కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర

మహాభారతము

18 పర్వములు

పర్వములు

mohan
PUBLICATIONS
ఆధ్యాత్మిక గ్రంథ నిలయం
ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్
FB@mohanpublications
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట, రాజమహేంద్రవరం - 533101.

mohanpublications.com
granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 1

ఆదిపర్వము

మొదటి భాగము (1,2,3,4 ఆశ్వాసములు)

కృతికర్త

నన్నయభట్టారకుడు

వ్యాఖ్యాతలు

డాక్టర్ దివాకర్ల వేంకటావధాని

డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం

ప్రధాన సంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITHRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATHAM

With Commentary
Adiparvamu of Nannaya Bhattarakudu
Vol. I. Part-I
(Cantos 1,2,3 and 4)

Commentary by
Dr.Divakarla Venkatavadhani - 1,2 and 3 Cantos
Dr. G.V.Subrahmanyam - 4th Canto

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Publications Series No.600
First Edition : August 2000
First Re-print : 2006

Revised Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by
Sri. L.V.Subrahmanyam, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D. Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీ హరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం **18** పర్వాలను **15** సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా అధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీ కార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నందూరి రామకృష్ణమాచార్యులు, డా॥ అప్పజోడు వెంకటసుబ్బయ్య భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్. రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీ కార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీ కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణం ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన సహిత మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీ కార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీ కార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైల కుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీ మతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి. గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జెల్లి శ్రీ రఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహా భారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత సంశోధిత పునర్ముద్రణ కార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్-ఇన్-చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

మహాభారతం మన జాతీయ కావ్యం (National Epic). ఈ ఇతిహాసంలో వ్యాసమహర్షి ధర్మం, అర్థం, కామం, మోక్షం - అనే నాలుగు పురుషార్థాలను సాధించటానికి అవసరమయ్యే విజ్ఞానం అంతా చక్కగా ఇమిడ్చాడు. వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తుల సారం ఇందులో సముచితంగా చోటుచేసికొన్నందువల్ల, ఈ గ్రంథం 'పంచమవేదం'గా, 'భారతీయ విజ్ఞాన సర్వస్వం'గా ప్రశస్తి పొందింది.

వ్యాసభగవానుడు లోకశ్రేయస్సును కోరి మూడు సంవత్సరాలు నిష్ఠతో భారతకథను 'జయ' కావ్యంగా రచించాడు. దానిని తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశాడు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అట్లా వినిపింపగా పెంపొందిన కావ్యాన్ని 'భారత' మని పిలిచారు. తరువాత ఆ కథను రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. అక్కడి మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిసి భారతం 'మహాభారతం'గా వాసి గాంచింది.

ఉగ్రశ్రవసుడు (సూతుడు) శౌనకాది మునులకు భారత కథనంతా చెప్పి, చివర ఇలా అంటాడు-

"యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి న తత్ క్వచిత్"

'ఇందులో ఉండేదే ఎక్కడైనా ఉంటుంది, ఇందులో లేనిది ఎక్కడా లేదు' (What is in Mahabharata is every where; what is not in Mahabharata is nowhere) - అని.

ఆసక్తికరమైన విషయం, ఏమంటే మహాభారతం ప్రపంచంలోని గ్రంథాలన్నింటిలోకి గొప్పది. ఉదాహరణకు "ఇలియడ్'', "ఒడెస్సీ''- అనేవి గ్రీకుల ప్రాచీన ప్రసిద్ధ వీరకావ్యాలు. మహాభారతం ఆ రెంటికన్నా అనేకరెట్లు పెద్దది. ఈ పెద్దతనం ఒక పరిమాణంలోనేగాక, పాత్ర చిత్రణ (Character delineation), భావాల వైవిధ్యం (Range of emotions) వంటి అంశాల్లో స్పష్టంగా తెలుస్తుంది.

మహాభారతంలో పాండవుల ఉత్తమ చరిత్ర, కౌరవుల దుర్వృత్తం చక్కగా ఆవిష్కరింపబడ్డాయి. పాండవులు ధార్మిక, సాత్త్విక, దైవీశక్తులు; కౌరవులు అధార్మిక, రాజస, తామసిక, ఆసురీశక్తులు. ఈ రెండురకాల శక్తుల నడుమ జరిగిన సంఘర్షణయే కురుక్షేత్ర సంగ్రామం. అందులో ధార్మికశక్తులకు జయాన్ని కలిగించి, అధర్మశక్తులను అంతమొందించి, అవతార పురుషుడుగా, జగద్గురువుగా నిలిచి ఉపదేశించిన దివ్యశక్తి శ్రీకృష్ణుడు.

భగవద్గీత భారతానికి ఆత్మ; పాండవుల చరిత్ర శరీరం; చతుర్విధ పురుషార్థ విజ్ఞానం జీవితం; ఇతిహాసాలు, ఉపాఖ్యానాలు జవసత్త్వాలు. మానవ జీవితమనే మహాసముద్రాన్ని మథించి బాదరాయణుడు మానవాళికి అందించిన

అమృతకలశం మహాభారతం. మానవజీవిత క్రమానికి మహాభారత ఇతివృత్తగమనానికి ఎంతో సాదృశ్యం గోచరిస్తుంది. ఒక్కమాటలో మానవ ధార్మిక జీవన ప్రవృత్తికి మహాభారతం ప్రాణాధారం.

మహాభారతం వేదాలు మొదలుకొని పురాణాలవరకు గల భారతీయ వాఙ్మయంయొక్క సారాంశాన్ని అందించటమేగాక, ఆ యా అంశాలకు వైరుధ్యం ఏర్పడినప్పుడు, వాటికి సామరస్యపూర్వక మార్గాన్ని నిర్దేశించే సమన్వయ సంహితగా పేరు గాంచింది:

"వేదములకు, అఖిలస్మృతి
వాదములకు, బహుపురాణ వర్గంబులకున్
వాదైన చోటులను తా
మూదల ధర్మార్థకామమోక్షస్థితికిన్"

ఈ విధంగా ఆర్షవాఙ్మయానికి అంతటికీ మూదల (ప్రమాణం) అయి ఉండటం మహాభారతం యొక్క ప్రత్యేకత!

దేవభాషలో అవతరించిన భారతం కాలక్రమేణ తమిళ, కర్ణాటాది దేశభాషలలోనికి అనువదింపబడుతూ వచ్చింది. ప్రాంతీయ భాషలలో వెలువడిన ఆ యా భారత అనువాదాలన్నిట్లోనూ తెలుగులో 'కవిత్రయం' వారు రచించిన ఆంధ్రమహాభారతానికి ఒక ప్రత్యేకత నెలకొనిఉంది. తెనుగుభారతం కేవలం అనువాదం కాదు; కృష్ణద్వైపాయనుడు వైదికమైన ఏ పరమార్థాన్ని మూలంలో నిరూపించాడో, ఆ నిరూపితార్థం చెక్కుచెదరకుండా పుణికిపుచ్చుకొని అవతరించిన స్వతంత్ర రచన ఆంధ్రమహాభారతం. కవిత్రయం కావించిన పునఃసృష్టి!

'తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి,' 'భారతం చదివినవాడు పండితుడు'- ఇత్యాది లోకోక్తులు తెలుగులో వెలిశాయంటే ఆంధ్రులకు మహాభారతమంటే ఎంతటి ఆదరమో తేటపడుతోంది. ఆంధ్రావళికి అలాంటి ఆదికావ్యాన్ని ప్రసాదించిన మహాకవులు మువ్వురూ త్రిమూర్తుల లాంటివారు. వారిలో ఆదికవియే విష్ణువు, కవిబ్రహ్మయే బ్రహ్మదేవుడు, ప్రబంధ పరమేశ్వరుడే పరమేశ్వరుడు. ఈ ముగ్గురు సారస్వత మూర్తులు వేరువేరు కాలాల్లో, తెలుగుదేశంలోని వేరువేరు ప్రాంతాల్లో తమతమ రచనల్ని కొనసాగించినప్పటికీ, కవిత్రయ భారతం స్వరూపంలోనూ, సందేశంలోనూ ఏకవాక్యతతో విలసిల్లుతూవుంది. ఇది ఆంధ్రావనికి దైవికంగా సిద్ధించిన అదృష్టవిశేషం. తరతరాల తెలుగుజాతికి ఆదర్శంగా తెనుగు సంస్కృతి మందిరంపై నిర్మించిన సమున్నత స్వర్ణగోపురం ఆంధ్రమహాభారతం. ఆ సుందర గోపురాన్ని నెలకొల్పిన అక్షర శిల్పులు "కవిత్రయం'' అందరకూ ఆరాధ్యులు.

పై త్రిమూర్తుల్లో ఆద్యుడు, ఆంధ్రసారస్వతానికి 'అపర వాల్మీకి' నన్నయభట్టారకుడు. ఆ మహాకవి వేంగీదేశపు రాజధాని అయిన రాజమహేంద్రవరంలో చాళుక్యవంశ ప్రభువగు రాజరాజుయొక్క ప్రోత్సాహంతో క్రీ.శ. 1053 ప్రాంతంలో వ్యాసభారత ఆంధ్రీకరణకు శ్రీకారం చుట్టాడు. ఆంధ్రవాఙ్మయ చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయ సన్నివేశాన్ని

పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982-83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం''గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్రాబ్ది జయంతి- ఉత్సవాలు తెలుగుదేశంలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడినాయి.

ఆ సందర్భంలో తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షధర్మానికి, ఆంధ్రభాషా సాహిత్యాలకు, సంస్కృతి సభ్యతలకు మార్గదర్శకమైన ఆది కావ్యానికి - ముఖ్యంగా తొలి మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచే ప్రతిపదార్థ, తాత్పర్య, విశేషాలను వ్రాయించి ప్రచురించే ధార్మిక కార్యక్రమాన్ని ఆసక్తితో చేపట్టారు. తొలుదొలుత నన్నయ భారతభాగంతో ఆరంభమైన ఈ కార్యక్రమం క్రమేణ తరువాతి పదిహేను పర్వాలకు కూడా వ్యాఖ్య వ్రాయించాలనే ఉదాత్త సంకల్పానికి దారితీసింది.

ఈనాటి విద్యార్థుల పాఠ్యప్రణాళికల్లో భారతీయ సంస్కృతి వైశిష్ట్యాన్ని బోధించే అంశాలకు తగినంత ప్రాధాన్యం లేక, అరుదైపోతూ ఉన్నందున, కవిత్రయమహాభారతం అందించే సందేశం సామాన్య జనులకూ, అలాగే నేటి యువతరానికీ అందేటట్లు చేయవలసిన ఆవశ్యకతను గుర్తించి, తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యానసహిత కవిత్రయ భారత ప్రచురణను అందుకు అనువైన మహోద్యమంగా చేపట్టి పురోగమిస్తున్నది.

మొదట నన్నయ భారతభాగానికి సరళగ్రాంథికంలోనూ, తరువాత తిక్కన భారత భాగానికి శిష్టవ్యావహారిక భాషలోనూ- అందులోనూ భిన్న భిన్నశైలులలో - వ్యాఖ్య రచింపబడి ఉన్నందున, ఈ మొత్తం సంపుటాల వ్యాఖ్యాన స్వరూపానికి ఏకవాక్యతనూ, సామాన్యపాఠకులకు సైతం సుబోధంగా ఉండే విశిష్ట వ్యావహారికరీతినీ సంతరించటానికి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని సంపాదకులుగా నియమించటమైనది.

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యానికే కీర్తికిరీటమైన ఆంధ్రమహాభారతాన్ని సరళవ్యాఖ్యతో అచిరకాలంలో సమగ్రంగా ముద్రించి, ఈ రీతిగా ఆంధ్రావళికి సమర్పింపగలుగుతున్నందుకు తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం ఎంతో సంతోషిస్తూన్నది.

ఆదికవి నన్నయభట్టారకుణ్ణి ఆంధ్రమహాభారత రచనకు ప్రోత్సహించిన రాజరాజు క్రీ.శ. 1022 ఆగస్టు 22వ తేదిన పట్టాభిషిక్తుడయ్యాడు. ఈ అద్వితీయ చారిత్రక సన్నివేశాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం ఈ సంవత్సరం ఆగస్టు 22న శ్రీ పద్మావతీ శ్రీనివాసుల మంగళాశాసనములతో ఆదిపర్వ, సభాపర్వ సంపుటాలను రాజమహేంద్రవరంలో ఆవిష్కరింపనున్నారు.

ఆదినుండీ ఈవాఙ్మయయజ్ఞంలో పాలుపంచుకొన్న సుగృహీతనామధేయులయిన విద్యావేత్తలందరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతున్నాము.

వేదత్రయమూర్తి అయిన వేంకటేశ్వరుని అనుగ్రహంవల్ల, వ్యాఖ్యానసహితమైన ఈ 'జయేతిహాసం' సర్వులకు జయప్రదము, ఆనంద సంధాయకము కాగలదని మా ఆశయము, ఆకాంక్ష.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనతి కాలంలోనే ప్రతులన్నీ చెల్లిపోయిన కారణంగా పునర్ముద్రిస్తున్నాము (2006). ఎప్పటిలాగే పాఠకులు సమాదరిస్తారని ఆశిస్తున్నాను.

వ్యాసరచిత భారతామ్నాయ మాంధ్రభా
షగనొనర్చి జగతిఁ బొగడు గనిన
నన్నపార్యుఁ, దిక్కనను గృతక్రతు, శంభు
దాసు నెఱ్ఱసుకవిఁ దలఁతు భక్తి.

కార్యనిర్వహణాధికారి
తి.తి. దేవస్థానములు, తిరుపతి.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీవేంకటేశ్వరస్వామి వారి దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమ స్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీ కారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 -' 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్తి సంచికను ప్రచురించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్లవేంకటావధాని
డా॥ నండూరి రామకృష్ణమాచార్య
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జులై11 తేదీన హైదరాబాదు బాలాజి భవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

“ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అర సున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్లవేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్వురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్లవేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది. ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిక్రమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశా స్త్రి గారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగా పర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీమధునాపంతుల సత్యనారాయణశా స్త్రిగారి గృహంలో 1991 జులై3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డి గారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక"ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥కె. సర్వోత్తమరావు	**శ్రీడి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నందూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిని అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉట్టంకించవచ్చు.''

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జులై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీ డి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా'' సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు''కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీస్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలో ని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్లకొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని **1/4** 'డెమ్మీసైజు'లో పంౖడెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా **1/4** 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులు బాటు కల్పించు కోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి, విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి".

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాష్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదక మండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

సంపాదక మండలి సభ్యులు

ఆచార్య నండూరి రామకృష్ణమాచార్యులు
శ్రీపొత్తూరి వెంకటేశ్వరరావు
ప్రొ॥ఎస్.బి. రఘునాథాచార్య
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
ఆచార్య కె.జె. కృష్ణమూర్తి
ఆచార్య కె.సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు
ప్రొ॥ఎస్.బి. రఘునాథాచార్య
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్యులు
శ్రీపొత్తూరి వెంకటేశ్వరరావు
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
ఆచార్య ఎం. కులశేఖరరావు
ఆచార్య కె.జె. కృష్ణమూర్తి
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు
డా॥ మేడసాని మోహన్
ఆచార్య ఎం. బుద్ధన్న
ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానంద

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి25వ తేదీన తిరుమలలో కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలుల లోని సభ్యులయొక్క సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారతసంపుటా లన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్తపాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ఇప్పుడు ప్రథమ సంపుటం - ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం సభాపర్వం- వెలువడినాయి. తరువాతి సంపుటాలు సైతం త్వరలోనే వెలుగుచూడ నున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కృతజ్ఞతలు :

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన సహృదయులు తిరుమల తిరుపతి దేవస్థాన కార్యానిర్వహణాధికారులు డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారికి అనేక ధన్యవాదాలు.

ఈ ప్రణాళికద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము'' ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధానపాత్ర వహించిన- వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదక మండలి, సలహా మండలి) యందలి విద్యావేత్తలు ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు - ఈ విద్వాంసులందరికి కృతజ్ఞతాపూర్వక నమోవాకములు.

"సప్తగిరి'' సంపాదకులుగా ఉండి, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి ప్రముఖ పాత్ర వహించిన కీ.శే. కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. "సప్తగిరి'' సంపాదక కార్యాలయ ప్రచురణల విభాగంలో 'సబ్ ఎడిటరు' గా ఉద్యోగిస్తూ 1995లో పదవినుండి విరమించేదాకా ఈ ప్రణాళిక విషయమై మిగుల సహకరించిన విద్వత్కవివర్యులు శ్రీమాన్ముదివర్తికొండమాచార్యులు గారికి, ఆచార్య కె.జె. కృష్ణమూర్తి (కంట్రోలర్ ఆఫ్ పబ్లికేషన్సు) గారికి అనేక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు శ్రీ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డా॥కె. రాధారమణ, డా॥ఎ. సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి.ఎస్. శ్రీనివాసన్ గారికి, తదితర సిబ్బందికి, టి.టి.డి. ముద్రణాలయ అధికారి శ్రీ ఎం. లక్ష్మణరావు గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీవేంకటేశ్వరస్వామి వారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ఎన్.ఎస్. రామమూర్తి

కన్వీనర్

సంపాదకుడు - సప్తగిరి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదకమండలి సభ్యులు

డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఎ.ఎస్., అధ్యక్షులు

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకులు: **ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం,**

ఆచార్య నందూరి రామకృష్ణమాచార్యులు

ప్రొ॥ఎస్.బి. రఘునాథాచార్య

ఆచార్య కె.జె. కృష్ణమూర్తి

శ్రీపొత్తూరి వేంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ఆచార్య నందూరి రామకృష్ణమాచార్యులు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె.జె. కృష్ణమూర్తి

డా॥ మేడసాని మోహన్

ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానంద

ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆచార్య ఎం. బుద్ధన్న

డా॥ ఎన్.ఎస్.రామమూర్తి, కన్వీనర్

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా 1,2
4. డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్న శాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	ఆను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	ఆను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఆను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది.	-	ఆదిపర్వం
సభా.	-	సభాపర్వం
అర.	-	అరణ్యపర్వం
విరా.	-	విరాటపర్వం
ఉద్యో.	-	ఉద్యోగపర్వం
భీష్మ.	-	భీష్మపర్వం
ద్రోణ.	-	ద్రోణపర్వం
కర్ణ.	-	కర్ణపర్వం
శల్య.	-	శల్యపర్వం
సౌప్తి.	-	సౌప్తికపర్వం
స్త్రీ.	-	స్త్రీ పర్వం
శాంతి.	-	శాంతిపర్వం
అను.	-	అనుశాసనికపర్వం
అశ్వ.	-	అశ్వమేధపర్వం
ఆశ్ర.	-	ఆశ్రమవాసపర్వం
మౌస.	-	మౌసలపర్వం
మహా.	-	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	-	స్వర్గారోహణపర్వం
సం.	-	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	-	సంస్కృత మహాభారతము
అను.	-	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	-	ప్రధాన సంపాదకుడు
క.	-	కందపద్యం
వ.	-	వచనం
ఆ.	-	ఆటవెలది
తే.	-	తేటగీతి
సీ.	-	సీసం
ఉ.	-	ఉత్పలమాల
చ.	-	చంపకమాల
మ.	-	మత్తేభ విక్రీడితం
శా.	-	శార్దూల విక్రీడితం
ఆశ్వా.	-	ఆశ్వాసం
క్రీ.శ.	-	క్రీస్తుశకం
య.	-	యగణం
మ.	-	మగణం
త.	-	తగణం
ర.	-	రగణం
జ.	-	జగణం
భ.	-	భగణం
న.	-	నగణం
స.	-	సగణం
ల.	-	లఘువు
గ.	-	గురువు
అలం.	-	అలంకారం
సం.	-	సంవత్సరం
మొ.	-	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పీఠిక

"అమితాఖ్యానక శాఖలం బొలిచి, వేదార్థామల చ్ఛాయమై,
సుమహద్వర్గ చతుష్క పుష్పవితతిన్ శోభిల్లి, కృష్ణార్జునో
త్తమ నానాగుణ కీర్తనార్థఫలమై, ద్వైపాయనోద్యాన జా
తమహాభారత పారిజాత మమరున్ ధాత్రీసుర ప్రార్థ్యమై." **(ఆది. 1.66)**

మహాభారతం పారిజాత కల్పవృక్షం

మహాభారతం భారతీయులకు పారిజాత కల్పవృక్షం వంటిది. అడిగిన కోర్కెలన్నీ అందించే దివ్యవృక్షం పారిజాతం. మహాభారతం కూడ అటువంటిదే. మానవులు కోరేవి పురుషార్థ ఫలాలు. వాటికి సంబంధించి తెలియదగిన విశేషాలన్నింటినీ చెప్పేది మహాభారతం.

"ధర్మే చార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ ! యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్"
(సం.మ.భా. ఆది. 56-33)

అని మహాభారతం ప్రకటించుకొన్నది. ధర్మార్థ కామ మోక్షాలకు సంబంధించి భారతంలో ఉన్న అంశం మరొకచోట ఉండవచ్చు కాని, లేని అంశం మరెక్కడా ఉండదని ఘంటాపథంగా చెప్పింది. అది నిజం ! అందుకే అది భారతీయ విజ్ఞానానికీ సంస్కృతికీ కల్పవృక్షం!

అది ద్వైపాయనుడని పిలువబడే ఉద్యానవనంలో పుట్టింది. వ్యాసుడు ద్వైపాయనుడనీ, కృష్ణద్వైపాయనుడనీ, సాక్షాత్ నారాయణుడనీ కీర్తింపబడ్డాడు. ఆయన వేదాలను వర్గీకరించాడు. బ్రహ్మసూత్రాలను ప్రపంచించాడు; భారతీయ విజ్ఞాన శాఖలను తమలో భద్రపరచుకొన్న అష్టాదశ మహాపురాణాలను రచించాడు; నాలుగు వేదాలలోని పరమార్థాన్నంతా ప్రతిపాదించే పంచమవేదంగా భారతాన్ని నిర్మించాడు. ప్రాచీనభారతీయ విజ్ఞాన సర్వస్వంగా తన వాఙ్మయాన్ని సంతరించి, వైదిక సంస్కృతిని అజరామరంగా నిలిపిన వ్యాసమహర్షి సాక్షాత్ విష్ణుకల్పుడు. "వ్యాసో నారాయణో హరిః", వ్యాసాయ విష్ణురూపాయ, వ్యాసరూపాయ విష్ణవే" అనే ప్రశస్తి ప్రసిద్ధం. "మునీనా మప్యహం వ్యాసః" అని శ్రీకృష్ణుడే గీతలో ప్రకటించుకొన్నాడు.

వేదవ్యాసుని మేధలోనుండి పుట్టిన భారతం మూడంచెలుగా విస్తరిల్లి లోకంలో వ్యాపించింది. ఆ మునీంద్రుడు భరతవంశకథను మూడేళ్ళు దీక్ష పూని, 'జయ' మనే కావ్యంగా మొదట రచించాడు. మహాభారతానికి అది మొదటి రూపం. దానిని వివిధ లోకాలలో ప్రచారం చేయటానికి తన శిష్యులను నియోగించాడు. నారదుడు దేవలోకంలోనూ, అసితుడైన దేవలుడు పితృలోకంలోనూ, వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పటం ద్వారా మానవలోకంలోనూ జయకావ్యానికి విజయవంతంగా వ్యాప్తి కలిగించారు. వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పేటప్పుడు అతనికి కలిగిన అనుమానాలనూ, అడిగిన విశేషాలనూ వ్యాసతాత్పర్యానికి అనుగుణంగా వివరించాడు. ఆ విశేషాలతో కలిపి వ్యాసుడి జయకావ్యం భారతంగా ప్రసిద్ధి పొందింది. దానిని వైశంపాయనుడు చెప్పగా రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు అనే సూతుడు విన్నాడు. ఆయన ప్రసిద్ధుడైన పౌరాణికుడు. ఒకసారి నైమిశారణ్యంలో శౌనకుడనే మహర్షి బ్రహ్మర్షిగణాలతో కలిసి లోకశ్రేయస్సుకొరకు

పన్నెండు సంవత్సరాలపాటు సత్రయాగం నిర్వహించాడు. అందులో సూతమహర్షి పాల్గొని శౌనకాది మహామునులకు, వారికోరికమీద, భారతాన్ని వినిపించాడు. అప్పుడు

శౌనకాదులు ఎన్నో అనుమానాలనూ, వివరాలనూ అడిగి తెలిసికొన్నారు. వాటిని సూతుడు వేదవ్యాసుడి అభిప్రాయానికి అనుగుణంగా అనువుగా వివరిస్తూ అందించాడు. దానితో గ్రంథం పెరిగింది. అదంతా కలిసి మహాభారతంగా ప్రసిద్ధి పొందింది. మహాభారత మంటే జయకావ్యం. మూడుదశలలో విస్తరించిన మహేతిహాసం. అది వ్యాసమునీంద్రుని కవితోద్యానంలో పుట్టి పెరిగిన పారిజాతం.

భారతమంటే భరతవంశీయుల కథ. వారు చంద్రవంశానికి చెందినవారు. సూర్యచంద్రాది వంశాలలో పుట్టి వేదధర్మాన్ని తాము ఆచరిస్తూ, ప్రజలచేత ఆచరింపజేసే ప్రభువుల చరిత్రలు పురాణాలలో ఉంటాయి. వాటిని వంశానుచరితాలని పిలుస్తారు. అవి స్వతంత్రకావ్యాలుగా రచింపబడితే ఇతిహాసా లౌతాయి. భరతవంశజులచరిత్ర చెప్పే మహాభారతం వస్తుతః వంశానుచరితం. అయితే, అది పురాణభాగంగా కాకుండా స్వతంత్ర గ్రంథంగా వెలువడింది కాబట్టి ఇతిహాస మనబడింది. అందులో మొదటినుండి చివరిదాకా సాగే కథను ఆఖ్యానం అంటారు. దానికి పోషకంగా నిలిచే అనుబంధ కథలను ఆఖ్యానకాలనీ, ఉపాఖ్యానాలనీ అంటారు. అవి ప్రధానకథలోని తాత్పర్యాన్ని మిత్రసమ్మితంగా వివరించటానికి తోడ్పడతాయి. మహాభారత కల్పవృక్షానికి బోదె వంటిది ఆఖ్యానం; ఆఖ్యానకాలూ, ఉపాఖ్యానాలూ కొమ్మల వంటివి. కొమ్మ లెంత పెద్దసంఖ్యలో ఉంటే చెట్టు అంత దట్టంగా, విశాలంగా విస్తరించి ఆకారంలోనూ, గుణంలోనూ గొప్పగా కనబడుతుంది. కథలో తెలిసికోదగిన ఎన్నో అంశా లున్నప్పుడే ఎన్నో ఉపాఖ్యానాలూ ఆఖ్యానకాలూ పుట్టుతాయి. మహాభారతం ధర్మవిజ్ఞానసర్వస్వం కాబట్టి దానిని వివరించటానికి అది అనేక ఆఖ్యానకాలతో, ఉపాఖ్యానాలతో విస్తరించింది.

ఉపాఖ్యానశాఖలతో వైశాల్యాన్ని పెంచుకొన్న మహాభారత పారిజాతవృక్షం వేదతాత్పర్యమనే అచ్చమైన చల్లని నీడ నిస్తుంది. ఎండ వేడిమికి బాధపడే బాటసారులు చెట్టునీడన చేరి, సేద తీర్చుకొంటారు. అట్లాగే జీవితంలో ఎన్నో సమస్యలతో, సంఘర్షణలతో, బాధలతో వ్యథ పొందే లోకులు మహాభారతంలో వివరింపబడే వేదధర్మతాత్పర్యాన్ని తెలిసికొని తరణోపాయాన్ని సాధించి శాంతిని పొందుతారు. మహాభారత పారిజాతవృక్షచ్ఛాయలో విశ్రమించటమంటే చతుర్వేదసారమైన మహాభారత తాత్పర్యంలో సదా జీవించటమన్నమాట!

పారిజాత వృక్షపు నీడలో పడుకొంటే ఆ చెట్టుకు పూచిన పూలవాసన గుబాళిస్తుంది. మహాభారత కల్పవృక్షానికి పూచే పూలంటే చతుర్విధ పురుషార్థాలే. ధర్మ, అర్థ, కామ, మోక్షాలకు సంబంధించిన సువాసనలను (ఉత్తమ సంస్కారాలను) తనను ఆశ్రయించినవారికి పంచిపెట్టి, పారవశ్యాన్ని కలిగిస్తుందన్నమాట. పూలు కొమ్మలకు పూస్తాయి. అవి కంటితో చూడటానికీ, వాసన చూడటానికీ ఆహ్లాదకరంగా ఉంటాయి. అట్లాగే భారతంలోని పురుషార్థవిజ్ఞానవిశేషాలు చదవటానికీ అందులోని ఉపదేశాత్మకమైన తాత్పర్యాన్ని భావించి గ్రహించి ఆనందించటానికీ తోడ్పడతాయి. ఉపరంజనంతోపాటు ఉపదేశాన్ని కూడా అందించి ఉత్తమకావ్య ప్రయోజనాన్ని కలిగించేవి ఆ చతుర్వర్గ పుష్పగుచ్ఛాలు!

చెట్టు తన రసానుభూతినీ, బీజాలనూ పండ్లలో భద్రపరచుకొంటుంది. పండ్లలోనే ఉంటుంది చెట్టు ప్రాణం. మహాభారత పారిజాత వృక్షానికి నరనారాయణ గుణ కీర్తన పరమార్థమే పరమఫలం! అందుకే భారతానికి కార్ష్ణ వేద మనీ, వాసుదేవతత్త్వకోశ మనీ ప్రసిద్ధి ఉన్నది. నర నారాయణులు పరస్పరం కలిసి ఏ విధంగా జీవిస్తారో, జీవించగలరో చెప్పే రసవత్తరమైన కావ్యం మహాభారతం. నరుడు తాను నారాయణుడుగా మారే ప్రస్థానం సాగిస్తాడు. నారాయణుడు తానుకూడా నరునిగా అవతరించి

నరుడిని ఉద్ధరించే ఉపాయాన్ని ఉపాసనగా ఉపదేశిస్తాడు. ఈ రెండు తత్త్వాల అంతరార్థాన్ని అమృతయోగంగా అందించే ఫలమే మహాభారత పరమార్థం.

మహాభారతమంతా ఒక యెత్తు. నరుడికి నారాయణుడు బోధించిన భగవద్గీత ఒక్కటీ ఒక యెత్తు. భగవద్గీత భారతానికి అంతరాత్మ. దాన్ని కూడా పంచమవేదమని పిలిచే సంప్రదాయం ఉన్నది. భారతమంతా చదివిన తరువాత పఠితలు కురుక్షేత్ర యుద్ధంలో చనిపోయిన వీరుల కథలన్నీ తలచుకొని లౌకికవిభూతులన్నీ విషాదాన్నే మిగిలిస్తాయని తెలిసికొని నిర్వేదాన్ని పొందుతారనీ, ఆ నిర్వేదాన్ని తొలగించుకొనటానికి భారతంలోని వాసుదేవతత్త్వాన్నీ, గీతాసారాన్ని ఆశ్రయిస్తారనీ, తద్ద్వారా క్రమంగా ముక్తిని సాధిస్తారని చెప్పే పరిపాటి ఉన్నది. దానివలన మహాభారత పరమార్థం మోక్షఫలం ! అని స్పష్టమౌతున్నది. ఏ గ్రంథం అటువంటి దివ్యఫలాన్ని అందిస్తుందో దాన్నే భారతీయులు పంచమవేదంగా, జ్ఞానఫలంగా, పవిత్రగ్రంథంగా భావిస్తారు. మహాభారతం అటువంటి మహాఫలం!

మహాభారత ప్రశస్తి

వ్యాసమహాభారతాన్ని ప్రశంసించని ప్రాచీనగ్రంథం లేదంటే ఆశ్చర్యం లేదు. మచ్చుకు మార్కండేయ మహాపురాణం పలికిన మాటలుః-

శ్లో. "భగవన్ ! భారతాఖ్యానం వ్యాసేనోక్తం మహాత్మనా,
పూర్ణ మస్త్వమలై శ్శుభై ర్నానాశాస్త్రసముచ్చయైః.
జాతి శుద్ధి సమాయుక్తం సాధు శబ్దోపశోభితమ్,
పూర్వపక్షోక్తి సిద్ధాన్త పరినిష్ఠాసమన్వితమ్.
త్రిదశానాం యథా విష్ణుః ద్విపదాం బ్రాహ్మణో యథా,
భూషణానాం చ సర్వేషాం యథా చూడామణిర్వరః.
యథాయుధానాం కులిశ మిన్ద్రియాణాం యథా మనః,
తథే హ సర్వశాస్త్రాణాం మహాభారత ముత్తమమ్.
యత్రార్థశ్చైవ ధర్మశ్చ కామో మోక్షశ్చ వర్ణ్యతే,
పరస్పరానుబన్ధాశ్చ సానుబన్ధా శ్చ తే పృథక్.
ధర్మశాస్త్ర మిదం శ్రేష్ఠ మర్థశాస్త్ర మిదం పరమ్,
కామశాస్త్ర మిదం చాగ్ర్యం మోక్ష శాస్త్రం తథోత్తమమ్.
చతురాశ్రమ ధర్మాణా మాచారస్థితి సాధనమ్,
ప్రోక్త మేత న్మహాభాగ వేదవ్యాసేన ధీమతా.
తథా తాతకృతం హ్యేత ద్వ్యాసే నోదారకర్మణా,
యథా వ్యాప్తం మహాశాస్త్రం విరోధై ర్నాభిభూయతే.
వ్యాసవాక్య జలౌఘేన కుతర్కతరుహారిణా,
వేదశైలావతీర్ణేన నిరజస్కా మహీకృతా.

కలశబ్ద మహాహంసం మహాఖ్యాన వరాంబుజమ్,
కథావిస్తీర్ణసలిలం కార్ష్ణం వేద మహాహ్రదమ్." **(1.2-11)**

మహాత్ముడైన వ్యాసుడు చెప్పిన భారతాఖ్యానం అనేక శాస్త్రార్థాల సమాహారం. సాధుశబ్ద ప్రయోగాలకూ, సహజ వస్తు ప్రతిపాదనలకూ, ధార్మిక విషయాలలో వేద పూర్వపక్షాలను ఖండించి సిద్ధాంతాలను సమర్థవంతంగా చేసే పద్ధతులకూ అది కాణాచి. దేవతలలో విష్ణువు వలె, ద్విజన్ములలో బ్రాహ్మణుడి వలె, అలంకారాలన్నిటిలో చూడామణి వలె, ఆయుధాలలో వజ్రాయుధం వలె, ఇంద్రియాలలో మనస్సువలె వేదాంగాలైన సర్వశాస్త్రాలలో మహాభారతం ఉత్తమం. ధర్మ, అర్థ, కామ, మోక్షాంశాలను వివరించటమే కాకుండా వాటిమధ్య ఉండే పరస్పర అనుబంధాలనూ, అవినాభావ సంబంధాలనూ వివరిస్తుంది భారతం. ధర్మశాస్త్రాలలో, అర్థశాస్త్రాలలో, కామశాస్త్రాలలో, మోక్షశాస్త్రాలలో మహాభారతమే మహనీయమైనది. చతురాశ్రమ ధర్మాలను ఆచరించేటప్పుడు కలిగే వైరుధ్యాలను తొలగించి, అన్వయించి మార్గం చూపించే మార్గదర్శి మహాభారతం. వేదశిఖరాలనుండి జలపాతం వలె దూకే వ్యాస వాక్య తాత్పర్యాలకు కుతర్క వృక్షాలు కూలిపోతాయి. ఆ వేదార్థజలం కార్ష్ణవేద మని పిలువబడే మహాభారత మహాసరోవరంగా రూపొందింది. అందులోని లోతు వాసుదేవ తత్త్వం ! ఆఖ్యానాలనే మహాపద్మాలు అందులో ఉంటాయి. మధురమైన నాదాలు చేసికొంటూ శబ్దాలనే మహాహంసలు అందులో సంచరిస్తూ ఉంటాయి - అని మహాభారతాన్ని కీర్తించింది మార్కండేయ పురాణం. అదొక్కటే కాదు మహాపురాణాలన్నీ మహాభారతాన్ని మహిమోన్నతంగా కీర్తించాయి. ఆ తాత్పర్యమంతా స్ఫురించేటట్లు నానాపురాణవిజ్ఞాననిరతుడైన నన్నయ ఒక గొప్ప పద్యం చెప్పాడు.

సీ. "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని, యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని, కవివృషభులు మహాకావ్య మనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహ మని, యైతిహాసికు లితిహాస మనియుఁ
బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ యంబని మహిఁ గొనియాడుచుండ

ఆ. వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై, పరఁగుచుండఁ జేసె భారతంబు". **(ఆది. 1. 32)**

శతపర్వ సంస్కృత మహాభారతం : అష్టాదశ పర్వ ఆంధ్ర మహాభారతం

కురుక్షేత్రయుద్ధం మహాభారతంలో మహనీయఘట్టం. కృత త్రేతా యుగాల చివర క్రమంగా దేవాసుర, రామరావణ యుద్ధాలు ఏ విధంగా జరిగాయో ద్వాపరయుగాంతంలో పాండవ ధార్తరాష్ట్రుల మధ్య కురుక్షేత్రంలో పద్దెనిమిది రోజులు మహాఘోర యుద్ధం ప్రవర్తిల్లింది. ఒకవిధంగా మహాభారతేతివృత్తాన్ని రెండు విభాగాలుగా చేయవచ్చును. ఒకటి - పాండవులూ కౌరవులూ పుట్టిన నాటినుండి కురుక్షేత్ర యుద్ధానికి సిద్ధమౌతున్నట్లుగా సాగే కథ. రెండు- యుద్ధానంతరం పాండవులు ధర్మబద్ధంగా రాజ్యాన్ని పాలించి మహాప్రస్థానం చేసిన కథ. కురుక్షేత్రయుద్ధానికి ముందు వెనుకల కథయే మహాభారతం.

కురుక్షేత్రయుద్ధం 5000 సంవత్సరాల క్రితం జరిగిందని జనశ్రుతి ప్రసిద్ధంగా ఉన్నది. కాని, చరిత్రకారులు చెప్పే కాల నిర్ణయాలు క్రీ.పూ. 14వ శతాబ్దం నుండి 32వ శతాబ్దం వరకూ వ్రేలాడుతున్నాయి. అయితే, శ్రీ వేదవ్యాస్ (ఐ.ఎ.యస్) గారు చేసిన కాలనిర్ణయం ప్రకారం కురుక్షేత్ర యుద్ధం క్రీ.పూ. 1328వ సం॥లో జరిగింది. మహాభారతంలోని అంతర్గత సాక్ష్యాలతోనూ, యుధిష్ఠిర జనమేజయుల పేర్లతో కనబడుతున్న శాసనాధారాలతోనూ, మరికొన్ని చారిత్రక పరిస్థితులతోనూ పరిశీలించిన తరువాత ఆ సంవత్సరంలో యుద్ధం జరిగి ఉంటుందని అనేకులు ఇప్పుడు విశ్వసిస్తున్నారు. ఈ కాలాన్నిబట్టి కురుక్షేత్రయుద్ధం జరిగి దాదాపు అయిదు వేలేండ్లు అయి ఉంటుంది అనటంలో కూడా కొంత సామంజస్యం కనబడుతున్నది.

కురుక్షేత్ర యుద్ధానికి ప్రత్యక్షసాక్షి కృష్ణద్వైపాయనుడు. ఒకవిధంగా ఆయన కురువంశాన్ని నిలిపినవాడు కూడా. ఆయనకు ఆ వంశచరిత్ర ఆమూలాగ్రం తెలుసు. అందువలననే ఆయన ఆ ఇతిహాసాన్ని నిర్మించటానికి ఉత్తమ అధికారి. అంతకు మించి ఆయన మహర్షి, ద్రష్ట, స్రష్ట. అయితే, ఆయన జయ కావ్యాన్ని ఎప్పుడు రచించి ఉండిఉంటా డన్నది ఒక పెద్ద ప్రశ్న. జయాన్ని లోకంలో ప్రచారం చేయటానికి తన శిష్యులైన పైల, వైశంపాయన, సుమంతు, జైమిను లనే శిష్యులను నియోగించాడు. వారు దాన్ని భారతంగా పెంచారు. ఆ తరువాత సూతుడు(సౌతి) మహాభారతంగా విస్తృతపరిచాడు. వ్యాసుడు రచించిన జయ కావ్యాన్ని గురించి అర్జునునికి మూడవతరంవాడైన జనమేజయుడికాలంలో మొదట వినవస్తున్నది. వైశంపాయనుడు దానిని వినిపిస్తూ ఉపాఖ్యానాలతో పెంచాడు. ఆశ్వలాయన గృహ్యసూత్రాలలో "భారత, మహాభారతాచార్యాః" అని వ్యాసశిష్యులైన పైల వైశంపాయన సుమంతులను కీర్తించటం గమనిస్తే వారికాలంలో జయకావ్యం, భారతంగా, మహాభారతంగా మారిన విషయం ధ్రువపడుతున్నది. ఆ తరువాత భారతాన్ని శౌనకాదులకు వినిపించిన సూతుడు వ్యాసశిష్యుడైన రోమహర్షణుని కుమారుడే. భారతం మహాభారతం కావటానికి మరొకతరం కాలం గడచి ఉంటుంది. లేదా వైశంపాయనుని తరంలోనే భారతం మహాభారతం కాగా, దానిని సూతుడు మరీపెంచి ఉంటాడు. ఈ విధంగా శ్రోతృజనాపేక్షలకు అనుగుణంగా పెరుగుతూ వచ్చిన సమగ్ర మహాభారత నిర్మాణం క్రీ.పూ. 3వ శతాబ్దం వరకూ సాగి ఉండవచ్చునని చరిత్రకారులు భావిస్తున్నారు.

జయకావ్యం మహాభారతరూపం తాల్చే నడిమికాలంలో అందులో చేరిన అనేకాంశాలు ఆయాకాలాలలో తలయెత్తిన సామాజిక జీవన ధర్మాలను గురించిన మీమాంసలకు సమాధానాలై ఉంటాయి. క్రీ.పూ. 3వ శతాబ్దానికిముందే భారతదేశంలో ప్రవర్తిల్లి ఉన్న వేదసంస్కృతి మ్లేచ్ఛులదండయాత్రలతో క్రొత్త సమస్యల నెదుర్కొన్నది. ప్రకృతి ఆరాధన, యజ్ఞయాగాది క్రతువులు క్రమంగా సన్నగిల్లటంతో వాటిని గురించిన అనేకప్రశ్నలు ప్రజలలో రేకెత్తాయి. ఇంద్ర వరుణాగ్ని సూర్యులవంటి ప్రకృతిదేవతలస్థానంలో విష్ణు, రుద్ర, దేవీ మూర్తులు వెలసి వారివారి శాఖలను విస్తరింప చేయటం మొదలుపెట్టాయి. ఆ తరువాత క్రమంగా జైన బౌద్ధ మతాలు దేశమంతా వ్యాపించాయి. మహారాజులు చక్రవర్తులు వైదికధర్మం వదలి జైన బౌద్ధాలను స్వీకరించి వాటి ప్రచారానికి తోడ్పడ్డారు. దానితో వర్ణాశ్రమ ధర్మాలూ, యజ్ఞయాగాది కర్మ విధానాలూ శిథిలమై పోసాగాయి. వేదధర్మాన్ని ఆశ్రయించిన వ్యవస్థలు సడలిపోవటంలో బాగా దెబ్బతిన్నది గార్హస్థ్యాశ్రమ ధర్మం. జైన బౌద్ధాల వలన సమాజంలో సన్న్యాసులకు సన్న్యాసినులకు గౌరవం పెరిగింది. అది ఆశ్రమధర్మంగా కాక మతధర్మంగా పరిణమించింది. పరిణతచిత్త సంస్కారం లేకుండా సన్న్యాసాన్ని స్వీకరించినవారు దానికి న్యాయం చేయలేకపోగా, వ్యవస్థకు కీడు చేయవచ్చును. వేదధర్మంలో సమాజవ్యవస్థకు గార్హస్థ్యధర్మమే పునాదిగా పేర్కొనటం ప్రసిద్ధం. జైన బౌద్ధాల ప్రాబల్యం వలన దెబ్బతిన్న కుటుంబవ్యవస్థను, వేదధర్మాన్నీ పునరుద్ధరించుకోవలసిన అవసరం ఏర్పడింది. ఆ సామాజికమైన ధర్మపునరుద్ధరణ ఉద్యమంలో భాగంగా వేదవ్యాసమహర్షి రచించిన జయ కావ్యాన్ని ఆయన శిష్యులు బలమైన వాఙ్మయసాధనంగా వాడుకొన్నారు. జయకావ్యానికి ముందున్న వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు, పురాణాలు మొదలైన సాహితీ శాఖలు వేదధర్మాన్ని విపులంగా వివరించి ఉన్నాయి. ఆ తాత్పర్యాన్నంతా ఒక ఇతిహాసంలో ఇమిడ్చి మిత్రసమ్మితంగా చెప్పవలసిన అవసరమూ, కాలానుగుణమైన ధర్మసమన్వయాలు చేయవలసిన అగత్యమూ ఏర్పడింది. అందువలననే మహాభారతం పంచమవేదంగా రూపొందింపబడింది.

శ్రుతులలో చెప్పబడిన తత్త్వాలకు ఆయా యుగాలకూ, కాలాలకూ అనుగుణంగా ఆచరణయోగ్యమైన ధర్మసూత్రాలను ప్రతిపాదించేవి స్మృతి గ్రంథాలు. వాటిల్లో మొదటిది మనుస్మృతి. ఈ తరువాత గౌతముడు, వసిష్ఠుడు, నారదుడు, ఆపస్తంబుడు మొదలైన వారు రచించిన ధర్మసూత్రాలు ప్రసిద్ధాలు. మనుస్మృతి కంటె ముందే పుట్టిన జయకావ్యంలో క్రమంగా ఆ యా స్మృతి గ్రంథాలలోని అంశాలన్నీ చేరి దాన్ని భారతంగా మహాభారతంగా మార్చి ఆయా కాలాల ప్రజలకు అనుగుణమైన ధార్మికజీవన సూత్రాలను అందిస్తూ వచ్చాయన్నమాట! స్మృతులకంటె ముందుపుట్టి స్మృతుల నన్నింటిని తనలో యథావకాశంగా ఇముడ్చుకొని, విశ్వశ్రేయస్సు కోసం విశ్వరూపాన్ని తాల్చిన ఇతిహాసం మహాభారతం.

మహాభారతం నూరుపర్వాల గ్రంథమనీ, లక్షశ్లోకాల విస్తృతిని సాధించిందనీ ప్రసిద్ధి. నన్నయభట్టు చెప్పిన వివరాలు ఈ సత్యానికి దగ్గరగా ఉన్నాయి. (చూడండి ఆదిపర్వంలోని పర్వానుక్రమణిక) వివరణకు ఈ పట్టిక గమనించండి.

పర్వంపేరు -	ఉపపర్వాలసంఖ్య -	సంస్కృతభారతంలో - శ్లోకాలసంఖ్య	ఆంధ్రభారతంలో - ఆశ్వాసాల సంఖ్య	పద్యగద్యసంఖ్య
1. ఆదిపర్వం	18	9,984	8	2,084
2. సభాపర్వం	9	4,311	2	618
3.ఆరణ్యపర్వం	16	13,664	7	2,894
4. విరాటపర్వం	4	3,500	5	1,624
5. ఉద్యోగపర్వం	11	6,998	4	1,562
6. భీష్మపర్వం	5	5,884	3	1,171
7. ద్రోణపర్వం	8	10,919	5	1,860
8. కర్ణపర్వం	1	4,900	3	1,124
9. శల్యపర్వం	4	3,220	2	827
10.సాప్తికపర్వం	3	2,874	2	376
11. స్త్రీపర్వం	5	1,775	2	376
12. శాంతిపర్వం	4	14,525	6	3,093
13. అనుశాసనికపర్వం	2	12,000	5	2,148
14. అశ్వమేధ పర్వం	2	4,420	4	976
15. ఆశ్రమవాసపర్వం	3	1,106	2	362
16. మౌసలపర్వం	1	300	1	226
17. మహాప్రస్థానిక పర్వం	1	120	1	79
18. స్వర్గారోహణపర్వం	1	200	1	97
19. హరివంశపర్వం, భవిష్యపర్వం	2	-(వదలబడినవి)		
మొత్తం :	100	1,00,500	63	21,507

మహాభారతంలో ముఖ్యపర్వాలూ, ఉపపర్వాలూ కలిసి నూరున్నాయి. అందులో హరివంశపర్వం, భవిష్యపర్వంతో కలిసి ఇమిడి ఉన్నది. కొందరు దానిని ఖిలవంశపురాణ మని అంటారు; స్వతంత్ర ప్రతిపత్తి గల గ్రంథంగా పరిగణిస్తారు. నన్నయ హరివంశాన్ని తన గ్రంథప్రణాళికలో చేర్చలేదు. తిక్కనాదులు నన్నయ నిర్ణయాన్ని అనుసరించారు. ఎఱ్ఱన హరివంశాన్ని వేరే గ్రంథంగానే రచించాడు. నన్నయ సంస్కృత మహాభారతంలోని శతపర్వాలనూ వాటి శ్లోక సంఖ్యలనూ పేర్కొన్నాడు. తాను విభక్తం చేసి చూపిన అష్టాదశపర్వాలలో గల అంశాలను పర్వసంగ్రహంలో నిర్దేశించాడు. ఉపపర్వవిభాగాన్ని తెలుగులో పొందుపరచలేదు. ఈవిధంగా నూరు ఉప పర్వాల సంస్కృత మహాభారతం తెలుగులో అష్టాదశ ముఖ్య పర్వాల మహాభారతమై అవతరించింది.

ఆంధ్రుల ఆదికావ్యం నన్నయ భారతం

సంస్కృత సాహిత్యంలో వాల్మీకి ఆదికవి; కన్నడ సాహిత్యంలో పంపడు ఆదికవి; తెలుగు సాహిత్యంలో నన్నయ ఆదికవి అని ప్రసిద్ధి, నన్నయ ఆరంభించిన ఆంధ్రమహాభారతం తెలుగులో ఆదికావ్యం. నన్నయ ఆది సభాపర్వాలను, ఆరణ్యపర్వంలోని నాలుగో ఆశ్వాసంలో కొంతభాగం (క్రీ.శ. 1054-61 సం॥ల మధ్య) రచించి దివంగతుడైనాడు. ఆ తరువాత 13వ శతాబ్దంలో తిక్కన విరాటపర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు పదిహేనుపర్వాలను ప్రబంధమండలిగా సంతరించాడు. ఆ తరువాత 14వ శతాబ్దంలో ఎఱ్ఱాప్రెగ్గడ ఆరణ్యపర్వశేషాన్ని పూరించాడు. ఈవిధంగా దాదాపు రెండున్నర శతాబ్దాల కాలంలో పదునెనిమిది పర్వాల మహాభారతం కవిత్రయంచేత తెలుగులో రచింపబడింది. ముగ్గురు మహాకవులు విభిన్నకాలాలలో రచించినా ఒకే మహాకవి ఏకకాలంలో రచించిన కావ్యాన్ని చదివినప్పుడు కలిగే ఒక మహానుభూతిని ఆంధ్రమహాభారతం అందించటం ఆంధ్రావళి అదృష్టం!

నన్నయభట్టారకుడు వేంగిని పాలించిన తూర్పుచాళుక్య ప్రభువైన రాజరాజనరేంద్రుని (క్రీ.శ. 1022 - 1061) ఆస్థానంలో కులబ్రాహ్మణుడనే మంత్రిగా ఉండేవాడు. రాజకీయాలలో విద్యాసాంస్కృతిక విషయాలలో రాజుకు తోడ్పడేవాడు. రాజశాసనాలను పద్యగద్యాత్మకంగానూ, సంస్కృతాంధ్రాలలోనూ రచించేవాడు. ఆనాటి వేంగీదేశ పండితకవులలో నన్నయ హిమవన్నగశిఖరం వంటివాడు. తెలుగువారికి కావ్యభాషాభిక్ష పెట్టగలిగిన వాగనుశాసనుడు, మహాకవి, యుగకర్త.

తూర్పుచాళుక్యులు వేంగీ దేశాన్ని క్రీ.శ. 7వ శతాబ్దంనుండి 11వ శతాబ్దం చివరివరకు పాలించారు. తూర్పుచాళుక్యుల రాజ్యం ఉత్తరాన విశాఖపట్టణ మండలంలోని చీపురుపల్లి మొదలుకొని దక్షిణాన నెల్లూరు వరకు, పశ్చిమాన కర్నూలు మండలంలోని మార్కాపురం మొదలుకొని తెలంగాణంలోని కుక్కునూరు వరకునూ, తూర్పుసముద్రాన్ని అంటి వ్యాపించి ఉండేది. వేంగికి ఉత్తరాన కళింగ ఓఢ్ర రాజ్యా లుండేవి. పశ్చిమోత్తరంగా పశ్చిమచాళుక్యుల రాజ్యాలు ఉండేవి. దక్షిణాన చోళరాజ్యం ఉండేది. ఈ రాజ్యాల మధ్య జరిగే యుద్ధాలలో వేంగి క్రీ.శ. 10వ శతాబ్ది చివరివరకూ అడపా దడపా అస్థిరంగానే ఉంటూ ఉండేది. క్రీ.శ. 999లో చోళరాజు కేసరివర్మ వేంగిని ఆక్రమించి శక్తివర్మను రాజుగా నిలిపాడు. అతడు 1011వరకు పాలించాడు. శక్తివర్మ కుమారుడు విమలాదిత్యుడు (క్రీ.శ. 1011-18) రాజమార్తాండుడుగా ప్రసిద్ధుడైనాడు. అతనికి ఇద్దరు భార్యలు. చోళచక్రవర్తి యైన రాజరాజు పుత్రిక కుందవాదేవి మొదటి భార్య. ఆమెవలన రాజరాజనరేంద్రుడు జన్మించాడు. రెండవభార్య తెలుగుచోళుల ఆడబడుచు మేళవ. ఆమెవలన విజయాదిత్యుడు పుట్టాడు. విమలాదిత్యుని తరువాత రాజరాజు క్రీ.శ. 1019లో రాజైనాడు. కాని, విజయాదిత్యునికీ అతనికీ పడలేదు. విజయాదిత్యుడు కర్ణాట (పశ్చిమ) చాళుక్యుల సాయంతో రాజరాజుపై దాడిచేశాడు. రాజరాజు తన మేనమామ అయిన మొదటి రాజేంద్రచోళ చక్రవర్తి సాయంతో విజయాదిత్యుడిని ఓడించి, మేనమామకూతురు అమ్మంగదేవిని వివాహమాడి క్రీ.శ. 1022 ఆగష్టు 22వ తేదీన బెజవాడలో పట్టాభిషిక్తుడైనాడు.

క్రీ.శ. 1031లో విజయాదిత్యుడు కర్ణాట చాళుక్యుల సాయంతో వేంగిమీద మరల దండెత్తి బెజవాడను ఆక్రమించాడు. రాజరాజు చోళదేశానికి పారిపోయి మరల క్రీ.శ. 1035లో చోళులసాయంతో బెజవాడను స్వాధీనం చేసికొని వేంగీరాజ్యాధిపతి అయినాడు. అలాగే కర్ణాటక చాళుక్యులు క్రీ.శ. 1044లో వేంగిని మరల ఆక్రమించటం, తిరిగి రాజరాజు క్రీ.శ. 1047లో వేంగిని గెలుచుకోవటం జరిగింది. రాజరాజు వేంగీ రాజధానిని రాజమహేంద్రవరానికి మార్చుకొన్నాడు. క్రీ.శ. 1053 వరకు వేంగి కొంత శాంతియుతంగానే ఉన్నది. కాని, 1053లో జరిగిన కొప్పం యుద్ధంలో అప్పటి చోళదేశాధిపతి ప్రథమ రాజాధిరాజు మరణించటంతో రాజరాజుకు చోళుల సహాయం అందటం ఆగిపోయింది. అందువలన పశ్చిమచాళుక్యులతో తన

జీవితకాలమంతా మైత్రితో ఉండేటట్లు సంధి చేసికొన్నాడు. ఆ సంధిని సాధించటంలో నన్నయభట్టు రాయబారిగా కృషి చేశాడు. అతనికి సహాధ్యాయుడైన పశ్చిమచాళుక్య మంత్రి నారాయణభట్టు సహాయపడ్డాడు. పశ్చిమచాళుక్యులస్థానాపతిగా వేంగికి వచ్చిన నారాయణభట్టుకు రాజరాజు అగ్రహార మిచ్చి గౌరవించాడు. ఆ తరువాత - అంటే 1054 - 1061 సం॥రాల మధ్యకాలంలో - నన్నయ భారతరచన చేపట్టి నిర్వహించి ఉంటాడు. నారాయణభట్టు నన్నయకు విలువైన సలహాల నిస్తూ, కురుక్షేత్రయుద్ధంలో నరునికి నారాయణుడు తోడ్పడ్డట్లుగా సహాయం చేసి ఉంటాడు.

రాజరాజనరేంద్రు డెదుర్కొన్న రాజకీయ పరిస్థితుల వెనుక మత విషయకమైన కారణాలు ఉండటం గమనింపదగిన అంశం. 11వ శతాబ్ది ప్రారంభంనాటికి తీరాంధ్రంలో బౌద్ధమతం క్షీణదశలోకి వచ్చింది. జైనం ప్రాబల్యం కోసం ప్రాకులాడుతున్నది. పశ్చిమ చాళుక్యులు జైనులు. వారు వేంగిమీద దండెత్తడానికీ, విజయాదిత్యునికి తోడ్పడటానికీ జైనమతం కూడా ఒక బలమైన కారణం కావచ్చు. విమలాదిత్యుడు చివరిరోజుల్లో వైదికధర్మాన్ని వదలి జైనమతాన్ని స్వీకరించాడు. అతడు పెండ్లాడిన ఇద్దరు రాణులలో మేళవ జైనమతాభిమానం గల రాణి. చోళరాజకన్య కుందవ వైదికధర్మ మార్గావలంబ, శివభక్తురాలు. ఆ యిద్దరు రాణులకు పుట్టిన పుత్రులు కూడా తల్లులు అభిమానించిన మతాలనే తమ ధర్మాలుగా గ్రహించి జీవితాలను సాగించారు. ఈ వాతావరణాన్ని పట్టి చూస్తే రాజరాజనరేంద్రునికీ, విజయాదిత్యునికీ నడుమ జరిగిన యుద్ధాలకు మతప్రాతిపదికలు కూడా ఉన్నాయని స్పష్టమౌతున్నది.

అయితే, తూర్పుచాళుక్య ప్రభువులలో చాలమంది వైదికధర్మాన్ని స్వీకరించి, దానిని పోషించినవారే. దానికితోడు ఆంధ్రభాషా సాహిత్యాలపై అమితమైన అభిమానాన్ని ప్రకటించి శాసనభాషగా, ప్రజాభాషగా, కావ్యభాషగా తెలుగును అభివృద్ధి చేసి, మహాకావ్యనిర్మాణానికి దోహదం చేసినవారే. వైదికధర్మాభిమానం తూర్పుచాళుక్యులకు ముందున్న పల్లవ, శాలంకాయన, విష్ణుకుండినుల కాలంనుండే కొనసాగుతున్నది. ఆ యుగాలలో రాజులు అశ్వమేధాది క్రతువులు చేయగా, తూర్పుచాళుక్యులు క్రతువులను మాని వేదవిద్యను ఘటికాస్థానాలద్వారా, గ్రామవిద్యాపీఠాల ద్వారా వ్యాపింపజేశారు. వైదికధర్మాన్ని దేవాలయ వ్యవస్థల ద్వారా విస్తరింపజేశారు. చాళుక్యులు నిర్మించిన దేవాలయాలు, వారి శిల్పరీతి, పౌరాణికాది వృత్తుల నేర్పరచిన తీరు తెలుగువారి చరిత్రలో ఒక క్రొత్త ఒరవడిని సృష్టించాయి.

వర్తమాన ఆంధ్ర సంస్కృతికి మొదటిసారి ప్రాతిపదికలు బలంగా పడింది తూర్పు చాళుక్యుల కాలంలోనే అని చారిత్రకులు పేర్కొన్నారు. చాళుక్యులు దేవాలయాలను గ్రామీణ సంస్కృతికి కేంద్రాలుగా పోషించారు. ప్రజలకు ధార్మికవిద్యను, సంస్కృతిని ప్రబోధించటానికి పౌరాణికులను నియోగించారు. వేదవిద్వాంసులకు అగ్రహారాలను విరివిగా దానం చేశారు. భారతీయ విజ్ఞాన నిధు లైన వేద, శాస్త్ర, పురాణాలను ప్రజలలో వ్యాపింపజేయటానికీ, వర్ణాశ్రమధర్మాలనూ, ముఖ్యంగా జైన బౌద్ధ ధర్మాల వలన శిథిలమైన గార్హస్థ్యాది ఆశ్రమ ధర్మాలనూ పునరుద్ధరించి వైదికధర్మాశ్రితమైన జీవనవిధానాన్ని ప్రజలలో వ్యాపింపజేసి సామాజికవ్యవస్థను పునర్నిర్మించాలని ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో భాగంగానే పంచమవేదమని ప్రసిద్ధిగాంచిన ఆంధ్రమహాభారతాన్ని "కృష్ణద్వైపాయనముని వృషభాభిహిత మహాభారతబద్ధ నిరూపితార్థం" ఏర్పడేటట్లుగా తెలుగులో నిర్మింపజేసి, తెలుగులోనే వైదికధర్మాన్ని తెలుగువారికి చెప్పించాలని కంకణం కట్టుకొన్నారు. సాంస్కృతికమైన సముద్ధరణానికి భాషాపోషణం చేపట్టి, ప్రజలభాషలోనే ఉదాత్తసాహిత్యాన్ని నిర్మించే యత్నం చేశారు తూర్పుచాళుక్యులు. దాదాపు మూడు శతాబ్దాల కృషి రాజరాజ నరేంద్రుని కాలంలో ఫలించి నన్నయభారతంగా అవతరించింది.

వ్యాసుడు జయవాక్యాన్ని వ్రాసినప్పుడూ, ఆయన శిష్యులు దాన్ని మహాభారతంగా విస్తరింప జేసినప్పుడూ ఎటువంటి మతసామాజిక పరిస్థితులు ఆయా కాలాలలో వాటికి ప్రేరక శక్తులుగా ఎట్లా పనిచేశాయో, తెలుగులో కవిత్రయం మహాభారతాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రచించటానికి కూడా ఆనాటి మత సామాజిక పరిస్థితులు అట్లా కారణా లయ్యాయి. వాటికి తోడు సాహితీపరిస్థితులు కూడా ఆంధ్రమహాభారత రచనకు విశేషంగా కాలికస్పృహను కల్పించాయి. నన్నయ భారతావతరణకు మతకారణా లెంత బలమైనవో అంతకంటె మిన్నగా సాహితీపరిస్థితుల ప్రేరణలు బలవత్తరాలైనవిగా కనపడుతున్నాయి.

తూర్పుచాళుక్యులు తెలుగును రాజభాషగా చేసి ప్రజలభాషను గౌరవించారు. సంస్కృతభాషతోపాటు తెలుగులో కూడ శాసనాలు వేయించారు. శాసనాలలో పద్యాలను వాడారు. సంపూర్ణచ్ఛందోబద్ధ శాసనాలు కూడా తూర్పుచాళుక్యులే వ్రాయించారు. ఆ కాలంలో వెలువడిన పండరంగని అద్దంకి శాసనంలో (క్రీ.శ. 849) ఒక తరువోజ వాడబడి ఉన్నా, అదే కాలంలోనే వేయించిన గుణగ విజయాదిత్యుని కందుకూరు శాసనం మొత్తం సీసపద్యమయంగా ఉండటం గమనించదగింది. ఆ తరువాత యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో అయిదు మధ్యాక్కరలు వాడబడినవి. మొత్తంమీద క్రీ.శ.తొమ్మిదవశతాబ్దంలో వేసిన తెలుగుశాసనాలలో జాతులో, ఉపజాతులో ప్రసిద్ధంగా ప్రయోగింపబడ్డాయి. క్రీ.శ. 1000 ప్రాంతంలో నిలిపిన విరియాల కామసాని గూడూరు శాసనంలో మూడు చంపకమాలలు, రెండు ఉత్పలమాలలు కనబడుతున్నాయి. అంటే 11వ శతాబ్దినాటికి చంపకమాలాది సంస్కృత వృత్తాలూ, మధ్యాక్కర, సీసం,తేటగీతి, ఆటవెలది, కందం మొదలైన దేశిచ్ఛందస్సులూ శాసనాలలోకి ఎక్కాయంటే పద్యకవిత్వం ప్రజలకు బాగా దగ్గరగా చేరి ప్రచారంలో ఉండేదన్నమాట! శాసనపద్యాలలో నన్నయ పద్యశైలితో పోలిన రచన ఒకింత గోచరించటం వలన నన్నయకుముందు దాదాపు రెండు మూడు వందల యేండ్లనుండి తెలుగుపద్యకవిత్వం ప్రజాదరణం పొంది ఉన్నదని తెలుస్తున్నది.

"మును మార్గకవిత లోకం
బున వెలయఁగ, దేశికవితఁ బుట్టించి తెనుం
గును నిలిపి రంధ్రవిషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్".

అని నన్నెచోడుడు తన కుమారసంభవ కావ్యావతారికలో పేర్కొన్నాడు. సంస్కృతసాహిత్య సంప్రదాయాల ననుసరించి వ్రాసే కవిత్వం మార్గమనీ, దేశభాషాసాహిత్య స్వభావాలను సంవదించుకొన్నది దేశి అనీ స్థూలంగా వివేచించవచ్చును. తూర్పు చాళుక్యులు దేశభాషలలో కవిత్వం రచింపచేసే ప్రయత్నం చేశారు. నన్నయకూడా తూర్పుచాళుక్యులు సాగించిన సాహిత్యోద్యమంలో భాగంగా ఆంధ్రమహాభారత రచనను చేపట్టాడని స్పష్టం. ఆయనకు రాజూ, విద్వత్పరిషత్తులూ అండగా ఉన్నాయని 'అవతారిక' చెపుతున్నది.

నన్నయకు ముందు కన్నడంలో క్రీ.శ. 940 నుండి పంపమహాకవియుగం సాగుతున్నది. పంపడు వేంగీమండలంలో పుట్టిన తెలుగువాడైనా, జైనమతాన్ని స్వీకరించి, కన్నడ చాళుక్యుల నాశ్రయించి, వేములవాడలో అరికేసరి ఆస్థానంలో స్థిరపడ్డాడు. అతడు జైనుల ప్రథమ తీర్థంకరుడైన వృషభదేవుని చరిత్రను 'ఆదిపురాణం' గా రచించాడు. మహాభారత కథను జైనమతానుగుణంగా మార్చి, 'విక్రమార్జునీయ' మనే కావ్యాన్ని నిర్మించాడు. ఒక మత పురాణం, ఒక మత కావ్యం వ్రాసే సంప్రదాయాన్ని పంపడు కన్నడ సాహిత్యంలో ప్రారంభించాడు. అతనికి "ప్రసన్న గంభీర వచన రచన చతుర కవితా గుణార్ణవు' డనీ, 'దేశి మార్గ సంయోగ' రూపమైన కావ్యశైలిని నిర్మించిన 'ఆదికవి' అనీ బిరుదు లుండేవి. పంపడు తన కావ్యాలలో ఉత్పలచంపకాదులనూ, కన్నడ దేశిచ్ఛందాలనూ వాడాడు. నన్నయకు ముందు పంప మహాకవి ప్రారంభించిన యుగాన్ని కన్నడ సాహిత్య చరిత్రకారులు స్వర్ణయుగంగా కీర్తించారు.

నన్నయ పంపని కావ్యశైలి వంటి కవితాశైలిని స్వతంత్రంగా తెలుగులో నిర్మించుకొన్నాడు. అయితే, పంపనిది రీతి ప్రధానమైన శైలి. నన్నయది గుణప్రధానమైన శైలి. అయినా, పంపకవివలెనే తెలుగులో మార్గదేశిపద్ధతులను మేళవించి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దేశీయమైన కావ్యమార్గాన్ని ఏర్పరిచాడనీ, అందుకే నన్నయను పంపకవి వలె 'ఆదికవి' అని పిలుస్తారనీ చరిత్ర సాక్ష్యం చెపుతున్నది. కన్నడంలో పురాణాలనూ, కావ్యాలనూ మతప్రచారస్పృహతో వ్రాసే సంప్రదాయం పంపడు ప్రచారంలోకి తెచ్చాడు. నన్నయ మత ప్రచార స్పృహకంటె సాహిత్యస్పృహను ఎక్కువగా రచనలో పాటించాడు. మతముద్ర వేసికొన్న పురాణప్రక్రియను, కావ్యప్రక్రియను వదలి, ఇతిహాసమైన మహాభారతాన్ని ఎన్నుకొన్నాడు. మానవజీవితంలోని చతుర్విధ పురుషార్థసాధన సమగ్ర చిత్రణం, దానికి సంబంధించిన శాస్త్రబోధనం చేయగల భారత సంహితను ధర్మదృష్టితో కావ్యకళాస్పృహతో నిర్మించాడు. దక్షిణాది భాషాసాహిత్యాలలో దేనికీ లేని ఒక విశిష్టమైన వ్యక్తిత్వం తెలుగు సాహిత్యానికి ఆంధ్రభారత రచనవలన నన్నయ కలిగించాడు.

నన్నయకు ముందు తెలుగులో ప్రజలు పాడుకొనే పాటలు ఉన్నాయి, పద్యరచన ఉన్నది కాని, ఒక మహాకావ్యశైలితో కూడిన కవిత్వం లేదు. నన్నయ దానిని చంపూపద్ధతిలో నిర్మించాడు. నన్నయ చంపూమార్గాన్నే తెలుగులో పద్యకావ్య ఫణితిగా ప్రవర్తిల్లజేశాడు. అందువలన తెలుగులో 'చంపూకావ్యం' అనే పారిభాషికపదం మృగ్యమై పోయింది. అదికారణంగా తిక్కన నిర్వచన కావ్యప్రక్రియను ఆపేరుతో ప్రత్యేకంగా చెప్పకోవలసి వచ్చింది. సంస్కృతంలోనూ ఇతర దక్షిణభాషాసాహిత్యాలలోనూ నిర్వచన కావ్యప్రక్రియ అనే పేరు లేదు. ఇటువంటి విశేషాలు నన్నయ తిక్కనాదులు తెలుగు సాహిత్యప్రక్రియలకు కల్పించిన ప్రత్యేకతకు పతాకలుగా నిలిచిఉన్నాయి.

కవియొక్క కవితాశైలి అతని సాహిత్యదర్శనం నుండి, వ్యక్తిత్వం నుండి పుట్టుతుంది. 11వ శతాబ్దపు సామాజిక పరిస్థితులకు తగిన వస్తువు మహాభారతేతివృత్త మైతే ఆ కాలానికి అత్యంత ఆధునికమైన కవితాదృక్పథం నన్నయది. క్రీ.శ. 11వ శతాబ్దం నుండి 18వ శతాబ్ది వరకు గల కాలాన్ని అఖిలభారతదేశంలో సాహిత్య దర్శనపరంగా 'ధ్వన్యనంతరయుగ' మని సాహిత్య విమర్శకులు వ్యవహరిస్తున్నారు. అందులో మమ్మటాదుల నుండి జగన్నాథ పండితరాయల వరకూ అనేకమంది లాక్షణికులు అనుసరించిన ధ్వనిమార్గాన్నీ రసమార్గాన్నీ సమర్థించే శాఖ ఒకటి. దానికి అనుగుణంగా కావ్యశైలిని నిర్మించే పద్ధతికి తెలుగులో శ్రీకారం చుట్టాడు నన్నయభట్టారకుడు. అతనిది ప్రధానంగా ధ్వనిప్రస్థానం. ఆ తరువాత తిక్కన, ఎఱ్ఱనలు నన్నయ ననుసరించారు. కవిత్రయంలో నన్నయ వస్తుధ్వనిని, తిక్కన రసధ్వనిని, ఎఱ్ఱన అలంకార ధ్వనిని ప్రధానంగా పోషించారు. సాహిత్య ప్రస్థానాలలో ఉత్తమమైనదిగా ఈనాటికీ పరిగణింపబడే ధ్వనిప్రస్థానం ఆదికవి నన్నయ కవితాశైలికి ప్రాతిపదిక కావటంచేత ఆంధ్రమహాభారతం తెలుగులో వెలువడిన ఉత్తమ సాహిత్య రచనగా నేటికీ సాహితీవేత్తలచేత పరిగణింపబడుతున్నది.

రాజరాజనరేంద్రుడు - కృతిశ్రోత, కృతిభర్త

రాజరాజనరేంద్రుడు మహావిద్వాంసుడు. ఆయన భారతీయ సాహిత్యాలను మథించాడు. పురాణాలను పక్షపాత రహితమైన బుద్ధితో విన్నాడు. అర్థ ధర్మ శాస్త్రాలను స్వయంగా చదివి తెలిసికొన్నాడు. ఉదాత్తరసాన్విత కావ్య నాటకాలను, వాటి వివిధ ప్రయోగ విధానాలను నిశితంగా పరిశీలించాడు. ప్రసన్నం చేసికొన్నాడు. ఈశ్వరాగమాలలో మనస్సును భక్తితో నిలిపాడు. అయినా, ఆయనకు వాటన్నింటికంటే శ్రీమహాభారతంలోని పరమార్థాన్ని వినాలనే అభిలాష ఎప్పుడూ మెండుగా ఉండేది. అంటే - భారతీయ శాస్త్ర సాహిత్య గ్రంథాలన్నింటిలో మహాభారతమే శ్రేష్ఠ మైనదని ఆయన నిశ్చితాభిప్రాయమన్నమాట!

రాజరాజనరేంద్రుని మనస్సుకు అయిదంశాలు అపరిమితమైన ప్రీతి కలిగిస్తాయి. అవేమంటే - బ్రాహ్మణోత్తములను పూజించాలనే అభిలాష, భారతాన్ని వినాలనే ఆసక్తి, పరమేశ్వరుడిని ఆరాధించాలన్న మహోత్సాహం, ఎల్లప్పుడూ అడిగినవారికి లేదనకుండా దానం చేయాలనే స్వభావం, సదా మంచివారల సాంగత్యంలో ఉండాలనే అభిలాష, వీటిలో భారత శ్రవణాసక్తి భారతరచనను ప్రోత్సహించింది.

చంద్రుడు మొదలుకొని క్రమంగా పూరుడు, భరతుడు, కురుమహారాజు, పాండురాజు వంశకర్తలుగా ప్రసిద్ధి చెందిన తన వంశంలో నిర్మలగుణశోభితులైన పాండవుల ఉత్తమచరిత్ర ఎప్పుడూ వినాలనే అభిలాష ఆయనను నన్నయచేత ఆంధ్రమహాభారతాన్ని రచింపచేయటానికి ప్రేరేపించింది.

భారతం వింటే బంగారు తొడుపులతో కపిలగోవులను నూరింటిని విప్రులకు దానంచేసిన పుణ్యం కలుగుతుందని రాజరాజు విశ్వాసం. అనేక భాషలలో, అనేక ప్రక్రియలలో అనేకమంది జనులవలన భారతకథను వింటూ అందులో ఆసక్తిని పెంచుకొనే వారికి అనేక యజ్ఞాలు చేసిన పరమఫలం లభిస్తుందని రాజరాజు నమ్మకం. అందువలన సంస్కృత మహాభారతంలో వేదవ్యాసుడు ఏ తాత్పర్యాన్ని, ఏ ధర్మతత్త్వాన్ని, ఏ సందేశాన్ని నిబద్ధించి నిరూపించాడో దానినే తెలుగులో వినాలని కుతూహలపడి రాజరాజ నరేంద్రుడు నన్నయభట్టును ఆంధ్రమహాభారతాన్ని రచించి వినిపించుమని కోరాడు. అయితే, ఆయన ఎక్కడా భారతాన్ని తనకు అంకిత మిమ్మని కోరలేదు. నన్నయకూడా అంకిత మిస్తున్నట్లు వాచ్యం చేయలేదు. ఆ మర్యాదలలో ఒకటైన షష్ఠ్యంతాల వంటి వేమీ వ్రాయలేదు. అయినా రాజరాజుకే తన భారతాన్ని వినిపించాడు. కృతిని అంకితం తీసికొనేవాడు కృతిభర్త. వినేవాడు కృతిశ్రోత. ఈ రెండుసంప్రదాయాలూ కావ్యజగత్తులో ఉన్నాయి. వాటిని ఒకేకావ్యంలో విడివిడిగా పాటించే పరిపాటికూడా ఉన్నది (కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి శ్రీమద్రామాయణ కల్పవృక్షం అందుకు ఉదాహరణం). ఆదికవి అయిన నన్నయ ఆంధ్రమహాభారతంలో కృతిభర్తృ శ్రోతృ సంప్రదాయాలను ఏకంచేసి అద్వైతస్థితిని పాటించారు. నన్నయ భారతభాగానికి కృతిశ్రోత అయిన రాజరాజనరేంద్రుడు కృతిభర్త కూడా. తిక్కన భారత భాగానికి కృతిభర్త అయిన హరిహరనాథుడు కృతిశ్రోత కూడా!

నన్నయ గురుపద్యవిద్యకు ఆద్యుడు

ఉ. "ఆదరణీయసార వివిధార్థగతి స్ఫురణంబు గల్గి య
ష్టాదశ పర్వనిర్వహణ సంభృతమై పెనుపొందియుండ నం
దాదిఁ దొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్". **(విరా. 1.6.)**

అని తిక్కన సోమయాజి నన్నయభట్టును ప్రస్తుతించాడు. మహాభారతంలో ఆదరింపదగినవీ, సారవంతమైనవీ అయిన బహువిధాలైన అర్థాలు ప్రతీయమానాలౌతుంటాయనీ, వాటి స్ఫురణను పసికట్టి దక్షతతో తెలుగున నన్నయ నిర్వహించాడని చెప్పటం ఒక యెత్తు. ఆంధ్రకవిత్వానికి ఒక బాటను చూపి గురువుగా, గురుపద్యవిద్యకు ఆద్యుడుగా గౌరవింపదగిన విశారదునిగా నన్నయను పేర్కొనటం మరొకయెత్తు. 'విద్యాదయితుండు' అని ప్రశంసించటం మరింకొక యెత్తు. ఆంధ్ర పద్యవిద్యకే కాక కావ్యవిద్యకు కూడా ఎన్నో శ్రీకారాలను తెలుగువారికి అందించిన ప్రతిభామూర్తి నన్నయ. అందువల్లనే ఆయన మహితాత్ముడు. తెలుగులో కావ్యరచనం చేసే ప్రతికవీ ముందుగా నమస్కారం చేయదగినవాడని నన్నయను తిక్కన ప్రశంసించాడు. అది సత్యం!

రాజరాజనరేంద్రుడు కూడ ఆంధ్రమహాభారతాన్ని తెలుగులో నిర్మించగలిగిన మహితాత్ముని లక్షణాలూ, మహాకవి లక్షణాలూ నన్నయలో దర్శించాడు. నన్నయ భారతావతారికలోని 'తన కులబ్రాహ్మణుడు' (1.9.) అనే పద్యం అందుకు సాక్ష్యం. అందులో నన్నయకు వేసిన విశేషణాలను రెండు రకాలుగా విభజించవచ్చును. అవి - 1. నన్నయ వ్యక్తి వివరాలు. 2. నన్నయ సాహితీ వ్యక్తిత్వపు వివరాలు. మొదటి రకానికి చెందినవి -1. నన్నయ రాజరాజనరేంద్రునికి 'కులబ్రాహ్మణుడు'. అంటే వంశపారంపర్యంగా నియమింపబడే పురోహితుడనే మంత్రి. 2. అనురక్తుడు. అంటే రాజుకు ప్రియమిత్రుడు. 3. అవిరళజపహోమ తత్పరుడు. అంటే వేదవిహితమంత్రతంత్ర కర్మలు ఆచరించేవాడని అర్థం. (జపం మంత్రాలకు సంబంధించింది. హోమం

యజ్ఞకర్మవిధులకు సంబంధించింది.) 4. సంహితాభ్యాసుడు అంటే వేదాధ్యయన అధ్యాపనాలలో సమర్థుడు. 5. పాత్రుడు - దానగ్రహణానికీ, ప్రశంసలకూ యోగ్యుడైనవాడు. 6. ఆపస్తంబసూత్రుడు 7. ముద్గలగోత్రజుడు - ఈరెండూ నన్నయ ధార్మిక జీవనపద్ధతికీ వంశౌన్నత్యానికీ సంబంధించినవి. 8. సద్వినుతావదాతుడు. 9. నిత్యసత్యవచనుడు 10. బుద్ధిలో బృహస్పతివంటివాడు. 11. సుజనుడు (ఉత్తముడు, మంచివాడు) - ఈ గుణాలన్నీ నన్నయయొక్క ఉత్తమశీలాన్ని, ఉత్తమవ్యక్తిత్వాన్నీ, బుద్ధిశక్తినీ తెలుపుతున్నాయి.

ఇక నన్నయ సాహితీవ్యక్తిత్వాన్ని తెలిపే విశేషణాలు. 1. విపుల శబ్దశాసనుడు - తెలుగులో మొదటి కావ్యం వ్రాయవలసిన కవికి సంస్కృతాంధ్ర శబ్దపరిజ్ఞానం విస్తారంగా ఉండాలి. ఆ అర్హతను ఈ విశేషణం సూచిస్తున్నది. 2. బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతుడు - అష్టాదశ మహాపురాణాలలోని వివిధ వేదశాస్త్ర విశేషాలు తెలిసి ఉంటే తప్ప 'పంచమవేద' మైన మహాభారతాన్ని వ్రాయటం సాధ్యంకాదు. 3. లోకజ్ఞుడు - కవికి లోకవ్యుత్పత్తి వ్యవహార విజ్ఞానాన్నీ, పాత్రచిత్రణ నైపుణ్యాన్నీ కలిగిస్తుంది. 4. ఉభయభాషాకావ్యరచనాభిశోభితుడు - సంస్కృతాంధ్ర భాషలలో కావ్యరచనం చేయగల సమర్థుడే మహాభారత రచనకు అర్హుడు. 5. సత్ప్రతిభాభియోగ్యుడు - నవనవోన్మేషశాలిని అయిన ప్రజ్ఞతో, అపూర్వనిర్మాణక్షమమైన ప్రజ్ఞతో ప్రకాశించేవాడు కాబట్టే తెలుగు భారతాన్ని అనువాదంగా కాక అనుసృజనంగా తీర్చిదిద్దగలిగాడు. మహితాత్ముడైన మహాకవియే మహాభారత రచనకు సమర్థుడని నన్నయవ్యక్తిత్వం ఋజువు చేస్తున్నది.

నన్నయ తాను చేసిన పూర్వకవిస్తుతిలో తన కవితావ్యక్తిత్వాన్ని ధ్వనింపజేశాడు. నన్నయ వాల్మీకి వ్యాసులను మాత్రమే కీర్తించాడు. దానికి కారణం ఆ యిద్దరి కవుల లక్షణాలూ నన్నయలో ఉన్నవి కాబట్టి. వాల్మీకిని 'గురుపద్యవిద్య'కు ఆద్యునిగా ప్రశంసించాడు. తెలుగువారు పద్యమనే పదాన్ని శ్లోకానికే కాదు లయబద్ధమైన ఎటువంటి కవితాభివ్యక్తికైనా వాడవచ్చుననే స్ఫూర్తిని నన్నయ నుండే గ్రహించారు. 'వచనపద్య' మనే నేటి వ్యవహారం గమనార్హం. ఈవిధంగా సంస్కృతంలో వాల్మీకి వలె తెలుగులో నన్నయ పెద్దదైన (అనంతకాలంగా సాగే) పద్యవిద్యకు ఆద్యుడు. యతిప్రాసల నియమాలతో కూడిన తెలుగు పద్య శిల్పం ఎంత కళయో, అంత శాస్త్రవిద్య. దాని కొక సమగ్రరూపాన్ని ప్రసాదించిన ప్రజ్ఞామూర్తి నన్నయ. నన్నయ వాడిన ఛందస్సులలోనే ఇప్పటికీ పద్య కావ్యకవులు రచనలు చేస్తూ ఉండటం అందుకు సాక్ష్యం. తెలుగుజాతి చిత్తవృత్తికి అనువైన ఛందస్సులను ఎన్నుకొని శిథిలం కాని మార్గాన్ని చూపిన పద్యవిద్యాచార్యుడు నన్నయ. 'గురుపద్యవిద్యకు నాద్యున్' అనే విశేషణానికి 'గురున్, పద్యవిద్యకు ఆద్యున్' అనే పాఠాంతరం ఉన్నది. అప్పుడు ''గురుఃబద్యవిద్యకు నాద్యున్'' అని ఉండాలి. ఆ అర్థం కూడా నన్నయకు అక్షరాలా అన్వయిస్తుంది. తెలుగు కవులకు నన్నయ ఆదిగురువు. వాల్మీకిని బ్రహ్మకల్పు డన్నాడు నన్నయ.తెలుగులో కావ్యశైలికి నన్నయకూడా బ్రహ్మకల్పుడే. 'ఋషివంటి నన్నయ రెండవ వాల్మీకి' అనే విశ్వనాథవారి ప్రశంస ఇక్కడ స్మరింపదగినది.

నన్నయ వ్యాసమహర్షిని విజ్ఞాన భాస్కరుడిగా కీర్తించాడు. భారత భారతీ వినీలాకాశంలోని అజ్ఞాన తిమిరాలను పోగొట్టి, పండితుల మనఃపద్మాలను వికసింపజేసే వ్యాసమహర్షిని ఒక జ్ఞానిగా భావించాడు. నన్నయ వాల్మీకి వంటి కవి, వ్యాసుడివంటి జ్ఞాని. అందువలననే శాస్త్రేతిహాసమైన సంస్కృత భారతాన్ని తెలుగులో కావ్యేతిహాసంగా నిర్మించగలిగాడు. పూర్వకవిస్తుతిలో ఎన్నుకొన్న వాల్మీకి వ్యాసుల వ్యక్తిత్వాలు తన సాహితీ వ్యక్తిత్వంలో ప్రతిఫలించి ఉండటంచేతనే నన్నయ ఆత్మాశ్రయ స్ఫూర్తితో వాటిని ఆవిష్కరించాడు.

ఆంధ్రమహాభారతం అనువాదం కాదు; అనుసృజనం

''జననుత కృష్ణద్వైపా
యనమునివృషభాభిహిత మహాభారతబ

ద్ధనిరూపితార్థ మేర్పడఁ
దెనుఁగున రచియింపు మధికధీయుక్తిమెయిన్.” **(ఆది.1.16)**

అని నన్నయను రాజరాజనరేంద్రుడు కోరినప్పుడు వ్యాసమునిచేత మహాభారతంలో ప్రతిపాదింపబడి నిరూపింపబడిన పరమార్థం తేటపడేటట్లు అధికమైన బుద్ధిశక్తితో తెలుగున రచింపుమన్నాడేకాని, మూలానికి నకలుగా తెలుగుచేయుమని, అంటే అనువదించుమని కోరలేదు. అందువలన నన్నయభారతం - ఆమాటకు వస్తే కవిత్రయభారతం - అనువాదం కాదు. అనుసృజనం, పునస్సృష్టి.

ఈ క్రింది అంశాలు ఈ నిర్ణయాన్ని బలపరుస్తాయి -

1. మూలంలోని హరివంశాన్ని తెలుగులోకి తేకుండా మహాభారతేతిహాసానికి ఆదిపర్వంనుండి స్వర్గారోహణపర్వం వరకూ సాగిన ఇతివృత్తంతో ఇతిహాసస్వరూపాన్ని సుసంఘటితంచేయటం. శ్రీకృష్ణనాయకమని అన్వయించటానికి అవకాశం తగ్గించి పాండవనాయకంగా ఆంధ్రభారతాన్ని స్థిరీకరించటం.

2. ధ్వన్యాలోకకర్త అన్నట్లు సంస్కృతమహాభారతం ‘శాస్త్రరూప కావ్యచ్ఛాయాన్వయి’; కావ్యమీమాంసాకర్త వివేచన ననుసరించి శాస్త్రేతిహాసం. అంటే వ్యాసమహర్షి చతుర్విధ పురుషార్థవ్యుత్పత్తిని వేదతత్త్వానుకూలంగా శాస్త్రీయంగా మిత్రసమ్మితంగా చెప్పాలని భావించి దానికి ఆలంబనగా చంద్రవంశచరిత్రను చేపట్టాడు. అందువలన వ్యాసమహర్షికి శాస్త్రప్రతిపాదన దృక్పథం, ప్రబోధ ప్రవృత్తీ ప్రధానంగా ఉన్నాయి. అంటే కావ్యస్పృహకంటె శాస్త్రస్పృహ వ్యాసుడికి ఎక్కువ అన్నమాట! నన్నయ వ్యాసభారతం కంటె వేరైన ప్రక్రియా దృక్పథంతో ఆంధ్రమహాభారతం నిర్మించాడు. ఆనందవర్ధనుని మాటల్లో మలిచి చెప్పాలంటే నన్నయ ఆంధ్రభారతాన్ని ‘కావ్యరూప శాస్త్రచ్ఛాయాన్వయి’గా రూపొందించాడు. మూలతాత్పర్యాన్ని కావ్యస్పృహతో ఆవిష్కరించాడు. అందువలన నన్నయరచన కావ్యేతిహాసంగా మారింది. మూలప్రక్రియ మారితే అది పునస్సృష్టియే అవుతుందికాని, అనువాదం అనిపించుకోదు.

3. ఆనందవర్ధనుని అన్వయం ప్రకారం వ్యాసమహాభారతంలో రసం శాంతం. మరి, నన్నయతో ఆరంభింపబడి తిక్కన ఎఱ్ఱనలతో ముగింపబడిన తెలుగు భారతంలో రసం ధర్మవీరం. రససమన్వయసూత్రం మూలభారతానికి ఒకవిధం; ఆంధ్రభారతానికి మరొకవిధం. ఈ రకంగా రసనిర్వహణలో స్వతంత్రదృష్టి సారించిన నన్నయ చేసింది అనుకరణంకాని, అనువాదంకాని కాదు. అనుసృజనం ఔతుంది.

4. వేదం శబ్దప్రధానం; ఇతిహాస పురాణాలు అర్థప్రధానాలు; కావ్యం ఉభయప్రధానం. వ్యాసభారతం అర్థప్రధానమైన శాస్త్రేతిహాసం. కవిత్రయభారతం ఉభయప్రధానమైన కావ్యేతిహాసం. కావ్యస్వభావాన్ని ఇతిహాసానికి జోడించి ఉత్తమమిశ్రప్రక్రియగా రూపొందించాడు నన్నయ. నన్నయ చూపించిన మిశ్రప్రక్రియాపరికల్పనం తెలుగుసాహిత్య ప్రయోగాలకు ఒక విశిష్టప్రస్థానాన్నే ప్రసాదించింది. ప్రాచీనాంధ్ర సాహిత్యవికాసచరిత్రమంతా దానికి సజీవసాక్ష్యం. మహాకవులు భారతాన్ని మహాకావ్యమంటారు. అందుకే. అర్థప్రధానమైన రచనను ఉభయప్రధానంగా మార్చటం అనువాదధోరణి కాదు. పునస్సృష్టి వైఖరి.

5. సంస్కృత మహాభారతంలోని శ్లోకరచనాశైలికంటె విశిష్టమైనదీ, రసవ్యంజకమైనదీ నన్నయ పద్యరచనాశైలి. నన్నయ శబ్దగుణప్రధాన రచన చేశాడు; తనదైన పద్యశైలి ఉదాత్తమైన ఒరవడిలో రూపొందించాడు; ధ్వనిభేదాలలోని వస్తుధ్వనిశిల్పాన్ని కవితాప్రవృత్తిగా పరిపోషించాడు. వ్యాసశైలికీ, నన్నయ (కవిత్రయ) శైలికీ సామ్యం లేదు. నన్నయపద్యశిల్పం మూలంకంటె విలక్షణ మైనది; స్వయంప్రకాశమైన దేశీయవ్యక్తిత్వం కలిగినది. నన్నయశైలి ఆంధ్రమహాభారతానికి జీవితం. శైలితో స్వంతముద్రవేసికొన్న తెలుగురచన అనువాదం కాదు; అనుసృజనమే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6. అనువాదమని భావించేవారుకూడా నన్నయది (కవిత్రయంవారిది) శబ్దానువాదం, భావానువాదం కాదనీ కథానువాదమనీ, స్వతంత్రానువాదమనీ వివేచించటం గమనింపదగిన అంశం. మూలభారతం భిత్తిక వంటిది; దానిమీద సాగే వర్ణచిత్రలేఖనం వంటిది నన్నయరచన.

7. నన్నయ తన కవిత్వానికి ప్రత్యేకంగా లక్షణాలను చెప్పుకొన్నాడు. ఆ లక్షణాలలో కథాకథనశిల్పానికి సంబంధించింది ఒకటి; పద్యరచనాశయ్యకు సంబంధించింది ఒకటి; ప్రజలనాలుకలమీద బ్రతుకగలిగిన సుభాషితాలను కవితామయంగా చిత్రించే కావ్యస్వభావానికి సంబంధించింది మరొకటి. క్రమంగా-అవి-ప్రసన్నకథాకలి(వి)తార్థయుక్తి, అక్షరరమ్యత, నానారుచిరార్థసూక్తినిధిత్వం-అనేవి. ఇవి సంస్కృతభారతంకంటె ఆంధ్రమహాభారతానికి గల ప్రత్యేక వ్యక్తిత్వాన్ని ప్రపంచిస్తున్నవి. వస్తువు మృత్తికవంటిది, నన్నయకవిత పాత్రను రూపొందించే వృత్తినైపుణ్యం వంటిది. మట్టి వ్యాసునిదైనా రూపొందించిన పాత్ర మాత్రం నన్నయది.

8. బహుభాషల, బహువిధముల, బహుజనులు చెప్పినా శ్రవణాసక్తితో భారతకథను వినే ప్రవృత్తి రాజరాజనరేంద్రునిది. అతనిది తాత్పర్యదృష్టి. అంటే అర్థప్రధానదృష్టి, నన్నయ రాజరాజనరేంద్రుని శ్రవణాసక్తికి కావ్యశక్తిని కూడ జోడించి సాహితీసృష్టి చేశాడు. రూపాన్ని రాజరాజు నిర్దేశించలేదు. నన్నయకు ఆ స్వేచ్ఛను కల్పించాడు. దానిని చక్కగా ఉపయోగించుకొని చంపూ కావ్యరూపాన్ని ఇచ్చాడు. వస్తు వెంత ముఖ్యమో, పరమార్థోపదేశ మెంత ముఖ్యమో, అది చెప్పే కవితాభివ్యక్తికూడ అంతముఖ్యమని నన్నయ చాటిచెప్పాడు. ఇవన్నీ తెలుగులో పునస్సృష్టిచేయగల ప్రతిభావంతుడు ప్రదర్శింపగలిగిన ప్రజ్ఞావిశేషాలు. కాబట్టి ఆంధ్రమహాభారతం అనువాదం కాదు; అనుసృజనం.

ఆదిపర్వం - భారతాఖ్యాన కథాబీజం

నాటకంలో ప్రథమాంకం, కావ్యంలో ప్రథమాశ్వాసం, ఇతిహాసంలో ఆదిపర్వం వృక్షానికి బీజంవంటి పాత్రను నిర్వహిస్తాయి. పుట్టి, పెరిగి, విస్తరించి, ఫలించే వృక్షంయొక్క జీవశక్తులన్నీ, మూలాధారాలన్నీ బీజంలో నిక్షిప్తమై ఉంటాయి. అట్లాగే, మహాభారత కథా పారిజాతవృక్ష మూలశక్తుల నిక్షేపమే ఆదిపర్వ ప్రాధాన్యం.

నన్నయ తన మహాభారత ప్రణాళికను పరోక్షంగా రాజరాజనరేంద్రుని నోట చెప్పించాడు. ఆ కథను ఎట్లా వినాలోకూడా వ్యంగ్యంగా నిర్దేశించాడు.

"హిమకరుఁదొట్టి పూరు భరతేశ కురుప్రభు పాండుభూపతుల్
క్రమమున వంశకర్త లనఁగా మహి నొప్పిన యస్మదీయ వం
శమునఁ బ్రసిద్ధులై విమల సద్గుణ శోభితులైన పాండవో
త్తములచరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెంతయున్. **(ఆది.1.14)**

వేదధర్మాన్ని ఆచరించి, ఆచరింపజేసిన ఆదర్శప్రభువుల వంశచరిత్రలను సూర్యచంద్రవంశగాథలుగా పురాణాలు, ఇతిహాసాలు వర్ణిస్తాయి. పాండవులు చంద్రవంశజులు. అంటే వారి వంశానికి మూలపురుషుడు చంద్రుడన్నమాట! ఒక్కొక్క వంశంలో వంశకర్తలని కొందరు ప్రసిద్ధి పొందుతారు. వారి పేర్లమీద ఆ వంశజులు పిలువబడుతూ ఉంటారు. చంద్రవంశంలో ఒక్కొక్కరు ఒక్కొక్క విశిష్టధర్మాన్ని పాటించినవారని పేరుపొందినవారు - వరుసగా పూరుమహారాజు, భరతమహారాజు, కురుమహారాజు, పాండుమహారాజు, వారు నలుగురూ ఆ వంశకర్తలు. తండ్రికొరకు నిండుయౌవనాన్ని త్యాగం చేసిన ధీరుడు పూరుడు. అఖండ రాజ్యాన్ని ఆదర్శవంతంగా పాలించిన ధర్మమూర్తి భరతుడు. యజ్ఞయాగాదుల నిర్వహించి ధర్మకర్మపరిరక్షణం చేసిన కర్మవీరుడు కురుమహారాజు. దిగ్విజయయాత్రలు చేసి రణపాండిత్యాన్ని ప్రకటించిన వీరుడైకూడా భ్రాతృప్రేమను ప్రదర్శించిన ఉదాత్త

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యుద్ధవీరుడు పాండురాజు. ఆ నలుగురి పేర్లమీదా ఆ వంశజులు ప్రసిద్ధికెక్కారు. పాండవులను - పౌరవులనీ, భారతులనీ, కౌరవులనీకూడా అందువల్లనే పిలుస్తూ ఉంటారు. మహాభారతంలోని విశేషమేమంటే - చంద్రవంశంలో పుట్టిన పాండవులు తమకు పూర్వం తమ వంశంలో పుట్టిన వంశకర్తల ఉత్తమగుణాల నన్నింటిని తమలో పండించుకొన్నారు. అందువలన చంద్రవంశం ధర్మాచరణలో పాండవచరిత్రయందే పరిపూర్ణతను పొందింది. కాబట్టి పాండవుల చరిత్రను సవిస్తరంగా వింటే భరతవంశచరిత్ర అంతా విన్నట్లే.

ఆదిపర్వంలోని ప్రథమ ద్వితీయాశ్వాసాలలో - సూతుడు శౌనకాది మునులకు మహాభారత కథను వినిపించటానికి ఏర్పడిన పరిస్థితులు, తత్కథా ప్రారంభాన్ని తెలిపే వృత్తాంతం వర్ణింపబడి ఉన్నవి. జనమేజయుడు చేసిన సర్పయాగంలో భారత కథాకథనం మొదలైనది. అందులో మొదటి ఘట్టం - వైశంపాయనుడు జనమేజయుడికి సర్పయాగశాలలో భారతకథను చెప్పటం ప్రారంభించటం. అందువలన ఆ సర్పయాగం ప్రవర్తిల్లటానికి కారణాలైన అంశాలను చెప్పటానికి ఈ రెండాశ్వాసాలూ వెచ్చింపబడ్డాయి. అందుకై ఆదిపర్వంలో వరుసగా సరమవృత్తాంతం, ఉదంకోపాఖ్యానం, ఉదంకుడు జనమేజయుడికి సర్పయాగం చేసే బుద్ధిని కలిగించే వృత్తాంతం చెప్పబడ్డాయి. సర్పయాగంలో సర్పకులం హుతం కావటానికి కారణ మేమిటన్న శౌనకాదుల ప్రశ్నకు వివరణగా భృగువంశ చరిత్రలో చ్యవనుని చరిత్రం, సహస్రపాదుని వృత్తాంతం, కద్రూవినతల వృత్తాంతం, సముద్రమథనం, సౌపర్ణోపాఖ్యానం, జరత్కారువృత్తాంతం, తక్షకవిషాగ్నిచేత పరీక్షిత్తు దగ్ధుడుకావటం, జనమేజయు డారంభించిన సర్పయాగాన్ని ఆస్తీకుడు ఆపించటం అనే కథార్థాలు వెలువడ్డాయి. అంటే - సర్పయాగ సంకల్పం ఉదంకునిది. సర్పయాగం చేసినవాడు జనమేజయుడు, దాన్ని నివారించినవాడు ఆస్తీకుడు. వారిముగ్గురి కథలు ఆఖ్యానకాలు. సర్పయాగం ఆగిన తరువాత ఆయాగశాలలోనే భారతకథాకథనం మొదలైనది. ఈ విధంగా భారతకథాకథనారంభ పూర్వరంగాన్ని చెప్పటం మహాభారతకథకు పూర్వరంగం. ఇది మొదటిరెండాశ్వాసాలలో నిర్వహింపబడింది.

ఆతరువాత - ఆదిపర్వంలోని తృతీయ, చతుర్థ, పంచమాశ్వాసాలు చంద్రవంశంలో ప్రసిద్ధి చెందిన వంశకర్తల చరిత్రలు చెప్పటానికి వినియోగించటం గమనింపదగిన అంశం. జనమేజయుడు వైశంపాయనుడిని పాండవధార్తరాష్ట్రుల విభేదాలకు కారణాలను వివరించుమని కోరాడు. దానితో వైశంపాయనుడు చెప్పే భారతాఖ్యానం మొదలయింది. ఆ ముని భారత మహిమను గురించి మొదట చెప్పి, పాండవధార్తరాష్ట్రుల నడుమగల భేదకారణాలను పేర్కొంటూ కురుక్షేత్రయుద్ధం జరిగినదాకా సాగిన కథను సంగ్రహంగా, టూకీగా ముందు చెప్పాడు. కురువంశంలో పుట్టిన మహావీరులందరూ దేవదానవాంశ సంభూతులనీ, కురుక్షేత్ర యుద్ధం దేవదానవ ప్రవృత్తుల మధ్య జరిగిన మహాసంఘర్షణమనీ వ్యాఖ్యానించాడు. దానితో భారతకథామూలతత్త్వం తేటతెల్లమౌతున్నది. ఇది కథాబీజమూలశక్తులలో ముఖ్యమైనది.

వేదవ్యాసరచిత భారతం కమనీయ ధర్మార్థకామమోక్షాలకు ఉత్తమసాధనమనీ, శ్రోతలకు అభిమతశుభాలను కలిగించే దనీ, త్రికరణాలతో చేసిన మహాపాపాలను కూడా తొలగించేదనీ, సత్యవాక్ప్రబంధమనీ, శతసహస్రశ్లోక సంఖ్యాపరిమాణం కలిగిన దనీ, సర్వలోకపూజ్య మైనదనీ నన్నయ వర్ణించాడు. (ఆది. 3.9).

ప్రసిద్ధ పరాక్రములు, ధృత వివేకులు, సత్యనిష్ఠులు, యశోధనులు, కృతజ్ఞులు, ఉత్తమధర్మపరులు, శరణాగతరక్షణ వ్రతులు అని ప్రసిద్ధు లైన భారతవీరుల సద్గుణకీర్తనమే వస్తువుగా కలిగిన భారతం సభలలో రక్తికట్టుతుం దనీ నన్నయ ప్రశంసించాడు.

భారతభారతీ వ్యక్తిత్వాన్ని పద్యసూక్తంగా చెప్పిన వాక్య మిది -

“ఆయుష్యం, బితిహాసవస్తుసముదాయం, బైహికాముష్మిక
శ్రేయఃప్రాప్తి నిమిత్త, ముత్తమ సభాసేవ్యంబు, లోకాగమ

న్యాయైకాంతగృహంబు నాఁ బరఁగి నానావేద వేదాంత వి
ద్యాయుక్తం బగుదానిఁ జెప్పఁదొడగెం దద్భారతాఖ్యానమున్.'' **(ఆది. 3.11)**

మహాభారతం ఇతిహాసవస్తుసముదాయ మని చెప్పిన లక్షణం దాని కథాస్వభావాన్ని వివేచించటానికి తోడ్పడుతుంది. ''ఇతిహాసః పురావృత్త'' మ్మని అమరసింహుడు. ''ఇతిహాసః - ఇతిహ పారంపర్యోపదేశ ఆస్తే అస్మిన్ ఆస ఆధారే ఘఞ్. ధర్మార్థకామమోక్షాణాం ఉపదేశసమన్వితమ్ । పూర్వముక్త కథాయుక్తం ఇతిహాసం ప్రచక్షతే ॥ ఇత్యుక్త లక్షణే పురావృత్త ప్రకాశకే భరతాదిగ్రంథే'' - అని శబ్దకల్పద్రుమం. ఈ నైఘంటిక నిరుక్తులను ఆధారంగా చేసికొని - ఇతిహాసం పరంపరాగతంగా చెప్పుకోబడుతున్న పూర్వచరిత్ర వస్తువు కలదై, ఉజ్జ్వలోపదేశాత్మకమై ఉంటుందని ఏర్పడుతున్నది.

అభినవగుప్తపాదుడు నాట్యశాస్త్రవ్యాఖ్యానంలో కర్మఫలసంబంధస్వభావం గల ఆగమికార్థాలు ఎందులో ప్రత్యక్షపరిదృశ్యమానా లౌతుంటాయో అదే ఇతిహాసమని పేర్కొన్నాడు. (ఏవం ప్రకారాః ప్రత్యక్షపరిదృశ్యమానాః ఆగమికార్థాః కర్మఫలసంబంధస్వభావాః యత్ర ఆసతే తేన ఇతిహాసేన......) అంటే ఆ యా పుణ్యపాపకర్మలకు ఆ యా ఫలాలు లభిస్తాయని ఆగమాలలో చెప్పబడిన వాక్యతాత్పర్యాలు కళ్ళయెదుట కనబడుతున్నట్లు ఇతిహాసంలోని ఇతివృత్తం చిత్రింపబడా లన్నమాట!

విద్యారణ్యసాయణాచార్యులు ''దేవాసురాస్సయంయత్తా ఆసన్'' అని పూర్వం జరిగినదట అన్నట్లు పూర్వప్రసిద్ధ వృత్తాలను చెప్పేది ఇతిహాసమని తమవేదభాష్యంలో చెప్పారు. ఉదాహరణబలాన్నిబట్టి దేవాసురుల ప్రవృత్తుల మధ్య జరిగే సంఘర్షణం చిత్రించటం ఇతిహాసలక్షణమనికూడా భావించవచ్చును.

''పరిక్రియా పురాకల్ప ఇతిహాస గతి ర్ద్విధా,
స్యా దేకనాయకా పూర్వా, ద్వితీయా బహునాయకా''.

అని కావ్యమీమాంసాకర్త రాజశేఖరుడు పేర్కొన్నాడు. ఇతిహాసం ప్రవర్తిల్లే విధానాన్నిబట్టి రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి-పరిక్రియ. అది ఏకనాయకం. రెండు- పురాకల్పం. అది బహునాయకం, రామాయణం పరిక్రియ. మహాభారతం పురాకల్పం - అని తాత్పర్యం. రాజశేఖరు డీ శబ్దాలను దార్శనికుల పరిభాషనుండి గ్రహించినట్లున్నాడు. దార్శనికులు పరిక్రియా పురాకల్పాలనేవి అర్థవాదాలుగా పేర్కొన్నారు. అవి నిందా, ప్రశంసా, పరకృతి, పురాకల్పాలని నాలుగు విధాలు. మహాపురుష డొకడు పూర్వం జరిగిన ఒక అంశాన్ని ప్రమాణంగా చూపించటం పరకృతి. ఉదాహరణకు 'అగ్ని అనేవాడు సర్వభక్షకుడు కాగోరి అగ్నిదేవుడిని ఆరాధించి సర్వభక్షకు డైనాడు' - అని ఒక పూర్వప్రవర్తిత ఐతిహ్యాన్ని ప్రమాణంగా చూపించటం పరకృతి. పూర్వం ఒకరిచేత చెప్పబడిన అర్థాన్ని ప్రతిపాదించేది పురాకల్పం. 'పూర్వం హోమాలు మోయటం ఇష్టంలేక అగ్ని నీటిలో దాగాడు. దేవతలు అగ్నిని అన్వేషిస్తున్నారు. అగ్ని నీటిలో దాగి ఉన్నాడని చేపలు వారికి చెప్పాయి. తన రహస్యాన్ని బయటపెట్టినందుకు అగ్ని ఆగ్రహించి చేపలను - 'లోకులు మిమ్మల్ని ఇష్టంవచ్చినట్లెల్లా చంపుతారుగాక!' అని శపించాడు - అనే పరవక్తృక అర్థప్రతిపాదన పురాకల్పం. (తైత్తిరీయసూత్రం). ఈ లక్షణాలను సూక్ష్మంగా గమనిస్తే పరక్రియ ఏకవక్తృకమనీ, పురాకల్పం బహువక్తృకమనీ తేటపడుతుంది. వస్తుతః ఈరెండూ అతీతార్థప్రధానాలే. అయినా, పరకృతి అద్యతనభూతార్థం. ప్రాచీనోదంతం ప్రప్రథమంగా ఒకవక్తచే చెప్పబడినది పరకృతి. పారంపర్యకథనంగా బహువక్తలచేత చెప్పబడినది పురాకల్పం. బహుశః మీమాంసకులు చెప్పే ఈ అర్థవాద భేదాలను రాజశేఖరుడు గ్రహించి వాటి లక్షణాలైన ఏకవక్తృక, బహువక్తృకత్వాలను మార్చి ఏకనాయక బహునాయకత్వాలుగా నిబంధించి ఉంటాడు. 'పరక్రియా' శబ్దాన్ని 'పరిక్రియా' గా మార్చి ఉంటాడు. ఇతిహాసం పారంపర్యోపదిష్టమే కాబట్టి మీమాంసకుల అభిప్రాయం తద్విరుద్ధం కాదు. భారతాన్ని వ్యాసుడు మొదట చెప్పాడు. ఆతరువాత ఆయన శిష్యులు, వారి పుత్రులు, ప్రశిష్యులు పరంపరగా చెప్పుతూ వచ్చారు. కాబట్టి ఇది బహువక్తృకం. పాండవులే కాక, భీష్మాదివీరుల వృత్తాంతాలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్వయంసమగ్రాలై పురుషార్థసాధన ప్రవృత్తితోపాటు కర్మఫలరూపస్వభావాన్నికూడా ప్రకటిస్తూ ఉండటంచేత మహాభారతం బహునాయకమైన పురాకల్ప మనీ చెప్పవచ్చును. ఈ విధంగా బహువక్తలవలన, బహునాయకులవలన ఏర్పడే ఇతిహాసాల సముదాయం మహాభారతమని నన్నయ అభివర్ణించాడు. భారతకథలోని సంశ్లిష్టత దీనివలన సూచిత మౌతున్నది.

అన్నదమ్ములైన పాండవధార్తరాష్ట్రుల నడుమ కురుక్షేత్ర ఘోరసంగ్రామం ఎందుకు జరిగింది? అంతమంది ఆ రణంలో ఎందుకు నిహతులైనారు? ఆ కాలంలో శ్రీకృష్ణుడివంటివారున్నా ఆ యుద్ధాన్ని ఎందుకు వారించలేకపోయారు? - వంటి ఎన్నో ప్రశ్నలు జనమేజయుడు - మనవలెనే - గుప్పించాడు. దానికి వేదవ్యాసుడు చెప్పిన సమాధానాలు వైశంపాయనుడు చెప్పాలి. అందువలన ముందుగా వ్యాసోత్పత్తిని గురించి చెప్పి, ఆ తరువాత దేవదానవాంశలతో పుట్టిన భీష్మాదులను పరిచయం చేశాడు. దేవదానవ ప్రవృత్తుల సంఘర్షణను ప్రతీకాత్మకంగా నిరూపించి చెప్పటం భారతేతిహాస కథాతాత్పర్యమని వైశంపాయనుడు వివరించాడు. దీనితో పౌరవవంశవివరణకు నాందీప్రస్తావనలు నిర్వహించినట్లైనది.

అసలుకథ ఇక్కడినుండి మొదలౌతుంది. అందులోనూ వంశకర్తల కథలు చెప్పటం మొదటిఘట్టం. పాండవులు చంద్రవంశజులైనా, చంద్రునినుండి వంశం ఏ విధంగా విస్తరించిందో వివరంగా చెప్పటం వ్యాసతాత్పర్యం కాదు. ఆ వంశ ప్రతిష్ఠకు మూలకారకులైన వంశకర్తల ప్రశంస చేయటమే వ్యాసభారత కథా హృదయం. దాన్ని నన్నయ ఎంతో స్పష్టంగా, ప్రసన్నంగా పేర్కొన్నాడు. ఈ పద్యం అందుకు సాక్ష్యం.

''నిరుపమ ధర్మమార్గ పరినిష్ఠితులై మహియెల్లఁ గాచుచుం
బరఁగిన తొంటి పూరుకురుపాండు మహీశులపేర్మిఁ జేసి భూ
భరవహనక్షమం బగుచుఁ బౌరవ కౌరవ పాండవాన్వయం
బురుగుణసంపదం బెరిఁగి యొప్పె సమస్త జగత్ప్రసిద్ధమై. **(ఆది. 3.88)**

ఈ పద్యంలో (అంటే భారతంలో) వంశకర్తలు ముగ్గురే చెప్పబడ్డారు. మహాభారతకాలానికి నలుగురయ్యారు. భరతుడు రెండో వంశకర్తగా నన్నయకూడా పేర్కొన్నాడు. ఆ నలుగురి వంశకర్తల కథలు చెప్పటం 3వ ఆశ్వాసంలో 88వ పద్యంనుండి పంచమాశ్వాసంలో 161వ పద్యం వరకు సాగుతుంది. వంశకర్తల చరిత్ర వర్ణించేటప్పుడు పూరు భరతేశుల తల్లిదండ్రుల చరిత్రలు విపులంగా చెప్పి వారి జీవితతత్త్వఫలాలుగా ఆ యిద్దరినీ వర్ణించే పద్ధతిని పాటించటం ఒకవిశేషం. కురుమహారాజు తపతీసంవరణుల కుమారుడు. ఆ దంపతుల ప్రణయగాథ పురాణప్రసిద్ధం. కాని, దానిని ఇందులో వివరించకుండా కురుమహారాజు వంశకర్త అనీ, అతనిపేరుమీద, కురుక్షేత్రం ప్రసిద్ధమైనదనీ మాత్రమే చెప్పి ఊరుకొన్నాడు. అయితే తపతీసంవరణుల కథ సప్తమాశ్వాసంలో మరొక సందర్భంలో చెప్పబడింది. నాల్గవవాడైన పాండురాజు పుట్టుకకు వ్యాసుడే కారకుడు. పాండురాజు చరిత్రం పాండవ చరిత్రానికి పాదువంటిది. దాన్ని ఇతిహాస కథకు పీఠంవలె వివరంగా చెప్పటం అవసరం. నన్నయ అట్లాగే చెప్పాడు. కాబట్టి అందులో ఔచిత్యంకూడా కనబడుతున్నది.

పాండుపుత్రులు, ధార్తరాష్ట్రులు హస్తినాపురంలో కలిసి ధృతరాష్ట్రుని మందిరంలో పెరగటాన్ని వర్ణించే ఘట్టంనుండి (5-162) పాండవ వృత్తాంతం మొదలై పద్దెనిమిది పర్వాలూ సాగుతుంది. ఈ కథారంభంలోనే వేదవ్యాసుడు సత్యవతికి ఏకాంతంలో చెప్పిన మాటల్లోని ఈ పద్యాలు భారతకథాతత్త్వసారాన్ని సూచిస్తున్నాయి.

క. ''మతిఁ దలఁపఁగ సంసారం
బతిచంచల మెండమావు లట్టుల సంప
త్ప్రతతు లతిక్షణికంబులు;
గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్.

క. క్రూరులు విలుప్తధర్మా
చారులు ధృతరాష్ట్రసుతు లసద్వృత్తులు ని
ష్కారణ వైరులు వీరల
కారణమున నెగ్గు పుట్టుఁ గౌరవ్యులకున్.

వ. దాని ధృతరాష్ట్రుండు తాన అనుభవించు. **(ఆది. 5.159 -161)**

పాండవచరిత్రలో వ్యాసుడు చెప్పదలచుకొన్నవి ముఖ్యంగా మూడంశాలు. అవి - 'వాసుదేవస్య మాహాత్మ్యం', 'పాండవానాం చ సత్యతా', దుర్వృత్తం ధార్తరాష్ట్రాణాం' - అనేవి. "అత్యుత్కటైః పుణ్యపాపై రిహైవ ఫల మశ్నుతే" అన్న న్యాయంచేత దుర్వృత్తులైన ధార్తరాష్ట్రులు నశించటానికి కారణం వారు స్వయంగా చేసికొన్న పాపకర్మయే. వాటికి సాక్షి, పోషకుడు ధృతరాష్ట్రుడు. తనవారందరూ పోగా తత్ఫలమైన అనంతశోకాన్ని అనుభవించేది ధృతరాష్ట్రుడు. పాండవులు తమ సత్కర్మలకు ఫలాన్ని ఇహపరాలలో అనుభవిస్తారు. కర్మకూ, కర్మఫలానికీ అతీతుడూ, సాక్షీభూతుడూ అయిన సాక్షాత్ పరమాత్మ శ్రీకృష్ణుడు. కర్మఫలరూపమైన భారతకథకు ఈ ముగ్గురూ మూడు ముఖాలు. మూడు మెట్లు. వాటిని ముమ్మూర్తులా, ముప్పేటగా ప్రదర్శించేది మహాభారతేతిహాసం.

ఆదిపర్వంలోని మరొకవిశేషంకూడా గమనింపదగింది. ధార్తరాష్ట్రుల దుర్వృత్తం ఎంత బలంగా చిత్రింపబడితే పాండవుల సద్వృత్తం అంత ఉజ్జ్వలంగా ప్రకాశించటానికి వీలౌతుంది. ఇది భారతకథలో సర్వత్రా పాటించే కథామర్మమే. అయితే, దానికి బీజప్రాయమైన కథాంశాలు ఆదిపర్వంలో స్థాపింపబడ్డాయి. వాటిలో పేర్కొనదగినవి -

1. దుర్యోధనుడు భీముని బలాన్ని సహించలేక అతడిని చంపే యత్నాలు చేయటం.
2. అర్జునుడు విలువిద్యలో అనన్యవీరుడుగా ప్రకాశిస్తూ ఉండగా, అతనికి ప్రత్యర్థిగా కర్ణుడిని అంగరాజుగా చేసి దుర్యోధనుడు ప్రోత్సహించటం.
3. దుర్యోధనుడు కణికనీతి నాశ్రయించి ధృతరాష్ట్రుని అండదండలతో, శకునికర్ణాదుల సలహాలతో పాండవులకు ఎగ్గుచేయాలని తలపెట్టటం, లాక్షాగృహదహనయత్నం చేయటం.
4. పాండవులు హస్తినాపురంలో ఉంటే తనకు రాజ్యాధికారం దక్కటం అసాధ్యమని భావించి దుర్యోధనుడు తండ్రిని ప్రేరేపించి వారిని ఇంద్రప్రస్థానికి పంపించటం.

పాండవేతివృత్తంలో ధర్మరాజాదులు ధార్తరాష్ట్రుల కుతంత్రాలనుండి తప్పించుకొనే అధ్యాయాలు కొన్ని, స్వీయపరాక్రమాదులను ప్రదర్శించి తమ ఆస్తిత్వాన్ని స్థాపించుకొనే సన్నివేశాలు కొన్ని, ఎట్టికష్టాలలోనైనా ధర్మాన్ని పాటించే సచ్ఛీలాన్ని ప్రదర్శించే సన్నివేశాలు కొన్నీ - కలసి పాండవ నాయక లక్షణాలను ప్రకాశింపజేస్తూ ఉంటాయి.

కురుక్షేత్ర సంగ్రామంలో ప్రజ్వలించే ప్రతీకారజ్వాలలకు ఆదిపర్వంలోనే అంకురారోపణం జరిగింది. భీమదుర్యోధనుల, కర్ణార్జునుల ద్వంద్వయుద్ధాలే కురుక్షేత్ర యుద్ధ పతాకలు. పాండవులు ధర్మానికి తలలొగ్గి కష్టాలకు ఓర్చుకోవటం, అజ్ఞాతంగా మారువేషాలలో నివసించటం, శత్రువులకు అసాధ్యమైన అస్త్రశస్త్రాలను తపస్సుతో యశస్సుతో సాధించటం, అపూర్వవిజయాలతో స్వీయకల్యాణాన్నీ, లోకకల్యాణాన్నీ సాధించటం, శ్రీకృష్ణుని మైత్రివలన దైవానుకూల్యాన్ని సంపాదించుకోవటమూ అనే ప్రధానాంశాలు ఆదిపర్వంలోనే ప్రదర్శితాలై భావిపాండవ కథా జీవితానికి ప్రాతిపదికలుగా పరిఢవిల్లుతున్నాయి. వీటన్నిటి తాత్పర్య మేమంటే ఆదిపర్వం భారతకథకు అన్నివిధాలా బీజభూతం !

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆంధ్రమహాభారతం - అమృతత్వసాధనం

"న కర్మణా న ప్రజయా ధనేన
త్యాగే నైకే అమృతత్వ మానశుః।
పరేణ నాకం నిహితం గుహాయామ్
విభ్రాజతే తద్యతయో విశంతి॥"

ఇతిహాసాలు, పురాణాలు, మహాకావ్యాలు కాలక్షేపానికి చదివేవి కావు. అవి అందించే మహోపదేశాలను మననం చేసికొనటానికి అధ్యయనం చేసేవి. పంచమవేదమైన మహాభారతం మానవలోకానికి ఒక మహత్తరమైన సందేశాన్ని ఇస్తుంది. మానవుడు జీవితంలో సాధించవలసింది అమృతత్వమే అన్నది ఆ భారతసంహిత అందిస్తున్న జీవన సందేశం.

అమృతత్వసాధన మంటే?

మహాభారతంలో మొదలూ, ముగింపూ - మానవుడు అమృతత్వసిద్ధి కోసం చేసే సాధనయొక్క ప్రారంభ పరిణతావస్థలను తెలుపుతూ ఉన్నాయి. ఆదిపర్వంలో ఉదంకోపాఖ్యానం చూచినా, క్షీరసాగర మథనోపాఖ్యానం గమనించినా, సర్పయాగ ఘట్టాన్ని చదివినా మానవుడు విషాదులవలన కలిగే మరణాన్ని జయించాలన్న కోరిక బలంగా కనబడుతుంది. శుక్రాచార్యుడు సాధించిన 'మృతసంజీవని'-యుద్ధంలో చనిపోయినవారిని బ్రతికించే ఒక మహామంత్రం. ఆ మంత్రం వెనుక మానవులు, దానవులు, దేవతలు మృత్యువుబారి పడకుండా తప్పించుకొనే ఉపాయంకోసం ప్రయత్నించిన ఒక ప్రస్థానం మనకు ప్రత్యక్షం అవుతుంది. కచుని చరిత్ర, యయాతి చరిత్ర శుక్రాచార్యునితో ముడిపడి ఉన్నాయి. శుక్రాచార్యుడి కూతురు దేవయాని. ఆమె మొదట వలచినవాడు బృహస్పతి కుమారుడు కచుడు. రాక్షసు లతనిని చంపినా, బూడిదచేసి మద్యంలో కలిపి శుక్రునిచేత త్రాగించినా మృతసంజీవని ప్రభావం చేత దేవయాని కచుడిని బ్రతికింపజేస్తుంది. మహాభారతకథకు మృతసంజీవని ఒక మహారంభం. మానవుని అమృతత్వసాధనకు అదొక శుభారంభం.

లోకంలో మరణం, లేదా మృతి ఒకవాస్తవంగా ఉన్నది. దేహి ప్రాణత్యాగం చేసినప్పుడు, దేహం పొందే జడత్వం మృత్యువు. పుట్టిన జీవి గిట్టటం సహజం. జన్మ ఎత్తిన ప్రాణి మృత్యువు పొందక తప్పదు. మానవుడు ఈ రెండింటిని జయించాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తూ వచ్చాడు. ఈ ప్రయత్నాన్ని ఆధ్యాత్మిక ప్రస్థానం అంటారు. మరణం లేకుండా ఉండే స్థితిని పొందితే అమరత్వం అనాలి. జన్మ ఎత్తకుండా ఉండే నిత్యస్థితిని మోక్ష మన్నారు. పుట్టినజీవి మరణం లేకుండా బ్రతకటం ఒక ఎత్తు. అసలు పుట్టుక లేకుండా బ్రహ్మస్థితిలో నిలవటం మరొక ఎత్తు. మొదటి మార్గానికి ఫలం స్వర్గం. రెండవ ప్రస్థానానికి ఫలం బ్రహ్మత్వం. ఈ రెండు రకాల సాధనలలో మొదటిది సామాన్యంగా కర్మమార్గాన్ని అనుసరించేవారికి లభ్యమౌతూ ఉంటుంది. జ్ఞానమార్గం అనుసరించే వారికి బ్రహ్మానందస్థితి గమ్యమౌతూ ఉంటుంది. భక్తిమార్గ ప్రస్థానంలో ఉభయసిద్ధులకు అవకాశం ఉన్నది. మహాభారతం ఈ మూడు మార్గాలను ముచ్చటగా మేళవించింది. ఆ సమన్వయానికి పాండవులు ఆదర్శోదాహరణాలు. అయితే, వారు ప్రధానంగా ధర్మ, కర్మ మార్గంలో నడిచిన వారు. దానికి పోషకంగా భక్తిని జ్ఞానాన్ని పొందుపరచుకొన్నారు. యక్షప్రశ్నలకు సమాధానం చెప్పగలిగిన దక్షుడు జ్ఞాని అయిన ధర్మరాజు. ద్రౌపది అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగిన వాడూ ధర్మరా జొక్కడే అని కురుసభలో భీష్మాదులచే ప్రశంస లందుకొన్నవాడు. ధర్మరాజు ధర్మతరువువంటివాడని శ్రీకృష్ణునిచేత కీర్తింపబడినవాడు. పంచమవేదమైన మహాభారతంలో ప్రతిపాదింపబడిన జ్ఞానాని కంతటికీ ఆచరణ రూపమైన ఆదర్శోదాహరణంగా నిలిచినవాడు - ధర్మరాజు. అతడు వస్తుతః జ్ఞాని. ఏకాగ్రచిత్తంతో స్మరించి, ధ్యానించి, తపించి యమ, సూర్య, అగ్ని, ఇంద్రాది దేవతలను సుముఖులుగా చేసికొన్న ఉత్తమ భక్తశిఖామణి ధర్మరాజు. అయితే అంతటి జ్ఞానాన్ని, అంతటి భక్తిని ఆచరణంలో

ప్రదర్శించి చూపటమే ఆయన ధ్యేయం. ధర్మరాజు జీవితంలో కర్మకు వన్నెపెట్టే భక్తిజ్ఞానాలే ప్రకాశిస్తూ ఉంటాయి. అందువలన ధర్మరాజు ధర్మ కర్మ వీరుడుగా ప్రసిద్ధిపొందాడు.

భీముడు ప్రచండ బలవీరుడు. పాండవుల పురుషార్థత్రయసాధనకు భీముడు బలమైన ప్రతినిధి. ధర్మరాజు సాధింపదలచుకొన్న లౌకికకార్యాలన్నీ భీమునిసాయంతోనే నెరవేర్చుకొంటాడు. భీమునికి ధర్మరాజు ధర్మమూర్తి. అతని మాట ధర్మశాసనం. అతని ఆజ్ఞ వేదం. అన్న మాటను జవదాటకుండా ఆచరించే ఆదర్శ కర్మవీరుడు భీముడు. అతనికి భ్రాతృ భక్తియే వ్రతం. అదియే అతని ధర్మానురక్తి. అతనికి అన్నయే జ్ఞానం. అన్నయే భక్తి. అతడిని అనుసరించటమే కర్మ. కప్పను, నీటిని గర్భంలో ధరించిఉన్న శిలామూర్తి వలె భక్తిజ్ఞానాలను గుప్తంగా దాచుకొన్న కర్మరుడు భీముడు.

అర్జునుడు యుద్ధవీరుడు. నరనారాయణులలో నరు డాతడు. నారాయణభక్తియుక్తుడు. ధర్మరాజు దైవకార్యాన్ని సాధింపవలసి వచ్చినపుడు అర్జునుడిని దివ్యోపకరణంగా వాడుకొంటాడు. ఇంద్రుని సాయం కావాలన్నా, పరమేశ్వరునుండి పాశుపతాస్త్రం పొందాలన్నా, సాక్షాత్ నారాయణుడైన శ్రీకృష్ణునితో అనుసంధానం పెంచుకోవాలన్నా అర్జునుడే అనువైన వాహిక. కృష్ణునిపట్ల అనన్యచిత్తంతో భక్తిని ప్రసరించే పరమయోగి అర్జునుడు. భగవద్గీతను శ్రీకృష్ణభగవానునిచేత స్వయంగా విన్న మహాజ్ఞాని. అతని భక్తి. అతని జ్ఞానం- అతని గాండీవ పాండిత్యాన్ని ప్రదర్శించడానికి పోషకంగా నిలిచాయి. అతడు యుద్ధాలలో విజయుడు. సాటిలేని మేటి వీరుడు. కర్మమార్గాన్ని అనుసరించినా జ్ఞానాన్ని గౌరవించినవాడూ. భక్తిని పండించుకొన్నవాడు.

నకుల సహదేవులు జంట వీరులు. వారికి అన్నలే దేవుళ్లు. వారి సేవయే భక్తి. వారు చెప్పిన పని చేయటమే కర్మ. వారు సేవాతత్పరులైన కర్మవీరులు.

ద్రౌపది పాండవ ధర్మపత్ని. అబల రూపంలో అవతరించిన అహంకారశక్తి. ధర్మరాజుయొక్క జ్ఞానశక్తిని, భీమాదుల క్రియాశక్తిని తన ఇచ్ఛాశక్తితో నడిపించ గలిగిన నారీమూర్తి. ఒక్కసారి పిలిస్తే చాలు ఎక్కడ ఉన్నా భగవంతుడు ఆమెకు ప్రసన్నుడౌతాడు. కురుసభలో కోక లందించిన శ్రీకృష్ణుడు, విరాటనగరంలో అంగసంరక్షణ చేకూర్చిన సూర్యభగవానుడు ఆమె భక్తి శక్తికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిన భగవద్రూపులు. ఆమె ప్రధానంగా కార్యశూరురాలు. అగ్నినుండి పుట్టిన అయోనిజ. జ్వాలవలె తనలో భక్తిజ్ఞానాలను పండించుకొన్న పరిణతమూర్తి, సాధ్వి. పతుల సేవ ఎట్లా చేయాలో, సత్యభామకు బోధించిన అనుభవజ్ఞానశీలి. భక్తిజ్ఞానాలున్నా, అవమానాగ్నితో అనవరతం జ్వలిస్తూ, శత్రుశేషం లేకుండా సంహార యజ్ఞం సాగించిన సాహసురాలు. కర్మమార్గావలంబిని ద్రౌపది.

ఈవిధంగా పాండవులు ప్రధానంగా ధర్మకర్మప్రవృత్తులకు ప్రతీకలుగా భారతంలో కనబడతారు. వీరందరిలో అగ్రగణ్యుడు ధర్మరాజు. ఆయన యమధర్మరాజు అంశతో పుట్టిన అపూర్వ ధర్మమూర్తి. మృత్యుదేవతయొక్క అనుగ్రహంతో పుట్టిన ధర్మరాజు మృత్యువును జయించటం మహాభారత కథలో ఫలితాంశం. బొందితో స్వర్గానికి వెళ్లాడు- అనే వాక్యానికి కొద్ది మంది మాత్రమే ఉదాహరణప్రాయంగా నిలువగలరు. వారిలో ధర్మరాజు అగ్రగణ్యుడు. సశరీరస్వర్గం కర్మమార్గాన్ని అనుసరించే ధర్మవీరుడు సాధించగలిగిన సమగ్రఫలం. దానినే అమరత్వం అంటారు. స్వర్గ నరకాలను దర్శించిన తరువాత ధర్మరాజు ఆకాశగంగలో మునిగి, స్వస్వరూపస్థితిని పొందాడు. మరణావస్థకు గురి అయ్యే దేహాన్ని ధరించినన్నాళ్లు అమరలోకాన్ని అందుకొన్నా, అమృతత్వసిద్ధి లభించదనీ, నశ్వరమైన దేహాభిమానాన్ని వదలి అనశ్వరమైన ఆత్మస్థితిలో నిలిచినప్పుడే అమృతత్వస్థితి అందుకొన్నట్లనీ, సశరీర స్వర్గానంతరం స్వసంకల్పంతో దేహత్యాగాన్ని చేసి ఆత్మ స్థితిలో నిలవటమే అమృతత్వమనీ, ఆంధ్ర మహాభారత కథ ప్రబోధిస్తున్నది. అమృతత్వసాధనలో ఇది ఒక పరిణతస్థితి. దీన్ని అందుకోవటానికి మహాభారతకథలో సాగిన మానవయత్నాలను మనం గమనిస్తే ఆ ప్రస్థానవైఖరి రసరమ్యంగా ప్రసన్నమౌతుంది.

అమృతత్వసాధనలో ఆదిమదశ 'మృతసంజీవనీ' విద్య

వృషపర్వుడనే దానవరాజుకు శుక్రాచార్యుడు గురువు. దేవదానవ యుద్ధాలలో దానవులు చనిపోతే వారిని బ్రతికించటానికి శుక్రాచార్యుడు 'మృతసంజీవని' అనే విద్యను కనిపెట్టాడు. ఆ విద్యవలన యుద్ధంలో చనిపోయిన దానవులందరూ బ్రతుకుతూ ఉండేవారు. ప్రతిరోజూ శుక్రుడు అసంఖ్యాకంగా దానవులను పునర్జీవితులుగా చేస్తుండేవాడు. ఇది దేవలోకంలో కలవరం రేకెత్తించింది. మృతసంజీవనీ విద్యను ఏవిధంగానైనా పొందాలని దేవతలు యోచించారు. వారిలో బృహస్పతి బుద్ధికుశలుడు. ఆయన పుత్రుడు కచుడు. అతడిని పిలిచి శుక్రాచార్యుడివద్దకు వెళ్ళి మృతసంజీవనీ విద్యను ఏవిధంగానైనా పొందుమని దేవతలు కోరారు. 'నియమవ్రత శీలుడవై శుక్రుడిని సేవించి, అతని ప్రీతికి పాత్రుడవై, అతడి మనసు కరిగి దయతో నీ కా విద్యను బోధించేటట్లుగా ప్రయత్నించు' మని ప్రేరేపించారు. 'శుక్రాచార్యుడికి దేవయాని అనే కూతు రున్నది. ఆమె అంటే ఆయనకు చెప్పలేనంత మమకారం. ఆమె మాటను ఆయన జవదాటడు కాబట్టి ఆమెను ముందుగా సుముఖురాలిని చేసుకో. శుక్రాచార్యుడిని భక్తితో సేవించు. నీ కిష్టసిద్ధి కలుగుగాక! అని దీవించి కచుడిని శుక్రాచార్యుడివద్దకు పంపారు దేవతలు.

కచదేవయాని కథ

కచుడి సుకుమారత్వానికీ, మృదు మధురవినయ ప్రియవచనాలకూ, నియమవ్రతశీలానికీ శుక్రాచార్యుడు ఎంతో సంతోషించి అతనిని దరికి చేర్చుకొన్నాడు. శుక్రుడిని బృహస్పతివలె భావించి కచుడు సేవించాడు. శుక్రుని ఆశ్రమంలో గురుశుశ్రూషలు కచుడు విధి తప్పకుండ నిర్వర్తించాడు. శుక్రాచార్యుడికి ప్రియశిష్యుడై మెలగజొచ్చాడు. అది దానవులకు కన్నుకుట్టింది. దేవతలమీద, బృహస్పతిమీద ఉన్న కోపంతో కచుడిని సంహరించాలని భావించారు దానవులు.

ఒకనాడు కచుడు హోమధేనువులను కాస్తూ ఒంటరిగా వనానికి వెళ్లాడు. అదే తగిన సమయమని భావించి దానవులు కొందరు అతడిని చంపి మద్దిచెట్టుకు బంధించి వెళ్ళిపోయారు. సాయంకాలం అయింది. హోమధేనువులు ఒంటిగా ఇంటికి తిరిగి వచ్చాయి.

అప్పటికే కచుడిమీద వలపు తొలిరేకులు విచ్చుకొంటున్న హృదయంతో దేవయాని తండ్రితో ఇట్లా అన్నది :

"వాఁడిమయూఖముల్ గలుగువాఁ డపరాంబుధిఁ గ్రుంకె, ధేనువుల్
నేఁ డిట వచ్చె నేకతమ, నిష్ఠమెయిన్ భవదగ్నిహోత్రముల్
పోఁడిగ వేల్వఁగాఁబడియెఁ, బ్రొద్దును బోయెఁ, గచుండు నేనియున్
రాఁడు, వనంబులోన మృగరాక్షసపన్నగబాధ నొందెనో." **(ఆది. 3. 112.)**

మనసులో బాధపడుతూ దేవయాని చెప్పిన మాటలు శుక్రాచార్యుని హృదయాన్ని ద్రవింపజేశాయి. దివ్యదృష్టి సారించి అసురుల చేత చంపబడిన కచుడిని గమనించాడు. మృతసంజీవనిని పంపి అతనిని సంజీవితుడిని చేసి తనవద్దకు పిలిపించుకొన్నాడు. దేవయాని అందుకు మనసులో ఎంతో సంతోషపడింది. మనసులోని కోరికను మాత్రం బయట పెట్టకుండా దాచుకొన్నది.

ఒకనాడు కచుడు పూజకై పూలు తీసికొనిరావటానికి అడవిలోకి ఒంటరిగా పోయాడు. అదను కనిపెట్టి అసురులు అతడిని పట్టిచంపి అగ్నిలో పడవేసి, కాల్చి, బూడిదచేసి దానిని మద్యంలో కలిపి శుక్రాచార్యుడి కిచ్చి అతనిచేత త్రాగించారు. శుక్రాచార్యుడికి సహజంగా ఉన్న సురాపానమోహంచేత పూర్వాపరాలు గమనించక ఆ సురను త్రాగాడు. సాయంకాలం అయింది. కచుడు తిరిగి రాలేదు. దేవయాని కనులవెంట నీరు పెట్టుకుంటూ కచుడు రాలేదని తండ్రిని ఎలుగెత్తి అడిగింది.

"సంజీవనీ విద్య తమ వద్ద ఉన్నదని అసురులు గర్వాంధులై ఆ కచుడిని సంహరించటానికి చూస్తున్నారు. ఒకవేళ ఆ విధంగా అతడు చనిపోతే ఉత్తమ గతులు పొందుతాడు. నీ వెందుకు అతనికొరకు దుఃఖిస్తావు?" అని శుక్రుడు దేవయానిని అడిగాడు. "మతిలోకోత్తరుడు, బృహస్పతి సుతుడు. నీ శిష్యుడు. బ్రహ్మచర్యాశ్రమసంపన్నుడు అయిన ఆ కచుడు అకారణంగా దనుజులచేత సంహరింపబడితే నేను అతని కొరకు శోకించకుండా ఎట్లా ఉండేది? ధర్మచ్యుతిని సహించని మీరు ఈ అధర్మాన్ని ఎట్లా సహిస్తారు? కచుడు కనపడితే తప్ప నేను ఆహారం ముట్టను"అని దేవయాని ఎక్కిళ్లుపెట్టి ఏడుస్తూ కూర్చున్నది. చాలాసేపటికి గాని శుక్రుడు ప్రసన్నం కాలేదు. యోగదృష్టితో లోకాలన్నీ చూచాడు. ఎక్కడా కచుడు కనపడలేదు. సురాసమ్మిశ్రిత భస్మమయుడై తన ఉదరంలోనే ఉన్న కచుడిని చివరికి చూచాడు. అప్పుడు సురాపానంవలన ఎంత చేటు కలుగుతుందో స్వయంగా తెలిసికొన్నాడు. ఆవేశంతో, పలువురు వినేటట్లుగా ఇట్లా ప్రబోధించాడు.

"మొదలి పెక్కుజన్మములఁ బుణ్యకర్మముల్
పరఁగఁ బెక్కు సేసి పడయఁబడిన
యట్టియెఱుక జనుల కాక్షణమాత్రన
చెఱుచు; మద్యసేవ సేయ నగునె?"
"భూసురు లాదిగఁ గల జను
లీసుర సేవించిరేని యిది మొదలుగఁ బా
పాసక్తిఁ బతితు లగుదురు;
చేసితి మర్యాద; దీనిఁ జేకొనుఁడు జనుల్." **(ఆది. 3.120-120)**

శుక్రుడు నాటినుండి సురాపానాన్ని మహాపాతకంగా శపించాడు. తన కడుపులో ఉన్న కచుడిని సంజీవితుడిని చేశాడు. ఉదరంలో నుంచే కచుడు శుక్రుడిని ఇట్లా ప్రార్థించాడు.

"ఓ పుణ్యాత్ముడా! నాకు తనువును ప్రాణాన్ని సత్వాన్ని ప్రసాదించావు. నీ ఉదరంలోనుండి వెలువడే మార్గాన్ని నాకు చూపించుము". ఆ మాటలు విని శుక్రుడు ఇట్లా అన్నాడు. "నీవు నా ఉదరాన్ని చీల్చుకొని గాని బయటకు రాలేవు. అట్లా వస్తే అప్పుడు నేను మరణిస్తాను. నన్ను సంజీవితుడిని చేయాలి నీవు" అని శుక్రాచార్యుడు కచుడికి సంజీవని ఉపదేశించాడు. ఆ తరువాత ఉదయాద్రిదరీముఖంనుండి ఉదయించిన పూర్ణచంద్రబింబంవలె కచుడు శుక్రునిగర్భంనుండి వెలువడ్డాడు. శుక్రాచార్యుడు విగతజీవుడై పడిపోయాడు. శుక్రుడిని కచుడు మృతసంజీవనీ విద్యచే పునరుజ్జీవితుడిని చేశాడు. ఉచ్చారణదక్షునిచేత అభిహితమైన శబ్దం వలె శుక్రాచార్యుడు సంజీవితుడై ప్రకాశించాడు. కచుడు అట్లా సంజీవనీవిద్యను పొంది చాలాకాలం శుక్రాచార్యుడిని సేవించి, ఒకనాడు అతని అనుమతితో దేవలోకానికి ప్రయాణమయ్యాడు.

అమరావతికి తిరిగి వెళ్ళుతున్న కచుడిని చూచి వియోగదుఃఖంతో దేవయాని ఇట్లా అన్నది.

"నీవును బ్రహ్మచారివి వినీతుఁడ, వేనును గన్యకన్, మహీ
దేవకులావతంస! రవితేజ! వివాహము నీకు నాకు మున్
భావజశక్తి నైనయది, పన్నుగ నన్నుఁ బరిగ్రహింపు సం
జీవనితోడ శుక్రు దయఁ, జేయుము నాకుఁ బ్రియంబు నావుడున్." **(ఆది- 3. 129.)**

దేవయాని మాటలకు కచుడు విషాదాకులచిత్తు డయ్యాడు. 'గురువులకు శిష్యులు పుత్రులు. లోక ధర్మ పథంలో ఇది అనుసరింపవలసిన పరమార్థం. నీవు నాకు గురుపుత్రివి. అంటే నాకు సహోదరివి. లోకనింద్యమైన ఈ తనూసంగమాన్ని నీవు భావించటం తప్పు. పలకటం మరింత తప్పు' అని హితబోధ చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దేవయానికి అపరిమితమైన కోపం వచ్చింది. 'నా కోరిక తీర్చని నీకు, నీ యందు సంజీవని పనిచేయకుండ ఉండుగాక!' అని శాపం పెట్టింది. కచుడు ధీరుడై ఇట్లా సమాధానం చెప్పాడు: "నేను ధర్మపథాన్ని తప్పిన వాడిని కాను. నీ శాపం వలన సంజీవని నాయందు పనిచేయకపోయినప్పటికీ, నాచేత ఉపదేశం పొందిన వారిపట్ల అది ఫలిస్తుంది. 'మరి నీవు ధర్మవిరోధంగా భావించావు, ప్రవర్తించావు. కాబట్టి నిన్ను బ్రాహ్మణుడు వివాహ మాడకుండుగాక!" అని ప్రతిశాపం ఇచ్చాడు కచుడు. అతడు అమరావతికి తిరిగి వెళ్ళిపోయాడు.

ధార్మిక దృక్పథం అమృతత్వ సాధనం

'జాతస్య మరణం ధ్రువం' అన్నది సత్యోక్తి. మృత్యువును జయించాలనే లక్ష్యంతో మానవుడు చేసే ప్రయత్నం అమృత ప్రస్థానం. అందులో శుక్రాచార్యుడు సాధించింది మృతసంజీవని. అంటే దేశ కాల పాత్ర పరిధిలో ఒక జీవి మరణిస్తే అదే స్థితిలో అతడు పునర్జీవితు డౌతాడు. అందులోను యుద్ధంలో మరణించినవారే పునర్జీవితులు కావటం ఈ కథలోని వాస్తవం. ఒకవేళ అందరూ బ్రతుకుతా రని భావించినా జరారోగ భయాలు ఈ విద్యచేత నివారింపబడవు. వయస్స్తంభనం ఈ విద్యవలన అసాధ్యం. సహజ మృత్యు దశను కూడా ఈ విద్య నివారిస్తుందని స్పష్టంగా లేదు. ఒక వేళ ఈ విద్యయే లభిస్తే అది యౌవనదశలోని వారికి వరప్రసాదం. తదితరుల కంత ప్రయోజనకారి కాకపోవచ్చును. దీనివలన శరీరాని కున్న అనిత్యత్వం నివారించబడటం లేదు. మృతసంజీవని అమృతత్వం కాదు. కాని, ఆవైపులో మానవుడు సాధించిన మొదటి మెట్టు.

విశేష మేమంటే ఈ విద్య దానవలోకగురు డైన శుక్రుడు సాధించింది. అమృతత్వ సాధనలోని తామసిక లక్షణం ఇందులో ఉన్నది. పడిపోయిన శరీరం ప్రాణవంతం కావటమే ఇందులోని పరమార్థం. శరీరం శిథిలం కాకుండా శాశ్వతంగా నిలిపే ప్రక్రియ ఇందులో లేదు. ఇది శరీరధారికి సాధ్యమవుతుందా? అన్న ప్రశ్నకు మృతసంజీవనీ విద్య మానవలోకానికి మిగిల్చింది.

మృతిని శరీరం వరకే భావించటం అసుర ప్రవృత్తి. శరీరం యొక్క అనిత్యత్వం గుర్తించి మానవునికి అమృతత్వాన్ని అందించేది ధర్మం ఒక్కటేనని తెలిసికొని అనుసరించటం దేవతల లక్షణం. ఆ తెలివిడితో అనిత్యమైన దేహంతో నిత్యమైన ధర్మసాధన ప్రస్థానం తెలిసి సాధించటం మానవత్వం. కచుడు దేవలోకానికి సంబంధించినవాడు. భస్మమైన అతని శరీరం తిరిగి రూపు కట్టడానికి తోడ్పడింది మృతసంజీవని. నిజానికి రాక్షసులు కాల్చిన శరీరం బూడిద అయినా అతడు మరలా బ్రతకగలిగాడు. ఆ కచుడే సోదరిగా భావింపదగిన దేవయానిని శరీరవ్యామోహంతో భార్యగా స్వీకరించినట్లయితే ధర్మంతోపాటు బూడిద పాలై పోయిఉండేవాడు. ధర్మచ్యుతుడైన వ్యక్తికి పునర్జీవితం లేదు. దానవులకు మృతసంజీవని విద్య. దేవతలకు ధార్మికనిష్ఠ విద్య. దానవవిద్య పరిమిత ప్రయోజనం కలిగిందే. ధార్మికవిద్య దేహానికి మృత్యువు కలిగినా మనిషికి ధర్మంతో జీవించే అమృతయోగాన్ని అందించే విద్య. దేహస్పృహ కలిగిన దేవయానికి ఆత్మస్పృహను కలిగించి, అసురలోకంలో అమృతయోగానికి నాందిని ఆలపించాడు కచుడు.

ఆంధ్రమహాభారతం గార్హస్థ్యధర్మం ద్వారా మానవులు సాధించే అమృతతత్వాన్ని ప్రబోధించటానికి పుట్టిన పంచమవేదం.

"శ్రీవాణీ గిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషు యే
లోకానాం స్థితి మావహ న్త్యవిహతాం స్త్రీ పుంస యోగోద్భవామ్,
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్త మామ్బుజభవ శ్రీకన్ధరా శ్శ్రేయసే". **(ఆది. 1.1)**

అన్నది మంగళశ్లోకం. ఇందులో కీర్తింపబడిన త్రిమూర్తులు సతీసహితులు, గార్హస్థ్య ధర్మ పరతంత్రులు. స్త్రీ పుంస యోగ రూపమైన లోకానికి శ్రేయస్సును చేకూర్చటం ఈ శ్లోకంలోని ఆకాంక్ష.

సమాజంలోని సర్వధర్మాలు గార్హస్థ్యధర్మం కేంద్రంగా పరిభ్రమిస్తూ ఉంటాయి. ఇల్లు చక్కగా ఉంటే ఇలాతలం అంతా సుభిక్షంగా ఉంటుంది. ఆశ్రమ ధర్మాలు అక్షయంగా సాగుతాయి. సృష్టిలో స్త్రీ పురుష సంబంధాలలో ధర్మస్పృహ అక్షయంగా నిలిస్తే సమాజంలో శాంతి అమృతప్రదంగా అందగిస్తుంది. దేవయాని కచుడిని కోరటంలో లౌకిక స్త్రీ పురుష సంబంధాన్ని మాత్రమే పరిగణించింది. అతడు బ్రహ్మచారి అని, తాను కన్య అని వాదించింది. మన సిదివరకే అతనికి దత్తమై ఉండటం వలన వివాహం నిశ్చితమని నిరూపించటానికి యత్నించింది. లౌకిక స్త్రీ పురుష సంబంధాలను పరిగణనంలోకి తీసుకుంటే దేవయానివాదంలో లౌకికన్యాయం ఉన్నది. కాని, కచుడు అది ధర్మబద్ధం కాదని త్రోసిరాజన్నాడు.

దేహసంబంధమైన దేవయాని వాదం శుక్రాచార్యుడి మృతసంజీవని వంటిది. కచుడి ధార్మికదృక్పథం దేవతల అమృతత్వ సాధనం వంటిది.

ఈ ఉభయ లోకాల చైతన్యాల నడుమ ధర్మసాధన మార్గంగా సాగేది మానవ ప్రస్థానం. చంద్రవంశజు డైన యయాతి ఈ ప్రస్థానానికి మార్గదర్శి. కచుడిచేత పరిత్యక్తురా లైన దేవయాని యయాతిజీవితంలో ప్రవేశించింది. చనిపోయినవారిని బ్రతికించే విద్యకు గురువైన శుక్రాచార్యుడి కుమార్తె దేవయానికి చంపటం తెలుసు. చావటం తెలుసు. కాని, పునర్జీవింపచేయటం తెలుసునా? అనే ప్రశ్న ఉదయింపజేస్తుంది.

దేవయానితో గార్హస్థ్య జీవితాన్ని సాగించటానికి మొదలు పెట్టిన యయాతి, మానవుడు సాధించే అమృతత్వసాధనలో త్యాగమనే మహాగుణం అమృతత్వానికి అపరరూపమే అని తలపింప జేసే ఫలితాలను అందించాడు. ఈ గాథ మరొక మధురమైన సాధన దశ.

త్యాగేనైకే అమృతత్వ మానశుః

దేవయానికి ప్రాణ స్నేహితురాలు వృషపర్వుని కూతురు శర్మిష్ఠ, వాళ్ళిద్దరూ కలిసి స్నేహానురాగాలతో విహరిస్తూ ఉండేవారు. ఒకసారి వేయిమంది కన్యకలతో కలిసి శర్మిష్ఠ దేవయానిని కలుపుకుని ఒక సరోవరంలో స్నానం చేయటానికి వెళ్ళింది. ఆ కన్యకలందరూ తమ చీరలను ఒడ్డుమీద ఉంచి నీటిలో దిగి జలక్రీడలాడటం మొదలుపెట్టారు. అంతలో ఒక సుడిగాలి వచ్చింది. ఒడ్డుమీద ఉన్న గుడ్డలన్నింటినీ కుప్పగా కలిపివేసింది. కన్యకలందరూ జలక్రీడ చాలించి ఒడ్డుకు చేరారు. ఎవరి దుస్తులు వారు వెతుక్కుంటూ గుర్తించి కట్టుకొంటున్నారు. శర్మిష్ఠ తొందరలో దేవయాని చీరను కట్టుకొన్నది. దేవయానికి శర్మిష్ఠ చీర మిగిలింది. ఆ చీర కట్టుకోటానికి దేవయాని ఇష్టపడలేదు. 'లోకోత్తరచరిత్రుడైన శుక్రాచార్యుని కుమార్తెను, నీకు పూజ్యురాలిని, భూసురకన్యను, నేను నీవు విడిచిన బట్టలను కట్టుకోవచ్చునా చెప్పు?' అని దేవయాని గద్దించింది.

శర్మిష్ఠ తెల్లవోయింది. 'మానాన్నగారి దగ్గర మీ నాన్నగారు పనిచేస్తారు. వారు మా తండ్రిని దీవించి వారికి హితం చేకూరుస్తుంటారు. వారిద్దరి మధ్య తేడాలు లేవు. మనిద్దరి మధ్య ఎందుకు? మీనాన్న గొప్పతనం గురించి నీ గొప్పతనం గురించి ప్రత్యేకించి నాకు వేరుగా చెప్పాలా? నేను కట్టుకున్న చీర నీకు కట్టుకోడానికి అంత పనికిరాదా?' అని అభిమానంతో క్షత్రియవనితగా పలికింది.

దేవయాని తన పట్టు వీడలేదు. శర్మిష్ఠ తనరోషం మానలేదు. కట్టిన చీర విప్పటం క్షత్రియ వనితకు అవమానం అనుకొన్నది శర్మిష్ఠ, ఒకరు విప్పిన చీరను తాను కట్టుకోవటం బ్రాహ్మణవనితకు తగదనుకొన్నది - దేవయాని, మాటలు

పెరిగాయి. శర్మిష్ఠ, దేవయానిని ఆ ప్రక్కనే ఉన్న పాడుబడ్డ బావిలోకి త్రోసి, వేయిమంది కన్యకలతో ఇంటికి తిరిగి వెళ్ళిపోయింది. అదేసమయంలో నహుషపుత్రుడు అయిన యయాతి వేటకై ఆ ప్రాంతానికి వచ్చాడు. ఆ సరోవరంలో నీరు త్రాగటానికి ఆ తీరానికి చేరుకొన్నాడు. ప్రక్కనే ఉన్న పాడుబడ్డబావిలో దేవయాని ఆర్తనాదం విన్నాడు. లతల నడుమ చిక్కుబడి ఉన్న ఆ లలితాంగిని చూచాడు. ఎవరైనా తనను రక్షిస్తారేమోనని ఎదురుచూస్తూ కన్నీరుకారుస్తూ ఉన్నది. ఆ విషాదమూర్తిని విలోకించాడు. వరుణదేవుని భార్యయే, భర్తమీద అలిగి జలనివాసం విడిచి భూస్థలానికి వచ్చిందా అన్నట్లు ఆర్తమూర్తి అయిన దేవయానిని కన్నారా చూశాడు. నూతిలో ఉన్న ఆమెపట్ల సానుభూతి ప్రకటించాడు.

“నీవెవరివి? ఇట్లా ఒంటరిగా ఈ పాడుబడ్డ బావిలో ఎందుకున్నావు?” అని ఎలుగెత్తి అడిగాడు.

యయాతి వృత్తాంతం

దేవయాని యయాతిని గుర్తించింది. ఇదివరలో ఎన్నోసార్లు వేటకొరకై వచ్చి తన తండ్రిని చూచి వెళ్ళినవాడే. మాటను పోల్చుకొన్నది. రూపును పోల్చుకొన్నది. తాను శుక్రాచార్యుడి కూతురునని చెప్పుకొన్నది. ప్రమాదవశాత్తు బావిలో పడ్డానని పేర్కొన్నది. తనను బయటికి తీసి రక్షించుమని వేడుకొన్నది. ఆమెదయనీయస్థితిని చూచి యయాతి దయాంతరంగుడైనాడు.

తనకుడిచేతిని చాచి దేవయాని కుడిచేయి పట్టి లాగి, ఆమెను బావినుండి పైకితీసి యయాతి తననగరానికి తిరిగి వెళ్ళాడు. దేవయానిని వెతుక్కుంటూ ‘ఘూర్ణిక’ అనే చెలికత్తె అక్కడికి వచ్చింది. ఇంటికి రమ్మని దేవయానిని కోరింది. దేవయాని కోపంతో అగ్నిజ్వాలగా మండిపోయింది.

“ఆ శర్మిష్ఠ చేసిన ఈ అవమానాన్ని నేను సహించలేను. ఆమె కన్నతండ్రి వృషపర్వుడు పాలించే ఈ నగరంలో నేను ప్రవేశించను. ఈ సంగతి మా తండ్రి శుక్రాచార్యులకు చెప్పి ఆయన్ని ఇక్కడకు పిలిపించు” మని ఘూర్ణికను ఆజ్ఞాపించింది.

శుక్రాచార్యుడు దేవయాని దగ్గరకు ఆత్రుతతో వచ్చాడు. కోప ఘూర్ణిత బాష్పపూరిత అయిన దేవయానిని చూచాడు. క్రోధంవలన కలిగే అనర్థాలను మనస్సులో భావించాడు. కుమార్తెకు బోధించాడు -

‘అమ్మా ! దేవయానీ! లోకంలో కోపాన్ని అణచుకొన్నవారు ఎంతో ఉత్తములని కీర్తింపబడుతారు. అనేక నియమాల కోర్చి, అపారదక్షిణల నిచ్చి, వేల యజ్ఞాలు చేసిన వారికంటె కోపం లేనివారు గొప్పవారని తత్త్వవేత్తలు చెపుతారు. ఎదుటివారు కోపగించినా తాము కోపగించుకోనివారు, ఎదుటివారు ఎగ్గులు పలికినా నిర్లిప్తంగా ఉండి, మారుపలకని వారు, అవమానాలపాలైనా, పగసాధించక ఓర్పు వహించేవారు, ధర్మజ్ఞులని లోకులు కీర్తిస్తారు. కాబట్టి బుద్ధిగలవారికి క్రోధం మంచిది కాదు. శర్మిష్ఠ రాజుకుమార్తె. చిన్న పిల్ల. దానితో నీకు పంత మెందుకు? ఇంటికి పోదాం రా’ అని శుక్రాచార్యుడు దేవయానిని అనునయించాడు.

‘అనురాగం, నేర్పు, సాహసం కలవారిని లెక్కచేయకుండా అవమానించే అవివేకులవద్ద ఉండటంకంటె కష్టం మరేదైనా ఉన్నదా? ఈ వృషపర్వనగరంలో నే నిక ప్రవేశించేది లేదు. ఎక్కడికైనా వెళ్ళిపోతాను’ అని బెదరించింది దేవయాని. శుక్రుడికి దేవయాని అంటే ప్రాణం. ఆమే గతి అని నమ్ముతాడు. అందువలన ఆమెతో తాను కూడా వస్తానని చెప్పి ఆమెను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ సంగతి వృషపర్వుడు గూఢచారులవలన తెలిసికొన్నాడు. శుక్రాచార్యులవద్దకు వచ్చాడు, వినయంతో నమస్కరించాడు. శుక్రాచార్యుల మృతసంజీవనీవిద్యా ప్రభావంతో దేవతలను మించే సంపదను దైత్యులు సంపాదించగలిగారనీ, ప్రాణాలతో బ్రతకగలిగారనీ, దానవ చతురంగబలమంతా శుక్రాచార్య వరదత్తమనీ ప్రశంసించి, దేవయాని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనసుకు ఏది ఇష్టమైతే దానిని తప్పక ఇస్తానని వృషపర్వుడు పేర్కొన్నాడు. ఆ మాటలు విని దేవయాని ఆనందపడింది. సమయం వచ్చింది కదా అని వేయిమంది కన్యకలతో కూడిన శర్మిష్ఠ తనకు దాసిగా ఉండాలని కోరింది. ఆ మాటను కాదనలేక వృషపర్వుడు అంగీకరించాడు. శుక్రుడు సంతోషించాడు. శర్మిష్ఠ కన్యకాసహస్రంతో ప్రతిరోజూ దేవయానిని సేవిస్తుండేది.

ఒకనాడు అందరూ కలిసి ఉద్యానవనానికి వెళ్ళారు. ఆ సమయంలో యయాతి సమీపారణ్యంలోకి వేటకై వచ్చి ఆ వనంలో ప్రవేశించాడు. దేవయానిని చూచి అతిథిసత్కారాలను పొందాడు. ఆమెప్రక్కనే 'అతిశయ రూప లావణ్య గుణసుందరి' అయిన శర్మిష్ఠను ఆమె చెలికత్తెలను చూచి వారిని పరిచయం చేసికొన్నాడు. అప్పుడు దేవయాని యయాతియందు అనురక్తురాలై తనను వివాహం చేసుకొమ్మని అడిగింది. నన్నయ ఆ సందర్భాన్ని ఎంతో గొప్పగా చిత్రించాడు.

"నిగ్రహ మేది నన్నుఁ దరణిప్రభ! కూపము వెల్వరించునాఁ
డుగ్రమయూఖుసాక్ష్యముగ నున్నతదక్షిణపాణిఁ జేసి భూ
పాగ్రణి! నాదు దక్షిణకరాబ్జము వట్టితి కాన మున్న పా
ణిగ్రహణంబు సేసి; తది నీ యెడ విస్మృతిఁబొందఁ బాడియే."
"నన్ను వివాహమై నహుషనందన! యీలలితాంగిఁ దొట్టి యీ
కన్నియ లందఱున్ దివిజకన్యలతో నెన యైనవారు నీ
కున్నతిఁ బ్రీతి సేయఁగ, నృపోత్తమ! వాసవుఁ బోలి లీలతో
నిన్నరలోకభోగము లనేకము లందుము నీవు నావుడున్." **(ఆది. 3. 160-161)**

దేవయాని మాటలకు యయాతి అభ్యంతరం చెప్పాడు. క్షత్రియులు బ్రాహ్మణ కన్యలను వివాహమాడటం ధర్మవిరుద్ధమని పేర్కొన్నాడు. దేవయాని తన వాదనను వీడలేదు. 'సకలలోకపూజ్యు డైన శుక్రాచార్యుడు ఈ వివాహాన్ని అంగీకరిస్తే, నన్ను నీ దాన్నిగా స్వీకరిస్తావా?' అని దేవయాని యయాతిని అడిగింది. శుక్రాచార్యుడు ఇది ధర్మవిరుద్ధం కాదని చెప్పితే తన కభ్యంతరం లేదని యయాతి పేర్కొన్నాడు. దేవయాని వెంటనే శుక్రాచార్యుడిని పిలిపించింది. 'తేజోమూర్తి అయిన శుక్రుడు వారి ఎదుట ప్రత్యక్షం అయ్యాడు. అందరూ ఆ మునికి నమస్కరించారు.

దేవయాని శుక్రాచార్యుడితో ఇట్లా అన్నది: 'ఈ యయాతి మహారాజు నన్ను నూతినుండి వెలికి తీస్తున్నప్పుడే నా కరగ్రహణం చేశాడు. అందువలన ఆయన ఈ జన్మకు నాకు భర్త అయినాడు. ఒకరు పట్టిన నా చేతిని మరొకరికి ఇవ్వటం న్యాయమా? కాబట్టి నాకు యయాతియే భర్త. మీ రంగీకరిస్తే నన్ను వివాహం చేసుకొంటానంటున్నాడు. నన్ను వివాహం చేసుకోవటంవలన యయాతికి ధర్మవిరోధం కలుగదని మీరు అనుగ్రహించాలి.'

ఈ మాటలు విన్న శుక్రుడు పుత్రికావ్యామోహంతో ఆమె వివాహాన్ని సమర్థించటానికి పూనుకొన్నాడు. అపక్రమదోషం లేకుండా వర మిచ్చాడు. వారిద్దరికీ వైభవంగా వివాహం చేశాడు. దేవయానితో పాటు సహస్రకన్యా పరివృత అయిన శర్మిష్ఠను అరణంగా అందించాడు. వారందరికీ అన్నపాన భూషణాది సౌకర్యాలను యయాతి కల్పించాలనీ, శర్మిష్ఠతో కలిసి శయనించటం పరిహరించాలనీ ఆజ్ఞాపించాడు.

యయాతి దేవయానినీ, శర్మిష్ఠనూ, కన్యాసహస్రాన్నీ వెంట తీసికొని నిజనగరానికి వెళ్ళాడు. దేవయానిని అంతః పురంలో మహారాణిభవనంలో ఉంచాడు. ఆమెఅనుమతితో శర్మిష్ఠను అశోక వన సమీపంలోని ఒక గృహంలో నివాసముంచాడు. దేవయాని యందు యయాతి యదు, తుర్వసులనే ఇద్దరు కుమారులను సంతతిగా పొందాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దేవయాని అహంకారవతి. తా ననుకొన్న పని ఏ విధంగానైనా సాధించుకొనే గండ్రగొండి. తన మనసు కచుడిమీదనే లగ్నమైనది కాబట్టి అతడే తన భర్త అని మొదట వాదించింది. అతడు ధర్మాన్ని చూపి ఆమెవలపు అధర్మమని నిరూపించేసరికి పడగచితికిన పాము తోకతో కాటేసినట్లు కచుడిని శపించి పగ దీర్చుకొన్నది. ప్రేమ త్యాగాన్ని, సహనాన్ని కోరుతుంది కాని పగనూ శాపాలనూ రెచ్చగొట్టదు. దేవయాని స్వార్థపరురాలైన అహంకార ప్రణయిని. ఆమె స్వార్థంముందు పితృభక్తి, రాజభక్తి, స్నేహానురక్తి. భర్త్రనురాగప్రవృత్తి అన్నీ దాసోఽహ మనవలసిందే.

యయాతి ధర్మపాలకుడైన ప్రభువు. రక్షించుమని కోరిన దేవయానిని బావినుండి పైకి తీసి కాపాడాడు. తన ధర్మం తాను నిర్వహించినట్లు నిజపురికి తిరిగి వెళ్ళాడు. దేవయానిసౌందర్యంమీద అతడు చూపు నిలుపలేదు - అది అతని ధర్మ ప్రవృత్తికి చక్కని నిదర్శనం. దేవయాని యయాతిని వివాహం ఆడటానికి 'పాణిగ్రహణం' అనే - ఒక పారిభాషిక పదం ఎన్నుకొన్నది. చేయి చేయి కలిసింది కాబట్టి యయాతితో తనకు పెళ్లైపోయిందని వాదించింది. అది వితండవాదం అనటానికి వీలులేదు కాని 'సమయానుకూలవాదం' అనవచ్చును. దాని నొకధర్మంగా ప్రతిపాదించింది. ఆమె చూపించిన ఆ ధర్మం అధర్మం అని భావిస్తున్న యయాతికి శుక్రాచార్యుడిచేత అది ధర్మమని చెప్పించి ఒప్పించాలనే ప్రయత్నం చేసింది. తండ్రిని తన అభిప్రాయానికి అనుకూలంగా మాట్లాడుమని కోరింది. ఆ వివాహంలో ఉన్న అపక్రమదోషాన్ని శుక్రాచార్యుడు శాస్త్రసమ్మతంగా సమర్థించలేక పోయాడు కాని, ఆ వివాహం వలన అటువంటి దోషం యయాతికి కలుగకుండా ఉండేట్లు వరమిచ్చి ఊరకున్నాడు. శుక్రాచార్యునిమీద దేవయాని తీవ్రప్రవృత్తిప్రభావం ఎంత బలంగా ఉండేదో ఆ సన్నివేశంవలన తెలుస్తున్నది.

శుక్రాచార్యుడు శర్మిష్ఠను సహస్రకన్యా సమేతంగా యయాతినగరానికి పంపాడు. కాని, మహారాణి అయిన దేవయానికి కలిగే శయనసౌఖ్యం మాత్రం ఆమెకు కలుగకూడదని శాసించాడు. ఈ మాటలు అంటున్నప్పుడు శుక్రుడు దేవయానితండ్రిగా కనపడతాడే కాని స్వతంత్రవ్యక్తిత్వంతో భాసించడు. పుట్టింట్లో తన తండ్రిని తన చుట్టూ త్రిప్పుకొన్న దేవయాని, అంతఃపురంలో యయాతిని కూడా తన చుట్టూ రంగులరాట్నంవలె త్రిప్పుకోవాలనే ప్రయత్నం చేసింది. భర్తకు తనకు తాను సమర్పించుకోవటానికి బదులు భర్తయే తనకు సమర్పితం కావాలని కోరుకొన్నది. పరస్పరానురాగబద్ధమైన ప్రణయంగా కాక దేవయాని అహంకారాగ్నికి ఆహుతి అర్పిస్తున్న సవనక్రియగా యయాతి సంసారాన్ని మార్చివేసింది. యయాతితో కలిసిఉన్న అనుక్షణం దేవయాని తాను శుక్రాచార్యుని పుత్రికనని జ్ఞాపకం చేస్తున్నట్లుండేది. ఆమెపట్ల అపరాధం జరిగితే పైన శుక్రాచార్యుడు ఉన్నాడని భయపెడుతున్నట్లుగా ఉండేది. ఆభిజాత్యంరీత్యా కూడా యయాతికంటె తానే ఉన్నతమైనదానని జాత్యహంకారాన్ని ప్రదర్శించుకొంటుండేది.

గార్హస్థ్యధర్మం సతీపతుల అద్వైత ప్రణయ సిద్ధికి ఫలరూపం కావాలి కాని అహంకారాల అనంత సంఘర్షణలకు రణరంగం కారాదు. ఒకరిలో ఒకరు కరిగి జాలువారుతున్నట్లు ఉండాలి కాని ఒకరికై ఒకరు జాగరణ చేస్తున్నట్లు ఉండకూడదు. దేవయాని గార్హస్థ్యధర్మం ఉండకూడని విధంగా సాగింది. అందువలన కొడుకులు పుట్టినా, ధర్మం క్రమంగా కొడిగట్టటం మొదలయింది. యయాతికి ఆత్మతృప్తి లేదు. సంసారంవలన ఏ అమృతాన్ని కోరుకొన్నాడో అది అతనికి లభించలేదు. అతని గార్హస్థ్యధర్మంలో దేవయాని బడబాగ్నిలా ప్రజ్వలించింది. క్రమంగా మృతిచెందుతున్న మానసిక గార్హస్థ్య ధర్మం యయాతిలో మరలా పునర్జీవింపచేసిన శక్తి శర్మిష్ఠ. శర్మిష్ఠ యౌవనవతి అయింది. అనన్యసామాన్య మైన సౌందర్యంతో వెలిగిపోతున్నది. ఆ వయసులో పతిని పొంది సుతులను పడసి సుఖించాలని ప్రతి యువతీ కోరుకొంటుంది. ఆమెకు అంతరాంతరాలలో అటువంటి గాఢమైన అనురాగం ఉండేది. దేవయాని ఏ విధంగా యయాతిని కోరి వరించి సాధించుకొన్నదో అట్లాగే తానూ ఆ మహారాజును పొందాలని ఆశపడుతూ ఉండేది. అదృష్టవశాత్తు ఒకనాడు యయాతి అశోకవనవిహారానికి ఆవైపు వచ్చాడు. ఒంటరిగా ఉన్న శర్మిష్ఠను చూచాడు. ఆమెయందు ప్రసన్నచిత్తు డయ్యాడు. ఆమె వినయ సంభ్రమాలతో రాజుకు నమస్కరించింది. తగిన సమయం దొరికిందని ఆ రాజుతో ఇట్లా మాట్లాడింది:

"నీలగళోపమాన! కమనీయగుణోన్నతిఁ జెప్పఁ జాలు న
న్నేలిన దేవయానికి నరేశ్వర! భర్తవు గాన నాకునుం
బోలఁగ భర్త వీవ; యిది భూనుత ధర్మపథంబు; నిక్కువం;
బాలును దాసియున్ సుతుఁడు నన్నవి వాయని ధర్మముల్ మహిన్". **(ఆది. 3.174.)**

'ఆ దేవయానిని పరిగ్రహించినపుడే ఆమెతో అరణంగా వచ్చిన నేనుకూడా నీకు పరిగ్రహయోగ్యురాలినే కాబట్టి నీవు కరుణించి నన్ను కూడా నీ సతిగా స్వీకరించు' మని ప్రార్థించింది.

యయాతి శుక్రాచార్యుడు విధించిన నియమాన్ని పేర్కొంటూ 'ఆ మహాముని మాటలకు నే నంగీకరించాను. ఇప్పుడు నేను అబద్ధమాడలేను' అన్నాడు శర్మిష్ఠతో. అప్పుడు శర్మిష్ఠ ఒక ఆపద్ధర్మాన్ని జ్ఞాపకం చేసింది. 'ప్రాణంమీదకు వచ్చినపుడు, సర్వసంపద అపహరింపబడేటప్పుడు, విప్రవధ జరిగేటప్పుడు, వధూజనసంగమ సమయంలోనూ, వివాహ సమయాలలోనూ అసత్యమాడినా, ఆదోష ముండదని మునివచనప్రమాణం ఉన్నది. నీవు వివాహసమయంలో ఈ నియమానికి అంగీకరించావు. కాబట్టి నీకు అసత్యదోషం కలుగదు' అని నచ్చచెప్పింది. యయాతి శర్మిష్ఠకు అనుకూలుడై, ఆమె అభిమతాన్ని అంగీకరించాడు. అతనివలన ఆమెకు ఒక కొడుకు పుట్టాడు. దేవయానికి ఆ సంగతి తెలిసి, శర్మిష్ఠ దగ్గరకు వచ్చి సంతానలబ్ధికి కారణం అడిగింది. శర్మిష్ఠ, ఒక మహాముని వరం వలన పుత్రుడు జన్మించాడని పేర్కొన్నది. దేవయాని నిజనివాసానికి వెళ్ళిపోయింది. ఆ తరువాత యయాతి శర్మిష్ఠయందు అనురక్తుడై వ్యవహరించాడు. వారిద్దరికీ ముగ్గురు కొడుకులు పుట్టారు. ద్రుహ్యుడు (ద్రుహ్యు), అనువు, పూరుడు - వారి పేర్లు.

ఒకనాడు ఆ ముగ్గురు కొడుకులు కలిసి త్రేతాగ్నులవలె ఆడుకొంటున్నారు. ఆ సమీపంలో యయాతి మహారాజు కూర్చున్నాడు. దేవయాని ఆ ప్రదేశానికి వచ్చింది. యయాతి ప్రతిరూపాలుగా ఉన్న ఆ కుమారులను చూచింది. వా రెవ్వరని యయాతిని ప్రశ్నించింది. అతడు మారు మాట్లాడలేదు. దేవయాని ఆ బిడ్డలను అడిగింది. శర్మిష్ఠా, యయాతులు తమ తల్లిదండ్రులని చెప్పారు. తనకు తెలియకుండ యయాతి శర్మిష్ఠ వలన సంతానాన్ని పొందటం తెలిసికొని కోపదుఃఖతాడిత యై శుక్రాచార్యుని ఆశ్రమానికి హుటాహుటిగా బయలుదేరింది. తండ్రిపాదాలమీద పడి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. యయాతి కూడా ఆమె వెంట శుక్రాచార్యుని ఆశ్రమానికి చేరుకొన్నాడు. దేవయాని గద్గదకంఠంతో, ఇచ్చినమాటను తప్పి యయాతి శర్మిష్ఠయందు ముగ్గురు కొడుకులను పొందిన కథనంతా తండ్రికి వివరించి, యయాతి తనకు తీరని అవమానం చేశాడని మొరపెట్టుకొన్నది. శుక్రుడు యయాతి మాటను వినే ఓపికను గాని, తీరికనుగాని ప్రకటించలేదు. తన ప్రియమైన పుత్రికకు యౌవనగర్వంతో రాగాంధుడై యయాతి అప్రియం చేశాడు కాబట్టి అతడు జరాభారపీడితుడు కావాలని శపించాడు.

యయాతి వినయంతో ఇట్లా అన్నాడు: 'ఋతుమతి అయి పుత్రార్థం పతిని కోరితే భార్యకు ప్రతికూలుడై ఋతు విఫలత్వం చేస్తే అతనికి భ్రూణహత్యాదోషం వస్తుందని పండితు లంటారు. దానికి భయపడి శర్మిష్ఠా ప్రార్థనాన్ని అంగీకరించి, క్రమంగా ఆమెయందు సంతానాన్ని పొందాను. దీనికి మీవంటి దివ్యమునీంద్రులు కోపగించటం, శపించటం న్యాయమా? నాకు దేవయానియందు కూడా విషయోపభోగవిరక్తి ఇంకా కలుగ లేదు. మీ శాపం వలన కలిగే జరాభారం నాకే కాదు. మీ కుమార్తెకు కూడా దుఃఖదాయకమే. కాబట్టి ఈ శాపాన్ని మీరు నివారించాలి" అని ప్రార్థించాడు.

శుక్రుడు యయాతి ప్రార్థనకు కరగిపోయాడు. శాపోపసంహారాన్ని సూచించాడు. శాపంవలన కలిగిన జరాభారాన్ని యయాతికొడుకులలో ఎవరైనా ధరిస్తే, అతని యౌవనాన్ని గ్రహించి యయాతి విషయోపభోగాలనూ, రాజసుఖాలనూ పొందవచ్చుననీ, భోగ తృప్తిని పొందిన తరువాత యయాతి, జరాభారాన్ని తీసికొని తన కొడుకు యౌవనాన్ని తిరిగి ఇవ్వవచ్చుననీ,

యయాతిముసలితనాన్ని ఆ విధంగా భరించిన పుత్రుడు ఆయన తరువాత రాజ్యానికి అర్హుడౌతాడనీ, వంశకర్తకూడా అవుతాడనీ శుక్రుడు ఆదేశించాడు. యయాతి దేవయానీ సహితుడై తన పురానికి తిరిగివచ్చాడు.

శుక్రుని శాపం వర్తించింది. యయాతి జరాభారాన్ని తాల్చాడు. కొడుకులను పిలిపించి క్రమంగా అందరినీ జరాభారాన్ని తీసికొని యౌవనాన్ని ఇమ్మని అడిగాడు. ఒక్క పూరుడు తప్ప మిగతావారంతా ముక్తకంఠంతో యయాతికోర్కెను త్రోసిరాజన్నారు. 'విధివశాత్తు కలిగిన రోగాన్ని కాని, ముసలితనాన్ని కాని ఎవరైనా భరిస్తారు కాని, తెలిసి తెలిసి ఎవరైనా జరాభారాన్ని తలమీద వేసికొంటారా? తల నరసిన తరువాత సాక్షాత్తు మన్మథుడినైనా తరుణులు దరికి చేరనివ్వరు. ముసలితనంతో క్రుంగిపోయిన సాక్షాత్తు కుబేరుడినైనా అభీష్టభోగాలకు బాహ్యునిగానే భావిస్తారు' అని తండ్రిమాటను మొదటి నలుగురు కొడుకులూ తిరస్కరించారు. అందుకు యయాతికి కోపం వచ్చింది. యదువంశంవారు రాజ్యానికి అయోగ్యులని శపించాడు. తుర్వసు వంశం వారు ధర్మాధర్మ విచక్షణారహితు లైన కిరాతకులకు రాజు లవుతారని శపించాడు. ద్రుహ్యు వంశంవారిని జలప్రాయమైన అరణ్య ప్రదేశాలకు రాజులయ్యేటట్లు శపించాడు. అనువువంశంవారిని అల్పాయుష్కులుగా తనువు చాలించేటట్లు శపించాడు.

వంశకర్త పూరు మహారాజు

చివరకు శర్మిష్ఠమూడవకొడుకు పూరుడు తండ్రిని దర్శించాడు. తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని కీర్తించాడు. తను విచ్చిన తల్లిదండ్రులకు తను విచ్చుకోవటం తనయుల సుకృతమని పేర్కొన్నాడు. తన యౌవనాన్ని తండ్రికోసం త్యాగమూర్తిగా దానం చేశాడు. యయాతి అతని యౌవనంతో సహస్రవర్షాలు అభిమతసుఖాలు అనుభవించి తృప్తుడై, పూరుని యౌవనాన్ని తిరిగి ఇచ్చి తన జరాభారాన్ని తాను స్వీకరించి పూరునకు పట్టాభిషేకం చేసి వంశకర్తగా వెలుగొందే మహత్తును కల్పించాడు. పూరుని త్యాగమే యయాతి గార్హస్థ్యధర్మానికీ, గార్హస్థ్య ధర్మంలో ముఖ్యమైన పుత్రధర్మానికీ త్యాగగుణంవలన కలిగే అమృతత్వసిద్ధికీ మూలకారణ మౌతున్నదని స్పష్టమౌతున్నది.

'త్యాగేనైకే' అమృతత్వ మానశుః-' అనే ఉపనిషత్ వేదసూక్తికి పూరుమహారాజుచరిత్రం ఉన్నతమైన ఉదాహరణం. మానవులు గార్హస్థ్యధర్మంలో త్యాగంవలననే అమృతత్వాన్ని సాధించగలుగుతా రన్నది వంశకర్తయైన పూరుడు ప్రబోధిస్తున్నాడు.

గార్హస్థ్య ధర్మ పీఠానికి నాలుగు పాదా లున్నాయి. ఒకటి - యజమాని లేదా గృహస్థుడు; రెండు - ఇల్లాలు లేదా గృహిణి; మూడు - పుత్రుడు లేదా సంతానం; నాలుగు- ధర్మం. ఇది సత్య ధర్మ త్యాగ శాంతి ప్రేమ అహింసాది భేదాలతో ఎన్నో రకాలుగా భాసించవచ్చు. వాటన్నింటిలో త్యాగరూపధర్మంవలన అమృతత్వసిద్ధి సత్వరంగా లభిస్తుంది.

యయాతి కథలో మానవలోకం అమృతత్వాన్ని గురించి దర్శింప వలసిన మార్గం సూచింపబడింది. దానవులకు శరీరం ముఖ్యం; చనిపోయిన శరీరం మరలా బ్రతకటం ముఖ్యం. బ్రతకటంమీద ఉన్న ఊనిక ఎట్లా బ్రతకాలి అన్న జీవన విధానం మీద లేదు అసురులకు. మానవునికి ముఖ్యం - ఎలా చచ్చా డన్నది కాదు, ఎలా జీవితాన్ని సాగించా డన్నది. మనిషి చనిపోయినా అతడిని బ్రతికించేది ధర్మం. అందులోనూ శ్రేష్ఠమైన ధర్మం త్యాగం. అందువలన మానవజీవితంలో మరణాన్ని భౌతికంగా జయించే పద్ధతికంటె ధార్మికంగా జయించే పద్ధతికి ప్రాముఖ్యం ఏర్పడింది.

మానవ జీవితంలో మృత్యు వొక అనివార్యవాస్తవం. కాని, చనిపోయే దేహం నిర్వహించే ధర్మం అజరామరం. దానిని సాధించటమే మానవ జీవన గమ్యం. దేవయాని వివాహధర్మాన్ని భౌతికధర్మంగా గ్రహించింది. అందువలన ఆమె శరీర సుఖం భర్త ముసలితనంతో మృగ్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఆమె తన గృహాన్ని అహంకారంతో కూలగొట్టుకొన్నది; కోపంతో బుగ్గిచేసికొన్నది. ఆమెకు స్వార్థం తప్ప పరార్థం లేదు. పరమార్థం ఆమెకు తెలియదు. ఇటువంటి ప్రవృత్తి గల యిల్లాలు గార్హస్థ్యధర్మాన్ని చంపగలదు.

అయితే, శర్మిష్ఠ ప్రేమతో, తనను తాను భర్తకు సమర్పించుకొనటంతో; ధర్మంతో గార్హస్థ్యధర్మానికి మరలా ప్రాణం పోసింది.యయాతి దేవయానివలన యజమానిగా మృతప్రాయుడయ్యాడు; శర్మిష్ఠ వలన మరల యజమానిగా పునరుజ్జీవితుడైనాడు. గృహిణీత్వం దేవయానివలన ప్రాణచైతన్యాన్ని కోల్పోయింది; శర్మిష్ఠవలన పంచప్రాణాలతో పల్లవించింది. దేవయాని కొడుకులు తల్లిదండ్రులపట్ల భౌతికధర్మం పచరించేవారు. శర్మిష్ఠ కొడుకులలో చివరివాడు పుత్రధర్మాన్ని రక్షించినవాడు. గార్హస్థ్య ధర్మంలో మూడవ పాదం సంతానం. అది యదువు మొదలైనవారిలో నిర్వీర్యమై పోయింది; పూరునిలో పునర్జన్మ ఎత్తింది. పూరుని ధర్మం త్యాగం. త్యాగమే యయాతి గార్హస్థ్య ధర్మానికి అమృతత్వసిద్ధి నిచ్చింది. దానికి ఫలంగా పూరునికి సామ్రాజ్యంతోపాటు, వంశకర్త అయ్యే యోగ్యత కలిగింది.

శకుంతలాదుష్యంతుల వృత్తాంతం

భరతుడు శకుంతలా దుష్యంతుల పుత్రుడు. యయాతి కథలో గార్హస్థ్యధర్మం ఒక గృహిణి చేత మూర్ఛితమైతే, మరొక గృహిణి పునరుద్ధరించిన కథ చిత్రింపబడింది. అందుకు యయాతి కూడా ఒక బలమైన హేతువైనాడు; దోహదశక్తిగా నిలిచాడు. వారిరువురి ప్రయత్నాలు విఫలమైనప్పుడు వారి గార్హస్థ్యధర్మాన్ని నిలిపింది పుత్రుడైన పూరుడు.

దుష్యంతుని చరిత్ర యయాతి చరిత్రకంటె ఒక అడుగు ముందుకు వేసింది. దుష్యంతుడు గాంధర్వ వివాహధర్మంతో శకుంతలను వివాహమాడాడు. ఆమెను అంతఃపురానికి తీసికొనిపోతానని మాట ఇచ్చాడు. కాని, మాట తప్పాడు, శకుంతల భర్త ఎదుటకు పుత్రునితో కలిసి వచ్చింది. అత డామెను భార్యగా గుర్తించలేదు. దానితో వివాహధర్మంతోపాటు, సత్యం కూడా కుప్పకూలిపోయింది. శకుంతల గార్హస్థ్యధర్మంలో యజమానికి, భార్యకు, సుతునికి, సత్యానికి ఉన్న ప్రాధాన్యాన్ని భర్తకు నిండుకొలువులో వివరించి చెప్పింది. దుష్యంతుడు ఆమె మాటలను పెడచెవిని పెట్టాడు. అప్పుడు ఆకాశవాణి నిజం బైట పెట్టింది. అపవాదభీతితో అబద్ధమాడానని దుష్యంతుడు నిండుసభలో అంగీకరించి, శకుంతలను పట్టమహిషిగా స్వీకరించి, భరతుడికి యౌవరాజ్యాభిషేకం చేశాడు.

గార్హస్థ్య ధర్మం నాలుగు పాదాలతో నడవాలంటే ఆ ధర్మాన్ని నిర్వహించే వారికి అంతఃకరణశుద్ధి ఉండాలని దుష్యంతుడి కథ బోధిస్తుంది. చిత్తశుద్ధి లేకపోతే సత్యం ప్రకటితం కాదు; సత్యం నిలువకపోతే సంసార వ్యవస్థ అస్తవ్యస్త మౌతుంది. ఇల్లాలికి అన్యాయం జరుగుతుంది; పుత్రునికి అస్తిత్వం లేకుండా పోతుంది. యజమాని అసత్యదోషంతో అంతరించి పోతాడు. కాబట్టి గార్హస్థ్య ధర్మానికి అమృతత్వం కలిగించేది సత్యధర్మనిరతి అన్న సత్యాన్ని సర్వాంగసమృద్ధంగా చాటే ఆఖ్యానకం శకుంతలా దుష్యంతుల వృత్తాంతం.

దుష్యంత మహారాజు కథను దుష్యంతోపాఖ్యానమనీ, శకుంతలోపాఖ్యానమనీ పిలుస్తూ ఉంటారు. ఆ రెండు పేర్లూ ఆ కథకు సార్థకాలే.

ఆ కథలో ఆ రెండు పాత్రలకూ ప్రాధాన్యం ఉన్నది. దుష్యంతుడు లౌకిక ధర్మానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. శకుంతల ఆత్మ ధర్మానికి ప్రతీకగా నిలబడుతుంది. అతడు ఒక అవస్థలో చిక్కుకొన్న వ్యక్తి. స్వీయధర్మాన్ని రక్షించుకోటానికి యత్నిస్తాడు. ఆమె గార్హస్థ్య వ్యవస్థా ధర్మాన్ని పరిరక్షించుకోటానికి ప్రయత్నిస్తుంది. వ్యక్తిధర్మం లోకాపవాద భీతితో వ్యవస్థాధర్మాన్నీ గార్హస్థ్య ధర్మాన్నీ నిరాకరిస్తే ఏర్పడే ధర్మసంకటస్థితిని చిత్రించేది ఈ కథ. ధర్మసంకటాన్ని కలిగించేది లౌకికవ్యవస్థకు అధిపతి అయిన దుష్యంత మహారాజు. ధర్మస్థితి నిలుపుకొనేది "ధర్మో రక్షతి రక్షితః" అనే సత్యాన్ని కాపాడిన శకుంతల.

ఈ కథలోనిది ధర్మ సమస్య. రాజు వర్ణాశ్రమ ధర్మ రక్షకుడు. క్షత్రియ ధర్మోచితంగా రాజ్యాన్ని బాహుబలంతో పాలిస్తున్నాడు. అతడు వేటకు పోవటం కూడా క్షత్రియ ధర్మమే. అరణ్యంలో మహర్షిని దర్శించడానికి ఒంటరిగా వెళ్ళటం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అతని రాజోచిత ధర్మమే. ఆశ్రమంలో శకుంతల కనబడుతుంది. ఆమె యందు అతని మనసు లగ్నమౌతుంది. ఆమె ముని కన్య అయితే తనకు వివాహయోగ్యురాలు కాదు కదా అని భావించడం కూడా అతని వర్ణ ధర్మ రక్షణ చిత్త ప్రవృత్తియే. శకుంతల మేనకా విశ్వామిత్రుల పుత్రిక అని తెలిసిన తరువాత ఆమెను వివాహమాడ నిశ్చయించటం కూడా వర్ణ ధర్మమే. గాంధర్వ విధిని శకుంతలను చేపట్టటం కూడా క్షత్రియ ధర్మమే. ఆమెకు పుట్టిన పుత్రుడికి యౌవరాజ్య పట్టాభిషేకం చేస్తానని అతడు మాట ఇవ్వటం కూడా క్షత్రియ ధర్మమే. అయితే, గాంధర్వ వివాహంలో కర్తలు ఫల భోక్తలు భార్యాభర్తలే.

దుష్యంతుడు మొదట వ్యక్తి, ఆపై రాజు, ఆ తరువాత శకుంతలాపతి, ఆపై ఆమెకుమారుని తన వారసునిగా ప్రకటించిన తండ్రి. ఈ నాలుగు అవస్థల నడుమ సంఘర్షణ రాకుండ చూచుకోవలసిన బాధ్యత ఆయన కున్నది. గాంధర్వ వివాహ ధర్మాన్ని రక్షించి శకుంతల వివాహాన్ని రహస్యంగా, అమంత్రకంగా చేసికొన్న సత్యాన్ని ప్రజలముందు, అమాత్యులముందు ప్రకటించవలసిన బాధ్యత అతని కున్నది. కాని, లోకాపవాదభీతిచేత ఆ ధర్మాన్ని నిర్వహించలేక పోయాడు. అతని వర్తనం ధర్మసంకటాన్ని, ధర్మగ్లానిని కలిగించే స్థితిని కల్పించింది. దానిని శకుంతల భక్తి వారించింది. ఆకాశవాణి సత్యాన్ని ప్రకటించి, ధర్మాన్ని రక్షించి, గార్హస్థ్య ధర్మవ్యవస్థను భూతలంమీద నిలిపింది.

ఈ ఉపాఖ్యానతత్త్వం లౌకికధర్మం ఆత్మధర్మాన్ని ఆదరించినప్పుడే సత్యం నిలుస్తుందని బోధిస్తున్నది. ఆ మహార్థాన్ని చెప్పడానికి అనువుగా కథ నడుస్తుంది. ఎలాగంటే -

(అ) కణ్వ మహర్షి ఆశ్రమంలో లేని తరుణంలోనే దుష్యంతుడు శకుంతలను గాంధర్వవిధిని వివాహమాడి, ఆ తరువాత అమాత్యులను మహర్షివద్దకు పంపి ఆమెను అంతఃపురానికి రప్పించుకొంటానని ఊరట పలికి వెడలిపోయి మిన్నకున్నాడు. దుష్యంతుడు మాట నిలువ బెట్టుకొనే కనీసప్రయత్నం చేయలేదు. అతడు వంచనకు పాల్పడ్డాడని స్పష్టమౌతుంది.

(ఆ) కణ్వుడు జరిగినదంతా దివ్యదృష్టితో చూచి వివాహం ధర్మబద్ధమైనదని అంగీకరించి, కూతురు కోరిన వరా లిచ్చి ఆమె యోగక్షేమాలను చూస్తాడు. వంశకర్త అయిన భరతుడు పుట్టి, సర్వదమనుడుగా పెరిగి, యౌవరాజ్యపట్టాభిషేకయోగ్యత వచ్చేంతవరకు కణ్వమహర్షి ఆశ్రమంలో శిక్షణ పొందుతాడు. కణ్వుడు దాదాపు రెండు దశాబ్దాలు నిశ్శబ్దంగా ఉండి చేసిన పని అపూర్వం. దుష్యంతుడి వంటి బలం భరతుడు పుట్టుకతో తెచ్చుకొన్న గుణం. కాని, జీవితమంతా యజ్ఞదీక్షలతో గడిపే వంశకర్త సంస్కారం భరతుడు కణ్వమహర్షి శిక్షణలో పెంచుకొన్న గుణం. దుష్యంతుని వారసునిలో లౌకికధర్మంకంటె ఆత్మ ధర్మం బలంగా ప్రతిష్ఠాపింపబడింది.

(ఇ) ఈ ఉపాఖ్యానంలో భరతుడు నిశ్శబ్ద పాత్ర. తల్లితో కలసి హస్తినాపురం చేరి నిండుసభలో దుష్యంతుడిని దర్శిస్తాడు. తల్లిదండ్రుల నడుమ జరిగిన సంభాషణ వింటాడు. తల్లిని తండ్రి నిరాకరిస్తున్నా, తనను పుత్రునిగా మన్నించక పోయినా భరతుడు కోపాన్ని ప్రకటించడు; పల్లెత్తి మాటాడడు. తనకు రావలసిన యౌవరాజ్య పట్టాభిషేకం సంగతి పట్టించుకోడు. ఆవు వెంట లేగదూడవలె తల్లి వెంట నడుస్తాడు. ఈ సహనం, ఈ శాంతి కణ్వసంస్కృతి; విరుద్ధ సత్త్వాల నడుమ గూడ స్నేహ శాంతులను దర్శించగల ఆశ్రమ సంస్కృతి. నన్నయ ఈ అంశాలన్నీ చెప్పకుండానే చెప్పినట్లు కథ నడిపాడు.

(ఈ) గార్హస్థ్యాశ్రమంలోని స్త్రీవ్యక్తిత్వానికి సజీవరూపకల్పన శకుంతల. గాంధర్వ వివాహ పద్ధతి ననుసరించి శకుంతల దుష్యంతుడిని వివాహమాడింది. తాను కులసతి అయింది. కణ్వు డామె వివాహాన్ని మన్నించాడు. కణ్వాశ్రమ సంస్కృతిలో ఆమె కులసతివ్యక్తిత్వాన్ని పరిపూర్ణంగా సాధించింది. గార్హస్థ్య ధర్మానికి భార్య, భర్త, సంతానం, సత్యం అనేవి నాల్గు స్తంభాలుగా నిలబడాలని, వాటిమీద ఆ వ్యవస్థ పదిలంగా నిలవాలని ఆమె నేర్చుకొన్నది. దానినే ఆచరించింది. దుష్యంతుడి సభలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దానినే బోధించింది. భార్య 'గృహనీతి విద్యకు ఆచార్యకము' అనే సూక్తికి ఆమెయే ఆదర్శంగా నిలిచింది. సత్య ప్రాతిపదిక లేని సంసారం నిస్సారమని దుష్యంతుని వర్తనం ఋజువు చేసింది. ఆమె ఆశలు, ఆశయాలు కుప్పగూలిపోయే పరిస్థితి యేర్పడింది. కాని, ఆమె దైవభక్తురాలు కావటంచేత భగవంతునిపై భారం వేసి ప్రార్థించింది. ఆకాశవాణి నిజం చెప్పి ఆమె గార్హస్థ్యధర్మాన్ని నిలిపింది. భారతదేశంలో గార్హస్థ్యధర్మం స్త్రీలవలననే ప్రధానంగా రక్షించబడుతుందన్న విశ్వాసాన్ని వాస్తవం చేసింది శకుంతల.

గృహస్థాశ్రమంలో స్త్రీ భార్యగా, తల్లిగా, తనయగా, ఉపాధ్యాయినిగా, వివేకవతిగా, ధర్మోద్ధారకురాలుగా వివిధ భూమికలను నిర్వహించి తన వ్యక్తిత్వాన్ని నిలుపుకొంటుంది. అంతఃపురానికి పిలిపించుకొంటానని ఊరడింపు మాటలు పలికి రాజధాని కేగి తిరిగి చూడని భర్తను పల్లెత్తు మాట కూడా అనకుండా ధర్మబుద్ధితో పుట్టింట నిలిచింది శకుంతల. పుట్టింట తండ్రి ఆనతిని జవదాటక జీవితం సాగించింది. తండ్రి అత్తవారింటికి పంపితే వెళ్లింది. నిండుసభలో దుష్యంతుని యెదుట గార్హస్థ్య ధర్మం నిలువబడే నాలుగు స్తంభాలను గురించి గంభీరంగా ధర్మోపన్యాసం చేసి తనసతీత్వాన్ని తన మాతృత్వాన్ని సమర్థించుకొని దుష్యంతుని పతిత్వాన్ని సత్యంతో ప్రకటించుకొమ్మని హెచ్చరించింది. కణ్వమహర్షికుమార్తె ధర్మబోధ చేసినట్లుంటుంది ఆమె ధర్మబోధ. ఆశ్రమ సంస్కృతి నాగరక కుహనా సంస్కృతిని మందలిస్తున్నట్లుంటుంది. వ్యాసుడు శకుంతల వాక్యాలలో ధ్వనిస్తాడు. ఋషి వంటి నన్నయ ఆమె మాటలలో నానారుచిరార్థ సూక్తి నిధిగా దర్శనమిస్తాడు. పఠిత ఆమె పాత్రలో పరవశించి ఉపదేశాన్ని పొందుతాడు. శకుంతల నిజంగా భరతమాత!

వంశకర్త భరతుడు

భరతుడు విశాలరాజ్యాన్ని పాలించాడు. అనేక యాగాలు చేసి భూరిదక్షిణలతో భూసురులను సంతోషపెట్టాడు. ఇది ఈ వంశకర్త విశిష్ట లక్షణం. ఈ గుణాన్ని ధర్మరాజు తన జీవితంలో పండించుకొన్నాడు. చక్రవర్తి చేయ గలిగిన రాజసూయ యాగాన్ని, అశ్వమేధ యాగాన్ని చేసి తన ప్రభుత్వాన్ని యజ్ఞదీక్షలతోనే గడిపాడు. లౌకికధర్మంలో కూడా ఆత్మధర్మం ఆవిష్కృతమయ్యేటట్లు జీవితయాత్ర సాగించి ఆదర్శవంతుడైన- ఇతిహాసనాయకు డయ్యాడు. భరతుడిశీలం ధర్మరాజులో ప్రతిఫలించింది. ఇది ధ్వనింపజేయటమే ఉపాఖ్యానానికీ, ఆఖ్యానానికీ ఉన్న సంబంధం.

మహాభారతంలో పాండవులు అక్షరాలా పౌరవులనీ, భరతవంశీయులనీ అనిపించుకొన్నారు. పాండవులు గార్హస్థ్యధర్మాన్నీ, క్షత్రియ ధర్మాన్నీ, మానవ ధర్మాన్నీ, అసిధారావ్రతంగా రక్షించారు. ద్రౌపది గృహిణీ ధర్మానికి పరిపూర్ణ ప్రతీకగా నిలిచింది. ఆమె అడుగడుగునా కౌరవాదులచేత అవమానాలు పొందినా ఆమెను రక్షించింది గార్హస్థ్య ధర్మం, గృహిణీధర్మం, సత్యధర్మం. ఎన్ని ఇక్కట్టులు వచ్చినా ధర్మాన్ని ఆ దంపతులు వీడలేదు. వారి గార్హస్థ్య ధర్మానికి త్యాగం, సత్యం అనేవి రెండు చక్రాలు. ఒకటి పూరు మహారాజు నిల్పిన వంశధర్మం; మరొకటి భరతచక్రవర్తి నిలిపిన వంశధర్మం. ఆ రెండూ పాండవులలో పరిపూర్ణత చెందాయి; అమృతత్వసిద్ధిని సంపాదించాయి.

వంశకర్త లైన కురు పాండు మహారాజులు

కురు మహారాజు, పాండు మహారాజు చంద్రవంశంలో వంశకర్తలుగా ప్రసిద్ధి చెందిన మహావీరులు. విపుల రాజ్యాలను జయించి, గడించిన అపారసంపదను యజ్ఞయాగాదులలో ప్రజలకు పంచిపెట్టే వితరణరూప త్యాగగుణం కురుమహారాజుకు అమృతత్వసిద్ధిని కలిగించింది. పాండవులు కూడా కురుమహారాజు సంప్రదాయాన్ని కాపాడారు. ధర్మజుడు రాజసూయయాగం, అశ్వమేధయాగం చేసి తన సార్వభౌమత్వాన్ని జీవితం తొలిదశలో, మలిదశలో కూడా ప్రతిష్ఠించుకొని, అపార ధనరాసులను వితరణంగా త్యాగంచేసి కీర్తి నార్జించి వంశకర్తల కీర్తికి పరిపూర్ణత్వాన్ని అమృతత్వాన్ని సాధించి పెట్టారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాండు మహారాజు అపార బలపరాక్రమశాలి. దిగ్విజయపరంపరతో కురుభీష్మాది వీరులను మరిపించిన మహాయోద్ధ. అతడెంత పరాక్రమవంతుడైనా ఆవంత అహంకారం లేనివాడు; గురుజనభక్తి ఆయన జన్మవ్రతం. కుటుంబంలో ఉన్న వారి నందరినీ చీలిపోకుండా ఒక్కటిగా అట్టి పెట్టాలన్న ఉదారాశయం కలవాడు. గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రుని మనస్సు నొప్పింపక గౌరవించిన అనుంగుతమ్ముడు. గార్హస్థ్య ధర్మంలో వంశరక్షణమనే ఒక సంప్రదాయానికి ఆయన నారు వేసి నీరు పోసి రక్షించాడు. పాండవులు తండ్రి తమ కిచ్చిన ఈ వారసత్వాన్ని తమ జీవితంలో అసిధారావ్రతంలా పాటించారు.

ధర్మజుడు వంశనాశనాన్ని కోరలేదు. శాంతిని ఆకాంక్షించాడు. శ్రీకృష్ణునిచేత ఆ పరమధర్మాన్ని కురుసభలో అందరికీ అందింపజేశాడు. కాని, వంశధర్మాన్ని మూలమట్టం చేసినవారు దుర్యోధనుడు, ధృతరాష్ట్రుడు. దానికి తగిన ఫలాన్ని వా రనుభవించారు. వంశకర్తలు నిర్మించిన త్యాగం, సత్యం, వితరణం, వంశరక్షణం అనే విశిష్ట ధర్మాల నన్నింటినీ మృతికి పాలు చేసి తాము మృత్యువు పాలైనారు ధృతరాష్ట్ర నందనులు. వాటి నన్నింటినీ రక్షించి వంశాన్నీ, వంశగౌరవాన్నీ, ధర్మాన్నీ పోషించి తాము అమృతత్వసిద్ధిని పొందారు పాండవులు.

అందువలననే ధర్మజుడు సశరీరస్వర్గం పొందాడు. ఇది వంశకర్తలు ప్రవర్తిల్ల చేసిన ధర్మానికి ధర్మజుడు కల్పించిన అమృతత్వం. అమృతమైన ధర్మమే మానవుని అమృతత్వసాధనం!

ఆఖ్యానకాలూ - ఉపాఖ్యానాలూ : ఆఖ్యానంతో అనుబంధాలూ

కావ్యపరిభాషలో అఖ్యానమనీ, ఆఖ్యానకమనీ, ఉపాఖ్యానమనీ, అఖ్యాయిక అనీ లాక్షణికులు వేరువేరు అర్థాలలో వాడుతూ ఉంటారు. వాటిని ఇతిహాస ప్రక్రియాపరంగా సమన్వయించుకొని సమీక్షించుకోవాలి.

ఇతిహాస మంటేనే పరంపరగా చెప్పబడే కథ. అందులో ప్రత్యక్షంగా ఒక కథకుడు శ్రోతలకు కథ చెప్పుతూ ఉంటాడు. కథకుడు ఆఖ్యాత. అతడు చెప్పే కథ ఆఖ్యానం. ఆఖ్యానానికి సూర్యరాయాంధ్ర నిఘంటువు పూర్వవృత్త కథనమనీ, ప్రత్యుత్తరమనీ, భారతాది అర్షమహాకావ్యాలలో నడుమ వచ్చే కథావిశేష మనీ, కథ అనీ అర్థాలు ఇచ్చింది. ఆఖ్యానంకంటె చిన్నకథను ఆఖ్యానక మని పేర్కొన్నది. ఇతిహాసంలో ప్రధానకథ ఆఖ్యానం అనటం సమంజసం. ఆఖ్యానకం దాన్ని అనుసరించి అనుబంధంగా సాగే కథనంగా గ్రహించటం సముచితం.

పురాణప్రక్రియకు సంబంధించిన పరిభాషలో 'పంచాంగాని పురాణేషు ఆఖ్యానక మితి స్మృతమ్' (మత్స్యపురాణం-2-23). పురాణాలలోని సర్గ ప్రతిసర్గాదులకు సంబంధించిన కథనాలను ఆఖ్యానకం అంటారు. ఇతిహాసాలకు సంబంధించిన పరిభాషలో 'స్వయందృష్టార్థకథనం ప్రాహు రాఖ్యానకం బుధాః' (శ్రీధరస్వామి విష్ణుపురాణటీక). స్వయంగా చూచిన చెప్పిన కథనాన్ని ఆఖ్యానక మంటారు. మహాభారతంలో ప్రధానకథ వ్యాసుడు చెప్పగా, అందులో జనమేజయాదులు అడిగిన ప్రశ్నలకు ప్రత్యుత్తరరూపంగా వైశంపాయనుడు స్వీయానుభవపూర్వకంగా చెప్పే కథలు ఆఖ్యానకాలు. నాయకులవెంట అనునాయకులు వర్తించేటట్లు ప్రధానకథనమైన ఆఖ్యానంతో కలిసి తత్పోషకంగా సాగే అనుబంధ కథనాలను ఆఖ్యానకా లనవచ్చును.

ఆఖ్యానకంకంటె భిన్నమైనది ఉపాఖ్యానం. "శ్రుతస్యార్థస్య కథన ముపాఖ్యానం ప్రచక్షతే" (శ్రీధరస్వామి విష్ణుపురాణటీక). ఇతరులవలన విన్నదానిని చెప్పటం ఉపాఖ్యానం. ఉపాఖ్యానం స్వయంసమగ్రంగా ఉండి ప్రధానకథలో ఏదో ప్రయోజనాన్ని సాధించటానికి చెప్పబడుతుంది. రామాయణంలో రాముడు నాయకుడు. లక్ష్మణాదులు అనునాయకులు. వారిగాథలు రాముని

కథకు అనుబంధంగానే ఉంటాయి. వాటినిగురించి వివరాలన్నీ రామకథలో భాగంగానూ, పోషకంగానూ ఉంటాయి. రామాయణంలో ఉపనాయకులు విభీషణ, సుగ్రీవాదులు, వారికథలు వారివి. కాని, అవి రామకథతో ముడివడి స్వీయప్రయోజనాన్ని సాధించుకొంటూ ప్రధానకథాప్రయోజనాన్ని కూడా సాధించిపెట్టుతాయి. అట్లాగే ఆఖ్యానకాలు ఆఖ్యానానికి అంగాలై దానిని సమగ్రం చేస్తుంటాయి. వాటికి స్వతంత్రప్రతిపత్తి ఉండదు. ఉపాఖ్యానాలు స్వీయప్రయోజనంతోపాటు కథాప్రయోజనాలనుకూడా సాధించిపెట్టుతూ సహకరిస్తూ ఉంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే - ఆఖ్యానానికి అండ (పార్శ్వం) వంటిది ఆఖ్యానకం ; దండ(ప్రాపు)వంటిది ఉపాఖ్యానం. ఈ రెండూ ఉంటేనే ఆఖ్యానం నిండుగా ఉండేది. ఇతిహాసం దండిగా పండేది !

ఆదిపర్వంలోని మొదటి రెండాశ్వాసాలలోని ఆఖ్యానకాలు సౌతి శౌనకాదిమునులకు ప్రత్యక్షంగా చెప్పినవి. మూడో ఆశ్వాసంనుండి వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పిన కథార్థాలుగా చెప్పినవి. ఇందులో వైశంపాయనుడు చెప్పినదే ఆఖ్యానం. సౌతి చెప్పినవి ఆఖ్యానకాలుగా పరిగణింపదగినవే. ఎందుకంటే అవన్నీ మహాభారత ప్రధాన కథకు పూర్వరంగాన్ని సిద్ధంచేసేవేకాబట్టి. అంతేకాదు మహాభారతంలో జనమేజయుడు కాకుండా శౌనకాదిమునులు అడిగిన ప్రశ్నలకు సౌతి చెప్పిన కథలన్నీ ఆఖ్యానకాలుగానే పరిగణించాలి. వైశంపాయనుడు చెప్పిన భారతంలోకూడా ఎన్నో ఆఖ్యానకాలు ఉంటాయి. కాబట్టి అమితాఖ్యానకశాఖలతో మహాభారతం విస్తరించింది.

ఆఖ్యానకాలు ప్రధానకథలోని పూర్వాపరాలను అనుసంధించేవిగానో, కార్యకారణసంబంధాన్ని చెప్పేవిగానో, కర్మఫలసంబంధాన్ని నిరూపించేవిగానో, పూర్వవృత్తాంతకథనాలుగానో, ప్రధానకథాతాత్పర్యసూచకాలుగానో, వ్యంజకాలుగానో, బీజభూతాలుగానో ఉంటాయి. స్వరూపంలోనేకాక స్వభావంలోకూడా వైవిధ్యాన్ని వెలార్చేవి ఆఖ్యానకాలు.

ఆదిపర్వంలోని పరమవృత్తాంతం-

"తగు నిది తగదని యెదలో
వగవక సాధులకుఁ బేదవారల కెగ్గుల్
మొగిఁ జేయు దుర్వినీతుల
కగు ననిమిత్తాగమంబు లయిన భయంబుల్." **(ఆది. 1.85)**

అనే సత్యాన్ని చెప్పటానికి ప్రవర్తిల్లిన ఆఖ్యానకం. మహాభారతంలో కౌరవుల దుర్నీతి లోకానికి అందించే గుణపాఠాన్నంతా సరమ ఒక్క చిన్నకందపద్యంలో చెప్పింది. కథ అణువంత అయినా భారతనీతిని బ్రహ్మాండంగా ప్రదర్శించింది. ఇది కథాతత్త్వ వ్యంజకమైన ఆఖ్యానకం.

జనమేజయుడు సర్పయాగం మొదలుపెట్టడం, దానిని ఆస్తీకుడు మధ్యలో మాన్పటం, ఆ యాగశాలలో వైశంపాయనుడు భారతకథనం ప్రారంభించటం అనే కథార్థాలకు పూర్వవృత్తాంత కథనాలుగా సాగే ఆసక్తికరమైన ఆఖ్యానకాలున్నాయి. అవి సాధించే ప్రయోజనాలలో కూడా వైవిధ్యం కనబడుతుంది.

ఉదంకునికథ సర్పయాగప్రవర్తనానికి బీజభూతమైన ఆఖ్యానకం, ఉపాఖ్యానం. తక్షకుడు ఉదంకునికి చేసిన అపకారానికి ప్రతీకారం చేయాలనే కక్షలోనుండి పుట్టింది సర్పయాగసంకల్పం. ఆ యజ్ఞంవలన ఉదంకునికి పగసాధింపువలన కలిగే తృప్తి మిగులుతుంది అయితే, ఆ యజ్ఞాన్ని తాను స్వయంగా చేయకుండా జనమేజయుడిచేత చేయించటంవలన ఉదంకుడి కథ ఒకవైపు ఉపాఖ్యానంగా మరొకవైపు కార్యకారణసంబంధంగల ఆఖ్యానంగా రాణిస్తున్నది. స్వీయప్రయోజనం సాధించుకొంటూనే

భారతకథా ప్రగతికి ఉదంకోపాఖ్యానం తోడ్పడింది. అంతేకాదు ఉదంకుని మాటలలో తక్షకుడు ప్రధానకథలోని దుర్యోధనుడుగా శ్రోతలచిత్తాలలో స్ఫురిస్తాడు. ఈ పద్యం అందుకు సాక్ష్యం:

"ప్రల్లదుఁడైన యొక్కకులపాంసను చేసినదానఁ దత్కులం
బెల్లను దూషితంబగుట యేమి యపూర్వము? గావునన్ మహీ
వల్లభ! తక్షకాధము నెపంబున సర్పములెల్ల నగ్నిలోఁ
ద్రెళ్ళఁగ సర్పయాగ మతిధీయుత! చేయుము విప్రసమ్మతిన్." **(ఆది. 1,125)**

సర్పయాగం భవిష్యత్తులో జరుగబోయే కురుక్షేత్ర యుద్ధాన్ని తలపిస్తున్నది. ఉదంకోపాఖ్యానం ప్రధానకథకు కారణకార్య సంబంధాన్ని, ప్రేరణప్రేరకసంబంధాన్ని కలిగిఉన్న శక్తిమంతమైన ఆఖ్యానకం.

లోకాలను దహింపచేసే విషాగ్నిని వెదజల్లే సర్పరాజులు ఏ కారణంవలన సవనాగ్నిలో పడి నశింపవలసివచ్చిందో చెప్పమని శౌనకాదులు అడిగారు. దానికి సమాధానంగా సర్పకులానికే తల్లి అయిన కద్రువ తనకొడుకులకు శాపం పెట్టిన కథ చెప్పటం ప్రారంభించాడు సౌతి. కథా ప్రారంభంలో పోలికకోసం సౌతి ఈ విధంగా అన్నాడు - పూర్వం రురుడు చేసే సర్పఘాతాన్ని సహస్రపాదుడు మాన్పినట్లుగా జనమేజయుడు చేసే సర్పయాగాన్ని జరత్కారుతనయుడైన ఆస్తీకుడు మాన్పాడని చెప్పాడు. శ్రోతృజనాపేక్షవలన ఉపమాన ఉపమేయస్థానాల్లో ఉన్నవారి కథ లన్నీ వివరంగా చెప్పవలసివచ్చింది. అందువలన రురుని పూర్వీకుని కథగా భృగుని వృత్తాంతం, సర్పకులం మీద కక్షకట్టిన రురుని కథ, హింస ఉత్తమ బ్రాహ్మణస్వభావం కాదని బోధించి సహస్రపాదుడు రురుని సర్పహింసాప్రవృత్తిని మాన్పటం - అనేవి పూర్వవృత్తాంతకథనా లైన ఆఖ్యానకాలుగా అవతరించాయి.

కద్రూవినతల కథలు విడదీయలేని జంటవంటివి. అందువలన సర్పవృత్తాంతంతోపాటు సౌపర్ణోపాఖ్యానం, అనూరుని కథ ఆఖ్యానాలుగా చోటుచేసికొనవలసి వచ్చింది. అందులో గరుడుని వృత్తాంతం అఖ్యానకంలోని ఉపాఖ్యానం. అందులోని సముద్రమథనం, దేవదానవ యుద్ధకథ, శేషుని ఉదంతం అంతర్గాథలు.

ఆస్తీకుడి జనకు డైన జరత్కారుడి వృత్తాంతం పూర్వవృత్తాంతరూపమైన ఆఖ్యానకం. పరీక్షిత్తు శాపవృత్తాంతం ప్రధానకథకు కార్యకారణసంబంధంతో పోషకంగా నిలిచే ఆఖ్యానకం. దాదాపు అన్నిరకాల ఆఖ్యానకాలనూ, ఉపాఖ్యానాలనూ ప్రధానకథకు, వ్యంజకాలుగా పోషకాలుగా అనుసంధించే నేర్పు మొదటి రెండాశ్వాసాలలో ప్రదర్శితమయ్యేటట్లు రచించాడు నన్నయభట్టారకుడు.

వైశంపాయనుడు చెప్పిన కథలో ఆఖ్యానకాలనూ, ఉపాఖ్యానాలనూ ఈ విధంగా గుర్తించవచ్చును:-

1. పూర్వాపరసంబంధం చెప్పేవి :- కచదేవయాని కథ; అంగారపర్ణ వృత్తాంతం.
2. కార్యకారణ సంబంధాన్ని చెప్పేవి - ధృష్టద్యుమ్న ద్రౌపదుల జననవృత్తాంతాలూ, పంచేంద్రోపాఖ్యానం.
3. కర్మఫలసంబంధాన్ని చెప్పేవి - భీష్మజనన వృత్తాంతం, మాండవ్యోపాఖ్యానం, ఇంద్రసేన వృత్తాంతం, పంచతీర్థంలోని మొసళ్ళకథ.
4. పూర్వవృత్తాంత కథనాలు - ఉపరిచరవసువు చరిత్ర, మత్స్యగంధి వృత్తాంతం, వేదవ్యాస జననం, కృపద్రోణుల జన్మవృత్తాంతాలు.
5. ప్రధానకథాతాత్పర్య వ్యంజకాలు - దేవదానవాంశలతో భీష్మాదులు జన్మించినట్లు చెప్పిన ఉదంతం మొదలైనవి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉపాఖ్యానాలు : దీర్ఘతముని వృత్తాంతం, వ్యుషితాశ్వుని వృత్తాంతం, వశిష్ఠుని వృత్తాంతం, సుందోపసుందుల కథ, శ్వేతకేతు వృత్తాంతం, మందపాలోపాఖ్యానం, ఏకలవ్యుని కథ.

అంతర్గాథలు : బకాసుర వృత్తాంతం, శక్తికల్మాషపాదుల కథ, ఔర్వుని కథ.

ఆదిపర్వకథలలో మహాపురుషు లెందరున్నా స్త్రీశక్తులే కథలను నడుపుతారు. యయాతి, దుష్యంతుడు, శంతనుడు, భీష్ముడు, పాండురాజు వంటి ప్రముఖులందరూ స్త్రీ ప్రాముఖ్యానికి తలలొగ్గినవారే. ఈ అంశాన్ని తిరుపతి వేంకటకవులు 'పాండవజననము' అనే నాటకంలో ఇట్లా అన్నారు:

"పేరు పూరుషులకుఁ దారసించునె కాని
కార్యనిర్వహణము కామినులది
వెన్నెలయె జగంబు వెలయింపవలెఁ గాని
చంద్రుఁడేమి సేయు? జలజనయన!"

ఈ దృష్టితో గమనిస్తే ఈ పర్వంలో దేవయాని, శకుంతల, మత్స్యగంధి లేదా సత్యవతి, గంగ, అంబ, అంబాలిక, గాంధారి, కుంతి వంశోద్ధరణంలో నిర్వహించే కీలకమైన పాత్రల ప్రాధాన్యం స్పష్టమౌతుంది. వంశకర్తలైన మహాపురుషులు మాతృమూర్తులచేత దిద్దితీర్చబడిన వ్యక్తులుగా కనపడతారు. పాండవులు కుంతీవాక్యబద్ధులు. ఆ తరువాత ద్రౌపదీరాగబద్ధులు. అయినా, వారి పూర్వీకులతో పోల్చుకొంటే పాండవులే స్త్రీశక్తిని నియమించగలిగిన పౌరుషోపేతులు, వీరనాయకగుణ సమగ్రులు. ఈ పరిణామాన్ని చిత్రించటంలోకూడా ఆదిపర్వం భారతకథాబీజభూతంగా నిలిచింది.

పంచమాశ్వాసంలో పాండవులకథ మొదలౌతుంది. ఆ ఆశ్వాసం చివరికే భీమార్జునులు అజేయులై రాణిస్తారు. షష్ఠాశ్వాసంలో భీమపరాక్రమం రాక్షససంహారంతో రాణించి దుర్నిరీక్షంగా ప్రకాశిస్తుంది. సప్తమాశ్వాసంలో అర్జునుడు అద్భుతవీరుడుగా నిలిచి మత్స్యయంత్రాన్ని భేదించి ద్రౌపదిని పాండవపత్నిగా పొందగలుగుతాడు. అష్టమాశ్వాసంచివరకు నరనారాయణులమైత్రి ఫలించి, వారు దివ్యాస్త్రాయుధాలను సాధించి జగద్విఖ్యాతులై నిలుస్తారు. మహాభారతకల్పవృక్షం కృష్ణార్జునోత్తమనానాగుణకీర్తనార్థఫలంకదా! ఆ లక్షణం ఆదిపర్వంలోనే అంకురించింది!

మహాభారతం ఒక మహాకథ

"ఏయది హృద్య? మపూర్వం
బేయది? యెద్దాని వినిన నెఱుక సమగ్రం
బై యుండు? నఘనిబర్హణ
మేయది? యక్కథయ వినఁగ నిష్టము మాకున్!" **(ఆది. 1.30)**

సూతుడిని శౌనకాది మహామును లడిగిన ప్రశ్న యిది. ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా మంచికథ వినదలచుకొన్నవారు అడుగవలసిన ప్రశ్న యిది.

కథ హృద్యంగా ఉండాలి. అంటే - మనసును ఆకట్టుకొనేటట్లు ఉండాలి. అపూర్వంగా ఉండాలి. అంటే- అంతకుముందు చెప్పబడనిదై ఉండాలనీ, లేదా, 'ఇంతగొప్పకథ ఎన్నడూ వినలే' దని అనిపించేటట్లు ఉండాలనీ భావం. కథ

వింటే జ్ఞానం సమగ్రంగా కలగాలి. జ్ఞానమంటే - ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను సాధించి జీవితాన్ని సార్థకం చేసికొనటానికి తగిన తెలివిని కలిగిఉండటం. జీవిత లక్ష్యాన్ని సాధించగలిగే సమగ్రజీవనధర్మపరిజ్ఞానమే ఎఱుక సమగ్రమై ఉండే కథాపరిజ్ఞానం. కథ పాపాన్ని తొలగించాలి. అంటే కథ విన్నతరువాత శ్రోతమనసులో ఒక ఉత్తమ పరిణామం రావాలి. జీవితంలో అధర్మప్రవృత్తిని తొలగించుకోగలిగే ఒక సంస్కారం ఏర్పడాలి. తనను తాను ఉద్ధరించుకొనే ఆత్మధర్మం పుణ్యం. దానికి విరుద్ధమైనది పాపం. పాపాన్ని ప్రక్షాళనం చేసికొనే ప్రజ్ఞను కథ శ్రోతకు, పఠితకు ప్రసాదించాలి. అది కథాతత్త్వం. ఈ లక్షణాలన్నీ ఉన్నకథ మహాభారతమని సూతమహర్షి పేర్కొన్నాడు.

'తింటే గారెలు తినాలి. వింటే భారతం వినాలి' అని తెలుగుసామెత. మానవులలో ఎన్నిరకాల ప్రవృత్తు లుంటాయో అన్నిటికీ, జీవితంలో ఎదురయ్యే సమస్యలకూ, ధర్మసంఘర్షణలకూ భారతం నిలువుటద్దం పట్టుతుంది. అందువలన అది హృద్యం. అపూర్వవ్యక్తుల, అపూర్వసన్నివేశాల అపూర్వసంగమం మహాభారతేతివృత్తం. శ్రీకృష్ణునివంటి దివ్యాదివ్యులూ, వ్యాసునివంటి మహాజ్ఞానులూ, భీష్మునివంటి ధర్మవ్రతులూ, కర్ణునివంటి త్యాగధనులూ, అభిమన్యునివంటి సాహసవీరులూ, పాండవులవంటి పరిణతప్రవృత్తులూ, సంసారయజ్ఞసంరక్షులవంటి మహిళామూర్తులూ కలిసి, ఆదర్శానికీ ఆచరణకూ మధ్య అన్వయాలను అందించే అపూర్వకథాప్రపంచం భారతం. పాండవుల సమగ్రజీవితం చిత్రింపబడిన భారతం పురుషార్థసాధన విజ్ఞానసర్వస్వం. అందువలన భారతం జీవనధర్మవేదం. అది వింటే ఎఱుక సమగ్రం కావటంలో అనుమానం లేదు. భారతం పుణ్యకథ. కథ వింటే పుణ్యం కలుగుతుందని అనిపించేది పుణ్యకథ. పుణ్యకథలకు ఫలశ్రుతి చెప్పటం పురాణసంప్రదాయం. భారతం వింటే ఎటువంటి ఫలం కలుగుతుందో పెక్కుచోట్ల ఈ గ్రంథంలోనే చెప్పబడింది. మచ్చుకు. ఆది - 1.34 పద్యాన్ని గ్రహించవచ్చును.

మహాభారతాఖ్యానం చదివితే పుణ్యం కలుగుతుందని చెప్పటమే కాకుండా ఇందులో కొన్ని ఆఖ్యానకాలూ, ఉపాఖ్యానాలూకూడా పుణ్యకథలని బోధపడేట్లు వాటికి ఫలశ్రుతులను ప్రత్యేకంగా చెప్పటం భారతకథాకథనవిశేషం. ఆదిపర్వంలో అటువంటివి- సౌపర్ణోపాఖ్యానం (ఫలశ్రుతి 2-122); ఆస్తీకుని చరితము (ఫలశ్రుతి 2-234, 235). ఇవి వట్టికథలు కావు. వేదార్థబృంహితాలైన ఆఖ్యానకాలు. సుపర్ణుడు మంత్రాధి దేవత. ఆస్తీకుడు హింసలేని యజ్ఞకర్మను బోధించే మంత్రద్రష్ట, సర్గప్రతిసర్గాదుల తత్త్వం చెప్పే ఆఖ్యాయిక సమస్తభూత సంభవకథ. ఫలశ్రుతి (3.72) కల పుణ్యాఖ్యానక మిది. సురాసురులు సముద్రమథనం చేసి సాధించిన అమృతాన్ని పురుషయత్నంతో గరుడుడు సాధించాడు. అమృతాన్ని పంచిన విష్ణువుకు వాహనమైనాడు. అమృతం త్రాగకుండానే దాని మహిమలను అలౌల్య (అనాసక్తయోగ) మనే గుణంతో సాధించిన మహితాత్ముడు. అమృతత్వమంటే 'అనాసక్తియోగం' 'స్వేచ్ఛ' (జీవన్ముక్తి) అని గరుడుడూ, 'అహింస' అని ఆస్తీకుడూ బోధించిన ఆఖ్యానకాలవి. పుణ్యకథల పేటిక, పుణ్యకథావాటిక మహాభారతం! అది ఆమూలాగ్రం అద్భుతం! తిక్కన కథను ముగిస్తూ అన్నమాటలు ఇందుకు నిదర్శనం.

"అతఁ డింతటిది మహాభా
రతంబ! యను నిశ్చయము దిరంబుగ మతి సం
గత మగుడు నమ్మహాత్ముల
కతివిశదము గాఁగ నిమ్మహాకథ చెప్పెన్!" **(స్వర్గా.1.78)**

ఇంతటిదా మహాభారతకథ! అని ఆశ్చర్యం కలిగించే మహాకథ ఈ పంచమవేదం!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నన్నయకవితావైభవం

"సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకలి(వి)తార్థయుక్తి లో
నారసి మేలునా, నితరు లక్షరరమ్యత నాదరింప, నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారతసంహితారచనబంధురుఁ డయ్యె జగద్ధితంబుగన్". **(ఆది. 1.26.)**

నన్నయ కవిత్వంలో సారమతులైన మహాకవులు బాగా బుద్ధితో భావనచేసి మెచ్చుకొనే గుణం ప్రసన్నకథాకలితార్థయుక్తి. అంటే ప్రసన్నమైన కథతో కూడుకొన్న అర్థాల (వాచ్య లక్ష్య వ్యంగ్యార్థాల) సంయోజనం. ప్రసన్న మైన కథ అంటే పఠితమనస్సుకు ప్రత్యక్షమైనట్లు అనుభూతి నందించే కథ. దానిని ప్రసిద్ధార్థ పదప్రయోగంవలన కలిగే ప్రసాదగుణంవలన నన్నయ కల్పిస్తాడు. అటువంటి కథను చెప్పాలంటే వాచ్యలక్ష్యవ్యంగ్యార్థాలను గుణవ్యంజకంగా సంయోజనం చేయాలి. ఎక్కడ కథార్థాలను వాచ్యం చేయాలో, ఎక్కడ లక్ష్యార్థంలో, ఎక్కడ వ్యంగ్యార్థంలో చెప్పాలో ఆ శిల్పమర్మాలను తెలియాలి. తెలిసి చేసిన అర్థసంయోజనంలోని ప్రౌఢిమను లోనారయటంవలన కథ మనసుకు ప్రసన్నమై ప్రత్యక్షమౌతుంది. అర్థశక్తి తెలిసినవారే దానిని అనుభవించగలరు. మహాకవులు ఆ గుణాన్ని భావనామయంగా దర్శించి అనుభవించి ప్రశంసిస్తారు.

'ప్రసన్నకథాకవితార్థయుక్తి' అని మరొక పాఠం ఉంది. అంటే ప్రసన్నమైన కథయొక్క, కవితయొక్క అర్థసంయోజనమని భావం. లేదా, ప్రసాదగుణంతో కూడిన కథాకవిత్వంలోని వాచ్యలక్ష్యవ్యంగ్యార్థాల సంయోజనం అనికూడా చెప్పవచ్చును. నన్నయ కథాకథన కవిత్వపద్ధతిని అభిమానించేవాడు. కథాసన్నివేశానికి తగిన కవితాశైలిని ప్రదర్శించేవాడనీ చెప్పవచ్చును. లేదా కథను ప్రసన్నంచేయటానికి కథనశిల్పంలో వ్యంగ్యాద్యర్థాలను సంయోజనంచేసి ప్రయోగిస్తాడనీ చెప్పవచ్చును. ఏమైనా ఇదికూడా సారమతు లైన కవితాశిల్పమర్మజ్ఞులకే ప్రసన్నం కాగల కవితాలక్షణం.

రెండవది సామాన్యులను ఆకర్షించేది. అది అక్షర రమ్యత. ఈ సమాసానికి 'అక్షరాలను రసభావవ్యంజకంగా ప్రయోగించటంవలన కలిగే సౌందర్యం - లేదా - ఆస్వాదయోగ్యత' అని కానీ, క్షరంకాని రచనాసౌందర్యం, తనివితీరని ఆస్వాదమాధుర్యం అనికానీ చెప్పవచ్చును. మొదటి అర్థం కావ్యశయ్యకు సంబంధించింది. రెండవది పద్యరచనా సౌందర్యానికి సంబంధించింది. మొత్తానికి అక్షరరమ్యతవలన రచనకు శ్రవణానందం కలిగించే గుణం అలవడుతుంది. అర్థం తెలియకపోయినా పద్యరచనలోని నాదమాధుర్యాన్ని సామాన్యులుకూడా తరుగని ఆసక్తితో ఆనందిస్తారు. నన్నయ కవిత్వాన్ని సామాన్యులచేత చదివింపచేసేదీ, వినిపింపచేసేదీ అయిన ధారామాధుర్యగుణం అక్షరరమ్యత.

నన్నయభట్టుకవిత్వంలో పండితపామరుల కందరికీ నచ్చేదీ, ఆయనవాక్కుకు సహజమైనదీ అయిన లక్షణం 'నానారుచిరార్థసూక్తినిధిత్వం'. అనేకరకాలైన ఉచితాలైన, కాంతిమంతాలైన అర్థాలను అందించగలిగే సూక్తులకు నన్నయ నిధివంటివాడు. సూక్తు లంటే సుభాషితాలనికానీ, అంద మైన కవితాభివ్యక్తులనికానీ పేర్కొనవచ్చును. ఈరెండూ కలిసినవీ కావచ్చును. ఇది కలకాలం జనుల నాల్కలపై కవిత్వాన్ని నిలపగలిగే లక్షణం.

సుభాషితాలైన సూక్తులు నానావిధాలైన అర్థాలను - అంటే వివిధ ప్రయోజనాలను - సాధిస్తాయి. లోకనీతిని, రాజనీతిని, ఆధ్యాత్మిక ప్రబోధాలను, ధర్మప్రబోధాలను, లోకజ్ఞతా విశిష్టాలైన అనుభవాలను సూక్తులు ప్రదర్శిస్తూ ఉంటాయి. నన్నయకవితలో ఇటువంటివి కోకొల్లలు. మచ్చుకు ఒక్కటి -

"నిండుమనంబు నవ్యనవనీత సమానము, పల్కు దారుణా
ఖండలశస్త్రతుల్యము జగన్నుత విప్రులయందు, నిక్క మీ
రెండును రాజులందు విపరీతము, గావున విప్రుఁ డోపు నో
పం డతిశాంతుఁడయ్యు నరపాలుఁడు శాపము గ్రమ్మరింపఁగన్." **(ఆది. 1.100)**

బ్రాహ్మణక్షత్రియుల స్వభావాన్ని గురించి చెప్పిన ఈపద్యం తెలుగునాట లౌకికప్రసంగాలలో లోకోక్తిగా వాడుకోవటం ఇప్పటికీ ఉన్నది. నన్నయకవిత ప్రజల పలుకుబడిలో సూక్తిసుధామాధుర్యంతో జీవిస్తుంది అనటానికి ఇది సాక్ష్యం.

"సూక్తియనగా రుచిరమైన చమత్కారయుక్తమైన కూర్పు. ఈ చమత్కారము ఒక్కొక్కపదమునందు, పదబంధమునందు, సమాసమునందు, కారకమునందు, వాక్యమునందు బహుభంగుల చూడవచ్చు" నని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు భావించారు. ఇవన్నీ అందమైన కవితాభివ్యక్తుల జాడలు.

నన్నయ ప్రధానంగా గుణవాది. శబ్దగుణ సంయోజన శిల్పంతో కవితలో సౌందర్యాన్నీ, ఆస్వాదనీయతనూ కల్పించటంలో ఆయన సిద్ధహస్తుడు. గుణవ్యంజకాలైన స్వరాలనూ, అక్షరాలనూ రచనలో కూర్చి రమ్యతను కల్పించటం ఆయన పద్యరచనా శిల్పం. నన్నయకు శబ్దగుణ మంటే ఇష్టం. రమణీయార్థ ప్రతిపాదక శబ్దాన్ని ఎన్నుకొని దానిని అక్షరసుందరంగా ఆవిష్కరిస్తాడు నన్నయ. ఉదంకోపాఖ్యానంలో చేసిన నాగస్తుతి ఇందుకు ఉదాత్తమైన ఉదాహరణ -

"బహువనపాదపాబ్ధి కులపర్వతపూర్ణ సరస్సరస్వతీ
సహిత మహామహీభర మజస్ర సహస్ర ఫణాళిఁ దాల్చి దు
స్సహతరమూర్తికిన్ జలధిశాయికిఁ బాయక శయ్య యైన య
య్యహిపతి దుష్కృతాంతకుఁ డనంతుఁడు మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్." **(ఆది. 1-104)**

విభావ స్వభావ వ్యంజక మైన శబ్దగుణం, అక్షరరమ్యత ఇందులోని రచనాసౌందర్య రహస్యం. బంధౌజ్జ్వల్య మనే కాంతిగుణం ఈ రచనలోని ప్రాణచైతన్యం. 'మహామహీభరా'న్ని మొదటి పాదంలోని అక్షరసంవిధానంతో భావ్యమానం చేశాడు. భూభారాన్ని మోస్తున్న ఆదిశేషుని శ్రమను సూచించే 'సహస్రఫణాళి' బుసలను ఊష్మాక్షరాలతో వ్యంజింపచేశాడు. పద్యరచనలో ఓజస్సునుండి క్రమంగా ప్రసాదానికి పరిణమించిన రచన అనంతుడు ఆగ్రహం వీడి ప్రసన్నత భజించాలన్న ఉదంకుని కామనకు అనువుగా అమరింది. XiViii

బంధంలోని వికటత్వమనే ఉదారతాగుణాన్ని అక్షరసౌందర్యంతో నన్నయ మేళవించే మెలకువ అనన్యసామాన్యం.

"వివిధోత్తుంగ తరంగ ఘట్టిత చలద్వేలావనైలావలీ
లవలీలుంగ లవంగ సంగత లతాలాస్యంబు లీక్షించుచున్
ధవళాక్షుల్ సని కాంచి రంత నెదురం దత్తీరదేశంబునం
దవదాతాంబుజ ఫేనపుంజనిభు నయ్యశ్వోత్తమున్ దవ్వులన్." **(ఆది. 2.29)**

పద్యపూర్వార్థంలో రమణీయమైన లతావనాల పారవశ్యం కలిగించే సౌందర్యం-పద్యం చివరిపాదంలో తెల్లగా అబ్బురపాటు కలిగించే అశ్వసాక్షాత్కారం. మధ్య ధవళాక్షులు కళ్ళప్పగించి చూస్తున్న దృశ్యం నాదమాధుర్యంతో స్వరదర్శనంతోపాటు స్వరూపదర్శనంకూడా చేయించాడు నన్నయభట్టారకుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గుణప్రధానమైన రచనలో ఒక వైలక్షణ్యం గోచరిస్తుంది. అది రీతిని పోషిస్తే రచనలోని గతిగాంభీర్యానికి ప్రాధాన్యం ఏర్పడుతుంది. వృత్తులను రూపొందిస్తే సాక్షాత్ రసస్ఫూర్తికి దోహదకారి అవుతుంది. నన్నయ గుణాలతో రీతుల కంటె వృత్తుల నెక్కువగా వ్యక్తీకరిస్తాడు.

"దాని శరీరసౌరభము దాని విలోలవిలోకనంబులున్
దాని మనోహరాకృతియు దాని శుచిస్మితవక్త్రకాంతియున్
దాని విలాసముం గడుముదంబునఁ జూచి మనోజబాణసం
తానహతాత్ముఁ డై నృపతి దానికి నిట్లనియెం బ్రియంబునన్". **(ఆది. 4.172)**

ఇందులోని సమతాగుణం మాధుర్యగుణం సత్యవతీపాత్రగత మైన సమవిభక్త శరీర స్వరూప సౌందర్యాన్నీ శృంగార రసవృత్తులనూ వ్యక్తీకరిస్తూ ఉండటం సహృదయహృదయైకవేద్యం.

"చందనతమాలతరులందు నగరుద్రుమములందుఁ గదళీవనములందు లవలీమా
కంద తరుషండములయందు ననిమీల దరవిందసరసీవనములందు వనరాజీ
కందళిత పుష్పమకరంద రసముం దగులుచుం దనువు సౌరభము నొంది జనచిత్తా
నందముగఁ బ్రోషితుల డెందము లలందురఁగ మందమలయానిల మమందగతి వీచెన్." **(ఆది. 5.139)**

మలయానిలవర్ణనం చేసిన నన్నయ సౌకుమార్యమనే శబ్ద గుణాన్ని ప్రసాదంతో మిళితం చేసి ప్రయోగించాడు కాని, దాన్ని అలంకృతం చేసి గాఢతరం చేయలేదు. ఈపద్యంలో శబ్దాలంకారం ఉన్నట్లు భాసించినా, రచన అలంకార ప్రధానం కాదు. అది వస్తుతత్త్వ వ్యంజకం. మలయానిల స్వభావాన్ని గుణవద్రచనం చేత ధ్వనింపచేయటంవలన నన్నయ కవిత్వంలో గుణమే వస్తువును వ్యంజింపచేసే విశిష్టకవితాగుణ మని తీర్పుచెప్పిన ట్లైనది. నన్నయ వస్తువునూ, పాత్రల స్వరూప స్వభావాలనూ, అభినయాలనూ, రసభావాలనూ గుణవ్యంజకాలుగా చేసి మెప్పించే కవితాశిల్పాన్ని ఆంధ్రభారతికి సహజాలంకారంవలె సమకూర్చాడు.

'ప్రసన్నకథాకలి(వి)తార్థయుక్తి' అనే కవితాలక్షణాన్ని దర్శింపగలిగిన నన్నయ తప్పక ధ్వనిసంప్రదాయానికీ, అందులోనూ వస్తుధ్వని పార్శ్వానికీ చెంది ఉంటాడు. ఆయన రచనలో అడుగడుగునా కనబడే ఈస్వభావానికి ఎన్నైనా ఉదాహరణ లివ్వవచ్చును. కాని రెండుమూడు మాత్రం.

నన్నయ రచనలో పరిత ఒక కథను ప్రమాణంగా తీసికొని పరిశీలించాలి: ఆఖ్యానకమైనా, ఉపాఖ్యానమైనా వాటికి తగిన కావ్యకథాశిల్పంతో లఘుకావ్యాలుగా రాణిస్తూ ఉంటాయి. ఉదాహరణకు ముందుగా ఉదంకోపాఖ్యానాన్ని గ్రహిద్దాం.

ఉదంకుని కథలో రెండు భాగా లున్నాయి. మొదటిది - గురుపత్నికి పౌష్యపత్నికుండలాలను తెచ్చియిచ్చినకథ. అందులోనే అతడు తక్షకుని అపకారానికి గురిఅయినాడు. రెండవది - అతడు జనమేజయునిచేత సర్పయాగాన్ని మొదలు పెట్టించిన కథ. అందులో తక్షకునిపై ప్రతీకారం తీర్చుకొనటానికి ప్రయత్నించాడు. ఈ రెండుభాగాలూ రెండుకార్యాలతో కూడిఉండటంచేత కథలజంటగా కనిపిస్తాయి. ఒక్కొక్కదానిలో దానికి తగిన కావ్యశిల్పనిర్వహణం స్వయంసమగ్రంగా ఉన్నది. అందువలన మచ్చుకు మొదటికథను పరిశీలిద్దాం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కథలో వాచ్యలక్ష్యవ్యంగ్యార్థాల సంయోజనం సహజంగా శక్తిమంతంగా ముప్పేటగా సాగింది. కథలో వాచ్యంగా చెప్పబడుతున్న అంశాలు ఒకపేట. ప్రతీకలతో చెప్పబడిన అంశాలు లక్ష్యార్థాలవంటివి అవి ఒకపేట. వాచ్యమైన అర్థాల నాధారంగా చేసికొని ప్రతీయమాన మయ్యే వ్యంగ్యార్థాలు మూడవపేట. కథారంభంలోనే పైలశిష్యుడైన ఉదంకుడు పంకజసన్నిభుడనీ, అఘపంకక్షాళన మహాతపస్సలిలుడనీ, అనాతంకమతి అనీ, అపరిమిత నిష్ఠాపరుడనీ, అణిమాది అష్టసిద్ధులు కలవాడనీ వర్ణించాడు నన్నయ. కథానాయకుడి గుణాలన్నీ ఒకచోట చెప్పటంవలన కథ వాచ్యమై పలచబడిపోయినట్లు పైకి అనిపించవచ్చును. కాని, కథామర్మజ్ఞులు అవన్నీ కథలో ఎలా వినియోగపడతాయో పర్యాలోచిస్తారు. ఉదాహరణకు తక్షకుడు బిలంద్వారా పాతాళానికి వెళ్లాడు. ఉదంకుడు కూడా ఆ బిలంలో ప్రవేశించి పాతాళానికి చేరాడు. అయితే, అక్కడ ఉదంకుడు లఘురూపాన్ని ధరించి బిలంలో దూరాడని నన్నయ వివరించడు. అణిమాదిసిద్ధులుండటం చేత ఆ పనిచేయగలిగాడని లోనారసి గమనిస్తే కథ ప్రసన్నమౌతుంది. అట్లాగే మిగతా విశేషణాలన్నీ కథలో జరిగే సన్నివేశాలకు శిల్పపరమైన అన్వయసూత్రాలుగా తోడ్పడతాయి. ఇదంతా కథను ప్రసన్నంచేసే ప్రక్రియలో వాచ్యార్థాలను పూర్వాపరసమన్వయ సంకేతాలుగా నిబంధించే కథాకథనశిల్పం.

కథలో తారసిల్లే - మహోక్షాన్నెక్కి వచ్చిన దివ్యపురుషుడు, వృషభగోమయం, సితాసితతంతుసంతాన పటాన్ని అల్లే ఇద్దరు స్త్రీలు, ద్వాదశారచక్రాన్ని త్రిప్పే ఆరుగురు కుమారులు, అతిప్రమాణతురంగాన్ని ఎక్కిన దివ్యపురుషుడు - వీరందరూ కథను సాగిస్తారు కాని, వారెవరో చివరకు గురువు వివరించేంతవరకు ఉదంకుడితోపాటు పఠితకూ తెలియదు. వాచ్యార్థానుపపత్తి ఏర్పడినప్పుడు అనువైన లక్ష్యార్థాన్ని చెప్పుకొన్నట్లుగానే కథలో తమ రహస్యాన్ని బయటపెట్టక చివరివరకూ ఉత్కంఠనూ, ప్రతీకాత్మకతనూ పోషించే ఈ పాత్రల కథ లక్ష్యార్థసంయోజన శిల్పాన్ని వెలారుస్తున్నది. ప్రతీకాత్మకతలో అర్థం తెలిసేంతవరకు ఉత్కంఠ; తెలిస్తే ప్రసన్నత!

ఉదంకుని కథలో ఇంద్రుడు అమృతాన్ని అతనిచేత ఎందుకు తినిపించాడు? పర్జన్యదేవుని సాక్షాత్కారం ఎందుకు కలిగింది? అగ్ని ఎందుకు సహాయం చేశాడు? పౌష్యునిభార్య పవిత్రులకు మాత్రమే కనపడట మంటే ఏమిటి? అన్నింటినీ మించి అసలు ఆ కుండలా లంటే ఏమిటి? మొదలైన అంశాలు వాచ్యార్థాలనుండి ప్రతీయమాన మయ్యే వ్యంగ్యార్థాలవలననే తెలుస్తాయి. అంతదాకా ఎందుకు? ఉదంకునిలో ఒక క్రోధమూర్తి ఉన్నాడన్న సంగతి పౌష్యునికి అతడు శాపమిచ్చినప్పుడు మాత్రమే బయటపడుతుంది. నివురుగప్పిన నిప్పువలె ఉన్న అతని క్రోధం సర్పయాగానికి బీజమని లోనారసి చూస్తే తప్ప గోచరించదు. ఈవిధంగా పరిశీలిస్తే నన్నయ ఉపాఖ్యానాలు నిస్తులమైన వస్తుధ్వనికి కౌస్తుభరత్నాలు!

ఉపాఖ్యానాలనేకాక ఆఖ్యానకాలను కూడ స్వయంసమగ్ర మైన కావ్యాలవలె తీర్చిదిద్దటం నన్నయ కథాకథనశిల్పంలో ఒక లక్షణం. అటువంటి వాటిల్లో ఉత్తమమైనది శకుంతలాదుష్యంతుల కథ. భరతవంశకర్తకు కారకులైన దంపతులు వారు కావటంచేత ఆ కథను సర్వాంగసుందరంగా మలచాడు నన్నయ. అందులో ప్రతి అంశమూ ప్రసన్నకథాకలి(వి)తార్థయుక్తికి రమణీయోదాహరణమే కాగలదు. మచ్చుకు ఒకటి రెండు -

1. మూలంలో లేని కొన్ని కల్పనలకు తెలుగులో క్రొత్తగా చేసి, కథకు ప్రసన్నతను కలిగించటంతోపాటు, వ్యంగ్యార్థసంయోజనంతో వస్తుధ్వనిని నన్నయ సాధించాడు.

(అ) దుష్యంతుడు కణ్వాశ్రమంలో శకుంతలను చూచినప్పుడు అమూలకమైన ఈక్రింది కల్పనను కాళిదాసుని అభిజ్ఞానశాకుంతల నాటకం ఆధారంగా గ్రహించి పొందుపరిచాడు నన్నయ. ''అసంశయం క్షత్ర పరిగ్రహక్షమా - యదార్య

మస్యా మభిలాషి మే మనః'' - అన్న కాళిదాసు శ్లోక తాత్పర్యాన్ని గ్రహించి ''ఇది మునికన్య యేని మఱి యేలొకొ యీలలితాంగి యందు నా, హృదయము తద్దయుం దవిలె ; నిప్పలు కింకను నమ్మనేరనయ్యెద'' (4.30) అని దుష్యంతునిచేత అనిపించాడు. ఆతరువాత ''భవహృదయ సాభిలాషం సంప్రతి సందేహనిర్ణయో జాతః'' అనే శ్లోకభావాన్ని ''ఇది మునినాథకన్యయని యెంతయు నిస్పృహవృత్తి నున్న'' (4.51) అనే పద్యంలో నిబంధించాడు. నన్నయ ఈ కల్పనలవలన కథ ప్రసన్నమయ్యే వ్యంగ్యార్థ సంయోజనం సాధించాడు. ఎట్లాగంటే - దుష్యంతుడు శకుంతలను గాంధర్వవిధిని వివాహమాడి, హస్తినాపురికి వెళ్ళి, ఆమెను అంతఃపురానికి పిలిపించుకోలేదు. పుత్రుడు పుట్టితే అతనికి యౌవరాజ్యపట్టాభిషేకం చేస్తానని మాట యిచ్చి దానిని స్మరించలేదు. నిండుకొలువులో శకుంతలను, భరతుడిని, భార్యాపుత్రులుగా గుర్తించలేదు. దానికి లోకాపవాదభీతిని హేతువుగా చూపించాడు తరువాత. ఆ ప్రవర్తనవలన దుష్యంతుడు ఉదాత్తు డనిపించుకోడు. పైపెచ్చు కపటిగా, కఠినుడుగా, అసత్యవాదిగా గోచరిస్తాడు. కాని, చివరకు ఆకాశవాణి నిర్దేశం ప్రకారం నిజాన్ని అంగీకరించాడు. ఆ హఠాత్ పరిణామానికి తగిన చిత్తసంస్కారం అతనిలో ఉన్నట్లు మూలకథలో ఎటువంటి సూచనా లేదు. నన్నయ దానిని కల్పించి, భావికథార్థవ్యంజకమైన కల్పనతో కథను ప్రసన్నం చేశాడు.

దుష్యంతుడు కణ్వమహర్షియొక్క తపోవనంలోకి పోయే ముందు ఖాండవవనాన్ని తలపించే సుందరవనాన్ని చూచాడు. అందులో సంతోషంగా ప్రవేశించాడు. అప్పుడు అక్కడి లతాలలనలు కుసుమాక్షతలను రాజుమీద చల్లినట్లూ, తుమ్మెదనాదాలే ఆశీస్సులుగా వినపడ్డట్లూ సన్నివేశాన్ని నన్నయ చిత్రించాడు. (4.17). ఈ రూపకాలంకార వర్ణనం దుష్యంతునికి త్వరలో జరుగబోయే గాంధర్వ వివాహాన్ని ధ్వనింపజేస్తున్నది.

కణ్వమహర్షి తపోవనవర్ణనం (4.23) వస్తుధ్వనికి చక్కని ఉదాహరణం. మునిశక్తివలన సహజవిరోధిజంతువులు సైతం తమవైరవృత్తిని మాని స్నేహంతో కలిసి జీవిస్తున్న ప్రకృతిని దుష్యంతుడు చూచి ఆశ్చర్యపోయాడు. ప్రకృతిమీద పురుషుని ప్రభావాన్ని వర్ణించే అపూర్వవర్ణన మది. శకుంతలాదుష్యంతుల గాంధర్వవివాహం విరుద్ధప్రవృత్తుల విశిష్ట స్నేహమే. అయినా, అక్కడి శాంతియే ఫలించింది. కణ్వమహర్షి వ్యక్తిత్వాన్ని ఆశ్రమవర్ణనం వ్యంగ్యంగా ప్రసన్నం చేసింది. దుష్యంతుని వర్తనానికి ముని కోపించడు. ప్రాణంగా పెంచిన తండ్రియొక్క అనుమతి లేకుండా స్వయంనిర్ణయంతో వివాహం చేసికొన్న శకుంతలను, ఆమె చేసినపని ధర్మవిరుద్ధం కాదని భావించి, మందలించడు. పైపెచ్చు, ఆమె గర్భంలో పెరుగుతున్న భరతుడు దుష్యంతునివలె కాకుండా వంశకర్త కాదగినవానిగా పెంచి, పెద్దచేసి, విద్యాబుద్ధులు నేర్పించాడు. నిశ్శబ్దంగా భావిభారతచక్రవర్తికి తగిన వ్యక్తిత్వాన్ని నిర్మించి యువరాజు కాదగిన వయసులో భరతుడిని శకుంతలవెంట హస్తినాపురానికి పంపాడు. కణ్వుని శాంతప్రవృత్తియే శకుంతలోపాఖ్యానంలోని ఆత్మశక్తి. దానిని నన్నయ ప్రసన్నం చేశాడు వ్యంగ్యార్థభరితమైన తపోవనవర్ణనంతో. ఇది నన్నయ సాధించిన అమూలకమైన మహాశిల్పం.

ఇటువంటివి ఎన్నెన్నో, మరికొన్నింటిని భావిపర్వపీఠికలలో సమీక్షించటం జరుగుతుంది.

నన్నయపద్యం ధారామధురంగా సాగుతుంది. పద్యం మొదలుపెట్టిన దగ్గరినుండి ముగిసేంతవరకూ సెలయేరువలె ప్రవహించినట్లుంటుంది. వింటే ముందుగా శ్రవణానందం కలిగిస్తుంది శబ్దసౌందర్యంతో. ఆలోచించినకొద్దీ ఆలోచనామృతం అందజేస్తుంది అర్థగాంభీర్యంతో. తత్సమపదభూయిష్ఠమైనా తెలుగుదనం రచనలో తొణికిసలాడుతూ ఉంటుంది. తెలుగువారు అందమైన ఆకారాన్నీ, అమందమైన భావావేశాన్నీ గౌరవిస్తారు. వారిచిత్తవృత్తికి అద్దంపట్టేది నన్నయపద్యశైలి. కృతిపతిప్రశంస చేసే మొదటి తెలుగు పద్యం నన్నయశైలికి అక్షరావతారం!

"రాజకులైకభూషణుఁడు, రాజమనోహరుఁ, డన్యరాజ తే
జోజయశాలిశౌర్యుఁడు, విశుద్ధయశశ్శరదిందుచంద్రికా
రాజితసర్వలోకుఁ, డపరాజితభూరిభుజాకృపాణధా
రాజలశాంతశాత్రవపరాగుఁడు రాజమహేంద్రుఁ డున్నతిన్". **(ఆది. 1.3)**

ఓజస్సులో ప్రసాదం కలిపితే వచ్చే ఒక మధురమైన శైలి ఇది. ఉదాత్తవర్ణనలో నన్నయ కలం ఈరీతిగా లాస్యంచేస్తుంది. ప్రసాదం సర్వగుణ సమర్ధనీయమనీ, అక్షరరమ్యత దాని సహజగుణమనీ, ధారామాధుర్యంతో కూడిన ఈవర్ణనంలో రాజరాజుకూ, ధర్మరాజుకూ సమానధర్మం పాటింపబడిందనీ గ్రహిస్తే నన్నయ కవితాలక్షణాలు మూడింటికీ ముచ్చటైన ఉదాహరణంగా దీనిని గుర్తించవచ్చును! నన్నయపద్యాలలో ఎన్నో భద్రగజాలు నడుస్తాయని ప్రసిద్ధి. అందుకే నన్నయనే భద్రగజంగా కీర్తించాడు ఎఱ్ఱన.

ఉ. "ఉన్నతగోత్రసంభవము, నూర్జితసత్త్వము, భద్రజాతి సం
పన్నము, నుద్ధతాన్యపరిభావిమదోత్కటమున్, నరేంద్రపూ
జోన్నయనోచితంబు నయి చొప్పడు నన్నయభట్ట కుంజరం
బెన్న నిరంకుశోక్తిగతి నెందును గ్రాలుటఁ బ్రస్తుతించెదన్." **(హరివంశము 1.6)**

కవిత్రయభారతం - వ్యాఖ్యానం

ఆంధ్రమహాభారతానికి ఆమూలాగ్రం వ్యాఖ్య ఇంతవరకు వెలువడలేదు. కొన్ని పర్వాలకు, కొన్ని ఆశ్వాసాలకు ఎడనెడ గచ్ఛత్ వ్యాఖ్యలు, సరళవ్యాఖ్యలు వచ్చాయి కాని ఒక సమగ్రతను సాక్షాత్కరింపచేసే వ్యాఖ్యానం రాలేదు. ఆ లోపాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంవారు తీర్చి అటు ధర్మప్రచారానికీ, ఇటు సాహిత్య ప్రసారానికీ ఎనలేని సేవచేస్తున్నారు. కవిత్రయభారతం తెలుగులోకి అవతరించి దాదాపు వేయేళ్లు (దాదాపు 950 సం॥) అవుతున్న తరుణంలో ఈ సమగ్రవ్యాఖ్య వెలువడటం ఆంధ్రులు చేసికొన్న అదృష్టం. ఈ వాఙ్మయ యజ్ఞంలో కర్తలైన టి.టి.డి.బోర్డు ఛైర్మన్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మొదలైన అధికారులూ, సంపాదకులూ వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, ప్రోత్సాహకులుగా కృషిచేసినవారూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతాపూర్వక నమస్సులు. కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు సలహామండలి సభ్యులకూ, సంపాదకమండలి సభ్యులకూ, ఈ ప్రచురణ విషయంలో విశేష శ్రద్ధ తీసికొన్న తిరుమల తిరుపతి దేవస్థానం సంపాదకులకూ, కంట్రోలర్ ఆఫ్ పబ్లికేషన్స్ గారికీ, సహాయకులైన వారి సిబ్బందికీ నా ధన్యవాదాలు.

విద్వద్వరేణ్యులైన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు ఆదిపర్వంలోని మొదటి మూడు ఆశ్వాసాలకు వ్యాఖ్యను సరళ గ్రాంథికభాషలో రచించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి నిర్ణయం ప్రకారం వారివ్యాఖ్యను శిష్టవ్యావహారికంలోకి పరివర్తనం చేయటం జరిగింది. నాలుగవ ఆశ్వాసానికి ప్రధానసంపాదకులే శిష్టవ్యావహారికంలో వ్యాఖ్యను సమకూర్చారు. డా॥ అప్పజోడువేంకటసుబ్బయ్యగారు తొలుత తాము సరళ గ్రాంథికభాషలో రచించిన ఆదిపర్వం 5,6,7,8 ఆశ్వాసాల వ్యాఖ్యను సంపాదకమండలి సలహాననుసరించి వారే శిష్టవ్యావహారికంలోనికి పరివర్తనంచేసి ఇచ్చారు. శిష్టవ్యావహారికశైలిలో పాటించవలసిన మార్గదర్శక సూత్రాలను సంపాదకమండలి రూపొందించింది. వాటి ననుసరించి కవిత్రయ మహాభారత వ్యాఖ్యానం మొత్తం శిష్టవ్యావహారికంలోనే సాగటం విశేషం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యాఖ్యాతలు చెప్పిన అంశాలకు మరికొన్ని విశేషాంశాలను చేర్చి, ప్రతి సంపుటికీ ఒక పీఠికను కూర్చి, ఈ సరళవ్యాఖ్యకు వీలైనంతవరకు సమగ్రతను, ఏకవాక్యతను, కథార్థ ప్రసన్నతను, కావ్యశిల్పతత్త్వ సమన్వయాన్నీ సంతరించి, ఎక్కువమంది సహృదయులకు సమ్మోదాన్ని కలిగించే దిశగా ప్రధాన సంపాదకుడి కృషి సాగింది. ఇది మొత్తంమీద అందరికీ అందుబాటులో ఉండే సరళ వ్యాఖ్య. విశేషాంశాలు భారతంలోని కొన్ని గంభీర విషయాలను దర్శించటానికి తోడ్పడే గవాక్షాలు మాత్రమే.

పద్మావతీసహిత శ్రీవేంకటేశ్వరస్వామివారు నాకు ఈ మహాభారత వ్యాఖ్యానసంపుటుల ప్రధాన సంపాదకత్వబాధ్యతలు ప్రసాదించటం నా పూర్వజన్మపుణ్యవిశేషం. ఆ పురాణ దంపతుల పాదపద్మాలకు భక్తితో సహస్ర ప్రణామాలు. ఈ ప్రచురణ సర్వధర్మ సారసత్యస్వరూపు డైన ఆ భగవానుని దివ్యచరణారవిందాలపై ఉంచుతున్న భక్తి పారిజాత పూజాకుసుమం!

హైదరాబాదు
బహుధాన్య శ్రావణ పూర్ణిమ
8-8-1998

జి.వి. సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు
కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆదిపర్వ కథాసారం

(మొదటి భాగం)

మహాభారత యుద్ధానంతరం కౌరవవంశానికి అంకురంగా నిలిచినవాడు ఉత్తరాభిమన్యుల పుత్రుడు పరీక్షితుడు. పాండవుల తరువాత హస్తినాపుర సింహాసన మెక్కి అరవైయేడేళ్ళు నిరాఘాటంగా పరిపాలించాడు. ఒకనాడు పరీక్షిన్మహారాజు వేటకు వెళ్లాడు. ఒక మృగంమీద బాణం వేశాడు. అది ఆ గుచ్చుకున్న బాణంతోనే పరుగెత్తటం మొదలు పెట్టింది. రాజు దాని వెంటపడ్డాడు. అది కనుమరుగైపోయింది. ఆ అరణ్యంలో శమీకుడనే ముని కనపడ్డాడు. అతడిని మృగాన్ని గురించి అడిగాడు. ఆ ముని ధ్యానంలో మౌనవ్రతంలో ఉండటంచేత మాట్లాడలేదు. పరీక్షిత్తుకు కోపం వచ్చింది. ప్రక్కన చచ్చిపడి ఉన్న ఒక పామును వింటి కొప్పుతో ఎత్తి ఆ మునిమెడలో వేసి హస్తినాపురికి తిరిగి వెళ్ళాడు.

శమీకుడు సమాధిలో ఉండటంచేత పాము మెళ్లోపడ్డా ఒళ్లు తెలియలేదు. అతనికి శృంగి అనే కుమారుడున్నాడు. అతడు తపస్వి అయినా మహాకోపి. తండ్రికి జరిగిన అవమానాన్ని ఒక ముని వలన విని, ఆగ్రహోదగ్రుడై, 'ఏడురోజుల్లో తక్షక విషాగ్ని దగ్ధుడై పరీక్షిత్తు ప్రాణాలు కోల్పోవుగాక!' అని శపించాడు.

శృంగి తండ్రి దగ్గరకు వచ్చాడు. పామును తండ్రి మెడనుండి తొలగించాడు. శాపాన్ని తండ్రికి తెలియజెప్పాడు. శమీకుడు కోపంవలన ఎన్నో అనర్థాలు కలుగుతాయనీ, క్షమాగుణం తపస్వికి అలంకారమనీ కొడుకునకు బోధించి శాపాన్ని క్రమ్మరించుమని కోరాడు. శృంగి దానికి అంగీకరించలేదు. శమీకుడు విచారపడ్డాడు. ఒక శిష్యునితో శాపవృత్తాంతాన్ని రాజుకు తెలియపరిచాడు.

శాపవృత్తాంతం విని పరీక్షిత్తు భయపడ్డాడు. మంత్రులతో మంతనాలు సలిపి ఒంటికంబపు మేడ కట్టించుకొని అందులో విషాన్ని విరిచే మహామంత్రాలు జపిస్తూ రాత్రింబవళ్ళు వైద్యులు, భటులు కాపలా కాస్తూ ఉంటే, వారంరోజుల గడువును కంటికి కూరుకు లేకుండా సాగిస్తూ ఉన్నాడు.

పూర్వం బ్రహ్మదేవుడు కశ్యపుడనే బ్రహ్మర్షికి, 'సంజీవని'ని ఉపదేశించాడు. పరీక్షిత్తును తక్షకుడు కాటేసి చంపితే అతనిని తిరిగి బ్రతికించి తన విద్యాబలాన్ని ప్రభువుముందు వెల్లడించాలని కశ్యపుడు బయలుదేరాడు. అతన్ని త్రోవలో తక్షకుడు కలిసికొన్నాడు. కశ్యపుని శక్తిని పరీక్షించటానికి తక్షకుడు ఒక మర్రిచెట్టును కాటేసి దగ్ధం చేశాడు; వెంటనే కశ్యపుడు ఆ చెట్టును బ్రతికించాడు. అతని విద్యాబలం తెలిసికొని ఎంతో ధనాన్ని అతనికి పారితోషికంగా ఇచ్చి హస్తినాపురం చేరకుండా అతడిని తిరిగి పంపించివేశాడు. పరీక్షిత్తుకు మృత్యువు తథ్యమని తేలింది.

తక్షకుడు నాగకుమారులతో కలిసి బ్రాహ్మణవేషాలతో వెడలి ఏకస్తంభహర్మ్యానికి చేరుకొన్నాడు. వేదఘోషతో వచ్చిన ఆ విప్రులను రాజు పూజించాడు. ఏడవరోజు సూర్యాస్తమయం అవుతున్నది కదా అని, ఆ విప్రులు తెచ్చిన పండ్లలో ఒకదానిని తినటానికి పరీక్షిత్తు ఉద్యుక్తుడైనాడు. ఆ పండులో క్రిమిగా తక్షకుడు తలయెత్తి విషాగ్నిని గుప్పించాడు. మేడతో సహా పరీక్షిత్తు దగ్ధుడైపోయాడు.

పరీక్షిత్తు చనిపోయేనాటికి అతని కుమారుడు జనమేజయుడు బాలుడు. పిన్ననాటనే రాజ్యభారాన్ని స్వీకరించవలసి వచ్చింది. తండ్రికి తక్షకునివలన కలిగిన అపకారాన్ని ఉదంకునివలన తెలిసికొని పాములజాతిమీద మండిపడ్డాడు. సర్పయాగం

చేసి తక్షకాదుల నందరినీ అగ్నిలో ఆహుతి చేయాలనుకొన్నాడు. యాగం ఆరంభమయింది. అగ్నికుండంలో పాములు వరుసగా వచ్చి పడుతున్నాయి. అప్పుడు ఆస్తీకుడనే విప్రుడిని వాసుకి మొదలైన నాగముఖ్యులు సర్పయాగాన్ని మాన్పించుమని ప్రార్థించారు. ఆస్తీకుడు సముచితమైన స్తుతులను చేసి జనమేజయుడిని మెప్పించి సర్పయాగం మాన్పించాడు.

ఆ తరువాత ఒకనాడు జనమేజయుడు విద్వద్గోష్ఠిలో ఉండగా వైశంపాయనాది శిష్యులతో వ్యాసమహర్షి అక్కడకు వచ్చాడు. జనమేజయ మహారాజు వ్యాసమహర్షిని అర్ఘ్య పాద్యాది విధులతో పూజించి వినయంతో నమస్కరించి ఇట్లా అడిగాడు-

'ఓ మహర్షీ! మీరూ, భీష్మాది కురువృద్ధులూ కలిసి రాజ్య సంపదను విభాగం చేసి ఇచ్చినప్పటికీ కూడా, సుఖశాంతులతో వాటిని అనుభవించకుండా అటు పాండవులూ, ఇటు కౌరవులూ ఏ కారణంవలన ఇంత ప్రజాక్షయమైన భారతయుద్ధం చేశారు? ఈ వంశ కలహం అసలు ఎందుకు కలిగింది? మీ ఆజ్ఞలను వారెందుకు పాటించలేదు? లేదా మీరు తెలిసి తెలిసి వారిని ఎందుకు వారించలేదు? పాండవధార్తరాష్ట్రుల విభేదన కథ వినాలని ఉన్నది. వినిపించండి' - అని జనమేజయుడు వేడుకొన్నాడు. వ్యాసమహర్షి శ్రీ మహాభారత కథాఖ్యానం చెప్పటానికి తన శిష్యుడైన వైశంపాయనుడిని నియోగించాడు. అందువలన కథకుడు - వైశంపాయనుడు. శ్రోత - జనమేజయుడు.

వ్యాసుని జననం

మహాభారతాన్ని రచించిన వేదవ్యాసులవారే పాండవుల చరిత్రలో ఒక ప్రధాన పాత్ర నిర్వహించారు. అందువలన ఆయనను గురించి ముందు తెలుసుకొందాం.

దాశరాజుకు మత్స్యగంధి అనే కూతురు ఉన్నది. అద్రిక అనే అప్సరస బ్రహ్మశాపంవలన యమునలో చేపగా తిరుగుతున్నప్పుడు, ఆమె ఉపరిచరవసువు వీర్యంవలన పుట్టింది. ఆమెను దాశరాజు కన్నబిడ్డవలె పెంచుకొంటున్నాడు. చేపకడుపున పుట్టటం వలన ఒళ్లల్లా చేపవాసన కొడుతుండేది ఆమెకు. అందువలన మత్స్యగంధి అని పిలిచేవారామెను. ఆమెకు యౌవనం వచ్చింది. యమునానదిమీద పడవ నడుపుతూ యాత్రికుల సేవ చేసుకోమని తండ్రి మత్స్యగంధిని నియోగించాడు. ఆమె శ్రద్ధాభక్తులతో ఆ పనిచేస్తున్నది.

వసిష్ఠమహర్షి మనుమడు, శక్తిపుత్రుడు, మహాతపస్వి అయిన పరాశరముని యమునానది దాటటానికి పడవరేవుకు వచ్చి మత్స్యగంధిని చూచాడు. ఆమె శరీర సౌందర్యం ఆ మహర్షి మనస్సును దోచుకొన్నది. అతడు తన కోర్కెను ఏకాంతంగా ఆమెకు తెలియజెప్పాడు. మునిమాట కాదంటే శాపమిస్తాడనే భయంతో పరాశరునితో మెల్లగా మత్స్యగంధి ఇట్లా అన్నది :

'మహర్షీ! నేనా కన్యకను, పైపెచ్చు నా మేనెల్లా చేపలకంపు; మీ మాట నే నంగీకరిస్తే నా కన్యకావ్రతం ముగిసిపోతుంది. అప్పుడు మా తండ్రిగారింటికి నేనెట్లా వెళ్లగలుగుతాను? కాబట్టి, నాకెటువంటిదోషం రాకుండా నీవు అనుగ్రహిస్తే నాకేమీ అభ్యంతరం లేదు' అని అన్నది మత్స్యగంధి.

పరాశరుడు ఆ మాటలు విని, సంతోషంతో ఆమె కన్యాత్వానికి లోపం లేకుండా వరమిచ్చాడు. ఆమె శరీరంలోని చేపలకంపు పోయి ఒక యోజనదూరం వరకూ పరిమళించే సుగంధాన్ని సహజశరీర వాసనగా ప్రసాదించాడు. దానితో ఆమె 'గంధవతి'గా, 'యోజనగంధి'గా పేరుపొందింది. ఆమెకు దివ్యాంబర భూషణాలు అందించాడు మహర్షి. పడవ నది నడుమ నున్న దీవికి చేరింది. పట్టపగలు - బట్టబయలు ఎట్లా సంగమం సాధ్యం? అని అనుమానించింది యోజనగంధి. పరాశరుడు పట్టపగలును చిమ్మచీకటిగా మార్చాడు. ఆ ముద్దరాలి అనురాగాన్ని అనుభవించాడు. ఆమెకు సద్యోగర్భంలో సూర్యతేజుడైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యాసుడు ఉదయించాడు. పుట్టగానే సద్యోయౌవనుడైనాడు. సమస్తజ్ఞానం ఆయనకు స్వాధీనమైనది. పరాశరుడు మత్స్యగంధికి మరికొన్ని వరాలిచ్చి వెళ్లిపోయాడు. నల్లని యమునాద్వీపంలో పుట్టటంవలనా, కృష్ణుడు - అంటే - నల్లనివాడు కావటంచేత వ్యాసుడు కృష్ణద్వైపాయనుడు అయినాడు. కృష్ణాజినం, కాషాయాలు, కపిలజడలు, దండకమండలాలూ సహజంగానే ధరించి వ్యాసుడు తల్లికి నమస్కరించాడు. 'మీకు నా అవసరం ఎప్పుడు ఉంటే అప్పుడు నన్ను తలుచుకొండి; ఆక్షణమే మీ యెదుట ఉంటాను' అని చెప్పి తపోవనానికి వెళ్లాడు. ఘోరతపస్సు చేసి, ఆత్మ సాక్షాత్కారాన్ని పొంది, చిక్కుపడిఉన్న వేదాలను విడదీసి లోకంలో వెలయించాడు; వేదవ్యాసుడైనాడు. మహాభారతంలో తానూ ఒక పాత్రగా జీవించి చివరకు ఆ కావ్యాన్ని తానే రచించాడు. యోజనగంధి అసలు పేరు సత్యవతి. కౌరవ వంశ చరిత్రలో తరువాత కీలకపాత్ర నిర్వహించింది.

భీష్మప్రతిజ్ఞ

వ్యాసుని తరువాత పాండవ కథలో మరో ప్రధానవ్యక్తి భీష్ముడు. శంతను మహారాజుకూ గంగాదేవికీ పుట్టిన మహాబలుడు. వసిష్ఠుని శాపంవలన భూతలం మీద పుట్టి, బ్రహ్మచారిగా, దీర్ఘాయువుగా, మహావీరుడుగా జీవించిన సత్యవ్రతుడు. యౌవరాజ్య పట్టాభిషేక యోగ్యుడై తండ్రియైన శంతనుమహారాజుగారి వాత్సల్యాన్ని చూరగొంటున్నాడు.

ఇట్లా ఉండగా ఒకనాడు శంతనుడు గంగానదీ తీరంలో యోజనగంధిని చూచాడు. ఆమెపై మరులు కొన్నాడు. ఆమె తండ్రి అయిన దాశరాజుకు తనకోరిక తెలిపాడు. దాశరాజు అందుకు అంగీకరించాడు కాని, ఒక నియమం పెట్టాడు. శంతనుడికీ సత్యవతికీ కలిగిన పుత్రునికే పట్టాభిషేకం చేయాలి; అప్పుడే సత్యవతితో వివాహానికి అంగీకరిస్తానన్నాడు. శంతనుడు భీష్ముని మీది అభిమానంతో సత్యవతి సంబంధాన్ని అంగీకరించలేక హస్తినాపురానికి తిరిగి వెళ్లాడు. కాని, సత్యవతీ విరహంతో కుమిలిపోతూ ఉన్నాడు. భీష్ముడు తండ్రి మనస్సును తెలిసికొంటాడు. దాశరాజు దగ్గరికి వెళ్ళాడు. అతని నియమాన్ని అంగీకరించాడు. దానికోసం రెండు భీషణ ప్రతిజ్ఞలు చేశాడు : ఒకటి - తాను రాజ్యం స్వీకరించకుండా శంతనునికీ సత్యవతికీ కలిగిన సంతానానికే రాజ్యం లభించేటట్లు చేస్తానని. రెండు - భవిష్యత్తులో తనకు పుట్టే బిడ్డలు సింహాసనానికి పోటీ పడకుండా ఉండటానికి వీలుగా ఆమరణ బ్రహ్మచర్యవ్రతాన్ని స్వీకరిస్తానని. ఈ ప్రతిజ్ఞలు విని దేవతలు పూలవాన కురిపించారు. 'భీష్ముడు' అని ప్రశంసించారు. తండ్రి అతనికి 'స్వచ్ఛందమరణాన్ని' వరంగా ఇచ్చాడు.

భీష్మునివలననే సత్యవతికీ శంతనునికీ వివాహమైనది. వారిద్దరికీ చిత్రాంగద, విచిత్రవీర్యులనే పుత్రులు పుట్టారు. వారి చిన్నప్పుడే శంతనుడు కన్నుమూశాడు. వారిద్దరి రక్షణభారంతోపాటు రాజ్యరక్షణభారాన్ని కూడా భీష్ముడు స్వీకరించాడు. చిత్రాంగదుడికి పట్టాభిషేకం చేశాడు. అతడు గర్వాంధుడై విహరించాడు. మనుజ గంధర్వాదులను ఆక్షేపించాడు. చిత్రాంగదుడనే ఒక గంధర్వపతికి కోపం వచ్చి అతడిని ద్వంద్వయుద్ధానికి ఆహ్వానించాడు. చిత్రాంగదు లిద్దరూ ఘోరంగా యుద్ధం చేశారు. శంతనుని పుత్రుడు చిత్రాంగదుడు యుద్ధంలో చనిపోయాడు. ఆ తరువాత భీష్ముడు విచిత్రవీర్యునికి హస్తినాపుర పట్టాభిషేకం చేశాడు. అతనికి కాశీరాజు కూతుళ్లను ముగ్గురిని స్వయంవరంలో బలవిజితలుగా తెచ్చి వివాహం చేయబోయాడు. వారిలో పెద్దది అంబ సాల్వుడిని వరించింది కావున భీష్ముడామెను సాళ్వదేశానికి పంపాడు. మిగిలిన ఇద్దరూ అంబిక, అంబాలికలను విచిత్రవీర్యుడికి కట్టబెట్టాడు. అతడు ఆ భార్యలతో అహోరాత్రాలు భోగించి నిర్వీర్యుడై అసువులను కోల్పోయాడు. దానితో హస్తినాపురికి నాథుడు లేకుండా పోయాడు.

అదొక విచిత్రమైన పరిస్థితి. కురువంశపుత్రులలో మిగిలింది భీష్ముడొక్కడే. సత్యవతి అతణ్ణి రాజ్యానికి పట్టాభిషిక్తుడవు కమ్మనీ, వివాహమాడి సంతానవంతుడవై వంశాన్ని నిలుపుమనీ వేడుకొన్నది. భీష్ముడు తన భీష్మప్రతిజ్ఞను జ్ఞాపకం చేసి,పంచభూతాలు వాటి ధర్మాలు తప్పినా నేను నా మాటను తప్పనని స్పష్టం చేశాడు. అప్పుడు భీష్ముడు నిండు సభలో ఒక

ఆపద్ధర్మాన్ని ప్రతిపాదించాడు. రాజవంశాలలో సంతానం లేకుండా రాజులు మృతులైనప్పుడు దేవరన్యాయంతో రాజులు సంతానాన్నిపొందే ఆచారాన్నీ, అది అప్పటిసమాజంలో పొందిన ప్రామాణికత్వాన్నీ వివరించి చెప్పాడు. అది అందరికీ అంగీకారమైనది. సత్యవతి వేదవ్యాసుని తలచి, అతడు తన కోడండ్రైన అంబిక, అంబాలికలయందు పురుషసంతానాన్ని కలిగించేటట్లు భావించింది.

ఆ దేవర న్యాయంవలన అంబికయందు వేయి యేనుగుల బలం గల ధృతరాష్ట్రుడు పుట్టాడు. కాని, అతడు పుట్టుగ్రుడ్డి. అందువలన వ్యాసుడు అంబాలికయందు మరొక పుత్రుణ్ణి అనుగ్రహించాడు. అతడు మహాపరాక్రమశాలి కాని, పాండు వర్ణం కలవాడు కాబట్టి పాండురాజయ్యాడు. సలక్షణ సంతానం కలుగలేదన్న అసంతృప్తితో అంబికను మరొకపుత్రుడిని కనుమని కోరుతుంది సత్యవతి. కాని, వ్యాసుని కపిలగడ్డం, కవిల జడలు, నల్లని పొడుగైన రూపం చూచి రెండవసారి పొందలేక అంబిక ఒకదాసిని తనస్థానంలో ఉంచింది. ఆమె వ్యాసుని హృదయాన్ని మెప్పించి ఒక సుతుడిని పొందింది. అతడే ధర్మవిదుడైన విదురుడు. వారినిపెంచి, పెద్దవారిని, విద్యావంతులను చేసి, వివాహితులను చేసే బాధ్యత కూడా భీష్ముడే స్వీకరించాడు.

ఇది ఆదిపర్వ కథాసారంలో మొదటిభాగం.

జి.వి. సుబ్రహ్మణ్యం

ప్రధాన సంపాదకుడు

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపుటము - 1

ఆదిపర్వము

మొదటి భాగము (1,2,3,4 ఆశ్వాసములు)

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
మంగళశ్లోకము		1
అవతారిక		2
భారతకథా ప్రస్తావన	1-1-8	22
పర్వానుక్రమణిక	1-2-34	27
పర్వసంగ్రహము	1-2-71	32
భారతసంహితా నిర్మాణప్రశంస	1-1-63	53
శమంతపంచకాక్షౌహిణీ సంఖ్యా కథనము	1-2-1	59
సరమవృత్తాంతము - జనమేజయుని పురోహిత వరణము	1-3-1	63
ఉదంకుండు పౌష్యమహాదేవికుండలంబులం దేఁబోవుట	1-3-86	67
తక్షకుండు కుండలంబు లపహరించుట	1-3-136	73
తక్షకుండు కుండలంబులం దెచ్చి యుదంకున కిచ్చుట	1-3-158	80
ఉదంకుండు జనమేజయునకు సర్పయాగబుద్ధిఁ గలిగించుట	1-3-177	85
భృగువంశకీర్తనము - భృగు వగ్నికి శాప మొసంగుట	1-5-3	88
చ్యవనునివలనఁ బులోముఁడను రాక్షసుండు చచ్చుట		91
ప్రమద్వర సర్పదష్టయై చచ్చి మరల బ్రదుకుట	1-8-1	98
సహస్రపాదుని వృత్తాంతము	1-10-6	103

ద్వితీయాశ్వాసము

గరుడోపాఖ్యానము		110
కద్రూవినతలు పుత్త్రులం గోరి పడయుట	1-14-5	110
అనూరుఁడు జనించి వినతకు శాప మిచ్చుట	1-14-14	111
దేవాసురు లమృతమును బడయఁ గోరి సముద్రమును మథించుట	1-15-5	113
దేవదానవుల యుద్ధము	1-11-10	118
కద్రూవినత లుచ్చైశ్శ్రవమును జూచి పందెములు సఱచుట	1-18-1	121
వినతకు గరుడుండు జనియించుట	1-20-4	126
గరుత్మంతుఁ డమృతంబుఁ దెచ్చుటకుఁ దల్లియనుమతిఁ గొనుట	1-24-1	132
గజకచ్ఛపముల వృత్తాంతము	1-25-10	136

గరుడం డమృతహరణార్థం బెగయుట	1-26-37	142
వాలఖిల్యుల వృత్తాంతము	1-27-4	144
గరుడఁ డమృతరక్షకులతో యుద్ధము సేయుట	1-28-1	149
శ్రీమన్నారాయణుఁడు గరుడునకుఁ బ్రసన్నుఁడగుట-ఇంద్రుండు గరుడునితో స్నేహించుట	1-29-12	154
బ్రహ్మయనుజ్ఞవలన శేషుఁడు భూభారంబు దాల్చుట	1-32-2	162
వాసుకి తల్లిశాపమునకు వగచుట	1-33-1	163
జరత్కారుండు వివాహంబు చేసికొనఁబూనుట	1-42-9	173
జనమేజయునకుఁ బరీక్షితు శాపకారణంబు మంత్రులు చెప్పుట	1-36-8	180
కశ్యపునకుఁ దక్షకుఁడు గోరిన ధనం బిచ్చి మరల్చుట	1-38-31	190
తక్షక విషాగ్నిచేఁ బరీక్షితుండు హర్మ్యంబుతోడ దగ్ధుం డగుట	1-39-19	194
జనమేజయమహారాజు సర్పయాగము సేయుట	1-46-6; 1-46-23	196
ఆస్తీకుఁడు సర్పయాగము నివారించుట	1-49-17	206

తృతీయాశ్వాసము

వ్యాసుఁడు జనమేజయునకు భారతకథం దెలుప వైశంపాయను నియోగించుట	1-54-1	219
భారతమహిమము		222
పాండవధార్తరాష్ట్రుల భేదకారణసంగ్రహము	1-55-6	225
ఉపరిచరవసుమహారాజు వృత్తాంతము	1-57-1	232
మత్స్యగంధి వృత్తాంతము	1-57-50	238
శ్రీవేదవ్యాసమునీంద్రుని యవతారము	1-57-70	242
భీష్మాదివీరులు దేవదానవాదుల యంశంబువలనఁ బుట్టుట	1-58-3	244
దేవదానవ ప్రముఖుల యుత్పత్తి క్రమము	1-59-9	249
దేవదానవాద్యంశములచే భూమియందుఁ బుట్టినవారి క్రమము	1-57-84	255
కౌరవవంశ వివరణము	1-70-10	260
యయాతి మహారాజు చరిత్రము	1-71-3	264
కచుండు దానవహతుం డై మృతసంజీవనిచే బ్రదుకుట	1-71-30	271
యయాతి నూతంబడిన దేవయాని నుద్ధరించుట	1-73-14	283
శర్మిష్ఠ దాసియై దేవయానిం గొలుచుట	1-75-13	290
యయాతి మహారాజు దేవయానిని వివాహం బగుట	1-76-8	293
యయాతి శర్మిష్ఠకుఁ బుత్రదానంబు సేయుట	1-77-10	302
శుక్రుఁడు యయాతికి శాపం బిచ్చుట	1-78-24	310
యయాతి యదుప్రముఖులకు శాపం బిచ్చుట	1-79-1	313
యయాతి పూరునకు బోధించిన నీతులు	1-82-6	319

ఇంద్రుండు యయాతిని స్వర్గలోకభ్రష్టునిఁ జేయుట	1-83-3	322
యయాతి యష్టకాదు లడిగిన ప్రశ్నలకు సంక్షేపరూపంబున సమాధానంబు లొసఁగుట	1-84-3	326

చతుర్థాశ్వాసము

పూరువంశక్రమము	1-90-11(1-89-4)	333
దుష్యంతుఁడు వేఁట కరుగుట	1-63-1	336
కణ్వాశ్రమ వర్ణన	1-64-3	339
శకుంతల దుష్యంతునకుఁ దన జన్మక్రమం బెఱింగించుట	1-65-14	347
దుష్యంతుండు శకుంతలను వివాహంబు సేసికొనఁగోరుట	1-67-1	357
భరతుని జననము	1-68-1	363
కణ్వమహాముని శకుంతలను దుష్యంతుపాలికిం బంపుట	1-68-10	366
దుష్యంతుఁడు శకుంతలను నిరాకరించుట	1-68-18	370
కుపితయైన శకుంతల దుష్యంతునకు ధర్మప్రబోధ మొనరించుట	1-68-22	371
దివ్యవాణి నాకర్ణించి దుష్యంతుఁడు శకుంతలను గ్రహించుట	1-69-28	382
భరతవంశ క్రమము	1-90-34	386
గంగావసువుల సమయము	1-91-1	390
తనపుత్రునకు భార్యవగుమని ప్రతీపుఁడు గంగ కుపదేశించుట	1-92-1	395
గంగాశంతనుల సమయము	1-92-26	398
గంగ శంతనునకు వసువుల వృత్తాంతమును దెలుపుట	1-29-49	403
గంగ దేవవ్రతునిం దెచ్చి శంతనున కిచ్చుట	1-94-11	406
శంతనుఁడు సత్యవతిని భార్యగాఁ గోరి ప్రతిహతమనోరథుఁడగుట	1-94-41	411
గాంగేయుఁడు బ్రహ్మచర్యవ్రతంబుఁ బూని భీష్ముండగుట	1-94-54	414
చిత్రాంగదా విచిత్రవీర్యుల వృత్తాంతము	1-95-1	421
భీష్ముఁడు కాశీరాజుకూఁతుల స్వయంవరమున కరుగుట	1-96-4	423
సాల్వుఁడు భీష్మునితో యుద్ధంబు సేయుట	1-96-27	425
విచిత్రవీర్యుని వివాహము, మరణము	1-96-52	428
సత్యవతి భీష్ముని వివాహమాడుమని కోరుట	1-97-4	430
దీర్ఘతముని వృత్తాంతము	1-98-6	434
సత్యవతి భీష్ముని యనుమతంబున వ్యాసుని సోదరక్షేత్రముల యందు సంతానమును బడయు మని నియోగించుట	1-99-1	438
ధృతరాష్ట్ర పాండురాజ విదురుల జననము	1-100-4	444
మాండవ్యోపాఖ్యానము	1-101-1	448

*****

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము

మొదటి భాగము

(1,2,3,4 ఆశ్వాసాలు)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము -ప్రథమాశ్వాసము

మంగళశ్లోకము

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషు యే
లోకానాం స్థితి మావహ న్త్వవిహతాం స్త్రీపుంసయోగోద్భవామ్
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమామ్బుజభవశ్రీకన్ధరా శ్రేయసే. **1**

ప్రతిపదార్థం: యే= ఏ విష్ణు బ్రహ్మ శంకరులు; శ్రీ, వాణీ, గిరిజాః= క్రమంగా లక్ష్మీ సరస్వతీ పార్వతులను; చిరాయ= చిరకాలంనుండి; వక్షః, ముఖ, అఙ్గేషు= రొమ్మునందూ, మొగమునందూ, దేహమునందూ; దధతః= ధరిస్తున్న వారై; స్త్రీ, పుంస, యోగ+ ఉద్భవామ్= స్త్రీపురుషుల సంయోగంవలన పుట్టిన; లోకానామ్= లోకములయొక్క; స్థితిమ్= స్థిరత్వాన్ని (నిలకడను); అవిహతామ్= అవిచ్ఛిన్న మైనదానినిగా; ఆవహన్తి= చేస్తున్నారో; వేద, త్రయ, మూర్తయః= ఋగ్యజుస్సామా లనే మూడు వేదాల రూపాలు గలవారున్నూ; సురైః= దేవతలచేత; సంపూజితాః= పూజింపబడినవారున్నూ అయిన; తే= పురుషోత్తమ+అమ్బుజభవ, శ్రీకన్ధరాః= విష్ణువు, బ్రహ్మ, శివుడు - అనబడే; త్రి, పురుషాః= త్రిమూర్తులు; వః= మీకు; శ్రేయసే= మేలుకొరకు (మేలు చేసేవారుగా); భూయాసుః= అగుదురు గాక!

తాత్పర్యం: ఏ విష్ణు బ్రహ్మ శంకరులు చిరకాలంనుండి క్రమంగా రొమ్మునందూ, ముఖమునందూ, దేహమునందూ లక్ష్మీ సరస్వతీ పార్వతులను ధరిస్తున్నవారై, స్త్రీపురుషుల సంయోగంవలన పుట్టిన లోకాల సుస్థిరత్వాన్ని అవిచ్ఛిన్నంగా కలిగిస్తున్నారో, మూడువేదాలరూపం కలవారున్నూ, దేవతలచేత పూజింపబడినవారున్నూ అయిన ఆ విష్ణు బ్రహ్మ శంకరు లనబడే త్రిమూర్తులు మీకు శ్రేయస్సును కలిగించేవా రౌతారు గాక!

విశేషం: కావ్యారంభ పద్యాన్ని శ్రీకారంతోనూ, మగణంతోనూ ప్రారంభించటం మంగళకరం. అందువలననే ఇది మంగళశ్లోకం. ఇది నాటకంలోని నాందివంటిది. కావ్యారంభంలో ఆశీర్వాదాన్ని కాని, నమస్కారాన్ని కాని, వస్తు నిర్దేశాన్ని కాని చేయా లని లాక్షణికుల నిర్దేశం.'ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశోవాపి తన్ముఖమ్'. ఈ శ్లోకంలో ఆశీర్వచనం ఉన్నది. నన్నయ మహాభారతాన్ని తెలుగులో రచిస్తున్నప్పటికీ సంస్కృతం అమరభాష కావటంచేత ఆశీఃపూర్వకమైన మంగళశ్లోకాన్ని సంస్కృతంలోనే వ్రాసి ఉన్నాడు. శ్రీకంధరుడు అంటే విషం కంఠంలో కలవా డని వ్యుత్పత్తి. ఆశీర్వచనంలో శ్రీకంధరశబ్దాన్ని ఎందుకు వాడినా డని కొందరికి సందేహం కలుగవచ్చు. శివుడు హాలాహలభక్షణం చేయటం లోకరక్షణంకొరకే కాబట్టి అది శుభాన్నే సూచిస్తుంది. వేదత్రయమూర్తు లనేపదం భారతం పంచమవేద మని సూచిస్తున్నది. పురుషోత్తమశబ్దం శ్రీకృష్ణుడినే కాక ధర్మజార్జున భీష్మాదులను కూడ జ్ఞప్తికి తెస్తున్నది. 'వక్షోముఖాఙ్గేషు' అనేది సమాహారద్వంద్వం కదా! అది ఏకవచనంలో కాక బహువచనంలో ఉండటానికి హేతు వేమి టని కొందరు ప్రశ్నిస్తారు. ఆ వక్షోముఖాంగాలు ఒక్కరివి కాక ముగ్గురివి కావటం అందుకు కారణం.

భార్యలను చిరకాలంనుండీ ప్రేమిస్తున్న ధర్మమూర్తులు త్రిమూర్తులు వేదత్రయంలో చెప్పబడిన గృహస్థధర్మానికి ప్రతీకలు. వారు స్త్రీపుంసయోగోద్భవ మైన లోకానికి అవిచ్ఛిన్నతను ప్రసాదిస్తా రనటంవలన భారతంలో వేదసమ్మతమైన గృహస్థధర్మం ప్రధానప్రతిపాద్యాంశం అని ధ్వని. ఇది సంస్కృతభారతారంభంకంటె విలక్షణమైనదని గమనించాలి. కావ్యతాత్పర్యాన్ని సూచించటం వస్తునిర్దేశంలోని భాగం. అలం: క్రమం.

నన్నయ ఋషితుల్యుడు. అతని నోట త్రిమూర్తులు అనే పదం రావటంచేత లోకాలస్థితిని త్రిమూర్తులు కొనసాగిస్తున్నట్లు ఆంధ్రమహాభారతాన్ని కూడా త్రిమూర్తితుల్యు లైన ముప్పురుకవులు రచించి పూర్తి చేస్తా రనే సూచన అప్రయత్నంగా కలిగిందని కొంద రంటారు. 'నన్నయ' పదం నారాయణ శబ్ద భవం; తిక్కన 'కవిబ్రహ్మ', ఎఱ్ఱన 'శంభుదాసుడు', అందుచేత కవిత్రయం వారు త్రిమూర్తులవంటివా రనటం సమంజసంగానే ఉన్నది. ఇది శార్దూలవిక్రీడితం. ఇందులో తెలుగుపద్యాలలోవలె ప్రాస కాని, అక్షరమైత్రితోకూడిన యతి కాని లేవు. సంస్కృతశ్లోక మర్యాదలే ఇందులో ఉన్నాయి.

అవతారిక

వ. అని సకలభువనరక్షణప్రభువు లై యాద్యు లైన హరిహరహిరణ్యగర్భ పద్మోమావాణీపతుల స్తుతియించి, తత్ప్రసాదసమాసాదిత నిత్యప్రవర్ధమాన మహామహీరాజ్యవిభవుండును, నిజభుజవిక్రమ విజితారాతి రాజనివహుండును, నిఖిలజగజ్జేగీయమాన నానాగుణరత్న రత్నాకరుండును నై పరఁగుచున్న రాజరాజ నరేంద్రుండు 2

ప్రతిపదార్థం: అని= పైశ్లోకంలో చెప్పబడినప్రకారం; సకల, భువన, రక్షణ, ప్రభువులు+ఐ= సర్వలోకాలను రక్షించటంలో సమర్థులై; ఆద్యులు+ఐన= సృష్టికి మొదటివా రైన; హరి, హిరణ్యగర్భ, పద్మా+ఉమా, వాణీపతులన్= విష్ణువు, శివుడు, బ్రహ్మ అనెడి లక్ష్మీ పార్వతీ సరస్వతీ భర్తలను; స్తుతియించి= పొగడి; తత్, ప్రసాద, సమాసాదిత, నిత్య ప్రవర్ధమాన, మహత్, మహీ, రాజ్య, విభవుండును= ఆ త్రిమూర్తిదంపతుల అనుగ్రహంచేత పొందబడిన దై, సంతతం వర్ధిల్లుతున్న గొప్పభూరాజ్యవైభవం కలవాడున్నూ; నిజ, భుజ, విక్రమ, విజిత+అరాతి, రాజ, నివహుండును= తన బాహువుల పరాక్రమంచేత జయింపబడిన శత్రురాజుల సమూహం కలవాడున్నూ; నిఖిల, జగత్+జేగీయమాన, నానా, గుణ, రత్న, రత్నాకరుండునున్= సమస్త జగత్తులచేత (లోకాలచేత) స్తుతింపబడుతున్న పలువిధాలైన సుగుణా లనెడి మణులకు సముద్రుడున్నూ; ఐ; పరఁగుచున్న= ఒప్పుతున్న; రాజరాజనరేంద్రుండు= తూర్పుచాళుక్యవంశానికి చెందిన రాజరాజనరేంద్రు డనే రాజు. (ఇతడు క్రీ.శ. 1019 (1022) నుండి 1062 వరకు వేంగీరాజ్యాన్ని పాలించాడు.)

తాత్పర్యం: అని సర్వలోకాలను రక్షించటంలో సమర్థులై సృష్టికి మొదటివారైన విష్ణువు, శంకరుడు, బ్రహ్మ అనబడే లక్ష్మీ పార్వతీ సరస్వతీ భర్తలను పొగడి, వారి అనుగ్రహంచేత పొందబడి, నిరంతరంగా అనుభవిస్తున్న గొప్పదైన ధరణీరాజ్యవైభవం కలవాడున్నూ, తన బాహువులపరాక్రమంచేత జయింపబడిన శత్రువులసమూహం కలవాడున్నూ, ఎల్ల జగత్తులచేత (లోకులచేత) స్తుతింపబడుతున్న పలువిధా లైన మంచిగుణా లనే మణులకు సముద్రుడున్నూ అయి ఒప్పుతున్న తూర్పుచాళుక్యవంశానికి చెందిన రాజరాజనరేంద్రుడు.

విశేషం: మొదటి శ్లోకంలో విష్ణు బ్రహ్మ శంకరులు అనే క్రమం చెప్పబడింది. ఈ వచనంలో హరిహరబ్రహ్మలు అనే వరుసక్రమం చెప్పబడింది. భారతాన్ని నన్నయ తరువాత తిక్కన, ఆ పిమ్మట ఎఱ్ఱన పూర్తి చేసి ఉన్నారు. భారతంలోని కథావిషయక్రమాన్నిబట్టి చూస్తే మొదట నన్నయ, పిమ్మట ఎఱ్ఱన, అనంతరం తిక్కన వస్తారు. శ్లోకంలో మొదటిక్రమాన్నీ, వచనంలో రెండోక్రమాన్నీ ఋషివంటి నన్నయ సూచించా డని ఊహించవచ్చును. అలం: వృత్త్యనుప్రాసం, అంత్యానుప్రాసం, రూపకం.

ఉ. రాజకులైకభూషణుఁడు, రాజమనోహరుఁ, డన్యరాజతే
జోజయశాలిశౌర్యుఁడు, విశుద్ధయశశ్శరదిందుచంద్రికా
రాజితసర్వలోకుఁ, డపరాజితభూరిభుజాకృపాణధా
రాజలశాంతశాత్రవపరాగుఁడు రాజమహేంద్రుఁ డున్నతిన్. 3

ప్రతిపదార్థం: రాజ, కుల+ఏక, భూషణుఁడు= చంద్ర (క్షత్రియ) వంశానికి (రాజులసమూహానికి) ముఖ్యఅలంకార మైనవాడు; రాజ, మనోహరుఁడు= చంద్రునివలె అందమైనవాడు; అన్య, రాజ, తేజస్+జయశాలి, శౌర్యుఁడు= పరరాజుల పరాక్రమాలను జయించటంచేత ప్రకాశించే శౌర్యం కలవాడు; విశుద్ధ, యశస్+శరత్+ఇందు, చంద్రికా, రాజిత, సర్వ, లోకుఁడు= నిర్మలమైన కీర్తి అనే శరత్కాల చంద్రుడి వెన్నెలచేత ప్రకాశింపచేయబడిన సమస్త జగత్తును కలవాడు; అపరాజిత, భూరి, భుజా, కృపాణ, ధారాజల, శాంత, శాత్రవ, పరాగుఁడు= ఓటమి ఎరుగని పెద్దదైన భుజమునందలి ఖడ్గముయొక్కవాదర అనే నీటిచేత శమింపచేయబడిన శత్రువులనెడి ధూళి కలవాడు; అయిన; రాజమహేంద్రుఁడు= రాజరాజనరేంద్రుడు; ఉన్నతిన్= ఔన్నత్యంతో (మీది పద్యంతో అన్వయం).

తాత్పర్యం: చంద్రవంశానికి (క్షత్రియవంశానికి, రాజసమూహానికి) ముఖ్యాలంకార మైనవాడు, చంద్రుడివలె అందమైనవాడు, పరరాజుల పరాక్రమాన్ని జయించటంచేత ప్రకాశించే శౌర్యం కలవాడు, నిర్మలమైన కీర్తి అనే శరత్కాలచంద్రుడివెన్నెలచేత ప్రకాశింప చేయబడిన సమస్తలోకాలు కలవాడు, ఓటమి యెరుగని దీర్ఘమైన బాహువునందలి ఖడ్గముయొక్కవాదర అనే నీటిచేత అణగింపబడిన శత్రువు లనే ధూళి కలవాడు అయిన రాజరాజనరేంద్రుడు పెంపుతో.

విశేషం: అలం: రూపకం, వృత్త్యనుప్రాసం. 1. ఈ పద్యంలో రాజరాజనరేంద్రుడి ఆభిజాత్యాన్నీ, సౌందర్యాన్నీ, శౌర్యాన్నీ, నిర్మలమైన కీర్తినీ, బాహుపరాక్రమాన్నీ కవి వర్ణించాడు. ఈ గుణాలు ఉత్తమనాయకత్వవ్యంజకాలు. ఈవిశేషణాలు భారతనాయకుడైన ధర్మరాజుకు కూడా వర్తింపచేయటానికి అనువుగా ఉండటం విశేషం. 2 కావ్యావతారికలో కృతిపతి వర్ణనం అనేది ఒక ముఖ్యమైన అంగం. కృతిపతులు సామాన్యంగా రెండురకాలు-(1) కృతిని అంకితం తీసికొనేవారు (2) కృతిని వినగోరేవారు. వినగోరే వారిని కృతిశ్రోత అంటారు. రాజరాజనరేంద్రుడు కృతిశ్రోత. అతడి వర్ణనం ఇందులో వస్తువు. 3. ఇందులో రూపకాలంకారం ప్రయోగింపబడింది. ఉపమానానికి, ఉపమేయానికి అభేదాధ్యవసాయం చేయడం రూపకాలంకార లక్షణం. "విశుద్ధయశశ్శరదిందుచంద్రికా..." అన్నపుడు. "భూరి భుజా కృపాణ ధారాజల శాంతశాత్రవ పరాగుఁడు" అన్నపుడు- యశస్సుకు చంద్రికకూ, కృపాణధారకు జలానికీ, శత్రువులకు పరాగానికీ, అభేదం చెప్పటంవలన రూపకాలంకారమైనది. 4. నాందీశ్లోకంలో చంద్రప్రశంస ఉండా లని లాక్షణిక నిర్దేశం. 'శ్రీవాణీగిరిజాశ్చిరాయ' అన్న శ్లోకంలో చంద్రప్రశంస లేదు కాని, మొదటిసారి ఎత్తుకొంటున్న ఈ తెలుగుపద్యంలో 'రాజ' శబ్దం శ్లేషార్థంలో ప్రయోగించడం విశేషం. 'రాజ' శబ్దం పునరావృత్తం చేయటంవలన ఈపద్యరచనకు అక్షరరమ్యత ఏర్పడింది. 5. చంద్రప్రశస్తి అర్థాంతరంలో వస్తున్న ఈపద్యాన్ని ఉత్పలమాలలో రచించటం విశేషం. రాజు అంటే చంద్రుడు, భూపతి, క్షత్రియుడు అనే అర్థాలున్నాయి. చంద్రప్రశస్తి ఇందులో వచ్చింది. ఉత్పలం (అంటే నల్లకలువ) చంద్రుడిని చూస్తే వికసిస్తుంది. అట్లాగే 'రాజ' వర్ణనంతో ఈపద్యం అక్షరమైన రమ్యతా భావాన్ని పొందుతూ ఉన్నది. 6. నన్నయశైలి ప్రసాదగుణ భూయిష్ఠమైనది. తత్సమపద బహుళమైనది. సంస్కృతశబ్దాలు వాడినా తెలుగు తియ్యందనానికి గానీ, తెలుగువారి వ్యావహారికతకుగానీ, జాతీయతకు గానీ భంజకం కాకుండా పోషకంగా ఉండటం ఈపద్యంలో విశేషం. 7.(ఉత్పలమాలను) ఏచరణానికి ఆచరణం విరిగిపోయేటట్లు వ్రాయటంకంటె ఒకచరణం మరొక చరణంతో అల్లుకొని పోయినట్లు వ్రాయటం నన్నయ కవితాశిల్పం. ఈపద్యం దానికి చక్కని ఉదాహరణం.

8. కృతిభర్తను వర్ణించే పద్ధతులు మూడు (1) వాస్తవికంగా చేసే వర్ణన (2) ఆలంకారికమైన వర్ణన (3) మిశ్రమ వర్ణన. నన్నయ మూడోపద్ధతి ననుసరించాడు. ఇందులో ఆలంకారికమైన వర్ణనం చేయబడింది. ముందుపద్యాలలో ఒక్కొక్కదానిలో క్రమంగా వాస్తవిక అలంకారిక వర్ణనపద్ధతులను నన్నయ పాటించాడు. (సంపా.)

క. విమలాదిత్యతనూజుఁడు, । విమలవిచారుఁడు, కుమారవిద్యాధరుఁ, డు
త్తమచాళుక్యుఁడు, వివిధా । గమవిహితశ్రముఁడు, తుహినకరుఁ డురుకాంతిన్. 4

ప్రతిపదార్థం: విమలాదిత్య, తనూజుఁడు= విమలాదిత్యుఁడు అనే చాళుక్యరాజు యొక్క (క్రీ.శ. 1011-1019) కుమారుడు; విమల, విచారుఁడు= నిర్మలమైన ఆలోచనలు కలవాడు; కుమార, విద్యాధరుఁడు= ఈ సమాసానికి నన్నయ ఊహించిన అర్థమేమో స్పష్టంగా తెలియటం లేదు. విద్యాధరులు దేవయోనివిశేషులు, గంధర్వులవంటివారు, పదమునుబట్టి వారు సంగీతాదికళలలో ప్రవీణు లని భావించవచ్చును. అందుచేత, కుమారవిద్యాధరు డంటే బాలగంధర్వాదులవలె బిరుదనామ మని తలంపవచ్చును. కుమారస్వామి దేవసేనాపతి. అస్త్రవిద్యలో ఆరితేరినవాడు. అందుచేత, అతనివిద్య అస్త్రవిద్య అనీ, దానిని ధరించినవాడు అస్త్రవిద్యలో నేర్పరి అనీ చెప్పవచ్చును. చాళుక్యులు కుమారస్వామి (స్కంద) భక్తులని ప్రతీతి. కుమారస్వామికి సంబంధించిన విద్య కుమారతంత్రం. దానిని ధరించినవాడు - అంటే అందులో నేర్పుకలవాడు - కుమారవిద్యాధరు డని చెప్పవచ్చును. మొత్తంమీద దీనికి సంగీత సాహిత్యాలలో నేర్పరి అనియో అస్త్రశస్త్రవిద్యాప్రవీణు డనియో చెప్పవలెను. ఉత్తమ, చాళుక్యుఁడు= శ్రేష్ఠుడైన చాళుక్యరాజు; వివిధ + ఆగమ, విహిత, శ్రముఁడు= పలువిధా లైన శాస్త్రాలలో (దేవపూజావిధానాలను తెల్పే పవిత్ర గ్రంథాలలో) చేయబడిన పరిశ్రమ కలవాడు; ఉరు, కాంతిన్= అత్యంత శరీరలావణ్యం (శోభ)లో, తుహినకరుఁడు= (మంచుకిరణాలు కలవాడు) చంద్రుడు- రాజరాజనరేంద్రుడు.

తాత్పర్యం: విమలాదిత్యుడికి రాజరాజచోళుడి కూతు రైన కుందవాంబయందు జనించిన పుత్రుడు, నిర్మలమైన ఆలోచనలు కలవాడు, కుమారస్వామివలె అస్త్రవిద్యలో నేర్పరి, శ్రేష్ఠు డైన చాళుక్యవంశపు రాజు, అనేకశాస్త్రాలలో పరిశ్రమ చేసినవాడు, దేహకాంతిలో చంద్రుడు అయిన రాజరాజనరేంద్రుడు.

విశేషం: వైష్ణవ శైవ శాక్త మతాలకు సంబంధించిన పూజావిధానాలు తెలిపే గ్రంథాలకు 'ఆగమము' అని పేరు. తంత్రగ్రంథాలను, వ్యాకరణాది శాస్త్రాలను, వేదాలను కూడ 'ఆగమము' లంటారు. విహితశ్రముఁడనేపాఠానికి విజితశ్రముఁడనే పాఠాంతరం ఉన్నది. విజితశ్రము డంటే పలువిధాలైన ఆగమగ్రంథాలను చదవటంలో జయింపబడిన శ్రమకలవాడు అని అర్థం. శ్రమను లెక్కచేయకుండ పఠించినవా డని భావం. విజితశ్రము డనే పాఠంకంటె విహితశ్రము డనే పాఠమే ఉచితంగా ఉన్నది. అలం: రూపకం.

చ. ఘనదురితానుబంధకలికాలజదోషతుషారసంహతిం
దన యుదయప్రభావమున దవ్వుగఁ జోపి జగజ్జనానురం
జన మగు రాజ్యసంతతవసంతనితాంతవిభూతి నెంతయుం
దనరుఁ జళుక్యమన్మథుఁడు ధర్మనిబద్ధదయార్ద్రబుద్ధి యై. 5

ప్రతిపదార్థం: చళుక్య, మన్మథుఁడు= చాళుక్యరా జయిన రాజరా జనే మన్మథుడు; ఘన, దురిత + అనుబంధ, కలికాలజ, దోష తుషార, సంహతిన్= గొప్ప పాపాలతో సంబంధం కల కలికాలంలో పుట్టిన దోషా లనే మంచుసముదాయాన్ని; తన, ఉదయ, ప్రభావమునన్= తన పుట్టుక (ఉదయించటం) యొక్క మహిమచేత; దవ్వుగన్= దూరంగా; చోపి= తరిమి; జగత్,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జన+అనురంజనము+అగు= లోకంలోని జనులను రంజింపజేసే దైన; రాజ్య, వసంత, నితాంత, విభూతిన్= రాజ్య మనే నిరంతర మైన వసంతర్తువుయొక్క అధిక మైన ఐశ్వర్యంతో; ధర్మ, నిబద్ధ, దయా+ఆర్ద్ర, బుద్ధి+ఐ= ధర్మానికి కట్టుబడినట్టి (స్థిరమైనట్టి) దయతో మెత్తనైన (తడసినట్టి) బుద్ధి కలవాడై; ఎంతయున్= మిక్కిలి; తనరున్= ఒప్పారుతూ ఉన్నాడు.

తాత్పర్యం: చాళుక్యవంశానికి చెందిన రాజరాజనే మన్మథుడు గొప్ప పాపాలతో సంబంధం కల కలికాలంలో పుట్టిన దోషా లనే మంచుసముదాయాన్ని తనపుట్టుకయొక్కమహిమతో దూరంగా త్రోలి, లోకంలోని జనులను ప్రీతి నొందించే రాజ్య మనే నిరంతరమైన వసంతర్తువుయొక్క దట్టమైన ఐశ్వర్యంతో ధర్మంపట్ల లగ్నమైనట్టిదీ, దయచేత మృదు వైనట్టిదీ అయిన బుద్ధికలవాడై మిక్కిలి ప్రకాశిస్తూ ఉన్నాడు.

విశేషం: అలం: రూపకం, వృత్త్యనుప్రాసం. రాజరాజును మన్మథుడితో పోల్చటంచేత అతడి అపారసౌందర్యం వెల్లడి ఔతున్నది. కృతత్రేతాద్వాపర కలియుగా లని యుగాలు నాలుగు. వాటిలో కలియుగం దోషాలతో కూడి ఉంటుంది. ఉత్తము డైన రాజు ఉదయిస్తే ఆదోషాలను తొలగించి ధర్మాన్ని నెలకొల్పుతాడు. ఆరుఋతువులలో చివరిది శిశిరఋతువు. అప్పుడు మంచు విస్తారంగా ఉంటుంది. తరువాత నూత్నసంవత్సరారంభంలో వసంతర్తువు వస్తుంది. అది రాగానే మంచు తగ్గిపోతుంది. ప్రకృతి సౌందర్యమయమై ఎల్లప్రాణులకు ఆనందకరంగా ఉంటుంది. అప్పుడు మన్మథుడు విజృంభిస్తాడు. అతడికీ వసంతుడికీ మిక్కిలి స్నేహం. మన్మథుడు వసంతరాజ్యానికి అధిపతి. 'రాజ్య సంతత వసంత' మన్నచోట సంతతశబ్దం సాభిప్రాయం. వసంతర్తువు రెండునెలలే ఉంటుంది. రాజ్య మావిధంగా కాకుండా నిత్య మై ఉంటుంది. ధర్మాన్ని అనుసరించేవాడు ఒకప్పుడు దయను విడిచి కఠినంగా వర్తించవలసి వస్తుంది. రాజరాజు ధర్మాన్ని పాలించినా దయను విడువలే డనే భావం - 'ధర్మనిబద్ధదయార్ద్రబుద్ధి యై' అనే విశేషణంవలన వ్యక్తమౌతున్నది.

'తుషారసంహతిన్ దవ్వుగఁజోపి', 'ఉదయప్రభావము', 'వసంతవిభూతి' అనే పదాలు రాజరాజునందు సూర్యత్వాన్ని కూడ స్ఫురింప జేస్తున్నవి. అప్పుడు చళుక్యభాస్కరుడు అనికూడ అనవచ్చును. రాజరాజునందు మన్మథత్వం, కలికాలదోషాల యందు తుషారసంహతిత్వం, రాజ్యమునందు వసంతత్వం ఆరోపించబడినవి. ఇచ్చట రూపకం సావయవంగానే ఉన్నది కాని అప్పుడు చివరి విశేషణానికి అప్రసిద్ధమైన అర్థం చెప్పుకోవలసి వస్తుంది. ధర్మమంటే ధనుస్సనే అర్థం కూడ ఉన్నది. వసంతంలో మన్మథుడు విల్లెక్కుపెట్టినా దయమాలి క్రూరంగా వర్తించలే దని ఊహించాలి. కృతిపతిని పుణ్యాత్ముడిగా వర్ణించిన కవితామయ మైన పద్యమిది. దీర్ఘాక్షరబహుళ మైన తత్సమపదాలప్రయోగాన్నీ, బిందుపూర్వక పరుషాక్షర పునఃప్రయోగాన్నీ చేసి ఔన్నత్యాన్నీ మాధుర్యాన్నీ అక్షరరమ్యతతో పోషించాడు నన్నయ.

ఉ. ఆశ్రితపోషణంబున, ననంతవిలాసమునన్, మనీషివి
ద్యాశ్రమతత్త్వవిత్త్వమున, దానగుణాభిరతిన్, సమస్తవ
ర్ణాశ్రమధర్మరక్షణమహామహిమన్, మహి నొప్పు సర్వలో
కాశ్రయుఁ, డాదిరాజనిభుఁ, డత్యకలంకచరిత్రసంపదన్. 6

ప్రతిపదార్థం: సర్వ, లోక+ఆశ్రయుఁడు= ఇది చాళుక్య రాజులకు కులక్రమాగతమైన బిరుదం; (ఎల్లజనులకును అండ అయినవాడని అర్థం); అతి+అకలంక, చరిత్ర, సంపదన్= మిక్కిలి నిర్మలమైన శీల మనెడి సంపదయందు; ఆది, రాజ, నిభుఁడు= తొల్లింటి రాజులైన మను, నల, నహుషాదులతో సమానుడైన రాజరాజనరేంద్రుడు; ఆశ్రిత, పోషణంబునన్= తనను ఆశ్రయించినవారిని పోషించటంచేతను; అనంత, విలాసమునన్= అధికమైన విలాసం చేతను; మనీషి విద్యా, శ్రమ, తత్త్వ, విత్త్వమునన్= పండితుల విద్యలందలి పరిశ్రమయొక్క సత్యస్వరూపాన్ని తెలిసికొనటంచేతను, (విత్+త్వము=విత్త్వము);

దాన, గుణ+అభిరతిన్=దానమనే గుణమునందలి ఆసక్తిచేతను; సమస్త, వర్ణ+ఆశ్రమ, ధర్మ, రక్షణ, మహత్, మహిమన్= అన్ని వర్ణాల యొక్కయు, ఆశ్రమాల యొక్కయు, ధర్మాలను రక్షించటంలో గొప్పమహత్త్వంచేతను, మహిన్=భూమియందు; ఒప్పున్= ప్రకాశిస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: 'సర్వలోకాశ్రయు' డనే కులక్రమాగతబిరుదంతో కూడినవాడున్నూ, మిక్కిలి నిర్మలమైన శీలసంపదలో మనువు, నలుడు, నహుషుడు మొదలైన పూర్వపురాజులతో సమానుడున్నూ అయిన రాజరాజు తన నాశ్రయించిన వారిని రక్షించటంచేతను, అధికమైన విలాసంచేతను, పండితుల విద్యలయందలి పరిశ్రమయొక్క యాథార్థ్యాన్ని తెలిసికొనటంచేతను, దానగుణంలోని ఆసక్తిచేతను, అన్ని వర్ణాల ఆశ్రమాల విధ్యుక్తధర్మాలను రక్షించటంలోని గొప్పమహిమచేతను, భూమియందు ప్రకాశిస్తూ ఉన్నాడు. పైన పేర్కొనబడిన గుణాలన్నింటిలో పూర్వరాజులతో సమాను డై రాజరాజు భూమియందు ప్రకాశిస్తా డనికూడ చెప్పవచ్చును.

విశేషం: బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య, శూద్ర వర్ణాలు నాలుగు. బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసా లనే ఆశ్రమాలు నాలుగు. ఆ యా వర్ణాలకూ, ఆశ్రమాలకూ ఉచితా లైన ధర్మాలు స్మృతులలో చెప్పబడినవి. ఆ ధర్మాలను రక్షించటం యోగ్యుడైన రాజువిధి. మనువు, నలుడు, నృగుడు, నహుషుడు, రంతిదేవుడు, భగీరథుడు, రాముడు మొదలైనవారు ఆదర్శప్రాయు లైన తొల్లిటిరాజులు. రాజరాజు వారితో సమానుడు.

సీ. **నిజమహీమండలప్రజఁబ్రీతిఁ బెంచుచుఁ, । బరమండలంబుల ధరణిపతుల**
నదిమి కప్పంబుల ముదముతోఁ గొనుచును, । బలిమి నీయని భూమివలయపతుల
నుక్కడఁగించుచు, దిక్కులఁ దనయాజ్ఞ । వెలిఁగించుచును, విప్రకులము నెల్లఁ
బ్రోచుచు, శర ణన్నఁ గాచుచు భీతుల, । నగ్రజన్ములకు ననుగ్రహమునఁ

ఆ. **జారుతరమహాగ్రహారంబు లిచ్చుచు, । దేవభోగముల మహావిభూతిఁ**
దనరఁజేయు, చిట్లు మనుమార్గుఁ డగు విష్ణు । వర్ధనుండు వంశవర్ధనుండు. **7**

ప్రతిపదార్థం: నిజ, మహీ, మండల, ప్రజన్= తన భూచక్రంలోని జనులను; ప్రీతిన్= ప్రేమతో; పెంచుచున్= వృద్ధి పొందిస్తూ; పర, మండలంబుల, ధరణిపతులన్= ఇతర (శత్రు) రాజ్యాలలో ఉన్న రాజులను, అదిమి= అణచి; కప్పంబులన్= ధనాలను; ముదముతోన్= సంతోషంతో; కొనుచును= గ్రహిస్తూ; బలిమిన్= బలంచేత; ఈయని= కప్పాలను ఈయని; భూమి, వలయపతులన్= భూమండలాల రాజులను; ఉక్కు+అడఁగించుచున్= గర్వ మడగగొట్టుతూ; దిక్కులన్= అన్ని దిక్కులలోను; తన, ఆజ్ఞ= తన ఆనతి; వెలిఁగించుచును= ప్రకాశింపచేస్తూ; విప్రకులమున్ + ఎల్లన్= బ్రాహ్మణ సమూహాల నెల్ల; ప్రోచుచున్= రక్షిస్తూ; శరణు+అన్నన్=రక్షింపు మని శరణాగతి చేస్తే; భీతులన్=భయపడినవారిని; కాచుచున్= రక్షిస్తూ; అగ్ర, జన్ములకున్= బ్రాహ్మణులకు; అనుగ్రహమునన్= దయతో; చారుతర, మహత్, అగ్రహారంబులు= మిక్కిలి అందమైన అగ్రహారాలను (బ్రాహ్మణులకు రాజులు దానాలుగా ఇచ్చే గ్రామాలు); ఇచ్చుచున్= ఇస్తూ; దేవ, భోగములన్= దేవాలయాలలోని దైవతాలకు చేసే ధూప దీప నైవేద్యాదులను, ఉత్సవాలను; మహత్, విభూతిన్=గొప్ప వైభవంతో; తనరన్, చేయుచున్=ఒప్పునట్లుగా చేస్తూ, కొనసాగిస్తూ; ఇట్లు= పైన పేర్కొనబడిన విధంగా; వంశ, వర్ధనుండు= వంశాన్ని వృద్ధి పొందించేవాడున్నూ; మను, మార్గుఁడు+అగు= సూర్యవంశ రాజులలో మొదటివాడూ, ఆదర్శప్రాయుడూ అయిన మనువు అనుసరించిన పరిపాలనక్రమం కలవాడున్నూ అయిన; విష్ణువర్ధనుండు= రాజరాజనరేంద్రుడు (మీది వచనంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తన రాజ్యభూభాగంలోని జనులను ప్రేమతో వృద్ధిపొందిస్తూ, ఇతరరాజ్యాలను ఏలే రాజులను అణచి సామంతరాజు లిచ్చే ధనరూపమైన పన్నులను సంతోషంతో గ్రహిస్తూ, బలగర్వంచేత కప్పాలను ఈయ నిరాకరించిన భూమండలాధిపతుల (రాజుల) గర్వ మడగిస్తూ, అన్ని దిక్కులలోనూ తన ఆజ్ఞను సాగేటట్లు చేస్తూ, బ్రాహ్మణసమూహా న్నెల్లా రక్షిస్తూ, భయంతో శరణాగతు లైతే అట్టివారిని కాపాడుతూ, భూసురులకు దయతో అందమైన అగ్రహారాల నిస్తూ, దైవాలకు జరుగవలసిన ధూపదీప నైవేద్యోత్సవాది కైంకర్యాలను గొప్పవైభవంతో కొనసాగిస్తూ, ఈవిధంగా వంశాన్ని పెంపొందించేవాడూ, పూర్వం మనువు అనుసరించిన మార్గాన్ని అనుసరించేవాడూ అయిన రాజరాజ నరేంద్రుడు.

విశేషం: రాజరాజుపరిపాలనవిధానం ఈపద్యంలో వర్ణింపబడింది. అతని ఆజ్ఞ అన్నిదిక్కులలో అప్రతిహతంగా చెల్లుతూ ఉన్నది. అతడు దేవబ్రాహ్మణులయందు భక్తి కలిగి ఉన్నాడు. వేదవేత్తలైన బ్రాహ్మణులు విప్రులు. విష్ణువర్ధన నామం చాళుక్యరాజులలో చాలమందికి ఉన్నది. అది ఒక బిరుదు వంటిది. విష్ణుశర్మ అనే బ్రాహ్మణుడు తొల్తటి చాళుక్యరాజుకుమారుడిని రక్షించటంచేత కృతజ్ఞతాపూర్వకంగా ఆ వంశపురాజులు విష్ణువర్ధననామాన్ని వహించా రని చెప్పుతారు.

ఇది నన్నయ రచించిన మొదటి సీసపద్యం. అతడు సీసపద్యాలలో కొన్ని ప్రత్యేక నియమాలు పాటించాడు. ఇందులో పండ్రెండుచోట్ల ప్రాసయతియే పాటింపబడింది. దీనిని 'సర్వప్రాససీసం' అంటారు.

ఇచ్చు ధాతువుకు కొన్నిచోట్ల ఈ అనేఆదేశం వస్తుంది. ఈ+ము అనునదే ఇమ్ము అయింది. ఇండు అనే రూపం కూడా ఇట్లా ఏర్పడిందే. వ్యతిరేకార్థక రూపాలలో కూడ ఈ వస్తుంది. ఈని=ఈయని; చిన్నయసూరి ఈయ రూపాన్ని కూడ అంగీకరించి పై నన్నయప్రయోగాన్నే ఇచ్చాడు. నన్నయకూడ ఈయ అనే రూపాన్ని మరెచ్చటనూ వాడి ఉండలేదు. (ఈయ అనేదే ఇయ్య రూపాన్ని పొందుతుంది.)

వ. అఖిలజలధివేలావలయవలయితవసుమతీవనితావిభూషణం బైన వేంగీదేశంబునకు నాయక రత్నంబునుం బోని రాజమహేంద్రపురంబునందు మహేంద్రమహిమతోఁ బరమానందంబున ననవరత మహామహీ రాజ్యసుఖంబు లనుభవించుచు, సకలభువనలక్ష్మీవిలాసనివాసం బయిన రమ్యహర్మ్యతలంబున మంత్రి పురోహిత సేనాపతి దండనాయక దౌవారిక మహాప్రధాన సామంత విలాసినీపరివృతుం డయి యపారశబ్దశాస్త్రపారగులైన వైయాకరణులును, భారత రామాయణాద్యనేక పురాణప్రవీణులైన పౌరాణికులును, మృదుమధుర రసభావభాసుర నవార్థవచనరచనా విశారదు లయిన మహాకవులును, వివిధతర్కవిగాహిత సమస్త శాస్త్రసాగరగరీయఃప్రతిభు లైన తార్కికులును నాదిగాఁ గలుగు విద్వజ్జనంబులు పరివేష్టించి కొలుచుచుండ విద్యావిలాసగోష్ఠీసుఖోపవిష్టుం డయి యిష్టకథావినోదంబుల నుండి యొక్కనాడు. 8

ప్రతిపదార్థం: అఖిల, జలధి, వేలా, వలయ, వలయిత వసుమతీ, వనితా, విభూషణంబు + ఐన= సమస్త సముద్రాల గుండ్రని చెలియలికట్టలచేత చుట్టబడిన భూమిఅనేస్త్రీకి అలంకార మైన; వేంగీ, దేశంబునకున్= పూర్వం తూర్పుచాళుక్యులు పరిపాలించిన వేంగీదేశానికి; నాయకరత్నంబునున్+పోని= హారాన నడుమన ఉండే పతకాన మధ్య ఉండే రత్నాన్ని పోలిన (శ్రేష్ఠమైన పట్టణమని అర్థం); రాజమహేంద్రపురంబునందున్; మహేంద్ర, మహిమతోన్= ఇంద్రునియొక్క మహిమ (మహత్త్వం) వంటి మహిమతో; పరమ+ఆనందంబునన్= అధికమైన సంతోషంతో; అనవరత, మహత్, మహీ, రాజ్య, సుఖంబులు= ఎడతెగని గొప్ప భూరాజ్యమువలని సౌఖ్యాలు; అనుభవించుచున్= పొందుతూ; సకల, భువన, లక్ష్మీ, విలాస, నివాసంబు+అయిన=

సర్వలోకాలలోని లక్ష్మి(సంపద)యొక్క విలాసానికి(లీలకు) నెలవైన; రమ్య, హర్మ్య, తలంబునన్= సుందరమైన సౌధప్రదేశంలో; మంత్రి, పురోహిత, సేనాపతి, దండనాయక, దౌవారిక, మహత్+ప్రధాన, సామంత, విలాసినీ, పరివృతుండు+అయి= మంత్రులచేతను, పురోహితులచేతను, సేనానాయకులచేతను, దండనాథులచేతను (వీరుకూడ సేనాపతులే కాని సేనానాయకుల క్రిందిహోదావారు), ద్వారపాలకులచేతను, మహా(ముఖ్య)మంత్రులచేతను, సామంతు లనబడే కప్పముకట్టే రాజులచేతను, సుందరులచేతను, చుట్టబడినవాడై; అపార, శబ్దశాస్త్ర, పారగులు+ఐన= అంతం లేని వ్యాకరణశాస్త్రాన్ని తుదిముట్ట చదివినవారైన (పారగులు= అవ్వలిఒడ్డుచేరినవారు); వైయాకరణులును= వ్యాకరణపండితులును; భారత, రామాయణ+ఆది+అనేకపురాణ ప్రవీణులు+ఐన= భారతం, రామాయణం మొదలైన పెక్కు పురాణాలయందు నేర్పరులైన; పౌరాణికులును= పురాణంచెప్పే పండితులును; మృదు, మధుర, రస, భావ, భాసుర, నవ+అర్థ, వచన, రచనా, విశారదులు+అయిన= లలితాలూ, తియ్యనివీ అయిన శృంగారాది రసభావాలతో ప్రకాశించేవీ, క్రొత్త అర్థాలు కలిగినవీ అయిన వాక్యాల నిర్మాణంలో నిపుణు లయిన; (వచనశబ్దం ఇప్పుడు 'గద్యము' అనే అర్థంలో వాడబడుతున్నది. దానికి వాక్కు, వాక్యం అనే అర్థాలుకూడా ఉన్నవి. అది పద్యమయంకాని, గద్యమయంకాని కావచ్చును); మహత్+కవులును= గొప్పకవులును; వివిధ, తర్క, విగాహిత, సమస్త, శాస్త్ర, సాగర, గరీయః, ప్రతిభులు+ఐన= పలువిధా లైన తర్కాలలో (చర్చాగోష్ఠులలో) మునిగిన(నిమగ్నమైన), సర్వశాస్త్రా లనెడి సముద్రాలు కల, మిక్కిలి అధిక మైన ప్రజ్ఞ కలవారైన; తార్కికులును= తర్కశాస్త్రపండితులును; ఆదిగాన్, కలుగు= మొదలుగాకల; విద్వత్+జనంబులు= పండితజనులు; పరివేష్టించి= బలసి (చుట్టునుకూడి); కొలుచుచుండన్= సేవిస్తూ ఉండగా; విద్యా, విలాస, గోష్ఠీ సుఖ+ఉపవిష్టుండు+అయి= విద్యలకు సంబంధించిన లీలతోకూడిన (సంతోషకరమైన) చర్చలతో సుఖంగా కూర్చుండి; ఇష్ట కథా, వినోదంబులన్= ప్రియములైన కథలతోనూ, వేడుకలతోనూ; ఉండి; ఒక్కనాఁడు= ఒకరోజున

తాత్పర్యం: నాలుగుసముద్రాల గుండ్రనిచెలియలికట్టలచేత చుట్టబడిన భూమి అనెడి స్త్రీకి అలంకారమైన, తూర్పుచాళుక్యులు పాలించే వేంగీదేశానికి- హారానికి నడుమనుండే నాయకమణిని పోలిన (వేంగీదేశానికి ముఖ్యపట్టణమైన) రాజమహేంద్రనగరంలో ఇంద్రుడివైభవంవంటి వైభవంతో అధికమైనసంతోషంతో ఎడతెగని గొప్పభూరాజ్యంవలన కలిగే సుఖాలు అనుభవిస్తూ, సర్వలోకాలలోని సంపదయొక్క విలాసానికి స్థాన మైన, సుందరమైన సౌధప్రదేశంలో మంత్రులు, పురోహితులు, సేనానాయకులు, ద్వారపాలకులు, మహామంత్రులు, సామంతరాజులు, సుందరాంగులు చుట్టూ కొలువుదీరి కూర్చుండిఉండగా, అంతంలేని వ్యాకరణశాస్త్రాన్ని తుదిముట్ట అభ్యసించిన వ్యాకరణపండితులున్నూ, భారతం, రామాయణం మున్నగు పెక్కుపురాణాలను ప్రవచించటంలో నేర్పరులైన పురాణపండితులున్నూ, లలితములును, తియ్యనివియును, శృంగారాది రసాలతోను, భావాలతోను ప్రకాశించే క్రొత్తఅర్థాలు కలిగినట్టివి అయిన వాక్యాలను రచించటంలో నిపుణులైన గొప్పకవులున్నూ, పలువిధాలైన తర్కశాస్త్రశాఖల సాహాయ్యంతో ప్రవేశించబడిన సర్వశాస్త్రాలనెడి సముద్రాలు కల అధిక ప్రజ్ఞావంతులైన తర్కశాస్త్రపండితులున్నూ, మొదలుగాగల పండితజనులు చుట్టూ చేరి సేవిస్తూ ఉండగా, విద్యలకు సంబంధించిన లీలలతో కూడిన చర్చలతో (చర్చలు వింటూ) సుఖంగా కూర్చుండి ప్రియము లైన కథలతోను, వినోదాలతోను ఉండి ఒక్కనాడు.

విశేషం: అలం: రూపకం, ఉపమ. రాజమహేంద్రనగరం వేంగీదేశానికి రాజధాని. అందలి సుందరహర్మ్యం సర్వలోకసంపదలతో విరాజిల్లుతూ ఉన్నది. మంత్రిపురోహితాదులు రాజోద్యోగులు. రాజరాజనరేంద్రుడిసభలో గొప్పవ్యాకరణపండితులూ, పురాణప్రవచనం చేసేవారూ, మహాకవులూ, తర్కశాస్త్రసాహాయ్యంతో సర్వశాస్త్రాలను అవగాహనచేసికొని మహాపండితు లైన విద్వాంసులూ ఉన్నారు. ఇందులో పేర్కొనబడిన మహాకవులు సంస్కృతభాషాకవులై ఉంటారు. తెలుగుకవులుకూడ ఉండవచ్చును.

వారు మృదుమధురాలు, నూత్నార్థశోభితాలు అయిన వాక్కులు పల్కటంలో నేర్పరులు. రాజరాజనరేంద్రు డప్పుడప్పుడు వివిధరాజోద్యోగులతోనూ, కవిపండితులతోనూ నిండు కొలువుండి విద్యాగోష్ఠులతో వినోదిస్తూ ఉండేవా డని తెలుస్తున్నది. అతడు కావ్యగీతప్రియుడుకదా! విద్యావిలాసగోష్ఠి- అనే సమాసానికి విద్యకు సంబంధించిన, కళలకు సంబంధించిన చర్చాగోష్ఠి(సమావేశం, సదస్సు)అనే అర్థంకూడా చెప్పవచ్చును. రాజసభలో మంత్రిసామంతులతోపాటు ఉన్నవారు విలాసినులు. విలాసినులు అంటే వేశ్య లనే అర్థం కంటే కళాకోవిదలనే అర్థం చెప్పటం సమంజసం. దేశంలోని విద్యలను, కళలనుగురించి, వాటిని పెంపొందించే అంశాలనుగురించి ఇష్టాగోష్ఠిగా చర్చించిన సభ అది. దానికి అధ్యక్షుడు రాజరాజనరేంద్రుడు. ఆ సభలో తీసికొన్న నిర్ణయాలను అమలుజరిపించేవాడు రాజు. ఆ గోష్ఠి కొన్నాళ్లు సాగింది. ఒకనాడు రాజు నన్నయను పిలిచి భారతం వ్రాయుమని కోరాడు. ఈవచనానికీ తరువాతిపద్యానికీ నడుమనున్న కథ సారమతులు లోనారసి భావించతగింది. విద్యావిషయంలో భాగంగా ఆంధ్రమహాభారత రచన జరగాలని సభ నిర్ణయించిఉంటుంది. ఆ రచన చేయగల దక్షుడు నన్నయయే అని తీర్మానించి ఉంటుంది. దానికి తగిన అర్హత లన్నీ ఉన్నవాడతడే అని వివేచించి ఉంటుంది. రాజరాజసంకల్పం, విద్వత్సభా నిర్ణయం ఏకవాక్యత పొందటంచేత నిండుసభలో నన్నయను రాజు స్వయంగా కోరాడు. భారతాన్ని తెలుగులో నిర్మించటం కష్టసాధ్యమైన పని అయినా రాజరాజనరేంద్రుడి అనుమతం వలనా, విద్వత్సభ అనుగ్రహం వలనా దానిని సాధిస్తానని నన్నయ అంగీకరించాడు. కథను పూర్తిగా చెప్పకుండా ధ్వనిమయం చేయటం నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తిలో ఒక శిల్పం.

సీ. **తనకులబ్రాహ్మణు, ననురక్తు, నవిరళ । జపహోమతత్పరు, విపులశబ్ద**
శాసను, సంహితాభ్యాసు, బ్రహ్మాండాది । నానాపురాణవిజ్ఞాననిరతుఁ,
బాత్రు, నాపస్తంబసూత్రు, ముద్గలగోత్ర । జాతు, సద్వినుతావదాతచరితు
లోకజ్ఞు, నుభయభాషాకావ్యరచనాభి । శోభితు, సత్ప్రతిభాభియోగ్యు,

ఆ. **నిత్యసత్యవచను, మత్యమరాధిపా । చార్యు, సుజను నన్నపార్యుఁ జూచి**
పరమధర్మవిదుఁడు, వరచళుక్యాన్వయా । భరణుఁ డిట్టు లనియెఁ గరుణతోడ. 9

ప్రతిపదార్థం: తన= తనయొక్క; కుల, బ్రాహ్మణున్= వంశపారంపర్యంగా వస్తున్న బ్రాహ్మణుడిని; అనురక్తున్= అనురాగంకలవాడిని; అవిరళ, జప, హోమ, తత్పరున్= నిరంతరం జపం చేయటంలోనూ, అగ్నియందు హవిస్సును వేల్చటం లోనూ, ఆసక్తుడైనవాడిని; విపులశబ్ద, శాసనున్= విస్తృతంగా శబ్దాలస్వరూపాన్ని నిరూపించినవాడిని; సంహితా+అభ్యాసున్=వేదంలోని మంత్రభాగం (వేదము) యొక్క అధ్యయనం కలవాడిని; బ్రహ్మాండ+అది, నానా, పురాణ, విజ్ఞాన, నిరతున్= బ్రహ్మాండ పురాణం (అష్టాదశపురాణాలలో ఇది ఒకటి) మొదలైన పలుపురాణాలలోని విశేషమైన జ్ఞానమునందు ప్రీతికలవాడిని; పాత్రున్= అర్హుడిని; ఆపస్తంబసూత్రున్= ఆపస్తంబమహర్షి రచించిన సూత్రాలలోని ధర్మాలను అనుసరించేవాడిని (ఇతరమహర్షులు రచించిన సూత్రాలుకూడ ఉన్నవి); ముద్గల, గోత్ర, జాతున్= ముద్గలమహర్షి మూలంగా గల గోత్రంలో పుట్టినవాడిని; సత్, వినుత+అవదాత, చరితున్= పండితులచేత (సజ్జనులచేత) నుతింపబడిన నిర్మలమైన వర్తనం కలవాడిని; లోక జ్ఞున్= లోకవ్యవహారం తెలిసినవాడిని; ఉభయ, భాషా, కావ్య, రచనా+అభిశోభితున్= సంస్కృతాంధ్రా లనే రెండుభాషలలోనూ కావ్యాలను రచించటంచేత ప్రకాశించేవాడిని; సత్, ప్రతిభా+అభియోగ్యున్= మంచి ప్రతిభతో (నవనవోన్మేషశాలినియైన ప్రజ్ఞతో) కూడినవాడిని (గొప్ప ప్రతిభాపాండిత్యాలు కలవాడిని); నిత్య, సత్య, వచనున్= ఎల్లప్పుడూ సత్యంతో కూడిన వాక్కు కలవాడిని, (ఎప్పుడూ సత్యమే పలుకువాడిని); మతి+ అమరాధిప+ ఆచార్యున్= బుద్ధిలో ఇంద్రునిగురు వైన బృహస్పతివంటి వాడిని; సుజనున్= మంచివాడిని; నన్నప+ఆర్యున్= పూజ్యుడైన నన్నయభట్టును; చూచి; పరమ, ధర్మ, విదుఁడు= ఉత్తమమైన ధర్మాన్ని తెలిసినవాడు (గొప్పధర్మవేత్త); వర, చళుక్య+అన్వయ+ఆభరణుఁడు= శ్రేష్ఠమైన చాళుక్యవంశానికి అలంకారమైన రాజరాజనరేంద్రుడు; కరుణతోడన్= దయతో; ఇట్టులు= క్రింద చెప్పబడేవిధంగా; అనియెన్= పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తనవంశంలో తండ్రితాతలనుండి పారంపర్యంగా వస్తున్న బ్రాహ్మణుడున్నూ, తనయందు ప్రీతికలవాడున్నూ, నిరంతరం జపహోమాలు చేయటంలో ఆసక్తికలవాడున్నూ, విస్తృతంగానూ విశదంగానూ శబ్దాలస్వరూపాన్ని నిర్ధారణ చేసినవాడున్నూ, వేదమంత్రభాగాన్ని అధ్యయనం చేసినవాడున్నూ, బ్రహ్మాండపురాణం మొదలైన అనేకపురాణాలలోని విజ్ఞానంపట్ల ఆసక్తికలవాడున్నూ, అర్హుడున్నూ, ఆపస్తంబసూత్రుడున్నూ, ముద్గలమునిగోత్రంలో పుట్టినవాడున్నూ, సుజనులచేతనూ పండితులచేతనూ నుతింపబడిన నిర్మలమైన శీలం కలవాడున్నూ, లోకజ్ఞత కలవాడున్నూ, ఎల్లప్పుడు సత్యమే పలికేవాడున్నూ, బుద్ధిలో బృహస్పతివంటివాడున్నూ, సజ్జనుడున్నూ అయిన నన్నయభట్టును చూచి పరమధర్మవేత్తా, శ్రేష్ఠమైన చాళుక్యవంశానికి అలంకార మైనవాడూ అయిన రాజరాజనరేంద్రుడు దయతో ఈవిధంగా పలికాడు.

విశేషం: ఆంధ్రమహాభారతంలో నన్నయనుగురించి ఏకొంచెమైనా తెల్పేపద్యం ఇది ఒక్కటే. ఇందులో అతడి గుణగణాలూ ప్రతిభాపాండిత్యాలూ సంగ్రహంగా చెప్పబడినవి. కులవిప్రు డంటే పురోహితు డని అర్థం ఉన్నది. కాని, నన్నయ వట్టి పురోహితుడు కాడు. చాళుక్యుల పంచామాత్యులలో కులబ్రాహ్మణుడు కూడ ఒకడు. నన్నయ అట్టి కులబ్రాహ్మణుడు. రాజరాజూ, నన్నయభట్టూ, కొంచెం ఇంచుమించుగా సమవయస్కులు, మిత్రులు అయిఉంటారు. అనురక్త పదం వారికి ఒండొరులయెడ కల అనురాగాన్ని సూచిస్తున్నది. నన్నయ సంహితాభ్యాసుడు. సంహిత అంటే వేదంలోని మంత్రభాగం. ఇచ్చట సామాన్యంగా వేదమంతా అధ్యయనం చేసినవా డని చెప్పుకోవలెను. సంహితాపదం ధర్మశాస్త్రాదులందుకూడ వర్తిస్తుంది. మనుధర్మశాస్త్రాన్ని మనుసంహిత అనికూడ అంటారు. అతడు నిత్యజపహోమాది వైదికకర్మలందు ఆసక్తి కలవాడు. కవినామగోత్రాదికథనం అవతారికలో ఒక ప్రధానాంగం.

నన్నయకు పూర్వం తెలుగుభాషకు విస్తృతి కాని, స్థిరమైనరూపం కాని లేదు. అది ఒక్కొక్కప్రాంతంలో ఒక్కొక్కవిధంగా ఉండేది. విభక్తిప్రత్యయాలు అన్నీ లేవు. అవ్యవస్థితంగా ఉన్న అట్టిభాషకు స్థిరమైనరూపాన్ని ఇచ్చి, సంస్కృతపదాలను తత్సమాలుగా తెలుగులో వాడటానికి తగిన ప్రణాళిక ఏర్పరచి, దానిని కావ్యరచనకు తగినదానినిగా చేశాడు. అతడు ఆంధ్రశబ్దచింతామణి అనే వ్యాకరణాన్ని రచించలేదని కొందరు అంటారు. అయినా, అతడు పైవిధంగా తెలుగుభాషకు కలిగించిన అభివృద్ధియే అతడిని విపులశబ్దశాసన నామానికి అర్హుడిగా చేసింది. పురాణాలు పదునెనిమిది. సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం అనే పంచలక్షణాలు కలవి పురాణాలు. బ్రహ్మ, పద్మ, విష్ణు, శివ, భాగవత, నారద, మార్కండేయ, అగ్ని, భవిష్యత్, బ్రహ్మవైవర్త, లింగ, వరాహ, స్కంద, వామన, కూర్మ, మత్స్య, గరుడ, బ్రహ్మాండా లనేవి పురాణాలపేర్లు. ఈ పురాణాలన్నింటిని నన్నయ చదివి అనేకవిధాలైన విజ్ఞానాన్ని సంపాదించాడు. పాత్రశబ్దంచేత అతడికి కావ్యరచనలోనే కాక వివిధవిషయాలలోకూడ ఉన్న అర్హత సూచించబడుతున్నది. అతడు నిర్మలశీలం, సౌజన్యం కలవాడు. అతడికి లోకజ్ఞత తప్పక ఉండాలి. నన్నయ సంస్కృతభాషలో రచించిన కావ్య మేదీ లభించటంలేదు. అతడు భారతారంభాన మంగళశ్లోకాన్ని సంస్కృతంలోనే రచించాడు. రాజరాజు నారాయణభట్టుకు నందమపూడిగ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. ఆశాసనకావ్యాన్ని నన్నయయే రచించాడు. అది సంస్కృతంలో ఉన్నది. ఆంధ్రశబ్దచింతామణికర్త అతడే అయినా, కాకపోయినా అతడి సంస్కృతకావ్యరచనాకౌశలానికి పైరెండే చాలును. చింతామణి శాస్త్రమే కాని కావ్యం కాదు. నన్నయ నిత్యసత్యవ్రతుడు, బుద్ధివైభవంలో దేవగురువైన బృహస్పతిని పోలినవాడు. నన్నయ అనేశబ్దంచివర 'అయ్య' అనేపద మున్నది. అయ్యకు బదులు అప్ప అనికూడ వాడచ్చును. దానికి రూపాంతరం అప.

ఇది సర్వప్రాససీసం- (పన్నెండుచోట్ల ప్రాసయతియే పాటింపబడినది). ఈసీసంలో మహాకవికి ఉండవలసిన లక్షణా లన్నీ తెల్పబడినవి. నన్నయ ఋషితుల్యుడు. నా౽నృషిః కురుతే కావ్య మ్మనే సూక్తి ఉన్నది. అట్టి ఋషితుల్యుడు కానివాడు

పంచమవేదమైన భారతాన్ని రచించటానికి అర్హుడు కాడు. నన్నయ ఈపద్యాన్ని ప్రథమపురుషలోరచించి ఒక క్రొత్తఒరవడి పెట్టాడు. ఇది అతడి వినయగుణాన్ని వ్యక్తీకరిస్తుంది.

చ. విమలమతిం బురాణములు వింటి ననేకము, లర్థధర్మశా
స్త్రములతెఱం గెఱింగితి, నుదాత్తరసాన్వితకావ్యనాటక
క్రమములు పెక్కుసూచితి, జగత్పరిపూజ్యము లైన యీశ్వరా
గమములయందు నిల్పితిఁ బ్రకాశముగా హృదయంబు భక్తితోన్. 10

ప్రతిపదార్థం: విమల, మతిన్= నిర్మలమైన మనస్సుతో; అనేకములు= పెక్కు; పురాణములు= బ్రహ్మాండాది పురాణాలు; వింటిన్; అర్థ, ధర్మ, శాస్త్రముల, తెఱంగు= కౌటిల్యాదులు రచించిన అర్థశాస్త్రాల, మన్వాదులు రచించిన ధర్మశాస్త్రాల విధం; ఎఱింగితిన్= తెలిసికొంటిని; ఉదాత్త, రస+అన్విత, కావ్య, నాటక, క్రమములు= గొప్పవీ, రసంతో కూడుకొన్నవీ అయిన కావ్యనాటకాల రీతులు; పెక్కు= అనేకం; చూచితిన్= తిలకించాను; జగత్, పరిపూజ్యములు+ఐన= లోకంచేత పూజింపదగినవైన; ఈశ్వర+ఆగమముల+అందున్= శివుడిని పూజించే విధానాలు తెల్పే గ్రంథాలయందు; ప్రకాశముగాన్= ప్రసిద్ధంగా; హృదయంబు= చిత్తం; భక్తితోన్ = శ్రద్ధతో; నిల్పితిన్= ఉంచితిని (చదవితిని).

తాత్పర్యం: నిర్మలమైన మనస్సుతో పెక్కుపురాణాలు విన్నాను. అర్థశాస్త్రాల ధర్మశాస్త్రాల పద్ధతిని తెలిసికొన్నాను. ప్రౌఢాలు, రసభరితాలు అయిన రఘువంశాది కావ్యాలయొక్కయు, శాకుంతలాది నాటకాలయొక్కయు తీరులు అనేకం చవిచూచాను. లోకానికి మిక్కిలి పూజనీయా లైన శైవాగమశాస్త్రాలయందు ప్రసిద్ధంగా చిత్తాన్ని భక్తితో స్థిరంగా ఉంచాను.

విశేషం: ఈపద్యం రాజరాజు విజ్ఞాన వివేకాలను తెలుపుతున్నది. అతడు పౌరాణికులు చదివి వినిపిస్తూ ఉంటే పెక్కుపురాణాలు విన్నాడు. రాజులు అర్థధర్మశాస్త్రాలను తప్పక చదవాలి. అర్థశాస్త్రం దేశఆర్థికస్థితిగతులను పెంపొందించటానికి తోడుపడేది. ధర్మశాస్త్రం ధర్మాలకు, ఆచారవ్యవహారాలకు సంబంధించింది. రాజరాజుకు పూర్వం తెలుగులో కావ్యాలు కాని, నాటకాలు కాని లేవు. అతడు తమిళ కన్నడ భాషలలోని కావ్యాలను (విక్రమార్జునవిజయాదులు కన్నడకావ్యాలు. పెరిందేవనారు రచించిన భారతాదులు తమిళకావ్యాలు) సంస్కృతంలోని కావ్యనాటకాలూ చదవి ఆనందించి ఉంటాడు. రాజరాజు శివభక్తుడు; అందుచేత శివపూజావిధానాలను తెలిపే శాస్త్రాలను శ్రద్ధతో చదవిఉంటాడు. శివశక్తివిష్ణుపూజాక్రమాలను వివరించే ఆగమగ్రంథాలు పెక్కు ఉన్నాయి. "ఆగతం పంచవక్త్రాత్తు, గతం చ గిరిజాననే, మతం చ వాసుదేవస్య, తస్మా దాగమ ముచ్యతే'- శబ్దకల్పద్రుమము. శివముఖంనుండి వచ్చి, పార్వతిముఖం చొచ్చి, విష్ణువుకు ఇష్టం కావటంచేత ఆగమానికి ఆపేరు వచ్చింది. కావ్యార్థసూచన మనే ప్రస్తావనాంగం ఇందులో ఉన్నది.

వ. అయినను నాకు ననవరతంబును శ్రీమహాభారతంబునందలి యభిప్రాయంబు పెద్ద యై యుండు. 11

ప్రతిపదార్థం: అయినను= శాస్త్రకావ్యనాటకాగమాదులను పఠించినా; నాకున్ = రాజరాజనరేంద్రుడికి అని భావం; అనవరతంబును= ఎల్లప్పుడున్నూ; శ్రీ, మహత్, భారతంబునందలి= శోభాయుక్తమైన వ్యాసరచిత మహాభారతంలోని; అభిప్రాయంబు= భావం, తాత్పర్యం, తత్త్వం; పెద్ద+ఐ= అధికమై; ఉండున్= ఉంటుంది.

తాత్పర్యం: శాస్త్రకావ్యనాటకాగమాదులను చదివినప్పటికీ నాకు శ్రీమత్ మహాభారతంలోని తాత్పర్యం, తత్త్వమే వాటిన్నింటికంటె గొప్పదిగా అనిపిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'అయినను నాహృదయంబును ననవరతంబును శ్రీమహాభారతంబునందలి యభిప్రాయంబు విన నభిలాష పెద్దయైయుండు' - అని కొన్ని ప్రతులలో కనపడుతున్నది. అంటే- నే నర్థధర్మశాస్త్రాలను, కావ్యనాటకాగమాలను చదివినప్పటికీ నాచిత్తంలో వ్యాసుడు రచించిన బహువిషయశోభితమైన మహాభారతేతిహాసంలోని భావాన్ని వినటానికి కోరిక అధిక మై ఉంటుంది అని భావం. ఈపాఠం రాజరాజు హృదయంలోని అభిలాషను సూచించేది. అతడికి 'భారత శ్రవణాసక్తి' ఇష్టమైన అంశాలలో ఒకటని రాబోయే పద్యంలో సూచించబడుతున్నది. దానికి అనుగుణంగా ఈపాఠం ఉన్నది. కాని, రాజరాజుకు గల నిశ్చయభావాన్ని ప్రస్తుత పాఠం సూచిస్తున్నది. పురాణాలు, అర్థధర్మశాస్త్రాలు, ఉదాత్తరసాన్విత కావ్యనాటకాలు, ఈశ్వరాగమాలు మొదలైన గ్రంథాలన్నింటిలో చెప్పిన తాత్పర్యం కంటె మహాభారతబద్ధ నిరూపితార్థం గొప్పదని రాజరాజు నిశ్చయం. అది అతడి విజ్ఞతను సూచిస్తున్నది. పూర్వపద్యభావంతో అన్వయిస్తున్నది. అది అతడి అభిలాషకు మూలకారణమైన నిశ్చయభావం. అందువలన ప్రస్తుతపాఠమే సముచితం. 'ఇందుల' రూపం యతిస్థానంలో కనపడుతున్నది (1-6-248, 2-1-188) కాబట్టి 'అందుల' అనేరూపం నన్నయ ఇక్కడ వాడిఉంటాడు.

మ. ఇవి యేనున్ సతతంబు నాయెడఁ గరం బిష్టంబు లై యుండుఁ బా
యవు భూదేవకులాభితర్పణమహీయఃప్రీతియున్. భారత
శ్రవణాసక్తియుఁ, బార్వతీపతిపదాబ్జధ్యానపూజామహో
త్సవమున్, సంతతదానశీలతయు, శశ్వత్సాధుసాంగత్యమున్. 12

ప్రతిపదార్థం: భూదేవ, కుల+అభితర్పణ, మహీయస్+ప్రీతియున్= బ్రాహ్మణులసముదాయాన్ని తృప్తిపొందించటంలో మిక్కిలి అధికమైన ఆసక్తియున్నూ; భారత, శ్రవణ+ఆసక్తియున్= భారతాన్ని వినటంలోని ప్రీతియున్నూ; పార్వతీపతి, పద+అబ్జ, ధ్యాన, పూజా, మహత్, ఉత్సవమున్= పార్వతిభర్త అయిన శివునియొక్క పద్మాలవంటిపాదాలను ధ్యానించటంలోను, పూజించటంలోను(కల) గొప్పవేడుకయున్నూ; సంతత, దాన, శీలతయున్= నిరంతరం దానం చేసే స్వభావం కలిగి ఉండటమున్నూ; శశ్వత్, సాధు, సాంగత్యమున్= ఎల్లప్పుడును సత్పురుషులతోడి సహవాసమున్నూ; ఇవి ఏనున్= అనే ఈ అయిదున్నూ; నా, ఎడన్= నాహృదయమందు; కరంబు= మిక్కిలి; ఇష్టంబులు+ఐ= ప్రీతికరాలై; ఉండున్= ఉంటాయి; పాయవు= తొలగవు.

తాత్పర్యం: ఈ అయిదున్నూ నాహృదయంలో మిక్కిలి ప్రీతికరా లై ఉంటాయి; తొలగవు. అవి ఏవంటే- 1. బ్రాహ్మణులసముదాయాన్ని తృప్తిపొందించటంలో మిక్కిలిగొప్పప్రీతి. 2. భారతాన్ని వినటంలో ఆసక్తి. 3. పద్మాలవంటిశివుడిపాదాలను ధ్యానించటంలో, పూజించటంలో ఉండే గొప్పవేడుక. 4. ఎల్లప్పుడూ దానం చేసే స్వభావం కలిగిఉండటం. 5. నిరంతరం సత్పురుషులతోడి సహవాసం చేయటం అనేవి.

విశేషం: ఇందులో రాజరాజుహృదయానికి మిక్కిలి ప్రీతికరా లైన ఐదు విషయాలు పేర్కొనబడినవి. వాటిలో మహాభారతం వినవలెననే కోరిక ఒకటి. అది ఆంధ్రమహాభారత రచనకు ప్రేరకమైన ప్రధాన కారణం. కావ్యరచనా కారణం చెప్పటం అవతారికలోని ఒకఅంగం. నన్నయ అయిదు అనటానికి ఏను అనే పదాన్నే వాడుతాడు. మహత్ అను విశేషణముయొక్క 'తర' భావాన్ని సూచించేపదం మహీయః. మహిష్ఠ 'తమ' భావాన్ని సూచిస్తుంది.

వ. మఱి యదియునుంగాక. 13

తాత్పర్యం: అంతేకాకుండా.

విశేషం: రాజరాజు తనకు భారతంపట్ల ప్రీతి అధికంగా ఉండటానికి మరికొన్ని కారణాలు తెల్పుతున్నాడు. ఈ వచనం కొన్ని ప్రతులలో లేదు.

చ. హిమకరుఁ దొట్టి పూరుభరతేశకురుప్రభుపాండుభూపతుల్
క్రమమున వంశకర్త లనఁగా మహి నొప్పిన యస్మదీయవం
శమునఁ బ్రసిద్ధులై, విమలసద్గుణశోభితు లైన పాండవో
త్తములచరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెంతయున్. 14

ప్రతిపదార్థం: హిమకరున్= చంద్రుని; తొట్టి= మొదలుకొని; పూరు, భరత+ఈశ, కురుప్రభు, పాండుభూపతుల్= యయాతికుమారుడైన పూరువు, శకుంతలాదుష్యంతులకుమారు డైన భరతచక్రవర్తి, కౌరవవంశాని కాపేరు రావటానికి హేతు వైన కురు వనే రాజు, పాండురాజు అనేవారు; క్రమమునన్= వరుసగా; వంశకర్తలు+అనఁగాన్= వంశాన్ని స్థాపించి కొనసాగించినవారు కాగా; మహిన్= భూమియందు; ఒప్పిన= ప్రకాశించిన; అస్మదీయవంశమునన్= మావంశమునందు; ప్రసిద్ధులు+ఐ= మిక్కిలిప్రఖ్యాతి పొందిన వారై; విమల, సద్గుణశోభితులు+అయిన= నిర్మలము లయిన మంచిగుణాలతో ప్రకాశించిన; పాండవ+ఉత్తముల= యోగ్యులైన పాండవులయొక్క (ధర్మరాజాదులైన పాండురాజు కుమారులయొక్క); చరిత్ర= వృత్తాంతం; నాకున్; సతతంబున్= ఎల్లప్పుడు; వినంగన్= వినటానికి; ఎంతయున్= మిక్కిలి; అభీష్టము= కోరిక, సమ్మతం, ఇష్టం.

తాత్పర్యం: చంద్రుడు మొదలుకొని పూరువు, భరతుడు, కురురాజు, పాండురాజు లనేవారు వరుసగా వంశాన్ని స్థాపించి కొనసాగించిన వారు కాగా భూమియందు అలరారిన మావంశంలో మిక్కిలి ప్రఖ్యాతు లై స్వచ్ఛమైన, యోగ్య మయిన గుణాలతో ప్రకాశించిన సజ్జను లైన పాండవులయొక్క చరిత్ర వినటం నాకెల్లప్పుడూ ప్రీతికర మై ఉంటుంది.

విశేషం: తొట్టు అనగా మొదలుకొను. తెలుగుకావ్యాలలో ఈధాతువుయొక్క క్త్వార్థకరూపం ఒక్కటే కనబడుతున్నది. కౌరవపాండవవంశం చంద్రవంశం. దీనికి మూలపురుషుడు చంద్రుడు. తరువాత ఆ వంశంలో ఎందరో మహారాజులు పుట్టి భూమిని పరిపాలించారు. వారిలో ముఖ్యు లైనవారిని మాత్రం నన్నయ ఈ పద్యంలో పేర్కొని ఉన్నాడు. వంశకర్త అనగా వంశాన్ని స్థాపించి దానిని కీర్తితో ధర్మమార్గంలో కొనసాగించినవాడు. అతడి తరువాత అతడి పేరుమీద అతడివంశస్థులు పిలువబడేవారు. ధర్మరాజాదులు పౌరవులు, భారతులు, కౌరవులు, పాండవులు అని పిలువబడటం వంశకర్తల ప్రాభవంవలననే.

చ. అమలసువర్ణశృంగఖుర మై కపిలం బగు గోశతంబు ను
త్తమబహువేదవిప్రులకు దానము సేసిన తత్ఫలంబు త
థ్యమ సమకూరు భారతకథాశ్రవణాభిరతిన్, మదీయచి
త్తము ననిశంబు భారతకథాశ్రవణప్రవణంబ కావునన్. 15

ప్రతిపదార్థం: అమల, సువర్ణ, శృంగ, ఖురము+ఐ= నిర్మలమయిన, బంగారంతో కూడిన కొమ్ములును, గిట్టలును, కలదై; కపిలంబు+అగు= గోరోజనంవంటి రంగు గల (ఎఱ్ఱని); గోశతంబును= ఆవులవందను; ఉత్తమ, బహు, వేద, విప్రులకున్= యోగ్యులైన పలువురు వేదాలుచదివిన బ్రాహ్మణులకు; దానము, చేసిన; తద్+ఫలంబు= ఆ ఫలితం; తథ్యము+అ= నిజంగా; భారత, కథా, శ్రవణ+అభిరతిన్= మహాభారతంలోని కథను వినే ఆసక్తిచేత; సమకూరున్= కలుగుతుంది; మదీయ, చిత్తమున్= నాహృదయంకూడ; అనిశంబున్= ఎల్లప్పుడు; భారత, కథా, శ్రవణ, ప్రవణంబు+అ= భారతంలోని కథను వినటంలో ఆసక్తికలదే; కావునన్= కాబట్టి. (తరువాతి పద్యంతో కలిపి చదువుకోవాలి).

తాత్పర్యం: పరిశుద్ధ మైన బంగారపు తొడుగుతో కూడిన కొమ్ములును, గిట్టలును కల కపిలవర్ణం కల వందఆవులను యోగ్యులు, వేదం అధ్యయనం చేసినవారు అయిన పలువురు బ్రాహ్మణులకు ('బహువేద' అనునప్పుడు నాలుగువేదాలు

చదివిన అనికూడ అర్థం చెప్పవచ్చును.) దానం చేసిన ఆ ఫలితం భారతకథను వినే ఆసక్తిచేత తప్పక కల్గుతుంది. నాహృదయంకూడ భారతకథను వినాలి అని కుతూహలపడుతూ ఉంటుంది. కాబట్టి.

విశేషం: గోవులలో కపిలగోవు శ్రేష్ఠమైనది. వేదాధ్యయనం చేసిన విప్రులు దానానికి మిక్కిలి పాత్రులు. పాత్రదానంవలన ఎక్కువఫలం చేకూరుతుంది.

క. జననుత కృష్ణద్వైపా । యనమునివృషభాభిహిత మహాభారతబ
ద్ధనిరూపితార్థ మేర్పడఁ, । దెనుఁగున రచియింపు మధికధీయుక్తిమెయిన్. 16

ప్రతిపదార్థం: జననుత= ప్రజలచేతకీర్తింపబడేవాడా! (నన్నయకు సంబోధనం); దీనిని జనులచేత స్తుతింపబడిన అని వ్యాసుడికి విశేషణంగా కూడ చెప్పవచ్చును. అప్పుడు అంతయు ఒకేసమాస మవుతుంది; కృష్ణద్వైపాయన, మునివృషభ+అభిహిత, మహత్, భారత, బద్ధ, నిరూపిత+అర్థము= వ్యాసు డనే మునిశ్రేష్ఠునిచే చెప్పబడిన మహాభారత మనే ఇతిహాసంలో కూర్చబడి నిరూపించబడిన (స్థిరంచేయబడిన) అర్థం- అంటే తాత్పర్యం, ధర్మతత్త్వం, ప్రబోధం, రసం మొదలైనవాటి సారవంతమైన అభిప్రాయమన్నమాట; ఏర్పడన్= స్పష్టమయ్యేటట్లు; తెనుఁగునన్= తెలుగుభాషలో; అధిక, ధీయుక్తిమెయిన్= గొప్పబుద్ధియొక్క కూడికతో; రచియింపుము= వ్రాయుము.

తాత్పర్యం: జనులచేత కీర్తింపబడే ఓనన్నయకవీ! వ్యాసమునిశ్రేష్ఠునిచేత చెప్పబడిన మహాభారతంలో తెల్పబడి నిరూపింపబడిన అర్థం తేటతెల్ల మయ్యేటట్లు అధికమైన బుద్ధిసంపద అలరారగా తెలుగుభాషలో వ్రాయుము.

విశేషం: వ్యాసుడు పరాశరమునికీ దాశరాజకన్యకూ ద్వీపంలో పుట్టాడు. అతడు నల్లనివాడు. అందుచేత కృష్ణద్వైపాయను డనే పేరు కలిగింది. సింహ, వృషభ, శార్దూల, కుంజరాదిశబ్దాలు సమాసంలో ఉత్తరపదాలై శ్రేష్ఠతను సూచిస్తాయి. ఈ పద్యంలో తెనుఁగుశబ్దం నకారమధ్యమముగా వాడబడింది. ఈ నకారం ప్రాసస్థానంలో ఉన్నది. నన్నయనాడు తెనుఁగుశబ్దమే వాడుకలో ఉన్నదికాబోలును. తరువాత 'తెలుఁగు' అనురూపంకూడ వచ్చింది. రాజరాజు నన్నయను భారతంలోని అర్థం ఏర్పడేటట్లుగా వ్రాయుమన్నాడే కాని, యథాతథంగా అనువాదం చేయు మని అడిగిఉండలేదు.

నన్నయకుముందే పంపకవి కన్నడంలో 'విక్రమార్జునవిజయం' అనే పేర భారతకథను కావ్యంగా వ్రాసిఉన్నాడు. అట్లే పెరిందేవనారు తమిళంలో భారతం వ్రాసిఉన్నాడు. పంపకవి జైనమతానికి చెందినవాడు. అందుచేత అతడికావ్యంలో ఆ మతానికి అనుగుణంగా వ్యాసభారతంలోని కథను, వర్ణనలను అక్కడక్కడ మార్చాడు. అది ఎరిగినవాడు కావటంచేత రాజరాజు నన్నయతో వ్యాసుడు భారతంలో నిరూపించిన తాత్పర్యాన్నే, తత్త్వాన్నే తేటపడేటట్లుగా తెనుగున భారతాన్ని రచింపు మని చెప్పాడని విమర్శకులు భావిస్తున్నారు.

క. బహుభాషల బహువిధముల । బహుజనములవలన వినుచు భారతబద్ధ
స్పృహు లగు వారికి నెప్పుడు । బహుయాగంబులఫలంబు పరమార్థ మిలన్. 17

ప్రతిపదార్థం: బహుభాషలన్= అనేకభాషలందు; బహువిధములన్= పలురీతులుగా; (అనగా కావ్యనాటకపురాణాదివివిధప్రక్రియలలో అని భావం); బహుజనములవలనన్= పలువురు జనులవలన; వినుచున్= వింటూ; భారత, బద్ధ, స్పృహులు= భారతకథయందు కట్టుబడిన కోరిక కలవారు; అగు, వారికిన్= అయిన జనులకు; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; ఇలన్= భూమియందు; బహు, యాగంబుల, ఫలంబు= అనేకయజ్ఞాలు చేయటంవలన కలిగే ఫలితం; పరమ+అర్థము= గొప్ప ప్రయోజనం (సత్యం).

తాత్పర్యం: అనేకభాషలలో, అనేక ప్రక్రియలలో పలువురు జనులవలన భారతకథను వింటూ అందులో అధికమైన ఆసక్తిని పెంచుకొన్నవారికి అనేకయజ్ఞాలు చేయటంవలన కలిగేఫలం గొప్ప ప్రయోజనంగా సమకూరుతుంది.

విశేషం: పరమార్థము+అగున్- అని పాఠాంతరం; అంటే తప్పక కలుగుతుంది అని అర్థం. అలం: వృత్త్యనుప్రాసం.

వ. అని యానతిచ్చిన విని యక్కవివరుం డి ట్లనియె. 18

ప్రతిపదార్థం: అని; ఆనతి+ఇచ్చినన్= రాజరాజు ఆజ్ఞాపించగా; విని; ఆ+కవి, వరుండు= కవిశ్రేష్ఠు డైన నన్నయభట్టు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పల్కెను.

తాత్పర్యం: అని రాజరాజు ఆజ్ఞాపించగా విని కవిశ్రేష్ఠు డైన నన్నయ క్రిందివిధంగా పలికాడు.

చ. అమలినతారకాసముదయంబుల నెన్నను, సర్వవేదశా
స్త్రముల యశేషసారము ముదంబునఁ బొందను, బుద్ధిబాహువి
క్రమమున దుర్గమార్థజలగౌరవభారతభారతీసము
ద్రముఁ దఱియంగ నీఁదను , విధాతృన కైనను నేరఁబోలునే. 19

ప్రతిపదార్థం: అమలిన, తారకా, సముదయంబులన్= నిర్మల మైన నక్షత్రాలసముదాయాలను; ఎన్నను= లెక్కించటానికిన్నీ; సర్వ, వేద, శాస్త్రముల, అశేష సారము= అన్ని వేదాలయొక్కయు, శాస్త్రాలయొక్కయు సంపూర్ణ మైన సారాంశాన్ని; ముదంబునన్= సంతోషంతో; పొందను= పొందటానికిన్నీ; బుద్ధి, బహు, విక్రమమునన్= మతి అనే భుజాలయొక్క బలంచేత; దుర్గమ+అర్థ, జల, గౌరవ, భారత, భారతీ, సముద్రమున్= పొంద శక్యం కాని అర్థమనే నీటియొక్క మహత్త్వంతో కూడిన భారతంలోని వాక్కనే సముద్రాన్ని; తఱియంగన్= దాటేటట్లుగా; ఈఁదను= ఈదటానికిన్నీ; విధాతృనకున్+ఐనను= బ్రహ్మకైనను; నేరన్+పోలునే= తెలిసికొనటానికి శక్య మౌతుందా? (కాదని భావం).

తాత్పర్యం: ఆకాశంలోని నక్షత్రసమూహాలను లెక్కించటానికీ, అన్నివేదాల శాస్త్రాల సంపూర్ణసారాన్ని సంతోషంతో గ్రహించటానికీ, బుద్ధి అనే భుజబలంతో పొంద శక్యం కాని (దిగటానికి అలవికాని) అర్థ మనే నీటియొక్క విస్తృతితో కూడిన భారతవాఙ్మయసముద్రాన్ని దాటేటట్లుగా ఈదటానికి (సముద్రపు ఆవలిఒడ్డు చేరటానికి) బ్రహ్మకైననూ శక్య మౌతుందా? కాదు.

విశేషం: ఈపద్యం నన్నయవినయగుణాన్ని సూచిస్తున్నది. అతడు మహాపండితుడైనప్పటికిన్నీ పంచమవేద మైన భారతాన్ని తెలుగులో వ్రాయటం తనకు అసాధ్య మని చెప్పుతున్నాడు. ఇందులో అతడు పేర్కొన్న విషయా లన్నీ అసాధ్యాలైనవే. మరియు, ఆరోజుల్లో తెలుగుభాష ఇంకను అభివృద్ధి చెంది ఉండ లేదు. అటువంటి భాషలో మహాభారతంవంటి గొప్పగ్రంథాన్ని రచించటం అసాధ్యమని అతడి భావం. అలం: రూపకం. అవతారికలో పఠితలకు ఆసక్తి కలిగేటట్లు కావ్యమహత్త్వాన్ని కీర్తించటం ఉన్ముఖీకరణంలోని భాగం. నన్నయ దానిని నిపుణంగా అలంకారసుందరంగా అక్షరరమ్యంగా నిర్వహించాడు. ఈ పద్యంలో కవి ప్రౌఢోక్తిచేత సిద్ధమైన అలంకారం వలన కలిగే వస్తుధ్వని ఉన్నది. భారతభారతీ సముద్రాన్ని తరించటం బ్రహ్మకుకూడ సాధ్యం కాదనటంలో భారతరచన ఎంత దుష్కరమైనదో రూపకాలంకారంవలన ప్రతీయమాన మౌతున్నది. 'అమలిన తారకాసముదయంబులన్' ఎన్నను' అన్నప్పుడు సముదాయార్థక శబ్దంమీద ఉన్న బహువచనప్రత్యయం, చుక్కలను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గుంపులుగుంపులుగా లెక్కపెట్టటంకూడా సాధ్యంకాని పని అని ధ్వనింపచేస్తున్నది. అంతేకాక, ఇందులో ప్రకృతం భారతభారతీసముద్రాన్ని దరియంగ నీదటం. తారకాసముదాయాలను ఎన్నటం, సర్వవేదశాస్త్రముల అశేషసారాన్ని పొందటం అనేవి అప్రకృతాలు. ఈ ప్రకృతాప్రకృతాలకు 'విధాతృనకైనను నేరబోలునే' అనేదానితో ధర్మైక్యం చెప్పబడింది. ఇది దీపకాలంకారలక్షణం. ఇది వాచ్యం. నన్నయకువలెనే బ్రహ్మకుకూడా సాధ్యంకాదనే అర్థం స్ఫురించటంచేత ఉపమానం ప్రతీయమానం అవుతున్నది. ఉపమాలంకారంలో ఉపమేయంకంటె ఉపమానం ఉదాత్తంగా ఉండాలి. దీపకంలో ఆలక్షణం లేదు. కాబట్టి తారకాగణనాదులకంటె భారతసముద్రం ఈదటమే గొప్పగా చెప్పబడే దీపకాలంకారమే మిక్కిలి చమత్కారవంతంగా ఉంటుంది. వ్యంగ్యమయ్యే ఉపమాలంకారం గుణీభూతం కావటం ఇక్కడ విశేషం. దీనివలననే మహాభారతరచనలోని దుష్కరత్వం ఔచితీశోభితంగా ప్రతీయమానమయ్యేటట్లు వస్తుధ్వని పద్యంలో రమణీయంగా నిర్వహింపబడింది. (సంసా.)

వ. అయినను దేవా! నీయనుమతంబున విద్వజ్జనంబుల యనుగ్రహంబునంజేసి నానేర్చువిధంబున నిక్కావ్యంబు రచియించెద నని. 20

ప్రతిపదార్థం: దేవా= ప్రభూ!; అయినను= అసాధ్యం అయినప్పటికీ; నీ, అనుమతంబునన్= నీసమ్మతిచేతనున్నూ; విద్వత్+జనంబుల= పండితజనులయొక్క; అనుగ్రహంబునన్+చేసి= దయచేతనున్నూ; నా, నేర్చు, విధంబునన్= నాకు తెలిసినరీతిని (కర్తృపదప్రథమకుషష్ఠి) నేను ఎరిగిన రీతిలో; ఈ కావ్యంబు= ఈ మహాభారతకావ్యాన్ని; రచించెదన్= వ్రాస్తాను; అని= అని పలికి.

తాత్పర్యం: 'ప్రభు వయిన రాజరాజా! భారతాన్ని రచించటం అసాధ్యమే అయినా, నీసమ్మతి (ఆజ్ఞ) చేతనూ, పండితజనుల దయచేతనూ నాకు తెలిసినవిధంగా యథాశక్తిగా ఈ మహాభారతకావ్యాన్ని రచిస్తాను' అని పలికి.

విశేషం: ఈవచనంకూడ నన్నయ వినయగుణాన్ని సూచిస్తున్నది. రాజరాజు రచించు మని ఆనతివ్వటంచేత పండితజనులు దయతో తోడుపడటంచేత యథాశక్తిగా భారతకావ్యాన్ని రచించగల నని నన్నయ చెప్పుతున్నాడు. సంస్కృతభారతం ఇతిహాసం. నన్నయ దానిని రసాలంకారపూరిత మైన కావ్యంగా రూపొందించ దలచా డని కావ్యశబ్దప్రయోగంవలన తెలుస్తున్నది. 'రచియించెదనని తొడంగి' అని పాఠాంతరం. తొడంగి= పూని. కావ్యావతరణాన్నీ(కవి రచించటానికి పూనుకోవటం), కావ్యస్వభావాన్నీ సూచించటం అవతారికాంగం.

తరలము.

హరిహరాజగజాననార్కషడాస్యమాతృసరస్వతీ
గిరిసుతాదిక దేవతాతతికిన్ నమస్కృతి సేసి దు
ర్భరతపోవిభవాధికున్, గురుఁ బద్యవిద్యకు నాద్యు, నం
బురుహగర్భనిభుం, బ్రచేతసుపుత్త్రు భక్తిఁ దలంచుచున్. 21

ప్రతిపదార్థం: హరి, హర+అజ, గజానన+అర్క, షట్+ఆస్య, మాతృ, సరస్వతీ, గిరిసుతా+ఆదిక, దేవతాతతికిన్= విష్ణువు, శివుడు, బ్రహ్మ, ఏనుగుమోముగలవినాయకుడు, సూర్యుడు, ఆరుముఖాలుకలకుమారస్వామి, లక్ష్మి, సరస్వతి, హిమవంతుని కూతురైనపార్వతి మొదలైన దేవతలసమూహానికి; నమస్కృతి+చేసి= (గసడదవాదేశం) నమస్కారంచేసి; దుర్భరతపస్+విభవ+అధికున్= అధికమైన తపస్సుయొక్క వైభవంచేత గొప్పవాడున్నూ; గురున్= గొప్పవాడున్నూ, ఆచార్యుడున్నూ, అజ్ఞానాన్ని పోగొట్టేవాడున్నూ; పద్యవిద్యకున్= పద్య(శ్లోక) రచనాసంప్రదాయజ్ఞానానికి; ఆద్యున్= మొదటివాడున్నూ(ఆదికవి); అంబురుహగర్భ,

నిభున్= బ్రహ్మతో సమానుడైనవాడున్నూ, అయిన; ప్రచేతసు, పుత్త్రున్= ప్రచేతసుని కుమారు డైన వాల్మీకిని; భక్తిన్= భక్తితో; తలంచుచున్= స్మరిస్తూ.

తాత్పర్యం: విష్ణువు, శివుడు, బ్రహ్మ, వినాయకుడు, సూర్యుడు, కుమారస్వామి, తల్లి యైన లక్ష్మి, సరస్వతి, పార్వతి మొదలైన దేవతలసమూహానికి నమస్కారం చేసి, అధికమైన తపస్సంపదచేత గొప్పవాడున్నూ, అజ్ఞానాన్ని తొలగించే ఆచార్యుడున్నూ, పద్య(శ్లోక)రచనాసంప్రదాయాన్ని ప్రవర్తింపచేయటంలో ఆదికవియున్నూ, బ్రహ్మతో సమానుడున్నూ అయిన ప్రచేతసుడి కుమారు డైన వాల్మీకిని భక్తితో స్మరిస్తూ.

విశేషం: కావ్యారంభంలో త్రిమూర్తులను, వారిభార్యలను, విఘ్నేశ్వరుడు మొదలైన దేవతలను భక్తితో స్మరించటం కవులకు పరిపాటి. ఈ సంప్రదాయానికి సంగ్రహంగా నయినా మార్గదర్శకు డయింది నన్నయయే. అతడు సూర్యుడినీ, కుమారస్వామిని కూడ స్మరించాడు. 'మాతృ' శబ్దానికి సప్తమాతృకలు, లేదా, అక్షరమాతృకలు అనే అర్థాలను కూడా చెప్పవచ్చును. తరువాతివారు వీరిని స్మరించటం అరుదుగా కనబడుతుంది. సంస్కృతంలో రామాయణం రచించిన వాల్మీకి ఆదికవిగా పరిగణింపబడుతున్నాడు. "మానిషాద ప్రతిష్ఠాం త్వమ్" అనేది అతడు చెప్పిన మొదటిశ్లోకమని అంటారు. అంతకుముందు వెలసిన ఉపనిషత్తులలో కొన్నిశ్లోకాలు ఉన్నవి. అవి వైదికాలు. లౌకిక సంస్కృతంలో మొట్టమొదట శ్లోకం వ్రాసినవాడు వాల్మీకియే కావచ్చును. ప్రచేతసుడు ఒక ఋషి. ప్రచేతసు డంటే వరుణుడు అనే అర్థంకూడ ఉన్నది. అలం: ఉపమ.

గురుపద్యవిద్యకు ఆద్యున్ అనే పాఠాంతరం ఉన్నది. గొప్పదైన పద్య(శ్లోక) రచనా సంప్రదాయానికి మొదటివాడని దీనికర్థం. ఇదే ఉచితపాఠమని తోస్తున్నది. 'గురుపద్యవిద్యకుఆద్యుడు' అనేవిశేషణం వాల్మీకికి ఎంత వర్తిస్తుందో నన్నయకూ అంతే వర్తిస్తుంది. వాల్మీకి సంస్కృతంలోనూ, నన్నయ తెలుగులోనూ గురుపద్యవిద్యకు ఆద్యు లైన ఆదికవులు. వాల్మీకిమహాకవిఅంశ నన్నయ్యలో ఉన్న దని ఈవిశేషణం ధ్వనింపచేస్తున్నది."మధుమయ ఫణితీనాం మార్గదర్శీ మహర్షిః" అనే భోజుడిప్రశంస వాల్మీకితోపాటు నన్నయకు కూడ సార్థకంగా వర్తిస్తుంది. ఇష్టదేవతాస్తుతి, పూర్వకవిస్తుతి అనబడే అవతారికాంగాలను నన్నయ ఈపద్యంలో నిర్వహించాడు.

తరలవృత్తానికి ప్రతిపాదంలోనూ- న, భ, ర, స, జ, జ, గ అనేగణాలు ఉంటాయి. 12వ అక్షరం యతిస్థానం. ఇందులోని మొదటిరెండు లఘువులను ఒకగురువుగా మారిస్తే 'మత్తకోకిల' ఔతుంది. విశేషవృత్తాలలో ఈ రెండింటినే నన్నయ ఎక్కువసంఖ్యలోవాడాడు.

ఉ. భారతభారతీశుభగభస్తిచయంబులఁ జేసి, ఘోరసం
సారవికారసంతమసజాలవిజృంభముఁ బాచి, సూరిచే
తోరుచిరాబ్జబోధనరతుం డగు దివ్యుఁ బరాశరాత్మజాం
భోరుహమిత్త్రుఁ గొల్చి మునిపూజితు భూరియశోవిరాజితున్. 22

ప్రతిపదార్థం: భారత, భారతీ, శుభ, గభస్తి, చయంబులన్, చేసి= భారతంలోని వాక్కు లనే మంగళకరాలైన కిరణాలయొక్క సముదాయంచేత; ఘోర, సంసార, వికార, సంతమస, జాల, విజృంభమున్= భయంకరమైన సంసారంలోని దుర్గుణాలు(వికృతులు) అనే గాఢ మైన చీకట్లసముదాయంయొక్క అతిశయాన్ని; పాచి= పోగొట్టి; సూరి, చేతస్+రుచిర+అబ్జబోధనరతుండు+అగు= పండితులహృదయా లనే ఒప్పిదమైనపద్మాలను వికసింపచేయటంలో ఆసక్తికలవా డైన; దివ్యున్= దేవతాతుల్యు డైన వాడిని; మునిపూజితున్= మునులచేత పూజింపబడినవాడిని; భూరి, యశస్+విరాజితున్= అధిక మైన కీర్తితో ప్రకాశించేవాడిని; పరాశర+ఆత్మజ+అంభోరుహమిత్త్రున్= పరాశరుడి కుమారు డైన వ్యాసు డనే(పద్మాలకు మిత్త్రు డైన) సూర్యుడిని; కొల్చి= సేవించి.

తాత్పర్యం: భారతంలోని వాక్కు లనే మంగళకరా లైన కిరణసముదాయాలచేత భయంకర మైన సంసారంలోని వికృతులు అనే దట్ట మైన చీకట్లయొక్క అతిశయాన్ని పోగొట్టి, పండితుల హృదయా లనే ప్రకాశించేపద్మాలను వికసింపచేయటంలో ఆసక్తికలవాడున్నూ, యోగ్యుడున్నూ, దేవతాతుల్యుడున్నూ, మునులచే పూజింపబడినవాడున్నూ, అధికమైనకీర్తిచేత ప్రకాశించేవాడున్నూ అయిన వ్యాసు డనే సూర్యుడిని సేవించి.

విశేషం: 'మునిపూజితు, భూరియశోవిరాజితున్' అనేవాటిని సూర్యుడికికూడ విశేషణాలుగా చెప్పవచ్చును. 'పాచి' అనేచోట 'పాపి' అనే పాఠాంతరం ఉన్నది. రెండింటికిని అర్థం సమానమే. 'పాయు' అనే ధాతువుకు 'పాచు' 'పాపు' అనేవి ప్రేరణార్థకరూపాలు. 'దివ్యపరాశరాత్మజాంభోరుహమిత్రు' అని సమాసరూపమైన పాఠాంతరంకూడ ఉన్నది. 'పరాశరాత్మ జాంభోరుహమిత్రుఁ గొల్చి' అని వ్యాసవిశేషణాలను సమాప్తిచేసి తిరిగి 'మునిపూజితు భూరియశోవిరాజితున్' అని విశేషణాలను వేయటంచేత సమాప్త పునరావృత్తదోషం ఏర్పడుతుందని కొందరు భావింపవచ్చును. కాని, ఉత్థితాకాంక్ష మైన సమాప్త పునరావృత్తం దోషం కాదని తెలిసికొనాలి.

ఈపద్యంలో రూపకాలంకారం ఉన్నది. వ్యాసునికీ సూర్యునికిన్నీ, భారతవాక్కులకూ సూర్యకిరణాలకున్నూ, సంసారవికారాలకూ చీకట్లకున్నూ, పండితమనస్సులకూ పద్మాలకున్నూ పోలిక చెప్పబడింది. త్రిమూర్తులు మొదలైన దేవతలను కొల్చినట్లే కావ్యారంభంలో తమకు పూర్వ మున్న కవులనుకూడ ప్రశంసించటం కవులకు పరిపాటి. నన్నయ తనకుముందు చెప్పదగిన తెలుగుకవులు ఎవ్వరూ లేకపోవటంచేతకాబోలు సంస్కృతంలో ఆదికవు లైన వాల్మీకిని వ్యాసుడిని మాత్రమే స్మరించాడు.

సంస్కృతకవులలోకూడ వాల్మీకివ్యాసులనే ఎన్నుకొనటంలో ఒకప్రత్యేకత ఉన్నది. నన్నయ తనలో వాల్మీకిలోని కవిత్వాంశ, వ్యాసునిలోని జ్ఞానాంశ కల వనీ, అందువలననే తాను మహాభారతాన్ని కావ్యేతిహాసంగా దిద్ది తీరుస్తున్నట్లూ సూచిస్తున్నాడు.

వ. మఱియును. 23

తాత్పర్యం: అంతేకాక, ఇంకనూ.

విశేషం: దేవతలను, కవులను మాత్రమే కాక నన్నయ ఆ కాలంలో ఉన్న పండితపరిషత్తులనుకూడ ప్రశంసిస్తూ ఉన్నాడు.

చ. పరమవివేకసౌరభవిభాసిత సద్గుణపుంజవారిజో
త్కరరుచిరంబు లై, సకలగమ్యసుతీర్థము లై, మహామనో
హరసుచరిత్రపావనపయఃపరిపూర్ణము లైన సత్సభాం
తరసరసీవనంబుల, ముదం బొనరం గొనియాడి వేడుకన్. 24

ప్రతిపదార్థం: పరమ, వివేక, సౌరభ, విభాసిత, సత్‌గుణ, పుంజ, వారిజ+ఉత్కర, రుచిరంబులు+ఐ= గొప్పజ్ఞాన మనే సువాసనతో ప్రకాశించే మంచిగుణాలసమూహ మనే పద్మాలసముదాయంచేత అందమైనవి అయి; సకల, గమ్య, సుతీర్థములు+ఐ= అందరికీ పోదగిన (చేరదగిన) (మంచిరేవు లనే) సత్పురుషులు (పూజ్యులైన పండితులు) కలవై; మహత్+మనోహర, సు, చరిత్ర, పావన, పయస్+పరిపూర్ణములు+ఐన= మిక్కిలి హృద్యములు (ఆనందకరములు) అయిన మంచిశీలములు అనే

పవిత్ర మైన జలాలతో నిండిన వైన; సత్, సభా+అంతర, సరసీ, వనంబులన్= పండితుల సభలమధ్యభాగా లనే సరస్సుల సమూహాలను; ముదంబు+ఒనరన్= సంతోషం కలిగేటట్లుగా; వేడుకన్= కుతూహలంతో; కొనియాడి= ప్రశంసించి.

తాత్పర్యం: గొప్పజ్ఞాన మనే పరిమళంతో ప్రకాశించే మంచిగుణాల సమూహ మనే పద్మాలసముదాయంచేత అంద మైనవి యై, అందరికిని దిగటానికి తగిన (చేరదగిన) మంచిరేవు లనే పూజ్యు లైన పండితులు కలవై, మిక్కిలిప్రీతికరా లైన మంచివర్తన లనే పవిత్రజలాలతో నిండిన వైన పండితులసభలమధ్యభాగా లనే సరస్సులసమూహాలను సంతోషమలరారగా ప్రీతితో ప్రశంసించి.

విశేషం: అలం: రూపకం. నన్నయకాలంలో విద్యాగోష్ఠులు జరిగే పండితసభ లుండినట్లు తెలుస్తున్నది. ఆ సభలలోని పండితులమెప్పు పొందినప్పుడే పండితులకుగాని, కవులకుగాని, వారి రచనలకుగాని గౌరవసత్కారాలు జరిగేవి. ఇట్టి పండితపరిషత్తులు తమిళదేశంలో ఉండే వని వింటాము. ఆచోళ సంప్రదాయాన్ని తూర్పుచాళుక్యులు వేంగిలో పోషించారు. నన్నయ అట్టి పండితసభలనుకూడ కొనియాడినాడు. తరువాతికవులకృతుల అవతారికలలో పండితసభలప్రశంస కనబడదు.

ఉ. **పాయక పాకశాసనికి భారతఘోరరణంబునందు నా**
రాయణునట్లు, వానసధరామరవంశవిభూషణుండు నా
రాయణభట్టు, వాఙ్మయధురంధరుఁడుం, దన కిష్టుఁడున్, సహా
ధ్యాయుఁడు నైనవాఁ డభిమతంబుగఁ దోడయి నిర్వహింపఁగన్. **25**

ప్రతిపదార్థం: పాయక= విడువక; పాకశాసనికిన్= ఇంద్రుడి కుమారు డైన అర్జునుడికి; భారత, ఘోర, రణంబునందున్= భారతంలో జరిగిన భయంకరమైన యుద్ధంలో (భారతవీరులకు జరిగిన భయంకరమైన యుద్ధంలో); నారాయణు+అట్లు= కృష్ణుడివలె; వానస, ధరామర, వంశ, విభూషణుండు= వానస అనేపేరు గల బ్రాహ్మణవంశానికి అలంకార మైనవాడు; వాఙ్మయ, ధురంధరుఁడున్= సంస్కృతకర్ణాటఆంధ్రాది సారస్వతాలలో మిక్కిలి సమర్థుడున్నూ; తనకున్= నన్నయభట్టుకు; ఇష్టుఁడున్= ప్రియమిత్రుడున్నూ; సహాధ్యాయుఁడున్= అతనితో కలిసి చదువుకొన్నవాడున్నూ; ఐనవాఁడు= అయినట్టివాడు; నారాయణభట్టు= నారాయణభట్టు అనేపేరు గల గొప్పపండితుడు; అభిమతంబుగన్= సమ్మతంగా; తోడు+అయి= సహాయు డై; నిర్వహింపఁగన్= నెరవేర్పగా.

తాత్పర్యం: భారతవీరులమధ్య జరిగిన భయంకర మైన కురుక్షేత్రసంగ్రామంలో సారథి యై విడువక అర్జునుడికి కృష్ణుడివలె, వానస అనే బ్రాహ్మణవంశానికి అలంకారమున్నూ, అనేకసారస్వతాలలో సమర్థుడున్నూ, తనకు ప్రియమిత్రుడున్నూ, సహపాఠియున్నూ అయిన నారాయణభట్టు అనే పండితుడు అనుకూలంగా సహాయుడై నెరవేర్పగా.

విశేషం: నారాయణభట్టూ, నన్నయభట్టూ కలిసి కంచిలో ఒక గురువుకడ సహపాఠకు లైచదువుకొన్నారనిన్నీ, తరువాత నారాయణభట్టు పశ్చిమచాళుక్యులమంత్రి అయినా డనిన్నీ చెప్తుతారు. విజయాదిత్యుడనే రాజరాజుసవతితమ్ముడు పశ్చిమచాళుక్యచక్రవర్తిసాహాయ్యంతో రాజరాజును వేంగీరాజ్యసింహాసనంనుండి తొలగించి తానే రాజు కావటానికి పలుసార్లు ప్రయత్నించాడు. నన్నయభట్టు తనమిత్రుడైన నారాయణభట్టు సాహాయ్యంతో పశ్చిమచాళుక్యులకూ రాజరాజుకూ మైత్రి కలిగించాడు. అప్పటినుండి రాజరాజుకు శాంతిచేకూరింది. అతడు కృతజ్ఞతాపూర్వకంగా నారాయణభట్టుకు నందమపూడిగ్రామాన్ని

అగ్రహారంగా ఇచ్చాడు. ఆ దానశాసనకావ్యాన్ని నన్నయభట్టే రచించాడు. అందులో అతడు నారాయణభట్టు సంస్కృత, కర్ణాట, ప్రాకృత, పైశాచికాంధ్రభాషలలో కవిరాజశేఖరు డని ప్రసిద్ధిపొందినట్లున్నూ, 'కవీభవజ్రాంకుశ' బిరుదాన్ని వహించినట్లున్నూ వ్రాసియున్నాడు. కొన్నిప్రతులలో 'వానస' అనటానికి బదులు 'వాసిగ' అనే పాఠాంతరం కనపడుతున్నది. దానికి 'ప్రసిద్ధిగ' అని అర్థం. నారాయణభట్టు ఇంటిపేరు వానసవా రని తేలింది.

కృష్ణుడు భారతయుద్ధంలో అర్జునుడికి సారథిగా ఉన్నాడు. అతడు దుర్యోధనుడున్నూ అర్జునుడున్నూ మొదట తనను సాయంకోరటానికి వచ్చినపుడు, యాదవసైన్యాన్ని రెండువిభాగాలుగా చేసి తానొక్కడునూ ఒకభాగమనిన్నీ, తాను యుద్ధం చేయక, వాక్సహాయంమాత్రం చేస్తూ ఉంటా ననిన్నీ, రెండవభాగ మైన పదివేలమందినారాయణగోపాలురు యుద్ధం చేస్తా రనిన్నీ, అర్జునుడు వెనుక వచ్చినా తా నతడిని ముందు చూడటంచేతనున్నూ, వయస్సులో పిన్నవాడుకావటంచేతనున్నూ అతడే ముందు కోరుకొంటాడని తెల్పాడు. అర్జునుడు శ్రీకృష్ణుడినే కోరుకొన్నాడు. దుర్యోధనుడు సంతోషిస్తూ వెడలిపోయాడు. కృష్ణుడు భారతయుద్ధంలో పాండవులకు అప్పుడప్పుడు వాక్సహాయం చేశాడే కాని ఆయుధం పట్టి యుద్ధంచేయలేదు. భీష్ముడిధాటికి పాండవసైన్యం ఆగలేనప్పుడు యుద్ధం చేయటానికి చక్రంపట్టాడుకాని తరువాత అర్జునుడిప్రార్థనచేత విరమించుకొన్నాడు. పైకథను పురస్కరించుకొని 'అర్జునుడికి కృష్ణుడివలె' అనే ఉపమానాన్నిబట్టి నారాయణభట్టున్నూ నన్నయభట్టుకు సంస్కృతభారతంలోని ఏయేభాగాలను తగ్గించవలెనో, వేటిని పెంచవలెనో, వేటిని తొలగించవలెనో, తెలుగున రచించేటప్పుడు ఎటువంటిభాషను వాడవలెనో, కన్నడంలో పంపమహాకవి ఎట్లు చేసినాడో- మొదలైనవాటినిగూర్చి తెలిపి వాక్సాహాయ్యంమాత్రం చేశాడని విమర్శకులు భావిస్తున్నారు. అలం: ఉపమ.

ఉ. సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకవితార్థయుక్తి లో
నారసి మేలునా, నితరు లక్షరరమ్యత నాదరింప, నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారతసంహితారచనబంధురుఁ డయ్యె జగద్ధితంబుగన్. 26

ప్రతిపదార్థం: కవి+ఇంద్రులు= కవిశ్రేష్ఠులు; సార, మతిన్= ప్రశస్తమైనబుద్ధితో; ప్రసన్న, కథా, కవితా+అర్థ, యుక్తి= ప్రసాదగుణంతో కూడిన కథలయందును, కవిత్వమునందును (లేక కథాకవిత్వమునందు. నన్నయకు పూర్వంశాసనపద్యాత్మక మైన కవిత్వమే కాని కథారూప మైనకవిత్వం లేదు. కౌరవపాండవులకథతో కూడిన అట్టికవిత్వం రచించిన మొదటికవి నన్నయయే.) కల అర్థముతోడి కూడికను; లోన్+ఆరసి= లోపల బాగుగా పరిశీలించి, హృదయమం దాలోచించి (అర్థముయొక్కఆంతర్యాన్ని అంటే అంతరార్థాన్ని గ్రహించి); మేలు, నాన్= శ్రేష్ఠమైనది అంటే, మేలుమే లని ప్రశంసించగా; ఇతరులు= కవీంద్రులు కాని సామాన్యపాఠకులు; అక్షర, రమ్యతన్= వర్ణాలకూర్పునందలి సౌందర్యాన్ని; ఆదరింపన్= మెచ్చుకొనగా; నానా, రుచిర+అర్థ, సు+ఉక్తి, నిధి= వివిధము లైన హృద్యము లైన అర్థాలతో కూడిన మంచిమాటలకు (సుభాషితాలకు) నిధాన మయిన; నన్నయభట్టు; తెనుంగునన్= తెనుగుభాషలో; జగత్+హితంబు+కన్= లోకానికి శ్రేయస్సు కలిగేటట్లుగా; మహత్+భారత, సంహితా, రచన, బంధురుఁడు= మహాభారతం అనే వేదాన్ని (వేదంలోనిమంత్రభాగం సంహిత ఇక్కడ వేదం అనే సామాన్యార్థాన్ని గ్రహించటం ఉచితం. మహాభారతానికి పంచమవేదమనే ప్రశస్తి ఉన్నది) రచించటంలో ఒప్పిదమైనవాడు; అయ్యెన్= అయ్యెను, అయినాడు.

తాత్పర్యం: కవిపుంగవులు ప్రశస్తమైన బుద్ధితో ప్రసాదగుణంతో కూడిన కథలందును, కవిత్వమందును (కథాకవిత్వమందు) గల మనోహరాలైనఅర్థాలతోడి కూడికను (అర్థసంహితత్వాన్ని) లోపల తరచి తరచి గ్రహించి బాగుబాగు అని ప్రశంసించగా, అన్యులు(సామాన్యులు) వీనులకు విందు చేకూర్చే అక్షరాలకూర్పులోని సౌందర్యాన్ని

మెచ్చుకోగా, హృద్యమైన అర్థాలతో కూడిన వివిధసుభాషితాలకు (నీతులకు, జాతీయాలకు, నానుడులకు)-లేదా-అనేకవిధాలైన రమణీయార్థ ప్రతిపాదకాలైన సుందరకవితాభివ్యక్తులకు నిధాన మైన నన్నయభట్టు లోకానికి శ్రేయస్సు కలిగేటట్లు మహాభారతం అనే వేదాన్ని రచించటంలో ఒప్పిదమైనవాడు (రచించటంచేత లోకప్రీతికరుడు) అయినాడు.

విశేషం: 'ప్రసన్న, కథా, కలిత, అర్థ, యుక్తి'- అనెడి పాఠాంతరం ఉన్నది. ప్రసాదగుణముతో కూడిన కథలందు ఉన్న అర్థాలకూడికను- అని అర్థం. ప్రసాదం, ఓజస్సు, మాధుర్యం మొదలైనవి కవితాగుణాలు. ప్రసాదం అంటే ఝటితిస్ఫూర్తి; చదువగానే అర్థమయ్యేగుణం. ఇది సర్వరససమర్పకం. ప్రసాదగుణం రసగ్రహణానికి తోడ్పడుతుంది. 'లోనారసి' అనేపదం సాభిప్రాయం. కొందరుపండితులు కవులు మొదలైనవారు కావ్యాన్ని చదివేటప్పుడు త్రచ్చి త్రచ్చి హృదయంలో అంతరార్థాన్ని గ్రహించి ఆనందించి రచయితను ప్రశంసిస్తారు. సామాన్యులు ఆ విధంగా చేయలేరు. పైపై విషయాలనుమాత్రమే గ్రహించి ఆనందిస్తారు. కావ్యానికి అర్థం లోపలిగుణం. శబ్దంబాహ్యగుణం. ఈపద్యంలో నన్నయకవిత్వంలోని మూడుగుణాలు(లక్షణాలు) పేర్కొనబడినవి. 1.ప్రసన్నకథాకవి(లి)తార్థయుక్తి; 2. అక్షరరమ్యత; 3. నానారుచిరార్థసూక్తినిధిత్వం. 'సంహితారచనబంధురుఁడయ్యె'- అనేవాక్యాన్ని ఆధారంగా చేసికొని నన్నయకవితలో 'రచనాబంధురత్వం' నాల్గవలక్షణ మని కొందరంటారు. విశిష్టపదరచనగల వైదర్భ్యాదిరీతులతో కూడిన 'పదవృత్త్యసహిష్ణు' వైనపదరచనారూపమైన శయ్య రచనాబంధురత్వమని అంటారు. అయితే, ఈ అంశాన్ని పండితు లంతగా పట్టించుకొనలేదు.

ఇక నన్నయ పేర్కొనిన తనకవితాలక్షణాలు సాపేక్షాలేకాని, సర్వసామాన్యాలు కావు. అందువలననే ఈలక్షణాలకు నిర్వచనాలు ఏ సంస్కృతలక్షణగ్రంథాలలోనూ లభించవు. కాబట్టి విమర్శకు లీలక్షణాలకు వివిధ వ్యాఖ్యానాలు చేశారు. అందులో 'ప్రసన్నకథాకలితార్థయుక్తి'కి 'ప్రసన్నమైనకథతో కూడికొనియున్న అర్థములసంయోజనం' అనీన్నీ, 'ప్రసన్నకవితార్థయుక్తి' అనేసమాసానికి 'ప్రసన్నకథయొక్కయు, కవితార్థముయొక్కయు,యుక్తి-అనగా కవితార్థములో ప్రసన్నమైనకథయుండుట, ప్రసన్నమగుట' అనీన్నీ విశ్వనాథ సత్యనారాయణగారిచ్చిన వివరణలే బహుళప్రచారంలో ఉన్నవి. ప్రసన్నమైన కథాకవితార్థయుక్తికి- 1. 'ప్రసన్నమైనకథయొక్కయు, కవిత్వముయొక్కయు, అర్థముయొక్కయు కూడిక' అనీన్నీ, 2. 'ప్రసన్నమైన కథాకవితయందలి అర్థముయొక్కకూడిక' అనీన్నీ, 3. 'ప్రసన్నమైనకథయందలి కవిత్వముయొక్కయు, అర్థముయొక్కయు కూడిక' అనీన్నీ, 4. 'ప్రసన్నమైన కథాకవితార్థముల కూడిక' అనీన్నీ అర్థాలు చెప్పుకోవచ్చు. అర్థ శబ్దానికి వాచ్య, లక్ష్య, వ్యంగ్యార్థాలనీ, ఉపరంజన ఉపదేశాలనే కావ్యప్రయోజనాలనీ, వస్తు, నేతృ, రసఫలౌచిత్యాలనే కావ్యార్థాలనీ విమర్శకులు వ్యాఖ్యానించారు.

'అక్షర రమ్యత' లో రమ్యత అంటే రామణీయకమనీ, సౌందర్యమనీ, ఆస్వాదయోగ్యత అనీ అర్థం చెప్పుకొనవచ్చు. అక్షర మంటే కేవలం అక్షరం కాదు. సముచితవర్ణవిన్యాసం. కాబట్టి, వర్ణవిన్యాసంవలన కలిగే నాదసౌందర్యం అక్షరరమ్యత అనీ, క్షరంకాని దైన పద్యరచనాసౌందర్యమనీ, మొక్కవోవని ఆస్వాదమాధుర్యమనీ అర్థాలు చెప్పుకొనవచ్చును. అక్షరరమ్యతను అక్షరచ్ఛందోరమ్యతగా కవితా(కావ్య)గుణాలవలన ఏర్పడే రమ్యతగా, సంగీతపరమైన, పూర్వమీమాంసాతత్త్వపరమైన అక్షరసౌందర్యంగాకూడా వ్యాఖ్యానించారు విమర్శకులు.

'నానారుచిరార్థసూక్తినిధి'- అనే విశేషణం సాక్షాత్తుగా నన్నయకు వేసింది. అది అతని వాక్కుకు సహజమైన లక్షణం. సూక్తిఅంటే రుచిరమై చమత్కారయుక్తమైన కూర్పు అని అర్థంచెప్పారు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు. ఈచమత్కారం ఒక్కొక్క పదంలోనూ, పదబంధంలోనూ, సమాసంలోనూ, కారకంలోనూ, వాక్యంలోనూ బహుభంగుల చూడవచ్చునని వారు వివరించారు. సూక్తులంటే అందమైన కవితాభివ్యక్తులనీ, ప్రియమైన మాటలనీ, శ్రేష్ఠములైన మాటలనీ, మృదుమధురమైన మాటలనీ, సుభాషితాలు, నీతులు, జాతీయాలు, లోకోక్తులు, నానుడులు మొదలైనవనీ విమర్శకులు వివేచిస్తున్నారు.

అర్థసూక్తులు-సమాసం ద్వంద్వమని కొందరు భావించారు. రుచిరార్థమంటే రమణీయార్థప్రతిపాదకమనీ, కావ్యసందర్భంలో ఒప్పిదాలై భాసించే లక్ష్యవ్యంగ్యార్థాలనీ కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. సూక్తిని అలంకారపర్యాయవాచిగా కొందరు భావిస్తున్నారు.

నానారుచిరార్థసూక్తినిధిత్వం నన్నయకవితలో కానవచ్చే సాధారణలక్షణం. కాగా, సారమతులైన కవీంద్రులు లోనారసిమెచ్చుకొనే లక్షణం ప్రసన్నకథాకలి(వి)తార్థయుక్తి. ఇది పండితులైన సహృదయులను, అక్షరరమ్యత కవితారసికులైన సామాన్య సహృదయులను ఆకర్షించటానికి ఉద్దేశింపబడినవి. పండిత పామర(Class and mass) జనులను రంజింపజేస్తూ ప్రజలనాల్కలమీద నిలిచేకవిత నన్నయది. అర్థ శబ్దాన్ని వాడుతున్న నన్నయ ధ్వనిమార్గ సమర్థకుడు. అతడికి అక్షరంకూడ వ్యంజనాశక్తికి సాధకమౌతుంది. రుచిరార్థ(రమణీయార్థ) ప్రతిపాదకమైన కవిత్వాభివ్యక్తియే అతడి కవిత్వానికి జీవితం. వస్తుధ్వని అతడి ప్రధానమార్గం. క్రీ.శ. 11- 18 శతాబ్దాలనడుమ భారతాలంకార చరిత్రలో ప్రవర్తిల్లిన ధ్వన్యనంతరయుగంలో తెలుగుసాహితీరంగంమీద ధ్వనిని. రసాన్ని సమర్థించినవారు నన్నయాదులు; అలంకారమార్గాన్ని సమర్థించినవారు నన్నెచోడాదులు; మూలరసవాదాలను సమర్థించినవారు పాల్కురికి సోమనాథుడు, శ్రీనాథుడు, పోతనాదులు. ధ్వనినీ రసాన్నీ సమర్థించిన నన్నయమార్గం ఉత్తమప్రస్థానం. ధ్వనిలో నన్నయ వస్తుధ్వనిని, తిక్కన రసధ్వనిని, ఎఱ్ఱన అలంకారధ్వనిని విశేషించి పోషించారు. ముగ్గురూ మూడుధ్వనులను ప్రధానంగా పోషించినా ప్రస్థానం ఒకటేకాబట్టి కవిత్రయకవితలో ఆంధ్రమహాభారతం ఒకేకవి రచించిన కావ్యేతిహాసంవలె రాణిస్తున్నది. (సంపా.)

వేదంలో సంహిత(మంత్రభాగం), బ్రాహ్మణము(యజ్ఞాలలోవేదమంత్రవినియోగాన్నిగురించి ఒక్కొక్కప్పుడు వాటి అర్థాలను కథోదాహరణపూర్వకంగా తెలిపేభాగం), ఆరణ్యకంకూడ బ్రాహ్మణాలకు సంబంధించినదే, (అరణ్యమున కూర్చబడినదో, అధ్యయనం చేయదగినదో అగుటచేత దీనికి ఆపేరు కలిగింది), ఉపనిషత్తు (వేదాంతభాగం, జ్ఞానబోధకం) అనే మూడుభాగాలు ఉంటాయి. ఇచ్చట సంహితాశబ్దం వేద మనే అర్థంలో వాడబడింది. నన్నయ ఋషితుల్యుడు. అందుచేత సంహితారచనకు అర్హుడు.

ఈపద్యంతో అవతారిక పూర్తి ఔతున్నది. పాత్రప్రవేశసూచన మనే ప్రస్తావనాంగం ఇందులో వ్యంగ్యంగా నిబంధించబడింది. ఇదంతయు ప్రథమపురుషలో వ్రాయబడింది. అవతారికలో స్వీయవిషయంకూడ ఉండటంచేత ఆత్మస్తుతిదోషం కలుగుతుం దేమో అని నన్నయ దీనిని ఈవిధంగా వ్రాసిఉంటాడు. నన్నయ పేర్కొన్నగుణాలు అతనిరచనలో స్పష్టంగా గోచరిస్తాయి. ఈ అవతారిక కవితావిషయంలోనే కాక సత్యకథనవిషయంలోకూడ సాటిలేనిది.

భారతకథాప్రస్తావన (సం. 1-1-8)

వ. తత్కథాప్రారంభం బెట్టి దనిన. 27

ప్రతిపదార్థం: తత్, కథా, ప్రారంభంబు= ఆ భారతంలోనికథకు ఆరంభం; ఎట్టిది+అనినన్= ఎటువంటిది అనగా.

తాత్పర్యం: ఆ మహాభారతంలోని కథకు మొదలు ఎటువంటిది అనగా.

సీ. నైమిశారణ్యపుణ్యక్షేత్రమునఁ గుల । పతి శౌనకుం డను పరమమౌని,
బ్రహ్మర్షిగణసముపాసితుం డై సర్వ । లోకహితార్థంబు లోకనుతుఁడు
ద్వాదశవార్షికోత్తమసత్త్రయాగంబు । మొగిఁ జేయుచున్న నమ్మునులకడకు
వచ్చి, తా నుగ్రశ్రవసుఁ డను సూతుఁడు । రౌమహర్షణి సుపౌరాణికుండు

ఆ. పరమభక్తితోడఁ బ్రణమిల్లియున్న న । క్కథకువలన మునినికాయ మెల్ల
వివిధపుణ్యకథలు వినువేడ్క నతనిఁ బూ । జించి రపరిమితవిశేషవిధుల. 28

ప్రతిపదార్థం: నైమిశ+అరణ్య, పుణ్యక్షేత్రమునన్= నైమిశం అనే పేరుగల అడవిఅనే పవిత్రక్షేత్రంలో; కులపతి= పదివేలమందిశిష్యులకు భోజనం పెట్టుతూ చదువు చెప్పేవాడు; శౌనకుండు+అను= శౌనకుడు అనే పేరు కల; పరమ, మౌని = గొప్పముని; బ్రహ్మ+ఋషి గణ, సముపాసితుండు+ఐ= బ్రహ్మర్షులసముదాయంచేత సేవింపబడినవా డై; లోక, నుతుఁడు= ప్రజలచేత స్తుతింపబడినవాడు; (శౌనకునకు విశేషణం); సర్వ, లోక, హిత+అర్థంబు= సకలజగత్తుయొక్కమేలుకొరకు; ద్వాదశ, వార్షిక,+ఉత్తమ, సత్ర, యాగంబు= పన్నెండు సంవత్సరాలు జరిగే శ్రేష్ఠ మైన సత్రము అనే యజ్ఞాన్ని; మొగిన్= పూనికతో; చేయుచున్నన్= చేస్తూఉండగా; ఆ+మునుల, కడకున్= ఆ శౌనకాదిమునులచెంతకు; వచ్చి; తాను; రౌమహర్షణి= రోమహర్షణుడు అనే సూతునికుమారుడు; సు, పౌరాణికుండు= లెస్సగా పురాణాలను ఎరిగిన(చెప్పేవాడు); ఉగ్రశ్రవసుఁడు, అను, సూతుఁడు= ఉగ్రశ్రవసుడు అనే పేరు గల సూతవంశానికిచెందినవాడు, పరమ, భక్తితోడన్= గొప్పభక్తితో; ప్రణమిల్లి+ఉన్నన్= నమస్కరించి ఉండగా; ఆ కథకువలనన్= ఆ పౌరాణికుని(కథలుచెప్పువాని)వలన; వివిధ, పుణ్య, కథలు= అనేక పవిత్రకథలు; విను, వేడ్కన్= వినాలనే ఆసక్తితో; ముని, నికాయము+ఎల్లన్= మునులసముదాయం అంతయున్నూ; అతనిన్= ఆ ఉగ్రశ్రవసుడిని; అపరిమిత, విశేష విధులన్= అధికమైనపూజావిధానాలతో; పూజించిరి= అర్చించారు.

తాత్పర్యం: కులపతి అయిన శౌనకుడు అనే మహాముని బ్రహ్మర్షులసముదాయంచేత సేవింపబడినవాడై, ఎల్లలోకాల శ్రేయస్సుకొరకు పన్నెండుసంవత్సరాలు జరిగే శ్రేష్ఠ మైన 'సత్త్రము' అనే యాగవిశేషాన్ని చేస్తూఉండగా, ఆ మునులచెంతకు వచ్చి రోమహర్షణు డనేవానికుమారుడున్నూ, మంచిపురాణకథకుడున్నూ అయిన ఉగ్రశ్రవసుడు అనేసూతుడు మిక్కిలిభక్తితో నమస్కరించి ఉండగా, మునులసమూహమంతా కలిసి ఆ కథకుడివలన వివిధపవిత్ర (పుణ్యం కలుగజేసే) కథలను వినవలె ననే కుతూహలంతో అతడిని అధికమైన పూజావిధానాలతో పూజించారు.

విశేషం: 'మునీనాం దశసాహస్రం యోఽన్నదానాది పోషణాత్ । అధ్యాపయతి విప్రర్షిరసౌ కులపతిః స్మృతః ॥' అనేది కులపతినిర్వచనం. 'సత్త్రము' అనేది ఒకయాగవిశేషం. ఇది 13 నుండి 100రోజులవరకుగాని అంతకు ఎక్కువకాలంగాని జరుగవచ్చును. రోమహర్షణుడనే సూతుడు, వ్యాసుడిశిష్యుడు. అతడి కుమారుడు ఉగ్రశ్రవసుడు సౌతి. క్షత్రియకాంతకు వైశ్యుడివలన పుట్టినవాడు సూతుడనిన్నీ, పురాణకథలు చెప్పటం అతనివ్యాపార మనిన్నీ నిఘంటువులలో ఉన్నది. సూతశబ్దానికి రథసారథి అని సామాన్యార్థం. కాని, ఇచ్చట కథకుడు అని చెప్పటం యుక్తంగా ఉంటుంది. అందుచేతనే మునులు అందరూ అతడివలన పుణ్యకథలు వినా లని అభిలషించి అతడిని పూజించారు.

వ. అక్కథకుండ వెండియు నమ్మునిసంఘంబునకు నమస్కారంబు సేసి, 'యే ననేకపురాణపుణ్యకథా కథనదక్షుండ, వ్యాస శిష్యుండైన రోమహర్షణునకుఁబుత్త్రుండ; నావలన నెక్కథ విన వలతు?' రనిన, నమ్మును లతని కి ట్లనిరి. 29

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= పౌరాణికుడు అయిన ఆ ఉగ్రశ్రవసుడు; వెండియున్= మరల; ఆ+ముని, సంఘంబునకున్= శౌనకుడు మొదలైన ఆ మునిసముదాయానికి; నమస్కారంబు; చేసి; ఏను=నేను; అనేక, పురాణ, పుణ్య, కథా, కథన, దక్షుండన్= పెక్కుప్రాచీనా లైన(పురాణాలలోని), పవిత్రాలైన కథలను చెప్పటంలో సమర్థుడను; వ్యాస, శిష్యుండు+ఐన= వ్యాసునికి శిష్యు డైన; రోమహర్షణునకున్= రోమహర్షణుడు అనే పేరు కల సూతునకు; పుత్త్రుండన్= కుమారుడను; నావలనన్; ఏ+కథ; వినన్, వలతురు= వినగోరుతారు?; అనినన్= అని అడుగగా; ఆ+మునులు; అతనికిన్= ఉగ్రశ్రవసునితో; ఇట్లు+అనిరి= ఈవిధంగా అన్నారు.

తాత్పర్యం: పౌరాణికు డైన ఆ ఉగ్రశ్రవసుడు మరల ఆమునుల సముదాయానికి నమస్కరించి, 'నేను అనేకపురాణాలలోని పుణ్యం కలిగించేకథలను చెప్పటంలో సమర్థుడిని; వ్యాసమహామునిశిష్యుడైన రోమహర్షణుడు అనే పరమపౌరాణికుని, కుమారుడిని; నానుండి మీ రేకథ వినాలని కోరుతున్నారు?' అని అడుగగా ఆ మునులు ఉగ్రశ్రవసుడితో ఈవిధంగా పలికారు.

క. **ఏయది హృద్య, మపూర్వం । బేయది, యెద్దాని వినిన నెఱుక సమగ్రం**
బై యుండు, నఘనిబర్హణ । మే యది? యక్కథయ వినఁగ నిష్టము మాకున్. **30**

ప్రతిపదార్థం: ఏ, అది= ఏది; హృద్యము= మనోహరమో; ఏ, అది= ఏది; అపూర్వంబు= క్రొత్తదో; ఏ+దానిన్= దేనిని; వినినన్= వినటంచేత; ఎఱుక= జ్ఞానం; సమగ్రంబు+ఐ= సంపూర్ణమై; ఉండున్=ఉండునో; ఏ+అది=ఏది; అఘ, నిబర్హణము= పాపాలను తొలగించేదో; ఆ+కథ+అ= అట్టికథయే; వినఁగన్= వినటానికి; మాకున్; ఇష్టము= ప్రియం.

తాత్పర్యం: ఏకథ మనోహరమో, ఏది క్రొత్తదై వింతగా ఉంటుందో, దేనిని వింటే సంపూర్ణమైన జ్ఞానం కలుగుతుందో, ఏది పాపాలను తొలగిస్తుందో అటువంటి కథయే వినటం మాకు ప్రీతికరం.

విశేషం: ఈపద్యం భారతకథకు ఉన్న గుణాలను, గొప్పతనాన్ని, దానిని వినటంవలన కలిగే లాభాలనూ చక్కగా తెల్పుతూ ఉన్నది. పూర్వలాక్షణికులు చెప్పిన కావ్యప్రయోజనాలు కొన్ని ఇందులో సూచింపబడినవి. "కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే, శివేతరక్షతయే సద్యఃపరనిర్వృతయే, కాంతాసమ్మితతయోపదేశయుజే'' అని మమ్మటుని కావ్యప్రకాశం. నన్నయ ధ్వనిరససంప్రదాయాలను సమర్థించేవాడు కాబట్టి వర్ణాన్నీ, శబ్దాన్నీకూడా తన రచనలో వ్యంజకాలుగా ప్రయోగిస్తాడు. ఈపద్యంలోని 'యత్, 'తత్' అర్థక శబ్దాలటువంటివి. 'యత్తదోర్నిత్యసంబంధః' అనిప్రమాణం. "ఏయది'' అన్నప్పుడు యదర్థకంతో అంతకుపూర్వం ప్రారంభించబడినదానిని తదర్థకం పరామర్శిస్తుంది. అప్పుడు తదర్థకం 'ప్రక్రాంతపరామర్శకం' అనబడుతుంది. హృద్యం, అపూర్వం మొదలైన లక్షణాలు కల కథ ఏదైతే ఉంటుందో అటువంటి లక్షణాలు కల కథ వినాలనే కోరిక ఇందులో ఉన్నది. లక్ష్యలక్షణవిశిష్ట మైన వస్తుస్వభావం ఇందులో శబ్దమూలక వస్తుధ్వని.

వ. **అనిన నుగ్రశ్రవసుం డట్లేని 'మీకు నభిమతం బైన పుణ్యకథఁ జెప్పెద, దత్తావధానుల రై వినుం' డని శౌనకాదిమహామునుల కిట్లని చెప్పందొడంగె: 'కృష్ణద్వైపాయనుండను బ్రహ్మర్షి తొల్లి వేదంబు లేకీభూతంబు లై యేర్పడకున్న ఋగ్యజుస్సామాథర్వంబులుగా విభాగించి, తన శిష్యులయిన పైలవైశంపాయన సుమంతు జైమినులం బంచి క్రమంబునఁ జతుర్వేదసూత్రంబులఁ జేయించి, వేదవ్యాసుండై నిజతపోమహత్త్వంబునం జేసి బ్రహ్మచేత ననుజ్ఞాతుం డై యష్టాదశ పురాణంబులును, నీతిధర్మ శాస్త్రార్థతత్త్వంబులును జతుర్వేద వేదాంతాభిప్రాయంబులును, జతుర్వర్గవర్గాను బంధబంధుర కథేతిహాసంబులును, జతుర్యుగ మహర్షి రాజవంశచరితంబు లును, జతుర్వర్ణాశ్రమధర్మక్రమంబులును, జతుర్ముఖప్రముఖనిఖిలసురముని గణపూజితుం డైన శ్రీకృష్ణునిమాహాత్త్వంబును, బాండవాది భారతవీరుల మహాగుణంబులును దనవిమల జ్ఞానమయం బైన వాగ్దర్పణంబునం దేర్పడి వెలుంగుచుండ.** **31**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్=మునులు ఈ విధంగా పలుకగా; ఉగ్రశ్రవసుండు= సౌతి(కథకుడు); అట్లు+ఏని= అట్లైనచో; మీకున్; అభిమతంబు+ఐన= ఇష్టమైన; పుణ్య, కథన్= పవిత్రమైనకథను; చెప్పెదన్; దత్త+అవధానులరు+ఐ= (ఈయబడిన) ఏకాగ్రతకలవారై; వినుండు; అని; శౌనక+ఆది, మహత్, మునులకున్= శౌనకుడు మొదలైన గొప్పమునులకు; ఇట్లు+అని= ఈవిధంగా; చెప్పన్+తొడంగెన్= చెప్పటానికి ఆరంభించాడు; కృష్ణద్వైపాయనుండు+అను= కృష్ణద్వైపాయనుడు అనేది వ్యాసునిపేరు; బ్రహ్మ+ఋషి= వేదతత్త్వజ్ఞానం కలముని; తొల్లి= పూర్వం; వేదంబులు= ఋగ్వేదం మొదలైనవి; ఏకీభూతంబులు+ఐ= ఒకేరూపం కలవై (విభజింపబడక ఒకేరాశిగా) ఉండి; ఏర్పడక+ఉన్నన్=తేటపడక (వేఱుపడక) ఉండగా; ఋక్, యజుస్, సామ+అథర్వంబులు, కాన్= ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం అనే నాల్గువేదాలు అయ్యేటట్లుగా, విభాగించి= విభజించి (వేరుపరచి); తన, శిష్యులు, అయిన, పైల, వైశంపాయన, సుమంతు, జైమినులన్= పైలుడు, వైశంపాయనుడు, సుమంతుడు, జైమిని అనేవారిని; పంచి= ఆజ్ఞాపించి; క్రమంబునన్= వరుసగా (పైలునిచేత ఋగ్వేదానికి, వైశంపాయనునిచేత యజుర్వేదానికి, సుమంతునిచేత సామవేదానికి, జైమినిచేత అథర్వవేదానికి); చతుర్+వేద సూత్రంబులన్= నాలుగువేదాలకు సంబంధించిన జ్ఞాపక ముంచుకొనటానికి వీలుగా ఉండే సంక్షేపవాక్యాలను (నియమాలను); చేయించి= చేసేటట్లుగా చేసి (వ్రాయించి), వేద, వ్యాసుండు+ఐ= వేదాలను విభజించినవాడు కావటంచేత వేదవ్యాసుడు అనే ప్రసిద్ధి కలవాడై; నిజ, తపస్, మహత్త్వంబునన్, చేసి= తనతపస్సుయొక్క గొప్పతనంచేత; బ్రహ్మచేత, అనుజ్ఞాతుండు+ఐ= ఆజ్ఞాపింపబడినవాడై; అష్టాదశ, పురాణంబులును= పదునెనిమిదిపురాణాలున్నూ; నీతి, ధర్మ, శాస్త్ర+అర్థతత్త్వంబులునున్= నీతిశాస్త్రముయొక్క, ధర్మశాస్త్రముయొక్క అర్థమున్నూ స్వభావమున్నూ; చతుర్+వర్గ+అనుబంధ, బంధుర, కథా,+ఇతిహాసంబులును= ధర్మార్థకామమోక్షా లనే నాలుగుపురుషార్థాలతోను, కామక్రోధాదు లగు ఇతరాలైన తెగలతోను, సంబంధం కల అందమైన కథలున్నూ, పూర్వకథలున్నూ; చతుః, యుగ, మహర్షి, రాజ, వంశ, చరితంబులును= కృతత్రేతాద్వాపరకలియుగాలందలి గొప్పఋషుల యొక్కయు, రాజులయొక్కయు వంశాలయొక్క చరిత్రలున్నూ; చతుర్+వర్ణ+ఆశ్రమ, నాలుగు ఆశ్రమాలయొక్కయు ధర్మాల యొక్క విధములున్నూ; చతుర్+ముఖ, నిఖిల, సుర, గుణ, పూజితుండు+ఐన= నాల్గుముఖాలు కల బ్రహ్మ మొదలైన ఎల్లదేవతలసమూహాలచేత పూజింపబడిన; శ్రీకృష్ణుని మహాత్మ్యంబును= శ్రీకృష్ణుడిమహత్త్వమును; పాండవ+ఆది, భారత, వీరుల, మహత్, గుణంబులును= పాండవులు మొదలైన భారతవీరుల(పరాక్రమవంతుల) గొప్పగుణాలును; తన, విమల, జ్ఞానమయంబు+ఐన= తనయొక్క నిర్మల మైన జ్ఞానంతో నిండిన; వాక్, దర్పణంబు+అందున్= వాక్కు అనే అద్దంలో; ఏర్పడి= తేటతెల్లమై; వెలుంగుచున్, ఉండన్= ప్రకాశిస్తూ ఉండగా.

తాత్పర్యం: మునులు ఆవిధంగా పలుకగా సౌతి(ఉగ్రశ్రవసుడు)'అట్లైతే మీకు ప్రియ మైన పవిత్రకథను చెప్పుతాను; ఏకాగ్రచిత్తు లై వినండి' అని శౌనకుడు మొదలైన మునులకు ఈవిధంగా చెప్పటానికి ఆరంభించాడు- కృష్ణద్వైపాయనుడు అనే పేరు కల వేదతత్త్వజ్ఞుడైన ముని పూర్వం వేదాలన్నీ కలిసి వేరువేరుగా లేకుండటంచేత వాటిని ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం అని నాలుగువేదాలుగా విభజించాడు. తనశిష్యు లైన పైలుడు, వైశంపాయనుడు, సుమంతుడు, జైమిని అనేవారిని ఆజ్ఞాపించి వరుసగా ఆ నలుగురిచేత నాలుగువేదాలను ధారణలో ఉంచుకొనటానికి వీలుగా సంక్షేపసూత్రాలను చేయించాడు. వేదాలను విభజించినవాడు కావటంచేత వేదవ్యాసు డని ప్రఖ్యాతిపొందినవాడై, తన తపోమహిమవలన బ్రహ్మచేత ఆజ్ఞాపింపబడి పదునెనిమిది పురాణాలను, నీతిశాస్త్రధర్మశాస్త్రాలయొక్క అర్థాన్నీ స్వభావాన్నీ, నాలుగువేదాలయొక్క, వాటికి సంబంధించిన ఉపనిషత్తులయొక్క భావాలనూ, ధర్మార్థకామమోక్షాదులతోనూ, ఇతరాలైన అరిషడ్వర్గాదులతోనూ సంబంధం గల హృద్యాలైనకథలను ఇతిహాసాలను, కృతత్రేతాద్వాపరకలియుగాలలోని గొప్పమునులయొక్కయు, రాజులయొక్కయు వంశాలచరిత్రలను, బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రు లనే నాలుగువర్ణాలయొక్కయు, బ్రహ్మచర్యగృహస్థవానప్రస్థసన్న్యాసాశ్రమాలలోని ధర్మాలయొక్కయు (చేయవలసినవిధుల) విధానాలను, నాలుగుమొగములబ్రహ్మమొదలైన సర్వదేవతలయొక్కయు,

మునులయొక్కయు సమూహాలచేత పూజింపబడిన శ్రీకృష్ణునిమహత్త్వమును, పాండవులు మొదలైన భారతశూరుల గుణగణాలును, నిర్మల మైన జ్ఞానంతో నిండిన తనవాక్కనెడి అద్దంలో తేటతెల్లంగా ప్రకాశిస్తూ ఉండగా-(భారతాన్ని రచించాడని తరువాతిపద్యంతో అన్వయం).

విశేషం: పురాణశబ్దానికి అనేకనిర్వచనాలు ఉన్నవి. ప్రాచీనమైనదైనను క్రొత్తగా ఉండేది అని ఒక నిర్వచనం ఉన్నది. సర్గం, ప్రతిసర్గం ('ప్రళయాంతంలో మరల చేసేసృష్టి), వంశం (దేవాసురమునీంద్రాదులవంశాలచరిత్రలు), మన్వంతరం, వంశానుచరితం (సూర్యచంద్రాదివంశాలకు చెందినరాజులచరిత్రం) అనేవి పురాణానికి ఉండే ఐదులక్షణాలు. ఇతి+హ+ఆస= ఇట్లుండెను (ఇట్లా జరిగిందని చెప్పబడిఉన్నది) అని ఇతిహాసశబ్దవ్యుత్పత్తి. ధర్మార్థకామమోక్షాలకు సంబంధించిన ఉపదేశాలతో కూడిన కథతో కూడిన పూర్వవృత్తం ఇతిహాసం.

సీ. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని, । యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని, । కవివృషభులు మహాకావ్య మనియు,
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని, । యైతిహాసికు లితిహాస మనియుఁ,
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ । యం బని, మహిఁ గొనియాడుచుండ.

ఆ. వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ । డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీన మై । పరఁగుచుండఁ జేసె భారతంబు. 32

ప్రతిపదార్థం: ధర్మ, తత్త్వజ్ఞులు= ధర్మముయొక్క నిజమైన స్వభావాన్ని ఎరుగువారు; ధర్మ, శాస్త్రంబు, అని= ధర్మాన్ని తెలిపే శాస్త్రగ్రంథ మనిన్నీ; అధ్యాత్మ, విదులు=పరమాత్మకూ జీవాత్మకూ గల సంబంధాన్ని తెలిసిన వేదాంతులు; వేద+అంతము+అనియున్= వేదాంతశాస్త్ర మనిన్నీ; నీతి, విచక్షణుల్= నీతియందు నేర్పుకలవారు; నీతిశాస్త్రంబు+అని= నీతులు తెల్పే శాస్త్ర మనిన్నీ; కవి, వృషభులు= కవిశ్రేష్ఠులు (సింహ,కుంజర,వృషభాది పదాలు సమాసాలలో ఉత్తరపదా లైతే శ్రేష్ఠతను సూచిస్తాయి); మహత్, కావ్యము అనియున్= గొప్పకావ్యం అనిన్నీ; లాక్షణికులు= రసం, ధ్వని, కావ్యం, అలంకారాలు మొదలైనవాటి లక్షణాలు తెలిసినవారు; సర్వ, లక్ష్య, సంగ్రహము; అని= అన్నిలక్ష్యముల సముదాయంఅనిన్నీ (నిర్వచనం లక్షణం. లక్షణానికి ఉదాహరణం లక్ష్యం); ఐతిహాసికులు= పూర్వం జరిగిన వృత్తాంతాలు తెలిసినవారు; ఇతిహాసము, అనియున్= పూర్వకథాగ్రంథ మనిన్నీ (చరిత్ర అనియు); పరమ, పౌరాణికుల్= ఉత్తములైన పౌరాణికులు (పురాణవిజ్ఞానం తెలిసినవారు, పురాణాలు చెప్పేవారు); బహు, పురాణ, సముచ్చయంబు+అని= పెక్కుపురాణాల సముదాయ మనిన్నీ; మహిన్= భూమియందు; కొనియాడుచున్+ఉండన్= పొగడుతూఉండగా; వివిధ, వేద, తత్త్వవేది= పలువిధాలైన వేదాల సత్యస్వభావాన్ని ఎరిగినట్టి వాడున్నూ; వేదవ్యాసుఁడు= వేదాలను విభజించినవాడున్నూ; ఆదిముని= ప్రాచీనులైన మునుల్లో ఒకడున్నూ; విష్ణుసన్నిభుండు= విష్ణువుతో సమానమైనవాడున్నూ,; అయిన; పరాశర+ఆత్మజుండు= పరాశరుడికి దాశకన్యయందు పుట్టిన కుమారుడు, కృష్ణద్వైపాయనుడు; విశ్వజనీనము+ఐ= సర్వజనులకును హిత మై; పరఁగుచున్, ఉండన్= ఒప్పుచుండేటట్లుగా; భారతంబు= భరతవంశీయులవృత్తాంతాన్ని తెలుపు భారత మనే మహాగ్రంథాన్ని; చేసెన్= రచించాడు.

తాత్పర్యం: ధర్మస్వభావం తెలిసినవారు ధర్మశాస్త్రగ్రంథ మనిన్నీ, పరమాత్మ జీవాత్మలసంబంధం తెలిసిన వేదాంతులు వేదాంతశాస్త్ర మనిన్నీ, నీతివిషయాలయందు నేర్పుకలవారు నీతులను తెల్పే శాస్త్ర మనిన్నీ, కవిశ్రేష్ఠులు గొప్పకావ్య మనిన్నీ, లక్షణం తెలిసినవారు పెక్కులక్ష్యాల సంపుటి అనిన్నీ, పూర్వకథలు తెలిసినవారు ఇతిహాస మనిన్నీ, ఉత్తమపౌరాణికులు పెక్కుపురాణాల సమూహ మనిన్నీ, భూమియందు పొగడుతూ ఉండగా సర్వవేదాల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సత్యస్వరూపాన్ని ఎరిగినవాడున్నూ, వేదాలను విభజించివేదవ్యాసు డనే పేరు పొందినవాడున్నూ, ప్రాచీనమునియున్నూ, విష్ణువుతో సమానుడున్నూ అయిన పరాశరునికుమారుడు (కృష్ణద్వైపాయనుడు) సర్వజనులకు హితమై ఒప్పేటట్లుగా సంస్కృతంలో భారత మనే గ్రంథాన్ని రచించాడు.

విశేషం: అలం: ఉల్లేఖం. 'య ది హాస్తి త దన్యత్ర య న్నే హాస్తి న త త్క్వచిత్' అని భారతాన్నిగురించి చెప్పుతూ ఉంటారు. ఇందులో ఉన్నది వేరేచోట ఉండవచ్చును. ఇందులో లేనిది మరెచ్చటా ఉండదు అని ఈ శ్లోకభావం. ఈ విషయాన్నే నన్నయ పై పద్యంలో తెల్పిఉన్నాడు. భారతంలో ధర్మాలు, వేదాంతం, నీతులు, రసపాత్రపోషణాదు లైన కావ్యలక్షణాలు, వివిధలక్షణాలకు లక్ష్యాలు, పూర్వకథలు, పురాణవృత్తాంతాలు మొదలైనవన్నీ ఉంటాయి. ఇది ఒకవిజ్ఞానకోశం. కృష్ణద్వైపాయనుడు పరాశరు డనేమునికీ దాశకన్యకూ యమునాద్వీపంలో పుట్టాడు. ఆ వృత్తాంతం ముందు చెప్పబడుతుంది. 'వ్యాసో నారాయణో హరిః ' అని సూక్తి. భాగవతంలో చెప్పబడిన విష్ణువు ఎత్తిన ఇరువదియొక్క అవతారాలలో వ్యాసుడు ఒకడు. అందుచేత విష్ణుసన్ని'భుడు అని చెప్పబడినాడు. భారతం అన్నిమతాలవారికిన్నీ, సర్వజనులకున్నూ హితం చేకూర్చేది. పంచమవేద మని ప్రసిద్ధిచెందింది. శాస్త్రకారులు ముందు లక్షణం చెప్పి తరువాత దానికి లక్ష్యం ఉదాహరణంగా చెప్పుతారు. ధర్మనీతి వేదాంతవ్యాకరణాదిశాస్త్రాలలో చెప్పబడిన లక్షణాలకు లక్ష్యాలు భారతంలో ఉంటాయి. కావ్యానికి అనేకనిర్వచనా లున్నవి. రసాత్మకమైనవాక్యం (వాక్యం రసాత్మకం కావ్యమ్.) అనేది వాటిలో ఒకటి. ఇతిహాసం చరిత్ర. జరిగిన వృత్తాంతాన్ని అది చెప్పుతుంది. సంస్కృతమహాభారతం శాస్త్రేతిహాసం. ఆంధ్రమహాభారతం కావ్యేతిహాసం.

పర్వానుక్రమణిక - (సం. 1-2-34)

వ. **అదియునుంబౌష్యంబు, పౌలోమం, బాస్తీకం, బాదివంశావతారంబు, సంభవపర్వంబు, జతుగృహదాహంబు, హైడింబంబు, బకవధ, చైత్రరథంబు, ద్రౌపదీస్వయంవరంబు, వైవాహికంబు, విదురాగమనంబు, రాజ్యార్ధలాభం, బర్జునతీర్థయాత్ర, సుభద్రాకల్యాణంబు, హరణహారిక, ఖాండవదహనంబు, మయదర్శనంబు, సభాపర్వంబు, మంత్రపర్వంబు, జరాసంధవధ, దిగ్విజయంబు, రాజసూయం, బర్ఘ్యాభిహరణంబు, శిశుపాలవధ, ద్యూతం, బనుద్యూతం, బారణ్యంబు, కిమ్మీరవధ, కైరాతం, బింద్రలోకాభిగమనంబు, ధర్మజతీర్థయాత్ర, జటాసురవధ, యక్షయుద్ధం, బాజగరంబు, మార్కండేయోపాఖ్యానంబు, సత్యాద్రౌపదీసంవాదంబు, ఘోషయాత్ర ప్రాయోపవేశంబు, వ్రీహిద్రోణకాఖ్యానంబు, ద్రౌపదీహరణంబు, కుండలాహరణం, బారణేయంబు, వైరాటంబు, కీచకవధ, గోగ్రహణం, బభిమన్యువివాహం, బుద్యోగంబు, సంజయయానంబు, ధృతరాష్ట్రప్రజాగరణంబు, సానత్సుజాతంబు, యానసంధి, భగవద్యానంబు, సేనానిర్యాత్ర, యులూకదూతాభిగమనంబు సమరథాతిరథసంఖ్యానంబు, కర్ణభీష్మవివాదం, బంబోపాఖ్యానంబు, జంబూఖండవినిర్మాణంబు, భూమిపర్వంబు, భీష్మాభిషేకంబు, భగవద్గీత, భీష్మవధ, ద్రోణాభిషేకంబు, సంశప్తకవధ, అభిమన్యువధ, ప్రతిజ్ఞాపర్వంబు, జయద్రథవధ, ఘటోత్కచవధ, ద్రోణవధ, నారాయణాస్త్రప్రయోగంబు, కర్ణపర్వంబు, శల్యపర్వంబు, హ్రదప్రవేశంబు, గదాయుద్ధంబు, సారస్వతంబు, సౌప్తికపర్వం, బైషీకంబు, జలప్రదానంబు, స్త్రీపర్వంబు, శ్రాద్ధపర్వంబు, రాజ్యాభిషేకంబు, చార్వాకనిగ్రహంబు, గృహప్రవిభాగంబు, శాంతిపర్వంబు, రాజధర్మానుకీర్తనం, బాపద్ధర్మంబు, మోక్షధర్మం, బానుశాసనికంబు, భీష్మస్వర్గారోహణం, బాశ్వమేధికం, బనుగీత,**

యాశ్రమవాసంబు, పుత్త్రసందర్శనంబు, నారదాగమనంబు, మౌసలంబు, మహాప్రస్థానికంబు, స్వర్గారోహణంబు, హరివంశంబు, భవిష్యత్పర్వంబు నను శతపర్వంబులు గలిగి. 33

వివరణ: అనుక్రమణిక అంటే విషయసూచిక. ఇది ఒకగ్రంథంలో ఏ విషయం తరువాత ఏ విషయం వస్తుందో క్రమంగా తెల్పుతుంది. సంస్కృతభారతంలో నూరు ఉపపర్వాలు ఉన్నవి. వాటిలో 98 ఉపపర్వాలను భారత కవిత్రయంవారు 18 పర్వాలుగా రచించారు. హరివంశ భవిష్యత్పర్వాలను ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశ మనేపేరుతో అనువదించాడు. అందులో విష్ణుపర్వంకూడా ఉన్నది. నన్నయ దానిని నూరుపర్వాలలో పేర్కొని ఉండలేదు. సంస్కృతభారతంలోని నూరుపర్వాలలో దేనితరువాత ఏది వస్తుందో ఈ పర్వానుక్రమణికలో తెల్పబడింది.

ప్రతిపదార్థం: ఆదియున్= ఆవ్యాసుడు రచించిన భారతమును, 1. పౌష్యంబు= ఉదంకుడు గురుపత్నికొరకు పౌష్యుడనే రాజుదేవికుండలాలను తెచ్చిన వృత్తాంత మీపర్వంలో ఉంటుంది. 2. పౌలోమంబు= పులోము డనే రాక్షసుడు భృగుపత్ని యైన పులోమ నెత్తుకొనిపోతూఉండగా ఆమెగర్భంనుండి జారి చ్యవనుడు జన్మించినవృత్తాంతంతో కూడింది; 3. ఆస్తీకంబు= ఆస్తీకు డనే జరత్కారుకుమారుడు జనమేజయుడు చేసే సర్పయాగాన్ని మాన్పించినకథ ఇందులో ఉంటుంది; 4. ఆది, వంశ+అవతారంబు= మొదటివంశాలపుట్టుక; ఇందులో వ్యాసుడిజన్మం, దేవతలు దైత్యులు, దానవులు, మునులు, యక్షులు, పక్షులు, గంధర్వులు మొదలైనవారిపుట్టుక, వారిఅంశాలతో పుట్టినవారిచరిత్ర, రాజవంశోత్పత్తి మొదలైన వృత్తాంతాలు ఉంటాయి; 5. సంభవపర్వంబు= భీష్ముడు, చిత్రాంగద విచిత్ర వీర్యులు, ధృతరాష్ట్రపాండురాజులు, విదురుడు, పాండవకౌరవులు, కృపద్రోణులు మొదలైన వారి జన్మవృత్తాంతాలతో కూడినపర్వం; 6. జతుగృహదాహంబు= లక్కయింటిని తగులబెట్టటం; 7. హైడింబంబు= విదురుడు ఉపదేశించినమార్గంలో పాండవులు వారణావతంనుండి వెలువడి వెడలటం, భీముడు హిడింబాసురుడిని వధించి హిడింబను వివాహమాడటం మొదలైన వృత్తాంతాలు ఇందులో ఉంటాయి; 8. బకవధ= ఏకచక్రపురంలో భీముడు బకాసురుడిని చంపటం; 9. చైత్రరథంబు= అంగారపర్ణుడనే గంధర్వుడు దగ్ధరథు డై చిత్రరథుడనే పేరుంచుకొని అర్జునుడితో సఖ్యంచేయటం, వసిష్ఠౌర్వోపాఖ్యానం, తపతీసంవరణోపాఖ్యానం చెప్పటం, అతనిఉపదేశం అనుసరించి పాండవులు ధౌమ్యుడిని పురోహితునిగా వరించటం ఇందులో ఉన్నవి. 10.ద్రౌపదీస్వయంవరంబు= ద్రుపదుడు ద్రౌపదీస్వయం వరాన్ని చాటగా అందులో అర్జునుడు మత్స్యయంత్రాన్ని భేదించటం, ద్రౌపది అతడిని వరించటం, ఇందులో ఉన్నవి. 11. వైవాహికంబు= పాండవులు ద్రౌపదిని వివాహమాడటం. 12. విదుర+ఆగమనంబు= విదురుడిరాక; ధృతరాష్ట్రుడు అర్ధరాజ్య మివ్వటానికి నిశ్చయించి పాండవులను తోడితెమ్మని విదురుడిని పంపగా, విదురుడు ద్రుపదుడినగరానికి రావటం ఇందుంటుంది. 13. రాజ్య+అర్ధ, లాభంబు= పాండవులు అర్ధ(సగం)రాజ్యం పొందటం; 14. అర్జున, తీర్థ, యాత్ర= నారదుడు చేసిన నియమాన్ని అనుసరించి ద్వాదశమాసికవ్రతాన్ని పాటించటానికై అర్జునుడు తీర్థయాత్రలు సేవించటానికై పోవటం; 15. సుభద్రా, కల్యాణంబు= సుభద్రయొక్కవివాహం, సన్న్యాసివేషంలో అర్జునుడు ద్వారకకు వెళ్ళటం, కృష్ణుడిసాయంతో సుభద్రను తీసికొనిపోవటం, సుభద్రార్జునులవివాహం ఈ పర్వంలో ఉన్నవి. 16. హరణ, హారిక= వివాహకాలంలో అల్లుడికీ, ఆడుబిడ్డకూ ఈయబడే ధనం హరణం. దీని వికృతి అరణం. బలరామకృష్ణాదులు సుభద్రకు అరణం తెచ్చిఇవ్వటం ఈ పర్వంలో ఉన్నది. 17. ఖాండవ, దహనంబు= అగ్నిదేవుడికోరిక ననుసరించి అర్జునుడు ఇంద్రుడిఖాండవవనాన్ని దహించటం. 18. మయ, దర్శనంబు= మయుడిని చూడటం, మయుడు నముచి అనే దానవుడి తమ్ముడు, దానవ విశ్వకర్మ. ఖాండవదహనసమయంలో ఇతడు అర్జునుడిని శరణుపొందగా అర్జునుడు ఇతనిని రక్షించాడు. మయుడు, అశ్వసేనుడు, మందపాలసుతులైన నలుగురు శార్ఙ్గకులు- ఈఆరుగురే ఖాండవదహనసమయంలో రక్షింపబడ్డారు. ఈపదునెనిమిదీ ఆదిపర్వంలోని ఉపపర్వాలు. 19. సభాపర్వంబు= ధర్మరాజుకు మయుడు అపూర్వ మైన సభను నిర్మించి ఇవ్వటం, నారదుడు అరుగుదెంచి దిక్పాలకులసభలను వర్ణించి చెప్పటం ఇందులో ఉన్నవి. 20. మంత్ర, పర్వంబు= ధర్మరాజు రాజసూయయాగాచరణాన్ని గురించి కృష్ణుడితో

ఆలోచించటం ఇందులో ఉన్నది. 21. జరాసంధవధ= కృష్ణుడు భీమార్జునులతో వెళ్ళి భీమునిచేత జరాసంధుడిని చంపించటం ఇందులోని విషయం. 22. దిక్, విజయంబు= రాజసూయయాగాచరణానికి ముందు భీమార్జునాదులు సర్వదిక్కులలో ఉన్నరాజులను జయించి ధనం తేవటం; 23. రాజసూయంబు= ధర్మరాజు రాజసూయయాగం చేయటం; 24. అర్ఘ్య+అభిహరణంబు= అర్ఘ్యము - అంటే పూజకు తగినవస్తువు; అభిహరణము= తెచ్చుట; భీష్మునిఉపదేశప్రకారం రాజసూయయాగంలో ధర్మజుడు అర్ఘ్యాన్ని శ్రీకృష్ణుడికి ఇవ్వటం; 25. శిశుపాల, వధ= శిశుపాలుడు అధిక్షేపించి నిందించగా కృష్ణుడు శిశుపాలుడిని వధించటం; 26. ద్యూతంబు= మయసభను చూచి అసూయతో కృశించిన దుర్యోధనుడిని 'జూదంలో ఓడించి పాండవరాజ్యమంతా నీకు వశమయ్యేటట్లు చేస్తా' నని శకుని ఓదార్చటం, విదురుడు ఇష్టంలేకపోయినా ధృతరాష్ట్రుని ఆజ్ఞచేత ధర్మరాజును ద్యూతానికి తీసికొని రావటం, ధర్మజుడు శకునితో జూదమాడి సర్వస్వాన్నీ ఒడ్డి ఓడిపోవటం ఇందలి విషయాలు. 27. అనుద్యూతంబు= తిరిగి జూదమాడటం, ధృతరాష్ట్రుడు ద్రౌపదికి కోరినవరా లివ్వటం, ధర్మరాజు శకునితో రెండవమారు జూదమాడి ఓడిపోవటం ఇందులో ఉన్నవి. ఈ తొమ్మిదీ సభాపర్వంలోని ఉపపర్వాలు. 28. ఆరణ్యంబు= పాండవులు ద్రౌపదితోకూడి అరణ్యవాసానికి వెళ్ళటం. 29. కిమ్మీర, వధ= అరణ్యంలో భీముడు కిమ్మీరు డనేరాక్షసుడిని వధించటం; కిమ్మీరుడు బకాసురుడి తమ్ముడు, హిడింబుడిమిత్రుడు; 30. కైరాతంబు= కిరాతరూపంలో ఉన్న శివుడికి సంబంధించింది. అర్జునుడు దివ్యాస్త్రాలు పొందటానికై తపస్సుచేయటానికి పోవటం, కిరాతరూపంలో ఉన్న శివుడితో పోరి అతడిని మెప్పించి పాశుపతాస్త్రాన్ని పొందటం అనేవిషయాలు ఇందులో ఉన్నవి. 31. ఇంద్ర, లోక+అభిగమనంబు= పాశుపతాస్త్రలాభానంతరం అర్జునుడు ఇంద్రుడి ఆహ్వానాన్ని మన్నించి మాతలి తెచ్చిన రథంమీద ఇంద్రలోకానికి (స్వర్గానికి)వెళ్ళటం; 32. ధర్మజ, తీర్థయాత్ర= రోమశుడు అర్జునుడి కుశలవార్త తెలిపినపిమ్మట ధర్మజుడు వివిధతీర్థాలను దర్శించటానికి పోవటం; 33. జటాసురవధ= సౌగంధికాపహరణం తరువాత బ్రాహ్మణవేషంతో పరశురామశిష్యుడ నని వచ్చి తమ కపకారం చేసిన జటాసురుడిని భీముడు వధించటం; 34. యక్షయుద్ధంబు= పాండవులు మాల్యవంత మనే పర్వతంమీద విహరించేటప్పుడు ద్రౌపదికోరిక తీర్చటానికి పంచవర్ణసురభికుసుమాలను తీసికొనిరావటానికి కుబేరనగరానికి వెళ్ళి మణిమంతుడు మొదలైన యక్షరాక్షసులతో యుద్ధం చేయటం; 35 ఆజగరంబు= అజగర మంటే పెద్దపాము, కొండచిలువ. దానికి సంబంధించిన పర్వం. మునిశాపంవలన అజగర మైన నహుషుడు భీముడిని పట్టుకొనగా, ధర్మరాజు వెదకటానికి వెళ్ళి, నహుషప్రశ్నలకు సమాధానాలు చెప్పి, అతనివలన అధ్యాత్మరహస్యాన్ని తెలిసికొనటం. 36. మార్కండేయ+ఉపాఖ్యానంబు= మార్కండేయమహర్షి పాండవులయొద్దకు వచ్చి బ్రాహ్మణప్రభావాన్నీ, వివిధఉపాఖ్యానాలను చెప్పటం; 37. సత్యా, ద్రౌపదీ, సంవాదంబు= సత్యభామకూ, ద్రౌపదికీ జరిగిన సంభాషణం; ద్రౌపది సత్యభామకు పతివ్రతాధర్మాలను చెప్పటం; 38. ఘోషయాత్ర= ఘోషమంటే గొల్లపల్లె, ఆవులమంద, కర్ణసౌబల దుర్యోధనాదులు పాండవులను అధిక్షేపించటానికై ఆవులమందను చూచే నెపంతో ద్వైతవనానికి పోవటం; 39. ప్రాయోపవేశంబు= మరణించటంకొరకు ఆహారాది సర్వకర్మలను విడిచి కూర్చుండటం; అవమానం పొందిన దుర్యోధనుడు ప్రాయోపవేశం చేయగా అతడిని కృత్య పాతాళానికి తీసికొనిపోవటం; 40. వ్రీహి, ద్రోణక+అఖ్యానంబు= వ్రీహి అంటే ధాన్యం(వడ్లు), ద్రోణకం అంటే తూము(కొలమానం), ఆఖ్యానం అంటే కథ; వ్యాసుడు ధర్మరాజుకు ముద్గలు డనే విప్రుడు ఉంఛవృత్తిచేత పాడ్యమిమొదలు పదునాలుగుదినాలు ఒక్కొక్కగింజచొప్పున తూమెడువడ్లు సమకూర్చి పర్వదినాన వండించి దేవతలకూ, పితరులకూ పూజలుచేసి, అతిథులకు అన్నంపెట్టి మిగిలినఅన్నంతో సకుటుంబంగా దేహయాత్ర నడపుతూ ఉండగా దుర్వాసుడు అరుదెంచి ఆరుపర్వములు భుజించి అతనియందు ఏ లోపాన్నీ కనలేక 'మేనితో స్వర్గానికి ఏగుదు' వని చెప్పి వెడలినకథ తెల్పటం. 41. ద్రౌపదీ, హరణంబు= సైంధవుడు ద్రౌపదిని బలాత్కారంగా ఎత్తుకొనిపోవటం. 42. కుండల+ఆహరణంబు= పాండవులకు హితం చేయవలె ననే కోరికతో ఇంద్రుడు బ్రాహ్మణవేషంతో వచ్చి కర్ణుడికుండలాలను గ్రహించటం; 43. అరణేయంబు= త్రచ్చి నిప్పుపుట్టించే కొయ్యకు అరణి అని పేరు. చెట్టుకొమ్మకు తగిలించిన తన అరణిని ఒకమృగం కొనిపోగా దానిని తెచ్చిఇమ్మని ఒకబ్రాహ్మణుడు వేడగా ధర్మజాదులు ఆ మృగాన్ని తరుముకొని పోవటం. అది అదృశ్య మవటం, యక్షప్రశ్నలు - అనేఅంశాలు ఈ పర్వంలో ఉన్నవి. ఈ విధంగా ఆరణ్యపర్వంలో

గల ఉపపర్వాలసంఖ్య పదహారు(16). 44. వైరాటంబు= విరాటునికి సంబంధించినది; పాండవులు అజ్ఞాతవాసం చేయటానికి విరటుడినగరానికి వెళ్ళటం; 45. కీచక, వధ= సైరంధ్రిగా ఉన్న ద్రౌపదిని వలచిన కీచకుడిని భీముడు సంహరించుట; 46. గో, గ్రహణంబు= దుర్యోధనాదులు విరాటుడి గోవులను గ్రహించిపోతూ ఉండగా అర్జునుడు ఉత్తరుడితో వెడలి కౌరవసేనలను ఓడించి గోవులను మరల్చటం; అంతకుముందు దక్షిణగోగ్రహణం; 47. అభిమన్యు, వివాహంబు= అభిమన్యుడు విరాటనందన ఐన ఉత్తరను పెండ్లాడటం. ఈవిధంగా విరాటపర్వంలో నాలుగుఅంతఃపర్వాలు ఉన్నవి. 48. ఉద్యోగంబు= ప్రయత్నం; ఉద్యోగపర్వంలో మొదట సంధికొరకు ప్రయత్నం, చివర యుద్ధంకొరకు ప్రయత్నం జరిగినవి; 49. సంజయ, యానంబు= సంజయుడు సంధికై ఉపప్లావ్యంలో ఉన్నపాండవులకడకు పోవటం; 50. ధృతరాష్ట్రప్రజాగరణంబు= సంజయుడు పాండవులయొద్దనుండి వచ్చి ధృతరాష్ట్రుడి ఉపేక్షయే యుద్ధోపద్రవానికి కారణ మని చెప్పి మరునాడు వివరాలను తెలుపుతా నని చెప్పి వెడలిపోతాడు; భయంచేత ధృతరాష్ట్రుడికి నిద్ర పట్టలేదు; అతడు మేల్కొనిఉండి విదురుడిని పిలిపించి నీతులు బోధింపుమన్నాడు. ప్రజాగరణ మంటే నిద్రపోకుండా మేల్కొని ఉండటం; 51. సానత్సుజాతంబు= సనత్సుజాతుడు అరుదెంచి ధృతరాష్ట్రుడికి ధర్మతత్త్వాన్ని బోధించటం; ఇదే సనత్సుజాతీయం; 52. యాన, సంధి= శ్రీకృష్ణుడు హస్తినాపురానికి వెళ్ళి పాండవులసంధియత్నాన్ని కురుసభలో వివరించవలె నని ధర్మరాజాదులు ప్రార్థించే విషయాలు ఇందులో ఉన్నవి; 53. భగవత్, యానంబు= భగవంతుడైన శ్రీకృష్ణుడు సంధికొరకు హస్తినాపురానికి పోవటం; 54. సేనా, నిర్యాత్ర= సేనల సమీకరణం; 55. ఉలూక, దూత, అభిగమనంబు= ఉలూకుడు శకునికుమారుడు; అతడు దూతగా ధృతరాష్ట్రుడు పంపగా పాండవులకడకు అరుదెంచటం; 56. సమరథ, అతిరథ, సంఖ్యానంబు= ఒకవిలుకాడితో సమంగా నిలిచి పోరగలిగిన యోధుడు సమరథుడు. పలువురువిలుకాండ్రతో పోరగలిగిన యోధుడు అతిరథుడు. కౌరవపాండవపక్షాలలో సమరథు లెవరో, అతిరథు లెవరో లెక్కించటం; 57. కర్ణ భీష్మవివాదంబు= భీష్ముడు కర్ణుడిని అర్ధరథుడిగా లెక్కించగా కర్ణుడు కలహించి భీష్ము డున్నంతవరకు యుద్ధం చేయ నని శపథంచేయటం; 58. అంబా+ఉపాఖ్యానంబు= కాశీరాజుకూతులలో పెద్దదైన అంబకథ; ఈ విధంగా ఉద్యోగపర్వంలో పదకొండుఉపపర్వా లున్నవి. 59. జంబూ, ఖండ, వినిర్మాణంబు= మేరుపర్వతంచుట్టూ ఉన్న ఏడుఖండాలలో జంబూఖండ మొకటి. ఆ ఖండముయొక్కనిర్మాణాన్ని గురించి సంజయుడు ధృతరాష్ట్రుడికి ఎరిగించటం; 60. భూమి, పర్వంబు= ఈ పర్వంలో భూమివిస్తారం వివరించబడింది; 61. భీష్మ+అభిషేకంబు= భీష్ముడిని కౌరవసేనకు నాయకునిగా అభిషేకించటం; 62. భగవత్, గీత= కౌరవపక్షాన ఉన్న గురుబంధుమిత్రాదులను చూచి, వారితో పోరాటం చేయజాలనని విషాదాన్ని పొందిన అర్జునుడికి కృష్ణుడు తత్త్వాన్ని బోధించి అతడిని యుద్ధోన్ముఖుడిని చేయటం; భగవంతుడైన శ్రీకృష్ణుడిచే బోధింపబడటంచేత ఈభాగానికి 'భగవద్గీత' అనే పేరు వచ్చింది. అది ఉన్న పర్వం ఇది. 63. భీష్మ, వధ= భీష్ముడిని సంహరించటం (నిజంగా ఇచ్చట భీష్మవధ జరుగలేదు. అర్జునుడు శిఖండిని రథంలో ఉంచుకొని యుద్ధానికి రాగా భీష్ముడు యుద్ధవిముఖుడై శరతల్పగతు డైనాడు). ఈ విధంగా భీష్మపర్వంలో అయిదు ఉపపర్వాలు ఉన్నవి. 64. ద్రోణ+అభిషేకంబు= ద్రోణుడిని సేనానాయకుడిగా అభిషేకించటం; 65. సంశప్తకవధ= (సమ్యక్ శప్త మంగీకారో యస్య సః సంశప్తకః) యుద్ధంనుండి తిరుగ నని శపథం చేసి యుద్ధంచేస్తూ ఇతరులను యుద్ధంచేయకుండా ఆటంకపరిచేవాడు సంశప్తకుడు. అభిమన్యువధకు ముందు అర్జునుడు సంశప్తకులు తొమ్మిది మందితో యుద్ధంచేయటానికి పోయి వారిని వధించటం. 66. అభిమన్యు, వధ= ద్రోణాదులు పలువురు కూడి పద్మవ్యూహాన్ని భేదించిన అభిమన్యుడిని వధించటం; 67. ప్రతిజ్ఞాపర్వంబు= జయద్రథుడు సైంధవుడు. అతడిని చంపుతానని అర్జునుడు శపథం చేసినపర్వం. 68. జయద్రథవధ= సైంధవుడిని వధించటం; 69. ఘటోత్కచవధ= భీముడి కుమారు డైన ఘటోత్కచుడిని వధించటం; 70. ద్రోణవధ= ద్రోణుడిని వధించటం; 71. నారాయణ+అస్త్ర, ప్రయోగంబు= కర్ణుడు సేనానాయకుడుగా ఉన్నాడు. అప్పుడు జరిగిన యుద్ధంతో కూడిన పర్వం. 73. శల్యపర్వంబు= శల్యుడు ఒక్కపగలు సేనానాయకుడుగా ఉన్నాడు. అప్పుడు జరిగిన యుద్ధంతో కూడిన పర్వం. 74. హ్రదప్రవేశంబు= దుర్యోధనుడు జలస్తంభనవిద్యచే మడుగులోకి ప్రవేశించటం; 75. గదాయుద్ధంబు= భీమదుర్యోధనులకు గదాయుద్ధం జరగటం; 76. సారస్వతంబు= సరస్వత్యాది పుణ్యతీర్థసంకీర్తనం; ఈ విధంగా శల్యపర్వంలో నాలుగు ఉపపర్వాలు

ఉన్నవి. 77. సౌప్తికంబు= సుఖంగా నిద్రిస్తున్న ధృష్టద్యుమ్నాది పాంచాలురను, ప్రతివింధ్యాది ద్రౌపదేయులను (ఉపపాండవులను), పాండవామాత్యులను అశ్వత్థామ వధించటం 78. ఐషీకంబు= అశ్వత్థామ, అర్జునుడు పరస్పరం బ్రహ్మ శిరోనామకాస్త్రాలను ప్రయోగించుకోవటం. 79. జలప్రదానంబు= యుద్ధంలో చనిపోయినవారికి జలతర్పణం ఇవ్వటం; (ఇది తెలుగున స్త్రీపర్వం మొదట్లో ఉన్నది). ఈ విధంగా సౌప్తికపర్వంలో మూడుఉపపర్వాలు ఉన్నవి. 80. స్త్రీ, పర్వంబు= యుద్ధంలో మరణించిన వీరులభార్యలు విలపించినపర్వం; 81. శ్రాద్ధపర్వంబు= మృతు లైనకౌరవవీరులకు సంస్కారోదకప్రదానాదికర్మ లొనరించటం; 82.రాజ్య+అభిషేకంబు= ధర్మరాజును రాజుగా అభిషేకించటం; 83. చార్వాక, నిగ్రహంబు= ధర్మరాజును మోసగించటానికై సన్న్యాసివేషంలో వచ్చిన చార్వాకుడనే రాక్షసుడిని బ్రాహ్మణులు హుంకారంతో చంపటం; 84. గృహ, ప్రవిభాగంబు= ధర్మజుడు తనకు పరిపాలనలో తోడ్పడుటకు భీమాదులకు ఆయా బాధ్యతలను విభజించి ఒప్పగించటం. ఈ విధంగా స్త్రీపర్వంలో ఐదు ఉపపర్వాలు ఉన్నవి. వీటిలో చివరి మూడూ తెలుగుభారతంలో శాంతి పర్వంలో మొదట చెప్పబడినవి. 85. శాంతిపర్వంబు= బంధువధచే నిర్వేదం పొందిన ధర్మరాజు శ్రీకృష్ణుడివచనాలు విని శాంతు డైన పర్వం; 86. రాజ, ధర్మ+అనుకీర్తనంబు= శరతల్పగతుడైన భీష్ముడు ధర్మజుడికి రాజుల కందరికి హితా లైన ధర్మాలను చెప్పటం. 87. ఆపత్+ధర్మంబు= ఆపత్ సమయాలలో అనుష్ఠింపదగిన ధర్మాలను భీష్ముడు చెప్పటం; 88. మోక్ష, ధర్మంబు= మోక్షప్రాప్తిహేతువు లైన ధర్మాలు చెప్పటం; ఈ విధంగా శాంతిపర్వంలో నాలుగు ఉపపర్వాలు ఉన్నవి. 89. ఆనుశాసనికంబు= భీష్ముడు ధర్మరాజుకు వివిధధర్మాలు తెల్పటం; 90. భీష్మ, స్వర్గ+ఆరోహణంబు= భీష్ముడు కృష్ణునిఅనుజ్ఞ తీసికొని స్వర్గానికి ఏగటం;- ఈ రెండున్నూ ఆనుశాసనికపర్వంలోని ఉపపర్వాలు. 91. ఆశ్వమేధికంబు= ధర్మరాజు భీష్మాదులను చంపినపాపం పోవటానికై వ్యాసప్రబోధితు డై అశ్వమేధయాగం చేయుటం; 92. అనుగీత= యుద్ధసమయాన చెప్పిన గీతాతత్త్వాన్ని మరచిన అర్జునుడిని మందలించి కృష్ణుడు మరల తత్త్వోపదేశం చేయుటం; ఈరెండున్నూ అశ్వమేధపర్వంలోని ఉపపర్వాలు. 93. ఆశ్రమవాసంబు= ధృతరాష్ట్రుడూ, గాంధారీ రాజ్యాన్ని విడిచి సంజయునితోకూడి ఆశ్రమంలో నివసించటానికి వనానికి పోవటం; 94. పుత్త్రసందర్శనంబు= యుద్ధనిహతు లైన పుత్త్రపౌత్త్రులనందరిని ధృతరాష్ట్రుడు వ్యాసవరప్రసాదంవలన చూచి విగతశోకుఁడయి పరమసిద్ధికి వెడలటం; 95. నారద+ఆగమనంబు= నారదుడిరాక- ఈ విధంగా ఆశ్రమవాసపర్వంలో మూడుఉపపర్వాలు ఉన్నవి. 96. మౌసలంబు= ముసలము అంటే రోకలి; దానికి సంబంధించింది. యాదవులు మదిరాపానమత్తులై సముద్రతీరాన తమలో తాము పోరి మరణించటం; 97. మహత్+ప్రస్థానికంబు= పరీక్షిత్తుకు రాజ్యాభిషేకం చేసి పాండవులు ద్రౌపదీసహితు లై పరమసిద్ధికి వెళ్ళటం. 98. స్వర్గ+ఆరోహణంబు= పాండవాదులు స్వర్గానికి పోవటం; 99. హరివంశంబు; 100. భవిష్యత్పర్వంబు- ఈ రెండింటికి ఖిలపర్వం అనిపేరు. నన్నయ విష్ణుపర్వాన్ని పేర్కొనలేదు. ఎఱ్ఱన ఇందులోని కొంతభాగాన్ని పూర్వార్ధంలోనూ, కొంతభాగం ఉత్తరార్ధంలోనూ చేర్చి హరివంశం రచించాడు. కేసరిమోహన్‌గంగూలిగారు తమ ఆంగ్లానువాదంలో విష్ణుభవిష్యత్ పర్వాలు రెండున్నూ ఖిలవంశ పురాణ మనబడు నని తెల్పియున్నారు. అను, శతపర్వంబులు= పైన పేర్కొనబడిన నూరుపర్వాలు; కలిగి= కలిగియుండి.

తాత్పర్యం: స్పష్టం.

సీ. **ఆయురర్థులకు దీర్ఘాయు రవాప్తియు । నర్థార్థులకు విపులార్థములును**
ధర్మార్థులకు నిత్యధర్మసంప్రాప్తియు । వినయార్థులకు మహావినయమతియుఁ
బుత్త్రార్థులకు బహుపుత్త్రసమృద్ధియు । సంపదర్థుల కిష్టసంపదలును
గావించు నెప్పడు భావించి వినుచుండు । వారికి నిమ్మహాభారతంబు

ఆ. **భక్తియుక్తులైన భాగవతులకు శ్రీ । వల్లభుండు భక్తవత్సలుండు**
భవభయంబు లెల్లఁ బాచి యిష్టార్థసం । సిద్ధిఁ గరుణతోడఁ జేయునట్లు. **34**

ప్రతిపదార్థం: ఈ, మహత్, భారతంబు= ఈ మహాభారతేతిహాసం; ఎప్పుడు= ఎల్లప్పుడున్నూ; భావించి= ధ్యానించి(తలంచి); వినుచున్+ఉండు, వారికి; భక్తి, యుక్తులు+ఐన= భక్తితోకూడిఉండిన; భాగవతులకున్= భగవద్భక్తులకు; భక్త, వత్సలుండు= భక్తులయందు ప్రీతికలవాడు; అగు= అయిన; శ్రీ, వల్లభుండు= లక్ష్మీభర్త అయిన విష్ణువు; భవ, భయంబులు+ఎల్లన్= సంసారం(పుట్టుక) వలని భయాలన్నీ; పాచి= పోగొట్టి; కరుణతోడన్= దయతో; ఇష్ట+అర్థ+సంసిద్ధి= కోరబడిన ప్రయోజనాలయొక్క అధిక మైన లాభాన్ని; చేయు+అట్లు= కలుగజేసేవిధంగా; ఆయుః+అర్థులకున్= ఆయువు కోరేవారికి; దీర్ఘ+ఆయుస్+అవాప్తియున్= దీర్ఘమైన ఆయువుయొక్క పొందుటయున్నూ; అర్థ+అర్థులకున్= ధనం కోరేవారికి; విపుల+అర్థములును= అధికమైనధనాలున్నూ; ధర్మ+అర్థులకున్= ధర్మాన్ని కోరేవారికి; నిత్య, ధర్మ, సంప్రాప్తియున్= శాశ్వత మైన(ఎల్లప్పుడున్నూ) ధర్మముయొక్క లాభమున్నూ; వినయ+అర్థులకున్= వినయం కోరేవారికి; మహత్+వినయ, మతియున్= గొప్పవినమ్రతతోకూడిన బుద్ధియున్నూ; పుత్ర+అర్థులకున్= కొడుకులను కోరేవారికి; బహు, పుత్ర, సమృద్ధియున్= పలువురు కొడుకులయొక్క సంపదయున్నూ; సంపద్+అర్థులకున్= సంపదను(ఐశ్వర్యాన్ని) కోరేవారికి; ఇష్ట, సంపదలును= కోరబడిన సంపదలున్నూ; కావించున్= కలిగించును.

తాత్పర్యం: ఈ మహాభారతం ఎల్లప్పుడున్నూ తలంచి వింటుండేజనులకు, భక్తితో కూడి ఉండే భక్తులకు భక్తులయందు ప్రీతి కల లక్ష్మీప్రియు డైన విష్ణువు దయతో సంసారభయాలన్నింటిని తొలగించి కోరినఫలాల లాభాలను కలుగజేసే విధాన- ఆయుర్దాయాన్ని కోరేవారికి దీర్ఘమైనఆయువుయొక్కలాభాన్నీ, ధనాన్ని కోరేవారికి అధికమైన ధనలాభాలనూ, ధర్మాన్ని కోరేవారికి సంతతధర్మలాభాన్నీ, వినయాన్ని కోరేవారికి గొప్పవినయంతోకూడిన బుద్ధినీ, కుమారులను కోరేవారికి పలువురుకుమారులసంపదయున్నూ, ఐశ్వర్యం కోరేవారికి అభీష్టసంపదలున్నూ కలుగజేస్తుంది.

విశేషం: అలం: ఉపమ. మహాభారతం పంచమవేదం అవటంచేత ఆదరంతో వినేవారికి ఆయురైశ్వర్యపుత్రాదిసంపదలను కలిగిస్తుంది. అట్టిశక్తి అన్నిగ్రంథాలకూ ఉండదు. భారతకథ పుణ్య కథ. దానిని వింటే అఘనిబర్హణ మౌతుంది.

పర్వసంగ్రహము (సం. 1-2-71)

వ. మఱియుఁ బౌష్యోదంకమాహాత్మ్యంబును, భృగువంశకీర్తనంబును, నాగగరుడసంభవంబును, సముద్రమథనంబు, నుచ్చైశ్శ్రవోజన్మంబును, సౌపర్ణోపాఖ్యానంబును, నాస్తీకచరితంబును, జనమేజయ సర్పయాగంబును, శ్రీమహాభారతకథాశ్రవణప్రవృత్తియు, వ్యాసజన్మంబును, దేవదైత్యదానవముని యక్షపక్షిగంధర్వాది నానావిధభూతసంభవంబును, దదంశావతారంబును, రాజవంశానుకీర్తనంబును, యయాతిచరితంబును, భారతవంశానుకీర్తనంబును, గంగాశంతనుసమాగమంబును, వసూత్పత్తియు, స్వర్గగమనంబును, దదంశసంఘాతంబున గాంగేయజన్మంబును, దద్రాజ్యనివర్తనంబును, బ్రహ్మచర్యప్రతిజ్ఞాపరిపాలనంబును, సత్యవతీవివాహంబును, జిత్రాంగదావిచిత్రవీర్యజన్మంబును, జిత్రాంగదరాజ్యాభిషేకంబును, జిత్రాంగదమరణానంతరంబున భీష్ముండు విచిత్రవీర్యుం గౌరవరాజ్యంబున నభిషిక్తుం జేయుటయు, వానిపరోక్షంబునఁ గృష్ణద్వైపాయనమునివలన ధృతరాష్ట్రపాండురాజుల జన్మంబు, నాణిమాండవ్యో పాఖ్యానంబును, ధర్ముండు మాండవ్యశాపంబున శూద్రయోనియందు విదురుం డై పుట్టుటయును, ధృతరాష్ట్రపాండురాజుల వివాహంబును, బాండవధార్తరాష్ట్ర సంభవంబును,

బాండునిర్యాణంబును, గృపద్రోణజన్మకథనంబును, గుమారాస్త్రవిద్యాగ్రహణంబును, గుమారాస్త్ర సందర్శనంబును, గర్ణార్జునుల పరస్పరక్రోధంబును, ద్రుపదగ్రహణమోక్షణంబును, యుధిష్ఠిరు యౌవరాజ్యాభిషిక్తుం జేయుటయు, దుర్యోధనుదుర్మంత్రంబును, వారణావత యాత్రయు, జతుగృహదాహంబును, విదురోపదిష్టద్వారంబునఁ బాండవాపక్రమణంబును, హిడింబాదర్శనంబును, హిడింబువధయును, ఘటోత్కచసంభవంబును, బాండవుల కేకచక్రపురంబున విప్రగృహంబున నజ్ఞాతచర్యయు, బకవధయు, ధృష్టద్యుమ్నద్రౌపదీ జన్మకథనంబును, గృష్ణద్వైపాయన సందర్శనంబును, గంగాతీరంబున నంగారపర్ణు నర్జునుండు జయించుటయుఁ, దాపత్యవసిష్ఠౌర్వోపాఖ్యానంబును, బాండవులు పాంచాలదేశంబునకుం జనుటయు, ద్రౌపదీస్వయంవరంబును, బంచేంద్రోపాఖ్యానంబును, ద్రౌపదీవివాహంబును, విదురాగమనంబును, గృష్ణసందర్శనంబును, రాజ్యార్థలాభంబును, ఖాండవప్రస్థ నివాసంబును, సుందోపసుందోపాఖ్యానంబును, నారదువచనంబున, ద్రౌపదియందు సమయ క్రియయును నర్జునుతీర్థాభిగమనంబును, నులూపీసమాగమంబును, జిత్రాంగదయందు బభ్రువాహను జన్మంబును, ద్వారకాగమనంబును, వాసుదేవానుమతంబున నర్జునుఁడు సుభద్రను వివాహం బగుటయు, సుభద్రాహరణంబును, హరణహారికయు, నభిమన్యుసంభవంబును, గాండీవదేవదత్త దివ్యరథాశ్వ లాభంబును, ఖాండవదహనంబు, నగ్నిభయంబువలన మయభుజంగమోక్షణంబును, మందపాలోపాఖ్యానంబును నను వృత్తాంతంబుల నొప్పి తొమ్మిదివేలుం దొమ్మన్నూటయెనుబదినాలుగు శ్లోకంబులు గలిగి. 35

ప్రతిపదార్థం: ఈవచనంలో ఆదిపర్వంలోని వివిధవిషయాలు చెప్పబడినవి. పౌష్య+ఉదంక, మాహాత్మ్యంబును= పౌష్యు డనే రాజుయొక్కయు, ఉదంకుడనే పైలశిష్యుడియొక్కయూ, మహత్యాన్నీ; భృగువంశ, కీర్తనంబును= భృగు వనే మహర్షియొక్క వంశస్తుతియున్నూ; నాగ, గరుడ, సంభవంబును= పాములయొక్కయూ, గరుత్మంతుని యొక్కయూ పుట్టుకయున్నూ; సముద్ర, మథనంబున్= దేవదానవులు సముద్రాన్ని త్రచ్చుటయునూ; ఉచ్చైశ్శ్రవస్+జన్మంబును= ఉచ్చైశ్శ్రవ మనే పేరుగల ఇంద్రుడితెల్లనిగుఱ్ఱంయొక్కపుట్టుకయున్నూ; సౌపర్ణ+ఉపాఖ్యానంబునున్= గరుడునికి సంబంధించినకథయున్నూ; ఆస్తీక, చరితంబును= ఆస్తీకుడు అనే జరత్కారువుకుమారు డైన మునిచరిత్రమున్నూ; జనమేజయ, సర్ప, యాగంబును= పరీక్షిత్తుకుమారుడైన జనమేజయుడు చేసిన సర్పయజ్ఞమున్నూ, (ఇందులో పాములు అగ్నిలో హోమం చేయబడతాయి); శ్రీ, మహత్, భారత, కథా, శ్రవణ, ప్రవృత్తియున్= శోభాయుక్త మైన మహాభారతంయొక్క వినుట అనే వృత్తాంతాన్నీ; వ్యాస, జన్మంబును= వ్యాసమహర్షియొక్క పుట్టుకయున్నూ; దేవ, దైత్య, దానవ, ముని, యక్ష, పక్షి, గంధర్వ+ఆది, నానా, విధ, భూత, సంభవంబును= దేవతలు, దైత్యులు, దితిపుత్రు లైన రాక్షసులు, దనుసంభవు లైన రాక్షసులు, మునులు, యక్షులు అనే దేవయోని విశేషాలూ, పక్షులు, గంధర్వులు అనే దేవయోనివిశేషాలు మొదలైన పలువిధా లైన జీవుల పుట్టుకయున్నూ; తద్+అంశ, అవతారంబును= దేవదానవులఅంశాలచేత భూమిపై పుట్టినవారిక్రమాన్నీ; రాజ, వంశ+అనుకీర్తనంబును=(వైవస్వతమనువు, వేనప్రముఖు లైన రాజులు, పురూరవుడు, ఆయువు, నహుషుడు, యయాతి, పూరువు మొదలైనవారితోకూడిన) రాజవంశాలయొక్క వివరణాన్నీ; యయాతి, చరితంబును= నహుషపుత్రుడైన యయాతిచరిత్రయున్నూ; భారతవంశ, అనుకీర్తనంబును= శకుంతలాదుష్యంతుల కుమారు డైన భరతుడికి సంబంధించిన భారతవంశంయొక్క స్తుతియున్నూ, (చెప్పటమన్నమాట); గంగా, శంతను, సమాగమంబును= గంగానదీశంతనులకూడికయున్నూ; వసు+ఉత్పత్తియున్= అష్టవసువుల పుట్టుకయున్నూ; స్వర్గ, గమనంబును= వారు స్వర్గానికి పోవటమున్నూ; తత్+అంశ, సంఘాతంబునన్= వసువులఅంశలసమూహంచే(కలయికచేత);

గాంగేయ, జన్మంబును= గంగాపుత్రుడైన భీష్ముడిపుట్టుకయున్నూ; తద్+రాజ్య, నివర్తనంబును= అతని రాజ్యంనుండి మరలటమున్నూ; (భీష్ముడు రాజ్యాన్ని విడవటం); బ్రహ్మచర్య, ప్రతిజ్ఞా, పరిపాలనంబును= భీష్ముడు పెళ్ళిచేసికొనకబ్రహ్మచర్యాన్ని అనుష్ఠిస్తానని ప్రతినచేసి దానిని పాటించుటయున్నూ; సత్యవతీ, వివాహంబును= సత్యవతీశంతనులపెండ్లియున్నూ; చిత్రాంగదా, విచిత్రవీర్య, జన్మంబును= శంతనుడికి సత్యవతియందు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అనే కుమారుల పుట్టుకయున్నూ; చిత్రాంగద, రాజ్య+అభిషేకంబును= శంతనుడి అనంతరం చిత్రాంగదుడిని, రాజ్యానికి రాజుగా అభిషేకించుటయున్నూ; చిత్రాంగదు, మరణ+అనంతరంబునన్= చిత్రాంగదుడిమృతి జరిగినపిమ్మట; భీష్ముండు; విచిత్రవీర్యున్= విచిత్రవీర్యుడిని; కౌరవరాజ్యంబునన్= కౌరవరాజ్యమునందు; అభిషిక్తున్, చేయుటయున్= అభిషేకింపబడినవాడినిగా (రాజుగా) చేయుటయున్నూ; వాని, పరోక్షంబునన్= ఆవిచిత్రవీర్యుడి మరణానంతరం; కృష్ణద్వైపాయన, మునివలనన్= వ్యాసమునివలన; ధృతరాష్ట్ర, పాండురాజుల; జన్మంబున్= పుట్టుకయున్నూ, ఆణిమాండవ్య+ఉపాఖ్యానంబును=ఆణి అంటే ఇరుసుచివర ఉండే చీల; మాండవ్యు డనేమునిని దొంగ అని భ్రమించి రాజు శూలప్రోతుడిని కావించి, తరువాత తనతప్పును తెలిసికొని, శూలాన్ని తీసివేయటానికి యత్నించాడు, కాని, దాన్ని తీయటానికి వీలుకలుగలేదు. అప్పుడు రాజు దానిమొదలు నెమ్మదిగా ఖండింపజేశాడు; శూలశేషం మాండవ్యుని కంఠపార్శ్వంలోపల ఉండిపోయింది. అందుచేత అతనికి ఆణిమాండవ్యు డనే పేరు కలిగింది. అతనికథయున్నూ; ధర్మండు= యముడు; మాండవ్య, శాపంబునన్= మాండవ్యుడిచ్చినశాపంచేత; శూద్రయోనియందున్= శూద్రగర్భంలో; విదురుండు+ఐ; పుట్టుటయును; ధృతరాష్ట్ర పాండురాజుల; వివాహంబును= పెండ్లియున్నూ; పాండవ, ధార్తరాష్ట్రసంభవంబును= పాండురాజకుమారు లైన ధర్మరాజాదులయున్నూ, ధృతరాష్ట్రునికుమారు లైన దుర్యోధనాదులయున్నూ, పుట్టుక; పాండు, నిర్యాణంబును= పాండురాజు మృతియున్నూ; కృప, ద్రోణ, జన్మకథనంబును= కృపాచార్యుడియొక్కయు, ద్రోణుడియొక్కయు పుట్టుకలు చెప్పుటయున్నూ; కుమార+అస్త్ర, విద్యా, గ్రహణంబును= ధర్మరాజ దుర్యోధనాది రాజకుమారులు అస్త్రవిద్యను గ్రహించుటయున్నూ (అభ్యసించుటయున్నూ); కుమార+అస్త్ర+సందర్శనంబును= పై రాజకుమారులఅస్త్రవిద్యను చూడటమున్నూ; కర్ణ+అర్జునుల, పరస్పర, క్రోధంబును= కర్ణునియొక్కయు అర్జునునియొక్కయు అన్యోన్యకోపమున్నూ; ద్రుపద, గ్రహణ, మోక్షంబును= అర్జునుడు ద్రుపదుడిని పట్టుకొని రాగా ద్రోణుడు విడిపించుటయున్నూ; యుధిష్ఠిరు= ధర్మరాజును; యౌవరాజ్య+అభిషిక్తున్, చేయుటయున్= యౌవరాజ్యపదవియందు అభిషేకింపబడినవాడినిగా చేయటమున్నూ; దుర్యోధను, దుర్మంత్రంబును= దుర్యోధనుడి చెడ్డఆలోచనయున్నూ; వారణావత, యాత్రయున్= వారణావత మనే నగరానికి పాండవులు వెళ్ళటమున్నూ; జతు, గృహ, దాహంబును= లక్కయింటిని తగులపెట్టుటయున్నూ; విదుర+ఉపదిష్ట, ద్వారంబునన్= విదురుడిచేత ఉపదేశింపబడిన ద్వారంనుండి; పాండవ, అపక్రమణంబును= పాండవులు తొలగిపోవుటయున్నూ; హిడింబా దర్శనంబును= హిడింబ అనే రాక్షస స్త్రీని చూచుటయున్నూ; హిడింబు, వధయును= హిడింబఅన్నయైన హిడింబుడిని చంపుటయున్నూ; ఘటోత్కచ, సంభవంబును= హిడింబయందు ఘటోత్కచుడు పుట్టుటయున్నూ; పాండవులకున్, ఏకచక్రపురంబునన్= ఏకచక్రపుర మనే నగరంలో; విప్ర, గృహంబునన్= బ్రాహ్మణునిఇంటియందు; అజ్ఞాత, చర్యయున్= ఇతరులచేత తెలియబడకుండ చరించుటయున్నూ; బక, వధయున్= బకాసురుడిని భీముడు చంపుటయున్నూ; ధృష్టద్యుమ్న, ద్రౌపదీ, జన్మ, కథనంబును= ధృష్టద్యుమ్నునియొక్కయు ద్రౌపదియొక్కయు పుట్టుకలను చెప్పుటయున్నూ; కృష్ణద్వైపాయన, సందర్శనంబును= వ్యాసుని చూచుటయున్నూ; గంగా, తీరంబునన్= గంగానది ఒడ్డున; అంగారపర్ణున్= అంగారపర్ణుడనే గంధర్వుడిని; అర్జునుండు; జయించుటయున్= జయించుటయున్నూ; తాపత్య, వసిష్ఠ, ఔర్వ+ఉపాఖ్యానంబును= తపతీసంవరణులకు కురువు పుట్టాడు. అతడు తాపత్యుడు. అతనియొక్కయు, వసిష్ఠునియొక్కయు, ఔర్వుని (ఒకభృగుపత్నికుమారుడు) యొక్కయు కథలున్నూ; పాండవులు; పాంచాల, దేశంబునకున్= ద్రుపదు డేలే పాంచాలదేశానికి; చనుటయున్= వెళ్ళుటయు; ద్రౌపదీ, స్వయంవరంబును= ద్రౌపది స్వయంవరమున్నూ (తనంత తాను మగని వరించే వివాహాన్ని); పంచ+ఇంద్ర+ఉపాఖ్యానంబును= ఐదుగు రింద్రులు పాండవులుగా జన్మించినకథయున్నూ; ద్రౌపదీ, వివాహంబును= ద్రౌపదియొక్క పెండ్లియున్నూ; విదుర+ఆగమనంబును= విదురునియొక్కరాకయున్నూ; కృష్ణ, సందర్శనంబును= కృష్ణుడిని

చూచుటయున్నూ; రాజ్య+అర్ధ, లాభంబును= రాజ్యంలోని సగంభాగాన్ని పొందుటయున్నూ; ఖాండవప్రస్థ, నివాసంబును= ఇంద్రప్రస్థపురంలో నివసించుటయున్నూ; సుంద+ఉపసుంద+ఉపాఖ్యానంబును= సుందుడు, ఉపసుందు డనే సోదరుల కథయున్నూ; నారదు, వచనంబునన్= నారదునిమాటచే (మాటననుసరించి); ద్రౌపదియందున్= ద్రౌపదివిషయంలో; సమయ, క్రియయును= ప్రతిజ్ఞచేయుటయున్నూ; అర్జును, తీర్థయాత్ర+అభిగమనంబును= సమయభంగం జరగటంచేత అర్జునుడు తీర్థాలను సేవించటానికి పోవటం; ఉలూపీ, సమాగమంబును= అర్జునుడు ఉలూపి అనే నాగకన్యను కూడుటయున్నూ; చిత్రాంగదయందు; బభ్రువాహను, జన్మంబును= బభ్రువాహను డనే కుమారుడి పుట్టుకయున్నూ; ద్వారకా, గమనంబును= ద్వారకానగరానికి అరుగుటయున్నూ; వాసుదేవ+అనుమతంబునన్= కృష్ణుడిసమ్మతిచేత; సుభద్రను= సుభద్రను; వివాహంబు+అగుటయున్= పెండ్లిఅగుటయున్నూ; సుభద్రా, హరణంబును= అర్జునుడు సుభద్రను కొనిపోవుటయున్నూ; హరణ, హారికయున్= కృష్ణబలరామాదులు సుభద్రకు అరణాన్ని తెచ్చుటయున్నూ; అభిమన్యు, సంభవంబును= అర్జునుడికి సుభద్రయందు అభిమన్యు డనే కుమారుడు పుట్టుటయున్నూ; గాండీవ, దేవదత్త, దివ్య, రథ+అశ్వ, లాభంబును= అర్జునుడు గాండీవ మనే ధనస్సును, దేవదత్త మనే శంఖాన్నీ; దేవతాసంబంధు లైన రథాన్నీ, గుఱ్ఱాలనూ పొందుటయున్నూ; ఖాండవ, దహనంబును= ఖాండవవనాన్ని దహించుటయున్నూ; అగ్ని, భయంబువలనన్= అగ్నివలనిభయంనుండి; మయ, భుజంగ, మోక్షణంబును= మయు డనే నముచితమ్ముడిని, తక్షకుడికుమారు డైన అశ్వసేనుడిని విడిపించుటయున్నూ; మందపాల+ఉపాఖ్యానంబును= మందపాలు డనే మునికథయున్నూ; అను, వృత్తాంతంబులన్= అనేకథలతో; ఒప్పి= అలరి, అందమై; తొమ్మిదివేలున్, తొమ్మన్నూట, ఎనుబది, నాలుగు= 9984; శ్లోకంబులు; కలిగి= పొంది.

తాత్పర్యం: స్పష్టం.

విశేషం: నన్నయ తాను అనుసరించిన భారతప్రతిలో ఏపర్వంలో ఎన్నిశ్లోకా లున్నవో తెల్పియున్నాడు. ఈ లెక్క తరువాత సంస్కృతభారతాన్ని పరిశోధించినవారికి మిక్కిలి ఉపయోగకర మైనది.

క. మదిఁ బౌష్యపర్వ మాదిగఁ బదునెనిమిదిపర్వములను బర్వి మనఃప్రీ
తిద మగుచు నాదిపర్వం । బది వినఁగా నొప్పు భారతాద్యం బగుచున్. 36

ప్రతిపదార్థం: మదిన్= మనస్సులో; పౌష్యపర్వము+ఆదిగన్= పౌష్యపర్వం మొదలుగా; పది+ఎనిమిది, పర్వములను= పదునెనిమిది(18)పర్వాలతో; (ఇవి సంస్కృతభారతంలోని 18 ఉపపర్వాలు. తెలుగుభారతంలో ఆదిపర్వము అనే పేరేకాని ఈ ఉపపర్వాలపే ర్లుండవు); పర్వి= ఒప్పి; మనస్+ప్రీతి, దము+అగుచున్= మనస్సుకు ప్రీతి నిచ్చేది ఔతూ; ఆది, పర్వంబు+అది+ఆ ఆదిపర్వం; భారత+ఆద్యంబు= భారతంలోని మొదటిది; అగుచున్; వినగాన్= వినటానికి; ఒప్పున్= అలరారును, తగును.

తాత్పర్యం: మనస్సులో పౌష్యపర్వంమొదలుగా గల పదునెనిమిదిఉపపర్వాలతో ఒప్పి, పఠితలమనస్సులకు ప్రీతిని కలిగించేదియున్నూ, భారతంలోని మొదటిపర్వమున్నూ ఔతూ ఆ ఆదిపర్వం వినటానికి ఇంపుగా ఉంటుంది.

విశేషం: 'మదిన్' అనేమాట సంస్కృతభారతంలోని పేర్లనుబట్టి ఆ పదునెనిమిది పర్వాలను మనస్సులో ఊహించవలె నని సూచిస్తున్నది.

వ. మఱియు ధర్మరాజునకు సభాప్రాప్తియుఁ, గింకరదర్శనంబును, నారదువలన లోకపాలసభాశ్రవణంబును, రాజసూయమహాధ్వరారంభంబును, జరాసంధవధయును, గిరివ్రజనిరుద్ధు లైన రాజులఁ గృష్ణుఁడు

విడిపించుటయును, దిగ్విజయంబును, రాజసూయంబు, నర్ఘ్యాభిహరణంబును, శిశుపాలవధయును, రాజసూయవిభూతికి దుఃఖితుం డై సభాస్ఖలితుం డై యున్న దుర్యోధనుం జూచి ద్రౌపదీభీమసేనులు నగుటయును, దత్కారణంబున జూదం బాడుటయు, నందు శకునికైతవంబున ధర్మరాజపరాజయంబును, ద్యూతదుఃఖార్ణవమగ్ను లైన పాండవులం బాంచాలి యుద్ధరించుటయును, బునర్ద్యూతపరాజితు లై పాండవులు వనవాసగతు లగుటయు నను వృత్తాంతంబుల నొప్పి నాలుగువేలున్ మున్నూటపదునొకండు శ్లోకంబులు గలిగి. 37

ప్రతిపదార్థం: మఱియున్; ధర్మరాజునకు; సభాప్రాప్తియున్= సభాలాభమున్నూ; కింకర, దర్శనంబును= రాక్షసకింకరులను చూచుటయున్నూ (మయుడు తాను నిర్మించినసభను ఎనిమిదివేల రాక్షసకింకరులచేత మోయించుకొని వచ్చాడు); నారదువలనన్; లోక, పాల, సభా, శ్రవణంబును= ఇంద్రాదిలోకపాలకులయున్నూ, బ్రహ్మయొక్కయున్నూ సభలనుగూర్చి వినుటయున్నూ; రాజసూయ, మహత్, అధ్వర, ఆరంభంబును= రాజసూయ మనే గొప్ప యజ్ఞంయొక్క ప్రారంభమున్నూ; జరాసంధ, వధయును= జరాసంధు డనే మగధరాజును సంహరించుటయున్నూ; గిరివ్రజ, నిరుద్ధులు+ఐన గిరివ్రజపట్టణంలో జరాసంధుడిచేత బంధింపబడిన; రాజులన్; కృష్ణుండు; విడిపించుటయును= బంధవిముక్తులనుచేయుటయున్నూ; దిక్, విజయంబును= భీమాదులు నాలుగుదిక్కులను జయించుటయున్నూ; రాజసూయంబును= రాజసూయయాగమున్నూ; అర్ఘ్య+అభిహరణంబును= కృష్ణుడు పూజాద్రవ్యాలను గ్రహించుటయున్నూ, శిశుపాల, వధయును= అతడు చేదిపతియైన శిశుపాలుడిని చంపుటయున్నూ; రాజసూయ, విభూతికిన్= రాజసూయయాగవైభవానికి; దుఃఖితుండు+ఐ= అసూయచేత శోకించినవాడై; సభా, స్ఖలితుండు+ఐ, ఉన్న= మయసభలో జారిపడి ఉన్న; దుర్యోధనున్; చూచి; ద్రౌపదీ, భీమసేనులు= ద్రౌపదియు, భీముడున్నూ; నగుటయును= పరిహసించుటయున్నూ; తద్, కారణంబునన్= (వారు నవ్వినారనే) ఆహేతువుచే; జూదంబు+ఆడుటయున్; అందున్= జూదంలో; శకుని, కైతవంబునన్= దుర్యోధనుడిమేనమామ ఐన శకుని కపటం వలన; ధర్మరాజ, పరాజయంబును= ధర్మరాజు ఓడుటయున్నూ; ద్యూత, దుఃఖ+అర్ణవ, మగ్నులు+ఐన= జూదంవలన కలిగిన దుఃఖ మనే సముద్రంలో మునిగినవారైన; పాండవులన్; పాంచాలి= పాంచాలరాజు కూతురైనద్రౌపది; ఉద్ధరించుటయును= పైకితీయుటయున్నూ; పునర్+ద్యూత, పరాజితులు+ఐన= మరల ఆడినజూదంలో ఓడిన; పాండవులు; వన, వాస, గతులు+అగుటయున్= అడవిలో నివసించటానికి వెడలినవా రగుటయున్నూ; అను; వృత్తాంతంబులన్= కథలతో; ఒప్పి= అలరి; నాలుగు, వేలున్, మూడు+నూట, పది+ఒకండు= 4311; శ్లోకంబులు; కలిగి.

తాత్పర్యం: సుగమం.

విశేషం: సభాపర్వం చిన్నదైననూ భారతకథకు ఆయువుపట్టు. ఇందులో జరిగిన దుర్యోధనపరాభవ ద్యూత ద్రౌపదీవస్త్రాపహరణాదులే కురుక్షేత్రసంగ్రామానికి కారణా లైనవి.

క. పర్వి సభాప్రభృతిగ నవ । పర్వములను విస్తరిల్లి, పండితచేతో
నిర్వృతిఁ జేయుచు రెండవ । పర్వము నా రమ్య మగు సభాపర్వ మిలన్. 38

ప్రతిపదార్థం: పర్వి= ఒప్పి; సభా, ప్రభృతిగన్= సభాపర్వం మొదలుగా గల; నవ, పర్వములను= తొమ్మిది ఉపపర్వాలతో; విస్తరిల్లి= వ్యాపించి; పండిత, చేతః, నిర్వృతిన్= పండితులమనస్సులకు ఆనందాన్ని; చేయుచున్= కలిగిస్తూ; రెండవపర్వము; నాన్= అనగా; సభా, పర్వము; ఇలన్= భూమియందు; రమ్యము+అగున్= సుందర మగును, (అందంగా అమరి ఉంటుంది).

తాత్పర్యం: పై వచనంలో పేర్కొనబడిన ఉదంతాలతో ఒప్పి (సభా, మంత్ర, జరాసంధవధ, దిగ్విజయ, రాజసూయ, అర్ఘ్యాహరణ, శిశుపాలవధ, ద్యూత, అనుద్యూతా లనే) తొమ్మిది ఉపపర్వాలతో వ్యాపించి, పండితులమనస్సుల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కానందం కలిగిస్తూ రెండవపర్వంగా సభాపర్వం లోకంలో సుందరమై విరాజిల్లుతున్నది. పదునెనిమిది పర్వాలలో సభాపర్వం రెండవది. ఉపపర్వాలలో పందొమ్మిదవది.

వ. మఱియు మహారణ్యంబునందుఁ గిమ్మీరవధయును, గృష్ణపాంచాలాగమనంబును, సౌభకాఖ్యానంబును, యుధిష్ఠిరభీమసేనసంవాదంబును, గురూపదేశంబున నర్జునుండు దివ్యాస్త్రంబులు వడయఁ దపశ్చరణంబు సేయుటయు, నీశ్వరుతోడియుద్ధంబును, లోకపాలసందర్శనంబును, దివ్యాస్త్రలాభంబును, స్వర్గగమనంబును, నిట బృహదశ్వుండను మహామునింగాంచుటయు, యుధిష్ఠిరాదులపరిదేవనంబును, నలోపాఖ్యానంబును, దమయంతీ పతివ్రతాస్తుతియు, యుధిష్ఠిరాదులకు నర్జునుకుశలవార్త రోమశుండు సెప్పటయును, ధర్మజుతీర్థాభిగమనంబును, జటాసురవధయును, బాంచాలీనియుక్తుం డై భీముండు సౌగంధికపుష్పాహరణార్థంబుగంధమాదనంబునందలికొలనికిఁజని యందు మణిమంతుఁడు మొదలుగాఁ గల యక్షరాక్షసులం జంపుటయు. నాజగరంబు, నగస్త్యోపాఖ్యానంబును, వాతాపిభక్షణంబు, నపత్యార్థం బగస్త్యమహాముని లోపాముద్ర నభిగమించుటయు. శ్యేనకపోతంబు లైన యింద్రాగ్నులు శిబిమాంసంబు గొనుటయు, ఋష్యశృంగుచరితంబును, బరశురామచరితంబును, గార్తవీర్యవధయును, మాంధాతృజన్మంబును, సౌకన్యాఖ్యానంబును, భార్గవుండయిన చ్యవనుండు శర్యాతియజ్ఞంబున నాశ్వినుల సోమపీథులం జేసి వారిచేత జవ్వనంబు వడయుటయు, జంతూపాఖ్యానంబును, యజ్ఞపుత్త్రుం డైన సోమకుండు బహుపుత్త్రార్థంబు యజ్ఞంబుసేసి పుత్త్రశతంబును బడయుటయు, వంద్యష్టావక్రుల వివాదంబును, సముద్రంబును జయించితిత్తిరియను మహర్షి తనతండ్రిం బడయుటయు, దివ్యాస్త్రంబులు వడసి యర్జునుండు హిరణ్యపురనివాసు లయిన పౌలోమ కాలకేయ నివాతకవచాదులం జంపుటయు, గంధమాదనంబున కందఱుం గూడవచ్చుటయు, మార్కండేయబహువిధోపాఖ్యానంబును, గృష్ణసందర్శనంబును, సత్యాద్రౌపదీసంవాదంబును, ఘోషయాత్రయుఁ, జిత్రసేనాదిగంధర్వులఁ బెక్కండ్ర జయించి దుర్యోధనుని విడిపించుటయు, దుర్యోధనుని ప్రాయోపవేశంబును, వ్రీహిద్రోణకాఖ్యానంబును, గలియుగధర్మంబును, వామ్యాశ్వహరణంబును, నింద్రద్యుమ్నోపాఖ్యానంబును, సరస్వతీగీతయు, ధుంధుమారుచరితంబును, జయద్రథుం డాశ్రమాంతరంబున ద్రౌపది నపహరించుటయు, భీముండు వానిం బరిభవించుటయు, నుద్దాలకోపాఖ్యానంబును, వైన్యోపాఖ్యానంబును, శ్రీరామాయణకథయును, సావిత్ర్యుపాఖ్యానంబును, బాండవులు క్రమ్మఱ ద్వైతవనంబునకు వచ్చుటయుఁ, గర్ణుకవచకుండలంబు లింద్రుండు గొనుటయు, నారణేయోపాఖ్యానంబును, యముండు ధర్మజు ననుశాసించుటయు, యమువలన వరంబులు వడసి పాండవులు పశ్చిమదిక్కునకుం జనుటయు ననువృత్తాంతంబుల నొప్పి పదుమూఁడువేలు నాఱునూటయఱువదినాల్గు శ్లోకంబులు గలిగి. 39

ప్రతిపదార్థం: మఱియున్; మహత్+అరణ్యంబునందున్= గొప్పఅడవిలో; కిమ్మీర, వధయును= బకాసురునితమ్ముడైన కిమ్మీరుడిని భీముడు సంహరించుటయున్నూ; కృష్ణ, పాంచాల+ఆగమనంబును= కృష్ణుడున్నూ, పాంచాలురున్నూ (యాదవాదులుకూడ) పాండవులను చూడటానికి వచ్చుటయున్నూ; సౌభక+ఆఖ్యానంబును= శిశుపాలుడి తమ్ముడు సాల్వుడు. అతనికి కామగమనం గల సౌభక మనే నగరం ఉన్నది. దానితో వచ్చి సాల్వుడు ద్వారకను ముట్టడించిన కథయున్నూ;

యుధిష్ఠిర, భీమసేన, సంవాదంబును= ధర్మరాజుకూ భీముడికీ జరిగిన సంభాషణ సమాచారమున్నూ; గురు+ఉపదేశంబునన్= వ్యాసుడు, ధర్మరాజు మొదలైన పెద్దలఉపదేశంచేత; అర్జునుండు; దివ్య+అస్త్రంబులు= దేవతాసంబంధా లైన అస్త్రాలను; పడయన్= (గసడదవాదేశము) పొందటానికి; తపః+చరణంబు= తపస్సును ఆచరించటం; చేయుటయున్; ఈశ్వరుతోడన్, యుద్ధంబును= (సమాసములందు చేత తోడ వలనల కిత్వం బగును, తోడన్=తోడి) శివునితో యుద్ధమున్నూ; లోక, పాల, సందర్శనంబును= ఇంద్రయమవరుణకుబేరాదిదిక్పాలురను చూచుటయున్నూ; దివ్య+అస్త్ర, లాభంబును= దేవతాసంబంధ మైన పాశుపతాస్త్రంయొక్క ప్రాప్తియున్నూ; స్వర్గ, గమనంబునున్= అర్జునుడు స్వర్గానికి పోవుటయున్నూ; ఇట= ధర్మరాజాదు లున్నచోట; బృహదశ్వుండు+అను; మహత్+మునిన్= గొప్పమునిని; కాంచుటయున్= చూచుటయున్నూ; యుధిష్ఠిర+ఆదుల= ధర్మరాజు మొదలైనవారి; పరిదేవనంబును= దుఃఖించుటయున్నూ; నల+ఉపాఖ్యానంబును= నలునికథయు; దమయంతీ, పతివ్రతా, స్తుతియున్= దమయంతి అనే పతివ్రతను పొగడుటయున్నూ; యుధిష్ఠిర+ఆదులకున్= ధర్మరాజు మొదలైనవారికి; అర్జును, కుశల, వార్త= అర్జునునిక్షేమవృత్తాంతం; రోమశుండు= రోమశు డనే పేరుగల దేవర్షి; చెప్పుటయున్నూ; ధర్మజు= ధర్మరాజుయొక్క; తీర్థ+అభిగమనంబును= నదీపుణ్యక్షేత్రాలనుగూర్చి వెళ్ళుటయున్నూ; జటాసుర, వధయును=జటాసురు డనే రాక్షసుణ్ణి భీముడు చంపుటయున్నూ; పాంచాలీ, నియుక్తుండు+ఐ= పాంచాలరా జైన ద్రుపదునికూతు రగు ద్రౌపదిచే పంపబడినవాడై; భీముండు; సౌగంధిక, పుష్ప+ఆహరణ+అర్థంబు= సౌగంధిక మనే తామరపూవును తెచ్చే నిమిత్తం; గంధమాదనంబునందలి= గంధమాదన మనే పర్వతంలో ఉన్న; కొలనికిన్= సరస్సుకు; చని= వెళ్ళి; అందున్= అచ్చట; మణిమంతుఁడు, మొదలుగాన్+కల= మణిమంతుడుమొదలైన; యక్ష, రాక్షసులన్= యక్షులను, రాక్షసులను; చంపుటయున్; ఆజగరంబున్= అజగరమనగా పెద్దపాము, కొండచిలువ. నహుషుడు అగస్త్యునిశాపంచేత అజగర మైనాడు. ఆపాము భీముడిని పట్టుకొనగా ధర్మరాజు అతడిని వెదకుతూ వెళ్ళి అతనిని విడిపించిన కథయున్నూ; అగస్త్య+ఉపాఖ్యానంబును= అగస్త్యమహర్షికథయున్నూ; వాతాపి, భక్షణంబున్= అగస్త్యుడు వాతాపి అనే రాక్షసుడిని తినుటయున్నూ; అపత్య+అర్థంబు= సంతానంనిమిత్తం; అగస్త్య, మహా, ముని; లోపాముద్రన్= లోపాముద్ర అనే తనభార్యను; అభిగమించుటయున్= పొందుట(రమించుట)యున్నూ; శ్యేన, కపోతంబులు+ఐన= గ్రద్దయొక్కయు, పావురముయొక్కయు రూపాలు తాల్చిన; ఇంద్ర+అగ్నులు= ఇంద్రుడున్నూ, అగ్నియున్నూ; శిబి, మాంసంబు= శిబిచక్రవర్తియొక్క మాంసాన్ని; కొనుటయున్= గ్రహించుటయున్నూ; ఋష్యశృంగు, చరితంబును= విభాండకుని కుమారు డైన ఋష్యశృంగునికథయు; పరశురామ, చరితంబును= పరశు వనగా గొడ్డలి. పరశువు ఆయుధంగా కలవా డగుటచేత అతనికి ఆపేరు వచ్చింది. పరశురాముడు విష్ణువుఅవతారాలలో ఆరవఅవతారం, అతని కథయున్నూ; కార్తవీర్య, వధయును= పరశురాముడు కార్తవీర్యుడిని సంహరించుటయున్నూ; మాంధాతృ, జన్మంబును= యువనాశ్వుని కుమారు డైన మాంధాత పుట్టుకయున్నూ; సౌకన్యా+ అఖ్యానంబును= సుకన్యకు సంబంధించిన కథయున్నూ; భార్గవుండు+అయిన= భృగుమహర్షికుమారు డైన, చ్యవనుండు; శర్యాతి, యజ్ఞంబునన్= సుకన్య తండ్రి యైన శర్యాతి చేసిన యజ్ఞంలో; ఆశ్వినులన్= అశ్వినీదేవతలను; సోమ, పీథులన్= సోమరసం త్రాగినవారిని; చేసి; వారిచేతన్= అశ్వినీదేవతలచేత; జవ్వనంబు= యౌవనం; పడయుటయున్= పొందుటయున్నూ; జంతు+ఉపాఖ్యానంబును= సోమకు డనే రాజర్షికుమారు డైన జంతువనే వాడి కథయున్నూ; యజ్ఞ, పుత్రుండు+ఐన= యజ్ఞునికుమారుడైన; సోమకుండు; బహుపుత్ర+అర్థంబు= పలువురుపుత్రులనిమిత్తం; యజ్ఞంబు; చేసి; పుత్రశతంబును= నూర్గురు కుమారులను; పడయుటయున్= పొందుటయున్నూ; వంది+అష్టావక్రుల= (వంది వరుణపుత్రుడు, అష్టావక్రుడు ఏకపాదుని కుమారుడు, అష్టావక్రుడు జనకునియజ్ఞంలో వందిని ఓడించాడు) వందియొక్కయు, అష్టావక్రుడియొక్కయు; వివాదంబును= శాస్త్రాదులయందలి వివిధవిషయాలను గురించి చర్చించుటయున్నూ, తగవున్నూ; సముద్రంబును; జయించి= ఓడించి; తిత్తిరి, అను; మహా+ఋషి= గొప్పముని; తన, తండ్రిన్; పడయుటయున్= పొందుటయున్నూ; దివ్య+అస్త్రంబులు= దేవతాసంబంధు లైన ఆయుధాలను (బాణాలను); పడసి= పొంది; అర్జునుండు; హిరణ్య, పుర, నివాసులు+ఐన= హిరణ్యపుర మనే పట్టణాన్ని ఇంద్రుడు సముద్రమధ్యంలో నిర్మింపజేశాడు. రాక్షసులు తపోబలంతో దానిని ఆక్రమించారు; ఆపట్టణంలో నివసించేవా రైన; పౌలోమ, కాలకేయ, నివాతకవచ+ఆదులన్= పులోమ అనే రాక్షసస్త్రీకుమారులు పౌలోములు, కాలక అనే

రాక్షసస్త్రీకుమారులు కాలకేయులు. వీరిమొత్తంసంఖ్య అరువదివేలు; పౌలోములు, కాలకేయులు, నివాతకవచులు(నివాతకవచుల సంఖ్య మూడు కోట్లు) మొదలైనవారిని చంపుటయున్నూ; గంధమాదనంబునకున్= గంధమాదనపర్వతానికి; అందఱున్, కూడన్= అన్నదమ్ములందరును కలియ(సమాగమశ్చ పార్థస్య భ్రాతృభి ర్గంధమాదనే- అని భండార్కరు సంస్కృతమూలము); వచ్చుటయున్= అర్జునుడు వచ్చుటయున్నూ; మార్కండేయ, బహు, విధ, ఉపాఖ్యానంబును= మార్కండేయుడు ప్రళయప్రకారం, వైవస్వత మను వృత్తాంతం మున్నగు అనేకవిధాలైన కథలను ధర్మరాజు చెప్పుటయున్నూ; కృష్ణ, సందర్శనంబును= కృష్ణుని చూచుటయున్నూ; సత్యా, ద్రౌపదీ, సంవాదంబును= సత్యభామకును ద్రౌపదికిని జరిగిన సంభాషణమున్నూ; ఘోషయాత్రయున్= ఘోష మనగా గొల్లపల్లె. దుర్యోధనాదులు పాండవులను అపహసించటానికై గోవులను సంరక్షించే నెపంతో ద్వైతవనానికి అరుగుటయున్నూ; చిత్రసేన+ఆది, గంధర్వులన్= చిత్రసేనుడు మొదలైన గంధర్వులను; పెక్కండ్రన్= పలువురిని; జయించి= ఓడించి; అర్జునుడు; దుర్యోధనునిన్= గంధర్వుల చేచిక్కిన దుర్యోధనుడిని; విడిపించుటయున్; దుర్యోధనుని ప్రాయోపవేశంబును= సర్వకర్మలను విడిచి మరణానికి సిద్ధపడి కూర్చుండుటయున్నూ (మరణపర్యంతం ఉపవసించటం); వ్రీహి, ద్రోణక+ ఆఖ్యానంబును= వ్రీహి అంటే ధాన్యం; ద్రోణక మంటే తూము(కొలమానం తూమెడుధాన్యం.) ముద్గలుడు అనే విప్రుడు ఉంఛవృత్తి చేస్తూ పాడ్యమి మొదలు పదునాలుగురోజులు ఒక్కొక్కగింజ చొప్పున ఏరి పర్వదినాన వండించి దేవపిత్రతిథివర్గానికి సమర్పించి మిగిలిన అన్నాన్ని తాను దారపుత్రాదులతో తింటూ కాలం గడుపుతూ ఉండేవాడు. దుర్వాసుడు అతడిని పరీక్షించి సంతృప్తుడై సశరీరస్వర్గాన్ని పొందుతా వని వరమిచ్చి వెళ్ళాడు. తూమెడు ధాన్యానికి సంబంధించిన ముద్గలుని కథయున్నూ; కలి, యుగ, ధర్మంబును= కలియుగానికి సంబంధించిన ధర్మాన్ని; వామ్య+అశ్వ, హరణంబును= వామదేవుని గుఱ్ఱాలను శలుడు అనేఅయోధ్యాపతి అయిన పరీక్షిత్తుకుమారుడు దొంగిలించటం; ఇంద్రద్యుమ్న+ఉపాఖ్యానంబును= మార్కండేయుడికంటె వృద్ధతము డైన ఇంద్రద్యుమ్నుడనే రాజుకథయున్నూ; సరస్వతీ, గీతయున్= తార్క్ష్యుడనే మునికి సరస్వతీదేవి ధర్మస్వరూపాన్నీ, పురుషుడు పరమపుణ్యు డైపుణ్యగతి పొందే మార్గాన్నీ చెప్పుటయున్నూ,(ఆధ్యాత్మికమతవిషయాలనుగురించి శ్లోకరూపంలో జరిగే సంభాషణం గీత అనబడుతుంది); ధుంధుమారు, చరితంబును= మధుకైటభులకుమారు డైన ధుంధుమారు డనే పేరుపొందిన కువలయాశ్వు డనే బృహదశ్వునిపుత్త్రుడి కథయున్నూ, జయద్రథుండు= సైంధవుడు; ఆశ్రమ+అంతరంబునన్= ఆశ్రమంనడుమ; ద్రౌపదిన్, అపహరించుటయున్= దొంగిలించికొని పోవుటయున్నూ; భీముండు; వానిన్= సైంధవుడిని; పరిభవించుటయున్= అవమానించుటయున్నూ, ఉద్దాలక+ఉపాఖ్యానంబును= ఉద్దాలకు డనే ఋషికథయున్నూ, (ఉద్దాలుడనికూడ అంటారు); వైన్య+ఉపాఖ్యానంబును= వేణు(ను) డనబడే రాజకుమారు డైన పృథుచక్రవర్తికథయున్నూ, ఇతడినిబట్టియే భూమికి పృథివి అనేపేరు కలిగింది; శ్రీ, రామాయణ, కథయును= శోభాయుక్త మైన రామాయణ (శ్రీరాముని) కథయున్నూ; సావిత్రీ+ఉపాఖ్యానంబును= సావిత్రికథయున్నూ; పాండవులు; క్రమ్మఱ= తిరిగి; ద్వైత, వనంబునకున్; వచ్చుటయున్; కర్ణు, కవచ, కుండలంబులు= కర్ణుడియొక్క కవచం(మైమరువు), కుండలాలు(కర్ణాభరణాలు), ఇవి అతనికి సహజాలు; ఇంద్రుండు; కొనుటయున్= గ్రహించుటయున్నూ; ఆరణేయ+ఉపాఖ్యానంబును= అరణి అనగా త్రచ్చి నిప్పు పుట్టించే కొయ్య, దానికి సంబంధించిన(ఆరణీయ) కథయున్నూ; యముండు; ధర్మజున్= ధర్మరాజును; అనుశాసించుటయున్= పొగడుటయున్నూ (బోధించుటయున్నూ); యమువలనన్= యమునినుండి; వరములు= కోరికలు; పడసి= పొంది; పాండవులు; పశ్చిమ, దిక్కునకున్= పడమటిదెసకు; చనుటయున్= వెళ్ళుటయున్నూ; అను; వృత్తాంతంబులన్= కథలతో; ఒప్పి=అలరి; పదుమూడు, వేలున్, ఆఱు, నూట, అఱువదినాల్గు= 13664; శ్లోకంబులు; కలిగి= పొంది.

తాత్పర్యం: స్పష్టం.

విశేషం: ఈ వచనంలో చెప్పబడిన వృత్తాంతాల క్రమానికిన్నీ తెలుగులోని ఆరణ్యపర్వంలోని వృత్తాంతాల క్రమానికిన్నీ వ్యత్యాసం ఉన్నది. ఉదాహరణకు అగస్త్యుని చరిత్రం. జటాసురవధ, సౌగంధికాపహరణం మొదలైనవాటిని గ్రహించవచ్చును.

క. ఆరణ్యపర్వ మనఁగా । నారణ్యప్రముఖ షోడశాంతఃపర్వా
ధార మయి సకలసూరిస । భారమ్యం బగు తృతీయపర్వము వెలయున్. 40

ప్రతిపదార్థం: ఆరణ్య, పర్వము= పాండవులు అరణ్యంలో నివసించటానికి సంబంధించిన పర్వం; అనఁగాన్; ఆరణ్య, ప్రముఖ, షోడశ, అంతః, పర్వ+ఆధారము+అయి= ఆరణ్యపర్వం మొదలుగా గల పదునారుఉపపర్వాలకు ఆశ్రయమై(16 ఉపపర్వాలు కల్గి); సకల, సూరి, సభా, రమ్యంబు+అగు= సర్వపండితుల సభలయందునూ అందమగు; తృతీయ, పర్వము= మూడవ దైన ప్రధానపర్వం; వెలయున్= ప్రసిద్ధ మై ఉంటుంది.

తాత్పర్యం: ఆరణ్యంమొదలు పదునారుఉపపర్వాలు కలిగి ఎల్లపండితులసభలందునూ అంద మై ఆరణ్యపర్వమనే పేర మూడవ దైన ప్రధానపర్వం ప్రసిద్ధిపొందింది.

విశేషం: నన్నయ పండితసభాప్రశస్తిని పర్వసంగ్రహంలో పలుచోట్ల చేస్తూ ఉంటాడు.

వ. మఱియు విరాటనగరంబునకుం జనుచుండి తత్సమీపశమీవృక్షంబునఁ బాండవులు తమయాయుధంబులు నిక్షేపించి తమ్మెవ్వరు నెఱుంగకుండ విరాటుం గొలిచి యునికియు, నందు భీముండు సింహబలుం దొట్టి సకలకీచకుల వధించుటయు, గోగ్రహణంబునఁ గురుబలంబుల నెల్ల నొక్కరుండ జయించి ధనంజయుండు గోగణంబులఁగ్రమ్మఱించుటయు, విరాటరాజపుత్త్రియైన యుత్తర నభిమన్యుండు వివాహం బగుటయునను వృత్తాంతంబుల నొప్పి మూడువేలు నేనూఱుశ్లోకంబులు గలిగి. 41

ప్రతిపదార్థం: మఱియున్; విరాట, నగరంబునకున్= విరటుడిపట్టణానికి; చనుచుండి= వెళ్లుతూ; తద్, సమీప, శమీ, వృక్షంబునన్= ఆనగరానికి చెంత ఉన్న జమ్మిచెట్టుమీద; పాండవులు; తమ, ఆయుధంబులు= పాండవులు ధరించే గద, గాండీవం మొదలైన శస్త్రాలను; నిక్షేపించి= ఉంచి; తమ్మున్= పాండవులను; ఎవ్వరున్= జను లెవ్వరున్నూ; ఎఱుఁగక+ఉండన్= తెలిసికొనకుండ; విరాటున్= విరాటరాజును; కొలిచి= సేవించి; ఉనికియున్= ఉండుటయున్నూ; అందున్= విరాటనగరంలో; భీముండు; సింహబలున్, తొట్టి= కీచకునిమొదలుకొని; సకల, కీచకులన్= అందరుకీచకులను (ఉపకీచకులను); వధించుటయున్= చంపుటయున్నూ; గోగ్రహణంబునన్= దుర్యోధనాదులు విరాటుడిగోవులను ముట్టడించి కొనిపోయేసమయంలో; కురు, బలంబులన్, ఎల్లన్= కౌరవసేనలను అన్నింటిని; ఒక్కరుండు+అ=ఒక్కడే; జయించి=ఓడించి; ధనంజయుండు= అర్జునుడు (భూమినంతను గెల్చి ధనాలను పొందియుండటంచేత అతనికి ఆపేరు కలిగింది); గోగణంబులన్= ఆవులమందలను; క్రమ్మఱించుటయున్= మరల్చుటయున్నూ; విరాట, రాజ, పుత్త్రి= విరాటరాజు కూతురు; ఐన; ఉత్తరన్= ఉత్తర అనే కన్యను; అభిమన్యుండు= అర్జునుడి కుమారుడైన అభిమన్యుడు; వివాహంబు+అగుటయున్= పెండ్లి ఆడుటయున్నూ; అను; వృత్తాంతంబులన్= కథలతో; ఒప్పి= అలరి; మూఁడు, వేలున్, ఏను, నూఱు= మూడువేలకు పైని అయిదువందల (3500); శ్లోకంబులు; కలిగి= పొంది.

తాత్పర్యం: సుగమం.

క. పర్వుచు వైరాటాదిక । పర్వచతుష్టయమునను సభారంజన మై
సర్వమనోజ్ఞము నాలగు । పర్వమునాఁ దగి విరాటపర్వము వెలయున్. 42

ప్రతిపదార్థం: పర్వుచున్= వ్యాపిస్తూ; వైరాట+ఆదిక, పర్వ, చతుష్టయమునను= విరాటునకు సంబంధించిన వైరాటము మొదలుగా గల ఉపపర్వాలు నాల్గింటితో; సభా, రంజనము+ఐ= పండితసభలను సంతోషపెట్టునది అయి; సర్వ, మనః,

జ్ఞము= అందరికి మనోహర మై; నాలుగు+అగు= నాల్గవది అయిన; పర్వము; నాన్= అనగా; తగి=ఒప్పి; విరాట, పర్వము=ప్రధానమైన విరాటపర్వం; వెలయున్= ప్రసిద్ధి కెక్కును.

తాత్పర్యం: వ్యాపిస్తూ వైరాటం మొదలుగా నాలుగు ఉపపర్వాలతో పండితసభలను రంజించేదై అందరికి (అన్నింటికంటె) మనోహరమైనదై నాల్గవపర్వ మయి ఒప్పి విరాటపర్వం ప్రకాశిస్తుంది.

విశేషం: నాలుగుశబ్దమున వృత్తియందు 'గు' లోపిస్తుంది; నాలు+అగు; నన్నయ 'అవ' కు బదులు 'అగు' అనుదానినే వాడుతూ ఉంటాడు- నాలగు.

వ. **మఱియు భారతరణోద్యోగు లైన పాండవు లుపప్లావ్యంబున విడియుటయు, నర్జునదుర్యోధనులు ద్వారకానగరంబునకుం జని శ్రీకృష్ణునిం గని సహాయత్వంబునకుం బ్రార్థించుటయు, నారాయణుండు వారి నాశ్వాసించి నారాయణగోపాలబలంబుల నిరూపించి వారలం గోరికొం డనుటయు, నారాయణ గోపాల బలంబుల దుర్యోధనుండు గోరికొనుటయు. నారాయణుని నొక్కని నర్జునుండు గోరికొనుటయు, ధృతరాష్ట్రుండు వనుప నుపశమనార్థం బుపప్లావ్యంబున సంజయుండు పాండవులకడకుం బోవుటయు, వాసుదేవసహితులైన పాండవులరణప్రారంభంబు విని ధృతరాష్ట్రుండు నిద్రాహారంబులు విడిచి చింతా క్రాంతుండగుటయు, హితవచనుం డైన విదురుపల్కులు వినమియు, ధృతరాష్ట్రునకు మనస్తాపోప శమనంబుగా సనత్సుజాతుం డధ్యాత్మకథలు సెప్పటయు, వాసుదేవార్జునుల యత్యంతసాంగత్యం బెఱింగి వచ్చిసంజయుండు సకలరాజసమక్షంబున విస్తరించుటయు, సర్వభూతహితుం డైన శ్రీకృష్ణుండు పాండవధార్తరాష్ట్రులకు సంధి గావింపం దలంచి హస్తిపురంబునకుం జని యందుఁ గర్ణాదిదుష్టశిక్షితుండైన దుర్యోధను దుర్మంత్రం బెఱింగి విశ్వరూపంబుఁ జూపుటయుఁ, గృష్ణుండు కర్ణునిం దనరథం బెక్కించుకొని యుపాయంబున ననునయించి యొడంబఱుపనేరక కర్ణుచేతం బ్రత్యాఖ్యాతుం డయి క్రమ్మఱి వచ్చుటయు, బలాతిబలసంఖ్యానంబు, నెల్లి యుద్ధంబు సేయవలయు నని కురుపతి పనుప నులూకుం డను దూత పాండవులపాలికి వచ్చి పరుసంబులు వలుకుటయు, సమరథాతిరథ సంఖ్యానంబు, నర్ధరథులలోనం గలయం ద న్నెన్నిన నలిగి కర్ణుండు భీష్ముపదిదినంబులు సమరపరాఙ్ముఖుం డగుటయు, రామభీష్ముల యుద్ధకీర్తనంబు, నంబోపాఖ్యానంబును, సంక్రందనోపాఖ్యానంబును, శ్వేతాభిషేకంబు నను వృత్తాంతంబుల నొప్పి యాఱువేలుం దొమ్మన్నూట తొంబదియెనిమిది శ్లోకంబులు గలిగి.** **43**

ప్రతిపదార్థం: మఱియున్; భారత, రణ+ఉద్యోగులు+ఐన= కురుక్షేత్రయుద్ధమునందు ప్రయత్నం కలవా రైన; పాండవులు; ఉపప్లావ్యంబునన్= ఉపప్లావ్యనగరంలో; విడియుటయున్= ఆగుటయున్నూ; అర్జున, దుర్యోధనులు= అర్జునుడున్నూ, దుర్యోధనుడున్నూ; ద్వారకా, నగరంబునకున్; చని= వెళ్ళి, శ్రీకృష్ణునిన్; కని= చూచి; సహాయత్వంబునకున్= తోడ్పడటానికి; ప్రార్థించుటయున్= వేడుటయున్నూ; నారాయణుండు= కృష్ణుడు; వారిన్= అర్జునదుర్యోధనులను; ఆశ్వాసించి= ఓదార్చి; నారాయణగోపాల, బలంబులన్= నారయణు లనే పేరు గల గోపాలకులసేనలను; నిరూపించి = చూపి, నిరూపణచేసి; వారలన్= అర్జునదుర్యోధనులను; కోరికొండు= తననుగాని నారాయణగోపాలురను గాని కోరుకొనండి; అనుటయున్= అని

చెప్పుటయున్నూ; నారాయణ, గోపాల, బలంబుల; దుర్యోధనుండు; కోరికొనుటయున్= తనకు కావలె నని కోరుటయున్నూ, నారాయణునిన్, ఒక్కనిన్, అర్జునుండు, కోరికొనుటయున్= శ్రీకృష్ణుడిని ఒక్కడినే అర్జునుడు కోరుకొనుటయున్నూ; ధృతరాష్ట్రుండు; పనుపన్= పంపగా; ఉపశమన+అర్థంబు= శాంతించుటకొరకు; ఉపప్లావ్యంబునన్= పాండవులు విడిసిన ఉపప్లావ్యనగరంలో; సంజయుండు= ధృతరాష్ట్రుండు దూతగా పంపిన సూతుడు; పాండవుల, కడకున్= పాండవులచెంతకు; పోవుటయున్= వెళ్ళుటయున్నూ; వాసుదేవ, సహితులు+ఐన= కృష్ణునితో కూడినవారైన; పాండవుల; రణ, ప్రారంభంబు= యుద్ధంకొరకు ప్రయత్నం; విని; ధృతరాష్ట్రుండు; నిద్రా+ఆహారంబులు= నిద్రను భోజనాన్ని; విడిచి; చింతా+ ఆక్రాంతుండు+అగుటయున్= శోకంచేత ఆక్రమింపబడినవాడు (దుఃఖితుడు) అగుటయున్నూ; హిత, వచనుండు+ఐన= మేలు కలిగించే వాక్యాలు కలవాడైన; విదురు, పలుకులు= విదురుడిమాటలు; వినమియున్= వినకుండుటయున్నూ; ధృతరాష్ట్రునకున్; మనః తాప+ఉపశమనంబు, కాన్= మనస్సులోని దుఃఖానికి శాంతికలిగేటట్లుగా; సనత్సుజాతుండు= సనత్సుజాతు డనే ముని; అధ్యాత్మ, కథలు= తత్త్వంతో కూడిన విషయాలు (వృత్తాంతాలు) చెప్పుటయున్నూ; వీనికి సనత్సుజాతీయ మని పేరు. తిక్కన దీనిని అనువదింపక ఊరక పేర్కొని విడిచివేశాడు. వాసుదేవ+అర్జునుల= కృష్ణుడియొక్క, అర్జునుడియొక్క; అత్యంత, సాంగత్యంబు= అధిక మైన స్నేహం; ఎఱింగి= తెలిసికొని; వచ్చి; సంజయుండు; సకల, రాజ, సమక్షంబునన్= రాజులందరి యెదుట, విస్తరించుటయున్= వివరించి చెప్పుటయున్నూ, సర్వ, భూత హితుండు+ఐన= ఎల్లజీవులకును మేలుకోరువాడైన శ్రీకృష్ణుడు; పాండవ, ధార్తరాష్ట్రులకున్= పాండుధృతరాష్ట్రపుత్రులకు; సంధి= పొందు; కావింపన్, తలంచి= చేయటానికి కోరి; హస్తినాపురంబునకున్ = హస్తినాపురానికి; చని= వెళ్ళి; అందున్= ఆ హస్తిపురంలో; కర్ణ+ఆది, దుష్ట, శిక్షితుండు+ఐన= కర్ణుడు మొద లైన దుర్జనులచేత బోధింపబడినవా డైన; దుర్యోధను; దుర్, మంత్రంబు= చెడ్డఆలోచన; ఎఱింగి= తెలిసికొని; విశ్వ, రూపంబున్= సర్వప్రపంచం తనలో ఉన్న రూపాన్ని; చూపుటయున్; కృష్ణుండు; కర్ణునిన్; తన, రథంబు; ఎక్కించుకొని= ఎక్కేటట్లుచేసి; ఉపాయంబునన్= నేర్పుతో; అనునయించి= ఓదార్చి; ఒడంబఱుపన్; నేరక= పాండవపక్షానికి వచ్చేటట్లు అంగీకరింపజేయజాలక; కర్ణుచేతన్= కర్ణునిచేత; ప్రత్యాఖ్యాతుండు+అయి= తిరస్కరింపబడినవాడై;క్రమ్మఱి= తిరిగి, వచ్చుటయున్; బల, అతిబల, సంఖ్యానంబున్= సేనయొక్కయు, ఎక్కువబల మున్న సేనయొక్కయు గణనమున్నూ; ఎల్లి= రేపు; యుద్ధంబు; చేయవలయున్+అని; కురు, పతి= కౌరవనాథు డయిన దుర్యోధనుడు; పనుపన్= పంపగా; ఉలూకుండు+అను, దూత= శకునికుమారు డైన ఉలూకు డనే దూత; పాండవులపాలికిన్= పాండవులచెంతకు, వచ్చి; పరుసంబులు= పరుషవాక్యాలు; పలుకుటయున్; సమరథ, అతిరథ, సంఖ్యానంబున్= సమరథులయొక్కయు (ఒకవిలుకానితో సరిగా నిల్చి పోరే యోధుడు సమరథుడు), అతిరథులయొక్కయు (రథంలో ఉండి అప్రతిమానంగా పోరాడే యోధుడు, లేదా అనేకులతో పోరాడే యోధుడు అతిరథుడు- అమితాన్ యోధయే ద్యస్తు స ప్రోక్తో౽తిరథస్తు సః) పరిగణనం; అర్ధరథులలోనన్= (ఒక్కవిలుకానితో సరిగా నిలిచి పోరలేని యోధుడు అర్ధరథుడు) అటువంటివారిలో; కలయన్= కలయునట్లుగా, తన్నున్= కర్ణుని; ఎన్నన్= గణింపగా; అలిగి= కోపించి; కర్ణుండు; భీష్మ, పదిదినంబులు= భీష్ముడు సేనానాయకుడుగా ఉన్న పదిరోజులున్నూ; సమర, పరాక్+ముఖుండు+అగుటయున్= యుద్ధంపట్ల విముఖుడు కావటమున్నూ; రామ, భీష్మల, యుద్ధకీర్తనంబున్= పరశురామభీష్ములయుద్ధముయొక్క పొగడ్తయున్నూ, అంబా+ఉపాఖ్యానంబును= కాశీరాజు కూతులలో పెద్దదైన అంబకథయున్నూ; సంక్రందన+ఉపాఖ్యానంబును= ఇంద్రుడియొక్క కథయున్నూ; శ్వేత+అభిషేకంబున్; అను; వృత్తాంతంబులన్= కథలతో; ఒప్పి= అలరి; ఆఱు, వేలున్, తొమ్మన్నూట, తొంబది, ఎనిమిది, శ్లోకంబులు= 6998 శ్లోకాలు; కలిగి= వహించి.

క. విదితం బై యుద్యోగము । మొదలుగఁ బదునొకఁడు పర్వముల నెంతయు నొ
ప్పిద మై యేనగు పర్వం । బిది నా నుద్యోగపర్వ మిమ్మగు సభలన్. 44

ప్రతిపదార్థం: విదితంబు+ఐ= తెలియబడినదై; ప్రసిద్ధ మై; ఉద్యోగము= ఉద్యోగమనే ఉపపర్వం; మొదలుగన్= మున్నుగా; పది+ఒకఁడు, పర్వములన్= పదకొండుపర్వాలతో; ఎంతయున్= మిక్కిలి; ఒప్పిదము+ఐ= అంద మై; ఇది; ఏను+అగు=

ఐదవదగు; పర్వంబు, నాన్= పర్వ మనగా; ఉద్యోగ, పర్వము= ఉద్యోగ మనే ప్రధానపర్వం; సభలన్= సభలలో; ఇమ్ము+అగున్= ఇంపగును.

తాత్పర్యం: ప్రసిద్ధ మై ఉద్యోగం మొదలుగా గల పదకొండు ఉపపర్వాలతో అంద మై ఇది ఐదవపర్వ మనగా ఉద్యోగపర్వం సభలలో ఇంపొందుతుంది.

విశేషం: భారతంలోని ప్రధాన మైన పదునెనిమిదిపర్వాలలో ఐదవది ఉద్యోగపర్వం. ఉద్యోగ మంటే ప్రయత్నం. ఈ పర్వంలో మొదట సంధికొరకున్నూ, తరువాత యుద్ధంకొరకున్నూ ప్రయత్నం చేయబడింది.

వ. మఱియు జంబూఖండవినిర్మాణంబు సంజయుండు ధృతరాష్ట్రునకుం జెప్పుటయు, భూవిస్తారంబును, భీష్మాభిషేకంబును, బాండవమధ్యమవిషాదంబును, వాసుదేవుండు మోక్షదర్శనహేతువులం జెప్పి యర్జును మోహభ్రాంతిఁ జెఱుచుటయు, శిఖండిం బురస్కరించుకొని యర్జునుండు భీష్ముని వధించుటయు నను వృత్తాంతంబుల నొప్పి యైదువేలునెనమన్నూటయెనుబదినాలుగు శ్లోకంబులు గలిగి. 45

ప్రతిపదార్థం: మఱియున్; జంబూఖండ, వినిర్మాణంబు= మేరుపర్వతం చుట్టూ ఉన్న తొమ్మిదిఖండాలలో జంబూఖండ మొకటి. జంబువు అంటే నేరేడుచెట్టు లేక నేరేడుపండు. జంబూఖండనిర్మాణాన్ని; సంజయుడు; ధృతరాష్ట్రునకున్; చెప్పుటయున్= వివరించుటయున్నూ; భూ, విస్తారంబును= భూమివిస్తీర్ణాన్నీ; భీష్మ+అభిషేకంబును= సేనానాయకుడిగా భీష్ముడిని అభిషేకించుటయున్నూ; పాండవ, మధ్యమ, విషాదంబును= పాండవులలో నడిమివాడైన అర్జునుడి దుఃఖమున్నూ; వాసుదేవుండు= కృష్ణుడు (వసుదేవుడికుమారుడు); మోక్షదర్శనహేతువులన్= మోక్షం పొందటానికి గల కారణాలను; చెప్పి= వివరించి; అర్జును= అర్జునుడి యొక్క; మోహ, భ్రాంతిన్= అజ్ఞానంవలన కలిగిన భ్రమను; చెఱుచుటయున్= పోగొట్టుటయున్నూ; శిఖండిన్= ద్రౌపదిసోదరు డైన శిఖండిని; పురస్కరించుకొని= ముందుంచుకొని; అర్జునుండు, భీష్ముని, వధించుటయున్= చంపుటయున్నూ అను, వృత్తాంతంబులన్= అనేకథలతో; ఒప్పి= అలరి, ఐదు, వేలున్, ఎనమన్నూట, ఎనుబది, నాలుగు, శ్లోకంబులు= 5884 శ్లోకాలు; కలిగి= పొంది.

తాత్పర్యం: స్పష్టం.

విశేషం: భూవిస్తారం, భీష్మాభిషేకం అనేఅంశాలు సంస్కృతమూలంలో లేవు.

క. జంబూఖండవినిర్మా । ణం బాదిగ హృదయరోచనము లగు నేన్ప
ర్వంబులను భీష్మపర్వము । పంబి వినం బొలుచు షష్ఠపర్వం బగుచున్. 46

ప్రతిపదార్థం: జంబూ, ఖండ, వినిర్మాణంబు= జంబూఖండాన్ని నిర్మించుట అనే విషయంతోకూడినపర్వం; ఆదిగన్= మొదలుగా, హృదయ, రోచనంబులు+అగు= హృదయాన్ని వికసింపచేసే వైన; ఏన్, పర్వంబులను= ఐదుపర్వాలతో; పంబి= అతిశయించి; వ్యాపించి; భీష్మపర్వము=భీష్మపర్వ మనే ప్రధానపర్వం; షష్ఠ, పర్వంబు+అగుచున్= ఆరవపర్వం ఔతూ; వినన్, పొలుచున్= వినటానికి ఒప్పుగా ఉంటుంది.

తాత్పర్యం: జంబూఖండవినిర్మాణం అనే ఉపపర్వం మొదలుగా గల చిత్తాన్ని వికసింపజేసే అయిదుఉపపర్వాలతో ఒప్పి భీష్మపర్వం ఆరవప్రధానపర్వం ఔతూ వినటానికి ఇంపుగా ఉంటుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: తెలుగుప్రతులలో జంబూఖండం అనటానికి బదులు జంబూషండం అని ఉన్నది.

వ. **మఱియు ద్రోణాభిషేకంబును, సంశప్తకు లర్జునుం బాపికొనిపోయి యేకతంబు యుద్ధంబు సేయుటయు, నర్జునుచేత సుప్రతీకగజంబుతోడన భగదత్తుచావును. ద్రోణకర్ణాదులు పెక్కంద్రు గూడుకొని యధర్మయుద్ధంబున నభిమన్యుం జంపుటయు, నర్జునుప్రతిజ్ఞయు, నభిమన్యు వధకుం గ్రుద్ధుండై యర్జునుం డే డక్షౌహిణులబలంబుల నొక్కరుండ చంపి సైంధవుం దునుముటయును, దొమ్మిదికోట్లు సంశప్తకుల నర్జునుండు నిశ్శేషంబు సేయుటయు, నలంబస శ్రుతాయు జలసంధ సోమదత్త భూరిశ్రవో బాహ్లిక విరాట ద్రుపద ఘటోత్కచ ధార్తరాష్ట్ర నారాయణగోపాలాదివధయును, ద్రోణవధయు, నశ్వత్థామ నారాయణాగ్నేయాస్త్రకీర్తనంబును, గృష్ణార్జునులమాహాత్మ్యంబును నను వృత్తాంతంబుల నొప్పి పదివేలుందొమ్మన్నూట పందొమ్మిది శ్లోకంబులు గలిగి.** **47**

ప్రతిపదార్థం: మఱియు; ద్రోణ+అభిషేకంబును= ద్రోణుని సేనానాయకుడిగా అభిషేకించుటయున్నూ; సంశప్తకులు= యుద్ధంలో ఎప్పుడూ వెనుకంజ వేయక ఇతురులపోరాటాన్ని ఆపటానికి నిల్పబడినవారు; అర్జునున్; పాపికొనిపోయి= దూరంగా తీసికొనిపోయి; ఏకతంబు= ఒంటరిగా; యుద్ధంబు; చేయుటయున్, అర్జునుచేతన్; సుప్రతీక, గజంబుతోడన్+అ= సుప్రతీక మనే పేరుకల ఏనుగుతోకూడ, భగదత్తు, చావును= భగదత్తుడు నరకాసురునికుమారుడు, బాష్కళునిఅంశానపుట్టినవాడు, అతడు చనిపోవుటయున్నూ; ద్రోణ, కర్ణ+ఆదులు= ద్రోణుడు కర్ణుడు మొదలైనవారు; పెక్కంద్రు= పలువురు; కూడుకొని= కలిసి; అధర్మ, యుద్ధంబునన్= ధర్మరహితమైనయుద్ధంలో; అభిమన్యున్= అర్జునుడికుమారుడిని; చంపుటయున్; అర్జును, ప్రతిజ్ఞయున్= అర్జునుడియొక్కశపథమున్నూ; అభిమన్యు, వధకున్= అభిమన్యుడు చంపబడినందుకు, క్రుద్ధుండు+ఐ= కోపాన్ని పొందినవాడై; అర్జునుండు; ఏడు+అక్షౌహిణుల, బలంబులన్= 21870 రథాలను, అన్నిఏనుగులను, 65610 గుఱ్ఱాలు, 109350 కాల్బురున్నూ గల సేనావిశేషం ఒకఅక్షౌహిణి. అటువంటి ఏడు అక్షౌహిణులసేనలను; ఒక్కరుండు+అ= ఒక్కడే; చంపి; సైంధవున్; తునుముటయును= చంపుటయున్నూ; తొమ్మిది, కోట్లు, సంశప్తకులన్, అర్జునుండు; నిశ్శేషంబు, చేయుటయున్= మిగులకుండ చేయుటయున్నూ(చంపుటయున్నూ); అలంబస, శ్రుతాయు, జలసంధ, సోమదత్త, భూరిశ్రవః, బాహ్లిక, విరాట, ద్రుపద, ఘటోత్కచ, ధార్తరాష్ట్ర, నారాయణగోపాల+ఆది, వధయును= అలంబసు డనే రాక్షసుడు, శ్రుతాయువు, జలసంధుడు, సోమదత్తుడు, భూరిశ్రవుడు, బాహ్లికుడు, విరాటుడు, ద్రుపదుడు, ఘటోత్కచుడు, ధృతరాష్ట్రునికుమారులు, నారాయణగోపాలురు మొదలైనవారి సంహారమున్నూ; ద్రోణ, వధయున్= ద్రోణుడినిచంపుటయున్నూ; అశ్వత్థామ; నారాయణ+ఆగ్నేయ+అస్త్ర, కీర్తనంబును= అశ్వత్థామ ప్రయోగించిన నారాయణాస్త్రముయొక్కయు ఆగ్నేయాస్త్రముయొక్కయు స్తుతియున్నూ; కృష్ణ+అర్జునుల, మాహాత్మ్యంబును= కృష్ణుడి యొక్కయు, అర్జునుడి యొక్కయు మహత్త్వమున్నూ; అను; వృత్తాంతంబులన్= కథలతో; ఒప్పి= అలరి; పది, వేలున్, తొమ్మన్నూట, పందొమ్మిది శ్లోకంబులు= 10919 శ్లోకాలు; కలిగి= పొంది.

తాత్పర్యం: సుగమం.

క. **విన నే డగుపర్వము మే । లనఁగా ద్రోణాభిషేక మాదిగఁ గల య**
య్యెనిమిదిపర్వములను న । త్యనుపమ మై ద్రోణపర్వ మమరున్ సభలన్. **48**

ప్రతిపదార్థం: వినన్= వినుటకు; ఏడు+అగు, పర్వము= ఏడవపర్వం; మేలు= శ్రేష్ఠమైనది; అనగా; ద్రోణ+అభిషేకము= ద్రోణుడిని సేనానాయకుడిగా అభిషేకించటం (ఇది ద్రోణపర్వంలోని మొదటిఉపపర్వం); ఆదిగన్= మొదలుగ; కల; ఆ+ఎనిమిదిపర్వములనున్= ఆ ఎనిమిది పర్వాలతో; అతి+అనుపమము+ఐ= మిక్కిలి సాటిలేని దై; ద్రోణపర్వము= ద్రోణపర్వ మనే ప్రధానపర్వం; సభలన్= పండితసభలలో; అమరున్= ఒప్పుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వినటానికి ఏడవపర్వం శ్రేష్ఠ మనగా ద్రోణాభిషేకం మొదలుగా గల ఎనిమిదిఉపపర్వాలతో సాటిలేని దై ప్రధాన మైన ద్రోణపర్వం పండితసభలలో ఒప్పారుతుంది.

వ. మఱియుఁగర్ణాభిషేకంబును, గర్జునకు రథంబు గడప శల్యుం బూన్చుటయుఁ,ద్రిపురదహనోపాఖ్యానంబును, గర్ణశల్యుల పరస్పరవివాదంబును, హంసకాకీయోపాఖ్యానంబును, యుధిష్ఠిరార్జునుల పరస్పర క్రోధవచనంబులు, నర్జునానునయంబును, వృషసేనువధయును, దుశ్శాసనుం జంపిభీముండు తద్వక్షోరక్తం బాస్వాదించుటయు, విప్రశాపనిమిత్తంబునఁ గర్ణురథచక్రంబు భూమియందుఁ గ్రుంగుటయు, నాగాస్త్రభయంబును, నర్జునురథంబు శ్రీకృష్ణుండు భూమియందుఁ జొనుపుటయు, నింద్రాదిత్యుల పరస్పరసంవాదంబును,గర్ణువధయును నను వృత్తాంతంబుల నొప్పినాలుగువేలుందొమ్మన్నూఱుశ్లోకంబులు గలిగి. 49

ప్రతిపదార్థం: మఱియున్; కర్ణ+అభిషేకంబును= సేనానాయకుడిగా కర్ణుని అభిషేకించుటయున్నూ; కర్జునకున్; రథంబు; కడపన్= నడుపుటకు; శల్యున్= మద్రరాజైన శల్యుడిని; పూన్చుటయున్= వహింపజేయుటయున్నూ; త్రిపుర, దహన+ఉపాఖ్యానంబును= మూడు పురాలను దహించటంతో కూడుకొన్న కథయున్నూ (శివుడు త్రిపురాలను దహించినకథ); కర్ణ, శల్యుల; పరస్పరవివాదంబును= ఒండొరులతో తగవున్నూ; హంస, కాకీయ+ఉపాఖ్యానంబును= హంసకునూ కాకికినీ సంబంధించిన కథయున్నూ; యుధిష్ఠిర, అర్జునుల; పరస్పర, క్రోధ, వచనంబులున్= ఒండొరుల కోపంతో కూడిన వాక్యాలున్నూ; అర్జున+అనునయంబున్= అర్జునుడిని బుజ్జగించటమున్నూ వృషసేనువధయును= కర్ణునికుమారు డైన వృషసేనుడిని చంపుటయున్నూ; దుశ్శాసనున్= దుర్యోధనుడి తమ్ము డైన దుశ్శాసనుడిని; చంపి; భీముండు; తద్, వక్షః రక్తంబున్= ఆ దుశ్శాసనుని రొమ్ములోని నెత్తురును; ఆస్వాదించుటయున్= చవిచూచుటయున్నూ; విప్ర, శాప, నిమిత్తంబునన్= బ్రాహ్మణునిశాప మనే కారణంచేత; కర్ణు, రథ, చక్రంబు; భూమియందున్; క్రుంగుటయున్= దిగబడుటయున్నూ; నాగ+అస్త్రభయంబునన్= సర్పాస్త్రభయంచేత; అర్జును, రథంబు= అర్జునుడి రథాన్ని; శ్రీకృష్ణుండు; భూమియందున్; చొనుపుటయున్= చొచ్చునట్లు చేయుటయున్నూ; ఇంద్ర+ఆదిత్యుల, పరస్పర, సంవాదంబును= ఇంద్రసూర్యులు పరస్పరం వాదించుకొనుటయున్నూ; అను; వృత్తాంతంబులన్= కథలతో; ఒప్పి= అలరి; నాలుగు, వేలున్, తొమ్మన్నూఱుశ్లోకంబులు= 4900 శ్లోకాలు; కలిగి= పొంది.

తాత్పర్యం: సుగమం.

క. అనుపమబలు లగు కర్ణా। ర్జునవీరుల శౌర్యమహిమ శోభిల్లంగా
నెనిమిది యగు పర్వం బిది। యనఁ బరఁగుం గర్ణపర్వ మతిహృద్యం బై. 50

ప్రతిపదార్థం: అనుపమబలులు= సాటిలేని బలం కలవారు; అగు; కర్ణ+అర్జున, వీరుల= వీరు లైన కర్ణునియొక్కయు, అర్జునునియొక్కయు; శౌర్యమహిమ= పరాక్రమమహత్త్వం; శోభిల్లంగాన్= ప్రకాశింపగా; ఇది; ఎనిమిది, అగు=ఎనిమిదవ; పర్వంబు; అనన్= అనగా; కర్ణ, పర్వము= కర్ణపర్వ మనే ప్రధానపర్వం; అతిహృద్యంబు+ఐ= మిక్కిలి మనోహర మై; పరఁగున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: సాటిలేనిబలం కలవారైన వీరు లైన కర్ణార్జునుల పరాక్రమమహత్త్వం ప్రకాశింపగా ఇది ఎనిమిదవపర్వం అనగా కర్ణపర్వ మనే ప్రధానపర్వం మిక్కిలి మనోహర మై ఒప్పుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియుభారతవీరు లెల్లఁబరలోకగతులైన శల్యుండు రణభారంబుపూనుటయుఁ, గురుకుమారవధయును, ధర్మజురోషంబున శల్యుమరణంబును, గురుముఖ్యులవధయును, సహదేవునిచేత సపుత్త్రకుం డైన శకునిచావును, సంజయగ్రహణమోక్షణంబును, హ్రదప్రవేశంబును, భీమదుర్యోధనుల గదాయుద్ధంబును సరస్వత్యాదిపుణ్యతీర్థకీర్తనంబు నను వృత్తాంతంబుల నొప్పి మూఁడువేలు నిన్నూటయిరువది శ్లోకంబులు గలిగి. 51

ప్రతిపదార్థం: మఱియున్ భారతవీరులు= భరతవంశానికి చెందిన వీరులు; ఎల్లన్= అందరున్నూ; పరలోక, గతులు+ఐనన్= స్వర్గలోకాన్ని పొందినవారు కాగా; శల్యుండు= మద్రరా జైన శల్యుడు; రణభారంబు= యుద్ధముయొక్కబాధ్యతను; పూనుటయున్= వహించుటయున్నూ; కురు, కుమార, వధయును= కురువంశానికి చెందిన కుమారులసంహరణమున్నూ; ధర్మజు, రోషంబునన్= ధర్మరాజుయొక్కకోపంచేత; శల్యుమరణంబును= శల్యునియొక్కచావున్నూ; కురుముఖ్యుల= ముఖ్యు లైన కురువంశస్థుల; వధయును= చంపుటయున్నూ; సహదేవునిచేతన్; సపుత్త్రకుండు+ఐన= కుమారునితో కూడిన; శకునిచావును= కౌరవులమేనమామ ఐన శకునిమరణమున్నూ; సంజయగ్రహణమోక్షణంబును= సాత్యకి సంజయుడిని పట్టుకొనగా వ్యాసుడు ప్రత్యక్షమై విడిపించుటయున్నూ; హ్రదప్రవేశంబును= దుర్యోధనుడు మడుగులో చొచ్చుటయున్నూ; భీమదుర్యోధనుల= భీమునియొక్కయు దుర్యోధనునియొక్కయు; గదాయుద్ధంబును= గదలతో చేయబడిన యుద్ధమున్నూ; సరస్వతీ+ఆది, పుణ్య, తీర్థకీర్తనంబును= సరస్వతి మొదలైన పుణ్యనదుల స్తుతియున్నూ; అను, వృత్తాంతంబులన్= అనేకథలతో; ఒప్పి= అలరి; మూఁడు, వేలున్, ఇరు+నూట, ఇరు+పది, శ్లోకంబులు= 3220 శ్లోకాలు; కలిగి= వహించి.

తాత్పర్యం: స్పష్టం.

ఆ. సభల విస్తరిల్లి శల్యాదికము లైన । నాల్గుపర్వముల వినంగఁ జాలి
నవమపర్వ మనఁగ నవ్యార్థరమణీయ । మగుచు శల్యపర్వ మతిశయిల్లు. 52

ప్రతిపదార్థం: సభలన్= సభలయందు; విస్తరిల్లి= వ్యాపించి; శల్య+ఆదికములు+ఐన= శల్యపర్వం మొదలైన; నాల్గుపర్వములన్= నాలుగుఉపపర్వాలలో; వినంగన్= వినటానికి; చాలి= తగి; నవమపర్వము= తొమ్మిదవపర్వం; అనఁగన్= అనగా; నవ్య+అర్థ, రమణీయము+అగుచున్= క్రొత్త వైన అర్థాలతో ఒప్పిద మౌతూ; శల్యపర్వము= శల్యపర్వ మనే ప్రధానపర్వం; అతిశయిల్లున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: సభలలో వ్యాపించి శల్యపర్వం మొదలైన నాలుగుఉపపర్వాలతో వినటానికి తగి తొమ్మిదవపర్వ మనగా నూత్నార్థసుందర మౌతూ శల్యపర్వం అనే ప్రధానపర్వం ఒప్పారుతుంది.

వ. మఱియు భీముగదాభిఘాతంబున దుర్యోధనుండు తొడలు విఱిగి పడినఁ, బాండవులు రణం బుపసంహరించి చనిన నాఁటిరాత్రి కృపకృతవర్మాశ్వత్థామలు పాండవశిబిరంబుపయింజనుటయు, నం దశ్వత్థామ కోపోద్దీపితుండై తనప్రతిజ్ఞదీఱ ధృష్టద్యుమ్నపురోగములైన సర్వపాంచాలురను బ్రతివింధ్యాదిద్రౌపదేయులను బాండవామాత్యులను సుఖసుప్తులయినవారి వధించుటయు, నందు శ్రీకృష్ణప్రసాదంబునఁ బాండవులేవురు సాత్యకియుం దప్పుటయుఁ, బుత్త్రభ్రాతృవధ దుఃఖిత యై పాంచాలి యనశనంబు సంకల్పించుకొనుటయుఁ, దద్వచనంబున భీముం డశ్వత్థామపిఱుందం జనుటయు,

భీమసేనభయార్తుండయి యశ్వత్థామ యపాండవం బయ్యెడుమని శరమోక్షణంబుసేయుటయు, నట్లుగాకుండెడు మని శ్రీకృష్ణుండు దానింబరిహరించుటయు, దానిం దునియ నర్జునుండు తనదివ్యబాణంబున నేయుటయు, వ్యాసాశ్వత్థామల యన్యోన్యశాపంబులు, నశ్వత్థామశిరోరత్నంబుఁ బాండవులుగొనుటయు నను వృత్తాంతంబుల నొప్పి రెండువేలునెనమన్నూటడెబ్బది శ్లోకంబులు గలిగి. 53

ప్రతిపదార్థం: భీము, గదా, అభిఘాతంబునన్= భీమునిగదయొక్క దెబ్బచేత; దుర్యోధనుండు; తొడలు, విఱిగి, పడినన్= తొడలు విరిగి పడిపోగా; పాండవులు; రణంబు= యుద్ధం; ఉపసంహరించి= చాలించి; చనినన్= వెళ్ళిన; నాఁటి, రాత్రి; కృప, కృతవర్మ, అశ్వత్థామలు= కృపాచార్యుడున్నూ, కృతవర్మయున్నూ, అశ్వత్థామయున్నూ; పాండవశిబిరంబుపయిన్= పాండవులు విడిసిన ప్రదేశంమీదికి; చనుటయున్= వెళ్ళుటయున్నూ; అందున్= ఆ ముప్వురిలో, (అచట); అశ్వత్థామ= ద్రోణుడికుమారు డైన అశ్వత్థామ; కోప+ఉద్దీపితుండు+ఐ= కోపంచేత మిక్కిలి మండిపడినవాడై; తనప్రతిజ్ఞ= తనశపథం; తీఱన్= ముగిసేటట్లుగా; ధృష్టద్యుమ్నపురోగములు+ఐన= ద్రుపదుని కుమారు డైన ధృష్టద్యుమ్నుడు ముందుగా కలవా రైన; సర్వపాంచాలురను= సకలపాంచాలదేశీయులను; ప్రతివింధ్య+ఆది ద్రౌపదేయులను= ప్రతివింధ్యుడు మొదలైన ద్రౌపదికుమారులను; పాండవ+అమాత్యులను= పాండవులమంత్రులను; సుఖసుప్తులు+అయినవారిన్= సుఖంగా నిద్రించినవారిని; వధించుటయును= చంపుటయున్నూ; అందున్= వారిలో; శ్రీకృష్ణప్రసాదంబునన్= శ్రీకృష్ణునిఅనుగ్రహంచేత; పాండవులు+ఏవురున్= పాండవులైదుగురున్నూ; సాత్యకియున్= సాత్యకియున్నూ; తప్పుటయును= చావక మిగులుటయున్నూ; పుత్త్ర, భ్రాతృ, వధ, దుఃఖిత+ఐ కుమారులయొక్కయు, సోదరులయొక్కయు సంహరణంచేత శోకించిన దై; పాంచాలి= పాంచాలరాజగు ద్రుపదుడి కూతు రైన ద్రౌపది; అనశనంబు= భోజనంలేకుండటం (ఉపవాసం); సంకల్పించుకొనుటయున్= నిశ్చయించుకొనుటయున్నూ; తద్, వచనంబునన్= ఆ ద్రౌపదియొక్క మాటచేత; భీముండు; అశ్వత్థామ, పిఱుందన్= అశ్వత్థామవెనుక; చనుటయున్= వెళ్ళుటయున్నూ; భీమసేన, భయ+ఆర్తుండు+ఐ= భీమసేనుడివలనిభయంచేత దుఃఖితు డై; అశ్వత్థామ; అపాండవంబు= పాండవులు లేకుండే స్థితి; అయ్యెడున్+అని= అగుగాక అని; శరమోక్షణంబు= బాణాన్ని విడుచుట; చేయుటయున్, అట్లు= ఆవిధంగా, అపాండవం; కాక, ఉండెడున్+అని= కాకుండు గాక అని; శ్రీకృష్ణుండు; దానిన్= ఆ బాణాన్ని; పరిహరించుటయున్= తప్పించుటయున్నూ; దానిన్= ఆబాణాన్ని; తునియన్= ఖండిత మయ్యేటట్లు; అర్జునుండు; తనదివ్యబాణంబునన్= తనయొక్కదేవతాసంబంధమైన అస్త్రంచేత; ఏయుటయున్= కొట్టుటయున్నూ (ప్రయోగించుటయున్నూ); వ్యాస+అశ్వత్థామల= వ్యాసునియొక్కయు, అశ్వత్థామయొక్కయు; అన్యోన్యశాపంబులున్= ఒండొరులను శపించుకొనుటయున్నూ; అశ్వత్థామశిరః+రత్నంబున్= అశ్వత్థామయొక్క శిరోమణిని; పాండవులు; కొనుటయున్= గ్రహించుటయున్నూ; అను వృత్తాంతంబులన్= అనే కథలతో, ఒప్పి= అలరి; రెండు, వేలున్, ఎనమన్నూట, డెబ్బదిశ్లోకంబులు= 2870 శ్లోకాలు; కలిగి= పొంది.

తాత్పర్యం: సులభం.

విశేషం: చిన్నయసూరి 'ఆశీశ్శాపార్థంబులందు ఎడు, త అనుప్రత్యయము లగు' నని, 'అచ్చుపరమగునపుడు వాని ద్రుతమునకు మవర్ణక' మగు ననీ చెప్పాడు. కాని, వ్రాతప్రతులలో 'ఎడున్' అనేదానికి బదులు 'ఎడమ' అనే రూపమే కానవస్తున్నది. కేతనకూడ దీవెనకు 'ఎడమ' ఔతుం దని చెప్పాడు. ఎడమ+అని= ఎడమని.

క. నుతసౌప్తికాదిపర్వ। త్రితయంబునఁ దనరి వసుమతీసురవరస

మ్మత మై సౌప్తికపర్వము। ప్రతిభ వినం బొలుచు దశమపర్వం బగుచున్. 54

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నుతసౌప్తిక+ఆది= పొగడబడిన 'సౌప్తికము' మొదలైన; పర్వత్రితయంబునన్= పర్వాలమూడింటితో, తనరి= ఒప్పి; వసుమతీ, సుర, వర, సమ్మతము+ఐ= బ్రాహ్మణశ్రేష్ఠులకు ఇష్ట మై; సౌప్తికపర్వము, సౌప్తికపర్వ మనే ప్రధాన పర్వం; దశమపర్వంబు+అగుచున్= పదవప్రధానపర్వం ఔతూ; ప్రతిభన్= ప్రజ్ఞతో; వినన్, పొలుచున్= విన సొంపుగా ఉంటుంది.

తాత్పర్యం: పొగడబడిన సౌప్తికం మొదలైన మూడు ఉపపర్వాలతో ఒప్పి, బ్రాహ్మణశ్రేష్ఠులకు ఇష్ట మై సౌప్తికపర్వం పదవపర్వ మౌతూ విన నింపుగా ఉంటుంది.

వ. మఱియు వీరపత్నీవిలాపంబును, గాంధారీధృతరాష్ట్రుల కోపప్రసాదంబులును, ధర్మజుండు రణనిహతు లైన పితృపితామహభ్రాతృ పుత్త్రభృత్యామాత్యమాతులాచార్యమిత్రాదులం బరీక్షించి యథావిధి సంస్కరింపందగు వారలం బంచుటయు, భారతవీరుల కుదకదానంబు సేయుటయుఁ, దత్సమయంబునఁ గుంతీదేవి పాండవులకుఁ గర్ణుండు గూఢోత్పన్నుం డని యెఱింగించుటయు, ధర్మజువిలాపంబును, ధర్మజురాజ్యాభిషేకంబును, చార్వాకనిగ్రహంబును, గృహప్రవిభాగంబును నను వృత్తాంతంబుల నొప్పి వేయునేడునూటడెబ్బదియైదు శ్లోకంబులు గలిగి. 55

ప్రతిపదార్థం: మఱియు; వీర, పత్నీ, విలాపంబును= కురుక్షేత్రసంగ్రామంలో వీరులభార్యలయేడ్పున్నూ; గాంధారీ, ధృతరాష్ట్రుల= గాంధారియొక్కయు, ధృతరాష్ట్రునియొక్కయు; కోప, ప్రసాదంబులును= కోపమున్నూ అనుగ్రహమున్నూ (ఉపశమనమున్నూ); ధర్మజుండు= ధర్మరాజు; రణ, నిహతులు+ఐన= యుద్ధంలో చంపబడిన; పితృ, పితామహ, భ్రాతృ, పుత్త్ర, భృత్య+అమాత్య, మాతుల, ఆచార్య, మిత్ర+ఆదులన్= తండ్రులు, (తండ్రి తండ్రులు) తాతలు, సోదరులు, కుమారులు, సేవకులు, మంత్రులు, మేనమామలు, గురువులు, స్నేహితులు మొదలైనవారిని (ఇందులో చెప్పబడిన బంధుత్వసంబంధాలు కొన్ని వరుసకు చెప్పబడినవి); పరీక్షించి= పరిశీలించి; యథావిధిన్= శాస్త్రాన్ని అతిక్రమించకుండ, సంస్కరింపన్= దహనంచేయటానికి; తగు, వారలన్= తగినవారిని; పంచుటయున్= పంపుటయున్నూ; భారత, వీరులకున్= భరతవంశానికి చెందినవీరులకు; ఉదక, దానంబు= తిలోదకా లివ్వటం; చేయుటయున్; తత్, సమయంబునన్= జలదాన మిచ్చేవేళ; కుంతీదేవి; పాండవులకున్; గూఢ+ఉత్పన్నుండు+అని= హిందూధర్మశాస్త్రాన్ని అనుసరించి చెప్పబడే పన్నెండుగురు సుతులలో గూఢోత్పన్నుడు ఒకడు. భర్త పరోక్షంలో స్త్రీకి రహస్యంగా పుట్టినవాడు; ఒక్కొక్కప్పుడు నిజ మైన తండ్రి ఎవ్వరో తెలియదు; (గృహే ప్రచ్ఛన్న ఉత్పన్నో గూఢజస్తు సుతః స్మృతః - యాజ్ఞవల్క్యస్మృతి 2-129); ఎఱింగించుటయున్= తెల్పుటయున్నూ; ధర్మజు= ధర్మరాజుయొక్క; విలాపంబును= దుఃఖమున్నూ; ధర్మజు, రాజ్య+అభిషేకంబును= ధర్మరాజును రాజ్యసింహాసనంమీద అభిషేకించుటయున్నూ; చార్వాక, నిగ్రహంబును= (దుర్యోధనుని సఖుడైన చార్వాకు డనే రాక్షసుడు విప్రసన్న్యాసివేషంలో వచ్చి ధర్మజునిగూర్చి నిరుత్సాహవాక్యాలు పలుకగా బ్రాహ్మణులు హుంకారాలు చేశారు. అతడు ఘోరాకృతితో నేల కూలాడు) చార్వాకుడిని విప్రులు శిక్షించుటయున్నూ; గృహ, ప్రవిభాగంబునున్= ప్రాసాదంలోని (రాజగృహంలోని) ఆయాభాగాలను భీమాదులకు విభజించి ఇచ్చుటయున్నూ అను; వృత్తాంతములన్= కథలతో; ఒప్పి= అలరి; వేయున్, ఏడు, నూట, డెబ్బది, ఐదు, శ్లోకంబులు= 1775శ్లోకాలు; కలిగి= వహించి, పొంది.

తాత్పర్యం: స్పష్టం.

విశేషం: ధర్మజరాజ్యాభిషేక, చార్వాకనిగ్రహాది వృత్తాంతాలు తెలుగులో శాంతిపర్వప్రథమాశ్వాసంలో ఉన్నవి.

క. పర్వుచు స్త్రీపర్వాదిక । పర్వంబుల నే నిటం గృపాయుత మై స్త్రీ
పర్వంబు పదునొకం డగు । పర్వము నా వెలయు సుకవిపండితసభలన్. 56

ప్రతిపదార్థం: పర్వుచున్= వ్యాపిస్తూ; స్త్రీ, పర్వ+ఆదిక, పర్వంబులన్= స్త్రీపర్వం మొద లైన ఉపపర్వాలలో; ఏనిటన్=ఐదింటితో; కృపాయుతము+ఐ= దయతో (జాలితో) కూడిన దై; స్త్రీ, పర్వంబు= స్త్రీపర్వ మనే ప్రధానపర్వం; పది+ఒకండు+అగు, పర్వము= పదునొకండవపర్వం; నాన్= అనగా; సుకవి, పండితసభలన్= మంచికవులయొక్కయు, పండితులయొక్కయు సభలందు; వెలయున్= ప్రసిద్ధమై ఉంటుంది.

తాత్పర్యం: స్త్రీపర్వం మొదలైన ఉపపర్వా లైదింటితో వ్యాపిస్తూ, జాలితో కూడిన దై స్త్రీపర్వ మనే ప్రధానపర్వం పదునొకండవపర్వంగా ఉత్తమకవిపండితులసభలలో ప్రసిద్ధమై ఉంటుంది.

వ. మఱియు బంధువర్గంబు నెల్ల వధియించి పరమనిర్వేదనపరుం డై కృష్ణువచనంబుల శాంతుం డై యున్న ధర్మజునకు శరతల్పగతుం డైన భీష్ముండు ధర్మవిదు లయిన రాజులకెల్ల హితంబుగా రాజధర్మంబులు, నాపద్ధర్మంబులు, నేవాని నెఱింగిన సర్వజ్ఞానసంపన్ను లగుదు రట్టి మోక్షధర్మంబులుఁ జెప్పటయు నను వృత్తాంతంబుల నొప్పి పదునాలుగువేలునేనూటయిరువది యైదుశ్లోకంబులు గలిగి. 57

ప్రతిపదార్థం: మఱియున్; బంధువర్గంబున్= చుట్టాలసముదాయాన్ని; ఎల్లన్= అంతటిని; వధియించి= చంపి; పరమనిర్వేదన, పరుండు+ఐ= అధిక మైన దుఃఖంలో తగుల్కొన్నవా డై; కృష్ణు, వచనంబులన్= శ్రీకృష్ణునివాక్యాలచేత; శాంతుండు+ఐ+ఉన్న= శాంతి పొంది ఉన్న; ధర్మజునకున్= ధర్మరాజుకు; శరతల్పగతుండు+ఐన= అంపశయ్యను పొందిన; భీష్ముండు; ధర్మవిదులు+అయిన= ధర్మం తెలిసినవా రైన; రాజులకున్+ఎల్లన్= రాజులందరికిన్నీ; హితంబు+కాన్= మేలు కలిగేటట్లుగా; రాజధర్మంబులున్= రాజులనుసరింపవలసిన ధర్మాలను; ఆపత్+ధర్మంబులును= సామాన్యంగా కాక ఆపదసమయాలలో అనుసరింపవలసిన ధర్మాలను; ఏవానిన్= వేనిని; ఎఱింగిన= తెలిసికొన్నచో, సర్వ, జ్ఞాన, సంపన్నులు= అన్నివిధాలైన జ్ఞానంతో కూడినవారు; అగుదురు= అగుదురో, అట్టి= అటువంటి, మోక్షధర్మంబులున్= జన్మరాహిత్యాన్ని కలిగించే ధర్మాలను; చెప్పుటయున్= తెల్పుటయున్నూ; అను, వృత్తాంతంబులన్= అనేకథలతో; ఒప్పి= అలరి; తగి; పదునాలుగు, వేలున్, ఏను, నూట ఇరువది, ఐదుశ్లోకంబులు= 14525 శ్లోకాలు; కలిగి= పొంది.

తాత్పర్యం: స్పష్టం.

క. సకలహితం బై శాంత్యా। దికపర్వచతుష్కమున విదిత మై సమబు
ద్ధికిఁ బండ్రెం డగు పర్వం। బ కడున్ మే లనఁగ శాంతిపర్వము వెలయున్. 58

ప్రతిపదార్థం: సకలహితంబు+ఐ= అందరికిని మేలు కలిగించే దై; శాంతి+ఆదిక పర్వచతుష్కమునన్= శాంతి మొదలైన ఉపపర్వాలు నాల్గింటితో; విదితము+ఐ= ప్రసిద్ధమై; సమబుద్ధికిన్= పక్షపాతం లేని సమమైనబుద్ధికి; పండ్రెండు+అగు= పండ్రెండవ, పన్నెండవ; పర్వంబు+అ= పర్వమే; కడున్= మిక్కిలి; మేలు+అనఁగన్= శ్రేష్ఠ మనగా; శాంతి పర్వము= శాంతిపర్వమనే ప్రధానపర్వం; వెలయున్= ప్రసిద్ధ మై ఉంటుంది.

తాత్పర్యం: అందరికిని మేలు కలిగించే దై, శాంతిమొద లైన నాలుగుఉపపర్వాలతో ప్రసిద్ధమై, నిష్పక్షపాతబుద్ధికి పన్నెండవపర్వమే మిక్కిలిశ్రేష్ఠ మైన దనగా శాంతిపర్వ మనే ప్రధానపర్వం ప్రకాశిస్తుంది.

వ. మఱియుఁ బితామహుం డగు గాంగేయువలన సర్వధర్మనిశ్చయంబును, దానివిధులును, నాచారవిధులును ధర్మరా జెఱుంగుటయుఁ, బుత్త్రానుశాసనంబును, భీష్మస్వర్గారోహణంబు నను వృత్తాంతంబుల నొప్పి పండ్రెండువేలశ్లోకంబులు గలిగి. 59

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మఱియున్; పితామహుండు+అగు= తాత అగు; గాంగేయువలనన్= గంగానందను డైన భీష్ముడివలన; సర్వధర్మనిశ్చయంబును= అన్నిధర్మాలయొక్క నిర్ణయాన్ని; దానవిధులును= దానం చేసే విధానాలను; ఆచారవిధులును= సర్వవర్ణాలవారును అనుసరించవలసిన ఆచారాలయొక్క విధానాలను; ధర్మరాజు; ఎఱుంగుటయున్= తెలిసికొనుటయున్నూ; పుత్ర+అనుశాసనంబును= భీష్ముడు తన కుమారుడగు ధృతరాష్ట్రుని దగ్గరకు పిలిచి హితమును ఉపదేశించటం. ఇదే పుత్రానుశాసనం. ఇదే భీష్ముడు చేసిన చివరి అనుశాసనం; భీష్మ, స్వర్గ+ఆరోహణంబున్= భీష్మునియొక్క స్వర్గాన్ని అధిష్ఠించుటయున్నూ (భీష్ముడుస్వర్గస్థుడు అగుటయున్నూ); అను, వృత్తాంతంబులన్= అనే, కథలతో; ఒప్పి= వెలసి, పంద్రెండువేలశ్లోకంబులు=12,000 శ్లోకాలు; కలిగి= పొంది.

తాత్పర్యం: స్పష్టం.

క. **ఒనరుఁ ద్రయోదశపర్వం। బనఁగా ననుశాసనాద్య మగు పర్వయుగం**
బున మే లై। విబుధశ్రే। ణినుతం బై యానుశాసనిక పర్వ మిలన్. **60**

ప్రతిపదార్థం: అనుశాసన+ఆద్యము+అగు= అనుశాసన మనే ఉపపర్వం మొదటిదిగా గల; పర్వయుగంబునన్= ఉపపర్వాలజంటచేత; మేలు+ఐ= శ్రేష్ఠమై; విబుధ, శ్రేణి, నుతంబు+ఐ= పండితుల సముదాయంచేత పొగడబడిన దై; త్రయోదశపర్వంబు+అనఁగాన్= పదమూడవపర్వ మనగా; ఆనుశాసనికపర్వము= ఆనుశాసనిక మనే ప్రధానపర్వం; ఇలన్= భూమిపై; ఒనరున్= వెలయును.

తాత్పర్యం: సుగమం.

వ. **మఱియు నశ్వమేధారంభంబును, సంవర్తమరుత్తీయోపాఖ్యానంబును, స్వర్ణకోశసంప్రాప్తియు, నుత్తరగర్భంబున నశ్వత్థామాస్త్రదగ్ధుం డై శ్రీకృష్ణుచేత సంజీవితుం డయిన పరీక్షితుని జన్మంబు, నర్జును నశ్వానుసరణంబు, నెడనెడరాజులతోడి యుద్ధంబును, జిత్రాంగదపుత్త్రుండైన బభ్రువాహనుం డాహవంబున నర్జునుం బరిభవించుటయు, నశ్వమేధమహాయజ్ఞంబునందు నకులోపాఖ్యానంబును, ననుగీతయు, బ్రాహ్మణగీతయు, గురుశిష్యసంవాదంబును నను వృత్తాంతంబుల నొప్పి నాల్గవేలునన్నూటయిరువది శ్లోకంబులు గలిగి.** **61**

ప్రతిపదార్థం: మఱియున్; అశ్వమేధ+ఆరంభంబును= అశ్వమేధయజ్ఞముయొక్క ప్రారంభమున్నూ; సంవర్త, మరుత్తీయ, ఉపాఖ్యానంబును= సంవర్తునియొక్కయు, మరుత్తునకు సంబంధించినదియున్నూ అగు కథయు; స్వర్ణ, కోశ, సంప్రాప్తియున్= బంగారముయొక్కయు, ధనముయొక్కయు లాభమున్నూ (పొందుటయున్నూ); ఉత్తర, గర్భంబునన్= అభిమన్యునిభార్య ఐన ఉత్తరకడుపున; అశ్వత్థామ+అస్త్ర, దగ్ధుండు+ఐ= అశ్వత్థామయొక్క బ్రహ్మాస్త్రంచేత కాల్చబడిన వాడై; శ్రీకృష్ణునిచేత; సంజీవితుండు+అయిన= బ్రతికింపబడినవా డైన; పరీక్షితుని= అభిమన్యునియొక్క కుమారుని; జన్మంబున్= పుట్టుకయున్నూ; అర్జున+అశ్వ+అనుసరణంబున్= అర్జునునియొక్క అశ్వమేధాశ్వాన్ని అనుసరించుటయున్నూ; ఎడన్, ఎడన్= అక్కడక్కడ; రాజులతోడన్+ యుద్ధంబును= రాజులతో యుద్ధమున్నూ; చిత్రాంగద, పుత్త్రుండు+ఐన= అర్జునునిభార్య యైన చిత్రాంగదకు కొడుకైన; బభ్రువాహనుండు; ఆహవంబునన్= యుద్ధంలో; అర్జునున్= అర్జునుడిని; పరిభవించుటయున్= అవమానించుట యున్నూ; అశ్వమేధ, మహత్, యజ్ఞంబునందున్= అశ్వమేధ మనే గొప్ప దైన యజ్ఞంలో; నకుల+ఉపాఖ్యానంబును= ముంగిసయొక్కకథయున్నూ; అనుగీతయున్= కృష్ణు డర్జునుడికి మరల చెప్పిన గీతయున్నూ (దీనిని స్వర్గలోకంనుండి వచ్చిన బ్రాహ్మణుడు చెప్పాడు); బ్రాహ్మణ, గీతయున్= బ్రాహ్మణుడు భార్యకు చెప్పినతత్త్వంతో కూడుకొన్న గీతయున్నూ; గురు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శిష్య, సంవాదంబును= గురువునకూ, శిష్యుడికీ జరిగిన సంభాషణయున్నూ; అను, వృత్తాంతంబులన్= అనే, కథలతో; ఒప్పి= అలరి; నాల్గు, వేలు, నలు+నూట, ఇరువది, శ్లోకంబులు= 4420 శ్లోకాలు; కలిగి= పొంది.

తాత్పర్యం: సుగమం.

విశేషం: రాజులతోడన్+యుద్ధంబు= సమాసములందు చేత, తోడ, వలనలకు ఇత్వ మౌతుంది, రాజులతోడియుద్ధము.

తే. అభిమతం బగు నశ్వమేధాదికద్వి । పర్వయుత మై చతుర్దశపర్వ మనఁగ
నాశ్వమేధికపర్వ మత్యంత నిబిడ । వస్తువిస్తార మై బుధవరుల సభల. 62

ప్రతిపదార్థం: అశ్వమేధ+ఆదిక, ద్వి, పర్వ, యుతము+ఐ= అశ్వమేధం మొదలైన రెండుఉపపర్వాలతో కూడిన దై; చతుః, దశ, పర్వము+అనఁగన్= పదునాల్గవ పర్వ మనగా; అత్యంత, నిబిడ, వస్తు, విస్తారము+ఐ= మిక్కిలి దట్ట మైన విషయాలవిస్తృతి కలదై; బుధ, వరుల, సభలన్= పండితశ్రేష్ఠులసభలలో; అభిమతంబు+అగున్= సమ్మత మౌతుంది.

తాత్పర్యం: అశ్వమేధం మొదలుగాగల రెండుఉపపర్వాలతో కూడిన దై, పదునాల్గవపర్వ మనగా ఆశ్వమేధిక మనే ప్రధానపర్వం మిక్కిలిదట్ట మైన విషయాలవిస్తృతి కలదై, పండితశ్రేష్ఠులసభలందు సమ్మత మౌతుంది.

వ. మఱియు ధృతరాష్ట్రుండును గాంధారియు రాజ్యంబు విడిచి విదురసంజయసహితంబుగా నాశ్రమవాసంబునకుఁజనుటయు, సకలరాజ్యభారధౌరేయులైనకొడుకులవిడిచి కుంతీదేవి గురుశుశ్రూషాపరయయి వారిపిఱుందన పోవుటయు, సమరనిహతు లైన పుత్త్రపౌత్త్రుల నెల్ల ధృతరాష్ట్రుండు వ్యాసవరప్రసాదంబునఁ గాంచి విగతశోకుం డయి గాంధారీకుంతీవిదుర సంజయులతోఁ బరమసిద్ధికింజనుటయుఁ, బాండవులు నారదువలన నిఖిలయాదవవ్యసనం బెఱుంగుటయు నను వృత్తాంతంబుల నొప్పి వేయునూటయాఱుశ్లోకంబులు గలిగి. 63

ప్రతిపదార్థం: మఱియున్; ధృతరాష్ట్రుండును; గాంధారియున్; రాజ్యంబు; విడిచి; విదుర, సంజయసహితంబుగాన్= విదురుడితోనూ, సంజయుడితోనూ కూడుకొని; ఆశ్రమవాసంబునకున్= అడవిలోని ఆశ్రమంలో నివసించుటకుగాను; చనుటయున్= వెళ్ళుటయున్నూ; సకలరాజ్య, భార, ధౌరేయులు+ఐన= సర్వరాజ్యముయొక్క బరువును వహించువా రైన; కొడుకులన్= ధర్మరాజాదులను; విడిచి; కుంతీదేవి; గురు, శుశ్రూషా, పర+అయి= పెద్దలను సేవించటంలో ఆసక్తి కలదై; వారి, పిఱుందన్+అ= ధృతరాష్ట్రాదుల వెనుకనే; పోవుటయున్; సమర, నిహతులు+ఐన= యుద్ధంలో చంపబడిన; పుత్త్ర, పౌత్త్రులన్, ఎల్లన్= కొడుకులను, కొడుకులకొడుకులను అందరిని; ధృతరాష్ట్రుండు; వ్యాస, ప్రసాదంబునన్= వ్యాసునిఅనుగ్రహంచేత; కాంచి= చూచి; విగత, శోకుండు+ అయి= పోయినదుఃఖం కలవా డై; గాంధారీ, కుంతీ, విదుర, సంజయులతోన్; పరమ, సిద్ధికిన్= మోక్షానికి; చనుటయున్= వెళ్ళుటయున్నూ; పాండవులు; నారదువలనన్= నారదమునివలన, నిఖిల, యాదవ, వ్యసనంబు= యాదవులందరియొక్క ఆపదను (మరణాన్ని); ఎఱుంగుటయున్= తెలిసికొనుటయున్నూ; అను, వృత్తాంతంబులన్= అనేకథలతో; ఒప్పి=అలరి; వేయు నూట, ఆఱు, శ్లోకంబులు= 1106 శ్లోకాలు; కలిగి= పొంది.

తాత్పర్యం: సులభం.

క. అమితార్థయుక్తితో నా । శ్రమవాసాదిత్రిపర్వసహితం బయి యా
శ్రమవాసపర్వ మత్యు । త్తమ కథలను వెలయుఁ బంచదశపర్వం బై. 64

ప్రతిపదార్థం: అమిత+అర్థ, యుక్తితోన్= అధికమైన అర్థముయొక్క కూడికతో; ఆశ్రమవాస+ఆది, త్రి, పర్వ, యుక్తంబు+అయి= ఆశ్రమవాసం మొదలుగా గల మూడు ఉపపర్వాలతో కూడిన దై; ఆశ్రమవాస, పర్వము=ఆశ్రమవాస మనే ప్రధానపర్వం; పంచదశ, పర్వంబు+ఐ= పదునైదవపర్వ మై; అతి+ఉత్తమ, కథలను= మిక్కిలి శ్రేష్ఠ లైన కథలతో; వెలయున్= ప్రసిద్ధ మౌతుంది.

తాత్పర్యం: అధిక మైన అర్థంతో కూడుకొన్న ఆశ్రమవాసం మొదలుగా గల మూడు ఉపపర్వాలతో కూడిన దై ఆశ్రమవాసం అనే ప్రధానపర్వం మిక్కిలిశ్రేష్ఠ లైన కథలతో పదునైదవపర్వమై ప్రసిద్ధి కెక్కుతుంది.

వ. మఱియు యాదవు లెల్ల మదిరాపానపరవశు లయి శాపనిమిత్తంబున సముద్రతీరంబునఁ దమలోఁ బోరి పొడిచికొని పరలోక గతు లగుటయు, దాని నెఱింగి రామకృష్ణాదియాదవ విరహితం బయిన ద్వారవతి కర్జునుం డరిగి విషణ్ణచిత్తుం డయి వసుదేవాదియాదవుల నెల్ల సంస్కరించి, యాదవకళత్రంబుల నెల్లఁ దోడ్కొని వచ్చుచో గాండీవదివ్యబాణంబులశక్తి దఱిఁగిన వనచరభయంబువలనఁ దత్కళత్రంబుల రక్షింపనోపమియు, నర్జునుండు ధర్మరాజుకడకు వచ్చి వ్యాసవాక్యప్రబోధితుం డై సన్న్యసించుటయు నను వృత్తాంతంబుల నొప్పి మున్నూఱుశ్లోకంబులు గలిగి పదియాఱవపర్వం బై మౌసలపర్వంబునాఁ బరఁగె; మఱియుఁ బరీక్షిద్రాజ్యాభిషేకంబును, రాజ్యపరిత్యాగము సేసి పాండవు లేవురు ద్రౌపదీసహితు లై పరమసిద్ధికిం జనుటయు నను వృత్తాంతంబుల నొప్పి నూటయిరువదిశ్లోకంబులు గలిగి పదియేడవపర్వం బై మహాప్రస్థానికంబునాఁ బరఁగె; మఱియుఁ గర్ణునరకప్రాప్తియుఁ దన్మోక్షణంబును, స్వర్గంబున భారతవీరులసంగమంబును, గర్మపరిపాకోపభోగంబు నను వృత్తాంతంబుల నొప్పి యిన్నూఱుశ్లోకంబులు గలిగి పదునెనిమిదవపర్వం బై స్వర్గారోహణంబు నాఁ బరఁగె; ని ట్లష్టాదశపర్వంబులు గలిగి. 65

ప్రతిపదార్థం: మఱియున్; యాదవులు+ఎల్లన్= యాధవులందరున్నూ; మదిరా, పాన, పరవశులు+అయి= మద్యం త్రాగటంచేత పరాధీను లై(వశముతప్పినవారై); శాప, నిమిత్తంబునన్= ముని లిచ్చిన శాపం కారణంచేత; సముద్ర, తీరంబునన్= సముద్రపుఒడ్డున; తమలోన్= తమలోతాము; పోరి= యుద్ధంచేసి; పొడిచికొని= ఆయుధాలతో గ్రుచ్చుకొని పరలోక, గతులు+అగుటయున్= మరణించుటయున్నూ (ఇతరలోకాలకు అరుగుటయున్నూ); దానిన్= వారు మరణించటం; ఎఱింగి= తెలిసికొని; రామ, కృష్ణ+ఆది, యాదవ, విరహితంబు+అయిన= బలరాముడు, కృష్ణుడు మొదలుగాగల యాదవులు లేని; ద్వారవతికిన్= ద్వారకకు; అరిగి= వెళ్ళి; విషణ్ణ, చిత్తుండు+అయి= దుఃఖంతో కూడిన హృదయం కలవా డై; వసుదేవ+ఆది, యాదవులన్+ఎల్లన్= వసుదేవుడు మొదలుగాగల యాదవులందరిని; సంస్కరించి= దహనంచేసి; యాదవకళత్రంబులన్, ఎల్లన్= యాదవులభార్యలందరిని, తోడ్కొని= తనవెంట తీసికొని; వచ్చుచోన్= వచ్చునప్పుడు; గాండీవ, దివ్య, బాణంబుల, శక్తి= గాండీవధనుస్సుయొక్కయు, దేవతాసంబంధు లైన బాణాలయొక్కయు బలము; తఱిఁగినన్= తగ్గగా; వన, చర, భయంబువలనన్= అడవియందు సంచరించే ఆటవికులవలని భయంవలన; తత్, తత్, కళత్రంబులన్= వారివారిభార్యలను; రక్షింపన్+ఓపమియున్= కాపాడజాలకపోవుటయున్నూ; అర్జునుండు; ధర్మరాజు, కడకున్= ధర్మరాజుచెంతకు; వచ్చి; వ్యాస, వాక్య, ప్రబోధితుండు+ఐ= వ్యాసముని చెప్పిన వాక్యాలచేత జ్ఞానం కలిగింపబడినవాడై; సన్న్యసించుటయున్= సన్న్యాసాశ్రమం

గ్రహించుటయున్నూ (సంసారాదులను విడుచుటయున్నూ) అను; వృత్తాంతంబులన్= కథలతో; ఒప్పి= అలరి; మూడు+నూరు, శ్లోకంబులు= 300 శ్లోకాలు; కలిగి= వహించి; పది+ఆఱవ, పర్వంబు+ఐ= పదునారవపర్వ మై; మౌసల, పర్వంబు= (మౌసలము అంటే రోకలికి సంబంధించింది) మౌసలము అనే ప్రధానపర్వం; నాన్= అనగా; పరఁగెన్= ఒప్పింది; మఱియున్; పరీక్షిత్, రాజ్య, అభిషేకంబును= అభిమన్యునికుమారు డైన పరీక్షిత్తుయొక్క(ను) రాజ్యమునందు అభిషేకించుటయున్నూ; రాజ్య, పరిత్యాగము= రాజ్యముయొక్కవిడుచుట; చేసి; పాండవులు+ఏవురున్, పాండవు లైదుగురును; ద్రౌపదీ, సహితులు+ఐ= ద్రౌపదితో కూడిన వారై; పరమ, సిద్ధికిన్= మోక్షానికి; చనుటయున్= వెళ్ళుటయున్నూ; అను; వృత్తాంతంబులన్= కథలతో; ఒప్పి= అలరి; నూట, ఇరువది, శ్లోకంబులు= 120 శ్లోకాలు; కలిగి= పొంది; పది, ఏడవ= పదునేడవ; పర్వంబు+ఐ= ప్రధానపర్వ మై; మహత్, ప్రస్థానికంబు= మహాప్రస్థానికపర్వం (మహాప్రస్థాన మంటే ఇహజీవితాన్ని విడిచి పోవటం); నాన్= అనగా; పరఁగెన్= ఒప్పింది. మఱియున్; కర్ణ, నరక, ప్రాప్తియున్= కర్ణునియొక్క(కర్ణుడు) నరకలోకాన్ని పొందుటయున్నూ; తద్+మోక్షణంబును= (కర్ణుడిని) అతడిని నరకంనుండి విడిపించుటయున్నూ; స్వర్గంబునన్= స్వర్గలోకంలో; భారత, వీరుల= భరతవంశానికి చెందిన యోధులయొక్క; సంగమంబును= కలిసికొనుటయున్నూ; కర్మ, పరిపాక+ఉపభోగంబులన్= కర్మలయొక్కఫలాన్ని అనుభవించుటయున్నూ; అను; వృత్తాంతంబులన్= కథలతో; ఒప్పి= అలరి; ఇరు+నూరు; శ్లోకంబులు= 200 శ్లోకాలు; పొంది; పది+ఎనిమిది+అవ= పదునెనిమిదవ; పర్వంబు+ఐ= ప్రధానపర్వమై; స్వర్గ+ఆరోహణంబు= స్వర్గానికి ఎక్కటం (స్వర్గానికి పోవటం) స్వర్గారోహణం; నాన్= అనగా; పరఁగెన్= ఒప్పింది; ఇట్లు= ఈవిధంగా; అష్టా, దశ, పర్వంబులు= పదునెనిమిది పర్వంబులు; కలిగి= పొంది.

తాత్పర్యం: విస్పష్టం.

విశేషం: ఉపపర్వాలు లేని ప్రధానపర్వాలకు నన్నయ వేరుగా ఇతరపర్వాలకువలె పద్యాలు వ్రాయలేదు.

భారతసంహితా నిర్మాణ ప్రశంస (సం. 1-1-63)

మ. అమితాఖ్యానకశాఖలం బొలిచి, వేదార్థామలచ్ఛాయ మై,
సుమహద్వర్గచతుష్కపుష్పవితతిన్ శోభిల్లి, కృష్ణార్జునో
త్తమనానాగుణకీర్తనార్థఫల మై, ద్వైపాయనోద్యానజా
త మహాభారత పారిజాత మమరున్ ధాత్రీసురప్రార్థ్య మై. 66

ప్రతిపదార్థం: అమిత+ఆఖ్యానక, శాఖలన్= పెక్కుకథ లనేకొమ్మలతో; పొలిచి= ఒప్పి; వేద+అర్థ+అమల, ఛాయము+ఐ=వేదాలలోని అర్థ మనే నిర్మల మైన నీడ కల దై; సు, మహత్, వర్గ, చతుష్క, పుష్ప, వితతిన్= మంచిగొప్పధర్మార్థకామమోక్షా లనే పురుషార్థచతుష్టయం(నాలుగు) అనే పూవులసముదాయంతో; శోభిల్లి= ప్రకాశించి; కృష్ణ+అర్జున+ఉత్తమ, నానా, గుణ, కీర్తన, అర్థ, ఫలము+ఐ= కృష్ణుడు, అర్జునుడు అనేవారియొక్క యోగ్యాలైన అనేకగుణాలప్రశంసవలని మేలు అనే(అందరికోరికలు అనే, ఉద్దేశముఅనే) పండ్లు కలదై; ద్వైపాయన+ఉద్యాన, జాత, మహాభారత, పారిజాతము= వ్యాసు డనే ఉద్యానవనంలో పుట్టిన మహాభారతం అనే కల్పవృక్షం; ధాత్రీసుర, ప్రార్థ్యము+ఐ= బ్రాహ్మణులకు (భూదేవతలకు) వేడదగిన దై; అమరున్= ఒప్పారుతుంటుంది.

తాత్పర్యం: అనేక ఉపాఖ్యానాలు (కథలు) అనే కొమ్మలతో, ఒప్పి, వేదాలలోని అర్థ మనే నిర్మల మైన నీడ కలదై, మంచి గొప్ప నాల్గుపురుషార్థాలు అనే పూవులసముదాయంతో ప్రకాశించి, కృష్ణార్జునుల యోగ్యాలైన వివిధసద్గుణాలను

కీర్తించటంవలని మేలు (ఉద్దేశం) అనే పండ్లు కలదై, వ్యాసు డనే ఉద్యానవనంలో పుట్టిన మహాభారతేతిహాసం అనే కల్పవృక్షం బ్రాహ్మణులకు ప్రార్థింపదగిన దై అలరారుతుంది.

విశేషం: అలం: రూపకం. సుమహావర్గ- అనే పాఠాంతరం గ్రహింపదగింది. స్వర్గంలోని పారిజాతం సురప్రార్థ్యం. మహాభారతం ధాత్రీసురప్రార్థ్యం, సర్వజనప్రార్థ్య మనియే భావం. మహాభారతం పారిజాతం అనటంవలన సర్వపురుషార్థ విజ్ఞానఫల ప్రదానం చేయగలదని తాత్పర్యం. (వివరాలకు చూడు: పీఠిక.)

వ. ఇట్టి మహాభారతంబు ననేకవిధపదార్థప్రపంచసంచితంబు నుపపర్వమహాపర్వోపశోభితంబు నుపద్వీపసంభృతం బయిన భువనం బజుండు నిర్మించినట్లు కృష్ణద్వైపాయనుండు నిఖిలలోకహితార్థంబు దత్తావధానుం డై సంవత్సరత్రయంబు నిర్మించి, దాని దేవలోకంబునందు వక్కాణింప నారదుం బనిచెఁ; బితృలోకంబున వక్కాణింప నసితుం డైన దేవలుం బనిచె; గరుడ గంధర్వయక్ష రాక్షసలోకంబులందు వక్కాణింప శుకుం బనిచె; నాగలోకంబునందు వక్కాణింప సుమంతుం బనిచె; మనుష్యలోకంబున జనమేజయునకు వక్కాణింప వైశంపాయనునిం బనిచె; నే నా వైశంపాయన మహామునివలన విని వచ్చితిఁ; దొల్లి కృతత్రేతావసాన సమయంబుల దేవాసుర రామరావణ యుద్ధంబులునుంబోలె ద్వాపరాంతంబునం బాండవధార్తరాష్ట్రులకు మహాఘోరయుద్ధం బయ్యెఁ; నందు. 67

ప్రతిపదార్థం: ఇట్టి= పైన పేర్కొనబడిన గుణాలు కల; మహత్, భారతంబున్= మహాభారత మనే గ్రంథాన్ని; అనేక, విధ, పదార్థ, ప్రపంచ, సంచితంబున్= పలువిధాలైన శబ్దాలయొక్కయు, అర్థాలయొక్కయు సముదాయంతో కూడినదానిని; ఉపపర్వ, మహత్, పర్వ+ఉపశోభితంబున్= మహాభారతంలో ప్రధానపర్వాలు పదునెనిమిది ఉన్నవి. అవి మహాపర్వాలు. ప్రతిమహాపర్వంలోను కొన్ని ఉపపర్వాలు ఉన్నవి. వీటిసంఖ్య నూరు. అటువంటి ఉపపర్వాలతోను, మహాపర్వాలతోను ప్రకాశించేదానిని; ఉపద్వీప, మహత్, ద్వీప, సంభృతంబు+అయిన= చిన్నద్వీపాలతోను, పెద్దద్వీపాలతోను కూడిన (ద్వీప మంటే దీవి. నీటినడుమ గల భూభాగం); భువనంబు= జగత్తును; అజుండు= బ్రహ్మదేవుడు; నిర్మించిన+అట్లు= తీర్చి దిద్దినవిధంగా; కృష్ణద్వైపాయనుండు= వ్యాసమహాముని; నిఖిల, లోక, హిత+అర్థంబు= సర్వలోకాల (ప్రజలు) మేలుకొరకు; దత్త+అవధానుండు+ఐ= ఈయబడిన ఏకాగ్రత కలవాడై (ఏకాగ్రతతో కూడినవాడై); సంవత్సర, త్రయంబు= మూడేండ్లు; నిర్మించి= సృజించి (వ్రాసి); దానిన్= ఆ మహాభారతాన్ని; దేవలోకంబునందున్= దేవలోక మైన స్వర్గంలో; వక్కాణింపన్= చెప్పడానికి; నారదున్= నారదమునిని; పనిచెన్= పంపాడు; పితృలోకంబునన్= పితృదేవతలలోకంలో; వక్కాణింపన్= చెప్పటానికి; అసితుండు+అయిన= నల్లనివాడైన (అసితుడు అనే మారుపేరు కల); దేవలున్= దేవలుడు అనే మునిని; పనిచెన్; గరుడ, గంధర్వ, యక్ష, రాక్షస, లోకంబులందున్= గరుడుని యొక్కయు, గంధర్వుల యొక్కయు, యక్షుల యొక్కయు, రాక్షసులయొక్కయు లోకాలలో; వక్కాణింపన్= చెప్పటానికి; శుకున్= తన కుమారు డైన శుకమహర్షిని; పనిచెన్; నాగలోకంబునందున్= పాములలోకంలో (పాతాళలోకంలో); వక్కాణింపన్= చెప్పటానికి; సుమంతున్= సుమంతు డనే శిష్యుడిని; పనిచెన్; మనుష్యలోకంబునన్= మర్త్యలోకంలో; జనమేజయునకున్= పరీక్షిత్తుకుమారు డైన జనమేజయుడికి; వక్కాణింపన్= చెప్పటానికి; వైశంపాయనునిన్= వైశంపాయను డనే మరియొక శిష్యుడిని; పనిచెన్; ఏను= నేను; ఆ వైశంపాయన, మహా, మునివలనన్= ఆ వైశంపాయను డనే గొప్పమునినుండి; విని= మహాభారతకథను విని; వచ్చితిన్; తొల్లి= మున్ను; కృత, త్రేతా+అవసానసమయంబులన్= కృతయుగముయొక్కయు, త్రేతాయుగముయొక్కయు చివరికాలాలలో; దేవ+అసుర, రామ, రావణ, యుద్ధంబులున్, పోలెన్= కృతయుగంచివర దేవతలకున్నూ రాక్షసులకున్నూ, త్రేతాయుగంచివర రాముడికిన్నీ రావణుడికిన్నీ జరిగిన యుద్ధాలవలె (క్రమాలంకారం); ద్వాపర+అంతంబునన్= ద్వాపరయుగంచివర; పాండవ, ధార్తరాష్ట్రులకున్= పాండురాజధృతరాష్ట్రకుమారులకు; మహత్, ఘోరయుద్ధంబు= గొప్పభయంకర మైన యుద్ధం; అయ్యెన్= జరిగింది; అందున్= ఆయుద్ధంలో.

తాత్పర్యం: పైన పేర్కొనబడిన గుణాలు కల మహాభారత మనే గ్రంథాన్ని పలురకాలైన శబ్దార్థాలసముదాయంతో కూడినట్టిదిన్నీ, నూరుఉపపర్వాలతోనూ పదునెనిమిదిమహాపర్వాలతోనూ ప్రకాశించేదిన్నీ అయినదాన్ని, చిన్నద్వీపాలతోనూ, పెద్దద్వీపాలతోనూ కూడినజగత్తును బ్రహ్మ సృజించినట్లు కృష్ణద్వైపాయను డనే వ్యాసమహాముని సర్వలోకప్రజలమేలుకొరకు ఏకాగ్రచిత్తు డై మూడుసంవత్సరాలు రచించాడు; ఆమహాభారతాన్ని స్వర్గలోకంలో చెప్పటానికి నారదమహామునిని, పితృదేవతాలోకంలో చెప్పటానికి అసితు డైన దేవలమునిని, గరుడగంధర్వ యక్షరాక్షసలోకాలలో చెప్పటానికి తనకుమారు డైన శుకమహర్షినీ, సర్పలోక మయిన పాతాళంలో చెప్పటానికి తనశిష్యు డైన సుమంతుడినీ, మానవలోకంలో పరీక్షిత్తుకుమారు డైన జనమేజయుడికి చెప్పటానికి వైశంపాయను డనే మరియొక శిష్యుడిని పంపాడు. నే నా వైశంపాయనమహామునివలన మహాభారతకథను విని వచ్చాను. పూర్వం కృతయుగాంతంలో దేవతలకూ రాక్షసులకూ, త్రేతాయుగాంతంలో రాముడికీ రావణుడికీ జరిగిన యుద్ధాలవలె ద్వాపరయుగంచివర పాండవులకున్నూ కౌరవులకున్నూ మిక్కిలి భయంకర మైన యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో.

విశేషం: మహాభారతాన్ని చెరకుగడతో పోలుస్తారు. చెరకుగడలో కనుపు లుంటాయి. పర్వమంటే కనుపు, గ్రంథభాగము. సముద్రంలో అనేకద్వీపా లుంటాయి. అందులో కొన్ని చిన్నవి. కొన్ని పెద్దవి. మహాద్వీపాలు నాలు గని కొందరు. ఏడని కొందరు, తొమ్మి దని కొందరు, పదమూ డని కొందరు, పదునెనిమి దని కొందరు చెప్తుతారు. ఇవి పూవుచుట్టూ రేకు లున్నట్లు మేరుపర్వతంచుట్టూ ఉంటాయి. ద్వీపానికీ ద్వీపానికీ నడుమ సముద్రం ఉంటుంది. సాధారణంగా ద్వీపాలు ఏడని ప్రసిద్ధి. అవి- జంబువు, ప్లక్షము, కుశము, క్రౌంచము, శాకము, శాల్మలము, పుష్కరము అనేవి. వీటి నడుమ జంబూద్వీపం ఉంటుం దనీ, దానిలోనే భరతఖండం ఉన్నదనీ చెప్తుతారు. గరుడుడు పక్షులరాజు. గరుడులు అనే దేవయోనివిశేషాలుకూడ ఉన్నట్లు కనబడుతున్నది. గంధర్వయక్షులు దేవయోనివిశేషాలు. జైమిని, పైలుడు, సుమంతుడు, వైశంపాయనుడు- అనేవారు వ్యాసుడి నలుగురుశిష్యులు. కృత, త్రేతా, ద్వాపర, కలియుగా లని యుగాలు నాలుగు. ఇందులో వ్యాసుడి జయకావ్యం మహాభారతంగా రూపొందిన దశలు పేర్కొనబడ్డాయి. అలం: ఉపమ.

తరలము.

పదిదినంబులు భీష్ముఁ డాహవభారకుండు, గురుండు పం
చదివసంబులు, గర్ణుఁడున్ దివసద్వయంబు, దినార్ధమం
దుదితతేజుఁడు శల్యుఁ, డత్యధికోగ్రవీరగదారణం
బది దినార్ధము గాఁగ నిట్లు మహాభయంకరవృత్తితోన్. 68

ప్రతిపదార్థం: భీష్ముడు; పది, దినంబులు= పదిరోజులు; ఆహవభారకుండు= యుద్ధంయొక్క భారాన్ని వహించేవాడు (సేనానాథుడు); గురుండు= ద్రోణుడు; పంచ, దివసంబులు= ఐదురోజులు; (సేనానాయకుడు); కర్ణుఁడున్= కర్ణుడుకూడ; దివసద్వయంబు= రెండురోజులు; ఉదిత, తేజుఁడు= ఉన్నతమైన పరాక్రమం కలవాడు; శల్యుఁడు= మాద్రిసోదరు డైన మద్రరాజు; దిన+అర్ధమందున్= రోజులోనిసగంభాగంలో (అంటే మధ్యాహ్నం వరకు); అతి+అధిక+ఉగ్ర, వీర, గదారణంబు+అది= కడుంగడు భయంకర మైన వీరరసంతో కూడిన (భీమదుర్యోధను లనే వీరులయొక్క) గదలతో చేయబడినయుద్ధం; దిన+అర్ధము కాఁగన్= రోజులో సగంభాగం (అంటే మధ్యాహ్నంనుండి సూర్యాస్తమయంలోగా) ఇట్లు= ఈవిధంగా; మహత్+భయంకరవృత్తితోన్= మిక్కిలి భయాన్ని కలిగించే వ్యాపారంతో.

తాత్పర్యం: పదునెనిమిదిరోజులు జరిగిన కురుక్షేత్రసంగ్రామంలో పదిరోజులు భీష్ముడు సేనానాయకుడుగా ఉన్నాడు. గురు డైన ద్రోణుడు ఐదురోజులు సేనానాయకుడుగా ఉన్నాడు. కర్ణుడు రెండురోజులున్నూ, దినంలో సగంభాగం అధికమైన పరాక్రమం గల శల్యుడున్నూ సేనానాయకులుగా ఉన్నారు. మిక్కిలి భయంకరమైన వీరుల(భీమదుర్యోధనుల) గదాయుద్ధం మిగిలిన సగందినంలో జరిగింది. ఈ విధంగా మిక్కిలి భయంకరమైన మానసికవ్యాపారంతో.

విశేషం: ఈ పద్యంతరువాత "పదిదినము లైదుప్రొద్దులుఁ బదపడి రెన్నాళ్ళు నొక్కపగలున్‌రేయున్, మదమున రణ మొనరించిరి, నదిసుత గురుకర్ణశల్యనాగపురీశుల్" అనే కందపద్యం కనబడుతుంది. ఇది ప్రక్షిప్త మని పలువురు భావిస్తున్నారు. ఈతరలవృత్తంలోని భావమే ఈ పద్యంలో ఉండటంచేత అది లేకపోవటంవలన కథకు బాధ లేదు. తరల మనేవృత్తం అతిధృతిచ్ఛందంలో పుట్టింది. ప్రతిపాదంలోనూ వరుసగా- న, భ, ర, స, జ, జ, గ- అనే గణా లుంటాయి. 12వ అక్షరంతో యతిమైత్రి.

శా. **ఏడక్షౌహిణు లెన్నఁ బాండవబలం; బేకాదశాక్షౌహిణుల్**
రూఢిం గౌరవసైన్య; మీ యుభయమున్ రోషాహతాన్యోన్య మై
యీడంబోవక వీఁక మైఁ బొడువఁగా నేపారు ఘోరాజి న
ల్లాడెన్ ధాత్రి శమంతపంచకమునం దష్టాదశాహంబులున్. **69**

ప్రతిపదార్థం: ఎన్నన్= గణింపగా; పాండవ, బలంబు= పాండవులసేన; ఏడు+అక్షౌహిణులు= ఏడు అక్షౌహిణులు; కౌరవసైన్యము= కౌరవులసేన, రూఢిన్= (రూడిన్‌పాఠాంతరం) ప్రసిద్ధితో; ఏకాదశ+అక్షౌహిణుల్= పదకొండు అక్షౌహిణులు; ఈ, ఉభయమున్= ఈరెండుసేనలును; రోష+ఆహత+అన్యోన్యము+ఐ= కోపంచేత కొట్టబడిన (చంపబడిన) ఒండొరులను కలిగినవై; ఈడన్+పోవక= వెనుదీయక; వీఁకమైన్= ఉత్సాహంతో; పొడువఁగాన్= పోరాడగా; ఏపు+ఆరు= అతిశయించు, విజృంభించు, ఘోర+ఆజిన్= భయంకర మైన యుద్ధంలో; శమంత, పంచకమునందున్= శమంతపంచక మనేప్రదేశంలో; అష్టాదశ, అహంబులున్= పదునెనిమిది రోజులును; ధాత్రి= భూమి; అల్లాడెన్= చలించింది.

తాత్పర్యం: పాండవసేనసంఖ్య ఏడక్షౌహిణులు, కౌరవసేనసంఖ్య పదకొండక్షౌహిణులు. ఈరెండుసేనలున్నూ తీవ్రకోపంతో ఇరువైపుల నున్న రథగజాదులను, వీరులను చంపుకొంటూ వెనుదీయక పరాక్రమంతో పోరాడగా, అతిశయించిన భయంకరయుద్ధంచేత పదునెనిమిది రోజులు శమంతపంచక మనేప్రదేశంలో భూమి కంపించిపోయింది.

విశేషం: శమంతపంచకానికి ఆ పేరు ఎట్లు వచ్చిందో డెబ్బైతొమ్మిదవ వచనంలో చెప్పబడింది. కొన్ని వ్రాతప్రతులలో 'అక్షోహిణి' అనేరూపం ఉన్నది.

వ. **ఇట్టి మహాభారతంబు కృష్ణద్వైపాయనమహామునివిరచితం బై ప్రవర్తిల్లుచుండు.** **70**

ప్రతిపదార్థం: ఇట్టి= ఇటువంటి; మహత్+భారతంబు= మహాభారతగ్రంథం; కృష్ణద్వైపాయన, మహత్, ముని, విరచితంబు+ఐ= వ్యాసమహామునిచేత రచింపబడిన దై; ప్రవర్తిల్లుచున్+ఉండున్= ఒప్పుతూ ఉంటుంది.

తాత్పర్యం: ఇటువంటి మహాభారత మనే గ్రంథం వ్యాసమహామునిచేత రచింపబడి ఒప్పారుతూ ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. ఇమ్మహాభారతం బిమ్ములఁ బాయక । విహితావధాను లై వినుచునుండు
వారికి విపుల ధర్మారంభసంసిద్ధి । యగుఁ బరమార్థంబ యశ్రమమున
వేదముల్ నాలుగు నాదిపురాణముల్ । పదునెనిమిదియుఁ దత్ప్రమితధర్మ
శాస్త్రంబులును మోక్షశాస్త్రతత్త్వంబులు । నెఱిఁగిన ఫల మగు, నెల్లప్రొద్దు

ఆ. దానములను బహువిధక్రతుహుతజప । బ్రహ్మచర్యములను బడయఁబడిన
పుణ్యఫలముఁ బడయఁబోలు, నశేషపా । పక్షయంబు నగు, శుభంబుఁ బెరుఁగు. 71

ప్రతిపదార్థం: ఈ+మహత్, భారతంబు= ఈమహాభారతాన్ని, ఇమ్ములన్= సుఖంగా, ఆమూలంగా; పాయక= విడువక, విహిత+అవధానులు+ఐ= విధింపబడిన ఏకాగ్రత కలవా రై, వినుచుండువారికిన్= వింటూ ఉండే జనులకు; విపుల, ధర్మ+ఆరంభ, సంసిద్ధి= విస్తార మైన ధర్మంతో కూడిన ప్రయత్నాలలాభం; అగున్= కలుగుతుంది; పరమార్థంబు+అ= తథ్యంగా; అశ్రమమునన్= శ్రమలేకుండ; వేదముల్, నాలుగున్= ఋగ్యజుస్సామాథర్వవేదాలు నాలుగున్నూ; ఆది, పురాణముల్, పది+ఎనిమిదియున్= ప్రధానాలైన పదునెనిమిది పురాణాలున్నూ; తద్, ప్రమిత, ధర్మ, శాస్త్రంబులును= వాటిచే తెలిసికొనబడు ధర్మాన్ని బోధించే శాస్త్రాలను; మోక్ష, శాస్త్రతత్త్వంబులు= మోక్షమార్గాన్ని సూచించే శాస్త్రాల యథార్థస్వరూపాలను; ఎఱిఁగిన= తెలిసికొనిన; ఫలము= లాభం; అగున్= కలుగును; ఎల్ల, ప్రొద్దున్= సర్వకాలాలలో; దానములనున్= దానాలచేతనూ; బహు, విధ, క్రతు, హుత, జప, బ్రహ్మచర్యములను= పలువిధా లైన యజ్ఞాలలో చేయబడిన హోమాలచేతనూ, జపాలచేతనూ; బ్రహ్మచర్యవ్రతంచేతనూ, పడయన్+పడిన= పొందబడిన; పుణ్య, ఫలమున్= పుణ్యముయొక్కలాభం; పడయన్, పోలున్= పొందశక్య మౌతుంది; అశేష, పాప, క్షయంబున్= సర్వపాపాలయొక్క నాశంకూడ; అగున్= జరుగుతుంది; శుభంబున్= శుభంకూడ; పెరుఁగున్= అభివృద్ధి ఔతుంది, వర్ధిల్లుతుంది.

తాత్పర్యం: ఈ మహాభారతాన్ని సమగ్రంగా (స్పష్టంగా) విడువక ఏకాగ్రచిత్తు లై వింటూ ఉండే జనులకు అధిక మైన ధర్మకార్యాలలాభం కలుగుతుంది; తథ్యంగా శ్రమలేకుండ నాలుగువేదాలున్నూ, ప్రధాన మైన పదునెనిమిది పురాణాలున్నూ, వాటిచేత నిరూపింపబడిన ధర్మాన్ని బోధించే శాస్త్రాలున్నూ, మోక్షమార్గాన్ని తెలిపే శాస్త్రాల యథార్థ స్వరూపాన్నీ తెలిసికొన్న ఫలం కలుగుతుంది; ఎల్లకాలాలలో చేయబడిన దానాలచేతను, వివిధ యజ్ఞాలలో చేయబడిన హోమాలచేతను, జపాలచేతను, బ్రహ్మచర్య వ్రతంచేతను పొందబడిన పుణ్యం యొక్క లాభం పొందశక్యమౌతుంది. సకల పాపాల నాశనం జరుగుతుంది; శుభం వర్ధిల్లుతుంది.

విశేషం: ఈ పద్యంలో మహాభారతాన్ని శ్రద్ధతో వినేవారికి కలిగే లాభాలన్నీ చెప్పబడినవి. దీనివలన దాని మహత్త్వం వ్యక్తమౌతుంది. బ్రహ్మ, పద్మ, విష్ణు, శివ, భాగవత, నారద, మార్కండేయ, అగ్ని, భవిష్యత్, బ్రహ్మ వైవర్త, లింగ, వరాహ, స్కంద, వామన, కూర్మ, మత్స్య, గరుడ, బ్రహ్మాండ పురాణా లనే మహాపురాణాలు పదునెనిమిది. సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరము, వంశాను చరితము అనేవి పురాణంలో ఉండే పంచలక్షణాలు.

ఉ. సాత్యవతేయ విష్ణుపద సంభవ మై, విబుధేశ్వరాబ్ధి సం
గత్యుపశోభితం బయి, జగద్విదితం బగు భారతీయ భా
రత్యమరాపగౌఘము నిరంతర సంతత పుణ్యసంపదు
న్నత్యభివృద్ధి సేయు వినినం గొనియాడిన నెల్లవారికిన్. 72

ప్రతిపదార్థం: ఈ పద్యంలో నన్నయ మహాభారతాన్ని ఆకాశగంగగా వర్ణిస్తూ శ్లిష్టరూపకం చేశాడు. కాబట్టి విశేషణాలను భారతపరంగానూ, గంగాపరంగానూ అన్వయించుకోవాలి. సాత్యవతేయ, విష్ణు, పద, సంభవము+ఐ= సత్యవతీపుత్రుడైన వ్యాసుడనే నారాయణుడియొక్కవాక్కు(పదాల)నుండి(భారతార్థం), పాదంనుండి(గంగార్థం)పుట్టినదై; లేదా వ్యాసుడనే ఆకాశం(విష్ణుపదం)నుంచి పుట్టినదై; విబుధ+ఈశ్వర+అబ్ధి, సంగతి+ఉపశోభితంబు+అయి= (భారతపరంగా) పండితశ్రేష్ఠులనే సాగరముయొక్క స్నేహ మనే సంగమంచేత ప్రకాశించినట్టిదై; లేదా పండితరాజులనే దేవేంద్రులు అనే సాగరంయొక్క స్నేహసంగమంచేత ప్రకాశించినట్టిదై; లేదా (గంగపరంగా) దేవతలరాజైన ఇంద్రుడికి సంబంధించిన(తూర్పు) సముద్రంయొక్క సంగమంచేత ప్రకాశించినట్టిదై; జగత్+విదితంబు+అగు= విశ్వానికంతటికి తెలియబడినట్టిదగుతున్న; భారతీయ, భారతీ+అమర+ఆపగా+ఓఘము= మహాభారతముయొక్క వాక్స్వరూపం(సరస్వతి) అనే దేవనదీ(గంగా)ప్రవాహాన్ని; వినిన‌న్, కొనియాడినన్= చెప్పగా వినినప్పటికినీ, స్వయంగా ప్రశంసచేసినప్పటికినీ; ఎల్లవారికిన్= సర్వప్రజలకును; నిర్+అంతర, సంతత, పుణ్య, సంపద్+ఉన్నతి+అభివృద్ధి, చేయున్= ఎల్లప్పుడును విస్తారమైన సుకృతరూపమైన వైభవాతిశయముయొక్క సమృద్ధిని కలిగిస్తుంది.

తాత్పర్యం: సత్యవతీ(యోజనగంధి)పుత్రుడైన వ్యాసుడనే నారాయణుడియొక్క వాక్కునుండి, పాదంనుంచి పుట్టినదై; లేదా వ్యాసుడనే ఆకాశంనుండి పుట్టినదై; పండితశ్రేష్ఠ(రాజు)లనే సాగరముయొక్క స్నేహమనే సంగమం(కలయిక)చే శోభింపబడినట్టిదై; లేదా, పండితరాజులనే దేవేంద్రులు అనే సముద్రంయొక్క స్నేహసంగమంచేత శోభింపబడినట్టిదై; లేదా, దేవతలరాజైన ఇంద్రుడికి సంబంధించిన(తూర్పుదిక్కునందలి) సముద్రముయొక్క స్నేహసంగమంచేత శోభింపబడినట్టిదై; విశ్వానికంతటికిని తెలియబడిన దయిన మహాభారతముయొక్క వాక్స్వరూపం(సరస్వతి)అనే దేవనది(ఆకాశగంగ)యొక్క ప్రవాహాన్ని(పౌరాణికులుచెప్పగా)వినినప్పటికిన్నీ, (స్వయంగా ఇతరులతో) ప్రశంసచేసినప్పటికిన్నీ, సర్వప్రజలకు ఎల్లప్పుడును, విస్తారమైన పుణ్యసంపదయొక్క అతిశయమైన అభివృద్ధిని (భారతవాక్కు అనే గంగ) కలిగిస్తుంది.

విశేషం: అలం: శ్లిష్టరూపకం. ఇటువంటి అలంకారసంకరప్రయోగాన్ని ప్రబంధకవులు విరివిగా చేశారు. 'నానారుచిరార్థసూక్తినిధిత్వానికి' ఈపద్యాన్ని ఉదాహరణగా చూపవచ్చును. సూక్తులు అంటే కేవలం నీతులు సుభాషితాలు అనిమాత్రమే అర్థం కాదు, అనేకవిధాలుగా రుచిరాలైన అర్థాలను ఇచ్చే మంచిమాటల, అలంకృతవాక్కులకూర్పు అనికూడ అర్థంచేసికొనాలి. విబుధేశ్వరాబ్ధి(తూర్పుసముద్రముయొక్క)సంగతిని భారతమనే గంగకు ముడిపెట్టటంలో ఔచిత్యం ఉన్నది. రాజరాజనరేంద్రుడిరాజ్యం తూర్పుసముద్రంచేత చుట్టబడినట్టిది కావున 'భారత' గంగావ్యాప్తిని(నన్నయరాజరాజుల) వేంగీదేశంవరకూ సూచించటం సమంజసంగా ఉన్నది. అదీకాక గంగానది(లేదా దక్షిణగంగ అయిన గోదావరి) తూర్పుసముద్రంలోనేకదా కలిసేది. రాజరాజనరేంద్రుడే భారతాన్ని ప్రస్తావించి దానిరచనకు నన్నయను పురికొల్పటం, భారతవంశీయులు, తనవంశీయులని చెప్పుకోవటం-ఇవన్నీ తూర్పుసముద్రంతోడి 'భారతగంగాసంగతి'కి విషయాలే. 'సాత్యవతేయ విష్ణుపదసంభవమై' అనేమాటలో సత్యవంతమైన, సర్వవ్యాపకమైన(విష్ణు) వాక్స్వరూపంనుండి పుట్టిందనే అర్థాన్నికూడ సంభావించవచ్చును. అట్లే 'భారతీయభారతి' అనేచోట 'భారతదేశవాఙ్మయస్వరూపం' అనే అర్థాన్నికూడ భావించవచ్చును. భారతీయభారతిని గంగాప్రవాహంతో రూపకంచేయటంవలన భారతసాహిత్య పావిత్ర్యం, మహిమ ప్రకటితా లౌతున్నాయి. ఇటువంటి నానార్థాలుకల పద్యాలను నన్నయ చాలాఅరుదుగా మాత్రమే రచించాడు. శబ్దంయొక్కశక్తి ఇట్లా ఉంటుందని చూపటానికే నన్నయ అక్కడక్కడా ఇట్లాంటి రచనను చేశాడని గ్రహించాలి.

వ. అనిన విని శౌనకాది మహామునులుశ్రీమహాభారత కథా శ్రవణ కుతూహల పరు లయి యక్కథకున కిట్లనిరి. 73

ప్రతిపదార్థం: అనినన్= సౌతి అట్లా చెప్పగా; విని; శౌనక+ఆది, మహత్, మునులు= శౌనకుడు మొదలైన గొప్పమునులు; శ్రీ, మహత్, భారత, కథా, శ్రవణ, కుతూహల పరులు+అయి= శోభాయుక్త మైన మహాభారతంలోని కథ యొక్క వినటంలోని ఉత్సాహంలో ఆసక్తు లై; ఆ+కథకునకున్= కథ చెప్పే ఆ సౌతికి; ఇట్లు= ఈ విధంగా; అనిరి= అన్నారు.

తాత్పర్యం: అని సౌతి చెప్పగా విని శౌనకుడు మొదలైన గొప్పమునులు మహాభారతంలోని కథను వినటంలో ఉత్సాహం కలవా రై కథకు డైన ఆ సౌతితో ఇట్లా అన్నారు.

శమంతపంచ కాక్షౌహిణీ సంఖ్యా కథనము (సం.1-2-1)

మ. అనఘా! మున్ను శమంతపంచకము నయ్యక్షౌహిణీ సంఖ్యయున్
వినఁగా మా కెఱిఁగించి భారత కథావిర్భూతికిం గారణం
బును దద్భారత విస్తరోక్తి విభవంబుం బాండవాడంబరం
బును భీష్మాదికురు ప్రవీర చరితంబుం జెప్పు ముద్యన్మతిన్. 74

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! సౌతీ!; మున్ను= ముందు, శమంత, పంచకమున్= శమంతపంచక మనే ప్రదేశాన్ని గూర్చియున్నూ; ఆ+అక్షౌహిణీ, సంఖ్యయున్= ప్రసిద్ధమైన అక్షౌహిణిలో ఎన్నెన్ని రథగజాదు లుంటాయో ఆ లెక్కయున్నూ; వినఁగాన్= వినేటట్లుగా; మాకున్; ఎఱిఁగించి= తెలిపి; భారత, కథా+ఆవిర్భూతికిన్= భారతంలోని కథ పుట్టటానికి; కారణంబును= హేతువును; తద్, భారత, విస్తర+ఉక్తి, విభవంబున్= ఆ భారతంలోని విరివితో కూడిన పల్కుల వైభవమున్నూ, పాండవ+ఆడంబరంబును= పాండు కుమారుల విజృంభణమున్నూ, కోపమును; భీష్మ+ఆది, కురు, ప్రవీర= భీష్ముడు మొదలైన కురువంశంలోని గొప్పవీరుల చరిత్ర (కథ) యున్నూ; ఉద్యత్+మతిన్= (ఉదయిస్తున్న) ప్రకాశిస్తున్న బుద్ధితో; చెప్పుము.

తాత్పర్యం: పాపరహితుడ వైన ఓ రౌమహర్షణీ! ముందుగా మాకు శమంతక పంచక మంటే ఏమిటో, అక్షౌహిణి అనే సేనావిభాగంలో రథగజాదులు ఎన్నెన్ని ఉంటాయో (ఏయే పక్షాన ఎన్నెన్ని అక్షౌహిణులు పోరాడెనో) ఆ సంఖ్యయున్నూ స్పష్టంగా తెలిపి, మహాభారతంలోని కథయొక్క పుట్టుకకు కారణమున్నూ, ఆ భారతంలోని విస్తృతితో కూడిన పల్కుల వైభవమున్నూ, పాండవుల విజృంభణాన్నీ, భీష్ముడు మొద లైన కురువంశంలోని గొప్పవీరుల ఉదంతాన్ని ప్రకాశించే బుద్ధితో చెప్పుము.

క. అనిన విని రోమహర్షణ। తనయుం డమ్మునుల కతిముదంబున వినయా
వనతుఁ డయి గురులఁ దనహృ। ద్వనజంబున నిలిపి కొలిచి వాగ్గణపతులన్. 75

ప్రతిపదార్థం: అనినన్=శౌనకాదిమునులు అట్లా అడుగగా; విని రోమహర్షణ, తనయుండు= రోమహర్షణు డనే సూతుడి కుమారుడు, ఉగ్రశ్రవుడు; ఆ+మునులకున్= ఆ శౌనకాది మునులకు; అతి, ముదంబునన్= అధికమైన సంతోషంతో; వినయ+అవనతుఁడు+అయి= వినయంతో వంగి నమస్కరించినవా డై; గురులన్= తండ్రి, వ్యాసుడు మొదలైన గురువులను; తన, హృద్, వనజంబునన్= పద్మం వంటి చిత్తంలో; నిలిపి= ఉంచి (స్మరించి); వాక్, గణపతులన్= సరస్వతిని, వినాయకుడిని; కొలిచి= సేవించి.

తాత్పర్యం: శౌనకాదిమునులు అట్లా అడుగగా విని రోమహర్షణుడికుమారు డైన సౌతి ఆమునులకు మిక్కిలి సంతోషంతో వినయంగా మ్రొక్కి, వ్యాసాదిగురువులను (పెద్దలను) తనచిత్తపద్మంలో (మనస్సులో) స్మరించి, వాగ్దేవి యైన సరస్వతిని, విఘ్నవినాశకు డైన వినాయకుడిని భజించినాడు.

విశేషం: సౌతి భారతేతిహాసాన్ని చెప్పబోతున్నాడు కాబట్టి గురువులను స్మరించి, సరస్వతిని, వినాయకుడిని భజించాడు. మునులకు మ్రొక్కటం ఆతడి వినయాన్ని సూచిస్తుంది.

ఉ. ఇంబుగ సర్వలోకజను లెవ్వనియేని ముఖ్యామృతాంశుబిం
బంబున నుద్భవం బయిన భారతవాగమృతంబు కర్ణరం
ధ్రం బను నంజలిం దవిలి త్రావుదు రట్టి మునీంద్రలోకవం
ద్యుం బరముం బరాశరసుతుం బ్రణమిల్లి కరంబు భక్తితోన్. 76

ప్రతిపదార్థం: ఇంబుగన్= ఒప్పుగ (ఇమ్మగ రూపాంతరం); సర్వ, లోక, జనులు= అన్ని లోకాలందలి ప్రజలును; ఎవ్వని, ఏని= ఏవ్యాసునియొక్క; ముఖ+ (అమృత+అంశు) అమృతాంశు, బింబంబునన్= ముఖ మనే (అమృతమయ కిరణాలు గల) చంద్రుని యొక్క మండలంలో; ఉద్భవంబు+అయిన= పుట్టిన; భారత, వాక్+అమృతంబు= భారతంలోని వాక్కులు అనే అమృతాన్ని; కర్ణ, రంధ్రంబు+అను= చెవిలోని బిలం (కన్నం) అనెడి; అంజలిన్= దోసిలితో; తవిలి= ఆసక్తులై; త్రావుదురు= త్రాగుదురో; అట్టి= అటువంటి; ముని+ఇంద్ర, లోక, వంద్యున్= మునీశ్వరుల సముదాయాలకు నమస్కరింప దగిన వాడిని; పరమున్= శ్రేష్ఠుని; పరాశరసుతున్= పరాశరకుమారు డైన వ్యాసుడిని; కరంబున్= మిక్కిలి; భక్తితోన్, ప్రణమిల్లి= నమస్కరించి.

తాత్పర్యం: సమస్తలోకంలోని జనులును ఒప్పుగా ఏవ్యాసమునీంద్రుని ముఖ మనే చంద్రబింబంనుండి పుట్టిన భారతవాక్కు లనే అమృతాన్ని చెవులరంధ్రా లనెడి దోసిళ్ళతో ఆసక్తులై త్రాగుతారో అట్టి మునీశ్వర సముదాయాలకు నమస్కరింప దగిన వాడున్నూ శ్రేష్ఠుడున్నూ పరాశరుడి కుమారుడున్నూ అయిన వ్యాసుడికి మిక్కిలి నమస్కరించి,

విశేషం: అలం: రూపకం; ఈపద్యం యత్తదర్థకాలతో (ఎవని-అట్టి) కూడి సంస్కృత వాక్యయోజనను సూచిస్తున్నది. యదర్థకం తరువాత 'ఏని' అనేది నన్నయరచనలో కనిపిస్తుంది.

వ. అమ్మును లడిగిన కథ యథాక్రమంబున సవిస్తరంబుగాఁ జెప్పందొడంగె. 77

ప్రతిపదార్థం: ఆ మునులు= ఆ శౌనకాది మునులు; అడిగిన; కథ= భారతకథను; యథా, క్రమంబునన్= క్రమాన్ని అతిక్రమించకుండ; స, విస్తరంబుగాన్= విస్తృతితో కూడ (వివరంగా); చెప్పన్, తొడంగెన్= సౌతి చెప్పటానికి ఆరంభించాడు.

తాత్పర్యం: శౌనకాదిమునులు తనను చెప్పు మని అడిగిన భారతకథను సౌతి వరుస తప్పకుండ చెప్పటానికి ఆరంభించాడు.

శా. త్రేతాద్వాపర సంధి నుద్ధత మదాంధీభూత విద్వేషిజీ
మూతోగ్రశ్వసనుండు రాముఁ డలుకన్ ముయ్యేడుమాఱుల్ రణ

ప్రీతిన్ వైరిధరాతలేశ్వరులఁ జంపెం బల్వురన్ దీర్ఘని
ర్ఘాత క్రూరకుఠారలూన నిఖిలక్షత్త్రోరుకాంతారుఁ డై. 78

ప్రతిపదార్థం: త్రేతా, ద్వాపర, సంధిన్= త్రేతా ద్వాపరయుగాల మధ్యకాలంలో; ఉద్ధత, మద+అంధీభూత, విద్వేషి, జీమూత+ఉగ్ర, శ్వసనుండు= అధిక మైన గర్వంచేత గ్రుడ్డివా రైన (మిక్కిలి మదించిన) శత్రువు లనే మేఘాలకు భయంకర మైన వాయు వగు; రాముఁడు= పరశురాముడు; అలుకన్= కోపంతో; మూఁడు, ఏడు, మాఱుల్= ఇరువది యొక్కసార్లు; రణప్రీతిన్= యుద్ధమునందలి ప్రీతితో; వైరి, ధరాతల+ఈశ్వరులన్= శత్రురాజులను; పల్వురన్= పెక్కుమందిని; దీర్ఘనిర్ఘాత, క్రూర, కుఠార, లూన, నిఖిల, క్షత్త్ర+ఉరు, కాంతారుఁడు+ఐ= పొడవైన, వజ్రంవలె కఠిన మైన గొడ్డలిచేత చంపబడిన సర్వక్షత్రియు లనే గొప్ప అడవి కలవాడై; చంపెన్= సంహరించాడు.

తాత్పర్యం: త్రేతాద్వాపరయుగాల మధ్యకాలంలో మిక్కిలి మదించిన శత్రువులనే మేఘాలకు, భయంకరవాయు వైన పరశురాముడు యుద్ధమందలి ప్రీతిచేత ఇరువది యొక్క పర్యాయాలు పొడవైన వజ్రంవలె కఠిన మైన గొడ్డలిచేత ఖండింపబడిన సర్వక్షత్రియవంశ మనే పెద్ద అడవి కలవా డై శత్రురాజులను పెక్కుమందిని చంపాడు.

విశేషం: అలం: రూపకం. శత్రువులు మదాంధీభూతులైనందువలన వధ్యులైనారని వస్తుధ్వని.

వ. **అప్పరశురాముండు నిజనిశిత కుఠారధారా విదళిత సకల క్షత్త్రరుధిరాపూర్ణంబులుగా నేను మడుంగులు గావించి తద్రుధిరజలంబులఁ బితృతర్పణంబు సేసి తత్పితృగణప్రార్థన నుపశమితక్రోధుం డయ్యె; దాననచేసి తత్సమీప ప్రదేశంబు శమంత పంచకంబునాఁ బరఁగె; మఱి యక్షౌహిణీసంఖ్య వినుండు. 79**

ప్రతిపదార్థం: ఆ+పరశురాముండు; నిజ, నిశిత, కుఠార, ధారా, విదళిత, సకల క్షత్త్ర, రుధిర+ఆపూర్ణంబులుగాన్= తన వాడి యైన గొడ్డలి వాదరచే ఖండింపబడిన సర్వక్షత్రియుల నెత్తురుచేత పూర్తిగా నిండినవి అయ్యేటట్లుగా, ఏను=ఐదు; మడుంగులు= కొలకులు (హ్రదాలు); కావించి= చేసి; తద్, రుధిర, జలంబులన్= ఆ రక్త మనే నీళ్ళతో; పితృ, తర్పణంబు= పితృ దేవతల తృప్తి; చేసి; తద్, పితృ, గణ, ప్రార్థనన్= ఆ పితృదేవతల వేడుకోలుచేత; ఉపశమిత, క్రోధుండు= శాంతించిన కోపం కలవాడు; అయ్యెన్; దానన్+అ, చేసి= అట్లా చేయటం చేతనే; తద్, సమీప, ప్రదేశంబు= అతడు అట్లా క్షత్రియుల నెత్తురుచేత ఐదు మడుగులు కావించి దానిచే పితృతర్పణం చేసిన చోటికి చెంత నున్న స్థలం; శమంత, పంచకంబు= శమంత పంచకం; నాన్= అనగా; పరఁగెన్= ఒప్పెను; మఱి= ఇంక; అక్షౌహిణీ, సంఖ్య= అక్షౌహిణి అనే సేనాభాగంలోని రథ గజాదులలెక్క; వినుండు.

తాత్పర్యం: ఆ పరశురాముడు తనవాడి యైన గొడ్డలి వాదరచేత ఛేదింపబడిన సర్వక్షత్రియుల రక్తంచేత పూర్తిగా నిండేటట్లుగా ఐదు హ్రదాలను ఏర్పరచి, ఆ రక్త మనే నీళ్ళతో తన పితృదేవతలకు తృప్తికావించి, ఆ పితృదేవతల వేడుకోలుచేత శాంతించిన కోపం కలవా డైనాడు. ఆ కారణంచేత ఆ చోటికి చెంత నున్న స్థలం శమంత పంచకం అనే పేరుతో ఒప్పారింది. ఇంక మీ రడిగిన అక్షౌహిణి అనే సేనావిభాగంలోని రథగజాదుల లెక్క చెప్పుతాను. ఆలకించండి.

సీ. **వరరథ మొక్కండు వారణ మొక్కండు । తురగముల్ మూఁడు కాల్వురును నేవు**
రను సంఖ్య గల యది యగుఁ బత్తి, యది త్రిగు । ణం బైన సేనాముఖంబు, దీని

త్రిగుణంబు గుల్మంబు, దీని ముమ్మడుఁ గగు । గణము, తద్గణము త్రిగుణిత మైన
వాహిని యగు, దాని వడి మూఁట గుణియింపఁ । బృతన నాఁ బరఁగుఁ, దత్పృతన మూఁట

ఆ. గుణిత మైనఁ జము వగున్, మఱి దాని ము । మ్మడుఁ గనీకినీ సమాఖ్య నొనరు,
నదియుఁ బదిమడుంగు లైన నక్షౌహిణి । యౌ నిరంతర ప్రమాను సంఖ్య. 80

ప్రతిపదార్థం: వర, రథము= శ్రేష్ఠమైన రథం; ఒక్కండు= ఒకటి; వారణము= ఏనుగు; ఒక్కండు= ఒకటి; తురగముల్= గుర్రాలు; మూఁడు; కాల్బరునున్= పదాతులు (కాలిబంట్లు); ఏవురు= ఐదుగురు; అను; సంఖ్య=లెక్క; కల+అది= కలది (సేనావిభాగం) పత్తి; అగున్= పత్తి అనేది ఔతుంది; అది= ఆ పత్తి; త్రిగుణంబు+ఐనన్= మూడు రెట్లైన (మూడు రథాలు, మూడు ఏనుగులు, తొమ్మిది గుర్రాలు, 15 మంది కాలిబంట్లు అయితే); సేనాముఖంబు= సేనాముఖ మనబడుతుంది; దీని= సేనాముఖం యొక్క; త్రిగుణంబు= మూడురెట్లు; (9 రథాలు, 9 ఏనుగులు, 27 గుర్రాలు, 45 మంది కాల్బరు కలది); గుల్మంబు= గుల్మ మనే సేనావిభాగం; దీని= గుల్మం యొక్క; మూఁడు+మడుఁగు= మూడురెట్లు; (27 రథాలు, 27ఏనుగులు, 81 గుర్రాలు, 135 మంది కాల్బరు)గణము= గణ మనే సేనావిభాగం; అగు; తద్, గణము= ఆ గణం; త్రి, గుణితము= మూడుచే గుణింపబడింది (81 రథాలు, 81 ఏనుగులు, 243 గుర్రాలు, 405 మంది కాల్బరు); ఐన: వాహిని= వాహిని అనే సేనావిభాగం: అగున్; దాని= వాహినిని; వడిన్= వేగంతో; (లేక బలంతో); మూఁటన్= మూడుతో; గుణియింపన్= గుణింపగా (243 రథాలు, 243 ఏనుగులు, 729 గుర్రాలు, 1215 మంది కాల్బరు); పృతన, నాన్= పృతన అనే సేనావిభాగ మనగా; పరఁగున్= ఒప్పును; తద్, పృతన= ఆ పృతన; మూఁటన్= మూడుతో; గుణితము+ఐనన్= గుణింపబడితే (729 రథాలు, 729 ఏనుగులు, 2187 గుర్రాలు, 3645 మంది కాల్బరు); చమువు= చమువు అనే సేనావిభాగం; అగున్; మఱి= ఇంక; దాని=ఆచమువు యొక్క; మూఁడు+మడుఁగు= మూడురెట్లు; అనీకినీ, సమాఖ్యన్= అనీకిని అనే పేరుతో; ఒనరున్= ఒప్పుతుంది (2187 రథాలు, 2187 ఏనుగులు, 6561 గుర్రాలు, 10935 కాల్బరు); అదియున్= ఆ అనీకిని కూడ; పది, మడుంగులు, ఐనన్= పదిరెట్లు అయితే (21870 రథాలు, 21870 ఏనుగులు, 65610 గుర్రాలు, 109350 కాల్బరు); నిరంతర, ప్రమా, అను, సంఖ్య=దట్ట మైన లెక్కను (యథార్థజ్ఞానాన్ని) అనుసరించిన సంఖ్యతో; అక్షౌహిణి= అక్షౌహిణి అనే సేనా విభాగం; ఔన్= ఔతుంది.

తాత్పర్యం: శ్రేష్ఠ మైన రథం ఒక్కటి. ఏనుగు ఒక్కటి, గుర్రాలు మూడు, కాలిబంట్లు ఐదుగురు - అనే సంఖ్య గల సేనా విభాగం 'పత్తి' ఔతుంది. ఆ పత్తి మూడింటితో గుణింపబడితే 'సేనా ముఖం' అనే సేనావిభాగం ఔతుంది; దీని మూడు రెట్లు 'గుల్మం'; గుల్మం యొక్క మూడురెట్లు 'గణం ఔతుంది; ఆ గణం మూడుచేత గుణింపబడితే 'వాహిని' ఔతుంది; దాని బలాన్ని మూడు చేత గుణిస్తే 'పృతన' అని ఒప్పారుతుంది; ఆ పృతన మూడుతో గుణింపబడితే 'చమువు' ఔతుంది. ఇంక దాని మూడు రెట్లు 'అనీకిని' అనే పేరుతో ఒప్పుతుంది; ఆ అనీకినికి పదిరెట్లైన దట్టమైన లెక్క ననుసరించిన సంఖ్యతో 'అక్షౌహిణి' ఔతుంది.

విశేషం: నిరంతర మంటే ఎడతెగని అనికాని దట్ట మైన అనికాని అర్థం. ఇక్కడ తప్పులేని - లేదా - భేదం లేని అని చెప్పవచ్చును.

వ. ఇరువది యొక్కవేయు నెనమన్నూట డెబ్బది రథంబులు, నన్ని యేనుంగులు, నఱువదేనువేలు నాఱునూటపది గుఱ్ఱంబులు, లక్షయుం దొమ్మిదివేలున్ మున్నూట యేఁబండ్రు వీరభటులును గలయది యొక్క యక్షౌహిణి యయ్యె; నట్టి యక్షౌహిణులు పదునెనిమిదింట సన్నద్ధులై కురుపాండవులు యుద్ధంబు సేయుటం జేసి యా శమంతపంచకంబు కురుక్షేత్రంబు నాఁబరఁగె; నట్టి కురుక్షేత్రంబునందు. 81

ప్రతిపదార్థం: ఇరువది, ఒక్క, వేయున్, ఎనమన్నూట, డెబ్బది, రథంబులున్= 21,870 రథాలున్నూ; అన్ని= 21,870, రథాలతో సమానసంఖ్య కల; ఏనుంగులున్= ఏనుగులున్నూ; అఱువది+ఏను, వేలున్, ఆఱు, నూట, పది= 65.610; గుఱ్ఱంబులున్= గుఱ్ఱాలున్నూ, లక్షయున్, తొమ్మిదివేలున్, మూడునూట, ఏఁబండ్రు, వీర, భటులును= 1,09,350 మంది వీరు లైన యోధులును (కాల్బలంవారును); కల+అది= కలసేనావిభాగం; ఒక్క, అక్షౌహిణి; అయ్యెన్; అట్టి= పైని పేర్కొన్న రథ గజ తురగ పదాతులతో యుద్ధానికి సంసిద్ధులై; కురు, పాండవులు= కౌరవులున్నూ, పాండవులున్నూ; యుద్ధంబు; చేయుటన్+చేసి= చేయటం చేత; ఆ, శమంతక పంచకంబు= శమంతక పంచక మనే ఆ ప్రదేశం; కురు, క్షేత్రంబు, నాన్= కురుక్షేత్ర మనగా; పరఁగెన్= ఒప్పారింది; అట్టి= అటువంటి, కురుక్షేత్రంబునందున్= కురుక్షేత్ర మనే ఆ ప్రదేశంలో.

తాత్పర్యం: శమంతకపంచక మని పిలువబడే ఆ ప్రాంతానికి - కురుపాండవులయుద్ధం అక్కడ జరగటంచేత కురుక్షేత్రం అనే పేరు వచ్చింది.

చ. **ప్రతిహతశత్రువిక్రముఁడు పాండవవంశ వివర్ధనుండు సు**
వ్రతుఁడు పరీక్షిదాత్మజుఁ డవద్యవిదూరుఁ డుదారకీర్తిని
ర్మిత వివిధాధ్వరుండు జనమేజయుఁ డన్ జనపాలుఁ డుత్తమ
స్తుతమతి దీర్ఘసత్త్ర మజితుం డొనరించె శుభాభికాంక్షి యై. **82**

ప్రతిపదార్థం: ప్రతిహత, శత్రు, విక్రముఁడు= అడ్డగింపబడిన (ఓడింపబడిన) శత్రువులయొక్క పరాక్రమం కలవాడు; పాండవ, వంశ, వివర్ధనుండు= పాండవులయొక్క వంశాన్ని మిక్కిలి వృద్ధి పొందించినవాడు; సు, వ్రతుఁడు= మంచి వ్రతం (పుణ్యకర్మలు) కలవాడు; పరీక్షిత్+ఆత్మజుఁడు= పరీక్షిత్తుయొక్క కుమారుడు; అవద్య, విదూరుఁడు= దోషాలకు (పాపాలకు) మిక్కిలి దూరంగా ఉండేవాడు; ఉదార, కీర్తి, నిర్మిత, వివిధ+అధ్వరుండు= గొప్ప కీర్తితో చేయబడిన పలువిధా లైన యజ్ఞాలు కలవాడు; ఉత్తమ, స్తుత, మతి= సజ్జనులచేత పొగడబడిన బుద్ధి కలవాడు; అజితుండు= జయింపబడనివాడు; అగు; జనమేజయుఁడు, అన్= జనమేజయుడు అనే; జన, పాలుఁడు= జనులను పాలించేవాడైన రాజు; శుభ+అభికాంక్షి+ఐ= శుభాన్ని (మంగళాన్ని) కోరేవాడై; దీర్ఘ, సత్త్రము= దీర్ఘకాలం సాగే యజ్ఞాన్ని; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: శత్రువుల పరాక్రమానికి అడ్డకట్ట వేసినవాడున్నూ, పాండవ వంశాన్ని మిక్కిలి వృద్ధి పొందించిన వాడున్నూ, మంచి పుణ్యకార్యాలలో నిష్ఠ కలవాడున్నూ, పరీక్షిత్తుకు కుమారుడున్నూ, పాపాలకు దూరుడున్నూ, కీర్తిదాయకాలైన వివిధయజ్ఞాలు చేసినవాడున్నూ, సజ్జనులచేత కీర్తింపబడిన బుద్ధికుశలత కలవాడున్నూ, ఓటమిని ఎఱుగని వాడున్నూ అగు జనమేజయు డనే రాజు తనకును ప్రజలకును దేశానికిని శుభాన్ని కోరువాడై దీర్ఘకాలం కొనసాగే యజ్ఞాన్ని చేశాడు.

విశేషం: ఇక్కడినుండి భారతకథ ఆరంభ మౌతుంది.

సరమ వృత్తాంతము - జనమేజయుని పురోహిత వరణము (సం. 1-3-1)

వ. **ఆ ప్రదేశంబునకు సరమ యను దేవశునికొడుకు సారమేయుం డను కుర్కురకుమారుండు క్రీడార్థంబు వచ్చి క్రుమ్మరుచున్న నలిగి జనమేజయు తమ్ములు శ్రుతసేనుండును భీమసేనుండును నుగ్రసేనుండును నను వార లా సారమేయు నడిచిన, నది యఱచుచుం బఱతెంచి తన తల్లికిం జెప్పిన, నా సరమయు నతికోపాన్విత యై జనమేజయునొద్దకు వచ్చి యి ట్లనియె.** **83**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ, ప్రదేశంబునకున్= జనమేజయుడు యజ్ఞం చేసే ఆ స్థలానికి; సరమ, అను= సరమ అనే పేరు గల; దేవశుని కొడుకు= దేవతల ఆడుకుక్క కొడుకు; సారమేయుండు, అను= సారమేయుడు అనే పేరు కల (సరమయొక్క కుమారుడు సారమేయుడు); కుర్కుర కుమారుండు= బాలశునకము, కుక్కపిల్ల; క్రీడా+అర్థంబు= ఆట నిమిత్తం; వచ్చి; క్రుమ్మరుచున్+ఉన్నన్= తిరుగుతూ ఉండగా; అలిగి= కోపించి; జనమేజయు తమ్ములు, శ్రుతసేనుండును, భీమసేనుండునున్, ఉగ్రసేనుండునున్, అనువారలు= శ్రుతసేనుడు, భీమసేనుడు, ఉగ్రసేనుడు అనే పేరు గలవారలు; ఆ సారమేయున్= సరమకుమారు డైన ఆ కుక్కను; అడిచినన్= కొట్టగా; అది= ఆ కుక్క; అఱచుచున్= ఏడుస్తూ; పఱతెంచి= వచ్చి; తన తల్లికిన్= తన తల్లియైన సరమకు; చెప్పినన్= తెల్పగా; ఆ, సరమయున్= తల్లిఐన ఆసరమకూడ; అతికోప+అన్విత+ఐ= మిక్కిలి కోపంతో కూడినదై; జనమేజయు+ఒద్దకున్= జనమేజయుడి చెంతకు; వచ్చి; ఇట్లు= ఈవిధంగా, అనియెన్= పలికింది.

తాత్పర్యం: జనమేజయుడు యజ్ఞం చేసే ఆ ప్రదేశానికి సరమ అనే పేరుకల దేవతలకుక్కకొడు కైన సారమేయు డనే పేరు గల కుక్కపిల్ల ఆటనిమిత్తం వచ్చి తిరుగుతుండగా కోపించి శ్రుతసేనుడు, భీమసేనుడు, ఉగ్రసేనుడు అనే పేర్లు కల జనమేజయుడి తమ్ముళ్ళు దానిని కొట్టగా, అది ఏడుస్తూ వచ్చి తన తల్లియైన సరమకు తెల్పింది. ఆ సరమ కూడ మిక్కిలికోపంతో కూడినదై జనమేజయుడి చెంతకు వచ్చి ఇట్లా పలికింది.

విశేషం: జనమేజయుడితమ్ముడు సారమేయుడిని కొట్టడానికి యజ్ఞం చేసే చోటికి కుక్క రాకూడదు అనే భావమే కారణ మై ఉంటుంది.

క. క్షితినాథ! కడు నకరుణా । న్వితు లై నీతమ్ము లతివివేకవిదూరుల్
మతిఁ దలఁపక నా పుత్త్రకు । నతిబాలకు ననపరాధు నడిచిరి పెలుచన్. 84

ప్రతిపదార్థం: క్షితినాథ= భూమికి పతి వైన ఓ జనమేజయా!; అతి, వివేక, విదూరుల్= మిక్కిలి జ్ఞానహీను లైన; నీతమ్ములు= శ్రుతసేనాదులు; కడున్= మిక్కిలి; అ కరుణా+అన్వితులు+ఐ= నిర్దయతో కూడిన వారై (దయలేని వారై); మతిన్= మనస్సులో (గౌరవాన్ని); తలఁపక= ఆలోచింపక; అతిబాలకున్= మిక్కిలి చిన్నవాడిని; అనపరాధున్= నేరం లేనివాడిని; నా, పుత్త్రకున్= నా కుమారుడిని; పెలుచన్= కోపంతో; అడిచిరి= కొట్టారు.

తాత్పర్యం: ఓరాజా! మిక్కిలి జ్ఞానహీను లైన నీ తమ్ములు ఏమియు దయలేనివారై చిన్నవా డని కూడా మనస్సులో ఆలోచించక మిక్కిలి చిన్నవాడున్నూ, ఎట్టి నేరం చేయనివాడున్నూ అయిన నా కుమారుడిని కోపంతో కొట్టారు.

విశేషం: సరమ అభిప్రాయాన్ని అనుసరించి దేవశునికొడు కగుటచేత సారమేయుడు యజ్ఞం చేసేచోటికి పోయినను నేరం కాకపోవచ్చును. అదిగాక, ఆ కుక్క అక్కడ తిరుగుతున్నదే కాని మరే తప్పు చేసియుండలేదు.

క. తగు నిది తగ దని యెదలో । వగవక, సాధులకుఁ బేదవారల కెగ్గుల్
మొగిఁ జేయు దుర్వినీతుల । కగు ననిమిత్తాగమంబు లయిన భయంబుల్. 85

ప్రతిపదార్థం: ఇది= ఇట్లా చేయటం (ఈపని); తగును= యుక్త మౌతుంది; తగదు= యుక్తం కాదు; అని; ఎదలోన్= మనస్సులో, వగవక= తలపక; పేదవారలకున్= అశక్తులైనవారికి, బీదవారికి; సాధులకున్= సజ్జనులకు (మంచివారికి); ఎగ్గుల్= కీళ్ళు; మొగిన్= పూనికతో; చేయు= చేయునట్టి; దుర్వినీతులకున్= నీతి హీనులకు; అనిమిత్త+ఆగమంబులు+అయిన= కారణం లేకుండానే రాక గల (కారణం లేకుండానే కలిగే); భయంబుల్; అగున్= కలుగుతాయి.

తాత్పర్యం: ఈపని యుక్తమైనది, యుక్తమైనది కాదు అని మనస్సులో ఆలోచించకుండానే బీదవారికీ, అశక్తులైనవారికీ, మంచివారికీ అపకారాలు కావాలని చేసే నీతిరహితులకు కారణం లేకుండానే ఆపదలు వస్తూ ఉంటాయి.

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తినిధిత్వానికి ఇది ఒక ఉదాహరణం.ఈ సూక్తి ధార్తరాష్ట్రుల దుర్వృత్తాన్నీ, వారిదుర్గతినీ ధ్వనింపచేస్తున్నది.

ఒక ప్రతిలో ఈపద్య మిట్లున్నది -

"తగు నిది తగదిది యని యెడ । వగవక సాధులకుఁ బెద్దవారికి నెగ్గుల్
మొగిఁజేయు దుర్వినీతుల । బగి నుండఁగ వచ్చు ఘోరపాపభయంబుల్."

'అనిమిత్తంబులైన కష్టచయంబుల్' అనికొన్నిప్రతులలో పాఠాంతరం కనబడుతున్నది.

వ. అని సరమ యదృశ్యయైన, నతి విస్మితుండై జనమేజయుండు కొన్ని దినంబులకు దీర్ఘసత్త్రంబు సమాప్తంబుసేసి హస్తిపురంబునకుం జని, యందు సుఖం బుండి, యొక్కనాఁడు దేవశునీవచన ప్రతీకారార్థంబు శాంతిక పౌష్టిక క్రియలు నిర్వర్తింప ననురూపపురోహితు నన్వేషించుచు ననేక మునిగణాశ్రమంబులకుం జని యొక్కమునిపల్లెం గని, యందు శ్రుతశ్రవసుం డను మహామునిం గని నమస్కరించి యి ట్లనియె. 86

ప్రతిపదార్థం: అని= ఇట్లాపలికి; సరమ= దేవశుని; అదృశ్య+ఐనన్= కంటికి కనబడకుండా తిరోహిత కాగా; అతి, విస్మితుండు+ఐ= మిక్కిలి ఆశ్చర్యపడిన వాడై; జనమేజయుండు; కొన్ని దినంబులకున్= కొన్ని రోజులకు; దీర్ఘసత్త్రంబు= తాను చేస్తున్న దీర్ఘకాలం కొనసాగే యజ్ఞాన్ని; సమాప్తంబు+చేసి= ముగించి (పూర్తి చేసి); హస్తిపురంబునకున్= రాజధాని యైన హస్తినాపురానికి; చని= వెళ్ళి; అందున్= ఆపురంలో, సుఖంబు+ఉండి= సుఖంతో ఉండి; ఒక్కనాఁడు= ఒక్కరోజున; దేవశునీ, వచన, ప్రతీకార+అర్థంబు= దేవతల కుక్క యైన సరమ పలికిన 'భయం కలుగుతుంది' అనే పలుకులకు మారుచేత (ప్రతిక్రియ) చేయటంకొరకు; శాంతిక, పౌష్టిక, క్రియలు= ఆపదలకు ఉపశాంతి కల్గించేవియున్నూ, శ్రేయస్సును వృద్ధిపొందించేవియున్నూ, అయిన కర్మలు; నిర్వర్తింపన్= చేయటానికి; అనురూప, పురోహితున్= తగిన పురోహితుడిని; (పురోహితు డంటే ముందు మేలు కలిగించే కుటుంబానికి కావలసిన కర్మకలాపాల నన్నింటిని చేయించేవాడు); అన్వేషించుచున్= వెదకుతూ; అనేక, ముని, గణ+ఆశ్రమంబులకున్= పెక్కుమునుల సముదాయాల యొక్క ఆశ్రమాలకు; చని= వెళ్ళి; ఒక్క; మునిపల్లెన్= మునులు నివసించే పల్లెను; కని= చూచి; అందున్= ఆ మునిపల్లెలో; శ్రుతశ్రవసుండు+అను= శ్రుతశ్రవసుడు అనే పేరు కల; మహా+మునిన్; కని= చూచి; నమస్కరించి= మ్రొక్కి; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పలికెను.

తాత్పర్యం: అని పలికి దేవశుని యైన సరమ కనబడకుండ పోగా మిక్కిలి ఆశ్చర్యపడి, జనమేజయుడు కొన్ని రోజులకు దీర్ఘ మైన ఆయాగాన్ని పూర్తిచేసి హస్తినాపురానికి వెళ్ళి, అక్కడ సుఖంగా ఉండి, ఒకరోజున 'ఆపదలు కలుగుతాయి' అని చెప్పిన సరమపలుకులకు ప్రతిక్రియ చేసేనిమిత్తం శాంతిని శ్రేయస్సును కలిగించే కర్మలు చేయటానికి తగిన పురోహితుడిని వెదకుతూ మునులు నివసించే అనేక ఆశ్రమాలకు వెళ్ళి, ఒక మునిపల్లెను చూచి, దానిలో శ్రుతశ్రవసు డనే ఒకగొప్పమునిని చూచి మ్రొక్కి ఇట్లా పలికాడు.

విశేషం: సుఖము+ఉండి= ఇక్కడ ప్రథమావిభక్తి తృతీయార్థంలో వాడబడింది. ఆపదలను తొలగించి శ్రేయం చేకూర్చే కర్మకలాపాలను శాంతిక, పౌష్టిక క్రియలు అంటారు.

క. కరుణించి యిండు నాకుం । బురోహితుఁడు గాఁగ మీసుపుత్త్రుఁ బవిత్రుం
బరమతపోనైష్ఠికు భా । సురయమనియమాభిరాము సోమశ్రవసున్. 87

ప్రతిపదార్థం: కరుణించి= దయయుంచి; పవిత్రున్= పరిశుద్ధు డైన వాడిని; పరమ, తపః, నైష్ఠికున్= గొప్ప తపస్సు (చే)నందు నిష్ఠ కలవాడిని; భాసుర, యమ, నియమ+అభిరామున్= ప్రకాశించే ఇంద్రియ నిగ్రహంచేతను, విధి విహిత నియమాలచేతను మనోహరు డైనవాడిని; మీ, సు, పుత్త్రున్= యోగ్యు డైన మీ కుమారుడిని; సోమశ్రవసున్= సోమశ్రవసు డనే పేరు కలవాడిని; నాకున్; పురోహితుఁడు, కాఁగన్= పురోహితు డయ్యేటట్లుగా; ఇండు= ఇవ్వండి.

తాత్పర్యం: పవిత్రుడూ, గొప్ప తపస్సులో నిష్ఠ కలవాడున్నూ, ప్రకాశించే ఇంద్రియ నిగ్రహంచేత నియమాలచేత ఒప్పేవాడున్నూ, సోమశ్రవసుడు అనే పేరు కలవాడున్నూ అయిన యోగ్యు డైన మీకుమారుడిని దయయుంచి నాకు పురోహితుడిగా సమర్పించండి.

విశేషం: యోగాంగాలు ఎనిమిది. వాటిలో మొదటి రెండు - యమము, నియమము అనేవి.

వ. అని యడిగి వాని యనుమతంబున సోమశ్రవసుం దనకుం బురోహితుం గావించుకొని వాని నభీష్ట సత్కా రంబుల సంతుష్టునిం జేసి తదుపదేశంబున. 88

ప్రతిపదార్థం: అని=మీకుమారుడిని నాకు పురోహితుడిగా ఇమ్మని; అడిగి; వాని, అనుమతంబునన్= శ్రుతశ్రవసుని అంగీకారంతో; సోమశ్రవసున్= అతని కుమారు డైన సోమశ్రవసుడిని; తనకున్; పురోహితున్; కావించుకొని= అయ్యేటట్లు చేసికొని; వానిన్= ఆ సోమశ్రవసుడిని; అభీష్ట, సత్కారంబులన్= అతనికి ఇష్టము లైన సన్మానాలచేత; సంతుష్టునిన్= సంతోషించిన వాడినిగా; చేసి; తద్+ఉపదేశంబునన్= అతనియొక్క హితవచనంచేత

తాత్పర్యం: 'మీ కుమారుడిని నాకు పురోహితుడిగా ఇ' మ్మని జనమేజయుడు శ్రుతశ్రవుడిని అడిగి అతడి అంగీకారంతో సోమశ్రవసుడిని తనకు పురోహితుడిగా చేసికొని ప్రియములైన సన్మానాలచేత అతడిని సంతోషపెట్టి అతని హితవచనంచేత.

ఉ. ఆయతకీర్తితో వివిధయాగములన్ సుర ధారుణీసురా
మ్నాయము నాహితాహుతి సమంచితదక్షిణ లిచ్చి తన్పుచుం
జేయుచునుండె రాజ్యము విశిష్ట జనస్తుత వర్ధమాన ల
క్ష్మీయుతుఁ డుత్తముండు జనమేజయుఁ డాదినరేంద్రమార్గుఁ డై. 89

ప్రతిపదార్థం: విశిష్ట జన, స్తుత, వర్ధమాన, లక్ష్మీ, యుతుఁడు= మిక్కిలి ఉత్తములైన జనులచేత నుతింపబడిన, వృద్ధి పొందుతున్న సంపదతో (రాజ్యలక్ష్మితో) కూడినవాడు; ఉత్తముండు= శ్రేష్ఠుడు అయిన; జనమేజయుఁడు; ఆది, నర+ఇంద్ర, మార్గుఁడు+ఐ= ఆదికాలంలోని మనువు మొదలైన రాజులయొక్క మార్గం (విధానం) వంటి మార్గం కలవాడై; ఆయత, కీర్తితోన్= విస్తార మైన కీర్తితో; వివిధ, యాగములన్= పలురకాలైన యజ్ఞాలలో; సుర, ధారుణీ, సుర+ఆమ్నాయమున్=

దేవతల యొక్కయు, బ్రాహ్మణుల యెక్కయు సముదాయాన్ని; ఆహిత+ఆహుతి, సమంచిత, దక్షిణలు= చేయబడిన హోమద్రవ్యాలను (దేవతలకు), ఉచిత మైన సంభావనలను (బ్రాహ్మణులకు); ఇచ్చి; తన్పుచున్= తృప్తినొందిస్తూ; రాజ్యము; చేయుచున్; ఉండెన్.

తాత్పర్యం: ఉత్తమజనులచేత స్తుతింపబడిన వృద్ధినొందుతున్న సంపదతో కూడినవాడున్నూ, శ్రేష్ఠుడున్నూ అయిన జనమేజయ మహారాజు పూర్వపుమహారాజులు అనుసరించిన మార్గాన్ని అనుసరిస్తూ, విశాల మైనకీర్తితో పలువిధా లైన యాగాలలో అగ్నియందు వేల్వబడిన హవిస్సులతో దేవగణాలనూ, భూరిసంభావనలతో బ్రాహ్మణ సముదాయాలనూ తృప్తిపొందిస్తూ రాజ్యం చేస్తూ ఉన్నాడు.

విశేషం: అలం: క్రమాలంకారం. జనమేజయుడు దేవతలను ఆహుతులచేతను, బ్రాహ్మణులను విశేష దక్షిణలచేతను తృప్తిపరుస్తూ పలువిధాలైన యాగాలు చేస్తూ ఉన్నాడు.

వ. ఇట్లనవరత శాంతిక పౌష్టిక క్రియలు నిర్వర్తించుచు గురుదేవ మహీదేవతర్పణాభిరతుం డై యుండు నంత. 90

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; అనవరత, శాంతిక, పౌష్టిక క్రియలు= ఎడతెగకుండ ఆపదలకు ఉపశాంతి కలిగించేవి, శ్రేయస్సును వృద్ధి పొందించేవి అయిన కర్మలను; నిర్వర్తించుచున్= చేస్తూ; గురు, దేవ, మహీదేవ, తర్పణ+అభిరతుండు+ఐ= గురువులను (పెద్దలను), దేవతలను, బ్రాహ్మణులను తృప్తి పొందించటంలో ఆసక్తి కలవాడై; ఉండు+అంతన్= ఉండగా.

తాత్పర్యం: ఈవిధంగా ఎల్లప్పుడున్నూ ఆపదలను తొలగించేవీ, శ్రేయస్సును వృద్ధి పొందించేవీ అయిన కర్మలను చేస్తూ గురువులను దేవతలను బ్రాహ్మణులను తృప్తిపరచటంలో ఆసక్తికలవాడై ఉండగా.

ఉదంకుండు పౌష్యమహాదేవికుండలంబులం దేఁబోవుట (సం. 1-3-86)

క. పంకజభవసన్నిభుఁ డఘ । పంకక్షాళన మహాతపస్సలిలుఁ డనా
తంకమతి పైలశిష్యుఁ డు । దంకుం డను మునివరుండు దద్దయు భక్తిన్. 91

ప్రతిపదార్థం: పంకజభవ, సన్నిభుఁడు= పద్మంలో పుట్టిన బ్రహ్మతో సమానుడు; అఘ, పంక, క్షాళన, మహత్, తపః, సలిలుఁడు= పాప మనే బురదను కడిగివేసే గొప్ప తప స్సనే నీరు కలవాడు; అనాతంక, మతి= భయం లేని మనస్సు కలవాడు; పైల, శిష్యుఁడు= పైలు డనే మునిశిష్యుడైన; ఉదంకుండు+అను= ఉదంకుడు అనే పేరు కల; ముని, వరుండు= మునిశ్రేష్ఠుడు; తద్దయున్= మిక్కిలి; భక్తిన్= భక్తితో.

తాత్పర్యం: బ్రహ్మతో సమానుడున్నూ, పాపమనే బురదను కడిగివేసే గొప్పతపస్సనే నీరు కలవాడున్నూ, భయం లేని మనస్సు కలవాడున్నూ అయిన పైలుడిశిష్యు డైన ఉదంకు డనే మునిశ్రేష్ఠుడు మిక్కిలిభక్తితో, (తరువాతిపద్యంతో అన్వయం.)

విశేషం: అలం: రూపకం, ఉదంకుడు వేదుడి శిష్యు డని సంస్కృతభారతంలో ఉన్నది. పైలుడు వ్యాసుడి ప్రధానశిష్యులలో ఒకడు. నన్నయ సంస్కృతభారతంలో మొదట గల ధౌమ్యశిష్యులవృత్తాంతాన్ని విడిచివైచి ఉదంకోపాఖ్యానంతో తెలుగు భారతాన్ని ఆరంభించాడు. జనమేజయుడిని సర్పయాగానికి ప్రేరేపించినవాడు ఉదంకుడే.

క. గురుకులమునందు గురులకుఁ । బరిచర్య లొనర్చి తా నపరిమిత నిష్ఠా॥
పరుఁ డై జ్ఞానము వడసెను । గురుదయ నణిమాదికాష్టగుణములతోడన్. 92

ప్రతిపదార్థం: గురు, కులమునందున్= ఆచార్యుడి ఇంటిలో; గురులకున్= పెద్దలకు (గురువులకు); పరిచర్యలు= సేవలు; ఒనర్చి= చేసి; తాన్=తాను; అపరిమిత, నిష్ఠాపరుఁడు+ఐ= అధిక మైన దీక్షయందు (భక్తిలో ఆసక్తి కలవాడై); గురుదయన్= గురువుల దయచేత; అణిమ+అదిక+అష్టగుణములతోడన్= అణిమ మొదలైన ఎనిమిది సిద్ధులతోకూడ; జ్ఞానము; పడసెను= పొందినాడు.

తాత్పర్యం: గురుగృహంలో పూజ్యు లైన పెద్దలకు సేవలు చేసి అధికమైన భక్తియందు ఆసక్తికలవా డై గురువుల దయతో అణిమ గరిమ మొదలైన ఎనిమిదిసిద్ధులతోకూడ జ్ఞానాన్ని సాధించాడు.

విశేషం: అణిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, మహిమ, ఈశిత్వం, వశిత్వం, కామావసాయిత అనేవి ఎనిమిదీ అష్టసిద్ధులు. అణిమ అంటే చిన్నరూపం పొందటం; కామావసాయిత అంటే కోరికలను అరికట్టటం. ఈపద్యంలోని వివరాలు అతని స్వభావాన్ని తెలపటమే కాకుండా భావికథలో ఆపాత్రను అర్థం చేసికొనటానికి సార్థకాలుగా తోడ్పడతాయి. కథను ప్రసన్నం చేసే కథాశిల్పంలో భాగంగా సార్థకవిశేషణాలను వాడటం నన్నయరచనలో కానవచ్చే ఒకవిశేషం.

వ. అయ్యుదంకుండు గురుహిత కార్యధురంధరుం డయి గురుపత్నీనియోగంబునం బౌష్యుం డను రాజుదేవి కుండలంబులం బ్రతిగ్రహించి తేరంబూని, వనంబులో నొక్కరుండ చనువాఁ డెదుర నొక్క మహోక్షంబు నెక్కి చనుదెంచువాని నొక్క దివ్యపురుషుం గని, వాని పన్నిన వృషభగోమయ భక్షణంబు సేసి, యమ్మహాత్ము ననుగ్రహంబు వడసి, యతిత్వరితగతిం జని, పౌష్యమహారాజుం గాంచి, దీవించి, గృహీతసత్కారుం డై యి ట్లనియె. 93

ప్రతిపదార్థం: ఆ+ఉదంకుండు; గురు, హిత, కార్య, ధురంధరుండు+అయి= గురువు గారికి ఇష్టమైన పని యొక్క భారాన్ని వహించే వాడై; గురుపత్నీ, నియోగంబునన్= గురువుగారి భార్యయొక్క ఆజ్ఞచేత; పౌష్యుండు+అను, రాజుదేవి= పౌష్యు డనే రాజుభార్యయొక్క; కుండలంబులన్= కర్ణాభరణాలను; ప్రతిగ్రహించి= పుచ్చుకొని; తేరన్, పూని= తేవటానికి యత్నించి; వనంబులోన్= అడవిలో; ఒక్కరుండు+అ= ఒక్కడే; చను, వాఁడు= వెళ్లేవాడు; ఎదురన్= తన ఎదుట; ఒక్క, మహత్+ఉక్షంబున్= ఒక పెద్ద ఎద్దును; ఎక్కి; చనుదెంచువానిన్= వచ్చేవాడిని; ఒక్క దివ్యపురుషున్; కని= చూచి; వాని, పన్నిన= (కర్తృపద ప్రథమకుషష్ఠి) అత డేర్పరచిన; వృషభ, గోమయ, భక్షణంబు= ఎద్దుపేడను తినటం; చేసి; ఆ, మహాత్మ+అనుగ్రహంబు= మహానుభావు డైన ఆదివ్యపురుషుడి దయ; పడసి= పొంది; అతి, త్వరితగతిన్= మిక్కిలి వేగంతో కూడిన గమనంతో; చని= వెళ్ళి; పౌష్య, మహా, రాజున్= పౌష్యుడనే పేరు కల ఆ గొప్పరాజును; కాంచి= చూచి; దీవించి= ఆశీర్వదించి; గృహీత, సత్కారుండు+ఐ= గ్రహింపబడిన సన్మానం కలవాడై; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ ఉదంకుడు గురువుగారి కిష్టమైనపనిని నెరవేర్చేవా డై, గురువుగారిఆజ్ఞచేత పౌష్యు డనే మహారాజు యొక్క దేవేరికర్ణాభరణాలు దానంగా పుచ్చుకొని తేవటానికి పూనుకొని, అడవిలో ఒక్కడే వెళ్ళుతూ తన ఎదుట ఒక పెద్దఎద్దునెక్కి వస్తున్న ఒక దేవతాపురుషుడిని చూచి, అతడు నియోగించిన ఎద్దుపేడ తిని, ఆ మహానుభావుడి దయ పొంది మిక్కిలివేగంతో కూడిన గమనంతో వెళ్ళి పౌష్యమహారాజును చూచి ఆశీర్వదించి, అత డిచ్చిన అర్ఘ్యపాద్యాదిసత్కారాలు గ్రహించి ఇట్లా పలికాడు.

విశేషం: "ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య ప్రజాతంతుం మా వ్యవచ్ఛేచ్ఛీః" (గురువు కోరిన అర్థాన్ని గురుదక్షిణగా ఇచ్చి వంశాభివృద్ధికి తోడ్పడుము) అని ఉపనిషత్తులు ఘోషిస్తున్నవి. గురువుకు కోరిక లేదు. అందువలన గురుపత్ని ఉదంకుడిని నియోగించింది. గురువుగారికి భార్యయందున్న అనురాగం, శిష్యుడియందున్న వాత్సల్యం ఈ సన్నివేశంలో వస్తుధ్వని, గురుకార్యనిర్వహణానికి పూనుకొన్న ఉదంకుడు ధర్మవీరుడు. అతడి ఉత్సాహానికి మెచ్చి వీరరసాధిదేవత అయిన ఇంద్రుడు ప్రత్యక్షమై అమృతసేవనం చేయిస్తాడు. ధర్మసాధనమే మానవులకు అమృతత్వసిద్ధి అని దివ్యపురుషుడి వృత్తాంతం ధ్వనింపజేస్తున్నది. కథచివరకు తెలిసే ఈసత్యం నన్నయగారి ప్రసన్నకథాకలి(వి)తార్థయుక్తికి ఉదాహరణం. మూలంలో దివ్యపురుషుడు గోమయభక్షణం చేయుమంటే మొదట ఉదంకుడు అంగీకరించలేదు. 'మీ గురువుకూడా ఈ గోమయభక్షణం చేసినవాడే' అని దివ్యపురుషుడు చెప్పి ఒప్పించిన తరువాత ఉదంకుడు సమ్మతించాడు. నన్నయ దీనిని వదలివేసి ఉదంకుడి ఉపజ్ఞను ఉద్దీపింపజేశాడు.(సంపా.)

తే. **ఏను గుర్వర్థ మర్థి నై మానవేశ! । కడఁగి వచ్చితి నిపుడు నీకడకు వేడ్క;**
దండితారాతి! నీ దేవికుండలమ్ము । లిమ్ము నా పూన్కి యిది సఫలమ్ము గాఁగ. 94

ప్రతిపదార్థం: మానవ+ఈశ= ఓ రాజా!; ఏను= నేను; గురు+అర్థము= గురువుగారి నిమిత్తం; అర్థిని+ఐ= యాచించేవాడినై; కడఁగి= పూని; ఇపుడు; నీకడకున్= నీచెంతకు; వేడ్కన్= సంతోషంతో; వచ్చితిన్; దండిత+అరాతి!= శిక్షింపబడిన శత్రువులు కలవాడా!; నా, పూన్కి+ఇది= ఈ నా ప్రయత్నం; సఫలమ్ము, కాఁగన్= ఫలంతో కూడినట్లు అయ్యేటట్లుగా; నీ, దేవి కుండలములు= నీరాణి ధరించే కర్ణాభరణాలు; ఇమ్ము.

తాత్పర్యం: ఓ రాజా ! నేను గురువుగారిప్రయోజనంకొరకు యాచకుడ నై పూని ఇపుడు సంతోషంతో నీచెంతకు వచ్చాను. శిక్షింపబడిన శత్రువులు కల ఓ రాజా! నా ఈ కోరిక (ప్రయత్నం) సిద్ధించేటట్లుగా నీ రాణి ధరించే కర్ణాభరణాలు నా కిమ్ము.

విశేషం: గురు+అర్థము= గుర్వర్థము - యణాదేశసంధి.

వ. **అనినం బౌష్యం డిట్టి మహాత్మున కీఁ గాంచితిఁ గృతార్థుండ నైతి నని సంతసిల్లి యుదంకున కి ట్లనియె: 'నయ్యా! మదీయ ధర్మపత్ని యక్కుండలంబులు దొడిగి యున్నయది; మద్వచనంబున వాని నిప్పించుకొ' మ్మనిన నుదంకుం డంతఃపురమునకుఁ జని పౌష్యమహాదేవిం గానక క్రమ్మఱి పౌష్యుపాలికి వచ్చి. 'నీదేవి నందులం గాన నీవ 'యక్కుండలంబులు దెప్పించి యి' మ్మనినఁ బౌష్యుం డి ట్లనియె.** 95

ప్రతిపదార్థం: అనినన్= అని ఉదంకుడు పలుకగా; పౌష్యుండు; ఇట్టి, మహత్, ఆత్మునకున్= ఇటువంటి మహానుభావుడికి (గొప్ప మనస్సు కలవాడికి), ఈన్, కాంచితిన్= కుండలాలు ఈయ జాలినాను; కృత+అర్థుండన్+ఐతిన్= ధన్యుడ నైనాను; అని; సంతసిల్లి= సంతోషించి; ఉదంకునకున్; ఇట్లు= ఈవిధంగా; అనియెన్; అయ్యా= ఆర్యా! (ఉదంకుడికి సంబోధన); మదీయ, ధర్మ పత్ని= నాయిల్లాలు (యథావిధిగా గృహస్థ ధర్మాన్ని నిర్వహించటానికి పెండ్లాడిన భార్య); ఆ+కుండలములు; తొడిగి, ఉన్న, అది= ధరించి ఉన్నది; మత్+వచనంబునన్= నామాటచేత (నేను ఇమ్మన్నా నని;) వానిన్= ఆ కుండలాలను, ఇప్పించుకొమ్ము= ఇచ్చేటట్లు చేసికొనుము; అనినన్= అని పౌష్యుడు పలుకగా; ఉదంకుండు; అంతఃపురమునకున్= రాణివాసపుస్త్రీలు ఉండే సౌధభాగానికి; చని= వెళ్ళి; పౌష్య, మహా, దేవిన్= పౌష్యుని పట్టమహిషిని; కానక= చూడక; క్రమ్మఱి= తిరిగి; పౌష్య, పాలికిన్= పౌష్యుని చెంతకు; వచ్చి; నీ, దేవిన్= నీరాణిని; అందులన్= అంతఃపురంలో; కానన్= చూడను (ఆమె కనబడలేదు);

నీవు+అ= నీవే; ఆ+కుండలంబులు; తెప్పించి= తెచ్చేటట్లు చేసి; ఇమ్ము; అనినన్= అని ఉదంకుడు పలుకగా; పౌష్యుండు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అని ఉదంకుడు అడుగగా పౌష్యుడు 'ఇట్టి మహానుభావుడికి (పాత్రునికి) అడిగిన కుండలాలను ఈయజాలినాను; ధన్యుడ నైనాను' అని సంతోషించి ఉదంకుడితో 'ఆర్యా! నా దేవేరి ఆ కుండలాలను ధరించి ఉన్నది. నామాటగా వాటిని ఆమెనుండి గ్రహించండి' అని పలుకగా, ఉదంకుడు రాణి నివసించే అంతఃపురానికి వెళ్ళి పౌష్యుని పట్టమహిషి కనబడక తిరిగి పౌష్యమహారాజుచెంతకు వచ్చి 'నీదేవేరిని అంతఃపురంలో చూడలేకపోయాను; నీవే ఆ కుండలాలను నాకై తెప్పించి యిమ్ము' అని పలుకగా పౌష్యుడు ఇట్లా అన్నాడు.

విశేషం: ఇచ్చునకు ప్రేరణార్థకరూపం ఇప్పించు; కొనుము= మధ్యమపురుషమందలి ము, డు ప్రత్యయములు పరము లయ్యేటపుడు కొనునకు కో బహుళంగా ఔతుంది. కొమ్ము; తరువాత దీర్ఘమునకు హ్రస్వమును ముప్రత్యయమునకు ద్విత్వమును వస్తాయి. అక్కుండలంబులు దొడిగియున్నయది' - అనేపాఠానికి 'అక్కుండలంబులు దొడుగనవసరంబై యున్నయది' అనే పాఠాంతరం ఉన్నది.

క. **భూవినుత! నిన్నుఁ ద్రిభువన । పావను నశుచి వని యెట్లు పలుకఁగ నగు? న**
ద్దేవి పవిత్ర, పతివ్రత । గావున నశుచులకుఁ గానఁగా దనవద్యా! 96

ప్రతిపదార్థం: భూ, వినుత= భూమియందలి జనులచేత స్తుతింపబడేవాడా!; అనవద్యా= దోషరహితుడా!; త్రి, భువన, పావనున్= ముల్లోకాలను పవిత్రం చేసేవాడిని; నిన్నున్; అశుచివి+అని= శుద్ధుడవు కావని; ఎట్లు= ఏవిధంగా; పలుకఁ గన్+అగున్= పలుక వచ్చును? (పలుక రాదు అనిభావం); ఆ+దేవి= ఆ నాదేవేరి; పవిత్ర= పవిత్రురాలు; పతి వ్రత= (భర్తయే వ్రతంగా కలది) పతిభక్తి కల ఇల్లాలు; కావునన్= అగుటచేత; అశుచులకున్= అపవిత్రులకు; కానన్, కాదు= చూడరాదు (కనబడదు).

తాత్పర్యం: భూప్రజలచే స్తుతింపబడేవాడా! దోషరహితుడా! ముల్లోకాలను పవిత్రంచేయ గల నిన్ను అపవిత్రుడ వని చెప్పటం ఎట్లా? చెప్పరాదు. ఆ నాదేవి పవిత్రురాలు. పతిభక్తి కలది. కావున అపవిత్రులకు చూడ శక్యం కాదు.

విశేషం: ఉదంకుడు పరమ పవిత్రుడు; పౌష్యునిదేవి పరమ పవిత్ర. మహాపతివ్రత. అపవిత్రులకు కనబడదు. ఉదంకుడికి కనబడలేదు. అతడిని అపవిత్రు డని ఎట్లా చెప్పటం? అని పౌష్యునిభావం. ఇందులో అర్థాంతరసంక్రమితవాచ్యధ్వని ఉన్నది. (సంపా.)

వ. **అనిన విని యుదంకుం డప్పుడు దలంచి 'యావృషభగోమయభక్షణానంతరంబున నాచమింపమి నైన నా యశుచిభావంబునఁ గా కేమి యప్పరమ పతివ్రత మదీయదృష్టిగోచర గాకున్నదయ్యె' నని పూర్వాభిముఖుం డయి శుద్ధోదకంబులం బ్రక్షాళితపాణిపాద వదనుండయి యాచమించి పౌష్యానుమతంబున నద్దేవియొద్దకుం జనిన, నదియును నమ్మహామునికి నమస్కరించి కుండలమ్ము లిచ్చి యి ట్లనియె.** 97

ప్రతిపదార్థం: అనినన్= పౌష్యు డావిధంగా పలుకగా; విని; ఉదంకుండు; అప్పుడు= పౌష్యు డావిధంగా పలికినప్పుడు; తలంచి= ఆలోచించి(వెనుకటి విషయాలను స్మృతికి తెచ్చుకొని); ఆ, వృషభ, గోమయ, భక్షణ+అనంతరంబునన్= దివ్యపురుషుడు

చెప్పినట్లు ఆ ఎద్దుపేడ తినిన తరువాత; ఆచమింపమిన్= (చూపుడువేలు పొడవుగా నిల్పిన పుడిసిటి జలాన్ని మూడుసార్లు గ్రహించటమే ఆచమించటం) అట్లా చేయకపోవటం చేత; ఐన= కలిగిన; నా= నాయొక్క; అశుచిభావంబునన్, కాక+ఏమి= అపవిత్రత్వం వలన కాక మరేమి కారణాన; ఆ+పరమపతివ్రత= గొప్ప పతిభక్తి కల ఆ పౌష్యునిదేవి; మదీయ, దృష్టి, గోచర= నాచూపునకు కనబడేది; కాక+ఉన్నది+అయ్యెన్= కాకుండ ఉన్నది అయినది (నాకు కనబడలేదు) అని; పూర్వ+అభిముఖుండు= తూర్పుదిక్కుకు ఎదురుగా ముఖం కలవాడు; అయి; శుద్ధ+ఉదకంబులన్= పవిత్రమైన నీళ్ళతో, ప్రక్షాళిత, పాణి, పాద, వదనుండు+అయి= కడుగబడిన చేతులు, కాళ్ళు ముఖం కలవాడై; ఆచమించి= పవిత్రత కొరకు మూడుసార్లు జలం త్రాగి (వార్చి); పౌష్య+అనుమతంబునన్= పౌష్యునియొక్క అంగీకారంతో; ఆ+దేవి+ఒద్దకున్= ఆ రాణిచెంతకు; చనినన్= వెళ్ళగా; అదియును= ఆ దేవికూడ; ఆ+మహత్, మునికిన్= గొప్పముని అయిన ఆ ఉదంకుడికి; నమస్కరించి= మ్రొక్కి; కుండలంబులు= కర్ణాభరణాలు; ఇచ్చి; అతనికి ఇచ్చి; ఇట్లు= ఈవిధంగా; అనియెన్; పలికింది.

తాత్పర్యం: పౌష్యుడు ఆవిధంగా పలుకగా విని ఉదంకుడు ఆలోచించి, దివ్యపురుషుడు చెప్పినట్లు ఎద్దుపేడ తినినతరువాత పరిశుద్ధికై ఆచమనం చేయకపోవటంచేత కలిగిన అపవిత్రతచే కాక మరేకారణాన ఆమహాపతివ్రత (పౌష్యునిదేవి) నాచూపునకు కనబడ దని తలంచి, తూర్పుదిక్కుగా తిరిగి పవిత్రమైన జలాలతో కడుగబడిన చేతులు, పాదాలు, ముఖం కలవా డై ఆచమనం చేసి, పౌష్యమహారాజుఅనుమతితో అతడి దేవేరిచెంతకు పోగా, ఆ దేవి మహాముని అయిన ఉదంకుడికి నమస్కారంచేసి తన కర్ణాభరణాలు ఇచ్చి ఇట్లా పలికింది.

క. తక్షకుఁ డీ కుండలము ల । పేక్షించుచు నుండు వాఁ డభేద్యుఁడు మాయా
దక్షుండు వానివలన సు । రక్షితముగఁ జేసి చనుము రవినిభతేజా ! 98

ప్రతిపదార్థం: రవి, నిభ, తేజా= సూర్యుడితో సమాన మైన కాంతి కల ఓ మహామునీ!; తక్షకుఁడు= తక్షకు డనే పేరు కల సర్పరాజు; ఈ+కుండలములు= నేను ధరించే ఈ కర్ణాభరణాలను; అపేక్షించుచున్+ఉండున్= కోరుతూ ఉంటాడు; వాఁడు= ఆ తక్షకుడు; అభేద్యుఁడు= భేదించటానికి (జయించటానికి) శక్యం కానివాడు; మాయా, దక్షుండు= మాయ (వంచన) యందు మిక్కిలి సమర్థుడు; వానివలనన్= ఆ తక్షకుడివలన; సురక్షితముగన్= లెస్సగా కాపాడబడిన వాటినిగా; చేసి= ఈ కుండలాలను భద్రపరిచికొని; చనుము= వెళ్ళుము.

తాత్పర్యం: సూర్యుడితో సమానమైన తేజం గల ఓ ఉదంకమహామునీ! నేను ధరించే ఈ కుండలాలను తక్షకు డనే సర్పరాజు తాను పొందాలని కోరుకొంటూ ఉంటాడు. అతడు భేదింపశక్యం కానివాడు, మాయయందు మిక్కిలి సమర్థుడు. ఈ కుండలాలను ఆతడు అపహరించకుండ లెస్సగా భద్రపరచికొంటూ వెళ్ళుము.

విశేషం: పౌష్యుడిదేవి కుండలాలవిషయంలో జాగరూకుడవై ఉండు మని ఉదంకుడిని ముందే హెచ్చరించింది.

వ. అనిన నుదంకుం 'డట్ల చేయుదు' నని యద్దేవి వీడ్కొని పౌష్యపాలికిం బోయిన, నతం 'డయ్యా! నీ వతిథివి మాయింటఁ గృతభోజనుండవై పొ' మ్మని క్షణియించిన, నొడంబడి యుదంకుండు గుడుచుచో నన్నంబు కేశదుష్టం బైన రోసి, కరం బలిగి 'యి ట్ల పరీక్షితం బైన యశుద్ధాన్నంబు పెట్టినవాఁడ వంధుండ వగు' మని శాపం బిచ్చిన, నల్గి 'యల్పదోషంబున నాకు శాపం బిచ్చినవాఁడవు నీ వనపత్యుండ వగు' మని ప్రతిశాపం బిచ్చిన, నుదంకుండు 'నే ననపత్యుండఁ గా నోప, దీనిఁ గ్రమ్మతింపు' మనినఁ బౌష్యుం డి ట్లనియె. 99

ప్రతిపదార్థం: అనినన్= దేవి ఆవిధంగా పల్కగా; ఉదంకుండు; అట్లు+అ= అట్లే; చేయుదున్+అని; ఆ+దేవి= ఆరాణిని; వీడ్కొని= పోయివస్తా నని చెప్పి విడిచి; పౌష్య, పాలికన్= పౌష్యమహారాజుచెంతకు; పోయినన్= వెళ్లగా; అతండు= ఆ పౌష్యుడు; అయ్యా= నీవు; అతిథివి= అతిథిగా వచ్చినవాడవు; మా, ఇంటన్= మాయింటియందు; కృత, భోజనుండవు+ఐ= చేయబడిన భోజనం కలవాడ వై; పొమ్ము+అని= వెళ్ళు మని; క్షణియించినన్= భోజనార్థం కోరగా; ఒడంబడి= అంగీకరించి; ఉదంకుండు; కుడుచుచోన్= భోజనం చేస్తున్నప్పుడు; అన్నంబు; కేశ, దుష్టంబు+ఐనన్= వెంట్రుకచేత అపవిత్రం కాగా; రోసి= అసహ్యించుకొని; కరంబు= మిక్కిలి; అలిగి= కోపించి; ఇట్లు= ఈవిధంగా అపరీక్షితంబు+ఐన= పరీక్షింపబడని; అశుద్ధ+అన్నంబు= అపవిత్ర మైన అన్నాన్ని; పెట్టినవాడవు; అంధుండవు= గ్రుడ్డివాడవు; అగుము+అని; కమ్మని; శాపంబు, ఇచ్చినన్= శాప మీయగా; అల్గి= కోపించి; అల్ప, దోషంబునన్= చిన్నతప్పుచేత; నాకున్; శాపంబు+ఇచ్చినవాడవు; నీవు; అనపత్యుండవు= సంతానం లేనివాడవు; అగుము= కమ్ము; అని ప్రతిశాపంబు+ఇచ్చినన్= అని తిరిగి శాపం ఈయగా; ఉదంకుండు= ఉదంకుఁడు; నేను; అనపత్యుఁడన్= సంతానంలేనివాడను; కాన్, ఓపన్= కాజాలను; దీనిన్= ఈ శాపాన్ని; క్రమ్మఱింపుము= తొలగింపుము; అనినన్= అని పలుకగా; పౌష్యుండు; ఇట్లు ఈవిధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: దేవి ఆవిధంగా పలుకగా ఉదంకుడు 'అట్లే చేస్తా' నని ఆ దేవివద్ద సెలవు తీసికొని పౌష్యుని చెంతకు వెళ్ళగా పౌష్యుడు 'ఆర్యా! నీవు అతిథివి. మా ఇంటిలో భోజనం చేసి వెళ్ళు' మని కోరగా అంగీకరించి ఉదంకుడు భోజనం చేసేటప్పుడు అన్నం వెంట్రుకచేత అపవిత్రం కాగా ఏవగించుకొని మిక్కిలి కోపించి 'ఈవిధంగా పరీక్షింపబడని అపవిత్ర మైన అన్నం పెట్టావు. గ్రుడ్డివాడ వగుము' అని పౌష్యుడికి శాప మిచ్చాడు. అంతట పౌష్యుడు కోపగించి 'చిన్నతప్పునకు నాకు శాప మిచ్చావు, నీవు సంతానం లేనివాడ వగుము' అని మారుశాపం ఇచ్చాడు. అప్పుడు ఉదంకుడు నేను సంతానం లేనివాడను కాలేను. ఈ శాపాన్ని ఉపసంహరించుము' అని పల్కగా పౌష్యుడు, ఈవిధంగా అన్నాడు.

విశేషం: పౌష్యోదంకులు ఆవేశంతో పరస్పరం శాపాలిచ్చుకొన్నవారివలె పైకి కనపడతారు. 'లోనారసి' చూస్తే వారిచర్యలకు హేతువులు గోచరిస్తాయి. అపరీక్షితమైన అన్నం పెట్టినందుకు పౌష్యుడిని గ్రుడ్డివాడయ్యేటట్లు శపించాడు ఉదంకుడు. పరీక్షించేవి కళ్ళుకాబట్టి, వాటిని ఉపయోగించలేదని గ్రుడ్డితనం రావాలని శపించాడు. గురుదక్షిణ నిచ్చిన శిష్యుడికి సత్సంతానం కలుగుతుందని ఉపనిషద్వాక్యం. ఉదంకుడు గురుదక్షిణనిచ్చి సేవచేస్తే అతనికి కలిగేది వంశాభివృద్ధి. అతనికి అదిలేకుండా పౌష్యుడు అతనికి సంతానం కలుగకుండా ఉండే శాపాన్ని పెట్టాడు. ఉదంకుడు ఆశాపాన్ని భరించలేక, దానిని ఉపసంహరించుకోమని పౌష్యుడిని ప్రార్థించటం తన గురుశుశ్రూషాఫలం నిష్ఫలమైపోయిందన్న నిర్వేదంతోనే. ఈవివరాలు నన్నయ కథలో చెప్పడు. సారమతులైనవారు లోనారసి తెలిసికొనేవి అని భావించాడు. ఇది వస్తుధ్వని. ప్రసన్నకథాకలితార్థయుక్తి. (సంపా.)

ఉ. నిండుమనంబు నవ్యనవనీతసమానము, పల్కు దారుణా
ఖండలశస్త్రతుల్యము జగన్నుత! విప్రులయందు; నిక్క మీ
రెండును రాజులందు విపరీతము; గావున విప్రుఁ డోపు, నో
పం డతిశాంతుఁ డయ్యు నరపాలుఁడు శాపము గ్రమ్మఱింపఁగన్. 100

ప్రతిపదార్థం: జగత్+నుత= లోకంచేత స్తుతింపబడినవాడా!; విప్రులయందున్= బ్రాహ్మణులందు; నిండు, మనంబు= పూర్ణమైన హృదయం; నవ్య, నవనీత, సమానము= కొత్తగా తీసిన వెన్నతో సమానం; పల్కు= మాట; దారుణ+అఖండల,

శస్త్ర, తుల్యము= భయంకర మైన ఇంద్రుడిఆయుధ మైన వజ్రంతో సమానమైనది; నిక్కము= నిజం; ఈ రెండును= హృదయం, పల్కు అనే రెండున్నూ; రాజులందున్= క్షత్రియులందు; విపరీతము= విరుద్ధం (అంటే హృదయం వజ్రసమానం, పల్కు వెన్నతో సమానం); కావునన్= అందుచేత; విప్రుఁడు= బ్రాహ్మణుడు; శాపము= ఇచ్చిన శాపాన్ని; క్రమ్మఱింపఁగన్= తొలగించటానికి; ఓపున్= శక్తుడౌతాడు; అతిశాంతుఁడు+అయ్యున్= మిక్కిలి శాంతస్వభావంతో కూడిన వా డైనప్పటికి; నర, పాలుఁడు= రాజు; ఓపండు= శాపం తొలగించటానికి శక్తుడు కాడు.

తాత్పర్యం: లోకంచేత స్తుతింపబడినవాడా! ఉదంకమహామునీ! బ్రాహ్మణులలో వారి నిండుహృదయం అప్పుడే తీసిన వెన్నతో సమానంగా మిక్కిలి మృదువుగా ఉంటుంది, మాట భయంకరమైన ఇంద్రుని వజ్రాయుధంతో సమానంగా ఉంటుంది, పరుషమైనది. ఇది నిజం. మనసూ, హృదయమూ అనే ఆ రెండున్నూ రాజులలో అందుకు విరుద్ధంగా ఉంటాయి. అంటే రాజులందు మనస్సు వజ్రతుల్యంగానూ, పల్కు నవనీతంగానూ ఉంటాయి. కాబట్టి బ్రాహ్మణుడు ఇచ్చిన శాపాన్ని ఉపసంహరించుకొనటానికి శక్తు డౌతాడు. మిక్కిలి శాంతస్వభావం కలవా డైనా రాజు ఉపసంహరించుకోవటానికి శక్తుడు కాడు.

విశేషం: అలం: కావ్యలింగం. ఈపద్యం సుప్రసిద్ధ మైనది. మనోవాక్కుల విషయంలో బ్రాహ్మణులకు రాజులకూ ఉండే భేదాన్ని ఇది వివరిస్తున్నది. రాజు మనస్సు కఠినం కాబట్టి తా నిచ్చిన శాపాన్ని ఉపసంహరింపజాల నని పౌష్యుడు చెప్పాడు. నన్నయ రుచిరార్థసూక్తి కిది ఉదాహరణం. మూలంలో విప్రులపల్కు మంగలికత్తితో పోల్చబడింది. నన్నయ ఔచిత్యాన్ని పాటించి 'దారుణాఖండల శస్త్రతుల్య' మని ఉపమించాడు. నన్నయరచనలో శబ్దగుణా లెక్కువ. వాటిల్లోకూడా ప్రసాదగుణం విస్తారంగా ప్రయోగింపబడుతుంది. బంధశైథిల్యం, అర్థనైర్మల్యం అనే శబ్దార్థగుణాలను రెండింటినీ పోషించిన పద్యమిది. అందువల్లనే ప్రసిద్ధమై ప్రజలనాల్కలమీద నిలిచింది. (సంపా.)

తక్షకుండు కుండలంబు లపహరించుట (సం. 1-3-136)

వ. 'కావున నా కశక్యంబు నీ యిచ్చిన శాపంబు గ్రమ్మఱింపు' మనిన నుదంకుం 'డట్లేని నీకు నల్పకాలంబున శాపమోక్షం బగు' నని పౌష్యునకు ననుగ్రహించి, 'మగుడి నేఁడ పోయి గురుపత్నికిఁ గుండలంబు లీఁగంటి' నని సంతోషించి చనువాఁ డెదుర నొక్క జలాశయంబు గని శుచిప్రదేశంబునఁ దనచేతి కుండలంబులు పెట్టి యాచమించుచున్నంతఁ దనతోడన వచ్చి తక్షకుండు నగ్నవేషధరుండై యక్కుండలంబులు గొని పాఱిన, నుదంకుండును వాని పిఱుందన పాఱి పట్టికొనుడు. 101

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి (రాజులహృదయం వజ్రకఠినం కాబట్టి); నాకున్; అశక్యంబు= (శాపం తొలగించటానికి) శక్యం కాదు; నీ ఇచ్చిన= (కర్తృపద ప్రథమకు షష్ఠి) నీ విచ్చిన; శాపంబు; క్రమ్మఱింపుము= తొలగింపుము; అనినన్= అని పౌష్యుడు పల్కగా; ఉదంకుండు; అట్లు+ఏని= నీకు శాపం ఉపసంహరించటానికి శక్తి లేకపోతే; నీకున్; అల్పకాలంబునన్= కొలదికాలంలోనే; శాప+మోక్షంబు= శాపం వలన విడుదల; అగున్+అని; పౌష్యునకున్= పౌష్యుడిని; అనుగ్రహించి= కరుణించి; మగుడి= తిరిగి; నేఁడు+అ= ఆరోజే; పోయి= వెళ్ళి, గురుపత్నికిన్= గురువుగారిభార్యకు, కుండలంబులు= ఆమె తెమ్మనిన కర్ణాభరణాలు; ఈన్, కంటిన్, అని= ఈయజాలితిని అని; సంతోషించి= ఆనందించి; చనువాఁడు= వెళ్ళువాడు, ఎదురన్= తన ఎదుట; ఒక్క; జల+ఆశయంబు= సరస్సును; కని= చూచి, శుచి, ప్రదేశంబునన్= శుద్ధ మైన స్థలంలో; తన చేతి, కుండలంబులు= తన చేతిలో ఉన్న కర్ణాభరణాలను; పెట్టి= ఉంచి; ఆచమించుచున్, ఉన్న+అంతన్= ఆచమనం చేస్తూ ఉండగా; తనతోడన్= తనవెంటనే; వచ్చి; తక్షకుండు= తక్షకుడు అనే పేరు కల సర్పరాజు; నగ్న, వేష, ధరుండు+ఐ=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దిగంబర వేషాన్ని ధరించినవాడై; ఆ కుండలాలు= పౌష్యుని దేవి ఇచ్చిన కుండలాలు, కొని= తీసికొని; పాటినన్= పరుగెత్తిపోగా; ఉదంకుండును= ఉదంకుడు కూడ; వాని, పిఱుందన్+అ= ఆ తక్షకుని వెనుకనే; పాఱి= పరుగెత్తి, పట్టికొనుడున్= అతనిని పట్టుకొనిన అనంతరం.

తాత్పర్యం: 'కాబట్టి శాపం తొలగించటం నాకు శక్యం కాదు; నీ విచ్చిన శాపమే తొలగింపుము' అని పౌష్యుడు పలుకగా ఉదంకుడు 'అట్లైతే నీకు కొద్దికాలంలోనే శాపంనుండి విముక్తి కలుగుతుం' దని (గ్రుడ్డితనం పోతుందని) పౌష్యుడిని కరుణించి, 'తిరిగి ఈరోజే వెళ్ళి గురువుగారిభార్యకు ఆమె కోరినట్లు కుండలాలను ఈయగలిగాను' అని సంతసించి వెళ్ళుతూ తన ఎదుట ఒకసరస్సును చూచి, పవిత్రస్థలంలో తనచేతిలో ఉన్న కుండలాలను ఉంచి ఆచమనం చేస్తూ ఉండగా, అతని వెంటనే వచ్చి తక్షకు డనే సర్పరాజు దిగంబరవేషం ధరించి ఆకుండలాలు గ్రహించి పరుగెత్తాడు ఉదంకుడుకూడ ఆ తక్షకుడివెనుకనే పరుగెత్తి అతడిని పట్టుకొన్నాడు. తరువాత.

విశేషం: పౌష్యునకు+అనుగ్రహించి= ఇటువంటి చోట్ల నన్నయ ద్వితీయావిభక్తికి బదులుగా షష్ఠీవిభక్తివాడుతూ ఉంటాడు. అప్పటికిని, ఇప్పటికిని ఉన్న కారకభేద మిది. పట్టికొనుడు - 'డు' అనే ప్రత్యయం ఆనంతర్యార్థాన్ని సూచిస్తుంది. చేతి - అనేది చేయి యొక్క ఔపవిభక్తికరూపం.

క. విడిచి దిగంబరవేషము । విడువక మణికుండలములు విషధరపతి యే
ర్పడ నిజరూపముతో న । ప్పుడ యహిలోకమున కరిగె భూవివరమునన్. 102

ప్రతిపదార్థం: విష, ధర, పతి= సర్పరాజు (తక్షకుడు); దిక్+అంబర, వేషము= దిక్కులే వస్త్రంగా గల నగ్నవేషం (గుడ్డలు లేని రూపం) విడిచి; మణి, కుండలములు= రత్నమయా లైన చెవికమ్మలను; విడువకు= విడిచిపెట్టక; ఏర్పడన్= తేటపడేటట్లుగా (తాను సర్పరాజని స్పష్టపడేటట్లు); నిజరూపముతోన్= తన సహజమైన రూపంతో; అప్పుడు+అ= వెంటనే; భూవివరమునన్= భూమియందలి కన్నంద్వారా; అహి, లోకమునకున్= నాగలోకానికి (పాతాళలోకానికి), అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: సర్పరాజైన తక్షకుడు నగ్నరూపం విడిచి, రత్నమయాలైన కుండలాలను మాత్రం విడువక, తనసహజ మైన తక్షకరూపంతో వెంటనే భూమిలోని రంధ్రంద్వారా నాగలోకానికి వెళ్ళాడు.

వ. ఉదంకుండును వానితోడన తగిలి యవ్వివరంబున నురగలోకంబున కరిగి నాగపతుల నెల్ల నిట్లని స్తుతియించె. 103

ప్రతిపదార్థం: ఉదంకుండును= ఉదంకుడు కూడ; వానితోడన్+అ= ఆ తక్షకుడితోనే; తగిలి= వెంబడించి; ఆ+వివరంబునన్= ఆ రంధ్రంలో (ద్వారా); ఉరగలోకంబునకున్= నాగలోకానికి; అరిగి= వెళ్ళి; నాగపతులన్, ఎల్లన్= పాములరాజులనందరిని; ఇట్లు+అని= ఈవిధంగా; స్తుతియించెన్= పొగడినాడు.

తాత్పర్యం: ఉదంకుడు కూడ తక్షకుడిని వెంబడించి, ఆ రంధ్రంద్వారా నాగలోకానికి వెళ్ళి, పాములరాజుల నందరిని ఈవిధంగా స్తుతించాడు.

విశేషం: మూలభారతంలో తక్షకుడిని వెంబడించి పట్టుకొనటానికి ఉదంకుడు నేలను త్రవ్వి అలసిపోయాడనీ, ఇంద్రుడు అతడి త్రవ్వుకోలలో వజ్రాయుధశక్తిని ప్రవేశపెట్టాడనీ, దాని మహిమవలన ఉదంకుడు నేలను త్రవ్వి నాగలోకంలో ప్రవేశించాడనీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉన్నది. నన్నయ దానిని స్పృశించలేదు. తక్షకుడి వెంట ఉదంకుడు కలుగులోదూరి నాగలోకం చేరినట్లు చెప్పాడు. 1.92వ పద్యంలో గురువు దయవలన ఉదంకుడికి అణిమాద్యష్టసిద్ధులు కలిగాయని నన్నయ వర్ణించాడు. ఉదంకు డా సిద్ధుల ప్రభావంతో ఆ కలుగులోదూరి వెనువెంటనే వెడలగలిగాడని వస్తుధ్వని. పూర్వాపర కథార్థసంవిధానంవలన 'ప్రసన్నకథా కలితార్థయుక్తి' ద్యోతకమౌతుంది. (సంపా.)

చ. బహువన పాదపాబ్ధి కులపర్వత పూర్ణ సరస్సరస్వతీ
సహిత మహామహీభర మజస్ర సహస్ర ఫణాళిఁ దాల్చి దు
స్సహతర మూర్తికిన్ జలధిశాయికిఁ బాయక శయ్య యైన య
య్యహిపతి దుష్కృతాంతకుఁ డనంతుఁడు మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్. 104

ప్రతిపదార్థం: బహు, వన, పాదప+అబ్ధి, కులపర్వత, పూర్ణ, సరస్+సరస్వతీ సహిత, మహత్, మహీ, భరము= పెక్కు అడవులతోను, చెట్లతోను, సముద్రాలతోను, కులపర్వతాలతోను, నీటితో నిండిన తటాకాలతోను, నదులతోను కూడిన గొప్ప భూమియొక్క బరువును; అజస్ర, సహస్ర, ఫణ+ఆళిన్= నిరంతరం వేయిపడగల సముదాయంతో; తాల్చి= ధరించి; దుస్సహతర, మూర్తికిన్= మిక్కిలి సహింపశక్యం గాని విగ్రహం కల; జలధిశాయికిన్= సముద్రంలో నిద్రించే నారాయణుడికి; పాయక= విడువక; శయ్య+ఐన= సెజ్జ ఐన; ఆ+అహిపతి= ఆ నాగరాజు; దుష్కృత+అంతకుఁడు= పాపాలను పోగొట్టేవా డైన; అనంతుఁడు= అనంతు డనే పేరుకల నాగరాజు; మాకున్= మాయెడ; ప్రసన్నుఁడు= ప్రసాదం (అనుగ్రహం) కలవాడు; అయ్యెడున్= అగుగాక!

తాత్పర్యం: పెక్కు అడవులతోను, చెట్లతోను, సముద్రాలతోను, కులపర్వతాలతోను, నీటితో నిండిన సరస్సులతోను, నదులతోను కూడిన గొప్ప భూమియొక్క బరువును ఎల్లప్పుడూ వేయిపడగల సముదాయంతో ధరించి మిక్కిలి సహింపశక్యం కాని విగ్రహం గల నారాయణుడికి విడువక శయ్యగా ఉండి, పాపాలను అంతరింపజేసే అనంతు డనే పేరుగల ఆ నాగరాజు మా పట్ల అనుగ్రహం కలవాడు అగుగాక!

విశేషం: మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, గంధమాదనం, వింధ్యం, పారియాత్రం అనే ఏడున్నూ కులపర్వతాలు. విష్ణువు సముద్రంలో ఆదిశేషువుమీద పవళించి ఉంటాడు. ఉదంకుడు ఋషి కాబట్టి 'మాకు' అని బహువచన ప్రయోగం చేశాడు. ఉదంకుడు నాగరాజులను నాలుగు పద్యాలలో స్తుతించాడు. వాటిలో ఇది మొదటిది. ఈ నాల్గు పద్యాల చివరన "మాకు ప్రసన్నుఁడయ్యెడున్" అనే పదాలు ఉన్నవి. తరువాత పలువురు కవులచేత వ్రాయబడిన సమానమకుటం గల శతకాలకు ఈ నాలుగు పద్యాలున్నూ మార్గదర్శకా లయిన వని విమర్శకులు చెప్పారు. మూలంలో లేకపోయినా అనంతవాసుకుల స్తోత్రాలను నన్నయ తెనుగున అధికంగా చేర్చి ఉన్నాడు. నాగరాజులలో శ్రేష్ఠు లవటంచేత వారినికూడ స్తుతించటం ఉచిత మని అతడు భావించి ఉంటాడు. 'మాకు' అనేబహువచనం తనను, తనగురుకులాన్ని మనసులో ఉంచుకొని ఉదంకుడు ప్రయోగించాడు. ఈపద్యంలో నన్నయ అక్షరరమ్యత రమణీయంగా దర్శనమిస్తుంది. భూభారాన్నీ, దానిని మోసే ఆదిశేషుడిని సహస్రఫణాల బుసలను, అనంతునికి శయ్యగా శేషుడు అనంతభారాన్ని మోస్తున్న అంతస్సత్త్వాన్ని ఊష్మాక్షరాలతో, అంతస్థాలతో ధ్వనింపచేయటం ఇందులోని అక్షరరమ్యత. అక్షరరమ్యతను విభావవిస్ఫూర్తికి వ్యంజకంగా వాడటం నన్నయ రచనాశిల్పం.

చ. అరిది తపోవిభూతి నమరారులబాధలు వొందకుండఁగా
నురగుల నెల్లఁ గాచిన మహోరగనాయకుఁ డానమత్సురా

సురమకుటాగ్రరత్నరుచిశోభితపాదున కద్రినందనే

శ్వరునకు భూషణం బయిన వాసుకి మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్. **105**

ప్రతిపదార్థం: అరిది= దుర్లభమైన; తపః, విభూతిన్= తపస్సుయొక్క వైభవం చేత; అమర+అరుల= దేవతలయొక్క శత్రువు లైన రాక్షసుల; బాధలు; పొందక, ఉండఁగాన్= పొందకుండ ఉండేటట్లుగా; ఉరగులన్, ఎల్లన్= పాములనందరిని; కాచిన= రక్షించిన; మహత్+ఉరగనాయకుఁడు= గొప్ప పాములరాజు; ఆనమత్, సుర+అసుర, మకుట+అగ్ర, రత్న, రుచి, శోభిత, పాదునకున్= తనకు నమస్కరించే దేవతలయొక్కయు, రాక్షసులయొక్కయు కిరీటాల పైభాగంలో ఉన్న మణులకాంతితో ప్రకాశించే పాదాలు కలవాడికి; అద్రినందన+ఈశ్వరునకున్= హిమవత్పర్వతానికి కూతు రైన పార్వతికి భర్త అయిన శివుడికి; భూషణంబు+అయిన= అలంకారమైన; వాసుకి= వాసుకి అనే పేరుగల సర్పరాజు; మాకున్= మాయెడ; ప్రసన్నుఁడు= అనుగ్రహం కలవాడు; అయ్యెడున్= అగుగాక!

తాత్పర్యం: చేయ శక్యంగాని తపస్సుయొక్కవైభవంచేత రాక్షసులు పెట్టేబాధలు పొందకుండేటట్లుగా నాగులనందరినీ రక్షించిన గొప్ప సర్పరాజున్నూ, వంగి నమస్కరించే దేవతలయొక్కయు రాక్షసులయొక్కయు కిరీటాలపైభాగాల నున్న మణులకాంతిచేత ప్రకాశించే పాదాలు కల పార్వతీపతి యైన శివుడికి అలంకార మైన వాసుకి అనే సర్పరాజు మాయెడ అనుగ్రహం కలవాడు అగుగాక!

విశేషం: ఈపద్యంలో నన్నయ అక్షరరమ్యత సార్థకంగా ఆవిష్కరించబడింది. సర్పకులాన్ని రక్షించిన ఉదారుడూ, శివుడి కంఠాభరణంగా నిలిచిన ఉదాత్తుడూ అయిన వాసుకి స్వభావాన్ని ఊష్మాక్షరాలకంటె అంతస్థాలతోనూ, నాదాక్షరాలతోనూ ధ్వనింపజేయటం ఇందులోని రచనాశిల్పం.

ఉ. దేవమనుష్యలోకములఁ ద్రిమ్మరుచున్ విపులప్రతాపసం

భావితశక్తిశౌర్యులు నపారవిషోత్కటకోపవిస్ఫుర

త్పావకతాపితాఖిలవిపక్షులు నైన మహానుభావు లై

రావతకోటి ఘోరఫణిరాజులు మాకుఁ బ్రసన్ను లయ్యెడున్. **106**

ప్రతిపదార్థం: దేవ, మనుష్య, లోకములన్= దేవతలయొక్కయు మనుష్యులయొక్కయు లోకాలందు; త్రిమ్మరుచున్= తిరుగుతూ; విపుల, ప్రతాప, సంభావిత, శక్తి, శౌర్యులున్= అధికమైన తేజస్సుచేత సన్మానింపబడిన (ఊహింపబడిన) సామర్థ్యాన్ని, పరాక్రమాన్ని కలవారున్నూ; అపార, విష+ఉత్కట, కోప, విస్ఫురత్, పావక, తాపిత+అఖిల, విపక్షులున్= అంతం లేని విషంచేత అధికమైన కోపంచేత ప్రకాశించే అగ్నిచేత తపింప చేయబడిన సర్వశత్రువులు కలవారున్నూ; ఐన; మహత్+అనుభావులు= గొప్ప ప్రభావం కలవారు; ఐరావత కోటి, ఘోర ఫణిరాజులు= ఐరావతులు (ఐరావత మనే పేరుగల గొప్ప నాగవంశం ఉన్నది. అందులో పలువురు నాగులు ఉంటారు) అనే కోటి సంఖ్యగల (అనేకులైన) భయంకరు లైన సర్పరాజులు; మాకున్= మాయెడ; ప్రసన్నులు= అనుగ్రహం కలవారు; అయ్యెడున్= అగు గాక!

తాత్పర్యం: దేవతల మనుష్యుల లోకాలలో తిరుగుతూ అధికమైన తేజస్సుచేత పూజింపబడిన సామర్థ్యం, పరాక్రమం కలవారున్నూ, అనంతవిషంచేత అధిక మైన కోపంతో ప్రకాశించే అగ్నిచేత తపింపజేయబడిన సర్వశత్రువులు కలవారున్నూ అయిన మహాత్ములు ఐరావత నాగవంశంలోని కోటిసంఖ్యాకు లైన భయంకర సర్పరాజులు మాపట్ల అనుగ్రహంకలవారు అగుదురుగాక!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: కోపం వచ్చినప్పుడు పాములు విషం కక్కుతాయి. ఆ విషం నుండి అగ్ని ఉప్పతిల్లుతుంది. పాత్రస్వభావ వ్యంజకమైన అక్షరరమ్యత ఇందులో సముచితంగా సంతరించబడి ఉన్నది. ఘోరఫణిరాజులను వర్ణించే ఈపద్యంలో ఊష్మాక్షరాలతోపాటు, పరుషాక్షరాలను, స్థిరాక్షరాలనూ వాడటం విశేషం.

ఉ. గోత్రమహామహీధర నికుంజములన్ విపినంబులం గురు
క్షేత్రమునం బ్రకామగతి ఖేలన నొప్పి, సహాశ్వసేనుఁ డై
ధాత్రిఁ బరిభ్రమించు బలదర్ప పరాక్రమదక్షుఁ డీక్షణ
శ్రోత్రవిభుండు తక్షకుఁడు శూరుఁడు మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్. 107

ప్రతిపదార్థం: గోత్ర, మహత్, మహీ, ధర, నికుంజములన్= గొప్ప కులపర్వతాల యొక్క పొదరిండ్లలోనూ; విపినంబులన్= అడవులయందును; కురుక్షేత్రమునన్= కురుక్షేత్రంలోనూ; ప్రకామ, గతి, ఖేలనన్= ఇచ్చవచ్చినట్లుగా పోవటంలోని (సంచరించటంలోని) క్రీడతో; ఒప్పి= అలరి; సహ+అశ్వసేనుఁడు+ఐ= కుమారుడైన అశ్వసేనునితో కూడినవాడై; ధాత్రిన్= భూమియందు; పరిభ్రమించు= తిరుగాడు. బల, దర్ప, పరాక్రమ, దక్షుఁడు= బలంలోను, గర్వంలోను శౌర్యంలోను సమర్థుడు; శూరుఁడు= పరాక్రమవంతుడు; (ఐన) ఈక్షణశ్రోత్రవిభుండు= కన్నులే చెవులుగా గల పాములఱేడు; తక్షకుఁడు; మాకున్= మాయెడ; ప్రసన్నుఁడు= అనుగ్రహం కలవాడు; అయ్యెడున్= అగుగాక!

తాత్పర్యం: గొప్ప కులపర్వతాల పొదరిళ్ళలోను, అడవులలోను, కురుక్షేత్రంలోను ఇచ్చవచ్చినట్లు సంచరించే క్రీడతో అలరి, కుమారు డైన అశ్వసేనుడితో కూడి భూమిమీద తిరుగుతూ బలంలోనూ, గర్వంలోనూ, శౌర్యంలోనూ సమర్థుడైన పరాక్రమవంతుడూ పాములకురాజూ అయిన తక్షకుడు మాయెడ అనుగ్రహం కలవాడు అగుగాక!

విశేషం: స్తుతికి ప్రసన్నుడు కాని దేవు డుండడు. ఆ భావంతో ఉత్తమ సర్పమూర్తులనూ, భయంకరసర్పరాజులనూ, చివరకు కుండలాలను హరించిన తక్షకుడినీ ఉదంకుడు కార్యార్థి అయి ప్రస్తుతించాడు. అందరిలో తక్షకుడు అభేద్యుడూ, దుష్కరుడూ కాబట్టి అతడిని దుష్కరప్రాసతోకూడిన పద్యంలో స్తుతించటం విశేషం. నన్నయపద్యరచనలోని అక్షరరమ్యతకు ఇది ఉదాహరణం. నన్నయ పైనాలుగు పద్యాలలో అనంతుడినీ, వాసుకినీ, ఐరావతకోటి ఫణిరాజులనూ, తక్షకుడినీ మాత్రమే ఎందుకు కీర్తించా డనే అంశం లోనారసి తెలిసికొనదగినది. నాగమాత అయిన కద్రువకు జన్మించిన సర్పాలలో మొదటి నలుగురిపేర్లు - అనంతుడు, వాసుకి, ఐరావతుడు, తక్షకుడు (చూడు. ఆది. 2.4). అందువలన ఆవరుసలో ఉదంకుడు వారిని స్తుతించాడు. భావికథలో జనమేజయుడు చేసే సర్పయాగానికి కారకుడు కాబోతున్నాడు. ఉదంకుడు. ఆ కథంతా చదివితే తెలిసే విశేషమేమంటే దుష్టపన్నగాలు అగ్నిలో పడి నశించటానికే ఆయజ్ఞం తోడ్పడిందని. అనంతుడు, వాసుకి ధర్మాత్ములై పుణ్యాత్ములై తపస్సులుచేసి నారాయణ పరమేశ్వరుల సేవాభాగ్యాన్ని పొందారు. దుష్టులు కాని ఫణిరాజులు సర్పయాగంలో దగ్ధులు కాకుండా తమ పుణ్యవిశేషాలతో బ్రతికిపోయారు. మాయాదక్షుడైన తక్షకుడు ఇంద్రుడిని ఆశ్రయించటంవలన చావుతప్పి బైటపడ్డాడు. అగ్నిలో పడబోతున్న తక్షకుడిని పడకుండా ఆస్తీకుడు ఆపాడు. అంటే దుష్టసర్పకులంలో హుతంకాకుండా చివరకు మిగిలింది తక్షకుడే అన్నమాట. ఆ తరువాత అతడు ఇంద్రునికి స్నేహితు డయ్యాడు. ఇంద్రుడి ఖాండవవనంలో నివసించాడు. అతడిని ఇంద్రుడు సదా రక్షిస్తూ ఉండేవాడు. పైకిచూస్తే, ఉదంకుడి కథలో తక్షకుడిని స్తుతించటం సందర్భౌచిత్యం. కథనంతా గాఢంగా భావిస్తే మూలంలో లేని అనంతుడిని, వాసుకిని నన్నయ ఉదంకుడిచేత ఎందుకు స్తుతింపచేశాడో, ఫణిరాజులనూ, తక్షకుడినీ ఎందుకు ప్రశంసింపచేశాడో పఠితకు అంతరార్థం ప్రసన్న మౌతుంది. ప్రసన్నకథాక(వి)లితార్థయుక్తి కిది చక్కని ఉదాహరణం. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనియి ట్లురగపతుల నెల్ల స్తుతియించి 'యందు సితాసితతంతు సంతానపటంబు ననువయించుచున్నవారి నిద్దఱ స్త్రీలను, ద్వాదశారచక్రంబుం బరివర్తించుచున్న వారి నార్వురఁ గుమారుల, నతిప్రమాణ తురంగంబు నెక్కినవాని మహాతేజస్వి నొక్క దివ్యపురుషుం గని విపులార్థవంతంబు లైన మంత్రంబుల నతిభక్తియుక్తుం డై స్తుతియించినం బ్రసన్నుం డై యద్దివ్యపురుషుం డయ్యుదంకున కి ట్లనియె. 108

ప్రతిపదార్థం: అని= అని పలికి; ఇట్లు= ఈవిధంగా; ఉరగపతులన్+ఎల్లన్= నాగరాజులనందరిని; స్తుతియించి= పొగడి; అందున్= నాగలోకంలో; సిత+అసిత, తంతు, సంతాన, పటంబున్= తెల్లని, నల్లని, దారాల సముదాయంతో కూడిన వస్త్రం; అనువయించుచున్+ఉన్నవారిన్= నేస్తున్న వారిని; ఇద్దఱ స్త్రీలను= ఇరువురు ఆడవారిని; ద్వాదశ+అర చక్రంబున్= పండ్రెండు (పన్నెండు) ఆకులు గల చక్రాన్ని; పరివర్తించుచు, ఉన్నవారిన్= త్రిప్పుతున్న వారిని; ఆర్వురన్, కుమారులన్= ఆరుగురు యువకులను; అతి, ప్రమాణ, తురంగంబున్= మిక్కిలి ఎత్తైన గుఱ్ఱాన్ని; ఎక్కిన వానిన్; మహత్, తేజస్విన్= గొప్ప తేజస్సు కలవాడిని; ఒక్క దివ్యపురుషున్= ఒక దేవతాపురుషుడిని; కని= చూచి; విపుల+అర్థవంతంబులు+ఐన= అధికమగు అర్థం కలవైన; మంత్రంబులన్= మంత్రాలతో; అతి, భక్తి, యుక్తుండు+ఐ= మిక్కిలి భక్తితో కూడినవాడై; స్తుతియించినన్= పొగడగా; ప్రసన్నుండు+ఐ= ప్రసాదం (అనుగ్రహం) కలవాడై; ఆ+దివ్యపురుషుండు= ఆ దేవతా పురుషుడు; ఆ+ఉదంకునకున్= ఆ ఉదంకమహామునితో; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని ఈవిధంగా నాగరాజులందరిని పొగడి పాతాళలోకంలో తెల్లని నల్లని దారాల సముదాయంతో కూడిన వస్త్రాన్ని నేస్తున్న ఇద్దరు స్త్రీలను, పండ్రెండు (పన్నెండు) ఆకులు గల చక్రాన్ని త్రిప్పుతున్నవారిని ఆరుగురు యువకులను, మిక్కిలి ఎత్తైన గుర్రాన్ని ఎక్కిన గొప్ప తేజస్సు కల ఒక దివ్యపురుషుడిని చూచి, అధికము లైన అర్థాలు గల మంత్రాలతో మిక్కిలిభక్తితో కూడినవాడై స్తుతించగా, ఆ దేవతాపురుషుడు అనుగ్రహం కలవా డై ఉదంకుడితో ఈ విధంగా పలికాడు.

విశేషం: నల్లని, తెల్లని దారాలతో కూడిన వస్త్రం విషయాన్నీ, ఇరువురు స్త్రీల విషయాన్నీ, ద్వాదశార చక్రాన్ని త్రిప్పుతున్న ఆరుగురు కుమారుల విషయాన్నీ, ఉత్తమ అశ్వాన్ని ఎక్కిన దివ్యపురుషుని విషయాన్నీ ముందు తెలియపరచటం అవుతుంది. (చూడు:1.118)

క. మితవచన! నీయథార్థ । స్తుతుల కతిప్రీతమానసుఁడ నైతి ననిం
దిత చరిత! నీకు నభివాం । ఛిత మెయ్యది దానిఁ జెపుమ చేయుదు ననినన్. 109

ప్రతిపదార్థం: మితవచన= పరిమిత మైన వాక్కులు కలవాడా!; అనిందిత, చరిత!= నిర్మల మైన వర్తనం కలవాడా! ఓ ఉదంకమహామునీ!; నీ= నీయొక్క, యథార్థస్తుతులకున్= సత్య మైన స్తోత్రాలకు; అతి, ప్రీత, మానసుఁడన్= మిక్కిలి ప్రీతి పొందిన మనస్సు కలవాడిని; ఐతిన్= అయినాను; నీకున్; అభివాంఛితము= కోరబడింది (కోరిక); ఏ+అది= ఏదో; దానిన్= ఆ కోరికను, చెపుము+అ= తెలుపుము; చేయుదున్= నెరవేరుస్తాను; అనినన్= అని ఆ దివ్యపురుషుడు పలుకగా.

తాత్పర్యం: పరిమితమైన వాక్కులు, నిర్మల మైనవర్తనం కలిగినట్టి ఓ ఉదంక మహామునీ! సత్యాలైన నీస్తోత్రాలచేత మిక్కిలి ప్రీతి పొందిన మనస్సు కలవాడ నైనాను. నీకు ఏ కోరిక కలదో దానిని చెప్పుము; నేను నెరవేరుస్తాను - అని దివ్య పురుషుడు పలుకగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఉదంకుండు గరంబు సంతసిల్లి 'యిన్నాగకులం బెల్ల నాకు వశం బగునట్టులుగ ననుగ్రహింపు' మనిన నప్పురుషుం 'డట్లేని నీయశ్వకర్ణరంధ్రాధ్మానంబు సేయు' మనిన వల్లె యని తద్వచనానురూపంబు సేయుడుఁ దత్క్షణంబ. 110

ప్రతిపదార్థం: ఉదంకుడు; కరంబు= మిక్కిలి; సంతసిల్లి= సంతోషించి; ఈ+నాగకులంబు+ఎల్లన్= ఈ పాముల సముదాయం అంతయున్నూ; నాకున్, వశంబు, అగు, అట్టులుగన్= అధీన మయ్యేటట్లుగా (వశపడేటట్లుగా); అనుగ్రహింపుము= దయచూపుము; అనినన్= అని ఉదంకుడు పలుకగా; ఆ+పురుషుండు= ఆ దివ్యపురుషుడు; అట్లు+ఏనిన్= నీ కటువంటి కోరిక ఉన్నట్లయితే; ఈ, అశ్వ, కర్ణ, రంధ్ర+ఆధ్మానంబు= నే నెక్కిన ఈ గుర్రం యొక్క చెవియందు ఊదుట; చేయుము+అనినన్= చేయు మని ఆ దివ్యపురుషుడు పలుకగా; వల్లె= అట్లే; అని; తద్, వచన+అనురూపంబు= ఆ దివ్యపురుషుడి వాక్కునకు తగింది; చేయుడున్= చేసిన అనంతరం; తద్+క్షణంబు+అ= ఆ క్షణంలోనే, వెంటనే.

తాత్పర్యం: ఉదంకుడు మిక్కిలి సంతోషించి 'ఈ పాముల వంశమంతా నా కధీన మయ్యేటట్లు కరుణించు' మని పలుకగా ఆ దివ్యపురుషుడు 'అట్లైతే ఈ గుర్రంయొక్క చెవికన్నంలో ఊదు' మని అన్నాడు. ఉదంకుడు అట్లే అని అంగీకారం సూచించి, ఆ దివ్యపురుషుడు పలికిన వాక్కులకు తగినట్లు చేయగా వెంటనే.

విశేషం: మూలంలో ఇచ్చట గుర్రంయొక్క అపానంలో ఊదు మని దివ్యపురుషుడు చెప్పినట్లు ఉన్నది. ఋషి అట్లా చేయటం ఉచితంగా ఉండ దని నన్నయ అపానాన్ని తొలగించి దానికి బదులు కర్ణరంధ్ర మని వ్రాశాడు.

శా. పాతాళైకనికేతనాంతరమునం బర్వెం దదశ్వాఖిల
స్రోతోమార్గ వినిర్గతోగ్ర దహనార్చుల్, పన్నగవ్రాతముల్
భీతిల్లెన్, భుజగాధినాథు మనమున్ భేదిల్లెఁ గల్పాంత సం
జాతప్రోద్ధత బాడబానల శిఖాశంకాధికాతంక మై. 111

ప్రతిపదార్థం: తద్+అశ్వ+అఖిల, స్రోతస్+మార్గ, వినిర్గత+ఉగ్ర, దహన+అర్చుల్= ఆ గుఱ్ఱముయొక్క సర్వఇంద్రియాలమార్గాల నుండి బయల్వెడలిన భయంకర మైన అగ్నియొక్క జ్వాలలు; పాతాళ+ఏక, నికేతన+అంతరమునన్= నాగలోక మనే ముఖ్యమైన(సాటిలేని) భువనం యొక్క మధ్య భాగంలో; పర్వెన్= వ్యాపించినవి; పన్నగవ్రాతముల్= పాముల సముదాయాలు; భీతిల్లెన్= భయపడినవి; కల్ప+అంత, సంజాత, ప్రోద్ధత, బాడబ+అనల, శిఖా, శంకా, అధిక+ఆతంకము+ఐ= ప్రళయకాలంలో పుట్టి విజృంభించిన బడబాగ్ని యొక్క జ్వాలలనే సందేహంవలన అధికమైన భయం కలదై; భుజగ+అదినాథు= సర్పరాజు యొక్క మనమున్= మనస్సుకూడ; భేదిల్లెన్= బ్రద్దలైనది.

తాత్పర్యం: పాతాళ మనే ముఖ్యమయిన భువనమధ్యంలో ఆ గుఱ్ఱముయొక్క సర్వేంద్రియ ద్వారాలనుండి బయల్వెడలిన భయంకరమైన అగ్నిజ్వాలలు వ్యాపించినవి. పాముల సముదాయాలు భయపడినవి; ప్రళయకాలంలో పుట్టి పైకెగసిన బడబాగ్నిజ్వాల లనే సందేహంవలన కలిగిన అధిక మైన భయం కలదై పాములరాజుయొక్క హృదయం కూడ బ్రద్దలయింది.

విశేషం: అలం: నన్నయ రచనలోని అక్షరరమ్యత కీపద్యం ఉదాహరణం. ఇందులో భయానకరసం స్ఫురిస్తుంది. దానిని పోషించేటట్లు - మార్గ, వినిర్గత, అర్చివంటి ద్విత్వాక్షరాలనూ, భ, ధ, భ, వంటి మహాప్రాణాలనూ వాడుతూ సమాసభూయిష్ఠమైన రచనతో ఓజోగుణాన్ని పోషించి బడబానలజ్వాలలవంటి అగ్నిజ్వాలల భయంకరరూపాన్ని అక్షరరమ్యంగా నన్నయ ఆవిష్కరించాడు.

తక్షకుండు కుండలంబులం దెచ్చి యుదంకున కిచ్చుట (సం.1-3-158)

క. శంకరనిభుఁ డగు విప్రుభ । యంకరకోపాగ్ని యొక్కొ! యనుచును జాతా
తంకుఁ డయి కుండలంబు లు । దంకునకును దెచ్చి యిచ్చెఁ దక్షకుఁ డంతన్. 112

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; తక్షకుడు; శంకరనిభుఁడు+అగు= శివునితో సమాను డైన; విప్రు= బ్రాహ్మణుడియొక్క; భయంకర, కోప+అగ్ని, ఒక్కొ= భయం కలిగించే కోప మనే అగ్నియేమో; అనుచును= అని భావిస్తూ; జాత+ఆతంకుఁ డు+అయి= పుట్టిన భయం కలవాడై; ఉదంకునకును= ఉదంక మహామునికి; కుండలంబులు= కర్ణాభరణాలు; తెచ్చి; ఇచ్చెన్= తెచ్చి ఇచ్చాడు.

తాత్పర్యం: అంత తక్షకుడు శివుడితో సమాను డైన బ్రాహ్మణుడి భయంకర మైన కోప మనే అగ్నియేమో! అని తలుస్తూ భయంతో కూడినవాడై కుండలాలను ఉదంకమహామునికి తెచ్చి ఇచ్చాడు.

విశేషం: అలం: రూపకం; ఉత్ప్రేక్ష.

వ. ఇట్లు నాగలోకంబున కెల్ల మహాక్షోభంబు గావించి తక్షకుచేతఁ గుండలంబులు గొని యుదంకుఁ డాత్మగతంబున. 113

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నాగలోకంబునకున్+ఎల్లన్= పాతాళలోకాని కంతటికి; మహాక్షోభంబు= గొప్ప కలత; కావించి= చేసి, కలిగించి; తక్షకుచేతన్= తక్షకుడి నుండి (వలన); కుండలంబులు= కర్ణాభరణాలు; కొని= గ్రహించి; ఉదంకుఁడు; ఆత్మగతంబునన్= తనలో.

తాత్పర్యం: ఈ విధంగా సర్పలోకాని కంతటికి గొప్పకలత కలిగేటట్లు చేసి తక్షకుడి (వలన) నుండి కుండలాలు గ్రహించి ఉదంకుడు తనలో.

విశేషం: ఆత్మగత మనేమాట నాటకంలో స్వగత మనే అర్థంలో రంగస్థల సూచనగా వాడుతుంటారు. పైకి వినబడని భాషణం ఆత్మగత మని సాహిత్యదర్పణం.

సీ. 'కుండలమ్ములు వేగ కొనిరమ్ము నాలవ । నాఁటికి నని పూని నన్నుఁ బనిచె
గురుపత్ని; నేఁడ యక్కుండలంబులు దొడ్గ । దివస; మీ దివస మతిక్రమింప
కుండంగఁబోక యె ట్లొడఁగూడు? ని న్నాగ । భవన మెప్పాట వెల్వడఁగఁ బోలు?
నేఁడు పోవనినాఁడు నిష్ఫలం బిమ్మహా । యత్నమంతయు' నని యధికచింతఁ

ఆ. దవిలియున్న నయ్యుదంకు నభిప్రాయ । మెఱిఁగి దివ్యపురుషుఁ డిట్టు లనియె:
'నీహయంబు నెక్కి యేఁగుమ; యిది వడి । గలదు మనముకంటె గాడ్పుకంటె'. 114

ప్రతిపదార్థం: గురుపత్ని= గురువుగారి భార్య; నాలవ నాఁటికిన్= నేటికి నాల్గవరోజుకు; కుండలంబులు= చెవికమ్మలు; వేగ= వేగంగా; కొనిరమ్ము= తీసికొనిరమ్ము; అని; పూని= పట్టుదలతో, కడగి; నన్ను; పనిచెన్= పంపింది; నేడు+అ= నేడే; ఆ

కుండలంబులు= ఆ కర్ణాభరణాలు; తొడ్గు= ధరించే; దివసము= రోజు; ఈ దివసము= ఈ రోజు; అతిక్రమింపక, ఉండంగన్= దాటిపోకుండ; పోక= పోవటం; ఎట్లు= ఏవిధంగా; ఒడన్, కూడున్= సమకూరుతుంది?; ఈ నాగభవనము= ఈ సర్పలోకం; (నుండి) ఏ+పాటన్= ఏవిధంగా; వెల్వడఁగన్, పోలున్= బయటకు పోవటానికి వీలౌతుంది?; నేఁడు= ఈరోజు; పోవనినాఁడు= వెళ్ళకపోతే; ఈ+మహత్ యత్నము+అంతయున్= నేను చేసిన ఈగొప్పప్రయత్నమంతా; నిష్ఫలంబు= ఫలం లేనిది (నిష్ప్రయోజనం) అని; అధికచింతన్= పెనుదిగులునందు; తవిలి ఉన్నన్= చిక్కి ఉండగా; ఆ+ఉదంకు+అభిప్రాయము= ఆ ఉదంకునియొక్కభావం; ఎఱిఁగి= తెలిసికొని; దివ్యపురుషుఁడు= (గుర్రాన్ని ఎక్కి ఉన్న) దేవతా పురుషుడు; ఇట్టులు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు; ఈ హయంబున్= ఈ గుర్రాన్ని; ఎక్కి; ఏఁగుము+ఆ= వెళ్ళుము; ఇది= ఈ గుర్రం; మనముకంటెన్= మనస్సుకంటె; గాడ్పుకంటెన్= గాలికంటె; వడి, కలదు= వేగం కలిగి ఉన్నది.

తాత్పర్యం: 'నేటికి నాల్గవరోజున కుండలాలను వేగంగా తీసికొని రమ్మని గురువుగారిభార్య పట్టుదలతో నన్ను పంపింది. ఆ కుండలాలు ధరించే దినం ఈనాడే. ఈరోజు దాటకుండ నేను అక్కడికి పోవటం ఏవిధంగా సమకూరుతుంది? ఈ నాగలోకంనుండి ఎట్లా బయటికి వెళ్ళవచ్చును? నేను వెళ్ళకపోతే నేను చేసిన ఈ మహాప్రయత్నమంతా నిష్ప్రయోజన మౌతుంది' - అని మిక్కిలి విచారంతో కలతనొంది యున్న ఆ ఉదంకుడిభావం తెలిసికొని తురగారూఢు డైన దివ్యపురుషుడు ఇట్లా పలికాడు: 'నీ వీ గుర్రం ఎక్కి వెళ్ళుము. ఇది మనస్సుకంటె గాలికంటె వేగం కలిగినది'.

విశేషం: మనస్సు, గాలీ వేగం కలవాటిలో ప్రసిద్ధా లైనవి. కథాకథనానికి ఉపయోగపడే ఇటువంటి సీసాలను కొందరు 'గునుగు' సీసాలంటారు.

వ. అనవుడు నద్దివ్యపురుషువచనంబున నత్తురంగంబు నెక్కితత్క్షణంబ యయ్యుదంకుండు గురుగృహంబునకు వచ్చె; నిట గురుపత్నియు శుచిస్నాత యై నూతనపరిధానశోభిత యై యక్కుండలంబులు దొడువ నవసరం బైనఁ దదాగ మనంబు గోరుచున్నయది యప్ప డయ్యుదంకుం గని తద్దయు సంతసిల్లి, తదానీతరత్నకుండల భూషిత యై, బ్రాహ్మణులం బూజించి నిజసంకల్పిత మహోత్సవం బొనరించె; నట్లు గురుకార్యంబు నిర్వర్తించియున్న యుదంకుం జూచి గురుం డి ట్లనియె. 115

ప్రతిపదార్థం: అనవుడున్= అనిన తరువాత; ఆ+దివ్య, పురుష= ఆ దేవతాపురుషుడి యొక్క; వచనంబునన్= మాటచే (మాటప్రకారం); ఆ+తురంగంబున్= ఆ గుర్రాన్ని; ఎక్కి; తద్+క్షణంబు+అ= ఆ క్షణమే, వెంటనే; ఆ+ఉదంకుండు; గురు, గృహంబునకున్= గురువుగారి ఇంటికి; వచ్చెన్; ఇట= ఇక్కడ గురుగృహంలో; గురుపత్నియున్= గురువుగారి భార్యయున్నూ; శుచి, స్నాతయున్= పవిత్రతకొరకు స్నానంచేసినది; ఐ=అయి;. నూతన, పరిధాన శోభిత+ఐ= క్రొత్తవస్త్రాలతో ప్రకాశించినదయి; ఆ+కుండలంబులు= ఆ కర్ణాభరణాలు; ధరింపన్= ధరించటానికి; అవసరంబు= సమయం; ఐనన్= కాగా; తద్+ఆగమనంబు= ఉదంకునిరాక; కోరుచున్న+అది= కోరుతున్నది; అప్పుడు; ఆ+ఉదంకున్= ఆ ఉదంకుని; కని= చూచి; తద్దయున్= మిక్కిలి; సంతసిల్లి= సంతోషించి; తద్, ఆనీత, రత్న, కుండల, భూషిత, ఐ= అతనిచేత తేబడిన మణిమయ కర్ణాభరణాలచేత అలంకరింపబడిన దై; బ్రాహ్మణులన్; పూజించి= పూజ చేసి; నిజ, సంకల్పిత, మహత్, ఉత్సవంబు= తనచేత సంకల్పింపబడిన గొప్పదైన వేడుక; ఒనరించెన్= చేసెను; అట్లు= ఆవిధంగా; గురుకార్యంబు= గురువుగారి పని (గురుపత్ని కార్య మైనా గురుకార్యమే); నిర్వర్తించి= చేసి; ఉన్న=ఉండిన; ఉదంకున్; చూచి; గురుండు= గురు వైన పైలుడు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: దివ్యపురుషుడు ఆ విధంగా పల్కిన తరువాత ఆతనిమాట ప్రకారం ఆ గుఱ్ఱాన్ని ఎక్కి ఉదంకుడు వెంటనే గురువుగారింటికి వచ్చాడు. గురుగృహంలో గురువుగారిభార్య పవిత్రస్నానం చేసి క్రొత్తబట్టలు కట్టుకొని వెలుగొందుతూ కర్ణాభరణాలు ధరించే సమయం ఆసన్నంకాగా, శిష్యుడైన ఉదంకుడి రాకకొరకు ఎదురుచూస్తున్నప్పుడు ఆ ఉదంకుడు రాగా చూచి, మిక్కిలి సంతోషించి, అతడు తెచ్చిన మణిమయకుండలాలను ధరించి, విప్రులను పూజించి, తాను సంకల్పించిన మహోత్సవాన్ని జరుపుకొన్నది. ఆ విధంగా గురువుగారిపని చేసి ఉన్న ఉదంకుడిని చూచి గురు వైన పైలుడు ఈవిధంగా పలికాడు.

క. ఈయున్న పౌష్యుపాలికిఁ । బోయి కడుంబెద్దదవ్వు పోయిన య ట్ల
త్యాయత విమల తపోమహి । మా! యిన్ని దినంబు లేల మసలితి చెపుమా! 116

ప్రతిపదార్థం: ఈ, ఉన్న= ఇచ్చటనే ఉన్న 'ఈ' సామీప్యాన్ని సూచిస్తుంది). పౌష్య, పాలికిన్= పౌష్యమహారాజు చెంతకు; పోయి= వెళ్ళి; కడున్= మిక్కిలి; పెద్ద= అధికమైన; దవ్వు= దూరం; పోయిన, అట్లు= పోయినవిధంగా; అతి+ఆయత, విమల, తపః, మహిమా= మిక్కిలి అధికమైన నిర్మలమైన తపస్సుయొక్క మహత్త్వం కలవాడా!; ఇన్ని, దినంబులు= ఇన్ని (నాలుగు) రోజులు; ఏల= ఏకారణంచేత; మసలితి(వి)= ఆలస్యం చేసినావు?; చెపుమా= తెలుపుము.

తాత్పర్యం: మిక్కిలి అధిక మైన నిర్మలమైనతపస్సుయొక్కమహిమ కలవాడా! ఇక్కడికి అతిసమీపంలో ఉన్న పౌష్యమహారాజుచెంతకు పోయి, చాలాదూరం పోయినవిధంగా ఏకారణంచేత ఇంతఆలస్యం చేశావో తెలియజెప్పుము.

విశేషం: పౌష్యునిపురం దగ్గరగానే ఉన్నది. నీవు గొప్ప తపస్సంపన్నుడవు. నీవు అచ్చటికి పోయి రావటానికి నాల్గురోజులు పట్టింది. ఇంత ఆలస్యం కావటానికి కారణ మేమి టని గురువు అడిగాడు. 'అత్యాయత విమల తపోమహిమా!' అనే సంబోధనం సాభిప్రాయం. తపోమహిమతో ఎటువంటి కార్యమైననూ సులభంగా చేయవచ్చును. 'ఈయున్న' అనే ఎత్తుగడ సంభాషణ సహజత్వం ఉట్టిపడేటట్లు నుడికారపు సొంపును ప్రదర్శిస్తున్నది.

వ. అనిన నుదంకుం డి ట్లనియెః 'నయ్యా! మీ యానతిచ్చినట్ల మసల వలవదు; తక్షకుం డను దుష్టోరగంబు సేసిన విఘ్నంబున నింత మసలవలసె; వినుఁడు: మిమ్ము వీడ్కొని చనువాఁడ నెదుర నొక్క మహోక్షంబు నెక్కి చనుదెంచువాని నొక్కదివ్యపురుషుం గని, వాని పన్నిన వృషభగోమయ భక్షణంబు సేసి చని పౌష్యమహాదేవి కుండలంబులు ప్రతిగ్రహించి వచ్చుచోఁ దక్షకుచేత నపహృతకుండలుండ నై వాని పిఱుందన పాతాళలోకంబునకుం బోయి నాగపతుల నెల్ల స్తుతియించి, యందు సితాసితతంతు సంతానపటంబు ననువయించుచున్నవారి నిద్దఱ స్త్రీలను, ద్వాదశారచక్రంబుఁ బరివర్తించుచున్నవారి నార్వురఁ గుమారుల, నతిప్రమాణతురగారూఢుండైన యొక్క దివ్యపురుషుం గని, తత్ప్రసాదంబునఁ గుండలంబులు వడసి, తదాదేశంబున నత్తురంగంబు నెక్కివచ్చితి; నిది యంతయు నేమి? నా కెఱింగింపుఁ' డనిన గురుం డిట్లనియె. 117

ప్రతిపదార్థం: అనినన్= గురువు అట్లనగా; ఉదంకుండు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పల్కెను; అయ్యా= ఆర్యా!; మీ, ఆనతి, ఇచ్చిన, అట్లు+అ= మీరు సెలవిచ్చిన విధంగా (కర్తృపద ప్రథమకు షష్ఠి); మసల, వలవదు= ఆలస్యం చేయ నవసరం లేదు; తక్షకుండు+అను; దుష్ట+ఉరగంబు= చెడ్డపాము; చేసిన; విఘ్నంబునన్= ఆటంకంచేత; ఇంత= ఇంతకాలం; మసల,

వలసెన్= ఆలస్యం చేయవలసి వచ్చింది; వినుఁడు; మిమ్మున్= (గురువుగారిని); వీడ్కొని= విడిచి (మీదగ్గర సెలవు తీసికొని); చను, వాఁడన్= వెళ్ళువాడను; ఎదురన్= నా ఎదుట; ఒక్క, మహత్, ఉక్షంబున్= గొప్ప (ఉన్నతమైన) ఎద్దును; ఎక్కి; చనుదెంచు, వానిన్= వచ్చువాడిని; ఒక్క, దివ్య, పురుషున్= ఒక దేవతాపురుషుడిని; కని= చూచి; వాని, పన్నిన= (కర్పృపద ప్రథమకుషష్ఠి) అతడు ఏర్పరచిన; వృషభ, గోమయ, భక్షణంబు= ఎద్దుపేడ తినటం; చేసి; చని= వెళ్ళి; పౌష్య, మహా, దేవి= పౌష్యుడి దేవేరియొక్క; కుండలంబులు; ప్రతిగ్రహించి= దానంగా తీసికొని; వచ్చుచోన్= వచ్చేటప్పుడు; తక్షకుచేతన్= తక్షకు డనే సర్పరాజుచేత; అపహృత, కుండలుండను+ఐ= దొంగిలించబడిన కుండలాలు కలవాడ నై; వాని, పిఱుందన్+అ= అ తక్షకుడి వెనుకనే; పాతాళ లోకంబునకున్= నాగలోకానికి; పోయి= వెళ్ళి; నాగ, పతులన్, ఎల్లన్= సర్పరాజుల నందరిని; స్తుతియించి= పొగడి; అందున్= ఆ పాతాళంలో, సిత+అసిత, తంతు, సంతాన, పటంబున్= తెల్లని నల్లని దారాల సముదాయంతో కూడిన వస్త్రాన్ని; అనువయించుచున్+ఉన్నవారిన్= నేస్తూ ఉన్నవారిని; ఇద్దఱు, స్త్రీలను= ఇరువురు ఆడువారిని; ద్వాదశ+అర, చక్రంబున్= పండెండ్రు (12) ఆకులు కల చక్రాన్ని; పరివర్తించుచున్+ఉన్న, వారిన్= త్రిప్పుచున్న వారిని; ఆర్వురన్, కుమారులన్= ఆర్గురు బాలకులను; అతి, ప్రమాణ, తురగ+ఆరూఢుండు+ఐన= మిక్కిలి ఎత్తైన గుర్రాన్ని ఎక్కినవాడిని; ఒక్క, దివ్యపురుషున్= ఒక దేవతా పురుషుడిని; కని= చూచి; తద్, ప్రసాదంబునన్= ఆ దివ్యపురుషుడి అనుగ్రహంచేత; కుండలంబులు; పడసి= పొంది; తద్+ఆదేశంబునన్= ఆ పురుషుడి ఆజ్ఞచేత; ఆ+తురంగంబున్= ఆ గుర్రాన్ని, ఎక్కి; వచ్చితిన్; ఇది, అంతయున్= పైన పేర్కొనబడిన దంతయున్నూ; ఏమి= ఏమిటి?; నాకున్; ఎఱింగిం పుఁడు= అంతరార్థం తెల్పండి; అనినన్= అని ఉదంకుడు అడుగగా; గురుండు= పైలుడు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని గురువుగారు అడుగగా ఉదంకుడు ఈవిధంగా చెప్పాడు: 'ఆర్యా! మీరు సెలవిచ్చినట్లు ఆలస్యం చేయవలసిన అవసరం లేదు. కాని, తక్షకుడు అనే పేరు గల దుష్టు డైన నాగరాజు చేసిన ఆటంకంచేత ఇన్ని రోజులు ఆలస్యం చేయవలసి వచ్చింది. నేను మిమ్ము వీడి వెళ్ళుతూ ఎదుట ఒక పెద్దఎద్దు నెక్కి వచ్చేవాడిని ఒక దేవతాపురుషుడిని చూచి అత డేర్పరచిన ఎద్దుపేడ తిని వెళ్ళి, పౌష్యమహారాజుదేవేరికర్ణాభరణాలు పుచ్చుకొని వస్తూ ఉన్నాను. వస్తూ ఉండగా తక్షకుడిచేత కుండలాలు అపహరింపబడ్డవి. నేను ఆ తక్షకుడి వెనుకనే నాగలోకానికి పోయి సర్పరాజులనందరిని పొగడి, ఆపాతాళలోకంలో తెల్లని నల్లని దారాలతో కూడిన వస్త్రం నేస్తున్న ఇద్దరు స్త్రీలను, పండ్రెండాకులు కల చక్రాన్ని త్రిప్పుతున్న ఆరుగురు బాలురను (యువకులను); మిక్కిలి ఎత్తైన గుర్రాన్ని ఎక్కిన ఒక దివ్యపురుషుడిని చూచి, అతని అనుగ్రహంచేత కర్ణాభరణాలు పొంది, అత డాజ్ఞాపించిన విధంగా ఆ గుర్రం ఎక్కి వచ్చాను. ఇదంతయు ఏమిటి? దీని అంతరార్థం నాకు తెలపండి' అని అడుగగా గురువైన పైలుడు ఈవిధంగా పలికాడు.

సీ. **అప్పురుషుం డింద్రుఁ, డయ్యుక్ష మైరావ । తంబు, గోమయ మమృతంబు, నాగ**
భువనంబులోఁ గన్న పొలఁతు లిద్దఱు ధాత । యును విధాతయు, వారి యనువయించు
సితకృష్ణతంతురాజిత తంత్ర మది యహో । రాత్రంబు, ద్వాదశారములు గలుగు
చక్రంబు మాసాత్మ సంవత్సరంబు, కు । మారు లయ్యార్వురు మహితఋతువు,

ఆ. **లత్తురంగ మగ్ని, యప్పురుషుండు ప । ర్జన్యుఁ డింద్రసఖుఁడు సన్మునీంద్ర ।**
యాది నింద్రుఁ గాంచి యమృతాశి వగుట నీ । కభిమతార్థ సిద్ధి యయ్యెనయ్య! 118

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సత్+ముని+ఇంద్ర= మంచి మునిశ్రేష్ఠుడా! ఉదంకా!; ఆ+పురుషుఁడు= ఎద్దు ఎక్కివచ్చిన పురుషుడు; ఇంద్రుఁడు; ఆ+ఉక్షము= ఆ ఎద్దు; ఐరావతంబు= దేవేంద్రుని వాహన మైన ఏనుగు; గోమయము= పేడ; అమృతంబు; నాగ, భువనంబులోన్= నాగలోకంలో; కన్న= నీవు చూచిన; పొలఁతులు, ఇద్దఱు= స్త్రీలు ఇరువురు; ధాతయును; విధాతయు; వారి, అనువయించు= వారు నేసెడి; సిత, కృష్ణ, రాజిత, తంత్రము+అది= తెల్లని నల్లని దారాలతో ప్రకాశించే ఆ మగ్గం; అహః, రాత్రము= పగలు, రాత్రి; ద్వాదశ+అరములు= పండ్రెండు (12) ఆకులు; కలుగు; చక్రంబు= చక్రం; మాస+ఆత్మ, సంవత్సరంబు= నెలల రూపమైన సంవత్సరం; కుమారులు, ఆ+ఆర్వురు= చక్రాన్ని త్రిప్పుతున్న ఆ ఆర్గురు బాలురు; మహిత, ఋతువులు= గొప్ప వసంతాదు లైన ఋతువులు; ఆ+తురంగము= ఆ గుర్రం; అగ్ని; ఆ+పురుషుండు= ఎత్తైన గుర్రాన్ని ఎక్కి కనబడిన ఆ పురుషుడు; ఇంద్ర, సఖుఁడు= ఇంద్రుడి మిత్రు డైన; పర్జన్యుఁడు= వర్షాధిదేవత; ఆదిన్= మొదట; ఇంద్రున్= ఇంద్రుడిని; కాంచి= చూచి; అమృత+ఆశివి+అగుటన్= అమృతాన్ని తిన్నవాడవగుటచేత; నీకున్; అభిమత+అర్థ, సిద్ధి= కోరబడిన ప్రయోజనం యొక్క ఫలం (నెరవేరటం); అయ్యెన్+అయ్య= కలిగినదయ్యా!

తాత్పర్యం: ఓ మంచిముని శ్రేష్ఠుడా! ఉదంకా! ఎద్దు నెక్కివచ్చిన ఆ పురుషుడు ఇంద్రుడు. అత డెక్కిన ఎద్దు దేవతల ఏను గైన ఐరావతం. పేడ అమృతం. పాములలోకంలో ఉన్న ఇద్దరు స్త్రీలు ధాత, విధాత అనేవారు. వారు నేసే తెల్లని నల్లని దారాల మగ్గం దినరాత్రి రూపం. పండ్రెండాకులు గల చక్రం నెలలరూప మైన సంవత్సరం. దానిని త్రిప్పే ఆర్గురు యువకులు గొప్పఋతువులు (వసంతం, గ్రీష్మం, వర్షం, శరత్తు, హేమంతం, శిశిరం). ఆ గుర్రం అగ్ని. దాని నెక్కిన దివ్యపురుషుడు ఇంద్రుడి మిత్రు డైన పర్జన్యుడు. మొదట ఇంద్రుడిని చూచి అమృతం తిన్నవాడ వగుటచేత నీకు వాంఛితార్థసిద్ధి కలిగింది. నీవు కోరినపని నెరవేరింది. కుండలాలు లభించాయి.

విశేషం: పర్జన్యుడు వర్షాధిదేవత. ఇంద్రుడినే పర్జన్యు డని అంటారు. ఇక్కడ అతడు ఇంద్రమిత్రుడిగా చెప్పబడినాడు. పర్జన్యుడంటే విష్ణువు అనే అర్థం కూడ ఉన్నది. పర్జన్యము= గర్జించే మేఘం, మేఘు డని కూడ చెప్పవచ్చు.

క. **కర మిష్టము సేసితి మా । కరిసూదన! దీన నీకు నగు సత్ఫలముల్;**
గురుకార్యనిరతు లగు స । త్పురుషుల కగు టరుదె? యధికపుణ్యఫలంబుల్. **119**

ప్రతిపదార్థం: అరి, సూదన= శత్రువులను సంహరించేవాడా! ఉదంకా! మాకున్= నాకు, నా భార్యకున్నూ; కరము= మిక్కిలి; ఇష్టము= ప్రియం (కోరబడింది); చేసితి(వి); దీనన్= ఇట్లు చేయటం చేత; నీకున్; సత్+ఫలముల్= మంచిఫలాలు, అగున్= కలుగుతాయి; గురు, కార్య, నిరతులు= గురువుగారి పనియందు ఆసక్తికలవారు; అగు; సత్, పురుషులకున్ యోగ్యు లైన జనులకు; అధిక, పుణ్య, ఫలంబుల్= గొప్ప పుణ్యాల ఫలితాలు; అగుట= కలగటం; అరుదు+ఎ= అపూర్వమా? ఏమీ కాదు.

తాత్పర్యం: శత్రువులను సంహరించువాడా! మాకు మిక్కిలి ప్రియాన్ని (కుండలాలను తెచ్చి ఇవ్వటం) కలిగించావు. ఈవిధంగా చేయటంవలన నీకు మంచిఫలితాలు కలుగుతాయి. గురువుల పనులందు ఆసక్తులయ్యే సజ్జనులకు గొప్పపుణ్యాలు చేసిన ఫలాలు కలగటంలో వింత లేదు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. నన్నయ నానారుచిరార్థ సూక్తినిధి, అతడి సూక్తులలో ఇది ఒకటి. గురుసేవ చేసి, వారిని సంతోషపెట్టటంవలన దేవతలు ప్రసన్నులౌతారని- ఆర్యోక్తి. "అథసేవామనిచ్ఛంతం గురు మర్థేన తోషయేత్! గుర్వర్థే యతమానం తం అనుగృహ్ణంతి దేవతాః" (సేవకు అంగీకరించని గురువును ధనంతో సంతోషపెట్టాలి. గురుదక్షిణకోసం పాటుపడే శిష్యుడిని దేవతలు అనుగ్రహిస్తారు) అనే తాత్పర్యాన్ని ఉదంకోపాఖ్యానం బోధిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. 'నీవలనం బరమ సంప్రీత హృదయుండ నయితి; నీవును గుర్వర్థంబునందు ఋణవిముక్తుండ వయితివి; నిజేచ్ఛనుండు' మనినఁ, దదనుజ్ఞ వడసి యుదంకుం డనేకకాలంబు దపంబు సేసె; నట్టి యుదంకుండు తక్షకు చేసిన యపకారంబునకుం బ్రతీకారంబు సేయం జింతించి యొక్కనాఁడు జనమేజయ మహీపాలుపాలికిం బోయి యి ట్లనియె. 120

ప్రతిపదార్థం: నీవలనన్= నీయెడ; పరమ, ప్రీత, హృదయుండన్, అయితిన్= మిక్కిలి ప్రీతి పొందిన హృదయం కలవాడ నైనాను; నీవును= నీవుకూడ; గురు+అర్థంబు+అందున్= గురువుగారి ప్రయోజనం విషయంలో (గురు కార్యనిర్వహణంలో); ఋణ, విముక్తుండవు= ఋణంవలన విడువబడినవాడవు; అయితివి; నిజ+ఇచ్ఛన్= నీ(తన)కోరికను అనుసరించి; ఉండుము+అనినన్= అని గురువు పలుకగా; తద్+అనుజ్ఞ= గురువుగారి అనుమతి; పడసి= పొంది; ఉదంకుండు; అనేక, కాలంబు= చాలాకాలం; తపంబు, చేసెన్= తపస్సు చేశాడు; అట్టి; ఉదంకుండు; తక్షకు, చేసిన= (కర్తృపద ప్రథమకు షష్ఠి) తక్షకుడు చేసిన; అపకారంబునకున్= కుండలాల అపహరణరూపమైన అపకారానికి; ప్రతీకారంబు= మారుచేత; చేయన్; చింతించి= చేయటానికి ఆలోచించి; ఒక్క, నాఁడు= ఒకరోజున; జనమేజయ, మహీపాలు, పాలికిన్= జనమేజయ మహారాజుచెంతకు; పోయి= వెళ్ళి, ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: నీయెడ నాహృదయం మిక్కిలి ప్రీతి పొందింది. నీవు కూడ గురువుగారి ప్రయోజనం (కార్యం) నెరవేర్చటంలో ఋణవిముక్తుడ వైనావు. ఇంక నీ ఇష్టం వచ్చినట్లు ఉండుము అని గురువు పలుకగా ఉదంకుడు అతని అనుమతి పొంది చాలకాలం తపస్సుచేశాడు. అట్టిఉదంకుడు తక్షకుడు కుండలాలను అపహరించి తనకు చేసిన అపకారానికి మారుచేత చేయటానికి తలంచి, ఒకరోజున జనమేజయమహారాజుచెంతకు వెళ్ళి ఈవిధంగా పలికాడు.

విశేషం: ఉదంకుడు ఎంతటి తపస్సు చేసినా తక్షకుడు తనకు చేసిన అపకారాన్ని మరవలేకపోయాడు. అది అతడి విచిత్రప్రవృత్తి. ఎంతటి మహర్షి అయినా తీవ్రమైన కోపాన్ని అతడు జయించలేకపోయాడు. చిన్నతప్పుకే పెద్దశాపాన్ని ఇచ్చి పౌష్యుడివద్ద తన స్వభావాన్ని బైటపెట్టుకొన్నాడు. దానికి తగిన శాపాన్నికూడ పొందాడు. అయినా అతడి కోపం చావలేదు. అంతటి తీవ్రస్వభావు డని నన్నయ ముందే కథలో ధ్వనింపచేశాడు. అతడి అంతర్గత తీవ్రకోపస్వభావమే భావికథలో సర్పయాగానికి కారణమైనది. దానికి బీజం పౌష్యునివద్ద కనబడుతుంది; ఆరంభం ఇక్కడ ప్రత్యక్షమౌతుంది. కాబట్టి ఇక్కడ కార్యారంభం సూచింపబడింది. (సంపా).

ఉదంకుండు జనమేజయునకు సర్పయాగబుద్ధిఁ గలిగించుట (సం.1-3-177)

చ. మితహితసత్యవాక్య! జనమేజయ! భూజనవంద్య! యేను సు
స్థితి గురుదేవకార్యములు సేయఁగఁబూను టెఱింగి, వంచనో
న్నతమతి యై యకారణమ నా కపకారము సేసెఁ దక్షకుం
డతికుటిలస్వభావుఁడు పరాత్మవిశేషవివేకశూన్యుఁ డై. 121

ప్రతిపదార్థం: మిత, హిత, సత్య, వాక్య= పరిమితాలైనవి, మేలు కలిగించేవి, సత్యంతో కూడినవి అయిన వచనాలు కలవాడా! భూ, జన, వంద్య= భూమియందలి జనులచేత నమస్కరింప దగినవాడా! జనమేజయ= జనమేజయ మహారాజా! ఏను= నేను; సు స్థితిన్= మంచిస్థితితో; గురు, దేవ, కార్యములు= గురువులయొక్కయు, దేవతలయొక్కయు పనులు; చేయఁగన్,

పూనుట= చేయటానికి యత్నించటం; ఎఱింగి= తెలిసికొని; వంచన+ఉన్నత, మతి+ఐ= మోసమునందు అధికమైన బుద్ధి (మోసంతో కూడిన బుద్ధి) కలవాడై; అకారణము+అ= కారణం లేకుండానే; అతి, కుటిల, స్వభావుఁడు= మిక్కిలి వక్రమైన (కపటంతోకూడిన) స్వభావం కలవాడు; అగు; తక్షకుండు; పర+ఆత్మ, విశేష వివేక, శూన్యుఁడు+ఐ= ఇతరులయొక్కయు, తనయొక్కయు అతిశయము (గొప్పతనం) నందలి జ్ఞానం లేనివాడై; అపకారము= హాని; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: పరిమితాలు, హితకరాలు, సత్యయుక్తాలు అయిన మాటలుమాటాడేవాడా! భూమియందలి జనులచేత నమస్కరింప దగినవాడా! జనమేజయమహారాజా! నేను మంచిస్థితిలో గురువుల దేవతల పనులు చేయటానికి యత్నించటం తెలిసికొని మోసంతో కూడిన బుద్ధి కలవా డై మిక్కిలికపటంతో కూడిన స్వభావం కల తక్షకు డనే సర్పరాజు ఇతరులయొక్కయు తనయొక్కయు మహత్త్వం తెలిసికొనే (ఇతరులకూ, తనకూ కల భేదం తెలిసికొనే) జ్ఞానం లేనివాడై కారణం లేకుండానే నాకు హాని చేశాడు.

విశేషం: మితహిత సత్యవాక్యాలు నన్నయకు ప్రియమైనవి. అతని రచనలో కూడా మితహితసత్యవాక్యత్వం కనిపిస్తుంది.

వ. అదియునుం గాక. 122

తాత్పర్యం: అదికాక; మరియు.

విశేషం: అదియున్+కాక= ఇక్కడ ద్రుతంమీద మరొక ద్రుతం వాడబడింది. అదియునున్ కాక. తరువాత ద్రుతకార్యం.

చ. అనవరతార్థ దాన యజనాభిరతున్, భరతాన్వయాభివ
ర్ధను, సకల ప్రజాహిత విధాను, ధనంజయ సన్నిభున్, భవ
జ్జనకుఁ బరీక్షితున్ భుజగజాల్ముఁ డసహ్య విషోగ్రధూమకే
తనహతిఁ జేసి చేసె నతిదాంతుఁ గృతాంతనికేతనాతిథిన్. 123

ప్రతిపదార్థం: అనవరత+అర్థ, దాన, యజన+అభిరతున్= ఎల్లప్పుడూ ధనాన్ని దానం చేయటంలోను, యజ్ఞాలు చేయటంలోను ఆసక్తి కలవాడిని; భరత+అన్వయ+అభివర్ధనున్= భరతునియొక్క వంశాన్ని వృద్ధిపొందించేవాడిని; సకల, ప్రజా, హిత, విధానున్= ఎల్ల ప్రజలకున్నూ మేలు కలిగించే విధానం కలవాడిని; ధనంజయ, సన్నిభున్= అర్జునుడితో (అగ్నితో) సమానుడిని; అతి, దాంతున్= మిక్కిలిదమం (అంతరింద్రియ నిగ్రహం) కలవాడిని; భవత్+జనకున్= నీతండ్రి అయిన; పరీక్షితున్= పరీక్షిన్మహారాజును; భుజగ, జాల్ముఁడు= క్రూరు డైన తక్షకు డనే పాము; అసహ్య, విష+ఉగ్ర; ధూమకేతన, హతిన్, చేసి= సహింప శక్యం కాని విషం నుండి పుట్టేభయంకర మైన అగ్నియొక్క దెబ్బచేత; కృతాంత, నికేతన+అతిథిన్= యమునియొక్క గృహానికి అతిథినిగా; అనగా మరణించిన వాడినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ఎల్లప్పుడూ ధనాన్ని దానం చేయటంలోను, యజ్ఞాలు చేయటంలోనూ ఆసక్తి కలవాడున్నూ, భరత వంశాన్ని అభివృద్ధి పొందించేవాడున్నూ, ప్రజలందరికినీ మేలు చేసేవాడున్నూ, అర్జునుడితో సమానుడున్నూ, నీజనకుడున్నూ, మిక్కిలి అంతరింద్రియనిగ్రహం కలవాడున్నూ అయిన పరీక్షిన్మహారాజును క్రూరు డైన తక్షకుడు (సర్పరాజు) సహింపశక్యం కాని విష మనే భయంకర మైన అగ్నియొక్క దెబ్బచేత యమునిగృహానికి అతిథిగా (అంటే మరణించిన వాడిగా) చేశాడు.

విశేషం: ఇందులో అర్జునుడి మనుమ డైన పరీక్షిత్తు గుణాలు వర్ణింపబడ్డాయి. తాతగుణాలు మనుమడికి రావటం సహజం. అందువలన అతడు ధనంజయ సన్నిభుడు. చివరిపాదంలోని 'చేసి' అనేది తృతీయావిభక్తి ప్రత్యయం. 'చేసెన్' అనేది చేయుధాతువు యొక్క భూతకాల ప్రథమైకవచన రూపం.

ఉ. కాదన కిట్టిపాటి యపకారముఁ దక్షకుఁ డేకవిప్రసం
బోధనఁ జేసి చేసె నృపపుంగవ! నీవు ననేకభూసురా
పాదిత సర్పయాగమున భస్మము సేయుము తక్షకాదికా
కోదరసంహతిన్ హుతవహోగ్ర సమగ్ర శిఖాచయంబులన్. 124

ప్రతిపదార్థం: నృప, పుంగవ= రాజశ్రేష్ఠుడా!; కాదు+అనక= చేయరాదు అనకుండ; ఇట్టి, పాటి= ఇంత పరిమాణం గల (అధికమైన); అపకారము= హాని; తక్షకుండు= తక్షకు డనే సర్పరాజు; ఏక, విప్ర, సంబోధనన్, చేసి= శృంగి అనే ఒక బ్రాహ్మణుడి ప్రేరణచేత; చేసెన్= చేశాడు; నీవున్= నీవుకూడ; అనేక, భూసుర+ఆపాదిత, సర్ప, యాగమునన్= పలువురు బ్రాహ్మణులచేత చేయబడిన పాములను ఆహుతిచేసే యజ్ఞంలో; తక్షక+అది, కాకోదర, సంహతిన్= తక్షకుడు మొదలైన పాముల సముదాయాన్ని; హుతవహ+ఉగ్ర, సమగ్ర, శిఖా, చయంబులన్= అగ్నియొక్క భయంకరమైన సమస్తమైన (బాగా మండుతున్న) జ్వాలలసముదాయంచేత; భస్మము+చేయుము= బూడిద చేయుము.

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడా! ఇది చేయరా దని నిరాకరించకుండా, శమీకుడిపుత్రు డైన శృంగి అనే ఒక బ్రాహ్మణుడి ప్రేరణచేత (పిలుపు చేత) తక్షకుడు ఇంతపెద్దకీడు చేశాడు. (నీ తండ్రిని కాటేసి చంపాడు). దానికి ప్రతీకారంగా నీవుకూడా పలువురు బ్రాహ్మణులచేత నిర్వహింపబడే సర్పయాగంలో అగ్నియొక్క భయంకర మైన సమస్త జ్వాలల సముదాయంచేత తక్షకుడు మొదలైన పాములసమూహాన్ని బూడిద చేయుము.

ఉ. ప్రల్లదుఁ డైన యొక్కకులపాంసను చేసినదానఁ దత్కులం
బెల్లను దూషితం బగుట యేమి యపూర్వము? గావునన్ మహీ
వల్లభ! తక్షకాధము నెపంబున సర్పము లెల్ల నగ్నిలోఁ
ద్రెళ్ళఁగ సర్పయాగ మతిధీయుత! చేయుము విప్రసమ్మతిన్. 125

ప్రతిపదార్థం: మహీ, వల్లభ= రాజా!; అతి, ధీ, యుత= అధిక మైన బుద్ధితో కూడినవాడా!; ప్రల్లదుఁడు+ఐన= దుష్టు డైన; ఒక్క కుల, పాంసను= కులాన్ని దూషించేవా డైన (కులానికి అపకీర్తి తెచ్చేవా డైన); తక్షకుని (కర్తృపద ప్రథమకు షష్ఠి); చేసిన దానన్= చేసిన పనిచేత; తద్+కులంబు+ఎల్లను= ఆ కులమంతయున్నూ; దూషితంబు+అగుట= నిందింపబడటం; ఏమి+అపూర్వము= ఏమంత ఆశ్చర్యం? (కాదని భావం); కావునన్= అందుచేత; తక్షక+అధమ= హీను డైన తక్షకుని; నెపంబునన్= మిషచే (కారణంచేత), సర్పములు+ఎల్లన్= పాములన్నియునూ; అగ్నిలోన్= అగ్నియందు; త్రెళ్ళఁగన్= పడేటట్లుగా; విప్ర, సమ్మతిన్= బ్రాహ్మణుల అంగీకారంతో; సర్పయాగము= పాములను ఆహుతి చేసే యజ్ఞాన్ని; చేయుము.

తాత్పర్యం: మిక్కిలి బుద్ధిమంతుడ వైన ఓ రాజా! దుష్టు డైన ఒక కులదూషకుడు చేసిన చెడ్డపనిచేత ఆ కులమంతా నిందింపబడటం (హింసింపబడటం) ఏమంత వింత? కాబట్టి నీచు డైన ఆ తక్షకుడు కారణంగా పాములన్నీ అగ్నిలో పడి హతమయ్యేటట్లుగా బ్రాహ్మణుల అంగీకారంతో సర్పయాగం చేయుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: కులంలో దుష్టుడు ఒక్క డుంటే చాలు. అతడివలన ఆ కులమంతా హాని పొందుతుంది- అనే వాక్యం గమనిస్తే దుష్టుడైన ఒక దుర్యోధనుడు కారణంగా కౌరవవంశ మంతా పలువురురాజులతో సహా మరణిస్తా రని కావ్యార్థం సూచింపబడుతున్నది. ఇది నన్నయ ప్రతిభాసంపదకు, అతని కవితలోని వస్తుధ్వనికి నిదర్శనం.

వ. అని యి ట్లయ్యుదంకుండు జనమేజయునకు సర్పయాగంబునందు బుద్ధి పుట్టించె ననిన విని శౌనకాది మహామును లక్కథకున కి ట్లనిరి. 126

ప్రతిపదార్థం: అని=అని పలికి; ఇట్లు= ఈవిధంగా; ఆ+ఉదంకుండు= ఉదంకు డనే పైలశిష్యుడు; జనమేజయునకున్= పరీక్షిత్తు కుమారుడైన జనమేజయుడికి; సర్ప, యాగంబునందున్= సర్పయాగం చేయటంలో; బుద్ధి= తలంపు; పుట్టించెన్= కలిగించాడు; అనినన్= అని సౌతి చెప్పగా; విని; శౌనక+ఆది, మహత్, మునులు= శౌనకుడు మొదలైన మహర్షులు; ఆ+కథకునికిన్= కథ చెప్పే సౌతికి; ఇట్లు= ఈవిధంగా; అనిరి= అన్నారు.

తాత్పర్యం: అని బోధించి ఈవిధంగా ఆ ఉదంకు డనే ముని జనమేజయమహారాజుకు సర్పయాగం చేయాలనే తలంపు కలిగించా డని సౌతి చెప్పగా విని, శౌనకుడు మొదలైన మహర్షులు అతనితో ఈవిధంగా అన్నారు.

చ. అమితజగద్భయంకరవిషాగ్నియు నప్రతిహన్యమాన వీ
ర్యముఁ గలయట్టి సర్పముల కా జనమేజయు చేయు సర్పయా
గమున నుదగ్రపావకశిఖాతతులం దొరఁగంగఁ గారణం
బమలచరిత్ర! యేమి చెపుమయ్య వినం గడు వేడ్క యయ్యెడున్. 127

ప్రతిపదార్థం: అమల చరిత్ర= నిర్మల మైన ప్రవర్తనం కలవాడా! సౌతీ!; అమిత, జగత్, భయంకర, విష+అగ్నియున్= అధికంగా లోకాలకు భయం కలిగించే విష మనే అగ్నియు; అప్రతిహన్యమాన, వీర్యమున్= అడ్డగింపబడని పరాక్రమాన్ని; కల+అట్టి= కలిగినటువంటి; సర్పాలకు; ఆ, జనమేజయు, చేయు= ప్రసిద్ధ డైన జనమేజయ మహారాజు చేసే; సర్పయాగమునన్= పాములను వ్రేల్చే యజ్ఞంలో, ఉదగ్ర, పావక, శిఖా, తతులన్= భయంకరమైన అగ్నియొక్క జ్వాలల సమూహంలో; తొరుఁ గంగన్= పడటానికి; కారణము+ఏమి= హేతు వేమిటి?; చెప్పుము+అయ్య= చెప్పవయ్యా (ప్రార్థనార్థకం); వినన్= వినటానికి; కడున్= మిక్కిలి; వేడ్క= కుతూహలం; అయ్యెడున్= ఔతున్నది.

తాత్పర్యం: నిర్మల మైన చరిత్ర గల ఓసౌతీ! లోకాలకు అధికంగా భయాన్ని కలిగించే విష మనే అగ్నియు, అడ్డగించటానికి వీలులేని పరాక్రమమూ కల పాములకు జనమేజయమహారాజు చేసే సర్పయాగంలో భయంకర మైన అగ్నిజ్వాలలసమూహాన పడటానికి హేతు వేమిటో తెల్పుమా! వినటానికి చాల కుతూహలం ఔతున్నది.

భృగువంశ కీర్తనము - భృగు వగ్నికి శాప మొసంగుట (సం. 1-5-3)

వ. అని యడిగిన వారికి నక్కథకుం డి ట్లని చెప్పెఁ ‘దొల్లి సర్పకుల జనని యైన కద్రువ శాపంబు కారణంబునం జేసి జనమేజయు సర్పయాగంబున సర్వభక్షకుం డైన యగ్నియందు సర్పంబుల కెల్ల నకాండప్రళయం బైన, దాని భృగువంశజుండైన రురుండు గావించు సర్పఘాతంబు సహస్రపాదుండుడిగించినట్లు జరత్కారుసుతుం

డైన యాస్తీకుండుడిగించె; దీని సవిస్తరంబుగాఁ జెప్పెదవినుం' డని భృగువంశకీర్తనంబు నాస్తీకు చరితంబును జెప్పం దొడంగె. **128**

ప్రతిపదార్థం: అని, అడిగినన్; వారికిన్= శౌనకాది మునులకు; ఆ+కథకుండు= కథ చెప్పే సౌతి; ఇట్లు+అని= ఈవిధంగా; చెప్పెన్; తొల్లి= పూర్వం; సర్ప, కుల, జనని, ఐన= పాముల సమూహానికి తల్లి అయిన; కద్రువ= కద్రువ అనే కశ్యపునిభార్య యొక్క; శాపంబు= శాప మనే; కారణంబునన్+చేసి= హేతువుచేత; జనమేజయు, సర్ప, యాగంబునన్= జనమేజయుడు చేసే సర్పయాగంలో; సర్వ, భక్షకుండు+ఐన= అన్నిటిని తినేవా డైన; అగ్ని+అందున్= అగ్నిలో; సర్పంబులకున్+ఎల్లన్= పాముల కన్నిటికిని; అకాండ, ప్రళయంబు+ఐనన్= అకస్మాత్తుగా (తలవని తలంపుగా) నాశనం కాగా; దానిన్= ఆ ప్రళయాన్ని; భృగు, వంశజుండు+ఐన= భృగుమహాముని వంశంలో పుట్టినవా డైన; రురుండు= రురుడు అనేవాడు; కావించు= చేసే, సర్ప, ఘాతంబు= పాములను చంపేక్రియను; సహస్రపాదుండు= సహస్రపాదుడు అనే ముని; ఉడిగించిన, అట్లు= మాన్పించినట్లుగా; జరత్కారు, సుతుండు+ఐన= జరత్కారు దంపతుల కుమారు డైన; ఆస్తీకుండు= ఆస్తీకుడు అనే వాసుకి మేనల్లుడు; ఉడిగించెన్= మాన్పించెను; దీనిన్= ఈవృత్తాంతాన్ని; స, విస్తరంబుగాన్= వివరాలతో కూడుకొని ఉండేటట్లుగా; చెప్పెదన్; వినుండు+అని; భృగువంశ, కీర్తనంబున్= భృగుమహర్షి వంశంయొక్క స్తుతియున్నూ; ఆస్తీకు, చరితంబును= ఆస్తీకుని వృత్తాంతమున్నూ; చెప్పన్, తొడంగెన్= చెప్పటానికి ఆరంభించాడు.

తాత్పర్యం: అని శౌనకాదిమునులు అడుగగా కథకు డైన సౌతి ఈవిధంగా చెప్పాడు. పూర్వం పాముల సమూహానికి తల్లి అయిన కద్రువ ఇచ్చిన శాపం కారణంగా జనమేజయుడు చేసిన సర్పయాగంలో సర్వభక్షకు డైన అగ్నియందు పాముల కన్నింటికిని ఆకస్మిక మైన నాశం కలుగగా, ఆ నాశంనుండి భృగువంశసంజాతు డైన రురుడు చేసే సర్పమారణాన్ని సహస్రపాదు డనే ముని మాన్పించినట్లుగా జరత్కారు దంపతుల కుమారు డైన ఆస్తీకు డనేముని మాన్పించాడు. ఈ వృత్తాంతాన్ని విపులంగా చెప్పుతాను. వినండి. అని భృగుమహామునివంశంయొక్క కీర్తనాన్నీ, ఆస్తీకునికథనూ చెప్పటం ఆరంభించాడు.

సీ. **భృగుఁ డను విప్రుండు మగువఁ బులోమ యన్ । దాని గర్భిణిఁ దన ధర్మపత్ని**
నగ్నిహోత్రమునకు నగ్నులు విహరింపు । మని పంచి యభిషేచనార్థ మరుగ,
నంతఁ బులోముఁ డన్ వింతరక్కసుఁ డగ్ని । హోత్రగృహంబున కొయ్య వచ్చి,
యత్తన్విఁ జూచి, యున్మత్తుఁడై 'యెవ్వరి । సతి యిది సెప్పుమా జాతవేద!'

ఆ. **యనఁగ, నగ్నిదేవుఁ డనృతంబునకు విప్ర । శాపమునకు వెఱచి'శాపభయము**
దీర్చుకొనఁగఁ బోలుఁ, దీర్పరా దనృతాబ్ధి । భాషణమున నైన పాపభయము.' **129**

ప్రతిపదార్థం: భృగుఁడు+అను; విప్రుండు= బ్రాహ్మణుడు; పులోమ, అన్, దానిన్= పులోమ అనే పేరు కలదానిని; మగువన్= (స్త్రీని) భార్యను; గర్భిణిన్= గర్భవతిని; తన; ధర్మ, పత్నిన్= వేదోక్తధర్మాన్ని అనుసరించి పెండ్లాడిన భార్యను; అగ్నిహోత్రమునకున్= అగ్నికార్యానికి; అగ్నులు; ఆహవనీయం, దక్షిణాగ్ని గార్హపత్యం అనే త్రేతాగ్నులను, విహరింపుము+అని= ప్రజ్వలింపచేయుము అని; పంచి= ఆజ్ఞాపించి; అభిషేచన+అర్థము= స్నానం చేసే నిమిత్తం; అరుగన్= వెళ్ళగా; అంతన్= అప్పుడు; పులోముఁడు+అన్= పులోముడు అనే పేరు కల; వింత, రక్కసుఁడు= అరుదైన రాక్షసుడు (అతడు వరాహరూపంలో రావటంచేత వింత పదం వాడబడింది); అగ్నిహోత్ర, గృహంబునకున్= అగ్నులను ఉపాసించే గృహభాగానికి; ఒయ్యన్= మెల్లగా; వచ్చి; ఆ+తన్విన్= పులోమ అనే ఆ స్త్రీని; చూచి; ఉన్మత్తుండు+ఐ= మోహించిన వాడై; జాతవేద= ఓ అగ్నీ!; ఇది=

ఈమె; ఎవ్వరి, సతి= ఎవరి భార్య?; చెప్పుమా= తెల్పుమా; అనఁగన్= అని అడుగగా; అగ్ని దేవుఁడు= దేవుడైన అగ్ని; అనృతంబునకున్= అసత్యానికిన్నీ; విప్రశాపంబునకున్= బ్రాహ్మణు డైన భృగువు పెట్టే శాపానికిన్నీ; వెఱచి= భయపడి; శాప, భయము= శాపంవలని భయాన్ని (హానిని); తీర్చుకొనఁగన్+పోలున్= తొలగించుకోవచ్చును; అనృత+అభిభాషణమునన్= అసత్యం పల్కుటంచేత; ఐన= కలిగిన; పాప, భయంబు= పాపంవలనిభయం; తీర్పన్, రాదు= తొలగింపరాదు.

తాత్పర్యం: భృగు వనే బ్రాహ్మణుడు గర్భవతియు, తన ధర్మపత్నియు అయిన పులోమ అనే సతిని అగ్నికార్యానికి అగ్నులను ప్రజ్వలింపజేయు మని నియోగించి స్నానం చేయటానికై వెళ్ళగా, అపుడు పులోముడు అనే పేరుగల వింతరాక్షసుడు అగ్నిగృహానికి మెల్లగా వచ్చి ఆ వనితను చూచి మోహితు డై 'ఓ అగ్నీ! ఈమె ఎవ్వరి భార్యయో చెప్పు' మని అడుగగా, అగ్నిదేవుడు అటు అసత్యం చెప్పటానికీ, ఇటు భృగు విచ్చే శాపానికీ భయపడి, 'శాపం వలన కలిగే హాని తొలగించుకోవచ్చును; అసత్య మాడటంవలన కలిగే పాపాన్ని తొలగింపరాదు'.

విశేషం: ఇందులో అసత్యభాషణంవలన కలిగే పాపం ఎంత అధికమైనదో సూచింపబడింది. ఇది నన్నయ సత్యనిష్ఠకు నిదర్శనం' అందుచేతనే అతడు 'నిత్యసత్యవచను' డనటం.

వ. అని విచారించి యప్పరమపతివ్రత భృగుపత్ని యని కలరూపుఁ జెప్పిన, నప్పులోముండు 'నిది నాకుఁ దొల్లి వరియింపంబడిన భార్య, పదంపడి భృగుండుపెండ్లియయ్యె' నని వరాహరూపంబున నాసాధ్వినతిసాధ్వసచిత్త నెత్తికొని పర్వం బర్వం, దద్గర్భంబున నున్న యర్భకుండు గరం బలిగి కుక్షిచ్యుతుం డై చ్యవనుండు నాఁ బరఁగె నమ్మునికుమారుని. 130

ప్రతిపదార్థం: అని; విచారించి= ఆలోచించి; ఆ+పరమ, పతివ్రత= ఆ గొప్ప పతివ్రత (భర్తయే వ్రతంగా కలది); భృగుపత్ని= భృగుమహర్షి యొక్క భార్య; అని; కల, రూపున్= ఉన్న విధం (యథార్థం) చెప్పినన్= తెల్పగా; ఆ+పులోముండున్= ఆ పులోము డనే రాక్షసుడున్నూ; ఇది= ఈమె; నాకున్= నాకొరకు; వరియింపబడిన= కోరబడిన (ఎన్నబడిన); భార్య; పదంపడి= పిమ్మట; భృగుండు= భృగుమహాముని; పెండ్లి, అయ్యెన్= వివాహ మాడినాడు; అని= అని తలచి; వరాహ, రూపంబునన్= పంది రూపంలో; ఆ, సాధ్విన్= ఆ పతివ్రతను; అతి, సాధ్వస, చిత్తన్= మిక్కిలి భయంతో కూడిన హృదయం కలదానిని; ఎత్తికొని= చేత గ్రహించి; పర్వన్, పర్వన్= వేగంగా చాలదూరం పరుగెత్తగా; పరుగెత్తగా (పఱచు ధాతువు యొక్క తుమున్నర్థక రూపం. పర్చు - పర్వన్); తద్+గర్భంబునన్= ఆమె గర్భంలో; ఉన్న; అర్భకుండు= శిశువు; కరంబు= మిక్కిలి; అలిగి= కోపించి; కుక్షి, చ్యుతుండు+ఐ= గర్భంనుండి జారినవాడై; చ్యవనుండు, నాన్= చ్యవనుడు (జారినవాడు) అనగా; పరఁగెన్= ఒప్పెను; ఆ+ముని, కుమారునిన్= ఆ భృగుమునియొక్క కొడుకును.

తాత్పర్యం: అని ఆలోచించి ఆ మహాపతివ్రత భృగుమహర్షిభార్య అని యథార్థం చెప్పగా ఆ పులోముడు 'ఈమె పూర్వం నాకై ఎన్నబడిన భార్య. తరువాత ఈమెను భృగుమహర్షి పెండ్లాడాడు' అని తలంచి పందిరూపంతో మిక్కిలి భయంతో కూడిన హృదయం గల ఆ పతివ్రతను గ్రహించి చాలాదూరం పరుగెత్తగా ఆమె గర్భంలో ఉన్న శిశువు మిక్కిలి కోపించి గర్భంనుండి జారి చ్యవను డనే పేరుతో ఒప్పారాడు. ఆ మునికొడుకును.

విశేషం: కుక్షిచ్యుతుడు కావటంచేత అతడికి చ్యవను డనే పేరు కలిగింది. పర్వన్ పర్వన్ అనే ద్విరుక్తి వలన చాల దూరం, కాలం సూచింపబడుతున్నవి!

చ్యవనునివలనఁ బులోముఁడను రాక్షసుండు చచ్చుట

క. సమదిత సూర్య సహస్రో। పమ దుస్సహతేజు జగదుపప్లవ సమయా
సమదీప్తి తీవ్ర పావక। సముఁ జూచుచు నసుర భస్మసాత్కృతుఁ డయ్యెన్. 131

ప్రతిపదార్థం: సముదిత, సూర్య, సహస్ర, ఉపమ, దుస్సహ, తేజున్= ఉదయించిన సూర్యుల వేయిమందితో సమానమైన సహింపశక్యం కాని కాంతి గలవాడిని; జగత్, ఉపప్లవ, సమయ, అసమ, దీప్తి, తీవ్ర, పావక, సమున్= లోకాలయొక్క ప్రళయకాలంలోని అప్రతిమాన మైన (సాటిలేని) కాంతి కల తీక్ష్ణ మైన అగ్నితో సమాన మైనవాడిని (మునికుమారుడిని); చూచుచున్; అసుర= రాక్షసుడు (పులోముడు); భస్మసాత్కృతుఁడు= బూడిదగా చేయబడినవాడు; అయ్యెన్= అయినాడు.

తాత్పర్యం: ఉదయించిన వేయిమంది సూర్యులతో సమాన మైన సహింపశక్యం గాని తేజస్సు కలవాడున్నూ, ప్రపంచానికి ప్రళయం కలిగే సమయంలో సాటిలేని కాంతిగల తీక్ష్ణ మైన అగ్నితో సమానమైన వాడున్నూ అయిన మునికుమారుడిని (చ్యవనుడిని) చూస్తూ పులోముడు దగ్ధ మై బూడిద అయినాడు.

విశేషం: ప్రళయాలు పలురకాలు. అగ్నిప్రళయంలో తీవ్రతేజస్సు గల అగ్నిచేత జగత్తంతా దగ్ధ మై బూడిద ఔతుంది. అసుర శబ్దం వైకల్పికంగా స్త్రీసమం. అసుర, అసురుడు, సంస్కృతసమాసంలో కాదు. రావణాసురుడు అలం: ఉపమ.

వ. పులోమయు నక్కొడుకు భృగుకులవర్ధను నెత్తికొని నిజాశ్రమంబునకు వచ్చె; నంతకు ముందఱ నా రక్కసునకు వెఱచి యక్కోమలి యేడ్చుచుం బోయినఁ దద్బాష్పధారాప్రవాహంబు మహానది యై తదాశ్రమసమీపంబునం బాఱిన దానికి వధూసర యను నామంబు లోకపితామహుండు సేసె; నంతఁ గృతస్నానుం డై భృగుండు సనుదెంచి బాలార్కుండునుంబోని బాలకు నెత్తికొనియున్న నిజపత్నిం జూచి యసుర సేసిన యపకారంబున కలిగి, 'యయ్యసుర ని న్నె ట్లెఱింగెఁ? నెవ్వరు సెప్పి' రనినఁ బులోమ యి ట్లనియె. 132

ప్రతిపదార్థం: పులోమయున్= ఆ పులోమకూడ; భృగు, కుల, వర్ధనున్= భృగుమహామునియొక్క వంశాన్ని వృద్ధి పొందించే; ఆ+కొడుకున్= ఆ కుమారుడిని; ఎత్తికొని; నిజ+ఆశ్రమంబునకున్= తన ఆశ్రమానికి; వచ్చెన్; ఆవచ్చుటకు, ముందఱన్= ఆ రావటానికి ముందే; ఆ రక్కసునకున్= పులోము డనే ఆ రాక్షసునికి, వెఱచి= భయపడి; ఆ+కోమలి= ఆ కాంత (పులోమ); ఏడ్చుచున్, పోయినన్= ఏడుస్తూ పోగా; తద్, బాష్ప, ధారా, ప్రవాహంబు= ఆమె కన్నీటి ధారలయొక్క ప్రవాహం; మహత్, నది, ఐ= గొప్పనది యై; తద్, ఆశ్రమ, సమీపంబునన్= ఆ ఆశ్రమం చెంత; పాఱినన్= ప్రవహింపగా; దానికిన్= ఆ నదికి; లోక, పితామహుండు= లోకానికి తాత అయిన బ్రహ్మ; వధూసర, అను, నామంబు= వధూసర అనే పేరు; చేసెన్= పెట్టాడు; అంతన్= పిమ్మట; కృత, స్నానుండు+ఐ= చేయబడిన స్నానం కలవాడై (స్నానం చేసిన వాడై); భృగుండు= భృగుమహర్షి; చనుదెంచి= వచ్చి; బాల+అర్కుండునున్+పోని= లేతసూర్యుడిని పోలిన; బాలకున్= కుమారుడిని; ఎత్తికొని, ఉన్న; నిజపత్నిన్= తన భార్యను; చూచి; అసుర+చేసిన= రాక్షసుడు చేసిన; అపకారంబునకున్= కీడునకు; అలిగి= కోపించి; ఆ+అసుర= ఆ రాక్షసుడు; నిన్నున్, ఎట్లు+ఎఱింగెన్= నిన్ను ఏ విధంగా తెలిసికొన్నాడు?; ఎవ్వరు, చెప్పిరి; అనినన్; పులోమ; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: భృగుమహర్షివంశాన్ని పెంపొందించే ఆ కుమారుడిని ఎత్తుకొని పులోమ తన ఆశ్రమానికి వచ్చింది. ఆమె రావటానికి పూర్వమే ఆ రాక్షసుడికి భయపడి ఆ పులోమ ఏడుస్తూ పోగా ఆమెకన్నులనుండి కారిన కన్నీళ్ళ

ధారలయొక్క ప్రవాహం గొప్పనది యై ఆ ఆశ్రమంచెంత ప్రవహింపగా, ఆనదికి లోకానికే తాత అయిన బ్రహ్మదేవుడు వధూసర అనే పేరు పెట్టాడు. పిమ్మట స్నానం చేసి భృగుమహర్షివచ్చి లేత సూర్యుడి వంటి కుమారుడిని ఎత్తుకొని ఉన్న తనభార్యను చూచి, రాక్షసుడు చేసిన హానికి కోపించి, 'ఆ రాక్షసుడు నిన్ను ఎట్లా తెలిసికొన్నాడు?' 'నీజాడ ఎవ్వరు చెప్పారు?' అని అడుగగా పులోమ ఇట్లా పలికింది

విశేషం: అలం: ఉపమ. వధూసర అంటే వధువును (స్త్రీని) అనుసరించేది అని అర్థం.

క. ఈ యగ్నిదేవుఁ డసురకు । నో యన చెప్పుటయు విని మహోగ్రాకృతితో
నాయసుర నన్ను సూకర । మై యప్పుడ యెత్తుకొని రయంబునఁ జనుచోన్. 133

ప్రతిపదార్థం: ఈ+అగ్నిదేవుఁడు= దేవు డైన ఈ అగ్ని; అసురకున్= రాక్షసునికి; ఓ, యనన్ - ఒయ్యనన్= మెల్లగా; చెప్పుటయున్= నన్నుగూర్చి తెలుపగా; విని; మహత్, ఉగ్ర+ఆకృతితోన్= గొప్ప భయంకర మైన ఆకారంతో; ఆ+అసుర= ఆ రాక్షసుడు; నన్నున్; సూకరము+ఐ= పంది యై; అప్పుడు+అ= వెంటనే; ఎత్తికొని= గ్రహించి; రయంబునన్= వేగంతో; చనుచోన్= వెళ్ళేటప్పుడు.

తాత్పర్యం: ఈ అగ్నిదేవుడు పులోమరాక్షసుడికి మెల్లగా నన్నుగూర్చి చెప్పగా విని, చాల భయంకర మైన ఆకారంతో ఆ రాక్షసుడు పంది యై నన్ను వెంటనే ఎత్తికొని వేగంతో వెళ్ళే ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'కుక్షిచ్యుతుఁడై సుతుఁ డా । రాక్షసు భస్మంబు సేసి రాజితశక్తిన్
రక్షించె నన్ను' ననవుడు । నక్షణమ మునీంద్రుఁ డగ్ని కతిరోషమునన్. 134

ప్రతిపదార్థం: సుతుఁడు= పుట్టిన కుమారుడు; కుక్షి, చ్యుతుఁడు+ఐ= గర్భంనుండి జారినవాడై; రాక్షసునిన్= రాక్షసు డైన పులోముడిని; భస్మంబు, చేసి= బూడిద చేసి; రాజిత, శక్తిన్= ప్రకాశించే శక్తితో; నన్నున్; రక్షించెన్= కాపాడెను; అనవుడున్= అనిన తరువాత; ఆ, క్షణము+అ= తత్ క్షణమే, వెంటనే; ముని+ఇంద్రుఁడు = ముని శ్రేష్ఠు డైన భృగువు; అగ్నికిన్; అతి, రోషమునన్= మిక్కిలి కోపంతో.

తాత్పర్యం: 'గర్భంలోని కుమారుడు గర్భంలోనుండి జారి ఆ రాక్షసుడిని బూడిద చేసి ప్రకాశించే మహిమతో నన్ను కాపాడాడు, అనిన అనంతరం మునిశ్రేష్ఠు డైన భృగువు వెంటనే అగ్నికి అతికోపంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఆ క్షణము అని పాఠాంతరం. త్రికముమీది అసంయుక్త హల్లునకు ద్విత్వం వస్తుంది. క్ష- అసంయుక్తం కాదు. అప్పుడు 'ఆ' హ్రస్వం కాదు, కాని క్షణమైనా వ్యవధానం లేకుండా అని అర్థం చెప్పవచ్చును.

వ. 'నీ వతిక్రూరుండవు సర్వభక్షకుండవు గ' మ్మని శాపం బిచ్చిన నగ్నిదేవుం డి ట్లనియె. 135

ప్రతిపదార్థం: నీవు; అతి, క్రూరుండవు= మిక్కిలి దుష్టుడవు; సర్వ, భక్షకుండవు= అన్నింటిని తినేవాడవు; కమ్ము= అగుము; అని; శాపంబు+ఇచ్చినన్= శపించగా; అగ్నిదేవుండు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నీవు మిక్కిలి దుష్టుడవు, అన్నిటిని తినువాడవు కమ్ము' అని భృగువు శపించగా అగ్నిదేవుడు ఈవిధంగా అన్నాడు.

క. తన యెఱిఁగిన యర్థం బొరుఁ । డనఘా! యిది యెట్లు సెప్పు మని యడిగినఁ జె
ప్పనివాఁడును సత్యము సె । ప్పనివాఁడును ఘోరనరకపంకమునఁ బడున్. 136

ప్రతిపదార్థం: ఒరుఁడు= ఇతరుడు; తన, ఎఱిఁగిన, అర్థంబు= తాను తెలిసికొనిన విషయాన్ని; అనఘా!= ఓ పాపరహితుడా!; ఇది, ఎట్లు, చెప్పుము= ఇది ఏవిధంగా జరిగిందో తెలుపుము; అని అడిగినన్= అని అడుగగా; చెప్పనివాఁడును= తెలుపని అతడును; సత్యము= నిజం; చెప్పనివాడును= తెలుపని అతడును; ఘోర, నరక, పంకమునన్= భయంకరమైన నరక మనే బురదలో; పడున్= పడతాడు.

తాత్పర్యం: తనకు తెలిసిన విషయాన్ని ఇతరు డెవరైనా 'ఓ పుణ్యాత్ముడా! ఇది ఎట్లా జరిగిందో తెలుపు' మని అడిగితే చెప్పటానికి నిరాకరించే వాడున్నూ, నిజం చెప్పక అబద్ధం చెప్పేవాడున్నూ భయకంర మైన నరక మనే బురదలో పడతారు. (ఇక్కడ బురదవంటి నరకంలో పడతా రని కూడ చెప్పవచ్చును. అప్పు డది ఉపమాన ఉత్తర పద కర్మధారయం).

విశేషం: ఇక్కడ కర్తృపదంలో రెండు శబ్దా లున్నప్పటికి వారు వేరే వ్యక్తులు కావటం చేత క్రియాపదం ఏకవచనంలోనే వాడబడింది. చెప్పనినాఁడును, అని పాఠాంతరం, చెప్పనప్పుడును అని అర్థం. అలం: రూపకం.

వ. కావున నే నసత్యంబునకు వెఱచి యక్కోమలి భృగుపత్ని యని కల రూపుఁ జెప్పితి; నఖిల జగత్కర్మసాక్షినై యుండి యసత్యం బెట్లు పలుక నేర్తు? నది నిమిత్తంబుగా నీవు నాకు శాపం బిచ్చిన, నే నలిగి నీకుఁ బ్రతిశాపం బీనోపనివాఁడను గాను; వినుము. 137

ప్రతిపదార్థం: కావునన్; ఏను= నేను; అసత్యంబునకున్= అబద్ధం పల్కటానికి; వెఱచి= భయపడి; ఆ+కోమలి= ఆస్త్రీ; భృగుపత్ని= భృగుమహర్షియొక్క భార్య; అని; కల, రూపున్= ఉన్న విధాన్ని (సత్యవిషయాన్ని); చెప్పితిన్= తెలిపితిని; అఖిల, జగత్, కర్మ, సాక్షిని+ఐ= ఎల్ల లోకాలలోని జనుల పనులకు సాక్షి నై, ఉండి; అసత్యంబు= అబద్ధం; ఎట్లు= ఏ విధంగా; పలుకన్, నేర్తున్= చెప్పజాలుదును?; అది, నిమిత్తంగా= నేను సత్యం చెప్పటం కారణంగా; నీవు; నాకున్; శాపంబు+ఇచ్చినన్; ఏను= నేను; అలిగి= కోపించి; ప్రతి శాపంబు= తిరిగి శాపం; ఈన్, ఓపనివాఁడను, కాను= ఇవ్వటానికి శక్తిలేనివాడను కాను, వినుము.

తాత్పర్యం: కాబట్టి, నేను అబద్ధం చెప్పటానికి భయపడి, ఆ సాధ్వి భృగుమహర్షిభార్య అని నిజ మైన విషయం ఉన్నది ఉన్నట్లు తెలిపినాను. ఎల్లలోకాలలోని ప్రజలు చేసే పనులను చూచేవాడనై ఉండి అబద్ధం ఏవిధంగా చెప్పజాలుతాను? అది కారణంగా నీవు నన్ను శపించగా నేనుకూడ కోపించి నీకు తిరిగి శాపం ఈయలేనివాడను కాను. వినుము.

విశేషం: శాపభయం కంటె, అసత్యభయానికే ప్రాధమ్యం.

చ. **అడిచినఁ, దిట్టినన్, మఱి మహాపరుషంబులు పల్కి యల్కతోఁ**
బొడిచిన నుత్తమద్విజులు పూజ్యులు; వారల కెగ్గు సేసినం
జెడు నిహముం బరంబు, నిది సిద్ధము గావు టెఱింగి, భక్తి నె
ప్పుడు ధరణీసురోత్తములఁ బూజలఁ దన్పుదు, నల్గ నోడుదున్. **138**

ప్రతిపదార్థం: అడిచినన్= కొట్టినప్పటికిన్నీ; తిట్టినన్= తిట్టినప్పటికిన్నీ; మఱి= ఇంకను; మహత్+పరుషంబులు= అతి కఠిన వాక్యాలు; పల్కి; అల్కతోన్= కోపంతో; పొడిచినన్= పిడికిలి మొదలైన వాటితో కొట్టినప్పటికిన్నీ; ఉత్తమ, ద్విజులు= శ్రేష్ఠు లైన బ్రాహ్మణులు; పూజ్యులు= పూజింపదగినవారు; వారలకున్= ఆ బ్రాహ్మణులకు; ఎగ్గు= హాని; చేసినన్= చేస్తే, ఇహమున్, పరంబున్= ఈ లోకంలోని సౌఖ్యమున్నూ, పైలోకంలోని సౌఖ్యమున్నూ; చెడున్= చెడిపోతాయి. ఇది= ఇట్లా చెడిపోవటం; సిద్ధము, కావుట= యథార్థం అగుట (నిర్ణయింపబడింది కావటం); ఎఱింగి= తెలిసికొని; భక్తిన్= భక్తితో; ఎప్పుడున్= ఎల్లప్పుడును; ధరణీసుర+ఉత్తములన్= శ్రేష్ఠులైన బ్రాహ్మణులను; పూజలన్= పూజలతో; తన్పుదున్= తృప్తి పొందిస్తాను;అల్గన్, ఓడుదున్= కోపించటానికి జంకుతాను.

తాత్పర్యం: కొట్టినా, తిట్టినా, ఇంకను అతికఠినా లైన వాక్యాలు పలికి కోపంతో పోట్లాడినా శ్రేష్ఠ లైన బ్రాహ్మణులు పూజించదగినవారు. అట్టి బ్రాహ్మణులకు హాని చేస్తే ఇహపరాలు చెడిపోతాయి. ఈవిషయం నిశ్చితమని ఎఱిగినవాడను కావటంచేత ఎప్పుడును శ్రేష్ఠ లైన బ్రాహ్మణులను భక్తితో పూజించి తృప్తి పొందిస్తాను. వారిపై కోపించటానికి భయపడతాను.

విశేషం: ఇక్కడ ఉత్తమద్విజులు అనే పదంలోని ఉత్తమ అనే విశేషణం గమనింపదగినది.

వ. **'నీవు బ్రాహ్మణుండవు నీ వెద్ది సేసిన నీక చను; లోకహితుండ నయిన నాకు శాపం బిచ్చి లోకంబుల కెల్లఁ జెట్ట సేసితి; వ దెట్లనిన వేదోక్తంబు లయిన నిత్యనైమిత్తిక బలివిధానంబులందు మహాద్విజులచేత నాయందు వేల్వంబడిన హవ్య కవ్యంబులు నాముఖంబునన దేవపితృగణంబు లుపయోగింతు; రట్టి యేను సర్వభక్షకుండ నై యశుచి నైనఁ గ్రియానివృత్తి యగుఁ; గ్రియానివృత్తి యైన లోకయాత్ర లేకుండు' నని యగ్నిభట్టారకుండు నిఖిలలోకవ్యాప్తం బైన తనతేజోమూర్తి నుపసంహరించిన.** **139**

ప్రతిపదార్థం: నీవు; బ్రాహ్మణుండవు; నీవు; ఎద్ది, చేసినన్= ఏది చేసినా; నీకున్+అ= నీకే; చనున్= తగును; లోక, హితుండన్+అయిన= జగత్తుకు మేలు చేసే వాడిని అయిన; నాకున్= శాపంబు+ఇచ్చి; లోకంబులకున్+ఎల్లన్= సర్వజగత్తులకున్నూ; చెట్ట, చేసితివి= కీడు చేశావు; అది= ఆ కీడు; ఎట్లు+అనినన్= ఏవిధంగా అనినన్; వేద+ఉక్తంబులు+అయిన= వేదాలయందు చెప్పబడిన వయిన; నిత్య, నైమిత్తిక, బలి, విధానంబులందున్= నిత్యం చేయదగినవియున్నూ; నిమిత్తంవలన చేయదగినవియున్నూ అగు పూజాపద్ధతులందు; మహా; ద్విజులచేతన్= గొప్ప బ్రాహ్మణులచేత; నాయందున్; వేల్వంబడిన= హోమంచేయబడిన, హవ్య, కవ్యంబులు= దేవతల కీయదగినవియున్నూ, పితృదేవతల కీయదగినవియున్నూ అయిన అన్నం మొదలైన పదార్థాలు; నా, ముఖంబునన్+అ= నా ద్వారానే; దేవ, పితృ, గణంబులు= దేవతలయొక్కయు, పితృదేవతలయొక్కయు సముదాయాలు; ఉపయోగింతురు= అనుభవిస్తారు,; అట్టి, ఏను= అటువంటి నేను; సర్వభక్షకుండను+ఐ= అన్నింటిని తినేవాడినై; అశుచిని, ఐనన్= అపవిత్రుడిని అయితే; క్రియా, నివృత్తి= కర్మలయొక్క లోపం (అప్రవృత్తి); అగున్= ఔతుంది; క్రియా, నివృత్తి, అయినన్= కర్మల అప్రవృత్తి అయితే; లోక, యాత్ర= లోకంయొక్క ప్రవర్తనం; లేక, ఉండున్; అని; అగ్ని

భట్టారకుండు= పూజ్యు డైన అగ్ని; నిఖిల, లోక, వ్యాప్తంబు+ఐన= అన్నిలోకాలయందును వ్యాపించిన; తన, తేజః, మూర్తిన్= తన యొక్కకాంతిరూప మైన మూర్తిని; ఉపసంహరించినన్= మరలించగా, తొలగించగా.

తాత్పర్యం: నీవు బ్రాహ్మణుడవు. నీ వేది చేసినా నీకే తగుతుంది; లోకాలకు మేలు చేసేవాడ నైన నాకు శాపమిచ్చి లోకాల కన్నింటికి కీడు చేశావు. అది ఎట్లాగంటే వేదాలయందు చెప్పబడిన నిత్యం చేసేవీ, నిమిత్తంవలన చేయదగినవీ అయిన పూజాపద్ధతులందు గొప్పబ్రాహ్మణులచేత నాయందు హోమం చేయబడిన వై దేవతలకూ పితృదేవతలకూ ఇచ్చే అన్నాది వస్తువులు నాద్వారానే దేవతల పితృదేవతల సమూహాలు ఉపయోగిస్తారు. అటువంటి నేను అన్నింటిని తినేవాడనై అపవిత్రుడిని అయితే కర్మలలోపం ఔతుంది. కర్మలలోప మైతే లోకగమనం సాగకుండా ఉంటుంది. అని పలికి పూజ్యు డైన అగ్ని అన్నిలోకాలలో వ్యాపించిన తనకాంతిమయ మైన రూపాన్ని లేకుండ చేయగా.

విశేషం: దేవతలకు ఈయదగిన అన్నాదులు హవ్యాలు, పితృదేవతలకు ఈయదగిన అన్నాదులు కవ్యాలు. నిత్యకర్మలు ప్రతిదినం చేయదగినట్టివి. సంధ్యావందనాదులు. వీటిని చేయకపోతే పాపం కలుగుతుంది. ఏదైన నిమిత్తంవలన చేయదగిన కార్యాలు, తీర్థయాత్రాదులు నైమిత్తికాలు, "అగ్నిముఖావై దేవతాః" అని శ్రుతి.

సీ. **త్రేతాగ్ను లెల్లను దేజరిల్లమిఁ జేసి । క్రతుకృత్యములు వినిర్గతము లయ్యెఁ;**
నగ్ని హోత్రములందు నౌపాసనాది సా । యంప్రాతరాహుతు లంత నుడిగె;
దేవతార్చనలందు దీపధూపాది స । ద్విధులు వర్తిల్లక విరతిఁ బొందెఁ;
బితృకార్యములఁ బితృపిండయజ్ఞక్రియ । లడఁగె విచ్ఛిన్నంబు లై ధరిత్రి;

ఆ. **నంత జనులు సంభ్రమాక్రాంతు లై మహా । మునులకడకుఁ జనిరి, మునులు నమర**
వరులకడకుఁ జనిరి, వారును వారును । బ్రహ్మకడకుఁ జనిరి భయము నొంది. **140**

ప్రతిపదార్థం: త్రేత+అగ్నులు+ఎల్లను= ఆహవనీయం, దక్షిణాగ్ని, గార్హపత్యం అనే మూడు అగ్నులున్నూ; తేజరిల్లమిన్+చేసి= ప్రకాశింపక పోవటంచేత; క్రతు, కృత్యములు= యాగకర్మలు; వినిర్గతములు+అయ్యెన్= లోపించినవి; అంతన్= అప్పుడు; అగ్నిహోత్రములందున్= అగ్నులలో; ఔపాసన+ఆది, సాయం, ప్రాతన్+ఆహుతులు= గృహస్థులైన బ్రాహ్మణులు చేసే అగ్ని ఉపాసన మొదలైన సాయంకాలాలలో ఉదయాలలో చేయదగిన హోమాలు; ఉడిగెన్= ఆగినవి; దేవతా+అర్చనలందున్= దేవతలకు చేసే పూజలలో; దీప, ధూప+ఆది, సత్, విధులు= దీపం, ధూపం మొదలైన మంచి విధానాలు; వర్తిల్లక= జరుగకుండ; విరతిన్, పొందెన్= విరామాన్ని పొందినవి (ఆగిపోయినవి); పితృ, కార్యములన్= పితృదేవతలకు చేయవలసిన శ్రాద్ధాది కృత్యాలలో; పితృ, పిండ, యజ్ఞ, క్రియలు= పితృదేవతలకు ఈయదగిన పిండాలును, యజ్ఞకార్యాలును; ధరిత్రిన్= భూమియందు; విచ్ఛిన్నంబులు+ఐ= భగ్నాలై (కొనసాగకుండినవై); అడఁగెన్= లోపించినవి; అంతన్= అప్పుడు; జనులు; సంభ్రమ+ఆక్రాంతులు+ఐ= వేగిరపాటుచేత ఆక్రమింపబడినవారై; మహా, మునుల, కడకున్= గొప్పమునులచెంతకు; చనిరి= వెళ్ళారు; మునులున్= ఆ మునులుకూడ; అమరవరుల కడకున్; దేవతాశ్రేష్ఠుల చెంతకు; చనిరి; వారును, వారును= ఆ మునులూ, దేవతలూ; భయమున్, ఒంది= భయపడి; బ్రహ్మకడకున్= బ్రహ్మచెంతకు; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ఆహవనీయం, దక్షిణాగ్ని, గార్హపత్యం అనే ఈమూడు అగ్నులున్నూ ప్రకాశించక పోవటంచేత యాగకార్యాలు లోపించినవి. అప్పుడు అగ్నులందు ఉపాసనం మొదలైన సాయంకాలాలలో ఉదయకాలాలలో చేసే హోమాలు లేకుండ పోయినవి; భూమియందు పితృకర్మలందు పితృదేవతలకు ఈయదగిన పిండాలు, యజ్ఞకార్యాలు

భగ్నాలై నశించినవి; అప్పుడు ప్రజలు వేగిరపాటుతో కూడిన వారై మునులచెంతకు వెళ్ళారు. మునులుకూడ దేవతా శ్రేష్ఠులచెంతకు వెళ్ళారు. ఆ మునులూ, దేవతలూ భయపడి బ్రహ్మదేవుడి చెంతకు వెళ్ళారు.

విశేషం: అగ్ని తనరూపాన్ని ఉపసంహరించటంవలన కలిగే నష్టాలన్నీ ఇందులో చెప్పబడినవి.

వ. బ్రహ్మయు భృగుశాప నిమిత్తంబున నగ్నిభట్టారకు నుపసంహారంబును, సకలలోక వ్యవహార విచ్ఛేదంబును నెఱింగి, యగ్నిదేవు రావించి యి ట్లనియె. 141

ప్రతిపదార్థం: బ్రహ్మయున్= బ్రహ్మకూడ; భృగు, శాప, నిమిత్తంబునన్= భృగుమహర్షి శాపం అనే హేతువుచేత; అగ్ని, భట్టారకు+ఉపసంహారంబును= పూజ్యుడైన అగ్ని తన రూపాన్ని లేకుండ చేయటమున్నూ; సకల, లోక, వ్యవహార, విచ్ఛేదంబునున్= ఎల్ల లోకాలలోని వ్యాపారాల భంగాన్నీ; ఎఱింగి= తెలిసికొని; అగ్ని, దేవున్= దేవు డైన అగ్నిని; రావించి= రప్పించి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: బ్రహ్మకూడ భృగుమహర్షి ఇచ్చిన శాపం కారణంగా పూజ్యు డైన అగ్ని తన తేజోరూపాన్ని లేకుండా చేయటమున్నూ, ఎల్లలోకాలలోని కర్మల కేర్పడిన భంగమున్నూ తెలిసికొని అగ్నిదేవుడిని రప్పించి ఈవిధంగా పలికాడు.

విశేషం: భట్టారకు+ఉపసంహారంబు= షష్ఠీ తత్పురుషంలో ఉకారానికి అచ్చుపర మైతే 'ను' ఆగమంగా వస్తుంది; భట్టారకు నుపసంహారము.

చ. ప్రకటిత భూత సంతతికి భర్తవు నీవ, చరాచర ప్రవృ
త్తికి మఱి హేతుభూతుఁడవు, దేవముఖుండవు నీవ, లోకపా
వకుఁడవు నీవ; యిట్టి యనవద్య గుణుండవు నీకు విశ్వభా
రక! భువనప్రవర్తనపరాఙ్ముఖభావముఁ బొందఁ బాడియే? 142

ప్రతిపదార్థం: ప్రకటిత, భూత, సంతతికిన్= వెలయింపబడిన (వ్యక్తమౌతున్న) ప్రాణుల సముదాయానికి; నీవు+అ= నీవే; భర్తవు= అధిపతివి; మఱి= ఇంకను; చర+అచర, ప్రవృత్తికిన్= చేతనాలు, అచేతనాలు అయిన వస్తువుల ప్రవర్తనకు; హేతుభూతుఁడవు= కారణ మైన వాడవు (నీవే); దేవముఖుండవు= దేవతలకు ముఖమైన వాడవు (అగ్నిలో వేల్వబడిన పదార్థాలు అగ్నిద్వారా దేవతలకు అందుతాయి. అందుచేత అతడు దేవముఖు డని చెప్పబడినాడు); నీవు+అ= నీవే; లోక, పావకుఁడవు= లోకాలను పవిత్రం చేసేవాడవు; నీవు+అ= నీవే; ఇట్టి= ఇటువంటి; అనవద్య, గుణుండవు= ప్రశస్త గుణాలు కలవాడవు (ఇక్కడ అనవద్యగుణుండు+అవు - అని కూడ విడదీయ వచ్చును); నీకున్; విశ్వభారక= ప్రపంచాన్ని భరించేవాడా! భువన, ప్రవర్తన, పరాఙ్ముఖభావమున్= లోకాన్ని ప్రవర్తింపచేయటంలో వైముఖ్యాన్ని; పొందన్= పొందటం; పాడియే?= న్యాయమా? కాదు.

తాత్పర్యం: వ్యక్తమైన భూతాల సముదాయానికి అధిపతివి నీవే; చేతనాచేతనాల ప్రవర్తనానికి కారణ మైన వాడివి నీవే; దేవతలకు ముఖమైనవాడవు నీవే; లోకాలను పవిత్రం చేసేవాడవు నీవే; ఇటువంటి ప్రశస్త గుణాలు కలవాడవైన నీకు ప్రపంచాన్ని భరించే ఓ అగ్నీ! లోకాన్ని ప్రవర్తింపచేయటంలో విముఖత్వం పొందటం న్యాయమా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పరాక్+ముఖ= పరాఙ్ముఖ; వర్గాక్షరాలకు న, మ అనే అనునాసికాలు పరమైనపుడు అవి తమ వర్గానికి చెందిన అనునాసికాక్షరాలుగా మారుతాయి. ఇచ్చట కకారం ఙకారంగా మారింది. ఇది అనునాసికసంధి.

వ. **'అమ్మహాముని వచనం బమోఘంబు గావున నీవు సర్వభక్షకుండ వయ్యును శుచులయం దెల్ల నత్యంతశుచి వై, పాత్రులయం దెల్లఁ బరమపాత్రుండ వై, పూజ్యులయం దెల్ల నగ్రపూజ్యుండ వై, వేదచోదిత విధానంబుల యందు విప్రసహాయుండ వై భువనంబుల నడుపు' మని, విశ్వగురుండు వైశ్వానరుం బ్రార్థించి నియోగించి భృగువచనంబు ప్రతిష్ఠాపించె; నట్టి భృగునకుఁ బుత్త్రుం డై పుట్టి పరఁగిన. 143**

ప్రతిపదార్థం: ఆ, మహత్, ముని= ఆ గొప్పముని (భృగుమహాముని) యొక్క; వచనంబు= వాక్యం; అమోఘంబు= వ్యర్థం కానిది; కావునన్; నీవు; సర్వభక్షకుండవు+అయ్యునున్= అన్నియు తినేవాడ వైనప్పటికిన్నీ; శుచులయందున్+ఎల్లన్= సర్వపవిత్రులయందున్నూ; అత్యంత, శుచివి+ఐ= మిక్కిలి పవిత్రుడవై; పాత్రులయందున్+ఎల్లన్= అర్హులైన వారి అందరి యందున్నూ; పరమ, పాత్రుండవు+ఐ= మిక్కిలి అర్హుడ వై; పూజ్యులయందున్+ఎల్లన్= పూజింపదగినవారి అందరియందున్నూ; అగ్రపూజ్యుండవు+ఐ= మొదట పూజింపదగిన వాడవు అయి; వేద, చోదిత, విధానంబులయందున్= వేదాలలో చెప్పబడిన కర్మపద్ధతులలో; విప్ర, సహాయుండవు+ఐ= బ్రాహ్మణులకు తోడ్పడేవాడ వై; లేక, బ్రాహ్మణులు తోడ్పడేవారుగా కలవాడవై; భువనంబులన్= లోకాలను; నడుపుము+అని= ప్రవర్తింప చేయుము అని; విశ్వ, గురుండు= లోకాలకు పెద్ద అయిన బ్రహ్మదేవుడు; వైశ్వానరున్= అగ్నిని; ప్రార్థించి= వేడి; నియోగించి= భువన ప్రవర్తనంలో నియమించి (ఆజ్ఞాపించి); భృగు, వచనంబు= భృగుమహర్షి యొక్క వాక్యాన్ని; ప్రతిష్ఠాపించెన్= స్థిరం చేశాడు. అట్టి భృగునకున్= అటువంటి భృగుమహర్షికి; పుత్త్రుండు+ఐ= కొడుకై; పుట్టి; పరఁగిన= ఒప్పారిన.

తాత్పర్యం: 'ఆ భృగుమహామునియొక్క వాక్యం వ్యర్థం కాదు. కాబట్టి నీవు అన్నియు తినేవాడవయినప్పటికీ, పవిత్రులందరిలో మిక్కిలి పవిత్రుడ వై, అర్హులందరిలో మిక్కిలి అర్హుడవై; పూజింపదగినవా రందరిలో మొదట పూజింపదగినవాడ వై, వేదాలలో చెప్పబడిన కర్మకలాపాలలో బ్రాహ్మణులకు తోడ్పడే వాడవై లోకాలను ప్రవర్తింపచేయు' మని లోకపిత అయిన బ్రహ్మ అగ్నిని వేడి, లోకప్రవర్తనంలో నియమించి భృగువుయొక్క వాక్యాన్ని స్థిరం చేశాడు. అటువంటి భృగుమహర్షికి కొడు కై పుట్టి ఒప్పారిన. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **చ్యవనునకు సుకన్యకు ను । ద్భవ మయ్యె ఘనుండు ప్రమతి; ప్రమతికి నమృతో**
ద్భవ యగు ఘృతాచికిని భా । ర్గవ ముఖ్యుఁడు రురుఁడు పుట్టెఁ గాంతియుతుం డై. 144

ప్రతిపదార్థం: చ్యవనునకున్= చ్యవన మహర్షికిన్నీ; సుకన్యకున్= శర్యాతి పుత్త్రిక అయిన సుకన్యకున్నూ; ఘనుండు= గొప్పవా డైన; ప్రమతి= ప్రమతి అనేవాడు; ఉద్భవము+అయ్యెన్= పుట్టాడు; ప్రమతికిన్; అమృత+ఉద్భవ+అగు= సముద్ర మథనంలో అమృతంతో పాటు పుట్టిన; ఘృతాచికిని= ఘృతాచి అనే అప్సరసకున్నూ; భార్గవముఖ్యుఁడు= భృగువంశంలో పుట్టిన వారిలో ప్రధాను డయిన; రురుఁడు= రురుడు అనేవాడు; కాంతియుతుండు+ఐ= కాంతితో కూడినవా డై; పుట్టెన్= జన్మించాడు.

తాత్పర్యం: భృగుపుత్రు డయిన చ్యవనుడికిన్నీ శర్యాతిమహారాజుకొమార్తె అయిన సుకన్యకున్నూ గొప్పవా డైన ప్రమతి అనేవాడు పుట్టాడు. ఆ ప్రమతికిన్నీ అమృతంతోపాటు పుట్టిన ఘృతాచి అనే అప్సరసకున్నూ భృగువంశంలో పుట్టినవారిలో శ్రేష్ఠు డైన రురుడు కాంతితో కూడినవా డై జన్మించాడు.

విశేషం: చ్యవనుడు సుకన్యను వివాహమాడినవృత్తాంతం ఆరణ్యపర్వంలోని తృతీయాశ్వాసంలో ఉన్నది.

ప్రమద్వర సర్పదష్ట యై చచ్చి మరల బ్రదుకుట (సం.1-8-1)

వ. అట్టి రురుం డను మునివరుండు విశ్వావసుం డను గంధర్వరాజునకు మేనకకుం బుట్టినదాని, స్థూలకేశుం డను మునివరునాశ్రమంబునఁ బెరుఁగుచున్న దాని, రూపలావణ్య గుణంబులఁ బ్రమదాజనంబులయం దెల్ల నుత్కృష్ట యగుటం జేసి ప్రమద్వర యన నొప్పచున్న కన్యక నతిస్నేహంబున వివాహంబుగా నిశ్చయించి యున్నంత. 145

ప్రతిపదార్థం: అట్టి; రురుండు+అను, మునివరుండు= ప్రమతికిన్నీ, ఘృతాచికిన్నీ పుట్టినట్టి రురుడు అనే మునిశ్రేష్ఠుడు; విశ్వావసుండు+అను= విశ్వావసుడు అనే పేరు కల; గంధర్వరాజునకున్= గంధర్వుల రాజుకున్నూ (గంధర్వులు దేవయోని విశేషాలు; ఆటపాటలలో ఆరితేరినవారు); మేనకకున్= మేనక అనే అప్సరసకున్నూ; పుట్టిన దానిని= జన్మించిన దానిని; స్థూలకేశుండు+అను, మునివరు, ఆశ్రమంబునన్= స్థూలకేశుడు అనేపేరు కల మునిశ్రేష్ఠుని తపోవనంలో; పెరుఁగుచున్న, దానిన్= పెద్దదవుతున్న దానిని; రూప, లావణ్య, గుణంబులన్= రూపంలోనూ సౌందర్యంలోనూ గుణాలలోనూ; ప్రమదాజనంబులయందున్+ఎల్లన్= స్త్రీజనాలందరిలో కెల్ల; ఉత్కృష్ట= శ్రేష్ఠురాలు; అగుటన్+చేసి= కావటంచేత; ప్రమద్వర, అనన్, ఒప్పుచున్న= ప్రమద్వర అనే పేరుతో అలరారుతూ ఉన్న; కన్యకన్= కన్యను; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రేమతో; వివాహంబు, కాన్= పెండ్లి ఆడటానికి; నిశ్చయించి, ఉన్న అంతన్= నిర్ణయం చేసికొని ఉండగా.

తాత్పర్యం: ప్రమతికిన్నీ ఘృతాచికిన్నీ పుట్టిన రురుడు అనే మునిశ్రేష్ఠుడు- విశ్వావసుడు అనే పేరుగల గంధర్వరాజుకున్నూ మేనక అనే అప్సరసకున్నూ పుట్టి స్థూలకేశుడనే మునిశ్రేష్ఠుని ఆశ్రమంలో పెరుగుతూ ఉన్నట్టిదియున్నూ, రూపంలోనూ, సౌందర్యంలోనూ, గుణాలలోనూ స్త్రీలందరిలో శ్రేష్ఠురాలు కావటంచేత ప్రమద్వర అనే పేరుతో అలరారుతున్నదియున్నూ అయిన కన్యను మిక్కిలిప్రేమతో పెండ్లి ఆడటానికి నిర్ణయం చేసికొని ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. కన్నియలతోడ నాడుచు నున్నదానిఁ । బాదమర్దిత మై యొక్క పన్నగంబు
గఱచెఁ గన్నియ లందఱు వెఱచి పఱచి । యఱచుచుండఁ బ్రమద్వర యవనిఁ ద్రెళ్ళె. 146

ప్రతిపదార్థం: కన్నియలతోడన్= తోడికన్యలతో (కలసి); ఆడుచున్, ఉన్నదానిన్= ఆడుతూ ఉన్న ప్రమద్వరను; పాద, మర్దితము+ఐ= పాదాలచేత త్రొక్కబడినదై; ఒక్క, పన్నగంబు= ఒకపాము; కఱచెన్; కన్నియలు+అందఱున్= కన్యలందరూ; వెఱచి= భయపడి; పఱచి= పరుగెత్తి; అఱచుచున్+ఉండన్= ఏడుస్తూ కేకలు వేస్తూ ఉండగా; ప్రమద్వర; అవనిన్= నేలపై; త్రెళ్ళెన్= పడింది.

తాత్పర్యం: తోడికన్యలతో ఆడుతున్న ఆ ప్రమద్వరను ఆమె పాదాలచే త్రొక్కబడిన దైన ఒకపాము కరచింది. అంత ఇతర కన్యలందరూ భయపడి పరుగెత్తి ఏడుస్తూ కేకలు వేస్తూ ఉండగా ఆ ప్రమద్వర నేలపై పడింది.

వ. దాని నెఱింగి కరుణాకలిత హృదయు లై గౌతమ కణ్వ కుత్స కౌశిక శంఖ మేఖల భరద్వాజ వాలఖిల్యోద్దాలక శ్వేతకేతు మైత్రేయ ప్రముఖులు ప్రమతియు రురుండును స్థూలకేశాశ్రమంబునకు వచ్చి విషవ్యపగతప్రాణ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యై పడియున్న యక్కన్యం జూచి దుఃఖితు లై యుండ, నచ్చోట నుండనోపక రురుండు శోకవ్యాకుల హృదయుం డై యేకతంబ వనంబునకుం జని. 147

ప్రతిపదార్థం: దానిన్= ప్రమద్వర పాముకాటుకు గురి అయి నేలపై పడటాన్ని గురించి; ఎఱింగి= తెలిసికొని; కరుణా,కలిత, హృదయులు+ఐ= దయతో కూడిన చిత్తాలు కలిగినవారై; గౌతమ.... మైత్రేయ, ప్రముఖులు= గౌతముడు, కణ్వుడు, కుత్సుడు, కౌశికుడు, శంఖుడు, మేఖలుడు, భరద్వాజుడు, వాలఖిల్యులు, ఉద్దాలకుడు, శ్వేతకేతుడు, మైత్రేయుడు మొదలైన వారున్నూ; ప్రమతియు, రురుండును; స్థూలకేశ+ఆశ్రమంబునకున్= స్థూలకేశుడియొక్క ఆశ్రమానికి; వచ్చి; విష వ్యపగత, ప్రాణ+ఐ= పాముయొక్క విషంచేత పోయిన ప్రాణాలు కలదై; పడియున్న= నేలపై పడియున్న; ఆ+కన్యన్= ఆ ప్రమద్వరను; చూచి; దుఃఖితులు+ఐ= శోకించిన వారై; ఉండన్= ఉండగా; ఆ+చోటన్= ఆ కన్యక పడియున్నచోట; ఉండన్+ఓపక= ఉండలేక; రురుండు; శోకవ్యాకుల, హృదయుండు+ఐ= చింతచేత కలత పొందిన చిత్తం కలవాడై; ఏకతంబు+అ= ఒంటరిగా; వనంబునకున్= అడవికి; చని= వెళ్ళి.

తాత్పర్యం: పాముకాటుచేత ప్రమద్వర నేలమీద పడి ఉన్న విషయాన్ని తెలిసికొని, దయతో కూడిన హృదయాలు కలవా రై గౌతముడు, కణ్వుడు, కుత్సుడు, కౌశికుడు (విశ్వామిత్రుడు), శంఖుడు, మేఖలుడు, భరద్వాజుడు, వాలఖిల్యులు, ఉద్దాలకుడు, శ్వేతకేతుడు, మైత్రేయుడు మొదలైన వారున్నూ, ప్రమతియు, రురుడున్నూ స్థూలకేశుని ఆశ్రమానికి వచ్చి విషంచేత చచ్చి నేలపై పడి ఉన్న ప్రమద్వరను చూచి దుఃఖితు లై ఉండగా, రురుడు అక్కడ ఉండలేక శోకంతో కలత చెందినహృదయం కలవాడై ఒంటరిగా అడవికి వెళ్ళి.

విశేషం: ప్రమద్వరను పాము కరచిం దని తెలియగానే ఋషులందరు రావటం వారి దయాపరత్వానికీ, ఐకమత్యానికీ నిదర్శనం. రురుడు ప్రమద్వరను ప్రేమించి యుండటంచేత ఆ దృశ్యాన్ని చూడలేక శోకాతిశయంతో ఒంటరిగా అడవిలోకి వెళ్ళాడు. ఋషులను పేరు పేరున పేర్కొంటూ నన్నయ రచించటంవలన ప్రమద్వర ఎందరి ఋషుల ఆదరాభిమానాలను చూరగొన్నదో వ్యంగ్యంగా నిర్దేశించాడు. ఆమె పునరుజ్జీవిత కావటానికి తగిన యోగ్యతను వ్యంగ్యంగా నిబంధించాడు.

చ. **అలయక యేన దేవయజనాధ్యయన వ్రత పుణ్యకర్మముల్**
సలుపుదునేని, యేన గురుసద్ద్విజభక్తుఁడనేని, యేన య
త్యలఘుతపస్వినేని దివిజాధిప భూసురులార! మన్మనో
నిలయకు నీ ప్రమద్వరకు నిర్విష మయ్యెడు నేఁడు మీదయన్. 148

ప్రతిపదార్థం: దివిజ+అధిప, భూసురులు+ఆర= ఓ దేవతాప్రభువులారా! బ్రాహ్మణులారా!; అలయక= అలసట చెందక; ఏను+అ= నేనే; దేవ, యజన+అధ్యయన, వ్రత, పుణ్య, కర్మముల్= దేవతలను పూజించటం (దేవతలనుగురించి యజ్ఞాలు చేయటం), వేదాలు పఠించటం, వ్రతాలు చేయటం అనే పుణ్యకర్మలు; సలుపుదున్+ఏని= చేసేవాడిని అయితే; ఏను+అ; గురు, సత్+ద్విజ, భక్తుఁడన్+ఏని= గురువులయొక్కయు, ఉత్తమవిప్రులయొక్కయు భక్తుడ నైన ట్లయితే; ఏను+అ; అతి+అలఘు, తపస్విన్+ఏని= మిక్కిలిగొప్పతపస్సుకలవాడి నైనట్లయితే; మత్+మనస్+నిలయకున్= నామనస్సేనివాసంగా గల (నాప్రాణనాయికకు) ఈ ప్రమద్వరకు; మీ, దయన్= మీకరుణచే; నేఁడు= ఈరోజున; ఇప్పుడు; నిర్విషము= విషములేకుండేటట్లు; అయ్యెడున్= అగుగాక.

తాత్పర్యం: ఓ దేవతాప్రభువులారా! బ్రాహ్మణులారా! నేను అలసటలేకుండా దేవతలను పూజించటం, యజ్ఞాలను ఆచరించటం, వేదాలను పఠించటం, వ్రతాలను ఆచరించటం అనే పుణ్యకార్యాలను చేసేవాడనైతే, నేను గురువులకు, ఉత్తమబ్రాహ్మణులకు భక్తుడ నైతే, నేను గొప్పతపస్సు కలవాడ నైతే నేడు నామనస్సే నిలయంగా గల నా ప్రాణనాయిక అయిన ఈ ప్రమద్వర మీదయచేత విషవిముక్తురాలు అగుగాక!

చ. అపరిమితాజ్ఞఁ జేసియు మహాపురుషుల్ విషతత్త్వసంహితా
నిపుణులు మంత్రతంత్రములు నేర్చి విధించియు దీనికిన్ విష
వ్యపగత మైన జీవ మిది వచ్చునుపాయము సేయరొక్కొ! నా
తపముఫలంబు నధ్యయనదానఫలంబులు నిత్తు వారికిన్. 149

ప్రతిపదార్థం: మహత్+పురుషుల్= మహాత్ములు; అపరిమిత+ఆజ్ఞన్, చేసియున్= అధికమైన ఆజ్ఞచేతను, లేదా, ఆజ్ఞ కావించియు; విష. తత్త్వ, సంహితా, నిపుణులు= విషం యొక్క వాస్తవస్థితిని తెల్పే శాస్త్రంలో నేర్పరులును; మంత్ర, తంత్రములు= మంత్రాలను, ఉత్తమా లైన ఔషధాలను (ఉపాయాలను); నేర్చి= తెలిసికొని; విధించియున్= ఏర్పాటు చేసియు; దీనికిన్= ఈప్రమద్వరకు; విషవ్యపగతము+ఐన= విషంచేత తొలగిపోయిన; జీవము+ఇది= ఈప్రాణం; వచ్చు, ఉపాయము= తిరిగివచ్చే మార్గం; చేయరు+ఒక్కొ= చేయరా; వారికిన్= అట్లా చేసేవారికి; నా, తపము, ఫలంబున్= నా తపస్సుయొక్క ఫలితాన్నీ; అధ్యయన, దాన, ఫలంబులున్= వేదపఠనంయొక్కయు, దానాలయొక్కయు ఫలాలను ఇస్తాను.

తాత్పర్యం: మహాత్ములు మహిమాన్విత మైన ఆజ్ఞ చేసికాని, విషతత్త్వాన్ని తెలిపే శాస్త్రంలో నేర్పరు లైనవారు మంత్రతంత్రాలు ఉచ్చరించి ప్రయోగించి కాని, విషంచేత ప్రాణాలు కోల్పోయిన ఈ ప్రమద్వరకు అవి తిరిగి వచ్చే ఉపాయం చేసిపెట్టరా? ఆ విధంగా చేసిన వారికి నాతపఃఫలాన్నీ, వేదాధ్యయనఫలాన్నీ, దానాలఫలాన్నీ ఇస్తాను.

విశేషం: కొందరు సిద్ధవాక్కులు పాము కరచినవారివద్దకు వెళ్ళి 'విషమా! దిగి తొలగిపొమ్మ' అని ఆజ్ఞాపిస్తే అది తొలగిపోతుంది. అట్లే మంత్ర తంత్ర ఔషధాదులచేత కూడ సర్పదష్టులైన వారిని బ్రతికించవచ్చును. ఈ పద్యంలో రురుడికి ప్రమద్వర ఎడగల నిర్మలమూ అధికమూ ఐన అనురాగం వెల్లడి ఔతున్నది. అతడు ఆమెను బ్రతికించటానికి ఎటువంటి త్యాగమైనా చేయటానికి సిద్ధమై ఉన్నాడు. కాబట్టి రురుడి ప్రేమ ఇందులో అసంలక్ష్యక్రమధ్వనిచేత ప్రతీయమాన మౌతున్నది.

వ. అని దీనవదనుం డై యాక్రోశించు వానికి నాకాశంబుననుండి యొక్కదేవదూత యిట్లనియె: 'నయ్యా! కాలవశంబయిన నెవ్వరికిం దీర్ఘాయు రరంబుగా; దొక్కయుపాయంబు గలదు; చేయనోపుదేనిఁ జెప్పెద వినుము; నీ యాయుష్యంబునం దర్ధం బిక్కన్య కి' మ్మనిన రురుం డట్ల చేయుదు నని తన యాయుష్యంబునం దర్ధం బక్కన్య కిచ్చిన నక్కోమలి దొల్లింటికంటె నధికశృంగారసమన్విత యై విషనిర్ముక్త యయ్యె; నట్లు దేవదూత ధర్మరాజానుమతంబునఁ దనచెప్పిన యుపాయంబునం బ్రమద్వరను బంచత్వంబువలనం బాపె; రురుండును దాని వివాహం బై యిష్టోపభోగంబుల ననుభవించుచు నుండె. 150

ప్రతిపదార్థం: అని; దీన, వదనుండు+ఐ= ఆర్తితో కూడినముఖం కలవాడై; ఆక్రోశించు వానికిన్= బిగ్గరగా విలపించే వానికి; ఆకాశంబునన్+ఉండి= ఆకాశంలోనుండి; ఒక్క, దేవ, దూత= ఒక దేవతల దూత (దేవతలచే పంపబడిన పురుషుడు); ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పలికాడు; అయ్యా= ఆర్యా! (రురునికి సంబోధనం); కాల, వశంబు+అయినన్= కాలానికి

స్వాధీన మైనది (మరణం) అయినచో; ఎవ్వరికిన్; తీర్పన్, తరంబు, కాదు= చక్కబరుప (తొలగింప) శక్యం కాదు; ఒక్క, ఉపాయంబు= సాధనం (తొలగించే విధం); కలదు; చేయన్+ఓపుదు(వు), ఏనిన్= చేయజాలుదువేని; చెప్పెదన్= తెలుపుతాను; వినుము; నీ, ఆయుష్యంబునందున్= నీ ఆయుర్దాయంలో; అర్ధంబు= సగం; ఈ+కన్యకున్= ఈ ప్రమద్వరకు; ఇమ్ము; అనినన్= అని చెప్పగా; రురుండు; అట్లు+అ= అట్లే; చేయుదును= చేస్తాను (ఇస్తాను); అని= అని పల్కి; తన, ఆయుష్యంబునందున్= తన ఆయుర్దాయంలో; అర్ధంబు= సగం; ఆ+కన్యకకున్= ఆ ప్రమద్వరకు; ఇచ్చినన్= ఈయగా; ఆ+కోమలి= ఆ సుందరి; తొల్లింటికంటెన్= మునుపటికంటె; అధిక, శృంగార, సమన్విత+ఐ= ఎక్కువ అందంతో కూడినదై; విష, నిర్ముక్త= విషమువలన విడువడింది; అయ్యెన్; అట్లు= ఆ విధంగా; దేవదూత= దేవతలు పంపిన పురుషుడు; ధర్మరాజ+అనుమతంబునన్= యముని అనుమతిచేత; తన, చెప్పిన= తాను చెప్పిన; ఉపాయంబునన్= సాధనంచేత, వెరవుచే; ప్రమద్వరను; పంచత్వంబు వలనన్= (దేహం పంచభూతాత్మకం, మరణించినప్పుడు మరల పంచభూతాలలో కలిసిపోతుంది) చావునుండి; పాపెన్= తొలగించాడు; రురుండును= రురుడు కూడ; దానిన్= ఆ ప్రమద్వరను; వివాహంబు+ఐ= పెండ్లాడి; ఇష్ట+ఉపభోగంబులన్= ప్రీతిని కలిగించే భోగాలను (విలాసాలను); అనుభవించుచున్+ ఉండి= పొందుతూ ఉండి.

తాత్పర్యం: అని దైన్యంతో కూడిన ముఖం కలవా డై ఎలుగెత్తి ఏడుస్తున్న రురునకు ఆకాశంనుండి ఒకదేవదూత ఇట్లా పలికాడు: 'ఆర్యా! కాలగోచరత్వం (మరణం) కలిగితే ఎవ్వరికిన్నీ తొలగింప శక్యం కాదు. అయినను ఒక మార్గం ఉన్నది. చేయగలిగినట్లైతే చెప్పుతాను వినుము. నీ ఆయుర్దాయంలో సగం ఈ బాలికకు ఇమ్ము' అని దేవదూత పలకగానే రురుడు అట్లే చేస్తా నని తన ఆయువులో సగాన్ని ఆ బాలికకు ఈయగానే ఆ సుందరి ముందటికంటె ఎక్కువ సౌందర్యం కలదై విషంనుండి విముక్తిచెందింది. ఆ విధంగా దేవదూత యముడి అనుమతితో తాను చెప్పిన ఉపాయంచేత ప్రమద్వరను మృత్యువునుండి ఉద్ధరించాడు. రురుడుకూడ ఆ ప్రమద్వరను పెండ్లాడి ప్రీతికరాలైన భోగాలను అనుభవిస్తూ ఉండి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తనసతి కపకారము సే । సిన పాముల కలిగి బాధ సేయుదు నని చి
క్కని దండము గొని పాములఁ । గనినప్పుడు యడువఁ దొడఁగె గహనములోనన్. 151

ప్రతిపదార్థం: తన, సతికిన్= తన భార్యకు; అపకారము= హాని; చేసిన; పాములకున్= పాములపై; అలిగి= కోపించి; బాధ= దుఃఖం; చేయుదున్= కలిగిస్తాను; అని; చిక్కని, దండము= దిట్టమైన కఱ్ఱ; కొని= గ్రహించి; పాములన్; కనిన+అప్పుడు+అ= చూచిన వెంటనే; గహనములోనన్= అడవిలో; అడువన్= కొట్టటానికి; తొడఁగెన్= ఆరంభించాడు.

తాత్పర్యం: తనభార్యకు హాని చేసిన పాములపై కోపించి వాటికి బాధకలిగిస్తా నని రురుడు దిట్టమైన కఱ్ఱను గ్రహించి అడవిలో పాములను చూచిన వెంటనే వాటిని కొట్టటానికి ఆరంభించాడు.

విశేషం: పాములకున్+అలిగి= ఇటువంటిచోట్ల నన్నయ షష్ఠీవిభక్తి వాడుతూ ఉంటాడు. కారకవిశేషం.

చ. తిరుగుచుఁ బుట్టలం బొదలఁ ద్రిమ్మరు పాముల రోసి రోసి ని
ష్ఠురతర దీర్ఘ దండమున డొల్లఁగ వ్రేయుచు, వచ్చి వచ్చి య
య్యిరవున డుండుభం బను నహిం గని వ్రేయఁగ దండ మెత్తుడున్
'హరి హరి' యంచు డుండుభమహాహి భయంపడి పల్కు భార్గవున్. 152

ప్రతిపదార్థం: తిరుగుచున్= అడవిలో తిరుగుతూ; పుట్టలన్= పుట్టలలోనూ; పొదలన్= పొదలలోనూ; త్రిమ్మరు= సంచరించే; పాములన్= సర్పాలను; రోసి, రోసి= వెదకి, వెదకి; నిష్ఠురతర, దీర్ఘ, దండమునన్= మిక్కిలి కఠినమైనదీ, పొడవైనదీ అయిన కఱ్ఱతో; డొల్లఁగన్= పడు (చచ్చు)నట్లుగా; వ్రేయుచున్= కొట్టుతూ; వచ్చి, వచ్చి= తిరిగి తిరిగి వచ్చి; ఆ+ఇరవునన్= ఆ స్థలంలో; డుండుభంబు+అను= విషం లేని డుండుభం అనే; అహిన్= పామును; కని= చూచి; వ్రేయఁగన్= కొట్టటానికి; దండము= కఱ్ఱ; ఎత్తుడున్= పైకెత్తినతోడనే; హరి, హరి= ఏదైన చెడ్డపని జరిగేటప్పుడు కృష్ణ కృష్ణ, హరి హరి అని హరినామాన్ని ఉచ్చరించటం పరిపాటి; అంచున్= అని పల్కుతూ; డుండుభ, మహత్, అహి= డుండుభ మనే ఆ పెద్దపాము; భయంపడి= భయపడి; భార్గవున్= భృగువంశస్థు డైన రురునితో; పల్కున్= అన్నది.

తాత్పర్యం: రురుడు అడవిలో తిరుగుతూ పుట్టలలో పొదలలో తిరిగే పాములను వెదకి వెదకి మిక్కిలి కఠినమైన పొడుగాటి కఱ్ఱతో చచ్చిపడేటట్లుగా కొట్టుతూ వచ్చివచ్చి ఒకచోట విషహీన మైన డుండుభ మనే పామును చూచి కొట్టటానికై కఱ్ఱ పైకెత్తగా, డుండుభ మనే ఆ పెద్దపాము భయపడి హరినామాన్ని ఉచ్చరిస్తూ భృగువంశ్యు డైన రురునితో ఈవిధంగా పలికింది.

విశేషం: అయ్యిరవున అనేచోట - అయ్యేరవున, ఒక్కిరుకున, అయ్యేరనొక, అయ్యిరవున, అయ్యిరుగున, వచ్చి యొక్కచో నిరుకున; వచ్చి యొక్కచో నెరనొక - అనే పాఠాలు అనేకము లున్నవి. ఎడ అనే పాఠం గ్రహిస్తే రడలకు నన్నయ ప్రాస మంగీకరించిన ట్లౌతుంది. ఇఱుకున - అంటే శకటరేఫం ఉండాలి. రఱప్రాసం కూడ నన్నయకు సమ్మతం కాదు. సూర్యరాయాంధ్ర నిఘంటువులో అయ్యేరన్= ఆవ్యసనంతో అనే అర్థం చెప్పబడింది. పాములను చంపటానికై తిరగటంకూడ ఒక వ్యసనమే. అందుచేత ఈ పాఠం ఉచితంగా కనబడుతున్నది. వ్యవహారంలో ఎరకు ఆ అర్థం ఉన్నట్లు అందులో సూచింపబడింది.

మత్తకోకిల.

> **'ఏమి కారణ మయ్య పాముల కింత యల్గితి? వీవు తే**
> **జోమయుండవు బ్రాహ్మణుండవు సువ్రతుండవు' నావుడుం**
> **'బాము లెగ్గొనరించె మత్ప్రియభామ; కేను రురుండ ను**
> **ద్దామసత్త్వుఁడ' నిన్ను నిప్పుడు దండతాడితుఁ జేసెదన్.** **153**

ప్రతిపదార్థం: ఏమి, కారణము, అయ్య= ఏమి హేతువయ్య? (అయ్య ప్రశ్నార్థకం); పాములకున్= పాములయెడ; ఇంత= ఇంత అధికంగా; అల్గితివి= కోపించినావు; ఈవు= నీవు; తేజః, మయుండవు= తేజస్సుతో కూడినవాడవు; బ్రాహ్మణుండవు= బ్రహ్మజ్ఞాన సంపన్నుడ వైన విప్రుడవు; సు, వ్రతుండవు= మంచివ్రతం కలవాడవు; నావుడున్= అని డుండుభం పల్కిన అనంతరం; (రురుడు ఈవిధంగా పలికాడు); మత్, ప్రియ, భామకున్= నా ప్రియురా లైన భార్యకు; పాములు; ఎగ్గు= హాని; ఒనరించెన్= చేసినవి; ఏను= నేను, రురుండన్= రురుడు అనే పేరు కల భార్గవుడను; ఉద్దామ, సత్త్వుఁడన్= అధిక మైన బలం కలవాడను; నిన్నున్; ఇప్పుడు+అ= ఈ క్షణమందే; దండ, తాడితున్= కఱ్ఱతో కొట్టబడిన వాడినిగా; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: 'పాములపై ఇంత అధికంగా కోపించినావు; అందుకు ఏమి కారణమయ్యా! నీవు గొప్పతేజస్సుతో కూడినవాడవు. బ్రాహ్మణుడవు. మంచి వ్రతం కలవాడవు' అనిన అనంతరం రురుడు ఈవిధంగా పల్కాడు. ప్రియురా లైన నాభార్యకు పాములు హాని చేసినవి (కరచి ఆమెను చంపినవి). నేను అధికబలం కల రురు డనే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భార్గవుడను. నిన్ను ఈ క్షణంలోనే దండంతో కొట్టి చంపుతాను.

విశేషం: తేజోమయాది విశేషణాలు కోపరహితుడవై ఉండవలసిన వాడ వని సూచిస్తున్నవి. కాబట్టి ఇక్కడ అర్థాంతర సంక్రమితవాచ్యధ్వని ఉన్నది. మత్తకోకిలంలోని ప్రతి పాదానికీ ర స జ జ భ ర అనే ఆరుగుణాలు (18 అక్షరాలు) ఉంటాయి. 11వ అక్షరం యతిస్థానం. ఇందులోని మొదటి గురువును రెండు లఘువులుగా చేస్తే తరలం ఔతుంది.

వ. అని రురుం డలిగి కృతాంతకర దండంబుం బోని తనదండం బెత్తికొనుడుఁ దత్క్షణంబ డుండుభంబు ముని
యై యెదుర నిలిచినం జూచి రురుం డి ట్లనియె. 154

ప్రతిపదార్థం: అని= అనిపలికి; రురుండు; అలిగి= కోపించి; కృతాంత, కర, దండంబున్, పోని= యముని చేతిలోని దండ మనే ఆయుధాన్ని పోలిన; తన, దండంబు= తన చేతిలోని కర్రను; ఎత్తికొనుడున్= పైకెత్తగా; తద్+క్షణంబు+అ= ఆ క్షణమందే; దుండుభంబు= డుండుభ మనే పాము; ముని+ఐ= ఋషియై; ఎదురన్= తన ఎదుట; నిలిచినన్= నిలబడగా; చూచి; రురుండు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని పల్కి రురుడు యమునిచేతిలో ఉండే దండాయుధాన్ని పోలిన తనచేతిలో ఉన్న కర్రను పైకెత్తగా వెంటనే (ఆ క్షణమందే) డుండుభ మనే ఆ పాము మునిరూపం ధరించి తన యెదుట నిలబడింది. ఆ మార్పు చూచి రురుడు ఈ విధంగా పలికాడు.

విశేషం: అలం: ఉపమ.

క. 'ఉరగమ వై యుండి మునీ । శ్వరవేషము దాల్చి యున్నవడు వెంతయు న
చ్చెరు; విది యెట్టులు?' నావుడు । రురునకు ని ట్లనియె మునివరుం డనురక్తిన్. 155

ప్రతిపదార్థం: ఉరగమవు+ఐ= పామువై; ఉండి; ముని+ఈశ్వర+వేషము= ముని నాథుని వేషం (రూపం); తాల్చి, ఉన్న= ధరించి ఉన్న; వడువు= విధం; ఎంతయున్= మిక్కిలి; అచ్చెరువు= ఆశ్చర్యం; ఇది= ఇట్లు కావటం; ఎట్టులు= ఏ విధం?; నావుడున్= అనిన అనంతరం; మునివరుండు= మునిశ్రేష్ఠు డైన; సహస్రపాదుఁడు; రురునకున్; అనురక్తిన్= అనురాగంతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇంతవరకు పామురూపంతో ఉండి ఇప్పుడు మునిశ్రేష్ఠుడిరూపం ధరించియున్నతీరు మిక్కిలి వింతగా ఉన్నది. ఇది ఏవిధంగా జరిగింది? అని అడిగిన అనంతరం సహస్రపాదు డనే మునిశ్రేష్ఠుడు రురునితో ఈ విధంగా చెప్పాడు.

సహస్రపాదుని వృత్తాంతము (సం. 1-10-6)

వ. 'ఏను సహస్రపాదుం డను మునిముఖ్యుండ; నా సహాధ్యాయుండు ఖగముం డను మునిముఖ్యుం డగ్నిహోత్ర
గృహంబున నున్న నే నపహాసార్థంబు తృణమయసర్పం బమ్మునిపై వైచిన, నతం డులికిపడి నా కలిగి. 'నీవు
నిర్వీర్యంబైన యురగంబ వగు' మని శాపం బిచ్చిన. నేనును 'మేలంబు సేసిన నింత యలుగ నేల?
క్షమియింపు' మనినం, బ్రసన్నుం డై ఖగముండు నావచనం బమోఘంబు గావునఁ గొండొకకాలంబు
డుండుభంబ వై యుండి, భార్గవకులవర్ధనుం డైన రురుం గనిన యప్పుడు శాపవిముక్తుండ వగుదు వనె'

నని సహస్ర పాదుండు రురునకుఁ దనవృత్తాంతం బంతయుం జెప్పి వెండియు ని ట్లనియె. 156

ప్రతిపదార్థం: ఏను= నేను; సహస్రపాదుండు+అను= సహస్రపాదు డనే పేరు గల; ముని; ముఖ్యుండన్= ముని శ్రేష్ఠుడను; నా, సహాధ్యాయుండు= నా సహపాఠి (నాతోకూడ విద్యాభ్యాసం చేసినవాడు); ఖగముండు+అను= ఖగముడు అనే పేరు గల; ముని, ముఖ్యుండు= మునిశ్రేష్ఠుడు; అగ్నిహోత్ర, గృహంబునన్= అగ్నులను ఉపాసన చేసే గృహంలో; ఉన్నన్= ఉండగా; ఏన్= నేను; అపహాస+అర్థంబు= వేళాకోళం కొరకు; తృణమయ, సర్పంబు= గడ్డితో చేయబడిన పామును; ఆ+మునిపైన్= ఆ ఖగము డనే మునిపై; వైచినన్= వేయగా; అతండు= ఆ ఖగముడు; ఉలికిపడి= భయపడి; నాకున్+అలిగి= నాపై కోపించి (నన్నయ ఇట్టిచోట్ల షష్ఠీ విభక్తి వాడుతుంటాడు); నీవు; నిర్వీర్యంబు+ఐన= శక్తి రహితమైన; ఉరగంబవు= పామువు; అగుము+అని; శాపంబు+ఇచ్చినన్= శాపం ఈయగా; ఏనును= నేనుకూడ; మేలంబు+చేసినన్= పరిహాసం చేయగా (గసడదవాదేశం); ఇంత= ఇంత అధికంగా; అలుగన్+ఏల= కోపగించటం ఎందుకు? క్షమియింపుము= మన్నింపుము; అనినన్= అని నేను పలుకగా; ప్రసన్నుండు+ఐ= శాంతుడై; ఖగముండు: నా, వచనంబు= నా పలుకు; అమోఘంబు= వ్యర్థం కానిది; కావునన్= అందుచేత; కొండొక, కాలంబు= కొంత కాలం; డుండుభంబవు+ఐ= విషం లేని పామువై (నిర్విషా, డుండుభాః స్మృతాః); ఉండి; భార్గవకుల వర్ధనుండు+ఐన= భృగువంశాన్ని వృద్ధిచేసేవాడైన; రురున్= రురు డనే వాడిని; కనిన+అప్పుడు = చూచినప్పుడు; శాప, విముక్తుండవు+అగుదువు= శాపంవలన విడిచిపెట్ట బడినవాడవు ఔతావు; అనెన్= అని పల్కాడు; అని; సహస్రపాదుండు; రురునకున్; తన, వృత్తాంతంబు+అంతయున్= తనకథ అంతయు; చెప్పి; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: నేను సహస్రపాదు డనే పేరుగల మునిశ్రేష్ఠుడను; నాకు సహపాఠి అయిన ఖగము డనే పేరు గల మునిశ్రేష్ఠుడు అగ్ని గృహంలో ఉండగా నేను పరిహాసానికై గడ్డితో చేయబడిన పామును ఆ మునిపై వేశాను. అతడు భయపడి, నాపై కోపించి, 'నీవు శక్తి లేని పామువు అగు' మని శాప మివ్వగా, నేను వేళాకోళం చేస్తే ఇంతగా కోపించట మెందుకు? మన్నింపు మని వేడుకోగా, శాంతు డై ఖగముడు 'నా పలుకు వ్యర్థం కాదు కాబట్టి కొంత కాలం విషం లేని పామువై ఉండి, భార్గవవంశాన్ని వృద్ధినొందించే రురుడు అనేవాడిని చూచినప్పుడు శాపంనుండి విముక్తుడవౌతా' వని పలికాడు- అని సహస్రపాదుడు రురునకు తన కథనంతా చెప్పి, మరల ఈ విధంగా అన్నాడు.

విశేషం: సహస్రపాదుడికి శాపమిచ్చిన సహాధ్యాయుడి పేరు 'ఖగముఖుడు' గా వావిళ్ళ ప్రతిలో ఉన్నది.

ఉ. భూనుతకీర్తి బ్రాహ్మణుఁడు పుట్టుడుఁ దోడన పుట్టు నుత్తమ
జ్ఞానము, సర్వభూతహిత సంహిత బుద్ధియుఁ జిత్తశాంతియున్,
మానమద ప్రహాణము, సమత్వము, సంతతవేదవిధ్యను
ష్ఠానము, సత్యవాక్యము, దృఢవ్రతముం, గరుణాపరత్వమున్. 157

ప్రతిపదార్థం: భూనుతకీర్తి= భూమిచేత (లోకులచేత) పొగడబడిన కీర్తిగల (ఇది రురునకు సంబోధన మైనా కావచ్చు); బ్రాహ్మణుఁడు; పుట్టుడున్= పుట్టిన అనంతరం; తోడన్+అ= వెంటనే; ఉత్తమ, జ్ఞానము= శ్రేష్ఠ మైన జ్ఞానం; సర్వ, భూత, హిత, సంహిత, బుద్ధియున్= ఎల్లజీవులయొక్క మేలునందు స్థిర మైన బుద్ధియున్నూ; చిత్త, శాంతియున్= హృదయమునందలి శాంతియున్నూ; మాన, మద, ప్రహాణమున్= కోపమును గర్వాన్ని విడుచుటయున్నూ; సమత్వమున్= సమానత్వమున్నూ; సంతత, వేద, విధి+అనుష్ఠానమున్= ఎల్లప్పుడును వేదములందు చెప్పబడిన కర్మలను చేయటమున్నూ; సత్య, వాక్యమున్=

సత్య మైన వచనమున్నూ (సత్యం మాటలాడటం); దృఢవ్రతమున్= నిశ్చల మైన వ్రతమున్నూ; కరుణాపరత్వమున్= దయయందు తత్పరు డై ఉండటమున్నూ; పుట్టున్= కలుగును.

తాత్పర్యం: భూజనులచేత నుతింపబడే కీర్తి గల బ్రాహ్మణుడు పుట్టిన అనంతరం వెంటనే శ్రేష్ఠ మైన జ్ఞానమున్నూ, ఎల్లజీవులమేలునందు స్థిరమైనబుద్ధియున్నూ, హృదయశాంతియున్నూ, కోపగర్వవర్జనమున్నూ, సమానత్వమున్నూ, ఎల్లప్పుడు వేదములందు చెప్పబడిన కర్మల నొనరించటమున్నూ, సత్యవచనమున్నూ, స్థిర మైన వ్రతమున్నూ, దయాపరత్వమున్నూ పుట్టుతాయి.

విశేషం: బ్రాహ్మణుడికి ఉండవలసిన లక్షణాలన్నీ ఇందు పేర్కొనబడినవి.

వ. 'అయ్యా! నీవు బ్రాహ్మణుండవు, భృగువంశ సముత్పన్నుండవు, సర్వగుణ సంపన్నుండ; విది యేమి దొడంగి? తిట్టి దారుణ క్రియారంభంబు క్షత్రియులకుం గాక బ్రాహ్మణులకుం జనునే? బ్రాహ్మణు లహింసాపరు; లొరులు సేయు హింసలు వారించు పరమకారుణ్య పుణ్యమూర్తులు: జనమేజయుం డను జనపతి చేయు సర్పయాగంబునందుఁగద్రూశాపంబున నయ్యెడు సర్పకుల ప్రళయంబును, భవత్పితృశిష్యుం డయిన యాస్తీకుండను బ్రాహ్మణుండ కాఁడె యుడిగించె' నని చెప్పి సహస్రపాదుండు రురునకు సర్పఘాతంబునం దుపశమన బుద్ధి పుట్టించె ననిన విని శౌనకాదిమహామును లక్కథకున కి ట్లనిరి. 158

ప్రతిపదార్థం: అయ్యా!= ఆర్యా! (ఇది రురునకు సంబోధనం); నీవు; బ్రాహ్మణుండవు; భృగు, వంశ, సముత్పన్నుండవు= భృగుమహర్షి యొక్క వంశంలో పుట్టిన వాడవు; సర్వ, గుణ, సంపన్నుండవు= అన్ని సద్గుణాల సంపదతో కూడినవాడవు; ఇది, ఏమి= ఇదేమి?; తొడంగితి(వి)= చేయటానికి ఆరంభించావు?; ఇట్టి= ఇటువంటి; దారుణ, క్రియా+ఆరంభమ్ము= ఘోరమైన పనియందలి ప్రయత్నం; క్షత్రియులకున్, కాక= క్షత్రియులకే కాక; బ్రాహ్మణులకున్= విప్రులకు; చనునే= తగునా?; (తగదు అని భావం); బ్రాహ్మణులు; అహింసాపరులు= హింస చేయకుండ ఉండటంలో ఆసక్తి కలవారు; ఒరులు+చేయు= (గసడదవాదేశం) ఇతరులు చేసే; హింసలు= బాధలు, లేక, వధలు; వారించు= నివారించు (అడ్డగించు); పరమ, కారుణ్య, పుణ్య, మూర్తులు= అధిక మైన దయతోను, పుణ్యంతోను కూడిన రూపాలు కలవారు; జనమేజయుండు+అను జనపతి= జనమేజయు డనే రాజు; చేయు; సర్ప, యాగంబునందున్= పాములను ఆహుతి చేసే యజ్ఞమందు; కద్రూశాపంబునన్= కద్రువ అనే కశ్యపుడి భార్య ఇచ్చిన శాపం చేత; అయ్యెడు= కలుగు; సర్ప, కుల, ప్రళయంబును= పాముల కులం యొక్క నాశమున్నూ; భవత్, పితృ, శిష్యుండు, అయిన= నీతండ్రికి శిష్యు డయిన; ఆస్తీకుండు+అను; బ్రాహ్మణుండు+అ+కాఁడు+ఎ= బ్రాహ్మణుడే కదా!; ఉడిగించెన్= తొలగించాడు; అని, చెప్పి; సహస్రపాదుండు= సహస్రపాదు డనే ముని; రురునకున్, సర్ప, ఘాతంబునందున్= పాములను హింసించటంలో; ఉపశమన, బుద్ధి= ఓర్పుతో కూడిన బుద్ధి; పుట్టించెన్= కల్గించెను; అనినన్= అనగా; విని; శౌనక+ఆది, మహత్, మునులు= శౌనకుడు మొదలైన మహర్షులు; ఆ కథకునకున్= కథ చెప్పే ఆ సౌతికి, ఇట్లు+అనిరి= ఈ విధంగా పలికారు.

తాత్పర్యం: అయ్యా! రురూ! నీవు బ్రాహ్మణుడవు, భృగుమహర్షివంశంలో పుట్టినవాడవు, సర్వసద్గుణసంపదతో కూడినవాడవు. ఇదేమి, ఇటువంటిపని చేయటానికి ఆరంభించావు? ఇట్టి ఘోర మైన పనియందలి ప్రయత్నం క్షత్రియులకు తగును గాని, బ్రాహ్మణులకు తగునా? బ్రాహ్మణులు హింసచేయకుండ ఉండటంలో ఆసక్తి కలవారు.

పైపెచ్చు ఇతరులు చేసే హింసలను తొలగించే గొప్ప దయకున్నూ పుణ్యానికిన్నీ రూపుకట్టినవారు. జనమేజయుడనే రాజు చేసే సర్పయాగంలో తల్లి యైన కద్రువ ఇచ్చిన శాపంచేత కలిగే నాగవంశ వినాశనాన్ని నీ తండ్రికి శిష్యు డైన ఆస్తీకు డనే బ్రాహ్మణుడే కదా వారించింది! అని చెప్పి ఆ సహస్రపాదు డనే ముని రురుడు అనే భృగువంశ బ్రాహ్మణుడికి పాములను చంపేయత్నం మానివేసే బుద్ధిని కలిగించా డని కథకుడు చెప్పగా విని శౌనకాది మహర్షులు కథకు డైన ఆ సౌతిని ఈ విధంగా అడిగారు.

ఆ. ఒరులవలనఁ బుట్టు నోటమియును నెగ్గుఁ । బొరయకుండ నరసి పుత్త్రవరులఁ
దగిలి కాచునట్టి తల్లి సర్పములకు । నేల యలిగి శాప మిచ్చె నయ్య! 159

ప్రతిపదార్థం: ఒరులవలనన్= ఇతరులవలన; పుట్టు= కలుగు; ఓటమియున్= భయాన్నీ; ఎగ్గున్= కీడునూ; పొరయక+ఉండన్= పొందకుండేటట్లుగా; అరసి= చూచి (విచారించి); పుత్త్రవరులన్= కుమార శ్రేష్ఠులను; తగిలి= ఆసక్తి కలిగి; కాచు+అట్టి= కాపాడునటువంటి; తల్లి; సర్పములకున్= పాములకు; అలిగి= కోపించి; ఏల= ఎందుకు; శాపము+ఇచ్చెన్+అయ్య!= శాప మిచ్చింది? అయ్య అనేది కథకుడికి సంబోధనం.

తాత్పర్యం: కథకుడ వైన ఓ సౌతీ! ఇతరులవలన కలుగు భయాన్నీ, కీడునూ, పొందకుండ పరిశీలించి ఉత్తము లైన కుమారులను వెంటబడి కాపాడునటువంటి తల్లియే పాములపై కోపించి ఎందుకు శాప మిచ్చింది? చెప్పుము.

విశేషం: ఉదంత తద్ధర్మ విశేషణానికి అచ్చు పరమైనపుడు నుగాగమం ఔతుంది. పుట్టు+ఓటమి= పుట్టునోటమి; కాచు+అట్టి= కాచునట్టి.

వ. అని సౌపర్ణాఖ్యాన శ్రవణ కుతూహలపరు లై యడిగిన. 160

ప్రతిపదార్థం: అని; సౌపర్ణ+అఖ్యాన, శ్రవణ, కుతూహల, పరులు+ఐ= గరుడునికి సంబంధించిన కథను వినా లనే ఉత్సాహంలో ఆసక్తు లై; అడిగినన్= శౌనకాది మహామును లడుగగా.

తాత్పర్యం: అని గరుడునికి సంబంధించిన కథను వినుటయందు ఆసక్తి కలవారై శౌనకాది మహాము‌ను లడుగగా. (తరువాతి ఆశ్వాసంలోని 'అక్కథకుండు' అనేదానితో అన్వయం.)

ఆశ్వాసాంతము

ఉ. రాజకులాగ్రగణ్య! మృగరాజపరాక్రమ! రాజరాజ! వి
భ్రాజితశుభ్రకీర్తి పరిపాండుర సర్వదిగంతరాళ! ఘో
రాజి ముఖోపలబ్ధ విజయ ప్రమదాశ్రిత బాహుదండ! ని
స్తేజిత వైరివీర! కులదీప! మృడప్రియ! విష్ణువర్ధనా! 161

ప్రతిపదార్థం: రాజ, కుల, అగ్రగణ్య!= చంద్రవంశంలో మొదట గణింపదగిన వాడా (శ్రేష్ఠుడా!); మృగరాజ, పరాక్రమ=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సింహం యొక్క పరాక్రమం వంటి పరాక్రమం కలవాడా! రాజరాజ= రాజరాజ నరేంద్రా! (రాజులకుకూడ రాజు వైన చక్రవర్తీ); విభ్రాజిత, శుభ్ర, కీర్తి, పరిపాండుర, సర్వ, దిక్, అంతరాళ!= ప్రకాశించే నిర్మల మైన కీర్తిచేత తెల్లనైన అన్నిదిక్కుల మధ్యభాగాలు కలవాడా!; ఘోర+ఆజి, ముఖ+ఉపలబ్ధ, విజయ, ప్రమదా+ఆశ్రిత, బాహుదండ!= భయంకర మైన అని మొనలో పొందబడిన విజయమనే స్త్రీ చేత ఆశ్రయింపబడిన దండముల వంటి భుజాలు కలవాడా!; నిస్తేజిత, వైరి, వీర!= తేజోహీనులుగా చేయబడిన శత్రువీరులు కలవాడా!; కులదీప!= కులానికి దీపం వంటివాడా! కులాన్ని ప్రకాశింపజేసేవాడా!; మృడప్రియ= శివుడికి ప్రీతిపాత్రు డైన వాడా!; విష్ణువర్ధనా!= విష్ణువర్ధనుడు అనే బిరుదు కలవాడా!

తాత్పర్యం: చంద్రవంశశ్రేష్ఠుడా! సింహపరాక్రముడా! రాజరాజ! ప్రకాశించే నిర్మల మైన కీర్తిచేత తెల్ల నైన అన్ని దిక్కుల మధ్యభాగాలు కలవాడా! భయంకరమైన రణరంగంలో పొందబడిన విజయమనే స్త్రీ చేత ఆశ్రయింపబడిన దండములవంటి భుజాలు కలవాడా! ఓడింపబడిన శత్రువీరులు కలవాడా! కులాన్ని ప్రకాశింప చేయువాడా! శివుడికి ప్రీతిపాత్రుడైన వాడా! విష్ణువర్ధన బిరుదాంకితుడా!

విశేషం: అలం: రూపకం.

క. ఆదిక్షత్త్ర చరిత్ర! ధ । రాదేవాశీఃపరంపరావర్ధిత ని
త్యోదయ! సత్యోదిత! విమ । లాదిత్యతనూజ! విక్రమాదిత్యనిభా! 162

ప్రతిపదార్థం: ఆదిక్షత్త్ర చరిత్ర= ఆదికాలంలో ఉన్న మనువు మొదలైన క్షత్రియుల చరిత్రవంటి చరిత్ర కలవాడా!; ధరా, దేవ+అశీః, పరంపరా, వర్ధిత, నిత్య, ఉదయ= బ్రాహ్మణులయొక్క ఆశీర్వాదాలసమూహంచేత వృద్ధి పొందింపబడిన సంతతమైన అభ్యుదయం కలవాడా!; సత్య+ఉదిత= సత్యంలో అధికుడా! (సత్యవాక్కులు కలవాడా); విమలాదిత్య, తనూజ= విమలాదిత్యుడి కుమారుడా!; విక్రమాదిత్య, నిభా= విక్రమాదిత్యు డనే ప్రసిద్ధు డైన రాజుతో సమానుడా (విక్రమంలో సూర్యునితో సమానుడా!).

తాత్పర్యం: ఆదికాలంలో ఉన్న మనువు మొదలైన క్షత్రియులచరిత్రవంటి చరిత్రకలవాడా! బ్రాహ్మణుల ఆశీర్వాదాల సమూహం చేత పెంపొందిన నిరంతర మైన అభ్యుదయం కలవాడా! సత్యవాక్కులు కలవాడా! (సత్యాధిక అని పాఠాంతరం), విమలాదిత్యుని కుమారుడా! విక్రమాదిత్యునితో సమానుడా!

విశేషం: అలం: ఉపమ.

తోటకము.

నిరవద్య! నరేశ్వర! నిత్యనిరం । తర ధర్మమతీ! గుణధామ! జగ
త్పరిపూరిత కీర్తి విభాసి! విభా కరతేజ! నృపోత్తమ! కాంతినిధీ! 163

ప్రతిపదార్థం: నిరవద్య= దోషరహితుడా!; నర+ఈశ్వర= రాజా!; నిత్య, నిరంతర, ధర్మ, మతీ= ఎల్లప్పుడున్నూ అవిచ్ఛిన్నంగా ధర్మమునందు బుద్ధి కలవాడా!; గుణ, ధామ= సద్గుణాలకు నిలయమా!; జగత్, పరిపూజిత, కీర్తి, విభాసి= లోకాలన్నింటిలో నిండిన కీర్తితో ప్రకాశించేవాడా! విభాకర, తేజ= సూర్యుడియొక్క తేజం వంటి తేజం కలవాడా!; నృప+ఉత్తమ= రాజులలో శ్రేష్ఠుడా!; కాంతి, నిధీ= కాంతికి నిధానమా!

తాత్పర్యం: దోషరహితుడా! మానవాధిపా!, ఎల్లప్పుడు ఎడతెఱపి లేకుండా ధర్మం చేసే బుద్ధి కలవాడా! సద్గుణాలకు నిలయమా! లోకాలన్నింటియందునూ నిండిన కీర్తితో ప్రకాశించేవాడా! సూర్యుడితేజం వంటి తేజం కలవాడా! రాజశ్రేష్ఠుడా! కాంతినిధానమా! రాజరాజనరేంద్రా!

విశేషం: తోటకవృత్తంలో ఒక్కొక్క పాదానికి నాలుగేసి సగణాలు ఉంటాయి. తొమ్మిదవ అక్షరం యతిస్థానం, ప్రాసనియమం ఉన్నది.

గద్యము.

ఇది సకల సుకవి జన వినుత నన్నయభట్ట ప్రణీతం బైన శ్రీ మహాభారతంబునం దాదిపర్వంబున ననుక్రమణికయును, పౌష్యోదంక మాహాత్మ్యంబును, భృగువంశకీర్తనంబు నన్నది ప్రథమాశ్వాసము. 164

ప్రతిపదార్థం: ఇది, సకల, సుకవి, జన, వినుత, నన్నయ, భట్ట, ప్రణీతంబు+ఐన= మంచికవులందరిచేత స్తుతింపబడిన నన్నయభట్టు అనే పేరుగల కవిచేత రచింపబడిన; శ్రీ, మహత్, భారతంబునందున్= శోభాయుక్త మైన మహాభారతమనే గ్రంథంలోని; ఆది, పర్వంబునన్= ప్రధానమైన పదునెనిమిది పర్వాలలో మొదటిదైన ఆదిపర్వంలో; అనుక్రమణికయును= కావ్యంలోని విషయాల సూచికయున్నూ, పౌష్య+ఉదంక, మాహాత్మ్యంబును= పౌష్యుడనే రాజుయొక్కయు, ఉదంకునియొక్కయు మాహాత్మ్యమున్నూ; భృగు, వంశ, కీర్తనంబును= భృగుమహర్షి వంశాన్ని కీర్తించటమున్నూ; అన్నది= అనేవాటితో కూడినది; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది సుకవులందరిచేత కీర్తింపబడే నన్నయభట్టుచేత రచింపబడిన శ్రీమహాభారతంలోని ఆదిపర్వంలో అనుక్రమణిక (భారతపర్వాల విషయసూచిక,) పౌష్యుడు, ఉదంకుడు అనే వారి మహత్త్వాన్ని చెప్పేకథ, భృగువంశాన్ని కీర్తించే కథ కల ప్రథమాశ్వాసం.

ఆదిపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము -ద్వితీయాశ్వాసము

శ్రీవనితావల్లభ! వేం । గీవిషయాధీశ! కావ్యగీతప్రియ! నా
నావనినాథకిరీటత । టీవిలసద్రత్నసంఘటితపదకమలా! 1

ప్రతిపదార్థం: శ్రీ, వనితా, వల్లభ= లక్ష్మి అనే కాంతకు ప్రియుడా!; వేంగీ, విషయ+అధీశ!= వేంగి అనే దేశానికి ప్రభువా!; కావ్య, గీత, ప్రియ!= కావ్యాలలో, గీతాలలో ఆసక్తికలవాడా!; నానా+అవని, నాథ, కిరీట, తటీ, విలసత్, రత్న, సంఘటిత, పద, కమలా!= పలువురురాజులయొక్క కిరీటాలప్రదేశాలలో ప్రకాశిస్తున్న మణులచేత కూర్పబడిన పద్మాలవంటి పాదాలు కలవాడా!

తాత్పర్యం: లక్ష్మి అనే కాంతకు ప్రియుడా! (నా౽విష్ణుః పృథివీపతిః అనే సూక్తిని అనుసరించి, రాజులలో విష్ణువుయొక్క అంశం ఉంటుంది. ఇక్కడ శ్రీఅంటే రాజ్యలక్ష్మి అనికూడ చెప్పవచ్చు); వేంగీదేశానికి రాజా! కావ్యాలలో, గీతాలలో అసక్తికలవాడా! బహుదేశరాజులకిరీటతటాలలో ప్రకాశించేమణులచేతకూర్చబడిన పద్మాలవంటిపాదాలు కలవాడా! రాజారాజనరేంద్రా!

విశేషం: ఇది రాజరాజనరేంద్రుడికి సంబోధన. ఇతడు కృతిపతి, కృతిశ్రోత.

గరుడోపాఖ్యానము

కద్రూవినతలు పుత్రులం గోరి పడయుట (సం. 1-14-5)

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుంజెప్పె: నాదియుగంబునం గశ్యపప్రజాపతిభార్యలయిన కద్రువయు వినతయు ననువారలు పుత్త్రార్థినులైయనేక సహస్రవర్షంబులు కశ్యపు నారాధించినం, గశ్యపుండు ప్రసన్నుం డై 'మీకోరినవరంబు లిచ్చెద వేఁడుం' డనిన. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు (త్రికసంధి)= రోమహర్షణు డనే సూతుడికుమారు డయిన ఉగ్రశ్రవసుడు; శౌనక+ఆది, మహత్, మునులకున్= శౌనకుడు మొదలయిన మహామునులకు; చెప్పెన్; ఆది, యుగంబునన్= కృతయుగంలో; కశ్యప, ప్రజాపతి, భార్యలు+అయిన= కశ్యపబ్రహ్మభార్య లయిన; కద్రువయు, వినతయున్, అను, వారలు= కద్రువ, వినత అనేవారు; పుత్త్ర+అర్థినులు+ఐ= కొడుకులను కోరేవారై; అనేక, సహస్ర, వర్షంబులు= పెక్కువేలఏండ్లు; కశ్యపున్, ఆరాధించినన్= కశ్యపుడిని సేవించగా; కశ్యపుండు; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహం కలవాడై; మీ, కోరినవరంబులు= మీరు కోరినవరాలను (కర్మపదప్రథమకు షష్ఠి); ఇచ్చెదన్= ఇస్తాను; వేఁడుండు= కోరుకొనండి; అనినన్= అని అనగా.

తాత్పర్యం: కథకుడైన ఉగ్రశ్రవసుడు శౌనకుడు మొదలయినమహామునులకు ఇట్లా చెప్పాడు: కృతయుగంలో కశ్యపబ్రహ్మయొక్క భార్య లయిన కద్రువ, వినత లనేవారు కుమారులనుకోరినవారై, పెక్కువేలఏండ్లు కశ్యపుడిని సేవించగా, అతడు అనుగ్రహం కలవా డై 'మీరు కోరినవరాలను ఇస్తాను కోరుకొనండి' అని పలుకగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

తరలము.

అనలతేజులు, దీర్ఘదేహులు నైనయట్టి తనూజులన్
వినుతసత్త్వులఁ గోరెఁ గద్రువ వేవురం గడువేడ్కతోఁ;
వినత గోరె సుపుత్త్రులన్ భుజవీర్యవంతుల, వారికం
టెను బలాధికు లైన వారిఁ, గడిందివీరుల, నిద్దఱన్. **3**

ప్రతిపదార్థం: కద్రువ; అనల, తేజులు= అగ్నియొక్కప్రకాశంవంటి ప్రకాశం కలవారు; దీర్ఘ, దేహులు= పొడవయినశరీరం కలవారు; ఐన, అట్టి; తనూజులన్= కుమారులను; వినుత, సత్త్వులన్= ప్రసిద్ధిపొందినబలం కలవారిని; వేవురన్= వెయ్యిమందిని; కడు, వేడ్కతోన్= మిక్కిలిఆసక్తితో; కోరెన్; వినత; భుజ, వీర్యవంతులన్= బాహువులయొక్క బలంకలవారిని; వారి కంటెను= ఆకద్రువకొడుకులకంటె; బల+అధికులు+ఐనవారిన్= బలంలో గొప్పవారిని; కడింది, వీరులన్= ఇతరులకు జయింపశక్యం కాని అధికవీరులను; సుపుత్త్రులన్= మంచికుమారులను; ఇద్దఱన్= ఇరువురిని; కోరెన్= కోరింది.

తాత్పర్యం: అగ్నివలె ప్రకాశించేవారున్నూ, పొడవయినదేహాలుకలవారున్నూ ప్రసిద్ధిపొందిన బలం కలవారున్నూ అయిన వెయ్యిమందికుమారులను కద్రువ మిక్కిలిసంతోషంతో కోరింది. వినత, ఆ కద్రువకుమారులకంటె బలంలో గొప్పవారున్నూ, బాహువులబలం కలవారున్నూ, అయిన ఇద్దరు మంచికుమారులను కోరింది.

విశేషం: తరల వృత్తానికి ప్రతిపాదంలోనూ న, భ, ర, స, జ, జ, గ - అనే గణాలుంటాయి. 12వ అక్షరం యతి. పాదానికి 19 అక్షరాలుంటాయి.

వ. **కశ్యపప్రజాపతి తొల్లి పెద్దకాలంబు తపంబు సేసి, పుత్త్రకామేష్టిఁ జేసెఁ గావునఁ గద్రువకు వేవురుకొడుకులను, వినతకు నిద్దఱుకొడుకులను వారికోరినయట్ల యిచ్చి, గర్భంబు లిమ్ముగా రక్షింపంబనిచిన నయ్యిద్దఱును దద్దయు సంతసిల్లి యున్నంత, గర్భంబులు గొండొకకాలంబునకు నండంబు లైన, నయ్యండంబులు ఘృతకుండంబులం బెట్టి రక్షించుచున్నంత, నేనూఱేండ్లకుఁ గద్రూగర్భాండంబులు తరతరంబ యవిసిన నందు శేష వాసుక్యైరావత తక్షక కర్కోటక ధనంజయ కాళియ మణినాగాపూరణ పింజర కైలాపుత్త్ర వామన నీలానీల కల్మాష శబలార్య కోగ్రక కలశపోతక సురాముఖ దధిముఖ విమలపిండ కాప్త కర్కోటక శంఖవాలి శిఖి నిష్ఠానక హేమగుహ నహుష పింగళ బాహ్యకర్ణ హస్తిపద ముద్గర పిండక కంబలాశ్వతర కాళీయక వృత్త సంవర్తక పద్మశంఖముఖ కూష్మాండక క్షేమక పిండారక కరవీర పుష్పదంష్ట్ర బిల్వక బిల్వపాండర మూషకాద శంఖశిరః పూర్ణభద్రహరిద్రకాపరాజిత జ్యోతిక శ్రీవహ కౌరవ్య ధృతరాష్ట్ర శంఖపిండ వీర్యవ ద్విరజస్సుబాహు శాలిపిండ హస్తిపిండ పిఠరక సుముఖ కౌణపాశన కుఠర కుంజర ప్రభాకర కుముద కుముదాక్ష తిత్తిరి హలిక కర్దమ బహుమూలక కర్కరాకర్కర కుండోదర మహోదరు లాదిగాఁగల వేవురు నాగముఖ్యులు పుట్టిన.** **4**

ప్రతిపదార్థం: కశ్యప ప్రజాపతి= కశ్యపబ్రహ్మ; తొల్లి= పూర్వం; పెద్దకాలంబు, తపంబు, చేసి; పుత్త్ర, కామ+ఇష్టిన్= పుత్త్ర, కామ మనే యజ్ఞాన్ని (కుమారులుకలగాలనే కోరికతో చేసే యాగాన్ని); చేసెన్; కావునన్= అట్లా యజ్ఞం చేయటంవలన;

కద్రువకున్; వేవురన్, కొడుకులను= వెయ్యిమందికుమారులను; వినతకున్, ఇద్దఱన్, కొడుకులన్; వారి, కోరిన, అట్లు+అ= వారు కోరిన విధంగానే; ఇచ్చి; గర్భంబులు= కడుపులోని పిండాలను; ఇమ్ముగాన్= ఉపాయంగా; రక్షింపన్, పనిచినన్= రక్షించటానికి నియమించగా; ఆ+ఇద్దఱును= ఆ కద్రూవినతలిద్దరును; తద్దయున్= మిక్కిలి; సంతసిల్లి, ఉన్నంతన్; గర్భంబులు= కడుపులోనిపిండాలు; కొండొక, కాలంబునకున్= కొంతకాలానికి; అండంబులు+ఐనన్= గ్రుడ్లుగా మారగా; ఆ+అండంబులు= ఆ గ్రుడ్లు; ఘృత, కుండంబులన్= నేతికుండలలో; పెట్టి; రక్షించుచున్న, అంతన్= రక్షిస్తూఉండగా; ఏను, నూఱు+ఏండ్లకున్= అయిదువందల సంవత్సరాలకు; కద్రూ, గర్భ+అండంబులు= కద్రువయొక్క గర్భంనుండి పుట్టిన గ్రుడ్లు; తరతరంబు+అ= ఒకదానితర్వాత ఒకటిగా; అనిసినన్= పగలగా; అందున్= ఆ గ్రుడ్లలో; శేషుడు, వాసుకి, ఐరావతుడు, తక్షకుడు, కర్కోటకుడు, ధనంజయుడు, కాళియుడు, మణినాగుడు, ఆపూరణుడు, పింజరకుడు, ఏలాపుత్త్రుడు, వామనుడు, నీలుడు, అనీలుడు, కల్మాషుడు, శబలుడు, ఆర్యకుడు, ఉగ్రకుడు, కలశపోతకుడు, సురాముఖుడు, దధిముఖుడు, విమలపిండకుడు, ఆప్తుడు, కర్కోటకుడు, శంఖుడు, వాలిశిఖుడు, నిష్ఠానకుడు, హేమగుహుడు, నహుషుడు, పింగళుడు, బాహ్యాకర్ణుడు, హస్తిపదుడు, ముద్గరుడు, పిండకుడు, కంబలుడు, అశ్వతరుడు, కాళీయకుడు, వృత్తుడు, సంవర్తకుడు, పద్మడు, శంఖముఖుడు, కూష్మాండకుడు, క్షేమకుడు, పిండారకుడు, కరవీరుడు, పుష్పదంష్ట్రుడు, బిల్వకుడు, బిల్వపాండరుడు, మూషకాదుడు, శంఖశిరుడు, పూర్ణభద్రుడు, హరిద్రకుడు, అపరాజితుడు, జ్యోతికుడు, శ్రీవహుడు, కౌరవ్యుడు, ధృతరాష్ట్రుడు, శంఖపిండుడు, వీర్యవంతుడు, విరజుడు, సుబాహువు, శాలిపిండుడు, హస్తిపిండుడు, పిఠరకుడు, సుముఖుడు, కౌణపాశనుడు, కుఠరుడు, కుంజరుడు, ప్రభాకరుడు, కుముదుడు, కుముదాక్షుడు, తిత్తిరి, హలికుడు, కర్దముడు, బహుమూలకుడు, కర్కరుడు, అకర్కరుడు కుండోదరుడు, మహోదరుడు; ఆదిగాన్, కల= మొదలుగా గల; వేవురు= వెయ్యిమంది; నాగముఖ్యులు= సర్పశ్రేష్ఠులు; పుట్టినన్= పుట్టగా.

తాత్పర్యం: పూర్వం కశ్యపబ్రహ్మ ఎక్కువకాలం తపస్సుచేసి, కుమారులను పొందగోరేవారు చేసే పుత్రకామేష్టి అనే యాగాన్ని చేశాడు. అట్లా చేయటంవలన కద్రువకు వెయ్యిమందికొడుకులను, వినతకు ఇద్దరుకొడుకులను వారు కోరినట్లుగా ఇచ్చి, గర్భాలను ఉపాయంతో కాపాడటానికి ఆజ్ఞాపించగా, వారిద్దరూ మిక్కిలిసంతోషించారు. కొంతకాలానికి గర్భాలు అండాలుగా మారాయి. వాటిని నేతికుండలలో ఉంచి రక్షిస్తూండగా అయిదువందల సంవత్సరాలకు కద్రువగర్భంలోని అండాలు, ఒకదాని తరువాత ఒకటిగా పగిలి, శేషుడు, వాసుకి, ఐరావతుడు, తక్షకుడు మొదలయిన వెయ్యిమంది సర్పశ్రేష్ఠులు పుట్టగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

అనూరుఁడు జనించి వినతకు శాప మిచ్చుట (సం. 1-14-14)

క. తన గర్భాండంబులరెం । టను బ్రియనందనులు వెలువడమి, నతిలజ్జా
వనత యయి వినత పుత్త్రా । ర్థిని యొకయండంబు విగతధృతి నవియించెన్. 5

ప్రతిపదార్థం: తన, గర్భ+అండంబుల, రెంటను= తనయొక్కకడుపునుండి పుట్టిన పిండరూపా లయిన గ్రుడ్లు రెండింటిలోను; ప్రియ, నందనులు= ప్రీతికరు లైన (కూరిమి)కొడుకులు; వెలువడమిన్= బయటపడకుండటంచేత; అతిలజ్జా+అవనత, అయి= మిక్కిలి సిగ్గుచేత క్రుంగిన దై; పుత్త్ర+అర్థిని= కొడుకులను కోరేటి; వినత; ఒక, అండంబున్= ఒక గ్రుడ్డును; విగత, ధృతిన్= పోయిన ధైర్యంతో; అవియించెన్= పగులగొట్టింది.

తాత్పర్యం: తన గర్భంనుండి పుట్టినగ్రుడ్లు రెండింటినుండి ముద్దుకుమారులు బయల్పడని కారణాన, మిక్కిలిసిగ్గుచేత క్రుంగినదై, కొడుకులను కోరే వినత ధైర్యం కోల్పోయి ఒకగ్రుడ్డును బ్రద్ద లయ్యేట్లు చేసింది.

క. దాన నపరార్ధకాయవి । హీనుఁడు, పూర్వార్ధతనుసహితుఁ డరుణుఁ డనం
గా నుదయించె సుతుండు, మ । హానీతియుతుండు తల్లి కప్రియ మెసఁగన్. 6

ప్రతిపదార్థం: దానన్= బ్రద్దలు చేయబడినగ్రుడ్డునుండి; అపర+అర్ధ, కాయ, విహీనుఁడు= క్రింది సగం శరీరం లేనివాడు; పూర్వ+అర్ధ, తను, సహితుఁడు= మీదిసగంశరీరంతో కూడినవాడు; అరుణుఁడు+అనంగాన్= అరుణు డనే పేరుతో; తల్లికిన్= తల్లి అయిన వినతకు; అప్రియము= అనిష్టం; ఎసఁగన్= అతిశయించగా; మహత్, నీతి, యుతుండు= గొప్పనీతితో కూడినవాడైన; సుతుండు= కుమారుడు; ఉదయించెన్= పుట్టాడు.

తాత్పర్యం: ఆగ్రుడ్డునుండి క్రిందిసగందేహం లేనివాడున్నూ, మీది సగందేహంతో కూడినవాడున్నూ అయినకుమారుడు అరుణు డనే పేరుతో గొప్పనీతితోకూడినవాడు తల్లికి అనిష్టం అతిశయించేటట్లు పుట్టాడు.

వ. ఇట్లు వికలాంగుం డై పుట్టిన యనూరుండు వినతకు నలిగి 'నన్ను సంపూర్ణశరీరుం గానీక యండం బవియించిన యవినీతవు కావున నీవు నీసవతికి దాసివై యేనూఱేం డ్లుండు' మని శాపం బిచ్చి, 'యింక నీ రెండవయండంబు తనకుఁ దాన యవియునంతకు నుండని; మ్మిందుఁ బుట్టెడు పుత్త్రుండు మహాబలపరాక్రమసంపన్నుండు నీ దాసీత్వంబు వాపు' నని సెప్పి సూర్యరథసూతుండయి యరిగె; వినతయు నయ్యండం బతిప్రయత్నంబున రక్షించుకొనియుండె; నంత. 7

ప్రతిపదార్థం: ఇట్లు; వికల+అంగుండు+ఐ= సంపూర్ణం కాని శరీరం కలవాడై; అనూరుండు= తొడలు లేనివాడు- ఇది అరుణుని నామాంతరం; వినతకున్, అలిగి= తల్లి అయిన వినతపై కోపించి (నన్నయనాడు ఇట్టిచోట్ల షష్ఠీవిభక్తి వాడబడుతూ ఉండేది. ఇది కారకభేదం); సంపూర్ణ, శరీరున్, కానీక= సమగ్రమయిన శరీరం కలవాడిని కానీయకుండ; అండంబు= గ్రుడ్డును; అవియించినన్= బ్రద్దలు చేయగా; అవినీతవు= నీతి లేని దానివి; కావునన్= ఆకారణంచేత; నీవు; నీసవతికిన్= నీ సవతి అయిన కద్రువకు; దాసివి+ఐ= సేవకురాలివై; ఏను, నూఱు+ఏండ్లు+ఉండుము, అని= అయిదువందలేండ్లు ఉండు మని; శాపంబు+ఇచ్చి= శాపాన్నిచ్చి; ఇంకన్= ఇకముందు; ఈ, రెండవ, అండంబు= వినత గర్భంనుండి వెలువడిన వేరొకగ్రుడ్డు; తనకున్, తాను+అ= తనంతట అదే; అవియు, అంతకున్= బ్రద్దలయ్యేంతవరకు; ఉండన్+ఇమ్ము; ఇందున్= ఈ రెండవగ్రుడ్డునుండి; పుట్టెడు, పుత్త్రుండు= పుట్టబోయే కుమారుడు; మహత్, బల, పరాక్రమ, సంపన్నుండు= గొప్పబలంతోను, శౌర్యంతోను కూడినవాడు; నీ, దాసీత్వంబు= నీదాసితనాన్ని; పాపున్= పోగొడతాడు; అనిచెప్పి; సూర్య, రథ, సూతుండు+అయి= సూర్యునియొక్కరథానికి సారథి అయి; అరిగెన్= వెళ్ళాడు; వినతయున్= వినతకూడ; ఆ+అండంబు= ఆ రెండవగ్రుడ్డును; అతి, ప్రయత్నంబునన్= మిక్కిలి ప్రయత్నంతో; రక్షించుకొని, ఉండెన్= కాపాడుకొని ఉండింది; అంతన్= ఆపైన.

తాత్పర్యం: పూర్తిగా ఏర్పడనిశరీరంతో పుట్టిన అనూరుడు, వినతపై కోపగించుకొని 'నన్ను పూర్తిశరీరం కలవాడిని కానీయకుండ గ్రుడ్డును బ్రద్దలుచేసిన నీతి లేనిదానివి. కావున నీ సవతి అయిన కద్రువకు దాసిగా అయిదువందలసంవత్సరాలు ఉండు' మని శపించి రెండవగ్రుడ్డు తనకుతానుగా పగిలేవరకు ఉండనిమ్ము. ఈ గ్రుడ్డునుండి పుట్టబోయే కుమారుడు గొప్పబలంతోను, పరాక్రమంతోను కూడినవాడు. అతడు నీదాసితనాన్ని పోగొడతాడు' అని తెలిపి సూర్యుడికి రథసారథిగా వెళ్ళాడు. వినతకూడ మిక్కిలి జాగరూకతతో ఆగ్రుడ్డును రక్షించుకొని ఉండింది. ఆ పైన (తరువాతి పద్యంతో అన్వయం.)

దేవాసురు లమృతమును బడయఁగోరి సముద్రమును మథించుట (సం.1-15-5)

క. అమరాసురవీరులు ము। న్నమల పయోరాశిఁ ద్రచ్చి, యమృతము వడయన్
సమకట్టి, సురేంద్రపురో। గము లై హరిహరహిరణ్యగర్భులతోడన్. 8

ప్రతిపదార్థం: అమర+అసుర, వీరులు= వీరులయిన దేవతలు, రాక్షసులు; మున్ను= పూర్వం; అమల, పయోరాశిన్= నిర్మలమయిన పాలసముద్రాన్ని; త్రచ్చి= మథించి; అమృతము+పడయన్= అమృతాన్ని పొందటానికి; సమకట్టి= సిద్ధపడి; సుర+ఇంద్ర, పురోగములు+ఐ= దేవతల రాజయిన ఇంద్రుడు ముందు కలవారై; హరి, హర, హిరణ్యగర్భులతోడన్= విష్ణువు, శివుడు, బ్రహ్మ అనేవారితో.

తాత్పర్యం: పూర్వం వీరులయిన దేవతలూ, రాక్షసులూ పాలసముద్రాన్ని మథించి అమృతాన్ని పొందటానికి పూని ఇంద్రుడిని ముందుంచుకొని విష్ణుశంకరబ్రహ్మలతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. మేరుమహామహీధరముమీఁదికి నందఱుఁ బోయి, 'యేక్రియన్
వారిధిఁ ద్రచ్చువారము? ధ్రువంబుగ దానికిఁ గవ్వ మెద్ది? యా
ధారము దాని కెద్ది?' యని తద్దయు వెన్నడియున్న, నచ్యుతాం
భోరుహగర్భులిద్దఱును బూనిరి సర్వము నిర్వహింపఁగన్. 9

ప్రతిపదార్థం: మేరు, మహత్, మహీధరము, మీఁదికిన్= మేరు అనే గొప్పపర్వతంమీదికి; అందఱున్+పోయి= దేవతలు రాక్షసులు అందరును వెళ్ళి; ఏక్రియన్= ఏవిధంగా; వారిధిన్= సముద్రాన్ని, త్రచ్చువారము= మథించగలం; ధ్రువంబుగన్= స్థిరంగా; దానికిన్= ఆకార్యానికి; కవ్వము; ఎద్ది= ఏది; దానికిన్= ఆకవ్వానికి; ఆధారము= అవలంబం; ఎద్ది= ఏది; అని; తద్దయున్= ఎక్కువగా; వెన్నడి, ఉన్నన్= చింతిస్తూ వెనకాడుతుండగా; అచ్యుత+అంభోరుహ, గర్భులు+ ఇద్దఱున్= విష్ణువు, బ్రహ్మ, ఇద్దరును; సర్వమున్= కార్యాన్నంతటిని; నిర్వహింపఁగన్= సాధించటానికి; పూనిరి= సమకట్టినారు.

తాత్పర్యం: దేవాసురు లందరూకలిసి మేరుపర్వతంమీదికి పోయి, 'ఏవిధంగా సముద్రాన్ని మథిద్దాము? మథించటానికి స్థిరమైన కవ్వం ఏది? ఆకవ్వానికి క్రింద ఆధార మేది?' అని మిక్కిలి చింతించి వెనుకాడుతుండగా బ్రహ్మవిష్ణువులిద్దరూ, ఆ మథనకార్యాన్నంతటినీ సాధించటానికి సమకట్టారు.

చ. అరుదుగ సర్వశైలములయంత తనర్పును నార్జవంబు సు
స్థిరతయు నోషధీరసవిశేషతయుం గల దుత్తమంబు మం
థరకుధరంబు గవ్వ మగు దానికి నంచును నిశ్చయించి, య
య్యిరువురుఁ బంపఁగాఁ బెఱికి యెత్తె ననంతుఁడు తద్గిరీంద్రమున్. 10

ప్రతిపదార్థం: అరుదుగన్= అపూర్వంగా; సర్వ, శైలముల, అంత, తనర్పును= అన్ని పర్వతాలంత పొడవును; ఆర్జవంబు= సరళత్వాన్ని (వంకరలేనితనాన్ని); సుస్థిరతయున్= మంచి స్థిరత్వాన్ని; ఓషధీ, రస, విశేషతయున్= మూలికలయొక్క రసంయొక్క అతిశయం కలిగి ఉండటాన్ని; కలది= కలిగి ఉన్నది; ఉత్తమంబు= శ్రేష్ఠమైనది అయిన; మంథర, కుధరంబు= మంథరపర్వతం; దానికిన్= ఆమథించేకార్యానికి; కవ్వము+అగున్; అంచును; నిశ్చయించి= నిర్ణయించి; ఆ+ఇరువురును= ఆబ్రహ్మవిష్ణువులిద్దరూ; పంపఁగాన్= ఆజ్ఞాపింపగా; అనంతుఁడు= శేషుడు; తద్, గిరి+ఇంద్రమున్= ఆపర్వతశ్రేష్ఠాన్ని; పెఱికి= పెళ్ళగించి, ఎత్తెన్= ఎత్తాడు.

తాత్పర్యం: అపూర్వంగా అన్నిపర్వతాలు కూడితే ఎంతపొడవుంటుందో అంతపొడవున్నూ, వంకరలేనిఎత్తున్నూ, మిక్కిలిస్థిరత్వాన్నీ కలిగి, మూలికలరసంయొక్క అతిశయత్వంతో కూడి శ్రేష్ఠమైనది అయిన మంథరపర్వతం, క్షీరసాగర మథనానికి కవ్వ మవుతుందని నిర్ణయించి ఆ బ్రహ్మవిష్ణువు లిరువురూ ఆజ్ఞాపించగా, శేషుడు ఆ పర్వతశ్రేష్ఠాన్ని పెళ్ళగించి పైకెత్తాడు.

వ. ఇట్లు పదునొకండువేలయోజనంబులతనర్పును, నంతియపాఁతునుం గల మంథరనగం బనంతుం డనంత శక్తిం బెటికి యెత్తిన, నందఱును నప్పర్వతంబు దెచ్చి, సముద్రంబులో వైచి, దానిక్రింద నాధారంబుగాఁ గూర్మరాజు నియమించి, యోక్త్రంబుగా వాసుకి నమర్చి. 11

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; పదునొకండు, వేల, యోజనంబుల, తనర్పును= పదకొండువేల ఆమడల(నాలుగుక్రోసులు) పొడవున్నూ; అంతియ, పాఁతునున్= పదకొండువేలయోజనాల భూమిలోపలిభాగాన్నీ; కల; మంథరనగంబు= మంథరపర్వతాన్ని; అనంతుండు= ఆదిశేషుడు; అనంత, శక్తిన్= అధికమయినశక్తితో; పెటికి= పెల్లగించి; ఎత్తినన్= ఎత్తగా; అందఱును= దేవాసురులందరూ; ఆ+పర్వతంబు+తెచ్చి= ఆమంథరపర్వతాన్ని తెచ్చి; సముద్రంబులోన్; వైచి= వేసి; దానిక్రిందన్= ఆపర్వతానికి అడుగున; ఆధారంబుగాన్= అవలంబంగా; కూర్మరాజు= ఆదికూర్మాన్ని (తాఁబేటిని); నియమించి= నియోగించి, యోక్త్రంబుగాన్= కవ్వపుత్రాడుగా; వాసుకిన్= వాసుకి అనే సర్పరాజును; అమర్చి= ఏర్పరచి.

తాత్పర్యం: ఈవిధంగా పదకొండువేలయోజనాల పొడవున్నూ, అంతే (అంటే పదకొండువేలయోజనాల) భూమిలోని భాగాన్నీ కలిగిన మంథరపర్వతాన్ని ఆదిశేషుడు అధిక మైన శక్తితో పెళ్ళగించి ఎత్తగా, దేవాసురులందరున్నూ ఆమంథరపర్వతాన్ని తెచ్చి, సముద్రంలో వేసి, దిగబడిపోకుండ దానిక్రింద ఆధారంగా ఆదికూర్మాన్ని నియోగించి, కవ్వపుత్రాడుగా వాసుకి అనే పేరున్న సర్పరాజును ఏర్పాటుచేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

శా. క్షోణీచక్రభరంబు గ్రక్కదల దిక్కుల్ మ్రోయఁగా నార్చి, య
క్షీణోత్సాహసమేతు లై రయమునన్ గీర్వాణులుం, బూర్వగీ
ర్వాణవ్రాతము నబ్ధిఁ ద్రచ్చునెడఁ దద్వ్యాకృష్టనాగానన
శ్రేణీప్రోత్థవిషాగ్నిధూమవితతుల్ సేసెం బయోదావలిన్. 12

ప్రతిపదార్థం: క్షోణీ, చక్ర, భరంబు= భూమియొక్కభారం, క్రక్కదలన్= మిక్కిలి కదలగా; దిక్కుల్= దిక్కులు; మ్రోయఁగాన్= ప్రతిధ్వనించగా; ఆర్చి= బొబ్బలిడి; అక్షీణ+ఉత్సాహ, సమేతులు+ఐ= అధికమయిన ఉత్సాహంతో కూడినవా రై; రయమునన్= వేగంతో, గీర్వాణులున్= దేవతలున్నూ; పూర్వగీర్వాణ, వ్రాతమున్= రాక్షసుల యొక్కసమూహమున్నూ; అబ్ధిన్= సముద్రాన్ని; త్రచ్చు+ఎడన్= మథించేటప్పుడు; తద్, వ్యాకృష్ట, నాగ+ఆనన, శ్రేణీ, ప్రోత్థ, విష+అగ్ని, ధూమ వితతుల్= వారిచేత లాగబడిన వాసుకి అనే సర్పంయొక్క ముఖాలవరుసనుండి బయల్వెడలిన విష మనే అగ్నియొక్క పొగలసముదాయాలు; పయోద+ఆవళిన్= మేఘాల పంక్తిని, చేసెన్= సమకూర్చాయి (కలిగించాయి).

తాత్పర్యం: గుండ్రని భూమి అంతయూ మిక్కిలి కదలగా, దెసలు మారుమ్రోయగా, కేకలువేస్తూ, అధిక మయిన ఉత్సాహంతో కూడినవారై, వేగంతో దేవతలున్నూ, రాక్షససముదాయమున్నూ సముద్రాన్ని మథించేటప్పుడు వారిచే లాగబడిన వాసుకిసర్పంయొక్క ముఖాలవరుసనుండి బయల్వెడలిన విష మనే అగ్నియొక్క పొగలగుంపులు మేఘపంక్తిని కల్పించాయి.

విశేషం: ప్రయోగదక్షుడైనకవి కవితలో వాడే వర్ణాలూ, పదాలూ ఏ విధంగా రసాదివ్యంజకా లౌతాయో, అట్లాగే సమాస సంఘటనలుకూడ విభావాదులను, రసాదులను వ్యంజింపచేస్తాయి. క్షోణీచక్రము, అక్షీణోత్సాహసమేతులు, గీర్వాణులు, పూర్వగీర్వాణులు అనే సమాసాలలో మూర్ధన్యము, అనునాసికమూ అయిన ణ వర్ణపునఃపునరావృత్తి వారు చేసే నాదాన్ని ధ్వనింపచేస్తున్నది. వాసుకి ముఖంనుండి వినిర్గతమైన విషాగ్నిధూమతతులను ఈపద్యంలో మిగిలిన సమాసాలకంటె దీర్ఘమైన సమాసంగా సంఘటించటంచేత వాసుకి ధైర్యం, విషానలధూమవ్యాప్తీ అక్షరరమ్యంగా ధ్వనింపజేయబడుతున్నాయి. (సంపా.)

క. ఉరగపతితలలవల నురు । తరజవమున నసురు లూఁది, తత్పుచ్ఛము ని
ర్జరవరు లూఁది మహోమ । త్సరమున వడిఁ ద్రచ్చి త్రచ్చి జవమఱియున్నన్. 13

ప్రతిపదార్థం: ఉరగపతి, తలల, వలను= సర్పరా జయిన వాసుకియొక్క తలలవైపు; ఉరుతర, జవమునన్= మిక్కిలి అధిక మయిన శక్తితో(వడితో); అసురులు= రాక్షసులు; ఊఁది= పట్టుకొని; తద్, పుచ్ఛము= ఆవాసుకియొక్కతోకను; నిర్జరవరులు= దేవతాశ్రేష్ఠులు; ఊఁది; మహత్, మత్సరమునన్= అధికమయిన చలంతో; వడిన్= వేగంతో; త్రచ్చి, త్రచ్చి= మథించి మథించి; జవము+అఱి, ఉన్నన్= శక్తి నశించి ఉండగా.

తాత్పర్యం: రాక్షసులు సర్పరాజయిన వాసుకితలలవైపును అధికమైనశక్తితో పట్టుకొని, దేవతలు దానితోకను పట్టుకొని మిక్కిలి పట్టుదలతో మథించి మథించి (మిక్కిలిగా మథించి) శక్తి తగ్గి ఉండగా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నారాయణుండు వారి క । వారితజవసత్త్వములు ధ్రువంబుగ నిచ్చెన్;
వారును దొల్లిటికంటె న । పారప్రారంభు లై రపరిమితశక్తిన్. 14

ప్రతిపదార్థం: నారాయణుండు= విష్ణువు, వారికిన్= ఆ దేవరాక్షసులకు; అవారిత, జవ, సత్త్వములు= తగ్గని వేగాన్ని, శక్తిని; ధ్రువంబుగన్= స్థిరంగా; ఇచ్చెను; వారును= ఆదేవరాక్షసులున్నూ; అపరిమితశక్తిన్= అధికమయినశక్తితో; తొల్లిటికంటెన్= మునుపటికంటె; అపార, ప్రారంభులు+ఐరి= అంతం లేని ప్రయత్నం కలవా రయ్యారు.

తాత్పర్యం: విష్ణువు, ఆ దేవరాక్షసులకు తగ్గనివేగాన్నీ, శక్తినీ స్థిరంగా ఇచ్చాడు. వారు అధికమయిన శక్తితో పూర్వంకంటె మేర లేని ప్రయత్నం గలవా రయ్యారు.

చ. ఉడుగక యొండొరుం జఱచి యొక్కబలంబున దేవదానవుల్
వడిగొని వార్ధి నిట్లు దరువం దరువన్ విష ముద్భవిల్లి నల్
గడలను విస్ఫులింగములు గప్పఁగఁ బర్విన, దానిఁ జెచ్చెరన్
మృడుఁడు గడంగి పట్టుకొని మ్రింగి గళంబున నిల్పెఁ బొల్పుగన్. 15

ప్రతిపదార్థం: ఉడుగక= మానక; ఒండు+ఒరున్= ఒకరినొకరిని; చఱచి= అరచేతకొట్టి; ఒక్కబలంబునన్= ఏకధాటిగా; దేవ, దానవుల్= దేవతలును, రాక్షసులును; వడి, కొని= వేగంవహించి; వార్ధిన్= సముద్రాన్ని; ఇట్లు= ఈవిధంగా; తరువన్, తరువన్= మథించగా, మథించగా; విషము; ఉద్భవిల్లి= పుట్టి; నల్గడలను= నాలుగుదిక్కులలోనూ; విస్ఫులింగములు= నిప్పుకణాలు; కప్పఁగన్= ఆవరించేటట్లుగా, పర్విననన్= వ్యాపించగా; దానిన్= ఆవిషాన్ని; మృడుఁడు= శివుడు; చెచ్చెరన్= శీఘ్రంగా; కడంగి= పూని; పట్టుకొని; మ్రింగి; గళంబునన్= కంఠంలోపల; పొల్పుగన్= పొందికగా; నిల్పెన్= ఉంచాడు.

తాత్పర్యం: దేవాసురులు మానక ఉత్సాహంతో ఒండొరులను చేతులతోచరచుకొంటూ ఏకధాటిగా వేగం పెంచి సముద్రాన్ని ఇట్లా మథించగా, మథించగా విషం పుట్టి నాలుగుదిక్కులా నిప్పుకణాలు ఆవరించేటట్లు వ్యాపించగా, దాన్ని వేగంతో శివుడు పూని పట్టుకొని మ్రింగి పొందికగా అందంగా ఉండేటట్లు కంఠంలోపల నిలిపాడు.

విశేషం: సముద్రమథనంవలన విషం పుట్టింది. నాలుగుదిక్కులా నిప్పురవ్వలు గుప్పింది. నిజానికి విస్ఫులింగాలు కావవి విషబిందువులు. కాని, కవి ప్రౌఢోక్తిచేత వాటిని విస్ఫులింగాలంటున్నాడు. అప్పుడది రూపకాలంకారం కావాలి. ఉపమేయాన్ని చెప్పకుండా ఉపమానాన్నే చెపుతున్నాడుకాబట్టి అతిశయోక్తి కావాలి. విషం అగ్నివలె దాహకంగా ఉన్నదని ఇక్కడి విస్ఫులింగశబ్దం స్ఫురింపజేస్తున్నది. కాబట్టి ఇక్కడ కవి ప్రౌఢోక్తిసిద్ధమైన అలంకారంవలన ఏర్పడిన వస్తుధ్వని ఉన్నది. వస్తుధ్వనిని నిర్వహించటంలో నన్నయ పాటించే పద్ధతులలో ఇది సర్వసాధారణ మైనది. దీనిని నానారుచిరార్థసూక్తిలో భాగంగా కొందరు భావిస్తారు. (సంపా.)

వ. మఱియు జ్యేష్ఠయుఁ జంద్రుండును శ్రీయును నుచ్చైశ్శ్రవంబును గౌస్తుభంబును నైరావణగజంబును నమృతపూర్ణశ్వేతకమండలు ధరుండైన ధన్వంతరియు నాదిగా ననేకంబు లుద్భవిల్లిన, నందుఁద్రిభువనవంద్య యయిన శ్రీదేవియు నిజప్రభాపటలపర్యుదస్త ప్రభాకరగభస్తివిస్తరం బయిన కౌస్తుభంబును నారాయణు వక్షఃస్థలంబున విలసిల్లె; నుచ్చైశ్శ్రవం బను యుగ్యంబు నైరావణగజంబును సురరాజయోగ్యంబు లయ్యెఁ; నంత నయ్యమృతంబు నసురులు చేకొనిన. 16

ప్రతిపదార్థం: మఱియున్= అదిగాక; జ్యేష్ఠయున్= జ్యేష్ఠాదేవియు; చంద్రుండును; శ్రీయునున్= లక్ష్మీదేవియు; ఉచ్చైశ్శ్రవంబును= ఆ పేరుగలగుఱ్ఱమున్నూ; కౌస్తుభంబును= కౌస్తుభమణియున్నూ; ఐరావణగజంబును= ఐరావణమనేపేరున్న ఏనుగున్నూ; అమృత, పూర్ణ, శ్వేత, కమండలు, ధరుండు+ఐన, ధన్వంతరియున్= అమృతంతో నిండిన తెల్లని కమండలాన్ని ధరించినవాడైన ధన్వంతరిఅనేపేరుగల దేవవైద్యుడున్నూ; ఆదిగాన్= మొదలుగా; అనేకంబులు= పెక్కు; ఉద్భవిల్లినన్= పుట్టగా; అందున్= వాటిలో; త్రిభువన, వంద్య, అయిన= మూడులోకాలకు నమస్కరించదగిం దైన; శ్రీదేవియున్= లక్ష్మీదేవియు; నిజ, ప్రభా, పటల, పర్యుదస్త, ప్రభాకర, గభస్తి, విస్తరంబు+ఐన= తనకాంతిసముదాయంచేత నిరసింపబడిన సూర్యునికిరణాలసముదాయం కల దైన; కౌస్తుభంబును; నారాయణ, వక్షఃస్థలంబునన్= విష్ణువుయొక్కరొమ్మున; విలసిల్లెన్= ప్రకాశించాయి; ఉచ్చైశ్శ్రవంబు+అను; యుగ్యంబు= గుఱ్ఱమున్నూ; ఐరావణ, గజంబును= ఐరావణమనేఏనుగున్నూ; సురరాజ, యోగ్యంబులు= దేవేంద్రుడికి తగినవి; అయ్యెన్; అంత, ఆ+అమృతంబున్; అసురులు= రాక్షసులు; చేకొనినన్= గ్రహించగా.

తాత్పర్యం: అదికాక, జ్యేష్ఠాదేవి, చంద్రుడు, లక్ష్మి, ఉచ్చైశ్శ్రవమనే తెల్లనిగుఱ్ఱం, కౌస్తుభమణి, అమృతంతో నిండిన తెల్లని కమండలం ధరించిన ధన్వంతరి అనే దేవవైద్యుడు, ఐరావణ మనే తెల్లఏనుగు మొదలుగా గల పెక్కు (వ్యక్తులును, వస్తువులును, జంతువులును) పుట్టగా, వాటిలో ముల్లోకాలకూ నమస్కరింపదగిన లక్ష్మీదేవి, తనకాంతి సముదాయంచేత తిరస్కరించబడిన సూర్యుని కిరణాల సముదాయం గల కౌస్తుభమణి విష్ణునిరొమ్మున ప్రకాశించాయి (విష్ణువు వాటిని గ్రహించాడు). ఉచ్చైశ్శ్రవ మనేగుఱ్ఱం, ఐరావత మనే ఏనుగు దేవేంద్రుడికి తగిన వయ్యాయి (వాటిని ఇంద్రుడు గ్రహించాడు). అప్పుడు ఆ అమృతాన్ని రాక్షసులు గ్రహించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నారాయణుండు కృత్రిమ। నారీరూపమునఁ దన్మనంబుల కతి మో
హారంభకారుఁ డై, యమ। రారులచేఁ గ్రమ్మఱంగ నమృతము గొనియెన్. 17

ప్రతిపదార్థం: నారాయణుండు= విష్ణువు; కృత్రిమ, నారీ, రూపమునన్= మాయాకాంతారూపంలో; తద్+మనంబులకున్= ఆరాక్షసుల మనసులకు; అతి, మోహ+ఆరంభకారుఁడు+ఐ= అధికమయిన మోహంయొక్క ఉదయం కలిగించే వాడై; అమర+అరులచేన్= దేవతలకు శత్రువు లైన రాక్షసులనుండి; క్రమ్మఱంగన్= తిరుగ; అమృతము; కొనియెన్= గ్రహించాడు.

తాత్పర్యం: విష్ణువు మాయాకాంతారూపంతో రాక్షసుల మనస్సులకు అధికమయిన మోహంకలిగించినవాడై వారినుండి తిరిగి అమృతాన్ని గ్రహించాడు.

వ. ఇట్లుపాయంబున నసురుల వంచించి యమృతంబు గొని విష్ణుదేవుండు దేవతల కిచ్చిన, నయ్యమృతంబు దేవత లుపయోగించుచోదేవరూపంబు దాల్చి రాహువు వేల్పులబంతి నయ్యమృతం బుపయోగించుచున్నఁ దత్సమీపంబున నున్న చంద్రాదిత్యులు వాని నెఱింగి నారాయణునకుం జెప్పిన, నయ్యమృతంబు వాని కంఠబిలంబు సొరకముందఱ. 18

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; ఉపాయంబునన్= నేర్పుతో; అసురులన్= రాక్షసులను; వంచించి= మోసగించి; అమృతంబు; కొని= గ్రహించి; విష్ణుదేవుండు; దేవతలకు+ఇచ్చినన్; ఆ+అమృతంబు= ఆ అమృతాన్ని; దేవతలు; ఉపయోగించుచోన్= త్రాగునప్పుడు; దేవ, రూపంబు= దేవతయొక్కరూపం; తాల్చి= ధరించి; రాహువు= రాక్షసులలో ఒకడు; నవగ్రహాలలో ఒకడు; వేల్పులబంతిన్= దేవతలవరుసలో; ఆ+అమృతంబు; ఉపయోగింపన్, పోయినన్= త్రాగటానికి వెళ్ళితే; తద్, సమీపంబునన్= అతని చెంత; ఉన్న= ఉండిన; చంద్ర+ఆదిత్యులు= చంద్రుడును, సూర్యుడును; వానిన్= రాహువును; ఎఱింగి= తెలిసికొని; నారాయణునకున్= విష్ణువుకు; చెప్పినన్= తెల్పగా; ఆ+అమృతంబు; వాని, కంఠబిలంబు= రాహువుయొక్క కంఠంయొక్క రంధ్రాన్ని; చొరక, ముందఱన్= ప్రవేశించటానికి ముందే.

తాత్పర్యం: ఈవిధంగా నేర్పుతో రాక్షసులను మోసగించి అమృతం గ్రహించి విష్ణువు దాన్ని దేవతల కిచ్చాడు. ఆ అమృతాన్ని దేవతలు త్రాగేటప్పుడు, దేవతారూపం ధరించి రాహువు దేవతల పంక్తిలో కూర్చుండి అమృతాన్ని త్రాగబోగా, అతనిచెంత ఉండిన చంద్రసూర్యులు వాడిని గుర్తించి విష్ణువుకు చెప్పారు. ఆ అమృతం రాహువు కంఠరంధ్రం ప్రవేశించటానికి ముందే (రాహువు దాన్ని మ్రింగటానికి ముందే). (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అమరారిమర్దనుఁడు చ । క్రము గ్రక్కున నేయ, రాహుకంఠము దెగి దే
హము ధరణిఁ బడియెఁ, దన్ముఖ । మమృతస్పర్శమున నక్షయం బై నిలిచెన్. 19

ప్రతిపదార్థం: అమర+అరి, మర్దనుఁడు= దేవతలకు శత్రువులైన రాక్షసులను సంహరించేటివిష్ణువు; చక్రము= తన ఆయుధ మైన సుదర్శనాన్ని; గ్రక్కునన్= వేగంగా; ఏయన్= ప్రయోగించగా, రాహు, కంఠము= రాహువుయొక్కమెడ; తెగి; దేహము= శరీరం; ధరణిన్= భూమిపై; పడియెన్= పడింది; తద్, ముఖము= ఆరాహువుయొక్కముఖం; అమృతస్పర్శమునన్= అమృతంయొక్క తాకుచేత; అక్షయంబు+ఐ= నాశనంలేనిదై; నిలిచెన్= ఉండిపోయింది.

తాత్పర్యం: రాక్షసాంతకు డయిన విష్ణువు తనచక్రాన్ని వేగంగా ప్రయోగించగా రాహువుయొక్కకంఠం తెగటంచేత శరీరం భూమిపై పడింది. అతడిముఖంమాత్రం అమృతంయొక్క తాకుచేత నాశనం లేనిదై ఉండిపోయింది.

విశేషం: ఇచట తెగి అనే క్త్వార్థకక్రియ హేత్వర్థంలో వాడబడింది. అంటే తెగటంచేత అని అర్థం.

వ. నాఁటంగోలె రాహువునకుఁ జంద్రాదిత్యులతోడి విరోధంబు శాశ్వతం బై ప్రవర్తిల్లుచుండె. 20

ప్రతిపదార్థం: నాఁటంగోలెన్= నాటినుండి; రాహువునకున్; చంద్ర+ఆదిత్యులతోడి, విరోధంబు= చంద్రసూర్యులతోడివైరం (సమాసంలో తోడకు ఇత్వం వచ్చింది); శాశ్వతంబు+ఐ= నిత్యమయి; ప్రవర్తిల్లుచుండెన్= సాగుతూ ఉన్నది.

తాత్పర్యం: నాటినుండి రాహువుకు చంద్రసూర్యులతోడివిరోధం శాశ్వతంగా సాగుతూ ఉన్నది.

దేవదానవుల యుద్ధము (సం.1-11-10)

సీ. అంత దేవాహితు లమృతంబు గానక । యెంతయు నలిగి బలీంద్రుఁ గూడి
మంతనం బుండి 'యమర్త్యులతోడి పొ । త్తింతియ చాలు, నింకేల?' యనుచు
సంతనకట్టి, యుత్సాహసమేతులై । యంతంబులేని రథాశ్వములను
దంతుల నమితపదాతుల నొడఁగూర్చి। యంతకాకారు లై యార్చి, యమర

ఆ. వరులఁ దాఁకి యేసి రురుతరశరపక్ష । జాతవాతరయవిధూత మగుచుఁ
జెదర జలదపంక్తి, బెదర వజ్రాయుధు । హృదయ, ముదిలకొనఁగఁ ద్రిదశగణము. 21

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట; దేవ+అహితులు= దేవతలకు శత్రువు లయిన రాక్షసులు; అమృతంబు; కానక= పొందక; ఎంతయున్, అలిగి= మిక్కిలి కోపించి; బలి+ఇంద్రున్= తమకు రాజయిన బలిని; కూడి= కలిసికొని; మంతనంబు+ఉండి= మంత్రాలోచనం చేసి; అమర్త్యులతోడి, పొత్తు= దేవతలతో స్నేహం; ఇంతియ= ఇంతే; చాలున్; ఇంకన్+ఏల, అనుచు= ఇంకెందుకంటూ, సంతనకట్టి= గుమికూడి; ఉత్సాహసమేతులు+ఐ= ఉత్సాహంతో కూడినవా రై; అంతంబు, లేని= అపార మయిన, అధికములయిన; రథ+అశ్వములను= రథాలనూ, గుఱ్ఱాలనూ; దంతులన్= ఏనుగులనూ; అమితపదాతులన్= అధికసంఖ్య కల కాల్బలాన్ని; ఒడఁగూర్చి= సమకూర్చి; అంతక+ఆకారులు+ఐ= యమునియొక్క రూపంవంటి రూపం కలవారై; ఆర్చి= బొబ్బలిడి; ఉరుతర, శర, పక్ష, జాత, వాత, రయ, విధూతము+అగుచున్= మిక్కిలి అధికమయిన బాణాలకు కట్టిన ఎరకలవలన పుట్టిన గాలిచేత ఎగురగొట్టబడినది ఔతూ; జలద, పంక్తి= మేఘాలవరుస; చెదరన్= చెదరిపోగా; వజ్ర+ఆయుధు, హృదయము= వజ్రం ఆయుధంగా కల ఇంద్రుడిహృదయం; బెదరన్= భయపడగా; త్రిదశగణము= దేవతలసముదాయం; ఉదిలకొనఁగన్= పరితపించగా; అమరవరులన్= దేవతాశ్రేష్ఠులను; తాఁకి= ఎదిరించి; ఏసిరి= బాణాలు ప్రయోగించారు.

తాత్పర్యం: అప్పుడు రాక్షసులు అమృతాన్ని పొందక మిక్కిలి కోపించి, తమరాజయిన బలిచక్రవర్తిని కలిసికొని ఆలోచనచేసి, 'దేవతలతోడిపొందు ఇంతే చాలు, ఇం కెందుకు' అంటూ గుమికూడి ఉత్సాహంతో కూడినవారై అమితము లయిన రథాలను, గుఱ్ఱాలను, ఏనుగులను, అధికసంఖ్య గల కాల్బలాన్ని సమకూర్చుకొని యముడివలె భయంకర మయిన ఆకారాలుకలవా రై కేకలువేస్తూ మిక్కిలి సంఖ్యలో వేసినబాణాలకు కట్టిన ఈకలవలన పుట్టిన గాలియొక్కవేగంచేత ఎగురగొట్టబడిందై మేఘపంక్తి చెల్లాచెదరు కాగా, ఇంద్రుడిహృదయం భయపడేటట్లు దేవతాసముదాయం పరితపించేటట్లు, దేవతాశ్రేష్ఠులను ఎదిరించి బాణాదు లయిన ఆయుధాలను ప్రయోగించారు.

విశేషం: ఇంత+ఎ= ఇంతె; ఇంతియ రూపాంతరం.

మహాస్రగ్ధర.

అమరేంద్రారాతు లిట్లాహవముఖమున నేయంగఁ దత్తీక్ష్ణబాణౌ
ఘము ఘోరం బై సురానీకముపయిఁ బెలుచం గప్పినం జూచి, దైత్యో
త్తములం గోదండచక్రోద్యతభుజులు మహాదారుణుల్ వీరలక్ష్మీ
రమణుల్ దుర్వారవాత్యారయమున నరనారాయణుల్ దాఁకి రల్కన్. 22

ప్రతిపదార్థం: అమర+ఇంద్ర+అరాతులు= దేవేంద్రునికి శత్రువు లయిన రాక్షసులు; ఇట్లు= ఈవిధంగా ఆహవముఖమునన్= యుద్ధరంగం ముందరి భాగాన; ఏయంగన్= బాణాదులను ప్రయోగించగా; తత్, తీక్ష్ణ, బాణ+ఓఘము= వారి వాడి అయిన బాణాలయొక్క సముదాయం; ఘోరంబు+ఐ= భయంకర మై; సుర+అనీకముపయిన్= దేవతలసైన్యంమీద; పెలుచన్, కప్పినన్ మిక్కిలి కప్పివేయగా; చూచి; దైత్య+ఉత్తములన్= రాక్షసశ్రేష్ఠులను; కోదండ, చక్ర+ ఉద్యత, భుజులు= క్రమంగా గాండీవ ధనుస్సుతోను, చక్రంతోను ఎత్తబడిన భుజాలు గలవారున్నూ; మహత్, దారుణుల్= మిక్కిలిభయంకరులున్నూ; వీర, లక్ష్మీరమణుల్= శౌర్యలక్ష్మికి ప్రియులున్నూ; ఐన; నర, నారాయణుల్= నరుడు, నారాయణుడు; దుర్వార, వాత్యారయమునన్= వారించశక్యంకాని పెనుగాలియొక్క వేగంవంటి వేగంతో; అల్కన్= కోపంతో; తాఁకిరి= ముట్టడించారు.

తాత్పర్యం: రాక్షసు లీవిధంగా యుద్ధరంగంలో బాణాలు ప్రయోగించగా వారి బాణాలసమూహం భయంకరమై దేవతలసేనమీద దట్టంగా కప్పుకోగా చూచి, గాండీవధనుస్సుతో, చక్రంతో కూడినవారూ, మిక్కిలి భయంకరులూ, శౌర్యలక్ష్మికి ప్రియులూ అయిన నరుడును నారాయణుడును అనేవారు వారింప శక్యంకాని పెనుగాలియొక్క వేగంవంటివేగంతో రాక్షసశ్రేష్ఠులను ముట్టడించారు.

విశేషం: బాణ+ఓఘము= బాణౌఘము, వృద్ధిసంధి, మహాస్రగ్ధరలో ప్రతిపాదానికి స, త, త, న, స, ర, ర, గ అనే గణాలుంటాయి. 1-9-16 అక్షరాలు యతిస్థానాలు. కాంతి(బంధౌజ్జ్వల్యం) అనే శబ్దగణం ఇందులో పోషింపబడింది.

మ. **నరచాపప్రవిముక్తదారుణబృహన్నారాచధారల్ భయం**
కరదైతేయనికాయకాయములపైఁ గప్పెన్ దిశల్ నిండ బం
ధురధాత్రీధరతుంగశృంగతటసందోహంబుపైఁ గప్పు దు
ర్ధర ధారాధర ముక్తసంతతపయోధారావళిం బోలుచున్. 23

ప్రతిపదార్థం: నర, చాప, ప్రవిముక్త, దారుణ, బృహత్, నారాచ, ధారల్= నరునిధనుస్సునుండి విడువబడిన భయంకరమైన పెద్దబాణాల పరంపరలు; దిశల్, నిండన్= దిక్కులు నిండగా; బంధుర ధాత్రీధర, తుంగ, శృంగ, తట, సందోహంబుపైన్= అందమయిన పర్వతాలయొక్క ఎత్తైనశిఖరాల అంచుల సముదాయంపై; కప్పు= ఆవరించే; దుర్ధర, ధారాధర, ముక్త, సంతత, పయః+ధారా+ఆవళిన్, పోలుచున్= ధరింపశక్యం కాని మేఘాలనుండి విడువబడిన దట్టమయిన నీటిధారల సముదాయాన్ని పోలుతూ; భయంకర, దైతేయ, నికాయ, కాయములపైన్= భయాన్ని కల్గించే రాక్షససముదాయాల శరీరాలపై; కప్పెన్= ఆవరించాయి.

తాత్పర్యం: నరునిధనుస్సునుండి విడువబడిన భయంకరము లైన పెద్దబాణాలపరంపరలు దిక్కులు నిండగా అందమయిన పర్వతాలయొక్క ఎత్తయిన శిఖరాలఅంచుల సమూహంపై కప్పే భరింపశక్యంకాని మేఘాలనుండి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విడువబడిన దట్ట మయిన నీటిధారలసముదాయాన్ని పోలుతూ, భయంకరులైన రాక్షసుల శరీరాల సముదాయాలపై కప్పాయి.

విశేషం: అలం: ఉపమ. ప్రసాద మిశ్రిత మైన ఓజస్సు (గాఢబంధత్వం) అనే శబ్దగుణం ఇక్కడ సార్థకంగా ప్రయోగించాడు నన్నయ.

మ. పతదుర్వీధరధాతునిర్ఝరజలాభం బై మహాదేహని
ర్గత సాంద్రారుణపూర మొక్కమొగి నొల్కం ద్రెస్సి, నారాయణో
న్నతదోర్దండవిముక్తచక్రనిహతిన్ నాకద్విషన్మస్తక
ప్రతతుల్ ఘోరరణంబునం బడియె భూభాగంబు కంపింపఁగన్. 24

ప్రతిపదార్థం: పతత్, ఉర్వీధర, ధాతు, నిర్ఝర, జల+ఆభంబు+ఐ= క్రిందకు పడుతున్న పర్వతంయొక్క గైరికాది ధాతువులతో కూడిన సెలయేళ్ళలోని నీటియొక్క కాంతివంటి కాంతి కలదై; (ఆభ= సమానం, కాంతి అనే అర్థాలున్నాయి.) నీటితో సమానమైన కాంతి కలదై; మహత్, దేహ, నిర్గత, సాంద్ర+అరుణ, పూరము= పెద్దశరీరాలనుండి బయల్వెడలిన దట్ట మయిన రక్తప్రవాహం; ఒక్క, మొగిన్= ఒకేవిధంగా (ఎడతెగకుండ); ఒల్కన్= కారగా; నారాయణ+ఉన్నత, దోర్దండ, విముక్త, చక్ర, నిహతిన్= నారాయణుడి యొక్క పొడవైన దండాలవంటి భుజాలనుండి విడువబడిన చక్రంయొక్క దెబ్బచేత; త్రెస్సి= తెగి; నాక, ద్విషత్, మస్తక, ప్రతతుల్= స్వర్గానికి శత్రువు లయిన రాక్షసుల తలల సమూహాలు; భూభాగంబు= భూతలం; కంపింపఁగన్= చలించగా; ఘోరరణంబునన్= భయంకరమయిన యుద్ధంలో, పడియెన్= పడ్డాయి.

తాత్పర్యం: పైనుండి క్రిందకు పడుతున్న గైరికాదిధాతువులతోకూడిన నదులనీటియొక్క కాంతివంటి కాంతికలదై, పెద్ద పెద్దదేహాలనుండి బయల్వెడలిన రక్తప్రవాహం ఎడతెగకుండ కారుతుండగా, నారాయణుడియొక్క పొడవైన; దండాలవంటి భుజాలనుండి విడువబడిన చక్రంయొక్క దెబ్బచేత తెగి, రాక్షసుల తలల సముదాయాలు భూతలం చలించేటట్లుగా భయంకర మయిన యుద్ధరంగంలో పడ్డాయి.

విశేషం: ద్విషత్+మస్తక= ద్విషన్మస్తక - అనునాసికసంధి, ఆభ= కాంతి, సమానం అనే అర్థాలు రెండూ పై సందర్భానికి ఉచితంగా ఉంటాయి. సమానం అనే అర్థాన్ని గ్రహిస్తే ఉపమాలంకారం అవుతుంది. ఓజస్సు అనే శబ్దగుణం రచనలో ఇక్కడ సార్థకం.

వ. ఇట్లు సముద్రతీరంబున నమరాసురులకు నతిఘోరయుద్ధం బయ్యె; నందు నరనారాయణు లపారపరాక్రము లై యసురవీరులఁ బెక్కండ్రం జంపిన నుక్కడంగి, దెసచెడి, యసురులు సముద్రంబు సొచ్చిన, నమరులు సమరలబ్ధవిజయు లై యమరపతి నమృతరక్షణార్థంబు ప్రార్థించి, యథాస్థానంబున మంథరనగంబు ప్రతిష్ఠాపించి, తమతమనివాసంబులకుం జని సుఖంబుండి రంత. 25

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; సముద్రతీరంబునన్= సముద్రపుటొడ్డున; అమర+అసురులకున్= దేవతలకును, రాక్షసులకును; అతిఘోరయుద్ధంబు= మిక్కిలి భయంకర మయినయుద్ధం; అయ్యెన్; అందున్= ఆ యుద్ధంలో; అపార, పరాక్రములు+ఐ= మేర లేని విక్రమంగలవా రై; అసుర, వీరులన్, పెక్కండ్రన్= పలువురు వీరు లయిన రాక్షసులను; చంపినన్= చంపగా; ఉక్కు+అడంగి= గర్వం తగ్గి; దెసచెడి= దిక్కులేక; అసురులు= రాక్షసులు; సముద్రంబు; చొచ్చినన్= ప్రవేశించగా; అమరులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దేవతలు; సమరలబ్ధవిజయులు+ఐ= యుద్ధంలో పొందబడిన విజయం కలవా రై; అమరపతిన్= దేవతలకు రాజయిన ఇంద్రుని; అమృత, రక్షణ+అర్థంబు= అమృతాన్ని రక్షించటంకొరకు; ప్రార్థించి= వేడి; మంథరనగంబున్= మంథరపర్వతాన్ని; యథాస్థానంబునన్= పూర్వ మున్న చోట; ప్రతిష్ఠాపించి= నిలిపి; తమ, తమ, నివాసంబులకున్= తమ తమ గృహాలకు; చని= వెళ్ళి; సుఖంబు+ఉండిరి= సుఖంతో ఉన్నారు.

తాత్పర్యం: ఈ విధంగా సముద్రపుటొడ్డున దేవతలకూ, రాక్షసులకూ మిక్కిలిభయంకర మైన యుద్ధం జరిగింది. ఆయుద్ధంలో నరుడును, నారాయణుడును అధిక మైన పరాక్రమం కలవారై వీరులయిన రాక్షసులను పలువురిని చంపగా, గర్వం తగ్గి దిక్కు లేక రాక్షసులు సముద్రంలో ప్రవేశించారు. దేవతలు యుద్ధంలో విజయాన్ని సాధించిన వారై, తమకు రాజైన ఇంద్రుడిని అమృతం రక్షించటంకొరకు ప్రార్థించి, మంథరపర్వతాన్ని పూర్వ ముండేచోట మళ్ళీ నిలిపి, తమ తమ గృహాలకు వెళ్ళి సుఖంతో ఉన్నారు.

విశేషం: సుఖంబు+ఉండిరి; ఇచ్చట ప్రథమావిభక్తి (సుఖంబు) తృతీయార్థంలో వాడబడింది.

కద్రూవినత లుచ్చైశ్శ్రవమును జూచి పందెములు సఱచుట (సం. 1-18-1)

క. అమృతముతో నుద్భవ మై । యమరేశ్వరయోగ్య మైన హయరత్నము త
ద్విమలోదధితీరంబునఁ । గొమరుగ నేకతమ యిచ్చఁ గ్రుమ్మరుచున్నన్. 26

ప్రతిపదార్థం: అమృతముతోన్; ఉద్భవము+ఐ= పుట్టి; అమర+ఈశ్వర, యోగ్యము+అయిన= దేవతలరా జయిన ఇంద్రుడికి తగిన; హయ, రత్నము= అశ్వశ్రేష్ఠం; తద్+విమల+ఉదధి, తీరంబునన్= ఆ నిర్మల మయిన పాలసముద్రపుటొడ్డున; కొమరుగన్= అందంగా; ఏకతము+అ= ఒంటరిగా; ఇచ్చన్= స్వేచ్ఛగా; క్రుమ్మరుచున్+ఉన్నన్= తిరుగుతుండగా.

తాత్పర్యం: అమృతంతోపాటు పుట్టి దేవేంద్రునిచే గ్రహింపబడిన ఉచ్చైశ్శ్రవ మనే అశ్వశ్రేష్ఠం, ఆ పాలసముద్రం ఒడ్డున అందంగా, ఒంటరిగా, స్వేచ్ఛగా తిరుగుతుండగా.

వ. కద్రువయు, వినతయు వినోదార్థంబు విహరించువారు కరిమకరనికరాఘాతజాత వాతోద్ధూత తుంగతరంగాగ్రసముచ్చలజ్జలకణాసారచ్ఛటాచ్ఛాదిత గగనతలం బైనదాని, నుద్యానవనంబునుంబోలె బహువిద్రుమలతాలంకృతం బైనదాని, నాటకప్రయోగంబునుంబోలె ఘనరసపాత్రశోభితరంగరమ్యం బైనదాని, దివంబునుం బోలె నహిమకరభరితం బైనదాని మఱియు. 27

ప్రతిపదార్థం: కద్రువయున్; వినతయున్; వినోద+అర్థంబు= వినోదంకొరకు; విహరించువారు= సంచరించేవారు; కరి, మకర, నికర+ఆఘాత, జాత, వాత+ఉద్ధూత, తుంగ, తరంగ+అగ్ర, సముచ్చలత్, జల, కణ+ఆసార+ఛటా+ఆచ్ఛాదిత, గగన, తలంబు+ఐనదానిన్= ఏనుగులయొక్క, మొసళ్ళయొక్క సముదాయంయొక్క దెబ్బలచేత పుట్టిన, గాలిచేత ఎగురగొట్టబడిన ఎత్తయిన కెరటాలపైభాగంలో కదలాడే నీటిబిందువుల జడివాన సముదాయంచేత కప్పబడిన ఆకాశభాగం కలదానిని; ఉద్యానవనంబునున్, పోలెన్= విహారవనంవలె; బహు, వి, ద్రుమ, లతా+అలంకృతంబు+అయిన, దానిన్= పెక్కుపక్షులతోకూడిన, చెట్లతోకూడిన, లతలచేత అలంకరింపబడినదానిని; సముద్రపక్షంలో - బహు, విద్రుమ, లతా+అలంకృతంబు+ఐనదానిన్= పెక్కుపగడపుతీగలచేత అలంకరింపబడిన దానిని; నాటక ప్రయోగంబునున్+పోలెన్= నాటకంయొక్క ప్రదర్శనంవలె; ఘన, రస, పాత్ర, శోభిత, రంగరమ్యంబు+ఐనదానిన్= గొప్పశృంగారాదిరసాలతోను, పాత్రలతోను ప్రకాశించేరంగంచే

అందమయినదానిని; సముద్రపక్షంలో - ఘన, రస, పాత్ర, శోభి, తరంగ, రమ్యంబు+ఐనదానిన్= గొప్ప (అధికమైన) నీటికి నెలవై ప్రకాశించే కెరటాలచేత సుందర మైనదానిని, ఇక్కడ 'ఘన' అంటే మేఘా లనియు అర్థం చెప్పవచ్చును (మేఘాలలోని నీటికి నెలవులై); దివంబునున్, పోలెన్= ఆకాశంవలె, అహిమ, కర, భరితంబు+ఐనదానిన్= వేడికిరణాలు గల సూర్యుడితో కూడినదానిని; సముద్రపక్షంలో- అహి, మకర, భరితంబు+ఐనదానిన్= పాములతోను, మొసళ్ళతోను కూడిన దానిని; మఱియున్= ఇంకా.

తాత్పర్యం: అటువంటి సమయంలో కద్రూవినతలు వేడుకకొరకు విహరిస్తూ, నీటిఏనుగుల, మొసళ్ళ సముదాయాల దెబ్బలవలన పుట్టిన గాలిచేత ఎగురగొట్టబడిన ఎత్తయిన కెరటాల పై భాగాన కదలాడే నీటిబిందువుల జడివాన మొత్తంచేత కప్పబడిన ఆకాశభాగం గలదానిని, విహారవనం వలె (పెక్కు పక్షులతోకూడిన చెట్లచేత, తీగలచేత అలంకరింపబడిన దానిని) పెక్కు పగడపు తీగలచే అలంకరింపబడినదానిని, (నాటకప్రదర్శనంవలె గొప్పశృంగారాది రసాలతోను, పాత్రలతోను ప్రకాశించేరంగస్థలం వలె సుందర మైనదానిని) విస్తృత మైన నీటికి నెల వై ప్రకాశించే కెరటాలచేత సుందర మైనదానిని, (ఆకాశంవలె సూర్యుడితో కూడిన దానిని) పాములతోను, మొసళ్ళతోను నిండినదానిని, అదికాక.

విశేషం: అలంకారాలు; శ్లేష, వృత్త్యనుప్రాసం, అంత్యానుప్రాసం. నన్నయశ్లేషతో రచించినకొద్దిభాగాల్లో ఇది ఒకటి. ఉద్యానవనంబునున్‌పోలెన్, నాటకప్రయోగంబునున్ పోలెన్ - అనేచోట్ల ద్రుతంపై మరొకద్రుతం వాడబడింది.

చ. **అలఘుఫణీంద్రలోకకుహరాంతరదీప్తమణిస్ఫురత్ప్రభా**
వలి గలదాని, శశ్వదుదవాసమహావ్రతశీతపీడితా
చలమునిసౌఖ్యహేతువిలసద్బడబాగ్ని శిఖాచయంబులన్
వెలిఁగెడిదానిఁ గాంచి రరవిందనిభానన లమ్మహోదధిన్. **28**

ప్రతిపదార్థం: అరవిందనిభ+ఆననలు= పద్మంతో సమాన మైన ముఖాలు కల కద్రూవినతలు; అలఘు, ఫణి+ఇంద్ర, లోక, కుహర+అంతర, దీప్త, మణి, స్ఫురత్, ప్రభా+ఆవళి, కలదానిన్= గొప్పనాగరాజులలోక మయిన పాతాళం యొక్క గుహలోపల ప్రకాశించే రత్నాలయొక్క వెలుగుతున్నకాంతులసముదాయం కలదానిని; శశ్వత్+ఉదవాస, మహత్, వ్రత, శీత, పీడిత+అచల, ముని, సౌఖ్య, హేతు, విలసత్, బడబా+అగ్ని, శిఖా, చయంబులన్= ఎల్లప్పుడు నీటిలో నివసించటమనే గొప్పవ్రతంచేత చలివలన బాధింపబడే కదలని (పర్వతాలనే) మునుల సుఖానికి కారణ మయి ప్రకాశిస్తున్న ఔర్వాగ్నియొక్క జ్వాలల సముదాయాలచే; వెలిఁగెడుదానిన్= ప్రకాశించేదాన్ని; ఆ+మహత్+ఉదధిన్= ఆ గొప్పసముద్రాన్ని; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: పద్మాలవంటి ముఖాలు కల కద్రూవినతలు గొప్పనాగరాజులలోకమయిన పాతాళగుహలో ప్రకాశించే మణులయొక్క వెలుగుతున్న కాంతులసముదాయం కలదానిని, ఎల్లప్పుడూ నీటిలో నివసించట మనే గొప్పవ్రతంచేత చలిచే బాధింపబడినప్పటికి కదలకుండాఉండే పర్వతాలనే మునులసౌఖ్యానికి కారణ మయి ఒప్పే బడబానలంయొక్క జ్వాలలసముదాయంచేత ప్రకాశించే ఆపెద్దసముద్రాన్ని చూచారు.

విశేషం: అలం: రూపకం. ఈపద్యరచనలో సమతా(మార్గభేద) విశిష్టమైన ఓజస్సు (గాఢబంధత్వం) అనే శబ్దగుణాన్ని, అక్షరరమ్యతను నన్నయ పోషించాడు. మొదటి, మూడవ చరణాలను దీర్ఘసమాసాలతో రచించి రెండవ, నాల్గవ చరణాలను,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'ఆవలిగలదాని, వెలిఁగెడిదాని' అనే పదాలతో సమంగా విరవటం వలన వృత్తరచనలో సమత్వం ఏర్పడింది. మిగిలిన వృత్తరచనలో ఓజస్సు రాణించింది. అలలవిన్యాసంలో సమత్వం, గాంభీర్యంలో ఓజస్విత కల సముద్రవర్ణనంలో ఈగుణసంయోజనం విభావస్ఫూర్తిని వెలారుస్తున్నది. (సంపా.)

మ. వివిధోత్తుంగ తరంగ ఘట్టన చలద్వేలావనైలావలీ
లవలీలుంగలవంగ సంగతలతాలాస్యంబు లీక్షించుచున్
ధవళాక్షుల్ సని కాంచి రంత నెదురం దత్తీరదేశంబునం
దవదాతాంబుజ ఫేనపుంజనిభు నయ్యశ్వోత్తముం దవ్వులన్. 29

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట; ధవళ+అక్షుల్= తెల్లనికన్నులు కల కద్రూవినతలు; చని= వెళ్ళి; ఎదురన్= తమఎదుట; దవ్వులన్= దూరంలో; వివిధ+ఉత్తుంగ, తరంగ, ఘట్టన, చలత్+వేలా, వన+ఏలా+ఆవలీ, లవలీ, లుంగ, లవంగ, సంగత, లతా, లాస్యంబులు= పలువిధా లయిన ఎత్తయిన కెరటాల దెబ్బలచే కదలుతున్న (వేలావన) సముద్రపుటొడ్డుమీది వనాలలోని ఏలకిలతల సమూహాలు, లవలి అనే పేరుగల లతలు, మాదీలతలు, లవంగలతలు అనే అందాలయిన (ఒండొంటితో కలసిన) లతలయొక్క చలన రూపాలయిన నాట్యాలు; ఈక్షించుచున్= చూస్తూ; తత్, తీర, దేశంబునందున్= ఆ సముద్రంయొక్క తీరప్రదేశంలో; అవదాత+అంబుజ, ఫేన, పుంజ, నిభున్= తెల్లనిపద్మాలతోనూ, నురుగు సముదాయంతోనూ, సమానమైన; ఆ+అశ్వ+ఉత్తమున్= ఆ శ్రేష్ఠ మైన గుఱ్ఱాన్ని; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: పిమ్మట తెల్లనికన్నులు గల ఆ కద్రూవినతలు తమఎదుట పలువిధా లైన ఎత్తైనకెరటాలదెబ్బలచేత కదలుతున్న సముద్రపుటొడ్డుమీది వనాలలోని ఏలకిలతలు, లవలీలతలు, మాదీలతలు, లవంగలతలు ఒండొంటితో కలిసి అందా లొలకపోసే లతల నాట్యాలు చూస్తూ తెల్లనిపద్మాలతోనూ, నురుగుసమూహంతోను సమానమైన ఆ ఉచ్చైశ్శ్రవమనబడే హయశ్రేష్ఠాన్ని చూచారు.

విశేషం: అలం: ఉపమ. వీనులకు విందైన సముద్రతరంగాల లయలూ, కన్నులకు పండువైన లతాలలనల నాట్యాలహొయలూ భూమికగా ఉండగా వాటిప్రక్కనే మనసును మరపించే తెల్లని ఉచ్చైశ్రవాన్ని దర్శింపచేస్తున్నాడు నన్నయ. ఇటువంటి చక్కని స్థిరచిత్రాలను వర్ణించటంలో నన్నయ దిట్ట. తరంగఘట్టనను, లతాలాస్యాలను, అశ్వసౌందార్యాన్నీ, విభావోచితమైన అక్షరరమ్యంగా వర్ణించాడు. ఓజోగుణ(గాఢబంధత్వ)విశిష్టమైన కాంతి(బంధౌజ్జ్వల్యం) అనే శబ్దగుణం కల రచనచేత సన్నివేశాన్ని ధ్వనిమయం చేశాడు నన్నయ. ఇందులోని అక్షరరమ్యత గుణపోషకం. (సంపా.)

వ. కని, కద్రువ వినతం జూచి 'చూడవె యల్ల యతిధవళంబైన యశ్వంబునందు సంపూర్ణచంద్రునందు నల్లయుంబోలె వాలప్రదేశంబునందు నల్ల యై యున్నది' యనిన విని వినతనగి 'నీ వే కన్నులం జూచితే యక్క! యెక్కడిది నల్ల? యీయశ్వరాజుమూర్తి మహాపురుషకీర్తియుంబోలె నతినిర్మలం బై యొప్పచున్నయది' యనిన విని నవ్వి వినతకుఁ గద్రువ యి ట్లనియె. 30

ప్రతిపదార్థం: కని= ఆగుర్రాన్ని చూచి; చూడవె= చూడుమా; అల్ల= ప్రసిద్ధ మైన; అతి, ధవళంబు+ఐన= మిక్కిలితెల్లని దైన; అశ్వంబునందున్= గుర్రంలో; సంపూర్ణ, చంద్రు+అందున్= నిండు చంద్రుడిలోని; నల్లయున్, పోలెన్= మచ్చవలె; వాలప్రదేశంబునందున్= తోకభాగంలో; నల్ల+ఐ= మచ్చ అయి; ఉన్నది; అనినన్= అని పలుకగా; విని; వినత; నగి= నవ్వి; నీవు, ఏ, కన్నులన్, చూచితి(వి), ఏ= నీవు ఏకన్నులతో చూచావో (సరిగా చూడలేదని భావం); అక్క= కద్రువకు సంబోధన;

నల్ల= మచ్చ; ఎక్కడిది= ఎక్కడ ఉన్నది; ఈ, అశ్వరాజు, మూర్తి= ఈశ్రేష్ఠమైన గుఱ్ఱరూపం; మహత్, పురుష కీర్తియున్, పోలెన్= మహాత్ముని కీర్తివలె; అతి, నిర్మలంబు+ఐ= మిక్కిలి తెల్లని దై; ఒప్పుచున్న, అది= ప్రకాశిస్తున్నది; అనినన్= అని వినత పల్కగా. విని= ఆలకించి; నవ్వి= హసించి; వినతకున్= వినతకు, కద్రువ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఆ గుఱ్ఱాన్ని చూచి కద్రువ వినతతో 'చూడుము! మిక్కిలి తెల్లని దైన ఆ గుఱ్ఱంలో, నిండు చంద్రుడిలోని మచ్చవలె తోకభాగం నల్లగా ఉన్నది' అని అనగా విని వినత నవ్వి 'ను వ్వే కన్నులతో చూచావే అక్కా! మచ్చ ఎక్కడిది? ఈ శ్రేష్ఠమైన గుఱ్ఱం మహాత్ముని కీర్తివలె మిక్కిలి తెల్లనిదై ప్రకాశిస్తున్నది' అని అనగా విని వినతతో కద్రువ ఇట్లా అన్నది.

విశేషం: అలం: ఉపమ.

తే. 'అమ్మహాశ్వంబుధవళదేహంబునందు । నల్ల గలిగిన నీ విప్డు నాకు దాసి
వగుము; మఱి యందు నల్లలే దయ్యె నేని । నీకు నే దాసి నగుదుఁ; బన్నిదము సఱుము.' 31

ప్రతిపదార్థం: ఆ+మహత్+అశ్వంబు, ధవళ, దేహంబు+అందున్= ఆగొప్ప గుఱ్ఱం యొక్క తెల్లని శరీరంలో; నల్ల= మచ్చ; కలిగినన్= ఉంటే; నీవు, ఇప్డు, నాకున్; దాసివి; అగుము; మఱి= అట్లుకాక; అందున్= శరీరంలో; నల్ల= మచ్చ; లేదు+అయ్యెన్+ఏని; నీకున్; నే= నేను; దాసిన్, అగుదున్; పన్నిదము= పందెం; చఱుము= (చరచుము) అరచేతిలో చేయివేసి పందెం వేయుము (చఱుము అనేది చరచుదమునకు రూపాంతరం).

తాత్పర్యం: ఆ గొప్ప గుఱ్ఱంయొక్క తెల్లనిదేహంలో నల్లనిమచ్చ ఉంటే నీ విప్పుడు నాకు దాసివి కమ్ము. అట్లా కాక ఆ శరీరంలో మచ్చలేకుంటే నేను నీకు దాసివి అవుతాను. పందెం వేయుము'.

వ. అని యి ట్లిద్దఱు నొండొరులకు దాసీత్వంబు పణంబుగా నొడివి పన్నిదంబు సఱచిన, వినత 'యయ్యశ్వంబు డాసి చూతము ర' మ్మనినఁ గద్రువయు 'నిపుడు ప్రొద్దు లేదు, పతిపరిచర్యాకాలంబు నయ్యె; ఱేపకడయ చూత' మని యిద్దఱు మగుడివచ్చి తమ నివాసంబులకుం బోయి యున్న యప్పుడు. 32

ప్రతిపదార్థం: అని, ఇట్లు+ఇద్దఱున్= వినతాకద్రువలిరువురును; ఒండు+ఒరులకున్= ఒకరికొకరు; దాసీత్వంబు= దాసితనం; పణంబుగాన్= పందెంగా; నొడివి= పలికి; పన్నిదంబు= పందెం; చఱచినన్= చేతితో కొట్టి వెయ్యగా; వినత; ఆ+అశ్వంబు= ఆగుఱ్ఱాన్ని; డాసి= సమీపించి; చూతము= చూద్దాము; రమ్ము, అనినన్; కద్రువయున్; ఇపుడు; ప్రొద్దు, లేదు= సమయం లేదు; పతి, పరిచర్యాకాలంబున్= భర్తకు సేవచేసేకాలంకూడ, అయ్యెన్; ఱేపకడ+అ= ఉదయమే; చూతము; అని; ఇద్దఱు; మగుడి వచ్చి= తిరిగి వచ్చి; తమ, నివాసంబులకున్= తమ గృహాలకు; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: అని ఈవిధంగా వినతాకద్రువలిద్దరు ఒకరొకరికి దాస్యం చేయటం పందెంగా పలికి పందెం వేయగా, వినత ఆ గుఱ్ఱాన్ని చేరి చూద్దాము రమ్మని పలుకగా, కద్రువ 'ఇప్పుడు సమయం చాలదు. భర్తకు సేవ చేసే కాలం కూడ అయింది. రేపు ఉదయమే వచ్చి చూద్దాము' అని తెలిపింది. అప్పు డాసతు లిద్దరూ తిరిగివచ్చి తమ తమ గృహాలకు పోయి ఉన్న సమయాన (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: చూచుదము - చువర్ణంతోడి దుగ్దకారం తకార మవుతుంది - చూతము.

సీ. **కద్రువ కొడుకులకడ కేఁగి 'యేను మి । మ్ముందఱ వేఁడెద నన్నలార!**
నాపంపు సేయుండు, నన్ను రక్షింపుఁడు । కామచారులకు దుష్కరము కలదె!
యుల్ల తెల్లని తురగోత్తము వాలంబు । నల్ల సేసితిరేని నాకు దాసి
యగు మన వినత, మీ రట్లు సేయనినాఁడు । దానికి మఱి యేను దాసి నగుదు;

ఆ. **జంట పన్నిదంబు సఱచితి మిట్లుగా' । ననినఁ బాములెల్ల 'నయ మిదియుఁ**
దల్లి పనిచె నని యధర్మువు సేయంగ । నగునె? యెఱుక గలరె మగువ లెందు'! **33**

ప్రతిపదార్థం: కద్రువ; కొడుకుల, కడకున్= కుమారులవద్దకు; ఏఁగి= వెళ్ళి; అన్నలార= వత్సలారా! మిమ్ము+అందఱన్, వేఁడెదన్; నా, పంపు, చేయుండు= నాఆజ్ఞ చేయండి; నన్ను; రక్షింపుఁడు= కాపాడండి; కామ, చారులకున్= ఇచ్చవచ్చినట్లు సంచరించేవారికి; దుష్కరము= చేయ శక్యం కానిది; కలదు+ఎ= ఉన్నదా! లేదు; ఉల్ల= దూరసమీపప్రదేశాలకు మధ్యప్రదేశంలో ఉన్న; తెల్లని, తురగ+ఉత్తము, వాలంబు= తెల్లని అశ్వశ్రేష్ఠం యొక్క తోకను; నల్ల+చేసితిరి+ఏని= మచ్చచేశారంటే; మన, వినత; నాకు; దాసి, అగున్; మీరు+అట్లు; చేయని, నాఁడు= చేయకుంటే; దానికిన్= వినతకు; మఱి ఇంక; ఏను= నేను; దాసిన్, అగుదున్; ఇట్లుగాన్= ఈవిధంగా; జంటపన్నిదంబు= ఇద్దరు సమానంగా వేసేపందెం; చఱచితిమి= వేశాము; అనినన్= అని చెప్పగా; పాములు+ఎల్లన్= పాములన్నీ; ఇదియున్= ఇది; అనయము= నీతి కానిది; తల్లి; పనిచెన్+అని= ఆజ్ఞాపించిన దని; అధర్మువు= అధర్మం; చేయంగన్, అగునె= చేయనవునా? ఎందున్= ఎక్కడైనా; మగువలు= స్త్రీలు; ఎఱుక, కలరె= తెలివిగలవారా? (కారని భావం).

తాత్పర్యం: కద్రువ కొడుకు లయిన పాములచెంతకు వెళ్ళి, 'వత్సలారా! నేను మిమ్మ ల్నందరినీ ప్రార్థిస్తున్నాను. నాఆజ్ఞ చేయండి. నన్ను కాపాడండి. ఇచ్చవచ్చినట్లు సంచరించగల మీకు చేయ శక్యంకానిది ఉన్నదా? ఆ తెల్లని అశ్వశ్రేష్ఠంతోకను మీరు మచ్చచేస్తే వినత నాకు దాసి అవుతుంది. మీరు అట్లా తోకను నలుపు చేయకపోతే నే నింక వినతకు దాసి నవుతాను. ఈ విధంగా ఒండొరులం పందెం వేసుకొన్నాం' అని పలుకగా పాములన్నీ 'ఇది నీతిరహితం. తల్లి ఆజ్ఞాపించిందని అధర్మం చేయవచ్చా? ఎక్కడైనా స్త్రీలు జ్ఞానం కలవారా!'

వ. **అని యందఱుఁ దమలో విచారించి యధర్మారంభంబునకు సుముఖులు గాకయున్నఁ, గద్రువ కోపోద్దీపితముఖి యై.** **34**

ప్రతిపదార్థం: అని; అందఱున్= పాములన్ని; తమలోన్= తమలోతాము; విచారించి= ఆలోచించి; అధర్మ+ఆరంభంబునకున్= అధర్మం చేయ మొదలిడటానికి; సుముఖులు= ఇష్టం కలవారు; కాక, ఉన్నన్= కాకుండగా; కద్రువ; కోప+ఉద్దీపిత, ముఖి యై= కోపంచేత ఎఱ్ఱబడిన ముఖం కలదై.

తాత్పర్యం: అని అందరూ తమలో తాము ఆలోచించి అధర్మం చేయటానికి ఇష్టపడనివారు కాగా, కద్రువ కోపంచేత ఎఱ్ఱబడిన ముఖం కలదై.

క. **'అనుపమముగ జనమేజయుఁ । డను జనపతి సేయు సర్పయాగ నిమిత్తం**
బునఁ బాములు పంచత్వము । సనియెడు' మని యురగములకు శాపం బిచ్చెన్. **35**

ప్రతిపదార్థం: అనుపమముగన్= సాటిలేకుండ; జనమేజయుఁడు= పరీక్షిత్తుకుమారుడు; అను జనపతి= అనేరాజు; చేయు సర్పయాగ, నిమిత్తంబునన్= సర్పాలను హుతం చేసే యజ్ఞ మనే కారణంగా; పాములు; పంచత్వము, చనియెడున్, అని= మరణం పొందుగాక అని; (ఎడు-తల ద్రుతానికి అచ్చు పరమైనపుడు మకారమవుతుంది); ఉరగములకున్= పాములకు; శాపంబు+ఇచ్చెన్= శాపమిచ్చినది.

తాత్పర్యం: 'పరీక్షిత్తుకుమారు డయిన జనమేజయు డనే రాజు చేసే సాటిలేని సర్పయాగం కారణంగా పాములు మరణం పొందుగాక' అని వాటికి శాప మిచ్చింది.

వ. అందు శాపానుభవభీతచిత్తుం డై కర్కోటకుం డనువాఁడు తల్లి పంచినరూపంబున నుచ్చైశ్శ్రవంబువాలంబు నీలంబుగాఁ బట్టి వ్రేలుచున్న, మఱునాఁడు తేపకడయ కద్రువయు వినతయుం జని, యత్తురంగంబుఁ జూచి వినత యోటువడి, కద్రువకు దాసి యై, నోసి పనులు సేయుచున్నంతఁ, బంచశత వర్షంబులు నిండి రెండవయండం బవిసిన నందు. 36

ప్రతిపదార్థం: అందున్= ఆపాములలో; శాప+అనుభవ, భీత, చిత్తుండు+ఐ= శాపాన్ని అనుభవించటానికి భయపడిన మనస్సు కలవా డై; కర్కోటకుండు+అనువాడు; తల్లి; పనిచిన, రూపంబునన్= ఆజ్ఞాపించిన రూపంతో, ఉచ్చైశ్శ్రవంబు, వాలంబు= ఆ పేరుండే అశ్వశ్రేష్ఠంయొక్క తోక; నీలంబు+కాన్= నల్ల అయ్యేట్లుగా; పట్టి= పట్టుకొని; వ్రేలుచున్నన్= వ్రేలాడుతుండగా; మఱునాఁడు; తేపకడ+అ= ఉదయమందే; కద్రువయున్, వినతయున్; చని= వెళ్ళి; ఆ+తురంగంబున్= ఆ గుర్రాన్ని; చూచి; వినత; ఓటు, పడి= ఓడి; నోసి= నొచ్చి, పనులు, చేయుచున్, ఉన్న, అంతన్= పనులు చేస్తూఉండగా; పంచశత, వర్షంబులు= ఐదువందలేండ్లు; నిండి= పూర్తికాగా; రెండవ, అండంబు= రెండవగ్రుడ్డు; అవిసినన్= పగులగా; అందున్= ఆగ్రుడ్డునుండి.

తాత్పర్యం: ఆ పాములలో శాపం అనుభవించటానికి భయపడిన హృదయం గలవాడై కర్కోటకు డనే పాము తల్లి అయిన కద్రువ ఆజ్ఞాపించిన రూపంతో ఉచ్చైశ్శ్రవ మనే తెల్లనిదేవతలగుర్రంతోకకు నల్లనిమచ్చ అయ్యేట్లుగా పట్టుకొని వ్రేలాడుతూ ఉండగా మరుసటి రోజున ఉదయమే కద్రువయు వినతయు వెళ్ళి ఆ గుర్రాన్ని చూచారు. దానితోకను కర్కోటకుడు నల్లగా పట్టుకొని వ్రేలాడుతుండటంచేత వినత ఓడి కద్రువకు దాసియై నొచ్చి ఆమె చెప్పిన పనులు చేస్తుండగా ఐదువందల ఏండ్లు నిండాయి. అంత వినత పెట్టిన రెండవగ్రుడ్డు పగిలి ఆ గ్రుడ్డునుండి.

వినతకు గరుడుండు జనియించుట (సం. 1-20-4)

ఉ. ఆతతపక్షమారుత రయ ప్రవికంపిత ఘూర్ణితాచల
వ్రాత మహార్ణవుండు, బలవన్నిజదేహసముజ్జ్వల ప్రభా
ధూత పతంగతేజుఁ డుదితుం డయి తార్క్ష్యుఁడు తల్లికిన్ మనః
ప్రీతి యొనర్చుచున్ నెగసె భీమజవంబున నభ్రవీథికిన్. 37

ప్రతిపదార్థం: ఆతత, పక్షమారుత, రయ, ప్రవికంపిత, ఘూర్ణిత+అచల, వ్రాత, మహత్, అర్ణవుండు= విశాల మైన రెక్కలగాలియొక్క వేగంచేత క్రమంగా చలింపజేయబడినట్టియు, సంక్షోభింప జేయబడినట్టియు, పర్వతాల సముదాయాలను, గొప్పసముద్రాలను, కలవాడున్నూ; బలవత్+నిజ, దేహ, సముజ్జ్వల, ప్రభా, ధూత, పతంగ, తేజుఁడు= బలం కల తన

దేహంయొక్క ప్రకాశించేకాంతిచేత తిరస్కరింపబడిన సూర్యునియొక్క కాంతి కలవాడున్నూ; అయిన; తార్క్ష్యుఁడు= గరుత్మంతుడు; ఉదితుండు+అయి= పుట్టి; తల్లికిన్= తల్లి అయిన వినతకు; మనఃప్రీతి= హృదయానికి ప్రియాన్ని; ఒనర్చుచున్= కావిస్తూ; అభ్రవీథికిన్= ఆకాశమార్గానికి; భీమజవంబునన్= భయంకర మయిన వేగంతో; నెగసెన్= ఎగిరాడు.

తాత్పర్యం: విశాల మయిన రెక్కలగాలుల వేగంచేత చలింపచేయబడిన పర్వతాల సమూహాన్ని, సంక్షోభింపచేయబడిన పెద్ద సముద్రాలను కలవాడున్నూ, బలం గల తనశరీరంయొక్క ప్రకాశించే కాంతిచేత తిరస్కరించబడిన సూర్యుడితేజస్సు కలవాడున్నూ అయిన గరుత్మంతుడు పుట్టి తల్లి అయిన వినతహృదయానికి ప్రియం చేస్తూ, అధికమయినవేగంతో ఆకాశమార్గానికి ఎగిరాడు.

క. దారుణకల్పాంతమరుత్ । ప్రేరిత హవ్యవహశిఖల పెల్లిది యని బృం
దారకమునిబృందస్తుతి । బోరనఁ దా నగ్నిసూక్తములతో నెసఁగెన్. 38

ప్రతిపదార్థం: దారుణ, కల్ప+అంత, మరుత్, ప్రేరిత, హవ్యవహ, శిఖల, పెల్లు+ఇది, అని= భయంకర మయిన ప్రళయకాలంలోని గాలిచే ప్రేరేపింపబడిన అగ్నియొక్క జ్వాలల సముదాయం ఇ దని; బృందారక, ముని, బృంద, స్తుతి= దేవతలయొక్కయు, మునుల సమూహంయొక్కయు స్తోత్రం; తాన్= తాను; బోరనన్=శీఘ్రంగా, అగ్ని, సూక్తములతోన్= అగ్నినిస్తుతించే వేదమంత్రాలతో ఎసఁగెన్= అతిశయించింది. (ఎగసెన్- పాఠాంతరం= బయల్వెడలింది).

తాత్పర్యం: భయంకరమయిన ప్రళయకాలంలోని గాలులచేత ప్రేరేపింపబడిన అగ్నియొక్క జ్వాలలసముదాయమిదని, దేవతలయొక్క, మునిసముదాయంయొక్క స్తోత్రం తాను శీఘ్రంగా అగ్నిని స్తుతించే వేదమంత్రాలతో అతిశయిల్లింది.

వ. అంత. 39

ప్రతిపదార్థం: అంతన్= పిదప

తాత్పర్యం: అటు పిమ్మట.

క. హరికులిశక్షతి యెఱుఁగని । గురుతరపక్షములతోడి కులగిరివోలెన్
గరుడండు గగనగతి నురు । తరజవమున నరుగుదెంచి తల్లికి మ్రొక్కెన్. 40

ప్రతిపదార్థం: హరి, కులిశ, క్షతి= ఇంద్రుని వజ్రాయుధంయొక్క దెబ్బ; ఎఱుఁగని= తెలియని; గురుతర, పక్షములతోడి కులగిరి, పోలెన్= మిక్కిలి పెద్దరెక్కలతో కూడిన కులపర్వతంవలె; గరుడండు; గగనగతిన్= ఆకాశగమనాన; ఉరుతర, జవమునన్= అధికమైన వేగంతో; అరుగుదెంచి= వచ్చి; తల్లికిన్= వినతకు; మ్రొక్కెన్= నమస్కరించాడు.

తాత్పర్యం: పూర్వం ఇంద్రుడు వజ్రాయుధంచేత పర్వతాలరెక్కలు ఖండించాడు. అట్లా వజ్రాయుధంయొక్క దెబ్బ నెఱుగని పెద్దరెక్కలతో కూడిన కులపర్వతం వలె గరుడుడు ఆకాశగమనాన వచ్చి తల్లి అయిన వినతకు నమస్కరించాడు.

విశేషం: అలం: ఉపమ, మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, గంధమాదనం, వింధ్యం, పారియాత్రం అనేవి ఏడుకులపర్వతాలు. ఈపద్యంలో కవిప్రౌఢోక్తిసిద్ధమైన అలంకారంవలన కలిగే వస్తుధ్వని ఉన్నది. వజ్రాహతికి రెక్కలు కోల్పోని

కులపర్వతం ఉపమానంగా చెప్పటం కవి ప్రౌఢోక్తి. దీనివలన భావికథలో ఇంద్రుడి వజ్రాయుధంకూడా ఏమీచేయలేనంత వీరుడై, ఇంద్రుడికి స్నేహితుడై, విష్ణువుకు వాహనమై, అమృతం త్రాగకపోయినా అమరుడై వెలుగొందే అసమానవీరుడయ్యే కథార్థాలు ధ్వన్యమానము లౌతున్నాయి. గరుత్మంతుడి గమనవేగం కందంలోని లఘువుల బాహుళ్యం వ్యంజింపజేస్తున్నది. అక్షరరమ్యతకూడ ఇక్కడ కథార్థధ్వనికి తోడ్పడుతున్నది. (సంపా.)

వ. ఇట్లు నిజజననికి మ్రొక్కి కద్రువపాలికిం బోయి. 41

తాత్పర్యం: ఈవిధంగా తనతల్లి యైన వినతకు నమస్కరించి, సవతితల్లి అయిన కద్రువచెంతకు వెళ్ళి.

చ. తడయక మ్రొక్కియున్న వినతాసుతు నప్పుడు సూచి, యాత్మలో
నిడుగడఁ జేయుచుం గడు సహింపక కద్రువ వానిఁ బిల్చి 'నా
కొడుకుల నెల్ల నెత్తికొని క్రుమ్మరుచుండుమ, యేమి పంచినన్
మడవక చేయు మీ' వని సమర్పణ సేసెఁ బ్రభుత్వ మేర్పడన్. 42

ప్రతిపదార్థం: తడయక= ఆలస్యంచేయక; మ్రొక్కి= నమస్కరించి; ఉన్న=ఉన్నటువంటి; వినతా, సుతున్= వినతయొక్క కుమారుడైన గరుడని; అప్పుడు= ఆసందర్భంలో; చూచి; ఆత్మలోన్= మనస్సులో; ఇడుగడన్, చేయుచున్= అసూయచూపుతూ; కడున్, సహింపక= మిక్కిలి ఓర్వలేక; కద్రువ; వానిన్= గరుడుని; పిల్చి; నా, కొడుకులన్, ఎల్లన్= నాకుమారు లైన పాముల నన్నింటిని; ఎత్తికొని= మోసికొని; క్రుమ్మరుచున్, ఉండుము+అ= తిరుగుతూఉండుమా! ఏమి, పంచినన్= వారేమి ఆజ్ఞాపించినా; ఈవు= నీవు; మడవక= మరలక (అలక్ష్యం చేయక); చేయుము; అని= అని పలికి; ప్రభుత్వము+ఏర్పడన్= అధికారం స్పష్టమయ్యేటట్లు; సమర్పణ, చేసెన్= గరుడునికి పాములను అప్పగించింది.

తాత్పర్యం: ఆలస్యం చేయకుండ మ్రొక్కిన, వినతపుత్రుడయిన గరుత్మంతుడిని కద్రువ చూచి మనసులో అసూయపడి ఓర్వలేక అతనితో ఇట్లా అన్నది: 'నాకొడుకుల(పాముల)నందరిని ఎత్తుకొని తిరుగుతూఉండుము. ఏపని చెప్పినను తిరస్కరించవ'ద్దని అధికారం ఏర్పడేటట్లు తన కొడుకులను అతనికి అప్పగించింది.

వ. గరుడండును గద్రువ పంచిన పనులెల్లను వినత యనుమతంబున నతివినయపరుం డై చేయుచు. 43

ప్రతిపదార్థం: గరుడండును= గరుడుడుకూడ (గరుడడు, గరుడుడు అనే రూపాలు రెండూ ఉన్నాయి); కద్రువ, పంచిన, పనులు+ఎల్లను= కద్రువ ఆజ్ఞాపించిన పనులన్నిటిని; వినత, అనుమతంబునన్= తల్లి అయిన వినత అంగీకారంతో; అతివినయ, పరుండు+అయి= మిక్కిలి నమ్రతతో కూడినవా డై; చేయుచున్= చేస్తూ.

తాత్పర్యం: గరుడుడుకూడ కద్రువ ఆజ్ఞాపించిన పనులన్నిటిని తన తల్లి అయిన వినత అంగీకారంతో మిక్కిలి నమ్రతతో చేస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఆ పన్నగముఖ్యులఁ దన । వీఁపునఁ బెట్టికొని పఱచి, విపినములు, మహా
ద్వీపములు, గిరులు, నఖిల ది । శాపాలపురములుఁ జూపెఁ జన వారలకున్. 44

ప్రతిపదార్థం: ఆ, పన్నగ, ముఖ్యులన్= ఆ సర్పశ్రేష్ఠులను; తన, వీపునన్= తన వీపుమీద; పెట్టికొని; పఱచి= పరువెత్తి (ఎగిరి); వారలకున్= ఆపాములకు; విపినములు= అడవులు; మహత్+ద్వీపములు= గొప్పదీవులు; గిరులున్= పర్వతాలను; అఖిల, దిశా, పాల, పురములున్= సకల దిక్పాలకుల నగరాలను కూడ; చనన్= ఒప్పేట్లుగా; చూపెన్= చూపెను.

తాత్పర్యం: గరుడడు ఆ సర్పముఖ్యులను తనవీపుమీద పెట్టుకొని ఎగిరి, అడవులను, గొప్పద్వీపాలను, పర్వతాలను, అష్టదిక్పాలకుల నగరాలను వారికి ఒప్పేట్లుగా చూపించాడు.

వ. ఒక్కనాఁడు సప్తమారుతజవంబున సప్తాశ్వమండలంబుదాఁక నెగసిన, నమ్మార్తాండు చండకిరణంబుల వేఁడిమిఁ దాఁకి, మాఁడి, గరుడని వీఁపున నున్నయురగులు దొరఁగి నేలంబడి మూర్ఛవోయినఁజూచి, కద్రువ కడునలిగి, గరుడనిం బదరి, యతిభక్తి నింద్రు నారాధించి. 45

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు; సప్తమారుత, జవంబునన్= ఏడుగాలులశక్తితో; సప్తాశ్వమండలంబు దాఁకన్= సూర్యమండలంవరకు; ఎగసినన్= పైకి ఎగురగా; ఆ+మార్తాండు= ఆ సూర్యునియొక్క; చండ, కిరణంబుల, వేఁడిమి= తీక్ష్ణమైన కిరణాలవేడి; తాఁకి= సోకి; మాఁడి= మాడిపోయి; గరుడని, వీఁపునన్, ఉన్న; ఉరగులు= పాములు; దొరఁగి= జారి; నేలన్, పడి; నేలమీద పడి; మూర్ఛ, పోయినన్; చూచి; కద్రువ; కడున్, అలిగి= మిక్కిలి కోపించి; గరుడనిన్; పదరి= ఆక్షేపించి; ఇంద్రున్; అతిభక్తిన్= మిక్కిలిభక్తితో; ఆరాధించి= పూజించి.

తాత్పర్యం: ఒకదినాన ఏడువాయువుల వేగంతో గరుడడు సూర్యుడిమండలం(బింబం)వరకు పైకెగురగా ఆసూర్యుడి తీక్షణ్ మైన కిరణాలవేడి తాకటంచేత గరుడుని వీపుపై ఉండే పాములు మాడి, జారి, నేలమీద పడి మూర్ఛిల్లగా చూచి కద్రువ మిక్కిలి కోపించి గరుడుని నిందించి ఇంద్రుడిని భక్తితో పూజించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. నరసురసిద్ధకింపురుషనాగనభశ్చరముఖ్యు లెల్ల నీ
కరుణయ వేచి మండ్రు, త్రిజగంబులు నీ కులిశాభిరక్షణ
స్ఫురణన చేసి సుస్థిరతఁ బొందుఁ బురందర! సర్వలోకసుం
దర! శరణంబు నా కగుము దానవసూదన! పాకశాసనా! 46

ప్రతిపదార్థం: దానవసూదన= రాక్షసులను హతమార్చినవాడా!; పాకశాసనా= పాకుడనే రాక్షసుడిని శిక్షించినవాడా!; సర్వ, లోక, సుందర= అన్ని లోకాలకు అందమైనవాడా!; పురందర= ఓఇంద్రుడా!; నర, సుర, సిద్ధ, కింపురుష, నాగ, నభస్+చర, ముఖ్యులు+ఎల్లన్= నరులు, దేవతలు, సిద్ధులు, కింపురుషులు, నాగులు, ఆకాశంలో తిరుగాడే ఇతరులు మొదలయిన వారిలోని. ముఖ్యులందరును; నీ, కరుణ+అ= నీదయనే; వేచి= ఎదురుచూచి; మండ్రు= జీవిస్తారు; నీ, కులిశ+అభిరక్షణ, స్ఫురణన్+అ+చేసి= నీవజ్రాయుధంయొక్క రక్షణంయొక్క అతిశయంచేతనే, త్రిజగంబులు= ముల్లోకాలు; సుస్థిరతన్, పొందున్= (స్థిరత్వాన్ని) శాంతిని పొందుతాయి; నాకున్; శరణంబు= రక్షణము, అగుము= కమ్ము.

తాత్పర్యం: రాక్షససంహారి వైన ఓ ఇంద్రుడా! నరులు, దేవతలు, సిద్ధులు, కింపురుషులు, నాగులు, ఆకాశమార్గాన చరించే ఇతర ముఖ్యు లందరూ నీదయనే అపేక్షించి జీవిస్తారు. నీవజ్రాయుధంయొక్క రక్షణ కలగటంచేతనే ముల్లోకాలు శాంతిని పొందుతాయి. ఓఇంద్రుడా! ఎల్లలోకాలలో సుందరుడ వైనవాడా! నాకు రక్షకుడ వగుము.

విశేషం: ఈపద్యంలో రేఫాక్షరబాహుళ్యంవలన అక్షరరమ్యత ఏర్పడింది. దీనివలన కద్రువ లోని మనోవేదన ధ్వన్యమాన మౌతున్నది. 'పురందర! సర్వలోకసుందర!' అనే సంబుద్ధిలోని బిందుపూర్వక దకారంతో కూడుకొన్న ర వర్ణం వలన కలిగే నాదమాధుర్యం ఇంద్రుడిని ప్రసన్నుడినిగా చేసికొనటానికి తోడ్పడుతుంది. ఉదారత(బంధముయొక్క వికటత్వం)తో కూడుకొన్న ప్రసాదం (బంధశైథిల్యం) అనే శబ్దగుణం రసభావవ్యంజకంగా సంవదించిన నన్నయ రచనాశిల్ప మిది. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని స్తుతియించి పర్జన్యప్రసాదంబున మహావృష్టి గొడుకులపయిం గురియించి, యయ్యురగుల విగత పరితాపులంజేసి కద్రువ గర్వంబున నుఱక గరుడని వినతనుం బనులుగొనుచున్నంత, నొక్కనాఁడు గరుడండు తల్లి కి ట్లనియె. 47

ప్రతిపదార్థం: అని; స్తుతియించి= పొగడి; పర్జన్య, ప్రసాదంబునన్= ఇంద్రుడి అనుగ్రహంచేత; మహత్, వృష్టి= గొప్పవాన; కొడుకులపయిన్= కుమారు లయిన పాములమీద; కురియించి= కురిసేట్లు చేసి; ఆ+ఉరగులన్= ఆపాములను; విగత, పరితాపులన్= పోయిన సంతాపం (వేడివల్లకలిగినబాధ) కలవారిని; చేసి; ఉఱక= లక్ష్యపెట్టక; పనులు, కొనుచున్+ఉన్న+అంతన్= వారిచేత పనులు చేయించుకొంటూండగా అప్పుడు; గరుడండు; తల్లికిన్= వినతకు; ఇట్లు+ అనియెన్= ఈవిధంగా పలికినాడు.

తాత్పర్యం: అని పొగడి, ఇంద్రుడి అనుగ్రహంచేత కొడుకులమీద గొప్పవాన కురిసేటట్లు చేసి, ఆపాములను వేడివలనకలిగినబాధ లేనివారిగా చేసి, కద్రువ ఎవ్వరినీ లక్ష్యపెట్టక వారిచే పనులు చేయించుకొంటూ ఉండగా, గరుడుడు తల్లితో ఇట్లా పలికాడు.

ఉ. ఆయతపక్షతుండహతి నక్కులశైలము లెల్ల నుగ్గుగాఁ
జేయు మహాబలంబును బ్రసిద్ధియునుం గల నాకు నీపనిం
బాయక వీఁపునం దవడుఁ బాముల మోవను, వారికిం బనుల్
సేయను నేమి కారణము సెప్పుము దీనిఁ బయోరుహాననా! 48

ప్రతిపదార్థం: పయోరుహ+ఆననా= పద్మంవంటి ముఖం కలదానా! ఆయత, పక్ష, తుండ, హతిన్; ఆయత= పెద్దవయిన; పక్ష= రెక్కలయొక్క; తుండ= ముక్కుయొక్క; హతిన్= దెబ్బచేత; ఆ+కుల, శైలములు+ఎల్లన్= ఆప్రాచీనపర్వతాలు అన్నింటిని; నుగ్గుగాన్= పొడిగా; చేయు, మహత్, బలంబును= చేసేగొప్పబలాన్ని; ప్రసిద్ధియునున్= ప్రఖ్యాతియు; కల; నాకున్; ఈపనిన్= ఈపనిని; పాయక= క్రమంతప్పకుండ; విడువక; వీఁపునందున్= వీపుమీద; అవడు, పాములు= నీచా లయిన పాములను; మోవను= మోయటానికి; వారికిన్, పనుల్ చేయను= ఆపాములకు సేవలుచేయటానికి, ఏమి కారణము; చెప్పుము.

తాత్పర్యం: పద్మంవంటిముఖంకలదానా! కులశైలాలన్నింటిని నావిశాలమైనరెక్కలతో, వాడియైన ముక్కుతోడి దెబ్బలతో పొడిగాచేసే గొప్పబలమున్నూ, ప్రసిద్ధియున్నూ ఉన్న నాకు విడువక సదా నీచా లయిన పాములను వీపుపై మోయటానికి, వాటికి సేవచేయటానికి కారణ మేమి? ఈ పనికి కారణమేమిటో చెప్పుము.

విశేషం: తల్లిని 'పయోరుహాననా!' అని సంబోధించటం ఉచితంకాదని కొందరంటారు. అయితే, ఇక్కడ అవయవార్థం అవివక్షితమని గ్రహించాలి. ఇటువంటిది ఈఆశ్వాసంలోనే మరొకటి ఉన్నది. వాసుకి తన చెల్లెలైన జరత్కారువును 'అంబుజనేత్రా'! (2.216) అని సంబోధిస్తాడు. ఇవి కావ్యభాషలో గౌరవాన్ని తెలిపే సంబుద్ధులుగా పరిగణింపబడతాయి. ఇందులో కొందరు భావించినట్లు అనౌచిత్యం లేదు.

వ. అని యడిగిన వినత తనకుం గద్రువతోడి పన్నిదంబున నైన దాసీత్వంబును, తత్కారణం బైన యనూరుశాపంబును గొడుకున కేర్పడం జెప్పి యి ట్లనియె. 49

ప్రతిపదార్థం: అని, అడిగినన్= అని గరుత్మంతుడు అడుగగా; వినత, తనకున్; కద్రువతోడి, పన్నిదంబునన్= కద్రువతో వేసిన పందెంవలన; ఐన, దాసీత్వంబును= ఏర్పడిన దాసితనాన్ని; తత్, కారణంబు+ఐన= దానికి కారణ మయిన; అనూరు, శాపంబునున్= అనూరు డిచ్చిన శాపాన్ని; కొడుకునకున్; ఏర్పడన్, చెప్పి= వివరించి (స్పష్టమయ్యేట్లుగా); ఇట్లు, అనియెన్.

తాత్పర్యం: అని గరుడుడు అడుగగా వినత తన సవతి అయిన కద్రువతో జరిగిన పందెంచేత కలిగిన దాస్యాన్నీ, ఆ కారణాన కలిగిన జ్యేష్ఠపుత్రు డైన అనూరు డిచ్చిన శాపాన్నీ కొడుకునకు స్పష్టంగా తెల్పి ఇట్లా అన్నది.

క. నీ కతమున నా దాస్యము । ప్రాకటముగఁ బాయు ననిన పలు కెడలోనం
జేకొని, యూఱడి నిర్గత । శోకస్థితి నున్నదానఁ జూవె ఖగేంద్రా! 50

ప్రతిపదార్థం: ఖగ+ఇంద్రా+= ఓపక్షిరాజా! నీకతమునన్= నీకారణంచే; నా దాస్యము= నా దాసితనం; ప్రాకటముగన్= ప్రసిద్ధంగా (అందరికీ తెలిసేటట్లుగా); పాయున్= పోతుంది; అనిన= అని అనూరుడు చెప్పిన; పలుకు= మాట; ఎడలోనన్= మనస్సులో; చేకొని= గ్రహించి; ఊఱడి= ఓదార్పుచెంది; నిర్గత, శోక, స్థితిన్= పోయిన దుఃఖం కల స్థితిలో; ఉన్నదానన్+చూవె= ఉన్నదానినిసుమా!

తాత్పర్యం: ఓ పక్షిశ్రేష్ఠుడా! నీకారణంగా నా దాసితనం పోతుం దని అనూరుడు చెప్పినమాటను మనస్సులో ఉంచుకొని, బాధ విడిచి దుఃఖంపోయినస్థితి కలదాన నై ఉన్నానుసుమా!

వ. 'కొడుకులు సమర్థులైనం దల్లిదండ్రులయిడుమలు వాయుట యెందునుంగలయది, గావున నీయట్టిసత్పుత్త్రుం బడసియు దాసి నై యుండుదాననే' యనిన విని వైనతేయుండు తద్దయు దుఃఖితుం డై, యొక్కనాఁడు కాద్రవేయుల కి ట్లనియె. 51

ప్రతిపదార్థం: కొడుకులు; సమర్థులు+ఐనన్= శక్తికలవారైతే; తల్లిదండ్రుల; ఇడుమలు= కష్టాలు; పాయుట= వీడటం; ఎందునున్, కల, అది= ఎచ్చటైనా ఉన్నది; కావునన్; నీ, అట్టి, సత్, పుత్త్రున్= నీవంటి మంచికుమారుడిని; పడసియున్= పొందియు; దాసిని+ఐ, ఉండు, దానను+ఏ= దాసి నై ఉంటానా; అనినన్= అని చెప్పగా; విని; వైనతేయుండు= వినతకొడు కైన గరుత్మంతుడు; తద్దయున్= మిక్కిలి; దుఃఖితుండు+ఐ= దుఃఖంపొందినవాడై; కాద్రవేయులకున్= కద్రువ కుమారు లయిన పాములకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'కుమారులు శక్తిమంతు లైతే తల్లిదండ్రుల కష్టాలు తొలగటం ఎచ్చటైనా ఉన్నదే(సహజమే). కావున నీవంటి యోగ్యు డైన కుమారుడిని పొంది నేను ఇంకా దాసి నై ఉంటానా!' అని వినత తెల్పగా విని గరుడుడు దుఃఖించి కద్రువపుత్రు లైన పాములతో ఇట్లా పలికాడు.

క. మా యీ దాస్యము వాయు ను । పాయము సేయుండు, నన్నుఁ బనుపుం డిష్టం
బేయది దానిన తెత్తు న । జేయుఁడ నై యమరవరులఁ జేకొని యైనన్. 52

ప్రతిపదార్థం: మా, ఈ, దాస్యము= తల్లియైన వినతకు, నాకు గల ఈబానిసతనం; పాయు+ఉపాయము= పోయేటి ఆలోచనను; చేయుండు= చెయ్యండి; నన్నున్; పనుపుండు= ఆజ్ఞాపించండి; ఇష్టంబు, ఏ+అది= కోరిం దేదో; దానిన్+అ= దాన్నే; అమర, వరులన్= దేవశ్రేష్ఠులను; చేకొని+ఐనన్= లోబరుచుకొని అయినా; అజేయుఁడను+ఐ= ఓడించబడనివాడనై, విజయం పొందేవాడినై; తెత్తున్= తెస్తాను.

తాత్పర్యం: నాతల్లియొక్క, నాయొక్కదాస్యం పోవటానికి ఆలోచన చేయండి; నన్ను ఆజ్ఞాపించండి; దేవశ్రేష్ఠులను లోబరుచుకొని అయినా మీకిష్టమయినదానిని విజయం పొంది తెస్తాను.

వ. అనిన నయ్యురగులు కరుణించి గరుడని కి ట్లనిరి. 53

ప్రతిపదార్థం: అనినన్= అని అడుగగా; ఆ+ఉరగులు= ఆపాములు; కరుణించి= జాలిపడి, దయదలచి; గరుడనికిన్+ ఇట్లు+అనిరి= గరుత్మంతునితో ఇట్లా చెప్పారు.

తాత్పర్యం: అని గరుడుడు అడుగగా ఆపాములు జాలిపడి గరుడుడితో ఇట్లా చెప్పారు.

చ. 'అమితపరాక్రమంబును, రయంబును, లావును గల్గు ఖేచరో
త్తముఁడవు నీవు; నీదయినదాస్యముఁ బాచికొనంగ నీకుఁ జి
త్తము గలదేని, భూరిభుజదర్పము శక్తియు నేర్పడంగ మా
కమృతముఁ దెచ్చియి' మ్మనిన నవ్విహగేంద్రుఁడు సంతసంబునన్. 54

ప్రతిపదార్థం: నీవు; అమిత, పరాక్రమంబును= అంతు లేని విక్రమాన్ని; రయంబును= వేగాన్ని; లావును= బలాన్ని; కల్గు; ఖేచర+ఉత్తముఁడవు= పక్షులలో గొప్పవాడివి, (పక్షి శ్రేష్ఠుడివి); నీది+అయిన, దాస్యమున్= నీకు కలిగిన బానిసతనాన్ని; పాచికొనంగన్= పోగొట్టుకొనటానికి; నీకున్; చిత్తము, కలదు+ఏని= మనసు ఉంటే; భూరి, భుజ, దర్పము= అధిక మైన భుజాలయొక్క గర్వమున్నూ; శక్తియున్= సామర్థ్యమున్నూ; ఏర్పడంగన్= స్పష్టమయ్యేటట్లు; మాకున్; అమృతమున్; తెచ్చి, ఇమ్ము; అనినన్= అని పాములు చెప్పగా; ఆ, విహగ+ఇంద్రుఁడు= ఆపక్షిశ్రేష్ఠుడు; సంతసంబునన్= సంతోషంతో.

తాత్పర్యం: 'నీవు అంతులేని విక్రమాన్ని, వేగాన్ని, బలాన్ని కలిగిన పక్షిశ్రేష్ఠుడవు. నీకు కలిగిన దాస్యం పోగొట్టుకొనాలనే అభిప్రాయ మున్నట్లయితే, గొప్ప భుజాలగర్వమూ, శక్తీ ప్రకటితమయ్యేటట్లుగా మాకు అమృతాన్ని తెచ్చిఇ' మ్మని పాములు చెప్పగా, ఆపక్షిశ్రేష్ఠుడు సంతోషంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: గరుడుడికి ఉన్న అనంతపరాక్రమాది గుణాలకు తగిన కోరిక అమృతాన్ని తెచ్చి ఇవ్వట మని పాములు నిర్ణయించాయి. అమృతాన్ని పొందటం పాముల కోర్కె. దానిని తీర్చగలిగిన సమర్థుడు వారికి దొరికాడు. అందుకని అడిగారు. మహాభారతంలో అనేక సందర్భాలలో అమృతత్వసాధనకై జీవులు చేసే ప్రస్థానాన్ని ధ్వనిమయంచేయటం ఇచ్చటి కథార్థప్రయోజనం.

గరుత్మంతుఁ డమృతంబుఁ దెచ్చుటకుఁ దల్లియనుమతిఁ గొనుట (సం. 1-24-1)

వ. 'అట్ల చేయుదు; నమృతంబు దెచ్చి మీ కిచ్చి, యేనునుం దల్లియు దాస్యంబువలన విముక్తుల మగువార' మని నొడివి, తద్వృత్తాంతం బంతయుం దల్లికింజెప్పి 'యమృత హరణార్థం బరిగెద' నని మ్రొక్కిన, వినత సంతసిల్లి కొడుకుం గౌఁగిలించుకొని. 55

ప్రతిపదార్థం: అట్లు+అ= ఆవిధంగానే; చేయుదున్; అమృతంబు, తెచ్చి; మీకున్+ఇచ్చి; ఏనున్; తల్లియున్; దాస్యంబువలనన్; విముక్తులము+అగువారము= విడువబడినవార మవుతాము; అని; నొడివి= చెప్పి; తద్, వృత్తాంతంబు= ఆవిషయం; అంతయున్; తల్లికిన్= వినతకు; చెప్పి; అమృత, హరణ+అర్థంబు= అమృతాన్ని హరించేనిమిత్తం; అరిగెదన్= వెడలుతాను; అని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ్రొక్కినన్= నమస్కరించగా; సంతసిల్లి= సంతోషించి; కొడుకున్= కుమారు డయిన గరుడుని; కౌఁగిలించుకొని= వాత్సల్యంతో ఆలింగనం చేసికొని.

తాత్పర్యం: 'అట్లే చేస్తాను. స్వర్గంనుండి అమృతం తెచ్చి మీ కిచ్చి నేనూ మాతల్లి అయిన వినతా దాస్యంనుండి విడువబడినవాళ్ళ మవుతా' మని పలికి, ఆవిషయమంతా తల్లియైన వినతకు తెల్పి 'అమృతం హరించటానికి వెళ్తా' నని నమస్కరించగా వినత సంతోషించి కొడుకును కౌగిలించుకొని.

చ. 'అనిలుఁడు పక్షయుగ్మ, మమృతాంశుఁడు వీఁపనలుండు మస్తకం,
బినుఁడు సమస్తదేహమును నెప్పుడుఁ గాచుచు నీ కభీష్టముల్
ఘనముగఁ జేయుచుండెడు జగన్నుత! యున్నతియున్ జయంబుఁ జే
కొను' మని యిచ్చె దీవనలు గోరి ఖగేంద్రునకుం బ్రియంబునన్. 56

ప్రతిపదార్థం: అనిలుఁడు= వాయువు; పక్షయుగ్మము= రెక్కలజంటను; అమృత+అంశుఁడు= చంద్రుడు; వీఁపు; అనలుండు= అగ్ని; మస్తకంబు= శిరస్సును; ఇనుఁడు= సూర్యుడు; సమస్తదేహమునున్= సర్వశరీరాన్ని; ఎప్పుడున్= ఎల్లప్పుడు; కాచుచున్= రక్షిస్తూ; నీకున్, అభీష్టముల్= కోరికలు; ఘనముగన్= గొప్పగా; చేయుచుండెడున్= తీరుస్తూ ఉంటారుగాక! జగత్+నుత= లోకాలచేత స్తుతింపబడినవాడా! ఉన్నతియున్= గొప్పతనాన్ని; జయంబున్= విజయాన్ని; చేకొనుము= గ్రహించుము; అని; కోరి; దీవనలు= ఆశీస్సులు; ప్రియంబునన్= ప్రీతితో; ఖగ+ఇంద్రునకున్= పక్షులకు రాజయిన గరుత్మంతుడికి; ఇచ్చెన్= ఇచ్చింది.

తాత్పర్యం: 'వాయువు రెక్కలజంటను, చంద్రుడు వీపును, అగ్ని తలను, సూర్యుడు ఎల్లశరీరాన్ని సర్వదా రక్షిస్తూ నీ కోరికలు గొప్పగా తీరుస్తూఉంటారు గాక! లోకాలచేత నుతింపబడేవాడా! గొప్పతనాన్ని, విజయాన్ని గ్రహించుము' అని వినత మనసులో కోరి పక్షులకు రా జయిన గరుడునికి ప్రీతితో ఆశీస్సులు ఇచ్చింది.

విశేషం: తల్లులు బిడ్డలకు ఉగ్గుపెట్టి వారి శరీరంలోని అంగాల నన్నింటికీ శ్రీరామరక్షలు కోరుతూ వాత్సల్యాన్ని వ్యక్తంచేసినట్లు ఇక్కడ వినత తనకొడుకు రెక్కలకు, వీపునకు, తలకు, శరీరం మొత్తానికీ దైవరక్షను నిర్దేశించింది. గరుడుడు పక్షికాదనీ, మంత్రమనీ చెప్పే తత్త్వజ్ఞులు వీటిని మంత్రరక్షాకవచంగా వ్యాఖ్యానిస్తారు.

వ. గరుడండును దల్లిదీవనలు గైకొని గమనోన్ముఖుం డై 'యమృతంబు దెచ్చునపుడు లావు గలుగవలయు, నా కాహారంబు ప్రసాదింపు' మనిన వినత యి ట్లనియె. 57

ప్రతిపదార్థం: గరుడండును; తల్లి; దీవనలు= ఆశీస్సులు; కైకొని= గ్రహించి; గమన+ఉన్ముఖుండు+ఐ= వెళ్ళటానికి సిద్ధుడై; అమృతంబు; తెచ్చునపుడు; లావు= బలం; కలుగవలయున్; నాకున్ ఆహారంబు= తినే పదార్థం; ప్రసాదింపుము= అనుగ్రహించుము; అనినన్; వినత; ఇట్లు+ అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: గరుడుడు తల్లి అయిన వినతయొక్క దీవెనలు పొంది వెళ్ళటానికి సిద్ధమై, 'అమృతం తెచ్చే సమయంలో తగినబలం కలిగి ఉండాలి; నాకు ఆహారం అనుగ్రహించు' మని తల్లితో పలుకగా ఆమె ఇట్లా అన్నది.

క. విషనిధికుక్షి నసంఖ్యము । నిషాదగణ ముండి ధారుణీప్రజకుఁ గడున్
విషమమును జేయు, దాని ని । మిషమున భక్షించి చను మమిత్రవిఘాతీ! 58

ప్రతిపదార్థం: అమిత్రవిఘాతీ= శత్రువులను సంహరించేవాడా! విషనిధి, కుక్షిన్= సముద్రంయొక్క గర్భాన; అసంఖ్యము= లెక్కలేని; నిషాదగణము= బోయవాళ్ళసముదాయం; ఉండి; ధారుణీ, ప్రజకున్= భూమిలోని జనులకు; కడున్= మిక్కిలి; విషమమును= కష్టాన్ని; చేయున్; దానిన్= ఆ నిషాదగణాన్ని; నిమిషమునన్= కనురెప్పపాటుకాలంలో (తక్కువకాలంలో) భక్షించి= తిని; చనుము= వెళ్ళుము.

తాత్పర్యం: ఓ శత్రువులను సంహరించే గరుడుడా! సముద్రగర్భాన లెక్కింపరాని బోయవాళ్ళసముదాయం ఉన్నది; భూమిలోని ప్రజలకు క్లేశం కలిగిస్తున్నది; ఆనిషాదగణాన్ని నిమిషకాలంలో తిని వెళ్ళుము.

వ. 'భక్షణవిషయంబున బ్రాహ్మణునిం బరిహరించునది' యనిన గరుడండు 'నాకు బ్రాహ్మణు నెఱుంగు తెఱంగెఱింగింపు' మనిన వినత యి ట్లనియె. 59

ప్రతిపదార్థం: భక్షణవిషయంబునన్= తినే సందర్భంలో; బ్రాహ్మణునిన్; పరిహరించునది= విడవాలి; అనినన్; గరుడండు; నాకున్; బ్రాహ్మణున్; ఎఱుంగు, తెఱంగు= తెలిసికొనే విధం; ఎఱింగింపుము= తెలుపుము.

తాత్పర్యం: తినే సందర్భంలో బ్రాహ్మణుడిని విడిచిపెట్టుము. (తినకుము) అని వినత పలుకగా గరుడుడు బ్రాహ్మణు డెవరో తెలిసికొనేవిధం తెల్పు మని అడుగగా వినత ఇట్లా చెప్పింది.

క. రయమున మ్రింగుడు గాలము । క్రియ నెవ్వఁడు కంఠబిలముక్రిందికిఁ జన క
గ్నియపోలె నేర్చుచుండును । భయరహితా! వాని నెఱుఁగు బ్రాహ్మణుఁ గాఁగన్. 60

ప్రతిపదార్థం: రయమునన్= వేగంతో; మ్రింగుడున్= మింగిన అనంతరం; గాలముక్రియన్= చేపనుపట్టే గాలంవలె; ఎవ్వఁడు; కంఠ, బిలము క్రిందికిన్= కంఠరంధ్రంక్రిందికి; చనక= వెళ్ళక; అగ్ని+అ+పోలెన్= అగ్నివిధంగా; ఏర్చుచుండును= కాలుస్తుంటాడో; భయరహితా= భయంలేనివాడా!; వానిన్= అట్టివాడిని; బ్రాహ్మణున్, కాఁగన్= బ్రాహ్మణు డయినట్లుగా; ఎఱుఁగు= తెలిసికో!

తాత్పర్యం: భయం లేని ఓ గరుత్మంతుడా! వేగంగా మింగేటప్పుడు చేపలను పట్టే గాలమనే సాధనంవలె ఎవడు కంఠరంధ్రంక్రిందికి పోకుండ అగ్నివలె కాలుస్తుంటాడో అట్టివాడిని బ్రాహ్మణుడిగా తెలిసికొమ్ము.

విశేషం: అలం: ఉపమ

తే. కోపితుం డైన విప్రుండు ఘోరశస్త్ర । మగు, మహావిష మగు, నగ్ని యగు; నతండ
యర్చితుం డైన జనులకు నభిమతార్థ । సిద్ధికరుఁ డగు, గురుఁడగుఁ, జేయుఁ బ్రీతి. 61

ప్రతిపదార్థం: విప్రుండు= బ్రాహ్మణుడు; కోపితుండు+ఐనన్= కోపం కల్గింపబడినవా డయితే; ఘోర, శస్త్రము+అగున్= భయంకరమైన ఆయుధ మవుతాడు; మహత్, విషము+అగున్= గొప్పవిష మవుతాడు; అగ్ని, అగున్; అతండు+అ= ఆ బ్రాహ్మణుడే; అర్చితుండు+ఐనన్= సేవింపబడినవా డయితే; జనులకున్= ప్రజలకు; అభిమత+అర్థ, సిద్ధి, కరుఁడు+అగున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కోరబడిన ప్రయోజనం యొక్క సిద్ధిని కలిగించేవా డవుతాడు; గురుఁడు+అగున్= ఉపదేశకు డవుతాడు; ప్రీతిన్+చేయున్= ఇష్టం కలిగిస్తాడు.

తాత్పర్యం: బ్రాహ్మణుడు కోపింపచేయబడితే భయంకర మయిన ఆయుధ మవుతాడు, గొప్పవిష మవుతాడు, అగ్ని అవుతాడు; ఆబ్రాహ్మణుడే సేవింపబడితే ప్రజలకు కోరబడిన ప్రయోజనంయొక్క సిద్ధిని కలిగించేవా డవుతాడు, ఆచార్యు డవుతాడు. ఇష్ట మొనరిస్తాడు.

వ. అని బ్రాహ్మణస్వరూపంబుఁ జెప్పిన నెఱింగి, వినతకు మ్రొక్కి వీడ్కొని, గరుడం డతిత్వరితగతిం బఱచి, సముద్రోదరంబున నున్న నిషాదు లనేక శతసహస్రసంఖ్యలవారిం బాతాళవివరంబునుంబోని తనకంఠబిలంబుఁ దెఱచి యందఱ నొక్కపెట్ట మ్రింగిన, నం దొక్క విప్రుం డుండి కుత్తుకకు డిగక నిప్పునుంబోలె నేర్చుచున్న నెఱింగి, 'నాకంఠబిలంబున విప్రుం డున్నవాఁడేని వెలువడి వచ్చునది' యనిన గరుడని క వ్విప్రుం డి ట్లనియె. 62

ప్రతిపదార్థం: అని; బ్రాహ్మణ, స్వరూపంబున్= బ్రాహ్మణుడియొక్క స్వరూపాన్ని (లక్షణాన్ని); చెప్పినన్= చెప్పగా; ఎఱింగి; వినతకున్; మ్రొక్కి= నమస్కరించి; వీడ్కొని= సెలవుపుచ్చుకొని; గరుడండు; అతి, త్వరిత, గతిన్= మిక్కిలి వేగం గల గమనంతో; పఱచి= పరుగెత్తి (ఎగిరి); సముద్ర+ఉదరంబునన్= సముద్రంయొక్క గర్భంలో; ఉన్న; అనేక, శత, సహస్ర, సంఖ్యల, వారిన్= పెక్కువందల వేల సంఖ్యలలో ఉన్న వారిని; నిషాదులన్= బోయలను; పాతాళవివరంబునున్, పోని= పాతాళలోకంయొక్క రంధ్రంవంటి; తన, కంఠ, బిలంబున్= తన కంఠంయొక్క రంధ్రాన్ని తెఱచి; ఒక్కపెట్టన్= ఒక్కమారుగా; మ్రింగినన్= మ్రింగగా; అందున్= ఆకంఠబిలంలో; ఎఱింగి= తెలిసి; విప్రుండు= ఒక్క బ్రాహ్మణుడు, ఉండి; కుత్తుకకున్, డిగక= కంఠంలోనికి దిగక; నిప్పునున్, పోలెన్= నిప్పువలె; ఏర్చుచున్+ఉన్నన్= కాలుస్తూ ఉండగా; నా కంఠబిలంబునన్= నా కంఠంయొక్క రంధ్రంలో; విప్రుండు= బ్రాహ్మణుడు; ఉన్నవాఁడు+ఏని= ఉన్నవా డయితే; వెలువడి వచ్చునది= బయటికి రావాలి; అనినన్= అనగా; గరుడనికిన్= గరుత్మంతుడితో; ఆ+ విప్రుండు= ఆబ్రాహ్మణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని వినత బ్రాహ్మణుడిలక్షణాన్ని చెప్పగా తెలిసికొని గరుడుడు వినతకు నమస్కరించి, ఆమెకడ సెలవు పుచ్చుకొని, మిక్కిలి వేగం గల గమనంతో ఎగిరి(పరుగెత్తి) సముద్రగర్భాన ఉండే పెక్కువేలసంఖ్య కల బోయలను పాతాళరంధ్రంవంటి తనకంఠరంధ్రం తెరిచి ఆనిషాదులనందరిని ఒకేమారు మ్రింగగా, ఆనిషాదులలో ఒక బ్రాహ్మణుడు ఉండి, గొంతుకలోనికి దిగక అగ్నివలె కాలుస్తుండగా తల్లి చెప్పిన లక్షణాన్నిబట్టి బ్రాహ్మణుడు కంఠంలో ఉన్నా డని తెలిసికొని, 'నాకంఠరంధ్రంలో ఎవడైనా బ్రాహ్మణుడు ఉంటే, బయటికి రావా' లని పలుకగా ఆబ్రాహ్మణుడు గరుడుడితో ఇట్లా పలికాడు.

విశేషం: అలం: ఉపమ.

ఉ. 'విప్రుఁడ నున్నవాఁడ, నపవిత్రనిషాది మదీయభార్య, కీ
ర్తిప్రియ! దీనిఁ బెట్టి చనుదెంచుట ధర్మువె నాకు?' నావుడున్
'విప్రులఁ బొంది యున్న యపవిత్రులుఁ బూజ్యులు గారె; కావునన్
విప్రకులుండ! వెల్వడుము వేగమ నీవును నీ నిషాదియున్.' 63

ప్రతిపదార్థం: కీర్తిప్రియ!= కీర్తిపట్ల ఆసక్తి కలవాడా! గరుత్మంతుడా!; విప్రుఁడన్= బ్రాహ్మణుడను; ఉన్నవాఁడన్; అపవిత్ర= పరిశుద్ధురాలు కానిది; నిషాది= బోయవనిత; మదీయ, భార్య= నాభార్య; దీనిన్= ఈబోయతను; పెట్టి=విడిచి; చనుదెంచుట= రావటం; నాకున్; ధర్మువు+ఎ= ధర్మమా! (ధర్మంకాదని భావం); నావుడున్= అనగావిని; విప్రకులుండ= బ్రాహ్మణకులుడా!; విప్రులన్= బ్రాహ్మణులను; పొంది, ఉన్న= చెంది ఉండే (చెట్టపట్టి ఉండే); అపవిత్రులున్= అపరిశుద్ధులుకూడ; పూజ్యులు కారె= పూజింపదగినవారు కారా! (అవుతారు); కావునన్= ఆకారణంవలన; నీవును= నీనిషాదియున్= నీబోయభార్యయు; వేగము+అ= శీఘ్రంగా; వెల్వడుము= బయటకు రమ్ము; ఇచట 'నిషాదియు' అనేశబ్దం సహార్థంలో వాడబడింది. నిషాదియున్ అంటే నిషాదితోడ అని అర్థం.

తాత్పర్యం: 'కీర్తిపట్ల ఆసక్తిగల ఓగరుత్మంతుడా! బ్రాహ్మణుడిని ఉన్నాను, నాభార్య అపరిశుద్ధురా లయిన బోయవనిత; దీన్ని విడిచి రావటం నాకు ధర్మమా?' అనగా గరుడడు 'బ్రాహ్మణులను పొంది ఉండే అపరిశుద్ధులుకూడ పూజింపదగినవారు కారా? కావున ఓ బ్రాహ్మణ కులానికి చెందినవాడా! నీవు నీనిషాదిభార్యతో వెంటనే బయటకు రమ్ము!'

వ. అనిన నాగరుడని యనుగ్రహంబున బ్రాహ్మణుండు నిషాదీసహితుం డై వెలువడి వచ్చి, గరుడని దీవించి, యథేచ్ఛం జనియె; గరుడండును గగనపథంబునం బఱచి, కశ్యపుం గని నమస్కరించి, 'యస్మజ్జననీ దాస్యనిరాసార్థం బురగుల కమృతంబుఁ దేర నరిగెద, నిషాదఖాదనంబున నాఁకలి వోవకున్నయది, నా కాహారంబు ప్రసాదింపు' మనిన కొడుకుకడంకకు మెచ్చి కశ్యపప్రజాపతి యి ట్లనియె. 64

ప్రతిపదార్థం: అనినన్= గరుడుడు అట్లా పలుకగా; ఆ, గరుడని; అనుగ్రహంబునన్= ఆ గరుడని దయచేత; బ్రాహ్మణుండు; నిషాదీసహితుండై=బోయజాతి పత్నితో వెలువడి, వచ్చి= బయటకు వచ్చి; గరుడనిన్; దీవించి= ఆశీర్వదించి; యథా+ఇచ్ఛన్= ఇచ్ఛవచ్చినట్లు; చనియెన్= వెళ్ళాడు; గరుడండును; గగనపథంబునన్= ఆకాశమార్గాన; పఱచి= ఎగిరి; కశ్యపున్= తండ్రి అయిన కశ్యపుని; కని= చూచి; నమస్కరించి= మ్రొక్కి; అస్మత్, జననీ, దాస్య, నిరాస+అర్థంబు= మాతల్లియొక్క బానిసతనాన్ని పోగొట్టటానికి; ఉరగులకున్= పాములకు; అమృతంబు; తేరన్= తేవటానికి; అరిగెదన్= వెళ్లుతున్నాను; నిషాద, ఖాదనంబునన్= నిషాదులను తినటంచేత; ఆకలి; పోవక+ఉన్న+అది= తొలగకుండా ఉన్నది; నాకున్; ఆహారంబు= తినేపదార్థం; ప్రసాదింపుము= అనుగ్రహించుము; అనినన్; కొడుకు, కడంకకున్= కొడు కయిన గరుడుని పూనికకు; మెచ్చి; కశ్యపప్రజాపతి= కశ్యపబ్రహ్మ; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: అని గరుడడు పలుకగా, అతనిదయవలన బ్రాహ్మణుడు తన నిషాదభార్యతో కూడి కంఠంనుండి బయటకు వచ్చి గరుడుని ఆశీర్వదించి, తన ఇచ్ఛవచ్చినట్లు వెళ్ళాడు. గరుడడును ఆకాశమార్గాన ఎగిరి తండ్రి అయిన కశ్యపుడిని చూచి మ్రొక్కి 'నాతల్లి దాస్యాన్ని తొలగించే నిమిత్తం పాములకు అమృతం తేవటానికి వెళ్ళుతున్నాను. బోయలను తినటంచేత నాఆకలి తీరలేదు. నాకు మరే దైనా ఆహారం అనుగ్రహించండి' అని పలుకగా అతని (కుమారుని) పూనికకు మెచ్చి కశ్యపబ్రహ్మ ఇట్లా అన్నాడు.

గజకచ్ఛపముల వృత్తాంతము (సం. 1-25-10)

క. అనలనిభుండు విభావసుఁ । డను విప్రుఁడు నియమవంతుఁ డర్థాఢ్యుం డై
తనరి సుఖ మున్న, నాతని । యనుజన్ముఁడు సుప్రతీకుఁ డనువాఁ డతనిన్. 65

ప్రతిపదార్థం: అనల, నిభుండు= అగ్నితో సమాను డయిన; విభావసుఁడు+అను, విప్రుఁడు= విభావసు డనే పేరుకల బ్రాహ్మణుడు; నియమవంతుఁడు= నియమం కలవాడు; అర్థ+ఆఢ్యుండు+ఐ= ధన సంపన్ను డయి; తనరి= ఒప్పి; సుఖము+ఉన్నన్= సుఖంతో ఉండగా; (ఇట ప్రథమ, తృతీయార్థంలో వాడబడింది); అతని+అనుజన్ముఁడు= అతని తమ్ముడు; సుప్రతీకుఁడు+అనువాఁడు= సుప్రతీకు డనే పేరు కలవాడు; అతనిన్= అన్న అయిన విభావసుడిని.

తాత్పర్యం: అగ్నితో సమానుడు, నియమాల ననుసరించేవాడు అయిన విభావసు డనే బ్రాహ్మణుడు, ధనసంపన్ను డై ఒప్పి సుఖంతో ఉండగా అతని తమ్ము డయిన సుప్రతీకు డనే పేరుకలవాడు అతని అన్న విభావసునితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'మనపితృవర్గము వడసిన । ధనము విభాగించి యిమ్ము ధర్మస్థితి నా'
కని యడుగంబోయిన య । య్యనుజునకు విభావసుం డహంకారమునన్. 66

ప్రతిపదార్థం: మన, పితృవర్గము= మనతల్లిదండ్రుల, తాతముత్తాతల సమూహం; పడసిన= పొందిన; ధనమున్= సంపదను; విభాగించి= పాలుపంచి (విభజించి); నాకున్; ధర్మస్థితిన్= ధర్మం ప్రకారంగా; ఇమ్ము; అని, అడుగన్, పోయిన= అని అడగటానికి వెళ్లిన; ఆ, అనుజునకున్= ఆ తమ్ము డయిన సుప్రతీకునికి; విభావసుండు; అహంకారమునన్= గర్వంతో.

తాత్పర్యం: 'మన తండ్రితాతలు పొందిన సంపదను ధర్మప్రకారంగా పాలు పంచి నా కి' మ్మని అడగటానికి వెళ్ళిన తమ్ము డయిన సుప్రతీకుడికి విభావసుడు గర్వంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తా నలిగి యిచ్చె శాపం । 'బేనుఁగ వై యుండు' మని, సహింపక వాఁడున్
మానుగఁ 'గూర్మమ వగు' మని । వానికిఁ బ్రతిశాప మిచ్చె వసులోభమునన్. 67

ప్రతిపదార్థం: తాను= ఆవిభావసుడు; అలిగి= కోపించి; ఏనుఁగవు+ఐ, ఉండుము+అని= ఏనుగవుగా ఉండుమని; శాపంబు+ఇచ్చెన్= శాపమిచ్చాడు; సహింపక= ఆశాపానికి ఓర్వక; వాఁడున్= తమ్ము డయిన సుప్రతీకుడును; మానుగన్= ఒప్పుగా; కూర్మమవు+అగుము+అని= తాబేలువు కమ్ము అని; వానికిన్= అన్న అయిన విభావసుడికి; వసులోభమునన్= సంపదపైనిఆశచేత; ప్రతిశాపము+ఇచ్చెన్= ఎదురుశాపం ఇచ్చాడు.

తాత్పర్యం: అన్న అయిన విభావసుడు 'ఏనుగవు కమ్మ' అని తమ్ముడిని శపిస్తే, ఆశాపానికి సహించక, తమ్ము డయిన సుప్రతీకుడు సంపదపై గల మక్కువతో 'తాబేలువు కమ్మ' అని అన్నను శపించాడు.

వ. 'ఇ ట్లన్నయుం దమ్ముండును నన్యోన్యశాపంబులం జేసి యోజనత్రయోత్సేధంబు గలిగి దశయోజనవృత్తం బైన కూర్మంబును, షడ్యోజనోత్సేధంబు గలిగి ద్వాదశ యోజన విస్తృతం బైన గజంబును నై సరోవర విపినంబుల నుండి యర్థనిమిత్తం బైన పూర్వవైరంబునఁ దమలో నిత్యంబు నొండొంటితోడం బెనంగి పోరుచుండు; నవి నీకాహారంబు సు; మ్మరుగుము, కార్యసిద్ధి యయ్యెడు' మనిన గరుడండును మనోవేగంబునం బఱచి యారెంటినిం గాంచి. 68

ప్రతిపదార్థం: ఇట్లు+అన్నయున్, తమ్ముండునున్; అన్యోన్య, శాపంబులన్, చేసి= ఒండొరుల కిచ్చుకొన్న శాపాలచేత; యోజన, త్రయ+ఉత్సేధంబు, కలిగి= మూడు యోజనాల పొడవు (3×8= 24మైళ్ళు) గలిగి; దశ, యోజన, వృత్తంబు+ఐన=

పదియోజనాల (ఆమడల) చుట్టుకొలత గలిగిన; కూర్మంబును= తాబేలును; షట్, యోజన+ఉత్సేధంబు, కలిగి= ఆరుయోజనాల పొడవు గలిగి; ద్వాదశ, యోజన, విస్తృతంబు+ఐన= పన్నెండు యోజనాల వ్యాప్తి (వెడల్పు) గలిగిన; గజంబునున్+ఐ= ఏనుగును అయి; సరోవరవిపినంబులన్= క్రమంగా చెరువులోను, అడవిలోను; ఉండి= నివసించి; అర్థ, నిమిత్తంబు+ఐన= సంపదకారణంగా ఏర్పడిన; పూర్వ, వైరంబునన్= పూర్వజన్మలోని పగతో; నిత్యంబున్= ఎల్లప్పుడును; తమలోన్= తమలోతాము; ఒండు+ఒంటితోడన్= ఒకటి ఇంకొకదానితో; పెనంగి= కలయబడి;పోరుచుండున్= పోట్లాడుతుంటాయి. అవి=ఆతాబేలును, ఏనుగును; నీకున్; ఆహారంబు, చుమ్మ= తినదగినపదార్థాలు సుమా!; అరుగుము= వెళ్ళుము; కార్యసిద్ధి= పని నెరవేరటం; అయ్యెడున్+అనినన్= అవుతుందని చెప్పగా; (ఆశీర్వచనాన ఎడు చివరి ద్రుతానికి 'మ'కారం ఆదేశ మయింది); గరుడండును, మనస్+వేగంబునన్= మనస్సుయొక్క వేగంవంటి వేగంతో; పఱచి= పరుగెత్తి (ఎగిరి); ఆ, రెంటినిన్= ఆ తాబేటిని, ఏనుగును; కాంచి= చూచి.

తాత్పర్యం: 'ఈవిధంగా అన్నదమ్ములిద్దరు ఒండొరుల కిచ్చుకొన్న శాపాలచేత, మూడామడల పొడవు, పది ఆమడల పరిధి కల తాబేలును, ఆరామడలపొడవు, పంద్రెండామడల వెడల్పు గల ఏనుగును అయి క్రమంగా (తాబేలు) చెరువులోను (ఏనుగు) అడవిలోను ఉండి పూర్వజన్మంలోని విరోధంతో తమలో తాము ఎల్లప్పుడూ ఒండొంటితో కలియబడి పోరుతూఉంటాయి. ఆ తాబేలు, ఆ ఏనుగు నీకు తినదగిన ఆహారం సుమా! వెళ్ళుము. నీపని నెరవేరుగాక!' అని పలుకగా గరుడడు మనస్సుయొక్క వేగంవంటి వేగంతో ఎగిరి ఆ రెండింటిని చూచి (తరువాతి పద్యంతో అన్వయం.)

క. చఱచి యొకచేతఁ గూర్మముఁ । బెఱచేత గజంబుఁ బట్టి పెనఁచి ఖగేంద్రుం
డిఱికికొని గగనవీథిం । బఱచె వియచ్చరవిమానపంక్తులు దూలన్. 69

ప్రతిపదార్థం: చఱచి= ఆక్రమించి; కొట్టి; ఒక, చేతన్= ఒకచేత్తో; కూర్మమున్= తాబేటిని; పెఱ, చేతన్= వేరొకచేత్తో; గజంబున్= ఏనుగును; పట్టి= పట్టుకొని; పెనఁచి= చుట్టుకొనేట్లుచేసి; ఖగ+ఇంద్రుండు= పక్షి శ్రేష్ఠుడయిన గరుత్మంతుడు; ఇఱికికొని అణగేటట్లు అదిమి; గగనవీథిన్= ఆకాశమార్గంలో; వియత్+చర, విమాన, పంక్తులు= ఆకాశంలో సంచరించే దేవతలయొక్క విమానాల వరుసలు; తూలన్= సంచలించేట్లుగా; పఱచెన్= ఎగిరాడు.

తాత్పర్యం: గరుత్మంతుడు పక్షి అవటంవల్ల రెక్కలతో ఏనుగును, తాబేటిని ఆక్రమించి ఒకచేత్తో (పాదంతో) తాబేటిని, వేరొకదానితో ఏనుగును పెనవేసి నొక్కి పట్టుకొని, ఆకాశంలో సంచరించే దేవతల విమానాల వరుసలు సంచలించేటట్లు ఎగిరాడు.

క. కనకవ్రతతీవితతులఁ । బెనఁగిన సురభూరుహములఁ బెద్దయు బెడఁగై
తనరిన యలంబతీర్థం । బున కరిగె నగంబు లొక్కమొగి గ్రక్కదలన్. 70

ప్రతిపదార్థం: కనక, వ్రతతీ, వితతులన్= సంపంగితీగల సమూహాలతో; పెనఁగిన= అల్లుకొని ఉండే; సుర, భూరుహములన్= దేవతా (కల్ప) వృక్షాలతో; పెద్దయున్= అధికంగా; బెడఁగు+ఐ= మనోహరమై; తనరిన= ప్రకాశించిన; అలంబ తీర్థంబునకున్ = అలంబ మనే పేరున్న తీర్థానికి; నగంబులు= కొండలు; ఒక్కమొగిన్= ఒక్కసారిగా; క్రక్కదలన్= (కదలగా, కదలగా) మిక్కిలి కదులుతుండగా; అరిగెన్= వెళ్ళినాడు.

తాత్పర్యం: సంపంగితీగలసమూహంతో అల్లుకొని ఉన్న దేవతావృక్షాలతో ఎక్కువగా మనోహర మై ప్రకాశిస్తున్న అలంబం అనే పేరున్న తీర్థానికి కొండలు మిక్కిలి కంపిస్తూ ఉండగా వెళ్లాడు.

వ. అందు రోహిణంబను పాదపోత్తమంబు గరుడనిం గని సంభావించి 'శతయోజనాయతంబైనమదీయ శాఖపై నుండి యిగ్గజకచ్ఛపంబుల భక్షించి పొ' మ్మనిన గరుడండు 'నట్ల చేయుదు' నని యమ్మహాశాఖపై నూఁద సమకట్టి, యందు. 71

ప్రతిపదార్థం: అందున్= ఆపర్వతంలో; రోహిణంబు+అను= రోహిణమనే పేరున్న; పాదప+ఉత్తమంబు= వృక్ష శ్రేష్ఠం (పెద్దచెట్టు); గరుడనిన్= గరుత్మంతుడిని; కని= చూచి; సంభావించి= ఆదరించి (గౌరవించి); శత, యోజన+ఆయతంబు+ఐన= వందయోజనాల పొడవు ఉండే; మదీయ శాఖపైన్= నాకొమ్మపై; ఉండి= కూర్చుండి; ఈ, గజ, కచ్ఛపంబులన్= ఈఏనుగును, తాబేటిని; భక్షించి, పొమ్ము= తిని వెళ్ళుము; అనినన్= అని చెప్పగా; గరుడండును= గరుత్మంతుడును; అట్లు+అ చేయుదున్, అని= ఆవిధంగానే చేస్తానని; ఆ, మహత్, శాఖపైన్= ఆ గొప్ప చెట్టుకొమ్మపై; ఊఁదన్, సమకట్టి= ఆధారంగా చేసికొని నిలబడటానికి నిశ్చయించి; అందున్= ఆ కొమ్మపై.

తాత్పర్యం: ఆ పర్వతంలో రోహిణము అనే వృక్షశ్రేష్ఠం గరుడుని చూచి గౌరవించి, 'వందామడల పొడవు గల నాకొమ్మపై నిల్చి ఈ ఏనుగును, తాబేటిని తిని వెళ్ళు' మని పలుకగా గరుడుడు అట్లే చేస్తా నని ఆపెద్ద కొమ్మపై నిలబడటానికి పూని ఆ కొమ్మపై (తరువాతి పద్యంతో అన్వయం.)

క. పాదంబులు పెట్టుడుఁ ద । త్పాదపఘనశాఖ విఱిఁగి బల్లన నుచ్చై
ర్నాదమున దిక్కు లద్రువఁగ । భేదిల్లె విహంగతతులు భీతిం బఱవన్. 72

ప్రతిపదార్థం: పాదంబులు= కాళ్ళు; పెట్టుడున్= మోపినవెంటనే; తద్, పాదపఘన, శాఖ= ఆరోహిణ మనే చెట్టుయొక్క గొప్ప కొమ్మ; విఱిఁగి; బల్లనన్= బల్లు మనేట్లుగా; ఉచ్చైః, నాదమునన్= పెద్దధ్వనితో; దిక్కులు; అద్రువఁగన్= కంపించగా; విహంగతతులు= పక్షుల సమూహాలు; భీతిన్= భయంతో; పఱవన్= పరుగెత్తగా, (ఎగురగా); భేదిల్లెన్= విరిగింది.

తాత్పర్యం: ఆగరుత్మంతుడు పాదాలు మోపగానే ఆ రోహిణ మనే వృక్షంయొక్క గొప్పకొమ్మ ఫెళ్ళుమనేటట్లుగా పెద్దధ్వనితో విరిగి, దిక్కులు కంపించగా, పక్షులసమూహాలు భయంతో ఎగిరిపోగా విరిగిపోయింది.

వ. అమ్మహాశాఖ నవలంబించి తలక్రిం దై యాదిత్యకిరణంబులు తమ కాహారంబుగాఁ దపంబు సేయుచున్న వాలఖిల్యమహామునిగణంబులం జూచి, యిది భూమిపయింబడిన నిమ్మునులకు బాధయగు నని దానిం గఱచికొని, గజకచ్ఛపంబులం గరంబుల నిఱికికొని, గరుడండు గగనంబునం బఱచి, తనకు నూఁద నిమ్మగు ప్రదేశం బెందునుం గానక గంధమాదనంబునకుం జని, యందుఁ దపంబు సేయుచున్న కశ్యపుం గనుంగొని మ్రొక్కిన. 73

ప్రతిపదార్థం: ఆ+మహత్, శాఖన్= ఆగొప్పకొమ్మను: అవలంబించి= పట్టుకొని; తల, క్రిందు+ఐ= తలక్రిందిభాగాన ఉండేటట్లుగా; ఆదిత్య, కిరణంబులు= సూర్యుని యొక్క కిరణాలు; తమకున్, ఆహారంబు, కాన్= భుజించేపదార్థం కాగా; తపంబు, చేయుచున్న, వాలఖిల్య, మహత్, ముని, గణంబులన్= వాలఖిల్యు లనే పేరున్న గొప్పమునులసమూహాలను; చూచి;

ఇది= ఈవిరిగిన కొమ్మ; భూమి, పయిన్, పడినన్= భూమిమీద పడితే; ఈ+మునులకున్= తలక్రిందుగా వ్రేలాడుతూ తపస్సు చేస్తున్న ఈ మునులకు; బాధ+అగున్+అని; దానిన్= ఆవిరిగినకొమ్మను; కఱచి కొని= నోటితో పట్టుకొని; గజ, కచ్ఛపంబులన్= ఏనుగును, తాబేటిని; కరంబులన్= చేతులలో; ఇఱికికొని= అడగునట్లుచేసి, అదిమిపట్టుకొని; గరుడండు; గగనంబునన్= ఆకాశంలో; పఱచి= ఎగురుతూ వెళ్ళి, తనకున్, ఊఁదన్= నిలవటానికి; ఇమ్ము+అగు, ప్రదేశంబు= తగినచోటును; ఎందునున్, కానక= ఎక్కడను చూడక; గంధమాదనంబునకున్= గంధమాదన మనే పర్వతానికి; చని= వెళ్ళి; అందున్= ఆపర్వతంలో; తపంబు+చేయుచున్న; కశ్యపున్= తండ్రి అయిన కశ్యపుడిని; కనుంగొని= చూచి; మ్రొక్కినన్= నమస్కరించగా.

తాత్పర్యం: ఆగొప్పకొమ్మను పట్టుకొని తలక్రిందుగా ఉండి సూర్యుడి కిరణాలే తమకు భోజనంగా తపస్సు చేస్తున్న వాలఖిల్యు లనే గొప్ప మునుల సమూహాన్ని చూచి ఈ కొమ్మ భూమిపై పడితే 'ఈమునులకు బాధ కలుగుతుం' దని ఆ కొమ్మను నోటితో కరచుకొని ఏనుగును, తాబేటిని చేతులలో అదిమిపట్టుకొని గరుడడు ఆకాశంలోనికి ఎగిరి తనకు నిలవటానికి వీలయినచోటు ఎచ్చటా కానలేక గంధమాదన పర్వతానికి వెళ్ళి అక్కడ తపస్సు చేస్తున్న తండ్రి అయిన కశ్యపుడిని చూచి నమస్కరించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. కనకమహీధరప్రతిమకాయు, మహాజవనిర్జితప్రభం
జను, నవిచింత్య భూరిబలసత్త్వసమన్వితు, దీప్తహవ్యవా
హనసము, వైనతేయునిఁద దాస్యగతద్రుమశాఖ నున్న య
త్యనఘుల వాలఖిల్యులను, నమ్మునినాథుఁడు చూచి నెమ్మితోన్. 74

ప్రతిపదార్థం: కనక, మహీధర, ప్రతిమ, కాయున్= బంగారుకొండ అయిన మేరు పర్వతంతో సమాన మైన శరీరం కలవాడిని; మహత్, జవ, నిర్జిత, ప్రభంజనున్= గొప్పవేగంచేత జయింపబడిన వాయువు కల; అవిచింత్య, భూరి, బల, సత్త్వ సమన్వితున్= ఊహింపరాని గొప్పబలంతో, శక్తితో కూడిన వాడిని; దీప్త హవ్యవాహన, సమున్= వెలుగుతున్న అగ్నితో సమాను డయిన వాడిని; వైనతేయునిన్= వినత యొక్క కుమారు డయిన గరుత్మంతుడిని; తద్, ఆస్య, గత, ద్రుమ, శాఖన్= ఆ గరుత్మంతుడియొక్క నోటిలో ఉండే చెట్టుకొమ్మకు; ఉన్న; అతి+అనఘులన్= ఎట్టిపాపం లేనివారిని; మిక్కిలి గొప్పవారిని; వాలఖిల్యులనున్= వాలఖిల్యు లనే పేరున్న మునులను; ఆ+ముని, నాథుడు= ఆమునులకు నాయకు డయిన కశ్యపుడు; నెమ్మితోన్= దయతో; చూచి.

తాత్పర్యం: మేరుపర్వతంతో సమాన మయిన శరీరం గల వాడిని, తనకు గలగొప్పవేగంతో జయింపబడిన వాయువు గలవాడిని, ఊహింపరాని గొప్పబలంతోను, శక్తితోను కూడినవాడిని, వెలుగుతున్న అగ్నితో సమానుడైనవాడిని, వినతాకుమారు డయిన గరుత్మంతుని, అతనినోటిలో ఉన్న చెట్టుకొమ్మకు వేలాడుతున్న పాపరహితు లైన వాలఖిల్యు లనే పేరున్న మునులను కశ్యపుడు దయతో చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

వ. 'ఇగ్గరుడండు భువనహితమహారంభుండు బలసమన్వితుండు, మీకు బాధయగునని యిత్తరుశాఖ విడువనేరకున్న వాఁడు; వీనిం గరుణించి మీరొండుకడ కరుగుం' డనిన వాలఖిల్యులు కశ్యపుప్రార్థనం జేసి

దాని విడిచి హిమవంతంబునకుం జనిరి; గరుడండును ముఖనిక్షిప్తశాఖాస్థలితవచనుం డగుచుఁ దండ్రి కిట్లనియె. 75

ప్రతిపదార్థం: ఈ+గరుడండు= ఈ గరుత్మంతుడు; భువన, హిత, మహత్+ఆరంభుండు= లోకాలకు మేలు కలిగించే గొప్పప్రయత్నం కలవాడు; బలసమన్వితుండు= బలంతో కూడినవాడు; మీకున్= చెట్టుకొమ్మకు తలక్రిందుగా వ్రేలాడుతూ తపస్సు చేసికొంటున్న మీకు; బాధ, అగును+అని; ఈ తరు, శాఖన్= ఈ చెట్టుకొమ్మను; విడువన్=, నేరక+ఉన్నవాఁడు= విడిచిపెట్ట లేక ఉన్నవాడు; వీనిన్= కొమ్మతోపాటు మిమ్మల్ని ఇక్కడికి తెచ్చిన ఈగరుత్మంతుడిని; కరుణించి= దయదలచి; మీరు+ఒండు, కడకున్= వేరొకచోటికి; అరుగుండు= వెళ్ళండి, అనినన్= అని చెప్పగా; వాలఖిల్యులు= వాలఖిల్యు లనే మునులు; కశ్యపు, ప్రార్థనన్ చేసి= కశ్యపునియొక్క కోరికచేత; దానిన్, విడిచి= ఆకొమ్మను విడిచి; హిమవంతంబునకున్= హిమవంత మనే పర్వతానికి; చనిరి= వెళ్ళారు; గరుడండును; ముఖ, నిక్షిప్త, శాఖా, స్థలిత, వచనుండు+అగుచున్= నోటిలో ఉంచుకొన్న కొమ్మవలన తొట్రుపాటుతో కూడిన మాటలు గలవా డవుతూ; తండ్రికిన్+ ఇట్లు+ అనియెన్= తండ్రి అయిన కశ్యపుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'ఈగరుత్మంతుడు లోకాలకు మేలుచేసే గొప్ప ప్రయత్నం కలవాడు. బలంతో కూడినవాడు. మీకు బాధకలుగుతుం దని నోటితో కరచుకొని ఉన్న ఈ చెట్టుకొమ్మను విడువజాలకున్నాడు. వీడిని అనుగ్రహించి మీరు ఇంకొకచోటికి వెళ్ళండి' అని పలుకగా వాలఖిల్యమునులు కశ్యపుడివేడికోలుతో ఆకొమ్మను విడిచి హిమవత్పర్వతానికి వెళ్ళారు. గరుడడును ముఖంలో ఉంచబడిన కొమ్మచేత తొట్రుపాటుతో కూడిన వాక్యాలు కలవాడవుతూ తండ్రి అయిన కశ్యపుడితో ఇట్లా పలికాడు.

క. ధరణీసురవిరహిత మగు । నరణ్యదేశంబు నాకు నానతియిం డి
త్తరుశాఖ విడువవలయును । కరము నిరోధ మిది యనినఁ గశ్యపుఁ డనియెన్. 76

ప్రతిపదార్థం: ధరణీసుర, విరహితము+అగు= బ్రాహ్మణులు లేనిదైన; అరణ్యదేశంబు= అడవి ప్రదేశాన్ని; నాకున్; ఆనతి+ఇండు= తెలియజేయండి (ఆజ్ఞాపించండి); ఈ, తరుశాఖన్= ఈ చెట్టుకొమ్మను; విడువన్‌వలయును; ఇది= ఈకొమ్మ; కరమున్= మిక్కిలి; నిరోధము= ఆటంకం; అనినన్= అని చెప్పగా; కశ్యపుండు+ అనియెన్= కశ్యపుడు చెప్పాడు.

తాత్పర్యం: బ్రాహ్మణులు లేని అడవిప్రాంతాన్ని నాకు తెలియజేయండి. ఈకొమ్మను అక్కడ విడిచిపెట్టాలి. ఇది నాకు మిక్కిలి ఆటంకం. అని చెప్పగా కశ్యపుడు ఇట్లా చెప్పాడు.

క. హిమశైలకందరాభా । గముకడ నిష్పురుషనగము కల దచ్చో నీ
ద్రుమశాఖ విడువు మది దా । నమానుష మగమ్య మీశ్వరాదుల కైనన్. 77

ప్రతిపదార్థం: హిమ, శైల, కందరా, భాగము, కడన్= మంచుకొండయొక్క గుహయొక్క ప్రాంతం దగ్గర; నిష్పురుషనగము= నిష్పురుష మనే కొండ; కలదు; అచ్చోన్= ఆకొండమీద; ఈ, ద్రుమ, శాఖన్,= ఈచెట్టు కొమ్మను; విడువుము; అది, తాను= ఆకొండ; అమానుషము= మానవాతీతం (మనుష్యకృతంకానిది); ఈశ్వర+ఆదులకున్+ఐనన్= ఈశ్వరుడు మొదలయిన వారికికూడ; అగమ్యము= పొందరానిది;

తాత్పర్యం: హిమాలయంయొక్క గుహాప్రాంతంలో నిష్పురుషం అనే కొండ ఉన్నది. అక్కడ ఈ చెట్టుకొమ్మను విడువుము. అది మానవాతీతం. ఈశ్వరుడు మొదలయిన వారికికూడ చొరరానిది.

విశేషం: 'హిమశైలకందరాభాగముకడ' - అన్నప్పుడు హిమవత్పర్వతగుహాసమీపంలో నిష్పురుష పర్వతం ఉన్నదని అర్థం వస్తున్నది. కాని, అక్కడ అది లేదు. అందువలన 'దేశవిరోధమనే దోషం ఏర్పడుతుందని కొందరు అంటారు. 'హిమరుద్ధకందరాభాగముకడ' అని ఉండాలని భావిస్తారు. "తతో నిష్పురుషం శైలం - హిమసంరుద్ధకందరం' అని మూలం.

వ. 'అది యిచ్చటికి లక్షయోజనంబులు గల దరుగు' మనిన గరుడండును మనోవేగంబునం బఱచి యా నిష్పురుషనగంబునం దత్తరుశాఖ విడిచి హిమవంతంబుమీఁదికిం బోయి గజకచ్ఛపంబుల భక్షించి, మహాసత్త్వసంపన్నుం డై నాకలోకంబున కెగయ సమకట్టి పక్షవిక్షేపంబుఁ జేసిన. 78

ప్రతిపదార్థం: అది= ఆకొండ; ఇచ్చటికిన్= ఈగంధమాదనపర్వతానికి; లక్షయోజనంబులు, కలదు= లక్ష ఆమడలదూరం ఉన్నది; అరుగుము= వెళ్ళుము; అనినన్= అని చెప్పగా; గరుడండును, మనస్+వేగంబునన్= మనస్సుయొక్క వేగంవంటి వేగంతో; పఱచి= పరుగెత్తి(ఎగిరి); ఆ, నిష్పురుష. నగంబునన్= ఆనిష్పురుష మనే కొండలో; తద్, తరు, శాఖన్= ఆ రోహిణి వృక్షం యొక్క కొమ్మను; విడిచి= వదలిపెట్టి; హిమవంతంబుమీఁదికిన్= హిమాలయపర్వతంపైకి; పోయి= వెళ్ళి; గజకచ్ఛపంబులన్= ఏనుగును, తాబేటిని; భక్షించి= తిని; మహత్, సత్త్వసంపన్నుండు+ఐ= గొప్పబలంతో కూడిన వాడయి; నాకలోకంబునకున్= స్వర్గలోకానికి; ఎగయన్= ఎగరటానికి; సమకట్టి= నిశ్చయించి, పూని; పక్ష, విక్షేపంబున్, చేసినన్= రెక్కలు విదల్చటం చేయగా.

తాత్పర్యం: 'ఆకొండ ఈగంధమాదనపర్వతానికి లక్షఆమడలదూరంలో ఉన్నది. వెళ్ళుము' అని తండ్రి పలుకగా గరుడడు మనోవేగంతో ఎగిరి ఆనిష్పురుషపర్వతంలో ఆచెట్టుకొమ్మను విడిచి హిమాచలంమీదికి పోయి ఏనుగును తాబేటిని తిని గొప్పబలంతోకూడినవాడై స్వర్గలోకానికి ఎగురబూని రెక్కలు విదిలించగా.

గరుడం డమృతహరణార్థం బెగయుట - (సం. 1-26-37)

క. ఘనపక్షానిలచలితా । వనిరుహములవలనఁ దొరఁగు వరపుష్పచయం
బనిమిషజయార్థ మరిగెడు । వినతాసుతుమీఁదఁ బుష్పవృష్టియ పోలెన్. 79

ప్రతిపదార్థం: ఘన, పక్ష+అనిల, చలిత+అవని, రుహముల వలనన్= గొప్పవైన రెక్కలయొక్క గాలిచేత కదలినచెట్లనుండి; తొరఁగు= జారిపడే; వర, పుష్ప, చయంబు= శ్రేష్ఠమైన పూలసముదాయం; అనిమిష, జయ+అర్థము= దేవతలను జయించటం కొరకు; అరిగెడు= వెళ్ళే; వినతా, సుతు, మీఁదన్= వినతకొడు కయిన గరుత్మంతుడిమీద; పుష్ప, వృష్టి+అ, పోలెన్= పూలవానవలె ఉండింది.

తాత్పర్యం: గొప్ప వయిన రెక్కలనుండి పుట్టిన గాలివలన కదలిన చెట్లనుండి శ్రేష్ఠములయిన పూలసమూహాలు దేవతలను జయించటానికి వెళ్ళేగరుత్మంతుడిపై పూలవానవలె ఒప్పాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. పూలవానయేమో అన్నట్లు ఉండిం దని భావం.

వ. ఇట్లమృతహరణార్థంబు గరుడండు గగనంబున కెగసిన, నట దేవలోకంబునందు. 80

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; అమృత, హరణ+అర్థంబు= అమృతాన్ని తేవటానికి గరుడండు; గగనంబునకున్= ఆకాశానికి; ఎగసినన్= ఎగురగా; అట; దేవలోకంబునందున్= అచ్చట దేవతలలోకంలో.

తాత్పర్యం: ఈ విధంగా అమృతాన్ని తేవటానికి గరుడడు ఆకాశంలోనికి ఎగురగా అక్కడ స్వర్గలోకంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

మాలిని.

సురపతిసభఁ జూడం జూడ నంగారవృష్టుల్
గురిసెఁ గులిశధారల్ గుంఠితం బయ్యెఁ, దిక్కుం
జరమదము లడంగెన్, సర్వదిక్పాలకాంతః
కరణములు భయోద్వేగంబునన్ సంచలించెన్. 81

ప్రతిపదార్థం: సుర, పతి, సభన్= దేవతలరా జయిన ఇంద్రునిసభలో; చూడన్, చూడన్= చూడగాచూడగా; అంగార, వృష్టుల్= నిప్పుకణాలవర్షాలు; కురిసెన్= కురిశాయి; కులిశధారల్= వజ్రాయుధంయొక్క అంచులు; కుంఠితంబు+అయ్యెన్= మొక్కపోయాయి (బండబారాయి); దిక్, కుంజర, మదములు= దిక్కులలోని ఏనుగుల గర్వాలు; అడంగెన్= అణగారాయి; సర్వ, దిక్, పాలక+అంతః, కరణములు= అన్ని దిక్కులయొక్క పాలకులయొక్క (అందరుదిక్పాలకుల) మనస్సులు; భయ+ఉద్వేగంబునన్= భయంయొక్క ఆవేశంతో; సంచలించెన్= కంపించాయి.

తాత్పర్యం: చూస్తుండగానే దేవేంద్రునిసభలో నిప్పుకణాలవర్షాలు కురిశాయి. వజ్రాయుధంయొక్క అంచులు మొక్కపోయాయి. దిక్కులలోని ఏనుగులగర్వాలు అణగారాయి; దిక్పాలకులమనస్సులు భయావేశంతో క్షోభించాయి.

విశేషం: మువర్ణకాంత మవటంచేత 'ధారలు' బహువచనాంత మైన విశేషణమైన 'కుంఠితం' ఏకవచనంలో ఉండవచ్చు. మాలినీ వృత్తంలో పాదానికి న, న, మ, య, య - అనేగణాలు ఉంటాయి. 9వఅక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. దేవలోకంలో ప్రవేశించే గరుత్మంతుడివలన దేవసభలో కలిగిన ఉత్పాతాలు ఒక మాలికగా ఇందులో నన్నయ వర్ణించాడు. (ఇవి గరుడ విజయాన్ని వ్యంగ్యంగా సూచిస్తున్నాయి.) అంగారవృష్టులు భావికథలో గరుత్మంతుడు చేసే యుద్ధాన్నీ, మిగిలిన ఉత్పాతాలు క్రమంగా-ఇంద్రుడు గరుడుడిపై ప్రయోగించే వజ్రాయుధం నిష్ఫలంకావటాన్నీ, సర్వలోక విజేతగా గరుత్మంతుడు గుర్తింపబడటాన్నీ, ఇంద్రుడివలె గరుత్మంతుడు పక్షికులానికి ఇంద్రుడు కావటాన్నీ ధ్వనింపచేస్తున్నట్లు నిబంధించటం నన్నయరచనలోని వస్తుధ్వని, గరుత్మంతుడి సురలోకవిజయానికీ, అమృతహరణానికీ, నారాయణ కరుణాప్రాప్తికీ, ఇంద్రుడి స్నేహానికీ, అమృతాన్ని ఇంద్రుడికి ఉపాయంతో తిరిగిఅందించటానికీ, వినతకూ గరుత్మంతుడికీ స్వాతంత్ర్యం లభించటానికీ నాందివలె రాణించే ఈపద్యాన్ని విశేషవృత్తమైన 'మాలిని'తో నన్నయ రచించి పఠితల మనస్సులు వస్తుధ్వనిని ఆస్వాదించేటట్లు హెచ్చరిస్తున్నారు. భరతుడు మాలినీవృత్తాన్ని 'నాందీముఖి' అన్నాడు. నన్నయ దానిని సార్థకం చేశాడు. (సంపా.)

వ. ఇట్టి మహోత్పాతంబులు పుట్టిన, సురపతి బృహస్పతిం జూచి, 'యిది యేమి నిమిత్తం?' బని యడిగిన, దాని నంతయు నెఱింగి బృహస్పతి సురపతి కి ట్లనియె. 82

ప్రతిపదార్థం: ఇట్టి; మహత్, ఉత్పాతంబులు= గొప్ప చెడ్డ శకునాలు; పుట్టినన్= పుట్టగా; సురపతి= దేవేంద్రుడు; బృహస్పతిన్+చూచి= గురు వైన బృహస్పతిని చూచి; ఇది, ఏమి; నిమిత్తంబు= కారణం; అని; అడిగినన్; దానిన్+అంతయున్= ఆవిషయా న్నంతటినీ; ఎఱింగి= తెలిసికొని; బృహస్పతి; సురపతికిన్= ఇంద్రుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: ఇటువంటి గొప్పదుశ్శకునాలు కలుగగా దేవేంద్రుడు దేవతాగురు వైన బృహస్పతిని చూచి 'ఈ అపశకునాలకు కారణ మేమిటి?' అని అడిగాడు. ఆవిషయ మంతా తెలిసికొని బృహస్పతి దేవేంద్రుడికి ఇట్లా చెప్పాడు.

సీ. **బ్రహ్మణ్యుఁ డగు కశ్యపబ్రహ్మవరమున । వినతకుఁ బుట్టిన యనఘమూర్తి**
వాలఖిల్యులదయ వరపక్షికులమున । క్రిందుఁ డై పరఁగిన యిద్ధతేజుఁ,
డుదధిలో నున్న యత్యుగ్రనిషాదుల । నారంగ మ్రింగిన ఘోరవీరుఁ,
డిభకచ్ఛపముల రోహిణశాఖతో నెత్తి । కొని దివిఁ బఱచిన యనిలవేగి.

తే. **వీఁగి తనతల్లిదాస్యంబు నీఁగఁబూని । తడయ కమృతంబు గొనిపోవఁ గడఁగి వచ్చెఁ;**
గామరూపసంపన్నుండు, గామగమనుఁ । డతఁడు నీకు నసాధ్యుండు శతమఖుండ! **83**

ప్రతిపదార్థం: శత, మఖుండ= ఇంద్రుడా! బ్రహ్మణ్యుఁడు+అగు= బ్రహ్మజ్ఞానం కలిగిన; కశ్యప బ్రహ్మ, వరమునన్= కశ్యపు డనే ప్రజాపతియొక్క వరంచేత; వినతకున్; పుట్టిన; అనఘమూర్తి= పాపంలేనట్టి వ్యక్తి; వాలఖిల్యుల, దయన్= వాలఖిల్యు లనే మునుల దయచేత; వర, పక్షి, కులమునకున్= శ్రేష్ఠ మయిన పక్షులయొక్క కులానికి; ఇంద్రుఁడు+ఐ= రాజై; పరఁగిన= ప్రసిద్ధి పొందిన; ఇద్ధ, తేజుఁడు= ప్రకాశించే ప్రతాపం కలవాడు; ఉదధిలోన్+ఉన్న= సముద్రంలో ఉండే; అతి+ఉగ్ర, నిషాదులన్= మిక్కిలి భయంకరు లైన బోయవాళ్ళను; ఆరంగ, మ్రింగిన= పూర్తిగా తినినట్టి; ఘోర, వీరుఁడు= భయంకరు డైన వీరుడు; ఇభ, కచ్ఛపములన్= ఏనుగును, తాబేటిని; రోహిణశాఖతోన్= రోహిణవృక్షంయొక్క కొమ్మతోపాటుగా; ఎత్తికొని= ఎత్తికొని పట్టుకొని; దివిన్= ఆకాశంలో; పఱచిన= (పరుగెత్తిన) ఎగిరిన; అనిల, వేగి= గాలియొక్క వేగం వంటి వేగం కలవాడు; వీఁగి= ఉత్సాహపడి; తన, తల్లి; దాస్యంబున్= తనతల్లి అయిన వినతయొక్క దాసితనాన్ని; ఈఁగన్+పూని= తొలగించటానికి నిశ్చయించి; తడయక= ఆలస్యంచేయక; అమృతంబు, కొని, పోవన్= అమృతాన్ని తీసికొనిపోవటానికి; కడఁగి, వచ్చెన్= పూని వచ్చాడు; కామ, రూప, సంపన్నుండు= కోరుకొన్నరూపం ధరించ కలవాడు; కామ, గమనుఁడు= కోరికకు తగినట్లుగా వెళ్ళేవాడు; నీకున్; అతఁడు= ఆవినతకొడుకు; అసాధ్యుండు= జయింపరానివాడు.

తాత్పర్యం: బ్రహ్మజ్ఞానం కలిగిన కశ్యపు డనే ప్రజాపతి వరంవలన వినతకు పుట్టిన పాపరహితుడు ఈగరుత్మంతుడు. ఇతడు వాలఖిల్యులనే మహర్షుల కృపచేత శ్రేష్ఠమయిన పక్షికులానికి రాజుగా ప్రసిద్ధిపొందిన గొప్ప ప్రభావం కలవాడు. సముద్రంలోపల ఉండే మిక్కిలి భయంకరు లైన బోయవాళ్ళను పూర్తిగా తినివేసిన ఘోర మైన వీరుడు. ఏనుగును, తాబేటిని రోహిణ వృక్షపు కొమ్మతోపాటు పట్టుకొని ఆకాశంలో ఎగిరిన వాయువేగం కలవాడు. ఉత్సాహపడి తనతల్లియొక్క దాసితనాన్ని పోగొట్టటానికి ఆలస్యం చేయకుండా అమృతం తీసికొనిపోవటానికి సాహసించి వచ్చాడు. ఇచ్ఛవచ్చిన రూపం ధరించగలిగినవాడు. ఇచ్ఛవచ్చినట్లుగా సంచరించేవాడు. ఓ ఇంద్రుడా! ఈగరుత్మంతుడు నీకు జయింపరానివాడు.

వాలఖిల్యుల వృత్తాంతము (సం. 1-27-4)

వ. **అగ్గరుడని మాహాత్మ్యంబు నీవు నెఱుంగుదు; వది యెట్లనినఁ దొల్లి కశ్యపప్రజాపతి పుత్త్రార్థి యై భవత్ప్రభృతులైన దేవగణంబులను, వాలఖిల్యప్రముఖు లైన మహామునిగణంబులను దనకు సహాయులనుగాఁ**

బడసి పుత్త్రకామేష్టి సేయునాఁడు నీవు నీబలంబునకుం దగినయిధ్మభారంబు మోచికొని యశ్రమంబున వచ్చువాఁడ వై, యల్పకుశపలాశేధ్మభారంబులు మోచికొని వడవడ వడంకుచు వచ్చువారి, నల్పసత్త్వుల, నంగుష్ఠప్రమాణ దేహుల; ననవరతోపవాస కృశీభూత శరీరుల, వాలఖిల్యమహామునులం జూచి నగిన, నమ్మునులు సిగ్గుపడి కడు నలిగి. 84

ప్రతిపదార్థం: ఆ+గరుడని, మాహాత్మ్యంబు= ఆగరుత్మంతుడి గొప్పతనాన్ని; నీవునున్= నీవుకూడ; ఎఱుంగుదువు= తెలియుదువు; అది; ఎట్లు+అనినన్= ఏవిధంగా నంటే; తొల్లి= పూర్వం; కశ్యప, ప్రజాపతి= కశ్యపబ్రహ్మ; పుత్త్ర+అర్థి+ఐ= కొడుకులను కోరేవాడై; భవత్, ప్రభృతులు+ఐన= నీవు మొదలుగా ఉండే; దేవగణంబులను= దేవతల సమూహాలను; వాలఖిల్య, ప్రముఖులు+ఐన= వాలఖిల్యులు మొదలగువారైన; మహత్+ముని గణంబులన్= గొప్పవారైన ఋషులయొక్క సమూహాలను, తనకున్= యజ్ఞంచేయబోయే తనకు (కశ్యపుడికి); సహాయులను కాన్= తోడ్పడేవాళ్ళుగా; పడసి= పొంది; పుత్త్ర, కామ+ఇష్టి, చేయువాఁడు= పుత్రకామేష్టిని చేసే వాడు; నీవు; నీ, బలంబునకున్= నీయొక్క శక్తికి; తగిన= సరిపడిన; ఇధ్మ, భారంబు= కట్టెల (సమిధల) బరువును; మోచికొని; అశ్రమంబునన్= శ్రమలేకుండా; వచ్చు, వాఁడవు+ఐ; అల్ప, కుశ, పలాశ+ఇధ్మ, భారంబులు= తక్కువయిన దర్భ, మోదుగకట్టెల బరువులను; మోచికొని; వడవడ= వణకటంలో ధ్వన్యనుకరణం; వడంకుచున్= వణికిపోతూ; వచ్చు, వారిన్= వచ్చేటివాళ్ళను; అల్పసత్త్వులన్= తక్కువబలం గలవారిని; అంగుష్ఠప్రమాణదేహులన్= బొటనవ్రేలంత కొలతఉన్న శరీరాలు కలవాళ్ళను; అనవరత+ఉపవాస, కృశీభూత, శరీరులన్= ఎల్లప్పుడూ ఉపవాసాలచేత (ఒకరోజంతా భోజనం చేయకుండా ఉండి మరునాటిఉదయం భుజించటం ఉపవాస మనబడుతుంది) చిక్కినశరీరం కలిగినవారిని; వాలఖిల్య, మహత్, మునులన్= వాలఖిల్యులనే గొప్పమునులను; చూచి; నగినన్= నవ్వగా; ఆ+మునులు= ఆవాలఖిల్యమునులు; సిగ్గుపడి; కడున్, అలిగి= మిక్కిలి కోపించి.

తాత్పర్యం: ఆ గరుడుని గొప్పతనం నీవుకూడ ఎరుగుదువు. అది ఎట్లంటే: పూర్వం కశ్యప ప్రజాపతి పుత్రులను కోరువాడై నీవుమొదలుగా ఉన్న దేవతలసమూహాలను, వాలఖిల్యులు మొదలుగా ఉన్న గొప్పమునుల సమూహాలను తనకు తోడ్పడే వాళ్ళనుగా పొంది (పుత్రులను పొందటానికై చేసే) పుత్రకామేష్టి అనే యజ్ఞాన్ని చేసేటప్పుడు నీవు నీబలానికి తగ్గ కట్టెల(సమిధల) మోపు మోసికొని శ్రమలేకుండా (అనాయాసంగా) వస్తూ స్వల్పమైన దర్భలయొక్క, మోదుగుకట్టెలయొక్క మోపులను మోసికొని శ్రమచేత వడవడవణకుతూ వచ్చే హీనబలులను, బొటనవ్రేలంతమాత్రం కొలత ఉండే దేహాలతోకూడినవారున్నూ నిరంతరం ఉపవాసం చేస్తూ ఉండటంచేత చిక్కినమేనులు కలవారున్నూ అయిన వాలఖిల్యులనే గొప్పమునులను చూచి నవ్వగా ఆమునులు సిగ్గుపడి మిక్కిలి కోపించి (తరువాతి పద్యంతో అన్వయం.)

క. రణవిజయుఁ డనల తేజుం । డణిమాదిగుణాఢ్యుఁ డుదితుఁ డయ్యెడు వీరా
గ్రణి శతమఖుకంటెను శత । గుణవీర్యుం డైన పుత్త్రకుం డజితుం డై. 85

ప్రతిపదార్థం: రణ, విజయుఁడు= యుద్ధంలో విజయం కలవాడు; అనల, తేజుండు= అగ్నియొక్క ప్రకాశంవంటి ప్రకాశం కలవాడు; అణిమా+ఆది, గుణ+ఆఢ్యుఁడు= అణిమ మొదలయిన గుణాలసంపద గలిగినవాడు; వీర+అగ్రణి= వీరులలో అగ్రేసరుడు; శతమఖుకంటెను= ఇంద్రుడికంటె; శతగుణవీర్యుండు+ఐన= వందరెట్లుబలం కలిగిన; పుత్త్రకుండు= కొడుకు; అజితుండు+ఐ= ఓడింపబడనివా డయి; ఉదితుఁడు+అయ్యెడున్= పుడతాడు (పుట్టగలడు).

తాత్పర్యం: యుద్ధంలో ఎప్పుడూ విజయం పొందేవాడున్నూ, అగ్నియొక్క ప్రకాశం గలవాడున్నూ, అణిమాదిగుణాలసంపద కలవాడున్నూ, వీరులలో అగ్రభాగాన ఉండేవాడున్నూ, ఇంద్రుడికంటె వందరెట్లు బలం కలవాడున్నూ అయిన కుమారుడు జయింపరానివా డై పుట్టగలడు.

విశేషం: అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశిత్వం, వశిత్వం అనేవి అష్టసిద్ధులు.

వ. వాఁడు రెండవయింద్రుం డయ్యెడు మని మహావీర్యవంతంబు లైన మంత్రంబుల వేల్చుచున్నంత, నంతయు నెఱింగి నీవు కశ్యపుపాలికిం బోయి నాకుం గరుణింపుండని వారిం బ్రార్థించినఁ గశ్యపప్రజాపతి యమ్మునుల కి ట్లనియె. 86

ప్రతిపదార్థం: వాఁడు= ఆపుట్టేవాడు; రెండవ, ఇంద్రుండు; అయ్యెడున్+అని= అవునుగాక! అని; మహత్, వీర్యవంతంబులు+ఐన= గొప్పశక్తితో గూడిన; మంత్రంబులన్= వేదమంత్రాలతో; వేల్చుచున్+ఉన్న+అంతన్= యజ్ఞకుండంలో హోమం చేస్తున్నసమయంలో; అంతయున్= విషయాన్నంతటిని; ఎఱింగి= తెలిసికొని; నీవు; కశ్యపుపాలికిన్= యజ్ఞం చేస్తున్న కశ్యపుడిసమీపానికి; పోయి= వెళ్ళి; నాకున్, కరుణింపుండు= నన్ను దయచూడండి (ఇట ద్వితీయావిభక్తి అర్థంలో షష్ఠి వాడబడింది) అని; వారిన్= ఆ వాలఖిల్యులను; ప్రార్థించినన్= వేడుకొనగా; కశ్యపప్రజాపతి= కశ్యపబ్రహ్మ; ఆ, మునులకున్= ఆవాలఖిల్యమునులకు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ఆ పుట్టేవాడు రెండవఇంద్రుడు అగుగాక! అని గొప్పశక్తిగల మంత్రాలతో అగ్నిలో హోమం చేస్తుండగా ఈ విషయమంతా తెలిసికొని నీవు కశ్యపుని చెంతకు వెళ్ళి, నన్ను దయచూడం డని వారిని వేడగా కశ్యపబ్రహ్మ ఆవాలఖిల్యులతో ఇట్లా చెప్పాడు.

ఉ. ఉండు నితండు పద్మజు నియోగమునం ద్రిజగంబులందు నిం
ద్రుం డయి భూతరాశిఁ దన దోర్బలశక్తిఁ గడంగి కాచుచున్;
రెండవయింద్రుఁ డైన విపరీత మగున్ భువనప్రవృత్తి; మీ
రొండువిధంబు సేయు టిది యుక్తమె బ్రహ్మనియుక్తి యుండఁగన్. 87

ప్రతిపదార్థం: ఇతండు= ఈయింద్రుడు; పద్మజు, నియోగమునన్= బ్రహ్మయొక్క ఆజ్ఞచేత; త్రిజగంబులందున్= మూడులోకాలలో; ఇంద్రుండు+అయి= ఇంద్రపదవి పొంది; భూతరాశిన్= ప్రాణులసమూహాన్ని; తన, దోస్+బల, శక్తిన్= తనభుజాలబలంయొక్క సామర్థ్యంతో; కడంగి= పూనుకొని; కాచుచున్= రక్షిస్తూ; ఉండున్= ఉంటాడు; రెండవ, ఇంద్రుఁడు; ఐనన్= ఏర్పడితే; భువన, ప్రవృత్తి= లోకాలయొక్కవర్తన; విపరీతము+అగున్= తారుమారవుతుంది; బ్రహ్మ, నియుక్తి= బ్రహ్మయొక్క నియోగం; ఉండఁగన్= ఉండగా; మీరు; ఒండు, విధంబు= వేరొకపద్ధతిని; చేయుట= చేయటం; ఇది, యుక్తము+ఎ= ఇది తగునా? తగదు.

తాత్పర్యం: ఇతడు బ్రహ్మయొక్క నియమంచేత మూడులోకాలలో ఇంద్రుడుగా ఉండి జీవులసమూహాన్ని, తనబాహువులబలంయొక్క సామర్థ్యంతో కాపాడుతున్నాడు. రెండవఇంద్రుడు ఏర్పడితే లోకాలయొక్కవర్తన తారుమారవుతుంది. బ్రహ్మయొక్క నియమం ఉండగా మీరు వేరువిధం చేయటం తగునా?(తగదు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. 'మీవచనం బమోఘంబు గావున నింక నాకు నుద్భవిల్లెడు పుత్త్రుండు పక్షికులంబున కెల్ల నింద్రుం డయ్యెడు' మనికశ్యపుండు వారల నొడంబఱిచి నీయింద్రత్వంబేకాధిష్ఠితంబు సేసె; నట్టి కశ్యపప్రజాపతి యజ్ఞమహిమను, వాలఖిల్యులతపోమహిమను వినతకుం బుట్టి విహగేంద్రుం డయిన యా గరుడం డిప్ప డమృతహరణార్థం బరుగుదెంచుటంజేసి స్వర్గలోకంబున మహోత్పాతంబులు పుట్టె' నని సురపతికి బృహస్పతి చెప్పిన విని, యింద్రుం డమృతరక్షకుల నెల్ల రావించి, 'మీర లతిప్రయత్నంబున నమృతంబు రక్షించుకొని యుండుం' డని పంచిన 'వల్లె' యని. 88

ప్రతిపదార్థం: మీ, వచనంబు= మీ(వాలఖిల్యుల) యొక్కమాట; అమోఘంబు= వ్యర్థం కానిది; కావునన్= కాబట్టి; ఇంకన్= ఇటుతర్వాత; నాకున్; ఉద్భవిల్లెడు, పుత్త్రుండు= పుట్టబోయేకొడుకు; పక్షికులంబునకున్+ఎల్లన్= పక్షులజాతి కంతటికిని; ఇంద్రుండు+అయ్యెడున్, అని= ఇంద్రుడు అవును గాక! అని; కశ్యపుండు; వారలన్= ఆ మునులను; ఒడంబఱిచి= ఒప్పించి; నీ, ఇంద్రత్వంబు= నీ ఇంద్రపదవిని; ఏక+అధిష్ఠితంబు చేసెన్= ఒక్కనిచే పొందబడిందిగా (అధిష్ఠింపబడిన దానినిగా) చేశాడు; అట్టి, కశ్యప, ప్రజాపతి, యజ్ఞమహిమను= అటువంటి కశ్యపబ్రహ్మయొక్క యజ్ఞంయొక్క మహత్త్వంచేతను; వాలఖిల్యుల తపస్+మహిమను= వాలఖిల్యులు అనే మునులయొక్క తపస్సుయొక్కగొప్పతనంచేతను; వినతకున్, పుట్టి; విహగ+ఇంద్రుండు+అయిన= పక్షులకు రాజయిన; ఆ, గరుడండు= ఆగరుత్మంతుడు; ఇప్పుడు; అమృతహరణ+అర్థంబు= అమృతాన్ని ఎత్తుకొనిపోవటంకొరకు; అరుగుదెంచుటన్, చేసి= రావటంచేత; స్వర్గలోకంబునన్, మహత్, ఉత్పాతంబులు= గొప్ప చెడుశకునాలు; పుట్టెను= ఏర్పడినవి; అని; సురపతికిన్= దేవతల రాజయిన ఇంద్రుడికి; బృహస్పతి= దేవతలగురు వయిన బృహస్పతి; చెప్పినన్= చెప్పగా; విని ఇంద్రుండు; అమృత, రక్షకులన్, ఎల్లన్= అమృతాన్ని కాపాడేవారినందరిని; రావించి= రప్పించి; (వచ్చుధాతువుకు ప్రేరణరూపం); మీరలు; అతిప్రయత్నంబునన్= మిక్కిలిప్రయత్నంతో; అమృతంబు రక్షించుకొని, ఉండుండు; అని పంచినన్= అని ఆజ్ఞాపించగా; వల్లె, అని= అట్లే అని (అంగీకరించి).

తాత్పర్యం: 'మీవాక్కు వ్యర్థం కాదు. కావున ఇంక నాకు పుట్టబోయేకొడుకు పక్షిజాతికి అంతకూ ఇంద్రుడు(రాజు) అవునుగాక!' అని కశ్యపుడు వాలఖిల్యులను అంగీకరింపజేసి నీఇంద్రపదవి ఒక్కడిచేతనే అధిష్ఠితం అయ్యేటట్లు (ఒక్కడే ఇంద్రుడు ఉండేటట్లు) చేశాడు. అట్టి కశ్యపబ్రహ్మ పుత్రకామేష్టి మహత్త్వంచేతను, వాలఖిల్యులతపస్సుయొక్క మాహాత్మ్యంచేతను జన్మించి పక్షులకు రాజైన ఆ గరుడడు ఇప్పుడు అమృతాన్ని కొనిపోవటంకొరకు రావటంచేత స్వర్గలోకంలో గొప్పదుశ్శకునాలు కలిగాయి' అని బృహస్పతి దేవేంద్రుడికి చెప్పగా విని, ఇంద్రుడు అమృతాన్ని రక్షించేవారిని అందరినీ రప్పించి 'మిక్కిలిప్రయత్నంతో అమృతాన్ని కాపాడుతూ ఉండం' డని పంపగా వారు అట్లే అని.

విశేషం: ఎడున్+అని; ఎడు, తల ద్రుతానికి అచ్చు పరమయ్యేటపుడు మకారం ఆదేశం ఔతుంది. ఎడుమని.

క. వారలు బహుప్రకారా । కారులు, వీరులు, నిశాతఖడ్గాదిమహా
దారుణ శస్త్రధరులు, కృ । ష్ణారుణ సితపీతఘనతరాంగత్రాణుల్. 89

ప్రతిపదార్థం: వారలు= ఆ అమృతాన్ని కాపాడేవారు; బహుప్రకార+ఆకారులు= పెక్కురకా లయిన రూపాలు కలవారు; వీరులు; నిశాత, ఖడ్గ+ఆది, మహత్, దారుణ, శస్త్ర, ధరులు= వాడి అయిన కత్తి మొదలయిన గొప్పభయంకరాలైన ఆయుధాలను ధరించినవారు; కృష్ణ+అరుణ, సిత, పీత, ఘనతర+అంగత్రాణుల్= నల్లని, ఎఱ్ఱని, తెల్లని, పచ్చని గొప్పవయిన కవచాలు కలవారు.

తాత్పర్యం: పెక్కురకా లయిన రూపాలు గల్గినవారు, వీరులు, వాడి అయిన కత్తి మొదలయిన భయంకరా లయిన ఆయుధాలు ధరించినవారు, నల్లని, ఎఱ్ఱని, తెల్లని, పచ్చని గొప్ప వయిన కవచాలు కలవారు అయిన ఆ అమృతరక్షకులు. (తరువాతి పద్యంలోని 'సమకట్టి' అనే దానితో అన్వయం.)

క. సమకట్టి యొక్కమొగి న। ప్రమాదు లై నిలిచి రేయుఁబవలును రక్షా
క్షము లై యమృతము చుట్టును। నమేయబలు లుండి రంత నతిరభసమునన్. 90

ప్రతిపదార్థం: సమకట్టి= పూని; ఒక్కమొగిన్= ఒకేవిధంగా (పూనికతో); అప్రమాదులు+ఐ= ఏమరుపాటు, పరాకు, లేనివా రయి; నిలిచి= నిలబడి ఉండి; రేయున్= రాత్రియున్నూ (రేయి-రూపాంతరం రే); పవలును= పగటిపూటయున్నూ; రక్షాక్షములు+ఐ= రక్షణలో సమర్థులై; అమృతము, చుట్టునున్= అమృతంయొక్క అన్నివైపులా; అమేయబలులు= అపరిమిత మైన బలం కలవారు; ఉండిరి; అంతన్= ఆసమయంలో; అతి, రభసమునన్= మిక్కిలి వేగంతో.

తాత్పర్యం: అమృతాన్ని రక్షించటానికి నిశ్చయించి దృఢమైన పూనికతో ఏమరుపాటు లేనివా రై నిలబడి రాత్రింబగళ్ళూ రక్షించటంలో సమర్థు లై ఊహింపరాని బలం కలవారు, అమృతంచుట్టూ కావలి ఉన్నారు. అంత మిక్కిలివేగంతో. (రాబోయేపద్యంతో అన్వయం.)

మ. వితతోల్కాశనిపుంజమొక్కొ యనఁగా విన్వీథివిక్షిప్తప
క్షతివాతాహతిఁ దూలి తూలశకలాకారంబు లై వారిద
ప్రతతుల్ సాల్పడి నల్గడం జెదరఁగాఁ బాటెన్ మనోవేగుఁ డై
పతగేంద్రుం డమృతాంతికంబునకుఁ దత్పాలుర్ భయం బందఁగన్. 91

ప్రతిపదార్థం: వితత+ఉల్క+అశని, పుంజము+ఒక్కొ= విరివిగా గల మండే నిప్పుకణాలయొక్కయు, పిడుగులయొక్కయు సమూహమా; అనఁగాన్= అనునట్లుగా; విన్, వీథి= ఆకాశమార్గంలో, విక్షిప్త, పక్షతి, వాత+ఆహతిన్= విదల్చబడిన రెక్కలయొక్క గాలియొక్క దెబ్బలచేత; తూలి= అటు నిటు కదలి; వారిదప్రతతుల్= మబ్బులయొక్క సముదాయాలు; తూల, శకల+ఆకారంబులు+ఐ= దూదిపింజలయొక్క రూపాలు గల వై; చాల్పడి= వరుసగట్టి; నల్, కడన్= నాల్గువైపులా, చెదరఁ గాన్= చెదరిపోగా; మనస్+వేగుఁడు+ఐ= మనస్సుయొక్క వేగంవంటి వేగం కలవా డయి; పతగ+ఇంద్రుండు= పక్షులకు ఇంద్రు డయిన గరుత్మంతుడు; అమృత+అంతికంబునకున్= అమృతం దగ్గరకు; తద్+పాలుర్= ఆఅమృతరక్షకులు; (పాలురు అనే ప్రథమావిభక్తి అంతంలో బహువచనానికి ఉకారం లోపించింది); భయంబు+అందఁగన్= భయపడగా; పాటెన్= పరుగెత్తాడు.

తాత్పర్యం: విరివి అయిన నిప్పుకణాలతో కూడిన పిడుగులసమూహమా అనేటట్లుగా ఆకాశమార్గంలో విదల్చబడిన రెక్కలనుండి పుట్టినగాలిదెబ్బచే అటునిటు కదలి, మబ్బులసముదాయాలు దూదిపింజల ఆకృతికల వై వరుసగట్టి నాలుగుదిక్కులకు చెదరిపోగా, అమృతాన్ని రక్షించేవారు భయపడేటట్లుగా, మనస్సుయొక్క వేగంవంటి వేగంకలవాడయి, గరుడుడు అమృతందగ్గరకు ఎగిరి వెళ్ళాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. అంత. 92

ప్రతిపదార్థం: అంతన్= పిదప.

తాత్పర్యం: పిమ్మట (తరువాతి పద్యంతో అన్వయం.)

గరుడఁ డమృతరక్షకులతో యుద్ధము సేయుట (సం. 1-28-1)

క. కల్పాంతానలకీలా । కల్పాయతపక్షుఁ, బక్షిగణవిభు, శౌర్యా
కల్పుఁ గని, యమృతరక్షు ల । నల్పక్రోధు లయి తాఁకి రార్చి కడంకన్. 93

ప్రతిపదార్థం: కల్ప+అంత+అనల, కీలా, కల్ప+ఆయత, పక్షున్= ప్రళయకాలంలోని అగ్నియొక్క జ్వాలలతో సమాన మయిన విశాల మైనరెక్కలు కలవాడిని; పక్షి, గణ, విభున్= పక్షులసమూహాలకు రాజయినవాడిని; శౌర్య+ఆకల్పున్= పరాక్రమం అలంకారంగా కలిగినవాడిని గరుత్మంతుడిని; కని= చూచి; అమృత, రక్షులు= అమృతాన్ని కాపాడేవారు; అనల్ప, క్రోధులు+అయి= అధిక మైన కోపంకలవా రయి; ఆర్చి= గర్జించి; కడంకన్= సాహసంతో; తాఁకిరి= ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: ప్రళయకాలంలోని అగ్నిజ్వాలలతో సమానమైన విశాలమైన రెక్కలు కలిగినవాడున్నూ, పక్షిగణాలకు రాజున్నూ, శౌర్య మలంకారంగా కలవాడున్నూ అయిన గరుత్మంతుడిని చూచి, అమృతాన్ని కాపాడేవారు అధికమైనకోపంతో అరచి పూనికతో ఎదుర్కొన్నారు.

క. తడఁబడ నేసియు వైచియుఁ । బొడిచియు వివిధాస్త్రశస్త్రముల నుద్ధతు లై
కడుకొని యుద్ధము సేసిరి । కడిమిమెయిన్ విబుధవరులు గరుఁడనితోడన్. 94

ప్రతిపదార్థం: తడఁబడన్= తొట్రుపాటుపడేటట్లు; ఏసియున్= బాణాలు ప్రయోగించియూ; వివిధ+అస్త్ర, శస్త్రములన్= పలురకా లయిన అస్త్రాలతో (మంత్రం ఉచ్చరించి ప్రయోగించబడే ఆయుధాలతో), శస్త్రాలతో (లోహాదినిర్మితాలయిన ఆయుధాలతో); వైచియున్= క్రమంగా పడేసియు; పొడిచియున్= క్రుమ్మియు; ఉద్ధతులు+ఐ= గర్వించినవా రై; కడుకొని= ఉత్సాహం పొంది; కడిమిమెయిన్= పరాక్రమంతో; గరుడనితోడన్= గరుత్మంతుడితో, విబుధవరులు= దేవతాశ్రేష్ఠులు; యుద్ధము; చేసిరి.

తాత్పర్యం: తొట్రుపడేటట్లుగా బాణాలు ప్రయోగించి, పలురకా లయిన శస్త్రాస్త్రాలతో పడేసియు, క్రుమ్మియు, గర్వించిన వారయి, ఉత్సాహం పొంది పరాక్రమంతో దేవతాశ్రేష్ఠులు గరుత్మంతుడితో యుద్ధం చేశారు.

వ. గరుడండును నిజపక్ష విక్షిప్తరజోవృష్టి నమరవరుల దృష్టిపథంబుఁ గప్పి స్వర్గలోకంబు నిరాలోకంబుగాఁ జేసిన, నమరేంద్రుపనుపునం బవనుం డా రజోవృష్టి చెదర వీచె నంత. 95

ప్రతిపదార్థం: గరుడండును= గరుత్మంతుడును; నిజ, పక్ష, విక్షిప్త, రజస్+వృష్టిన్= తనరెక్కలచేత విదల్చబడిన దుమ్ముయొక్క వర్షంతో; అమరవరుల= దేవతాశ్రేష్ఠులయొక్క; దృష్టిపథంబున్= చూపుమార్గాన్ని; కప్పి; స్వర్గలోకంబు= దేవతలలోకమైన స్వర్గలోకాన్ని; నిరాలోకంబు, కాన్= వెలుగు లేనిది అయ్యేటట్లుగా; చేసినన్= చేయగా; అమర+ఇంద్రు, పనుపునన్=

దేవతలరాజయిన ఇంద్రుడి ఆజ్ఞచేత; పవనుండు= గాలి; ఆ, రజః+వృష్టి= ఆదుమ్ముయొక్కవర్షం, చెదరన్= చెదరేటట్లుగా; వీచెన్= విసిరాడు; అంతన్= అప్పుడు

తాత్పర్యం: గరుడడు తనరెక్కలచేత చిమ్మబడిన ధూళివర్షంచేత దేవతాశ్రేష్ఠుల దృష్టిమార్గాన్ని కప్పి స్వర్గలోకాన్ని వెలుతురులేనిదానినిగా చేయగా, ఇంద్రుడిఆజ్ఞచేత వాయువు ఆ దుమ్మువాన చెదరిపోయేటట్లుగా విసరాడు.

మాలిని.

పరశు కులిశ కుంత ప్రాస బాణాసనోద్య
త్పరిఘ కణప చక్ర ప్రస్ఫుర ద్బాహు సేనా
పరివృతుఁ డయి తాఁకెన్ భౌమనుం డన్మహాకిం
కరుఁడు సమరకేళీగర్వితున్ వైనతేయున్. 96

ప్రతిపదార్థం: పరశు, కులిశ, కుంత, ప్రాస, బాణాసన, ఉద్యత్, పరిఘ, కణప, చక్ర, ప్రస్ఫురత్, బాహు, సేనా, పరివృతుఁడు+అయి= గొడ్డలి, వజ్రాయుధం, బల్లెములు, ఈటెలు, విండ్లు, పైకెత్తబడిన గుదియలు, కణపాలు (ఒకరకంఆయుధాలు), చక్రాలు మొదలయిన వాటితో ప్రకాశిస్తున్న భుజాలు కలిగిన సైన్యంతో చుట్టబడినవాడయి; భౌమనుండు+అన్= భౌమనుడు అనే పేరు కల (అనులోని ఉత్వం లోపించింది); మహత్, కింకరుఁడు= గొప్పసేవకుడు; సమర, కేళీగర్వితున్= యుద్ధ మనే క్రీడలో మదించిన; వైనతేయున్= వినతకొడు కయిన గరుత్మంతుడిని; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: గొడ్డలి, వజ్రం, బల్లెం, ఈటె, విల్లు, ఎత్తబడినబాణం, కణపం, చక్రం అనేవాటితో ప్రకాశిస్తున్నచేతులు కలిగిన సైన్యంతో చుట్టబడిన వాడయి భౌమనుడనే గొప్ప సేవకుడు యుద్ధ మనే క్రీడలో మదించిన గరుత్మంతుడిని ఎదుర్కొన్నాడు.

క. **బలవత్ఖగేంద్రకోపా । నలభస్మీభూతుఁ డై క్షణంబున వాఁడున్**
బలమఱి క్రాఁగె నుదగ్ర। జ్వలన జ్వాలావలీఢశలభమపోలెన్. 97

ప్రతిపదార్థం: బలవత్, ఖగ+ఇంద్ర, కోప+అనల, భస్మీభూతుఁడు+ఐ= బలవంతు డయిన, పక్షిరా జయిన గరుత్మంతుడియొక్క కోప మనే అగ్నిచేత బూడిద అయినవాడయి; క్షణంబునన్= క్షణకాలంలో; వాఁడున్= ఆభౌమనుడుకూడ; బలము+అఱి= బలం నశించి; ఉదగ్ర, జ్వలన, జ్వాలా+అవలీఢ, శలభము+అ, పోలెన్= పైకిలేస్తున్న అగ్నియొక్క మంటలచే కాల్చబడిన మిడుతయే అన్నట్లుగా క్రాఁగెన్= మాడిపోయాడు.

తాత్పర్యం: బలవంతు డయిన గరుత్మంతుడియొక్క కోప మనే అగ్నిచేత బూడి దయిన వా డయి, క్షణకాలంలో ఆభౌమను డనేవాడు బలం నశించి పైకి లేచే అగ్నిమంటలచేత కాల్చబడిన మిడతయే అన్నట్లుగా దగ్ధుడైనాడు.

విశేషం: అలం: ఉపమ.

సీ. **పక్షతుండాగ్ర నఖక్షతదేహు లై । బోరన నవరక్తధార లొలుక**
విహగేంద్రునకు నోడి నిహతు లై సురవరుల్ । సురరాజు మఱువు సొచ్చిరి కలంగి;

సాధ్యు లనాయాససాధ్యులై పాఱిరి । పూర్వాభిముఖు లయి గర్వ ముడిఁగి;
వసువులు రుద్రులు వసుహీనవిప్రుల । క్రియ దక్షిణాశ్రితు లయిరి భీతి

ఆ. వంది; యపరదిక్కుఁ బొంది రాదిత్యు; లా । శ్వినులు నుత్తరమున కొనరఁ బఱచి;
రనల వరుణ పవన ధనద యమాసురుల్ । వీఁక దఱిఁగి కాందిశీకు లయిరి. 98

ప్రతిపదార్థం: పక్ష, తుండ+అగ్ర, నఖ, క్షత, దేహులు+అయి= రెక్కలు ముక్కుయొక్కకొనభాగం, గోళ్ళు అనేవాటిచే గాయపరచబడిన శరీరాలు కలవా రయి; బోరన= శీఘ్రంగా; నవ, రక్త, ధారలు= క్రొత్తనెత్తురుల ధారలు; ఒలుకన్= కారగా; విహగ+ఇంద్రునకున్, ఓడి= గరుత్మంతునికి ఓడిపోయి; నిహతులు+ఐ= హింసింపబడినవారై; కలంగి= కలతపొంది; సురవరుల్= దేవతాశ్రేష్ఠులు; సురరాజు, మఱువు= దేవతలకు రాజయిన ఇంద్రుడి ఆశ్రయాన్ని; చొచ్చిరి= చేరారు; సాధ్యులు= సాధ్యు లనే దేవతలలోని ఒకతెగవారు; అనాయాససాధ్యులు+ఐ= శ్రమలేకయే జయింపబడినవా రయి; గర్వము+ ఉడిఁగి= గర్వం నశించి; పూర్వ+అభిముఖులు+ఐ= తూర్పుముఖంగా పోయేవా రయి; పాఱిరి= పరుగెత్తారు; వసువులు= ఎనమండుగురు వసువులు; రుద్రులు= పదొకండుమంది రుద్రులు; భీతిన్+ అంది= భయపడి; వసుహీన, విప్రులక్రియన్= సంపద లేని బ్రాహ్మణులవలె; దక్షిణ+ఆశ్రితులు+అయిరి= దక్షిణదిక్కును ఆశ్రయించినవారైనారు. బ్రాహ్మణపక్షంలో - దక్షిణా+ ఆశ్రితులు+ అయిరి= సంభావనను ఆశ్రయించినవారైనారు; ఆదిత్యులు= పంద్రెండుగురు సూర్యులును; భీతిన్+అంది= భయపడి; అపర, దిక్కున్= పడమటిదిక్కును; పొందిరి= చేరారు. (సూర్యాస్తమయం పడమటిదిక్కున జరుగుతుంది); ఆశ్వినులు= అశ్వినీదేవతలు; ఉత్తరమునకున్= ఉత్తరదిక్కుకు; ఒనరన్= ఒప్పునట్లుగా; పఱచిరి= పారిపోయారు; అనల, వరుణ, పవన, ధనద, యమ+అసురుల్= అగ్ని, వరుణుడు, వాయువు, కుబేరుడు, యముడు, రాక్షసు డయిన నైరృతి అనే దిక్పాలురు; వీఁక, తఱిఁగి= పరాక్రమం తగ్గి, కాందిశీకులు+అయిరి= దిక్కు తెలియక పరుగెత్తినవా రైనారు.

తాత్పర్యం: గరుడుడి రెక్కలచే, ముక్కుకొనచే, గోళ్ళచే దెబ్బతిన్నశరీరం గలవా రయి బోరు మని నెత్తుటిధారలు కారుతుండగా గరుత్మంతుడిచేత జయింపబడి, హింసింపబడి దేవతాశ్రేష్ఠులు ఇంద్రుడిచాటుకు చేరారు; సాధ్యు లనే దేవతాగణం శ్రమలేకుండా జయింపబడినవా రై గర్వం విడిచి తూర్పుదిక్కుకు పారిపోయారు; వసువులు, రుద్రులు సంపద లేని బ్రాహ్మణులవలె దక్షిణదిక్కును ఆశ్రయించారు (సంభావనను ఆశ్రయించారు); పంద్రెండుగురు సూర్యులు కలత చెంది పడమటిదిక్కును పొందారు; అశ్వినీదేవతలు ఉత్తరదిక్కుకు పోయారు; అగ్ని, వరుణుడు, వాయువు, కుబేరుడు, యముడు, అసురు డయిన నైరృతి అనే దిక్పాలురు దిక్కు తెలియక పారిపోయారు.

విశేషం: అలం: ఉపమ, శ్లేష

క. తలరఁగ రేణుక్రథన । ప్రలిహప్రరుజాశ్వకృంతపదనఖులను ర
క్షులఁ గులిశనిశాతనఖా । వలిఁ బక్షీంద్రుండు వ్రచ్చివందఱలాడెన్. 99

ప్రతిపదార్థం: పక్షి+ఇంద్రుండు= పక్షులకు రా జయిన గరుత్మంతుడు; రేణు, క్రథన, ప్రలిహ, ప్రరుజ+అశ్వకృంత, పదనఖులు+అనురక్షులన్= రేణువు, క్రథనుడు, ప్రలిహుడు, ప్రరుజుడు, అశ్వకృంతుడు, పదనఖుడు అనే కావలివాళ్ళను; తలరఁగన్= సంభ్రమించేటట్లుగా, కులిశ, నిశాత, నఖ+ఆవలిన్= వజ్రాయుధంవలె వాడి అయినగోళ్ళవరుసతో; వ్రచ్చి= చీల్చి; వందఱలు+ఆడెన్= ముక్కలు చేశాడు.

తాత్పర్యం: రేణువు, క్రథనుడు, ప్రలిహుడు, ప్రరుజుడు, అశ్వక్రంతుడు, పదనఖుడు అనే కావలివాళ్ళను సంభ్రమించేటట్లుగా గరుడడు వజ్రంవంటి వాడి అయిన గోళ్ళవరుసతో చీల్చి ముక్కలు చేశాడు.

వ. ఇట్లు నిర్జరవరుల నెల్ల నిర్జించి, యూర్జితుం డై గరుడం డమృతస్థానంబున కరిగి, దానిం బరివేష్టించి ఘోరసమీరప్రేరితం బై దుర్వారశిఖాజిహ్వాల నంబరంబు నాస్వాదించుచున్న యనలంబుం గని, తత్క్షణంబ సకలనదీజలంబుల నెల్లఁ బుక్కిలించుకొని వచ్చి యయ్యనలంబు నాఱంజల్లి, తీక్ష్ణధారం బై దేవనిర్మితం బై పరిభ్రమించుచున్న యంత్రచక్రంబు నారాంతరంబున సంక్షిప్తదేహుం డై చొచ్చి యచ్చక్రంబుక్రింద. 100

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; నిర్జర, వరులన్, ఎల్లన్= దేవతలనందరిని; నిర్జించి= జయించి; ఊర్జితుండు+ఐ= బలవంతుడై; గరుడండు; అమృతస్థానంబునకున్= అమృతంఉండే ప్రదేశానికి; అరిగి= వెళ్ళి; దానిన్= ఆ అమృతాన్ని; పరివేష్టించి= చుట్టుకొని; ఘోర, సమీర, ప్రేరితంబు+ఐ= భయంకర మైన వాయువుచే రగుల్కొల్పబడిన దై; దుర్వార, శిఖా, జిహ్వాలన్= వారింప శక్యం గాని అగ్నిజ్వాల లనే నాలుకలతో; అంబరంబున్= ఆకాశాన్ని; ఆస్వాదించుచున్+ఉన్న= నాకుతున్న (తాకుతున్న); అనలంబున్, కని= అగ్నిని చూచి; తద్, క్షణంబు+ అ= ఆ క్షణమందే; సకల, నదీజలంబులన్+ఎల్లన్= అన్ని నదులయొక్క నీటినంతటిని; పుక్కిలించుకొని= నోటిలో ఉంచుకొని (గండూషించి); వచ్చి; ఆ+అనలంబున్= ఆ అగ్నిని; ఆఱన్, చల్లి= ఆరిపోయేటట్లుగా చల్లి; తీక్ష్ణ, ధారంబు+ఐ= పదు నైన అంచు గలదై; దేవనిర్మితంబు+ఐ దేవతలచేత తయారుచేయబడిన దై; పరిభ్రమించుచున్+ఉన్న= తిరుగుతున్న, యంత్రచక్రంబు, ఆర+అంతరంబునన్= యంత్రంలోని చక్రంయొక్క ఆకులలోపలిభాగాన; సంక్షిప్తదేహుండు+ఐ= చిన్నదిగా చేయబడినశరీరం కలవాడై; చొచ్చి= ప్రవేశించి; ఆ, చక్రంబు, క్రిందన్= ఆచక్రంయొక్క క్రిందిభాగంలో.

తాత్పర్యం: ఈ విధంగా దేవతాశ్రేష్ఠులను అందరినీ ఓడించి బలవంతుడై గరుడడు అమృతం ఉండే ప్రదేశానికి వెళ్ళి భయంకరమైనగాలిచేత రగుల్కొల్పబడి వారింపశక్యం గాని జ్వాల లనే నాలుకలచేత ఆకాశాన్ని కబళిస్తున్న అగ్నిని చూచి ఆ క్షణమందే అన్నినదులలోని నీటినంతటిని నోటిలో ఉంచుకొని వచ్చి ఆ అగ్ని ఆరిపోయేటట్లుగా చల్లి, వాడి అయిన అంచుకలదై, దేవతలచే నిర్మింపబడి తిరుగుతున్న యంత్రరూప మైన చక్రంయొక్క ఆకులనడుమ సంకోచింపబడిన (చిన్నదిగా చేయబడిన) దేహం కలవా డై ఆచక్రంక్రింద.

విశేషం: అలం: రూపకం.

ఉ. ఘోరవికార సన్నిహిత కోపముఖంబులు, దీప్తవిద్యుదు
ల్కారుణ దారుణాక్షములు నై, నిజదృష్టి విషాగ్ని నన్యులం
జేరఁగనీక యేర్చుచుఁ బ్రసిద్ధముగా నమృతంబు చుట్టు ర
క్షారతి నున్న యుగ్రభుజగంబుల రెంటిని గాంచి చెచ్చెరన్. 101

ప్రతిపదార్థం: ఘోర, వికార, సన్నిహిత, కోప, ముఖంబులు= భయంకరా లయి వికారంతో కూడిన కోపం కల నోళ్ళు కలవియున్నూ; దీప్త, విద్యుత్+ ఉల్క+ అరుణ, దారుణ+అక్షములు+ఐ= వెలుగుతున్న మెఱుపులవలె నిప్పులవలె ఎఱ్ర నైన, భయంకరా లయిన కన్నులు గలవియై; నిజ దృష్టి, విష+అగ్నిన్= తమచూపులనుండి ప్రసరించే విష మనే అగ్నితో; అన్యులన్= ఇతరులను; చేరఁగన్, ఈక= దగ్గరకు రానీకుండ; ఏర్చుచున్= దహిస్తూ; ప్రసిద్ధముగాన్= ప్రకటమయ్యేటట్లు; అమృతంబు,

చుట్టున్; రక్షా, రతిన్= రక్షించడంలోని ఆసక్తితో; ఉన్న; ఉగ్ర, భుజగంబులన్, రెంటిని= భయంకరమయిన పాములను రెంటిని; కాంచి= చూచి; చెచ్చెరన్= వెంటనే.

తాత్పర్యం: భయంకరాలయి, వికారంతో కూడిన కోపమున్న ముఖాలు కలవియున్నూ; వెలుగుతున్న మెరుపులవలె, నిప్పుకణాలవలె, ఎఱ్ఱ నైన, భయంకరా లయిన కన్నులు కలవియున్నూ అయి తమ కన్నులలోని విష మనే అగ్నితో ఇతరులను దగ్గరకు రానీకుండ దహిస్తూ అమృతానికి చుట్టూ కాపాడటంలోని ఆసక్తితో ఉన్న భయంకరా లయిన పాములను రెంటిని చూచి, వెంటనే.

విశేషం: అలం: రూపకం. ఈపద్యరచనలోని రేఫాక్షరబాహుళ్యం, పరుషాక్షరవిన్యాసం సర్పాల భయంకరాకారాలను అక్షరరమ్యంగా ధ్వనింపజేస్తున్నవి.

వ. **అయ్యురగంబులం దనపక్షరజోవృష్టినంధంబులంజేసి, వాని శిరంబులు ద్రొక్కి పరాక్రమం బెసంగనమృతంబు కొని గరుడండు గగనంబున కెగసిన.** **102**

ప్రతిపదార్థం: ఆ+ఉరగంబులన్= ఆపాములను; తన, పక్ష, రజస్+వృష్టి= తనరెక్కలవలన ఏర్పడిన దుమ్ముయొక్క వర్షంతో; అంధంబులన్+చేసి= గ్రుడ్డివాటినిగా చేసి; వాని, శిరంబులు, త్రొక్కి= వాటితలలు త్రొక్కి; పరాక్రమంబు+ఎసంగన్= పరాక్రమం ఎక్కువ కాగా; అమృతంబు, కొని= అమృతం తీసికొని; గరుడండు; గగనంబునకున్= ఆకాశానికి; ఎగసినన్= ఎగిరిపోగా.

తాత్పర్యం: ఆపాములను తనరెక్కలచేత ఎగురగొట్టబడిన దుమ్మువర్షంచేత గ్రుడ్డివాటినిగా చేసి, వాటి తలలు తన్ని, శౌర్యమొప్పేటట్లు అమృతాన్ని గ్రహించి గరుడుడు ఆకాశానికి ఎగిరిపోగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **కలహమున నిట్లు సురవీ । రులఁ బల్వుర నోర్చి, యొక్కరుఁడ యమృతముఁ దె**
క్కలికొని, యాస్వాదింపక । యలోలుఁ డగు వానిఁ జూచి హరి యి ట్లనియెన్. **103**

ప్రతిపదార్థం: కలహమునన్= యుద్ధంలో; ఇట్లు= ఈవిధంగా; సురవీరులన్= వీరు లైన దేవతలను, పల్వురన్= చాలామందిని; ఓర్చి= ఓడించి; ఒక్కరుఁడు+అ= ఒక్కడే; అమృతమున్= అమృతాన్ని; తెక్కలికొని= అపహరించి; ఆస్వాదింపక= రుచిచూడక; అలోలుఁడు+అగువానిన్= ఆసక్తిలేకుండ ఉన్న ఆగరుత్మంతుడిని, చూచి; హరి= విష్ణువు; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈవిధంగా యుద్ధంలో దేవతావీరులను పెక్కుమందిని జయించి ఒక్కడే అమృతాన్ని దొంగిలించి రుచి చూడకుండ అనాసక్తుడుగా ఉండే గరుత్మంతుడిని చూచి విష్ణువు ఇట్లా అన్నాడు.

క. **నీ విజయోత్సాహమునకు, । లావునకు, జవంబునకు, నలౌల్యమునకు, స**
ద్భావమునకు మెచ్చి, వరం । బీ వచ్చితి, వేఁడు మెద్ది యిష్టము నీకున్. **104**

ప్రతిపదార్థం: నీ, విజయ+ఉత్సాహమునకున్= నీవిజయంలోని ప్రయత్నానికి; లావునకున్= బలానికి; జవంబునకున్= వేగానికి; అలౌల్యమునకున్= అనాసక్తికి; సత్, భావమునకున్= మంచితనానికి; మెచ్చి= సంతోషించి; వరంబు+ఈన్, వచ్చితిన్= వరం ఇవ్వటానికి వచ్చాను; నీకున్, ఇష్టము, ఎద్ది= నీకు ఏది ప్రియమో; వేఁడుము= కోరుకొమ్ము.

తాత్పర్యం: నీ విజయంలోని పూనికకు (ప్రయత్నానికి) బలానికి, వేగానికి, అనాసక్తికి, మంచితనానికి, సంతోషించి నీకు వర మివ్వటానికి వచ్చాను. నీ కేది ఇష్టమో కోరుకొమ్ము.

శ్రీమన్నారాయణుఁడు గరుడునకుఁ బ్రసన్నుఁ డగుట; ఇంద్రుండు గరుడునితో స్నేహించుట (సం. 1-29-12)

వ. అని ప్రసన్నుం డై యానతిచ్చిన యాదిదేవుం డగు శ్రీమన్నారాయణునకు నమస్కరించి గరుడం డి ట్లనియె. 105

ప్రతిపదార్థం: అని; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహించినవాడయి; ఆనతి+ ఇచ్చిన= సెల విచ్చినటువంటి; ఆది, దేవుండు+ అగు= మొదటివే ల్పయిన; శ్రీమత్+నారాయణునకున్= శోభాయుక్తు డయిన నారాయణుడికి; నమస్కరించి= మ్రొక్కి; గరుడండు= గరుత్మంతుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని, దయకలవా డై ఆజ్ఞ ఇచ్చిన దేవాదిదేవు డయిన శ్రీమహావిష్ణువుకు మ్రొక్కి గరుడడు ఇట్లా పలికాడు.

విశేషం: శ్రీమత్+నారాయణునకున్= శ్రీమన్నారాయణునకు- అనునాసిక సంధి; ఆనతి+ఇచ్చిన= ఇకారసంధి; ఆనతిచ్చిన.

సీ. **'అమృతాశనంబు చేయకయును దేవ! నా । కజరామరత్వంబు నందుటయును,**
అఖిలలోకంబుల కగ్రణి వైన నీ । యగ్రంబునందు ని న్నధికభక్తిఁ
గొలుచుచు నునికియుఁ గోరితిఁ, గరుణతో । దయసేయు ముద్ధతదైత్యభేది!'
యనవుడు వానికి నభిమతంబులు ప్రీతుఁ । డై యిచ్చి హరి యిట్టు లనియె: 'నాకు

ఆ. **ననఘ! వాహనంబ వై మహాధ్వజమ వై । యుండు' మనినఁ బక్షియును ప్రసాద**
మనుచు మ్రొక్కిపఱచె; నంత నాతనిమీఁద । వజ్ర మెత్తి వైచె వాసవుండు. 106

ప్రతిపదార్థం: దేవ= ఓదేవుడా! ఉద్ధత, దైత్య, భేది= గర్వించిన రాక్షసులను సంహరించేవాడా! అమృత+అశనంబు= అమృతం తినటం; చేయకయును= చేయకుండానే; నాకున్, అజర+అమరత్వంబున్= ముసలితనం, చావు అనేవి లేకుండటాన్ని; అందుటయును= పొందటాన్ని; అఖిల, లోకంబులకున్= అన్నిలోకాలకు; అగ్రణివి+ఐన= ప్రధానుడ వయిన; నీ, అగ్రంబునందున్= నీయెదుట; నిన్నున్; అధిక, భక్తిన్= మిక్కిలిభక్తితో; కొలుచుచున్, ఉనికియున్= సేవిస్తూ ఉండటము; కోరితిన్= వేడుకొన్నాను; కరుణతోన్= దయతో; దయచేయుము= అనుగ్రహించుము (ఇమ్ము); అనవుడున్= అనగా; వానికిన్= ఆగరుత్మంతుడికి; అభిమతంబులు= కోరికలను; ప్రీతుఁడు+ఐ= సంతోషించినవా డయి; ఇచ్చి; హరి= విష్ణువు; ఇట్టులు+అనియెన్= ఇట్లా చెప్పాడు; అనఘ= పాపం లేని వాడా!; నాకున్= విష్ణువు నయిన నాకు; వాహనంబవు+ఐ= మోసేవాహనాని వై; ధ్వజమవు+ఐ= గొప్ప జెండా వై; ఉండుము; అనినన్= అని చెప్పగా; పక్షియును= పక్షి అయిన గరుత్మంతుడును; ప్రసాదము+అనుచున్= అనుగ్రహమంటూ; మ్రొక్కి= నమస్కరించి; పఱచెన్= ఎగిరాడు; అంతన్= అంతట; అతనిమీఁదన్= ఆగరుత్మంతుడిమీద; వాసవుండు= ఇంద్రుడు; వజ్రము= వజ్రాయుధాన్ని; ఎత్తివైచెన్= పైకెత్తి విసిరాడు.

తాత్పర్యం: గర్వితు లైన రాక్షసులను సంహరించేవాడా! దేవా! అమృతం తినకుండానే ముసలితనం, చావు రాకుండటాన్నీ, అన్ని లోకాలకు అధికుడ వయిన నీయెదుట మిక్కిలి భక్తితో నిన్ను సేవిస్తుండటాన్నీ కోరినాను.

దయతో ఇమ్మ్మ. అని గరుత్మంతుడు కోరగా సంతోషించినవా డయి అతనికి కోరికలను ఇచ్చి విష్ణువు 'నీవు నాకు వాహనంగా, గొప్పజెండాగా ఉండుము' అని చెప్పగా పక్షి అయిన గరుత్మంతుడు అనుగ్రహ మంటూ నమస్కరించి యెగిరిపోయాడు. అప్పుడు ఇంద్రుడు అతనిపై వజ్రాయుధాన్ని విసరివేశాడు.

వ. అదియును నంబరంబున నగ్నికణంబులు చెదరం బఱతెంచి పక్షిరాజుపక్షంబులు దాఁక వచ్చినం జూచి గరుడండు నగి, 'నీచేయువేదన నన్నుం దాఁక నోపదు; నీవు మహామునిసంభవంబ వగుటను, దేవేంద్రునాయుధంబ వగుటను నిన్ను నవమానింపంగాదు, గావున మదీ యైకపర్ణశకలచ్ఛేదంబు సేయుము; నాయందు నీశక్తి యింతియ' యనిన సకలభూతసంఘం బెల్ల నాతనిపర్ణంబులసుస్థిరత్వంబునకు మెచ్చి సుపర్ణుం డని పొగడిరి. సురేంద్రుండును నవ్విహగేంద్రుమాహాత్మ్యంబునకు మెచ్చి యచ్చెరు వంది యి ట్లనియె 107

ప్రతిపదార్థం: అదియును= ఆవజ్రాయుధమును; అంబరంబునన్= ఆకాశంలో; అగ్నికణంబులు= నిప్పుకణాలు; చెదరన్= ఎగిరిపడేట్లుగా; పఱతెంచి= వచ్చి; పక్షిరాజు, పక్షంబులు= పక్షులకు రా జయిన గరుత్మంతుడి రెక్కలను; తాఁక, వచ్చినన్= తాకటానికి రాగా; చూచి; గరుడుండు= గరుత్మంతుడు; నగి= నవ్వి; నీ, చేయు, వేదన= నీవు చేసే బాధ; నన్నున్= నన్ను (గరుత్మంతుడిని); తాఁకన్, ఓపదు= తాకజాలదు; నీవు; మహత్, ముని, సంభవంబవు+అగుటను= గొప్పమునినుండి పుట్టినదాని వవటంచేతను (వజ్రాయుధం దధీచి వెన్నెముకతో నిర్మింపబడిం దని పురాణవచనం); దేవేంద్రు+ ఆయుధంబవు+ అగుటను= దేవేంద్రుడియొక్క ఆయుధ మవటంచేతను; నిన్నున్; అవమానింపన్, కాదు= అవమానించరాదు; కావునన్= అందుచేత; మదీయ+ఏక, పర్ణ, శకల, ఛేదంబు= నాదయిన ఒక ఈకయొక్క ముక్కను తుంచటాన్ని; చేయుము; నాయందున్= నామీద; నీ, శక్తి= నీయొక్క (వజ్రాయుధంయొక్క) ప్రభావం; ఇంతి+అ= ఇంతమాత్రమే; అనినన్= అని పలుకగా; సకల, భూత, సంఘంబు+ఎల్లన్= అన్ని ప్రాణులయొక్క సమూహమంతా; అతని, పర్ణంబుల= ఆ గరుత్మంతుని రెక్కలయొక్క; సుస్థిరత్వంబునకున్= గట్టితనానికి; మెచ్చి= పొగడి; సుపర్ణుండు+అని= సుపర్ణుడు అనేపేరుతో; పొగడిరి= మెచ్చుకొన్నారు; (సుపర్ణుడంటే మంచిబల మైన రెక్కలు కలవాడని వ్యుత్పత్తి); సుర+ఇంద్రుండును= దేవతలకు రాజయిన ఇంద్రుడు కూడా; ఆ, విహగ+ ఇంద్రు, మాహాత్మ్యంబునకున్= ఆ పక్షులకు రాజయిన గరుత్మంతుడి గొప్పతనానికి; మెచ్చి; అచ్చెరువు+అంది= ఆశ్చర్యం పొంది; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆవజ్రాయుధం ఆకాశంలో నిప్పుకణాలు ఎగురునట్లుగా వచ్చి పక్షులకు రాజయిన గరుత్మంతుడి రెక్కలను తాకటానికి రాగా చూచి గరుడుడు నవ్వి 'నీవు చేసే బాధ నన్ను తాకజాలదు. నీవు గొప్పముని అయిన దధీచి వెన్నెముకచేత చేయబడినదాన వవటంచేత నిన్ను అవమానించటం తగదు. కావున నాయొక్క ఒక యీకముక్కను త్రుంచివేయుము. నాపై నీశక్తి ఇంతమాత్రమే' అని పలుకగా సర్వభూతసమూహం అతనిరెక్కల దృఢత్వానికి మెచ్చుకొని సుపర్ణు డని స్తుతించింది. దేవేంద్రుడుసైతం ఆపక్షిరాజుగొప్పతనానికి మెచ్చి ఆశ్చర్యపడి ఇట్లా పలికాడు.

విశేషం: ఇక్కడ గరుత్మంతుడికి సుపర్ణు డనే పేరు ఎట్లా వచ్చిందో చెప్పబడింది.

ఆ. నిరుపమానశౌర్య! నీతోడఁ జెలిమి సే । యంగ నా కభీష్ట మైనయదియు;
నిట్టి విక్రమంబు, నిట్టి సామర్థ్యంబుఁ గలదె! యొరుల కిజ్జగంబునందు. 108

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నిరుపమాన, శౌర్య=సాటిలేని పరాక్రమం కలవాడా! నీతోడన్, చెలిమి= నీతో(గరుత్మంతుడితో) స్నేహం; చేయంగన్= చేయటానికి; నాకున్+అభీష్టము+ఐన, అదియు= నాకు కోరిక గలిగింది; ఇట్టి విక్రమంబున్= ఇటువంటిపరాక్రమం; ఇట్టి, సామర్థ్యంబున్= ఇటువంటిశక్తి; ఒరులకున్= ఇతరులకు; ఈ+జగంబునందున్= ఈలోకంలో; కలదే+ఏ= కలదా (లేదని భావం).

తాత్పర్యం: ఓసాటిలేనిపరాక్రమం కలవాడా! నీతో స్నేహం చేయా లని నాకు కోరిక కలిగింది. ఇటువంటి విక్రమం, సమర్థత ఈ లోకంలో ఇతరులకు ఉన్నదా? (లేదని భావం).

విశేషం: నీతోడన్+చెలిమి; సమాసాలలో చేత, తోడ, వలన అనే వాటికి ఇత్వం వస్తుంది. నీతోడి చెలిమి- అలుక్సమాసం.

క. అమరుఁడ వజరుఁడ వజితుఁడ । వమేయుఁడవు; నీకు నమృత మది యేల ఖగో
త్తమ! దీని నొరుల కిచ్చిన । నమరులకును వా రసాధ్యు లగుదురు పోరన్. 109

ప్రతిపదార్థం: అమరుఁడవు= మరణం లేనివాడివి; అజరుఁడవు= ముసలితనం లేనివాడివి; అజితుఁడవు= ఓడింపబడనివాడివి; అమేయుఁడవు= కొలది చెప్పరానివాడివి; నీకున్; అమృతము+అది+ఏల= అమృతం ఎందుకు? ఖగ+ఉత్తమ!= పక్షులలో శ్రేష్ఠుడా! దీనిన్= ఈఅమృతాన్ని; ఒరులకున్= దేవతలకంటె ఇతరులకు; ఇచ్చినన్= ఇస్తే; వారు= ఆ అమృతం త్రాగినవారు; పోరన్= యుద్ధంలో; అమరులకును= దేవతలకుకూడ; అసాధ్యులు+అగుదురు= జయింపరానివా రవుతారు.

తాత్పర్యం: నీవు మరణం, ముసలితనం, పరాజయం లేనివాడివి. ఇట్టివాడి వని కొలది యిడరానివాడివి. నీకు అమృతం ఎందుకు? ఓ పక్షిరాజా! ఈ అమృతాన్ని ఇతరులకు ఇస్తే వారు దేవతలకుకూడ జయింపరానివా రవుతారు.

క. 'నీ వొరులకు నీయమృతం । బీ వలవదు; నాకు మగుడ నిచ్చిన నీ కి
ష్టావాప్తి యగు విధం బేఁ । గావించెద' ననిన హరికి గరుడం డనియెన్. 110

ప్రతిపదార్థం: నీవు= (గరుత్మంతుడు); ఒరులకున్= ఇతరులకు; ఈ అమృతంబు= ఈఅమృతాన్ని; ఈ, వలవదు= ఇయ్యవద్దు; (ఈన్- ఇచ్చుధాతువుయొక్క తుమున్నర్థకరూపం); నాకున్; మగుడన్, ఇచ్చినన్= తిరిగి ఇస్తే; నీకున్; ఇష్ట+అవాప్తి= ఇష్టమయినదాన్ని పొందటం; అగు, విధంబు= అయ్యేవిధానాన్ని; ఏన్= నేను; కావించెదన్= చేస్తాను; అనినన్= అని చెప్పగా; హరికిన్= ఇంద్రుడికి; గరుడండు= గరుత్మంతుడు; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'నీవు ఇతరులకు ఈఅమృతాన్ని ఇయ్యవద్దు. నాకు దాన్ని తిరిగి తెచ్చి ఇస్తే, నీకిష్టమయింది జరిగేవిధంగా నేను చేస్తా' నని ఇంద్రుడు గరుత్మంతుడితో చెప్పగా, అతడితో గరుత్మంతుడు ఇట్లా అన్నాడు.

వ. 'ఏను మదీయమాతృదాసీత్వనిరాసార్థం బురగుల కమృతంబుఁ దెచ్చియిత్తు నని కాద్రవేయులతో నొడివి వచ్చినవాఁడ; నీ యమృతంబు గొనిపోయి వారల కిచ్చి మదీయజననీదాస్యంబుఁ బాచికొనిన, నురగు లీ యమృతం బుపయోగింపకుండ ముందఱ నీవు గొనిచను' మనిన, నగ్గరుడని మహానుభావంబునకు మెచ్చి 'నీబలపరాక్రమంబులు వినవలతుం జెప్పు' మనిన నయ్యింద్రునకు గరుడం డి ట్లనియె. 111

ప్రతిపదార్థం: ఏను= నేను; మదీయ, మాతృ, దాసీత్వ, నిరాస+అర్థంబు= తల్లియొక్క దాసితనాన్ని పోగొట్టటానికి; ఉరగులకున్= పాములకు; అమృతంబున్, తెచ్చి, ఇత్తున్, అని= తీసుకొని వచ్చి ఇస్తానని; కాద్రవేయులతోన్= కద్రువకుమారు లయిన పాములతో; నొడివి, వచ్చినవాఁడన్= చెప్పి వచ్చినవాడిని; ఈ, అమృతంబు; కొనిపోయి= తీసికొనివెళ్ళి; వారలకున్= ఆపాములకు; ఇచ్చి; మదీయ, జననీ, దాస్యంబున్= నాతల్లియొక్క దాసితనాన్ని; పాచికొనినన్= పోగొట్టుకొన్నతరువాత; ఉరగులు= పాములు; ఈ, అమృతంబున్= నేను తీసికొనివెళ్ళిన అమృతాన్ని; ఉపయోగింపకుండన్= వాడకుండ(భుజింపకుండ); ముందఱన్= ముందుగా; నీవు; కొని=తీసికొని; చనుము= వెళ్ళుము; అనినన్= అని చెప్పగా; ఆ, గరుడని, మహత్+అనుభావంబునకున్= ఆగరుత్మంతుడి మహత్త్వానికి; మెచ్చి=మెచ్చుకొని; నీ, బల, పరాక్రమంబులు= నీయొక్క బలాన్ని; పరాక్రమాన్ని; వినన్, వలతున్= వినగోరుతాను; చెప్పుము; అనినన్= అనగా; ఆ+ఇంద్రునకున్= ఆ దేవేంద్రుడికి; గరుడండు; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: 'నేను నాతల్లి అయిన వినతదాస్యం తొలగించే నిమిత్తం, మీకు అమృతం తీసికొని వచ్చి ఇస్తా నని కద్రువకుమారు లైన పాములతో చెప్పి వచ్చాను. ఈ అమృతం తీసికొనిపోయి ఆ పాముల కిచ్చి నా తల్లిదాస్యం పోగొట్టుకొన్న పిమ్మట, పాము లీ అమృతం త్రాగకముందే నీవు దాన్ని గ్రహించి వెళ్ళుము' అని గరుడడు పలుకగా అతని మహత్త్వం మెచ్చుకొని 'నీబలాన్ని, పరాక్రమాన్ని వినగోరుతాను; చెప్పు' మని అడుగగా ఆ ఇంద్రునితో గరుడుడు ఇట్లా పలికాడు.

క. పరనిందయు, నాత్మగుణో । త్కరపరికీర్తనముఁ జేయఁగా నుచితమె స
త్పురుషుల? కైనను, నీ క । చ్చెరువుగ నా కలతెఱంగుఁ జెప్పెదఁ బ్రీతిన్. **112**

ప్రతిపదార్థం: సత్, పురుషులకున్= సజ్జనులకు; పర, నిందయున్= ఇతరులను నిందించటం; ఆత్మ, గుణ+ఉత్కర, పరికీర్తనమున్= తనయొక్క గుణాల సముదాయాన్ని పొగడుకోవటం; చేయఁగాన్, ఉచితము+ఎ= చేయటం తగునా! ఐనను= అయినప్పటికిని; నీకున్= (ఇంద్రుడికి); అచ్చెరువుగన్= ఆశ్చర్యమయ్యేటట్లుగా; నా, కల, తెఱంగున్= నాసత్య మయిన విధాన్ని; ప్రీతిన్= ఇష్టంతో; చెప్పెదన్= చేస్తాను.

తాత్పర్యం: ఇతరులను నిందించటం, తమగుణాలసముదాయాన్ని మెచ్చుకోవటం చేయటం సజ్జనులకు తగునా? (తగదు). అయినా నీకు ఆశ్చర్య మయ్యేటట్లుగా నా సత్యమయినవిధాన్ని ప్రీతితో చెప్తాను.

ఉ. స్థావరజంగమప్రవితతం బగు భూవలయంబు నెల్ల నా
లావునఁ బూని తాల్తు, నవిలంఘ్యపయోధిజలంబు లెల్ల ర
త్నావళితోన చల్లుదు బృహన్ని జపక్షసమీరణంబునన్,
దేవగణేశ! యీక్షణమ త్రిమ్మరి వత్తుఁ ద్రివిష్టపంబులన్. **113**

ప్రతిపదార్థం: దేవ, గణ+ఈశ= దేవతల సమూహానికి రాజా!; స్థావర, జంగమ, ప్రవితతంబు+అగు= అచరాలు, చరాలు అయిన వస్తువులతో నిండినట్టి; భూవలయంబున్, ఎల్లన్= భూమండలాన్నంతటిని; నాలావునన్= నాబలంతో, పూని= వహించి; తాల్తున్= మోస్తాను; బృహత్, నిజ, పక్ష, సమీరణంబునన్= పెద్ద వయిన నారెక్కలగాలితో; అవిలంఘ్య, పయోధి, జలంబులు+ఎల్లన్= దాటశక్యం కాని సముద్రంయొక్క నీళ్ళ నన్నింటిని; రత్న+ఆవళితోన్+అ= రత్నాలసమూహంతో పాటుగా; చల్లుదున్= వెదజల్లుతాను; త్రి, విష్టపంబులన్= మూడులోకాలను; ఈక్షణము+అ= ఒక్కక్షణంలోనే; త్రిమ్మరి, వత్తున్= చుట్టు తిరిగి వస్తాను.

తాత్పర్యం: ఓదేవగణాలకు రాజా! ఇంద్రుడా! చరాలు; అచరాలు అయిన పదార్థాలతో నిండినట్టి భూమండలాన్నంతటిని నాబలంతో వహించి మోస్తాను. పెద్ద వయిన నారెక్కలగాలితో దాట శక్యం కాని సముద్రపునీళ్ళ నన్నింటిని రత్నాలసమూహంతో పాటుగా వెదజల్లుతాను. మూడులోకాలను క్షణంలో చుట్టి వస్తాను.

విశేషం: గరుత్మంతుడిలో ధీరోదాత్తలక్షణాలు ప్రకటితమైనవి. ఉదారత(బంధముయొక్కఅవికటత్వం)అనే శబ్దగుణం ఉదాత్తంగా పోషింపబడింది. ఈ పద్యం పరాక్రమవర్ణనానికి గౌరవం తెచ్చింది. ఇది నన్నయగుణసంవిధానశిల్పం.

వ. **అని చెప్పిన గరుడని జవసత్త్వసామర్థ్యంబులకు మెచ్చి సంతసిల్లి 'నీవు నాతో నెప్పుడు బద్ధసఖ్యుండ వై యుండవలయు' నని, వెండియు దేవేంద్రుండు గరుడని కి ట్లనియె.** **114**

ప్రతిపదార్థం: అని, చెప్పినన్= అని చెప్పగా; గరుడని= గరుత్మంతుడియొక్క; జవ, సత్త్వసామర్థ్యంబులకున్= వేగానికి, బలానికి, శక్తికి; మెచ్చి; సంతసిల్లి= సంతోషించి; నీవు= (గరుత్మంతుడు); నాతోన్= (దేవేంద్రుడితో); ఎప్పుడున్= ఎల్లప్పుడు; బద్ధ, సఖ్యుండవు+అయి= కట్టబడిన స్నేహం కలవాడి వై; ఉండన్, వలయున్, అని= ఉండా లని, వెండియున్= మళ్ళీ; దేవ+ఇంద్రుండు= దేవతలకు రాజయిన ఇంద్రుడు; గరుడనికిన్+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని గరుడడు చెప్పగా, అతనివేగానికి, బలానికి, శక్తికి మెచ్చుకొని, సంతోషించి, 'నీవు నాతో ఎల్లప్పుడు స్నేహం కలవాడి వయి ఉండాలి' అని పలికి, మళ్ళీ ఇంద్రుడు గరుడనితో ఇ ట్లన్నాడు.

క. **'నా కభిమత మొనరించితి। నీ కిష్టము చెప్పికొను' మనిన 'దుర్మదు లై**
మా కి ట్లహితముఁ జేసిన। యా కద్రువపుత్త్రు లశన మయ్యెడు నాకున్'. **115**

ప్రతిపదార్థం: నాకున్+అభిమతము= నాకు(ఇంద్రుడికి) ఇష్టమైనదాన్ని; ఒనరించితి(వి)= చేశావు; నీకున్= (గరుత్మంతుడికి); ఇష్టము= ప్రియ మైనది; చెప్పికొనుము= తెల్పుము; అనినన్= అని చెప్పగా; దుర్మదులు+ఐ= చెడ్డగర్వం కలవా రయి; మాకున్= నాకు, నాతల్లి అయిన వినతకు; అహితమున్= అపకారాన్ని; చేసిన; ఆకద్రువ, పుత్త్రులు= ఆకద్రువ యొక్కకొడుకులు(పాములు); నాకున్= నాకు; అశనము+అయ్యెడున్= ఆహారం అగునుగాక!

తాత్పర్యం: 'నాకు ఇష్ట మైనదాన్ని చేశావు. నీ కిష్ట మయినదాన్ని తెల్పుము' అని ఇంద్రుడు గరుత్మంతుడితో చెప్పగా, 'అతిగర్వం కలవా రయి నాకు, నాతల్లి అయిన వినతకు అపకారం చేసిన కద్రువకొడుకులు నాకు ఆహారం కావాలి'.

క. **భవదభిరక్ష్యము లగు నీ। భువనంబులయందు సర్పములు భ్రిమ్మరుటన్**
దివిజాధిప! నీ కెఱిఁగిం। పవలసె; నీయాజ్ఞ నాకుఁ బడయఁగ వలసెన్. **116**

ప్రతిపదార్థం: దివిజ+అధిప= దేవతలకురాజా! భవత్+అభిరక్ష్యములు+అగు= నీచే కాపాడదగినట్టి; ఈ, భువనంబుల, అందున్= ఈలోకాలలో; సర్పములు= పాములు; భ్రిమ్మరుటన్= తిరుగుచుండటంచేత; నీకున్; ఎఱిగింపన్‌వలసెన్= తెలియజేయ వలసి వచ్చింది; నీ, ఆజ్ఞన్= నీఅనుజ్ఞను; నాకున్; పడయఁగన్‌వలసెన్= పొందవలసి వచ్చింది.

తాత్పర్యం: ఓ దేవరాజా! ఇంద్రుడా! నీచే రక్షింపదగినట్టి ఈలోకాల్లో పాములు తిరుగుతుండటంచేత నీకు తెలియజేయవలసి వచ్చింది. నాకు నీఆజ్ఞ పొందవలసి వచ్చింది.

విశేషం: మహాబలశాలి అయిన గరుడుడు తనంత తానే పాములను తినగలడు. ఇతరులఅనుమతి అడుగవలసిన అక్కరలేదు. అయినా, ఇంద్రపాలితా లయిన లోకాల్లో పాములు తిరుగుతుంటాయి కాబట్టి, వినయంతో అతని ఆజ్ఞను అర్థించాడు.

వ. అని గరుడండు దనకు నురగభోజనత్వంబు సురపతిచేతం బడసి, తదనుగమ్యమానుం డై, యురగుల యొద్దకు వచ్చి, మరకతహరితం బైన కుశాస్తరణంబున నమృతకలశంబు నిలిపి, యురగులకుం జూపి యి ట్లనియె. 117

ప్రతిపదార్థం: అని; గరుడండు= గరుత్మంతుడు; తనకున్, ఉరగ, భోజనత్వంబు= పాములు భోజనంగా గలిగిఉండటాన్ని; సురపతిచేతన్= దేవతలకు రా జయిన ఇంద్రునిచేత; పడసి= పొంది; తద్, అనుగమ్యమానుండు+ఐ= ఆ ఇంద్రునిచే అనుసరింపబడుతున్నవాడయి; ఉరగుల+ఒద్దకున్= పాములసమీపానికి; వచ్చి; మరకత, హరితంబు+ఐన= మరకతమణులవలె ఆకుపచ్చనైన; కుశ+ఆస్తరణంబునన్= దర్భలపరుపుమీద; అమృతకలశంబు= అమృతం కలపాత్రను; నిలిపి= ఉంచి; ఉరగులకున్= పాములకు; చూపి; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: అని గరుడడు తనకు పాములు భోజనంగా కలిగిఉండటాన్ని ఇంద్రుడిచేత పొంది, ఆ ఇంద్రుడిచే అనుసరింపబడుతున్నవా డయి పాములదగ్గరకు, వచ్చి, మరకతమణులవలె పచ్చగా ఉన్న దర్భల పరుపుపై (పేర్చినచోట) అమృత ముండేపాత్రను పెట్టి, పాములకు చూపి, ఇట్లా పలికాడు.

విశేషం: అలం: ఉపమ.

క. అనిమిషనాథ సుగుప్త మ। యిన యమృతము దెచ్చి మీకు నిచ్చితి; నస్మ
జ్జననీదాస్యము వాసెను। దినకరపవనాగ్నితుహినదీప్తుల కరిగాన్. 118

ప్రతిపదార్థం: అనిమిష, నాథ, సు, గుప్తము+అయిన= దేవతలకు రా జయిన ఇంద్రుడిచేత బాగుగా రక్షింపబడిన; అమృతము, తెచ్చి, మీకున్, ఇచ్చితిన్= అమృతాన్ని తెచ్చి మీ కిచ్చాను; అస్మద్+జననీ, దాస్యము= నాతల్లి అయిన వినతయొక్క దాసితనం; దినకర, పవన+అగ్ని, తుహిన, దీప్తులు+అ= సూర్యుడు, గాలి, అగ్ని, చంద్రుడు అనేవారు; కరి, కాన్= సాక్షిగా; పాసెన్= తొలగింది.

తాత్పర్యం: దేవేంద్రుడిచేత బాగుగా రక్షింపబడిన అమృతాన్ని తెచ్చి మీ కిచ్చివేశాను. సూర్యుడు, గాలి, అగ్ని, చంద్రుడు అనేవాళ్ళు సాక్షులుగా నాతల్లి అయిన వినతయొక్క దాసితనం పోయింది.

విశేషం: దాస్యము+పాసెను= దాస్యమువాసెను - పకారానికి వాదేశం. అస్మద్+జనని= అస్మజ్జనని - శ్చుత్వసంధి. ఈపద్యంలో అర్థవ్యక్తి(అర్థవ్యక్తిహేతుత్వం)అనే శబ్దగుణం రాణిస్తున్నది. 'అనిమిషనాథసుగుప్త' మైన అమృతాన్ని తాను తేవటంలో ఉన్న తెగువను గరుత్మంతుడు చెప్పటంతోపాటు గుప్తంగాఉన్న ఇంద్రుడిబారినుండి అమృతాన్ని దక్కించుకోవటం మీశక్తియుక్తులమీద ఆధారపడి ఉన్నదనిచెపుతున్న అర్థం ఇందులో వ్యంగ్యం. అమృతం తేవటమేకాని దానిని వినియోగించటం తన బాధ్యత కాదని వ్యంగ్యం. వెంటనే తల్లిని తీసికొని వెళ్ళటంలో అది స్పష్ట మౌతున్నది.

వ. 'మీరలు స్నాతాలంకృతుల రై వచ్చి దీని నుపయోగింపుం' డని పంచి, తల్లిం దనవీఁ పెక్కించుకొని విహగేంద్రుం డురగుల కదృశ్యుండైయున్న సురేంద్రు వీడ్కొని చనియె; నిట యురగులును నమృతోపయోగకు తూహలంబున నొండొరులం గడవఁ గృతస్నానాలంకృతు లై చనుదెంచుటకు ముందఱ. 119

ప్రతిపదార్థం: మీరలు= మీరు; స్నాత+అలంకృతులరు+ఐ= స్నానం చేసినవారు, అలంకరించు కొన్న వారు నై (విశేషణోభయపదకర్మధారయం); వచ్చి; దీనిన్= ఈఅమృతాన్ని; ఉపయోగింపుండు+అని= వాడుకొనం డని (భుజించం డని); పంచి= పంపి; తల్లిన్= తల్లి అయిన వినతను; తన, వీఁపు+ఎక్కించుకొని= తనవీపున ఎక్కించుకొని; విహగ+ఇంద్రుండు= పక్షులకు ఇంద్రు డయిన గరుత్మంతుడు; ఉరగులకున్= పాములకు; అదృశ్యుండు+ఐ= కనబడనివా డై; ఉన్నన్; సుర+ఇంద్రు= దేవతలరా జయిన ఇంద్రుడిని; వీడ్కొని= పోయివస్తా నని చెప్పి విడిచి; చనియెన్= వెళ్ళాడు; ఇట= అమృతముండే చోట; ఉరగులునున్= పాములు కూడా; అమృత+ఉపయోగ, కుతూహలంబునన్= అమృతాన్ని వాడుకొనే (త్రాగే) ఉత్సాహంతో; ఒండు+ఒరులన్= ఒకరొకరిని; కడవన్= దాటి ముందుకు పోయేటట్లు; కృత, స్నాన+అలంకృతులు+ఐ= చేయబడినస్నానం కలవారును, అలంకరింపబడినవారును అయి; చనుదెంచుటకున్= రావటానికి; ముందఱన్= ముందుగానే.

తాత్పర్యం: 'మీరు స్నానం చేసిన పిమ్మట అలంకరించుకొని వచ్చి అమృతం త్రాగం' డని పంపి, పక్షిరా జయిన గరుత్మంతుడు తల్లి అయిన వినతను తనవీపుపై ఎక్కించుకొని, పాములకు కనబడకుండ ఉండే దేవేంద్రుడి కడ సెలవుపుచ్చుకొని వెళ్ళిపోయాడు. ఇంక ఇచ్చట- పాములు అమృతం ఉపయోగించటంలోని ఉత్సాహంతో ఒండొంటిని దాటేటట్లుగా(ఆహమహమికతో) స్నానం చేసి, అలంకరించుకొని రావటానికి ముందే.

విశేషం: స్నాతాలంకృతులు+రు. ఇది ప్రథమావిభక్తితో ముగిసే యుష్మద్విశేషణ మవటంచేత, బహువచనాంత మవటంచేత 'రు' ఆగమంగా వచ్చింది. ఈ ఆగమానికి వెనుక ఉండే ఉత్వం అత్వంగా మారింది. స్నాతాలంకృతులరు.

క. **అమరాధిపుఁ డమృతముఁ గొని । యమరావతి కరిగి, తొంటియట్టుల సుస్థా**
నమున నవిచలిత రక్షా । క్షముఁ డై రక్షించుకొని సుఖస్థితి నుండెన్. **120**

ప్రతిపదార్థం: అమర+అధిపుఁడు= దేవతలకు రాజయిన ఇంద్రుడు; అమృతమున్+కొని= అమృతాన్ని తీసికొని, అమరావతికిన్= దేవతలపట్టణ మయిన అమరావతికి; అరిగి= వెళ్ళి; తొంటి, అట్టులు+అ= పూర్వంవిధంగానే; సు, స్థానమునన్= మంచిచోట; అవిచలిత, రక్షా, క్షముఁడు+ఐ= చెదరని రక్షణలో సమర్థు డయి; రక్షించుకొని= కాపాడు కొని; సుఖ, స్థితిన్= సుఖమయిన ఉనికితో; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: ఇంద్రుడు అమృతాన్ని గ్రహించి, అమరావతీనగరానికి వెళ్ళి పూర్వంవలెనే, ఆ అమృతాన్ని మంచిచోట ఉంచి స్థిరమైన రక్షణంలో సమర్థు డై రక్షించుకొంటూ, సుఖంతో కూడిన స్థితితో ఉండినాడు.

వ. **అంత నయ్యురగులు నమృతం బుపయోగింపం గానక దానియున్నస్థానం బని దర్భలు నాకిన నాలుకలు రెండుగా వ్రయ్యుటంజేసి, నాటంగోలె ద్విజిహ్వులు నాఁ బరఁగిరి; యమృతస్థితింజేసి దర్భలు పవిత్రంబు లయ్యె.** **121**

ప్రతిపదార్థం: అంతన్= తర్వాత; ఆ+ఉరగులు= ఆ పాములు; అమృతంబు= అమృతాన్ని; ఉపయోగింపన్, కానక= ఉపయోగింపలేక (త్రాగాలని ఎంచి దాన్ని కానక); దాని, ఉన్న, స్థానంబు+అని= అది ఉన్నచో టని; (కర్తృపద ప్రథమకు షష్ఠి); దర్భలు; నాకినన్= నాకగా; నాలుకలు; రెండుగా; వ్రయ్యుటన్, చేసి= చీలుటచేత; నాటన్, కోలెన్= నాటనుండి; ద్వి, జిహ్వులు, నాన్= రెండు నాలుకలు కలవారనేటట్లు; పరఁగిరి= ఒప్పినారు; అమృత, స్థితిన్, చేసి= అమృతంయొక్క ఉనికిచేత; దర్భలు; పవిత్రంబులు+అయ్యెన్= పవిత్రాలయ్యాయి.

తాత్పర్యం: పిమ్మట ఆపాములు అమృతం త్రాగటానికి వెళ్ళి, అది అచ్చట లేకపోవటంచేత ఉపయోగింప లేక అది ఉన్నస్థల మని దర్భలు నాకగా వాటిఅంచులు పదునుగా ఉంటాయికాబట్టి వాటి నాలుకలు రెండుగా చీలాయి. నాటినుండి పాములు (ద్విజిహ్వలు) రెండునాలుకలు కలవిగా ఒప్పినాయి. అమృతం తమపై ఉంచటం చేత దర్భలు పవిత్రా లయ్యాయి.

క. ఈ సౌపర్ణాఖ్యానము । భాసురముగ వినిన పుణ్యపరులకు నధిక
శ్రీ సంపద లగు; దురితని । రాసం బగుఁ; బాయు నురగరక్షోభయముల్. 122

ప్రతిపదార్థం: ఈ, సౌపర్ణ+ఆఖ్యానము= గరుత్మంతుడికి సంబంధించిన ఈ కథను; భాసురముగన్= ప్రకాశమానంగా (ఒప్పుగా); వినిన= వినినట్టి; పుణ్యపరులకున్= పుణ్యంపట్లఆసక్తి కలవారికి; అధికశ్రీ సంపదలు= విస్తారమయిన సిరియు, సంపదయు; అగున్= కలుగుతుంది; దురితనిరాసంబు= పాపాలు తొలగటం; అగున్=అవుతుంది; ఉరగ, రక్షః, భయముల్= పాములవలన, రాక్షసులవలన భయాలు; పాయున్= తొలగిపోతాయి.

తాత్పర్యం: గరుత్మంతుడికి సంబంధించిన ఈ కథను ఒప్పుగా వినిన పుణ్యాత్ములకు అధిక మయిన సిరిసంపదలు కలుగుతాయి. పాపక్షయం అవుతుంది. పాములనుండి, రాక్షసులనుండి భయాలు తొలగిపోతాయి.

విశేషం: ఇది గరుడోపాఖ్యానం వినటంవలన కలిగే ఫలాన్ని తెల్పుతున్నది - ఫలశ్రుతి.

వ. ఇట్లురగు లమృతం బుపయోగింపం గానక చనిన, శేషుండు తనతల్లియుం దమ్ములుఁజేసిన యధర్మంబునకు నిర్వేదించి, వారల విడిచి కడునిష్ఠతో గంధమాదన బదరీవన గోకర్ణ పుష్కరారణ్య హిమవంతంబు లాదిగాఁ గల పుణ్యస్థానంబులం దనేక సహస్రవర్షంబులు బ్రహ్మ నుద్దేశించి తపంబు సేసిన, బ్రహ్మయుఁ బ్రత్యక్షం బై వరంబు వేడు మనిన శేషుం డి ట్లనియె. 123

ప్రతిపదార్థం: ఇట్లు=ఈవిధంగా; ఉరగులు= పాములు; అమృతంబు=అమృతాన్ని; ఉపయోగింపన్, కానక= ఉపయోగించటానికి పొందక; చనినన్= వెళ్ళిపోగా; శేషుండు= ఆదిశేషుడు; తన తల్లియున్; తమ్ములున్; చేసిన; అధర్మంబునకున్= ధర్మవిరుద్ధ మయిన కార్యానికి; నిర్వేదించి= దుఃఖించి; వారలన్= తల్లిని, తమ్ముళ్ళను; విడిచి; కడు, నిష్ఠతోన్= మిక్కిలి నియమంతో; గంధమాదన, బదరీవన, గోకర్ణ, పుష్కర+అరణ్య, హిమవంతంబులు+ఆదిగాన్= గంధమాదనపర్వతం, బదరీవనం, గోకర్ణమనేక్షేత్రం, పుష్కర మనే పేరున్న అరణ్యం, హిమవత్పర్వతం మొదలుగా ఉండే; పుణ్యస్థానంబులందున్= పవిత్రా లైన ప్రదేశాలలో; అనేక సహస్రవర్షంబులు= పెక్కువేలయేండ్లు; బ్రహ్మన్, ఉద్దేశించి= బ్రహ్మనుగురించి; తపంబు, చేసినన్= తపస్సు చేయగా; బ్రహ్మయున్= బ్రహ్మకూడ; ప్రత్యక్షంబు+ఐ= ఎదుట నిలిచి; వరంబు, వేడుము+అనినన్= ఏదైనా వరం వేడుకొ మ్మని అనగా; శేషుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా పాములు అమృతాన్ని ఉపయోగించే భాగ్యం పొందలేక వెళ్లిపోగా, ఆదిశేషుడు తనతల్లి, తమ్ములు చేసిన ధర్మవిరుద్ధ మైన కార్యానికి అసహ్యపడి, దుఃఖించి, వారిని విడిచి, మిక్కిలి నియమంతో గంధమాదనపర్వతం, బదరీవనం, గోకర్ణక్షేత్రం, పుష్కరారణ్యం, హిమాచలం మొదలయిన పుణ్యక్షేత్రాలలో పెక్కువేలయేండ్లు బ్రహ్మనుగురించి తపస్సు చేయగా బ్రహ్మకూడ కనుల ఎదుట నిలిచి ఏదైనా వరం వేడుకొమ్మని పలుకగా ఆదిశేషుడు ఇట్లా అన్నాడు.

బ్రహ్మ యనుజ్ఞవలన శేషుఁడు భూభారంబు దాల్చుట (సం. 1-32-2)

సీ. **'తల్లియు నాసహోదరులును మూర్ఖు లై! ధర్మువు నుచితంబుఁ దప్పి వినత**
కావైనతేయున కపకారములు సేసి, । రెప్పుడు వారు సహింప కెగ్గు
సేయుదు, రేను రోసితి, వారితోడిపొ । త్తొల్లఁ, దపంబు సేయుచు శరీర
భారంబు విడిచెదఁ బరమేష్ఠి!' యనవుడు । నాతని సమబుద్ధి కజుఁడు మెచ్చి

ఆ. **నిత్యసత్యధర్మనిరతుండ వఖిలంబు । దాల్పనోపు నట్టి ధైర్యయుతుఁడ,**
విది యనన్యవిషయ; మిమ్మహీభారంబు । నీవ తాల్పవలయు నిష్ఠతోడ. 124

ప్రతిపదార్థం: పరమేష్ఠి!= ఓ బ్రహ్మదేవుడా! తల్లియున్= తల్లి అయిన కద్రువయు; నా, సహోదరులును= తోడబుట్టిన నా తమ్ములును; మూర్ఖులు+ఐ= బుద్ధిలేనివా రయి; ధర్మువున్= ధర్మాన్ని; ఉచితంబున్= తగినకార్యాన్ని; తప్పి= అతిక్రమించి; వినతకున్= సవతితల్లి అయిన వినతకు, వైనతేయునకున్= వినతకుమారు డైన గరుడునికిని; అపకారములు= హానులను; చేసిరి; వారు= తల్లి, తమ్ముళ్ళును; ఎప్పుడున్= ఎల్లప్పుడు; సహింపక= సైపక, ఓర్వలేక; ఎగ్గు, చేయుదురు= హాని చేస్తారు; ఏను= నేను; రోసితిన్= అసహ్యపడ్డాను; వారితోడి, పొత్తు+ఒల్లన్= తల్లితోను, తమ్ములతోను స్నేహాన్ని అంగీకరించను; తపంబు, చేయుచున్= తపస్సు చేస్తూ; శరీరభారంబు= దేహంయొక్క బరువును; విడిచెదన్= వదలుతాను(మరణిస్తాను); అనవుడున్= అనిన అనంతరం; అతని, సమబుద్ధికిన్= శేషునియొక్క ధర్మంతోకూడిన తలంపుకు; అజుఁడు= బ్రహ్మ; మెచ్చి; నిత్య, సత్య, ధర్మ, నిరతుండవు= ఎల్లప్పుడు సత్యం పట్ల, ధర్మంపట్ల ఆసక్తికలవాడివి; అఖిలంబు= సర్వాన్ని, తాల్పన్, ఓపు+అట్టి= ధరింపజాలునట్టి; ధైర్యయుతుఁడవు= ధైర్యంతో కూడినవాడివి; ఇది, అనన్య, విషయము= ఇతరులకు శక్యం(గోచరం)కాని కార్యం(అంశం); ఈ+మహీభారంబు= ఈభూమియొక్కబరువును; నిష్ఠతోడన్= స్థిరత్వంతో; నీవు+అ= నీవే; తాల్పన్‌వలయు= ధరించాలి.

తాత్పర్యం: 'ఓబ్రహ్మదేవుడా! నాతల్లి అయిన కద్రువ, తమ్ముళ్ళు, మూఢు లై ధర్మాన్ని, యుక్తాన్ని, విడిచి నా సవతితల్లి అయిన వినతకు, ఆమె కుమారు డైన గరుడుడికి కీడులు చేశారు. వాళ్ళు ఓర్వలేక ఎప్పుడూ ఇట్లే హాని చేస్తుంటారు. నేను అసహ్యపడ్డాను. వాళ్ళతో కలిసి ఉండటం నా కిష్టం లేదు. తపస్సు చేస్తూ దేహభారాన్ని విడుస్తాను' అని శేషుడు పలుకగా, బ్రహ్మ అతడి ధర్మబుద్ధికి మెచ్చి 'నీవు ఎల్లప్పుడు సత్యంపట్ల, ధర్మంపట్ల ఆసక్తి కలిగినవాడివి. సర్వం భరించేధైర్యంతో కూడినవాడివి. ఇది ఇతరులకు శక్యం కాని విషయం. ఈభూమియొక్క బరువును నీవే నియమంతో భరించాలి.

చ. **వినతకు నాత్మజుం డయిన వీరుఁడు, కశ్యపవాలఖిల్యస**
న్మునులవరంబు గన్న ఖగముఖ్యుఁడు, వాసవు నోర్చియున్న స
ద్వినుతబలుండు కావున వివేకమునన్ వినతాతనూజుతో
ఘనముగఁ జెల్మి సేయు; మిది కార్యము నీకు భుజంగమేశ్వరా! 125

ప్రతిపదార్థం: భుజంగమ+ఈశ్వరా!= పాములకు రాజు వైన శేషుడా! వినతకున్; ఆత్మజుండు= కుమారుడు; అయిన; వీరుఁడు= పరాక్రమవంతుడు; కశ్యప, వాలఖిల్య, సత్, మునుల= కశ్యపుడు, వాలఖిల్యులు అనే మంచి మునీశ్వరుల; వరంబు; కన్న= పొందిన; ఖగముఖ్యుఁడు= పక్షిశ్రేష్ఠుడు; వాసవున్= ఇంద్రుడిని; ఓర్చి+ఉన్న= ఓడించిఉన్న; సత్, వినుత, బలుండు=

సజ్జనులచే నుతింపబడిన బలం కలవాడు; కావునన్, వివేకమునన్= తెలివితో; వినతా, తనూజుతోన్= వినతకు కుమారు డైన గరుడనితో; ఘనముగన్= గొప్పగా; చెల్మి, చేయుము= స్నేహం చేయుము; ఇది= ఇట్లా స్నేహం చేయటం; నీకున్; కార్యము= చేయదగినపని.

తాత్పర్యం: సర్పరాజు వైన ఓ శేషుడా! వినతకు కుమారు డైన గరుత్మంతుడు పరాక్రమవంతుడు, కశ్యపుడు వాలఖిల్యులు మొద లైన గొప్పమునుల వరం పొందిన పక్షిశ్రేష్ఠుడు, ఇంద్రుడిని ఓడించి సజ్జనులచే స్తుతింపబడిన బలం కలవాడు. కాబట్టి తెలివితో ఆ గరుడనితో స్థిరంగా స్నేహం చేయుము. అతనితో స్నేహంచేయటం నీకు కర్తవ్యం.

విశేషం: బంధశైథిల్యం, అర్థవైమల్యం కల ప్రసాదగుణరమ్యమైన ఇటువంటి పద్యాలకు నన్నయ నిధి.

వ. అని బ్రహ్మ నియోగించిన శేషుం డశేషమహీభారంబు దాల్చి గరుడనితో బద్ధసఖ్యుం డై యుండె; నిట వాసుకియుం దల్లిశాపంబున జనమేజయు చేయు సర్పయాగంబునం దయ్యెడుసర్పకులప్రళయంబునకు వెఱచి, తనబాంధవుల నైరావతాది సహోదరుల రావించి విషణ్ణహృదయుం డై యి ట్లనియె. 126

ప్రతిపదార్థం: అని; బ్రహ్మ; నియోగించినన్= ఆజ్ఞాపించగా; శేషుండు; అశేష, మహీ, భారంబు= సర్వ మైన భూమియొక్క బరువును; తాల్చి= ధరించి; గరుడనితోన్= గరుత్మంతుడితో; బద్ధ, సఖ్యుండు+అయి, ఉండెన్= కట్టబడిన స్నేహం కలవాడై ఉన్నాడు; ఇటన్= ఇచ్చట (తల్లి, తమ్ముళ్ళు ఉన్నచోట); వాసుకియున్= వాసుకి అనే సర్పశ్రేష్ఠుడును; తల్లిశాపంబునన్= తల్లి అయిన కద్రువశాపంచేత; జనమేజయు, చేయు= జనమేజయుడు చేయబోయే; (కర్తృపదప్రథమకు షష్ఠి); సర్పయాగంబునందున్= పాములను ఆహుతి చేసే యజ్ఞంలో; అయ్యెడు= కాబోయే; సర్ప, కుల, ప్రళయంబునకున్= పాముల వంశంయొక్క నాశనానికి; వెఱచి= భయపడి; తనబాంధవులన్= తనబంధువు లయిన; ఐరావత+ఆది, సహోదరులన్= ఐరావతుడు మొదలయిన సోదరులను; రావించి= రప్పించి; విషణ్ణహృదయుండు+ఐ= దుఃఖించిన చిత్తం కలవాడయి; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: అని బ్రహ్మ ఆజ్ఞాపించగా శేషుడు భూమియొక్క సమస్తభారాన్నీ ధరించి గరుత్మంతుడితో స్నేహం కలిగి ఉన్నాడు. ఇచట వాసుకి అనే సర్పశ్రేష్ఠుడు తల్లి అయిన కద్రువయొక్క శాపంచేత జనమేజయుడు చేయబోయే సర్పయాగంలో కాగలపాములసముదాయంయొక్క వినాశనానికి భయపడి తన చుట్టాలను, ఐరావతుడు మొద లయిన సోదరులను పిలిపించి దుఃఖించినహృదయం కలవాడయి ఈ విధంగా పలికాడు.

వాసుకి తల్లిశాపమునకు వగచుట (సం. 1-33-1)

చ. చిరముగ బ్రహ్మకుం దపము సేసి, యనంతుఁ డనంతధారుణీ
భరగురుకార్యయుక్తుఁ డయి, పన్నగముఖ్యులపొత్తు వాసి, చె
చ్చెరఁ దనయంత నుండి, మదిఁ జేర్చి తలంపఁడ యొక్కనాఁడు దు
ర్ధరతర దందశూకకుల భావిభయప్రవిఘాతకృత్యముల్. 127

ప్రతిపదార్థం: చిరముగన్= చిరకాలం; బ్రహ్మకున్= బ్రహ్మనుగురించి (ద్వితీయకుబదులుషష్ఠి); తపము, చేసి; అనంతుఁడు= శేషుడు; అనంత, ధారుణీ, భర, గురు కార్యయుక్తుఁడు+అయి= అంతంలేని భూమిని మోయటం అనే గొప్పపనితో కూడినవా డయి; పన్నగముఖ్యుల= సర్పశ్రేష్ఠుల; పొత్తు, పాసి= స్నేహం విడిచి; చెచ్చెరన్= శీఘ్రంగా; తన, అంతన్, ఉండి= తాను వేరుగా ఉండి; ఒక్కనాఁడు= ఒక్కరోజుకూడ; దుర్భరతర, దందశూక, కుల, భావి, భయ, ప్రవిఘాత, కృత్యముల్= మిక్కిలి భరింపశక్యం కాని పాములయొక్కవంశానికి ముందు కాబోయే భయాన్ని అడ్డగించే పనులను; మదిన్= మనస్సులో; చేర్చి= కూర్చి; తలంపఁడు+అ= ఏమియు తలపోయడు.

తాత్పర్యం: శేషుడు చిరకాలం బ్రహ్మనుగురించి తపస్సు చేసి విస్తృతమైన భూమిని భరించటం అనే గొప్పకార్యంతో కూడిన వా డయి సర్పశ్రేష్ఠుల స్నేహం విడిచి శీఘ్రంగా తనంతతాను వేరుగా ఉండి ఒకప్పుడైనా మిక్కిలి భరింపశక్యంకాని పాముల సముదాయానికి ముందు కలుగబోయే భయాన్ని తొలగించే పనులను మనస్సులో తలంచి ఏమియు ఆలోచన చేయడు.

విశేషం: ఈపద్యంలో నన్నయ ఆరోహావరోహక్రమం వాక్యార్థసంయోజనంలో దీపింపచేస్తూ 'సమాధి' అనే శబ్దగుణాన్ని పోషించాడు. బ్రహ్మను తపస్సుతో మెప్పించి భూమిభారాన్ని మోసే దుష్కరమైనకార్యాన్ని సాధించిన శేషుడు సమర్థుడై ఉండికూడా తన సర్పకులానికి రాబోయే మహాప్రళయాన్నిగురించి పట్టించుకోవటంలేదని వాసుకి తనబంధువులతో చెపుతున్నాడు. చిన్నచిన్నమాటలతో మొదలై చివరిచరణమంతా వ్యాపించి ఉన్న దీర్ఘసమాసంతో చేసిన వాక్యవిన్యాసం ఆరోహక్రమాన్ని సూచిస్తూ వాసుకి మనోవేదనను వ్యక్తంచేస్తున్నది. (సంపా.)

వ. 'మఱి యమృతమథనంబునాఁడు మంథరమహానగంబునకు నేత్రంబ నయిన నాక్లేశంబునకు మెచ్చి యమరులెల్లఁ బితామహుం బ్రార్థించి నాకు నవ్యయత్వంబును, సకలభయవిమోక్షణంబునుగా వరం బిప్పించి; రైనను జననీశాపంబున నురగకులప్రళయం బగుటకు మనోదుఃఖంబు దుస్సహం బై యుండు; దాని నుడిగించు నుపాయంబెద్ది? యేమిసేయువార?' మని చింతించుచున్న యన్నాగరాజునకు నాగకుమారు లత్యుద్ధతు లై యి ట్లనిరి. 128

ప్రతిపదార్థం: మఱి= ఇంకను, అమృత, మథనంబు, నాఁడు= అమృతంకొరకు సముద్రాన్ని త్రచ్చేటప్పుడు; మంథర, మహత్, నగంబునకున్= కవ్వ మైన మంథర మనే గొప్పపర్వతానికి; నేత్రంబన్, అయిన= తరిత్రాడు నయిన; నా, క్లేశంబునకున్= నాకష్టానికి; మెచ్చి; అమరులు, ఎల్లన్= దేవతలందరును; పితామహున్= బ్రహ్మను; ప్రార్థించి= వేడి; నాకున్, అవ్యయత్వంబును= నాశంలేకుండటమును; సకల, భయ, విమోక్షణంబునున్, కాన్= సర్వభయాలనుండి విముక్తి అవునట్లుగా; వరంబు+ఇప్పించిరి= వరం ఇచ్చేటట్లు చేశారు; ఐనను= నా కేమీ భయంలేకపోయినా; జననీశాపంబునన్= తల్లియొక్క శాపంచేత; ఉరగ, కుల, ప్రళయంబు+అగుటకున్= పాములవంశం నాశం అవటానికి; మనస్+దుఃఖంబు= మనస్సులోని చింత; దుస్సహంబు+ఐ= సహింప శక్యం కానిదై; ఉండున్; దానిన్= ఆనాశాన్ని; ఉడిగించు+ఉపాయంబు= తొలగించేమార్గం; ఎద్ది= ఏది? ఏమిచేయువారము= దానిని తొలగించటానికి ఏం చేద్దాం?; అని; చింతించుచున్న= దుఃఖిస్తున్న; ఆ+నాగరాజునకున్= సర్పరా జైన ఆ వాసుకికి; నాగకుమారులు= యువకులైన పాములు; అతి+ఉద్ధతులు+ఐ= మిక్కిలి గర్వించినవా రై; (అతి+ఉద్ధతులు= అత్యుద్ధతులు- యణాదేశసంధి); ఇట్లు+అనిరి.

తాత్పర్యం: 'ఇంక- అమృతంకొరకు సముద్రం త్రచ్చేటప్పుడు కవ్వ మైన గొప్ప మంథరపర్వతానికి తరిత్రాడుగా అయిన నాకష్టానికి మెచ్చి దేవతలు అందరూ బ్రహ్మను వేడి నాకు నాశం లేకుండా ఉండేటట్లు, అన్నిభయాలనుండి

విముక్తియు అయ్యేటట్లు వరం అనుగ్రహింపజేశారు. నాకు భయంలేకపోయినా తల్లి అయిన కద్రువశాపంచేత సర్పాలసముదాయానికి వినాశం కలుగుతుండటంచేత, మనస్సులోని దుఃఖం సహింపశక్యంకాని దై ఉంటున్నది. సర్పాలకు కలిగే నాశాన్ని తొలగించే ఉపాయం ఏమైనా ఉందా? ఏం చేద్దాం?' అని దుఃఖిస్తున్న సర్పరాజైన ఆవాసుకితో యువకు లైన నాగులు మిక్కిలిగర్వించినవా రై ఇట్లా పలికారు. అనంతుడికీ వాసుకికీ ఉన్న భేదాన్ని తెలపటంలో వరుసగా పద్యాన్నీ వచనాన్నీ ఎన్నుకొన్న నన్నయగారి రుచిరార్థసూక్తినిధిత్వం గమనార్హం.

విశేషం: ఈభాగం వాసుకికి సర్పకులంపట్ల ఉండే అభిమానాన్ని సూచిస్తున్నది. బ్రహ్మవరంచేత అతనికి ఎట్టిహాని కలగదు. అయినా అతడు తనతోడిపాములకు కలుగబోయే వినాశాన్ని గురించి చింతించాడు. నాగకుమారులు వయస్సులో చిన్న వా రవటంచేత గర్వించి ఇట్లా చేద్దాం, అట్లా చేద్దాం అని పలికారు. అనంతుడికీ వాసుకికీ ఉన్న భేదాన్ని తెలపటంలో వరుసగా పద్యాన్నీ వచనాన్నీ ఎన్నుకొన్న నన్నయగారి రుచిరార్థసూక్తినిధిత్వం గమనార్హం.

సీ. జనమేజయునిచేయు సర్పయాగమునకు । విఘ్న మందఱము గావింత; మతఁడు
ధర్మార్థి గావున ధారుణీసురుల మై । యడుగుద మిదియుఁ జేయకు మనియును;
గొందఱ మతనికిఁ గూర్చు మంత్రులము నై । యీక్రతుక్రియఁ జేసి యిహపరముల
కగుఁ బెక్కుదోషంబు లని హేతువులు సూపి । యుడిగింత; మందఱు నొక్కమొగిన

ఆ. భక్ష్యభోజ్యలేహ్య పానీయములమీఁద । సదములోని విప్రజనులమీఁద
వెగడుపడఁగఁ బాఱి వెఱపింత మొజ్జలు । తత్ప్రయోగవిధులు దప్పి పఱవ. 129

ప్రతిపదార్థం: జనమేజయునిచేయు= జనమేజయుడు కావించే (కర్తృపదప్రథమకుషష్ఠి); సర్పయాగమునకున్= సర్పాలను ఆహుతిచేసే యజ్ఞానికి; అందరమున్= మనమందరము; విఘ్నము= అంతరాయం; కావింతము= చేద్దాము; (విఘ్నా లెట్లా చేయాలో చెప్పుతున్నారు); అతఁడు= జనమేజయుడు; ధర్మ+అర్థి= ధర్మాన్ని కోరేవాడు; కావునన్; ధారుణీ, సురులము+ఐ= బ్రాహ్మణుల మయి; ఇదియున్= ఈయజ్ఞాన్ని; చేయకుము; అనియును; అడుగుదము; కొందఱము= మనలో కొందరం; అతనికిన్= జనమేజయుడికి; కూర్చు= ప్రియపడే; మంత్రులమున్, ఐ; ఈ క్రతు, క్రియన్, చేసి= ఈ సర్పయాగకార్యంచేత; ఇహపరములకున్= ఈలోకంలోను, పరలోకంలోను కలిగేసౌఖ్యాలకు; పెక్కుదోషంబులు= అనేక లోపాలు; అగున్, అని; హేతువులు, చూపి= కారణాలు తెలిపి; ఉడిగింతము= మానేటట్లు చేద్దాము; అందఱున్= మనమందరమూ; ఒక్కమొగిన్+అ= ఒకేపూనికతో; భక్ష్య, భోజ్య, లేహ్య, పానీయములమీఁదన్= తినదగినవియు, భుజింపదగినవియు, నాకదగినవియు, త్రాగదగినవియు అయిన నాలుగువిధాల ఆహారాలమీద; సదములోని= సభలోని; విప్రజనులమీఁదన్= బ్రాహ్మణులమీద; వెగడుపడగన్= భయం(వికారం) పొందేటట్లుగా; పాఱి= పరుగెత్తి; ఒజ్జలు= గురువులు (ఋత్విక్కులు మొదలైనవారు) తద్ప్రయోగవిధులు= ఆయజ్ఞాన్ని చేసే విధానాలు; తప్పి= విడిచి; పఱపన్= పారిపోయేట్లుగా; వెఱపింతము= భయపడేటట్లు చేద్దాము.

తాత్పర్యం: జనమేజయుడు చేసే సర్పయాగానికి మనమందరం ఆటంకం కలిగిద్దాం. ఎట్లంటే, జనమేజయుడు ధర్మాన్ని కోరేవాడు కావున మనం బ్రాహ్మణుల మై ఈయజ్ఞం చేయవద్దని అడుగుదాం. మనలో కొందరం ఆ జనమేజయుడికి ఇష్టులమై మంత్రుల మై ఈయాగాన్ని చేయటంచేత ఇహపరసౌఖ్యాలకు పెక్కులోపాలు కలుగుతాయని కారణాలు చూపి మానేటట్లు చేద్దాం. అందరం ఒకే పూనికతో భక్ష్యాలు, భోజ్యాలు, లేహ్యాలు, పానీయాలు అనే నాలుగు విధా లైన ఆహారాలమీద, సభలోని బ్రాహ్మణులమీద వికారంగా పరుగెత్తి ఋత్విక్కులు మొదలయిన గురువులు ఆ యజ్ఞాలు చేసే విధానాలు విడిచి పారిపోయేటట్లు భయపెట్టుదాము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ పద్యంలో గర్వితు లై నాగకుమారులు యజ్ఞానికి విఘ్నం కలిగించటానికై చెప్పిన ఉపాయాలు తెలుపబడినవి. కావించు+దము= చువర్ణంతోకూడిన దకారానికి తకారంఅవుతుంది. ఇట్లే ఉడిగింతము, వెఱపింతము అనేవి. భక్ష్యభోజ్యలేహ్యపానీయాలు నాలుగు విధా లైన ఆహారాలు. కొందరు వీటికి చోష్యంకూడా కలిపి ఆహారాలు అయిదు విధాలని చెప్పుతారు.

వ. అనిన వారలలోఁ గొందఱు బుద్ధిమంతు లయిన భుజంగముఖ్యు లి ట్లనిరి. 130

ప్రతిపదార్థం: అనినన్= అని నాగకుమారులు పలుకగా, వారలలోన్= వారిలో; కొందఱు; బుద్ధిమంతులు, అయిన, భుజంగముఖ్యులు= పాములలో శ్రేష్ఠులు, ఇట్లు+అనిరి;

తాత్పర్యం: నాగకుమారులు ఇట్లా పలుకగా ఆనాగులలో తెలివిగలవా రైన కొందఱు సర్పశ్రేష్ఠులు ఈవిధంగా పలికారు.

క. ఇవి మీ కన్నియుఁ జేయఁగ । నవు నని తలఁపకుఁడు; భూసురాహుతి మంత్రో
ద్భవ దారుణదహనశిఖల్ । గవిసిన నెద్దియును జేయఁగా నెడ గలదే! 131

ప్రతిపదార్థం: మీకున్; ఇవి, అన్నియున్= మీరు చెప్పిన ఉపాయాలన్నీ, చేయఁగన్, అవున్, అని= చేయటానికి వీ లవుతా యని; తలఁపకుఁడు= భావించకుడు; భూసుర+ఆహుతి, మంత్ర+ఉద్భవ, దారుణ, దహన, శిఖల్= బ్రాహ్మణులు అగ్నిలో వేల్చేటప్పుడు పఠించే మంత్రాలవలన పుట్టిన భయంకర మయిన అగ్నియొక్క జ్వాలలు; కవిసినన్= ఆక్రమించగా; ఎద్దియును= దేనినికూడా; చేయఁగాన్= చేయటానికి; ఎడ= అవకాశం; కలదే= ఉన్నదా? లేదని భావం.

తాత్పర్యం: మీరు చెప్పిన వన్నీ చేయటానికి వీలవుతా యని తలపోయకండి. బ్రాహ్మణులు అగ్నిలో వేల్చేటప్పుడు పఠించే మంత్రాలవలన పుట్టే భయంకర మైన అగ్నియొక్కజ్వాలలు వ్యాపిస్తే ఏదైనా చేయటానికి అవకాశముంటుందా? ఉండ దని భావం.

వ. అనిన విని నాగరాజానుజుం డైన యేలాపుత్త్రుం డి ట్లనియె. 132

ప్రతిపదార్థం: అనినన్= బుద్ధిమంతు లైన కొందరు నాగులు అట్లా చెప్పగా; విని; నాగరాజ+అనుజుండు+అయిన= సర్పరా జైన వాసుకికి తమ్ము డైన; ఏలాపుత్త్రుండు= ఏలాపుత్రు డనే పేరుగల నాగకుమారుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని వాసుకి తమ్ము డైన ఏలాపుత్రు డనే నాగకుమారుడు ఇట్లా పలికాడు.

ఆ. శాప మిచ్చునాఁడు జననియుత్సంగంబు । నందు నిద్రవోయి నట్ల యుండి
యమరవరుల కజున కైన యన్యోన్యసం । భాషణంబు లెఱుకపడఁగ వింటి. 133

ప్రతిపదార్థం: శాపము+ఇచ్చునాఁడు= కద్రువ మనకు శాపం ఇచ్చే దినాన; జనని, ఉత్సంగంబునందున్= తల్లి ఒడిలో; నిద్ర, పోయిన, అట్లు+అ= నిద్రపోయినట్లే; ఉండి; అమరవరులకున్= దేవతాశ్రేష్ఠులకు, అజునకున్= బ్రహ్మకు; ఐన= జరిగిన; అన్యోన్య, సంభాషణంబులు= ఒండొరులమాటలు; ఎఱుక పడఁగన్= తెలిసేటట్లుగా; వింటిన్= విన్నాను.

తాత్పర్యం: కద్రువ పాములకు శాపం ఇచ్చేదినాన ఆమెఒడిలో నిద్రరాక పోయినా నిద్రపోతున్నట్లే ఉండి, దేవతాశ్రేష్ఠులకూ బ్రహ్మకూ జరిగిన ఒండొరుల మాటలు స్పష్టంగా తెలిసేటట్లు విన్నాను.

వ. అప్పలుకులు సవిస్తరంబుగాఁ జెప్పెదవినుండు; 'శాపానంతరంబ యమరులెల్ల నజున కిట్లని రయ్యా! కద్రువ కడు నిర్దయురాలై యిట్టి యనంతబలవీర్యసంపన్ను లయిన కొడుకులం బడసి, వారి కకారణంబ దారుణం బైన శాపం బిచ్చె; మీరును వారింపక యుపేక్షించితిరి; దీనికిం బ్రతీకారంబు గలదే? 'యనిన నమరులకుఁ గమలసంభవుం డి ట్లనియె. 134

ప్రతిపదార్థం: ఆ+పలుకులు= అజునికిని, అమరవరులకును జరిగిన పరస్పరసంభాషణలు; సవిస్తరంబుగాన్= వివరంతో కూడుకొని ఉండేటట్లుగా; చెప్పెదన్= తెల్పుతాను; వినుండు; శాప+అనంతరంబు+అ= కద్రువశాపం ఇచ్చిన వెంటనే; అమరులు+ఎల్లన్= దేవతలందరూ; అజునికిన్= బ్రహ్మదేవుడికి; ఇట్లు+అనిరి= ఈవిధంగా చెప్పారు; అయ్యా= బ్రహ్మకు సంబోధనం; కద్రువ= నాగమాత; కడునిర్దయురాలు+ఐ= మిక్కిలికఠినురాలై; ఇట్టి= ఇటువంటి; అనంత, బల, వీర్య, సంపన్నులు+అయిన= మేరలేని బలంతోను, పరాక్రమంతోను, కూడినవారైన; కొడుకులన్; పడసి= పొంది; వారికిన్= ఆ కొడుకులకు; అకారణంబు+అ= కారణంలేకుండానే; దారుణంబు+ఐన= ఘోరమైన; శాపంబు+ఇచ్చెన్; మీరును= మీరుకూడ; వారింపక= అడ్డగింపక; ఉపేక్షించితిరి= ఊరకున్నారు; దీనికిన్= ఆమె ఇచ్చిన శాపానికి; ప్రతీకారంబు= మారుచేత (తొలగించే ఉపాయం); కలదే= ఉన్నదా? అనినన్= అని అడుగగా; అమరులకున్= దేవతలకు; కమలసంభవుండు= బ్రహ్మదేవుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దేవతలకును, బ్రహ్మకును జరిగిన సంభాషణలు వివరంగా చెప్పుతాను, వినండి. కద్రువ పాములకు శాపం ఇచ్చినవెంటనే దేవతలందరు బ్రహ్మతో ఇట్లా పలికారు. "అయ్యా! కద్రువ మిక్కిలి కఠినాత్మురాలై అపారమైన బలం, పరాక్రమం ఉన్న ఇట్లాంటి కొడుకులను పొందికూడా వారికి కారణంలేకుండానే ఘోరమైన శాపం ఇచ్చింది. దానిని మీరు కూడ నివారించక ఊరకున్నారు. ఆ శాపానికి మారుసేత ఉన్నదా?" అని దేవతలు అడుగగా వారికి బ్రహ్మ ఇట్లా చెప్పాడు.

క. క్రూరాకారుల, జగదప । కారులఁ, బన్నగులఁ దాల్పఁగా నోపని యి
ద్ధారుణికి హితంబుగ దు । ష్టోరగసంహార మిప్పు డొడఁబడ వలసెన్. 135

ప్రతిపదార్థం: ఘోర+ఆకారులన్= ఘోరమైన ఆకారం కలవారున్నూ; జగత్, అపకారులన్= లోకానికి హాని చేసేవారు న్నూ; అయిన; పన్నగులన్= పాములను; తాల్పఁగాన్, ఓపని= మోయజాలని; ఈ+ధారుణికిన్= ఈభూమికి; హితంబుగన్= మేలయ్యేటట్లు; ఇప్పుడు; దుష్ట+ఉరగ, సంహారము= దుర్మార్గు లయిన నాగుల వినాశాన్ని; ఒడఁబడవలసెన్= అంగీకరింపవలసి వచ్చింది.

తాత్పర్యం: క్రూరమైన రూపం కలవారున్నూ, లోకానికి హాని చేసేవారున్నూ అయిన పాములను మోయజాలని ఈ భూమికి మేలు కలగటానికై ఇప్పుడు దుర్మార్గు లైన నాగుల వినాశానికి అంగీకరింపవలసి వచ్చింది.

వ. 'మఱియు సకలలోకహితాచారంబు లై ప్రసిద్ధులైన నాగముఖ్యుల నెల్ల వాసుకి చెలియ లైన జగత్కారువునకు జగత్కారుం డను మహామునికిఁ బుట్టెడువాఁడధికతేజస్వి యాస్తీకుం డను మహాముని జనమేజయసమారబ్ధ సర్పసత్త్రప్రళయంబువలన రక్షించు' నని పితామహుండు దేవతలకుం జెప్పిన తెఱంగు సెప్పిన, వాసుకి ప్రముఖనాగముఖ్యులెల్ల సంతసిల్లి యేలాపుత్త్రు నెత్తుకొని సాధువాదంబుల నభినందించిరి; వాసుకియు

నాఁటంగోలె జరత్కారుమునీంద్రుం డెన్నండు దార పరిగ్రహంబు సేయునో యని తత్సమయ సమాగమం బపేక్షించి యుండు నంత. 136

ప్రతిపదార్థం: మఱియున్; సకల, లోక, హిత+ఆచారంబులు+ఐ= అన్ని లోకాలకు మేలు కలిగించే ప్రవృత్తి కలవారై; ప్రసిద్ధులు+ఐన= ప్రఖ్యాతు లైన; నాగముఖ్యులన్, ఎల్లన్= సర్పశ్రేష్ఠులందరినీ; వాసుకి, చెలియలు+ఐన= వాసుకి చెల్లె లయిన; జరత్కారువునకున్= జరత్కారువు అనే ఆమెకును; జరత్కారుండు+అను= జరత్కారు డనే పేరున్న; మహత్, మునికిన్= గొప్పవా డైన ఋషికిని; పుట్టెడు, వాఁడు= జనించేవాడు; అధిక, తేజస్వి= మిక్కిలి తేజస్సుతో కూడినవాడు; ఆస్తీకుండు+అను= ఆస్తీకు డనే; మహత్, ముని= గొప్పముని; జనమేజయ= జనమేజయుడిచేత; సమారబ్ధ= చక్కగా ఆరంభింపబడిన; సర్ప, సత్ర, ప్రళయంబువలనన్= సర్పయజ్ఞంలో జరిగే నాశంవలన; రక్షించును+అని= కాపాడుతా డని; పితామహుండు= బ్రహ్మ; దేవతలకున్= దేవతలకు; చెప్పిన, తెఱంగు= విధం; చెప్పినన్= చెప్పగా; వాసుకి, ప్రముఖ, నాగముఖ్యులు+ఎల్లన్= వాసుకి మొదలయిన సర్పశ్రేష్ఠులు అందరును; సంతసిల్లి= సంతోషించి; ఏలాపుత్రున్= ఏలాపుత్రు డనే పేరున్న నాగకుమారుడిని; ఎత్తుకొని; సాధువాదంబులన్= మంచిమాటలతో, (సంతోషంతో కూడిన పలుకులతో); అభినందించిరి= స్తుతించారు; వాసుకియున్= వాసుకికూడ; నాఁటంగోలెన్= అప్పటినుండి; జరత్కారు మునీంద్రుండు= జరత్కారువు అనే మునిశ్రేష్ఠుడు; ఎన్నండు= ఎప్పుడు; దారపరిగ్రహంబు= భార్యను గ్రహించటం; చేయును+ఓ= చేయగలడో! అని; తద్+సమయ, సమాగమంబు= ఆసమయంయొక్క రాకను; (జరత్కారుడు జరత్కారువును భార్యగా గ్రహించేసమయం ఎప్పుడు వస్తుందా? అని); అపేక్షించి, ఉండు+అంతన్= కోరుకొంటూ ఉండగా.

తాత్పర్యం: మఱియు సర్వలోకాలకు మేలు కలిగించేవారై, ప్రఖ్యాతు లయిన ముఖ్య లయిన నాగులనందరిని వాసుకిచెల్లె లయిన జరుత్కారువుకూ, జరత్కారు డనే గొప్పమునికీ జనించేవాడూ మిక్కిలిప్రకాశం కలవాడూ అయిన ఆస్తీకు డనే మహాముని జనమేజయుడిచేత ప్రారంభింపబడిన సర్పయాగప్రళయం నుండి రక్షిస్తా డని బ్రహ్మ దేవతలకు చెప్పిన విధాన్ని తెల్పగా, నాగశ్రేష్ఠులందరు సంతోషం పొంది ఏలాపుత్రు డనే నాగకుమారుని ఎత్తుకొని మృదువచనాలతో పొగిడారు. వాసుకి అప్పటినుండి జరత్కారుడు ఎప్పుడు భార్యను పరిగ్రహిస్తాడో అని ఆ సమయంయొక్క రాకకై కాంక్షిస్తూ ఉండగా- (తరువాతి పద్యంతో అన్వయం.)

క. పరమతపోనిధి, యాయా॰ వరవంశోత్తముఁడు, నియమవంతుఁడు, లోకో
త్తరుఁడు, జరత్కారుఁడు నాఁ । బరఁగిన ముని బ్రహ్మచర్యపరిపాలకుఁ డై. 137

ప్రతిపదార్థం: పరమ, తపస్+నిధి= గొప్పతపస్సుకు నిలయమైనవాడు; యాయావర, వంశ+ఉత్తముఁడు= యాయావర వంశంలో గొప్పవాడు; నియమవంతుఁడు= బ్రహ్మచర్యాది నియమాలు కలవాడు; లోక+ఉత్తరుఁడు= అతిలోకమహిమ కలవాడు; జరత్కారుఁడు; నాన్= జరత్కారుడు అనే పేరుతో; పరఁగిన= ఒప్పిన; ముని; బ్రహ్మ, చర్య, పరిపాలకుఁడు+ఐ= బ్రహ్మచర్యవ్రతాన్ని ఆచరించేవాడై.

తాత్పర్యం: గొప్పతపస్సుకు నిలయ మైన వాడు, యాయావర మనే వంశంలో శ్రేష్ఠుడు, బ్రహ్మచర్యాదినియమాలు కలవాడు, లోకాతీతుడు అయిన జరత్కారు డనే పేరుగల ముని బ్రహ్మచర్యాన్ని ఆచరించేవా డై.

క. ఘోరవ్రతములు సలుపుచు । దారపరిగ్రహము సేయఁ దా నొల్లక, సం
సారపునర్భవభీతి న । పారవ్యామోహపాశబంధచ్యుతుఁ డై. 138

ప్రతిపదార్థం: ఘోరవ్రతములు= అతికఠిన మైన పూజాది వ్రతాలు(ఉపవాసాదులు); సలుపుచున్= చేస్తూ; దారపరిగ్రహము, చేయన్= భార్యను గ్రహించటానికి; తాను, ఒల్లక= ఆజరత్కారుడు ఇష్టపడక; సంసార, పునః+భవ, భీతిన్= ప్రపంచంలో మళ్ళీపుట్టటం వలని భయంచేత; అపార, వ్యామోహ, పాశ, బంధ, చ్యుతుఁడు+ఐ= అంతులేని మిక్కిలి అజ్ఞానంఅనే త్రాళ్ళబంధంనుండి విముక్తుడై.

తాత్పర్యం: అతికఠిన మైన పూజాదివ్రతాలు చేస్తూ భార్యను గ్రహించటానికి ఆ జరత్కారుడు ఇష్టపడక సంసారంలో మళ్ళీ జన్మ కలుగుతుం దనే భయంవలన, అంతులేని అధికవ్యామోహ మనే త్రాళ్ళబంధంనుండి విముక్తు డై.

వ. **తపస్స్వాధ్యాయ బ్రహ్మచర్యవ్రతంబులం జేసి ఋషులఋణంబుల నీఁగుచుఁ బరిభ్రమించువాఁడు వనంబులో నొక్కపల్వలంబు గని, యందు మూషికవిలూనం బయి యొక్కమూలంబు తక్కియున్న వీరణతృణస్తంబంబు నవలంబించి తలక్రిం దై యాదిత్యకిరణంబు లాహారంబుగా వ్రేలుచున్న ఋషులం గొందఱం జూచి డాయంబోయి జరత్కారుం డి ట్లనియె.** **139**

ప్రతిపదార్థం: తపస్+స్వాధ్యాయ, బ్రహ్మచర్య, వ్రతంబులన్, చేసి= తపస్సు, వేదాధ్యయనం, బ్రహ్మచర్యవ్రతం అనే వాటిచేత, ఋషులఋణంబులన్= ఋషులయొక్క ఋణాలను; ఈఁగుచున్= తొలగిస్తూ; పరిభ్రమించువాఁడు= తిరిగేవాడు; వనంబులోన్= అడవిలో; ఒక్కపల్వలంబు= ఒకనీటిపడియను; కని=చూచి; అందున్= ఆ పల్వలంలో; మూషికవిలూనంబు+అయి= ఎలుకలచే ఖండింపబడి; ఒక్కమూలంబు= ఒక్కవేరు; తక్కి+ఉన్నదానిన్= మిగిలిఉన్నదాన్ని; వీరణతృణస్తంబంబున్= ఔరుగడ్డిదుబ్బును; అవలంబించి= పట్టుకొని; తలక్రిందు+ఐ; ఆదిత్యకిరణంబులు= సూర్యకిరణాలు; ఆహారంబుగాన్= భోజనంగా; వ్రేలుచున్, ఉన్న= వ్రేలాడుతున్న; ఋషులన్ కొందఱన్= కొందరుమునులను; చూచి; డాయన్, పోయి= సమీపించి; జరత్కారుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: తపస్సు, వేదాలు చదవటం, బ్రహ్మచర్యవ్రతం అనే వాటిచేత ఋషులయొక్క ఋణాన్ని తొలగిస్తూ తిరిగే జరత్కారుడు అడవిలో ఒకనీటిపడియను చూచి అందు ఎలుకలచే కొరకబడి ఒక్కవేరుమాత్రమే మిగిలిఉన్న ఔరుగడ్డిదుబ్బును పట్టుకొని తలక్రిందుగా సూర్యుడి కిరణాలే తిండిగా వ్రేలాడుతున్న కొందరుఋషులను చూచి సమీపించి వారితో ఇట్లా పలికాడు.

విశేషం: యజ్ఞాదులచేత దేవతలఋణాన్ని, వేదాధ్యయనంచేత ఋషులఋణాన్ని, సంతానప్రాప్తిచేత పితృదేవతలఋణాన్ని తొలగించవచ్చని శాస్త్రాలు చెప్తుతాయి. జరత్కారుడు ఒక్క ఋషిఋణాన్ని మాత్రమే తొలగించుకొనగలిగాడు.

క. **'కడునుగ్రము దలక్రిందుగఁ । బడి వ్రేలుట; యిదియు నొక తపంబొకొ; నా కే**
ర్పడఁ జెప్పుఁ డీ తపం, బేఁ । దొడఁగెద' ననవుడును నయ్యధోముఖవిప్రుల్. **140**

ప్రతిపదార్థం: తలక్రిందుగన్= తల క్రింద ఉండేటట్లు; పడివ్రేలుట= ఉండి వ్రేలాడటం; కడున్, ఉగ్రము= మిక్కిలి భయంకరం; ఇదియున్= ఇట్లా తలక్రిందుగా వ్రేలాడటం; ఒక, తపంబు+ఒకొ= ఒక తపస్సుయొక్క విధమా! నాకున్; ఏర్పడన్, చెప్పుఁడు= తేటపడేట్లుగా తెల్పండి; ఏన్= నేను; ఈ, తపంబు; తొడఁగెదన్= చేయబూనుతాను; అనవుడున్= అనిన అనంతరం; ఆ+అధః+ముఖ, విప్రుల్= క్రిందికి ముఖం ఉండేటట్లుగా వ్రేలాడుతుండే ఆబ్రాహ్మణులు.

తాత్పర్యం: తలక్రిందుగా ఉండి వ్రేలాడటం మిక్కిలి భయంకరం. ఇట్లా చేయటంకూడ ఒకతపోవిశేషమా? నాకు స్పష్టంగా చెప్పండి; ఈతపస్సును నేనుకూడ చేయబూనుతాను'. అని జరత్కారుడు పలుకగా ముఖంక్రిందుగా వ్రేలాడుతుండే ఆ మునులు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అనఘ! యిది యేటి తప, మే । మనుపమ దుఃఖితుల మగుట, నాధారము లే
కను సంతానోచ్ఛేదం । బున వ్రేలెద మధమలోకమున తెరువు చనన్. 141

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుఁడా! ఇది= ఇట్లా తలక్రిందుగా వ్రేలాడటం; ఏటి, తపము= ఎట్టి తపస్సు (తపస్సు కాదనిభావం); ఏము= మేము; అనుపమ, దుఃఖితులము+అగుటన్= సాటిలేని శోకం కలవార మవటం చేత; సంతాన+ఉచ్ఛేదంబునన్= సంతానంయొక్క లేమిచేత; (సంతానసూత్రం తెగిపోవటంచేత); ఆధారము, లేకను= అవలంబంలేక; అధమలోకమున, తెరువు= నీచమైన లోకంయొక్క మార్గంలో; చనన్= వెళ్ళటానికి; వ్రేలెదము= వ్రేలాడుతున్నాము.

తాత్పర్యం: పాపరహితుఁడా! ఇది ఏమి తపస్సు? మేము సాటిలేని చింతకు గురిఅయినవాళ్ళ మవటంచేత, మా తరువాత సంతానం లేకున్నకారణాన ఆధారం లేక హీన మైన లోకంయొక్కమార్గంలో వెళ్ళటానికి ఇట్లా వ్రేలాడుతున్నాం.

విశేషం: లేక-వ్యతిరేకక్త్వార్థకం. ఇది కళయే. ఇచట 'ను' అర్థవిశేషంలో వాడబడింది. 'లేదని' - అని పాఠాంతరం. లోకము+తెరువు- ఒక్కొక్కప్పుడు తత్పురుషసమాసంలో 'న' ఆగమంగా వస్తుంది.

వ. మందభాగ్యుల మయిన మావంశంబున జరత్కారుం డను పాపకర్ముండు పుట్టి దారపరిగ్రహంబు సేయను, సంతానంబు వడయను నొల్లకున్నవాఁ; డే మాతని పితృపితామహులము; మాపట్టిన యవురుగంటవేళ్ళెల్లం గాలుండు మూషికవ్యాజంబునం దరతరంబ కొఱికిన నొక్కవేర తక్కియున్నయిది; యదియును జరత్కారుం డనపత్యుం డయినం దెగు; నే మధఃపాతుల మగుదు; మాతం డపత్యంబు వడసెనేని యూర్ధ్వగతుల మగుదుము. 142

ప్రతిపదార్థం: మందభాగ్యులము+అయి= హీన మైన అదృష్టం కలవారమైన; మావంశంబునన్= మావంశంలో; జరత్కారుండు+అను; పాపకర్ముండు= పాపంతో కూడిన పనులు కలవాడు; పుట్టి; దారపరిగ్రహంబు= భార్యను గ్రహించటం (పెండ్లి చేసికోవటం); చేయను= చేయటానికి; సంతానంబు= సంతతిని; పడయనున్= పొందటానికి; ఒల్లక+ఉన్నవాఁడు= అంగీకరించకున్నాడు; ఏము= మేము; అతని పితృపితామహులము= అతని తండ్రి తాతలం; మాపట్టిన (కర్తృపదప్రథమకు షష్ఠి)= మేం పట్టుకొన్న; అవురు, గంట, వేళ్ళు, ఎల్లన్= ఔరుగడ్డి దుబ్బు వేళ్ళన్నీ; కాలుండు= యముడు; మూషికవ్యాజంబునన్= ఎలుక లనే మిషచేత; తరతరంబు+అ= క్రమంగా; కొఱికినన్= కొరికి వేయగా; ఒక్క, వేరు+అ= ఒక్కవేరుమాత్రమే; తక్కి, ఉన్న, అది= మిగిలిఉన్నది; అదియును= ఆ ఒక్కవేరుకూడ; జరత్కారుండు; అనపత్యుండు+అయినన్= సంతానం లేనివా డయితే; తెగున్= తెగిపోతుంది (ఛిన్నమవుతుంది); ఏము= మేము; అధఃపాతులము= క్రిందపడేవాళ్ళం; అగుదుము; అతండు= ఆ జరత్కారుడు; అపత్యంబు= సంతానం; పడసెన్+ఏని= పొందితే; ఊర్ధ్వగతులము= పైలోకాలకు పోయేవాళ్ళం; అగుదుము.

తాత్పర్యం: అదృష్టహీనుల మైన మావంశంలో జరత్కారు డనే పాపాత్ముడు పుట్టి పెండ్లి చేసుకొనటానికీ, సంతానం పొందటానికీ అంగీకరించ కున్నాడు; మే మాతని తండ్రితాతలం; మేము పట్టుకొని వేలాడుతున్న ఔరుగడ్డి

దుబ్బువేళ్ళ నన్నింటిని యముడు ఎలుకలమిషతో క్రమంగా కొరికి వేస్తే ఒక్కవేరుమాత్రం మిగిలి ఉన్నది. జరత్కారుడు సంతానం పొందకపోతే ఆవేరుకూడ తెగిపోతుంది. అప్పుడు మేము అధోలోకాలలో పడతాం. అతడు సంతానం పొందితే పైలోకాలకు పోయేవాళ్ళం అవుతాం.

తే. నీవు మాచుట్టమవపోలె నెమ్మితోడ । నవహితుండ వై మాపల్కు లాదరించి;
తా జరత్కారుఁ గని చెప్పవయ్య వాని । నెఱుఁగుదేని మాపడియెడు నీయవస్థ. 143

ప్రతిపదార్థం: నీవు; మా, చుట్టమవు+అ, పోలెన్= మాబంధువువలె; నెమ్మితోడన్= ప్రీతితో; అవహితుండవు+ఐ= ఏకాగ్రచిత్తుడ వయి; మాపల్కులు= మామాటలు; ఆదరించితి(వి); ఆ జరత్కారున్= ఆ జరత్కారుని; కని= చూచి; వానిన్= అతనిని; ఎఱుఁగుదు+ఏని= తెలిసిఉంటే; మాపడియెడు= మేం పొందే; ఈ, అవస్థ= ఈదుర్గతి, చెప్పవు+అయ్య= తెల్పవయ్య.

తాత్పర్యం: నీవు ఎవరో మాకు బంధువువలె ప్రీతితో ఏకాగ్రచిత్తుడ వై మామాటలు విని మన్నించావు. ఆ జరత్కారుడిని ఎరుగుదువేని మేం పొందే ఈదురవస్థ వానికి తెలియజెప్పుము.

విశేషం: మాచుట్టమువలె, (మాపల్కులు,) మాపడియెడు ఈ అవస్థ వీటిలోని అస్మదర్థకసర్వనామాలు పదగతములై అర్థాంతరసంక్రమితవాచ్యధ్వనికి అంగాలైనవి. పదగతమని, వాక్యగతమని అర్థాంతరసంక్రమితవాచ్యధ్వని రెండురకాలు. ఈ రెండింటిని నిపుణంగా పలుచోట్ల కథాసందర్భాలలో ప్రయోగించాడు నన్నయ.

వ. అనిన విని జరత్కారుం డతికారుణ్యచిత్తుం డయి, యపత్యార్థం బవశ్యంబు వివాహంబు గావలయు నని యెంతయుం బ్రొద్దు చింతించి తన పితృవర్గంబున కి ట్లనియె. 144

ప్రతిపదార్థం: అనినన్, విని= పితృదేవతలు అట్లా పలికితే విని; జరత్కారుండు; అతి, కారుణ్య, చిత్తుండు+అయి= మిక్కిలి జాలితో కూడిన హృదయం కలవా డయి; అపత్య+అర్థంబు= సంతానంకొరకు; అవశ్యంబు= తప్పక; వివాహంబు, కావలయున్, అని= పెండ్లి చేసికొనాలని; ఎంతయున్, ప్రొద్దు= చాలాసేపు; చింతించి= ఆలోచించి (దుఃఖించి); తన, పితృ, వర్గంబునకున్= తన తండ్రి తాతల సముదాయంతో; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పితృదేవత లిట్లా పలుకగా, జరత్కారుడు మిక్కిలి దయతో కూడిన హృదయం కలవా డయి సంతానంకొరకు తప్పక పెండ్లిచేసుకోవా లని చాలాసేపు ఆలోచించి తన పితృదేవతల సముదాయంతో ఇట్లా పలికాడు.

క. మీరలు నాపితృదేవత । లారాధ్యుల; రేను మీకు నాత్మజుఁడ; జర
త్కారుఁ డనువాఁడ; ముందఱ । దారపరిగ్రహము సేయఁ దగులదు బుద్ధిన్. 145

ప్రతిపదార్థం: మీరలు; నాపితృదేవతలు= నాతండ్రితాతలు; ఆరాధ్యులరు= పూజింపదగినవారు; ఏను=నేను; మీకున్; ఆత్మజుఁడ= కుమారుడను; జరత్కారుఁడు+అనువాఁడన్= జరత్కారు డనే పేరు గలవాడను; ముందఱన్= ఇంతకుముందు; దార, పరిగ్రహము, చేయన్= భార్యను గ్రహించటానికి (పెండ్లి చేసికొనటానికి); బుద్ధిన్= మనస్సులో; తగులదు= (ఆసక్తి) పుట్టదు.

తాత్పర్యం: మీరు నా పితృదేవతలు; నాకు పూజింపదగినవారు; నేను మీకుమారుడిని; జరత్కారు డనే పేరు గలవాడిని; ఇంతకుముందు నాకు పెండ్లి చేసికొనాలనే ఆసక్తి మనస్సులో పుట్టలేదు.

విశేషం: ఆరాధ్యులు- యుష్మద్విశేషణం, బహువచనం - 'రు' ఆగమంగా వచ్చింది. ఈ ఆగమానికి ముందున్న ఉత్వానికి అత్వంకలిగింది.- ఆరాధ్యులరు.

క. **మి మ్మిట్లు చూచి, మీకు హి । త మ్మెట్లగు నట్లకా ముదంబున దారా**
ర్థమ్ము ప్రవర్తింపఁగఁ జి । త్తమ్మిప్పుడు పుట్టె నాకు ధర్మస్థితి మై. **146**

ప్రతిపదార్థం: మిమ్ము+ఇట్లు= మిమ్ము ఈ విధంగా వ్రేలాడుతుండగా; చూచి; మీకున్; హితమ్ము= మేలు; ఎట్లు= ఏవిధంగా; అగున్= అవుతుందో; అట్లు+అ, కాన్= అట్లే అగునట్లుగా; ముదంబునన్= సంతోషంతో; దార+అర్థమ్ము= భార్యకోసం; (పెండ్లినిమిత్తం); ప్రవర్తింపఁగన్= వర్తించటానికి; ధర్మస్థితిమైన్= ధర్మంతో కూడిన స్థితితో; నాకున్; చిత్తమ్ము= మనస్సు(కోరిక); ఇప్పుడు, పుట్టెన్= ఇప్పుడు పుట్టింది.

తాత్పర్యం: ఇట్లా వ్రేలాడుతున్న మిమ్ము చూచి మీకు మే లెట్లా అవుతుందో అట్లే అవునట్లుగా సంతోషంతో ధర్మంతో కూడిన స్థితితో పెండ్లాడే నిమిత్తం వర్తించా లని నా కిప్పుడు మనసు పుట్టింది.

వ. **అనిన నమ్మహామునులు జరత్కారుపల్కులకు సంతసిల్లి యి ట్లనిరి.** **147**

ప్రతిపదార్థం: అనినన్= అని జరత్కారుడు పలుకగా; ఆ+మహత్+మునులు= ఆ గొప్పమునులు; జరత్కారుపల్కులకున్; సంతసిల్లి= సంతోషించి; ఇట్లు+అనిరి= ఇట్లు పలికారు.

తాత్పర్యం: అని జరత్కారుడు పలుకగా, వ్రేలాడుతున్న ఆగొప్పమునులు అతనిమాటలకు సంతోషించి ఈవిధంగా పలికారు.

చ. **తగియెడు పుత్త్రులం బడసి, ధర్మువు దప్పక, తమ్ము నుత్తముల్**
పొగడఁగ మన్మహామతులు పొందుగతుల్ గడుఘోరనిష్ఠతోఁ
దగిలి తపంబు సేసియును, దక్షిణ లిమ్ముగ నిచ్చి యజ్ఞముల్
నెగడఁగఁ జేసియుం, బడయనేర రపుత్త్రకు లైన దుర్మతుల్. **148**

ప్రతిపదార్థం: తగియెడు= తగిన(ఉత్తములైన); పుత్త్రులన్= కొడుకులను; పడసి= పొంది; ధర్మువు= ధర్మం; తప్పక= వీడక; తమ్మున్; ఉత్తముల్= మంచివారు; పొగడఁగన్= పొగడునట్లుగా; మన్+మహత్+మతులు= జీవించే గొప్పబుద్ధిమంతులు; పొందు, గతుల్= పొందేటి స్థితులు; కడు, ఘోర, నిష్ఠతోన్= మిక్కిలి కఠినమైన నియమంతో; తగిలి= ఆసక్తికలిగి; తపంబు, చేసియును; దక్షిణలు= సంభావనలు; ఇమ్ముగన్= ఒప్పుగా; ఇచ్చి; యజ్ఞముల్= యాగాలు; నెగడఁగన్= అధిక మవునట్లుగా; చేసియున్= చేసినప్పటికిని; అపుత్త్రకులు+ఐన= కొడుకులు లేనట్టి; దుర్మతుల్= దుష్టబుద్ధి కలవారు(చెడ్డవారు); పడయన్, నేరరు= పొందజాలరు.

తాత్పర్యం: యోగ్యు లయిన కొడుకులను పొంది ధర్మమార్గం తొలగకుండ తమ్ము సజ్జనులు పొగడేట్లుగా జీవించే గొప్ప బుద్ధిమంతులు పొందే ఉత్తమలోకాలను మిక్కిలి కఠిన మైన నిష్ఠతో విడువక తపస్సు చేసినప్పటికీ, ఒప్పుగా దక్షిణ లిచ్చి యజ్ఞాలు అధికంగా చేసినప్పటికీ పుత్రహీను లైన దుర్జనులు (అట్టిగతులు) పొందజాలరు.

విశేషం: మను+మహామతులు - మనుధాతువుయొక్క తద్ధర్మవిశేషణం 'మను' - (మనెడు, మనెడి అనేవి ఇతరరూపాలు) ఇచ్చట 'మను' అనేరూపంలోని 'ఉ' కారం లోపిస్తే 'మన్మహామతులు' అని అయింది. నన్నయ రుచిరార్థసూక్తికి ఉదాహరణం ఈపద్యం.

జరత్కారుండు వివాహంబు చేసికొనఁబూనుట (సం. 1-42-9)

వ. 'కావున నీవు కృతదారపరిగ్రహుండ వై సంతానంబు వడసి, మమ్ము నూర్ధ్వలోకగతులం జేయు' మనిన, జరత్కారుం 'డట్లేని నాకు సనామ్ని యయినదాని వివాహంబు గావలయు' నని వారికి నమస్కరించి వీడ్కొని, సనామ కన్యాన్వేషణపరుం డై భూవలయం బెల్లఁ గలయం గ్రుమ్మరి. 149

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నీవు; కృత, దార, పరిగ్రహుండవు+ఐ= చేయబడిన భార్యయొక్క గ్రహణంకలవాడి వై (పెండ్లాడి); సంతానంబు, పడసి= సంతానం పొంది; మమ్మున్, ఊర్ధ్వలోక, గతులన్= ఉన్నతలోకాలకు పోయే వాళ్ళను; చేయుము+అనినన్= చేయు మని పితృదేవతలు పలుకగా; జరత్కారుండు; అట్లు+ఏని= నేను పెండ్లాడి సంతానం పొందా లంటే; నాకు; సనామ్ని, అయిన, దానిన్= సమానమయిన పేరు కలిగిన దాన్ని; (జరత్కారువు అనే పేరు కలిగినదానిని); వివాహంబు, కావలయున్= పెండ్లాడాలి; అని; వారికిన్= పితృదేవతలకు; నమస్కరించి; వీడ్కొని= వదలి; సనామ, కన్యా+అన్వేషణ, పరుండు+ఐ= తనపేరుతో సమాన మైన పేరున్న కన్యను వెదకటంలో ఆసక్తి కలవా డయి; భూవలయంబు+ఎల్లన్= సర్వభూచక్రాన; కలయన్= అంతటా; క్రుమ్మరి= తిరిగి.

తాత్పర్యం: 'కాబట్టి నీవు భార్యను గ్రహించి, సంతానం పొంది, మమ్మ ఉన్నతలోకాలకు వేళ్ళేవాళ్ళనుగా చేయు' మని పితృదేవతలు పలుకగా, జరత్కారుడు 'అట్లయితే నేను నాతో సమానమయిన పేరు కల కన్యను పెండ్లాడాలి' అని వారికి నమస్కరించి వారివద్ద సెలవు తీసికొని తనపేరుతో సమాన మయిన పేరు కల కన్యను వెదకటంలో ఆసక్తికలవా డయి భూచక్రమంతా తిరిగి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తరువోజ.

అనవరతవ్రతాయాసఖేదమున నతికృశం బగుచున్న యంగంబునందుఁ
దనరి యేర్పడ సిరల్, దద్దయు ముదిమిఁ దల వడంకుచునుండఁ, దన పితృవరుల
ఘనముగా నూర్ధ్వాభిగమనులఁ జేయఁగడఁగి వివాహంబుగా జరత్కారుఁ
డనఘుండు దనకోర్కి కనురూప యైనయట్టి కన్యకఁ గానఁ డయ్యె మర్త్యమున. 150

ప్రతిపదార్థం: అనవరత, వ్రత+ఆయాస, ఖేదమునన్= ఎడతెగకుండ వ్రతాలు చేయటంవలని శ్రమచే కలిగిన దుఃఖంచేత; అతి, కృశంబు+అగుచున్న= మిక్కిలి చిక్కిన; అంగంబునందున్= శరీరంలో; తనరి= అతిశయించి; సిరల్= నాడులు; ఏర్పడన్= స్పష్టంగాబయట పడగా; తద్దయున్= మిక్కిలి; ముదిమిన్= ముసలితనంచేత; తల, వడంకుచున్, ఉండన్= తల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వణికిపోతుండగా; తన పితృవరులన్= శ్రేష్ఠు లైన తన తాతతండ్రులను; ఘనముగాన్= గొప్పగా; ఊర్ధ్వ+అభిగమనులన్= ఉన్నతలోకాలకు పోయే వారినిగా; చేయన్, కడఁగి= చేయబూని; వివాహంబు, కాన్= పెండ్లాడటానికి; అనఘుండు= పాపరహితు డయిన; జరత్కారుఁడు; తనకోర్కికిన్= తనకోరికకు (తనతో సమానమయినపేరు గల కన్యను పొందటం అతని కోరిక); అనురూప, ఐన అట్టి= తగినట్టి; కన్యకన్= కన్యను; మర్త్యమునన్= భూలోకంలో; కానఁడు+అయ్యెన్= చూడలేకపోయాడు (పొందలేనివా డయ్యాడు).

తాత్పర్యం: ఎల్లప్పుడూ వ్రతాలు చేయటంవలని శ్రమచేత కలిగే దుఃఖంవలన మిక్కిలి చిక్కిపోతున్న శరీరంలో అధికంగా నాడులు బయటపడగా, ముసలితనంచేత తల వణకుతూ ఉన్న, శ్రేష్ఠు లైన తన తాతతండ్రులను గొప్పగా ఉన్నతలోకాలకు పంపబూని వివాహ మాడటానికి పాపరహితు డయిన జరత్కారుడు తనకోరికకు తగినట్టి కన్యను భూలోకంలో పొందలేనివా డయ్యాడు.

విశేషం: తల వడంకుచునుండు తన పితృవరుల- అని పాఠాంతరం. ఈపాఠమే సరసంగా ఉన్నది, ప్రౌఢవ్యాకరణకారుడు దీన్నే గ్రహించాడు. రెండుద్విపదపాదాలు కలిస్తే ఒకతరువోజ పాద మవుతుంది. 3 ఇంద్రగణాలు, 1 సూర్యగణం, మళ్ళీ 3 ఇంద్రగణాలు, 1 సూర్యగణం ప్రతిపాదంలో ఉంటాయి. 3వగణాద్యక్షరం యతిమిత్రస్థానం. ఉత్తరార్ధంలో కూడ ఆయతియే కొనసాగాలి. ప్రాసనియమం ఉన్నది.

వ. ఇట్లు జరత్కారుండు వివాహాపేక్షం బ్రతీక్షించుచున్న వాసుకియుం దనచారులవలన నంతయు నెఱింగి, నిజసహోదరి యైన జరత్కారుం దోడ్కొని జరత్కారుమహామునిపాలికిం బోయి యి ట్లనియె. 151

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; జరత్కారుండు; వివాహ+అపేక్షన్= పెండ్లిమీదికోరికతో; ప్రతీక్షించుచున్నన్= ఎదురుచూస్తుండగా; వాసుకియున్= వాసుకికూడ; తన, చారుల, వలనన్= తనవేగులవారివలన; అంతయున్= ఆవిషయమంతా; ఎఱింగి= తెలిసికొని; నిజ, సహోదరి+అయిన= తనతోబుట్టువయిన; జరత్కారున్= జరత్కారువు అనే పేరున్నదానిని; తోడ్కొని= తనవెంట తీసికొని; జరత్కారు, మహత్, ముని, పాలికిన్= జరత్కారుడనే గొప్పమునిచెంతకు; పోయి= వెళ్ళి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా జరత్కారుడు వివాహంమీదికోరికతో ఎదురుచూస్తుండగా, వాసుకికూడ తనసేవకులవలన విషయాన్నంతటినీ తెలిసికొని తన తోబుట్టు వయిన జరత్కారువును వెంటతీసికొని జరత్కారుమునిచెంతకు వెళ్ళి ఇట్లా పలికాడు.

శా. ధన్యం బయ్యె భవత్కులం, బతి కృతార్థం బయ్యె నస్మత్కులం,
బన్యోన్యానుగుణాభిధానములఁ జిత్తానంద మొందెన్ వివే
కన్యాయాన్విత భూసురోత్తమ! జరత్కారూ! జగన్మాన్య! యి
క్కన్యాభిక్షఁ బరిగ్రహింపుము జరత్కారున్ మదీయానుజన్. 152

ప్రతిపదార్థం: వివేక, న్యాయ+అన్విత= జ్ఞానంతోను, ధర్మంతోను కూడినవాడ! భూసుర+ఉత్తమ= బ్రాహ్మణశ్రేష్ఠుడా! జగత్+మాన్య= లోకంచేత పూజింపదగినవాడా! జరత్కారూ= ఓజరత్కారుమహర్షీ! భవత్కులంబు= మీవంశం; ధన్యంబు= పుణ్యవంతం; అయ్యెన్= అయింది; అస్మత్, కులంబు= మావంశం; కృతార్థంబు= ధన్యం; అయ్యెన్; అన్యోన్య+

అనుగుణ+అభిధానములన్= ఒండొరులకు తగినపేర్లచేత; చిత్త+ఆనందము= హృదయంలో సంతోషం; ఒందెన్= కలిగింది; మదీయ+అనుజన్= నాయొక్కచెల్లెలిని; జరత్కారున్= జరత్కారువు అనేదాన్ని; ఈ+కన్యాభిక్షన్= ఈకన్యారూప మయిన భిక్షను; పరిగ్రహింపుము= ప్రియంతో స్వీకరించండి.

తాత్పర్యం: జ్ఞానంతోను ధర్మంతోను కూడినవాడా! బ్రాహ్మణశ్రేష్ఠుడా! లోకపూజ్యుడా! జరత్కారుమహర్షీ! మీవంశం పుణ్యవంత మయింది. మావంశం ధన్య మయింది. నీకూ మాచెల్లెలికిని ఉండే ఒండొరులకు తగిన గుణాలచేత, పేర్లచేత హృదయంలో ఆనందం కలిగింది. నాచెల్లె లైన ఈజరత్కారువును వివాహార్థమై కన్యారూప మైన భిక్షగా ప్రీతితో గ్రహించండి.

విశేషం: ఇచట వాసుకి చెల్లెలిపేరూ, జరత్కారుమహర్షిపేరూ, సమానా లవటంచేత ఒండొరులకు ఆనుకూల్యం ఏర్పడింది. జరత్కారుడు తనపితృదేవతలతో తనకు సనామ అయిన కన్య దొరికితే పెండ్లిచేసికొంటా నని చెప్పాడు. అట్లే సనామ అయిన కన్య అతనికి లభించింది.

వ. అనిన నొడంబడి, జరత్కారుండు సనామ యగుటంజేసి యక్కన్యకను వివాహం బై, ప్రథమసమాగమంబునం దన ధర్మపత్నికి సమయంబు సేసె; 'నాకు నీ వెన్నండేని యవమానంబు దలంచితి, నాఁడ నిన్నుం బాసి పోవుదు' ననిన నాఁటంగోలె. 153

ప్రతిపదార్థం: అనినన్= అని వాసుకి పలుకగా; ఒడంబడి= అంగీకరించి; జరత్కారుండు; సనామ, అగుటన్, చేసి= తనతో సమాన మయిన పేరు కలది అవటంచేత; ఆ+కన్యను= ఆజరత్కారువును; వివాహంబు+అయి= పెండ్లాడి; ప్రథమ, సమాగమంబునన్= మొదటికలయికలో; తనధర్మపత్నికిన్= తన భార్యకు (అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్య ధర్మపత్ని); సమయంబు= నియమం; చేసెన్= చేశాడు; నీవు; ఎన్నండు+ఏని= ఎప్పుడైనా; నాకున్; అవమానంబు= అగౌరవం; తలంచితి(వి)= తలపోశావో; నాఁడు+అ= ఆరోజుననే; నిన్నున్; పాసి= విడిచి, పోవుదున్= వెడతాను; అనినన్= అని పలుకగా; నాఁటన్, కోలెన్= ఆరోజునుండి.

తాత్పర్యం: అని వాసుకి పలుకగా జరత్కారుమహాముని తనతో సమానమయిన పేరు కలదవటంచేత ఆ కన్యను పెండ్లాడి మొదటి కూడికలోనే (మొట్టమొదటిసారి ఆమెను కూడినప్పుడే) తనభార్యకు 'నాకు నీవు ఎప్పుడు అగౌరవం తలపోస్తావో ఆరోజుననే నిన్ను విడిచిపోతాను' అని నియమం చేశాడు. ఆనాటినుండి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'తలంచితి(వి)' ఇచ్చట భూతకాల మవటంచేత 'వ' కారానికి లోపం. 'కోలె' అనేది నన్నయనాడు పంచమీ విభక్తి ప్రత్యయంగా వాడబడుతూ ఉండేది.

క. వాలుపయి నడచున ట్లౌ । బ్బాలిక నడునడ నడుంగి భయమున నియమా
భీలుఁ డగు పతికిఁ బవళుల్ । రేలును నేమఱక పరిచరించుచు నుండెన్. 154

ప్రతిపదార్థం: ఆ+బాలిక= జరత్కారు వనే ఆ కన్య; వాలుపయిన్= కత్తిమీద; నడచు+అట్లు; నడునడ= ఇది వణకటంలోని ధ్వన్యనుకరణం; నడుంగి= వణకి(శంకించి); భయమునన్= భయంతో; నియమ+అభీలుఁడు+అగు= నియమం చేయటంచేత భయంకరు డయిన; పతికిన్= భర్తకు; పవళుల్= పగటిపూటల్లోను; రేలునున్= రాత్రుల్లోను; ఏమఱక= అశ్రద్ధ వహించక; పరిచరించుచున్, ఉండెన్= సేవచేస్తూ ఉండింది.

తాత్పర్యం: కన్య అయిన ఆ జరత్కారువు కత్తిపై నడుస్తున్నట్లుగా భయంతో వడవడవణకి నియమంచేత భయంకరు డైన భర్తకు పగళ్ళూ, రాత్రిళ్ళూ పొరపాటు పడకుండ శ్రద్ధతో సేవ చేస్తూ ఉండేది.

క. అనవరతభక్తిఁ బాయక। తనపతికిం బ్రియము సేసి, తద్దయు గర్భం
బనురక్తిఁ దాల్చి యొప్పెను। దినకరగర్భ యగు పూర్వదిక్సతివోలెన్. 155

ప్రతిపదార్థం: అనవరత, భక్తిన్= నిరంతరమైనభక్తితో; పాయక= విడువక; తన, పతికిన్= తనభర్తఅయిన జరత్కారుడికి; తద్దయున్= మిక్కిలి; ప్రియము+చేసి; అనురక్తిన్= అనురాగంతో; గర్భంబు= గర్భాన్ని; తాల్చి= ధరించి; దిన, కర, గర్భ, అగు= సూర్యుడు గర్భంలో(మధ్యభాగంలో)ఉన్న; పూర్వదిక్, సతి, పోలెన్= తూర్పు ది క్కనే కాంతవలె; ఒప్పెను= ప్రకాశించింది.

తాత్పర్యం: జరత్కారువు ఎడతెగని భక్తితో విడువక తనభర్తకు మిక్కిలిప్రీతి ఒనరించి, అనురాగంతో గర్భం ధరించి సూర్యుడు గర్భంలో ఉన్న తూర్పుదిక్కు అనే కాంతవలె ప్రకాశించింది.

విశేషం: అలం: ఉపమ, రూపకం.

వ. అక్కోమలి యొక్కనాఁడు దనకుఱువు దలయంపిగాఁ గృష్ణాజినాస్తరణంబున నిజనాథుండు నిద్రితుండై యున్న యవసరంబున నాదిత్యుం డస్తగిరిశిఖరాసన్నుం డగుటయు, సంధ్యాసమయోచితక్రియలు నిర్వర్తింపఁ దదాశ్రమవాసు లైన మునులు గడంగుటం జూచి యాత్మగతంబున. 156

ప్రతిపదార్థం: ఆ+కోమలి= సుకుమారగాత్రి అయిన ఆ జరత్కారువు; ఒక్కనాఁడు; తన, కుఱువు= తనతొడ; తలయంపిగాన్= తలగడ అగునట్లుగా; కృష్ణ+అజిన+ఆస్తరణంబునన్= కృష్ణమృగచర్మరూప మయిన పక్కమీద; నిజనాథుండు= తన భర్త; నిద్రితుండు+ఐ= నిద్రపోతున్నవా డయి; ఉన్న, అవసరంబునన్= ఉన్న సమయంలో; ఆదిత్యుండు= సూర్యుడు; అస్తగిరి, శిఖర+ఆసన్నుండు= పడమటికొండకొనను సమీపించినవాడు; (అస్తమించటానికి సిద్ధంగా ఉన్నవాడు); అగుటయున్= కాగా; సంధ్యాసమయ+ఉచితక్రియలు= సంధ్యాసమయంలో చేయదగిన కర్మలు; నిర్వర్తింపన్= చేయటానికి; తద్+ఆశ్రమవాసులు+ఐన= ఆ ఆశ్రమంలో నివసించేవారయిన; మునులు= ఋషులు; కడంగుటన్= పూనటాన్ని; చూచి; ఆత్మగతంబునన్= తనలో.

తాత్పర్యం: సుకుమారగాత్రి అయిన ఆ జరత్కారువు తనతొడనే తలగడగా, కృష్ణమృగచర్మపుపక్కపై తనభర్త నిద్రిస్తున్న సమయంలో, సూర్యుడు పడమటికొండకొనను చేరగా (అస్తమించటానికి సిద్ధంగా ఉండగా) ఆ ఆశ్రమంలో నివసించే ఋషులు సంధ్యాకాలంలో చేయదగిన సంధ్యావందనాదికర్మలు చేయటానికి పూనగా చూచి తనలో (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. 'సంధ్యలం దొనరించు సద్విధుల్ గడచిన। ధర్మలోపం బగుఁ దడయ కేల
బోధింప వై తని భూసురప్రవరుండు। పదరునో, బోధింపఁబడి యవజ్ఞ
దగునె నా కిట్లు నిద్రాభంగ మొనరింప। నని యల్గునో, దీని కల్గెనేని
యలుకయ పడుదుఁ గా, కగునె ధర్మక్రియా। లోపంబు, హృదయంబులో సహింప'

ఆ. నని వినిశ్చితాత్మ యై నిజపతిఁ బ్రబో। ధించె; మునియు నిద్ర దేఱి యలిగి
'యేల నిద్రఁ జెఱిచి తీవు' నావుడు జర। త్కారు విట్టు లనియెఁ గరము వెఱచి. 157

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సంధ్యలందున్= సంధ్యాకాలాల్లో; ఒనరించు= చేసే; సత్, విధుల్= మంచికర్మలు; కడచినన్= అతిక్రమిస్తే; ధర్మలోపంబు= ధర్మానికి భంగం; అగున్= అవుతుంది; తడయక= ఆలస్యం చేయక; ఏల= ఎందుకు?; బోధింపవు+ఐతి(వి) +అని= మేల్కొల్పవయితి వని (భూతకాలమవటంచేత 'అయితివి' లోని 'వ' కారం లోపించింది); భూసుర, ప్రవరుండు= విప్రశ్రేష్ఠు డైన జరత్కారుడు; పదరునో= కోపిస్తాడో!; బోధింపఁబడి= మేల్కొల్పబడి; అవజ్ఞన్= అవమానంతో; నాకున్; ఇట్లు= ఈవిధంగా; నిద్రాభంగము= నిద్రకు ఆటంకం; ఒనరింపన్= చేయగా; తగునె= యుక్తమవునా అని; అల్గునో= కోపించునో; అలుక+అ=కోపాన్నే; పడుదున్, కాక=అనుభవిస్తానుకాని; ధర్మక్రియాలోపంబు= చేయదగినధర్మకార్యాల, లోపాన్ని; (చేయకపోవటాన్ని); హృదయంబులోన్= చిత్తంలో; సహింపన్+అగునే= సయింపదగునా! అని; వినిశ్చిత+ఆత్మ+ఐ= నిశ్చయింపబడిన మనస్సు కలదై; నిజ, పతిన్= తనభర్తను; ప్రబోధించెన్= మేల్కొలిపింది; మునియున్= జరత్కారుమునికూడా; నిద్ర, తేఱి= నిద్రనుండి తేరుకొని(మేలుకొని); అలిగి= కోపించి; ఈవు=నీవు; ఏల= ఎందుకు; నిద్రన్; చెరిచితి(వి)= నిద్ర చెడేటట్లు చేశావు; నావుడున్= అనిన అనంతరం; కరము= మిక్కిలి; వెఱచి= భయపడి; జరత్కారువు= అతనిభార్య; ఇట్టులు+అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: సంధ్యాకాలాలలో చేయవలసిన సత్కర్మలు లోపిస్తే ధర్మభంగం అవుతుంది. ఆలస్యం చేయక ఎందుకు నన్ను మేల్కొల్ప లేదు? అని బ్రాహ్మణశ్రేష్ఠు డైన జరత్కారుడు కోపిస్తాడో? మేలుకొల్పబడి అవమానంగా భావించి నా కీ విధంగా నిద్రకు ఆటంకం కలిగించటం తగునా? అని కోపిస్తాడో! ఒకవేళ మేల్కొల్పినందుకు కోపిస్తే కోపాన్నే భరిస్తాను గాక! ధర్మకార్యానికి లోపం హృదయంలో సైపదగునా' అని హృదయంలో నిశ్చయించుకొని జరత్కారువు తనభర్తను మేల్కొల్పింది. జరత్కారుడును నిద్రనుండి మేల్కొని కోపించి 'నీవు ఎందుకు నాకు నిద్రాభంగం చేశావు?' అని అనగా జరత్కారువు మిక్కిలి భయపడి ఇట్లా పలికింది.

విశేషం: ఇచట సాధ్వి అయిన జరత్కారువుమనస్సులో ధర్మసంఘర్షణ కలిగింది. భర్త నిద్రపోతున్నాడు. సంధ్యాసమయం అయింది. సంధ్యాకాలంలో చేయదగినకర్మలు చేయకుంటే ధర్మలోప మవుతుంది. అందుకు భర్త కోపించవచ్చు. ఒకవేళ లేపితే, లేచి నిద్రాభంగ మెందుకు చేశా వని కోపించవచ్చు. ఆసమయంలో భర్తను లేపకపోవటం అధర్మం. లేపటమూ అధర్మమే. రెండువిధాలా భర్త కోపించవచ్చు. ఆమె మనసులో బాగా ఆలోచించి, కోపాన్నే భరించవచ్చును కాని ధర్మక్రియాలోపం సహించరాదని నిశ్చయించి భర్తనులేపింది. ఇచట ఆమెకు ఉండే ధర్మక్రియాసక్తి తెల్లమవుతున్నది. ఆమెలోని ధర్మచింతనప్రవృత్తి ఆమె సంతానమైన ఆస్తీకునిలో ప్రతిఫలిస్తుందని వస్తుధ్వని. ఇందులో నన్నయధర్మనిష్ఠ ప్రతిఫలిస్తూఉంది.

క. 'ఇనుఁ డస్తమింపఁ బోయిన । ననఘా! బోధింపవలసె' ననవుడు, 'నామే
ల్కను నంతకు నుండక యినుఁ । డొనరఁగ నస్తాద్రి కేఁగ నోడఁడె చెపుమా!' 158

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా; ఇనుఁడు= సూర్యుడు; అస్తమింపన్ పోయినన్= అస్తమించటానికి సిద్ధంగా ఉండగా; బోధింపన్వలసెన్= ధర్మక్రియాభంగ మవుతుం దేమో అని నిన్ను మేల్కొల్పవలసి వచ్చింది; అనవుడున్= అనిన అనంతరం; నా, మేల్కను, అంతకున్= నేను మేల్కొనేంతవరకు; ఉండక= అస్తమించకుండ ఉండక; ఇనుఁడు= సూర్యుడు; ఒనరఁగన్= ఒప్పుగా; అస్త+అద్రికిన్= పడమటికొండకు; ఏఁగన్= వెళ్ళటానికి; ఓడఁడు+ఎ= భయపడడా? చెపుమా= చెప్పుము.

తాత్పర్యం: 'ఓ పాపరహితుడా! సూర్యు డస్తమించటానికి సిద్ధంగా ఉండగా, ధర్మకార్యాచరణానికి లోపం కలుగుతుందని నిన్ను మేల్కొల్పవలసి వచ్చిం' దని ఆమె అనగా, జరత్కారుడు, నేను మేల్కొనేంతవరకు అస్తమించకుండ ఉండక సూర్యుడు పడమటికొండకు వెళ్ళటానికి భయపడడా! చెప్పుము' (అని పలికాడు).

విశేషం: మునిప్రభావం చాలా గొప్పది. అతడు మేల్కొనకపోతే సూర్యుడు అస్తమించటానికి భయపడతా డని అతని అభిప్రాయం.

వ. 'నీవు నా కవమానంబు దలంచితివి; నీయొద్దనుండ నొల్లఁ ; దొల్లి నీకు నాచేసిన సమయంబు నిట్టిద; నీగర్భంబున నున్నవాఁడు సూర్యానలసమప్రభుం డైన పుత్త్రుం; డుభయకులదుఃఖోద్ధరణ సమర్థుండు సుమ్ము; నీవు వగవక నీయగ్రజునొద్ద నుండు' మని జరత్కారువు నూరార్చి జరత్కారుండు తపోవనంబునకుం జనియె; నిట జరత్కారువును తనయగ్రజుం డైన వాసుకి యొద్దకు వచ్చి తద్వృత్తాంతంబంతయు నెఱింగించి యుండునంత. 159

ప్రతిపదార్థం: నీవు; నాకున్; అవమానంబు= అగౌరవం; తలంచితివి= తలపోశావు; నీయొద్దన్= నీచెంత; ఉండన్, ఒల్లన్= ఉండటానికి అంగీకరించను; తొల్లి= పూర్వం(మొదట); నీకున్; నా, చేసిన (కర్తృపదప్రథమకు షష్ఠి); సమయంబున్= నియమంకూడా; ఇట్టిది+అ= ఇట్టిదే. నీ, గర్భంబునన్= నీకడుపులో; ఉన్నవాడు; సూర్య+అనల, సమప్రభుండు+ఐన= సూర్యుడితోను, అగ్నితోను సమానమయిన కాంతి కల; పుత్త్రుండు= కుమారుడు; ఉభయ, కుల+ఉద్ధరణ, సమర్థుండు= మన ఇరువురియొక్క కులాల దుఃఖాన్ని తొలగించటానికి (పైకితేవటానికి) శక్తి కలవాడు సుమా (చుమ్ము- చూడుము యొక్క సంక్షేపరూపం); నీవు; వగవక= విచారింపక; నీ, అగ్రజు+ఒద్దన్= నీఅన్న అయిన వాసుకి చెంత; ఉండుము; అని; జరత్కారువున్= తనభార్య అయిన జరత్కారువును; ఊరార్చి= ఓదార్చి; జరత్కారుండు= ముని; తపోవనంబునకున్, తపస్సు చేసికొనటానికి తగిన అడవికి; చనియెన్= వెళ్లాడు; ఇటన్= ఇక్కడ; జరత్కారువును= భార్యకూడ; తన, అగ్రజుండు+ఐన= తనఅన్న అయిన; వాసుకి+ఒద్దకున్= వాసుకిచెంతకు; వచ్చి; తద్, వృత్తాంతంబు= జరిగినవిషయం; అంతయున్; ఎఱింగించి, ఉండు+అంతన్= తెలిపి ఉన్నంత.

తాత్పర్యం: 'నీవు నిద్రనుండి లేపటంచేత నాకు అవమానం చేయటానికి తలపోశావు. నీచెంత ఉండటానికి అంగీకరించను. ఎన్నడయినా నీవు నా కవమానం తలపోస్తే నాడే నిన్ను విడిచి పోతా నని ముందే నీకు శపథం చేసి ఉన్నాను, నీ కడుపున ఉన్న కుమారుడు సూర్యుడితోను, అగ్నితోను సమాన మయిన కాంతికలవాడు. మన ఇరువురికులాలయొక్క దుఃఖాన్ని తొలగించటానికి తగిన శక్తి కలవాడు సుమా! నీవు విచారించక నీ అన్నచెంత ఉండుము.' అని జరత్కారువును ఓదార్చి జరత్కారుముని తపస్సు చేసికొనటానికి అడవికి వెళ్ళాడు. ఇచట జరత్కారువును తన అన్న అయిన వాసుకి చెంతకు వచ్చి విషయమంతా తెలిపి ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

క. ఆపూర్ణతేజుఁ డపగత । పాపుఁ డపాకృతభవానుబంధుఁడు, నిజమా
తాపితృపక్షప్రబల భ । యాపహుఁ డాస్తీకుఁ డుదితుఁ డై పెరిఁగెఁ బ్రభన్. 160

ప్రతిపదార్థం: ఆపూర్ణతేజుఁడు= మిక్కిలిసంపూర్ణమైన తేజస్సు కలవాడు; అపగతపాపుఁడు= పోయినపాపం కలవాడు; అపాకృత, భవ+అనుబంధుఁడు= తిరస్కరింపబడిన సంసారంయొక్క సంబంధం కలవాడు; నిజ, మాతృ, పితృ, పక్ష, ప్రబల, భయ+అపహుఁడు= తనతల్లియొక్క, తండ్రియొక్క పక్షాలయొక్క అధికమైన భయాన్ని పోగొట్టేవాడు; ఆస్తీకుఁడు= ఆస్తీకు డనేపేరు కలవాడు; ఉదితుఁడు+ఐ= పుట్టి; ప్రభన్= కాంతితో; పెరిఁగెన్= వర్ధిల్లాడు.

తాత్పర్యం: అంతటను నిండిన తేజస్సు కలవాడున్నూ, పాపంలేనివాడున్నూ, తిరస్కరింపబడిన సంసారబంధం కలవాడున్నూ, తనతల్లిదండ్రుల ఉభయపక్షాలకు చెందినవారి అధిక మైన భయాన్ని పోగొట్టేవాడున్నూ అయిన ఆస్తీకుడు కాంతితో పుట్టి పెరిగాడు.

విశేషం: మాతృ+పితృ= మాతాపితృ, ద్వంద్వసమాసంలో తొలిపదంచివరి ఋవర్ణస్థానంలో ఆవర్ణం వస్తుంది. 'ఆనఙ్ఋతోర్ద్వంద్వే.'

తే. **చ్యవనసుతుఁ డైన ప్రమతితోఁ జదివె సకల । వేదవేదాంగములు, నిజవిమలబుద్ధి**
నెఱిఁగె సకలశాస్త్రంబుల, నెల్లయందు । నధికసాత్త్వికుఁ డాస్తీకుఁ డనఁగ జనులు. **161**

ప్రతిపదార్థం: జనులు= ప్రజలు; ఎల్ల+అందున్= అన్నిచోట్లలోను; ఆస్తీకుఁడు; అధికసాత్త్వికుఁడు= గొప్పసత్త్వగుణం కలవాడు; అనఁగ= అనేటట్లుగా; చ్యవనసుతుఁడు+అయిన= చ్యవనుడికుమారు డయిన; ప్రమతితోన్= ప్రమతి అనే వాడివద్ద; సకల, వేద, వేద+అంగములు= అన్నివేదాలను, వేదాలకు అంగాలను; చదివెన్; సకల, శాస్త్రంబులన్= అన్ని శాస్త్రాలను; నిజ, విమల, బుద్ధిన్= తన నిర్మల మయిన బుద్ధితో; ఎఱిఁగెన్= తెలిసికొన్నాడు.

తాత్పర్యం: ఆ ఆస్తీకుడు ప్రజలు ఎల్లప్రదేశాలలోను అధిక మైన సత్త్వంకలవా డని పొగడేటట్లుగా చ్యవనకుమారు డైన ప్రమతివద్ద అన్నివేదాలను, వేదాలఅంగాలను అధ్యయనం చేశాడు. నిర్మల మయిన బుద్ధితో అన్ని శాస్త్రాలను తెలిసికొన్నాడు.

విశేషం: ఋగ్యజుస్సామాథర్వాలు నాలుగువేదాలు. శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం అనేఆరున్నూ వేదాంగాలు.

ప్రమతితో చదివె అనేచోట తృతీయావిభక్తి ప్రత్యయమైన 'తో' వాడబడింది. "ఉపయోగంబునందు ఆఖ్యాతకు తోడవర్ణకమగును." "ఉపయోగ మనఁగా నియమపూర్వకవిద్యాస్వీకారము."

వ. **అటజనమేజయుండు దక్షకవిషానలంబునం దన జనకు పంచత్వం బుదంకువలన నెఱింగి, మంత్రులం జూచి, 'యిది యేమినిమిత్తంబు? దీని సవిస్తరంబుగాఁ జెప్పుం' డనిన మంత్రు లి ట్లనిరి.** **162**

ప్రతిపదార్థం: అటన్= అచ్చట; జనమేజయుండు= పరీక్షిత్తు కుమారుడు; తక్షక, విష+అనలంబునన్= తక్షకునియొక్క విష మనే అగ్నిచేత; తన, జనకు, పంచత్వంబు= తన తండ్రి అయిన పరీక్షిత్తుమరణం; ఉదంకువలనన్= ఉదంకుడిద్వారా; ఎఱింగి= తెలిసికొని; మంత్రులన్, చూచి; ఇది; ఏమి; నిమిత్తంబు= కారణం; దీనిన్= ఈవృత్తాంతాన్ని; సవిస్తరంబుగాన్= వివరంతోకూడుకొని ఉండేట్లుగా; చెప్పుండు; అనినన్= అని అడుగగా; మంత్రులు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: అచ్చట- జనమేజయుడు తక్షకుని విష మనే అగ్నిచేత తన తండ్రి అయిన పరీక్షిత్తు మరణించాడనిన వృత్తాంతం ఉదంకుడివలన తెలిసికొని మంత్రులను చూచి 'ఇది ఎందువలన జరిగింది? దీనిని వివరంగా తెల్పండి' అని అడుగగా మంత్రు లిట్లా పలికారు.

విశేషం: మానవశరీరం పంచభూతాత్మకం. మరణించినప్పుడు అది మళ్ళీ పంచభూతాలలో కలసిపోతుంది. అందుకే మరణానికి పంచత్వ మనే పేరు కలిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జనమేజయునకుఁ బరీక్షితు శాపకారణంబు మంత్రులు చెప్పుట. (సం. 1-36-8)

సీ. అభిమన్యునకు విరాటాత్మజ యైన యు । త్తరకును బుట్టిన ధర్మమూర్తి,
కౌరవాన్వయపరిక్షయమున నుదయించి । ప్రథఁ బరీక్షితుఁడు నాఁ బరఁగువాఁడు,
ధర్మార్థకామముల్ దప్పక సలుపుచుఁ । బూని భూప్రజ నెల్లఁ బుణ్యచరిత
ననఘుఁ డై రక్షించి యఱువదియేఁడులు । రాజ్యంబు సేసిన రాజవృషభుఁ,

ఆ. డధికధర్మమార్గుఁ డైన నీయట్టి స । త్పుత్త్రుఁ బడసియున్న పుణ్యుఁ, డన్య
నాథ మకుటమణిగణప్రభారంజిత । పాదపంకజుండు భరతనిభుఁడు. 163

ప్రతిపదార్థం: అభిమన్యునకున్; విరాట+ఆత్మజ+ఐన= విరాటునికూతురైన; ఉత్తరకును; పుట్టిన; ధర్మమూర్తి= ధర్మరూపుడు; కౌరవ+అన్వయ, పరిక్షయమునన్= కౌరవుల వంశంయొక్క వినాశసమయాన; ఉదయించి= పుట్టి; ప్రథన్= ప్రసిద్ధిచేత; పరీక్షితుఁడు, నాన్= పరీక్షితుడు అనగా; పరఁగువాఁడు= ఒప్పువాడు; ధర్మ+అర్థ, కామముల్= ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలను; తప్పక= అతిక్రమించక; సలుపుచున్= చేస్తూ; పూని= యత్నించి; భూ, ప్రజన్, ఎల్లన్= భూమిలోని ప్రజలనందరిని; పుణ్యచరితన్= పవిత్రమయిన ప్రవర్తనతో; అనఘుఁడు+ఐ= పాపరహితుఁ డై; రక్షించి= కాపాడి; అఱువదియేఁడులు= అరవయిసంవత్సరాలు; రాజ్యంబు చేసిన= రాజ్యాన్ని పాలించిన; రాజవృషభుఁడు= రాజశ్రేష్ఠుడు; అధిక, ధర్మమార్గుఁడు+ఐన= మిక్కిలి ధర్మంతో కూడినమార్గం కలవాడి వైన; నీ+అట్టి= నీవంటి; సత్, పుత్త్రున్= మంచికుమారుడిని; పడసి, ఉన్న= పొంది ఉన్న; పుణ్యుఁడు= పవిత్రుడు; అన్య, నాథ, మకుట, మణి, గణ, ప్రభా, రంజిత, పాద, పంకజుండు= ఇతరరాజులయొక్క కిరీటాలలోని రత్నాల సముదాయాలయొక్క కాంతిచే ప్రకాశింపజేయబడిన పద్మాలవంటి పాదాలు కలవాడు; భరతనిభుఁడు= శకుంతలాదుష్యంతులకుమారు డైన భరతుడితో సమానుడు.

తాత్పర్యం: అభిమన్యుడికి విరాటునికూతు రైన ఉత్తరకు జన్మించిన ధర్మస్వరూపుడు, కౌరవవంశం వినాశంపొందే సమయంలో పుట్టి ప్రసిద్ధిచే పరీక్షితుడు అనగా ఒప్పేవాడు, ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలను అతిక్రమించక అనుసరిస్తూ యత్నించి భూమిలోని ప్రజలను అందరిని పవిత్ర మయిన చరిత్రంతో పాపరహితుడై కాపాడి అరవయి సంవత్సరాలు రాజ్యం పాలించిన రాజశ్రేష్ఠుడు, మిక్కిలిధర్మంతో కూడినమార్గం కలవాడి వైన నీవంటి మంచికుమారుడిని పొంది ఉన్న పవిత్రుడు, ఇతరరాజుల కిరీటాలలోని మణుల సముదాయాలయొక్క కాంతిచే ప్రకాశింపజేయబడిన పద్మాలవంటి పాదాలు కలవాడు, భరతునితో సమానుడు.

విశేషం: అభిమన్యుడు కురుక్షేత్రసంగ్రామంలో మరణించే టప్పటికి ఉత్తర గర్భవతి అయి ఉండింది. అశ్వత్థామ గర్భస్థశిశువును సంహరించటానికి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. కృష్ణుడు చక్రంచేత దానిని నివారించి శిశువును రక్షించి కౌరవవంశాన్ని నిలిపాడు. అప్పుడు ఉత్తరకు పరీక్షిత్తు పుట్టాడు. అతడు కృష్ణుడిచే రక్షింపబడన ట్లయితే పాండవవంశం అంతరించి ఉండేది! సింహ, శరభ, శార్దూల, వృషభాది శబ్దాలు సమాసంలో ఉత్తరపదా లయితే శ్రేష్ఠతావాచక సూచకా లవుతాయి. శకుంతలా దుష్యంతులకు పుట్టిన భరతుడు కౌరవవంశకర్తలలో ఒకడు.

వ. భవత్పితృప్రపితామహుం డైన పాండురాజునుంబోలె మృగయాసక్తుం డై యొక్కనాఁడు మహాగహనంబులఁ బెక్కుమృగంబుల నెగచి చంపి, తనచేత నేటువడి పాఱినమృగంబు వెంటఁ దగిలి మహాధనుర్ధరుం డై యజ్ఞమృగంబు పిఱుందం బఱచు రుద్రుండునుం బోలె. 164

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భవత్, పితృ, ప్రపితామహుండు+ఐన= నీతండ్రి అయిన పరీక్షిత్తుకు ముత్తాత అయిన; పాండురాజునున్, పోలెన్= పాండురాజువలె; మృగయా+ఆసక్తుండు+ఐ= వేటలో ఆసక్తి కలవాడై; ఒక్కనాఁడు; మహత్, గహనంబులన్= పెద్దఅడవులలో; పెక్కు మృగంబులన్= అనేక జంతువులను; ఎగచి= తరిమి; చంపి; తనచేతన్; ఏటు, పడి= బాణపుదెబ్బ తిని; పాఱిన= పారిపోయిన; మృగంబువెంటన్= లేడివెంట; తగిలి= అనుసరించి; మహత్, ధనుః+ ధరుండు+ఐ= గొప్పవింటిని ధరించినవా డై; యజ్ఞమృగంబు= యజ్ఞరూప మయిన లేడియొక్క; పిఱుందన్= వెనుక; పఱచు= పరిగెత్తే; రుద్రుండునున్, పోలెన్= శివునివలె.

తాత్పర్యం: జనమేజయుడితండ్రి పరీక్షిత్తు, అతనితండ్రి అభిమన్యుడు, అతనితండ్రి అర్జునుడు, అతనితండ్రి పాండురాజు-అందుచేత పాండురాజు జనమేజయుడికి ముత్తాత అవుతాడు. ఆ పాండురాజు వలె వేటపట్ల ఆసక్తి కలవా డయి పరీక్షిత్తు ఒకనాడు పెద్దఅడవులలో అనేకజంతువులను తరిమి చంపి, తనచేత బాణపుదెబ్బ తిని పారిపోయిన ఒకలేడిని అనుసరిస్తూ గొప్పవిల్లు ధరించినవా డయి యజ్ఞరూప మైన లేడివెనుక పరుగెత్తే శివుడివలె.

విశేషం: దక్షాధ్వరధ్వంససమయంలో యజ్ఞం మృగరూపం ధరించి పరుగెత్తుతూ ఉంటే రుద్రుడు దానివెనుక తరుముతూ పరిగెత్తాడు. ఇచ్చట పరీక్షిత్తుకు ఆయజ్ఞమృగాన్ని వెంటాడే రుద్రునితో పోలిక చెప్పబడింది. అలంకారం ఉపమ.

పృథ్వీవృత్తము.

అమిత్త్రమదభేది యొక్కరుఁడ యమ్మృగాన్వేషణ
భ్రమాకులితచిత్తుఁ డై తగిలి పాఱుచున్ ముందటన్
శమీకుఁ డనువాని నొక్కమునిసత్తమున్ సంతత
క్షమాదమసమన్వితుం గనియెఁ గాననాంతంబునన్. 165

ప్రతిపదార్థం: అమిత్ర, మద, భేది= శత్రువులయొక్కగర్వాన్ని అడగించేవాడు; ఒక్కరుఁడు+అ= ఒక్కడే; ఆ+మృగ+అన్వేషణ, భ్రమ+ఆకులిత, చిత్తుఁడు+ఐ= ఆ లేడిని వెదకటంకొరకు తిరగటంవలన కలతపెట్టబడిన హృదయం కలవాడై; తగిలి= అనుసరించి; పాఱుచున్= పరుగెత్తుతూ; ముందటన్; కానన+అంతంబునన్= అడవిచివర; సంతత, క్షమా, దమ, సమన్వితున్= ఎల్లప్పుడూ ఓర్పుతోను, అంతరింద్రియనిగ్రహంతోను కూడిన వాడిని; శమీకుడు+అను, వానిన్= శమీకు డనేపేరు కలవాడిని; ఒక్క, ముని, సత్తమున్= ఒకమునిశ్రేష్ఠుడిని; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: శత్రువులగర్వాన్ని అణచేపరీక్షిత్తు ఒక్కడే (ఒంటరిగా) తనచేత బాణంతోకొట్టబడి పరుగెత్తేమృగాన్ని వెదకటంకొరకు తిరగటంచేత కలతపెట్టబడిన హృదయం కలవాడై వెంటనంటి పరుగెత్తుతూ, ఎదుట అడవిచివర అధిక మైన ఓర్పుతోను, అంతరింద్రియనిగ్రహంతోను కూడిన శమీకు డనే పేరు గల ఒకమునిశ్రేష్ఠుడిని చూచాడు.

విశేషం: పృథ్వీవృత్తంలో ఒక్కొక్కపాదానికి జ, స, జ, స, య, లగ అనేగణాలు ఉంటాయి. పన్నెండవఅక్షరం యతిస్థానం. సంస్కృతంలో తొమ్మిదో అక్షరాన్ని యతిస్థానంగా పరిగణిస్తారు. నన్నయాదులు 12వ అక్షరాన్ని యతిగా పాటించారు. ప్రబంధకవులు తొమ్మిదవ అక్షరాన్నే యతిగా నిలిపారు.

వ. కని 'మునీంద్రా! నాచేత నేటువడి మృగం బమ్మ్రుతోన యిటవచ్చె, నది యెక్కడంబాఱె? నీ వెఱుంగుదేని చెప్పుమనిన, నమ్ముని మౌనవ్రతుండు గావునఁ బలుకకున్నం గినిసి, తత్సమీపంబున నపగతప్రాణం బై

పడియున్నపాముం దనవింటికొప్పన నెత్తి, యమ్మునియఱుతం దగుల వైచి, క్రమ్మఱి హస్తిపురంబునకు వచ్చియున్నంత. 166

ప్రతిపదార్థం: కని= చూచి; ముని+ఇంద్రా!= మునిశ్రేష్ఠుడా! నాచేతన్; ఏటు, పడి= బాణపుదెబ్బతిని; మృగంబు= లేడి; అమ్ముతోన్+అ= బాణంతోనే; ఇట, వచ్చెన్= ఇచటికి వచ్చింది; అది= ఆ మృగం; ఎక్కడన్= ఎక్కడికి; పాఱెన్= పరుగెత్తింది; నీవు; ఎఱుంగుదు(వు)+ఏని= ఎరిగిఉంటే; (భూతకాలంలోవలెనే తద్ధర్మంలో కూడ క్రియచివర ఉన్నవకారం లోపిస్తుంది); చెప్పుము= తెల్పుము; అనినన్= అనిఅడుగగా; ఆ+ముని= శమీకు డనే ఆ ముని; మౌన, వ్రతుండు, కావునన్= మాటాడకుండటం వ్రతంగా కలవాడు అవటంచేత; పలుకక+ఉన్నన్= బదులు పలకకుండా ఉండగా; కినిసి= కోపించి; తద్, సమీపంబునన్= అతనికి చేరువనే; అపగత, ప్రాణంబు+అయి= పోయిన ప్రాణం కలదై; పడి, ఉన్న, పామున్= పామును; తన, వింటి, కొప్పునన్= తనవింటికొనతో; ఎత్తి= పైకితీసి; ఆ+ముని, అఱుతన్= ఆమునియొక్కకంఠంలో; తగులన్, వైచి= అంటేటట్లుగా వేసి (తగిలించి); క్రమ్మఱి= తిరిగి, హస్తి, పురంబునకున్= హస్తినాపురానికి; వచ్చి, ఉన్న+అంతన్= చేరి ఉండగా.

తాత్పర్యం: చూచి, 'ఓమునిశ్రేష్ఠా! నాచేత బాణపుదెబ్బతిన్న లేడి ఆబాణంతోకూడ ఇక్కడకు వచ్చింది. అది ఎక్కడికి పారిపోయింది? నీకు తెలిసిఉంటే చెప్పుము' అని అడుగగా ఆ ముని మౌనవ్రతం కలవాడుకావున సమాధానం ఏమీ చెప్పకుండా ఉండగా, కోపించి అతనిచెంత చచ్చి పడిఉన్న ఒక పామును తన వింటికొనచే పైకితీసి ఆ శమీకముని మెడలో తగిలించి తిరిగి హస్తినాపురానికి వచ్చి ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ఆశమీకుపుత్త్రుఁ డంబుజసంభవు । గుఱిచి భక్తితోడ ఘోరతపము
సేయుచున్న సుప్రసిద్ధుండు శృంగి య । న్వాఁడు భృంగిసముఁడ వంధ్యకోపి. 167

ప్రతిపదార్థం: ఆ, శమీకు, పుత్త్రుఁడు= ఆ శమీకమునియొక్క కుమారుడు; అంబుజ, సంభవు, గుఱిచి= పద్మానపుట్టినవాడయిన బ్రహ్మనుగురించి; భక్తితోడన్= పూజ్యభావంతో; ఘోర, తపము= తీవ్ర మైన తపస్సు; చేయుచున్న; సుప్రసిద్ధుండు= మంచిఖ్యాతిగలవాడు; భృంగిసముఁడు= శివకింకరుడైన భృంగితో సమానుడు; (శివసమాను డనియు చెప్పవచ్చును); అవంధ్యకోపి= వ్యర్థంకాని కోపంకలవాడు; శృంగి, అన్, వాఁడు= శృంగి అనే పేరుకలవాడు.

తాత్పర్యం: ఆ శమీకమహర్షి కుమారుడు శృంగి అనేవాడు భక్తితో బ్రహ్మను గురించి కఠోరమైన తపస్సు చేస్తున్న సుప్రసిద్ధుడు. అతడు శివకింకరుడైన భృంగితో సమానుడు; మొక్కవోని కోపం గలవాడు.

విశేషం: 'అను' అనే ఉదంతతద్ధర్మవిశేషణంలో 'ఉ' లోపించింది. అన్వాడు.

క. తనజనకు నఱుతఁ బవనా । శనశవముఁ దగిల్చి రాజసమునఁ బరీక్షి
జ్జనపాలు చనుట, కృశుఁ డను । మునివలన నెఱింగి కోపమూర్ఛాన్వితుఁ డై. 168

ప్రతిపదార్థం: తన, జనకు= తన తండ్రియొక్క; అఱుతన్= కంఠంలో; పవన+అశన, శవమున్= వాయువును భక్షించే పాముయొక్క కళేబరాన్ని; తగిల్చి= అంటేట్లుగా చేసి; రాజసమునన్= దర్పంతో; పరీక్షిత్+జనపాలు, చనుట= పరీక్షిన్మహారాజు వెళ్ళటం; కృశుఁడు+అను= కృశుడు అనే పేరు గల; మునివలనన్= తపస్వివలన; ఎఱింగి= తెలిసికొని; కోపమూర్ఛా+అన్వితుఁడు+ఐ= కోపంయొక్క అతిశయంతో కూడినవా డై, కోపంతో వివశు డై అని అర్థం.

తాత్పర్యం: తన తండ్రిమెడలో పాముయొక్క కళేబరాన్ని అంటేట్లు వేసి దర్పంతో పరీక్షిన్మహారాజు వెళ్ళటం కృశుడనే మునివలన తెలిసికొని కోపంయొక్క అతిశయంతో కూడినవాడై. (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: పరీక్షిత్+జనపాలు- శ్చుత్వసంధి - పరీక్షిజ్జనపాలు. జనకు+ఋుతన్-తత్పురుషసమాసంలో ఉకార, ఋుకారాలకు అచ్చు పరమయినపుడు 'ను' ఆగమంగా వస్తుంది. జనకునఋుత.

వ. శాపజలంబు లెత్తికొని 'విజనం బైన విపినాంతరంబున విజితేంద్రియుం డై, మొదవుల చన్నులు వత్సంబులు గుడుచునప్పు డుద్గతం బగు పయఃఫేనంబ తనకాహారంబుగా మౌనవ్రతంబునం దపంబు సేయుచున్న మహావృద్ధు మదీయజనకు నవమానించిన పరీక్షితుండు నేఁడు మొదలుగా సప్తదివసంబులలోనఁ దక్షక విషాగ్నిదగ్ధుం డై యమసదనంబున కరిగెడు' మని శాపం బిచ్చి తండ్రిపాలికిం జని. 169

ప్రతిపదార్థం: శాప, జలంబులు= శాపమివ్వటంకొరకు నీళ్లను; ఎత్తికొని= గ్రహించి; విజనంబు+ఐన= జనరహిత మైన; విపిన+అంతరంబునన్= అడవినడుమ; విజిత+ఇంద్రియుండు+ఐ= జయింపబడిన ఇంద్రియాలు కలవా డై; మొదవుల= ఆవుల; చన్నులు; వత్సంబులు= దూడలు; కుడుచు+అప్పుడు= కుడిచేసమయంలో; ఉద్గతంబు+అగు= పైకి వచ్చే; పయస్+ఫేనంబు+అ= పాలనురుగే; తనకున్; ఆహారంబు, కాన్= భోజన మవునట్లుగా; మౌన, వ్రతంబునన్= మాటలాడకుండటం (మౌనం) అనే నియమంతో; తపంబు, చేయుచున్న= తపస్సు చేస్తున్న; మహత్, వృద్ధున్= మిక్కిలిముసలివాడిని; మదీయ, జనకున్= నాతండ్రిని; అవమానించిన= పరాభవించిన; పరీక్షితుండు; నేఁడు, మొదలుగాన్= ఈరోజుమొదలుకొని; సప్త, దివసంబుల, లోనన్= ఏడురోజులలో; తక్షక, విష+అగ్ని, దగ్ధుండు+ఐ= తక్షకు డనే సర్పరాజు విష మనే అగ్నిచే తగులబెట్టబడినవాడై; యమ సదనంబునకున్= యముని గృహానికి (నరకానికి); అరిగెడున్+అని= వెళ్ళుగాక అని; (ఎడు, త, ల, ద్రుతానికి అచ్చు పరమయినపుడు 'మ'కార మవుతుంది); శాపంబు+ఇచ్చి; తండ్రి; పాలికిన్= తండ్రి అయిన శమీకుడిచెంతకు; చని= వెళ్ళి.

తాత్పర్యం: శాప మివ్వటానికి నీళ్ళు గ్రహించి, 'జనరహిత మైన అడవినడుమ ఇంద్రియాలను నిగ్రహించి ఆవులచన్నులు దూడలు కుడిచేటప్పుడు బయటికి వచ్చే పాలనురుగే తనకు భోజనమయ్యేట్లుగా మౌనవ్రతం పూని తపస్సుచేస్తున్న మిక్కిలిముసలివాడిని నా తండ్రిని అవమానించిన పరీక్షితు డనేరాజు, నేడు మొదలుకొని (నేటికి) ఏడురోజులలో తక్షకుడనే సర్పరాజుయొక్క విషమనే అగ్నిచేత కాల్చబడి యమలోకానికి వెళ్ళుగాక! (మరణించుగాక!)' అని శాప మిచ్చి తండ్రి అయిన శమీకుని చెంతకు వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: శాప మిచ్చేటప్పుడు జలం గ్రహించి ఇట్లా జరుగునుగాక! అని పలికి దాన్ని విడిచిపెడతారు.

క. ఉరగకళేబర మంసాం । తరమునఁ బడి వ్రేలు చునికిఁ దలఁపక యచల
స్థిరుఁ డై పరమధ్యానా । వరతేంద్రియవృత్తి నున్నవాని శమీకున్. 170

ప్రతిపదార్థం: ఉరగ, కళేబరము= పాముయొక్కశవం; అంస+అంతరమునన్= మూపులనడుమ; పడి; వ్రేలుచున్+ఉనికిన్= వ్రేలాడుతుండటం; తలఁపక= తలపోయక; అచల+స్థిరుఁడు+ఐ= పర్వతంవలె కదలనివాడై; పరమ, ధ్యాన+అవరత+ఇంద్రియవృత్తిన్= గొప్పధ్యానంచేత తొలగిన ఇంద్రియాలయొక్క వ్యాపారంతో; ఉన్నవానిన్, శమీకున్= శమీకు డనేమునిని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పాముయొక్కశవం మూపులనడుమనుండి వ్రేలాడుతుండటం తలపోయక పర్వతంవలె కదలకున్నవా డై, గొప్పదైన పరమాత్మధ్యానంచేత ఉడిగిన ఇంద్రియాలయొక్క వ్యాపారాలతో ఉన్న శమీకమునిని. (తరువాతి వచనంతో అన్వయం.)

వ. కని యయ్యురగకళేబరంబుఁ బాఱవైచి, తత్క్షణంబ ప్రబుద్ధనయనుం డైనతండ్రి కభివాదనంబు సేసి, బాష్పపూరితనయనుం డై శృంగి పరీక్షితు నుద్దేశించి తన చేసిన శాపస్థితి సెప్పిన విని, శమీకుండు గరంబడలి యి ట్లనియె. 171

ప్రతిపదార్థం: కని= చూచి; ఆ+ఉరగ, కళేబరంబు= ఆపాముశవం; పాఱవైచి= తీసివేసి తద్, క్షణంబు+అ= ఆక్షణమందే; ప్రబుద్ధనయనుండు+ఐన= మేల్కొన్న(తెరువబడ్డ) కన్నులుకలవా డయిన; తండ్రికిన్; అభివాదనంబు, చేసి= గోత్ర నామాదులు చెప్పి సాష్టాంగనమస్కారం చేసి; బాష్పపూరితనయనుండు+ఐ= కన్నీటితో నిండినకన్నులు కలవా డై; శృంగి; పరీక్షితున్= పరీక్షిన్మహారాజును; ఉద్దేశించి= గురించి; తన, చేసిన= తాను చేసిన; శాప, స్థితి= శాపంయొక్క ప్రకారం; చెప్పినన్= చెప్పగా; విని; శమీకుండు; కరంబు= మిక్కిలి; అడలి= శోకించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: చూచి, ఆ పాముశవాన్ని తీసివేసి, ఆ క్షణమందే కన్నులు తెరచిన తండ్రికి నమస్కారం చేసి, కన్నీటితో నిండిననేత్రాలు కలవాడై పరీక్షితుని గురించి తా నిచ్చిన శాపవిధానాన్ని చెప్పగా విని శమీకమహర్షి మిక్కిలి దుఃఖించి ఇట్లా పలికాడు.

క. క్రోధమ తపముం జెఱుచును; । గ్రోధమ యణిమాదు లైన గుణములఁ బాపుం:
గ్రోధమ ధర్మక్రియలకు । బాధ యగుం; గ్రోధిగాఁ దపస్వికిఁ జన్నే? 172

ప్రతిపదార్థం: క్రోధము+అ= కోపమే; తపమున్= తపస్సును; చెఱుచును= చెడేట్లు చేస్తుంది; క్రోధము+అ; అణిమ+ఆదులు+ఐన= అణిమ, మహిమ మొదలయిన; గుణములన్= సిద్ధులను; పాపున్= పోగొట్టుతుంది; క్రోధము+అ; ధర్మక్రియలకున్= ధర్మంతోకూడిన కార్యాలకు; బాధ, అగున్= ఆటంకం అవుతుంది; తపస్వికిన్= మునికి; క్రోధికాన్= కోపంకలవా డవటం; చన్నే (చనున్+ఏ)= తగునా! తగ దని భావం.

తాత్పర్యం: కోపమే తపస్సును చెడగొడుతుంది. కోపమే అణిమ, లఘిమ మొదలయిన అష్టసిద్ధులను పోగొడుతుంది. కోపమే ధర్మంతో కూడిన కార్యాలకు బాధ కలిగిస్తుంది. కావున తపస్సు చేసే మునికి కోపం తగునా?

విశేషం: ఈ పద్యం దీని తర్వాతిపద్యం నన్నయ సూక్తినిధిత్వానికి తార్కాణాలు, చనున్+ఏ= ప్రశ్నార్థకమైన ఏకారం పరమవటంచేత 'చను' లోని ఉకారం లోపించింది- చన్నే.

క. క్షమ లేని తపసితపమును, । బ్రమత్తుసంపదయు, ధర్మబాహ్యప్రభురా
జ్యము భిన్నకుంభమున తో । యములట్టుల యధ్రువంబు లగు నివి యెల్లన్. 173

ప్రతిపదార్థం: క్షమ, లేని= ఓర్పు లేని; తపసి, తపమును= మునియొక్కతపస్సును; ప్రమత్తు= మిక్కిలిమత్తుగొన్నవాడి; (ప్రమాదపడేవాడియొక్క); సంపదయున్= ధనమున్నూ; ధర్మ, బాహ్య, ప్రభు= ధర్మానికి వెలిఅయిన (ధర్మంలేని) రాజుయొక్క; రాజ్యమున్= ప్రభుత్వమున్నూ, ఇవి, ఎల్లన్= ఇవన్నీ; భిన్నకుంభమున, తోయములు+అట్టులు+అ= బ్రద్ద లయిన కుండలోని నీళ్ళవలె; అధ్రువంబులు+అగున్= అస్థిరాలు అవుతాయి.

తాత్పర్యం: ఓర్పులేని ముని తపస్సున్నూ, ప్రమాదపడేవాడి ధనమున్నూ, ధర్మంనుండి తొలగినరాజురాజ్యమున్నూ, ఇవన్నియు బ్రద్దలయిన కుండలోని నీళ్ళవలె అస్థిరా లవుతాయి.

విశేషం: అలం: ఉపమ, కుంభము+తోయములు=తత్పురుషంలో ఒక్కొక్కప్పుడు 'న' ఆగమంగా వస్తుంది; కుంభమునతోయములు.

వ. **క్షమ విడిచి నీవు దృష్టాదృష్టవిరుద్ధం బైనక్రోధంబుఁ జేకొని సకలక్షమారక్షకుం డైన పరీక్షిత్తునకుం బరీక్షింపక శాపం బిచ్చి చెట్ట సేసితివి; రాజరక్షితు లై కాదె మహామును లతిఘోరతపంబు సేయుచు, వేదవిహిత ధర్మంబులు నడుపుచు మహాశక్తిమంతు లయి యున్నవా; రట్టిరాజుల కపకారంబు దలంచు నంత కంటె మిక్కిలిపాతకం బొం డెద్ది? మఱియు భరతకుల పవిత్రుం డైన పరీక్షితు రాజసామాన్యుంగా వగచితే? 174**

ప్రతిపదార్థం: క్షమ= ఓర్పు; విడిచి; నీవు; దృష్ట+అదృష్ట, విరుద్ధంబు+ఐన= మొదటిసారే చూడబడినట్టిదీ ఇదివర కెన్నడు చూడబడనట్టిదీ, మునులకు పొందతగనిదీఅయిన; క్రోధంబున్= కోపాన్ని; చేకొని= గ్రహించి; సకల, క్షమా, రక్షకుండు+ఐన= సర్వభూమిని రక్షించేవా డయిన; పరీక్షితునకున్; పరీక్షింపక= బాగుగా పరిశీలించక; శాపంబు+ఇచ్చి; చెట్ట, చేసితివి= చెడు చేశావు; రాజ, రక్షితులు+ఐ, కాదె= రాజుచే రక్షింపబడినవా రయి కదా! మహత్, మునులు= గొప్పమునులు; అతి, ఘోర, తపంబు, చేయుచున్= మిక్కిలి తీవ్ర మైన తపస్సు చేస్తూ; వేద, విహిత, ధర్మంబులు= వేదాలచే విధింపబడిన ధర్మకార్యాలు; నడుపుచున్= చేస్తూ; మహత్, శక్తిమంతులు+అయి, ఉన్నవారు= గొప్పమహిమ కలవా రయి ఉన్నారు; అట్టి, రాజులకు, అపకారంబు= కీడు; తలంచు, అంతకంటెన్= తలపోసేంతకంటె; మిక్కిలి పాతకంబు= అధిక మయినపాపం; ఒండు= ఇతరం; ఎద్ది= ఏది? ఏదీ లే దని భావం; మఱియున్= అదిగాక; భరత, కుల, పవిత్రుండు+ఐన= భరతకులంలో ధర్మకార్యాలు చేయటంచేత పవిత్రు డైన (భరతవంశాన్ని పవిత్రం చేసేటి అని కూడ అర్థం చెప్పవచ్చును); పరీక్షితున్= పరీక్షిన్మహారాజును; రాజ, సామాన్యున్, కాన్= సాధారణు డైనరాజుగా; వగచితి+ఏ= (భూతకాల మవటంచేత 'ఏ'కారంలోపం) తలచావా!

తాత్పర్యం: ఓర్పు విడిచి నీవు ఇదివర కెప్పుడు చూడనట్టి, మునులకు ఉండరానట్టి కోపాన్ని పొంది సరిగా ఆలోచించక సర్వభూమిని రక్షించేవా డైన పరీక్షిన్మహారాజుకు శాప మిచ్చి చెడు చేశావు. రాజులచే రక్షింపబడేకదా గొప్పమునులు మిక్కిలి తీవ్రమయిన తపస్సు చేస్తూ, వేదాలచే విధింపబడిన ధర్మకార్యాలు కొనసాగిస్తూ, గొప్ప శక్తికలవారై ఉన్నారు. అట్టిరాజులకు కీడుచేయ తలపోయటం కంటె అధికతరమైన పాపం మరొకటి ఉండదు. అదికాక, భరతవంశాన్ని పవిత్రం చేసేటి పరీక్షిన్మహారాజును సామాన్యు డైన రాజుగా తలపోశావా? అతడు సామాన్యు డైనరాజు కాడు. గొప్పమహారాజని భావం.

విశేషం: దృష్టాదృష్టవిరుద్ధం అనేదాన్ని విశేషణోభయపదకర్మధారయంగా గ్రహిస్తే, పైన చెప్పబడిన అర్థం సరిపోతుంది. దాన్ని షష్ఠీతత్పురుషంగా గ్రహిస్తే, దృష్ట మంటే చూడబడినది, అదృష్ట మంటే చూడబడనిది. ఇహపరాలకు విరుద్ధ మయిన దని అర్థం చెప్పుకోవాలి.

ఉ. **క్షత్త్రియవంశ్యు లై ధరణిఁ గావఁగ బుట్టినవారు బ్రాహ్మణ**
క్షత్త్రియవైశ్యశూద్రు లనఁగాఁ గల నాలుగుజాతులన్ స్వచా

రిత్రము దప్పకుండఁగఁ బరీక్షితు కాచినయట్లు రామమాం
ధాతృరఘుక్షితీశులు ముదంబునఁ గాచిరె యే యుగంబులన్! 175

ప్రతిపదార్థం: క్షత్త్రియ, వంశ్యులు+ఐ= క్షత్రియవంశానికి చెందినవారై; ధరణిన్= భూమిని; కావఁగన్= రక్షించటానికి; పుట్టినవారు; (దీన్ని రామమాంధాతృరఘుక్షితీశులు అనేదానికి విశేషణంగా గ్రహించాలి); రామ, మాంధాతృ; రఘు, క్షితీశులు= రాముడు, మాంధాత, రఘువు అనేరాజులు; ఏ, యుగంబులన్= ఏయుగాలలోనైనా; బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు+అనఁ గాన్, కల= బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే పేర్లు కల; నాలుగుజాతులన్= నాలుగు వర్ణాలలోనివారిని; స్వ, చారిత్రము= తమతమప్రవర్తన (వర్ణధర్మం); తప్పక+ఉండఁగన్= విడిచిపోకుండేట్లుగా; పరీక్షితు, కాచిన, అట్లు= పరీక్షిన్మహారాజు రక్షించినట్లు; ముదంబునన్= సంతోషంతో; కాచిరి+ఎ= రక్షించారా!

తాత్పర్యం: క్షత్రియకులానికి చెందినవా రై, భూమిని రక్షించటానికి పుట్టినట్టి రాముడు, మాంధాత, రఘుమహారాజు మొదలయినరాజులు ఏయుగంలోనైనా బ్రాహ్మణులు, క్షత్రియులు, కోమట్లు, శూద్రులు అనేపేర్లుగల నాలుగువర్ణాలను తమతమధర్మాలను తప్పకుండ పరీక్షిన్మహారాజు రక్షించినట్లు సంతోషంతో రక్షించిఉన్నారా! (రాముడు, మాంధాత మున్నయినవారుకూడ పరీక్షితుడు రక్షించినట్లు నాలుగువర్ణాలప్రజలను, తమతమవర్ణధర్మాలను తప్పకుండ రక్షించి ఉండలే దని భావం.)

విశేషం: పరీక్షితు, కాచిన, అట్లు= కర్తృపదప్రథమకు షష్ఠీవాడబడింది. క్షత్రియు డంటే క్షతం(ఆపద) నుండి రక్షించేవాడు అని వ్యుత్పత్తి, మాంధాత సూర్యవంశానికి చెందినమహారాజు, యువనాశ్వునికుమారుడు. అతడు తండ్రిగర్భంనుండి బయటికి రాగానే మునులు ఇతడు దేన్ని కుడుచును (కమ్+ఏష-ధాస్యతి) అని పలికారు. అప్పుడు ఇంద్రుడు వచ్చి 'మాం ధాస్యతి', నన్ను కుడుచును అని పలికాడు. అందుచే ఇతనికి మాంధాత అనే పేరు కలిగింది. ఇతడు నన్ను తొలగిస్తా డని ఇంద్రుడు భయంపొందటంచేత ఇతని కీపేరు వచ్చిందని కొందరు చెప్పి ఉన్నారు. ఇతడు షోడశ(16) మహారాజుల్లో ఒకడు. అప్పకవి ఈపద్యాన్ని సంయుతాసంయుతప్రాసానికి ఉదాహరణంగా ఇచ్చాడు. మొదటి మూడుపాదాలలో ప్రాసాక్షరం తకారరేఫసంయుక్త మయింది. నాల్గవపాదంలో మాంధాతృ అనేటప్పుడు మాత్రం 'తృ' అసంయుక్తం.

వ. 'అతండు మృగయావ్యసనంబున నపరిమితక్షుత్పిపాసాపరిశ్రాంతుం డయి యెఱుంగక నా కవజ్ఞఁ జేసె; నేనును దాని సహించితి; నమ్మహాత్మునకు నీయిచ్చిన శాపంబుఁ గ్రమ్మరింపనేర్తేని లగ్గగు' ననిన శృంగి యి ట్లనియె. 176

ప్రతిపదార్థం: అతండు= పరీక్షిత్తు; మృగయా, వ్యసనంబునన్= వేటలోని అత్యాసక్తిచే; అపరిమిత, క్షుధ్, పిపాసా, పరిశ్రాంతుండు+అయి= అధిక మైన ఆకలిచేత, దప్పికచేత, అలసినవా డయి; ఎఱుంగక= తెలియక; నాకున్; అవజ్ఞన్= అవమానాన్ని; చేసెన్; ఏనును= నేనుకూడ; దానిన్= అతడు చేసిన అవమానాన్ని; సహించితిన్= సైచాను; ఆ+మహాత్మునకున్= ఆమహనీయు డైన పరీక్షిత్తునకు; నీఇచ్చిన= (కర్తృపదప్రథమకుషష్ఠి) నీవు ఇచ్చిన; శాపంబును; క్రమ్మఱింపన్= మరల్చటానికి; నేర్తు(వు) ఏని=(తద్ధర్మమున వకారలోపం) ఓపుతావేని; లగ్గు+అగున్= మేలవుతుంది; అనినన్= అని శమీకుడు పలుకగా; శృంగి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ పరీక్షిత్తు వేటపైని ఆసక్తిచేత అధికమయిన ఆకలిచే, దప్పికచే మిక్కిలి అలసి తెలియక నాకు అవమానం చేశాడు. నేనుకూడ దాన్ని సహించాను. ఆ మహనీయు డైన పరీక్షిత్తుకు నీవు ఇచ్చిన శాపం మరల్చగలిగితే మేలవుతుంది. అని శమీకుడు పలుకగా కుమారు డైన శృంగి ఇ ట్లన్నాడు.

విశేషం: వ్యసనాలు ఏడు: వెలది, జూదం, పానం, వేట, వాక్పారుష్యం, దండపారుష్యం, సొమ్ము అనవసరంగా వ్యయం చేయటం. వీటిలో వేట ఒకటి. వ్యసనపరాయణులు ఎట్టిదోషా న్నైనా చేస్తా రనటానికి ఇది నిదర్శనం.

క. అలుకమెయి మున్న పలికితి । నలుకని నా పలుకు తీక్ష్ణ మై యింతకు ను
జ్జ్వలదహనాకృతిఁ దక్షకుఁ । దలరఁగఁ బ్రేరేప కేల తానెడ నుడుగున్. 177

ప్రతిపదార్థం: అలుకమెయిన్= కోపంతో; మున్ను+అ= పూర్వమే; పలికితిన్= శాపమిచ్చాను; అలుకని= భయపడని; నా, పలుకు= నామాట; తీవ్రమై, ఇంతకున్= ఈపాటికి; ఉజ్జ్వల, దహన+ఆకృతిన్= మండే అగ్నియొక్క ఆకారంతో; తక్షకున్= తక్షకుడిని; తలరఁగన్= సంభ్రమించేటట్లుగా, (చలించేటట్లుగా), ప్రేరేపక= ప్రోత్సహింపక; ఏల= ఎందుకు; తాన్= తాను; ఎడన్= దూరంగా; వ్యర్థంగా; ఉడుగున్= తొలగిపోతుంది, మానుతుంది; మాన దని భావం.

తాత్పర్యం: కోపంతో పూర్వమే పలికాను. భయపడనినామాట తీవ్ర మై ఈపాటికి మండేఅగ్నియొక్క ఆకారంతో తక్షకుడిని కలత పొందేట్లుగా ప్రోత్సహింపక తాను ఎందుకు దూరంగా ఉండిపోతుంది? అంటే తక్షకుడిని తప్పక ప్రేరేపిస్తుం దని భావం.

విశేషం: ('అలుకని' - అనేపాఠం సందేహాస్పదంగా ఉన్నది.) (కొన్నిప్రతులలో ఉండే 'అలుకనె'- (అలుకన+ఎ) = నాపలుకు అంత చులకనిదా? అనేపాఠం ఉచితతరంగా కనిపిస్తున్నది.)

వ. 'నావచనం బమోఘం' బనిన, శమీకుండు శోకాకులితచిత్తుండై, తన శిష్యున్ గౌరముఖుం డనువానిం బిలిచి, 'దీని నంతయుఁ బరీక్షితునకెఱింగించి తక్షకువలనిభయంబు దలంగునట్టి యుపాయంబు సేసికొమ్మని చెప్పి ర' మ్మనిన; వాఁడు నప్పుడ పరీక్షితుపాలికిం జని యి ట్లనియె. 178

ప్రతిపదార్థం: నావచనంబు= నాపలుకు; అమోఘంబు= వ్యర్థం కానిది; అనినన్= అని శృంగి పలుకగా; శమీకుండు; శోక+ఆకులిత, చిత్తుండు+అయి= చింతచే కలత చెందిన హృదయం కలవా డయి; గౌరముఖుండు+అనువానిన్= గౌరముఖుడు అనేపేరు కలవాడిని; తన, శిష్యున్; పిలిచి; దీనిన్, అంతయున్= శృంగి శపించినవిషయమంతా; పరీక్షితునకున్; ఎఱింగించి= తెలిపి; తక్షకువలని భయంబు= (సమాసంలో చేత, తోడ, వలన అనేవాటికి 'ఇ' కారం వస్తుంది) తక్షకుడి వలన కలిగే భయాన్ని; తలంగు, అట్టి= తొలగించేటి; ఉపాయంబు; చేసికొమ్ము, అని= చేసికొమ్మని; చెప్పి, రమ్ము+అనినన్= చెప్పిర మ్మని పలుకగా; వాఁడున్= ఆగౌరముఖుడును; అప్పుడు+అ= వెంటనే; పరీక్షితు, పాలికిన్= పరీక్షిత్తుచెంతకు; చని=వెళ్ళి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నా పలుకు వ్యర్థం కాదు' అని శృంగి పలుకగా శమీకుడు దుఃఖంచేత కలత చెందిన హృదయం కలవా డయి, గౌరముఖుడనే పేరు గల తనశిష్యుడిని పిలిచి 'ఈ విషయమంతా పరీక్షిత్తుకు తెలిపి, తక్షకుడివలన కలిగే భయం తొలగే ఉపాయం చేసికొ మ్మని చెప్పిర' మ్మని పంపగా ఆ గౌరముఖుడు వెంటనే పరీక్షితుడిచెంతకు వెళ్ళి ఇట్లా పలికాడు.

సీ. అడవిలో నేకాంతమతి ఘోరతపమున । నున్న మా గురులపై నురగశవము
వైచుట విని యల్గి, వారి తనూజుండు । శృంగి యన్వాఁడు కార్చిచ్చునట్టి
శాపంబు నీ కిచ్చె, సప్తాహములలోన । నా పరీక్షితుఁడు నాయలుకఁ జేసి
తక్షకవిషమున దగ్ధుఁ డయ్యెడు మని, । దానికి గురులు సంతాప మంది

ఆ. భూతలేశ! నన్నుఁ బుత్తెంచి రిప్పుడు, । తద్భయంబులెల్లఁ దలఁగునట్టి
మంత్రతంత్రవిధు లమర్చి యేమఱకుండు । నది నిరంతరంబు ననియుఁ గఱప. 179

ప్రతిపదార్థం: అడవిలోన్= అడవిలో; ఏకాంత, మతిన్= ఏకాగ్రమైన మనస్సుతో; ఘోర, తపమునన్, ఉన్న= తీవ్రమైన తపస్సులో ఉండిన; మా గురులపైన్= మాగురు వైన శమీకునిమీద; (పూజ్యార్థంలో బహువచనం); ఉరగశవము= సర్పంయొక్కకళేబరాన్ని (చచ్చినపామును); వైచుట= వేయటం; విని; అల్గి= కోపించి; వారితనూజుండు= మాగురువులకుమారుడు; శృంగి, అన్, వాఁడు= శృంగి అనే పేరు కలవాడు; ('అను' లోని 'ఉ' కారం లోపిస్తే 'అన్వాడు' అయింది); కార్చిచ్చు+అట్టి= దావాగ్నివంటి; (అడవిని కాల్చే అగ్నివంటి); శాపంబు; సప్త+అహములలోనన్= ఏడురోజుల్లో; ఆ పరీక్షితుఁడు; నా, అలుకన్‌చేసి= నాకోపంచేత; తక్షకవిషమునన్= తక్షకుడి యొక్క విషంచేత; దగ్ధుఁడు= దహింపబడినవాడు; అయ్యెడున్+అని= అవునుగాక అని; (దీవనకు, శాపానికి ఎడమ, కావుత మొదలైనవి అవుతాయి); నీకున్, ఇచ్చెన్= నీకు శాపమిచ్చాడు; దానికిన్= శాపమివ్వటానికి; గురులు= శమీకుడు; సంతాపము+అంది= దుఃఖం పొంది; భూతల+ఈశ= ఓరాజా! ఇప్పుడు; నన్నున్; తద్, భయంబులు+ఎల్లన్= ఆశాపంవలని భయాలన్నీ; తలఁగు, అట్టి= తొలగించేటి; మంత్ర, తంత్ర, విధులు= మంత్రాలు, తంత్రాలు, (చేయదగిన కార్యాలు) మొదలైన విధానాలు; నిరంతరంబున్= సతతం; అమర్చి= ఏర్పరచి; ఏమఱక+ఉండునది= అశ్రద్ధవహించక ఉండాలి; అనియున్= అనికూడ; కఱపన్= బోధించటానికి; ఇప్పుడు; నన్నున్; పుత్తెంచిరి= పంపారు.

తాత్పర్యం: అడవిలో ఏకాగ్రమయిన మనస్సుతో తీవ్రమయిన తపస్సు చేస్తున్న పూజ్యులైన మాగురువుగారిపై నీవు చచ్చినపామును వేయటం విని కోపించి శృంగి అనేపేరు కల వారికుమారుడు 'ఏడురోజులలో ఆ పరీక్షితుడు నాకోపంచేత తక్షకు డనే పాముయొక్క విషంచేత దహింపబడుగాక!' అని దావాగ్ని వంటి శాపం నీ కిచ్చాడు. అట్లా అతడు శాప మివ్వటానికి మా గురువుగారు శోకించి ఓరాజా! దానివల్ల కలిగే భయాలన్నీ తొలగించే మంత్రాలు తంత్రాలు మొదలయిన విధానాలన్నీ ఏర్పరచి సంతతం జాగరూకతతో ఉండా లని నీకు బోధించేకొరకు నన్నిప్పుడు నీకడకు పంపారు.

విశేషం: ఇది శమీకుని క్షమాశక్తినీ సౌజన్యాన్నీ సూచిస్తుంది. అలం: ఉపమ. అయ్యెడున్+అని= అయ్యెడుమని "ఎడు, తల ద్రుతంబునకు అచ్చుపరంబగునపుడు మకారంబగు.'' (బాలవ్యా. క్రి.28సూ.)

వ. అని చెప్పి గౌరముఖుం డరిగినం, బరీక్షితుండు పరిక్షీణహృదయుం డై తనచేసిన వ్యతిక్రమంబునకు సంతాపించి, శమీకు నుపశమనంబునకు మెచ్చి శృంగి శాపంబునకు వెఱచి మంత్రివర్గంబుతో విచారించి యాత్మరక్షయం దప్రమాదుం డై. 180

ప్రతిపదార్థం: అని; చెప్పి; గౌరముఖుండు= శమీకునిశిష్యుడు; అరిగినన్= వెళ్ళగా; పరీక్షితుండు; పరిక్షీణహృదయుండు+ఐ= మిక్కిలి బలహీన మైన హృదయం కలవాడై; తనచేసిన= తాను చేసిన, (కర్తృపదప్రథమకు షష్ఠి); వ్యతిక్రమంబునకున్= ధర్మవిరుద్ధకార్యానికి; సంతాపించి= దుఃఖించి; శమీకు+ఉపశమంబునకున్= శమీకునియొక్క ఓర్పునకు; మెచ్చి; శృంగి, శాపంబునకున్= శృంగి ఇచ్చినశాపానికి; వెఱచి= భయపడి; మంత్రివర్గంబుతోన్= మంత్రులసమూహంతో; విచారించి= ఆలోచించి; ఆత్మ, రక్ష, అందున్= తన్ను రక్షించుకోవటంలో; అప్రమాదుండు+అయి= ఏమరుపాటు లేనివా డయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని గురువుగారిసందేశం చెప్పి గౌరముఖుడు వెళ్ళగా, పరీక్షిత్తు కలతచెందినహృదయం కలవాడై తాను చేసిన ధర్మ విరుద్ధకార్యానికి శోకించి, శమీకుని ఓర్పునకు మెచ్చి, శృంగి ఇచ్చినశాపానికి భయపడి, మంత్రులసమూహంతో ఆలోచించి తనను రక్షించుకోవటంలో ఏమరుపాటు లేనివాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. సకలోర్వీశుఁ డతిప్రయత్నపరుఁ డై, సర్వక్రియాదక్ష త
క్షకకోటుల్ పనిసేయఁగా, ఘనతరైకస్తంభహర్మ్యంబుఁ ద
క్షకభీతిన్ రచియింపఁ బంచి, దృఢరక్షన్ దానిలో నుండెఁ బా
యక రాత్రిందివజాగరూకహితభృత్యామాత్యవర్గంబుతోన్. 181

ప్రతిపదార్థం: సకల+ఉర్వీ+ఈశుఁడు= సర్వభూమికిని ప్రభు వైన పరీక్షిత్తు; తక్షకభీతిన్= తక్షకుడివలని భయంచేత; అతిప్రయత్నపరుడు+ఐ= అధికమైన ప్రయత్నంలో ఆసక్తికలవాడై; సర్వ, క్రియా, దక్ష, తక్షక, కోటుల్= అన్నిపనులలోను సమర్థులైన వడ్ల (వడ్రంగుల) వారి సముదాయాలు; పనిచేయఁగాన్; ఘనతర, ఏక, స్తంభ, హర్మ్యంబున్= మిక్కిలి గొప్ప దైన ఒకటే స్తంభంగల సౌధాన్ని; రచియింపన్= నిర్మించటానికి; పంచి= ఆజ్ఞాపించి; రాత్రిందివ, జాగరూక, హిత, భృత్య+అమాత్య, వర్గంబుతోన్= రాత్రియు పగలును శ్రద్ధవహించి ఉండే ఆప్తులయొక్కయు, సేవకులయొక్కయు, మంత్రులయొక్కయు సముదాయంతో; పాయక= విడువక; దృఢరక్షన్= దట్ట మైన రక్షణతో; దానిలోన్= ఆఒంటికంబపుమేడలో; ఉండెన్= నివసించాడు.

తాత్పర్యం: సర్వభూమికి ప్రభు వైన పరీక్షిత్తు అధిక మైన ప్రయత్నంలో ఆసక్తి కలవాడై తక్షకుడివలనిభయంచేత అన్నిపనులను చేయటంలో నేర్పరు లైన వడ్రంగులసమూహాలు పనిచేయగా గొప్పదైన ఒంటికంబపుమేడ నిర్మించటానికి ఆజ్ఞాపించి రేయుంబవళ్ళు మేల్కొని ఉండి శ్రద్ధవహించేఆప్తుల, సేవకుల, మంత్రుల సమూహంతో విడువక దట్టమైనరక్షణతో ఆ ఒంటికంబపు మేడలో నివసించాడు.

వ. మఱియు విషాపహరంబులయి వీర్యవంతంబు లయిన మంత్రతంత్రంబులు గలిగి యాజ్ఞాసిద్ధులైన విషవైద్యుల నొద్దఁ బెట్టికొని పరీక్షితుం డుండునంత, నట తక్షకుండు విప్రవచన ప్రచోదితుం డయి పరీక్షితునొద్దకు నెవ్విధంబునఁ బోవనగునో యని చింతించుచుండె; నటఁ దొల్లి. 182

ప్రతిపదార్థం: మఱియున్= అదిగాక; విష+అపహరంబులు+అయి= విషాన్ని పోగొట్టేవై; వీర్యవంతంబులు+అయిన= శక్తి కల వైన; మంత్రతంత్రంబులు= మంత్రంబులును, వాటికి ఉచితమైన చర్యలును కలిగి; ఆజ్ఞాసిద్ధులు+అయిన= ఆజ్ఞతో సిద్ధిపొందిన (నోటితో ఆజ్ఞాపించటం చేతనే విషాన్ని పోగొట్టడంలో సమర్థులైన); విషవైద్యులన్= విషాన్ని తొలగించే వైద్యులను; ఒద్దన్= చెంత; పెట్టుకొని= ఉంచుకొని; పరీక్షితుండు= పరీక్షిన్మహారాజు; ఉండు+అంతన్= ఉండగా; అట= అచ్చట; తక్షకుండు; విప్ర, వచన, ప్రచోదితుండు+అయి= బ్రాహ్మణు డైన శృంగియొక్క శాపవచనంచేత ప్రేరేపింపబడినవాడై; పరీక్షితు+ఒద్దకున్= పరీక్షిత్తుదగ్గరకు; ఏవిధంబునన్= ఏవిధంగా; పోవన్, అగునో, అని= వెళ్ళటానికి వీలవుతుందో అని; చింతించుచున్+ ఉండెన్; అటన్; తొల్లి= పూర్వం.

తాత్పర్యం: అదిగాక, విషాన్ని తొలగించే, శక్తితో కూడినమంత్రాలు క్రియాకలాపాలు కలిగి, ఆజ్ఞాపించటంచేతనే విషాన్ని పోగొట్టటానికి సమర్థు లైన విషవైద్యులను దగ్గర ఉంచుకొని పరీక్షిత్తు ఉండగా; అచ్చట తక్షకుడు బ్రాహ్మణు డైన శృంగివచనంచేత ప్రేరేపించబడి, పరీక్షిత్తుకడకు ఎట్లా పోవటానికి వీలవుతుందో అని ఆలోచిస్తూ ఉన్నాడు. అచ్చట పూర్వం (అంతకుపూర్వమే). (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కశ్యపునకుఁ దక్షకుఁడు గోరిన ధనం బిచ్చి మరల్చుట (సం. 1-38-31)

మధ్యాక్కర.

ధరణిఁ జరాచరభూతసంఘుంబుఁ దమవిషవహ్ని
నురగంబు లేర్చుచు నునికి కలిగి, పయోరుహగర్భుఁ
డురగవిషాపేతజీవ సంజీవనోపదేశంబు
గరుణఁ గశ్యపునకు నిచ్చె నఖిలలోకహితంబు పొంటె. 183

ప్రతిపదార్థం: ధరణిన్= భూమిలో; చర+అచర, భూత, సంఘుంబున్= జంగమస్థావర (కదిలేటి కదలనట్టి) ప్రాణుల, వస్తువుల సముదాయాన్ని; తమ, విషవహ్నిన్= తమయొక్కవిష మనే అగ్నిచే; ఉరగంబులు= పాములు; ఏర్చుచున్= కాలుస్తూ; ఉనికికిన్= ఉండటానికి; అలిగి= కోపించి; పయోరుహగర్భుఁడు= బ్రహ్మ; ఉరగవిష+అపేత, జీవ, సంజీవన+ఉపదేశంబు= పాములయొక్క విషంచేత పోయినప్రాణం కలవారిని మళ్ళీ బ్రదికించే ఉపదేశాన్ని (మంత్రాన్ని); కరుణన్= దయతో; అఖిల, లోక, హితంబు, పొంటెన్= సర్వలోకాలయొక్కమేలుకొరకు; కశ్యపునకున్= కశ్యపమునికి; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: భూమిలో స్థావరజంగమ వస్తుసముదాయాన్ని తమవిషాగ్నిచేత పాములు కాల్చి వేస్తుండటంవలన కోపించి బ్రహ్మదేవుడు సర్వలోకాలమేలు కోరి పాములవిషంచేత ప్రాణం పోయినవారిని మళ్ళీ జీవింపజేసే మంత్రోపదేశాన్ని దయతో కశ్యపుడికి ఇచ్చాడు.

విశేషం: జడపదార్థాలుకూడ తీవ్రమయిన సర్పవిషంచేత మాడిపోవటానికి అవకాశం ఉన్నది. మధ్యాక్కర అనేది ఒక దేశీవృత్తం. ఇందులో పాదానికి రెండింద్రగణాలు, ఒకసూర్యగణం, మళ్ళీ రెండు ఇంద్రగణాలు ఒకసూర్యగణం, మొత్తం ఆరుగణాలు ఉంటాయి. పూర్వకవులలో మధ్యాక్కరను నన్నయ, ఆరణ్యపర్వశేషంలో ఎఱ్ఱన మాత్రమే వాడారు. అయిదవగణంలోని మొదటిఅక్షరం యతిమిత్రస్థానం. ఎఱ్ఱన నాల్గవగణం మొదటిఅక్షరంపైనే యతిస్థానం వేశాడు. పలువురు లాక్షణికులుకూడ అట్లే చెప్పారు. ప్రాసనియమం ఉన్నది. పొంటె అనేది చతుర్థీవిభక్తి ప్రత్యయం. నన్నయ తర్వాత దానిప్రయోగం క్రమంగా సన్నగిల్లింది.

వ. అట్టి కశ్యపుం డను బ్రహ్మర్షి 'శృంగిశాపంబునఁ బరీక్షితుండు తక్షకదష్టుం డగు నేఁడు సప్తమదివసం బటె! యేను వాని నపేతజీవు సంజీవితుం జేసి నావిద్యాబలంబు మెఱయుదు; మఱి యదియునుంగాక.' 184

ప్రతిపదార్థం: అట్టి; కశ్యపుండు+అను; బ్రహ్మ+ఋషి= బ్రహ్మజ్ఞానం కల మహర్షి; శృంగి, శాపంబునన్= శృంగియొక్క శాపంచేత; పరీక్షితుండు; తక్షక, దష్టుండు+అగు= తక్షకునిచేత కరువబడినవాడు కాగల; నేఁడు= ఈరోజు; సప్తమ, దివసంబు+అటె= ఏడవరో జట; ఏను= నేను; అపేతజీవున్= తొలగినప్రాణం కలవాడిని; వానిన్= ఆపరీక్షితుని; సంజీవితున్; బ్రతికినవాడిని; చేసి; నా, విద్యాబలంబు= నాయొక్కవిద్యలోనిశక్తిని, మెఱయుదున్= ప్రకాశింపజేస్తాను; మఱి= ఇంకను; అదియునున్, కాక= అది కాక.

తాత్పర్యం: విషాగ్నిదగ్ధులను మళ్ళీ జీవింపజేయగల మంత్రాన్ని బ్రహ్మచేత ఉపదేశం పొందిన బ్రహ్మజ్ఞానంగల కశ్యపుడనే బ్రహ్మర్షి ఇట్లా ఆలోచించాడు: 'శృంగియొక్క శాపంచేత పరీక్షితుడు తక్షకునిచేత కరవబడినవాడవుతాడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అతడు శాప మిచ్చి నేటికి ఏడుదినాలు అయినదట; ప్రాణం పోయిన ఆ పరీక్షిత్తును నేను మళ్ళీ సజీవుడిని చేసి నావిద్యలోని శక్తిని ప్రకాశింపజేస్తాను. అదిగాక'. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'మెఱయు' ధాతువు అంతర్భావితప్రేరణం. మెఱయు అంటే 'మెఱయించు' అని అర్థం.

తే. **ధరణియెల్లను రక్షించు ధర్మచరితు । నా పరీక్షితు రక్షించి, యతనిచేత**
నపరిమితధనప్రాప్తుండ నగుదుఁ; గీర్తి । యును ధనంబు ధర్మముఁ గొను టుఱదె నాకు. **185**

ప్రతిపదార్థం: ధరణి+ఎల్లనున్= భూమినంతటిని; రక్షించు= కాపాడే, ధర్మచరితున్= ధర్మంతోకూడిన చరిత్రుడిని; ఆ, పరీక్షితున్= ఆ పరీక్షిన్మహారాజును; రక్షించి= జీవింపచేయటంచేత కాపాడి; అతనిచేతన్; అపరిమిత, ధన, ప్రాప్తుండన్= అధికమయినధనాన్ని పొందినవాడిని; అగుదున్= అవుతాను; కీర్తియును; ధనంబు; ధర్మము= పుణ్యం; కొనుట; నాకున్; ఉఱదె= తగదా; (తగి ఉంటుంది).

తాత్పర్యం: 'భూమినంతటిని కాపాడే ధర్మప్రవర్తను డైన పరీక్షిత్తును తక్షకవిషాగ్నినుండి కాపాడి అతనిచేత అధికమయిన ధనాన్ని పొందుతాను. కీర్తిని. సొమ్మును, పుణ్యాన్ని గ్రహించటం నాకు తగదా!' (తగును అని భావం).

వ. **అని విచారించి హస్తిపురంబునకుం బోవువానిఁ దక్షకుండు వృద్ధవిప్రుం డయి వనంబులో నెదురంగని 'మునీంద్రా! యెట వోయె, దేమి కార్యంబున' కనిన వానికిం గశ్యపుం డి ట్లనియె.** **186**

ప్రతిపదార్థం: అని; విచారించి= ఆలోచించి; హస్తిపురంబునకున్= హస్తినాపురానికి; పోవువానిన్= వెళ్ళేవాడిని(కశ్యపుని); తక్షకుండు; వృద్ధవిప్రుండు+అయి= ముసలిబ్రాహ్మణు డయి; వనంబులోన్= అడవిలో; ఎదురన్= తనఎదుట; కని= చూచి; ముని+ఇంద్రా= మునిశ్రేష్ఠుడ! ఎట= ఎచ్చటికి; పోయెదు (వకారలోపం)= వెడతావు; ఏమి, కార్యంబునకున్= ఏపని చేయటానికి; అనినన్= అని అడుగగా; వానికిన్= వృద్ధబ్రాహ్మణరూపు డయిన తక్షకునికి; కశ్యపుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: అని ఆలోచించి, పరీక్షితు డుండే హస్తినాపురానికి వెళ్ళే కశ్యపుడిని తక్షకుడు ముసలిబ్రాహ్మణుడి రూపంతో వెళ్ళి అడవిలో తనయెదుట చూచి 'ఓమునిశ్రేష్ఠుడా! ఎచటికి, ఏపని చేయటానికి వెళ్ళుతున్నావు?' అని అడుగగా; తక్షకుడితో కశ్యపుడు ఇట్లా పలికాడు.

క. **తక్షకుఁ డను పన్నగుఁడు ప । రీక్షితుఁ గఱచునటె నేఁ; డరిందము నతనిన్**
రక్షింపఁగఁ బోయెద శుభ । దక్షిణు నా మంత్ర తంత్ర దాక్షిణ్యమునన్. **187**

ప్రతిపదార్థం: తక్షకుఁడు+అను, పన్నగుఁడు= తక్షకుడనే పేరున్న నాగుడు (పాము), నేఁడు= ఈరోజున; పరీక్షితున్= పరీక్షిన్మహారాజును; కఱచున్, అటె= కరుస్తాడట; అరిందమున్= శత్రువులను అణచేవాడు; శుభదక్షిణున్= మంగళప్రదుడు; (మంచిమనస్సుకలవాడు) అయిన; అతనిన్= ఆ పరీక్షిన్మహారాజును; నామంత్ర, తంత్ర, దాక్షిణ్యమునన్= నాయొక్క మంత్రాలలోను, శాపహరణకార్యంలోను ఉన్న సామర్థ్యంచేత; రక్షింపఁగన్= కాపాడటానికి; పోయెదన్= పోతున్నాను.

తాత్పర్యం: తక్షకు డనే పాము నేడు పరీక్షిన్మహారాజును కరుస్తాడట; శత్రువుల నణచేవాడు, శుభప్రదుడు, సమర్థుడు, మంచిమనస్సు కలవాడు అయిన ఆ మహారాజును విషాన్నిపోగొట్టటంలో శక్తి ఉన్న నా మంత్రతంత్ర సామర్థ్యంచేత కాపాడటానికి వెళ్ళుతున్నాను.

విశేషం: నాలుగవపాదంలోని 'దక్షిణు' - అనే విశేషణంయొక్క 'దక్షత' అనే పాఠాంతరం పెక్కు ప్రతులలో ఉన్నది.

క. అనిన విని నగుచు వాఁ డి। ట్లనియెను 'దక్షకుఁడ నేన, యశనినిపాతం
బున బ్రదుకఁగ నగు నేనియు। ననఘా! మద్విషనిహతుల కగునే బ్రదుకన్. 188

ప్రతిపదార్థం: అనినన్= అని కశ్యపుడు పలుకగా; విని; నగుచున్= నవ్వుతూ; వాఁడు= తక్షకుడు; ఇట్లు+అనియెను= ఇట్లా పలికాడు. తక్షకుఁడన్= తక్షకుడిని; ఏను+అ= నేనే; ఆశని, నిపాతంబునన్= వజ్రాయుధంయొక్క (పిడుగు) పాటుచేత; బ్రదుకఁగన్+అగున్, ఏనియున్= జీవించవచ్చు నేమోకాని,; అనఘా= ఓపాపరహితుడా! మత్, విష, నిహతులకున్= నాయొక్క విషంచేత చంపబడినవారికి; బ్రదుకన్= జీవించటానికి; అగున్+ఏ= శక్యమవునా! (కా దని భావం.)

తాత్పర్యం: అని కశ్యపుడు పలుకగా విని నవ్వుతూ తక్షకుడు ఇట్లన్నాడు: 'ఓ పాపరహితుడా! నేనే ఆ తక్షకుడిని. వజ్రాయుధం (పిడుగుపాటు) యొక్క దెబ్బచేత బ్రతికిన బ్రతుకవచ్చుగాక! నావిషంచేత చంపబడిన వారికి జీవింప శక్యం కాదు.'

వ. 'నీమందులు మంత్రంబులు నాయందుం బనిసేయవు క్రమ్మఱి పొమ్ము; కాదేని నీవ చూడ నివ్వట వృక్షంబుఁ గఱచి నావిషానలంబున భస్మంబు సేసెద; నోపుదేని దీనిని సంజీవితంబుఁజేయు' మని తక్షకుం డా వృక్షంబుఁ గఱచిన. 189

ప్రతిపదార్థం: నీమందులు= నీవు వేసే మందులు; మంత్రంబులు= విషాన్ని పోగొట్టే మంత్రాలు; నాయందున్= నావిషయంలో; పని, చేయవు= సఫలం కావు; క్రమ్మఱి= తిరిగి; పొమ్ము= వెళ్ళుము; కాదు+ఏని= అట్లాకాకుంటే; నీవు+అ= నీవే; చూడన్= చూస్తుండగా; ఈ+వటవృక్షంబున్= ఈమఱ్ఱిచెట్టును; కఱచి; నావిష+అనలంబునన్= నావిషంయొక్క అగ్నిచేత; భస్మంబు, చేసెదన్= బూడిద చేస్తాను; ఓపుదు(వు), ఏని= శక్తి కలవాడ వయితే; దీనిని= ఈవృక్షాన్ని; సంజీవితంబున్= బ్రతికినదాన్ని; చేయుము; అని; తక్షకుండు; ఆ వృక్షంబున్= ఆ చెట్టును; కఱచినన్= కరవగా.

తాత్పర్యం: 'నీవు వేసే మందులు, మంత్రాలు నా విషయంలో పని చేయవు. వ్యర్థా లవుతాయి. తిరిగివెళ్ళిపొమ్ము; అట్లా కాకుంటే, నీవు చూస్తూండగానే ఈ మఱ్ఱిచెట్టును కరచి నా విషంవలన పుట్టే అగ్నిచేత బూడిద చేస్తాను. శక్తికలవాడ వయితే ఈ చెట్టును మళ్ళీ బ్రతికించు ' అని తక్షకుడు ఆ చెట్టును కాటువేయగా.

ఆ. అయ్యహీంద్ర విష మహానల దగ్ధ మై। విపుల పత్త్ర దీర్ఘ విటపతతుల
గగనమండలంబుఁ గప్పిన యవ్వట। తరువు భస్మ మయ్యెఁ దత్క్షణంబ. 190

ప్రతిపదార్థం: ఆ+అహి+ఇంద్ర, విష, మహత్, అనల, దగ్ధము+ఐ= పాములరా జయిన ఆ తక్షకుని విషంవలన పుట్టిన గొప్ప అగ్నిచేత కాల్చబడిం దై; విపులపత్త్ర దీర్ఘ, విటప, తతులన్= విశాలా లయిన ఆకులచేతను పొడవైన కొమ్మలచేతను; గగనమండలంబున్= ఆకాశప్రదేశాన్ని; కప్పిన= ఆక్రమించిన; ఆ+వట, తరువు= ఆ మఱ్ఱిచెట్టు; తద్, క్షణంబు+అ= వెంటనే (ఆ క్షణమే); భస్మము+ అయ్యెన్= బూడిద అయింది.

తాత్పర్యం: పాముల రాజయిన ఆ తక్షకుని విషంవలన పుట్టిన గొప్ప అగ్నిచేత కాల్చబడి, విశాలమయిన ఆకులచేత, పొడవైనకొమ్మల సమూహాలచేత ఆకాశప్రదేశాన్ని ఆక్రమించిన ఆ మఱ్ఱిచెట్టు వెంటనే బూడిద అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. కశ్యపుండును నప్పుడ యాభస్మ చయంబు గూడఁ ద్రోచి, తన మంత్రతంత్రశక్తింజేసి యెప్పటియట్ల వృక్షంబుగాఁ జేసినం జూచి, తక్షకుం డతివిస్మయం బంది 'మునీంద్రా! నీవిద్యాబలంబున నిది సంజీవితం బయ్యె నేనియు నతికుపిత విప్రశాప వ్యపగతాయుష్యం డైన పరీక్షితుండు సంజీవితుండు గానోపండు; వాని యిచ్చు ధనంబు కంటె నాయం దధికధనంబు గొనిపొ' మ్మనినఁ గశ్యపుండును దన దివ్యజ్ఞానంబున నట్లకా నెఱింగి, తక్షకుచేత ననంతం బైన యర్థంబు గొని క్రమ్మఱి చనియె; విజనం బైన విపినాంతరంబున నైన యయ్యిరువుర వృత్తాంతంబు మీ రె ట్లెఱింగితి రంటేని వినుము. 191

ప్రతిపదార్థం: కశ్యపుండును= కశ్యపుడు కూడ; అప్పుడు+అ= అప్పుడే; ఆ భస్మచయంబు= చెట్టుకాలగా మిగిలిన బూడిద సముదాయాన్ని; కూడన్, త్రోచి= కలిసేట్లుగా ప్రోగుచేసి; తన, మంత్ర, తంత్ర, శక్తిన్, చేసి= తనయొక్క మంత్రాలయొక్క విషాన్ని తొలగించే కార్యాలయొక్క శక్తిచేత; ఎప్పటి, అట్లు+అ= పూర్వం విధంగానే; వృక్షంబుగాన్= చెట్టుగా; చేసినన్= చేయగా; చూచి; తక్షకుండు; అతి, విస్మయంబు= అధికమైన ఆశ్చర్యం; అంది= పొంది; ముని+ఇంద్రా!= మునిశ్రేష్ఠా!; నీ, విద్యాబలంబునన్= నీవిద్యలోని శక్తిచేత; ఇది= ఈచెట్టు; సంజీవితంబు= మళ్ళీ చక్కగా బ్రదికింది; అయ్యెన్, ఏనియున్= అయినప్పటికి; అతి, కుపిత, విప్ర, శాప, వ్యపగత+ఆయుష్యుండు+అయిన= మిక్కిలి కోపించిన బ్రాహ్మణునియొక్క శాపంచేత పోయిన ఆయుర్దాయం కల; పరీక్షితుండు; సంజీవితుండు= బ్రతికినవాడు; కాన్, ఓపండు= కాజాలడు; వాని, ఇచ్చు, ధనంబు, కంటెన్= ఆపరీక్షితు డిచ్చే ధనంకంటె; నా, అందున్= నావలన; అధిక, ధనంబు= ఎక్కువధనం; కొని= గ్రహించి; పొమ్ము= వెళ్ళుము; అనినన్= అని పలుకగా; కశ్యపుండును; తన, దివ్యజ్ఞానంబునన్= దివ్యమైన (ఇంద్రియాల కతీతమైన) తపస్సువలన కలిగిన జ్ఞానంచేత; అట్లు+అ, కాన్= అట్లే కావటం (పరీక్షితుడు మరణించక తప్పదనటం); ఎఱింగి= తెలిసికొని; తక్షకుచేత; అనంతంబు+అయిన= అంతంలేని; అర్థంబు= ధనం; కొని= గ్రహించి; క్రమ్మఱి= తిరిగి; చనియెన్= వెళ్ళిపోయాడు; విజనంబు+అయిన= జనులు లేని; విపిన+అంతరంబునన్= అడవినడుమ; ఐన= జరిగిన; ఆ+ఇరువుర= ఆ ఇద్దరియొక్క; వృత్తాంతంబు; మీరు; ఎట్లు+ఎఱింగితిరి= మీ రెట్లా తెలిసికొన్నారు; అంటి(వి)+ఏని= (భూతకాలమవటంచేత 'వ' కారలోపం) అంటావేమో; వినుము (ఈపలుకులు, మంత్రులు జనమేజయుడితో చెపుతున్నారు).

తాత్పర్యం: కశ్యపుడుకూడ అప్పుడే కాలిన ఆ చెట్టుయొక్కబూడిదను పోగుచేసి తనమంత్రాలయొక్క, తంత్రాలయొక్క బలంచేత పూర్వంలాగే చెట్టుగా చేయగా, చూచి తక్షకుడు మిక్కిలి ఆశ్చర్యం పొంది 'ఓ మునిశ్రేష్ఠుడా! నీ విద్యయొక్క శక్తిచేత ఈ చెట్టు చక్కగా బ్రతికినప్పటికిని మిక్కిలి కోపించిన బ్రాహ్మణు డైన శృంగియొక్క శాపంచేత చనిపోయిన పరీక్షితుడు బ్రదుకజాలడు అత డిచ్చే సొమ్ముకంటె నావలన ఎక్కువ సొమ్ము గ్రహించి వెళ్ళిపొమ్ము' అని పలుకగా కశ్యపుడు కూడ తపస్సువలన కలిగిన తన దివ్యజ్ఞానంచేత అట్లే కావటం తెలిసికొని తక్షకుడివలన అధిక మైన ధనం గ్రహించి తిరిగి వెళ్ళిపోయాడు. జనం లేని అడవి నడుమ జరిగిన ఆ తక్షక, కశ్యపుల సంగతి మీ రెట్లా తెలిసికొన్నా రని అడుగుతా రేమో చెప్పుతాం వినండి.

తే. ఇప్పురంబున బ్రాహ్మణుం డింధనార్థ। మేఁగి, మున్న యావృక్షంబు నెక్కి, దాని
తోన దగ్ధుఁ డై, మఱి దానితోన లబ్ధ। జీవుఁడై వచ్చి జనులకుఁ జెప్పె దీని. 192

ప్రతిపదార్థం: ఈ+పురంబున, బ్రాహ్మణుండు= ఈ పట్టణంలోని విప్రుడు, ఇంధన+అర్థము= కట్టెలనిమిత్తం; ఏఁగి= వెళ్ళి; మున్ను+అ= అంతకుముందే; ఆ, వృక్షంబున్, ఎక్కి= ఆ మఱ్ఱిచెట్టును ఎక్కి; దానితోన్+అ= ఆ చెట్టుతోడనే; దగ్ధుఁడు+ఐ= కాల్చబడినవా డై; మఱి= తర్వాత; దానితోన్+అ= ఆ చెట్టుతోడనే; లబ్ధ, జీవుఁడు+ఐ= పొందబడినప్రాణం కలవా డై; వచ్చి= పట్టణానికి తిరిగి వచ్చి; దీనిన్= ఈ వృత్తాంతాన్ని; జనులకున్= ప్రజలకు; చెప్పెన్,

తాత్పర్యం: ఈ హస్తినాపురంలోని విప్రు డొకడు కట్టెల నిమిత్తం అడవికి పోయి, తక్షకుడు ఈ వృక్షాన్ని కాల్చటానికి ముందే దాన్ని ఎక్కి దానితోపాటు కాల్చబడి తర్వాత ఆ చెట్టుతోనే పొందబడిన ప్రాణం కలవాడై పట్టణానికి తిరిగివచ్చి ఈ వృత్తాంతాన్ని జనులకు చెప్పాడు.

తక్షకవిషాగ్నిచేఁ బరీక్షితుండు హర్మ్యంబుతోడ దగ్ధుం డగుట (సం. 1-39-19)

వ. అట్లు కశ్యపుం గ్రమ్మఱించి తక్షకుండు తత్‌క్షణంబ నాగకుమారులం బిలిచి 'మీరలు విప్రుల రయి సురభి కుసుమ స్వాదు వన్యఫలంబులు పలాశపర్ణపుటికలం బెట్టికొని పరీక్షితు పాలికిం జని యిం' డని పంచి, తానును వారితోడన యదృశ్యరూపుం డయి వచ్చిన. 193

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; కశ్యపున్= కశ్యపమహర్షిని; క్రమ్మఱించి= తిరిగివెళ్ళేట్లు చేసి; తక్షకుండు; తద్+క్షణంబు+అ= ఆ క్షణమందే; నాగకుమారులన్= యువకులైననాగులను; పిలిచి; మీరలు= మీరు; విప్రులరు+అయి= బ్రాహ్మణు లయి; సురభి, కుసుమ, స్వాదు, వన్య, ఫలంబులు= సువాసన గల పువ్వులును, వనంలోని రుచిగల పండ్లును; పలాశ, పర్ణ, పుటికలన్= మోదుగ ఆకులలోను బుట్టలలోను; పెట్టికొని; పరీక్షితు, పాలికిన్= పరీక్షిత్తు చెంతకు; చని= వెళ్ళి; ఇండు; అని, పంచి= అని ఆజ్ఞాపించి; తానును= తానుకూడ; వారితోడన్, అ= వారివెంటనే; అదృశ్య, రూపుండు+అయి= కనబడని రూపం కలవా డయి; వచ్చినన్= రాగా.

తాత్పర్యం: తక్షకుడు ఆవిధంగా కశ్యపమహర్షిని మరలించి, ఆ క్షణమందే సర్పకుమారులను పిలిచి, 'మీరు బ్రాహ్మణు లై సువాసన గల పువ్వులను వనంలోని రుచిగల పండ్లను మోదుగ ఆకుల బుట్టలలో పెట్టుకొని పరీక్షిత్తు చెంతకు వెళ్ళి అతడి కివ్వం' డని ఆజ్ఞాపించి, తానుకూడ వారితోడనే అదృశ్యరూపుడై రాగా.

విశేషం: విప్రులు+రు - ప్రథమాంతా లయిన యుష్మదస్మద్విశేషణాలకు ఏకత్వమున వునులును, బహుత్వమున రుములును అంతాగమాలు ప్రాయికంగా అవుతాయి. ఈఆగమం పరమయినపుడు ఉత్వానికి అత్వం అవుతుంది- విప్రులరు.

చ. ద్విజవరులం గుమారుల నతిప్రియదర్శను లైనవారి ఋ
గ్యజుషపదక్రమంబులు క్రియన్ గుణియించుచు వచ్చువారి న
గ్గజపురవల్లభుండు గని, గ్రక్కున డాయఁగఁ బిల్చి మెచ్చి, భా
వజసుభగుండు చేకొనియె వారలు దెచ్చినవాని నన్నిటిన్. 194

ప్రతిపదార్థం: భావజ, సుభగుండు= మన్మథునివలె అందమైనవాడు; ఆ+గజపుర, వల్లభుండు= హస్తినాపురానికిరా జైన ఆ పరీక్షిత్తు; ద్విజవరులన్= బ్రాహ్మణశ్రేష్ఠులను; అతి ప్రియదర్శనులు+అయిన, వారిన్= మిక్కిలి ప్రియ మైన దర్శనం కలవారిని (చూడటానికి మిక్కిలి ప్రీతి కలిగించేవారిని); ఋక్, యజుష, పద, క్రమంబులు= ఋగ్వేదంయొక్క యజుర్వేదంయొక్క పదపాఠాన్ని, క్రమపాఠాన్ని; క్రియన్= అనుగుణంగా చేతులు త్రిప్పటం మొదలయినపనితో; గుణియించుచున్= లెక్కిస్తూ; వచ్చువారిన్= వచ్చేవాళ్ళను; కుమారులన్= బ్రాహ్మణవేషంలో ఉన్న యువకులను (నాగకుమారులను); కని= చూచి; గ్రక్కునన్= వేగంగా; డాయఁగన్= సమీపించేటట్లుగా; పిల్చి; మెచ్చి; వారలు= వారు; తెచ్చినవానిన్= తెచ్చిన వస్తువులను; (పూలను, పండ్లను); అన్నిటిన్= అన్నిటిని; చేకొనియెన్= గ్రహించాడు.

తాత్పర్యం: మన్మథునివలె సుందరుడు, హస్తినాపురప్రభువు అయిన పరీక్షిత్తు మిక్కిలిప్రియ మైన రూపం కలవారిని, ఋగ్వేదంయొక్క యజుర్వేదంయొక్క పదపాఠాన్ని, క్రమపాఠాన్ని అనుగుణ మైన క్రియతో లెక్కిస్తూ వచ్చేవాళ్ళను, బ్రాహ్మణయువకులను, (బ్రాహ్మణరూపంలో ఉన్న నాగకుమారులను) చూచి, వెంటనే దగ్గరకు రమ్మని పిలిచి, వారు తెచ్చిన పూలను, పండ్లను అన్నింటిని స్వీకరించాడు.

విశేషం: పద మంటే వేదవాక్యంలోని పదాలను ఒండొంటితో విడదీయటం, క్రమ మంటే ఒక్కొక్కమారు ఒక్కొక్కపదాన్ని విడిచి మరొకపదాన్ని గ్రహిస్తూ వేదాన్ని పఠించే ఒకానొకపద్ధతి.

క. **వారల నర్ఘప్రియ స । త్కారులఁ గావించి పుచ్చి, కాలనియోగ**
ప్రేరితుఁ డై, యమరేంద్రా । కారుఁడు తద్వన్యఫలజిఘత్సాపేక్షన్. **195**

ప్రతిపదార్థం: అమర+ఇంద్ర+ఆకారుఁడు= దేవేంద్రుడి ఆకారంవంటి ఆకారం కలవాడు; వారలన్= ఆ విప్రకుమారులను; అర్ఘ, ప్రియ, సత్కారులన్= తగినట్టి, ప్రీతి కలిగించే సన్మానం కలవారిని; కావించి= చేసి; పుచ్చి= పంపి; కాలనియోగప్రేరితుఁడు+ఐ= కాలం (యముని) యొక్క నిర్దేశంచేత (ఆజ్ఞచే) ప్రేరేపింపబడినవా డై; తద్+వన్య, ఫల, జిఘత్సా+అపేక్షన్= ఆవనంలోని ఫలాలను తినాలనే కోరికతో.

తాత్పర్యం: ఇంద్రుని ఆకారంవంటి ఆకారం కల ఆ పరీక్షిత్తు వచ్చిన బ్రాహ్మణకుమారులకు తగినట్లు, వారికి ప్రీతి కలిగించేటట్లు సన్మానించి పంపి, కాలం(కాలుని) యొక్క ఆజ్ఞచేత ప్రేరేపించబడిన వాడై వారు తెచ్చిన అడవిలోని ఫలాలను తినాలనేకోరికతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. **సూరెల నున్న మంత్రులను జుట్టములం గడుఁ గూర్చుమిత్త్రులన్**
సారబలుండు చూచి 'మునిశాపదినంబులు వోవుదెంచె, నం
భోరుహమిత్త్రుఁ డస్తగిరిఁ బొందెడు' నం చొగిఁ దత్ఫలావలుల్
వారల కెల్లఁ బెట్టి, యనవద్యుఁడు దా నొకపండు చెచ్చెరన్. **196**

ప్రతిపదార్థం: అనవద్యుఁడు= దోషరహితుడు; సార, బలుండు= శ్రేష్ఠమైనబలం కల పరీక్షిత్తు; సూరెలన్= పార్శ్వంలో; ఉన్న; మంత్రులను; చుట్టములన్; కడున్, కూర్చు= మిక్కిలి ప్రీతి కలిగించే (ఆప్తులైన); మిత్రులన్= స్నేహితులను; చూచి; ముని, శాప, దినంబులు= ముని అయిన శృంగి ఇచ్చిన శాపానికి సంబంధించిన రోజులు; పోవుదెంచెన్= కడచిపోయాయి; అంభోరుహ, మిత్రుఁడు= పద్మాలకు ఆప్తుడైన సూర్యుడు; అస్తగిరిన్= పడమటికొండను; పొందెడున్= పొందుతున్నాడు; అంచున్= అని పలుకుతూ; ఒగిన్= వరుసగా; తద్, ఫల+ఆవలుల్= ఆ పండ్లసముదాయాలు; వారలకున్, ఎల్లన్= వారి కందరికిని; పెట్టి, తానున్+ఒక, పండు; చెచ్చెరన్= వేగంగా.

తాత్పర్యం: దోషరహితుడు, అధిక మయిన బలం కలవాడు అయిన పరీక్షిత్తు పార్శ్వాలలో ఉన్నమంత్రులను, బంధువులను, మిక్కిలి ఆప్తులైన స్నేహితులను చూచి 'ముని అయిన శృంగి ఇచ్చిన శాపపురోజులు ఏడును గడిచాయి; సూర్యుడు అస్తమిస్తున్నాడు'. అని పలుకుతూ వరుసగా ఆ ఫలాలసముదాయాలను వారికందరికి పెట్టి తానూ ఒకపండు వేగంగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ముని పెట్టిన శాపపు గడువురోజులు ముగిశాయి, అంభోరుహమిత్రుఁ డస్తగిరిఁ బొందెడు- అని పరీక్షిత్తు అన్న వాక్యాలలో 'గండం' అనే సూచ్యార్థసూచనం నిబంధించాడు నన్నయ. సూర్యుడస్తమించబోతున్నాడని చెప్పిన పరీక్షిత్తు తన అస్తమయాన్నే అజ్ఞాతంగా ధ్వనింపచేశా డన్నది ఇక్కడి విశేషం.

క. కొని వ్రచ్చుడు, లోపల న । ల్లనిక్రిమి యై తోఁచి, చూడ లత్తుక వర్ణం
బునఁ బామై, విషవహ్నులు । దనుకఁగఁ గురువీరుఁ గఱచి తక్షకుఁ డరిగెన్. 197

ప్రతిపదార్థం: కొని= గ్రహించి; వ్రచ్చుడున్+ చీల్చినవెంటనే; లోపలన్= ఆ పండులోపల; నల్లనిక్రిమి, ఐ= నల్లనిపురుగై; తోఁచి= కనబడి; చూడన్= పరిశీలించగా; లత్తుక, వర్ణంబునన్= లాక్షారసంవలె ఎఱ్ఱనిరంగుతో; పాము+ఐ; విషవహ్నులు= విషంయొక్క అగ్నులు; తనుకఁగన్= ప్రకాశించగా(కలుగగా); కురువీరున్= వీరు డైన కురువంశస్థుడిని (పరీక్షిత్తును); కఱచి; తక్షకుఁడు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ పండును గ్రహించి చీల్చిన వెంటనే నల్లనిపురు గై కనబడి, చూస్తుండగానే పారాణివంటి ఎఱ్ఱనిరంగుతో పామై, విషంయొక్క అగ్నులు జ్వలించగా వీరు డైన పరీక్షిత్తును తక్షకుడు కఱచి వెళ్ళాడు.

వ. తత్పరిజనంబు లందఱు నశనిపాతంబున బెదరి చెదరినట్లు గనుకనిం బఱచి; రయ్యేకస్తంభహర్మ్యంబును దక్షకవిషాగ్ని దగ్ధంబయ్యె; నట్లు భవజ్జనకుండు పరలోకగతుండైనం, బురోహిత పురస్సరానేకభూసురవరులు యథావిధిం బరలోకక్రియలు నిర్వర్తించి రంత. 198

ప్రతిపదార్థం: తద్, పరిజనంబులు+అందఱున్= ఆ పరీక్షిత్తు సేవకులందరు, ఆశనిపాతంబునన్= పిడుగుపాటుచేత; బెదరి= భయపడి; చెదరిన+అట్లు= చెదరి పోయిన విధంగా; కనుకనిన్= సంభ్రమంతో; (వేగిరపాటుతో); పఱచిరి= పరుగెత్తారు; ఆ+ఏకస్తంభహర్మ్యంబును= ఆ ఒంటికంబపుమేడయు; తక్షక, విష+అగ్ని, దగ్ధంబు+అయ్యెన్= తక్షకునియొక్క విషంయొక్క అగ్నిచేత కాల్చబడినది అయింది; అట్లు= ఆవిధంగా; భవత్, జనకుండు= నీతండ్రి; పరలోకగతుండు+అయినన్= పరలోకాన్ని పొందినవాడు (మరణించినవాడు) కాగా; పురోహిత, పురస్సర+అనేక, భూసుర, వరులు= పురోహితులు ముందుగా గల పలువురు బ్రాహ్మణశ్రేష్ఠులు; యథావిధిన్= విధి నతిక్రమించకుండ; పరలోకక్రియలు= పరలోకానికి సంబంధించిన కర్మలు; నిర్వర్తించిరి= చేశారు.

తాత్పర్యం: ఆ పరివారజనులు అందరును, పిడుగుపాటుచే భయపడి చెల్లాచెద రైనట్లు సంభ్రమంతో పరుగెత్తారు. ఆ రాజున్న ఒంటికంబపు మేడకూడ తక్షకుడి విషంయొక్క అగ్నిచేత కాల్చబడింది. ఆవిధంగా నీతండ్రి మరణించగా, పురోహితులతో కూడిన బ్రాహ్మణశ్రేష్ఠులు శాస్త్రాన్ని అతిక్రమించకుండ అతనికి పరలోకంలో ఉత్తమగతి కల్గించే కర్మలు చేశారు.

విశేషం: అలం: ఉపమ.

జనమేజయ మహారాజు సర్పయాగము సేయుట (సం. 1-46-6; 1-46-23)

క. ఆయుష్మంతుఁడ వై, ల । క్ష్మీయుత! బాల్యంబునంద మీయన్వయరా
జ్యాయత్తమహీభారం । బాయతభుజ! నీవు దాల్చి తభిషిక్తుఁడ వై. 199

ప్రతిపదార్థం: లక్ష్మీయుత= లక్ష్మితో కూడినవాడా! ఆయత, భుజ= దీర్ఘాలైన బాహువులు కలవాడా; బాల్యంబు+అందున్+అ= చిన్నతనమందే; ఆయుష్మంతుఁడవు+ఐ= చిరంజీవివై; మీ, అన్వయ, రాజ్య+ఆయత్త, మహీభారంబు= మీవంశానికి చెందిన రాజ్యంలో వ్యాపించిన భూమియొక్క బరువును; అభిషిక్తుఁడవు+ఐ= అభిషేకింపబడినవాడి వై; నీవు; తాల్చితి(వకారలోపం)= వహించావు.

తాత్పర్యం: దీర్ఘమైనబాహువులు కలవాడా! లక్ష్మితో కూడినవాడా! ఓ జనమేజయా! చిరంజీవి వౌ నీవు చిన్నతనమందే అభిషేకించబడినవాడి వై మీవంశానికి చెందినరాజ్యంలో వ్యాపించిన భూమియొక్క బరువును భరించావు.

ఉ. పెంచితి ధర్మమార్గమునఁ బ్రీతి యొనర్చుచు ధారుణీప్రజన్;
మంచి తనేకయాగముల మానుగ దక్షిణ లిచ్చి విప్రులన్;
నించితి సజ్జనస్తుతుల నిర్మల మైన యశంబు దిక్కులన్;
సంచితపుణ్య! సర్వగుణసంపద నెవ్వరు నీసమానులే! 200

ప్రతిపదార్థం: సంచితపుణ్య!= సంపాదింపబడిన పుణ్యాలు కలవాడా! ప్రీతి ఒనర్చుచున్= ప్రీతి కావిస్తూ, ధారుణీప్రజన్= భూమిలోని ప్రజలను ధర్మమార్గమునన్= ధర్మంతో కూడిన మార్గంలో; పెంచితి(వి) (వకారలోపం)= ధర్మమార్గంతో పోషించావు; అనేకయాగములన్= పెక్కుయజ్ఞాలలో; మానుగన్= ఒప్పుగా; దక్షిణలు= సంభావనలు; ఇచ్చి, విప్రులన్= బ్రాహ్మణులను; మంచితి(వి)= పోషించావు; సజ్జనస్తుతులన్= మంచివాళ్ళ పొగడ్తలతో; దిక్కులన్= దిక్కులలో; నిర్మలము+ఐన= పరిశుద్ధమైన; యశంబు= కీర్తి; నించితి(వి)= నిండేటట్లు చేశావు; సర్వగుణ, సంపదన్= అన్నిగుణాలయొక్కసంపదలోను; ఎవ్వరున్= ఎవరైనా; నీసమానులు+ఏ= నీకు సమానులా? కారు అనిభావం.

తాత్పర్యం: ప్రీతికావిస్తూ భూజనాన్ని ధర్మమార్గంలో పెంపొందించావు; పెక్కుయజ్ఞాలలో ఒప్పుగా దక్షిణలు ఇచ్చి బ్రాహ్మణులను మనేటట్లు చేశావు, పోషించావు; ఉత్తమ జనులపొగడ్తలచేత పరిశుద్ధమైన కీర్తి దిక్కులలో నిండేటట్లు చేశావు; సంపాదించబడిన పుణ్యాలు కలవాడా! సమస్తగుణాలసంపదలో ఎవ్వ రైనా నీకు సరిపోలగలరా? (సమానులు కారని భావం).

విశేషం: పై పద్యంలోని నాలుగుపాదాలలో నాలుగు సమానవాక్యాలు నిండిఉండటం నన్నయ పద్యశిల్పానికి ఒక మచ్చుతునక. దీన్నే సమతాగుణం అంటారు. ఇటువంటి సమతాగుణాన్ని వృత్తాలలో నన్నయ అరుదుగా వాడతాడు. ఈ గుణాన్ని ఎఱ్ఱాప్రెగ్గడ స్వీకరించి ఎక్కువగా వాడాడు.

ఉ. కాదన కిట్టిపాటియపకారముఁ దక్షకుఁ డేకవిప్ర సం
బోధనఁ జేసి చేసె; నృపపుంగవ! నీవు ననేక భూసురా
పాదిత సర్పయాగమున భస్మము సేయుము తక్షకాది కా
కోదరసంహతిన్ హుతవహోగ్ర సమగ్ర శిఖాచయంబులన్. 201

ప్రతిపదార్థం: నృప, పుంగవ= రాజశ్రేష్ఠుడా!; కాదు+అనక= యుక్తంకా దని అనకుండ; ఇట్టి, పాటి= ఇంతప్రమాణం కల (అధికమైన); అపకారమున్= హానిని; (కీడును); తక్షకుఁడు; ఏక, విప్ర, సంబోధనన్, చేసి= ఒకబ్రాహ్మణుడియొక్క ప్రేరణచేత; చేసెన్= చేశాడు; నీవున్= నీవుకూడ; అనేకభూసుర+ఆపాదిత, సర్ప, యాగమునన్= పలువురు బ్రాహ్మణులచేత చేయబడిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాములను ఆహుతి చేసే యజ్ఞంలో; హుతవహ+ఉగ్ర, సమగ్ర, శిఖా, చయంబులన్= అగ్నియొక్కభయంకరాలు, సంపూర్ణాలు అయిన జ్వాలలయొక్క సమూహాలలో; తక్షక+ఆది, కాకోదర+సంహతిన్= తక్షకుడు మొదలైన పాముల సముదాయాన్ని; భస్మము+చేయుము= బూడిద చేయుము.

తాత్పర్యం: ఓ రాజశ్రేష్ఠుడా! యుక్తం కా దనకుండ తక్షకుడు, శృంగి అనే ఒక బ్రాహ్మణుని ప్రేరణచేత ఇంతఅధికమైన కీడు చేశాడు. నీవు కూడ పలువురు బ్రాహ్మణులచేత నిర్వహించబడిన పాములను ఆహుతి చేసే యజ్ఞంలో తక్షకుడు మొదలైన పాములసమూహాన్ని భయంకరాలు, సంపూర్ణాలు అయిన అగ్ని జ్వాలలసముదాయాలలో బూడిద చేయుము.

విశేషం: తక్షకుడు ఒకవిప్రుడిచే మాత్రమే ప్రేరేపించబడి నీతండ్రిని చంపి ఇంతఅధిక మైన కీడు చేశాడు. నీవు పలువురువిప్రులచేత చేయబడే సర్పయాగంలో తక్షకుడినే కాదు ఇతరసర్పాలనుకూడ బూడిద చేయుము. ఈ పద్యంలో 'ద' కారానికి 'ధ' కారానికి ప్రాస వేయబడింది "సంచోదన చేత చేసె రిపుసూదన" అనే పాఠాంతరం ఉన్నది.

వ. అనిన విని జనమేజయుండు కోపోద్దీపితచిత్తుం డై సర్పయాగము సేయ సమకట్టి, పురోహితులను ఋత్విజులను బిలువంబంచి వారల కి ట్లనియె. 202

ప్రతిపదార్థం: అనినన్= మంత్రు లిట్లాపలుకగా; విని; జనమేజయుండు; కోప+ఉద్దీపిత, చిత్తుండు+ఐ= కోపంచేత, జ్వలింపజేయబడిన హృదయం కలవా డై; సర్పయాగము= సర్పాలను ఆహుతి చేసే యజ్ఞం; చేయన్, సమకట్టి= చేయటానికి పూని; పురోహితులను; ఋత్విజులను= యజ్ఞం చేయించే ఋత్విక్కులను; పిలువన్, పంచి= పిలవటానికి ఆజ్ఞాపించి; వారలకున్= ఆ పురోహితులకు ఋత్విక్కులకు; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: మంత్రు లిట్లా పలుకగా, విని జనమేజయుడు, కోపంచేత మండింపబడిన హృదయం కలవా డయి సర్పయాగం చేయబూని పురోహితులను, ఋత్విక్కులను పిలవటానికి ఆజ్ఞాపించి, వచ్చిన ఆ పురోహితులతో ఇట్లా పలికాడు.

విశేషం: ఋత్విజులు పదారుగురు: బ్రహ్మ, ఉద్గాత, హోత, ప్రతిప్రస్థాత, పోత, ప్రతిహర్త, అచ్ఛావాకుడు, నేష్ట, ఆగ్నీధ్రుడు, సుబ్రహ్మణ్యుడు, గ్రావస్తుతుడు, ఉన్నేత, అధ్వర్యుడు, బ్రాహ్మణాచ్ఛంసి, ప్రస్తోత, మైత్రావరుణుడు.

చ. తనవిషవహ్ని మజ్జనకుఁ దక్షకుఁ డెట్లు దహించె నట్ల యే
నును సహమిత్రబాంధవజనుం డగు తక్షకు నుగ్రహవ్యవా
హనశిఖలన్ దహించి, దివిజాధిపలోకనివాసుఁ డైన మ
జ్జనకున కీయుదంకునకు సాధుమతంబుగఁ బ్రీతిఁ జేసెదన్. 203

ప్రతిపదార్థం: తన; విషవహ్నిన్= విషంయొక్కఅగ్నిచేత; మత్, జనకున్= నాతండ్రిని; తక్షకుఁడు; ఎట్లు= ఏవిధంగా; దహించెన్= కాల్చాడో; అట్లు+అ= ఆవిధంగానే; ఏనును= నేనుకూడ; సహమిత్రబాంధవ, జనుండు+అగు= మిత్రులతోను, చుట్టాలైన జనులతోను కూడినవా డయిన; తక్షకున్= తక్షకుడిని; ఉగ్రహవ్యవాహనశిఖలన్= భయంకర మైన అగ్నియొక్క జ్వాలలచేత; దహించి= కాల్చి; దివిజ+అధిప, లోక, నివాసుఁడు+ఐన= దేవతలకు రాజైన ఇంద్రునిస్వర్గలోకంలో నివాసంకలవా డైన

(స్వర్గస్థుడైన); మత్, జనకునకున్= నాతండ్రికిని; ఈ, ఉదంకునకున్; సాధుమతంబుగన్= సజ్జనులకు సమ్మత మయ్యేటట్లుగా; ప్రీతిన్= ఇష్టాన్ని; చేసెదన్= కలిగిస్తాను.

తాత్పర్యం: తక్షకుడు తనవిషాగ్నిచేత నా తండ్రిని ఎట్లా కాల్చివేశాడో, ఆవిధంగానే మిత్రులతోను, బంధుజనాలతోను కూడిన తక్షకుడిని భయంకరమైన అగ్ని జ్వాలలలో కాల్చి స్వర్గస్థుడైన నాతండ్రికిని, ఈ ఉదంకుడనే బ్రాహ్మణుడికిని, సజ్జనులకు అభిమత మయ్యేటట్లుగా ప్రీతి కలిగిస్తాను.

వ. 'సర్పయాగం బిట్టి దని శాస్త్రవిధానంబు గలదేని చెప్పం' డనిన ఋత్విజు లి ట్లనిరి. 204

ప్రతిపదార్థం: సర్పయాగంబు= సర్పాలను ఆహుతి చేసే యజ్ఞం; ఇట్టిది+అని= ఈవిధంగా ఉండే దని; శాస్త్రవిధానంబు= శాస్త్రంలో చెప్పబడిన పద్ధతి; కలదు+ఏని= ఉన్నట్లయితే; చెప్పుండు= తెల్పండి; అనినన్= జనమేజయుడు అడుగగా; ఋత్విజులు= యజ్ఞంచేసేవారు; ఇట్లు+అనిరి= ఈవిధంగా పలికారు.

తాత్పర్యం: 'సర్పయాగం ఇట్లా ఉంటుం దని శాస్త్రాలలో చెప్పబడిన క్రమం ఏదైనా ఉంటే తెల్పం' డని అడుగగా ఋత్విక్కులు ఈవిధంగా పలికారు.

మత్తకోకిల.

'నీతదర్థమ కాఁగ దేవవినిర్మితం బిది, యన్యు లు
ర్వీతలేశ్వర! దీనిఁ జేయరు; వింటి మేము పురాణ వి
ఖ్యాత మాద్యము' నావుడున్, విని కౌరవప్రవరుండు సం
జాత నిశ్చయుఁ డయ్యె నప్పుడు సర్పయాగము సేయఁగన్. 205

ప్రతిపదార్థం: ఉర్వీతల+ఈశ్వర= ఓభూపతీ! జనమేజయా! నీ, తదర్థము+అ+కాఁగన్= నీకొరకే అయినట్లు; ఇది= ఈ సర్పయాగం; దేవ, వినిర్మితంబు= దేవతలచేత కల్పింపబడింది; అన్యులు= ఇతరులు; దీనిన్= ఈసర్పయాగాన్ని; చేయరు; ఏము= మేము; వింటిమి= వినిఉన్నాము; పురాణవిఖ్యాతము= పురాణాల్లో ప్రసిద్ధం; ఆద్యము= మొదటిది, సనాతనమైనది; నావుడున్= ఋత్విజులట్లా పలికినతర్వాత; విని; కౌరవప్రవరుండు= కురువంశంలో పుట్టినవారిలో శ్రేష్ఠుడు, జనమేజయుడు; అప్పుడు; సర్పయాగము= సర్పాలను ఆహుతి చేసేయజ్ఞాన్ని; చేయఁగన్= చేయటానికి; సంజాతనిశ్చయుఁడు+అయ్యెన్= పుట్టిన నిశ్చయం కలవాడు అయ్యాడు.

తాత్పర్యం: 'రాజా! జనమేజయా! ఈ సర్పయాగం నీకొరకే దేవతలచేత కల్పింపబడింది. ఇతరులు దీనిని చేయరు; మేము విని ఉన్నాము; ఇది పురాణాలలో ప్రసిద్ధం; ప్రాచీనమైనది' అని ఋత్విజులు పలుకగా విని కౌరవశ్రేష్ఠు డైన జనమేజయుడు అప్పుడు సర్పయాగం చేయటానికి నిశ్చయించాడు.

విశేషం: 'తదర్థము' అనేదాన్ని నన్నయ చతుర్థీవిభక్త్యర్థంలో వాడుతుంటాడు. మత్తకోకిలలో ప్రతిచరణానికీ ర-స-జ-జ-భ-ర అనే గణాలు ఉంటాయి. పదకొండవ అక్షరం యతిస్థానం

వ. ఇట్లు కృతనిశ్చయుం డై జనమేజయుండు కాశిరాజపుత్త్రి యయిన వపుష్టమ యను మహాదేవి ధర్మపత్నిగా సర్పయాగదీక్షితుం డయి, శాస్త్రోపదిష్ట ప్రమాణ లక్షణ నిపుణ శిల్పాచార్య వినిర్మితంబును, యజ్ఞోపకరణానేక

ద్రవ్యసంభారసంభృతంబును, బ్రభూతధనధాన్యసంపూర్ణంబును, స్వస్వనియుక్తక్రియారంభసంభ్రమ పరిభ్రమద్బ్రాహ్మణ నివహంబును నయిన యజ్ఞాయతనంబున నున్న యా రాజునకు నొక్క వాస్తువిద్యా నిపుణుం డైన పౌరాణికుం డి ట్లనియె. 206

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; కృత, నిశ్చయుండు+ఐ= చేయబడిన నిశ్చయం కలవా డై; జనమేజయుండు; కాశిరాజ, పుత్త్రి; అయిన; వపుష్టమ, అను= వపుష్టమ అనే పేరున్న; మహాదేవి= పట్టమహిషి(రాణి); ధర్మపత్ని, కాన్= ధర్మా న్ననుసరించి పెండ్లాడిన భార్యగా; సర్పయాగ దీక్షితుండు+అయి= సర్పయాగంలో దీక్ష కలవాడై; శాస్త్ర+ఉపదిష్ట, ప్రమాణ, లక్షణ, నిపుణ, శిల్ప+ఆచార్య= శాస్త్రాలలో చెప్పబడిన కొలతలలో, లక్షణాలలో నేర్పరులైన శిల్పాచార్యులచేత; వినిర్మితంబును= కట్టబడినది; యజ్ఞ+ఉపకరణ+అనేక, ద్రవ్య, సంభార, సంభృతంబును= యజ్ఞానికి కావలసిన సాధనాలచేతనూ, పెక్కువస్తువుల సముదాయంతోనూ నిండినది; ప్రభూత, ధన, ధాన్య, సంపూర్ణంబును= అధిక మైన ధనంతోనూ, ధాన్యాలతోనూ నిండినది; స్వ, స్వ, నియుక్త, క్రియా+ఆరంభ, సంభ్రమ, పరిభ్రమత్, బ్రాహ్మణ, నివహంబునున్= తమకు తమకు నియోగింపబడిన కార్యాలను మొదలుపెట్టటంలోని వేగిరపాటుచేత తిరుగుతున్న బ్రాహ్మణులసముదాయం కలది; అయిన; యజ్ఞ+ఆయతనంబునన్= యజ్ఞగృహంలో; ఉన్న= ఉన్నట్టి; ఆ రాజునకున్= రా జైన ఆ జనమేజయునికి; ఒక్క, వాస్తువిద్యానిపుణుండు, ఐన= గృహనిర్మాణశాస్త్రంలో నేర్పరి అయిన; పౌరాణికుండు= పురాణజ్ఞుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: ఈవిధంగా నిశ్చయించినవాడయి, జనమేజయమహారాజు కాశీరాజుకు కూతురైన వపుష్టమ అనే పేరున్న మహారాజ్ఞి ధర్మపత్నిగా సర్పయాగం చేయటానికి దీక్షవహించి, శాస్త్రంలో చెప్పబడిన కొలతలలో లక్షణాలలో నేర్పరులైన శిల్పశ్రేష్ఠులచేత నిర్మింపబడినది, యజ్ఞానికి కావలసిన పెక్కుసాధనాలతోను, అనేకవస్తువుల సముదాయంతోను కూడినది, అధికమైన ధనంతోను, ధాన్యంతోను నిండినది, తమకు, తమకు నియోగింపబడిన క్రియలను ఆరంభించటంలోని వేగిరపాటుచేత తిరుగుతున్న విప్రులసమూహం కలది అయిన యజ్ఞగృహంలో ఉన్న జనమేజయుడితో గృహనిర్మాణశాస్త్రంలో నేర్పరి అయిన పురాణజ్ఞుడు ఒకడు ఇట్లా పలికాడు.

విశేషం: యజ్ఞం చేసేవాడు తనధర్మపత్నితోకూడ దీక్ష వహించాలి. భార్యలేనివాడు యజ్ఞం చేయరాదు. యజ్ఞానికి అనేకసాధనాలు కావాలి. అట్లే యజ్ఞానికి సంబంధించిన వివిధ కార్యాలు నిర్వహించటానికి పలువురు బ్రాహ్మణులు కావాలి. వాస్తువు అంటే గృహం లేక గృహం కట్టటానికి తగినస్థలం అని అర్థం. గృహనిర్మాణశాస్త్రానికి వాస్తువిద్య అనిపేరు.

క. అనఘా! యీయజ్ఞము విధి। సనాథఋత్విక్ప్రయోగసంపూర్ణం బ
య్యును గడచన నేరదు; నడు। మన యుడుగును భూసురోత్తమ నిమిత్తమునన్. 207

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! జనమేజయా!; ఈ, యజ్ఞము= నీవు చేయబోయే సర్పయాగం; విధిసనాథ, ఋత్విక్, ప్రయోగ, సంపూర్ణంబు+అయ్యును= శాస్త్రంతో కూడిన ఋత్విక్కులయొక్క కార్యవిధానంతో సమగ్రమైనది అయినను; కడచననేరదు= చివరివరకు సాగదు; భూసుర+ఉత్తమ, నిమిత్తమునన్= బ్రాహ్మణ శ్రేష్ఠుడియొక్క కారణంచేత; నడుమన్+అ= మధ్యలోనే; ఉడుగును= ఆగిపోతుంది.

తాత్పర్యం: పుణ్యాత్ముడ వైన జనమేజయా!; నీవు చేయబోయే యీ యజ్ఞం ఋత్విక్కులు శాస్త్రోక్తంగా చేసే క్రియాకలాపంచేత సమగ్ర మైనప్పటికిన్నీ చివరిదాకా సాగదు. ఒక బ్రాహ్మణోత్తముని కారణంగా మధ్యలోనే ఆగిపోతుంది.

వ. అనినవానివచనం బవకర్ణించి, రాజనియుక్తు లయి చ్యవనకుల విఖ్యాతుండైన చండభార్గవుండు హోతగాఁ, బింగళుం డధ్వర్యుండుగా, శార్ఙ్గరవుండు బ్రహ్మగాఁ, గౌత్సుం డుద్గాతగా, వ్యాస వైశంపాయన పైల జైమిని సుమంతు శుక శ్వేతకేతు మౌద్గ ల్యోద్దాలక మాండవ్య కౌశిక కౌండిన్య శాండిల్యక్రామఠకకోహ లాసిత దేవల నారద పర్వత మైత్రే యాత్రేయ కుండజఠర కాలఘట వాత్స్యశ్రుతశ్రవో దేవశర్మ శర్మద రోమ శోదంక హరిత రురు పులోమ సోమశ్రవసు లాదిగాఁ గల మహామునులు సదస్యులుగా నీలాంబరపరిధానులును, ధూమసంరక్తనయనులు నై యాజ్ఞికు లగ్నిముఖంబు సేసి వేల్వం దొడంగిన. 208

ప్రతిపదార్థం: అనినన్= అని పౌరాణికుడు చెప్పగా; వాని, వచనంబు= అతనిమాట; అవకర్ణించి= పెడచెవినిపెట్టి, రాజ, నియుక్తులు+అయి= రాజుచే నియోగింపబడినవారై; చ్యవనకుల, విఖ్యాతుండు+ఐన= చ్యవనకులంలో ప్రసిద్ధుడైన; చండభార్గవుండు= చండ భార్గవు డనే ముని; హోతగాన్= ఋగ్వేదం తెలిసిన ఋత్విక్కుకాగా; పింగళుండు= పింగళు డనే పేరున్నముని; అధ్వర్యుండుగాన్= యజుర్వేద తంత్రం నడిపే ఋత్విజుడుగా; శార్ఙ్గరవుండు= శార్ఙ్గరవు డనే పేరున్నముని; బ్రహ్మగాన్= పదారుగురు ఋత్విజులలో ఒకడు కాగా; (యజ్ఞకర్తచేత ధనం పుచ్చుకొని యజ్ఞం చేయించేవాడు ఋత్విజుడు); కౌత్సుండు= కౌత్సు డనే ఋషి; ఉద్గాతగా= సామవేదతంత్రాన్ని నడిపే ఋత్విజుడు కాగా; వ్యాస, వైశంపాయన, పైల, జైమిని, సుమంతు, శుక, శ్వేతకేతు, మౌద్గల్య+ఉద్దాలక, మాండవ్య, కౌశిక, కౌండిన్య, శాండిల్య, క్రామఠక, కోహల+అసిత, దేవల, నారద, పర్వత మైత్రేయ+ఆత్రేయ, కుండజఠర, కాలఘట, వాత్స్య, శ్రుతశ్రవః దేవశర్మ, శర్మద, రోమశ+ఉదంక, హరిత, రురు, పులోమ, సోమశ్రవసులు= వ్యాసుడు, వైశంపాయనుడు, పైలుడు, జైమిని, సుమంతుడు, (వీరు నలుగురు వ్యాసుని శిష్యులు), శుకుడు (వ్యాసుని కుమారుడు), శ్వేతకేతుడు, మౌద్గల్యుడు, ఉద్దాలకుడు, మాండవ్యుడు, కౌశికుడు (విశ్వామిత్రుడు), కౌండిన్యుడు, శాండిల్యుడు, క్రామఠకుడు, కోహలుడు, అసితుడు, దేవలుడు (కొందరు అసితుడూ దేవలుడూ ఒక్కరే అంటారు బహుశః దేవలుడు నల్లగా ఉండేవాడు కాబోలు) నారదుడు, పర్వతుడు, మైత్రేయుడు, ఆత్రేయుడు, కుండజఠరుడు, కాలఘటుడు, వాత్స్యుడు, శ్రుతశ్రవుడు, దేవశర్మ, శర్మదుడు, రోమశుడు, ఉదంకుడు, హరితుడు, రురుడు, పులోముడు, సోమశ్రవసుడు; ఆదిగాన్, కల= మొదలుగాగల; మహత్, మునులు= గొప్పఋషులు; సదస్యులుగాన్= యజ్ఞవిధి పరీక్షాధికారులుగా; నీల+అంబర, పరిధానులును= నల్లనివస్త్రాలను ధరించినవారును; ధూమ, సంరక్త నయనులున్+ఐ= పొగచేత ఎఱ్ఱబడిన నేత్రాలు కలవారును అయి; యాజ్ఞికులు= యజ్ఞాన్ని నడిపేవారు; అగ్నిముఖంబు+చేసి= అగ్నిసాధ్యా లయిన కర్మలకు పూర్వమందు చేసే అంగభూత మైన కర్మసముదాయాన్ని చేసి; వేల్వన్= అగ్నిలో నెయ్యిమొదలైనవాటిని సమర్పించటానికి; తొడంగినన్= పూనగా.

తాత్పర్యం: అని పౌరాణికుడు చెప్పగా; అతనిమాట పెడచెవిని పెట్టి రాజుచే నియోగింపబడినవారై, చ్యవన మహర్షికులంలో ప్రసిద్ధుడైన చండభార్గవుడు హోతగా, పింగళుడు అధ్వర్యుడుగా, శార్ఙ్గరవుడు ఒక ఋత్విజుడుగా, కౌత్సుడు ఉద్గాతగా, వ్యాసవైశంపాయనాదు లైన మహర్షులు యజ్ఞవిధిపరీక్షకులుగా, నల్లనివస్త్రాలు ధరించినవారును, పొగలచేత ఎఱ్ఱబడిన నేత్రాలు కలవారును అయి యజ్ఞతంత్రాన్ని నడిపే ఋత్విజులు అగ్నిసాధ్యమైన కర్మలకు అంగభూతమైన కర్మకలాపాన్ని చేసి అందులో నెయ్యి మొదలైనపదార్థాలను హోమంచేయటానికి ప్రారంభించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

**క. ధరణిసురమంత్రహోమ । స్ఫురణను వివశు లయి భూరిభుజగప్రభు లొం
డొరుఁ బిలుచుచు నధికభయా । తురు లై కుండాగ్నులందుఁ దొరఁగిరి పెలుచన్. 209**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధరణిసుర, మంత్ర, హోమ, స్ఫురణను= బ్రాహ్మణుల మంత్రాలయొక్కయు, అగ్నిలో వేల్చే నెయ్యి మొదలయిన పదార్థాలయొక్కయు ప్రకాశంచేత; వివశులు+అయి= వశం తప్పినవా రై; భూరి, భుజగ, ప్రభులు= గొప్పపాములరాజులు; ఒండొరున్= ఒకరినొకరు; పిలుచుచున్; అధిక, భయ+ఆతురులు+ఐ= ఎక్కువభయంచేత కలతపొందినవారై; పెలుచన్= శీఘ్రంగా; కుండ+అగ్నులందున్= హోమకుండంలోని అగ్నులలో; తొరఁగిరి= పడ్డారు.

తాత్పర్యం: బ్రాహ్మణుల మంత్రాలయొక్కయు, అగ్నిలో వేల్చేపదార్థాలయొక్కయు ప్రభావంచేత వశంతప్పినవారై గొప్పపాములరాజులు ఒకరినొకరు పిలుచుకొంటూ ఎక్కువభయంచేత కలతనొందినవారై హోమకుండంలోని అగ్నులలో శీఘ్రంగా పడ్డారు.

వ. మఱియుఁ గోటిశ మానసపూర్ణ శలపాల హలీమక పిచ్ఛిల గౌణప చక్ర కాలవేగ ప్రకాలన హిరణ్యబాహు శరణ కక్షక కాలదంతకాదు లయిన వాసుకి కుల సంభవులును, బుచ్ఛాండక మండలక పిండసేక్తృ రణేభకోచ్ఛిఖ శరభ భంగ బిల్వ తేజోవిరోహణ శిలి శలకర మూక సుకుమార ప్రవేపన ముద్గర శిశురోమ సురోమ మహాహన్వాదు లయిన తక్షక కుల సంభవులును, బారావత పారిజాత యాత్ర పాండర హరిణ కృశ విహంగ శరభ మోద ప్రమోద సంహతాపనాదు లయిన యైరావతకులసంభవులును, నేరక కుండల వేణి వేణీస్కంధ కుమారక బాహుక శృంగబేర ధూర్తక ప్రాతరాతకాదు లయిన కౌరవ్యకులసంభవులును, శంకుకర్ణ పిఠరక కుఠార సుఖసేచక పూర్ణాంగద పూర్ణముఖప్రహాస శకుని దర్యమాహర కామఠక సుషేణ మానసావ్యయ భైరవ ముండ వేదాంగ పిశంగ చోద్రపారక వృషభ వేగవ త్పిండారక మహాహను రక్తాంగ సర్వసారంగ సమృద్ధ పఠవాసక వరాహకవీరణకసుచిత్ర చిత్రవేగిక పరాశర తరుణకమణిస్కంధారుణ్యాదు లయిన ధృతరాష్ట్రకుల సంభవులును నయి యొక్కొక్కమొగి సహస్రాయుతసంఖ్యులు గలిగి. 210

తాత్పర్యం: మఱియు కోటిశుడు, మానసుడు, పూర్ణుడు, శలుడు, పాలుడు, హలీమకుడు, పిచ్ఛిలుడు, గౌణపుడు, చక్రుడు, కాలవేగుడు, ప్రకాలనుడు, హిరణ్యబాహుడు, శరణుడు, కక్షకుడు, కాలదంతకుడు మొదలైన వాసుకియొక్క కులంలో పుట్టినవారున్నూ, పుచ్ఛాండకుడు, మండలకుడు, పిండసేక్త, రణేభకుడు, ఉచ్ఛిఖుడు, శరభుడు, భంగుడు, బిల్వతేజుడు, విరోహణుడు, శిలశలకరుడు, మూకుడు, సుకుమారుడు, ప్రవేపనుడు, ముద్గరుడు, శిశురోముడు, సురోముడు, మహాహనువు మొదలయినవా రైన తక్షకవంశంలో పుట్టినవారున్నూ, పారావతుడు, పారిజాతయాత్రుడు (పారియాత్రుడు), పాండరుడు, హరిణుడు, కృశుడు, విహంగుడు, శరభుడు, మోదుడు, ప్రమోదుడు, సంహతాపనుడు (సంహతాశనుడు) మొదలయినవా రైన ఐరావతసర్పరాజకులంలో పుట్టినవారున్నూ, నేరకుడు, కుండలుడు, వేణి, వేణీస్కంధుడు, కుమారకుడు, బాహుకుడు, శృంగబేరకుడు, ధూర్తకుడు, ప్రాతరాతకుడు మొదలయినవా రైన కౌరవ్యు డనే సర్పరాజకులంలో పుట్టినవారున్నూ, శంకుకర్ణుడు, పిఠరకుడు, కుఠారుడు, సుఖసేచుకుడు, పూర్ణాంగదుడు, పూర్ణముఖుడు, ప్రహాసుడు, శకుని, దర్యుడు, మాహరుడు, (హరి, ఆమాహరుడు అని సంస్కృతం) కామఠకుడు, సుషేణుడు, మానుడు, సావ్యయుడు (మానసుడు, అవ్యయుడు అనికూడ విడదీయవచ్చును) భైరవుడు, ముండుడు, వేదాంగుడు, పిశంగుడు, చోద్రపారకుడు (పింగళుడు, ఉడుపారగుడు అని సంస్కృతం); వృషభుడు, వేగవంతుడు, పిండారకుడు, మహాహనుడు, రక్తాంగుడు, సర్వసారంగుడు, సమృద్ధుడు, పఠవాసకుడు, వరాహకుడు, వీరణకుడు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సుచిత్రుడు, చిత్రవేగికుడు, పరాశరుడు, తరుణకుడు, మణిస్కంధుడు, ఆరుణ్యుడు మొదలయినవా రైన ధృతరాష్ట్రసర్పరాజకులంలో పుట్టినవారున్నూ ఒక్కొక్కమొత్తంగా; వేలపదివేలు సంఖ్యలు కలిగి.

మ. అతివేగాకులచిత్తు లై పడి, రుదాత్తాశీవిషాగ్నుల్, సితా
సితపీతారుణ వర్ణదేహులు, నవాసృగ్రక్తనేత్రుల్, మహో
న్నతు లేక త్రిక పంచ సప్త నవ నానామస్తకుల్, పల్వు రు
ద్ధతనాగేంద్రులు బ్రహ్మదండహతి నార్తధ్వాను లై వహ్నిలోన్. 211

ప్రతిపదార్థం: ఉదాత్త+ఆశీ, విష+అగ్నుల్= అధిక మైన ఆశి అనే ఒకరక మైన (కోరల్లో ఉండే) విషరూపమైన అగ్ని కలవారున్నూ; సిత+అసిత, పీత+అరుణ, వర్ణ, దేహులున్= తెల్లని నల్లని పసుపు పచ్చని ఎర్రని రంగులు గల దేహాలు కలవారున్నూ; నవ+అసృక్+రక్తనేత్రుల్= క్రొత్తనెత్తురువలె ఎఱ్ఱనైన నేత్రాలు కలవారున్నూ; మహత్, ఉన్నతులు= మిక్కిలి ఎత్తైన వారున్నూ; ఏక, త్రిక, పంచ, సప్త, నవ, నానామస్తకుల్= ఒకటి, మూడు, అయిదు, ఏడు, తొమ్మిది మొద లైన పెక్కుతలలు గలవారున్నూ; పల్వురు= అనేకులు; ఉద్ధతనాగ+ఇంద్రులు= గర్వించిన సర్పరాజులు; బ్రహ్మదండ, హతిన్= బ్రాహ్మణుల మంత్రమనే దండంయొక్క దెబ్బచేత; ఆర్తధ్వానులు+ఐ= దైన్యంతో కూడిన ధ్వనులు కలవా రై; అతి, వేగ+ఆకుల+చిత్తులు+ఐ= మిక్కిలివేగంచేత కలతపొందిన హృదయం కలవా రై; వహ్నిలోన్= అగ్నిలో; పడిరి.

తాత్పర్యం: అధికమైన కోరల్లోని విషరూప మైన అగ్నికలవారున్నూ, తెల్లని, నల్లని, పసుపుపచ్చని, ఎర్రని రంగులు కల దేహాలు కలవారున్నూ, మిక్కిలి ఎత్తైన వారున్నూ, ఒకటి, మూడు, ఐదు, ఏడు, తొమ్మిది మొదలయిన పెక్కుతలలు కలవారున్నూ అయిన అనేకులు గర్వితు లైన సర్పరాజులు మంత్రమనే దండంయొక్క దెబ్బచేత దీన మైన ధ్వనులుకలవారై, అధిక మైన వేగంచేత కలతచెందిన చిత్తం కలవారై అగ్నిలో పడ్డారు.

విశేషం: 'బ్రహ్మదండహతి'- అనేసమాసానికి - బ్రహ్మఅంటే మంత్రం అనే అర్థం ఉన్నది కాబట్టి బ్రాహ్మణుల మంత్రరూపమైన శిక్షయొక్క దెబ్బచేత అనీ, లేదా, బ్రాహ్మణుల మంత్రరూపమైన దండంయొక్క దెబ్బచేత అని కానీ చెప్పవచ్చును. మంత్రం అధ్యాహారంగా గ్రహించాలి.

క. తడఁబడఁ బడియెడు రవమును, । బడి కాలెడు రవముఁ, గాలి పలుదెఱఁగుల వ్ర,
స్సెడు రవమును, దిగ్వలయముఁ । గడుకొని మ్రోయించె నురగకాయోత్థిత మై. 212

ప్రతిపదార్థం: తడఁబడన్= తొట్రుపడేట్లుగా; పడియెడు= అగ్నిలో పడే; రవమును= ధ్వనియు; పడి= అగ్నిలో పడి; కాలెడు= కాలేటప్పుడు కలిగే; రవమును= ధ్వనియు; కాలి= దగ్ధమై; పలుతెఱఁగులన్= పెక్కువిధాల; వ్రస్సెడు= చీలెడు; రవమును= ధ్వనియు; ఉరగ, కాయ+ఉత్థితము+ఐ= పాములశరీరాలనుండి పుట్టినవై; దిక్, వలయమున్= దిక్చక్రం; కడుకొని= అతిశయించి; మ్రోయించెన్= మ్రోగునట్లు చేశాయి.

తాత్పర్యం: తొట్రుపాటు పడుతూ అగ్నిలో పడేటప్పుడు కలిగేధ్వనియున్నూ, పడి కాలేధ్వనియున్నూ, కాలి పెక్కువిధాల బ్రద్దలయ్యేటప్పుడు కలిగే ధ్వనియున్నూ, పాముల దేహాలనుండి బయల్వడినవై దిక్చక్రాన్ని అతిశయంగా మ్రోగేటట్లు చేశాయి.

వ. అంత. 213

తాత్పర్యం: పిమ్మట. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తక్షకుఁ డతిభీతుం డై। యా క్షణమున నరిగె 'సురగణాధిప! నన్నున్
రక్షింపుమ రక్షింపుమ। రక్షింపుమ' యనుచు నప్పురందరు కడకున్. 214

ప్రతిపదార్థం: తక్షకుఁడు= తక్షకు డనే సర్పరాజు; అతి, భీతుండు+ఐ= మిక్కిలి భయపడినవాడై; సుర, గుణ+అధిప!= దేవతలసమూహానికి అధిపతి వైన ఇంద్రుడా!; నన్నున్; రక్షింపుము+అ= కాపాడుమా; రక్షింపుము+అ= కాపాడుమా; అనుచున్= అని వేడుతూ; ఆ+పురందరు, కడకున్= ఆ ఇంద్రునిచెంతకు; ఆ క్షణమునన్= ఆ సమయంలో; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ సమయంలో తక్షకు డనే సర్పరాజు మిక్కిలి భయపడినవా డయి 'దేవతాధిపతి వైన ఓ ఇంద్రుడా! నన్ను కాపాడుము, కాపాడుము, కాపాడుము' అని వేడుతూ ఇంద్రుడిచెంతకు వెళ్ళాడు.

వ. పురందరుండును దొల్లి కమలజువాక్యంబున వాసుకిప్రముఖ సర్పకులముఖ్యులకు సర్పసత్త్రభయంబు లేమి యెఱింగినవాఁడు గావున వాని నోడకుండు మని చేకొనియుండె; నిట వాసుకియు జనమేజయ సమారబ్ధ సర్పసత్త్ర పరిత్రస్తుం డై ద్వియోజన త్రియోజనాయామ స్థూలవ్యాళనివహంబులు నిజవంశ భ్రాతృవంశ జనితంబు లయినవి జననీ వాగ్దండపీడితంబు లయి యగ్నికుండంబునఁ బడుటకు శోకించి తన చెలియలి జరత్కారువుం జూచి యి ట్లనియె. 215

ప్రతిపదార్థం: పురందరుండును= ఇంద్రుడును, తొల్లి= పూర్వం; కమలజు, వాక్యంబునన్= బ్రహ్మదేవుని వచనంచేత; వాసుకి, ప్రముఖ, సర్ప, కుల, ముఖ్యులకున్= వాసుకిమొదలయిన పాములకులంలోని ప్రధానులకు; సర్ప, సత్త్ర, భయంబు= సర్పయాగంవలనిభీతి; లేమి= లేకుండటం; ఎఱింగినవాఁడు= తెలిసినవాడు; కావునన్= కాబట్టి; వానిన్= తక్షకుడిని; ఓడక, ఉండుము+అని= భయపడక ఉండుమని; చేకొని, ఉండెన్= గ్రహించి ఉన్నాడు; ఇటన్= సర్పాలుండేచోట; వాసుకియున్= వాసుకి అనే సర్పరాజును; జనమేజయ, సమారబ్ధ, సర్ప, సత్త్ర, పరిత్రస్తుండు+ఐ= జనమేజయమహారాజుచేత ఆరంభించబడిన సర్పయాగంవలన మిక్కిలి భయపడినవాడై; ద్వియోజన, త్రియోజన+ఆయామ, స్థూల, వ్యాళ, నివహంబులు= రెండామడలు (ఆమడ= 4 క్రోసులు), మూడామడల పొడవును, లావును ఉన్నపాములసమూహాలు; నిజ, వంశ, భ్రాతృ, వంశ, జనితంబులు+అయినవి= తనవంశంలోను, సోదరుల వంశంలోను పుట్టినట్టివి; జననీవాక్+దండ, పీడితంబులు+ఐ= తల్లియొక్క శాపరూపమయినవాక్కు అనే శిక్షచే పీడింపబడినవై; అగ్నికుండంబునన్= హోమాగ్నికుండంలో (యజ్ఞసమయంలో అగ్నిని ఉంచటానికి నిర్మించినగొయ్యి); పడుటకున్; శోకించి= దుఃఖించి; తనచెలియలి= తన చెల్లె లైన; జరత్కారువున్= జరత్కారునిభార్యను; చూచి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: ఇంద్రుడు పూర్వం బ్రహ్మయొక్క వచనంచేత వాసుకి మొదలైన పాములకులంలోని శ్రేష్ఠులకు సర్పయాగంవలని భయం లేకుండటం ఎరిగినవా డవటంచేత తక్షకుడిని భయపడకు మని ఆదరంతో గ్రహించి ఉన్నాడు. ఇంక- సర్పా లుండేచోట వాసుకి అనే సర్పరాజు జనమేజయుడిచేత ఆరంభించబడిన సర్పయాగంవలన మిక్కిలి భయపడినవాడై, రెండామడలు మూడామడలు పొడవును, లావును గల తనవంశంలోను సోదరులవంశంలోను పుట్టిన సర్పసమూహాలు తల్లియైన కద్రువ ఇచ్చిన వాగ్రూప మైన శాపంచేత (శిక్షచేత), పీడింపబడిన వై హోమాగ్నికుండంలో పడటానికి దుఃఖించి, తనచెల్లెలూ జరత్కారుమునిభార్యా అయిన జరత్కారువును చూచి ఇట్లా పలికాడు.

క. ప్రస్తుత ఫణి సత్త్ర భయ । త్రస్తాత్మల మైన యస్మదాదుల కెల్లన్
స్వస్తి యొనర్పఁగ నవసర । మాస్తీకున కయ్యె నిప్పు డంబుజనేత్రా! 216

ప్రతిపదార్థం: అంబుజ, నేత్రా= పద్మాలవంటి నేత్రాలు కలదానా (జరత్కారువునకు సంబోధనం), ప్రస్తుత, ఫణి, సత్త్ర, భయ, త్రస్త+ఆత్మలము+ఐన= ఆరంభింపబడిన సర్పయాగంవలన భయపడిన హృదయాలు కలవార మైన; అస్మద్+ ఆదులకున్+ ఎల్లన్= నేను మొదలుగాగల వారికందరికిని; స్వస్తి= శుభం; ఒనర్పఁగన్= చేయటానికి; అవసరము= సమయం; ఇప్పుడు= ఈక్షణంలో, ఆస్తీకునకున్= నీకుమారు డైన ఆస్తీకునికి; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: పద్మాలవంటికన్నులుగల ఓ జరత్కారూ! జనమేజయుడిచేత ఆరంభింపబడిన సర్పయాగంవలన భయపడిన హృదయాలు కలవార మైన నేను మొదలుగాగల పాముల కన్నింటికిని శుభం (మేలు) చేయటానికి అవసరమైన సమయం ఇప్పుడు నీకుమారుడైన ఆస్తీకుడికి కలిగింది.

విశేషం: అవసరము(సం.)= సమయం; తెలుగులో వ్యవహారంలో 'అక్కర' అనే అర్థంకూడ దీని కున్నది. 'అంబుజనేత్రా!' అని అన్న చెల్లెలిని సంబోధించవచ్చునా అని కొందరు శంకించవచ్చును; ఈ సంబుద్ధి శృంగార భావవ్యంజకమే కాకుండా గౌరవవ్యంజకమైనదని కూడ గ్రహించాలి. ఈ ఆశ్వాసంలోనే (2.48 పద్యంలో) గరుత్మంతుడు తల్లియైన వినతను 'పయోరుహాననా' అని సంబోధించటంలోకూడ తాత్పర్య మిటువంటిదే.

క. విమలతపోవిభవంబునఁ । గమలజు నట్టిండ విగతకల్మషుఁ డాస్తీ
కమహాముని; యీతనివచ । నమున మహాహికులరక్షణం బగుఁ బేర్మిన్. 217

ప్రతిపదార్థం: ఆస్తీక, మహత్, ముని; విమల, తప+విభవం= నిర్మలమైన తపస్సు యొక్క వైభవంలో; కమలజు+అట్టిండు+అ= బ్రహ్మవంటివాడే; విగత, కల్మషుఁడు= పోయినపాపం కలవాడు; (పవిత్రుడు); ఈతని, వచనమునన్= ఈ ఆస్తీకుని వాక్కుచేత; మహత్+అహి+కుల, రక్షణంబు= గొప్పపాములకులంయొక్క రక్షణం; పేర్మిన్= అతిశయంతో; అగును= అవుతుంది.

తాత్పర్యం: నీ కుమారుడైన ఆస్తీకమహాముని, నిర్మలతపస్సంపదలో బ్రహ్మదేవుడి వంటివాడు. పాపరహితుడు. ఇతని మాటలచేత గొప్పవైన పాములసముదాయాల రక్షణం సమంజసంగా అవుతుంది.

విశేషం: కమలజు+అట్టిండు- 'షష్ఠీసమాసమునందుత్తున కచ్చు పరమగునపుడు నుగాగమమగును'- కమలజునట్టిండు. అట్టి+వాఁడు- తచ్ఛబ్దమైన 'వ'కులోపం అట్టిఁడు, అట్టిండు.

వ. 'బ్రహ్మవచనంబు నిట్టిద కా విని యేలాపుత్త్రుండు మాకుఁ జెప్పె; జరత్కారుమహామునికి నిన్ను వివాహంబు సేయుటయు నేతదర్థంబ; యింకొక్కనిమేషంబేని యుపేక్షించిన సకలసర్పప్రళయం బగుం గావున నాస్తీకుండు జనమేజయ మహీపాలు పాలికిం బోయి సర్పయాగం బుడిగించి రక్షింపవలయు' ననిన, నయ్యగ్రజువచనంబులు విని జరత్కారువు గొడుకు మొగంబు చూచి 'భవన్మాతుల నియోగంబు సేయు' మనిన నాస్తీకుం డి ట్లనియె. 218

ప్రతిపదార్థం: బ్రహ్మవచనంబును= బ్రహ్మవాక్కుకూడ; ఇట్టి+అది+అ= ఇట్టిదే!; కాన్, విని= అవునట్లుగా విని; (చూడు 132-136 పద్యాలు); ఏలాపుత్త్రుండు= ఏలాపుత్త్రు డనే పేరున్న నాగకుమారుడు; మాకున్; చెప్పెన్= తెలిపాడు; జరత్కారు, మహత్, మునికిన్; నిన్నున్= జరత్కారువును; వివాహంబు+చేయుటయున్= పెండ్లిచేయుటయును; ఏతద్+అర్థంబు+అ= ఈ ప్రయోజనం కలదే! (ఈ ప్రయోజనం కొరకే!); ఇంకన్+ఒక్క, నిమేషంబు+ఏని= ఇంకొక్కనిమిష మైనా; ఉపేక్షించినన్= అశ్రద్ధచేస్తే; సకల, సర్ప ప్రళయంబు= అన్నిపాములవినాశం; అగున్; కావునన్= కాబట్టి; ఆస్తీకుండు; జనమేజయ, మహీపాలు పాలికిన్=జనమేజయమహారాజు చెంతకు, పోయి= వెళ్ళి; సర్ప, యాగంబు= పాములను హోమం చేసే యజ్ఞం; ఉడిగించి= మానేటట్లు చేసి; రక్షింప వలయున్= పాములను కాపాడాలి. అనినన్= అని వాసుకి చెప్పగా; ఆ+అగ్రజు, వచనంబులు= ఆ అన్నగారి వాక్కులు; విని; జరత్కారువు= చెల్లెలైన జరత్కారువు; కొడుకు, మొగంబు= కుమారుని (ఆస్తీకుని) ముఖం; చూచి; భవత్+మాతుల, వినియోగంబు= నీ మేనమామ అయిన వాసుకిపనుపు (నియోగించినపని); చేయుము+అనినన్= చేయు మని తెల్పగా; ఆస్తీకుండు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: 'బ్రహ్మదేవునివాక్కుకూడ ఇటువంటిదే అయినట్లుగా (సర్పయాగం ఆస్తీకుడిచేత ఉడిగింపబడుతుందని) విని ఏలాపుత్రు డనే నాగకుమారుడు మాకు తెల్పాడు. జరత్కారుమహామునికి ని న్నిచ్చి పెండ్లిచేయటంకూడ ఈ ప్రయోజనం నెరవేరటానికే! ఇంకొక్క నిమిషమైనా అశ్రద్ధ చేస్తే సర్వసర్పవినాశం అవుతుంది. కాబట్టి ఆస్తీకుడు జనమేజయమహారాజు చెంతకు వెళ్ళి సర్పయాగం మాన్పించి పాములను రక్షించాలి' అని వాసుకి చెప్పగా, అన్నగారి వాక్కులు విని చెల్లెలైన జరత్కారువు కుమారుడి (ఆస్తీకుని) ముఖం చూచి 'నీమేనమామ అయిన వాసుకి చెప్పినపని చేయు' మని తెల్పగా ఆస్తీకుడు ఇట్లా అన్నాడు.

విశేషం: ఇట్టి+అది; 'అది యవి శబ్దముల అత్తునకు వృత్తిని వైకల్పికంగా లోపము', ఇట్టిది, భవత్+మాతుల-అనునాసికసంధి - భవన్మాతుల.

ఆస్తీకుఁడు సర్పయాగము నివారించుట (సం. 1-49-17)

క. కడవఁబడి మున్ను వహ్నిం । గడుకొని పడినవియ కాని కద్రూసుతులం
బడనీ నింక; నవశ్యము । నుడిగింతును సర్పయాగ; మోడకుఁ డింకన్. 219

ప్రతిపదార్థం: కడవఁబడి= (స్వార్థంలోపడు) గతించి; మున్ను= ఇంతకుపూర్వం; వహ్నిన్= అగ్నిలో; కడుకొని= అతిశయించి; పడిన+అవి+అ, కాని= పడ్డవే కాని; కద్రూసుతులన్= కద్రువకొడుకు లైన పాములను; ఇంకన్= ఇంకముందు; పడన్, ఈను= పడనీయను; అవశ్యమున్= నిశ్చయంగా; సర్పయాగము; ఉడిగింతును= మానేటట్లు చేస్తాను; ఇంకన్= ఇకముందు; ఓడకుఁడు = భయపడకండి.

తాత్పర్యం: ఇంతకుముందు (గతించినకాలంలో) అగ్నిలో అధికంగా పడినవాటినే కాని, కద్రువకొడుకు లైన పాములను ఇకముందు (భవిష్యత్తులో) పడనీయను, తప్పక సర్పయాగాన్ని మాన్పించుతాను. ఇంక(ఇప్పటినుండి) భయపడకండి.

వ. అని యాస్తీకుండు వాసుకి ప్రముఖుల నాశ్వాసించి, సకలవేదవేదాంగపారగు లయిన విప్రవరులతో జనమేజయ సర్పసత్త్ర సదనంబునకుం జనుదెంచి, స్వదేహకాంతి సభాంతరంబెల్ల వెలుంగుచుండ స్వస్తివచనపూర్వకంబుగా ని ట్లని స్తుతియించె. 220

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని= అనిపలికి; ఆస్తీకుండు; వాసుకి, ప్రముఖులన్= వాసుకి మొదలైనవారిని; ఆశ్వాసించి= ఓదార్చి; సకల, వేద, వేద+అంగ, పారగులు+అయిన= సర్వ (నాలుగు) వేదాలయు, ఆరువేదాంగాలయు అంతాన్ని పొందిన (వేదవేదాంగాలను పూర్తిగా పఠించిన), విప్ర, వరులతోన్= బ్రాహ్మణశ్రేష్ఠులతో; జనమేజయ, సర్ప, సత్ర, సదనంబునకున్= జనమేజయుడి సర్పయాగం జరిగే యజ్ఞశాలకు; చనుదెంచి= వచ్చి; స్వ, దేహ, కాంతిన్= తనమేనికాంతిచే; సభా+అంతరంబు+ఎల్లన్= సభామధ్యభాగ మంతా; వెలుంగుచుండన్= ప్రకాశిస్తుండగా; స్వస్తి, వచన, పూర్వకంబుగాన్= శుభాన్ని సూచించే (స్వస్తి) వాక్కు మొదలుగా కలిగేట్లుగా; ఇట్లు+అని= ఈవిధంగా పలికి; స్తుతియించెన్= పొగిడాడు.

తాత్పర్యం: అని పలికి ఆస్తీకుడు వాసుకి మొదలైన నాగరాజులను ఓదార్చి, నాలుగువేదాలలోను, ఆరువేదాంగాలలోను నిష్ణాతు లైన బ్రాహ్మణశ్రేష్ఠులతో జనమేజయుడు సర్పయాగం చేసే శాలకు వచ్చి తనమేనికాంతిచే సభామధ్యమంతా ప్రకాశిస్తుండగా మంగళవాక్పూర్వకంగా జనమేజయుడిని ఈవిధంగా కీర్తించాడు.

విశేషం: ఋగ్యజుస్సామాథర్వము లని వేదాలు నాలుగు, శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం అనే ఆరూ వేదాంగాలు.

మ. **రజనీనాథకు లైన భూషణుఁడ వై, రాజర్షి వై, ధారుణీ**
ప్రజ నెల్లన్ దయతోడ ధర్మచరితం బాలించుచుం, దొంటి ధ
ర్మజు నాభాగు భగీరథున్ దశరథున్ మాంధాతృ రాముస్ రఘున్
విజయుం బోలితి సద్గుణంబుల జగద్విఖ్యాత పారీక్షితా! 221

ప్రతిపదార్థం: జగత్, విఖ్యాత= లోకంలో సుప్రసిద్ధుడ వైన; పారీక్షితా!= పరీక్షిత్తుకుమారుడ వైన జనమేజయుడా!; రజనీ, నాథ, కుల+ఏక, భూషణుఁడవు+ఐ= రాత్రికి పతి అయిన చంద్రుడి వంశంలో ప్రధాన మైన అలంకారాని వై; రాజ+ఋషివి+ఐ= ఋషివంటిరాజు వై (తమ పవిత్రచరిత్రంచేత ఋషిగా పరిగణింపబడే రాజు రాజర్షి. పురూరవుడు. జనకుడు, విశ్వామిత్రుడు మొదలైనవారు రాజర్షులు); ధారుణీప్రజన్+ఎల్లన్= భూమిలోనిప్రజలనందరిని; దయతోడన్; ధర్మ, చరితన్= ధర్మంతో కూడిన వర్తనంతో; పాలించుచున్= పరిపాలిస్తూ; తొంటి= పూర్వముండే; ధర్మజున్= ధర్మరాజును; నాభాగున్= అంబరీషుడి తండ్రి అయిన నాభాగుడనే సూర్యవంశపురాజును; భగీరథున్= సగరుని మనుమ డై గంగను ఆకాశంనుండి పాతాళం వరకు తెచ్చిన సూర్యవంశపురాజును; దశరథున్= రాముడితండ్రి అయిన దశరథుడిని; మాంధాతృ= కృతయుగంలో ఉన్న మాంధాత అనేయువనాశ్వుడి కుమారుడిని; రామున్= శ్రీరాముడిని; రఘున్= దశరథునితాత అయిన రఘుమహారాజును; విజయున్= అర్జునుడిని; సత్, గుణంబులన్= మంచి గుణాలలో; పోలితి(వి)= సరిపోలినావు.

తాత్పర్యం: ఓ జనమేజయమహారాజా! చంద్రవంశప్రధానాలంకారానివై, ఋషివంటి రాజువై, దయతోను, ధర్మంతోను కూడిన ప్రవర్తనతో భూమిలోని ప్రజలనందరిని పరిపాలిస్తూ మున్ను ప్రసిద్ధులైన ధర్మరాజును, నాభాగుడిని, భగీరథుడిని, దశరథుడిని, మాంధాతను, రాముడిని, రఘుమహారాజును, అర్జునుడిని ఉత్తమగుణాలలో సరిపోలినావు.

విశేషం: ధర్మరాజును, అర్జునుడిని నన్నయ ఆరంభాంతాలలో పేర్కొన్నాడు. వారు జనమేజయుడి ప్రపితామహులు, చంద్రవంశాలంకారులు. మిగిలినవారందరూ సూర్యవంశంలో ప్రసిద్ధులైన రాజులు. మాంధాత యువనాశ్వుడి గర్భంనుండి పుట్టాడు. అప్పుడు మునులు 'కమేష ధాస్యతి' అని అన్నారు. అప్పుడు ఇంద్రుడు వచ్చి 'మాం ధాస్యతి' అని పలికాడు.

అందుచేత అతడికి మాంధాత అనే పేరు కలిగింది. నన్నయ ఉదంకోపాఖ్యానంలో రచించిన నాగస్తుతి (ఆది. 1:104-107) ఎంతప్రసిద్ధమో, ఆస్తీకునికథలో రచించిన జనమేజయయాగస్తుతి అంత ప్రశస్తం. నన్నయ గుణప్రధానమైన రచన చేస్తాడు. వామనుడు గుణాలను శబ్దగుణా లనీ అర్థగుణా లనీ విభజించాడు. క్రమంగా ఆ విభాగం కలిసిపోయి శబ్దగుణాలకే పరిమితమైపోయింది. నన్నయ శబ్దగుణవాది. పదిరకాల శబ్దగుణాలను మాధుర్యము, ఓజస్సు, ప్రసాదము అనే మూడుగుణాలలో అంతర్భవింపచేయటం మమ్మటాదులమతం. నన్నయకాలంనాటికి ఈవాదమే ప్రచారంలో ఉన్నది. ఉదంకోపాఖ్యానంలోని నాగస్తుతిలోని నాల్గుపద్యాలలో మాధుర్యౌజోగుణాలలో ప్రసాదాన్ని మిశ్రమంచేసి రచించాడు. అందుకు అవి సహృదయ హృదయానురంజకా లయ్యాయి. నన్నయ ఈఘట్టంలో పదిపద్యాలను (221-226; 228, 229, 231, 233) ప్రసాదమిశ్రిత మైన పదిగుణాలకు ప్రతినిధులుగా రచించి అపూర్వప్రయోగాన్ని చేశాడు. దశగుణసమాహారంగా కనబడే ఈఘట్టంలోని నన్నయపద్యాలు ఆణిముత్యాలు. వాటిలో ఈపద్యం ఉక్తిచమత్కారవిశిష్ట మైన మాధుర్యం (పృథక్పదత్వం) అనే గుణానికి చక్కని ఉదాహరణం. జనమేజయుడి ఆభిజాత్యాన్నీ, ధర్మచరిత్రాన్నీ, సద్గుణౌన్నత్యాన్నీ రుచిరార్థసూక్తులతో ఉదాత్తంగా కీర్తించాడు. సర్పయాగం చేయటం ఆస్తీకుడిదృష్టిలో ఉత్తమధర్మకార్యం కాదు. అటువంటి అమానుషయజ్ఞాన్ని నిర్వహిస్తున్న జనమేజయుడిని విమర్శించకుండా ఉదాత్తప్రశంసలతో ప్రారంభించటం ఉక్తినైపుణ్యం. ఇంతటివాడికి ఈపని తగదు- అని తేల్చిచెప్పటానికి అనువుగా తియ్యగా పొగడటంతో ప్రారంభించిన ఆస్తీకుడి మాటలతీరులోని ఈ ఉపక్రమణికను మాధుర్యగుణంలో నిబంధించటం మనోహరం, ఆస్వాదమధురం. (సంపా.)

తరలము.

> **కువలయంబున వారి కోరిన కోర్కికిం దగ నీవు పాం**
> **డవకులంబు వెలుంగఁ బుట్టి, దృఢంబుగా నృపలక్ష్మితో**
> **నవనిరాజ్యభరంబు దాల్చిన యంతనుండి మఖంబులం**
> **దివిరి యిష్టధనంబు లిచ్చుటఁ దృప్తు లైరి మహాద్విజుల్. 222**

ప్రతిపదార్థం: కు, వలయంబున, వారి= భూవలయంలోని జనుల(లు); కోరిన; కోర్కికిన్= కోరికకు; తగన్= తగినట్లుగా; నీవు, పాండవకులంబు= పాండవులవంశం; వెలుంగన్= ప్రకాశించేటట్లుగా; పుట్టి; దృఢంబుగాన్= స్థిరంగా; నృపలక్ష్మితోన్= రాజలక్ష్మితో; అవని, రాజ్య, భరంబు= భూమిరాజ్యంయొక్క భారాన్ని; తాల్చిన, అంతనుండి= ధరించినప్పటినుండి; మఖంబులన్= యజ్ఞాలలో; తివిరి= యత్నించి, (కుతూహలపడి); ఇష్టధనంబులు= బ్రాహ్మణులచేత కోరబడిన ధనాలను; ఇచ్చుటన్= ఇవ్వటంచేత; మహత్, ద్విజుల్= గొప్పబ్రాహ్మణులు, తృప్తులు+ఐరి= తృప్తి పొందారు.

తాత్పర్యం: భూవలయంలోని ప్రజలు కోరినకోరికకు తగినట్లు నీవు పాండవులవంశం ప్రకాశించేటట్లుగా పుట్టి స్థిరంగా రాజ్యలక్ష్మితో భూరాజ్యభారం వహించినప్పటినుండి యజ్ఞాలలో కుతూహలపడి బ్రాహ్మణులకు అభీష్టాలైన ధనాలు ఇస్తూండటంవలన వారు తృప్తిపొందారు.

విశేషం: కువలయంబు+వారు- తత్పురుషసమాసంలో 'న' ఆగమంగా వచ్చింది- కువలయంబునవారు. మహాబ్రాహ్మణశబ్దానికి గొప్పబ్రాహ్మణు డనే అర్థమే కాక నీచబ్రాహ్మణు డనే అర్థంకూడ ఉన్నది. మహాద్విజశబ్దానికి అటువంటి నీచార్థం లేదు. యజ్ఞాలు చేసి భూరిదక్షిణ లిచ్చి వంశప్రతిష్ఠను కాపాడిన జనమేజయుడిని ప్రసాదగుణభూయిష్ఠ మైన పద్యంలో కీర్తించటం సమంజసం. అర్థవైమల్యంతో కూడిన బంధశైథిల్యం ప్రసాదం. ఆయజ్ఞాలకూ ఈ యజ్ఞానికీ ఉన్న భేదాన్ని సారమతులైన సహృదయులభావనకు వదలటం నన్నయ వస్తుధ్వని. (సంపా.)

ఉ. అమ్మనుజేంద్రుఁ డైన నలుయజ్ఞము, ధర్మజురాజసూయయ
జ్ఞమ్ముఁ, బ్రయాగఁ జేసిన ప్రజాపతియజ్ఞముఁ, బాశపాణియ
జ్ఞమ్మును, గృష్ణుయజ్ఞము, నిశాకరుయజ్ఞము నీ మనోజ్ఞ య
జ్ఞమ్మును నొక్కరూప విలసన్మహిమం గురువంశవర్ధనా! 223

ప్రతిపదార్థం: కురు, వంశ, వర్ధనా!= కౌరవవంశాన్ని వృద్ధిపొందించేవాడా!; ఆ+మనుజ+ఇంద్రుఁడు+ఐన= ప్రసిద్ధు డైన రాజేంద్రు డైన; నలు యజ్ఞము= నలుని యాగమున్నూ; ధర్మజు, రాజసూయ, యజ్ఞమ్మున్= ధర్మరాజుయొక్క రాజసూయయాగమున్నూ; ప్రయాగన్= త్రివేణీసంగమ మైన ప్రయాగక్షేత్రంలో; చేసిన; ప్రజాపతి, యజ్ఞమున్= బ్రహ్మదేవుని యజ్ఞమున్నూ; పాశపాణి= పాశం హస్తంలో ఉన్న వరుణుని; యజ్ఞమ్మును; కృష్ణు= కృష్ణునియొక్క; యజ్ఞమున్; నిశా, కరుయజ్ఞమున్= చంద్రుని యజ్ఞమున్నూ; నీ, మనోజ్ఞ, యజ్ఞమ్మునున్= నీవు చేస్తున్న మనోహరమైన యజ్ఞమున్నూ; విలసత్+మహిమన్= ప్రకాశిస్తున్న మహత్త్వంలో; ఒక్క, రూపు+అ= ఒక్కవిధమే (సమానాలు).

తాత్పర్యం: కౌరవవంశాన్ని వృద్ధిపొందించేవాడా! జనమేజయా! ప్రసిద్ధుడైన నలమహారాజుయాగం, ధర్మరాజు చేసిన రాజసూయయజ్ఞం; బ్రహ్మదేవుడు ప్రయాగక్షేత్రంలో చేసిన యజ్ఞం, వరుణదేవుడి యజ్ఞం, కృష్ణుడియజ్ఞం, చంద్రుడియజ్ఞం, మనోహరమైన నీయజ్ఞం, ప్రకాశించే మహత్త్వంలో ఒక్కవిధమే (సమానాలే).

విశేషం: అలం: ఉపమ. నలాదులు చేసిన యజ్ఞాలు చాలాగొప్పవి. జనమేజయుడి యజ్ఞంకూడ అట్టిదే. విలసత్+మహిమన్= అనునాసికసంధి - విలసన్మహిమ. ఈపద్యరచనలో నన్నయ వస్తుస్వభావస్ఫుటత్వాన్ని స్ఫురింపచేయటానికి అర్థవ్యక్తి (ఝటిత్యర్థ ప్రతిపత్తిహేతుత్వం) అనే గుణాన్ని సార్థకంగా వాడాడు. సర్పయజ్ఞం ఎన్ని యజ్ఞాలకంటె ఎంతగొప్పదో చెప్పాడు. అంతవరకూ దేవతలు, భూపతులు చేయని ఆదియజ్ఞమైన సర్పయజ్ఞంయొక్క స్వరూపస్వభావాలను వివిధయజ్ఞాలతో పోల్చిచెప్పాడు. ఈస్తుతి విన్నవారు ఆస్తీకుడు ఆ యజ్ఞాన్ని సమర్థిస్తున్నాడని అనుకొంటారు. జనమేజయాదులుకూడ అట్లాగే భావించారు. నిషేధించటానికి పూర్వరంగంగా తోడ్పడిన ప్రశంస ఇది. (సంపా.)

చ. వితతమఖప్రయోగవిధివిత్తము, లుత్తమధీయుతుల్ జగ
న్నుత సుమహాతపోధను, లనుగ్రహనిగ్రహశక్తియుక్తు లీ
క్రతువున ఋత్విజుల్, కమలగర్భసమానులు పూర్వదిక్పతి
క్రతువున యాజకోత్తములకంటెఁ బ్రసిద్ధులు సర్వవిద్యలన్. 224

ప్రతిపదార్థం: ఈక్రతువున= నీవు చేసే సర్పయాగంలోని; ఋత్విజుల్= యజ్ఞం చేయించేవారు; వితత, మఖ, ప్రయోగ, విధి, విద్, తములు= విస్తృత మైన యజ్ఞాన్ని ప్రయోగించే (చేసే) విధానాన్ని ఎరిగినవాళ్ళలో శ్రేష్ఠులు; ఉత్తమ, ధీ, యుతుల్= ప్రశస్త మైన (గొప్ప) బుద్ధితో కూడినవారు; జగత్+నుత= లోకంచే స్తుతింపబడిన; సు, మహత్, తపస్+ధనులు= చాలగొప్పతపస్సే ధనంగా కలవారు; అనుగ్రహ, నిగ్రహ, శక్తి, యుక్తులు= దయచూపటం, శిక్షించటం అనేశక్తులతో కూడినవారు; కమల, గర్భ, సమానులు= బ్రహ్మతో సమానులు; పూర్వదిక్, పతి, క్రతువున= తూర్పుదిక్కుకు అధిపతి అయిన ఇంద్రునియజ్ఞంలోని; యాజక+ఉత్తములకంటెన్= యజ్ఞంచేయించే ఋత్విక్శ్రేష్ఠులకంటెను; సర్వవిద్యలన్= అన్ని విద్యలలోను; ప్రసిద్ధులు= ప్రసిద్ధిపొందినవారు.

తాత్పర్యం: నీవు చేస్తున్న ఈసర్పయాగంలోని ఋత్విక్కులు విస్తృతమైన యజ్ఞాచరణవిధానాన్ని బాగా ఎరిగినవారు, అధికబుద్ధిసంపన్నులు, లోకంచేత స్తుతింపబడిన మిక్కిలి గొప్పతపస్సే ధనంగా కలవారు, దయతో చూడటం, శపించి శిక్షించటం అనేశక్తులతో కూడినవారు, బ్రహ్మతో సమానులు, అన్ని విద్యలలోను, తూర్పుదిక్కును ఏలే ఇంద్రుడియజ్ఞంలోని ఉత్తమఋత్విజులకంటె ప్రసిద్ధిని పొందినవారు (కీర్తిమంతులు).

విశేషం: అలం: ఉపమ, జగత్+నుత= అనునాసికసంధి. ఈసమాసం 'లోకంచేతస్తుతింపబడేవాడా' అని జనమేజయుడికి సంబోధన మైనా కావచ్చును. ఋత్విజుల మహత్త్వాన్ని కీర్తించే ఈపద్యరచనలో నన్నయ బహుపదముల ఏకవద్భావాన్నీ మనోహరమైన ఘటనను ప్రదర్శించే శ్లేషము- అనే గుణాన్ని నిబంధించి రమ్యతను కల్పించాడు. వివిధరంగాలలో, వివిధగుణాలతో భాసించే అంతమంది యాజకోత్తములు ఒక్కచోటకూడటం అపూర్వసంఘటన, వారందరినీ సామూహికంగా ప్రశంసించటంలో భాసించే బహుపదాల ఏకవద్భావం శ్లేష మనే గుణం. లయబద్ధ మైన ఒక యజ్ఞచిత్రాన్ని నన్నయ ఇందులో పఠితల కందించాడు.(సంపా.)

శా. **విద్వన్ముఖ్యుఁడు, ధర్మమూర్తి, త్రిజగద్విఖ్యాతతేజుండు కృ**
ష్ణద్వైపాయనుఁ డేగుదెంచి, సుతశిష్యబ్రహ్మసంఘంబుతో
సద్వంద్యుండు సదస్యుఁ డయ్యె ననినన్ శక్యంబె వర్ణింప; సా
క్షాద్విష్ణుండవు నీవు భూపతులలోఁ గౌరవ్యవంశాగ్రణీ! **225**

ప్రతిపదార్థం: కౌరవ్య వంశ+అగ్రణీ!= కౌరవవంశంలో పుట్టిన వారిలో అగ్రేసరుడా!; విద్వత్+ముఖ్యుఁడు= విద్వాంసులలో ప్రధానుడు; ధర్మ, మూర్తి= ధర్మమేరూపంపొందినవాడు; త్రి, జగత్, విఖ్యాత, తేజుండు= ముల్లోకాలలో ప్రసిద్ధమైన కాంతికలవాడు. సత్, వంద్యుండు= సజ్జనులకు (పండితులకు) నమస్కరింపదగినవాడు; కృష్ణద్వైపాయనుఁడు= వ్యాసుడు; సుత, శిష్య, బ్రహ్మ, సంఘంబుతోన్= కుమారు డైన శుకునితో, వైశంపాయనాదిశిష్యులతో, ఋత్విక్కుల సముదాయంతో; ఏగుదెంచి= వచ్చి; సదస్యుఁడు= యజ్ఞవిధి పరీక్షాధికారి; అయ్యెన్, అనినన్= అయినాడంటే; వర్ణింపన్, శక్యంబు+ఎ= నీయజ్ఞమహిమను (నిన్ను) వర్ణించతరమా!(కాదు); భూపతులలోన్= రాజులలో; నీవు; సాక్షాత్; విష్ణుండవు+అ= సాక్షాత్తుగా విష్ణుమూర్తివే.

తాత్పర్యం: కౌరవవంశ్యులలో శ్రేష్ఠుడా! (జనమేజయా!) విద్వాంసులలో శ్రేష్ఠుడు, మూర్తి తాల్చిన ధర్మం, ముల్లోకాలలో ప్రసిద్ధమైన తేజం కలవాడు, సుజనవందనీయుడు అయిన వ్యాసమహర్షి స్వయంగా కుమారుడితోను, శిష్యులతోను, ఋత్విజులసముదాయంతోను వచ్చి నీయజ్ఞంలో సదస్యు డైనా డంటే నీయజ్ఞాన్నీ, నిన్నూ వర్ణింప తరమవుతుందా? రాజులలో నీవు సాక్షాత్తుగా విష్ణుమూర్తివే!

విశేషం: యమునాద్వీపంలో పుట్టినవాడు ద్వైపాయనుడు, నల్లని వాడవటం చేత కృష్ణద్వైపాయనుడు. పైలుడు, జైమిని, వైశంపాయనుడు, సుమంతుడు అతనిశిష్యులు. బ్రహ్మసంఘంపేర్లు 208వ వచనంలో చెప్పబడినవి. 'నాஉవిష్ణుః పృథివీపతిః' అనే సూక్తిని అనుసరించి రాజులందరూ విష్ణ్వంశ కలవారే. ఆ అంశ లేనివాడు రాజు కాడు. జనమేజయుడు సాక్షాత్తుగా విష్ణువే - అని ఆస్తీకుడి ప్రశంస. బ్రహ్మవిష్ణుమహేశ్వరులలో విష్ణువు స్థితికారుడు. జనమేజయుడు సర్పయజ్ఞంచేస్తూ లయకారు డౌతున్నాడు. ఈ తారతమ్యాన్ని చివరలో ఆస్తీకుడు తన కోర్కెద్వారా ధ్వనింపజేస్తాడు. అందువలన ఇందులో వస్తుధ్వని ఉన్నది. అంతేకాదు. ఈపద్యరచనలో నన్నయ సభ్యప్రసంగంతో కూడిన బంధముయొక్క వికటత్వ మనే ఉదారత- అనే గుణాన్ని గొప్పగా పోషించాడు. కృష్ణద్వైపాయనుడి గుణగణాలను కీర్తించి, అంతటివాడిని సదస్యుడిగా చేసికొన్న జనమేజయుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సాక్షాత్ విష్ణువే అనటం ఇందులోని రుచిరార్థం. రచనలో నృత్యవద్భావం వాక్యపదవిన్యాసంలో గోచరించటం ఉదారతాగుణస్వభావం. అది ఈపద్యంలో సాక్షాత్కరించింది. (సంపా.)

ఉ. ఆర్తిహరక్రియాభిరతుఁ డై, కృతసన్నిధి యై, ప్రదక్షిణా
వర్త శిఖాగ్రహస్తముల వహ్ని మహాద్విజదివ్యమంత్రని
ర్వర్తితహవ్యముల్ గొనుచు వారిజవైరికులేశ! నీకు సం
పూర్తమనోరథంబులును, బుణ్యఫలంబులు నిచ్చుచుండెడున్. 226

ప్రతిపదార్థం: వారిజ, వైరి, కుల+ఈశ= పద్మాలకు శత్రువైన చంద్రునివంశంలో పుట్టినరాజా! ఆర్తి, హర, క్రియా+అభిరతుఁడు+ఐ = బాధను పోగొట్టే కర్మలలో ఆసక్తి కలవా డై; కృత, సన్నిధి+ఐ= చేయబడిన సన్నిధానం (సామీప్యం) కలవాడై; ప్రదక్షిణ+ఆవర్త+శిఖా+అగ్రహస్తములన్= కుడివైపునకు తిరిగే జ్వాల లనే ముంజేతులతో; వహ్ని= అగ్ని; మహత్, ద్విజ, దివ్య, మంత్ర, నిర్వర్తిత, హవ్యముల్= గొప్ప బ్రాహ్మణుల దేవతా సంబంధు లైన మంత్రాలచేత నెరవేర్చబడిన (అర్పించబడిన) అన్నాదులను; కొనుచున్= గ్రహిస్తూ; నీకున్; సంపూర్తమనోరథంబులును= సంపూర్ణాలైన కోరికలను; పుణ్యఫలంబులున్= పుణ్యకార్యాలవలని ఫలితాలను; ఇచ్చుచుండెడున్= ఇస్తూ ఉండుగాక!

తాత్పర్యం: చంద్రవంశంలో పుట్టిన జనమేజయ మహారాజా! బాధను తొలగించే కర్మలం దాసక్తుడై, సన్నిహితుడై (ప్రత్యక్షమై) అగ్ని, బ్రాహ్మణోత్తముల దివ్యమంత్రాలచేత హోమం చేయబడిన అన్నాది హవ్యాలను కుడికి తిరిగే జ్వాల లనే ముంజేతులతో గ్రహిస్తూ, నిండైన కోరికలను, పుణ్యాల ఫలితాలను నీకు ఇస్తూ ఉండుగాక!

విశేషం: అగ్నిజ్వాలలు కుడివైపునకు తిరగటం శుభావహం. అగ్నిని కాంతి అనే గుణంకల రచనతో కీర్తించటం సార్థకం. కాంతికి ఔజ్జ్వల్యం స్వభావం. ఈ పద్యంలోని అక్షరరమ్యత కాంతిని పోషిస్తున్నది. (సంపా.)

వ. అని జనమేజయు, నాతని యజ్ఞమహిమను, ఋత్విజులను, సదస్యులను, నగ్నిభట్టారకు ననురూప శుభవచనంబులఁ బ్రస్తుతించిన నాస్తీకున కందఱును బ్రీతు లయి; రంత జనమేజయుం డాస్తీకుం జూచి 'మునీంద్రా! నీ కెద్ది యిష్టంబు దానిన యిత్తు, నడుగు' మనినఁ గరంబు సంతసిల్లి యాస్తీకుం డి ట్లనియె. 227

ప్రతిపదార్థం: అని= అని పలికి; జనమేజయున్= జనమేజయుడిని; ఆతని= అతడు చేసే; యజ్ఞమహిమను= యజ్ఞంయొక్క మహత్త్వాన్ని; ఋత్విజులను= యాజకులను; సదస్యులను= యజ్ఞవిధులను పరీక్షించే వ్యాసాదులను; అగ్ని, భట్టారకున్= పూజ్యుడైన అగ్నిని; అనురూప, శుభ, వచనంబులన్= తగిన మంగళవాక్కులతో; ప్రస్తుతించినన్= నుతింపగా; ఆస్తీకునకున్= ఆస్తీకునిపట్ల; అందఱును= రాజాదులు అందరును; ప్రీతులు+అయిరి= ప్రీతి పొందినవారైనారు; అంతన్= అప్పుడు; జనమేజయుండు; ఆస్తీకున్; చూచి; ముని+ఇంద్రా! (సవర్ణదీర్ఘసంధి)= మునిశ్రేష్ఠుడా!; నీకున్; ఎద్ది= ఏది; ఇష్టంబు= ప్రీతికరమో! దానిన్+అ= దానినే; ఇత్తున్= ఇస్తాను; అడుగుము; అనినన్= అని పల్కగా; కరంబు= మిక్కిలి; సంతసిల్లి= సంతోషించి; ఆస్తీకుండు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అని జనమేజయమహారాజును, అతని యజ్ఞంయొక్క మహత్త్వాన్ని, యజ్ఞం చేయించే ఋత్విక్కులను, యజ్ఞవిధిపరీక్షకు లైన సదస్యులను, పూజ్యు డైన అగ్నిని, వారివారికి తగిన మంగళవాక్కులతో పొగడగా, రాజాదులందరూ ఆస్తీకుడిపట్ల ప్రీతికలవా రైనారు. అప్పుడు జనమేజయుడు ఆస్తీకుని చూచి 'మునిశ్రేష్ఠా! నీ కేది ప్రియమో దానినే ఇస్తాను. అడుగు' మని పలుకగా, మిక్కిలి సంతోషించి ఆస్తీకు డిట్లా అన్నాడు.

విశేషం: ఆస్తీకునకు ప్రీతు లయిరి= నన్నయ ఇట్టిసందర్భాలలో షష్ఠీవిభక్తి వాడుతుంటాడు. 'ఆస్తీకునియెడ' అని అర్థం.

ఆస్తీకుడు యజ్ఞం మాన్పించటానికి వచ్చాడు. అచ్చటివారందరూ ప్రీతులైతే కాని తన వచ్చినపని సఫలం కాదు. అందుచేత అతడు అందరినీ ప్రస్తుతించాడు. ఆ స్తుతికూడ యథార్థమే కాని కేవలం పొగడ్త కాదు. కార్యసాఫల్యం కోరేవాడు ఇట్లా చేయాలి.

ఉ. మానిత సత్యవాక్య! యభిమన్యుకులోద్వహ! శాంతమన్యుసం
తానుఁడ వై దయాభినిరతస్థితి నీవు మదీయబంధు సం
తానమనోజ్వరం బుపరతంబుగ, నాకుఁ బ్రియంబుగా మహో
ర్వీనుత! సర్పయాగ ముడివింపుము; కావుము సర్పసంహతిన్. 228

ప్రతిపదార్థం: మానిత, సత్య, వాక్య= పూజింపబడిన సత్యమైన వాక్కు కలవాడా!; అభిమన్యు, కుల+ఉద్వహ= అభిమన్యుడి వంశాన్ని ఉద్ధరించేవాడా! (జనమేజయుడు అభిమన్యుడి పౌత్రుడు); మహత్, ఉర్వీ, నుత= విశాలమైన భూమిచే (భూజనులచేత) పొగడబడేవాడా!; శాంతమన్యుసంతానుఁడవు+ఐ= శమించిన (అణగిన) కోపం, దుఃఖం మొదలయినవాటి సముదాయం కలవాడి వై; దయా+అభినిరత, స్థితి= దయపట్ల ఆసక్తి కలస్థితిలో; నీవు; మదీయ, బంధు, సంతాన, మనస్+జ్వరంబు= నాకు సంబంధించిన బంధువుల(సర్పాల) సమూహంయొక్క మనస్సులలోని బాధ (జ్వరమంటే వేడి. ఇచ్చట ఆర్తి లేక బాధ అని చెప్పాలి); ఉపరతంబుగన్= శమించేటట్లుగా; నాకున్; ప్రియంబుగాన్= ప్రీతి కలిగేటట్లుగా; సర్ప, యాగము= సర్పాలను హత మొనరించే ఈయజ్ఞం; ఉడివింపుము= మాన్పుము; సర్పసంహతిన్= పాములసమూహాన్ని; కావుము= రక్షించుము.

తాత్పర్యం: పూజింపబడిన సత్యవాక్యం కలవాడా! అభిమన్యుడివంశాన్ని ఉద్ధరించేవాడా! విశాలమైన భూమిచేత (భూజనులందరిచేత) పొగడబడేవాడా! జనమేజయా! శమించిన కోపాదులసమూహం కలవాడివై, దయపట్ల ఆసక్తికలస్థితితో నాచుట్టా లైన పాములసమూహంయొక్క మనస్సులలోని ఆర్తి మానేటట్లుగా, నాకు ప్రీతి కలిగేటట్లుగా ఈ సర్పయాగాన్ని మానేటట్లు చేయుము. పాములసమూహాన్ని కాపాడుము.

విశేషం: 227వ వచనంలో జనమేజయుడు ఆస్తీకుడితో 'నీ కేది ఇష్టమో అది ఇస్తా' నన్నాడు. ఆస్తీకుడు సర్పయాగం మాన్పించటానికై వచ్చాడు. దాన్ని ఉడిగించటం జనమేజయుడికి ఇష్టం కాదు. 'నీవు అనిన వాక్యాన్ని పాటించి సత్యవచనుడివి కమ్ము' అని సూచించటానికై ఆస్తీకుడు 'మానిత సత్యవాక్య!' అని సంబోధించాడు. ఉడుగు-అపదాద్యంబయి అసంయుక్తం బయిన గకారానికి వకారాదేశం - ఉడువు; దీనికి ప్రేరణార్థక రూపం 'ఉడివించు. ఆస్తీకుడి కథకు ఈ పద్యం ప్రాణంవంటిది. సర్పయాగం ఆగటానికి ఆస్తీకుడు ఈపద్యంలో కోరుకొనే వరమే కారణం. ఇంతకుముందు ఆరుపద్యాలలో ఈ కోర్కె తీరటానికి అనువైన మానసికమైన వాతావరణాన్ని ఆస్తీకుడు కల్పించాడు. ఇప్పుడు ఆకోర్కెను బైటపెట్టాడు. ఆతని మాటలతీరులో నన్నయ సౌకుమార్య మనే గుణాన్ని పోషించాడు. పారుష్యంలేకుండా ఉండేది సౌకుమార్యం. అయినా రచనలో అజరఠత్వం ఆకృతికట్టాలి. జరఠత్వం అంటే ముసలితనం, కరకుతనం, గట్టితనం. ఈ మూడూ సౌకుమార్యగుణం కల రచనలో ఉండరాదు. అర్థవంత మైన ఎత్తుగడతో 'ఇచ్చినమాట నిలువబెట్టుకోవటం నీ జన్మవ్రతమౌతుంది. తప్పదు-' అనే భావం భావ్యమానమై పద్యభావాన్నంతా చైతన్యవంతం చేస్తుంది. జనమేజయుడు తీవ్రప్రతీకారవాంఛతో మొదలుపెట్టిన సర్పయాగాన్ని చాలించటం సత్యవాక్యపరిపాలనంలో భాగంగా మారుతుంది. అందువలన రచనలో ఒక ఉత్కంఠ రేకెత్తింపబడి అర్థరీత్యా, పద్యగతిరీత్యా ముసలితనంలేని జవసత్త్వాలు గోచరిస్తాయి. అడుగబోతున్నది అసాధ్యమైనకోరిక. కాని, ఆస్తీకుడి మాటలతీరులో కరకుతనం గోచరించదు. 'నా కోరికను కోపతాపాలు మానిన దయాబుద్ధితో ఆలోచించు' అని సుకుమారంగా హెచ్చరించా డతడు. ఎంతటి సంస్కారవంతమైన, ధ్వనిమయమైనవాక్కు!; 'నాకోరిక తీరిస్తే పాములవంశాలను పీడిస్తున్న మనోజ్వరం

తగ్గుతుంది, నామనస్సుకు ప్రీతి కలుగుతుంది' అన్నప్పుడు దయాదృష్టితో చూస్తే ఈరెండూ ఉత్తమధర్మాలు ఔతాయని ధ్వని. ఈ వాక్యంలోకూడా సౌకుమార్యం పరిమళిస్తున్నది. ఇక చివరికి 'సర్పయాగ ముడివింపుము; కావుము సర్పసంహతిన్' - అన్నప్పుడు మాటలో కాఠిన్యం లేకపోవటం గమనింపదగిన అంశం. తన బంధునాశనానికి పూనుకొన్న జనమేజయుడిని నిజానికి ఆస్తీకుడు పరుషంగా నిందించి శపించాలి. కాని, మాటలో కరకుదనం లేకుండా గట్టితనం స్ఫురించకుండా మృదువుగా, వినయంగా, హితంగా ప్రార్థిస్తున్నట్లు నివేదించుకొన్నాడు. ఆస్తీకుడు పూర్వపద్యాలలో తాను చేసిన స్తుతులన్నీ ఎంతటి సుకుమారాలైన మందలింపులో అప్పుడు జనమేజయుడికి తెలిసివచ్చేటట్లు మెత్తగా మాట్లాడింపచేశాడు నన్నయ. వాక్యాలలో నిబంధించిన వాచ్యార్థాలు తమ వాచ్యార్థాలను అప్రధానం చేసికొంటూ ప్రతీయమానమౌతున్న రమణీయ వ్యంగ్యార్థాలను ప్రసరించటం ఈస్తుతిలో విశేషం. ఇందులో సంబుద్ధులుకూడా సార్థకాలే. చివరకు- 'మహోర్వీనుత సర్పయాగము' అనేచోట ఒక చమత్కారం ఉన్నది. దీన్ని సమస్తంగా తీసికొంటే 'లోకమంతా కీర్తించిన సర్పయాగం' అని భావం. లోకమంతా కీర్తించే ఈయాగం జనమేజయుడి ప్రతీకారదృష్టితోచూస్తే ప్రశంసార్హం. కాని, ఉత్తమవంశజుని ఉత్తమధర్మ మైన దయాదృష్టితో చూస్తే అది విపరీతం. అప్పు డందులో విపరీతార్థవ్యంగ్యం గమ్యమానం అవుతుంది. కాగా, "మహోర్వీనుత!" అనే మాటను జనమేజయుడికి వేసిన సంబుద్ధిగాకూడా గ్రహించవచ్చు. అప్పుడు- 'సర్పయాగం ఆపి, సర్పకులాన్ని రక్షిస్తే నీవు ఈప్రపంచంలోని అందరిచేతా కీర్తింపబడతావు' అనే అర్థం ధ్వన్యమానం ఔతుంది. నన్నయ ధ్వనిమయరచనలో ఇక్కడ మెత్తగా మాట్లాడటం ఎంత గుణమో, వ్యంగ్యంగా మాట్లాడటంకూడా అంత గుణం. 'శబ్దగుణశాలి నన్నయ చతురశైలి'. (సంపా.)

చ. అనిన సదస్యులందఱుఁ బ్రియంబున 'నిట్టి విశిష్ట విప్రము
ఖ్యునకు మహాతపోధనునకుం దగుపాత్రున కెద్ది యిచ్చినన్
ఘనముగ నక్షయం బగును గావున నీ ద్విజనాథుకోర్కిఁ బెం
పున వృథ సేయఁగాఁ దగదు భూవలయేశ్వర! యిమ్ము నెమ్మితోన్.' 229

ప్రతిపదార్థం: అనినన్= అస్తీకుడు అట్లా అడుగగా; సదస్యులు+అందఱున్= సభ్యులందరున్నూ (వ్యాసాదులందరును); ప్రియంబునన్= ప్రీతితో; ఇట్టి, విశిష్ట, విప్ర, ముఖ్యునకున్= ఇటువంటి మిక్కిలి ఉత్తము డైన బ్రాహ్మణశ్రేష్ఠుడికి; మహత్, తపః, ధనునకున్= గొప్ప తపస్సే ధనంగా కలవాడికి; తగు= తగిన; పాత్రునకున్= అర్హునికి; ఎద్ది= ఏది; ఇచ్చినన్= ఇచ్చినప్పటికీ; ఘనముగన్= గొప్పగా; అక్షయంబు+అగును= తరుగనిది అవుతుంది; కావునన్= కాబట్టి; భూ, వలయ+ఈశ్వర= భూచక్రానికిరాజా! ఈ, ద్విజ, నాథు కోర్కిన్= ఈబ్రాహ్మణముఖ్యుడికోరికను; పెంపునన్= గౌరవంతో; వృథ, చేయన్, కాన్= వ్యర్థం చేయటం; తగదు= ఉచితం కాదు; నెమ్మితోన్= ప్రేమతో; ఇమ్ము.

తాత్పర్యం: అని ఆస్తీకుడు అడుగగా సభ్యులందరున్నూ 'తగినవాడు, అర్హుడు, గొప్పతపస్సే ధనంగా కలవాడు అయిన ఇటువంటి ఉత్తమబ్రాహ్మణుడికి ప్రీతితో ఏది ఇచ్చినా అది మిక్కిలి క్షయం లేనిది అవుతుంది కాబట్టి ఓరాజా! ఈ బ్రాహ్మణశ్రేష్ఠునికోరిక వ్యర్థం చేయటం తగదు. గౌరవంతోను, ప్రేమతోను ఇతడు అడిగింది ఇవ్వండి. (యజ్ఞాన్ని మానే టట్లు చేయండి).

విశేషం: గౌరవింపదగినవా డవటంచేత ఈ విప్రసత్తముడి కోరిక వ్యర్థం చేయటం తగదని భావం. ఈపద్యరచనలో 'సమాధి' అనే గుణమున్నది. అర్థదర్శనం కలిగేటట్లు వర్ణాల, శబ్దాల ఆరోహ అవరోహక్రమ విన్యాసం చేస్తే సమాధి. సదస్యులందరు ఈ పద్యంలో జనమేజయుడి సంకల్పంవెనుక ఉన్న తాత్పర్యాన్ని వదలి సర్పయాగాన్ని ఆపుమని అడుగుతున్న ఆస్తీకుడి వ్యక్తిత్వాన్ని దృష్టిలో పెట్టుకొని కర్తవ్యార్థదర్శనం చేస్తున్నారు, చేయిస్తున్నారు. అందువలన ఆస్తీకుడికోర్కెను తీర్చటమే అందరి ఏకాభిప్రాయం. ఏకోన్ముఖంగా సాగే అర్థదర్శనాన్ని ఆస్తీకుడిని ప్రశంసించే విశేషణాలలో కానవచ్చే సాభిప్రాయ అక్షరోచ్చారణలోని ఆరోహావరోహాలతో సార్థకంగా నన్నయ 'సమాధి' గుణాన్ని సాధించాడు. (సంపా.)

వ. అనిన సర్వజనానుమతంబుగా జనమేజయుం డాస్తీక ప్రార్థనం జేసి సర్పయాగం బుడిగించె; నయ్యవసరంబున. 230

ప్రతిపదార్థం: అనినన్= సదస్యులు అట్లా పలుకగా; సర్వ, జన+అనుమతంబుగాన్= అందరికీ సమ్మత మయ్యేటట్లుగా; జనమేజయుండు; ఆస్తీక, ప్రార్థనన్, చేసి= ఆస్తీకునివేడుకోలుచేత (ఆస్తీకుడు అడగటంచేత); సర్ప, యాగంబు= సర్పయజ్ఞాన్ని; ఉడిగించెన్= మానేటట్లు చేశాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అని సదస్యులు పలుకగా అందరికీ సమ్మత మయ్యేటట్లుగా జనమేజయుడు ఆస్తీకు డడగటంచేత అతనికోరికను అనుసరించి సర్పయాగం మానిపించాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: మూలంలో ఆస్తీకుడు సర్పయాగాన్ని మాన్పించండని అడుగగా జనమేజయుడు మొదట సమ్మతించక మరొకవరం కోరుకొమ్మని నుడివినట్లున్నూ, అతడు అదే అడుగగా సమ్మతించినట్లున్నూ ఉన్నది.

మ. అతులోర్వీసురముఖ్య మంత్రహుత మాహాత్మ్యంబునన్ వాసవ
చ్యుతుఁ డై ముందర తక్షకుం డురువిషార్చుల్ దూల వాత్యారయో
ద్ధతి నుద్ధూతవివర్ధితాయతబృహద్దావాగ్నివోలెన్ విచే
ష్టితుఁ డై మేఘపథంబులం దిరుగుచుండెన్ విస్మితుల్గా జనుల్. 231

ప్రతిపదార్థం: అతుల+ఉర్వీ సుర, ముఖ్య, మంత్ర, హుత, మాహాత్మ్యంబునన్= సాటిలేని బ్రాహ్మణశ్రేష్ఠుల మంత్రాలచేత అగ్నిలో వేల్చటంయొక్క మహిమచే; వాసవ, చ్యుతుఁడు+ఐ= ఇంద్రునిచేత విడువబడినవాడై; ముందర= ఎదుట; తక్షకుండు= ఆపేరున్న సర్పరాజు; ఉరు, విష+అర్చుల్= గొప్పవిషంయొక్క జ్వాలలు; తూలన్= చలింపగా(రాలగా); వాత్యా, రయ+ఉద్ధతిన్= సుడిగాలియొక్క వేగంయొక్క విజృంభణంచేత; ఉద్ధూత, వివర్ధిత+ఆయత, బృహత్, దావ+అగ్ని, పోలెన్= ఎగురగొట్టబడిన మిక్కిలివృద్ధినొందింపబడిన దీర్ఘమైన పెద్దకార్చిచ్చువలె; విచేష్టితుఁడు+ఐ= చేష్టతక్కినవాడై; (వివశు డై); జనుల్= చూస్తున్న జనులు; విస్మితుల్, కాన్= ఆశ్చర్యం పొందిన వారవుతుండగా; మేఘపథంబులన్= మేఘమార్గాలలో; (ఆకాశంలో); తిరుగుచున్+ఉండెన్= సంచరిస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: తక్షకుడు సాటిలేని బ్రాహ్మణ శ్రేష్ఠుల హోమమంత్రాల మహిమచేత ఇంద్రుడినుండి విడివడినవాడై, విషాగ్నిజ్వాలలు చలిస్తూ ఉండగా, చేష్టా శూన్యుడై, అతిశయమైన సుడిగాలి వేగంచేత ఎగురగొట్టబడి వృద్ధిపొందిన విశాలమైన కార్చిచ్చువలె ఆకాశంలో పరిభ్రమిస్తూ ఉన్నాడు. ఆ దృశ్యాన్ని జనులు ఆశ్చర్యంతో చూస్తున్నారు!.

విశేషం: అలం: ఉపమ. పాములు అగ్నిలో పడును గాక! అని బ్రాహ్మణులు మంత్రాలు పఠిస్తూ ఉన్నారు. ఆమంత్రాలమహిమచేత పాములు హుతమౌతున్నాయి. హుతమంటే అగ్నికి కానుకగా (ఆహుతిగా) ఈబడేది. ఇచట తక్షకుడే హుతం. విచేష్టితుడు అంటే ప్రయత్నించేవా డనే అర్థంకూడ ఉన్నది. తక్షకుడు అగ్నిలో పడకుండటానికై ఎంతో ప్రయత్నిస్తూ ఆకాశంలో వివశు డై తిరుగుతున్నాడు. ఉద్ధతుడైన తక్షకుని వివశస్థితిని ప్రసాద సమతాగుణవిశిష్ట మైన ఓజోగుణంలో నిబంధించి రచనలో ప్రౌఢత్వాన్ని ప్రదర్శించాడు నన్నయ. భయవిహ్వలుడైన భయంకరాకారుని స్వరూపస్వభావాలను ప్రసాదమిశ్రితమైన ఓజోబంధంతో నన్నయ చిత్రించి ఔచిత్యం పాటించాడు. అంతేకాదు. ఆ దృశ్యంలో అగ్నిజ్వాలల ఔన్నత్యాన్ని- 'అతులోర్వీసుర ముఖ్యమంత్రహుతమాహాత్మ్యంబునన్' అనే దీర్ఘసమాసంతో సూచించాడు. ఆ అగ్నిలో పడటానికి సిద్ధమై ఆకాశంలో

అల్లల్లాడుతున్న తక్షకుడిని "ఉద్ధూతవివర్ధితాయతబృహద్దావాగ్నివోలెన్" ఉన్నాడని వర్ణిస్తూ ఉపమానాన్ని మరొక అగ్నిజ్వాలగా దీర్ఘసమాసంతో కల్పించాడు. ఒకటి సవనాగ్ని, మరొకటి దావాగ్ని. ఆ ఆకృతుల సామ్యాన్ని రచనాగతసమాన సమాసద్వయ సంఘటనతో ప్రదర్శించటం 'సమత' అనే శబ్దగుణ లక్షణం. ఈపద్యంలో ప్రధానగుణం ఓజస్సు. దానికి పోషకంగా నిలిచినవి ప్రసాదం, సమత, ఈ మూడింటినీ కథలోని రసభావపోషణకు అనువుగా వాడటం నన్నయ కవితాశిల్పం. (సంపా.)

క. ఆతని నత్యుగ్రానల । పాతోన్ముఖుఁ డైన వానిఁ బడకుండఁగ 'నో
హో తక్షక! క్రమ్ము' మని । యాతతభయుఁ గ్రమ్మఱించె నాస్తీకుఁ డెడన్. 232

ప్రతిపదార్థం: ఆస్తీకుఁడు; అతి+ఉగ్ర+అనల, పాత+ఉన్ముఖుఁడు+ఐన, వానిన్= మిక్కిలి భయంకర మైన అగ్నిలో పడటానికి సిద్ధు డైన వాడిని; ఆతత, భయున్= విస్తార మైన భయం కలవాడిని; ఆతనిన్= ఆ తక్షకుడిని; ఓహో, తక్షక!= ఓతక్షకుడా! క్రమ్మఱుము= మరలిపొమ్ము; అని; పడక+ఉండఁగన్= అగ్నిలో పడకుండా ఉండేటట్లుగా; ఎడన్= నడుమనే; క్రమ్మఱించెన్= మరల్చాడు.

తాత్పర్యం: మిక్కిలి భయంకర మైన అగ్నిలో పడటానికి సిద్ధుడై ఉన్నట్టి, అధికమైన భయంతో కూడినట్టి ఆ తక్షకుడిని ఆస్తీకుడు 'ఓహో తక్షకా! మరలిపొమ్ము' అని పలికి అగ్నిలో పడకుండ నడుమనే మరల్చాడు.

విశేషం: 'ఎడన్' అంటే అగ్నిలో పడబోవటానికి ముందు అనిఅర్థం.

మ. 'జననీశాపభయప్రపీడితమహాసర్పేంద్రులన్ సర్పయా
గనిమిత్తోద్ధత మృత్యువక్త్రగతులం గాకుండఁగాఁ గాచె' నం
చును నాస్తీకమునీంద్రు నందుల సదస్యుల్ సంతసం బంది బో
రనఁ గీర్తించిరి సంతతస్తుతిపదారావంబు రమ్యంబుగన్. 233

ప్రతిపదార్థం: జననీ, శాప, భయ, ప్రపీడిత, మహత్, సర్ప+ఇంద్రులన్= తల్లి అయిన కద్రువశాపంవలని భయంచేత మిక్కిలి పీడింపబడిన గొప్పసర్పరాజులను; సర్పయాగ నిమిత్త+ఉద్ధత, మృత్యు, వక్త్ర, గతులన్= సర్పయాగం కారణంగా గల గర్వించిన మరణదేవతయొక్క ముఖాన్ని పొందినవారిని; కాక+ఉండఁగాన్= కాకుండేటట్లుగా; కాచెన్= రక్షించాడు; అంచునున్= అంటూ; ఆస్తీక, ముని+ఇంద్రున్= ఆస్తీకమునిశ్రేష్ఠుని; అందుల, సదస్యుల్= ఆ యజ్ఞశాలలోని సభ్యులు; (ఋత్విక్కులు మొదలైనవారు); సంతసంబు+అంది= సంతోషం పొంది; సంతత, స్తుతి, పద+ఆరావంబు= దట్టమైన స్తోత్రశబ్దాలధ్వని; రమ్యంబుగన్= సుందరమయ్యేటట్లుగా; బోరనన్= శీఘ్రంగా, పదే పదే; కీర్తించిరి= పొగిడారు.

తాత్పర్యం: 'తల్లి అయిన కద్రువ ఇచ్చిన శాపంవలని భయంచేత మిక్కిలి బాధింపబడిన గొప్ప సర్పరాజులను సర్పయాగం కారణంగా గల భయంకరమైన మృత్యుదేవతముఖాన్ని పొందినవారిని (మరణించినవారిని) కాకుండేట్లుగా రక్షించా' డని యాగశాలలోని సభ్యులు సంతోషం పొంది ఆస్తీకమునీంద్రుడిని అధికమైన స్తోత్రశబ్దాలధ్వనులతో మనోహరంగా పదేపదే ప్రస్తుతించారు.

విశేషం: జీవులకు ఒక్కొక్కరికి మరణం ఒక్కొక్కకారణంవలన కలుగుతూ ఉంటుంది. సర్పాలకు సర్పయాగం మృత్యుకారణ మయింది. అందుల- సమాసంలో అందు మొదలయినవాటికి 'అలి' ఆగమంగా వస్తుంది, నన్నయ భారతంలో 'ఉల'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆగమంకూడ కనిపిస్తుంది. అందలి అని అర్థం. ఆస్తీకుడు జనమేజయాదులను స్తుతించిన ఈఘట్టంలోని పద్యాలన్నీ అక్షరరమ్యతకు అనువైన ఉదాహరణలు. 'సంతతసస్తుతిపదారావంబు రమ్యంబుగన్' అనటంలో నన్నయ వ్యంగ్యంగా పైపద్యంలోని తనకవితాగుణ మైన అక్షరరమ్యతనుకూడ సూచించాడు. ఈపద్యరచనలో 'సమత' అనే గుణాన్ని పోషించాడు నన్నయ. మార్గాభేదత్వం సమత. ఈపద్యపూర్వార్ధంలో సదస్యులు ఆస్తీకుడిని స్తుతించినమాటలు ఓజోగుణవిశిష్టంగా ఉన్నాయి. స్తుతించిన సదస్యులనుగురించి ఉత్తరార్ధంలో నన్నయచెప్పినమాటలు మాధుర్యం (ఉక్తిచమత్కారం)తో కూడిఉన్నాయి. కీర్తనమున్న రెండుచరణాలూ, కథనమున్న రెండుచరణాలూ గుణనిర్వహణలో సమత్వాన్ని సాధించాయి. దానివలన పద్యనిర్మాణంలో సమత్వంతో కూడిన తూకం ఏర్పడింది. అంతేకాక, నాలుగుచరణాలలో మూడింట- పైచరణం క్రిందిచరణంలో చొచ్చుకొనిపోయే లక్షణం ఏకవాక్యతను, సమతను సూచిస్తున్నది. ఈ సన్నివేశాన్ని 'సమతా' గుణరచనతో ముగించటం శిల్పియైన నన్నయ సాధించిన చాతుర్యం. ఆదిపర్వంలోని ప్రథమ ద్వితీయాశ్వాసాలు సర్పసంహారోపసంహారంతో సమాప్తంకావటంకూడా కథారచనా పరమైన సమతాగుణం. (సంపా.)

క. ఒనర జరత్కారు మునీం । ద్రునకు జరత్కారునకు సుతుం డైన మహా
మునివరు నాస్తీకుని ముద । మునఁ దలఁచిన నురగభయముఁ బొందదు జనులన్. 234

ప్రతిపదార్థం: ఒనరన్=ఒప్పునట్లుగా; జరత్కారు, ముని+ ఇంద్రునకున్= జరత్కారువనే; మునిశ్రేష్ఠుడికి; జరత్కారునకున్= వాసుకి చెల్లెలైన జరత్కారువునకు; సుతుండు+ఐన= కుమారు డైన; మహత్, మునివరున్= గొప్పమునిశ్రేష్ఠుడిని; ఆస్తీకుని; ముదమునన్= సంతోషంతో; తలఁచినన్= స్మరించగా; జనులన్= ప్రజలను; ఉరగ, భయమున్= పాములవలని భయంకూడ; పొందదు= ప్రాపింపదు (అంటదు).

తాత్పర్యం: ఒప్పుగా జరత్కారువనే మునిశ్రేష్ఠునికి, జరత్కారు వనే వాసుకి చెల్లెలికి కుమారుడైన ఆస్తీకమహామునిని స్మరిస్తే జనులకు పాములవలన భయం కలుగదు.

విశేషం: ఆస్తీకచరిత్రానికి ఇది ఫలశ్రుతి.

వ. మఱియు నయ్యాస్తీకు చరితంబు విన్నవారికి సర్వపాపక్షయం బగు నని. 235

ప్రతిపదార్థం: మఱియున్= అదీకాక; ఆ+ఆస్తీకు, చరితంబు= ఆ ఆస్తీకముని చరిత్రం (కథ); విన్నవారికిన్= విన్నజనులకు; సర్వపాపక్షయంబు= అన్నిపాపాలనాశం; అగున్= అవుతుంది; (జరుగుతుంది); అని.

తాత్పర్యం: అదీకాక, ఆ ఆస్తీకమునివర్యునికథ విన్నజనులకు సకలపాపాలు తొలగిపోతాయి.

విశేషం: పై పద్యంలో ఆస్తీకుడిని స్మరించినవారికి కలిగే ఫలం చెప్పబడింది. ఈ వచనంలో అతడి కథ వినేవారికి కలిగే ఫలం పేర్కొనబడింది. మహాభారతకథాపరమార్థం అమృతత్వసాధనం. దీనికి సంబంధించిన మహార్థాలను చెప్పే ఆఖ్యానకాలకుకూడా ఫలశ్రుతులు చెప్పటం గమనింపదగిన అంశం. గరుడోపాఖ్యానం అమృతం త్రాగకుండానే అమరుడైనవాడి కథ. అమృతాన్ని అందించినా అందుకోలేని ఉరగుల కథ, సర్పయాగవృత్తాంతంలో ఆస్తీకుడు పాములను మృతినుండి తప్పించి, అదే అమృతత్వంగా అందించాడు. అమృతం అనేది ద్రవ్యమా? ధర్మమా? గుణమా? తత్త్వమా? అనే మీమాంసలలో దయాగుణమే అమృతమని తేల్చిన కథ యిది. ప్రధానకథకు పూర్వరంగమైన ఈరెండాశ్వాసాలకథకూ ఔచిత్యవంతమైన ముగింపు ఇది. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆశ్వాసాంతము

క. రాజమహేంద్ర! కవీంద్రస । మాజ సురక్ష్మాజ! రాజమార్తాండ! ధరి
త్రీజననుతచారిత్ర! వి । రాజిత గుణరత్న! రాజరాజనరేంద్రా! 236

ప్రతిపదార్థం: రాజమహత్+ఇంద్ర= రాజేంద్రా! రాజశ్రేష్ఠుడా!; కవి+ఇంద్ర, సమాజ, సురక్ష్మాజ= కవిశ్రేష్ఠులసమూహానికి దేవతావృక్షమా! (కల్పవృక్షమా!); రాజ, మార్తాండ= సూర్యుడివంటిరాజా!; ధరిత్రీ, జన, నుత, చారిత్ర= భూమిలోని జనులచేత పొగడబడే చరిత్రకలవాడా!; విరాజిత, గుణ, రత్న= ప్రకాశించే గుణాలనే రత్నాలు కలవాడా!; రాజరాజనరేంద్రా!

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడా! కవిశ్రేష్ఠులసముదాయానికి కల్పవృక్షమా! సూర్యుడివంటిరాజా! సూర్యుడివలె తేజస్సు కలవాడా! భూమిలోని జనులచేత స్తుతింపబడిన చరిత్ర కలవాడా! ప్రకాశించే గుణా లనే రత్నాలు కలవాడా! రాజరాజనరేంద్రా!

విశేషం: అలం: ఉపమ, రూపకం. ఆశ్వాసాంతంలో కృతిరచనాప్రేరకు డైన రాజరాజనరేంద్రునికి సంబోధనలు ఇందులోను తరువాతపద్యంలోను ఉన్నాయి.

వసంతతిలకవృత్తము.

వీరావతార! సుకవిస్తుత! నిత్యధర్మ
ప్రారంభ! శిష్టపరిపాలనసక్త! రాజా!
నారాయణాఖ్య! కరుణారసపూర్ణ! వీర
శ్రీరమ్య! రాజకులశేఖర! విష్ణుమూర్తీ! 237

ప్రతిపదార్థం: వీర+అవతార= వీరరసంయొక్క వ్యక్త మైన రూపమా! మూర్తిధరించినవీరరసమా!; సుకవి, స్తుత= మంచికవులచే నుతింపబడేవాడా!; నిత్య, ధర్మ, ప్రారంభ= ఎల్లప్పుడు ధర్మంతో కూడిన ప్రయత్నాలు కలవాడా!; శిష్టపరిపాలనసక్త= ఉత్తములను పాలించటంలో ఆసక్తికలవాడా!; రాజా!= ప్రభువైనవాడా!; నారాయణ+ఆఖ్య= (రాజు) నారాయణు డనే బిరుదు కలవాడా!; కరుణా, రస, పూర్ణ= దయారసంతో నిండినవాడా!; వీర, శ్రీ, రమ్య= వీరరసలక్ష్మిచే సుందరుడా!; రాజ, కుల, శేఖర= రాజవంశంలో శ్రేష్ఠుడా!; విష్ణుమూర్తీ= విష్ణువుయొక్క మూర్తివంటి మూర్తికలవాడా!.

తాత్పర్యం: మూర్తీభవించినవీరరసమా! మంచికవులచేత స్తుతింపబడేవాడా! ఎల్లప్పుడు ధర్మంతో కూడిన ప్రయత్నాలు కలవాడా! ఉత్తములను పరిపాలించటంలో ఆసక్తికలవాడా! రాజా! (రాజ) నారాయణు డనే బిరుదు కలవాడా! దయారసంతో నిండినవాడా! వీరరసలక్ష్మిచే సుందరుడా! రాజవంశంలో శ్రేష్ఠుడా! విష్ణువుయొక్క మూర్తివంటి మూర్తి కలవాడా!

విశేషం: వసంతతిలక వృత్తంలో ఒక్కొక్కపాదానికి, త, భ, జ, జ, గగ - అనే గణాలు (14 అక్షరాలు) ఉంటాయి. 8వఅక్షరం యతిమిత్రస్థానం. 'రాజా! నారాయణాఖ్య' - కు 'రాజనారాయణాఖ్య' అనే పాఠాంతరం ఉన్నది. రాజ, నారాయణాఖ్య అన్నప్పుడు రెండవపాదంచివర లఘువు వస్తుంది. సంస్కృతంలో పాదాంతంలో గురువుకు బదులు లఘువు వాడే సంప్రదాయం ఉన్నది. నన్నయ ఇచ్చట ఆ సంప్రదాయాన్ని అనుసరించా డని చెప్పాలి. కొందరు ఈపాఠమే సముచిత తరమని భావిస్తున్నారు.

గద్యము.

ఇది సకల సుకవిజన వినుత నన్నయభట్టప్రణీతం బయిన శ్రీమహాభారతంబునం దాదిపర్వంబున నాగగరుడోత్పత్తియు, సముద్రమథనంబును, నమృతసంభవంబును, సౌపర్ణాఖ్యానంబును, జనమేజయ సర్పయాగంబును, నాస్తీక చరితంబును నన్నది ద్వితీయాశ్వాసము. 238

ప్రతిపదార్థం: గద్యము= వచనం; దీర్ఘవచనం; ఛందోనియమం లేకపోయినా అనుప్రాసాదులతో శ్రవణసుభగంగా ఉండేటట్లు వ్రాయబడే వచనం, కావ్యాలలో ఆశ్వాసాంతాలలో కవి తనబిరుదాలను పేర్కొని తాను ఆకావ్యంలో ఆ ఆశ్వాసం ముగిసిం దని సూచించటానికి వ్రాసేవచనం. నన్నయ ఆశ్వాసంలోని ముఖ్యవిషయాలను కూడ ఇందులో సూచిస్తూ ఉంటాడు.

ఇది= ఈఆశ్వాసం; సకల, సుకవి, జన, వినుత= అందరు సత్కవి జనులచేత స్తుతింపబడిన; నన్నయ, భట్ట, ప్రణీతంబు+అయిన= పూజ్యు డైన నన్నయకవిచే రచింపబడిన; శ్రీమహత్, భారతంబు+అందున్= శోభాయుక్త మైన మహాభారతం అనే కావ్యంలో; ఆదిపర్వంబునన్= మొదటి దైన ఆదిపర్వంలో; నాగ, గరుడ+ఉత్పత్తియున్= పాములయొక్క, గరుత్మంతునియొక్క పుట్టుకయున్నూ; సముద్ర మథనంబును= దేవాసురులు అమృతంకొరకు సముద్రాన్ని చిలకటమున్నూ; అమృత, సంభవంబును= అమృతంయొక్క పుట్టుక (ఉత్పత్తి) యున్నూ; సౌపర్ణ+ఆఖ్యానంబును= గరుడునికి సంబంధించిన కథయున్నూ; జనమేజయ, సర్ప, యాగంబునున్= పరీక్షిత్తుకుమారుడైన జనమేజయుడి (అతడు చేసిన) సర్పాలను ఆహుతి చేసే యజ్ఞవృత్తాంతమున్నూ; ఆస్తీకు, చరితంబునున్= జరత్కారుకుమారుడైన ఆస్తీకముని కథయున్నూ; అన్నది= అనేవాటితో కూడింది; ద్వితీయ+ఆశ్వాసము= రెండవ ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది సర్వసత్కవిజనులచేత స్తుతింపబడే పూజ్య నన్నయకవిచేత రచింపబడిన శ్రీమహాభారత మనే కావ్యంలో, ఆదిపర్వంలో - పాములయొక్క గరుడునియొక్క పుట్టుక, సముద్రాన్ని దేవాసురులు మథించటం, అమృతంయొక్క ఉత్పత్తియున్నూ, గరుడునికి సంబంధించిన కథ, జనమేజయమహారాజు చేసిన సర్పయాగం, ఆస్తీకుడి కథ అనేవాటితో కూడినది రెండవ ఆశ్వాసం.

ఆదిపర్వం ద్వితీయాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము -తృతీయాశ్వాసము

శ్రీమచ్చళుక్య వంశశి । ఖామణి! మనుమార్గ! రాజకంఠీరవ! ధై
ర్యామరధరణీధర! ధర । ణీమండన! ధర్మనిరత! నిత్యాభ్యుదయా! 1

ప్రతిపదార్థం: శ్రీమత్+చళుక్య, వంశ, శిఖామణి= శోభాయుక్తమైన చళుక్యవంశానికి శిరోమణి ఐనవాడా!; మనుమార్గ= మనువు యొక్క మార్గంవంటి మార్గం కలవాడా! (మనువు మార్గాన్ని అనుసరించేవాడా!); రాజకంఠీరవ= రాజసింహా!; ధైర్య+అమర, ధరణీధర= ధైర్యంలో దేవతలపర్వత మైన మేరువువంటివాడా!; ధరణీమండన= భూమికి అలంకార మైనవాడా! ధర్మ, నిరత= ధర్మమందు ఆసక్తికలవాడా!; నిత్య+అభ్యుదయా!= నిరంతర మైన శుభోదయం కలవాడా!

తాత్పర్యం: (రాజరాజనరేంద్రుడికి సంబోధన) శోభాయుక్తమైన చాళుక్యవంశానికి శిరోమణీ! (శ్రేష్ఠుడా!) మనుమార్గప్రవర్తకుడా! రాజశ్రేష్ఠుడా! ధైర్యహేమాద్రీ! భూమికి అలంకారప్రాయ మైనవాడా! ధర్మమం దాసక్తికలవాడా! నిరంతరశుభోదయం కలవాడా!

వ్యాసుఁడు జనమేజయునకు భారతకథం దెలుప వైశంపాయను నియోగించుట (సం.1-54-1)

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె: నట్లు జనమేజయుం డుపసంహృతసర్పసత్త్రుం డయి యథావిధి సంపూర్ణదక్షిణల ఋత్విజులను, సదస్యులనుం బూజించి, దీనానాథజనంబులకుఁ గోరినధనంబు లిచ్చి, యనేకపురాణపుణ్యకథాశ్రవణకుతూహలపరుం డగుచు విద్వజ్జనగోష్ఠి నుండి యొక్కనాఁడు. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= కథచెప్పేవాడు, ఉగ్రశ్రవసుడు; శౌనక+ఆది, మహత్+మునులకున్= నైమిశారణ్యపుణ్యప్రదేశంలో ఉన్న శౌనకుడు మొదలైన మహామునులకు; చెప్పెను= చెప్పాడు; అట్లు= ఆవిధంగా; జనమేజయుండు= పరీక్షిన్మహారాజు కుమారుడు; ఉపసంహృత, సర్ప, సత్త్రుండు+అయి= ముగించబడిన సర్పయాగం కలవాడై, యథావిధి= శాస్త్రప్రకారంగా; (విధి నతిక్రమించకుండ);విధిననుసరించి సంపూర్ణ, దక్షిణలన్= నిండైన సంభావనలతో; ఋత్విజులను= యజ్ఞం చేయించేవారిని; సదస్యులనున్= యజ్ఞవిధి పరీక్షాధికారులను; పూజించి; దీన+అనాథ, జనంబులకున్= దీనులకున్నూ, దిక్కులేనివారికిన్నీ; కోరినధనంబులు; ఇచ్చి; అనేక, పురాణపుణ్యకథా శ్రవణకుతూహలపరుండు= పెక్కుపురాణాలలోని పుణ్యప్రదా లైన కథలను వినటంలో ఆసక్తిగలవా డగుచు; విద్వత్+జన, గోష్ఠిన్= విద్వాంసు లైన జనులగోష్ఠిలో ఉండి; ఒక్కనాఁడు= ఒకరోజు.

తాత్పర్యం: కథ చెప్పే సౌతి శౌనకుడు మొదలైన గొప్పమునులకు చెప్పాడు: ఆవిధంగా పరీక్షిత్తుకుమారు డైన జనమేజయుడు ముగించబడినసర్పయాగం కలవాడై, శాస్త్రాన్ని అతిక్రమించకుండా అధిక మైన సంభావనలతో యజ్ఞం చేయించే ఋత్విక్కులను, యజ్ఞవిధిపరీక్షకులైన వ్యాసాదులను పూజించి, ఆర్తులకున్నూ, దిక్కులేనివారికిన్నీ వారు కోరిన ధనాన్ని ఇచ్చి, పెక్కుపురాణాలలోని (ప్రాచీనాలైన) పుణ్యప్రదాలైన కథలను వినటానికి ఆసక్తి కలవాడై పండితు లైనవారిసభలో వారితో సల్లాపం చేస్తూ ఒకరోజు. (తరవాతి పద్యంతో అన్వయం.)

మ. పరమబ్రహ్మనిధిం, బరాశరసుతున్, బ్రహ్మర్షిముఖ్యున్, దయా
పరుఁ, గౌరవ్యపితామహున్, జనహితప్రారంభుఁ, గృష్ణాజినాం

బరు, నీలాంబుదవర్ణదేహు, ననురూపప్రాంశు, నుద్యద్దివా
కర రుక్పింగజటాకలాపు, గతరాగద్వేషు, నిర్మత్సరున్. **3**

ప్రతిపదార్థం: పరమబ్రహ్మనిధిన్= శ్రేష్ఠమైనతపస్సుకు, (వేదాలకు)నిధి యైనవాడిని; పరాశరసుతున్= పరాశరుడికుమారుడిని; బ్రహ్మ+ఋషి, ముఖ్యున్= బ్రహ్మర్షులలో ప్రధానుడిని; దయా, పరున్= దయయందు ఆసక్తికలవాడిని; కౌరవ్య, పితామహున్= కౌరవసంతతికి తాత యైనవాడిని; జన, హితప్రారంభున్= ప్రజాహితమందు ప్రయత్నం కలవాడిని; కృష్ణ+అజిన+అంబరున్= జింకచర్మం వస్త్రంగా కలవాడిని; నీల+అంబుద, వర్ణదేహున్= నీలమేఘవర్ణంవంటి వర్ణం కలశరీరంకలవాడిని; అనురూప, ప్రాంశున్= తగినఎత్తు(పొడవు)గలవాడిని; ఉద్యత్+దివాకర, రుక్+పింగ, జటా, కలాపున్= ఉదయించే సూర్యుడికాంతివలె రాగిరంగు జడలసమూహం కలవాడిని; గత, రాగద్వేషున్= నశించిన రాగద్వేషాలు కలవాడిని; నిర్మత్సరున్= మాత్సర్యం లేనివాడిని.

తాత్పర్యం: పరమతపోనిధిని, పరాశరకుమారుడిని, బ్రహ్మర్షులలో అగ్రగణ్యుడిని, దయామయుడిని, కురుకులపితామహుడిని, లోకకల్యాణకారకుడిని, కృష్ణాజినాంబరధారిని, నల్లనిమేఘంయొక్క వర్ణంవంటి వర్ణం కల దేహం కలవాడిని, తగినయెత్తు గలవాడిని, ఉదయభానుడి కాంతి గల రాగిరంగుజడలసముదాయం కలవాడిని, రాగద్వేషాలు లేనివాడిని, మాత్సర్యరహితుడిని. (క్రిందివచనంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

వ. **వైశంపాయన ప్రభృతి శిష్యవర్గంబులతో ననేకమునిగణపరివృతుం డయి, కనకమణిమయోచ్చాసనంబున నున్న వ్యాసభట్టారకు నతిభక్తి నర్ఘ్యపాద్యాదివిధులం బూజించి, వినయవినమితశిరస్కుం డై నమస్కరించి జనమేజయుం డి ట్లనియె.** **4**

ప్రతిపదార్థం: వైశంపాయన, ప్రభృతి, శిష్యవర్గంబులతోన్= వైశంపాయనుడు మొదలుగా గల శిష్యులసమూహాలతో; అనేకమునిగణపరివృతుండు+అయి= పెక్కుమంది మునులసమూహంతో చుట్టబడినవాడై; కనక, మణిమయ+ఉచ్చ+ ఆసనంబునన్= బంగారంతోను, మణులతోను నిండిన ఎత్తైనపీఠంమీద; ఉన్న; వ్యాసభట్టారకున్= పూజ్యు డైన వ్యాసమహర్షిని; అతి, భక్తిన్= మిక్కిలిభక్తితో, అర్ఘ్య, పాద్య+ఆది, విధులన్=పూజకు పుష్పాలు, కాళ్ళు కడుగుకొనేందుకు నీళ్ళు మొదలైన పరిచర్యలతో; పూజించి= అర్చించి; వినయవినమిత, శిరస్కుండు+ఐ= వినయంతోవంగినతల కలవాడై; నమస్కరించి; జనమేజయుండు. ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: వైశంపాయనుడు మొదలైన శిష్యులసమూహంతోను, పెక్కుమందిమునులతోను చుట్టబడినవా డై బంగారంతోను, మణులతోను చేయబడిన ఉన్నత మైన ఆసనమందు కూర్చున్న వ్యాసభగవానుడిని జనమేజయుడు అర్ఘ్యపాద్యాదు లిచ్చి మిక్కిలిభక్తితో పూజించి ఇట్లా పలికాడు.

విశేషం: భట్ట, భట్టార, భట్టారక శబ్దాలు పూజ్యవాచకాలు. ఇవి వ్యక్తిపేరుకు ముందునను, వెనుకను వస్తాయి. ఉదా: భట్టోద్భటుడు; కుమారిలభట్టు; నన్నయభట్టు; వ్యాసభట్టారకుడు మొ॥ విద్వాంసుడైన బ్రాహ్మణుడిపేరుతో "భట్టారక" శబ్దం వాడబడుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. ప్రీతితో మీరును భీష్మాదికురువృద్ధ । రాజులు నుండి భూరాజ్యవిభవ
మెల్ల విభాగించి యిచ్చినం, దమతమ । వృత్తుల నుండక, వీఁగి పాండు
ధృతరాష్ట్రనందనుల్ ధృతి చెడి, వా రేమి । కారణంబునఁ బ్రజాక్షయము గాఁగ
భారతయుద్ధ మపారపరాక్రముల్ । చేసిరి? మీపంపు సేయ రైరి?

ఆ. యెఱిఁగి యెఱిఁగి వారి నేల వారింపర; । యిట్టి గోత్రకలహ మేల పుట్టె?
దీని కలతెఱంగు దెలియంగ నానతి । యిందు నాకు సన్మునీంద్రవంద్య! 5

ప్రతిపదార్థం: సత్, ముని+ఇంద్ర, వంద్య= ఉత్తము లైన మునిశ్రేష్ఠులచేత నమస్కరించదగిన వ్యాసమహర్షీ!; మీరును= (వ్యాసుడున్నూ) భీష్మ+ఆది, కురువృద్ధ, రాజులున్= భీష్ముడు మొద లైన కురువంశ్యులైనపెద్దలున్నూ, రాజులున్నూ; ఉండి= దగ్గరే ఉండి; ప్రీతితోన్= ప్రేమతో; భూ, రాజ్య, విభవము+ఎల్లన్= భూమియొక్క రాజ్యసంపద నంతా; విభాగించి= విభజించి; ఇచ్చినన్= ఇచ్చినప్పటికీ; తమ, తమ; వృత్తులన్= నడవడులలో, జీవనవిధానాలలో; ఉండక; వీఁగి= చలించి; పాండుధృతరాష్ట్రనందనుల్= పాండురాజపుత్రులున్నూ, ధృతరాష్ట్రుడిపుత్రులున్నూ; ధృతి, చెడి=ధైర్యం నశించి; వారు; ఏమి కారణంబునన్; ప్రజా, క్షయము కాఁగన్= ప్రజలకు వినాశం కలిగేటట్లుగా; భారత, యుద్ధము; అపార, పరాక్రముల్= అంతులేనిశౌర్యం కలవారు; చేసిరి; మీ పంపు= మీ ఆజ్ఞను; చేయరు+ఐరి= చేయనివా రైనారు; ఎఱిఁగి ఎఱిఁగి; వారిన్; ఏల= ఎందుకు; వారింపరు= నివారించరు?; ఇట్టి; గోత్ర, కలహము= వంశమందలియుద్ధం; ఏల; పుట్టెన్= ఎందుకు కలిగింది; దీని; కల, తెఱంగు= యథార్థస్థితి; తెలియంగన్= తెలిసేటట్లుగా, నాకున్; ఆనతి+ఇందు= ఆజ్ఞాపించండి. (తెలుపండి).

తాత్పర్యం: ఉత్తములైన మునులచేత నమస్కరించదగిన ఓ వ్యాసభగవానుడా! మీరున్నూ, భీష్మాదికురువృద్ధులున్నూ, రాజులున్నూ దగ్గర ఉండి రాజ్యసంపదనంతటినీ విభాగించి ఇవ్వగా, అంతులేనిపరాక్రమం కల కౌరవపాండవులు తమతమవృత్తులలో ఉండకుండా చలించి ప్రజానాశ మయ్యేటట్లుగా భారతయుద్ధాన్ని చేసేందుకు ఎందుకు పాల్పడ్డారు? మీఆనతిని వారు ఎందుకు పాటించకున్నారు? తెలిసికూడా మీరు ఇటువంటియుద్ధాన్ని ఎందుకు నివారింపలేకపోయారు? ఈ గోత్రకలహ మెందుకు పుట్టింది? దీని యథార్థస్థితిని నాకు తెలియజెప్పండి.

విశేషం: ఎఱిఁగి+ఎఱిఁగి= ఆమ్రేడితము పరమైనను క్వార్థకమగుటచేత సంధి కాలేదు. శ్రోత అయిన జనమేజయుడు పాండవకౌరవులు భారతయుద్ధం ఎందుకు చేశారు? అని ప్రశ్నించాడు. ఆ యుద్ధం జరగకుండా ఉండటానికి అనువైన హేతువులను గురించి, అవి విఫల మైన పద్ధతులను గురించి తెలిసికొన తలచాడు. వ్యాసభీష్మాదులు ఉండి రాజ్యవిభాగంచేసి ఎవరి బ్రదుకులు వారివిగా జీవించటానికి అవకాశం కలిగించినా యుద్ధం ఎందుకు వచ్చిందని మొదటిఅనుమానం. వ్యాసభీష్మాదుల మాటలు వారు వినకపోవటానికి కారణమేమిటి? వారు వినకపోయినప్పుడు వీరు ఉదాసీనత ప్రకటించటంలో కల కారణమేమిటి? అని ప్రశ్నించి, ఇన్ని రకాలుగా యుద్ధం జరుగకుండా ఉండటానికి వీలున్నా అది ప్రవర్తిల్లటానికి మూలమైన బలమైన హేతువేది? అని అడిగాడు చివరకు. ఒక్కొక్కప్రశ్నకు సమాధానం చెపితే కథలోని లోతులు క్రమంగా తెలుస్తాయి. అన్నింటిలో చివరిప్రశ్నబలమైనది, లోతైనది, ఉత్కంఠను కలిగించేది, అన్నింటికి బీజం వంటిది. కాబట్టి కురుపాండవులమధ్య జరిగిన కురుక్షేత్రయుద్ధానికి కల ఆ మూలహేతువును మొదట వివరించటంద్వారా నన్నయ కథాతాత్పర్యాన్ని ప్రసన్నం చేస్తున్నాడు.

వ. అని యిట్లు పాండవధార్తరాష్ట్రవిభేదనకథాశ్రవణకుతూహలపరుం డయి యడిగిన జనమేజయునకుం గరుణించి, కృష్ణద్వైపాయనుండు వైశంపాయనమునింజూచి 'శ్రీమహాభారతకథాఖ్యానంబాద్యంతంబితనికి సవిస్తరంబుగాఁ జెప్పు' మని పంచిచనిన. 6

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని, ఇట్లు; పాండవ= పాండవులయొక్కయు; ధార్తరాష్ట్ర= ధృతరాష్ట్రునికుమారులయొక్కయు; విభేదన= వేరుపాటుకు సంబంధించిన; కథాశ్రవణ= కథను వినుటయందు; కుతూహలపరుండు+ఐ= కుతుకమందు ఉత్సాహం కలవాడై; అడిగిన; జనమేజయునకున్= జనమేజయుడిని (ద్వితీయకు షష్ఠి); కరుణించి= కనికరించి; కృష్ణద్వైపాయనుండు= వేదవ్యాసుడు; వైశంపాయన, మునిన్; చూచి; శ్రీ, మహత్, భారత, కథా+ఆఖ్యానంబు= శోభాయుక్తమైన మహాభారతకథతోకూడిన ఇతిహాసాన్ని; ఆది+అంతంబు= మొదటినుండి చివరివరకు; ఇతనికిన్= ఈ జనమేజయుడికి; సవిస్తరంబుగాన్= విస్తృతితోకూడి ఉండేటట్లు; చెప్పుము; అని; పంచి= ఆజ్ఞాపించి; చనినన్= వెళ్ళగా.

తాత్పర్యం: అని ఈవిధంగా కౌరవపాండవులకలహవృత్తాంతాన్ని వినటానికి కుతూహలు డై ఉన్న జనమేజయుడిని కరుణించి, వేదవ్యాసుడు వైశంపాయనుని చూచి 'శ్రీమహాభారతకథతో కూడిన ఇతిహాసాన్ని ఆద్యంతం సవిస్తరంగా ఇతడికి చెప్పు' మని ఆజ్ఞాపించి వెళ్ళగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: జనమేజయు డడిగిన ప్రశ్నలో భారతయుద్ధానికి వ్యాసుడి బాధ్యత ఎంత అనే అంశం అంతర్గర్భితంగా ఉన్నది. అందువలన భారతకథను తానే చెప్పి తనను తాను సమర్థించుకొన్నట్లు కాకుండా, తన శిష్యుడైన వైశంపాయనుడిని మహాభారతకథను విస్తరించి చెప్పు మన్నాడు. విస్తరించట మంటే శ్రోత అడిగే ప్రశ్నలకూ, వెలిబుచ్చే అనుమానాలకూ తగిన వివరాలతో కథను పెంచి చెప్పటమన్నమాట. తాను రచించిన భారతాన్ని మానవలోకంలో ప్రచారం చేయటానికి వ్యాసుడు వైశంపాయనుడిని నియోగించాడు (చూడు: ఆది. 1.67).

భారత మహిమము

క. జనమేజయుండు విద్వ । జ్జనపరివృతుఁ డై సమస్తజనపాలసభా
జనయోగ్యుని వైశంపా । యనమునిఁ బూజించె వినతుఁ డై వినువేడ్కన్. 7

ప్రతిపదార్థం: (భారతాన్ని) విను వేడ్కన్= వినే వేడుకతో, జనమేజయుండు; విద్వత్+జన, పరివృతుఁడు+ఐ= విద్వాంసు లైన జనులతో కూడినవాడై; సమస్త, జనపాలసభాజన, యోగ్యునిన్= సమస్తరాజులసభలలో ఉండే జనాలలోయోగ్యుడైనవాడిని (ఉండేందుకుతగినవాడిని) వైశంపాయనమునిన్= వైశంపాయను డనే పేరుకలిగిన మునిని; వినతుఁడు+ఐ= విధేయు డై; పూజించెన్= అర్చించాడు.

తాత్పర్యం: జనమేజయుడు శ్రీ మహాభారతాన్ని వినే వేడుకతో విద్వజ్జనాలతో కూడి, సకలరాజసభాసదులలో ఉత్తము డైన వైశంపాయనమునిని విధేయుడై పూజించాడు.

వ. ఆ వైశంపాయనుండును నఖిలభువనవంద్యుం డయిన కృష్ణద్వైపాయనమునీంద్రునకు నమస్కారంబు సేసి, విద్వజ్జనంబుల యనుగ్రహంబు వడసి. 8

ప్రతిపదార్థం: ఆ వైశంపాయనుండును= వ్యాసమహర్షిశిష్యుడైన ఆ వైశంపాయనుడు; అఖిల, భువనవంద్యుండు= సమస్తలోకాలచేత నమస్కరించదగినవాడు; అయిన; కృష్ణద్వైపాయనముని+ఇంద్రునకున్; నమస్కారంబు; చేసి; విద్వత్+జనంబుల= విద్వాంసు లైన జనాలయొక్క; అనుగ్రహంబు= దయ; పడసి=పొంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ వైశంపాయనుడు వేదవ్యాసుడికి నమస్కరించి, అక్కడి విద్వాంసుల అనుగ్రహాన్ని పొంది. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. కమనీయధర్మార్థకామమోక్షములకు । నత్యంతసాధనం బయినదాని,
వేడ్కతోఁ దవిలి తన్ వినుచున్నవారల । కభిమతశుభకరం బయినదాని,
రాజుల కఖిలభూరాజ్యాభివృద్ధిని । త్యాభ్యుదయప్రదం బయినదాని,
వాఙ్మనఃకాయప్రవర్తితానేకజ । న్మాఘనిబర్హణం బయినదాని,

ఆ. సత్యవాక్ప్రబంధశతసహస్రశ్లోక । సంఖ్య మయినదాని, సర్వలోక
పూజ్య మయినదాని, బుధనుతవ్యాసమ । హాముని ప్రణీత మయినదాని. 9

ప్రతిపదార్థం: కమనీయ, ధర్మ+అర్థ, కామ మోక్షములకున్= ఇంపైన (కోరదగిన) ధర్మం, అర్థం,కామం, మోక్షం అనే చతుర్విధపురుషార్థాలకున్; అత్యంతసాధనంబు= అధిక మైన సాధనం; అయినదానిన్= అయినట్టిదానిని; వేడ్కతోన్= కుతూహలంతో; తవిలి= ఆసక్తి కలిగి, తన్=తన్ను వినుచున్నవారలకున్; అభిమత; శుభకరంబు= ఇష్టము లైన శుభాలను కలిగించేది; అయినదానిన్ రాజులకున్; అఖిల, భూ, రాజ్య+అభివృద్ధి, నిత్య+అభ్యుదయప్రదంబు= సమస్తభూమియొక్క రాజ్యాభివృద్ధిని, ఎల్లవేళల శుభోదయాన్ని ఇచ్చేది అయినదానిన్ వాక్+మనస్+కాయ+ప్రవర్తిత+అనేక, జన్మ+అఘ, నిబర్హణంబు= వాక్కుచేత, మనస్సుచేత, శరీరంచేత చేయబడిన అనేకజన్మాలలోని పాపాలను, హతమార్చేది అయినదానిని; సత్యవాక్+ప్రబంధ, శత, సహస్రశ్లోకసంఖ్యము= సత్య మైన వాక్కులకూర్పు కల నూరువేలశ్లోకాలసంఖ్య గలది అయినదానిని; సర్వలోకపూజ్యమున్= సమస్తలోకాలలో పూజించతగినది అయినదానిన్; బుధనుత వ్యాసమహత్మునిప్రణీతము= విద్వాంసులచేత పొగడబడిన వ్యాసమహామునిచేత రచింపబడినది అయినదానిన్= అయినట్టి దానిని

తాత్పర్యం: మనోహరా లైన (కోరదగిన) ధర్మం, అర్థం, కామం, మోక్షం, అనే నాలుగువిధా లైన పురుషార్థాలకు మిక్కిలిసాధనమైనదియున్నూ, కుతూహలంతో ఆసక్తిగా వింటున్నశ్రోతలకు ఇష్టమైన శుభాలను చేసేదిన్నీ, రాజులకు సమస్తభూమియొక్క రాజ్యమందలివృద్ధిని, సంతతశుభాభివృద్ధిని ఇచ్చేదిన్నీ, వాక్కు, మనస్సు, దేహం అనేత్రికరణాలతో చేయబడిన పెక్కుజన్మాలలోనిపాపాలను పోగొట్టేదిన్నీ, సత్యమైన వాక్కులకూర్పుకల వందవేలసంఖ్య కలదియూ, సమస్తజనులచేత పూజింపదగిందిన్నీ, పండితులచేత పొగడబడిన వ్యాసమహామునిచేత రచింపబడినదిన్నీ, అయినదానిని.

విశేషం: 'కృష్ణద్వైపాయన మునివృషభాభిహిత మహాభారతబద్ధనిరూపితార్థ' మేర్పడేటట్లు ప్రవచింపబోతున్న వైశంపాయనుడు వ్యాసమహాభారతప్రశస్తిచేయటం సముచితం. ఈపద్యంలో మహాభారత కావ్యప్రయోజనాలను పేర్కొనటం జరిగింది. పురుషార్థసాధనం అర్థప్రయోజనాన్ని, వినేవారికి శుభాలు కలిగించటం వ్యవహారవేత్తృత్వాన్నీ, అభ్యుదయాలు కలిగించి పాపాలను తొలగించటం శివేతరక్షయాన్ని, సర్వలోకపూజ్యత్వం యశస్సునూ సూచిస్తున్నాయి. నూరువేల శ్లోకాల భారతం మహత్భారతం అని పిలవటానికి యోగ్యమైన దని తాత్పర్యం. మహాకావ్యం సద్యఃపరనిర్వృతిని కలిగిస్తుం దని భావం. ఒకవస్తువునందుకానీ, వ్యక్తియందుకానీ పెక్కుగుణాలను వర్ణించేటప్పుడు దాని దాని అనిచెప్పటం నన్నయపద్యాలలో పలుచోట్ల కనిపిస్తుంది. వాక్+మనః= వాఙ్మనః-అనునాసిక సంధి.

చ. వినుతపరాక్రముల్, ధృతివివేకులు, సత్యసమన్వితుల్, యశో
ధనులు, కృతజ్ఞు, లుత్తములు, ధర్మపరుల్, శరణాగతానుకం

పను లనఁగాఁ బ్రసిద్ధు లగు భారతవీరుల సద్గుణానుకీ
ర్తనముల నొప్పుదాని, విదితం బగుదాని సభాంతరంబులన్. **10**

ప్రతిపదార్థం: వినుత, పరాక్రముల్= పొగడబడినపరాక్రమం కలవారు; ధృతి, వివేకులు= ధైర్యం, తెలివి కలవారు; సత్యసమన్వితుల్= సత్యంతో కూడినవారు; యశస్+ధనుల్= కీర్తియే ధనంగా కలవారు; కృతజ్ఞులు= చేసినమేలు మరువనివారు; ధర్మపరుల్= ధర్మమం దాసక్తులు; శరణ+ఆగత+అనుకంపనులు= శరణుచొచ్చినవారియందు దయకలవారు; అనఁగాన్; ప్రసిద్ధులు+అగు= ప్రఖ్యాతు లైన; భారత, వీరుల= వీరు లైన భరతవంశస్థులయొక్క; సత్+గుణ+అనుకీర్తనములన్= మంచిగుణాలస్తుతులతో; ఒప్పు; దానిన్; సభా+అంతరంబులన్= సభలలోపల; విదితంబు+ అగు, దానిన్= తెలియబడినదానిని, (ప్రసిద్ధమైనదానిని).

తాత్పర్యం: మహాపరాక్రమవంతులు, ధైర్యవివేకాలు కలవారు, సత్యపరులు, కీర్తిధనులు, కృతజ్ఞులు, ఉత్తములు, ధార్మికులు, శరణాగతులయందు దయకలవారు అని ప్రసిద్ధిపొందిన భారతవీరులసద్గుణాలను కీర్తించటంతో ఒప్పి, సభాంతరాలలో ప్రశస్త మైనదానిని (భారతాన్ని).

విశేషం: ఉత్తమనాయకులవలననే కావ్యాలకు ఉత్తమ గౌరవం లభిస్తుంది. అందువలన మహాభారతానికి ఉత్తమ కావ్యగౌరవప్రయోజనాలు సిద్ధించటానికి కారకులైన చంద్రవంశవీరుల గుణకీర్తనం ఈపద్యంలో నన్నయ నిర్వహించాడు. భారతవీరులు- అంటే భరతవంశంలో పుట్టిన వీరులనీ, భారతకావ్యంలోని వీరులనీ, పాండవులనీ అర్థాలు చెప్పవచ్చును. ఉత్తమనాయకవిశిష్టమైన భారతాన్ని వినటంవలన కలిగే లాభాలను రాబోయే పద్యంలో నన్నయ వివరిస్తున్నాడు.

శా. **ఆయుష్యం, బితిహాసవస్తుసముదాయం, బైహికాముష్మిక**
శ్రేయః ప్రాప్తినిమిత్త, ముత్తమసభాసేవ్యంబు, లోకాగమ
న్యాయైకాంతగృహంబునాఁ బరఁగి, నానావేదవేదాంతవి
ద్యాయుక్తం బగుదానిఁ జెప్పఁ దొడఁగెం దద్భారతాఖ్యానమున్. **11**

ప్రతిపదార్థం: ఆయుష్యంబు= ఆయుస్సు నిచ్చేది; ఇతిహాస, వస్తుసముదాయంబు= పూర్వకథలందలి ఇతివృత్తాలసమూహం కలది; ఐహిక+ఆముష్మిక, శ్రేయస్ప్రాప్తినిమిత్తము= ఇహలోకసంబంధ మైన పరలోకసంబంధ మైన శుభాలు పొందటానికి కారణం; ఉత్తమ, సభా, సేవ్యంబు= శ్రేష్ఠము లైన సభలచేత (యందు) సేవింపదగినది; లోక+ఆగమ, న్యాయ+ఏకాంత, గృహంబు= లోకానికి, శాస్త్రానికి సంబంధించిన ఆచారాలకు అనన్య మైన నిలయం; నాన్= అన్నట్లుగా; పరఁగి= ప్రసిద్ధికాంచి; నానా, వేదవేదాంత, విద్యాయుక్తంబు+అగుదానిన్= అనేకా లైన వేదాలలోని, ఉపనిషత్తులలోని జ్ఞానంతో కూడినదైన; తద్= ఆ; భారత+ఆఖ్యానమున్= భారతకథను; చెప్పన్, తొడఁగెన్= చెప్పటానికి ఆరంభించాడు.

తాత్పర్యం: ఆయుర్దాయాన్ని ఇచ్చేదీ, పూర్వకథావిషయాలసమూహం కలదీ, ఇహపరలోకశ్రేయాలను పొందటానికి కారణ మైనదీ, ప్రముఖా లైన సభలందు సేవింపదగినదీ, లోకానికి, శాస్త్రానికి సంబంధించిన ఆచారాలకు అనన్య మైన నిలయమైనదీ అయి, ప్రసిద్ధి పొంది, అనేక వేద వేదాంతజ్ఞానాలతో కూడిన ఆ మహాభారతకథను (వైశంపాయనుడు) చెప్పటానికి ఆరంభించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: భారతం వివిధవిషయాలతో కూడిన విజ్ఞానకోశమని చెప్పదగింది. ఇహపరపుణ్యసాధనం, సమస్తాచారవిధానాలకు నిలయం, శాస్త్రేతిహాసం, కావ్యరచనంవలన కలిగే ప్రయోజనాలను తొమ్మిదవ పద్యంలో సూచించి, కావ్యశ్రవణంవలన కలిగే లాభాలను ఈపద్యంలో నన్నయ పేర్కొన్నాడు.

పాండవధార్తరాష్ట్రుల భేదకారణసంగ్రహము (సం. 1-55-6)

సీ. **పాండుకుమారులు పాండుభూపతిపరో । క్షంబున హస్తిపురంబునందు**
ధృతరాష్ట్రునొద్దఁ దత్సుతులతో నొక్కటఁ । బెరుఁగుచు, భూసురవరులవలన
వేదంబులును ధనుర్వేదాదివిద్యలుఁ । గఱచుచుఁ గడలేనియెఱుకఁ దనరు
చున్నఁ, దద్విపుల గుణోన్నతి సైఁపక । దుర్యోధనుండు దుష్కార్య మెత్తి.

ఆ. **దుర్ణయమున శకునికర్ణదుశ్శాసనుల్ । గఱపఁ బాండవులకు నఱయ చేయఁ**
గడఁగెఁ; బాండవులును గడుధార్మికులు గానఁ । బొరయ రైరి వారిదురితవిధుల. 12

ప్రతిపదార్థం: పాండుకుమారులు= పాండవులు; పాండు, భూపతి, పరోక్షంబునన్= పాండురాజు(మరణించిన) పిమ్మట; హస్తిపురంబునందున్; ధృతరాష్ట్రు+ఒద్దన్; తద్+సుతులతోన్= ఆ ధృతరాష్ట్రుని కుమారులతో; ఒక్కటన్= కూడి (ఏకకాలంలో); పెరుఁగుచున్= పెరుఁగుతూ; భూసుర, వరులవలనన్= బ్రాహ్మణశ్రేష్ఠులవలన; వేదంబులును; ధనుః+వేద+ఆది, విద్యలున్= ధనుర్వేదంమొదలైన విద్యలు; కఱచుచున్= నేరుస్తూ; కడ, లేని, ఎఱుకన్= అంతులేనిజ్ఞానంతో; తనరుచున్నన్= ప్రకాశిస్తుండగా; తద్+విపుల, గుణ+ఉన్నతిన్= వారి విస్తారమైన సుగుణాలగొప్పతనం; సైఁపక= సహించక; దుర్యోధనుండు; దుష్కార్యము= చెట్టను; ఎత్తి= గ్రహించి; దుర్ణయమునన్= అన్యాయంగా; శకుని, కర్ణ, దుశ్శాసనుల్; కఱపన్= బోధించగా; పాండవులకున్; అఱ+అ= కీడే; చేయన్, కడఁగెన్= చేయటానికి ప్రయత్నించాడు; పాండవులును; కడు, ధార్మికులు= మిక్కిలి ధర్మయుక్తులు; కానన్= కాబట్టి; వారి, దురితవిధులన్= ఆ కౌరవులపాపకృత్యాలను; పొరయరు+ఐరి= పొందకున్నారు.

తాత్పర్యం: పాండురాజుమరణానంతరం పాండవులు హస్తినాపురంలో ధార్తరాష్ట్రులతోపాటు పెరుగుతూ, విప్రవరుల (వలన) వద్ద వేదాలు, ధనుర్వేదాదివిద్యలు నేరుస్తూ, అపారజ్ఞానసంపన్నులై ఉండగా, వారిగుణసంపదకు సహించక దుర్యోధనుడు దుష్కార్యాలకు తలపడి, శకుని కర్ణ దుశ్శాసనులు బోధించగా పాండవుల కెల్లప్పుడు కీడే చేయటానికి యత్నించేవాడు. పాండవులు పరమధార్మికులు కావటంచేత ధార్తరాష్ట్రుల దుష్కార్యాలవలన హాని పొందకుండిరి.

విశేషం: కురుక్షేత్రయుద్ధానికి బీజభూతమైన కథాసన్నివేశంతో కథను ప్రారంభించటం ప్రస్తుత కథాశిల్పం. పాండుకుమారులు నాయకులుగా, దుర్యోధనుడు ప్రతినాయకుడుగా రూపొందే భావికథలో నన్నయ కావ్యత్వాన్ని ధ్వనింపచేస్తున్నాడు. కొండను అద్దంలో చూపినట్లు భారతకథనంతా ఒక సీసపద్యంలో ప్రతిఫలింపజేసి పాండవకౌరవ భేద కారణాన్ని నిరూపించటం నన్నయ కథారచనాశిల్పం. ధృతరాష్ట్రు+ఒద్ద; షష్ఠీసమాసంలో ఉకారఋకారముల కచ్చుపరమైనప్పుడు ను ఆగమమౌతుంది- ధృతరాష్ట్రునొద్ద.

వ. **అది యెట్లనిన: నొక్కనాఁడు జలక్రీడాపరిశ్రమవిచేష్టితుం డయి ప్రమాణకోటిస్థలంబున నిద్రితుం డైన భీమసేను నతిఘనలతాపాశబద్ధుం జేసి గంగమడువునం ద్రోచిన, నాతం డనంతసత్త్వుండు గావునఁ దద్బంధంబు**

లెల్లఁ దెగ నీల్గి మీఁదికి నెగసె; మఱియొక్కనాఁ డతివ్యాయామఖేదంబున సుప్తుం డైన వానిసర్వాంగంబుల యందుఁ గృష్ణసర్పంబులం బట్టి కఱపించిన, నాతండు వజ్రమయదేహుండు గావునఁ దద్విషదంష్ట్రలు నాఁటవయ్యె; మఱియు నొక్కనాఁడు భోజన సమయంబున వానికి విషంబు వెట్టిన, నతండు దివ్యపురుషుండు గావునఁ దద్విషం బన్నంబుతోడన జీర్ణం బయ్యె; మఱియు వారల కెల్ల నపాయంబు సేయసమకట్టి. 13

ప్రతిపదార్థం: అది= వారు పాపకృత్యాలు చేయటం; ఎట్లు+అనినన్; ఒక్కనాఁడు; జలక్రీడాపరిశ్రమ, విచేష్టితుండు+అయి= జలక్రీడలో మిక్కిలి అలసటచేత చేష్ట లుడిగినవా డై; ప్రమాణకోటిస్థలంబునన్= ప్రమాణకోటి అనే ప్రదేశంలో; నిద్రితుండు+ఐనన్= నిద్రపోయినవాడు కాగా; భీమసేనున్; అతి, ఘన, లతా, పాశబద్ధున్= మిక్కిలిపెద్ద వైన తీగ లనే త్రాళ్ళతో బంధించబడినవాడిని; చేసి; గంగ, మడువునన్= గంగానదిమడుగు(హ్రదం)లో; త్రోచినన్; ఆతండు= ఆ భీముడు; అనంత+సత్త్వుండు= అంతులేని బలంకలవాడు; కావునన్; తద్+బంధంబులు+ఎల్లన్= ఆ కట్టు(త్రాళ్ళన్నియున్నూ); తెగన్= తెగిపోయేటట్లుగా; నీల్గి= ఒడలువిఱుచుకొని; మీఁదికిన్, ఎగసెన్= నీటిపైకిలేచాడు; మఱి, ఒక్కనాఁడు; అతివ్యాయామఖేదంబునన్= మిక్కుట మైన పరిశ్రమవలన కలిగినబాధతో; సుప్తుండు+ఐనన్= నిద్రితు డైన; వానిన్= భీముడిని; సర్వ+అంగంబులయందున్= అన్నిఅవయవాలందు; కృష్ణసర్పంబులన్= నల్లత్రాచుపాములను; పట్టి; కఱపించినన్= కరిచేటట్లు చేయగా; ఆతండు= ఆ భీముడు; వజ్రమయ, దేహుండు= వజ్రమయమైన శరీరంకలవాడు; కావునన్; తద్= ఆ పాములయొక్క; విష, దంష్ట్రలు= విషపుకోరలు; నాటవు+అయ్యెన్= దిగబడవయ్యెను; మఱియున్; ఒక్కనాఁడు= ఇంకొకరోజున; భోజన, సమయంబునన్= అన్నం తినేటప్పుడు; వానికిన్= ఆ భీముడికి; విషంబు+పెట్టినన్; అతండు; దివ్యపురుషుండు= దేవ(అలౌకిక) పురుషుడు; కావునన్; తద్+విషంబు= ఆ విషం; అన్నంబుతోడన్+అ= అన్నంతోపాటుగానే; జీర్ణంబు+అయ్యెన్= అరిగిపోయింది; మఱియున్; వారలకున్+ఎల్లన్= ఆ పాండవులకందరికిన్నీ; అపాయంబు= కీడు; చేయన్; సమకట్టి= పూనుకొని.

తాత్పర్యం: పాండవులు పరమధార్మికులు కాబట్టి ధార్తరాష్ట్రులు చేస్తున్న దుశ్చర్యలచేత హాని పొందకున్నారు. అదెట్లా గనగా ఒకరోజు భీముడు జలక్రీడ లాడి మిక్కిలి అలసి సొమ్మసిల్లి ప్రమాణకోటి అనే ప్రదేశంలో నిద్రిస్తుండగా, అతడిని లతాపాశాలతో బంధించి గంగమడుగులోనికి త్రోశారు. ఆ భీముడు అనంతబలుడు కాబట్టి మేలుకొని, ఆ బంధాలు తెగేటట్లుగా ఒడలు విఱుచుకొని బయటికి వచ్చాడు. మఱొకరోజు భీముడు మిక్కిలి పరిశ్రమించి గాఢనిద్రలో ఉన్నపుడు నల్లత్రాచుపాములచేత కఱపించారు. అతడు వజ్రకాయుడుకాబట్టి ఆ సర్పాలవిషదంష్ట్రలు అతనిశరీరంలో దిగబడలేదు. మరి ఇంకొకరోజు భీముడికి భోజనం చేసేటప్పుడు అన్నంలో విషం కలిపి పెట్టించారు. ఆ భీముడు దివ్యపురుషుడు కాబట్టి అన్నంతోపాటే విషంకూడా జీర్ణమైపోయింది. అంతటితో ఆగక ఆ ధార్తరాష్ట్రులు పాండవుల కందరికీ కీడు చేసేందుకు పూనుకొని.

విశేషం: దుర్యోధనుడు పాండవులకు హాని చేసేవా డనటానికి ఉదాహరణంగా ఈ విషయాలను సౌతి చెప్పాడు. మొదట భీముడికి చేసిన కీడులను మూడింటిని పేర్కొన్నాడు. అతడు పాండవులకు వజ్రకవచం వంటివాడు. నీరుతో, విషంతో అతడిని చంపటానికి దుర్యోధనుడు ప్రయత్నించి విఫలు డయ్యాడు. దానివలన భీముడు అనంతబలుడనీ, వజ్రకాయుడనీ, దివ్యుడనీ తేలింది. ఆపైన పాండవులనందరినీ సామూహికంగా చంపటానికి యత్నించాడు- అగ్నితో. లాక్షాగృహదహనం ఆ ప్రయోజనంకొరకు రూపొందించిందే. (తరువాతి పద్యంలో ఆ అంశం వర్ణింపబడుతున్నది.)

సీ. వదలక కురుపతి వారణావతమున । లక్కయిల్ గావించి, యక్కజముగ

నందఱఁ జొన్పి, యం దనలంబు దరికొల్పఁ । బనిచినఁ, బాండునందను లెఱింగి

విదురోపదిష్టభూవివరంబునం దప । క్రాంతు లై బ్రదికి నిశ్చింతు లయిరి;

ధర్మువు నుచితంబుఁ దప్పనివారల, । సదమలాచారుల నుదిత సత్య

ఆ. రతుల నఖిలలోకహితమహారంభుల, । భూరిగుణుల, నిర్జితారివర్గు

లై వెలుంగువారి దైవంబ రక్షించు । దురితవిధుల నెపుడుఁ బొరయకుండ. 14

ప్రతిపదార్థం: వదలక (తనదుష్కార్యాలను) విడువక; కురుపతి= దుర్యోధనుడు; వారణావతమునన్= వారణావత మనే పేరు కల నగరంలో; లక్క, ఇల్= లక్కఇల్లు; కావించి= నిర్మించి; అక్కజముగన్= ఆశ్చర్యంగా; అందఱన్+చొన్పి= అందరినీ ప్రవేశపెట్టి; అందున్= ఆ ఇంటిలో; అనలంబు= నిప్పు; దరికొల్పన్= మండింపగా; పనిచినన్= ఆజ్ఞాపించగా; పాండు+నందనులు+ఎఱింగి= పాండవులు తెలిసికొని; విదుర+ఉపదిష్ట, భూ, వివరంబునందున్= విదురుడిచేత చెప్పబడిన భూమిరంధ్రమందు; అపక్రాంతులు+ఐ= తొలగిపోయినవా రై; బ్రదికి; నిశ్చింతులు+అయిరి= చింత లేనివా రైనారు; ధర్మువున్= ధర్మాన్ని; ఉచితంబున్= యోగ్యతను, తగినవిధానాన్ని; తప్పనివారలన్= విడువనివారిని; సత్+అమల+ఆచారులన్= నిర్మల మైన నడవడి కలవారిని; ఉదిత, సత్య, రతులన్= (శాస్త్రమందు) చెప్పబడిన సత్యమందు ఆసక్తికలవారిని; అఖిల, లోక, హిత, మహత్+ఆరంభులన్= సమస్తలోకాలమేలుకొఱకై గొప్పపూనిక కలవారిని; భూరిగుణులన్= గొప్పగుణవంతులను; నిర్జిత+అరి, వర్గులు+ఐ= జయించబడినశత్రుసమూహం కలవారై; వెలుంగువారిన్= ప్రకాశించేవారిని; దైవంబు+అ= దైవమే; దురిత, విధులన్= పాపపుపనులను; ఎపుడున్; పొరయకుండన్= పొందకుండ; రక్షించున్= రక్షించును.

తాత్పర్యం: తన దురుద్దేశం విడవక, దుర్యోధనుడు వారణావతంలో లక్క ఇల్లొకటి నిర్మించి, అందులో పాండవులు ప్రవేశించేటట్లుచేసి దానికి నిప్పంటించు మని ఆజ్ఞాపించాడు. అది గ్రహించి పాండవులు విదురు డెఱిగించిన భూరంధ్రంనుండి బయటపడి బ్రతికి చింతలేనివా రైనారు. ధర్మాన్ని, యోగ్యతను తప్పని సజ్జనులను, ఋజుమార్గవర్తనులను, సత్యసంధులను, సకలజనహితకారులను, గుణసంపన్నులను, శత్రువులసమూహాన్ని జయించి ప్రకాశించేవారిని, పాపకార్యాలనుండి దైవమే ఎప్పుడూ రక్షిస్తుంటాడు.

విశేషం: ఈ పద్య ఉత్తరార్ధం నన్నయసూక్తినిధిత్వానికి తార్కాణం.

వ. ఇట్లు దుర్యోధనుచేయు నపాయంబులవలనం బాయుచుఁబాండవులు లాక్షాగృహదాహంబువలన నక్షయు లై జననీసహితంబుగా వనంబులకుం జనిన, నందు భీమసేనుండు హిడింబాసురుం జంపి, వాని చెలియలి హిడింబను వివాహం బై, యేకచక్రపురంబున కేఁగి, యందు బకాసురుం జంపి విప్రులం గాచె; మఱి. యందఱు విప్రవేషంబున ద్రుపదుపురంబునకుం జని, యందు ద్రౌపదీస్వయంవరంబున మత్స్యయంత్రం బర్జునుం డశ్రమంబున నురుల నేసి, సకలరాజలోకంబు నొడిచి, ద్రోవదింజేకొనిన, దాని నేవురు గురువచనంబున వివాహం బై ద్రుపదుపురంబున నొక్కసంవత్సరం బున్న నెఱింగి ధృతరాష్ట్రుండు వారి రావించి, వారల కర్ధరాజ్యంబిచ్చి, యింద్రప్రస్థపురంబున నుండం బనిచిన, నందుఁ బాండవులు రాజ్యంబు సేయుచున్నంత. 15

ప్రతిపదార్థం: దుర్యోధను, చేయు, అపాయంబువలనన్= దుర్యోధనుడు చేసేకీడులనుండి; పాయుచున్= తొలగుతూ; పాండవులు; లాక్షాగృహ, దాహంబువలనన్= లక్కయిల్లు కాలటంనుండి; అక్షయులు+ఐ= నశించనివా రై; జననీ, సహితంబుగాన్=

తల్లి యైన కుంతితోకూడ; వనంబులకున్= అడవులకు; చనినన్= వెళ్ళగా; అందున్= వనంలో; భీమసేనుండు; హిడింబ+అసురున్= హిడింబు డనే రాక్షసుడిని; చంపి; వాని, చెలియలిన్; హిడింబను; వివాహంబు+ఐ= పెళ్లిచేసికొని; ఏకచక్రపురంబునకున్; ఏఁగి= వెళ్ళి; అందున్= ఏకచక్రపురంలో; బక+అసురున్= బకు డనే రాక్షసుడిని; చంపి; విప్రులన్= బ్రాహ్మణులను, కాచెన్= కాపాడెను; మఱి; అందరున్= తరువాత పాండవులందరు; విప్ర, వేషంబునన్= బ్రాహ్మణులవేషంతో; ద్రుపదపురంబునకున్= ద్రుపదరాజుపట్టణానికి; చని; అందున్= ఆ పట్టణంలో; ద్రౌపదీస్వయంవరంబునన్= ద్రౌపదీస్వయంవరమహోత్సవంలో (తనంత తాను మగని వరించి చేసికొనువివాహంలో); మత్స్యయంత్రంబు= చేప ఆకారంకలయంత్రాన్ని; అర్జునుండు; అశ్రమంబునన్= శ్రమలేకుండా; ఉరలన్+ఏసి= రాలునట్లుగా బాణంతో కొట్టి; సకల, రాజలోకంబున్= సమస్తరాజసమూహాన్ని; ఒడిచి= ఓడించి; ద్రోవదిన్= ద్రౌపదిని; చేకొనినన్= చెట్టపట్టగా; దానిన్= ఆద్రౌపదిని; ఏవురున్= అయిదుగురును; గురువచనంబునన్= పెద్దలమాటప్రకారం; వివాహంబు+ఐ= పెళ్ళాడి; ద్రుపదు, పురంబునన్; ఒక్క, సంవత్సరంబు; ఉన్నన్= ఉండగా; ఎఱింగి= తెలిసికొని; ధృతరాష్ట్రుండు; వారిన్= ఆ పాండవులను; రావించి= రప్పించి; వారలకున్= ఆ పాండవులకు; అర్ధరాజ్యంబు= సగంరాజ్యం; ఇచ్చి; ఇంద్రప్రస్థపురంబునన్; ఉండన్, పనిచినన్= ఉండేందుకు ఆజ్ఞాపించగా; అందున్= ఆ ఇంద్రప్రస్థంలో; పాండవులు; రాజ్యంబు, చేయుచున్, ఉన్న+అంతన్= రాజ్యం చేస్తుండగా.

తాత్పర్యం: ఈ విధంగా దుర్యోధనుడు చేస్తున్న కీడులనుంచి తొలగుతూ, పాండవులు లక్కయిల్లుకాలటంవలన ఎటువంటి హాని లేనివా రై తల్లితోకూడ అడవులకు వెళ్లారు. ఆ అడవులలో భీముడు హిడింబు డనే రాక్షసుడిని చంపి, అతనిచెల్లెలైన హిడింబను పెళ్ళాడి, ఏకచక్రపురానికి వెళ్ళి, అక్కడ బకు డనే రాక్షసుడిని చంపి బ్రాహ్మణులను రక్షించాడు. తరువాత పాండవు లందరూ బ్రాహ్మణవేషాలు ధరించి ద్రుపదుడిపట్టణానికి వెళ్ళారు. అక్కడ ద్రౌపది స్వయంవరవివాహోత్సవంలో చేపరూపంలో అమర్చిన యంత్రాన్ని అర్జునుడు శ్రమలేకుండా బాణంతో పడగొట్టి, రాజులందరినీ ఓడించి, ద్రౌపదిని గ్రహించాడు. తరువాత కుంతి, వ్యాసుడు మొదలైన పెద్దలమాటలను అనుసరించి పాండవు లైదుగురు ద్రౌపదిని పెళ్ళాడి ఒక్కఏడు ద్రుపదునిపట్టణంలోనే ఉన్నారు. ఆ విషయం తెలిసికొని ధృతరాష్ట్రుడు వారిని రప్పించి సగంరాజ్యం ఇచ్చి, ఇంద్రప్రస్థ మనే పట్టణంలో ఉండం డని ఆజ్ఞాపించాడు. దానిలో పాండవులు రాజ్యంచేస్తూ ఉండగా (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: వచ్చు ధాతువు ప్రేరణార్థకరూపం రావించు, లాక్షాగృహదాహ మైన తరువాత పాండవు లెక్కడున్నారో దుర్యోధనాదులకు తెలియదు. ద్రౌపదీవివాహం వలననే వాళ్ళ ఉనికి తెలియవచ్చింది.

క. ద్వారవతి కేఁగి, యర్జునుఁ । డారంగ సుభద్రఁ బెండ్లి యై వచ్చి, మహా
వీరు నభిమన్యుఁ గులవి । స్తారకు సత్పుత్త్రు నతిముదంబునఁ బడసెన్. 16

ప్రతిపదార్థం: ద్వారవతికిన్+ఏఁగి= ద్వారకానగరానికి వెళ్లి; అర్జునుఁడు; ఆరంగన్= మనస్ఫూర్తిగా; సుభద్రన్= సుభద్రను, (బలరామకృష్ణులసోదరిని) పెండ్లి యై; వచ్చి; మహత్+వీరున్= గొప్పవీరుడిని; కుల, విస్తారకున్= వంశాన్ని విస్తరింపజేసేవాడిని; సత్+పుత్త్రున్= యోగ్యు డైన కుమారుడిని; అభిమన్యున్= అభిమన్యు డనేపేరు కలిగినవాడిని; అతి, ముదంబునన్= మిక్కిలి సంతోషంతో; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: అర్జునుడు ద్వారకానగరానికి వెళ్ళి, అక్కడ సుభద్రను మనసార పెళ్ళాడి వచ్చి, వీరుడు వంశవర్ధనుడు అయిన అభిమన్యు డనేపేరు కల సత్పుత్త్రుడిని పొందాడు.

వ. మఱియు నగ్నిదేవుచేత దివ్యరథంబును దివ్యాశ్వంబులును గాండీవదేవదత్తంబులును నక్షయబాణ తూణీరంబులుం బడసి, సురగణంబులతో సురపతి నోర్చి, ఖాండవదహనంబున నగ్నిదేవునిం దనిపె; మఱి మయువలన సభాప్రాప్తుం డై, భీమునిచేత జరాసంధుం జంపించి, దిగ్విజయంబు సేసి సార్వభౌముం డై ధర్మరాజు రాజసూయమహాయజ్ఞంబుఁ గావించె; నివి మొదలుగాఁ గల పాండవులగుణసంపదలు చూచి సహింప నోపక దుర్యోధనుండు శకునికైతవంబున మాయాద్యూతంబున ధర్మరాజుం బరాజితుం జేసి, పంద్రెండేఁడులు వనవాసంబును, నొక్కయేఁడు జనపదంబున నజ్ఞాతవాసంబునుగా సమయంబు సేసి భూమి వెలువరించినం, జని పాండవులు వనవాసంబున నున్నంత. 17

ప్రతిపదార్థం: మఱియున్= అదిగాక; అగ్ని, దేవుచేతన్; దివ్య, రథంబును= దేవతాసంబంధ మైన రథాన్ని; దివ్య+అశ్వంబులును= దివ్యము లైన గుఱ్ఱాలను; గాండీవ, దేవదత్తంబులును= గాండీవ మనే పేరు గల ధనుస్సును, దేవదత్త మనే పేరు గల శంఖాన్ని; అక్షయ, బాణ, తూణీరంబులున్= తరగనిబాణాలు గల అమ్ములపొదులను; పడసి= పొంది; సురగణంబులతోన్= దేవతలసమూహాలతో కూడ; సుర, పతిన్= దేవేంద్రుడిని; ఓర్చి= జయించి; ఖాండవదహనంబునన్= ఖాండవ మనే పేరు గల వనాన్ని దహించటంచేత; అగ్నిదేవున్= అగ్నిహోత్రుడిని; తనిపెన్= సంతృప్తిపరిచాడు; మయువలనన్= మయు డనే పేరు కల శిల్పివలన; సభా, ప్రాప్తుండు+ఐ= సభాభవనాన్ని పొందినవాడై; భీముచేతన్= భీమసేనుడిచేత; జరాసంధున్= జరాసంధు డనే వాడిని (జర అనురాక్షసిచేత కూర్చబడినవాడిని, మగధరాజును); చంపించి; దిక్+విజయంబుచేసి= దిక్కులను జయించి; సార్వభౌముండు+ఐ= చక్రవర్తియై; ధర్మరాజు; రాజసూయ, మహాయజ్ఞంబు= రాజసూయ మనే పేరు కలిగిన గొప్పయజ్ఞాన్ని; కావించెన్= చేశాడు; ఇవి, మొదలుగాన్ కల; పాండవుల; గుణ, సంపదలు= సుగుణా లనే సంపదలను; చూచి; సహింపన్, ఓపక= ఓర్వజాలక; దుర్యోధనుండు; శకుని, కైతవంబునన్= శకునియొక్క కపటమున; మాయాద్యూతంబునన్= (ఇంద్రజాలాదివిద్యతో కూడిన దైన) మాయజూదాన; ధర్మరాజును; పరాజితున్, చేసి= ఓడినవాడినిగా చేసి; పంద్రెండు+ఏఁడులు; వనవాసంబును= అడవిలో నివసించటమున్నూ; ఒక్కఏఁడు; జనపదంబునన్= గ్రామమందు, దేశమందు; అజ్ఞాతవాసంబునుగాన్= తెలియబడకుండా నివసించటం అవునట్లుగా; సమయంబు= ప్రతిజ్ఞ, కట్టడి; చేసి; భూమి; వెలువరించినన్= భూమి(దేశం)నుండి; వెడలింపఁగాన్= బయటికి పంపగా; చని; పాండవులు; వనవాసంబునన్= అరణ్యవాసమందు; ఉన్న+అంతన్= ఉండగా.

తాత్పర్యం: అదికాక అర్జునుడు అగ్నిదేవుడిచేత దేవతాసంబంధ మైన రథాన్ని, దివ్యా లైన గుఱ్ఱాలను, గాండీవ మనే ధనుస్సును, దేవదత్త మనే శంఖాన్ని, తరగనిబాణాలతో కూడిన అమ్ములపొదులను పొంది దేవతాసమూహాలతో కూడ దేవేంద్రుడిని ఓడించి ఖాండవవనాన్ని దహించటంచేత అగ్నిని తృప్తి పరచాడు. తరువాత మయు డనే రాక్షసశిల్పివలన సభాభవనాన్ని పొంది, భీముడిచేత జరాసంధు డనే మగధరాజును చంపించి, అన్నిదిక్కులను జయించి చక్రవర్తి యై ధర్మరాజు రాజసూయ మనే గొప్పయజ్ఞాన్ని చేశాడు. పైన పేర్కొనబడిన ఘనకార్యాలు మొదలైన పాండవులసుగుణాలను, సంపదను చూచి ఓర్వజాలక దుర్యోధనుడు శకునికపటంచేత మాయజూదంలో ధర్మరాజును ఓడించి పన్నెండేళ్ళు అడవిలో నివసించటమున్నూ, ఒక్కఏడు గ్రామంలో (పట్టణంలో, జను లుండే ప్రదేశంలో) తెలియబడకుండా నివసించేటట్లుగాను నియమం చేసి, దేశంనుండి వెళ్ళగొట్టగా వెళ్ళి, పాండవులు అడవిలో నివసిస్తుండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: మయుడు రాక్షసశిల్పి. త్రిపురాసురులకు మూడుపురాలను నిర్మించి యిచ్చినవా డితడే. రాజసూయము= చక్రవర్తి అయినవాడిచేత చేయబడే గొప్ప యజ్ఞం. సామంతులందరూ పిలువబడి ఈయజ్ఞానికి వస్తారు. ఇది చేసేవాడి నిర్వివాద మైన సమ్రాట్పదవిని సూచిస్తుంది. "రాజావై రాజసూయే నేష్ట్వా భవతి''. శతపథబ్రాహ్మణం. పశుపతికి (శివుడికి) సంబంధించినది పాశుపతం. భూమి అంటే రాజ్య మని అర్థం.

చ. పరమగురూపదేశమునఁ బార్థుఁడు పార్థివవంశశేఖరుం
డరిది తపంబునన్, భుజబలాతిశయంబున నీశుఁ బన్నగా
భరణుఁ బ్రసన్నుఁ జేసి, దయఁ బాశుపతాదిక దివ్యబాణముల్
హరసురరాజదేవనివహంబులచేఁ బడసెం బ్రియంబునన్. 18

ప్రతిపదార్థం: పరమ, గురు+ఉపదేశమునన్= శ్రేష్ఠ డైన గురువుయొక్క (వ్యాసుని) బోధచేత (సవర్ణదీర్ఘసంధి); పార్థివ, వంశ, శేఖరుండు= రాజవంశంలో శ్రేష్ఠ డైన; పార్థుఁడు= అర్జునుడు; అరిది, తపంబునన్= అరుదైన తపస్సుచేత; భుజ, బల+అతిశయంబునన్= బాహుబలంయొక్కగొప్పతనంచేత; పన్నగ+ఆభరణున్= పాములు ఆభరణాలుగా కలవాడిని; ఈశున్= శంకరుడిని; దయన్= దయతో; ప్రసన్నున్, చేసి= అనుగ్రహం కలవాడినిగా చేసి; పాశుపత+ఆదిక, దివ్యబాణముల్= పాశుపతం మొద లైన దివ్యా లైన బాణాలను; హర= శివుడిచేతను; సురరాజ= దేవేంద్రుడిచేతను; దేవనివహంబులచేన్= దేవతలసమూహాలచేతను; ప్రియంబునన్= ప్రీతితో; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: అత్యుత్తము డైన గురువుయొక్క ఉపదేశంచేత రాజవంశశ్రేష్ఠు డైన అర్జునుడు దుష్కర మైన తపంచేతనూ, బాహుపరాక్రమంచేతనూ, శివుడిని దయతో ప్రసన్నుడిగా చేసికొని, శంకరుడిచేతనూ, ఇంద్రుడిచేతనూ, దేవతలసమూహంచేతనూ, పాశుపతం మొదలైన దివ్యబాణాలను పొందాడు.

అక్కర. వనమునఁ బదియు రెండేఁడు లజ్ఞాతవాస మొక్కేఁడు
జనపదంబున నుండి, తపన నయ్యేండ్లు సలిపి, సద్వృత్తు
లనఘులు మును వేఁడి, కొనక మఱి భారతాజి సేయంగ
మొనసిరి, పాండవ కౌరవుల భేదమూల మిట్టిదియ. 19

ప్రతిపదార్థం: వనమునన్= అరణ్యంలో; పదియున్, రెండు+ఏఁడులు= పండ్రెండేండ్లు; అజ్ఞాతవాసము= (ఎవ్వరికీ) తెలియబడకుండేటట్లుగా వసించటం; ఒక్క+ఏఁడు= ఒకసంవత్సరం; జనపదంబునన్= గ్రామమందు, (జనాలు నివసించే ప్రదేశంలో); ఉండి= నివసించి; తపనన్= తాపంతో; ఆ+ఏండ్లు= ఆ పదమూడుసంవత్సరాలు; సలిపి= ఆచరించి; సత్+వృత్తులు= మంచినడవడికలవారు; అనఘులు= పాపరహితులు, పుణ్యాత్ములు; మును= ముందుగా; వేఁడి, కొనక= యాచించి కూడా, పొందలేక; (రాజ్యభాగ మీయుమని ప్రార్థించియు పొందజాలక; మఱి= పిమ్మట; భారత+ఆజిన్= భారతయుద్ధం; చేయంగన్= చేయటానికి; మొనసిరి= పూనుకొన్నారు; పాండవ, కౌరవుల= పాండవులకు, కౌరవులకు; భేదమూలము= వైరానికి కారణం; ఇట్టి+అది+అ= ఇటువంటిదే.

తాత్పర్యం: పన్నెండేళ్ళు అరణ్యవాసం, ఒకయేడు అజ్ఞాతవాసం జనావాసప్రదేశాలలో చేసి, దుఃఖంతో ఆ పదమూడేళ్ళు గడిపి, సద్వర్తనులు, పుణ్యాత్ములు అయిన ఆ పాండవులు మళ్ళీ రాజ్యభాగాన్ని వేడుకొని కూడ పడయజాలక భారతయుద్ధానికి తలపడ్డారు. కౌరవపాండవుల వైరానికి కారణ మిదే.

విశేషం: కౌరవపాండవుల వైరకారణాన్ని నిరూపించే నెపంతో భారతేతిహాస కథలోని ప్రధానాంశాలను చెప్పి శ్రోతలకు మహేతిహాసకథను ప్రసన్నం చేసికొనే రుచిరమార్గాన్ని నన్నయ అందించాడు. ఈఘట్టంలో భారతయుద్ధంవరకు కల కథాంశాలు చెప్పి ఆపటంవలన- కారణం చెప్పి కార్యాన్ని విస్తారంగా తెలిసికొనండి అని శ్రోతలను ప్రోత్సహించినట్లయింది. అంతేకాక ప్రథమాశ్వాసంలో సౌతి భారతయుద్ధమే భారత మన్నట్లుగా పద్దెనిమిదిరోజుల కురుక్షేత్రయుద్ధాన్ని పేర్కొన్నాడు. (చూడు: ఆది. 1.68-70). కార్యం ముందు చెప్పి కారణాన్ని తరువాత చెప్పటం కథాకథన శిల్పంలో ఒక మెలకువ. ఉత్కంఠను పోషించే వివేకం. ఇది మధ్యాక్కరయే. 2. ఇంద్రగణాలు, ఒకసూర్యగణం, మళ్ళీరెండుఇంద్రగణాలు, ఒకసూర్యగణం మొత్తం పాదానికి ఆరుగణాలు. యతిమిత్రస్థానం పంచమగణం మొదటి అక్షరం. ఇట్టి+అది= ఇట్టిది - అది యందలి అకారానికి లోపం.

వ. ఇట్టి భరతకులముఖ్యులవంశచరితానుకీర్తనంబునం జేసి యిక్కథ శ్రీమహాభారతంబునాఁ బరఁగె. 20

ప్రతిపదార్థం: ఇట్టి; భరత, కుల, ముఖ్యుల= భరతవంశంలోనిశ్రేష్ఠులయొక్క, వంశ= వంశంయొక్క, చరిత= నడవడియొక్క; (కథ) అనుకీర్తనంబునన్+చేసి= నుతించటం (చెప్పటం) వలన; ఈ+కథ= ఈ, కథ; శ్రీమహాభారతంబు, నాన్= శోభాయుక్తమైన మహాభారత మనగా; పరఁగెన్= ప్రవర్తిల్లింది, ఒప్పింది.

తాత్పర్యం: పైన పేర్కొన్న ఇటువంటి భరతవంశంలోని శ్రేష్ఠులవంశచరిత్రను చెప్పేది కాబట్టి ఈకథ శ్రీమహాభారత మనే పేరుతో ఒప్పింది.

విశేషం: అనుధాతువు తుమున్నర్థకం నాన్ - అనన్.

శా. ఆ నారాయణపాండవేయగుణమాహాత్మ్యామలజ్యోత్స్నఁ జి
త్తానందం బొనరించుచున్, జనుల కర్థాంశుప్రకాశంబుతో
మానై, సాత్యవతేయధీవనధి జన్మ శ్రీమహాభారతా
ఖ్యానాఖ్యామృతసూతి యొప్పు నిఖిలాఘధ్వాంతవిధ్వంసి యై. 21

ప్రతిపదార్థం: ఆ= శ్రీమహాభారతంలో కల; నారాయణ, పాండవేయ, గుణ, మాహాత్మ్య+అమల, జ్యోత్స్నన్= శ్రీకృష్ణుడియొక్క, పాండుకుమారులయొక్క, సుగుణాల మహిమ అనే, నిర్మల మైన వెన్నెలచేత; జనులకున్= ప్రజలకు; చిత్త+ఆనందంబు= మనస్సుయొక్క సంతోషాన్ని; ఒనరించుచున్= కలిగిస్తూ; అర్థ+అంశు, ప్రకాశంబుతోన్= (పురుషార్థాలు) అర్థాలు అనే కిరణాలకాంతితో; మాను+ఐ= మనోజ్ఞ మై; సాత్యవతేయ, ధీవనధి, జన్మ, శ్రీమహాభారత+ఆఖ్యాన+ఆఖ్యా+అమృతసూతి= సత్యవతికుమారు డైన శ్రీవ్యాసభగవానుడియొక్క బుద్ధి అనే సముద్రమందు పుట్టుక కలిగిన (జన్మించిన) సంపద్యుక్తమైన మహాభారతకథ అనే పేరు కల చంద్రుడు; నిఖిల+అఘ+ధ్వాంత+విధ్వంసి+ఐ= సకలపాపాలనే చీకట్లను నాశ మొనర్చేది అయి, ఒప్పున్= ప్రకాశిస్తుంది.

తాత్పర్యం: శ్రీకృష్ణపాండవేయుల గుణమహిమలనే నిర్మల మైన వెన్నెలచేత జనులమనసులకు ఆనందం కలిగిస్తూ, పురుషార్థా లనే కిరణాలకాంతులతో మనోజ్ఞ మౌతూ, వ్యాసభగవానుడి మేధాసముద్రంనుండి పుట్టిన చంద్రు డనే శ్రీమహాభారతకథ సకలపాపా లనే చీకట్లను నశింపచేసే దై ఒప్పుతుంది.

విశేషం: అలం: రూపకం. రూపకాలంకారం: "ఉపమానేన యత్తత్వ ముపమేయస్య రూప్యతే। గుణానాం సమతం దృష్ట్వా రూపకం నామ తద్విదుః" (భామహ కావ్యాలంకారం). చంద్రవంశజుల చరిత్ర యైన భారతాన్ని చంద్రుడిగా రూపించటం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సార్థకం. ఇందులో సావయవ రూపకం నిర్వహింపబడటంచేత చంద్రవంశచరిత్ర మహత్త్వం సమగ్రంగా నిరూపింపబడిం దనిన తాత్పర్యం వ్యంగ్యం. ఈపద్యంలో కవిప్రౌఢోక్తిసిద్ధమైన అలంకారకృత అలంకారధ్వని ఉన్నది. కవిప్రౌఢోక్తి వలన వాచ్యరూపంగా కనబడే అలంకారం వలన మరొక అలంకారం ప్రతీయమానమై చమత్కారాతిశయాన్ని కలిగిస్తే దానిని పైఅలంకారధ్వనిగా పేర్కొంటారు. ఈపద్యంలోని రూపకాలంకారం వాచ్యమైనది. అందులో ఉపమేయం మహాభారతం; ఉపమానం చంద్రుడు, ఆ రెండింటికి అభేదం చెప్పటంవలన రూపకమైనది. కాగా, అందులో ఉపమానంకంటె ఉపమేయానికే వైశిష్ట్యం కలిగే టట్లు వర్ణించటంచేత వ్యతిరేకాలంకారం ధ్వనిస్తున్నది. వాచ్య మైన రూపకాలంకారంలో కవిప్రౌఢోక్తి వలన వ్యతిరేకాలంకారం ప్రతీయమానమై చమత్కారకారి కావటంచేత ఇక్కడ అలంకారకృత అలంకారధ్వని పోషింపబడింది. (సంపా.)

ఉపరిచరవసుమహారాజు వృత్తాంతము (సం. 1-57-1)

వ. ఇట్టి శ్రీమహాభారతంబునకుం గర్త యయిన శ్రీవేదవ్యాసునిజన్మంబు సవిస్తరంబుగాఁ జెప్పెద వినుము. 22

ప్రతిపదార్థం: ఇట్టి, శ్రీమహత్, భారతంబునకున్; కర్త= నిర్మాత; శ్రీవేదవ్యాసుని= వేదాలను విభాగం చేసిన శ్రీవ్యాసుడి; జన్మంబు= పుట్టుక; సవిస్తరంబుగాన్= విపులంగా, వివరణంతోకూడి; చెప్పెదన్. వినుము.

తాత్పర్యం: మరియూ, ఇటువంటి శ్రీమహాభారతాన్ని రచించిన శ్రీవేదవ్యాసుడి జన్మగురించి వివరంగా చెపుతాను వినుము.

సీ. వాసవప్రతిముండు వసు వను నాతండు । చేదిభూనాథుండు శిష్టలోక
నుతకీర్తి మృగయావినోదార్థ మడవికిఁ । జని, యొక్కమునిజనాశ్రమమునందు
నిర్వేదమున మహానిష్ఠతో సన్న్యస్త । శస్త్రుఁ డై తప మొప్పఁ జలుపుచున్న
నాతనిపాలికి నమరగణంబుతో । నింద్రుండు వచ్చి తా నిట్టు లనియె:

ఆ. 'ధరణిఁ బ్రజఁ గరంబు దయతోడ వర్ణధ । ర్మాభిరక్షఁ జేసి యమలచరిత
నేలి, రాజ్యవిభవ మది యేల యని తప । శ్చరణ నునికి నీక చనియె ననఘ!' 23

ప్రతిపదార్థం: వాసవ, ప్రతిముండు= దేవేంద్రుడితో సమానుడు; 'వసువు' అనుఆతండు; చేది, భూనాథుండు= చేదిదేశానికి ప్రభువు; శిష్ట, లోక, నుత, కీర్తి= పండితజనంచేత పొగడబడినకీర్తి కలవాడు; మృగయా, వినోద+అర్థము= వేటయందు (అనే) వినోదంకొరకు; అడవికిన్; చని= వెళ్ళి; ఒక్క; ముని, జన+ఆశ్రమమునందున్= ఒకమునిజనులనివాసమందు; నిర్వేదమునన్= తత్త్వజ్ఞానంచేత, దుఃఖ, ఈర్ష్యాదులపట్ల కలిగే హేయత్వబుద్ధితో; మహత్+నిష్ఠతోన్= గొప్పనియమంతో; సన్న్యస్త, శస్త్రుఁడు, ఐ= వదలివేయబడిన ఆయుధాలు కలవా డై; తపము; ఒప్పన్= చక్కగా; చలుపుచున్నన్= ఆచరిస్తుండగా; ఆతని, పాలికిన్= ఆ వసువుదగ్గరికి; ఇంద్రుండు; అమరగణంబుతోన్= దేవతలసమూహంతో; వచ్చి; తాను, ఇట్టులు; అనియెన్; అనఘ!= పాపరహితుడా! వసుమహారాజా! ధరణిన్= భూమిని; ప్రజన్= ప్రజను; కరంబున్= మిక్కిలి; దయతోడన్; వర్ణ, ధర్మ+అభిరక్షన్= వర్ణాల (కులాల) యొక్క, ఆశ్రమధర్మాలయొక్క, రక్షణ, చేసి; అమల, చరితన్= నిర్మలమైన నడవడికతో; ఏలి= పాలించి; రాజ్యవిభవము= రాజ్యసంపద; అది, ఏల, అని= ఎందుకని; తపః+చరణన్= తపాన్ని ఆచరించటంలో; ఉనికి= ఉండటం; నీకున్+అ= నీకే; చనియెన్= తగింది.

తాత్పర్యం: చేదిదేశానికి ప్రభువు వసువు. అతడు దేవేంద్రతుల్యుడు, శిష్టజనవినుతుడు. ఆ రా జొకనాడు వేటనిమిత్తం అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ మున్యాశ్రమాన్ని దర్శించటంవలన అతనికి నిర్వేదం కలిగింది. ఆయుధాలను వదలివేసి ఆ రాజు మున్యాశ్రమంలో మహానిష్ఠతో తపం చేయ సాగాడు. ఒకరోజు ఇంద్రుడు ఆ రాజుదగ్గరకు వచ్చి, 'పాపరహితుడా! వర్ణాశ్రమధర్మరక్షణం చేసి ప్రజలను దయతో పరిపాలించావు. నిర్మల మైన నడవడితో రాజ్య మేలి ఈ విభవం దేనికి అని తపశ్చర్యలో ఉండటం నీకే తగింది'. నీవు తప్ప మరెవ్వరూ ఇట్లా చేయ రని భావం.

వ. 'నీవర్ణధర్మప్రతిపాలనంబునకుఁ దపంబునకు మెచ్చితి; నీవు నాతోడం జెలిమిసేసి నాయొద్దకువచ్చుచుంబోవుచు మహీరాజ్యంబు సేయుచు నుండు' మని వానికి దేవత్వంబును గనకరత్నమయం బైన దివ్యవిమానంబును నెద్దాని నేని తాల్చిన నాయుధంబులు దాఁక నోడు నట్టి వాడని వనజంబులు గలిగిన యింద్రమాల యను కమలమాలికయును, దుష్టనిగ్రహశిష్టపరిపాలనక్షమం బైన యొక్కవేణుయష్టియు నిచ్చిన, నవ్వసువును దవ్విమానారూఢుం డై యుపరిలోకంబునం జరించుటంజేసి యుపరిచరుండు నాఁ బరఁగి, యక్కమల మాలికయుఁ దనకుం జిహ్నంబుగా నవ్వేణుయష్టికి మహావిభవంబు సేయుచు, మెఱసి యేఁటేఁట నింద్రోత్సవం బను నుత్సవంబు సేయుచు నీశ్వరునకు నింద్రాదిదేవతలకు నతిప్రీతి సేసె; నది మొదలుగా రాజులెల్లం బ్రతిసంవత్సరంబు నింద్రోత్సవంబు సేయుచుండుదురు. 24

ప్రతిపదార్థం: నీ వర్ణ, ధర్మ ప్రతిపాలనంబునకున్= నీయొక్క వర్ణధర్మాల పరిపాలనకు (పోషణకును); తపంబునకున్; మెచ్చితిన్; నీవు; నాతోడన్; చెలిమి= స్నేహం; చేసి; నా ఒద్దకున్= నాదగ్గరకు; వచ్చుచున్, పోవుచున్= రాకపోకలు సాగిస్తూ; మహీ, రాజ్యంబు= భూపరిపాలనం; చేయుచున్, ఉండుము; అని; వానికిన్= ఆ వసువుకు; దివ్యత్వంబును= దేవతాభావాన్ని, కనకరత్నమయంబు= బంగారంతోను, రత్నాలతోను నిండింది; అయిన; దివ్యవిమానంబును= దేవతాసంబంధ మైన విమానాన్ని; ఏ+దానిన్+ఏని= దేనిని; తాల్చినన్= ధరించిన; ఆయుధంబులు; తాఁకన్+ఓడున్= ఆయుధాలు తగిలేందుకు భయపడతాయో, (తాకలేవో); అట్టి= అటువంటి; వాడని= వాడిపోని; వనజంబులు= పద్మాలు; కలిగిన; ఇంద్రమాల= ఇంద్రమాల అనే పేరు కలిగిన; కమలమాలికయును= పద్మాలదండయున్నూ; దుష్ట, నిగ్రహ= దుష్టులను అణచటంలోనూ; శిష్ట, పరిపాలన= ఉత్తములైనవారిని పాలించటంలోనూ; క్షమంబు+ఐన= సమర్థమైన; ఒక్క, వేణు, యష్టియున్= వెదురుకర్రనూ; ఇచ్చినన్= ఇవ్వగా; ఆ+వసువును= ఆ వసురాజుకూడ తద్= విమాన+ఆరూఢుండు+ఐ= ఆ విమానాన్ని ఎక్కినవా డై, ఉపరిలోకంబునన్= ఊర్ధ్వలోకమందు; చరించుటన్+చేసి= సంచరించుటచేత; ఉపరిచరుండు, నాన్= ఉపరిచరుడు, (పైలోకంలో తిరిగేవాడు), అనఁగాన్; పరఁగి= ప్రసిద్ధినిపొంది; ఆ+కమలమాలికయున్= ఆ పద్మమాలయు; తనకున్, చిహ్నంబుగాన్= తనకుగుర్తుగా; ఆ+వేణుయష్టికిన్; మహావిభవంబుసేయుచున్, మెఱసి= గొప్పవైభవంచేస్తూ, ప్రకాశించేటట్లు చేసి; ఏఁటేఁటన్= ప్రతిసంవత్సరం; ఇంద్ర+ఉత్సవంబు+అను; ఉత్సవంబు= ఇంద్రోత్సవ మనే పేరు కలిగిన వేడుకను; చేయుచున్; ఈశ్వరునకున్= శివుడికి; ఇంద్ర+ఆది, దేవతలకున్= ఇంద్రుడు మొదలైన దేవతలకు; అతి, ప్రీతి= మిక్కిలి సంతృప్తి; చేసెన్; అది మొదలుగాన్= ఆ నాటినుండి; రాజులు+ఎల్లన్= రాజులందరు; ప్రతిసంవత్సరంబున్; ఇంద్ర+ఉత్సవంబు, చేయుచున్+ఉండుదురు.

తాత్పర్యం: 'నీ వర్ణాశ్రమధర్మపరిపాలనకు, తపస్సుకు మెచ్చుకొంటున్నాను. నీవు నాతో స్నేహం చేసి నావద్దకు వస్తూ పోతూ రాజ్యపాలనం చేస్తూ ఉండు' మని పలికి అతనికి దివ్యత్వాన్నీ, మణిసువర్ణమయమైన దివ్యవిమానాన్నీ, ఎటువంటి ఆయుధాలను తాకనివ్వని (ఎటువంటి ఆయుధాలు తాకలేని) వాడిపోనిపద్మాలు కల ఇంద్రమాల అనే పద్మమాలనూ, దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు సమర్థ మైన వేణుయష్టినీ ఇచ్చాడు. ఆ వసురాజు ఆ విమానాన్ని ఎక్కి

పైలోకంలో చరిస్తుండటంచేత ఉపరిచరుడు అనే పేరుతో ఒప్పి, ఆ ఇంద్రమాలిక తనకు గుర్తుగా, వేణుయష్టికి గొప్పవైభవంతో ఏటేటా ఇంద్రోత్సవాన్ని జరిపిస్తూ ఈశ్వరుడికి, ఇంద్రాదిదేవతలకు సంతోషాన్ని చేకూర్చాడు. నాటినుండీ రాజులందరూ ప్రతిసంవత్సరం ఇంద్రోత్సవాన్ని జరుపుతున్నారు.

విశేషం: మెఱయుధాతువు అంతర్భావిప్రేరణము. మెఱయునట్లు చేయు. ఇంద్రోత్సవము= ఇంద్రునిగౌరవార్థ మై రాజులేటేటా చేసే ఉత్సవం.

క. ఘనముగ నయ్యింద్రోత్సవ । మొనరించు మహీపతులకు నొగి నాయుర్వ
ర్ధనము నగుఁ, బెరుఁగు సంతతి, । యనవరతము ధరణిఁ బ్రజకు నభివృద్ధి యగున్. 25

ప్రతిపదార్థం: ఘనముగన్= గొప్పగా; ఆ+ఇంద్ర+ఉత్సవము= ఆ ఇంద్రోత్సవం; ఒనరించు= చేసే; మహీపతులకున్= రాజులకు; ఒగిన్= క్రమంగా; ఆయున్, వర్ధనమున్= జీవితకాలం పెరగటం; అగున్= ఔతుంది; సంతతి= సంతానం, (పుత్రపౌత్రపారంపర్యం); పెరుఁగున్= అభివృద్ధి అవుతుంది (జరుగుతుంది); ధరణిన్= భూమియందు; ప్రజకున్= జనాలకు, అభివృద్ధి= పెంపు; అగున్= ఔతుంది.

తాత్పర్యం: ఆ ఇంద్రోత్సవాన్ని వైభవంగా చేసే రాజులకు ఆయువు పెరుగుతుంది; సంతతి వృద్ధి చెందుతుంది. అతని రాజ్యంలోనిప్రజకు ఎల్లప్పుడూ అభివృద్ధి జరుగుతుంది.

వ. అట్టియింద్రోత్సవంబున నతిప్రీతుండయిన యింద్రువరంబున నుపరిచరుండు బృహద్రథ మణివాహన సౌబల యదురాజన్యు లనియెడి కొడుకుల నేవురం బడసి, వారలం బెక్కుదేశంబుల కభిషిక్తులం జేసిన, నయ్యేవురువాసవులు వేఱువేఱ వంశకరు లయి పరఁగి; ర ట్లుపరిచరుండు లబ్ధసంతానుం డయి రాజర్షి యయి రాజ్యంబు సేయుచు, నిజపురసమీపంబునం బాఱిన శుక్తిమతి యను మహానదిం గోలాహలం బనుపర్వతంబు గామించి యడ్డంబు వడిన, దానిం దనపాదంబునం జేసి తలఁగంద్రోచిన, నన్నదికిఁ బర్వతసమాగమంబున వసుపదుం డను కొడుకును గిరిక యను కూఁతురుం బుట్టిన, నయ్యిరువురను శుక్తిమతి దద్దయు భక్తిమతి యై గిరినిరోధంబు బాచి యుపకారంబు సేసిన యుపరిచరునకు మెచ్చి కానిక యిచ్చిన, నాతండు వసుపదుం దనకు సేనాపతిం జేసికొని, గిరికం దనక ధర్మపత్నిగాఁ జేసికొని యున్నంత, నగ్గిరిక ఋతుమతి యయిన, దీనికి మృగమాంసంబు దెచ్చి పెట్టు మని తనపితృదేవతలు పంచిన, నప్పు డయ్యుపరిచరుండు మృగవధార్థంబు వనంబున కరిగి. 26

ప్రతిపదార్థం: అట్టి; ఇంద్రోత్సవంబునన్; అతిప్రీతుండు+అయిన= మిక్కిలిసంతోషించినవా డైన; ఇంద్రు= దేవేంద్రుడియొక్క; వరంబునన్; ఉపరిచరుండు; బృహద్రథుడు, మణివాహనుడు, సౌబలుడు, యదువు, రాజన్యుడు అనే పేరు గల; కొడుకులను; ఏవురన్= ఐదుగురిని; పడసి= పొంది; వారలన్; పెక్కుదేశంబులకున్; అభిషిక్తులన్+చేసినన్= అభిషేకించబడినవారిని (ప్రభువులను) చేయగా; ఆ+ఏవురు; వాసవులు= ఆ అయిదుగురు వసునందనులు; వేఱువేఱ; వంశకరులు+అయి= వంశాన్ని వృద్ధిచేసేవా రై; పరఁగిరి= ప్రసిద్ధిచెందారు. అట్లు; ఉపరిచరుండు; లబ్ధసంతానుండు+అయి= పొందినసంతానం కలవాడై; రాజ+ఋషి+అయి= రాజులలో ఋషివంటివా డై; రాజ్యంబు, చేయుచున్, నిజపురసమీపంబునన్= తనపట్టణానికి దగ్గరగా; పాఱిన= ప్రవహించిన; శుక్తిమతి, అను మహానదిన్; కోలాహలంబు+అను, పర్వతంబు; కామించి= మోహించి; అడ్డంబు+పడినన్= అడ్డుపడగా;

దానిన్= ఆ పర్వతాన్ని; తనపాదంబునన్+చేసి= తనకాలితో; తలఁగన్+త్రోచినన్= తొలగిపోయేటట్లుగా నెట్టివేయగా; ఆ+నదికిన్= ఆ ఏటికి; పర్వతసమాగమంబునన్= పర్వతంయొక్క కలయికచేత; వసుపదుండు; అనుకొడుకును; గిరిక అనుకూఁతురున్; పుట్టినన్; ఆ+ఇరువురును= ఆ ఇద్దరిని; శుక్తిమతి; తద్దయున్= మిక్కిలి; భక్తిమతి, ఐ= భక్తితో కూడిన మనస్సుగల దై; గిరినిరోధంబు= పర్వతంయొక్క అడ్డుపాటు; పాచి= తొలగించి; ఉపకారంబు, చేసిన; ఉపరిచరునకున్, మెచ్చి; కానిక= కానుక; ఇచ్చినన్; ఆతండు= ఆ ఉపరిచరుడు; వసుపదున్= వసుపదు డనే పేరు గల శుక్తిమతీకోలాహలు లకుమారుడిని; సేనాపతిన్; చేసికొని; గిరికన్= శుక్తిమతీకోలాహలులకుమార్తెను; తనకున్; ధర్మపత్నిగాన్= పట్టమహిషిగా; చేసికొని= స్వీకరించి; ఉన్న+అంతన్= ఉండగా: ఆ+గిరిక= ఆ గిరిక (ఉపరిచరుని రాజ్ఞి); ఋతుమతి= పుష్పవతి; అయినన్; దీనికిన్= ఈమెకు; మృగమాంసంబు= లేడిమాంసము; తెచ్చి పెట్టుము; అని; తన; పితృదేవతలు; పంచినన్= ఆజ్ఞాపించగా; అప్పుడు; ఆ+ఉపరిచరుండు; మృగవధ+అర్థంబు= జింకలను వధించుటకొఱకు; వనంబునకున్; అరిగి= వెళ్ళి.

తాత్పర్యం: ఉపరిచరుడు జరిపించిన ఇంద్రోత్సవాలకు దేవేంద్రు డెంతో సంతోషించాడు. ఇంద్రునివరంవలన ఉపరిచరుడికి బృహద్రథుడు, మణివాహనుడు, సౌబలుడు, యదువు, రాజన్యుడు అనే అయిదుగురుకుమారులు జన్మించారు. ఆ అయిదుగురు అనేకదేశాలకు అధిపతు లైనారు. వంశం అభివృద్ధి కావించారు. ఈవిధంగా ఉపరిచరుడు సంతానాన్ని పొంది, రాజర్షి అయి రాజ్యపాలనం చేస్తుండగా, ఆతడినగరసమీపంలో శుక్తిమతి అనేనదిని కామించి కోలాహలంఅనేపర్వతం ఆ నదిని అడ్డగించగా, ఉపరిచరుడు ఆపర్వతాన్ని తనకాలితో తొలగించాడు. పర్వతసంపర్కంచేత ఆ నదికి వసుపదు డనే కుమారుడు, గిరిక అనే కుమార్తె జన్మించారు. శుక్తిమతీనది ఉపరిచరుడికి కృతజ్ఞతగా, తనకొడుకైనవసుపదుడినీ, కూతురైన గిరికనూ కానుకగా ఇచ్చింది. ఆ రాజు వసుపదుడిని తనసేనాపతిగా గిరికను ధర్మపత్నిగా చేసికొన్నాడు. గిరిక ఋతుమతి అయింది. ఆమెకు మృగమాంసం తెచ్చిపెట్టుమని పితృదేవతలు ఆజ్ఞాపించగా, ఉపరిచరుడు మృగాలను వేటాడి ఆమెకు మృగమాంసం తెచ్చి పెట్టటానికి అడవికి వెళ్ళాడు.

సీ. పలుకులముద్దును, గలికిక్రాల్గన్నుల । తెలివును, వలుఁదచన్నులబెడంగు,
నలఘుకాంచీపదస్థలములయొప్పును । లలితాననేందుమండలము రుచియు,
నళినీలకుటిలకుంతలములకాంతియు, । నెలజవ్వనంబున విలసనమును,
నలసభావంబునఁ బొలుపును, మెలుపును । గలుగు నగ్గిరికను దలఁచి తలఁచి,

ఆ. ముదితయందుఁ దనదు హృదయంబు నిలుపుటఁ । జేసి రాగ మదర భాసురముగ
రమణతో వనాంతరమున రేతస్స్కంద । మయ్యె నవనిపతికి నెయ్య మొనర. 27

ప్రతిపదార్థం: పలుకులముద్దును= మాటలయొక్క మనోజ్ఞతయున్నూ; కలికిక్రాల్గన్నుల= మనోజ్ఞాలై చలించే కన్నులయొక్క; తెలివును= తెల్లదనమున్నూ; వలుఁదచన్నులబెడంగు= స్థూలా లైన కుచముల సొగసున్నూ; అలఘు, కాంచీపద, స్థలముల= విశాలాలైన పిరుదుప్రదేశాలయొక్క; ఒప్పును= అందమున్నూ; లలిత+ఆనన+ఇందుమండలము= మృదు వైన ముఖచంద్రబింబము యొక్క; రుచియున్= కాంతియున్నూ; అళినీలకుటిలకుంతలముల= తుమ్మెదలవలె నల్లనివి, వంకరలైన శిరోజాలయొక్క; కాంతియున్= వన్నెయూ; ఎలజవ్వనంబున= లేతయౌవనంలోని; విలసనమును= ప్రకాశమున్నూ; అలసభావంబునన్= మందత్వమందలి పొలుపును= అందమున్నూ; మెలుపును= జాగరూకతయున్నూ; కలుగు= ఉన్నటువంటి; ఆ+గిరికను= ఆ గిరికను; తలఁచి తలఁచి= భావించి భావించి; ముదితయందున్= ఆ గిరికయందే; తనదు; హృదయంబు=

మనస్సు, నిలుపుటన్, చేసి= నిలిపినందువలన; రాగము= అనురాగం; అడరన్= అతిశయించగా; భాసురముగన్= ప్రకాశించునదిగా; రమణతోన్= ప్రీతితో; వన+అంతరమునన్= అడవియందు; రేతస్+స్కందము= ఇంద్రియస్రావం; నెయ్యము+ఒనరన్= ప్రీతి ఒప్పునట్లుగా; అవనిపతికిన్= ఉపరిచరునకు; అయ్యెన్= ఆయెను. (అయింది).

తాత్పర్యం: ఆ గిరికముద్దుపలుకులను, అంద మైన కన్నులను, వక్షోజాలసోయగాన్ని, పిరుదులఒప్పును, చంద్రబింబంవంటిముఖసౌందర్యాన్ని, తుమ్మెదలవలె నల్లనైన, వంకరయైన శిరోజాలసౌభాగ్యాన్ని, నవయౌవన విలాసాలను, అలస విలాసాల అందచందాలను ఉపరిచరుడు తలచుకొని, తలచుకొని గిరికాలగ్నమనస్కు డై ఆ వనమధ్యంలో రేతస్స్ఖలన మొనర్చాడు.

విశేషం: అలం: ఉపమ. స్వభావోక్తి. వస్తువులో, వర్ణనలో, రచనలో ఈపద్యం ఒక విశిష్టమైనది. నాయికా స్వరూప సౌందర్యవిలాసాలను సాక్షాత్తుగా చూస్తున్నట్లుగా తన్మయత్వంతో భావించి ఆమెతో సంగమించినప్పుడు పొందే రేతస్స్ఖలనాన్ని వసురాజు పొందాడు. ఇటువంటి వస్తువే అరుదు. వర్ణనంలో సీసమంతా స్వభావోక్తితో నిండిఉన్నది. ఎడనెడ ఉపమ మెరుగుపెట్టింది. ఉపమ స్వభావోక్తికే పోషకంగా నిలిచింది. భౌతికరూపభావనం వలన భౌతికమైన ఇంద్రియస్ఖలనం కలిగినట్లు వర్ణించేటప్పుడు స్వభావోక్తియే సముచితం. ఇక పద్యరచనలో లఘుబహుళ మైన అక్షరరమ్యత గోచరిస్తుంది. అది వసురాజుయొక్క రతిభావతీవ్రతను ధ్వనిస్తున్నది. ఇందులో గిరికాదేవి విలాసాలను భావించిన వసురాజును నన్నయ వర్ణించి నప్పటికీ అతడు పొందింది రసానుభూతిగా కాక, భౌతికానుభూతిగా పేర్కొనటంచేత- అలంకారం, రసభావాలూ వస్తువునే ధ్వనిస్తున్నాయి. అంటే- అలంకార రసధ్వనులు వస్తుధ్వనిని పోషించే విశిష్టరచన ఈపద్యం. (సంపా.)

వ. అయ్యమోఘవీర్యం బొక్కయజీర్ణపర్ణపుటంబున నిమ్ముగా సంగ్రహించి యొక్కడేగయఱుతంగట్టి దీనిం గొనిపోయి గిరికకిమ్మని యుపరిచరుండు పనిచిన, నదియు నతిత్వరితగతి నాకానం గడచి యాకాశంబునం బఱచునప్పుడు. **28**

ప్రతిపదార్థం: ఆ+అమోఘవీర్యంబు= ఆ ఉపరిచరుని వ్యర్థం కాని రేతస్సు; ఒక్క; అజీర్ణపర్ణపుటంబునన్= చిరిగిపోని (చిరుగులేని, చిరగని) ఆకుదొప్పలో; ఇమ్ముగాన్= చక్కగా; సంగ్రహించి= పదిలపరిచి; ఒక్కడేగ, అఱుతన్= ఒకడేగయొక్క మెడకు; కట్టి; దీనిన్= ఈ ఆకుదొప్పను; కొనిపోయి; గిరికకున్; ఇమ్ము; అని; ఉపరిచరుండు= వసురాజు; పనిచినన్= పంపగా; అదియున్= ఆ డేగయు; అతిత్వరితగతిన్= మిక్కిలిశీఘ్ర మైన పోకడతో; ఆ కానన్= ఆ అడవిని; కడచి= దాటి; ఆకాశంబునన్; పఱచు+అప్పుడు= పరుగిడుతున్నప్పుడు (ఎగిరిపోతున్నప్పుడు).

తాత్పర్యం: అమోఘ మైన ఆ వీర్యాన్ని ఒక చిరగని ఆకుదొప్పలో చేర్చి, దానిని ఒకడేగమెడకు కట్టి, దీనిని తీసికొని వెళ్ళి గిరికకు ఇమ్మని ఉపరిచరుడు పంపాడు. ఆ డేగ మహావేగంతో ఆ అడవిని దాటి ఆకాశంలో ఎగురుతున్నప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'అమోఘవీర్యం' అనేపదం సార్థకం. భావికథార్థవ్యంజకం. వ్యర్థంకానిది, మహిమాన్విత మైనది అని అమోఘశబ్దం ధ్వనింపజేస్తున్నది. అది ఎవరు ఉపయోగించినా సంతానాన్ని కలిగించేది అనీ, ఏదోవిధంగా అది సంతానకారక మౌతుందనీ అర్థం స్ఫురిస్తుంది. పితృదేవతలు కోరినట్లు గిరిక లేడిమాంసం తినకపూర్వమే ఆ వీర్యం ఆమెయందు వినియోగపడదని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కథార్థాలు సూచిస్తున్నాయి. గిరిక కొరకు ఉద్దిష్టమైన వసువీర్యం నదిలోపడి, చేపమ్రింగి, కవలపుట్టుకకు దారితీస్తుంది. ఆ కవలలో ఒకతె అయిన మత్స్యగంధి వ్యాసుడికి తల్లి అవుతుంది. అంటే వ్యాసోత్పత్తికి బీజన్యాసం ఈ అమోఘవీర్యం.

క. ఆమిష మని దానిం గొనఁ । గా మది సమకట్టి, యొక్కఖగ మాఖగమున్
వ్యోమమునఁ దాఁక, దివిసం । గ్రామం బారెంటి కయ్యెఁ గడురభసమునన్. 29

ప్రతిపదార్థం: ఆమిషము+అని= మాంస మని భావించి; దానిని= ఆ ఆకుదొప్పలో ఉన్నదానిని; కొనఁగాన్= తీసికొనేందుకు; మదిన్= మనస్సులో; సమకట్టి= పూనుకొని; ఒక్కఖగము= ఒకపక్షి; ఆ ఖగమున్= ఆ డేగను; వ్యోమమునన్= ఆకాశంలో; తాఁకన్= ఎదుర్కోఁగా; ఆరెంటికిన్= ఆ రెండుపక్షులకు; దివిన్= ఆకాశంలో; కడురభసమునన్= మిక్కిలివేగంగా; సంగ్రామంబు= యుద్ధం; అయ్యెన్= జరిగింది.

తాత్పర్యం: అది మాంస మని భావించి, దానిని అపహరించేందుకు పూనుకొన్న ఒక డేగ ఆ డేగను ఆకాశంలో ఎదుర్కొన్నది. ఆ రెంటికీ తత్క్షణమే ఆకాశంలో యుద్ధం జరిగింది.

క. సునిశితతుండహతిని వ్ర । స్సినపర్ణపుటంబు వాసి చెదరుచు నృపనం
దనువీర్యము యమునానది । వనమధ్యమునందు వాయువశమునఁ బడియెన్. 30

ప్రతిపదార్థం: సునిశితతుండహతిని= మిక్కిలిపదు నైన ముక్కుదెబ్బచేత; వ్రస్సిన= తెగిన; పర్ణపుటంబు= ఆకుదొప్ప; పాసి= వీడిపోయి; చెదరుచున్; నృపనందనువీర్యము= ఆ వసురాజుయొక్కరేతస్సు; యమునానది; వనమధ్యమునందున్= నీటిమధ్యలో (నడుమ); వాయువశమునన్= గాలికి లోబడి; పడియెన్.

తాత్పర్యం: మిక్కిలిపదు నైన పక్షిముక్కుయొక్క దెబ్బచేత ఆ ఆకుదొప్ప చెదరిపోయి, వసురాజువీర్యం యమునానదినీటిమధ్యలో గాలివాటున పడిపోయింది.

వ. తొల్లి బ్రహ్మశాపనిమిత్తంబున నద్రిక యను నప్సరస యమునయందు మీ నయి క్రుమ్మరుచున్నయది యవ్వసువీర్యబిందుద్వయంబు త్రావి గర్భంబు దాల్చిన దశమమాసంబునందు. 31

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; బ్రహ్మ, శాపనిమిత్తంబునన్= బ్రహ్మదేవుడిశాపకారణంగా; అద్రిక, అను, అప్సరస, యమునయందున్; మీను+అయి= చేప అయి; క్రుమ్మరుచున్+ఉన్న+అది= తిరుగుతున్నది; ఆ+వసువీర్యబిందుద్వయంబు= ఆ వసురాజుయొక్క వీర్యపుబొట్లను రెంటిని; త్రావి= త్రాగి; గర్భంబు తాల్చిన; దశమమాసంబునందున్= పదవనెలలో.

తాత్పర్యం: పూర్వం బ్రహ్మశాపంవలన అద్రిక అనే అప్సరస యమునానదిలో చేపగా మారి తిరుగాడుతున్నది. ఆ చేప ఆ వసురాజు వీర్యబిందువులు రెంటిని త్రాగి గర్భం ధరించింది. పదవనెలలో.

తే. తెరలవల వైచి జాలరుల్ దిగిచి, దాని । యుదరదళనంబు సేసి, యం దొక్కకొడుకు
నొక్కకూఁతును గని, వారి నొనరఁ దెచ్చి । దాశరాజున కిచ్చిరి తత్క్షణంబ. 32

ప్రతిపదార్థం: తెరలవలలు= మఱుగువలలను; వైచి= వేసి; జాలరుల్= చేపలుపట్టేవాళ్ళు; తిగిచి= లాగి; దాని, ఉదరదళనంబు, చేసి= ఆ చేపయొక్కపొట్టను పగులగొట్టి (చీల్చి); అందున్+ఒక్క కొడుకున్, ఒక్క, కూఁతును= ఆ చేపపొట్టలో ఒక

కుమారుడిని, ఒక కూతురును; కని= చూచి; వారిని= వారిద్దరిని; ఒనరన్= చక్కగా; తెచ్చి; తద్క్షణంబు+అ= వెంటనే; దాశరాజునకున్+ఇచ్చిరి.

తాత్పర్యం: జాలరులు మరుగువలలు వేసి, ఆ చేపను లాగి, దానికడుపును చీల్చి అందులో ఒకకొడుకును, కూతురును కనుగొని, వారిని భద్రంగా తెచ్చి వెంటనే దాశరాజున కిచ్చారు.

మత్స్యగంధి వృత్తాంతము (సం. 1-57-50)

వ. అయ్యద్రికయు మానుషప్రసవం బొనరించినం దనకు శాపమోక్షణం బగు నని బ్రహ్మవచనంబు గలుగుటంజేసి మీనయోని విడిచి, దివ్యవనిత యయి దేవలోకంబునకుం జనియె; మఱియును మత్స్యోదరంబునం బుట్టిన యక్కొడుకు మత్స్యరాజునాఁ బరఁగి, ధర్మపరుం డయి మత్స్యదేశంబున కధిపతి య య్యెఁ; నక్కూఁతును దాశరాజు దనకూఁతుంగాఁ జేకొని పెంచినం బెరుఁగుచు. 33

ప్రతిపదార్థం: ఆ+అద్రికయున్= అద్రిక అనే పేరు కలిగిన ఆ అప్సరసయును; మానుషప్రసవంబు= మానవుడిని కనటం; ఒనరించినన్= చేసినట్లయితే; తనకున్; శాపమోక్షణంబు+అగున్= శాపంనుండి తొలగటమౌతుంది; అని; బ్రహ్మవచనంబు= బ్రహ్మదేవునియొక్కవాక్కు; కలుగుటన్+చేసి= కలిగినందువలన; మీనయోనిన్= చేపగర్భం; విడిచి; దివ్యవనిత+అయి= దేవతాస్త్రీ అయి; దేవలోకంబునకున్; చనియెన్; మఱియును; మత్స్య+ఉదరంబునన్= చేపకడుపులో; పుట్టిన; ఆ+కొడుకు; మత్స్యరాజు నాన్= మత్స్యరాజుఅనే పేరుకలవాడై; పరఁగి= ప్రసిద్ధిచెంది; ధర్మపరుండు+అయి= ధర్మమం దాసక్తికలవా డై; మత్స్యదేశంబునకున్; అధిపతి+అయ్యెన్= రాజయ్యాడు; దాశరాజు; ఆ+కూఁతును= ఆ ఆడపిల్లను; తనకూఁతున్+కాన్+చేసికొని= తనకుమార్తెగా చేసికొని; చేకొని= స్వీకరించి; పెంచినన్= పెంచగా; పెరుఁగుచున్= అభివృద్ధిచెందుతూ.

తాత్పర్యం: అద్రిక అనే పేరు కలిగిన ఆ అప్సరస మనుష్యులను కంటే తనకు శాపం తీరిపోతుం దని బ్రహ్మ చెప్పినందువలన మత్స్యగర్భాన్ని విడిచి దివ్యవనితగా మారి దేవలోకానికి వెళ్ళిపోయింది. చేపకడుపున పుట్టిన ఆ కుమారుడు మత్స్యరాజనే పేరుతో ప్రసిద్ధుడై మత్స్యదేశానికి రాజైనాడు. ఆ ఆడపిల్లను దాశరాజు తనకూతురుగా చేసికొని పెంచుతుండగా ఆమె వృద్ధి చెందుతూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అంబుజముఖి యక్కన్య ప్రి । యం బొనరఁగ మత్స్యగంది యనఁగా ధర్మా
ర్థంబుగఁ దనతండ్రి నియో । గంబున నయ్యమున నోడఁ గడపుచు నుండెన్. 34

ప్రతిపదార్థం: అంబుజముఖి= పద్మంవంటి ముఖం గల; ఆ+కన్య= ఆ బాలిక; ప్రియంబు+ఒనరఁగన్= ప్రేమ కలిగేటట్లుగా; మత్స్యగంధి+అనఁగాన్= మత్స్యగంధి (చేపలవాసన కలది) అనే పేరుతో; ధర్మ+అర్థంబుగన్= ధర్మంకొరకు; తండ్రినియోగంబునన్= తండ్రియైన దాశరాజుయొక్క ఆజ్ఞతో; ఆ+యమునన్= ఆయమునానదిలో; ఓడన్= నావను; కడపుచున్+ఉండెన్= నడుపుతూ ఉన్నది.

తాత్పర్యం: పద్మంవంటి చక్కటిముఖం గల ఆ కన్య మత్స్యగంధి అనేపేరుగలదై, తనతండ్రి ఆజ్ఞచొప్పున యమునానదిలో ఓడ నడుపుతున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అంత. **35**

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట.

తాత్పర్యం: పిమ్మట.

చ. గతమదమత్సరుండు, త్రిజగద్వినుతుండు, వసిష్ఠపౌత్త్రుఁ డు
న్నతమతి, శక్తిపుత్త్రుఁ, డఘనాశనఘోరతపోధనుండు, సు
వ్రతుఁ డయి తీర్థయాత్ర చనువాఁడు, పరాశరుఁ డన్మునీంద్రుఁ డ
య్యతివఁ దలోదరిం గనియె నయ్యమునానది యోడరేవునన్. **36**

ప్రతిపదార్థం: గత, మద, మత్సరుండు= గతించిన మదం, మాత్సర్యం కలవాడు, అంటే మదమాత్సర్యాలు లేనివాడు; త్రిజగత్+వినుతుండు= ముల్లోకాలచేత పొగడబడినవాడు; వసిష్ఠపౌత్త్రుఁడు= వసిష్ఠమహామునియొక్క పుత్రుడిపుత్రుడు; ఉన్నతమతి= పెద్దమనస్సుకలవాడు; శక్తిపుత్త్రుఁడు= శక్తిమహామునికుమారుడు; అఘ, నాశన, ఘోర, తపస్+ధనుండు= పాపాన్ని నశింపజేసేటటువంటి భయంకర మైన తపస్సే ధనంగా కలవాడు; సువ్రతుఁడు= చక్కనిపుణ్యకర్మలు కలవాడు; అయి; తీర్థయాత్ర= పుణ్యక్షేత్రానికి ప్రయాణం; చనువాఁడు= వెళ్ళేవాడు; పరాశరుఁడు+అన్= పరాశరు డనే పేరు కలిగిన; మునీంద్రుఁడు= మునిశ్రేష్ఠుడు; ఆ+యమునానది+ఓడరేవునన్= ఆ యమునానదిలో ఓడలు ఆగేచోట; తలోదరిన్= సన్నని ఉదరం గల దైన; ఆ, అతివన్= ఆ స్త్రీని (మత్స్యగంధిని); కనియెన్= చూశాడు.

తాత్పర్యం: మదమాత్సర్యాలు లేని సాధుశీలి, ముల్లోకాలచేత పొగడ్తల నందుకొన్నవాడు, విశాలహృదయుడు, పాపాలను నశింపచేసే మహాతపస్సంపన్నుడు, వ్రతనిష్ఠ గలవాడు, వసిష్ఠుడికి పౌత్రుడు, శక్తిమహామునికి పుత్రుడు అయిన పరాశరు డనే పేరు గల మునీంద్రుడు తీర్థయాత్రకు వెళుతూ యమునానదిఓడరేవులో ఆ మత్స్యగంధిని చూచాడు.

విశేషం: పరాశరుడిపుత్రుడే వ్యాసభగవానుడు. వ్యాసమహర్షివంశవృక్ష మిది. "వ్యాసం వసిష్ఠ నప్తారం శక్తేఃపౌత్ర మకల్మషమ్ । పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్" ॥ వసిష్ఠుడిమునిమనుమడు, శక్తిమహాముని పౌత్రుడు, పరాశరుడికుమారుడు, శుకుడికి తండ్రి యైనవాడు వ్యాసుడు. అంటే: వసిష్ఠుడిపుత్రుడు శక్తిమహాముని; శక్తిపుత్రుడు పరాశరుడు; పరాశరుడిపుత్రుడు వ్యాసుడు. వ్యాసుడికుమారుడు శుకమహర్షి.

వ. ఇట్లేకతంబ యేకవస్త్ర యై యోడ నెక్కవచ్చువారి నిరీక్షించుచున్న సత్యవతిం జూచి యా మునివరుండు దానియందు మదనపరవశుం డై దానిజన్మంబు దన దివ్యజ్ఞానంబున నెఱింగి, యయ్యోడ యెక్కి దానితో నొక్కటఁ జని చని. **37**

ప్రతిపదార్థం: ఇట్లు; ఏకతంబు+అ= ఒంటరిగానే; ఏకవస్త్ర+ఐ= ఒకేవస్త్రం గలదై; ఓడను ఎక్క వచ్చువారిన్; నిరీక్షించుచున్+ఉన్న= ఎదురుచూస్తున్న; సత్యవతిన్= మత్స్యగంధిని; చూచి; ఆ మునివరుండు= మునిశ్రేష్ఠు డైన ఆ పరాశరుడు; దానియందున్= ఆ మత్స్యగంధియందు; మదనపరవశుండు+ఐ= మన్మథుడికి లొంగినవా డై; దానిజన్మంబు= ఆ మత్స్యగంధి పుట్టుకను; తన; దివ్యజ్ఞానంబునన్= అలౌకిక మైన జ్ఞానంతో; ఎఱింగి; ఆ+ఓడ= ఆ ఓడను; ఎక్కి; దానితోన్= ఆ సత్యవతితో; ఒక్కటన్+చని= వెంబడివెళ్ళి; చని.

తాత్పర్యం: ఇట్లా ఒంటరిగా ఒకేవస్త్రం ధరించింద్రై ఓడ నెక్కేందుకు వచ్చేవారికోసం వేచిఉన్న మత్స్యగంధిని పరాశరుడు చూచి, మోహించి, తన దివ్యజ్ఞానంచేత ఆమెజన్మవృత్తాంతాన్ని గ్రహించి, ఆమెతోపాటు పోయి పోయి.

సీ. చపలాక్షిచూపులచాడ్పున కెడ మెచ్చుఁ, । జిక్కనిచనుఁగవఁ జీఱఁ గోరు,
నన్నువకౌఁదీగ యందంబు మది నిల్పు, । జఘనచక్రంబుపైఁ జలుపు దృష్టి,
యభిలాష మేర్పడు నట్లుండఁగాఁ బల్కు, । వేడ్కతో మఱుమాట వినఁగఁ దివురు,
నతిఘనలజ్జావనత యగు నక్కన్య । పైఁ బడి లజ్జయుఁ బాపఁ గడఁగు

ఆ. నెంతశాంతు లయ్యు, నెంత జితేంద్రియు । లయ్యు, గడువివిక్త మయినచోట
సతులగోష్ఠిఁ జిత్తచలన మొందుదు; రెందుఁ । గాముశక్తి నోర్వఁగలరె జనులు. 38

ప్రతిపదార్థం: చపలాక్షి= చంచలా లైన చూపులు కల ఆ మత్స్యగంధియొక్క; చూపుల, చాడ్పునకున్= చూపులవిధానానికి; ఎడన్+మెచ్చున్= హృదయంలో మెచ్చుకొన్నాడు; చిక్కని, చనుఁగవన్= ఒత్తయిన చనుదోయిని; చీఱన్, కోరున్= చీల్చ(గిల్ల) కోరాడు; అన్నువ, కౌఁదీఁగ= సన్నటితీగెవంటి నడుముయొక్క; అందంబున్; మదిన్, నిల్పున్= మనస్సునందు నిలిపాడు; జఘన, చక్రంబుపైన్= గుండ్రనిపిరుదులపై; దృష్టిన్= దృష్టిని; చలుపున్= ప్రసరింప జేశాడు; అభిలాషము= కోరిక; ఏర్పడునట్లుండఁగాన్= తేటతెల్లమగునట్లుగా (తేటతెల్లమయేటట్లుగా); పల్కున్= పలికాడు; వేడ్కతోన్= వేడుకతో; మఱుమాట= ప్రత్యుత్తరాన్ని; వినఁగన్= వినేందుకు, తివురున్= ప్రయత్నించాడు; అతి, ఘన, లజ్జా+అవనత+అగు= మిక్కుట మైన సిగ్గుతో వంగింది అయిన (వంగిన); ఆ+కన్యపైన్+పడి= ఆ కన్యమీదపడి; లజ్జయున్= (ఆకన్యయొక్క) సిగ్గును; పాపన్+కడఁగున్= పోగొట్టేందుకు ప్రయత్నించాడు; ఎంతశాంతులయ్యున్= ఎంతటి శాంతం కలవా రైనా; ఎంతజిత+ఇంద్రియులు+అయ్యున్= ఎంతగా ఇంద్రియాలను జయించినవా రైనా; కడున్= మిక్కిలి; వివిక్తము+అయినచోటన్= ఏకాంత మైన తావులో; సతులగోష్ఠిన్= స్త్రీలతోడికూటమియందు; చిత్తచలనము+ఒందుదురు= మనశ్చాంచల్యాన్ని పొందుతారు; జనులు= ప్రజలు; కాముశక్తిన్= మన్మథునిసామర్థ్యాన్ని; ఓర్వన్+కలరె= సహింపగలరా? (సహింపలేరు.)

తాత్పర్యం: పరాశరుడు మత్స్యగంధినేత్రసౌందర్యాన్ని చూచి మనసులో మెచ్చుకొన్నాడు. ఆమెచనుదోయిని నఖక్షతం చేయగోరాడు. ఆమె సన్నటినడుము సొగసును మనస్సులో నిలుపుకొన్నాడు. ఆమె జఘనప్రదేశమందే దృష్టి నిలుపుకొన్నాడు. తనకోరిక వెల్లడి అయ్యేటట్లుగా మాటలాడాడు. ఆమెప్రత్యుత్తరాన్ని వినేందుకు ఉవ్విళ్ళూరాడు. మిక్కుట మైన సిగ్గుతో నున్న ఆ కన్యమీద పడి ఆమెలజ్జను బాపేందుకు ప్రయత్నించాడు. ఎంతశాంతులైనా, ఎంతజితేంద్రియు లైనా, ఏకాంతస్థలంలో స్త్రీలకూటమి తటస్థిస్తే చిత్తచాంచల్యానికి లోనవుతారు. మన్మథునిబలాన్ని ఓర్వగలజను లున్నారా? లేరనుట.

విశేషం: సామాన్యంచేత విశేషం సమర్థింపబడింది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసమని అభిప్రాయం.

లక్షణం: సమర్థనీయస్యార్థస్య కావ్యలింగం సమర్థనమ్ (కువలయానందమ్)

వ. ఇట్లు విగతలజ్జాపరవశుం డయి మునివరుండు దనయభిప్రాయం బక్కన్యక కెఱింగించిన, నదియును దీని కొడంబడనినాఁడు నా కలిగి యిమ్ముని శాపం బిచ్చునో యని వెఱచి యి ట్లనియె. 39

ప్రతిపదార్థం: ఇట్లు, విగత, లజ్జా, పరవశుండు+అయి= పూర్తిగా విడిపోయిన లజ్జకు లొంగిన వాడై; మునివరుండు= మునిశ్రేష్ఠుడైన ఆపరాశరుడు; తనఅభిప్రాయంబు; ఆ+కన్యకకున్= ఆ పడుచునకు; ఎఱింగించినన్= తెల్పగా; అదియును=

ఆ మత్స్యగంధియు; దీనికిన్= ఇందుకు; ఒడంబడనినాఁడు= ఒప్పుకొనని నాడు; నాకున్+అలిగి= నామీద కోపగించి; ఈ+ముని= ఈ ఋషి; శాపంబు+ఇచ్చునో+అని; వెఱచి= భయపడి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా మునిపుంగవు డైన పరాశరుడు సిగ్గువిడిచి తనకోరికను ఆ కన్యకు తెల్పగా, ఇందుకు ఇష్టపడకపోతే ఆ ముని శపిస్తాడేమో అని భయపడి ఇలా అన్నది.

తరలము.

తనువు మీన్పొలవల్చు జాలరిదాన, నట్లును గాక యే
ననఘ! కన్యకఁ, గన్యకావ్రత మంతరించిన నెట్లు మ
జ్జనకునింటికిఁ బోవ నేర్తుఁ? బ్రసాదబుద్ధి యొనర్పు స
న్మునిగణోత్తమ! నాకు దోషవిముక్తి యె ట్లగు నట్లుగాన్. 40

ప్రతిపదార్థం: తనువు= శరీరం; మీన్, పొల వల్చు= చేపవాసన వచ్చేటువంటి; జాలరి, దానను= చేపలు పట్టేవారికులానికి చెందినదానిని; అట్లునుగాక; ఏను= నేను; అనఘ!= ఓపుణ్యుడా! కన్యకన్= కన్నెను; కన్యకా, వ్రతము= కన్యగాఉండే నియమం; అంతరించినన్= నశించినచో; ఎట్లు; మత్+జనకు+ఇంటికిన్= నా తండ్రియొక్క ఇంటికి; పోవన్, నేర్తున్= పోజాలెదను? (పోగలను); సత్+మునిగణ+ఉత్తమ= శ్రేష్ఠు లైన మునులసమూహంలో శ్రేష్ఠుడా; నాకున్; దోషవిముక్తి= దోషంనుండి తొలగటం; ఎట్లు+అగున్= ఎట్లవుతుందో; అట్లుగాన్= ఆ విధ మయ్యేటట్లుగా; ప్రసాదబుద్ధి= అనుగ్రహంతో కూడిన బుద్ధిని; ఒనర్పుము= చేయవలసింది.

తాత్పర్యం: శరీరం చేపలవాసనతో కూడినట్టి జాలరిదాన్ని నేను. అదీకాక ఓ పుణ్యాత్ముడా! నేను కన్యను. నా కన్యాత్వం అంతరిస్తే నేను ఎట్లా నా తండ్రిగడప త్రొక్కుతాను? ఓ మునిగణోత్తమా! నాకు దోషం కలగని రీతిగా అనుగ్రహించవలసింది.

వ. అనిన నమ్మునివరుండు గరంబు సంతోషించి 'నాకు నిష్టంబు సేసినదాన నీకన్యాత్వంబు దూషితంబు గా, దోడకు' మని దానికి వరం బిచ్చి, నీవు వసు వనురాజర్షివీర్యంబునం బుట్టినదానవు గాని సూతకులప్రసూతవు కా వని చెప్పి, దానిశరీరసౌగంధ్యంబు యోజనంబునం గోలె జనులకు నేర్పడునట్లుగాఁ బ్రసాదించిన, నది గంధవతి యనియు, యోజనగంధి యనియుఁబరఁగి, తత్ప్రసాదంబున ననేక దివ్యాంబరాభరణభూషితయు నయి యమునానదీద్వీపంబున నోడ చేర్చి. 41

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; ఆ+మునివరుండు= ఆ మునిశ్రేష్ఠుడు, పరాశరుడు; కరంబు= మిక్కిలి; సంతోషించి; నాకున్; ఇష్టంబు= ప్రియం; చేసినదానన్= చేసినందువలన; నీ కన్యాత్వంబు= నీ కన్నెతనం; దూషితంబు= నిందింపబడినది; కాదు; ఒడకుము= భయపడకు; అని; దానికిన్= ఆ మత్స్యగంధికి; వరంబు+ఇచ్చి; నీవు; వసురాజ+ఋషి= వసు వనేపేరు కల రాజర్షియొక్క; వీర్యంబునన్= రేతస్సువలన; పుట్టినదానవు; కాని; సూతకులప్రసూతవు= సూతకులమందు పుట్టినదానివి కావు; అని; చెప్పి; దాని; శరీరసౌగంధ్యంబు= శరీరపరిమళం; యోజనంబునన్+కోలెన్= ఆమడ దూరంవరకు; జనులకున్; ఏర్పడు+అట్లు, కాన్= తెల్లమయేటట్లుగా; ప్రసాదించినన్= అనుగ్రహించగా; అది= ఆ మత్స్యగంధి; గంధవతి అనియున్; యోజనగంధి; అనియున్; పరఁగి= ప్రసిద్ధిచెంది; తద్+ప్రసాదంబునన్= ఆ పరాశరుడి అనుగ్రహంతో; అనేకదివ్య+

అంబర+ఆభరణ, భూషితయున్= పెక్కుదివ్యము లైన వస్త్రాలతోను, ఆభరణాలతోను అలంకరించబడినది, అయి; యమునాద్వీపంబునన్, ఓడ చేర్చి= యమునా నదిలో చుట్టూ నీరున్న నేలగల చోటుకు (ద్వీపం దగ్గరికి) నావను చేర్చి.

తాత్పర్యం: మత్స్యగంధిమాటలకు పరాశరుడు చాలాసంతోషించి, 'నాకు ప్రియంచేసినందువలన నీకన్యాత్వం చెడదు; భయపడకు' అని వర మిచ్చి, 'నీవు వసురాజర్షివీర్యంవలన జన్మించినదానివి కాని, సూతకులంలో పుట్టినదానివి కావు' అని ఎఱుకపరచి ఆమెశరీరసుగంధం యోజనదూరంలో కల జనులకు ఎరుక పడేటట్లుగా (తెలిసేటట్లుగా) అనుగ్రహించాడు. ఆమె గంధవతిగా, యోజనగంధిగా ప్రసిద్ధిచెందింది. ఆమె పరాశరుడిఅనుగ్రహంతో దివ్యవస్త్రాభరణాలంకృతు రాలై యమునాద్వీపానికి ఓడను చేర్చి.

తే. 'ఎల్లవారును జూడంగ నిట్టిబయల । నెట్లు సంగమ మగు' నని యింతి యన్న
నమ్మునీంద్రుండు గావించె నప్పు డఖిల । దృష్టిపథరోధినీహారతిమిర మంత. 42

ప్రతిపదార్థం: ఎల్లవారును= సమస్తజనులును; చూడంగన్; ఇట్టి బయలన్= ఇటువంటి బాహ్యప్రదేశంలో; ఎట్లు; సంగమము+అగున్= కలయిక ఔతుంది; అని; ఇంతి= ఆ యోజనగంధి; అన్నన్= పలుకగా; అమ్మునీంద్రుండు= ఆ మునిశ్రేష్ఠు డైన పరాశరుడు; అప్పుడు; అఖిల, దృష్టి, పథ, రోధి, నీహార, తిమిరము= అశేషజనుల దృక్పథాలను నిరోధించే మంచు అనే చీకటిని; అంతన్= అంతటా; కావించెన్= కల్పించాడు.

తాత్పర్యం: 'అందరూ చూస్తుండగా ఇటువంటిబయలుప్రదేశంలో ఎట్లా కలయిక అవుతుం?' దని యోజనగంధి అనగా అప్పు డాపరాశరముని సమస్తజనులదృష్టిని నిరోధించే మంచుచీకట్లను కల్పించాడు.

శ్రీవేదవ్యాసమునీంద్రుని యవతారము (సం. 1-57-70)

క. పరమేష్ఠికల్పుఁ డగు న । ప్పరాశరుసమాగమమునఁ బరమగుణైకా
భరణకు ననవద్యమనో । హరమూర్తికి సత్యవతికి నమ్మునిశక్తిన్. 43

ప్రతిపదార్థం: పరమేష్ఠి, కల్పుఁడు+అగు= బ్రహ్మదేవుడితో సమాను డైన; ఆ+పరాశరు= ఆ పరాశరుడియొక్క; సమాగమమునన్= కలయికవలన; పరమ, గుణ+ఏక+ఆభరణకున్= ఉత్తమగుణాలే ముఖ్యమైన భూషణంగాకలదియున్నూ; అనవద్యమనోహరమూర్తికిన్= నిర్దోషం, మనోజ్ఞం అయిన ఆకారం కలదియున్నూఅయిన; సత్యవతికిన్= యోజనగంధికి; ఆ మునిశక్తిన్= ఆ పరాశరమునిమహిమతో.

తాత్పర్యం: బ్రహ్మసమాను డైన ఆ పరాశరమహర్షి సంగమంతో సుగుణాభరణకు, నిర్దోషం, మనోహరం అయినరూపం కలిగిన సత్యవతికి ఆ మునిమహిమవలన. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. సద్యోగర్భంబున నహి । మద్యుతితేజుండు వేదమయుఁ డఖిలమునీం
ద్రాద్యుఁడు వేదవ్యాసుం । డుద్యద్జ్ఞానంబుతోడ నుదితుం డయ్యెన్. 44

ప్రతిపదార్థం: సద్యస్+గర్భంబునన్= తత్కాలగర్భాన; అహిమద్యుతి తేజుండు= సూర్యుడితేజస్సువంటి తేజస్సుకలవాడు; వేదమయుఁడు=(వేదాలచేత) జ్ఞానంచేత నిండినవాడు; అఖిలమునీంద్ర+ఆద్యుఁడు= సమస్తమునులలో మొదటివాడు; వేదవ్యాసుండు; ఉద్యత్+జ్ఞానంబుతోడన్= ఉదయిస్తున్న జ్ఞానంతో; ఉదితుండు+అయ్యెన్= జన్మించాడు.

తాత్పర్యం: ఆ సత్యవతికి తత్కాలగర్భమందు సూర్యసన్నిభుడు, వేదమయుడు, ఆదిముని అయినటువంటి వేదవ్యాసుడు జ్ఞానవంతు డై అవతరించాడు.

క. ఆ యమునాద్వీపమున న । మేయుఁడు కృష్ణుఁడయి లీలమెయిఁ గృష్ణద్వై
పాయనుఁ డనఁ బరఁగి వచ । శ్శ్రీయుతుఁడు తపంబువలనఁ జిత్తము నిలిపెన్. 45

ప్రతిపదార్థం: ఆ యమునాద్వీపమునన్; అమేయుఁడు= మహనీయుడు; కృష్ణుఁడు+అయి= నల్లనివాడై; లీలమెయిన్= విలాసంతో లేదా-మహిమతో; కృష్ణద్వైపాయనుఁడు+అనన్+పరఁగి= కృష్ణద్వైపాయను డనే పేరుతో ప్రసిద్ధిచెంది; వచస్+ శ్రీయుతుఁడు= వాక్యసంపదతో కూడిన ఆ వ్యాసుడు; తపంబువలనన్= తపస్సునందు; చిత్తము నిలిపెన్= మనసు నిలిపాడు.

తాత్పర్యం: ఆ యమునాద్వీపంలో మహనీయుడు; నల్లనివాడు; వచస్సంపన్నుడు అయినట్టి అతడు కృష్ణద్వైపాయను డన్నపేరుతో ప్రసిద్ధుడై తపోమార్గంలోనే మనసు నిలిపాడు.

విశేషం: కృష్ణద్వైపాయనుడు= నల్లనైన యమునానదియొక్క ద్వీపాన్ని జన్మస్థానంగా కలవాడు.

వ. పరాశరుండు సత్యవతి గోరిన వరంబు లిచ్చి నిజేచ్ఛ నరిగె; నంతఁ గృష్ణద్వైపాయనుండును గృష్ణాజిన పరిధాన కపిలజటామండల దండకమండలు మండితుం డై తల్లిముందట నిలిచి కరకమలంబులు మొగిచి మ్రొక్కి 'మీకుం బనిగలయప్పుడ నన్నుం దలంచునది; యాక్షణంబ వత్తు' నని సకలలోకపావనుం డఖిలలోక హితార్థంబుగాఁ దపోవనంబునకుం జని, యందు మహాఘోరతపంబు సేయుచు. 46

ప్రతిపదార్థం: పరాశరుండు; సత్యవతి, కోరినవరంబులు; ఇచ్చి; నిజ+ఇచ్ఛన్= తనఇష్టప్రకారంగా; అరిగెన్= వెళ్ళాడు; అంతన్; కృష్ణద్వైపాయనుండును; కృష్ణాజినపరిధాన= జింకచర్మపు వస్త్రంతోను; కపిల, జటా, మండల= గోరోజనవర్ణం వంటి వర్ణం గల జడల సమూహంతోను; దండ, కమండలు, మండితుండు+ఐ= దండంతోను, జలపాత్రతోను ప్రకాశించినవాడై; తల్లిముందట నిలిచి; కరకమలంబులు= హస్తపద్మాలు; మొగిచి= మోడ్చి; మ్రొక్కి, మీకుం బనిగల, అప్పుడు+అ; నన్నున్ తలంచునది; ఆక్షణంబు+అ= ఆక్షణాన్నే; వత్తును; అని, సకలలోకపావనుండు= సమస్తలోకాలలోనూ పవిత్ర మైనవా డైన ఆ వ్యాసుడు; అఖిలలోకహిత+అర్థంబు, కాన్= సమస్తలోకాలయొక్క మేలుకొరకు; తపోవనంబునకున్; చని; అందున్; మహాఘోరతపంబు= గొప్ప భయంకరమైన తపస్సు; చేయుచున్= చేస్తూ.

తాత్పర్యం: పరాశరుడు సత్యవతి కోరినవరా లిచ్చి వెళ్ళిపోయాడు. అంతట కృష్ణద్వైపాయనుడు జింకచర్మపు వస్త్రంతోను, ఎఱ్ఱని జడలతోను, దండకమండలాలను ధరించి తల్లిముందర నిలచి ఆమెకు మ్రొక్కి, 'మీకు పని కలిగినప్పుడు నన్ను తలవండి; ఆ క్షణమే నేను వస్తా' నని చెప్పి, పరమపవిత్రు డైన ఆ వ్యాసుడు లోకహితానికై తపోవనానికి వెళ్ళి, అక్కడ మహాభయంకర మైన తపస్సుచేస్తూ.

విశేషం: 40వ పద్యంలో మత్స్యగంధి తన కన్యకావ్రతం అంతరించటంవలన కలిగే దోషంనుండి తాను విముక్తురా లయ్యే వరాన్ని కోరింది. పరాశరుడు ఆ వరం ఇచ్చాడు. పరాశరుడిపొందువలన ఆమె కన్యాత్వం కోల్పోయింది. పుత్రవతి అయింది. పరాశరుడు వెళ్లాడు. కాని, ఆమెయందు కన్యాత్వం యథాపూర్వంగానే నిలిచి ఉన్నది. దానితో ఆమెకు పరాశరపత్ని అనే దోషం లేకుండా పోయింది. ఆమెకు సద్యోగర్భంవలన వ్యాసుడు పుట్టాడు. అతడు సద్యోయౌవనుడైనాడు; తల్లికి మ్రొక్కి తపోవనానికి

వెళ్ళాడు. ఎప్పుడు స్మరిస్తే అప్పుడు వస్తానని వరంలాంటి వాగ్దాన మిచ్చాడు. అవివాహిత అయిన మత్స్యగంధికి పుట్టినపుత్రుడు అట్లా పుట్టి అట్లా వెళ్లకపోతే ఆమె కన్యాత్వం దూషితమయ్యేది. చివరకు ఆమె కన్యగానే మిగిలింది. కాని, మత్స్యగంధి యోజనగంధిగా మారింది. కన్యగా ఉన్నప్పటి శరీరమత్స్యగంధ దోషంకూడా పోయింది. ఆమె కేర్పడిన శరీరసౌగంధ్యమే తరువాతికథలో శంతనుడిని ఆకర్షించింది. హస్తినాపుర పట్టమహిషిని చేసింది. కథను లోనారసి చూచేవారికి స్ఫురించే ఈ కథార్థాలన్నీ ప్రసన్నకథాకవి(లి) తార్థయుక్తితో నన్నయ సాధించిన వస్తుధ్వని విశేషాలే.

ఉ. **సంచిత పుణ్యుఁ డంబురుహసంభవునంశము దాల్చి పుట్టి లో**
కాంచితుఁ డైనవాఁడు నిఖిలాగమపుంజము నేర్పడన్ విభా
గించి జగంబులందు వెలిఁగించి సమస్తజగద్ధితంబుగాఁ
బంచమవేద మై పరఁగు భారతసంహితఁ జేసె నున్నతిన్. **47**

ప్రతిపదార్థం: సంచిత పుణ్యుఁడు= కూడబెట్టిన పుణ్యాలు కలవాడు; అంబురుహ సంభవు నంశము= బ్రహ్మయొక్క అంశం; తాల్చి= ధరించి; పుట్టి; లోక+అంచితుఁడు+ఐనవాఁడు= లోకమందు పూజించబడిన వా డైనటువంటి కృష్ణద్వైపాయనుడు; నిఖిల+ఆగమ పుంజము= సకల వేదాల సమూహం; ఏర్పడన్= తేటతెల్ల మయ్యేటట్లుగా; విభాగించి= వేర్పాటు చేసి; జగంబులందున్ వెలిఁగించి= లోకాలలో ప్రకాశింపజేసి; సమస్త జగత్+హితంబుగాన్= సకల జగాలకు మేలు చేసేదిగా; పంచమ వేద మై పరఁగు= ఐదవవేదంగా ప్రసిద్ధ మైన; భారత సంహితన్= భారతమనే వేదభాగాన్ని; ఉన్నతిన్= గొప్పగా; చేసెన్.

తాత్పర్యం: పుణ్యనిధియున్నూ, బ్రహ్మఅంశాన జన్మించిన లోకపూజ్యుడున్నూ అయినట్టి ఆ కృష్ణద్వైపాయనుడు వేదాలను విభాగించి, వాటిని లోకంలో ప్రశస్తం కావించి, విశ్వశ్రేయస్సుకై పంచమవేద మని ప్రసిద్ధి చెందిన ఈ భారతసంహితను రచించాడు.

విశేషం: ఈపద్యం ప్రసాదగుణరంజిత. భారతసంహితను రచించిన వ్యాసుడిపుట్టుకనుగురించి నన్నయ చెప్పి, ఆ తరువాత భీష్మాది వీరుల పుట్టుకలనుగురించి చెప్పబోతున్నాడు. ఈ వరుసలోనే ఎందుకు చెప్పాలి? అనే ప్రశ్న ఏర్పడుతున్నది. దానికి రెండుకారణాలు కనబడుతున్నాయి. 5వ పద్యంలో జనమేజయుడు 'ప్రీతితో మీరును, భీష్మాది కురువృద్ధరాజులు ఉండికూడా పాండవ ధార్తరాష్ట్రులు రాజ్యాన్ని విభజించుకొని పాలిస్తూకూడా ఎందుకు యుద్ధం జరిగింది', అని వ్యాసుడిని ప్రశ్నించాడు. దానికి తరువాత వైశంపాయనుడు ఆవరుసలోనే సమాధానం చెప్పుకుంటూవస్తూ వ్యాసభీష్ముల జన్మవృత్తాంతాలను ముందుగా చెప్పాడు. అంతేకాక దేవతాంశలతో పుట్టినవారిలో బ్రహ్మాంశకలవాడు వ్యాసుడు. వసువుల అంశలు కలవాడు భీష్ముడు. అందువలన ఆక్రమంలో చెప్పాడు. అయితే వ్యాసుడు లోకహితార్థం జీవించటానికి పుట్టాడు. భీష్మాదులు యుద్ధంచేయటానికి పుట్టారు. అందువలన వ్యాసునికథ ప్రత్యేకంగా చెప్పబడింది. భీష్ముడికథ గుంపులో కలిసి పుట్టింది. శంతనుడి కథనుండి స్వంతంగా పెరిగింది. వీరిరువురూ భారతకథలో పాల్గొనే పాత్రలే. అయినా, వ్యాసుడు చిరంజీవి, భీష్ముడు దీర్ఘకాలం జీవించినవాడు. ఇటువంటి అర్థాలన్నింటినీ ఆ వరుసలో కథచెప్పటంద్వారా నన్నయ భావింపజేస్తున్నాడు.

భీష్మాదివీరుల దేవదానవాదుల యంశంబువలనఁ బుట్టుట (సం. 1-58-3)

వ. **'మఱియు దేవదైత్య దానవ ముని యక్ష పక్షిగంధర్వాదుల యంశావతారంబులు దాల్చి భీష్మాది మహావీరులు భారత యుద్ధంబు సేయ ననేకులు పుట్టిరి. వారల కొలంది యెఱింగి చెప్ప ననేకకాలం బనేకసహస్ర ముఖంబులవారి కైన నలవిగా' దనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె.** **48**

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకనూ (ఇంకా); దేవ= దేవతలు; దైత్య= దితిసంతాన మైన రాక్షసులు; దానవ= దను సంతాన మైన రాక్షసులు; ముని= మునులు; యక్ష= యక్షులు; పక్షి= పక్షులు; గంధర్వ+ఆదులు= గంధర్వులు మొదలైనవారి; అంశ+అవతారంబులు= అంశాలయొక్క రూపాలను; తాల్చి= ధరించి; భీష్మ+ఆది+మహావీరులు= భీష్ముడు మొదలైన గొప్పవీరులు; భారత యుద్ధంబు+ చేయన్; అనేకులు= పెక్కుమంది; పుట్టిరి; వారలకొలంది= వారి సామర్థ్యం; ఎఱింగి, చెప్పన్= తెలిసికొని చెప్పేందుకు; అనేకకాలంబు= చాలకాలం; అనేక, సహస్ర, ముఖంబులవారికిన్+ఐనన్= పెక్కు వేలముఖాలు కలవారి కైనా; అలవి, కాదు= శక్యం కాదు; అనినన్, విని= అని చెప్పగా విని; జనమేజయుండు= పరీక్షిత్తు కుమారుడు; వైశంపాయనునకున్= వ్యాసశిష్యు డైన వైశంపాయను డనే మునికి (తో); ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అంతేకాదు. దేవతలు, రాక్షసులు, మునులు, యక్షులు, పక్షులు, గంధర్వులు మొదలైనవారి అంశాలతో భీష్ముడు మొదలైన మహావీరులు భారతయుద్ధం చేయటానికి అనేకులు పుట్టారు. వారి బలాబలాలు తెలిసి చెప్పటానికి పెక్కువేల ముఖాలు కలవారుకూడా చాలకాలం చెప్పినా సాధ్యం కాదు'- అనగా విని జనమేజయుడు వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 'మునికిట్లనియె' మునితో నిట్లనియె. 'సూ॥ వచ్యర్థా ముఖ్యకర్మంబునకుఁ దోడ కు వర్ణంబులు ప్రాయికంబుగా నగు' (బా.వ్యా.)

క. 'అమరాసుర ముఖ్యుల యం । శములను మహిఁ బుట్టి 'సకలజనపాలక సం
ఘములకు భారతరణరం । గమునను లయ మొంద నేమి కారణ?' మనినన్. 49

ప్రతిపదార్థం: అమరాసుర, ముఖ్యుల= దేవతలయు, రాక్షసులయు ముఖ్యు లైన వారియొక్క; అంశములను= భాగాలతో; మహిన్= భూమిపై; సకల, జనపాలక, సంఘములకున్= సకల రాజుల సమూహాలకు; పుట్టి= జన్మించి; భారత, రణ, రంగమునను= భారత యుద్ధరంగంలో; లయము+ఒందన్= నాశమయ్యేందుకు; ఏమి కారణము?; అనినన్= అని అడుగగా.

తాత్పర్యం: 'దేవదానవులఅంశలతో పుట్టిన సకలరాజ సమూహాలు భారతయుద్ధంలో నశించటానికి కారణం ఏమిటి?' అని జనమేజయుడు అడుగగా.

వ. జనమేజయునకు వైశంపాయనుం డి ట్లనియె. 50

ప్రతిపదార్థం: జనమేజయునకున్= జనమేజయుడితో; వైశంపాయనుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

సీ. పరశురాముండు భీకర నిజకోపాగ్ని । నుగ్రుఁ డై యిరువదియొక్కమాఱు
ధాత్రీతలం బపక్షత్త్రంబు సేసినఁ, । దత్క్షత్త్రసతులు సంతానకాంక్ష
వెలయంగ ఋతుకాలముల మహావిప్రుల । దయఁ జేసి ధర్మువు దప్పకుండఁ
బడసిరి పలువురఁ గొడుకులఁ గూఁతుల, । నిప్పాటఁ దత్క్షత్త్ర మెసఁగి యుర్విఁ

ఆ. బర్వి రాజధర్మపద్ధతి ననఘమై, । జారచోర దుష్టజనుల బాధఁ
బొరయకుండ నిఖిల భూప్రజాపాలనఁ । జేయుచుండె శిష్టసేవ్య మగుచు. 51

ప్రతిపదార్థం: భీకర, నిజకోప+అగ్నిన్= భయంకర మైన తన కోప మనే అగ్నిచేత; ఉగ్రుఁడు+ఐ= భయంకరు డై; ధాత్రీ, తలంబు= భూతలాన్ని; అపక్షత్త్రంబు= క్షత్రియులు లేనిది; చేసినన్= చేయగా; తద్+క్షత్త్రసతులు= ఆ క్షత్రియులయొక్క భార్యలు; సంతానకాంక్ష= సంతానమం దున్న కోరిక; వెలయంగన్= బయల్పడగా; ఋతుకాలములన్= స్త్రీల ఋతు సంబంధ మైన సమయాలలో; మహత్+విప్రుల, దయన్+చేసి= గొప్పవా రైన బ్రాహ్మణులయొక్క దయవలన; ధర్మువు, తప్పకుండన్= ధర్మమార్గం వీడకుండగా; పలువురన్= పెక్కురను కొడుకులన్; కూఁతులన్; పడసిరి= పొందారు; తద్+క్షత్త్రము= ఆ క్షత్రియవంశం; ఎసఁగి= ఒప్పారి; ఉర్విన్+పర్వి= భూమియందు వ్యాపించి; రాజధర్మ పద్ధతిన్= రాజధర్మ విధానాన్ని; అనఘము+ఐ= పాపరహితమై; జార, చోర, దుష్ట జనుల బాధన్= జారులవలన, దొంగలవలన, దుష్టులవలన బాధ; పొరయకుండన్= కలుగకుండా; నిఖిల, భూప్రజాపాలనన్= సమస్త భూమియందున్న ప్రజల పాలనం, శిష్ట, సేవ్యము+అగుచున్= శిష్టజనులచేత సేవించదగిన దగుతూ; చేయుచుండెన్.

తాత్పర్యం: పరశురాముడు ఉగ్రకోపుడై, ఇరవైయొక్కమార్లు దండెత్తి క్షత్రియు లందరిని వధించగా, ఆ రాజుల భార్యలు సంతానకాంక్షతో ఋతుకాలాలలో బ్రాహ్మణశ్రేష్ఠుల అనుగ్రహంతో, ధర్మవిధిని అనుసరించి సంతానాన్ని పొందారు. మళ్ళీ రాజవంశాలు వర్ధిల్లాయి. అట్లా జన్మించిన రాజులు ధర్మమార్గాన్ని విడువక జార చోర దుష్టజనాల బాధ ప్రజలకు కలుగకుండా భూమిని పాపరహితంగా పరిపాలించారు. వారిపాలన శిష్టసేవ్య మై ఉన్నది.

విశేషం: 'రాజధర్మపద్ధతిననఘమై' అనేచోట 'రాజధర్మపథనీతి విడువక' అనేపాఠాంతరం ఉన్నది.

వ. ఇట్లు బ్రాహ్మణ వీర్య ప్రభవు లయిన క్షత్త్రియులు ధర్మమార్గంబునం బ్రజాభిరక్షణంబు సేయుటంజేసి వర్ణాశ్రమ ధర్మస్థితులు దప్పక ప్రవర్తిల్లుటయు, బ్రహ్మక్షత్త్రంబుల కాయుర్వర్ధనంబును, ననవరతయాగతర్పిత పర్జన్య ప్రసాదంబునం గోరినయప్పుడు వానలు గురియుచు సకల సస్యసమృద్ధియుఁ, బ్రజావృద్ధియు నైన భూదేవి ప్రజాభారపీడిత యై సురాసుర మునిగణ పరివృతు లై యున్న హరి హర హిరణ్యగర్భుల కడకుం జని యిట్లనియె. 52

ప్రతిపదార్థం: బ్రాహ్మణ, వీర్య, ప్రభవులు= బ్రాహ్మణులయొక్క తేజస్సువలన జన్మించినవారు; అయిన; క్షత్రియులు; ధర్మమార్గంబునన్= ధర్మశాస్త్రపద్ధతిలో; ప్రజా+అభిరక్షణంబు= ప్రజలను కాపాడటం; చేయుటన్+చేసి= చేయటంవలన; వర్ణ+ఆశ్రమ, ధర్మ, స్థితులు= నాలుగు వర్ణాలయొక్క, నాలుగు ఆశ్రమాలయొక్క నియమాలయొక్క వ్యవస్థలు; తప్పక; ప్రవర్తిల్లుటయున్= ఏర్పడి ఉండగా; బ్రహ్మ, క్షత్త్రంబులకున్= బ్రాహ్మణ క్షత్రియ వర్ణాలవారికి; ఆయుస్+వర్ధనంబు= ఆయుస్సు పెరగటం; అనవరత యాగ, తర్పిత, పర్జన్య, ప్రసాదంబునన్= నిరంతరం యాగాలలో తృప్తి పొందిన దేవేంద్రుడి అనుగ్రహంచేత; కోరిన+అప్పుడు; వానలు కురియుచున్; సకలసస్యసమృద్ధియున్= సమస్తమైన పంటలయొక్క సంపద; ప్రజావృద్ధియున్= సంతానవృద్ధియు; ఐనన్= కాగా; భూదేవి; ప్రజాభారపీడిత+ఐ= ప్రజలభారంచేత బాధింపబడినదై; సుర+అసుర, మునిగణ, పరివృతులు+ఐ= దేవతల, రాక్షసుల, మునుల సమూహంచేత కూడినవా రై; ఉన్నన్; హరి, హర, హిరణ్యగర్భులకడకున్= విష్ణుశివబ్రహ్మలదగ్గరికి; చని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా బ్రాహ్మణులవలన జన్మించిన రాజులు ధర్మమార్గంలో ప్రజలను పాలించటంచేత వర్ణాశ్రమ ధర్మాలు స్థిరత్వం పొందినవి. బ్రాహ్మణులకు క్షత్రియులకు ఆయుర్దాయం పెరిగింది. నిరంతరం యజ్ఞాలవలన తృప్తి పొందిన దేవేంద్రుడి అనుగ్రహంచేత కోరినప్పుడు వానలు కురిసి, పంటలు పండాయి. ప్రజాబాహుళ్య మధిక మయింది. భూదేవి ప్రజాభారాన్ని సహించలేక బ్రహ్మ విష్ణు మహేశ్వరులవద్దకు వెళ్ళి ఇట్లా పలికింది.

క. 'భూరి ప్రజా నిరంతర । భారము దాల్చు టిది కరము భారము; దయతో
మీరీభారమునకుఁ బ్రతి । కారము గావించి నన్నుఁ గావుం' డనినన్. 53

ప్రతిపదార్థం: భూరి, ప్రజానిరంతర, భారము= అధిక మైన ప్రజలయొక్క ఎడతెగని బరువు; తాల్చుట+ఇది= ధరించుట అనునది కరమున్, భారము= మిక్కిలి బరువైనది; దయతోన్; మీరు; ఈ భారమునకున్; ప్రతికారము= ప్రతిక్రియ; కావించి= చేసి; నన్నున్; కావుండు= రక్షింపుడు. (రక్షించండి); అనినన్= అని అనగా.

తాత్పర్యం: 'అధిక మైన జనబాహుళ్యభారాన్ని మోయటం నాకు మిక్కిలి భార మౌతున్నది. దయతో మీ రీ భారానికి తగినప్రతిక్రియ చేసి నన్ను రక్షించండి' అని భూదేవి పలుకగా.

క. వనజాసను ననుమతమున । వనరుహనాభుండు వాసవప్రముఖసుప
ర్వనికాయాంశంబులతోఁ । దనరఁగఁ బుట్టించె నుర్విఁ దనయంశమ్మున్. 54

ప్రతిపదార్థం: వనజాసను= బ్రహ్మదేవుడి; అనుమతమునన్= సమ్మతితో; వనరుహనాభుండు= విష్ణుదేవుడు; వాసవ, ప్రముఖ, సుపర్వనికాయాంశంబులతోన్= ఇంద్రుడు మొదలైన ప్రముఖులైన దేవతాగణాల అంశలతో; తన+అంశమ్మున్= తనపాలును; తనరఁగన్= అతిశయించేటట్లుగా; ఉర్విన్= భూమియందు; పుట్టించెన్.

తాత్పర్యం: బ్రహ్మదేవుడి సమ్మతితో విష్ణుదేవుడు ఇంద్రాదిదేవతల అంశలతో, తన అంశ అతిశయించేటట్లుగా భూమిపై జన్మింపజేశాడు.

విశేషం: భూభారాన్ని తొలగించటానికి దేవతల అంశాలతో, తన అంశంతో భూమిమీద వీరులను సృష్టించినవాడు బ్రహ్మ కాడు విష్ణువు. ఇది పురాణాలలో వర్ణించే సర్గప్రతిసర్గాలవంటిది కాదు. భారతేతిహాసంలో పుట్టిన దైవాసురాంశ సంభూతులు విష్ణుసంకల్పంవలన పుట్టినవారు. కురుక్షేత్రయుద్ధంలో తాము సంఘర్షణపడి అందులో అపారప్రజానష్టం కలిగించి భూభారం తగ్గించటం వారి ఆశయం.

క. దితిసుత దానవ యక్ష । ప్రతతుల యంశములఁ బుట్టి ప్రజలకు విహితా
హితు లగుచుండి రనేకులు । జితకాశులు ధరణిపతులు శిశుపాలాదుల్. 55

ప్రతిపదార్థం: దితిసుత, దానవ, యక్షప్రతతులన్= దైత్య దానవ యక్షసమూహాలతో; అనేకులు= పెక్కుమంది; జితకాశులు= జయశీలురు; శిశుపాల+ఆదుల్= శిశుపాలుడు మొదలైన; ధరణీపతులు= రాజులు; పుట్టి= జన్మించి; ప్రజలకున్= ప్రజలకు విహిత+అహితులు+అగుచుండిరి= మిత్రులున్నూ, శత్రువులున్నూ అవుతున్నారు.

తాత్పర్యం: దైత్య దానవ యక్షుల అంశలతో పెక్కుమంది శిశుపాలాది జయగర్వితులైన రాజులు జన్మించి ప్రజలకు హితులుగానూ, అహితులుగానూ ఉన్నారు.

చ. అతులబలాఢ్యు లైన యమరాంశ సముద్భవు లెల్లఁ బాండుభూ
పతిసుతపక్ష మై, సురవిపక్ష గణాంశజు లెల్ల దుర్మదో
ద్ధత కురురాజ పక్షమయి, ధారుణిభారము వాయ ఘోరభా
రతరణభూమి నీల్గిరి పరస్పరయుద్ధము సేసి వీరు లై. 56

ప్రతిపదార్థం: అతుల బలాఢ్యులు+ఐన= సాటిలేని బలసంపన్ను లైన; అమర+అంశ సముద్భవులు+ఎల్లన్= దేవతల అంశలతో పుట్టిన వా రంతా; పాండుభూపతి సుత, పక్షము+ఐ= పాండవేయుల పక్షాన్ని పొంది; సుర విపక్షగణ + అంశజులు+ఎల్లన్= రాక్షసుల సమూహాల అంశాలలో పుట్టిన వారంతా; దుర్మద+ఉద్ధత కురురాజ పక్షము+అయి= దుర్మదుడున్నూ, గర్వితుడున్నూ అయిన దుర్యోధనుడి పక్షం పొందినవారై; ధారుణి, భారము+పాయన్= భూభారం తొలగేటట్లుగా; వీరులు+ఐ; పరస్పరయుద్ధము+చేసి= ఒకరితో, ఒకరు పోరాడి; భారత రణభూమిన్= భారతయుద్ధరంగంలో; ఈల్గిరి= చనిపోయారు.

తాత్పర్యం: దేవతల అంశలతో జన్మించిన సాటిలేని పరాక్రమవంతు లంతా పాండవేయులపక్షమై, రాక్షసాంశలతో పుట్టినవారంతా ఉద్ధతుడు, ఉన్మదుడు అయిన దుర్యోధనుడిపక్షాన్ని పొంది, వీరులై ఒకరితో ఒకరు పోరాడి భూభారం తొలగేటట్లుగా భారత రణరంగాన హతులైనారు.

విశేషం: దేవాసుర ప్రవృత్తుల నడుమ జరిగే బలమైన సంఘర్షణను వర్ణించటం ఇతిహాస స్వభావం.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 57

ప్రతిపదార్థం: ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అనగా విని జనమేజయుడు వైశంపాయనుడితో ఈవిధంగా అన్నాడు.

క. ఆదిత్య దైత్య దానవు, లాదిగఁ గల భూతరాశి దగు సంభవమున్
మేదినిఁ దదంశముల మ, ర్త్యోదయములు నాకుఁ జెప్పు మొగి నేర్పడఁగన్. 58

ప్రతిపదార్థం: ఆదిత్య, దైత్య, దానవులు= దేవతలు, రాక్షసులు, దానవులు; ఆదిగన్+కల= మొదలుగా గల; భూతరాశిది+అగు= జీవసముదాయానికి సంబంధించిన; సంభవమున్= పుట్టుకను; మేదినిన్= భూమియందు; తద్+అంశములన్= వారి అంశలతో; మర్త్య+ఉదయములు= మానవులయొక్క పుట్టుకలు; ఒగిన్= క్రమంగా; ఏర్పడఁగన్= తేట తెల్లమయ్యేటట్లుగా; నాకున్+చెప్పుము= నాకు తెల్పుము.

తాత్పర్యం: దేవదానవ రాక్షసుల జీవసముదాయంయొక్క పుట్టుకను, ఆ అంశలతో వా రీ భూమిపై మానవులుగా జన్మించటాన్నిగురించి నాకు తేటతెల్లంగా చెప్పండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: దేవదానవాదుల అంశావతారాలుగా భూమిమీద పుట్టినవారినిగురించి చెప్పేముందు ఆ అంశలకు మూలకారకు లైనవారి పుట్టుకల విశేషాలను వివరించి, కథను ప్రసన్నం చేయుమని (తేటతెల్లంచేయుమని) జనమేజయు డడిగాడు.

దేవదానవప్రముఖుల యుత్పత్తిక్రమము (సం. 1-59-9)

వ. అనిన విని జనమేజయునకు వైశంపాయనుం డి ట్లని చెప్పెఁ; దొల్లి సకలజగదుత్పత్తినిమిత్తభూతుం డైన బ్రహ్మకు మానసపుత్త్రు లైన మరీచియు, నంగిరసుండును, నత్త్రియుఁ, బులస్త్యుండును, బులహుండును, గ్రతువును ననునార్వురు పుట్టి; రందు మరీచికిఁ గశ్యపప్రజాపతి పుట్టెఁ; గశ్యపువలనఁ జరాచర భూతరాశి యెల్ల నుద్భవిల్లె; నె ట్లనిన- బ్రహ్మదక్షిణాంగుష్ఠంబున దక్షుండును, వామాంగుష్ఠంబున ధరణి యను స్త్రీయునుం బుట్టిన యయ్యిరువురకును. 59

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; జనమేజయునకు; వైశంపాయనుండు; ఇట్లు+అని, చెప్పెన్; తొల్లి= పూర్వం; సకల జగత్+ఉత్పత్తి నిమిత్త భూతుం డైన= సమస్త లోకాలను సృష్టించేందుకు కారణ మైనవా డైన; బ్రహ్మకున్; మానస, పుత్త్రులు= మనస్సునుండి పుట్టిన కొడుకులు; ఐన; మరీచియున్; అంగిరసుండునున్; అత్రియున్; పులస్త్యుండును; పులహుండును; క్రతువునున్; అను+ఆర్వురు; పుట్టిరి; అందున్= వారిలో; మరీచికిన్; కశ్యప ప్రజాపతి; పుట్టెన్; కశ్యపు వలనన్; చర+అచర భూతరాశి= జంగమ స్థావరాలు మొదలుగాగల జీవసముదాయం; ఎల్లన్+ఉద్భవిల్లెన్= సమస్తం పుట్టింది; ఎట్లు+అనినన్= ఏవిధంగా అంటే; బ్రహ్మ, దక్షిణ+అంగుష్ఠంబునన్= బ్రహ్మ యొక్క కుడిచేతి బొటన వ్రేలియందు; దక్షుండును; వామ+అంగుష్ఠంబునన్= ఎడమచేతి బొటనవ్రేలియందు; ధరణి, అను, స్త్రీయునున్= ధరణి అనే పేరుగల వనితయున్నూ; పుట్టినన్= పుట్టగా; ఆ+ఇరువురకును= ఆ ఇద్దరికిన్నీ.

తాత్పర్యం: మానవజాతిపుట్టుకనుగురించి వైశంపాయనుడు జనమేజయుడికి ఇట్లా చెప్పాడు: సృష్టికారకు డైన బ్రహ్మదేవుడి మానసపుత్త్రు లైన వారు ఆరుగురు. వారు మరీచి, అంగిరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు అనే పేర్లు కలవారు. వీరిలో మరీచికి కశ్యపప్రజాపతి జన్మించాడు. కశ్యపుడికి స్థావరజంగమా లన్నీ పుట్టినవి. బ్రహ్మదేవుడి కుడిచేతి బొటనవ్రేలియందు దక్షు డనే వాడున్నూ, ఎడమచేతి బొటనవ్రేలియందు ధరణి అనే స్త్రీయున్నూ జన్మించారు వారిద్దరికి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. సుతు లనఘులు వేవురు దమ । యుతు లై యుదయించి, సాంఖ్యయోగాభ్యాసో
న్నతిఁ జేసి ముక్తు లై, భూ । రితేజు లందఱును నూర్ధ్వరేతసు లైనన్. 60

ప్రతిపదార్థం: అనఘులు= పుణ్యులు; వేవురు= వేయిమంది; సుతులు= కొడుకులు; దమయుతులు+ఐ= ఇంద్రియనిగ్రహంతో కూడినవా రై; ఉదయించి= జన్మించి; సాంఖ్య యోగ+అభ్యాస+ఉన్నతిన్, చేసి= సాంఖ్య మనే యోగాన్ని అభ్యసించటంలోని గొప్పతనంచేత; భూరి, తేజులు= గొప్ప తేజస్సు కలవారు; అందఱును; ముక్తులు+అయి; ఊర్ధ్వ, రేతసులు+ఐనన్= ఋషులు కాగా.

తాత్పర్యం: ధరణికి, దక్షునికి వేయిమంది పుత్రులు జన్మించారు. వారు ఇంద్రియనిగ్రహం కలవారై సాంఖ్య యోగాన్ని అభ్యసించి, ముక్తు లై ఊర్ధ్వరేతసులు (ఋషులు) కాగా.

వ. పదంపడి యేఁబండ్రుకూఁతులుం బుట్టిన, వారల నెల్ల దక్షుం డపుత్త్రకుండు గావునఁ బుత్త్రీకరణంబు సేసి, యందుఁ గీర్తి లక్ష్మీ ధృతి మేధా పుష్టి శ్రద్ధా క్రియా బుద్ధి లజ్జా మతు లను వనితలఁ బదుండ్రను ధర్మ్మం డను మనువున కిచ్చె; నశ్విన్యాదు లైన యిరువదేడ్వు రను జంద్రున కిచ్చె; నదితి దితి దను కాలా నాయు స్సింహికా ముని కపిలా వినతా క్రోధా ప్రాధా క్రూరా కద్రువ లను పదుమువ్వురను గశ్యపున కిచ్చె; నం దదితి యనుదానికి ధాతృ మిత్త్రార్యమ శక్ర వరుణాంశు భగ వివస్వ త్పూష సవితృ త్వష్టృ విష్ణు లనంగా ద్వాదశాదిత్యులు పుట్టిరి; మఱియును. 61

ప్రతిపదార్థం: పుత్త్రీకరణము= పుత్రులుగా భావించుట.

తాత్పర్యం: దక్షప్రజాపతికి ఏభైమంది కుమార్తెలు జన్మించారు. వారిలో పది మందిని ధర్ముడికి, ఇరవైఏడు మందిని చంద్రుడికి, పదమూడు మందిని కశ్యపుడికి ఇచ్చాడు. కశ్యపుడికి ఇచ్చిన కుమార్తెలలో అదితి అనే కుమార్తెకు ద్వాదశాదిత్యులు జన్మించారు.

క. దితి యనుదానికి నప్రతి । హతబలుఁడు హిరణ్యకశిపుఁ డనఁ బుట్టె సుతుం;
డతనికి నేవురు పుట్టిరి । ప్రతాపగుణయుతులు సుతులు ప్రహ్లాదాదుల్. 62

ప్రతిపదార్థం: దితి+అనుదానికిన్= దితియనుపేరుగల వనితకు; అప్రతిహతబలుఁడు= అడ్డగించరాని శక్తి గలవాడైన; హిరణ్యకశిపుఁడు= హిరణ్యకశిపుడనే పేరుగలిగిన; సుతుండు= కుమారుడు; పుట్టెన్= జన్మించాడు; అతనికిన్= ఆహిరణ్యకశిపుడికి; ప్రతాప గుణయుతులు= శౌర్య మనే గుణముతో కూడిన వారైన; ప్రహ్లాద+ఆదుల్= ప్రహ్లాదుడు మొదలైన; సుతులు= కొడుకులు; ఏవురు= ఐదుమంది; పుట్టిరి= కలిగిరి.

తాత్పర్యం: దక్షుడు కశ్యపుడి కిచ్చిన తన కూతుళ్ళలో దితి అనే ఆమెకు హిరణ్యకశిపు డనే అవక్రపరాక్రముడు జన్మించాడు. అతడికి బలపరాక్రమ గుణసంపన్ను లైన ప్రహ్లాదుడు మొదలుగా గల అయిదుగురు కుమారులు పుట్టారు.

వ. ఆ ప్రహ్లాదసంహ్లాదానుహ్లాద శిబిబాష్కలులయందుఁ బ్రహ్లాదునకు విరోచన కుంభనికుంభు లనంగా ముగ్గురు పుట్టి; రందు విరోచనునకు బలి పుట్టె; బలికి బాణాసురుండు పుట్టె; దను వనుదానికి విప్రచిత్తి శంబర నముచిపులోమాసి లోమకేశి దుర్జయాదు లయిన దానవులు నలువండ్రు పుట్టిరి; వారల పుత్త్రపౌత్త్రవర్గం బసంఖ్యాతం బై ప్రవర్తిల్లెఁ; గాల యనుదానికి వినాశనక్రోధాదు లెనమండ్రు పుట్టిరి. 63

ప్రతిపదార్థం: నలువండ్రు= నలభైమంది; పుత్త్ర పౌత్ర వర్గంబు= కొడుకుల, మనుమల సమూహం; అసంఖ్యాతంబు= లెక్కపెట్టరానిది; ఎనమండ్రు= ఎనిమిదిమంది;

తాత్పర్యం: ఆ అయిదుగురిలో ప్రహ్లాదుడికి విరోచనుడు, కుంభకుడు, నికుంభుడు అనే ముగ్గురు కొడుకులు పుట్టారు. విరోచనుడికి బలి పుట్టాడు. బలికి బాణాసురుడు జన్మించాడు. దను వనే వనితకు విప్రచిత్తి మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నలుబది (40) మంది దానవులు కలిగారు. వారి కొడుకుల, మనుమళ్ళ సమూహం లెక్కించటానికి శక్యం కానిదై వ్యాపించింది. కాల అనే వనితకు వినాశనుడు, క్రోధుడు మొదలైన ఎనిమిదిమంది పుట్టారు.

ఆ. అజితశక్తియుతులనాయువ యనుదాని । కజరు లధిక వీరు లతుల భూరి
భుజులు శక్రరిపులు పుట్టిరి నలువురు । విక్షర బలవీర వృత్రు లనఁగ. 64

ప్రతిపదార్థం: అజితశక్తి యుతులు= జయించబడని శక్తితో కూడిన వారైన; అజరులు= ముసలితనం లేనివారు; అధికవీరులు= గొప్ప పరాక్రమవంతులు; అతుల, భూరి, భుజులు= సాటి లేని భుజబలం కలవారైన; విక్షర బలవీర వృత్రులు+అనఁగన్= విక్షరుడు, బలుడు, వీరుడు, వృత్రు డనే పేర్లు కలవారు; నలువురు; శక్రరిపులు= దేవేంద్రుడికి శత్రువులు; అనాయువ, అను, దానికిన్= అనాయువ అనే ఆమెకు; పుట్టిరి= జన్మించారు.

తాత్పర్యం: అనాయువు అనే ఆమెకు మహాపరాక్రమవంతు లైన విక్షర బల వీర వృత్రు లనే పేర్లు కల నలుగురు కుమారులు ఇంద్రుడికి శత్రువు లై జన్మించారు.

వ. మఱియు సింహిక యనుదానికి రాహువు పుట్టె; ముని యనుదానికి భీమసేనోగ్రసేనాదు లయిన గంధర్వులు పదార్వురు పుట్టిరి; కపిల యను దానికి నమృతంబును గోగణంబులును బ్రాహ్మణులును ఘృతాచీ మేనకాదు లయిన యప్సరసలును బుట్టిరి; వినత యను దానికి ననూరుండును గరుడుండును బుట్టి; రం దనూరునకు శ్యేని యనుదానికి సంపాతి జటాయువులు పుట్టిరి; క్రోధ యను దానికిఁగ్రోధవశగణంబు పుట్టెఁ; బ్రాధ యను దానికి సిద్ధాదులు పుట్టిరి; క్రూర యనుదానికి సుచంద్ర చంద్ర హంత్రాదులు పుట్టిరి; కద్రువ యను దానికి శేష వాసుకి పురోగమానేక భుజంగముఖ్యులు పుట్టిరి. 65

ప్రతిపదార్థం: పది+ఆర్వురు= పదియారుమంది; గోగణంబులు= గోవుల సమూహం; శేషవాసుకి పురోగమ+అనేక, భుజంగముఖ్యులు= శేషుడు, వాసుకి మున్నగు పలువురు సర్పశ్రేష్ఠులు.

తాత్పర్యం: సింహికకు రాహువు, మునికి భీమసేనాదు లైన గంధర్వులు పదహారుమంది, కపిలకు అమృతం, గోగణం, బ్రాహ్మణులు, అప్సరసలు జన్మించారు. వినతకు అనూరుడు గరుడుడు పుట్టారు. అనూరుడికి శ్యేని అనే భార్య వలన సంపాతి, జటాయువు జన్మించారు. క్రోధకు క్రోధ వశగణం పుట్టింది. ప్రాధకు సిద్ధాదులు పుట్టారు. క్రూరకు సుచంద్రాదులు జన్మించారు. కద్రువకు శేషుడు వాసుకి మొదలైన సర్పముఖ్యులు పుట్టారు.

సీ. మఱి యంగిరసుఁ డను మానసపుత్త్రున । కయ్యుతథ్యుండు బృహస్పతియును
సంవర్తుఁడును గుణాశ్రయ యోగసిద్ధి య । న్ధ్యాతురుఁబుట్టి; రక్కొడుకులందు
విభుఁడు బృహస్పతి వేల్పుల కాచార్యుఁ । డై లోకపూజితుఁ డై వెలింగె;
మానుగా నత్రి య న్మానసపుత్త్రున । కుద్భవించిరి ధర్మయుతచరిత్రు

ఆ. లఖిలవేదవేదు లాద్యు లనేకులు । దీప్తరవిసహస్రతేజు లనఘు
లధికతరతపోమహత్త్వసంభృతవిశ్వ । భరులు సత్యపరులు పరమమునులు. 66

తాత్పర్యం: అంగిరసు డనే మానసపుత్రుడికి ఉతథ్యుడు, బృహస్పతి, సంవర్తుడు అనే కొడుకులూ, గుణవతి అయిన యోగసిద్ధి అనే కూతురూ జన్మించారు. ఆ కుమారులలో బృహస్పతి దేవతలకు గురువై లోకపూజ్యుడై ప్రకాశించాడు. అత్రి అనే మానసపుత్రుడికి ధర్మస్వభావులు, వేదవిదులు, వేయిసూర్యులవెలుగు కలవారు, పుణ్యాత్ములు, అధికతపోమహితులు, ఆద్యులు సత్యపరులు అయినట్టి పరమమునులు అనేకులు జన్మించారు.

వ. మఱియుఁ బులస్త్యుం డను మానసపుత్త్రునకు ననేకరాక్షసులు పుట్టిరి; పులహుం డను మానసపుత్త్రునకుఁ గిన్నర కింపురుషాదులు పుట్టిరి; క్రతు వను మానసపుత్త్రునకు సత్యవ్రత పరాయణు లైన పతంగ సహచరులు పుట్టిరి; పైతామహుం డైన దేవుం డను మునికిఁ బ్రజాపతి పుట్టె; వానికి ధూమ్రా బ్రహ్మవిద్యా మనస్వినీ రతాశ్వసాశాండిలీ ప్రభాత లనంగా నేడ్వురు భార్య లై; రందు ధూమ్రకు ధరుండును, బ్రహ్మవిద్యకు ధ్రువుండును, మనస్వినికి సోముండును, రతకు నహుండును, శ్వసకు ననిలుండును, శాండిలికి నగ్నియుఁ, బ్రభాతకుఁ బ్రత్యూష ప్రభాసు లనంగా నెనమండ్రు వసువులును బుట్టి; రందు ధరుం డను వసువునకు ద్రవిణుండును. హుతహవ్యవహుండునుం బుట్టిరి; ధ్రువుండను వసువునకుఁ గాలుండు పుట్టె; సోముం డను వసువునకు మనోహర యనుదానికి వర్చసుండును శిబిరుండును బ్రాణుండును రమణుండును బృథ యను కూఁతురునుం బుట్టిరి; పృథకుఁ బదుండ్రు గంధర్వసుతులు పుట్టిరి; యహుం డను వసువునకు జ్యోతి పుట్టె; ననిలుండను వసువునకు శివ యను దానికి మనోజవుండును నవిజ్ఞాతగతియునుం బుట్టిరి. అగ్ని యను వసువునకుఁ గుమారుండు పుట్టెఁ; బ్రత్యూషుం డను వసువునకు ఋషియైన దేవలుండు పుట్టెఁ; బ్రభాసుం డను వసువునకు బృహస్పతి చెలియ లైన యోగసిద్ధికి విశ్వకర్మ పుట్టె. 67

తాత్పర్యం: పులస్త్యు డనే బ్రహ్మమానసపుత్రుడికి అనేక రాక్షసులు జన్మించారు. పులహు డనే మానసపుత్రుడికి కిన్నర కింపురుషాదులు పుట్టారు. క్రతు వనేమానసపుత్రుడికి పక్షిసంతతులు జన్మించాయి. దేవుడనే మనువుకు ప్రజాపతి పుట్టాడు. ఆ ప్రజాపతికి ఏడుగురు భార్యలు. వారిలో ధూమ్ర అనే ఆమెకు ధరుడనే వాడు, బ్రహ్మ విద్యకు ధ్రువుడు, మనస్వినికి సోముడు, రతకు అహుడు, శ్వసకు అనిలుడు, శాండిలికి అగ్ని, ప్రభాతకు ప్రత్యూష, ప్రభాసు లనేపేర్లు కల ఎనిమిదిమంది వసువులు జన్మించారు. ఆ వసువులలో ధరుడనే వాడికి ద్రవిణుడు హుత హవ్యవహుడు అనే వారు జన్మించారు. ధ్రువుడనే వసువుకు కాలుడు పుట్టాడు. సోముడనే వసువుకు అతని భార్య అయిన మనోహరయందు వర్చసుడు, శిబిరుడు, ప్రాణుడు, రమణుడు అనే కుమారులు, పృథ అనే కూతురు పుట్టారు. పృథకు పదిమంది గంధర్వులు జన్మించారు. యహుడనే వసువుకు జ్యోతి జన్మించింది. అనిలుడికి శివ అనే ఆమెవలన మనోజవుడున్నూ, అవిజ్ఞాతగతియున్నూ జన్మించారు. అగ్నికి కుమారుడనే పేరు కలవాడు పుట్టాడు. ప్రత్యూషుడికి దేవలుడనే ఋషి జన్మించాడు. ప్రభాసుడనే వసువుకు బృహస్పతిసోదరి అయిన యోగసిద్ధి భార్య. ఈ దంపతులకు విశ్వకర్మ జన్మించాడు.

క. ఆ విశ్వకర్మ నిర్మిత । దేవవిమానుండు, నిఖిల దివ్యాభరణ
శ్రీవిరచన పరితోషిత । దేవుఁడు, శిల్పప్రజాపతియు నై నెగడెన్. 68

ప్రతిపదార్థం: ఆ విశ్వకర్మ= శ్రీ విశ్వకర్మ; నిర్మిత దేవవిమానుండు= నిర్మించబడిన దేవతలయొక్క విమానాలు కలవాడు; అంటే దేవవిమానాలను నిర్మించినవాడు; నిఖిల దివ్యాభరణ శ్రీ విరచన పరితోషిత దేవుఁడు= సమస్త మైన దివ్యము లైన

ఆభరణాల సంపదను నిర్మించటంచేత మిక్కిలి సంతృప్తిపడిన దేవతలు కలవాడు; శిల్ప ప్రజాపతియున్+ఐ= శిల్పకళలో బ్రహ్మవంటి వాడై; నెగడెన్= ప్రసిద్ధి కెక్కాడు.

తాత్పర్యం: ఆ విశ్వకర్మ దేవతల విమానాలను నిర్మించినవాడు, సమస్తదివ్యాభరణసంపదను విరచించటంచేత దేవతలను సంతోషపెట్టినవాడు. అతడు శిల్పప్రజాపతిగా ప్రసిద్ధి కెక్కాడు.

వ. మఱియు స్థాణునకు మానసపుత్త్రు లైన మృగవ్యాధ శర్వ నిర్మృత్యజైక పాదహిర్బుధ్న్యపినాకి దహనేశ్వరకపాలి స్థాణు భవు లనంగా నేకాదశరుద్రులు పుట్టిరి; మఱి బ్రహ్మ దక్షిణస్తనంబున ధర్మిం డను మనువు పుట్టె; వానికి శమకామహర్షు లనంగా ముప్వురు పుట్టిరి; యాముప్వురకుఁ గ్రమంబునఁ బ్రాప్తి రతి నంద లనంగా ముప్వురు భార్యలైరి; సవితృనకు బడబారూపధారిణి యైన త్వాష్ట్రికి నాశ్వినులు పుట్టిరి; బ్రహ్మహృదయంబున భృగుండు పుట్టె; వానికిఁగవి పుట్టె; వానికి శుక్రుండు పుట్టి యసురుల కాచార్యుం డయ్యె; వానికిఁ జండామర్కత్వష్టృధరాత్త్రు లనంగా నలువురు గొడుకులు పుట్టిరి; వా రసురులకు యాజ్ఞికు లైరి మఱియును. 69

తాత్పర్యం: స్థాణుడికి మానసపుత్రు లై ఏకాదశరుద్రులు జన్మించారు. బ్రహ్మదక్షిణస్తనంనుండి ధర్మ డనే మనువు జన్మించాడు. అతడికి శమకామహర్షు లనే ముగ్గురు పుత్రులు పుట్టారు. ఆ ముగ్గురికీ ప్రాప్తి రతి నంద లనే వారు భార్యలైనారు. సవితృడికి బడబారూపం ధరించిన త్వాష్ట్రికి ఆశ్వినులు జన్మించారు. బ్రహ్మహృదయం నుండి భృగుడు జన్మించాడు. ఆ భృగుడికి కవియును, ఆ కవికి శుక్రుడును జన్మించారు. శుక్రుడు రాక్షసులకు గురు వైనాడు. శుక్రుడికి నలుగురు కుమారులు పుట్టారు. వారు రాక్షసులకు యాజ్ఞికు లైనారు.

సీ. విగతాఘుఁ డైన యాభృగునకుఁ బుత్త్రుఁడై । చ్యవనుండు పుట్టె; భార్గవవరుండు
జనవంద్యుఁ డతనికి మనుకన్యకకుఁ బుట్టె । నూరుల నౌర్వుండు భూరికీర్తి;
యతనికి నూర్వురు సుతులు ఋచీకాదు । లుదయించి రఖిల భూవిదిత తేజు;
లందు ఋచీకున కొందంగ జమదగ్ని । యనుముని పుట్టె; నాతనికిఁ బుట్టి

ఆ. రలఘుమతులు సుతులు నలువురు; వారిలోఁ । బరశురాముఁ డాదిపురుషమూర్తి
దండితాహితుండు గొండుక యయ్యును । దద్ద గుణములందుఁ బెద్ద యయ్యె. 70

ప్రతిపదార్థం: విగత+అఘుఁడు+ఐన= (పూర్తిగా పోయిన పాపం గలవా డైన) పరమ పుణ్యు డైన; భార్గవ వరుండు= భృగువంశ శ్రేష్ఠుడు; జనవంద్యుఁడు= జనులచేత నమస్కరించ తగినవాడు; ఊరులన్= తొడలయందు; భూరికీర్తి= గొప్పకీర్తి గలవాడు; అఖిల భూవిదిత తేజులు= సమస్తభూమియందు ప్రసిద్ధ మైన తేజం కలవారు; అలఘుమతులు= ఉదారులు; ఆదిపురుషమూర్తి= శ్రీమన్నారాయణుడి రూపం; దండిత+అహితుండు= శత్రువులను శిక్షించినవాడు; కొండుక= బాలుడు; తద్ద= గొప్ప; గుణముల+అందున్; పెద్ద+అయ్యెన్;

తాత్పర్యం: పరమపుణ్యు డైన భృగువుకు చ్యవనుడు జన్మించాడు. పూజ్యు డైన చ్యవనుడికి మనుకన్యక భార్య అయినది. ఆ దంపతులకు ఊరువులందు ఔర్వుడు జన్మించాడు. అతడికి ఋచీకాదు లనబడే నూరుగురు కుమారులు పుట్టారు. వారిలో ఋచీకుడికి జమదగ్ని ఉదయించాడు. ఆ జమదగ్నిమహామునికి నలుగురు కుమారులు.

వారిలో పరశురాముడు మహావిష్ణువు అవతారం. అతడు శత్రుసంహారం కావించి చిన్న వాడైనా మహామహుడుగా ప్రసిద్ధి కెక్కాడు.

వ. మఱియు బ్రహ్మకు ధాతయు విధాతయు ననంగా నిద్దఱు మనుసహాయులై పుట్టిరి; వారితోడను లక్ష్మి పుట్టె; లక్ష్మికి మానసపుత్త్రు లనేకులు పుట్టిరి; వరుణునకు జ్యేష్ఠకు బలుండును సుర యను కూఁతురునుం బుట్టిరి; సురయం దధర్ముండు పుట్టె; నా యధర్మునకు నిర్ఋతికి భయ మహాభయ మృత్యువు లనఁగా ముప్పురు పుట్టిరి; మఱియుఁ దామ్రకుఁ గాకియు శ్యేనియు భాసియు ధృతరాష్ట్రియు శుకియు నన నేవురుకన్యలు పుట్టిరి; యందుఁ గాకి యనుదానికి నులూకంబులు పుట్టె; శ్యేని యను దానికి శ్యేనంబులు పుట్టె; భాసి యనుదానికి భాసగృధ్రాదులు పుట్టె; ధృతరాష్ట్రి యను దానికి హంస చక్ర వాకంబులు పుట్టె; శుకియను దానికి శుకంబులు పుట్టె; మఱియుం గ్రోధునకు మృగియు మృగమందయు హరియు భద్రమనసయు మాతంగియు శార్దూలియు శ్వేతయు సురభియు సురసయు ననఁ దొమ్మండ్రు పుట్టి; రందు మృగి యనుదానికి మృగంబులు పుట్టె; మృగమంద యనుదానికి ఋక్ష చమర సృమరాదులు పుట్టె; హరి యనుదానికి వానరగణంబులు పుట్టె భద్రమనస యనుదానికి నైరావణంబు పుట్టె; నైరావణంబునకు దేవనాగంబులు పుట్టె; మాతంగి యనుదానికి గజంబులు పుట్టె; శార్దూలి యనుదానికి సింహవ్యాఘ్రంబులు పుట్టె; శ్వేత యనుదానికి దిగ్గజంబులు పుట్టె; సురభి యనుదానికి రోహిణియు గంధర్వియు ననలయు ననం బుట్టి; రందు రోహిణికిఁ బశుగణంబులు పుట్టె; గంధర్వి యనుదానికి హయంబులు పుట్టె; ననలకు గిరి వృక్షలతా గుల్మంబులు పుట్టె; సురసకు సర్పంబులు పుట్టె; నిది సకలభూత సంభవప్రకారంబు. 71

ప్రతిపదార్థం: ఉలూకంబులు= గుడ్లగూబలు; శ్యేనంబులు= డేగలు; భాసగృధ్ర+ఆదులు= భాసములు గ్రద్దలు మొదలైనవి; శుకంబులు= చిలుకలు; ఋక్ష చమర సృమర+ఆదులు= ఎలుగుబంట్లు, చమరమృగాలు; పెద్ద చమరమృగాలు మొదలైనవి; ఐరావణంబు= తెల్లఏనుగు; దేవనాగంబులు= దేవతల ఏనుగులు; వానర గణంబులు= కోతుల సమూహాలు; వ్యాఘ్రంబులు= పెద్దపులులు; గుల్మంబులు= పొదలు; సకలభూతసంభవప్రకారంబు= సమస్తజీవులు పుట్టినరీతి.

తాత్పర్యం: బ్రహ్మకు ధాత, విధాత అనే ఇద్దరు జన్మించి మనువుకు సహాయు లైనారు. ధాతృవిధాతలతోపాటు లక్ష్మి జన్మించింది. ఆమెకు మానసపుత్రులు అనేకులు జన్మించారు. జ్యేష్ఠా వరుణ దంపతులకు బలు డనే కుమారుడు; సుర అనే కూతురు జన్మించారు. సురకు అధర్ముడు పుట్టాడు. అధర్ముడికి నిర్ఋతి భార్య అయింది. ఆ దంపతులకు భయ, మహాభయ, మృత్యువు అనే ముగ్గురు పుట్టారు. మఱియు, తామ్ర అనే ఆమెకు కాకి, శ్యేని, భాసి, ధృతరాష్ట్రి, శుకి అనే అయిదుగురు కన్యలు పుట్టారు. కాకికి గుడ్లగూబలు, శ్యేనికి డేగలు, భాసికి భాసములు, గ్రద్దలు, ధృతరాష్ట్రికి హంసలు, చక్రవాకాలు, శుకికి చిలుకలు జన్మించాయి. మఱియు క్రోధుడికి మృగి మొదలైన తొమ్మిది మంది కూతులు జన్మించారు. వారిలో మృగి అనే ఆమెకు మృగాలు, మృగమంద అనే ఆమెకు ఎలుగుబంట్లు, చిన్న, పెద్ద చమరీ మృగాలు పుట్టాయి. హరి అనే ఆమెకు కోతుల సమూహం కలిగింది. భద్రమనస అనే ఆమెకు ఐరావణం, ఐరావణానికి దేవగజాలు కలిగాయి. మాతంగికి గజాలు పుట్టాయి. శార్దూలికి సింహాలు, పెద్దపులులు పుట్టాయి. శ్వేతకు దిగ్గజాలు పుట్టాయి. సురభికి రోహిణి, గంధర్వి, అనల అనేవారు పుట్టారు. వారిలో

రోహిణికి పశువులు, గంధర్వికి గుఱ్ఱాలు, అనలకు కొండలు, చెట్లు, తీగెలు, తీవెపొదలు పుట్టాయి. సురసకు సర్పాలు పుట్టాయి. సకలజీవాలు పుట్టినరీతి ఇది.

చ. దివిజ మునీంద్ర దానవదితి ప్రభవాదిసమస్తభూతసం
భవముఁ గృతావధాను లయి భక్తిమెయిన్ వినుచున్న పుణ్యమా
నవులకు నిక్కువం బగు మనఃప్రియ నిత్యసుఖంబులుం జిరా
యువు బహుపుత్త్రలాభవిభవోన్నతియున్ దురితప్రశాంతియున్. 72

ప్రతిపదార్థం: దివిజమునీంద్ర దానవ దితి ప్రభవాది సమస్త భూత సంభవము= దేవతలు, మహామునులు, దానవులు, రాక్షసులు మొదలైన సమస్త జీవుల పుట్టుకను; కృతావధానులు+అయి= ఏకాగ్రత కలిగిన వారై; భక్తి మెయిన్= భక్తితో; వినుచున్+ఉన్న; పుణ్యమానవులకున్; మనఃప్రియ నిత్య సుఖంబులున్= మనసుకు ఇంపైన నిరంతర సౌఖ్యాలున్నూ; చిరాయువు= దీర్ఘాయువున్నూ, బహుపుత్ర లాభ విభవ+ఉన్నతియున్= పెక్కుమంది పుత్రులయొక్క లాభమూ, మహైశ్వర్యమూ; దురిత, ప్రశాంతియున్= పాపం అణగిపోవటమూ; నిక్కువంబు+అగున్= యథార్థ మౌతాయి. (తప్పకుండ కలుగుతాయి అని భావం).

తాత్పర్యం: దేవతలు, మునులు, దైత్యులు, దానవులు మొదలైన జీవుల పుట్టుకను సావధానులై వింటున్న పుణ్యులకు అభీష్టాలైన నిత్యసుఖాలు, చిరాయువు, బహుపుత్రలాభం, ఉన్నతమైన వైభవం పాపక్షయం యథార్థంగా అవుతాయి.

విశేషం: దేవతలు మొదలుకొని సర్వభూతాలవరకు సాగిన ఈ సృష్టికథను వినినవారికి కలిగే శుభాలను పేర్కొనే ఫలశ్రుతి ఇది. పురాణపంచలక్షణాలలో సర్గ, ప్రతిసర్గ, వంశ, మన్వంతరాలకు చెందిన కొన్నిఅంశాలు ఇందులో చోటుచేసికొని ఉండటంచేత పుణ్యప్రదమని తెలపటానికీ, సృష్టిలో ప్రతిజీవికూడా ఆ బ్రహ్మచైతన్యంనుండి పుట్టిన దనే ఆధ్యాత్మికస్పృహ కలగటానికీ ఈ ఫలశ్రుతి తోడ్పడుతుంది. "బీజం మాం సర్వభూతానాం, విద్ధి పార్థ! సనాతనం" (భగవద్గీత. 7.10) అనే భగవద్వాక్యం దీనికి ప్రమాణం.

దేవదానవాద్యంశములచే భూమియందుఁ బుట్టిన వారి క్రమము (సం.1-57-84)

వ. మఱియు మర్త్యలోకంబునందు దేవదైత్యదానవుల యంశావతారంబుల వివరించెద వినుము. 73

తాత్పర్యం: భూలోకంలో దేవదానవ రాక్షసుల అంశలతో జన్మించిన వారినిగూర్చి వివరిస్తాను వినవలసింది.

క. యాదవవంశంబున జగ । దాదిజుఁ డగు విష్ణుదేవునంశంబున ను
త్పాదిల్లెఁ గృష్ణుఁ డపగత । ఖేదుఁడు వసుదేవ దేవకీదేవులకున్. 74

ప్రతిపదార్థం: జగత్+ఆదిజుఁడు+అగు= జగత్తునకు మొదట పుట్టినవాడైన; విష్ణుదేవు+అంశంబునన్= విష్ణుదేవునియొక్క అంశతో; అపగత, ఖేదుఁడు= దుఃఖంలేనివాడు, యాదవ వంశంబునన్; వసుదేవ, దేవకీదేవులకున్; కృష్ణుఁడు; ఉత్పాదిల్లెన్= పుట్టెను.

తాత్పర్యం: జగత్తుకు ఆద్యుడైన మహావిష్ణునిఅంశంతో శ్రీకృష్ణుడు యాదవవంశంలో దేవకీవసుదేవులకు జన్మించాడు.

క. శ్రీ వెలుఁగ రోహిణికి వసు । దేవున కుదయించె విష్ణుదేవాంశమునన్
భూవంద్యుఁ డనంతుఁడు బల । దేవుండు ప్రలంబ ముఖ్యదితిజాంతకుఁ డై. 75

ప్రతిపదార్థం: శ్రీ వెలుఁగన్= సంపద విలసిల్లేటట్లుగా; విష్ణుదేవ+అంశమునన్= విష్ణుమూర్తి అంశతో; భూవంద్యుఁడు= భూమిలోని జనులచేత నమస్కరించ తగినవాడు; అనంతుఁడు= ఆదిశేషుడు; ప్రలంబ ముఖ్యదితి జాంతకుడై (దితిజ+ అంతకుఁడై)= ప్రలంబుడువంటి ప్రముఖ రాక్షసులను చంపేవాడై; బలదేవుండు; ఉదయించెన్= జన్మించాడు.

తాత్పర్యం: విష్ణుమూర్తిఅంశతో సర్వజనవంద్యు డైన ఆదిశేషుడు ప్రలంబాది రాక్షసులను సంహరించే వాడై రోహిణీ వసుదేవులకు బలదేవు డనే పేరుతో జన్మించాడు.

వ. మఱియు లక్ష్మి యంశంబున రుక్మిణి యుదయించె; సనత్కుమారు నంశంబునఁ బ్రద్యుమ్నుండు పుట్టె; నప్సరసల యంశంబులఁ గృష్ణునిషోడశసహస్రాంతఃపురవనితలు పుట్టి; రయ్యయి వేల్పుల యంశంబుల యదువృష్ణి భోజాంధక వంశంబుల వీరు లనేకులు పుట్టిరి; మఱియు. 76

తాత్పర్యం: లక్ష్మి అంశతో రుక్మిణి జన్మించింది; సనత్కుమారుడి అంశతో ప్రద్యుమ్నుడు ఉదయించాడు. అప్సరసలఅంశలతో శ్రీకృష్ణుడి పదహారువేల అంతఃపుర స్త్రీలు జన్మించారు. ఆ యాదేవతల అంశలతో యదువృష్ణి భోజఅంధక వంశాలందు వీరులు అనేకులు జన్మించారు. ఇంకను.

క. ముదమునఁ బ్రభాసుఁ డను నెని । మిది యగు వసునంశమునను మేదిని భీష్ముం
డుదయించె సర్వవిద్యా । విదుఁ డపజిత పరశురామ వీర్యుఁడు బలిమిన్. 77

ప్రతిపదార్థం: ముదమునన్= సంతోషంతో; ఎనిమిది+అగు= ఎనిమిదవ; వసు+అంశమునను= వసువు అంశంతో; మేదినిన్= భూమిలో; సర్వ విద్యావిదుఁడు= సమస్తవిద్యలు తెలిసినవాడు; అపజిత పరశురామ వీర్యుఁడు= ఓడింపబడిన పరశురాముడి యొక్క పరాక్రమం కలవాడు; బలిమిన్= శౌర్యంతో; భీష్ముండు; ఉదయించెన్= జన్మించాడు.

తాత్పర్యం: ప్రభాసుడనే ఎనిమిదవవసువుయొక్క అంశతో సమస్తవిద్యలు ఎరిగినవాడు, తనబలిమితో పరశురాముడిని గెల్చినవాడు అయినట్టి భీష్ముడు జన్మించాడు.

క. అనఘుఁడు సురగురునంశం । బునను భరద్వాజుకలశమునఁ బుట్టె శరా
సనవిద్యాచార్యుఁడు భూ । వినుతుఁడు ద్రోణుండు నిఖిలవేదవిదుం డై. 78

ప్రతిపదార్థం: అనఘుఁడు= పాపరహితుడు; సురగురు+అంశంబునను= బృహస్పతి అంశతోను; భరద్వాజు కలశమునన్= భరద్వాజ మునికలశపాత్రమందు; శరాసన, విద్యా+ఆచార్యుఁడు= ధనుర్విద్యాగురువూ; భూవినుతుఁడు= భూమియందలి జనులచేత కొనియాడబడినవాడూ అయిన; ద్రోణుఁడు; నిఖిలవేద విదుండు+ఐ= సమస్త వేదాలను తెలిసినవాడై; పుట్టెన్= పుట్టాడు.

తాత్పర్యం: దేవగురువైన బృహస్పతి అంశతో ధనుర్విద్యాగురువు, జనవంద్యుడు, సకల వేదజ్ఞుడు అయిన ద్రోణుడు జన్మించాడు.

క. అలఘుఁడు కామక్రోధా । దుల యేకత్వమునఁ బుట్టె ద్రోణునకు మహా
బలుఁ డశ్వత్థామ రిపు । ప్రళయాంతకుఁ డస్త్రశస్త్రపరిణతుఁ డగుచున్. 79

ప్రతిపదార్థం: కామ, క్రోధ+ఆదుల, ఏకత్వమునన్= కామం, క్రోధం మొదలైనవి ఏకం కావటం చేత; మహాబలుఁడు= గొప్పబలశాలి; రిపు ప్రళయాంతకుఁడు= శత్రువుల కల్లోలాన్ని అంతమొందించేవాడు; అస్త్ర శస్త్ర పరిణతుఁడు= అస్త్రాల (ప్రయోగాల)లో, శస్త్రాల (ప్రయోగాల)లో ఆరితేరినవాడు; అగుచున్; అశ్వత్థామ, ద్రోణునకున్, పుట్టెన్.

తాత్పర్యం: కామక్రోధాదుల ఏకత్వంవలన శత్రుప్రళయాన్ని అణచేవాడూ, అస్త్రశస్త్రాదులలో ఆరితేరిన వాడూ, మహాబలశాలియూ అయిన అశ్వత్థామ ద్రోణుడికి జన్మించాడు.

వ. మఱియు నేకాదశరుద్రుల యంశంబునఁగృపుఁడు పుట్టె; సూర్యునంశంబునఁగర్ణుండు పుట్టె; ద్వాపరాంశంబున శకుని పుట్టె; నరిష్టాపుత్త్రుం డయిన హంసుం డను గంధర్వ విభుండు ధృతరాష్ట్రుం డయి పుట్టె; మతి యనువేల్పుగాంధారి యై పుట్టె; మఱియు నయ్యిద్దఱకుం గలియంశంబున దుర్యోధనుండు పుట్టెఁ; బౌలస్త్య భ్రాతృవర్గంబు దుశ్శాసనాది దుర్యోధనానుజ శతం బై పుట్టె; హిరణ్యకశిపుండు శిశుపాలుండై పుట్టె; సంహ్లాదుండు శల్యుం డై పుట్టె; ననుహ్లాదుండు ధృష్టకేతుం డై పుట్టె; శిబి యనువాఁడు ద్రుమసేనుం డై పుట్టె; బాష్కలుండు భగదత్తుఁ డై పుట్టె; విప్రచిత్తి యను దానవుండు జరాసంధుం డై పుట్టె; నయశ్శిరుండును నశ్వశీర్షుండును నయశ్శంకుండును గగనమూర్ధుండును వేగవంతుండును ననువా రేవురు దానవులు గేకయరాజు లయి పుట్టిరి; కేతుమంతుండమితౌజుం డై పుట్టె; స్వర్భానుం డుగ్రసేనుండై పుట్టె; జంభుండు విశోకుండై పుట్టె; నశ్వపతి కృతవర్మ యై పుట్టె; వృషపర్వుండు దీర్ఘప్రజ్ఞుం డై పుట్టె; నజరుండు మల్లుం డై పుట్టె; నశ్వగ్రీవుండు రోచమానుం డై పుట్టె; సూక్ష్ముండు బృహద్రథుం డై పుట్టెఁ; దుహుం డనువాఁడు సేనాబిందుం డై పుట్టె; నేకచక్రుండు ప్రతివింధ్యుం డై పుట్టె; విరూపాక్షుండు చిత్రవర్మ యై పుట్టె; హరుండును నహరుఁ డును సుబాహు బాహ్లికు లై పుట్టిరి; చంద్రవక్త్రుండు ముంజకేశుం డై పుట్టె; నికుంభుండు దేవాపి యై పుట్టె; శరభుండు సోమదత్తుం డై పుట్టెఁ; జంద్రుండు చంద్రవర్మ యై పుట్టె; నర్కుండు ఋషికుం డై పుట్టె; మయూరుండు విశ్వుం డై పుట్టె; సుపర్ణుండు క్రోధకీర్తి యై పుట్టె; రాహువు క్రోధుం డై పుట్టెఁ; జంద్రహంత శునకుం డై పుట్టెఁ; నశ్వుం డనువా డశోకుండైపుట్టె; భద్రహస్తుండు నందుం డై పుట్టె; దీర్ఘజిహ్వుండు గాశిరాజై పుట్టెఁ; జంద్రవినాశనుండు జానకి యై పుట్టె; బలీనుండు పౌండ్రమత్స్యుం డై పుట్టె; వృత్రుండు మణిమంతుం డై పుట్టెఁ; గాలాపుత్త్రు లెనమండ్రు క్రమంబున జయత్సేనాపరాజితనిషధాధిపతి శ్రేణిమన్మ హౌజో ఉ భీరు సముద్రసేన బృహత్తులై పుట్టిరి; క్రోధ వశగణంబువలన మద్రక కర్ణ వేష్ట సిద్ధార్థ కీటక సువీర సుబాహు మహావీర బాహ్లిక క్రథ విచిత్ర సురథ శ్రీమన్నీల చీరవాసో భూమిపాల దంతవక్త్ర రుక్మిజనమేజ యాషాఢ వాయువేగ భూరితేజ ఏకలవ్య సుమిత్ర వాటధాన గోముఖ కారూషకక్షేమ ధూర్తి శ్రుతాయు రుద్వహ బృహత్సేన క్షేమాగ్ర తీర్థకుహర మతిమ దీశ్వరాదు లనేకులు పుట్టిరి; కాలనేమి కంసుండై పుట్టె; స్త్రీ పుంసరూప ధరుం డైన గుహ్యకుండు శిఖండి యై పుట్టె; మరుద్గణాంశంబునఁ బాండురాజు పుట్టె. 80

ప్రతిపదార్థం: ఏకాదశరుద్రులు= పదకొండుమందిరుద్రులు. ద్వాపర+అంశంబునన్= ద్వాపరం అనే కలిసహాయుడి అంశతో; వేల్పు= దేవత; భ్రాతృవర్గంబు= సోదరుల సమూహం; మరుత్+గణ+అంశంబునన్= మరుత్తుయొక్క గణాల అంశతో.

తాత్పర్యం: స్పష్టం.

క. **మరుతులయంశంబునఁ బు । ట్టిరి ముప్పురు వివిధరణపటిష్ఠబలులు సు**
స్థిరయశులు ద్రుపదసాత్యకి । విరాట భూపతులు భువనవిశ్రుతచరితుల్. **81**

ప్రతిపదార్థం: వివిధ రణ పటిష్ఠబలులు= వేరువేరు విధా లయిన యుద్ధాలలో దృఢ మైన బలంగలవారు; సుస్థిరయశులు= శాశ్వత మైన కీర్తి కలవారు; భువన విశ్రుత చరితుల్= లోకమందు ప్రసిద్ధి కెక్కిన నడవడి కలవారు; ద్రుపద సాత్యకి విరాట భూపతులు; మరుతుల+అంశంబునన్= మరుత్తుల అంశతో; పుట్టిరి.

తాత్పర్యం: మరుత్తుల అంశలతో అనేకయుద్ధాలలో ఆరితేరినవారూ, శాశ్వతయశస్కులూ, లోకప్రసిద్ధ చరిత్రులూ అయిన ద్రుపదుడు, సాత్యకి, విరాటుడు అనే ముగ్గురు జన్మించారు.

క. **మాండవ్యుం డను మునివరు । చండతర క్రోధజనిత శాపంబున ధ**
ర్ముం డఖిల ధర్మతత్త్వవి । దుం డనఁ విదురుఁ డనఁ బేర్మితో నుదయించెన్. **82**

ప్రతిపదార్థం: మాండవ్యుండు+అను, మునివరు= మాండవ్యుడనేపేరుగల మునిశ్రేష్ఠునియొక్క; చండతరక్రోధజనితశాపంబునన్= మిక్కిలి తీవ్ర మైన కోపంవలన పుట్టిన శాపంచేత; ధర్ముండు= యముడు; అఖిలధర్మతత్త్వవిదుండు+అనన్= సమస్తధర్మాల యొక్కస్వభావం తెలిసినవా డనగా; పేర్మితోన్= గౌరవంతో; విదురుఁడు+అనన్; ఉదయించెన్= జన్మించాడు.

తాత్పర్యం: మాండవ్యమహాముని తీవ్రంగా కోపించి ఇచ్చిన శాపంవలన యమధర్మరాజు సమస్తధర్మాలస్వభావం ఎఱిగినవాడుగా విదురు డనే పేరుతో జన్మించాడు.

క. **ప్రియ మొనరఁగ సిద్ధియు బు । ద్ధియు నను దేవతలు వసుమతిని గుంతియు మా**
ద్రియు నై పుట్టిరి పాండు । ప్రియపత్నులు నిఖిలజగదభీష్టచరిత్రల్. **83**

ప్రతిపదార్థం: ప్రియము+ఒనరఁగన్= ప్రియం కలుగుతున్నట్లుగా, సిద్ధియున్, బుద్ధియున్+అనుదేవతలు; వసుమతిని= భూమియందు, నిఖిలజగత్+అభీష్ట చరిత్రల్= సమస్త జగత్తుకు ఇష్టమైన చరిత్ర కలవారు; కుంతియున్; మాద్రియును+ఐ; పాండుప్రియపత్నులు= పాండురాజుయొక్క అనుగుభార్యలుగా; పుట్టిరి.

తాత్పర్యం: సిద్ధి బుద్ధి అనే దేవతలు కుంతిగానూ, మాద్రిగానూ జన్మించి సకల లోకాలకు ఇష్టమైన చరిత్ర కలవారై పాండురాజుకు పట్టమహిషు లైనారు.

సీ. **యమునంశమునఁ బుట్టె నధిపతి ధర్మజుం; । దనిలాంశమునఁ బుట్టె ననిలజుండు;**
శక్రాంశమున ధనంజయుఁ డుదయించె; నా । శ్వినుల యంశముల నూర్జితులు నకుల
సహదేవు లనవద్యచరితులు పుట్టిరి; । శ్రీమూర్తి యై యాజ్ఞసేని పుట్టె;
నగ్నియంశమున జితారి ధృష్టద్యుమ్నుఁ । డనఁ బుట్టె ద్రుపదరాజాన్వయమున;

ఆ. ననఘ! యిది సురాసురాంశావతారకీ । ర్తనము; దీని వినినఁ దవిలి భక్తిఁ
జదివినను సమస్త జనులకు నఖిలదే । వాసురాదు లిత్తు రభిమతములు. 84

ప్రతిపదార్థం: యముని+అంశమునన్= యముని అంశతో; అధిపతి= ప్రభు వైన; ధర్మజుండు= యుధిష్ఠిరుడు; పుట్టెన్= పుట్టెను; అనిలజుండు= భీమసేనుడు; అనిల+అంశమునన్= వాయుదేవుడి అంశతో; పుట్టెన్; శక్ర+అంశమునన్= ఇంద్రుడి అంశతో; ధనంజయుఁడు= అర్జునుడు; ఉదయించెన్= పుట్టెను; ఊర్జితులు= దృఢమైనవారు; అనవద్య, చరితులు= పవిత్ర మైన నడవడి గలవారు; నకుల, సహదేవులు; ఆశ్వినుల, అంశములన్= అశ్వినీదేవతల అంశలతో; పుట్టిరి; శ్రీమూర్తి, ఐ= లక్ష్మీ స్వరూపం కలదై; యాజ్ఞసేని= ద్రౌపది; పుట్టెన్; జిత+అరి= శత్రువులను జయించినవాడు; ధృష్టద్యుమ్నుఁడు+అనన్; ద్రుపదరాజ+అన్వయమునన్= ద్రుపదరాజు వంశంలో; అగ్ని+అంశమునన్= అగ్నిదేవుడిఅంశతో; పుట్టెన్; అనఘ!= పాపరహితు డైనవాడా! (జనమేజయా!); ఇది= ఇప్పుడు చెప్పింది; సుర+అసుర+అంశ+అవతార కీర్తనము= దేవతల యొక్క రాక్షసుల యొక్క అంశలతో జన్మించిన వారిస్తుతి; తవిలి= ఆసక్తితో; దీనిన్= ఈకథనాన్ని; వినినన్= వినినా; భక్తిన్, చదివినను= భక్తితో చదివినా, అఖిల, దేవ+అసుర+ఆదులు= సమస్తదేవతలు, రాక్షసులు మొదలైనవారు; సమస్త, జనులకున్= ప్రజలందరికి; అభిమతములు= కోరికలు; ఇత్తురు= ఇస్తారు.

తాత్పర్యం: యముడి అంశతో ధర్మరాజు, వాయుదేవుడి అంశతో భీముడు, ఇంద్రుడి అంశతో అర్జునుడు జన్మించారు. అశ్వినుల అంశతో నకుల సహదేవులు పుట్టారు. లక్ష్మి అంశతో ద్రౌపది జన్మించింది. అగ్నిఅంశతో ధృష్టద్యుమ్నుడు ద్రుపద రాజవంశంలో జన్మించాడు. ఓ పుణ్యుడా! ఇది దేవాసురులఅంశలతో భూతలంమీద జన్మించినవారి కీర్తనం. దీనిని భక్తితో విన్నవారికీ చదివినవారికీ ఆ దేవాసురులు కోరికలను నెరవేరుస్తారు.

విశేషం: ఈ సురాసురాంశావతార కథనం వినినవారికి చదివినవారికి కలిగే శుభఫలితాలను తెలిపే ఈపద్యం ఫలశ్రుతితో కూడిఉన్నది. అంశలతో అవతరించినవారు సురాసురులు. వారిలో ఆఅంశలు స్మరింపతగినవి. దైవముయొక్క పరిపూర్ణకళలో ఒకఅంశమాత్రమే భూమిమీద భౌతికాకారంతో అవతరిస్తే వారిని అంశావతారు లంటారు. సురాంశసంభూతులు దైవీసంపదకు, అసురాంశసంభూతులు ఆసురీసంపదకు ప్రతినిధులు. "ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్, దైవ ఆసుర ఏవచ" (భగవద్గీత 16.6) అన్న శ్రీకృష్ణుడు వీరందరిలో పరిపూర్ణావతారుడు. అవతరించిన పరమాత్మతత్త్వాన్ని ఆసురీప్రవృత్తులు దర్శించలేకపోగా ద్వేషిస్తారు; చివరకు నశిస్తారు. 'అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితం' (భ.గీ. 9.11) అని అందుకే అన్నాడు శ్రీకృష్ణుడు. కాగా, సురాంశసంభూతులైన పాండవాదులు శ్రీకృష్ణుడిని భజించి, సేవించి తరించారు. 'మహాత్మానస్తు మాం పార్థ! దైవీంప్రకృతి మాశ్రితాః భజం త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాది మవ్యయమ్" (భ.గీ.9.13) అన్న గీతాకారుడి వాక్యం స్మరింపతగింది. భారతకథను లౌకికదృష్టితో చదివితే వచ్చేది నీతి; కావ్యదృష్టితో చదివితే కలిగేది రసానుభూతి; ఆధ్యాత్మిక దృష్టితో చదివితే పొందేది సర్వశ్రేయస్సుల విభూతి- అని ఇటువంటి ఫలశ్రుతులు పఠితలకు జ్ఞాపకం చేస్తుంటాయి.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 85

తాత్పర్యం: అనగా విని జనమేయుడు వైశంపాయనుడితో ఈవిధంగా అన్నాడు.

సీ. అభ్యస్తవేదవేదాంగులు, విధిదత్త । దక్షిణాప్రీణిత ధరణిదేవు,
లనవరతాశ్వమేధావభృథస్నాన । పూతమూర్తులు, కృతపుణ్యు, లహిత
వర్గజయుల్, ప్రాప్తవర్గచతుష్టయుల్, । సత్త్వాది సద్గుణజన్మనిలయు
లాభరతాది మహామహీపాలకు । లిద్ధయశోర్థు లెందేనిఁ బుట్టి

ఆ. రట్టి కౌరవాన్వయంబుఁ బాండవ నృప । రత్నములకు వారిరాశి యైన
దాని వినఁగ వలతుఁ దద్దయుఁ బ్రీతితో । విప్రముఖ్య! నాకు విస్తరింపు. 86

ప్రతిపదార్థం: అభ్యస్త, వేద, వేదాంగులు= వేదవేదాంగాలను అభ్యసించిన వారు; విధిదత్త, దక్షిణా, ప్రీణిత, ధరణి దేవులు= యజ్ఞవిధులందు ఇవ్వబడిన దక్షిణలచేత తృప్తిపరచబడిన బ్రాహ్మణులు కలవారు. (బ్రాహ్మణులను తృప్తిపరచిన వారు); అనవరత+అశ్వమేధ+అవభృథ, స్నాన పూతమూర్తులు= నిరంతర అశ్వమేధ యాగాలందలి యజ్ఞాంత స్నానాలచేత పవిత్ర మైన ఆకారాలు కలవారు; కృతపుణ్యులు= పుణ్యం చేసినవారు; అహిత వర్గజయుల్= అరిషడ్వర్గాలను (కామక్రోధలోభమోహ మదమాత్సర్యాలను), జయించినవారు; ప్రాప్త వర్గ చతుష్టయుల్= ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే వర్గ చతుష్టయాన్ని పొందినవారు; సత్త్వ+ఆది, సద్గుణ జన్మనిలయులు= సత్త్వంమొదలైన గుణాల పుట్టుకకు నివాస మైనవారు; ఆ భరత+ఆది, మహామహీపాలకులు= భరతుడు మొదలైన మహారాజులు; ఇద్ధయశస్+అర్థులు= దీప్త మైన కీర్తిని కోరేవారు; ఎందు+ఏనిన్, పుట్టిరి= దేనియందు పుట్టారో అట్టి; కౌరవ+అన్వయంబున్= కౌరవవంశాన్ని; పాండవ నృపరత్నములకున్= పాండవు లనే రాజశ్రేష్ఠులకు; వారి, రాశి+ఐన= సముద్రమైన; దానిన్= దానిని, తద్దయున్= మిక్కిలి; విప్రముఖ్య!= ఓ బ్రాహ్మణ శ్రేష్ఠుడా! వైశంపాయనుడా:; విస్తరింపు= వివరించి చెప్పుము; వినఁగన్, వలతున్= వినగోరుతాను.

తాత్పర్యం: సకలవేదవేదాంగాలు అభ్యసించినవారు, యజ్ఞయాగాలలో భూరిదక్షిణ లిచ్చి బ్రాహ్మణులను సంతృప్తి పరచిన వారు, నిరంతరం అశ్వమేధయాగా లాచరించి అవభృథస్నానంచేత పవిత్రమైన దేహాలు కలవారు, పుణ్యాచరితులు, అరిషడ్వర్గాలను జయించినవారు, ధర్మార్థకామాదులను పొందినవారు. సత్త్వగుణసంపన్నులు అయినటువంటి భరతుడు మొదలుగా గల కీర్తికాంక్షులైన మహారాజులు పుట్టిన కౌరవవంశం పాండవు లనే రత్నాలకు సముద్రం వంటిది. అటువంటి కౌరవవంశాన్నిగురించి నాకు సవిస్తరంగా ప్రీతితో తెలుపుము. విన వేడుక పడుతున్నాను.

విశేషం: అలం: రూపకం. కౌరవాన్వయ మనే మహాసముద్రంలో గ్రహించదగిన రత్నాలు పాండవులు, వారికథ సవిస్తరంగా చెప్పటం భారతేతిహాస వస్తుస్వభావం.

వ. అని యడిగిన జనమేజయునకు వైశంపాయనుం డి ట్లనియె. 87

ప్రతిపదార్థం: సుగమం

తాత్పర్యం: అని అడుగగా వైశంపాయనుడు జనమేజయుడితో ఈవిధంగా అన్నాడు.

కౌరవ వంశ వివరణము (సం. 1-70-10)

చ. నిరుపమధర్మమార్గపరినిష్ఠితు లై మహి యెల్లఁ గాచుచుం
బరఁగిన తొంటి పూరు కురు పాండు మహీశుల పేర్మిఁ జేసి భూ
భరవహనక్షమం బగుచుఁ బౌరవ కౌరవ పాండవాన్వయం
బురుగుణసంపదం బెరిఁగి యొప్పె సమస్త జగత్ప్రసిద్ధ మై. 88

ప్రతిపదార్థం: నిరుపమ, ధర్మమార్గ, పరినిష్ఠితులు+ఐ= సాటిలేని ధర్మమార్గమందు చక్కగా ఉంచబడినవా రై; మహి+ఎల్లన్= భూమినంతా; కాచుచున్= కాపాడుతూ; పరఁగిన= ప్రసిద్ధి పొందిన, తొంటి= పూర్వపు; పూరు, కురు, పాండు మహీ+ఈశుల=

పూరుడు కురుడు పాండుడు అనే పేర్లు గల మహారాజులయొక్క; పేర్మిన్+చేసి= గొప్పతనంవలన; భూ+భర వహన క్షమంబు+అగుచున్= భూభారాన్ని వహించేందుకు సమర్థ మైనది అవుతూ; పౌరవ= పూరురాజుకు సంబంధించిన; కౌరవ= కురురాజుకు సంబంధించిన; పాండవ, అన్వయంబు= పాండురాజుకు సంబంధించిన వంశం; ఉరుగుణసంపదన్= గొప్పగుణా లనే సంపదతో; పెరిఁగి= వర్ధిల్లి; సమస్త జగత్+ప్రసిద్ధము+ఐ= సమస్తలోకాలలో ప్రసిద్ధి పొందిన దై; ఒప్పెన్= శోభిల్లెను.

తాత్పర్యం: సాటిలేని ధర్మమార్గమందు లెస్సగా ప్రవర్తించినవారై, భూమినంతా కాపాడుతూ ప్రసిద్ధులైన పూరు, కురు, పాండురాజుల గొప్పతనంవలన పౌరవ కౌరవ పాండవ వంశాలు భూభారాన్ని వహించటానికి సమర్థమైన వవుతూ, గొప్పగుణసంపదతో పెరిగి సర్వజగత్ప్రసిద్ధా లై ఒప్పినవి.

విశేషం: జనమేజయు డడిగింది కౌరవవంశంలో పుట్టిన పాండవులకథ. ధర్మమార్గంలో నడవటం ఆ వంశకర్తలకు, వంశజులకు జీవితవ్రతం. ఆ ధర్మవర్తనంవలన కౌరవవంశం పౌరవ, కౌరవ, పాండవవంశంగా గుణసంపదచేత విస్తరించి లోకప్రసిద్ధిచెందింది. క్రమంగా విస్తరించిన వంశచరిత్ర విధానం తేటతెల్లమయ్యేటట్లు కథాకథనం సాగుతుం దని నన్నయ సూచన. (వివరాలకు పీఠిక చూడండి). ఈపద్యంలో రవర్ణ పునరావృత్తి అక్షరరమ్యతను ఆవిష్కరిస్తున్నది.

వ. అది యెట్లనినం: దొల్లి దాక్షాయణి యైన యదితికిఁ గశ్యపునకుం బుట్టిన వివస్వంతునకు వైవస్వతుం డను మనువును యముండును శనైశ్చరుండును యమునయుఁ దపతియు ననం బుట్టి; రందు వైవస్వతుం డను మనువు వలన బ్రహ్మక్షత్రియ వైశ్యశూద్రాదు లైన మానవులు పుట్టిరి; మఱియు వానికి వేనప్రముఖు లైన రాజు లేఁబండ్రు పుట్టి వంశకరు లై తమలోన యుద్ధంబు సేసి మడిసిరి; మఱియు నమ్మనుపుత్త్రి యైన యిల యనుదానికి సోమపుత్త్రుం డైన బుధునకుఁ బురూరవుండు పుట్టి చక్రవర్తి యై. 89

ప్రతిపదార్థం: సుగమం

తాత్పర్యం: దక్షుడికుమార్తె యైన అదితికీ కశ్యపుడికీ జన్మించిన వివస్వంతు డనేవాడికి వైవస్వతు డనే మనువు, యముడు, శని, యమున, తపతి అనేవారు పుట్టారు. వారిలో వైవస్వతు డనే మనువువలన బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు మొదలైన మానవులు పుట్టారు. ఆ వైవస్వతుడికి వేనుడు మొదలైన రాజులు ఏభైమంది జన్మించి వంశాన్ని వృద్ధిచేసి చివరకు తమలో తాము పోరాడి మరణించారు. ఆ మనుపుత్రిక అయిన ఇల అనే ఆమెకు చంద్రుడిపుత్రు డైన బుధుడికి పురూరవుడు జన్మించాడు. అతడు చక్రవర్తి అయినాడు.

క. ఇమ్మహిఁ ద్రయోదశ ద్వీ । పమ్ములు దన శౌర్యశక్తిఁ బాలించి మదాం
ధ్యమ్మున విప్రోత్తమ వి । త్తమ్ములు దా నపహరించె ధనలోభమునన్. 90

ప్రతిపదార్థం: ఈ+మహిన్= ఈభూమిని; త్రయోదశ ద్వీపమ్ములు= పదమూడు ద్వీపాలను; శౌర్యశక్తిన్= పరాక్రమ సామర్థ్యంతో; పాలించి= ఏలి; మద+ఆంధ్యమ్మునన్= మదమువలని గ్రుడ్డితనంతో; విప్ర+ఉత్తమ విత్తమ్ములు= బ్రాహ్మణ శ్రేష్ఠులయొక్క సంపదలను; తాను; ఆ పురూరవుడు; ధనలోభమునన్= ధనాశతో; అపహరించెన్= దొంగిలించాడు.

తాత్పర్యం: ఆ పురూరవచక్రవర్తి ఈ భూమిని, పదమూడు ద్వీపాలను మహాశౌర్యంతో పాలిస్తూ మదాంధుడై బ్రాహ్మణోత్తముల ధనాలను ధనాశాపరుడై అపహరించాడు.

క. విని దాని నుడుపఁగా బ్ర । హ్మనియుక్తుం డై సనత్కుమారుఁడు మహికిం
జనుదెంచె బ్రహ్మలోకం । బుననుండి యనేక దివ్యమునిసంఘముతోన్. 91

ప్రతిపదార్థం: విని= దానిని తెలిసికొని; దానిన్+ఉడుపఁగాన్= దానిని మాన్పింప జేసేందుకు (పురూరవుడు చేసిన బ్రాహ్మణ ధనాపహరణాన్ని); బ్రహ్మ నియుక్తుండు+ఐ= బ్రహ్మచేత నియమించబడిన వాడై; సనత్కుమారుఁడు= సనత్కుమారు డనే దేవర్షి; అనేక దివ్యముని సంఘముతోన్= పెక్కుమంది దేవమునుల సమూహంతో; బ్రహ్మలోకంబున, నుండి; మహికిన్, చనుదెంచెన్= భూలోకానికి వచ్చాడు.

తాత్పర్యం: పురూరవుడు చేసిన బ్రాహ్మణధనాపహరణాన్ని విని దానిని తొలగించేందుకు బ్రహ్మచేత నియుక్తుడై సనత్కుమారుడు పెక్కుమంది దేవమునులతో బ్రహ్మలోకం నుండి భూలోకానికి వచ్చాడు.

వ. పురూరవుండును రాజ్యగర్వంబున నమ్మునులకు దర్శనం బీనొల్లక పరిహసించిన నలిగి వారలు వాని నున్మత్తుంగా శపియించిన, వాఁడు గంధర్వలోకంబున నూర్వశీ సహితుం డై యుండె; నట్టి పురూరవునకు నూర్వశికి నాయువు ధీమంతుండు నమావసువు దృఢాయువు వనాయువు శతాయువు నను నార్వురు గొడుకులు పుట్టి; రం దాయువునకు స్వర్భానవి యను దానికి నహుష వృద్ధశర్మ రజి గయానేనసు లనంగా నేవురు పుట్టిరి; వారి యందు నహుషుండు రాజ్యాభిషిక్తుం డై. 92

ప్రతిపదార్థం: సుగమం

తాత్పర్యం: రాజ్యగర్వంతో పురూరవుడు ఆ విచ్చేసిన దేవమునులకు దర్శనమిచ్చేందుకు ఇష్టపడక వారిని పరిహసించాడు. వారు కోపించి పురూరవుడు వెఱ్ఱివా డవాలి అని శపించారు. అంతట పురూరవుడు గంధర్వలోకంలో ఊర్వశి అనే అప్సరసతో కూడి ఉన్నాడు. ఊర్వశీపురూరవులకు ఆయువు, ధీమంతుడు, అమావసువు, దృఢాయువు, వనాయువు, శతాయువు అనే ఆరుగురు కుమారులు జన్మించారు. ఆయువు స్వర్భానవి అనే దంపతులకు నహుషుడు, వృద్ధశర్మ, రజి, గయుడు, అనేనసుడు - అనే అయిదుగురు జన్మించారు. వారిలో నహుషుడు ప్రభువై.

మ. చతురంభోధిపరీతభూవలయమున్ సద్వీప సారణ్యస
క్షితిభృత్కం బగుదాని భూరిభుజశక్తిం జేసి పాలించుచుం
గ్రతువుల్ నూ ఱొనరించి కీర్తి వెలయంగా దిక్కులన్ నిర్జితా
హితుఁ డై యా నహుషుండు దాఁ బడసె దేవేంద్రత్వముం బేర్మితోన్. 93

ప్రతిపదార్థం: చతుః+అంభోధిపరీత, భూవలయమున్= నాలుగుసముద్రాలచే చుట్టబడిన భూమండలాన్ని; సద్వీప, సారణ్య, సక్షితి, భృత్కం, బగు, దానిన్= ద్వీపాలతోకూడ అరణ్యాలతోకూడ, పర్వతాలతోకూడ కూడిఉన్న భూమిని; భూరి భుజశక్తిన్+చేసి= అధిక మైన బాహుపరాక్రమంతో; పాలించుచున్= పరిపాలిస్తూ; క్రతువుల్= యజ్ఞాలు; నూఱు+ఒనరించి= నూఱింటిని చేసి; దిక్కులన్= దిశలయందు; కీర్తి= యశస్సు; వెలయంగాన్= ప్రకాశించేటట్లుగా, నిర్జిత+అహితుఁడు+ఐ= శత్రువులను జయించినవాడై; ఆ నహుషుండు= స్వర్భానవి, ఆయువుల పుత్రుడైన నహుషుడు; పేర్మితోన్= గౌరవంతో; తాన్= తాను; దేవేంద్రత్వమున్= దేవేంద్రపదవిని; పడసెన్= పొందాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ద్వీపారణ్యపర్వతాలతో కూడినదీ నాలుగుసముద్రాలచేత చుట్టబడినదీ అయిన భూమండలాన్ని తన అపారబాహుబలంతో పరిపాలిస్తూ నూఱుయజ్ఞాలు చేసి, తనకీర్తి నలుదిశలకు వ్యాపింపజేసి, శత్రువులను జయించిన వాడైన ఆ నహుషుడు దేవేంద్రపదవిని పొందాడు.

వ. **అట్టి నహుషునకుఁ బ్రియంవద యనుదానికి యతి యయాతి సంయా త్యాయా త్యయతి ధ్రువు లనంగా నార్వురు పుట్టి; రందు యయాతి రా జై యనేకయాగంబులు సేసి శుక్రపుత్త్రి యయిన దేవయానియందు యదుతుర్వసులును వృషపర్వపుత్త్రి యయిన శర్మిష్ఠయందు ద్రుహ్యానుపూరులు ననంగా నేవురు కొడుకులం బడసి రాజ్యంబు సేయుచు శుక్రశాపంబున జరాభారపీడితుం డై కొడుకుల నందఱం బిలిచి యి ట్లనియె. 94**

తాత్పర్యం: నహుషుని, భార్య ప్రియంవద. ఆ దంపతులకు యతి యయాతి సంయాతి ఆయాతి అయతి ధ్రువులు అనే ఆరుగురుకుమారులు జన్మించారు. వారిలో యయాతి రాజై అనేకయజ్ఞాలు చేశాడు. శుక్రుడికుమార్తె అయిన దేవయానిని పెళ్ళాడి అతడు యదువు, తుర్వసుడు అనే ఇద్దరు కుమారులను పొందాడు. వృషపర్వపుత్రియైన శర్మిష్ఠయం దాతడు ద్రుహ్యి, అనువు, పూరు డనే ముగ్గురుకుమారులను బడసి (మొత్తం అయిదుగురు కొడుకులను పొంది), రాజ్యపరిపాలన చేస్తూ శుక్రుడిశాపంవలన ముసలితనంచేత పీడితు డయ్యాడు. అప్పు డా యయాతి తనకుమారుల నందరినీ పిలిచి ఇట్లా అన్నాడు.

సీ. **'విషయోపభోగాభిలషణ మింకను నాకు । వదలక పెరుఁగుచున్నదియుఁ గాన**
నందనులార! మీయం దొక్కరుండు నా । దగు జరాభారంబు దగిలి తాల్చి
తనజవ్వనంబు నా కొనరంగ నెవ్వఁ డీ । నోపు నాతండ సద్వీపసకల
ధారుణీసామ్రాజ్యభారయోగ్యుం డగు' । నని యడిగిన నగ్రతనయుఁ డయిన

ఆ. **యదువుఁ దొట్టి సుతులు ముదిమికి నోపక । తలలు వాంచి యున్న వెలయఁ దండ్రి**
పనుపుఁ జేసి ముదిమి గొని జవ్వనం బిచ్చెఁ । బూరుఁ డనుసుతుండు భూరికీర్తి. 95

ప్రతిపదార్థం: విషయ+ఉపభోగ+అభిలషణము= ఇంద్రియ సుఖాలందలి కోరిక; ఇంకను= ఇప్పటికీకూడ; నాకున్; వదలక; పెరుఁగుచున్+ఉన్నదియున్, కాన= కనుక; నందనులు+ఆర!= కుమారులారా! నాదగు= నా యొక్క జరాభారంబు= ముసలితనపు బరువును; మీయందున్+ఒక్కరుండు= మీలోఒకడు; తగిలి= ఆసక్తిగొని, తాల్చి= ధరించి; తన జవ్వనంబు= తన యౌవనము; నాకున్; ఒనరంగన్= ఒప్పునట్లుగా; ఏ+వాఁడు; ఈనోపున్= ఇయ్యగలవాడో; ఆతండు+అ= అతడే; సద్వీప, సకల, ధారుణీ, సామ్రాజ్య, భార, యోగ్యుండు+అగున్= ద్వీపాలతో కూడిన సమస్త భూమిసామ్రాజ్యంయొక్క భారానికి తగినవా డౌతాడు; అని; అడిగినన్; అగ్రతనయుఁడు+అయిన= పెద్దకుమారుడైన; యదువున్ తొట్టి= యదు వనువాడు మొదలుగా గల; సుతులు= కుమారులు; ముదిమికిన్+ఓపక= ముదిమిని తీసికొనేందుకు ఇష్టపడక; తలలు, వాంచి, ఉన్నన్= అనంగీకారసూచకంగా తలలు వంచుకొని ఉండగా; వెలయన్= ప్రకాశమయ్యేటట్లు; తండ్రిపనుపున్+చేసి= తండ్రి ఆజ్ఞతో; భూరికీర్తి= గొప్పకీర్తి కలవాడు; పూరుఁడు+అను, సుతుండు; ముదిమి, కొని= ముసలితనాన్ని తీసికొని; జవ్వనంబు+ఇచ్చెన్= యౌవనాన్ని ఇచ్చాడు.

తాత్పర్యం: 'ఇంద్రియసుఖాభిలాష న న్నింకా వదలిపెట్టక పెరుగుతున్నది. కాబట్టి ఓ కుమారులారా! మీలో ఒక్కడు నా ముసలితనాన్ని తీసికొని నిజ యౌవనాన్ని నాకు ఇవ్వండి. ఆవిధంగా ఇవ్వగలిగినవాడే ఈ సకలసామ్రాజ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భారాన్ని వహించేందుకు యోగ్యుడు' అని యయాతి ఈవిధంగా అడుగగా యదువు మొదలైన కొడుకులు మారు మాటాడక తలలు వంచుకొని ఉన్నారు. అప్పుడు పూరుడనే కొడుకు తండ్రిఆజ్ఞతో అతడి ముసలితనాన్ని తాను తీసికొని తన యౌవనాన్ని తండ్రికి ఇచ్చాడు.

విశేషం: ఈ సీసపద్యంలో ప్రాసయతి పాటింపబడింది.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 96

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: అనగా విని జనమేయుడు వైశంపాయనునితో ఈవిధంగా అన్నాడు.

యయాతి మహారాజు చరిత్రము (సం.1-71-3)

తే. వర్ణధర్మముల్ గాచుచు వసుధ యెల్ల । ననఘ చరితుఁ డై యేలిన యయ్యయాతి
భూసురోత్తమ! భార్గవపుత్త్రి యైన । దేవయానిని దా నెట్లు దేవిఁ జేసె?. 97

ప్రతిపదార్థం: వర్ణ ధర్మముల్= కులం మొదలైన వాటి ధర్మాలను; కాచుచున్= కాపాడుతూ; వసుధ, ఎల్లన్= భూమినంతనూ; అనఘ చరితుఁడు+ఐ= పుణ్యవర్తను డై; ఏలిన= పాలించిన; ఆ+యయాతి= ఆ యయాతిమహారాజు; భూసురోత్తమ!= ఓ వైశంపాయన మహర్షీ! (ఓ బ్రాహ్మణోత్తమా!); బ్రాహ్మణులందు ఉత్తముడా!; భార్గవపుత్త్రి+ఐన= శుక్రుడికూతు రైన; దేవయానిని= దేవయాని అనే ఆమెను; తాను; ఎట్లు; దేవిన్= భార్యగా; చేసెన్= చేశాడు?

తాత్పర్యం: వర్ణాశ్రమధర్మాలను సంరక్షిస్తూ పుణ్యవర్తను డై భూమండలాన్ని ఏలిన ఆ యయాతిమహారాజు బ్రాహ్మణోత్తము డైన శుక్రుడికూతురును- దేవయానిని భార్యగా ఎట్లా చేసికొన్నాడో ఓ వైశంపాయనమహర్షీ! తెలుపవలసింది.

విశేషం: వర్ణాశ్రమధర్మాలను రక్షించిన యయాతి విలోమవివాహాన్ని ఎట్లా చేసికొన్నా డని ధర్మసందేహం.

తే. విపులతేజంబునను దపోవీర్యమునను । జగదనుగ్రహనిగ్రహాశక్తియుక్తుఁ
డయినయట్టి యయాతికి నలిగి యేమి । కారణంబున శాపంబు కావ్యుఁ డిచ్చె? 98

ప్రతిపదార్థం: విపుల, తేజంబునను= విస్తార మైన తేజస్సుచేతను, తపస్+వీర్యమునను= తపస్సుయొక్క ప్రభావంచేతనున్నూ; జగత్+అనుగ్రహ, నిగ్రహాశక్తియుక్తుఁడు= లోకాన్ని అనుగ్రహించటంలోనూ, నిరోధించటంలోనూ శక్తితో కూడిన వాడు, అయిన, అట్టి, యయాతికిన్; అలిగి= కోపించి, కావ్యుఁడు= శుక్రుడు; ఏమి, కారణంబునన్, శాపంబు+ఇచ్చెన్= ఏ కారణంవలన శపించాడు?

తాత్పర్యం: విస్తారమైన తేజస్సుచేతనూ, తపఃప్రభావంచేతనూ లోకాలను అనుగ్రహించేందుకు, నిగ్రహించేందుకు సమర్థు డైనట్టి యయాతిమహారాజును కోపించి శుక్రు డేకారణాన అతడిని శపించాడు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియు నస్మద్వంశకరుం డయిన యయాతిచరితంబు విన వలతుం జెప్పు మని యడిగిన వానికి వైశంపాయనుం డి ట్లనియె. 99

ప్రతిపదార్థం: వినవలతున్= వినగోరెదను.

తాత్పర్యం: అంతేకాక, మావంశాన్ని వృద్ధి చేసిన ఆ యయాతియొక్క వృత్తాంతాన్ని నేను వినగోరుతాను చెప్పు మని అడుగగా జనమేజయుడికి వైశంపాయనుడు ఈవిధంగా అన్నాడు.

క. మనుజాధిప! వృషపర్వుం । డను దానవపతికి శుక్రుఁ డా చార్యుం డై
యనిమిషవిరోధులకుఁ బ్రియ । మొనరించుచు వివిధ విధినయోపాయములన్. 100

ప్రతిపదార్థం: మనుజ+అధిప!= ఓరాజా! (జనమేజయా); దానవపతికిన్= రాక్షసరాజుకు; శుక్రుఁడు; ఆచార్యుండు+ఐ= గురువై; అనిమిష విరోధులకున్= దేవతలకు శత్రువులు ఐన రాక్షసులకు; వివిధవిధి, నయ+ఉపాయములన్= వేర్వేరు ఏర్పాట్లచే నీతులతో, ఉపాయాలతో; ప్రియము+ఒనరించుచున్= సంతోషాన్ని కలిగిస్తూ.

తాత్పర్యం: ఓ రాజా! వృషపర్వు డనే రాక్షసరాజుకు శుక్రుడు ఆచార్యు డై పెక్కువిధాల ఏర్పాట్లతో, నీతులతో, ఉపాయాలతో రాక్షసులకు సంతోషాన్ని కలిగిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. దేవాసుర రణమున గత । జీవితు లగు నసురవరులఁ జెచ్చెర మృతసం
జీవని యను విద్యఁ బున । ర్జీవులఁగాఁ బ్రతిదినంబుఁ జేయుచు నుండెన్. 101

ప్రతిపదార్థం: దేవ+అసుర, రణమునన్= దేవదానవుల యుద్ధమందు; గత, జీవితులు+అగు= మరణించినవారైన; అసుర, వరులన్= రాక్షసశ్రేష్ఠులను; చెచ్చెరన్= శీఘ్రంగా; మృతసంజీవని యను విద్యన్= మృతసంజీవని అనే పేరు కలిగిన చనిపోయినవారిని తిరిగిబ్రతికించే విద్యతో; ప్రతి, దినంబున్; పునః+జీవులన్+కాన్= మరల (తిరిగి) బ్రతికినవా రయ్యేటట్లుగా; చేయుచున్+ఉండెన్= చేస్తూ ఉండేవాడు.

తాత్పర్యం: దేవ దానవ యుద్ధంలో మృతు లైన రాక్షసులను శీఘ్రంగా మృతసంజీవని అనే విద్యచేత వారిని ప్రతిదినం పునర్జీవితులను చేస్తున్నాడు.

వ. దాని నెఱింగి దేవతలెల్ల నతి భీతు లై యసురుల నోర్వ నోపక శుక్రువలన మృతసంజీవని వడసి తేనోపునట్టి మహాసత్త్వుం డెవ్వం డగునో యని విచారించి బృహస్పతిపుత్త్రుండయిన కచునికడకుం జని యిట్లనిరి. 102

ప్రతిపదార్థం: అతిభీతులు+ఐ= మిక్కిలి భయపడినవారై; అసురులన్= రాక్షసులను; ఓర్వన్+ఓపక= గెలువ జాలక; పడసి= పొంది; తేన్+ఓపునట్టి= తీసుకురాజాలిన; మహాసత్త్వుండు= గొప్పబలవంతుడు; కచునికడకున్= కచుని చెంతకు.

తాత్పర్యం: ఆ విషయం తెలిసికొని దేవతలు భయపడి, రాక్షసులను జయించలేక, శుక్రునివద్దనుండి మృతసంజీవనీ విద్యను పొంది తిరిగి రాగల గొప్పసమర్థు డెవ్వడో అని విచారించి, బృహస్పతికుమారు డైన కచుడివద్దకు వెళ్ళి ఇట్లా అన్నారు.

క. పోరను మృతసంజీవని । కారణమున నిహతు లయ్యుఁ గా రసురవరుల్
వారల నోర్వఁగ మన కతి । భారము దుర్వారవీర్యబలయుతు లగుటన్. 103

ప్రతిపదార్థం: పోరను= యుద్ధమందు; మృతసంజీవని, కారణమునన్; నిహతులు+అయ్యున్= చచ్చినవారయ్యూ; కారు= చావరు; అసురవరుల్= రాక్షస శ్రేష్ఠులు; దుర్వార వీర్యబలయుతులు= నివారించేందుకు శక్యం కాని వీరత్వంతో బలంతో కూడినవారు; అగుటన్= కావటంచేత; ఓర్వఁగన్= జయించటానికి; మనకున్; అతి, భారము= మిక్కిలి బరువు (శక్యం కానిది, మోయలేనిది అని భావం).

తాత్పర్యం: యుద్ధంలో రాక్షసులు చనిపోయినా మృతసంజీవనికారణాన చావకుండా ఉన్నారు. వారు అపార వీర్యబలవంతులు కావటంచేత వారిని జయించటం మనకు అసాధ్య మై ఉన్నది.

క. మనపక్షంబున వా ర । ద్దనుజులచే నిహతు లయ్యుఁ దగ మృతసంజీ
వని లేమిఁ జేసి యమసా । దనమున కరుగుదురు వీర్యదర్పితు లయ్యున్. 104

ప్రతిపదార్థం: మన పక్షంబునవారు= మనవైపు ఉన్నవారు; (దేవతలు); ఆ+దనుజులచేన్= ఆ రాక్షసులచేత, నిహతులు= చంపబడినవారు; అయ్యున్= అయినప్పటికి; తగన్= ఒప్పారగా; మృతసంజీవని, లేమిన్+చేసి= చనిపోయినవారిని బ్రతికించే మృతసంజీవనీ విద్య లేకపోవటం కారణంగా; యమసాదనమునకున్= యముడి గృహానికి (నరకానికి లేదా మృత్యువు దగ్గరకు అని భావం); వీర్యదర్పితులు= పరాక్రమం చేత గర్వించిన వారు; అయ్యున్= అయినప్పటికీ; అరుగుదురు= వెడతారు (చనిపోతారు).

తాత్పర్యం: మహాబలగర్వితు లైనా మనపక్షంలోనివారు రాక్షసులచేత చంపబడిన మనకు మృతసంజీవని లేనందువల్ల యముడి నివాసానికే పోతున్నారు.

విశేషం: సదనము (రూ) సాదనము.

క. కావున మృతసంజీవనిఁ । దేవలయును శుక్రువలన ధృతిఁ బడసి తప
శ్శ్రీవిభవ! దాని బలమునఁ । గావంగావలయు సురనికాయబలంబున్. 105

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; మృతసంజీవనిన్; శుక్రువలనన్= శుక్రునివద్ద నుండి; ధృతిన్+పడసి= ధైర్యంతో పొంది; తేవలయున్= తీసికొని రావలెను, తపస్+శ్రీ విభవ!= తపస్సుయొక్క శోభావిభవం కలవాడా!; ఓకచుడా! సుర, నికాయబలంబున్= దేవతల సమూహంయొక్క బలాన్ని; దాని బలమునన్= ఆమృత సంజీవనియొక్క శక్తిచేత; కావంగాన్, వలయున్= రక్షించవలెను;

తాత్పర్యం: కాబట్టి శుక్రుడినుండి మృతసంజీవనీవిద్యను పొంది తీసికొని రావాలి. ఓతపోధనా! ఆ సంజీవనీ విద్యాబలంతో దేవగణాలబలాన్ని కాపాడాలి.

క. బాలుండవు, నియమవ్రత । శీలుండవు, నిన్నుఁ బ్రీతిఁ జేకొని, తద్వి
ద్యాలలనాదానముఁ గరు । ణాలయుఁ డై చేయు నమ్మహాముని నీకున్. 106

ప్రతిపదార్థం: బాలుండవు= నీవు గ్రహణధారణ శక్తులు గల చిన్నవాడవు; నియమవ్రత, శీలుండవు= నియమాలు, ఉపాసనాది పుణ్యకర్మలు చేయటం స్వభావంగా కలవాడవు; నిన్నున్; ప్రీతిన్= ఆదరంగా; చేకొని= దరిచేర్చి; తద్= ఆ మృత సంజీవని అనబడే; విద్యాలలనా, దానమున్= విద్య అనే కన్యాదానాన్ని; కరుణా+ఆలయుఁడు+ఐ= దయకు నివాస స్థాన మైన వాడై; ఆ+మహత్+ముని= ఆ గొప్పవా డైన శుక్రమహర్షి, నీకున్; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: నీవు బాలుడివి. నియమాలు, వ్రతాలు నీకు స్వభావసిద్ధ మైనవి. శుక్రాచార్యుడు నిన్ను శిష్యుడిగా స్వీకరించి, సంతోషంతో నీ కా విద్యాకన్యను దయతో ఇవ్వగలడు.

విశేషం: విద్యాలలనాదానము - అనే రూపక సమాసం భావికథార్థ వ్యంజకం. ముందు కథలో దేవయాని తనమనసును కచుడికి అర్పించుకొనే కథార్థం ఇందులో ధ్వని. విద్యయనే, లలనను - అనీ, విద్యను, లలనను అనీ సమన్వయించవచ్చును.

వ. 'దుహితృస్నేహంబునం జేసి యద్దేవయాని పలుకులు శుక్రుం డతిక్రమింపండు గావున నీనేర్చువిధంబున దాని చిత్తంబు వడసి శుక్రు నారాధించిన నీ కిష్టసిద్ధి యగు' నని దేవతలు ప్రార్థించి పంచినం, గచుండును దేవహితార్థంబు వృషపర్వుపురంబునకుం జని యచ్చట వేదాధ్యయనశీలుం డయి సకలదైత్యదానవ గణోపాధ్యాయుం డయి యున్న శుక్రుం గని నమస్కరించి యి ట్లనియె. 107

ప్రతిపదార్థం: దుహితృస్నేహంబునన్+చేసి= కూతురునందలి ప్రేమచేత; అతిక్రమింపండు= జవదాటడు; దేవహిత+అర్థంబు= దేవతలమేలు కొరకు; సకలదైత్యదానవ గణ+ఉపాధ్యాయుండు= సమస్తదైత్యుల, దానవుల సమూహమునకు గురువు.

తాత్పర్యం: 'కూతురుపై నున్న ప్రేమచేత దేవయానిమాటలను శుక్రుడు జవదాటడు. కాబట్టి నీ సామర్థ్యంతో ఆమె మనసును లోబరచుకొని, శుక్రుడికి శుశ్రూష చేస్తే, నీకు కార్యసిద్ధి కలుగుతుంది' అని దేవతలు వేడుకొని పంపగా కచుడు దేవతలమేలుకొరకై వృషపర్వుడిపట్టణానికి వెళ్ళి అక్కడ నిరంతరవేదాధ్యయనపరుడున్నూ, దైత్య దానవగణానికి గురువున్నూ అయినట్టి శుక్రాచార్యుడిని చూచి నమస్కరించి ఇట్లా పలికాడు.

విశేషం: దేవతలు కచుడికి మృతసంజీవనిని సాధించే మెలకువ ఒకటి చెప్పారు. మంత్రవిద్య శుక్రాచార్యాధీనం; శుక్రుడు ఆతని కుమార్తె అయిన దేవయానిపట్ల ఉన్న స్నేహానికి అధీనుడు. దేవయానిని ప్రసన్నం చేసికొంటే, శుక్రుడు, ఆ తరువాత అతని విద్య అనుకూలిస్తాయి అని చెప్పారు దేవతలు. భావికథాగతిని ఈ వాక్యం ప్రసన్నం చేస్తున్నది. కథలో దేవయానిపాత్రకు కల ప్రాధాన్యానికి ప్రాతిపదిక వేశాడు నన్నయ ఇక్కడ. ప్రసన్న కథాకలితార్థయుక్తికి చక్కని ఉదాహరణం.

క. ఏను గచుం డనువాఁడ, మ । హానియమసమన్వితుఁడ, బృహస్పతిసుతుఁడన్,
మానుగ వచ్చితి నీకును । భానునిభా! శిష్యవృత్తిఁ బని సేయంగన్. 108

ప్రతిపదార్థం: భానునిభా= సూర్యసన్నిభుడ వైన ఓ మహర్షీ!; ఏను= నేను; మహానియమ, సమన్వితుఁడన్= గొప్ప నియమాలతో కూడినవాడిని; బృహస్పతి, సుతుఁడన్= దేవగురు వైన బృహస్పతికి కుమారుడిని; కచుండు+అను, వాఁడన్= కచుడనే పేరు కలవాడిని; శిష్యవృత్తిన్= శిష్యప్రవర్తనతో; నీకును= నీకు; పని+ చేయంగన్= సేవచేయటానికి; మానుగన్= ఒప్పిదంగా; వచ్చితిన్= వచ్చాను.

తాత్పర్యం: సూర్యసన్నిభుడ వైన ఓమహర్షీ! నేను కచు డనేవాడిని. బృహస్పతికుమారుడిని. మీకు శుశ్రూష చేసి సేవించటానికి వచ్చాను.

విశేషం: విద్యయందు ఆసక్తి, గురువునందు భక్తి, నియమనిష్ఠలయందు ప్రసక్తి కల శిష్యుడే గురువుల ఆదరగౌరవాలను పొందగలడని కచునివర్తనం తెలుపుతున్నది.

వ. అనిన నమ్మునికుమారుని సుకుమారత్వంబును, వినయ ప్రియవచన మృదుమధురత్వంబును, ననవరత నియమవ్రత ప్రకాశిత ప్రశాంతత్వంబునుం జూచి శుక్రుం డతిస్నేహంబున 'వీనిం బూజించిన బృహస్పతిం బూజించిన యట్ల' యని యభ్యాగతపూజల వాని సంతుష్టుంగాఁ జేసి శిష్యుంగాఁ జేకొని యున్నంత, నక్కచుండు. 109

ప్రతిపదార్థం: సుకుమారత్వంబును= మృదుత్వమును (చక్కనికౌమారదశను); వినయ, ప్రియ, వచన, మృదు, మధురత్వంబును= వినయంతో కూడిన ప్రియమైన మాటలలోని మెత్తదనమున్నూ, తియ్యదనమున్నూ; అనవరత, నియమ, వ్రత, ప్రకాశిత, ప్రశాంతత్వంబునున్= నిరంతరం నియమాలచేత, ఉపాసనలచేత ప్రకాశించబడిన ప్రశాంతతను; చూచి; శుక్రుండు; అతి, స్నేహంబునన్= అమితమైన వాత్సల్యంతో; వీనిన్= కచుడిని; పూజించినన్= గౌరవిస్తే (ఆదరిస్తే); బృహస్పతిన్, పూజించిన+అట్ల, అని= బృహస్పతిని గౌరవించినట్లే ఔతుం దని; వానిన్= కచుడిని; అభ్యాగత, పూజలన్= అతిథిపూజలతో; వానిన్= కచుడిని; సంతుష్టున్+కాన్, చేసి= తృప్తిపొందినవాడిగా చేసి; (సంతోషపెట్టి); శిష్యున్+కాన్, చేకొని= శిష్యు డయ్యేటట్లు చేసికొని; ఉన్న+అంతన్= ఉండగా; ఆ+కచుండు.

తాత్పర్యం: అని పలికిన కచుడి సౌకుమార్యాన్ని, అతడి వినయప్రియవచనాలలోని మెత్తదనాన్ని, తియ్యదనాన్ని, నిత్యనియమవ్రతాలవలన అతనిముఖంలో వెలిగే ప్రశాంతతను చూచి శుక్రుడు మిక్కిలి ప్రేమతో 'వీడిని పూజిస్తే దేవగురువును పూజించినట్లే' అని తలచి, అతిథిమర్యాదలు చేసి అతడిని సంతృప్తిపరిచి తనశిష్యుడిగా స్వీకరించాడు. అంతట కచుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. పని యేమి పంచినఁ బదపడి చేసెద । ననక తన్ బంచిన యాక్షణంబ
చేయుచు నిజగురు చిత్తవృత్తికిఁ గడు । ననుకూలుఁ డై వినయంబుతోడ
మనమునఁ జెయ్వుల మాటలభక్తి నే । కాకారుఁ డై, మఱి యంతకంటె
దేవయానికి సువిధేయుఁ డై ప్రియహిత । భాషణములఁ బుష్పఫలవిశేష

ఆ. దానములను సంతతప్రీతిఁ జేయుచు, నివ్విధమునఁ బెక్కులేండ్లు నిష్ఠ
గురుని గురుతనూజఁ గొలిచి యయ్యిరువుర । నెమ్మి వడసెఁ దనదునేర్పుపేర్మి. 110

ప్రతిపదార్థం: పని, ఏమి, పంచినన్= పని ఏమి ఆజ్ఞాపించినా; పదపడి= తరువాత; చేసెదను; అనక; తన్, పంచిన= తనను ఆజ్ఞాపించిన; ఆ క్షణంబు+అ= వెంటనే; చేయుచున్= చేస్తూ; నిజగురు, చిత్తవృత్తికిన్= తనగురువుయొక్క మనఃప్రవృత్తికి; కడున్+అనుకూలుఁడు+ఐ= మిక్కిలి అనుకూలంగా ఉన్నవాడై; వినయంబుతోడన్= అణకువతో; మనమునన్, చెయ్వులన్, మాటలన్, భక్తిన్= మనోవాక్కాయకర్మలలో భక్తిలో; ఏక+ఆకారుఁడై= ఒకేవిధంగా మెలిగి; మఱి; అంతకంటెన్= శుక్రుడిపట్లచూపే

భక్తికంటె; దేవయానికిన్; విధేయుఁడు+ఐ= మరింత అనుకూలు డై; ప్రియ, హిత, భాషణములన్= ప్రియాలూ, హితాలూ అయిన మాటలతో; పుష్పఫల, విశేష, దానములను= పూలు, పండ్లు మొదలైనవాటిని విశేషంగా తెచ్చి ఇవ్వటంవలనను; సంతత, ప్రీతిన్, చేయుచున్= ఎల్లప్పుడు సంతోషాన్ని కలిగిస్తూ; ఈ+విధమునన్, పెక్కులు+ఏండ్లు; నిష్ఠన్= నియమాలతోడిదీక్షతో; గురునిన్, గురుతనూజన్= గురువుగారిని, గురుపుత్రిక అయిన దేవయానిని; కొలచి= సేవించి; ఆ+ఇరువుర, నెమ్మిన్= ఆ ఇద్దరి ప్రీతిని; తనదు, నేర్పు, పేర్మిన్, పడసెన్= తన నేర్పరితనంతో పొందాడు.

తాత్పర్యం: ఏపని చెప్పినా తరువాత చేస్తా నని బదులు చెప్పకుండా వెంటనే చేస్తూ, శుక్రుడి మనఃప్రవృత్తికి చాలా అనుకూలు డై మనోవాక్కాయకర్మలలో ఒకేవిధం కలవా డై; అంతకంటె అధికంగా దేవయానికి మిక్కిలి విధేయుడై, ప్రియవాక్యాలతోను, పుష్పఫలాల నధికంగా తెచ్చి ఇవ్వటంతోను ఆమెకు సంతోషం కలిగిస్తూ ఈతీరుగా ఎన్నో సంవత్సరాలు గురువును గురుపుత్రిని కొలిచి ఎంతోనేర్పుతో వారి ప్రేమను పొందాడు.

వ. ఇట్లు గురుశుశ్రూషాకౌశలంబునఁ గచుండు శుక్రునకుం బ్రియశిష్యుం డై యున్న నెఱింగి, దానవులు సహింపనోపక బృహస్పతితోడి యలుకనక్కచు నొక్కనాఁడు హోమధేనువులం గాచుచు వనంబున నేకతంబ యున్న వాని వధియించి, విశాల సాలస్కంధంబున బంధించి చని; రంత నాదిత్యుం డస్తగిరి శిఖరగతుం డగుడు మగుడి హోమధేనువు లింటికి వచ్చిన, వానితోడన కచుండు రాకున్న, దేవయాని తనమనంబున మలమల మఱుంగుచుం బోయి తండ్రి కి ట్లనియె. 111

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; గురు, శుశ్రూషా, కౌశలంబునన్= గురువును సేవించటంలోని నేర్పరితనంతో; కచుండు; శుక్రునకున్; ప్రియశిష్యుండై, ఉన్నన్= మనసుకెక్కిన శిష్యుడై ఉండగా; ఎఱింగి= తెలిసికొని, గ్రహించి; దానవులు= రాక్షసులు; సహింపన్+ఓపక= ఓర్వలేక; బృహస్పతితోడి, అలుకన్= బృహస్పతియందు ఉన్న కోపంతో; ఒక్కనాఁడు= ఒకరోజు; హోమధేనువులన్= యజ్ఞకార్యాలకు ఉపయోగపడే ఆవులను; కాచుచున్= అరణ్యాలలో మేతమేస్తున్నప్పుడు వాటికి ఎటువంటి ఆపద రాకుండా రక్షిస్తూ; వనంబునన్= అడవిలో; ఏకతంబు+అ= ఒంటరిగా; ఉన్నవానిన్; వధియించి= చంపి; విశాల, సాల, స్కంధంబునన్= విస్తార మైన చెట్టుబోదెకు; బంధించి= కట్టి; చనిరి= వెళ్ళారు; అంతన్= ఆతరువాత; ఆదిత్యుండు= సూర్యుడు; అస్తగిరి శిఖరగతుండు+అగుడున్= పడమటి కొండ శిఖరాన్ని చేరినవాడు కాగా; మగుడి= తిరిగి; హోమధేనువులు; ఇంటికిన్; వచ్చినన్= రాగా; వానితోడన్+అ= ఆగోవులతోపాటే కలిసి; కచుండు; రాక+ఉన్నన్= రాకుండా ఉండగా; దేవయాని; తన, మనంబునన్= తన మనసులో; మలమల, మఱుంగుచున్= మలమలమని మనస్సు (వేదనపడగా) పోయి= వెళ్ళి; తన, తండ్రికిన్= తన తండ్రియైన శుక్రుడితో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నది.

తాత్పర్యం: ఈవిధంగా కచుడు తన సేవానైపుణ్యంతో శుక్రుడికి ప్రియశిష్యు డై ఉండటం తెలిసికొని రాక్షసులు సహించలేక, దేవగురు వైన బృహస్పతితో తమకు గల వైరాన్ని పురస్కరించుకొని కోపించి, ఆ కచుడు ఒకరోజు హోమధేనువులను కాస్తూ ఒంటరిగా ఉండగా రాక్షసులు అతడిని వధించి, ఒకపెద్దచెట్టుబోదెకు బంధించి వెళ్ళిపోయారు. అప్పుడు సూర్యాస్తమయ మైనది. హోమధేనువులు తిరిగి ఇంటికి వచ్చాయి. వాటివెంబడి కచుడు రాకపోవటాన్ని గమనించి దేవయాని కలవరపడుతూ తనతండ్రివద్దకు వెళ్ళి యిట్లా అన్నది.

ఉ. వాఁడిమయూఖముల్ గలుగువాఁ డపరాంబుధిఁ గ్రుంకె, ధేనువుల్
నేఁ డిట వచ్చె నేకతమ, నిష్ఠమెయిన్ భవదగ్నిహోత్రముల్

పోఁడిగ వేల్వఁగాఁ బడియెఁ, బ్రొద్దును బోయెఁ, గచుండు నేనియున్
రాఁడు, వనంబులోన మృగరాక్షసపన్నగబాధ నొందెనో! 112

ప్రతిపదార్థం: వాఁడి, మయూఖముల్, కలుగువాఁడు= సూర్యుడు (చురుకుచురుకు మనే కిరణాలు కలవాడు); అపర+అంబుధిన్= పశ్చిమసముద్రంలో; క్రుంకెన్= మునిగాడు (అస్తమించాడు); ధేనువుల్= గోవులు; నేఁడు; ఇట; ఏకతము+అ= ఒంటరిగానే; వచ్చెన్; నిష్ఠమెయిన్= నియమంతో; భవత్+అగ్ని హోత్రముల్= నీ హోమాగ్నులు; పోఁడిగన్= ఒప్పుగా; వేల్వఁగాన్, పడియెన్= ఆహుతు లర్పించబడెను; ప్రొద్దును+పోయెన్= ప్రొద్దు కూడా పోయింది; కచుండున్+ఏనియున్, రాఁడు= కచుడుమాత్రం తిరిగిరాలేదు; వనంబులోనన్= అడవిలో; మృగ, రాక్షస, పన్నగబాధన్+ఒందెనో= క్రూరమృగాలవలన (కాని), రాక్షసులవలన (కాని), సర్పాలవలన (కాని) ఎటువంటి ఇబ్బందినైనా పొందాడేమో!

తాత్పర్యం: సూర్యుడు పడమటిసముద్రంలో క్రుంకాడు. హోమధేనువులు ఒంటరిగా తిరిగి వచ్చాయి. చీకటి పడటం వలన నీ అగ్నిహోత్రాలు చక్కగా ఆహుతులను పొందుతున్నాయి. చాలా ప్రొద్దు పోయింది. కచుడు మాత్రం తిరిగి రాలేదు. అడవిలో మృగ రాక్షస సర్పాలవలన బాధను పొందాడేమో!.

విశేషం: అలం: స్వభావోక్తి. సంధ్యాసమయాన్ని స్వభావోక్తిలో వర్ణిస్తూనే కచుడిపట్ల దేవయానికి గల అభిలాషనుకూడ రమణీయంగా ధ్వనింపజేశాడు నన్నయ. తెలుగులోని మంచిపద్యాలలో ఇది ఒకటి. అందుకు కారణం నన్నయ రచనాశిల్పమే. మాటలవలన మనసులోని అభిలాష ప్రసన్న మౌతున్నట్లుగా చెప్పే ఈపద్యరచనలో ప్రసాదగుణం పోషింపబడటం రసవ్యంజకం. నన్నయ కవితలో ఈపద్యంవంటి ప్రసాదగుణభూయిష్ఠా లైన పద్యాలు విశేషంగా కనబడతాయి. ఇందులో దేవయాని అభిలాష వ్యంగ్యం. దానికి ఆర్తి, అధిక్షేపం, శంక, దైన్యం, నిర్వేదం మొదలైన సంచారులు పోషకాలు. సంచారులు వాక్యాలవలన, అభిలాష తాత్పర్యంవలన అనుగమ్యమానా లౌతున్నాయి. వాక్యాలలోని క్రియాపదాలవలన రసభావవ్యంజనం చేసే శిల్పం మొదట పేర్కొనదగింది. క్రుంకె; వచ్చె; పోయె- అనే భూతార్థక క్రియలు 'వాటిపని అవి కచుడిసంగతి పట్టించుకోకుండానే జరుపుకున్నాయి' అనే ఆర్తిని ధ్వనింపజేస్తున్నాయి. 'వేల్వఁగాఁబడియెఁ' అనే కర్మార్థకప్రయోగం శుక్రుడుకూడా పట్టించుకోకుండా తనవిధులు తాను యాంత్రికంగా నిర్వర్తించాడనే అమర్షభావాన్ని వ్యక్తంచేస్తున్నది. 'కచుండునేనియున్ రాఁడు' అన్నప్పుడు అన్నీ సవ్యంగా జరిగిపోతున్నప్పుడు కచుడెందుకు రాడో గమనించండి! మీ కెవ్వరికీ పట్టలేదా? కీడేమైనా జరిగిందేమో! అనే శంక అందులో ధ్వని. 'బాధనొందెనో' అన్నప్పుడు ఆర్తి, దైన్యం, నిర్వేదం ధ్వనింపబడుతున్నాయి. ఇంతేకాదు 'వాఁడిమయూఖముల్ కలుగువాఁడు' అనే విశేషణంలోని 'కలుగు' అనే తద్ధర్మార్థక క్రియకూడా వ్యంజకమే. పగలల్లా కచుడు అడవులలో ఉండటంవలన దేవయానికి ఇంట్లో కచుడి యెడబాటువలన ఎండ తీవ్రంగా ఉన్నట్లు అనిపించేదనీ, ఎప్పుడు సూర్యు డస్తమిస్తాడా అని క్షణాలు లెక్కపెట్టుతూ పగళ్ళు భారంగా గడిపేదనీ, అస్తమయం కాగానే కచుడి దర్శనంవలన చంద్రదర్శనసౌఖ్యాన్ని పొందే దనీ ధ్వని. ఆరోజు బాధకలిగించే సూర్యుడు వెళ్ళాడే కాని సుఖాన్ని ఇచ్చే కచుడు రాలేదు. ఆవులుకూడా కచుడితో కలిసివెళ్ళాయి. కాని, ఒంటరిగానే తిరిగివచ్చాయి. కలిసిఉండటంవలన కచుడిపట్ల వాటికి ఆమాత్రం స్నేహధర్మం ఉండవద్దా? అసలు ఒంటరిగా ఎందుకు వచ్చాయి? వచ్చి ఏమీ పట్టనట్లు ఎట్లా ఉన్నాయి? అని ఆమె పడే ఆవేదన ఆమెకు అతనిపట్ల ఉన్న సాహచర్యమాధుర్యాన్ని వ్యక్తంచేస్తున్నది. తండ్రి సాయంకాలంలో జరిపే అగ్నికార్యాలు యథావిధిగా జరిపాడే కాని, తనవలె తన శిష్యుడుకూడా ఆనాడు చేశాడా లేదా అని గమనించనే లేదు. అనుఁగుశిష్యుడిని ఆయన ఆరోజు ఎందుకుమర్చిపోయాడో? అని ఆమెకు అమర్షం. ప్రొద్దుపోయింది. అందరూ ఇక నిద్రపోతారు. ఆమెవలె ఆసక్తితో అతడికొరకు ఎవరూ అడగటం లేదు. ఆమెకు రతిభావోదయమూలమైన అభిలాష అంకురించింది. అందువల్లనే 'కచుడు ఒక్కడుమాత్రం తిరిగిరాడు' అని కంటతడిపెట్టి దైన్యాన్ని ప్రకటించింది. ప్రొద్దుపోతే, అడవిలో ఒంటరిగా మిగిలిపోతే కచుడికి మృగరాక్షస

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సర్వబాధ లేర్పడవచ్చును. వాటివలన అతడు చనిపోవచ్చును. అతడు చనిపోయినా ఎవరికీ దిగులు లేనట్లున్నది. పరిస్థితి గమనిస్తే తండ్రి, ఇల్లు, గోసంపద మొదలైన వెన్ని ఉన్నా దేవయానికి వాటిన్నిటికంటె కచుడే ఆత్మీయుడుగా, మనసు కోరేవాడుగా అనిపించాడు. అది అభిలాషయొక్క సమగ్రాభివ్యక్తి, నన్నయ అలంకార, వస్తుధ్వనులను రసధ్వనిలో పర్యవసింపజేసే కావ్యరచనాశిల్పం ఇందులో మకుటాయమానంగా ప్రసన్నమౌతున్నది. (సంపా.)

కచుండు దానవహతుం డై మృతసంజీవనిచే బ్రదుకుట (సం.1-71-30)

వ. అనిన విని శుక్రుండు దనదివ్యదృష్టి నసురవ్యాపాదితుం డైన కచుం గని, వానిం దోడ్కొని తేర మృతసంజీవనిం బంచిన, నదియును బ్రసాదం బని యతి త్వరితగతిం జని, విగతజీవుం డయిన కచు నప్పుడ సంజీవితుం జేసి తోడ్కొని వచ్చినం జూచి శుక్రుండును దేవయానియు సంతసిల్లి యున్నంతఁ, గొన్నిదినంబులకు వెండియు నొక్కనాఁడు. 113

ప్రతిపదార్థం: అనినన్= అని దేవయాని చెప్పగా; విని; శుక్రుండు తన దివ్య, దృష్టిన్= జ్ఞానదృష్టితో; అసుర, వ్యాపాదితుండు+ఐన= రాక్షసులచేత చంపబడిన; కచున్; కని= చూచి; వానిన్= ఆకచుని; తోడ్కొని, తేరన్= పిలుచుకొని తెచ్చేందుకు; మృతసంజీవనిన్= చచ్చిపోయినవారిని బ్రతికించే విద్యను; పంచినన్= పంపగా; అదియును= ఆ విద్యయున్నూ; ప్రసాదంబు+అని= అనుగ్రహ మని; అతి, త్వరిత, గతిన్= మిక్కిలివేగంతో కూడిన గమనంతో; చని= వెళ్ళి; విగత, జీవితుండు+అయిన= పోయిన ప్రాణం కల; కచున్; అప్పుడు+అ= ఆ క్షణమందే; సంజీవితున్, చేసి= బ్రతికినవాడిని కావించి (చేసి); తోడ్కొని, వచ్చినన్= తనవెంట తీసికొని రాగా; చూచి, శుక్రుండును; సంతసిల్లి= సంతోషించి; ఉన్న+అంతన్= ఉండగా; కొన్ని, దినంబులకున్= కొన్ని రోజులకు; వెండియున్= మరల; ఒక్కనాఁడు= ఒకరోజు.

తాత్పర్యం: అని దేవయాని చెప్పగా విని శుక్రుడు తనదివ్యదృష్టితో రాక్షసులచేత చంపబడిన కచుడిని చూచి, అతడిని బ్రదికించి తెచ్చేందుకు మృతసంజీవనీవిద్యను పంపగా, ఆవిద్యకూడ అది తనకు అనుగ్రహ మని తలంచి మిక్కిలివేగంతో కూడిన గమనంతో వెళ్ళి, ప్రాణరహితు డైన కచుడిని తత్క్షణమే బ్రదికించి తన వెంట తీసికొని రాగా చూచి శుక్రుడూ, దేవయానియూ సంతోషించి ఉండగా కొన్నిరోజులతర్వాత మళ్ళీ ఒకరోజున. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: చర్మచక్షువులచూపు బహిఃప్రపంచంలో కొంతవరకు కొన్నివస్తువులనుమాత్రమే చూడగలదు. ఇది సామాన్యజీవుల కందే దృష్టి. దివ్యదృష్టి దాని కతీత మైనది. దానితో ఎంతదూరంలో ఉన్నదాని నైనా, ఎక్కడున్నదాని నైనా చూడవచ్చును. ఇది మునులకు, దేవతలకు ఉంటుంది. ప్రసాదంబు+అని= రాజులు దేవతలు మొదలైన వారు ఏదైనా పనిచేయు మని ఆజ్ఞాపించగానే సేవకులు, భక్తులు అనుగ్రహంగా భావించి వినయంతో ప్రసాద మంటారు. తమరు పని చెప్పి మమ్మల్ని అనుగ్రహించా రని విన్నవించుకొంటారు.

క. అడవికిఁ బువ్వులు దేరఁగ । వడి నరిగినకచునిఁ జంపి, వారక దనుజుల్
పొడవు సెడఁ గాల్చి, సురతోఁ । దడయక యబ్బూది శుక్రుఁ ద్రావించి రొగిన్. 114

ప్రతిపదార్థం: అడవికిన్; పువ్వులు; తేరఁగన్= తెచ్చేందుకు; వడిన్= వేగంగా; అరిగిన= వెళ్ళిన; కచునిన్; చంపి; వారక= ఉడుగక (అంతటితో ఆగక); దనుజుల్; పొడవు= రూపం; చెడన్= చెడిపోయేట్లుగా; కాల్చి; ఆ+బూది= కచుడిని కాల్చగా

ఏర్పడిన బూడిద; సురతోన్= మద్యంతో; తడయక= ఆలస్యం చేయక; ఒగిన్= క్రమంగా; శుక్రున్= శుక్రుడిచేత; త్రావించిరి= త్రాగేటట్లుగా చేశారు.

తాత్పర్యం: పూలు తెచ్చేందుకై అడవికి వెళ్ళిన కచుడిని చంపారు. అంతటితో ఆగక రాక్షసులు అతడి రూపులేకుండా కాల్చి, ఆలస్యం చేయకుండా ఆ బూడిదను మద్యంతోకలిపి, క్రమంగా శుక్రుడు త్రాగేటట్లు చేశారు.

విశేషం: తెచ్చు, తుమున్నర్థకము తేరన్ త్రాగు - త్రావు - ప్రేరణార్థకము త్రావించు.

వ. శుక్రుండును సురాపానమోహితుం డయి యున్న, దొల్లింటియట్ల దేవయాని గచుం గానక దుఃఖిత యై 'నేఁడును గచుండు రాక మసలె; నసురులచేత నిహతుం డయ్యెఁ గావలయు' నని శోకించిన దానిం జూచి శుక్రుం డి ట్లనియె. 115

ప్రతిపదార్థం: శుక్రుండును= శుక్రుడు కూడ; సురా, పాన, మోహితుండు+అయి= మద్యం త్రాగటంచేత తెలివి తప్పినవాడై; ఉన్నన్= ఉండగా; తొల్లింటి, అట్లు+అ= పూర్వం వలెనే; దేవయాని; కచున్= కచుడిని; కానక= అరయక; దుఃఖిత+ఐ= దుఃఖం పొందినదై; నేఁడును= ఈ దినానకూడ; కచుండు; రాక= రాకుండా, మసలెన్= ఆలస్యం చేశాడు; అసురులచేతన్= రాక్షసులచేత; నిహతుండు= చంపబడినవాడు; అయ్యెన్, కావలయున్= అయ్యెను కాబోలును అని; శోకించినన్= దుఃఖించగా; దానిన్= దేవయానిని; చూచి; శుక్రుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: శుక్రుడుకూడ మద్యం త్రాగటంచేత మోహం (మైకం) పొందిన వాడై ఉండగా, పూర్వంవలెనే దేవయాని కచుడిజాడ తెలియక దుఃఖంపొందిన దై, 'ఈనాడుకూడ కచుడు రాకుండా ఆలస్యం చేశాడు. రాక్షసులచేత చంపబడినవా డయ్యాడు కాబోలు' నని చింతించగా ఆమెను చూసి శుక్రుడు ఇట్లా పలికాడు.

విశేషం: కచుడు అడవినుండి తిరిగిరానప్పుడు మొదటిసారి ఏమైనాడో తెలియక కలవరపడింది; రెండవసారి చంపబడి ఉండవచ్చునన్న నమ్మకంతో దుఃఖించింది. మొదటిసారి మనసులోనే వేదనను దాచుకొన్నది. ఇప్పుడు దుఃఖించి బైటపెట్టింది. అభిలాష- చింత అనే దశనందుకొన్న దని ధ్వని. శృంగారస్థాయి యైన రతి దశవిధావస్థలలో పరిణతి పొందుతుందని లాక్షణికుల వివేచన. మొదటిదశనుండి రెండవదశయొక్క పరిణామం ఇందులోని రసధ్వని. (సంపా.)

క. వగవక సంజీవని పెం । పగణిత గర్వమున నసురు లా కచుతోడం
బగఁ గొని చంపెద; రాతఁడు । సుగతికిఁ జనుఁగాక; యేల శోకింపంగన్?. 116

ప్రతిపదార్థం: సంజీవని; పెంపు= మృతులైన వారిని బ్రతికించేవిద్యయొక్క మహత్త్వం; వగవక= తలపక; అసురులు= రాక్షసులు; అగణిత, గర్వమునన్= గణింపరాని (అధికమైన) గర్వంతో; ఆ, కచుతోడన్= ఆ కచుడితో; పగన్= వైరాన్ని; కొని= పొంది; చంపెదరు= అతడిని చంపుతారు; ఆతఁడు= ఆ కచుడు; సుగతికిన్= మంచిస్థితికి (మోక్షానికి); చనున్, కాక= పోవుగాక; శోకింపన్, ఏల= దుఃఖించట మెందుకు?

తాత్పర్యం: సంజీవనీవిద్యగొప్పతనాన్ని ఆలోచించక రాక్షసులు అధికగర్వంతో ఆ కచుడితో వైరం పూని అతడిని చంపుతారు. అతడు ఉత్తమగతికి వెళ్ళుగాక. దీనికి దుఃఖించట మెందుకు?

విశేషం: వగచు ధాతువుకు నన్నయకాలాన తలచు అనే అర్థముండేది. తరువాత దానికి దుఃఖించు అన్న అర్థ మేర్పడింది.

వ. అనిన దేవయాని యి ట్లనియె. 117

తాత్పర్యం: శుక్రు డా విధంగా పలుకగా దేవయాని ఇట్లా అన్నది.

మ. మతిలోకోత్తరుఁ డైన యంగిరసుమన్మం, డాశ్రితుం, డాబృహ
స్పతికింబుత్త్రుఁడు, మీకు శిష్యుడు, సురూప బ్రహ్మచర్యాశ్రమ
వ్రత సంపన్నుఁ, డకారణంబ దనుజవ్యాపాదితుం డైన న
చ్యుతధర్మజ్ఞ! మహాత్మ! యక్కచున కే శోకింప కె ట్లుండుదున్?. 118

ప్రతిపదార్థం: మతి లోక+ఉత్తరుఁడు+ఐన= బుద్ధిలో అసాధారణు డైన, అంగిరసు= అంగీరసు డనే; ముని యొక్క; మన్మండు= పౌత్త్రుడు (మనుమడు); ఆశ్రితుండు= ని న్నాశ్రయించినవాడు; ఆ బృహస్పతికిన్= అంతటి దేవగురువు, సుప్రసిద్ధుడున్నూ అయి బృహస్పతికి; పుత్త్రుఁడు= కొడుకు; మీకున్= శుక్రుడికి; శిష్యుఁడు; సురూప, బ్రహ్మచర్య+ఆశ్రమ+వ్రత సంపన్నుఁడు= మంచి రూపం కలవాడున్నూ, బ్రహ్మచర్యాశ్రమ మనే వ్రతంతో కూడినవాడున్నూ అయిన కచుడు; అకారణంబు+అ= కారణం లేకుండానే; దనుజ, వ్యాపాదితుండు+ఐనన్= రాక్షసులచేత చంపబడ్డవాడు కాగా; అచ్యుత; ధర్మజ్ఞ= చ్యుతి లేని ధర్మాన్ని ఎరిగినవాడా! (ధర్మమార్గం తప్పనివాడా!); మహత్+ఆత్మ= మహానుభావా! (శుక్రుడికి సంబోధన); ఆ+కచునకున్= ఆ కచుడికొరకు; ఏన్= నేను; శోకింపక= దుఃఖించక; ఎట్లు ఉండుదున్= ఏ విధంగా ఉంటాను?

తాత్పర్యం: చ్యుతి లేని ధర్మాన్ని ఎరిగిన వాడా! పరమధర్మజ్ఞుడా! మహానుభావా! బుద్ధియందు లోకాతీతు డైన అంగిరసు డనే మునికి మనుమడున్నూ, ని న్నాశ్రయించినవాడున్నూ, ప్రసిద్ధు డైన బృహస్పతికి కుమారుడున్నూ, మీకు శిష్యుడున్నూ, మంచిరూపం కలవాడున్నూ, బ్రహ్మచర్యాశ్రమ మనే వ్రతంతో కూడినవాడున్నూ, అయినటువంటి కచుడు కారణం లేకుండానే రాక్షసులచేత చంపబడినవాడు కాగా అతడికొరకు నే నెట్లా దుఃఖించకుండా ఉంటాను?

విశేషం: దేవయాని కచుడియం దనురక్తురాలయిన దన్న సంగతిని ఈపద్యంలో వ్యంగ్యంగా స్ఫురిస్తున్న స్మృతి, గుణస్తుతి అనే దశలు తెలుపుతున్నాయి. రతిభావ పరిణామదశలలో ఇవి మూడవది, నాల్గవది, అవస్థలు పది. అవి- అభిలాష, చింత స్మృతి, గుణస్తుతి, ఉద్వేగము, ప్రలాపము, ఉన్మాదము, వ్యాధి, జాడ్యము, మరణము. రాత్రికి ఆశ్రమానికి తిరిగిరాని కచుడు తప్పక చనిపోయి ఉంటాడని పూర్వానుభవ స్మృతిచర్వణంవలన నిశ్చయించింది. చనిపోతే దిగులుపడేదేముంది? అని శుక్రుడు పేర్కొనగానే ఆమె తనశోకానికి కారణం చెప్పింది. ఆ కారణం కచుడి గుణగణప్రశస్తియే. కచుడు ఉత్తమవంశజుడు. తాతతండ్రులు మహామునులు. జగద్విదితులు. ఇక గురువుగారా వారిద్దరికి ఏమాత్రం తీసిపోని మహితాత్ముడు. కచుడు అందగాడు, బ్రహ్మచర్యవ్రతనిష్ఠాపరుడు. అటువంటి యోగ్యుడు రాక్షసులకారణంగా చనిపోయాడంటే శోకించకుండా ఎలా ఉండగలను? అని పలికింది. ఇందులో కచగుణకీర్తనం వాచ్యం. ఆ కీర్తనంవెనుక ఉన్న దేవయాని విప్రలంభం వ్యంగ్యం. ఉత్తమవంశజుడు, అందగాడు, బ్రహ్మచారి, శుక్రుడి శిష్యుడు అయిన కచుడు అన్నివిధాల తనకు యోగ్యుడైన వరుడని దేవయాని భావం. దీనిని తండ్రి గ్రహించడేమి? అని కోపం. అంతటి బ్రహ్మచారి పోతే తండ్రి శోకించనందుకు అధిక్షేపం. తండ్రికి ఇష్టంలేకపోయినా దేవయాని అతడి వియోగాన్ని భరించలే నని వ్యంగ్యంగా తండ్రికి చెపుతున్నది. కచుడికి తనకూతురు నివ్వటం ధర్మం కాదు కాబట్టి శుక్రు డామె అభిలాషను గమనింపలేదు. అయినా, కనీసమానవధర్మంతో చూచినా అతడిని రక్షించటం ఉచితం, ధర్మం, ఉత్తమలక్షణం. దానిని ధ్వనింపజేసేటట్లు 'అచ్యుతధర్మజ్ఞ! మహాత్మ!' అని

దేవయాని తండ్రిని సంబోధించింది. నన్నయ దేవయాని రతిభావావస్థ (గుణస్తుతి)ను మాధుర్య మనే గుణంతో పోషించాడు. ఉక్తివైచిత్ర్యంతో కూడుకొన్న పృథక్పదత్వం ఈరచనలో గుణం. అదే మాధుర్యం. 'అటువంటి కచుడు నిష్కారణంగా మనరాక్షసులచేత చంపబడితే ముల్లోకాలలో శుక్రుడి శిష్యుడు చంపబడ్డాడనే అపకీర్తి వస్తుంది. అతడి తాతతండ్రులుకూడ లోకత్రయవిదితులు. అన్ని లోకాలలో ఈవార్త గుప్పు మంటుంది. వారందరూ శుక్రుడిని నిందిస్తారు. ఈ గురుబంధువర్గమంతటి కంటె కచుడు నాకు కావలసినవాడు. అందువలన మీకు దుఃఖంలేకపోవచ్చును, నాకుమాత్రం విచారం కలుగుతుంది- అని అనురక్తిని ఉక్తివైచిత్రితో చెప్పింది. 'శోకింప కెట్లుండుదున్' అనటంలో మరొక చమత్కారమున్నది. ఆప్తజనవియోగంవలన, పునస్సమాగమం లేని ప్రియుడి యెడబాటువలన నాయిక పొందేది శోకం. అటువంటి శోకం దేవయాని పొందింది. కచుడు బ్రతికివస్తేనే ఆ శోకం సంచారి అయి రతికి పోషక మయ్యేది. లేదా శోకం కరుణరసంగా మారుతుంది. నన్నయ రుచిరార్థసూక్తినిధిత్వానికీ, వస్తుధ్వనిని రసధ్వనిలో పర్యవసింపచేయటానికీ, ఈ పద్యం అమూల్యోదాహరణం. (సంపా.)

వ. 'వానిం జూచి కాని కుడువనొల్ల' నని దేవయాని యేడ్చుచున్నఁ, బెద్దయుంబ్రొద్దునకుఁ బ్రసన్నుం డై శుక్రుండు దనయోగదృష్టిం జూచి లోకాలోకపర్యంతభువనాంతరంబునఁ గచుం గానక సురాసమ్మిశ్ర భస్మ మయుం డై తనయుదరంబున నున్న యక్కచుం గని, సుర సేసిన దోషంబును, నసురులు సేసిన యపకారంబును నెఱింగి. 119

ప్రతిపదార్థం: వానిన్= ఆ కచుడిని; చూచి; కాని= చూసిన తరువాత కాని; కుడువన్+ఒల్లన్= తినటానికి సమ్మతించను; అని; దేవయాని; ఏడ్చుచున్+ఉన్నన్= ఏడుస్తుండగా; పెద్దయున్, ప్రొద్దునకున్= చాలాసేపటికి; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహం కలవాడై; శుక్రుండు; యోగదృష్టిన్= యోగాభ్యాసంచేత లభించిన అతీంద్రియదృష్టితో (దివ్యదృష్టితో); చూచి; లోకాలోక, పర్యంత, భువన+అంతరంబునన్= లోకాలోకపర్వతంచేత చుట్టబడిన ప్రపంచంయొక్క నడుమన్; కచున్= కచుడిని; కానక= కనుగొనలేక; సురా, సమ్మిశ్ర, భస్మమయుండు+ఐ= మద్యంలో కలిసిన బూడిదఆకారం కలవాడై; తన; ఉదరంబునన్= పొట్టలో; ఉన్న; ఆ కచున్; కని= చూచి; సుర+చేసిన= మద్యపానం చేసిన; దోషంబునున్= కీడును; అసురులు= రాక్షసులు; చేసిన; అపకారంబునున్= హానిని; ఎఱింగి= తెలిసికొని.

తాత్పర్యం: ఆ కచుడిని చూసినతరువాత కాని అన్నం తినేందుకు అంగీకరించ నని దేవయాని ఏడుస్తుండగా, చాలాసేపటికి అనుగ్రహం కలవా డై శుక్రుడు దివ్యదృష్టితో చూచి, లోకాలోకపర్వతంచేత చుట్టబడిన ప్రపంచం మధ్యలో కచుడిని చూడక మద్యంలో కలిసిన బూడిద రూపాన తన కుక్షిలో ఉన్న ఆ కచుడిని చూచి మద్యపానం చేసిన హానినీ, రాక్షసులు చేసిన కీడునూ తెలిసికొని.

విశేషం: తాము చెప్పిన పని చేయనప్పుడు అన్నం తినేందుకు అంగీకరించకుండా ఏడవటం పిల్లలకు, ఆడవాళ్ళకు సహజం. భూమి చుట్టూ లోకాలోకపర్వతం (చక్రవాళపర్వతం) ఉంటుం దని చెపుతారు. దానికి ఇవతల వెలుతురు, అవతల చీకటి ఉంటుంది.

ఆ. మొదలి పెక్కు జన్మములఁ బుణ్యకర్మముల్ । పరఁగఁ బెక్కుసేసి పడయఁబడిన
యట్టి యెఱుక జనుల కాక్షణ మాత్రన । చెఱుచు మద్యసేవ సేయ నగునె?. 120

ప్రతిపదార్థం: మొదలి, పెక్కు, జన్మములన్= పూర్వమందలి అనేకజన్మలందు; పుణ్యకర్మముల్= పుణ్యం కలిగించే పనులు; పరఁగన్= ఒప్పుగ; పెక్కు, చేసి= అనేక మైనవి చేసి; పడయఁ బడిన, అట్టి= పొందబడినటువంటి; ఎఱుక= జ్ఞానం;

జనులకున్= ప్రజలకు; ఆ క్షణమాత్రన్+అ= ఆ క్షణమందే; చెఱుచు= చెడునట్లు చేయు; మద్య, సేవ= మద్యాన్ని సేవించటం (మద్యపానం) చేయన్+అగున్+ఎ= చేయదగునా; (చేయరా దని భావం).

తాత్పర్యం: పూర్వమందలి అనేక జన్మాలలో పుణ్యకార్యాలను ఒప్పుగా అనేకం చేసి పొందబడిన జ్ఞానం జనాలకు క్షణమాత్రంలోనే పోగొట్టే మద్యపానం చేయదగునా?

విశేషం: మద్యపానం చేస్తే పూర్వజన్మాలలోని పుణ్యకర్మాలవలన లభించిన జ్ఞానంకూడా నశిస్తుం దని సందేశం. మద్యపాన దుష్ఫలితాన్ని తెలిపే రుచిరార్థ సూక్తి ఇది. మద్యపానం పంచమహాపాతకాలలో ఒకటి.

క. భూసురు లాదిగఁ గల జను । లీసుర సేవించిరేని యిది మొదలుగఁ బా
పాసక్తిఁ బతితు లగుదురు; । చేసితి మర్యాద; దీనిఁ జేకొనుఁడు జనుల్. 121

ప్రతిపదార్థం: భూసురులు+ఆదిగన్= బ్రాహ్మణులు మొదలుగా; కల; జనులు; ఈ సురన్= ఈ మద్యాన్ని; సేవించిరి+ఏని= సేవించారా (త్రాగితే); ఇది మొదలుగన్= నేడు మొదలుకొని; పాప+ఆసక్తిన్= పాపమందలి అపేక్షచేత (పాపమునందే తగులు కొనటంచేత); పతితులు= భ్రష్టులు (పాపలోకమందు పడినవారు); అగుదురు; మర్యాద= కట్టుబాటు; చేసితిన్; దానిని= ఆ కట్టుబాటును; జనుల్= ప్రజలు; చేకొనుఁడు= గ్రహించండి.

తాత్పర్యం: నేడు మొదలుకొని బ్రాహ్మణులు మున్నగు జనులు ఈ మద్యాన్ని పానం చేస్తే పాపమందు తగులుకొని దుర్గతి పొందుతారు. నే నీ కట్టడి చేశాను. ప్రజలు గ్రహించండి.

విశేషం: ఇది మొదలుగా అంటే నేను మద్యపానం చేయటంవలన కీడు జరిగింది మొదలుకొని అని అర్థం. మద్యపానం చేసేవారు అధోలోకాలకు పోతా రని దీనివలన తెలుస్తున్నది.

వ. అని శుక్రుండు సురాపానంబు మహాపాతకంబుగా శపియించి, తనయుదరంబున నున్న కచు నప్పుడ సంజీవితుం జేసిన, నంద యుండి కచుండు శుక్రున కి ట్లనియె. 122

ప్రతిపదార్థం: అని; శుక్రుండు; సురా, పానంబు= మద్యాన్ని త్రాగటం; మహత్+పాతకంబు, కాన్= గొప్ప పాప మయ్యేటట్లుగా; శపియించి= శపించి (శాపమిచ్చి); తన ఉదరంబునన్= తనపొట్టలో ఉన్న; కచున్; అప్పుడు+అ= వెంటనే; సంజీవితున్, చేసినన్= మరల బ్రతికిన వాడిని చేయగా; అందున్+అ= పొట్టయందే; ఉండి; కచుండు; శుక్రునకున్; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: అని శుక్రుడు మద్యం త్రాగటం గొప్పపాప మౌనట్లుగా శాప మిచ్చి తనపొట్టలో నున్న కచుడిని ఆక్షణమందే మరల బ్రదికినవాడిని చేయగా, కడుపులోనే ఉండి కచుడు శుక్రుడితో ఇట్లా పలికాడు.

క. తనువును జీవము సత్త్వం । బును బడసితి నీ ప్రసాదమున; నీయుదరం
బనఘా! వెలువడు మార్గం । బొనరింపుము నాకు భూసురోత్తమ! దయతోన్. 123

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! భూసుర+ఉత్తమ= బ్రాహ్మణశ్రేష్ఠుడా; తనువును= దేహాన్ని; జీవమున్= ప్రాణాన్ని; సత్త్వంబును= బలాన్ని; నీ ప్రసాదమునన్= నీ అనుగ్రహంచేత; పడసితిన్= పొందాను; నీ, ఉదరంబు= కడుపునుండి; నాకున్; వెలువడు మార్గంబు= బయటికి వచ్చేవిధం (త్రోవ); దయతోన్; ఒనరింపుము= చేయుము.

తాత్పర్యం: పాపరహితుడవు, బ్రాహ్మణశ్రేష్ఠుడవు అయిన ఓ శుక్రుడా! నీ అనుగ్రహంవలన దేహాన్ని, ప్రాణాన్ని, బలాన్ని పొందాను. నాకు దయతో నీకడుపునుండి బయటికి వచ్చే విధం కావించవలసింది.

విశేషం: నీయుదరంబు+వెలువడు మార్గంబు 'ఒకానొకచో నొకవిభక్తికి మరియొక్క విభక్తియు నగును'. ఇచ్చట ఉదరంబు అనగా ఉదరమువలననుండి అని అర్థం. ప్రథమ పంచమ్యర్థమున వాడబడింది.

వ. అనిన 'నాయుదరంబుభేదిల్లినంగాని యిమ్మునికుమారుండు వెలువడ నేరం; డుదరభేదనంబున మూర్ఛితుండ నయిన నన్ను సంజీవితుంజేయ వలయు' నని శుక్రుండు కచునకు సంజీవని నుపదేశించిన. 124

ప్రతిపదార్థం: అనినన్= అని కచుడు పలుకగా; నా+ఉదరంబు= నాకడుపు; భేదిల్లినన్, కాని= బద్దలయితే తప్ప; ఈ+మునికుమారుండు= (బృహస్పతి) మునికొడు కయిన ఈకచుడు; వెలువడన్ నేరండు= బయటికి రాజాలడు; ఉదర, భేదనంబునన్= కడుపు బద్దలవటం వలన; మూర్ఛితుండను= మూర్ఛపొందినవాడను; అయిన, నన్నున్; సంజీవితున్= బ్రతికినవాడినిగా, చేయవలయున్= కచుడు చేయాలి; అని; శుక్రుండు; కచునకున్; సంజీవనిన్= మరణించినవారిని బ్రతికించే విద్యను; ఉపదేశించినన్= ఉపదేశం చేయగా (నేర్పుగా).

తాత్పర్యం: అని కచుడు పలుకగా, 'నాకడుపు భేదిల్లితే కానీ (బద్ద లయితే తప్ప) బృహస్పతి కుమారు డైన కచుడు బయటికి రాలేడు. కడుపు బద్దలవటంచేత మూర్ఛ పొందిన నన్ను ఈ కచుడు మరల బ్రతికించాలి' అని శుక్రుడు కచుడికి సంజీవనివిద్యను ఉపదేశించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఉదరభిదాముఖమున న । భ్యుదయముతో నిర్గమించె బుధనుతుఁడు కచుం
డుదయాద్రిదరీముఖమున । నుదితుం డగు పూర్ణహిమమయూఖుఁడ పోలెన్. 125

ప్రతిపదార్థం: ఉదర, భిదా, ముఖమునన్= కడుపుయొక్క రంధ్రముయొక్క మొదటినుండి, బుధనుతుఁడు= పండితులచేత స్తుతించబడినవాడు; కచుండు; అభ్యుదయముతోన్= విజయంతో, వాంఛితార్థఫలసిద్ధితో; ఉదయ+అద్రి, దరీ, ముఖమునన్= తూర్పుకొండ గుహారంభాన; ఉదితుండు+అగు= ఉదయించినవా డైన; పూర్ణ, హిమ, మయూఖుఁడు+అ+పోలెన్= నిండు చంద్రుడో యన; నిర్గమించెన్= బయటికి వచ్చాడు.

తాత్పర్యం: పండితులచే స్తుతించబడు కచుడు వాంఛితార్థసిద్ధితో తూర్పుకొండగుహయొక్క ఆరంభాన ఉదయించే చంద్రుడో యన శుక్రుడి కడుపురంధ్రంమొదటినుండి బయటికి వచ్చాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. సంజీవనీవిద్యను పొందిన కచుడిని అమృతప్రదుడైన చంద్రుడితో సంభావించటం ఔచిత్యవంతంగా ఉన్నది. కచుడు సంజీవనీవిద్య పొందటానికే వచ్చాడు. అతడికోరిక నెరవేరింది.

వ. అంత. 126

తాత్పర్యం: ఆ తరువాత.

తే. **విగతజీవుఁ డై పడియున్న వేదమూర్తి । యతనిచేత సంజీవితుఁ డై వెలింగె**
దనుజమంత్రి యుచ్చారణదక్షుచేత । నభిహితం బగు శబ్దంబునట్ల పోలె. **127**

ప్రతిపదార్థం: విగత, జీవుఁడు+ఐ= పోయిన ప్రాణం కలవాడై; పడి, ఉన్న= నేలమీద పడి ఉన్న; వేద, మూర్తి= రూపు ధరించిన వేద మైన (వేదరూపుడైన); దనుజ, మంత్రి= రాక్షసులమంత్రి అయిన శుక్రుడు; ఉచ్చారణ, దక్షుచేతన్= శబ్దాలను ఉచ్చరించటం (పలకటం) లో సమర్థుడైనవాడిచేత; అభిహితంబు+అగు= పలుకబడిన; శబ్దంబు+అట్లు+అ, పోలెన్= పదంవలె; అతనిచేతన్= కచుడిచేత; సంజీవితుఁడు+ఐ= బ్రతికించబడినవాడై; వెలింగెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: ప్రాణం పోయినవాడై పడి ఉన్న, వేదవిగ్రహు డైన, రాక్షసమంత్రి అయిన శుక్రుడు కచుడిచేత బ్రతికించబడినవా డై, పదాలను చక్కగా ఉచ్చరించటంలో నేర్పుకలవాడిచేత పలుకబడిన పదంవలె ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ. ఇందులోని ఉపమానం అపూర్వం. శబ్దబ్రహ్మవేత్తలకే అది తెలుస్తుంది. సుష్ఠూచ్చారణదక్షులు పలికే శబ్దాలు వీనులవిందు లై ప్రకాశిస్తాయి. అంతేకాక ఇక్కడ మరొక విశేషం ఉన్నది. శబ్దం కావ్యశరీరంవంటిది. అది సమర్థంగా ఉచ్చరించబడితే సమగ్రంగా ఆవిష్కరించబడినట్లౌతుంది. అట్లాగే కాలి, బూడిద అయి శుక్రుడి కడుపులో జీర్ణించిన కచుడు సంజీవనీ విద్యాప్రభావంచేత చెక్కుచెదరని ఆకారంతో బయలువెడలినాడని భావం. సంజీవనీ మంత్రాన్ని గ్రహించి ఉచ్చరించే సామర్థ్యం అతనియందు సమగ్రంగా ఏర్పడిందని కూడా వ్యంగ్యం. అట్లు, పోలె= అని రెండు ఉపమానవాచకాలను ఉపయోగించటం నన్నయరచనలలో కొన్ని చోట్లను, నన్నెచోడుడి కుమారసంభవంలో పెక్కుచోట్లను కనిపిస్తాయి. శబ్దంబు+అట్లు= షష్ఠీసమాసమున ఉత్తున కచ్చు పరమగునపుడు నుగాగమ మగును'; శబ్దంబునట్లు.

వ. **ఇ ట్లతిప్రయత్నంబునఁ గచుండు శుక్రువలన సంజీవని వడసి పెద్దకాలం బుండి, యొక్కనాడు శుక్రుచేత ననుజ్ఞాతుం డయి దేవలోకంబునకుం బోవుచుండి, దేవయాని కతిప్రియపూర్వకంబునం జెప్పిన, నదియును దద్వియోగదుఃఖిత యై కచున కి ట్లనియె.** **128**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; అతి, ప్రయత్నంబునన్= అధిక మైన ప్రయత్నంచేత; కచుండు; శుక్రువలన; సంజీవని= చచ్చినవారిని బ్రదికించే విద్యను; పడసి= పొంది (పకు వాదేశము); పెద్ద, కాలంబు= చాలకాలం; ఉండి= శుక్రుడిదగ్గర ఉండి; ఒక్కనాడు; శుక్రుచేతన్; అనుజ్ఞాతుండు+అయి= అనుమతించ బడినవాడై; దేవలోకంబునకున్= స్వర్గలోకానికి; పోవుచున్+ఉండి= వెళ్ళుతూ; దేవయానికి; అతిప్రియ, పూర్వకంబునన్= మిక్కిలి ప్రీతితో; చెప్పినన్= నేను వెళ్ళుతున్నా నని తెల్పగా; అదియును= ఆ దేవయానియున్నూ; తద్+వియోగ, దుఃఖిత+ఐ= అతని ఎడబాటువలన దుఃఖం పొందిన దై; కచునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా అధిక మైన ప్రయత్నంతో (మిక్కిలి కష్టపడి) కచుడు శుక్రుడినుండి మృతులను బ్రదికించే విద్యను పొంది, చాలకాలంఉండి, ఒకరోజున శుక్రుడిఅనుమతి పొంది స్వర్గలోకానికి తిరిగి వెళ్తూ, దేవయానికి అతిప్రీతిపూర్వకంగా ఆవార్త చెప్పగా, ఆమెయు అతని ఎడబాటుకు దుఃఖించి అతనితో ఇట్లా పలికింది.

ఉ. **'నీవును బ్రహ్మచారివి, వినీతుఁడ, వేనును గన్యకన్; మహీ**
దేవకులావతంస! రవితేజ! వివాహము నీకు నాకు మున్

భావజశక్తి నైనయది; పన్నుగ నన్నుఁ బరిగ్రహింపు సం
జీవనితోడ శుక్రుదయఁ; జేయుము నాకుఁ బ్రియంబు' నావుడున్. 129

ప్రతిపదార్థం: మహీదేవ, కుల+అవతంస= బ్రాహ్మణకులానికి సిగబంతియైనవాడా!; రవి, తేజ= సూర్యుడి కాంతివంటి కాంతి కలవాడా!, కచుడా!; నీవును= నీవుకూడ; బ్రహ్మచారివి= అవివాహితుడవు; వినీతుఁడవు= వినయవంతుడివి; (గురువుచే విద్యపొందినవాడివి); ఏనును= నేనుకూడ; కన్యకన్= వివాహం కానిదానను; నీకున్, నాకున్= మన కిద్దరికీ; వివాహము= పెళ్ళి; మున్= ముందే; భావజ, శక్తిన్= మన్మథుడి ప్రభావంచేత; ఐన+అది= అయినది (మన్మథుడి ప్రభావంచేత నిన్ను నేను ప్రేమించాను కాబట్టి మానసికంగా పెండ్లి అయిపోయింది); పన్నుగన్= ఒప్పుగ; శుక్రుదయన్= నాతండ్రి అయిన శుక్రుడియొక్క దయతో; సంజీవనితోడన్= సంజీవనీవిద్యతోపాటుగ; నన్నున్; పరిగ్రహింపు(ము)= స్వీకరించుము, వివాహమాడుము; నాకున్; ప్రియంబు= ప్రీతి; చేయుము= కలిగించుము; నావుడున్= అని దేవయాని చెప్పిన అనంతరం.

తాత్పర్యం: 'బ్రాహ్మణకులానికి అలంకార మైనవాడా! సూర్యుడికాంతివంటికాంతి కలిగిన ఓ కచుడా! నీవు వినయవంతుడివి, అవివాహితుడవు. నేనుకూడ కన్యను (పెళ్ళికానిదానిని). నీకూ, నాకూ ఇంతకుముందే మన్మథుడి శక్తిచేత (నేను నిన్ను ప్రేమించటంవలన) పెళ్ళి అయిపోయింది. అందుచేత శుక్రుడిదయతో సంజీవనీవిద్యతోపాటుగా నన్ను స్వీకరించి, వివాహమాడి, నాకు ప్రీతి కలిగించుము' అని దేవయాని చెప్పిన తరువాత.

విశేషం: నన్నయ రచనలో ప్రసాదగుణానికి ప్రసిద్ధమైన పద్యమిది. దేవయాని తన మనసులోని మాటను అనురాగంతో అకలుషంగా అవక్రంగా సూటిగా చెప్పే ఈపద్యంలో బంధశైథిల్యం, అర్థవైమల్యం పోషించబడటంతో శబ్దార్థగుణాలను నన్నయ ప్రదర్శించి తన ప్రజ్ఞను చాటుకొన్నాడు. శుక్రుడినుండి సంజీవనీవిద్యను పొందాలంటే, అతడికి ప్రాణమైన దేవయానితో స్నేహంగా ఉండి, ఆమెమనసును మెప్పించాలని బృహస్పతియే ముందుగా కచుడికి సూచించి ఉన్నాడు. కచుడి రూపంతోపాటు, అతడి చనవుకూడా దేవయానియందు అనురాగాన్ని మొలకెత్తింపచేసింది. ఆ అభిమానంతోనే రెండుసార్లు తండ్రిచేత అతడిని బ్రదికింపజేసింది. మొదట శుక్రుడు నిర్లిప్తంగా ఉండగా అన్నపానీయాలు మాని తండ్రిచేత కచుడి యోగక్షేమాలను ఆలోచించేట్లు చేసింది. దీనిని బట్టి కచుడు మొదట దేవయానిమనసు దోచుకొన్నట్లు, ఆపై శుక్రుడి మనసు గెలుచుకొన్నట్లు కథలోని అర్థాలు ప్రసన్నాలౌతున్నాయి. అయితే ఆమె తనమనసులోని రతిభావాన్ని కచునితో కాని, తండ్రితోకాని ఎన్నడూ చెప్పలేదు. దానికి కారణం కచుడి విద్యాభ్యాసం ముగియక పోవటమే. విద్య ముగిసిన తరువాత బ్రహ్మచారులైన విద్యార్థులు వివాహయోగ్యతను పొందుతారు. కాబట్టి ఆమె తనకోర్కెను కచుడు విద్యాభ్యాసం పూర్తిచేసి దేవలోకానికి బయలుదేరేంతవరకు బయటపెట్టలేదు. కాగా, ఇక కచుడు బయలుదేరేలోపలే తనకోర్కెను అతనికి చెప్పి, వెంటనే అతనిని దక్కించుకోవాలి. ఆ ఆత్రంతో మనసులోనిమాటను సూటిగా చెప్పినట్లు నన్నయ రచించాడు. కచుడి యందు తనమనసు లగ్నమైనది కాబట్టి వివాహమైనట్లే అని నిర్ణయించి చెప్పింది దేవయాని. కచుడి అంగీకారాన్ని ఆమె అడగలేదు. దానికి కారణం అతడు తిరస్కరిస్తా డని ఆమె ఊహించలేదు. దానికి అతడు చూపుతున్న చనవుకూడ హేతువు కావచ్చును; లేదా- తండ్రిదగ్గర తనమాట అడ్డులేకుండా సాగేమాలిమి ఉన్నది కాబట్టి కచుడుకూడా తనకోర్కెను కాదనకుండా మన్నిస్తాడనే అధికారిక ప్రవృత్తికూడా బలమైనకారణం కావచ్చును. మృతసంజీవనీవిద్యను శుక్రుని దయతో ఏవిధంగా స్వీకరించావో అట్లాగే తననుకూడా స్వీకరించుమని కోరింది. ఇందులో కచుడే శుక్రుడిని అడిగి తనను వివాహమాడాలనీ, అడిగితే తండ్రికాదనకుండా తాను చూచుకుంటాననీ, తండ్రికి మృతసంజీవని ఎంత ప్రాణప్రదమో తానూ అంతేననీ, ఆరెండింటినీ పొందే అర్హత కచుడుమాత్రమే సాధించగలిగాడు కాబట్టి అతడే తనకు భర్త (భరింపదగినవాడు) కాదగినవాడనీ దేవయాని భావించింది. కన్యలో ఉదయించిన యౌవనంకంటె లజ్జ అతిశయించి ఉండటం సహజం. దేవయాని కన్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అయ్యును గడుసరి. తరువాతికథలో ఇది నిరూపింపబడుతుంది. మనసులు కలిసిన పెళ్ళి మన్మథుడే చేశా డని కచుడితో చెప్పిన దేవయాని పాణిగ్రహణం (చేయిపట్టి నూతినుండి లాగావు కాబట్టి) అయిందికాబట్టి నీకూనాకూ ఇదివరకే పెళ్ళి అయిపోయినట్లే అని యయాతితో చెప్పగలిగింది. ఆపెళ్ళిని తండ్రిచేత ఒప్పించి యయాతిచేత అంగీకరింపజేసింది. అంగీకరించని కచుడికి శాప మిచ్చింది; ప్రతిశాపాన్ని కూడా పొందింది. గారాబంగా పెరిగిన గడుసరి పిల్లలలో కానవచ్చే గూఢాహంకారం దేవయాని పాత్రకు జీవం. దానిని బీజంగా నాటాడు నన్నయ ఈపద్యంలో. (సంపా.)

క. ఆ కచుఁ డత్యంతవిషా । దాకులుఁ డై 'లోకనింద్య మగు నర్థము నీ
వాకునకుఁ దెచ్చు టుచితమె? । నాకు సహోదరివి నీవు నాచిత్తమునన్.' 130

ప్రతిపదార్థం: ఆ కచుఁడు= అత్యంత, విషాద+ఆకులుఁడు+ఐ= మిక్కిలి శోకంచేత కలత పొందిన వాడై; లోక, నింద్యము= లోకంచేత నిందించదగినది; అగు+అర్థము= అగునట్టి కోరిక (పని); నీ వాకునకున్= నీవాక్కునకు; తెచ్చుట+ఉచితము+ఎ= తెచ్చుట తగునా (తగదు); నా చిత్తమునన్= నాహృదయమందు; నీవు, నాకున్ సహోదరివి= గురుపుత్రిక వగుటచే తోడపుట్టిన దానివి, నేను నిన్ను సోదరిగా భావిస్తున్నాను.

తాత్పర్యం: దేవయాని తనను వివాహమాడు మని కోరగా కచుడు శోకంచేత కలత పొందినవాడై 'లోకంచేత నిందించదగినకోరిక నీవాక్కునకు తెచ్చుట తగునా? (పలకటం తగదు). గురుపుత్రివి అవటంచేత నా హృదయంలో నీవు సోదరివి. నేను నిన్ను చెల్లెలుగా భావిస్తున్నాను'.

విశేషం: కచుడు ధర్మబుద్ధికలవాడు కావటంచేత గురుపుత్రిని తోబుట్టువుగా భావించాడు. అగు+అర్థము= 'ఉదంత తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగుటచే 'ను' ఆగమము'= అగునర్థము. వాక్కు= 'దీర్ఘము మీది హల్లునకు ద్విత్వము బహుళము' - వాకు ఇచ్చట ద్విత్వము రాలేదు. తెచ్చుట+ఉచితమె= అత్తునకు సంధి ఐనది= తెచ్చుటుచితమె.

క. గురులకు శిష్యులు పుత్త్రులు । పరమార్థమ లోకధర్మపథ మిది; దీనిం
బరికింపక యీ పలుకులు । తరుణీ! గురుపుత్త్రి! నీకుఁ దగునే పలుకన్. 131

ప్రతిపదార్థం: తరుణీ= యువతీ; గురుపుత్త్రి= గురువుగారి కూతు రైన ఓ దేవయానీ!; గురులకున్; శిష్యులు; పుత్త్రులు= కుమారులు (పుత్ర సమానులు); పరమ+అర్థము+అ= ఉత్తమ మైన సత్యమే; ఇది= శిష్యులు గురువులకు పుత్రులన్నది; లోక; ధర్మ పథము= లోకంలోని ధర్మం యొక్క మార్గం; దీనిన్= ఈధర్మాన్ని; పరికింపక= చూడక; ఈ, పలుకులు= నన్ను వివాహ మాడుమన్న మాటలు; నీకున్, పలుకన్; తగును+ఏ= పలకటం తగునా (తగుదు).

తాత్పర్యం: యువతీ! గురుకుమారీ! గురువులకు శిష్యులు కొడుకులతో సమానులు. ఇది పరమసత్యం. లోక మనుసరించవలసిన ధర్మమార్గం. దీనిని చూడక (ఆలోచించక) నన్ను పరిగ్రహించు మని పలకటం నీకు ఉచితమా!

విశేషం: గురుపుత్రి అనే సంబోధన సాభిప్రాయం. సూక్తి అంటే సుభాషిత మనే అర్థం ఉన్నది. నన్నయ ఒక్కొకసారి పద్యాన్నంతా ఒక సుభాషితంగా రూపొందిస్తాడు. ఒక్కొకసారి పద్యంలోని భాగాన్ని సూక్తిగా చిత్రిస్తాడు. సామెతలవంటి వాక్యాలను పద్య పూర్వార్ధంలోకానీ, ఉత్తరార్ధంలోకానీ నిబంధించటం నన్నయ రచనాశిల్పంలోని ఒకమెలకువ. నిరంతరాధ్యాపకు డైన గురువు శిష్యుడికి తండ్రివంటివాడనే ధర్మం అది. 4.49 పద్యంలో గమనించవచ్చు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన నా కచునకు దేవయాని కరం బలిగి 'నీవు నా మనోరథంబు విఫలంబుగాఁ జేసిన వాఁడవు; నీకు సంజీవని పని సేయకుండెడు' మని శాపం బిచ్చినఁ, గచుం 'డేను ధర్మపథంబుఁ దప్పనివాఁడను; నీ వచనంబున నాకు సంజీవని పనిచేయదయ్యెనేనియు నాచేత నుపదేశంబు గొన్నవారికిఁ బనిసేయుంగాక; మఱి నీవు ధర్మ విరోధంబు దలంచితివిగావున నిన్ను బ్రాహ్మణుండు వివాహంబు గాకుండెడు' మని దేవయానికిఁ బ్రతిశాపం బిచ్చి తత్క్షణంబ. 132

ప్రతిపదార్థం: అనినన్= అని కచుడు పలుకగా; దేవయాని; కరంబు= మిక్కిలి, అలిగి= కోపించి; నీవు; నా, మనోరథంబు= నా కోరిక; విఫలంబుగాన్= ఫలంలేని దానిగా; చేసిన వాఁడవు; నీకున్; సంజీవని= నా తండ్రినుండి నేర్చుకొనిన చనిపోయినవారిని బ్రతికించే సంజీవనీవిద్య; పని; చేయక+ఉండెడున్+అని= ఉపయోగపడకుండు గాక అని; శాపంబు+ఇచ్చినన్= శాపమివ్వగా; కచుండు; ఏను= నేను; ధర్మపథంబున్= ధర్మమార్గాన్ని; తప్పని వాఁడను= దాటని వాడిని; నీ వచనంబునన్= నీ శాపంవలన; (పలుకుచేత) నాకున్; సంజీవని= సంజీవనీవిద్య; పని, చేయదు+అయ్యెన్+ఏనియున్= పని చేయకపోయినా (భవిష్యదర్థకాన భూతకాలం); నా చేతన్; ఉపదేశంబు, కొన్న వారికిన్= ఉపదేశం పొందినవారికి; పని, చేయున్, కాక= ఉపయోగపడు గాక; మఱి= ఇంక; నీవు; ధర్మవిరోధంబు= ధర్మానికి వ్యతిరేక మైనపని; తలంచితివి; కావునన్; నిన్నున్; బ్రాహ్మణుండు; వివాహంబు, కాక+ఉండెడున్+అని= పెళ్ళాడకుండుగాక అని; దేవయానికిన్; ప్రతిశాపంబు= ఎదురుశాపం; ఇచ్చి; తత్+క్షణంబు+అ= ఆక్షణమందే (వెంటనే).

తాత్పర్యం: అని కచుడు పలుకగా దేవయాని మిక్కిలికోపించి 'నీవు నాకోరిక నిష్ఫలం చేశావు కాబట్టి నీకు సంజీవనీ విద్య ఉపయోగపడకుండును గాక' అని శాపమిచ్చింది. కచుడు 'నేను ధర్మమార్గాన్ని అతిక్రమించనివాడను. నీ శాపవచనంచేత నాకు సంజీవనీవిద్య పనిచేయక పోయినా నాచేత ఉపదేశం గ్రహించినవారికి పనిచేస్తుంది గాక. ఇంక నీవు ధర్మం కాని పని (సోదరప్రాయు డైన తండ్రిశిష్యుడిని పెళ్ళాడా లని) తలపోశావు కాబట్టి నిన్ను బ్రాహ్మణుడు పెళ్ళాడకుండుగాక' అని ఎదురు(మారు) శాప మిచ్చి వెంటనే.

విశేషం: పని+చేయు= చకు సాదేశం; పనిసేయు. ఉండెడున్+అని= ఎడుతలద్రుతమున కచ్చుపర మగునపుడు మకారమౌతుంది; ఉండెడు మని. (ఆశీరర్థమున ఎడమ అగు నని కొందరి మతము. అప్పుడు ఎడమని అనే రూపం వస్తుంది.)

క. దేవగురునందనుం డమ । రావాసంబునకు నరిగి యమరులకును సం
జీవని యుపదేశించి, సు । ధీవినుతుఁ డొనర్చుచుండె దేవహితంబుల్. 133

ప్రతిపదార్థం: సుధీ, వినుతుఁడు= పండితులచేత స్తుతించబడినవాడు; దేవ, గురు, నందనుండు= దేవతలగురు వైన బృహస్పతి కుమారుడు (కచుడు); అమర+ఆవాసంబునకున్= దేవతలనివాస మైన స్వర్గానికి; అరిగి= వెళ్ళి; అమరులకును= దేవతలకు; సంజీవని= సంజీవనీ విద్య; ఉపదేశించి= బోధించి; దేవహితంబున్= దేవతలకొరకు మేలును; ఒనర్చుచున్+ఉండెన్= చేయుచుండెను.

తాత్పర్యం: పండితులచేత స్తుతింపబడువాడూ బృహస్పతికుమారుడూ అయినటువంటి కచుడు దేవతల నివాస మైన స్వర్గానికి వెళ్ళి దేవతలకు సంజీవనీవిద్య ఉపదేశించి దేవతలకు మేలు చేస్తున్నాడు.

వ. ఇట వృషపర్వుకూఁతురు శర్మిష్ఠయను కన్యక యొక్కనాడు కన్యకాసహస్రపరివృతయయి దేవయానీ సహితంబు వనంబునకుం జని, యొక్క సరోవర తీరంబునఁ దమతమ పరిధానంబులు పెట్టి జలక్రీడ లాడుచున్న, నవి సురకరువలిచేతం బ్రేరితంబు లయి కలిసిన నొండొరులం గడవఁ గొలను వెలువడు సంభ్రమంబున నక్కన్యక లన్యోన్యపరిధానంబులు వీడ్వడం గొని కట్టునెడ దేవయానిపుట్టంబు శర్మిష్ఠ గట్టిన, మఱి దాని పరిధానంబు దేవయాని పుచ్చుకొనక రోసి శర్మిష్ఠం జూచి యి ట్లనియె. 134

ప్రతిపదార్థం: ఇటన్= శుక్రుడుండే చోట, రాక్షసరాజధానిలో; వృషపర్వు+కూఁతురు= వృషపర్వు డనే రాక్షసరాజుకుమార్తె; శర్మిష్ఠ, అను కన్యక= శర్మిష్ఠ అనే పేరు గల కన్య; ఒక్కనాఁడు= ఒకరోజున; కన్యకా, సహస్ర, పరివృత, అయి= కన్యకల వేలచే, పలువురు కన్యలచేత చుట్టబడిం దై; దేవయానీ, సహితంబు= దేవయానితోకూడ; వనంబునకున్= అడవికి; చని= వెళ్ళి; ఒక్కసరోవర, తీరంబునన్= ఒక సరస్సు ఒడ్డున; తమ, తమ పరిధానంబులు= తమ తమ కట్టుబట్టలు; పెట్టి= ఉంచి; జలక్రీడలు= నీటియందాటలు; ఆడుచున్+ఉన్నన్= చేయుచుండగా; అవి= ఆ బట్టలు; సురకరువలిచేతన్= సుడిగాలిచేత; ప్రేరితంబులు+అయి= ప్రేరేపించబడినవై (ఎగురగొట్టబడినవై); కలిసినన్= కలిసిపోగా; ఒండు+ఒరులన్= ఒకరొకరిని; కడవన్= మించునట్లుగ; కొలను= సరస్సునుండి (పంచమ్యర్థమున ప్రథమ); వెలువడు= బయటికి వచ్చే; సంభ్రమంబునన్= వేగిరిపాటుతో; ఆ+కన్యకలు= జలకేళిచేసిన కన్యలు; అన్యోన్య, పరిధానంబులు= ఒండొరుల వస్త్రాలు; వీడ్వడన్= మారుపడేటట్లుగా; కొని= గ్రహించి; కట్టు+ఎడన్= కట్టుకొనే సమయాన; దేవయాని పుట్టంబున్= దేవయాని వస్త్రాన్ని; (చీరను); శర్మిష్ఠ= రాక్షసరాజుకూతురు; కట్టినన్= కట్టుకొనగా; మఱి= అనంతరం; దాని, పరిధానంబు= ఆశర్మిష్ఠ వస్త్రాన్ని; దేవయాని; పుచ్చుకొనక= గ్రహించక; రోసి= అసహ్యించుకొని; శర్మిష్ఠన్; చూచి; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పలికింది.

తాత్పర్యం: కచుడు వెళ్ళిపోయినతర్వాత శుక్రుడు ఉన్నచోట రాక్షసరా జైన వృషపర్వుడికూతురు శర్మిష్ఠ అనే పేరు గల కన్య వేలకొద్ది కన్యలచేత చుట్టబడి దేవయానితోకూడ అడవికి వెళ్ళింది. (ఉద్యానవనానికి వెళ్ళి) ఒక కొలనుఒడ్డున వారు తమ తమ కట్టుబట్టలు పెట్టి జలకేళి చేస్తుండగా ఆ బట్టలు సుడిగాలిచేత ఎగురగొట్టబడి కలిసిపోయాయి. ఆ కన్యలు ఒండొరులను మీరునట్లుగా సరస్సునుండి బయటికి వచ్చే తొందరలో ఒండొరుల చీరలు మారుపడేటట్లు గ్రహించి కట్టుకొనే సమయాన దేవయానిచీర శర్మిష్ఠ కట్టుకొన్నది. అప్పుడు ఆ శర్మిష్ఠ వస్త్రాన్ని దేవయాని గ్రహించక ఏవగించుకొని శర్మిష్ఠను చూచి ఇట్లా పలికింది.

విశేషం: మూలంలో ఆకన్యలవస్త్రాలను ఇంద్రుడు కలిపివేసిన ట్లున్నది. నన్నయ మార్చి సురకరువలిచే నవి కలిపివేయబడిన వని వ్రాయటం ఔచిత్యశోభితంగా ఉన్నది.

క. లోకోత్తరచరితుం డగు । నా కావ్యతనూజ; నీకు నారాధిత; నేఁ
బ్రాకట భూసురకన్యక; । నీకట్టిన మైల గట్ట నేర్తునె చెపుమా. 135

ప్రతిపదార్థం: లోక+ఉత్తర, చరితుండు+అగు= అసామాన్యచరిత్ర కలవా డైన; ఆ, కావ్య, తనూజన్= ఆ శుక్రుడి కూతురిని; నీకున్= శర్మిష్ఠకు; ఆరాధితన్= పూజింపబడిన (తగిన) దానిని; నేన్= నేను; ప్రాకట, భూసుర, కన్యకన్= ప్రసిద్ధి పొందిన బ్రాహ్మణ కన్యకను; నీకట్టిన= (కర్తృపద ప్రథమకు షష్ఠి) నీవు కట్టుకొన్న; మైల= మలిన వస్త్రాన్ని; కట్టన్, నేర్తున్+ఎ= కట్టుకో గలనా; చెపుము+ఆ= చెప్పుమా.

తాత్పర్యం: అసాధారణచరిత్రు డైన శుక్రుడికూతురిని, నీకు పూజనీయురాలిని, ప్రసిద్ధ మైన బ్రాహ్మణకులాన పుట్టినకన్యను అయిన నేను నీవు కట్టుకొన్న మలినవస్త్రాన్ని కట్టుకోగలనా? చెప్పుము.

విశేషం: అగు+ఆ= ఉదంత తద్ధర్మ విశేషణమున కచ్చు పర మైనప్పుడు నుగాగమం ఔతుంది; అగు నా కావ్యు- అనుట వల్ల శుక్రుడి లోకోత్తరచరితత్వం వ్యక్తం చేయబడింది.

వ. అనిన శర్మిష్ఠ యి ట్లనియె. 136

తాత్పర్యం: దేవయాని అట్లా పలుకగా శర్మిష్ఠ ఇట్లా అన్నది.

క. మా యయ్యకుఁ బాయక పని । సేయుచు దీవించి ప్రియము సెప్పచు నుండున్
మీయయ్య; వెండి మహిమలు । నా యొద్దన పలుక నీకు నానయు లేదే?. 137

ప్రతిపదార్థం: మా అయ్యకున్= మాతండ్రి అయిన వృషపర్వుడికి; మీ అయ్య= మీ తండ్రి అయిన శుక్రుడు; పాయక= విడువక; పని, చేయుచున్, దీవించి= ఆశీర్వదించి; ప్రియము= ఇష్టము; చెప్పుచున్+ఉండున్= చెప్పుతూఉంటాడు; వెండి= మరియు; మహిమలు= గొప్పతనాలు; నా; ఒద్దన్+అ= నా దగ్గరే; పలుకన్= చెప్పటానికి; నీకున్; నానయున్= సిగ్గుకూడ; లేదు+ఏ= లేదా!

తాత్పర్యం: మీతండ్రి అయిన శుక్రుడు మాతండ్రి అయిన వృషపర్వుడిని విడువక సేవిస్తూ ఆశీర్వదించి ప్రియవాక్యాలు పలుకుతూ ఉంటాడు. మరి మీ గొప్పతనాలు నాదగ్గరే పలికేందుకు (పలకటానికి) నీకు సిగ్గుకూడ లేదా?

వ. 'నాకట్టిన పుట్టంబు నీకుం గట్టంగాదు గా కేమి' యని గర్వంబున నెగ్గులాడి దేవయాని నొక్కనూతం ద్రోచి, శర్మిష్ఠ కన్యకాసహస్రపరివృత యయి క్రమ్మఱి వచ్చి నిజనివాసంబున నుండె; నంత. 138

ప్రతిపదార్థం: నా, కట్టిన= నేను కట్టుకొన్న (కర్తృపద ప్రథమకు షష్ఠి); పుట్టంబు= వస్త్రం; నీకున్; కట్టన్, కాదు, కాక+ఏమి= కట్టుకొనరాదా ఏమి; అని; గర్వంబునన్= గర్వంతో; ఎగ్గులు+ఆడి= నిందలు పలికి; దేవయానిన్= దేవయానిని; ఒక్కనూతన్= ఒకనూతిలో; త్రోచి= త్రోసిపడేసి; శర్మిష్ఠ; కన్యకా, సహస్ర, పరివృత, అయి= కన్యలయొక్క వేయిచేత (పలువురు కన్యలచేత) చుట్టబడిన దై; క్రమ్మఱి వచ్చి= తిరిగివచ్చి; నిజనివాసంబునన్= తనయొక్క ఇంటిలో; ఉండెన్; అంతన్= పిమ్మట.

తాత్పర్యం: 'నేను కట్టుకొన్నవస్త్రం నీవు కట్టుకోరాదా ఏమిటి?' అని గర్వంతో నిందలాడి, దేవయానిని ఒక నూతిలో త్రోసివేసి, శర్మిష్ఠ వేయిమందికన్యకలతో కూడిన దై తిరిగివచ్చి తన గృహమందు ఉన్నది. పిమ్మట.

విశేషం: సహజంగా జరుగుతున్నట్లు చిత్రించే కథాసన్నివేశాలు కొన్ని భావికథార్థవ్యంజకాలుగా నిబంధింపబడటం వస్తుధ్వని శిల్పం. సుడిగాలిచేత శర్మిష్ఠాదేవయానుల చీరలు కలిసిపోయినవి. దేవయానిచీర శర్మిష్ఠ ధరించటం, శర్మిష్ఠచీరను దేవయాని తిరస్కరించటం ఆ పాత్రల చిత్తవృత్తులకు నిదర్శనాలు. విశేష మేమంటే చీరెలు మారుపడిన ఇరువురూ భావికథలో యయాతికి భార్యలు(సవతులు) కానున్నారు. క్షత్రియవనిత పెండ్లాడదగిన యయాతిని శర్మిష్ఠకు దక్కకుండా దేవయాని తాను పొందగలుగుతుంది బలీయ మైన విధివలన (లేదా శాపంవలన). శర్మిష్ఠ వేయిమంది చెలికత్తెలతోసహా తనకు దాస్యంచేసేటట్లు సాధించగలుగుతుంది. ఈ కథార్థాలకు బీజాలు ఇక్కడ ఉన్నాయి. చీరెలను కలిపిన గాలి విధి. వారిరువురు

సవతు లయ్యే యోగం అందులో ధ్వని. చీరెలు యయాతికి భార్యలుగా ఉండే సతీత్వాలకు సంకేతాలు. క్షత్రియవనిత కట్టుకొనే చీరను తాను ధరించలేదు దేవయాని. భావికథలో శర్మిష్ఠ వలె దేవయాని యయాతి మనసు నాకర్షించలేదు. శుక్రుడి భయంవలన, దేవయాని గడుసరితనంవలన యయాతి ఆమెను కట్టుకొన్నాడే కాని సహజమైన వలపువలన కాదు. దేవయాని జాత్యహంకారవతి; శర్మిష్ఠ అభిమానవతి. పట్టింపువస్తే నూరుగురు చెలికత్తెలసాయంతో దేవయానిని పాడుబడినబావిలో పడవేయగలిగిన సమర్థురాలు శర్మిష్ఠ, తరువాతి కథలో తాను యయాతిని పెండ్లాడి, తనకుమారుడైన పూరుని గుణౌన్నత్యంవలన రాజమాత అయి తన బలాన్నీ బలగాన్నీ ప్రదర్శించుకొన్నది. దేవయానికిగల కోపం, అహంకారం, అసహనం, ఈర్ష్య, ప్రతీకారప్రవృత్తి అనేవి క్రమంగా ఆమెను గార్హస్థ్యసుఖాలకూ, భర్తకూ దూరంచేస్తాయి. ఈకథలో చీరెకట్టి సహనంతో, స్థైర్యంతో, అభిమానంతో నిలిచిన శర్మిష్ఠ చివరకు క్షత్రియోచిత విజయాన్ని సాధిస్తుంది. జాత్యహంకారంవలన దేవయాని రెండింటికి చెడ్డ రేవడి ఔతుంది. భర్తను తిరిగిపొందిన దేవయాని ఓడిపోయిన అహంకారిణి. ఆ భావికథార్థాలకు ఇప్పటి కథాసన్నివేశాలను వ్యంజకాలుగా సంయోజనచేయటం నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి. (సంపా.)

యయాతి నూతంబడిన దేవయాని నుద్ధరించుట (సం. 1-73-14)

ఉ. **ఆనహుషాత్మజుం డగు యయాతి యధిజ్యధనుస్సహాయుఁ డై**
యానతశాత్రవుండు మృగయారసలోలనిబద్ధబుద్ధిఁ ద
త్కాననమెల్లఁ గ్రుమ్మఱి నికామధృతశ్రముఁ డేగుదెంచె నం
దానలినాక్షి యున్న విపినాంతర కూపతటంబునొద్దకున్. **139**

ప్రతిపదార్థం: ఆనత, శాత్రవుండు= విధేయులైన శత్రువులు కలవాడు (శత్రువులను జయించిన వాడు); ఆ, నహుష= ఆత్మజుండు+అగు= ప్రసిద్ధ డైన నహుషుడి కుమారుడైన; యయాతి= మహారాజు; అధిజ్య, ధనుస్+సహాయుఁడు+ఐ= ఎక్కుపెట్టబడిన నారి కల విల్లు సహాయంగా గలవాడై; మృగయా, రసలోల, నిబద్ధ, బుద్ధిన్= వేట అనే వినోదమందు ఆసక్తి కలదియున్నూ, కట్టబడినదియున్నూ అయిన బుద్ధిగలవాడై; తద్, కాననము+ఎల్లన్= ఆ అడవిఅంతా; క్రుమ్మఱి= తిరిగి; నికామ, ధృత, శ్రముఁడు= మిక్కిలిగా పొందబడిన బడలిక గలవాడై; అందున్= ఆ అడవిలో; ఆ, నలిన+అక్షి= పద్మాలవంటి నేత్రాలు కలిగిన ఆదేవయాని; ఉన్న= పడియున్న; విపిన+అంతర, కూప, తటంబు, ఒద్దకున్= అడవినడుమ నున్న నూతి ఒడ్డు దగ్గరకు; ఏగుదెంచెన్= వచ్చెను.

తాత్పర్యం: ఓడించబడి విధేయులైన శత్రువులు కల ప్రసిద్ధుడైన నహుషుడి కుమారు డైన యయాతిమహారాజు వేట అనే వినోదమందు ఆసక్తిగల బుద్ధి కలవాడై, ఆ అడవి అంతా తిరిగి అధికంగా పొందబడిన శ్రమకలవాడై అక్కడ దేవయాని పడియున్న అడవిమధ్యలోని నూతిగట్టుదగ్గరకు వచ్చాడు.

విశేషం: ఆ, అను పదం ప్రసిద్ధ డనే అర్థాన్ని సూచిస్తుంది. తటంబు+ఒద్దకున్= షష్ఠీ సమాసమందు ఉకార బుకారములకు అచ్చుపరమైనపుడు నుగాగమ మౌతుంది. తటంబు నొద్దకున్.

సీ. **చనుదెంచి, యమ్మహాజనపతి జల మపే । క్షించి, యచ్చో విశ్రమించి, చూచి,**
తత్కూపమున విలసత్కూలఘనవల్లి । యన్నిష్టసఖి నూఁదియున్న దాని,
గురుకుచయుగముపైఁ బరువడిఁ దొరఁగెడు । కన్నీరు పూరించుచున్న దానిఁ,
దనసమీపమునకు జనుల యాగమనంబు । పన్నుగాఁ గోరుచునున్న దాని,

ఆ. వరుణదేవుతోడఁ గర మల్గి జలనివా । సంబు విడిచి భూస్థలంబువలని
కరుగుదేర నున్న వరుణేంద్రదేవియ । పోనిదాని దేవయానిఁ గనియె. 140

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; ఆ+మహత్, జనపతి= ఆ గొప్పరాజు (యయాతి); జలము= నీరు; అపేక్షించి= కోరి; అచ్చోన్= అచ్చట; విశ్రమించి= బడలిక తీర్చుకొని; చూచి; తద్+కూపమునన్= ఆనూతియందు; విలసత్, కూల, ఘన, వల్లి= ప్రకాశిస్తున్న ఒడ్డునందలి గొప్పతీగ; అను, ఇష్టసఖిన్= అనెడి ఇష్టురా లైన చెలికత్తెను; ఊఁది, ఉన్నదానిన్= పట్టుకొని ఉన్నదానిని; గురు, కుచయుగముపైన్= పెద్దస్తనాల జంటపై; పరువడిన్= క్రమంగా; తొరఁగెడు= కారెడు; కన్నీరు= బాష్పజలం; పూరించుచున్+ఉన్నదానిన్= నిండిస్తున్నదానిని; తన సమీపమునకున్= తన దగ్గరకు; జనుల= జనాలయొక్క; ఆగమనంబు= రాక; పన్నుగాన్= ఒప్పుగా; కోరుచున్+ఉన్నదానిన్= కోరుతున్న దానిని; వరుణదేవుతోడన్= పడమటి దిక్కునకు రా జైన వరుణదేవుడితో (వరుణదేవుడు జలాధిదేవత); కరము= మిక్కిలి; అల్గి= కోపించి; జలనివాసంబు= జలమందు నివసించటం విడిచి; భూస్థలంబు, వలనికిన్= భూప్రదేశం దిక్కుకు; అరుగుదేరన్, ఉన్న= వచ్చేందుకు సిద్ధంగా ఉన్న; వరుణ+ఇంద్రు, దేవి+అ= వరుణదేవుడి భార్యనే (వరుణుడి పట్టమహిషిని); పోనిదానిన్= పోలినదానిని; దేవయానిన్; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: వచ్చి, ఆ యయాతిమహారాజు నీరు కోరి, అక్కడ విశ్రాంతి గైకొని, చూచి, ఆనూతిలో ఒప్పుతున్న ఒడ్డునం దున్న గొప్పలత అనే ఇష్టసఖిని (రూపకాలంకారం) పట్టుకొన్న దానిని, పెద్దవైనస్తనయుగ్మంపై క్రమంగా జారు కన్నీటిని నింపుతున్నదానిని తనవద్దకు జనులరాకను ఒప్పుగా కోరుతున్నదానిని, వరుణదేవుడితో మిక్కిలి కోపించి జలమందలి నివాసాన్ని విడిచి భూప్రదేశందిక్కుకు రానున్న వరుణుడిపట్టమహిషిని పోలినదానిని దేవయానిని చూచాడు.

విశేషం: అలం: ఉపమాలంకారం: ఉత్ప్రేక్ష అనికూడ చెప్పవచ్చును. వరుణుఁడు జలాలకు రాజు. అందుచేత అతడిభార్య జలంలోనే నివసిస్తుంది. తీగను పట్టుకొని యున్న దేవయాని- భర్తమీద కోపించి భూప్రదేశందిక్కుకు రానున్న వరుణుడి పట్టమహిషేమో అన్నట్లున్నది. ఆ+చోటన్= అచ్చోట= త్రికసంధి. ఉత్తర పదమగు చోట శబ్దము టాక్షరము లోపంబు విభాష నగును. చోటుశబ్దము యొక్క సప్తమీ విభక్తి చోటన్. అను+ఇష్టసఖి= అను అనెడి ఉదంత తద్ధర్మ విశేషణమునందలి ఉకారము లోపించగా 'అన్' ఔతుంది. ఇచ్చట ఈ నకారానికి అచ్చుపరమైనందువలన నకారానికి ద్విత్వం వచ్చింది. కొందరు ఇది ద్రుతద్విత్వ సంధి అని చెప్తారు. కాని అన్ లోని నకారం ద్రుతం కాదు - మరి కొందరు అన్న+ఇష్టసఖి అని విడదీస్తారు. 'అరుగుదెంచు' ధాతువుకు తుమున్నర్థకం అరుగుదేరన్, నన్నయ వర్ణించేటప్పుడు విశేషణాలతర్వాత దాని, దాని అని ఉపయోగించటం పెక్కుచోట్ల కానవస్తుంది. ఈ పద్యం చూచి చిత్రకారుఁడు చిత్రాన్ని గీయవచ్చును. నన్నయవర్ణనలు చిత్రకారుడిచిత్రం వలె ఏకైకవిన్యాసాన్ని సూచిస్తా యని విమర్శకులు చెప్తారు. రసపోషకంగా అలంకారాన్ని ప్రయోగించటం, నిర్వహించటం, విడవటం, అవసరం వస్తే మిక్కిలిగా నిర్వహించకపోవటం అనే పద్ధతులు ధ్వనిమార్గవర్తులైన కవులు పాటిస్తారు. నన్నయ ఇక్కడ శోకిస్తున్న శృంగార విభావాన్ని వర్ణిస్తూ అలంకారాన్ని మిక్కిలిగా నిర్వహింపకపోవటం గమనార్హం. 'విలసత్కూపఘనవల్లి యన్నిష్టసఖి నూఁదియున్నదాని' అన్నచోట రూపకం వాడి, దానిని వదలి ఆమెరూపంకంటె దుఃఖాన్ని ఎక్కువగా వర్ణించి, ఎత్తుగీతలో 'వరుణదేవేంద్రుదేవియపోనిదాని' అని ఉపమాలంకారాన్ని నిర్వహించాడు నన్నయ. ఇక్కడ అలంకారం క్రమంగా వస్తువును భావాన్నీ ధ్వనింపచేస్తున్నది.

వ. కని 'నీ వెవ్వరిదాన? వి ట్లేల యేకతంబ యువ్విపినాంతరకూపంబున నున్న దాన?' వనిన విని దేవయాని యెప్పడుం దమ విహరించుచున్న యవ్వనంబునకు మృగయావినోదార్థంబు యయాతి వచ్చుటంజేసి తొల్లియుఁజూచినది కావున నాతని నెఱింగి యి ట్లనియె. 141

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కని= దేవయానిని చూచి; నీవు; ఎవ్వరిదానవు= ఎవరికి సంబంధించిన దానివి; ఇట్లు= ఈవిధంగా; ఏల= ఎందుకు; ఏకతంబు+అ= ఒంటరిగా; ఈవిపిన+అంతర, కూపంబునన్= ఈ అడవిమధ్య ఉన్న నూతియందు; ఉన్నదానవు; అనినన్= అని యయాతి అడుగగా; విని; దేవయాని; ఎప్పుడున్= ఎల్లప్పుడును (అంతకు ముందు); తమ, విహరించుచున్+ఉన్న= తాము విహారం చేస్తూఉండే; ఆ+వనంబునకున్= ఆ అడవికి; మృగయా, వినోద+అర్థంబు= వేట అనే వినోదం (వేడుక) నిమిత్తం; యయాతి, వచ్చుటన్ చేసి= వస్తూ ఉండటంచేత; తొల్లియున్= పూర్వం కూడ; చూచినది; కావునన్; అతనిన్= యయాతిని; ఎఱింగి= తెలిసికొని, గుర్తించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: యయాతి దేవయానిని చూచి 'నీవు ఎవతెవు? ఈవిధంగా ఒంటరిగా ఈ అడవినడుమ ఉన్న నూతియందు ఎందుకు పడియున్నావు?' అని అడుగగా దేవయాని విని ఎప్పుడూ తాము విహరించే ఆ అడవికి వేటవేడుక కొరకు వస్తూ ఉండటంవలన, అంతకుముందుకూడ అతడిని చూచిఉన్నది కాబట్టి గుర్తించి ఇట్లా పలికింది.

తరలము.

> **అమరసన్నిభ! యేను ఘోరసురాసురాహవభూమి న**
> **య్యమరవీరులచేత మర్దితు లైన దానవులన్ గత**
> **భ్రములఁగాఁ దన విద్యపెంపునఁ బ్రాప్తజీవులఁ జేసి య**
> **త్యమితశక్తిమెయిన్ వెలింగినయట్టి భార్గవుకూఁతురన్.** **142**

ప్రతిపదార్థం: అమర, సన్నిభ= దేవతలతో సమానమైనవాడా!; ఏను= నేను; ఘోర, సుర+అసుర+ఆహవభూమిన్= భయంకరమైన దేవరాక్షసుల యుద్ధరంగంలో; ఆ+అమరవీరులచేతన్= వీరు లైన ఆ దేవతలచేత; మర్దితులు+అయిన= చంపబడిన; దానవులన్= రాక్షసులను; గత, భ్రములన్, కాన్= పోయినభ్రమ కలవా రగునట్లుగా; తన విద్య పెంపునన్= సంజీవని అనే తనవిద్యయొక్క గొప్పతనంచేత; ప్రాప్తజీవులన్; పొందబడిన జీవం (ప్రాణం) కలవారినిగా; చేసి; అతి+అమిత, భక్తిమెయిన్= మిక్కిలి అధిక మైన శక్తితో; వెలింగిన+అట్టి= ప్రకాశించినట్టి; భార్గవు= శుక్రుడియొక్క; కూఁతురన్= కుమార్తెను.

తాత్పర్యం: దేవతాసమానుడి వైన ఓ యయాతీ!. నేను భయంకర మైన దేవరాక్షసులయుద్ధరంగంలో వీరు లైన దేవతలచేత చంపబడిన రాక్షసులను తన సంజీవనీవిద్యాప్రభావంచేత భ్రమతొలగినవారినిగాను, ప్రాణవంతులను గాను చేసి అత్యధిక మైన శక్తితో ప్రకాశించిన శుక్రుడికుమార్తెను.

విశేషం: గతభ్రములఁగా అనేచోట జితశ్రములఁగా అన్న పాఠ మున్నది. అనగా జయించబడినశ్రమ కలవారినిగా అని అర్థం: ఈ పాఠంకూడా ఉచితంగానే ఉన్నది. అతి+అమిత= అత్యమిత- యణాదేశసంధి. కూఁతు శబ్దము ప్రథమైక వచనమునకు రు వర్ణ మగును. కూఁతురు. ఇది అస్మద్విశేషణ మగుటచే ను అంతాగమముగా వచ్చినది. ఈ ఆగమానికి ముందు ఉత్వం అత్వమైనది. కూతురన్. తరలవృత్తానికి ప్రతిపాదంలోనూ న-భ-ర-స-జ-జ-గ అనే గణా లుంటాయి. 12వ అక్షరం యతిస్థానం. ఇందలి మొదటి రెండులఘువులను ఒకగురువుగా చేస్తే మత్తకోకిలపాదమౌతుంది. అప్పుడు గణాలు "ర,స,జ,జ,భ,ర" అవుతాయి.

వ. **'దేవయాని యనుదానఁ బ్రమాదవశంబున నిన్నూతం బడి వెలువడ నేరకున్నదానను; న న్నుద్ధరించి రక్షింపు' మనిన నవ్విప్రకన్యకయందుఁ దద్దయు దయాళుం డై.** **143**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దేవయాని యనుదానన్; ప్రమాదవశంబునన్= ఏమరుపాటు కారణాన; ఈ+నూతన్= ఈ నూతియందు; పడి; వెలువడన్, నేరక+ఉన్నదానను= పైకి రాజాలకున్నాను (రాలేకపోతున్నాను); నన్నున్, ఉద్ధరించి= పైకి తీసి; రక్షింపుము= కాపాడుము; అనినన్= అని పలుకగా; ఆ+విప్రకన్యక, అందున్= బ్రాహ్మణుడి (శుక్రుడి) కుమార్తె అయిన ఆ దేవయానియందు; తద్దయున్= మిక్కిలి; దయాళుండు+ఐ= దయకలవా డయి.

తాత్పర్యం: నేను దేవయాని అనే పేరుకలదానిని. ఏమరుపాటు కారణాన ఈ నూతిలో పడి పైకి రాలేకున్నాను. నన్ను పైకి తీసి రక్షించు మని పలుకగా ఆ బ్రాహ్మణకన్య అయిన దేవయానియెడల మిక్కిలిదయ కలవాడై.

విశేషం: 'అది శబ్దమునకు వునులు పరంబగునపుడును సంబోధనంబునందు దాన అన్న దాదేశం బగును'. అను+అది+ను= అనుదానను. దేవయాని ప్రమాదవశాన నూతిలో పడలేదు; శర్మిష్ఠ ఆమెను త్రోసింది. కాని, ఆమె ఈవిధంగా చెప్పటం ఆమె గడుసుతనాన్ని సూచిస్తుంది. శుక్రాచార్యుడికూతుర నని చెప్పుకొని ఆమె తన అభిజాత్యాన్ని చెప్పుకొన్నది. తన పాటుకు కారణంచెప్పకుండ, యయాతిపై కలిగిన అభిలాషకు ప్రతిఫలంగా అతని ఆదరాభిమానాలను పొందాలనుకోవటం అట్లా మాటాడటంలో కల వస్తుధ్వని.

చ. **జలధివిలోలవీచి విలసత్కలకాంచి సమంచితావనీ**
తలవహనక్షమం బయిన దక్షిణహస్తమునం దదున్నమ
ద్గళదురఘర్మవారికణక్రమకరాబ్జము వట్టి నూతిలో
వెలువడఁ గోమలిం దిగిచె విశ్రుతకీర్తి యయాతి ప్రీతితోన్. **144**

ప్రతిపదార్థం: విశ్రుతకీర్తి= ప్రసిద్ధమైనకీర్తి కల యయాతి; జలధి, విలోల, వీచి, విలసత్, కల, కాంచి, సమంచిత+అవనీ, తల, వహన, క్షమంబు+అయిన= సముద్రంయొక్క చలించే తరంగా లనబడే ప్రకాశిస్తున్న మధురంగా మ్రోగే ఒడ్డాణంతో కూడిన భూతలాన్ని భరించటంలో సమర్థ మైన; దక్షిణ హస్తమునన్= కుడిచేతితో; తద్+ఉన్నమత్+గళత్+ఉరు, ఘర్మ, వారి, కణ, క్రమ, కర+అబ్జము= ఆ దేవయానియొక్క పైకెత్తబడుతున్నట్టియూ, జారుతున్న అధికమైన చెమట బిందువులచేత సుందరమైనట్టియూ పద్మము వంటిచేతిని; పట్టి= గ్రహించి; నూతిలోన్= నూతినుండి; వెలువడన్= బయటికి వచ్చునట్లుగా; కోమలిన్= మృదు వైన శరీరం కల దేవయానిని; ప్రీతితోన్= ప్రేమతో; తిగిచెన్= లాగెను (పైకిలాగాడు).

తాత్పర్యం: ప్రసిద్ధ మైన కీర్తి గల యయాతి సముద్రంయొక్క చలించే తరంగాలనే మధురమైన ధ్వని కలిగిన ఒడ్డాణంతో కూడిన ధరణీతలాన్ని వహించే శక్తి గల కుడిచేతితో పైకెత్తబడినదియూ, జారుతున్న అధికమైన చెమటబిందువులతో అంద మైనదీ అయిన దేవయాని పద్మంవంటిచేయిని పట్టుకొని నూతినుండి పైకి వచ్చేటట్లుగా ప్రీతితో పైకి తీశాడు.

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం, రూపకం. యయాతి దేవయానియొక్క కరాబ్జము పట్టుకొనటం ముందు జరుగబోతున్న పాణిగ్రహణాన్ని సూచిస్తుంది. దేవయాని హస్తం చెమటబిందువులతో తడిసి ఉండటంవలన పద్మంగా రూపించటం సముచితం. యయాతి కుడిచేయి భూభారవహనక్షమ మైనది కాబట్టి దిగ్గజముయొక్క తుండంవలె నున్నదని భావించటానికి వీలున్న 'హస్త' శబ్దం వాడటం సార్థకం. దేవయానియందు ఉదయించిన అభిలాషవలన కలిగిన సాత్త్వికభావోదయంగా హస్తంమీది స్వేదాన్ని నన్నయ వర్ణించి ధ్వనింపజేశాడు. అది కరగ్రహణంచేత పరిపుష్టి చెందింది. వర్ణ్యవస్తు స్వరూపస్వభావవ్యంజకాలైన

అక్షరాలను రచనలో వాడి శయ్యాసౌందర్యాన్ని పోషించే అక్షరరమ్యతకు ఈ పద్యం రమణీయోదాహరణం. నూతిలో వెలువడ= నూతినుండి బయటికి వచ్చేటట్లు ఇక్కడ షష్ఠీవిభక్తి పంచమ్యర్థంలో వాడబడింది.

వ. ఇట్లు దేవయాని నుద్ధరించి నిజపురంబున కరిగె; నిట దేవయానియు శర్మిష్ఠసేసిన యెగ్గువలన విముక్తయయి తన్ను రోయుచు వచ్చుదాని ఘూర్ణిక యను పరిచారికం గని 'యేను వృషపర్వుపురంబు సొర నొల్ల; శర్మిష్ఠ చేత నా పడిన యవమానంబు మదీయ జనకున కెఱింగింపు' మని పంచిన, నదియును నతిత్వరితగతిం జని తద్వృత్తాంతం బంతయు శుక్రునకుం జెప్పిన, శుక్రుండును నాక్షణంబ వచ్చి కోప ఘూర్ణిత బాష్ప పూరితనయన యై యున్న దేవయానిం గని యి ట్లనియె. 145

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; దేవయానిన్; ఉద్ధరించి= పైకి తీసి; నిజపురంబునకున్= తన పట్టణానికి; అరిగెన్= యయాతి వెళ్ళాడు. ఇటన్= ఇచ్చట; దేవయానియున్= దేవయానికూడ; శర్మిష్ఠ, చేసిన= వృషపర్వుడి కూతు రైన శర్మిష్ఠ చేసిన; ఎగ్గువలనన్= కీడువలన; విముక్త+అయి= విడువబడినదై; తన్నున్= దేవయానిని; రోయుచున్+వచ్చు, దానిన్= వెదకుతూ వస్తున్న దానిని; ఘూర్ణిక అను పరిచారికన్= ఘూర్ణిక అన్న పేరు కల సేవకురాలిని; కని= చూచి; ఏను= నేను; వృషపర్వు, పురంబు= వృషపర్వు డనే రాక్షస రాజు పట్టణాన్ని; చొరన్+ఒల్లన్= ప్రవేశించటానికి అంగీకరించను; శర్మిష్ఠచేతన్; నా పడిన= (కర్తృపదప్రథమకుషష్ఠి) నేను పొందిన; అవమానంబు= పరాభవం; మదీయ జనకునకున్= నాతండ్రి యైన శుక్రుడికి; ఎఱింగింపుము= తెల్పుము; అని, పంచినన్= అని పంపగా; అదియునున్= ఆ ఘూర్ణికయును; అతి త్వరితగతిన్= మిక్కిలి వేగంతో కూడిన గమనంతో; చని= వెళ్ళి; తద్, వృత్తాంతంబు+అంతయున్= దేవయానికి జరిగిన అవమాన విషయమంతా; శుక్రనకున్; చెప్పగా; శుక్రుండునున్= శుక్రుడు కూడ; ఆ క్షణంబు+అ= ఆక్షణ మందే; వచ్చి; కోప, ఘూర్ణిత, బాష్ప, పూరిత, నయన, అయి, ఉన్న= కోపంచేత తిరుగుడు పడినట్టియున్నూ, కన్నీటితో నిండినట్టియున్నూ నేత్రాలు కలదై ఉన్న; దేవయానిన్; కని= చూచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా దేవయానిని నూతినుండి పైకి తీసి యయాతి తనపట్టణానికి వెళ్ళాడు. ఇక్కడ దేవయాని కూడా శర్మిష్ఠ తనకు చేసిన కీడువలన విడువబడినదై తనను వెదకుతూ వస్తున్న ఘూర్ణిక అనే పేరు కలదానిని చూచి 'నేను వృషపర్వుడి పట్టణంలో ప్రవేశించటానికి అంగీకరించను; శర్మిష్ఠచేత నేను పొందిన అవమానం నా తండ్రికి తెలుపుము' అని పంపగా, ఘూర్ణికకూడా మిక్కిలివేగంతో కూడిన గమనంతో వెళ్ళి జరిగిన వృత్తాంతమంతా శుక్రుడికి చెప్పింది. శుక్రుడుకూడ తత్క్షణమే వచ్చి, కోపంచేత తిరుగుడు పడినట్టి, కన్నీటితో నిండినట్టి నేత్రాలు కలదై ఉన్న దేవయానిని చూచి యిట్లా పలికాడు.

క. అనుపమ నియమాన్వితు లై । యనూనదక్షిణలఁ గ్రతుసహస్రంబులు సే
సినవారికంటె నక్రో । ధనుఁడ గరం బధికుఁ డండ్రు తత్త్వవిధిజ్ఞుల్. 146

ప్రతిపదార్థం: అనుపమ, నియమ+అన్వితులు+అయి= సాటిలేని నియమంతో కూడిన వా రై; అనూన, దక్షిణలన్= అధికము లయిన దక్షిణలతో (సంభావనలతో); క్రతు, సహస్రంబులు= యజ్ఞములు వేలు; చేసిన వారికంటెన్; అక్రోధనుఁడు+అ= కోపశీలం లేనివాడే; కరంబు= మిక్కిలి; అధికుఁడు= గొప్పవాడు; అని; తత్త్వవిధిజ్ఞుల్= పరమార్థ మెఱిఁగినవారు; అండ్రు= అందురు (అంటారు).

తాత్పర్యం: సాటి లేని నియమంతో కూడినవా రై గొప్పదక్షిణలతో వేలకొద్దీ యజ్ఞాలు చేసినవారికంటెకూడ కోపం లేనివాడే మిక్కిలిగొప్పవా డని పరమార్థం తెలిసినవారు చెప్తారు.

విశేషం: నన్నయ సూక్తులలో ఇది ఒకటి. అను+దురు, తిదుటలు పరంబు లగునపుడు అన్వాదుల'ను' స్థానమున సున్న యగును- అందురు. ఇట బిందువు మీది తదలకు నిత్య వైకల్పికంబులయి టడ లగును- అండురు. ఉత్వలోపము- అంద్రు.

క. అలిగిన నలుగక, యెగ్గులు । పలికిన మఱి విననియట్ల ప్రతివచనంబుల్
వలుకక, బన్నము వడి యెడఁ । దలఁపక యు న్నతఁడె చూవె ధర్మజ్ఞుఁ డిలన్. 147

ప్రతిపదార్థం: అలిగినన్= ఇతరులు కోపించగా; అలుగక= కోపించక; ఎగ్గులు, పలికినన్= నిందావాక్యాలు పలుకగా; మఱి= అనంతరం, విని, అట్లు+అ= ఆ నిందావాక్యాలు విననివిధంగానే; ప్రతివచనంబుల్= మారుమాటలు; పలుకక; బన్నము= అవమానము; పడి= పొంది; ఎడన్= హృదయమందు; తలఁపక= దానిని తలపకుండగనే; ఉన్న+అతఁడు+అ+చూవె= ఉన్నవాడే సుమా; ఇలన్= భూమియందు; ధర్మజ్ఞుఁడు= ధర్మం తెలిసినవాడు.

తాత్పర్యం: ఇతరులు కోపిస్తే కోపించకుండా, ఇతరులు నిందలు పలికితే మరి వాటిని విననట్లే మారుపలుకక, అవమానం పొందికూడా హృదయమందు తలవకుండా ఉన్నవాడే సుమా భూమియందు ధర్మ మెరిగినవాడు.

విశేషం: ఇదికూడ నన్నయ సూక్తులలో ఒకటి. చూవె - చుమా యొక్క సంక్షిప్తరూపం.

వ. 'కావున బుద్ధి గలవారికిఁ గ్రోధంబు గొనియాడం దగదు; శర్మిష్ఠ రాచకూఁతురు; గొండుక యది; దానితోడి దేమి ర' మ్మనిన దేవయాని యి ట్లనియె. 148

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; బుద్ధి, కలవారికిన్= బుద్ధిమంతులకు; క్రోధంబు= కోపము; కొని, ఆడన్, తగదు= పొగడుట యుక్తం కాదు; శర్మిష్ఠ; రాచకూఁతురు= రాజుగారి కూతురు; కొండుక+అది= చిన్నది; దానితోడి+అది+ఏమి= దానితో ఏమి; రమ్ము; అనినన్= అని శుక్రుఁడు పిలువగా; దేవయాని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'కాబట్టి బుద్ధిమంతులకు కోపాన్ని పొగడటం తగదు. అంటే కోపం మంచి దని పొగడటం యుక్తం కాదు. శర్మిష్ఠ; రాజకుమారి, వయసులో చిన్నది. దానితో ఏమిటి! (అంటే అది చేసిన పని లెక్కచేయ కూడదు) ఇంటికి రా' అని శుక్రుడు పలుకగా దేవయాని ఇట్లా అన్నది.

విశేషం: తోడన్+అదితోడిది= 'సమాసముల చేత తోడ వలనల కిత్వమగును. అది, శబ్దముల అత్తునకు వృత్తిని లోపంబు బహుళముగా నగును.

క. కడు ననురక్తియు నేర్పును । గడఁకయు, గలవారి నుఱక కడవఁగ నెగ్గుల్
నొడివెడు వివేకశూన్యుల । కడ నుండెడు నంతకంటెఁ గష్టము గలదే. 149

ప్రతిపదార్థం: కడున్= మిక్కిలి; అనురక్తియున్= ప్రేమయు; నేర్పును; కడఁకయున్= యత్నమును (పూనికయును); కల, వారిన్; ఉఱక= లక్ష్యము చేయక, కడవఁగన్= మేర మీరునట్లుగ; ఎగ్గుల్= నిందలు; నుడివెడు= పలికెడి; వివేకశూన్యుల కడన్= జ్ఞానహీనులవద్ద; ఉండెడు, అంతకంటెన్= నివసించేదానికంటె; కష్టము= నీచత్వం; కలదు+ఏ= ఉన్నదే; లేదని భావం.

తాత్పర్యం: మిక్కిలి అనురాగమూ, నేర్పూ, పూనికయు, కలవారిని లక్ష్యపెట్టక మేరమీరేటట్లుగా నిందలు పలికేజ్ఞాన హీనులవద్ద నివసించటంకంటె నైచ్యం వేరుగా గలదా! లేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. 'ఈవృషపర్వుపురం బేను జొరనొల్ల; నెట యేనియుం బోదు' ననిన శుక్రుండు 'నాకు నీవ గతివి. నీతోడ నేనును వత్తు' ననుచుఁగూఁతుం బట్టువఱుచుచున్నంత, నంతయుఁజారులవలన నెఱింగి వృషపర్వుండు శుక్రునొద్దకు వచ్చి నమస్కరించి యి ట్లనియె. 150

ప్రతిపదార్థం: ఈ, వృషపర్వు, పురంబు= ఈ వృషపర్వుడి యొక్కపట్టణం; ఏను= నేను, చొరన్+ఒల్లన్= ప్రవేశించ నంగీకరించను; ఎట, ఏనియున్= ఎక్కడికైనా, పోదున్= వెళతాను; అని= అని దేవయాని పలుకగా; శుక్రుండు; నాకున్; నీవు+అ= నీవే; గతివి= దిక్కు; నీతోడన్; నేనును= నేనుకూడా; వత్తున్= వస్తాను; అనుచున్= అని పలుకుతూ; కూఁతున్= కూతురిని; పట్టువఱుచుచున్; ఉన్న, అంతన్= అను నయిస్తుండగా (ఓదారుస్తుండగా); అంతయున్= జరిగిన విషయమంతా; చారులవలనన్= వేగులవారివలన; ఎఱింగి= తెలిసికొని; వృషపర్వుండు= రాక్షసరాజు; శుక్రు+ఒద్దకున్= శుక్రుడి దగ్గరకు; వచ్చి; నమస్కరించి= మ్రొక్కి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఈ వృషపర్వుడిపట్టణంలో నేను ప్రవేశించటానికి అంగీకరించను. మరి ఎక్కడికైనా వెడతాను' అని దేవయాని పలుకగా శుక్రుడు 'నాకు నీవే దిక్కు, నీతో నేను కూడా వస్తా' నని కూతురిని ఓదారుస్తుండగా, ఈ విషయమంతా వేగులవారివలన తెలిసికొని, రాక్షసరా జైన వృషపర్వుడు శుక్రుడివద్దకు వచ్చి నమస్కరించి ఇట్లా పలికాడు.

ఉ. దేవతలన్ జయించుచు నతిస్థిరసంపదలం ద్వదీయవి
ద్యావిభవంబు పెంపునన దానవు లుద్ధతు లైరి; కానినాఁ
డీ వనరాశిలోఁ జొరరె యింతకు నంతకకోపు లైన య
ద్దేవపతాకినీపతుల దివ్యనిశాతమహాయుధాహతిన్. 151

ప్రతిపదార్థం: దేవతలన్= దేవతలను; జయించుచున్; అతిస్థిర, సంపదలన్= మిక్కిలి స్థిరమైన సంపదలతో; త్వదీయ, విద్యావిభవంబు, పెంపునన్+అ= నీయొక్క విద్యయొక్క వైభవం యొక్క గొప్పతనం చేతనే; దానవులు= రాక్షసులు; ఉద్ధతులు+ఐరి= గర్వించినవా రైనారు; కాని, నాఁడు= అది లేనప్పుడు; అంతక, కోపులు+అయిన= యముడియొక్క కోపం వంటి కోపం కలవారైన; ఆ+దేవ, పతాకినీ, పతుల= ఆ దేవతలసేనా నాయకులయొక్క; దివ్య, నిశాత, మహత్, ఆయుధ, ఆహతిన్= దేవతా సంబంధులూ, వాడివియూ అయిన గొప్పఆయుధాల దెబ్బచేత, ఇంతకున్= ఈ పాటికే; ఈవన రాశిలోన్= ఈ సముద్రంలో; చొరరు+ఎ= ప్రవేశించరా! ప్రవేశిస్తా రని భావం.

తాత్పర్యం: నీ విద్యా మహత్త్వంయొక్క గొప్పతనం చేతనే దేవతలను జయిస్తూ మిక్కిలి స్థిరమైన సంపదలతో రాక్షసులు గర్వం కలవా రైనారు కానిచో, (ఆ విద్యలేనపుడు) యముడికోపంవంటి కోపం కలవా రైన ఆ దేవతా సేనాపతుల దివ్య మైనవీ, వాడి అయినవీ అయిన గొప్పఆయుధాల దెబ్బలచేత ఈసముద్రంలో ప్రవేశించి ఉండరా! అంటే మరణించి ఉండరా? అని భావం.

విశేషం: ఇంతకు నంతక కోపులు - ఇచ్చట ఛేకానుప్రాసం కలదు. వృషపర్వుడు చెప్పిన దంతా సత్యమే. శుక్రుడి మృతసంజీవనీ విద్య లేకుంటే దేవతలు రాక్షసులను చంపి ఉండేవారే; లేకుంటే భయంతో రాక్షసులు సముద్రంలో దాగి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉండేవారే. వస్తుస్వభావస్ఫుటత్వంతో కూడుకొన్న ఝటితీత్యర్థప్రతిపత్తికి హేతు వైన రచన కల ఈపద్యంలో అర్థవ్యక్తి అనే శబ్దగుణం పోషించబడింది. (సంపా.)

క. వారణ ఘోటక భాండా। గారంబులు మొదలుగాఁగఁ గల ధనములతో
సూరినుత! యిందఱము నీ। వారకములు గాఁగ మమ్ము వగవుము బుద్ధిన్. 152

ప్రతిపదార్థం: సూరి, నుత= పండితులచేత స్తుతించబడినవాడా! శుక్రుడా!; వారణ, ఘోటక, భాండాగారంబులు= ఏనుగులు, గుఱ్ఱాలు, ధనాలు ఉండేచోట్లు; మొదలు, కాఁగన్= మొదలయ్యేటట్లుగా; కల, ధనములతోన్= ఉన్న ధనాలతో; ఇందఱము= ఈ రాక్షసులమందరమూ; నీ వారకములు, కాఁగన్= నీ సొమ్ములౌనట్లుగా; మమ్మున్= రాక్షసులను; బుద్ధిన్= మనస్సులో; వగవుము= తలచుము.

తాత్పర్యం: ఏనుగులు గుఱ్ఱాలు మొదలుగా గల ధనాలతో ఈ రాక్షసులందరమున్నూ నీ సొమ్ములుగానే మనస్సునందు తలచవలసింది.

విశేషం: వారకం= లేనికాలమునందు ఉపయోగార్థ మొకరి కిచ్చి, కలిగినకాలమునందు మరల పుచ్చుకొనే ధనం మొదలయినది - అని నిఘంటువులోని అర్థం. నన్నయకాలంలో 'వగచు' ధాతువుకు 'తలచు' అని అర్థం.

శర్మిష్ఠ దాసి యై దేవయానిం గొలుచుట (సం.1-75-13)

వ. 'ఈ దేవయాని కెద్ది యిష్టంబు దానిన యిత్తు, నడుగు' మనిన దేవయాని సంతసిల్లి 'యట్లేని శర్మిష్ఠ గన్యకా సహస్రంబుతో నాకు దాసి గావలయు, నిదియ నా కిష్టంబు; దీనిన యిచ్చునది' యనిన వృషపర్వుం డప్పు డక్కూఁతు రావించి, కన్యకాసహస్రంబుతో దేవయానికి దాసిగా నిచ్చి శుక్రునకు మనఃప్రియంబు సేసిన, శర్మిష్ఠయు నగ్గురువచనంబునఁ గన్యకాసహస్రంబుతో నిత్యంబును దేవయానిం గొలుచుచుండె; నంత నొక్కనాఁడు. 153

ప్రతిపదార్థం: ఈ దేవయానికిన్= నీకూతు రైన దేవయానికి; ఎద్ది= ఏది; ఇష్టంబు= ప్రియమో; దానిన్+అ= దానినే; ఇత్తున్= ఇచ్చెదను; అడుగుము+అనినన్= అడుగు మని వృషపర్వుడు పలుకగా; దేవయాని; సంతసిల్లి= సంతోషించి; అట్లు+ఏని= అట్లైతే; అంటే నేనడిగిన దానినే (నా కిష్టమైన దానినే, నీ విచ్చేటట్లయితే); శర్మిష్ఠ= నీకూతురైన శర్మిష్ఠ; కన్యకా, సహస్రంబుతోన్= కన్యకలు వేయిమందితో; నాకున్, దాసి, కావలయున్= సేవకురాలు కావాలి; ఇది+అ= ఇదే; నాకు; ఇష్టంబు= ప్రియం (ఇష్టం); దీనిన్+అ= దీనినే; ఇచ్చునది= ఇమ్ము; అనినన్= అని దేవయాని పలుకగా; వృషపర్వుండు; అప్పుడు+అ= ఆ క్షణమే; ఆ+కూఁతున్= తన కూతురైన శర్మిష్ఠను; రావించి= రప్పించి; కన్యకా, సహస్రంబుతోన్= కన్యలు వేయిమందితో; దేవయానికిన్; దాసి+కాన్= దాసి అయ్యేటట్లుగా; ఇచ్చి; శుక్రునకున్; మనస్+ప్రియంబు= మనసుకు ప్రీతి; చేసినన్= చేయగా; శర్మిష్ఠయున్; ఆ+గురువచనంబునన్= ఆ తండ్రి యైన వృషపర్వుడి మాటచేత; కన్యకాసహస్రంబుతోన్= కన్యకలు వేయిమందితో; నిత్యంబును= ఎల్లప్పుడున్నూ; దేవయానిన్; కొలుచుచున్; ఉండెన్= సేవిస్తూ ఉన్నది; అంతన్= అటుతరువాత; ఒక్కనాఁడు= ఒక్కరోజున.

తాత్పర్యం: 'ఈ దేవయాని కేది ఇష్టమో (ప్రియమో) దానినే ఇస్తాను' అని వృషపర్వుడు పలుకగా దేవయాని సంతోషించి 'అట్లా అయితే, శర్మిష్ఠ వేయిమందికన్యలతో నాకు దాసి కావాలి; ఇదే నాకు ఇష్టం. దీనినే నాకు

ఇవ్వాలిసింది' అని పలుకగా వృషపర్వుండు తత్క్షణమే తనకూతు రైన శర్మిష్ఠను రప్పించి, వేయిమంది కన్యలతో దేవయానికి దాసిగా ఇచ్చి, గురువైన శుక్రుడికి మనఃప్రీతి కావించాడు. శర్మిష్ఠకూడా తండ్రివాక్యాలను అనుసరించి వేయిమంది కన్యలతో ఎల్లప్పుడూ దేవయానిని సేవిస్తూ ఉన్నది. అటుతర్వాత ఒక్కరోజున. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'విధియందు లూట్టునకు అదియను తచ్ఛబ్దమును ముందు ను గాగమంబును నగును'. ఇచ్చు+అది= ఇచ్చునది= ఇమ్ము.

క. వనకేళీ కౌతుకమునఁ। జనియెను శర్మిష్ఠఁ దొట్టి సఖులెల్ల ముదం
బునఁ గొలిచిరాఁగ విభవము। దన కమరఁగ దేవయాని తద్వనమునకున్. 154

ప్రతిపదార్థం: దేవయాని; వన; కేళీ, కౌతుకమునన్= వనమందలి క్రీడయందలి కుతూహలంతో; శర్మిష్ఠన్+తొట్టి= శర్మిష్ఠ మొదలైన; సఖులు+ఎల్లన్= చెలికత్తెలందరూ; ముదంబునన్= సంతోషంతో; కొలిచి= సేవించి; రాఁగన్= తనతో రాగా; విభవము= వైభవం; తనకున్; అమరఁగన్= ఒప్పగా; తద్+వనమునకున్= ఆ అడవికి (యయాతి తనను నూతినుండి వెలికితీసిన వనానికే); చనియెను= వెళ్ళెను.

తాత్పర్యం: దేవయాని శర్మిష్ఠ మొదలైన చెలులంతా సంతోషంతో సేవించి రాగా, తనకు వైభవం ఒప్పగా, పూర్వపు వనానికే, వనమందు క్రీడించే కుతూహలంతో వెళ్ళింది.

విశేషం: తొట్టు ధాతువునకు క్త్వార్థకరూప మొక్కటే కానవస్తున్నది. పూర్వం వనాని కేగినపుడు రాచకూతు రైన శర్మిష్ఠకు అధిక వైభవ మున్నది. ఇప్పు డామె దేవయానికి దాసి అవటంచేత దేవయానికి అధికవైభవం కలిగింది.

వ. ఇ ట్లరిగి యవ్వనంబునఁ గన్యకలుం దానును బుష్పాపచయంబు సేయుచు, విమలజలప్రవాహ విలసితం బైన యొక్కసెలయేటి కెలన, నవవికచ కుసుమ సుకుమార కోరక నికర భరిత సహకార కురవక వకు ళాశోక తమాల సాల చ్ఛాయాశీతల సికతాతలంబున నిష్టవినోదంబుల నున్న యవసరంబున. 155

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; అరిగి= వెళ్ళి; ఆ+వనంబునన్= ఆ అడవిలో; కన్యకలున్= చెలికత్తెలయిన కన్యకలున్నూ; తానును; పుష్ప+అపచయంబు= పువ్వులను కోయటం; చేయుచున్; విమల, జల ప్రవాహ విలసితంబు+ఐన= నిర్మలమైన నీటిప్రవాహంతో ప్రకాశించేదైన; ఒక్క, సెలయేటి, కెలనన్= ఒక కొండనదిపక్క; నవ, వికచ కుసుమ= కొత్తగా వికసించిన పువ్వులయొక్క; సుకుమార, కోరక, నికర= మృదువైన పూమొగ్గలయొక్క సమూహంతో; భరిత= నిండిన; సహకార= తియ్యమామిడిచెట్లయొక్క; కురవక= గోరంట చెట్లయొక్క; వకుళ= పొగడచెట్లయొక్క; అశోక= అశోకవృక్షాలయొక్క; తమాల= చీకటిచెట్లయొక్క; సాల= మద్దిచెట్ల యొక్క; ఛాయా= నీడచేత; శీతల= చల్లనైన; సికతా, తలంబునన్= ఇసుకప్రదేశమందు; ఇష్ట, వినోదంబులన్= ప్రియా లైన వేడుకలతో; ఉన్న; అవసరంబునన్= సమయంలో.

తాత్పర్యం: ఈవిధంగా వెళ్ళి ఆవనంలో చెలికత్తె లైన కన్యలున్నూ, తానున్నూ, పూలు కోస్తూ నిర్మల మైన నీటిప్రవాహంతో ప్రకాశించే ఒక్క కొండనదిప్రక్క క్రొత్తగా వికసించిన పూలతోను, మృదువు లైన మొగ్గలయొక్క

సమూహంతోను, నిండిన తియ్యమామిడిచెట్ల గోరంటచెట్ల పొగడచెట్ల అశోకవృక్షాల చీకటిమాకుల మద్దిచెట్ల నీడలచేత చల్ల నైన ఇసుకప్రదేశంలో తమ కిష్ట మైనవేడుకలతో ఉన్న సమయాన. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: సాల మంటే వృక్ష మని అర్థం కూడ కలదు. అపుడు సహకారాది వృక్షాలయొక్క నీడచేత అని అర్థం చెప్పాలి. సాల+ఛాయా= సాలచ్ఛాయా. హ్రస్వ మైన అచ్చు తరువాతి ఛకారం ద్విరుక్త మౌతుంది.

సీ. **అంగనాజనుల యుత్తుంగ సంగత కుచ । కుంకుమ చందన పంకములయు**
వారివ ధమ్మిల్లభారావకలిత ది । వ్యామోద నవపుష్పదామములయు
వారివ ముఖ సకర్పూరతాంబూలాది । వాసిత సురభి నిశ్శ్వాసములయు
వారివ పరిధాన చారుధూపములయు । విలసిత సౌరభావలులు దాల్చి

తే. **యనిలుఁ డను దూత వోయి తోడ్కొనుచు వచ్చె । దేవయానిపాలికి మృగతృష్ణఁ జేసి**
కాననంబునఁ గ్రుమ్మరువాని వీరు । నతిపరిశ్రాంతుఁ డైన యయాతి నంత. **156**

ప్రతిపదార్థం: అంగనా, జనుల= స్త్రీలయొక్క; ఉత్తుంగ= ఎత్తైన, సంగత= ఒకదానికొకటి మిక్కిలి దగ్గరగా నున్న; కుచ= స్తనాలయందలి; కుంకుమ, చందన, పంకములయున్= కుంకుమయొక్క, మంచిగంధం యొక్క, బురదల యొక్క; (కుంకుమ చందన ద్రవాలయొక్క; వారివి+అ= ఆ స్త్రీలవే అయిన; ధమ్మిల్లభార= పెద్దకొప్పుల నుండి; అవకలిత= జారిన; దివ్య+ఆమోద= మంచిసువాసన కల; వన పుష్ప దామములయున్= క్రొత్త పూలదండలయొక్క; వారివి+అ= ఆ స్త్రీలవే అయిన; ముఖ= ముఖాలనుండి వెలువడు; సకర్పూర, తాంబుల+ఆది= కర్పూరంతో కూడిన తాంబూలం మొదలైనవాటిచేత; వాసిత= సువాసన కలవిగా చేయబడిన; సురభి, నిశ్శ్వాసములయున్= పరిమళాలు కల నిట్టూర్పులయొక్క; వారివి+అ= ఆ స్త్రీలవే అయిన; పరిధాన= వస్త్రాల యొక్క; చారు, ధూపములయున్= ఒప్పయిన ధూపాలయొక్క; విలసిత, సౌరభ+ఆవలులు= ప్రకాశించే వాసనల సముదాయాలు; తాల్చి= ధరించి; అనిలుఁడు+అను, దూత= గాలి అనే దూత; పోయి= వెళ్ళి; మృగతృష్ణన్, చేసి= ఎండమావులచేత; కాననంబునన్= అడవిలో; క్రుమ్మరువానిన్= తిరిగేవాడిని; వీరున్= వీరు డైన వాడిని; అతిపరిశ్రాంతుఁ డు+అయిన= మిక్కిలి అలసినవా డైన; యయాతిన్= యయాతిమహారాజును; దేవయాని, పాలికిన్= దేవయాని సమీపానికి; తోడ్కొనుచున్, వచ్చెన్= తీసికొని వచ్చాడు; అంతన్= అటు పిమ్మట.

తాత్పర్యం: స్త్రీజనాల ఎత్తైనట్టి, అందమైనట్టి స్తనాలయందలి కుంకుమ గంధ ద్రవాలయొక్క సుగంధాలను ఆ స్త్రీలకే సంబంధించిన పెద్ద కొప్పులయం దుంచబడిన మంచివాసనలతో కూడిన క్రొత్తపూలదండలయొక్క సువాసనలను, ఆ స్త్రీలకే సంబంధించిన ముఖాలనుండి వెలువడే కర్పూరంతో కూడిన తాంబూలం మొదలైన వాటిచేత సువాసన కలవిగా చేయబడిన పరిమళవంతమైన నిట్టూర్పులయొక్క సౌగంధ్యాలను, ఆ స్త్రీలకే సంబంధించిన వస్త్రాల ఒప్పైనధూపాలయొక్క ప్రకాశించే సువాసనలసముదాయాన్ని వహించి వాయు వనే దూత వెడలి ఎండమావులచే అడవిలో తిరుగుతున్నట్టియూ, వీరుడైనట్టియూ, మిక్కిలి అలసినట్టియూ అయిన యయాతిమహారాజును దేవయాని చెంతకు తీసికొని వచ్చాడు.

విశేషం: అవకలిత శబ్దానికి జారిన అని కాని, వ్రేలాడుతున్న అని కాని అర్థాలు చెప్పవచ్చును. వాసిత, సురభి అనే పదాలు పునరుక్తులవలె తోచవచ్చును కాని సురభి శబ్దానికి సహజ మైన సౌరభం కల అని అర్థం చెప్పుకుంటే వారినిశ్శ్వాసాలు సహజ

పరిమళ భరిత మైనవనీ, తాంబూలాది సుగంధద్రవ్యాలవలన ఆ సౌరభం మరింత అధిక మైనదనీ ఊహించవచ్చును. వస్త్రాలకు సువాసన కలిగేందుకు సుగంధాలతో ధూపాలు వేసేవా రని గ్రహించవచ్చును. మృగతృష్ణ అంటే ఎండమావులు. ఇక్కడ మృగాలను వేటాడుటయందు కోరిక లేక దప్పి అని అర్థం చెప్పుకొనటం యుక్తంగా ఉంటుంది. లేక మృగతృష్ణను చూచి నీరున్న దనుకొని భ్రమించి దప్పిక కలవాడవటంచేత యయాతి తిరుగుతున్నా డని భావించవచ్చును. గాలి అనే దూత యయాతిని తీసికొని వచ్చాడు అంటే గాలిలోని పరిమళంచేత ఆకర్షించబడి యయాతి దేవయానిదగ్గరకు వచ్చా డని భావం. అలం: రూపకం.

క. తరళనయనాబ్జదళములు - నెరయఁగఁ బై మున్న చల్లి నృపసుతుఁ బూజిం
చిరి నవకుసుమమయాలం - కరణ విశేషముల నచటి కాంతలు ప్రీతిన్. 157

ప్రతిపదార్థం: అచటికాంతలు= అక్క డున్న దేవయాని మొదలైన స్త్రీలు; తరళ, నయన+అబ్జ, దళములు= చలించే నేత్రాలనుండి వెలువడే చూపులనెడి తామరరేకులు; నెరయఁగన్= నిండునట్లుగా; పైన్= యయాతి మీద; మున్ను+అ= మొదటనే చల్లి; నవ, కుసుమ మయ+అలంకరణ విశేషములన్= క్రొత్తపూలతో నిండిన అలంకార విశేషాలచేత; ప్రీతిన్= ప్రీతితో; నృపసుతున్= రాజకుమారు డైన యయాతిని; పూజించిరి= గౌరవించారు.

తాత్పర్యం: అక్కడ ఉన్న దేవయాని మొదలైన స్త్రీలు రాజకుమారు డైన యయాతిపై మొదటే చంచలాలయిన నేత్రాలనుండి వెలువడే చూపులనే పద్మదళాలు నిండేటట్లుగా చల్లి, తరువాత క్రొత్తపూలమాలలు మొదలైన అలంకారాలచేత అతడిని ప్రీతితో పూజించారు.

విశేషం: అలం: రూపకాతిశయోక్తి. యయాతి తమదగ్గరకు రాగానే ఆ స్త్రీలు మొదట తమచూపులను ప్రసరింపచేశా రనీ, తరువాత పుష్పమయాలైన అలంకారాలచేత పూజించా రనీ భావం.

యయాతిమహారాజు దేవయానిని వివాహం బగుట (సం.1-76-8)

వ. అయ్యయాతియుఁ దత్ప్రదేశంబున సుఖోపవిష్టుం డై దేవయానిం దొల్లి యెఱింగినవాఁ డై యతిశయరూప లావణ్యగుణసుందరి యయిన శర్మిష్ఠ నెఱుంగ వేఁడి, 'మీ రెవ్వరివారలు మీకులగోత్ర నామంబు లెఱుంగ వలతుం జెప్పుం' డనిన నారాజునకు దేవయాని యి ట్లనియె. 158

ప్రతిపదార్థం: ఆ+యయాతియున్= ఆ యయాతియు; తద్, ప్రదేశంబునన్= అక్కడ; సుఖ+ఉపవిష్టుండు+ఐ= సుఖంగా కూర్చున్నవాడై; దేవయానిన్= దేవయానిని; తొల్లి= అంతకుముందే; ఎఱింగినవాఁడు+ఐ= నూతినుండి తీసినప్పుడే ఎఱిగినవాడు కాబట్టి; అతిశయ, రూప, లావణ్య, గుణసుందరి, అయిన= అధిక మైన రూపంతోను, సౌందర్యంతోను, గుణాలతోను అందమైన; శర్మిష్ఠను; ఎఱుంగన్, వేఁడి= తెలుసుకొన కోరి; మీరు; ఎవ్వరి, వారలు= ఎవరికి సంబంధించిన వారు; మీ, కుల, గోత్ర, నామంబులు= మీ యొక్క కులాన్ని గోత్రాన్ని, పేరును; ఎఱుంగన్, వలతున్= తెలిసికొనకోరుతాను; చెప్పుండు; అనినన్= అని అడుగగా; ఆ రాజునకున్= యయాతికి; దేవయాని; ఇట్లు= ఈవిధంగా, అనియెన్= పల్కింది.

తాత్పర్యం: ఆ యయాతికూడ అక్కడ సుఖంగా కూర్చుండి, అంతకుముందే నూతినుండి బయటికి తీసినపుడు దేవయానిని ఎరిగియున్నవా డవటంవలన అధిక మైన రూపంతోను, సౌందర్యంతోను, గుణాలతోను ఒప్పుతున్న

శర్మిష్ఠ ఎవరో తెలుసుకొన కోరి 'మీరు ఎవరికి సంబంధించినవారు, మీకులాలను, గోత్రాలను, పేరులను తెలిసికొనకోరుతున్నాను చెప్పు' డని అడిగాడు. అప్పుడు దేవయాని యయాతితో ఇట్లా పలికింది.

విశేషం: యయాతి శర్మిష్ఠను ఇప్పుడే మొదటిమారు చూచాడు. ప్రథమదర్శనం లోనే ఆమెసౌందర్యాదులచేత ఆకర్షింపబడినాడు. ఆమెను ఒక్కదాన్నిగురించే అడగటం యుక్తంగా ఉండ దని అతడు అందరినిగురించీ అడిగాడు.

తే. **నన్ను మున్న యెఱుంగు; దిన్నాతి నాకు । దాసి, వృషపర్వుఁ డను మహాదానవేంద్రు**
కన్య; నాయొద్ద నెప్పుడుఁ గదలకుండు । ననఘ! మఱి దీని శర్మిష్ఠ యండ్రు జనులు. **159**

ప్రతిపదార్థం: అనఘ= పాపరహితుడా; నన్నున్= నన్నుగురించి; మున్ను+అ= ముందే; ఎఱుంగుదు (తద్ధర్మ క్రియ అవటంచేత వకారం లోపించింది); ఈ+నాతి= ఈకన్య; నాకున్, దాసి= సేవకురాలు; వృషపర్వుఁడు+అను= వృషపర్వు డనే పేరు కల; మహత్+దానవ+ఇంద్రు= గొప్పరాక్షసరాజుయొక్క; కన్య= కూతురు; నాఒద్దన్= నాచెంత; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; కదలక+ఉండున్= వదలక నివసిస్తూ ఉంటుంది; మఱి= ఇంక; జనులు; దీనిన్= ఈమెను; శర్మిష్ఠ; అండ్రు= శర్మిష్ఠ అని అంటారు. (పిలుస్తారు.)

తాత్పర్యం: పాపరహితుడ వైన ఓయయాతీ! నీవు నన్నుగురించి ఇంతకు ముందే తెలిసికొన్నావు. ఈమె నాకు సేవకురాలు. వృషపర్వు డనే పేరు కలిగిన గొప్పరాక్షసరాజుకూతురు. నాచెంతనే ఎప్పుడూ విడువకుండా సేవ చేస్తూ ఉంటుంది. ఇక ఈమెను ప్రజలు శర్మిష్ఠ అంటారు.

విశేషం: అను - దురు. సూ: 'తిదుటలు పరంబు లగునపుడు అను మొదలగువాని స్థానంబున పూర్ణబిందు వగును' - అందురు. సున్నమీది దకారానికి డకారాదేశం- అండురు - ఉత్వలోపం - అండ్రు. ఇక్కడ దేవయాని తన గొప్పతనం ప్రదర్శించేందుకై రాక్షసరాజుకుమార్తెతనకు దాసి అని చెప్పింది. శర్మిష్ఠ తనంతటతాను పరిచయంచేసికొంటే మహాదానవేంద్రు కన్యగా చెప్పుకొంటుంది. అందువలన దేవయాని తానే చొరవతీసికొని ఆరాజుకూతురు దాసి అనీ ఆమెకు (చివరకు తనపెళ్లి తానే చేసికొనే) స్వాతంత్ర్యంకూడా లేదని స్పష్టంచేస్తుంది. 'రత్నహారీతుపార్థివః అనే న్యాయంతో కన్యారత్నాన్ని తానే నని వ్యంగ్యంగా సూచిస్తుంది.

ఉ. **నిగ్రహ మేది నన్నుఁ దరణిప్రభ! కూపము వెల్వరించునాఁ**
దుగ్రమయూఖసాక్ష్యముగ నున్నతదక్షిణపాణిఁ జేసి భూ
పాగ్రణి! నాదు దక్షిణకరాగ్రము వట్టితి కాన మున్న పా
ణిగ్రహణంబు సేసి; తది నీయెడ విస్మృతిఁ బొందఁ బాడియే. **160**

ప్రతిపదార్థం: తరణి, ప్రభ!= సూర్యుడికాంతివంటి కాంతి గలవాడా!; నిగ్రహము= మేర, నింద (లేదా అవమానం); ఏది= నశించి (ఇక్కడ ఏద అనే పాఠాంతర మున్నది. అదే ఉచితం. నాకు కలిగిన అవమానం నశించేటట్లుగా); కూపము. వెల్వరించునాఁడు= నూతినుండి బయటికి తీసేటప్పుడు; భూప+అగ్రణి= రాజశ్రేష్ఠుడా; ఉగ్రమయూఖ, సాక్ష్యముగన్= తీక్ష్ణ మైన కిరణాలు కలిగిన సూర్యుడి సాక్ష్యం కలిగేటట్లు; ఉన్నత, దక్షిణ, పాణిన్, చేసి= ఎత్తైన (పొడవైన) కుడిచేతితో; నాదు; దక్షిణ, కర+అగ్రము= కుడిచేతి అగ్రభాగాన్ని; పట్టితి(వి)= గ్రహించావు; కాన= కాబట్టి; మున్ను+అ= ఇంతకుముందే; పాణి, గ్రహణంబు చేసితి(వి)= చేతిని పట్టుకొనటం చేశావు. (పెళ్ళాడావు); అది= ఆవిషయం; నీఎడన్= నీహృదయంలో; విస్మృతిన్= మరపును; పొందన్= పొందటం; పాడి+ఏ= న్యాయమా?

తాత్పర్యం: సూర్యుడియొక్కకాంతివంటి కాంతి గల ఓ రాజశ్రేష్ఠుడా! నాకు కలిగిన చెర (శిక్ష) నశించేటట్లుగా (మేరమీరి) నన్ను నూతినుండి బయటికి తీసిననాడే సూర్యుడి సాక్షిగా దీర్ఘమైన నీకుడిచేతితో నాకుడిముంజేతిని గ్రహించావు. కాబట్టి ఇంతకుముందే నన్ను పెళ్ళాడినావు (నాచేయి పట్టుకున్నావు). ఆ విషయం నీహృదయంలో మరవటం న్యాయమా!

విశేషం: నిగ్రహ మంటే అదుపులో ఉండటం. ఇంద్రియనిగ్రహాదులలో ఈఅర్థం సరిపోతుంది. ఇక్కడ శిక్ష, నింద, మేర, చెఱ అనే అర్థాలు చెప్పుకోవటం యుక్తంగా ఉంటుంది. శర్మిష్ఠ దేవయానిని శిక్షించేందుకై ఆమెను నూతిలో త్రోసింది. అది చెఱవలె ఉన్నది. యయాతి పైకి తీయటంచేత ఆమె కాశిక్ష తొలగింది. ఈ పద్యంలో దేవయాని గడుసరితనం మరొకసారి స్పష్టమౌతుంది. యయాతి శర్మిష్ఠయొక్క 'అతిశయరూపలావణ్యసౌందర్యాన్ని' చూచాడు. ఆకర్షితుడైనాడు. అంతకుముందు దేవయానిని చూచాడు కాని ఆసక్తుడు కాలేదు. ఆమెకంటె అతిశయించిన రూపలావణ్యాలు శర్మిష్ఠకు ఉన్నాయని ధ్వని. యయాతి చూపులలోని మర్మాన్నీ, ఆమెనుగురించి తెలిసికోవాలనే ఆకాంక్షనూ దేవయాని పసికట్టింది. మనసులో కోర్కెకలిగితే వివాహమైనట్లే అని దేవయానిభావం. కచుడితో ఆమె ఆవిధంగానే పేర్కొన్నది. ఇప్పుడు యయాతి శర్మిష్ఠపై ఆసక్తికలిగి ఉండటంవలన, అది వివాహమయ్యే అవకాశం ఉన్నది. తా నుండగా తనదాసి అయిన శర్మిష్ఠపై యయాతి ఆసక్తిని ప్రకటించటం ఆమె సహించలేకపోయింది. అందుకే తనకూ యయాతికీ అంతకుముందే పాణిగ్రహణమైపోయిందని మనోధర్మాన్ని ప్రతిపాదించింది. యయాతిని తానే దక్కించుకొనవలెనని భావించింది. ఈవిధంగా ఆత్మాభిమానాన్ని శర్మిష్ఠముందు నిలుపుకొనటానికి యయాతిని వివాహమాడే నిర్ణయాన్ని మెరుపువలె తీసికొనటంలో ఆమెగడుసరితనం, సద్యఃస్ఫూర్తి, చాకచక్యం వెల్లడి అవుతున్నాయి. నన్నయ శిల్పంతో తీర్చిదిద్దినపాత్రలలో దేవయాని ఒకతె. ఉక్తివైచిత్ర్యంతో కూడికొనిన పృథక్పదత్వం గల ఈరచన మాధుర్యగుణవిశిష్టం. అభిలాషను ధ్వనింపచేయటంలో మాధుర్యం మహనీయం. (సంపా.)

ఉ. **'నన్ను వివాహ మై నహుషనందన! యీలలితాంగిఁ దొట్టి యీ**
కన్నియలందఱున్ దివిజకన్యలతో నెన యైనవారు నీ
కున్నతిఁ బ్రీతి సేయఁగ నృపోత్తమ! వాసవుఁ బోలి లీలతో
నిన్నరలోకభోగము లనేకము లందుము నీవు' నావుడున్. **161**

ప్రతిపదార్థం: నహుషనందన= నహుషుడి కొడుకువైన యయాతీ!; నన్ను; వివాహము+ఐ= పెళ్ళాడి; ఈ, లలిత+అంగిన్, తొట్టి= సుందరాంగి యైన ఈశర్మిష్ఠ మొదలుకొని; దివజకన్యలతోన్= దేవతాకన్యలతో; ఎన, అయినవారు= సాటి అయినవారు; ఈ, కన్నియలు, అందఱున్= ఈకన్యలంతా; నీకున్; ఉన్నతిన్= పెంపుతో, గౌరవంతో; ప్రీతి, చేయఁగన్= ప్రియం చేకూర్చగా; నృప+ఉత్తమ= రాజశ్రేష్ఠుడా!; వాసవున్= ఇంద్రుడిని; పోలి; లీలతోన్= విలాసంతో; నీవు; ఈ+నరలోక, భోగములు= ఈ మానవలోకానికి సంబంధించిన సౌఖ్యాలు; అనేకములు= పెక్కులు; అందుము= పొందుము; నావుడున్= అని దేవయాని పలుకగా.

తాత్పర్యం: 'నహుషుడి కుమారుడివైన ఓ యయాతి మహారాజా! నన్ను పెళ్ళాడి సుందరాంగి యైన శర్మిష్ఠ మొదలుగా గల దేవకన్యకలతో సాటి యైన ఈకన్యలంతా నీకు గౌరవంతో ప్రియం చేకూర్చగా ఇంద్రుడిని పోలి విలాసంతో నీవు మానవలోకానికి సంబంధించిన పెక్కుభోగా లనుభవించుము' అని దేవయాని పలికిన అనంతరం.

విశేషం: తొట్టుధాతువుకు తొట్టి అనే క్త్వార్థకరూపం ఒక్కటే ప్రయోగాలలో కనవస్తోంది. తనను వివాహమాడితే దేవకన్యలతోసాటివచ్చే శర్మిష్ఠాది కన్యలందరూ యయాతిని సేవించి ప్రీతి కలిగిస్తారని చెప్పటంలోకూడా దేవయాని గడుసరితనం కనబడుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శర్మిష్ఠ మీద నీకు మక్కువ ఉంటే ముందు నన్ను వివాహమాడాలని సూచించింది. అయినా తాను రాణిగా, శర్మిష్ఠ దాసిగా మాత్రమే యయాతికి సేవలందించగలదని వ్యంగ్యంగా నిర్దేశించింది. ఈ పద్యరచనలోని మాధుర్యగుణం రసభావానుగుణం. (సంపా.)

వ. 'క్షత్త్రియకన్యకల బ్రాహ్మణులు వివాహం బగుదురు గాక; యధర్మోత్తరంబుగా క్షత్త్రియులు బ్రాహ్మణకన్యకల వివాహం బగుదురే? నీపలుకులు ధర్మ విరుద్ధంబులు; మఱియు సర్వవర్ణాశ్రమధర్మంబులు సంకరంబులు గాకుండ రక్షించుచున్న యేన యిట్టి యధర్మంబున కొడంబడితినేని జగత్ప్రవృత్తి విపరీతం బగు' ననిన నయ్యయాతికి దేవయాని యి ట్లనియె. 162

ప్రతిపదార్థం: క్షత్త్రియ కన్యకలన్= క్షత్రియుల కూతుళ్ళను; బ్రాహ్మణులు; వివాహంబు+అగుదురు, కాక= వివాహ మాడతారు కాని; అధర్మ+ఉత్తరంబు+కాన్= అధర్మం మీది దగునట్లుగా (ఇక్కడ, అధర్మ మార్గమున, ధర్మేతరంబుగా, అధర్మంబుగా అనే పాఠాంతరా లున్నాయి) అనే అర్థం వస్తుంది; క్షత్రియులు; బ్రాహ్మణ, కన్యకలన్= విప్రుల కూతుళ్ళను; వివాహంబు+అగుదురు+ఏ= పెళ్ళాడుతారా? నీ పలుకులు= నీ మాటలు; ధర్మవిరుద్ధంబులు= ధర్మానికి వ్యతిరేకమైనవి; మఱియున్= అదీకాక; సర్వవర్ణ+ఆశ్రమ ధర్మంబులు= సకలములయిన బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రాది వర్ణాలయొక్క, బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ సన్న్యాసాశ్రమాలయొక్క ధర్మాలు; సంకరంబులు= ఒకదానితో ఒకటి కలిసినవి; కాక+ఉండన్= కాకుండగా; రక్షించుచు; ఉన్న= పాలిస్తున్న; ఏను+అ= రాజునైన నేనే; ఇట్టి, అధర్మంబునకున్= ఇట్టి ధర్మం కాని కార్యానికి; ఒడంబడితిన్+ఏనిన్= అంగీకరిస్తే; జగత్, ప్రవృత్తి= జగత్తుయొక్క వ్యాపారం (స్థితి); విపరీతంబు= వ్యత్యస్తం; అగున్; అనినన్= అని యయాతి పలుకగా; ఆ+యయాతికిన్; దేవయాని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'క్షత్రియులకూతుళ్ళను బ్రాహ్మణులు పెళ్ళాడుతారు కానీ అధర్మంగా క్షత్రియులు విప్రులకూతుళ్ళను పెళ్ళాడుతారా? నీ మాటలు ధర్మానికి వ్యతిరిక్తాలు. అదిగాక అన్నివర్ణాలయొక్క ఆశ్రమాల యొక్క ధర్మాలు సంకీర్ణాలు కాకుండా కాపాడుతున్న రాజు నైన నేనే ఇటువంటి అధర్మానికి అంగీకరిస్తే లోకవ్యాపారం వ్యత్యస్త మైపోతుంది' అని పలుకగా యయాతికి దేవయాని ఇ ట్లన్నది.

క. 'వెలయఁగ ధర్మాధర్మం । బులు నడపుచు నిఖిలలోకపూజ్యుండై ని
ర్మలుఁ డగు శుక్రుఁడు పంచిన । నలఘుభుజా! నను వివాహ మగుదే?' యనినన్. 163

ప్రతిపదార్థం: అలఘుభుజా!= గొప్ప బాహువులు కలవాడా! (పరాక్రమవంతుడా); వెలయఁగన్= ప్రసిద్ధికెక్కేటట్లుగ; ధర్మ+అధర్మంబులు= ధర్మాన్నీ, అధర్మాన్నీ; నడపుచున్= జరిగిస్తూ, నిర్ణయిస్తూ; నిఖిల, లోకపూజ్యుండు+ఐ= సకలలోకాలచేత (ప్రజలచేత) పూజనీయుడై; నిర్మలుఁడు+అగు= అనఘు డైన; శుక్రుఁడు= నాతండ్రి శుక్రాచార్యుఁడు; పంచినన్= ఆజ్ఞాపిస్తే; ననున్ వివాహము అగుదువు+ఏ= నన్ను పెళ్ళాడుతావా; అనినన్= అని దేవయాని పలుకగా.

తాత్పర్యం: 'గొప్పబాహుపరాక్రమం కలవాడా! ప్రసిద్ధమయ్యేటట్లుగా ధర్మాన్నీ అధర్మాన్నీ నిర్ణయిస్తూసకలలోకాలకు పూజనీయు డై పాపరహితు డైన నాతండ్రి శుక్రు డాజ్ఞాపిస్తే నన్ను పెండ్లాడుతావా?' అని దేవయాని పలుకగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ధర్మాధర్మ నిర్ణయం శాస్త్రప్రకారం చేయబడుతుంది లోకంలో. ఇక్కడ శాస్త్రకారుడివంటి శుక్రాచార్యుడిని ప్రమాణంగా ప్రతిపాదిస్తున్నది దేవయాని, శుక్రుడు రాక్షసాచార్యుడు. అతడు చెప్పింది ధర్మవిరుద్ధంగా ఉండదని లోకులు విశ్వసిస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శుక్రుడు దేవయాని అభిమతానికి విరుద్ధమైన ధర్మం చెప్పడు. ఆచార్యప్రమాణం చూపి తన అభిమతాన్ని తీర్చుకోదలచటంలో దేవయాని గడుసరితనం ప్రకటితమౌతున్నది.

వ. 'అమ్మహాముని వచ్చి యిది ధర్మవిరుద్ధంబు గా దని చెప్పెనేని నిన్ను వివాహం బగుదు' నని యయాతి యొడంబడిన దేవయాని యప్పుడ శుక్రు రావించిన. 164

ప్రతిపదార్థం: ఆ, మహత్+ముని= ఆ గొప్పముని శుక్రుడు; వచ్చి; ఇది= ఈ వివాహం; ధర్మ, విరుద్ధంబు, కాదు+అని= ధర్మానికి వ్యతిరేకం కాదని; చెప్పెన్+ఏని= చెప్పినట్లైతే; నిన్నున్ వివాహంబు+అగుదున్+అని= నిన్ను పెండ్లాడుతా నని; యయాతి; ఒడంబడినన్= అంగీకరింపగా; దేవయాని; అప్పుడు+అ= వెంటనే (ఆ క్షణంలోనే); శుక్రున్= శుక్రాచార్యుడిని; రావించినన్= వచ్చేటట్లు చేయగా.

తాత్పర్యం: 'మహాముని యైన ఆ శుక్రుడు వచ్చి ఈ వివాహం ధర్మానికి విరుద్ధం కా దని చెప్పినట్లైతే నిన్ను పెళ్ళాడుతా' నని యయాతి అంగీకరించగా దేవయాని వెంటనే తండ్రి యైన శుక్రుడిని అక్కడికి రప్పించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తనదివ్యతేజమున న । వ్వన మెల్ల వెలుంగుచుండ వచ్చెను భృగునం
దనుఁడు నిజనందనకుఁ బ్రియ । మొనరింపఁగఁదలఁచి దానియొద్దకుఁ బ్రీతిన్. 165

ప్రతిపదార్థం: తన, దివ్య, తేజమునన్= తనయొక్క దేవతాసంబంధ మైన కాంతిచేత; ఆ+వనము, ఎల్లన్= ఆ అడవిఅంతా; వెలుంగుచుండన్= ప్రకాశిస్తుండగా; నిజనందనకున్= తనకూతురికి; ప్రియము= ప్రీతి; ఒనరింపఁగన్+తలఁచి= చేయదలచి; భృగునందనుఁడు= భృగుకుమారు డైన శుక్రుడు; దాని, ఒద్దకున్= దేవయానిచెంతకు; ప్రీతిన్= ప్రీతితో; వచ్చెను.

తాత్పర్యం: దేవతాసంబంధ మైన కాంతిచేత ఆ అడవిఅంతా ప్రకాశిస్తుండగా భృగుకుమారు డైన శుక్రుడు తనకూతురైన దేవయానికి ప్రీతిచేయదలచి ప్రేమతో ఆమెవద్దకు వచ్చాడు.

క. అతిసంభ్రమమున నవనీ । పతి విహితోత్థానుఁ డై తపశ్శక్తిఁ బ్రజా
పతినిభుఁ డగు భార్గవునకు । నతిభక్తిం బ్రణమితోత్తమాంగుం డయ్యెన్. 166

ప్రతిపదార్థం: అవనీపతి= రాజైన యయాతి; అతి సంభ్రమమునన్= అధికమైన వేగిరపాటుతో; విహిత+ఉత్థానుఁడు+ఐ= చేయబడిన లేచుట కలవాడై (లేచినవాడై); తపః, శక్తిన్= తపస్సుయొక్క శక్తిచేత; ప్రజాపతినిభుఁడు+అగు= బ్రహ్మతో సమానుడైన; భార్గవునకున్= శుక్రుడికి; అతిభక్తిన్= మిక్కిలిభక్తితో; ప్రణమిత+ఉత్తమాంగుండు= మిక్కిలి వంచిన శిరస్సు కలవాడు (శిరస్సు మిక్కిలి వంచి నమస్కరించిన వాడు); అయ్యెన్.

తాత్పర్యం: రాజైన యయాతి మిక్కిలి వేగిరపాటుతో లేచి నిలబడి తపస్సుయొక్కశక్తియందు బ్రహ్మతో సమానుడైన శుక్రుడికి అధిక మైన భక్తితో నమస్కరించాడు.

విశేషం: ఈపద్యం యయాతికి గురువులయెడ ఉండే భక్తిని సూచిస్తున్నది. ఇందులో 'అతి' అనే విశేషణాలు, ప్రాదివర్ణాలు వ్యంజకాలై అక్షరరమ్యతను కల్పిస్తున్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియు దేవయానియు శర్మిష్ఠయుం గన్యకాసహస్రంబును నత్యంతభక్తితోఁ గ్రమంబున నమస్కరించి; రంత దేవయాని శుక్రున కి ట్లనియె. 167

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; దేవయానియున్, శర్మిష్ఠయున్; కన్యకాసహస్రంబున్= వేయిమంది కన్యలున్నూ; అత్యంత భక్తితోన్= అధికమైన భక్తితో; క్రమంబునన్= వరుసగా; (దేవయానీ పురస్సరంగా) నమస్కరించిరి; అంతన్= అటుపిమ్మట; దేవయాని; శుక్రునకున్, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: తరువాత దేవయానియూ, శర్మిష్ఠయూ, చెలికత్తె లయిన వేయిమందికన్యకలునూ, మిక్కిలి భక్తితో శుక్రుడికి నమస్కరించారు. అటుపిమ్మట దేవయాని శుక్రుడితో ఇట్లా పలికింది.

విశేషం: క్రమంబున అన్న పదంచేత ముందు దేవయాని, తరువాత శర్మిష్ఠ, ఆ తరువాత కన్యకలు నమస్కరించా రని గ్రహించవచ్చును. దీనివలన దేవయాని ప్రాముఖ్యం వెల్లడి అవుతున్నది.

ఆ. ఇన్నరేంద్రుచేత మున్న గృహీత మై । యున్న నాకరంబు గ్రన్న నింక
నొరున కర్హ మగునె పరిణయ విషయ మై । ధరఁ బరిగ్రహింపఁ బరమమూర్తి!. 168

ప్రతిపదార్థం: పరమమూర్తి= పరమమైన ఆకారం కలవాడా!; ఈ+నర+ఇంద్రుచేతన్= ఈరాజశ్రేష్ఠుడిచేత; మున్ను+అ= పూర్వమే; గృహీతము+అయి, ఉన్న= గ్రహించబడియున్న; నాకరంబు= నాచేయి; పరిణయ, విషయము+ఐ= వివాహానికి వస్తువై (వివాహ సంబంధాన); క్రన్నన్= శీఘ్రంగా; ధరన్= భూమియందు; పరిగ్రహింపన్= గ్రహించటానికి; ఇంకన్, ఒరునకున్= మరి ఇతరుడికి; అర్హము+అగును+ఎ= తగిన దౌ తుందా?; (కాదని భావం).

తాత్పర్యం: పరబ్రహ్మస్వరూపుడి వైన ఓతండ్రీ! ఈ రాజశ్రేష్ఠుడిచేత ఇంతకు పూర్వమే గ్రహించబడి యున్న నాచేతిని వివాహవిషయాన ఇంకొకరికి గ్రహించటానికి తగునా?

వ. 'కావున నాకు నీ జన్మంబునఁ బతి యయాతియ; యితండును భవద్వచనంబున నన్ను వివాహం బగుదు ననియె; నిందు ధర్మవిరోధంబు లేకుండు నట్లుగాఁబ్రసాదింపవలయు' ననిన శుక్రుండు గరుణించి 'యయాతికి నీకును నయిన యీ వివాహంబునం దపక్రమదోషంబు లేకుండెడు' మని వరం బిచ్చి యయ్యిరువురకుం బరమోత్సవంబున వివాహంబు సేసి, శర్మిష్ఠం జూపి 'యిది వృషపర్వుని కూఁతురు; దీనికిఁ బ్రియంబున నన్నపాన భూషణాచ్ఛాదన మాల్యానులేపనాదుల సంతోషంబు సేయునది; శయనవిషయంబునఁ బరిహరించు నది' యని పంచి, కూఁతు నల్లునిం బూజించిన; నయ్యయాతియు శుక్రుని వీడ్కొని దేవయానిని శర్మిష్ఠను గన్యకా సహస్రంబును దోడ్కొని నిజపురంబునకుం జని యంతః పురరమ్యహర్మ్యతలంబున దేవయాని నునిచి, తదనుమతంబున నశోకవనికాసమీపంబున నొక్క గృహంబునందుఁ గన్యకాసహస్రంబుతో శర్మిష్ఠ నునిచి, దేవయానియందు సుఖోపభోగపరుం డై యున్నఁ; గొండొకకాలంబునకు దేవయానికి యదుతుర్వసు లను కొడుకులు పుట్టి; రంత శర్మిష్ఠ సంప్రాప్తయౌవనయు ఋతుమతియు నై యాత్మగతంబున. 169

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నాకున్; ఈ జన్మంబునన్= ఈపుట్టుకయందు; పతి= భర్త; యయాతి+అ= యయాతియే; ఇతండును= ఈయయాతికూడ; భవత్+వచనంబునన్= నీమాట ననుసరించి; నన్నున్; వివాహంబు+అగుదున్+అనియెన్= పెళ్ళాడుతా నని పలికాడు; ఇందున్= ఈ వివాహంలో; ధర్మ, విరోధంబు= ధర్మానికి వ్యతిరేకం; లేక+ఉండు+అట్లుగాన్= లేకుండే విధంగా; ప్రసాదింపవలయున్= అనుగ్రహించవలెను; అనినన్= అని దేవయాని పలుకగా; శుక్రుండు; కరుణించి= దయతాల్చి; యయాతికిన్; నీకునున్, అయిన; ఈ వివాహంబునందున్= ఈ పెళ్ళిలో; అపక్రమ, దోషంబు= క్రమం తప్పటం అనే దోషం; లేక, ఉండెడున్, అని= లేకుండు గాక, అని; వరంబు+ఇచ్చి; ఆ+ఇరువురకున్= ఆ దేవయానీయయాతు లిద్దరికిని; పరమ+ఉత్సవంబునన్= గొప్పవేడుకతో; వివాహంబు, చేసి= పెళ్ళిచేసి; శర్మిష్ఠన్; చూపి= యయాతికి చూపించి; ఇది= ఈమె; వృషపర్వుని కూతురు; దీనికిన్= ఈ శర్మిష్ఠకు; ప్రియంబునన్= ప్రీతితో; అన్న, పాన, భూషణ, అచ్ఛాదన, మాల్య+అనులేపన+ఆదులన్= అన్నం, పానం, అలంకారాలు, వస్త్రాలు, దండలు, శరీరానికి పూసుకొనే అనులేపనాలు మొదలైనవాటిచే; సంతోషంబు, చేయు+అది= ఆనందం కలిగించవలసింది; శయన, విషయంబునన్= పడకవిషయాన; పరిహరించు+అది= వర్జించవలసింది; అని; పంచి= ఆజ్ఞాపించి; కూఁతున్= కూతురైన దేవయానిని; అల్లునిన్= అల్లుడైన యయాతిని; పూజించినన్= గౌరవించగా; ఆ+యయాతియున్= ఆ యయాతికూడ; శుక్రునిన్; వీడ్కొని= విడిచి (శుక్రుడి వద్ద సెలవుతీసికొని); దేవయానిని, శర్మిష్ఠను, కన్యకాసహస్రంబును= కన్యకలు వేయిమందిని; తోడ్కొని= తనతో తీసికొని; నిజ, పురంబునకున్= తన పట్టణానికి; చని= వెళ్ళి; అంతఃపుర, రమ్య, హర్మ్య తలంబునన్= అంతఃపురమందలి అందమైన ప్రాసాద ప్రదేశమందు; దేవయానిన్; ఉనిచి= ఉంచి; తద్, అనుమతంబునన్= ఆమె అంగీకారంతోనే; అశోక, వనికా సమీపంబునన్= అశోకవృక్షాలతో కూడిన వనంచెంత; ఒక్క గృహమందున్= ఒక ఇంటియందు (ఇంట్లో); కన్యకా సహస్రంబుతోన్= కన్యలు వేయిమందితో; శర్మిష్ఠన్, ఉనిచి; దేవయానియందున్, సుఖ+ఉపభోగ, పరుండు+ఐ= సుఖాలను అనుభవించటంలో ఆసక్తి కలవాడై; ఉన్నన్= ఉండగా; కొండొకకాలంబునకున్= కొంతకాలానికి; దేవయానికిన్; యదు, తుర్వసులు+అను= యదువు తుర్వసుడు అనే; కొడుకులు; పుట్టిరి; అంతన్= ఆ తరువాత, శర్మిష్ఠ; సంప్రాప్త, యౌవనయున్= పొందబడిన యౌవనం కలదీ ఋతిమతియున్+ఐ= పుష్పవతియూ అయి; ఆత్మగతంబునన్= తనలో.

తాత్పర్యం: 'నా కీ పుట్టుకయందు (జన్మలో) యయాతియే భర్త. ఈ యయాతియు నీమాటను అనుసరించి నన్ను పెళ్ళాడుతా నని పలికాడు. ఈ మా వివాహంలో ధర్మానికి వ్యతిరేకం లేకుండేటట్లుగా అనుగ్రహించాలి (అనుగ్రహించవలసింది)' అని దేవయాని పలుకగా శుక్రుడు దయతాల్చి 'యయాతికీ నీకూ అయ్యే ఈ పెళ్ళిలో అధర్మదోషం లేకుండు గాక' అని వర మిచ్చి, వారిద్దరికీ అధిక మైన వేడుకతో పెళ్ళిచేసి యయాతికి శర్మిష్ఠను చూపించి 'ఈమె వృషపర్వు డనే రాక్షసరాజుకూతురు. ఈమెకు భోజనం, పానీయాలు, అలంకారాలు, వస్త్రాలు, దండలు, శరీరానికి పూసుకునే లేపనాలు మొదలైనవాటిచేత ఆనందం కల్పించుము. పడకవిషయంలో మాత్రం ఈమెను వర్జించవలసింది' అని ఆజ్ఞాపించి కూతు రైన దేవయానిని, అల్లు డైన యయాతిని గౌరవించాడు. ఆ యయాతికూడ శుక్రుడి దగ్గరసెలవు తీసుకొని దేవయానిని శర్మిష్ఠను వేయిమందికన్యలను వెంటతీసికొని తనపట్టణానికి వెళ్ళి అంతఃపురమందలి అందమైనమేడలో దేవయానిని ఉంచి, ఆమె అంగీకారంతో అశోకవృక్షాలవనానికి చెంత నున్న ఒకయింట్లో వేయిమంది కన్యలతో శర్మిష్ఠను ఉంచి, దేవయానితో సుఖాలను అనుభవిస్తూ ఉన్నాడు. కొంత కాలానికి దేవయానికి యదువు, తుర్వసుడు అనే కొడుకులు పుట్టారు. తరువాత శర్మిష్ఠ యౌవనవతీ, పుష్పవతియు, అయి, ఆత్మలో.

విశేషం: ఉండెడున్= అని 'సూ:- ఎడుతల ద్రుతమునకు అచ్చు పరంబగునపుడు మకారము. ఉండెడు మని. దేవయాని కడుగడుసరిగా తండ్రితో మాటాడింది. తనకూ యయాతికీ వివాహం కావటం ధర్మమా అధర్మమా అని ఆమె తండ్రి నడుగలేదు. యయాతిచేత ముందే కరగ్రహణం చేయబడిన దేవయానిని మరొకరు పాణిగ్రహణం చేయడానికి వీలులేదనీ, అట్లా జరిగితే అది ధర్మ విరుద్ధమనీ, ఆధర్మవైరుద్ధ్యాన్ని తొలగించటమంటే ఈజన్మకు దేవయానికి యయాతియే భర్త' అని నిర్ణయించటమనిన్నీ, శుక్రాచార్యుడు అంగీకరిస్తే యయాతి దేవయానిని స్వీకరించటానికి అంగీకరించాడనీ దేవయాని సూచించింది. కూతురు స్వయంగా స్వీకరించిన వరుడిని అంగీకరించి, ఆశీర్వదించి, ధర్మవిరుద్ధం కాకుండా దారిచూపించటం తప్ప మరొకదారి శుక్రుడికి మిగిలించకుండా మాటాడటంలోనే దేవయాని గడుసరితనం ఉన్నది. శుక్రుడు కూడ దేవయానికి యయాతితో కరగ్రహణం కారణంగా వివాహమైనట్లుగానే నిర్ణయించి, దానివలన కలిగే అపక్రమదోషం లేకుండా వరమిచ్చాడు. తనయకు హితం చేద్దామనే ఉద్దేశంతోనే వచ్చిన శుక్రుడు దేవయానిపక్షంలోనే తీర్పిచ్చాడు. కాదు. ఆయనచేత ఆ తీర్పు దేవయాని ఇప్పించింది. నన్నయ దేవయాని పాత్రను మెలకువతో చిత్రించి ప్రసన్నకథాకలితార్థయుక్తిని ప్రదర్శించాడు. శుక్రుడు యయాతితో శర్మిష్ఠ కన్ని సౌకర్యాలూ కలిగించుమని పలికి శయనవిషయాన ఆమెను వర్జించాలి అనగా ఆమె సంగమం పరిహరించాలి అని ఆజ్ఞాపించాడు. ఈ విషయం చాలా ముఖ్య మైనది. యయాతి అట్లా చేయక శర్మిష్ఠతో భోగించి శుక్రుడిశాపానికి గురి అయ్యాడు.

చ. అసదృశయౌవనం బిది యనన్యధనం బగు నొక్కొ! నాకు ని
క్కుసుమ సముద్గమంబును నగోచర దుర్గమ దుర్గవల్లరీ
కుసుమ సముద్గమం బగు నొకో! పతిలాభము లేమిఁ జేసి; యొ
ప్పెసఁగఁగ దేవయాని పతి నేమి తపం బొనరించి కాంచెనో! 170

ప్రతిపదార్థం: అసదృశ యౌవనంబు+ఇది= సాటిలేని నా యీ యౌవనం; అనన్యధనంబు= ఎవరిచేతను అనుభవించబడని సొమ్ము; (ఇతరుల భోగాలకు పాత్రమవక నాయందే జీర్ణించేది); అగున్+ఒక్కొ= అవునేమో; నాకున్; ఈ+కుసుమ, సముద్గమంబును= ఈరజో దర్శనమున్నూ; పతి, లాభము, లేమిన్ చేసి= భర్తృప్రాప్తి లేకపోవటంచేత; అగోచర, దుర్గమ, దుర్గవల్లరీ, కుసుమ, సముద్గమంబు= ఇతరులకు వెళ్ళటానికి శక్యంకాని, దుర్గమందలి లతకు పూవులపుట్టుక; అగున్+ఒకో= దుర్గఅగునా ఏమి; ఒప్పు+ఎసఁగఁగన్= అందమతిశయించగా; దేవయాని; ఏమి తపంబు= ఏ గొప్పతపస్సు; ఒనరించి= చేసి; పతిన్= భర్తను; కాంచెన్+ఓ= పొందెనో.

తాత్పర్యం: సాటిలేని నా యీ యౌవనం అన్యులకు ఉపభోగ్యం కాక నాయందే జీర్ణించిపోవునా ఏమి! నాకు ఈ రజోదర్శనం (ఋతుమతీత్వం) భర్తృప్రాప్తి లేకపోవటంచేత ఇతరులకు ప్రవేశించేందుకు (వెళ్ళేందుకు) శక్యంకాని కోటలోని లతలకు పూచిన పుష్పాలపుట్టుక అగునా ఏమి? అంద మతిశయించగా దేవయాని ఏమి గొప్పతపం చేసి భర్తను పొందిందో!

విశేషం: కుసుమం అంటే పువ్వు. స్త్రీ రజస్సు అని అర్థాలు ఉన్నాయి. స్త్రీకి కుసుమ సముద్గమం అయింది అంటే ఆమె ఋతుమతి అయినది అని అర్థం. మనుష్యులు చొరలేని దుర్గంలోని లతలపూవులు వికసించి, వాడి వత్త లై పోవటమే కానీ వాటిని ఇతరులు ఉపయోగించేందుకు వీలుండదు. అట్లాగే భర్తృలాభం లేకపోవటంచేత తన ఋతుమతీత్వం కూడ

అన్యోపభోగ్యం కాకుండా వ్యర్థ మై పోతుం దని శర్మిష్ఠ విచారిస్తున్నది. అన్యులయొక్కధనం అన్యధనం. దానికి వ్యతిరేకం అనన్యధనం. స్త్రీయౌవనాన్ని భర్త అనుభవించాలి. అప్పు డది స్వధనం. భర్త అనుభవించకపోతే అది అనన్యధనమై వ్యర్థమై పోతుంది. అలం: కావ్యలింగం. 'కుసుమ' శబ్దంలో శ్లేష. పాత్ర స్వగతాన్ని వాక్యసుందరంగా నాటకీయంగా నన్నయ చిత్రించాడు. దీప్తరసత్వం కలిగిన ఔజ్జ్వల్యం రచనలోని శబ్దగుణం. వాక్యాలచివర క్రమంగా ఒక్కొ, ఒకో, ఓ అనే శబ్దాలు ప్లుతాలయి ఆమె భావతీవ్రతను ధ్వనింపజేస్తున్నాయి. 'అగోచరదుర్గమదుర్గవల్లరీ కుసుమసముద్గమం బగునొకో' అన్న వాక్యం ఆమె దాసీత్వంలో పొందుతున్న బాధయొక్క గాఢత్వాన్ని వ్యక్తంచేస్తుంది. ఏనాటి కైనా తాను పొందదలచుకొన్న యయాతి తన యౌవనాన్ని ఉపభోగించే అవకాశం లభించదేమో అన్న శంక, నిర్వేదం వ్యక్తంచేసింది. యయాతిని భర్తగా పొందిన దేవయాని అదృష్టాన్ని అసూయతో ప్రశంసించింది. శబ్దగుణంచేత రసభావధ్వని ఇందులో గమ్యమానం. (సంపా.)

క. పతిఁ బడసి సుతులఁ బడయఁగ । నతివలు గోరుదురు; గోరినట్టుల తనకుం
బతిఁ బడసి సుతులఁ బడసెను; । సతు లీభార్గవికి భాగ్యసంపద నెనయే. 171

ప్రతిపదార్థం: పతిన్= భర్తను; పడసి= పొంది; అతివలు= స్త్రీలు, సుతులన్= కొడుకులను; పడయఁగన్= పొందటానికి; కోరుదురు; కోరిన+అట్టులు+అ= కోరినట్లే; తనకున్; పతిన్= భర్తను; పడసి= పొంది; సుతులన్= కొడుకులను; పడసెను= పొందింది; ఈభార్గవికిన్= శుక్రుడి కూతు రైన ఈ దేవయానికి; సతులు= ఇతరకాంతలు; భాగ్య, సంపదన్= అదృష్ట సంపదయందు; ఎన+ఏ= సాటియా? (కారని భావం).

తాత్పర్యం: స్త్రీలు భర్తను పొంది కుమారులను పొందగోరుతారు. ఈ దేవయాని తాను కోరినట్లే భర్తను పొంది కొడుకులను కూడ పొందింది. అదృష్ట సంపదలో ఈమెకు ఇతరకాంతలు సాటి కారు.

విశేషం: కందపద్యంలో పూర్వ, ఉత్తరార్ధాల నిర్వహణలో (అంటే మొదటి, మూడవ చరణాల నిర్మాణంలో) సమత అనే శబ్దగుణం పోషింపబడింది. లోకంలో అందరు వనితలు కోరుకొనే పతిసౌఖ్యాన్నీ, పుత్రలాభాన్నీ దేవయాని పొందగలిగిందని చెప్పటంలో ఉన్న సమత్వం ఈగుణం వ్యంజింపజేస్తున్నది. అయితే సతులందరూ దేవయానికి సమానం కారు అన్న వాక్యంలో ఈర్ష్య, దైన్యం గోచరిస్తాయి. లోకంలో సతులు తాముకోరుకొన్న పతులను తాము పొందారు. కాని, దేవయాని శర్మిష్ఠ పొందవలసిన పతిని పొందటమేకాకుండా సర్వసతులకు సాధారణధర్మమైన పతిపొందును తాను పొందకుండా నిరోధించింది. నిజానికి ఆపని క్షత్రియవనిత అయిన తాను చేయగలిగిఉండాలి. కాని, ఆ అదృష్టం దేవయానికి దక్కిందని శర్మిష్ఠ దైన్యం. రసభావవ్యంజకమైన గుణవాక్యవిన్యాసం ఇందులోని శిల్పం. (సంపా.)

తరువోజ.

ఈ రాజునంద నా హృదయంబు దవిలి యెప్పుడు నుండు; న న్నీతఁడు గరము
కారుణ్యమునఁ బ్రీతిగలయట్లు సూచుఁ; గమలాక్షి భార్గవకన్య దా నెట్లు
గోరి యీతనిఁ దనకును బతిఁ జేసికొనియె నటుల యేను గోరి లోకైక
భారధురంధరుఁ బరహితు ధర్మపరు నహుషాత్మజుఁ బతిఁ జేసికొందు. 172

ప్రతిపదార్థం: ఈ రాజునందున్+అ= ఈయయాతి మహారాజునందే; నాహృదయంబు= నా చిత్తము; ఎప్పుడున్= ఎల్లప్పుడును; తవిలి ఉండున్= ఆసక్తికలిగి ఉంటుంది; నన్నున్; ఈతఁడు= ఈయయాతి; కరము= మిక్కిలి; కారుణ్యమునన్= దయతో;

ప్రీతి, కల, అట్లు= ప్రేమ ఉన్న విధాన; చూచున్; కమల+అక్షి= పద్మాలవంటి నేత్రాలు కలిగిన; భార్గవకన్య= శుక్రుడికూతు రైన దేవయాని; తాన్, ఎట్లు= తా నేవిధంగా; కోరి; ఈతనిన్= ఈయయాతిని; తనకును; పతిన్= భర్తను; చేసికొనియెన్= చేసికొన్నదో; అటులు+ఆ= అట్లే (అలాగే); ఏను= నేను కూడ; కోరి; లోక+ఏక+భార ధురంధరున్= లోకంయొక్క మొత్తం బరువును (భారాన్ని) వహించే వాడిని; పరహితున్= ఇతరులకు మేలు చేసేవాడిని; ధర్మపరున్= ధర్మమందు ఆసక్తికలవాడిని; నహుష+ఆత్మజున్= నహుషుడి కుమారు డైన యయాతిని; పతిన్= భర్తను; చేసికొందున్.

తాత్పర్యం: ఈ యయాతిమహారాజునందే నాచిత్త మెప్పుడూ ఆసక్తి కలిగి ఉన్నది. న న్నా రాజు మిక్కిలి దయతో, ప్రేమ తో చూస్తాడు. పద్మాలవంటినేత్రాలు కల శుక్రుడికూతు రైన దేవయాని తా నేవిధంగా వాంఛించి యయాతిని తనకు భర్తగా చేసికొన్నదో అట్లాగే నేనుకూడ కోరి లోకంయొక్క మొత్తంభారం వహించే వాడూ, ఇతరులకు మేలు చేసేవాడూ, ధర్మమం దాసక్తి కలవాడూ, నహుషుడి కుమారుడూ అయినట్టి ఈ యయాతిని భర్తగా చేసికొంటాను.

విశేషం: లోక+ఏక= లోకైక - వృద్ధిసంధి. తరువోజ దేశీవృత్తం: రెండు ద్విపదపాదము లైతే ఒక్క తరువోజపాద మౌతుంది. అనగా ఒక్కొక్క పాదానికి మూడింద్రగణాలు ఒక సూర్య గణం, మరల మూడింద్రగణాలు ఒక సూర్యగణం ఉంటాయి. ప్రాసనియమం కలదు. యతిమైత్రి పూర్వోత్తరార్ధములందు మొదటి గణం మొదటి అక్షరానికీ, మూడవగణం మొదటి అక్షరానికీ. నన్నయప్రసన్న కథాకలితార్థయుక్తి కీపద్యము చక్కని ఉదాహరణం. పాత్ర సంభాషణ ద్వారా పూర్వాపర కథార్థాలను భావింపజేయటం వలన కథను ప్రసన్నం చేసే ప్రక్రియను ఇందులో నన్నయ ప్రదర్శించాడు. అలనాడు వనంలో యయాతి' అతిశయరూపలావణ్యగుణసుందరి (3.158)'గా శర్మిష్ఠను దర్శించాడు. తొలిచూపును వర్ణించి వదలిన నన్నయ ఆ అంశాన్ని చెప్పటానికి వీలులేక మానివేశాడు. కాని, ఇక్కడ శర్మిష్ఠ తలపులో ఆ కథను పూరిస్తున్నాడు. ప్రథమ వీక్షణంలో శర్మిష్ఠ యయాతిని వలచింది. నాటినుండి ఆమె అతడిని ఎల్లప్పుడు మనస్సులో స్మరిస్తున్నది. యయాతికూడ ఆమెను చూచినప్పుడెల్లా మనసులో ప్రీతి ఉన్నట్లు చూస్తాడు. ఇరువురు అనురక్తులైనట్లు ఆ చూపులే సాక్షులు. అయితే, యయాతిని భర్తగా పొందిన అదృష్టం మాత్రం దేవయానికి దక్కింది. దేవయాని ఏవిధంగా తనంతట తాను కోరి యయాతిని భర్తగా పొందిందో, శర్మిష్ఠకూడా ఆవిధంగానే పొందాలని ఉవ్విళ్లూరింది. అంటే శర్మిష్ఠా యయాతుల హృదయాలలో ప్రణయబీజం గూఢంగానే ఉండిపోయింది. అది అంకురించి, పుష్పించి, ఫలించటానికి అదను రావలసి ఉన్నదని వ్యంగ్యార్థ సంయోజనంవలన తెలిసికొనాలి. (సంపా.)

యయాతి శర్మిష్ఠకుఁ బుత్రదానంబు సేయుట (సం.1-77-10)

వ. అని విచారించుచున్న యవసరంబున దాని పుణ్యస్వరూపంబు సన్నిహితం బైన య ట్లొక్కనాఁడు యయాతి యశోకవని కాలోకనతత్పరుండైవచ్చువాఁ డేకతంబ యున్న శర్మిష్ఠం గనిన, నదియును సంభ్రమ వినయావనత యై తనవలన నమ్మహీపతి ప్రసన్నచిత్తుం డగుట యెఱింగి కరకమలంబులు మొగిచి యి ట్లనియె. 173

ప్రతిపదార్థం: అని; విచారించుచున్+ఉన్న= తలపోస్తున్న; అవసరంబునన్= సమయమందు; దాని= శర్మిష్ఠయొక్క; పుణ్యస్వరూపంబు= పుణ్యంయొక్కస్వరూపం; సన్నిహితంబు+ఐన, అట్లు= దగ్గరగా వచ్చినట్లు; ఒక్కనాఁడు= ఒకరోజున, యయాతి; అశోక, వనికిన్= అశోక వనానికి; ఆలోకన, తత్పరుండు+ఐ= చూడటంలో ఆసక్తికలవా డై (అశోకవనికా+ఆలోకన

తత్పురుండు+ఐ- అన్న సమాసంకూడ చేయవచ్చు.); వచ్చువాడు; ఏకతంబు+అ= ఒంటరిగా (ఆలోచనకు తగినచోట) ఉన్న; శర్మిష్ఠన్; కనినన్= చూడగా; అదియును= ఆ శర్మిష్ఠ కూడ; సంభ్రమ, వినయ+అవనత+ఐ= వేగిరపాటుతో కూడిన వినయంతో వంగినదై; తన వలనన్= తనపై (ఎడ); ఆ+మహీపతి= ఆ రాజు; ప్రసన్న, చిత్తుండు+అగుట= ప్రసన్న మైన హృదయం కలవా డవటం, దయతో (ప్రసాదంతో) కూడిన హృదయం కలవా డవటం; ఎఱింగి= తెలిసికొని; కరకమలంబులు= పద్మాలవంటిచేతులు; మొగిచి= మోడ్చి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: అని శర్మిష్ఠ భావిస్తున్న సమయంలో మూర్తీభవించిన ఆమెపుణ్యం దగ్గరకు వచ్చిందా (సమీపించిందా) అన్నట్లు ఒకరోజు యయాతి అశోకవనాన్ని చూడటానికి ఆసక్తి కలవాడై వచ్చి ఒంటరిగాఉన్న శర్మిష్ఠను చూడగా ఆమె కూడా వేగిరపాటుతోను, వినయంతోను నమ్రయై తనయెడ ఆ రాజు అనుగ్రహంతో కూడిన హృదయం కలవా డవటం తెలిసికొని హస్తపద్మాలు మోడ్చి యిట్లా పలికింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

ఉ. **నీలగళోపమాన! కమనీయగుణోన్నతిఁ జెప్పఁ జాలు న**
న్నేలిన దేవయానికి నరేశ్వర! భర్తవు గాన నాకునుం
బోలఁగ భర్త వీవ; యిది భూనుత! ధర్మపథంబు; నిక్కువం;
బాలును దాసియున్ సుతుఁడు నన్నవి వాయనిధర్మముల్ మహిన్. **174**

ప్రతిపదార్థం: నీలగళ+ఉపమాన= నల్లనికంఠం కలిగిన శివుడు ఉపమానంగా కలవాడా (శివునితో సమానుడా!); నర+ఈశ్వర= రాజా!; కమనీయ, గుణ+ఉన్నతిన్= అందమైన గుణాలయొక్క మహిమయందు; చెప్పన్+చాలు= చెప్పటానికి తగిన (అంటే గొప్పగుణాలు కలవారిలో పరిగణించదగిన); నన్నున్+ఏలిన= నన్ను పాలించే; దేవయానికిన్; భర్తవు; కాన= కాబట్టి; నాకునున్= సేవకురాలైన నాకుకూడ; పోలఁగన్= తగినట్లుగా; భర్తవు+ఈవు+అ= మగడివి నీవే; భూనుత= భూమిచే (లోకులచేత) నుతింపబడువాడా; ఇది= స్వామినికి భర్త అయినవాడు సేవకురాలికి కూడ భర్త కావటం; ధర్మపథంబు= ధర్మమార్గం; నిక్కువంబు= యథార్థం. ఆలును= భార్యయు; దాసియున్= సేవకురాలును; సుతుఁడున్= కుమారుడును; అను+అవి= అనేవి; మహిన్= భూమియందు; పాయని; విడువని; ధర్మముల్.

తాత్పర్యం: శివసమానుడ వైన ఓరాజా! అందము లైన గుణాలమహత్త్వంచేత పరిగణించదగిన నాకు యజమానురా లైన దేవయానికి భర్తవు కాబట్టి, నాకు కూడా తగినట్లుగా నీవే భర్తవు. లోకులచేత నుతించబడేవాడా! ఇది ధర్మమార్గం; యథార్థం. ఈ లోకంలో భార్య, సేవకురాలు, కుమారుడు అనేటటువంటివి విడువని (పరస్పరం విడదీయరాని) ధర్మాలు (విధులు).

విశేషం: ధర్మములు అన్నచోట అర్థములు అనే పాఠాంతర మున్నది. అర్థములు= సొమ్ములు. ఈ పద్యంలో శర్మిష్ఠను వివేకవతిగా నన్నయ చిత్రించాడు. దేవయానివలె తానుకూడ యయాతికి భార్య కావటానికి యోగ్యత ధర్మబద్ధంగా ఉన్న దని శర్మిష్ఠ వివరించి చెప్పింది. భార్యతోపాటు, దాసి, సంతానం అనేవి విడదీయలేని ధర్మాలని లోకధర్మంతో సమర్థించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దానివలన యజమానురాలైన దేవయానికి భర్తవు అయినట్లే దాసికి కూడ భర్తవౌతావని సూచించింది. ఈధర్మంవలన దేవయాని నియమానికి భంగంరాదు. యయాతి కాదనలేని ధర్మసూక్ష్మాన్ని ప్రతిపాదించి సుముఖుడైన యయాతిని సమ్మతింపచేసే వివేకాన్ని ప్రదర్శించింది. ఈవాక్యాలన్నీ ఒకయెత్తు. 'నీలగళోపమాన!' అన్న సంబోధనం ఒక్కటీ ఒక్కయెత్తు. ఇది భావనారమణీయమైన సూక్తి. విషాన్ని కంఠంలో తాల్చి లోకహితం కొరకు పాటుపడిన శివుడు (మంగళప్రదుడు) నీలకంఠుడు. ఇష్టంలేకపోయినా కష్టమని చెప్పకుండా దేవయానిని భార్యగా స్వీకరించిన ధీరుడు యయాతి. మనస్సు లగ్నమైనా శర్మిష్ఠను స్మరించకుండా ఉదాసీనంగా ఉండిపోయిన ఉదాత్తుడు యయాతి. శర్మిష్ఠపైగల అనురాగాన్ని గూఢంగా దాచుకొన్న లోకపతియైన యయాతి యొక్క తత్కాల హృదయస్థితిని స్ఫురింపజేసే సంబోధనం నిబంధించటంలో ఉన్నది నన్నయ వాగనుశాసనత్వం, రుచిరార్థసూక్తి నిధిత్వం. ఇందలి గుణం మాధుర్యం సార్థకం. (సంపా.) అలం: అర్థాంతరన్యాసం. వ్యా.వి: అనిన, 'పడు మొదలగు వాటి సవర్ణమునకు అత్వమును కడహల్లునకు ద్విత్వమును విభాషనగును' అనిన అన్న+అవి: అత్సంధిచే - అన్నవి. అవిలోనిఅకారమునకులోపము, అన్నవి.

వ. 'అద్దేవయానిం బరిగ్రహించినప్పడ తద్ధనం బగుట నేనును భవత్పరిగ్రహంబ కావున నన్నుం గరుణించి నాకు ఋతుకాలోచితంబుఁ బ్రసాదింపవలయు' ననిన నయ్యయాతి యి ట్లనియె. 175

ప్రతిపదార్థం: ఆ+దేవయానిన్= ఆ దేవయానిని; పరిగ్రహించిన+అప్పుడు+అ= వివాహమాడినప్పుడే; తద్+ధనంబు+అగుటన్= ఆమెకు సంబంధించిన ధనాన్ని (సేవకురాల నవటంచేత); ఏనును= నేనుకూడ; భవత్+పరిగ్రహంబు+అ= మీ భార్యనే; కావున; నన్నున్; కరుణించి= దయదలచి, నాకున్; ఋతుకాల+ఉచితంబున్= ఋతుకాలానికి తగిన దానిని (సంగమాన్ని); ప్రసాదింపవలయున్= అనుగ్రహించవలసింది; అనినన్= అని శర్మిష్ఠ పలుకగా; ఆ+యయాతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'మీ రా దేవయానిని పెళ్ళి చేసికొన్నప్పుడే ఆమె దాసినవటం చేత ఆమె సొత్తునైన నేను కూడ మీ భార్యనే. కాబట్టి దయదలచి నాకు ఋతుకాలానికి తగిన సంగమాన్ని అనుగ్రహించవలసిం' దని పలుకగా, ఆ యయాతి ఇట్లా అన్నాడు.

విశేషం: దేవయానివలెనే శర్మిష్ఠకూడ యయాతిని భర్తగా పొందటం విశేషం. దేవయాని భార్య కాబట్టి ఆమె సొత్తైన శర్మిష్ఠకూడ ఆమెవలెనే భోగింపదగినది. కావున శర్మిష్ఠకూడ భార్యయే. భార్యకు భర్త ఋతుకాలోచిత ధర్మాన్ని నిర్వహించటం అవశ్యకర్తవ్యం. క్షత్రియకన్యయైన శర్మిష్ఠ వివాహప్రసక్తి తేకుండా ఉండటం వివేకం. ఆమెను యయాతి గ్రహిస్తే అది గాంధర్వవివాహం అవుతుంది. పెండ్లితంతు లేని సతీపతిధర్మాన్ని ప్రతిపాదించిన శర్మిష్ఠ గడుసరి.

క. లలితాంగి! శయన మొక్కఁడు । వెలిగా రుచిరాన్నపాన వివిధాభరణా
దుల శర్మిష్ఠకు నిష్టము । సొలయక చేయు మని నన్ను శుక్రుఁడు పంచెన్. 176

ప్రతిపదార్థం: లలితాంగి!= సుందరమైన శరీరం కలదానా; శయనము+ఒక్కఁడు= పడక ఒక్కటి మాత్రం; వెలిగాన్= బాహ్యమయ్యేటట్లుగా (విడిచి); రుచిర+అన్నపాన, వివిధ+ఆభరణ+ఆదులన్= రుచిగల భోజన పానీయాలు, పలువిధాలైన అలంకారాలు మొదలైన వాటిచేత; శర్మిష్ఠకున్; ఇష్టము= ప్రియం; సొలయక= వెనుదీయక; చేయుము; అని; నన్నున్; శుక్రుడు; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: సుందరాంగి వైన ఓ శర్మిష్ఠా! పడక ఒక్కటే తప్ప రుచిగల భోజనపానీయాలు, పలువిధా లైన అలంకారాలు మొదలైనవాటిచేత శర్మిష్ఠవిషయంలో వైముఖ్యం చూపకుండా ప్రీతి కలిగించుమని శుక్రుడు నన్నాజ్ఞాపించాడు.

వ. 'ఏ నమ్మహామునివచనంబున కప్పు డొడంబడితి; నెట్లు బొంకనేర్తు' ననిన శర్మిష్ఠ యి ట్లనియె. 177

ప్రతిపదార్థం: ఏను; ఆ+మహత్, ముని= గొప్పముని యైన శుక్రుడియొక్క; వచనంబునకున్= మాటకు; అప్పుడు= అతడాజ్ఞాపించినపుడు; ఒడంబడితిన్= అంగీకరించాను; ఎట్లు= ఏవిధంగా; బొంకన్, నేర్తున్= అసత్య మాడగలను? అనినన్= అని యయాతి పలుకగా; శర్మిష్ఠ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నేను గొప్పముని అయిన శుక్రుడిమాటకు అప్పుడే అంగీకరించాను. ఇప్పుడేవిధంగా అసత్యమాడగలను? అని యయాతి పలుకగా శర్మిష్ఠ ఇట్లా అన్నది.

క. చను బొంకఁగఁ బ్రాణాత్యయ । మున, సర్వధనాపహరణమున, వధ గావ
చ్చిన విప్రార్థమున, వధూ । జన సంగమమున, వివాహసమయములందున్. 178

ప్రతిపదార్థం: ప్రాణ+అత్యయమునన్= ప్రాణాలకు చేటువచ్చే సమయాన; సర్వ, ధన+అపహరణమునన్= ఉన్న సమస్తధనాన్ని దొంగిలిస్తున్న సమయాన; వధ, కావచ్చిన, విప్ర+అర్థమునన్= హత్య కావించబడేందుకు సిద్ధంగా ఉన్న బ్రాహ్మణుడికొరకు; వధూ, జన, సంగమమునన్= స్త్రీజనాలతో సంభోగవిషయాన; వివాహసమయములందున్= పెళ్ళికాలమందు; బొంకఁగన్= అబద్ధమాడటం; చనున్= తగును.

తాత్పర్యం: ప్రాణాలకు నాశం కలిగే సమయాన, సమస్తధనం అపహరించబడే సమయాన, వధించబడేందుకు సిద్ధంగా ఉన్న బ్రాహ్మణుడిని రక్షించేందుకూ, స్త్రీజనసంగమవిషయానా, పెళ్ళివేళలందూ అసత్య మాడవచ్చును.

విశేషం: ఈవిషయమే భాగవతంలో "వారిజాక్షులందు వైవాహికములందు, ప్రాణ విత్తమాన భంగమందుఁ, జకిత గోకులాగ్ర జన్మరక్షణమందు, బొంకవచ్చు నఘముఁ బొందదధిప!" అనే పద్యంలో చెప్పబడింది. ఇక్కడ వధూజనసంగమం విషయం కాబట్టి పెళ్లిసమయాన యయాతి ఒడంబడిన కారణాన బొంకవచ్చు అని శర్మిష్ఠ చెప్తున్నది.

వ. 'ఈ యేనింటియందు నసత్యదోషంబు లేదని మునివచనప్రమాణంబు గలదు; నీవు వివాహసమయంబున నొడంబడితివి కావున నసత్య దోషంబునం బొంద' వనిన నయ్యయాతి యొడంబడి శర్మిష్ఠకు నభిమతం బొనరించె; నదియుఁ దత్సమాగ మంబున గర్భిణి యై కొడుకుం గనిన విస్మయపడి దేవయాని దానికడకు వచ్చి యి ట్లనియె. 179

ప్రతిపదార్థం: ఈ యేనింటి యందున్= ఈ అయిదింటిలోను; అసత్య, దోషంబు= అబద్ధం ఆడటంవలన దోషం; లేదు+అని; ముని, వచన, ప్రమాణంబు= మునీంద్రులు చెప్పిన మాట అనే ప్రమాణం; కలదు; నీవు; వివాహ, సమయంబునన్= పెళ్ళాడే సమయంలో; ఒడంబడితివి= అంగీకరించావు; కావునన్; అసత్యదోషంబునన్= అబద్ధమాడటం వలని పాపంతో

(పాపాన్ని); పొందవు= పొందవు (కలయవు); అనినన్= అంగీకరించి; శర్మిష్ఠకున్; అభిమతంబు= ఇష్టం; ఒనరించెన్= చేశాడు; అదియున్= శర్మిష్ఠ కూడ; తద్+సమాగమంబునన్= అతనితోడి కలయికచేత; గర్భిణి+ఐ= గర్భవతి అయి; కొడుకున్, కనినన్= ప్రసవించిగా; విస్మయపడి= ఆశ్చర్యపడి; దేవయాని; దాని, కడకున్= శర్మిష్ఠవద్దకు; వచ్చి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పైన చెప్పబడిన ఐదువిషయాలలోను అబద్ధ మాడటంవలన పాపం లేదని మునీశ్వరులవచన మనే ప్రమాణం ఉన్నది. నీవు పెళ్ళిసమయంలో అంగీకరించావు కాబట్టి అబద్ధం దోషం పొందవు' అని శర్మిష్ఠ పలుకగా యయాతి అంగీకరించి శర్మిష్ఠకు ప్రీతి కావించాడు. శర్మిష్ఠకూడ యయాతితోడి కలయికచేత గర్భవతి అయి పుత్రుడిని కన్నది. అది చూచి దేవయాని ఆశ్చర్యపడి శర్మిష్ఠదగ్గరకు వచ్చి ఇట్లా పలికింది.

విశేషం: అసత్య దోషంబునన్+పొందవు= ఇక్కడ పొందుధాతువు అసమాపక క్రియగా వాడబడింది. విస్మయము+పడి= పడు మొదలైనవి పరమయ్యేటప్పుడు మువర్ణానికి లోపంగాని పూర్ణబిందువుగాని వస్తుంది. ఇచ్చట లోపం వచ్చింది.

తే. బాల వయ్యు నత్యుత్తమశీలవినయ । గౌరవాన్విత వై నిర్వికారవృత్తి
నున్న నీ కున్నయునికిన సన్నుతాంగి! । సుతుఁడు పుట్టుట యిది గడుఁజోద్య మయ్యె. 180

ప్రతిపదార్థం: సన్నుత+అంగి= పొగడబడిన అంగాలు కలదానా; బాలవు+అయ్యున్= వయసులో చిన్నదానివి అయికూడా, అతి+ఉత్తమ, శీల, వినయ, గౌరవ, అన్వితవు+ఐ= మిక్కిలి శ్రేష్ఠ మైన శీలంతోను, గౌరవంతోను కూడినదానివై; నిర్వికారవృత్తిన్= వికారం లేని వ్యాపారంతో; ఉన్న= వర్తిస్తున్న; నీకున్; ఉన్న ఉనికిన్+అ= ఉన్నట్లుండగానే; (ఎవరికీ తెలియకుండానే); సుతుఁడు, పుట్టుట, ఇది= కొడుకుపుట్టటమనేది; కడున్; చోద్యము; అయ్యెన్= మిక్కిలి ఆశ్చర్యకర మైనది.

తాత్పర్యం: ఓ సుందరాంగీ! బాలికవై కూడా, శ్రేష్ఠ మైన శీలంతోను, వినయంతోను, గౌరవంతోను కూడినదానివై మనోవికారం లేని వ్యాపారంతో ఉన్న నీకు ఉన్నట్లుండి కొడుకు పుట్టటం చూడగా మిక్కిలి ఆశ్చర్యంగా ఉన్నది.

విశేషం: ఈపద్యంలో శర్మిష్ఠకు వాడబడిన విశేషణాలు ఆమె వయసును, ప్రవర్తనను, వికారం లేని సచ్చరిత్రను సూచిస్తున్నాయి. అట్టి ఆమెకు ముం దెవరికీ తెలియకుండగానే, కుమారుడు పుట్టటం అన్నది ఆశ్చర్యకరంగా ఉన్నది. అది దేవయాని హృదయంలో శంకను కలిగించింది.

వ. అది యె ట్లని యడిగిన శర్మిష్ఠ లజ్జావనతవదన యయి యి ట్లను; 'నెందేనినుండి యొక్కమహామునె నిఖిల వేదవేదాంగపారగుండు వచ్చి ఋతుమతినై యున్న నన్నుం జూచి నాకుఁ బుత్త్రోత్పత్తిఁ బ్రసాదించె' ననిన విని దేవయాని నిజనివాసంబునకుం జనియె; శర్మిష్ఠయు నయ్యయాతివలనఁ గ్రమంబున ద్రుహ్యాను పూరు లనంగా ముువ్వురు గొడుకులం బడసి యున్నంత, నొక్కనాఁడు. 181

ప్రతిపదార్థం: అది, ఎట్లు= కుమారుడు పుట్టటం ఎట్లా జరిగింది; అని, అడిగినన్= అని దేవయాని అడుగగా; శర్మిష్ఠ, లజ్జా+అవనత, వదన అయి= సిగ్గుచేత వంగిన ముఖం కలదై; ఇట్లు+అనున్= ఇట్లా పలికింది; ఎందున్+ఏని+ఉండి= ఎక్కడ నుండియో; ఒక్క మహత్, ముని= ఒక గొప్పముని; నిఖిలవేద, వేద+అంగ, పారగుండు= అన్ని వేదాలయొక్క, వేదాంగాలయొక్క

అంతం చూచిన వాడు; వచ్చి; ఋతుమతిన్+ఐ+ఉన్న= పుష్పవతి నై ఉన్న; నన్నున్; నాకున్; చూచి; పుత్త్ర+ఉత్పత్తిన్= కొడుకు కాన్పును; ప్రసాదించెన్= అనుగ్రహించాడు; అనినన్= అని శర్మిష్ఠ పలుకగా; విని; దేవయాని. నిజనివాసంబునకున్= తన యింటికి; చనియెన్= వెళ్ళింది. శర్మిష్ఠయున్= శర్మిష్ఠకూడ, ఆ+యయాతివలనన్; క్రమంబునన్= వరుసగా; ద్రుహ్యు+అను, పూరులు అనంగాన్= ద్రుహ్యు; అనువు, పూరుడు అనే పేర్లతో ఒప్పే ముప్పురుకొడుకులన్; పడసి= పొంది; ఉన్న+అంతన్= ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజు.

తాత్పర్యం: నీకు కొడుకు పుట్టటం ఎట్లా జరిగిం దని దేవయాని అడుగగా శర్మిష్ఠ సిగ్గుతో ముఖం వంచుకొని ఇట్లా అన్నది: 'ఎక్కడినుండియో సమస్త వేదాలను, వేదాంగాలను బాగా చదివిన ఒక గొప్పముని వచ్చి ఋతుకాలమం దున్న నన్ను చూచి నాకు పుత్త్రజన్మను అనుగ్రహించాడు' - అని శర్మిష్ఠ పలుకగా విని దేవయాని తన గృహానికి వెళ్ళింది. శర్మిష్ఠకూడ ఆ యయాతివలన వరుసగా ద్రుహ్యుడు, అనువు, పూరుడు అనే ముగ్గురు కొడుకులను పొంది ఉండగా ఒక్కరోజున.

విశేషం: ఋగ్యజుస్సామాథర్వణ వేదాలు నాలుగు. శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, కల్పం, నిరుక్తం, జ్యోతిషం అనే ఆరు వేదాంగాలు, ద్రుహ్యు+అను= ద్రుహ్యును - యణాదేశసంధి. వివాహవిషయాలలో బొంకు లాడినా అసత్యదోషం రాదని చెప్పిన శర్మిష్ఠ ఇక్కడ తాను ఆ ధర్మాన్నే పాటించిందని చెప్పేటట్లు వ్యవహరించింది. పుత్రసంతానం ఇచ్చింది యయాతికాని ముని కాదు. అయినా, అట్లా చెప్పినా దోషం లేదని శర్మిష్ఠభావం.

సీ. **కరువలిచేఁ దూలుకపిల జటాలియ । కరమొప్పు శిఖలుగాఁ గనకరత్న**
మయజాల భూషణామలదేహదీప్తుల । తేజంబుగాఁ బ్రవిదీప్యమాన
యాగశతంబుల నర్చితం బైన మూఁ । డగ్నులు ప్రత్యక్ష మైన యట్లు
దనమ్రోల శర్మిష్ఠతనయులు గ్రీడించు । చుండంగ నున్న యయ్యుర్వితేని

ఆ. **కడకు నేఁగుదెంచెఁ గన్యలు దనుజాధి! రాజసుతయుఁ దోడరాఁగ నొప్పి**
దేవి దేవయాని దేవేంద్రుదేవియ । పోలె నెంతయును విభూతి మెఱసి. **182**

ప్రతిపదార్థం: కరువలిచేన్= గాలిచేత; తూలు= చలించు; కపిల, జట+ఆళి+అ= గోరోజనంవంటి రంగు గల జడల యొక్క సముదాయమే; కరము+ఒప్పు= మిక్కిలి అందగించు; శిఖలు, కాన్= సిగలుగా; కనక, రత్నమయ, జాల, భూషణ, అమల దేహ, దీప్తులు+అ= బంగారంతోను, రత్నాలతోను కూడిన కవచాలవలె, నగలవలె నిర్మల మైన శరీరంయొక్క కాంతులే; తేజంబుకాన్= తేజస్సుగా; ప్రవిదీప్య మాన యాగ శతంబులన్= మిక్కిలి ప్రకాశిస్తున్న నూరు యజ్ఞాల యందు; అర్చితంబు+ఐన= పూజించబడిన; మూడు+అగ్నులు= త్రేతాగ్నులు; ప్రత్యక్షము+ఐన+అట్లు= ఎదుట సాక్షాత్కరించినట్లు; తనమ్రోలన్= తన ఎదుట; శర్మిష్ఠ తనయులు= శర్మిష్ఠకుమారులు; క్రీడించుచున్+ఉండంగన్= ఆడుతుండగా; ఉన్న; ఆ+ఉర్వితేని కడకున్= ఆ యయాతి మహారాజు చెంతకు; కన్యలు= చెలికత్తె లైన ఇతర కన్యకలునూ; దనుజ+అధిరాజు సుతయున్= రాక్షస రా జైన వృషపర్వుడి కూతు రైన శర్మిష్ఠయునూ; తోడన్, రాఁగన్= తనవెంట రాగా; ఒప్పి= ప్రకాశించి; దేవేంద్రు, దేవి+అ, పోలెన్= దేవతల రా జైన, ఇంద్రుడి పట్టమహిషి యైన శచీదేవివలె; ఎంతయును= మిక్కిలి; విభూతి= వైభవం; మెఱసి= ప్రకాశించి; దేవి, దేవయాని= పట్టమహిషి యైన దేవయాని; ఏఁగుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: గాలిచేత కదిలే కపిలవర్ణం గల జడలసమూహమే మిక్కలి సుందర మైన సిగలుగా, బంగారంతోను, రత్నాలతోను, నిండిన (కవచాలవలె) నగలవలె నిర్మల మైన శరీరకాంతులే తేజస్సుగా ప్రకాశిస్తున్న వందలకొలది యజ్ఞాలయందు పూజించబడిన త్రేతాగ్నులు సాక్షాత్కరించినట్లు తన ఎదుట శర్మిష్ఠకుమారు లైన ద్రుహ్యుడు మొదలైన వారు ఆడుతుండగా ఉన్న ఆ యయాతిమహారాజువద్దకు కన్యకలునూ, వృషపర్వుడి కూతురైన శర్మిష్ఠయునూ తనవెంట రాగా దేవేంద్రుడి పట్టమహిషి యైన శచీదేవివలె వైభవం మెరయ పట్టమహిషి యైన దేవయాని వచ్చింది.

విశేషం: ('కనకరత్నమయజాల' లోని 'జాల' అన్నపదానికి కవచ మని అర్థం చెప్పాల్సి వచ్చింది. జాల అనగా సమూహమని అర్థ మున్నది కాని అప్పుడు అది భూషణ అన్న పదం తరువాత ఉండాలి) ఆ బాలురు అలంకారాదులు లేకపోయినా సహజకాంతిచేతనే ప్రకాశిస్తున్నా రని కవిభావం. గార్హపత్యము, దక్షిణాగ్ని, ఆహవనీయము అనేవి మూడు త్రేతాగ్నులు. శర్మిష్ఠకుమారులు త్రేతాగ్నులవలె ఉన్నారనటం చేత ఆమెవలననే యయాతి గృహస్థధర్మం సార్థకమైనదనీ, వంశకర్తను ఆమెవలననే పొందగలిగాడనీ భావికథార్థ ధ్వని. అలం: మొదటి మూడుపాదాలలో రూపకం, ఉత్ప్రేక్షల సంకరం ఉన్నది. ఎత్తుగీతిలో ఉపమ ఉన్నది.

వ. ఇ ట్లరుగుదెంచి యధికతేజస్వులయి యయాతి ప్రతిబింబంబులుం బోని యబ్బాలకులం జూచి' యిక్కుమారు లెక్కడి వా? రెవ్వరికొడుకు? లని యయాతి నడిగి యలబ్ధప్రతివచనయై 'మీ తల్లిదండ్రులెవ్వ' రని యక్కుమారుల నడిగిన. 183

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; అరుగుదెంచి= వచ్చి; అధిక, తేజస్వులు, అయి= మిక్కిలితేజుస్సు కలవా రై; యయాతి ప్రతిబింబంబులున్, పోని= యయాతియొక్క మాఱురూపాలవంటి; (యయాతిరూపం వంటి రూపం కల); ఆ+బాలకులన్= ఆ కుమారులను; చూచి; ఈ+కుమారులు; ఎక్కడివారు; ఎవ్వరి కొడుకులు; అని; యయాతిన్; అడిగి; అలబ్ధ ప్రతివచన+ఐ= పొందబడని సమాధానం కలదై; మీ తల్లిదండ్రులు= మీ తల్లి, తండ్రి; ఎవ్వరు; అని; ఆ+కుమారులన్; అడిగినన్= దేవయాని అడుగగా.

తాత్పర్యం: (దేవయాని) ఈవిధంగా వచ్చి అధిక మైన తేజస్సు కలిగి యయాతిరూపంవంటి రూపం కల శర్మిష్ఠ కుమారులను చూచి 'ఈకుమారులు ఏప్రదేశానికి చెందినవారు? ఎవ్వరి కొడుకులు?' అని యయాతిని అడిగింది. యయాతి సమాధానం చెప్పకపోతే, 'మీ తల్లిదండ్రు లెవ్వరు? అని ఆ కుమారులనే అడిగింది.

క. తరుణప్రదేశినులు మా। సరముగ వారలు యయాతి శర్మిష్ఠలఁ జూ
పిరి తండ్రియుఁ దల్లియు నని। కర మనురాగిల్లెఁ గన్యకానివహంబున్. 184

ప్రతిపదార్థం: వారలు= ఆ కుమారులు; తరుణ, ప్రదేశినులు= లేత చూపుడువేళ్ళు; మాసరముగన్= దీర్ఘం కాగా; తండ్రియున్, తల్లియున్+అని; యయాతి శర్మిష్ఠలన్= యయాతి మహారాజును; శర్మిష్ఠను; చూపిరి; కన్యకా, నివహంబున్= కన్యలయొక్క సముదాయం కూడ; కరము= మిక్కిలి; అనురాగిల్లెన్= ప్రీతిపొందెను.

తాత్పర్యం: ఆ కుమారులు లలితము లైన చూపుడువ్రేళ్ళు దీర్ఘాలు కాగా వీరు మా తండ్రి తల్లి అని యయాతి శర్మిష్ఠలను చూపించారు. ఆ దృశ్యం చూచి అక్కడి కన్యకలసముదాయం మిక్కిలిప్రీతిని పొందారు.

విశేషం: ఇక్కడ మీతండ్రీ, తల్లీ ఎవ్వరని దేవయాని అడుగగా కుమారులు చూపుడు వ్రేళ్ళతో వరుసగా యయాతి శర్మిష్ఠలను చూపించటం చాలా సహజంగా ఉన్నది. సామాన్యంగా లోకంలో తల్లిదండ్రు లెవ రని అడుగుతారు. కాని, ఇక్కడ తండ్రిఎవరో ముందు తెలియాలి. తల్లిఎవరో ఆతరువాత; కాబట్టి ఇక్కడ ఆ పదాల వరుస మారింది.

వ. ఇట్లు ద న్నెఱుంగకుండ యయాతి శర్మిష్ఠవలన లబ్ధసంతానుం డగుట యప్పు డెఱింగి. 185

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; తన్నున్+ఎఱుంగక+ఉండ= తనసంగతి తెలిసికొనకుండా, తనకు తెలియకుండా; యయాతి; శర్మిష్ఠవలనన్; లబ్ధ సంతానుండు+అగుట= పొందబడిన సంతానం కలవా డౌట; అప్పుడు; ఎఱింగి= దేవయాని తెలిసికొని.

తాత్పర్యం: ఈవిధంగా తనసంగతి తెలిసికొనకుండా (తనకు తెలియకుండా) యయాతి శర్మిష్ఠవలన సంతానాన్ని పొందటం అప్పుడు తెలిసికొని.

విశేషం: తా నెరుగకుండా అని ఉంటే ఎక్కువ ఉచితంగా ఉండేదని కొందరు భావిస్తారు. కాని, తనకు తెలియకుండా, తనసంగతి తెలియకుండా అని రెండర్థాలు వచ్చేటట్లు వాడి నన్నయ ప్రకృత, భావికథార్థవ్యంజకత్వాన్ని సాధించాడు. తనకు తెలియకుండా యయాతి శర్మిష్ఠవలన సంతానంపొందటంలో దోషం యయాతియందే ఉన్నదని ఆమె భావించింది. ఆపని యయాతి ఆమెసంగతి (శక్తియుక్తులు) తెలియకచేశాడని అభిమానపడి తనతండ్రిచేత శాపాన్ని ఇప్పించింది. భర్త తనపట్ల చేసిన ఈ అపరాధానికి ప్రతీకారం చేయాలని భావించే దేవయాని దురహంకారిణి.

చ. పతివిహితానురాగమున భార్గవపుత్త్రి యయాతిచేత వం
చిత యయి, వాఁడు దానవికిఁ జేసిన నెయ్యు మెఱింగి, కోపదుః
ఖిత యయి, తండ్రిపాలి కతిఖేదమునం జని, దీర్ఘనేత్రని
ర్గతజలధారలం గడిగెఁ గాంత తదీయ పదాబ్జయుగ్మమున్. 186

ప్రతిపదార్థం: పతివిహిత+అనురాగమునన్= భర్తకు విధింపబడిన ప్రేమవిషయంలో భార్గవపుత్త్రి= శుక్రుడికూతు రైన దేవయాని; యయాతిచేతన్; వంచిత+అయి= మోసగించబడిన దై; వాఁడు= యయాతి; దానవికిన్= రాక్షసస్త్రీ యైన శర్మిష్ఠకు; (శర్మిష్ఠయందు అని అర్థం:) చేసిన; నెయ్యము= ప్రేమ; ఎఱింగి= తెలిసికొని; కోపదుఃఖిత, అయి= కోపంచేత దుఃఖం పొందినదై; తండ్రిపాలికిన్= తండ్రి యైన శుక్రుడి చెంతకు; అతిఖేదమునన్= మిక్కిలి శోకంతో; చని= వెళ్ళి; తదీయపద+అబ్జ, యుగ్మమున్= ఆ శుక్రుడి పద్మాలవంటి పాదాలజంటను; దీర్ఘ, నేత్ర, నిర్గత, జలధారలన్= ఆయతములైన కన్నులనుండి బయల్వెడలిన (బయటపడిన) కన్నీటిధారలచేత; కడిగెన్= తడిపినది. (అతనిపాదాలపై పడి ఏడ్చిన దని భావం.)

తాత్పర్యం: పతి అన్యస్త్రీని ప్రేమించడంచేత, అతనిచేత వంచించబడిన దై శుక్రుడికూతు రైన దేవయాని, యయాతి రాక్షసకన్య యైన శర్మిష్ఠయందు చేసిన ప్రేమకలాపాన్ని ఎఱిగి కోపాన్ని, దుఃఖాన్ని పొందినదై, మిక్కిలి శోకంతో తండ్రివద్దకు వెళ్ళి తన విశాలనయనాలనుండి జారు కన్నీటిధారలచేత, అతని పాదపద్మయుగాన్ని కడిగింది. (అతడిపాదాలు క్షాళితాలయ్యేంత అధికంగా కన్నీ రోడ్చి ఏడ్చిందని భావం).

విశేషం: ప్రతివిహితానురాగమున అను పాఠాంతరం కలదు. ప్రతివిహితమంటే వ్యతిరేకంగా చేయబడింది. ఇక్కడ యయాతి శర్మిష్ఠను ప్రేమించటం వ్యతిరేకంగా చేయబడిన ప్రేమయే. అందుచేత ఈ పాఠమే ఉచితతరంగా కనబడుతున్నది.

ఈపద్యంలో దేవయానికి కలిగిన కోపదుఃఖభావాలు రుచిరార్థరమ్యంగా వర్ణింపబడినాయి, తా నుండగా మరొక వనితను వలచుటవలన అవమానితురాలయింది. తనభర్త శర్మిష్ఠయందు పుత్రులను పొందాడని తెలిసి దేవయాని మండిపడింది. శర్మిష్ఠ పరోక్షంగా తనమీద విజయం సాధించింది. ఆమె అస్తిత్వం అస్తి నాస్తి విచికిత్సలో పడింది. ఆమె అహంకారం దెబ్బతిన్నది. తండ్రిపెట్టిన కట్టడి వీగిపోవటంచేత ఏర్పడిన ఈవిపత్తును గురించి చెప్పుకొనటానికి పుట్టింటికి వెళ్ళింది. తండ్రిపాదపద్మాలను కన్నీటితో కడిగింది. కన్నీటితో పాదాలు కడిగిందనటంలో లక్ష్యార్థం ప్రధానం. పాదాలపై పడి కంటికి కడవకట్టినట్లు దుఃఖించిందని భావం. దాని వలన ఆమె దుఃఖభావతీవ్రత ధ్వనిస్తోంది కాబట్టి ఇక్కడ లక్షణా మూలధ్వని. కన్నీటితో కాళ్ళుకడగటమనేదానివలన దుఃఖం వాచ్యం కావటంవలన అవివక్షితవాచ్యధ్వని. (సంపా.)

శుక్రుఁడు యయాతికి శాపం బిచ్చుట (సం.1-78-24)

వ. అయ్యయాతియు దానిం బట్టువఱుచుచుఁ దోడన చని శుక్రుం గని నమస్కరించి యున్న నద్దేవయాని గద్గద వచన యై 'యధర్మంబున ధర్మంబు గీడ్పఱిచి యిమ్మహీశుం డాసురంబున నాసురియం దనురక్తుం డై పుత్త్రత్రయంబు వడసి నాకవమానంబు సేసె' ననిన విని శుక్రుండు యయాతి కలిగి 'నీవు యౌవనగర్వంబున రాగాంధుండ వై నాకూఁతున కప్రియంబు సేసితివి కావున జరాభారపీడితుండవు గ' మ్మని శాపం బిచ్చిన నయ్యయాతి శుక్రున కి ట్లనియె. 187

ప్రతిపదార్థం: ఆ+యయాతికూడ; దానిన్= దేవయానిని; పట్టువఱుచుచున్= ఓదార్చుచు; తోడన్+అ= వెంటనే, చని= వెళ్ళి, శుక్రున్= శుక్రుడిని; కని= చూచి; నమస్కరించి; ఉన్నన్= నమస్కారం చేసి ఉండగా; ఆ+దేవయాని; గద్గద, వచన, ఐ= డగ్గుత్తికతో కూడిన మాటలు కలదై; అధర్మంబునన్= అధర్మంచేత; ధర్మంబు= ధర్మాన్ని; కీడ్పఱిచి= కించపరిచి; ఈ+మహీ+ఈశుండు= ఈరాజు; ఆసురంబునన్= రాక్షస విధాన; ఆసురి, అందున్= రాక్షసస్త్రీయందు; అనురక్తుండు+ఐ= ప్రేమకలవాడై; పుత్త్రత్రయంబు= ముగ్గురు కొడుకులను; పడసి= పొంది; నాకున్; అవమానంబు చేసెన్= పరాభవం చేశాడు; అనినన్= అని దేవయాని పలుకగా; విని; శుక్రుండు; యయాతికిన్= యయాతియెడ; అలిగి= కోపించి; నీవు; యౌవనగర్వంబునన్= యౌవనంవలని గర్వంచేత; రాగ+అంధుండవు+ఐ= ప్రేమచేత గ్రుడ్డివాడి వై; నాకూఁతునకున్= నాకూతు రైన దేవయానికి; అప్రియంబు= అనిష్టం; చేసితివి; కావునన్; జరా, భారపీడితుండవు= ముసలితనంయొక్కభారంచేత బాధించబడిన వాడివి; కమ్ము= అగుము; అని; శాపంబు; ఇచ్చినన్; ఆ+యయాతి; శుక్రునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ యయాతికూడ దేవయానిని ఓదారుస్తూ వెంటనే వెళ్ళి శుక్రుడిని దర్శించి నమస్కరించాడు. దేవయాని డగ్గుత్తికతో కూడికొన్న వాక్కులు కలదై ఇట్లా అన్నది: 'ఈ మహారాజు అధర్మంచేత ధర్మాన్ని కించపరిచి రాక్షసపద్ధతిలో రాక్షసకన్య అయిన శర్మిష్ఠను అనురాగంతో గ్రహించి పుత్త్రత్రయాన్ని పొంది నాకు అవమానం చేశాడు'. ఆమెమాటలు విని శుక్రుడు యయాతిమీద ఆగ్రహించి 'నీవు యౌవనగర్వంతో రాగాంధుడ వై నాకూతురికి ఇష్టంలేనిపని చేశావు. కాబట్టి ముసలితనపు బరువుతో పీడింపబడేవాడివి కమ్ము' అని శపించాడు. అప్పుడు ఆ యయాతి శుక్రాచార్యుడితో ఇట్లన్నాడు.

విశేషం: దేవయాని కోపాన్నీ దుఃఖాన్నీ ఉపశమింపచేయటానికి యయాతి ప్రయత్నించాడు. ఆమెవెంట శుక్రాచార్యుడి దగ్గరకు వెళ్ళి నమస్కరించాడు. అయినా ఆ ముని అతడిని పట్టించుకొన్నట్లు లేదు. ఆమె తండ్రితో చెప్పిన మాటలలో ముఖ్యమైన

అంశాలు. 1. రాజు అధర్మంచేత ధర్మాన్ని కించపరిచాడు. అంటే అధర్మసంబంధంవలన గృహస్థధర్మాన్ని కించపరిచాడని భావం. 2. అసురుడివలె వ్యవహరించి అసురకన్యను అనురాగంతో స్వీకరించాడు. ఈవాక్యంలో అసురశబ్దం నిందావాచకం. రాక్షసస్త్రీని ఈ రాక్షసుడు ప్రేమించి నన్ను రాక్షసంగా అవమానించాడని భావం. 3. పైపెచ్చు ఆమెయందు ముగ్గురుకొడుకులను పొందాడు. ఇది అచ్చమైన అసూయతో అన్నమాట. పట్టమహిషిఅయిన తనకు ఇద్దరు కొడుకులు. శర్మిష్ఠకు ముగ్గురుకొడుకులు. ఈ మూడింటికి గల మూలకారణం యౌవనంలో కలిగే రాగాంధ్య మని శుక్రుడు నిర్ణయించాడు. దానిని తొలగించే వార్ధక్యాన్ని శాపంవలన యయాతికి కలిగించాడు. శపించటానికి కారణం యయాతి అధర్మవర్తనం అని అనలేదుకాని కూతురుకు చేసిన అప్రియ మని మాత్రం ప్రత్యేకించి పేర్కొన్నాడు. కూతురి అప్రియత్వాన్ని తొలగించటానికి శాపాన్ని ఇచ్చాడు. ఆమె కిమ్మనలేదు కాబట్టి తండ్రి చేసినపని ఆమెకు ఆమోదయోగ్యమే అని వ్యంగ్యం. నాటకీయంగా పాత్రల సంభాషణలు వర్ణిస్తూ కథార్థాలను ప్రసన్నంచేసే నన్నయ ప్రయోగనైపుణ్యం ఇందులో ప్రసన్నమౌతున్నది. (సంపా.)

క. ఋతుమతి యై పుత్త్రార్థము । పతిఁ గోరిన భార్యయందుఁ బ్రతికూలుం డై
ఋతువిఫలత్వము సేసిన । యతనికి మఱి భ్రూణహత్య యగు నండ్రు బుధుల్. 188

ప్రతిపదార్థం: ఋతుమతి+ఐ= పుష్పవతి యై; పుత్ర+అర్థము= పుత్రుడి నిమిత్తం; పతిన్= భర్తను; కోరిన; భార్యయందున్; ప్రతికూలుండు+ఐ= అనుకూలుడు కానివాడై; ఋతు, విఫలత్వము చేసిన; అతనికిన్= ఋతుకాలంయొక్క వ్యర్థత్వం కావించిన వాడికి; మఱి; భ్రూణహత్య= గర్భమందలి బిడ్డను చంపటం (వలన కలుగు పాపం) అగును; అని; బుధుల్= పండితులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పుష్పవతి యై భర్తను వాంఛించిన భార్యయెడ ఆనుకూల్యం లేనివాడై ఋతుకాలాన్ని వ్యర్థం చేసిన వాడికి గర్భస్థశిశువును చంపినపాప మౌ తుందని పెద్దలు (చెప్పారు).

విశేషం: ఇది నన్నయసూక్తులలో ఒకటి. యయాతి ఈపద్యంలో ఋతుమతి అయిన సతి పుత్రార్థం పతిని కోరితే, దానిని కాదనటం భ్రూణహత్యచేసినంత దోషం అనే పండితప్రమాణాన్ని పేర్కొన్నాడు. అది- అధర్మంతో ధర్మాన్ని కించపరిచాడన్న దేవయాని వాదాంశానికి సమాధానం. అట్లాచెప్పటంలో యయాతి దేవయానికంటె గడుసరితనాన్ని ప్రదర్శించాడు. యజమానురాలు రాజుకు భార్య అయితే ఆమె సేవకురాలుకూడ ఆయనకు భార్యయే. అయినా, ఆమెకు శయ్యాసుఖం మాత్రం ఈయవద్దని శుక్రుడి కట్టుబాటు. యయాతి తనంతట తాను ఆమె పొందును కోరలేదు. ఆమె ఋతుమతి అయినప్పుడు పుత్రార్థిని యై అతడిని అర్థించింది. ఆకోర్కెను అతడు తీర్చాడు. ఇందులో ధర్మవైరుద్ధ్యం లేదు. పుత్రులకొరకే అయిన సంబంధంవలన శర్మిష్ఠకు ముగ్గురుకొడుకులు పుట్టారు. అందువలన అధర్మంవలన ధర్మం అవమానంపొందలేదని యయాతి వాద తాత్పర్యం. అది ఆసుర మైన ధర్మంకాదనీ మానవీయధర్మ మనీ అతడి అభిప్రాయం.

క. దానికి భీతుఁడ నై య । మ్మానవతీ ప్రార్థనం గ్రమం బొనరఁగ సం
తానము వడసితి నెదలో । దీనికి నలుగంగఁ దగునె దివ్యమునీంద్రా! 189

ప్రతిపదార్థం: దివ్యముని, ఇంద్రా= దేవతాముని శ్రేష్ఠుడా, శుక్రాచార్యా!; దానికిన్= భ్రూణహత్యకు; భీతుఁడన్+ఐ= భయపడిన వాడి నై; ఆ+మానవతీ ప్రార్థనన్= అభిమానం కల ఆ శర్మిష్ఠయొక్క వేడికోలుచేత; క్రమంబు= న్యాయం (వరుస) ఒనరఁగన్= సమకూడేటట్లుగా; సంతానము= సంతతి; పడసితిన్= పొందితిని (పొందాను); దీనికిన్= ఈన్యాయమైనదానికి; ఎదలోన్= హృదయంలో అలుగంగన్ తగున్+ఎ= కోపించటం యుక్తమా? (కాదని భావం).

తాత్పర్యం: దేవతామునిశ్రేష్ఠుడ వైన ఓ శుక్రాచార్యా! ఆ భ్రూణహత్యాపాపానికి భయపడి, మానవతి యైన శర్మిష్ఠ కోరికచేత సక్రమంగానే సంతానాన్ని పొందాను. దీనికి హృదయంలో కోపించ తగునా?

వ. 'ఏ నిద్దేవయానియందు విషయోపభోగతృప్తుండఁ గాను, జరాభారంబుఁ దాల్పనోప' నని ప్రార్థించిన విని వానికి శుక్రుండు గరుణించి 'యట్లేని నీముదిమి నీకొడుకులయం దొక్కరునిపయిం బెట్టి వానిజవ్వనంబు నీవు గొని రాజ్యసుఖంబు లనుభవింపుము; నీవు విషయోపభోగ తృప్తుండ వైన మఱి నీముదిమి నీవ తాల్చి, వాని జవ్వనంబు వానికి నిచ్చునది; నీ ముదిమిఁ దాల్చిన పుత్త్రుండ రాజ్యంబున కర్హుండును, వంశకర్తయు నగు' ననిన నయ్యయాతి శుక్రు వీడ్కొని దేవయానీసహితుం డై తనపురంబునకు వచ్చి శుక్రుశాపంబున జరాభారంబుఁ దాల్చిన, వానికి. 190

ప్రతిపదార్థం: ఏను= నేను; ఈ+దేవయానియందున్; విషయ+ఉపభోగ, తృప్తుండన్, కాను= ఇంద్రియ భోగాలను అనుభవించటంలో తృప్తిచెందిన వాడిని కాను; జరాభారంబున్= ముదిమి బరువును; తాల్పన్+ఓపన్= భరించజాలను; అని ప్రార్థించినన్= అని వేడుకోగా; విని; వానికిన్= యయాతియెడ; శుక్రుండు; కరుణించి= దయతలచి; అట్లు+ఏని= నీవు జరాభారం వహించ లేకపోయినట్లయితే; నీ ముదిమి= నీ ముసలితనం; నీ కొడుకులయందున్; ఒక్కరుని, పయిన్; పెట్టి= ఉంచి; వాని జవ్వనంబు= ఆ కొడుకుయౌవనం; నీవు కొని= నీవు గ్రహించి; రాజ్యసుఖంబులు= రాజత్వంవలని సౌఖ్యాలను; అనుభవింపుము; నీవు; విషయ+ఉపభోగ, తృప్తుండవు= ఇంద్రియ భోగాలను అనుభవించటంచేత తృప్తిపొందినవాడివి; ఐన; మఱి= అయిన పిమ్మట; నీ ముదిమి= నీ ముసలితనం; నీవు+అ= నీవే; తాల్చి= ధరించి; వాని జవ్వనంబు= ఆ కొడుకుయౌవనం; వానికిన్= ఆ కొడుకుకు; ఇచ్చునది= ఇమ్ము; నీ ముదిమిన్; తాల్చిన; పుత్త్రుండు+అ= కొడుకే; రాజ్యంబునకున్= రాజత్వానికి; అర్హుండును= తగినవాడును; వంశకర్తయున్= వంశాన్ని కొనసాగించేవాడును; అగున్; అనినన్= అని శుక్రుడు పలుకగా; ఆ యయాతి; శుక్రున్= శుక్రుడిని; వీడ్కొని= సెలవు పుచ్చుకొని; (విడిచి) దేవయానీ+సహితుండు+ఐ= దేవయానితో కూడినవా డై; తన పురంబునకున్= తన పట్టణానికి; వచ్చి; శుక్రుశాపంబునన్= శుక్రుడిశాపంచేత; జరాభారంబున్= ముదిమిబరువును; తాల్చిన, వానికిన్= ధరించిన (గ్రహించిన) యయాతికి.

తాత్పర్యం: 'నే నీ దేవయానియందు ఇంద్రియభోగాలను అనుభవించటంలో (చే) తృప్తి పొంది యుండలేదు. అధిక మైన ముసలితనాన్ని వహించలేను' అని యయాతి వేడుకోగా విని వానియెడల శుక్రుడు దయతలచి నీవు ఇంద్రియభోగాలచేత తృప్తిపొందనివాడ వైతే నీ ముసలితనాన్ని నీకొడుకులలో ఒకడికి ఇచ్చి, వాడి యౌవనాన్ని నీవు గ్రహించి రాజ్యసుఖాలను అనుభవించుము; నీవు ఇంద్రియభోగాలవలన తృప్తిపొందినతరువాత నీముసలితనాన్ని నీవే తిరిగి గ్రహించి, నీ కొడుకుయౌవనాన్ని వాడి కిచ్చివేయుము. నీ ముసలితనాన్ని గ్రహించిన కొడుకే రాజ్యం చేయటానికి తగినవాడున్నూ వంశాన్ని కొనసాగించేవాడున్నూ అవుతా' డని పలుకగా ఆ యయాతి శుక్రుడిని వీడ్కొని దేవయానితో కూడినవా డై తనపట్టణానికి వచ్చి శుక్రుడు ఇచ్చిన శాపంవలన ముదిమి వహించాడు. ఆ తరువాత యయాతికి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'నేను దేవయానియందు విషయోపభోగతృప్తుడను కాను'- అని యయాతి అనటంలో విశేషం ఉన్నది. శర్మిష్ఠతోడి సంబంధం పుత్త్రార్థమే. దేవయానితోడి సంబంధం నిత్య మైనది. రాజులకు అనేక భార్య లుండవచ్చును. కాని, దేవయానియందు అతడికి విషయవాంఛ తీరలేదు. కాబట్టి వార్ధక్యభారంవలన దుఃఖం కలిగేది దేవయానిపొందు లేనందుకే. అది ఆమెకుకూడ

ప్రీతిపాత్రం కాదు. అందుచేత జరాభారాన్ని వహించలే నన్నాడు. శుక్రుడు తనపొరపాటు తెలిసికొన్నాడు. దేవయానినోట మాట పెకలలేదు. అటువంటిది యయాతి వాక్యనైపుణ్యం. ఇది వస్తుధ్వని. (సంపా.)

క. తల వడఁకఁ దొడఁగె, నింద్రియ । ముల గర్వ మడంగె, నంగములు వదలె, వళీ
పలితంబు లయ్యె, వగరును । దలయేరును నుక్కిసయును దరికొనుదెంచెన్. 191

ప్రతిపదార్థం: తల; వడఁకన్+తొడఁగెన్= తలవణకుట మొదలు పెట్టింది; ఇంద్రియముల= దేహం, నేత్రం మొదలైన కర్మేంద్రియాల; గర్వము= విజృంభణం; అడంగెన్= తగ్గింది; అంగములు= అవయవాలు; వదలెన్= శిథిలాలు అయినవి; వళీ, పలితంబులు= ముడతలున్నూ, నరసిన వెంట్రుకలున్నూ; అయ్యెన్; వగరును= శ్వాసరోగమున్నూ; తల ఏరును= తలనొప్పియున్నూ; ఉక్కిసయును= పొడిదగ్గున్నూ; దరికొనుదెంచెన్= విజృంభించాయి. తలకొనుదెంచెన్ అని పాఠాంతరం. (కలిగాయి లేక సంభవించాయి.)

తాత్పర్యం: తల వణకటం మొదలు పెట్టింది. ఇంద్రియాల మదం అణిగింది. అవయవాలు సడలినాయి; శరీరాన ముడతలు ఏర్పడ్డాయి. వెంట్రుకలు నరిశాయి. ఉబ్బసం, తలనొప్పి, పొడిదగ్గు కలిగాయి.

విశేషం: ఈపద్యంలో ముసలితనపు లక్షణా లన్నీ వర్ణించబడ్డాయి. అలం: స్వభావోక్తి.

యయాతి యదుప్రముఖులకు శాపం బిచ్చుట (సం. 1-79-1)

వ. ఇట్లు జరాక్రాంతుం డైన యయాతి గొడుకులనెల్లరావించి 'నాకు విషయసుఖతృప్తి లేకున్నయది గావున మీయందొక్కరుండు నా ముదిమి గొని తన జవ్వనంబు నా కిచ్చునది' యనిన విని యదు తుర్వసు ద్రుహ్యానులు దండ్రి కి ట్లనిరి. 192

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; జరా+ఆక్రాంతుండు= ముసలితనంచేత ఆక్రమించబడినవాడు; ఐన, యయాతి; కొడుకులన్+ఎల్లన్= కుమారులనందరినీ; రావించి= రప్పించి; నాకున్; విషయ, సుఖతృప్తి= ఇంద్రియ సుఖాల తృప్తి; లేక+ఉన్న+అది= కలుగకున్నది; కావున; మీయందున్; ఒక్కరుండు= ఒకడు; నాముదిమి= నాముసలితనం; కొని= గ్రహించి; తన జవ్వనంబు= తన యౌవనం; నాకు; ఇచ్చునది= ఇవ్వవలసింది; అనినన్= అని యయాతి పలుకగా; విని; యదు, తుర్వసు, ద్రుహ్యు+అనులు= ఆ పేర్లు కలిగిన కొడుకులు; తండ్రికిన్= యయాతికి; ఇట్లు+అనిరి= ఈవిధంగా పలికారు.

తాత్పర్యం: ఈవిధంగా వృద్ధుడైన యయాతి కొడుకులందరినీ తనకడకు రప్పించి 'నాకు ఇంద్రియభోగాలను అనుభవించటంలో తృప్తి కలగక ఉన్నది. కావున మీలో ఒకడు నా ముసలితనం గ్రహించి తనయౌవనాన్ని నాకు ఇవ్వవలసింది' అని యయాతి పలుకగా విని యదువు, తుర్వసుడు, ద్రుహ్యు, అనువు అనే కుమారులు యయాతితో ఇట్లా చెప్పారు.

విశేషం: ద్రుహ్యు+అనులు= దుహ్యానులు (యణాదేశసంధి).

ఆ. తగిలి జరయు రుజయు దైవవశంబున । నయ్యెనేని వాని ననుభవింత్రు
గాక యెఱిఁగి యెఱిఁగి కడఁగి యారెంటిఁ జే। కొందురయ్య యెట్టి కుమతు లైన. 193

ప్రతిపదార్థం: తగిలి= అంటి; జరయున్= ముసలితనమూ; రుజయున్= రోగమూ; దైవవశంబునన్= విధివశాన; అయ్యేన్, ఏని= అయినట్లయితే; వానిని= ఆ జరారోగాలను; అనుభవింత్రు, కాక= అనుభవిస్తారు కాని; ఎఱిఁగి ఎఱిఁగి= బాగా తెలిసి; (తెలిసి తెలిసి); కడఁగి= పూని; ఆ రెంటిన్= ఆ జరారోగాలు రెండింటినీ; ఎట్టి కుమతులు+ఐనన్= ఎటువంటి బుద్ధిహీను లైనా; చేకొందురు+అయ్య?= గ్రహిస్తారా? గ్రహించరు.

తాత్పర్యం: ముసలితనమున్నూ; రోగమున్నూ విధివశాన ఎవరికైనా కలిగితే వారు వాటిని అనుభవిస్తారు కాని, తెలిసి తెలిసి మరొకరినుండి కావాలని ఆ రెంటింటినీ ఎవ్వరైనా ఎంతబుద్ధిహీను లైనా గ్రహిస్తారా?

విశేషం: అనుభవించుదురు. చువర్ణంతోడి దుక్దకారానికి తకారమౌతుంది. అనుభవింతురు. ఉత్వలోపము - అనుభవింత్రు. ఆమ్రేడితం పరమైనను క్త్వార్థక మగుటచేత సంధి కాలేదు - ఎఱిఁగియెఱిఁగి. ఈపద్యం నన్నయ సూక్తి.

క. నరలు గల కాము నైనను । దరుణులు రోయుదురు డాయ; ధనపతి యయ్యుం
బురుషుఁడు దుర్వారజరా । పరిభూతి నభీష్టభోగబాహ్యుఁడ కాఁడే. 194

ప్రతిపదార్థం: నరలు, కల= నరసిన వెంట్రుకలు కల; కామున్+ఐనను= మన్మథుడినైనా (అందగాడినైనా) కూడా; తరుణులు= జవ్వనులు; డాయన్= సమీపించటానికి; రోయుదురు= ఏవగిస్తారు. (అసహ్యపడతారు); పురుషుఁడు; ధనపతిఅయ్యున్= కుబేరు డైనా కూడా, అంటే సంపన్నుడైనా కూడ; దుర్వార జరాపరిభూతిన్= వారించ శక్యం కాని ముసలితనంవలని రోతచేత; అభీష్ట భోగ బాహ్యుఁడు+అ= ఇష్టము లైన భోగాలు వెలియైనవాడు; కాఁడు+ఏ= కాడా; అవుతాడు.

తాత్పర్యం: నరసిన వెంట్రుకలు కలిగిన మన్మథుడి నైనా యౌవనవతులు సమీపించటానికి అసహ్యించుకొంటారు. పురుషుడు ధనవంతు డైనా కూడా (కుబేరుడైనప్పటికి) వారించశక్యం కాని ముసలితనంవలన కలిగేరోతచేత ఇష్టములైన భోగాలు పొంద వీలు లేనివాడు కాడా!

విశేషం: ఇది నన్నయసూక్తి.

వ. అని యొడంబడ కున్న నలిగి యయాతి 'యదువంశంబునవారు రాజ్యంబున కయోగ్యులుగాఁ, దుర్వసు వంశంబునవారు ధర్మాధర్మవివేకశూన్యు లై సంకీర్ణవర్ణ కిరాతులకు రాజులుగా, ద్రుహ్యువంశంబునవారు దుపప్లవసంతార్యం బైన దేశంబునకు రాజులుగా, జరాదూషకుం డగుట ననువంశంబునవారు ముదియు నంతకు నుండక జవ్వనంబునన పంచత్వంబున కరుగు వారునుంగా శాపంబిచ్చి, యానలువురకుం గొండుక వాని శర్మిష్ఠాపుత్త్రుఁ బూరుం బిలిచి యడిగిన, వాఁడు దండ్రి కోరినయట్ల చేసిన నవయౌవనుం డై యయాతి యభిమతసుఖంబులు సహస్రవర్షంబు లనుభవించి తృప్తుం డై, పూరుజవ్వనంబు వానిక యిచ్చి, తన జరాభారంబుఁ దాన తాల్చి నిజాజ్ఞావిధేయ చతురంత మహీతల బ్రహ్మక్షత్త్రాది వర్ణముఖ్యుల నెల్ల రావించి మంత్రిపురోహితసామంత పౌరజన సమక్షంబున సకలక్షోణీ చక్రసామ్రాజ్యంబునకుఁ బూరు నభిషిక్తుం జేసిన సర్వప్రకృతిజనంబు లారాజున కి ట్లనిరి. 195

ప్రతిపదార్థం: అని; ఒడంబడక, ఉన్నన్= కొడుకులు ముసలితనం గ్రహించేందుకు అంగీకరించకుండా ఉండగా; యయాతి; యదువంశంబున వారు= యదువు వంశానికి చెందినవారు; రాజ్యంబునకున్= రాజ్యం చేసేందుకు; అయోగ్యులుగాన్=

తగనివారౌనట్లుగా (తగని వారుగా); తుర్వసు వంశంబున వారు= తుర్వసు వంశానికి చెందిన వారు; ధర్మ+అధర్మ వివేకశూన్యులు+ఐ= ఇది ధర్మం. ఇది అధర్మం అనేజ్ఞానం లేనివారై; సంకీర్ణ, వర్ణ కిరాతులకున్= సంకరజాతులైన వనచరులకు; రాజులుగాన్= రాజు లౌనట్లుగా; ద్రుహ్యువంశంబున వారు= ద్రుహ్యుని వంశానికి చెందినవారు, ఉడుప= ఉడుపప్లవ సంతార్యం బైన= తెప్పల చేతను, పడవల చేతను, (పుట్టుల చేతను) దాటటానికి యోగ్య మైన; దేశంబునకున్; రాజులుగాన్= రాజు లౌనట్లుగా; జరాదూషకుండు, అగుటన్= ముదిమిని నిందించిన వా డౌటచేత; అనువంశంబున వారు= అనువు వంశానికి చెందిన వారు; ముదియున్+అంతకున్= ముసలివారయ్యేంత వరకు; ఉండక= జీవించక; జవ్వనంబునన్+అ= యౌవనమందే; పంచత్వంబునకున్= మరణానికి (పంచభూతాలలో కలిసి పోవటానికి); అరుగు వారునున్+కాన్= వెళ్ళేవారు ఔనట్లుగా; శాపంబు+ఇచ్చి; ఆ నలువురకున్= యదువు మొదలైన నలుగురికంటె; కొండుకవానిన్= చిన్నవాడిని; శర్మిష్ఠాపుత్రున్= శర్మిష్ఠ కుమారు డైన; పూరున్= పూరు డనే వాడిని; పిలిచి; అడిగినన్= నా ముసలితనం పుచ్చుకొని నీ యౌవనం ఇస్తావా అని అడుగగా; వాఁడు= ఆ పూరుడు; తండ్రి; కోరిన అట్లు+అ= తండ్రి యైన యయాతి కోరినట్లే; చేసినన్= చేయగా; నవయౌవనుండు+ఐ= క్రొత్త యౌవనం కలవా డై; యయాతి; అభిమత సుఖంబులు= ఇష్టము లైన భోగాలు; సహస్ర వర్షంబులు= వేయి సంవత్సరాలు; అనుభవించి= పొంది తృప్తుండు+ఐ= తృప్తి పొందినవా డై; పూరుజవ్వనంబు= పూరుని యౌవనం; వానికిన్+అ= వానికే; ఇచ్చి; తనజరా, భారంబున్= తన ముదిమి బరువును; తాను+అ= తానే; తాల్చి= వహించి; నిజ, ఆజ్ఞా విధేయ, చతుః+అంత, మహీతల, బ్రహ్మక్షత్ర+ఆది వర్ణముఖ్యులన్, ఎల్లన్= తన ఆజ్ఞకు విధేయ మైన నాలుగు సముద్రాల చేత చుట్టబడిన భూతలమందలి బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలగు వర్ణాలలోని ప్రధానులందరినీ; రావించి= రప్పించి; మంత్రి పురోహిత సామంత పౌరజన సమక్షంబునన్= మంత్రులయొక్క, పురోహితులయొక్క; సామంతరాజులయొక్క; పురజనులయొక్క ఎదుట; సకలక్షోణీ చక్రసామ్రాజ్యంబునకున్= సర్వ భూవలయ సామ్రాజ్యానికి; పూరున్= పూరువును; అభిషిక్తున్+చేసి= అభిషేకించబడినవాడిని చేయగా, సర్వప్రకృతి, జనంబులున్= ఎల్లపురజనులున్నూ; ఆ రాజునకున్; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: అని అంగీకరించకుండాఉన్న కొడుకులను కోపించి యయాతి యదువువంశానికి చెందినవారు రాజత్వానికి తగని వా రౌనట్లుగా, తుర్వసువంశానికి చెందినవారు ధర్మాధర్మజ్ఞానం లేనివా రై సంకర జాతులకు చెందిన ఆటవికులకు రాజు లౌనట్లుగా, ద్రుహ్యువంశానికి చెందినవారు తెప్పలచే దాటదగిన దేశానికి (జలమయమైన దేశానికి) రాజు లౌనట్లుగా; ముదిమిని నిందించినవా డవటంచేత అనువువంశానికి చెందినవారు ముసలివారయ్యేంత వరకు జీవించక యౌవనంలోనే మరణించువా రౌనట్లుగా శాప మిచ్చి, యదువు మొదలైన నల్గురికంటె చిన్నవాడు, శర్మిష్ఠ కుమారు డైన పూరుడిని పిలిచి అడుగగా అతడు తండ్రి కోరినట్లుగానే తన యౌవనాన్ని తండ్రికి ఇచ్చి, అతని ముసలితనాన్ని తాను గ్రహించాడు. యయాతి నవ (క్రొత్త) యౌవన సమన్వితుడై ఇష్టభోగాలను వేయిసంవత్సరాలనుభవించి తృప్తి పొందినవా డై, అతడి యౌవనాన్ని ఆతడికే ఇచ్చి, తన ముసలితనాన్ని తానే ధరించి తనఆజ్ఞకు వశమైన నాల్గుసముద్రాలు హద్దులుగా గల భూతలమందున్న బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలైన వర్ణాలలోని ప్రధాను లందరినీ రప్పించి మంత్రులు, పురోహితులు, సామంతరాజులు మొదలైన పురజనుల ఎదుట సర్వభూతల సామ్రాజ్యానికి పూరుడిని అభిషేకించాడు. అప్పుడు పురజనులందరూ రాజును చూసి యిట్లా పలికారు.

విశేషం: యదువంశంబు+వారు= తత్పురుషసమాసంలో కొన్నిచోట్ల 'న' ఆగమంగా వస్తుంది. వంశంబున వారు. స్వామి, అమాత్యుడు, సుహృత్తు, కోశము, రాష్ట్రము, దుర్గము, బలము అనునవి సప్తప్రకృతులు.

మ. అవిచారం బని పల్క నోడెదము ధర్మాభిజ్ఞ! నీయగ్రసం
భవుఁ డత్యున్నతశక్తియుక్తుఁడు మహీభారప్రగల్భుండు భా
ర్గవదౌహిత్రుఁడు పాత్రుఁ డీయదుఁడు లోకఖ్యాతుఁ డుండంగ నీ
భువనేశత్వభరంబుఁ బూన్పఁ దగునే పూరున్ జఘన్యాత్మజున్. 196

ప్రతిపదార్థం: ధర్మ+అభిజ్ఞ= ధర్మం తెలిసినవాడా!; అవిచారంబు, అని= అనాలోచిత మని; పల్కన్= చెప్పటానికి; ఓడెదము= భయపడుతున్నాము; అతి+ఉన్నతశక్తి యుక్తుఁడు= మిక్కిలి అధిక మైన సామర్థ్యంతో కూడినవాడు; మహీభార, ప్రగల్భుండు= భూమియొక్క బరువును వహించేందుకు సమర్థుడు; భార్గవ దౌహిత్రుఁడు= శుక్రుడి కూతు రైన దేవయానికి కొడుకు; లోకఖ్యాతుఁడు= జగత్తులో ప్రసిద్ధుడు; పాత్రుఁడు= తగిన వాడు (యోగ్యుడు); నీ అగ్రసంభవుఁడు= నీ పెద్దకొడుకు; యదుఁడు; ఉండంగన్= ఉండగా; ఈ, భువన+ఈశత్వ, భరంబున్= ఈ జగత్ప్రభుత్వ భారాన్ని; జఘన్యా+ఆత్మజున్= శూద్రస్త్రీయందు పుట్టినకుమారుడిని (చిన్నవాడిని); పూరున్= పూరుడిని; పూన్పన్; తగున్, ఏ= వహింపచేయటం ఉచితమా?

తాత్పర్యం: ధర్మం తెలిసిన ఓ యయాతి మహారాజా! అనాలోచిత మని చెప్పటానికి జంకుతున్నాము. అధికమైన సామర్థ్యంతో కూడినవాడూ, భూభారాన్ని వహించే నేర్పు కలవాడూ, తగినవాడూ, జగత్ప్రసిద్ధుడూ, శుక్రుడి మనుమడూ అయిన నీ పెద్దకొడుకు యదు వుండగా కనిష్ఠపుత్రుడు (తక్కువజాతిస్త్రీకి పుట్టినవాడు) అగు పూరుడిని రాజ్యభారం వహించేందుకు నియోగించటం తగునా?

విశేషం: జఘన్య శబ్దం విశేషణం. దానికి కనిష్ఠుడు, నీచుడు, నిందితుడు అనే అర్థాలు ఉన్నాయి. అది స్త్రీ లింగమైనప్పుడు నీచస్త్రీ, నింద్యురాలైన స్త్రీ అని అర్థం వస్తుంది. అటువంటి స్త్రీ కుమారుడు జఘన్యాత్మజుడు. శర్మిష్ఠ రాజకుమార్తె అయినా కూడా దాసి అవటంచేత ఆమెకు జఘన్యా శబ్దం వాడబడింది. కనిష్ఠకుమారు డని చెప్తే ఎట్టిబాధా వుండదు. మంత్రుల మాటలలో అర్థశక్తిమూలవస్తుకృతవస్తుధ్వని ఉన్నది. అర్థదర్శనాన్ని కలిగించే వర్ణాల, పదాల ఆరోహావరోహక్రమం రచనలో పోషించటంద్వారా 'సమాధి' అనే శబ్దగుణం రాణించింది. (సంపా.)

వ. అనిన వారల కయ్యయాతి యి ట్లనియె. 197

ప్రతిపదార్థం: అనినన్=పురజను లట్లా పలుకగా; ఆ+యయాతి; వారలకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: పురజనులు ఆవిధంగా పలుకగా ఆ యయాతి వారితో ఇట్లా అన్నాడు.

క. యదుఁ డగ్రతనూజుఁడు నా । హృదయ సముద్భవుఁడు దానయిన మద్వచనం
బిది యేటిది యని కడు దు । ర్మదుఁ డై చేయక కృతావ మానుం డయ్యెన్. 198

ప్రతిపదార్థం: యదుఁడు+అగ్రతనూజుఁడు= జ్యేష్ఠ కుమారుడు (పెద్ద కొడుకు); నా, హృదయ, సముద్భవుఁడు= నా ఆత్మజుడు; తాన్; అయినన్= అయినప్పటికీ; మత్, వచనంబు= నా పలుకు; ఇది; ఏటి+అది= ఇది ఎట్టిది; అని; కడు, దుర్మదుఁడు+ఐ= మిక్కిలి గర్విష్ఠుడై; చేయక= నామాట పాటించక; కృత+అవమానుండు= అవమానంచేసినవాడు; అయ్యెన్= అయినాడు.

తాత్పర్యం: యదుఁడు నాజ్యేష్ఠకుమారుడు, ఆత్మజుడు అయినాకూడా చాలాగర్వితు డై నామాటను లెక్కచేయక నన్ను అవమానించినాడు.

విశేషం: ఏటి+అది. అది, యవిశబ్దముల అత్తునకు వృత్తిని లోపం బహుళంగా ఔతుంది.

క. **తనయుండు దల్లిదండ్రులు । పనిచినపని సేయఁడేని, పలు కెడలోఁ జే**
కొనఁడేని, వాఁడు తనయుం । డనఁబడునే? పితృధనమున కర్హుం డగునే? **199**

ప్రతిపదార్థం: తనయుండు= కొడుకు; తల్లి+తండ్రి= తల్లిదండ్రులు; పనిచిన పని= ఆజ్ఞాపించిన పని; చేయఁడు+ఏని= చేయని వాడైతే; పలుకు= తల్లిదండ్రుల మాట; ఎడలోన్= మనస్సులో; చేకొనఁడు+ఏని= గ్రహించనివాడైతే; వాఁడు= అట్టి కొడుకు, తనయుండు= కొడుకు; అనఁబడున్+ఏ= అనబడునా; పితృధనమునకున్= తండ్రి యొక్క సొమ్ముకు; అర్హుండు+అగున్+ఏ= తగినవా డౌనా?

తాత్పర్యం: కొడుకు తల్లిదండ్రు లాజ్ఞాపించిన పని చేయకపోతే, వారివాక్యం హృదయ పూర్వకంగా అంగీకరించకపోతే అట్టివాడు కొడుకు అనబడతాడా? తండ్రిసొమ్ముకు తగినవాడు అవుతాడా? కాడు.

క. **పూరుఁడు గొండుక యయ్యును । భూరిగుణజ్యేష్ఠుఁడును సుపుత్త్రుఁడు నవనీ**
భారసహిష్ణుఁడు నాతఁడ । కోరినకార్యంబు దీర్చి కుశలుం డగుటన్. **200**

ప్రతిపదార్థం: పూరుఁడు; కోరిన కార్యంబు= తండ్రినైన నేను కోరినపని; తీర్చి= నెరవేర్చి; కుశలుండు= నేర్పరి; అగుటన్= అగుటచేత; కొండుక+అయ్యును= వయసులో చిన్నవా డైనాకూడా; భూరి, గుణజ్యేష్ఠుఁడును= అధికము లైన గుణాలలో పెద్దవాడున్నూ; సుపుత్త్రుఁడున్= యోగ్యుఁడైన కుమారుడున్నూ; అవనీభార సహిష్ణుఁడున్= భూమియొక్క బరువును వహించే ఓర్పుకలవాడున్నూ; ఆతడు+అ= అతడే. (అయ్యాడు).

తాత్పర్యం: పూరుడు తండ్రి నైన నేను కోరినపని నెరవేర్చిన నేర్పరి అవటంచేత, వయసులో చిన్నవాడైనా, అధికము లైన గుణాలచేత అగ్రజుడూ, యోగ్యు డైన పుత్రుడూ, భూమిబరువును వహించే సహనం కలవాడూ అతడే.

వ. **'నా జరాభారంబుఁ దాల్చిన పుత్త్రుండ రాజ్యంబున కర్హుండును వంశకర్తయు నగు; శుక్రవచనంబును నిట్టిద' యని యయాతి ప్రకృతిజనంబుల నొడంబఱిచి, పూరు నఖిల భూభారధురంధరుం జేసి, యదుప్రభృతులఁ బ్రత్యంత భూములకు రాజులం జేసి, తాను వేదవేదాంగపారగు లయిన బ్రాహ్మణులతోడం దపోవనంబునకుం జని, యందుఁ గందమూల ఫలాశనుం డై వన్యంబులయిన ఫలంబుల హవ్యకవ్యంబుల నగ్నిభట్టారకుం బితృదేవతలం దనుపుచు, వానప్రస్థ విధానంబుఁ దప్పక శిలోంఛవృత్తి నతిథిభుక్తశేషం బుపయోగించుచు, నియతాత్ముం డై జితారిషడ్వర్గుండును నయి సహస్ర వర్షంబులు దపంబు సలిపి సర్వసంగ విముక్తుం డై, సర్వద్వంద్వంబులును విడిచి ముప్పది యేండ్లు నిరాహారుం డయి, యొక్కయేఁడు వాయుభక్షకుం డయి, పంచాగ్నిమధ్యంబున నిల్చి, యొక్కయేఁడు నీటిలో నేకపాదంబున నిలిచి, మహాఘోరతపంబు సేసి, దివ్య విమానంబున దేవలోకంబునకుం జని, యందు దేవర్షిగణపూజితుం డై**

బ్రహ్మలోకంబునకుం జని, యందు బ్రహ్మర్షిగణపూజితుం డై యనేక కల్పంబు లుండి, క్రమ్మఱ నింద్రలోకంబునకు వచ్చిన నింద్రుండు వానిం బూజించి యి ట్లనియె. 201

ప్రతిపదార్థం: నాజరా, భారంబున్= నా ముదిమి బరువును; తాల్చిన= వహించిన; పుత్త్రుండు+అ= కొడుకే; రాజ్యంబునకున్= రాజ్యపరిపాలనకు; అర్హుండును= తగినవాడును; వంశకర్తయున్= వంశాన్ని కొనసాగించినవాడును; అగున్; శుక్రవచనంబును= శుక్రునియొక్క వాక్యం కూడ; ఇట్టి+అది+అ= ఇట్టిదే; అని; యయాతి; ప్రకృతి జనంబులన్= పురజనులను; ఒడంబఱిచి= ఒప్పించి (అంగీకరింప జేసి); పూరున్= పూరుని; అఖిల, భూ, భార, ధురంధరున్= సమస్త (సర్వ) భూభారాన్ని వహించేవాడిని; చేసి; యదుప్రభృతులన్= యదువు మొదలైన వారిని; ప్రత్యంత భూములకున్= మిక్కిలి సమీపంలో ఉన్న దేశాలకు (మ్లేచ్ఛదేశాలకు); రాజులన్+చేసి; తాను; వేద, వేదాంగ, పారగులు+అయిన= వేదాలయొక్క; శిక్షా వ్యాకరణాది వేదాంగాలయొక్క అంతం చూచిన, అంటే వేద వేదాంగాలను బాగా ఎఱిగిన; బ్రాహ్మణులతోడన్= తపః+వనంబునకున్= తపస్సు చేసికొనేందుకు తగిన అడవికి; చని= వెళ్ళి; అందున్= ఆ వనమందు; కంద, మూల, ఫల, అశనుండు+ఐ= దుంపలు, వేర్లు, పళ్ళు ఆహారంగా కలవాడై; వన్యంబులు+అయిన= అడవిలో పుట్టిన; ఫలంబులన్= పళ్ళతో; హవ్యకవ్యంబులన్= దేవతల కివ్వదగిన అన్నంచేతను; పితృదేవతల కివ్వదగిన అన్నంచేతను, (ఇక్కడ అన్నమంటే ఆహారం) అగ్నిభట్టారకున్= హవ్యములచే పూజ్యు డైన అగ్నిని; పితృదేవతలన్= కవ్యములచే పితృదేవతలను; తనుపుచున్= తృప్తి నొందిస్తూ; వానప్రస్థ, విధానంబున్= నాల్గు ఆశ్రమాలలో మూడవది వానప్రస్థం, వానప్రస్థు డంటే వనవాసవ్రతాన్ని అవలంబించేవాడు; అట్టివాడి నియమాన్ని; తప్పక= మానక; శిలా+ఉంఛవృత్తిన్= రాళ్ళలో రాలిన గింజలను ఏరుకుని తినట మనే జీవనోపాయంతో; అతిథిభుక్తశేషంబు= అతిథులు తినగా మిగిలిన ఆహారాన్ని; ఉపయోగించుచున్= గ్రహిస్తూ; నియత+ఆత్ముండు+అయి= నియమంతో కూడిన ఆత్మకలవాడై; జిత+అరి+షట్+వర్గుండునున్= జయించబడిన కామక్రోధాదు లనే అంతఃశత్రుసమూహం కలవాడును; అయి; సహస్రవర్షంబులు= వేయి ఏళ్ళు; తపంబు; సలిపి= చేసి; సర్వ, సంగ, విముక్తుండు+ఐ= అన్ని ఆసక్తులచేత విడువబడిన వాడై; సర్వద్వంద్వంబులున్= శీతోష్ణ సుఖదుఃఖాది సకల ద్వంద్వాలను; విడిచి; ముప్పది యేండ్లు; నిరాహారుండు+అయి= ఆహారం లేనివా డై; ఒక్కయేఁడు; వాయుభక్షకుండు+అయి= గాలిని మాత్రం తినేవాడై; పంచ+అగ్ని మధ్యంబునన్= ఐదు అగ్నులనడుమ; నిల్చి; ఒక్క, ఏఁడు; నీటిలోన్; ఏకపాదంబునన్= ఒంటికాలితో; నిలిచి; మహత్+ఘోరతపంబు= గొప్పతీవ్ర మైన తపస్సును చేసి; దివ్య, విమానంబునన్= దేవతాసంబంధ మైన విమానమందు; దేవలోకంబునకున్= స్వర్గలోకానికి; చని= వెళ్ళి; అందున్= స్వర్గలోకంలో; బ్రహ్మ+ఋషి, గణ పూజితుండు+ఐ= బ్రహ్మర్షుల సముదాయంచేత పూజించబడినవా డై; అనేక, కల్పంబులు= పెక్కుయుగాలు; ఉండి; క్రమ్మఱన్= మళ్ళీ; ఇంద్రలోకంబునకున్= ఇంద్రుడి లోకానికి; (అనగా స్వర్గలోకానికి); వచ్చినన్= రాగా; ఇంద్రుండు; వానిన్= యయాతిని; పూజించి; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: 'నా ముదిమిబరువు వహించిన కొడుకే రాజ్యపాలనానికి తగినవాడూ, వంశాన్ని కొనసాగించే వాడూ అవుతాడు. శుక్రుడుకూడ ఈవిధంగానే (ఇట్లాగే) చెప్పి ఉన్నాడు' అని యయాతి పురజనులను ఒప్పించి పూరుడిని సకలమహీభారాన్ని వహించే చక్రవర్తిగా చేసి, యదువు మొదలైనవారిని సన్నిహితప్రదేశాలకు రాజులుగా చేసి, తాను వేదాలను వేదాంగాలను బాగా చదివిన బ్రాహ్మణులతో తపోవనానికి వెళ్ళాడు. ఆ వనంలో అతడు దుంపలను వేర్లను పళ్ళను భుజిస్తూ అడవి పళ్ళచేతను హవ్యాలచేతను అగ్నిదేవుడిని, కవ్యాలచేత పితృదేవతలను తృప్తి పొందిస్తూ (పరుస్తూ) వానప్రస్థాశ్రమనియమం తప్పక శిలలయందు రాలిన గింజలను ఏరుకొని తినటమే వృత్తిగా కలవాడై, అతిథులు తినగా మిగిలిన ఆహారాన్ని సేవిస్తూ, నియమంతో కూడిన ఆత్మ కలవాడూ, అరిషడ్వర్గాలను జయించిన వాడూ అయి, వెయ్యేళ్ళు, తపస్సు చేశాడు. తర్వాత సర్వసంగాలను, శీతోష్ణసుఖ దుఃఖాది ద్వంద్వాలను విడిచి

ముప్ఫైఏళ్ళు ఆహారం లేకుండా, ఒక్కఏడు వాయువునుమాత్రం భక్షిస్తూ, ఐదగ్నుల మధ్య నిలిచి (నిలబడి); ఒకఏడు నీటిలో ఒంటికాలిపై నిలబడి గొప్పతీవ్ర మైన తపస్సు చేసి దేవతావిమానంలో స్వర్గలోకానికి వెళ్ళాడు. ఆ స్వర్గలోకంలో దేవర్షులసమూహంచేత పూజించబడి బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ బ్రహ్మర్షులసమూహంచేత పూజించబడి అనేకకల్పా లుండి మళ్ళీ ఇంద్రలోకానికి రాగా, ఇంద్రుడు అతడిని పూజించి యిట్లా పలికాడు.

విశేషం: ఆహవనీయం, దక్షిణాగ్ని, గార్హపత్యం - త్రేతాగ్నులు. ఇవి క్రమంగా వేదికి పూర్వ, దక్షిణ, పశ్చిమదిశలలో (దిక్కులలో) ఉంటాయి. ఈ మూడిటికి సభ్యం, అవసథ్యం అనే రెండు కలిస్తే పంచాగ్నులు. ఈరెండు వేదికి ఈశాన్యదిక్కులో ఉంటాయి. బ్రహ్మ+ఋషి - బ్రహ్మర్షి - గుణసంధి.

ఆ. 'కొడుకుజవ్వనంబుఁ గొని నీవు నిజరాజ్య । భూరిభరము వానిఁ బూన్చునప్పు
డతని కెద్ది గఱపి' తని యడిగిన హరి । కయ్యయాతి యిట్టు లనుచుఁ బలికె. 202

ప్రతిపదార్థం: కొడుకు జవ్వనంబున్= కొడు కైన పూరుడి యౌవనం; కొని= గ్రహించి; వానిన్= ఆ పూరుని; నీవు; నిజ, రాజ్యభూరి భరమున్= నీ రాజ్యంయొక్క అధికమైన భారాన్ని; పూన్చు+అప్పుడు= వహింపచేసేటప్పుడు; అతనికిన్= ఆ పూరునికి; ఎద్ది, కఱపితి(వి) అని= ఏది బోధించితివి అని; అడిగినన్; హరికిన్= ఇంద్రుడికి; ఆ+యయాతి; ఇట్టులు; అనుచున్; పలికెన్.

తాత్పర్యం: 'కొడుకైన పూరుడి యౌవనాన్ని నీవు గ్రహించి, అతడిని విస్తృతమైన నీ రాజ్యభారాన్ని భరింప చేసేటప్పుడు అతని కేమి బోధించావు?' అని ఇంద్రుడు అడుగగా యయాతి ఇంద్రుడితో ఇట్లా పలికాడు.

యయాతి పూరునకు బోధించిన నీతులు (సం.1-82-6)

క. ఎఱుక గలవారి చరితలు । గఱచుచు, సజ్జనుల గోష్ఠిఁ గదలక ధర్మం
బెఱుఁగుచు, నెఱిఁగిన దానిని । మఱవ కనుష్ఠించునది సమంజసబుద్ధిన్. 203

ప్రతిపదార్థం: ఎఱుక, కలవారి చరితలు= జ్ఞానం కలవారి చరిత్రలు; కఱచుచున్=అభ్యసిస్తూ; సజ్జనుల, గోష్ఠిన్= మంచివారి సల్లాపమందు; (సభయందు); కదలక; ధర్మంబు; ఎఱుఁగుచున్= తెలిసికొంటూ; ఎఱిఁగిన దానిని= తెలిసికొన్న దానిని; మఱవక= మఱచిపోక; సమంజస బుద్ధిన్= న్యాయంతో కూడినబుద్ధితో; అనుష్ఠించునది= చేయవలెను.

తాత్పర్యం: జ్ఞానం కలవారి చరిత్రలు అభ్యసిస్తూ, సజ్జనులసల్లాపమందు కదలకుండా ధర్మం తెలిసికొంటూ, తెలిసికొన్నదానిని మరిచిపోకుండా న్యాయంతో కూడిన బుద్ధితో చేయాలి. (ఆచరించాలి).

విశేషం: మఱవక+అనుష్ఠించునది= అత్వసంధి.

క. ఇచ్చునది పాత్రునకు ధన । మచ్చుగ; నొరు వేఁడకుండునది; యభిముఖు లై
వచ్చిన యాశార్థుల వృథ । పుచ్చక చేయునది సర్వభూతప్రీతిన్. 204

ప్రతిపదార్థం: పాత్రునకున్= అర్హుడికి; అచ్చుగన్= తగినట్లుగా; ధనము; ఇచ్చునది= ఈయవలయును (ఇవ్వవలసింది); ఒరున్= ఇతరుని; వేఁడక+ఉండునది= ప్రార్థించకుండా ఉండాలి; అభిముఖులు+ఐ= ఎదురుముఖం కలవారై; వచ్చిన, ఆశా+అర్థులన్= కోరికలను అడిగేవారికి, (ఆశతో కూడిన యాజకులను); వృథపుచ్చక= వ్యర్థం చేయక; సర్వభూత ప్రీతిన్= ఎల్ల జీవులకును సంతృప్తిని, చేయునది= చేయవలెను (చేయాలి).

తాత్పర్యం: అర్హుడికి తగినట్లుగా ధన మివ్వాలి. ఇంకొకరిని అడగకుండా. ఎదురుగా వచ్చిన యాచకులను వ్యర్థం చేయక (నిరాశపుచ్చక) సకలజీవులకూ సంతృప్తి చేయాలి. (తృప్తిని కలిగించాలి).

విశేషం: ఉండు+అది= 'విధియందు అది యను తచ్ఛబ్దంబును ముందు నుగాగమంబు నగును' ఉండునది.

క. **మనమునకుఁ బ్రియంబును హిత । మును బథ్యముఁ దథ్యమును నమోఘము మధురం**
బును బరిమితమును నగు పలు । కొనరఁగఁ బలుకునది ధర్మయుతముగ సభలన్. **205**

ప్రతిపదార్థం: మనమునకున్= మనస్సుకు; ప్రియంబున్= ప్రీతికలిగించేదీ; హితమును= మేలు కలిగించేదీ; పథ్యమున్= తగినదియున్నూ; తథ్యమును= సత్యమైనదీ; అమోఘమున్= వ్యర్థం కానిదీ మధురంబును= తీయనిదీ; పరిమితమును= సంక్షిప్తమైనదీ; అగు పలుకు= అయిన మాట; ఒనరఁగన్= ఒప్పేటట్లుగా; సభలన్= సభలలో; ధర్మయుతముగన్= ధర్మంతో కూడి ఉండేటట్లుగా; పలుకునది= పలకాలి.

తాత్పర్యం: సభలలో మనసుకు ప్రీతి కలిగించేదీ, మేలైనదీ, ఉచితమైనదీ, సత్యమైనదీ, తీయనిదీ, విస్తృతం కానిదీ, అయినమాట ధర్మంతో కూడుకొని ఉండేటట్లుగా పలకాలి.

విశేషం: సభలలో మానవు డేవిధంగా మాటాడాలో నన్నయ ఈపద్యంలో సూచిస్తున్నాడు. పలికే పలుకు మితమైనది, హితమైనది, సత్యమైనది అయి ఉండాలి అని అతని అభిప్రాయం. 'మిత హిత సత్యవాక్య జనమేజయ' అని అతడు జనమేజయుడిని సంబోధించాడు. కావ్యంలోకూడ నన్నయవాక్యాలు అట్లాగే ఉంటాయి.

సీ. **వదన బాణాసన వ్యక్తముక్తము లైన । పలుకు ల న్కడువాఁడి బాణతతులఁ**
బరమర్మలక్ష్యముల్ పాయక భేదించు । చుండెడి దుర్జనయోధవరుల
కడనుండ కున్నది; కరుణ యార్జవమక్ష । జయము సత్యంబును శమము శౌచ
మును నివి యెద నిల్పునది; శత్రుషడ్వర్గ । జయమందునది శుద్ధశాంతబుద్ధి;

తే. **మదముఁ గామముఁ గ్రోధంబు మత్సరంబు । లోభమును మోహమును నను లోని సహజ**
వైరివర్గంబు నొడిచినవాఁడ యొడుచు । నశ్రమంబున వెలుపలి యహితతతుల. **206**

ప్రతిపదార్థం: వదన, బాణాసన, వ్యక్తముక్తములు+ఐన= ముఖ మనే ధనుస్సునుండి వెలువడినవై విడవబడిన; పలుకులు+అన్, కడు వాఁడి బాణతతులన్= పలుకు లనే మిక్కిలివాడి యైన బాణాలసమూహంచేత; పర, మర్మ లక్ష్యముల్= ఇతరులయొక్క జీవస్థానాలనే గురులను; పాయక= విడువక; భేదించుచున్+ఉండెడి= చీలుస్తుండెడి; దుర్జన యోధవరులకడన్= దుష్టులైన జను లనబడే యోధశ్రేష్ఠులచెంత; ఉండక+ఉన్నది= ఉండకుండవలెను; కరుణ= దయ; ఆర్జవము= ఋజుత్వం; అక్షజయము=

ఇంద్రియజయం; సత్యంబును; శమము= అంతరింద్రియనిగ్రహం; శౌచము= శుచిత్వం; అను+ఇవి= అనువీటిని; ఎదన్= హృదయమందు; నిల్పునది= స్థిరంగా ఉండేటట్లు చేయాలి; శత్రు; షట్ వర్గ జయము= కామాదులైన ఆర్గురుశత్రువుల సముదాయాల జయము; శుద్ధశాంతబుద్ధిన్= నిర్మలం, శాంతం ఐనదైన బుద్ధితో; అందునది= పొందవలయును; మదమున్= గర్వాన్ని; కామమున్; క్రోధంబున్= కోపము; మత్సరంబున్= మాత్సర్యం; లోభమును= పిసినారితనాన్ని; మోహమునున్= అజ్ఞానాన్ని; అను; లోనిసహజవైరి వర్గంబున్= సహజమైన అంత శ్శత్రు సముదాయాన్ని (సహజం అంటే స్వభావసిద్ధమైనది); ఒడిచిన, వాడు+అ= ఓడించినవాడే; వెలుపలి, అహిత, తతులన్= బయట నున్న శత్రువుల సముదాయాన్ని; అశ్రమంబునన్= శ్రమలేకుండ, ఒడుచున్= ఓడిస్తాడు.(ఓడించగలడు).

తాత్పర్యం: ముఖమనే వింటియందు వ్యక్తములై విడువబడిన మాట లనే వాడియైన బాణాల సమూహంతో, ఇతరుల మర్మాలనే గుఱులను, విడవక చీలుస్తుండే దుష్టు లైన యోధశ్రేష్ఠుల చెంత నివసించకూడదు. దయ, ఋజుత్వం, ఇంద్రియజయం, సత్యం, బహిరింద్రియనిగ్రహం, శుచిత్వం అనే వాటిని హృదయంలో నిలపాలి. నిర్మల మైన శాంతబుద్ధితో కామాది వైరులను ఆరుగురిని జయించాలి. గర్వం, కామం, కోపం, మత్సరం, పిసినారితనం, అజ్ఞానం అనే సహజమైన అంతశ్శత్రువుల సముదాయాన్ని ఓడించినవాడే బహిశ్శత్రువుల సముదాయాన్ని శ్రమలేకుండా ఓడిస్తాడు.

విశేషం: అలం: రూపకాలంకారం. ఉండు+అది= ఉండునది కావాలి. కాని నన్నయ దానికి బదులు ఉన్నది అని వాడాడు. కామక్రోధలోభమోహమదమాత్సర్యాలు సహజములైన అంతశ్శత్రువులు. వెలుపలి శత్రువులు రాజులు, మానవులు మొదలైనవారు.

వ. 'అని పూరుం గఱపితి; నమ్మహాపురుషుం డొరులకుఁ గఱపునట్టి సర్వగుణసంపన్నుం' డనిన విని యింద్రుండు వెండియు నయ్యయాతి కి ట్లనియె. 207

ప్రతిపదార్థం: అని; పూరున్= పూరుని; కఱపితిన్= బోధించాను; ఆ, మహత్, పురుషుండు= ఆ మహానుభావుడు; ఒరులకున్= ఇతరులకు; కఱపు+అట్టి= బోధించేటి; సర్వగుణ సంపన్నుండు= సకల సద్గుణాలతో కూడినవాడు; అనినన్= అని యయాతి పలుకగా; విని; ఇంద్రుండు; వెండియున్= మరల; ఆ+యయాతికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అని నా కొడు కైన పూరుడికి బోధించాను. ఆ మహాత్ముడు ఇతరులకు బోధించగల సర్వగుణాలతో కూడినవాడు' (అతడికి ఇతరులు బోధించవలసిన అవసరం లేదని భావం), అని యయాతి పలుకగా విని ఇంద్రుడు మరల ఆ యయాతితో ఇట్లా పలికాడు.

విశేషం: యయాతి తనకొడు కైన పూరుడిని మహాపురుషుడు అనటానికి కారణం అతడి సద్గుణసంపదలే.

క. ఏమి తపం బొనరించితి । భూమీశ్వర! పుణ్యలోక భోగంబులఁ దే
జోమహిమ ననుభవించితి । సామాన్యమె శతసహస్రసంవత్సరముల్. 208

ప్రతిపదార్థం: భూమి+ఈశ్వర= ఓరాజా! యయాతీ! ఏమితపంబు= ఏతపస్సు; ఒనరించితి(వి)= చేశావు; శతసహస్ర సంవత్సరముల్= వందల వేల యేళ్ళు; పుణ్యలోక, భోగంబులన్= స్వర్గాది పుణ్యలోకాలలోని సౌఖ్యాలను; తేజస్+మహిమన్= కాంతియొక్క మహత్త్వంచేత; అనుభవించితి(వి)= పొందావు; సామాన్యము+ఎ= సాధారణమా?.

తాత్పర్యం: ఓమహారాజా! నీవు ఏ (మి) తపస్సు చేశావు? వందవేలయేళ్ళు తేజస్సుయొక్క మహత్త్వంచేత, స్వర్గలోక పుణ్యంచేత స్వర్గాదిలోకాలలోని సౌఖ్యాల ననుభవించావు. ఇది అసాధారణం.

వ. అనిన నయ్యింద్రున కయ్యయాతి యి ట్లనియె. 209

తాత్పర్యం: అని ఇంద్రుడు పలుకగా ఆ యయాతి ఇట్లా అన్నాడు.

క. సురదైత్య యక్షరాక్షస । నరఖేచర సిద్ధమునిగణ ప్రవరుల భా
సురతపములు నాదగు దు । ష్కరఘోరతపంబు సరియుఁ గా వమరేంద్రా!. 210

ప్రతిపదార్థం: అమర+ఇంద్రా= దేవతలకు రాజైన ఓయింద్రుడా! సురదైత్య యక్షరాక్షస నరఖేచర సిద్ధముని గణప్రవరుల= దేవతల, దితికుమారులైన దైత్యుల, యక్షుల, రాక్షసుల, మానవుల, ఖేచరుల (ఆకాశంలో సంచరించేవారు) సిద్ధుల, మునుల సముదాయంలో శ్రేష్ఠులైన వారియొక్క; భాసుర తపములు= ప్రకాశించే తపస్సులు; నా+అది+అగు= నాదగు; దుష్కర, ఘోరతపంబు= చేయశక్యం కాని తీవ్రమైన తపస్సుకు; సరియున్, కావు= సమానం కావు.

తాత్పర్యం: దేవతలకు రాజువైన ఓ ఇంద్రుడా! దేవతల, దైత్యుల, యక్షుల, రాక్షసుల, మానవుల, ఆకాశ సంచారుల, సిద్ధుల, మునుల, సముదాయాలలో శ్రేష్ఠ లైనవారి ప్రకాశించే తపస్సులు, చేయశక్యం కాని తీవ్రమైన నాతపస్సుకు సమానం కావు.

విశేషం: ఇక్కడ యయాతి తన తపస్సు సుర దైత్యాదుల తపస్సుకంటె మించినదనీ, అసమానమైన దనీ గర్వంతో పలికాడు. ఈ గర్వమే అతని పతనానికి కారణ మయింది.

ఇంద్రుఁడు యయాతిని స్వర్గలోకభ్రష్టునిఁ జేయుట (సం.1-83-3)

వ. అని తపోభిమానంబున మహర్షులతపంబు లవమానించి పలికిన నయ్యయాతిగర్వంబునకు సహింపక యింద్రుం డలిగి 'నీకు దేవలోకసుఖానుభవంబులందుఁ బుణ్యసమాప్తియయ్యెఁ; నీగర్వంబు నిన్నింత సేసె; నింక నధోలోకంబున కరుగు' మనిన వాఁడును 'మనుష్యలోకంబునకుం బోవనోప; నంతరిక్షంబున సద్భువనంబున సత్సంగతి నుండు నట్లుగా నాకుఁ బ్రసాదింపు' మని యింద్రుననుమతంబు వడసి. 211

ప్రతిపదార్థం: అని; తపస్+అభిమానంబునన్= తన తపస్సునందలి అభిమానంచేత; మహర్షుల, తపంబులు= గొప్ప మునులయొక్క తపస్సులు; అవమానించి= తక్కువపరచి; పల్కినన్= పలుకగా; ఆ+యయాతి గర్వంబునకున్= ఆ యయాతియొక్క గర్వానికి; సహింపక= ఓర్వక, ఇంద్రుండు; అలిగి= కోపించి; నీకున్; దేవలోక సుఖ+అనుభవంబులందున్= స్వర్గలోకంలోని సుఖాలను అనుభవించటంలో; పుణ్యసమాప్తి, అయ్యెన్= నీవు చేసిన పుణ్యం పూర్తి అయింది; నీగర్వంబు; నిన్నున్, ఇంత చేసెన్= నీ కింత చెడ్డ చేసింది; ఇంకన్= ఇకముందు; అధస్+లోకంబునకున్= కిందిలోకానికి; అరుగుము; అనినన్= వెళ్ళుమని పలుకగా; వాఁడును= యయాతియు; మనుష్య, లోకంబునకున్= మానవలోకానికి; పోవన్, ఓపన్= వెళ్ళలేను; అంతరిక్షంబునన్= ఆకాశమందు; సత్, భువనంబునన్= నక్షత్రలోకాన; సత్, సంగతిన్= నక్షత్రాల స్నేహంతో; ఉండు, అట్లుగాన్= ఉండేవిధాన; నాకున్; ప్రసాదింపుము= అనుగ్రహించుము; అని; ఇంద్రు+అనుమతంబు= ఇంద్రునియొక్క సమ్మతి; పడసి= పొంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని తపస్సునందు గర్వంచేత మహామునుల తపస్సులను తక్కువచేసి పలుకగా, ఆ యయాతి గర్వానికి సహించక ఇంద్రుడు కోపించి 'నీకు స్వర్గలోకసుఖాల ననుభవించటంలోని పుణ్యం క్షీణించింది. నీ గర్వం నీకు ఇంతహాని చేసింది. ఇక ముందు అధోలోకాలకు వెళ్ళు' మని పలుకగా, యయాతి 'నేను మానవలోకానికి వెళ్ళలేను; ఆకాశంలో నక్షత్రలోకమందు నక్షత్రాల స్నేహంతో ఉండేటట్లుగా న న్ననుగ్రహించు' మని ఇంద్రుడి సమ్మతి పొంది.

విశేషం: కామ్యకర్మలను చేసేవారు ఆ పుణ్యం కారణంగా స్వర్గానికి పోతారు. అక్కడ వారు భోగాలను అనుభవిస్తే వారి పుణ్యం క్షీణిస్తుంది. అపుడు వారు మళ్ళీ మనుష్యలోకాన జన్మిస్తారు. ఈ విషయమే 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి' అని భగవద్గీతలో చెప్పబడింది.

తే. **అంతరిక్షంబువలన దిగంతరములు । వెలుఁగఁ జనుదెంచు నాతని విమలదీప్తి**
సూచి సద్గణములు గడుఁ జోద్య మంది । రురుతరద్యుతి యిది యేమి యొక్కొయనుచు. 212

ప్రతిపదార్థం: అంతరిక్షంబు వలనన్= ఆకాశందెస; దిక్+అంతరములు= దిక్కులయొక్క మధ్యభాగాలు; వెలుఁగన్= ప్రకాశించగా; చనుదెంచు, ఆతని= వచ్చు యయాతియొక్క; విమలదీప్తి= నిర్మలమైన కాంతి; చూచి; సత్+గణములు= నక్షత్రగణాలు; ఉరుతరద్యుతి, ఇది= మిక్కిలి అధికమైన యీ కాంతి; ఏమి; ఒక్కో= ఏమోకదా; అనుచున్; కడున్= మిక్కిలి; చోద్యము+అందిరి= ఆశ్చర్యం పొందారు.

తాత్పర్యం: ఆకాశందెస దిక్కులమధ్యభాగాలు ప్రకాశింపగా వచ్చే యయాతియొక్క నిర్మల మైన కాంతి చూచి అధిక మైన ఈకాంతి ఏమో కదా! అంటూ నక్షత్రగణాలు ఎక్కువ ఆశ్చర్యాన్ని పొందాయి.

వ. **అంతనయ్యయాతి దౌహిత్రు లయిన యష్టకుండును బ్రతర్దనుండును వసుమంతుండును నౌశీనరుం డయిన శిబియు ననువారలు సద్భువన నివాసులు దమ యొద్దకుం జనుదెంచిన యయాతి నధిక తేజోమయు ననంత పుణ్యమూర్తిం గని నిసర్గస్నేహంబున నభ్యాగత పూజల సంతుష్టుంజేసి 'నీవెవ్వండ? వెం దుండి యేమికారణం బున నిందులకు వచ్చి?' తని యడిగిన వారలకు నయ్యయాతి యి ట్లనియె.** 213

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట; ఆ+యయాతి ఆ యయాతియొక్క; దౌహిత్రులు+అయిన= కూతురి కొడుకు లైన అష్టకుడు, ప్రతర్దనుడు, వసుమంతుడు; ఔశీనరుండు+ఐన= ఉశీనర దేశానికి రాజైన; శిబియున్; అనువారలు+అనే పేర్లు కలవారు సత్+భువన నివాసులు= నక్షత్రలోకాన నివసించేవారు; తమ యొద్దకున్= తమ వద్దకు; చనుదెంచిన= వచ్చిన; యయాతిన్; అధిక, తేజోమయున్= గొప్ప తేజస్సుతో కూడిన వాడిని; అనంతపుణ్య మూర్తిన్= అంతం లేని పుణ్యం రూపు ధరించినవాడిని; కని= చూచి; నిసర్గ స్నేహంబునన్= సహజమైన ప్రేమతో; అభ్యాగత పూజలన్= అతిథులకు చేయవలసిన పూజలచేత; (భోజన సమయంలో వచ్చిన అతిథి - అభ్యాగతుడు); సంతుష్టున్ చేసి= సంతోషించిన వాడినిగా చేసి; నీవు; ఎవ్వండవు; ఎందున్+ఉండి= ఎక్కడినుండి; ఏమి కారణంబునన్= ఏ కారణం చేత; ఇందులకున్= ఇచ్చటికి; వచ్చితి(వి); అని; అడిగినన్; వారలకున్= ఆ అష్టకాదులకు; ఆ+యయాతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అటు తరువాత ఆ యయాతి కూతురి కొడుకులైన అష్టకుడు, ప్రతర్దనుడు, వసుమంతుడు, ఉశీనరదేశానికి సంబంధించిన శిబి అనబడేనక్షత్ర లోకనివాసులైన వారు తమవద్దకు వచ్చిన గొప్పతేజస్సుతో కూడిన అధికమైనపుణ్యం

రూపుధరించిన యయాతిని చూచి, సహజమైనప్రేమతో అభ్యాగతులకు చేయవలసిన పూజలతో సంతోషపెట్టి 'నీ వెవరివి? ఎక్కడినుండి ఏ కారణాన ఇక్కడకు వచ్చావు' అని అడుగగా వారికి ఆ యయాతి ఇట్లా పలికాడు.

క. అనవద్యధర్మచరితం । బున నున్నతుఁ డైన నహుషపుత్త్రుఁడఁ, బూరుం
డను మధ్యమలోకేశ్వరు । జనకుండ, యయాతి యనఁగఁ జనియెడువాఁడన్. 214

ప్రతిపదార్థం: అనవద్య, ధర్మ, చరితంబునన్= నింద్యంకాని ధర్మంతో కూడిన ప్రవర్తనమందు; ఉన్నతుఁడు+ఐన= అధికుడయిన; నహుష, పుత్త్రుఁడన్= నహుషుడి కుమారుడను; పూరుండు+అను= పూరు డనే పేరు కల; మధ్యమ+లోక+ఈశ్వరు= మర్త్యలోక ప్రభువుయొక్క, జనకుండన్= తండ్రిని; యయాతి, అనఁగన్= యయాతి అనే పేరుతో; చనియెడు; వాఁడన్= ఒప్పేవాడిని.

తాత్పర్యం: అనింద్యం, ధర్మయుక్తం అయిన చరిత్రచేత అధికుడైన నహుషుడి కుమారుడిని; పూరుడనే పేరు కల మధ్యమలోకాన్ని పరిపాలించే రాజుయొక్క తండ్రిని; యయాతి అనే పేరుతో ఒప్పువాడిని.

విశేషం: యయాతి తండ్రి యైన నహుషుడు ఇంద్రపదవి నధిష్ఠించి అగస్త్యుడిశాపంచేత అజగర మై పడి ధర్మజుడి సమాగమం చేత శాపవిముక్తు డైనవాడు.

క. అమిత తపోవిభవంబునఁ । గమలజులోకంబు మొదలుగాఁ గల సురలో
కములందుఁ బుణ్యఫలములఁ । గ్రమమున భోగించి యింద్రుకడ కేఁ జనినన్. 215

ప్రతిపదార్థం: అమిత, తపః, విభవంబునన్= అధికమైన తపస్సుయొక్క వైభవంచేత; కమలజులోకంబు, మొదలుగాన్, కల= బ్రహ్మలోకం మొదలయిన; సురలోకములందున్= దేవలోకాలందు; పుణ్యఫలములన్= పుణ్యంయొక్క ఫలాలను; క్రమమునన్= వరుసగా; భోగించి= అనుభవించి; ఇంద్రుకడకున్= ఇంద్రునిచెంతకు; ఏన్= నేను; చనినన్= వెళ్ళగా.

తాత్పర్యం: అధిక మైన తపస్సుయొక్క వైభవంచేత బ్రహ్మలోకం మొదలైన దేవలోకాలలో వరుసగా పుణ్యఫలాలను అనుభవించి ఇంద్రుడిచెంతకు నేను వెళ్ళగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. సురపతి నా తపమున క । చ్చెరువడి నీ తపము పేర్మిఁ జెప్పుమ యనినన్
సురసిద్ధమునీంద్ర తప । శ్చరణలు నాతపముతోడ సరిగా వంటిన్. 216

ప్రతిపదార్థం: సురపతి= దేవతలకు రాజైన ఇంద్రుడు; నాతపమునకున్= నేను చేసిన తపస్సుకు; అచ్చెరువడి= ఆశ్చర్యపడి; నీతపము పేర్మిన్= నీవు చేసిన తపస్సుయొక్క పెంపును; చెప్పుము+అ= చెప్పుమా; అనినన్= అని అడుగగా; సురసిద్ధ, ముని+ఇంద్ర తపః చరణలు= దేవతలయొక్కయు, సిద్ధులయొక్కయు, మునిశ్రేష్ఠులయొక్కయు తపము చేయుటలు; నా తపముతోడన్= నేను చేసిన తపస్సుతో; సరి కావు= సమానం కావు; అంటిన్= అని పలికితిని.

తాత్పర్యం: దేవతలకు రాజైన ఇంద్రుడు నేను చేసిన తపస్సున కాశ్చర్యపడి 'నీ తపస్సుయొక్క మహత్త్వం చెప్పు' మని అడుగగా 'దేవతల, సిద్ధుల, మునిశ్రేష్ఠుల తపఃకార్యాలు నా తపంతో సమానం కా' వని పలికాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'అను' ధాతువుయొక్క భూతకాలమందలి ఉత్తమపురుషైకవచనం 'అనితిని', ను స్థానంబున బిందువు - అంతిని; బిందువు మీది తకారానికి టకారం అంటిని; అంటిన్.

చ. అమరవిభుండు దాని విని యల్గి 'మదంబున నుత్తమావమా
నము దగునయ్య చేయ' నని నన్ను నధోభువనప్రపాతసం
భ్రమవివశాత్ముఁ జేసె; నది పాడియ; యెందును నల్ప మయ్యు ద
ర్పము బహుకాలసంచిత తపఃఫలహాని యొనర్పకుండునే. 217

ప్రతిపదార్థం: అమర, విభుండు= దేవతలకు రాజైన ఇంద్రుడు; దానిన్= నే నన్న మాటల తీరును; విని; అల్గి= కోపించి; మదంబునన్= గర్వంతో; ఉత్తమ+అవమానము= పూజ్యుల (శ్రేష్ఠులైన వారి) పరాభవము; చేయన్= చేయటం; తగున్+అయ్యా= ఉచితమౌనా! అని; నన్నున్, అధస్+భువన, ప్రపాత, సంభ్రమ, వివశ+ఆత్మున్= క్రిందిలోకాలకు పడటంలోని వేగిరపాటుచేత వశం తప్పిన ఆత్మకలవాడిని; చేసెన్; అది= అట్లా చేయటం; పాడి+అ= న్యాయమే; ఎందును= ఎక్కడైనా; అల్పము+అయ్యున్= స్వల్పమైనా కూడా; దర్పము= గర్వము; బహుకాలసంచితతపస్+ఫలహాని= ఎంతోకాలంగా సంపాదించబడిన తపస్సుయొక్క ఫలంయొక్క కీడును (నాశాన్ని); ఒనర్పక+ఉండున్+ఏ= చేయకుండునా! తప్పక చేస్తుం దని భావం.

తాత్పర్యం: దేవేంద్రుడు నామాట విని కోపించి 'గర్వంతో శ్రేష్ఠులైనవారిని అవమానించటం తగునా?' అని నన్ను క్రిందిలోకాలకు పడటంలోని వేగిరపాటుచేత వశం తప్పిన ఆత్మకలవాడినిగా చేశాడు. అది న్యాయమే. ఎక్కడైనా స్వల్పమైన దైనా గర్వం పెద్దకాలం చేసిన తపస్సుయొక్కఫలాన్ని నాశనం చేయకుండా ఎట్లాఉంటుంది?.

విశేషం: యయాతి తనతప్పు తాను అంగీకరించాడు. ఇంద్రుడు శపించటంలో అన్యాయం లేదని అతడే చెప్పుకోవటం అతని ఔదార్యాన్ని సూచిస్తుంది. అలం: అర్థాంతరన్యాసం.

వ. 'ఇట్లు కుపిత శతమఖ వచన ప్రపీడితుండ నయి తదాదేశంబున సద్భువనంబునకు వచ్చితి' ననిన నాతండు దమకు మాతామహుం డగుటయు నతని మహత్త్వంబును సార్వలౌకికత్వంబును సర్వజ్ఞానసంపత్తియు నెఱింగి, యష్టకాదులు సకల ధర్మాధర్మంబులు, సుగతి, దుర్గతి స్వరూపంబులు, జీవుల గర్భోత్పత్తిప్రకారంబులు, వర్ణాశ్రమధర్మంబులు నడిగిన వారల కయ్యయాతి యి ట్లనియె. 218

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; కుపిత, శతమఖ, వచన, ప్రపీడితుండన్+అయి= కోపించిన యింద్రుడియొక్క శాపవాక్యం చేత, మిక్కిలి బాధించబడిన వాడ నై; తద్+ఆదేశంబునన్= అతని యొక్క ఆజ్ఞచేత; సత్+భువనంబునకున్= నక్షత్రలోకానికి; వచ్చితిన్, అనినన్= అని యయాతి పలుకగా; ఆతండు= యయాతి; తమకున్= అష్టకాదులకు; మాతామహుండు; అగుటయున్= తల్లి(కి) దండ్రి కావటమూ; అతని, మహత్త్వంబును= అతని గొప్పతనమును; సార్వలౌకికత్వంబును= విశ్వజనీనత్వమును (సర్వలోకాల వారికి తెలిసియుండుటయు); సర్వజ్ఞాన సంపత్తియున్= సమస్తమైన జ్ఞానంయొక్క సంపదయున్నూ; ఎఱింగి= తెలిసికొని; అష్టక+ఆదులు= అష్టకులు మొదలైన వారు; సకల, ధర్మ+అధర్మంబులు= అన్నిధర్మాలు, అధర్మాలు: సుగతి, దుర్గతి స్వరూపంబులు= మంచిగతియొక్క (మోక్షం), చెడ్డ గతియొక్క (నరకాదుల); స్వరూపంబులు= స్వభావాలు; జీవుల,

గర్భ+ఉత్పత్తి ప్రకారంబులు= జీవులు పిండరూపాన పుట్టే విధము; వర్ణ, ఆశ్రమ ధర్మంబులును= బ్రాహ్మణ క్షత్రియాది వర్ణాలయొక్క బ్రహ్మచర్యాశ్రమాలయొక్క, స్వభావాలు; అడిగినన్= అడుగగా; వారలకున్= అష్టకాదులకు; ఆ+యయాతి; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పల్కినాడు.

తాత్పర్యం: 'ఈ విధంగా కోపించిన ఇంద్రుడియొక్క వాక్కుచేత పీడించబడినవాడినై, అతడి ఆజ్ఞచేత నక్షత్ర లోకానికి వచ్చాను' అని యయాతి పలుకగా ఆయయాతి తమ మాతామహుడు కావటంచేతను, అతని గొప్పతనం సమస్త లోకాలలో ప్రసిద్ధి చెందటం చేతను, అన్ని విషయాలగురించిన జ్ఞానసంపదను తెలిసికొని అష్టకుడు మొదలైన వారు అన్ని ధర్మాలను, అధర్మాలను, మంచి చెడ్డగతుల స్వభావాలను, జీవుల పిండోత్పత్తి విధానాన్ని, వర్ణాశ్రమ ఆచారాలను అడుగగా ఆ అష్టకాదులకు యయాతి ఇట్లా చెప్పాడు.

యయాతి యష్టకాదు లడిగిన ప్రశ్నలకు సంక్షేపరూపంబున సమాధానంబు లొసఁగుట (సం.1-84-3)

ఆ. సర్వభూతదయకు సత్యవాక్యమునకు । నుత్తమంబు ధర్మ వొం డెఱుంగ;
నొరుల నొప్పి కోడ కుపతాప మొనరించు । నదియ కడు నధర్మ మనిరి బుధులు. 219

ప్రతిపదార్థం: సర్వభూతదయకున్= ఎల్ల జీవులయందలి దయకును; సత్య వాక్యమునకున్= సత్యంతో కూడిన వాక్యానికి; (వానికంటె) ఉత్తమంబు= శ్రేష్ఠమైన; ధర్మువు= ధర్మము; ఒండు= ఇతరము; ఎఱుంగన్; ఒరుల నొప్పికిన్= ఇతరులయొక్క బాధకు; (ఇతరులను బాధ పెట్టటానికి); ఓడక= భయపడక, జంకక; ఉపతాపము= సంతాపము; ఒనరించు+అది+అ= కలిగించుటయే; బుధులు= పండితులు; కడున్= మిక్కిలి; అధర్మము+అనిరి.

తాత్పర్యం: ఎల్లజీవులయందు దయ కలిగి ఉండటంకంటెను, నిజమైనవాక్యం పల్కటంకంటెను, శ్రేష్ఠ మైన ధర్మ మింకొకటి నాకు తెలియదు. ఇతరులను బాధించటానికి జంకక, సంతాపం కలుగ జేయటం మిక్కిలి అధర్మమని పండితులు చెప్పారు.

ఆ. వేదవిహితవిధుల నాదరించుట యూర్ధ్వ । గతికిఁ దెరువు; విధులఁ గడచి యెందు
నాఁగఁబడినవాని లోఁగక చేయుట । యధమగతికి మార్గ మనిరి మునులు. 220

ప్రతిపదార్థం: వేదవిహిత, విధులన్= వేదమందు విధించబడిన కార్యాలను; ఆదరించుట= ప్రీతితో చేయటం; ఊర్ధ్వగతికిన్= ఉన్నతమైన గతికి; తెరువు= మార్గం; విధులన్= వేదాలలో విధించబడిన కార్యాలను; కడచి= దాటి; ఎందున్= ఎక్కడైనా; ఆఁగఁబడినవానిన్= నిషేధించబడిన వాటిని; లోఁగక= వెనుదీయక; చేయుట; అధమగతికిన్= నీచమైన గతికి; మార్గము; అని; మునులు; అనిరి= చెప్పారు.

తాత్పర్యం: వేదమందు విధించబడిన కార్యాలను పాటించటం ఉన్నతమైన గతికి మార్గం. వేదమందు విధించబడిన కార్యాన్ని అతిక్రమించి, ఎల్లయెడల నిషేధించబడినవాటిని వెనుదీయక (వెనుకాడక) చేయటం నీచమైన గతికి మార్గం అని మునులు చెప్పారు.

వ. మఱియు గర్భయోనియందు ఋతుపుష్ప రససంయుక్తం బగుచు రేతంబు గాడ్పుచేతం బ్రేరితం బయి కలసిన, నందుఁ బంచతన్మాత్రలు పొడ వయి క్రమంబున నవయవంబు లేర్పడి లబ్ధజీవు లయి యుద్భవిల్లి, శ్రోత్రంబుల శబ్దంబును నేత్రంబుల రూపంబును ఘ్రాణంబున గంధంబును జిహ్వను రసంబును ద్వక్కున స్పర్శంబును మనంబున సర్వంబును నెఱుంగుచుఁ, బూర్వకర్మనియోగంబున దుష్కృతంబును సుకృతంబును జేయుచు, దుష్కృత బాహుళ్యంబునఁ బుణ్యంబు గీడ్పఱిచి బుద్ధి విరహితులై తిర్యగ్యోనులందుఁ బుట్టుదురు; సుకృత బాహుళ్యంబునఁ బాపంబు గీడ్పఱిచి బుద్ధియుక్తులై మనుష్యయోనులందుఁ బుట్టి, యుక్తాచారులును దత్త్వ విదులును నయి, దేవత్వంబునం బొంది, విశుద్ధజ్ఞాను లయి ముక్తు లగుదురు; మఱి యుక్తాచారు లెవ్వరనిన గురు శుశ్రూష సేయుచు నిత్యాధ్యయనాగ్ని కార్యంబులయం దప్రమత్తు లయి శమదమ శౌచంబులు దాల్చి యవిప్లుత బ్రహ్మచర్యులయిన బ్రహ్మచారులును, బాపంబునకుఁబరోపతాపంబునకు వెఱచి ధర్మ్యంబైన విత్తంబున నతిథులం బూజించుచు యజ్ఞంబులు సేయుచుఁ బరుల యీనిధనంబులు పరిగ్రహింపక నిత్యానుష్ఠానపరు లయిన గృహస్థులును, నియతాహారు లై సర్వసంగంబులు విడిచి జితేంద్రియు లైన వానప్రస్థులును, వనంబులనుండి గ్రామ్యవస్తువుల నుపయోగింపక గ్రామంబులనుండి శరీర ధారణార్థంబు నియతస్వల్పభోజను లయి నగర ప్రవేశంబు పరిహరించి కామక్రోధాదులం బొరయక శౌచాచారక్రియారతు లయి సర్వద్వంద్వంబులు నొడిచిసర్వసంగవివర్జితులయి యేకచరు లయి యనేకనికేతను లయిన యతులును నను వీరలు దమతమ పుణ్యాచారంబులం జేసి క్రిందం బదితరంబులవారిని మీఁదం బదితరంబుల వారిని దమ్మును నుద్ధరింతురు. 221

ప్రతిపదార్థం: మఱియున్= అదికాక; గర్భయోనియందున్= పిండముండు స్త్రీ అవయవమందు; ఋతుపుష్ప రస సంయుక్తంబు= ఋతుకాలానికి సంబంధించిన రజస్సుతో కూడినది; అగుచున్; రేతంబు= పురుషుడి వీర్యం; గాడ్పుచేతన్= గాలిచేత; ప్రేరితంబు+అయి= ప్రేరేపించబడినదై; కలసినన్= కలయగా; అందున్= ఆ రేతస్సునందు (గర్భయోనియందు) పంచతన్మాత్రలు= ఐదయిన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు; పొడవు+అయి= రూపొంది; క్రమంబునన్= కాలక్రమాన; అవయవంబులు= అంగాలు; ఏర్పడి= రూపొంది; లబ్ధజీవులు+అయి= పొందబడిన జీవం కలవారై; ఉద్భవిల్లి= పుట్టి; శ్రోత్రంబులన్= చెవులచేత; శబ్దంబును= ధ్వనిని; నేత్రంబులన్= కన్నులచేత; రూపంబును; ఘ్రాణంబునన్= ముక్కుచేత; గంధంబును= వాసనను; జిహ్వను= నాలుకచేత; రసంబునున్= రుచిని; త్వక్కునన్= చర్మంచేత; స్పర్శంబును= స్పర్శను (తాకుడును); మనంబునన్= మనస్సుచేత; సర్వంబునున్= సమస్తమును; ఎఱుంగుచున్; పూర్వకర్మ నియోగంబునన్= పూర్వజన్మ మందలి కర్మల పనుపుచేత; దుష్కృతంబును= చెడ్డపనిని; సుకృతంబును= మంచిపనిని; చేయుచున్; దుష్కృత, బాహుళ్యంబునన్= చెడ్డపనుల ఆధిక్యత చేత; పుణ్యంబు= పుణ్యమును; కీడ్పఱచి= తక్కువచేసి; బుద్ధి విరహితులు+ఐ= బుద్ధిలేని వారై; తిర్యక్+యోనులందున్= పశుపక్ష్యాదుల గర్భమందు; పుట్టుదురు; సుకృత బాహుళ్యంబునన్= పుణ్యంయొక్క ఆధిక్యంచేత; పాపంబున్= పాపమును; కీడ్పఱిచి= తక్కువ పఱిచి; బుద్ధియుక్తులు+ఐ= బుద్ధితో కూడినవారై; మనుష్య యోనులందున్= మానవ గర్భమందు; పుట్టి; యుక్త+ఆచారులు= తగిన ఆచారం కలవారును; తత్వవిదులునున్= తత్త్వం తెలిసిన వారును; అయి; దేవత్వంబునన్= దేవత్వాన్ని; పొంది; విశుద్ధ జ్ఞానులు+అయి= నిర్మలమైన జ్ఞానం కలవారై; ముక్తులు= మోక్షం పొందినవారు; అగుదురు; మఱి=ఇంక; యుక్త+ఆచారులు= తగిన ఆచారం కలవారు; ఎవ్వరు+అనినన్= ఎవ్వ రనగా; గురు,

శుశ్రూష= గురువులసేవ, చేయుచున్; నిత్య+అధ్యయన+అగ్ని కార్యంబులయందున్= నిత్యం చేయదగిన వేదాధ్యయన, అగ్ని ఉపాసన మొద లైన పనులలో; అప్రమత్తులు= ప్రమాదం లేనివారు; శమ దమశౌచంబులు= బహిరింద్రియ అంతరింద్రియ నిగ్రహాన్ని; శుచిత్వాన్ని; తాల్చి= పొంది; అవిప్లుత బ్రహ్మచర్యులు+అయిన= చెడని బ్రహ్మచర్య వ్రతం కలవా రైన బ్రహ్మచారులును; పాపంబునకున్; పర+ఉపతాపంబునకున్= ఇతరులకు సంతాపాన్ని కలిగించటానికి; వెఱచి= భయపడి; ధర్మ్యంబు అయిన= ధర్మంతో కూడిన, ధర్మమార్గాన సంపాదించబడిన; విత్తంబునన్= ధనంతో; అతిథులన్; పూజించుచున్; యజ్ఞంబులు చేయుచున్; పరుల ఈని ధనంబులు= ఇతరులు ఇవ్వని ధనాలు (పరుల ధనంబులు, పరధనంబులు అని పాఠాంతరం. ఇవే యుక్తమైనవి); పరిగ్రహింపక= చేకొనక; నిత్య+అనుష్ఠాన పరులు= సంతతం చేయదగిన సంధ్యావందనాది కార్యాలయందు ఆసక్తి కలవా రైన; గృహస్థులును; నియత+ఆహారులు+ఐ= నియమంతో కూడిన ఆహారం కలవారై; సర్వసంగంబులు= అన్ని ఆసక్తులు; విడిచి; జిత+ఇంద్రియులు+ఐన= జయించబడిన ఇంద్రియాలు కలవారైన; వానప్రస్థులును= వానప్రస్థాశ్రమం కలవారును; వనంబులన్+ఉండి= అడవులందు నివసించి; గ్రామ్య వస్తువులను= గ్రామాలందలి వస్తువులను; ఉపయోగింపక; గ్రామంబులన్+ఉండి= గ్రామాలందు నివసించి; శరీర, ధారణ+అర్థంబు= శరీరం నిలిచే నిమిత్తం; నియత, స్వల్ప భోజనులు అయి= నియమంతో కూడిన స్వల్ప మైన ఆహారం కలవారై; నగర ప్రవేశంబు= పట్టణాలందు ప్రవేశించటం; పరిహరించి= విడిచి; కామ+క్రోధ+ఆదులన్= కామం, క్రోధం మొదలైన వాటిని; పొరయక= పొందక; శౌచ+ఆచార క్రియారతులు+అయి= శుచిత్వంతో కూడిన ఆచారమందును (ఆచారంలోను పనులలోను ఆసక్తికలవారై); సర్వద్వంద్వంబులున్= శీతోష్ణసుఖదుఃఖాది ద్వంద్వాలన్నింటినీ; ఒడిచి= ఓడించి (జయించి); సర్వసంగ, వివర్జితులు+అయి= అన్ని సంగాలచేత విడువబడిన వారై; ఏక, చరులు+అయి= ఒంటరిగా సంచరించువా రై; అనేక నికేతనులు+అయిన= పెక్కు గృహాలు కలవారైన (ఒకేయింట్లో ఉండకుండా పెక్కుగృహాలకు భిక్షాటనార్థం వెళ్ళేవా రైన) యతులును= సన్న్యాసులును; (వీరు యుక్తాచారులు); అను వీరలు= అనే వీరు; తమ, తమ, పుణ్య+ఆచారంబులన్ చేసి= వారి వారి పుణ్యంతో కూడిన ఆచారాలచేత; క్రిందన్= జరిగిన కాలమందలి (కడచిపోయిన కాలంలోని); పదితరంబులవారిని; మీఁదన్= ముందువచ్చు; పదితరంబులవారిని; తమ్మును; ఉద్ధరింతురు= మీది కెత్తుదురు, ఉద్ధరిస్తారు.

తాత్పర్యం: అదిగాక గర్భయోనియందు ఋతుకాలమందలి స్త్రీ రజస్సుతో కూడినదై పురుషుడిరేతస్సు గాలిచేత ప్రేరేపించబడి కలయగా, ఆ గర్భయోనియందు శబ్దస్పర్శాదు లైన ఐదు తన్మాత్రలు రూపొంది క్రమంగా అవయవా లేర్పడి జీవం పొంది జన్మిస్తారు. తరువాత చెవులచేత శబ్దాన్ని, నేత్రాలచేత రూపాన్ని, ముక్కుచేత వాసనను, నాలుకచేత రుచిని, చర్మంచేత స్పర్శగుణాన్ని, మనస్సుచేత సమస్తాన్నీ ఎరుగుదురు (తెలిసికొంటారు). పిమ్మట పూర్వజన్మలోని కర్మలఏర్పాటుచేత మంచిపనిని, చెడ్డపనిని చేస్తూ చెడ్డపనుల ఆధిక్యంచేత పుణ్యాన్ని తక్కువ పరచి (చేసి) బుద్ధిలేనివారై పశుపక్ష్యాదుల గర్భాలందు జన్మిస్తారు. పుణ్యంయొక్క ఆధిక్యంచేత పాపాన్ని తక్కువ కావించి బుద్ధితో కూడినవారై మానవగర్భాలందు పుట్టి తగిన ఆచారాలు కలవారున్నూ, తత్త్వజ్ఞానం కలవారున్నూ అయి దేవత్వాన్ని పొంది నిర్మల మైన జ్ఞానంతో కూడి మోక్షాన్ని పొందుతారు. మఱి యుక్తాచారులు ఎవరంటే గురువుల సేవచేస్తూ నిత్యం వేదాధ్యయనాన్ని, అగ్నికార్యాన్ని పొరపాటులేకుండా చేస్తూ అంతర్బహిరింద్రియ నిగ్రహాన్ని, శుచిత్వాన్ని ధరించి భ్రష్టం కాని బ్రహ్మచర్యవ్రతం కలవా రైన బ్రహ్మచారులునూ, పాపానికీ, పరులను పీడించటానికీ భయపడి ధర్మమార్గాన సంపాదించబడిన ధనంతో అతిథులను పూజిస్తూ యజ్ఞాలు చేస్తూ ఇతరులు ఈయని ధనాలను గ్రహించక నిత్యకర్మానుష్ఠానంలో ఆసక్తులై ఉండే గృహస్థులును, నియమంతో కూడిన ఆహారం కలవారై

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సర్వాసక్తులు విడిచి ఇంద్రియాలను జయించి ఒప్పారు వానప్రస్థులును, అడవియం దుండి గ్రామమందు పుట్టిన వస్తువులను వాడక గ్రామాలందు నివసించి దేహపోషణకై స్వల్పమైన (కొద్దిగా) ఆహారం స్వీకరిస్తూ (గ్రహిస్తూ) పట్టణాలలో ప్రవేశించక కామక్రోధాదులను పొందక శుచిత్వంతో కూడిన ఆచారాలందు, కర్మలందు ఆసక్తి కలవారై శీతోష్ణ సుఖ దుఃఖాదులను, సర్వ ద్వంద్వాలను జయించి సర్వాసక్తులను విడిచి ఒంటరిగా సంచరిస్తూ ఒకే గృహం లేనివారై యుండు సన్న్యాసులును-వీరు యుక్తాచారులు. వీరు తమ తమ పుణ్యాలయిన ఆచారాల చేత పదితరాల పూర్వులను, పదితరాల ముందువారిని మరియు, తమ వెనుక నున్న వారిని కూడ ఉద్ధరిస్తారు.

క. మానాగ్నిహోత్రమును మఱి । మానాధ్యయనమును మానమౌనంబు నవి
జ్ఞానమున మానయజ్ఞము । నా నయథార్థంబు లివియు నాలుగు నుర్విన్. 222

ప్రతిపదార్థం: మాన+అగ్నిహోత్రమును= గర్వంతో కూడిన అగ్ని ఉపాసనను; మఱి, మాన+అధ్యయనమును= ఆడంబరంతో కూడిన వేదాధ్యయనాన్ని; మానమౌనంబునన్= గర్వంతో కూడిన మౌనమును (మౌనాన్ని తాల్చుటయు); అవిజ్ఞానమునన్= జ్ఞానంలేకుండ (లేకపోవటంచేత); మానయజ్ఞమును= గర్వంతో కూడిన యజ్ఞమును; నాన్= అనగా; ఇవియున్ నాలుగున్= మానంతో కూడిన అగ్నిహోత్ర. అధ్యయన, మౌన, యజ్ఞములు నాలుగూ; ఉర్విన్= భూమియందు; అయథార్థంబులు= నిజాలు కావు.

తాత్పర్యం: గర్వంతో కూడిన అగ్నిహోత్రం, ఆడంబరానికై చేసే వేదాధ్యయనం, గర్వంతో కూడుకొన్న మౌనం, జ్ఞానం లేకుండా ఆడంబరంతో చేసే యజ్ఞం అనే నాలుగూ భూమియందు అసత్యా లైనవి (అయోగ్యా లైనవి).

వ. అని యయాతి యష్టకాదు లడిగినవాని నెల్ల సంక్షేపరూపంబునం జెప్పటయు వార లి ట్లనిరి. 223

ప్రతిపదార్థం: అని, యయాతి; అష్టక+ఆదులు= తన దౌహిత్రు లైన, అష్టకుడు మొదలైన వారు; అడిగిన వానిన్, ఎల్లన్= అడిగిన ప్రశ్నలు అన్నింటిని; సంక్షేప రూపంబునన్= విస్తరంగా కాక, సంక్షేప రూపాన; చెప్పుటయున్= చెప్పగా; వారలు= అష్టకాదులు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: అని యయాతి తనదౌహిత్రు లయిన అష్టకాదులు అడిగిన ప్రశ్నల కన్నిటికీ సంక్షేపంగా సమాధానా లీయగా, అష్టకాదు లతనితో ఇట్లా అన్నారు.

విశేషం: ఇక్కడ మూలంలో అష్టకాదు లడిగిన ప్రశ్నలూ యయాతి ఇచ్చిన సమాధానాలూ విస్తృతంగా ఉన్నాయి. ఇది ఆధ్యాత్మిక విషయం కావటంచేత నన్నయ వాటిని సంగ్రహించాడు. సంగ్రహించినట్లు అతడే 'సంక్షేపరూపంబున' అని సూచించాడు. శాస్త్రేతిహాసమైన వ్యాసభారతాన్ని తెలుగులో కావ్యేతిహాసంగా నిర్మించే విధానంలో ముఖ్యమైన లక్షణం శాస్త్రాంశసంగ్రహీకరణం.

తే. 'సకల ధర్మవిదుండవు, సర్వలోక । వర్తనము లెఱింగిన పుణ్యకర్త, వీవు
నెయ్య మొనరంగ నెఱిఁగింపుమయ్య మాకు । వెలయఁ బుణ్యలోకంబులు గలవె' యనిన. 224

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సకల, ధర్మ, విదుండవు= అన్ని ధర్మాలను ఎఱింగిన వాడివి; సర్వలోక వర్తనములు= అన్ని లోకాల ప్రవర్తనలు; ఎఱింగిన= తెలిసిన; పుణ్యకర్తవు= పుణ్యం చేసినవాడివి; ఈవు= నీవు; నెయ్యము; ఒనరంగన్= స్నేహ మొప్పునట్లుగా; మాకున్; వెలయన్= ప్రసిద్ధంగా; పుణ్యలోకంబులు= పవిత్ర మైన లోకాలు; కలవు+ఎ= కలవా?; ఎఱింగింపుమయ్యా= తెలుపవయ్యా; అనినన్= అని అష్టకాదు లడుగగా.

తాత్పర్యం: 'నీవు సర్వధర్మాలను ఎరిగినవాడివి, సర్వలోకప్రవర్తనలు తెలిసిన పుణ్యమూర్తివి, స్నేహ మొప్పగా మాకు పుణ్యలోకాలు కలవా?' అని అష్టకాదులు అడుగగా. (తరువాతి వచనంతో అన్వయం.)

వ. 'మీకుంబుణ్యలోకంబులుగల' వని యయాతి సెప్పిన విని యన్నలువురు సంతోషించి 'యేము నీ దౌహిత్రులము సు' మ్మని త మ్మెఱింగించి వానికిఁ బుణ్యలోకంబు లిచ్చిన న ట్లయ్యయాతి సత్సంగతిం జేసి తానును దౌహిత్రులు నూర్ధ్వలోకంబునకుం జనియె నని. 225

ప్రతిపదార్థం: మీకున్; పుణ్యలోకంబులు= పుణ్యం చేసేవారు పోవు లోకాలు; కలవు= ఉన్నవి; అని; యయాతి; చెప్పినన్= చెప్పగా; విని; ఆనలువురున్= అష్టకుడు, ప్రతర్దనుడు వసుమంతుడు, శిబి అనే నలువురును; సంతోషించి; ఏము= మేము; నీదౌహిత్రులము; సుమ్ము= నీకూతురి కుమారులము సుమా!; అని; తమ్మున్, ఎఱింగించి= తమను తెలిపికొని; వానికిన్= ఆ యయాతికి; పుణ్యలోకంబులు; ఇచ్చినన్= ఇయ్యగా; అట్లు; ఆ+యయాతి; సత్సంగతిన్, చేసి= సత్పురుషుల సాంగత్యంచేత; తానును, దౌహిత్రులున్= కూతురి కుమారులును (మనుమలును); ఊర్ధ్వలోకంబునకున్= పైస్వర్గలోకానికి; చనియెన్= వెళ్ళెను; అని.

తాత్పర్యం: 'మీకు పుణ్యలోకా లున్నవి' అని యయాతి చెప్పగా విన్న ఆ నలుగురు మనుమలూ సంతోషించి 'మేము నీకూతురికుమారులం సుమా!' అని తమను తాము తెలుపుకొని ఆ యయాతికి పుణ్యలోకాలు ఇచ్చారు. ఆ విధంగా ఆ యయాతి ఉత్తములసంసర్గంచేత తాను మనుమలతో పైలోకానికి వెళ్ళాడు అని.

విశేషం: తానున్ దౌహిత్రులున్ చనియె - ఆత్మార్థం బభిహితం కావటంచేత ఇచ్చట క్రియకు ఏకవచనం కలిగింది.

క. ఆ యతులపుణ్యునకు నన । సూయునకుఁ బరీక్షిదగ్రసుతునకు వైశం
పాయనుఁ డనంతపుణ్యఫ । లాయత్తము గాఁగఁ జెప్పె నని కడుఁ బ్రీతిన్. 226

ప్రతిపదార్థం: వైశంపాయనుఁడు= వ్యాసుడి శిష్యుడు; ఆ, అతుల, పుణ్యునకున్= సాటిలేని పుణ్యం కలవాడికి; అనసూయునకున్= అసూయ లేని వాడికి; పరీక్షిత్, అగ్రసుతునకున్= పరీక్షిత్తు యొక్క జ్యేష్ఠకుమారు డైన ఆ జనమేజయుడికి; అనంత, పుణ్య, ఫల, ఆయత్తము; కాఁగన్= అంతం లేని పుణ్యంయొక్కఫలాని కధీన మయ్యేటట్లుగా; కడున్, ప్రీతిన్= మిక్కిలి ప్రీతితో; చెప్పెన్; అని శౌనకాదిమహర్షులకు సౌతి వివరించాడు.

తాత్పర్యం: సాటిలేని పుణ్యం కలవాడున్నూ, ఈర్ష్యారహితుడున్నూ, పరీక్షిన్మహారాజు జ్యేష్ఠ కుమారుడున్నూ అయిన జనమేజయుడికి వైశంపాయనుడు అంతం లేని పుణ్యంయొక్క ఫలానికి అధీనమౌనట్లుగా మిక్కిలి ప్రీతితో చెప్పాడని సౌతి శౌనకాదిమహర్షులకు తెలిపాడు.

ఆశ్వాసాంతము

క. వీరశ్రీవనితాశ్రిత । భూరిస్థిర బాహుదండ! బుధనుత సుగుణా
ధార! కలియుగపవిత్ర! పు । రారాతి పదాబ్జపూజనాసక్తమతీ! 227

ప్రతిపదార్థం: వీర, శ్రీ, వనితా+ఆశ్రిత, భూరి, స్థిరబాహు, దండ= వీరలక్ష్మి అనే కాంతచేత ఆశ్రయించబడిన విశాలం, దృఢం అయిన దండంవంటి బాహువులు కలవాడా!; బుధ, నుత, సుగుణ+ఆధార= పండితులచేత పొగడబడిన మంచిగుణాలకు నెలవైనవాడా!; కలియుగ పవిత్ర= కలియుగాన్ని పవిత్రం చేసేవాడా!; పుర+అరాతి, పద+అబ్జ పూజన+ఆసక్త మతీ= త్రిపురాలకు శత్రు వైన (త్రిపుర సంహారు డైన) పద్మాలవంటి శివుడిపాదాలయందు ఆసక్తి కల మనస్సు కలవాడా!

తాత్పర్యం: వీరలక్ష్మి అనే కాంతచేత ఆశ్రయించబడిన విశాలాలు, దృఢాలు నైన దండాలవంటి బాహువులు కలవాడా! పండితులచేత పొగడబడిన మంచిగుణాలకు ఆశ్రయమైనవాడా! కలియుగాన్ని పవిత్రీకరించేవాడా! త్రిపురవైరి యైన శివుడి పాదపద్మాలందు ఆసక్తి కల మనస్సు కలిగినవాడా! రాజరాజా!

మత్తకోకిలము.

దండితాహితవీర! సూరినిధాన! దానవినోద! కో
దండపార్థ! పరాక్రమ ప్రియధామ! దిక్పరిపూరితా
ఖండ పాండు యశోనిధీ! పరగండభైరవ! వైరివే
దండ గండ విదారి ఘోరతరాసి భాసిభుజార్గళా!. 228

ప్రతిపదార్థం: దండిత+అహిత, వీర= శిక్షించబడిన శత్రువీరులు కలవాడా!; సూరి, నిధాన= పండితులకు నిధియైనవాడా!; దానవినోద= దానమందు వేడుక కలవాడా!; కోదండ, పార్థ= ధనుర్విద్యయందు అర్జునుడా!; పరాక్రమ, ప్రియ, ధామ= శౌర్యానికి ఇష్టమైన నెలవైన వాడా!; దిక్+పరిపూరిత+అఖండ, పాండు, యశస్+నిధీ= అన్ని దిక్కులందు నిండిన అధికమైన నిర్మల మైన కీర్తికి నిధానమా!; పరగండ భైరవ= (ఇది బిరుదు) శత్రువీరులకు భయంకరుడా!; వైరి, వేదండ గండ విదారి, ఘోర, తర+అసి, భాసి, భుజ+అర్గళా= శత్రువుల ఏనుగుల కపోలాలను భేదించే మిక్కిలి భయంకరమైన ఖడ్గంతో ప్రకాశించే గుదియల (గడియ) వంటి భుజాలు కలవాడా!

తాత్పర్యం: శిక్షించబడిన శత్రువీరులు కలవాడా! పండితులకు నిధాన మైనవాడా! దానమందు వేడుక కలవాడా! ధనుర్విద్యలో అర్జునుడివంటివాడా! శౌర్యానికి ప్రీతికరమైన నెలవా! అన్నిదిక్కులయందు నిండిన అధికమైన నిర్మలమైన కీర్తికి నిధానమా! శత్రువీరులకు భయంకరుడా! శత్రువుల ఏనుగులకపోలాలను, పగులగొట్టే భయంకరమైన ఖడ్గంతో ప్రకాశించే తలుపుగడియవంటి భుజాలు కలవాడా!

విశేషం: 227, 228 పద్యాలు ఆశ్వాసాంత పద్యాలు. ఇవి రాజరాజును వర్ణించే విశేషణాలతో కూడి ఉన్నవి. మత్తకోకిలంలో పాదానికి రస జజ భర గణాలతో కూడిన 18 అక్షరా లుంటాయి. యతిస్థానం 11వ అక్షరం. ఇందులో మొదటి గురువును రెండు లఘువులుగా మారిస్తే తరల మౌతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గద్యము.

ఇది సకల సుకవిజన వినుత నన్నయభట్టప్రణీతం బయిన శ్రీమహాభారతంబునం దాది పర్వంబున శ్రీమహాభారత కథాప్రారంభంబును, వ్యాసుజన్మంబును, దేవ దైత్య దానవ ముని యక్ష పక్షి గంధర్వాది నానా విధభూత సంభవంబును, దదంశావతారంబును, రాజవంశోత్పత్తియు, యయాతిచరితంబును నన్నది తృతీయాశ్వాసము. **229**

తాత్పర్యం: ఇది సర్వ సత్కవులచేత సన్నుతింపబడే నన్నయభట్టుచేత రచింపబడిన శ్రీమహాభారతంలోని ఆదిపర్వంలో శ్రీమహాభారత కథయొక్క ఆరంభం, వ్యాసుడి పుట్టుక, దేవతలు, దితికుమారులైన రాక్షసులు, దనుకుమారు లైన దానవులు, మునులు, యక్షులు, పక్షులు, గంధర్వులు మొదలైన పలువిధా లైన జీవుల పుట్టుక, వారి అంశాల జన్మం, (భూమిపై అవతరించటం), రాజవంశాల పుట్టుక, యయాతిరాజు చరిత్ర అనే విషయాలతో కూడిన మూడవ ఆశ్వాసం.

ఆదిపర్వంలో తృతీయాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము -చతుర్థాశ్వాసము

శ్రీలలనాస్తన ఘటిత వి । శాలోరస్థల! వివేకచతురానన! వా
ణీ లీలాస్పద! విలస । చ్చాళుక్యాన్వయ పయోధి సంపూర్ణశశీ! 1

ప్రతిపదార్థం: ఈపద్యంలోని విశేషణాలు రాజరాజనరేంద్రుడి సంబోధనలు. శ్రీలలనా, స్తన, ఘటిత, విశాల, ఉరస్+స్థల= లక్ష్మి (రాజ్యలక్ష్మి) అనే కాంతయొక్క కుచాలచే చేర్చబడిన విపులమైన వక్షఃప్రదేశం కలవాడా! వివేక, చతురానన= జ్ఞానంలో నాల్గుమొగాలుకల బ్రహ్మ! (చతుర+ఆనన అనికూడా చెప్పవచ్చును; అప్పుడు జ్ఞానంలో నెగ్గగల ముఖం కలవాడా అని అర్థం); వాణీ, లీలా+ఆస్పద= సరస్వతీ విలాసాలకు నెలవైనవాడా!; విలసత్+చాళుక్య+అన్వయ, పయోధి, సంపూర్ణ, శశీ= ప్రకాశించే చాళుక్యవంశం అనే సముద్రానికి నిండుజాబిల్లి ఐనవాడా!; రాజరాజనరేంద్రా!

తాత్పర్యం: లక్ష్మి అనే కాంతయొక్కస్తనాలతో కూడిన విపులమైన వక్షస్స్థలం కలవాడా! వివేకంలో బ్రహ్మవంటివాడా! సరస్వతీవిలాసాలకు పట్టుకొమ్మ అయినవాడా! (కావ్యగీతప్రియా!) ప్రకాశించే చాళుక్యవంశం అనే సముద్రానికి నిండుచంద్రుడా! రాజరాజనరేంద్రుడా!

విశేషం: అలం: రూపకం. 'నా విష్ణుః పృథివీపతిః' అనే సూక్తిని అనుసరించి రాజు విష్ణ్వంశతో కూడి ఉంటాడు. అప్పుడు అతడిని లక్ష్మి ఆలింగనం చేసికొంటుంది అని భావన. సంబోధనల కైన విశేషణాల అర్థాలు వేటికవే ప్రత్యేకంగా ఉంటాయి. కాని ఇక్కడ 'వివేక చతురానన, వాణీలీలాస్పద' అనే రెండు విశేషణాలు మాత్రం పరస్పరం సమన్వయపడుతూ ఉండటం విశేషం. బ్రహ్మ లక్షణమున్న రాజరాజు సరస్వతికి ఆశ్రయుడయ్యాడనే భావం కుదురుతున్నది. విలసత్+చాళుక్య= విలసచ్చాళుక్య. శ్చుత్వసంధి.

పూరువంశక్రమము (సం.1-90-11) (1-89-4)

వ. **అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె : నట్లు యయాతికిఁ బుత్త్రుం డయిన పూరుండు సకల మహీరాజ్యంబు సేయుచు వంశకర్త యయిన వానికిఁ గౌసల్య యనుదానికి జనమేజయుండు పుట్టి రాజై యశ్వమేధత్రయంబుఁజేసి ప్రఖ్యాతి నొందె; నాజనమేజయునకు ననంత యనుదానికిఁబ్రాచిన్వంతుఁడు పుట్టి పరాక్రమంబున నుదయాచల పర్యంతంబు ప్రాగ్దిగ్విజయంబు సేసి ప్రాచిన్వంతుఁడు నాఁ బరఁగె; నట్టి ప్రాచిన్వంతునకు నశ్మకి యనుదానికి సంయాతి పుట్టె; వానికి వరాంగియనుదానికి నహంయాతి పుట్టె; వానికిం గృతవీర్యపుత్త్రియైన భానుమతికి సార్వభౌముండు పుట్టె; వానికిఁ గేకయ రాజపుత్త్రి యైన సునందకు జయత్సేనుండు పుట్టె; వానికి వైదర్భి యైన సుశ్రవసకు నవాచీనుండు పుట్టె; నయ్యవాచీనునకు విదర్భరాజపుత్త్రి యైన మర్యాదకు నరిహుండు పుట్టె; వానికి నాంగి యనుదానికి మహాభౌముండు పుట్టె; నా మహాభౌమునకుం బ్రసేనజిత్పుత్త్రియైన సుపుష్టకు నయుతానీకుండు పుట్టె; వానికిం బృథుశ్రవసుని పుత్త్రి**

యైన కామకు నక్రోధనుండు పుట్టె; వానికిం గాళింగి యైన కరంభ యనుదానికి దేవాతిథి పుట్టె; వానికి వైదేహి యయిన మర్యాదకు ఋచీకుండు పుట్టె; వానికి నాంగియైన సుదేవ యనుదానికి ఋక్షుండు పుట్టె; ఋక్షునకుఁ దక్షకపుత్త్రి యయిన జ్వాలయనుదానికి మతినారుండు పుట్టి. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= భారతకథను చెప్పేవా డైన సౌతి; శౌనక+ఆది, మహత్+మునులకున్= శౌనకుడు మొదలైన గొప్పమునులకు; చెప్పెన్= చెప్పాడు; అట్లు=(వెనుకచెప్పిన)ఆవిధంగా; యయాతికిన్= యయాతి మహారాజుకు; పుత్త్రుండు+అయిన= కుమారుడు అయిన; పూరుండు= పూరుడు; సకల, మహీ, రాజ్యంబు+చేయుచున్= సమస్త మైన భూమియొక్క పరిపాలనం చేస్తూ; వంశ, కర్త, అయిన= వంశానికి తనదైన వర్తనంవలన ఒక ప్రత్యేక గౌరవాన్ని కలిగించి, తన తరువాతి వంశజులకు తనపేరుతో పిలువబడే మర్యాదను సృష్టించే వాడిని వంశకర్త అంటారు. అటువంటివాడు కాగా; వానికిన్= ఆ పూరునకున్నూ; కౌసల్య, అనుదానికిన్= కౌసల్య అనే పేరు కల వనితకున్నూ; జనమేజయుండు; పుట్టి; రాజు+ఐ= ప్రభువుఅయి; అశ్వమేధత్రయంబున్+చేసి= అశ్వమేధయాగాలు మూడింటిని చేసి; ప్రఖ్యాతిన్+ఒందెన్= ప్రసిద్ధి పొందాడు; ఆ, జనమేజయునకున్; అనంత, అనుదానికిన్; ప్రాచిన్వంతుండు; పుట్టి; పరాక్రమంబునన్= శౌర్యంతో; ఉదయ+అచల, పర్యంతంబు= సూర్యుడు ఉదయించే తూర్పుదిక్కుకొండవరకు; ప్రాక్, దిక్, విజయంబు+చేసి= తూర్పుదిక్కును జయించి; ప్రాచిన్వంతుఁడు, నాన్= తూర్పుదిక్కుకు రాజు అని; పరఁగెన్= ప్రసిద్ధిపొందాడు; అట్టి, ప్రాచిన్వంతునకున్; అశ్మకి, అను, దానికిన్, సంయాతి, పుట్టెన్; వానికిన్= ఆ సంయాతికిన్నీ; వరాంగి, అను, దానికిన్, అహంయాతి, పుట్టెన్; వానికిన్= ఆ అహంయాతికిన్నీ; కృతవీర్యపుత్త్రి; అయిన= కృతవీర్యునియొక్క కూతు రయిన భానుమతికిన్= భానుమతికిన్నీ; సార్వభౌముండు; పుట్టెన్; వానికిన్= ఆ సార్వభౌముడికి; కేకయ, రాజపుత్త్రి, అయిన= కేకయరాజుకు కూతురయిన; సునందకున్; జయత్సేనుండు; పుట్టెన్; వానికిన్= ఆ జయత్సేనునకు; వైదర్భి, అయిన= విదర్భరాజుకు కూతురైన; సుశ్రవసకు; అవాచీనుండు; పుట్టెన్; ఆ+అవాచీనునకున్; విదర్భ, రాజపుత్త్రి, అయిన= విదర్భదేశరాజుకు కూతురయిన; మర్యాదకున్= మర్యాద అనేపేరు కల వనితకు; అరిహుండు, పుట్టెన్; వానికిన్= ఆ అరిహునకు; ఆంగి, అనుదానికిని; మహాభౌముండు; పుట్టెన్; ఆ, మహాభౌమునకున్; ప్రసేనజిత్, పుత్త్రి, అయిన= ప్రసేనజిత్తుని పుత్త్రిక అయిన; సుపుష్టకున్; ఆయుతానీకుండు; పుట్టెన్; వానికిన్= ఆ అయుతానీకునకునూ; పృథుశ్రవసుని, పుత్త్రిక అయిన; సుపుష్టకున్; అయుతానీకుండు; పుట్టెన్; వానికిన్= ఆ ఆయుతానీకునకునూ; పృథుశ్రవసుని, పుత్త్రి, అయిన= పృథుశ్రవసుని కూతురయిన; కామకున్; అక్రోధనుండు; పుట్టెన్; వానికిన్= అక్రోధనుడికి; కాళింగి, అయిన= కళింగదేశపురాజు కూతు రయిన; కరంభ, అను, దానికిని; దేవాతిథి, పుట్టెన్; వానికిన్= ఆ దేవాతిథికిని; వైదేహి, అయిన= విదేహరాజుయొక్క కూతురైన; మర్యాదకున్; ఋచీకుండు; పుట్టెన్; వానికిన్= ఆ ఋచీకునకును; ఆంగి+అయిన= అంగరాజుకు కూతురైన; సుదేవ, అనుదానికిన్; ఋక్షుండు, పుట్టెన్; ఋక్షునకున్; తక్షకపుత్త్రి, అయిన= తక్షకునియొక్క కూతురైన; జ్వాల, అనుదానికిని; మతినారుండు; పుట్టి.

తాత్పర్యం: స్పష్టం

క. **ఇమ్ముగ సరస్వతీ తీ । రమ్మునఁ బండ్రెండు వత్సరమ్ములు విధిమా**
ర్గమ్మున సద్గుణసముదా । య మ్మెసగఁగఁ జేసి సత్త్రయాగము నిష్ఠన్. 3

ప్రతిపదార్థం: ఇమ్ముగన్= ఇంపుగా; సరస్వతీ, తీరమ్మునన్= సరస్వతీనది ఒడ్డున; పండ్రెండు, వత్సరమ్ములు= పదిరెండు (12) సంవత్సరాలు; విధి, మార్గమ్మునన్= శాస్త్రపద్ధతితో; సత్+గుణ, సముదాయమ్ము= మంచిగుణాల సమూహము; ఎసగఁగన్= అతిశయించగా; నిష్ఠన్= ఎక్కువ శ్రద్ధతో; సత్త్రయాగమున్= సత్త్రయాగాన్ని; చేసెన్= ఆచరించాడు.

తాత్పర్యం: మతినారుడు సరస్వతీనదిఒడ్డున పన్నెండుసంవత్సరాలు సత్త్రయాగాన్ని విధివిధానంగానూ, సద్గుణసమూహాలు అతిశయించేటట్లుగానూ ఎక్కువశ్రద్ధతో ప్రీతితో చేశాడు.

విశేషం: 13 మొదలు 100 రోజులవరకూ కొనసాగే యాగాన్ని సత్త్రయాగమంటారు.

క. అతనికి సరస్వతీనది । మతి ననురక్త యయి వాని మానుగఁ దనకుం
బతిఁ జేసికొనియె ధర్మ । స్థితి; నయ్యిరువురకుఁ ద్రసుఁడు ధీరుఁడు పుట్టెన్. 4

ప్రతిపదార్థం: అతనికిన్= మతినారుని యందు (సప్తమికి మారుగా షష్ఠీవిభక్తి); సరస్వతీనది; మతిన్= మనస్సులో; అనురక్త+అయి= అనురాగం కలదై; వానిన్= ఆ మతినారుని; మానుగన్= ఒప్పుగా; తనకున్= తనకు; పతిన్= భర్తగా; ధర్మస్థితిన్= ధర్మమార్గాన; చేసికొనియెన్= చేసికొనెను. (వరించి పెండ్లాడింది); ఆ+ఇరువురకున్= సరస్వతికీ, మతినారునికీ; ధీరుఁడు= ధైర్యవంతుడైన; త్రసుఁడు= త్రసుడుఅనేవాడు; పుట్టెన్= జన్మించాడు.

తాత్పర్యం: మతినారునియందు సరస్వతీనదికి మనస్సులో అనురాగం కలుగగా, ఆమె అతడిని ధర్మమార్గంలో తనభర్తగా చేసికొన్నది. వారిద్దరికీ త్రసుడు అనేవాడు పుట్టాడు.

వ. ఆ త్రసునకుఁ గాళింది యనుదానికి నిలినుండు పుట్టె; వానికి రథంతరి యను దానికి దుష్యంతుండు పుట్టెఁ; బుట్టి యనన్యసాధారణశక్తియుక్తుం డై. 5

ప్రతిపదార్థం: ఆ, త్రసునకున్= ఆ త్రసు డనే రాజుకున్నూ; కాళింది, అనుదానికిన్= కాళింది అనేపేరు కల వనితకున్నూ; ఇలినుండు; పుట్టెన్; వానికిన్= ఆ ఇలినునకు; రథంతరి, అనుదానికిన్= రథంతరి అనే స్త్రీకిన్నీ; దుష్యంతుండు, పుట్టెన్= జన్మించాడు; పుట్టి; అనన్య, సాధారణ, శక్తి, యుక్తుండు+ఐ= ఇతరులకు సామాన్యం కాని సామర్థ్యం కలవాడై.

తాత్పర్యం: ఆ త్రసునికి కాళింది అనే భార్యయందు ఇలినుడు అనేవాడు పుట్టాడు. ఆ ఇలినుడికి రథంతరి అనేదానియందు దుష్యంతుడు జన్మించాడు. ఆ దుష్యంతుడు ఇతరులకు సాధారణంకాని (అధికమైన) సామర్థ్యంతో కూడినవాడై.

క. బాలహరిణములఁ బట్టెడు । లీలను విషమాటవీ చలిత కేసరి శా
ర్దూలేభ శరభములఁ దన । బాలత్వమునంద యెగిచి పట్టుచు మఱియున్. 6

ప్రతిపదార్థం: బాల, హరిణములన్= లేడిపిల్లలను; పట్టెడు, లీలను= పట్టుకొనేవిధంగా; విషమ+అటవీ, చలిత= తిరగటానికి వీలుకాని (దుర్గమమైన) అడవులందు తిరుగుతున్నట్టి; కేసరి= సింహాలను; శార్దూల= పులులను; ఇభ= ఏనుగులను; శరభములన్= మీఁగండ్లమృగాలను; తన, బాలత్వమునందున్+అ= తనచిన్నతనంలోనే; యెగిచి, పట్టుచున్= వెంటాడి పట్టుకొంటూ; మఱియున్= ఇంకనూ.

తాత్పర్యం: ఆ దుష్యంతుడు తన చిన్నతనంలోనే లేడిపిల్లలను పట్టుకొనేవిధంగా దుర్గమ మైన అడవుల్లో తిరుగాడే సింహాలను, పులులను, ఏనుగులను, శరభమృగాలను వెంటాడి పట్టుకొంటూ, ఇంకా, (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. శరభానికి ఎనిమిది కాళ్లుంటా యనీ, అది సింహంకంటె బలవత్తర మైన దనీ అంటారు.

క. ఉర్వీరుహ నివహముతోఁ । బర్వతములు వెఱికి యొండు పర్వతములపైఁ
బర్వఁగ వైచుచు యౌవన । గర్వంబున నొప్పె నుర్విఁ గడు నధికుం డై. 7

ప్రతిపదార్థం: ఉర్వీరుహ, నివహముతోన్= వృక్షాల సమూహంతోపాటుగా; పర్వతములు+పెటికి= పర్వతాలను పెకలించి; ఒండు, పర్వతములపైన్= వేరుపర్వతాలమీద; పర్వఁగన్, వైచుచున్= పడవేస్తూ; ఉర్విన్= భూమియందు; యౌవన, గర్వంబునన్= యౌవనం వలని గర్వంతో; కడున్+అధికుండు+ఐ= మిక్కిలి గొప్ప వాడయి; ఒప్పెన్= అతిశయించాడు.

తాత్పర్యం: వృక్షాలసమూహంతోపాటుగా పర్వతాలను పెకలించి వేరే పర్వతాలపై పడవేస్తూ, యౌవనగర్వంతో భూలోకంలో మిక్కిలి గొప్పవా డయి అతిశయించాడు.

విశేషం: పర్వతములు+పెటికి= 'ప' కు 'వ' ఆదేశం; పర్వతములు వెటికి; గసడదవాదేశం.

దుష్యంతుఁడు వేఁట కరుగుట (సం. 1-63-1)

శా. ఆ దుష్యంతుఁ డనంతసత్త్వుఁడు సమస్తాశాంతమాతంగ మ
ర్యాదాలంకృత మైన భూవలయ మాత్మాయత్త మై యుండఁగా
నాదిత్యాంశు సమీర దుర్గమ మహోగ్రారణ్య దేశాళితో
నాదిక్షత్త్ర చరిత్ర నేలె నజితుండై బాహువీర్యంబునన్. 8

ప్రతిపదార్థం: అనంత, సత్త్వుఁడు= అంతులేని బలం కలిగిన; ఆ, దుష్యంతుఁడు= అంతటిదుష్యంతుడు; సమస్త, ఆశా+అంత, మాతంగ, మర్యాదా+అలంకృతము+ఐన= అన్నిదిక్కులయొక్క చివరలందలి ఏనుగులయొక్క హద్దుతో అలంకరింపబడింది అయిన; భూవలయము= భూమండలం; ఆత్మ+ఆయత్తము+ఐ, ఉండఁగాన్= తనకు ఆధీనం కాగా; ఆదిత్య+అంశు, సమీర, దుర్గమ, మహత్, ఉగ్ర, అరణ్య, దేశ+ఆళితోన్= సూర్యుడి కిరణాలకున్నూ, గాలికిన్నీ ప్రవేశింప శక్యంగాని మిక్కిలి భయంకర మైన అడవిప్రాంతాల సమూహంతో; ఆది, క్షత్త్ర, చరిత్రన్= తొలుతటి మనువు మొదలైన రాజుల చరిత్రవంటి చరిత్రతో; బాహువీర్యంబునన్= భుజాలయొక్క బలంతో; అజితుండు+ఐ= ఓడనివాడై; ఏలెన్= పరిపాలించాడు.

తాత్పర్యం: అనంతమైన బలం కలిగిన ఆ దుష్యంతుడు అన్ని దిక్కులచివరలలో గల యేనుగులు (అష్టదిగ్గజాలు) సరిహద్దుగా ఒప్పిన భూమండలం తనకు అధీనమై ఉండగా సూర్యకిరణాలకున్నూ వాయువుకున్నూ ప్రవేశింపరానట్టి భయంకరాలైన అడవిప్రదేశాలతోపాటుగా పూర్వరాజులవర్తనంవంటి వర్తనంతో, భుజబలంతో, ఓడనివాడై భూమిని పరిపాలించాడు.

విశేషం: భూమిని ఎనిమిది దిక్కులందు ఎనిమిది ఏనుగులు మోస్తూ ఉంటా యని చెప్తుతారు. ఆ అష్టదిగ్గజాలు హద్దుగా గల భూమి అంటే సర్వభూమిని అని అర్థం. దుష్యంతుని విశాలమైన రాజ్యంలో దుర్గమారణ్యాలు, తపోవనాలు ఎక్కువగా ఉన్నా యని సూచన. ఇవి భావికథలో దుష్యంతుడు వేటకు పోవటానికీ, శకుంతలను చూచి వివాహం చేసికొనటానికీ అనువుగా ఉన్నవి. ఇటువంటిభావికథార్థసూచన నన్నయ వస్తుధ్వనికి నిదర్శనం. 'అనంతసత్త్వుఁడు' అంటే అనంతుడి(ఆదిశేషుడి) బలంవంటి బలం కలవాడనికూడ అర్థం చెప్పవచ్చును. భూభారం వహించే సందర్భం కనుక ఇదికూడ సమంజసంగా ఉంటుంది. ఓజోగుణభూయిష్ఠమైన ప్రసాదగుణం ఉదాత్తవిభావవర్ణనలో సముచితంగా ప్రయోగింపబడింది.

క. ఆతని రాజ్యంబున ను। ర్వీతలము ప్రజాసమృద్ధి వెలసి రుజాశో
కాతంక క్షయ శంకా। పేతం బై ధర్మచరితఁ బెరుఁగుచు నుండెన్. 9

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అతని రాజ్యంబునన్= ఆ దుష్యంతుని పరిపాలనలో; ఉర్వీతలము= భూతలం; ప్రజాసమృద్ధిన్= జనులయొక్క అభివృద్ధితో; వెలసి= ప్రసిద్ధిపొంది; రుజా, శోక, ఆతంక, క్షయ, శంకా+అపేతంబు+ఐ= రోగాలు, దుఃఖాలు, విఘ్నాలు, నష్టాలు, అనుమానాలు లేనిదై; ధర్మ, చరితన్= ధర్మమైన వర్తనంతో; పెరుఁగుచున్+ఉండెన్= అభ్యుదయాన్ని పొందుతూ ఉన్నది.

తాత్పర్యం: దుష్యంతుడి పరిపాలనంలో దేశం ప్రజలఅభివృద్ధితో ప్రసిద్ధిచెంది రోగాలూ, దుఃఖాలూ, విఘ్నాలూ, నష్టాలూ, అనుమానాలూ ఏమీ లేనిదై ధర్మమైన ప్రవర్తనంతో సాగుతూ ఉన్నది.

విశేషం: దుష్యంతుడు ప్రజలకు ధర్మవర్తన మైన పాలనను అందించటంవలన వారికి ఎటువంటి అరిష్టాలు కలుగకుండా అభ్యుదయాలు కలుగుతూ ఉన్నాయని తాత్పర్యం. మూలంలో ఆరు శ్లోకాలలో ఉన్న భావాన్ని 'రుజా..... అపేతంబై' అన్న సమాసంలో కుదించి చెప్పాడు నన్నయ. భావికథలో ప్రజాపవాదభీతివలన శకుంతలాభరతులను భార్యాపుత్త్రులనుగా నిండుసభలో పేర్కొనకపోవటానికి తగిన భిత్తికను నన్నయ కథాకథనంలో సమకూర్చాడు.

వ. అమ్మహీపతి యొక్కనాఁడు మృగయావినోదార్థి యయి యాదిత్యహయంబులకంటె వడిగల హయంబులు పూనిన రథం బెక్కి యాజానేయతురంగారూఢు లైన యాశ్వికులు పరివేష్టించి రాఁగ ననంతకుంతశక్తిచాప కృపాణపాణు లయిన వీరభటసహస్రంబులతోఁ జని వనంబులోని మృగంబులం జుట్టుముట్టి. 10

ప్రతిపదార్థం: ఆ+మహీపతి= భూమికి నాథు డైన ఆ దుష్యంతుడు; ఒక్కనాఁడు= ఒకరోజున; మృగయా, వినోద+అర్థి, అయి= వేటయందలి ఆనందాన్ని కోరినవాడై; ఆదిత్య, హయంబులకంటెన్= సూర్యుడియొక్క గుఱ్ఱాలకంటె; వడి+కల= వేగం కలిగిన; హయంబులు, పూనిన= గుఱ్ఱాలను కట్టిన; రథంబు+ఎక్కి= రథాన్ని ఎక్కి; ఆజానేయ, తురంగ+ఆరూఢులు+ అయిన= మేలిజాతి గుఱ్ఱాలను ఎక్కినట్టివా రైన; ఆశ్వికులు= రౌతులు; పరివేష్టించి, రాఁగన్= చుట్టూ చేరి వస్తూఉండగా; అనంత, కుంత, శక్తి, చాప, కృపాణ, పాణులు+అయిన= అనేకాలైన ఈటెలు, చిల్లకోలలు (ఆయుధవిశేషాలు), విండ్లు, కత్తులు చేతులలో కలవారైన; వీర, భట, సహస్రంబుతోన్= వీరులైన అనేక యోధులతో; చని= వెళ్ళి; వనంబులోని= అడవిలోని; మృగంబులన్= జంతువులను; చుట్టుముట్టి= నలువైపుల క్రమ్ముకొని దాడిచేసి.

తాత్పర్యం: ఆ దుష్యంతుడు ఒకనాడు వేటాడి వేడుక పడదామన్న కోరికతో సూర్యుడి గుఱ్ఱాలకంటె వేగంగల గుఱ్ఱాలను కట్టిన రథాన్ని ఎక్కి, మేలిరకం గుఱ్ఱాలపై ఎక్కిన ఆశ్వికులు తన చుట్టూ చేరి అనుసరిస్తూ ఉండగా ఈటెలు, చిల్లకోలలు, విండ్లు, కత్తులు మొదలైన ఆయుధాలను ధరించిన వీరభటులు అనేకులు వెంటరాగా, ముందుకు సాగి, వనంలోని మృగాలను నలువైపుల చుట్టుముట్టి దాడిచేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. కలయఁగ నార్పుల బొబ్బల । యులివున నవ్విపిన మను మహోదధిఁ బెలుచం
గలఁచెను దుష్యంత మహా । బల మందరనగము సత్త్వభయజననం బై. 11

ప్రతిపదార్థం: కలయఁగన్= వనమంతా వ్యాపించగా; ఆర్పులన్= మానవుల అరపులయూ, బొబ్బలన్= జంతువుల అరపులయూ; ఉలివునన్= ధ్వనితో; ఆ+విపినము+అను, మహత్+ఉదధిన్= ఆ అరణ్యమనే పెద్ద సముద్రాన్ని; దుష్యంత, మహత్+బల, మందర, నగము= దుష్యంతుడిసేన అనే మందరపర్వతం; సత్త్వ, భయ, జననంబు+ఐ= ప్రాణులకు భయాన్ని కలిగించే దై; పెలుచన్= ఆటోపంతో; కలఁచెను= కలతపెట్టింది.

తాత్పర్యం: ఆ వనమంతా వ్యాపించగా భటులూ, జంతువులూ చేసే కేకలూ అరుపులూ కలిసిన చప్పుడుతో ఆ అరణ్య మనే మహాసముద్రాన్ని దుష్యంతుడిసేన అనే మందరపర్వతం (కవ్వపుకొండ) ప్రాణులకు భయంకలిగేటట్లు కలతపెట్టింది.

విశేషం: అలం: రూపకం. అరణ్యమనే సముద్రాన్ని మథించగా దుష్యంతుడికి శకుంతల అనే లక్ష్మి లభిస్తుం దనే సూచన ఇందులో ఉన్నది.

క. సరభస పరిచరిత మహా । శరభ ద్విపరిపు వరాహ శార్దూల మద
ద్విరదాది ప్రకర భయం । కరవనమధ్యమున నృపతి గడుఁ గడిమిమెయిన్. 12

ప్రతిపదార్థం: సరభస= తొట్రుపాటుతో కూడికొన్న వేగంతో; పరిచరిత= తిరుగుతున్న; మహత్+శరభ= గొప్పవైన శరభమృగాలున్నూ; ద్విప, రిపు= (ఏనుగులకు శత్రువులైన) సింహాలున్నూ; వరాహ= పందులున్నూ; శార్దూల= పెద్దపులులున్నూ; మద, ద్విరద+ఆది= మదించిన ఏనుగులు మొదలైన వానియొక్క; ప్రకర= సమూహాలచేత; భయంకర= భయాన్ని కలిగించే; వన, మధ్యమునన్= అరణ్యముయొక్క నడిమిప్రాంతంలో; నృపతి= రాజు, దుష్యంతుడు; కడున్= మిక్కిలి; కడిమిమెయిన్= పరాక్రమంతో.

తాత్పర్యం: తొందరగా తిరుగుతున్న మహాశరభాలు, సింహాలు, పందులు, పెద్దపులులు, మదపుటేనుగులు మొదలైన జంతుసమూహాలతో భయంకరమైన ఆ అరణ్యమధ్యప్రాంతంలో దుష్యంతుడు మిక్కిలి పరాక్రమంతో.

విశేషం: 10వ వచనం నుండి వేటవర్ణనం జరుగుతున్నది. రాజు సైన్యంతో అడవిలో ప్రవేశించి, మృగాలను చుట్టుముట్టి, అరుపులతో, బొబ్బలతో వేసి, వాటిని భయపెట్టి అరణ్యమధ్యభాగానికి వచ్చేటట్లు చేశాడు. వనమధ్యభాగంలో రాజు వేటచేశాడు. అత్యంత సహజసుందరంగా వేటవర్ణనం సాగుతున్నది. మితహితవచనాలకూ, యథార్థవర్ణనలకూ స్తుతులకూ నన్నయ ప్రసిద్ధి.

క. ఓసరిలి పఱచు మృగముల । నేసియు, డాసిన మృగముల నెగచి భుజాసిన్
వ్రేసియుఁ, జంపెను మృగయా । వ్యాసక్తి నపారఘోరవన్యమృగాళిన్. 13

ప్రతిపదార్థం: ఓసరిలి= తప్పించుకొని; పఱచు= పారిపోవు; మృగములన్= జంతువులను; ఏసియున్= కొట్టియున్నూ; డాసిన, మృగములన్= దగ్గరకు వచ్చిన జంతువులను; ఎగచి= తరిమి, కుప్పించి; భుజ+అసిన్= చేతిలోని కత్తితో; వ్రేసియున్= కొట్టియు, నరికియున్నూ; మృగయా, వ్యాసక్తిన్= వేటయందలి వేడుకతో; అపార, ఘోర, వన్య, మృగ+ఆళిన్= అంతులేని క్రూరాలైన అడవికి చెందిన జంతువుల సమూహాన్ని; చంపెను= చంపాడు.

తాత్పర్యం: తప్పించుకొని పారిపోయే జంతువులను కొట్టియున్నూ, సమీపానికి వచ్చినవాటిని తరిమి, కుప్పించి నరికియున్నూ దుష్యంతుడు వేటలోని వేడుకతో అపారక్రూరవనజంతువులను సంహరించాడు.

వ. ఇట్లు పెక్కుమృగంబుల నెగిచి చంపుచు మఱియుఁ జంపెడువేడుక నతి దూరంబున కరిగిన, నాతని రథవేగంబు ననుగమింపనోపక యధిక క్షుత్పిపాసాపరవశు లయి పదాతు లయ్యయి ప్రదేశంబుల

విశ్రమించి; రంత దుష్యంతుండు కతిపయామాత్య పురోహితసహితుం డై కొండొకనేల యరిగి, ముందట నొక్క పుణ్యనదీతీరంబున వివిధసురభి కుసుమఫల భారవినమ్ర తరులతాగుల్మ పరిశోభితం బయిన యొక్కవనంబు గని. 14

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; పెక్కు, మృగంబులన్= అనేక జంతువులను; ఎగిచి, చంపుచున్= తరిమి చంపుతూ; మఱియున్= ఇంకను; చంపెడు, వేడుకన్= వేటచేయాలన్న ఆసక్తితో; అతిదూరంబునకున్= మిక్కిలి దూరానికి; అరిగినన్= వెళ్ళగా; ఆతని, రథ, వేగంబున్= దుష్యంతునియొక్క రథంయొక్క వేగాన్ని; అనుగమింపన్+ఓపక= అనుసరించటానికి సమర్థులు కాక; అధిక, క్షుద్, పిపాసా, పరవశులు+అయి= ఎక్కువగా ఆకటిచేతను, దప్పికచేతను, అదుపుతప్పినవారై; పదాతులు= నేలపై నిలబడి యుద్ధం చేసే సైనికులు; ఆ+అయి, ప్రదేశంబులన్= ఆయా ప్రాంతాలలో; విశ్రమించిరి= విశ్రాంతి తీసికొన్నారు; అంతన్= ఆ సమయంలో; దుష్యంతుండు; కతిపయ+అమాత్య, పురోహిత, సహితుండు+ఐ= కొందరుమంత్రులతో, మంచిచెడులను తెలిపే బ్రాహ్మణులతో కూడినవాడై; కొండు+ఒక, నేల, అరిగి= వేఱొక ప్రదేశానికి చేరి; ముందటన్= ఎదురుగా; ఒక్క, పుణ్య, నదీ, తీరంబునన్= ఒక పవిత్ర మైన నదియొక్క ఒడ్డున; వివిధ, సురభి, కుసుమ, ఫల, భార, వినమ్ర, తరు, లతా, గుల్మ, పరిశోభితంబు+అయిన= రకరకా లయిన వాసనలు కలిగిన పూవులయొక్క పండ్లయొక్క బరువుచే వంగిన చెట్లు, తీగలు, పొదలతో అలంకరింపబడిన; ఒక్క, వనంబు+కని= ఒక వనాన్ని చూచి.

తాత్పర్యం: ఆవిధంగా దుష్యంతుడు అనేకమృగాలను తరిమి తరిమి చంపుతూ, ఇంకా వేటాడే వేడుకతో చాలదూరం వెళ్ళగా, ఆతడి రథవేగానికి కాలిబంట్లు తట్టుకోలేక, అనుసరించే ఓపికను కోల్పోయి, ఆకలిదప్పులతో అదుపుతప్పి ఆ యా ప్రదేశాలలో విశ్రాంతి తీసికొన్నారు. ఆ సమయంలో దుష్యంతుడు కొందరు మంత్రులతో, పురోహితులతో కలిసి వేరొక ప్రదేశానికి చేరి, ఎదురుగా ఒక పవిత్రమైన నదిఒడ్డున పలురకాల వాసనలు గల పూలతోనూ, పండ్లభారంతోనూ వంగిన చెట్లతో, తీగలతో, పొదలతో అందమైన ఒక వనాన్ని చూచాడు.

విశేషం: దుష్యంతుడు వేటాడినది సూర్యరశ్మి సోకని దుర్గమారణ్యం. దానికి సమీపంలో ఉన్నది మాలిని అనే పుణ్యనది. ఆ నదికి ఆవలి ఒడ్డుపై ఉన్నది తపోవనం. ఇటు అరణ్యానికీ అటు తపోవనానికీ నడుమ పుణ్యనది. ప్రకృతివర్ణనం పరమరమణీయం.

కణ్వాశ్రమ వర్ణన (సం. 1-64-3)

క. అమరపతి ఖాండవమునకు । రమణను వైశ్రవణు చైత్రరథమునకు సమా
నముగా దీనిని భూభా । గమునను రచియించె నొక్కొ కమలజుఁడు దయన్. 15

ప్రతిపదార్థం: కమలజుఁడు= తామరపూవునందు పుట్టినవాడైన బ్రహ్మ; దయన్= కనికరంతో; దీనిని= ఈవనాన్ని; అమర, పతి, ఖాండవమునకున్= దేవతలకు ప్రభువైన ఇంద్రుడి (ఉద్యానవనమైన) ఖాండవానికి; రమణను= ఒప్పిదమైన గుణంలో; వైశ్రవణు, చైత్రరథమునకున్= కుబేరుడియొక్క (ఉద్యానవనమైన) చైత్రరథానికి; సమానముగాన్= సరిసమానంగా, తుల్యంగా; భూ, భాగమునను= ఈ భూఖండంలో; రచియించెన్+ఒక్కొ= నిర్మించాడు కాబోలు.

తాత్పర్యం: ఈవనాన్ని ఇంద్రుడి ఉద్యానవనమైన ఖాండవానికీ, కుబేరుని ఉద్యానవనమైన చైత్రరథానికీ అందంలో సమానంగా ఉండేటట్లు భూతలంమీద బ్రహ్మ దయతో నిర్మించాడు కాబోలు!

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. వనదర్శనంచేతనే అద్భుతభావావిష్టుడైనాడు దుష్యంతుడు. అందులో ప్రవేశిస్తే మరికొన్ని అద్భుతాలను చూడబోతున్నాడనీ, అనుభవించబోతున్నాడనీ అలంకారకృతవస్తుధ్వని. అద్భుతభావవ్యంజకంగా ఫలోత్ప్రేక్షను నన్నయ నిపుణంగా ప్రయోగించాడు.

వ. అని దాని రమణీయభావంబుఁ బొగడుచుఁ జనుదెంచి యవ్వనంబు సొచ్చునప్పుడు 16

ప్రతిపదార్థం: అని= ఆవిధంగా; దాని= ఆవనంయొక్క; రమణీయ, భావంబున్= అందమైన విధానాన్ని; పొగడుచున్= మెచ్చుకొంటూ; చనుదెంచి= వచ్చి; ఆ+వనంబు, చొచ్చునప్పుడు= ఆవనంలో ప్రవేశించేటప్పుడు (గసడదవాదేశం).

తాత్పర్యం: ఆవిధంగా దుష్యంతుడు ఆ వనసౌందర్యాన్ని మెచ్చుకొంటూ వచ్చి ఆ వనంలో ప్రవేశించే సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. అతిరుచిరాగతుం డయిన యాతనికిన్ హృదయప్రమోద మా
తతముగ నవ్వనంబున లతాలలనల్ మృదులానిలాపవ
ర్జిత కుసుమాక్షతావళులు సేసలు వెట్టినయట్టిరైరి సం
పత దళినీనినాదమృదుభాషల దీవన లొప్ప నిచ్చుచున్. 17

ప్రతిపదార్థం: అతిరుచిర+ఆగతుండు+అయిన= మిక్కిలి ఒప్పిద మైన ఆగమనం కలవాడైన; (ఆగతమంటే ఆగమనం - భావేక్తః- సు+ఆగతము= స్వాగతం కలవాడు అని భావం); ఆతనికిన్= ఆ దుష్యంతుడికి; హృదయ, ప్రమోదము= మనస్సులోని ఆహ్లాదం; ఆతతముగన్= అధికమయ్యేటట్లుగా; ఆ+వనంబున= ఆ వనంలోని; లతాలలనల్= తీగ లనెడి వనితలు; సంపతత్, అళినీ, నినాద, మృదుభాషలన్= అటూ ఇటూ తిరుగుతున్న ఆడుతుమ్మెదల ఝుంకారాలు (ధ్వనులు) అనే మెత్తనిమాటలతో; దీవనలు= ఆశీస్సులను, శుభాకాంక్షలను; ఒప్పన్= తగినవిధంగా; ఇచ్చుచున్= ఇస్తూ; మృదుల+ అనిల+అపవర్జిత, కుసుమ+అక్షత+ఆవళులు= మెల్లని(మెత్తని) గాలులచేత రాల్చబడిన పూవులు అనెడి అక్షతల సమూహాలను; సేసలు, పెట్టిన, అట్టిరు+ఐరి= తలంబ్రాలుగా పోసినవా రైనారు-లేదా-ఆశీఃపురస్సరంగా అక్షతలు చల్లినవారైనారు.

తాత్పర్యం: మిక్కిలి సముచితంగా వచ్చిన ఆ దుష్యంతుడికి మనస్సులోని ఆహ్లాదం అధికమయ్యేటట్లుగా ఆ వనంలోని లతలనే వనితలు అటూ ఇటూ ఎగురుతున్న ఆడుతుమ్మెదల ఝుంకారధ్వనులనెడి మెత్తనిమాటలతో తగిన విధంగా ఆశీస్సులను ఇస్తూ, మెల్లనిగాలులచేత రాల్చబడిన పూవు లనెడి అక్షతలసమూహాన్ని తలంబ్రాలుగా చల్లినట్లు భాసించారు.

విశేషం: అలం: రూపకం, ఉత్ప్రేక్ష, సముచితంగా ప్రవేశించిన రాజుకు సముచితమైన స్వాగతం లభించినట్లు నన్నయ వర్ణించాడు. లతాలలనలు కల్యాణగీతాలతో పుష్పాక్షతలను తలంబ్రాలు పోసినట్లు మీదచల్లారని చేసిన ఈవర్ణనం దుష్యంతుడికి జరుగబోయే కల్యాణాన్ని సూచిస్తున్నది. భావికథార్థవ్యంజకమైన ఈపద్యం నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తికి రుచిరార్థసూక్తికీ చక్కని ఉదాహరణం. పద్యరచనలో అక్షరరమ్యత ప్రసాదమిశ్రితమైన మాధుర్యగుణాన్ని పోషిస్తూ శృంగారవ్యంజకంగా, ఆస్వాదయోగ్యంగా అమరింది. సవర్ణదీర్ఘాక్షరాల సంయోజనం పద్యానికి గీతికామాధుర్యాన్ని కలిగిస్తున్నది. నన్నయకవితాలక్షణాలన్నీ అమరిన అందమైన పద్య మిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియును. 18

తాత్పర్యం: ఇంకను. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. కాఱడవిఁ బఱచు మృగముల । నూఱడకం దిగిచి డస్సియున్నతని శ్రమం
బాఱఁగ నెడఁ బరితాపము । దీఱఁగఁ బైవీచె నన్నదీపవనంబుల్. 19

ప్రతిపదార్థం: కాఱడవిన్= దట్టమైన అడవిలో; పఱచు, మృగములన్= పరుగెత్తే జంతువులను; ఊఱడకన్= విరామంలేకుండా; తిగిచి= చంపి, వేటాడి; డస్సి, ఉన్న, అతని= అలసియున్న ఆ దుష్యంతుడియొక్క; శ్రమంబు+ఆఱఁగన్= బడలిక తొలగేటట్లు; ఎడన్= మనస్సులోని; పరితాపము, తీఱఁగన్= తాపం తీరేటట్లుగా; ఆ+నదీ, పవనంబుల్= ఆ నదియొక్కగాలులు; పై, వీచెన్= దుష్యంతునిమీద ప్రసరించెను.

తాత్పర్యం: దట్టమైన అడవిలో పరుగెత్తే మృగాలను విరామం లేకుండ వెంటాడి వేటాడటంచేత అలసియున్న దుష్యంతుడి బడలిక తీరేటట్లు, మనసులోని తాపం తగ్గేటట్లు ఆ నదిమీదనుండి వచ్చే చల్లనిగాలులు అతనిపై వీచాయి.

మానిని. ఏచి తనర్చి తలిర్చిన క్రోవుల నిమ్మగు ఠావుల, జొంపములం
బూచిన మంచియశోకములన్, సురపొన్నలఁ, బొన్నల, గేదఁగులం,
గాచి బెడంగుగఁ బండిన యాసహకారములం, గదళీతతులం
జూచుచు, వీనుల కింపెసఁగన్ వినుచున్ శుకకోకిల సుస్వరముల్. 20

ప్రతిపదార్థం: ఏచి= విజృంభించి (పొడవుగా); తనర్చి= ప్రకాశించి పెరిగి; తలిర్చిన= చిగురులువేసిన; క్రోవులన్= ఎర్రగోరంటచెట్లచే; ఇమ్మగు= సొగసైన; ఠావులన్= తావులను; జొంపములన్= గుబురులుగా; పూచిన= పూలు పూసిన; మంచి, అశోకములన్= అనువైన అశోకవృక్షాలను; సురపొన్నలన్= సురపొన్న వృక్షాలను; పొన్నలన్= పొన్నచెట్లను; గేదఁగులన్= మొగలిచెట్లను; కాచి= కాయలుకాసి; బెడంగుగన్= బాగుగా; పండిన= పండియున్న; ఆ సహకారములన్= ఆ తీయమామిడిచెట్లను; కదళీ, తతులన్= అరటిచెట్ల సమూహాలను; చూచుచున్= చూస్తూ; వీనులకున్= చెవులకు; ఇంపు+ఎసఁగన్= ప్రీతికలిగేటట్లుగా; శుక, కోకిల, సుస్వరముల్= చిలుకలపలుకులు, కోకిలపాటలు (సుస్వరాలు); వినుచున్= వింటూ.

తాత్పర్యం: పొడవుగా పెరిగి చిగురించిన ఎర్రగోరంటచెట్లచే అంద మైన తావులనూ, గుబురులుగా పూలు పూసిన మంచిఅశోకవృక్షాలనూ, సురపొన్నలనూ, పొన్నలనూ, మొగలిపొదలనూ, చక్కగా కాయలు కాసి పండిన అందమైన తియ్యమామిడిచెట్లనూ, అరటిచెట్లగుంపులనూ చూస్తూ చిలుకలపలుకులను, కోకిలలమధురస్వరాలను చెవులకు పండువుగా వింటూ- (మీది పద్యంతో అన్వయం).

విశేషం: అలం: రూపకం, మానినీవృత్తంలోని ప్రతిచరణంలోనూ 7 భగణాలపై ఒక గురువు ఉంటుంది. 1-13-19 అక్షరాలకు ఒక యతి చొప్పున మూడు యతిస్థానాలుంటాయి. నన్నయ మాత్రం 13వ అక్షరానికి మాత్రమే యతిమైత్రిని పాటించాడు. తెలుగులో ఆ, ఈఅనేవర్ణాలు ప్రసిద్ధినీ, విశేషాన్నీ, మహత్త్వాన్నీ, నిర్దేశాన్నీ సూచిస్తుంటాయి.

కవిరాజవిరాజితము.

చని చని ముందట నాజ్య హవిర్ధృత సౌరభ ధూమలతాతతులం
బెనఁగిన ప్రాఁకుల కొమ్మలమీఁద నపేతలతాంతము లైనను బా
యని మధుపప్రకరంబులఁ జూచి జనాధిపుఁ డంత నెఱింగెఁ దపో
వన మిది యల్లదె దివ్యమునీంద్రునివాసము దానగు నంచు నెదన్. **21**

ప్రతిపదార్థం: చని, చని= వెళ్ళివెళ్ళి; ముందటన్= ఎదురుగా; ఆజ్య, హవిః, ధృత, సౌరభ, ధూమలతా, తతులన్= యజ్ఞాలలో హోమం చేసే హవి స్సయిన నేతివాసనచేత ధరింపబడిన వాసనలు కల పొగలను కలిగిన (పొగచూరిన) తీగలయొక్క సమూహాలతో; పెనఁగిన= అల్లుకొనిపోయిన; ప్రాఁకుల, కొమ్మల, మీఁదన్= చెట్లయొక్క కొమ్మలపై; అపేత, లతాంతములు+ఐనను= తొలగిన పూవులు కలిగిన వైనా (పూవులులేని వైనా అనిభావం); పాయని= (చెట్లను) విడిచిపెట్టని; మధుప, ప్రకరంబులన్= తుమ్మెదలయొక్క గుంపులను; చూచి; జన+అధిపుఁడు= ప్రజలకు ప్రభువైన ఆ దుష్యంతుడు; అంతన్= అపుడు; ఇది= ఈప్రదేశం; తపస్+వనము= (ఋషులు) తపస్సు చేసుకొనటానికి అనువైన అడవి; అల్ల+అదె= ఆ కనపడేదే (సమీపవాచకం); దివ్య, ముని+ఇంద్రు, నివాసము= మహిమాన్వితులైన మునులలో (ఇంద్రునివంటివాడు) శ్రేష్ఠుడైన వాడియొక్క ఉండేచోటు; తాను+అగున్, అంచున్= అయిఉండవచ్చునని; ఎదన్= మనస్సులో; ఎఱింగెన్= తెలిసికొన్నాడు.

తాత్పర్యం: ఆవిధంగా చాలదూరం వెళ్ళి ఎదురుగా యజ్ఞహవిస్సులైన నేతులవాసనలుగల పొగలతో చూరిన తీగలతో అల్లుకొని ఉన్న చెట్లకొమ్మలమీద పూవులు లేకున్నప్పటికీ విడిచివెళ్ళకుండా ఉన్న తుమ్మెదగుంపులను చూచి, ఆ ప్రాంతం తపోవన మనిన్నీ, దగ్గరలో ఉన్నది దివ్యమునీంద్రుడియొక్క నివాస మనిన్నీ అపుడు దుష్యంతుడు మనసులో తెలిసికొన్నాడు.

విశేషం: కవిరాజవిరాజితంలోని ప్రతిచరణంలోనూ 1 నగణం, 6 జగణాలూ, 1 వగణం వరుసగా ఉంటాయి. 1, 8, 14, 20 అక్షరాలు యతిస్థానాలు. ప్రాసనియమం ఉన్నది. నన్నయ మాత్రం 14వ అక్షరంతో మాత్రమే యతిమైత్రిని పాటించి ఒక యతికే ప్రాధాన్య మిచ్చాడు. మానినీవృత్తపాదంలోని మొదటి గురువును రెండు లఘువులుగా మారిస్తే కవిరాజవిరాజిత మౌతుంది. మానినీ, కవిరాజవిరాజితాలు రెండున్నూ జంటగా కుదిరి శకుంతలాదుష్యంతుల భావికల్యాణ సమాగమాన్ని. సూచిస్తున్నవి. వనాలకంటె, ఉద్యానవనాలకంటె తపోవనానికి ఉండే విలక్షణత్వాన్ని నన్నయ ఈవర్ణనంలో చిత్రించాడు. కొమ్మలకు తీగలు అల్లుకోవటం, ఆతీగలపూలమీద తుమ్మెదలువ్రాలటం సామాన్యవనాలస్వభావం. కాని, తపోవనంలో, పూలు, పూలవాసన లేకపోయినా లతలు హవిస్సులపొగవలన కలిగిన వాసనతో తుమ్మెదలను అమితంగా ఆకర్షిస్తున్నాయి. నాగరకజీవితంలోని విలాసగృహస్థధర్మంకంటె ఆశ్రమంలోని నియమసహితగృహస్థధర్మంలోని గాఢత్వాన్ని నన్నయ వ్యంజింపచేస్తున్నాడు. హవిస్సులవాసన అక్కడిస్త్రీల (శకుంతలాదుల) పాతివ్రత్యస్వభావవ్యంజకం.

వ. **ఇట్లు హృదయసుఖావహం బగుచున్న యవ్వనంబులో నరిగి యరిగి యనవరత మహాద్విజ పఠ్యమానవేదధ్వనులను, నవిచ్ఛిన్న హూయమానాగ్ని హోత్రస్వాహాశబ్దంబులను, ననేకమునిగణప్రణీత వచన విషయ విభాగ వినిర్ణయన్యాయనిపుణ విద్వత్సభాసంభాషణఘోషంబులను, బ్రతిపక్ష దుర్విభేద ప్రమాణ విచార్యమాణ వేదార్థ మీమాంసక గోష్ఠీవివాద నాదంబులనుంజేసి మ్రోయుచు, యజ్ఞప్రయోగప్రవీణు లయిన యాజ్ఞికులకును విహితానుష్ఠానాసక్తులయిన యనుష్ఠాతలకును నధికతపోనిరతు లయిన**

మహాతపోధనులకును నివాసం బయిన పుణ్యనదీతీరంబునఁ దద్దయు రమ్యం బయి గంగాతీరంబున నరనారాయణస్థానంబునుంబోలె జగత్పావనం బైన కణ్వమహాముని యాశ్రమంబు గని యందు. 22

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; హృదయ, సుఖ+ఆవహంబు+అగుచున్+ఉన్న= మనస్సుకు హాయిని కలిగిస్తూ ఉన్న; ఆ+వనంబులోన్+అరిగి= ఆ వనంలోకివెళ్ళి; అనవరత, మహత్, ద్విజ, పఠ్యమాన, వేద, ధ్వనులను= ఎల్లప్పుడు గొప్ప బ్రాహ్మణులచేత చదువబడుతున్న వేదాలయొక్క స్వరనాదాలను; అవిచ్ఛిన్న, హూయమాన+అగ్నిహోత్ర, స్వాహా, శబ్దంబులను= ఎడతెగకుండ హోమం చేయబడుతున్న అగ్నిహోత్రానికి చెందిన స్వాహా అనే శబ్దాలను; అనేక, మునిగణ, ప్రణీత, వచన, విషయ, విభాగ, వినిర్ణయ, న్యాయ, నిపుణ, విద్వత్, సభా, సంభాషణ, ఘోషంబులను= పెక్కుమంది మునుల సమూహాలచేత రచింపబడిన వాక్యతాత్పర్యాలను విభజించి అర్థనిర్ణయం చేసే న్యాయశాస్త్రనిపుణు లైన పండితులయొక్క సభలలో జరిగే సంభాషణల సవ్వడులను; ప్రతిపక్ష, దుర్విభేద, ప్రమాణ, విచార్యమాణ, వేద+అర్థ, మీమాంసక, గోష్ఠీ వివాదనాదంబులనున్+చేసి= ప్రతిపక్షం (ఎదురువాదం) చేసేవారికి చిక్కువిడదీయరాని ప్రమాణాల (ఉపపత్తుల)తో ఆలోచింపజేస్తూ ఉన్న వేదతాత్పర్యం గల మీమాంసకులయొక్క చర్చలలోని వాదప్రతివాదాల ధ్వనులచేత; మ్రోయుచున్= సవ్వడిచేౌతూ; యజ్ఞ, ప్రయోగ, ప్రవీణులు+అయిన= యజ్ఞాలను నిర్వహించటంలో నిపుణులైన; యాజ్ఞికులకును= యజ్ఞం చేయించే ఋత్విక్కులకును; విహిత+అనుష్ఠాన+ఆసక్తులు+అయిన= వేదశాస్త్రాలలో చెప్పబడిన యోగ్య మైన తపోజపాదు లైన ఆచరణయోగ్యా లైనవాటిని అనుసరించటంలో ఆసక్తి కలవారు ఐన; అనుష్ఠాతలకును= కర్మనిష్ఠులకును; అధిక, తపః, నిరతులు+అయిన= గొప్పదైన తపస్సుచేయటంలో ఆసక్తికలవారు ఐన; తపస్+ధనులకును= తపస్సే ధనంగా గలవారి (తపస్వుల)కిని; నివాసంబు+అయిన= నివసించే ప్రదేశమైన; పుణ్యనదీ తీరంబునన్= పవిత్రమైన నదియొక్క ఒడ్డున; తద్దయున్, రమ్యంబు+అయి= మిక్కిలి సుందరమై; గంగా, తీరంబునన్= గంగానది ఒడ్డున; నర, నారాయణ, స్థానంబునున్, పోలెన్= ప్రాచీనములైన నరనారాయణులయొక్క నివాసస్థలంవలె; జగత్‌పావనంబు+ఐన= లోకాలను పవిత్రం చేసే; కణ్వ, మహత్, ముని, ఆశ్రమంబున్+కని= కణ్వమహర్షియొక్క ఆశ్రమాన్ని చూచి.

తాత్పర్యం: ఆ విధంగా దుష్యంతుడు హృదయానికి ఆహ్లాదం కలిగించే ఆ వనంలో ప్రవేశించి వెళ్ళివెళ్ళి, నిరంతరం పదక్రమంగా పఠింపబడుతున్న ఉత్తమవిప్రుల వేదనాదాలచేత, నిరంతరాయంగా అగ్నిలో వేల్వబడుతున్న హవిస్సులకు సంబంధించిన స్వాహాశబ్దాలచేత, అనేక మునులు ప్రతిపాదించిన వాక్యాలలోని (చేసిన నిర్వచనాలలోని) విషయాలను విభజించి అర్థనిర్ణయం చేసే న్యాయశాస్త్ర నిపుణులైన పండితులసభలలో జరిగే సంభాషణల ఘోషలతో, ప్రతిపక్షం చేసేవారికి చిక్కువిడదీయరాని ప్రమాణాలతో వేదార్థవిచారణ చేసే మీమాంసకుల చర్చలలోని వాదిప్రతివాదాలవలన కలిగే సవ్వడుల చేతనూ శబ్దిస్తూ, యజ్ఞాలను నిర్వహించటంలో నిపుణులైన ఋత్విక్కులకు, వేదవిహితాలైన కర్మలను అనుసరించే నిష్ఠాపరులకు, మహాతపోధనులకు నివాస ప్రదేశమై, గంగానదీతీరంలోఉన్న నరనారాయణులు నివసించేప్రదేశంవలె పుణ్యనదీతీరంలో సుందరంగా శోభిల్లుతూ లోకాన్ని పవిత్రం చేస్తూన్న కణ్వమహాముని ఆశ్రమాన్ని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఆర్షధర్మానికి ఆలవాలమైన ఋష్యాశ్రమంలో సాగే నిత్యకార్యక్రమాలను నన్నయ ఇందులో నిపుణంగా సూచించాడు. తపోవనంలో దుష్యంతుడు ప్రవేశించి ముందుకు సాగుతూ క్రమంగా వృక్షలతాది ప్రకృతి సంపదనూ, యజ్ఞయాగాది క్రతువులు నిర్వహిస్తూ వేదశాస్త్రాధ్యయనాలు సాగిస్తున్న మునుల సమూహాలనూ దర్శించాడు. వనంలోని అంతర్భాగాలలో ప్రవేశించి తర్వాత క్రమంగా కణ్వమహర్షియొక్క శాంతగుణంచేత ప్రభావితమైన ఆశ్రమజీవితం గోచరిస్తుంది. నన్నయ లోకజ్ఞతకు ఇది నిదర్శనం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. శ్రవణసుఖంబుగా సామగానంబులు । చదివెడు శుకముల చదువు దగిలి
కదలక వినుచుండు కరులయుఁ గరికర । శీతలచ్ఛాయఁ దచ్ఛీకరాంబు
కణముల చల్లనిగా డ్పాసపడి దానిఁ । జెంది సుఖం బున్న సింహములయు,
భూసురప్రవరులు భూతబలుల్ తెచ్చి । పెట్టు నీవారాన్న పిండతతులు

తే. గడఁగి భక్షింప నొక్కటఁ గలిసియాడు । చున్న యెలుకలుఁ బిల్లుల యొండు సహజ
వైరివర్గంబులయు సహవాస మపుడు । సూచి మునిశక్తి కెంతయుఁ జోద్య మంది. 23

ప్రతిపదార్థం: శ్రవణ, సుఖంబు, కాన్= చెవులకు పండుగుగా; సామగానంబులు= సామవేదాన్ని సస్వరంగా పాడటాలను; చదివెడు= యథాతథంగా పలుకుతూన్న; శుకముల= చిలుకలయొక్క; చదువు= పాండిత్యమందు, చదివేపద్ధతియందు; తవిలి= ఇష్టపడి; ఆసక్తిచెంది; కదలక, వినుచున్న, కరులయున్= కదలకుండా తన్మయత్వంతో వింటున్న ఏనుగులయొక్కయు; కరి, కర, శీతల, ఛాయన్= ఏనుగుల తొండాలయొక్క చల్లని నీడలో; తద్+శీకర+అంబు, కణముల= ఆ తొండాలవలని నీటితుంపురులయొక్క; చల్లని, గాడ్పు+ఆసపడి= చల్లనిగాలిని కోరుకొని; దానిన్+చెంది= ఆ చల్లగాలిని పొంది; సుఖంబు+ఉన్న, సింహములయున్= హాయిగా ఉన్న సింహాలయొక్కయు; భూసుర, ప్రవరులు= బ్రాహ్మణశ్రేష్ఠులు; భూత, బలుల్= పక్షులు, జంతువుల వంటి జీవులకు ఆహారంగా; తెచ్చిపెట్టు= తీసికొనివచ్చి వివిధప్రదేశాలలో ఉంచే; నీవార+అన్న, పిండతతులున్= నివ్వరిధాన్యంతో వండిన అన్నపుముద్దల సమూహాలను; కడఁగి= పూని; భక్షింపన్= తినటానికి; ఒక్కటన్= ఒకచోట; కలిసి, ఆడుచున్, ఉన్న= కలసిమెలసి తిరుగుతున్న; ఎలుకలున్, పిల్లుల= ఎలుకలయొక్క, పిల్లులయొక్క; ఒండు, సహజ, వైరి, వర్గంబులయున్= పరస్పరం సహజంగా వైరం గల జాతులయినప్పటికిన్నీ; సహవాసము= కలిసిఉండే స్వభావాన్ని, సాహచర్యాన్ని, మైత్రిని; అపుడు, చూచి= ఆ సమయంలో కనుగొని; మునిశక్తికిన్= మునియొక్క మహిమకు; ఎంతయున్= ఎంతగానో; (అమితంగా); చోద్యము+అంది= ఆశ్చర్యపడి.

తాత్పర్యం: చెవులపండువుగా చిలుకలు సామవేదాన్ని సస్వరంగా పాడే పద్ధతులలో ఆసక్తిపొంది తన్మయత్వంతో కదలకుండా వింటున్న ఏనుగులూ, ఏనుగులతొండాల చల్లని నీడలలో వాటి నీటితుంపురుల చల్లనిగాలిపై ఆశపడి దాన్ని పొంది సుఖంగా ఉన్న సింహాలూ, బ్రాహ్మణశ్రేష్ఠులు భూతబలులు తెచ్చి వివిధప్రదేశాలలో నీవారధాన్యపు అన్నపిండాలను ఉంచగా వాటిని తినాలని వేగిరపడుతూ ఒకచోట కలిసిమెలసి తిరుగుతున్న ఎలుకలూ పిల్లులూ, అవి తమతమ మధ్య పరస్పరం సహజంగా ఉన్న వైరిస్వభావం గల వర్గాలైనప్పటికీ కలసిమెలసి మసలే వాటి స్నేహప్రవృత్తిని చూచి మునిమహిమకు ఎంతగానో ఆశ్చర్యపడి.

విశేషం: ప్రకృతిపురుషుల పరస్పరప్రభావాన్ని వర్ణించటం ఉత్తమకావ్యకళ. శమ దమ సమన్వితుడు, కరుణాహృదయుడు, సమచిత్తుడు అయిన కణ్వమహర్షి తమ మహిమను తపోవన జీవులపై వేసి వాటిమధ్య వైరుధ్యం లేని సహజీవన శాంత ప్రవృత్తిని కలిగించాడు. కణ్వముని మాహాత్మ్యాన్ని ఆశ్రమప్రకృతివర్ణనంద్వారా వ్యంజింపజేస్తున్న ఈపద్యం ధ్వనికావ్యరచనకు చక్కని ఉదాహరణం. శకుంతలాదుష్యంతుల జీవితంలో విరుద్ధభావాలకు సంఘర్షణ ఏర్పడగా ప్రసాదించేది కణ్వమహర్షి సహనధర్మశీలమే.

వ. 'ఇక్కాశ్యపుం డైన కణ్వమహామునీంద్రునకు నమస్కరించి వచ్చెద; నా వచ్చునంతకు నందఱు నిచ్చోటన యుండునది' యని. 24

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఈ+కాశ్యపుండు+ఐన= కశ్యపుని వంశానికి చెందిన ఈ; కణ్వ, మహత్+మునీంద్రునకున్= కణ్వుడనే గొప్ప మునిశ్రేష్ఠునకు; నమస్కరించి, వచ్చెదన్= మ్రొక్కివస్తాను; నా, వచ్చు, అంతకున్= నేను (తిరిగి) వచ్చేంతవరకున్నూ; అందఱున్= మీరందరుకూడ; ఈ+చోటన్+అ= ఈప్రదేశంలోనే; ఉండునది= ఉండవలెను; అని= అని పలికి.

తాత్పర్యం: 'కశ్యపప్రజాపతి వంశజుడైన ఈ కణ్వమహర్షిని దర్శించి నమస్కరించి తిరిగివస్తాను. నేను వచ్చేంతవరకు మీరందరూ ఇక్కడే ఉండండి' అని పలికి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. **వలయు నమాత్యులం దగినవారల నుండఁగఁ బంచి ధారుణీ**
తలవిభుఁ డొక్కరుండ చని తన్విఁ బయోజదళాయతాక్షి సం
కుల మిళితాళినీల పరికుంచిత కోమలకుంతలన్ శకుం
తల యను కన్యకం గనియెఁ దన్మునివల్లభు మందిరంబునన్. **25**

ప్రతిపదార్థం: వలయు+అమాత్యులన్= (ఋష్యాశ్రమాలను దర్శించేటప్పుడు రాజువెంట) ఉండదగిన, అత్యవసరమైన మంత్రులను; తగినవారలన్= యోగ్యులను, సమర్థులను; ఉండఁగన్, పంచి= అక్కడే ఉండటానికి ఆజ్ఞాపించి; ధారుణీతల, విభుఁడు= రాజయిన దుష్యంతుడు; ఒక్కరుండు+అ= ఒక్కడే(ఒంటరిగానే); చని= వెళ్ళి; తన్విన్= సన్నని శరీరం కలదానిని; పయోజ, దళ+ఆయత+అక్షిన్= తామరపూలరేకుల వలె విశాలమైన కన్నులు కలదానిని; సంకుల, మిళిత+అళి, నీల, పరికుంచిత, కోమల, కుంతలన్= దట్టంగా కూడిఉన్న తుమ్మెదల వలె నల్లనై మిక్కిలి వంకరలైన సుకుమారాలైన ముంగురులను కలిగినదానిని; శకుంతల+అను, కన్యకన్= శకుంతల అనే పేరుగల కన్యను; తద్+మునివల్లభు, మందిరంబునన్= ఆ మునిశ్రేష్ఠుడైన కణ్వుడియొక్క నివాసంలో; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: తనవెంట వస్తున్న ముఖ్యు లైన మంత్రులను, అనుచరులను అక్కడే ఉండేటట్లు నియమించి దుష్యంతుడు ఒంటరిగానే వెళ్ళి, మునిశ్రేష్ఠుడైన కణ్వుడి నివాసంలో సన్నని మేను కలిగినది, తామరపూలరేకులవంటి విశాలమైన కన్నులు కలది, ఒత్తుగా గుమికూడిన తుమ్మెదవలె నల్లగా వంకరలైన మెత్తని ముంగురులు కలది, అయిన శకుంతల అనే కన్యను చూచాడు.

విశేషం: అలం: ఉపమ, వృత్త్యనుప్రాసం. ఈ పద్యరచనలో 'ల' అనే అక్షరం తరచుగా వినిపించి శకుంతల సౌందర్య లావణ్యాలను ధ్వనింపజేస్తున్నది. ఇది నన్నయ రచనలోని అక్షరరమ్యత. కణ్వుడిని దర్శింపవచ్చిన దుష్యంతుడు ఆశ్రమంలో మునికిబదులు శకుంతలను చూచినట్లు వర్ణించటం విశేషం, శకుంతల మధురమూర్తిని వర్ణించటంలో నన్నయ మాధుర్యగుణం పోషించాడు.

వ. **అదియును ననంతవిలాసంబున జయంతుండ పోని దుష్యంతు నెఱింగి, యతిసంభ్రమంబున నాసనార్ఘ్య పాద్యాది విధులం బూజించి, కుశలం బడిగి యున్న, నక్కన్యకం జూచి దుష్యంతుం డి ట్లనియె.** **26**

ప్రతిపదార్థం: అదియునున్= ఆ శకుంతలకూడ; అనంత, విలాసంబునన్= అపారమైన శరీరసహజహావభావాలతో; జయంతుండు+అ, పోని= జయంతుడివలెనేఉన్న; దుష్యంతున్+ఎఱింగి= దుష్యంతుడిని తెలిసికొని; అతి, సంభ్రమంబునన్= మిక్కిలి (ఆదరగౌరవాలతోకూడుకొన్న) తొట్రుపాటుతో; ఆసన+అర్ఘ్య, పాద్య+ఆది, విధులన్= కూర్చుండటానికి ఆసనం. త్రాగటానికి నీరు, కాళ్ళుకడుగుకొనటానికి నీరు, ఇవ్వటం మొదలైన అతిథిసత్కార విధానాలచేత; పూజించి= గౌరవించి;

కుశలంబు+అడిగి, ఉన్నన్= క్షేమాన్ని తెలిసికొని ఉండగా; ఆ+కన్యకన్= ఆ శకుంతలను; చూచి; దుష్యంతుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: శకుంతలకూడా అపారసహజశరీరహావభావాలు కలిగి, ఇంద్రుడికుమారుడైన జయంతుడితో పోల్చదగిన సౌందర్యంతో ఉన్న దుష్యంతుడిని తెలిసికొని, ఆదరగౌరవాలతో కూడుకొన్న తొట్రుపాటుతో ఆసనం, అర్ఘ్యం, పాద్యం మొదలైన అతిథి సపర్యలను చేసి పూజించి, క్షేమాదులను తెలిసికొని ఉండగా, ఆ కన్యను చూచి దుష్యంతుఁడు ఈవిధంగా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

ఉ. 'క్రచ్చఱ వేఁట వచ్చి యిట కణ్వమహామునిఁ జూచి పోవఁగా
వచ్చితి; మెందుఁ బోయిరొకో వా?' రనినన్ విని యాలతాంగి ' వా
రిచ్చటినుండి యీక్షణమ యేఁగిరి కానకుఁ బండ్లుదేర; మీ
వచ్చు టెఱింగిరేని జనవల్లభ! వారును వత్తు రింతకున్. 27

ప్రతిపదార్థం: క్రచ్చఱన్= సవిలాసంగా, వినోదంగా; వేఁట, వచ్చి= వేటకొరకు వచ్చి; ఇటన్= ఈ ఆశ్రమంలో; కణ్వ, మహత్+మునిన్= కణ్వుడనే గొప్పమునిని; చూచి, పోవఁగాన్= దర్శించి పోవటానికి; వచ్చితిమి= వచ్చాము (ఈబహువచనం స్వీయగౌరవవాచకం); వారు= కణ్వమహర్షి (ఇక్కడి బహువచనంకూడ గౌరవవాచకం); ఎందున్+పోయిరి+ఒకొ= ఎక్కడికి వెళ్ళినారో కదా!; అనినన్= అని అడుగగా; విని; ఆ, లతా+అంగి= తీగవలె శరీరంగల ఆ శకుంతల; వారు= ఆ కణ్వమహర్షి; ఇచ్చటినుండి= ఈ ఆశ్రమంనుండి; ఈ క్షణము+అ= ఇప్పుడే; కానకున్= అడవికి; పండ్లు తేరన్= పండ్లను తేవటానికి; ఏఁగిరి= వెళ్ళారు; మీ, వచ్చుట= మీరాకను; ఎఱింగిరి+ఏని= తెలిసికొన్నచో; జనవల్లభ= ఓరాజా!; వారును= ఆ కణ్వమహర్షికూడ; ఇంతకున్= ఈలోపుననే; వత్తురు= వస్తారు.

తాత్పర్యం: 'వినోదంగా వేటకు వచ్చి కణ్వమహామునిని దర్శించుకొని పోదా మని ఇక్కడకు వచ్చాను. వారు ఎక్కడికి పోయినారోకదా?' అని దుష్యంతుడు అడుగగా, లతాంగి అయిన శకుంతల ఇ ట్లన్నది: 'వారు ఇక్కడినుండి ఇంతకుముందే (ఈక్షణమే) పండ్లు తేవటానికి అడవిలోకి వెళ్ళారు. మీరాక వారికి తెలిస్తే, ఓరాజా! వారుకూడ ఇప్పుడే తిరిగివస్తారు'. (శకుంతల మాటలు తరువాయి వచనంలో కొనసాగుతున్నాయి.)

వ. 'వారు వచ్చునంతకు నొక్కముహూర్తం బుండునది' యనిన విని యక్కోమలి వినయంబునకు మృదుమధురవచనంబులకు సంతసిల్లి, దానిం గన్యకగా నెఱింగి మనోజరాజ్యలక్ష్మియుంబోని దాని సర్వలక్షణ లక్షితంబు లయిన సర్వావయవంబులుం జూచి సంచలితహృదయుం డై 'నీ వెవ్వరి కూఁతుర? విట్టి రూపలావణ్యవిలాసవిభ్రమగుణసుందరి విందుల కేల వచ్చి'? తని యడిగిన నది యి ట్లనియె. 28

ప్రతిపదార్థం: వారు, వచ్చు, అంతకున్= వారు తిరిగి వచ్చేవరకు; ఒక్క, ముహూర్తంబు= ఒక్కక్షణం (కొంచెంసేపు లేదా రెండు గడియల కాలం); ఉండునది= వేచియుండండి; అనినన్, విని= అని శకుంతల పలుకగా దుష్యంతుడు విని; ఆ, కోమలి, వినయంబునకున్= ఆ (మృదులస్వభావ యైన) శకుంతల అణకువకూ; మృదు, మధుర, వచనంబులకున్= మెత్తని,

తీయని మాటలకూ; సంతసిల్లి= సంతోషపడి; దానిన్= ఆ శకుంతలను; కన్యక, కాన్= వివాహం కాని వనితగా; ఎఱింగి= తెలిసికొని; మనోజ, రాజ్య, లక్ష్మియున్+పోని= మన్మథునియొక్క రాజ్యలక్ష్మివలెఉన్న; దాని= ఆశకుంతలయొక్క; సర్వ, లక్షణ, లక్షితంబులు+అయిన= అన్ని మంచి లక్షణాలు కలిగిన, సాముద్రిక చిహ్నాలు కల; సర్వ+అవయవంబులున్= శరీరఅవయవాల నన్నింటిని; చూచి; సంచలిత, హృదయుండు+ఐ= చలించిన మనస్సు కలవాడై(కోరిక కలవాడై అనిభావం); నీవు, ఎవ్వరి, కూఁతురవు= నీవు ఎవరియొక్క కుమార్తెవు?; ఇట్టి, రూప, లావణ్య, విలాస, విభ్రమ, గుణ, సుందరివి= ఇంతటి అపూర్వమైన ఆకారం, మేని నిగనిగ, సహజసుందర హావభావాలు, చేష్టలు అనే గుణాలచేత అందగత్తె వైన నీవు; ఇందులకున్= ఇక్కడికి, ఈ ఆశ్రమానికి; ఏల= ఏకారణంవలన; వచ్చితి(వి)= వచ్చావు? అని; అడిగినన్, అది= ఆ శకుంతల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: 'కణ్వమహాముని వనంనుండి తిరిగివచ్చేవరకు కొంతసేపు వేచి ఉండండి' - అని పలికిన ఆ శకుంతల వినయగుణానికీ, మెత్తని తియ్యని పలుకులకూ సంతోషించి, ఆమెను కన్యగా తెలిసికొని, మన్మథుని రాజ్యలక్ష్మివలె శుభలక్షణాలన్నింటితో కూడుకొన్న శరీరావయవాలు గల ఆమె సౌందర్యాన్ని చూచి స్పందించిన మనస్సుతో 'నీవు ఎవ్వరి కుమారితవు? ఇటువంటి అపూర్వ రూపాన్నీ లావణ్యాన్నీ సహజ శరీరహావభావ గుణాలు గల సుందరివి ఈ ఆశ్రమానికి ఏకారణంవలన వచ్చావు?' అని అడుగగా ఆమె ఇట్లా పలికింది.

విశేషం: అలం: తొలిచూపులోనే శకుంతలాదుష్యంతులకు అభిలాష కలిగింది. అనంతవిలాసంతో జయంతుడివలెనున్న అతని అందం ఆమెను ఆకర్షించింది; ఆమె వర్తనం సౌందర్యం మన్మథరాజ్యలక్ష్మివలె ఉన్న ఆమె రూపవైభవం అతడిని ఆకట్టుకొన్నాయి. ఆశ్రమంలో కంటె రాజసౌధంలో ఉండదగిన సుందరిగా ఆమెను భావించి ఆసక్తితో ఆమెనుగురించి అడిగాడు దుష్యంతుడు.

శకుంతల దుష్యంతునకుఁ దనజన్మక్రమం బెఱింగించుట (సం. 1-65-14)

క. **'జగతీవల్లభ! యే న । త్యగణిత ధర్మస్వరూపుఁ డని జనములు దన్**
బొగడఁగ జగదారాధ్యుం । డగు కణ్వమహామునీంద్రునాత్మజ' ననినన్. **29**

ప్రతిపదార్థం: జగతీ, వల్లభ= లోకానికి నాథుడవైన ఓరాజా!; ఏను= నేను; అతి+అగణిత, ధర్మ, స్వరూపుఁడు+అని= మిక్కిలి గొప్పదయిన ధర్మముయొక్క రూపం వంటివాడు అని; జనములు= లోకములు; తన్= తనను (కణ్వుడిని); పొగడఁగన్= మెచ్చుకొంటూ ఉండగా; జగత్, ఆరాధ్యుండు+అగు= లోకాలచేత పూజింపదగినవాడు అయిన, కణ్వ, మహత్+ముని+ఇంద్రు, ఆత్మజన్= కణ్వుడుఅనేపేరుగల గొప్పమునిశ్రేష్ఠుడియొక్క కుమారితను; అనినన్= అనగా.

తాత్పర్యం: 'ఓ ప్రభువా! అపారమైన ధర్మమే రూపం దాల్చినవాడని ప్రజలు తనను ప్రశంసిస్తూ ఉండగా లోకపూజ్యుడై ఉన్న కణ్వమహామునీంద్రుడి కూతురిని నేను' అని అనగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. **'ఇది మునికన్య యేని మఱి యేలొకొ యీలలితాంగియందు నా**
హృదయము దద్దయుం దవిలె; నిప్పలు కింకను నమ్మనేర న
య్యెద; విజితేంద్రియుం డనఁగ నిమ్మునిఁ బాయక విందు' నంచుఁ దా
నిది కలరూ పెఱుంగ నవనీపతి యుత్సుకుఁ డయ్యె నాత్మలోన్. **30**

ప్రతిపదార్థం: 'ఇది= ఈకన్యక (శకుంతల); ముని, కన్య, ఏని= మునియొక్క కూతురైనట్లయితే; మఱి= ఈవిధంగా అని భావం; ఏల+ఒకొ= ఏకారణంచేతనో; ఈ, లలిత+అంగి, అందున్= ఈకోమలిపై; నాహృదయము= నామనస్సు; తద్దయున్= బాగా(గాఢంగా); తవిలెన్= లగ్నమైనది; ఈ, పలుకు= (ఈమె చెప్పిన) ఈమాటను; ఇంకను, నమ్మనేరను+అయ్యెదన్= ఇప్పటికిన్నీ నమ్మజాలక ఉన్నాను; ఈ+మునిన్= ఈకణ్వమునిని; విజిత+ఇంద్రియుండు+అనఁగన్= జయింపబడిన ఇంద్రియాలు కలవాడని లోకులు అనగా (అనగా అవివాహితుడై బ్రహ్మచర్యవ్రతంలో ఉన్నా డని విన్నాను అనిభావం); పాయక= ఎల్లప్పుడూ; విందున్= వింటాను; అంచున్= అని తలుస్తూ; తాన్= తాను స్వయంగా; ఇది= ఈవిషయాన్ని (ద్వితీయకు మారుగా ప్రథమ); కల, రూపు+ఎఱుంగన్= ఉన్నది ఉన్నట్లుగా తెలిసికొనటానికి; అవనీ, పతి= రాజు (దుష్యంతుడు); ఆత్మలోన్= మనస్సులో; ఉత్సుకుఁడు+అయ్యెన్= ఆసక్తు డైనాడు.

తాత్పర్యం: 'ఈ శకుంతల మునికన్యయే అయినట్లయితే ఈకోమలిపై నామనస్సు ఎందుకు గాఢంగా లగ్నమైనది?' 'నే నీమెమాటను నమ్మజాలకుండా ఉన్నాను. ఈ కణ్వముని ఇంద్రియాలను జయించినవా డని ఎప్పుడూ వింటూ ఉంటాను' అని భావిస్తూ, 'ఈమె మాటలలోని యాథార్థ్యాన్ని ఉన్నది ఉన్నట్లు తెలుసుకోవా' లని మనస్సులో దుష్యంతుడు ఆసక్తిని పొందాడు.

విశేషం: దుష్యంతుడు క్షత్రియుడు. అతడి హృదయం శకుంతలయందు లగ్నమైనది. ఆమేమో తాను మునికన్య నని చెప్పింది. ఆమె నిజంగా మునికన్యయే అయితే అతని అంతఃకరణం ఆమెయందు ఆసక్తిని పొందేది కాదు. తన అంతఃకరణం ధర్మబద్ధమైనదని దుష్యంతుడికి గాఢమైన విశ్వాసం. అది అతడి ఉత్తమసంస్కారానికి గుర్తు. మూలభారతంలో తన సంశయాన్ని దుష్యంతుడు సూటిగా శకుంతలతో చెప్పినట్లున్నది. దానిని నన్నయ దుష్యంతుడి ఆత్మగతంగా మార్చాడు. ఈ కల్పనమీద కాళిదాసు రచించిన అభిజ్ఞానశాకుంతల నాటకంలోని "అసంశయం క్షత్రపరిగ్రహక్షమా । యదార్య మస్యా మభిలాషి మే మనః" "సతాం హి సందేహపదేషు వస్తుషు, ప్రమాణమంతఃకరణప్రవృత్తయః" అనే శ్లోకపాదాల ప్రభావం కనబడుతున్నది. తన మనస్సు ఆమెపై లగ్నమైనది కాబట్టి ఆమె క్షత్రియపరిగ్రహయోగ్యమైనదనిన్నీ, దానికి దుష్యంతుడి అంతఃకరణమే సాక్షి అనిన్నీ భావం.

వ. ఇట్లు దుష్యంతుం డా శకుంతలజన్మం బెఱుంగ వేఁడి వెండియు దాని కి ట్లనియె. 31

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; దుష్యంతుండు; ఆ+శకుంతల జన్మంబు= ఆ శకుంతలయొక్క పుట్టుకనుగురించి; ఎఱుంగన్, వేఁడి, తెలిసికొనగోరి; వెండియున్= మరియు; దానికిన్= శకుంతలతో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: దుష్యంతుడు ఆవిధంగా ఆ శకుంతలపుట్టుకనుగురించి తెలిసికొనగోరి శకుంతలతో మరల ఈవిధంగా అన్నాడు.

తే. ఉత్తమాశ్రమనిష్ఠితుఁ డూర్ధ్వరేతుఁ । డైన కణ్వమహాముని యనఘచరితుఁ;
డట్టిముని కెట్లు గూఁతుర వైతి? దీని । నాకు నెఱుఁగంగఁ జెప్పుము నలిననేత్ర! 32

ప్రతిపదార్థం: నలిన, నేత్ర= పద్మాలవంటి కన్నులు కలదానా!; ఉత్తమ+ఆశ్రమ, నిష్ఠితుఁడు= ఉత్తమమైన ఆశ్రమమైన సన్న్యాసంలో నిష్ఠ కలిగినవాడున్నూ; ఊర్ధ్వ, రేతుఁడు= అధఃపతనం లేని రేతస్సు కలవాడు (ఇంద్రియనిగ్రహం కలవాడు) న్నూ; ఐన; కణ్వ, మహాముని; అనఘ, చరితుఁడు= కళంకంలేని చరిత్రకలవాడు; అట్టి= అటువంటి; మునికిన్; ఎట్లు= ఏవిధంగా; కూతురవు+ఐతి(వి)= కుమార్తె వైనావు; దీనిన్= ఈవిషయాన్ని; నాకున్= (దుష్యంతుడికి); ఎఱుఁగంగన్+చెప్పుము= తెలియజెప్పుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పద్మనేత్ర వైన ఓశకుంతలా! చతుర్విధాశ్రమాలలో ఉత్తమ మైన సన్న్యాసాశ్రమాన్ని నిష్ఠతో పాటించిన వాడూ, ఇంద్రియనిగ్రహం కలవాడూ అయిన కణ్వమహర్షి కళంకంలేని చరిత్రకలవాడు. అటువంటి ఆ మునికి నీ వెట్లా కూఁతుర వైనావు? ఆ సంగతి నాకు తెలియజెప్పుము.

వ. అని యడిగిన నారాజునకు శకుంతల యి ట్లనియె. 33

ప్రతిపదార్థం: అని, అడిగినన్= ఆ విధంగా అడుగగా; ఆ, రాజునకున్= ఆ రాజైన దుష్యంతుడికి; శకుంతల; ఇట్లు, అనియెన్= ఈవిధంగా అన్నది.

తాత్పర్యం: దుష్యంతుడు ఆవిధంగా అడుగగా శకుంతల ఈవిధంగా అన్నది.

క. 'ఇక్కమలాక్షి శకుంతల । యెక్కడియది? దీని జన్మ మెవ్విధ?' మని త
మ్మొక్క మునినాథుఁ డడిగిన । నిక్కాశ్యపు లర్థిఁ జెప్పి రేను వినంగన్. 34

ప్రతిపదార్థం: ఒక్కముని, నాథుఁడు= ఒక మునిశ్రేష్ఠుడు; ఈ+కమల+అక్షి= పద్మాలవంటి కన్నులు కల ఈ; శకుంతల; ఎక్కడి+అది= ఎక్కడినుండి వచ్చింది; దీని, జన్మము= ఈ శకుంతలయొక్క పుట్టుక; ఏ+విధము= ఎటువంటిది? అని; తమ్మున్= తమను (కణ్వమహర్షిని); అడిగినన్= అడుగగా; ఈ+కాశ్యపులు= కశ్యపవంశానికి చెందిన ఈ కాశ్యపులవారు; ఏను; వినంగన్= నేను వినేటట్లుగా; అర్థిన్= ప్రీతితో (సంస్కృతంలో ఈ అర్థం లేదు); చెప్పిరి= చెప్పారు (బహువచనం గౌరవసూచకం).

తాత్పర్యం: ఒకమునిశ్రేష్ఠుడు ఒకసారి కణ్వులవారిని ఈవిధంగా అడిగారు - 'పద్మాలవంటి కన్నులు గల ఈ శకుంతల ఎక్కడినుండి వచ్చింది? దీని పుట్టుపూర్వోత్తరా లేమిటి?' అని. అప్పుడు కణ్వులవారు నేనుకూడా వినేటట్లు ఈవిధంగా ప్రీతితో చెప్పారు.

వ. 'నాజన్మప్రకారంబు మాయయ్య యమ్మునికిం జెప్పినవిధంబు చెప్పెదఁజిత్తగించివిను'మని యాదుష్యంతునకు శకుంతల యి ట్లనియె. 35

ప్రతిపదార్థం: మా+అయ్య= మాతండ్రి (కణ్వమహర్షి); నా, జన్మ, ప్రకారంబున్= నా పుట్టుక వృత్తాంతాన్ని; ఆ+మునికిన్, చెప్పిన, విధంబు, చెప్పెదన్= ఆ మునితో చెప్పిన పద్ధతిగానే విన్నవిస్తాను; చిత్తగించి= మనసుపెట్టి; వినుము+అని; శకుంతల; ఆ దుష్యంతునకున్; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: 'మా తండ్రిగారైన కణ్వమహర్షి నా జన్మవృత్తాంతాన్ని ఆ మునికి చెప్పిన పద్ధతిగా నీకు విన్నవిస్తాను. మనసుపెట్టి విను' మని శకుంతల దుష్యంతుడితో ఈవిధంగా అన్నది.

విశేషం: కణ్వుడు శకుంతలకు ఆమెవృత్తాంతాన్ని ఎన్నడూ ఆమెతో స్వయంగా చెప్పకపోవటం ఒకవిశేషం. ఒక మునితో చెప్పవలసివచ్చినప్పుడు ఆమెకూడా వినేటట్లు చెప్పటం ఔచిత్యం. ఇప్పుడు శకుంతల తనజన్మవృత్తాంతాన్ని తానే చెప్పుకొంటున్నట్లు కాకుండా కణ్వుడు మునికి చెప్పినట్లుగా చెప్పటం పరమౌచిత్యం. ఈ పద్ధతి వలన శకుంతల జన్మవృత్తాంతానికి ప్రామాణికత కలుగుతుంది. కణ్వపాత్ర రంగంమీద లేని లోపం తీరుతుంది. ఇది నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి.

సీ. అనఘుఁడు రాజర్షియై తపశ్శక్తిమై । బ్రహ్మర్షిభావంబుఁ బడసియున్న
సన్మునీశ్వరుఁడు విశ్వామిత్రుఁ డతిఘోర । తపము సేయుచునున్నఁ దత్తపమున
కెంతయు వెఱచి దేవేశ్వరుఁ డప్సరో । గణములలో నగ్రగణ్య యైన
దాని మేనక యను ధవళాక్షిఁ బిలిచి 'వి । శ్వామిత్రుపాలికిఁ జని తదీయ

ఆ. ఘోరతపము చెఱిచి కోమలి! నా దైన ! దేవరాజ్యమహిమఁ దివిరి నీవు
గావు' మనిన నదియుఁ గడు భయంపడి యమ । రేశ్వరునకు మ్రొక్కియిట్టు లనియె. 36

ప్రతిపదార్థం: అనఘుఁడు= కళంకంలేనివాడు; రాజ+ఋషి+ఐ= రాజర్షి ఐ; (తపస్సాధనలో రాజర్షి కావటం ఒకస్థాయి; బ్రహ్మర్షి కావటం దాని పైస్థాయి, విశ్వామిత్రుడు రాజవంశంలో పుట్టి తపస్సుచేసి రాజర్షి అయినాడు); తపస్+శక్తి, మైన్= తపస్సుయొక్క బలంతో; బ్రహ్మ+ఋషి, భావంబున్= బ్రహ్మర్షి అనే స్థితిని (ఇది తపస్సాధనలో మిక్కిలి గొప్పది); పడసి, ఉన్న= పొందిఉన్న; సత్+ముని+ఈశ్వరుఁడు= ఉత్తములైన మునులలో గొప్పవాడైన; విశ్వామిత్రుఁడు; అతి, ఘోర, తపము= మిక్కిలి భయంకరమైన తపస్సును; చేయుచున్+ఉన్నన్= చేస్తూఉండగా; తద్+తపమునకున్= ఆ మహర్షియొక్క తపస్సుకు; ఎంతయున్, వెఱచి= మిక్కిలి భయపడి; దేవ+ఈశ్వరుఁడు, దేవతలకు రాజైన ఇంద్రుడు; అప్సరస్+గణములలోన్= అప్సరసలయొక్క సమూహాలలో; అగ్ర, గణ్య, ఐన, దానిన్= మొదట లెక్కింపదగిన దైన దానిని (శ్రేష్ఠురాలిని); మేనక, అను, ధవళ+అక్షిన్= మేనక అనే పేరుగల తెల్లని కన్నులు కలదానిని; పిలిచి; కోమలి!= మృదుస్వభావురాలా!; విశ్వామిత్రుపాలికిన్= విశ్వామిత్రుడి దగ్గరకు; చని= వెళ్ళి; తదీయ, ఘోర, తపము= అతనియొక్క భయంకరమైన తపస్సును; చెఱిచి= పాడుచేసి; నా+అది+ఐన= నాకు చెందిన; దేవ, రాజ్య, మహిమన్= దేవతల రాజ్య మైన స్వర్గంయొక్క గొప్పతనాన్ని; తివిరి= ప్రయత్నించి; నీవు; కావుము= కాపాడుము; అనినన్= అని చెప్పగా; అదియున్= ఆ మేనకకూడ; కడున్, భయము, పడి= మిక్కిలి భయపడి; అమర+ఈశ్వరునకున్= దేవతల ప్రభు వైన ఇంద్రుడికి; మ్రొక్కి= నమస్కరించి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: రాజర్షియై తపశ్శక్తితో బ్రహ్మర్షి భావాన్ని పొందియున్న పుణ్యాత్ముడు, మునిశ్రేష్ఠుడు అయిన విశ్వామిత్రుడు అత్యంతభయంకర మైన తపస్సు చేస్తూ ఉండగా, ఆ తపస్సుకు మిక్కిలి భయపడి దేవేంద్రుడు అప్సరోగణాలలో ఉత్తమురా లైన మేనకను పిలిపించి, 'ఓకోమలీ! నీవు ఆ విశ్వామిత్రుడి దగ్గరకు పోయి అతని భయంకర తపస్సును ఏ యత్నంతో నైనా భగ్నంచేసి నా స్వర్గరాజ్య గౌరవాన్ని నీవు రక్షించాలి' అని పల్కగా, మేనక అందుకు భయపడి ఇంద్రుడికి మ్రొక్కి ఈవిధంగా అన్నది.

చ. వనజభవప్రభావుఁ డగువాని వసిష్ఠు నపత్యశోక మ
న్వననిధిలోన ముంచిన యవారితసత్త్వుఁడు నిన్నుఁ దొట్టి యీ
యనిమిషు లెల్లవానికి భయంపడుచుండుదు రట్టియుగ్రకో
పనుకడ కిప్పు డేఁగు మని పాడియె యిప్పని నన్నుఁ బంపఁగన్. 37

ప్రతిపదార్థం: వనజభవ, ప్రభావుఁడు+అగువానిన్= బ్రహ్మయొక్క మహత్త్వం వంటి మహత్త్వం కలిగిన; వసిష్ఠున్= వసిష్ఠ మహామునిని; అపత్యశోకము+అన్, వననిధిలోనన్= సంతానం (చనిపోవటం) వలని దుఃఖ మనే సముద్రంలో; ముంచిన= మునిగేటట్లు చేసిన; అవారిత, సత్త్వుఁడు= అడ్డులేని గొప్పతనం కలవాడు (విశ్వామిత్రుడు); నిన్నున్+తొట్టి= నిన్ను మొదలుకొని;

ఈ, అనిమిషులు, ఎల్లన్= ఈ దేవతలందరున్నూ; వానికిన్= ఆ విశ్వామిత్రుడికి; భయము+పడుచున్+ఉండుదురు= భయపడుతూ ఉంటారు; అట్టి, ఉగ్ర, కోపను, కడకున్= అటువంటి భయంకరమైన కోపంగలవాడైన విశ్వామిత్రుడి వద్దకు; ఇప్పుడు= ఈ పరిస్థితిలో; ఏఁగుము+అని= వెళ్ళుమని; ఈ+పనిన్= ఈకార్యంలో; నన్నున్, పంపఁగన్= నన్ను పంపటం; పాడి+ఎ= ధర్మమా? (ధర్మం కాదని భావం).

తాత్పర్యం: బ్రహ్మమహిమ వంటి మహిమ గల వసిష్ఠుడిని సైతం పుత్రశోకసాగరంలో ముంచినవాడు ఆ అనివార్యతేజస్వి విశ్వామిత్రుడు. నీవు మొదలుకొని దేవతలందరూ ఆ మహర్షి అంటే భయపడుతూ ఉంటారు. అట్టి భయంకర కోపస్వభావుడి పాలికి ఈ పనిమీద ఇప్పుడు నన్ను పొమ్మని చెప్పటం న్యాయం కాదు.

విశేషం: అలం: రూపకం. వసిష్ఠ మహర్షిని బ్రహ్మమహత్త్వం వంటి మహత్త్వం కలవాడని చెప్పటం; విశ్వామిత్రుడిని ఉగ్రకోపనుడు (రుద్రునివంటి కోపంకలవాడు) అనటం విశేషం. నూరుగురు పుత్రులు చనిపోవటంవలన కలిగే పుత్రశోకం సముద్రం వంటిదని రూపకం చేయటం సార్థకం. బ్రహ్మనే సముద్రంలో ముంచగలిగిన వాడికి దేవతలు ఒక్కలెక్కయా అని వ్యంగ్యం. దేవేంద్రాదులే భయపడుతూ ఉండగా కోమలికి ఆపని అసాధ్యమని భావం. ఉగ్రకోపనుని ఉగ్రత తరువాతి పద్యంలో వర్ణింపబడుతున్నది.

ఉ. అమ్ముని యల్గి చూచుడును నాక్షణమాత్రన గోత్రధారుణీ
ధ్రమ్ములు వ్రయ్యు, నయ్యిసుము దక్కఁగ నంబుధు లింకు, మూఁడులో
కమ్ములు దిర్దిరం దిరుగు, గాడ్పు చలింపఁగ నోడు, నుగ్రతం
బమ్మినయట్టి కోపపరుపాలికి భామలు వోవ నోడరే. 38

ప్రతిపదార్థం: ఆ+ముని= ఆమహర్షి (విశ్వామిత్రుడు); అల్గి, చూచుడును= కోపించి చూచిన వెంటనే; ఆ+క్షణమాత్రన్+అ= ఆ క్షణంలోపలే; గోత్ర, ధారుణీధ్రమ్ములు= సప్తకులపర్వతాలు; వ్రయ్యున్= బ్రద్దలౌతాయి; ఆ+ఇసుము, తక్కఁగన్= ఇసుక (మాత్రమే) మిగిలేటట్లుగా; అంబుధులు= సముద్రాలు; ఇంకున్= ఇంకిపోతాయి; మూఁడు, లోకమ్ములు= స్వర్గమర్త్యపాతాళాలు అనే మూడు లోకాలు; దిర్దిరన్= దిరదిర, గిరగిర; తిరుగున్= తిరుగును; గాడ్పు= వాయువు, గాలి; చలింపఁగన్= కదలటానికి, వీచేటందుకు; ఓడున్= జంకుతుంది; ఉగ్రతన్= తీవ్రమైన కోపభావంతో; పమ్మిన+అట్టి= అతిశయించినట్టి; కోపపరు, పాలికిన్= కోపస్వభావం కలవాడి యొద్దకు; భామలు= స్త్రీలు; పోవన్+ఓడరు+ఏ= వెళ్ళటానికి జంకరా? (జంకుతా రని భావం).

తాత్పర్యం: ఆ విశ్వామిత్రముని కోపించి చూస్తే ఆ క్షణంలోనే కులపర్వతాలన్నీ బ్రద్దలౌతాయి; అడుగున ఉన్న ఇసుకమాత్రమే మిగిలేటట్లు సముద్రాలన్నీ పూర్తిగా ఇంకిపోతాయి; మూడులోకాలూ గిరగిరా చక్రంవలె తిరిగిపోతాయి; గాలి కదలటానికికూడా జంకుతుంది. ఉగ్రస్వభావంతో అతిశయించే ఆ కోపపరుడి సమీపానికి భామలు పోవటానికి భయపడరా?

విశేషం: కులపర్వతాలు: మహేంద్రము, మలయము, సహ్యము, శుక్తిమంతము, గంధమాదనము, వింధ్యము, పారియాత్రము సప్తసముద్రములు: లవణసముద్రము, ఇక్షుసముద్రము, సురాసముద్రము, సర్పిస్సముద్రము, దధిసముద్రము, క్షీరసముద్రము, జలసముద్రము.

వ. 'అయినను నానేర్చువిధంబున నమ్మునివరుచిత్తంబు మెత్తన చిత్తజాయత్తంబగునట్లుగాఁ జేసెద' నని వాసవు వీడ్కొని మేనక తనకు మందమలయానిలంబు దోడుగాఁ జనుదెంచి, హిమవత్పర్వతప్రదేశంబునం దపంబుసేయుచున్న విశ్వామిత్రు తపోవనంబు సొత్తెంచిన. 39

ప్రతిపదార్థం: అయినను= అయినప్పటికీ; నా, నేర్చు, విధంబునన్= నేను నేర్చిన పద్ధతిలో; ఆ+మునివరు, చిత్తంబు= ఆ మునిశ్రేష్ఠుని మనస్సు; మెత్తన= తిన్నగా, లలితంగా; చిత్తజ+ఆయత్తంబు+అగునట్లు+కాన్= మన్మథునికి స్వాధీనమయ్యేటట్లుగా; చేసెదను+అని= చేస్తాను అనిచెప్పి; వాసవున్= దేవేంద్రుడిని; వీడ్కొని; మేనక; తనకున్= (మేనకకు); మంద, మలయ+అనిలంబు= మలయపర్వతంమీదనుండి వీచే మెల్లని చల్లగాలి; తోడుగాన్= వెంట రాగా; సాయపడగా; చనుదెంచి= వచ్చి; హిమవత్, పర్వత, ప్రదేశంబునన్= హిమవత్పర్వతప్రాంతంలో; తపంబు, చేయుచున్న= తపస్సుచేస్తూఉన్న; విశ్వామిత్రు= విశ్వామిత్రుడియొక్క; తపోవనంబు= తపస్సుకొరకైన అరణ్యాన్ని; చొత్తెంచినన్= ప్రవేశించగా.

తాత్పర్యం: 'అయినప్పటికి నేను నేర్చిన విధంగా (నాశక్తికొలది) ఆ మునిశ్రేష్ఠుని మనస్సును తిన్నగా మన్మథుడికి స్వాధీనమయ్యేటట్లుచేస్తాను'- అని చెప్పి దేవేంద్రుడిని వీడ్కొని మేనక చల్లని పిల్లగాలి వెంటరాగా బయలుదేరి వెళ్ళి హిమవత్పర్వతప్రాంతంలో తపస్సు చేసికొంటూ ఉన్న విశ్వామిత్రుడి తపోవనంలో ప్రవేశించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. చల్లని దక్షిణ మారుత । మల్లన వీతెంచెఁ దగిలి యా లలనా ధ
మ్మిల్ల కుసుమాంగరాగస । ముల్లసనసుగంధి యగుచు మునివరుమీఁదన్. 40

ప్రతిపదార్థం: చల్లని, దక్షిణ, మారుతము= చల్లగా ఉండే మలయమారుతం; అల్లనన్= మెల్లగా; ఆ, లలనా, ధమ్మిల్ల, కుసుమ+అంగరాగ, సముల్లసన, సుగంధి, అగుచున్= ఆ వనిత (మేనక) యొక్క కొప్పులోని పూలవలనను, మైపూత వలనను అతిశయించిన మంచివాసన కలది ఔతూ; మునివరుమీఁదన్= మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుడిమీద; తగిలి= విడువకుండా; వీతెంచెన్= ప్రసరించింది.

తాత్పర్యం: దక్షిణదిక్కునుండి వీచే చల్లని మలయానిలం ఆ మేనక కొప్పులోని పూలవాసనలచేతను, ఆమెమైపూతల సుగంధాలచేతను అమితంగా పరిమళిస్తూ ఆ మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుడి మేనిపై విడువకుండా వీచింది.

విశేషం: పద్యంలోని ద్విరుక్త లకారప్రాస గాలి మెల్లగా వీచే లక్షణాన్ని అక్షరరమ్యంగా సూచిస్తున్నది. 'మునివర' లోని 'వర' శబ్దం మేనక ఇష్టసిద్ధిని స్ఫురింపజేస్తున్నది.

వ. అంత. 41

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: ఆపైన (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. అనిమిషకాంతయున్ నవలతాంత విభూషణ లీల నల్లన
ల్లన వనకేళి లాలస విలాసగతిం జనుదెంచి ముందటం

గనియె మహామునిప్రవరుఁ గౌశికుఁ గౌశిక చిత్తభీతి సం
జనన మహాతపశ్చరణ సంయతచిత్తు నిరస్తచిత్తజున్. 42

ప్రతిపదార్థం: అనిమిషకాంతయున్= దేవవనిత ఐన మేనకయు; నవ, లతాంత, విభూషణ, లీలన్= క్రొత్తవైన పూల అలంకారాల విలాసంతో; అల్లనన్+అల్లనన్= మెల్లమెల్లగా; వనకేళి, లాలస, విలాస, గతిన్= వనంలో విహరించే కోరికతో నైన కులుకునడకతో; చనుదెంచి= వచ్చి; ముందటన్= ఎట్టయెదుట; మహత్+ముని, ప్రవరున్= గొప్పమునులలో శ్రేష్ఠుడిని; కౌశిక, చిత్త, భీతి, సంజనన, మహత్+తపస్+చరణ, సంయత, చిత్తున్= ఇంద్రుడి మనస్సులో భయం పుట్టించే గొప్పదైన తపస్సు చేయటంలో నియతిగల మనస్సు కలవాడిని; నిరస్త, చిత్తజున్= తిరస్కరింపబడిన మన్మథుడిని కలిగినవాడిని; కౌశికున్= కుశికవంశానికి చెందిన విశ్వామిత్రుడిని; కనియెన్= చూచింది.

తాత్పర్యం: దేవకాంత అయిన మేనక క్రొత్తవైన పూల అలంకారాల విలాసంతో, మెల్లమెల్లగా వనంలో విహరించే కోరికతో కులుకుతూ నడుస్తూ వచ్చి తనముందట మహామునులలో శ్రేష్ఠుడూ, ఇంద్రుడిమనస్సులో భయంపుట్టించే గొప్పతపస్సు చేయటంలో నియతమైన మనస్సు కలవాడూ, మన్మథభావాన్ని జయించినవాడూ అయిన విశ్వామిత్రుడిని చూచింది.

విశేషం: రెప్పపాటు లేకుండా విశ్వామిత్రుడిని చూడటంవలన మేనకకు అనిమిషత్వం సార్థక మైన దని చమత్కారం. కౌశిక శబ్దాన్ని విశ్వామిత్రపరంగానూ, ఇంద్రపరంగానూ వాడటం విశేషం.

క. అంబుజలోచన గని విన। యంబున నమ్మునికి మ్రొక్కి యనురాగముతో
డం బుష్పాపచయ వ్యా। జంబున విహరించుచుండె సఖులుం దానున్. 43

ప్రతిపదార్థం: అంబుజలోచన= పద్మాలవంటి కన్నులు గల మేనక; కని= విశ్వామిత్రుడిని చూచి; ఆ+మునికిన్; వినయంబునన్= అణకువతో; మ్రొక్కి= నమస్కరించి; అనురాగముతోడన్= ప్రీతితో; పుష్ప+అపచయ, వ్యాజంబునన్= పూలుకోసికొనటం అనే నెపంతో; సఖులున్, తానున్= చెలికత్తెలూ తానూ కలసి; విహరించుచున్+ఉండెన్= విహారం చేస్తూ ఉన్నది.

తాత్పర్యం: పద్మనేత్ర అయిన మేనక వినయంతో విశ్వామిత్రుడికి నమస్కరించి, ప్రీతితో పూలుకోసే నెపంతో చెలికత్తెలతో కలసి తానూ విహరిస్తూ ఉన్నది.

విశేషం: అంబుజలోచన అని వర్ణించటంలోనూ, బిందుపూర్వక సరళాక్షర ప్రాసలోనూ, నాదాక్షరాల, బిందుపూర్వక వర్ణాలప్రయోగంలోనూ నన్నయ అక్షరరమ్యంగా అనురాగభావాన్ని ధ్వనింపజేశాడు.

చ. అలసత యొప్పఁగాఁ దరుణి యమ్మునివల్లభుమ్రోల నున్న స
మ్మిళిత సుగంధబంధురసమీరవశంబునఁ దూలి బాల పై
వలు వెడలన్ బయల్పడియె వల్గకుచంబులుఁ గక్షయుగ్మమున్
లలితకృశోదరంబుఁ దరళత్రివళీయుత రోమరాజియున్. 44

ప్రతిపదార్థం: తరుణి= యువతి(మేనక); అలసత, ఒప్పఁగాన్= అలసభావం తోపగా; ఆ+ముని, వల్లభు, మ్రోలన్= ఆ ఋషిశ్రేష్ఠుడి (విశ్వామిత్రుని) ముందట; ఉన్నన్= ఉండగా; సంమిళిత, సుగంధ, బంధుర, సమీర, వశంబునన్= మిళితమైన

మంచి వాసనగల ఒప్పిదమైన గాలివలన; బాల, పైవలువ= కోమలి పైపైట; తూలి= ఒరిగి; ఎడలన్= తొలగిపోగా; వల్ల, కుచంబులున్= పెద్దవైన చన్నులున్నూ; కక్ష, యుగ్మమున్= బాహుమూలల (చంకల) జంటయున్నూ; లలిత, కృశ+ఉదరంబున్= కోమలమైన సన్నని పొట్టయున్నూ (నడుమున్నూ); తరళ, త్రి, వళీయుత, రోమ, రాజియున్= మెరుస్తున్న కడుపుమీది మూడుమడతలతో కూడిన నూగారున్నూ; బయల్, పడియెన్= బయటపడినవి.

తాత్పర్యం: మేనక అలసభావం తోపగా ఆ ఋషిశ్రేష్ఠుడి ముందట ఉండగా, మంచివాసనతో కూడికొన్న గాలివలన కోమలి పైట ఒరిగి తొలగిపోయింది. అప్పుడు ఆమె పెద్దవైన వక్షోజాలూ, కోమలమైన సన్నని నడుమూ, మెరిసే కడుపుమీది మూడు మడతలతోకూడిన నూగారూ బయటపడ్డాయి.

విశేషం: మేనక శరీరాంగ సౌందర్యాన్ని వర్ణించే ఈపద్యరచనలో మాధుర్య మనే శబ్దగుణం పోషించి నన్నయ ఔచిత్యాన్ని పాటించాడు. ఆమె పైటను తొలగించిన గాలిని వర్ణించిన సమాసం మిగిలినవాటికంటె పొడుగ్గా ఉండటం శిల్పసుందరం. పైట తొలగినప్పుడు స్త్రీశరీరంలో కనపడే మన్మథస్థానాలను మాత్రమే వర్ణించటం రసవిభావస్ఫూర్తికి ఉద్దీపకం. అంతఃస్థాలను, అనునాసికాలను, బిందుపూర్వకవర్ణాలను వాడి మేనక సౌందర్యమాధుర్యాన్ని అక్షరరమ్యంగా నన్నయ అభివర్ణించాడు.

క. అందుఁ దనదృష్టి నాటుడుఁ । గందర్ప నిశాత సాయకంబులు పెలుచన్
డెందముఁ గాఁడిన ధృతి సెడి । కంది మునీంద్రుండు దానిఁ గవయం దివిరెన్. 45

ప్రతిపదార్థం: ముని+ఇంద్రుండు= మునిశ్రేష్ఠుడు, విశ్వామిత్రుడు; అందున్= పైట తొలగిన ఆమె అందంలో; తనదృష్టి= తనయొక్క చూపు; నాటుడున్= తగులుకొనగా; కందర్ప, నిశాత, సాయకంబులు= మన్మథుని వాడియైన బాణాలు; పెలుచన్= అధికంగా; డెందమున్= హృదయాన్ని; కాఁడినన్= నాటగా; ధృతి+చెడి= నిబ్బరాన్ని (నిగ్రహాన్ని) కోల్పోయి; కంది= (విరహంచేత) తపించి; దానిన్= ఆమెను (మేనకను); కవయన్, తివిరెన్= కూడటానికి పూనుకొన్నాడు.

తాత్పర్యం: విశ్వామిత్రుడు తనదృష్టి పైట తొలగిన మేనకమేనిసౌందర్యంలో చిక్కుకోవటంచేత, మన్మథుడు వేసిన వాడిబాణాలు మిక్కుటంగా తనహృదయంలో నాటగా, నిగ్రహాన్ని కోల్పోయి వలపుతాపంతో మేనకపొందుకొరకు పూనుకొన్నాడు.

వ. మేనకయు విశ్వామిత్రు నిష్టంబునకుం దగిన కామోపభోగంబులం బెద్దకాలంబు రమియించిన నయ్యిద్దఱకు నిక్కన్యక పుట్టిన, దీని మాలిని యను నొక్కయేటి పులినతలంబునం బెట్టి మేనక దేవలోకంబునకుం జనియె; విశ్వామిత్రుండును దపోవనంబునకుం జనియె; నంత నమ్ముని ప్రభావంబున. 46

ప్రతిపదార్థం: మేనకయున్= మేనకకూడ; విశ్వామిత్రు+ఇష్టంబునకున్= విశ్వామిత్రుడియొక్క కోర్కెకు; తగిన= ఉచితమైన; కామ+ఉపభోగంబులన్= మన్మథక్రీడలచేత; పెద్దకాలంబు= చాలకాలం; రమియించినన్= క్రీడించగా; ఆ+ఇద్దఱకున్= ఆ ఇరువురికి; ఈ+కన్యక= ఈ ఆడపిల్ల(శకుంతల); పుట్టినన్= పుట్టగా; దీనిన్= దీనిని (ఈశిశువును); మాలిని, అను+ఒక్క, యేటి, పులిన, తలంబునన్, పెట్టి= మాలిని అనే పేరు గల ఒక నదియొక్క ఇసుకతిన్నెపై ఉంచి; మేనక; దేవలోకంబునకున్= స్వర్గానికి; చనియెన్= వెళ్లింది; విశ్వామిత్రుండును; తపస్+వనంబునకున్= తపస్సు చేసికొనే అడవికి; చనియెన్= వెళ్ళాడు; అంతన్= ఆ మీద; ఆ+ముని, ప్రభావంబునన్= ఆ విశ్వామిత్రఋషియొక్క మహిమవలన.

తాత్పర్యం: మేనకకూడా విశ్వామిత్రుడి కోర్కెకు తగినట్లు మన్మథక్రీడలతో చాలకాలం భోగించగా వారిద్దరికి ఈకన్యపుట్టింది. మేనక ఈ బిడ్డను మాలినీనదీతీరాన ఒక ఇసుకతిన్నెమీద ఉంచి తాను దేవలోకానికి వెళ్ళిపోయింది. ఆ విశ్వామిత్రుడుకూడా తపోవనానికి వెళ్ళాడు. ఆ తరువాత ఆ మునిప్రభావంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: మూలభారతంలో శకుంతలను (శిశువుగా ఉన్నప్పుడు) పక్షులు తమకు తాము రక్షించినట్లు ఉండగా, నన్నయ ఆ రక్షణం మునిప్రభావంవలన కలిగిం దని అమూలకమైన హేతువును చూపించాడు. మునిమహిమను ప్రకటించే ఈ కల్పన సందర్భోచితం.

ఆ. చెలఁగి లేవ నేడ్చు చిఱుతుకదానిఁ గ్ర । వ్యాదఘోరమృగము లశనబుద్ధిఁ
బట్టకుండఁ జెట్టుపలఁ గప్పి రక్షించు । కొని శకుంతతతులు గూడియుండె. 47

ప్రతిపదార్థం: చెలఁగి= పూని, ప్రయత్నించి; లేవన్= లేవటానికై; ఏడ్చు= ఏడ్చే; చిఱుతుకదానిన్= చిట్టిపాప అయినదానిని; క్రవ్యాద, ఘోర, మృగములు= రాక్షసులూ, క్రూరమృగాలూ; అశన, బుద్ధిన్= తినాలనే కోర్కెతో; పట్టకుండన్= నోటకరవకుండ; చెట్టుపలన్= రెక్కలను; కప్పి= కమ్మి; రక్షించుకొని= కావాలని ఆప్యాయంగా కాపాడి; శకుంత, తతులు= పక్షులగుంపులు; కూడి, ఉండెన్= గుంపుగా కలసిఉన్నాయి.

తాత్పర్యం: చిట్టిపాపగా ఉన్న పసిగందు పైకిలేవటానికి చేతకాక ఏడుస్తూ ఉంటే ఆ అరుపు విని రాక్షసులూ, క్రూరమృగాలూ తినాలనే కోర్కెతో నోటకరచుకొనిపోకుండా పక్షులగుంపులు తమ రెక్కలతో ఆబిడ్డను రక్షించుకొంటూ గుమికూడిఉన్నాయి.

విశేషం: 'రక్షించుకొని' అనే ఆత్మనేపదార్థ క్రియతో పక్షు లా బాలపై ప్రదర్శించిన వాత్సల్యాతిశయాన్ని నన్నయ సూచించాడు.

వ. అంత నేము శిష్యగణంబులతోడ సమిత్కుసుమ ఫలాహరణార్థం బక్కడకుం జని, యమ్మాలినీ పులినతలంబున శకుంతరక్షిత యై యున్న కూఁతు నత్యంతకాంతిమతి నవనీతలంబున కవతరించిన తరుణ శశిరేఖ యుంబోని దాని నెత్తుకొని వచ్చి, శకుంతరక్షిత యగుటఁ జేసి శకుంతల యను నామం బిడి కరంబు గారవంబునం బెనిచితిమి. 48

ప్రతిపదార్థం: అంతన్= ఆ సమయంలో; ఏము= మేము (ఏను అనిచెప్పే గౌరవబహువచనం ఏము); శిష్యగణంబులతోడన్= శిష్యుల సమూహాలతో; సమిత్, కుసుమ, ఫల+ఆహరణ+అర్థంబు= సమిధలు, పూలు, పండ్లు, తేవటానికై; ఆ+కడకున్= ఆ ప్రదేశానికి; చని= వెళ్ళి; ఆ+మాలినీపులినతలంబునన్= ఆ మాలిని అనే పేరుగల నదియొక్క ఇసుకతిన్నె పై ; శకుంత, రక్షిత+ఐ= పక్షులచేత రక్షింపబడినది ఐ; ఉన్న; కూఁతున్= ఆ ఆడుశిశువును; అత్యంత, కాంతి, మతిన్= అపారమైన వెలుగుతోకూడిఉన్నదానిని; అవనీ, తలంబునకున్+అవతరించిన= నేలమీదికి దిగివచ్చిన; తరుణ, శశిరేఖయున్+పోని దానిన్= క్రొత్తదైన చంద్రకళను పోలిఉన్నదాన్ని; ఎత్తుకొని, వచ్చి= తీసికొని వచ్చి; శకుంత, రక్షిత, అగుటన్, చేసి= పక్షులచేత కాపాడబడినది కావటం చేత; శకుంతల, అను, నామంబు+ఇడి= శకుంతల అనే పేరుపెట్టి; కరంబు= మిక్కిలి; గారవంబునన్= మమకారంతో, ముద్దుగా; పెనిచితిమి= పెంచాము.

తాత్పర్యం: ఆ సమయంలో మేము శిష్యగణాలతో సమిధలు, పూలు, పండ్లు తెచ్చుకొనటానికి అక్కడికి వెళ్ళాము. మాలినీ నదీతీరంలోని ఒక ఇసుకతిన్నెమీద పక్షులచేత రక్షింపబడియున్న ఈ అమ్మాయి మిక్కిలి కాంతితో ప్రకాశిస్తూ నేలమీదకు దిగివచ్చిన క్రొత్తచంద్రరేఖవలె ఉండగా ఎత్తుకొని వచ్చాము. శకుంతాలచేత రక్షింపబడింది కాబట్టి ఆ బాలకు శకుంతల అనే పేరుపెట్టి కడు గారాబంగా పెంచాము.

మధురాక్కర.

తనర జనకుండు నన్నప్రదాతయును భయత్రాత
యును ననఁగ నింతులకు ముప్ప రొగిన గురువులు; వీర
లనఘ! యుపనేత మఱియు నిరంతరాధ్యాపకుండు
ననఁగఁ బురుషున కియ్యేవు రనయంబును గురువులు. **49**

ప్రతిపదార్థం: తనరన్= ఒప్పారగా; జనకుండున్= జన్మ నిచ్చిన తండ్రియున్నూ; అన్న, ప్రదాతయును= అన్నంపెట్టి పోషించి ప్రాణం నిలిపిన అన్నదాతయున్నూ; భయ, త్రాతయున్= భయంనుండి కాపాడేవాడున్నూ; అనఁగన్= అని; ఇంతులకున్= స్త్రీలకు; ఒగిన= వరుసగా; వీరలు= వీళ్ళు (పైనపేర్కొన్నవారు); ముప్పురున్= ముగ్గురూ; గురువులు= తండ్రులు; అనఘ!= ఓ పాపరహితుడవైన మునీ!; పురుషునకున్= మగవాడికి; మఱియున్= పైముగ్గురేకాక ఇంకను; ఉపనేత= ఉపనయనం చేసినవాడూ; నిరంతర+అధ్యాపకుండున్= ఎల్లప్పుడు వేదాలను పాఠంగాచెప్పేవాడూ; ఈ+ఏవురున్= మొత్తం ఈ అయిదుగురు; అనయంబును= ఎల్లప్పుడూ; గురువులు= తండ్రులు.

తాత్పర్యం: స్త్రీలకు తండ్రులుగా కన్నవాడినీ, అన్నం పెట్టినవాడినీ, భయంనుండి రక్షించినవాడినీ మొత్తం వరుసగా ముగ్గురిని చెప్పుతారు; ఓ పుణ్యాత్ముడవైన మహర్షీ! పురుషులకు ఈ ముగ్గురేకాక ఉపనయనం చేసినవాడినీ, వేదాలు చెప్పినవాడినీ కలిపి మొత్తం అయిదుగురిని ఎల్లప్పుడూ తండ్రులుగా పరిగణిస్తారు.

విశేషం: మూలంలో - 'శరీరకృత్, ప్రాణదాతా, యస్య చాన్నాని భుంజతే' । క్రమేణైతే త్రయోఽప్యుక్తాః పితరో ధర్మదర్శనే" - అని స్త్రీలకు గురువులు ముగ్గురే అని చెప్పబడి ఉండగా నన్నయ పురుషులకు అయిదుగురు గురువు లని విశేషించి పేర్కొన్నాడు. మధురాక్కర చరణంలో క్రమంగా 1 సూర్యగణం, 3 ఇంద్రగణాలు, 1 చంద్రగణం ఉంటాయి. నాల్గవగణం మొదటి అక్షరంతో యతి మైత్రి. ప్రాసనియమం ఉన్నది.

వ. **'అనం బరఁగిన శాస్త్రార్థంబున నేము దీనికి భయత్రాతల మగుటంజేసి గురుల; మిదియును మాచే నభివర్ధిత యగుటం జేసి మాకు హృదయానందని యైన కూఁతు' రని కణ్వమహామును లమ్మునికిం జెప్పిన విధం బంతయు సవిస్తరంబుగా శకుంతల చెప్పిన విని దుష్యంతుం డాత్మగతంబున.** **50**

ప్రతిపదార్థం: అనన్+పరఁగిన= ఈ విధంగా లోకప్రసిద్ధిచెందిన; శాస్త్ర+అర్థంబునన్= శాస్త్రప్రమాణంచేత; ఏము= మేము (కణ్వుడు); దీనికిన్= శకుంతలకు; భయత్రాతలము+అగుటన్+చేసి= భయాన్ని తొలగించినవారం కావటంచేత; గురులము= తండ్రులం (బహువచనం ఆత్మగౌరవ సూచకం); ఇదియును= ఈ శకుంతలకూడా; మాచే, అభివర్ధిత, అగుటన్+చేసి= మాచేత పెంచబడింది కాబట్టి; మాకున్, హృదయ+ఆనందని+ఐన, కూఁతురు= మాకు మనసుకు ఆనందాన్ని కలిగించే కూతురు; అని= ఈవిధంగా; కణ్వమహాత్+మునులు; ఆ+మునికిన్; చెప్పిన, విధంబు+అంతయున్; సవిస్తరంబుగాన్=

వివరంగా; శకుంతల; చెప్పినన్; విని; దుష్యంతుండు; ఆత్మగతంబునన్= తనలో తాను స్వగతంగా (రాబోయే పద్యంలోవలె అనుకొన్నాడు).

తాత్పర్యం: 'ప్రసిద్ధ మైన ఈ శాస్త్రప్రమాణంచేత మేము శకుంతలకు భయత్రాతలం కావటంచేత గురువులం. ఈమెకూడా మాచేత పెంచబడి ఉండటంచేత మాకు మనసు కెక్కిన కూతురు' - అని కణ్వమహాముని ఆ మునికి చెప్పిన విధమంతా వివరంగా శకుంతల చెప్పగా విని దుష్యంతుడు తనలోతాను - (ఈవిధంగా అనుకొన్నాడు). (తరువాతి పద్యంతో అన్వయం.)

దుష్యంతుండు శకుంతలను వివాహంబు సేసికొనఁ గోరుట (సం. 1-67-1)

చ. **ఇది మునినాథ కన్య యని యెంతయు నిఃస్పృహవృత్తి నున్ననా**
హృదయము రాజపుత్త్రి నని యిక్కమలాక్షి నిజాభిజాత్య సం
పద నెఱిఁగించినన్ మదనబాణపరంపర కిప్పు డుండ నా
స్పద మయి సంచలించె నళిపాత వికంపిత పంకజాకృతిన్. **51**

ప్రతిపదార్థం: ఇది= ఆమె (శకుంతల); మునినాథ, కన్య, అని= మునిశ్రేష్ఠుడి కూతు రని; ఎంతయున్= మిక్కిలి; నిస్+స్పృహవృత్తిన్= నిరాశతో; ఉన్న; నా హృదయము= (దుష్యంతుడి మనస్సు); ఈ+కమల+అక్షి= పద్మాలవంటి కన్నులుకల ఈ శకుంతల; రాజపుత్త్రిన్, అని= క్షత్రియుడి కూతురను అని; నిజ+అభిజాత్య, సంపదన్= తనయొక్క వంశవైభవాన్ని; ఎఱిఁగించినన్= తెలుపగా; ఇప్పుడు; మదన, బాణ, పరంపరకున్= మన్మథునియొక్క బాణాల వరుసకు; ఉండన్, ఆస్పదము+అయి= నెలవై, వశమై; అళిపాత, వికంపిత, పంకజ+ఆకృతిన్= తుమ్మెదలు వాలటంచేత చలించినపద్మంవలె; సంచలించెన్= కంపించింది.

తాత్పర్యం: శకుంతల మునికన్య యేమో అని మిక్కిలి నిరాశతో ఉన్న నా హృదయం ఈ పద్మాక్షి తాను రాజపుత్త్రినని తన వంశౌన్నత్యాన్ని తెలపటంచేత మన్మథబాణపరంపరకు వశమై తుమ్మెదలు వాలటంచేత కంపించిన పద్మంవలె చలించింది. (అని దుష్యంతుడు తనలో అనుకొన్నాడు).

విశేషం: అలం: ఉపమ. "ఇది మునికన్యయేని''..... అనే పద్యం, "ఇది మునినాథకన్యయని''...... అన్న ఈ పద్యం - ఈ రెండున్నూ నన్నయ ఈకథకు పెట్టిన రెండు వన్నెలు. దుష్యంతుడి ఉత్తమచిత్తవృతికి ఉదాహరణలు. కాళిదాసుడి అభిజ్ఞానశాకుంతల నాటకంలోని "భవ హృదయ సాభిలాషం సంప్రతి సందేహ నిర్ణయోజాతః'' ఇత్యాది వాక్యాలు ఈ కథాసంవిధాన కల్పనలో నన్నయకు తోడ్పడి ఉంటాయి. "సతాం హి సందేహ పదేషు వస్తుషు ప్రమాణ మంతఃకరణప్రవృత్తయః'' అనే శ్లోకతాత్పర్యాన్ని ఈపద్యభావం ధ్వనింపచేస్తున్నది. దశవిధమన్మథావస్థలలో మూడవదైన సంకల్పం ఇందులో సూచింపబడుతున్నది. పై రెండు పద్యాలూ చంపకమాలలే. అంటే వృత్తైక్యం పాటింపబడిందన్నమాట. రెండుపద్యాల ఎత్తుగడలూ సమానమే. ఇటువంటి వృత్త, గతిసామ్యాలు ఛందశ్శిల్పసంబంధి విశేషాలు. ఇవికూడా వస్తురస భావాలను ధ్వనింపజేస్తాయి. మొదటిపద్యంలో నాయకుడి హృదయంలో ఏర్పడిన శంక రెండవపద్యంలో నివృత్త మై రతిభావదీప్తికి ఏర్పడిన అడ్డంకి తొలగి రసస్థితికి చేరే వికాసం ఏర్పడింది. అందువలన ఈరెండుపద్యాలు నాయకగతమైన స్థాయి పోషణలో రెండు బలమైన బిందువులు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగా రీ పద్యద్వయ సన్నివేశ ప్రాశస్త్యాన్ని ఇట్లా పేర్కొన్నారు- "రెండుస్వగతములును సదృశతమము లైన చంపకము లందే నిబంధింపబడినవి. మొదటిదానియందుఁ దునిఁగిపోవచ్చిన దుష్యంతునిరతి రెండవదానియం

దతుకుకొని కొసలు సాగినది. శకుంతలా దుష్యంతుల ప్రణయకలాపమున కడ్డుగా జొచ్చుకొనివచ్చిన మేనకావిశ్వామిత్రుల శృంగారవృత్తాంతమున కుభయకూలములందును నిల్చి యీ రెండుపద్యములు అవాంతర కథాప్రవాహసేతునిబంధన ప్రయోజకములగు రెండు మహాస్తంభములవలె నున్నవి. ఇది ఛందస్సాధనముచే సాధింపబడిన కథాశిల్పము" (నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి - పు. 162)

వ. అనుచు మదనాతురుం డయి దుష్యంతుండు దనయం దక్కోమలియనురాగం బుపలక్షించి యి ట్లనియె. 52

ప్రతిపదార్థం: అనుచున్= అని తనలో తాను అనుకొంటూ; మదన+ఆతురుండు+అయి= మన్మథుడిచేత బాధింపబడినవాడై (కోరికను ఆపుకోలేనివాడై); దుష్యంతుండు; తనయందున్; ఆ+కోమలి, యనురాగంబు+ఉపలక్షించి= ఆ శకుంతలయొక్క ప్రీతిని గమనించి); ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ విధంగా తనలో తాను అనుకొంటూ మనసులో మన్మథపరమైన భావాలు ఒత్తిడిచేయగా శకుంతల తనపై వలపుగొన్నట్లు గమనించి దుష్యంతుడు ఈవిధంగా పలికాడు.

క. ఈ వల్కలాజినములకు । నీ వన్యఫలాశనముల కీ విటపకుటీ
రావాసములకు నుచితమె । నీ విలసిత రూపకాంతి నిర్మలగుణముల్. 53

ప్రతిపదార్థం: నీ, విలసిత, రూప, కాంతి, నిర్మల, గుణముల్= నీ (శకుంతల) యొక్క (ప్రకాశితాలైన) అందమైన ఆకారము, దాని కాంతి, మచ్చలేని గుణాలు (అనేవి); ఈ వల్కల+అజినములకున్= ఈ నారచీరలకున్నూ; ఈ, వన్యఫల+అశనములకున్= ఈ అడవికి సంబంధించిన పండ్ల ఆహారాలకూ; ఈ, విటప, కుటీర+ఆవాసములకున్= ఈ పర్ణశాల నివాసాలకూ; ఉచితమె?= యోగ్యమైనదా? కాదని భావం.

తాత్పర్యం: నీ అందమైనరూపం, నీ మేనిప్రకాశం మచ్చలేని నీగుణాలు అనేవి ఈ నారచీరలు కట్టటానికీ, అడవిపండ్లు తింటూ ఉండటానికీ, ఈ ఆకుటిండ్లలో (పర్ణశాలలలో) నివసించటానికీ తగినవి కావు.

విశేషం: అందమైన రూపం నారచీరలు కట్టటం ఉచితం కాదు; మేనికాంతి అడవిపండ్లు తినటంవలన వాడిపోతుంది కాబట్టి అనుచితం. నిర్మలగుణాలు గల ఆమె మణులు పొదిగిన గృహాలలో ఉండదగింది కాబట్టి ఆశ్రమాలలో ఉండటం ఉచితం కాదని భావం. తన అభిలాషకు అనుకూలంగా ఆమెఅందం ఆశ్రమజీవితానికి అనుకూలం కాదని ప్రబోధించాడు (ప్రశంసించాడు) దుష్యంతుడు.

ఉ. ఈ మునిపల్లె నుండు టిది యేల కరం బనురాగ మొప్పఁగా
భామిని! నాకు భార్య వయి భాసురలీల నశేషరాజ్య ల
క్ష్మీ మహనీయ సౌఖ్యముల మేలుగ నందు మనిందితేందుపా
దామలతుంగహర్మ్యముల హారిహిరణ్మయ కుట్టిమంబులన్. 54

ప్రతిపదార్థం: భామిని!= ఓ శకుంతలా!; ఈ, ముని, పల్లెన్= ఈ మునులయొక్క పల్లెలో; ఉండుట. ఇది ఏల?= ఈవిధంగా ఉండటం ఎందుకు?; కరంబు= మిక్కిలి; అనురాగము, ఒప్పఁగాన్= వలపు అందగించగా; నాకున్= (దుష్యంతునికి); భార్యవు+అయి= ఇల్లాలివై; భాసుర, లీలన్= ప్రకాశించే వైభవంతో; అశేష. రాజ్య, లక్ష్మీ, మహనీయ, సౌఖ్యములన్= అపారమైన

రాజ్యసంపదవలని గొప్పవైన సుఖాలనూ; అనిందిత+ఇందు, పాద+అమల, తుంగ, హర్మ్యములన్= మచ్చలేని చంద్రకిరణాలవలె తెల్లని ఎత్తైన మేడలయొక్క; హారి, హిరణ్మయ, కుట్టిమంబులన్= అందమైన బంగారపు కట్టడాల పైభాగాలలో, మేలుగన్= ఇంపుగా, శుభంగా; అందుము= అందుకొమ్ము, అనుభవింపుము.

తాత్పర్యం: ఓ శకుంతలా! ముని లుండే ఈపల్లెలో ఈవిధంగా ఉండటం ఎందుకు? మిక్కిలివలపు అందగించగా నాకు భార్యవు కమ్ము; ప్రకాశించే వైభవంతో అపారమైన రాజ్యసంపదవలన కలిగే సుఖాలను, మచ్చలేని చంద్రకిరణాలవలె తెల్లగానుండే ఎత్తైనమేడలలో అందమైన బంగారు కట్టడాల పైభాగాలలో మేలుగా అనుభవించుము.

విశేషం: పద్యం చిన్నచిన్న పదాలతో మొదలై సమాసాలతో ముగుస్తున్నట్లు సాగిన రచన శకుంతల అప్పటి దైన్యస్థితి నుండి పెండ్లి అయిన తరువాత క్రమంగా పొందే ఉన్నతస్థితిని స్ఫురింపచేస్తున్నట్లు దుష్యంతుడు పలికిన పద్ధతిని నన్నయ స్ఫురింపచేశాడు.

సీ. **'బ్రాహ్మంబు దైవంబుఁ బరఁగ నార్షంబుఁ బ్రా । జాపత్యమును రాక్షసంబు నాసు**
రంబు గాంధర్వంబు రమణఁ బైశాచంబు । నను నెనిమిది వివాహములయందుఁ
గడుఁ బ్రశస్తములు సత్క్షత్త్ర వంశ్యులకు గాం । ధర్వ రాక్షసములు ధర్మయుక్తి;
నీకును నాకును నెమ్మిఁ బరస్పర । ప్రేమంబు గాముండు పెంపఁదొడఁగెఁ

ఆ. **గాన యెడయుఁ జేయఁగా నేల? గాంధర్వ । విధి వివాహ మగుట వినవె యుక్త'**
మనిన లజ్జఁ జేసి యవనత వదన యై । యాలతాంగి యిట్టు లనియెఁ బతికి. **55**

ప్రతిపదార్థం: బ్రాహ్మంబు= సదాచారంగల వరుడిని వస్త్రాదులచేత అలంకరించి పూజించి చేసే కన్యాదానం; దైవంబున్= జ్యోతిష్టోమం మొదలైన యజ్ఞాలు ప్రారంభించేటప్పుడు యథావిధిగా ఆ యజ్ఞవిధిని నడిపిన ఋత్విజుడిని అలంకరించి చేసే వివాహం; పరఁగన్= ఒప్పగా; ఆర్షంబున్= ధర్మార్థం వరుడినుండి గోమిథునాన్ని తీసికొని కన్య నిచ్చి యథావిధిగా చేసే వివాహం; ప్రాజాపత్యమును= వరుడిచేత నేను ఇతర ఆశ్రమాలను వేటినీ స్వీకరించకుండ గృహస్థాశ్రమంలోనే ఉండి ధర్మాన్ని ఆచరిస్తాను' అని ప్రతిజ్ఞ చేయించి కన్యాదానం చేయటం; రాక్షసంబున్= కన్యను బలాత్కారంగా తీసికొని వచ్చి చేసికొనే వివాహం; ఆసురంబు= కన్యయొక్క తల్లిదండ్రులకూ, కన్యకూ యథాశక్తిద్రవ్య మిచ్చి యథేచ్ఛగా చేసికొనే వివాహం; గాంధర్వంబు= వధూవరులు పరస్పరం ప్రేమించుకొని చేసికొనే వివాహం; పైశాచంబున్= నిద్రిస్తూ కాని, త్రాగి మైమరచి కాని శీలాన్ని రక్షించుకోవటంలో పరాకుగా ఉన్న వనితను సంభోగేచ్ఛతో రహస్యంగా ఎత్తుకొనిపోయి చేసికొనే వివాహం; అను= అని చెప్పబడే; రమణన్= ఒప్పారు; ఎనిమిది, వివాహముల, అందున్= ఎనిమిది రకాల పెండ్లిండ్లలో; సత్, క్షత్త్రవంశ్యులకున్= మంచి క్షత్త్రియ వంశంలో పుట్టినవారికి; గాంధర్వ, రాక్షసములు= గాంధర్వవివాహమున్నూ, రాక్షస వివాహమున్నూ; ధర్మయుక్తిన్= ధర్మంతో కూడికొని ఉండటంచేత; కడున్, ప్రశస్తములు= ఎంతో మేలైనవి; నీకును, నాకును= నీకూ నాకూ (శకుంతలకూ, దుష్యంతుడికీ); నెమ్మిన్= ప్రీతితో; కాముండు= మన్మథుడు; పరస్పర, ప్రేమంబు= ఒకరిపై మరొకరికి అనురాగాన్ని; పెంపన్+తొడఁగెన్= ఎక్కువ చేస్తున్నాడు; కాన= కాబట్టి; ఎడయున్+చేయఁగాన్+ఏల= ఆలస్యంచేయటం ఎందుకు; గాంధర్వవిధిన్= గాంధర్వవివాహపద్ధతిలో; వివాహము+అగుట= పెండ్లిచేసికొనటం; యుక్తము, వినవె= సమంజసం సుమా!; అనినన్= అని పలుకగా; ఆ, లతాంగి= లతవంటి శరీరంకల ఆ శకుంతల; లజ్జన్, చేసి= సిగ్గుతో; అవనత, వదన, ఐ= వంచిన మొగం కలిగినదై (తలవంచుకొని); పతికిన్= రాజుతో; ఇట్టులు+అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: 'బ్రాహ్మం, దైవం, ఆర్షం, ప్రాజాపత్యం, రాక్షసం, ఆసురం, గాంధర్వం, పైశాచం - అనే ఎనిమిది రకాలైన వివాహాలలో ఉత్తమక్షత్రియవంశాలకు చెందినవారికి గాంధర్వ రాక్షసవివాహాలు ధర్మంతోకూడి ఉండటంచేత మేలైనవి. ఇప్పుడు మన్మథుడు నీకూ నాకూ ప్రేమను ప్రీతితో పరస్పరం పెంపొందింపజేస్తున్నాడు కాబట్టి ఆలస్యం చేయట మెందుకు? గాంధర్వవివాహపద్ధతిలో పెండ్లాడటం సమంజసం సుమా!' అని దుష్యంతుడు పలుకగా ఆ శకుంతల సిగ్గుతో తల వంచుకొని రాజుతో ఈవిధంగా అన్నది.

విశేషం: అష్టవిధ వివాహాలలో మొదటి నాలుగున్నూ బ్రాహ్మణులకు ఉచితమైనవి; గాంధర్వరాక్షసవివాహాలు క్షత్రియులకున్నూ, ఆసురం వైశ్యశూద్రులకున్నూ యోగ్యమైనవి. పైశాచికం ఎవ్వరూ అనుసరించతగింది కాదు - అని శాస్త్రాలు చెప్పుతున్నాయి. భారతదేశమంతటా మనుస్మృతి ప్రామాణికంగా పరిగణింపబడుతుంది. దాని తరువాత గౌతమ, బోధాయన, ఆపస్తంబాదులు రచించిన ధర్మశాస్త్ర గ్రంథాలు ఆయాకాలాలలో ప్రచారంలోకి వచ్చాయి. భారతదేశంలోని ఆయాప్రాంతాలవారికి, ఆయావర్గాలవారికి అవికూడా ప్రామాణికాలుగా ఉన్నాయి. త్రిలింగదేశంలో సామవేదులు గౌతమ ధర్మసూత్రాలనూ, మిగిలినవారు ఆపస్తంబసూత్రాలనూ అనుసరిస్తారు. కవిత్రయంవారు ముగ్గురూ ఆపస్తంబసూత్రులు, మనుధర్మాలతో ఆపస్తంబధర్మసూత్రాలు ఎడనెడ భేదిస్తాయి. ఆసందర్భాలలో నన్నయ మనుధర్మశాస్త్రాంశాలను అనుసరించి, ఆపస్తంబసూత్రాలు భేదించేఅంశాలను ప్రత్యేకించి పేర్కొనకుండా వదలటం గమనింపదగిన విషయం. రాజరాజనరేంద్రుడు 'మనుమార్గ' వర్తనుడు కావటం, వ్యాసనిబద్ధమహాభారతార్థానికి విరుద్ధం కాకుండా రచింపవలె నని ఆయన కోరటం దానికి కారణం కావచ్చు, దీనికి ఉదాహరణంగా అష్టవిధవివాహాల ప్రశంసను పేర్కొనవచ్చు. మనువు అష్టవిధవివాహాలు చెప్పాడు. వాటిలో ఆసురపైశాచాలు సర్వదా నిందించదగినవిగా పేర్కొన్నాడు. (మనుస్మృతి - 3- 21, 25). ఆపస్తంబుడు కేవలం ఆరింటినే చెప్పాడు. అవి - బ్రాహ్మ, దైవ, ఆర్ష, గాంధర్వ, ఆసుర, రాక్షసాలు. ఆపస్తంబుడు ప్రాజాపత్య, పైశాచాలను వదిలాడు. నన్నయ ఆపస్తంబసూత్రుడైనా అష్టవిధవివాహాలను పేర్కొన్నాడు. అయితే నింద్యాలను గురించి మాటాడలేదు. కథలో అవసరం లేదు కాబట్టి వదలి ఉండవచ్చును.

తిక్కన ఆనుశాసనిక పర్వంలో (2-226) బ్రాహ్మ, క్షాత్ర, గాంధర్వ, రాక్షస, ఆసుర వివాహాలను అయిదింటిని పేర్కొన్నాడు. ఇందులో క్షాత్రం క్రొత్తది. ఒకరినొకరు వలచినా రని తెలిసికొని పెద్దలు వధూవరులకు చేసే వివాహం క్షాత్రం. ఇది సంస్కృత భారతంలోనే ప్రస్తావించబడి ఉన్నది (సం.మ.భా. ఆను.44.9) దాన్ని తిక్కన యథాతథంగా గ్రహించాడు. అయితే, రాక్షస ఆసుర వివాహాలు ధర్మదూషితా లని పేర్కొన్నాడు. వివిధ ధర్మాలలో వాదు ఏర్పడినప్పుడు మనుశాస్త్రమే ప్రమాణ మని భారతం ప్రతిపాదిస్తున్న దని దీనివలన తాత్పర్యం ఏర్పడుతున్నది.

క. కరుణానిరతులు ధర్మ । స్వరూపు లింతకు మదీయజనకులు సనుదెం
తురు; వారు వచ్చి నీ కి । చ్చిరేని పాణిగ్రహణము సేయుము నన్నున్. 56

ప్రతిపదార్థం: కరుణా, నిరతులు= దయాపరులున్నూ; ధర్మస్వరూపులు= ధర్మమేరూపముతాల్చినవారున్నూ; (అయిన); మదీయ, జనకులు= నాతండ్రిగారు; ఇంతకున్= ఇంతలోనే; చనుదెంతురు= వస్తారు; వారు= కణ్వమహర్షి; వచ్చి; నీకున్, ఇచ్చిరి+ఏని= నీకు భార్యగా ఇవ్వటానికి అంగీకరిస్తే; నన్నున్= నన్ను; పాణిగ్రహణము, చేయుము= వివాహము చేసికొమ్ము.

తాత్పర్యం: దయాపరులు, ధర్మమే మూర్తికట్టినవారు అయిన మాతండ్రి కణ్వమహర్షులు ఇంతలోనే వస్తారు. వారు వచ్చి నన్ను నీకు భార్యగా కన్యాదానం చేస్తే నన్ను నీవు పెండ్లాడుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అనిన దానికి దుష్యంతుం డి ట్లనియె. 57

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: అని శకుంతల అనిన దానికి దుష్యంతుడు ఈవిధంగా పలికాడు.

తే. తనకు మఱి తాన చుట్టంబు, తాన తనకు । గతియుఁ, ద న్నిచ్చుచోఁ దాన కర్త యనఁగ
వనజనేత్ర! గాంధర్వవివాహ మతి ర । హస్యమును నమంత్రకమును నగుచు నొప్పు. 58

ప్రతిపదార్థం: వనజనేత్ర= పద్మాలవంటి కన్నులు కలదానా, శకుంతలా!; తనకున్, మఱి, తాను+అ, చుట్టంబు= తనకు చుట్టాలు మరెవ్వరు లేకుండా తానే తనకు చుట్టం కావటం; తాన, తనకున్, గతియున్= తనకు తానే దిక్కుకావటం; తన్నున్ (తనను)+ఇచ్చుచోన్, తాన, కర్త, అనఁగన్= తనను తాను ఇచ్చుకొనేటప్పుడు కన్యాదానం చేసే కర్తకూడా తానే కావటం; అనఁగన్= అని ప్రసిద్ధి చెందిన; గాంధర్వ, వివాహము= గాంధర్వవివాహం; అతి, రహస్యమును= మిక్కిలి గోప్యమున్నూ; అమంత్రకమును= మంత్రతంత్రాలు లేనిదిన్నీ; అగుచున్= ఔతూ; ఒప్పున్= ఒప్పారును.

తాత్పర్యం: ఓ కమలనేత్రా! తనకు తానే చుట్టం కావటం, తనకు తానే దిక్కు కావటం. తనను తాను ఇచ్చుకొంటున్నప్పుడు తానే కర్త కావటం అనే లక్షణాలతో ప్రసిద్ధి చెందిన గాంధర్వవివాహం మిక్కిలి గోప్యంగానూ, మంత్రతంత్రరహితంగానూ ఉంటుంది.

వ. అని దుష్యంతుండు గాంధర్వవివాహస్వరూపంబు చెప్పి శకుంతల నొడంబఱిచిన నది యి ట్లనియె. 59

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; దుష్యంతుండు; గాంధర్వ, వివాహ, స్వరూపంబు= గాంధర్వవివాహం జరిగే పద్ధతి; చెప్పి= తెలిపి; శకుంతలను, ఒడంబఱిచినన్= శకుంతలను ఆ వివాహానికి అంగీకరించేటట్లు చేయగా; అది= ఆ శకుంతల; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నది.

తాత్పర్యం: పైవిధంగా దుష్యంతుడు గాంధర్వ వివాహం ప్రవర్తిల్లే పద్ధతిని చెప్పి శకుంతలను ఒప్పించాడు. అప్పుడామె దుష్యంతుడితో ఈవిధంగా అన్నది.

చ. నరనుత! నీ ప్రసాదమున నా కుదయించిన నందనున్ మహీ
గురుతర యౌవరాజ్యమునకున్ దయతో నభిషిక్తుఁ జేయఁగా
వరము ప్రసన్నబుద్ధి ననవద్యముగా దయసేయు నెమ్మితోఁ;
నిరుపమకీర్తి! యట్లయిన నీకును నాకును సంగమం బగున్. 60

ప్రతిపదార్థం: నరనుత!= ప్రజలచేత కీర్తింపబడినవాడా!; నీ, ప్రసాదమునన్= నీ దయవలన; నాకున్; ఉదయించిన= పుట్టిన; నందనున్= కుమారుడిని; మహీ, గురుతర, యౌవరాజ్యమునకున్= గొప్పదైనభూమికి యౌవరాజ్యపదవియందు; అభిషిక్తున్, చేయఁగాన్= అభిషేకింపబడినవాడినిగా చేయటానికి; వరము= వరాన్ని; దయతోన్= దయతో; ప్రసన్నబుద్ధిన్= నిండుమనసుతో; అనవద్యముగాన్= ఉదాత్తంగా, తిరుగులేకుండా; నెమ్మితోన్= ప్రీతితో; దయ, చేయు(ము)= ఇమ్ము; నిరుపమకీర్తి= సాటిలేని కీర్తికలవాడా!; అట్లు+అయినన్= నే నడిగినవిధంగా జరిగితే; నీకును, నాకును= నీకున్నూ, నాకున్నూ; సంగమంబు= కలయిక, పెండ్లి; అగున్= అగును.

తాత్పర్యం: కీర్తిమంతుడ వైన దుష్యంతుడా! నీ అనుగ్రహంవలన నాకు పుట్టిన పుత్రునకు నీ విశాలసామ్రాజ్యానికి యౌవరాజ్యపదవిలో అభిషేకం చేసేవరాన్ని దయతోకూడిన నిండుమనసుతో ఉదాత్తంగా ప్రీతితో ఇమ్ము. సాటిలేని కీర్తికలవాడా! ఈవిధంగా అయితే నీకూ నాకూ వివాహ మౌతుంది.

విశేషం: 'నరనుత' అనే పదానికి 'నరవర' అనే పాఠాంతరం ఉన్నది. (నరవర= నరులలో శ్రేష్ఠుడైనవాడా); 'నిరుపమకీర్తి' కి 'నిరుపమదాన' అనే పాఠాంతరం ఉన్నది; 'సాటిలేనిదానం చేసేవాడా!' అనే సంబుద్ధి తా నడిగే వరాన్ని తప్పకుండా ఈయటం అతని దానప్రవృత్తికి తగిన దనే భావం శకుంతల ప్రకటించిందనే అర్థం స్ఫురిస్తుంది. శకుంతల తల్లిదండ్రులవలన తనకు కలిగిన అన్యాయం తన సంతతికి జరుగకూడ దని ముందే జాగ్రత్తపడి తన లోకజ్ఞతను ప్రదర్శించింది. నన్నయ రుచిరార్థసూక్తినిధి ఈపద్యం. ప్రతి పదం శకుంతల సౌముఖ్యాన్నీ, గడుసరితనాన్నీ నిపుణంగా చాటుతున్నది. మాటలన్నీ వాచ్యార్థంలో సంస్కృతి సౌగంధ్యంతో కూడి ఉన్నాయి. వాచ్యార్థస్ఫూర్తి తరువాత ప్రతీయమాన మయ్యే వ్యంగ్యార్థంద్వారా రుచిరంగా వెలుగొందే వైదగ్ధ్యం వాటిలో గోచరిస్తుంది. నీ ప్రసాదమున - దయతో - వరము - ప్రసన్నబుద్ధి - అనే మాటలతో దుష్యంతుడిని కోరుతున్నప్పుడు శకుంతల సాక్షాత్తు భగవంతుడిని అడుగుతున్నట్లు భక్తి వినయాలను ప్రదర్శించింది. నరనుత - నిరుపమ కీర్తి - అనవద్యముగా - అనే మాటలు వాడుతున్నప్పుడు లోకజ్ఞత ప్రకటించింది. ఇచ్చే వరం త్రికరణశుద్ధిగా తిరుగులేకుండా ప్రీతితో ఇవ్వాలని అడగటంలో నేర్పరితనం ఉన్నది. మాటతప్పితే ప్రజలలో నిరుపమానంగాఉన్న నీ కీర్తి మొక్కపోతుంది అని హెచ్చరించింది. ఇంతటి వ్యంగ్యార్థాన్ని వస్తుధ్వనికి అంగంగా వాడుకొనటం నన్నయ నేర్పరితనం. రాజు మదనాతురు డై సంగమాన్ని కోరుతున్నాడు. గాంధర్వవివాహం అనే ధర్మాన్ని చూపుతున్నాడు. ఆ తరువాతి సంగతి మాటాడటం లేదు. శకుంతల తనకూ తన సంతతికీ భద్రతకొరకు, దుష్యంతుడి అనురాగాన్ని పరీక్షించటంకొరకు ఈ వరం అడిగింది. 'నీకును నాకును సంగమంబగున్' అనటంలో గాంధర్వవిధిని అంగీకరించి, ఆతడి సంగమాన్ని మనసారా కోరుతున్నట్లు తెలిపింది. ఆమె మాటలలో ఎంతటి చొరవ ఉన్నదో అంతటి బిగువుకూడ ఉండటం నన్నయ సంభాషణరచనాచాతుర్యఫలం. రాజసభలో ఈ వరమే చర్చనీయాంశ మౌతుంది. కాబట్టి శకుంతలకథలో ఈపద్యం త్రాసులో ముల్లువంటిది. దుష్యంతుడు కణ్వమహర్షిదర్శనం చేసికొనకుండా నిష్క్రమించటానికీ, ఆ తరువాత శకుంతలను అంతః పురానికి పిలిపించుకొనకపోవటానికీ కల గూఢ మైన హేతువు ఆమె అడిగిన ఈవరమే. ఆమె పెద్దకోరిక కోరింది. అది పుత్రుడు పుట్టినప్పుడు ఫలిస్తుంది. పుత్రుడు పుట్టితే ఆమె తెలియపరచాలి. యౌవరాజ్య విషయం ఆ తరువాతిమాట, ఇట్లా ఎన్నో సన్నివేశాలపరంపరతో ముందుకథ నడవాలి. శకుంతలా గతంగా ఉన్న స్వీయభద్రతావిషయకమైన శంకయే భావికథలో ఒక గండంగా పరిణమించబోవటం వస్తుధ్వని విశేషం. ప్రసాదము, ప్రసన్నబుద్ధి - అనే పదాలు నన్నయరచనలో ప్రధానంగా కనబడే ప్రసాదగుణాన్నీ ప్రసన్నకథాకలి(వి)తార్థయుక్తినీ జ్ఞప్తికి తెప్పిస్తున్నాయి.

వ. **అనిన విని శకుంతల కెంతయు సంతోషంబుగా దాని కోరిన వరంబిచ్చి, గాంధర్వవివాహంబున నభిమతసుఖంబు లనుభవించి, యక్కోమలి వీడ్కొని 'నిన్నుఁ దోడ్కొనిరా నస్మత్ప్రధానవర్గంబుఁ గణ్వమహాముని పాలికిం బుత్తెంచెద' నని యూఱడ నొడివి దుష్యంతుండు నిజపురంబునకుం జనియె; నిట శకుంతలయుఁ దనచేసినదాని మునివరుం డెఱింగి యలిగెడునో యని వెఱచుచుండె; నంత నమ్మహాముని వనంబుననుండి కందమూలఫలంబులు గొని చనుదెంచి, లలితశృంగారభావంబున లజ్జావనతవదనయు నతిభీతచిత్తయు నైయున్న కూఁతుంజూచి, తన దివ్యజ్ఞానంబున నంతవృత్తాంతంబు నెఱింగి, క్షత్త్రియులకు గాంధర్వవివాహంబు విధిచోదితంబ యని సంతసిల్లి శకుంతల కి ట్లనియె. 61**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్, విని= అని చెప్పగా విని; ఎంతయున్; సంతోషంబున్; శకుంతలకున్; దాని, కోరిన, వరంబు+ఇచ్చి= ఆమెకోరిన వరం ఇచ్చి (ప్రథమకు షష్ఠి); గాంధర్వ, వివాహంబునన్; అభిమత, సుఖంబులు= ఇష్టసుఖాలు, (రతిసుఖాలు); అనుభవించి= పొంది; ఆ+కోమలిన్= ఆ శకుంతలను; వీడ్కొని= వెళ్ళివస్తానని; నిన్నున్= నిన్ను (శకుంతలను); తోడ్కొని, రాన్= తీసికొనిరావటానికి; అస్మద్, ప్రధాన, వర్గంబున్= నా మంత్రులను; కణ్వ, మహత్+ముని, పాలికిన్= కణ్వమహాముని దగ్గరకు; పుత్తెంచెదన్= పంపుతాను; అని= అనిచెప్పి; ఊఱడన్, నొడివి= సమాధానపడేటట్లు నచ్చజెప్పి; దుష్యంతుండు; నిజ, పురంబునకున్= తన రాజధానికి; చనియెన్= వెళ్ళాడు; ఇట= ఆశ్రమంలో; శకుంతలయున్= శకుంతలకూడ; తన, చేసిన, దానిన్= తానుచేసినపనిని; మునివరుండు= మునిశ్రేష్ఠుడైన కణ్వుడు; ఎఱింగి= తెలిసికొని; అలిగెడునో= కోపిస్తాడేమో; అని; వెఱచుచున్+ఉండెన్= భయపడుతూ ఉండింది; అంతన్= ఆ సమయంలో; ఆ+మహత్+ముని= ఆ కణ్వమహర్షి; వనంబుననుండి= అడవినుండి; కందమూల, ఫలంబులు, కొని= కందగడ్డలు, పండ్లు తీసికొని; చనుదెంచి= వచ్చి; లలిత, శృంగార, భావంబునన్= సున్నితమైన శృంగారహావభావాలతో; లజ్జా+అవనత, వదనయున్= సిగ్గుచేత వంచబడిన ముఖం కలిగినదియున్నూ; అతి, భీత, చిత్తయున్= మిక్కిలి భయపడిన హృదయం కలిగినదియున్నూ; ఐ; ఉన్న; కూఁతున్, చూచి= కూతురిని చూచి; తన, దివ్య, జ్ఞానంబునన్= తనయొక్క దివ్యదృష్టితో; అంత, వృత్తాంతంబున్+ఎఱింగి= జరిగిన కథనంతటిని తెలిసికొని; క్షత్త్రియులకున్= రాజులకు; గాంధర్వవివాహంబు; విధి, చోదితంబు+అ, అని= శాస్త్రసమ్మతమే అని; సంతసిల్లి= సంతోషించి; శకుంతలకున్= శకుంతలతో ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శకుంతలమాటలు విని అమితసంతోషంతో ఆమె కోరిన వరాన్ని ఇచ్చి, గాంధర్వవివాహ మాడి, ఇష్టసుఖాలను అనుభవించి, ఆకోమలిని వీడ్కొని 'నిన్ను వెంటబెట్టుకొని రావటానికి మంత్రులను కణ్వమహాముని వద్దకు పంపుతా'నని ఆమెను సమాధానపరచి, ఒప్పించి, దుష్యంతుడు తన నగరానికి వెళ్లిపోయాడు. ఇక ఇక్కడ ఆశ్రమంలో శకుంతలకూడ తాను చేసిన పనిని కణ్వమహర్షి తెలిసికొని కోపగిస్తాడేమో అని భయపడుతూ ఉన్నది. అప్పుడు కణ్వమహర్షికందమూలాలను, పండ్లను కోసికొని వనంనుండి తిరిగివచ్చి సున్నితమైన శృంగారహావభావాలతో సిగ్గుతో తలవంచుకొని భయపడుతూ ఉన్న తనకూతురు శకుంతలను చూచి దివ్యజ్ఞానంతో జరిగిన కథనంతా తెలిసికొన్నాడు. 'క్షత్త్రియులకు గాంధర్వవివాహం శాస్త్రసమ్మతమే' అని సంతోషించి శకుంతలతో ఈవిధంగా అన్నాడు.

విశేషం: కణ్వుడు కరుణానిరతు డనీ, ధర్మస్వరూపు డనీ శకుంతల చెప్పింది. ఆమెమాటలను ఆ మహర్షి తనవర్తనంద్వారా నిరూపించుకొన్నాడు.

భరతుని జననము. (సం.1-68-1)

తే. **తల్లి! నీకులగోత్ర సౌందర్యములకుఁ । దగిన పతిఁ గంటి; దానికిఁ దగఁగ గర్భ**
మయ్యెఁ; నీదు గర్భమున వాఁ డఖిలభువన । వహన మహనీయుఁ డగు చక్రవర్తి సుమ్ము. **62**

ప్రతిపదార్థం: తల్లి= అమ్మా! (తల్లిదండ్రులు కూతుళ్ళను ఆప్యాయంగా పిలిచే పిలుపు); నీ, కుల, గోత్ర, సౌందర్యములకున్= నీకులానికీ, గోత్రానికీ, అందానికీ; తగిన= యోగ్యుడైన; పతిన్= భర్తను; కంటి(వి)= పొందావు; దానికిన్, తగఁగన్= దానికి తగినట్లుగా; గర్భము+అయ్యెన్= నీకు గర్భమైనది; నీదు, గర్భమునవాఁడు= నీ గర్భంలో ఉన్నవాడు; అఖిల, భువన, వహన, మహనీయుఁడు+అగు= సమస్తభూమిని భరించ (పాలించ)గల గొప్పవాడైన; చక్రవర్తి, సుమ్ము= చక్రవర్తి సుమా!

తాత్పర్యం: అమ్మా! నీకులగోత్రాలకు అందచందాలకు తగిన భర్తను నీవు పొందగలిగావు. దానికి తగినట్లుగా నీవు గర్భవతివికూడ అయినావు. నీగర్భంలో ఉన్నవాడు ఈసమస్త భూమిని పాలించగలిగిన మహనీయు డయ్యే చక్రవర్తిసుమా!.

విశేషం: కణ్వమహర్షి భూత, భవిష్యత్, వర్తమానాలను దర్శించగల మహిమాన్వితు డనీ, క్రాంతదర్శి అనీ ఈమాటలు స్ఫురింపజేస్తున్నవి.

వ. 'నీధర్మచరితంబునకు మెచ్చితి, నీ కోరిన వరం బిచ్చెద వేఁడు' మనిన శకుంతలయు 'నాచిత్తం బెప్పుడు ధర్మువునంద తగిలియుండను, నాకుద్భవించెడు పుత్త్రుండు దీర్ఘాయురారోగ్యైశ్వర్య బలసమన్వితుండును వంశకర్తయుఁగాను వలయు' ననిన నమ్మహాముని కరుణించి దాని కోరిన వరం బిచ్చి, యథాకాలవిధుల గర్భసంస్కార రక్షణంబులు సేయించి యున్నంత, వర్షత్రయంబు సంపూర్ణం బైన, శకుంతలకు భరతుం డుదయించి కణ్వనిర్వర్తిత జాతకర్మాది క్రియాకలాపుం డయి పెరుఁగుచుఁ గరతలాలంకృతచక్రుండును, చక్రవర్తిలక్షణలక్షితుండును, సింహసంహననుండును, దీర్ఘబాహుండును, ననంతజవసత్త్వ సంపన్నుండును నై పరఁగుచు. 63

ప్రతిపదార్థం: నీ, ధర్మ, చరితంబునకున్= ధర్మబద్ధమైన నీ ప్రవర్తనకు; మెచ్చితిన్(ని)= సంతోషించాను; నీ, కోరిన, వరంబు; ఇచ్చెదన్; వేఁడుము= కోరుకొమ్ము; అనినన్= అనగా; శకుంతలయున్, నాచిత్తంబు= నామనస్సు; ఎప్పుడున్= అన్నివేళలా; ధర్మువునందున్+అ= ధర్మంలోనే; తగిలి, ఉండను= ఆసక్తి కలిగి ఉండేటట్లు; నాకున్, ఉద్భవించెడు, పుత్త్రుండు= నాకు పుట్టే కొడుకు; దీర్ఘ+ఆయున్+ఆరోగ్య+ఐశ్వర్య, బల, సమన్వితుండును= దీర్ఘమైన ఆయుస్సుతోనూ, ఆరోగ్యంతోనూ, సంపదలతోనూ, బలంతోనూ కూడినవాడూ; వంశకర్తయున్= పుట్టిన వంశానికి కీర్తిప్రతిష్ఠలు కలిగించి తన తరువాతివారిని తనవంశజులుగా పేర్కొనేటట్లు చేసే ప్రముఖుడు వంశకర్త - అటువంటివాడుగానూ; కాన్, వలయున్, అనినన్= కావలెనని కోరగా; ఆ+మహాముని= ఆ కణ్వమహర్షి; కరుణించి= దయచూపి; దాని, కోరిన, వరంబు+ఇచ్చి= ఆమె కోరిన వరాన్ని ఇచ్చి; యథాకాల విధులన్= ఆయా సమయాలలో చేయదగిన శాస్త్రోక్త పద్ధతులతో; గర్భ, సంస్కార, రక్షణంబులు, చేయించి= స్త్రీ గర్భము తాల్చినప్పుడూ, ఆ గర్భము పెరుగుతున్నప్పుడూ గర్భస్థ శిశువు రక్షణం కోసము చేసే విధులను చేయించి; ఉన్నంతన్= ఉండగా; వర్షత్రయంబు, సంపూర్ణంబు+ఐనన్= మూడేండ్లు నిండగా; శకుంతలకున్; భరతుండు; ఉదయించి= పుట్టి; కణ్వ, నిర్వర్తిత, జాతకర్మ+ఆది, క్రియాకలాపుండు+అయి= కణ్వునిచేత చేయించబడిన జాతకర్మ మొదలైన సంస్కారక్రియలతో కూడినవాడై; పెరుఁగుచున్= పెద్దవాడౌతూ; కర, తల+అలంకృత, చక్రుండును= అరచేతియందు అమరిన చక్రరేఖ అనే సాముద్రిక లక్షణం కలవాడున్నూ; చక్రవర్తి, లక్షణ, లక్షితుండును= చక్రవర్తి కాగలిగే లక్షణాలు శరీరంమీద సాముద్రికంగా కనబడుతున్నవాడూ; సింహ, సంహననుండును= సింహంయొక్క శరీరంవంటి శరీరం కలవాడున్నూ; దీర్ఘబాహుండును= పొడ వైన చేతులు కలవాడున్నూ; అనంత, జవ, సత్త్వ, సంపన్నుండును+ఐ= అపారమైన వేగాన్నీ బలాన్నీ కలవాడున్నూ అయి; పరఁగుచున్= ఒప్పారుతూ.

తాత్పర్యం: 'నీధర్మప్రవర్తనకు నేను మెచ్చాను. నీవు కోరిన వరం ఇస్తాను. వేడుకొమ్ము' అని కణ్వమహర్షి అనగానే శకుంతల 'నా మనస్సెల్లప్పుడూ ధర్మంలోనే లగ్నమై ఉండాలి' అనీ, 'నాకు పుట్టే కొడుకు దీర్ఘాయువు, ఆరోగ్యం, ఐశ్వర్యం, బలం కలిగి వంశకర్తగా ప్రసిద్ధికెక్కాలి' అనీ కోరింది. అందుకు ఆ మహాముని కరుణించి శకుంతల

కోరిన వరాన్ని ఇచ్చి గర్భవతికి చేయవలసిన సంస్కార రక్షణ విధులను చేయించి ఉండగా, మూడేళ్ళు నిండిన తరువాత ఆమెకు భరతుడు జన్మించాడు. కణ్వమహర్షి అతనికి జాతకర్మాది క్రియాకలాపాలు జరిపించగా పెరుగుతున్నాడు. అరచేతిలో చక్రరేఖ కలవాడు, చక్రవర్తి, లక్షణాలన్నీ ముద్రించుకొన్న మేను కలవాడు. సింహంవలె సర్వాంగసుందరుడు, పొడుగైన చేతులు కలవాడు, అపారమైన వేగమూ, బలమూ కలవాడై భరతుడు విలసిల్లాడు.

విశేషం: భరతుడు పుట్టుకతోనే చక్రవర్తి కాదగిన సాముద్రిక చిహ్నాలు కలిగిఉన్నాడు. అరచేతిలో చక్రరేఖ రాజయోగాన్ని సూచిస్తుంది. "చక్రాసి చాప వజ్రాభా । రేఖాః కుర్వంతి భూపతిమ్' - అని సాముద్రికశాస్త్రం. చక్రం, ఖడ్గం, విల్లు, వజ్రాయుధం వంటి రేఖలు కలవాడు తప్పక రాజౌతాడని శాస్త్రం.

మ. **అమితోగ్రాటవిలోనఁ గ్రుమ్మరు వరాహవ్యాళశార్దూల ఖ**
డ్గమదేభాదులఁ బట్టి తెచ్చి ఘనుఁడై కణ్వాశ్రమోపాంత భూ
జములం దోలిన కట్టుచుం బలిమిమై శాకుంతలుం డొప్పె వ
న్యమదేభంబుల నెక్కుచుం దగిలి నానాశైశవక్రీడలన్. **64**

ప్రతిపదార్థం: శాకుంతలుండు= శకుంతలయొక్క కుమారుడైన భరతుడు; బలిమిమైన్= బలంతో; అమిత+ఉగ్ర+అటవిలోనన్= ఎంతో భయంకరమైన అడవిలో; క్రుమ్మరు= తిరుగాడు; వరాహ, వ్యాళ, శార్దూల, ఖడ్గ, మద+ఇభ, ఆదులన్= అడవిపందులను, పాములను, పులులను, ఖడ్గమృగాలను, మదపుటేనుగులను, మరి ఇతరమృగాలను; పట్టి, తెచ్చి= పట్టుకొని, తీసికొనివచ్చి; ఘనుఁడు+ఐ= ప్రముఖుడు+ఐ; కణ్వ+ఆశ్రమ+ఉపాంత+భూజములందున్= కణ్వునియొక్క ఆశ్రమం యొక్క సమీపంలోని చెట్లకు; ఓలిన్+అ= వరుసగా; కట్టుచున్= కట్టివేస్తూ; తగిలి= ఆసక్తితో; మద+ఇభంబులన్, ఎక్కుచున్= అడవికి సంబంధించిన మదించిన ఏనుగులపై ఎక్కి స్వారిచేస్తూ; నానా, శైశవ, క్రీడలన్= అనేకరకా లైన బాల్యక్రీడలతో; ఒప్పెన్= ఒప్పారెను.

తాత్పర్యం: భరతుడు అపారబలంతో అతిభయంకర మైన అడవులలో తిరుగాడే అడవిపందులను, పాములను, పులులను, ఖడ్గమృగాలను, మదించిన ఏనుగులను ఇంకా తదితరమృగాలను అవలీలగా పట్టి తెచ్చి ఘటికుడై ఆ ఆశ్రమ సమీపప్రాంతంలో ఉన్న చెట్లకు వరుసగా కట్టివేస్తూ, ఆసక్తితో అడవిలో తిరిగే మదించిన ఏనుగులపై ఎక్కి స్వారిచేస్తూ తన బాల్యక్రీడలను అనేకవిధాలుగా ప్రదర్శిస్తూ ఉన్నాడు.

విశేషం: తండ్రి యైన దుష్యంతుడు పెద్దవా డైన తరువాత ప్రదర్శించిన బలాన్ని భరతుడు బాల్యంలోనే ప్రదర్శించాడు. శాకుంతలుండు అంటే శకుంతులయొక్కపుత్రుడని అర్థం. స్త్రీభ్యోఢక్' అని ఢక్ప్రత్యయాదులు వచ్చి శాకుంతలేయుడు అని కావలసింది. కాని, ఉత్సర్గశాస్త్రంచేత మహాకవి ప్రవర్తింపచేశాడని వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. ప్రసాదగుణమిశ్రిత మైన ఓజోగుణరచన బాలవీరుడి పరాక్రమవర్ణనంలో సహజంగా రాణించింది.

వ. **ఇట్లు వనంబులోని సర్వసత్త్వంబులను దనమహాసత్త్వంబునం జేసి దమియించుచున్న యాతనిం జూచి యాశ్చర్యం బంది యందులమునులెల్ల నాతనికి సర్వదమనుం డను నామంబుఁ జేసిరి; కణ్వమహామునియు నక్కుమారు నుదార తేజోరూప విక్రమ గుణంబులకు సంతసిల్లి 'వీఁ డఖిల భువన యౌవరాజ్యంబునకు సమర్థుం డగు సమయం బరుగుదెంచె' నని విచారించి యొక్కనాఁడు కూఁతున కి ట్లనియె.** **65**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; వనంబులోని= అరణ్యంలోని; సర్వసత్త్వంబులను= అన్నిమృగాలనూ; తన, మహత్+సత్త్వంబునన్, చేసి= తనయొక్క గొప్పదైన బలంచేత; దమియించుచున్+ఉన్నన్= అణచివేస్తూ (నశింపచేస్తూ) ఉండగా; అందుల, మునులెల్లన్= అక్కడి మునులందరు; ఆతనిన్= భరతుడిని; చూచి; ఆశ్చర్యంబు+అంది= అబ్బురపడి; ఆతనికిన్= భరతుడిని; సర్వదమనుండు= అన్నింటిని అణచువాడు; అను, నామంబున్, చేసిరి= అనే అర్థం గల బిరుదనామం పెట్టారు; కణ్వ, మహత్+మునియును; ఆ+కుమారు+ఉదార, తేజో, రూప, విక్రమ, గుణంబులకున్= ఆ బాలునియొక్క ఉత్తమ తేజస్సు (ప్రకాశం)కూ, ఆకారసౌష్ఠవానికీ, పరాక్రమగుణాలకూ; సంతసిల్లి= సంతోషించి; వీఁడు= ఈ భరతుడు; అఖిల, భువన, యౌవరాజ్యంబునకున్= సమస్త రాజ్యానికి యౌవరాజ్య పదవికి; సమర్థుండు+అగు, సమయంబు= యోగ్యుడైన సమయం; అరుగుదెంచెను+అని= వచ్చింది అని; విచారించి= ఆలోచించి; ఒక్కనాఁడు= ఒకరోజున; కూఁతునకున్= పుత్రిక అయిన శకుంతలతో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈవిధంగా అరణ్యంలోని అన్ని జంతువులనూ తన మహాబలంచేత అణచివేస్తున్న భరతుడిని చూచి ఆశ్చర్యపడి అక్కడి మునులందరూ అతడికి 'సర్వదమనుడు' (అన్నింటిని అణచివేసేవాడు) అనే పేరుపెట్టి పిలిచారు. కణ్వమహామునికూడా ఆ బాలుడి ఉదాత్తతేజస్సును, రూపాన్నీ, పరాక్రమగుణాలనూ చూచి సంతసించి అతడు సమస్తరాజ్యానికి యువరాజుగా ఉండదగిన సమయం వచ్చిం దని భావించి ఒకనాడు కూతు రైన శకుంతలతో ఈవిధంగా అన్నాడు.

ఆ. ఎట్టిసాధ్వులకును బుట్టిన యిండ్లను । బెద్దకాల మునికి తద్ద తగదు;
పతులకడన యునికి సతులకు ధర్మువు; । సతుల కేడుగడయుఁ బతుల చూవె. 66

ప్రతిపదార్థం: ఎట్టి, సాధ్వులకును= ఎటువంటి పతివ్రతలకైనను; పుట్టిన, ఇండ్లను= వారివారి పుట్టిండ్లలో; పెద్దకాలము+ఉనికి= చాలకాలం ఉండటం; తద్ద, తగదు= ఎంతమాత్రం (అత్యంతం) ఉచితం కాదు; సతులకున్= ఇల్లాళ్ళకు; పతుల, కడన్= భర్తలదగ్గరే; ఉనికి= ఉండటం; ధర్ము వు= ధర్మం, న్యాయం; సతులకున్= వివాహితులకు; పతులు+అ= భర్తలే; ఏడు+కడయున్= ఏడురకాలైన రక్ష; (గురువు, తల్లి, తండ్రి, పురుషుడు, విద్య, దైవం, దాత - అనేవారు ఏడురకాలైన రక్షలు); చూవె= సుమా!

తాత్పర్యం: ఎటువంటి పతివ్రతలకైనా పుట్టినిళ్ళలో ఎక్కువకాలం ఉండటం ఎంతమాత్రం ఉచితం కాదు. ఇల్లాళ్ళకు భర్తలదగ్గర ఉండటమే ధర్మం. భార్యలకు భర్తలే సర్వరక్షకులు (ఏడుగడలు) సుమా!

విశేషం: నన్నయగారి సూక్తినిధిత్వానికి ఈపద్యం ఒక చక్కని ఉదాహరణం.

కణ్వమహాముని శకుంతలను దుష్యంతుపాలికిం బంపుట (సం. 1-68-10)

వ. 'కావున నీ విక్కుమారునిం దోడ్కొని నీపతిపాలికి నరుగు' మని మహాతపోధను లైన తన శిష్యులం గొందఱఁ దోడువంచిన, శకుంతలయు దౌష్యంతిం దోడ్కొని దుష్యంతుపాలికి వచ్చి సకలసామంతమంత్రిపురోహిత ప్రధానపౌరజనపరివృతుండై యున్న యారాజుం గనుంగొని. 67

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నీవు; ఈ+కుమారునిన్= ఈ బాలుడిని, లేదా, పుత్రుడిని; తోడ్కొని= వెంటతీసికొని; నీ, పతి, పాలికిన్= నీభర్త దగ్గరకు; అరుగుము= వెళ్ళుము; అని; మహాతపోధనులు+ఐన= గొప్పదైన తపస్సే ధనంగా కలవారైన;

తన, శిష్యులన్; కొందఱన్; తోడు, పంచినన్= తోడుగా వెంట పంపగా; శకుంతలయున్; దౌష్యంతిన్= దుష్యంతుడి పుత్త్రుడైన భరతుడిని; తోడ్కొని= వెంటతీసికొని; దుష్యంతుపాలికిన్, వచ్చి= దుష్యంతుడివద్దకు వచ్చి; సకల, సామంత, మంత్రి, పురోహిత, ప్రధాన, పౌరజన, పరివృతుండు+ఐ, ఉన్న= అందరు సామంతులు, మంత్రులు, పురోహితులు, సేనాపతులు, పురజనులచేత కూడినసభలో ఉన్నవాడైన; ఆ, రాజున్, కనుంగొని= ఆదుష్యంతుడిని చూచి.

తాత్పర్యం: 'కాబట్టి నీ వీ కుమారుడిని తీసికొని నీభర్తవద్దకు పొమ్ము' అని గొప్ప తపస్వులైన శిష్యులను కొందరిని తోడిచ్చి పంపగా శకుంతలకూడ భరతుడిని వెంటతీసికొని దుష్యంతుడి వద్దకు వచ్చి, సామంతులు, మంత్రులు, పురోహితులు, ప్రధానులు, పౌరజనులతో కూడి ఉన్నసభలో ఆ రాజును చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. గురునాశ్రమంబునను ము । న్నరుదుగఁ బతివలనఁ గనిన యనురాగము నా
దరణము ననుగ్రహంబును । గరుణయు సంభ్రమము నపుడు గానక యెడలోన్. 68

ప్రతిపదార్థం: మున్ను= పూర్వం; గురు, ఆశ్రమంబునను= తండ్రియైన కణ్వుడి ఆశ్రమంలో; అరుదుగన్= అపూర్వంగా; పతివలనన్= భర్తఐన దుష్యంతుడిలో; కనిన= చూచిన; అనురాగమున్= వలపునూ; ఆదరణమున్= ఆప్యాయతయూ; అనుగ్రహంబును= అనుకూలతయూ; కరుణయున్= దయయు; సంభ్రమమున్= తొట్రుపాటుతో కూడిన ఆసక్తియు; అపుడు; కానక= చూడక; ఎడలోన్= మనసులో.

తాత్పర్యం: పూర్వం తండ్రిఆశ్రమంలో అపూర్వంగా తనపతి తనపట్లచూపిన వలపును, ఆదరాన్నీ, దయనూ, ఆసక్తినీ అప్పుడు కానక హృదయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: కణ్వాశ్రమంలో దుష్యంతుడు శకుంతలను గాంధర్వవివాహం చేసికొన్న ఘట్టంలో ఆ దుష్యంతుడి పాత్రలో పోషించిన భావక్రమాన్ని వ్యంగ్యంగా నన్నయ ఇక్కడ సూచించాడు. ఇది కథాకథనశిల్పంలో ఒకభాగం. ఎన్నో యేళ్ళక్రితం జరిగిన ఆఘట్టాన్ని మధురస్మృతిగా సమీక్షించింది శకుంతల. అది వమ్ము కావటంతో ఆమెహృదయం వికలమైపోయింది.

క. ఎఱుఁగ డొకొ నన్ను; నెఱిఁగియు । నెఱుఁగని యట్లుండునొక్కొ; యెడ దవ్వగుడున్
మఱచెనొకొ! ముగ్ధ లధిపులు । మఱవరె బహుకార్యభారమగ్నులు కారే. 69

ప్రతిపదార్థం: నన్నున్; ఎఱుఁగడు+ఒకొ= నన్ను ఎఱుగడా?; ఎఱిఁగియున్, ఎఱుఁగని, అట్లు+ఉండును+ఒక్కొ= గుర్తించికూడ గుర్తించనట్లు ఉంటున్నాడో(నటిస్తున్నాడో) ఏమో; ఎడ, దవ్వు+అగుడున్= చూచిచాలకాలంకావటంచేత; మఱచె నొకొ= మరచిపోయాడో ఏమో; అధిపులు= రాజులు; ముగ్ధులు= మూఢులు(మరపు ఎక్కువగా కలవారు అనిభావం); మఱవరె= మరచిపోరా; బహు, కార్య, భార, మగ్నులు, కారే= పలు పనులఒత్తిడులలో మునిగిఉంటారుకదా!

తాత్పర్యం: ఇతడు నన్ను గుర్తించలేదా? గుర్తించికూడ గుర్తించనట్లు నటిస్తున్నాడా? చాలకాలం కావటంచేత మరచాడో ఏమో; రాజులు అనేకకార్యాలలో మునిగి ఉంటారు కదా! అందువలన వారికి మరపు వింతకాదు. ప్రభువులు మూఢులు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

చ. తలఁపఁగ నాఁడు పల్కినవిధం బెడఁ దప్పఁగ వీడె నొక్కొ చూ
డ్కులు విరసంబులై కరము క్రూరము లైన నిమిత్త మేమియో?
కలయఁగఁ బల్కరించి రుపకారులు నై రని నమ్మియుండఁగా
వలవదు బుద్ధిమంతులు నవప్రియు లైన ధరాధినాథులన్. 70

ప్రతిపదార్థం: తలఁపఁగన్= ఆలోచింపగా; నాఁడు= పెండ్లినాడు; పల్కిన, విధంబు= మాటాడిన పద్ధతి; ఎడన్, తప్పఁగన్ వీడెను+ఒక్కొ= మనసుమారి వదలిపెట్టాడా ఏమి?; చూడ్కులు= చూపులు; విరసంబులు+ఐ= విముఖంగా; కరము, క్రూరములు= మిక్కిలి కఠినాలు; ఐన, నిమిత్తము+ఏమియో= అయినకారణ మేమిటో?; నవ, ప్రియులు+ఐన= క్రొత్తదనాన్నే ఎల్లప్పుడు ప్రేమించేవారైన; ధరా+అధినాథులన్= భూపతులను; కలయఁగన్= కలుపుగోలుతనంతో; పల్కరించిరి= మాటాడా రనీ; ఉపకారులును+ఐరి+అని= మేలుచేసినవారైనారనీ; బుద్ధిమంతులు= తెలివిగలవారు; నమ్మి+ఉండఁగాన్, వలవదు= నమ్మిఉండకూడదు.

తాత్పర్యం: ఆలోచించగా, ఈరాజు పెండ్లినాడు పలికినపద్ధతిని మనసు మార్చుకొని వదలిపెట్టినాడా ఏమి? అతనిచూపులు నాయెడ విరసంగా, అత్యంత కఠినంగా ఉన్నవి. కారణ మేమిటో? క్రొత్తక్రొత్తవాటినే ప్రేమించే రాజులను (క్రొత్తగా వారు కలిసినప్పుడు) కలుపుగోలుతనంతో పల్కరించా రనీ, ఉపకారులై వ్యవహరించా రనీ బుద్ధిమంతులు వారిని నమ్మి ఉండరాదు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. శకుంతలమాటలలో పాలకులస్వభావాన్ని నన్నయ పరోక్షంగా అధిక్షేపించాడు.

వ. అని తలంచి చింతాక్రాంత యై శకుంతల వెండియు నాత్మగతంబున. 71

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: ఆ విధంగా భావించి దుఃఖంచేత ఆవరింపబడిన హృదయంతో శకుంతల మనస్సులో ఇంకనూ ఇలా అనుకొన్నది.

క. మఱచినఁ దలఁపింపఁగ నగు; । నెఱుఁగని నాఁ డెల్లపాట నెఱిఁగింప నగున్;
మఱి యెఱిఁగి యెఱుఁగ నొల్లని । కఱటిం దెలుపంగఁ గమలగర్భుని వశమే. 72

ప్రతిపదార్థం: మఱచినన్= (ఎవరైనా ఒక అంశాన్ని నిజంగా) మరచిపోయినట్లయితే; తలఁపింపఁగన్+అగున్= జ్ఞప్తికి తేవచ్చును; ఎఱుఁగనినాఁడు=(ఎవరైనా అసలు) తెలియనిస్థితిలో ఉన్నప్పుడు; ఎల్లపాటన్= అన్నివిధాలయత్నించి ఏదోపద్ధతిలో; ఎఱిఁగింపన్+అగున్= తెలియచెప్పవచ్చును; మఱి= కాని; ఎఱిఁగి= తెలిసికూడ; ఎఱుఁగన్+ఒల్లని= తెలియటానికి అంగీకరించని, లేదా, తెలియనట్లు నటించే; కఱటిన్= మోసగాడికి; తెలుపంగన్= తెలియచెప్పటం; కమల, గర్భుని, వశమే?= బ్రహ్మదేవుడి వశమా? కాదని భావం.

తాత్పర్యం: ఎవరైనా నిజంగా మరచిపోతే జ్ఞాపకం చేయవచ్చును; అసలు తెలియనప్పుడు ఏ పాటుపడి అయినా తెలియచెప్పవచ్చును. కాగా, తెలిసి కూడ తెలియని వాడివలె నటించే మోసగాడికి తెలియజేయటం బ్రహ్మతరంకూడా కాదు.

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తికి ఇది చక్కని నిదర్శనం. ఈసూక్తివినగానే భర్తృహరిసుభాషితాలలోని మూర్ఖపద్ధతిలో చెప్పబడిన ఈసుభాషితం స్ఫురిస్తుంది. "అజ్ఞఃసుఖమారాధ్యస్సుకతరమారాధ్యతేవిశేషజ్ఞః, జ్ఞానలవదుర్విదగ్ధం(బ్రహ్మాపినరం న రంజయతి'. దీనికి ఏనుగు లక్ష్మణకవి అనువాదం తెలుగునాట ప్రసిద్ధం. "తెలియని మనుజుని సుఖముగఁ దెలుపం దగు సుఖతరముగఁ దెలుపఁగవచ్చున్ దెలియనివానిం, దెలిసియుఁ, దెలియని నరుఁదెల్ప బ్రహ్మదేవుని వశమే.''

వ. అయినను వచ్చి మిన్నక పోవంగాదు కావున నాపూర్వవృత్తాంతంబెల్ల నెఱింగించి యే నిక్కుమారుం జూపుదు' నని మనంబున నిశ్చయించి శకుంతల యా రాజున కి ట్లనియె. 73

ప్రతిపదార్థం: అయినను= అయినప్పటికి; వచ్చి= ఇక్కడకు వచ్చి; మిన్నక= ఊరక; పోవన్+కాదు= తిరిగిపోవటం తగదు; కావునన్= కాబట్టి; ఆ, పూర్వవృత్తాంతంబు+ఎల్లన్= ఆ ముందు జరిగిన కథనంతా; ఎఱింగించి= తెలిపి, జ్ఞాపకంచేసి; ఏను= నేను(శకుంతల); ఈ+కుమారున్= ఈకొడుకును; చూపుదును+అని, మనంబునన్, నిశ్చయించి= చూపిస్తానని మనస్సులో నిర్ణయించుకొని; శకుంతల; ఆ, రాజునకున్= ఆ దుష్యంతుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: 'అయినప్పటికిని, ఇంతదూరం వచ్చి ఏమీ సాధించకుండా ఊరక తిరిగిపోవటం తగదు కాబట్టి, మునుపు జరిగిన కథనంతా జ్ఞాపకంచేసి, నేను ఈ కుమారుడిని ఆతడికి చూపిస్తా' నని మనస్సులో నిశ్చయించుకొని శకుంతల దుష్యంతుడితో ఈ విధంగా పలికింది.

క. జననాథ! వేఁట నెపమున । గొనకొని కణ్వాశ్రమమునకున్ వచ్చి ముదం
బున నందు నాకు నీయి । చ్చిన వరము దలంపవలయుఁ జిత్తములోనన్. 74

ప్రతిపదార్థం: జననాథ= ప్రజలకు ప్రభువైన ఓ దుష్యంతుడా!; వేఁట, నెపమునన్= వేట అనే మిషతో; గొనకొని= పూని (కావాలని); కణ్వ+ఆశ్రమమునకున్, వచ్చి= కణ్వ మహర్షియొక్క ఆశ్రమానికి వచ్చి; అందున్= ఆ ఆశ్రమంలో; ముదంబునన్= సంతోషంతో; నాకున్= (శకుంతలకు); నీ, ఇచ్చిన, వరము= నీవు ఇచ్చిన వరాన్ని (ప్రథమకు షష్ఠి); చిత్తములోనన్= మనస్సులో; తలంపన్, వలయున్= జ్ఞాపకం చేసికొనవలసింది.

తాత్పర్యం: ఓరాజా! వేట అనే మిషతో కావాలని సప్రయత్నంగా కణ్వమహాముని ఆశ్రమానికి వచ్చి, అక్కడ నీవు సంతోషంగా నాకు ఇచ్చిన వరాన్ని మనసులో జ్ఞాపకం చేసికొమ్ము!

విశేషం: 60వ పద్యంలో శకుంతల అడుగగా దుష్యంతుడు ప్రసాదించిన వరం ప్రస్తావింపబడుతున్నది. శకుంతలాదుష్యంతుల నడుమ రహస్యంగా ఏర్పడిన ఒప్పంద మిది. అది విస్మరింపబడితే కథాకార్యమంతా భగ్నమైపోయినట్లే. ఆ వరానికి సాక్షు లెవ్వరూ లేరు. శకుంతలాదుష్యంతులే దానికి సాక్షులు. అందులో దుష్యంతుడు విస్మరించినట్లు నటిస్తూ ఆ సత్యాన్ని అబద్ధంగా మార్చటానికి యత్నిస్తున్నాడు. అందుకే శకుంతలకు ఆవేదన.

క. బాలార్కతేజుఁ డగు నీ । బాలుఁడు నీకొడుకు వీనిఁ బౌరవకుల ర
త్నాలంకారు నుదార గు । ణాలయు యువరాజుఁ జేయు మభిషేకముతోన్. 75

ప్రతిపదార్థం: బాల+అర్క, తేజుఁడు+అగు= బాల॥ (ఉదయించిన) సూర్యుని ప్రకాశంవంటి ప్రకాశం కలవాడైన; ఈ బాలుఁడు, ఈ చిరంజీవి; నీ, కొడుకు= నీయొక్క కుమారుడు; పౌరవ, కుల, రత్న+అలంకారున్= పూరుమహారాజు వంశకర్తగా వెలసిన

ఈవంశానికి అలంకారమైన వాడూ; (అయిన); వీనిన్= ఈ భరతుడిని; అభిషేకముతోన్= రాజ్యాభిషేకంతో, యువరాజున్; చేయుము;

తాత్పర్యం: బాలసూర్యుడివలె వెలుగుతున్న ఈ బాలుడు నీ కొడుకు. పౌరవవంశానికే అలంకార మైనవాడూ, ఉత్తమగుణాలకు నెలవైనవాడూ అయిన ఇతడిని యువరాజుగా అభిషేకించుము.

విశేషం: 74, 75 పద్యాలలో శకుంతల మాటనేర్పరితనాన్ని, ఔచిత్యాన్ని ప్రదర్శించింది. కణ్వాశ్రమంలో సంగమానికి పూర్వం దుష్యంతుడు వరమిచ్చాడు. ఆ సంగతి జ్ఞాపకం చేసింది. ఆ పైన జరిగిన గాంధర్వవిధి వివాహాన్ని ప్రస్తావించకుండా, పుత్త్రోదయాన్నీ, అతనియౌవరాజ్యాధికారాన్నీ పేర్కొన్నది. నిండుసభలో మాటాడేటప్పుడు పాటింపవలసిన లోకజ్ఞతను శకుంతల పాటించింది. గాంధర్వవివాహవిషయం ధ్వనిమయం చేయటం నన్నయ రచనాశిల్పం.

దుష్యంతుఁడు శకుంతలను నిరాకరించుట (సం. 1-68-18)

వ. అనిన విని దుష్యంతుండు దానినంతయు నెఱింగియు నెఱుంగనివాఁడ పోలె ని ట్లనియె. 76

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: శకుంతల ఆవిధంగా అన్న మాటలు విని దుష్యంతుడు ఆ సంగతి అంతయు తెలిసికూడ తెలియనివాడి వలె ఈ విధంగా అన్నాడు.

క. ఏ నెఱుఁగ నిన్నుఁ నెక్కడి । దానవు? మిన్నకయ యనుచితంబులు పలుకం
గా నేల? యరుగు మంబురు । హానన! యెందుండి వచ్చి తందులకు వడిన్. 77

ప్రతిపదార్థం: అంబురుహ+ఆనన!= పద్మంవంటి ముఖం కలదానా! (శకుంతలా!); ఏన్= నేను; నిన్నున్; ఎఱుఁగన్= ఎరుగను; ఎక్కడి, దానవు= ఎక్కడ పుట్టినదానవు? నీవు అసలు ఎవరవు?; ఎక్కడినుండి వచ్చినదానవు? అని మూడు అర్థాలు చెప్పవచ్చును; మిన్నక+అయ= ఊరకయే; అనుచితంబులు= కూడనిమాటలు; పలుకంగాన్+ఏల= పలకటం ఎందుకు? (వలదు అని భావం); ఎందున్+ఉండి, వచ్చితి(వి)= ఎక్కడినుండి వచ్చావో; అందులకున్= ఆ ప్రదేశానికి; వడిన్= వేగంగా; అరుగుము= వెళ్ళుము.

తాత్పర్యం: పద్మముఖీ! నిన్ను నేను ఎరుగను; నీ వసలు ఎవరవు; ఊరకే ఒప్పని మాటలు మాటలాడుతా వెందుకు? ఎక్కడనుండి వచ్చావో అక్కడికే తిరిగివెళ్ళుము.

వ. అనిన విని, వెల్లనై, వెచ్చనూర్చి, నిశ్చేష్టిత యై, కెందమ్మిరేకులవలనం దొరంగు జలకణంబులపోలెఁ గోపారుణిత నయనంబుల బాష్పకణంబులు దొరంగం దలవాంచి, యారాజుం గటాక్షించుచు, హృదయసంతాపంబు దనకుం దాన యుపశమించుకొని, పెద్దయుం బ్రొద్దు చింతించి శకుంతల యా రాజున కి ట్లనియె. 78

ప్రతిపదార్థం: అనినన్= అని రాజు పల్కఁగా; విని; వెల్లన+ఐ= తెల్లబోయి; వెచ్చన్+ఊర్చి= వేడిగా నిట్టూర్పు విడిచి; నిశ్చేష్టిత+ఐ= చేతలు లేనిదై, కాలుచేతులాడనిదై; కెంపు+తమ్మి, రేకులవలనన్, తొరంగు, జలకణంబుల, పోలెన్= ఎఱ్ఱతామరపూల

రేకులనుండి జారే నీటిబిందువుల వలె; కోప+అరుణిత, నయనంబులన్= కోపంచేత ఎర్రబారిన కన్నులనుండి; బాష్పకణంబులు= కన్నీటిబిందువులు; తొరంగన్= కారగా; తల, వాంచి= తలను వంచికొని; ఆ, రాజున్= ఆ దుష్యంతుడిని; కటాక్షించుచున్= కనుకొసలలోనుండి చూస్తూ; హృదయ, సంతాపంబు= మనోవేదనను; తనకున్+తాను+అ= తనకుతానే, స్వయంగా; ఉపశమించుకొని= తగ్గించుకొని; పెద్దయున్+ప్రొద్దు= చాలసేపు; చింతించి= విచారించి; శకుంతల; ఆ, రాజునకున్= ఆ దుష్యంతునికి; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: దుష్యంతుడిమాటలు విని శకుంతల తెల్లబోయి, చేష్ట లుడిగి, ఎర్రతామరపూల రేకులపైనుండి జారుతున్న నీటిబిందువులవలె కోపంచేత ఎర్రబారిన కన్నులనుండి కన్నీటిబిందువులు కారుతూఉండగా, తలవంచుకొని ఆ రాజును క్రీగంటిచూపులతో చూస్తూ మనోవేదనను తనకు తానే అణచుకొని, చాలసేపు విచారించి ఆ రాజుతో ఈ విధంగా పలికింది.

విశేషం: ఇక్కడ దుఃఖతీవ్రతవలన కలిగే వైవర్ణ్యం, స్తంభం, అశ్రుపాతం అనే సాత్త్వికభావాలు శకుంతలయందు సహజంగా వర్ణించబడినవి. బాష్పవర్ణనంలోని ఉపమాలంకారం సార్థకం.

కుపిత యైన శకుంతల దుష్యంతునకు ధర్మప్రబోధ మొనరించుట. (సం. 1-68-22)

ఆ. ఏల యెఱుక లేని యితరుల యట్ల నీ। వెఱుఁగ ననుచుఁ బలికె దెఱిఁగి యెఱిఁగి;
యేన కాని దీని నెఱుఁగ రిం దొరు లని। తప్పఁబలుక నగునె ధార్మికులకు! 79

ప్రతిపదార్థం: నీవు= నీవు (దుష్యంతుడు); ఎఱిఁగి= అన్నివిషయాలు బాగా తెలిసికూడ; ఎఱుఁగను+అనుచున్= (తెలిసినదానిని) తెలియదు, అంటూ; ఎఱుక, లేని; ఇతరులు+అ+అట్లు+అ= అజ్ఞానుల వలె ఎవరో మాటాడినట్లు; పలికెదు= మాట్లాడుతావు; ఇందున్= ఇక్కడ; దీనిని= ఈ విషయాన్ని, లేదా, ఈ శకుంతలను; ఏను+అ, కాని= నేను మాత్రమేకాని; ఒరులు= ఇంకొకరు; ఎఱుఁగరు+అని= తెలియరని; ధార్మికులకున్= ధర్మాత్ములకు, ధర్మాత్ములైన మీకు (దుష్యంతునకు); తప్పన్, పలుకన్, అగును+ఎ= అబద్ధమాడవచ్చునా? (కూడదని భావం).

తాత్పర్యం: అన్నీ బాగా తెలిసికూడ నాకు తెలియదు అని ఎవరో తెలియని ఇతరులవలె ఎందుకు మాటాడుతావు? ఇక్కడ దీనిని నేనే కాని ఇతరు లెవ్వరు ఎఱుగ రని (సాక్షులు లేరని) ధర్మాత్ములైనవారు అబద్ధమాడవచ్చునా? (తగదని భావం).

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'తప్పఁబలుక నగునె ధార్మికులకు' అనే వాక్యం సాధారణలోకధర్మంగానూ, దుష్యంతుని పట్ల వర్తించే అధిక్షేపంగానూ గ్రహించవచ్చును.

చ. విమలయశోనిధీ! పురుషవృత్త మెఱుంగుచునుండుఁ జూవె వే
దములును బంచభూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్
యముఁడును జంద్రసూర్యులు నహంబును రాత్రియు న న్మహాపదా
ర్థము లివి యుండఁగా నరుఁడు దక్కొననేర్చునె తన్ను ద్రుచ్చిలన్. 80

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: విమలయశోనిధీ!= నిర్మలమైన కీర్తికి నెలవైనవాడా!; వేదములును= వేదాలున్నూ; పంచభూతములు= భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము - అనే అయిదు ప్రకృతులున్నూ; ధర్మువు= ధర్మమున్నూ; సంధ్యలు= ఉదయసంధ్య, సాయంసంధ్య అనే రెండున్నూ; అంతర్+ఆత్మయున్= హృదయమున్నూ; యముఁడును= (మృత్యువునకు అధిదేవత ఐన) యముడూ; చంద్ర, సూర్యులు= చంద్రుడూ, సూర్యుడూ; అహంబును= పగలూ; రాత్రియున్= రాత్రియూ; అన్, మహత్+పదార్థములు= అనబడే మహాపదార్థాలు; పురుషవృత్తము= నరుని చరిత్రాన్ని (నరులు చేసే పనులను); ఎఱుంగుచున్+ఉండున్+చూవె= తెలిసికొంటూ ఉంటాయిసుమా!; ఇవి, ఉండఁగాన్= ఈ మహాపదార్థాలు ఉండగా; నరుఁడు= మానవుడు; తన్ను= తనను తాను; ముచ్చిలన్= దొంగిలింపగా, వంచింపగా; తక్కొనన్ (తల+కొనన్), నేర్చునె= పూనుకొనగలడా? (పూనుకొనలేడని భావం). (ముచ్చిలన్= వంచించుకొని; తక్కు+ఒననేర్చునె= వేరువిధంగా చేయపూనుకొనునా? అనికూడ చెప్పవచ్చును.)

తాత్పర్యం: నిర్మలమైన కీర్తికి నిధివంటివాడ వైన దుష్యంతుడా! వేదాలు, పంచభూతాలు, ధర్మం, ఉభయసంధ్యలు, హృదయం, యముడు, చంద్రసూర్యులు, పగలు, రాత్రి - అనే మహాపదార్థాలు నరులవర్తనాన్ని ఎప్పుడూ గమనిస్తూనే ఉంటాయిసుమా! ఆ మహాపదార్థాలు ఉండగా నరుడు తనంతట తాను వంచించుకోగలడా! (సత్యాన్ని దాచుకొనగలడా, లేదా, తాను చేసిన దానిని దాచుకొనగలడా?), (లేడని భావం).

విశేషం: 'విమలయశోనిధీ!' అన్న సంబోధనం సార్థకం. అసలే అచ్చమైన కీర్తికలవాడవు ఇప్పుడు అసత్యమాడి నీ కీర్తికి మచ్చ తెచ్చుకోవద్దన్న హెచ్చరిక అందులో గమ్యం.

"ఆదిత్యచంద్రావనిలో నలశ్చ, ద్యౌర్భూమి రాపో హృదయం యమశ్చ
అహశ్చ రాత్రిశ్చ ఉభే చ సంధ్యే, ధర్మశ్చ జానాతి నరస్య వృత్తమ్" - అనే మూలశ్లోకంలో లేని 'వేదాలను' మహాపదార్థాలలో మొదట చేర్చి నన్నయ వేదప్రామాణ్యాన్ని గౌరవించాడు. 'పంచమవేదానికి' సార్థకత కలిగించాడు. గాంధర్వవిధితో రహస్యంగా వివాహంచేసికొని, నిండుకొలువులో సాక్ష్యాధారాలు లేవని సాహసించాడు దుష్యంతుడు. సత్యానికీ, ధర్మానికీ, అంతేకాదు మనిషిచేసే ప్రతిపనికీ, సంకల్పానికీ అతని అంతరాత్మయే అసలైన సాక్షి. అంతరాత్మను చంపుకొంటే మనిషి తనను తాను వంచించుకొన్నట్లే అవుతుందని ఈసూక్తిలోని రుచిరార్థం. శకుంతలాదుష్యంతుల కథలోని పరమార్థం. ఇది నన్నయసూక్తి మౌక్తికం.

క. నా యెఱిఁగినట్ల యిన్నియు । నీ యిచ్చిన వరము ధారుణీవర! యెఱుఁగున్
నాయందుఁ దొంటియట్టుల । చేయు మనుగ్రహ; మవజ్ఞ సేయం దగునే! 81

ప్రతిపదార్థం: ధారుణీవర!= ఓరాజా!; నీ, ఇచ్చిన, వరము= నీవు నాకు ఇచ్చిన ఆ వరాన్ని గురించి; నా, ఎఱిఁగిన+అట్లు+అ= నాకు తెలిసిన విధంగానే; ఇన్నియున్= (ముందుపద్యంలో చెప్పిన) మహాపదార్థాలన్నీ; ఎఱుఁగున్= తెలియును; తొంటి+అట్టులు+అ= వెనుకటివలెనే; నాయందున్= నాయెడల; అనుగ్రహము, చేయుము= దయను ప్రదర్శించుము, అనురాగాన్ని అందించుము; అవజ్ఞ, చేయన్, తగును+ఏ= అవమానించటం ఉచితమా? (కాదని భావం).

తాత్పర్యం: ఓ రాజా! నీ విచ్చిన వరాన్నిగురించి నా కెట్లా తెలియునో ఆవిధంగానే వేదాలు మొదలైన మహాపదార్థాలకు కూడా తెలియును. కాబట్టి, నాపట్ల వెనుకటి వలెనే అనురాగాన్ని ప్రసాదించుము; నన్ను అవమానించటం తగునా? (తగదు).

క. సతియును గుణవతియుఁ బ్రజా! పతియు ననువ్రతయు నైన వనిత నవజ్ఞా
న్వితదృష్టిఁ జూచు నతి దు । ర్మతి కిహముం బరముఁ గలదె మతిఁ బరికింపన్. 82

ప్రతిపదార్థం: మతిన్= బుద్ధియందు; పరికింపన్= ఆలోచించగా; సతియును= పతివ్రతయున్నూ; గుణవతియున్= గుణవంతురాలున్నూ; ప్రజాపతియున్= సంతానవతియూ; అనువ్రతయున్= అనుకూలయూ; ఐన; వనితన్= స్త్రీని, భార్యను; అవజ్ఞా+అన్విత, దృష్టిన్= తిరస్కార దృష్టితో; చూచు, అతి, దుర్మతికిన్= చూచే మిక్కిలి దుష్టబుద్ధికలవాడికి; ఇహమున్, పరమున్, గలదు+ఎ= ఈ లోకంలో, పరలోకం (స్వర్గలోకం) లో సుఖం ఉంటుందా? బ్రతికినా చచ్చినా సుఖపడలే డని భావం.

తాత్పర్యం: బుద్ధితో బాగా పరిశీలిస్తే - పతివ్రత, గుణవంతురాలు, సంతానవతి, అనుకూల అయిన భార్యను తిరస్కారభావంతో చూచే మిక్కిలి దుర్బుద్ధికి ఇహపరసుఖాలు రెండూ ఉంటాయా? (ఉండ వనీ, రెంటికి చెడ్డ రేవడి ఔతా డనీ భావం).

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తికి ఇది చక్కని ఉదాహరణం. గృహస్థాశ్రమధర్మం నాలుగు బలమైనస్తంభాలమీద నిలువబడిన వ్యవస్థ. ఆనాలుగుస్తంభాలేవంటే-1 యజమానుడు (భర్త, గృహస్థుడు, గృహమేధి) 2. కులసతి (భార్య, గృహిణి) 3. సంతానం (సుతుడు, పుత్రిక) 4. సత్యం (సత్యస్వరూపమైన పరమధర్మం, దాని వివిధభేదాలు). ఈ నాల్గింటియొక్క ప్రాశస్త్యాన్నిగురించి చెప్పించటమే శకుంతల ధార్మికోపన్యాసంలోని వ్యాసహృదయం. వాటిలో మొదటిఅంశమైన యజమానునియొక్క స్వరూపస్వభావాలను వ్యంగ్యంగా నిర్దేశించటం ఈపద్యంలోనూ ఆతరువాతి పద్యంలోనూ గమనించవచ్చును.

క. సంతతగృహమేధి ఫలం । బంతయుఁ బడయంగ నోపు ననుగుణభార్యా
వంతుం డగువాఁడు క్రియా । వంతుఁడు దాంతుండుఁ బుత్త్రవంతుండు నగున్. 83

ప్రతిపదార్థం: అనుగుణ, భార్యావంతుండు+అగు, వాఁడు= అనుకూలవతి అయిన భార్య కలవాడు; క్రియావంతుఁడు= కర్మలను ఆచరించేవాడూ; దాంతుండున్= ఇంద్రియ నిగ్రహం కలవాడూ; పుత్త్రవంతుండున్= పుత్రసంతానం కలవాడూ; అగున్= ఔతాడు; సంతత, గృహమేధి, ఫలంబు, అంతయున్= ఎల్లప్పుడు గార్హస్థ్యాశ్రమం నిర్వహించే యజమాని పొందే ఫలాన్నంతటినీ; పడయంగన్+ఓపున్= పొందగలుగుతాడు.

తాత్పర్యం: అనుకూలవతి ఐన భార్యగలవాడు కర్మలు ఆచరించగలుగుతాడు, ఇంద్రియాలను నిగ్రహించగలుగుతాడు, పుత్రసంతానాన్ని పొందగలుగుతాడు, గార్హస్థ్యధర్మాన్ని ఎల్లప్పుడూ ఆచరించే గృహస్థుడు పొందే ఫలాన్నంతటినీ; పడయంగన్+ఓపున్= పొందగలుగుతాడు.

విశేషం: గృహస్థాశ్రమధర్మాన్ని కీర్తించే రుచిరార్థసూక్తి యిది.

వ. మఱియును. 84

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: అంతేకాక.

సీ. ధర్మార్థకామసాధన కుపకరణంబు । గృహనీతివిద్యకు గృహము, విమల
చారిత్రశిక్ష కాచార్యకం, బన్వయ । స్థితికి మూలంబు, సద్గతికి నూఁత,
గౌరవంబున కేకకారణం, బున్నత । స్థిరగుణమణుల కాకరము, హృదయ
సంతోషమునకు సంజనకంబు భార్యయ । చూవె భర్తకు, నొండ్లు గావు ప్రియము,

ఆ. లెట్టి ఘట్టములను నెట్టి యాపదలను । నెట్టితీఱములను ముట్టఁబడిన
వంతలెల్లఁ బాయు నింతులఁ బ్రజలను । నొనరఁ జూడఁగనిన జనుల కెందు. 85

ప్రతిపదార్థం: ధర్మ+అర్థ, కామ, సాధనకున్, ఉపకరణంబు= ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలను సాధించటానికి సాధనం; గృహనీతి, విద్యకున్, గృహము= గృహనీతి అనేవిద్యకు నెలవైనది; విమల, చారిత్ర, శిక్షకున్+ఆచార్యకంబు= నిర్మలమైన శీలాన్ని బోధించే గురువు; అన్వయ, స్థితికిన్, మూలంబు= వంశం నిలబడటానికి ఆధారం; సత్+గతికిన్, ఊఁత= ఉత్తమగతియైన మోక్షానికి ఊతకర్ర; గౌరవంబునకున్+ఏక, కారణంబు= మన్ననకు ముఖ్యహేతువు; ఉన్నత స్థిరగుణమణులకున్+ఆకరము= ఆదర్శమైనవీ, కలకాలం నిలిచేవీ అయిన మణులవంటి గుణాలకు నెలవైనది; హృదయ సంతోషమునకున్, సంజనకంబు= మానసికమైన ఆహ్లాదాన్ని కలిగించేది; భార్య+అ,చూవె= భార్యయేసుమా; భర్తకున్= మగనికి; ప్రియములు= ఇష్టమైనవి; ఒండ్లు, కావు= ఇతరాలు కావు; ఇంతులన్= భార్యలను; ప్రజలను= సంతానాన్నీ (బిడ్డలను); ఒనరన్, చూడన్, కనిన, జనులకున్= సరిగా ఆదరింపగలిగినవారికి ఎందున్= ఎక్కడైనా; ఎట్టి, ఘట్టములనున్= ఎటువంటి సన్నివేశాలలో (తరుణాలలో)నైనా; ఎట్టి, ఆపదలను= ఎటువంటి విపత్తులలోనైనా; ఎట్టితీఱములను= ఎటువంటి ఇబ్బందులలోనైనా; ముట్టన్+పడిన, వంతలు+ఎల్లన్= ఆవరించిన దుఃఖాలన్నియున్నూ; పాయున్= తొలగిపోతాయి.

తాత్పర్యం: ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలను సాధించటానికి అనువైన సాధనమూ, గృహనీతి అనే విద్యకు నెలవైనదీ, నిర్మలమైన శీలాన్ని గురించి ప్రబోధించే గురుస్థానమూ, వంశం నిలవటానికి ఆధారమైనదీ, ఉత్తమగతులు పొందటానికి ఊతకర్ర అయినదీ, మన్ననకు ముఖ్యహేతువైనదీ, ఆదర్శప్రాయమైనవీ కలకాలం నిలిచేవీ అయిన మణులవంటి గుణాలకు నెలవైనదీ, హృదయానందాన్ని కలిగించేదీ భర్తకు భార్యయే సుమా! మగనికి ఇల్లాలికంటె ఇంపైనది వేరొకటి లేదు. ఆలుబిడ్డలను ఆప్యాయంగా చూచేవారికి ఏచోటనైనా, ఎటువంటి పరిస్థితులలోనైనా, ఎటువంటి ఆపదలలోనైనా, ఇబ్బందులలోనైనా చుట్టుముట్టిన దుఃఖాలన్నీ తొలగిపోతాయి.

విశేషం: గృహస్థాశ్రమధర్మరక్షణకు కేంద్రబిందు వైన గృహిణియొక్క గొప్పతనాన్నిచెప్పే గొప్పతెలుగుపద్యం.

వ. మఱియు భార్య పురుషునం దర్ధం బగుటంజేసి పురుషునకు మున్న పరేత యైన పతివ్రత పరలోకంబునం దనపురుషుం గూడఁ దదాగమనంబు ప్రతీక్షించుచుండుం; బురుషుండు మున్న పరేతుం డైనఁ బదంపడి తానును బరేత యై తనపురుషుం గూడ నరుగునట్టి భార్య నవమానించుట ధర్మవిరోధంబు; మఱియునుం బురుషుండు భార్యయందుఁ బ్రవేశించి గర్భంబునఁ బుత్త్రుండై తాన యుద్భవిల్లు గావున 'నఙ్గా దఙ్గా త్సమ్భవసి' యనునది యాదిగాఁగల వేదవచనంబులయందును జనకుండునుఁ బుత్త్రుండును ననుభేదంబు లేదు. 86

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక; భార్య= ఇల్లాలు; పురుషునందున్= మగనిలో; అర్ధంబు= సగం; అగుటన్+చేసి= కావటంచేత; పురుషునకున్; మున్ను+అ, పరేత, ఐన= మగనికంటె ముందే మరణించిన; పతివ్రత; పరలోకంబునన్= స్వర్గలోకంలోకూడ; తన, పురుషున్, కూడన్= తన భర్తతో కలియటానికి; తద్+ఆగమనంబు= అతడిరాకను; ప్రతీక్షించుచున్+ ఉండున్= ఎదురుచూస్తూ ఉంటుంది; పురుషుండు, మున్ను+అ, పరేతుండు+ఐనన్= భర్త ముందుగా చనిపోతే; పదంపడి= తరువాత; తానును, పరేత+ఐ= తానుకూడ చనిపోయినదై; తన, పురుషున్, కూడన్, అరుగునట్టి, భార్యను= తన మగనితో కలియుట కొరకు పోయే భార్యను; అవమానించుట= భంగపరచటం; ధర్మ, విరోధంబు= ధర్మానికి వ్యతిరేకం; మఱియునున్= ఇంతేకాక; పురుషుండు= భర్త; భార్యయందున్, ప్రవేశించి= భార్యలో ప్రవేశించి; గర్భంబునన్= గర్భధారణమార్గంలో; పుత్త్రుండు+ఐ= కుమారుడై; తాను+అ= తానే; ఉద్భవిల్లున్, కావునన్= పుట్టుతాడు కాబట్టి; అంగాత్+అంగాత్, సంభవసి= శరీరంనుండి పుట్టుతున్నావు; అను+అది, ఆదిగాన్+కల= అనే వాక్యం మొదలైన; వేదవచనంబుల+అందును= వేదవాక్యాలలోకూడ; జనకుండునున్, పుత్త్రుండును, అను, భేదంబు, లేదు= తండ్రి అనీ, కొడుకనీ భేదం ఉండదు.

తాత్పర్యం: అంతేకాక, భార్య భర్తలో సగం కాబట్టి మగనికంటె ముందే చనిపోయిన పతివ్రత పరలోకంలోకూడ తనభర్తతో కూడిఉండా లని అతడిరాకకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. భర్త ముందుగా చనిపోతే తానుకూడ వెనువెంట వెళ్లి భర్తను కూడుకొనే భార్యను అవమానించటం ధర్మవిరోధం. అంతే కాదు. భర్త భార్యయందు ప్రవేశించి గర్భంలో వసించి పుత్రుడై జన్మిస్తాడు కాబట్టి 'అంగాత్ అంగాత్ సంభవసి శరీరం నుండి పుట్టుతున్నావు ఇత్యాది వేదవాక్యంవల్ల కూడ తండ్రికొడుకులకు భేదం లేదు.

విశేషం: గృహస్థాశ్రమంలో పుత్త్రునియొక్క ప్రాధాన్యం 86 నుండి 91వ పద్యంవరకు చెప్పబడింది.

క. **విను గార్హపత్య మను న । య్యనలము విహరింపఁబడి తదాహవనీయం**
బున వెలుఁగునట్ల వెలుఁగును । జనకుఁడు దాఁ బుత్త్రుఁడై నిజద్యుతితోడన్. **87**

ప్రతిపదార్థం: విను= తెలిసికొమ్ము!; గార్హపత్యము+అను, ఆ+ఆనలము= గార్హపత్యం అని పిలువబడే ఆ అగ్ని; విహరింపఁబడి= ప్రజ్వలింపచేయబడి; తద్+ఆహవనీయంబున= ఆ ఆహవనీయం అనే అగ్నిలో; వెలుఁగున్, అట్లు+అ= ఏవిధంగా వెలుగుతుందో ఆవిధంగా; జనకుఁడు= తండ్రి; తాన్= తానే; పుత్త్రుఁడు+ఐ= కుమారుడై; నిజ, ద్యుతితోన్= తనకాంతితో; వెలుగును= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: గార్హపత్యం అనబడే అగ్ని ప్రజ్వలింపబడి ఏవిధంగా ఆహవనీయంలో వెలుగొందుతుందో ఆవిధంగానే తండ్రి తానే పుత్రుడై తన ప్రకాశంతో వెలుగొందుతాడు. దీనిని తెలిసికొనుము.

విశేషం: అలం: ఉపమ. గృహస్థు నిత్యాగ్నిహోత్రం చేసికొనటానికి ఆరిపోకుండా రక్షించుకొనే అగ్ని గార్హపత్యాగ్ని, వైశ్వదేవాది క్రియలు ఆచరించటానికి గార్హపత్యాగ్నినుండి గ్రహించి క్రియాసమాప్తివరకు హోమం చేయటానికి ఉపయోగించే అగ్ని ఆహవనీయాగ్ని, గార్హపత్యంలోని అగ్నియే ఆహవనీయంలో వెలుగొందుతుంది కాబట్టి తండ్రి తనువునుండి పుత్రుడు పుట్టి ప్రకాశిస్తాడని భావం.

క. **తాన తననీడ నీళ్ళు ల । లో నేర్పడఁ జూచునట్లు లోకస్తుత! త**
త్సూను జనకుండు సూచి మ । హానందముఁ బొందు నతిశయప్రీతిమెయిన్. **88**

ప్రతిపదార్థం: లోకస్తుత= లోకులచేత కీర్తింపబడినవాడా! దుష్యంతా!; తాను+అ= తానే; తన, నీడన్; నీళ్ళులలోన్= నీళ్ళల్లో, ఏర్పడన్= స్పష్టంగా; చూచున్+అట్లు= చూచేవిధంగా; జనకుండు= తండ్రి; తద్+సూను= అతని కుమారుడిని; చూచి; అతిశయ, ప్రీతిమెయిన్= మిక్కిలి సంతృప్తితో, మహత్+ఆనందమున్= గొప్పదైన ఆనందాన్ని; పొందును= పొందుతాడు.

తాత్పర్యం: రాజా! పురుషుడు నీళ్ళలో తననీడ తాను స్పష్టంగా చూచినవిధంగా తండ్రి కొడుకును చూచి మిక్కిలి సంతృప్తితో మహదానందాన్ని పొందుతాడు.

విశేషం: అలం: ఉపమ. పరమాత్మకు జీవాత్మకు బింబప్రతిబింబ భావం అద్వైతంలో చెప్పబడినట్లు ఇక్కడ తండ్రికొడుకులకు బింబప్రతిబింబ భావం చెప్పబడింది. తత్త్వతః రెండూ ఒకటే అని భావం.

వ. 'పున్నామ్నో నరకాత్త్రాయత ఇతి పుత్త్ర' యను వేదవచనంబు గలదు గావునఁ బుణ్యాచారుం డయిన పుత్త్రుం డుభయపక్షంబులవారి నుద్ధరించుఁ; గావున. 89

ప్రతిపదార్థం: పుత్+నామ్ను; నరకాత్ - త్రాయతే+ఇతి, పుత్రః - 'పుత్' అనే పేరు కల నరకంనుండి కాపాడుతాడు కాబట్టి పుత్త్రుడు అనబడతాడు; అను, వేదవచనంబు; కలదు; కావునన్; పుణ్య+ఆచారుండు+అయిన, పుత్త్రుండు= పవిత్రమైన నడవడిక కలవాడైన పుత్రుడు; ఉభయ, పక్షంబుల, వారినిన్= రెండుప్రక్కలవారిని (ఇటుతండ్రి పక్షంవారిని అటు తల్లిపక్షంవారిని); ఉద్ధరించున్= ఉత్తమలోకాలను కలిగిస్తాడు (పైకెత్తుతాడు); కావున.

తాత్పర్యం: పుత్ అనే పేరుగల నరకంనుండి తల్లిదండ్రులను కాపాడుతాడు కాబట్టి పుత్త్రుడు అనే పేరు ఏర్పడింది అని వేదం చెప్పింది. కాబట్టి ఉత్తమశీలుడైన పుత్రుడు తల్లిదండ్రుల ఉభయవంశాలవారిని ఉద్ధరిస్తాడు కాబట్టి.

విశేషం: పుత్రుడి మహిమ తెలియటానికి ఈపర్వంలోని జరత్కారు వృత్తాంతం, పాండురాజతపోవన వృత్తాంతాలు చదువవచ్చును.

క. నీ పుణ్యతనువు వలనన । యీపుత్త్రకుఁ డుద్భవిల్లి యెంతయు నొప్పున్
దీపంబువలన నొండొక । దీపము ప్రభవించినట్లు తేజం బెసఁగన్. 90

ప్రతిపదార్థం: దీపంబు వలనన్= ఒక దీపంవలన; ఒండు+ఒక, దీపము= మరొకదీపం; తేజంబు+ఎసఁగన్= వెలుగొందగా; ప్రభవించిన+అట్లు= పుట్టినట్లు; నీ, పుణ్య, తనువు, వలనన్+అ= నీపవిత్రమైన శరీరంవలననుండియే; ఈపుత్త్రకుఁడు= ఈ కొడుకు (భరతుడు); ఉద్భవిల్లి= పుట్టి; ఎంతయున్+ఒప్పున్= ఎంతగానో ప్రకాశిస్తున్నాడు.

తాత్పర్యం: ఒక దీపంనుండి మరొకదీపం పుట్టి వెలుగొందినట్లు నీ పుణ్యశరీరంనుండి ఈపుత్త్రుడు పుట్టి ప్రకాశిస్తున్నాడు.

విశేషం: అలం: ఉపమ. దీపంనుండి దీపం పుట్టటంతో తండ్రితనువునుండి పుత్రుడు పుట్టటం పోల్చబడింది. వెలిగించిన దీపం ఆకృతి కోల్పోయేది లేదు, వన్నెతగ్గేది లేదు. వెలిగినదీపం వెలిగించిన దీపంలాగానే ఆకృతిలో తేజస్సులో సమంగా ప్రకాశిస్తుంది. రూపాంతరం పొందినా రూపసామ్యం తండ్రిపుత్రులలో ఉంటుందని చెప్పే ఉపమ ఇది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. విపరీతప్రతిభాష లేమిటికి నుర్వీనాథ! యీ పుత్త్రగా
త్రపరిష్వంగసుఖంబు సేకొనుము ముక్తాహార కర్పూర సాం
ద్రపరాగ ప్రసరంబుఁ జందనముఁ జంద్రజ్యోత్స్నయుం బుత్త్రగా
త్రపరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే కడున్ శీతమే. 91

ప్రతిపదార్థం: ఉర్వీనాథ= భూమియొక్క పతివైన ఓరాజా!; విపరీత, ప్రతిభాషలు, +ఏమిటికిన్?= విరుద్ధాలైన మారుమాటలు ఎందుకు? (అటువంటి మాటలు చెప్పబోకు మనిభావం); ఈ, పుత్త్ర, గాత్ర, పరిష్వంగ, సుఖంబు= ఈ కుమారుడియొక్క శరీరాన్ని కౌగిలించుకొనటంవలని హాయిని; చేకొనుము= స్వీకరించుము(అనుభవింపుమని భావం); ముక్తా, హార, కర్పూర, సాంద్ర, పరాగ, ప్రసరంబున్= ముత్యాలహారాలున్నూ, పచ్చకర్పూరపు దట్టమైన పొడియొక్క వ్యాపనమున్నూ (పచ్చకర్పూరపు మైపూత అనిభావం); చందనమున్= మంచిగంధమున్నూ; చంద్రజ్యోత్స్నయున్= వెన్నెలయున్నూ; జీవులకున్= ప్రాణులకు; పుత్త్ర, గాత్ర, పరిష్వంగము+అట్లు= కుమారుడి శరీరాన్ని కౌగిలించుకొన్నట్లు; హృద్యంబు+ఏ= మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించునా?; కడున్, శీతమే= మిక్కిలి చల్లదనంగా ఉండునా? (ఉండదని భావం).

తాత్పర్యం: ఓరాజా! విరుద్ధాలైన మారుమాటలు ఎందుకు? ఈపుత్రుడిని కౌగిలించుకొని ఈతడి కౌగిలివలన కలిగే సుఖాన్ని అనుభవించుము. ముత్యాలహారాలూ, పచ్చకర్పూరపు దట్టమైన పొడి ప్రసారం, మంచిగంధమూ, వెన్నెలయూ జీవులకు పుత్రునికౌగిలివలె మనసుకు సుఖాన్నీ, మంచి చల్లదనాన్నీ కలిగించలేవు.

విశేషం: అలం: వ్యతిరేకం. స్పర్శసిద్ధాంతాన్ని ప్రతిపాదించే ఈపద్యం నన్నయగారి సూక్తిమధురమైన కవిత్వానికి ఉత్తమ ఉదాహరణంగా తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందింది. ఇందులో నన్నయ ఎన్నుకొన్న ఉపమాద్రవ్యాలన్నీ అమూలకాలే.

క. అనఘుఁడు వంశకరుండై । పెనుపున నీసుతుఁడు వాజపేయంబులు నూ
టొనరించు నని సరస్వతి । వినిచె మునులు వినఁగ నాకు వినువీథిదెసన్. 92

ప్రతిపదార్థం: నీసుతుఁడు= నీకొడుకు; అనఘుఁడు= పాపరహితుడున్నూ; వంశకరుండు+ఐ= వంశకర్తయున్నూఅయి; పెనుపునన్= గొప్పతనంతో; వాజపేయంబులు, నూరు,+ఒనరించున్+అని= వాజపేయంఅనేపేరుగల యజ్ఞాలను నూరింటిని చేస్తాడని; వినువీథి, దెసన్= ఆకాశమార్గంలో; సరస్వతి= (ఆకాశ)వాణి; మునులు, వినఁగన్= ఋషులందరూ వినేటట్లు; నాకున్= నాకు (శకుంతలతో); వినిచెన్= చెప్పింది.

తాత్పర్యం: 'పుణ్యాత్ముఁ డైన నీకుమారుడు వంశకర్తయై పూనికతో నూరువాజపేయయాగాలను చేస్తా' డని ఆకాశవీధిలో సరస్వతి (ఆకాశవాణి) మునులందరూ వినేటట్లుగా నాతో చెప్పింది.

విశేషం: నన్నయ ఈ వివరాలు భరతుడు పుట్టిన ఘట్టంలో చెప్పలేదు. దుష్యంతుడి నిండుసభలో చెప్పించాడు. ఇది కథాకథన కళ. ఆకాశవాణిచేత పొగిడించుకొనినవాడు మహాత్ముడు ఔతాడనీ, ఆకాశవాణి భవిష్యద్వాణిగా సత్యమే చెపుతుందనీ అందరి విశ్వాసం. శకుంతల చెప్పిన ఆకాశవాణి సత్యకథనాన్ని దుష్యంతుడు నమ్మడు; అది పరోక్షప్రమాణం కావటంచేత. భావికథలో తన సభలోనే ఆకాశవాణి పలికినప్పుడు ప్రత్యక్షప్రమాణమని నమ్మాడు. ఆకాశవాణి ద్వయ ప్రయోగం వస్తుశిల్పం. ఈ సన్నివేశంలో తులనాత్మక శిల్పానుశీలనంవలన వస్తుధ్వని రాణిస్తున్నది.

క. భూరిగుణు నిట్టి కులవి । స్తారకు దారకు నుదారధర్మప్రియ! ని
ష్కారణమ తప్పఁజూడఁగ । సారమతీ! చనునె నాఁటి సత్యము గలుగన్. 93

ప్రతిపదార్థం: ఉదార, ధర్మ, ప్రియ= ఉత్తమ మైన ధర్మమునందు ప్రీతికలవాడా!; సారమతీ= సారవంత మైన బుద్ధికలవాడా!; నాఁటి, సత్యము, కలుగన్= ఆ వివాహంనాడు (దుష్యంతుడు) ఇచ్చిన వరమనే సత్యం వాస్తవమై ఉండగా; భూరి, గుణున్= అనేక గుణాలు కలవాడిని; ఇట్టి= ఇటువంటి (ఆకాశవాణి కీర్తించినటువంటి); కుల, విస్తారకున్= వంశాన్ని విస్తరించేవాడిని (వంశోద్ధారకుడిని); దారకున్= పుత్రుడిని (బాలకుడిని); నిష్కారణము+అ= కారణంలేకుండానే; తప్పన్, చూడఁగన్= కాదనటం (విముఖంగా చూడటం); చనునె= తగునా? (తగ దని భావం).

తాత్పర్యం: ఉత్తమధర్మప్రియా! సారమతీ! మనవివాహ మైననాడు నా కిచ్చిన వర మనే సత్యం నిలిచి ఉండగా, అపారగుణవంతుడు, వంశవిస్తారకుడు, అయిన పుత్త్రుడిని ఏకారణం లేకుండానే కాదనటం తగునా? (తగదు అని భావం).

విశేషం: ఉదారధర్మప్రియ! సారమతీ! అనీ శకుంతల దుష్యంతుడిని సంబోధించటం సాభిప్రాయం; ధర్మం తెలిసినవాడూ, వివేకం కలవాడూ పుత్త్రుడిని కాదన డని హెచ్చరింపు.

చ. నుతజలపూరితంబు లగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత! యొక బావి మేలు; మఱి బావులు నూఱిటికంటె నొక్కస
త్క్రతువది మేలు; తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు; త
త్సుత శతకంబుకంటె నొక సూనృతవాక్యము మేలు సూడఁగన్. 94

ప్రతిపదార్థం: సూనృతవ్రత!= నిజము మాటాడటమే నియమంగా కలవాడా!; నుత, జల, పూరితంబులు+అగు= మంచినీటిచేత నిండినవైన; నూతులు= చేదుడుబావులు; నూఱిటికంటెన్= వందకంటె; ఒక, బావి, మేలు= ఒక దిగుడుబావి ఉత్తమం; మఱి; బావులు, నూఱిటికంటెన్= దిగుడుబావులు వందకంటె; ఒక్క, సత్+క్రతువు+అది, మేలు= ఒకమంచి యజ్ఞం ఉత్తమం; తద్+క్రతుశతంబున, కంటెన్= అటువంటి నూరు యజ్ఞాలకంటె; సుతుండు, మేలు= కొడుకు మేలు; తద్, సుత, శతకంబు, కంటెన్= అట్టి కొడుకులు వందమందికంటె; చూడఁగన్= పరిశీలించగా; ఒక సూనృత, వాక్యము, మేలు= ఒక సత్యవాక్యం ఉత్తమం.

తాత్పర్యం: సత్యవ్రతం గల ఓ రాజా! మంచినీటితో నిండిన చేదుడుబావులు నూరింటికంటె ఒక దిగుడుబావి మేలు; కాగా, బావులు నూరింటికంటె ఒక మంచియజ్ఞం మేలు; అటువంటి నూరుయజ్ఞాలకంటె ఒక పుత్రుడు మేలు. అట్టి పుత్రులు నూరుమందికంటె ఒక సత్యావాక్యం మంచిది.

విశేషం: అలం: సారాలంకారం. 'సూనృతవ్రత!' అన్న సంబోధనం సాభిప్రాయం. మాటతప్పిన దుష్యంతుడి ప్రవర్తనను ఎత్తిపొడిచేది. ఆగ్రహంలో కూడ శకుంతల ఔచిత్యం పాటించింది. గృహస్థాశ్రమధర్మంలో సంతానంకంటె సత్యం గొప్పదని తాత్పర్యం. దీనిని 95, 96 పద్యాలలోకూడా వివరించటం గమనించదగింది. ఉత్తరోత్తరాలకు ఉత్కర్ష చెప్పి వర్ణిస్తే సారాలంకారం. ఉత్కర్ష ఆకారంలో కాదు గుణంలో. ఇక్కడ పుణ్యంలో నూరు నూతులు త్రవ్వించిన పుణ్యంకంటె ఒక బావి త్రవ్వించిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పుణ్యం మిన్న. నూరు బావులు కట్టించిన పుణ్యంకంటె ఒక యజ్ఞంవలని పుణ్యం మేలు. నూరుయజ్ఞాల ఫలంకంటె ఒక కొడుకును పొందిన పుణ్యం మిన్న. నూర్గురు కొడుకులను కన్న పుణ్యంకంటె ఒక సత్యవాక్యం శ్రేష్ఠం. నూరు సంఖ్య అధికమైన ప్రమాణానికి గుర్తు. నన్నయ రుచిరార్థసూక్తికి ఇది మంచి ఉదాహరణం.

క. వెలయంగ నశ్వమేధం । బులు వేయును నొక్కసత్యమును నిరుగడలం
దుల నిడి తూఁపఁగ సత్యము । వలనన ములుసూపు గౌరవంబున పేర్మిన్. 95

ప్రతిపదార్థం: తులన్= త్రాసునందు; వెలయంగన్= ప్రకటమయ్యేటట్లు; అశ్వమేధంబులు, వేయునున్= వేయి అశ్వమేధయాగాలు (ఒకవైపు)నూ; ఒక్క, సత్యమును= ఒక సత్యాన్ని మాత్రమే (రెండోవైపునూ); ఇరుగడలన్= రెండువైపులా; తులన్= త్రాసులో ఇడి=ఉంచి; తూఁపఁగన్= తూచగా; గౌరవంబున+పేర్మిన్= గురుత్వము నందలి ఆధిక్యంతో ॥బరువుయొక్క ఆధిక్యంతో సత్యము, వలనన= సత్యంవైపే; ములు, చూపున్= ముల్లుచూపుతుంది, మొగ్గుచూపుతుంది. (సత్యమే గొప్ప దని సూచిస్తుంది అని భావం).

తాత్పర్యం: ఒక త్రాసులో బాహాటంగా వేయి అశ్వమేధాల (ఫలాన్ని)ను ఒకవైపునా, ఒక్కసత్యాన్ని మాత్రమే మరొకవైపునా ఉంచి తూచగా సత్యంవైపు బరువువలన ములుచూపి (మొగ్గుచూపి) సత్యమే గొప్పదని నిరూపిస్తుంది.

విశేషం: కొన్నిప్రతులలో ఈపద్యంతరువాత మరొక కందపద్యం అధికంగా కనబడుతున్నది. అది- "క. విను సత్యాలాపమునకు। మనుజేంద్ర! శతాశ్వమేధమహితఫలంబుల్ । గొనకొని చూచిన సరిగా । వనయంబును నిట్లు వలుకు నాగమఫణితుల్". తాత్పర్యంలో ఈపద్యంకంటె విశేషం లేకపోవటంచేత ఆపద్యం లేకపోయినా సందర్భంలో ఎటువంటి లోపమూ కానరాదు.

తే. సర్వతీర్థాభిగమనంబు సర్వవేద । సమధిగమము సత్యంబుతో సరియుఁ గావు
ఎఱుఁగు మెల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద । యండ్రు సత్యంబు ధర్మజ్ఞు లైన మునులు. 96

ప్రతిపదార్థం: సర్వ, తీర్థ+అభిగమనంబు= సమస్త తీర్థాలకు పోవటం; సర్వ, వేద, సమధిగమము= వేదాలనన్నింటిని అధ్యయనం చేయుటం; సత్యంబుతోన్, సరియున్, కావు= సత్యంతో సాటి కావు; ధర్మజ్ఞులు+ఐన, మునులు= ధర్మం బాగా తెలిసిన ఋషులు; ఎందున్= ఎప్పుడైనా, ఎక్కడైనా; సత్యంబు= సత్యం; ఎల్ల, ధర్మంబులకున్= ధర్మాలన్నింటికంటె; పెద్ద, అండ్రు= గొప్పది అంటారు; ఎఱుఁగుము= తెలిసికొనుము, గమనించుము.

తాత్పర్యం: తీర్థా లన్నింటినీ సేవించటం, వేదాల నన్నింటినీ అధ్యయనంచేయటం సత్యంతో సాటికావు. ధర్మం బాగాతెలిసిన ఋషులు ఎల్లప్పుడు అన్నిధర్మాలకంటె సత్యమే గొప్పదని అంటారు. దీన్ని గమనించుము.

విశేషం: గృహస్థాశ్రమధర్మాలన్నింటిలో సత్యమే శ్రేష్ఠమని భావం. "సత్యమేవేశ్వరో లోకే । సత్యే ధర్మః ప్రతిష్ఠితః । సత్యమూలాని సర్వాణి । సత్యాన్నాస్తి పరం పదం" అని పురాణోక్తి. లోకంలో సత్యమే ఈశ్వరుడు; సత్యంలోనే ధర్మం నిత్యంగా నిలిచి ఉంటుంది; సర్వజగత్తుకూ సత్యమే మూలం; సత్యంకంటె ఉత్తమపదం మరొకటి లేదు. సత్యమంటే సత్యవాక్య మనీ, నిత్య(సత్య)మనీ రెండర్థాలున్నాయి. ఆ రెండూ ఈ సందర్భంలో గృహస్థాశ్రమపరంగా అన్వయిస్తాయి.

క. కావున సత్యము మిక్కిలి । గా విమలప్రతిభఁ దలఁచి కణ్వాశ్రమ సం
భావిత సమయస్థితి దయఁ । గావింపుము; గొడుకుఁ జూడు కరుణాదృష్టిన్. 97

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; విమల, ప్రతిభన్= నిర్మలమైన బుద్ధితో; సత్యమున్= సత్యాన్ని; మిక్కిలిగాన్= గొప్పదానినిగా; తలఁచి= భావించి; కణ్వ+ఆశ్రమ, సంభావిత, సమయస్థితి= (నీవు) కణ్వాశ్రమంలో చేసిన ప్రతిజ్ఞను; దయన్= దయతో; కావింపుము= నెరవేర్చుము; కొడుకున్=(నీ) కొడుకును (భరతుడిని); కరుణాదృష్టిన్= దయాభావంతో; చూడుము= చూడుము (మన్నించుము).

తాత్పర్యం: కాబట్టి, నిర్మల మైన బుద్ధితో సత్యం గొప్పదిగా భావించి, కణ్వమహర్షిఆశ్రమంలో నీవు చేసిన ప్రతిజ్ఞను దయతో నెరవేర్చుము. నీ కొడుకును దయతో చూడుము.

విశేషం: గృహస్థాశ్రమధర్మంలో సత్యంచేత సర్వార్థసాధనం చేయవచ్చని భావం.

క. **క్షత్త్రవరుఁ డైన విశ్వా। మిత్త్రునకుఁ బవిత్ర యైన మేనకకున్ స**
త్పుత్త్రి నయి బొంకు పలుకఁగ। ధాత్రీతలనాథ! యంత ధర్మేతరనే? **98**

ప్రతిపదార్థం: ధాత్రీతలనాథ= ఓరాజా!; క్షత్త్రవరుఁడు+ఐన= క్షత్త్రియులలో ఉత్తముడయిన; విశ్వామిత్త్రునకున్= విశ్వామిత్రుడికిన్నీ; పవిత్ర+ఐన= పవిత్రురాలు అయిన; మేనకకున్= మేనకకున్నూ; సత్+పుత్త్రిన్+అయి; యోగ్యురాలైన కుమార్తె నయి; బొంకు, పలుకఁగన్= అబద్ధ మాడటానికి; అంత, ధర్మ+ఇతరనే?= నేను అంత అధర్మపరురాలనా? (కానని భావం).

తాత్పర్యం: ఓరాజా! క్షత్త్రియులలో ఉత్తము డైన విశ్వామిత్రుడికీ, పవిత్రురా లైన మేనకకూ యోగ్యురా లైన కుమార్తె నయిన నేను అబద్ధమాడటానికి అంత అధర్మపరురాలను కాను.

వ. **అనిన శకుంతల పలుకులు సేకొన నొల్లక దుష్యంతుం డి ట్లనియె.** **99**

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: పైవిధంగా పలికిన శకుంతలయొక్క మాటలను దుష్యంతుడు అంగీకరించక ఈవిధంగా అన్నాడు.

క. **ఏ నెట? నీ వెట? సుతుఁ డెట? । యే నెన్నఁడు తొల్లి చూచి యెఱుఁగను నిన్నున్;**
మానిను లసత్యవచనలు । నా నిట్టు లసత్యభాషణం బుచితంబే? **100**

ప్రతిపదార్థం: ఏన్+ఎట= నేను ఎక్కడ?; నీవు+ఎట= నీవు ఎక్కడ?; సుతుఁడు+ఎట= కుమారుడు ఎక్కడ; ఏన్= నేను; నిన్నున్= నిన్ను (శకుంతలను); తొల్లి= పూర్వం; ఎన్నఁడున్= ఏరోజునా, ఎప్పుడూ; చూచి, ఎఱుఁగను= చూడలేదు (చూచినట్లు జ్ఞాపకం లేదు); మానినులు= ఆడువారు; అసత్య, వచనలు, నాన్= అబద్ధాలు ఆడుతారు అన్నట్లుగా; ఇట్టులు= ఈవిధంగా; అసత్యభాషణంబు= అబద్ధాలు ఆడటం; ఉచితంబు+ఏ= తగునా? (తగదని భావం).

తాత్పర్యం: నే నెక్కడ? నీ వెక్కడ? కుమారు డెక్కడ? ని న్నింతకుపూర్వం ఏనాడూ చూచి ఎఱుగను. 'ఆడువారు అబద్ధా లాడుతారు' అన్నట్లుగా ఈవిధంగా అసత్యం పలకటం నీకు తగునా? (ఉచితం కాదు).

విశేషం: 'అసత్యవచనా నార్యః' అని మూలం, దీనిని నన్నయ ఔచిత్యవంతంగా తెలుగుచేశాడు. 'స్త్రీలు అసత్యవచనలు నాన్' -అనటంలో ఆ విశేషం ఉంది. ఆడువారు అసత్యాలు మాట్లాడుతారు అన్న నిశ్చితార్థం కాకుండా, ఆడువారు అబద్ధాలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెపుతారేమో అన్నపేరు నీవలన వచ్చేటట్లుగా (నాన్= అనగా) అని చెప్పటం ఔచిత్యం. స్త్రీజాతికి అపకీర్తి తేవద్దు అనే హెచ్చరిక ఇందులో గమ్యం. మరొక విశేషాన్ని శ్రీమదాంధ్రమహాభారతం సంశోధితముద్రణం పేర్కొన్నది." క. వనకన్యకయఁట నేనఁట । వనమున గాంధర్వమున వివాహంబఁట నం । దనుఁగనెనట, మరచితినఁట । వినఁగూడునె యిట్టిభంగి విపరీతోక్తుల్' - ఈపద్యము ఆదిపర్వమున నున్న దని అప్పకవి వ్రాసియున్నాడు- ఈపద్యము పినవీరభద్రుని శృంగారశాకుంతలములో నున్నది. అయినచో నిచ్చోటనే యుండఁబోలు. (ప్రథమసంపుటం - పుట. 204 (అధస్సూచి). దుష్యంతుడు ఈ మాటలన్న తరువాత శకుంతలనూ మేనకా విశ్వామిత్రులనూ, అనౌచిత్యంతోకూడిన నిందావాక్యాలతో అధిక్షేపించినట్లు సంస్కృతభారతంలో ఉన్నది. నన్నయ ఆ మాటలన్నీ వదలి శకుంతల సచ్ఛీలాన్ని వ్యక్తం చేశాడు.

క. పొడవునఁ బ్రాయంబునఁ గడుఁ । గడిఁది బలంబునను జూడఁగా నసదృశు నీ
కొడు కని యీతని నెంతయు । నెడమడుగుగఁ జూపఁ దెత్తె యిందఱు నగఁగన్. 101

ప్రతిపదార్థం: ఈతనిన్= ఇతనిని (భరతుడిని); చూడఁగాన్= పరిశీలించగా; పొడవునన్= ఆకారంచేత; ప్రాయంబునన్= వయస్సులోనూ, కడున్, కడిఁది, బలంబునను= అమితమైన బలంలోనూ; అసదృశున్= సాటిలేనివాడిని; నీకొడుకు+అని= నీయొక్క కుమారుడు, అని; ఎంతయున్, ఎడమడుగుగన్= ఎంతయో విరుద్ధంగా; ఇందఱున్= ఇంతమంది; నగఁగన్= నవ్వేటట్లు, ఎగతాళిచేసేటట్లు; చూపన్= నాకు చూపించటానికి; తెత్తె= తెస్తావా?

తాత్పర్యం: చూడంగానే రూపంలోనూ, వయస్సులోనూ అధికమైన బలంలోనూ సాటిలేనివాడుగా కనబడుతున్న ఇతడిని 'నీకొడుకు' అని ఎంతో విరుద్ధంగా అందరూ నవ్వేటట్లు నాకు చూపటానికి తీసికొనివచ్చావా?

వ. 'ఇట్టి లోకవిరుద్ధంబుల కే మోడుదు; మయుక్తంబు లయిన పలుకులు పలుకక నీయాశ్రమంబునకుం బొ'
మ్మనిన శకుంతల యత్యంతసంతాపితాంతఃకరణ యై. 102

ప్రతిపదార్థం: ఇట్టి= ఇటువంటి; లోక, విరుద్ధంబులకున్= వాస్తవానికి వ్యతిరేకంగా ఉండేవాటికి; ఏము= మేము (నేను అనే సర్వనామానికి గౌరవవాచక బహువచనం); ఓడుదుము= భయపడతాము, జంకుతాము (అంగీకరించమని భావం); అయుక్తంబులు+అయిన= తగనివి అయిన; పలుకులు, పలుకక= మాటలు మాటాడక; నీ, ఆశ్రమంబునకున్+ పొమ్ము+అనినన్= నీయొక్క ఆశ్రమానికి తిరిగిపొమ్ము అని అనగా; శకుంతల; అత్యంత, సంతాపిత+అంతఃకరణ+ఐ= మిక్కిలి తపింపబడిన హృదయం కలిగినదై.

తాత్పర్యం: ఇటువంటి లోకవాస్తవ వ్యతిరేకాంశాలను మేము అంగీకరించం. తగనిమాటలు పలుకక నీవు నీ ఆశ్రమానికి తిరిగిపొమ్ము - అని దుష్యంతుడు పలుకగా శకుంతల మనస్సులో అధికంగా సంతాపాన్ని పొందినదై.

మధ్యాక్కర.

'తడయక పుట్టిననాఁడ తల్లిచేఁ దండ్రిచే విడువఁ
బడితి; నిప్పుడు పతిచేతను విడువఁబడియెదనొక్కొ!
నుడువులు వేయు నిం కేల? యిప్పాటినోములు తొల్లి
కడఁగి నోఁచితిని గా కేమి' యనుచును గందె డెందమున. 103

ప్రతిపదార్థం: పుట్టిననాఁడు+అ= పుట్టిననాడే; తడయక= ఆలస్యంకాక; తల్లిచేన్, తండ్రిచేన్= తల్లిచేత (మేనకచేత), తండ్రిచేత (విశ్వామిత్రుడిచేత) విడువఁబడితిన్= వదలివేయబడినాను; ఇప్పుడు; పతిచేతను= భర్తచేతకూడ; విడువఁబడియెదన్+ఒక్కొ=

వదలబడతానో ఏమో!; ఇంకన్+ఏల= మరింకెందుకు; నుడువులు, వేయున్= వేయి(పెక్కు)మాటలు; ఈ+పాటి, నోములు= ఇంతటి (ఫలాన్ని ఇచ్చే) నోములు పూజలు; తొల్లి= పూర్వం; కడఁగి= పూనుకొని; నోచితిని, కాక+ఏమి= నోచాను కాబోలు; అనుచును; డెందమునన్= హృదయంలో; కందెన్= దుఃఖించింది, బాధపడింది.

తాత్పర్యం: 'పుట్టిననాడే వెంటనే తల్లిదండ్రులచేత ఆ నాడు విడువబడినాను. ఇప్పుడు భర్తచేతకూడ విడువబడతాను కాబోలు; ఇక వేయి(పెక్కు)మాట లాడట మెందుకు? పూర్వం ఇటువంటి కొరనోములే నోచాను కాబోలు. అని శకుంతల మనసులో బాధపడింది.

విశేషం: మధ్యాక్కర పాదంలో వరుసగా రెండు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం, రెండు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం ఉంటాయి. నన్నయ అయిదవ గణం మొదటి అక్షరంతో యతి పాటించాడు. ప్రాస నియమం ఉన్నది. ఈపద్యంలో ఒక్క 'పతి' అనే శబ్దం తప్ప మిగిలిన వన్నీ తెలుగు మాటలే. శోకభావాని కనుగుణమైన వృత్తాన్ని, రచనను, వాక్యాలను ఇందులో నన్నయ ప్రయోగించాడు.

వ. ఇట్లు దద్దయు దుఃఖించి విగతాశయై బోరనఁదొరఁగు బాష్పజలంబు లందంద యొత్తికొనుచు 'నింక దైవంబ కాని యొండు శరణంబు లేదని యప్పరమ పతివ్రత తనయుందోడ్కొనిక్రమ్మఱిపోవ నున్న యవసరంబున. 104

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; తద్దయున్= మిక్కిలి; దుఃఖించి= ఏడ్చి; విగత+ఆశ+ఐ= వదలబడిన ఆశలు కలదై; బోరనన్= ఎడతెరపిలేకుండ; తొరఁగు= కారు; బాష్పజలంబులు= కన్నీళ్ళు; అందు+అందు+అ= అక్కడికక్కడే; ఒత్తికొనుచున్= చెంగుతోఅద్దుకొంటూ; ఇంకన్= ఇకపై; దైవంబు+అ, కాని= దేవుడే తప్ప; ఒండు, శరణంబు, లేదు+అని= మరొకదిక్కు లేదని; ఆ+పరమపతివ్రత= ఆ గొప్ప ఇల్లాలు; తనయున్+తోడ్కొని= కొడుకును వెంటబెట్టుకొని; క్రమ్మఱిపోవన్+ఉన్న, అవసరంబునన్= తిరిగిపోబోతున్న సమయంలో.

తాత్పర్యం: ఈవిధంగా మిక్కిలి యేడ్చి, ఆశలు వదలుకొని, ఎడతెరపిలేకుండ కారే కన్నీళ్ళను అప్పుడప్పుడు ఒత్తుకొంటూ, ఇకపై నాకు దైవమే శరణ్యమని భావించి, ఆ ఉత్తమపతివ్రత కొడుకును వెంటబెట్టుకొని తిరిగిపోబోతున్న సమయంలో.

విశేషం: 'అన్యథా శరణం నాస్తిత్వమేవ శరణం మమ' వంటి భక్తిభావం శకుంతల ప్రదర్శిస్తున్నది కాబట్టి దైవరక్షణం కలుగుతుందని భావికథార్థధ్వని.

దివ్యవాణి నాకర్ణించి దుష్యంతుఁడు శకుంతలను గ్రహించుట (సం. 1-69-28)

చ. 'గొనకొని వీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు; సే
కొని భరియింపు మీతని; శకుంతల సత్యము వల్కె, సాధ్వి, స
ద్వినుత, మహాపతివ్రత వివేకముతో' నని దివ్యవాణి దా
వినిచె ధరాధినాథునకు విస్మయ మందఁగఁ దత్సభాసదుల్. 105

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: గొనకొని= అతిశయించి; వీఁడు= ఇతఁడు (భరతుడు); నీకును, శకుంతలకున్, ప్రియనందనుండు= నీకూ శకుంతలకూ (పుట్టిన) ముద్దుబిడ్డడు; ఈతనిన్= ఈపుత్రుడిని; చేకొని= స్వీకరించి; భరియింపుము= పోషించుము; సాధ్వి= ఇల్లాలు; సత్+వినుత= ఉత్తములచేత కీర్తింపబడినట్టి; మహాపతివ్రత= గొప్పపతివ్రత; (అయిన) శకుంతల; వివేకముతోన్= తెలివితో; సత్యము, పల్కెన్= నిజం చెప్పింది (గసడదవాదేశం); అని; తద్, సభా+ఆసదుల్= ఆ సభలో ఉన్నవారు; విస్మయము+అందఁగన్= ఆశ్చర్యపడగా; దివ్యవాణి= దేవతాసంబంధమైన వాణి, ఆకాశవాణి; ధరా+అధినాథునకున్= భూపతికి, రాజుకు (దుష్యంతుడికి); వినిచెన్= వినిపించింది.

తాత్పర్యం: 'ఈభరతుడు నీకూ శకుంతలకూ మిక్కిలి ముద్దుబిడ్డడు. ఈతనిని స్వీకరించి, పోషించుము. ఇల్లాలు, ఉత్తమకీర్తి కలిగింది, మహాపతివ్రత అయిన శకుంతల వివేకంతో నిజం చెప్పింది' - అని ఆకాశవాణి ఆ సభలోనివారు విని ఆశ్చర్యపడేటట్లు రాజుకు వినిపించింది. (ప్రకటించింది).

విశేషం: కథానిర్వహణంలో అంతంలో అద్భుతరసం ఉండాలని లక్షణవాక్యం. సభాసదులు విస్మయ మందేటట్లు ఆకాశవాణి పలకటంవలన అది సిద్ధించింది. ఇందులో స్వతస్సిద్ధంగా ఏర్పడిన అర్థశక్తివలన కలిగిన వస్తువు చేసే వస్తుధ్వని (స్వతస్సంభవ్యర్థ శక్త్యుద్భవ వస్తుకృత వస్తుధ్వని) ఉన్నది. 'ఏ నెట? నీ వెట? సుతు డెట? ఏ నెన్నఁడు తొల్లి చూచి యెఱుఁగను నిన్నున్' - అన్న దుష్యంతుడి మాటలకు పరోక్ష సమాధానం దివ్యవాణి సాక్ష్యం. పురుషుడి వృత్తాన్ని గమనిస్తూ ఉండే మహాపదార్థాలలో శబ్దగుణం కలిగిన ఆకాశం సాక్ష్యం పలకటం అద్భుతం. ఔచిత్యం. అమూర్తమైన ఆకాశవాణికి మానవీకరణం వస్తుకళావిశేషం. 'గొనకొని వీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు' అనే వాక్యంలో దుష్యంతుడి ఆక్షేపాలన్నీ నిరాకరింపబడ్డాయి. తల్లిదండ్రులకు ప్రియనందనుడు భరతుడు అని పేర్కొనటంలో శకుంతలకు వలెనే దుష్యంతుడికికూడా భరతుడు ప్రీతిపాత్రుడే అయినా రాజు కావాలని ఆ సత్యాన్ని దాస్తున్నాడని ధ్వని. 'కొడుకును స్వీకరింపు' మనేది ధర్మప్రబోధం. 'శకుంతల సత్యం చెప్పింది' అనటంలో దుష్యంతుడు అబద్ధం చెప్పాడని తేలిన తాత్పర్యం. శకుంతల వివేకవతి. ఆమె తన ఉపన్యాసంలో క్రమంగా గృహిణి గొప్పతనాన్ని చెప్పి సాధ్వి అనిపించుకొన్నది. చక్రవర్తికాబోయే కొడుకు గొప్పతనాన్ని వివరించి సద్వినుత అనిపించుకొన్నది. దుష్యంతుడిని ఇంత సుకుమారంగా మందలించి సత్యాన్ని ప్రతిష్ఠాపించిన ఆకాశవాణి మాటలుకూర్చిన ఈరచనలో సౌకుమార్య మనే శబ్దగుణం సార్థకంగా పోషింపబడింది. పరుషవాక్యాలతో తిరస్కరించిన దుష్యంతుడికి దివ్యవాణి సుకుమారంగా ధర్మాన్ని నిర్దేశించింది. దానిని వస్తుధ్వనితో నిర్వహించటం నన్నయ రచనాశిల్పం.

వ. **ఇట్లెల్లవారలకు నతిహర్షంబుగా శకుంతల పతివ్రతాత్వంబును సత్యంబును భరతోత్పత్తియుఁ బ్రశంసించు వేలుపుల పలుకు లతివ్యక్తంబు లయి యాకాశంబువలన వీతెంచిన విని దుష్యంతుండు సభాసదులు విన ని ట్లనియె.** **106**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; అతి, హర్షంబుగాన్= మిక్కిలి సంతోషంతో; శకుంతల, పతివ్రతాత్వంబును= శకుంతలయొక్క పాతివ్రత్యాన్ని గురించి; సత్యంబును= సత్యాన్ని గురించి; భరత+ఉత్పత్తియున్= భరతునియొక్క పుట్టుకను గురించి; ప్రశంసించు, వేలుపుల, పలుకులు= కీర్తించే దేవతల మాటలు; అతి, వ్యక్తంబులు+అయి= మిక్కిలి స్పష్టంగా; ఆకాశంబువలనన్= ఆకాశంనుండి; వీతెంచినన్= రాగా; దుష్యంతుండు; విని; సభాసదులు; వినన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా శకుంతల పాతివ్రత్యాన్ని గురించి, సత్యాన్ని గురించి, భరతుడి పుట్టుకను గురించి మిక్కిలి సంతోషంతో కీర్తించే దేవతలమాటలు, విస్పష్టంగా ఆకాశంనుండి వెలువడగా దుష్యంతుడు విని సభాసదులతో ఈవిధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఆకాశవాణితోపాటు దేవతల మాటలు వినబడటం ఈ కథలోని విశేషం. అపూర్వంకూడా, గృహస్థాశ్రమ వ్యవస్థలో ఇల్లాలు, కొడుకు, సత్యం అనే అంశాలు యజమానుడు (గృహస్థుడు) అనే ఒక్కరిచేత వంచింపబడితే ధార్మికంగా, ఆధ్యాత్మికంగా ప్రకృతిలో ఎంత సంక్షోభం కలుగుతుందో ఈ సన్నివేశంలో నన్నయ వస్తుధ్వని నాశ్రయించి ప్రపంచించాడు. దేవతలు శకుంతలను, భరతుడిని, సత్యాన్ని గురించి ప్రశంసించిన వాక్యాలు సభలో ఉన్నవారందరికీ హర్షాతిశయం కలిగించినట్లు నన్నయ పేర్కొనటంతో అంతటి నిండుసభలో దుష్యంతు డొక్కడే దోషిగా మిగిలిపోయాడని చెప్పక తెలుస్తున్న విశేషం. ఈ ముగింపు ఎంత గొప్పగా ఉన్నది! 'ధర్మో రక్షతి రక్షితః' అన్న వేదోక్తి సార్థక మైనది.

తే. ఏను నీ యింతియును గాని యెఱుఁగ రన్యు। లర్థిఁ గణ్వమహాముని యాశ్రమంబు
నందు గాంధర్వవిధి వివాహమునఁ గరము। నెమ్మిఁ జేసిన దీని పాణిగ్రహణము. 107

ప్రతిపదార్థం: అర్థిన్= కోర్కెతో; కణ్వ, మహత్+ముని, ఆశ్రమంబునందున్; గాంధర్వ, విధిన్, వివాహమునన్= గాంధర్వ పద్ధతిలో చేసికొనే పెండ్లి; కరమున్, నెమ్మిన్= మిక్కిలి ప్రీతితో; చేసిన, దీని, పాణిగ్రహణము= చేసికొన్న ఈమెతోడి వివాహం; ఏనున్= నేనున్నూ (దుష్యంతుడున్నూ); ఈ+ఇంతియునున్= ఈ వనిత (శకుంతల) యున్నూ; కాని= తప్ప; అన్యులు= ఇతరులు; ఎఱుఁగరు= తెలియరు. (ఇతరులకు తెలియదని భావం).

తాత్పర్యం: అలనాడు కోరి కోరి కణ్వమహర్షి ఆశ్రమంలో గాంధర్వవివాహపద్ధతి నాశ్రయించి ఈమెను మిక్కిలి ప్రీతితో చేసికొన్నవివాహం నాకూ ఈమెకూ తప్ప ఇతరుల కెవ్వరికి తెలియదు.

తే. అన్యు లెఱుఁగమిఁ జేసి లోకాపవాద। భీతి నెఱింగియు నిత్తన్విఁ బ్రీతి దప్పి
యెఱుఁగ నంటిని నిందఱ కిప్డు డెఱుఁగఁ। జెప్పె నాకాశవాణి యచ్చెరువు గాఁగ. 108

ప్రతిపదార్థం: అన్యులు= ఇతరులు; ఎఱుఁగమిన్, చేసి= ఎరుగకపోవటంచేత; లోక+అపవాద, భీతిన్= లోకనిందవలని భయంచేత; ఈ+తన్విన్= ఈవనితను; ఎఱింగియున్= తెలిసియుండికూడ; ప్రీతి, తప్పి= ఆప్యాయత లేకుండ; ఎఱుఁగను, అంటిని= నాకు తెలియదన్నాను; ఇందఱకున్= ఇంతమందికి; ఇప్పుడు= ఈక్షణంలో; ఆకాశవాణి; అచ్చెరువు, కాఁగన్= అబ్బురపాటు కలిగేటట్లు; ఎఱుఁగన్, చెప్పెన్= తెలియచెప్పింది.

తాత్పర్యం: ఇతరుల కెవ్వరికీ తెలియదు కాబట్టి లోకనింద కలుగునేమో అన్నభయంతో నా కీమె తెలిసిఉన్నప్పటికీ కఠినంగా 'ఈమె నాకు తెలియదు' అన్నాను. కాని, ఇప్పుడు అందరికీ తెలిసేటట్లు అద్భుతంగా ఆకాశవాణి ప్రకటించింది.

విశేషం: దుష్యంతుడు నిజాన్ని బయటపెట్టాడు. కళంకాన్ని కడిగివేసికొన్నాడు. అతడి వర్తనంవలన శకుంతలా మాహాత్మ్యం ధ్వనింపజేయబడింది.

వ. అని మహానురాగంబునం గొడుకు నెత్తికొని హర్షపులక లెసఁగ నాలింగనంబు సేసి, శకుంతలా మహాదేవి నతిప్రణయగౌరవంబునసంభావించి, యౌవరాజ్యంబునకు భరతు నభిషిక్తుంజేసి. పెద్దకాలంబు రాజ్యసుఖంబు లనుభవించి, తన రాజ్యభారం బంతయు భరతుం బూన్చి, దుష్యంతుండు తపోవనంబున కరిగిన. 109

ప్రతిపదార్థం: అని= అని పలికి; దుష్యంతుండు; మహత్+అనురాగంబునన్= మిక్కిలి ప్రేమతో; కొడుకున్= కుమారుడిని ప్రేమాతిశయంతో (భరతుడిని); ఎత్తికొని; హర్ష, పులకలు+ఎసఁగన్= సంతోషంతో కూడిన గగుర్పాటు కలుగగా; ఆలింగనంబు, చేసి= కౌగిలించుకొని; శకుంతలా, మహాదేవిన్= పట్టమహిషి అయిన శకుంతలను; అతి, ప్రణయ, గౌరవంబునన్= మిక్కిలి వలపు యొక్క గురుత్వంతో; సంభావించి= సమ్మానించి; భరతున్= భరతుడిని; యౌవరాజ్యంబునకున్, అభిషిక్తున్, చేసి= యౌవరాజ్యపదవిలో అభిషేకం చేసి; పెద్దకాలంబు= చాలకాలం; రాజ్య, సుఖంబులు= రాజ్యంవలని భోగాలు; అనుభవించి= పొంది; తన, రాజ్యభారంబు+అంతయున్; భరతున్+పూన్చి= భరతుడు వహించేటట్లు చేసి; తపోవనంబునకున్+అరిగినన్= తపస్సుకు అనువైన అరణ్యానికి పోగా.

తాత్పర్యం: అని పలికి దుష్యంతుడు అమితప్రేమతో కొడుకును ఎత్తుకొని సంతోషంతో కలిగిన పులకలతో కౌగిలించుకొని, పట్టమహిషి అయిన శకుంతలను మిక్కిలి ప్రణయగౌరవంతో సమ్మానించి, భరతుడిని యౌవరాజ్యపదవిలో అభిషేకించి, చాలకాలం రాజ్యసుఖాలు అనుభవించి, తన రాజ్యభారా న్నంతా భరతుడికి అప్పగించి, తాను తపోవనానికి పోగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం - అని ఆశ్రమాలు నాలుగు. అందులో దుష్యంతుడు గార్హస్థ్యాశ్రమాన్ని నిర్వహించి వానప్రస్థం స్వీకరించాడు. బహుకాలం వనంలో తపస్సు చేసికొంటూ ఉండే ఆశ్రమం వానప్రస్థం. కథను ముగించటంలో కమనీయశిల్పం ఉన్నది ఇక్కడ. యజమానుడు మొదట సత్యాన్ని అంగీకరించి గృహస్థధర్మానికి మూలమైన శక్తిని రక్షించాడు. ఆమీద 'పుత్రగాత్రపరిష్వంగసుఖాన్ని' అనుభవించి దీపంవలన వెలిగిన దీపంవంటి అద్వైతానుభవంతో స్పర్శజ్ఞానంవలన కలిగిన పులకలతో పుత్రమహిమను చవి చూచాడు. గార్హపత్యాగ్ని ఆహవనీయంలో ప్రజ్వలించటానికి కారకురాలైన ఇల్లాలిని సంభావించాడు. ఇప్పటికి గృహస్థధర్మపీఠం నాలుగుకాళ్ళమీద నిలబడింది. భరతుడికి యౌవరాజ్యాభిషేకం చేసి సత్యవాక్యస్థాపనం చేసి, మిగిలిన ఆశ్రమధర్మాలను దుష్యంతుడు అనుసరించి సమగ్రజీవితాన్ని సాగించాడు.

చ. **భరతుఁ డశేష భూభువనభార ధురంధరుఁ డై వసుంధరం**
బరఁగి, యనేక యాగములఁ బాయక భాస్కర జహ్నుకన్యకా
సురుచిర తీరదేశముల సువ్రతుఁడై యొనరించి, భూరిభూ
సురులకు నిచ్చె దక్షిణలు శుద్ధసువర్ణ గవాశ్వహస్తులన్. **110**

ప్రతిపదార్థం: భరతుఁడు అశేష, భూభువన, భార, ధురంధరుఁడు+ఐ= అపార మైన సామ్రాజ్యంయొక్క బాధ్యతను వహించగలిగినవాడై; వసుంధరన్, పరఁగి= భూమిపై ప్రసిద్ధి వహించి; భాస్కర, జహ్నుకన్యకా= సూర్యుడిపుత్రిక అయిన యమునానదియొక్కయు, జహ్నుమహర్షి పుత్రిక (చెవిలోనుండి వెలువడటంచేత) అయిన గంగానదియొక్కయు; సురుచిర, తీర, దేశములన్= అందమైన తీర ప్రాంతాలలో; సు, వ్రతుఁడు+ఐ= ఉత్తమదీక్ష పొందినవాడై; అనేక, యాగములన్= పెక్కు యజ్ఞాలను; పాయక= వీడక, ఆసక్తితోన్; ఒనరించి= చేసి; దక్షిణలు= ద్రవ్యరూపంగా ఇచ్చే కానుకలనూ; శుద్ధ, సువర్ణ, గో+అశ్వ, హస్తులన్= మేలిమిబంగారాన్నీ, గోవులనూ, గుఱ్ఱాలనూ, ఏనుగులనూ; భూరి, భూసురులకున్, ఇచ్చెన్= అధికసంఖ్యలోగల బ్రాహ్మణులకు దానంచేశాడు.

తాత్పర్యం: భరతుడు అపార మైన సామ్రాజ్యభారాన్ని వహించి, లోకంలో ప్రసిద్ధి కెక్కి, గంగాయమునా నదీ పవిత్రతీరప్రాంతాలలో దీక్షతో అనేక యజ్ఞాలను ఆసక్తితో చేసి బ్రాహ్మణులకు అధికంగా దక్షిణలను, మేలిమి బంగారాన్నీ, గోవులనూ, గుఱ్ఱాలనూ, ఏనుగులనూ దానంచేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భరతవంశక్రమము (సం. 1-90-34)

వ. మఱియు నతీతానాగతు లైన నిజవంశంబున రాజులకెల్ల వంశకర్త యయ్యె; నట్టి భరతునకుఁ గైకేయి యైన సునందకు భుమన్యుండు పుట్టె; వానికి దాశార్హపుత్త్రి యైన విజయకు సుహోత్రుండు పుట్టె; వానికి నిక్ష్వాకు కన్యయైన సువర్ణకు హస్తి పుట్టె; నతనిపేరం గౌరవ్య రాజధాని యైన నగరంబు హస్తిపురంబునాఁ బరఁగె; నట్టి హస్తికిం ద్రిగర్తరాజపుత్త్రి యైన యశోధరకు వికుంఠనుండు పుట్టె; వానికి దాశార్హపుత్త్రి యైన వసుదేవకు నజమీఢుండు పుట్టె; నయ్యజమీఢునకుఁ గైకేయియు గాంధారియు ఋక్షయు నను మువ్వురు స్త్రీలకు.111

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: అంతేకాక, తనవంశంలో పూర్వం ఉండిన, భవిష్యత్తులో పుట్టే రాజుల కందరికీ వంశకర్త అయినాడు. అటువంటి భరతుడికీ కేకయరాజపుత్రిక అయిన సునందకూ భుమన్యుడు పుట్టాడు. అతడికీ దాశార్హుడి కూతురైన విజయకూ సుహోత్రుడు జన్మించాడు. అతడికీ ఇక్ష్వాకుడి పుత్రిక అయిన సువర్ణకూ హస్తి అనేవాడు పుట్టాడు. అతడిపేరుమీద కౌరవుల రాజధాని అయిన నగరం 'హస్తిపురం' అనగా ఒప్పారింది. ఆ హస్తికీ త్రిగర్తరాజుయొక్క కుమార్తె అయిన యశోధరకూ వికుంఠనుడు పుట్టాడు. అతడికీ దాశార్హరాజు పుత్రిక అయిన వసుదేవకూ అజమీఢుడు జన్మించాడు. ఆ అజమీఢుడికీ కైకేయి, గాంధారి, ఋక్ష అనే ముగ్గురు స్త్రీలకూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

**క. బలయుతులు నూటయిరువది । నలువురు సుతు లుద్భవిల్లి నానాదేశం
బులకుఁ బతు లైరి; మఱి వా । రలలో సంవరణుఁ డఖిలరాజ్యోన్నతుఁ డై. 112**

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: బలవంతు లైన నూట ఇరవైనలుగురు (124) కొడుకులు పుట్టి వివిధ దేశాలకు రాజు లైనారు. మఱి, వారందరిలో సంవరణుడు సమస్తరాజ్యాలలోనూ శ్రేష్ఠుడై.

**క. అనఘుఁడు పౌరవకుల వ । ర్ధనుఁ డద్దినవాథ తనయఁ దపతి వివాహం
బొనరఁగ నయ్యె; నిరువుర । కును వంశకరుండు పుట్టెఁ గురుఁ డున్నతుఁడై. 113**

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: పుణ్యాత్ముడూ, పౌరకులాన్ని వృద్ధిచెందించేవాడూ అయిన సంవరణుడు సూర్యుడి కుమార్తె అయిన తపతిని యోగ్యంగా వివాహం చేసికొన్నాడు. వారిరువురికి వంశకర్త అయిన కురుడు శ్రేష్ఠుడై పుట్టాడు.

వ. వానిపేరం గురుక్షేత్రంబునాఁ బరఁగె; నట్టి కురునకు దాశార్హియైన శుభాంగికిని విధూరథుండు పుట్టె; వానికి మాగధి యయిన సంప్రియకు ననశ్వుండు పుట్టె; నయ్యనశ్వునకు మాగధి యైన యమృతకుం బరీక్షితుండు పుట్టె; వానికి బహుదానసుత యైన సుయశకు భీమసేనుండు పుట్టె; వానికిం గైకేయి యైన కుమారికిఁ బ్రదీపుఁడు (బర్యశ్రవసుండు) పుట్టె; వానికిఁబ్రతీపుండు పుట్టెఁ; బ్రతీపునకు శిబిపుత్త్రియయిన సునందకు

దేవాపి శంతనుబాహ్లికు లనఁగా ముప్వురు పుట్టి; రందు దేవాపి బాల్యంబునంద తపోవనంబున కరిగిన శంతనుండు రాజయ్యెః; వానికి గంగాదేవికి దేవవ్రతుం డైన భీష్ముండు పుట్టె; మఱియు శంతనునకు యోజనగంధి యయిన సత్యవతికిం జిత్రాంగద విచిత్రవీర్యు లనంగా నిద్దఱుగొడుకులు పుట్టి; రందుఁ జిత్రాంగదుండు బాల్యంబున గంధర్వనిహతుండయిన, వానికింగొండుకవానివిచిత్రవీర్యురాజ్యాభిషిక్తుంజేసి భీష్ముండు కాశీరాజదుహితల నంబికాంబాలిక లనువారి నిద్దఱ విచిత్రవీర్యునకు వివాహంబు సేసిన. 114

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: అతడి పేరుమీద కురుక్షేత్ర మని పిలువబడింది. అటువంటి కురునకూ దాశార్హరాజపుత్రి అయిన శుభాంగికీ విదూరథుడు పుట్టాడు. అతడికీ మగధరాజు కుమార్తె అయిన సంప్రియకూ అనశ్వుడు పుట్టాడు. ఆ అనశ్వుడికీ మగధరాజకన్య అయిన అమృతకూ పరీక్షితుడు పుట్టాడు. వాడికీ బహుదానుడి కూతురైన సుయశకూ భీమసేనుడు పుట్టాడు. అతడికీ కేకయరాజపుత్రి అయిన కుమారికీ ప్రదీపుడు (పర్యశ్రవసుడు) పుట్టాడు. అతడికి ప్రతీపుడు పుట్టాడు. ప్రతీపుడికీ శిబికుమార్తె అయిన సునందకూ దేవాపి శంతనుడు బాహ్లికుడు అనే పేర్లు గల ముగ్గురు పుట్టారు. వారిలో దేవాపి బాల్యంలోనే తపోవనానికి వెళ్ళగా శంతనుడు రాజైనాడు. అతడికినీ గంగాదేవికినీ దేవవ్రతుడైన భీష్ముడు పుట్టాడు. అంతేకాక శంతనుడికీ యోజనగంధి అని పిలువబడే సత్యవతికీ చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అనే ఇద్దరు కొడుకులు పుట్టారు. వారిలో చిత్రాంగదుడు చిన్నతనంలోనే గంధర్వుడిచేత చంపబడటంచేత చిన్నవాడైన విచిత్రవీర్యుడిని రాజ్యాభిషిక్తుడిగా చేసి భీష్ముడు కాశీరాజుకుమార్తెలను అంబిక, అంబాలిక అనేవారిని ఇద్దరనిచ్చి వివాహంచేయగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. **అతిశయరూపయౌవన గుణాధిక సుందర మైన యాసతీ**
ద్వితయమునందు సంతతరతిన్ వివశుం డయి రాజకృత్యముల్
మతి నొకనాఁడుఁ జేయ కహిమద్యుతితేజుఁడు రాజయక్ష్మబా
ధితుఁడయి దేవలోకసుదతీప్రియుఁ డయ్యె విచిత్రవీర్యుఁడున్. 115

ప్రతిపదార్థం: అహిమద్యుతి, తేజుఁడు= సూర్యకాంతివంటిప్రకాశంకలవాడైన; విచిత్రవీర్యుఁడున్= విచిత్రవీర్యుడుకూడ; అతిశయ, రూప, యౌవన, గుణ+అధిక, సుందరము+ఐన= అత్యంతం రూపంచేతను, వయసుచేతను, గుణాలయొక్క, ఆధిక్యంచేతను అందమైన; ఆ సతీద్వితయమునందున్= ఆభార్య లిరువురియందు; సంతత, రతిన్= విరామం లేని రతి (క్రీడ)భావానికి; వివశుండు+అయి= లోనైనవాడై; రాజకృత్యముల్= రాజుచేయవలసిన విధులను; మతిన్= బుద్ధితో; ఒకనాఁడున్+చేయక= ఒకరోజుకూడ చేయక; రాజయక్ష్మ, బాధితుఁడు+అయి= క్షయరోగపీడితుడయి; దేవలోక, సుదతీ, ప్రియుఁడు+అయ్యెన్= దేవలోకవనితలకు ప్రీతిపాత్రుడైనాడు, అంటే - మరణించా డని భావం. (పుణ్యంచేసినవారు చనిపోయిన తరువాత స్వర్గలోకం చేరి రంభాది దేవవనితలతో క్రీడిస్తారని ప్రతీతి).

తాత్పర్యం: సూర్యప్రకాశుడైన విచిత్రవీర్యుడు రూపంలోనూ, యౌవనంలోనూ గుణాలలోనూ అత్యంతసుందరులైన ఆ భార్య లిరువురియందును నిరంతరరతిభావానికి వశుడై, రాజవిధులనుగురించి యెన్నడూ మనసుకు పట్టించుకొనక క్షయరోగ పీడితుడై స్వర్గస్థుడైనాడు.

విశేషం: విచిత్రవీర్యుడి నిరంతర కామప్రవృత్తిని ఓజోగుణమిశ్రిత మైన మాధుర్యగుణం కల రచనతో నన్నయ రక్తికట్టించాడు. మాధుర్యంతో ఉక్తివైచిత్ర్యం మెరుస్తూ ఉండాలి. దానిని కవిప్రౌఢోక్తితో నన్నయ సాధించాడు. ఇద్దరు భార్యలతో నిరంతర రతి సాగించి క్షయరోగానికి గురిఅయి విచిత్రవీర్యుడు మృతుడైనా డనటానికి బదులుగా దేవలోకసుదతీప్రియుడైనా డనటం కవి ప్రౌఢోక్తి. ఇందులో పర్యాయోక్త్యలంకారం స్ఫురిస్తున్నది. చెప్పేదానిని సూటిగా కాకుండా భంగ్యంతరంగా చెప్పటం పర్యాయోక్తం. అట్లా చెప్పటంవలన విచిత్రవీర్యుడు చనిపోయికూడా దేవలోక సుదతీ భోగాన్ని కామపురుషార్థఫలంగా అనుభవిస్తున్నాడన్న వ్యంగ్యార్థం ప్రతీయమానం అవుతున్నది. ఇది ప్రౌఢోక్తి. రతివివశత్వం వలన విచిత్రవీర్యుడి రాజధర్మ ప్రవృత్తికి క్షయం కలిగింది. అతడి రుగ్మతకూడ క్షయవ్యాధియే. అతడి కామప్రవృత్తివలన అతడి దేహక్షతియే కాకుండా ధర్మక్షతి, వంశక్షతి అయింది. వంశంలో ఏర్పడిన మహాప్రళయ మది. సంతానవిచ్ఛేద మయ్యే ఆ దారుణ ఫలితానికి కారణమైన సంతతరతి రాజులకు తగదని కావ్యోపదేశం. దానిని నన్నయ కవిప్రౌఢోక్తిచేత సిద్ధమైన వస్తువుచేత కలిగే వస్తుధ్వనిగా రచనలో నిబంధించాడు. కవిప్రౌఢోక్తిసిద్ధ వస్తుకృతవస్తుధ్వని అనబడే ఈ రచనాశిల్పం నన్నయ పెక్కుచోట్ల ప్రదర్శించాడు. అందువలననే నన్నయది ధ్వనిప్రస్థాన మనీ, అందులో వస్తుధ్వని ఆయన మార్గమనీ పేర్కొనటం.

క. **అంత దౌష్యంతి సంతానవిచ్ఛేదంబు గావచ్చిన సత్యవతీనియుక్తుండై సకలధర్మమూర్తి కృష్ణద్వైపాయనుండు దేవరన్యాయంబున నంబికయందు ధృతరాష్ట్రుని, నంబాలికయందుఁ బాండురాజును నంబికాపరిచారిక యందు విదురునిం బుట్టించిన; నందు ధృతరాష్ట్రునకు గాంధారికి వ్యాసవరప్రసాదంబున దుర్యోధనుండాదిగా నూర్వురు గొడుకులు పుట్టిరి. పాండురాజు నియోగంబునఁ గుంతీమాద్రులకు ధర్మానిలశక్రాశ్వినుల ప్రసాదంబున ధర్మజభీమార్జున నకులసహదేవు లనంగా నేవురుకొడుకులు పుట్టి; రయ్యేవురకుం బాంచాలి ధర్మపత్నియయ్యె;దానియందు ధర్మరాజునకుఁబ్రతివింధ్యుండును, భీమసేనునకు శుత్రసోముండును, నర్జునునకు శ్రుతకీర్తియు, నకులునకు శతానీకుండును, సహదేవునకు శ్రుతసేనుండును ననఁ బంచోపపాండవులు పుట్టిరి; మఱి ధర్మరాజునకు స్వయంవర లబ్ధ యైన దేవికయనుదానికి యౌధేయుండు పుట్టె; భీమసేనునకు జరంధరకు సర్వగుండు పుట్టె; నర్జునునకు సుభద్రకు నభిమన్యుండు పుట్టె; నకులునకుఁ జైద్యయయిన కరేణుమతికి నిరమిత్రుండు పుట్టె; సహదేవునకు స్వయంవరలబ్ధయైన విజయకు సుహోత్రుండు పుట్టె; మఱియుభీమసేనునకు హిడింబకుఘటోత్కచుండు పుట్టె; నిప్పాటంబాండవ పుత్త్రులైన పదునొక్కండ్రయందును వంశకరుం డైన యభిమన్యునకు విరాటపుత్త్రి యయిన యుత్తరకుం బరీక్షితుండు పుట్టె.** **116**

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: అప్పుడు భరతవంశం విచ్ఛేదం అయ్యే స్థితికి రాగా సత్యవతిచేత నియోగింపబడి సమస్తధర్మమూర్తి అయిన వ్యాసుడు దేవరన్యాయంతో అంబికయందు ధృతరాష్ట్రుడినీ, అంబాలికయందు పాండురాజునూ, అంబికయొక్క చెలికత్తెయందు విదురుడినీ పుట్టించాడు. వారిలో ధృతరాష్ట్రుడికీ, గాంధారికీ వ్యాసుడివరంవలన దుర్యోధనుడు మొదలుకొని వందమంది కొడుకులు పుట్టారు. పాండురాజు నియోగించగా కుంతీమాద్రులకు యమధర్మరాజు, వాయువు, ఇంద్రుడు, అశ్వినీదేవతల దయవలన క్రమంగా ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులసహదేవులు అనబడే అయిదుగురు కొడుకులు పుట్టారు. ఆ అయిదుమందికి పాంచాలి భార్య అయింది. ఆమెయందు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మరాజుకు ప్రతివింధ్యుడూ, భీమసేనుడికి శ్రుతసోముడూ, అర్జునుడికి శ్రుతకీర్తియూ, నకులుడికి శతానీకుడూ, సహదేవుడికి శ్రుతసేనుడూ, పంచ ఉపపాండవులు అనబడేవారు పుట్టారు. ఇంకనూ, ధర్మరాజుకు స్వయంవరంలో లభించిన దేవిక అనేదానికీ యౌధేయుడు పుట్టాడు. భీమసేనుడికి జరంధరవలన సర్వగుడు పుట్టాడు. అర్జునుడికీ సుభద్రకూ అభిమన్యుడు పుట్టాడు. నకులుడికీ చేది వంశజురాలైన కరేణుమతికీ నిరమిత్రుడు పుట్టాడు. సహదేవుడికీ స్వయంవరంలో లభించిన విజయకూ సుహోత్రుడు పుట్టాడు. అంతేకాక, భీమసేనుడికీ హిడింబకూ ఘటోత్కచుడు పుట్టాడు. ఈ విధంగా పాండవులయొక్క పుత్రులైన పదకొండుమందిలోనూ వంశాన్ని నిలిపినవాడు అభిమన్యుడు. అతడికీ విరాటరాజపుత్రి అయిన ఉత్తరకూ పరీక్షితుడు పుట్టాడు.

విశేషం: దేవరుడనగా మగని తోబుట్టువు. రాజకుటుంబాలలో రాజ్యానికి వారసులు కాదగిన రాణికి మగనివలన సంతానం కలుగనప్పుడు బావగారి వలననో, మఱదివలననో సంతానం పొందడం దేవరన్యాయం. విచిత్రవీర్యుడు, చిత్రాంగదుడు సంతాన రహితులు కాగా, వారల అన్నయైన దేవరుడైన వ్యాసుడు ధృతరాష్ట్ర పాండురాజులను కన్నాడు.

క. అతనికి ననంత పుణ్యా । న్వితయనఁదగు మాద్రవతికి నీ వఖిలజగ
న్నుత! జనమేజయ! పుట్టితి । ధృతిఁ బాండవవంశమునకుఁ దేజం బెసఁగన్. 117

ప్రతిపదార్థం: అతనికిన్= పరీక్షితుడికి; అనంత, పుణ్య+అన్విత, అనన్, తగు, మాద్రవతికిన్= అపారపుణ్యంతో కూడినది (పుణ్యవతి) అని ప్రసిద్ధిచెందిన మాద్రవతికి; అఖిల, జగత్+నుత= సమస్తలోకాలచేత కీర్తింపబడువాడా!; జనమేజయ= జనమేజయుడా!; పాండవ, వంశమునకున్= పాండురాజు పేరుమీద ప్రసిద్ధమైన వంశానికి; ధృతిన్= స్థిరంగా; తేజంబు+ఎసఁగన్= వన్నె కలుగగా; నీవు= నీవు (జనమేజయుడు); పుట్టితి (వి)= పుట్టావు.

తాత్పర్యం: సమస్తలోకాలచేత కీర్తింపబడే జనమేజయుడా! పాండవవంశానికి స్థిరంగా వన్నె కలిగేటట్లు నీవు పరీక్షితుడికీ పుణ్యవతి అయిన మాద్రవతికీ పుట్టావు.

మ. మఱియు నీకును వపుష్టమకును శతానీక శంకుకర్ణులుపుట్టి; రందు శతానీకునకువైదేహికి నశ్వమేధదత్తుండు పుట్టె. 118

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: కాగా, నీకూ వపుష్టమకూ శతానీకుడు, శంకుకర్ణుడు అనే ఇద్దరు పుత్రులు పుట్టారు. వారిలో శతానీకుడికీ వైదేహి (విదేహరాజపుత్రిక) కీ అశ్వమేధదత్తుడు పుట్టాడు.

క. వీ రైలులుఁ బౌరవులును । భారతులును గౌరవులును బాండవులు ననన్
వీరు లయి పరఁగి; రిది నయ । పారగ! భవదీయవంశ పరిపాటి మహిన్. 119

ప్రతిపదార్థం: వీరు= ఇంతవరకు పేర్కొన్నరాజులు; ఐలులు= ఐలుడువంశకర్తగా కలవారు; పౌరవులును= పురుమహారాజు వంశకర్తగాకలవారు; భారతులును= భరతుడు వంశకర్తగా కలవారు; కౌరవులును= కురుమహారాజు వంశకర్తగాకలవారు; పాండవులున్= పాండుమహారాజు వంశకర్తగా కలవారు; అనన్= అని పిలువబడుతూ; వీరులు+అయి, పరఁగిరి= పరాక్రమవంతులై

ఒప్పారినారు; నయపారగ!= నీతిలో పారం ముట్టినవాడా!; ఇది= పైనచెప్పినవిధం; మహిన్= లోకంలో (భూమిపై); భవదీయ, వంశ, పరిపాటి= నీయొక్క వంశముయొక్క అనుక్రమం, (వంశవృక్షం అని భావం).

తాత్పర్యం: వీరు ఐలులనీ, పౌరవులనీ, భారతులనీ, కౌరవులనీ, పాండవులనీ పిలువబడుతూ వీరులుగా ప్రసిద్ధిచెందారు. ఓ నయకోవిదుడా! ఇది లోకంలో వాసికెక్కిన నీవంశక్రమం.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 120

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: అనగా విని జనమేజయుడు వైశంపాయనుడితో ఈవిధంగా అన్నాడు.

క. నరవరుఁ డగు శంతనున క । మరనదికిని నెట్లు సంగమం బయ్యె మహా
పురుషుండు భీష్ముఁ డె ట్ల । య్యిరువురకును బుట్టె? దీని నెఱిఁగింపు మొగిన్. 121

ప్రతిపదార్థం: నరవరుఁడు+అగు, శంతనునకున్= శ్రేష్ఠుడైన శంతనునకూ; అమర, నదికినిన్= గంగకూ; ఎట్లు, సంగమంబు, అయ్యెన్= ఏవిధంగా సంయోగం అయింది; ఆ+ఇరువురకును= ఆ ఇద్దరికీ; మహత్+పురుషుండు, భీష్ముఁడు= గొప్పవాడైన భీష్ముడు; ఎట్లు; పుట్టెన్= ఏవిధంగా పుట్టాడు?; ఒగిన్= క్రమంగా; దీనిన్= ఈవృత్తాంతాన్ని; ఎఱిఁగింపుము= తెలుపుము

తాత్పర్యం: ఉత్తముడైన శంతనుడికీ గంగకూ పొత్తు ఏవిధంగా కలిగింది? వా రిరువురికీ మహాత్ముడైన భీష్ముడు ఏవిధంగా పుట్టాడు? ఈ వృత్తాంతాన్ని క్రమంగా నాకు తెలుపుము.

గంగా వసువుల సమయము (సం. 1-91-1)

వ. 'మఱి పాండవ ధార్తరాష్ట్ర సంభవంబును సవిస్తరంబుగా వినవలతుం జెప్పు' మనిన వానికి వైశంపాయనుం డి ట్లని చెప్పెఁ; దొల్లి యిక్ష్వాకువంశంబున మహాభిషుం డనువాఁడు పుట్టి మహాధర్మశీలుండై యశ్వమేధసహస్రంబును రాజసూయశతంబునుం జేసి యింద్రాదిదేవతలం దనిపి, దేవలోకంబునకుం జని యందు దేవర్షిగణంబులతోఁ బితామహుంగొల్చుచున్న యవసరంబున గంగానది దివ్యస్త్రీరూపధారిణి యయి బ్రహ్మసభకు వచ్చిన. 122

ప్రతిపదార్థం: మఱి= ఇంకను; పాండవ, ధార్తరాష్ట్ర, సంభవంబును= పాండురాజుకుమారులయొక్కయు, ధృతరాష్ట్రుని పుత్రులయొక్కయు పుట్టుకను; సవిస్తరంబుగాన్= విపులంగా; వినన్, వలతున్= వినగోరుతాను; చెప్పుము; అనినన్; వానికిన్= జనమేజయునికి; వైశంపాయనుండు; ఇట్లు+అని, చెప్పెన్= ఈవిధంగా చెప్పాడు; తొల్లి= పూర్వం; ఇక్ష్వాకు వంశంబునన్= ఇక్ష్వాకుడు మూలపురుషుడుగా వెలసిన వంశంలో; మహాభిషుండు; అనువాఁడు; పుట్టి; మహత్+ధర్మశీలుండు+ఐ= ఉత్తమధర్మస్వభావం కలవాడై; అశ్వమేధ, సహస్రంబును= అశ్వమేధ యాగాలు వేయినీ; రాజసూయ, శతంబును= రాజసూయయాగాలు నూరున్నూ; చేసి; ఇంద్ర+ఆది, దేవతలన్, తనిపి= ఇంద్రుడు మొదలైన దేవతలను సంతోషపెట్టి; దేవ, లోకంబునకున్, చని= దేవతలయొక్క లోకమైన స్వర్గానికి వెళ్ళి; అందున్= అక్కడ; దేవ, ఋషిగణంబులతోన్= దేవతలయొక్కయు, మునులయొక్కయు సమూహాలతో కలిసి; పితామహున్= బ్రహ్మను; కొల్చుచున్న= సేవిస్తున్న;

అవసరంబునన్= సమయంలో; గంగానది; దివ్య, స్త్రీ, రూప, ధారిణి+అయి= దేవతా సంబంధమైన స్త్రీయొక్క రూపాన్ని తాల్చినదయి; బ్రహ్మసభకున్, వచ్చినన్= బ్రహ్మదేవుడియొక్క సభకు రాగా.

తాత్పర్యం: 'ఇంకను పాండవుల, ధృతరాష్ట్ర పుత్త్రుల పుట్టుపూర్వోత్తరాలు వివరంగా వినగోరుతున్నాను చెప్పు' మని జనమేజయుడు అడుగగా వైశంపాయనుడు ఈవిధంగా చెప్పాడు: 'పూర్వం ఇక్ష్వాకువంశంలో మహాభిషుడనేవాడు పుట్టి ఉత్తమధర్మస్వభావుడై వేయి అశ్వమేధయాగాలను, నూరు రాజసూయయాగాలను చేసి ఇంద్రాదిదేవతలను సంతృప్తిపరచి స్వర్గలోకానికి పోయి అక్కడ దేవతలతోనూ ఋషిగణాలతోనూ కలిసి బ్రహ్మను సేవిస్తున్న సమయంలో గంగానది దేవవనితారూపం ధరించి బ్రహ్మసభకు రాగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ఊరుమూల మేర్పడఁగ నయ్యువిద వలువు । దొలఁగె ననిలంబుచేత విధూత మగుచు;
నమరు లెల్లఁ బరాఙ్ముఖు లైరి; దాని । సాభిలాషుఁ డై చూచె మహాభిషుండు. 123

ప్రతిపదార్థం: అనిలంబు, చేతన్, విధూతము+అగుచున్= గాలిచేత ఎగురగొట్టబడినది ఔతూ; ఆ+ఉవిద, వలువు= ఆ వనితచీర; ఊరుమూలము+ఏర్పడఁగన్= తొడమొదలు కనబడునట్లుగా; తొలఁగెన్= తొలగిపోయింది; అమరులు+ఎల్లన్= దేవతలందరు; పరాక్+ముఖులు+ఐరి= ప్రక్కకు త్రిప్పుకొనిన ముఖాలు కలవారు ఐనారు; మహాభిషుండు; దానిన్= అట్టిస్థితిలో నున్న గంగను; స+అభిలాషుఁడు+ఐ= ఆసక్తితోకూడినవాడై; చూచెన్= చూచాడు.

తాత్పర్యం: గంగాదేవి కట్టుకున్న చీర గాలికి ఎగురగొట్టబడటంచేత ఆమె తొడలమొదలు కనపడేటట్లు తొలగింది. దానిని దేవతలందరు చూడక మొగాలు ప్రక్కకు త్రిప్పుకొన్నారు. కాని, మహాభిషుడు మాత్రం ఆసక్తితో దానిని చూచాడు.

విశేషం: ఈ పద్యంతరువాతకొన్ని ప్రతులలో "గంగాదేవియు నమ్మహాభిషురూపయౌవనవిలాసంబుల కోటువడి వానినచూచుచుండె' అనే వచనం కనబడుతున్నది. కాని, ఈ భావం మూలంలో లేదని శ్రీమహాభారతసంశోధితప్రతి దీనిని గ్రహించలేదు. ఒకవేళ ఈ వచనం ఉన్నదనుకొంటే గంగకూడ శాపార్హురాలౌతుంది. అది కథలో పొసగదు కాబట్టి ఆ వచనాన్ని గ్రహించకపోవటమే సముచితం.

ఆ. దాని నెఱిఁగి కమలయోని వానికిఁ గర । మల్గి మర్త్యయోనియందుఁ బుట్టు
మనుచు శాపమిచ్చె; నొనరంగ వాఁడును । గరము భీతిఁ గరయుగంబు మొగిచి. 124

ప్రతిపదార్థం: కమలయోని= బ్రహ్మ; దానిన్, ఎఱిఁగి= దానిని గ్రహించి; వానికిన్= ఆ విధంగా చూచిన మహాభిషునిగురించి; కరము+అల్గి= మిక్కిలి కోపించి; మర్త్యయోనియందున్= మానవగర్భంలో; పుట్టుము, అనుచున్; శాపము; ఇచ్చెన్; ఒనరంగన్= ఒప్పగా; వాఁడును= మహాభిషుడు; కరము, భీతిన్= మిక్కిలిభయంతో; కర, యుగంబు= చేతులజంట (రెండుచేతులు); మొగిచి= జోడించి.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు దానిని తెలిసికొని మహాభిషుడిమీద అమితంగా కోపించి అతడిని మానవవనితకు పుట్టు మని తగినట్లు శాపమిచ్చాడు. మహాభిషుడు మిక్కిలి భయపడి చేతులు రెండూ జోడించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. 'మర్త్యలోకంబున రాజర్షివరులలోనఁ బుణ్యచరిత్రుండు ప్రతీపుండ కావున వానికిఁ బుత్త్రుండ నై జన్మించెద; నొరులయందు జనింపనోప' నని కమలభవుననుమతంబు వడసె, గంగయు నమ్మహాభిషుని మహానుభావంబును రూపసౌందర్యంబులును దనయందుల యభిలాషయు నెఱింగి తానును మనోజబాణబాధిత యయి వానిన తలంచుచు మర్త్యలోకంబునకు వచ్చునది యెదుర. 125

ప్రతిపదార్థం: మర్త్యలోకంబునన్= మానవలోకంలో; రాజర్షి, వరులలోన్= రాజులయ్యు ఋషిత్వాన్నికూడ సాధించినవారిలో నెల్ల; పుణ్య, చరిత్రుండు= నిర్మలస్వభావం కలవాడు; ప్రతీపుండు+అ= ప్రతీపుడు మాత్రమే; కావునన్= కాబట్టి; వానికిన్= అతనికి; పుత్త్రుండను+ఐ, జన్మించెదన్= కొడుకునై పుట్టుతాను; ఒరుల+అందున్= ఇతరులకు; జనింపన్+ఓపన్= పుట్టజాలను; అని; కమలభవు, అనుమతంబు= బ్రహ్మదేవునియొక్క సమ్మతిని; పడసెన్= పొందాడు; గంగయున్= గంగకూడ; ఆ+మహాభిషుని, మహత్+అనుభావంబును= ఆ మహాభిషుడియొక్క దొడ్డతనాన్నీ; రూప, సౌందర్యంబులును= ఆకారాన్నీ అందాన్నీ; తనయందుల, అభిలాషయున్= తనపట్లకోరికయు; ఎఱింగి= గ్రహించి; తానును=తానుకూడ; మనోజ, బాణ, బాధిత+అయి= మన్మథుడియొక్క బాణాలచేత కొట్టబడినది అయి (విరహాన్ని పొంది); వానిని+అ= అతనినే; తలంచుచున్= స్మరిస్తూ; భావిస్తూ; మర్త్యలోకంబునకున్, వచ్చునది, ఎదురన్= మానవలోకానికి రాగానే, ఎదుట.

తాత్పర్యం: 'మానవ(భూ)లోకంలో గల రాజర్షులందరిలో పుణ్యాత్ముడు ప్రతీపుడు కాబట్టి అతడికి మాత్రమే పుత్త్రుడనై జన్మిస్తాను; మరొకరియందు జన్మించలేను' అని కోరి దానికి బ్రహ్మదేవుడి సమ్మతినిపొందాడు. గంగకూడ ఆ మహాభిషుని దొడ్డతనాన్నీ, రూపసౌందర్యాలనూ, తనపట్ల అతని కున్న కోరికను గమనించి మన్మథబాణాలకు గురియై ఆతడినే తలపోస్తూ మర్త్యలోకానికి వచ్చి, ఎదుట.

క. అనిమిషలోక వియోగం । బున దుఃఖితు లయి వసిష్ఠమునివరు శాపం
బున వచ్చువారి వసువుల । నెనమండ్రం గాంచి గంగ యెంతయుఁ బ్రీతిన్. 126

ప్రతిపదార్థం: అనిమిషలోక, వియోగంబునన్= దేవలోకముయొక్క ఎడబాటుతో; దుఃఖితులు+అయి= బాధపడినవారై; వసిష్ఠ మునివరు, శాపంబునన్= వసిష్ఠ డనే ఋషిశ్రేష్ఠుడియొక్క శాపంవలన; వచ్చువారిన్= వస్తున్నవారిని; వసువులన్, ఎనమండ్రను= వసువులను ఎనిమిదిమందిని; గంగ; ఎంతయున్+ప్రీతిన్= మిక్కిలి ఆప్యాయంగా; కాంచి= చూచి.

తాత్పర్యం: స్వర్గలోకం విడువవలసివచ్చినందుకు దుఃఖితు లైనవారూ, వసిష్ఠమహాముని శాపంతో భూలోకానికి వస్తున్నవారూ అయిన ఎనిమిదిమంది వసువులను గంగ మిక్కిలి ఆప్యాయంగా చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: యమధర్మరాజుయొక్క పదిమంది భార్యలలో వసువు అనుఆమెకు జన్మించిన ఎనిమిదిమంది పుత్రులు వసువులు. వారు ఎల్లప్పుడు కలసిఉండే గణదేవతలు. వారిపేర్లు - ఆపుడు, ధ్రువుడు, సోముడు, అధ్వరుడు, అనిలుడు, ప్రత్యూషుడు, అనలుడు, ప్రభాసుడు.

క. 'ద్యుతి దఱిగి నిజనియోగ । చ్యుతిఁ బొందను మీకు నొండుచోటికి నరుగం
గత మేమి'? యనిన విని య । య్యుతివకు సురనదికి నిట్టు లని రవ్వసువుల్. 127

ప్రతిపదార్థం: ద్యుతి, తఱిగి= కాంతి తగ్గి; నిజ, నియోగ, చ్యుతిన్, పొందను= మీ స్థితినుండి పతనం కావటానికీ; ఒండు, చోటికిన్+అరుగన్= మరొకచోటికి పోవటానికీ; కతము+ఏమి+అనినన్= కారణ మేమిటి అనగా; విని; ఆ+వసువులు; ఆ+అతివకున్ సురనదికిన్= స్త్రీరూపంలో ఉన్న గంగానదికి; ఇట్టులు+అనిరి= ఈవిధంగా అన్నారు.

తాత్పర్యం: 'కాంతిహీను లై మీపదవులనుండి పతనం చెందటానికీ, ఉన్నచోటువదలి మరొకచోటికి పోవటానికీ కలకారణం ఏమి' టని అడుగగా స్త్రీరూపంలో ఉన్న గంగకు ఆ వసువులు ఈ విధంగా అన్నారు.

వ. 'ఏము వసిష్ఠమునివరు శాపంబునం జేసి మర్త్యలోకంబునం దెయ్యేనియు నొక్కపుణ్యవతి యైన స్త్రీయందు జన్మింపంబోయెద' మని దుఃఖించి, తమ శాపప్రకారంబు గంగాదేవికి నెఱింగించి, 'యే మొండుచోట జన్మింపనోపము; నీయంద పుట్టెదము; మఱి మహాభిషుండు ప్రతీపునకు శంతనుం డై పుట్టెడుఁగావున వానికి నీకును సమాగమం బగు; మాజన్మంబునకు నిమిత్తం బాతండ యగు' ననిన విని గంగ సంతసిల్లి యి ట్లనియె. 128

ప్రతిపదార్థం: ఏము= మేము (వసువులు); వసిష్ఠ, మునివరు, శాపంబునన్+చేసి= వసిష్ఠమహాముని శాపం కారణంగా; మర్త్యలోకంబునందున్= భూలోకంలో; ఏది+ఏనియున్, ఒక్క, పుణ్యవతి, ఐన, స్త్రీ, అందున్= ఎవరైనా ఒక పుణ్యంచేసికొన్న వనితకు; జన్మింపన్, పోయెదము+అని= పుట్టా లని వెళ్ళుతున్నా మని; దుఃఖించి= ఏడ్చి, బాధపడి; తమ, శాప, ప్రకారంబు= తమకు శాపం కలిగిన పద్ధతిని; గంగాదేవికిన్; ఎఱింగించి= తెలిపి; ఏము+ఒండు, చోటన్, జన్మింపన్, ఓపము= మేము మరొకచోట పుట్టలేము; నీయందున్+అ= నీయందే, నీకే; పుట్టెదము= జన్మిస్తాము; మఱి= ఇక; మహాభిషుండు; ప్రతీపునకున్; శంతనుండు+ఐ; పుట్టెడున్, కావునన్= పుట్టుతాడు కాబట్టి; వానికిన్, నీకును, సమాగమంబు+అగున్= అతనికీ నీకూ సంయోగం కలుగుతుంది. అతండు+అ= అతడే(శంతనుడే); మా, జన్మంబునకున్, నిమిత్తంబు= మాపుట్టుకకు కారణం; అగును+అనినన్, విని= ఔతా డని చెప్పగా విని; గంగ; సంతసిల్లి= సంతోషించి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నది.

తాత్పర్యం: మేము వసిష్ఠ మహామునిశాపంవలన భూలోకంలో ఎవరైనా ఒక్కపుణ్యవతి యైన వనితయందు జన్మించవలె నని పోతున్నామని దుఃఖించి, తమ శాపవృత్తాంతాన్ని గంగాదేవికి తెలియజెప్పి, 'మేము వేరేచోట ఎక్కడా జన్మించలేము, నీకు పుత్రులముగా పుట్టుతాము; ఇక - మహాభిషుడే ప్రతీపునకు శంతనుడై పుట్టుతాడు కాబట్టి అతనికీ నీకూ సంగమమౌతుంది. మా జన్మకు అతడే కారకు డౌతాడు' అనగా విని గంగ సంతోషించి ఈవిధంగా అన్నది.

క. 'నా కభిమతంబు నిట్టిద; । మీకును నుపకార మగు; సమీహిత బుద్ధిం
జేకొని చేసెద మీర ల । శోకస్థితి నుండుఁ' డనుచు సురనది కరుణన్. 129

ప్రతిపదార్థం: నాకున్, అభిమతంబున్, ఇట్టిది+అ= నాకోరికకూడా ఇటువంటిదే. సమీహిత, బుద్ధిన్= కోరబడిన మనస్సుతో (ఇష్టమైన మనస్సుతో అనిభావం); చేకొని= స్వీకరించి, అంగీకరించి; చేసెదన్= ఆచరిస్తాను; మీకునున్= మీకుకూడ; ఉపకారము+అగున్= మేలౌతుంది; మీరలు+అశోకస్థితిన్, ఉండుఁడు+అనుచున్= మీరు నిశ్చింతగా (దుఃఖం లేని మానసికస్థితిలో)ఉండండి అంటూ; సురనది= గంగానది; కరుణన్= దయతో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నాకోరికకూడ అటువంటిదే; మీకోరికను ఇష్టమైన మనస్సుతో అంగీకరించి అమలుపరుస్తాను. మీకు మేలుకూడ జరుగుతుంది. మీ రింక నిశ్చింతగా ఉండండి' అంటూ గంగాదేవి కరుణతో (తరువాతి వచనంతో అన్వయం).

వ. వసువులకు మనఃప్రియంబుగాఁబలికిన విని, వారును గంగ యనుగ్రహంబు వడసి 'నీవు మాకు నుపకారంబు సేయనోపుదేని నేము నీకుం గ్రమక్రమంబునం బుట్టునప్పుడ మమ్ము నీళ్ల వైచుచు మర్త్యలోకంబున నుండకుండునట్లుగాఁ జేయునది; మాకు వసిష్ఠ మహాముని యనుజ్ఞయు నిట్టిద' యనిన గంగయు 'నట్ల చేయుదు; మఱి మీరెల్ల స్వర్గతులైన నా కొక్కకొడుకు దీర్ఘాయుష్మంతుండై యుండెడు విధం బె'ట్లనిన దానికి వసువు లి ట్లనిరి. 130

ప్రతిపదార్థం: వసువులకున్= అష్టవసువులకు; మనస్+ప్రియంబు, గాన్= మనస్సుకు సంతోషం కలిగేటట్లు; పలికినన్; విని; వారును; గంగ, అనుగ్రహంబు, పడసి= గంగయొక్క దయను పొంది; 'నీవు, మాకున్, ఉపకారంబు, చేయన్, ఓపుదు+ఏని= నీవు మాకు మేలు చేయగలిగితే; ఏము, నీకున్, క్రమక్రమంబునన్, పుట్టు+అప్పుడు+అ= మేము నీకు ఒకరి తరువాతి ఒకరు వరుసగా పుట్టినప్పుడే; మమ్మున్, నీళ్లన్, వైచుచున్= మమ్మల్ని నీళ్ళలో పడవేస్తూ; మర్త్యలోకంబునన్+ఉండకుండు, అట్లుగాన్= భూలోకంలో ఉండకుండా ఉండే విధంగా; చేయునది= చేయవలసింది; మాకున్; వసిష్ఠమహాముని, అనుజ్ఞయున్, ఇట్టిది+అ= వసిష్ఠ మహర్షి మా కిచ్చిన అనుమతికూడా ఇదే; అనినన్; గంగయున్; అట్లు+అ, చేయుదున్= ఆ విధంగానే చేస్తాను; మఱి= ఇక; మీరు+ఎల్లన్, స్వర్గతులు+ఐనన్= మీరందరు మరణిస్తే (స్వర్గానికి చేరితే); నాకున్+ఒక్క, కొడుకు, దీర్ఘాయుష్మంతుండు+ఐ= నాకు ఒక కొడుకు చాలకాలం జీవించేవాడై; ఉండెడు, విధంబు+ఎట్లు+అనినన్= ఉండే పద్ధతి ఏమిటి అనగా; దానికిన్= ఆ ప్రశ్నకు; వసువులు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: వసువుల మనస్సులకు ప్రీతికలిగేటట్లు గంగాదేవి పలుకగా విని, వారు గంగాదేవి దయను పొంది ఈవిధంగా కోరారు- "నీవు మాకు ఉపకారం చేయగలిగితే మేము నీకు ఒకరితరువాత ఒకరు పుట్టినప్పుడే(వెంటనే) మమ్ములను నీళ్ళలో పడవేస్తూ మేము భూలోకంలో ఉండకుండా చేయవలసింది. మాకు వసిష్ఠమహర్షి ఇచ్చిన అనుమతికూడా ఇదే'. ఆ మాటలు విని గంగ ఈ విధంగా అన్నది. "మీ రడిగినట్లు ఆవిధంగానే చేస్తాను. అయితే, మీరందరు స్వర్గానికి చేరితే నాకు ఒక్కకొడుకు దీర్ఘాయువుకలవాడై ఉండేవాడు కావాలి. అది ఏవిధంగా వీలౌతుంది?' ఆ మాటలకు వసువులు ఈవిధంగా అన్నారు.

క. మాయం దొక్కొక్కళ్ళతు । రీయాంశముఁ దాల్చి శుభచరిత్రుం డై దీ
ర్ఘాయుష్యుం డష్టమ వసు । వాయతభుజుఁ డుండు నీకు నాత్మోద్భవుఁ డై. 131

ప్రతిపదార్థం: మాయందున్+ఒక్క+ఒక్కళ్ళ, తురీయ+అంశమున్, తాల్చి= మాలో ఒక్కొక్కరియొక్క నాల్గవ అంశాన్ని (ఈపరిపూర్ణ మహత్త్వంలో నాల్గవవంతు) ధరించి; శుభ, చరిత్రుండు+ఐ= మంగళకరమైన శీలం కలవాడై; దీర్ఘ+ఆయుష్యుండు= చాలకాలం జీవించేవాడూ; ఆయత+భుజుఁడు= విశాలాలైన భుజాలు కలవాడూ; అష్టమవసువు= ఎనిమిదవ వసువు అయిన ప్రభాసుడు; నీకున్, ఆత్మ+ఉద్భవుఁడు+ఐ= కన్నకొడుకై; ఉండున్= భూలోకంలో ఉంటాడు.

తాత్పర్యం: మా ఒక్కొక్కళ్ళ నాల్గవ అంశాన్ని ధరించి ఉత్తమశీలుడై, దీర్ఘాయువై, విశాలభుజాలుగల అష్టమవసువు-ప్రభాసుడు నీకు కన్నకొడుకై మర్త్యలోకంలో ఉంటాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తన పుత్త్రునకు భార్య వగు మని ప్రతీపుఁడు గంగ కుపదేశించుట (సం.1-92-1)

వ. అని యిట్లు గంగా వసువు లొండొరులు సమయంబు సేసికొని చని; రంత నిక్కడ. 132

తాత్పర్యం: అని ఈవిధంగా గంగాదేవి, అష్టవసువులూ పరస్పరం కట్టడిచేసికొని వెళ్ళారు. ఆ పైన ఇక్కడ. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. వీరుఁడు ప్రతీపుఁ డఖిల। క్ష్మారాజ్య, సుఖములఁ దనిసి మానుగ గంగా
తీరమునఁ దపము సేయుచు। భారతకులుఁ డుండె ధర్మపరుఁడై నిష్ఠన్. 133

ప్రతిపదార్థం: భారతకులుఁడు= భరతవంశంలో పుట్టినవాడూ; వీరుఁడు= పరాక్రమవంతుడూ, అయిన; ప్రతీపుఁడు; అఖిల, క్ష్మా, రాజ్య, సుఖములన్, తనిసి= సమస్త సామ్రాజ్య సుఖాలను అనుభవించి తృప్తుడై; నిష్ఠన్= దీక్షతో; ధర్మపరుఁడు+ఐ= ధర్మమునందు ప్రీతికలవాడై; మానుగన్= ఒప్పిదంగా; గంగా, తీరమునన్= గంగానది ఒడ్డున; తపము, చేయుచున్, ఉండెన్= తపస్సు చేస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: భరతకులంలో పుట్టి వీరుడైన ప్రతీపుడు సమస్తరాజ్యభోగాలను తనివితీర అనుభవించి ధర్మపరుడై దీక్షపట్టి గంగానదీతీరంలో మనోజ్ఞంగా తపస్సు చేస్తూ ఉన్నాడు.

వ. ఇట్లు యమ నియమవ్రత పరాయణుండై యున్నవానికిం బ్రత్యక్షం బై యొక్కనాఁడు. 134

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: ఈవిధంగా యమం, నియమం అనే యోగపద్ధతుల నాచరించే నిష్ఠలో నిమగ్నుడై ఉండగా ప్రతీపుడికి (గంగ) ఒకనాడు ప్రత్యక్షమై. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: యమ, నియమాలు అష్టాంగ యోగంలోని భాగాలు. ఆ యోగంలోని ఎనిమిది అంగాల పేర్లు ఇవి - యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధ్యానం, ధారణం, సమాధి. హింసాదులు చేయకుండ ఉండటం యమము. అది పదిరకాలు. అవి - సత్యం, దయ, క్షమ, ధృతి, మితాహారం, ఆర్జవం, బ్రహ్మచర్యం, అస్తేయం, అహింస, శౌచం. శరీరంకంటె భిన్నమైన మట్టి, నీళ్ళు సాధనాలుగా చేసే యోగసాధనం నియమం. అదికూడా పది విధాలు. అవి - తపం, సంతోషం, ఆస్తికత్వం, దానం, భగవదర్చన, వేదాంతశ్రవణం, లజ్జ, మతి, జపం, వ్రతం.132, 133, 134 సంఖ్యల పద్యవచనాలకు బదులు ఒకప్రతిలో "ఇట్లు నియమవ్రతులై వసువులు గంగకు నియమంబుసేసి చనిన నిట గంగయు భూలోకంబునకు వచ్చి నిరంతర నియమవ్రతపరాయణుండైయున్న ప్రతీపుం డనువానికిం బ్రత్యక్షం బై యొక్కనాడు "అనేవచనం కనబడుతున్నదని శ్రీమదాంధ్రమహాభారతసంశోధితముద్రణప్రతిలో ఉన్నది. (పు. 215)

ఉ. గంగ నిజాంగదీప్తు లెసఁగం జనుదెంచి లతాంగి సంగతో
త్తుంగ పయోధర ద్వితయ తోయరుహానన చారునేత్ర ది
వ్యాంగన యై ప్రతీపవసుధాధిపు శాలవిశాల దక్షిణో
త్సంగమునందు మన్మథవశంబున నుండెఁ గరంబు లీలతోన్. 135

ప్రతిపదార్థం: లతా+అంగి= తీగవంటి మేను కలిగినది; సంగత, ఉత్తుంగ, పయోధర, ద్వితయ; తోయరుహ+ఆనన= ఒప్పిదమై ఎత్తైన వక్షోజాల జంటను కలిగినదీ; పద్మంవంటి ముఖం కలిగినదీ; చారు, నేత్ర= అందమైన కన్నులు కలదీ; అయిన, గంగ= గంగాదేవి; నిజ+అంగ, దీప్తులు+ఎసఁగన్= తన శరీరపు కాంతులు వ్యాపించగా; దివ్య+అంగన+ఐ= దేవవనితగా రూపం తాల్చి; చనుదెంచి= వచ్చి; మన్మథ, వశంబునన్= మన్మథునికి వశమైనభావంతో (వలపుతో); ప్రతీప, వసుధా+అధిపు= ప్రతీపుడనేపేరుగల భూపతి(రాజు)యొక్క; శాల, విశాల, దక్షిణ+ఉత్సంగమునందున్= చెట్టువలె విశాలమైన కుడితొడమీద; కరంబు, లీలతోన్= మిక్కిలి శృంగారహేలతో; ఉండెన్= కూర్చుండెను.

తాత్పర్యం: గంగానది తీవెవంటి మేను కలిగినది, పొందికగా ఎత్తైన వక్షోజములజంట కలిగినది, పద్మమువంటి ముఖం కలిగినది అయిన దివ్యవనితారూపం తాల్చి తన శరీరకాంతులు ప్రసరిస్తూఉండగా వచ్చి మన్మథపారవశ్యంతో ప్రతీపమహారాజుయొక్క చెట్టువలె విశాలమైన కుడితొడమీద మిక్కిలి విలాసంగా కూర్చున్నది.

విశేషం: గంగ లతాంగి. ఆమె శరీరం తీగవంటిది. ప్రతీపుని వక్షస్సు చెట్టు వంటిది. తీగ చెట్టుకు అల్లుకొనినట్లు ఆమె అతని తొడపై ఉన్నదని స్వారస్యం.

వ. ప్రతీపుండును దానింజూచి యచ్చెరువంది 'నీవెందులదాన? విట్లేలనాకుఱువెక్కి?' తనిన నది యి ట్లనియె. 136

ప్రతిపదార్థం: కుఱువు= తొడ

తాత్పర్యం: ప్రతీపుడు గంగను చూచి ఆశ్చర్యపడి 'నీ వెక్కడిదానవు? నాతొడపై ఎందు కెక్కావు?' అని అడుగగా గంగ ఈవిధంగా అన్నది.

ఆ. ఏను జహ్నుకన్య నింద్రసమాన! నీ । సద్గుణావళులకు సంతసిల్లి
భానుతేజ! నీకు భార్యగా వచ్చితి । నిష్టమునఁ బరిగ్రహింపు నన్ను. 137

ప్రతిపదార్థం: ఇంద్రసమాన= ఇంద్రుడితో పోలినవాడా!; ఏను= నేను; జహ్ను, కన్యను= జహ్నుమహర్షి కుమార్తెను; గంగను; నీ, సద్గుణావళులకున్= నీయొక్క మంచి గుణములయొక్క సమూహానికి; సంతసిల్లి= సంతోషించి; భానుతేజ= సూర్యుడివంటి ప్రకాశం కలవాడా!; నీకున్, భార్య, కాన్, వచ్చితిన్= నీకు భార్య అగునట్లుగా (నీకు భార్యనౌదా మని) వచ్చాను; నన్నున్; ఇష్టమునన్= ప్రీతితో; పరిగ్రహింపు(ము)= స్వీకరించుము.

తాత్పర్యం: ఇంద్రసమానుడవైన ప్రతీపమహారాజా! నేను జహ్నుమహర్షి పుత్రికను గంగను. నీ మంచిగుణాలకు సంతోషించి నీకు భార్య నౌదా మని వచ్చాను. సూర్యతేజుడా! నన్ను ప్రీతితో స్వీకరించుము.

చ. అనినఁ బ్రతీపుఁ డిట్లనియె; 'నంబురుహానన యగ్నిసాక్షికం
బునఁ బరిణీత యైన సతిఁ బొల్పుగ నొక్కతఁగాని యన్యలన్
మనముననేనియుం దలఁప; మానిని! యిట్టి జితాత్ము నన్ను ని
ట్లని పలుకంగ నీ కగునె? యన్యులఁ బల్కినయట్ల బేల వై. 138

ప్రతిపదార్థం: అనినన్= అని గంగ పల్కగా; ప్రతీపుఁడు= ఇట్లు+అనియెన్; అంబురుహ+ఆనన= పద్మమువంటి ముఖంకలదానా!; అగ్నిసాక్షికంబునన్= అగ్నిసాక్షిగా; పరిణీత+ఐన= వివాహమైన; సతిన్= ఇల్లాలిని; పొల్పుగన్= ఒప్పారగా; ఒక్కతన్+కాని=

ఒక్కతినేకాని; అన్యలన్= ఇతరస్త్రీలను; మనమునన్+ఏనియున్, తలఁపన్= మనస్సులోకూడ భావించను; మానిని= ఓ అభిమానవతీ!; ఇట్టి; జిత+ఆత్మున్, నన్నున్= ఇటువంటి ఆత్మనిగ్రహంగలనాతో; అన్యలన్, పల్కిన, అట్లు+అ= ఇతరులతో మాటాడినట్లు; బేలవు+ఐ= అమాయకురాలవై; ఇట్లు+అని= ఈవిధంగా; పలుకంగన్= మాటాడటానికి; నీకున్+అగునె= నీకు తగునా? (తగ దని భావం).

తాత్పర్యం: అని గంగ పల్కగా ప్రతీపుడు ఈవిధంగా అన్నాడు - "ఓ పద్మముఖీ! అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యను ఒక్కతనేగాని ఇతరవనితలను మనసులో సైతం స్మరించను. ఓ అభిమానవతీ! ఇటువంటి ఆత్మనిగ్రహమున్న నన్ను, ఇతరులతో పలికినట్లుగా, అమాయకురాలవై ఈవిధంగా అడగటం నీకు న్యాయమా? (కాదని భావం).

వ. 'మఱి యదియునుంగాక స్త్రీభాగం బయిన డాపలికుఱువెక్కక పురుషభాగంబై పుత్త్రారోహణ యోగ్యం బైన నావలపలికుఱు వెక్కితిగావున నాపుత్త్రునకు భార్య వగు' మనిన నదియునట్ల చేయుదునని యదృశ్యయయ్యె; నంతం బ్రతీపుఁడును బుత్త్రార్థియై సకలతీర్థంబులయందు సునందాదేవియుం దాను వేదవిహితవ్రతంబులు సలుపుచుఁ బెద్దకాలంబు దపంబు సేసిన. 139

ప్రతిపదార్థం: మఱి= ఇంక; అదియునున్, కాక= అదికూడకాక; స్త్రీ, భాగంబు+అయిన= స్త్రీకూర్చుండేవైపు అయిన; డాపలి, కుఱువు+ఎక్కక= ఎడమతొడపైకి ఎక్కక; పురుష, భాగంబు+ఐ= పురుషులు కూర్చుండేవైపుఅయి; పుత్ర+ఆరోహణ, యోగ్యంబు+ఐ= కొడు కెక్కి కూర్చుండదగిన; నా, వలపలి, కుఱువు+ఎక్కితి(వి)= నాకుడితొడపైకి ఎక్కావు; కావునన్= కాబట్టి; నా, పుత్త్రునకున్, భార్యవు+అగుము+అనినన్= నాకొడుకుకు ఇల్లాలివి అగు మనగా; అదియును= ఆ గంగయు; అట్లు+అ; చేయుదును+అని; అదృశ్య+అయ్యెన్= మాయమాయెను; అంతన్= ఆ తరువాత; ప్రతీపుఁడును; పుత్ర+అర్థి+ఐ= పుత్రసంతానంకొఱకు; సకల, తీర్థంబుల, అందున్= అన్ని పుణ్యతీర్థాలలోనూ; సునందాదేవియున్, తానున్, వేద, విహితవ్రతంబులు= వేదాలలో చెప్పబడిన దీక్షలు; సలుపుచున్= చేస్తూ; పెద్దకాలంబు= చాలకాలం; తపంబు+చేసినన్= తపస్సు చేయగా.

తాత్పర్యం: 'అంతేకాకుండా నీవు స్త్రీలు కూర్చుండేవైపు ఎడమతొడపై ఎక్కకుండా, పురుషులు కూర్చుండేవైపైనది, పుత్రులు ఎక్కదగినది అయిన కుడితొడపై ఎక్కావు కాబట్టి నాకొడుకుకు ఇల్లాలి వగుము' అనగా, ఆమె అట్లే చేస్తానని చెప్పి మాయమైపోయింది. ఆ తరువాత ప్రతీపుడు పుత్రుడికోసం సహధర్మచారిణియైన సునందాదేవితో కూడి సమస్త పుణ్యతీర్థాలలోను వేదధర్మోచితమైన వ్రతాలను నిర్వహిస్తూ చాలకాలం; తపస్సు చేయగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. అధికపుణ్యమూర్తు లైన యయ్యిరువుర । కమరనిభుఁడు కౌరవాన్వయంబు
వెలుఁగుచుండఁ బుట్టె వీరాగ్రగణ్యుండు । సంతతార్థదాయి శంతనుండు. 140

ప్రతిపదార్థం: అధిక, పుణ్యమూర్తులు+ఐన= అమితపుణ్యం కలిగించే ఆకారం కలిగినవారైన; ఆ+ఇరువురకున్= ఆ దంపతులకు సునందాప్రతీపులకు; అమర, నిభుఁడు= దేవతలతో తుల్యమైనవాడు; వీర+అగ్రగణ్యుండు= పరాక్రమవంతులలో శ్రేష్ఠుడు; సంతత, అర్థ, దాయి= ఎల్లప్పుడు ధనాన్ని దానంచేసేవాడు; (అయిన) శంతనుండు; కౌరవ+అన్వయంబు= కురుమహారాజు వంశకర్తగా నైన వంశం; వెలుఁగుచున్+ఉండన్; ప్రకాశిస్తూఉండగా; పుట్టెన్= పుట్టాడు.

తాత్పర్యం: అమితపుణ్యాదంపతులైన సునందాప్రతీపులకు దేవతలతో తుల్యుడైనవాడు, వీరశ్రేష్ఠుడు, మహాదాత అయిన శంతనుడు కౌరవవంశం ప్రకాశించగా జన్మించాడు.

వ. ఇట్లుదయించి పెరిఁగి సంప్రాప్త యౌవనుం డైన కొడుకుం జూచి ప్రతీపుండు తనకు నక్షయపుణ్యలోకంబులు గలిగె నని సంతసించి, సకలరాజ్యభారధౌరేయుఁగా నభిషిక్తుం జేసి కొడుకున కి ట్లనియె. 141

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; ఉదయించి= పుట్టి; పెరిగి; సంప్రాప్త యౌవనుండు+ఐన= యువకుడైన; కొడుకున్; చూచి; ప్రతీపుండు; తనకున్; అక్షయ, పుణ్య, లోకంబులు, కలిగెన్, అని= క్షయంకాని పుణ్యభోగాలకు అనువైన లోకాలు కలిగాయి అని; సంతసించి= సంతోషించి; సకల, రాజ్యభార, ధౌరేయున్+కాన్= సమస్తరాజ్యముయొక్క భారాన్ని వహించేవాడిగా; అభిషిక్తున్, చేసి= రాజుగా చేసి; కొడుకునకున్+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా పుట్టి పెరిగి యువకు డైన కొడుకును చూచి ప్రతీపుడు తనకు శాశ్వతపుణ్యలోకసుఖాలు కలిగా యని సంతోషించి, సమస్త రాజ్యభారాన్ని కొడుకుపై ఉంచి, రాజ్యానికి పట్టంకట్టి, కొడుకుతో ఈవిధంగా అన్నాడు.

మధ్యాక్కర.

తనుమధ్య దా నొక్కకన్య సురనదీతటమున నన్నుఁ
గనిన నక్కన్యకఁ జూచి 'నీ విట్టి కమనీయ రూప,
వొనర నా సుతునకు భార్య వగు మన్న నొడఁబడి యియ్య
కొనియెఁ; గావున దానిఁ దగ వివాహ మగుము నెయ్యమునను.' 142

ప్రతిపదార్థం: తనుమధ్య= సన్నని నడుముగలది అయిన; తాను+ఒక్క, కన్య= ఒకకన్య(తానుగా); సురనదీ, తటమునన్= గంగానది ఒడ్డున; నన్నున్, కనినన్= నన్ను చూడగా; ఆ+కన్యకన్, చూచి= ఆ కన్యను చూచి; నీవు+ఇట్టి, కమనీయ, రూపవు= నీవు ఇంతటి అందమైనరూపం కలదానిని; ఒనరన్= ఒప్పారగా; నా, సుతునకున్, భార్యవు+అగుము; అన్నన్; ఒడఁబడి= అనుకూలించి; ఇయ్యకొనియెన్= అంగీకరించింది; కావునన్= కాబట్టి; దానిని= ఆ కన్యను; తగన్= ఒప్పుగా; నెయ్యమునను= అనురాగంతో; వివాహము+అగుము= పెండ్లిచేసికొమ్ము.

తాత్పర్యం: గంగానదీతీరాన సన్నవినడుము గల ఒకకన్య తానుగా నన్ను దర్శించగా, నే నాకన్యను చూచి 'నీవు ఇంతటి అందమైన ఆకారం కలిగినదానవు, నాకొడుకుకు భార్యవు కమ్ము' అనగా, ఆమె అనుకూలించి అంగీకరించింది. కాబట్టి, ఆ కన్యను అనురాగంతో తగినట్లు వివాహం చేసికొమ్ము.'

విశేషం: మధ్యాక్కరలోని ప్రతి పాదంలోనూ వరుసగా 2 ఇంద్రగణాలూ, 1 సూర్యగణం, 2 ఇంద్రగణాలూ, 1 సూర్యగణం అమరిఉంటాయి. నన్నయ అయిదవగణంలోని మొదటివర్ణంతో యతిమైత్రి చేశాడు. ప్రాస నియతం.

గంగా శంతనుల సమయము (సం. 1-92-26)

వ. మఱి యక్కోమలి కులగోత్రనామంబు లడుగక దానియిష్టంబు సలుపు మని కొడుకుం బంచి ప్రతీపుఁడు తపోవనంబునకుం జనియె; నిట శంతనుండు రాజ్యంబు సేయుచు నొక్కనాఁడు మహాధనుర్ధరుండై

మృగయావినోదంబులఁ దగిలి యొక్కరుండును వనమ్ములోఁ గ్రుమ్మరువాఁ డనిలాలోలకల్లోలమాలాస్ఫాలన
సముచ్ఛల జ్జలకణాసార శిశిరశిశిరం బగుచున్న గంగాపులినతలంబున. 143

ప్రతిపదార్థం: మఱి= ఇంకను; ఆ+కోమలి, కుల, గోత్ర, నామంబులు+అడుగక= ఆ వనితయొక్క కులం, గోత్రం, నామం అడుగకయే; దాని, ఇష్టంబు, సలుపుము+అని= దానికోర్కె తీర్చు మని; కొడుకున్+పంచి= పుత్రుడిని నియమించి; ప్రతీపుఁడు; తపో, వనంబునకున్, చనియెన్= తపోవనానికి వెళ్ళాడు; ఇట= ఇక్కడ; శంతనుండు; రాజ్యంబు; చేయుచున్; ఒక్కనాఁడు; మహత్+ధనుస్+ధరుండు+ఐ= గొప్పవిల్లును ధరించినవాడై; మృగయా, వినోదంబులన్= వేటలోని వినోదాలలో; తగిలి= ఆసక్తుడై; ఒక్కరుండును= ఒక్కడే; వనమ్ములోన్, గ్రుమ్మరువాఁడు= అరణ్యంలో తిరుగుతూ; అనిల+ఆలోల, కల్లోల, మాలా, స్ఫాలన, సముచ్ఛలత్= గాలిచేత కదలింపబడిన అలల వరుసల తాకిడివలన పైకి లేపబడుతున్న; జల, కణ+అసార, శిశిర, శిశిరంబు+అగుచున్న= నీటితుంపురుల జడివానవలన మిక్కిలి చల్లనైనది ఔతున్న; గంగా, పులినతలంబునన్= గంగానదియొక్క ఇసుకతిన్నెలపైభాగాన.

తాత్పర్యం: అంతేకాక, ఆ కోమలికులగోత్రనామాలుకూడ అడుగకుండ దానికోర్కె తీర్చు మని కొడుకును నియోగించి ప్రతీపుడు తపోవనానికి వెళ్ళాడు. ఇక, ఇక్కడ శంతనుడు రాజ్యం చేస్తూ ఒకనాడు గొప్పదైన విల్లుగైకొని వేటలోని వినోదాలలో ఆసక్తుడై ఒక్కడే అడవిలో తిరుగుతూ గాలిచేత కదలింపబడిన అలల వరుసల తాకిడివలన పైకి లేపబడుతున్న నీటితుంపురుల జడివానవలన మిక్కిలి చల్లనైన గంగానదియొక్క ఇసుకతిన్నెపై. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం. అలల కదలికలలోని అందాన్ని "అనిలా.......తలంబున" అనే వర్ణనలో లకార పునరావృత్తి వలన సాధించి నన్నయ అక్షరరమ్యతను ప్రదర్శించాడు. గంగాదేవి సౌందర్య వ్యంజకం ఈ అక్షరరమ్యత.

క. తరళాయతలోచన న। త్యురుకుచఁ దేజోభిరామ నుత్తమదివ్యాం
బర మాల్య మణిమయాలం। కరణోజ్జ్వలవేష నొక్కకన్యకఁ గనియెన్. 144

ప్రతిపదార్థం: తరళ+ఆయత, లోచనన్= కదలాడుతున్న విశాలమైన కన్నులుకలదీ; అతి+ఉరు, కుచన్= మిక్కిలిపెద్దవైన చన్నులు కలదీ; తేజస్+అభిరామన్= ప్రకాశంచేత అందమైనదీ; ఉత్తమ, దివ్య+అంబర, మాల్య, మణిమయ+అలంకరణ+ఉజ్జ్వల, వేషన్= శ్రేష్ఠాలైన దేవతాసంబంధులైన వస్త్రాలతో, పూలమాలలతో, మణులతో నిండిన అలంకారాలతో ప్రకాశించే వేషం కలిగినది - అయిన - ; ఒక్క, కన్యకన్= ఒక కన్యను; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: కదలాడే వెడల్పైన కన్నులు కలది, మిక్కిలి పెద్దవైన వక్షోజాలు కలది, మేనివన్నెచేత అందమైనది, మేలిరకపు దివ్యవస్త్రాలతోనూ, పూలమాలలతోనూ, మణులతో నిండిన హారాలతోనూ వెలుగొందుతున్న వేషం కల ఒక కన్యను చూచాడు.

చ. కని 'వనకన్యయో దనుజకన్యకయో భుజగేంద్రకన్యయో
యనిమిషకన్యయో యిది వియచ్చరకన్యకయో యపూర్వ మీ
వనమున కిట్టు లేకతమ వచ్చునె మానవకన్య' యంచు న
య్యనఘుఁడు దానిఁ జిత్తమున నాదట వోవక చూచెఁబ్రీతితోన్. 145

ప్రతిపదార్థం: ఆ+అనఘుఁడు= ఆ పాపరహితుడైన శంతనుడు; కని= చూచి; ఇది= ఈకన్య; వనకన్యయో= వనదేవతాకన్య ఏమో; దనుజ, కన్యకయో= రాక్షసజాతికి చెందిన కన్యఏమో; భుజగ+ఇంద్ర, కన్యయో= సర్పరాజుయొక్క తనయయేమో?; అనిమిష కన్యయో= దేవకన్యయేమో; వియచ్చరకన్యకయో= గంధర్వకన్యయేమో; అపూర్వము= ముందెన్నడు చూడని అద్భుతం; మానవకన్య= మానవజాతికి చెందిన కన్య; ఈ వనమునకున్= ఈ అరణ్యానికి; ఇట్టులు= ఈవిధంగా; ఏకతమ= ఒంటరిగా; వచ్చునె= వస్తుందా? (రాలేదని భావం); అంచున్= అని అనుకొంటూ; దానిన్= ఆ కన్యను; చిత్తమునన్= మనసులో; ఆదట, పోవక= తనివితీరక; ప్రీతితోన్= ఆసక్తితో; చూచెన్= చూచాడు.

తాత్పర్యం: నిర్మలస్వభావు డైన శంతనుడు ఆ కన్యను చూచి ఆమె వనదేవతాకన్యయేమో? లేదా రాక్షసరాజకన్యయేమో, లేదా సర్పరాజపుత్రికయేమో, దేవతాకన్యయేమో, లేదా గంధర్వాదికన్యయేమో అని భావించి, ఆమె సౌందర్యాన్ని అద్భుతమైనదిగా ప్రశంసించి, మానవకన్య అయితే ఆ అడవిలో ఒంటరిగా వస్తుందా? అని అనుకొంటూ ఆమెను తనవితీరక ఆసక్తితో చూచాడు.

విశేషం: అలం: ఉల్లేఖం, ఉత్ప్రేక్ష, అపూర్వవస్తుదర్శనంవలన కలిగిన అబ్బురపాటుకు ఉత్ప్రేక్షాలంకారం ఉచితం; అబ్బురపాటువలన కలిగిన భావతరంగిణిని ఉల్లేఖంతో వర్ణించటం సార్థకం. ధ్వనికి తోడ్పడే అలంకారాలను వాడటం నన్నయస్వభావం.

వ. అదియు నమ్మహీపతి రూపయౌవనసౌందర్యవిలాసంబుల కోటువడి మహానురాగంబున వానిన చూచుచున్నంత. 146

ప్రతిపదార్థం: ఓటు+పడు= వశమగు.

తాత్పర్యం: ఆ కన్యకూడ ఆ రాజుయొక్క రూపాన్నీ, యౌవనాన్నీ, సౌందర్యహావభావాలనూ చూచి వాటికి వశురాలై అపారమైన అనురాగంతో (వలపుతో) అతడినే చూస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఇరువురు నొండొరువులఁ గడు । సురుచిరముగఁ జూచు వాఁడిచూడ్కులు దనకున్
శరములుగాఁ గొని యేసెను । మరుఁ డయ్యిరువుర మనోభిమానచ్యుతిగన్. 147

ప్రతిపదార్థం: ఇరువురున్= ఉభయులూ (గంగాశంతనులు); ఒండు+ఒరువులన్= ఒకరిని మరొకరు; కడు, సురుచిరముగన్= మిక్కిలి ఒప్పిదమైనట్లుగా; చూచు= చూచే; వాఁడి, చూడ్కులు= పదునైన (ఎదుటివారిని హత్తుకొనేటట్లుండే) చూపులను; మరుఁడు= మన్మథుడు; తనకున్= తనకు; శరములుగాన్= బాణాలుగా; కొని= గ్రహించి; ఆ+ఇరువుర, మనః, అభిమాన, చ్యుతిగన్= ఆ ఉభయుల మానసికస్థైర్యం జారేటట్లుగా; ఏసెను= నాటాడు.

తాత్పర్యం: గంగాశంతను లిద్దరూ ఒకరినొకరు మిక్కిలి మనోహరంగా చూచుకొనే వారిచూపులనే తనబాణాలుగా ఎన్నుకొని మన్మథుడు ఆ యిరువురి మానసికస్థైర్యం జారేటట్లు సంధించాడు.

విశేషం: అలం: ప్రహర్షణం. మన్మథుని బాణాలు అయిదు - అవి : అరవిందం, అశోకం, చూతం, నవమల్లిక, నీలోత్పలం. 'ఒకరువుఁడు'కు రూపాంతరం ఒరువుఁడు. ఒండు- ఒరువుఁడు- ఒకరువుఁడు ఇవన్నీ రూపాంతరాలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. శంతనుండు దానిం జూచి 'నీవెందులదాన' విట్లేల యేకతంబ యున్నదాన' వని యడుగ నోడి మిన్నకయున్న నాతండు తనయందు దృఢానురాగుం డగుట యెఱింగి యది యి ట్లనియె. 148

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: శంతనుడు ఆకన్యను చూచి 'నీ వెక్కడిదానవు? ఈవిధంగా ఒంటరిగా ఎందు కున్నావు?' అని అడగటానికి జంకి ఊరకుండగా, అతడు తనయందు గాఢమైన అనురాగం కలిగి ఉండటాన్ని గ్రహించి ఆమె ఈవిధంగా పలికింది.

క. భూనాథ! నీకు భార్యం। గా నన్నుఁ బరిగ్రహింపఁ గడుకొని యిష్టం
బేని సమయంబు సేయుము। మానుగ నా కిష్టమయినమార్గముఁ బ్రీతిన్. 149

ప్రతిపదార్థం: భూనాథ= ఓరాజా! (భూమికి అధిపతి అయినవాడా); నీకున్; భార్యన్+కాన్= భార్యను అయ్యేటట్లుగా; నన్నున్; పరిగ్రహింపన్= స్వీకరించటానికి; కడుకొని= పూనుకొని; ఇష్టంబు+ఏని= కోరిక అయినట్లయితే; మానుగన్= మనోజ్ఞంగా; నాకున్+ఇష్టము+అయిన, మార్గమున్= నాకు నచ్చే పద్ధతిలో; ప్రీతిన్= సంతోషంతో; సమయంబు= కట్టడి, ప్రతిజ్ఞ; చేయుము.

తాత్పర్యం: ఓరాజా! నీకు భార్య అయ్యేటట్లు నన్ను స్వీకరించా లని నీకు కోరి కైతే, పూనుకొని మనోజ్ఞంగా నాకు నచ్చే పద్ధతిలో ఒక కట్టడి చేయుము.

వ. అది యెట్లంటేని -'యే నెద్ది సేసినను దానికి నొడంబడి వారింపకుండను, నన్ను నప్రియంబులు పలుకక యుండను వలయు; నట్లైన నీకు భార్య నై యభిమతసుఖంబు లొనరింతు; నటుగాక నీ వెప్పడేని నన్ను నప్రియంబులు వలుకు దప్పడ నిన్నుఁ బాసిపోదు' ననిన శంతనుండు నొడంబడి దానిం బరిగ్రహించె; గంగయు మనుష్యస్త్రీరూపధారిణియై వాని కిష్టోపభోగంబులు సలుపుచుండె; నంత. 150

ప్రతిపదార్థం: అది, ఎట్లు+అంటి(వి)+ఏని= అది ఏవిధంగా అంటావా (అంటే అని భావం); ఏను+ఎద్ది, చేసినను= నే నేమి చేసినా; దానికిన్= చేసినదానికి; ఒడంబడి= అంగీకరించి; వారింపక+ఉండను= అడ్డగించకుండానూ; నన్ను+అప్రియంబులు, పలుకక, ఉండను= నాతో పరుష మైన మాటలు మాటలాడకుండానూ; వలయున్= ఉండాలి; అట్లు+ఐనన్= ఆ విధంగా అయితే; నీకున్, భార్యను+ఐ= నీకు ఇల్లాలినై; అభిమత, సుఖంబులు+ఒనరింతును= ఇష్ట(కోరిన)సుఖాలు అందిస్తాను; అటు, కాక= దానికి విరుద్ధంగా; నీవు+ఎప్పుడేని, నన్ను, అప్రియంబులు, పలుకుదు(వు)= నీవు ఎప్పుడైనా నాకు ఇష్టంకాని మాటలు మాట్లాడితివా; అప్పుడు+అ= వెంటనే; నిన్నున్, పాసి, పోదున్, అనినన్= నిన్ను వదలిపోతాను అని అనగా; శంతనుండు; ఒడంబడి= అంగీకరించి; దానిన్= ఆ కన్యను; పరిగ్రహించెన్= పెండ్లాడాడు; గంగయున్= గంగకూడ; మనుష్య, రూపధారిణి+ఐ= మానవరూపం ధరించినదై; వానికిన్= అతడికి; ఇష్ట, ఉపభోగంబులు, సలుపుచున్+ఉండెన్= కోరిన అనుభవాలను కలిగిస్తూ ఉన్నది; అంతన్= ఆతరువాత.

తాత్పర్యం: అది ఏవిధంగా అంటే - 'నేను ఏది చేసినా, దానికి నీవు అంగీకరించి, అడ్డు చెప్పకుండ నన్ను పరుష మైనమాటలతో మనసు నొప్పించకుండ ఉండాలి. అట్లైతే నేను నీకు భార్యనై కోరిన కోర్కెలు తీరుస్తాను. అట్లుకాక నీవెప్పుడైనా నాకు నచ్చనిమాటలు పలికితే వెంటనే నిన్ను విడిచిపోతాను' అనగా శంతనుడు ఆమె కట్టడికి

అంగీకరించి ఆమెను పెండ్లాడాడు. గంగకూడ మానవవనితరూపం ధరించి అతడికి కోరిన సుఖాలను కలిగిస్తూ ఉన్నది. ఆ తరువాత (తరువాతి పద్యంతో).

విశేషం: శంతనుడు గంగను కిమ్మనకుండా అంగీకరించటానికి కారణం అతడి తండ్రియైన ప్రతీపుడిఆదేశం. (చూడు. 142 143 పద్యాలు).

సీ. వరుణుఁ డాదిగఁగల వసువులు దోడ్తోడఁ। బుట్టుచు నున్న నప్పొలఁతి వారి
నల్లన పుట్టిన యప్పుడ కొనిపోయి। నిర్దయ యై గంగనీరిలోన
వైచిన, నెఱిఁగి య వ్వసుమతీనాథుండు। 'తనయుల ని ట్లేల దయయు లేక
గంగలో వైచెదు'? కడు నధర్మం బేల। చేసెదు' నా నోడుఁ; జెలువ దన్నుఁ

ఆ. బాసిపోవు ననియుఁ బలుకక యెప్పటి। యట్ల నెమ్మి నుండు; నంతఁ బుట్టెఁ
దనయుఁ డష్టముండు దల్లిదండ్రుల కతి। ప్రీతియును ముదంబుఁ బెరుఁగుచుండ. 151

ప్రతిపదార్థం: వరుణుఁడు+ఆదిగన్, కల, వసువులు= వరుణుడు మొదలైన వసువులు; తోడ్తోడన్, పుట్టుచున్, ఉన్నన్= వెంటవెంటనే పుట్టుతూ ఉండగా; ఆ+పొలఁతి= ఆ వనిత, గంగ; వారిన్+అల్లన, పుట్టిన అప్పుడు+అ= వారిని సడిచప్పుడు లేకుండ పుట్టినప్పుడే; కొనిపోయి= ఎత్తుకొనిపోయి; నిర్దయ+ఐ= దయలేని కఠినురాలై; గంగనీరిలోనన్, వైచినన్= గంగానదిజలంలో పడవేయగా; ఆ+వసుమతీనాథుండు= ఆరాజు; ఎఱిఁగి= తెలిసికొని; తనయులను+ఇట్లు+ఏల, దయయున్, లేక= దయకూడా లేకుండా కొడుకులను ఆవిధంగా ఎందుకు; గంగలోన్, వైచెదు(వు)= గంగలో వేస్తావు?; కడు, అధర్మంబు+ఏల, చేసెదు(వు)= మిక్కిలి అధర్మాన్ని ఎందుకు చేస్తావు; నాన్= అని అనటానికి; ఓడున్= వెనుకాడును; చెలువ= భార్య; తన్నున్= తనను; పాసిపోవును+అనియున్= వదలిపోతుంది అనికూడ; పలుకక= మారుమాటాడక; ఎప్పటి, అట్లు+అ= ఎప్పటివలెనే; నెమ్మిన్= ప్రీతితో; ఉండున్= ఉండేవాడు; అంతన్= అప్పుడు; తనయుఁడు, అష్టముండు= ఎనిమిదవ కొడుకు; తల్లి, తండ్రులకున్= అమ్మనాయనలకు; అతి, ప్రీతియును= మిక్కిలి ఆసక్తియున్నూ; ముదంబున్= సంతోషమున్నూ; పెరుఁగుచున్+ఉండన్= పెంపొందుతుండగా; పుట్టెన్= జన్మించాడు.

తాత్పర్యం: వరుణుడు మొదలైన వసువులు వెంటవెంటనే పుట్టుతుండగా గంగ సడిచప్పుడు లేకుండ వారిని పుట్టిన వెంటనే నిర్దయురాలై తీసికొనిపోయి గంగానదినీటిలో పడవేసేది. ఆ రాజు ఆ సంగతి తెలిసికొని "కొడుకులను దయమాలి ఆ విధంగా గంగలో ఎందుకు వేస్తావు? మిక్కిలి అధర్మాన్ని ఎందుకు చేస్తావు?" అని అడగటానికి వెనుకాడేవాడు. ఆమె తనను వదలి వెళ్ళిపోతుందేమో అని మారుమాట లేకుండ ఎప్పటివలెనే ప్రీతితో ఉండేవాడు. అప్పుడు ఎనిమిదవ కొడుకు తల్లిదండ్రులకు మిక్కిలి ఆసక్తిని, అనురాగాన్ని పెంచుతూ పుట్టాడు.

వ. అక్కొడుకుం జూచి పుత్త్రమోహంబునఁ జంపనీనోపక శంతనుండు గంగ కి ట్లనియె. 152

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: ఆ కొడుకును చూచి కొడుకుమీది మమకారంతో అతడిని చంపనీయలేక శంతనుడు గంగతో ఈవిధంగా అన్నాడు.

గంగ శంతనునకు వసువుల వృత్తాంతమును దెలుపుట (సం. 1-29-49)

క. పడయంగ రాని కొడుకులఁ । గడుఁ బలువురఁ బడసి పుత్త్రఘాతినివై; తీ
కొడుకు నుదయార్కతేజుని । విడువఁగ నే నోప ననుచు వేడుకతోడన్. 153

ప్రతిపదార్థం: పడయంగన్, రాని, కొడుకులన్= పొందటానికి శక్యంగాని కొడుకులను; కడున్, పలువురన్, పడసి= పెక్కుమందిని కని; పుత్త్ర ఘాతినివి+ఐతి(వి)= కొడుకులను చంపేశావు; ఈకొడుకున్= ఈపుత్రుడిని; వేడుకతోడన్= సంతోషం (పుత్రోత్సవం) కారణంగా; ఉదయ+అర్క, తేజునిన్= ఉదయిస్తున్న సూర్యప్రకాశం వంటి తేజస్సు కలవాడిని; విడువఁగన్= వదలటమంటే; నేను+ఓపను= నేను సహించలేను; అనుచున్= అని పలుకుతూ.

తాత్పర్యం: పొంద శక్యంగాని కొడుకులను అనేకులను పొంది(కని)కూడ, పుత్రులను చంపేదాని వైనావు. వేడుక కలిగించే ఈపుత్రుడిని, బాలసూర్యుడి ప్రకాశం కలవాడిని వదలాలంటే నాకు శక్యం కాదు, అంటూ (తరువాతి వచనంతో అన్వయం).

వ. దాని నప్రియంబులు వలికి వారించిన, నదియుం దొల్లి చేసిన సమయంబు దలంచిఁ 'నీతోడిసంగతి నాకు నింతియ; యేను బుణ్యజలప్రవాహపవిత్రఁ ద్రిభువనపావని యనంబరఁగిన గంగఁజుమ్మీ! వసువులు వసిష్ఠశాపంబున వసుమతిం బుట్టుచుండి యే మొండుచోట జన్మింపనోపము; నీయంద పుట్టెదము; మర్త్యంబునం బెద్దకాలం బుండకుండ మమ్ము ముక్తులం జేయు మని నన్నుం బ్రార్థించిన దేవహితార్థంబు మనుష్యస్త్రీరూపంబు దాల్చి నీవలన వసువులం బుట్టించితి; దీన నీకుం బుణ్యలోకంబు లక్షయంబు లగు; మఱియు నియ్యష్టమపుత్త్రుండు వసువులం దొక్కొక్కళ్ళ చతుర్థాంశంబులు దాల్చి సకలధర్మమూర్తి యయి పుట్టినవాఁడు; లోకహితార్థంబుగా మర్త్యంబునం బెద్దకాలం బుండు 'ననిన గంగకు శంతనుండి ట్లనియె.154

ప్రతిపదార్థం: దానిన్= గంగను; అప్రియంబులు= ఇష్టంలేని మాటలు; పలికి= మాటాడి; వారించినన్= అడ్డగించగా; అదియున్= ఆ గంగకూడ; తొల్లి, చేసిన సమయంబు= పూర్వం ఒప్పుకొన్న కట్టడిని; తలంచి= జ్ఞాపకం చేసికొని; నీతోడి, సంగతి= నీతో కలసిఉండటం; నాకున్+ఇంతియ= నాకు ఇంతవరకే; ఏను= నేను; పుణ్య, జలప్రవాహ, పవిత్రన్= పుణ్యంకలిగించే నీటియొక్కప్రవాహంచేత పవిత్రమైన దానిని; త్రి, భువన, పావని= మూడులోకాలలో పవిత్రురాలు; అనన్, పరఁగిన, గంగన్, చుమ్మీ= అని ప్రసిద్ధికెక్కిన గంగను సుమా!; వసువులు= అష్టవసువులు; వసిష్ఠ, శాపంబునన్= వసిష్ఠుడియొక్కశాపంవలన; వసుమతిన్, పుట్టుచున్+ఉండి= భూమిపై పుట్టుతూ; ఏము= మేము; ఒండు, చోటన్, జన్మింపన్, ఓపము= మరొకచోట పుట్టలేము; నీ, అందున్+అ, పుట్టెదము= నీగర్భమందే పుట్టుతాము; మర్త్యంబునన్= భూలోకంలో; పెద్దకాలంబు+ఉండక+ఉండన్= ఎక్కువకాలం ఉండకుండ; మమ్మున్, ముక్తులన్, చేయుము+అని= మమ్ములను నరజన్మనుండి విడువబడినవారినిగా చేయుమని; నన్నున్, ప్రార్థించినన్= నన్ను వేడగా; దేవహిత+అర్థంబు= దేవతలయొక్క మేలుకొరకు; మనుష్య, స్త్రీ, రూపంబు, తాల్చి= మానవవనితారూపం ధరించి; నీవలనన్, వసువులన్, పుట్టించితిన్= నీవు కారణంగా వసువులను కన్నాను; దీనన్= దీనివలన; నీకున్= నీకు(శంతనుడికి); పుణ్య, లోకంబులు+అక్షయంబులు+అగున్= పుణ్యంచేసినవారు మరణానంతరం పొందే ఉత్తమలోకాలు క్షయంకాకుండా అనుభవానికి వస్తాయి; మఱియున్= అంతేకాక; ఈ+అష్టమపుత్త్రుండు= ఈ ఎనిమిదవ కొడుకు; వసువులందున్+ఒక్కొక్కళ్ళ+చతుర్థ+అంశంబులు, తాల్చి= వసువులలోని ఒక్కొక్కళ్ళయొక్క నాలుగో అంశాన్ని పొంది(ధరించి); సకల, ధర్మ, మూర్తి+అయి= సమస్తధర్మాలయొక్క ఆకృతివంటివా డయి; పుట్టినవాఁడు= పుట్టాడు;

లోక, హిత+అర్థంబు, కాన్= లోకంయొక్క మేలు కొరకు; మర్త్యంబునన్= భూలోకంలో; పెద్దకాలంబు= చాలకాలం; ఉండును= జీవిస్తాడు; అనినన్= అనగా; గంగకున్; శంతనుఁడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ విధంగా గంగకు ఇష్టం లేని మాటలు పలికి అడ్డగించగా, ఆమె పూర్వం చేసికొన్న నియమాన్ని జ్ఞాపకం చేసికొని 'నీతోడిపొత్తు ఇంతటితో సరి; నేను పుణ్యజల ప్రవాహరూప నైన పవిత్రురాలను; మూడులోకాలలో పరమపవిత్ర నని పేరొందిన గంగను సుమా! అష్టవసువులు వసిష్ఠుని శాపంవలన భూమిపై పుట్టుతూ, మేము మరొకచోట పుట్టలేము, నీగర్భమందే జన్మిస్తాము; భూలోకంలో ఎక్కువకాలం ఉండకుండ మమ్ములను ఆ జన్మలనుండి విముక్తి చేయు మని నన్ను వేడగా, ఆ దేవతల మేలుకోరి మానవవనితారూపం ధరించి నీవలన వసువులను కన్నాను. దీనివలన నీకు క్షయంలేని పుణ్యలోకాలు కలుగుతాయి. అంతేకాక, ఈ ఎనిమిదవకొడుకు వసువులలో ఒక్కొక్కళ్ళనాల్గవఅంశాన్ని ధరించి సమస్తధర్మాలకు మూర్తికట్టినవాడుగా పుట్టాడు. లోకశ్రేయస్సుకొఱకు భూలోకంలో చాలకాలం ఇతడు జీవిస్తాడు' అని చెప్పగా గంగతో శంతనుడు ఈ విధంగా అన్నాడు.

క. వసువు లనువా రపేత । వ్యసనులు, దేవతలు, లోకవంద్యులు; వారిన్
వసుమతిఁ బుట్టఁగ శాపము । వసిష్ఠముని యేల యిచ్చె వారిజనేత్రా! 155

ప్రతిపదార్థం: వారిజనేత్రా!= తామరలవంటి కన్నులు కలదానా! గంగా!; వసువులు+అను, వారు= వసువులని పిలువబడేవారు; అపేత, వ్యసనులు= తొలగిన దోషాలు కలవారు(దోషాలు లేనివారు అనిభావం); దేవతలు; లోకవంద్యులు= జనులచేత నమస్కరింపదగినవారు; (అయిన) వారిన్= ఆ వసువులను; వసుమతిన్= భూలోకంలో; పుట్టఁగన్= పుట్టేటట్లు; శాపము= శాపాన్ని వసిష్ఠముని= వసిష్ఠుడనే పేరుగల ఋషి; ఏల= ఎందుకు; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: వసువులు దోషరహితులు, దేవతలు, లోకులచేత పూజింపదగినవారు. అటువంటివారిని ఆ వసిష్ఠముని భూలోకంలో పుట్టేటట్లు ఎందుకు శపించాడు?

విశేషం: కామక్రోధాలవలన పుట్టే దోషాలను వ్యసనా లంటారు. అవి ఏడు. (సప్తవ్యసనాలు). కామం వలనపుట్టే నాలుగు వ్యసనాలు సురాపానము, స్త్రీవాంఛ, వేట, జూదం. కోపం వలనకలిగే వ్యసనాలు మూడు : వాక్పారుష్యం, దండపారుష్యం, అర్థదూషణం.

వ. 'మఱి వసువులు పుట్టుచు స్వర్గంబునకుం జనుటయు, నీయష్టమవసువు మర్త్యంబునం బెద్దకాలం బునికియు నేమి కారణం?' బని యడిగిన వానికి గంగ యి ట్లనియె. 156

ప్రతిపదార్థం: విస్పష్టం.

తాత్పర్యం: 'కాగా, వసువులు పుట్టుతూ స్వర్గానికి వెళ్ళటానికీ, ఈ ఎనిమిదవవసువు భూలోకంలో చాలకాలం జీవించటానికీ(ఉండటానికీ) కారణ మేమి?' టని అడుగగా శంతనుడితో గంగ ఈ విధంగా అన్నది.

విశేషం: 128వ వచనంలో వసువులు తమ శాపప్రకారాన్ని గంగకు వినిపించినట్లు మాత్రం చెప్పి, ఇక్కడ శంతనుడి కోరికమీద గంగచేత ఆ కథను ప్రసన్నంగా చెప్పించటం కథాకథనశిల్పం. అప్పుడే చెప్పిఉన్నట్లయితే ఉత్కంఠ ఉండేదికాదు. పైపెచ్చు పునరుక్తి కలిగేది. ఈ రెండు దోషాలు కలుగకుండ నన్నయ కథను కాపాడాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **అతులతపంబునన్ వరుణుఁ డన్మునిచే బహుపుణ్యకర్మసు**
స్థితిఁ బ్రభవింపగాఁ బడిన దివ్యమునీంద్రుఁ డశేషలోక పూ
జితుఁడు వసిష్ఠుఁ డాశ్రమముఁ జేసి తపం బొనరించె బ్రహ్మస
మ్మితుఁ డురురత్నరాజిత సుమేరు మహీధర కందరంబునన్. 157

ప్రతిపదార్థం: అతుల, తపంబునన్= అపారమైన తపస్సువలన; వరుణుఁడు+అన్, మునిచేన్= వరుణుడు అనే పేరుగల మునిచేత; బహు, పుణ్య, కర్మ, సుస్థితిన్= అనేకములైన మంచి కార్యాలయొక్క కలిమివలన (పుణ్యకర్మఫలంగా); ప్రభవింపఁగాఁ +బడిన= పుట్టింపబడిన; దివ్య, ముని+ఇంద్రుఁడు= దేవతామహిమలు కల ఋషులలో శ్రేష్ఠుడు; అశేష, లోక, పూజితుఁడు= సమస్తలోకాలలో గౌరవింపబడినవాడు; బ్రహ్మసమ్మితుడు= బ్రహ్మతో సమానుడు; (అయిన) వసిష్ఠుఁడు; ఉరు, రత్న,రాజిత, సుమేరు, మహీధర, కందరంబునన్= పెద్దవైన రత్నాలచేత ప్రకాశించెడి సుమేరువు అనే పర్వతంయొక్క గుహలో (విభాగం); ఆశ్రమమున్, చేసి= ఆశ్రమం చేసికొని; తపంబు= తపస్సు; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: వరుణుడు అనే మునికి అపారతపస్సువలననూ, అనేకపుణ్యకర్మలయొక్క ఫలస్థితివలననూ పుట్టిన దివ్యమునీంద్రుడు, సర్వలోకాలచేత గౌరవింపబడేవాడు, బ్రహ్మతో సమానుడు అయిన వసిష్ఠమహర్షి రత్నాలతో వెలుగొందే పెద్దదైన మేరుపర్వతపు గుహలోపలిభాగాన్ని ఆశ్రమంగా చేసికొని తపస్సు చేశాడు.

వ. **మఱియు దక్షప్రజాపతి పుత్త్రియయిన సురభికిం గశ్యపునకుం బుట్టిన నందిని దనకు హోమధేను వయి కోరిన వస్తువులు గురియుచుండఁదపంబు సేయుచున్న వసిష్ఠునాశ్రమంబునకు వసువు లెనమండ్రును భార్యాసహితు లై క్రీడార్థంబు వచ్చి, వసిష్ఠుహోమధేనువుం జూచి, దాని శీలంబునకు విస్మయం బందుచున్నచో నం దష్టమవసుభార్య పతి కి ట్లనియె. 158**

తాత్పర్యం: కాగా, దక్షప్రజాపతియొక్క కూతు రయిన సురభికిన్నీ పుట్టిన నందిని అనే ధేనువు హోమానికి కావలసిన ద్రవ్యాల నన్నింటిని తనపాదుగుద్వారా అందించే హోమధేనువుగా ఉండి, కోరిన వస్తువులన్నింటిని పాలధారతోపాటు వర్షిస్తూ ఉండగా నిశ్చింతగా తపస్సుచేస్తున్న వసిష్ఠుడియొక్క ఆశ్రమానికి ఒకసారి ఎనిమిదిమంది వసువులు భార్యలతోకూడి విహారార్థం వచ్చి, వసిష్ఠుడి హోమధేనువును చూచి, దాని మహిమకు(స్వభావానికి) ఆశ్చర్యపడుతూ ఉన్న సమయంలో ఎనిమిదవ వసువుయొక్క భార్య తనభర్తతో ఈ విధంగా అన్నది.

ఆ. **దీనిపాలు ద్రావి మానవుల్ పదియువే। లేండ్లు జరయు రుజయు నెఱుఁగ కమర**
భావమున సుఖంబు జీవింతు రటె!; దీని। నేలఁగనిన వాఁడ యెందుఁ బెద్ద. 159

ప్రతిపదార్థం: దీని, పాలు, త్రావి= ఈనందినీధేనువుయొక్క పాలు త్రాగి; మానవుల్= నరులు; పదియున్, వేల+ఏండ్లు= పదివేలసంవత్సరాలు; జరయున్, రుజయున్, ఎఱుగక= ముసలితనం, రోగం అంటే తెలియకుండా(లేకుండా); అమర, భావమునన్= మరణంలేనిస్థితిలో; సుఖంబు, జీవింతురు+అటె= హాయిగా బ్రతుకుతారటగా; దీనిన్, ఏలన్, కనిన, వాఁడు+అ= దీనిని తన అదుపులో ఉంచుకొని పాలింపకలిగినవాడే; ఎందున్= ఎక్కడైనా; పెద్ద= గొప్పవాడు (అనబడతాడు).

తాత్పర్యం: ఈ నందినీధేనువుపాలు త్రాగి నరులు పదివేలేండ్లు ముసలితనం, రోగాలు లేకుండ అమరత్వంతో హాయిగా బ్రతుకుతారటగా! దీనికి యజమానుడై పాలకుడైనవాడే నిజంగా ఎక్కడైనా గొప్పవాడుగా పరిగణింపబడేది.

వ. 'మర్త్యలోకంబున నుశీనరపతికూఁతురు జితవతి యను కోమలి నా ప్రియసఖి; యే నెప్పుడు దానికిఁ బ్రియంబు గోరుచుండుదు; నిమ్మొదవు నమ్ముదితకిచ్చిపుత్త' మనినఁబ్రణయిని వచనంబుల కనుగుణంబుగాఁ బ్రభాసుండు నిజభ్రాతృచోదితుం డయి వసిష్ఠుహోమధేనువుం బట్టికొనిపోయిన, నమ్మునియు దనహోమధేనువుం గానక వనంబెల్లఁ గలయరోసి, తన యోగదృష్టిం జూచి వసువులు గొనిపోక యెఱింగి.160

ప్రతిపదార్థం: మర్త్యలోకంబునన్= భూలోకంలో; ఉశీనర, పతి, కూఁతురు= ఉశీనరము- అనే దేశపు రాజుయొక్క కూతురు; జితవతి, అను, కోమలి= జితవతి అనే పేరుగల వనిత; నా, ప్రియసఖి= నాకు ఇష్టమైన స్నేహితురాలు; ఏను+ఎప్పుడున్; దానికిన్, ప్రియంబు, కోరుచున్+ఉండుదు(ను)= ఆమె సంతోషాన్నేకోరుతూ ఉంటాను; ఈ+మొదవున్= ఈఆవును; ఆ+ముదితకున్+ఇచ్చి, పుత్తము+అనినన్= ఆ వనితకు ఇచ్చి పంపుదాము అనగా; ప్రణయిని, వచనంబులకున్+ అనుగుణంబుగాన్= ప్రియురాలి మాటలకు అనువుగా; ప్రభాసుండు; నిజభ్రాతృ, చోదితుండు+అయి= తన సోదరులచేత ప్రేరితుడై; వసిష్ఠ, హోమధేనువున్, పట్టికొనిపోయినన్= వసిష్ఠుడియొక్క హోమధేనువును తీసికొనిపోగా; ఆ+మునియున్= ఆ వసిష్ఠుడు; హోమధేనువున్; కానక, వనంబు+ఎల్లన్= అరణ్యమంతా; కలయన్, రోసి= నలుదిక్కులా వెదకి; తన, యోగదృష్టిన్, చూచి= తన దివ్యదృష్టితో చూచి; వసువులు, కొనిపోక= కొనిపోవుట; ఎఱింగి= వసువులు తీసికొనిపోవటం తెలిసికొని.

తాత్పర్యం: 'భూలోకంలో ఉశీనరదేశాధిపతియొక్కకూతురు జితవతి అనే ఆమె నా ప్రాణస్నేహితురాలు. నే నెప్పుడూ ఆమెకు సంతోషం కలిగించా లని భావిస్తూ ఉంటాను. ఈ ఆవును ఆమె కిచ్చిపంపుదా' మనగా, ప్రియురాలి మాటలకు అనువుగా ప్రభాసుడు తనసోదరులచేత ప్రేరితుడై వసిష్ఠుడి హోమధేనువును పట్టికొనిపోగా, ఆముని తనహోమధేనువు కనబడకపోవటంతో అడవినాలుగుమూలల గాలించి, తన యోగదృష్టితో చూచి, వసువులు తీసికొనిపోవటం తెలిసికొని.

ఆ. 'మనుజయోనిఁ బుట్టుఁ' డని వారి కప్పుడు । కోప మడర మునియు శాప మిచ్చె;
భయము వొంది వివశు లయి వచ్చి వారును । వినయ మొనర నిట్టు లనిరి మునికి. 161

ప్రతిపదార్థం: మునియున్= వసిష్ఠుడు; వారికిన్= వసువులకు; అప్పుడు; మనుజయోనిన్, పుట్టుఁడు+అని= మానవగర్భంలో పుట్టండి అని; శాపము; ఇచ్చెన్; వారును= వసువులుకూడ; భయము, పొంది= భయపడి; వివశులు+అయి= కలతపొందిన బుద్ధికలవారై; వచ్చి; వినయము+ఒనరన్= అణకువ ఒప్పారగా; మునికిన్= వసిష్ఠుడితో; ఇట్టులు+అనిరి= ఈవిధంగా అన్నారు.

తాత్పర్యం: అప్పుడు వసిష్ఠుడు వసువులను 'మీరు మానవజన్మ ఎత్తండి' అని కోపంతో శపించాడు. వారు అందుకు భయపడి మనసు కలతపడగా వినయంగా వసిష్ఠుడితో ఈ విధంగా అన్నారు.

గంగ దేవవ్రతునిం దెచ్చి శంతనున కిచ్చుట (సం. 1-94-11)

వ. 'నీవు ధర్మమూర్తివి; మాచేసిన యజ్ఞానంబు సహించి మర్త్యంబునం బెద్దకాలం బుండకుండ మా కనుగ్రహింపవలయు' నని ప్రార్థించిన నమ్ముని ప్రసన్నుం డయి 'మీకోరినయట్ల యగు; నష్టముం డయిన యీప్రభాసుండుపెద్దయునపరాధంబుఁజేసెఁగావున వీఁడు మర్త్యలోకంబునం బెద్దకాలంబుండు;

ననపత్యుండు నగు' ననియె నని గంగాదేవి తనస్వరూపంబుఁ జూపి, వసూత్పత్తియు స్వర్గగమన నిమిత్తంబును గాంగేయ జన్మస్థితియునుం జెప్పి, 'దేవవ్రతుం డయిన యిక్కుమారుండు పెరుఁగునంతకు నాయొద్దన యుండు'నని శంతను నొడంబఱిచి కొడుకుం దోడ్కొని యరిగిన; విస్మయం బంది శంతనుండు దానితోడి యిష్టోపభోగంబులం బెద్దకాలంబు సనిన నల్పకాలంబుకా వగచుచు హస్తిపురంబునకు వచ్చి.162

ప్రతిపదార్థం: నీవు; ధర్మమూర్తివి= ధర్మంరూపు తాల్చినవాడవు; మా, చేసిన= మేం చేసిన; అజ్ఞానంబు= అవివేకపు పనిని; సహించి= ఓర్చి; మర్త్యంబునన్= భూలోకంలో; పెద్దకాలంబు+ఉండక+ఉండన్= చాలకాలం జీవించకుండా; మాకున్+అనుగ్రహింప, వలయున్+అని, ప్రార్థించినన్= మమ్మలను దయచూడు మని వేడుకొనగా; ఆ+ముని, ప్రసన్నుండు+అయి= ఆ వసిష్ఠుడు సుముఖుడై; మీ, కోరిన, అట్లు+అ, అగున్= మీరు కోరిన విధంగానే అవుతుంది; అష్టముండు+అయిన, ఈ, ప్రభాసుండు= ఎనిమిదవవాడైన ఈప్రభాసుడు; పెద్దయున్, అపరాధంబున్, చేసెన్, కావునన్= మిక్కిలి నేరం చేశాడుకాబట్టి; వీఁడు= ఇతడు(ప్రభాసుడు); మర్త్యలోకంబునన్= భూలోకంలో; పెద్దకాలంబు+ఉండున్= చాలకాలం ఉంటాడు; అనపత్యుండు+అగున్= సంతానంలేనివాడును ఔతాడు; అనియెను; అని; గంగాదేవి; తన, స్వరూపంబున్= తన నిజరూపాన్ని; చూపి= చూపించి; వసు+ఉత్పత్తియున్= వసువులయొక్క పుట్టుకనుగురించి; స్వర్గ, గమన, నిమిత్తంబును= వారిస్వర్గప్రయాణానికి(మరణానికి) గల కారణాన్నీ; గాంగేయ, జన్మస్థితియునున్= గంగకుమారుడైన భీష్ముడియొక్క పుట్టుకకు సంబంధించిన వాస్తవాన్నీ; చెప్పి; దేవవ్రతుండు+అయిన= దేవవ్రతుడు అనేపేరుతో వ్యవహరింపబడే ఈబాలుడు; పెరుఁగు+అంతకున్= పెద్దవాడయ్యేంతవరకు; నాయొద్దన్+అ, ఉండును+అని= నాదగ్గరే ఉంటా డని; శంతనున్= శంతనుడిని; ఒడంబఱిచి= ఒప్పించి; కొడుకున్, తోడ్కొని, అరిగినన్= కుమారుడిని తీసికొనిపోగా; శంతనుండు; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; దానితోడి, ఇష్ట+ఉపభోగంబులన్, పెద్దకాలంబు, చనినన్= గంగతో కలిసి కోరిన కోర్కెలను అనుభవించటం చాలకాలం సాగినప్పటికిన్నీ; అల్పకాలంబు, కాన్= కొద్దికాలమే సాగినట్లు; వగచుచున్= బాధపడుతూ; హస్తిపురంబునకున్, వచ్చి= హస్తినాపురానికి తిరిగివచ్చి.

తాత్పర్యం: 'వసిష్ఠమహర్షీ! నీవు ధర్మం తెలిసినవాడవు. మేము చేసిన అవివేకపుపనికి ఓర్చుకొని భూలోకంలో ఎక్కువకాలం ఉండకుండ మమ్మలను దయచూడు' మని వేడుకోగా, ఆ వసిష్ఠుడు అనుకూలుడై 'మీరు కోరినట్లే ఔతుంది; కాని, ఈ ఎనిమిదవవాడైన ప్రభాసుడు మిక్కిలినేరం చేశాడుకాబట్టి వీడు భూలోకంలో చాలకాలం జీవిస్తాడు, సంతానం లేనివాడుకూడ ఔతాడు' అని అన్నా డని చెప్పి, గంగాదేవి తన నిజస్వరూపాన్ని చూపి వసువులపుట్టుకను గురించి, వారు స్వర్గానికిపోవడానికి గల కారణాన్నిగురించి, భీష్ముడి పుట్టుకకు సంబంధించిన వాస్తవాన్ని గురించి చెప్పి, దేవవ్రతుడని ఆ కుమారుడికి పేరుపెట్టి, అతడు పెద్దవాడయ్యేంతవరకు తనదగ్గరే ఉంటాడని పేర్కొని, దానికి శంతనుడిని ఒప్పించి, కొడుకును తనతో తీసికొనిపోయింది. శంతనుడు దాని కంతటికి ఆశ్చర్యపడి గంగతో తాను చాలకాలం కోరినకోర్కెలు అనుభవించినా అది స్వల్పకాలంగానే తోచగా విచారపడుతూ హస్తినాపురానికి వచ్చి.

మ. తన కాజ్ఞావశవర్తు లై మహిసమస్తక్షత్రవంశేశు లె
ల్లను భక్తిం బనిసేయుచుండఁగ విశాలం బైన సత్కీర్తి ది
గ్వనితా మౌక్తిక దామలీల వెలుఁగన్ వారాశిపర్యంత భూ
జనరక్షాపరుఁ డయ్యె శంతనుఁడు రాజద్రాజధర్మస్థితిన్. 163

ప్రతిపదార్థం: శంతనుఁడు; రాజత్, రాజధర్మస్థితిన్= ప్రకాశిస్తున్న రాజధర్మం యొక్క వ్యవస్థతో; తనకున్; ఆజ్ఞా, వశవర్తులు+ఐ= శాసనానికి లొంగినవారై; మహిన్, భూమిలోని సమస్త, క్షత్ర, వంశ+ఈశులు+ఎల్లను= క్షత్రియవంశాలకు చెందిన రాజులందరూ; భక్తిన్= వినయంతో; పని+చేయుచున్+ఉండఁగన్= సేవలు చేస్తూ ఉండగా; విశాలంబు+ఐన, సత్, కీర్తి= బాగా వ్యాపించిన మంచి కీర్తి; దిక్, వనితా, మౌక్తిక, దామ, లీల, వెలుఁగన్= దిక్కు అనెడి స్త్రీయొక్క ముత్యాలదండయో అన్నట్లు ప్రకాశించగా; వారాశి, పర్యంత, భూ, జన, రక్షా, పరుఁడు+అయ్యెన్= సముద్రాలవరకు వ్యాపించి ఉన్న భూమియొక్క జనులయొక్క రక్షణయందు నిమగ్నుడైనాడు.

తాత్పర్యం: శంతనుడు తన శాసనానికి తలఒగ్గి భూతలంమీది క్షత్రియవంశ్యులైన రాజు లందరు వినయంతో తనకు సేవలుచేస్తూ ఉండగా వ్యాపించిన తన ఉత్తమకీర్తి, దిక్కులనే వనితలకు పెట్టిన ముత్యాలదండయో అన్నట్లు ప్రకాశించగా, వెలుగొందుతున్న రాజధర్మవ్యవస్థతో సముద్రాలవరకు వ్యాపించిన భూమిని, ప్రజలను రక్షించటంలో నిమగ్నుడైనాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. ఇట్లు లోకంబెల్లఁ దనధర్మమార్గంబ పొగడుచుండ సుఖంబుండి యాతం డొక్కనాఁడు మృగయావ్యాజంబున గంగాసమీపంబునం జనువాఁడు దన్నుంబాసి తనుత్వంబుఁ దాల్చినట్లు గడునల్పప్రవాహం బైయున్నదానిం గంగానదిం జూచి యిది యేమినిమిత్తంబో యనుచుం గొండొకనేల యరిగి. 164

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; లోకంబు+ఎల్లన్= లోకమంతా; తన, ధర్మ, మార్గంబు+అ= తనయొక్కధర్మపద్ధతిని; పొగడుచున్+ఉండన్= ప్రశంసిస్తూ ఉండగా; సుఖంబు+ఉండి= హాయిగా కాలంగడుపుతూ; ఆతండు= శంతనుడు; ఒక్కనాఁడు= ఒకరోజున; మృగయా, వ్యాజంబునన్= వేట నెపంతో; గంగా, సమీపంబునకున్, చనువాఁడు= గంగానదియొక్క సమీపానికిపోతున్నవాడు; తన్నున్, పాసి, తనుత్వంబున్, తాల్చినట్లు= తనను వదలివెళ్ళి చిక్కినట్లు (సన్నపడ్డట్లు); కడున్, అల్ప, ప్రవాహంబు+ఐ, ఉన్న, దానిన్= మిక్కిలి తక్కువైన నీటిజాలు కలిగినదై ఉన్నదానిని; గంగానదిన్; చూచి; ఇది, ఏమి నిమిత్తంబు+ఓ, అనుచున్= దీనికి కారణ మేమిటో అని అనుకొంటూ; కొండొక, నేల అరిగి= మరొకచోటికి పోయి.

తాత్పర్యం: ఈవిధంగా లోకమంతా తా ననుసరించే ధర్మమార్గాన్ని పొగడుతూ ఉండగా, సుఖంగా ఉండి, ఒకనాడు వేటకై గంగానదిసమీపానికి పోగా ఎదుట గంగానది తనముండి దూరంకావటంచేత చిక్కి సన్నబడిపోయిందా అన్నట్లు మిక్కిలి తక్కువనీటిపారుదల కలిగింద్తై ఉండగా చూచి, దీనికి కారణ మేమిటో అని అనుకొంటూ మరొక ప్రాంతానికి పోయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

తరలము.

కనియె ముందట నమ్మహీపతి గాంగసైకత భూములం
బనుగొనన్ ధను వభ్యసించుచు బానసంహతి సేతుగా
ఘనముగా నమరాపగౌఘముఁ గట్టియున్న కుమారు న
త్యనఘు నాత్మసమాను నాత్మజు నాపగేయు మహాయశున్. 165

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ+మహీపతి= ఆ రాజు (శంతనుడు); గాంగ, సైకత, భూములన్= గంగానదికి సంబంధించిన ఇసుకతిన్నెలపై; పన్ను+కొనన్-పనుగొనన్= (అభ్యాసంవలన) విద్యదృఢపడటానికి; ధనువు+అభ్యసించుచున్= విలువిద్యను అభ్యాసంచేస్తూ; బాణసంహతిన్= బాణాలయొక్క సమూహాన్ని; సేతుగాన్= అడ్డుకట్టగా; ఘనముగాన్= గొప్పగా, గట్టిగా; అమర+ఆపగా+ఓఘమున్= దేవతలనది అయిన గంగయొక్క ప్రవాహాన్ని; కట్టి+ఉన్న= అడ్డుపెట్టిఉన్న; అతి+అనఘున్= మిక్కిలి దోషరహితుడిని; ఆత్మ, సమానున్= తనతో పోలినవాడిని(రూపపరాక్రమాలలో); ఆత్మజున్= తన కుమారుడిని; ఆపగేయున్= గంగాపుత్రుడిని; మహత్+యశున్= గొప్పకీర్తికలవాడిని; కుమారున్= బాలుడిని, (పుత్రుడిని); ఎదుటన్= కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: ఆ శంతనుడు గంగానదిఒడ్డున నున్న ఇసుకతిన్నెలమీద ధనుర్విద్య గట్టిపడటానికి విల్లమ్ములతో అభ్యాసం చేస్తూ బాణాలసమూహంతో గంగాప్రవాహానికి అడ్డుకట్టగా కట్టి నీటిప్రవాహానికి అడ్డుపెట్టి ఉన్న దోషరహితుడు, తనతో సమానుడైనవాడు, తనకుమారుడు, గంగాపుత్రుడు, గొప్పకీర్తి కలవాడు అయిన ఒక బాలుడిని ఎదుట చూచాడు.

విశేషం: తరలము- ఇది అతిధృతి ఛందంలో పుట్టింది. ప్రతిపాదానికీ పందొమ్మిది అక్షరా లుంటాయి. గణాలు- న, భ, ర, స, జ, జ, గ; 12వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది. 'కుమారున్ - అత్యనఘున్ - ఆత్మసమానున్ - ఆత్మజున్ - ఆపగేయున్ - మహాయశున్' - అనే వరుసలో విశేషణాలు వాడి శంతనుడు దేవవ్రతునిలో కానవచ్చే గుణాలను క్రమంగా సహజంగా గుర్తించినట్లు నన్నయ వర్ణించాడు. ఇది ప్రసన్నకథాకవితలోని ఒక శిల్పం.

వ. **కని పుట్టిననాఁడ చూచినవాఁడు గావున నప్పు డెఱుంగనేరక విస్మయాకులిత చిత్తుం డయి యుండెఁ; గుమారుండు నాతనిం జూచి తండ్రిగా నెఱుంగనేరకయు నిసర్గస్నేహమోహితుం డై యుండె; నంత, 166**

తాత్పర్యం: ఆవిధంగా చూచి, అతడిని పుట్టిననాడుమాత్రమే చూచి ఉన్నాడు కాబట్టి ఆసమయంలో గుర్తించలేక శంతనుడు ఆశ్చర్యంతో కలతపడిన హృదయంకలవాడై ఉన్నాడు. ఆ బాలుడుకూడ శంతనుడిని చూచి తండ్రిగా గుర్తించలేకపోయినా సహజమైన అనురాగంతో ముగ్ధుడై ఉండిపోయాడు. అంతట (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **దివ్యభూషణాలంకృతదేహుఁ డైన । కొడుకు వలపలిచేయూఁది కోమలాంగి**
దివ్యనది ప్రీతితోఁ జనుదెంచి పతికిఁ । జూపి 'భూనాథ! వీఁడు నీ సూనుఁ' డనియె. 167

ప్రతిపదార్థం: దివ్య, భూషణ+అలంకృత, దేహుఁడు+ఐన= దేవతాసంబంధు లైన ఆభరణాలచేత అలంకరింపబడిన శరీరం కలవాడైన; కొడుకు, వలపలి, చేయి+ఊఁది= కొడుకుయొక్క కుడిచేయి పట్టుకొని; కోమల+అంగి, దివ్యనది= వనిత యైన గంగ; ప్రీతితోన్, చనుదెంచి= సంతోషంతో వచ్చి; పతికిన్+చూపి= భర్తకు ఆ కుమారుడిని చూపి; భూనాథ= ఓరాజా!; వీఁడు= ఈబాలుడు; నీ, సూనుఁడు= నీకుమారుడు; అనియెన్= అని చెప్పింది.

తాత్పర్యం: దివ్యాభరణాలతో అలంకరింపబడిన మేను కలవాడైన కొడుకుయొక్క కుడిచేయిపట్టుకొని గంగాదేవి ఆప్యాయంగా వచ్చి బాలుడిని భర్తకు చూపి, 'ప్రభూ! ఈ బాలుడు నీకుమారుడు' అని చెప్పింది.

వ. **మఱియును. 168**

ప్రతిపదార్థం: సుస్పష్టం.

తాత్పర్యం: ఇంకా ఏమంటే. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. సాంగంబు లగుచుండ సకలవేదంబులు । సదివె వసిష్ఠుతోఁ; సకలధర్మ
శాస్త్రాది బహువిధశాస్త్రముల్ శుక్రబృ । హస్పతుల్ నేర్చినయట్ల నేర్చెఁ
బరమాస్త్రవిద్య నప్పరశురాముం డెంత । దక్షుఁ డంతియ కడుదక్షుఁ డయ్యెఁ;
నాత్మవిజ్ఞానంబునందు సనత్కుమా । రాదుల యట్టిఁడ యనఘమూర్తి

ఆ. నొప్పుగొనుము వీని; నుర్వీశ!' యని సుతు । నిచ్చి గంగ సనిన, నెఱిఁగి తనయు
నెమ్మిఁ దోడుకొనుచు నిధి గన్నపేదయ । పోలె సంతసిల్లి భూవిభుండు. 169

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ= రాజా! వసిష్ఠుతోన్= వసిష్ఠుడివద్ద; స+అంగంబులు+అగుచున్+ఉండన్= అంగాలతో కూడికొని ఉండగా; సకల, వేదంబులు, చదివెన్= అన్ని వేదాలనూ చదివాడు; శుక్ర, బృహస్పతుల్, నేర్చిన, అట్లు+అ= రాక్షసులగురువైన శుక్రుడు, దేవతల గురువైన బృహస్పతి నేర్చిన విధంగానే; సకలధర్మశాస్త్ర+ఆది, బహువిధశాస్త్రముల్= ధర్మశాస్త్రం మొదలైన అనేక శాస్త్రాలనన్నింటిని; నేర్చెన్= నేర్చాడు; పరమ+అస్త్ర, విద్యన్= మంత్రసహితా లైన శ్రేష్ఠమైన అస్త్రాలను ప్రయోగించే విద్యలో; ఆ+పరశురాముండు+ఎంత, దక్షుఁడు= ఆజమదగ్నిపుత్రుడైన పరశురాముడు ఎంత సమర్థుడో; అంతియ, కడు, దక్షుఁడు+అయ్యెన్= అంతగా మిక్కిలి నేర్పరి అయినాడు; ఆత్మవిజ్ఞానంబునందున్= ఆధ్యాత్మిక జ్ఞానంలో; సనత్‌కుమార+ ఆదులు+అ, అట్టిఁడ, అనఘమూర్తిన్= సనత్కుమారుడు మొదలైనవారివలెనే పుణ్యమూర్తికలవాడు అయిన; వీనిన్= వీడిని; ఒప్పు, కొనుము= ఇష్టంతో గ్రహించుము; అని, సుతున్= ఇచ్చి= అని కొడుకును, ఒప్పగించి; గంగ, చనినన్= (గసడదవాదేశం) గంగాదేవి వెడలిపోగా; తనయున్= కుమారుడిని; ఎఱిఁగి= గుర్తించి; నెమ్మిన్= ప్రీతితో; తోడుకొనుచున్= వెంటతీసికొనివెళ్ళుతూ; నిధి, కన్న, పేద+అ,పోలెన్= డబ్బుపాతర(గుప్తధనం)ను కనుగొనిన పేదవాడివలె; భూవిభుండు= రాజు; సంతసిల్లి= సంతోషించి,

తాత్పర్యం: 'ఓ రాజా! ఇతడు వసిష్ఠుడివద్ద వేదాలను సాంగంగా చదివాడు; శుక్రుడు, బృహస్పతి నేర్చినట్లుగా సకలధర్మశాస్త్రాలను, వివిధశాస్త్రాలను నేర్చాడు; శ్రేష్ఠమైన అస్త్రాలన్నింటిని ప్రయోగించే నేర్పులో ఆ పరశురాముడు ఎంతసమర్థుడో అంతటిసమర్థుడైనాడు. ఆత్మజ్ఞానంలో సనత్కుమారాదులవలె పుణ్యాత్ముడైనవాడు. నీకుమారుడైన ఇతడిని స్వీకరించుము' అని శంతనుడికి కుమారుడిని ఒప్పచెప్పి వెడలిపోగా; శంతనుడు విషయమంతా తెలిసికొని పెన్నిధిని పొందిన పేదవాడివలె కొడుకును చూచి ఉప్పొంగిపోయి, అతడిని తనవెంట తీసికొనిపోయాడు.

విశేషం: అలం: ఉపమ; భార్యాపుత్రులు దూరమైన శంతనుడు ఎంతటిమహారాజైనా ఒంటరిగా ఎంతటిపేదవాడుగా కనబడతాడో, కొడుకుతో కూడుకొని ఉంటే ఎంతఅదృష్టవంతుడుగా గోచరిస్తాడో' పెన్నిధిని కనిన పేదవాడివలె' అనే పోలికతో నన్నయ రుచిరార్థదీప్తితో చెప్పాడు. వివిధరంగాలలో అత్యున్నతులు, ఆదర్శవంతులు అయినవారు- వసిష్ఠుడు, శుక్రుడు, బృహస్పతి, పరశురాముడు, సనత్‌కుమారుడు మొదలైనవారు. వారందరి పాండిత్యం ఒక్కటైతే ఎంతగొప్పదో అంతటి ఘనమైనవిద్వత్తు కలవాడు దేవవ్రతుడని వ్యంగ్యం. ఒక కామపురుషార్థాన్ని వదలి మిగిలిన పురుషార్థాలన్నింటికి సంబంధించిన విజ్ఞానాన్ని దేవవ్రతుడు గ్రహించాడని వస్తుధ్వని. సంతానంలేకుండ దీర్ఘకాలం ధర్మాత్ముడుగా భీష్ముని జీవితవృత్తానికి ఇటువంటి కథార్థాలు వ్యంజకాలై సార్థకా లౌతున్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. తన పురంబునకు వచ్చి సకలరాజన్య ప్రధాన సమక్షంబున గాంగేయునకు యౌవరాజ్యాభిషేకంబు సేసి, కొడుకుతోడి వినోదంబులం దగిలి నాలుగువత్సరంబు లనన్యవ్యాపారుండై యుండి, యొక్కనాఁడు యమునాతీరంబున వేఁటలాడుచుఁ గ్రుమ్మరువాఁ డపూర్వసురభిగంధం బాఘ్రాణించి దానివచ్చిన వల నారయుచు నరిగి యమునాతీరంబున. 170

ప్రతిపదార్థం: తన, పురంబునకున్, వచ్చి= తన రాజధానికి తిరిగివచ్చి; సకల, రాజన్య, ప్రధాన, సమక్షంబునన్= సమస్త సామంత ప్రభువులయొక్కయు, మంత్రులు మొదలైన రాజోద్యోగులలో ముఖ్యులైనవారియొక్కయు ఎదుటన్; గాంగేయునకున్= గంగకుమారుడైన దేవవ్రతునకు; యౌవరాజ్య+అభిషేకంబు, చేసి= యువరాజు పదవిలో అభిషేకించి; కొడుకుతోడి, వినోదంబులన్, తగిలి= కొడుకుతో కలిసి వేడుకలలో ఆసక్తుడై; నాలుగు, వత్సరంబులు, అనన్య, వ్యాపారుండు+ఐ, ఉండి= నాలుగేండ్లు మరే ఇతర వ్యాసంగాలు లేనివాడై ఉండి; ఒక్కనాఁడు= ఒకరోజున; యమునా, తీరంబునన్= యమునానదీతీరంలో; వేఁటలు+ఆడుచున్= వేటాడుతూ, క్రుమ్మరువాఁడు= తిరుగుతుండే అతడు; అపూర్వ, సురభి, గంధంబు+ఆఘ్రాణించి= అద్భుతమైన (అంతకుముందెరుగని) ఒక గంధద్రవ్యం యొక్క సువాసనను అనుభవించి; (వాసన చూచి); దాని, వచ్చిన, వలను+ఆరయుచున్, అరిగి= అది వచ్చిన దిక్కున వెదకుతూ వెళ్ళి; యమునాతీరంబునన్= యమునానది ఒడ్డున.

తాత్పర్యం: శంతనుడు తన రాజధానికి తిరిగివచ్చి సకలరాజప్రధానుల ఎదుట గాంగేయుడికి యౌవరాజ్యపట్టాభిషేకం చేసి కొడుకుతో వేడుకలు సలుపుతూ నాలుగేళ్ళు మరే వ్యాసంగాలూ లేకుండ ఉండి, ఒకనాడు యమునానదీతీరంలో వేటాడుతూ తిరుగుతుండగా ఒక అపూర్వ మైన సుగంధం వాసన చూచాడు. ఆ వాసన వస్తున్న దిక్కుననే వెళ్ళుతూ యమునాతీరంలో.

శంతనుఁడు సత్యవతిని భార్యగాఁగోరి ప్రతిహత మనోరథుఁ డగుట (సం. 1-94-41)

క. కనకావదాతకోమల । తనులతఁ దనుమధ్యఁ గమలదళనేత్రను యో
జనగంధి నవనినాథుఁడు । గనియెను సురకన్యవోని కన్నియ నంతన్. 171

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; అవనినాథుఁడు= రాజు; కనక,+అవదాత, కోమల, తనులతన్= బంగారంవలె స్వచ్ఛమైన (తెల్ల) మెత్తనిలతవంటి మేనుకలిగినది; తనుమధ్యన్= సన్నని నడుము కలిగినది; కమల, దళ, నేత్రను= తామరరేకులవంటి కన్నులు కలదానిని; యోజన, గంధిన్= ఆమడదూరందాకా మేనిసుగంధాన్ని వ్యాపింపచేసేది అనే సార్థకమైన పేరును కలది; సుర, కన్య, పోని, కన్నియన్= దేవకన్యవంటికన్యను; కనియెను= చూచాడు.

తాత్పర్యం: అప్పుడు రాజు బంగారువలె స్వచ్ఛమైన మృదువైన లతవంటి మేను కలిగినది, సన్నని నడుము కలది, తామరరేకులవంటి కన్నులు కలది, ఆమడదూరం మేని సుగంధాన్ని వ్యాపింపజేసేది, అయిన దేవకన్యవంటి కన్యను చూచాడు.

విశేషం: అలం: ఉపమ.

ఉ. దాని శరీరసౌరభము, దాని విలోల విలోకనంబులున్,
దాని మనోహరాకృతియు, దాని శుచిస్మిత వక్త్రకాంతియున్,

దాని విలాసముం గడుముదంబునఁ జూచి మనోజబాణసం
తానహతాత్ముఁ డై నృపతి దానికి ని ట్లనియెం బ్రియంబునన్. 172

ప్రతిపదార్థం: నృపతి= రాజు(శంతనుడు); దాని, శరీర, సౌరభమున్= ఆమెయొక్క మేనిసుగంధమును; దాని, విలోల, విలోకనంబులున్= ఆమెయొక్క కదలాడే చూపులు; దాని, మనోహర+ఆకృతియున్= ఆమెయొక్క అందమైన ఆకారం; దాని, శుచి, స్మిత, వక్ర్త, కాంతియున్= ఆమెయొక్క తెల్లని చిరునవ్వుకల ముఖకాంతియు; దాని, విలాసమున్= ఆమెయొక్క శృంగారహావభావలక్షణాన్నీ; కడు, ముదంబునన్= మిక్కిలి సంతోషంతో; చూచి= చూచి; మనోజ, బాణ, సంతాన; హత+ ఆత్ముఁడు+ఐ= మన్మథుడియొక్క బాణాల సమూహంతో కొట్టబడిన హృదయం కలిగినవాడై; ప్రియంబునన్= అనురాగంతో; దానికిన్= ఆమెతో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: శంతనుడు ఆమెశరీరపరిమళాన్నీ, ఆమె చలించే కన్నులనూ, ఆమె అందమైన ఆకారాన్నీ, తెల్లని చిరునవ్వుతో కూడిన ఆమెముఖకాంతినీ, ఆమెశృంగారహావభావలీలలను మిక్కిలిసంతోషంతో చూచి మన్మథబాణాలతో కొట్టబడినహృదయం కలిగినవాడై(మదనవికారానికి లోనై) అనురాగంతో ఆమెతో ఈవిధంగా అన్నాడు.

విశేషం: నన్నయగారి అక్షరరమ్యతకు అద్దం పట్టే రచన. యోజనగంధి మధురాకృతిలో ఉన్న సమవిభక్తమైన రూపవైభవాన్ని 'సమత' అనే శబ్దగుణంతో ధ్వనింపజేశాడు నన్నయ. అక్షరరమ్యత అంటే రచనలోని రమణీయాక్షరప్రయోగ పునరావృత్తులవలన కలిగే అందమే కాదు, పద, పదసముదాయాలవలన కలిగే అందమనికూడ అర్థం. ఇందులో రాజు ఆమె సౌందర్యాన్ని చూచి మన్మథబాణహతాత్ముడైనాడన్నది వర్ణ్యవస్తువు. మన్మథుడి బాణాలు అయిదు. నన్నయ నాయికను వర్ణించేటప్పుడు షష్ఠీవిభక్త్యంతాలైన తచ్ఛబ్దాలు ('దాని' అనే సర్వనామాలు) అయిదింటితో అయిదు విశేషణాలను ప్రయోగించటం సార్థకం. ఆమె శరీర విలాసాలే పంచబాణాల వంటివని కవిప్రౌఢోక్తిసిద్ధమైన వస్తుధ్వని. ముదంబునన్ అనే మాట అభిలాషను ధ్వనింపజేస్తున్నది. పద్యపూర్వార్ధంలో నాయికా సౌందర్యవర్ణనం, ఉత్తరార్ధంలో నాయకుడి అభిలాషవర్ణనం. పూర్వార్ధంలో సమతాగుణం నాయికా సౌందర్యదర్శకం. మొత్తంపద్యంలో భాసించే మాధుర్యం రతిభావవ్యంజకం, నాయికయందు 'శుచిస్మితవక్ర్తకాంతి' అనేది విశిష్టసౌందర్యలక్షణంగా నన్నయ నిర్దేశించాడు. రాబోయే పద్యంలోకూడా దానిని పేర్కొన్నాడు. మనసులోని మర్మాన్ని ముసిముసినవ్వులతో ముద్దుముద్దుగా ధ్వనింపజేయగల ముద్దరాలు యోజనగంధి.

ఉ. 'ఎందులదాన? వేకతమ యియ్యమునానది నోడ నడ్పుచున్
సుందరి! నీకు నున్కి యిది చూడఁగఁ దా నుచితంబె?' నావుడున్
మందమనోజ్ఞహాసముఖమండల మెత్తి మృగాక్షి చూచి సం
క్రందనసన్నిభున్ నృపతిఁ గన్యక యి ట్లని పల్కెఁ బ్రీతితోన్. 173

ప్రతిపదార్థం: సుందరి= అందమైనదానా! ఎందుల, దానవు= ఎక్కడిదానవు?; ఏకతము+అ= ఒంటరిగా; ఈ+యమునానదిన్= ఈ యమునానదిలో; ఓడ, నడ్పుచున్, నీకున్, ఉన్కి= పడవ నడుపుతూ నీవు ఉండటం; ఇది, చూడఁగన్, తాన్, ఉచితంబు+ఎ= చూడటానికి ఇది యోగ్యంగా లేదు; నావుడున్= అనగా విని; కన్యక= ఆ కన్య; మంద, మనోజ్ఞ, హాస, ముఖ, మండలము+ఎత్తి= అంద మైన చిరునవ్వు గల గుండ్రనిముఖాన్ని పైకెత్తి; మృగ+అక్షి= లేడికన్నులవంటి కన్నులుగల ఆమె; సంక్రందన, సన్నిభున్, నృపతిన్= ఇంద్రుడిని పోలిన ఆ రాజును; చూచి; ప్రీతితోన్= సంతోషంతో; ఇట్లు+అని, పల్కెన్.

తాత్పర్యం: 'అందమైనదానా! నీ వెక్కడిదానవు? ఒంటరిగా ఈ యమునానదిలో పడవనడుపుకొంటూ నీవు ఈ విధంగా ఉండటం చూడటానికి ఉచితంగా ఉన్నదా? (లేదు)' అని రాజుఅనగా విని ఆ కన్య చిరునవ్వుతో అందమైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గుంద్రని ముఖం పైకెత్తి లేడికన్నుల వంటి కన్నులతో ఇంద్రుడిని పోలిన ఆ రాజును చూచి సంతోషంతో ఈ విధంగా అన్నది.

విశేషం: అలం: ఉపమ. నన్నయగారి అక్షరరమ్యతకు చక్కని ఉదాహరణ ఈపద్యరచన.ఈ పద్యపు ఎత్తుగడ తరువాతికవులకు ఎందరికో ఆయాసందర్భాలలో స్ఫూర్తి నిచ్చింది. పద్యపూర్వార్ధంలో వాచికాభినయం, ఉత్తరార్ధంలో ఆంగికాభినయం వర్ణించి నాయకుడి అభిలాషను, నాయిక ఆభిముఖ్యాన్నీ నాటకీయతతో ధ్వనింపజేసి, రసధ్వనికి వస్తుధ్వనిని పోషకంగా నిలిపిన మాధుర్యగుణవిశిష్ట మైన రచన యిది.

విశేషం: అలం: ఉపమ.

వ. **'ఏను దాశరాజుకూఁతురఁ; దండ్రి నియోగంబున నిక్కార్యంబు ధర్మార్థంబు సేయుచుందు' ననిన దాని యభినవ రూపసౌందర్యంబులు దొల్లియు విని యెఱింగినవాఁ డై యక్కోమలిం గామించి దాశరాజుకడకుం జని తనయభిప్రాయం బెఱింగించిన, నతండును సంతసిల్లి శంతను నత్యంతభక్తిం బూజించి యి ట్లనియె.174**

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: 'నేను దాశరాజుకూతురిని; తండ్రిగారి ఆజ్ఞచేత ఈపనిని ధర్మంకోసం చేస్తుంటాను' అనిఅనగా దాని క్రొంగ్రొత్త రూప సౌందర్యాలను ఇదివరకే విని తెలిసికొన్నవాడు కావటంచేత, ఆ లలితాంగిపై కోర్కెపడి దాశరాజు వద్దకు వెళ్ళి తనఅభిప్రాయాన్ని తెలిపాడు. దాశరాజు సంతోషించి శంతనుడిని మిక్కిలిభక్తితో పూజించి ఈ విధంగా అన్నాడు.

తే. **పుట్టినప్పుడ కన్యకఁ బోలునట్టి । వరుస కిచ్చుట యిది లోకవర్తనంబు;**
వసుమతీనాథ! నీయట్టి వరున కిచ్చి । ధన్యులము గామె యిక్కన్యఁ దద్ద పేర్మి. 175

ప్రతిపదార్థం: పుట్టి, నప్పుడు+అ= పుట్టినప్పుడే; కన్యకన్, పోలునట్టి, వరునకున్+ఇచ్చుట= కన్యకను అనువైన వరునకు ఇవ్వటం; ఇది= అనేది; లోకవర్తనంబు= లోకమర్యాద; వసుమతీ, నాథ!= భూపతీ; నీ+అట్టి, వరునకున్= నీవంటి(యోగ్యుడైన) వరునకు; ఈ+కన్యన్= ఈకన్యను(యోజనగంధిని); తద్ద, పేర్మిన్= మిక్కిలి అనురక్తితో; ఇచ్చి; ధన్యులము, కామె= కృతార్థులం కామా! (ఔతా మని భావం).

తాత్పర్యం: పుట్టినప్పుడే కన్యను తగిన వరున కివ్వటం అనేది లోకమర్యాద. (పుట్టినప్పుడే ఆడపిల్లను ఒక అయ్యచేతిలో పెట్టాలి. అత డెక్కడో పుట్టే ఉంటా డని భావించటం లోక పరిపాటి). రాజా! ఈకన్యను మిక్కిలి మక్కువతో నీవంటి ఉత్తము డైన వరున కిచ్చి కృతార్థులం కామా?

వ. **'అయినను నా డెందంబునం గలదానిం జెప్పెద; నిక్కన్యక నీకు ధర్మపత్నిగాఁ జేయునట్టి యిష్టంబు గలదేని నావేఁడిన దాని ని'మ్మనినన శంతనుండు 'దాని నీనగునేని యిచ్చెదఁ; గానినాఁడీనేర; నది యేమి సెప్పు' మనినన దాశరా జి ట్లనియె. 176**

ప్రతిపదార్థం: స్పష్టం.

తాత్పర్యం: 'అయినప్పటికీ, నామనస్సులో ఉన్నదానిని చెప్పుతాను. ఈకన్యకను భార్యగా చేసికొనే కోరిక నీకు ఉంటే నేను కోరినదానిని ఇ' మ్మనగా శంతనుడు 'అది ఇవ్వదగిందైతే ఇస్తాను; కాకపోతే ఈయలేను. అది ఏమిటో తెలియచెప్పుము' అనగా దాశరాజు ఈ విధంగా అన్నాడు.

మధ్యాక్కర.

'భూపాల! నీకు నిక్కోమలివలనఁ బుట్టిన సుతుఁడు
నీ పరోక్షంబున రాజు గావలె; నెమ్మి ని ట్లీఁగ
నోపుదే?' యనిన శంతనుఁడు గాంగేయు యువరాజుఁ దలఁచి
'యీపల్కు దక్కఁగ నొండు వేఁడుమ యిచ్చెద' ననిన. 177

ప్రతిపదార్థం: భూపాల!= రాజా!; నీకున్; ఈ, కోమలివలనన్, పుట్టిన, సుతుఁడు= ఈ సుకుమారివలన కలిగిన కొడుకు; నీ, పరోక్షంబునన్, రాజు, కావలెన్= నీ తరువాత రాజు కావాలి; నెమ్మిన్= ప్రీతితో; ఇట్లు+ఈఁగన్, ఓపుదు+ఏ, అనినన్= ఈవిధంగా మాట ఇవ్వగలవా అని అనగా; శంతనుండు; గాంగేయున్, యువరాజున్, తలఁచి= యువరాజైన గాంగేయుడిని మనసులో జ్ఞాపకంచేసికొని; ఈపల్కు, తక్కఁగన్, ఒండు, వేఁడుము+ఇచ్చెదన్, అనినన్= ఈమాటతప్ప ఏదైనా వేరొకటి వేడుకో ఇస్తాను అనగా.

తాత్పర్యం: 'రాజా! నీకు ఈ సుకుమారివలన పుట్టిన కొడుకు నీ అనంతరం రాజ్యానికి రాజు అయ్యేటట్లు ప్రీతిగా మాట ఇవ్వగలవా?' అని అడుగగా శంతనుడు యువరాజయిన గాంగేయుడిని భావించి, 'ఈమాట తప్ప వేరే ఏమైనను వేడుకో ఇస్తాను' అని అనగా. (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: మధ్యాక్కర ప్రతిచరణంలో వరుసగా 2 ఇంద్రగణాలు, 1 సూర్యగణం, 2 ఇంద్రగణాలు, 1 సూర్యగణం ఉంటాయి. నన్నయ 5వ గణంలోని మొదటి అక్షరాన్ని యతిగా పాటించాడు. ప్రాసనియమం ఉంది.

గాంగేయుఁడు బ్రహ్మచర్యవ్రతంబుఁ బూని భీష్ముం డగుట (సం. 1-94-54.)

వ. 'నా కొండెద్దియు నిష్టంబు లే' దనిన విని, యద్దాశరాజుచేతం బ్రతిహత మనోరథుం డయి, క్రమ్మఱి నిజపురంబునకు వచ్చి, శంతనుండు చింతాక్రాంతుం డయి సత్యవతిన తలంచుచు, నివృత్తకార్యాంతరుం డయియున్న; నొక్కనాఁడు గాంగేయుండు తండ్రిపాలికి వచ్చి యి ట్లనియె. 178

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: 'నాకు మరేదియు ఇష్టం లే' దనగా విని, ఆ దాశరాజుచేత నిరాకరింపబడిన కోరికకలవాడై, తిరిగి తన పట్టణానికి వచ్చి, శంతనుడు విచారంచేత ఆవరింపబడినవాడై సత్యవతినే తలుస్తూ రాజకార్యాలనుండి దూరమై ఉండగా, ఒకనాడు గాంగేయుడు తండ్రిచెంతకు వచ్చి ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. భవదభిరక్షితక్షితికి బాధ యొనర్ప(గ నోపునట్టి శా
త్రవనివహంబు లేదు; వసుధాప్రజకెల్ల ననంతసంతతో
త్సవముల; రాజులెల్ల ననిశంబు విధేయుల నీకు; నిట్లు మా
నవవృషభేంద్ర! యేలొకొ మనఃపరితాపము(బొందియుండ(గన్. 179

ప్రతిపదార్థం: మానవ, వృషభ+ఇంద్ర= మానవులలో శ్రేష్ఠుడైనవాడా!; భవత్, అభిరక్షిత, క్షితికిన్= నీచేత లెస్సగా రక్షింపబడిన ఈ రాజ్యానికి(భూమికి); బాధ, ఒనర్ప(గన్, ఓపునట్టి, శాత్రవ, నివహంబు, లేదు=ఇబ్బంది కలిగించ గలిగిన శత్రుసమూహంలేదు; వసుధా, ప్రజకున్+ఎల్లన్= భూమిపైని జనులందరికిని; అనంత, సంతత+ఉత్సవములు+అ= అపారంగా ఎల్లప్పుడూ సంతోషాలే; నీకున్; అనిశంబున్= ఎల్లప్పుడు; రాజులు+ఎల్లన్= రాజులందరు; విధేయులు+అ= లొంగిఉన్నవారే; ఇట్లు= ఈవిధంగా; మనస్+పరితాపమున్= మనోవేదనను; పొంది+ఉండ(గన్= కలిగిఉండటం; ఏల+ఒకొ= ఎందుకో కదా!

తాత్పర్యం: మానవులలో శ్రేష్ఠుడైనవాడా! నీచేత లెస్సగా రక్షింపబడిన ఈ రాజ్యానికి సమస్య తెచ్చిపెట్టగల శత్రువుల సమూహం లేదు; దేశంలోని ప్రజల కందరికి అపారంగా ఎల్లప్పుడు శుభాలే కలుగుతున్నాయి; రాజులందరు ఎప్పుడూ నీకు లొంగిఉన్నారు, మరి - ఈవిధంగా మనోవేదన పొంది ఉండటానికి కారణ మేమిటో?

విశేషం: శంతనుడి మనోవ్యథకు కారణం తెలియక, ఆయననే అడిగి తెలిసికొందామని గాంగేయుడు రెండు ప్రశ్న లడిగాడు. ఆ రెండూ రాజ్యరక్షణకు సంబంధించినవే. శంతనుడికి అంతఃపుర సమస్యలు లేవు కాబట్టి గాంగేయు డాదిశలో ఆలోచించలేదు. రాజ్యరక్షణ విషయాలలోకూడా బయటి శత్రువులు, అంతశ్శత్రువులు అనే అంశాలకే ప్రాధాన్య మిచ్చాడు. రాజ్యాన్ని ఆక్రమించే శత్రుకూటాలు పేరుకుకూడా లేవు; సామంతరాజు లందరూ ప్రజలు సుఖంగా ఉండటంచేత అణగిమణిగియే ఉన్నారు. ఇక చింతకు కారణమేమిటని ప్రశ్న. శంతనుడి మనోవ్యథ బైటివారి కెవ్వరికీ చెప్పుకొనలేని సున్నితమైనదని నన్నయ ఈ పరామర్శద్వారా వివక్షితవాచ్యధ్వనిగా నిబంధించాడు.

వ. అనిన విని పెద్దయుంబ్రొద్దు చింతించి శంతనుండు గొడుకున కి ట్లనియె. 180

ప్రతిపదార్థం: సుస్పష్టం.

తాత్పర్యం: అనగా విని చాలసేపు ఆలోచించి శంతనుడు కొడుకుతో ఈవిధంగా అన్నాడు.

విశేషం: మనసులోని మాట చెప్పుకోలేక ఎంతోకాలం చింతించాడు శంతనుడు. గాంగేయు డడిగిన తరువాత ఎట్లా చెప్పవలెనా అని కొంతకాలం చింతించాడనటంవలన కథలో ఉత్కంఠ పెరుగుతుంది. శంతనుడు చెప్పే మాటలపై అవధానం కలుగుతుంది. కథాకవితలో ఇటువంటి రచన శిల్పసుందరం.

క. వినవయ్య! యేకపుత్త్రు(డు । ననపత్యు(డు నొక్కరూప యని ధర్మువులన్
విని, నీకు(దోడు పుత్త్రుల । ననఘా! పడయంగ నిష్టమయినది నాకున్. 181

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; వినవయ్య= వినుము; ధర్మువులన్= ధర్మశాస్త్రాలలో; ఏక, పుత్త్రు(డు= ఒకేఒకకొడుకు కలవాడు; అనపత్యు(డు= సంతానం లేనివాడు; ఒక్క, రూపు+అ= ఒక్కటే, సమానమే; అని; విని; నాకున్; నీకున్, తోడు=నీకు సహాయంగా ఉండే; పుత్త్రులన్, పడయంగన్, ఇష్టము+అయినది= కొడుకులను పొందటానికి కోరిక కలిగింది.

తాత్పర్యం: ఓపుణ్యాత్ముడా! వినుము. ఒకే ఒక కొడుకు కలవాడు, సంతానం లేనివాడు - వీరిద్దరూ సమానులే అని ధర్మశాస్త్రాలలో విని, నీకు తోడుగా మరికొందరు కొడుకులను పొందా లని నాకు కోరిక కలిగింది.

విశేషం: శంతనుడు తన అభిప్రాయాన్ని సుసంగతంగా ప్రతిపాదిస్తున్నాడు. తర్కంలో 'నా ఉసంగతం ప్రయుంజీత' అని ఉన్నది. అసంగతాన్ని ప్రయోగించకూడదు కాబట్టి శంతనుడు అసంగతం కాని వాక్యం మాటాడినట్లు నన్నయ చిత్రించాడు. మాటాడే మాటల్లో పూర్వోత్తర సంబంధం ఉండటం సంగతి అంటారు. అది ప్రసంగం, ఉపోద్ఘాతం, హేతుత్వం, అవసరం, కార్యైక్యం, కారణైక్యం అని ఆరువిధాలు. వాటిని నిపుణంగా ప్రయోగించి నన్నయ రుచిరార్థసూక్తినైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాడు. 'వివాహ మౌతాను' (184) అని ఫలితాంశంగా చెప్పదలచుకొని దానిని ఎదుటివారు తర్కసహంగా అంగీకరించేట్లు ప్రసంగం చేశాడు. దాని మొదలే ఈ పద్యం. లోకంలో ఏకపుత్రుడూ, అనపత్యుడూ ఒకటే నని ధర్మశాస్త్రాలంటాయని శాస్త్రప్రమాణంతో ప్రసంగం మొదలు పెట్టి, భీష్ముడికి తోడుగా మరికొంతమంది కొడుకులను పొందాలని ఉన్నదని ఉపోద్ఘాతం ప్రారంభించాడు. 'పుత్రులకొరకు పెళ్ళి' అనే తర్కంతో మొదలుపెట్టటం శంతనుడి లోకజ్ఞత.

క. జనవినుత! యగ్నిహోత్రం । బును సంతానమును వేదములు నెడతెగఁగాఁ
జన దుత్తమవంశజులకు । ననిరి మహాధర్మనిపుణు లైన మునీంద్రుల్. 182

ప్రతిపదార్థం: జనవినుత= ప్రజలచేత కీర్తింపబడువాడా!; మహత్+ధర్మ, నిపుణులు+ఐన, ముని+ఇంద్రుల్= గొప్పధర్మశాస్త్ర నిర్ణయాలలో నిపుణులైన ఋషిశ్రేష్ఠులు; ఉత్తమ, వంశజులకున్= శ్రేష్ఠమైన వంశాలలో పుట్టినవారికి; అగ్నిహోత్రంబును= నిత్యకర్మాధికారాన్ని ఇచ్చే అగ్నికార్యం చేసికొనటానికి రక్షించుకొనే అగ్నిహోత్రమున్నూ; సంతానమును= వంశం విచ్ఛిన్నం కాకుండా రక్షించే సంతానమున్నూ; వేదములున్= జీవనవిధానానికి త్రోవచూపించే ఇహపరసాధనాలైన వేదాలున్నూ; ఎడతెగన్, కాన్= విడివడేటట్లు; చనదు= చేయకూడదు; అనిరి= అన్నారు.

తాత్పర్యం: ప్రజలచేత ప్రశంసింపబడే ఓ గాంగేయా! ఉత్తమధర్మ శాస్త్రనిర్ణయాలలో నిపుణులైన ఋషివరులు 'ఉత్తమవంశాలలో పుట్టినవారు అగ్నిహోత్రాన్నీ, సంతానాన్నీ, వేదాలనూ తమ గృహాలలో విచ్ఛిన్న మయ్యేటట్లు చేసికొనరా' దని అన్నారు.

విశేషం: ఈ పద్యంలో శంతనుడు తన కోర్కెను ధర్మవేత్తలైనవారి (ఆప్త) ప్రమాణంతో హేతుబద్ధం చేస్తున్నాడు. అంటే హేతుత్వమనే సంగతిని కల్పిస్తున్నా డన్నమాట. ఎడతెగకుండా అగ్నిని, సంతానాన్ని, వేదాలను రక్షించుకొనాలని వారన్నారని పేర్కొన్నాడు. గాంగేయు డున్నాడు కదా! మరి సంతానం ఎడతెగిపోవటం ఎలా కలుగుతుంది? అనే ఆకాంక్ష దానివలన కలుగుతుంది. (పూర్వం గంగవలన ఏడుగురు కొడుకులను పొందికూడా వారిని గంగపాలు చేసికొన్న స్మృతి ఇక్కడ వస్తుగత ధ్వనిగా గమ్యమానం).

క. నీవస్త్ర శస్త్ర విద్యా । కోవిదుఁడవు; రణములందుఁ గ్రూరుఁడ; వరివి
ద్రావణ సాహసికుండవు । గావున నీయునికి నమ్మఁగా నేర నెదన్. 183

ప్రతిపదార్థం: నీవు= (గాంగేయుడు); అస్త్ర, శస్త్ర, విద్యా, కోవిదుఁడవు= మంత్రసహిత, మంత్రరహిత బాణాలను ప్రయోగించే విద్యలో పండితుడవు; రణములందున్= యుద్ధాలలో; క్రూరుఁడవు= దయాదాక్షిణ్యాలు లేని కరకువాడివి; అరి, విద్రావణ, సాహసికుండవు= శత్రువులను అణచటంలో వెనుకముందు చూడని తెగువరివి; కావునన్= కాబట్టి; నీ+ఉనికిన్= నీవు ఉండటాన్ని (బ్రతికి ఉండటాన్ని); ఎదన్= మనస్సులో; నమ్మఁగాన్, నేరను= నమ్మజాలను.

తాత్పర్యం: నీవు అస్త్రశస్త్రవిద్యలో పండితుడవు; యుద్ధాలలో దయాదాక్షిణ్యాలు లేని కరకువాడివి; శత్రువులను సంహరించటంలో వెనుకముం దాలోచించని సాహసికుడవు. (ఈమూడు గుణాలూ ఎప్పుడో ఒకప్పుడు నీకు ప్రమాదాన్ని తెచ్చిపెట్టేవే) కాబట్టి నీవు దీర్ఘకాలం బ్రతుకుతా వని నేను మనసులో నమ్మలేకపోతున్నాను.

విశేషం: గాంగేయు డుండగాకూడా బహుపుత్త్రులకొరకు ప్రయత్నం చేయవలసిన 'అవసరం' అనే సంగతి ఇందులో ప్రస్తావించబడింది. గాంగేయుడు అస్త్రశస్త్రవిద్యలలో ఎంతటి నిపుణుడో, రణరంగంలో అంతటి క్రూరుడు. శత్రువులను వెనుకముందు చూడకుండా చంపే సాహసానికి ఒడిగట్టేవాడు; అందువలన అతడికి మృత్యువు ఎప్పుడైనా ఏర్పడవచ్చును అని బహుపుత్త్రకాంక్షకు గల అవసరాన్ని చెప్పాడు. గాంగేయుడు దీర్ఘకాలం జీవిస్తాడని గంగ ఇదివరలో సూచించింది. కాని, అది ఇప్పటి అవసరానికి అనువైనది కాదు. అందువలన దానిని కప్పిఉంచాడు. దీనికి ఫలితంగా తరువాత శంతనుడు భీష్ముడికి స్వేచ్ఛా మరణాన్ని వరంగా ప్రసాదించి దీర్ఘాయువుగా దీవించాడు.

వ. 'బహుపుత్త్రార్థంబు యత్నంబు సేయవలయు; వివాహం బయ్యెద' ననిన విని గాంగేయుండు వృద్ధామాత్యపురోహితసుహృజ్జనంబులతోవిచారించి, యోజనగంధి రాజు చిత్తంబునం గలుగుట యెఱింగి, యనేక రాజన్యసమన్వితుం డయి దాశరాజుకడకుం జని' మారాజునకు సత్యవతిని దేవింగా నిచ్చునది' యని యడిగిన; నాతండును దేవవ్రతుం బూజించి, 'నీవు ధర్మశీలుండ, వర్థానర్థవిదుండవు, సకలకార్య సమర్థుండవు. గుర్వర్థంబు కన్యార్థివై వచ్చితివి కావునం గృతార్థుండ నైతి; నెవ్వనియేని వీర్యంబున నిక్కన్య యుద్భవిల్లె నట్టి యుపరిచరుం డను రాజర్షి 'యీ సత్యవతి నొరుల కీవలవదు; శంతనునక యిచ్చునది' యనుటంజేసి తొల్లి యసితుం డయిన దేవలుండు కన్యార్థి యయి వచ్చి ప్రత్యాఖ్యాతుం డయ్యె; నిట్టి సంబంధ మెవ్వరికిఁ బడయనగు?' 184

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: 'అనేక పుత్త్రులకొరకు ప్రయత్నం చేయాలి. వివాహం చేసికొంటాను' అని శంతనుడు అనగా గాంగేయుడు పెద్దలు, మంత్రులు, పురోహితులు, మిత్రులు మొదలైనవారితో ఆలోచించి రాజుమనసులో యోజనగంధి ఉన్నదని తెలిసికొని అనేక సామంతరాజులతో కలిసి దాశరాజువద్దకు వెళ్ళి 'మారాజుకు సత్యవతిని రాణిగా ఇ' మ్మని అడిగాడు. దాశరాజు దేవవ్రతుడిని గౌరవించి 'నీవు ధర్మాన్ని ఆచరించే స్వభావం కలవాడవు. ఉచితానుచితాలు (లాభనష్టాలను గురించి) తెలిసినవాడవు; అన్ని కార్యాలనూ నిర్వహింపగలవాడవు; తండ్రికొరకు కన్యను కోరటానికి వచ్చావు కాబట్టి నేను ధన్యుడనైనాను. ఈకన్య ఎవరివీర్యంవలన పుట్టిందో ఆ రాజర్షి ఉపరిచరుడు ఈ సత్యవతిని ఇతరుల కెవ్వరికీ ఈయవద్దనీ, శంతనునకు ఇమ్మనీ అన్నాడు. కాబట్టే, పూర్వం అసితవంశానికి చెందిన దేవలుడు కన్యను కోరి వచ్చి నాచే తిరస్కరింపబడ్డాడు. ఇటువంటి ఈసంబంధాన్ని ఎవరు పొందగలరు?'

విశేషం: 'బహుపుత్త్రార్థంబు యత్నంబు సేయవలయు' అనే వాక్యంవలన పైన చెప్పబడిన వాక్యార్థరూపకార్యాలకన్నింటికీ ఐక్యరూపమైన తాత్పర్యం ప్రతిపాదింపబడింది. ఇదే కార్యైక్యం. ఇక నిశ్చితాంశం- 'వివాహంబయ్యెద' అనే నిర్ణయం. ఇది సర్వకారణాలకూ కార్యరూపమైన ఫలితాంశం, ప్రతిపాద్యాంశం. తర్కబద్ధమైన, సంగత మైన వాదనైపుణ్యంతో శంతనుడు ప్రసంగం చేయటం నన్నయగారి నానారుచిరార్థసూక్తి వైభవానికి నిదర్శనం. శంతను డెంత తర్కబద్ధంగా తన నిశ్చయాన్ని

చెప్పినా, ఎవరితో వివాహం కావాలని కోరుకొంటున్నాడో గాంగేయుడికి చెప్పలేదు. అది ఉచితంకూడా. గాంగేయుడు మంత్రుల మంతనాలలో దానిని తెలిసికొన గలిగాడు. గాంగేయుడికి వ్యంగ్యమైనది పఠితకు వాచ్యమే. అందువలన దానిని సూచించి వదలి ఔచిత్యాన్ని పాటించాడు నన్నయ.

శంతనుడి వాదనలో ఎంతటి 'సంగతి' ఉన్నదో దాశరాజువాక్యంలోకూడా అంతటి 'సంగతి' నిపాటించి రచనాశిల్పంలో సరితూకాన్ని నన్నయ పాటించాడు. 'మారాజుకు సత్యవతిని దేవిగా ఇవ్వండి' అని గాంగేయుడు అడగటం ప్రసంగం. దాశరాజు గాంగేయుడిని ప్రశంసించటం, సత్యవతిని శంతనుడికి తప్ప మరొకరికి ఇచ్చే అవకాశం లేకపోవటం, ఇదివరకే దేవలుడు ఆమెను కోరగా నిరాకరించటం మొదలైన బిగువైన అంశాలతో ఉపోద్ఘాతం దాశరాజు ఇచ్చాడు. అతడి మాటలనుబట్టి సత్యవతి శంతనుడికొరకే పుట్టినట్లు స్పష్టమయింది. దానివలన హేతుత్వంకూడా సిద్ధించింది.

క. విను మైనను సాపత్న్యం । బను దోషము కలదు దీన; నదియును నీచే
తన సంపాద్యము; నీ వలి । గిన నడ్డమె పురహరాజకేశవు లయినన్. 185

ప్రతిపదార్థం: ఐనను= అయినప్పటికిని; వినుము; దీనన్= శంతనునకు యోజనగంధి నిచ్చి వివాహం చేయటంవలన; సాపత్న్యంబు+అను, దోషము= సవతి(రెండవభార్య)కి పుట్టారు అనే దోషం(ఆమె బిడ్డలకు); కలదు= ఉండగలదు; అదియును= అందులోను; నీచేతన్+అ= నీవలననే(నీవు శంతనునకు మొదటిభార్యవలన పుట్టిఉండటంవలన); సంపాద్యము= కలిగేది; నీవు+అలిగినన్= నీవు కోపిస్తే; పుర, హర, అజ, కేశవులు+అయినన్= త్రిపురసంహారకు డైన శివుడు, బ్రహ్మ, విష్ణువు అయినను; అడ్డమె?= ఎదురునిలువగలరా? (నిలువలేరని భావం).

తాత్పర్యం: అయినా నేను చెప్పేది వినుము - 'శంతనుడికి యోజనగంధి నీయటంవలన, సవతిసంతాన మనే దోషం ఆమె బిడ్డలకు ఏర్పడుతుంది. అందులోనూ అది నీవలననే ఏర్పడుతుంది. కాగా, నీవు కోపిస్తే త్రిమూర్తులుకూడ నీయెదుట నిలువగలరా? (నిలువలే రని భావం).

విశేషం: పెద్దరాణి కుమారు డుండగా తరువాతి రాణుల కొడుకులకు రాజ్యాధికారం ఉండదు. కాబట్టి సాపత్న్యమనే దోషం ఏర్పడింది. ఆ దోష నివారణోపాయాన్ని రాబోయే వచనంలో కోరాడు. అంటే 'అవసరం' అనే సంగతిని ప్రయోగించాడన్నమాట. 'నీ చేతన సంపాద్యము' అనే పాఠాంతరం 'నీ చేతన పరిహార్యము' అనే పాఠం కంటె ఉత్తమం. అందువలన ఇది గ్రాహ్యం.

వ. 'ఆ దోషం బెట్లు పరిహృతంబగు నట్లుగా నీచిత్తంబునం దలంచి వివాహంబు సేయు' మనిన గాంగేయుం
డి ట్లనియె. 186

ప్రతిపదార్థం: విస్పష్టం.

తాత్పర్యం: 'ఆ దోషం ఏవిధంగా తొలగింపబడుతుందో ఆవిధంగా నీమనస్సులో భావించి(నిర్ణయించుకొని) వివాహం జరుపు' మని అనగా గాంగేయుడు ఈ విధంగా పలికాడు.

విశేషం: అవసరమనే సంగతి బలంగా ప్రతిపాదింపబడింది. గాంగేయు డుండగా సత్యవతి సంతానానికి రాజ్యాధికారం రాదు. ఈ కార్యవైరుద్ధ్యానికి ఐక్యత కూర్చవలసినవాడు గాంగేయుడే. అందువలన అతడు ప్రతిజ్ఞ చేయబోతున్నాడు రాబోయే పద్యంలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. వినుఁడు ప్రసిద్ధులైన పృథివీపతు లిందఱు నే గురుప్రయో
జనమునఁ జేసితిన్ సమయసంస్థితి; యీలలితాంగి కుద్భవిం
చిన తనయుండ రాజ్యమును జేయఁగ నర్హుఁడు; వాఁడ మాకు నె
ల్లను బతి; వాఁడ కౌరవకులస్థితికారుఁ డుదారసంపదన్. 187

ప్రతిపదార్థం: ప్రసిద్ధులు+ఐన, పృథివీపతులు+ఇందఱున్= ప్రఖ్యాతులైన రాజులు ఇంతమంది; వినుఁడు= వినండి; ఏన్= నేను; గురుప్రయోజనమునన్= తండ్రియొక్క కార్యాన్ని ఉద్దేశించి; సమయ, సంస్థితి= ప్రతిజ్ఞయొక్క వ్యవస్థ (కలకాలం చక్కగా నిలిచే ప్రతిజ్ఞ)ను; చేసితిన్= చేశాను; ఈ, లలిత+అంగికిన్= కోమలమైన మేనుగల ఈవనితకు; ఉద్భవించిన= పుట్టిన; తనయుండు+అ= కొడుకే; రాజ్యమును, చేయఁగన్+అర్హుఁడు= రాజ్యం చేయటానికి హక్కుకలవాడు(యోగ్యుడు); వాఁడు+అ= అతడుమాత్రమే; మాకున్+ఎల్లను, పతి= మాకందరికి ప్రభువు; వాఁడు+అ= అతడే; ఉదార, సంపదన్= గొప్పదైన వైభవంతో; కౌరవ, కుల, స్థితి, కారుఁడు= కౌరవవంశంయొక్క అస్తిత్వానికి హేతువు (అంటే అతని సంతానమే భావికాలంలో కౌరవవంశం చక్రవర్తిత్వానికి అర్హత పొంది ఉంటుందని భావం)

తాత్పర్యం: ఇచ్చట సమావేశమైయున్న ప్రసిద్ధప్రభువు లందరూ వినండి. నేను తండ్రిగారి ప్రయోజనం కొరకు స్థిరమైన ఒక ప్రతిజ్ఞ చేశాను. అదేమంటే - ఈమెకు పుట్టినకొడుకే రాజ్యం చేయటానికి హక్కుగలవా డౌతాడు; అతడే మాకందరికి ప్రభువుగా పరిగణింపబడతాడు; అతడే గొప్ప దైన సంపత్తితో కౌరవవంశాన్ని నిలిపేవాడు ఔతాడు.

విశేషం: శంతనుడికి సత్యవతివలన పుట్టిన పుత్రుడే అతడి తరువాత సింహాసనార్హు డౌతాడని రాజుల ఎదుట గాంగేయుడు ప్రతిజ్ఞ చేయటంతో సాపత్న్యదోషం తొలగి కార్యం (సత్యవతిని శంతనుడి కిచ్చి వివాహం చేయటం) లో ఐక్యత ఏర్పడింది. అంటే కార్యనిర్వహణానికి మార్గం ఏర్పడిందని భావం. ఇది కార్యైక్యమనే సంగతి.

వ. అని సభాసదులకెల్ల రోమహర్షణంబుగా సత్యవ్రతుండయిన దేవవ్రతుండు పలికిన వెండియు దాశరా
జిట్లనియె. 188

ప్రతిపదార్థం: సభాసదులు= సభలో ఉన్నవారు; వెండియున్= మరల.

తాత్పర్యం: అని సభలో ఉన్న ధర్మజ్ఞులందరు గగుర్పాటు పొందేటట్లుగా సత్యమే జీవితదీక్షగా గల దేవవ్రతుడు పలుకగా దాశరాజు ఇంకను ఈ విధంగా అన్నాడు.

క. 'నీ వఖిల ధర్మవిదుఁడవు । గావున నీ కిట్ల చేయఁగా దొరకొనియెన్;
భావిభవత్సుతు లిట్టిరె? । నీవిహితస్థితియు సలుపనేర్తురె?' యనినన్. 189

ప్రతిపదార్థం: నీవు; అఖిల, ధర్మ, విదుఁడవు= సమస్తధర్మాలను తెలిసినవాడవు; కావునన్= కాబట్టి; నీకున్; ఇట్లు+అ, చేయఁగాన్, దొరకొనియెన్= ఈవిధంగా చేయటానికి చెల్లింది(సిద్ధించింది); భావి, భవత్, సుతులు= ముందుకాలంలోని నీ కొడుకులు; ఇట్టిరె= ఇటువంటివారే ఔతారా?; నీ, విహిత, స్థితియున్= నీచేత విధింపబడిన కట్టడిని; సలుపనేర్తురు+ఎ= అమలుచేయగలరా? (లేరని భావం); అనినన్= అని అనగా.

తాత్పర్యం: నీవు సమస్తధర్మాలను తెలిసినవాడవు కాబట్టి నీ కీవిధంగా చేయటం చెల్లింది. కాని, ముందుకాలంలో నీ కొడుకులు ఇటువంటివారే కాగలరా? నీవు విధించిన ఈ నియమాన్ని వారు పాటించగలరా? - అని అనగా.

క. ధృతిఁ బూని బ్రహ్మచర్య । వ్రత మున్నతిఁ దాల్చితిని ధ్రువంబుగ; ననప
త్యత యైనను లోకము లా । యతిఁ బెక్కులు గలవు నాకు ననుభావ్యము లై. 190

ప్రతిపదార్థం: ధృతిన్= స్థిరంగా; పూని= పూనుకొని; బ్రహ్మచర్యవ్రతము= వివాహ మాడకుండ బ్రహ్మచారిగనే జీవితాంతంవరకు ఉండే దీక్షను; ఉన్నతిన్= ఉదాత్తంగా; ధ్రువంబుగన్= నిశ్చితంగా; తాల్చితిని= ధరించాను; అనపత్యత, ఐనను= సంతానంలేని (భావం)స్థితి నాకు కలిగినప్పటికి; నాకున్; ఆయతిన్= రాబోయే కాలంలో; లోకములు, పెక్కులు= అనేకలోకాలు; అనుభావ్యములు+ఐ= అనుభవింపదగినవై; కలవు= ఉన్నవి.

తాత్పర్యం: స్థిర మైన బుద్ధితో పూనుకొని బ్రహ్మచర్యవ్రతాన్ని నిశ్చితంగా సమున్నతంగా స్వీకరించాను. దానివలన సంతానంలేని స్థితి నాకు కలిగినప్పటికీ, రాబోయేకాలంలో అనేకలోకాలు నాకు అనుభవింపదగినవై ఉన్నవి.

విశేషం: ఇక్కడ కారణైక్య మనే సంగతి సిద్ధించింది. దాశరాజు పెట్టిన నియమానికి మూలకారణాలు మూడు. గాంగేయుడి అడ్డు ఉండకూడదు; గాంగేయుడి సంతతివలన కలిగే ఇబ్బందులు ఉండకూడదు. చిన్నరాణి సంతాన మైనా సత్యవతి కొడుకులకే రాజ్యం కావాలి. ఈ కారణాలన్నీ భీష్ముడి బ్రహ్మచర్యదీక్షతో సమగ్రంగా ఐక్యతను పొందాయి. సుసంగత వాక్యవిన్యాసం నన్నయగారి రుచిరార్థసూక్తికి రమణీయ వైభవం.

వ. అని యిట్లు సత్యవతిని దనతండ్రికి వివాహంబు సేయుపొంటె నిజరాజ్యపరిత్యాగంబును బ్రహ్మచర్య వ్రత పరిగ్రహణంబును జేసిన దేవవ్రతు సత్యవ్రతంబునకు గురుకార్యధురంధరత్వంబునకు మెచ్చి దేవర్షి గణంబులు నాతనిపయిం బుష్పవృష్టిఁ గురిసి భీష్ముం డని పొగడిరి. దాశరాజును గరంబు సంతసిల్లి శంతనునకు సత్యవతి నిచ్చె నంత. 191

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: అని ఈవిధంగా సత్యవతిని తనతండ్రి అయిన శంతనున కిచ్చి పెండ్లిచేయటంకొరకు తనకువారసత్వంగా వచ్చే రాజ్యాన్ని వదలి పెట్టటమూ, బ్రహ్మచర్యవ్రతాన్ని స్వీకరించటమూ చేసిన దేవవ్రతుడి యొక్క సత్యనిష్ఠనూ, తండ్రికార్యాన్ని నిర్వహించటంలో ప్రదర్శించిన నేర్పరితనాన్నీ మెచ్చుకొని దేవతలూ, ఋషిసమూహాలు ఆతనిమీద పూలవాన కురిపించి 'భీష్ముడు' అని ప్రశంసించారు. దాశరాజుకూడ మిక్కిలి సంతోషించి శంతనుడికి సత్యవతిని ఇచ్చాడు. ఆ తరువాత- (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. ఇనతేజుం డతిభక్తిఁ గాంచనరథం బెక్కించి యక్కన్యఁ దో
డ్కొని తెచ్చెం దనతల్లి సత్యవతినిన్ క్షోణీజనుల్ దన్ను బో
రనఁ గీర్తింపఁగ శంతనుం డతిమనోరాగంబునం బొంద శాం
తనవుం డాతతకీర్తి హస్తిపురికిం దత్కౌతుకారంభుఁ డై. 192

ప్రతిపదార్థం: ఇనతేజుండు= సూర్యుడివలె ప్రకాశించేవాడైన భీష్ముడు, ఆ+కన్యన్= ఆ కన్యను(సత్యవతిని); తన, తల్లిన్= తనకు తల్లివరుస అయినదానిని; అతి, భక్తిన్= మిక్కిలి భక్తితో; కాంచనరథంబు+ఎక్కించి= బంగారుతేరును ఎక్కించి; తోడు+కొని= వెంటతీసికొని; తన్నున్= తనను; క్షోణీ, జనుల్= భూప్రజలు; బోరనన్, కీర్తింపఁగన్= వెంటవెంటనే ప్రశంసించగా; శంతనుండు; అతి, మనో, రాగంబునన్, పొందన్= మిక్కిలి హృదయాహ్లాదాన్ని అనుభవించగా; ఆతతకీర్తి= విస్తారమైన కీర్తికలవాడైన; శాంతనవుండు= శంతనుడి కుమారుడైన భీష్ముడు; హస్తిపురికిన్= హస్తినాపురానికి; తద్+కౌతుక+ఆరంభుఁడు+ఐ= దాని పండుగను మొదలు పెట్టినవాడై; తెచ్చెన్= తెచ్చెను.

తాత్పర్యం: సూర్యుడివలె ప్రకాశించే భీష్ముడు ఆ కన్యకను, తనకు తల్లి అయినదానిని, సత్యవతిని భూప్రజలందరు తనను తేపతేపకు జయజయధ్వానాలతో కీర్తిస్తూ ఉండగా, శంతనుడు మనసులోని మమకారాన్ని భావించి తన్మయత్వాన్ని పొందుతూ ఉండగా, విశాలకీర్తిని గడించిన శంతనుడిపుత్రుడు హస్తినాపురికి ఆమెకు వేడుకను కలిగించేవాడై తనవెంట తీసికొనివచ్చాడు.

చిత్రాంగదా విచిత్రవీర్యుల వృత్తాంతము (సం. 1-95-1)

వ. శంతనుండును బరమానురాగంబున సత్యవతిని వివాహంబై, యతిమానుషం బయిన యాభీష్మ సత్యవ్రతంబునకు సంతసిల్లి, యాతనికి స్వచ్ఛందమరణంబుగా వరం బిచ్చి, సత్యవతియందుఁ జిత్రాంగద విచిత్రవీర్యులన నిద్దరు కొడుకులం బడసి, వారలు సంప్రాప్తయౌవనులు గాకుండఁ బరలోకగతుం డైనఁ, దండ్రికి భీష్ముండు పరలోకక్రియలు నిర్వర్తించి, చిత్రాంగదు రాజ్యాభిషిక్తుం జేసిన; నాతండును నతివ్యాలోలుండై గర్వంబున నెవ్వరి నుఱక సురదనుజ మనుజ గంధర్వాదుల నాక్షేపించుచున్న వాని కలిగి చిత్రాంగదుం డను గంధర్వపతి యుద్ధార్థియయి వచ్చినం గురుక్షేత్రంబునందు. 193

ప్రతిపదార్థం: శంతనుండును; పరమ+అనురాగంబునన్= అమితమైన ప్రేమతో; సత్యవతిని; వివాహంబు+ఐ; అతి, మానుషంబు+అయిన= మానవాతీతమైన; ఆ, భీష్మ, సత్య, వ్రతంబునకున్= ఆ భీష్ముడియొక్క సత్యనిష్ఠకు; సంతసిల్లి= సంతోషించి; ఆతనికిన్= భీష్ముడికి; స్వచ్ఛంద, మరణంబుగాన్= తాను కోరుకొన్నప్పుడే తనకు చావుకలిగేటట్లు; వరంబు= ఇచ్చి; సత్యవతియందు; చిత్రాంగద, విచిత్రవీర్యులు+అనన్; ఇద్దరు, కొడుకులన్; పడసి= పొంది; వారలు= ఆకొడుకులు; సంప్రాప్త, యౌవనులు, కాకుండన్= పొందబడిన యౌవనం కలవారు (యువకులు) కాకుండగనే; పరలోక, గతుండు+ఐనన్= స్వర్గలోకానికి వెళ్లగా(మరణించగా); తండ్రికిన్= శంతనుడికి; భీష్ముండు; పరలోక, క్రియలు, నిర్వర్తించి= చనిపోయినవారు ఉత్తమలోకాలను పొందటానికి చేసే వేదవిహితక్రియాకలాపాలను చేసి; చిత్రాంగదున్, రాజ్య+అభిషిక్తున్, చేసినన్= చిత్రాంగదుడిని రాజ్యానికి రాజుగా అభిషేకించగా; ఆతండును= చిత్రాంగదుడును; అతి, వ్యాలోలుండు+ఐ= మిక్కిలి లౌల్యంకలవాడై (చంచలుడై); గర్వంబునన్= అహంకారం చేత; ఎవ్వరిన్= ఎవ్వరినీ; ఉఱక= లెక్కచేయక; సుర, దనుజ, మనుజ, గంధర్వ+ఆదులన్= దేవతలు, రాక్షసులు, మానవులు, గంధర్వులు మొదలైనవారిని; ఆక్షేపించుచున్+ఉన్నన్= ఎగతాళి చేస్తూ ఉండగా; వానికిన్+ అలిగి= అతనిపై కోపించి; చిత్రాంగదుండు+అను, గంధర్వ, పతి= చిత్రాంగదుడు అనే గంధర్వరాజు; యుద్ధ+అర్థి+అయి, వచ్చినన్= యుద్ధాన్ని కోరి రాగా; కురుక్షేత్రంబునందున్= కురుక్షేత్రంలో.

తాత్పర్యం: శంతనుడు అమితమైన ప్రేమతో సత్యవతిని వివాహమాడి, మానవమాత్రులకు అసాధ్యమైన ఆ భీష్ముడి సత్యనిష్ఠకు సంతోషించి అతనికి అతని ఇచ్ఛ వచ్చినప్పుడు మరణించేటటువంటి వరమిచ్చి, సత్యవతియందు

చిత్రాంగద విచిత్రవీర్యు లనే ఇద్దరు కొడుకులను పొంది, వారు యువకులు కాకుండానే పరలోకానికి పోయాడు. భీష్ముడు తండ్రికి అపరక్రియలు చేసి, చిత్రాంగదుడికి రాజ్యాభిషేకం చేశాడు. అతడు కడు చంచలుడై అహంకారంతో ఎవ్వరిని లెక్కచేయక దేవతలను, రాక్షసులను, మానవులను, గంధర్వాదులను లక్ష్యం చేయక మాటాడుతుండగా అతని ప్రవర్తనకు కోపించి చిత్రాంగదు డనే గంధర్వరాజు తనతో ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానించాడు. అప్పుడు కురుక్షేత్రంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నరగంధర్వాధిపు ల । య్యిరువురు చిత్రాంగదులు సహింపక యని నొం
డొరుఁ దాఁకి వీఁకఁ బొడిచిరి । హిరణ్వతీ తీరమున నహీనబలాఢ్యుల్. 194

ప్రతిపదార్థం: నర, గంధర్వ+అధిపులు= నరులకూ, గంధర్వులకూ రాజు లైన; ఆ+ఇరువురు, చిత్రాంగదులు= ఆ ఇద్దరు చిత్రాంగదులు; సహింపక= ఒకరినొకరు లెక్కచేసికొనకుండ; అనిన్= యుద్ధంలో; ఒండు+ఒరున్, తాకి= ఒకరి నొకరు ఢీకొని; వీఁకన్= పరాక్రమంతో; అహీన, బల+ఆఢ్యుల్= తక్కువకాని బలసంపద కలవారైనవారు; హిరణ్వతీ, తీరమునన్= హిరణ్వతీనదీతీరంలో; పొడిచిరి= పోట్లాడుకొన్నారు.

తాత్పర్యం: నరులకు, గంధర్వులకు ప్రభువు లైన ఆ ఇద్దరు చిత్రాంగదులు లెక్కచేయక యుద్ధంలో ఒకరినొకరు ఎదుర్కొని తరుగని బల మనే ధనం గలవారు హిరణ్వతీనదీతీరంలో పోట్లాడుకొన్నారు.

విశేషం: చిత్రాంగదుడిపై అదే పేరుగల గంధర్వపతి కోపించి యుద్ధానికి పిలవటం విశేషం. అది ద్వంద్వయుద్ధం కావటంచేత భీష్ముడు యుద్ధం చేయలేదు.

క. వదలక మాయాయుద్ధా । తిదక్షుఁ డయి వంచనోన్నతిన్ గంధర్వుం
డుదితరవితేజుఁ జిత్రాం । గదుఁ జంపె విచిత్ర పత్త్రకార్ముకహస్తున్. 195

ప్రతిపదార్థం: గంధర్వుండు; మాయా, యుద్ధ+అతి, దక్షుఁడు+అయి= మాయతో చేసే యుద్ధంలో మిక్కిలి నేర్పరి అయి; విచిత్ర, పత్త్ర, కార్ముక, హస్తున్= అపూర్వాలైన బాణాలను విండ్లను చేత ధరించినవాడైన; ఉదిత, రవి, తేజున్= ఉదయించిన సూర్యుడివలె ప్రకాశించేవాడైన, చిత్రాంగదున్; వదలక= వీడక; వంచన+ఉన్నతిన్= మిక్కిలి మోసంతో; చంపెన్= చంపాడు.

తాత్పర్యం: మాయాయుద్ధంలో మిక్కిలి నేర్పరి అయిన గంధర్వుడు విచిత్రాలైన బాణకోదండాలను ధరించి ఉదయించే సూర్యుడివలె ప్రకాశించే చిత్రాంగదుడిని పట్టువిడవకుండా పోరి చంపాడు.

వ. ఇట్లు చిత్రాంగదుండు గంధర్వనిహతుం డయినఁ, దత్పరోక్షంబున భీష్ముండు విచిత్రవీర్యుం గౌరవరాజ్యంబున కభిషిక్తుం జేసిన. 196

ప్రతిపదార్థం: గంధర్వనిహతుండు= గంధర్వునిచే చంపబడినవాడు.

తాత్పర్యం: ఈవిధంగా చిత్రాంగదుడు గంధర్వుడిచేత చంపబడగా అతడి తరువాత భీష్ముడు విచిత్రవీర్యుడిని కౌరవరాజ్యానికి రాజుగా అభిషేకించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **వసునిభుఁడు పైతృకం బగు । వసుధా రాజ్యంబు భీష్మవచనమున గత**
వ్యసనుఁడయి తాల్చెఁ దేజం । బెసగంగ విచిత్రవీర్యుఁ డిద్ధయశుం డై. 197

ప్రతిపదార్థం: వసునిభుఁడు= వసురాజువంటివాడైన; విచిత్రవీర్యుఁడు; భీష్మ, వచనమునన్= భీష్ముడియొక్క ఆజ్ఞచొప్పున; పైతృకంబు+అగు= తండ్రినుండి వారసత్వంగా వచ్చే; వసుధారాజ్యంబు= భూపాలనం; గత, వ్యసనుండు+అయి= ఆపదలు లేనివాడై; తేజంబు+ఎసగంగన్= పరాక్రమం ఒప్పారగా; ఇద్ధ+యశుండు+ఐ= నిర్మలమైన కీర్తికలవాడై; తాల్చెన్= వహించాడు.

తాత్పర్యం: వసురాజువంటివా డైన విచిత్రవీర్యుఁడు భీష్ముడి ఆజ్ఞ చొప్పున భయరహితు డై నిజపరాక్రమం నిండారగా నిర్మలకీర్తితో భూపాలనాన్ని చేపట్టాడు.

భీష్ముఁడు కాశీరాజుకూఁతుల స్వయంవరమున కరుగుట (సం. 1-96-4)

వ. **అట్టి విచిత్రవీర్యు నారూఢయౌవనుం జూచి భీష్ముండు వివాహయత్నపరుం డయి తన చారులవలనం గాశీరాజు కూఁతుల స్వయంవరోత్సవంబు విని ధనుర్ధరుం డయి రథం బెక్కి యొక్కరుండును వారణాసీపురంబునకుం జని యందు స్వయంవరంబునకు మూఁగిన రాజలోకం బెల్ల వెఱచి వెఱుఁగుపడి చూచుచుండ నక్కన్యకలఁ దనరథం బెక్కించికొని యెల్లవారలు విన ని ట్లనియె.** 198

తాత్పర్యం: అటువంటి విచిత్రవీర్యుడు యౌవనం పొందగా గమనించి, భీష్ముడు అతడికి వివాహంచేసే ప్రయత్నంలో నిమగ్నుడై తనగూఢచారులవలన కాశీరాజుయొక్క కుమార్తెల స్వయంవరోత్సవం జరుగుతున్నదని విని, ధనుస్సును ధరించి రథమెక్కి ఒక్కడే వారణాసీ నగరానికి పోయి, ఆ నగరంలో స్వయంవరం నిమిత్తం సమావేశమైన రాజుల సమూహాలు భయపడి నిశ్చేష్టులై చూస్తూ ఉండగా ఆకన్యలను తనరథంమీద ఎక్కించుకొని అందరూ వినేటట్లు ఈవిధంగా అన్నాడు.

క. **నాయనుజునకు వివాహము । సేయఁగఁ గన్యాత్రయంబుఁ జేకొని బలిమిం**
బోయెద నడ్డం బగు వా । రాయతభుజశక్తి నడ్డమగుఁ డాజిమొనన్. 199

ప్రతిపదార్థం: నా, అనుజునకున్= నాతమ్ముడికి; వివాహము, చేయఁగన్= పెండ్లిచేయటానికి; కన్యా, త్రయంబున్= కన్యలుముగ్గురిని; బలిమిన్= బలవంతంగా, పరాక్రమంతో; చేకొని, పోయెదన్= తీసికొనిపోతాను; అడ్డంబు+అగువారు= అడ్డువచ్చేవారు; ఆజి, మొనన్= యుద్ధవ్యూహంతో; ఆయత, భుజ, శక్తిన్= విస్తారమైన భుజబలంతో, అడ్డము+అగుఁడు= అడ్డగించండి.

తాత్పర్యం: ఈ కన్యలు ముగ్గురినీ నాతమ్ముడి కిచ్చి పెండ్లి చేయటానికై బలంతో బలవంతంగా తీసికొనిపోతాను. అడ్డుతగిలేవారు అపారభుజబలంతో యుద్ధవ్యూహంతో అడ్డగించండి.

వ. **'బ్రాహ్మంబు మొదలుగాఁగల యెనిమిది వివాహములయందు క్షత్త్రియులకుఁ గాంధర్వ రాక్షసంబు లుత్తమంబులు; స్వయంవరంబున జయించి వివాహం బగుట యంతకంటె నత్యుత్తమంబు గావున నిమ్మూఁగినరాజలోకంబు నెల్ల నోడించి యిక్కన్యలం దోడ్కొని నాచనుట యిది ధర్మంబ' యని కాశీరాజునకుం జెప్పి వీడ్కొని భీష్ముండు వచ్చునప్పుడు.** 200

ప్రతిపదార్థం: మూఁగిన= గుమికూడిన.

తాత్పర్యం: బ్రాహ్మం మొదలుకొని ఎనిమిది రకాల వివాహాలలో క్షత్త్రియులకు గాంధర్వం, రాక్షసం అనేవి రెండూ శ్రేష్ఠా లైనవి. స్వయంవరంలో జయించి పెండ్లిచేసికోవటం అంతకంటె ఎంతో శ్రేష్ఠం. కాబట్టి ఇక్కడ కూడిన రాజులయొక్క సమూహాన్నంతా ఓడించి ఈకన్యలను తీసికొని నేను పోవటం అనేది న్యాయమే అని కాశీరాజుకు చెప్పి వీడ్కోలు పలికి భీష్ముడు తిరిగి వచ్చేటప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. నరనాగాశ్వవరూథయూథములతో నానావనీనాథు లు
ద్ధురు లై యొక్కట నొండొరుం జఱచి యుత్తుంగానిలోద్ధూత సా
గరసంక్షోభసమంబుగాఁ గలఁగి వీఁకన్ వీరులై తాఁకి యే
సిరి దేవవ్రతుపై నభోవలయ మచ్ఛిద్రంబుగా నమ్ములన్. 201

ప్రతిపదార్థం: నానా+అవనీ, నాథులు= వివిధ దేశాలకు రాజులైనవారు; నర, నాగ, అశ్వ, వరూథ, యూథములతోన్= భటులయొక్కయు, ఏనుగులయొక్కయు, గుఱ్ఱాలయొక్కయు, సైన్యాల సమూహాలతో; ఒక్కటన్= ఒక్కచోట; ఒండొరున్, చఱచి= ఒకరినొకరు భుజాలపై చరచుకొని (ఐక్యతను తెలుపుకొని); ఉత్తుంగ+అనిల+ఉద్ధూత, సాగర, సంక్షోభ, సమంబుగాన్= గాలిచేత ఎత్తుగా ఎగురగొట్టబడిన (అలలుగల) సముద్రంయొక్క ఘోషతో సరి అయినదిగా; కలఁగి= కోపించి; వీఁకన్= గర్వంతో; వీరులు+ఐ= పౌరుషవంతులై; తాఁకి= ఢీకొని, ఎదిరించి; దేవవ్రతుపైన్= దేవవ్రతుడిమీద; నభోవలయము, న+ఛిద్రంబుకాన్= ఆకాశగోళంలో సందులేకుండ; అమ్ములన్= బాణాలను; ఏసిరి= గుప్పించారు.

తాత్పర్యం: వివిధ దేశాలకు అధిపతులైన రాజులందరు పదాతులు, ఏనుగులు, అశ్వాలు, సైన్యసమూహాలతో కలిసి ఒకచోట చేరి పరస్పరం (ప్రోత్సహించుకొంటూ) భుజాలపై చరచుకొంటూ బలమైన గాలితో ఎగురగొట్టబడిన అలలతో కూడిన సముద్రఘోషతో సమానంగా రోషంతో కోపించి గర్వంతో పౌరుషవంతులై ఎదిరించి ఆకాశవలయంలో ఆవంతసందులేకుండ దేవవ్రతుడిమీద బాణాలు గుప్పించారు.

విశేషం: అలం: ఉపమ, చతురంగబల సమీకరణాన్ని, సామూహిక యుద్ధ సంక్షోభాన్నీ, బాణాల గుప్పింపునూ వ్యక్తీకరించే అక్షర రమ్యతకు ఓజోగుణదీప్తికి ఈరచన ఉదాహరణ.

క. వారల నందఱ రౌద్రా । కారుం డై కసిమసంగి గాంగేయుఁడు దు
ర్వార పటుబాణనిహతిని । వీరాహవరంగమునకు విముఖులఁ జేసెన్. 202

ప్రతిపదార్థం: గాంగేయుఁడు= గంగాకుమారుడైన భీష్ముడు; రౌద్ర+ఆకారుండు+ఐ= భయంకరమైన కోపంతో కూడిన రూపం కలవాడై; వారలన్+అందఱన్= వారందరిని; కసిమసంగి= విజృంభించి; దుర్వార, పటు, బాణ, నిహతిని= వారించటానికి శక్యంగాని బలమైన బాణాల తాకిడిచేత; వీర+ఆహవ, రంగమునకున్= వీరయుద్ధభూమికి; విముఖులన్, చేసెన్= దూరమయ్యేవారిగా చేశాడు (యుద్ధభూమిని వదలి పారిపోయేటట్లు చేశా డని భావం).

తాత్పర్యం: భీష్ముడు తీవ్రమైన కోపంగలవాడై విజృంభించి, త్రిప్పికొట్టటానికి శక్యంగాని బలమైన బాణాల దెబ్బలచేత రాజులనందరిని వీరయుద్ధభూమినుండి వైదొలగిపోయేటట్లు చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. నెఱి నుఱక వైరి వీరుల । నెఱఁకుల దూఱంగ నేయు నృపపుంగవు నం
పఱ కోర్వక పిఱు సని రని । వెఱచి విషణ్ణు లయి సకలవిషయాధిపతుల్. 203

ప్రతిపదార్థం: సకల, విషయ+అధిపతుల్= సమస్త దేశాలయొక్క రాజులు; నెఱిన్, ఉఱక= ఇంచుకైనా లక్ష్యపెట్టక తాకునట్లు; వైరి, వీరుల, నెఱఁకులన్, దూఱంగన్= శత్రువులైన వీరులయొక్క మర్మస్థానాలలో గ్రుచ్చుకొనేటట్లు; ఏయు= బాణాలను వేయు; నృప, పుంగవు= రాజశ్రేష్ఠుడి (భీష్ముడి)యొక్క; అంపఱకున్= బాణాలకు; ఓర్వక= తాళలేక; అనిన్, వెఱచి= యుద్ధంచేయటానికి భయపడి; విషణ్ణులు+అయి= దుఃఖితులై, పిఱు, చనిరి= వెనుదిరిగి పోయారు.

తాత్పర్యం: సమస్తదేశాల ప్రభువులందరు భీష్ముడు తమపై క్రమంగా తాకేటట్లు శత్రువీరుల మర్మాలలో గ్రుచ్చుకొనేటట్లు బాణాలను సంధించి వేస్తూ ఉంటే ఆ బాణాలకు తాళలేక దుఃఖితులై యుద్ధంచేయటానికి భయపడి వెనుతిరిగిపోయారు.

వ. ఇట్లు నిఖిలక్షత్త్రియక్షయార్థం బలిగిన పరశురాముండునుంబోలెఁ గడు నలిగి, పరశురామశిష్యుం డా క్షత్త్రవర్గంబునెల్లఁ దన శరధారావర్షంబున ముంచి యోడించి యేకవీరుం డయి వచ్చువాని పిఱుంద సమరసన్నద్ధుం డయి సాల్వుండు సనుదెంచి. 204

ప్రతిపదార్థం: పిఱుందన్= వెంబడి, వెనుక, సమరసన్నద్ధుండు= యుద్ధమునకు సిద్ధపడినవాడు.

తాత్పర్యం: ఈవిధంగా సమస్తక్షత్త్రియులను నశింపచేయటానికి కోపించిన పరశురాముడి విధంగా మిక్కిలి కోపించి పరశురాముడి శిష్యుడైన భీష్ముడు ఆ రాజుల సమూహాన్నంతా తన బాణధారలనే వానలో ముంచి ఓడించి ఏకవీరుడు (యుద్ధంలో పెక్కురను ఒక్కడే నిస్సహాయంగా ఓడించిన మేటివీరుడు) అయి వస్తూఉండగా అతని వెన్నంటి యుద్ధానికి సిద్ధమై సాల్వుడు వచ్చి.

విశేషం: అలం: భీష్ముడు పరశురాముడి వలె అలిగాడన్నచోట ఉపమ; శరధారావర్షంలో రూపకం.

సాల్వుఁడు భీష్మునితో యుద్ధంబు సేయుట (సం. 1-96-27)

ఉ. 'ఈవసుధాధినాథుల జయించిన యట్టిద కాదు; చక్కనై
పోవక నిల్వు నా కెదిరిపోర మదీయధనుర్విముక్త నా
నావిధ మార్గణోగ్ర గహనంబున దిగ్భ్రమఁబొంద కెమ్మెయిం
బోవఁగఁ బోలు నీకనుచుఁ బూరుకులోత్తముఁ దాఁకె వీఁకతోన్. 205

ప్రతిపదార్థం: ఈ, వసుధా+అధినాథులన్, జయించిన, అట్టిది+అ, కాదు= ఈ రాజులను జయించటంవంటిదే కాదు; నాకున్+ఎదిరి, పోరన్, చక్కన+ఐ, పోవక, నిల్వు(ము)= నాతో ఎదురొడ్డి యుద్ధంచేయటానికి, పోకుండ నిలువబడు; మదీయ, ధనుర్విముక్త, నానా, విధ, మార్గణ+ఉగ్ర, గహనంబునన్= నాయొక్కవిల్లునుండి విడువబడిన పెక్కురకాలైన బాణా లనే భయంకర మైన అడవిలో; దిక్+భ్రమన్, పొందక= దిక్కులు తెలియని ఆశ్చర్యం పొందకుండా; ఏ+మెయిన్, పోవఁగన్,

పోలున్, నీకున్+అనుచున్= నీకు ఏవిధంగా పోవటానికి వీలౌతుందని అంటూ; వీఁకతోన్= గర్వంతో; పూరు, కుల+ఉత్తమున్= పూరు మహారాజు వంశంలో శ్రేష్ఠుడైన భీష్ముడిని; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: 'ఈ రాజులను జయించటం అదొక జయం కాదు. అట్లా సూటిగా పోకుండ నన్ను ఎదురించి యుద్ధంచేయటానికి నిలుచుండుము. నా విల్లునుండి విడువబడిన బహువిధాలైన బాణా లనే భయంకరమైన అరణ్యంలో దిక్కుత్రోవలు తెలియక అబ్బురపాటుపొందకుండా ఎక్కడికిపోతావు?' అని అంటూ సాల్వుడు పూరువంశంలో ఉత్తముడైన భీష్మునిమీద గర్వంతో బాణాలు వేశాడు.

విశేషం: అలం: రూపకం.

వ. భీష్ముండును దనరథంబు నివర్తింపించి సంవర్తసమయ సమవర్తియుంబోలె నతిరౌద్రాకారుండయి నిలిచిన. 206

తాత్పర్యం: భీష్ముడుకూడ తనరథాన్ని వెనుకకు త్రిప్పించి ప్రళయకాలంలోని యముడివలె మిక్కిలి భయంకర మైన (రుద్రసంబంధమైన) ఆకారంకలవాడై నిలువగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

చ. 'అనిలజవంబునం బఱచు నమ్మదనాగ మెదిర్చి క్రమ్మఱిం
చిన పరికాఁడ పోలెఁ గురుసింహవరూథము నిట్లు గ్రమ్మఱిం
చునె యితఁ' డంచునుం దగిలి చూపఱు సాల్వమహీశు విక్రమం
బొనరఁగ నల్గడం బొగడుచుండిరి విస్మయసక్తచిత్తు లై. 207

ప్రతిపదార్థం: అనిలజవంబునన్= వాయువేగంతో; పఱచు= పరుగెత్తు; ఆ+మదనాగము+ఎదిర్చి= ఆ మదించిన ఏనుగును ఎదిరించి; క్రమ్మఱించిన= మళ్ళించిన; పరికాఁడు+అ; పోలెన్= తెగకు ముఖ్యమైన ఏనుగువలె; కురుసింహ, వరూథమున్= కురువంశంలో శ్రేష్ఠుడైన భీష్మునియొక్క సైన్యాన్ని; ఇట్లు= ఈవిధంగా; ఇతఁడు= సాల్వుడు; క్రమ్మఱించునె= మళ్ళింపగలిగాడే; అంచునున్= అనిఅంటూ; తగిలి= ఆసక్తితో; చూపఱు= చూచేవారు; విస్మయ, సక్త, చిత్తులు+ఐ= ఆశ్చర్యంతోకూడిన మనస్సులు కలవారై; సాల్వ, మహీ+ఈశు, విక్రమంబు= సాల్వభూపతి పరాక్రమాన్ని; నల్గడన్= నాల్గుదిక్కులా; పొగడుచున్+ఉండిరి= పొగడుతూ ఉండిపోయారు.

తాత్పర్యం: 'వాయువేగంతో పరుగెత్తే మదించిన ఏనుగును ఎదిరించి మళ్ళించిన ఆ తెగకు ముఖ్యమైన ఏనుగువలె కురుశ్రేష్ఠుడైన భీష్ముడియొక్క సైన్యాన్ని ఈవిధంగా ఇతడు మళ్ళించాడే' - అంటూ ఆసక్తితో చూచేవారు ఆశ్చర్యంతో నిండిన మనస్సులతో సాల్వభూపతి పరాక్రమాన్ని నాల్గుదిక్కులా పొగడుతూ ఉండిపోయారు.

విశేషం: అలం: ఉపమ.

వ. అంత. 208

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తరువాత (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ధృతిమెయి శతసంఖ్యయు దశ । శతసంఖ్యయు శతసహస్రసంఖ్యయును శతా
యుత సంఖ్యయుఁగా దేవ । వ్రతుమీఁదను సాల్వుఁ డేసె వాఁడిశరంబుల్. 209

ప్రతిపదార్థం: సాల్వుఁడు; ధృతి, మెయిన్= ధైర్యంతో; వాఁడిశరంబుల్= పదను గల బాణాలను; శతసంఖ్యయున్= నూరుసంఖ్యలో; దశ, శతసంఖ్యయున్= పదినూర్లు అంటే వేయి సంఖ్యలో; శత, సహస్ర, సంఖ్యయును= నూరువేల (లక్ష) సంఖ్యలో; శత+అయుత, సంఖ్యయున్, కాన్= నూరుపదివేల (పదిలక్షల) సంఖ్యలుగా; దేవవ్రతు, మీఁదను= దేవవ్రతుడను పేరు గల భీష్ముడిమీద; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: సాల్వుడు ధైర్యంతో భీష్ముడిమీద పదనైన బాణాలను వరుసగా నూరు, వేయి, లక్ష, పదిలక్షల సంఖ్యలలో ప్రయోగించాడు.

క. ఘనభుజుఁ డన్నియు నడుమన । తునియఁగ వడి నేసి, వానితురగచయస్యం
దన సూతుల నొక్కొక య । మ్మునఁ ద్రెళ్ళఁగ నేసె భరతముఖ్యుఁడు పోరన్. 210

ప్రతిపదార్థం: ఘన, భుజుఁడు= గొప్పభుజాలు కలవాడైన; భరత, ముఖ్యుఁడు= భరతకులశ్రేష్ఠుడు - భీష్ముడు; పోరన్= యుద్ధంలో; అన్నియున్= సాల్వుడు ప్రయోగించిన బాణాల నన్నింటిని; నడుమన్+అ= మధ్యలోనే; తునియఁగన్= విరిగిపోయేటట్లు; వడిన్, ఏసి= వేగంగా బాణాలను ప్రయోగించి; వాని= సాల్వుడియొక్క; తురగ, చయ, స్యందన, సూతులన్= గుఱ్ఱాలసమూహాన్నీ, రథాన్నీ, రథాన్ని నడిపే సారథినీ; ఒక్కొక, అమ్మునన్= ఒక్కొక బాణంతో; త్రెళ్ళఁగన్= నేలపై కూలేటట్లు; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: గొప్ప భుజాలు కల ఆ భరతకులశ్రేష్ఠు డైన భీష్ముడు యుద్ధంలో సాల్వుడు ప్రయోగించిన బాణాల నన్నింటిని మధ్యలోనే తునిగిపోయేటట్లు వేగంగా బాణాలు ప్రయోగించి, అతడి గుఱ్ఱాలను, రథాలను, సారథినీ ఒక్కొక్కబాణంతో నేలపై కూలేటట్లు చేశాడు.

విశేషం: సాల్వుడు ఆశ్చర్యం కలిగించేటట్లు అధికసంఖ్యలో బాణాలను ప్రయోగించి భీష్ముడిని ఓడించటానికి యత్నించగా ఆబాణాలనన్నింటిని మధ్యలోనే త్రుంచివేసి, ఒక్కొక్కబాణంతోనే రథాన్నీ గుఱ్ఱాలనూ సారథిని చంపి అత్యద్భుత మనిపించుకొన్నా డని వ్యంగ్యం.

క. రథమును రథ్యంబులు సా । రథియును వృథ యైన భగ్నరథుఁ డై భాగీ
రథికొడుకుచేత విమనో । రథుఁ డై సాల్వుండు నిజపురంబున కరిగెన్. 211

ప్రతిపదార్థం: రథమును= రథమూ; రథ్యంబులున్= గుఱ్ఱాలూ; సారథియును= సారథియూ; వృథ+ఐనన్= పనికిరానివి కాగా; భగ్నరథుఁడు+ఐ= విరిగిన రథం కలవాడై; భాగీరథి, కొడుకుచేతన్= గంగాపుత్రుడైన భీష్ముడివలన; వి, మనోరథుఁడు+ఐ= వీగిపోయిన కోర్కెలు కలవాడై; సాల్వుండు= సాల్వుడు; నిజపురంబునకున్+అరిగెన్= తన రాజధానికి వెళ్ళాడు.

తాత్పర్యం: రథమూ, గుఱ్ఱాలూ, సారథీ పనికిరాకుండ పోగా సాల్వుడు రథం విరిగిపోవటమే కాకుండా మనోరథంబు (కోర్కె)కూడా వీగిపోయేటట్లు భీష్ముడు చేయగా చేసేది లేక తననగరానికి తిరిగివెళ్ళాడు.

వ. ఇట్లు సకలరాజలోకంబు నెల్ల నశ్రమంబున నోడించి సాల్వరాజు మందల విడిచి పరాక్రమలబ్ధ లయిన కాశీరాజదుహితలనంబాంబికాంబాలికలందోడ్కొని వచ్చి భీష్ముండు విచిత్రవీర్యునకు వివాహంబుసేయనున్న నందుఁ బెద్దయది యైన యంబ యిట్లనియె. 212

ప్రతిపదార్థం: పెద్ద+అది= పెద్దయది= జ్యేష్ఠురాలు.

తాత్పర్యం: ఈవిధంగా సమస్త రాజసమూహాన్నంతా తేలికగా ఓడించి సాల్వరాజును ప్రాణాలతో సేనలను బాధించక వదలి పరాక్రమంచేత లభించినవా రయిన కాశీరాజుపుత్రికలను అంబ, అంబిక, అంబాలికలను, తీసికొని వచ్చి భీష్ముడు విచిత్రవీర్యుడికి వివాహం చేయబోగా, ఆ ముగ్గురిలో పెద్దదయిన అంబ ఈవిధంగా అన్నది.

ఆ. పరఁగ నన్ను సాల్వపతి వరియించినఁ । దండ్రిచేతఁ బూర్వదత్త నైతి
నమ్మహీశునకు; నయంబున నెయ్యది । ధర్మ్మ వెఱిఁగి దానిఁ దలఁపు మిపుడు. 213

ప్రతిపదార్థం: పరఁగన్= ఒప్పునట్లు; సాల్వపతి= సాల్వు డనేరాజు; నన్నున్= (అంబను); వరియించినన్= కోరుకొనగా; ఆ+మహీ+ఈశునకున్= ఆ రాజుకు; తండ్రిచేతన్= నాతండ్రిచేత; పూర్వ, దత్తను+ఐతిన్= ముందే ఇవ్వబడినదాన నైనాను; నయంబునన్= న్యాయంగా, నీతిగా; ఏ+అది, ధర్మువు= ఏది ధర్మమో; ఎఱిఁగి= తెలిసికొని; దానిన్= ఆ చేయదగినదానిని; ఇపుడు; తలఁపుము= ఆలోచించుము.

తాత్పర్యం: సాల్వరాజు నన్ను ఒప్పారగా వరించటంచేత మాతండ్రి నన్ను ఇంతకుపూర్వమే ఆ రాజుకు మాట ఇచ్చాడు. ఇప్పుడు (ఈపరిస్థితులలో) చేయదగిన ధర్మ మేదో తెలిసికొని నీతితో నిర్ణయించుము.

విచిత్రవీర్యుని వివాహము, మరణము (సం. 1-96-52)

వ. అనిన విని భీష్ముండు ధర్మవిదు లయిన బ్రాహ్మణుల యనుమతంబున దాని సాల్వరాజున కిచ్చిపుచ్చి, మహోత్సవంబున నయ్యిరువురు కన్యకల విచిత్రవీర్యునకు వివాహంబు సేసిన 214

ప్రతిపదార్థం: ధర్మవిదులు= ధర్మం తెలిసినవారు.

తాత్పర్యం: అనగా విని భీష్ముడు ధర్మం తెలిసిన బ్రాహ్మణుల అనుమతితో అంబను సాల్వరాజుకు ఇచ్చేటట్లు పంపి, గొప్పవైభవంగా ఆ ఇద్దరు కన్యలను విచిత్రవీర్యుడికి ఇచ్చి పెళ్ళిచేయగా.

ఉ. లాలిత రూపయౌవన విలాస విభాసిను లైన యంబికాం
బాలికలన్ వివాహ మయి భారతవంశకరుండు గామ లీ
లాలలితానుభోగరసలాలసుఁ డై నిజరాజ్యభార చిం
తాలసుఁ డయ్యెఁ; గామికి నయంబున నొండు దలంపఁబోలునే! 215

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భారత, వంశ, కరుండు= భరతవంశోద్ధారకుడు అయిన విచిత్రవీర్యుడు; లాలిత, రూప, యౌవన, విలాస, విభాసినులు+ఐన= పోషింపబడిన రూప, యౌవనాలయొక్క లీలలచేత ప్రకాశించేవారైన; అంబికా, అంబాలికలన్; వివాహము+అయి= పెండ్లియాడి; కామ, లీలా, లలిత+అనుభోగ, రస, లాలసుఁడు+ఐ= మన్మథ విలాసాలచేత కోమలా లైన ఇష్టభోగాల అనుభవసారాన్ని పొందటంలో విషయాసక్తుడై; నిజ, రాజ్య, భార, చింతా+అలసుఁడు+అయ్యెన్= తన రాజ్యభారాన్ని గురించిన ఆలోచనలో ఉత్సాహంలేనివాడు అయ్యాడు; కామికిన్= ఇంద్రియసుఖాలను కోరేవాడికి; నయంబునన్= పొందికగా; ఒండు= మరొకదానినిగురించి; తలంపన్, పోలునే= ఆలోచింప వీలు కలుగునా? (కలుగ దని భావం).

తాత్పర్యం: భారతవంశకరు డైన విచిత్రవీర్యుడు లావణ్యంతో కూడిన రూప యౌవన విలాసాలతో ప్రకాశించే అంబికను, అంబాలికను పెండ్లాడి మన్మథలీలలతోకూడిన లలితభోగానుభవాలసారాన్ని పొందాలనే విషయాభిలాషతో తన రాజ్యనిర్వహణభారాన్నిగురించి ఆలోచించటంలో ఆసక్తిలేనివా డైనాడు. అంతేకదా! కాముకునికి పొందికగా మరొక విషయాన్నిగురించి ఆలోచించే వీలెక్కడ కలుగుతుంది? (కలుగదని భావం).

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. లలనల విలాసాలను, విచిత్రవీర్యుని విషయాసక్తిని వర్ణించే యీపద్యరచనలో లవర్ణం విరివిగా వాడి లాలిత్యాన్ని పోషించి శృంగార రసానుకూలమైన అక్షరరమ్యతను నన్నయ పాటించాడు. శ్లేష అనే శబ్దగుణం సార్థకం.

వ. ఇట్లు సకలవ్యాపారరహితుం డై కాశీరాజదుహితల నయ్యిరువుర నతిప్రణయగౌరవంబునం దగిలి.216

ప్రతిపదార్థం: దుహితలు= పుత్రికలు

తాత్పర్యం: ఈవిధంగా అన్ని ప్రవృత్తులను మానుకొని కాశీరాజు కూతుళ్ల నిద్దరిని అధికమైనప్రేమాదరంతో కూడి. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. అమలసుధారమ్య హర్మ్యతలంబుల । నవకుసుమామోద నందనములఁ
గృతకాద్రి కందర క్రీడాగృహాంగణ । వివిధరత్నోపలవేదికలను
గలహంస కలనాదకమనీయ కమలినీ । దీర్ఘికాసైకతతీరములను
రమియించుచును గామరాగాధికాసక్తిఁ । జేసి శోషించి విచిత్రవీర్యుఁ

ఆ. డమరపురికిఁ జనిన, నతనికిఁ బరలోక । విధుల శాస్త్రదృష్టి వెలయఁ జేసె
నాపగాతనూజుఁ డఖిలబాంధవులయు । బ్రాహ్మణులయుఁదోడ భానునిభుఁడు. 217

ప్రతిపదార్థం: విచిత్రవీర్యుఁడు; అమల, సుధా, రమ్య, హర్మ్య, తలంబులన్= స్వచ్ఛమైన(తెల్లనైన) సున్నపుపూతవలన అందమైన భవనాలయొక్క పైభాగాలలోనూ; నవ, కుసుమ+ఆమోద, నందనములన్= క్రొత్తపూలయొక్క వాసనలుగల ఉద్యానవనాలలోనూ; కృతక+అద్రి, కందర, క్రీడాగృహ+అంగణ= కృత్రిమంగా అమర్చిన కొండలయొక్క గుహలయొక్క, విలాసగృహాలయొక్క ముంగిళ్ళలోని; వివిధ, రత్న+ఉపల, వేదికలను= అనేకవిధా లైన రత్నాలతో ఉన్న రాతిఅరుగులమీదనూ; కలహంస, కలనాద= రాజహంసలయొక్క అవ్యక్తమధురమైన స్వరాలచేత; కమనీయ= అందమైన; కమలినీ, దీర్ఘికా, సైకత, తీరములను= సరోవరాలయొక్క, నడబావులయొక్క, తీరాల్లోని ఇసుక తిన్నెల మీద; రమియించుచును= క్రీడిస్తూ; కామ,

రాగ+అధిక+ఆసక్తిన్‌చేసి= కామసుఖంలోని మిక్కిలికోరిక కారణంగా; శోషించి= చిక్కిశల్యమై; అమర, పురికిన్, చనినన్= దేవతల నగరానికి పోగా (చనిపోగా); అతనికిన్= విచిత్రవీర్యుడికి; శాస్త్రదృష్టి, వెలయన్= శాస్త్రాలలో చెప్పబడిన పద్ధతికి అనుకూలంగా; పరలోక, విధులన్= చనిపోయినవారికి ఉత్తరగతులు కలిగించటానికి చేసేకర్మలు; ఆపగాతనూజుఁడు= గంగయొక్కపుత్త్రుడు, భీష్ముడు; భాను, నిభుఁడు= సూర్యుడితోపోలినవాడు; అఖిల, బాంధవులయున్, బ్రాహ్మణులయున్, తోడన్= అందరు బంధువులతో బ్రాహ్మణులతో కలిసి; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: తెల్లని సున్నంతో అందంగా ఉన్న మేడలపైభాగాలలోనూ, క్రొత్తగా పూచిన పూలసువాసనలుగల ఉద్యానవనాలలోనూ, కృత్రిమంగా కట్టిన కొండల గుహలలోనూ విలాసగృహాల ముంగిళ్లలో ఉన్న వివిధ రత్నాలు తాపిన రాతి అరుగులమీదనూ, రాజహంసల మధురమైన కూతలతో అందమైన సరోవరాలయొక్క, నడబావులయొక్క, తీరాలలోని ఇసుకతిన్నెలమీదనూ క్రీడిస్తూ కామభోగంలోని అమితమైన ఆసక్తివలన విచిత్రవీర్యుడు చిక్కిశల్యమై స్వర్గస్థుడు కాగా అతడికి సూర్యసన్నిభు డైన భీష్ముడు బంధువులందరితో, బ్రాహ్మణులతో కలిసి శాస్త్రోక్తంగా పరలోకవిధులను యథావిధిగా చేశాడు.

సత్యవతి భీష్ముని వివాహమాడు మని కోరుట (సం. 1-97-4)

వ. మఱియు నత్యంతశోకార్ణవంబున మునింగిన తల్లిని మఱఁదండ్రను నాశ్వాసించి, యరాజకం బయిన రాజ్యం బకలంకంబుగాఁబ్రతిపాలించుచున్న కొడుకు నఖిలధర్మవిదు గాంగేయుం జూచి సత్యవతి యి ట్లనియె. 218

ప్రతిపదార్థం: మఱియున్= ఆపైన; అత్యంత, శోక+అర్ణవంబునన్, మునింగిన= అపార మైన దుఃఖ మనే సముద్రంలో మునిగిన; తల్లిని; మఱఁదండ్రను= తమ్మునిభార్యలను; ఆశ్వాసించి= ఓదార్చి; అ, రాజకంబు+అయిన, రాజ్యంబు= రాజు లేకుండా పోయిన రాజ్యాన్ని; అకలంకంబుకాన్= ఎటువంటి అపవాదు రాకుండ; ప్రతిపాలించుచున్+ఉన్న= రక్షకుడుగా పాలిస్తూ ఉన్న; కొడుకున్= కొడుకును; అఖిల, ధర్మ, విదున్, గాంగేయున్, చూచి= అన్నిధర్మాలూ తెలిసినవాడైన గంగాతనయుడైన భీష్ముడిని చూచి; సత్యవతి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నది.

తాత్పర్యం: ఆ తరువాత, అపారమైన దుఃఖసాగరంలో మునిగిన తల్లిని, మరదళ్ళనూ ఓదార్చి, రాజు లేని ఆరాజ్యానికి ఏలోపం రాకుండ రాజప్రతినిధిగా పాలనంసాగిస్తూ ఉండగా తనకు కొడుకూ, సర్వధర్మాలు తెలిసినవాడూ అయిన భీష్ముడిని చూచి సత్యవతి ఈవిధంగా అన్నది.

విశేషం: అలం: రూపకం.

క. శంతను సంతానంబును । సంతతకీర్తియును బిండసత్కృతియును న
త్యంత మహీభారమును బ । రంతప! నీయంద చిరతరం బై నిలిచెన్. 219

ప్రతిపదార్థం: పరంతప= శత్రువులను తపింపచేయువాడా! భీష్ముడా!; శంతను, సంతానంబును= శంతనుడియొక్క సంతానం (అనదగినవాస్తవమున్నూ); సంతత, కీర్తియును= కలకాలముండే కీర్తియున్నూ; పిండ, సత్కృతియునున్= పితృదేవతలకు పిండములు సమర్పించే ఉత్తమకర్మయూ; అత్యంత, మహీ, భారమును= అపారమైన రాజ్యంయొక్క భారమూ; నీ+అందున్+అ= నీయందే; చిరతరంబు+ఐ= చాలకాలం ఉండేదిగా; నిలిచెన్= ఏర్పడింది.

తాత్పర్యం: శత్రువులను తపింపజేసే ఓవీరుడా! భీష్మా! శంతనుడియొక్క సంతాన మని చెప్పదగిన వాస్తవమూ, కలకాలముండే కీర్తియూ, పితృదేవతలకు పిండప్రదానం చేసే ఉత్తమకర్మాధికారమూ, అపారమైన సామ్రాజ్యభారమూ నీయందే చాలకాలం నిలిచిఉండే స్థితి ఏర్పడింది.

చ. జననుత సర్వధర్మములు సర్వజగత్పరివర్తనక్రమం
బును మఱి సర్వవంశములుఁ బుట్టిన మార్గము నీవ నిక్కువం
బనఘ! యెఱుంగు; దున్నతగుణాఢ్యుఁడవున్ భరతాన్వయావలం
బనుఁడవు నీవ; నిన్నొకఁడు పంచెదఁ జేయుము మత్ప్రియంబుగన్. 220

ప్రతిపదార్థం: అనఘ= దోషాలు లేనివాడా; పుణ్యాత్ముడా! (భీష్మా!); జన, నుత, సర్వ, ధర్మములు= ప్రజలచేత కొనియాడబడే అన్ని ధర్మాలనుగురించి; సర్వ, జగత్, పరివర్తన, క్రమంబును= ప్రపంచంలో జరుగుతున్న మార్పులన్నింటిక్రమాన్నీ; మఱి= అంతేకాక; సర్వ, వంశములున్, పుట్టిన, మార్గమున్= (రాజ)వంశాలన్నీ ప్రారంభమైన విధానాన్నీ; నిక్కువంబు= వాస్తవంగా, నిజంగా; నీవు+అ, ఎఱుంగుదు(వు)= నీకు మాత్రమే తెలుసు; నీవు+అ= నీవే; ఉన్నత, గుణ+ఆఢ్యుఁడవున్= ఉత్తమగుణ సంపన్నుడవు; భరత+అన్వయ+అవలంబనుఁడవు= భరతుడు వంశకర్తగా ఉన్న వంశానికి ఆధారమైనవాడవు; నిన్నున్+ ఒకఁడు, పంచెదన్= నిన్ను ఒకఁడు, పంచెదన్= నిన్ను ఒకటి ఆజ్ఞాపిస్తాను; మత్, ప్రియంబుగన్, చేయుము= నాకు సంతోషమయ్యేటట్లు చేయుము.

తాత్పర్యం: పాపరహితుడవయిన ఓ భీష్మా! ప్రజలచేత కీర్తింపబడే ధర్మాలన్నింటిని గురించి, లోకంలో జరిగే పరిణామాలన్నింటి క్రమాన్నిగురించీ, అంతేకాక, రాజవంశాలన్నీ పుట్టిన విధానాలగురించి నీవు వాస్తవజ్ఞానం కలిగిఉన్నావు. ఉత్తమగుణసంపదగల నీవే ఈనాడు భరతవంశానికి ఆధారంగా నిలిచి ఉన్నావు. నిన్ను నేను ఒకటి ఆజ్ఞాపిస్తాను. నాసంతోషంకొరకు దానిని నీవు చేయుము.

క. ఇక్కురువంశంబున నీ । వొక్కరుఁడవ యున్నవాఁడ; వుర్వీరాజ్యం
బెక్కటి సేకొని తేజము । దిక్కుల వెలిఁగింపు సంతతియుఁ బడయు మొగిన్. 221

ప్రతిపదార్థం: ఈ+కురువంశంబునన్= ఈకురువంశంలో; నీవు+ఒక్కరుఁడవు+అ, ఉన్నవాఁడవు= నీవు ఒక్కడివే ఉన్నావు; ఉర్వీ, రాజ్యంబు= భూమిపరిపాలనను; ఎక్కటి, చేకొని= మరెవరి సహాయంలేకుండా ఒక్కడివే తీసికొని; తేజమున్= పరాక్రమాన్ని, ప్రకాశాన్ని; దిక్కులన్, వెలిఁగింపు(ము)= దిక్కులందు ప్రకాశించేటట్లు చేయుము; ఒగిన్= క్రమంగా; సంతతియున్, పడయుము= సంతానాన్నికూడా పొందుము.

తాత్పర్యం: ఇప్పుడు ఈకురువంశంలో (రాజ్యార్హు డైనవాడవు) నీవొక్కడవే (బ్రతికి) ఉన్నావు. నీవు ఈరాజ్యాన్ని అసహాయవీరుడిగా చేపట్టి నీపరాక్రమతేజాన్ని నలుదిక్కులా వెలిగేటట్లు చేయుము. క్రమంగా సంతానాన్నికూడ పొందుము.

క. 'నిరతంబు బ్రహ్మమొదలుగ । వరుసన యెడతెగక యిట్లు వచ్చిన వంశం
బురుభుజ! నీ వుండఁగ నీ । తరమున విచ్ఛిన్న మగుట ధర్మువె?' యనినన్. 222

ప్రతిపదార్థం: ఉరుభుజ= గొప్పభుజాలు కలవాడా (బాహుబలం కలవాడా అనిభావం); బ్రహ్మ, మొదలుగన్= బ్రహ్మదేవుడు మొదలుకొని; వరుసన్+అ= పరంపరగా; నిరతంబున్= ఎల్లప్పుడూ; ఎడతెగక= విచ్ఛిన్నం కాకుండ (ఆగిపోకుండ); ఇట్లు= ఈవిధంగా; వచ్చిన, వంశంబు= సాగిన వంశం; నీవు+ఉండఁగన్= నీవు(మిగిలి) ఉండగానే; నీతరమునన్= నీ జీవితకాలంలోనే; విచ్ఛిన్నము+అగుట= తెగిపోవుట (వంశంలో వారసుడు లేకుండపోవటం); ధర్మువు+ఎ= ధర్మమా? (కాదని భావం); అనినన్= అని అనగా.

తాత్పర్యం: 'గొప్ప భుజబలం కలవాడా! బ్రహ్మదేవుడు మొదలుకొని పరంపరగా ఎక్కడా ఎప్పుడూ ఆగిపోకుండా ఈవిధంగా వచ్చిన ఈవంశం నీ వుండగానే, నీజీవితకాలంలోనే వంశపరంపర విచ్ఛిన్నం కావటం (తెగిపోయి ఆగిపోవటం) ధర్మమా? (ధర్మం కాదు) అని సత్యవతి అనగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. విని భీష్ముఁ డనియె 'మీ కి । ట్లని యానతి యీయఁదగునె? యమ్మెయి నాప
ల్కిన పల్కును మఱి నా తా । ల్చిన వ్రతమును జెఱుప నంత చిఱుతనె చెపుఁడా'. 223

ప్రతిపదార్థం: విని= సత్యవతి మాటలు విని; భీష్ముఁడు+అనియెన్= భీష్ముడు ఈవిధంగా అన్నాడు; మీకున్+ఇట్లు+అని, ఆనతి, ఈయన్, తగునె= మీరు ఈవిధంగా ఆజ్ఞాపించటం న్యాయమా?; ఆ+మెయిన్, నా పల్కిన, పల్కును= ఆ విధంగా నేను చేసిన ప్రతిజ్ఞను (శంతనుడికి సత్యవతివలన పుట్టిన సంతానానికే రాజ్యం చెందేటట్లు చూస్తా నని దాశరాజుకు ఇచ్చిన మాటను ఇక్కడ భీష్ముడు ప్రస్తావన చేస్తున్నాడు); మఱి= అంతేకాక; నా, తాల్చిన, వ్రతమును= నేను పూనిన (బ్రహ్మచర్య) వ్రతాన్నీ (సత్యవతి సంతానానికి సవతికొడుకుల పోరు రాకుండ భీష్ముడు బ్రహ్మచర్యవ్రతాన్ని స్వీకరించిన ప్రస్తావన ఇది); చెఱుపన్= పాడుచేసుకోటానికి; అంత, చిఱుతనె, చెపుఁడు+ఆ= అంత బాలుడినా (అవివేకినా) చెప్పండి.

తాత్పర్యం: సత్యవతి మాటలు విని భీష్ముడు ఈవిధంగా అన్నాడు - "మీకు ఈవిధంగా ఆజ్ఞాపించటం ఉచితమా? (కాదు). ఆ విధంగా ఆనాడు చేసిన ప్రతిజ్ఞనూ, అంతేకాక నేను చేపట్టిన బ్రహ్మచర్యవ్రతాన్నీ వమ్ముచేయటానికి నే నంత బాలుడినా? (అవివేకినా) చెప్పండి. (కాదని భావం).

క. హిమకరుఁడు శైత్యమును, న । ర్యముఁడు మహాతేజమును, హుతాశనుఁ డుష్ణ
త్వము విడిచిరేని గుర్వ । ర్థము నాచేకొనిన సద్వ్రతంబు విడుతునే? 224

ప్రతిపదార్థం: హిమకరుఁడు= (చల్లని కిరణాలు కలవాడు); చంద్రుడు; శైత్యమును= చల్లదనాన్నీ; అర్యముఁడు= సూర్యుడు; మహత్+తేజమును= గొప్పదైన ప్రకాశాన్నీ; హుత+అశనుఁడు= (హోమము చేయబడిన ద్రవ్యాలే ఆహారంగా కలవాడు); అగ్ని; ఉష్ణత్వమున్= వేడిమినీ; విడిచిరి+ఏని= వదలినప్పటికిన్నీ; గురు+అర్థము= తండ్రికొరకు; నా, చేకొనిన= నేను చేపట్టిన; సత్+వ్రతంబు= ఉత్తమదీక్షను (బ్రహ్మచర్యవ్రతాన్ని); విడుతును+ఏ= విడిచిపెట్టుతానా? (విడువ నని భావం).

తాత్పర్యం: చంద్రుడు చల్లదనాన్నీ, సూర్యుడు అత్యంతప్రకాశాన్నీ, అగ్ని వేడిమినీ విడిచినప్పటికీ, నేనుమాత్రం తండ్రికొఱకు చేపట్టిన ఈ ఉత్తమవ్రతాన్ని విడుస్తానా? (విడువను అని భావం).

వ. 'పృథివ్యాది మహాభూతంబులు గంధాదిగుణంబుల నెట్లు విడువ వట్ల యేనును గురుకార్యంబున మీశుల్కార్థంబుగా సర్వజనసమక్షంబున నాచేసిన సమయస్థితి విడువ; నది యట్లుండె; మీయానతిచ్చినట్లు

నాయెఱుఁగని ధర్మువులు లేవు; శంతనుసంతానంబు శాశ్వతంబగునట్లుగ క్షత్త్రధర్మంబుసెప్పెద; నాచెప్పినదాని ధర్మార్థవిదు లయి లోకయాత్రానిపుణు లయిన పురోహితప్రముఖ నిఖిలబ్రాహ్మణవరులతో విచారించి చేయునది' యని భీష్ముఁ డందఱు విన ని ట్లనియె. 225

ప్రతిపదార్థం: పృథివీ+ఆది, మహత్, భూతంబులు= భూమిమొదలైన గొప్పవైన పంచభూతాలు; గంధ+ఆది, గుణంబులను+ఎట్లు, విడువవు= వాసనమొదలైన సహజలక్షణాలను ఏవిధంగా వదలుకోవో; అట్లు+అ, ఏనును= ఆ విధంగానే నేనుకూడ; గురు, కార్యంబునన్, మీ శుల్క+అర్థంబుగా= తండ్రికొరకైన (వివాహ) కార్యంలో మీకివ్వవలసిన కట్నం కొరకుగా; సర్వ, జన, సమక్షంబునన్= జనులందరి ఎదుట; నా, చేసిన, సమయ, స్థితి= నేను చేసిన నియమవ్యవస్థను; విడువను= వదలను; అది, అట్లు+ఉండెన్= అది ఆవిధంగా ఉండనివ్వండి.; మీ, ఆనతి+ఇచ్చినట్లు= మీరు ఆజ్ఞాపించినట్లు (మీరు-బహువచన గౌరవవాచకం); నా, ఎఱుఁగని, ధర్మువులు, లేవు= నాకు తెలియని ధర్మాలు లేవు; శంతను, సంతానంబు, శాశ్వతంబు+అగునట్లుగన్= శంతనుడి సంతతి అవిచ్ఛిన్నంగా (శాశ్వతంగా) సాగుతూ ఉండేటట్లుగా; క్షత్త్ర, ధర్మంబు, చెప్పెదన్= క్షత్త్రియులు పాటించదగిన ధర్మాన్ని చెప్తుతాను; నా, చెప్పిన, దానిన్= నేను చెప్పిన ఆ ధర్మాన్ని; ధర్మ+అర్థ, విదులు, అయి= ధర్మముయొక్క ప్రయోజనాన్నిగురించి తెలిసినవారై; లోక, యాత్రా, నిపుణులు+అయిన= లోకం సాగేతీరును తెలిసిన నేర్పరులగు; పురోహిత, ప్రముఖ, నిఖిల, బ్రాహ్మణ, వరులతోన్= పురోహితుడు మొదలైన సమస్త బ్రాహ్మణశ్రేష్ఠులతో; విచారించి= ఆలోచించి; చేయునది= ఆచరించవలసింది; అని; భీష్ముఁడు; అందఱు; వినన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'భూమి మొదలైన పంచమహాభూతాలు గంధం మొదలైన సహజగుణాలను ఏవిధంగా విడువవో అట్లే నేనుకూడ తండ్రిగారి ప్రయోజనం కొరకు మీ కివ్వవలసిన కన్యాశుల్కం నిమిత్తం జనులందరిముందు నేను చేసిన ప్రతిజ్ఞయొక్క వ్యవస్థను నేను విడువను. అది అట్లుండ నివ్వండి. మీరు చెప్పినట్లు నాకు తెలియని ధర్మాలు లేవు. శంతనుడి సంతానం అవిచ్ఛిన్నంగా సాగుతూ ఉండేటట్లుగా క్షత్త్రియధర్మాన్ని ఒకదానిని చెప్తుతాను. నేను చెప్పినదానిని ధర్మప్రయోజనాన్నీ, లోకంపోకడ విధానాన్నీ తెలిసిన నిపుణులైన పురోహితులు మొదలైన సమస్త బ్రాహ్మణశ్రేష్ఠులతో ఆలోచించి చేయవలసింది' - అని భీష్ముడు అందరూ వినేటట్లు ఈ విధంగా అన్నాడు.

విశేషం: పృథివి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము - అనేవి పంచమహాభూతాలు. గంధం, రసం, రూపం, స్పర్శ, శబ్దం - అనేవి (వరుసగా) వాటి సహజగుణాలు.

చ. **పితృవధజాతకోపపరిపీడితుఁ డై జమదగ్నిసూనుఁ డు**
ద్ధతబలు హైహయున్ సమరదర్పితుఁ జంపి యశేషధారుణీ
పతుల వధించె గర్భగతబాలురు నాదిగ; నట్టిచోటఁ ద
త్సతులకుఁ దొల్లి ధర్మవిధి సంతతి నిల్పరె భూసురోత్తముల్. 226

ప్రతిపదార్థం: జమదగ్ని, సూనుఁడు= జమదగ్నికుమారు డైన పరశురాముడు; పితృ, వధ, జాత, కోప, పరిపీడితుఁడు+ఐ= తండ్రియొక్క వధవలన కలిగిన కోపంచేత బాధపడినవాడై; ఉద్ధత, బలున్= గర్వంతోకూడిన బలంకలవాడిని; సమర, దర్పితున్= యుద్ధంలో మదించినవాడిని; హైహయున్= హైహయుడిని; చంపి; గర్భగత బాలురున్, ఆదిగన్= స్త్రీగర్భాలలోని బాలురు మొదలుకొని; అశేష, ధారుణీ, పతులన్= శేషంలేకుండా రాజులనందరిని; వధించెన్= చంపాడు; అట్టిచోటన్= ఆవిధంగా జరిగినపట్ల; తద్, సతులకున్= ఆ రాజపత్నులకు; తొల్లి= పూర్వం; ధర్మవిధిన్= ధర్మశాస్త్రనియమంప్రకారం; భూసుర+ఉత్తముల్= బ్రహ్మోత్తములు; సంతతి, నిల్పరు+ఎ?= సంతానాన్ని నిలిచేట్లుచేయరా? (చేశారనిభావం).

తాత్పర్యం: పరశురాముడు తనతండ్రి వధింపబడటంవలన కలిగిన కోపంచేత పీడితుడై మహాబలసమన్వితుడు, యుద్ధాలలో మదించివ్యవహరించేవాడూ అయిన హైహయుడిని చంపి, రాజపత్నుల గర్భాలలోఉన్న బాలురు మొదలు కొని రాజులనందరినీ ఎవ్వరూ మిగలకుండా చంపాడు. అటువంటి సందర్భంలో పూర్వం బ్రాహ్మణశ్రేష్ఠులు ధర్మశాస్త్రవిధిప్రకారం ఆ రాజపత్నులందు సంతానాన్ని కలిగించి వంశాలను నిలిపారు.

దీర్ఘతముని వృత్తాంతము (సం. 1-98-6)

వ. మఱి యదియునుంగాక యుతథ్యుం డను మునివరుపత్ని మమత యనుదాని గర్భిణి నభ్యాగతుం డయి బృహస్పతి దేవరన్యాయంబున నభిలషించినఁ దదీయగర్భస్థుం డయిన పుత్త్రుం డెఱింగి యిది ధర్మవిరుద్ధం బని యాక్రోశించిన వానికి నలిగి బృహస్పతి 'సర్వభూతేప్సితం బైన యిక్కార్యంబునందు నాకుఁ బ్రతికూలుండ వయితివి కావున దీర్ఘతమంబును బొందు' మని శాపం బిచ్చిన, వాఁడును దీర్ఘతముండు నాఁ బుట్టి సకలవేదవేదాంగవిదుండయి జాత్యంధుం డయ్యును తనవిద్యాబలంబునఁ బెద్దకాలంబునకుఁ బ్రద్వేషిణి యను నొక్కబ్రాహ్మణి వివాహం బయి గౌతమాదు లయిన కొడుకులం బెక్కండ్రం బడసిన, నది లబ్ధపుత్త్రయై తన్ను మెచ్చుకున్న 'నిట్లేల నన్ను మెచ్చ?' వని దీర్ఘతముండు ప్రద్వేషిణి నడిగిన నది యి ట్లనియె. 227

ప్రతిపదార్థం: సుస్పష్టం.

తాత్పర్యం: మరి అంతేకాక - ఉతథ్యుడు అనే మునియొక్క భార్యమమతఅనేపేరుగల వనితను గర్భిణిఅయిఉన్ననూ అభ్యాగతుడుగా వచ్చిన బృహస్పతి దేవరన్యాయాన్ని అనుసరించి కోరగా, ఆమెగర్భంలో ఉన్న బాలుడు దానిని తెలిసికొని అది ధర్మవ్యతిరేక మని పెద్దగా అరవగా, అందుకు బృహస్పతి కోపపడి 'జీవులందరిచేత కోరబడే ఈపనిలో నాకు వ్యతిరిక్తుడ వైనావు కాబట్టి దీర్ఘకాలం చీకటిని అనుభవించు' మని (గ్రుడ్డివాడ వగుమని) శాపంపెట్టగా, ఆతడు దీర్ఘతము డనే పేరున పుట్టి వేదాలనూ, వేదాంగాలనూ తెలిసికొని పుట్టుగ్రుడ్డి అయినప్పటికీ తనవిద్యాబలంతో చాలకాలం తరువాత ప్రద్వేషిణి అనే బ్రాహ్మణవనితను పెండ్లాడి గౌతముడు మొదలైన కొడుకులను అనేకులను పొందగా, ఆమె పుత్రవతి అయినప్పటికీ తనను మెచ్చుకుండగా 'ఎందుకు నన్ను ఈవిధంగా మెచ్చువు?' అని దీర్ఘతముడు ప్రద్వేషిణిని అడుగగా ఆమె ఈవిధంగా అన్నది.

తే. పతియు భరియించుఁ గావున భర్తయయ్యెఁ। భామ భరియింపఁబడుఁగాన భార్య యయ్యెఁ;
బరఁగ నవి మనయందు వీడ్వడియె నిన్ను। నేన యెల్లకాలము భరియింతుఁ గాన. 228

ప్రతిపదార్థం: పతియున్= మగడు; భరియించున్, కావునన్= భార్యను భరిస్తాడు కాబట్టి; భర్త, అయ్యెన్= భర్త అని పిలువబడతాడు; భామ= ఇల్లాలు; భరియింపఁబడున్, కాన= భర్తచేత భరింపబడుతుంది కాబట్టి; భార్య, అయ్యెన్= భార్య అనబడుతున్నది; పరఁగన్= ఒప్పగా; అవి= ఆ భార్యాభర్తలస్వభావాలు; నిన్నున్, నేను+అ; ఎల్లకాలము; భరియింతున్= భరిస్తాను, పోషిస్తాను; కాన= కాబట్టి; మన, అందున్= మనపట్ల; వీడ్వడియెన్= వేరుపడ్డాయి, (తిరగబడ్డాయి).

తాత్పర్యం: భార్యను భరిస్తాడు కాబట్టి మగడిని 'భర్త' అని పిలుస్తారు. భర్తచేత భరింపదగింది కాబట్టి ఇల్లాలిని 'భార్య' అని అంటారు. నేను నిన్నే యెల్లకాలం భరిస్తూ (పోషిస్తూ) ఉంటాను కాబట్టి అదిమనపట్ల వ్యత్యస్తమైనది (ఆ సంబంధం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'ఎంతకాల మయిన నిప్పాట భరియింప । నోప నింక నరుగు మొండుకడకు'
ననిన నిర్దయాత్మ లని దీర్ఘతముఁ డల్గి । సతుల కెల్ల నపుడు శాప మిచ్చె. 229

ప్రతిపదార్థం: ఎంత, కాలము+అయినన్= ఎంతకాలమైననూ; ఈ+పాటన్= ఇదే విధంగా; భరియింపన్, ఓపన్= భరింప(పోషింప) జాలను; ఇంకన్= ఇకమీద; ఒండు, కడకున్= మరొకచోటికి; అరుగుము= వెళ్ళుము; అనినన్= అనగా; దీర్ఘతముఁడు; అల్గి= కోపించి; నిర్దయ+ఆత్మలు+అని= ఆడువారు దయలేని హృదయాలు కలవా రని; సతులకున్+ఎల్లన్= ఇల్లాండ్ర కందరికి; అపుడు; శాపము+ఇచ్చెన్= శాపం పెట్టాడు.

తాత్పర్యం: 'ఎంతకాల మయినా ఇదేవిధంగా భరించవలసివస్తే నేను భరించలేను; ఇక నీవు మరొకచోటికి వెళ్ళుము' అనగా స్త్రీలు దయలేని హృదయాలు కలిగినవా రని దీర్ఘతముడు కోపించి ఇల్లాండ్రకందరికి అప్పుడు శాపం పెట్టాడు.

క. పతిహీన లయిన భామిను । లతిధనవతు లయ్యుఁ గులజ లయ్యును ననలం
కృత లయ్యెడు మాంగల్యర । హిత లయ్యెడుఁ గృపణవృత్తి నిదియు మొదలుగన్. 230

ప్రతిపదార్థం: పతి, హీనలు+అయిన, భామినులు= భర్త చనిపోయిన వనితలు; అతి, ధనవతులు+అయ్యున్= ఎక్కువ ధనం కలవారైననూ; కులజలు+అయ్యునున్= ఉత్తమకులాలలో పుట్టినవారైననూ; ఇదియున్, మొదలుగన్= ఇప్పటినుండి; కృపణవృత్తిన్= దయనీయంగా; అనలంకృతలు+అయ్యెడున్= అలంకారాలు లేనివా రౌతారు గాక; మాంగల్య, రహితలు+అయ్యెడున్= తాళి లేని వారౌతారు గాక!

తాత్పర్యం: భర్తలను కోల్పోయిన భార్యలు ఎంతటి ధనవతు లైనా, ఉత్తమకులాలలో పుట్టినవారైనా ఇప్పటినుండి దయనీయంగా అలంకారాలు లేనివారుగా, తాళిలేనివారుగా అయ్యెదరుగాక! (ఇది దీర్ఘతము డిచ్చిన శాపం).

వ. అనిశాపంబిచ్చిన దీర్ఘతమునకు నలిగి ప్రద్వేషిణి 'యిమ్ముదుకని నెటయేనియుం గొనిపొం' డని తనకొడుకులం బంచిన, వారును నయ్యౌతథ్యు నతివృద్ధు జాత్యంధు నింధనంబులతో బంధించి మోహాంధులయి గంగలో విడిచిన, నమ్మునియునుబ్రవాహవేగంబునఁబెక్కుదేశంబులుగడచి చనియె; నంత నొక్కనాఁడు బలియనురాజు గంగాభిషేకార్థంబు వచ్చినవాఁ డయ్యింధన బంధనంబున నుండియు నుదాత్తానుదాత్త స్వరిత ప్రచయస్వరభేదంబు లేర్పడ సలక్షణంబుగా వేదంబులం జదువుచుఁ, దరంగ ఘట్టనంబునం దనయున్నదరిం జేరవచ్చినవానిఁ దీరంబుఁ జేర్చి, యింధనబంధనంబులు విడిచి, మహర్షి మామతేయుంగా నెఱిఁగి, తన్నెఱింగించుకొని నమస్కారంబు సేసి యి ట్లనియె. 231

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: అని శాపం పెట్టిన దీర్ఘతముడిపై కోపించి ప్రద్వేషిణి 'ఈముసలివాడిని ఎక్కడికైనా తీసికొనిపొండి' అని తన కొడుకులను ఆజ్ఞాపించింది. వారు మిక్కిలి ముసలివాడు, పుట్టుగ్రుడ్డి అయిన ఆ ఉతథ్యుడి కుమారుడైన దీర్ఘతముడిని కట్టెలతో కలిపికట్టి గర్వాంధు లై గంగలో విడిచిపెట్టారు. ఆ ముని గంగాప్రవాహవేగంలో అనేకదేశాలు దాటి వెళ్ళాడు. అంత, ఒకనాడు బలి అనేరాజు గంగాస్నానంకొరకు వచ్చి కొయ్యలకు కట్టబడిఉండికూడ ఉదాత్త,

అనుదాత్త స్వరిత ప్రచయస్వరముల భేదం స్పష్టంగా తెలిసేటట్లు లక్షణసహితంగా వేదాలను చదువుతూ అలలతాకిడికి తా నున్న తీరానికి చేరరాగా, అతడిని ఒడ్డుకు చేర్చి కట్టెలకు కట్టిన కట్లను విప్పి మమతాపుత్రుడూ, మహర్షీ అయిన దీర్ఘతము డని తెలిసికొని, తనను అతనికి తెలియచెప్పుకొని నమస్కరించి ఈవిధంగా అన్నాడు.

క. ఎందుండి వచ్చి తిందుల । కెందుల కేఁగుదు మహామునీశ్వర ! విద్వ
ద్వందిత! నాపుణ్యంబునఁ । జెందితి ని న్నిష్టఫలముఁ జెందిన పాటన్. 232

ప్రతిపదార్థం: మహత్+ముని+ఈశ్వర= గొప్పమునులలో శ్రేష్ఠుడైనవాడా!; విద్వత్+వందిత= విద్వాంసులచేత నమస్కరింపబడినవాడా!; ఎందున్+ఉండి, ఇందులకున్+ వచ్చితి(వి)= ఎక్కడినుండి ఇక్కడికి వచ్చావు?; ఎందులకున్+ఏఁగుదు(వు)= ఎక్కడికి పోతావు?; ఇష్ట, ఫలము, చెందిన, పాటన్= కోరినకోర్కె ఫలించిన విధంగా; నిన్నున్; నా, పుణ్యంబునన్= నాపుణ్యంవలన; చెందితిన్= పొందాను.

తాత్పర్యం: మహామునిశ్రేష్ఠుడా! విద్వాంసుల నమస్కృతు లందుకొన్నవాడా! ఎక్కడినుండి ఇక్కడికి వచ్చావు? ఎక్కడికి పోతావు? నాకోర్కె ఫలించి నన్ను పొందినట్లు నాపుణ్యవశంగా నిన్ను చూడగలిగాను.

వ. 'ఏనపుత్త్రకుండనై యెవ్విధంబునను సంతానంబు వడయనేరకున్నవాఁడ; నాకు సంతానదానంబు దయసేయు' మని యతనిం బూజించి తనపురంబునకుం దోడ్కొని చని, ఋతుమతి యై యున్న తనదేవి సుదేష్ణ యనుదాని సమర్పించిన, నదియును. 233

ప్రతిపదార్థం: సుస్పష్టం.

తాత్పర్యం: 'నేను కొడుకులు లేనివాడి నై ఏవిధంగానూ సంతతిని పొందలేకుండా ఉన్నాను. నాకు సంతానదానం దయతో చేయుము' అని అతడిని గౌరవించి తననగరానికి తీసికొనిపోయి, ఋతుస్నాం చేసియున్న తనరాణి యైన సుదేష్ణను అతనికి అర్పించగా, ఆమె

ఆ. పుట్టుఁ జీకు వృద్ధుఁ బూతిగంధానను । వేదజడునిఁ బొంద వెలఁది రోసి,
తన్నపోనిదానిఁ దన్విఁ గోమలిఁ దన । దాదికూఁతుఁ బంచెఁ దపసికడకు. 234

ప్రతిపదార్థం: పుట్టు, చీకు= పుట్టుకతోనే గ్రుడ్డివాడు అయినవాడిని; వృద్ధున్= ముసలివాడిని; పూతి, గంధ+ఆననున్= దుర్గంధం (చెడువాసన) గల ముఖం (నోరు) కలవాడిని; వేద, జడునిన్= వేదంతప్ప మరొక విషయం తెలియని మూఢుడిని; పొందన్= కలియుటకు; వెలఁది= వనిత (రాణి); రోసి= అసహ్యించుకొని; తన్నున్+అ= తనను అన్నివిధాలా; పోని, దానిన్= పోలినదానిని; తన్విన్= సన్ననినడుము కలిగినదానిని; కోమలిన్= మృదువైనదానిని; తన, దాది, కూఁతున్= తనను పెంచినదాదియొక్క కూతురును; తపసి, కడకున్, పంచెన్= ఋషివద్దకు పంపింది.

తాత్పర్యం: పుట్టుగ్రుడ్డి, ముసలివాడు, దుర్గంధం వచ్చేనోరు కలవాడు, వేదంతప్ప మరొక విలాసం తెలియని అరసికుడు అయిన ఆ మునిని పొందటానికి రాణి ఏవగించుకొని, తనను అన్నివిధాలా పోలి ఉన్న సన్ననినడుముగలిగి, కోమలి అయిన తన దాదికూతురును మునిచెంతకు పంపించింది.

వ. ఆ దీర్ఘతముండును దానివలనఁ గాక్షీవదాదుల నేకాదశపుత్త్రులం బుట్టించిన బలియును సంతసిల్లి 'వీరలు నాపుత్త్రకులే?' యనిన నమ్ముని వాని కి ట్లనియె. 235

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: ఆ దీర్ఘతముడున్నూ ఆ దాదికూతురువలన కాక్షీవదుడు మొదలైన పదకొండుమంది కొడుకులను పుట్టించగా బలి సంతోషించి వీరందరు నాకొడుకులేనా! అని అడుగగా ఆ ముని ఆ రాజుతో ఈవిధంగా అన్నాడు.

క. వీరలు నీకులపుత్త్రులు । గారు; భవద్దేవి దాదిగాదిలిసుతకున్
భూరిభుజ! యుద్భవించిన । వారు మహాధర్మపరు లవారితసత్త్వుల్. 236

ప్రతిపదార్థం: భూరిభుజ= ఘనమైన భుజాలు కలవాడా!; వీరలు= వీరు; నీ, కుల, పుత్త్రులు, కారు= నీవంశంలో పుట్టిన కొడుకులు కారు; భవత్, దేవి, దాది, గాదిలిసుతకున్, ఉద్భవించిన, వారు= నీయొక్కరాణియొక్కదాదియొక్క ముద్దులకూతురుకు పుట్టినవారు; మహత్+ధర్మ, పరులు= గొప్పదైన ధర్మంలో ఆసక్తి కలవారు; అవారిత, సత్త్వుల్= వారించటానికి వీలు కాని బలం కలవారు.

తాత్పర్యం: మహాభుజా! ఈ పుట్టినవారు నీవంశంలో పుట్టినవారు కారు. నీరాణియొక్క దాదిముద్దులకూతురుకు పుట్టినవారు. వీరు ఉత్తమధర్మపరాయణులు, ఎదురులేని బలశక్తి కలవారు.

వ. అనిన నబ్బలి సంతానార్థి గావున వెండియు నమ్మునిం బ్రార్థించి తత్ప్రసాదంబు వడసి సుదేష్ణ నియోగించిన దీర్ఘతముండును దానియంగంబులెల్ల నంటిచూచి 'వంశకరుండును మహాసత్త్వుండును నయ్యెడు కొడుకు నీకుం బుట్టు' నని యనుగ్రహించిన, దానికి నంగరాజను రాజర్షి పుట్టె; నివ్విధంబున నుత్తమ క్షత్త్రియక్షేత్త్రంబులందు ధర్మమార్గంబున బ్రాహ్మణులవలనం బుట్టివంశకరు లయిన క్షత్త్రియు లనేకులు గలరు. 237

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; ఆ+బలి= ఆ బలిమహారాజు; సంతాన+అర్థి, కావున= సంతానాన్ని కోరువాడు కాబట్టి; వెండియున్= మరల; ఆ+మునిన్= దీర్ఘతముడిని; ప్రార్థించి= వేడికొని; తద్+ప్రసాదంబు, పడసి= అతని అనుగ్రహం పొంది; సుదేష్ణ= సుదేష్ణఅనేపేరుగల తన రాణిని; నియోగించినన్= అతని పొందుకై ఆజ్ఞాపించగా; దీర్ఘతముండును; దాని, అంగంబులు+ఎల్లన్, అంటి చూచి= ఆమె శరీరభాగాలన్నీ చేతితో తాకి(చూచి); వంశ, కరుండును= వంశాన్ని నిలువబెట్టేవాడున్నూ; మహత్+సత్త్వుండును= గొప్పబలంకలవాడున్నూ; అయ్యెడు, కొడుకు, నీకున్, పుట్టును; అని; అనుగ్రహించినన్= కరుణించగా; దానికిన్= సుదేష్ణకు; అంగరాజు+అను, రాజర్షి (రాజ+ఋషి), పుట్టెన్= అంగరాజు అనేపేరుతో ఋషిత్వం సాధించిన రాజు పుట్టాడు; ఈ+విధంబునన్; ఉత్తమ, క్షత్త్రియ, క్షేత్త్రంబులందున్= ఉత్తము లైన క్షత్త్రియులయొక్క భార్యలయందు; ధర్మ, మార్గంబునన్= ధర్మపద్ధతిలో; బ్రాహ్మణులవలనన్; పుట్టి; వంశకరులు; అయిన; క్షత్త్రియులు; అనేకులు= పెక్కుమంది; కలరు= ఉన్నారు.

తాత్పర్యం: అని పలుకగానే ఆ బలిమహారాజు సంతానాన్ని కోరుకొన్నవాడు కాబట్టి మరల ఆ మునిని వేడికొని, అతడి అనుమతిని పొంది తనరాణి యైన సుదేష్ణను ఋషితోడి పొందుకు నియమించాడు. ఆ దీర్ఘతముడు ఆమె శరీరభాగాల నన్నింటిని చేతితో తాకి వంశాన్ని నిలుపగలిగినవాడూ; గొప్పబలవంతుడూ, అయ్యేకొడుకు నీకు

జన్మిస్తాడని వరమీయగా సుదేష్ణకు అంగరాజు అనేపేరుగల రాజర్షి పుట్టాడు. ఈవిధంగా ఉత్తమక్షత్రియుల భార్యలయందు ధర్మమార్గంలో బ్రాహ్మణులవలన పుట్టి, వంశోద్ధారకు లైన క్షత్రియులు అనేకులు ఉన్నారు.

సత్యవతి భీష్మని యనుమతంబున వ్యాసుని సోదరక్షేత్రములయందు సంతానమును బడయు మని నియోగించుట (సం. 1-99-1)

క. **కావున నియతాత్ము జగ। త్పావను ధర్మస్వరూపు బ్రాహ్మణుఁ బడయం**
గావలయు; వాఁడు సంతతిఁ। గావించు విచిత్రవీర్యకక్షేత్రములన్. **238**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నియత+ఆత్మున్= నిగ్రహింపబడిన హృదయం కలవాడున్నూ; జగత్, పావనున్= లోకాన్ని పావనంచేసేవాడూ; ధర్మ, స్వరూపున్= ధర్మమే రూపం తాల్చినవాడూ; (అయిన) బ్రాహ్మణున్= బ్రాహ్మణుడిని; పడయం, గావలయున్= పొందాలి; వాఁడు= అతడు; విచిత్రవీర్యక, క్షేత్రములన్= విచిత్రవీర్యుడియొక్క భార్యలందు; సంతతిన్= సంతానాన్ని; కావించున్= పుట్టిస్తాడు.

తాత్పర్యం: కావున మనోనిగ్రహం కలవాడు, లోకపావనుడు, ధర్మమూర్తి అయిన ఒక బ్రాహ్మణుడిని పొందగలగాలి. అతడు విచిత్రవీర్యుడి భార్యలయందు సంతతిని కలిగిస్తాడు.

వ. **అనిన భీష్మపలుకులకు సంతోషించి సత్యవతి దొల్లి దనకన్యయైయున్నకాలంబునఁ బరాశరుండు దన్నుఁ గామించుటయు, నమ్మునివరంబునఁ దనకన్యాత్వంబు దూషితంబు గాకునికియుఁ, దత్ప్రసాదంబునం జేసి యమునాద్వీపంబునఁ గృష్ణద్వైపాయనుండు గానీనుం డయి సద్యోగర్భంబునఁ బుట్టి పనిగలయప్పుడ తన్నుఁ దలంచునది యని చెప్పితపోవనంబునకుం జనుటయును భీష్మనకుంజెప్పి, 'నిజతపోదహన దగ్ధపాపేంధనుం డయిన కృష్ణద్వైపాయనుం డఖిలధర్మమూర్తి నిత్యసత్యవచనుండు నా నియోగంబున నీ యనుమతంబున భవద్భ్రాతృక్షేత్రంబులయందు సంతానంబు వడయు' ననిన, నమ్మహర్షి కీర్తనంబు విని భీష్ముండు కరకమలంబులు మొగిచి వ్యాసభట్టారకుఁ డున్న దిక్కునకు మ్రొక్కి 'తొల్లి జగంబు లుత్పాదించిన యాదిమబ్రహ్మకుం గల సామర్థ్యంబు గల వేదవ్యాసుం డిక్కురువంశంబుఁబ్రతిష్ఠించునది యెల్లవారికి నభిమతంబ' యనిన, సత్యవతి కురువంశోద్వహనార్థంబు పారాశర్యుం దలంచుడు నాక్షణంబ.** **239**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; భీష్మ, పలుకులకున్= భీష్మునియొక్క మాటలకు; సంతోషించి= ఆనందించి; సత్యవతి; తొల్లి= పూర్వం; తన, కన్య, ఐ, ఉన్న, కాలంబునన్= తాను కన్యగా ఉన్నకాలంలో; పరాశరుండు; తన్ను, కామించుటయున్= తనను కోరుటయున్నూ; ఆ+ముని, వరంబునన్= ఆ మునియొక్క అనుగ్రహంతో; తన, కన్యాత్వంబు, దూషితంబు, కాక, ఉనికియున్= తన కన్యాభావం దోషంలేకుండ ఉండుటయున్నూ; తద్, ప్రసాదంబునన్, చేసి= అతనిదయవలన; యమునా, ద్వీపంబునన్= యమునానదిలోని ఒకద్వీపంలో; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; కానీనుండు+అయి= కన్యకు పుట్టినవాడై; సద్యస్+గర్భమునందున్= వెంటనే ఏర్పడిన గర్భంలో; పుట్టి; పని, కల, అప్పుడు+అ, తన్ను, తలంచునది, అని= అవసరం వచ్చినప్పుడు వెంటనే తనను స్మరించునది, అని; చెప్పి; తపోవనంబునకున్= తపస్సు చేసికొనే అరణ్యానికి; చనుటయును= వెళ్లుటనుగూర్చి; భీష్మునకున్, చెప్పి; నిజ, తపః, దహన, దగ్ధ, పాప+ఇంధనుండు+అయిన= తనదైన తపస్సు అనే అగ్నిచేత దహింపచేయబడిన పాపము అనే వంటచెరకు కలవాడు అయిన (తపోఽగ్నిచేత పాపాన్ని తొలగించుకొన్నవాడు

అనిభావం); కృష్ణద్వైపాయనుండు; అఖిల, ధర్మ, మూర్తి= సమస్తధర్మాలు మూర్తికట్టినవాడు; నిత్య, సత్య, వచనుండు= ఎల్లప్పుడు సత్యాన్నే పలికేవాడు; నా, నియోగంబునన్= నా ఆజ్ఞవలన; నీ, అనుమతంబునన్= నీఅనుమతితో; భవత్+భ్రాతృ, క్షేత్రంబులయందున్= నీయొక్క తమ్మునిభార్యలయందు; సంతానంబు, పడయును, అనినన్= సంతానాన్ని పొందుతాడు అని చెప్పగా; ఆ+మహర్షి, కీర్తనంబు, విని= ఆ గొప్పమునియైన వ్యాసుని ప్రశంస విని; భీష్ముండు; కరకమలంబులు, మొగిచి= తామరలవంటి చేతులు జోడించి; వ్యాసభట్టారకుఁడు; ఉన్న; దిక్కునకున్, మ్రొక్కి= నమస్కరించి; తొల్లి= పూర్వం; జగంబులు= లోకాలను; ఉత్పాదించిన= సృష్టించిన; ఆదిమ, బ్రహ్మకున్, కల, సామర్థ్యంబు, కల, వేదవ్యాసుండు= ఆద్యు డైన బ్రహ్మ కున్న నేర్పు కల వేదవ్యాసుడు (వేదాలను విభజించటంవలన వేదవ్యాసుడని పిలువబడతాడు); ఈ+కురు, వంశంబున్, ప్రతిష్ఠించును= ఈ కురువంశాన్ని నిలువబెట్టుతాడు; అది, ఎల్లవారికిన్, అభిమతంబు+అ, అనినన్= అది అందరికీ ఆమోదమే అని అనగా; సత్యవతి; కురువంశ+ఉద్వహన+అర్థంబు= కురువంశాన్ని ఉద్ధరించటంకొరకై; పారాశర్యున్= పరాశరుని కుమారుడైన వ్యాసుడిని; తలంచుడున్= స్మరించగా; ఆ క్షణంబు+అ= అప్పుడే.

తాత్పర్యం: ఆ విధంగా అనగా భీష్ముడిమాటలకు సత్యవతి సంతోషపడి, పూర్వం తాను కన్యగా ఉన్నప్పుడు పరాశరమహర్షి తనను కోరటం, ఆ మునివరంవలన తన కన్యాత్వం దోషంలేకుండా ఉండటం, అతడి దయవలన యమునానదిలోని ద్వీపంలో వ్యాసుడు కన్యకుపుట్టినవాడుగా తనకు జన్మించటం, తనకెప్పుడైనా పనిపడినట్లైతే వెంటనే తనను తలంచుకొమ్మని చెప్పి అతడు తపోవనానికి పోవటం భీష్ముడికి చెప్పింది. 'కృష్ణద్వైపాయనుడు(వ్యాసుడు) తన తపస్సు అనే అగ్నితో పాపాలు అనే కట్టెలను కాల్చివేసిన తేజస్వి, సమస్తధర్మాలను తెలిసినవాడు. ఎల్లప్పుడూ సత్యం మాటాడేవాడు. నా ఆజ్ఞచేతనూ నీ అంగీకారంవలననూ నీ తమ్ముడి భార్యలందు సంతానాన్ని పొందుతాడు' అని అన్నది సత్యవతి. భీష్ముడు ఆ మహర్షి ప్రశంస విని చేతులు జోడించి వ్యాసుడున్న దిక్కుకు తిరిగి మ్రొక్కి 'పూర్వం లోకాలను సృష్టించిన మొదటిబ్రహ్మదేవుడికున్న సామర్థ్యంగల వేదవ్యాసుడే ఈ కురువంశాన్ని నిలపాలి. ఇది అందరికి అంగీకారమే' అని అనగా సత్యవతి కురువంశాన్ని ఉద్ధరించటంకొరకు వేదవ్యాసుడిని మనసులో తలచుకోగానే వెంటనే. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. నీలగిరీంద్ర శృంగమున నిర్మల మైన సువర్ణవల్లరీ
జాలమువోని పింగళవిశాలజటాచయ మొప్పఁగా వచ
శ్శ్రీలలితుండు వచ్చి నిలిచెన్ హరినీలవినీల విగ్రహో
రాళరుచుల్ వెలుంగఁగఁ బరాశరసూనుఁడు తల్లిముందటన్. 240

ప్రతిపదార్థం: నీలగిరి+ఇంద్ర, శృంగమునన్= శ్రేష్ఠమైన నల్లనికొండయొక్క శిఖరంమీద; నిర్మలము+ఐన= స్వచ్ఛమైన; సువర్ణ, వల్లరీ, జాలము, పోని= బంగారుతీగల సమూహంవంటి; పింగళ, విశాల, జటా, చయము+ఒప్పఁగాన్= గోరోజనం వంటి రంగు గలిగి వ్యాపించి ఉన్న జడలయొక్క సమూహం అందంగా ఉండగా; వచస్+శ్రీ, లలితుండు= వాక్కు అనెడి సంపదచేత మృదువైనవాడు (మృదువైనవాక్కులనెడి సంపద కలవాడు); హరినీల, వినీల, విగ్రహ+ఉరాళరుచుల్, వెలుంగఁ గన్= ఇంద్రనీలం అనే రత్నంవలె దట్టమైన నీలవర్ణం గల ఆకారంనుండి వెలువడే కాంతులు; వెలుంగఁగన్= ప్రకాశించగా; పరాశర, సూనుఁడు= పరాశరమహర్షికి సత్యవతియందు పుట్టినవాడైన వ్యాసుడు; వచ్చి= వచ్చి; ముందటన్= తల్లిఎదుట; నిలిచెన్= నిలిచాడు.

తాత్పర్యం: శ్రేష్ఠమైన నల్లనికొండయొక్క శిఖరంమీది అచ్చమైన బంగారు తీగల సమూహం వలె గోరోజనంవంటి రంగుతో వ్యాపించిఉన్న జడలసమూహంతో ఒప్పారి మృదువైన మాట లనెడి సంపదతో కూడిన వేదవ్యాసుడు ఇంద్ర నీలం అనే మణివలె నీలకాంతులు ప్రకాశిస్తూ ఉండగా వచ్చి తల్లిముందట నిలిచాడు.

విశేషం: అలం: ఉపమ. నవరత్నాలలో ఒకటి నీలం, వజ్ర, వైడూర్య, గోమేధిక, పుష్యరాగ, మరకత, మాణిక్య, నీల, ప్రవాళ, ముత్యాలు నవరత్నాలు. ఈ పద్యరచనలో శ్లేషము అనే శబ్దగుణం, అక్షరరమ్యత గమనింపదగినవి.

వ. సత్యవతియును బెద్దకాలంబునకు వచ్చిన యాప్రథమపుత్త్రు నతిహర్షంబునం గౌఁగిలించుకొని యవిరళపయోధారల నానందబాష్పధారలం జేసి యభిషేకించుచున్న, నమ్మునివరుండును దల్లి బాష్పజలంబులు దుడిచి యభివాదనంబు సేసి పురోహితపురస్సరభూసురవరులతో విధిపూర్వకంబుగా భీష్ముండు సేసిన యర్ఘ్యాదిపూజలు సేకొని సుఖాసీనుం డై యున్న, నమ్మహామునిఁ గుశలం బడిగి సత్యవతి యి ట్లనియె. 241

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: చాలకాలం తరువాత వచ్చిన ఆ మొదటికొడుకును సత్యవతి అమితసంతోషంతో కౌగిలించుకొని తెరపిలేకుండ స్రవించే చనుబాలధారలతోనూ, ఆనందంతో కలిగిన కన్నీటిధారలతోనూ అభిషేకిస్తూ ఉండగా, ఆ మునిశ్రేష్ఠుడు తల్లికన్నీటిని తుడిచి నమస్కరించాడు. పురోహితుడిని ముందుంచుకొని బ్రాహ్మణశ్రేష్ఠులతో కలసి నియమానుసారంగా భీష్ము డిచ్చిన అర్ఘ్యాద్యతిథిపూజలు గ్రహించాడు. ఆ పై సుఖంగా అసనంమీద కూర్చుండి ఉండగా సత్యవతి ఆ మహామునిని క్షేమాదులు అడిగి ఈ విధంగా అన్నది.

క. జనకునకును స్వామిత్వము । తనయోద్దేశమునఁ గలిమి తథ్యమ; యది య
జ్జననికిఁ గలుగున కావునఁ । జనుఁ బనిఁ బంపంగ నిన్ను జననుత! నాకున్, 242

ప్రతిపదార్థం: తనయ+ఉద్దేశమునన్= కొడుకునుబట్టి; జనకునకును= తండ్రికి; స్వామిత్వము= ప్రభుత్వం, ఆజ్ఞ ఇచ్చే అధికారం; కలిమి= కలిగిఉండటం; తథ్యము+అ= నిజం; అది= ఆ ప్రభుత్వం, అధికారం, ఆ+జననికిన్= ఆతల్లికికూడ; కలుగును+అ= తప్పక కలుగుతుంది; కావునన్= కాబట్టి; జననుత= ప్రజలచేత ప్రశంసింపబడినవాడా! (వ్యాసా!); నాకున్; నిన్నున్; పనిన్, పంపంగన్= ఈ పని చేయుమని ఆజ్ఞాపించటం; చనున్= ఉచితమే ఔతుంది.

తాత్పర్యం: కొడుకుల లక్ష్యంలో తండ్రికి ఆజ్ఞాపించే అధికారం తప్పకుండా ఉంటుంది; అట్లాగే తల్లికికూడ అటువంటి అధికారం కలుగుతుంది కాబట్టి లోకంచేత కీర్తింపబడే వ్యాసుడా! నీకు పనిచెప్పి చేయు మని ఆజ్ఞాపించటం నాకు ఉచితమే ఔతుంది.

చ. అనుపమరాజ్యసంపదకు నర్హుఁడు వంశము విస్తరింపనో
పినసుచరిత్రుఁ డీసుతుఁడు భీష్ముఁడు; దొల్లియుఁ దండ్రికిం బ్రియం
బనఘుఁడు సేయుచుండి నిఖిలావనిరాజ్యనివర్తనంబునుం
దనరఁగ బ్రహ్మచర్యమును దాల్చె జగద్విదితప్రతిజ్ఞుఁ డై. 243

ప్రతిపదార్థం: అనుపమ, రాజ్య, సంపదకున్, అర్హుఁడు= సాటిలేని రాజ్య మనే సంపదకు యోగ్యుడైనవాడున్నూ; వంశము, విస్తరింపన్, ఓపిన, సుచరిత్రుఁడు= వంశాన్ని వృద్ధిచేయ గల మంచిప్రవర్తన కలవాడున్నూ; (అయిన); భీష్ముడు; తొల్లియున్= పూర్వం; అనఘుఁడు= పాపరహితుఁడైనవాడు (భీష్ముడు); ఈ సుతుఁడు= ఈ కుమారుడు; తండ్రికిన్= తండ్రియైన శంతనుడికి; ప్రియంబు= సంతోషాన్ని; చేయుచున్+ఉండి= కలిగిస్తూఉండి; నిఖిల+అవని, రాజ్య, నివర్తనంబునున్= సమస్తమైన భూసామ్రాజ్యాన్ని త్యజించటమూ; బ్రహ్మచర్యమును= వివాహముచేసికొనకుండ ఉండేవ్రతమూ; తనరఁగన్= ఒప్పునట్లుగా; జగత్+విదిత, ప్రతిజ్ఞుఁడు+ఐ= లోకానికి తెలియబడిన ప్రతిజ్ఞకలవాఁడై (లోకంలో ప్రసిద్ధికెక్కేటట్లు ప్రతిజ్ఞచేసినవాడై అనిభావం); తాల్చెన్= ధరించాడు.

తాత్పర్యం: సాటిలేని రాజ్యసంపదకు అర్హత కలవాడూ, వంశాన్ని విస్తరింపజేయగల ఉత్తమప్రవర్తన కలవాడూ, పాపరహితుడూ అయిన ఈకుమారుడు భీష్ముడు, పూర్వం తన తండ్రికి సంతోషాన్ని కలిగిస్తూ సకలసామ్రాజ్యాన్ని త్యజించి, బ్రహ్మచర్యవ్రతాన్ని ఒప్పారగా తాల్చి లోకంలో ప్రసిద్ధి కెక్కేటట్లు ప్రతిజ్ఞ చేశాడు.

విశేషం: భీష్ముని వర్ణనం కాంతి అనే శబ్దగుణప్రధానంగా సాగటం సముచితంగా ఉన్నది.

క. ఈయన్వయవిచ్ఛేదము । నీ యెఱుఁగని యదియె సన్మునిస్తుత! జగముల్
నీయంద నిలిచినవి గా । వే యిక్కాలత్రయప్రవృత్తులతోడన్. 244

ప్రతిపదార్థం: ఈ, అన్వయ, విచ్ఛేదము= ఈవంశం(పరంపర)సాగక ఇంతటితో తెగిపోవటం; నీ, ఎఱుఁగని, అదియె?= నీకు తెలియనిదా?; సత్+ముని, స్తుత= ఉత్తములైన ఋషులచేత కీర్తింపబడేవాడా! (వ్యాసుడా!); ఈ+కాల, త్రయ, ప్రవృత్తుల తోడన్= భూత, భవిష్యత్, వర్తమానా లనే మూడుకాలాలయొక్క స్వభావాలతో కూడిన; జగముల్= లోకాలు; నీ, అందున్+అ, నిలిచినవి, కావే= నీయందే ఉన్నవికదా!

తాత్పర్యం: ఈ వంశం ఇంతటితో ఆగిపోవటం (ఈవంశసంతతి పరంపర ఇంతటితో తెగిపోవటం) నీకు తెలియనిది కాదుకదా! మహామునులచే స్తుతింపబడే నీయందే మూడుకాలాలస్వభావాలతో మసలే జగత్తంతా నిలిచిఉన్నదికదా! (నీవు సర్వకాలసర్వజ్ఞుడవు అనిభావం).

క. ధృతి నీయనుజుం డై వి । శ్రుతుఁ డైన విచిత్రవీర్యు సుక్షేత్రములన్
సుతులం బడయుము కుల మవి । రతసంతతి నెగడ దేవరన్యాయమునన్. 245

ప్రతిపదార్థం: నీ, అనుజుండు+ఐ= నీతమ్ముడై; విశ్రుతుఁడు+ఐన= కీర్తికెక్కినవాడైన; విచిత్రవీర్య, సుక్షేత్రములన్= విచిత్రవీర్యునియొక్క భార్యలయందు, ధృతిన్= సంతోషంతో; దేవరన్యాయమునన్= దేవరన్యాయంతో (క్షత్రియవంశం సంతతిలేకుండ విచ్ఛిన్నమైపోతున్నప్పుడు ఉత్తమబ్రాహ్మణుడివలన క్షత్రియవనితలయందు సంతానం పొందటం దేవరన్యాయం); కులము= వంశం; అవిరత, సంతతి, నెగడన్= ఆపు లేని సంతానంతో వర్ధిల్లగా సుతులన్, పడయుము= కొడుకులను పొందుము.

తాత్పర్యం: నీతమ్ముడుగా ప్రసిద్ధి చెందిన విచిత్రవీర్యుడియొక్క భార్యలయందు దేవరన్యాయాన్ని అనుసరించి సంతోషంతో ఈకులం ఎప్పుడూ ఎడతెగనిసంతతితో ఉండేటట్లు కుమారులను పొందుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: భర్త అనపత్యుడై చనిపోతే స్త్రీ ఆ భర్తసోదరుడివలన సంతతిని పొందటం దేవరన్యాయము.

క. నీ కారణమున వంశ మ । నాకుల మై నిలుచుటయుఁ దదాప్తులుఁ బ్రజలున్
శోకభయంబులు విడుతురు, । నాకును భీష్మునకుఁ గడు మనఃప్రియ మెసఁగున్. 246

ప్రతిపదార్థం: నీ, కారణమునన్= నీవు కారణంగా; వంశము= భరతవంశం; అనాకులము+ఐ= చెదరిపోనిదై; నిలుచుటయున్= స్థిరపడుటయూ; తద్+ఆప్తులు= ఆ వంశయోగక్షేమాలు కోరే హితులూ; ప్రజలున్= రాజ్యప్రజలు; శోక, భయంబులు, విడుతురు= దుఃఖాన్నీ భయాన్నీ విడిచిపెడతారు; (వంశం విచ్ఛిన్నమౌతుందనే శోకం విచిత్రవీర్యుని తరువాత రాజ్యానికి రాజుండడేమో అనే భయం నిడిచిపెడతారని భావం); నాకును= (సత్యవతికిని); భీష్మునకున్, కడున్, మనస్+ప్రియము+ ఎసఁగున్= ఎక్కువయైన మానసికసంతోషం కలుగుతుంది.

తాత్పర్యం: నీవు కారణంగా భరతవంశం చెదరిపోకుండ స్థిరపడటమూ, ఆ వంశహితం కోరే ఆత్మీయులు, దేశప్రజలు దుఃఖాన్నీ భయాన్నీ వదలిపెట్టటమూ జరుగుతుంది. నాకూ, భీష్ముడికీ ఎంతో సంతోషం కలుగుతుంది.

క. అని సత్యవతి నియోగిం । చిన వేదవ్యాసుఁ 'డట్ల చేయుదు; నిది యెం
దును గల ధర్మువ; యెప్పుడు । వినఁబడు నానాపురాణ వివిధశ్రుతులన్. 247

ప్రతిపదార్థం: అని; సత్యవతి; నియోగించినన్= ఆజ్ఞాపించగా; వేదవ్యాసుఁడు= అట్లు+అ= ఆవిధంగానే; చేయుదును= చేస్తాను; ఇది, ఎందును, కల, ధర్మువు+అ= ఇది అన్నిచోట్ల ఉన్న ధర్మమే; నానా, పురాణ, వివిధ, శ్రుతులన్= అనేకపురాణాల్లోనూ, వివిధ వేదాలలోనూ, జనశ్రుతి సంప్రదాయాల్లోనూ; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; వినఁబడున్= ప్రచారంలో ఉన్నది.

తాత్పర్యం: ఈ విధంగా సత్యవతి ఆజ్ఞాపించగా వేదవ్యాసుడు ఇ ట్లన్నాడు - నేను నీవు ఆజ్ఞాపించినట్లే చేస్తాను. ఇది అంతటా ఉన్నధర్మమే. బహు పురాణాల్లోనూ, వేదాలలోనూ, జనశ్రుతిపరంపరలోనూ ఎప్పుడూ వినబడుతూ ఉన్నది.

వ. 'ఇక్కాశీరాజ దుహితలయందు ధర్మస్థితిం బుత్త్రోత్పత్తిఁగావించెద; వీరలు నా చెప్పిన వ్రతం బొకసంవత్సరంబు సేసి శుద్ధాత్మ లగుదురేని సత్పుత్త్రులు పుట్టుదు' రనిన సత్యవతి యి ట్లనియె. 248

ప్రతిపదార్థం: సుగమం.

తాత్పర్యం: 'ఈకాశీరాజ పుత్రికలయందు ధర్మనియమంతో పుత్రులను పుట్టిస్తాను. వీరు నేను చెప్పిన వ్రతాన్ని (నియమాన్ని) ఒక సంవత్సరకాలం ఆచరించి పవిత్రమైన హృదయాలు కలిగినవారై ఉంటే ఉత్తములైన కొడుకులు పుట్టుతారు' అని అనగా సత్యవతి ఈవిధంగా అన్నది.

క. ప్రకటముగ వంశవిస్తా । రకు లగు పుత్త్రకులఁ జెచ్చెరం బడయుదు; రరా
జక మయిన ధారుణీప్రజ । కొక నిమిషం బయినఁ బ్రకృతి నుండఁగ లావే. 249

ప్రతిపదార్థం: ప్రకటముగన్=లోకానికి తెలిసేటట్లుగా; వంశ, విస్తారకులు+అగు, పుత్త్రకులన్= వంశాన్ని పెంపొందించే కుమారులను; చెచ్చెరన్= వెనువెంటనే; పడయుదురు= పొందుతారు(కంటారు); అ, రాజకము+అయినన్, ధారుణీ, ప్రజకున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాజులేనిరాజ్యప్రజలకు; ఒక, నిమిషంబు+అయినన్= ఒకక్షణకాలమైనప్పటికి; ప్రకృతిన్, ఉండఁగ, లావు+ఏ= సహజ శాంతస్వభావంతో ఉండటం అశక్యం కాదా!

తాత్పర్యం: ప్రసిద్ధంగా వంశాన్ని పెంపొందించే కొడుకులను వెంటవెంటనే వారు పొందుతారు. ఎందుకంటే రాజులేని రాజ్యప్రజలకు ఒకక్షణకాలమైనా సహజ శాంతస్వభావంతో ఉండటం అశక్యంకదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

చ. అవని యరాజకం బయిన యప్పడ భూప్రజయందు సర్వధ
ర్మువులుఁ దొలంగు, దేవమునిముఖ్యులు వాయుదు, రోలి వృష్టిలే
దవు, మఱి యర్ఘువుల్ దఱుఁగు నందురు గావునఁ గాలయాపనం
బవితథవాక్య! చేయక నయంబున రాజ్యము నిల్పు మిత్తఱిన్. 250

ప్రతిపదార్థం: అవని= భూమి; అ, రాజకంబు+అయిన, అప్పుడు+అ= రాజులేకుండపోయినవెంటనే; భూ, ప్రజ, అందున్= రాజ్యప్రజలలో; సర్వ, ధర్మువులు= ధర్మాలన్నీ; తొలంగున్= తొలగిపోతాయి; దేవ, ముని, ముఖ్యులు= దేవతలు, మునిశ్రేష్ఠులు లేదా దేవమునిశ్రేష్ఠులు; పాయుదురు= దేశంవదలి వెడలిపోతారు; ఓలిన్= క్రమంగా; వృష్టి, లేదు+అవు= వానలు లేకుండా ఉంటాయి; (కాటకం (కరువు) ఏర్పడుతుంది); మఱి= ఇంకను; అర్ఘువుల్= వెలలు; తఱుఁగును= పడిపోతాయి; అంటారు= అని చెప్పుతారు; కావునన్= కాబట్టి; అవితథవాక్య= మాటతప్పనివాడా! (సత్యవాక్యపాలకుడా); కాల, యాపన, చేయక= ఆలస్యం చేయకుండ; ఇత్తఱిన్= ఈసమయంలో; నయంబునన్= పొందికగా; నేర్పుగా; రాజ్యము, నిల్పుము= రాజ్యాన్ని కాపాడు(ము).

తాత్పర్యం: రాజ్యంలో రాజు లేకుండ పోయినవెంటనే రాజ్యప్రజలలో ధర్మాలన్నీ తొలగిపోతాయి; దేవఋషిశ్రేష్ఠులు రాజ్యాన్ని వదలిపోతారు; క్రమంగా వానలు లేకుండా పోతాయి; ఇక, వస్తువుల విలువలు పడిపోతాయి అని చెప్పుతారు కాబట్టి ఓ సత్యవాక్యపరిపాలకా! ఆలస్యం చేయక ఈ సమయంలో నేర్పుగా రాజ్యాన్ని నిలుపు(ము).

క. దయ నీచే నుత్పాదితు । లయినసుతులు ద మ్మెఱుంగునంతకు భీష్ముం
డయ నయశాలి సమర్థుం । డయి చేకొని రాజ్యభార మారయుచుండున్. 251

ప్రతిపదార్థం: దయ, నీచేన్, ఉత్పాదితులు+అయిన, సుతులు= దయతో నీవలన పుట్టింపబడిన కొడుకులు; తమ్మున్+ఎఱుంగు, అంతకున్= తమంతట తాము రాజ్యం నిర్వహించే తెలివి వచ్చేంతవరకు; భీష్ముండు; అయ, నయశాలి= శుభావహాలైన, నీతి యుక్త కార్యాలను, నిర్వహించే శక్తి కలవాడు. ("అయః శుభావహో విధిః" - అమరకోశము, 1 కాండము, కాలవర్గము, 29 శ్లో.) సమర్థుండు= నిర్వాహకుడు; అయి; రాజ్యభారము; చేకొని= స్వీకరించి; ఆరయుచున్+ఉండున్= రక్షిస్తూ ఉంటాడు.

తాత్పర్యం: దయతో నీవలన పుట్టించబడిన కొడుకులు తమంతట తాము తెలిసికొని రాజ్యంచేసేంతవరకు, భీష్ముడే రాజ్యానికి ఆవశ్యకాలు మంగళకరాలు, నీతిమంతాలు అయినా కార్యాలన్నీ సమకూర్చేవాడై సామర్థ్యంతో రాజ్యకార్యభారాన్ని చేపట్టి నిర్వహిస్తూ ఉంటాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని సత్యవతి కృష్ణద్వైపాయను నియోగించి ఋతుమతియు శుచిస్నాతయు నై యున్న యంబికకడకుం జని 'క్షేత్రజుం డైనవాఁడు సుపుత్త్రుండు గావున ధర్మ్యం బైన విధానంబున నీవు రాజ్యధురంధరుం డయిన కొడుకుం బడసి భరతవంశంబు నిలుపు; మెల్లధర్మంబులకంటెఁ గులంబు నిలుపుటయు మిక్కిలి ధర్మంబు; నేఁటిరాత్రి నీకడకు దేవరుండు వచ్చుం; దదాగమనంబుఁ బ్రతీక్షించి యుండునది' యని కోడలి నొడంబఱిచి యనేకసహస్రమహీసురులను దేవతలను ఋషులను నిష్టభోజనంబులం దనిపియున్న నారాత్రియందు .252

తాత్పర్యం: అని సత్యవతి వ్యాసుడిని ఆజ్ఞాపించి ముట్టయి శుద్ధిస్నానం చేసిఉన్న అంబిక వద్దకు పోయి (యజమానునిభార్య కన్నవాడు) పుత్రులలో ఉత్తమపుత్రుడు కాబట్టి న్యాయమైన పద్ధతిలో రాజ్యాన్ని ధరింపగల సమర్థుడైన కొడుకును నీవు పొంది భరతవంశాన్ని నిలుపుము. ధర్మాలన్నింటిలోకంటె వంశం నిలపటం ఉత్తమధర్మం. నేటిరాత్రికి నీవద్దకు దేవరుడు (భర్తకు సోదరుడైన బ్రాహ్మణోత్తముడు) వస్తాడు. అతనిరాకకొరకు ఎదురుచూస్తూ ఉండవలసింది' అని కోడలిని అంగీకరింపజేసి పెక్కువేల బ్రాహ్మణులకు, దేవతలకు, మునులకు ఇష్టమైనవిందులు పెట్టి తృప్తులను చేసిఉండగా, ఆనాటిరాత్రి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'దేవర'- అంటే భర్తయొక్క సోదరుడు, 'దేవరన్యాయం'- 'అపుత్రాం గుర్వనుజ్ఞాతో దేవరః పుత్ర కామ్యయా'- అని యాజ్ఞవల్క్య స్మృతి (1.68). పుత్రవతి కాకుండానే భర్తను కోల్పోయిన స్త్రీ (విధవ) యందు, ఆమె దేవరుడు (భర్తసోదరుడు) పెద్దల అనుమతితో సంతానాన్ని పొందటం, దేవరన్యాయం.

ధృతరాష్ట్ర పాండురాజ విదురుల జననము (సం. 1-100-4)

క. 'తివిరి సుతజన్మ మెన్నం । డవునొకొ దేవరుని వలన?' ననుచును నవప
ల్లవకోమలాంగి యంబిక । ధవళేక్షణ విమలశయనతలమున నున్నన్. 253

ప్రతిపదార్థం: తివిరి= కుతూహలపడి; నవపల్లవ, కోమల+అంగి= క్రొత్తచిగురాకువంటి దేహం గల సుకుమారవతి; ధవళ+ఈక్షణ= తెల్లనిచూపులు కలది; అంబిక; దేవరుని వలనన్= పతి సోదరుడు, సంతానాన్ని కలిగించటానికై నియోగించబడిన బ్రాహ్మణోత్తముని వలన; సుత, జన్మము, ఎన్నండు+అవును+ఒకొ= కొడుకు పుట్టడం ఎప్పుడు కలుగుతుందో; అనుచును= అని తలపోస్తూ; విమల, శయన, తలమునన్, ఉన్నన్= శుభ్రమైన శయ్యపై ఉండగా.

తాత్పర్యం: క్రొత్తచిగురాకువంటి సుకుమార శరీరం కలిగి తెల్లనిచూపులతో ఒప్పారే అంబిక- దేవరుని వలన 'నాకు ఎప్పుడు కొడుకు పుట్టుతాడో!' అని తలపోస్తూ కుతూహలపడి శుభ్రమైన శయ్యపై పరుండి ఉన్నది.

మధ్యాక్కర.

అవసరజ్ఞుం డయి వ్యాసుఁ డేతెంచె నంత నత్తపసి
కవిలగడ్డంబును గవిలజడలును గవిలకన్నులును
దవినయన్నువ నల్ల నైన దీర్ఘపుందనువును జూచి
యువిద గన్నుంగవ మొగిచి తెలివక యుండె భయమున. 254

ప్రతిపదార్థం: వ్యాసుఁడు; అవసర, జ్ఞుండు+అయి= తగినవేళ అది అని తెలిసినవాడై; ఏతెంచెన్= వచ్చాడు; అంతన్= అప్పుడు; ఆ+తపసి= ఆమునియొక్క; కవిల, గడ్డంబును= (కపిలశబ్ధభవం కవిల) గోరోజనంవంటి రంగుగల గడ్డాన్నీ; కవిల, జడలును= గోరోజనంవంటి రంగుగల జడలుకట్టిన తలజుట్టునూ; కవిల, కన్నులును= గోరోజనంవంటి రంగులో ఉన్న కళ్ళనూ; తవిన= (తగిన); అన్నువ= సన్ననైన; నల్లన+ఐ= నల్లనిరంగుగలది అయిన; దీర్ఘపున్, తనువును= పొడుగాటి శరీరమునూ; చూచి; ఉవిద= వనిత(అంబిక); భయమునన్= భయంతో; కన్నుంగవ, మొగిచి, తెఱవక, ఉండెన్= కన్నులజంటను మూసి తెరువకుండానే ఉండిపోయింది.

తాత్పర్యం: అది తగినవేళ అని తెలిసినవాడై వ్యాసుడు వచ్చాడు. అప్పుడు ఆ మునియొక్క గోరోజనంవంటి రంగులో ఉన్న గడ్డాన్నీ, జడలనూ, కళ్ళనూ, వాటికి తగినట్లుగా సన్నగా నల్లగా పొడుగ్గా ఉన్న శరీరాన్ని చూచి అంబిక భయంతో కన్నులురెండూ మూసికొని తెరవకుండానే ఉండిపోయింది.

విశేషం: మధ్యాక్కరలోని ప్రతిచరణంలోనూ వరుసగా రెండు ఇంద్రగణాలూ, ఒక సూర్యగణం, రెండు ఇంద్రగణాలూ, ఒక సూర్యగణం ఉంటాయి. నన్నయ అయిదవ గణం మొదటి అక్షరంతో యతిమైత్రి చేశాడు. ప్రాసనియమం ఉంది. "కవిలగడ్డంబును, కవిలజడలును, గవిలకన్నులును''- అనేపాదానికి "కపిలగడ్డంబును, కపిలజడలును, గపిలకన్నులును''- అనే పాఠాంతరం కనబడుతున్నది. దీనినిగురించి ఆంధ్రమహాభారతసంశోధితముద్రణంలో ఈక్రిందివిధంగా వివరింపబడిఉన్నది: " ఇచ్చట కపిలగడ్డము అను పాఠము గ్రహించినచో వైరిసమాస మగుటయేకాక పవప్రాస మేర్పడుచున్నది. ఇది నన్నయకు సమ్మతమగునో కాదో నిర్ణయించుట కాధారములేదు. తాళపత్రప్రతు లన్నియును, శ,ష ప్రతులును కపిలగడ్డము అను పాఠమునే గ్రహించినవి. 'కవిల' కపిలశబ్దవైకృత మని శబ్దరత్నాకరము. కాని, ప్రాచీనశాసనములందు కపిలగోవు అనుటకు కవిల అనురూపము వినవచ్చును. వేగవిరాళు వంటిరూపములు కాన్పించుచున్నవి. దీనినిబట్టి కపిలశబ్దమునకు కవిలరూపము ప్రాచీనమైనది కలదు. నన్నయ యీకవిలరూపము నిచ్చట వాడెనని సరిపుచ్చుకొనవలెను. మఱియొక సందర్భమునందు కపిలశబ్దమును నన్నయ ప్రయోగించెను. 'అమరసువర్ణశృంగ (1-15) ఇత్యాదిపద్యమునందు కపిలం బగు గోశతంబు అని ప్రయోగము కన్పించుచున్నది. ప, వలకు, అభేదవర్గయతిని అప్పకవి యంగీకరించెను. సంధిగత మైనప్పుడు గసడదవాదేశముచేప, వలకు ప్రాస యంగీకరింపబడినది. అట్టిచో ప, వలకు అభేదవర్గనియతిచే క్వాచిత్కమైన ప్రాసయుండెనేమో తెలియదు. గవురుగడ్డంబును అనుపాఠమును వినవచ్చుచున్నది. (ఆముద్రితగ్రంథచింతామణి- సంపుటము 16, సంచిక2, పుట17, సం.1903). ఇచ్చట సంస్కృతమూలమునందు భిన్నవిశేషణములు వాడబడియున్నవి. 'తస్య కృష్ణస్య కపిలాం జటాం దీప్తే చ లోచనే బభ్రూణీచైవ శ్మశ్రూణి దృష్ట్వా దేవీన్యమీలయత్'. నన్నయ కూడ ఇదేమార్గము నవలంబించి భిన్నవిశేషణములను వాడె నని భావించవచ్చును. అప్పుడు గవురుగడ్డము, కపిలజడలును, కపిలకన్నులును అని నన్నయ ప్రయోగించియుండెనని ఊహింపవచ్చును. (ప్రథమసంపుటము-పుట.245 (అథస్సూచిక).

వ. కృష్ణద్వైపాయనుండును దానికింబుత్త్రదానంబు సేసి 'యాయంబికయందు బలపరాక్రమవంతుం డయిన కొడుకు పుట్టు; వాఁడు మాతృదోషంబున నంధుం డగు' ననిన విని విషణ్ణచిత్త యయి సత్యవతి వెండియుం గృష్ణద్వైపాయనుంబ్రార్థించి' యింకనంబాలికయం దొక్కకొడుకుంబడయు' మని నియోగించిన నెప్పటియట్ల యమ్మునివరుండు నంబాలిక కడకుం జనిన, నదియుం దనవేషంబునకు వెఱచి వెల్లనైయున్న నక్కోమలికిం బుత్త్రదానంబుసేసి' యీయంబాలికయందు మహాబలపరాక్రమగుణవంతుండు వంశకరుండు నగుపుత్త్రుండు పుట్టు; వాఁడును మాతృదోషంబునఁ బాండుదేహుం డగు' నని చెప్పి యరిగిన. 255

ప్రతిపదార్థం: కృష్ణద్వైపాయనుండును= వ్యాసుడును; దానికిన్= ఆమెకు; పుత్త్ర, దానంబు, చేసి= కొడుకు కలుగునట్లుగా చేసి; ఈ, అంబిక, అందున్= ఈ అంబికకు; బల, పరాక్రమవంతుండు+అయిన= దేహబలం, పౌరుషం కలిగినవాడైన; కొడుకు, పుట్టున్= కొడుకు పుట్టుతాడు; వాఁడు= అతడు; మాతృ, దోషంబునన్= తల్లియొక్క పొరపాటువలన; అంధుండు+అగున్= గ్రుడ్డివాడుఔతాడు; అనినన్= అనిచెప్పగా; విని; విషణ్ణ, చిత్త, అయి= దుఃఖంతో నిండిన హృదయం కలిగినదై; సత్యవతి; వెండియున్= మరల; కృష్ణద్వైపాయనున్, ప్రార్థించి= వ్యాసుడిని వేడికొని; ఇంకన్= మరియు; అంబాలిక, అందున్; ఒక్క, కొడుకున్, పడయుము+అని= ఒకకొడుకును పొందు మని; నియోగించినన్= ఆజ్ఞాపించగా; ఎప్పటి+అట్ల+అ= ఇదివరకువలెనే; ఆ, మునివరుండు= ఆ ఋషిశ్రేష్ఠుడు; అంబాలిక, కడకున్, చనినన్= అంబాలికవద్దకు పోగా; అదియున్= ఆమెకూడ; తన, వేషంబునకున్= తనయొక్క (వ్యాసుడియొక్క) ఆకారానికి; వెఱచి= భయపడి; వెల్లన్+ఐ, ఉన్నన్= తెల్లబోయి ఉండగా; ఆ+కోమలికిన్= ఆ చక్కనిదానికి; పుత్త్రదానంబు, చేసి= పుత్రుడిని ఇచ్చి (కొడుకు కలిగేటట్లుచేసి); ఈ, అంబాలిక, అందున్; మహత్+బల, పరాక్రమ, గుణవంతుండు= గొప్పదైన దేహబలం, పౌరుషం, అనే గుణాలు కలవాడు; వంశకరుఁడున్= వంశాన్ని నిలిపేవాడు; అగు; పుత్త్రుండు, పుట్టున్= కొడుకు పుట్టుతాడు; మాతృ, దోషంబునన్= తల్లిపొరపాటు కారణంగా; పాండు, దేహుండు+అగున్= తెలుపు (మించిన పచ్చని) రంగుగల శరీరం కలవాడు ఔతాడు; అని, చెప్పి, అరిగినన్= అని, పలికి, వెడలిపోగా.

తాత్పర్యం: వ్యాసుడు అంబికకు పుత్రుడు కలిగేటట్లు అనుగ్రహించి, ఆమెకు దేహబలం, పరాక్రమం కలవాడైన కొడుకు పుట్టుతాడనీ, తల్లిపొరపాటువలన అతడు గ్రుడ్డివాడౌతా డనీ చెప్పాడు. ఆ మాటలువిని సత్యవతి విచారంతో నిండిన మనస్సుతో మరల వ్యాసుడిని వేడికొని అంబాలికయందు ఒక్కకొడుకును పొందు మని ఆజ్ఞాపించగా, ఎప్పటివలెనే ఆమునిశ్రేష్ఠుడు అంబాలికవద్దకు వెళ్ళగా, ఆమెకూడ వ్యాసుడి వేషాన్నిచూచి భయపడి తెల్లబోయి ఉన్నది. వ్యాసుడు ఆమెకు పుత్రుడిని ప్రసాదించి ఆ అంబాలికకు గొప్ప దేహబలం, పౌరుషం (అనే) మంచి గుణాలు కలవాడు, వంశాన్ని నిలిపేవాడు (వంశకర్తగా వంశానికి కీర్తితెచ్చేవాడు) అయిన కొడుకు పుట్టుతాడు. వాడుకూడ తల్లిపొరపాటు కారణంగా తెల్లనిరంగు (పాండువర్ణం) గల దేహం కలవా డౌతాడు అని చెప్పి వెళ్ళిపోగా.

విశేషం: వ్యాసుడు పుత్రదానం చేసినప్పుడు అంబిక, అంబాలికలు ఉన్న స్థితులను బట్టి వారు కనే కొడుకులకు దోషాలు ఏర్పడ్డాయి. అంబిక కన్నులు మూసికొని తెరవలేదు కాబట్టి ఆమెకు పుట్టే కొడుకు (ధృతరాష్ట్రుడు) గ్రుడ్డివాడైనాడు. అంబాలిక తెల్లబోయి ఉన్నది కాబట్టి ఆమెకొడుకు (పాండురాజు) పుట్టుకతోనే పాండువర్ణంతో వెలువడ్డాడు. వారిరువురి తారతమ్యంకూడ వ్యాసుడు నిర్దేశించాడు. గ్రుడ్డివాడు 'బలపరాక్రమవంతుడు' ఔతాడనీ, పాండురాజు 'మహాబలపరాక్రమ గుణవంతుడు' 'వంశకరుడు' ఔతాడనీ చెప్పాడు. భారతంలో ధృతరాష్ట్ర పాండురాజుల జాతకాలు వ్యాసుడు వారు పుట్టకపూర్వమే నిర్ణయించాడు. ఈ తారతమ్యాన్ని ముందు పద్యాలలో వివరిస్తున్నాడు నన్నయ.

క. బలవ న్మదనాగాయుత । బలయుతుఁడు సుతుండు పుట్టెఁ బ్రజ్ఞాచక్షుం
డలఘుఁడు ధృతరాష్ట్రుం డా । లలనకు నంబికకుఁ గురుకులప్రవరుం డై. 256

ప్రతిపదార్థం: బలవత్+మద, నాగ+అయుత, బలయుతుఁడు= బలంతో మదించిన పదివేల ఏనుగులయొక్క బలంతోకూడినవాడైన; ప్రజ్ఞా చక్షుండు= బుద్ధియే కన్నులుగా కలవాడు; అనగా గ్రుడ్డివాఁడు అలఘుఁడు= అల్పుడుకానివాడు; ధృతరాష్ట్రుఁడు; ఆ, లలనకున్= ఆయింతికి; అంబికకున్; కురుకుల, ప్రవరుండు+ఐ= కురువంశంలో శ్రేష్ఠుడై; సుతుండు= కొడుకు; పుట్టెన్= పుట్టాడు.

తాత్పర్యం: బలం కలిగి మదించిన పదివేలేనుగులబలంతో కూడుకొన్నవాడు. బుద్ధియే చూపుగా కలవాడు (కళ్ళు లేకపోయినా బుద్ధితో గ్రహింపగలిగినవాడు); అల్పుడు కానివాడు అయిన ధృతరాష్ట్రుడు అంబికకు కురువంశశ్రేష్ఠుడుగా కొడుకై పుట్టాడు.

క. అంబాలికకును గుణర । త్నాంబుధి పాండుర విరాజితాంగుఁడు ప్రభవిం
చెం బాండురాజు గురువం । శంబు ప్రతిష్ఠింప ధర్మసర్వజ్ఞుం డై. 257

ప్రతిపదార్థం: అంబాలికకును= అంబాలికకుకూడ; గుణరత్న+అంబుధి= మంచిగుణాలు అనే రత్నాలకు సముద్రంవంటివాడూ; పాండుర, విరాజిత+అంగుఁడు= తెల్లనిరంగు గల చర్మంతో ప్రకాశించిన శరీరంకలవాడూ; (అయిన); పాండురాజు; కురు, వంశంబు, ప్రతిష్ఠింపన్= కురువంశాన్ని సుస్థిరంగా నిలపటానికి; ధర్మ, సర్వజ్ఞుండు+ఐ= ధర్మాలన్నీ తెలిసినవాడై; ప్రభవించెన్= పుట్టాడు.

తాత్పర్యం: అంబాలికకుకూడ సద్గుణాలనే రత్నాలకు సముద్రవంవంటివాడూన్నూ; తెల్లని రంగుతో ప్రకాశించే మేను కలవాడూ అయిన పాండురాజు కురువంశాన్ని స్థిరంగా నిలపటానికి సర్వధర్మాలు తెలిసినవాడుగా పుట్టాడు.

వ. ఇట్లు క్రమంబునం బుట్టిన ధృతరాష్ట్ర పాండుకుమారులకు బ్రాహ్మణసమేతుం డై భీష్ముండు జాతకర్మాదిక్రియ లొనరించినంత. నాంబికేయు జాత్యంధుం జూచి దుఃఖిత యయి సత్యవతి వెండియుఁ బారాశర్యుం దలంచుడు, నాక్షణంబ యమ్మునివరుండు వచ్చి పని యేమి యని యన్న 'నీయంబికకుఁ బ్రథమపుత్త్రుం డంధుం డయ్యెఁ; నింక నొక్కకొడుకు రూపవంతుం బడయు' మనిన, 'నియతతాత్మ యగునేని సుపుత్త్రుండు పుట్టు'ననవుడు, సత్యవతి తొల్లింటియట్ల కోడలి నియోగించిన, నక్కోమలి యమ్మునివరు వికృతవేషరూప గంధంబుల కోపక రోసి, తనదాసి ననేక భూషణాలంకృతం జేసి తనశయనతలంబున నుండం బంచిన, వ్యాసభట్టారకుండు వచ్చి దాని చేసిన యిష్టోపభోగంబులం దుష్టుండై దానికిం బుత్త్రదానంబు సేసిన.258

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; క్రమంబునన్, పుట్టిన= వరుసగా పుట్టిన; ధృతరాష్ట్ర, పాండుకుమారులకున్; బ్రాహ్మణ, సమేతుండు+ఐ= బ్రాహ్మణులతో కూడుకొనినవాడై; భీష్ముండు; జాతకర్మ+ఆది, క్రియలు+ఒనరించిన, అంతన్= శిశువుపుట్టినప్పుడు చేసే సంస్కారం మొదలైన చేయదగిన పను లన్నింటిని చేసిన తరువాత; సత్యవతి; ఆంబికేయున్, జాత్యంధున్, చూచి= అంబికయొక్క కొడుకును పుట్టుగ్రుడ్డివాడిగా చూచి; దుఃఖిత+అయి= బాధపడినదై; వెండియున్= మరల; పారాశర్యున్, తలంచుడున్= వ్యాసుడిని స్మరించటంచేత; ఆ క్షణంబు+అ= వెంటనే; ఆ, మునివరుండు, వచ్చి= ఆఋషిశ్రేష్ఠుడు వచ్చి; పని+ఏమి, అని, అన్నన్= ఏమి పని ఉన్నది అని అడుగగా; ఈ, అంబికకున్; ప్రథమపుత్త్రుండు= మొదటికొడుకు; అంధుండు+అయ్యెన్= గ్రుడ్డివా డైనాడు; ఇంకన్, ఒక్క కొడుకున్= ఇంకను మరొకకొడుకును; రూపవంతున్= అందగాడిని; పడయుము+అనినన్= పొందుము అని అనగా; నియత+ఆత్మ, అగును+ఏని= నిగ్రహంతో కూడిన హృదయం కలిగినది అయితే; సుపుత్త్రుండు= మంచికొడుకు; పుట్టును= పుట్టుతాడు; అనవుడున్= అనగా విని; సత్యవతి; తొల్లింటి, అట్లు+అ= ఇదివరకువలెనే; కోడలిన్, నియోగించినన్= కోడలిని ఆజ్ఞాపించగా; ఆ+కోమలి= ఆ అందగత్తె (అంబిక); ఆ+మునివరు, వికృత, వేష, రూప, గంధంబులకున్= ఆ మునియొక్క (వ్యాసునియొక్క) వికారమైన వేషానికీ, ఆకారానికీ, మేనివాసనకూ; ఓపక= సహించలేక; రోసి= అసహ్యించుకొని; తన, దాసిన్= తనయొక్క చెలికత్తెను; అనేక, భూషణ+అలంకృతన్, చేసి= పెక్కుసొమ్ములతో అలంకరింపబడినదానిగా చేసి; తన, శయన, తలంబునన్= తా నుండవలసిన పడకమీద; ఉండన్,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పంచినన్= ఉండుమని ఆజ్ఞాపించగా; వ్యాసభట్టారకుండు= వ్యాసమహర్షి, వచ్చి; దాని, చేసిన, ఇష్ట+ఉపభోగంబులన్, తుష్టుండు+ఐ= ఆ దాసి చేసిన ఇష్టమైన కామక్రీడల వలన సంతోషించినవాడై; దానికిన్= ఆమెకు; పుత్త్ర, దానంబు, చేసినన్= మగసంతానాన్ని ఇవ్వగా.

తాత్పర్యం: ఈవిధంగా ధృతరాష్ట్రుడూ, పాండురాజు వరుసగా పుట్టగా, వారికి భీష్ముడు బ్రాహ్మణులతోకూడి జాతకర్మమొదలైన సంస్కారాలను చేయించగా, సత్యవతి అంబిక కొడుకును పుట్టుగ్రుడ్డివాడుగా తెలిసికొని దుఃఖించి మరల వ్యాసుడిని తలచింది. ఆ మునివరుడు వెంటనే వచ్చి 'పని ఏమున్నది?' అని అడుగగా, ఈఅంబికకు పుట్టిన మొదటికొడుకు గ్రుడ్డివాడైనాడు కాబట్టి రూపవంతు డైన మరొక కొడుకును ఆమెయందు పొందు మని అడిగింది. 'ఆమె నిగ్రహం కలిగిన హృదయంతో ఉంటే మంచికొడుకు పుట్టగల'డని వ్యాసు డన్నాడు. ఆమాట విని సత్యవతి ఇదివరకు వలెనే కోడలైన అంబికను ఆజ్ఞాపించింది. ఆమె ఆ మునియొక్క వికారమైన వేషాన్నీ, ఆకారాన్నీ, మేనివాసననూ సహించలేక, అసహ్యించుకొని తనదాసి నొకదానిని పెక్కుసొమ్ములతో అలంకరించి తా నుండవలసిన సెజ్జమీద ఆమె ఉండేటట్లు ఆజ్ఞాపించింది. వ్యాసమహర్షి వచ్చి ఆ దాసి ప్రీతితో చేసిన కామక్రీడలకు సంతోషించి ఆమెకు పుత్రసంతానాన్ని ఇవ్వగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: దేహి తల్లికడుపులో పడినప్పటినుండి మరణించేవరకు పదహారు రకాలైన సంస్కారాలకు అర్హుడౌతాడు. వాటిని షోడశకర్మ లని అంటారు. అవి - గర్భాధానం, పుంసవనం, సీమంతం, జాతకర్మం, నామకరణం, అన్నప్రాశనం, చౌలం, ఉపనయనం, ప్రాజాపత్యం, సౌమ్యం, ఆగ్నేయం, వైశ్వదేవం, గోదానం, సమావర్తనం, వివాహం, అంత్యక్రియ.

ఆ. చండకోపుఁ డయిన మాండవ్యమునివరు । శాపమున జముండు సంభవిల్లె
విదురుఁ డనఁగ ధర్మవిదుఁడు పారాశర్యు । వీర్యమునను భువి నవార్యబలుఁడు. 259

ప్రతిపదార్థం: చండ, కోపుఁడు+అయిన= తీవ్రమైన కోపం కలవాడైన; మాండవ్య, మునివరు, శాపమునన్= మాండవ్యుడు అనే పేరుకల మునిశ్రేష్ఠుడి యొక్క శాపంవలన; జముండు= యముడు; భువిన్= భూలోకంలో; పారాశర్యు, వీర్యమునను= వేదవ్యాసుడి శుక్లంవలన; విదురుఁడు+అనఁగన్= విదురుడు అని పిలువబడే; ధర్మ, విదుఁడు= ధర్మవిషయాలలో పండితుడు; అవార్య, బలుఁడు= అడ్డగించటానికి వీలులేని బలంకలవాడు; సంభవిల్లెన్= పుట్టాడు.

తాత్పర్యం: తీవ్రకోపస్వభావుడైన మాండవ్యమహర్షి పెట్టినశాపం కారణంగా యముడు భూలోకంలో వేదవ్యాసుడివీర్యంవలన ధర్మశాస్త్రపండితుడూ, ఎదురులేనిబలంకలవాడూ అయిన విదురుడుగా పుట్టాడు.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 260

తాత్పర్యం: అనగా విని జనమేజయుడు వైశంపాయనుడితో ఈ విధంగా అన్నాడు.

మాండవ్యోపాఖ్యానము (సం. 1-101-1)

ఆ. సకలజీవరాశి సుకృత దుష్కృత ఫల । మెఱిఁగి నడుపుచున్న యట్టి ధర్ముఁ
డొంద శూద్రయోనియందు మాండవ్యుచే । శప్తుఁడై యదేల సంభవించె? 261

ప్రతిపదార్థం: సకల, జీవ, రాశి, సుకృత, దుష్కృత, ఫలము= సమస్తమైన జీవులయొక్క సమూహంయొక్క పుణ్యాలయొక్క పాపాలయొక్క ఫలాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; నడపుచున్+ఉన్న= ధర్మాన్ని నడుపుతూ ఉన్న; అట్టి; ధర్ముఁడు= ఇటువంటి యమధర్మరాజు; మాండవ్యుచేన్, శప్తుఁడు+ఐ= మాండవ్యుడిచేత శపింపబడినవాడై; శూద్ర, యోని, యందున్= శూద్రవనితయందు; ఒందన్= పుట్టుకపొందటం; అది= అనేది; ఏల, సంభవించెన్= ఏకారణంవలన కలిగింది?

తాత్పర్యం: సమస్త జీవసమూహాల పుణ్యపాపాల ఫలాలను తెలిసి వాటికి తగిన ధర్మం నడుపుతూ ఉన్నఇటువంటి యమధర్మరాజుకు మాండవ్యుడిచేత శపింపబడి శూద్రవనితకు పుట్టేస్థితి ఎందుకు కలిగింది?

విశేషం: ఈపద్యానికిబదులు- "సకలలోకధర్మమూర్తి యైన యముండుశూద్రుండైపుట్టుటయు మాండవ్యమునివరుండు శాపంబిచ్చుటయు నానతిమ్మనిన వానికి" అనే వచనం ఒకప్రతిలో కనబడుతున్నదని శ్రీమదాంధ్రమహాభారతసంశోధితముద్రణం చెప్తుతున్నది. (పు. 248).

వ. అని యడిగిన వానికి వైశంపాయనుం డిట్లని చెప్పె; మాండవ్యుం డను బ్రహ్మర్షి దొల్లి మహీవలయంబునం గల తీర్థంబు లెల్ల నేకచారి యయి సేవించి యొక్క నగరంబున నెడ గలుగు నడవిలో నాశ్రమంబు గావించి తద్ద్వారవృక్షమూలంబున నూర్ధ్వబాహుం డయి మౌనవ్రతంబునం దపంబు సేయుచున్న నన్నగరంబు రాజు నర్థంబు మ్రుచ్చిలికొని మ్రుచ్చు లారెకులచేత ననుధావ్యమాను లై మాండవ్యసమీపంబునం బాఱి యయ్యాశ్రమంబులో డాఁగిన, వారి వెనుదగిలి వచ్చిన యారెకు లమ్మునిం గని 'రాజధనాపహారు లయిన చోరులు నీయొద్దన పాఱిరెటవోయి రెఱుంగుదేని చెప్పు' మనిన నమ్ముని మౌనవ్రతుండు గావునఁ బలుకకున్నం గినిసి యయ్యాశ్రమంబులోఁ జొచ్చి వెదకి ధనంబుతోడ నామ్రుచ్చులం బట్టికొని. 262

ప్రతిపదార్థం: అని, అడిగినన్, వానికిన్= అని ప్రశ్నించగా, జనమేజయుడికి; వైశంపాయనుండు; ఇట్లు+అని, చెప్పెన్= ఈవిధంగా చెప్పాడు; తొల్లి= పూర్వం; మాండవ్యుండు+అను, బ్రహ్మర్షి= మాండవ్యుడు అనే పేరుగల బ్రాహ్మణు డైన ఋషి; మహీ, వలయంబునన్, గల, తీర్థంబులు+ఎల్లన్= భూమండలంలో ఉన్న పుణ్యతీర్థాల నన్నింటిని; ఏకచారి+అయి, సేవించి= ఒంటిగా తిరిగి సేవించుకొని; ఒక్క, నగరంబునన్= ఒక పట్టణప్రాంతంలో; ఎడ, కలుగు, అడవిలోన్= దూరంగా ఉన్న అడవిలో; ఆశ్రమంబు, కావించి= కుటీరం కట్టుకొని; తద్+ద్వార, వృక్ష, మూలంబునన్= ఆ ఆశ్రమద్వారంలో ఉన్న చెట్టుయొక్క మొదట్లో; ఊర్ధ్వ, బాహుండు+అయి= చేతులెత్తిఉంచినవాడై; మౌనవ్రతంబునన్= మాటాడకుండ ఉండే నియమంతో; తపంబు, చేయుచున్+ఉన్నన్= తపస్సుచేస్తూ ఉండగా; ఆ+నగరంబు, రాజు, అర్థంబు, మ్రుచ్చిలికొని= ఆపట్టణపురాజుయొక్క ధనాన్ని దొంగిలించి; మ్రుచ్చులు= దొంగలు; ఆరెకులచేతన్, అనుధావ్యమానులు+ఐ= తలారులచేత అనుసరింపబడుతున్నవారై; మాండవ్య, సమీపంబునన్, పాఱి= మాండవ్యుని వద్దకు పరుగెత్తి; ఆ+ఆశ్రమంబులో, డాఁగినన్= ఆ ఆశ్రమంలో దాగుకొనగా; వారి, వెను, తగిలి, వచ్చిన, ఆరెకులు= వారిని అనుసరించి వచ్చిన తలారులు; ఆ+మునిన్, కని= ఆ ఋషిని చూచి; రాజ, ధన+అపహారులు+అయిన, చోరులు= రాజుయొక్క డబ్బును దొంగిలించినవా రయిన దొంగలు; నీ, యొద్దన్+అ, పాఱిరి= నీదగ్గరికే పరుగెత్తారు; ఎట+పోయిరి= ఎక్కడకు వెళ్లారు; ఎఱుంగుదు(వు)+ఏని, చెప్పుము+అనినన్= నీకు తెలిస్తే తెలియచెప్పు మని అనగా; ఆ+ముని, మౌనవ్రతుండు, కావునన్= ఆ ముని మాటాడని దీక్షపట్టినవాడు కాబట్టి; పలుకక+ఉన్నన్= మాటాడకుండ ఉండగా; కినిసి= కోపగించి; ఆ+ఆశ్రమంబులోన్, చొచ్చి= ప్రవేశించి; ధనంబుతోడన్; ఆ మ్రుచ్చులన్; పట్టికొని;

తాత్పర్యం: ఆవిధంగా అడిగిన జనమేజయుడికి వైశంపాయనుడు ఈవిధంగా చెప్పాడు; పూర్వం మాండవ్యు డనే బ్రహ్మర్షి ఒంటరిగా భూమండలంలో ఉన్న పుణ్యతీర్థాల నన్నిటిని తిరిగి తిరిగి సేవించి ఒక పట్టణానికి కొంతదూరంగా

ఉన్న అడవిలో ఆశ్రమం కట్టుకొని, దానిద్వారంలో ఉన్న వృక్షంమొదట్లో చేతులు పైకెత్తి ఉంచి మౌనవ్రతంతో తపస్సుచేస్తూ ఉండగా, ఆపట్టణపు రాజుయొక్క ధనాన్ని దొంగిలించి దొంగలు తలారులు తమను వెంటాడుతూ ఉండగా మాండవ్యుడి సమీపానికి పరుగెత్తి ఆ ఆశ్రమంలో దాక్కొన్నారు. ఆ దొంగలను వెంటాడి వచ్చిన తలారులు ఆ మునిని చూచి 'రాజధనం దొంగిలించిన దొంగలు నీదగ్గరికే పరుగెత్తి వచ్చారు. నీకు తెలిస్తే వారిజాడను చెప్పు' మని అడుగగా, ఆ ముని మౌనవ్రతంలో ఉండటంచేత మాటాడకుండ ఉండగా, కోపగించి ఆశ్రమంలో ప్రవేశించి ఆ దొంగలను పట్టుకొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. తాన చోరులకును దాపికాఁడై వేష। ధారి మిన్నకేని తపముసేయు
చున్నయట్టు పలుకకున్నవాఁడని యెగ్గు। లాడి యారెకులు నయంబు లేక. 263

ప్రతిపదార్థం: తాను+అ= తానే; చోరులకును= దొంగలకు; తాపికాడు+ఐ= సంధానంచేసేవాడై; వేషధారి= మునివేషం ధరించినవాడై; మిన్నక+ఏని, తపము, చేయుచున్+ఉన్న+అట్టు= పలకకుండ ఉండే నెపంతో తపస్సు చేస్తున్నట్లు; పలుకక+ఉన్నవాఁడు +అని= మౌనంగా ఉన్నా డని; ఎగ్గులు+ఆడి= నిందలు పలికి; ఆరెకులు= తలారులు, లేదా, రక్షకభటులు; నయంబు, లేక= నీతి తప్పి.

తాత్పర్యం: ఆ మునియే దొంగలకు సంధానం చేసే దళారి అనీ, వేషం వేసికొని మౌనంగా తపస్సు చేస్తున్నట్లు మాటాడకుండ ఉన్నా డని నిందలుపలికి తలారులు నీతిమాలి. (తరువాతి వచనంతో అన్వయం.)

వ. మాండవ్యు నామ్రుచ్చులతోన కట్టికొని వచ్చి రాజునకుంజూపి ధనంబొప్పించిన, రాజు నామ్రుచ్చులం జంపించి తపోవేషంబుననున్న మ్రుచ్చని యమ్మాండవ్యునిఁ బురంబువెలుపల శూలప్రోతుం జేయించిన. 264

తాత్పర్యం: మాండవ్యుడిని ఆ దొంగలతో కలిపి కట్టి తీసికొని వచ్చి రాజుకు చూపి ధనాన్ని ఒప్పగించగా, రాజు ఆ దొంగలను చంపించి, తపస్వివేషంలో ఉన్న దొంగగా భావించి ఆ మాండవ్యుడిని నగరం వెలుపలిభాగంలో ఇనుపశూలానికి గుచ్చబడినవాడై - కొఱుత వేయబడినవాడై.

క. మునివరుఁ డట్లుండియుఁ దన। మనమున నతిశాంతుఁ డయి సమత్వమునఁ దప
మ్మొనరించె ననశనుం డ। య్యును బహుకాలంబు ప్రాణయుక్తుం డగుచున్. 265

ప్రతిపదార్థం: మునివరుఁడు= మునిశ్రేష్ఠుడు; అట్లు+ఉండియున్= ఆ విధంగా ఉండికూడ; తన, మనమునన్= తన మనస్సులో; అతి, శాంతుండు+అయి= మిక్కిలి శాంతంతో కూడినవాడై (నిర్వికారుడై); సమత్వమునన్= సుఖదుఃఖాలలో చలించని మనస్సుగలయోగంతో (సమత్వం యోగఉచ్యతే); అనశనుండు+అయ్యును= ఆహారం తీసికొనని వాడైనప్పటికి; బహుకాలంబు= చాలకాలం; ప్రాణ, యుక్తుండు+అగుచున్= ప్రాణాలతో కూడినవా డౌతూ; తపమ్ము+ఒనరించెన్= తపస్సు చేశాడు.

తాత్పర్యం: మునిశ్రేష్ఠు డైన మాండవ్యుడు ఆవిధంగా కొఱుత వేయబడికూడ తన మనస్సులో ఎటువంటి వికారంలేని శాంతభావంతో, సుఖదుఃఖాలలో కలతచెందని యోగచిత్తంతో ఆహారం తినకపోయినా చాలకాలం ప్రాణాలతో కూడినవాడై తపస్సుచేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు శరీరదుఃఖంబుదలంపక తపంబుసేయుచున్న యమ్ముని తపంబు పేర్మికి మెచ్చి మహామునులు పక్షులయి రాత్రివచ్చి 'మునీంద్రా! యిట్టి మహాతపస్వి వైన నీ కిట్టి దుఃఖంబు గావించిన వా రెవ్వ' రని యడిగిన వారికి నమ్మాండవ్యుం డి ట్లనియె. 266

తాత్పర్యం: ఈవిధంగా దేహానికి కలిగిన బాధను పట్టించుకోక తపస్సుచేస్తున్న ఆ ముని తపస్సుయొక్క అతిశయానికి (గొప్పతనానికి) మెచ్చి, గొప్పవారైన ఋషులు పక్షులఆకారంతో రాత్రివేళ వచ్చి 'ఓమునిశ్రేష్ఠుడా! ఇటువంటి గొప్పతపస్వి వైన నీకు ఇటువంటి బాధ కలిగించినవారు ఎవ్వరు?' అని అడుగగా వారికి ఆ మాండవ్యుడు ఈవిధంగా అన్నాడు.

తే. ఎఱిఁగి యెఱిఁగి నన్నడుగంగ నేల దీని; । సుఖము దుఃఖంబుఁ బ్రాప్తించుచోట నరుఁడు
దగిలి తనకర్మవశమునఁ దనరుఁ దాన । కర్తగా కన్యులకు నేమి కారణంబు? 267

ప్రతిపదార్థం: దీనిన్, ఎఱిఁగి, ఎఱిఁగి, నన్నున్+అడుగంగన్+ఏల= దీనిని బాగా తెలిసికూడ నన్ను అడగటం దేనికి?; సుఖము, దుఃఖంబున్, ప్రాప్తించు, చోటన్= సుఖదుఃఖాలు కలిగేటప్పుడు; నరుఁడు= మానవుడు; తన, కర్మవశమునన్= తాను స్వయంగా చేసిన పుణ్యపాపకర్మల నాశ్రయించి; తగిలి= వాటిని పొంది; తనరున్= ఒప్పుతూ ఉంటాడు; తాను+అ= తానుమాత్రమే; కర్త, కాక= కారకుడు కాక; అన్యులకున్= ఇతరులు కారకులు కావటానికి; ఏమి, కారణంబు= కారణ మేమి ఉంటుంది?

తాత్పర్యం: మీప్రశ్నకు సమాధానం మీకు బాగా తెలిసికూడ నన్నడగటం దేనికి? నరుడు తన పూర్వపుణ్యాపాపకర్మల ఫలంగానే సుఖదుఃఖాలను పొందేటప్పుడు అనుభవిస్తూ ఉంటాడు. కాబట్టి నరుడు తనకర్మఫలాలకు తానే కర్త (కారకుడు) ఔతాడు కాని ఇందులో ఇతరులు కారణ మెందు కౌతారు?

విశేషం: "అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్'' - అన్న సూక్తికి నన్నయగారి రచన రుచిరార్థ కవితాభివ్యక్తి, మాండవ్యుడు గొప్ప ఆత్మజ్ఞాని, శంకరభగవత్పాదులు సాధనపంచకంలో చెప్పిన ఈ క్రింది శ్లోకానికి అతడు ఉదాహరణప్రాయుడు. "ఏకాంతే సుఖ మాస్యతాం, పరతరే చేతః సమాధీయతాం, పూర్ణాత్మాసు సమీక్ష్యతాం, జగదిదం తద్బాధితం దృశ్యతాం. ప్రాక్కర్మప్రవిలాప్యతాం, చితిబలాన్నాప్యుత్తరైః శ్లిష్యతాం, ప్రారబ్ధస్త్విహ భుజ్యతా మథ పరబ్రహ్మాత్మనా స్థీయతామ్''. ఏకాంతప్రదేశంలో సుఖంగా కూర్చుండుము, పరబ్రహ్మంలో చిత్తాన్ని సమాధానం చేయుము, ఈ జగత్తును పూర్ణబ్రహ్మంగా చూడుము, అది బ్రహ్మంలో విలీనమైనట్లు పరిగణించుము, పూర్వకర్మలను క్షయం చేసికొమ్ము. జ్ఞానాన్ని ఆశ్రయించి రాబోయే కర్మలయందు ఆసక్తుడవు కాబోకుము, ప్రారబ్ధభోగాన్ని అనుభవిస్తూ బ్రహ్మంలో నెలకొని ఉండుము అని ఈ శ్లోకభావం. ఇందులో చివరచెప్పిన అంశం మాండవ్యునిలో ముమ్మార్తులా గోచరిస్తున్నది.

వ. అని యమ్మహామునులతో మాండవ్యుండు పలికిన పలుకు లన్నగర రక్షకులు విని వచ్చి రాజున కెఱింగించిన, రాజునుం బఱతెంచి శూలప్రోతుం డయి యున్న మాండవ్యునకు నమస్కరించి 'నా చేసిన యజ్ఞానంబు సహించి నాకుం బ్రసాదింపవలయు' నని శూలంబువలన నమ్మునింబాచుచోనది పుచ్చరాకున్న, దానిమొదలు మెత్తన తునిమించినఁ దత్కంఠపార్శ్వంబునందు శూలశేషం బంతర్గతం బై యుండె; దానం జేసి యాముని యాణిమాండవ్యుండునాఁబరఁగుచునమ్మహాముని ఘోరతపంబుసేసి యెల్లలోకంబులు గమించి యొక్కనాఁడు యమునిపురంబునకుం జని ధర్మరాజున కి ట్లనియె. 268

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ విధంగా ఆ మహామునులతో మాండవ్యుడు పలికిన మాటలను ఆ నగరాన్ని రక్షించే భటులు వినివచ్చి రాజుకు తెలుపగా, ఆరాజు వెంటనే బయలుదేరి శూలానికి గ్రుచ్చబడి కట్టబడిఉన్న మాండవ్యుడికి మ్రొక్కి 'నేను చేసిన తెలివితక్కువతనానికి (అజ్ఞానానికి) క్షమించి నన్ను అనుగ్రహించవలె' నని శూలంనుండి ఆమునిని విడిపించబోగా అది తీయటానికి రాలేదు. అప్పుడు దాని మొదలును నెమ్మదిగా నరికించగా అతని కంఠంలోని ప్రక్కభాగంలో మిగిలిన శూలభాగం శరీరంలోనే ఉండిపోయింది. దానివలన ఆ ముని ఆణి మాండవ్యుడు అని పిలువబడినాడు. ఆ మహాముని గొప్పతపస్సు చేసి లోకాలన్నింటిని దాటి ఒకనాడు యమునినగరానికి పోయి యమధర్మరాజుతో ఈవిధంగా అన్నాడు.

క. **దండధర! యిట్టి దారుణ । దండమునకు నేమిదుష్కృతముఁ జేసితి? ను**
గ్రుండ వయి తగనిదండము । దండింపఁగ బ్రాహ్మణుండఁ దగునే నన్నున్? 269

ప్రతిపదార్థం: దండధర= యముడా!; ఇట్టి, దారుణ, దండమునకున్= ఇటువంటి భయంకరమైన శిక్షకు; ఏమి, దుష్కృతమున్, చేసితిన్= ఏమి పాపం చేశాను? నన్నున్, బ్రాహ్మణుండన్, ఉగ్రుండవు+అయి= అధికమైన కోపంకలవాడవై; తగని, దండము, దండింపఁగన్= కూడని శిక్షచే శిక్షించటం; తగును+ఏ= న్యాయమా? (కాదని భావం).

తాత్పర్యం: యమధర్మరాజా! ఇటువంటి భయంకర మైన శిక్షకు నే నేమి తప్పుచేశాను? బ్రాహ్మణుడ నైన నన్ను ఇంతగా కోపించి కూడనిశిక్షతో శిక్షించటం న్యాయమా?

వ. **అనిన మాండవ్యునకు ధర్మరా జి ట్లనియె. 270**

తాత్పర్యం: అనగా మాండవ్యుడితో ధర్మరాజు ఈ విధంగా అన్నాడు.

క. **సొలయక తూనిఁగలం గొ । ఱ్ఱులఁ బెట్టితి నీవు నీచిఱుతకాలము త**
త్ఫల మిప్పు డనుభవించితి; । తొలఁగునె హింసాపరులకు దుఃఖప్రాప్తుల్. 271

ప్రతిపదార్థం: నీవు; నీ చిఱుతకాలము= నీ చిన్నతనంలో; తూనిఁగలన్; సొలయక= స్వేచ్ఛగా ఎగురకుండ; కొఱ్ఱులన్, పెట్టితి(వి)= మేకులకు (శూలాలకు) గ్రుచ్చి పెట్టావు; తద్, ఫలము+ఇప్పుడు+అనుభవించితి(వి)= దానియొక్క ఫలాన్ని ఇప్పుడు అనుభవించావు; హింసాపరులకున్= హింస చేసేవారికి; దుఃఖప్రాప్తుల్= కష్టాలు కలగటాలు; తొలఁగున్+ఎ= తప్పుతాయా? (తప్ప వని భావం).

తాత్పర్యం: నీవు నీ చిన్నతనంలో తూనీగలను ఎగురనీయకుండా పట్టి ముండ్లకు గ్రుచ్చి ఉంచావు. దానిఫలాన్నే ఇప్పుడు అనుభవించావు. హింస చేసేవారికి కష్టాలు పొందక తప్పుతుందా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. **అనిన విని మాండవ్యుం డలిగి 'జన్మంబు మొదలుగాఁబదునాలుగువత్సరంబులు దాఁటునంతకుఁ బురుషుండు బాలుండు; వాఁడెద్ది సేసినఁ బాపంబుం బెద్ద పొరయండు; వానికి నోరు లెగ్గసేసినఁ బాతకు లగుదు; రిది నాచేసిన మర్యాద; నీవిట్టి ధర్మంబు దలంపక బాల్యంబున నల్పదోషంబుఁజేసిన నాకు**

బ్రాహ్మణోచితంబుగాని క్రూరదండంబు గావించినవాఁడవు మర్త్యలోకంబున శూద్రయోనిం బుట్టు'మని శాపం బిచ్చుటంజేసి వాఁడు విదురుం డై పుట్టె. **272**

తాత్పర్యం: అనగా విని మాండవ్యుడు కోపించి 'పుట్టినది మొదలుగా పధ్నాలుగేండ్లు దాటేంతవరకు పురుషుడు బాలు డనబడతాడు. అతడు ఏది చేసినా పాపాన్ని పెద్దగా పొందడు. అతడికి ఇతరులు కీడు చేస్తే పాపు లౌతారు. ఇది నేను చేసిన కట్టడి. నీవు ఇట్టిధర్మాన్ని భావించక బాల్యంలో స్వల్పమైన దోషాన్ని చేసిన నాకు బ్రాహ్మణులకు యోగ్యంకాని కఠినమైన శిక్షను ఇచ్చావు. కాబట్టి నీవు మానవలోకంలో శూద్రవనితకు పుట్టు' మని శాపం ఇవ్వటంచేత అతడు (యముడు) విదురుడై పుట్టాడు.

క. అని మాండవ్యాఖ్యానము । జనమేజయునకు నుదారచరితునకుఁ బ్రియం
బునఁ జెప్పెను వైశంపా । యనుఁ డవితథపుణ్యవచనుఁడని కడుభక్తిన్. **273**

ప్రతిపదార్థం: అని= ఈవిధంగా; మాండవ్య+అఖ్యానము= మాండవ్యునికథను; అవితథ, పుణ్య, వచనుఁడు= సత్యమైనవి, పుణ్యప్రదమైనవి అయిన మాటలు కలవాడు; వైశంపాయనుఁడు; ఉదారచరితునకున్= ఉత్తమప్రవర్తన కలవాడికి; జనమేజయునకున్; కడున్, భక్తిన్= మిక్కిలిభక్తితో; ప్రియంబునన్= ప్రీతితో; చెప్పెను= చెప్పాడు. అని.

తాత్పర్యం: ఈవిధంగా మాండవ్యుని కథను సత్యములు, పుణ్యప్రదములు అయిన మాటలుకల వైశంపాయనుడు ఉత్తమప్రవర్తన గల జనమేజయుడికి మిక్కిలిభక్తితో ప్రీతిగా చెప్పాడు అని.

ఆశ్వాసాంతము

క. సత్యాశ్రయకులశేఖర! నిత్యోదయ! రాజరాజనృప! సుకవిజన
స్తుత్య మహాగుణ! విమలా । దిత్యాగ్రతనూజ! విమలధీరమణీయా! **274**

ప్రతిపదార్థం: సత్యాశ్రయ, కుల, శేఖర= సత్యాశ్రయుడియొక్క వంశంలో శ్రేష్ఠుడైనవాడా!; నిత్య+ఉదయ= ఎల్లప్పుడు అభ్యుదయం కలవాడా!; రాజరాజనృప= రాజరాజనరేంద్రుడా!; సుకవి, జన, స్తుత్య, మహాగుణ= ఉత్తమకవులచేత కీర్తింపదగిన గొప్పగుణాలు కలవాడా!; విమలాదిత్య+అగ్ర, తనుజా!= విమలాదిత్యుడి పెద్దకుమారుడా!; అమల, ధీ, రమణీయా!= నిర్మల మైన బుద్ధిచేత అందమైనవాడా!.

తాత్పర్యం: సత్యాశ్రయుడివంశంలో మిన్నయైనవాడా! ఎల్లప్పుడు అభ్యుదయం కలవాడా! రాజరాజనరేంద్రా! ఉత్తమకవులచేత కీర్తింపదగిన గొప్పగుణాలు కలవాడా!; విమలాదిత్యుడి పెద్దకుమారుడా!; నిర్మలమైన బుద్ధిచేత అందమైనవాడా!

ద్రుతవిలంబితము.

త్రిభువనాంకుశ దీప్తినిధీ! సమ । స్తభువనాశ్రయ ధర్మధురంధరా!
శుభయశః పరిశోభిత పూర్వది । క్ప్రభువిలాస! కృపారసబంధురా! **275**

ప్రతిపదార్థం: త్రిభువనాంకుశ, దీప్తి, నిధీ= మూడులోకాలను అంకుశంవలె నియమించగల తేజస్సుకు నిధి(పాతర)వంటివాడా! సమస్త, భువన+ఆశ్రయ, ధర్మ, ధురంధరా= అన్నిలోకాలను ఆశ్రయించిన ధర్మాన్ని భరించేవాడా!; శుభ, యశః, పరిశోభిత, పూర్వదిక్, ప్రభు, విలాస= మంగళకరమైన కీర్తితో ప్రకాశించిన ఇంద్రుడియొక్క విలాసంకలవాడా!; కృపారసబంధురా= దయారసంతో ఒప్పినవాడా!.

తాత్పర్యం: మూడులోకాలను నియమించగల తేజస్సుకు నిధివంటివాడా!; లోకాలన్నింటిని ఆశ్రయించిన ధర్మాన్ని భరించేవాడా!, మంగళకరమైన కీర్తితో ప్రకాశించిన ఇంద్రుడియొక్క విలాసం (వైభవం) కలవాడా!; దయారసంతో ఒప్పినవాడా!

విశేషం: ద్రుతవిలంబితవృత్తం జగతీచ్ఛందంలో పుట్టింది. ప్రతిపాదంలోనూ వరుసగా న,భ,భ,ర అనే నాల్గుగణాలు ఉంటాయి మొత్తం 12 అక్షరా లుండే పాదంలో 7వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది. నన్నయ రచనలో ద్రుతవిలంబిత మొక్కటే ఉన్నది. అదే ఇది.

గద్యము.

ఇది సకల సుకవిజన వినుత నన్నయభట్ట ప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దాదిపర్వంబునం గౌరవ వంశ కీర్తనంబును, గంగా శంతను సమాగమంబును, వసూత్పత్తియు స్వర్గగమనంబును, దదంశ సంఘాతంబున గాంగేయు జన్మంబును, దద్రాజ్య నివర్తనంబును, బ్రహ్మచర్యవ్రత ప్రతిజ్ఞాపరిపాలనంబును, సత్యవతీ వివాహంబును, జిత్రాంగద విచిత్రవీర్యుల జన్మంబును, జిత్రాంగద మరణానంతరంబున భీష్ముండు విచిత్రవీర్యు రాజ్యంబున నిలుపుటయు, విచిత్రవీర్యుని వివాహంబును, వాని పరోక్షంబునం గృష్ణద్వైపాయనువలన ధృతరాష్ట్ర పాండురాజుల జన్మంబును, మాండవ్యుశాపంబున విదురు జన్మంబును నన్నది చతుర్థాశ్వాసము. **276**

తాత్పర్యం: ఇది సమస్తసత్కవులసమూహం కీర్తించే నన్నయభట్టు రచించిన శ్రీమహాభారతంలోని ప్రధానము లైన పదునెనిమిది పర్వాలలో మొదటి దైన ఆదిపర్వంలో కౌరవవంశాన్ని వర్ణించటం, గంగాశంతనుల కలయిక, వసువుయొక్క పుట్టుక, అతడు రాజ్యాన్ని పరిత్యజించటం, బ్రహ్మచర్యవ్రతాన్ని గ్రహించిన ప్రతిజ్ఞను పాటించటం, చిత్రాంగదుడు చనిపోయినతరువాత భీష్ముడు విచిత్రవీర్యుడిని రాజ్యపాలకుడిగా నిలపటం, విచిత్రవీర్యుడి వివాహం, అతని తరువాత వ్యాసుడివలన ధృతరాష్ట్రపాండురాజుల పుట్టుక, మాండవ్యుడి శాపం, విదురుడిపుట్టుక అనే కథార్థాలు కలది నాల్గవ ఆశ్వాసం.

ఆది పర్వంలో చతుర్థాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపుటము - 1
ఆదిపర్వము
మొదటి భాగము (1,2,3,4 ఆశ్వాసములు)
గద్యపద్య ప్రథమపాదసూచి

పద్యము	పుట
అ	
అంగనాజనుల	292
అంత	118
అంత	149
అంత	204
అంత	239
అంత	276
అంత	352
అంత	426
అంత దేవాహితులమృతంబు	118
అంత దౌష్యంతి సంతాన	388
అంత నయ్యయాతి	323
అంత నయ్యురగులు	160
అంత నేము శిష్యగణంబు	355
అంతరిక్షంబువలన	323
అందుఁ దనదృష్టి నాటుడు	354
అందు రోహిణంబను	139
అందు శాపానుభవ	126
అంబాలికకును గుణరత్న	447
అంబుజముఖి యక్కన్య	238
అంబుజలోచన గని	353
అక్కథకుండు వెండియు	23
అక్కథకుండు శౌనకాది	109
అక్కథకుండు శౌనకాది	219
అక్కథకుండు శౌనకాది	333
అక్కొడుకుం జూచి పుత్త్ర	402
అక్కోమలి యొక్కనాఁడు	176
అఖిలజలధివేలా	7
అగ్గరుడని మాహాత్మ్యంబు	144
అజితశక్తియుతుల	251
అట జనమేజయుండు	179
అట్టి కశ్యపుండను బ్రహ్మర్షి	190
అట్టి నహుషునకుఁ బ్రియవాస	263
అట్టి యింద్రోత్సవంబున	234
అట్టి రురుం డనుముని	98
అట్టి విచిత్రవీర్యు నారూఢ	423
అట్ల చేయుదు నమృతంబు	132
అట్లు కశ్యపుం గ్రమ్మఱించి	194
అడవికిఁ బువ్వులు దేరఁగ	271
అడవిలో నేకాంతమతి	187
అడిచినఁ దిట్టినన్	94
అతండు మృగయావ్యసనంబున	186
అతనికి ననంతపుణ్యా	389
అతనికి సరస్వతీనది	335
అతిరుచిరాగతుం డయిన	340
అతి వేగాకులచిత్తులై	203
అతిశయ రూపయౌవన	387
అతి సంభ్రమమున	297
అతులతపంబునన్	405
అతులబలాఢ్యులైన	248
అతులోర్వీసురముఖ్య	214
అది యిచ్చటికిలక్ష	142
అదియు నమ్మహీపతి	400
అదియునుంగాక	86
అదియునుం బౌష్యంబు	27
అదియును సంబరంబున	155
అదియును ననంత	345
అది యెట్లంటేని	401
అది యెట్లనినం దొల్లి	261
అది యెట్లనిన నొక్కనాఁడు	225
అది యెట్లని యడిగిన	306
అద్దేవయానిం	304
అధికపుణ్యు మూర్తులైన	397
అనం బరఁగిన	356

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనఘ యిది యేటి తపమే	170
అనఘా మున్ను శమంత	59
అనఘా యీయజ్ఞము	200
అనఘుఁడు పౌరవకుల	386
అనఘుఁడు రాజర్షియై	350
అనఘుఁడు వంశకరుండై	377
అనఘుఁడు సురగురు	256
అనల తేజులు దీర్ఘ	110
అనలనిభుండు	136
అనవద్య ధర్మచరితంబున	324
అనవరతభక్తిఁ బాయక	176
అనవరతవ్రతాయాస	173
అనవరతార్థదాన	86
అనవుడు నద్దివ్య	81
అని గరుడండు దనకు	159
అని చెప్పి గౌరముఖుం	188
అని చెప్పిన గరుడని	158
అని జనమేజయు నాతని	211
అని తపోభిమానంబున	322
అని తలంచి చింతాక్రాంతయై	368
అని దాని రమణీయ	340
అని దీనవదనుండై	100
అని దుష్యంతుండు	361
అనినం బౌష్యుం డిట్టి	69
అనినఁ బ్రతీపుఁ డిట్లనియె	396
అనిన దానికి దుష్యంతుం	361
అనిన దేవయాని	273
అనిన నబ్బలి సంతానార్థి	437

పద్యము	పుట
అనిన నమ్మహామునులు	172
అనిన నమ్ముని కుమారుని	268
అనిన నమ్మునివరుండు	241
అనిన నయ్యింద్రున	322
అనిన నయ్యురగులు	132
అనిన నాకచునకు	280
అనిన నాగరుడని	136
అనిన నాయుదరంబు	276
అనిన నుగ్రశ్రవసుం	24
అనిన నుదంకుం డట్ల	71
అనిన నుదంకుం డిట్లనియె	82
అనిన నొడంబడి	175
అనిన భీష్మపలుకులు	438
అనిన మాండవ్యునకు	452
అనిన వాని వచనం	201
అనిన వారల కయ్యయాతి	316
అనిన వారలలోఁ	166
అనిన విని జనమేజయుండు	198
అనిన విని జనమేజయుండు	248
అనిన విని జనమేజయుండు	259
అనిన విని జనమేజయుండు	264
అనిన విని జనమేజయుండు	390
అనిన విని జనమేజయుండు	448
అనిన విని జనమేజయునకు	249
అనిన విని జరత్కారుం డతి	171
అనిన విని దుష్యంతుండు	370
అనిన విని నగుచు	192
అనినవిని నాగరాజానుజుండైన	166

పద్యము	పుట
అనిన విని పెద్దయుం	415
అనిన విని భీష్ముండు	428
అనిన విని మాండవ్యుండలిగి	452
అనిన విని యుదంకుండు	70
అనిన విని రోమహర్షణ	59
అనిన విని వెల్లనై	370
అనిన విని శకుంతల	362
అనిన విని శుక్రుండు	271
అనిన విని శౌనకాది	58
అనిన శకుంతల	380
అనిన శర్మిష్ఠ	282
అనిన సదస్యు లందఱుఁ	213
అనిన సర్వజనానుమతంబుగా	214
అని పాండవ ధార్తరాష్ట్ర	221
అని పూరుం గఱపితి	321
అని ప్రసన్నుండై	154
అని బ్రహ్మ నియోగించిన	163
అని బ్రాహ్మణస్వరూపంబు	135
అని మహానురాగంబునం	384
అని మాండవ్యాఖ్యానము	453
అనిమిష కాంతయున్	352
అనిమిషనాథసుగుప్త	159
అనిమిషలోక	392
అని యందఱుఁ దమలో	125
అని యడిగిన	260
అని యడిగిన నారాజునకు	349
అని యడిగిన వానికి	449
అని యడిగిన వారికి	88
అని యడిగిన వినత	130

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అని యడిగి వాని	66
అని యమ్మహామునులతో	451
అని యయాతి యష్టకాదు	329
అని యానతిచ్చిన	15
అని యాస్తీకుండు వాసుకి	206
అని యిట్లయ్యుదంకుండు	88
అని యిట్లిద్దఱు నొండొరులకు	124
అని యిట్లు గంగావసువు	395
అని యిట్లు పాండవ	221
అని యిట్లురగపతులనెల్ల	78
అని యిట్లు సత్యవతిని	420
అని యొడంబడకున్న	314
అని రురుం డలిగి	103
అనిలజవంబునం	426
అనిలుఁడు పక్షయుగ్మ	133
అని విచారించి	90
అని విచారించి హస్తి	191
అని విచారించుచున్న	302
అని శాపంబిచ్చిన	435
అనిశుక్రుండు సురాపానంబు	275
అని సకలభువన	2
అని సత్యవతి కృష్ణ	444
అని సత్యవతి నియోగించిన	442
అని సభాసదులకెల్ల	419
అని సరమ యదృశ్యయైన	65
అని సౌపర్ణాఖ్యానశ్రవణ	106
అని స్తుతియించి	130
అనుచు మదనాతురుండయి	358
అనుపమబలులగు	45
అనుపమముగ	125
అనుపమనియమాన్వితులై	287
అనుపమరాజ్యసంపదకు	440
అన్య లెఱుఁగమిఁ జేసి	384
అపరిమితాజ్ఞఁ జేసియు	100
అప్పరశురాముండు	61
అప్పలుకులు సవిస్తరంబుగా	167
అప్పురుషుం డింద్రు	83
అభిమతంబగు	51
అభిమన్యునకు విరాటాత్మజ	180
అభ్యస్తవేదవేదాంగులు	259
అమరపతి ఖాండవము	339
అమరవిభుండు దాని విని	325
అమర సన్నిభ యేను	285
అమరాధిపుఁ డమృతము	160
అమరారిమర్దనుఁడు	117
అమరాసురముఖ్యుల	245
అమరాసురవీరులు	113
అమరుఁడ వజరుఁడ	156
అమరేంద్రారాతులు	119
అమలసుధారమ్య	429
అమలసువర్ణశృంగ	13
అమలినతారకా	15
అమిత జగద్భయంకర	88
అమిత తపోవిభవంబున	324
అమితపరాక్రమంబును	132
అమితాఖ్యానకశాఖలం	53
అమితార్థయుక్తితో	52
అమితోగ్రాటవిలోనఁ	365
అమిత్ర మదభేది	181
అమృతముతో నుద్భవమై	121
అమృతాశనంబు చేయక	154
అమ్మనుజేంద్రుఁడైననలు	209
అమ్మహామునివచనంబు	97
అమ్మహాముని వచ్చి	297
అమ్మహాశాఖ నవలంబించి	139
అమ్మహాశ్వంబు ధవళ	124
అమ్మహీపతి యొక్కనాఁడు	337
అమ్మునియల్గి చూచుడును	351
అమ్మును లడిగిన కథ	60
అయినను దేవా నీయనుమతంబున	16
అయినను నాకు	11
అయినను నాడెందంబునం	413
అయినను నానేర్చువిధంబున	352
అయినను వచ్చిమిన్నక	369
అయ్యద్రికయు మానుష	238
అయ్యమోఘవీర్యం బొక్క	236
అయ్యయాతియుఁ	293
అయ్యయాతియు దానింబట్టు	310
అయ్యహీంద్రవిష	192
అయ్యా నీవు బ్రాహ్మణుండవు	105
అయ్యుదంకుండు	68
అయ్యురగంబులం	153
అరిది తపోవిభూతి	75
అరుదుగ సర్వశైలముల	113

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అలఘుఁడు కామక్రోధాదుల	257
అలఘుఫణీంద్ర	122
అలయక యేన	99
అలసత యొప్పఁగా	353
అలిగిన నలుగక	288
అలుక మెయిమున్న	187
అవని యరాజకంబయిన	443
అవసరజ్ఞుండయి	444
అవిచారం బని పల్క	316
అసదృశయౌవనంబిది	300
ఆ	
ఆ కచుఁ డత్యంతవిషాదా	279
ఆతతపక్షమారుత	126
ఆతని నత్యుగ్రానల	215
ఆతని రాజ్యంబున	336
ఆ త్రసునకుఁ గాళింది	335
ఆదిక్షత్రచరిత్ర	107
ఆదిత్యదైత్యదానవ	248
ఆ దీర్ఘతముండును	437
ఆ దుష్యంతుఁ డనంత	336
ఆ దోషంబెట్లు పరిహృతం	418
ఆ నహుషాత్మజుండగు	283
ఆ నారాయణ పాండవేయ	231
ఆ పన్నగముఖ్యుల	128
ఆ పూర్ణతేజుఁ డపగత	178
ఆ ప్రదేశంబునకు	63
ఆ ప్రహ్లాద	250
ఆమిషమని దానిం గొనఁగా	237
ఆయతకీర్తితో వివిధ	66

పద్యము	పుట
ఆయతపక్షతుండహతి	130
ఆ యతులపుణ్యునకు	330
ఆ యమునాద్వీపమున	243
ఆయురర్థులకు దీర్ఘాయు	31
ఆయుష్మంతుఁడవై	196
ఆయుష్యం బితిహాస	224
ఆరణ్యపర్వమనఁగా	40
ఆర్తి హరక్రియాభిరతుఁడై	211
ఆ విశ్వకర్మనిర్మిత	252
ఆ వైశంపాయనుండును	222
ఆ శమీకు పుత్త్రుఁ డంబుజ	182
ఆశ్రితపోషణంబున	5
ఇ	
ఇంబుగ సర్వలోక	60
ఇక్కమలాక్షి శకుంతల	349
ఇక్కాశిరాజదుహితల	442
ఇక్కాశ్యపుండైన	344
ఇక్కురువంశంబున	431
ఇగ్గరుడుండు భువన	140
ఇచ్చునది పాత్రునకు	319
ఇట వృషపర్వు కూఁతురు	281
ఇట్టి భరత కుల ముఖ్యుల	231
ఇట్టి మహాభారతంబు కృష్ణ	56
ఇట్టి మహాభారతంబు ననేక	54
ఇట్టి మహోత్పాతంబులు	143
ఇట్టి లోక విరుద్ధంబుల	381
ఇట్టి శ్రీమహాభారతంబునకుం	232
ఇట్లతిప్రయత్నంబున	277
ఇట్లనవరత శాంతిక	67

పద్యము	పుట
ఇట్లన్నయుం దమ్ముండు	137
ఇట్లమృతహరణార్థంబు	142
ఇట్లరిగి యవ్వనంబునఁ	291
ఇట్లరుగుదెంచి యధిక	308
ఇట్లు కుపిత శతమఖ	325
ఇట్లు కృతనిశ్చయుండై	199
ఇట్లు క్రమంబునం బుట్టిన	447
ఇట్లు గురుశుశ్రూషా	269
ఇట్లు చిత్రాంగదుండు	422
ఇట్లు జరత్కారుండు	174
ఇట్లు జరాక్రాంతుండైన	313
ఇట్లు దద్దయు దుఃఖించి	382
ఇట్లు దన్నెఱుంగకుండ	309
ఇట్లుదయించి పెరిఁగి	398
ఇట్లు దుర్యోధను చేయు	227
ఇట్లు దుష్యంతుండు	348
ఇట్లు దేవయాని నుద్ధరించి	287
ఇట్లు నాగలోకంబున	80
ఇట్లు నిఖిలక్షత్రియ	425
ఇట్లు నిజజననికి	128
ఇట్లు నిర్జరవరుల	152
ఇట్లు పదునొకండు	114
ఇ ట్లుపాయంబున నసురుల	117
ఇట్లు పెక్కుమృగంబుల	338
ఇట్లు బ్రాహ్మణవీర్యప్రభవు	246
ఇట్లు యమ నియమవ్రత	395
ఇట్లురగు లమృతంబు	161
ఇట్లు లోకంబెల్లఁ	408
ఇట్లు వనంబులోని	365

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఇట్లు వికలాంగుండై	112
ఇట్లు విగతలజ్జా	240
ఇట్లు శరీరదుఃఖంబు	451
ఇట్లు సకలరాజలోకంబు	428
ఇట్లు సకలవ్యాపార	429
ఇట్లు సముద్రతీరంబున	120
ఇట్లు హృదయసుఖావహం	342
ఇట్లెల్లవారలకు	383
ఇట్లేకతంబ యేకవస్త్రయై	239
ఇది మునికన్యయేని	347
ఇది మునినాథ కన్యయని	357
ఇది సకల సుకవిజన	108
ఇది సకల సుకవిజన	218
ఇది సకల సుకవిజన	332
ఇది సకల సుకవిజన	454
ఇనతేజుం డతిభక్తిఁ	420
ఇనుఁడస్తమింపఁ బోయిన	177
ఇన్నరేంద్రుచేత మున్న	298
ఇప్పురంబున బ్రాహ్మణుం	193
ఇమ్మహాభారతం బిమ్ముల	57
ఇమ్మహిఁ ద్రయోదశ	261
ఇమ్ముగ సరస్వతీ	334
ఇరువదియొక్క వేయు	62
ఇరువురు నొండొరువులఁ	400
ఇవి మీకన్నియుఁ జేయఁగ	166
ఇవి యేనున్ సతతంబు	12
ఈ	
ఈ దేవయానికెద్ది యిష్టంబు	290
ఈ మునిపల్లెనుండు టిది	358

పద్యము	పుట
ఈయగ్నిదేవుఁ డసురకు	92
ఈయన్వయ విచ్ఛేదము	441
ఈయున్న పౌష్యపాలికిఁ	82
ఈయేనింటియందు	305
ఈ రాజనంద నాహృదయంబు	301
ఈవల్కలాజినములకు	358
ఈవసుధాధినాథుల	425
ఈవృషపర్వుపురం	289
ఈసౌపర్ణాఖ్యానము	161
ఉ	
ఉండు నితండు పద్మజు	146
ఉడుగక యొండొరుం	115
ఉత్తమాశ్రమనిష్ఠితుఁ	348
ఉదంకుండు గరంబు	79
ఉదంకుండును వానితోడన	74
ఉదరబిదాముఖమున	276
ఉరగకళేబర	183
ఉరగపతి తలలవల	115
ఉరగమవైయుండి	103
ఉర్వీరుహనివహముతో	335
ఊ	
ఊరుమూల మేర్పడఁగ	391
ఋ	
ఋతుమతియై పుత్త్రార్థము	311
ఎ	
ఎంతకాలమయిన నిప్పాట	435
ఎందుండి వచ్చితిందుల	436
ఎందులదాన వేకతమ	412

పద్యము	పుట
ఎట్టి సాధ్వులకును	366
ఎఱిఁగి యెఱిఁగి	451
ఎఱుఁగఁడొకొ నన్ను	367
ఎఱుకగలవారి	319
ఎల్లవారును జూడంగ	242
ఏ	
ఏచి తనర్చి తలిర్చిన	341
ఏడక్షౌహిణులెన్నఁ బాండవ	56
ఏ నపుత్రకుండనై	436
ఏ నమ్మహామునివచనంబున	305
ఏ నిద్దేవయానియందు	312
ఏను గచుం డనువాఁడ	267
ఏను గుర్వర్థ మర్థినై	69
ఏను జహ్నుకన్య	396
ఏను దాశరాజు కూఁతుర	413
ఏను నీయింతియును	384
ఏను మదీయ మాతృ	156
ఏను సహస్రపాదుండను	103
ఏనెట నీవెట సుతుఁడెట	380
ఏ నెఱుఁగ నిన్ను నెక్కడి	370
ఏమి కారణమయ్య	102
ఏమి తపం బొనరించితి	321
ఏము వసిష్ఠ మునివరు	393
ఏయది హృద్య మపూర్వం	24
ఏల యెఱుకలేని	371
ఒ	
ఒక్కనాఁడు సప్తమారుత	129
ఒనర జరత్కారు	216
ఒనరుఁ ద్రయోదశపర్వం	50

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఒరులవలనఁ బుట్టు	106
ఓ	
ఓసరిలి పఱచు	338
క	
కడవఁబడి మున్నువహ్నిం	206
కడు ననురక్తియు	288
కడు సుగ్రము దలక్రిందుగ	169
కద్రువ కొడుకుల	125
కద్రువయు వినతయు	121
కనక మహీధర ప్రతిమ	140
కనక ప్రతతీవితతుల	138
కనకావదాతకోమల	411
కని కద్రువ వినతం జూచి	123
కని నీవెవ్వరిదాన విట్లేల	284
కని పుట్టిననాఁడ	409
కని మునీంద్రా నాచేత	181
కని యయ్యురగకళేబరంబుఁ	184
కనియె ముందట నమ్మహీ	408
కని వనకన్యయో	399
కన్నియలతోడ నాడుచు	98
కమనీయ ధర్మార్థ కామ	223
కర మిష్టము సేసితి	84
కరుణానిరతులు	360
కరుణించి యుండు నాకు	66
కరువలిచేఁ దూలు	307
కలయఁగ నార్పుల బొబ్బల	337
కలహమున నిట్లు	153
కల్పాంతానలకీలా	149
కశ్యపప్రజాపతి	110

పద్యము	పుట
కశ్యపుండును నప్పుడ	193
కాదన కిట్టిపాటి యపకారము	87
కాదన కిట్టిపాటి	197
కాఱడవిఁబఱచు	341
కావున నాకశక్యంబు	73
కావున నియతాత్ము	438
కావున నాకు నీ జన్మంబునఁ	298
కావున నీవు కృతదార	173
కావున నీవిక్కుమారునిం	366
కావున నేన సత్యంబునకు	93
కావున బుద్ధి గలవారికి	288
కావున మృతసంజీవనిఁ	266
కావున సత్యము మిక్కిలి	379
కుండలమ్ములు వేగ	80
కుక్షిచ్యుతుఁడై	92
కువలయంబునవారి	208
కృష్ణద్వైపాయనుండును	445
కొడుకు జవ్వనంబుఁగొని	319
కొడుకులు సమర్థులైనం	131
కొని వ్రచ్చుడు లోపల	196
కోపితుండైన విప్రుండు	134
క్రచ్చఱ వేఁట వచ్చియుట	346
క్రూరాకారుల జగదప	167
క్రోధమ తపముం జెఱచును	184
క్ష	
క్షత్రవరుఁడైన	380
క్షత్రియకన్యకల	296
క్షత్రియవంశ్యులై	185
క్షమలేని తపసి	184

పద్యము	పుట
క్షమ విడిచి నీవు	185
క్షితినాథ కడు నకరుణా	64
క్షోణీచక్రభరంబు	114
గ	
గంగనిజాంగదీప్తులెసఁగం	395
గతమదమత్సరుండు	239
గరుడండును గద్రువ	128
గరుడండును దల్లి	133
గరుడండును నిజపక్ష	149
గురుకులమునందు	68
గురునాశ్రమంబునను	367
గురులకు శిష్యులు పుత్త్రులు	279
గొనకొని వీఁడు నీకును	382
గోత్రమహామహీధర	77
ఘ	
ఘనదురితానుబంధ	4
ఘనపక్షానిలచలితావని	142
ఘనభుజుఁ డన్నియు	427
ఘనముగ నయ్యింద్రోత్సవ	234
ఘోరవికార సన్నిహిత	152
ఘోరవ్రతములు సలుపుచు	168
చ	
చండకోపుఁ డయిన	448
చతురంభోధిపరీత	262
చని చని ముందట	342
చనుదెంచి యమ్మహాజనపతి	283
చను బొంకఁగఁ బ్రాణాత్యయ	305
చపలాక్షిచూపుల	240
చఱచియొకచేతఁ గూర్మముఁ	138

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
చల్లని దక్షిణమారుత	352
చిరముగ బ్రహ్మకుం	163
చెలఁగి లేవనేడ్చు	355
చ్యవనసుతుఁడైన ప్రమతి	179
చ్యవనునకు సుకన్యకు	97
జ	
జంబూఖండవినిర్మాణం	43
జగతీవల్లభ యే	347
జనకునకును స్వామిత్వము	440
జననాథ వేఁట నెపమున	369
జననీశాపభయ	215
జననుత కృష్ణద్వైపాయన	14
జననుత సర్వధర్మములు	431
జనమేజయుండు విద్వజ్జన	222
జనమేజయునకు వైశంపాయ	245
జనమేజయుని చేయు	165
జనవినుత యగ్నిహోత్రం	416
జలధివిలోలవీచి	286
త	
తక్షకుఁ డతిభీతుండై	204
తక్షకుఁడను పన్నగుఁడు	191
తక్షకుఁడీ కుండలముల	71
తగియెడు పుత్రులం	172
తగిలి జరయు రుజయు	313
తగు నిది తగదని	64
తడఁబడఁబడియెడు	203
తడఁబడ నేసియు	149
తడయక పుట్టిననాఁడ	381
తడయక మ్రొక్కియున్న	128
తత్కథాప్రారంభం	22
తత్పరిజనంబు లందఱు	196
తన కాజ్ఞావశవర్తులై	407
తనకు మఱి తాన చుట్టంబు	361
తనకులబ్రాహ్మణు	9
తనగర్భాండంబుల	111
తనజనకు నఱుత	182
తనదివ్య తేజమున	297
తనపురంబునకు వచ్చి	411
తనయుండు తల్లిదండ్రులు	317
తనయెఱిఁగినయర్థం	93
తనర జనకుండు నన్న	356
తనవిష వహ్ని మజ్జనకు	198
తనసతి కపకారము	101
తనుమధ్య దానొక్క కన్య	398
తనువును జీవము సత్త్వం	275
తనువు మీన్పొలవల్చు	241
తపస్స్వాధ్యాయ బ్రహ్మ చర్య	169
తరళనయనాబ్జదళములు	293
తరళాయతలోచన	399
తరుణప్రదేశినులు	308
తలఁపఁగనాఁడు పల్కిన	368
తలరఁగరేణుక్రథన	151
తలవడఁక దొడఁగె	313
తల్లి నీకుల గోత్ర సౌందర్య	363
తల్లియు నా సహోదరులును	162
తాన చోరులకును దాపికాఁడై	450
తాన తననీడ నీళ్లలలో	375
తా నలిగి యిచ్చె శాపం	137
తిరుగుచుఁ బుట్టలం బొదల	101
తివిరి సుతజన్మ	444
తెరల వలవైచి జాలరుల్	237
తొల్లి బ్రహ్మశాపనిమిత్తంబున	237
త్రిభువనాంకుశదీప్తనిధీ	453
త్రేతాగ్నులెల్లను దేజరిల్ల	95
త్రేతాద్వాపర సంధి	60
ద	
దండధర యిట్టి దారుణ	452
దండితాహితవీరసూరి	331
దయ నీచే నుత్పాదితు లయిన	443
దాన నపరార్థకాయ	112
దానికి భీతుఁడనై	311
దాని నప్రియంబులు పలికి	403
దాని నెఱింగి కరుణా	98
దాని నెఱింగి దేవతలెల్ల	265
దాని నెఱిఁగి కమలయోని	391
దాని శరీరసౌరభము	411
దారుణకల్పాంత మరుత్	127
దివిజమునీంద్ర దానవ	255
దితి యనుదానికి	250
దితి సుత దానవ యక్ష	247
దివ్యభూషణాలంకృత	409
దీని పాలు ద్రావి మానవుల్	405
దుహితృ స్నేహంబునం జేసి	267
దేవగురునందనుండమరా	280

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
దేవతలన్ జయించుచు	289
దేవమనుష్యలోకముల	76
దేవయాని యను దానఁ	285
దేవాసురరణమున	265
ద్యుతి దఱిఁగి నిజనియోగ	392
ద్వారవతి కేఁగి యర్జును	228
ద్విజవరులం గుమారుల	194
ధ	
ధన్యంబయ్యె భవత్కులం	174
ధరణిఁ జరాచరభూత	190
ధరణియెల్లను రక్షించు	191
ధరణిసుర మంత్రహోమ	201
ధరణీసురవిరహితమగు	141
ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని	26
ధర్మార్థ కామసాధన	374
ధృతిఁ బూని బ్రహ్మచర్య వ్రత	420
ధృతి నీయనుజుండై	441
ధృతిమెయి శతసంఖ్యయు	427
న	
నన్ను మున్న యెఱుంగు	294
నన్ను వివాహమై నహుష	295
నరగంధర్వాధిపు	422
నరచాపప్రవిముక్త	119
నరనాగాశ్వవరూథ	424
నరనుత నీ ప్రసాదమున	361
నరలుగలకామునైనను	314
నరవరుఁడగు శంతనున	390
నరసురసిద్ధ కింపురుష	129
నాఁటంగోలె రాహువునకు	118
నాకట్టినపుట్టంబు	282
నాకభిమతంబు నిట్టిద	393
నాకభిమత మొనరించిత	158
నాకొండెద్దియు నిష్టంబు	414
నాజన్మప్రకారంబు	349
నాజరాభారంబుఁ దాల్చిన	317
నాయనుజునకు వివాహము	423
నాయెఱిఁగి నట్ల యిన్నియు	372
నారాయణుండు కృత్రిమ	116
నారాయణుండు వారి	115
నా వచనం బమోఘం బనిన	187
నిండుమనంబు నవ్యనవ	72
నిగ్రహమేది నన్నుఁ దరణి	294
నిజమహీమండలప్రజఁ	6
నిరతంబు బ్రహ్మ మొదలుగ	431
నిరవద్యనరేశ్వర	107
నిరుపమ ధర్మమార్గ	260
నిరుపమాన శౌర్య	155
నీకతమున నా దాస్యము	131
నీకారణమున వంశ	442
నీ తదర్థమ కాఁగ దేవ	199
నీధర్మ చరితంబునకు	364
నీపుణ్య తనువువలన	376
నీమందులు మంత్రంబులు	192
నీలగళోపమాన కమనీయ	303
నీలగిరీంద్రశృంగమున	439
నీవఖిలధర్మ విదుఁడవు	419
నీవతిక్రూరుండవు	92
నీవర్ణధర్మప్రతిపాల	233
నీవలనం బరమ సంప్రీత	85
నీవస్త్ర శస్త్ర విద్యా	416
నీవిజయోత్సాహమునకు	153
నీవు ధర్మమూర్తివి	406
నీవు నీకవమానంబు	178
నీవు బ్రాహ్మణుండవు	94
నీవును బ్రహ్మచారివి	277
నీవు మాచుట్టమవపోలె	171
నీవారులకు నీయమృతం	156
నుతజలపూరితంబులగు	378
నుతసౌప్తికాదిపర్వ	47
నెఱినుఱక వైరివీరుల	425
నైమిశారణ్యపుణ్యక్షేత్ర	22
ప	
పంకజభవసన్నిభు	67
పక్షతుండాగ్రనఖక్షత	150
పడయంగరాని కొడుకుల	403
పతదుర్వీధరధాతు	120
పతిఁ బడసి సుతులఁ	301
పతియు భరియించుఁ గావున	434
పతివిహితానురాగమున	309
పతిహీనలయిన భామిను	435
పదంపడి యేఁబండ్రు గూతులుం	250
పదిదినంబులు భీష్ము	55
పనియేమి పంచినఁ	268
పరఁగ నన్ను సాల్వపతి	428
పరనిందయు నాత్మగుణోత్కర	157
పరమగురూపదేశమున	230

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
పరమతపోనిధి	168	ప్రతిహతశత్రువిక్రముడు	63	భీష్ముండును దనరథంబు	426
పరమబ్రహ్మనిధిం	219	ప్రతీపుండును దానిం జూచి	396	భూసురులాదిగఁ గల	275
పరమవివేకసౌరభ	18	ప్రల్లదుఁ డైనయొక్క	87	భూనాథనీకు భార్యంగా నన్నుఁ	401
పరమేష్ఠికల్పుఁడగు	242	ప్రస్తుతఫణిసత్త్రభయ	205	భూనుతకీర్తి బ్రాహ్మణుఁడు	104
పరశు కులిశ కుంత	150	ప్రియమొనరఁగ సిద్ధియు	258	భూపాల నీకు నిక్కోమలి	414
పరశురాముండు భీకర	245	ప్రీతితో మీరును భీష్మాది	221	భూరిగుణు నిట్టికుల	378
పరాశరుండును సత్యవతి	243	**బ**		భూరిప్రజానిరంతర	247
పర్విసభాప్రభృతిగ	36	బలవత్ఖగేంద్ర కోపానల	150	భూవినుత నిన్నుఁ ద్రిభువన	70
పర్వుచు వైరాటాదిక	40	బలవన్మదనాగాయుత	446	భృగుఁడను విప్రుండు	89
పర్వుచు స్త్రీ పర్వాదిక	48	బలయుతులు నూటయిరువది	386	**మ**	
పలుకుల ముద్దును గలికి	235	బహుపుత్త్రార్థంబు	417	మందభాగ్యులమయిన	170
పాండుకుమారులుపాండుభూపతి	225	బహుభాషల బహువిధముల	14	మతిలోకోత్తరుఁడైన	273
పాతాళైకనికేతనా	79	బహువనపాదపాబ్ధి	75	మదిఁ బౌష్యపర్వమాదిగ	35
పాదంబులు పెట్టుడు	139	బాలవయ్యు నత్యుత్తమశీల	306	మనపక్షంబున	266
పాయక పాకశాసనికి	19	బాలహరిణములఁ బట్టెడు	335	మనపితృవర్గమువడసిన	137
పితృవధజాతకోపపరి	433	బాలార్కతేజుఁడగు నీబాలుఁడు	369	మనమునకుఁ బ్రియంబును	320
పుట్టినప్పుడ కన్యకఁబోలు	413	బాలుండవు నియమవ్రత	266	మనుజయోనిఁబుట్టు	406
పుట్టుఁజీకు వృద్ధుఁ బూతి	436	బ్రహ్మణ్యుఁడగు కశ్యపబ్రహ్మ	144	మనుజాధిప వృషపర్వుం	265
పున్నామ్నోనరకాత్త్రాయత	376	బ్రహ్మయు భృగుశాప	96	మరుతులయంశంబున	258
పురందరుండును దొల్లి	204	బ్రహ్మవచనంబు నిట్టిద	205	మర్త్యలోకంబున	392
పురూరవుండును రాజ్య	262	బ్రాహ్మంబు దైవంబు	359	మర్త్యలోకంబున	406
పులోమయు నక్కొడుకు	91	బ్రాహ్మంబు మొదలుగాఁగల	423	మఱచినఁ దలఁపింపఁగ	368
పూరుఁడు గొండుకయయ్యును	317	**భ**		మఱి పాండవధార్తరాష్ట్ర	390
పృథివ్యాదిమహాభూతంబులు	432	భక్షణవిషయంబున	134	మఱి యంగిరసుఁడను	251
పెంచితి ధర్మమార్గమున	197	భరతుఁ డశేష భూభువనభార	385	మఱి యక్కోమలికులగోత్ర	398
పొడువునఁ బ్రాయంబునఁ	381	భవత్పితృప్రపితామహుండైన	180	మఱి యదియునుంగాక	12
పోరను మృతసంజీవని	266	భవదభిరక్షితక్షితికి	415	మఱి యదియునుంగాక	397
ప్రకటముగ వంశ విస్తార	442	భవదభిరక్ష్యములగు	158	మఱి యదియునుంగాక	434
ప్రకటితభూతసంతతికి	96	భారతభారతీశుభగభస్తి	17	మఱి యమృతమథనంబు	164

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
మఱియుఁ గర్ణాభిషేకంబును	45
మఱియుఁ గోటిశమానస	202
మఱియుఁ బితామహుండగు	49
మఱియుఁ బులస్త్యుండను	252
మఱియుఁ బౌష్యోదంక	32
మఱియు గర్భయోనియందు	327
మఱియు జంబూఖండవినిర్మాణం	43
మఱియు జ్యేష్ఠయుఁజంద్రుండును	116
మఱియు దక్షప్రజాపతి	405
మఱియు దేవదైత్యదానవ	244
మఱియు దేవయానియు	298
మరియు ద్రోణాభిషేకంబును	44
మఱియు ధర్మరాజునకు	35
మఱియు ధృతరాష్ట్రుండును	51
మఱియు నగ్నిదేవుచేత	229
మఱియు నతీతానాగతులైన	386
మఱియు నత్యంతశోకార్ణవంబున	430
మఱియు నయ్యాస్తీకుచరితంబు	216
మఱియు నశ్వమేధారంభంబును	50
మఱియు నస్మద్వంశకరుం	265
మఱియు నీకును	389
మఱియును	18
మఱియును	341
మఱియును	373
మఱియును	409
మఱియు నేకాదశరుద్రుల	257
మఱియు బంధువర్గంబునెల్ల	49
మఱియు బ్రహ్మకు ధాతయు	254
మఱియు భారతరణోద్యోగులైన	41
మరియు భారతవీరులెల్ల	46
మఱియు భార్యపురుషునం	374
మఱియు భీము గదాభి	46
మఱియు మర్త్యలోకంబునందు	255
మఱియు మహారణ్యంబునందు	37
మఱియు యాదవులెల్ల	52
మఱియు లక్ష్మియంశంబున	256
మఱియు విరాటనగరంబునకుం	40
మఱియు విషాపహరంబులయి	189
మఱియు వీరపత్ని విలాపంబు	48
మఱియు సకలలోక	167
మఱియు సింహికయనుదానికి	251
మఱియు స్థాణునకు	253
మఱివసువులు పుట్టుచు	404
మాండవ్యుండను మునివరు	258
మాండవ్యు నామ్రుచ్చులతోన	450
మానాగ్నిహోత్రమున	329
మానితసత్యవాక్య	212
మాయందొక్కొక్కళ్ళ	394
మాయయ్యకుఁ బాయక	282
మాయాదాస్యము వాయు	131
మితవచన నీయథార్థ	78
మితహిత సత్యవాక్య	85
మిమ్మిట్లుచూచి మీకు హితమ్మెట్లగు	172
మీకుం బుణ్యలోకంబులు	330
మీరలు నాపితృదేవత	171
మీరలు స్నాతాలంకృతులరై	159
మీవచనం బమోఘంబు	147
ముదమునఁ బ్రభాసుఁడను	256
మునివరుఁ డట్లుండియుఁ	450
మేనకయు విశ్వామిత్రు	354
మేరుమహామహీధరము	113
మొదలి పెక్కు జన్మముల	274
య	
యదుఁ డగ్రతనూజుఁడు	316
యమునంశమునఁబుట్టె	258
యాదవవంశంబున	255
ర	
రజనీనాథకులైక	207
రణవిజయుఁ డనలతేజుం	145
రథమును రథ్యంబులు	427
రయమున మ్రింగుడు గాలము	134
రాజకులాగ్రగణ్య	106
రాజకులైకభూషణుఁడు	3
రాజమహేంద్ర కవీంద్ర	217
ల	
లలితాంగి శయనమొక్కఁడు	304
లాలితరూప యౌవనవిలాస	428
లోకోత్తరచరితుండగు	281
వ	
వగవక సంజీవని	272
వదన బాణాసనవ్యక్త	320
వదలక కురుపతి	226
వదలక మాయాయుద్ధా	422
వనకేళీకౌతుకమునఁ	291

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
వనజభవప్రభావుఁ	350
వనజాసను ననుమతమున	247
వనమునఁ బదియు రెండేఁడు	230
వరరథ మొక్కండు	61
వరుణుఁ డాదిగఁగల	402
వర్ణధర్మముల్ గాచుచు	264
వలయు నమాత్యులం	345
వసునిభుఁడు పైతృకంబగు	423
వసువులకు మనఃప్రియంబుగా	394
వసువు లనువా రపేత	404
వాఁడిమయూఖముల్ గలుగు	269
వాఁడు రెండవయింద్రుం డయ్యెడు	146
వానింజూచికాని కుడువ	274
వానిపేరం గురుక్షేత్రంబు	386
వారణ ఘోటకభాండాగారం	290
వారల నందఱరౌద్రాకారుండై	424
వారల నర్హప్రియసత్కారుల	195
వారల బహుప్రకారాకారులు	147
వారు వచ్చునంతకునొక్క	346
వాలుపయి నడుచునట్ల	175
వాసవప్రతిముండు	232
విగతజీవుఁడై పడియున్న	277
విగతాఘుఁడైన యాభృగునకు	253
విడిచి దిగంబరవేషము	74
వితతమఖ ప్రయోగవిధి	209
వితతోల్కాశని పుంజమొక్కొ	148
విదితంబై యుద్యోగము	42
విద్వన్ముఖ్యుఁడు ధర్మమూర్తి	210

పద్యము	పుట
వినతకు నాత్మజుండయిన	162
విన నేడగు పర్వము	44
వినవయ్యయేకపుత్త్రుఁడు	415
విని దాని నుడుపఁగా	262
విని భీష్ముఁడనియె	432
వినుఁడు ప్రసిద్ధులైన	419
విను గార్హపత్యమను	375
వినుతపరాక్రముల్	223
వినుమైనను సాపత్న్యం	418
విపరీతప్రతిభాష	377
విపులతేజంబునను	264
విప్రుఁడ నున్నవాఁడ నపవిత్ర	135
విమలతపోవిభవంబున	205
విమలమతిం బురాణములు	11
విలమయశోనిధీ పురుష	371
విమలాదిత్యతనూజుఁడు	4
వివిధోత్తుంగ తరంగ	123
విషనిధికుక్షి నసంఖ్యము	134
విషయోపభోగాభిలషణ	263
వీరలు నీకులపుత్త్రులు	437
వీరశ్రీవనితాశ్రిత	331
వీరావతార సుకవిస్తుత	217
వీరుడు ప్రతీపుఁ డఖిల	395
వీరైలులుఁ బౌరవులును	389
వెలయంగ నశ్వమేధంబులు	379
వెలయఁగ ధర్మాధర్మంబులు	296
వేదవిహితవిధుల	326
వైశంపాయన ప్రభృతి	220

పద్యము	పుట
శ	
శంకరనిభుఁడగు విప్రు	80
శంతనుండు దానింజూచి	401
శంతనుండునుబరమానురాగంబున	421
శంతను సంతానంబును	430
శాపజలంబు లెత్తికొని	183
శాపమిచ్చువాఁడు జనని	116
శుక్రుండును సురాపాన	272
శ్రవణసుఖంబుగా	344
శ్రీమచ్ఛళుక్యవంశశిఖామణి	219
శ్రీలలనాస్తనఘటిత	333
శ్రీవనితావల్లభ	109
శ్రీవాణీగిరిజాశ్చిరాయ	1
శ్రీవెలుఁగ రోహిణికి	256
స	
సంచితపుణ్యుఁ డంబురుహ	244
సంతతగృహమేధిఫలం	373
సంధ్యలం దొనరించుసద్విధుల్	176
సకలజీవరాశి సుకృత	448
సకలధర్మవిదుండవు	329
సకలహితంబై శాంత్యాదిక	49
సకలోర్వీశుఁ డతిప్రయత్న	189
సతియును గుణవతియు	373
సత్యవతియునుబెద్దకాలంబునకు	440
సత్యాశ్రయ కులశేఖర	453
సద్యోగర్భంబున నహిమ	242
సభల విస్తరిల్లి	46
సమకట్టి యొక్క మొగి	148

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము - పుట	
సముదిత సూర్యసహస్రోపమ	91
సరభసపరిచరిత	338
సర్పయాగం బిట్టిదని	199
సర్వతీర్థాభిగమనంబు	379
సర్వభూతదయకు	326
సాంగంబు లగుచుండ	410
సాత్యవతేయవిష్ణుపద	57
సారమతిం గవీంద్రులు	20
సుతు లనఘులు వేవురు	249
సునిశిత తుండహతిని	237
సురదైత్యయక్షరాక్షస	322
సురపతి నాతపమున	324
సురపతిసభఁ జూడంజూడ	142
సూరెలనున్న మంత్రులను	195
సొలయక తూనిఁగలం	452
స్థావరజంగమ ప్రవితతం	157

హ

హరికులిశక్షతి	127
హరిహరాజగజాననార్క	16
హిమకరుఁడు శైత్యమును	432
హిమకరుఁ దొట్టి పూరు	13
హిమశైలకందరాభాగము	141

*****

ఆదిపర్వ కథాసారం

(రెండవభాగం)

ధృతరాష్ట్రునికి పెళ్లియీడు వచ్చింది. గాంధారదేశాన్ని పరిపాలించే సుబలుడనే రాజుకు గాంధారి అనే కూతురు ఉన్నదనీ, ఆమె రూపలావణ్యశీలాలలో ఉత్తమురాలనీ, నూరుగురు బిడ్డలకుతల్లి కాగలదనీ జ్యోతిష్కుల వలన విని భీష్ముడు స్వయంగా ఆ సంబంధాన్ని కుదిర్చాడు. అంతేకాదు, గాంధారికి పదిమంది తోబుట్టువు లున్నారు. వారందరినీ ధృతరాష్ట్రుని కిచ్చి పెళ్ళిచేయించాడు. అంతేకాక, కులశీలవతులైన నూరుగురు కన్యల నిచ్చి ఆపై వివాహాలు జరిపించాడు. ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడయినా అతనికి ఎటువంటి లోపం రాకుండా చూచాడు. అతనికి పట్టాభిషేకం చేశాడు.

పాండురాజు అఖిలాస్త్రశస్త్రవిద్యలను గడించి విస్తృతదేశదండయాత్రలు చేసి, అపారధనరాసులు తెచ్చి ధృతరాష్ట్రుని వశం చేసేవాడు. బంధువులకు పంచేవాడు. అతడు స్వయంవరంలో పొందిన కన్య కుంతి; భీష్మానుమతితో పెండ్లాడిన కన్య మాద్రి. పాండురాజు కుంతీమాద్రులను అమితానురాగంతో చూచుకుంటూ ఉండేవాడు.

కర్ణుని జన్మరహస్యం

ఇక్కడ కుంతి జీవితంలో జరిగిన ఒక రహస్యవృత్తాంతం చెప్పాలి. కుంతిభోజునియింట కుంతి కన్యగా పెరుగుతున్నప్పుడు అతిథులకు సత్కారాలను స్వయంగా నిర్వహిస్తూ వారి ఆశీస్సులను, ప్రశంసలను పొందుతూ ఉండేది. ఒకసారి దుర్వాసుడు వారింటికి అతిథిగా వచ్చాడు. అతనికి ఇష్టమైన పదార్థాలను వండి వడ్డించి భక్తితో సేవించింది - కుంతి. ఆ ముని సంతసించి ఒక దివ్యమంత్రాన్ని ప్రసాదించా డామెకు. ఆ మంత్రంతో ఏ వేల్పునైనా ఆరాధిస్తే అతడు కోరినపుత్రుడిని ఇచ్చి సంతోషపెడతాడు. అది ఆపద్ధర్మంగా వాడుకోతగినది మాత్రమే.

ఆ ముని వెళ్లిపోగానే ఆ మంత్రశక్తిని పరీక్షించాలని ఆసక్తి కలిగి గంగదరి కేగి కుంతి సూర్యుడిని స్మరించి, అతనివంటికొడుకును కోరి మంత్రాన్ని జపించింది. సూర్యుడు తరుణద్యుతితో ఆ తరుణి దగ్గరకు వచ్చాడు. సహజకవచకుండల శోభితుడైన బిడ్డ నిచ్చాడు. అతడే కర్ణుడు. అయితే కుంతి కోరికపై ఆమె కన్యాత్వం యథాతథంగా ఉండేటట్లు వరమిచ్చాడు. కుంతి సూర్యప్రేరితమై వచ్చిన ఒకమందసంలో కర్ణుడిని ఉంచి నదిలో వదలింది. సూతు డొకడు ఆ పెట్టెను పట్టి కర్ణుని తన పట్టిగా పెంచుకొన్నాడు.

కుంతి కర్ణుని జన్మరహస్యాన్ని బైటపెట్టలేదు. అది దేవరహస్యంగానే ఉండిపోయింది.

పాండవ, కౌరవజననం

ఒకసారి పాండురాజు వేటకు వెళ్లాడు. ఆ రోజు వనంలో ఎక్కడా వేటకు మృగాలు దొరకలేదు. విసిగి వేసారి పోయాడు. చివరకు ఒకచోట, రెండుమృగాలు క్రీడిస్తుంటే చూచి వాటిని బాణాలతో కొట్టి చంపాడు. కిందము డనే

ముని తనభార్యతో కలిసి మృగరూపంలో క్రీడిస్తున్నాడు. అతడు పాండురాజు బాణాలకు చనిపోతూ శాపం పెట్టాడు. 'నేను నా భార్యతో కూడియున్నప్పుడు ఎలా చనిపోతున్నానో అలాగే నీవూ నీ భార్యతో కూడినప్పుడు చనిపోతావు. నీ భార్యకూడా చనిపోతుంది' - అని శపించి ఋషి దంపతులు కన్ను మూశారు. పాండురాజు విషణ్ణుడయ్యాడు; విరక్తుడుకూడా అయ్యాడు. భార్యాసమేతుడై శతశృంగపర్వతం చేరి ఘోర తపస్సు చేయ నారంభించాడు. అది బ్రహ్మలోకానికి వెళ్లేదారి. కొందరు మునులు బ్రహ్మలోకానికి పోతూ ఉంటే పాండురాజు వారితో తానూ వస్తా నన్నాడు. కాని, వారు 'అపుత్రస్య గతిర్నాస్తి - అని వినలేదా! నీకు సంతానం లేదు కాబట్టి మోక్షానికి అర్హతలే'దని చెప్పారు. వారిమాటలు పాండురాజును మరీ క్రుంగదీశాయి.

సంతానాన్ని గురించి కుంతీమాద్రులతో కలిసి ఆలోచించాడు. దుర్వాసమహర్షి తన కిచ్చిన మహామంత్ర మొకటున్నదని ఆపద్ధర్మంగా దానిని పుత్రలబ్ధికి వాడుకోవచ్చునని కుంతి చెప్పింది. పాండురాజు అంగీకరించాడు. కుంతిని పుత్రసంతానంకొరకు మంత్రమహిమ నాశ్రయించుమని నియోగించాడు. ఆమె భర్తకు ప్రదక్షిణం చేసి సమాహితచిత్తంతో మంత్రాన్ని జపించింది. మొదటగా సర్వలోకాలకు ఆశ్రయమైన ధర్మానికి మూలమైనవాడు ధర్ముడు; అతనిని స్మరించి ఉత్తమధర్మవర్తనుడైన పుత్రుడిని కోరుకొన్నది. దిక్కులు కాంతులతో పిక్కటిల్లేటట్లు వెలుగొందే బాలుడు ధర్ముని అంశాన జన్మించాడు. అతడు పుట్టినప్పుడు సర్వభూతములు సంతోషించాయి. ఆకాశవాణి ఇట్లా పలికింది; "ఇతడు కురుకులదీపకుడౌతాడు; ధర్మస్థిరమతి కావటంచేత యుధిష్ఠిరుడు అని పిలువబడతాడు".

యుధిష్ఠిరుడు పుట్టినసంగతి హస్తినాపురానికి వార్త అందింది. అందరూ సంతోషించారు. కాని, గాంధారి అప్పటికే గర్భవతి. సంవత్సరం నిండుతున్నా ముందుగా సంతానాన్ని కనలేకపోయింది. ఆ అసూయతో కడుపుపై బాదుకొన్నది. గర్భపాతమైపోయింది. వేదవ్యాసుడు వచ్చి ఆ పిండఖండాలను నూటొక్కటిని లెక్కించి వేరువేరు తైలభాండాలలో భద్రపరిచాడు. నూర్వురు కొడుకులు, ఒక్క కూతురు పుడతా రని చెప్పి వెళ్లాడు.

అక్కడ - శతశృంగపర్వతంమీద పాండురాజు మరొక పుత్రుని పొందాలనే కోరికతో కుంతిని - వాయుదేవుని నారాధించి ఉత్తమజవసత్త్వుడైన కుమారుడిని పొందుమని అడిగాడు. ఆమె అలాగే చేసింది. వజ్రదేహుడైన విక్రమోన్నతుడైన బాలుడు పుట్టాడు. దివ్యవాణి అతనికి "భీమసేనుడు" అని పేరు పెట్టింది.

అదేరోజు హస్తినాపురంలో దుర్యోధనుడు పుట్టాడు. కులాన్నీ, లోకాన్నీ నాశనం చేయగల దుశ్శకునాలు ఎన్నో పొడసూపాయి. అందరూ భయవిహ్వలులైనారు. అట్లాగే క్రమంగా దుశ్శాసనుడు మొదలైన తొంభైతొమ్మిది మంది తమ్ములు, దుశ్శల అనే చెల్లెలు పుట్టారు. కులనాశకుడైన దుర్యోధనుడిని ఒక్కడిని దూషించటం మంచి దని పెద్దలు ధృతరాష్ట్రునికి సూచించారు. అతడు పుత్రవ్యామోహంతో దాన్ని అంగీకరించలేదు.

ఈ సంగతి విని - పాండురాజు త్రిలోకవిజయుడైన పుత్రునికొరకు ఏకపాదంమీద నిలువబడి ఒక సంవత్సరకాలం ఇంద్రుడిని గురించి తపస్సు చేశాడు. దేవేంద్రుడు ప్రసన్నుడై శత్రుక్షయాన్ని చేయగల మహావీరుడు నీకు కొడుకుగా పుడతాడని వరమిచ్చాడు. కృతార్థుడైన పాండురాజు, కుంతీదేవిని ఉపాసించుమని కోరాడు. ఆమె అట్లాగే ఆరాధించింది. స్థిరపౌరుషుడు, లోకోత్తరుడు, వంశకరుడు అయిన పుత్రుడు ఇంద్రాంశతో పుట్టాడు. ఆ సమయంలో దేవతలు ఆ బాలుని భావిబలవీర్యాలను కీర్తిస్తూ పూలవానలు కురిపించారు. ఉత్తరఫల్గుణీనక్షత్రంలో పుట్టాడు కాబట్టి ఆ బాలుడిని ఫల్గుణుడని పిలిచారు.

ముగ్గురు కొడుకులను చూచి పాండురాజు మూడులోకాలు జయించినట్లు పొంగిపోతుండేవాడు. కాని మాద్రి తనయందు పుత్రసంతానం పొందే ఉపాయం లేకపోవటంవలన విచారిస్తూ ఉండేది. దీన్ని గమనించి కుంతితో ఒప్పించి, దుర్వాసుని మంత్రప్రభావంతో మాద్రిచేత అశ్వినీదేవతలను ఆరాధింపజేసి కవలపిల్లలను పొందగలిగాడు. వారే నకుల సహదేవులు. సౌందర్యపరాక్రమాలలో సాటిలేనివారు. ఇట్లా పంచపాండవులు పుట్టి శుక్లపక్షచంద్రబింబాలవలె పెంపొందుతూ ఉన్నారు.

అంతలో ఒక విపత్తు. వసంతఋతువు వచ్చింది. ప్రకృతిశోభ మానవుల హృదయాల నుప్పొంగ జేస్తున్నది. కుంతి అన్నదానవ్రతంలో నిమగ్నురాలై ఉన్నది. మాద్రి ఒక్కతే పాండురాజు ప్రక్కన ఉన్నది. ఆమె మనోహరరూపం వసంతప్రభావంతో అతని మనస్సు నాకర్షించింది. పాండురాజు మాద్రిని సమీపించాడు. మునిశాపంచేత మరణించాడు. శతశృంగీయులందరూ గుమిగూడారు. హృదయవిదారకంగా విచారించారు. మాద్రి తాను పాండురాజుతో సహగమనం చేసింది. కుమారులరక్షణకు కుంతి దృఢచిత్తంతో జీవించ సంకల్పించింది. మాద్రీపాండురాజుల అంత్యక్రియల తర్వాత వారి అవశేషాలతో అందరూ హస్తినాపురం చేరారు.

రగిలిన పగలు

హస్తినాపురరాజమందిరంలో అటు కౌరవులు, ఇటు పాండవులు అందరూ కలిసి బాలక్రీడలాడుతుండే వారు. అందరిలో బలాఢ్యుడు భీమసేనుడు. జలక్రీడ లాడేటప్పుడు భీముడు కౌరవులను భుజాలపై కెక్కించుకొని నీటిలో ముంచి తేల్చి ఉక్కిరిబిక్కిరి చేసేవాడు. పండ్లకోసం కౌరవులు చెట్లెక్కితే భీముడు చెట్లమొదళ్ళు పట్టి ఊపి పండ్లతోబాటు వారిని కూడా క్రింద పడేసేవాడు. ఇట్లా భీముని చేతిలో బాధలు పడలేక దుర్యోధనుడు శకునిదుశ్శాసనులతో మంతనాలు సలిపి, భీముడిని ఒంటరిగా ఉన్నప్పుడు చంపటానికి పన్నాగాలు పన్నాడు.

ఒకనాడు భీముడు జలక్రీడలలో వేయిమంది వీరకుమారులతో పోటీపడి గెలిచి, బాగా అలసిపోయి, చల్లగాలి వీస్తుంటే నీటి ఒడ్డునే పడుకొని గాఢనిద్రపోయాడు. దాన్ని గమనించిన దుర్యోధనుడు భీముడిని లతాపాశాలతో గట్టిగా కట్టించి నీటిలో త్రోయించాడు. కాని భీముడు ఒళ్ళు విరుచుకునేసరికి ఆ లతలన్నీ పెటపెటా తెగిపోయాయి. భవబంధవిముక్తునివలె నీటినుండి బయటికి వచ్చాడు.

ఒకనాడు బాగా శ్రమించి భీముడు నిద్రిస్తున్నాడు. ఆ అదను కనిపెట్టి దుర్యోధనుడు ఒక సారథిచేత పాములను తెప్పించి అతడిని కరిపించాడు. భీమునిశరీరం వజ్రతుల్యం కావటంచేత పాముల కోరలు అతని చర్మంలో దిగబడలేదు. కాని, నిద్ర మెలకువ వచ్చింది. అతడు సారథి నొక్క చరుపుతో చంపివేశాడు. పాములను కాళ్ళతో నలిపేశాడు. ఒకసారి అన్నంలో విషం కలిపి పెట్టించాడు. యుయుత్సుడు వద్దంటున్నా ఆకలిగొన్న భీముడు ఆ విషాన్నం తిన్నాడు. విషంకూడా ఆకలివలన అతనికి అమృతంగా మారింది. ఇట్లా ఎన్నో ఉపాయాలతో భీముడిని వధించి ధర్మరాజును ఒంటరివాడిని చేసి చంపాలని దుర్యోధనుడు ప్రయత్నించి విఫలుడయ్యాడు. చివరకు పాండవుల కందరికీ అపాయం కలిగించే ఉపాయమే ఉపాదేయమనుకొన్నాడు.

ఆదిపర్వ కథాసారం - 4

భీష్ముడు బాలురకందరికీ మొదట కృపాచార్యునిచేత విలువిద్య నేర్పించాడు. ఆపై ద్రోణుడినికూడా నియోగించాడు. ద్రోణుడిని ద్రుపదుడు అవమానించాడు. అందువలన అతనిపై ప్రతీకారం తీర్చుకోవాలని అతడు లోలోన మండిపడిపోతున్నాడు. శిష్యు లందరిని తనకోర్కె తీర్చగలరా అని అడిగాడు. అర్జునుడు ఒక్కడే మాట ఇచ్చాడు. అందువలన అతడిని జగదేకవీరునిగా తీర్చిదిద్దుతానని ద్రోణుడు వరమిచ్చాడు. ఏకలవ్యుని వంటివారిఅడ్డును ఉపాయంతో తొలగించాడు. రాత్రియుద్ధం, శబ్దభేది, అస్త్రశస్త్రాలు, విలువిద్యా రహస్యాలు ఎన్నెన్నో అర్జునుడికి బోధించాడు. విలువిద్యలో పార్థుడే ప్రథమగణ్యుడు.

రాజకుమారుల అస్త్రశస్త్రపాండిత్యాన్ని పెద్దలముందు ప్రదర్శింప చేయటానికి ద్రోణుడు ఒక విశాల సమతల ప్రదేశంలో రంగం ఏర్పాటు చేయించాడు. తెల్లనివస్త్రాలను ధరించిన ద్రోణుడు అశ్వత్థామ వెంటరాగా క్రీడారంగం మధ్యకు వచ్చి నిలబడ్డాడు. కురుకుమారులందరూ జ్యేష్ఠానుపూర్వంగా మహాధనువులతో తనుత్రాణాలతో గురువుగారివెనుక వరుసగా నిలిచారు. చూడముచ్చటగా నున్నది దృశ్యం.

మొట్టమొదట భీమదుర్యోధనుల గదాద్వంద్వయుద్ధం ప్రవర్తిల్లింది. భూమి దద్దరిల్లేటట్లు పాదఘట్టనం చేస్తూ మదపుటేనుగులవలె భయంకరంగా పోరాడసాగారు భీమదుర్యోధనులు. ప్రజలలో వారివురిపట్ల అభిమానం గలవారు పెద్దఅరుపులతో పాటు పరస్పరవివాదాలుగూడా చేయటం మొదలుపెట్టారు. దానితో వారిద్దరి పోరును ద్రోణుడు అశ్వత్థామను పంపి ఆపివేయించాడు.

ఆ తరువాత హేమకవచావృతుడు, ఉన్నతచాపధరుడు, అసితోత్పలవర్ణుడు, బద్ధతూణీరుడు అయిన అర్జునుడు రంగమధ్యంలో నిలిచి జనహృదయాలను ఆకట్టుకొన్నాడు. ప్రజలు చేసే ప్రస్తుతి మిన్నంటింది. అర్జునుడు ఆచార్యునిఅనుమతితో ఆగ్నేయ, వారుణాదిమహాస్త్రాలను ప్రయోగించి, పరుగెత్తుతున్న మృగాలపై బాణాలు నాటేపలునేర్పులను ప్రదర్శించి విలువిద్యలో మేటివీరుడని జయజయధ్వానాలు పొందాడు.

అంతలో సహజకవచకుండలధారియైన కర్ణుడు రంగద్వారం వద్ద నిలిచి భుజాస్ఫాలనం చేసి అర్జునుడిని ద్వంద్వయుద్ధానికి ఆహ్వానించాడు. ద్రోణుని అనుమతితో ముందుగా అర్జునుడు ప్రదర్శించిన విద్యలన్నీ ప్రదర్శించి చూపించాడు. అతని పరాక్రమాన్ని చూచి దుర్యోధను డతనిని కౌగలించుకొని "నాతో స్నేహం చేసి నాకూ నా బంధువులకూ హితం చేసి నన్ను కురురాజ్యం ఏలించి, నా ఐశ్వర్యం ఉపయోగించుకో" అని కోరాడు. కర్ణుడు దానికి అంగీకరించాడు.

ఆ తరువాత కర్ణార్జునుల ద్వంద్వయుద్ధం మొదలైనది. కర్ణుడు పర్జన్యాస్త్రం వేశాడు. అర్జునునిపై మేఘాలు దట్టంగా క్రమ్మాయి. కుంతి భయపడింది. అంతలో అర్జునుడు వాయుబాణం వేసి మేఘాలను చిమ్మివేశాడు. కుంతి శాంతపడింది. వారిద్దరి నడుమ పంతాలు పెరుగుతున్నందువలన కృపాచార్యు డడ్డంవచ్చి, అర్జునుని తల్లిదండ్రుల పేర్లు కులం అందరికీ తెలుసు. అట్లాగే నీ వివరాలు తెలియజెప్పుమని కర్ణుడిని అడిగాడు. కర్ణుడు చెప్పడానికి సిగ్గుపడి తలవంచుకొన్నాడు.

దుర్యోధనుడు రంగప్రవేశం చేసి, రాజైతేతప్ప పార్థునితో యుద్ధం చేయడానికి వీల్లేదంటే ఇదుగో అంగరాజ్యా న్నిస్తున్నానని, రంగమధ్యంలో సింహాసనం వేసి అంగరాజ్య పట్టాభిషేకం చేసి కర్ణుడిని అంగరాజుగా పిలిచాడు. సూతుడు, కొడుకుని చూచి ఉప్పొంగిపోయి కౌగలించుకొన్నాడు. కర్ణుడు అతనికి అభివాదనం చేశాడు. దానితో

అతడు సూతపుత్రుడని అందరికీ తెలిసిపోయింది. సూతపుత్రుడు క్షత్రియునితో యుద్ధం చేయటం తగదన్నాడు భీముడు. దుర్యోధనుడు అతని మాటలకు అడ్డువచ్చాడు. 'లేడి కడుపున పులి పుడుతుందా? ఇంతటి దివ్యతేజస్సు కలవాడు సామాన్యుడై ఉంటాడా? సూరుల జన్మస్థానం సురల జన్మం, ఏరుల జన్మం ఎవరు చెప్పగలరు? సహజకవచకుండలధారియైన ఇతడు అంగరాజ్యానికే కాదు, అఖిల మహీ మండలానికే అధిపతి కాగలిగినవాడు' అని ప్రశంసిస్తూ ఉండగా ప్రొద్దు క్రుంకింది. అందరూ వారివారి మందిరాలకు వెళ్ళారు.

గురుదక్షిణ

మరునాడు ద్రోణాచార్యులు శిష్యులందరినీ పిలిచి 'గురుదక్షిణ నివ్వండి!' అన్నాడు. అందరూ గురువు గారిని ఆదేశించుమన్నారు. 'ఐశ్వర్యమదగర్వితుడైన ద్రుపదుడిని ఓడించి పట్టి నాముందు పెట్టండి. అదే నేను కోరే గురుదక్షిణ' అని ప్రకటించాడు-ద్రోణాచార్యుడు.

ఆమాట వినగానే కౌరవులందరూ సైన్యాలను వెంటబెట్టుకొని రథాలెక్కి పాంచాలపురం వైపు పయనం సాగించారు. పాండవులు గురువుకు ప్రదక్షిణం చేసి ఆయనను వెంట తీసికొని ఆ తరువాత బయలుదేరారు. కౌరవుల సేనను ద్రుపదుడు చతురంగసేనతో ఎదుర్కొనాడు. పోరు ఘోరంగా సాగింది. ద్రుపదుని పరాక్రమానికి కౌరవులు నిలువలేకపోయారు. వెనుదిరిగి పోసాగారు. పాండవు లెదురుపడ్డారు. వారి అండన నిలిచారు. అర్జునుడు భీమునిసాయంతో ముందుకు నడిచాడు. ద్రోణుడినీ, ధర్మజుడినీ ఒకచోట నిలిపారు. సైన్యంతో భీముడు ద్రుపదుని గజబలాన్ని మట్టుపెట్టాడు. అర్జునుడు అశ్వబలాన్ని మట్టుబెట్టి ద్రుపదునిపై బాణాలు గుప్పించాడు. అంతలో ద్రుపదుడు అర్జునుని విల్లును విరుగకొట్టాడు. అర్జునుడు సింహంవలె లంఘించి కత్తితో ద్రుపదుని రథంపైకి దూకాడు. మెరుపుదాడి చేసి అతడిని రథాక్షంతో కట్టి ద్రోణుని యెదుటకు తెచ్చి ఉంచాడు. అప్పుడు అవహేళనగా నవ్వుతూ ద్రోణుడు ద్రుపదునితో ఈవిధంగా అన్నాడు.

క. "వీ రెవ్వరయ్య ద్రుపదమ
హారాజులె యిట్లు కృపణులయి పట్టువడన్
వీరికి వలసెనె యహహా! మ
హా రాజ్యమదాంధకార మది వాసెనొకో!"

ఇప్పటికైనా నేను జ్ఞాపకానికి వచ్చానా? అని అధిక్షేపించి ద్రుపదుడిని వదలివేశాడు. ఇట్లా గురుదక్షిణ పాండవులే ఇవ్వగలిగారు.

లాక్షాగృహ దహనం

రాజ్యభారాన్ని వహించగలవాడినిగా భావించి భీష్మ విదురాదులతో విచారించి ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు యువరాజుగా పట్టంగట్టాడు. ధర్మజుడు నలుగురుతమ్ములసాయంతో నాలుగుదిక్కులా విజయయాత్రలు సాగించి అపారధనరాసులను తెచ్చి హస్తినాపుర వైభవాన్ని పెంచాడు. ధర్మరాజు పేరుకు యువరాజుగాని, తీరుకు సార్వభౌముడు.

పాండవులమీద పెరుగుతున్న ప్రజానురాగం దుర్యోధనునిగుండెల్లో అసూయాగ్నిని రగిల్చింది. అతడు

ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్లి తన దుఃఖాన్ని వెళ్లగ్రక్కాడు. 'పైతృకమైన ఈ రాజ్యలక్ష్మిని పూర్వం పాండురాజు భరించాడు. కాబట్టి ఇప్పుడు ధర్మరాజును యువరాజును చేశారు. ఆ తరువాత ఆతనికొడుకులు, మనుమలే రాజ్యాధిపతులౌతారు. మేము వారిని సేవించి బ్రతికేదుర్గతి ఏర్పడుతుంది. రాజ్యం మీ ఆధీనంలో ఉన్నది కాబట్టి మీరే మాకు, రాజ్యానికి మార్గం వేసి చూపించాలి. పాండవులకీర్తి ప్రజలలో పెరిగిపోతున్నది. ముందు వారిని దూరం చేయండి. వారణావతానికి పంపండి. ఆరునెలలలో నేనూ హస్తినాపురి ప్రజలలో నా మీద అభిమానం కలిగేటట్లు చూచుకొంటాను' - అని వాదించి తండ్రిని ఒప్పించాడు.

ధృతరాష్ట్రుడు నయంతో ప్రేమతో పాండవులను కుంతితోసహా వారణావతానికి పంపాడు. అక్కడ దుర్యోధనుడు పురోచనునితో లక్కయింటిని కట్టించి సమయం కనిపెట్టి అందులో పాండవులు తగులపడేటట్లు చూడాలని పన్నాగం పన్నాడు. విదురు డీరహస్యాన్ని గోప్యంగా ధర్మరాజుకు సూచించాడు. ధర్మజుడు గ్రహించి, భీమునితో చెప్పి, లాక్షాగృహంలో నిపుణంగా జాగరూకతతో ఉంటుంటారు. విదురుడు ఒక గూఢచారిని పాండవుల చెంతకు పంపించి లక్కయింటినుండి వారు తప్పించుకొని పోవటానికి బిలమార్గాన్ని ఏర్పరచి, కృష్ణ చతుర్దశినాటిరాత్రి లాక్షాగృహదహనమవుతుందని సూచించాడు. భీముడు ఈ రహస్యాన్ని గమనించి, పురోచనుని, ఒక దాసిని, దాని అయిదుగురు కొడుకులను ఆ లక్కయింటిలో ఉంచి, అన్నదమ్ములను తల్లిని బిలంద్వారా పంపించి, నియమించిన ముహూర్తంకంటె ముందే లక్కయిల్లు మొత్తం దహనమయ్యేటట్లు చూచి తాను బిలంద్వారా వెడలిపోయాడు. ఒక్క విదురుడు తప్ప అందరూ పాండవులు లక్కయింటిలో పడి కాలిపోయారని దుఃఖించారు. ధృతరాష్ట్రదుర్యోధనుల పాపసంకల్పాలను ప్రజలు గర్హించారు.

బిలద్వారంగుండా పాండవులు బయటపడి పాదచారులై నడిచి ఒక వనం చేరారు. భీముడు నీరు తెచ్చేలోపలే ఒక చెట్టుకింద ధర్మజాదులూ, కుంతీ గాఢనిద్రలో మునిగిపోయారు. వారి దీనావస్థకు విచారపడుతూ ఆ రాత్రి భీముడు వారికి కాపలా కాస్తూ ఉన్నాడు.

అది హిడింబాసురుడు నివసించే వనం. నరవాసన కొట్టింది అతనికి. పాండవులను చంపి వండి వడ్డించు మని చెల్లెలైన హిడింబను ఆజ్ఞాపించాడు. ఆమె ఆ చెట్టు దగ్గరకు వచ్చింది. భీముని సుందరవీరాకారం చూచింది. మనసారా ప్రేమించింది. అతనితోడిదే తనజీవిత మని మొదటిచూపులోనే నిర్ణయించుకొన్నది. అన్నను పోగొట్టుకొన్నా భీముడిని మాత్రం పొందాలనుకొన్నది. అన్నివిషయాలు భీముడికి చెప్పింది. ఆలస్యమైనదని హిడింబుడు లేచి వచ్చాడు. భీము డాతనితో యుద్ధానికి తలపడ్డాడు. రాక్షసుని అరుపులకు కుంతి నిద్ర లేచింది; ధర్మజాదులు లేచారు. హిడింబ మానవాకారంలో ఎదుట పడింది. కుంతి ఆమెను గురించి అడిగింది. హిడింబ ఏ సంగతీ దాచుకోకుండా మనసు విప్పి కుంతితో చెప్పుకొన్నది. ఆమెకు ఎన్నో మహిమలున్నాయి. వాటిని ప్రదర్శించి చూపింది. భీముడు హిడింబాసురుడుని చంపాడు. పాండవులను హిడింబ అనుసరించింది. భీముడు వారించాడు. ధర్మజుడు, కుంతి భీముడికి నచ్చజెప్పారు. శాలిహోత్రుని ఆశ్రమంగురించి హిడింబ చెప్పినమాటలు నిజమని తెలిశాయి. భీమునితో హిడింబకు వివాహమయింది. పగలల్లా ఆ దంపతులు అడవులలో విహరించేవారు. రాత్రిళ్ళు ధర్మరాజాదుల వద్ద ఉండేవారు. కొన్నాళ్ళకు ఘటోత్కచు డనేపుత్రుడు పుట్టాడు-హిడింబకు. భయంకరాకారుడు, సద్యోయౌవనుడు, అస్త్రశస్త్రకుశలుడు, రాక్షస పిశాచబలపరివృతుడు అయిన ఘటోత్కచుడు పాండవులను కొంతకాలం సేవించి రాక్షస రాజ్యానికి వెళ్ళిపోయాడు - తల్లిని తీసికొని. తనను స్మరిస్తేచాలు ప్రత్యక్షమౌతానని తండ్రితో చెప్పాడు.

శాలిహోత్రుని ఆశ్రమంలో వ్యాసుడు పాండవులకు దర్శనమిచ్చాడు. జరిగిన దానికి విచారించవద్దని ధైర్యం చెప్పి, భావికార్యక్రమాన్ని సూచించి వెళ్లాడు. పాండవులు బ్రాహ్మణవేషాలతో ఏకచక్రపురం చేరారు. అక్కడ భిక్షాటనం చేసికొంటూ బ్రతుకు సాగించారు. అయినా, అక్కడ ప్రజలను పట్టి పీడించే బకాసురుడిని భీముడు వధించి వారికి శాంతిసౌఖ్యాలను అందించాడు.

పాండవవివాహం

ఆనాడు అర్జునుడి చేతిలో ఓడిన ద్రుపదుడు ద్రోణుడిని చంపే ఒకకొడుకును, అర్జునుని వివాహమాడే ఒకకూతురును పొందాలని అనేకఘోరవ్రతాలు చేశాడు. చివరకు ఒక క్రతువు నిర్వహించాడు. యజ్ఞాగ్నిలో నుండి ఉజ్జ్వల కరవాలంతో రథారూఢుడైన ధృష్టద్యుమ్నుడు పుట్టాడు. దివ్యతేజస్విని ద్రౌపది పుట్టింది. ఆ ద్రౌపదిని అర్జునునకివ్వాలని లోన సంకల్పం. పైకి చలత్ మత్స్యయంత్రభేదనాన్ని వరపరీక్షగా పెట్టాడు-ద్రుపదమహారాజు. ఈ సంగతి పాండవులు ఏకచక్రపురంలో విన్నారు. పాంచాలపురికి హుటాహుటిన బయలుదేరారు.

ద్రుపదనగరం స్వయంవరోత్సవంతో కోలాహలంగా ఉన్నది. ఎత్తుగా కట్టబడిన మత్స్యయంత్రాన్ని అయిదుబాణాలతో ఎవడు కొట్టగలడో, ఆ విలుకాడే ద్రౌపదికి భర్త కాగలడని పాంచాలపతి ప్రకటించాడు. రాజులు నగరం చుట్టూ డేరాలు తీర్చి స్వయంవరానికి దిగి ఉన్నారు. పాండవు లాపురిలో బ్రాహ్మణ వేషాలతో ప్రవేశించి ఒక కుంభాకారుని యింట్లో వసించి మత్స్యయంత్రసభకు వెళ్లారు.

ధృష్టద్యుమ్నుడు స్వయంవరనియమాన్ని ప్రకటించాడు. స్వయంవరసభలో విచ్చేసియున్న రాజులనందరినీ ద్రౌపదికి చూపించాడు. అందులో నూరుగురు కౌరవులున్నారు. కర్ణాశ్వత్థామాదులుకూడా ఉన్నారు. వారిలో ఎవరు లక్ష్యాన్ని భేదిస్తే అతడు కల్యాణమాలకు అర్హుడని సూచించాడు. ఆ సభలోని అతిథులలో వాసుదేవు డున్నాడు. అతడు బ్రాహ్మణవర్గంలో పంచాగ్నులవలె వెలుగొందుతున్న పాండవులను గ్రహించి, పార్థుడు పాంచాలిని గ్రహిస్తాడని సంతోషించాడు.

కొందరు రాజులు విల్లు ఎక్కుపెట్టలేక వెనుతిరిగిపోయారు; కొందరు ప్రయత్నమే చేయలేకపోయారు; కొందరు చేసి విఫలురయ్యారు. బ్రాహ్మణులలో నుండి అర్జునుడు లేచి యంత్రాన్ని సమీపించి, గురువులకు నమస్కరించి, ధనువునకు ప్రదక్షిణం చేసి మ్రొక్కి, దానిని అవలీలగా ఎక్కుపెట్టి, అలవోకగా మత్స్యయంత్రాన్ని భేదించాడు. సభికు లందరూ ఆశ్చర్యపోయారు. బ్రాహ్మణు లుప్పొంగిపోయారు. ధృష్టద్యుమ్నుడు సైన్యంతో అర్జునుని వెంట నిలువ బడ్డాడు. ధర్మజుడు నకుల సహదేవులతో కలిసి వసతిగృహానికి వెళ్లాడు. ద్రౌపది కల్యాణమాలను అర్జునుని మెడలో ఉంచటానికి బయలుదేరింది. దుర్యోధనాదు లది సహించలేకపోయారు. రాచకన్నెను విప్రుడి కివ్వటం అవమానమని ఆగ్రహించారు. విప్రాకారంలో నున్న అర్జునుడిని అపహసించారు. ద్రుపదుడు భయపడి బ్రాహ్మణుల వెనకాల నిలువబడ్డాడు. వారందరికి అభయమిచ్చి అర్జునుడు భీమ సహాయంతో తిరుగబడ్డాడు.

అర్జునుడికి ఎదురుగా కర్ణుడు నిలిచి బాణయుద్ధం చేశాడు. తన ఎదుట నిలువగలిగిన ఆత దెవడా? అని కర్ణు డాశ్చర్యపోయాడు. ఎవడో విప్రశ్రేష్ఠునివలె నున్నాడని రణరంగం నుండి తొలగిపోయాడు. భీముడు శల్యుడిని

నేలపై పడేసి కొట్టాడు. అతడు లేచి దుమ్ము దులుపుకొని వెళ్లిపోయాడు. ఆ బ్రాహ్మణులెవరో తేల్చుకోవాలని పట్టుబట్టిన దుర్యోధనాదులకు మొగం వాచేటట్లు సమాధానం చెప్పి వాసుదేవుడు పంపివేశాడు. రాజులందరూ మరలిపోయారు. భీమార్జునులు ద్రౌపదిని తీసికొని యింటికి వచ్చారు. ధర్మజాదులతో కలిసి "తల్లితో అమ్మా! మే మొకభిక్ష తెచ్చాం" అని అన్నారు. కుంతి అసలు విషయాన్ని గ్రహింపక "మీ రయిదుగురూ ఉపయోగించుకొనండి" అని కొడుకులను నియోగించింది. ఆ తరువాత ద్రౌపదిని చూచి ప్రబోధించానని చిన్నబోయింది. ఆమె అన్నమాట అయితీరుతుంది. పాండవులు అమ్మమాట జవదాటరు. కుంతి కలత చెందింది. ధర్మజుడు తల్లినోదార్చి ద్రౌపదిని అర్జునుడినే వివాహమాడుమన్నాడు. అర్జునుడు పెద్దవాడైన ధర్మరాజును పెండ్లాడుమన్నాడు. వీరిద్దరూ ఇట్లా అంటూనే ఉన్నారు. పాండవులైదుగురూ పాంచాలిని చూచి మన్మథభావాన్ని ఒకేసారి పొందారు. పాంచాలి కూడా వారి అయిదుగురియందు బద్ధానురాగయై నిలిచింది. ధర్మజుడు వేదవ్యాసుని మాటలు స్మరించి ద్రౌపదిని పాండవులైదుగురు పాణిగ్రహణం చేయటమే ఉత్తమ మని నిర్ణయించాడు.

మత్స్యయంత్రం భేదించింది అర్జునుడనీ, ద్రౌపదిని వివాహమాడేది పాండవు లనీ తెలిసికొని ద్రుపదుడు సంతోషించాడు. ద్రౌపదికి భర్తృపంచకం ఏర్పడటానికి గల పూర్వజన్మవృత్తాంతాన్ని వ్యాసుడు వినిపించాడు. ఆమె అయిదుగురు భర్తలకు భార్య అయినా ఎవరిదగ్గర కన్యాత్వం సతీత్వం వారివద్ద మొక్కవోకుండా ఉండే వరం ఉండటంవలన వివాహంలోకూడా వరుసగా ధర్మజాదులు తాళిగట్టేటప్పు డామె కన్యాత్వం చెక్కు చెదరకుండా నిలిచింది. ఆ మహిమను చూచి అగ్నిజాతయైన ద్రౌపదియొక్కవిశిష్టలక్షణంగా అందరూ భావించారు. వాసుదేవుడు సంతోషించాడు. పాండవులవివాహం వైభవంగా జరిగింది. వారు పాంచాలనగరంలో ఒకయేడాదిపాటు ఉన్నారు.

ఇంద్రప్రస్థపురం

ధృతరాష్ట్రుడు భీష్మాదుల నీతివచనాలు విని విదురుని పంపి పాండవులను హస్తినాపురానికి పిలిపించాడు. లాక్షాగృహదహనం నుండి పాండవులు బైటపడ్డందుకు దుర్యోధనుడు లోలోన మండిపోతుండేవాడు. పాండవులు ఎక్కువకాలం హస్తినాపురంలో ఉండకుండా చూడుమని తండ్రిని బలవంతపెట్టేవాడు. కొడుకుపోరు పడలేక ధృతరాష్ట్రుడు పాండవులకు అర్ధరాజ్యమిచ్చి ఇంద్రప్రస్థపురం రాజధానిగా ఏలుకోండని పంపాడు. ధర్మరాజును పట్టాభిషిక్తుడిని చేశాడు. శ్రీకృష్ణాదులు వెంటరాగా పాండవులు ఇంద్రప్రస్థపురాన్ని చేరుకొన్నారు.

శ్రీకృష్ణుడు ఇంద్రుడిని, ఇంద్రుడు విశ్వకర్మను స్మరించగా విశ్వకర్మసాయంతో ఇంద్రప్రస్థపురం దిక్పాలకుల పురాలతో దీటైనదిగా రూపొందింది. వాసుదేవుని అనుమతితో ఆశీస్సులతో ధర్మజు డానగరంలో ప్రవేశించి అపరదేవేంద్రునివలె వెలుగొందుతూ ఉన్నాడు.

ఒకనాడు నారదుడు వచ్చి పాండవులలో ఒక్కొక్కరు ద్రౌపదిని ఒక్కొక్క యేడు తన భవనంలో ఉంచుకోవా లనీ, ఆ కట్టడిని తెలిసిగాని, తెలియకగాని ఎవరైనా మీరితే ఒకయేడాది పాటు అతడు తీర్థయాత్రలు చేసిరావా లనీ నియమం చేశాడు. పాండవులు దానికి కట్టుబడి ఉన్నారు.

అలా ఒకయేడు ధర్మరాజు అంతఃపురంలో ద్రౌపది ఉంటున్నది. అర్జునుడు బ్రాహ్మణ ధేనువును రక్షించటానికై ఆయుధాలు తెచ్చుకొందామని ధర్మజుని భవనానికి వెళ్ళాడు. దొంగలను చంపి ధేనువును బ్రాహ్మణున కిచ్చి ఆయుధాలు ఉన్నచోట పెట్టాడు. కాని ఆ సమయంలో అర్జునాదులు ధర్మజునింటికి పోగూడదు. నియమం

తప్పినట్లైనది. ధర్మజుడు వలదన్నా అర్జునుడు తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఆ యాత్ర అతనికి పుణ్యం పురుషార్థం కలిసి వచ్చేటట్లు చేసింది. ఉలూచి, చిత్రాంగద, సుభద్రలు అర్జునుని వివాహమాడారు. సుభద్ర బలరామ శ్రీకృష్ణుల ముద్దుల చెల్లెలు. అర్జునుడు యతివేషంలో సుభద్రకు సన్నిహితుడు కావటానికి, ఆమెను వివాహమాడి ఇంద్రప్రస్థపురానికి చేరటానికీ శ్రీకృష్ణుడు సూత్రధారుడుగా నిలిచాడు. సుభద్రార్జునుల వివాహం ఇంద్రోపేంద్రులే స్వయంగా చేయించారు. ఆమీద బలరాముడంగీకరించాడు. సుభద్రను ద్రౌపది దీవించింది. పాండవవంశాన్ని నిలిపే కౌరవవధువుగా సుభద్ర మహాభారతంలో చిరస్మరణీయురాలిగా నిలిచింది.

ఇది ఆదిపర్వకథాసారంలో రెండవభాగం.

జి.వి. సుబ్రహ్మణ్యం

ప్రధానసంపాదకుడు

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపుటం -2

ఆదిపర్వము

రెండవ భాగము (5, 6, 7, 8 ఆశ్వాసములు)

విషయసూచిక

పంచమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
ధృతరాష్ట్ర పాండుకుమారులు పెరుఁగుట	1-102-1	467
ధృతరాష్ట్రుడు గాంధారిని వివాహంబు సేసికొనుట	1-103-10	473
కుంతి చరిత్రము	1-104-1	475
కర్ణుఁడు జనియించి సూతగృహంబు సేరుట	1-104-10	479
పాండురాజు వివాహమై దిగ్విజయము సేయుట	1-105-1	483
పాండురాజు సత్కృత్యములు	1-106-1	486
వేటకుఁ బోయిన పాండురాజునకు శాపంబు గలుగుట	1-109-5	488
పాండురాజు శతశృంగంబునఁ దపోవృత్తి నుండుట	1-111-1	497
వ్యుషితాశ్వుం డను రాజువృత్తాంతము	1-112-7	504
శ్వేతకేతుఁడు స్త్రీ పురుషుల విషయంబునఁ గావించిన కట్టడి	1-113-1	507
కుంతీదేవియందు ధర్మరాజుజననము	1-114-3	511
గాంధారి యుదరతాడనంబు గావించుకొనుట	1-107-8	514
దుర్యోధనాదుల జననము	1-107-24	517
భీముని శరీరదార్ఢ్యము	1-114-11	520
ఇంద్రప్రసాదంబునఁ గుంతి కర్జునుఁ డుదయించుట	1-114-15	521
మాద్రికి నకులసహదేవులు పుట్టుట	1-115-1	527
వసంత వర్ణనము	1-116-1	530
పాండురాజు మరణము	1-116-4	532
మాద్రి సహగమనము సేయుట	1-116-25	534
మునులు పాండవులను హస్తినాపురంబునకుం గొనివచ్చి		

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విషయము	సంస్కృతమూలము	పుట
ధృతరాష్ట్రున కొప్పగించుట	1-117-6	536
కురుపాండుకుమారుల బాలక్రీడలు	1-119-13	543
దుర్యోధనుఁడు భీమునిఁ జంపింపఁ దివురుట	1-119-28	546
కృపాచార్యుల జన్మవృత్తాంతము	1-120-2	551
ద్రోణాచార్యుల జన్మవృత్తాంతము	1-121-3	554
ద్రోణుఁడు ద్రుపదునిచే నవమానితుఁ డగుట	1-122-2	559
ద్రోణుఁడు హస్తినాపురంబునకు వచ్చుట	1-122-14	561
భీష్ముఁడు కురుపాండుకుమారులకు ద్రోణుని గురువుగా నియమించుట	1-122-2	566
ఏకలవ్యం డనువాఁడు ద్రోణు నారాధించి విలువిద్య గఱచుట	1-123-10	570
ద్రోణుఁ డస్త్రవిద్యం దనశిష్యులఁ బరీక్షించుట	1-123-15	576
అర్జునుఁడు ద్రోణుని మొసలినుండి విడిపించుట	1-123-68	579

షష్ఠాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
కుమారాస్త్ర విద్యాసందర్శనము	1-123-68	584
భీమదుర్యోధనులు దమ గదాకౌశలంబు సూపుట	1-124-30	589
అర్జునుండు తన యస్త్రవిద్యాకౌశలంబు సూపుట	1-125-18	595
కర్ణుఁడు ప్రవేశించి యర్జును నధిక్షేపించుట	1-126-2	597
కర్ణార్జునుల ద్వంద్వయుద్ధము	1-126-23	601
దుర్యోధనుఁడు కర్ణుని నంగరాజ్యమున కభిషిక్తుం జేయుట	1-126-36	605
కౌరవపాండవులు గురుదక్షిణార్థంబు ద్రుపదుం బట్టఁ జనుట	1-127-1	612
భీమార్జునులు ద్రుపదుని సేనను దునుమాడుట అను	1-78-40 పంక్తి	617
అర్జునుఁడు ద్రుపదుం బట్టి కట్టి తెచ్చుట	1-128-3	620
ధృతరాష్ట్రుఁడు యుధిష్ఠిరుని యౌవరాజ్యాభిషిక్తునిం జేయుట	1-179-191	623
భారద్వాజుం డర్జునునకు బ్రహ్మశిరోనామక దివ్యబాణం బొసఁగుట అను	1-80-20 పంక్తి	625
కణికనీతి	1-81-10	627
దుర్యోధనుఁడు తండ్రితోఁ దన మనోదుఃఖంబుఁ దెలుపుట	1-129-10	635
దుర్యోధనుఁడు పాండవులను వారణావతంబునకుఁ బంపుమని తండ్రితోఁ జెప్పుట	1-30-8	639
ధృతరాష్ట్రుండు పాండవులను వారణావత నగరంబునకుఁ బోవఁ బనుచుట	1-131-2	642
దుర్యోధనుఁడు లాక్షాగృహనిర్మాణమునకై పురోచనుని వారణావతంబునకుఁ బంపుట	1-132-2	644
వారణావతప్రస్థానము - విదురోపదేశము	1-133-4	646

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విషయము	సంస్కృతమూలము	పుట
పాండవులు జననీసహితంబుగా వారణావతంబుఁ జేరుట	1-134-1	650
లాక్షాగృహదహనము	1-135-1	654
పాండవులు లక్కయింటఁ జచ్చిరని ధృతరాష్ట్రుండు దుఃఖించుట	1-137-10	660
పాండవులు వారణావతమునుండి దక్షిణదిశగా నడచుట	1-137-17	662
భీముఁడు నిద్రితులైన జననీసోదరులను జూచి చింతిల్లుట	1-138-14	664
హిడింబ భీమసేనునిం జూచి మోహించుట	1-139-1	668
భీమసేనహిడింబాసురుల యుద్ధము	1-141-15	674
భీముఁడు తల్లియనుమతంబున హిడింబను బరిగ్రహించుట	1-143-1	683
పాండవులకు వ్యాసుఁడు హితోపదేశము సేయుట	1-144-7	685
హిడింబయందు ఘటోత్కచుండు పుట్టుట	1-145-27	688
పాండవు లేకచక్రపురంబున విప్రగృహంబున నుండుట	1-145-1	690
బకున కాహారముగాఁ బోవుటనుగూర్చి బ్రాహ్మణకుటుంబము విచారించుట	1-145-20	693
కుంతీదేవికి బ్రాహ్మణుండు తన దుఃఖకారణంబును దెలుపుట	1-148-1	700
బకునిఁ జంప భీమునిఁ బంపుటకుఁ గుంతి నిశ్చయించుట	1-149-13	704
కుంతి ధర్మజునకుఁ బరదుఃఖనివారణము పరమపుణ్యంబని తెలుపుట	1-150-20	708
భీముఁడు బకాసురునిఁ జంపఁ బోవుట	1-151-1	711
భీమసేనుఁడు బకాసురుం జంపట	1-151-15	713

సప్తమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
ధృష్టద్యుమ్న ద్రౌపదులయుత్పత్తివృత్తాంతము	1-153-1	721
ద్రౌపదీవివాహప్రయ్నతము (అమూలకము)		730
పాండవులు పాంచాలపురంబునకు బయలుదేరుట	1-156-2	733
పాండవులు ద్రుపదుపురంబున కరుగుచు వ్యాసమహర్షిం గనుట	1-157-1	734
అర్జునుఁ డంగారపర్ణుని జయించుట	1-158-9	737
అంగారపర్ణుం డర్జునునితో సఖ్యము సేయుట	1-158-35	742
అంగారపర్ణుఁడు పాండవులకుఁ బురోహితునిఁ బురస్కరింపుఁ డని చెప్పుట	1-159-17	746
తపతీసంవరణోపాఖ్యానము	1-160-3	749
సంవరణుండు తపతిం జూచి మోహించుట	1-160-25	751

విషయము	సంస్కృతమూలము	పుట
వసిష్ఠుఁడు తపతినిఁ గొనితెచ్చి సంవరణునకు వివాహంబు సేయించుట	1-162-12	756
అంగారపర్ణుడు అర్జునునకు వసిష్ఠుమహిమ చెప్పుట	1-165-2	761
శక్తిమహాముని కల్మాషపాదుని శపియించుట	1-166-7	768
పుత్త్రశోకంబున వసిష్ఠుఁడు ఆత్మహత్యకుఁ బ్రయత్నించుట	1-166-40	771
వసిష్ఠువలనఁ గల్మాషపాదుండు శాపవిముక్తిఁ జెందుట	1-168-5	775
వసిష్ఠ ప్రసాదంబునఁ గల్మాషపాదుండు పుత్త్రవంతుఁడగుట	1-168-11	777
భార్గవుండయిన ఔర్వుని జననము	1-169-20	780
పితృదేవతలు ఔర్వుని శాంతచిత్తునిఁ జేయుట	1-170-14	782
పరాశరుఁడు రాక్షసవినాశార్థంబు సత్త్రయాగంబు సేయుట	1-172-2	786
పాండవులు ధౌమ్యునిఁ బురోహితుఁగా వరియించుట	1-174-6	789
ద్రౌపదీస్వయంవరము	1-179-11	793
రాజపుత్త్రులు మత్స్యయంత్రమును భేదింపఁబోయి భంగపడుట	1-177-22	797
అర్జునుఁడు మత్స్యయంత్రంబుఁ దెగనేయుట	1-179-4	801
ద్రౌపది యర్జునుని వరించుట	1-179-22	806
అర్జునుండు కర్ణునితో యుద్ధంబు సేసి జయించుట	1-181-3	809
అర్జునుండు ద్రౌపదిం దెచ్చి తల్లికి నివేదించుట	1-182-1	815
శ్రీకృష్ణబలరాములు ధర్మరాజాదులఁ జూడవచ్చుట	1-183-2	818
పాండవుల వంశాదికము నెఱింగి రమ్మని ద్రుపదుండు ధృష్టద్యుమ్నుం బనుచుట	1-184-3	821
పాండవులు ద్రుపదమహారాజగృహంబునకుఁ బోవుట	1-185-25	827
వ్యాసమహాముని ద్రుపదునియొద్దకు వచ్చుట	1-186-38	833
ద్రుపదునకు వ్యాసుండు ఇంద్రసేన యను పతివ్రతకథ సెప్పుట	1-100-60	838
ద్రుపదునకు వ్యాసుండు పంచేంద్రోపాఖ్యానంబు సెప్పుట	1-189-1	842
ద్రౌపదీవివాహమహోత్సవము	1-90-5	849

అష్టమాశ్వాసము

పాండవులు ద్రుపదరాజుపురంబున నిష్టోపభోగంబు లనుభవించుచు సుఖంబుండుట	1-190-25	855

విషయము	సంస్కృతమూలము	పుట
చారులవలన పాండవుల యభ్యుదయమును విని దుర్యోధనుఁడు నిర్వేదించుట	1-191-1	859
దుర్యోధనుఁడు తండ్రితోఁ బాండవపాంచాల విభేదనోపాయంబు నాలోచించుట	1-192-25	863
భీష్మద్రోణులు దుర్యోధనునకు బుద్ధి సెప్పుట	1-195-1	869
పాండవులను దోడ్తేర ధృతరాష్ట్రుండు విదురునిఁ బంచుట	1-193-3	879
పాండవులు హస్తిపురంబునకు వచ్చుట	1-199-10	883
విశ్వకర్మ యింద్రప్రస్థపట్టణమును నిర్మించుట	1-199-28	886
నారదుఁడు పాండవులపాలికి వచ్చుట	1-200-8	896
సుందోపసుందోపాఖ్యానము	1-201-1	898
సుందోపసుందు లొండొరులతోఁ బోరి చచ్చుట	--	905
నారదప్రేరితులయి పాండవులు సమయము సేయుట	1-204-27	906
సమయభంగకారణమున నర్జునుండు తీర్థయాత్రకుం జనుట	1-206-12	911
ఉలూచి యర్జునునిఁ గామించుట	1-206-12	913
అర్జునుండు చిత్రాంగదను వివాహంబగుట	1-207-14	918
అర్జునుఁడు పంచతీర్థంబులం దప్సరసలను శాపవిముక్తుల నొనరించుట	1-208-1	921
అర్జునుండు ద్వారకానగరంబునకుఁ జనుట	1-210-4	930
అర్జునుండు యతిరూపంబున కన్యాపురంబున నుండుట	(సం-అను.1-114-64 పంక్తి)	937
అర్జునుండు సుభద్రను వివాహంబగుట	(సం-అను.1-114-270 పంక్తి)	943
అర్జునుండు సుభద్రాసహితుండై యింద్రప్రస్థపురంబునకుఁ జనుట	1-213-13	950
శ్రీకృష్ణబలదేవాదులు పాండవులకుఁ గానుకలు తెచ్చి యిచ్చుట	1-213-33	952
అభిమన్యుప్రభృతుల జననము	1-213-58	956
అగ్నిదేవుఁడు ఖాండవసమీపమున విహరించుచున్న కృష్ణార్జునులకడకు వచ్చుట	1-214-29	960
శ్వేతకి యను రాజర్షివృత్తాంతము	1-215-11 (అను.1-8)	963
అగ్నిదేవుండు కృష్ణార్జునులకుఁ జక్రకార్ముకాదు లొసంగుట	1-215-12	967
కృష్ణార్జును లగ్నిహోత్రునిచే ఖాండవంబు దహింపఁజేయుట	1-216-28	970
ఇంద్రుండు కృష్ణార్జునులతోఁ బోరుట	1-218-13	977
మందపాలోపాఖ్యానము	1-220-1	983
ఇంద్రుం డర్జునునకు నాగ్నేయ వారుణ వాయవ్యాది దివ్యబాణంబు లిచ్చుట	1-225-7	992

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము

రెండవ భాగము

(5,6,7,8 ఆశ్వాసాలు)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము - పంచమాశ్వాసము

శ్రీనాథమూర్తి! విబుధని ၊ ధాన! మహాదాన తర్పితద్విజవర! వేం
గీనాథ! పార్థనిభ! యభిమానమహార్ణవ! మహేంద్రమహిమాతిశయా! 1

ప్రతిపదార్థం: శ్రీనాథమూర్తి=లక్ష్మిదేవికి భర్త అయిన విష్ణువువంటి ఆకారం కలవాడా!; విబుధ, నిధాన= పండితులకు నిధివంటివాడా!; మహా, దాన తర్పిత, ద్విజ వర= గొప్పదానాలచేత తృప్తిని పొందింపబడిన బ్రాహ్మణశ్రేష్ఠులు కలవాడా!; వేంగీ నాథా= వేంగీదేశానికి ప్రభువు అయినవాడా!; పార్థ, నిభ= అర్జునితో సమానం అయినవాడా!; అభిమాన మహా+అర్ణవ= ప్రేమయందు సముద్రంవంటివాడా లేదా ఆత్మగౌరవంలో సముద్రంవంటివాడా!; మహా+ఇంద్ర, మహిమ+అతిశయా= దేవేంద్రుని గొప్పతనంవంటి ఆధిక్యము కలవాడా!

తాత్పర్యం: విష్ణుమూర్తివంటి ఆకారంకలవాడా! పండితులకు నిధివంటివాడా! మహాదానాలచేత బ్రాహ్మణ శ్రేష్ఠులను తృప్తి పొందించినవాడా! వేంగీదేశానికి రాజైనవాడా! అర్జునునితో సమానమైనవాడా! సముద్రమంత ప్రేమ కలవాడా లేదా సముద్రమంత ఆత్మాభిమానం కలవాడా! దేవేంద్రునంతటి గొప్పతనం కలవాడా!

విశేషం: ఇది రాజరాజనరేంద్రుని మనోహరమైన ఆకారాన్ని, మహాదానగుణాన్ని, పరాక్రమ విశేషాన్ని, ప్రేమాతిశయాన్ని, వైభవాన్ని తెలియచేసే ఆశ్వాసారంభ సంబోధనపద్యం.

ధృతరాష్ట్రపాండుకుమారులు పెరుఁగుట (సం.1-102-1)

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పెఁ: నట్లు ధృతరాష్ట్రపాండువిదురులు భీష్మాభిరక్షితులై పెరుఁగుచు, నుపనయనానంతరంబున నధ్యయనం బొనరించి రాజవిద్యలయందు జితశ్రము లై యున్నంత. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= కథను చెప్పే ఆ ఉగ్రశ్రవసమహర్షి; శౌనక+ఆది, మహా, మునులకున్= శౌనకుడు మొదలైన మహర్షులకు; చెప్పెన్; అట్లు= ఆ విధంగా; ధృతరాష్ట్ర, పాండు విదురులు; భీష్మ+అభిరక్షితులు+ఐ= భీష్మునిచేత పోషింపబడిన వాళ్ళయి; పెరుగుచు= వృద్ధిచెందుతూ; ఉపనయన+అనంతరంబునన్= ఉపనయనం జరిగినతరువాత; అధ్యయనంబు= విద్యాభ్యాసం; ఒనరించి= చేసి; రాజ, విద్యల+అందు= క్షత్రియులకు తగిన విద్యలలో; జిత, శ్రములు+ఐ= జయింపబడిన శ్రమ కలవాళ్ళయి - అనగా సమర్థులై; ఉన్నంత= ఉండినప్పుడు.

తాత్పర్యం: మహాభారతకథను చెప్పే ఆ ఉగ్రశ్రవసుడు, శౌనకాదిమహామునులకు ఇట్లా చెప్పాడు; ఆ విధంగా ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు భీష్ముని పోషణలో పెరుగుతూ ఉపనయనమైన తరువాత విద్యాభ్యాసం చేసి, రాజవిద్యలలో ఆరితేరి ఉండగా.

సీ. **అమరాపగాసుతు ననుశాసనంబునఁ। గౌరవ రాజ్యంబు గడు వెలింగెఁ,**
గురుభూము లుత్తరకురువులకంటెను। నధికలక్ష్మీయుక్తి నతిశయిల్లె,
ధర్మాభిసంరక్షితం బైన భూప్రజ। కెంతయు నభివృద్ధి యెసఁగుచుండె,
వలసినయప్పుడు వానలు గురియుట। సస్యసమృద్ధి ప్రశస్త మయ్యెఁ,

ఆ. **బాలు సేఁపెఁ బుష్పఫలభరితంబు లై। తరువనంబు లొప్పె, ధర్మకర్మ**
నిరతిఁ జేసి కరము నెమ్మితో నన్యోన్య। హితముఁ జేయుచుండి రెల్ల జనులు **3**

ప్రతిపదార్థం: అమర+ఆపగా, సుతు, అనుశాసనంబునన్= దేవనది అయిన గంగయొక్క పుత్రుడు భీష్ముని ఏలుబడిచేత; కౌరవ, రాజ్యంబు; కడు=మిక్కిలి; వెలింగెన్=ప్రకాశించింది; కురు, భూములు=కురుదేశంలోని భూభాగాలు; ఉత్తర, కురువుల కంటెను=ఉత్తరకురుదేశంలోని ప్రదేశాలకంటె; అధిక, లక్ష్మీ, యుక్తిన్= అధికమైన సంపదచేత; అతిశయిల్లెన్= హెచ్చెను; ధర్మ+ అభిరక్షితంబు+ఐన= ధర్మంచేత చక్కగా రక్షింపబడిన; భూ, ప్రజకు= దేశప్రజలకు; ఎంతయున్= మిక్కిలి; అభివృద్ధి; ఎసఁగుచుండెన్= కలుగుతూ ఉండెను; వలసిన, అప్పుడు= అవసరమైనప్పుడు; వానలు, కురియుట= వానలు కురవటంచేత; సస్య, సమృద్ధి= పంటల అతిశయం; ప్రశస్తము+అయ్యెన్= గొప్పగా ఉండెను; పాలు, చేఁపెన్= పాలు పోసుకొన్నవి; (పంటగింజలు పాలుపోసుకోవడం అంటే పంటలు సారవంతంగా పండట మని భావం లేదా పాడి ఎక్కువయింది అని భావం); తరు, వనంబులు= చెట్ల సమూహాలు; పుష్ప, ఫల, భరితంబులు+ఐ= పూలతో, పళ్ళతో నిండిన వై; ఒప్పెన్= శోభిల్లినాయి; ఎల్ల జనులు= ప్రజలంతా; ధర్మ, కర్మ, నిరతిన్+చేసి= ధర్మకార్యాలమీద ఆసక్తిచేత; కరము, నెమ్మితోన్= మిక్కిలి ప్రేమతో; అన్యోన్య హితమున్= ఒకరికి ఒకరు మేలును; చేయుచుండిరి = చేస్తూ ఉన్నారు.

తాత్పర్యం: భీష్మునిపాలనలో కౌరవరాజ్యం గొప్పగా వెలిగింది. కురుదేశం ఉత్తరకురుదేశాలకంటె అధికసంపదతో విలసిల్లింది. ధర్మంచేత చక్కగా రక్షింపబడిన దేశప్రజలకు అభివృద్ధి కలుగుతూ ఉన్నది. అవసరమైనప్పుడు వానలు కురవటంచేత పంటలు సమృద్ధిగా పండాయి. పాడి ఎక్కువ అయింది. వృక్షాలు పూలతో, పళ్ళతో నిండాయి. ప్రజలంతా ధర్మకార్యాలమీద ఆసక్తి కలవా ళ్ళయి మిక్కిలి ప్రేమతో ఒకరి కొకరు మేలు చేస్తూ ఉన్నారు.

విశేషం: సమర్థుడు, ధర్మ బద్ధుడు అయిన భీష్ముని పాలనలో దేశంలో శాంతిసౌభాగ్యాలు ఎట్లా ఉన్నాయో ఈ పద్యం తెలుపుతున్నది. (వ్రాతప్రతులలో మొదటిపాదము చివర "వెలుంగె" అని ఉన్నది.)

మ. **అమలాచారపవిత్రభూసురవరేణ్యాగార పుణ్యప్రదే**
శములం దధ్యయనారవంబు విధివత్స్వాహాస్వధాస్వస్తిశ
బ్దములున్ మంగళతూర్యఘోషములు నుద్యత్కౌతుకాశీర్నినా
దములున్ రమ్యతరంబు లయ్యె ధరణిం దద్రాజ్యసంవృద్ధితోన్. **4**

ప్రతిపదార్థం: ధరణిన్=భూమిమీద; తద్+రాజ్య, సంవృద్ధితోన్= ఆ భీష్మునిపరిపాలనయొక్క పెంపుతో; అమల+ఆచార, పవిత్ర, భూసుర, వరేణ్య+అగార, పుణ్య ప్రదేశముల, అందు= నిర్మలమైన ఆచారంచేత, పరిశుద్ధాలు అయిన బ్రాహ్మణ శ్రేష్ఠుల ఇళ్ళలోని ఆ పుణ్యస్థలాలలో; అధ్యయన+ఆరవంబు= వేదపఠనధ్వని; విధివత్+స్వాహా, స్వధా, స్వస్తి శబ్దములున్= వేదశాస్త్రకర్మలతో కూడుకొన్న స్వాహా, స్వధా, స్వస్తి శబ్దాలూ; మంగళతూర్య, ఘోషములున్= మంగళవాద్యాల ధ్వనులూ;

ఉద్యత్+కౌతుక+ఆశీస్+నినాదములున్= వృద్ధిపొందే సంతోషంతో కూడిన ఆశీర్వచనశబ్దాలూ; రమ్యతరంబులు= మిక్కిలి మనోహరాలు; అయ్యెన్= అయినవి.

తాత్పర్యం: పెంపు వహించిన భీష్మునిపరిపాలనలో - సదాచారంచేత పవిత్రాలైన బ్రాహ్మణశ్రేష్ఠులఇళ్ళలో, పుణ్యస్థలాలలో- వేదనాదాలు, శ్రౌత స్మార్త కర్మసంబంధాలైన స్వాహా, స్వధా, స్వస్తిశబ్దాలు, మంగళవాద్య ధ్వనులు, మహానందంతో కూడిన ఆశీర్వచనాలు మిక్కిలి మనోహరాలై వినిపిస్తున్నాయి.

విశేషం: బ్రాహ్మణుల ఇళ్ళలో వేదకర్మలు, లౌకిక కర్మలు నిర్విఘ్నంగా సాగుతున్నా యని వస్తుధ్వని. అధ్యయన అధ్యాపనాలు, నిత్యనైమిత్తిక యజ్ఞకర్మలు, శుభకార్యాలు, ఆశీర్వచనాలు అనే నాల్గు క్రియలు వాటికి మూలమైన బ్రాహ్మణ సదాచార సంపత్తిని ధ్వనింపచేస్తున్నాయి. వర్ణాశ్రమ ధర్మ రక్షణపరుడైన భీష్ముని ప్రవృత్తి వస్తుధ్వని. ప్రసాదగుణమిశ్రితమైన ఓజస్సును ఉదాత్తవస్తువర్ణనంతో నిబంధించటం నన్నయరచనలో తరచుగా కనపడే శైలీశిల్పం. (సంపా.)

వ. ఇట్లు బ్రహ్మోత్తరంబుగాఁ బ్రజాభివృద్ధియు సస్యసమృద్ధియు నగుచుండ, నాంబికేయు ధృతరాష్ట్రు రాజ్యాభిషిక్తుం జేసి, భీష్ముండు దనకు విల్లును విదురుబుద్ధియును సహాయంబులుగా రాజ్యంబు రక్షించుచున్నంత. 5

ప్రతిపదార్థం: ఇట్లు; బ్రహ్మ+ఉత్తరంబు, కాన్= బ్రాహ్మణులు అధికులు కాగా; ప్రజా, వృద్ధియు= ప్రజలయొక్క అభివృద్ధి; సస్య, సమృద్ధియున్= పంటలు దండిగా పండటం; అగుచుండన్; భీష్ముండు; ఆంబికేయు= అంబికకొడుకు అయినవాడిని; ధృతరాష్ట్రున్; రాజ్య+అభిషిక్తున్= రాజ్యానికి అభిషేకింపబడినవాడిని - అంటే రాజును; చేసి; తనకున్; విల్లును; విదురు, బుద్ధియును; సహాయంబులుగాన్= తోడు కలవిగా; రాజ్యంబున్; రక్షించుచున్+ఉన్నంత= కాపాడుతూ ఉన్నప్పుడు.

తాత్పర్యం: ఈ విధంగా బ్రాహ్మణులు అధికులు అవుతుండగా, ప్రజలు అభివృద్ధి చెందుతుండగా, పంటలు సమృద్ధిగా పండుతుండగా భీష్ముడు అంబికకొడుకు అయిన ధృతరాష్ట్రుడిని పట్టాభిషిక్తుడిని చేసి, తనకు ధనుస్సు, విదురుడిబుద్ధిబలం సహాయకాలుగా కౌరవరాజ్యాన్ని రక్షిస్తూ ఉండగా.

విశేషం: ధృతరాష్ట్రుని పట్టాభిషిక్తత వివాదగ్రస్తం. ఔత్తరాహభారతప్రతులలో అంధత్వంచేత ధృతరాష్ట్రుడు, పారసవత్వంచేత అనగా (పరుని కులము), పరస్త్రీయందు పుట్టినవాడు అగుటచేత విదురుడు రాజ్యాన్ని పొందలేక పోయినట్లూ, పాండురాజు రాజు అయినట్లూ చెప్పబడింది.

ధృతరాష్ట్ర స్త్వచక్షుష్ట్వా ద్రాజ్యం న ప్రత్యపద్యత

పారసవత్వా ద్విదురో రాజా పాండు ర్బభూవహ. (సం.భా.అధ్యా.109 శ్లో.25)

దాక్షిణాత్యప్రతిలోమాత్రం ధృతరాష్ట్రుడు పట్టాభిషిక్తు డైనట్లు ఉన్నది.

భీష్మేణ రాజా కౌరవ్యో ధృతరాష్ట్రోఽభిషేచితః (సం.భా. దాక్షిణాత్యప్రతి. అధ్యా 18. శ్లో.21)

కాని అదే ప్రతిలో అదే అధ్యాయంలో ధృతరాష్ట్రుడు అంధుడు అవటంచేత రాజ్యాన్ని పొందలేకపోయినట్లు, పారసవత్వం చేత విదురుడు రాజు కానట్లు, పాండురాజే రా జైనట్లు చెప్పబడి ఉండటం గమనించతగింది.

ధృతరాష్ట్ర స్త్వచక్షుష్ట్వా ద్రాజ్యం న ప్రత్యపద్యత

పారసవత్వా ద్విదురో రాజా పాండు ర్బభూవ హ. (సం.భా. దక్షిణాత్యప్రతి అధ్యా.18 శ్లో.30)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తెలుగుభారతంలో కూడా అనేక సందర్భాలలో ధృతరాష్ట్రుడి పట్టాభిషిక్తతకు ప్రతిబంధకా లైన వాక్యా లున్నాయి. (ఆది. షష్ఠా.ప.123 వ.124; ప 128, వ, 129, ప. 143)

ధృతరాష్ట్రుని పట్టాభిషిక్తత విషయంలో నన్నయ దాక్షిణాత్యప్రతిని అనుసరించినట్లు ఉన్నది.

మ. ఆయము గర్వమున్ విడిచి యన్యపతుల్ పనిసేయ నిట్లు గాం
గేయభుజాబలంబున నికృత్తవిరోధిసమాజుఁ డై కుమా
రాయితశక్తిశాలి ధృతరాష్ట్రుఁడు రాజ్యము సేయుచుండె న
త్యాయతకీర్తితోఁ దనకు హస్తిపురం బది రాజధానిగన్. 6

ప్రతిపదార్థం: ఆయము= ఆదాయం; గర్వమున్ విడిచి; అన్య, పతులు= తక్కిన రాజులు; పనిచేయన్= సేవ చేయగా; ఇట్లు= ఈ విధంగా; గాంగేయ; భుజా, బలంబునన్= భీష్మునిభుజబలంచేత; నికృత్త, విరోధి, సమాజుఁడు+ఐ= నరకబడిన శత్రువులసమూహం కలవాడై; కుమార+ఆయిత, శక్తిశాలి= కుమారస్వామి అంతటి పరాక్రమం కలవాడైన; ధృతరాష్ట్రుఁడు; అతి+ఆయత; కీర్తితోన్= మిక్కిలి పొడవైన కీర్తితో - అనగా అత్యధికమైన కీర్తితో; తనకున్; హస్తిపురంబు; అది; రాజధానిగన్= రాజు నివసించు ప్రధాన నగరముగా అనగా పరిపాలనకేంద్రముగా; రాజ్యమున్ = రాజ్యమును; చేయుచున్+ఉండెన్= పాలిస్తూ ఉండినాడు.

తాత్పర్యం: ఇతరదేశాలరాజులు తమ ఆదాయాన్ని, గర్వాన్ని విడిచి తనను కొలుస్తూ ఉండగా, భీష్ముని భుజబలంచేత శత్రురాజులను సంహరించి, కుమారస్వామి అంతటి శక్తిశాలి అయిన ధృతరాష్ట్రుడు హస్తినాపురాన్ని తనకు రాజధానిగా చేసికొని, అత్యధికకీర్తితో రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉన్నాడు.

విశేషం: 'ఆయము గర్వమున్' అనేదానికి 'ఆయుతగర్వమున్' అనే పాఠాంతరం ఉన్నది. అప్పుడు అధికమయిన గర్వమును విడిచి ఇతరరాజులు అందరూ ధృతరాష్ట్రుడిని కొలిచారు అని అనవలసివస్తుంది. పద్యంలోని ప్రసాదగుణం పరిపాలనలోని ప్రశాంతతను ధ్వనింపచేస్తున్నది.

వ. ఇట్లు రాజ్యంబు సేయుచు నారూఢ యౌవనుం డైన యా ధృతరాష్ట్రునకు వివాహంబు సేయ సమకట్టి, భీష్ముండు గాంధారపతి యయిన సుబులుకూఁతు గాంధారి యనుదాని, నతిశయ రూపలావణ్య శీలాభిజాత్య సమన్వితఁ గా బ్రాహ్మణులవలన విని విదురున కి ట్లనియె. 7

ప్రతిపదార్థం: ఇట్లు; రాజ్యంబు; చేయుచు; ఆరూఢ, యౌవనుండు+ఐన= యౌవనవంతుడు కాగా; ఆ, ధృతరాష్ట్రునకున్= ఆ ధృతరాష్ట్ర మహారాజునకు; వివాహంబు; చేయన్ సమకట్టి= పూనుకొని; భీష్ముండు= భీష్ముడు; గాంధారపతి, అయిన= గాంధారదేశానికి రాజైన; సుబలు, కూఁతున్= సుబలుని పుత్రికను; గాంధారి, అను, దానిన్= గాంధారి అను పేరుగల కన్యను; అతిశయ, రూప, లావణ్య, శీల+ఆభిజాత్య; సమన్వితగా= మిక్కిలి, అందమైన రూపంతో; కాంతితో, మంచినడవడితో, ఉన్నతమైన వంశంతో కూడిన దానినిగా; బ్రాహ్మణులవలనన్= విప్రుల మూలమున; విని= విని; విదురనకున్= విదురునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా రాజ్యం చేస్తూ యౌవనవంతు డైన ఆ ధృతరాష్ట్రునికి వివాహం చేయటానికి పూనుకొని భీష్ముడు, గాంధారరాజైన సుబలునికూతురు గాంధారి - అందమైన రూపం కల దని, కాంతి కల దని, మంచి నడవడితో, ఉన్నత మైన వంశంతో కూడుకొన్న దని, బ్రాహ్మణులవలన విని విదురునితో ఇట్లా అన్నాడు.

క. ఈ వంశము విచ్ఛేదము । గావచ్చినఁ గులము నిలుపఁగా సత్యవతీ
దేవి వచనమున సంతతి । గావించెను వ్యాసుఁ డను జగత్కర్త దయన్. 8

ప్రతిపదార్థం: ఈ వంశము; విచ్ఛేదము= నాశం; కావచ్చినన్= కానుండగా; కులము నిలుపఁగాన్= కురువంశమును నిలుపుటకై; సత్యవతీదేవి, వచనమునన్= సత్యవతీదేవి యొక్క మాటవలన; వ్యాసుఁడు; అను; జగత్+కర్త= వ్యాసుడు అను పేరుగల బ్రహ్మ; దయన్= కృపతో; సంతతిన్ కావించెను= సంతానము కలిగించాడు.

తాత్పర్యం: ఈ కురువంశం నశిస్తూ ఉండగా, సత్యవతీదేవిమాటప్రకారం వ్యాసుడు అనే బ్రహ్మ, కులాన్ని నిలపటానికి దయతో సంతానాన్ని కలిగించాడు.

విశేషం: అలం: రూపకం.

క. ఈ కులము వివర్ధింపఁగ । నా కభిమత; మేను వింటి నలినేక్షణ దా
నేకశత సుతులఁ బడయఁగ । నా కన్యక వరము వడసె నటె హరుచేతన్. 9

ప్రతిపదార్థం: ఈ, కులము= ఈ వంశాన్ని; వివర్ధింపఁగన్= వృద్ధిపొందించటానికి; నాకున్; అభిమతము= ఇష్టం; ఏను=నేను; వింటిన్= విన్నాను; నలిన+ఈక్షణ= తామరలవంటి కళ్ళు కలది; తాన్=తాను; ఆ, కన్యక= ఆ గాంధారి; ఏక, శత, సుతులన్= ఒక కూతురును ఎక్కువగాగల వందమందికొడుకులను; పడయఁగన్= పొందటానికి; హరుచేతన్= శివునివలన; వరము; పడసెన్, అటె= పొందెనట కదా.

తాత్పర్యం: ఈ వంశాన్ని వృద్ధిపొందింప చేయడం నాకు ఇష్టం. తామరలవంటి అందమైన కళ్ళు కల ఆ గాంధారి వందమంది కొడుకులు, ఒక కూతురు- మొత్తం నూటొక్కరు తనకు కలిగేటట్లు శివుడివలన వరం పొందిందట కదా.

విశేషం: తనతరంలోనే సంతతిలేని కారణంగా రాజవంశంలో వారసుడులేని దీనస్థితి ఏర్పడటం భీష్ముడు గ్రహించాడు. దేవర న్యాయంతో ధృతరాష్ట్రపాండురాజులు పుట్టారు. వారితరంలో మళ్ళీ వారసులు లేనిదుస్థితి రాకూడ దని భావించాడు. నూరుగురు కొడుకులను, ఒక కూతురుని కనగలిగిన వధువును అన్వేషించాడు. పైకి చూస్తే అది ఒక అత్యాశగా ఉండవచ్చు. కాని, కులవిస్తారం కావా లంటే విస్తృతసంతానం గల కులసతి కావాలి. వంశాభివృద్ధినిగూర్చిన భీష్ముని ఆసక్తి ఈ మాటలలో ధ్వనిస్తూ ఉన్నది. ఏకశతసుతులన్ - ఇందులో సుతశబ్దం ఏకశేషసమాసంలో ఉన్నది కాబట్టి కొడుకు లనీ, కూతు రనీ అర్థం ఇస్తుంది. సుతులును=సుతయు, సుతుడును; ఏకశేషసమాసంలో పుంలింగమే శేషిస్తుంది. ఏకశతమంటే నూటొక్కరని అర్థం. గాంధారి నూర్గురుకొడుకులను, ఒక కూతురిని కంటుం దని శివునివరం.

వ. 'కావున ధృతరాష్ట్రునకు గాంధారిని వివాహంబు సేయుదము; గాంధారపతి మనతోడి సంబంధమునకుం దగు' నని నిశ్చయించి సుబలు పాలికిఁ దగుముదుసళ్ళం బంచిన, సుబలుండును సుముఖుం డై

'కురుకులవిస్తారకుం డయిన ధృతరాష్ట్రుండ యిక్కన్యకకు నర్హుండు గావున నా రాజునకు గాంధారి నిచ్చితి' ననిన, వాని బంధుజనంబు లెల్లఁ దమలో ని ట్లనిరి. 10

ప్రతిపదార్థం: కావునన్; ధృతరాష్ట్రునకున్; గాంధారిని; వివాహంబున్, చేయుదము= పెండ్లిగావింతము; గాంధారపతి= గాంధారరాజు సుబలుడు; మనతోడి= మనతో; సంబంధమునకున్= వియ్యమునకు, తగున్; అని= ఆ విధముగా; నిశ్చయించి= నిర్ణయించుకొని; సుబలు, పాలికి= సుబలునిదగ్గరకు; తగు, ముదుసళ్ళన్= తగినపెద్దలను; పంచినన్= పంపగా; సుబలుండును; సుముఖుండు+ఐ= అనుకూలు డై; కురు, కుల విస్తారకుండు+అయిన= కురువంశాన్ని పెంచేవాడైన; ధృతరాష్ట్రుండు+అ= ధృతరాష్ట్రుడే; ఈ+కన్యకకున్; అర్హుండు= తగినవాడు; కావునన్; ఆ రాజునకున్= ధృతరాష్ట్రునకు; గాంధారిన్; ఇచ్చితిన్; అనిన; వాని= ఆ సుబలునియొక్క; బంధు, జనంబులు+ఎల్లన్= బంధుగణమంతా; తమలోన్; ఇట్లు+అనిరి= ఈ విధంగా అనుకొన్నారు.

తాత్పర్యం: 'కాబట్టి ధృతరాష్ట్రునితో గాంధారిని వివాహం చేద్దాము. గాంధారదేశప్రభువు సంబంధం యోగ్యమైనది' అని తీర్మానించి; సుబలునిదగ్గరికి యోగ్యులైన పెద్దలను పంపగా, సుబలుడుకూడా అనుకూలుడై 'వంశాన్ని విస్తరించేవా డైన ధృతరాష్ట్రుడే ఆ కన్యకు తగినవాడు. కాబట్టి, ధృతరాష్ట్రునికి గాంధారి నిస్తా'నని వాగ్దానంచేయగా గాంధారరాజబంధువు లందరూ తమలో తాము ఇట్లా అనుకొన్నారు.

విశేషం: తమతో సంబంధానికి తగినవాడు గాంధారరాజు అని భావించాడు- భీష్ముడు. దానికి కారణ మేమిటో చెప్పడు నన్నయ. సారమతులు లోనారసి తెలిసికొనదగిన అంశ మని వ్యంగ్యంచేశాడు. వంశవిస్తారాన్ని కోరేవారే గాంధారిని వివాహమాడటం సహజం. నూటఒక్క బిడ్డల తల్లి కాగల వరం పొందిన గాంధారికి వంశ విస్తృతికొరకు వివాహం చేసికొనే ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడైనా అనువైన, యోగ్యుడైన వరుడు అని వ్యంగ్యార్థం. గాంధారరాజు తన కూతురికి తగిన భర్త లభించా డని భావించాడు. తనభారం తీరిం దని తలంచాడు. ఎవ్వరికీ చెప్పకుండానే అంగీకరించాడు. ఇదంతా ఊహిస్తే కథ ప్రసన్నమౌతుంది. ఇది నన్నయ కథాకథనశిల్పం. (సంపా.)

తే. అంగములలోన మే లుత్తమాంగ, మందు । నుత్తమంబులు గన్నుల యుర్విజనుల,
కట్టి కన్నులు లే వను నదియకాక । యుత్తముఁడు గాఁడె సద్గుణయుక్తి నతఁడు. 11

ప్రతిపదార్థం: ఉర్వి, జనులకు= భూమిమీదప్రజలకు; అంగములలోన్= అవయవాలలో; ఉత్తమ+అంగము= తల; మేలు= శ్రేష్ఠము; అందున్= ఆ తలలో; కన్నులు+అ= కన్నులే; ఉత్తమంబులు= శ్రేష్ఠాలు; అట్టి, కన్నులు= అటువంటి కన్నులే అతనికి లేవు; అనున్= అని లోకము అనును; అదియు+అ, కాక= అంతమాత్రమేకాని; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; సత్+గుణ, యుక్తిన్=మంచిగుణాల కూడికతో; ఉత్తముఁడు; కాఁడే= అగునుకదా.

తాత్పర్యం: లోకంలో మానవులకు అవయవా లన్నింటిలో శిరస్సు ప్రధానం. ఆ శిరస్సులో కన్నులే ప్రధాన మైనవి. అటువంటి కన్నులే ధృతరాష్ట్రునికి లేవు. కాని అతడు మంచిగుణాలచేత ఉత్తముడే కదా!

విశేషం: 'కన్యా వరయతే రూపమ్' అనీ 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్' అనీ అభియుక్తోక్తి. గాంధారి పద్మాలవంటి అందమైన కళ్ళుకలది. ఆమెకు పుట్టుగ్రుడ్డితో పెండ్లి. ఆమెకు తగినవాడు ధృతరాష్ట్రుడే అని గాంధారపతి నిర్ణయించి, వివాహం నిశ్చయించాడు. అతడు చండశాసనుడు. అతని మాటను ఎవరూ కా దనలేరు. చివరకు గాంధారికూడా! ఆమెకు కూడ వివాహం కావా లంటే ధృతరాష్ట్రునివంటి వంశవిస్తారకుడే ముందుకు రావా లని తెలుసు. బంధువులుమాత్రం చూచి గ్రుడ్డివానికి పిల్ల నివ్వటం ఇష్టంలేక అధిక్షేపాత్మకంగా, వ్యంగ్యంగా గుసగుసలాడుకొన్నారు.

ధృతరాష్ట్రుడు గాంధారిని వివాహంబు సేసికొనుట (సం.1-103-10)

వ. అనిన వారిపలుకులు విని గాంధారి ధృతరాష్ట్రునకుఁ బితృవచనదత్తగాఁ దన్ను నిశ్చయించి, 'నాకుఁ బతి యిమ్మహీపతియ కాని యొరుల నొల్ల' నని యప్పరమపతివ్రత పరపురుషదర్శనంబు పరిహరించి, పతి కను గుణంబుగా నేత్రపట్టంబునఁ దన నేత్రంబులు గట్టికొని యుండె; నంత నక్కన్యం దోడ్కొని దాని సహోదరుం డయిన శకుని మహావిభూతితో హస్తిపురంబునకు వచ్చిన' ధృతరాష్ట్రుండును బరమోత్సవంబున గాంధారిని వివాహంబై దానితోఁ బుట్టిన కన్యకల సత్యవ్రతయు సత్యసేనయు సుదేష్ణయు సంహితయుఁ దేజశ్శ్రవయు సుశ్రవయు నికృతియు శుభయు శంభువయు దశార్ణయు నను పందుండ్ర నొక్కలగ్నంబున వివాహం బయి మఱియును. 12

ప్రతిపదార్థం: అనినన్+ అని అనగా; వారిపలుకులు విని; గాంధారి; ధృతరాష్ట్రునకున్= యువరాజైన ధృతరాష్ట్రునకు; తన్నున్= తనను; పితృ వచన, దత్తన్; కాన్= తండ్రిమాటతో ఇవ్వబడిన దానినిగా; నిశ్చయించి= నిర్ణయించి; నాకున్; పతి=భర్త; ఈ+మహీపతియు+అ, కాని= ఈ ధృతరాష్ట్రమహారాజేకాని; ఒరులన్= ఇతరులను; ఒల్లను= ఇష్టపడను; అని= ఆ ప్రకారంగా తెలిసి; ఆ+పరమ, పతివ్రత; పర, పురుష, దర్శనంబు= ఇతరపురుషులను చూడటం; పరిహరించి= వదలి; పతికిన్= భర్తకు; అనుగుణంబుగా= తగినట్లు; నేత్ర, పట్టంబునన్= కంటివస్త్రంతో; తన, నేత్రంబులు= తనకళ్ళు; కట్టికొనిఉండెన్= కనబడకుండా కట్టుకొని ఉండినది; అంతన్= తరువాత; ఆ+కన్యన్= ఆ గాంధారిని; తోడ్కొని= వెంటపెట్టుకొని; దాని= ఆ గాంధారియొక్క; సహోదరుఁడు+అయిన= తోడబుట్టినవాడైన; శకుని; మహా, విభూతితో= గొప్పసంపదతో; హస్తి, పురంబునకున్= హస్తినా పురమునకు; వచ్చినన్= రాగా; ధృతరాష్ట్రుండును; పరమ+ఉత్సవంబునన్= మహావైభవంగా; గాంధారిని; వివాహంబు+ఐ= పెళ్ళి చేసికొని; దానితోన్= ఆమెతో కూడ; పుట్టిన= జన్మించిన అనగా గాంధారీదేవి తోబుట్టువు లైన; కన్యకలన్, సత్యవ్రతయు; సత్యసేనయు; సుదేష్ణయు, సంహితయు, తేజశ్శ్రవయు; సుశ్రవయు; నికృతియు, శుభయు, శంభువయు, దశార్ణయున్, అను; పదుండ్రను= పదిమందిని; ఒక్క; లగ్నంబునన్= ఒకే ముహూర్తమునందు; వివాహంబు+అయి= పెండ్లాడి; మఱియును= ఇంకను.

తాత్పర్యం: సుబలుని బంధువులమాటలు విన్న గాంధారి, తండ్రి తనను ధృతరాష్ట్రుని కిచ్చినట్లు నిశ్చయించుకొన్నది. 'నాకు భర్త ధృతరాష్ట్రమహారాజే, అన్యులను వివాహమాడ అంగీకరించ' నని ఆ మహాపతివ్రత పరపురుషులను తాను చూడటానికి ఇష్టపడక, భర్తకు కళ్ళు లేవు కనుక తానుకూడా కళ్ళకు అడ్డంగా గుడ్డ కట్టుకొన్నది. తరువాత ఆమె సోదరుడు శకుని అధికసంపదతో ఆమెను వెంటబెట్టుకొని హస్తినాపురానికి వచ్చాడు. ధృతరాష్ట్రుడు మహావైభవంగా గాంధారినే కాక ఆమె చెల్లెళ్ళు పదిమందినికూడా ఒకే ముహూర్తంలో వివాహమాడాడు.

విశేషం: తండ్రి తీసికొనిన నిర్ణయాన్ని గురించి బంధువులు మాట్లాడుకొనే మాటలు గాంధారి విన్నది. తండ్రిమాటను గౌరవించి తాను ధృతరాష్ట్రుడిని పత్నిగా భావించుకొని, అతనికి అనురూపంగా కళ్ళకు గంతలు కట్టుకొన్నది. ఆమెచర్యవలన అటు పితృభక్తి, ఇటు పతిభక్తి వ్యక్తమయ్యాయి. బంధువులనోళ్ళు మూతపడ్డాయి. గాంధారి తనతో పాటు పదిమంది తోబుట్టువులతో సహా ధృతరాష్ట్రుని అంతఃపురంలో ప్రవేశించింది. వారినికూడా ధృతరాష్ట్రుడు వివాహమాడాడు.

క. కులమును రూపము శీలముఁ। గల కన్యలఁ దెచ్చి తెచ్చి గాంగేయుం డీ
నలఘుఁడు ధృతరాష్ట్రుఁడు కుల। తిలకుండు పరిగ్రహించె దేవీశతమున్. 13

ప్రతిపదార్థం: కులమును= వంశమును; రూపము= ఆకారము; శీలమున్= మంచి నడతయును; కల= ఉన్న; కన్యలన్; తెచ్చితెచ్చి= ఎక్కువగా తీసికొనివచ్చి; గాంగేయుండు= భీష్ముడు; ఈన్= ఇవ్వగా; అలఘుఁడు= గొప్పవాడు; కుల, తిలకుండు= వంశానికి అలంకారమైనవాడు; ధృతరాష్ట్రుఁడు; దేవీ, శతమున్= భార్యలు వందమందిని; పరిగ్రహించెన్= పెళ్ళిచేసికొన్నాడు.

తాత్పర్యం: కులం, రూపం, శీలం ఉన్న కన్యలను భీష్ముడు పలువురిని తెచ్చి ఇవ్వగా ధృతరాష్ట్రుడు వందమందిని పెళ్ళిచేసికొన్నాడు.

విశేషం: కన్యలను తెచ్చి తెచ్చి అని రెండుమార్లు చెప్పటంలో భీష్ముడు వంశవిస్తృతిమీద ఎంత అధికమైన ఆసక్తిని ప్రదర్శించాడో స్పష్టమౌతుంది. వందమంది కొడుకులను కనే గాంధారితో పాటు నూటపదిమంది రాణులను ధృతరాష్ట్రుని కిచ్చి పెళ్ళి చేయించాడు భీష్ముడు. వారందరివలన కలిగే సంతానంతో మరెప్పటికీ కురువంశంలో వారసులు లేరనే ప్రశ్న పుట్టదని అనుకొన్నాడు ఆ కురుపితామహుడు. అనావృష్టిని చూచిన గంగాసుతుడు అతివృష్టిని అభిలషించాడు. చివరకు ధృతరాష్ట్రసంతతి అంతా గంగపాలు కావటం విధివిలాసం.

వ. అంత.

తాత్పర్యం: ఆ తరువాత.

సీ. వేదంబులందుఁ బ్రవీణుఁడై మఱి సర్వ। శాస్త్రంబులందుఁ గౌశలము మెఱసి
యసికుంత కార్ముకాద్యాయుధ విద్యల। యందు జితశ్రముఁ డై తురంగ
సింధురారోహణశిక్షల దక్షుఁడై। నీతిప్రయోగముల్ నెఱయ నేర్చి
యతిమనోహర నవయౌవనారూఢుఁడై। కఱలేని హిమరశ్మికాంతి దాల్చి

ఆ. పెరుఁగుచున్న కొడుకుఁ బృథువక్షు నాయత। బాహు దీర్ఘదేహుఁ బాండుఁ జూచి
వీనివలనఁ గులము వెలుఁగు నంచును నెడ। జాహ్నవీసుతుండు సంతసిల్లి. 15

ప్రతిపదార్థం: వేదములందున్= నాలుగు వేదాలలో; ప్రవీణుఁడు+ఐ= నేర్పరి అయి; మరి+ అంతేకాక; సర్వశాస్త్రంబులందున్= అన్ని శాస్త్రములలోకూడా; కౌశలము= సామర్థ్యం; మెఱసి= ప్రకాశింపచేసి; అసి, కుంత, కార్ముక+ఆది+ఆయుధ, విద్యల, అందున్= కత్తి, ఈటె, విల్లు మొదలైన ఆయుధాలకు సంబంధించిన విద్యలందు; జితశ్రముఁడు+ఐ= జయింపబడిన శ్రమకలవాడై-అనగా సమర్థుడై; తురంగ, సింధుర+ఆరోహణ; శిక్షలన్= గుఱ్ఱాలను, ఏనుగులను ఎక్కి స్వారిచేసేటటువంటి అభ్యాసాలలో; దక్షుఁడు+ఐ= నేర్పరి అయి; నీతి, ప్రయోగముల్= అనేకనీతులను ప్రయోగించేమాటలు; నెఱయన్= బాగా; నేర్చి; అతి, మనోహర, నవ, యౌవన+ఆరూఢుఁడు+ఐ= మిక్కిలి మనోహరం అయిన క్రొత్తయౌవనం పొందినవాడై; కఱలేని= మచ్చ లేని; హిమరశ్మి, కాంతిన్= చల్లనికిరణాలు కల చంద్రునికాంతిని; తాల్చి= ధరించి; పెరుఁగుచు+ఉన్న, కొడుకున్= వృద్ధి చెందుచున్న కుమారుని; పృథు, వక్షున్= విశాలమైన వక్షఃస్థలం కలవాడిని; ఆయత, బాహున్= పొడవైన చేతులు కలవాడిని; దీర్ఘ, దేహున్= పొడవైన శరీరం కలవాడిని; పాండున్= పాండురాజును; చూచి; వీనివలనన్; కులము= వంశం; వెలుఁగున్; అంచును= అనుచు (అంటూ); ఎడన్= హృదయంలో, జాహ్నవీ, సుతుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; సంతసిల్లి= సంతోషించి.

తాత్పర్యం: వేదాలను, సర్వశాస్త్రాలను బాగా నేర్చి, కత్తి, ఈటె, ధనుస్సు మొదలైన ఆయుధవిద్యలలో ఆరితేరి, గుఱ్ఱాలను, ఏనుగులను ఎక్కి స్వారి చేయటంలో బాగా నేర్పరి అయి, మనోహరమైన నవయౌవనం కలవాడై,

మచ్చలేని చంద్రుడివలె ప్రకాశిస్తూ, విశాలమైన వక్షం, పొడవైన చేతులు, నిడుపైన శరీరం కల పాండురాజును చూచి ఇతనివలన వంశం వన్నెకు ఎక్కుతుం దని భీష్ముడు సంతోషించి.

విశేషం: వేదాలు నాలుగు - ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. శాస్త్రాలు ఆరు - తర్కం, వ్యాకరణం, ధర్మం, మీమాంస, వైద్యం, జ్యోతిషం. యౌవనారూఢులైన ధృతరాష్ట్రుడిని, పాండురాజును వర్ణించే తీరులో నన్నయ ఒక భేదాన్ని పాటించి కథాకథనశిల్పాన్ని ప్రదర్శించాడు. పాండురాజుకు గల వేదశాస్త్రపాండిత్యంగాని, యుద్ధోచిత పరిశ్రమగాని ధృతరాష్ట్రునికి లేవు. పాండురాజుయొక్క యౌవనం అతిమనోహరంగా ఉన్నదట. ధృతరాష్ట్రునివలన కులం విస్తరిల్లుతుం దనీ, పాండురాజువలన కులగౌరవం పెరుగుతుం దనీ భీష్ముని ఆశయం. ధార్తరాష్ట్రులు సంఖ్యలో అధికమైనా, పాండవులు యశస్సులో అధికు లౌతా రనీ పాండురాజువల్లనే కులం కీర్తి కెక్కుతుం దనీ వస్తుధ్వని.

వ. ఇ క్కుమారున కెందు వివాహంబు సేయుద మని విదురుతో విచారించుచుండె; నంతఁ దొల్లి. 16

ప్రతిపదార్థం: ఈ+కుమారునకున్= యువకుడైన ఈ పాండురాజుకు; ఎందున్=ఎక్కడ; వివాహంబు, చేయుదము= పెండ్లిచేద్దాము; అని; విదురుతోన్; విచారించుచున్, ఉండెన్= ఆలోచిస్తూ ఉన్నాడు; అంతన్= తరువాత; తొల్లి= పూర్వం.

తాత్పర్యం: ఈ యువకుడైన పాండురాజుకు వివాహం చేయా లని విదురునితో కలిసి ఆలోచిస్తూ ఉన్నాడు. తరువాత - పూర్వం.

కుంతిచరిత్రము (సం.1-104-1)

సీ. యాదవకులవిభుఁ డగు శూరుఁ డను నాతఁ। డాత్మతనూజలయందుఁ బెద్ద
దాని నంబుజముఖి ధవళాక్షి వసుదేవు। చెలియలిఁ బృథ యను చెలువఁ బ్రీతిఁ
దనమేనయత్తనందనుఁ డపుత్త్రకుఁ డైన। యా కుంతిభోజున కర్థితోడఁ
గూఁతుఁగా నిచ్చినఁ గోమలి యాతని। యింటఁ దా నుండి యనేక విప్ర

తే. వరుల కతిథిజనులకు నవారితముగఁ। దండ్రి పనుపున నిష్టాన్నదాన మొనరఁ
జేయుచున్న దుర్వాసుఁ డన్ సిద్ధమౌని। వచ్చె నతిథి యై భోజనవాంఛఁ జేసి. 17

ప్రతిపదార్థం: యాదవ, కుల, విభుఁడు+అగు= యాదవవంశరాజు అయిన; శూరుఁడు, అనునాతఁడు= శూరుడు అను పేరుగలవాడు; ఆత్మ, తనూజల, అందున్= తనకూతుళ్ళలో; పెద్దదానిన్= పెద్దకుమార్తెను; అంబుజముఖిన్= పద్మంవంటి ముఖం కలదానిని; ధవళ+అక్షిన్= తెల్లనికళ్ళు కలదానిని; వసుదేవు, చెలియలిన్= వసుదేవుని చెల్లెలిని; పృథ, అను= పృథ అను పేరుగల; చెలువన్= అందమైన పిల్లను; ప్రీతిన్= ప్రియమార; తన, మేనయత్త, నందనుఁడు= తన మేనత్తకుమారుడు; అపుత్త్రకుఁడు+ఐన= సంతానం లేనివాడైన; ఆ, కుంతిభోజునకున్= ప్రసిద్ధుడైన కుంతిభోజునికి; అర్థితోడన్= ప్రీతితో; కూతున్, కాన్ ఇచ్చినన్= కూతు రగునట్లుగా ఈయగా; కోమలి= ఆ సుకుమారి - పృథ; ఆతని, ఇంటన్= కుంతిభోజుని ఇంటిలో; తాన్= తాను; ఉండి= వసించి; అనేక, విప్ర, వరులకున్= పెక్కుమంది బ్రాహ్మణశ్రేష్ఠులకు; అతిథి, జనులకున్= ఆగంతకులైన ప్రజలకు; అవారితముగన్= అడ్డులేకుండా; తండ్రి, పనుపునన్= తండ్రిఆజ్ఞతో; ఇష్ట+అన్న, దానమున్= ఇష్టమైన భోజనం పెట్టటాన్ని; ఒనరన్= తగువిధంగా; చేయుచు+ఉన్నన్= చేస్తూఉండగా; దుర్వాసుఁడు+అన్; సిద్ధ, మౌని= సిద్ధికలముని; భోజన, వాంఛన్, చేసి= భోజనంమీద కోరికతో; అతిథి+ఐ వచ్చెన్= అతిథిగా విచ్చేసినాడు.

తాత్పర్యం: యాదవవంశరాజు అయిన శూరుడు తన పెద్దకుమార్తె పృథను, పిల్లలు లేని తనమేనత్తకొడు కైన కుంతిభోజుడికి ఎంతో ప్రీతితో పుత్రికగా ఇచ్చాడు. ఆ సుకుమారి కుంతిభోజుడిఇంట్లో తా నుండి, తండ్రి ఆజ్ఞతో పెక్కుమంది బ్రాహ్మణశ్రేష్ఠులకు, అతిథిజనులకు యథేచ్ఛగా అన్నదానం చేస్తూ ఉండగా దుర్వాసు డనే సిద్ధమౌని 'భోజనం పెట్టు' మని అతిథిగా వచ్చాడు.

విశేషం: అతిథి - తిథీ,వారం మున్నగు కాలనియమాలు లేకుండా, ఇంటికి భోజనానికి వచ్చినవాడు.

వ. కుంతియు న మ్మునివరు కోరిన యాహారంబు వెట్టిన సంతుష్టుం డై యమ్మునివరుం డి ట్లనియె: 'నీమంత్రంబున నీ వే వేల్పుల నారాధించి తవ్వేల్పులు నీకోరినయట్టి పుత్త్రకుల నిత్తు' రని యాపద్ధర్మంబుగా నొక్కదివ్యమంత్రంబుఁ బ్రసాదించి చనిన, నమ్మంత్రశక్తి యెఱుంగ వేఁడి కుంతి యొక్కనాఁ డేకాంతంబ గంగకుం జని యవగాహనంబు సేసి. 18

ప్రతిపదార్థం: కుంతియున్= కుంతీదేవియు; ఆ+ముని, వరు, కోరిన= ఆ మునిశ్రేష్ఠుడు కోరిన; ఆహారంబు, పెట్టినన్= విందుభోజనము పెట్టగా; సంతుష్టుండు+ఐ= పూర్తిగా తృప్తిచెందినవాడై; ఆ+ముని, వరుండు= ఆ మునిశ్రేష్ఠుడు - దుర్వాసుడు; ఇట్లు+అనియెన్; ఈ మంత్రంబునన్= ఈ మంత్రముచేత; నీవు; ఏ వేల్పులన్= ఏ దేవతలను; ఆరాధించితివి= పూజించావో; ఆ+వేల్పులు= ఆ దేవతలు; నీ, కోరిన, అట్టి= నీవు కోరినటువంటి; పుత్త్రకులన్= కుమారులను; ఇత్తురు+అని= ప్రసాదింతురు అని తెలిపి; ఆపద్+ధర్మంబుగాన్= ఆపత్కాలంలోని ధర్మంగా; ఒక్క; దివ్య, మంత్రంబున్; ప్రసాదించి= ఇచ్చి; చనినన్= వెళ్ళగా; ఆ+మంత్ర, శక్తిన్= ఆ మంత్రము యొక్క ప్రభావాన్ని; ఎఱుంగన్ వేఁడి= తెలియకోరి; కుంతి= కుంతీదేవి; ఒక్కనాఁడు= ఒక్కదినం; ఏకాంతంబు+అ= ఒంటరిగా; గంగకున్+చని= గంగకు వెళ్ళి; అవగాహనంబు చేసి= స్నానం చేసి.

తాత్పర్యం: కుంతి ఆ మునిశ్రేష్ఠుడు కోరిన ఆహారం పెట్టగా దుర్వాసుడు చాలా తృప్తి పొంది 'ఈ మంత్రం చేత నీవు ఏ దేవతలను ఆరాధిస్తావో ఆ దేవతలు నీవు కోరిన కొడుకులను ఇస్తారు' అని ఆపద్ధర్మంగా ఒక దివ్యమంత్రాన్ని ఉపదేశించి వెళ్ళాడు. తరువాత ఆమె ఆ మంత్రశక్తిని తెలిసికొనాలని ఒకరోజు ఒంటరిగా గంగకు వెళ్ళి స్నానం చేసి.

విశేషం: ఆపద్ధర్మం అంటే గత్యంతరం లేకపోయినప్పుడు పాటించదగిన న్యాయం అని భావం. త్రికాలజ్ఞుడైన దుర్వాసుడు పాండవోత్పత్తికి ఆ మంత్రం ఆపద్ధర్మంగా వినియోగింపబడా లని భవిష్యద్దర్శనంతో వరంగా ప్రసాదించాడు. అట్లా పుట్టినవాళ్ళే కౌంతేయు లయ్యారు (ధర్మరాజాదులు). ఆపద్ధర్మంగా కాక మంత్రశక్తి పరీక్షార్థం వినియోగించినప్పుడు పుట్టిన కర్ణుడు కౌంతేయుడుగా కాక రాధేయుడుగా ప్రసిద్ధికావటం జరిగింది.

క. అ మ్మంత్రముఁ దనదగు హృద । యమ్మున నక్కన్య నిలిపి యాదిత్యున క
ర్ఘ్య మ్మెత్తి ' నాకు నిమ్ము ప్రి । యమ్మున నీ యట్టి పుత్త్రు నంబుజమిత్త్రా ! ' 19

ప్రతిపదార్థం: ఆ+మంత్రమున్= ప్రసిద్ధిగల ఆ మంత్రాన్ని; తనది, అగు= తనదైన; హృదయమ్మునన్= హృదయంలో; ఆ+కన్య= ఆ కుంతి; నిలిపి= ఉంచుకొని అనగా జపించి; ఆదిత్యునకున్= సూర్యుడికి; అర్ఘ్యమ్ము= పూజకోసం దోసిట్లోకి తీసికొనే నీటిని; ఎత్తి= పైకెత్తి; అంబుజ మిత్త్రా= నీటిలోంచి పుట్టిన పద్మానికి మిత్రుడవు అయినవాడా- ఓ సూర్యుడా! నాకున్; ప్రియమ్మునన్= ప్రీతితో; నీ, అట్టి= నీవంటి; పుత్త్రున్= కుమారుని; ఇమ్ము= ప్రసాదించు.

తాత్పర్యం: కుంతి ఆ మంత్రాన్ని తనమనస్సులో జపించి సూర్యునికి అర్ఘ్యం ఇచ్చి 'ఆదిత్యా! నాకు నీవంటి కొడుకును ప్రేమతో ఇమ్ము.'

క. అని కేలు మొగిచి నిలిచిన । వనజాయతనేత్ర కడకు వచ్చెను గగనం
బున నుండి కమలమిత్త్రుఁడు । తన తీవ్రకరత్వ ముడిగి తరుణద్యుతితోన్. 20

ప్రతిపదార్థం: అని= ఆప్రకారంగా; కేలు= చేతులు; మొగిచి= మోడ్చి; నిలిచినన్= నిలువగా, కమల, మిత్త్రుఁడు= పద్మాలకు మిత్రుడు అయిన సూర్యుడు; తన; తీవ్ర, కరత్వము= వేడికిరణాలు కలిగి ఉండటాన్ని; ఉడిగి= విడిచి; తరుణ, ద్యుతితోన్= లేతకాంతితో అనగా యువకుడి అందంతో; వనజ+ఆయత, నేత్ర, కడకు= నీటినుండి పుట్టిన పద్మాలవలె విశాలమైన కన్నులు కల కుంతి దగ్గరకు; గగనంబుననుండి= ఆకాశంనుండి; వచ్చెను.

తాత్పర్యం: అని కుంతి చేతులు మోడ్చి నిలబడగా, సూర్యుడు తన వేడికిరణాలను విడిచి, కోమలకాంతితో (యువకుడి అందంతో) ఆకాశంనుండి ఆమెదగ్గరకు దిగివచ్చాడు.

వ. అ కన్యకయు నట్టి తేజోరూపంబు సూచి విస్మయంబునను భయంబునను గడు సంభ్రమించి నడునడ నడుంగుచున్నదాని 'నోడకుండు' మని సూర్యుండు ప్రసన్నుండై 'నీకోరినవరం బీ వచ్చితి' ననిన గొంతియు లజ్జావనతవదనయై' యొక్కబ్రహ్మవిదుండు నాకుం గరుణించి యిమ్మంత్రం బుపదేశించిన దానిశక్తి నెఱుంగ వేఁడి యజ్ఞానంబున నిన్నుం ద్రిలోకైకదీపకుం ద్రిపురుషమూర్తిఁ ద్రివేదమయు రావించిన యీయపరాధంబు నాకు సహింపవలయు.' 21

ప్రతిపదార్థం: ఆ+కన్యకయున్= ఆ కుంతీదేవి; అట్టి; తేజస్+రూపంబు= కాంతిమంతమైన ఆకారం; చూచి= విస్మయంబునను=ఆశ్చర్యంతో; భయంబునను= భీతితో; కడు=మిక్కిలి; సంభ్రమించి= తొట్రుపడి; నడునడ= నడకమధ్యలో; నడుంగుచు+ఉన్న, దానిన్= వణుకుతున్నదానిని; ఓడక+ఉండుము= భయపడకుము; అని= ఆ విధంగా తెలిపి; సూర్యుండు = సూర్యభగవానుడు; ప్రసన్నుండు+ఐ= దయకలవాడై; నీ కోరిన, వరంబు= నీవు కోరిన ప్రసిద్ధమైనవరాన్ని; ఈన్= ఇవ్వటానికి; వచ్చితిన్ అనిన; గొంతియు= కుంతీదేవికూడ; లజ్జా+అవనత, వదన+ఐ= సిగ్గుతో వంచుకొన్న ముఖం కలదై; ఒక్క, బ్రహ్మ విదుండు= ఒక ప్రసిద్ధుడైన బ్రహ్మమును తెలిసినవాడు; నాకున్; కరుణించి= దయతలచి; ఈ+మంత్రంబున్; ఉపదేశించినన్= ఉపదేశింపగా; దాని శక్తిన్= దాని బలాన్ని; ఎఱుంగ, వేఁడి= తెలిసికొనా లని; అజ్ఞానంబునన్= తెలివి తక్కువతనంతో; త్రిలోక+ఏక, దీపకున్= మూడులోకాలను ముఖ్యంగా వెలిగించేవాడిని; త్రి, పురుష, మూర్తిన్= బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అనే ముగ్గురు ఆకారం అయినవాడిని; త్రివేదమయున్= మూడు వేదాలరూపం అయినవాడిని; నిన్నున్; రావించిన= రప్పించిన; ఈ+అపరాధంబు= ఈ తప్పు; నాకున్= నాయందు; సహింపవలయున్= ఓర్చుకోవాలి.

తాత్పర్యం: ఆ కుంతీదేవికూడా అటువంటి కాంతిమంతమైన సూర్యునిరూపాన్ని చూచి ఆశ్చర్యంతో, భయంతో మిక్కిలి తొట్రుపడి వణకుతూ ఉండగా, సూర్యుడు, భయపడకు మని ప్రసన్నుడై 'నీవు కోరిన వరం ఇవ్వటానికి వచ్చాను' అన్నాడు. కుంతి సిగ్గుతో ముఖం వంచుకొని 'ఒక బ్రహ్మజ్ఞాని దయతో నాకు ఈ మంత్రాన్ని ఉపదేశించగా దానిశక్తి తెలిసికొనాలనే కోరికతో - మూడులోకాలను ముఖ్యంగా వెలిగించేవాడవు, త్రిమూర్తుల స్వరూపుడవు, మూడువేదాల ఆకారం తాల్చినవాడవు అయిన నిన్ను అజ్ఞానంచేత రప్పించిన నా తప్పును క్షమించుము.'

విశేషం: సూర్యుడు ఉదయం బ్రహ్మస్వరూపు డని, మధ్యాహ్నం శివస్వరూపు డని, సాయంకాలం విష్ణుస్వరూపు డని ప్రసిద్ధి. అందువలన సూర్యుడు త్రిపురుషమూర్తి. "బ్రహ్మస్వరూప ముదయే - మధ్యాహ్నే తు మహేశ్వరమ్ । సాయం ధ్యాయే త్సదా విష్ణుం- । త్రిమూర్తించ దివాకరమ్"॥ అట్లాగే సూర్యుడు ఉదయం ఋగ్వేదస్వరూపుడు, మధ్యాహ్నం యజుర్వేదస్వరూపుడు' సాయంకాలం సామవేదస్వరూపుడు. అందువల్లనే త్రివేదమయుడు. సూర్యుడు-(వ్రు) ప్రాణులను వారివారి వృత్తులందు ప్రేరేపించేవాడు.

ఆ. 'ఎఱుకలేమిఁ జేసి యింతు లెప్పుడు నప । రాధయుతలు సాపరాధ లయిన
వారిఁ గరుణ నెల్లవారును రక్షింతు' । రనుచు సూర్యునకు లతాంగి మ్రొక్కె. 22

ప్రతిపదార్థం: ఎఱుక= జ్ఞానం; లేమిని, చేసి= లేకపోవటంచేత; ఇంతులు= స్త్రీలు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; అపరాధయుతలు=తప్పిదాలతో కూడినవారు; స+అపరాధలు= తప్పులతో కూడినవారు; అయినన్= అగుటచేత; వారిన్= ఆ స్త్రీలను; కరుణన్= దయతో; ఎల్లవారును= అందరూ; రక్షింతురు; అనుచున్= అని తెల్పుతూ; లతా+అంగి= లతవంటి (సుకుమారమయిన) దేహంకలది - కుంతి; సూర్యునకున్= సూర్యభగవానునికి; మ్రొక్కెన్= నమస్కరించింది.

తాత్పర్యం: 'తెలివి లేక స్త్రీలు ఎప్పుడూ తప్పులు చేస్తారు. తప్పులు చేసిన స్త్రీలను దయతో అందరూ మన్నిస్తారు' అని అంటూకుంతి సూర్యునికి నమస్కరించింది.

వ. సూర్యుండును 'నీకు దుర్వాసుం డిచ్చిన వరంబును మంత్రంబుశక్తియు నెఱుంగుదు; మదీయదర్శనంబు వృథగాదు; నీ యభిమతంబు సేయుదు' ననిన గొంతి యి ట్లనియె. 23

ప్రతిపదార్థం: సూర్యుండును; నీకున్; దుర్వాసుఁడు+ఇచ్చిన= దుర్వాసుడు ప్రసాదించిన; వరంబును; మంత్రంబు, శక్తియున్= మంత్రంయొక్కబలాన్ని; ఎఱుంగుదున్= తెలియుదును; మదీయ, దర్శనంబు= నాదర్శనం- నీవు నన్ను చూడటం; వృథకాదు= వ్యర్థం కాదు; నీ అభిమతంబు= నీ యిష్టప్రకారం; చేయుదును; అనినన్; కాంత= కుంతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీకు దుర్వాసుడు ప్రసాదించిన వరంగురించి, మంత్రశక్తినిగురించి నాకు తెలుసు. నా దర్శనం వృథా కాదు. నీ కోర్కె నెరవేరుస్తాను' అని సూర్యుడు పలుకగా, కుంతి ఈ విధంగా అన్నది.

ఆ. ఏను మంత్రశక్తి యెఱుఁగక కోరితిఁ । గన్య కిదియు కోరఁగాదు నాక;
నాకు గర్భమయిన నాతలిదండ్రులుఁ । జుట్టములును నన్నుఁ జూచి నగరె? 24

ప్రతిపదార్థం: ఏను= నేను; మంత్ర, శక్తి= మంత్రంయొక్క శక్తిని; ఎఱుఁగక= తెలియక; కన్యకున్= పెళ్ళికానిస్త్రీకి; ఇదియున్= ఇది; కోరన్+కాదు= కోరకూడదు; నాకు+అ= అని అనక; కోరితిన్; నాకు; గర్భము+అయినన్= గర్భము కలిగినచో; నా, తలిదండ్రులున్; చుట్టములును= బంధువులును; నన్నున్ చూచి = నన్ను కనుగొని; నగరె= నవ్వరా?

తాత్పర్యం: నేను మంత్రశక్తి తెలియక, ఇది పెళ్ళికానిస్త్రీ కోరకూడ దని తెలియక కోరాను. నాకు గర్భం వస్తే నన్ను చూచి నా తల్లిదండ్రులు, బంధువులు నవ్వరా?

వ. అనిన విని సూర్యుండు దానికిఁ గరుణించి 'నీకు సద్యోగర్భంబునఁ బుత్త్రుఁ డుద్భవిల్లు; నీకన్యాత్వంబును దూషితంబుగా' దని వరం బిచ్చినఁ, దత్క్షణంబ యక్కన్యకకు నంశుమంతునంశంబునఁ గానీనుం డై. 25

ప్రతిపదార్థం: అనినన్; విని; సూర్యుండు; దానికిన్= ఆ కుంతీదేవిని; కరుణించి= దయతలచి; నీకున్; సద్యస్+గర్భం బునన్= ఇప్పటికిప్పుడు కలిగే గర్భంవలన; పుత్త్రుడు; ఉద్భవిల్లున్= పుడతాడు; నీ, కన్యాత్వంబును= నీ కన్నెతనంకూడ; దూషితంబుకాదు= దోషం కలదికాదు; అని= ఆ ప్రకారంగా; వరంబు+ఇచ్చినన్= వరాన్ని ఇయ్యగా; తద్+క్షణంబు+అ= ఆ క్షణంలోనే; ఆ+కన్యకకున్; అంశుమంతు; అంశంబునన్= సూర్యుని అంశంచేత; కానీనుండు+ఐ= కన్యకు పుట్టినవా డై. (కానీనః కన్యకాజాతః - అని అమరకోశం).

తాత్పర్యం: అని కుంతి అనగా విని సూర్యుడు ఆమెమీద దయతలచి 'నీకు సద్యోగర్భంవలన పుత్త్రుడు పుట్టుతాడు. నీ కన్నెతనంకూడా చెడదు' అని వరం ఇవ్వగా, అప్పటికప్పుడే ఆ కన్యకు సూర్యునిఅంశాన కన్యాపుత్త్రుడై.

కర్ణుఁడు జనియించి సూతగృహంబు సేరుట (సం.1-104-10)

చ. సలలిత మైన పుట్టుఁగవచంబు నిసర్గజ మైన కుండలం
బుల యుగళంబు నొప్పఁగ సుపుత్త్రుఁడు కర్ణుఁడు పుట్టె సూర్యమం
డలమొకొ భూతలంబున బెడంగయి దీప్తిసహస్రకంబుతో
వెలుఁగెడు నా నిజద్యుతి సవిస్తరలీల వెలుంగుచుండఁగన్. 26

ప్రతిపదార్థం: సలలితము+ఐన= అందమైన; పుట్టు, కవచంబు= పుట్టుకతోనే ఏర్పడ్డకవచం; నిసర్గజము+ఐన= సహజమైన; కుండలంబుల, యుగళంబున్= చెవిపోగుల జంటయు; ఒప్పఁగన్= ప్రకాశించగా; సు+పుత్త్రు+డు= చక్కనికుమారుడు; కర్ణుఁడు; సూర్య, మండలము+ఒకొ= సూర్యమండలమే యేమో; భూతలంబునన్= భూమిమీద; బెడంగు+అయి= అందమై; దీప్తి, సహస్రకంబుతో= వేయికిరణాలతో; వెలుఁగెడు, నా= ప్రకాశిస్తున్నదా అన్నట్లు; నిజ, ద్యుతి= తనకాంతి; సవిస్తర లీలన్= విరివి అయిన విలాసంతో; వెలుంగుచు+ఉండఁగన్; పుట్టెన్= పుట్టాడు.

తాత్పర్యం: అందమైన సహజకవచకుండలాలతో ప్రకాశిస్తూ, సూర్యమండలమే భూమిమీద వేయికిరణాలతో ప్రకాశిస్తున్నదా అన్నట్లు అధికమైన కాంతితో కర్ణుడు పుట్టాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. 'నిజద్యుతిసవిస్తరలీల వెలుంగుచుండఁగన్' అనే విశేషణం సార్థకం. మహాభారతపాత్రలలో స్వీయ వ్యక్తిత్వంతో ఒంటరిపోరుతో దిగంతయశస్సు గడించిన వీరుడు కర్ణుడు. కర్ణుడు లేకపోతే భారతం లేదన్న లోకోక్తి ఈ పాత్రకున్న ప్రత్యేకతను తెలుపుతున్నది. పుట్టుకవచంతో, కుండలాలతో పుట్టిన దివ్యరూపంకలవాడైనా, కర్ణుడు నిజజీవితంలో విషాదాంతనాయకుడు.

వ. అంత నాదిత్యుం డాకాశంబున కరిగినఁ, గొడుకుం జూచి కుంతి దద్దయు విస్మయం బంది యెద్దియుం జేయునది నేరక. 27

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; ఆదిత్యుండు= సూర్యుడు; ఆకాశంబునకు; అరిగినన్= వెళ్ళగా; కుంతి; కొడుకున్; చూచి; తద్దయున్= మిక్కిలి; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; చేయునది, నేరక= ఏమి చేయాలో తెలియక.

తాత్పర్యం: తరువాత సూర్యుడు ఆకాశానికి వెళ్ళిపోగా, కుంతి కొడుకును చూచి మిక్కిలి ఆశ్చర్యపడి ఏమి చేయాలో తెలియక.

తరువోజ

ఏల యమ్ముని నాకు నిచ్చె నిమ్మంత్ర? మిమ్మంత్రశక్తి యే నెఱుఁగంగ వేఁడి
యేల పుత్త్రకుఁ గోరి యెంతయు భక్తి నినుఁ దలంచితిఁ బ్రీతి? నినుఁడును నాకు
నేల సద్యోగర్భమిచ్చెఁ? గుమారుఁ డేల యప్పుడ యుదయించె? నిం కెట్టు
లీ లోకపరివాద మే నుడిగింతు? నింతకు నింతయు నెఱుఁగరె జనులు! 28

ప్రతిపదార్థం: ఏల= ఎందుకు; ఆ+ముని= ఆ దుర్వాసుడు; నాకున్; ఈ+మంత్రము, ఇచ్చెన్= ఈ మంత్రాన్ని ప్రసాదించినాడు; ఈ+మంత్ర, శక్తి= ఈ మంత్రము యొక్క బలాన్ని; ఏన్=నేను; ఎఱుఁగంగ, వేఁడి= తెలిసి కొనా లని కోరి; ఏల= ఎందుకు; పుత్త్రకున్= కొడుకును; కోరి= ఇష్టపడి; ఎంతయున్= మిక్కిలి; భక్తిన్= భక్తితో; ఇనున్= సూర్యుడిని; తలంచితిన్= తలచుకొన్నాను; ప్రీతిన్= ప్రేమతో; ఇనుఁడును= సూర్యుడుకూడ; ఏల= ఏమిటికి; నాకున్=నాకు; సద్యఃగర్భము= అప్పటికప్పుడే కలిగే గర్భాన్ని; ఇచ్చెన్; ఏల= ఎందుకు; కుమారుఁడు; అప్పుడు+అ= అప్పుడే, ఉదయించెన్= పుట్టాడు; ఇంకన్=ఇటుపై; ఎట్టులు= ఏవిధంగా; ఈ లోక, పరివాదమున్= ఈలోకాపవాదాన్ని; ఏను= నేను; ఉడిగింతున్= లేకుండా చేస్తాను; ఇంతకున్= ఇప్పటికే; జనులు; ఇంతయున్= జరిగినది అంతా; ఎఱుఁగరె= తెలిసికోరా?

తాత్పర్యం: దుర్వాసుడు నా కెందుకు ఈ మంత్రాన్ని ఉపదేశించాడు? ఆ మంత్రప్రభావాన్ని తెలిసికొనా లని నేను ఎందుకు భక్తితో సూర్యుడిని స్మరించాను? ఆ సూర్యుడుకూడ నాకు ఎందుకు సద్యోగర్భాన్ని ఇచ్చాడు? అప్పుడే ఈ పుత్త్రుడు ఎందుకు నాకు పుట్టాడు? ఇంక ఏ విధంగా ఈ లోకాపవాదాన్ని తప్పించుకొంటాను? ఇప్పటికే జరిగిన దంతా ప్రజలు తెలిసికొనిఉండరా?

విశేషం: తరువోజలోని ప్రతిపాదంలోనూ రెండు ద్విపదపాదా లుంటాయి. ద్విపదలో ప్రతిపాదంలోనూ మూడు ఇంద్రగణాల మీద ఒక సూర్యగణం ఉంటుంది. అంటే తరువోజలో ఒక్కొక్క చరణంలో 3 ఇంద్రగణాలు+ ఒక సూర్యగణం+ 3 ఇంద్రగణాలు+ 1 సూర్యగణం ఉంటాయన్నమాట. ప్రతి రెండేసి గణాలమీద మూడు యతులు ఉంటాయి. ప్రాసనియతికూడా ఉన్నది. మొదటి పాదం గురువుతోకాని, లఘువుతోకాని, ప్రారంభమైతే మిగిలిన పాదాలన్నీ అట్లాగే సాగాలి. "తరువోజ యలసము, సుకుమారమైన ఛంద మని కవిత్రయము వారభిప్రాయపడినట్లు వారి ప్రయోగమునుబట్టి యూహింపఁదగియున్నది. చింత, శంక, దైన్యము, గ్లాని, శోకము మున్నగు నలసచిత్తవృత్తులందే తరువోజలు తఱచుగాఁ బ్రయోగింపబడి యున్నవి. విశేషించి భారతమందలి పందొమ్మిది తరువోజలలో నేడు తరువోజలు స్త్రీవాక్యములై యుండుటచే విన్నకోట పెద్దన యన్నట్లు స్త్రైణమైన మృదువృత్తముగా, కవిత్రయము భావించి రని కూడ తలంపవచ్చును... ఈ తరువోజయందు మత్తకోకిలా సంక్రమణ కల్పితమైన గమకచమత్కారము గుర్తింపదగియున్నది... తరువోజ మత్తకోకిలా భ్రాంతిని మాటిమాటికి గలిగించు చున్నది. విరుద్ధావిరుద్ధ నానాభావసాంకర్య చిత్రితమైన కుంతీదేవి తత్కాలచిత్తవృత్తి రమ్యముగ ధ్వనితమగుచున్నది." (డాక్టర్ పాటిబండ మాధవశర్మ - ఆంధ్రమహాభారతము. ఛందశ్శిల్పము). వితర్కరూపకమైన వాక్యవిన్యాసం పద్యమంతా ఒకే పద్ధతిలో కూర్చబడి ఉండటంచేత సమత (మార్గాభేదం) అనే శబ్దగుణం సార్థకంగా సమకూరింది. (సంపా.)

వసంతతిలకము

'ఈ బాలు నెత్తుకొని యింటికిఁ జన్న, నన్నున్
నా బంధు లందఱు మనంబున నేమనా? రె
ట్లీ బాలసూర్యనిభు నిట్టుల డించి పోవం
గా బుద్ధిపుట్టు?' నని కన్య మనంబులోనన్. 29

ప్రతిపదార్థం: ఈ, బాలున్= ఈ శిశువును; ఎత్తుకొని= తీసుకొని; ఇంటికిన్= అంతఃపురానికి; చన్న= వెళ్ళిన; నన్నున్; నా బంధులు+అందఱున్= నా చుట్టా లందరు; మనంబునన్= మనస్సులో; ఏమి+అనారు= ఏమి అనరు? - అనగా ఏమైనా అంటారు; ఎట్లు; ఈ, బాల, సూర్య, నిభున్= ఈ బాలసూర్యుడితో సమానమైనవాడిని; ఇట్టులన్= ఈ రీతిగా; డించి= దించి, వదలిపెట్టి; పోవన్కాన్= పోవగా; బుద్ధిపుట్టున్= ఆలోచన కలుగుతుంది.; అని= ఆ ప్రకారంగా; కన్య= పెళ్ళికానికుంతి; మనంబులోనన్= మనస్సులో.

తాత్పర్యం: ఈ బాలుడిని ఎత్తుకొని ఇంటికి వెళ్ళితే నన్ను నా బంధువు లందరూ దూషిస్తారు. అట్లని, బాలసూర్యుడివంటి ఈ బాలుడిని వదలి వెళ్ళటానికి బుద్ధి ఎట్లా పుడుతుంది? అని కన్యగా ఉన్న కుంతి మనస్సులో.

విశేషం: వసంతతిలకవృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా - త-భ-జ-జ-గగ- అనే గణా లుంటాయి. ఎనిమిదవ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది. దీనికి సింహోన్నత, సింహోద్ధత, ఉద్ధర్షిణి, మధుమాధవి, శోభాతతి, కర్ణోత్పల మొదలైన పే ర్లున్నాయి. నన్నయ ఈ వృత్తంలో మూడుపద్యాలు వ్రాశాడు. వాటిలో రెండు ఆశ్వాసాంత్యపద్యాలుగానూ, ఒకటి (అంటే ఈపద్యం) కథాసందర్భంలోనూ ఉపయోగించాడు. కుంతీదేవియొక్క అనిశ్చితమైన చిత్తవృత్తిని ఈ వృత్తం ధ్వనింపచేస్తున్నది. పుత్రుడిమీది మమకారం, బంధువులవలన కలిగే అపవాదం అనే రెండుభావావస్థలనడుమ అల్లల్లాడుతున్న ఆ మాతృమూర్తి వత్సల, భయభావాలను మాధుర్య మనే గుణంతో పోషించటం నన్నయరచనాశిల్పం, పృథక్పదత్వంతోపాటు ఉక్తివైచిత్ర్యంకూడా ఇందులో ఉన్నది. కుంతి మాతృమూర్తిగా వేదనపడుతున్నది. కాని, కన్య మనంబులో ఈ మాట లనుకొన్నట్లు నన్నయ చెప్పాడు. అది పొసగదు కదా! అనిపించవచ్చును. ఆమెకు సద్యోగర్భంలో కర్ణుడు పుట్టగానే సూర్యవరంవలన ఆమె కన్యాత్వం దూషితం కాకుండా యథాస్థితిగా ఉన్న దని వస్తుధ్వని, ఈ కన్యాత్వస్థితి వచ్చినందువలననే పసివాడైన కర్ణుడిని మందసంలో ఉంచి వెంటనే రాగలిగిం దని భావించాలి. నన్నయ 'కన్య' అనే మాటతో పాత్రయొక్క తత్కాలస్థితిగతులను ధ్వనింపచేయటం ఉక్తి చమత్కారం. (సంపా.)

వ. వందురి వగచుచున్న దాని పుణ్యంబున నాదిత్యప్రేరితం బయి యనర్ఘరత్నవసుభరితంబయిన యొక్కమంజస నదీప్రవాహవేగంబునం దనయొద్దకు వచ్చిన, దానిలోఁ జెచ్చెరఁ దనకొడుకుం బెట్టి, కుంతి నిజగృహంబునకు వచ్చె; నంత. 30

ప్రతిపదార్థం: వందురి= దుఃఖించి; వగచుచు+ఉన్న= ఆలోచిస్తున్న; దాని, పుణ్యంబునన్= ఆమె పుణ్యంవలన; ఆదిత్య, ప్రేరితంబు+అయి= సూర్యుడిచేత పంపబడినదై; అనర్ఘ, రత్న, వసు, భరితంబు+అయిన= అమూల్యమైన రత్నాలచేత, బంగారంచేత నిండినట్టిది అయిన; ఒక్క, మంజస= ఒకపెట్టె; నదీ, ప్రవాహ, వేగంబునన్= నదీప్రవాహవేగంచేత; తన,ఒద్దకు=

తన సమీపమునకు; వచ్చినన్= రాగా; దానిలోన్= ఆ పెట్టెలో; చెరన్+చెరన్= వెంటనే; తన, కొడుకున్= అప్పటికప్పుడే పుట్టిన తన కుమారుని; పెట్టి= ఉంచి; కుంతి= కుంతీకుమారి; నిజ, గృహంబునకున్= తన ఇంటికి; వచ్చెన్; అంత= ఆ తరువాత.

తాత్పర్యం: దుఃఖిస్తూ, ఆలోచిస్తున్న కుంతీదేవిపుణ్యంవలన సూర్యుడు పంపిన ఒకపెట్టె అమూల్యమైన రత్నాలతో, బంగారంతో నిండి నదీప్రవాహవేగంవలన ఆమెదగ్గరకు వచ్చింది. ఆ విధంగా తన దగ్గరకు వచ్చిన పెట్టెలో వెంటనే తనకొడుకును పెట్టి, కుంతి తనఇంటికి వచ్చింది. ఆ తరువాత.

ఆ. ఘనభుజుండు రాధ యను దానిపతి యొక్క। సూతుఁ డరుగుదెంచి చూచి రత్న
పుంజభరిత మయిన మంజసలో నున్న। కొడుకు దానితోన కొనుచు వచ్చి. 31

ప్రతిపదార్థం: ఘన, భుజుండు= గొప్పభుజాలు కలవాడు; రాధ, అను, దాని= రాధ అనుపేరుగల ఆమె; పతి= భర్త; ఒక్క, సూతుఁడు= సూతవంశంలో పుట్టినవాడు ఒకడు; అరుగుదెంచి= వచ్చి; చూచి= కనుగొని; రత్న, పుంజ, భరితము= రత్నాల సమూహంతో నిండినది; అయిన; మంజసలోన్= పెట్టెలో; ఉన్న= ఉండినట్టి; కొడుకున్; దాని, తోనన్= ఆ పెట్టెతోనే; కొనుచు= తీసికొంటూ; వచ్చి= ఇంటికివచ్చి.

తాత్పర్యం: రాధ అనే స్త్రీకి భర్త అయిన ఒక సూతుడు, గొప్పభుజాలు కలవాడు వచ్చి చూచి, రత్నాలపెట్టెలో ఉన్న బిడ్డను ఆ పెట్టెతోకూడ తీసికొని వెళ్ళి.

క. తన భార్యకు రాధకు ని। చ్చిన నదియును గరము సంతసిల్లి కుమారుం
గని చన్నులు సేఁపి ముదం। బునఁ బెనిచెను సుహృదు లెట్టిపుణ్యమొ యనఁగన్. 32

ప్రతిపదార్థం: తన భార్యకు, రాధకున్= తన ఇల్లాలు రాధకు; ఇచ్చినన్= ఈయగా; అదియును= ఆమెకూడా; కరము= మిక్కిలి; సంతసిల్లి; కుమారున్; కని=చూచి; చన్నులు= పాలిండ్లు, చేఁపి= పాలుకారునట్లు చేసి; సుహృదులు= చెలులు; ఎట్టి, పుణ్యమొ= ఎటువంటి పుణ్యమో; అనఁగన్= అని పలుకగా; ముదంబునన్= సంతోషముతో; పెనిచెను=పెంచింది.

తాత్పర్యం: తన భార్య అయిన రాధకు ఇవ్వగా, ఆమె చాలా సంతోషించి, ఆ కుమారుడిని చూచి చన్నులు చేపగా అతనికి పాలిచ్చి, చెలు లందరూ, 'ఇదంతా నీ పుణ్యం' అని పొగడగా, ఆ బాలుడిని పెంచింది.

వ. ఇట్లు వసునివహంబుతో వచ్చుటంజేసి వసుషేణుం డను నామంబునం బరగి కర్ణుండు రాధేయుం డై సూతగృహంబునం బెరుఁగుచుండె; నంత నిట. 33

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వసు, నివహంబుతో= రత్నాల, బంగారుసమూహంతో; వచ్చుటన్+ చేసి= రావటంవలన; వసుషేణుండు; అను; నామంబునన్= పేరుతో; పరగి= ఒప్పి; కర్ణుండు; రాధేయుండు+ఐ= రాధకొడుకై; సూత, గృహంబునన్= సూతుని ఇంట్లో; పెరుఁగుచు+ఉండెన్= పెరుగుతూ ఉండినాడు; అంతన్, ఇట= అటుమీద - ఇక్కడ.

తాత్పర్యం: ఈ విధంగా బంగారంతో, రత్నాలతో రావటంచేత వసుషేణుడు అనే పేరుతో కర్ణుడు రాధకొడుకుగా సూతుడి ఇంట్లో పెరుగుతున్నాడు. ఆపైన ఇక్కడ.

విశేషం: వసుశబ్దానికి బంగారు, రత్నాలు అనే రెండుఅర్థాలూ ఉన్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాండురాజు వివాహ మై దిగ్విజయము సేయుట (సం. 1-105-1)

సీ. యదుకులవిమలపయఃపయోనిధిసుధా । కరరేఖఁ, గమనీయకాంతినిలయ,
ననవరతాన్నదానాభితర్పితముని । విప్రజనాశీఃపవిత్రమూర్తి,
వినయాభిమానవివేకసౌజన్యాది । సదమలగుణరత్నజన్మభూమిఁ,
బరమపతివ్రతాభరణాభిశోభితఁ । దామరసేక్షణఁ, దాల్మియందుఁ

ఆ. బృథివిఁ బోనిదానిఁ బృథయను కన్యక । నధికవీరుఁ డై స్వయంవరమునఁ
బడసి పరనరేంద్రపరిభావి పాండు భూ । వరుఁడు పేర్మితో వివాహ మయ్యె. 34

ప్రతిపదార్థం: యదుకుల, విమల పయస్+పయస్+నిధి, సుధాకర, రేఖన్= యదువంశం అనే నిర్మలమైన పాలసముద్రానికి చంద్రరేఖ అయిన దానిని; కమనీయ, కాంతి, నిలయన్= మనోహరమైన కాంతికి స్థానం అయినదానిని; అనవరత+అన్నదాన+అభితర్పిత, ముని, విప్రజన+ఆశీస్, పవిత్రమూర్తిన్= ఎడతెగని అన్నదానంచేత తృప్తి పొందింపబడిన మునుల, బ్రాహ్మణుల ఆశీర్వచనంచేత పవిత్రమైన ఆకారం కలదానిని; వినయ+అభిమాన, వివేక, సౌజన్య+ఆది, సద్+అమల, గుణ, రత్న, జన్మభూమిన్= అడకువ, గౌరవం, వివేకం, మంచితనం మొదలైన ఉత్తమాలు అయిన నిర్మలగుణాలు అనే రత్నాలకు పుట్టుచోటు అయిన దానిని; పరమ, పతివ్రతా+ఆభరణ+అభిశోభితన్= ఉత్తమమైన పాతివ్రత్యం కల స్త్రీలకు నగవలె ఎక్కువగా ప్రకాశింపజేయబడుతున్నదానిని; తామరస+ఈక్షణన్= కమలాలవంటి కన్నులు కలదానిని; తాల్మి, అందున్= ఓర్పులో; పృథివిన్= భూమిని; పోనిదానినన్= పోలినట్టిదానిని; పృథ, అను, కన్యకన్= పృథ అనే పేరుగల కన్నెను అనగా కుంతిని; పర, నర+ఇంద్ర, పరిభావి= శత్రురాజులను అవమానించువాడు; పాండు, భూవరుఁడు= పాండురాజు; అధిక, వీరుఁడు+ఐ= మిక్కిలి పరాక్రమశాలి అయి; స్వయంవరమునన్= స్వయంవరమునందు; పడసి= పొంది; పేర్మితో= గొప్పగా ప్రీతిగా; వివాహము+అయ్యెన్= పెళ్ళి చేసుకొన్నాడు.

తాత్పర్యం: యదువంశ మనే నిర్మలసముద్రానికి చంద్రరేఖవంటిది, మనోహరమైన తేజస్సుకు స్థానమైనది, ఎడతెగని అన్నదానంచేత మునులను బ్రాహ్మణులను తృప్తిపొందించి వాళ్ళ ఆశీర్వచనంచేత పవిత్రమైన ఆకారం కలది, వినయం, గౌరవం, వివేకం, మంచితనం మొదలైన ఉత్తమగుణా లనే రత్నాలకు జన్మభూమి అయినది, పరమ పతివ్రతలకు అలంకారంవలె ప్రకాశించేది, కమలాలవంటి కన్నులు కలది, ఓర్పులో భూమితో పోల్చదగింది అయిన పృథను, శత్రురాజులను జయించిన పాండురాజు మహాపరాక్రమశాలి అయి, స్వయంవరంలో పొంది, ప్రీతితో పెళ్ళి చేసికొన్నాడు.

విశేషం: అలం: రూపకం, ఉపమ. ఈ పద్యంలో నన్నయ కుంతిని ఒక శృంగారనాయికగా కాక పుణ్యవతిగా, పవిత్రమూర్తిగా వర్ణించాడు. 'గణనీయకాంతినిలయ' అన్న విశేషణంద్వారా ఈ పద్యరచనలో కాంతి అనే శబ్దగుణం గణనీయంగా పోషింపబడిం దని సూచించాడు. వాడిన దీర్ఘసమాసాలు ఔజ్జ్వల్యం అనే స్వభావాన్ని ప్రదర్శించటంచేత కుంతిలోని కాంతిశీలం ధ్వనిమయం అవుతున్నది. అక్షరరమ్యత కాంతిగుణశోభకు వ్యంజకం కావటం ఈ రచనలోని విశేషం. భారతకథలోని మాతృమూర్తిగా అత్యంత కీలకమైన పాత్రను నిర్వహించే పృథను (కుంతిని) సీసపద్యంలో గుణసుందరంగా, ఉదాత్తంగా పరిచయం చేయటం రుచిరార్థ సూక్తినిధి ప్రదర్శించినశిల్పం.

వ. మఱియు భీష్మానుమతంబున మద్రరాజతనయ మాద్రి యనుదాని మహోత్సవంబున వివాహంబై పాండురాజు భరతకులరత్నాలంకారుం డై పరాక్రమంబున నెవ్వరిని మెచ్చక యపారచతురంగబలసమన్వితుం డై. 35

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మఱియు; భీష్మ+అనుమతంబున= భీష్ముడి అనుమతితో; మద్ర, రాజ, తనయ= మద్రదేశానికి సంబంధించిన రాజు కూతురు; మాద్రి అను దానిన్= మాద్రి అను పేరుగల ఆమెను; మహా+ఉత్సవంబునన్= గొప్ప పండుగతో (ఊరేగింపుతో); వివాహంబై= పెండ్లాడి; పాండురాజు= పాండురాజు; భరత, కుల, రత్న+ అలంకారుండు+ఐ= భరతవంశానికి రత్నాభరణం వంటివాడై; పరాక్రమంబునన్= వీర్యము లేదా శౌర్యమునందు; ఎవ్వరిని, మెచ్చక= ఎంతటివారినైనా, లెక్కచేయక; అపార, చతురంగ, బల, సమన్వితుండు+ఐ= అంతులేని నాలుగు అంగములు (రథ, గజ, తురగ, పదాతులు) కలసేనతో కూడుకొన్నవాడై.

తాత్పర్యం: పాండురాజు భీష్మునిఅనుమతితో మద్రరాజుకూతురైన మాద్రినికూడా వైభవంగా వివాహంచేసికొని, భరతవంశానికి రత్నాభరణంవంటివాడై, పరాక్రమంలో ఎవరినీ లెక్కచేయక చతురంగబలాలతో కూడుకొన్నవాడై.

మ. ధ్వజినీ పాత భరంబునం దలరఁగా, ధాత్రీధరాహీంద్ర మూ
ర్ధజరత్నప్రకరంబు లున్నతగజేంద్రస్యందనప్రోల్లస
ద్ధ్వజ వాతాహతిఁ దూలఁగా జలదబృందం బీక్రియన్ సర్వది
గ్విజయార్థం బరిగెం గురుప్రభుఁడు దోర్వీర్యప్రకాశార్థి యై. 36

ప్రతిపదార్థం: ధ్వజినీ, పాత, భరంబునన్= సైన్యంనడకభారంచేత; ధాత్రీ, ధర+అహి+ఇంద్ర, మూర్ధజ, రత్న, ప్రకరంబులు= భూమిని మోస్తున్న నాగరాజైన ఆదిశేషుని శిరస్సునందు పుట్టిన రత్నాలసమూహాలు; తలరఁగా= చలింపగా; ఉన్నత, గజ+ఇంద్ర, స్యందన, ప్ర+ఉల్లసత్+ధ్వజ, వాత+ఆ, హతిన్= ఎత్తైన మేలిమి ఏనుగులయొక్క, రథాలయొక్క బాగా ప్రకాశించే టెక్కెముల గాలిదెబ్బచేత; జలద, బృందంబు= మేఘాలసమూహం; తూలఁగాన్= చలింపగా; ఈ, క్రియన్= ఈ విధంగా; కురు, ప్రభుఁడు= కురురాజైన పాండురాజు; దోః+వీర్య, ప్రకాశ+అర్థి+ఐ= బాహుబలాన్ని ప్రకటించాలన్న కోరిక కలవాడై; సర్వ, దిక్+విజయ+అర్థంబు= అన్నిదిక్కులను జయించటంకొరకు; అరిగెన్+ వెళ్ళాడు.

తాత్పర్యం: సైన్యంయొక్క పాదఘట్టనలభారంవల్ల భూమిని మోస్తున్న ఆదిశేషునిశిరోమణులు చలించేటట్లు, ఎత్తైన మేలిమిఏనుగులమీద, రథాలమీద కల జెండాల గాలిదెబ్బకు మేఘాల సమూహం చెదిరేటట్లు పాండురాజు తన బాహుబలాన్ని ప్రకటించా లన్నకోరికతో దిగ్విజయంకోసం వెళ్ళాడు.

విశేషం: అలం: అతిశయోక్తి. మత్తేభవృత్తం సమాసఘటితమై సంధిబంధురమై, ఉదాత్తగంభీరంగా ప్రసాదమిశ్రిత ఓజోగుణంతో సాగింది. ఈ పద్యశైలి వీరరసోచితం; అక్షరరమ్యం.

క. అతులప్రతాపలీలా। యుతుఁ డై ప్రాగ్దక్షిణాపరోత్తర దిగ్భూ
పతుల నిజశాసన వశీ। కృతులం గావించెఁ దనదుకీర్తి వెలుంగన్. 37

ప్రతిపదార్థం: అతుల, ప్రతాప, లీలా, యుతుఁడు+ఐ= సాటిలేని పరాక్రమవిలాసంతో కూడినవాడై; ప్రాక్+దక్షిణ+అపర+ఉత్తర, దిక్+భూపతుల= తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరదిక్కులరాజులను; తనదు కీర్తి; వెలుంగన్; నిజ, శాసన, వశీకృతులన్= తన ఆజ్ఞకు లొంగేటట్లు చేయబడినవారినిగా - అనగా తనకు లొంగినవారినిగా; కావించెన్= చేశాడు.

తాత్పర్యం: సాటిలేని పరాక్రమవిలాసంతో పాండురాజు నాలుగుదిక్కులరాజులను తన ఆజ్ఞకు లొంగేటట్లు చేశాడు.

మహాస్రగ్ధర

అతిరౌద్రాకారకీలాయతదవదహనోగ్రాగ్ర సేనానిపీడా
హతు లై నానావిధోపాయనములు గొని సౌహార్దవాంఛన్ జయశ్రీ
శ్రితబాహుం గానఁగా వచ్చిరి సకలజగత్సేవ్యమానున్ మహేంద్ర
ప్రతిముం గౌరవ్యవంశప్రభు నఖిలమహీపాలు రాంబాలికేయున్. 38

ప్రతిపదార్థం: అఖిల, మహీ, పాలురు= భూమిమీది రాజులంతా; అతి, రౌద్ర+ఆకార, కీలా+ఆయత, దవదహన+ఉగ్ర+ అగ్ర, సేనా, నిపీడా, హతులు+ఐ= మిక్కిలితీక్ష్ణ మైన ఆకారం కల మంటలచేత గొప్పదైన కార్చిచ్చువలె భయంకరమైన ముందు ఉన్న సైన్యంతాకిడిచేత కొట్టబడినవారై; నానావిధ+ ఉపాయనములు= పలురకాలకానుకలు; కొని= తీసికొని; సౌహార్ద, వాంఛన్= స్నేహంమీదికోరికతో; జయ శ్రీ, శ్రిత, బాహున్= జయలక్ష్మిచేత ఆశ్రయించబడిన చేతులు కలవాడిని; సకల, జగత్+సేవ్యమానున్= అన్నిలోకాలచేత సేవింపదగినవాడిని; మహా+ఇంద్ర, ప్రతిమున్ = దేవేంద్రుడితో సమానమైనవాడిని; కౌరవ్య, వంశ, ప్రభున్= కురువంశరాజును; ఆంబాలికేయున్= అంబాలికకొడుకైన పాండురాజును; కానఁగాన్= చూడటానికి; వచ్చిరి= వచ్చారు.

తాత్పర్యం: భూమిమీద రాజులంతా మహాతీవ్రజ్వాలలతో మండుతున్న కార్చిచ్చువలె భయంకరమయిన ముందున్న సైన్యం తాకిడిచేత కొట్టబడినవాళ్ళయి అనేకరకాల కానుకలు తీసుకొని, మిత్రత్వాన్ని కోరి జయలక్ష్మిని ఆశ్రయించిన చేతులుకలవాడు, అన్నిలోకాలచేత సేవించబడేవాడు, దేవేంద్రునితో సమానుడయినవాడు, కురువంశప్రభువు అయిన - పాండురాజును చూడటానికి వచ్చారు.

విశేషం: అలం: ఉపమ. మహాస్రగ్ధర పాదానికి 22 అక్షరా లుంటాయి. స, త, త, న, స ర, ర, గ అనే గణాలు వరుసగా ఉంటాయి. 9, 16 అక్షరాలకు యతి చెల్లుతుంది. నన్నయ వ్రాసినవి మొత్తం రెండు మహాస్రగ్ధరలు, మొదటిది (ఆది 2.22) దేవదానవయుద్ధంలో నరనారాయణులు ప్రదర్శించిన ప్రతాపాన్ని వర్ణించేది. రెండవది ఇది. దిగ్విజయయాత్రలో పాండురాజు ప్రదర్శించిన పరాక్రమాన్ని వర్ణించేది. "వీరస్య భుజదండానాం వర్ణనే స్రగ్ధరా భవేత్" అని క్షేమేంద్రుని మతం. స్రగ్ధరలోని మొదటి గురువును రెండు లఘువులు చేస్తే మహాస్రగ్ధర ఔతుంది. కాబట్టి స్రగ్ధరవలె మహాస్రగ్ధరనుకూడా మహావీరుల పరాక్రమ ప్రదర్శనకు వినియోగించి, నన్నయ వృత్తౌచిత్యాన్ని పాలించాడు. (సంపా.) పరాక్రమంవల్ల గాంభీర్యాన్ని, విజయలక్ష్మి వల్ల సౌందర్యాన్ని ఒక గొప్ప దండవలె ధరించినా డని-వృత్తము పేరుకు తగిన సన్నివేశకల్పన నన్నయఛందశ్శిల్పమర్మజ్ఞతకు నిదర్శనం.

చ. లలిత హయ ద్విపంబుల విలాసినులన్ మణిరౌప్య కాంచనా
వలుల నజావిగోమహిష వర్గములన్ బహుభూషణంబులన్
బలువిడిఁ గప్పముల్ ధరణిపాలురచేఁ గొని నూఱువేల్గజం
బులఁ బెటికించి తెచ్చెఁ గురుముఖ్యుఁ డకుప్యధనమ్ము లిమ్ముగన్. 39

ప్రతిపదార్థం: కురు, ముఖ్యుఁడు= కురువంశంలో ముఖ్యుడైనవాడు - పాండురాజు; లలిత, హయ, ద్విపంబులన్= మనోహరాలైన గుఱ్ఱాలను, ఏనుగులను; విలాసినులన్= అందమైన స్త్రీలను; మణి, రౌప్య, కాంచన+ఆవలులన్= మణుల వెండిబంగారాల సమూహాలను; అజ+అవి, గో, మహిష, వర్గములన్= మేకల, గొర్రెల, గోవుల, దున్నల సమూహాలను; బహు,

భూషణంబులన్= అనేక ఆభరణాలను; బలువిడిన్= మిక్కుటంగా; కప్పములన్= పన్నులు; ధరణిపాలురచేన్= రాజులనుండి; కొని= గ్రహించి; అకుప్య, ధనమ్ములు= వెండి బంగారు రూపం అయిన సంపదలను; ఇమ్ముగన్= సులువుగ; నూఱు, వేల్, గజంబులన్= నూరువేల ఏనుగులతో; పెఱికించి= మోయించి; తెచ్చెన్.

తాత్పర్యం: పాండురాజు మనోహరాలైన గుర్రాలను, ఏనుగులను, అందమైన స్త్రీలను, మణులను, వెండిని, బంగారాన్ని, మేకలను, గొర్రెలను, ఆవులను, దున్నలను, చాలాధనాన్ని రాజులనుండి కప్పాలుగా గ్రహించాడు. వెండి, బంగారు రూపమైన ధనాన్ని నూరువేలఏనుగులతో మోయించి తెచ్చాడు.

క. శరనిధిపరివృత విశ్వం । భరఁ గల భూపతులు పాండుపతికృతమునఁ గిం
కరు లై ప్రతిసమకల్పిత । కరు లై రది మొదలుగాఁగఁ గౌరవ్యులకున్. 40

ప్రతిపదార్థం: శర, నిధి, పరివృత, విశ్వంభరన్= సముద్రంచేత చుట్టబడిన భూమిమీద; కల= ఉన్న; భూపతులు= రాజులు; పాండుపతి, కృతమునన్= పాండురాజు చేసిన పనివలన; కింకరులు+ఐ= సేవకులై; అది, మొదలు, కాఁగన్= అప్పటినుండి; కౌరవ్యులకున్= కురువంశరాజులకు; ప్రతి, సమ, కల్పిత, కరులు+ఐ= ప్రతిసంవత్సరం ఏర్పాటు చేయబడిన కప్పం కలవారు అయ్యారు - అనగా ప్రతిసంవత్సరం కప్పం చెల్లిస్తున్నారు.

తాత్పర్యం: భూమిమీది రాజులంతా పాండురాజు చేసిన పనివల్ల సేవకులై, అప్పటినుండి కురువంశ రాజులకు ప్రతి సంవత్సరం కప్పం చెల్లిస్తున్నారు.

పాండురాజు సత్కృత్యములు (సం. 1-106-1)

వ. ఇట్లు పాండురాజు దిగ్విజయంబు సేసి తదుపార్జితంబు లైన యపరిమితధనంబులఁ దెచ్చి ధృతరాష్ట్రుననుమతంబున భీష్మునకు సత్యవతికిం దమతల్లు లైన కౌసల్యలకు విదురునకు సుహృజ్జనులకు బ్రాహ్మణులకు నిచ్చి, వారివలన ననేకాశీఃప్రశంసలు వడసి సుఖం బున్నంత. 41

ప్రతిపదార్థం: ఇట్లు; పాండురాజు; దిక్+విజయంబు, చేసి= దిక్కులను జయించి; తద్+ఉపార్జితంబులు+ఐన= ఆ దిగ్విజయంవలన సంపాదించబడిన; అపరిమిత, ధనంబులన్= అంతులేని సంపదలను; తెచ్చి; ధృతరాష్ట్రు, అనుమతంబున= ధృతరాష్ట్రుని అంగీకారంతో; భీష్మునకున్; సత్యవతికిన్; తమ, తల్లులు+ఐన; కౌసల్యలకు= కోసలరాజు కూతుళ్ళకు; విదురునకున్; సుహృద్+జనులకున్= స్నేహితులకు; బ్రాహ్మణులకున్; ఇచ్చి; వారివలనన్; అనేక+ఆశీస్+ప్రశంసలు= పెక్కు ఆశీస్సులు, పొగడ్తలు; పడసి= పొంది; సుఖంబు+ఉన్నంత= సుఖంగా ఉండగా.

తాత్పర్యం: ఈ విధంగా పాండురాజు దిగ్విజయం చేసి, అంతులేని సంపద తెచ్చి, ధృతరాష్ట్రుని అనుమతితో భీష్మునికి, సత్యవతికి, తమతల్లులకు, విదురునకు, మిత్రులకు, బ్రాహ్మణులకు ఇచ్చి, వారివలన అనేక ఆశీర్వచనాలను, ప్రశంసలను పొంది, సుఖంగా ఉండగా.

చ. వినుతయశుండు పాండునృపవీరుఁడు దిగ్విజయంబు సేసి పెం
పునఁ గొనివచ్చి యిచ్చిన యపూర్వ మహా ధనరాశి పేర్మి వా

రని విభవంబుతోడ ధృతరాష్ట్రుఁడు సేసె శతాశ్వమేధముల్

దనిసన భూసురేశులకు దక్షిణ లిచ్చి యథోచితంబుగన్. 42

ప్రతిపదార్థం: వినుత, యశుండు= పొగడబడిన కీర్తికలవాడు; పాండునృప, వీరుఁడు= వీరుడైన, పాండురాజు; దిక్+ విజయంబు, చేసి= దిక్కులను జయించి; పెంపునన్= గొప్పతనంచేత; కొనివచ్చి= తీసికొనివచ్చి; ఇచ్చిన= ఇచ్చినటువంటి; అపూర్వ, మహా, ధన, రాశి, పేర్మిన్= అంతకుముందు లేని గొప్ప ధనసమూహం యొక్క అతిశయంతో; వారని, విభవంబుతోడ= ఎడతెగని వైభవంతో; ధృతరాష్ట్రుఁడు; తనిసనన్= తృప్తిదీర; భూసుర+ఈశులకు= బ్రాహ్మణశ్రేష్ఠులకు; యథా+ఉచితంబుగన్= ఎవరికి తగినట్లు వారికి; దక్షిణలు= పెద్దవారికి గౌరవంగా ఇచ్చు ధనము; ఇచ్చి= ఒసగి; శత+అశ్వమేధముల్= వంద అశ్వమేధయాగాలు; చేసెన్.

తాత్పర్యం: కీర్తిమంతు డైన పాండురాజు దిక్కులను జయించి గొప్పగా తెచ్చి ఇచ్చిన ధనసమూహంతో ధృతరాష్ట్రుడు, మహావైభవంగా తృప్తిదీర బ్రాహ్మణోత్తములకు ఎవరికి తగినట్లు వారికి దక్షిణలు ఇచ్చి, వంద అశ్వమేధయాగాలు చేశాడు.

వ. మఱియు నప్పాండురాజు వినయవిధేయత్వంబున ధృతరాష్ట్రునకు, నభిమతకార్యకరణంబున బాంధవులకు, ననుకూలత్వంబున సుహృజ్జనులకుఁ, బరిశ్రమజ్ఞానంబున విద్వాంసులకుఁ, గారుణ్యదానంబున ననాథులకు, నభయంకరత్వంబున మహీప్రజలకు సంతోషంబు సేయుచు. 43

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఆ+పాండురాజు; వినయ, విధేయత్వంబునన్= అణకువతో లొంగిఉండటంచేత; ధృతరాష్ట్రునకున్; అభిమతకార్య, కరణంబునన్= ఇష్టమైన పనులు చేయటంచేత; బాంధవులకున్= చుట్టాలకు; అనుకూలత్వం బునన్= అనుకూలంగా ఉండటంచేత; సుహృత్+జనులకున్= మిత్రులకు; పరిశ్రమ, జ్ఞానంబునన్= కృషిని గుర్తించటంచేత; విద్వాంసులకున్= పండితులకు; కారుణ్య, దానంబునన్= దయను దానంచేయటంచేత - అనగా కరుణ చూపటంచేత; అనాథులకున్= దిక్కులేనివాళ్ళకు; అభయంకరత్వంబునన్= భయంలేకుండా చేయడంచేత; మహీ, ప్రజలకున్= భూమిమీద ప్రజలకు; సంతోషంబు, చేయుచున్= సంతసం కలిగిస్తూ.

తాత్పర్యం: అంతేకాక ఆ పాండురాజు వినయవిధేయతలతో ధృతరాష్ట్రునికి, ఇష్టమైన పనులు చేయటంతో బంధువులకు, అనుకూలంగా ఉండటంతో మిత్రులకు, చేసిన కృషిని గుర్తించడంతో పండితులకు, దయ చూపటంతో దిక్కులేనివాళ్ళకు, భయంలేకుండా చేయటంతో ప్రజలకు సంతోషాన్ని కలిగిస్తూ.

విశేషం: ఇవి ఉత్తమరాజుకు ఉండే లక్షణాలు. ఉత్తమరాజు లక్షణాలే కాదు ఉత్తమవ్యక్తు లందరిలో ఉండే ఉన్నతమైన గుణాలు. వ్యక్తులంతా అలవరచుకోవలసిన ఉత్తమగుణాలు. పాండురాజు వంశకర్త. భావిచక్రవర్తుల వర్తనవిధిని ఆదర్శవంతంగా ఆచరించి చూపించాడు. పాండురాజు తన వంశాన్నీ, కుటుంబాన్నీ సమైక్యంగా, సంపన్నంగా, సంతోషంగా, ఆదర్శవంతంగా ఉంచటానికి తన శక్తియుక్తు లన్నీ ధారపోసి వంశకర్త అయినాడు. పాండురాజు తెచ్చియిచ్చిన ధనంతో వంద అశ్వమేధాలు చేసిన ధృతరాష్ట్రుడు వంశవిచ్ఛిత్తికి దోహదంచేశాడు. పాండురాజు ప్రవర్తిల్లచేసిన ఉదార చరిత్రాన్ని పాండవులు కొనసాగించారు. అందువలననే ధార్తరాష్ట్రులు నశించారు. పాండవులు వంశోద్ధారకులైనారు. పాండురాజు ప్రవర్తనలో ధ్వనిస్తున్న భావికథార్థాలను సారమతితో భావించాలి.

క. 'మండిత గుణ సంపద నధి। కుం డగుచున్ బూరు భరత కురు పతులకుఁ దు
ల్యుం డయి వంశకరుం డగుఁ। బాండుమహీశుఁ' డని బుధసభలు దనుఁ బొగడన్. 44

ప్రతిపదార్థం: మండితగుణసంపదన్= అలంకరింపబడిన సుగుణాల అతిశయంలో; అధికుండు= గొప్పవాడు; అగుచున్= అవుతూ; పాండు, మహీ+ఈశుఁడు= పాండురాజు; పూరు, భరత, కురుపతులకున్= రాజులైన పూరు, భరత, కురురాజులకు; తుల్యుండు+అయి= సమానుడైనవాడై; వంశ, కరుండు= వంశాన్ని నిలిపేవాడు, అగున్= కాగలడు; అని= ఆ ప్రకారంగా; బుధ, సభలు= పండితసమూహాలు; తనున్= తన్ను; పొగడన్= ప్రశంసింపగా.

తాత్పర్యం: 'అనేకసుగుణాలతో గొప్పవాడై పాండురాజు పూరు భరత కురు చక్రవర్తులతో సమానుడై, వంశాన్ని నిలిపేవాడు ఔతా' డని పండితులు తనను పొగడుతూ ఉండగా.

క. నానాద్రవ్య నిరంతర। దానముల ననూనయజ్ఞదక్షిణలను ధా
త్రీనాథుఁడు బ్రాహ్మణులను। శ్రీనిలయులఁ జేయుచుండె శిష్టప్రియుఁ డై. 45

ప్రతిపదార్థం: ధాత్రీ; నాథుఁడు= భూపతి - పాండురాజు; నానా, ద్రవ్య, నిరంతర, దానములన్= అనేక విధాలైన సంపదలను నిరంతరం దానంచేస్తూ ఉండటంవలన; అనూన, యజ్ఞ, దక్షిణలను= తక్కువకాని యజ్ఞాలలో దక్షిణలచేత - అనగా యజ్ఞాలలో గొప్పగా ఇచ్చే దక్షిణలచేత; శిష్ట, ప్రియుఁడు+ఐ= సదాచారసంపన్నులకు ప్రియమైనవాడై; బ్రాహ్మణులను; శ్రీనిలయులన్= సంపదకు ఉనికిపట్టు లయిన వారినిగా; చేయుచున్+ఉండెన్.

తాత్పర్యం: పాండురాజు అనేకవిధాలైన సంపదలను నిరంతరం దానం చేయటంచేత, యజ్ఞాలలో గొప్పగా దక్షిణలు ఇవ్వటంచేత, సదాచారసంపన్నులకు ప్రియమైనవాడై, బ్రాహ్మణులను ధనవంతులనుగా చేస్తూ ఉన్నాడు.

వేటకుఁ బోయిన పాండురాజునకు శాపంబు గలుగుట (సం. 1-109-5)

వ. మఱియు ననేకవినోదంబులను ననవరతకామానురూపవిషయసుఖానుభవంబులనుం బ్రొద్దు పుచ్చుచు నాతండు మృగయావ్యసనంబునం దగిలి. 46

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; అనేక, వినోదంబులను= పెక్కు వినోదాలతో; అనవరత, కామ+అనురూప, విషయ, సుఖ+అనుభవంబులన్= ఎడతెగని కామానికి తగిన విషయ సుఖాలను అనుభవించటంచేత; ప్రొద్దు, పుచ్చుచున్= కాలం గడుపుతూ; ఆతండు= పాండురాజు; మృగయావ్యసనంబునన్= వేటమీది మితిమీరిన ఆసక్తితో; తగిలి= తగులుకొని.

తాత్పర్యం: అంతేకాక, వివిధ సుఖవిలాసాలతో, ఎడతెరిపి లేకుండా కోరుకొన్న భోగాలు అనుభవించటంతో కాలంపుచ్చుతూ, పాండురాజు వేటమీద మితిమీరిన ఆసక్తితో తగులుకొని.

ఉ. వాసవసన్నిభుండు హిమవన్నగదక్షిణపార్శ్వభూములన్
శ్రీసతిఁ బోని కుంతియును జెల్వగు మాద్రియుఁ దోడ రాఁగ బా
ణాసన బాణ భాసిత మహాభుజుఁడై విహరించుచుండె ని
చ్ఛాసదృశంబుగా గజవశాద్వయమధ్య గజేంద్ర లీలతోన్. 47

ప్రతిపదార్థం: వాసవ, సన్నిభుండు= దేవేంద్రునితో సమానుడు అయిన పాండురాజు; హిమవత్+నగ, దక్షిణ, పార్శ్వ, భూములన్= హిమాలయపర్వతంయొక్క దక్షిణంవైపు ఉన్న భూములలో; శ్రీసతిన్+పోని= లక్ష్మీదేవిని పోలినట్టి; కుంతియును= కుంతియు; చెలువు+అగు= అందమైనది అయిన; మాద్రియున్; తోడ, రాఁగన్= వెంట రాగా; బాణ+ఆసన, బాణ, భాసిత, మహా, భుజుఁడు+ఐ= ధనుస్సుచేత, బాణాలచేత ప్రకాశింపచేయబడిన గొప్పభుజాలు కలవాడై; ఇచ్ఛా, సదృశంబుగాన్= కోరికకు తగినట్లు; గజావశా, ద్వయ, మధ్య, గజ+ఇంద్ర, లీలతోన్= ఆడేనుగులు రెండింటి మధ్య ఉండే మదపుటేనుగువంటి విలాసంతో; విహరించుచున్+ఉండెన్= విహరిస్తూ ఉండినాడు.

తాత్పర్యం: దేవేంద్రునితో సమాను డైన పాండురాజు, హిమాలయపర్వతానికి దక్షిణవైపున ఉండే భూములలో లక్ష్మీదేవివంటి కుంతి, అందమైన మాద్రి తనవెంట రాగా; ధనుస్సును, బాణాలను చేపట్టి ఇష్టంవచ్చినట్లుగా, రెండు ఆడుఏనుగుల మధ్య ఉండే మగమదపుటేనుగువంటి విలాసంతో విహరిస్తూ ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. మఱియుఁ దనకు ధృతరాష్ట్రుం డిష్టాన్నపాన మాల్యానులేపన భూషణాదులు నిత్యంబునుం బుత్తెంచుచుండ నిట్లు వనవాసవ్యాసంగంబున నుండి, యొక్కనాఁడు పెక్కుమృగంబుల నెగిచి యొక్కటి నేనియు నేయంగానక కినిసి యొక్కయెడ. 48

ప్రతిపదార్థం: మఱియున్; తనకున్; ధృతరాష్ట్రుండు; ఇష్ట+అన్న, పాన, మాల్య+అనులేపన, భూషణ+ఆదులు= ఇష్టమైన అన్నపానాలు, పూదండలు, మైపూతలు, ఆభరణాలు మొదలైనవాటిని; నిత్యంబునున్= ప్రతిరోజు; పుత్తెంచుచు+ఉండన్= పంపుతూ ఉండగా; ఇట్లు; వన, వాస, వ్యాసంగంబునన్= అడవిలో ఉండటంమీది ఆసక్తితో; ఉండి= వసించి; ఒక్కనాఁడు; పెక్కు, మగ్ృంబులన్= అనేకమృగాలను; ఎగిచి= తరిమి; ఒక్కటిన్, ఏనియున్= ఒక్కదానినికూడా; ఏయన్+కానక= కొట్టడానికి సాధ్యపడక; కినిసి= కోపించి; ఒక్క+ఎడన్= ఒకచోట.

తాత్పర్యం: అంతేకాక తనకు ఇష్టమైన అన్నపానాలు, పూదండలు, మైపూతలు, ఆభరణాలు మొదలైనవి ప్రతిరోజు ధృతరాష్ట్రుడు పంపుతూ ఉండగా, అడవిలో ఉండా లనే ఆసక్తి ఉండి, ఒకరోజు అనేకమృగాలను తరిమి, ఒక్కదాన్ని కూడా కొట్టడం సాధ్యంకాక కోపించి, ఒకచోట.

క. మనసిజరాగంబునఁ బెనఁ। గిన యిఱ్ఱిని లేడిఁ జూచి కృతహస్తుఁడు పె
ల్చన యే నమ్ముల నారెం। టిని ద్రెళ్ళఁగ నేసెఁ గడుఁ గఠినహృదయుం డై. 49

ప్రతిపదార్థం: మనసిజ, రాగంబునన్= మన్మథరాగంతో; పెనఁగిన= కలిసిన; ఇఱ్ఱిని= మగజింకను; లేడిన్= ఆడుజింకను; చూచి= కనుగొని; కృత, హస్తుఁడు= బాణాలను ప్రయోగించటంలో అలవాటుపడిన చేయి కలవాడు; కడున్= మిక్కిలి; కఠిన, హృదయుండు+ఐ= కఠినమైన మనస్సు కలవాడై; పెల్చన= గట్టిగా; ఏను+అమ్ములన్= ఐదుబాణాలతో; ఆ, రెంటిని= ఆ రెండుమృగాలను; త్రెళ్ళఁగన్= చనిపోయేటట్లు; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: మన్మథరాగంతో కలిసి ఉన్న మగ ఆడుజింకలను చూచి, బాణప్రయోగంలో నేర్పుకలవాడైన పాండురాజు కఠినహృదయుడై అయిదుబాణాలతో అవి చనిపోయేట్లు గట్టిగా కొట్టాడు.

వ. ఇట్లేసి యబ్బాణంబులు పుచ్చికొనియున్న యప్పాండురాజుం జూచి యమ్మృగమిథునంబునం దల్పావశిష్టజీవం బై పడియున్న మృగంబు మనుష్యవచనంబుల ని ట్లనియె. 50

విశేషం: ఇట్లు+ఏసి= ఈ విధంగా కొట్టి; ఆ+బాణంబులు; పుచ్చికొని= తీసికొని; ఉన్న, ఆ+పాండురాజున్; చూచి; ఆ, మృగ, మిథునంబునందు= ఆ మృగాలజంటలో; అల్ప+అవశిష్ట, జీవంబు+ఐ= కొంచెం మిగిలిన ప్రాణం కలదై; ఉన్న= ఉండిన; మృగంబు= మగజింక; మనుష్య, వచనంబులన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా కొట్టి ఆ బాణాలు తీసికొన్న ఆ పాండురాజును చూచి, ఆ మృగాలజంటలో కొన ఊపిరితో ఉన్న మగజింక మానవవాక్కులతో ఈవిధంగా అన్నది.

తరలము.

హరిపరాక్రమ! యేను గిందముఁ డన్మునిన్, మృగముల్ నిరం
తరము నిట్లు రమింపఁగాఁ గని తద్రతం బెడఁ గోరి సుం
దర మృగాకృతి నేను భార్యయు దారుణాటవిఁ గామ భో
గరతి నుండితి మిష్టచారిమృగవ్రజంబుల పొత్తునన్. 51

ప్రతిపదార్థం: హరి, పరాక్రమ= దేవేంద్రునిపరాక్రమంవంటి పరాక్రమం కలవాడా!; ఏను= నేను; కిందముఁడు, అను, మునిన్= కిందముడు అను పేరుగల మునిని; మృగముల్= జింకలు; నిరంతరమున్= ఎల్లప్పుడు; ఇట్లు; రమింపన్+కాన్= సంభోగించటాన్ని; కని=చూచి; తద్+రతంబు= వానియొక్కక్రీడను; ఎడన్=మనస్సులో; కోరి= ఇష్టపడి; సుందర, మృగ+ఆకృతిన్= అందమైన జింకలరూపంతో; ఏను= నేను; భార్యయు= నా ఇల్లాలు; దారుణ+అటవిన్= భయంకరమైన అడవిలో; కామ, భోగ, రతిన్= మన్మథసుఖంమీది ఆసక్తితో; ఇష్ట, చారి, మృగ, వ్రజంబుల, పొత్తునన్= ఇష్టంగా తిరుగుతున్న జింకలసమూహాల సహవాసంతో; ఉండితిమి.

తాత్పర్యం: దేవేంద్రునివంటి పరాక్రమం కలవాడా! నేను కిందముడు అనే మునిని. ఎల్లప్పుడూ ఈ విధంగా మృగాలు సంభోగించటాన్ని చూచి అట్లా సంభోగించా లని భావించి, నేనూ, నా భార్యా అందమైన మృగరూపాలు ధరించి, భయంకరమైన ఈ అడవిలో స్వేచ్ఛగా తిరిగే తోటిజింకల సమూహంతో కలసి, మన్మథసుఖాలు అనుభవిస్తున్నాం.

విశేషం: తరల వృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, భ, ర, స, జ, జ, గ - గణాలు ఉంటాయి. 12వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది. తరలం తన పేరుకు తగినట్లుగా చంచలం, తరంగితం, కంపితం అయిన చిత్తవృత్తిని ధ్వనింపచేస్తుంది. కిందముని చంచలత్వాన్ని కంపితకంఠంతో (కొనఊపిరితో) చెప్పే సందర్భంలో వాడి నన్నయ ఛందశ్శిల్పాన్ని ప్రదర్శించాడు.

వ. మృగముల మై యున్న మమ్ము వధియించిన దీన నీకు పాతకంబు లేదు; వేటలాడుటయు, మృగంబులఁ జంపుటయు రాజులకు ధర్మంబ; యయినను. 52

ప్రతిపదార్థం: మృగములము+ఐ, ఉన్న= జింకలమై ఉండు; మమ్మున్= మమ్మల్ని; వధియించిన= చంపిన; దీనన్= దీనివలన; నీకున్; పాతకంబు= పాపం; లేదు= ఉండదు; వేటలు, ఆడుటయు= వేటాడుటలు; మృగంబులన్= జింకలను; చంపుటయున్= వధించుట; రాజులకున్= క్షత్రియులకు; ధర్మంబు+అ= న్యాయమే; అయినను.

తాత్పర్యం: జింకల మై ఉన్న మమ్మల్ని చంపటంవలన నీకు పాపం రాదు. వేటాడటం, మృగాలను చంపటం క్షత్రియులకు ధర్మమే, అయినా.

తే. **పఱవనోపక యున్న, మైమఱచి పెంటిఁ । బెనఁగియున్నను, బ్రసవింప మొనసియున్నఁ,**
దెవులు గొనియున్న మృగములఁ దివిరి యేయ । రెఱచి యాహారముగ మను నెఱుకు లయిన. 53

ప్రతిపదార్థం: పఱవన్= పరుగెత్తటానికి; ఓపక= శక్తి లేక; ఉన్నన్= ఉండినను; మైమఱచి= శరీరము మరచి; పెంటిన్= ఆడుదానితో; పెనఁగి= కూడి; ఉన్నను= ఉండినప్పుడును; ప్రసవింపన్= ఈనటానికి; మొనసి= పూని; ఉన్నన్= ఉన్న సమయంలోను; తెవులు, కొని= వ్యాధిని పొంది; ఉన్నన్= ఉండినప్పుడున్నూ; మృగములన్= జింకలను; ఎఱచి= మాంసం; ఆహారముగ; మను= జీవించే; ఎఱుకులు= బోయవారు; అయినన్= అయినా; తివిరి= ప్రయత్నించి; ఏయరు= కొట్టరు.

తాత్పర్యం: పరుగెత్తలేనివి, ఆడుదానితో కూడుకొన్నవి, ఈనుతున్నవి, వ్యాధితో బాధపడుతున్నవి అయిన మృగాలను మాంసం ఆహారంగా జీవించే కిరాతులుకూడా కొట్టరు.

చ. **ఇనసమతేజు లై ధరణి నెన్నడు ధర్మపథంబు దప్పఁ ద్రొ**
క్కని భరతాదిరాజుల జగన్నుతవంశమునందుఁ బుట్టి నీ
కనఘచరిత్ర । యిట్లు దగునయ్య యధర్మువు సేయ? నీ యెఱుం
గని నృపధర్మువుల్ గలవె? కౌరవపుంగవ! గౌరవస్థితిన్. 54

ప్రతిపదార్థం: ఇన, సమ, తేజులు+ఐ= సూర్యుడితో సమానమైన తేజస్సు కలవారై; ధరణిన్= భూమిమీద; ఎన్నడున్= ఎప్పుడునూ; ధర్మ, పథంబు= ధర్మమార్గాన్ని; తప్పన్, త్రొక్కన్= తప్పుగా త్రొక్కని; భరత+ఆది, రాజుల, జగత్+నుత, వంశము+అందున్= భరతుడు మొదలైన రాజులు గల్గి; లోకంచేత పొగడబడినవంశంలో; పుట్టి; అనఘ, చరిత్ర= పాపం లేని నడవడి కలవాడా!; నీకున్, ఇట్లు; అధర్మువు= అన్యాయం; చేయన్= చేయటానికి; తగును+అయ్య= తగునా అయ్యా; కౌరవ, పుంగవ= కురువంశంలో శ్రేష్ఠుడా!; గౌరవ, స్థితిన్= ఉన్నతస్థితిలో ఉండటంచేత; నీ, ఎఱుంగని= నీకు తెలియని; నృప, ధర్మువుల్= రాజధర్మాలు; కలవె= కలవా?

తాత్పర్యం: సూర్యునితో సమానమైన తేజస్సు కలవారై, భూమిమీద ఎప్పుడూ ధర్మమార్గాన్ని తప్పని భరతుడు మొదలైన రాజుల ప్రసిద్ధవంశంలో పుట్టి, పుణ్యాత్ముడవైన నీకు అధర్మం చేయటం తగునా? కౌరవశ్రేష్ఠా! ఉన్నత స్థితిలో ఉన్న నీకు తెలియనిరాజధర్మాలు ఉన్నాయా?

విశేషం: భరతుడు మొదలైన వంశకర్తలు ధర్మమూర్తులు. వారివంశంలో పుట్టిన పాండురాజుకూడా ఆదర్శమూర్తిగా ఉండక, అధర్మంగా రతివివశులైన మృగాలను చంపటం గర్హించదగిన దని మునివచనం. "యద్య దాచరతి శ్రేష్ఠః తత్తదే వేతరో జనః। స యత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే" భ.గీ.3.21 అని గీతావాక్యం. పెద్దవారి ఆచరణలనే ఇతరజనులు

అనుసరిస్తారు. పెద్దలు చూపిన ప్రమాణాలకు లోకం కట్టుబడిఉంటుంది అన్న ధర్మాన్ని ఆధారంగా చేసుకొని కిందముడు పలికాడు. 'తగునయ్య' అను ప్రయోగము ఎంతో ఔచిత్యవంతము. తండ్రివై కాపాడవలసిన నీవు, రతిక్రీడలో ఉన్న మమ్మల్ని చంపటం న్యాయమా? అని మెత్తని మందలింపు.

వ. అని తన్ను నిందించి పలికిన నామృగంబు పలుకుల కలిగి పాండురా జి ట్లనియె. 55

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; తన్ను= తనను; నిందించి; పలికినన్= మాటాడగా; ఆ, మృగంబు= ఆ జింకయొక్క; పలుకులకున్= మాటలకు; అలిగి= కోపించి; పాండురాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని తనను నిందించి పలుకగా ఆ జింకమాటలు విని కోపించి, పాండురాజు ఈ విధంగా పలికాడు.

తే. పగఱఁ గని సైఁతురేనియు మృగకులంబు । గని సహింపరు రాజులు; మొనసి వాని
గ్రచ్చఱగఁ జంపుదురు; నమ్మి కిచ్చి చంపఁ । జనదు; మాయాబలంబునఁ జనదు చంప. 56

ప్రతిపదార్థం: రాజులు, పగఱన్= శత్రువులను; కని= చూచి; సైఁతురు+ఏనియున్= సహించినప్పటికిని; మృగ, కులంబు= మృగాలసమూహాన్ని; కని= చూచి; సహింపరు= ఓర్చుకొనరు; మొనసి= పూని, వానిన్= ఆ మృగాలను; గ్రచ్చఱగన్= వేగంగా; చంపుదురు; నమ్మిక +ఇచ్చి= నమ్మించి; చంపన్= చంపగా; చనదు= కూడదు; మాయా, బలంబునన్= మోసంయొక్క బలంచేత - అనగా మోసగించి; చంపన్= వధింపగా; చనదు= కూడదు.

తాత్పర్యం: రాజులు శత్రువులను చూచి సహిస్తారేమో కాని మృగాలను చూచి సహించరు. వెంటనే వాటిని చంపుతారు. అయినా నమ్మించి కాని, మోసంచేసి కాని చంపకూడదు.

వ. 'తొల్లి యగస్త్య మహామునీంద్రుండు మృగ మాంసంబున నిత్యశ్రాద్ధంబు సేయుచుండి రాజులకు మృగవధ దోషంబు లేకుండ నిర్మించె; దీని నీకు నిందింపఁదగునే?' యనుచున్న నమ్మృగంబులు బాణఘాతక్షతవేదన సహింపనోపక 'సర్వప్రాణులకు సాధారణం బయి యిష్టం బగు సుఖావసరంబున నున్న మమ్ము ననపరాధుల వధించితి గావున నీవును౦ బ్రియాసంగమం బయిన యప్పడ పంచత్వం బొందెదు' మని, 'నీ ప్రియయు నిన్ను ననుగమించు' నని పాండురాజునకు శాపం బిచ్చి, గతప్రాణము లై పడియున్న మృగంబులం జూచి శోకించి పాండురాజు పరమ నిర్వేదనపరుం డయి. 57

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; అగస్త్య, మహా, ముని+ఇంద్రుండు= అగస్త్యమహర్షి; మృగ, మాంసంబునన్= జింకమాంసముతో; నిత్య, శ్రాద్ధంబు= ప్రతిదినశ్రాద్ధం; చేయుచున్+ఉండి= చేస్తూ ఉండి; రాజులకున్= క్షత్రియులకు; మృగ, వధ, దోషంబు= మృగాలను చంపటంవలని పాపం; లేకుండన్; నిర్మించెన్= చేశాడు; దీనిన్= ఈ పనిని, నీకున్= నీకు; నిందింపన్= దూషింపగా; తగునే= యోగ్యము అగునా? అనుచున్నన్= అంటూండగానే; ఆ+మృగంబులు= ఆ రెండు జింకలు; బాణ, ఘాత, క్షత, వేదనన్= బాణందెబ్బలవలన ఏర్పడిన గాయాలబాధను; సహింపఁగన్, ఓపక= ఓర్చుకోలేక; సర్వ, ప్రాణులకు; సాధారణంబు+అయి; ఇష్టంబు+అగు; సుఖ+అవసరంబునన్= సుఖసమయంలో; ఉన్న= ఉండిన; మమ్మున్= మమ్మల్ని; అనపరాధులన్= తప్పుచేయనివారిని; వధించితివి= వధించావు; కావున; నీవున్= నీవుకూడా; ప్రియా, సంగమంబు= ప్రియురాలితో కలయిక; అయిన= కలిగినవేళ; అప్పుడు+అ; పంచత్వంబు= మరణం; ఒందెదుము= పొందుతావు గాత; అని= ఆ

ప్రకారంగా; నీ, ప్రియయున్= నీ ప్రియురాలు కూడ; నిన్నున్, అనుగమించున్= వెంబడిస్తుంది; అని; పాండురాజునకు; శాపంబు+ఇచ్చి; గత, ప్రాణములు+ఐ= పోయిన ప్రాణాలు కల వై; పడియున్న= నేలపై పడిఉన్న; మృగంబులన్= జింకలను; చూచి; దుఃఖించి= శోకించి; పాండురాజు; పరమ, నిర్వేదన, పరుండు+అయి= మిక్కిలి నిరాశ చెందినవా డై.

తాత్పర్యం: 'పూర్వం అగస్త్యమహర్షి మృగమాంసంతో ప్రతిరోజూ శ్రాద్ధం చేస్తూ, రాజులకు మృగవధవలన పాపం లేకుండా చేశాడు. అందువలన నీవు నన్ను నిందించటం తగునా?' - అని అంటూ ఉండగా, ఆ మృగాలు బాణం దెబ్బలవలన కలిగినబాధ ఓర్చుకోలేక, ప్రాణు లన్నిటికి సాధారణ మై, ఇష్టమైన సంభోగ సుఖాన్ని అనుభవిస్తున్న సమయంలో ఏ తప్పు చేయని మమ్మల్ని చంపావు. కాబట్టి నీవుకూడా నీ ప్రియురాలితో కలిసినప్పుడు మరణాన్ని పొందుతావు; నీ భార్యకూడా నీతో మరణించుగాక' అని పాండురాజుకు శాపమిచ్చి, ప్రాణాలు విడిచి పడి ఉన్న ఆ మృగాలను చూచి, పాండురాజు మిక్కిలి దుఃఖించి నిరాశ చెందినవాడై.

విశేషం: శ్రాద్ధము - శ్రద్ధతో కూడినది - కాల, పాత్ర నియమాలతో చేసే పితృక్రియ.

క. ఎట్టి విశిష్టకులంబునఁ । బుట్టియు, సదసద్వివేకములు గల్గియు, మున్
గట్టిన కర్మఫలంబులు । నెట్టన భోగింపకుండ నేర్తురె మనుజుల్? 58

ప్రతిపదార్థం: మనుజుల్= మానవులు; ఎట్టి విశిష్ట, కులంబునన్= ఎంతటి ఉత్తమవంశంలో; పుట్టియున్; సత్+అసత్+ వివేకములు= మంచి చెడ్డలను గురించిన పరిజ్ఞానాలు; కల్గియున్= కలిగియుండియు; మున్= పూర్వజన్మలో; కట్టిన= కూడబెట్టుకొన్న; కర్మ, ఫలంబులు= కర్మఫలాలు; నెట్టన= తప్పక; భోగింపక= అనుభవింపక; ఉండ, నేర్తురె = ఉండగలరా?

తాత్పర్యం: మానవులు ఎంతటి ఉత్తమవంశంలో పుట్టినా, మంచిచెడ్డలనుగురించిన పరిజ్ఞానాలు కలిగిఉన్నా, పూర్వ జన్మకర్మఫలాన్ని అనుభవించక తప్పదు.

విశేషం: విధికంటె కర్మ బలీయ మని సుభాషితం. "ఫలం కర్మాయత్తం కి మమరగణైః కించ విధినా । నమ స్తత్కర్మేభ్యో విధిరపి న యేభ్యః ప్రభవతి" అని భర్తృహరిసుభాషితం (కర్మపద్ధతి-91 శ్లో) - ఫలం కర్మాధీనం కాబట్టి దేవతలతోనూ, దైవంతోనూ మా కేమిపని? దేవతలకుకూడా దాట శక్యంగాని కర్మకే నమస్కారం అని భర్తృహరికవితోక్తి. (సంపా.)

వ. కామవ్యామోహితుం డయి కొండుకనాఁడు మదీయజనకుండు పరలోకగతుం డైనఁ దత్క్షేత్రంబున ధర్మమయుం డయిన కృష్ణద్వైపాయనమునివలన నుద్భవిల్లి, ధర్మప్రవృత్తుండ నై యున్న నా కిట్టి దుర్వ్యసనంబు కర్మవశంబున సంభవించె; నింక మునివృత్తియ యుచితంబు గావున సర్వసంగంబులు విడిచి, సర్వభూతంబులయందు సమచిత్తుండనై, హింస దలంపక నిత్యంబు నొక్కొక్కవనస్పతియందు నొక్కొక్కవన్య ఫలంబు భిక్ష గొని, యసంభవం బయిననాఁ డుపవాసంబు సేసి, వృక్షమూలంబున నుండి పాంసుపరిచ్ఛన్నదేహుండ నయి. 59

ప్రతిపదార్థం: మదీయ, జనకుండు= నాతండ్రి; కామ, వ్యామోహితుండు+అయి= మన్మథునిచేత మిక్కిలి మోహింప చేయబడినవాడై; కొండుకనాఁడు= చిన్నతనంలో; పర, లోక, గతుండు+ఐనన్= స్వర్గలోకానికి వెళ్ళినవాడు కాగా; తద్+క్షేత్రంబునన్= అతని భార్యకు; ధర్మమయుండు+అయిన= ధర్మస్వరూపుడు అయిన; కృష్ణద్వైపాయన, మునివలనన్= వ్యాసమునివల్ల; ఉద్భవిల్లి= పుట్టి; ధర్మ, ప్రవృత్తుండను+ఐ= ధర్మమార్గంలో నడుస్తున్నవాడ నై; ఉన్న నాకున్= జీవించునాకు; ఇట్టి;

దుర్+వ్యసనంబు= ఇటువంటి చెడ్డఅవస్థ; కర్మ, వశంబున్= పూర్వజన్మంలో చేసిన పనులను అనుసరించి; సంభవించెన్= కలిగెను; ఇంకన్= ఇటుపై; ముని, వృత్తి, అ= మునిజీవనమే; ఉచితంబు= తగినది; కావునన్= కాబట్టి; సర్వ, సంగములు= అన్నిబంధాలు; విడిచి; సర్వ, భూతంబుల, అందున్= అన్ని ప్రాణులలో; సమ, చిత్తుండను+ఐ= సమానమైన మనస్సు కలవాడనై; హింస= హింసనుగూర్చి; తలంపక= ఆలోచింపక; నిత్యంబున్= ప్రతిరోజు; ఒక్కొక్క, వనస్పతి, అందున్= ఒక్కొక్క చెట్టునందు; ఒక్కొక్క, వన్య, ఫలంబు= ఒక్కొక్క, అడవిసంబంధ మైన పండును; భిక్ష, కొని= బిచ్చముగా గ్రహించి; అసంభవంబు+అయిననాఁడు= దొరకని రోజు; ఉపవాసంబు, చేసి= తిండిలేక ఉపవాసం గావించి; వృక్ష మూలంబునన్, ఉండి= చెట్టుమొదటఉండి; పాంసు పరిచ్ఛన్న దేహుండను+అయి= దుమ్ముతో కప్పబడిన దేహం కలవాడనై.

తాత్పర్యం: నా తండ్రి కామపరవశుడై చిన్ననాడు చనిపోగా, ఆయన భార్యకు ధర్మస్వరూపుడైన కృష్ణద్వైపాయనుని వలన పుట్టి, ధర్మమార్గంలో నడుస్తున్న నాకు ఈ దురవస్థ పూర్వజన్మకర్మను అనుసరించి కలిగింది. ఇక నాకు తగింది ముని వృత్తే. అందువలన బంధాల నన్నింటిని విడిచిపెట్టి, అన్నిప్రాణులందు సమబుద్ధి కలిగి, హింసమాని, ప్రతిరోజూ ఒక్కొక్కచెట్టునుండి ఒక్కోపండు భిక్షగా తీసికొని, అదీ దొరకనిరోజు ఉపవాసం ఉంటూ, చెట్టుమొదట్లో నివసిస్తూ, దుమ్ముతో నిండిన శరీరాన్ని కలవాడ నై.

విశేషం: పాండురాజు మునివృత్తిని స్వీకరించా లని సంకల్పించాడు. మునినిగురించి భగవద్గీతలో ఇట్లా చెప్పబడింది. "దుఃఖే ష్వనుద్విగ్నమనాః, సుఖేషు విగతస్పృహః । వీతరాగభయక్రోధః, స్థితధీ ర్ముని రుచ్యతే॥" (భ.గీ.2.56) దుఃఖాలు కలిగినప్పుడు కలతచెందని మనస్సు కలవాడు, సుఖాలపై కోరికలేనివాడు, అనురాగభయక్రోధాలను వదలినవాడు అయిన స్థితప్రజ్ఞుడు ముని. అట్టి మునిచిత్తవృత్తినీ, జీవనవిధానాన్నీ స్వీకరించా లని బ్రతుకుమీది నిరాశతో పాండురాజు సంకల్పించాడు.

సీ. ఇంద్రియార్థంబులం దింద్రియవ్యాపార । ముడిగించి; క్రియ లెల్ల విడిచి, పుణ్య
పాపబంధంబుల నోపి బంధింపంగఁ । బడక మనోవృత్తి నొడిచి, నాకు
నిది ప్రియం బప్రియం బిది నింద యిది మహా । స్తుతి యిది యనక, సంతత నితాంత
సంతోషయుతుఁడనై వంతయు భయమును । శీతాతపంబులు వాతగతియు

ఆ. నెఱుఁగ కివ్విధమున మఱచి, శరీరంబు । మరణజీవితముల కురువిషాద
తోషవృత్తు లుడిగి, భీషణాటవి నుండి । చేసెదను దపంబు భాసురముగ. **60**

ప్రతిపదార్థం: ఇంద్రియ+అర్థంబుల, అందున్= ఇంద్రియవిషయా లైన శబ్ద, స్పర్శ, రూప, రస గంధాలలో; ఇంద్రియ, వ్యాపారము= ఇంద్రియాలు పనిచేయటాన్ని; ఉడిగించి= మాన్పించి; క్రియలు+ఎల్లన్= పనులు అన్నీ; విడిచి= వదలిపెట్టి; పుణ్య, పాప, బంధంబులన్= పాపపుణ్యాలబంధాలను; ఓపి= సహించి; బంధింపఁగన్, పడక= కట్టుపడకుండా; మనో, వృత్తిన్= మనోవ్యాపారాన్ని; ఒడిచి= జయించి అనగా ఓడించి; నాకున్; ఇది, ప్రియంబు= ఇది ఇష్టం; ఇది, అప్రియంబు= ఇది ఇష్టం కాదు; ఇది, నింద= ఇది దూషణ; ఇది మహా, స్తుతి= ఇది గొప్పపొగడ్త; అనక= అని తలపక; సంతత, నితాంత, సంతోష, యుతుఁడను+ఐ= ఎడతెగని అధికమైన సంతోషంతో కూడుకొన్నవాడ నై; వంతయున్= దుఃఖాన్ని; భయమును= భయాన్ని; శీత+ఆతపంబులు= చలిని ఎండను; వాత, గతియున్= గాలికదలికను; ఎఱుఁగక= తెలియక; ఈ+విధమునన్= ఇట్లు; శరీరంబున్; మఱచి; మరణ జీవితములకు= చావు బ్రతుకులకు; ఉరు, విషాద, తోష, వృత్తులు= గొప్ప దుఃఖం, సంతోషం అనే మనోవృత్తులను; ఉడిగి= విడిచి; భీషణ+అటవిన్= భయంకరమైన అడవిలో; ఉండి; తపంబున్= తపస్సును; భాసురముగన్= ప్రకాశించేటట్లు; చేసెదను.

తాత్పర్యం: నేను ఇంద్రియాలను బంధించి; అగ్నికర్మలను వదలి, పాపపుణ్యాలను విడిచి, మనస్సును ఓడించి, ఇది ఇష్టం, ఇది అనిష్టం, ఇది నింద, ఇది స్తుతి అనే భావం లేకుండా, ఎడతెగని మహానందంతో - దుఃఖం, భయం, చలి, ఎండ, గాలి అంటే ఏమిటో తెలియక, శరీరాన్ని మరచిపోయి, చావుకు దుఃఖాన్నీ, బ్రతుకునకు సంతోషాన్నీ లేనివాడ నై, భయంకర మైన అరణ్యంలో పెద్దతపస్సు చేస్తాను.

విశేషం: మునివృత్తికి ఫలం స్థితప్రజ్ఞత్వం. భగవద్గీతలో చెప్పబడిన స్థితప్రజ్ఞ లక్షణాలు పాండురాజు సంకల్పంలో ప్రతిఫలిస్తున్నాయి. "యదా సంహరతే చాయం, కూర్మోంఽ౽గానీవ సర్వశః । ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా॥ య స్సర్వత్రా నభిస్నేహః, తత్తత్ప్రాప్యశుభాశుభం । నాభినందతి న ద్వేష్టి, తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా॥'' మొదలైన శ్లోకాల తాత్పర్యం (భ.గీ. అధ్యా.2. శ్లో.58-57) స్మరింపతగినది. తపింపచేయటం తపస్సు. తపస్వి క్రమంగా ఇంద్రియాలను, క్రియలను, మనస్సును, రాగద్వేషాలను, ద్వంద్వాలను, సుఖదుఃఖాలను తపింపచేసి బ్రహ్మానందసిద్ధిని పొంది, ఆపై బ్రహ్మపదవిని పొందుతాడు. పాండురాజు ఆ మార్గాన్ని ఆశ్రయించా లని సంకల్పించాడు.

వ. అని నిశ్చయించి, గొంతిని మాద్రినిం జూచి; 'మీర లిందుండి నవయక హస్తిపురంబునకుం జని నాతపోవృత్తి నునికి రాజునకు సత్యవతీదేవికి భీష్మునకు విదురనకుం గౌసల్యలకు వృద్ధపురోహిత బ్రాహ్మణులకుం జెప్పి యం దుండుం' డనిన, వారలు బాష్పపూరితనయన లయి 'యిట్టి యుగ్రతపంబు విడిచి, మమ్ము విడువనియట్టి యాశ్రమంబున నుండి తపంబు సేయు నది; యేము నిన్ను విడిచి పోవనోపము; మమ్ము విడిచితేని యిప్పడ ప్రాణంబులు విడుతు' మనిన వారల నిశ్చయం బెఱింగి 'యట్లేని నాయొద్దన యుండుం; డేను వానప్రస్థాశ్రమంబున వల్కలంబులు గట్టి, రేపును మాపును మధ్యాహ్నంబునప్పడును స్నానంబు సేసి వేల్చుచుం గందమూలఫలాశనుండనై, పితృదేవతల వాక్సలిలవన్యఫలంబులం దనుపుచుఁ, గ్రమంబున దేహమోక్షణంబు సేయుదు' నని యప్పడు. 61

విశేషం: అని= ఆ ప్రకారంగా; నిశ్చయించి; గొంతిని= కుంతిని; మాద్రినిన్= మాద్రిని; చూచి; మీరలు; ఇందున్+ఉండి= ఇచ్చట వసించి; నవయక= కృశించిపోక; హస్తి, పురంబునకున్= హస్తినాపురికి; చని= వెళ్ళి; నా, తపస్+వృత్తి, ఉనికి= నేను తపోవృత్తిస్వీకరించే విషయాన్ని; రాజునకున్= ధృతరాష్ట్రునకు; సత్యవతీదేవికి= సత్యవతీదేవికి; భీష్మునకున్= భీష్మునికి; విదురునకున్; కౌసల్యలకు= అంబిక, అంబాలికలకు; వృద్ధ= వృద్ధులకు; పురోహిత= పురోహితులకు; బ్రాహ్మణులకున్= విప్రులకు; చెప్పి= తెలిపి; అందు+ ఉండుండు= అక్కడనే ఉండండి; అనినన్= అని చెప్పగా; వారలు= వారు (కుంతి, మాద్రి); బాష్ప, పూరిత, నయనలు+అయి= కన్నీటితో నిండిన కళ్ళు కలవారై; ఇట్టి, ఉగ్ర, తపంబు= ఇటువంటి భయంకరమైన తపస్సు; విడిచి= వీడి; మమ్మున్, విడువని, అట్టి, ఆశ్రమంబునన్+ఉండి= మమ్మల్ని విడిచిపెట్టనటువంటి ఆశ్రమంలో ఉండి; తపంబు, చేయునది= తపస్సు చేయండి; ఏము= మేము; నిన్నున్; విడిచి; పోవన్, ఓపము= పోలేము; మమ్ము; విడిచితి+ఏని= వదలివేసితివా; ఇప్పుడు+అ= ఈ క్షణమే; ప్రాణంబులన్, విడుతుము; అనినన్= అనగా; వారల= వారి యొక్క; నిశ్చయంబు= నిర్ణయము; ఎఱింగి= తెలిసికొని; అట్లు+ఏని= అట్లా అయితే; నా. ఒద్దన= నాదగ్గరే; ఉండుండు= ఉండండి; ఏను= నేను; వానప్రస్థ+ఆశ్రమంబునన్= వనములో వసించు ఆశ్రమధర్మముచేత; వల్కలంబులు= నారచీరలు; కట్టి; రేపును= ఉదయం; మాపును= సాయంకాలం; మధ్య+అహ్నంబు, అప్పుడును= మధ్యాహ్న సమయమునకూడ; స్నానంబు, చేసి= స్నానముగావించి; వేల్చుచున్= హోమం చేస్తూ; కంద, మూల; ఫల+అశనుండను+ఐ= గడ్డలు, వేళ్ళు, పళ్ళు ఆహారంగా కలవాడనై; పితృదేవతలన్= పితృదేవతలను; వాక్, సలిల, వన్య, ఫలంబులన్= మాటలతో, నీళ్ళతో, అడవిలో ఉండే పళ్ళతో; తనుపుచున్= తృప్తిపెట్టుతూ; క్రమంబున; దేహ, మోక్షణంబు= శరీరాన్ని విడువటం; చేయుదును= చేస్తాను; అని= అని చెప్పి; అప్పుడు.

తాత్పర్యం: అని నిశ్చయించి పాండురాజు కుంతిని, మాద్రిని చూచి 'మీరు ఇక్కడే ఉండి కృశించి పోక హస్తినాపురం వెళ్ళి, నేను తపోవృత్తిలో ఉండటాన్ని ధృతరాష్ట్రునికి, సత్యవతికి, భీష్మునికి, విదురునికి, తల్లులకు, వృద్ధులకు, పురోహితులకు, బ్రాహ్మణులకు చెప్పి అక్కడ ఉండండి' అని చెప్పగా వారు కంటతడిపెట్టి - 'ఈ విధమైన భయంకరతపస్సు మాని మాతోకూడ ఆశ్రమంలో ఉండి తపస్సు చేయండి. మేము మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళలేం. మీరు మమ్మల్ని వదలితే ఇప్పుడే ప్రాణాలు విడుస్తాం' అనగా, వారినిర్ణయం తెలిసికొని, 'అట్లా అయితే మీరు నా దగ్గరే ఉండండి. నేను వానప్రస్థాశ్రమంలో నారచీరలు కట్టి ఉదయం, సాయంకాలం, మధ్యాహ్నం స్నానం చేసి హోమం చేస్తూ కందమూలాలు, ఫలాలు ఆహారంగా తీసికొని, పితృదేవతలను మాటలతో, నీళ్ళతో, ఫలాలతో తృప్తిపరుస్తూ క్రమంగా శరీరాన్ని విడుస్తాను' అని అప్పుడు.

విశేషం: ఆశ్రమాలు నాలుగు. అవి - బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం. గృహస్థాశ్రమాన్ని వదలి వనంలోనే నివసిస్తూ తపస్వియై నియమజీవితాన్ని సాగించే ఆశ్రమం (జీవనవిధానం) వానప్రస్థం. వానప్రస్థంలో భార్యలతో కలిసి జీవించవచ్చును. సన్న్యాసంలో ఆ అవకాశం లేదు. అందువలననే చాలామంది రాజులు వానప్రస్థాశ్రమంలోనే తనువులు చాలిస్తారు.

పృథ్వి.

అమూల్య మణి భూషణంబులు గజాశ్వ బృందంబులున్
సమృద్ధ ధన ధాన్యరాసులుఁ బ్రశస్తగోవర్గముం
గ్రమంబునను భూసురేశుల కగణ్యపుణ్యార్థి యై
యమర్త్యనిభుఁ డిచ్చెఁ బాండువిభుఁ డత్యుదారస్థితిన్. **62**

ప్రతిపదార్థం: అమూల్య, మణి, భూషణంబులు= వెలలేని (అనగా ఎంతో విలువైన) రత్నాల సొమ్ములు; గజ+అశ్వ, బృందంబులున్= ఏనుగుల, గుర్రాల, సమూహాలు; సమృద్ధ, ధన, ధాన్య, రాసులున్= అధికమైన ధనరాసులు, ధాన్యరాసులు; ప్రశస్త, గోవర్గమున్= శ్రేష్ఠమైన ఆవులసమూహాన్ని; అమర్త్య, నిభుఁడు= దేవతలతో సమానుడైనవాడు; పాండు, విభుఁడు= పాండురాజు; అగణ్య, పుణ్య+అర్థి+ఐ= లెక్కకు మించిన పుణ్యాన్ని కోరినవాడై; అతి+ఉదార, స్థితిన్= మిక్కిలి ఎక్కువగా ఉదారమైన స్థితిచే; భూసుర+ఈశులకు= బ్రాహ్మణశ్రేష్ఠులకు; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: దేవతలతో సమానుడైన పాండురాజు, అపరిమిత మైన పుణ్యాన్ని కోరి, మిక్కిలి ఉదారంగా బ్రాహ్మణ శ్రేష్ఠులకు ఎంతో విలువైన రత్నాల సొమ్ములను, ఏనుగులను, గుఱ్ఱాలను, ధనరాసులను, ధాన్యరాసులను, శ్రేష్ఠమైన ఆవులను ఇచ్చాడు.

విశేషం: పృథ్వీ వృత్తపాదంలో 17 అక్షరా లుంటాయి. జ, స, జ, స య, లగ - అనే గణాలు వరుసగా ప్రతిపాదంలోనూ క్రమంగా వస్తాయి. 12వ అక్షరం యతిస్థానం. ప్రాస నియతి ఉన్నది. ఆంధ్రభారతంలో ఈ వృత్తాన్ని నన్నయమాత్రమే 5 సార్లు ప్రయోగించాడు. "సాక్షేప క్రోధ ధిక్కారే పరం పృథ్వీ భరక్షమా" అనే క్షేమేంద్రుని మతానికి చెందినవాడు నన్నయ. సంపదలపై తీవ్రమైన వ్యతిరేకభావంతో విరివిగా విప్రులకు దానం చేయటం ఈ వృత్తంలో వర్ణితం. (సంపా.)

వ. మఱియుం గల వస్తువు లెల్లను ధృతరాష్ట్రున కిచ్చి పుచ్చి, మమత్వాహంకారవిముక్తుండై, ధర్మపత్ను లయ్యిరువురుం దనయట్ల తపస్వినులై తోడరా నుత్తరాభిముఖుండై యరిగి, నాగశైలంబును జైత్రరథంబును బారిషేణంబును హిమవంతంబునుం గడచి, సురసిద్ధసేవితం బయిన గంధమాదనంబునం గొండొక కాలం బుండి, యింద్రద్యుమ్నం బను కొలనును హంసకూటంబును నతిక్రమించి. 63

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; కల, వస్తువులు+ఎల్లను= ఉన్నవస్తువులన్నీ; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రునికి; ఇచ్చి, పుచ్చి= ఇచ్చి పంపి; మమత్వ+అహంకార, విముక్తుండు+ఐ= మమకారంచేత, అహంకారంచేత విడువబడినవాడై; ధర్మ పత్నులు= ధర్మనిర్వహణకోసం అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకొన్న భార్యలు; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరు; తన, అట్లు+అ= తనవలె; తపస్వినులు+ఐ= తపస్సు చేసేవారై; తోడరాన్= వెంటరాగా; ఉత్తర+అభిముఖుండు+ఐ= ఉత్తరదిశవైపు ముఖం కలవాడై; అరిగి= వెళ్ళి; నాగశైలంబును; చైత్రరథంబును; పారిషేణంబును; హిమవంతంబునున్- ఆయా పేర్లుగల ప్రదేశాలను; కడచి= దాటి; సుర, సిద్ధ, సేవితంబు+అయిన= దేవతలచేత, సిద్ధులచేత సేవింపబడినదైన; గంధమాదనంబునన్= గంధమాదన పర్వతంమీద; కొండు+ఒక, కాలంబు= కొంతకాలం; ఉండి= వసించి; ఇంద్రద్యుమ్నంబు+అను= ఇంద్రద్యుమ్నము అను పేరుగల; కొలనును= సరస్సును; హంసకూటంబును= హంసకూటము అనుదానిని, అతిక్రమించి= దాటి.

తాత్పర్యం: ఇంకా ఉన్నవస్తువు లన్నీ ధృతరాష్ట్రునికి ఇచ్చి పంపి, మమకారాన్ని, అహంకారాన్ని విడిచి, తన ధర్మపత్నులు కుంతీమాద్రులు తనవలె తాపసవృత్తిని స్వీకరించి వెంటరాగా, ఉత్తరదిశవైపు పయనించి, నాగశైలాన్ని, చైత్రరథాన్ని, పారిషేణాన్ని, హిమవంతాన్ని దాటి, దేవతలు, సిద్ధులు సేవించే గంధమాదనంమీద కొంతకాలం ఉండి, ఇంద్రద్యుమ్నం అనే కొలనును, హంసకూటాన్ని దాటి వెళ్ళి.

పాండురాజు శతశృంగంబునఁ దపోవృత్తి నుండుట (సం. 1-111-1)

మ. యతిసంఘంబుల సంగతిన్ దురితకర్మాపేతుఁడై యేఁగి సం
తతసిద్ధామరయక్ష సేవితసముద్యచ్ఛృంగ మై యున్న యా
శతశృంగం బను పర్వతంబున శుభాచారుండు నిత్యవ్రతో
ద్యతుఁ డై ఘోరతపంబు సేసె మునిబృందం బద్భుతం బందఁగన్. 64

ప్రతిపదార్థం: యతి, సంఘంబుల, సంగతిన్= మునుల సమూహాల సహవాసంతో; దురిత, కర్మ+అపేతుఁడు+ఐ= పాపకర్మలనుండి తొలగినవాడై; ఏఁగి= వెళ్ళి; సంతత, సిద్ధ+అమర, యక్ష, సేవిత, సముద్యత్+శృంగము+ఐ= ఎల్లప్పుడు సిద్ధులచేత, దేవతలచేత, యక్షులచేత సేవించబడిన మిక్కిలి ఎత్తైన శిఖరాలు కలదై; ఉన్న; ఆ శత, శృంగంబు= ప్రసిద్ధమైన శతశృంగము; అను, పర్వతంబున= అను పేరుగల కొండయందు; శుభ+ఆచారుండు= శుభమైన నడవడి కలవాడు; నిత్య, వ్రత+ఉద్యతుఁడు+ఐ= ఎడతెగని వ్రతాలమీద పూనిక కలవాడై; ముని, బృందంబు= మునులసమూహం; అద్భుతంబు+ అందఁగన్= ఆశ్చర్యపడేటట్లు; ఘోర, తపంబు; = భయంకరమైన తపస్సు; చేసెన్.

తాత్పర్యం: పాండురాజు మునులతో కలిసి పాపకర్మలకు దూరమై, ఎప్పుడూ సిద్ధులు, దేవతలు, యక్షులు సేవించే ఎత్తైన శిఖరాలు కల శతశృంగ మనే పర్వతంమీద (శుభమైన) మంగళకరమైన నడవడితో, ఎడతెగని వ్రతాలతో, మునులంతా ఆశ్చర్యపడేటట్లు ఘోరమైనతపస్సు చేస్తూ ఉన్నాడు.

వ. ఇట్లు శతశృంగంబున నుత్తరభాగంబునందుఁ దపంబు సేయుచు బ్రహ్మఋషి సమానుండై, దివ్యవిమానంబు లెక్కివచ్చుచుం బోవుచున్న దేవగణంబులచేత సంకీర్ణం బైన స్వర్గమార్గంబున నుత్తరాభిముఖు లై యూర్ధ్వలోకంబున కనాయాసంబున నరిగెడు మునిసహస్రంబుం జూచి, 'మీర లెందులకుఁ బోయెద'రని యడిగిన నప్పాండురాజునకు వార లి ట్లనిరి. 65

ప్రతిపదార్థం: ఇట్లు; శతశృంగంబునన్= శతశృంగపర్వతమున; ఉత్తరభాగంబునందున్= ఉత్తరంవైపు; తపంబు; చేయుచున్; బ్రహ్మ, ఋషి, సమానుండు+ఐ= బ్రహ్మర్షులతో సమానమైనవాడై; దివ్య, విమానంబులు= దేవతలు ఎక్కి తిరుగు రథములు; ఎక్కి= ఎక్కి; వచ్చుచున్, పోవుచు+ఉన్న= వస్తూపోతూ ఉన్నట్టి; దేవ, గణంబులచేత= దేవతలసమూహంతో; సంకీర్ణంబు+ఐన= నిండిన; స్వర్గ, మార్గంబునన్= దివి యొక్కదారిలో; ఉత్తర+అభిముఖులు+ఐ= ఉత్తరదిశవైపు ముఖాలు కలవారు అయి; ఊర్ధ్వ, లోకంబునకున్= స్వర్గానికి; అనాయాసంబునన్= శ్రమలేకుండ; అరిగెడు= వెళుతున్న; ముని సహస్రంబున్= వెయ్యిమంది మునులను; చూచి; మీరలు; ఎందులకున్; పోయెదరు; అని అడిగినన్= అని అడుగగా; ఆ+పాండురాజునకున్= ఆ పాండురాజుతో; వారలు= వారు; ఇట్లు, అనిరి.

తాత్పర్యం: ఈ విధంగా శతశృంగపర్వతానికి ఉత్తరభాగంలో తపస్సు చేస్తూ బ్రహ్మర్షులతో సమానమైనవాడై, దివ్య విమానా లెక్కి వస్తూ పోతూ ఉండే దేవతాసమూహాలతో నిండిన స్వర్గమార్గంలో, ఉత్తరదిక్కుగా స్వర్గలోకానికి శ్రమ లేకుండా వెళ్ళుతున్న వెయ్యిమందిమునులను చూచి, 'మీరు ఎక్కడికి పోతున్నా'? రని అడుగగా, ఆ పాండురాజుతో వారు ఇట్లా అన్నారు.

**క. అమవస గావున నేఁ డ క్కమలజుఁ గొలువఁగ మహర్షిగణములు పితృసం
ఘములును బోదురు బ్రహ్మం । డమునం గలవార లం దొడంగూడంగన్. 66**

విశేషం: నేఁడు= ఈ రోజు; అమవస= అమావాస్య; కావున= కాబట్టి; ఆ+కమలజున్= పద్మంనుండి పుట్టిన ఆ బ్రహ్మదేవుడిని; కొలువఁగన్= సేవించటానికి; మహర్షి, గణములు= మహర్షుల సమూహాలు; పితృ, సంఘములును= పితృదేవతల సమూహాలు; బ్రహ్మండమునన్= విశ్వంలో; కల, వారలు= ఉండేవారు; అందు=ఆ బ్రహ్మలోకంలో; ఒడన్+కూడంగన్= చేరటానికి; పోదురు= పోతూఉన్నారు.

తాత్పర్యం: ఈ రోజు అమావాస్య. అందువలన బ్రహ్మదేవుడిని సేవించడానికి మహర్షులసమూహాలు, పితృదేవతల సమూహాలు, బ్రహ్మండంలో ఉన్నవాళ్ళంతా ఆ బ్రహ్మలోకం చేరటానికి పోతారు.

విశేషం: అమావాస్య పితృదినంగా ప్రసిద్ధం.

వ. 'అది కారణంబుగా నేమును బ్రహ్మలోకంబునకుం బోయెద' మనిన నమ్మునుల పిఱుంద భార్యాద్వయసహితుండై సమవిషమప్రదేశంబులం జనుచున్న య ప్పాండురాజుం జూచి ఋషు లి ట్లనిరి. 67

విశేషం: అది, కారణంబుగాన్= ఆ కారణంగా; ఏమును= మేముకూడా; బ్రహ్మ, లోకంబునకున్; పోయెదము; అనన్=అనగా; ఆ+మునుల; పిఱుంద= వెనుక; భార్యా, ద్వయ, సహితుండు+ఐ= భార్యల జంటతో కూడినవాడు అయి; సమ, విషమ, ప్రదేశములన్= సమంగా, మిట్టపల్లాలుగా ఉన్న భూములలో; చనుచు+ఉన్న= వెళ్ళుతున్న; ఆ+పాండురాజున్; చూచి; ఋషులు; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: 'ఆ కారణంగా మేము బ్రహ్మలోకానికి పోతున్నాం' అని అనగా, ఆ మునుల వెనుక భార్య లిద్దరితో సమంగానూ, మిట్టపల్లాలుగానూ ఉన్న భూమిమీద పోతున్న ఆ పాండురాజును చూచి ఋషులు ఇట్లా అన్నారు.

క. వీర లతిలలిత మృదులా । కారలు, గిరివిషమగహనగహ్వరముల రా
నేరరు గావున నిట చను । దేరక మీ రుండుఁ డివియు దేవపథంబుల్. 68

ప్రతిపదార్థం: వీరలు= ఈ కుంతీమాద్రులు; అతి, లలిత, మృదుల+ఆకారలు= మిక్కిలి మనోహరం, సుకుమారం అయిన ఆకారాలు కలవారు; గిరి, విషమ, గహన, గహ్వరములన్= కొండలలో మిట్టపల్లాలై చొరశక్యం కాని గుహలలో; రానేరరు= రాలేరు; కావునన్; ఇట= ఇచ్చటనుండి; చనుదేరక= రాకుండ; మీరు; ఉండుఁడు; ఇవియు= విశేషించి ఇవి; దేవ, పథంబుల్= దేవలోకానికి వెళ్ళే దారులు.

తాత్పర్యం: నీ భార్యలు మిక్కిలి సుకుమారమైన శరీరాలు కలవాళ్ళు. వీళ్ళు కొండలలో మిట్టపల్లాలై చొర శక్యం కాని గుహలలో రాలేరు. మీరు ఆగండి. విశేషించి ఇవి దేవమార్గాలు.

విశేషం: నీ భార్యలు సుకుమారశరీరాలు కలవారు; మిట్టపల్లాలతో చొరశక్యంకాని ఈ కొండగుహలలో రాలేరు- అనటం సమంజసమే. కాని, తాము వెళ్తూ మీరు ఆగండి; ఇవి దేవమార్గాలు అనడంలో - ఈ మార్గంలో వచ్చే యోగ్యత మీకు లేదనే అంశాన్ని సూక్ష్మాతిసూక్ష్మంగా పాండురాజుమనస్సు నొవ్వకుండా మునులు ధ్వనింపచేశారు. పాండురాజుకు తప స్సున్నది. సంతానం లేదు. సంతానహీనులకు దేవమార్గంలో ప్రవేశించడానికి అర్హత లేదు. ఈ విషయాన్ని పాండురాజు గ్రహించాడు.

క. అనిన విని నరుల కక్కడఁ జనఁబోలమి యెఱిఁగి పాండుజనపాలకుఁ డి
ట్లనియెను 'స్వర్గద్వారం । బనపత్యులు గాన నోపరటె మును లయ్యున్.' 69

ప్రతిపదార్థం: అనిన, విని= అని మునులు చెప్పగా విని; నరులకు; అక్కడన్; చనన్+పోలమి= వెళ్ళటం సాధ్యం కాకుండటాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; పాండు, జనపాలకుఁడు= పాండురాజు; ఇట్లు+అనియెను; అనపత్యులు= సంతానం లేనివారు; మునుల్+అయ్యున్= ఋషులైనప్పటికి; స్వర్గ, ద్వారంబు= స్వర్గముయొక్క వాకిలి; కానన్= చూచుటకు; ఓపరు+అటె= చూడలేరట కదా.

తాత్పర్యం: ఋషు లన్న మాటలు విని, మానవు లక్కడికి పోలే రని తెలిసికొని పాండురాజు - 'సంతానం లేనివాళ్ళు మును లైనప్పటికీ స్వర్గద్వారాన్ని చూడలేరటకదా' అన్నాడు.

విశేషం: 68వ పద్యంలో వ్యంగ్యంగా చెప్పబడిన అంశం ఈ పద్యంలో వాచ్యం కావటంచేత అత్యంతతిరస్కృతవాచ్యధ్వని ఇక్కడ గుణీభూత మయింది. (సంపా.)

వ. 'అపుత్త్రస్య గతి ర్నాస్తి' యను వేదవచనంబుం గలదు గావున నే నపుత్త్రకుండ నేమి సేయుదు? ననిన మునులును గరుణించి యోగదృష్టి ననాగతం బెఱింగి. 'నీ వపుత్త్రకుండవు గావు; దైవాధిష్ఠితం బైన సంతానంబు నీకు ధర్మానిలశక్రాశ్వినులవరంబున నగు; నక్షయలోకంబులుం బడయుదువు గావున సంతానార్థంబు యత్నంబుఁ సేయు' మనిన విని పాండురా జాత్మగతంబునఁ 'బురుషుండు పుట్టుచుండి దేవఋషి పితృమనుష్యులఋణంబులు నాలుగింటితోడం బుట్టి యథాకాలవిధుల వానివలన విముక్తుండు గావలయు; నట్లుగాని వానికిఁ బుణ్యలోకంబులు

లేవు; యజ్ఞంబులంజేసి దేవతలఋణంబును, దపస్స్వాధ్యాయ బ్రహ్మచర్యవ్రతంబులంజేసి ఋషుల ఋణంబును, శ్రాద్ధపుత్త్రలాభంబులం జేసి పితరుల ఋణంబును, నానృశంస్యంబునం జేసి మనుష్యుల ఋణంబునుం బాపవలయు; నందుఁ బితరుల ఋణంబు దక్కఁ దక్కిన మూఁడుఋణంబులవలన విముక్తుండ నయితి. 70

విశేషం: అపుత్రస్య= బిడ్డలులేనివానికి; గతిః= పుణ్యలోకం; నాస్తి= లేదు; అను; వేద, వచనంబున్= వేదవాక్యంకూడ; కలదు, కావున; నేనున్= నేను; అపుత్రకుండను= సంతానంలేనివాడిని; ఏమి చేయుదును; అనిన= అనగా; మునులును; కరుణించి= దయదలచి; యోగ, దృష్టిన్; అనాగతంబు= రాబోవుదానిని; ఎఱింగి= గ్రహించి; నీవు; అపుత్రకుండవు= పుత్రులు లేనివాడివి; కావు; దైవ+అధిష్ఠితంబు+ఐన= దేవతలచేత ప్రభావితం చేయబడిన; సంతానంబు; నీకున్; ధర్మ+అనిల, శక్ర+అశ్వినుల, వరంబునన్= యమునియొక్క, వాయువుయొక్క, ఇంద్రునియొక్క, అశ్వినీదేవతలయొక్క వరంచేత; అగున్= కలుగుతుంది; అక్షయ, లోకంబులున్= నాశం లేనిలోకాలు - అనగా పుణ్యలోకాలు; పడయుదువు= పొందుతావు; కావునన్, సంతాన+అర్థంబు= సంతానంకొరకు; యత్నంబు; చేయుము; అనినన్= అనగా; విని; పాండురాజు; ఆత్మగతంబునన్= మనస్సులో; పురుషుండు; పుట్టుచుండి; దేవ, ఋషి, పితృ, మనుష్యుల, ఋణంబులు; నాలుగింటితోడన్; పుట్టి; యథాకాల, విధులున్= ఆ యా కాలాల్లో చేసే కార్యాలచేత; వానివలన= ఈ ఋణాలవలన; విముక్తుండు= విడువబడినవాడు; కావలయున్= అగును; అట్లు, కానివానికిన్= ఆ విధంగా కాని అతనికి; పుణ్యలోకంబులు; లేవు= ఉండవు; యజ్ఞంబులన్, చేసి, దేవతల, ఋణంబును; తపస్+స్వాధ్యాయ, బ్రహ్మచర్య, వ్రతంబులన్, చేసి= తపస్సుచేత, వేదాధ్యయనంచేత, బ్రహ్మచర్యవ్రతంచేత; ఋషుల, ఋణంబును; శ్రాద్ధ, పుత్రలాభంబులన్, చేసి= శ్రాద్ధాలచేత, కొడుకులను పొందటంచేత; పితరుల ఋణంబునున్; ఆనృశంస్యంబు+చేసి= అక్రూరమైన భావంచేత - అనగా దయకలిగి ఉండటంచేత; మనుష్యుల ఋణంబునున్; పాపవలయున్= పోగొట్టవలెను; అందున్= అందులో; పితరుల, ఋణంబు; తక్కన్= తప్ప; తక్కిన, మూడు, ఋణంబులవలనన్; విముక్తుండను+అయితిన్= విడువబడినవాడను అయ్యాను.

తాత్పర్యం: 'పుత్రులు లేనివారికి పుణ్యలోకం లేదు' అనే వేదవచనంకూడా ఉన్నది. నేను పుత్రులు లేనివాడిని. ఏమి చేసేది?' - అని పాండురాజు అనగా, మునులు, దయతలచి, యోగదృష్టితో ముందు జరిగేదాన్ని తెలిసికొని 'నీవు పుత్రులు లేనివాడివి కావు. యమధర్మరాజు, వాయువు, ఇంద్రుడు, అశ్వినీదేవతల వరంతో నీకు సంతానం కలుగుతుంది. నీవు పుణ్యలోకాలు పొందుతావు. కాబట్టి సంతానంకొరకు ప్రయత్నించుము' అని చెప్పారు. అది విని పాండురాజు మనస్సులో ఇట్లా తలచాడు. 'పురుషుడు దేవ, ఋషి, పితృ, మనుష్య ఋణాలు నాలుగింటితో పుట్టి, ఆయాకాలాలలో చేయవలసిన కార్యాలచేత ఈ ఋణవిముక్తుడు కావాలి. అట్లా ఋణవిముక్తుడు కానివాడికి పుణ్యలోకాలు లేవు. యజ్ఞాలు చేసి దేవతల ఋణాన్నీ, తపస్సు, వేదాధ్యయనం, బ్రహ్మచర్యవ్రతంచేత ఋషుల ఋణాన్నీ, శ్రాద్ధాలు పెట్టి, కొడుకుల్ని కని పితృదేవతల ఋణాన్నీ, దయార్ద్రహృదయుడై మానవఋణాన్ని తీర్చుకోవాలి. నేను ఒక్క పితరులఋణం తప్ప-మిగతా మూడూ తీర్చుకొన్నాను.

విశేషం: పంచమవేదమైన మహాభారత ఆంధ్రీకరణంలో నన్నయ సందర్భోచితంగా వేదధర్మాలను వివరించడమే కాక వేదవాక్యాలను కూడా చెప్పాడు. 'అపుత్రస్య గతి ర్నాస్తి' అనే వాక్యం అటువంటిదే. 'ఋణం' శబ్దంలో ఋ వర్ణానికి బదులు రు, రి వర్ణాలు - ఋషి - రుషి - రిషి, ఋణము - రుణము - అని తాళపత్రప్రతులలో ఉండటం గమనించదగింది.

తే. దేహనాశంబుతోడన తీఱు నెల్ల। ఋణములును మఱి పితరులఋణము దేహ
నాశ మయినను దీఱదు నాకు నదియ। తక్కియున్నది యే నెట్లు దానిఁ బాతు. 71

ప్రతిపదార్థం: దేహ, నాశనంబుతోడన= శరీరం నశించిన వెంటనే; ఎల్ల, ఋణములను= అప్పులన్నీ, తీఱున్= తీరిపోతాయి; మఱి= ఇక; పితరుల, ఋణము= పితృ ఋణం; దేహ, నాశము+అయినను, తీరదు= శరీరము నాశనం అయినప్పటికి తీరిపోదు; నాకున్; అదియు; ఆ పితరుల ఋణమే; తక్కి, ఉన్నది= మిగిలి ఉన్నది; ఏను= నేను; దానిన్= దానిని; ఎట్లు, పాతున్= ఏవిధంగా తొలగించుకుంటాను.

తాత్పర్యం: శరీరం నశించిన వెంటనే అన్నిఋణాలు తీరిపోతాయి. పితరుల ఋణముమాత్రం శరీరం నశించినా తీరదు. నాకు అది ఒక్కటే మిగిలిఉన్నది. నేను దానిని ఎట్లా తీర్చుకొనగలను?

వ. అని దుఃఖించి మృగశాపంబు దలంచి, తనవలన సంతానం బయ్యెడి విధంబు లేమి యెఱింగి యొక్కనాఁ డేకాంతంబ గొంతి కి ట్లనియె. 72

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; దుఃఖించి; మృగ, శాపంబు; తలంచి; తనవలన= తనమూలకంగా; సంతానంబు;అయ్యెడి= కానున్న; విధంబు= తీరు; లేమి= లేకపోవటాన్ని; ఎఱింగి= తెలిసి; ఒక్కనాఁడు; ఏకాంతంబు+అ= ఒంటరిగా; గొంతికి= కుంతీదేవికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని విచారించి మృగశాపాన్ని తలచికొని, తనవలన సంతానం కలిగేమార్గం లేకపోవటాన్ని తెలిసికొని, ఒకరోజు ఒంటరిగా ఉన్న కుంతితో ఈ విధంగా అన్నాడు.

ఉ. దానములం దపంబుల సదక్షిణ యజ్ఞములన్ విహీన సం
తానుల కూర్ధ్వలోక సుపథంబు లవశ్యము గావు; లబ్ధ సం
తానుల యెందుఁ బుణ్యు; లిది తథ్యము గావున నొండు దక్కి సం
తానము నాకు నయ్యెడువిధం బొనరింపుము ధర్మసంస్థితిన్. 73

ప్రతిపదార్థం: దానములన్; తపంబులన్; స, దక్షిణ, యజ్ఞములన్= దక్షిణలతో కూడిన యజ్ఞాలచేత; విహీన, సంతానులకు= సంతానం లేనివాళ్ళకి, ఊర్ధ్వ, లోక సుపథంబులు= పై లోకాలకు మంచిమార్గాలు; అవశ్యము= తప్పక; కావు= లభించవు; లబ్ధ, సంతానులు+అ= పొందబడిన సంతానం కలవాళ్ళే, ఎందున్= ఎచ్చటైనా; పుణ్యులు= పుణ్యంకలవాళ్ళు; ఇది; తథ్యం= నిజం; కావునన్; ఒండు= ఇతరకార్యాలు; తక్కి= మాని; నాకున్; సంతానము; ధర్మ, సంస్థితిన్= ధర్మమార్గంలో; అయ్యెడు, విధంబు= కాగల తీరు; ఒనరింపుము= చేయుము.

తాత్పర్యం: దానాలు చేసినా, దక్షిణలతో యజ్ఞాలు చేసినా, సంతానం లేనివాళ్ళకు పుణ్యలోకాలు లభించవు. సంతానం కలవాళ్ళే పుణ్యవంతులు. అందువలన నీవు ఇతరకార్యా లన్నీ మాని, ధర్మమార్గంలో నాకు సంతానం కలిగేటట్లు చేయుము.

క. అనపత్యుఁడ నై జీవిం । చిన, మృతిఁ బొందినను నిర్విశేషంబ; యిహం
బును బరమును నఫలమ; గా । వున సంతతి వడయు ధర్మువున ధర్మసతీ! 74

ప్రతిపదార్థం: అనపత్యుఁడను+ఐ= బిడ్డలు లేనివాడనై; జీవించినన్= బ్రతికినను; మృతిన్+పొందినను= మరణం పొందినా; నిర్+విశేషంబు+అ= విశేషం లేదు - అనగా ఒక్కటే; ఇహంబును= ఈ లోకం; పరమును= పరలోకం; అఫలము+అ= ఫలం లేనిదే; కావున; ధర్మ, సతీ= ధర్మపత్నీ - కుంతీ! ధర్ముమ్మవునన్= ధర్మంచే; సంతతి= సంతానాన్ని; పడయుము= పొందుము.

తాత్పర్యం: బిడ్డలు లేనివాడినై జీవించినా, మరణించినా ఒకటే; ఇహపరలోకాలు రెండూ ఫలరహితాలే. అందుచేత నీవు ధర్మపద్ధతిలో సంతానం పొందుము.

వ. 'ఔరస క్షేత్రజ దత్తక కృత్రిమ గూఢోత్ప న్నాపవిద్ధు లను నార్వురుపుత్త్రులు బంధువులు దాయాదులు నగుదురు, కానీన సహోఢక్రీత పౌనర్భవ స్వయందత్త జ్ఞాతు లను నార్వురుపుత్త్రులు బంధువు లగుదురు గాని దాయాదులు గా; రట్టి పుత్త్రులలో నౌరసున కించుకయ తక్కువగాని తక్కటి పుత్త్రులకంటె క్షేత్రజుం డుత్కృష్టుం; డందును దేవరన్యాయ జాతుం డుత్తముం డండ్రు గావున నస్మన్నియోగంబునంజేసి ధర్మమార్గంబున క్షేత్రజులం బడసిన నేనును బుత్త్రవంతుల పుణ్యలోకంబులు వడయనేర్తు; నె ట్లనినఁ; దొల్లి గేకయరా జైన శారదండాయని పుత్త్రోత్పాదనంబునం దశక్తుం డయి తనధర్మపత్ని నీచెలియలి శ్రుతసేనం బుత్త్రార్థంబు నియోగించిన నది బ్రాహ్మణవచనంబునం బుణ్యస్నాతయై పుంసవనహోమంబు సేయించి ఋత్విజులవలన దుర్జయాదు లయిన కొడుకుల ముప్పురం బడసెఁ; బుత్త్రలాభంబున ననంతపుణ్యఫలం బగుట నది ధర్మ్యం బయిన యాచారం' బనిన విని కుంతి యి ట్లనియె. 75

ప్రతిపదార్థం: ఔరస, క్షేత్రజ, దత్తక, కృత్రిమ, గూఢ+ఉత్పన్న+అపవిద్ధులు+అను= వివాహం చేసికొన్న భార్యయందు తనకు పుట్టినవాడు, నియోగంచేత తన భార్యయందు ఇతరులవలన పుట్టినవాడు, తనకు కుమారుడుగా ఇవ్వబడిన ఇతరుల కుమారుడు, అభిమానంతో కుమారుడుగా పెంచుకొనబడినవాడు, తనభార్యయందు తనకు తెలియకుండా ఇతరులవలన జన్మించినవాడు, తల్లిదండ్రులచేత విడిచిపెట్టబడి తనదగ్గర చేరినవాడు; అను; ఆర్వురు= ఆరుగురు; పుత్త్రులు; బంధువులు; దాయాదులున్= తన సంపదలో భాగం పొందేవాళ్ళు; అగుదురు; కానీన, సహోఢ, క్రీత, పౌనర్భవ, స్వయందత్త, జ్ఞాతులు= పెళ్ళికిముందు తన భార్య కన్యగా ఉన్నప్పుడు పుట్టినవాడు, వివాహసమయానికే గర్భిణిగా ఉన్న తన భార్యకు వివాహానంతరం పుట్టినవాడు, తల్లిదండ్రులకు ధన మిచ్చి కొనబడినవాడు, భర్తచే విడువబడిన స్త్రీకి లేదా విధవకు తనచేత పుట్టింపబడినవాడు, నీకు పుత్రుడను అవుతా నని తనంతగా తాను వచ్చినవాడు, తనగోత్రంవాడు; అను; ఆర్వురు= ఆరుగురు; పుత్త్రులు; బంధువులు; అగుదురు= ఔతారు; కాని, దాయాదులు= ఆస్తిలో భాగం పంచుకొనేవారు; కారు; అట్టి, పుత్త్రులలో, క్షేత్రజుండు= నియోగంచేత తన భార్యకు ఇతరులచేత పుట్టిన కుమారుడు; ఔరసునకు= వివాహమాడిన తన భార్యయందు తనకు పుట్టినవాడికంటె; ఇంచుకయ= కొంచెం; తక్కువగాని= అల్పుడు కాని; తక్కటి= మిగిలిన; పుత్రులకంటె; ఉత్కృష్టుండు= శ్రేష్ఠుడు; అందును= అందులోనూ; దేవర, న్యాయ, జాతుండు= దేవరన్యాయంవలన పుట్టినవాడు; ఉత్తముండు; అండ్రు= అంటారు; కావునన్; అస్మత్, నియోగంబునన్, చేసి= నా ఆజ్ఞతో చేసి; ధర్మ, మార్గంబునన్= ధర్మమార్గముచేత; క్షేత్రజులన్= క్షేత్రజులను; పడసినన్= పొందినచో; నేనును= నేనుకూడా; పుత్త్రవంతుల, పుణ్యలోకంబులు= పుత్రులున్నవాళ్ళు పొందే పుణ్యలోకాలు; పడయ, నేర్తున్(నేర్చుదున్)= పొందగల్గుతాను; ఎట్లు+అనినన్= ఏ విధంగా అంటే; తొల్లి= పూర్వం; కేకయ, రాజు+ఐన; శారదండాయని; పుత్ర+ఉత్పాదనంబు; అందున్= కొడుకులను పుట్టించటంలో; అశక్తుండు+అయి= శక్తిలేనివాడై; తన, ధర్మ, పత్ని= తాను అగ్నిసాక్షిగా వివాహం చేసికొన్న భార్యను; నీ చెలియలిన్= నీ (కుంతియొక్క) చెల్లెలిని; శ్రుతసేనన్; పుత్త్ర+అర్థంబు= పుత్రుల కొరకు; నియోగించినన్= ఆజ్ఞాపించగా; అది= ఆమె; బ్రాహ్మణ= బ్రాహ్మణుల; వచనంబునన్= మాటనుబట్టి; పుణ్య, స్నాత +ఐ= పవిత్రమైన స్నానం చేసిందై; పుంసవన, హోమంబు= కొడుకు పుట్టడానికి చేసే వైదికశుభకర్మకు

సంబంధించినహోమం; చేయించి; ఋత్విజులవలనన్= యజ్ఞం చేయించే బ్రాహ్మణులవలన; దుర్జయ+ఆదులు+అయిన= దుర్జయుడు మొదలగు వారైన; కొడుకులన్; ముప్వురన్= ముగ్గురిని; పడసెన్= పొందెను; పుత్ర, లాభంబునన్= కొడుకులు పుట్టడంవలన; అనంత; పుణ్య, ఫలంబు+అగుటన్= అంతులేని పుణ్యం కలగటంచేత; అది= దేవరన్యాయంతో పుత్రులను పొందటం; ధర్మ్యంబు+ అయిన, ఆచారంబు= ధర్మంతో కూడిన ఆచారము; అనినన్= అనగా; విని; కుంతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఔరసుడు, క్షేత్రజుడు, దత్తకుడు, కృత్రిముడు, గూఢోత్పన్నుడు, అపవిద్ధుడు అనే ఆరుగురు పుత్రులు బంధువులుమాత్రమే కాదు, ఆస్తిలో భాగస్వాములుకూడా. కానీనుడు, సహోఢుడు, క్రీతుడు, పౌనర్భవుడు, స్వయందత్తుడు; జ్ఞాతుడు అనే ఆరుగురుపుత్రులు బంధువులే, కాని, ఆస్తిలో భాగస్వాములు కారు. ఈ పుత్రు లందరిలో క్షేత్రజుడు ఔరసుడికన్నా కొంచెం తక్కువ; తక్కినవారికన్నా మిన్న. అందునా దేవరన్యాయంచేత పుట్టిన క్షేత్రజుడు ఉత్తముడు. అందువలన నీవు నా ఆజ్ఞచేత ధర్మమార్గంలో క్షేత్రజులను పొందితే పుత్రు లున్నవాళ్ళు పొందే పుణ్యలోకాలు నేను పొందుతాను. ఎట్లా అంటే - పూర్వం కేకయరాజు శారదండాయని తాను పుత్రులను పొందలేక తనధర్మపత్ని, అంటే నీచెల్లెలు శ్రుతసేనను పుత్రులకొరకు నియోగించగా, ఆమె బ్రాహ్మణులు చెప్పినట్లు పుణ్యస్నానం చేసి, పుత్రులు పుట్టటంకోసం చేసేపుంసవన హోమం చేయించి, ఋత్విజులవలన దుర్జయుడు మొదలైన ముగ్గురుకొడుకులను పొందింది. పుత్రులు పుట్టటంచేత అంతులేని పుణ్యం కలుగుతుంది. కాబట్టి దేవరన్యాయంచేత పుత్రులను పొందటం ధర్మంతో కూడిన ఆచారం' అని పాండురాజు చెప్పగా కుంతి ఇట్లా అన్నది.

విశేషం: ఆంధ్రమహాభారతంలో సంశోధితప్రతిలో ఈ క్రింది విశేషా లున్నాయి. "సంస్కృతమూలము-సంతానమును బంధుదాయాదులు, అబంధుదాయాదులు- అని రెండుగా విభజించినది. అందు బంధుదాయాదులు; (1) స్వయంజాతుఁడు (2) ప్రణీతుఁడు (3) పరిక్రీతుఁడు (4) పౌనర్భవుఁడు (5) కానీనుఁడు (6) స్వైరిణీసుతుఁడు. అబంధుదాయాదులు- (1) దత్తుఁడు (2) క్రీతుఁడు - కృత్రిముఁడు (3) స్వయందత్తుడు (4) సహోఢుఁడు (5) జ్ఞాతరేతుఁడు (6) హీనయోనిధృతుఁడు. క్షేత్రజుఁడు -అనుటకు బదులు పి.పి.ఎస్ ప్రతిలో 'క్షేత్రిక' పదము కలదు. మూలమునందు 'క్షేత్రజుఁడు' అను పేరు లేదు. ప్రణీతుఁ డనియే కలదు. "ఊఢాయామేవ ఉత్తమానుగ్రహా జ్జాతః ప్రణీతః" అని నీలకంఠీయవ్యాఖ్య. బంధు దాయాద, అబంధుదాయాద విభాగమునందు నన్నయ మార్పులు చేసెను. దత్తక, కృత్రిమాపవిద్ధులు - అనువారిని నన్నయ బంధుదాయాదులలో చేర్చెను. బంధుదాయాదులనుండి పరిక్రీతుఁడు, పౌనర్భవుఁడు, కానీనుఁడు - అను వీరిని తొలగించెను. హీనయోనిధృతుఁడు మూలములో అన్ని ప్రతులయందును పేర్కొనఁబడెను. ఆంధ్రమునం దీతఁడు విడువఁబడెను. షట్సంతానమును పూర్తి చేయుటకై క్రీతుఁడు, కృత్రిముఁడు వేర్వేరుగా పరిగణింపఁబడిరి. (ప్రథమసంపుటం పు.273)"

మరొక విశేషం: నన్నయ ఆపస్తంబసూత్రుడు కాబట్టి ఆపస్తంబధర్మసూత్రాలను అనుసరించి సంతానవిషయాన్ని సమీక్షించి ఉండవచ్చును. మనువు, బోధాయనుడు, గౌతముడు ద్వాదశవిధపుత్రులను పేర్కొన్నారు. వారు ఔరస, క్షేత్రజ, దత్తక,కృత్రిమ, గూఢోత్పన్న, అపవిద్ధ, కానీన, సహోఢ, క్రీత, పౌనర్భవ, స్వయందత్త, జ్ఞాతులు. ఆపస్తంబుడు ఆరుగురిని మాత్రమే వారసులుగా, దాయాదులుగా పేర్కొన్నాడు. వారిలోకూడ క్రీతుడినీ, దత్తుడినీ తిరస్కరించాడు. నన్నయ మనువు పేర్కొన్నద్వాదశ పుత్రులను పేర్కొన్నప్పటికీ ఆరుగురినే వారసులుగా నిర్ధారించాడు. ఔరసుని తరువాత క్షేత్రజుడిని నిలిపాడు. (సంపా.)

క. భరతకులశ్రేష్ఠుఁడ వయి। పరఁగిన నీ కేము ధర్మపత్నుల మయి యిం
కొరుల మనుష్యుల నంతః। కరణంబులఁ దలఁపఁ బొందఁగా నోపుదుమే? 76

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భరత, కుల, శ్రేష్ఠుఁడవు+అయి= భరతవంశంలో ఉత్తముడవు అయి; పరఁగిన= ఒప్పిన; నీకున్= నీకు; ఏము= మేము; ధర్మపత్నులము+అయి= అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్యలమై; ఇంకన్= మరి; ఒరుల, మనుష్యులన్= ఇతర పురుషులను; అంతఃకరణంబులన్= మనస్సులలో; తలఁపన్= తలంచుటకు; పొందగా= కలవడానికి; ఓపుదుమె= ఒప్పుకొందుమా? (ఒప్పుకొన మని భావం.)

తాత్పర్యం: భరతవంశంలో శ్రేష్ఠుడ వైన నీకు ధర్మపత్నుల మై, పరపురుషులను మనస్సులలో తలవటానికి, కలవటానికి ఒప్పుకోగలమా?

వ. 'భవత్ప్రసాదంబున మాయందుఁ బుత్త్రోత్పత్తి యగు నె ట్లనిన; దీని కనుగుణం బయినది యొక్క పుణ్యకథఁ దొల్లి పౌరాణికులవలన నా వినిన దానిం జెప్పెదఁ జిత్తగించి విను' మని పాండురాజునకుఁ గుంతి యి ట్లనియె. 77

ప్రతిపదార్థం: భవత్+ప్రసాదంబునన్= నీ అనుగ్రహంతో; మాయందున్; పుత్త్ర+ఉత్పత్తి, అగున్= కొడుకులు పుట్టటం జరుగుతుంది.; ఎట్లు+అనిన= ఏ విధంగా అంటే; దీనికిన్; అనుగుణంబు+అయినది= తగినది; ఒక్క, పుణ్య, కథ= ఒక పుణ్యకథ; తొల్లి= పూర్వం, పౌరాణికులవలన= పురాణాలు చెప్పేవారివలన; నా, వినిన, దానిన్= నేను విన్న దానిని; చెప్పెదన్= తెలుపుతాను; చిత్తగించి= మనస్సు ఉంచి; వినుము; అని; పాండురాజునకున్; కుంతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీదయవలన మాకు కొడుకులు కల్గుతారు. ఎట్లా అంటే దీనికి తగ్గ ఒకపుణ్యకథ పూర్వం పౌరాణికులు చెప్పగా విన్నాను. మనస్సు నిలిపి వినండి' అని పాండురాజుతో కుంతి ఇట్లా అన్నది.

వ్యుషితాశ్వుండను రాజు వృత్తాంతము (సం. 1-112-7)

చ. అతుల బల ప్రతాప మహిమాధికుఁ డై వ్యుషితాశ్వుఁ డన్మహీ
పతి నయధర్మతత్పరుఁడు పౌరవవంశజుఁ డశ్వమేధముల్
శత మొనరించుచుండి భుజశక్తి జయించె మహీశులం బ్రవ
ర్ధితయశుఁ డై ప్రతీచ్యుల నుదీచ్యులఁ బ్రాచ్యుల దాక్షిణాత్యులన్. 78

ప్రతిపదార్థం: అతుల, బల, ప్రతాప, మహిమ+అధికుఁడు+ఐ= సాటిలేని బలపరాక్రమాల ప్రభావంచేత గొప్పవాడై; నయ, ధర్మ, తత్పరుఁడు= నీతి, ధర్మాలమీద ఆసక్తికలవాడు; పౌరవ, వంశజుఁడు= పూరువువంశంలో పుట్టినవాడు; వ్యుషిత+అశ్వుఁడు= వ్యుషితాశ్వుడు; అన్+మహీ, పతి= అనే రాజు; అశ్వమేధముల్= అశ్వమేధయాగములు; శతము= వంద, ఒనరించు+ఉండి= చేస్తూ ఉండి, భుజ, శక్తిన్= భుజబలంతో; ప్రవర్ధిత, యశుఁడు+ఐ= పెంపొందింపబడిన కీర్తి కలవాడై; ప్రతీచ్యులన్= పడమటి దిక్కులో ఉన్నవాళ్ళను; ఉదీచ్యులన్= ఉత్తరాన ఉన్నవాళ్ళను; ప్రాచ్యులన్= తూర్పున ఉన్నవాళ్ళను; దాక్షిణాత్యులన్= దక్షిణాన ఉన్నవాళ్ళను; మహి+ఈశులన్= రాజులను; జయించెన్.

తాత్పర్యం: సాటిలేని బలపరాక్రమాలతో అందరిని మించినవాడై, నీతిలో, ధర్మంలో ఆసక్తి కలిగి, పూరువంశంలో జన్మించిన వ్యుషితాశ్వు డనే మహారాజు అశ్వమేధయాగాలు వంద చేసి, భుజబలంతో పెంపొందిన కీర్తి కలవాడై నాలుగుదిక్కులలో ఉన్న రాజులను జయించాడు.

విశేషం: వ్యుషితాశ్వుడు బలపరాక్రమాలలో, దిగ్విజయాలలో పాండురాజును పోలి ఉండటంచేత కుంతికి అతని వృత్తాంతం జ్ఞాపకం వచ్చినట్లు ధ్వని. పాండురాజుయొక్క దిగ్విజయప్రశంసలోను, వ్యుషితాశ్వునిప్రశంసలోను నన్నయ చంపకమాలను వినియోగించటం విశేషం. వృత్తరచనాశిల్పం. చూడు. 39, 42 (సంపా.)

క. ఆతని యజ్ఞంబునఁ బురు । హూత పురస్సర మరుద్గణోత్తము లధిక
ప్రీతిఁ జనుదెంచి హవ్యము । లాతతహస్తములఁ గొందు రగ్నిముఖమునన్. 79

ప్రతిపదార్థం: అతని= ఆ రాజుయొక్క; యజ్ఞంబునన్; పురుహూత, పురఃసర, మరుత్+గణ+ఉత్తములు= దేవేంద్రుడు మొదలైన దేవతా శ్రేష్ఠులు; అధిక, ప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; చనుదెంచి= వచ్చి; అగ్ని, ముఖమునన్= అగ్నిదేవునిమూలాన; హవ్యములు= హోమంలో వేసిన ఆహుతులు; ఆతత, హస్తములన్= చాపబడిన చేతులతో; కొందురు= తీసికొంటారు.

తాత్పర్యం: ఆ వ్యుషితాశ్వునియజ్ఞంలో దేవేంద్రుడు మొదలైన దేవతాశ్రేష్ఠులు మిక్కిలిప్రీతితో వచ్చి, చేతులు చాచి అగ్నిదేవునిముఖంగా ఆహుతులు గైకొంటారు.

వ. అట్టి వ్యుషితాశ్వుండు కాక్షీవతి యైన భద్ర తన భార్యయందు ననవరత కామాసక్తిం జేసి యక్ష్మ
రుజాక్రాంతుం డయి యస్తమించిన నది పుత్త్రాలాభదుఃఖిత యయి పతివియోగంబు సహింప నోపక. 80

విశేషం: అట్టి, వ్యుషిత+అశ్వుండు= వ్యుషితాశ్వుడు అను రాజు; కాక్షీవతి+ఐన; భద్ర; అను; తన భార్యయందున్= తన పత్నిపై; అనవరత, కామ+ఆసక్తిన్+చేసి= ఎడతెగని కామంమీద ఆసక్తితో; యక్ష్మ; రుజా+ఆక్రాంతుండు+అయి= క్షయరోగంచే ఆక్రమింపబడిన వాడై; అస్తమించినన్= మరణించగా; అది= అతని భార్య అయిన భద్ర; పుత్త్ర+అలాభ, దుఃఖిత+అయి కొడుకులను పొందలేక పోవటంతో దుఃఖించినదై; పతి, వియోగంబును= భర్తను కోల్పోవటాన్ని; సహింపన్+ఓపక= ఓర్చుకోలేక.

తాత్పర్యం: అటువంటి వ్యుషితాశ్వుడు తనభార్యమీద మితిమీరినకామంతో ఆసక్తుడై వ్యవహరించి క్షయ రోగగ్రస్తుడై మరణించగా, అతనిభార్య భద్ర కొడుకులు లేకపోవటంతో దుఃఖించి, భర్తను కోల్పోవటాన్ని సహించలేక.

తే. పతియులేక జీవించు నయ్యతివ కయిన । జీవనముకంటె దానికిఁ జావ లగ్గు
కాన నీతోన చనుదెంతుఁ గాని నిన్నుఁ । బాసి యిం దుండఁగా నోప వాసవాభ ! 81

విశేషం: పతియు= భర్త; లేక; జీవించు= జీవించే; ఆ+అతివకు= ఆ స్త్రీకి; అయిన= ఏర్పడిన; జీవనముకంటె= బతకటంకన్నా; దానికిన్= ఆ స్త్రీకి; చావు+అ, లగ్గు= చావే మేలు; కాన; నీతోన; చనుదెంతున్= వస్తాను; కాని; వాసవ+ఆభ= దేవేంద్రుని వంటి తేజస్సుకలవాడా!; నిన్నున్; పాసి= విడిచి; ఇందున్= ఈ లోకంలో; ఉండన్+కాన్= ఉండటానికి; ఓపన్= ఇష్టపడను.

తాత్పర్యం: భర్తలేకుండా జీవించటంకన్నా స్త్రీ చావటమే మేలు. అందువలన నేను నీతో వస్తాను కాని, ఇక్కడ ఉండలేను.

వ. 'కాదేని నాకు నీ పుణ్యమూర్తిప్రతిమూర్తులైన పుత్త్రులం బ్రసాదింపు' మని దర్భాస్తరణశాయిని యై యాశవంబుఁ
గౌఁగిలించుకొని విలాపించుచున్న దానికి వాని శరీరమువనుండి యొక్క దివ్యవాణి యి ట్లనియె. 82

ప్రతిపదార్థం: కాదు+ఏని= అట్లా కాకపోతే; నాకున్; నీ, పుణ్య, మూర్తి, ప్రతిమూర్తులు+ఐన= నీ పవిత్రమైన రూపం కలవారైన; పుత్రులన్= కుమారులను; ప్రసాదింపుము= దయతో ఇమ్ము; అని= ఆ విధంగా తెలిపి; దర్భ+ఆస్తరణ, శాయిని+ఐ= దర్భలపరుపుమీద పడుకొన్నది అయి; ఆ, శవంబున్= ఆ భర్తశవాన్ని; కౌగలించుకొని; విలపించుచు+ఉన్న= ఏడుస్తున్న; దానికి= ఆ భద్రకు; వాని, శరీరమునునుండి= ఆ వ్యుషితాశ్వునిశరీరంనుండి; ఒక, దివ్య, వాణి= ఒక దేవతాసంబంధమైన వాక్కు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అట్లా కాకపోతే నాకు నీపవిత్రరూపంవంటి రూపం కల కొడుకులను ప్రసాదించు' అని దర్భల పరుపుమీద పడుకొని భర్తశవాన్ని కౌగలించుకొని ఏడుస్తూ ఉండగా, ఆమెతో అతని శరీరంనుండి ఒక దివ్యవాణి ఇట్లా అన్నది.

క. విదితముగ నీకు వర మి । చ్చెద నోడకు లెమ్ము; గుణవశీకృతభువనుల్
సదమలచరిత్రు లాత్మజు । లుదయింతురు వగవకుండు ముదితేందుముఖీ! 83

ప్రతిపదార్థం: విదితముగ= ప్రసిద్ధంగా; నీకు; వరము; ఇచ్చెదన్; ఓడకు= భయపడకుము, లెమ్ము; ఉదిత+ఇందు, ముఖీ= ఉదయించిన చంద్రునివంటి ముఖంకలదానా; గుణ, వశీ, కృత, భువనుల్= గుణాలచేత వశం చేసుకోబడిన లోకాలు కలవాళ్ళు; సత్+అమల, చరిత్రులు= ఉత్తమమైన నిర్మలమైన నడవడి కలవాళ్ళు; ఆత్మజులు= కుమారులు; ఉదయింతురు= పుట్టుతారు; వగవక= చింతించక; ఉండుము.

తాత్పర్యం: నీకు వర మిస్తాను. భయపడవద్దు. లెమ్ము. ఉదయించినచంద్రునివంటిముఖంకలదానా! సుగుణాలచేత లోకాలను వశంచేసుకొనేవాళ్ళు, ఉత్తమమైన నడవడి కలవాళ్ళు అయినకొడుకులు నీకు పుడతారు. బాధపడకుము.

వ. 'ఋతుమతి వయిన యష్టమ దివసంబుననేనిం జతుర్దశ దివసంబుననేని శుచి వై శయనంబున నుండి నన్నుఁ దలంపు' మనిన నదియుం దద్వచనానురూపంబు సేసి మువ్వురు సాల్వులును, నల్వురు మద్రులునుంగా నేడ్వురు కొడుకులం బడసె; నది గావున 'నీవు మాయందు దైవానుగ్రహంబున నపత్యంబు వడయు' మనినం గుంతిం జూచి పాండురాజు ధర్మ్యం బయిన యొక్క పురాణ కథఁ జెప్పెదఁ 'దొల్లి స్త్రీలు పురుషులచేత ననావృత లయి స్వతంత్రవృత్తి నఖిలప్రాణిసాధారణం బైన ధర్మంబునం దమతమవర్ణంబులయందు ఋతుకాలంబు దప్పక నియతానియతపురుషు లయి ప్రవర్తిల్లుచున్న, నుద్దాలకుం డను నొక్కమహామునిభార్య నతిసాధ్వి నధికతపోనిధి యైన శ్వేతకేతుతల్లి ఋతుమతి యైన దాని నొక్క వృద్ధవిప్రుం డతిథి యై వచ్చి పుత్రార్థంబు గామించిన శ్వేతకేతుం డలిగి యిది ధర్మవిరుద్ధం బని యాక్రోశించి దాని సహింపనోపక. 84

విశేషం: ఋతుమతివి= ముట్టుఅయినదానివి; అయిన; అష్టమ, దివసంబునన్=ఏనిన్= ఎనిమిదోరోజున కాని; చతుర్దశ, దివసంబునన్+ఏని= పద్నాలుగో రోజున కాని; శుచివి+ఐ= పరిశుద్ధమైన దానివై; శయనంబునన్+ఉండి= పడకమీద ఉండి; నన్నున్; తలంపుము; అనినన్; అదియున్= ఆమె కూడా; తత్+వచన+అనురూపంబునన్+చేసి= అతనియొక్క మాటకు తగినట్లుగా ఆచరించి; మువ్వురు, సాల్వులును; నల్వురు, మద్రలునున్; కాన్= అగునట్లు; ఏడ్వురు= ఏడుమంది; కొడుకులన్; పడసెన్= పొందెను; అది= ఆమె; కావున= కాబట్టి; నీవున్=నీవును; మాయందున్= మాయెడ; దైవ+అనుగ్రహంబునన్;

అపత్యంబు= సంతానాన్ని; పడయుము= పొందుము; అనినన్= అనగా; కుంతిన్; చూచి; పాండురాజు; ధర్మ్యంబు+అయిన= ధర్మసంబంధమైన; ఒక్క= ఒక; పురాణ= ప్రాచీనమైన; కథన్= కథను; చెప్పెదన్= చెపుతాను; తొల్లి= పూర్వం; స్త్రీలు; పురుషులచేత= భర్తలచేత; అనావృతులు+అయి= చుట్టుకొనబడనివా రై - అనగా కట్టడిలేనివారై; స్వతంత్ర, వృత్తిన్= స్వతంత్ర మైన ప్రవర్తనతో; అఖిల, ప్రాణి, సాధారణంబు+ఐన= అన్నిప్రాణులకు సామన్యమైన; ధర్మంబునన్; తమ, తమ వర్ణంబులఅందున్= తమతమ జాతులలో; ఋతుకాలంబు= ముట్టయిన తరువాత పదహారురోజులు; తప్పక= దాటకుండ; నియత+అనియత, పురుషులు+అయి= నియమింపబడిన, నియమింపబడని పురుషులు కలవారై; ప్రవర్తిల్లుచున్+ఉన్నన్= వర్తిస్తూ ఉండగా; ఉద్దాలకుండు; అను; ఒక్క, మహా, ముని, భార్యన్= ఒక గొప్ప తపస్వి యొక్క ఇల్లాలిని; అతి, సాధ్విన్= మిక్కిలిపతివ్రత అయిన దానిని; అధిక, తపస్+నిధి+ఐన= అధికమైన తపస్సునకు స్థానమైనవాడు అయిన; శ్వేతకేతు, తల్లి= శ్వేతకేతునియొక్క తల్లిని; ఋతుమతి+ఐన= ముట్టు అయినది కాగా; దానిన్= ఆమెను; ఒక్క; వృద్ధ, విప్రుండు= ముసలి బ్రాహ్మణుడు; అతిథి+ఐ; వచ్చి; పుత్ర+అర్థంబు= కొడుకును పొందటంకొఱకు; కామించిన= రమింపగా; శ్వేతకేతుండు; అలిగి= కోపించి; ఇది; ధర్మ, విరుద్ధంబు= ధర్మానికి వ్యతిరేకం; అని; ఆక్రోశించి= తిట్టి; దాని; సహింపక= ఓర్వక.

తాత్పర్యం: 'నీవు ముట్టయిన ఎనిమిదో రోజు కాని, పద్నాలుగో రోజు కానీ పరిశుద్ధురాల వై పడకమీద ఉండి నన్ను స్మరింపుము' అని అనగా ఆమెకూడా ఆ మాటప్రకారం చేసి ముగ్గురు సాల్వులను, నలుగురు మద్రలను మొత్తం ఏడుగురు కొడుకులను కన్నది. కాబట్టి మాయందు నీవుకూడ దైవానుగ్రహంతో సంతానాన్ని పొందు' మని కుంతి చెప్పగా, పాండురాజు ఆమెను చూచి 'నీకు ధర్మసంబంధమైన ఒక పురాణకథ చెబుతాను. 'పూర్వం స్త్రీలు భర్తవలన కట్టడి లేని వాళ్ళయి, స్వతంత్రమైన ప్రవర్తన కలిగి, సర్వప్రాణిసాధారణమైన ధర్మంతో, తమ తమ జాతులలో ముట్టయిన తరువాత గర్భధారణకు యోగ్యమైన పదహారురోజులకాలం దాటకుండా, నియమింపబడిన లేదా నియమింపబడని పురుషులతో రమిస్తూ ఉండగా; మహాతపస్వి అయిన శ్వేతకేతుని తల్లి, మహాముని అయిన ఉద్దాలకుని భార్య, మహాపతివ్రత - ముట్టయి ఉన్నసమయంలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు అతిథిగా వచ్చి తనకు పుత్త్రుడు కావా లని ఆమెను కామింపగా, శ్వేతకేతుడు కోపించి, ఇది ధర్మవిరుద్ధం అని తిట్టి, దాన్ని సహించక.

శ్వేతకేతుఁడు స్త్రీపురుషుల విషయంబునఁ గావించిన కట్టడి (సం. 1-113-1)

సీ. 'ఇది యాదిగా సతు లెన్నండుఁ బరపురుషార్థినుల్ గాఁ జన; దన్యపురుష
సంగమంబునఁ జేసి సకలపాతకములు నగుఁ ; బరిగ్రహభూత లయిన సతుల
కిట్టిద మర్యాద యి మ్మనుష్యుల కెల్లఁ జేసితి లోక ప్రసిద్ధి గాఁగ '
నని ధర్మ్యమైన మర్యాద మానవులకుఁ దద్దయు హితముగా ధర్మమూర్తి

ఆ. యబ్జభవసమానుఁ డగు శ్వేతకేతుండు । నిలిపె; నదియు ధారుణీ జనంబు
నందు లోకపూజ్యమై ప్రవర్తిల్లుచు । నుండె శిష్ట సంప్రయుక్తిఁ జేసి. 85

ప్రతిపదార్థం: ఇది, ఆదిగాన్= ఇది మొదలుగా; సతులు= స్త్రీలు; ఎన్నండున్= ఎప్పుడూకూడ; పర, పురుష+అర్థినుల్= పరపురుషులను కోరేవారుగా; కాన్, చనదు= కాకూడదు; పరిగ్రహభూతలు+అయిన, సతులకు= చేపట్టబడిన స్త్రీలకు- అనగా పెళ్లి అయిన స్త్రీలకు; అన్య పురుష, సంగమంబునన్+చేసి= పరపురుషసంబంధంవలన; సకల, పాతకములున్= అన్ని

పాపాలు; అగున్= కలుగును; ఇట్టిది+అ= ఇదే; మర్యాద= కట్టుబాటు; ఈ+మనుష్యులకు+ఎల్లన్= ఈ మానవు లందరికి; లోక, ప్రసిద్ధి, కాఁగన్= ప్రపంచంలో ప్రసిద్ధిచెందేటట్లు; చేసితి; అని= ఆ ప్రకారముగా; ధర్మ్యము+ఐన= ధర్మంతో కూడిన దైన; మర్యాద= హద్దు; అబ్జ, భవ, సమానుఁడు+అగు= పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవునితో సమానమైనవాడైన; శ్వేతకేతుండు; నిలిపెన్= ఉంచెను; అదియు= ఆ నియమం; శిష్ట, సంప్రయుక్తిన్+చేసి= పెద్దల ఆచారంచేత; లోక, పూజ్యము+ఐ= లోకంచేత పూజింప తగినదై; ప్రవర్తిల్లుచున్+ఉండెన్= నడుస్తూ ఉన్నది.

తాత్పర్యం: 'ఇది మొదలు స్త్రీలు ఎప్పుడూ పరపురుషులను కోరకూడదు. వివాహితస్త్రీలకు పురుషసంగమం వలన సర్వపాపాలు కలుగుతాయి. ఈ కట్టుబాటు లోకప్రసిద్ధంగా మానవు లందరికీ చేశాను' - అని ధర్మంతో కూడిన ఈ కట్టడిని మానవులకు మేలు కలిగేటట్లు ధర్మమూర్తి, బ్రహ్మతో సమానుడు అయిన శ్వేతకేతుడు ఏర్పాటు చేశాడు. ఆ మర్యాదనే శిష్టులంతా అనుసరించటంతో అది లోకానికి పూజింపతగిందై నడుస్తున్నది.

వ. మఱియుఁ దిర్యగ్యోనులయందును నుత్తరకురుదేశంబులయందును మొదలింటి ధర్మంబ యిప్పడుం బ్రవర్తిల్లుచుండునట్లు మనుష్యులయందు శ్వేతకేతుండు సేసిన ధర్మస్థితికారణంబున నాఁటంగోలె. 86

ప్రతిపదార్థం: మఱియున్; తిర్యక్+యోనుల, అందున్= పశుపక్ష్యాదులలోకూడ; ఉత్తర, కురు, దేశంబుల+అందును; మొదలింటి, ధర్మంబు+అ= మొదటి పద్ధతే - అనగా ఆడుప్రాణి ఋతుకాలంలో ఇష్టం వచ్చిన మగప్రాణితో రమించే పద్ధతి; ఇప్పుడున్; ప్రవర్తిల్లుచు+ఉండున్= జరుగుతూ ఉన్నది; అట్లు= ఆ విధంగా; శ్వేతకేతుఁడు; మనుష్యుల= మానవులలో; చేసిన= ఏర్పాటు గావించిన; ధర్మ, స్థితి= ధర్మం యొక్క ఉనికి; కారణంబునన్= కారణముచేత; నాఁటన్+కోలె= ఆ నాటి నుండి.

తాత్పర్యం: పశుపక్ష్యాదులతో కూడ, ఉత్తరకురుభూములలో ఇప్పటికీ ఆడుప్రాణి ఋతుకాలంలో ఏ నియమం లేకుండా ఇష్టం వచ్చినట్లు మగప్రాణితో రమించే మొదటి పద్ధతే ఉన్నది. శ్వేతకేతుడు ఆ విధంగా మానవులలో ఏర్పాటు చేసిన ధర్మంవలన ఆ రోజునుండీ.

క. పురుషులచే ధర్మస్థితిఁ। బరిగ్రహింపంగఁ బడిన భార్యలకు నిరం
తరము నిజపురుషభక్తియుఁ బరపురుషవివర్జనంబుఁ బరిచిత మయ్యెన్. 87

ప్రతిపదార్థం: పురుషులచే= మగవారిచే; ధర్మ, స్థితిన్= ధర్మమార్గంతో; పరిగ్రహింపంగన్+పడిన= వివాహం చేసుకొనబడిన; భార్యలకు; నిరంతరము= ఎల్లప్పుడు; నిజ, పురుష భక్తియున్= తమ భర్తలమీద భక్తీ; పర, పురుష వివర్జనంబున్= పర పురుషులను విడవటం; పరిచితము+అయ్యెన్= అలవడినదిగా అయింది.

తాత్పర్యం: పురుషులు ధర్మమార్గంలో వివాహం చేసుకొన్న భార్యలకు, ఎల్లప్పుడూ తమ భర్తలమీద భక్తి కలిగి ఉండటం, పరపురుషులను విడవటం అలవడింది.

తే. భర్తచేత నియోగింపఁ బడక సతికి। నెద్దియును జేయఁగాఁ దగ; దెద్ది యైన
భర్తచేత నియోగింపఁ బడిన దానిఁ। జేయకునికి దోషం బని చెప్పె మనువు. 88

ప్రతిపదార్థం: భర్తచేతన్= మగనిచేత; నియోగింపన్, పడక= ఆజ్ఞాపింపబడక; సతికిన్= భార్యకు; ఎద్దియును= ఏదీ; చేయఁగాన్, తగదు= చేయకూడదు; ఎద్ది+ఐనన్= ఏదైననూ; భర్తచేత= మగనిచేత; నియోగింపన్, పడిన, దానిన్= ఆజ్ఞాపింప బడినదానిని; చేయక+ఉనికి= చేయకుండటం; దోషంబు; అని, మనువు, చెప్పెన్= అని మనువు అన్నాడు.

తాత్పర్యం: భర్త ఆజ్ఞాపించనిదే భార్య ఏదీ చేయకూడదు. భర్త దేనిని ఆజ్ఞాపించినా అది చేయక పోవటం దోషం' అని మనువు చెప్పాడు.

వ. పతి నియోగించిన దానిం జేయని నాఁడు భార్యకుం బాతకం బని యెఱింగి కాదె తొల్లి సౌదాసుం డైన కల్మాషపాదుం డను రాజర్షిచేత నియుక్తయై వానిభార్య మదయంతి యనునది వసిష్ఠువలన నశ్మకుం డను పుత్త్రుం బడసె; నస్మజ్జన్మంబు నిట్టిద; మహాముని యయిన కృష్ణద్వైపాయనువలనఁ గురుకులవృద్ధిపొంటె నే ముద్భవిల్లితిమి; కావున నీ విన్నికారణంబులు విచారించి నా నియోగంబు సేయుము. 89

ప్రతిపదార్థం: పతి= భర్త; నియోగించిన, దానిన్= ఆజ్ఞాపించినదాన్ని; చేయని, నాఁడు= చేయని రోజు; భార్యకున్; పాతకంబు+అని= పాప మని; ఎఱింగి= తెలిసి; కాదె= కదా; తొల్లి= పూర్వం; సౌదాసుండు+ఐన= సుదాసుడి కుమారు డైన; కల్మాషపాదుండు; అను= అనుపేరుగల; రాజ+ఋషిచేతన్= రాజర్షివలన; నియుక్త+ఐ= ఆజ్ఞాపించబడినది అయి; వాని, భార్య= అతని పత్ని; మదయంతి; అనునది= అనుపేరు కలది; వసిష్ఠువలనన్= వసిష్ఠునివలన; అశ్మకుండు+అను; పుత్త్రున్; పడసెన్= పొందింది; అస్మత్+జన్మంబున్= మా పుట్టుకకూడా; ఇట్టిది+అ= ఇటువంటిదే; మహాముని; అయిన; కృష్ణద్వైపాయను వలనన్; కురు, కుల, వృద్ధిపొంటెన్= కురువంశవృద్ధి కొరకు; ఏము= మేము; ఉద్భవిల్లితిమి= జన్మించాము; కావునన్= కాబట్టి; నీవు= నీవు, ఇన్ని; కారణంబులు; విచారించి; నా, నియోగంబు= నా ఆజ్ఞ; చేయుము= పాటించుము.

తాత్పర్యం: భర్త ఆజ్ఞాపించిన దానిని చేయని రోజు భార్యకు పాపం వస్తుం దని తెలిసే కదా, పూర్వం సుదాసుడి కుమారుడైన కల్మాషపాదుడి ఆజ్ఞతో అతనిభార్య మదయంతి వసిష్ఠునివలన అశ్మకు డనే పుత్రుడిని పొందింది. మా పుట్టుకకూడా ఇటువంటిదే. మహాముని కృష్ణద్వైపాయనునివలన కురువంశం వృద్ధిపొందటానికి మేము జన్మించాము. కాబట్టి నీవు ఈ కారణా లన్నీ విచారించి నేను చెప్పినట్లు చేయుము.

చ. అలయక ధర్మశాస్త్రములయందుఁ బురాణములందుఁ జెప్ప ను
త్పలదళనేత్ర! విందుమ యపత్యము మే లని; కావునన్ యశో
నిలయులఁ బుత్త్రులం బడయు నీ కొనరించెద సంగతాంగుళీ
దళవిలసన్మదీయకరతామరసద్వయయోజితాంజలిన్. 90

ప్రతిపదార్థం: ఉత్పల, దళ, నేత్ర= కలువ రేకులవంటి కన్నులు కలదానా!; అలయక= విసుగు లేకుండ; ధర్మశాస్త్రముల, అందున్= ధర్మశాస్త్రాలలో; పురాణముల, అందున్= పురాణాలలో; చెప్పన్= చెప్పగా; అపత్యము= సంతానం; మేలు; అని; విందుము+అ= వింటున్నాం కదా; కావునన్; యశః+నిలయులన్= కీర్తికి స్థానమైనవారిని; పుత్త్రులన్; పడయు= పొందుము; సంగత+అంగుళీ, దళ, విలసత్+మదీయ, కర, తామరస, ద్వయ, యోజిత, అంజలిన్= కూడినవ్రేళ్ళు అనే రేకులతో ప్రకాశిస్తున్న నా కరకమలాల జంటచేత కూర్చబడిన నమస్కారాన్ని; నీకున్; ఒనరించెదన్= చేస్తాను.

తాత్పర్యం: కలువ రేకులవంటి కన్నుల కల ఓ కుంతీ! విసుగు లేకుండా ధర్మశాస్త్రాలలోను, పురాణాలలోను సంతానం మే లని చెప్పగా వింటున్నాంకదా! అందువల్ల కీర్తిమంతు లైన పుత్రులను పొందుము. కమలాల జంటవంటి నా చేతు లెత్తి నీకు నమస్కారం చేస్తాను.

విశేషం: అలం: రూపకం. పాండురాజు కరకమలాలను జోడించి భార్యను ప్రార్థించటంలో ఒక వైశిష్ట్యాన్ని ప్రదర్శించాడు. పాండురాజు చెప్పిన కథనాన్నిబట్టి సమాజవ్యవస్థలో పూర్వం మాతృస్వామ్యవ్యవస్థమాత్రమే ఉండేది. ఆ తరువాత శ్వేతకేతువు మొదలైనవాళ్ళు వివాహిత అన్యపురుషసంయోగం పొందటం పాప మనే కట్టుబాటు ఏర్పరచి, పితృస్వామ్యవ్యవస్థకు ప్రాతిపదికలు వేశారు. మధ్యేమార్గంగా దేవరన్యాయం ప్రవర్తిల్లింది. దానితో మిశ్రస్వామ్యవ్యవస్థ తలయెత్తింది. భర్త బ్రతికి ఉండగా అన్యపురుష స్మరణం, గ్రహణం సముచితం కా దని కుంతి చెప్పింది. కాని, పాండురాజు, పతి అనుమతితో దేవరన్యాయంతో కలిగే సంతానం - క్షేత్రజులను- పొందు మని మాతృస్వామ్యప్రవృత్తిని ప్రార్థిస్తున్నాడు. దేవాంశసంభూతులు దేవరన్యాయజులకంటె ఉత్తము లని కుంతి అభిప్రాయం. నమస్కరించే పాండురాజులో పుత్రులకొరకైన దైన్యం, మాతృవ్యవస్థమీది గౌరవం ధ్వనిస్తున్నాయి. (సంపా.)

వ. అని పుత్త్రముఖావలోకనలోలత్వంబున దీనవదనుం డై దేవిం బ్రార్థించినఁ గుంతియుం బుత్త్రోత్పాదనోన్ముఖి యై కుంతిభోజునింటఁ దనకొండుకనాఁడు దుర్వాసునిచేతం బడసిన మంత్త్రంబుతెఱంగు పతి కెఱింగించి 'యమ్మంత్త్రంబున కిది యవసరం బయ్యెః నేవేల్పు నారాధింతు? నాన తి' మ్మనిన సంతసిల్లి కుంతీదేవికిం బాండురా జి ట్లనియె. 91

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; పుత్త్ర, ముఖ+అవలోకన, లోలత్వంబునన్= కొడుకుల ముఖాన్ని చూడాలనే ఆసక్తితో- అనగా కొడుకులు కావా లనే కోరికతో; దీన, వదనుండు+ఐ= దీనమైన ముఖం కలవా డై; దేవిన్= భార్యను - కుంతిని; ప్రార్థించినన్= అర్థింపగా; కుంతియున్; పుత్త్ర+ఉత్పాదన+ఉన్ముఖి+ఐ= కొడుకులను పుట్టించటంలో అనుకూలమైనది అయి; కుంతిభోజు, ఇంటన్; తన కొండుక, నాఁడు= తన చిన్నతనంలో; దుర్వాసుని చేతన్; పడసిన= పొందిన; మంత్రంబు, తెఱంగు= మంత్రంయొక్క విధం; పతికి= భర్తకు; ఎఱింగించి= తెలిపి; ఆ+మంత్రంబునకు= ఆ మంత్రానికి; ఇది; అవసరంబు= సమయం; అయ్యెన్= అయింది; ఏ, వేల్పున్= ఏ దేవుడిని; ఆరాధింతున్= సేవింతును; ఆనతి, ఇమ్ము, అనినన్= ఆజ్ఞాపించు మనగా; సంతసిల్లి= సంతోషించి; కుంతీదేవికిన్; పాండురాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని కొడుకులముఖాన్ని చూడా లనే కుతూహలంతో దీనవదను డై పాండురాజు కుంతిని ప్రార్థించగా ఆమెకూడా కొడుకులను కనా లనే కోరికకు అనుకూలమైనదై, తనచిన్నతనంలో కుంతిభోజుని ఇంట్లో దుర్వాసునిచేత తాను పొందిన మంత్రవిషయాన్ని భర్తకు చెప్పింది. ' ఆ మంత్రానికి ఇది సమయ మనీ, ఏ దేవుడిని సేవించాలో ఆజ్ఞాపించు' మని భర్తను అడిగింది, పాండురాజు సంతోషించి, కుంతీదేవితో ఈవిధంగా అన్నాడు.

క. లలితాంగి! యెల్లలోకం । బులు ధర్మువునంద నిలుచుఁ ; బొలుపుగ ధర్మం
దలఁపుమ; యాతఁడ మఱి వే । ల్పులలోపలఁ బెద్ద ధర్మమున సత్యమునన్. 92

విశేషం: లలిత+అంగి= అందమైన శరీరం కలదానా! ఓ కుంతీ!; ఎల్ల, లోకంబులు; ధర్మువు, అందు+అ=ధర్మం మీదే; పొలుపుగన్= స్థిరంగా; నిలుచున్= నిలుస్తాయి; ధర్మన్= ధర్మదేవతను; తలఁపుము+అ= స్మరించుము; మఱి= ఇక; వేల్పుల లోపలన్= దేవతలలో; ధర్మమునన్= ధర్మమునందు; సత్యమునన్= సత్యమునందును; ఆతఁడు+అ= అతడే; పెద్ద= గొప్పవాడు.

తాత్పర్యం: అందమైన శరీరం కల ఓ కుంతీ! అన్నిలోకాలు ధర్మంమీదే స్థిరంగా నిలుస్తాయి. ధర్మదేవతను స్మరించుము. దేవతలలో ధర్మంలోనూ, సత్యంలోనూ అతడే పెద్దవాడు.

విశేషం: "విశ్వం ధరతీతి ధర్మః" లోకాన్ని ధరించేది ధర్మం. ఆ ధర్మానికి అధిదేవత ధర్ముడు; అతడిని స్మరించి సంతానాన్ని పొందటంలో పాండురాజుయొక్క విశ్వశ్రేయోదృష్టి వ్యక్తమౌతున్నది. ధర్మాన్ని రక్షించే సంతానాన్ని కోరటం ఉత్తమగృహస్థుయొక్క ధర్మం. పుట్టబోయే కొడుకు మూర్తికట్టిన ధర్మం కావా లని పాండురాజు సంకల్పం.

వ. **అని నియోగించినఁ, గుంతియుం బతికిఁ బ్రదక్షిణంబుఁ జేసి సమాహితచిత్త యై మహాముని యిచ్చిన మంత్రంబు విధివంతంబుఁ జేసి ధర్ముని నారాధించిన, నా ధర్ముండును యోగమూర్తి ధరుం డై వచ్చి, వరం బిచ్చినం, గుంతియుఁ దత్ప్రసాదంబున గర్భంబు దాల్చి, సంవత్సరంబు పరిపూర్ణం బైన.** **93**

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; నియోగించినన్= ఆజ్ఞాపించగా; కుంతియున్; పతికిన్= భర్తకు; ప్రదక్షిణంబున్; చేసి; సమాహిత, చిత్త+ఐ= నిలువబడిన మనస్సు కల దై; మహాముని; ఇచ్చిన; మంత్రంబున్; విధి, వంతంబున్= విధితో కూడిన దానినిగా; చేసి; ధర్ముని= ధర్మదేవతను; ఆరాధించినన్= ప్రార్థించగా; ఆ ధర్మండును; యోగ, మూర్తి, ధరుండు+ఐ= యోగబలంచేత ఆకారాన్ని ధరించినవాడై; వచ్చి; వరంబు, ఇచ్చినన్= వరము ఈయగా; కుంతియున్; తద్+ప్రసాదంబునన్= అతని దయచేత; గర్భంబున్; తాల్చి= ధరించి; సంవత్సరంబు= ఒక సంవత్సరం; పరిపూర్ణంబు+ఐనన్= పూర్తికాగా.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించగా, కుంతీదేవి భర్తకు ప్రదక్షిణం చేసి, మనస్సు నిలిపి మహాముని ఇచ్చిన మంత్రాన్ని యథావిధిగా జపించి, ధర్మదేవతను ప్రార్థించింది. ధర్ముడు యోగంచేత రూపాన్ని ధరించి వచ్చి వరమిచ్చాడు. కుంతీదేవి అతనిదయవలన గర్భం ధరించి సంవత్సరకాలం పూర్తి కాగానే.

విశేషం: కుంతి గర్భం ధరించి, సంవత్సరకాలం పూర్తిఅయిన తరువాత - కుమారుడిని కన్నట్లు ఈ కథనంలో ఉన్నది. సంవత్సరకాలం గడిచినట్లు మూలంలో లేదు. కుంతీదేవి ధర్ముడిని ఆహ్వానించేనాటికి గాంధారి ఒక సంవత్సరం గర్భవతి అయిఉన్నది. 'సంవత్సరధృతే గర్భే గాంధార్యా జనమేజయ!' అని మూలం. (భం.ఆది.పు.505)

కుంతీదేవియందు ధర్మరాజుజననము (సం.1-114-3)

ఉ. **శాత్త్రవజైత్రతేజమున సర్వదిశల్ వెలుఁగంగ నైంద్ర న**
క్షత్త్రయుతుండుగా శశి ప్రకాశజయోన్నత మైన యష్టమిన్
మిత్త్రముఖగ్రహప్రతతి మేలుగ నాభిజితోదయంబునం
బుత్త్రుఁడు ధర్మునంశమునఁ బుట్టె నతిస్థిరధర్మమూర్తి యై. **94**

ప్రతిపదార్థం: శాత్త్రవ, జైత్ర, తేజమునన్= శత్రువులను జయించే పరాక్రమంతో; సర్వ, దిశల్= అన్ని దిక్కులు; వెలుఁగంగన్; శశి= చంద్రుడు; ఐంద్ర, నక్షత్ర, యుతుండుగా= జ్యేష్ఠా నక్షత్రంతో కూడినవాడుగా; ప్రకాశ, జయ+ఉన్నతము+ఐన= కాంతితో, జయంతో ఉచ్చస్థితిలో ఉండగా; అష్టమిన్= అష్టమినాడు; మిత్త్ర, ముఖ, గ్రహ, ప్రతతి= సూర్యుడు మొదలైన గ్రహాల సమూహం; మేలుగన్= బాగుండగా; ఆభిజిత+ఉదయంబునన్= అభిజిన్ముహూర్తం ప్రారంభంలో; ధర్ము+అంశమునన్= ధర్మునియొక్క అంశం చేత; పుత్త్రుఁడు; అతి, స్థిర, ధర్మ, మూర్తి+ఐ= మిక్కిలి స్థిరమైన ధర్మం ఆకారంగా కలవా డై; పుట్టెన్.

తాత్పర్యం: దిక్కు లన్నీ వెలుగగా, చంద్రుడు జ్యేష్ఠా నక్షత్రంతోకూడి ఉచ్చస్థితిలో ఉండగా, సూర్యాదిగ్రహాలు శుభస్థానాలలో ఉండగా, అష్టమినాడు అభిజిన్ముహూర్తప్రారంభంలో ధర్మదేవతఅంశచేత శత్రువులను జయించగల పరాక్రమంతో ధర్మరాజు జన్మించాడు.

విశేషం: ఆంధ్రమహాభారత సంశోధితముద్రణప్రతిలో ఈక్రింది వివరణం అధస్సూచికలో ఇవ్వబడింది; "యుధిష్ఠిరుఁడు వికృతి సంవత్సర ఫాల్గుణ బహుళ అష్టమియందు జన్మించినట్లు భారతకూలంకష వ్యాఖ్యాకారుఁడు వివరించెను. కలియుగాది ప్రమాది సంవత్సరము చైత్రశుద్ధపాడ్యమిగనుక, ఆ పయిని నూటయెనిమిదియేళ్ళ యెనిమిది దినముల క్రిందట యుధిష్ఠిర జననము. ఆ తిథికి - అనగా ఫాల్గుణబహుళఅష్టమికి - జ్యేష్ఠానక్షత్రము వచ్చును. జయతిథిన్నీ అవును. ధర్మరాజు తరువాత సంవత్సరమునకు భీమునిపుట్టుక - ఖరసంవత్సరఫాల్గుణశుక్లత్రయోదశి మాఘనక్షత్రము. దుర్యోధనుఁడు భీమునికన్న మూఁడుయామములు 'చింన్న" చిన్న. అర్జునుఁడు నందనసంవత్సర ఫాల్గుణశుక్ల పౌర్ణమాసి" (పుట.279). సంశోధితముద్రణప్రతిలో 'శాత్రవ', 'మిత్ర' శబ్దప్రయోగం ఉన్నది. వావిళ్ళప్రతిలో 'మిత్త్ర' శబ్దం ఉంది. 'క్షత్త్ర శబ్దం క్షత్ర'గా వాడబడింది. ఈ రెండింటిని గమనించి ప్రాససామ్యం పరిష్కరించటమైనది.

నన్నయ ధర్మజుని పుట్టుకను ఉత్పలమాలలో వర్ణించాడు. మహావీరుల పుట్టుకలను, వారికి సంబంధించిన అంశాలను వర్ణించినప్పుడు కొన్నిటికి ఉదాత్త గంభీరమైన ఉత్పల చంపకమాలా వృత్తాలను ఎన్నుకొని, నన్నయ సజాతీయఛందస్సంవాద శిల్పాన్ని వెలార్చి పద్యవిద్యను ప్రదర్శించాడు. ఉదాహరణకు; కర్ణుని పుట్టుక (5.26) పాండురాజు తనకు సంతానాన్ని సమకూర్చు మని కుంతిని కోరటం(5.90), వ్యుషితాశ్వునిపరాక్రమం (5.78), మరొక పుత్రునికొరకు వాయుదేవుడిని ఉపాసించు మని పాండురాజు కుంతిని కోరటం (5.102), భీముని పుట్టుక (5.104), ఇంద్రుని అంశతో కుమారుడిని కను మని పాండురాజు కుంతిని కోరటం (5.120) ధర్మజాదుల నందరిని పాండురాజుపుత్రులుగా గుర్తించి, హస్తినాపురిప్రజలు మొదటిసారిగా వారిని చూచినతీరు (5.150) మొదలైన చోట్ల చంపకమాలలు గమనించతగినవి. ధర్మరాజుజననం (5-94), ధృతరాష్ట్ర రాజ్యపాలనం (5.6), పాండురాజువిలాసం (5.47), సంతానంకొరకు ప్రార్థన (5.73), మాద్రి సంతానం కొరకు పరితపించటం (5.129), హస్తినాపుర ప్రజలు పాండవులను అసాధారణవ్యక్తు లని కీర్తించటం (5.151), (5.153), ఏకలవ్యునివర్ణనం (5.235) ఉత్పలమాలలో ఉన్నాయి. ఈ పద్యా లన్నింటిలోకంటె ధర్మజునిపుట్టుక వర్ణించే ఉత్పలమాల వృత్తంలో సంయుక్తాక్షరంతో దుష్కరప్రాస వాడి మిగిలినవారికంటె ధర్మజుని సంశ్లిష్టమైన ఉదాత్తవ్యక్తిత్వాన్ని ధ్వనింపచేయటం విశేషం. పద్యరచనలో కాంతి అనే శబ్దగుణాన్ని ఉజ్జ్వలంగా పోషించి నన్నయ గుణవద్రచనాశిల్పాన్ని వెలార్చాడు. 'శాత్త్రవ జైత్ర తేజమున సర్వదిశల్ వెలుగంగ' అనే విశేషణంలోనే కాంతిగుణం సూచించబడింది. ఉజ్జ్వలమైన తారాచంద్ర గ్రహ దైవబలాల వర్ణనతో అది ప్రకాశించింది. జ్యేష్ఠానక్షత్రం (పెద్దవాడుగా సూచించే నక్షత్రం)లో తారాబలం, చంద్రుడి శుభస్థితిలో చంద్రబలం, మిత్త్రగ్రహస్థితిలో గ్రహబలం, 'అతిస్థిరధర్మమూర్తి' అనిచెప్పి లోకాన్ని ధరించే ధర్మమే మూర్తికట్టినవా డని చెప్పటంతో దైవబలం-సూచించటంవలన ఒక పరిపూర్ణపురుషుడి ఉజ్జ్వలవ్యక్తిత్వాన్ని నన్నయ ధ్వనింపచేశాడు. జననకాలశుభగ్రహలక్షణాదులవివరంతో ఇతిహాసనాయకుడైన ధర్మజుడి జన్మఘట్టాన్ని వర్ణించి (ఇతరులకు ఈ వివరాలు ఇవ్వలేదు) అతడు భావికాలంలో చరిత్రపై వేయబోయే ప్రభావాన్ని ధ్వనిమయంగా నన్నయ సూచించాడు. (సంపా.)

క. ధరణీసురు లాదిగ ను । ర్వరలోఁ గల సర్వభూత వర్గం బెల్లం
బరమోత్సవ మొందెను గుణ । శరణ్యుఁ డగు ధర్మజన్ము జన్మదినమునన్. 95

ప్రతిపదార్థం: ధరణీ, సురులు+ఆదిగన్= బ్రాహ్మణులు మొదలుగా; ఉర్వరలోన్= భూమిమీద; కల= ఉన్న; సర్వ, భూత, వర్గంబు= అన్ని ప్రాణుల సమూహం; ఎల్లన్= అంతయు; గుణ, శరణ్యుడు= మంచిగుణాలకు స్థానమైనవాడు; అగు; ధర్మ,

జన్మ, జన్మ, దినమునన్= ధర్ముడినుండి పుట్టిన వానియొక్క జన్మదినాన - అనగా ధర్మరాజు పుట్టినరోజున; పరమ+ఉత్సవము= మిక్కిలి ఆనందం; ఒందెను= పొందాయి.

తాత్పర్యం: గుణవంతు డైన ధర్మరాజు పుట్టినరోజు బ్రాహ్మణులు మొదలుకొని భూమిమీద ఉన్న అన్ని ప్రాణులు ఎంతో ఆనందాన్ని పొందాయి.

విశేషం: ఇది శుభకరమైన మహాశకునం. సర్వభూతహితుడు, ధర్మరక్షకుడు, ప్రజారంజకుడైన సమ్రాట్టు కానున్నా డన్న భావిసూచన ఇందులో ధ్వని.

క. శతశృంగ నిలయు లగు సం। శ్రితవ్రతులు విప్రవరులు సేసిరి ధర్మ
స్థితి జాతకర్మ మత్యు। న్నతిఁ బాండుప్రథమపుత్త్రునకు హర్షముతోన్. 96

ప్రతిపదార్థం: పాండు, ప్రథమ, పుత్త్రునకున్= పాండురాజుయొక్క మొదటికుమారునికి; శత, శృంగ, నిలయులు+అగు= శతశృంగ పర్వతాన్ని ఉనికిపట్టుగా కలవాళ్ళయిన; సంశ్రిత, వ్రతులు= ఆశ్రయింపబడిన వ్రతం కలవాళ్ళు; విప్ర, వరులు= బ్రాహ్మణ శ్రేష్ఠులు; ధర్మ, స్థితి= ధర్మమార్గంలో; అతి+ఉన్నతిన్= మిక్కిలి గొప్పగా; జాతకర్మము= పుట్టినప్పుడు శిశువుకు చేసే సంస్కారం; హర్షముతోన్= సంతోషంతో; చేసిరి.

తాత్పర్యం: పాండురాజుయొక్క మొదటి కుమారునికి శతశృంగపర్వతంమీద వ్రతదీక్ష పూని ఉన్న బ్రాహ్మణ శ్రేష్ఠులంతా ధర్మమార్గంలో సంతోషంతో చాలాగొప్పగా జాతకర్మ చేశారు.

క. కురుకుల విభుఁ డగు ధర్మ। స్థిరమతి యగు నీతఁ డనుచు ధృతిఁ జేసి యుధి
ష్ఠిరుఁ డను నామముఁ దా ను। చ్చరించె నాకాశవాణి జనవినుతముగన్. 97

ప్రతిపదార్థం: ఈతఁడు= ఈ ధర్మనందనుడు; కురు, కుల, విభుఁడు= కురువంశానికి రాజు; అగున్; ధర్మ, స్థిర, మతి= ధర్మంలో స్థిరమైన బుద్ధికలవాడు; అగున్= కాగలడు; అనుచున్; ఆకాశవాణి; ధృతిన్+చేసి= ధైర్యంవలన; యుధిష్ఠిరుఁడు= యుద్ధంలో నిలుకడ కలవాడు; అను; నామమున్= పేరును; తాను= ఆ ఆకాశవాణి; జన, వినుతముగన్= జనులచేత కొనియాడబడేది ఔనట్లుగా; ఉచ్చరించెన్= పలికింది.

తాత్పర్యం: ఈతడు కురువంశానికి రా జవుతాడు. ధర్మంలో స్థిరమైన బుద్ధి కలవాడు అవుతాడు. ధైర్యంవలన యుధిష్ఠిరు డవుతాడు' అని ఆకాశవాణి లోకం కొనియాడేటట్లుగా అతనికి యుధిష్ఠిరు డనే పేరు పెట్టింది.

విశేషం: ఆకాశవాణి పేరుపెట్టటంచేత యుధిష్ఠిరుడు దేవహితు డని సూచన. పాండుధృతరాష్ట్రుల తరువాత వంశకర్తల గౌరవం నిలిపే చక్రవర్తి అత డౌతా డనీ, ధర్మాచరణంలో వీరుడూ, ధీరుడూ, స్థిరుడూ అయి ధర్మవీరరసప్రధానకథానాయకుడు కాగల డనీ ధ్వని. మహాభారతేతిహాసంలో మొదటినుండి చివరిదాకా ధృతితో నిలిచే ధర్మమూర్తి యుధిష్ఠిరుడు. (సంపా.)

గాంధారి యుదరతాడనంబు గావించుకొనుట (సం. 1-107-8)

వ. ఇట్లు పుత్త్రోదయంబునఁ బరమహర్ష సంపూర్ణ హృదయుం డై పాండురాజు కుంతీ మాద్రీ సహితుండై శతశృంగంబున నుండునంత, నట ముందఱ ధృతరాష్ట్రువలనన్ గాంధారి కృష్ణద్వైపాయనువరంబున గర్భంబు దాల్చి, యొక్క

సంవత్సరంబు నిండినఁ బ్రసూతి కాకున్నం బదరుచుఁ బుత్త్రలాభలాలస యయి యున్న యది యప్పు డయ్యుధిష్ఠిరు జన్మంబు విని మనస్తాపంబున నుదరతాడనంబుఁ జేసికొనిన, గర్భపాతం బగుడును. 98

ప్రతిపదార్థం: ఇట్లు; పుత్త్ర+ఉదయంబుననన్= కొడుకు పుట్టుకచేత; పరమ, హర్ష, సంపూర్ణ, హృదయుండు+ఐ= ఎక్కువ సంతోషంచేత నిండిన మనస్సు కలవాడై; పాండురాజు; కుంతీ, మాద్రీ, సహితుండు+ఐ= కుంతీదేవితో, మాద్రితో కూడినవాడై; శతశృంగంబునన్+ ఉండునంతన్= శతశృంగపర్వతమున, ఉండగా; అట= అక్కడ - హస్తినాపురంలో; ముందఱ= ముందుగా; ధృతరాష్ట్రువలనన్= ధృతరాష్ట్రునివల్ల; గాంధారి= గాంధారి; కృష్ణద్వైపాయను, వరంబునన్= కృష్ణద్వైపాయనుని వరంచేత; గర్భంబున్, తాల్చి= గర్భము ధరించి; ఒక్క, సంవత్సరంబు నిండినన్= ఒక సంవత్సరము పూర్తికాగా; ప్రసూతి=కాన్పు; కాకున్నన్= కాకపోగా; పదరుచు= త్వరపడుచు; పుత్త్ర, లాభ, లాలస+అయి= కొడుకును పొందా లనే మితిమీరిన ఆసక్తి కలది అయి; ఉన్న; అది= అయినది; అప్పుడు; ఆ+యుధిష్ఠిరు, జన్మంబున్= ఆ యుధిష్ఠిరుని పుట్టుకను; విని; మనస్+ తాపంబునన్= మనస్సులోని దుఃఖంచేత; ఉదర, తాడనంబున్= కడుపును బాదుకోవటం; చేసికొనిన= చేసుకో; గర్భ, పాతంబు= గర్భం క్రిందపడటం; అగుడును= కాగా.

తాత్పర్యం: ఇట్లా కొడుకు పుట్టటంవలన ఎంతో ఆనందించి పాండురాజు కుంతీమాద్రులతో శతశృంగాన ఉండగా, హస్తినాపురంలో కృష్ణద్వైపాయనునివరంచేత, ధృతరాష్ట్రునివలన, కుంతికన్నా ముందే గర్భవతి అయిన గాంధారి, ఒక సంవత్సర మైనా తనకు కాన్పు కాకపోవడంతో త్వరపడుతూ కొడుకును పొందా లని తహతహలాడుతూ ఉండగా, యుధిష్ఠిరుడు కుంతికి పుట్టాడని విని, కడుపును బాదుకోగా గర్భపాత మయింది.

విశేషం: తల్లుల మనఃప్రవృత్తులకు పిల్లలు ప్రతిబింబా లౌతారు. విశ్వశ్రేయస్సును కోరి, ధర్మమూర్తిని కోరి, కన్నది-కుంతీదేవి. కుంతీదేవికంటె ముందుగా గర్భవతి అయినా, తొలికాన్పు కుంతీదేవికే దక్కిం దని అసూయతో తనగర్భాన్ని తానే విచ్ఛిన్నం చేసుకొన్నది-గాంధారి. ధర్మరాజు వంశాన్నీ, ధర్మాన్నీ నిలిపేవా డౌతాడు; దుర్యోధనాదులు వంశాన్ని విచ్ఛిన్నం చేసేవా రౌతారు. ఇది వస్తుధ్వని. గాంధారిగర్భవిచ్ఛిత్తియే వంశవిచ్ఛిత్తికి సూచన. ఆమె అసూయామాత్సర్యాదిగుణాలే సంతానానికి వర్తించాయి. (సంపా.)

క. దాని నెఱింగి పరాశర। సూనుఁడు చనుదెంచి సుబలసుతఁ జూచి 'మనో
హీన వయి గర్భపాతము। గా నిట్టులు సేయు టిదియుఁ గర్తవ్యం బే.' 99

ప్రతిపదార్థం: దానిన్= ఆ గర్భపాతవృత్తాంతాన్ని; ఎఱింగి= తెలిసికొని; పరాశర, సూనుఁడు= పరాశరుని కుమారుడు - కృష్ణద్వైపాయనుడు; చనుదెంచి= వచ్చి; సుబల, సుతన్= సుబలునియొక్క కూతురిని - గాంధారిని; చూచి; మనోహీనవు+అయి= మనస్సులేని దాన వై; గర్భ, పాతము= గర్భం క్రిందపడుట; కాన్= అగునట్లుగా; ఇట్టులు= ఈ విధంగా; చేయుట; ఇదియున్= ఇట్టి హీనకార్యం; కర్తవ్యంబు+ఏ= చేయతగిందా?

తాత్పర్యం: అది తెలిసి కృష్ణద్వైపాయనుడు వచ్చాడు. గాంధారిని చూచి 'నీవు బుద్ధి లేకుండా ఈ విధంగా గర్భపాతం చేసికొనటం తగునా?' అన్నాడు.

విశేషం: ఈ పద్యంలో సముచ్చయంతోకూడిన 'ఇది' శబ్దంలో ఎంతో అర్థం ఇమిడిఉంది. అంతటి హీనమైన కార్యానికి అది సున్నితమైన మందలింపు. మందమతివై ఇంతటి తెగువకు పూనుకోవడం తగునా అని హెచ్చరిక.

క. ఇమ్మాంసపేశి నేకశ । త మ్ముదయింతురు సుతులు ముదమ్మున; నిది త
థ్య; మ్మింక నైన నతియ । త్నమ్మున రక్షింపు దీని నా వచనమునన్. 100

ప్రతిపదార్థం: ఈ+మాంస, పేశిన్= ఈ మాంసపు ముద్దనుండి; ఏక శతమ్ము= నూటొక్కమంది; సుతులు= కుమారులు, కూతుళ్ళు; ముదమ్మునన్= సంతోషంతో; ఉదయింతురు= పుడతారు; ఇది+తథ్యమ్ము= ఇది నిజం; ఇంకన్+ ఐనన్= ఇకనైనా; నా వచనమునన్= నా, మాటచేత; దీనిన్= ఈ మాంసపుముద్దను; అతి, యత్నమ్మునన్= మిక్కిలి ప్రయత్నంతో; రక్షింపు= కాపాడుము.

తాత్పర్యం: ఈ మాంసపుముద్దనుండి నూటొక్కమంది కొడుకులు కూతుళ్ళు (నూరుగురు కొడుకులు, ఒక కూతురు) పుడతారు. ఇది నిజం. నా మాట నమ్మి దీనిని చాలాజాగ్రత్తగా కాపాడుకొమ్ము.

విశేషం: ఏకశతము - (చూడు. 9వ పద్యవిశేషం.)

వ. అని గాంధారిం బదరి తొల్లివేదంబులు విభాగించిన మహానుభావుం డమ్మాంసపేశి నేకోత్తరశతఖండంబులుగా విభాగించి, 'వీని వేఱు వేఱ ఘృత కుండలంబులం బెట్టి, శీతలజలంబులం దడుపుచు నుండునది; యిందు నూర్వురు గొడుకులు నొక్క కూతురుం బుట్టుదు'రని చెప్పి చనినఁ, దద్వచనప్రకారంబు చేయించి, గాంధారీ ధృతరాష్ట్రులు సంతసిల్లియున్న; నిట శతశృంగంబున. 101

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; గాంధారిన్; పదరి= నిందించి; తొల్లి= పూర్వం; వేదంబులు; విభాగించిన; మహానుభావుండు; ఆ+మాంస, పేశిన్= ఆ మాంసపు ముద్దను; ఏక+ఉత్తర, శత, ఖండంబులుగా= నూటొక్క ముక్కలుగా; విభాగించి; వీనిన్= ఈ ముక్కలను; వేఱు, వేఱు+అ= వేర్వేరుగా; ఘృత, కుండలంబులన్= నేతికుండలలో; పెట్టి; శీతల జలంబులన్= చల్లని నీటితో; తడుపుచున్, ఉండునది= తడుపుతూ ఉండవలసింది; ఇందున్= ఈ కుండలలో; నూర్వురు, కొడుకులున్= నూరుమంది కుమారులూ; ఒక్క కూతురున్= ఒక కుమార్తె; పుట్టుదురు= జన్మిస్తారు; అని; చెప్పి; చనినన్= వెళ్ళగా; తద్+వచన ప్రకారంబు= ఆయనమాట ప్రకారం; చేయించి; గాంధారీ, ధృతరాష్ట్రులు; సంతసిల్లి, ఉన్నన్= సంతోషించి ఉండగా; ఇటన్, శతశృంగంబునన్= ఇక్కడ, శతశృంగపర్వతం దగ్గర.

తాత్పర్యం: అని గాంధారిని ఆక్షేపించి; పూర్వం వేదాలను విభజించిన మహానుభావుడు వ్యాసుడు, ఆ మాంసపు ముద్దను నూటొక్క ముక్కలుగా చేసి, 'వేర్వేరుగా వీటిని నేతి కుండలలో పెట్టి, చన్నీళ్ళతో తడుపుతూ ఉండండి, వీటినుండి నూరుమంది కొడుకులు, ఒక్క కూతురు పుడతారు' అని చెప్పి వెళ్ళగా, గాంధారీ ధృతరాష్ట్రులు ఆయన చెప్పినప్రకారం చేయించి, సంతోషంతో ఉండగా - ఇక్కడ శతశృంగపర్వతం దగ్గర.

చ. నిరుపమకీర్తి పాండుధరణీపతి వేడియుఁ గుంతిఁ జూచి 'యం
బురుహదళాక్షి ! యింక నొకపుత్త్రు నుదారచరిత్రు నుత్తమ
స్థిరజవసత్త్వు నయ్యనిలదేవుదయం జనియింపు పెంపుతోఁ ;
గురుకులరక్షకుం డతఁ డగున్ బలవద్భుజవిక్రమోన్నతిన్. 102

ప్రతిపదార్థం: నిరుపమ, కీర్తి= సాటిలేని కీర్తి కలవాడు; పాండుధరణీపతి= పాండురాజు; వెండియున్= మళ్ళీ; కుంతిన్; చూచి; అంబురుహ, దళ+అక్షి= తామరరేకులవంటి కన్నులు కలదానా; ఇంకన్, ఒక పుత్త్రున్= ఇంకా ఒక కుమారుని; ఉదార, చరిత్రున్= గొప్పనడవడి కలవాడిని; ఉత్తమ, స్థిర, జవ, సత్త్వున్= శ్రేష్ఠమైన, స్థిరమైన వేగం, బలం కలవానిని; ఆ+అనిలదేవు, దయన్= ఆ వాయుదేవునిదయచేత; జనియింపు= పుట్టించుము; అతఁడు= ఆ పుత్రుడు; పెంపుతోన్= గొప్పతనంచేత; బలవత్+భుజ, విక్రమ+ ఉన్నతిన్= బలమైన భుజాల పరాక్రమంయొక్క అతిశయంచేత; కురు, కుల రక్షకుండు= కురువంశాన్ని రక్షించేవాడు; అగున్= కాగలడు.

తాత్పర్యం: సాటిలేనికీర్తి కల పాండురాజు కుంతీదేవిని చూచి, 'నీవు గొప్పనడవడి కలవాడూ, శ్రేష్ఠమైన, స్థిరమైన వేగం, బలం కలవాడూ అయిన మరో కొడుకును, వాయుదేవునిదయతో కనుము. అతడు గొప్పగా తన భుజబలపరాక్రమంచేత కురువంశాన్ని రక్షిస్తాడు.'

విశేషం: పాండురాజుపుత్త్రసంకల్పాలు విశిష్టంగా ఉన్నాయి. సత్యాన్నీ, ధర్మాన్నీ సర్వలోకంలో నిలుపగలిగినవాడుగా మొదటి కొడుకును కోరాడు. ధర్ముడిని ఆరాధించి యుధిష్ఠిరుడిని పొందాడు. ఇప్పుడు మహాబలశాలి అయిన కొడుకును వంశరక్షణం కొరకు కోరుకొంటున్నాడు. ముందు ధర్మరక్షణం, (లోకరక్షణం) ఆ తరువాత వంశరక్షణం. ఆ క్రమంలో పాండురాజుయొక్క ధార్మికచింతన వెల్లడిఅవుతున్నది. పాండురాజు చంద్రవంశకర్తలలో ఒకడుకదా! (సంపా.)

వ. అని పనిచిన నెప్పటియట్ల కుంతీదేవి వాయుదేవు నారాధించి తత్ప్రసాదంబున గర్భంబు దాల్చి, సంవత్సరంబు సంపూర్ణం బగుడును. 103.

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; పనిచినన్= ఆజ్ఞాపించగా; ఎప్పటి అట్లు+అ= ఎప్పటివలెనే; కుంతీదేవి; వాయుదేవున్; ఆరాధించి; తద్+ప్రసాదంబునన్= ఆయన అనుగ్రహంచేత; గర్భంబున్; తాల్చి= ధరించి; సంవత్సరంబు= ఒక్క సంవత్సరం; సంపూర్ణంబు= పూర్తి; అగుడును= కాగా.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించగా ఎప్పటివలెనే కుంతీదేవి వాయుదేవుడిని పూజించింది. అతనిదయవలన గర్భం తాల్చింది. ఒకఏడాది పూర్తి కాగానే -

చ. సుతుఁడు నభస్వదంశమున సుస్థిరుఁ డై యుదయించినన్ మహా
యతికృత జాతకర్ముఁ డగు నాతని కాతతవీర్యవిక్రమో
న్నతునకు భీమసేనుఁ డను నామముఁ దా నొనరించె దివ్యవా
క్సతి శతశృంగశైల నివసన్మునిసంఘము సంతసిల్లఁగన్. 104

ప్రతిపదార్థం: సుతుఁడు= కుమారుడు; నభస్వత్+అంశమునన్= వాయుదేవునియొక్క అంశంచేత; సుస్థిరుఁడు+ఐ= మిక్కిలి నిలుకడ కలవాడై; ఉదయించినన్= పుట్టగా; మహా, యతి, కృత, జాతకర్ముఁడు= గొప్ప ఋషులచే చేయబడిన జాతకర్మం కలవాడు; అగు, ఆతనికిన్= ఆ వాయుపుత్రునికి; ఆతత, వీర్య, విక్రమ+ఉన్నతునకు= అధికబలపరాక్రమాలచేత గొప్పవాడైన వానికి; దివ్య, వాక్+సతి= ఆకాశవాణి; తాన్= తను; శతశృంగ, శైల, నివసత్+ముని, సంఘము= శతశృంగ పర్వతం మీద నివసించే మునుల సమూహం; సంతసిల్లఁగన్= సంతోషింపగా; భీమసేనుఁడు; అను; నామమున్= పేరును; ఒనరించెన్= చేసింది.

తాత్పర్యం: వాయుదేవునిఅంశతో మహాబలవంతు డైనకొడుకు పుట్టగా, మహర్షులు అతనికి జాతకర్మ చేశారు. అధికబలపరాక్రమాలచేత ఉన్నతు డైన ఆ బాలునికి శతశృంగపర్వతంమీద నివసించే మహర్షు లందరూ సంతోషించేటట్లుగా ఆకాశవాణి భీమసేను డని నామకరణం చేసింది.

విశేషం: ఈ పద్యరచనలో ప్రసాదగుణం పోషింపబడింది. మునిసంఘం పొందిన సంతోషానికి కారకుడైన భీమునిపుట్టుకను ఆ గుణంలో వర్ణించటం ఔచిత్యం. ధర్మజుని పుట్టుకను వర్ణించిన పద్యంలో (5-94) సంయుక్తాక్షరమైన తవర్ణాన్ని ప్రాసగా నిలపటంవలన ధర్మజుడు నాయకుడు కాగా, ఈ వృత్తంలో అసంయుక్త మైన తకారం ప్రాసగా నిలపటంవలన భీమసేనుడు అనునాయకుడుగా ఎల్లప్పుడు అన్నను అనుసరించి ఉంటా డని ఛందశ్శిల్పంతో నన్నయ సాధించినవస్తుధ్వని. (సంపా.)

దుర్యోధనాదుల జననము (సం.1-107-24)

క. **అనిలజు పుట్టిన దివసము - నన యట దుర్యోధనుండు నరనుత ! ధృతరా**
ష్ట్రనకున్ గాంధారికి న। గ్ర నందనుఁడు ఘనుఁడు పుట్టెఁ గలియంశమునన్. **105**

ప్రతిపదార్థం: నరనుత= జనులచేత పొగడబడేవాడా! ఓ జనమేజయ మహారాజా!; అనిలజు, పుట్టిన, దివసమునన= వాయుదేవుని కుమారు డైన భీమసేనుడు పుట్టినరోజే; అట= హస్తినాపురంలో; కలి, అంశమునన్ = కలియొక్క అంశంలో; గాంధారికిన్; ధృతరాష్ట్రునకున్; అగ్ర, నందనుఁడు= పెద్దకొడుకు; ఘనుఁడు= గొప్పవాడు; దుర్యోధనుండు; పుట్టెన్.

తాత్పర్యం: ఓ జనమేజయమహారాజా! వాయుపుత్రుడు భీముడు పుట్టినరోజే, హస్తినాపురంలో గాంధారీ ధృతరాష్ట్రులకు కలిఅంశతో పెద్దకొడుకుగా గొప్పవాడైన దుర్యోధనుడు పుట్టాడు. (అని వైశంపాయనమహర్షి చెప్పటం ప్రారంభించాడు.)

శా. **ఆదుర్యోధనుఁ డుద్భవిల్లుడును గ్రవ్యాదారవంబుల్ శివా**
నాదంబుల్ మదఘూకఘూంకృతులు నానారాసభధ్వానముల్
భూదిక్కంపముగాఁ జెలంగె విగతాంభోభృన్నభోవీథియం
దాదిత్యద్యుతి మాయఁగాఁ గురిసె నుగ్రాసృఙ్మహావర్షముల్. **106**

ప్రతిపదార్థం: ఆ, దుర్యోధనుఁడు; ఉద్భవిల్లుడును= పుట్టగా; క్రవ్యాద+ఆరవంబుల్= క్రూరమృగాల అరుపులు; శివా, నాదంబుల్= ఆడునక్కలయొక్క కూతలు; మద, ఘూక, ఘూంకృతులు= మదించిన గుడ్లగూబల ఘూంకారాలు; నానా, రాసభ, ధ్వానముల్= అనేకవిధా లైన గాడిదల ఓండ్ర శబ్దాలు; భూ, దిక్+కంపము, కాన్= భూమికి, దిక్కులకు చలనం కలిగేటట్లు; చెలంగెన్= మ్రోగాయి; విగత+అంభస్+భృత్+నభస్+వీథి, అందున్= పోయిన మేఘాలు కల ఆకాశమార్గంలో; ఆదిత్య, ద్యుతి= సూర్యునియొక్క కాంతి; మాయఁగాన్= నశించేటట్లుగా; ఉగ్ర+అసృక్+మహా, వర్షముల్= భయంకర మైన నెత్తుటి పెనువానలు; కురిసెన్= కురిశాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు పుట్టగానే క్రూరమృగాల అరుపులు, నక్కలకూతలు, మదించినగుడ్లగూబల ఘూంకారాలు, నానావిధా లైన గాడిదల ఓండ్రలు, భూమి, దిక్కులు కంపించే విధంగా చెలరేగాయి. ఆకాశంలో నీటిని ధరించిన మేఘాలు తొలగి, సూర్యకాంతి మాసేటట్లుగా భయంకర మైన పెద్దనెత్తుటివానలు కురిశాయి.

విశేషం: ఇవి అన్నీ లోకోపద్రవాన్ని సూచించే అపశకునాలు. పాండురాజుపెద్దకొడుకు పుట్టినప్పుడు సర్వలోకానందకరాలైన శుభశకునాలు కలిగాయి. ధృతరాష్ట్రునిపెద్దకొడుకు పుట్టినప్పుడు సర్వలోకారిష్టదాయకాలైన అపశకునాలు కలిగాయి. ఇవి

భావికథలో కురువంశంలో వా ళ్ళిద్దరూ వరుసగా నిర్వహించే నిర్మాణాత్మక, విధ్వంసకాత్మకపాత్రల ప్రవృత్తులను ధ్వనింప చేస్తున్నాయి.

వ. మఱియు దుర్యోధనజన్మానంతరంబున ధృతరాష్ట్రునకు వైశ్యాపుత్త్రుం డయిన యుయుత్సుండు పుట్టె; నంత గాంధారికి నొక్కొక్కదివసంబున నొక్కొక్కరుండుగాఁ గ్రమంబున దుశ్శాసన దుస్సహ దుశ్శల జలసంధ సమ సహ విందానువింద దుర్ధర్ష సుబాహు దుష్ప్రధర్షణ దుర్మర్షణ దుర్ముఖ దుష్కర్ణ కర్ణ వివింశతి వికర్ణ శల సత్త్వ సులోచన చిత్రోపచిత్ర చిత్రాక్ష చారుచిత్ర శరాసన దుర్మద దుర్విగాహ వివిత్సు వికటాన నోర్ణనాభ సునాభ నందోపనందక చిత్రబాణ చిత్రవర్మ సువర్మ దుర్విమోచనాయోబాహు మహాబాహు చిత్రాంగ చిత్రకుండల భీమవేగ భీమబల బలాకి బలవర్ధ నోగ్రాయుధ సుషేణ కుండధార మహోదర చిత్రాయుధ నిషంగి పాశి బృందారక దృఢవర్మ దృఢక్షత్త్ర సోమకీ ర్త్యనూదర దృఢసంధ జరాసంధ సద సువా గుగ్రశ్రవ ఉగ్రసేన సేనానీ దుష్పరాజ యాపరాజిత కుండశాయి విశాలాక్ష దురాధర దుర్జయ దృఢహస్త సుహస్త వాతవేగ సువర్చ ఆదిత్యకేతు బహ్వాశి నాగదత్తాగ్రయాయి కవచి క్రథన కుండి ధనుర్ధ రోగ్ర భీమరథ వీరబాహ్వా లోలు పాభయ రౌద్రకర్మ ధృడరథాశ్ర యానాధృష్య కుండభేది విరావి ప్రమథ ప్రమాథి దీర్ఘరోమ దీర్ఘబాహు వ్యూఢోరు కనకధ్వజ కుండాశి విరజసు లనంగా నూర్వురు గొడుకులు పుట్టిన. 107

ప్రతిపదార్థం: మఱియు; దుర్యోధన, జన్మ+అనంతరంబున= దుర్యోధనునిపుట్టుక తర్వాత; వైశ్యా, పుత్త్రుండు+అయిన= కోమటి స్త్రీ కొడుకైన; యుయుత్సుండు; పుట్టెన్; గాంధారికిన్; ఒక్కొక్క, దివసంబునన్= ఒక్కొక్క రోజు; ఒక్కొక్కరుండుగాన్= ఒక్కొక్కడుగా; క్రమంబునన్= వరుసగా; దుశ్శాసనుడు, దుస్సహుడు మొదలైనవారు; అనంగాన్; నూర్వురు= వందమంది; కొడుకులు= కుమారులు; పుట్టినన్= పుట్టగా.

తాత్పర్యం: అంతేకాక, దుర్యోధనుడు పుట్టినతరువాత ధృతరాష్ట్రునికి వైశ్యకులపత్నివలన యుయుత్సు డనే కొడుకు పుట్టాడు. ఆ తరువాత గాంధారికి రోజు కొక్కడుగా దుశ్శాసనాదులు వరుసగా పుట్టారు. (వారిపే ర్లన్నీ పై వచనంలో వరుసగా ఉన్నాయి). ఈ విధంగా మొత్తం నూరుగురుకొడుకులు పుట్టారు.

తే. ఆ తనూజుల కందఱ కనుజ యై ల। తాంగి దుశ్శల యను కూఁతు రమరఁ బుట్టె ;
నందు దౌహిత్రవంతుల దైన్య పుణ్య। గతియుఁ గాంతు నే నని పొంగెఁ గౌరవుండు. 108

ప్రతిపదార్థం: ఆ, తనూజులకు+అందఱకున్= ఆ కుమారులందరికి; అనుజ+ఐ= అనుసరించి పుట్టిన దై - అనగా చెల్లెలై; లతా+అంగి= తీగవంటి దేహం కలది; దుశ్శల; అను; కూఁతురు; అమరన్= ఒప్పుగా; పుట్టెన్; అందున్= ఆమెయందు; దౌహిత్రవంతులది+ఐన= కూతురియొక్క కొడుకులు కలవారిది అయిన; పుణ్య, గతియున్= పుణ్యలోకంకూడ; నేనున్; కాంతున్= పొందుతాను; అని= ఆ విధంగా; కౌరవుండు= ధృతరాష్ట్రుడు; పొంగెన్= సంతోషించాడు.

తాత్పర్యం: ఆ కొడుకు లందరికి చెల్లెలుగా సుకుమారి అయి దుశ్శల అనే కూతురు పుట్టింది. ఆమెవలన దౌహిత్రులు కలవాళ్ళు పొందేపుణ్యలోకాన్నికూడా పొందుతా నని ధృతరాష్ట్రుడు సంతోషించాడు.

విశేషం: దుహిత అంటే కూతురు అని అర్థం. ఆమెకొడుకు దౌహిత్రుడు.

వ. ఇట్లేకోత్తరశతపు త్త్రులం బడసి కృతార్థుండై యున్న ధృతరాష్ట్రుకడకు భీష్మవిదురాది బంధుజనంబులుఁ బురోహితప్రముఖ బ్రాహ్మణవరులును వచ్చి యొక్కనాఁ డేకాంతంబున ని ట్లనిరి. 109

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్లు; ఏకోత్తర, శత, పుత్త్రులన్= నూటొక్కమంది కొడుకులను కూతుంఁడ్రను (100మందికొడుకులు, ఒకకూతురు); పడసి= పొంది; కృత+అర్థుండు+ఐ= తీరిన కోరిక కలవాడై; ఉన్న; ధృతరాష్ట్రు, కడకు= ధృతరాష్ట్రునిదగ్గరకు; భీష్మ, విదుర+ఆది, బంధు, జనంబులున్= భీష్ముడు, విదురుడు మొదలైన బంధువులు; పురోహిత, ప్రముఖ, బ్రాహ్మణ, వరులును= పురోహితులు మొద లైన బ్రాహ్మణ శ్రేష్ఠులు; వచ్చి; ఒక్కనాఁడు; ఏకాంతంబునన్= ఒంటరిగ; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ఈ విధంగా నూటొక్కమంది పిల్లల్ని పొంది కోరిక తీరిన ధృతరాష్ట్రుని దగ్గరకు భీష్ముడు, విదురుడు మొదలైన బంధువులు, పురోహితులు మొదలైన బ్రాహ్మణ శ్రేష్ఠులు వచ్చి ఒంటరిగా అతనితో ఇట్లా అన్నారు.

క. మన దుర్యోధను జన్మం । బునఁ బెక్కులు దుర్నిమిత్తములు పుట్టె; జగ
జ్జనసంక్షయజననుం డగు । నని పలికెద రెఱుక గల మహాత్ములు వానిన్. 110

ప్రతిపదార్థం: మన, దుర్యోధను, జన్మంబునన్= మనదుర్యోధనుడు పుట్టినప్పుడు; దుర్+నిమిత్తములు= చెడ్డశకునాలు; పెక్కులు= చాల; పుట్టెన్; ఎఱుక= జ్ఞానం; కల= ఉన్న; మహాత్ములు; వానిన్= ఆ దుర్యోధనుడిని; జగత్+జన+సంక్షయ, జననుండు= లోకంలోని ప్రజలకు నాశనం కలిగించేవాడు; అగున్, అని= అవుతాడు అని; పలికెదరు= చెప్తుతారు.(చెప్పారు).

తాత్పర్యం: మన దుర్యోధనుడు పుట్టినప్పుడు అనేకదుశ్శకునాలు పుట్టాయి. జ్ఞానులైన మహాత్ములు వాడు లోక జననాశకు డని అంటారు.(అన్నారు).

క. కులమునకు నఖిలలోకం । బులకు నపాయంబు సేయు పురుషాధము ని
మ్ముల దూషించి జగంబును । గులమును రక్షించు టుఱదె కువలయనాథా! 111

ప్రతిపదార్థం: కువలయనాథా= భూమికి ప్రభువు అయినవాడా!; కులమునకున్= వంశానికి; లోకంబులకున్= అన్ని లోకాలకు; అపాయంబు= కీడు; చేయు; పురుష+అధమున్= పురుషులలో నీచుడిని; ఇమ్ములన్= సంతోషంతో; దూషించి= విడిచివేసి; జగంబును= లోకాన్ని; కులమును= వంశాన్ని; రక్షించుట; ఉఱదు+ఎ= తగదా?

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! కులానికీ, లోకాలకూ కీడు కల్గించే నీచుడైన ఈ దుర్యోధనుడిని వదలివేసి, లోకాన్నీ, కులాన్నీ రక్షించటం తగదా? (తగునని భావం.)

వ. 'కావున నిప్పడ దుర్యోధను దూషింతము; నీకు వెండియుఁ బుత్త్రశతంబు సంపూర్ణంబయి పెరుఁగుచున్నయది' యనిన ధృతరాష్ట్రుండు పుత్త్రమోహంబున నప్పలుకులు విన నొల్లకుండె; నంత నట శతశృంగంబునఁ గుంతీదేవి భీమసేను సుపుత్త్రుం బడసి, దశమదివసంబున వేల్పులకు మ్రొక్కఁ గొడుకు నెత్తుకొని దేవగృహంబునకుఁ బోవునెడ నతివిషమగహనగిరిగహ్వరంబుననుండి యొక్కపులి వెలువడి యామిషార్థి యయి పయికి లంఘించిన. 112

ప్రతిపదార్థం: కావునన్; ఇప్పుడు+అ= ఇప్పుడే; దుర్యోధను; దూషింతము= వదలి వేద్దాం; నీకున్; వెండియున్= మరియు; పుత్త్రశతంబు= వందమందికొడుకులు; సంపూర్ణంబు+అయి= నిండుగా; పెరుగుచు+ఉన్న అది = పెరుగుతూ ఉన్నారు; అనినన్= అనగా; ధృతరాష్ట్రుండు; పుత్త్ర మోహంబునన్= కొడుకుమీది మమకారంతో; ఆ+పలుకులు= పెద్దలు చెప్పిన ఆ మాటలు; వినన్= వినటానికి; ఒల్లక+ఉండెన్= ఇష్టపడలేదు; అంతన్= అప్పుడు; అట= అచ్చట; శతశృంగంబునన్= శతశృంగ పర్వతందగ్గర; కుంతీదేవి; భీమసేనున్= భీమసేనుడు అను; సుపుత్త్రున్= చక్కనికుమారుని; పడసి= పొంది; దశమ,

దివసంబునన్= పదోరోజు; వేల్పులకున్= దేవతలకు; మ్రొక్కన్= మ్రొక్కుటకై; కొడుకున్; ఎత్తుకొని; దేవ, గృహంబునకున్= దేవాలయానికి; పోవు, ఎడన్= పోవుచోట; అతి, విషమ, గహన, గిరి, గహ్వరంబునన్, ఉండి= మిక్కిలి మిట్టపల్లాలై ప్రవేశించడానికి సాధ్యం కాని కొండగుహనుండి; ఒక్క; పులి; వెలువడి= బయటకు వచ్చి; ఆమిష+అర్థి, అయి= మాంసంకోరిన దై; పయికిన్= మీదికి; లంఘించినన్= దూకగా.

తాత్పర్యం: 'అందువలన ఇప్పుడే దుర్యోధనుడిని విడిచిపెట్టుము, నీకు ఇంకా వందమందిపిల్లలు నిండుగా పెరుగుతున్నారు' అని అనగా, ధృతరాష్ట్రుడు పుత్రమమకారంతో ఆ పలుకులు వినటానికి ఇష్టపడలేదు. అక్కడ శతశృంగపర్వతంమీద కుంతి భీమసేనుడిని కని, పదోరోజున దేవతలకు మ్రొక్కటానికి ఆ బాలుడిని ఎత్తుకొని దేవాలయానికి పోయేచోట - మిక్కిలి మిట్టపల్లాలై ప్రవేశించ సాధ్యం కాని కొండగుహనుండి ఒకపులి బయటకు వచ్చి, మాంసాన్ని కోరి మీదికి దూకగా.

భీమునిశరీరదార్ఢ్యము (సం.1-114-11)

క. వీరుఁడు పాండుమహీపతి । దారుణ బాణ త్రయమునఁ దద్వ్యాఘ్రంబున్
ధారుణిఁ ద్రెళ్ళఁగ నడుమన । భూరిభుజుం డేసి కాచెఁ బుత్త్రుం దేవిన్. 113

ప్రతిపదార్థం: వీరుఁడు; భూరి, భుజుండు= గొప్పభుజాలు కలవాడు; పాండు, మహీపతి= పాండురాజు; దారుణ, బాణ, త్రయమునన్= భయంకరమైన మూడుబాణాలతో; తద్+వ్యాఘ్రంబున్= ఆ పులిని; నడుమన్+అ= మధ్యలోనే; ధారుణిన్= భూమిమీద; త్రెళ్ళఁగన్= (చచ్చి) పడేటట్లు; ఏసి= కొట్టి; పుత్త్రున్= కొడుకును; దేవిన్=భార్యఐన కుంతీదేవిని; కాచెన్= రక్షించాడు.

తాత్పర్యం: వీరుడు, బలమైన భుజాలు కలవాడు అయిన పాండురాజు భయంకరాలైన మూడుబాణాలతో మధ్యలోనే ఆ పులిని భూమిమీద చచ్చిపడేటట్లు కొట్టి కొడుకు భీముడిని, భార్య కుంతీదేవిని కాపాడాడు.

క. ఉరు శార్దూల భయంబునఁ । బరవశ యయి కుంతి యున్న బాలకుఁడు శిలో
త్కరముపయిఁ బడియెఁ దన ని । ష్ఠురతనుహతిఁ జేసి రాలు చూర్ణంబులుగన్. 114

ప్రతిపదార్థం: ఉరు, శార్దూల, భయంబునన్= పెద్దపులివలన కలిగినభయంతో; కుంతి; పరవశ+అయి= ఒడలు తెలియని దై; ఉన్నన్= ఉండగా; బాలకుఁడు; తన, నిష్ఠుర, తను హతిన్= తన కఠినమైన శరీరంయొక్క దెబ్బచేత; రాలు, చూర్ణంబులుగన్= రాళ్ళు పొడి అయ్యేటట్లు; చేసి; శిలా+ఉత్కరము, పయిన్= రాళ్ళ సమూహంమీద - కొండమీద; పడియెన్= పడినాడు.

తాత్పర్యం: పెద్దపులివలన కలిగినభయంతో కుంతీదేవి శరీరం స్వాధీనం తప్పగా, బాలుడు భీముడు క్రిందపడ్డాడు. కఠినమైన అతనిశరీరం తాకిడికి ఆ కొండమీది రాళ్ళు పొడి అయ్యాయి.

వ. దానిం జూచి పాండురాజు సంభ్రమంబునఁ బఱతెంచి విస్మితుం డై కొడుకు నెత్తికొని కుంతీదేవిం దోడ్కొని వేల్పులకు మ్రొక్కించి మగుడి నిజాశ్రమంబునకు వచ్చి సుఖం బుండి, గాంధారీధృతరాష్ట్రులకుఁ బుత్త్రశతంబు పుట్టుట విని, ఋషులవలన దివ్యమంత్రోపదేశంబుఁ గొని. 115

ప్రతిపదార్థం: దానిన్+చూచి; పాండురాజు; సంభ్రమంబునన్= వేగిరపాటుతో; పఱతెంచి= వచ్చి; విస్మితుండు+ఐ= ఆశ్చర్య పడినవాడై; కొడుకున్; ఎత్తుకొని; కుంతీదేవిన్; తోడ్కొని= తనతో తీసికొని; వేల్పులకున్= దేవతలకు; మ్రొక్కించి; మగుడి= మరలి; నిజ+ఆశ్రమంబునకున్= తనయొక్క ఆశ్రమానికి; వచ్చి; సుఖంబు, ఉండి= సుఖంగా ఉండి; గాంధారీ, ధృతరాష్ట్రులకున్; పుత్ర శతంబు= వందమందికొడుకులు; పుట్టుట విని; ఋషులవలనన్; దివ్య, మంత్ర+ఉపదేశంబున్; కొని= గ్రహించి.

తాత్పర్యం: దానిని చూచి పాండురాజు వేగిరపాటుతో వచ్చాడు. ఆశ్చర్యపడి ఆ కొడుకును ఎత్తికొన్నాడు. కుంతీదేవిని తోడ్కొని దేవతలకు మ్రొక్కించి, తిరిగి తనఆశ్రమానికి వచ్చి సుఖంగా ఉండగా, గాంధారీ ధృతరాష్ట్రులకు వందమందికొడుకులు పుట్టా రని విని, ఋషులవలన దివ్యమంత్రోపదేశాన్ని పొంది.

ఇంద్రప్రసాదంబునఁ గుంతి కర్జునుఁ డుదయించుట (సం.1-114-15)

క. కొడుకుం ద్రిలోక విజయుం। బడయుదు నని ఘోర మగు తపం బొనరింపం
దొడఁగె సురరాజు నెడలో। నిడికొని యేకాగ్రబుద్ధి నేకాంతమునన్. 116

ప్రతిపదార్థం: త్రిలోక, విజయున్= మూడులోకాలను జయించేవాడిని; కొడుకున్; పడయుదును= పొందుతాను; అని= అని తలచి; ఘోరము+అగు= భయంకర మైనట్టి; తపంబు; సురరాజన్= దేవతలరా జైన దేవేంద్రుడిని; ఎడలోన్= మనస్సులో; ఇడికొని= ఉంచుకొని; ఏక+అగ్ర, బుద్ధిన్= ఒకదానిమీదే లగ్నమైన మనస్సుతో; ఏకాంతమునన్= ఒంటరిగా; ఒనరింపన్= చేయడానికి; తొడఁగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: ముల్లోకాలను జయించగల కొడుకును పొందా లని దేవేంద్రుడిని ధ్యానిస్తూ, ఏకాగ్రబుద్ధితో, ఏకాంతంగా గొప్పతపస్సు చేయడానికి పూనుకొన్నాడు.

విశేషం: కథలో కారణం చెప్పకుండా కార్యాలు జరుగుతున్నట్లు చెప్పటం ప్రసన్నకథాకవితలో ఒకశిల్పం. వందమంది కొడుకులు ధృతరాష్ట్రునికి పుట్టా రని వినగానే పాండురాజు దివ్యమంత్రాల ఉపదేశం పొందాడు; ఒంటి కాలిమీద గొప్పతపస్సు చేశాడు. త్రిలోకవిజయుడైన కొడుకును కోరుకొన్నాడు. ఈచర్యకు కారణం కథలో స్పష్టంగా లేదు. కాని లో నారసి చూస్తే కారణం స్పష్టమౌతుంది. ధార్తరాష్ట్రులు నూరుగురు ఏకమైతే మూడులోకాలనే జయించగలరేమో, ధర్మరక్ష కులరక్షకులైన ధర్మజ భీము లిద్దరూ ధార్తరాష్ట్రుల ధాటికి నిలువలేకపోవచ్చును. త్రిలోకవిజయుడైన పుత్త్రుడుమాత్రమే ధార్తరాష్ట్రులకు దీటుగా నిలిచి, పాండవ ప్రాభవాన్ని, లోకాధిపత్యాన్ని నిలుపగల డనే భావం పాండురాజులో కలిగినట్లు స్పష్టమౌతూఉంది. అందుకే త్రిలోకవిజయుడైన పుత్రునికొరకు త్రిలోకాధిపతిని ఆరాధించటం. (సంపా.)

వ. ఇట్లతి నిష్ఠ నేకపాద స్థితుం డయి తపంబు సేయుచుఁ గుంతి నొక్క సంవత్సరంబు వ్రతంబు సేయం బంచియున్న నప్పాండురాజున కింద్రుండు ప్రత్యక్షం బై. 117

ప్రతిపదార్థం: ఇట్లు; అతి, నిష్ఠన్= మిక్కిలి నియమంతో; ఏక, పాద, స్థితుండు+అయి= ఒకపాదంమీదనే నిలిచి ఉన్నవాడై - అనగా ఒంటి కాలిమీద నిలబడి; తపంబు, చేయుచున్= తపస్సు గావిస్తూ; కుంతిన్; ఒక్క, సంవత్సరంబు; వ్రతంబు చేయన్= వ్రతం చేయటానికై; పంచి= ఆజ్ఞాపించి; ఉన్నన్= ఉండగా; ఆ+పాండురాజునకున్= ఆ పాండురాజునకు; ఇంద్రుండు= మహేంద్రుడు; ప్రత్యక్షంబు+ఐ= ఎదుట కన్పించినవాడై.

తాత్పర్యం: ఈ విధంగా మిక్కిలినిష్ఠతో ఒంటికాలిమీద నిలబడి తాను తపస్సు చూస్తూ, కుంతీదేవిని ఒక సంవత్సరం వ్రతం చేయవలసిందిగా ఆజ్ఞాపించి ఉండగా, ఆ పాండురాజుకు దేవేంద్రుడు ప్రత్యక్షమై.

క. 'పుత్త్రుఁడు నీ కుదయించు న। మిత్త్రక్షయకరుఁడు బంధుమిత్త్రాంబుజ స

న్మిత్త్రుం' డని వర మిచ్చిన। ధాత్త్రీపతి పొంగి పృథకుఁ దా ని ట్లనియెన్. 118

ప్రతిపదార్థం: నీకున్; అమిత్ర, క్షయ, కరుఁడు= మిత్రులు కాని వాళ్ళను నాశం చేసేవాడు - అంటే శత్రువులను నాశనం చేసేవాడు; బంధు, మిత్త్ర+అంబుజ, సత్+మిత్త్రుండు= చుట్టాలు, స్నేహితులు అనే పద్మాలకు చక్కని సూర్యునివంటివాడు; పుత్త్రుఁడు; ఉదయించును= పుట్టుతాడు; అని= ఆ విధంగా; వరము+ఇచ్చినన్= వరం ఇయ్యగా; ధాత్రీ, పతి= పాండురాజు; పొంగి= మిక్కిలి సంతోషించి; తాన్= తాను; పృథకున్= కుంతీదేవికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీకు శత్రువులను నాశనం చేసేవాడు, బంధువులు, స్నేహితులు అనే పద్మాలకు సూర్యుని వంటివాడు అయినకొడుకు పుడతాడు' అని వరం ఇవ్వగా పాండురాజు ఎంతో సంతోషించి కుంతీదేవితో ఇట్లా అన్నాడు.

విశేషం: పాండురాజు వరం కోరినట్లు చెప్పకుండా, ఇంద్రుడే తనంతట తాను వర మిచ్చినట్లు చెప్పటం ఇక్కడ విశేషం. శత్రువులను సంహరించేవాడు, బంధువులను సంతోషపెట్టేవాడు అయిన కొడుకు పుట్టుతా డని ఇంద్రునివరం. నిజానికి అటువంటి కొడుకు కావా లన్నది పాండురాజు మనసులోనికోరిక. ఆ శత్రువు లెవరు? ఆ బంధువు లెవరు? - అనే ప్రశ్నలకు సమాధానం కాలం చెప్పవలసిందే. సారమతులు లో నారసి భావించతగిందే.

క. ధనమున విద్యను సంతతిఁ దనిసిన వా రెందుఁ గలరె? ధవళేక్షణ ! కా

వున నా కింకను బలువురఁ। దనయులఁ బడయంగ వలయు ధర్మువు పేర్మిన్. 119

ప్రతిపదార్థం: ధవళ+ఈక్షణ= తెల్లని కన్నులు కలదానా!; ధనమునన్= ధనంచేత; విద్యను= విద్యచేత; సంతతిన్= సంతానంచేత; తనిసినవారు= తృప్తిపొందినవారు; ఎందున్= ఎక్కడైనా; కలరె= ఉన్నారా?; కావునన్= కాబట్టి; నాకున్= నాకు; ఇంకను= ఇంకా; పలువురన్= పెక్కుమందిని; తనయులను= పుత్రులను; ధర్మువు, పేర్మిన్= ధర్మంయొక్క అతిశయంచేత; పడయంగవలయున్= పొందాలి.

తాత్పర్యం: ఓ కుంతీ! లోకంలో ధనం, విద్య, సంతానం విషయాలలో తృప్తి పొందినవాళ్ళు ఎవరైనా ఉన్నారా? అందువలన నా కింకా ఎందరో కొడుకులను ధర్మమార్గంలో పొందా లని ఉన్నది.

చ. అమరగణంబులోనఁ బరమార్థమ యింద్రుఁడు పెద్ద, సర్వలో

కములకు వల్లభుం డతఁడ కావున నయ్యమరాధిపప్రసా

దమున సుతున్ సురేంద్రసము ధర్మసమన్వితు నస్మదీయవం

శము వెలుఁగింపఁగాఁ బడయు సర్వజగత్పరిరక్షణక్షమున్. 120

ప్రతిపదార్థం: అమర, గణంబులోనన్= దేవతలసమూహంలో; పరమ+అర్థము+అ= సత్యంగానే; ఇంద్రుఁడు; పెద్ద= పెద్దవాడు, గొప్పవాడు; అతడు+అ= అతడే; సర్వ, లోకములకున్= అన్ని లోకాలకు; వల్లభుండు= రాజు; కావునన్= అందుచేత; ఆ+అమర+అధిప, ప్రసాదమునన్= ఆ దేవతలరాజుయొక్క దయతో; సుర+ఇంద్ర,సమున్= దేవేంద్రునితో సమాను డైనవాడిని;

ధర్మ సమన్వితున్= ధర్మంతో కూడినవాడిని; సర్వ, జగత్+రక్షణ, క్షమున్= లోకా లన్నింటిని కాపాడటంలో సమర్థుడు అయినటువంటివాడిని; అస్మదీయ, వంశము = నా వంశం; వెలుఁగింపఁగాన్= ప్రకాశింప చేయటానికి; సుతున్= కుమారుని; పడయు= పొందుము.

తాత్పర్యం: దేవతలలో నిజంగా దేవేంద్రుడు పెద్ద. అతడే లోకాల కన్నింటికి రాజు. అందువలన ఆ దేవేంద్రుని దయతో అతనితో సమాన మైనవాడు, ధర్మాత్ము డైనవాడు, అన్నిలోకాలను రక్షించటంలో సమర్థు డైనవాడు, నా వంశాన్ని వెలిగించేవాడు అయినకొడుకును పొందుము.

వ. అని నియోగించినఁ గుంతియుఁ దొల్లిటి యట్ల దుర్వాసుం డిచ్చిన మంత్రంబున నింద్రు నారాధించినఁ, దత్ప్రసాదంబునఁ గుంతికి. 121

ప్రతిపదార్థం: అని; నియోగించినన్= ఆజ్ఞాపించగా; కుంతియున్; తొల్లిటి, అట్లు+అ= ఇదివరకటివలెనే; దుర్వాసుండు; ఇచ్చిన= ప్రసాదించిన; మంత్రంబునన్= మంత్రంచేత; ఇంద్రున్= ఇంద్రుని; ఆరాధించినన్= పూజించగా; తద్+ప్రసాదంబునన్= అతని దయతో; కుంతికిన్.

తాత్పర్యం: అని పాండురాజు ఆజ్ఞాపించగా; కుంతికూడ ఇదివరకటివలెనే దుర్వాసు డిచ్చినమంత్రంతో ఇంద్రుడిని ప్రార్థించగా అతనిదయతో కుంతికి.

క. స్థిరపౌరుషుండు లోకో । త్తరుఁ డుత్తరఫల్గునీప్రథమపాదమునన్
సురరాజునంశమున భా । సురతేజుఁడు వంశకరుఁడు సుతుఁ డుదయించెన్. 122

ప్రతిపదార్థం: స్థిర, పౌరుషుండు= నిలకడైన పౌరుషం కలవాడు; లోక+ఉత్తరుఁడు= లోకంలో శ్రేష్ఠుడు; భాసుర, తేజుఁడు= ప్రకాశిస్తున్న తేజస్సు కలవాడు; వంశ, కరుఁడు= వంశాన్ని నిలిపేవాడు; సుతుఁడు= కుమారుడు; సుర, రాజు, అంశమునన్= దేవేంద్రుని అంశంతో; ఉత్తర ఫల్గునీ, ప్రథమ, పాదమునన్= ఉత్తరఫల్గునీనక్షత్రం మొదటిపాదంలో; ఉదయించెన్= పుట్టాడు.

తాత్పర్యం: స్థిరమైనపౌరుషం కలవాడు, లోకంలో కెల్ల శ్రేష్ఠుడు, ప్రకాశించే తేజస్సు కలవాడు, వంశాన్ని నిలిపేవాడు అయినకుమారుడు, దేవేంద్రునిఅంశతో ఉత్తరఫల్గునీనక్షత్రప్రథమపాదంలో జన్మించాడు.

విశేషం: పాద మనగా నాల్గోవంతు.

వ. అయ్యవసరంబున.

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సందర్భంలో **123**

తాత్పర్యం: ఆ సమయంలో.

సీ. 'విను కార్తవీర్యుకంటెను వీరుఁ డగుట నర్జుననామ మీతండ యొనరఁ దాల్చు;
నీతండ యనిఁ బురుహూతాదిసురుల నోడించి ఖాండవము దహించు బలిమి;

నీతండ నిఖిలావనీతలేశుల నోర్చి రాజసూయము ధర్మరాజు నునుచు;

నీతండ వేల్పులచేత దివ్యాస్త్రముల్ వడసి విరోధుల నొడుచుఁ గడిమి'

ఆ. ననుచు నవపయోదనినదగంభీర మై। నెగసె దివ్యవాణి గగనవీథిఁ,

గురిసెఁ బుష్పవృష్టి, సురదుందుభిధ్వనుల్। సెలఁగె సకలభువనవలయ మద్రువ. 124

ప్రతిపదార్థం: విను; కార్తవీర్యుకంటెన్; వీరుఁడు; అగుటన్= అవటంచేత; అర్జున, నామము= అర్జును డనే పేరు; ఒనరన్= ఒప్పేటట్లు; తాల్చున్= ధరిస్తాడు; ఈతండు+అ= ఇతడే; అనిన్= యుద్ధంలో; పురుహూత+ఆది, సురులన్= ఇంద్రుడు మొదలైన దేవతలను; ఓడించి; బలమిన్= పరాక్రమంతో; ఖాండవము= ఖాండవవనాన్ని; దహించున్= కాల్చును; ఈతండు+అ= ఇతడే; నిఖిల+అవనీతల+ఈశులన్= మొత్తం భూమిమీది రాజులను; ఓర్చి= జయించి; రాజసూయము= రాజసూయయాగంలో; ధర్మరాజున్= ధర్మరాజును; ఉనుచున్= ఉంచుతాడు; ఈతండు+అ= ఇతడే; వేల్పులచేత= దేవతలచేత; దివ్య+అస్త్రముల్= దేవతా సంబంధమైన బాణాలు; పడసి= పొంది; కడిమిన్= పరాక్రమంతో; విరోధులన్= శత్రువులను; ఒడుచున్= ఓడిస్తాడు; అనుచున్= అంటూ; నవ, పయోద, నినద, గంభీరము+ఐ= క్రొత్త మేఘంయొక్క ఉరుమువలె గంభీరమై; దివ్య, వాణి= దేవతా సంబంధ మైన పలుకు; గగన, వీథిన్= ఆకాశవీథిలో; నెగసెన్= వ్యాపించింది; పుష్ప, వృష్టి= పూలవాన; కురిసెన్; సుర, దుందుభి, ధ్వనుల్= దేవతలయొక్క నగారాల మ్రోతలు; సకల, భువన, వలయము= మొత్తం భూమండలం; అద్రువన్= అదిరేటట్లు; చెలఁగెన్= మ్రోగాయి.

తాత్పర్యం: 'ఇతడు కార్తవీర్యునికన్నా వీరుడు కావటంచేత అర్జునుడు అనేపేరు వహిస్తాడు. యుద్ధంలో ఇంద్రాది దేవతలను ఓడించి, పరాక్రమంతో ఖాండవాన్ని దహిస్తాడు. భూమిమీద రాజు లందరినీ జయించి, ధర్మరాజుచేత రాజసూయయాగాన్ని చేయిస్తాడు. దేవతలవలన దివ్యాస్త్రాలు పొంది శత్రువులను జయిస్తాడు' అని ఆకాశవాణి క్రొత్త మేఘం మ్రోసిన ఉరుమువలె గంభీరంగా పలికింది. పూలవాన కురిసింది. భూమండలం దద్దరిల్లేటట్లు దేవ దుందుభులు మ్రోగాయి.

విశేషం: పుట్టుకను కందపద్యంలో వర్ణించి; మహిమను సీసపద్యంలో వివరించటం నన్నయ ప్రదర్శించిన పద్యవిద్యాప్రౌఢి. ధర్మజభీములు స్థిరపాత్రలుగాను, అర్జునునిపాత్ర వికాసదశలను పొందేదిగాను చిత్రించటం భారతకథలో కనపడుతుంది. ధర్మజు డనే ధర్మశక్తికి భీముడు భౌతికబలాన్ని కూర్చేవాడు; అర్జునుడు దైవబలాన్ని అనుసంధించేవాడు. ఆ భేదం చెప్పటం నన్నయ వస్తుశిల్పం. 'ఈతండ' ఏవార్థకమైన తదర్థకసర్వనామాలను మూడుచరణాలలో మొదట వాడి, అర్జునుని పరిణామ స్థితులను నన్నయ కథలో చక్కగ సూచించాడు. ఏవార్థకం అర్జునుని అనన్యపరాక్రమాన్ని ధ్వనింప చేస్తుంది. ఖాండవదహన ఘట్టంనుండి అర్జునునికి శ్రీకృష్ణసహాయం, దేవతలవలని దివ్యాస్త్రలాభం కలగటం ప్రారంభ మౌతుంది. ఇవి భావికథాబీజాలుగా ప్రస్తావించి వాటి వివరాలను తెలిసికొనటానికి పఠితలహృదయాలలో ఉత్కంఠను రేకెత్తించటం ప్రసన్నకథాకవి(లి) తార్థయోజనం. (సంపా.)

వ. మఱియు మరీచ్యాది ప్రజాపతులును, ధాత్రాది ద్వాదశాదిత్యులును, మృగవ్యాధాది రుద్రులును, ధరాది వసువులును, భరద్వాజాది మహర్షులును, భీమసేనాది గంధర్వులును, శేషాది మహానాగముఖ్యులును, వైనతేయాది ఖచరులును, మేనకాద్యప్సరసలును, నాశ్వినులును, విశ్వేదేవతలును, మఱియు స్వర్గంబున నున్నరాజులుం జను దెంచిన. 125

ప్రతిపదార్థం: మఱియున్; మరీచి+ఆది, ప్రజాపతులును= మరీచి మొద లైనబ్రహ్మలు, ధాతృ+ఆది, ద్వాదశ+ ఆదిత్యులును= ధాత మొదలైన పన్నెండుమందిసూర్యులు; మృగవ్యాధ+ఆది, రుద్రులు= మృగవ్యాధుడు మొదలైన రుద్రులు; ధర+ఆది, వసువులును= ధరుడు మొదలైనవసువులు; భరద్వాజ+ఆది, మహర్షులును= భరద్వాజుడు మొదలైన మహామునులు; భీమసేన+ఆది, గంధర్వులును= భీమసేనుడు మొదలైన గంధర్వులు; శేష+ఆది, మహా, నాగ, ముఖ్యులును= శేషుడు మొదలైన సర్పశ్రేష్ఠులు; వైనతేయ+ఆది, ఖచరులును= వైనతేయుడు మొదలైన ఆకాశసంచారులు; మేనకా+ఆది. అప్సరసలును= మేనక మొదలైన అప్సరసలు; అశ్వినులు= అశ్వినీదేవతలు; విశ్వేదేవతలును; మఱియున్= ఇంకనూ; స్వర్గంబునన్+ఉన్న; రాజులున్; చనుదెంచినన్= రాగా.

తాత్పర్యం: అంతేకాక, మరీచి మొదలైన నవబ్రహ్మలు, ధాత మొదలైన ద్వాదశాదిత్యులు, మృగవ్యాధుడు మొదలైన ఏకాదశరుద్రులు, ధరుడు మొదలైన అష్టవసువులు, భరద్వాజుడు మొదలైన మహర్షులు, భీమసేనుడు మొదలైన గంధర్వులు, శేషుడు మొదలైన సర్పశ్రేష్ఠులు, గరుత్మంతుడు మొదలైన ఆకాశగమనం కలిగినవాళ్ళు, మేనక మొదలైనఅప్సరసలు, అశ్వినీదేవతలు, విశ్వేదేవతలు, ఇంకా స్వర్గంలో ఉన్నరాజులంతా రాగా.

విశేషం: ప్రజాపతులు తొమ్మిదిమంది. వారిని నవబ్రహ్మ లంటారు. వారు-భృగువు, పులస్త్యుడు, పులహుడు, అంగిరసుడు, అత్రి, క్రతువు, దక్షుడు, వసిష్ఠుడు, మరీచి. ద్వాదశాదిత్యులు - ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూషుడు, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు. ఏకాదశరుద్రులు - అజుడు, ఏకపాదుడు, అహిర్బుధ్న్యుడు, త్వష్ట, రుద్రుడు, హరుడు, శంభుడు, త్ర్యంబకుడు, అపరాజితుడు, ఈశానుడు, త్రిభువనుడు. (మృగవ్యాధు డనగా రుద్రుడు);

క. శతశృంగనగేంద్రము శత । ధృతి సర్గదినంబపోలెఁ ద్రిభువనభూత
ప్రతతిఁ బరిపూర్ణశోభా । ధృతి నింద్రతనూజుజన్మదినమున నొప్పెన్. 126

ప్రతిపదార్థం: ఇంద్ర, తనూజు, జన్మదినమునన్= ఇంద్రునికొడు కైన అర్జునుని పుట్టినరోజు; శతశృంగ, నగ+ఇంద్రము= శతశృంగం అనేపేరు కల పర్వతశ్రేష్ఠం; త్రి, భువన, భూత, ప్రతతిన్= మూడులోకాలలోని భూతాలసమూహంతో; పరిపూర్ణ, శోభా, ధృతిన్= నిండుశోభను ధరించటంచేత; శతధృతి, సర్గ, దినంబు+అ పోలెన్= బ్రహ్మయొక్క సృష్టిరోజువలె; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: అర్జునుడు పుట్టినరోజు శతశృంగపర్వతం మూడులోకాలలోని భూతాలు అక్కడికి రాగా పరిపూర్ణ శోభతో బ్రహ్మదేవుడు సృష్టిచేసేరోజువలె ప్రకాశించింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఇందులో అలంకారకృత వస్తుధ్వని ఉన్నది. త్రిభువనాలనుండి పెద్దలు రావటంచేత రెండు విశేషార్థాలు స్ఫురిస్తున్నాయి. పాండవులలో మూడులోకాలను దర్శించిన తన విజయగీతాలను పాడించుకొన్నవాడు అర్జును డొక్కడే. ఈ భావి కథార్థధ్వని ఒకటి. బ్రహ్మదేవుడు సృష్టిచేసేరోజేమో అన్న ఉత్ప్రేక్షవలన అర్జును డొక్కడే పాండవులలో వంశకారకు డౌతా డని లో నారసినవారిభావనకు అందే మరొక భావికథార్థవస్తుధ్వని. (సంపా.)

మాలిని :

సరససురవధూలాస్యంబులున్ సిద్ధవిద్యా
ధరపటుపటహాతోద్యంబులుం గిన్నరీ కిం

పురుష లలితగీతంబుల్ మహారమ్య మయ్యెన్

వరముని దివిజాశీర్వాదనాదంబుతోడన్. 127

ప్రతిపదార్థం: సరస, సుర, వధూ లాస్యంబులున్= మనోహరా లైన అప్సరసలయొక్క నృత్యాలు; సిద్ధ, విద్యాధర, పటు, పటహ+ఆతోద్యంబుల్= సిద్ధుల, విద్యాధరులయొక్క గట్టి తప్పెటల, వీణ, వేణువు, మృదంగం, కాంస్యం (కంచువాద్యం) అనే నాలుగు విధాలైన వాద్యాలయొక్క శబ్దాలు; కిన్నరీ, కింపురుష, లలిత, గీతంబుల్= కిన్నర స్త్రీల, కింపురుషులయొక్క మనోహరాలైన గానాలు; వర, ముని, దివిజ+ఆశీర్వాద, నాదంబుతోడన్= ఉత్తము లైన ఋషులయొక్క, దేవతలయొక్క ఆశీర్వచనశబ్దంతో; మహా, రమ్యము= మిక్కిలి మనోహరం; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: మనోహరా లైన అప్సరసల నృత్యాలు, సిద్ధవిద్యాధరుల వీణా వేణు మృదంగాదివాద్యాల ధ్వనులు, కిన్నర కింపురుషుల లలితగానాలు, మహర్షులు, దేవతలు చేసే ఆశీర్వచనాలశబ్దంతో మిక్కిలి మనోహరంగా ఉన్నది.

విశేషం: మాలినిపాదంలో వరుసగా న, న, మ, య, య అనే గణా లుంటాయి. 9వ అక్షరం యతిస్థానం. ప్రాసనియతి ఉన్నది.. వరమునిదివిజాశీర్వాదాలతో సహా దేవతల లలితగీతాలు మహారమ్య మయ్యె నని సహోక్తిరమ్యంగా నన్నయ వర్ణించాడు. వర్ణ్యవస్తువుకు తగిన అక్షరరమ్యత రచనాసౌందర్యాంశం. శ్లేష, సమతగుణాల నిర్వహణం దానికి పోషణం, కాగా మునుల ఆశీస్సులు - తపస్సుచేసి ఇంద్ర పరమేశ్వరాదులను మెప్పించగలిగే అర్జునుని తపోవీరాన్ని, లలితగీతాదులు - ధీరలలితుడుగా ప్రదర్శించే అతడి సరసశృంగారవిలాసయశోవీరాన్ని భావింప చేసేవిగా ఉన్నాయి. (సంపా.)

వ. పాండురాజును బరమోత్సవంబునం గుంతివలనఁ బురుషత్రయసమానం బయిన పుత్త్రత్రయంబు వడసి భువనత్రయరాజ్యంబు వడసినంతియ సంతసిల్లి, కుమారులతోడి వినోదంబులం దగిలి యున్నంత; మాద్రి దనయందుఁ బుత్త్రజన్మంబు వడయు నుపాయంబు లేమికి దుఃఖించి యాత్మగతంబున. 128

ప్రతిపదార్థం: పాండురాజును= పాండురాజుకూడ; పరమ+ఉత్సవంబునన్= మిక్కిలి వేడుకగా; కుంతివలనన్; పురుష, త్రయ, సమానంబు+అయిన= పురుషులు ముగ్గురితో (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో) సమానమైన; పుత్త్ర, త్రయంబు= కొడుకులు ముగ్గురిని; పడసి= పొంది; భువన, త్రయ, రాజ్యంబు= మూడు లోకాలయొక్క పాలనాధికారం; పడసినంతియు+అ= పొందినంతగా; సంతసిల్లి= సంతోషించి; కుమారులతోడి; వినోదంబులన్= విలాసంగా ఆటలలో; తగిలి= తగుల్కొని - అనగా ప్రొద్దు పుచ్చుతూ; ఉన్నంతన్= ఉండగా; మాద్రి; తనయందున్= తనకు; పుత్త్ర, జన్మంబు= కొడుకులు పుట్టటం; పడయు= పొందే; ఉపాయంబు; లేమికి= లేకున్నందుకు; దుఃఖించి; ఆత్మగతంబునన్= మనస్సులో.

తాత్పర్యం: పాండురాజు మిక్కిలివేడుకగా కుంతీదేవివలన త్రిమూర్తులతో సమానమైన ముగ్గురు కొడుకులను పొంది, త్రిలోకాధిపత్యం పొందినంతగా సంతోషించి, కుమారులతో విలాసంగా ఆటలతో ప్రొద్దు పుచ్చుతూ ఉండగా - మాద్రి తనకు కొడుకులు పుట్టేమార్గం లేనందుకు దుఃఖించి, మనస్సులో.

ఉ. కోరిన కోర్కికిం దగఁగఁ గుంతి సుతత్రయంబుఁ గాంచె; గాం

ధారియు నక్కడన్ సుతశతంబు ముదం బొనరంగఁ గాంచె; నేఁ

బోరచి యాఁడుఁబుట్టువునఁ బుట్టి నిరర్థకజీవ నైతి సం

సారసుఖావహం బయిన సత్సుతజన్మముఁ గానఁ బోలమిన్. 129

ప్రతిపదార్థం: కుంతి; కోరిన, కోర్కికిన్; తగన్+కన్= తగినట్లుగ; సుత, త్రితయంబున్= కొడుకులు ముగ్గురిని; కాంచెన్= కన్నది; గాంధారియున్= గాంధారికూడా; అక్కడన్= హస్తినాపురంలో; సుత, శతంబు= కొడుకులు వందమందిని; ముదంబు= సంతోషం; ఒనరంగన్= ఒప్పేటట్లు; కాంచెన్= కన్నది; ఏన్= నేను; పోరచి, ఆడు, పుట్టువునన్= నిస్సార మైన స్త్రీజన్మతో; పుట్టి; సంసార సుఖ+ఆవహంబు+అయిన= సంసారంలో సుఖాన్ని కలిగించేది ఐన; సత్+సుత, జన్మమున్= మంచికొడుకుల పుట్టుకను; కానన్‌పోలమిన్= కనలేకపోవటంచేత; నిరర్థక, జీవన్= వ్యర్థ మైన బ్రతుకు కలదాన్ని; ఐతిన్= అయినాను.

తాత్పర్యం: కుంతి తాను కోరినకోర్కెకు తగినట్లు ముగ్గురు కొడుకులను కన్నది. అక్కడ హస్తినాపురంలో గాంధారి సంతోషంగా వందమందికొడుకులను కన్నది. నేను నిస్సార మైన ఆడజన్మ నెత్తి సంసారంలో సుఖాన్ని కలిగించే కొడుకులను కనలేకపోవటంచేత వ్యర్థ మైనబ్రతుకు కలదాన్ని అయ్యాను.

విశేషం: మాద్రిమాటలలో తోడికోడళ్ళవలె తానుకూడా సంతానవతి కాలేకపోయినందుకు పడే వేదనతోపాటు, స్త్రీకి జీవితంలో సంతానకాంక్ష ఎంత ప్రబలమో వ్యక్త మవుతున్నది. 'పోరచియాఁడుఁబుట్టువునఁ బుట్టి నిరర్థకజీవ నైతి' - అనే వాక్యం సంతానం లేని జీవితం ఎంతో నిరర్థక మని ఆమె ఎంతగా భావిస్తున్నదో ధ్వనింపచేస్తున్నది. వాక్యం అలక్ష్యక్రమవ్యంగ్యానికి వ్యంజన మయ్యే రచన కిది చక్కని ఉదాహరణం. ఓజఃప్రసాదగుణమిశ్రరూపమైన పద్యరచన మాద్రిమనోవేదనను ప్రసన్నం చేస్తున్నది. (సంపా.)

మాద్రికి నకులసహదేవులు పుట్టుట (సం. 1-115-1)

వ. అని వగచుచు నొక్కనాఁ డేకాంతంబునం బతియొద్ద గద్గద వచన యై తన మనోవాంఛితంబుఁ జెప్పి 'కుంతీదేవి యనుగ్రహంబుం బడయ నగునేని కొడుకులం బడయుదు; నట్లయిన నాకును నీకును లోకంబులకును హితం బగుఁ గావున నాకుఁ బుత్త్రోత్పాదనంబు దయసేయం గుంతీదేవికి నానతి యి' మ్మనిన మాద్రికిఁ బాండురా జి ట్లనియె. 130

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; వగచుచున్= చింతిస్తూ; ఒక్కనాఁడు; ఏకాంతంబునన్= ఒంటరి పాటున; పతి, ఒద్ద= భర్త దగ్గర; గద్గద, వచన+ఐ= తడబడుతున్న మాటలు కలదై; తన మనో, వాంఛితంబున్= తన మనస్సులోని కోరికను; చెప్పి; కుంతీదేవి, అనుగ్రహంబున్ = కుంతీదేవియొక్క దయను; పడయన్+అగున్+ఏని; పొందకల్గినట్లైతే; కొడుకులన్; పడయుదును= పొందుతాను; అట్లు+అయినన్= ఆ విధంగా అయితే; నాకును; నీకును; లోకంబులకును; హితంబు+అగున్= మేలు కల్గుతుంది. కావున; నాకున్; పుత్త్ర+ఉత్పాదనంబు= కొడుకులు పుట్టేటట్లు; దయ, చేయన్= కరుణచూపేటట్లు; కుంతీదేవికిన్; ఆనతి; ఇమ్ము= ఆజ్ఞ ఇమ్ము; అనినన్= అనగా; మాద్రికిన్; పాండురాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చింతిస్తూ ఒకరోజు ఒంటరిగా భర్తదగ్గర తడబడేమాటలతో తనమనస్సులోని కోరికను తెలిపి 'కుంతీదేవి దయతలిస్తే నేను కొడుకులను పొందుతాను; అట్లా అయితే నాకు, నీకు, లోకాలకు మే లవుతుంది. అందువలన నాకు కొడుకులు పుట్టేటట్లు చేయవలసిందిగా కుంతీదేవికి ఆజ్ఞ ఇవ్వండి' అని మాద్రి అనగా పాండురాజు ఇట్లా అన్నాడు.

క. నా వచనమున నపత్యముఁ । గావించును గుంతి నీకుఁ గడు నెయ్యముతోఁ;
నీ వగచిన యీ యర్థమ । చూవె । మనంబునఁ దలంచుచుండుదు నేనున్. 131

ప్రతిపదార్థం: నా వచనమునన్= నామాటచేత; కుంతి; నీకున్; కడు, నెయ్యముతో= మిక్కిలి ప్రేమతో; అపత్యమున్= సంతానాన్ని; కావించును; నీ, వగచిన= నీవు ఆలోచించిన; ఈ, అర్థము+అ= ఈ విషయాన్నే; ఏనున్, మనంబునన్, తలంచుచుందున్; చూవె= నేను కూడా మనస్సులో అనుకుంటూ ఉంటాను సుమా.

తాత్పర్యం: నా మాటప్రకారం కుంతి మిక్కిలి ప్రేమతో నీకు సంతానాన్ని కలుగజేస్తుంది. నీవు తలచిన ఈ విషయాన్నే నేనూ నా మనస్సులో కోరుకొంటూ ఉండేవాడినిసుమా.

వ. అని పలికి యప్పుడ కుంతీదేవిం బిలిచి మద్రరాజపుత్త్రి దయిన మనోవాంఛితంబుఁ జెప్పి 'సకలలోక కల్యాణ కారులాశ్వినులు గావున వారి నారాధించి యపత్యంబు వడయు' మనిన గొంతియుం బతివచనానురూపంబు సేసిన మాద్రికి. 132

ప్రతిపదార్థం: అని; పలికి; అప్పుడు+అ= ఆ క్షణమే; కుంతీదేవిన్+పిలిచి; మద్ర, రాజ, పుత్త్రిది+అయిన= మద్రరాజ కూతురైన మాద్రియొక్క; మనస్+వాంఛితంబున్= మనస్సులోని కోరికను; చెప్పి= తెలిపి; సకల, లోక, కల్యాణ, కారులు= అన్ని లోకాలకు శుభాన్ని కూర్చేవారు; ఆశ్వినులు= అశ్వినీదేవతలు; కావునన్; వారిన్; ఆరాధించి= పూజించి; అపత్యంబు= సంతానం; పడయుము= పొందుము; అనిన; గొంతియున్= కుంతీదేవియు; పతి, వచన+అనురూపంబు= మగనిమాటకు తగినట్లుగా; చేసినన్= చేయగా; మాద్రికిన్.

తాత్పర్యం: అని పలికి అప్పుడే కుంతీదేవిని పిలిచి, మాద్రి కోరికను తెలియచెప్పి; 'లోకానికంతా మేలుచేసేవాళ్ళు అశ్వినీదేవతలు కాబట్టి వాళ్ళను ఆరాధించి సంతానాన్ని పొందుము' అని చెప్పాడు. కుంతికూడా మగనిమాటకు తగినట్లు చేయగా మాద్రికి.

తే. కవలవారు సూర్యేందుప్రకాశతేజు లా । శ్వినులయంశములఁ బుట్టి రమరగుణులు
వారలకుఁ బ్రీతి నాకాశవాణి సేసె । నకుల సహదేవు లనియెడు నామయుగము. 133

ప్రతిపదార్థం: కవలవారు= కవల పిల్లలు; సూర్య+ఇందు, ప్రకాశ, తేజులు= సూర్యచంద్రులవలె ప్రకాశించే కాంతి కలవాళ్ళు; అమర, గుణులు = దేవతలయొక్క గుణాలవంటి గుణాలు కలవాళ్ళు; ఆశ్వినుల, అంశములన్= అశ్వినీదేవతల అంశలలో; పుట్టిరి= జన్మించారు; వారలకున్= వాళ్లకు; ప్రీతిన్= సంతోషంతో; ఆకాశవాణి; నకుల, సహదేవులు; అనియెడు; నామ, యుగము = పేర్లజంటను; చేసెన్.

తాత్పర్యం: సూర్యచంద్రులవలె ప్రకాశించే తేజస్సు కలవాళ్ళు, దేవతల గుణాలవంటి గుణాలు కలవాళ్ళు అశ్వినీదేవతల అంశలలో కవలలు పుట్టారు. వారికి ఆకాశవాణి సంతోషంతో నకుల సహదేవు లనేపేర్లు పెట్టింది.

క. ఊర్జితులు యుధిష్ఠిర భీ । మార్జున నకుల సహదేవు లన నిట్లు వివే
కార్జితయశు లుదయించిరి । నిర్జరుల వరప్రసాదనిర్మితశక్తిన్. 134

ప్రతిపదార్థం: ఊర్జితులు= గట్టిబలం కలవాళ్ళు; భీమ+అర్జున, నకుల, సహదేవులు; అనన్= అనగా; వివేక+ఆర్జిత, యశులు= వివేకంచేత సంపాదించబడిన కీర్తి కలవాళ్ళు; నిర్జరుల, వర, ప్రసాద నిర్మిత, శక్తిన్= దేవతలయొక్క వరప్రసాదంచేత కల్పించబడిన శక్తిచేత; ఇట్లు; ఉదయించిరి= పుట్టారు.

తాత్పర్యం: బలవంతు లైన యుధిష్ఠిరభీమార్జుననకులసహదేవు లనేవాళ్ళు - వివేకంచేత సంపాదించిన కీర్తి కలవాళ్ళు, దేవతల వరప్రసాదంచేత ఈ విధంగా పుట్టారు.

విశేషం: 'పాండవులు పుట్టిన శుభవేళలలో ఆకాశవాణి పలికింది: వాళ్ళకు పేర్లనుకూడా తానే పెట్టింది. అర్జునుని జన్మదినం త్రిలోకవైభవంగా జరిగింది. దైవాంశసంభూతులేకాక, దైవబలసమన్వితులు, దైవాశీర్వాదయుతులు పాండవులు. ఊర్జితులు అంటే పురుషకారాన్ని సాధింపగలిగిన బలం కలవా ళ్ళని విశేషార్థం. వివేక+ఆర్జితయశులు అనే విశేషణం కూడా పాండవులకు సార్థకమే. సదసద్వివేకం ధర్మవీరుల లక్షణం. పాండవుల సద్వృత్తం, ధార్తరాష్ట్రుల దుర్వృత్తమే భావిభారతకథ. ఇది వస్తుధ్వని. (సంపా.)

వ. అంత నట. **135**

టీ. అంతన్= తరువాత; అటన్= అక్కడ.

సీ. మృగ శాప భయమున జగతీశుఁ డప్పాండు। పతి శతశృంగపర్వతమునందుఁ
బత్నీసమేతుఁడై యత్నంబుతో ఘోర। తప మొనరించుచు విపులశక్తి
నమరవరప్రసాదమున ధర్మస్థితిఁ। గొడుకుల నేవురఁ బడసె ననియు
విని వసుదేవుండు మనమున హర్షించి। యనుజను మఱఁదిని ఘనుఁడు చూడఁ

తే. దనపురోహితుఁ గశ్యపుం డను మహాత్ముఁ। జీరి పుత్తెంచె నవ్విప్రుచేత భాగి
నేయు లగు కుమారులకు నమేయరత్న। భూషణావళు లిచ్చి విశేషలీల. **136**

ప్రతిపదార్థం: జగతి+ఈశుఁడు= లోకానికంతటికి ప్రభువు; ఆ+పాండు, పతి= ఆ పాండురాజు; మృగ, శాప, భయంబునన్= మృగశాపంవలన కల్గిన భయంతో - అనగా మృగరూపం పొందిన కిందము డనే ఋషివలన కల్గిన శాపభయంతో; శతశృంగ, పర్వతమునందున్; పత్నీ, సమేతుఁడు+ఐ= భార్యలతో కూడినవాడై; యత్నంబుతోన్; ఘోర, తపమున్= తీవ్రతపస్సును; ఒనరించుచు= చేస్తూ; విపుల, శక్తిన్= గొప్ప శక్తిచేత; అమర, వర, ప్రసాదమునన్= దేవతలయొక్క వరప్రసాదంచేత; ధర్మ, స్థితిన్= ధర్మమార్గంలో; కొడుకులన్; ఏవురన్= ఐదుగురిని; పడసెన్= పొందెను; అనియున్= అని కూడా; విని= ఆలకించి; ఘనుఁడు; వసుదేవుండు; మనమునన్= మనస్సులో; హర్షించి= సంతోషించి; అనుజను= తోడబుట్టిన దానిని - చెల్లెలిని (కుంతిని); మఱఁదిని (అనగా పాండురాజును); చూడన్= చూడగా; పురోహితున్= పురోహితుణ్ణి; కశ్యపుఁడు అను మహాత్మున్ = కశ్యపుడు అనే పేరుగల మహనీయుణ్ణి; చీరి= పిలిచి, ఆహ్వానించి; ఆ+విప్రుచేతన్= ఆ బ్రాహ్మణునితో; భాగినేయులు= తోబుట్టువుయొక్క కొడుకులు; అగు+కుమారులకున్= అయిన పుత్రులకు; అమేయ, రత్న, భూషణ+ఆవళులు= అపరిమిత మైన రత్నాభరణాల సమూహాలను; విశేష, లీలన్= అధిక మైన విలాసంతో; ఇచ్చి+పుత్తెంచెన్ = ఇచ్చి పంపాడు.

తాత్పర్యం: పాండురాజు మృగశాపభయంవలన భార్యలతో కలిసి శతశృంగపర్వతంమీద ఘోరతపస్సు చేస్తూ, దేవతలవరప్రసాదంవలన ధర్మమార్గంలో అయిదుగురుకొడుకులను పొందా డని విని, కుంతిఅన్న వసుదేవుడు, తన చెల్లెలిని, మరదిని చూచి రావడానికి తన పురోహితు డైన కశ్యపుడిని పిలిచి, అతనిచేత తన చెల్లెలిపిల్లలకు అపరిమిత మైన రత్నాభరణాలను విశేషవైభవంతో ఇచ్చి పంపాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పాండవులకు యాదవులతో ఏర్పడబోయే గాఢమైన అనుబంధానికి ఇది ప్రస్తావనవంటిది. పాండురాజుతో బంధుత్వం కలుపుకొన్న వసుదేవుని తరువాత వాసుదేవుడుకూడా పాండవులతో బంధుత్వాన్ని కలుపుకుంటాడు (సుభద్రను అర్జునుడి కిచ్చి); అంతేకాదు వారియోగక్షేమాలను చూచే రక్షకుడుగా నిలుస్తాడు.

వ. **అ క్కశ్యపుండును జనుదెంచి పృథామాద్రీ సహితుం డయి యున్న యప్పాండురాజుం గని వసుదేవు సందేశంబుఁ జెప్పి యక్కుమారులకు రత్నభూషణాంబరంబు లిచ్చి, క్రమంబునఁ జౌలోపనయనంబు లొనరించి, వేదాధ్యయనంబు సేయించుచున్నంత వసంతసమయం బఖిలజీవలోకానందజననం బై యేర్పడం జనుదెంచిన.** **137**

ప్రతిపదార్థం: ఆ+కశ్యపుండును; చనుదెంచి= వచ్చి; పృథా, మాద్రీ, సహితుండు+అయి= కుంతీమాద్రులతో కూడినవాడై; ఉన్న= కలిసిఉండే; ఆ+పాండురాజును; కని= చూచి; వసుదేవు, సందేశంబు= వసుదేవుడు చెప్పి పంపిన సమాచారాన్ని; చెప్పి; ఆ+కుమారులకున్= ఆ పాండవులకు; రత్న, భూషణ+అంబరంబులు= రత్నాల ఆభరణాలు, వస్త్రాలు; ఇచ్చి; క్రమంబునన్= వరుసగా; చౌల+ఉపనయనంబులు= చౌలకర్మ, ఉపనయనకర్మ; ఒనరించి= చేసి; వేద+అధ్యయనంబున్= గురుముఖమున వేదాన్ని చదివించటం; చేయించుచు+ఉన్నంత= చేయిస్తూ ఉండే సమయంలోనే; వసంత, సమయంబు= వసంతకాలం; అఖిల, జీవ, లోక+ఆనంద, జననంబు+ఐ= అన్ని ప్రాణిసమూహాలకు ఆనందాన్ని కలిగించే దై; ఏర్పడన్+చనుదెంచినన్= తేటపడునట్లు, రాగా.

తాత్పర్యం: ఆ కశ్యపుడు వచ్చి కుంతీమాద్రులతో కలిసి ఉన్న పాండురాజును చూచి, వసుదేవుడు చెప్పి పంపిన సందేశాన్ని వినిపించి, క్రమంగా వాళ్ళకు చౌలోపనయనకర్మలు చేసి వేదాధ్యయనం చేయిస్తూ ఉండగా అన్ని ప్రాణులకు ఆనందాన్ని కలిగిస్తూ వసంతకాలం వచ్చింది.

వసంతవర్ణనము (సం. 1-116-1)

లయగ్రాహి.

కమ్మని లతాంతములకు మ్మొనసి వచ్చు మధుపమ్ముల సుగీత నినదమ్ము లెసఁగెం; జూ
తమ్ముల లసత్కిసలయమ్ముల సుగంధి ముకుళమ్ములను నానుచు ముద మ్మొనర వాచా
లమ్ము లగు కోకిల కులమ్ముల రవమ్ము మధుర మ్మగుచు విన్చెఁ; ననిశమ్ము సుమనోభా
రమ్ముల నశోకనికరమ్ములును జంపకచయమ్ములును గింశుకవనమ్ములును నొప్పెన్. **138**

ప్రతిపదార్థం: కమ్మని, లతా+అంతములకున్= మంచివాసన కల పూలకు; మొనసి= పూని; వచ్చు= చెంతకు విచ్చేయు; మధుపమ్ముల, సుగీత, నినదమ్ములు= తుమ్మెదలయొక్క చక్కని గానాల ధ్వనులు; ఎసఁగెన్= అతిశయించినాయి; చూతమ్ముల, లసత్+కిసలయమ్ముల, సుగంధి, ముకుళమ్ములన్= మామిడిచెట్లయొక్క ప్రకాశిస్తున్న చివుళ్ళను, మంచివాసన కల మొగ్గలను; ఆనుచున్= తింటూ; ముదమ్ము= సంతోషం, ఒనరన్= ఒప్పగా; వాచాలమ్ములు= కూయునటువంటివి; అగు= అయిన; కోకిల, కులమ్ముల, రవమ్ము= కోయిల గుంపులయొక్క ధ్వని; మధురమ్ము+అగుచు; వినిచెన్= వినిపించింది; అనిశమ్ము= ఎల్లప్పుడూ; సుమనస్+భారమ్ములన్= పూలబరువుచేత; అశోక, నికరమ్ములును= అశోకవృక్షాల సమూహాలు; చంపక, చయమ్ములును= సంపెంగల సమూహాలు; కింశుక, వనమ్ములును= మోదుగులసమూహాలు, ఒప్పెన్= అందగించాయి.

తాత్పర్యం: సువాసన కల పూలకు మూగినతుమ్మెదలఝుంకారం అతిశయించింది. మామిడిచివుళ్ళను, మొగ్గలను తింటూ సంతోషంతో కూసే కోయిలగుంపులకూతలు మనోహరంగా వినిపించాయి. అశోకాలు, సంపెగలు, మోదుగులు బాగా పూచాయి.

విశేషం: లయగ్రాహి పాదానికి 30 అక్షరా లుంటాయి. భ, జ, స, న, భ, జ, స, న, భ, య అనే గణాలు వరుసగా ఉంటాయి. 9, 17, 25 అక్షరాలు ప్రాసయతిస్థానాలు. ప్రాసనియమం ఉన్నది. నన్నయ రచించినమూడులయగ్రాహులలో రెండింటిని (క్రింది పద్యంకూడా) వెంటవెంటనే వసంతర్తువర్ణనలో వినియోగించటం విశేషం. (తరువాతి పద్యంకూడా లయగ్రాహియే). ఈ పద్యంలో వసంత ఋతువులో వనాలలో విరబూసి కనువిందుచేసే పూలచెట్ల అందాన్ని, వీనుల విందుచేసే తుమ్మెదల ఝుంకార నాదాన్ని, కోయిలల సుస్వరమాధుర్యాన్ని నన్నయ వర్ణించాడు. మకారం నాదాక్షరం, సప్తస్వరాలలో ఒకటి. అటువంటి మకారాన్ని ద్విరుక్తంగా, నియతసుందరంగా, మళ్ళీమళ్ళీ ప్రయోగించి, ఆ తుమ్మెదల ఝుంకారనాదాన్ని, ఆ కోయిలల సుస్వర మాధుర్యాన్ని పాఠకుల చెవి సోకేటట్లు చేశాడు. శృంగారభావోద్దీపకంగా ఏర్పడిన వాతావరణాన్ని అక్షరరమ్యంగా ధ్వనింపచేశాడు. వసంతం లోకంలో అందరికీ అందంగా, ఆనందంగా, ప్రాణప్రదంగా ఉండటం సహజం. కానీ ఇక్కడ పాండురాజుకు మాద్రికి ప్రాణహారిగా పరిణమించింది. అంటే లయగ్రాహి ప్రాణగ్రాహి అయింది. ఒకరికి ఇరువురి ప్రాణాలు అంతమయ్యాయి. అందుకే రెండు లయగ్రాహివృత్తాలు. లయించటం అంటే నశించటం. ఈ సందర్భంలో ఒకే పర్యాయం భార్యాభర్తల ప్రాణాలు లయమయ్యాయి. (వృత్తాలు) లయాత్మకపద్యంలో పేరుకు తగిన ఔచిత్యాన్ని, అందులో అంతర్గతంగా ఉన్న పరమసత్యాన్ని నన్నయ ప్రసన్న గంభీరంగా ప్రతిపాదించాడు.

లయగ్రాహి

చందన తమాలతరులందు నగరుద్రుమములందుఁ గదళీవనములందు లవలీ మా
కంద తరుషండములయందు ననిమీలదరవిందసరసీవనములందు వనరాజీ
కందళిత పుష్పమకరందరసముం దగులుచుం దనుపు సౌరభము నొంది జనచిత్తా
నందముగఁ బ్రోషితులడెందము లలందురఁగ మందమలయానిల మమందగతి వీచెన్. 139

ప్రతిపదార్థం: చందన, తమాల, తరుల+అందున్= మంచి గంధపు చెట్లయందు, చీకటి చెట్లయందు; అగరు, ద్రుమముల+అందున్= అగరు చెట్లతోటలందు, కదళీ, వనముల+అందు= అరటితోటలందు; లవలీ, మాకంద, తరు, షండముల+అందున్= లవలీతీగల, తియ్యమామిడి చెట్లయొక్క సమూహాలయందు; అనిమీలత్+అరవింద, సరసీ, వనముల+ వికసించిన తామరలు కల కొలకుల సమూహాలందు; వనరాజీ, కందళిత, పుష్ప, మకరంద, రసమున్= వనసమూహంలో వికసించిన పూలమీది తేనెను; తగులుచున్= తాకుతూ; తనువు= చల్లదనం; సౌరభమున్= సువాసనను; ఒంది= పొంది; జన, చిత్త+ఆనందముగన్= ప్రజలమనస్సుకు సంతోషం కలిగేట్లు; ప్రోషితుల, డెందములు= దేశాంతరంలో ఉన్న వారి మనస్సులు; అలందురఁగన్= దుఃఖించేట్లు; మంద, మలయ+అనిలము= మెల్లనిచల్లగాలి; అమంద, గతిన్= అధిక మైన వ్యాప్తితో; వీచెన్= వీచింది.

తాత్పర్యం: మంచిగంధపుచెట్ల, చీకటిచెట్ల, అగరుచెట్ల, అరటితోటల, లవలీతీగల, తియ్యమామిడి చెట్ల సమూహాలలో, పూచిన తామరకొలనులలో, వికసించినపూలలోని తేనెమీద పాకుతూ చల్లదనాన్ని, సువాసనను పొంది ప్రజల మనస్సుకు ఆనందం కలిగించేటట్లు, దేశాంతరంలో ఉన్నవాళ్ళ మనస్సులు దుఃఖించేటట్లు మందమారుతం అధికంగా వీచింది. (తమాల= చీకటి చెట్లు- నల్లని ఆకులు గల చెట్లు. లవలీ= ఒకతీగ, ఒక ఫలవృక్షము)

విశేషం: ముందు పద్యంలో రూపనాదాత్మక వనసౌందర్యాన్ని రమణీయంగా వర్ణించిన నన్నయ - ఈ పద్యంలో కనువిందుచేసే వనసౌందర్యంతో పాటు స్పర్శాత్మకమందమలయానిలాన్ని మనోహరంగా వర్ణించాడు. ఆ పద్యంలో తుమ్మెదల ఝుంకారనాదాన్ని, కోయిలల స్వరమాధుర్యాన్ని ధ్వనింపచెయ్యటానికి ద్విరుక్తమకారాన్ని వాడుకుంటే - ఈ పద్యంలో మందమలయానిలాన్ని అందచేయటానికి బిందుపూర్వక దకారాన్ని వాడుకొన్నాడు. అక్షరశిల్పి నన్నయ. అక్షరరమ్యం, రుచిరార్థమనోజ్ఞం ఆయన కవిత.

పాండురాజుమరణము (సం. 1-116-4)

వ. ఇట్లు సర్వభూతసమ్మోహనంబయిన వసంతసమయంబునం బాండురాజు మదనసమ్మోహనమార్గణబందీకృత మానసుం డై మద్రరాజపుత్త్రి దైన మనోహరాకృతియందు మనంబు నిలిపి యున్నంత; నొక్కనాఁడు కుంతీదేవి బ్రాహ్మణభోజనంబు సేయించుచుండి మాద్రీరక్షణంబునం దేమఱియున్న యవసరంబున. 140

ప్రతిపదార్థం: ఇట్లు; సర్వ, భూత, సమ్మోహనంబు+అయిన= అన్ని ప్రాణులను మోహింపచేసేది అయిన; వసంత, సమయంబునన్= వసంతకాలంలో; పాండురాజు; మదన, సమ్మోహన, మార్గణ, బందీకృత, మానసుండు+ఐ= మన్మథుడి యొక్క సమ్మోహన బాణంచేత కట్టివేయబడిన మనస్సు కలవా డై; మద్రరాజ, పుత్త్రికది+ఐన= మాద్రికి సంబంధించిందైన; మనోహర+ఆకృతియందున్= అందమైన రూపంమీద; మనంబు= మనస్సు; నిలిపి; ఉన్నంతన్= ఉండగా; ఒక్కనాఁడు; కుంతీదేవి= కుంతి; బ్రాహ్మణ, భోజనంబు, చేయించుచున్= బ్రాహ్మణులకు భోజనం చేయిస్తూ; ఉండి= ఉన్నదై; మాద్రీ, రక్షణంబునందున్= మాద్రియొక్క రక్షణలో; ఏమఱి= మరచి; ఉన్న అవసరంబునన్= ఉండిన సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా అన్నిప్రాణులను మోహింపచేసే వసంతకాలంలో పాండురాజు మన్మథునియొక్క సమ్మోహన బాణానికి లొంగిన మనస్సు కలవాడై, మాద్రియొక్క మనోహరరూపం మీద మనస్సు నిలిపి, ఒక రోజు కుంతీదేవి బ్రాహ్మణభోజనం చేయిస్తూ మాద్రిని కనిపెట్టటం మరచి ఉన్నసమయంలో.

విశేషం: మానవమనస్తత్త్వంపై ప్రకృతిప్రభావం ప్రబలం. విశేషించి వసంతప్రభావం విపరీతం. మాద్రి వయస్సులో చిన్నది. మహా సౌందర్యవతి. ఆమె పాండురాజువశం కాకుండా, వా ళ్ళిద్దరికీ ఏకాంతం ఏర్పడకుండా కుంతి కనిపెడుతూనే ఉన్నది. కానీ ఆ రోజు బ్రాహ్మణభోజనంలో నిమగ్నురా లై ఆమె మాద్రివిషయం మరచింది.

ఉ. చారుసువర్ణహాసినవచంపకభూషయు సిందువారము
క్తా రమణీయయున్ వకుళదామవతంసయు నై యపూర్వ శృం
గారవిలాసలీల యెసఁగం దనముందట నున్న మాద్రి నం
భోరుహనేత్రఁ జూచి కురుపుంగవుఁ డంగజరాగమత్తుఁ డై. 141

ప్రతిపదార్థం: చారు, సువర్ణ, హాసి, నవ, చంపక, భూషయున్= అంద మైన బంగారాన్నే గేలిచేసే క్రొత్తసంపెంగపువ్వులే ఆభరణంగా కలది; సిందువార, ముక్తారమణీయయున్= వావిలిపూ లనే ముత్యాలచే మనోహరమైనదియున్నూ; వకుళ, దామ, వతంసయున్,ఐ= పొగదదండలు చెవి ఆభరణాలుగా కలదై; అపూర్వ, శృంగార, విలాస, లీల= అంతకుముందు లేని అలంకార విలాసం యొక్క అతిశయం; ఎసఁగన్= ఒప్పగా; తన, ముందటన్, ఉన్న= తన ముందున్న; అంభోరుహ, నేత్రన్= కమలాలవంటి కన్నులు కలదానిని; మాద్రిన్= మాద్రిని; చూచి= కనుగొని, కురు పుంగవుఁడు= కురుశ్రేష్ఠు డైన పాండురాజు; అంగజ, రాగ, మత్తుఁడు+ఐ= మన్మథరాగంచేత మదించినవాడై,

తాత్పర్యం: అందంలో బంగారాన్ని మించిన క్రొత్తసంపెంగపువ్వులే ఆభరణాలుగా కలదై, వావిలిపూ లనే ముత్యాలచేత మనోహర మైనదై, పొగదండలు చెవి ఆభరణాలుగా కలదై అంతకుముం దెన్నడూ లేని శృంగారవిలాసంతో తన ముందున్న - కమలాలవంటి అందమైన కన్నులు కల మాద్రిని చూచి, కురుశ్రేష్ఠుడైన పాండురాజు మన్మథరాగవశుడై.

విశేషం: సహజంగానే సౌందర్యవతి అయిన మాద్రికి వసంత పుష్పాలంకారాలు అమితమైన శోభను కల్గించాయి. ఆమె రూపం ఆనాడు పాండురాజుకు మత్తెక్కించింది. (వతంస-అవతంసయొక్కరూపాంతరం)

క. కిందముశాపము డెందము । నం దలఁపక శాపభయమునన్ మాద్రి గడున్
వందురి వారింపఁగ బలి । మిం దత్సంభోగసుఖసమీహితుఁ డయ్యెన్. 142

ప్రతిపదార్థం: కిందము, శాపమున్= కిందమునియొక్క శాపాన్ని; డెందమునన్= మనస్సులో; తలఁపక= ఆలోచింపక; మాద్రి; శాప, భయమునన్= శాపంవలని భయంచేత; కడున్= మిక్కిలి; వందురి= దుఃఖించి; వారింపఁగన్= అడ్డుకోగా; బలిమిన్= బలాత్కారంచే; తత్+సంభోగ, సుఖ సమీహితుఁడు= దానితో సంభోగసుఖంమీద కోరిక కలవాడు; అయ్యెన్.

తాత్పర్యం: పాండురాజు కిందమునిశాపాన్ని మరచాడు. ఆ శాపం గుర్తున్నమాద్రి ఎంతో భయంతో, దుఃఖంతో తనను వారిస్తున్నా, బలాత్కారంగా ఆమెతో సంభోగసుఖాన్ని పొందకోరాడు.

విశేషం: ప్రకృతిప్రభావం, మాద్రి సౌందర్యం, మానవసహజమైన కామతృష్ణ. విశేషించి ఆ కామతృష్ణ తీర్చుకోవటానికి అనుకూలించిన ఆ సమయం పాండురాజుప్రాణాలు తీశాయి. విధి బలీయం.

వ. దానం జేసి విగతజీవుం డైన యప్పాండురాజుం గౌఁగిలించుకొని మాద్రి యఱచుచున్న, దాని యాక్రందన ధ్వని విని వెఱచి కుంతీదేవి గొడుకులుం దానునుం బఱతెంచి పతియడుగులపయిం బడి యేడ్చుచున్న నెఱింగి, శతశృంగ నివాసులగు మునులెల్లం దెరలివచ్చి చూచి శోకవిస్మయాకులితచిత్తు లయి; రంతఁ గుంతీదేవి మాద్రి కి ట్లనియె. 143

ప్రతిపదార్థం: దానన్+చేసి= దానివలన; విగత, జీవుండు+ఐన= కోల్పోయిన ప్రాణాలు కల వాడైన; ఆ+పాండురాజున్; కౌఁగిలించుకొని; మాద్రి; అఱచుచున్నన్= రోదిస్తుండగా; దాని+ఆక్రందన, ధ్వని= ఆమె ఏడుపు శబ్దం; విని; వెఱచి= భయపడి; కుంతీదేవి; కొడుకులున్; తానునున్; పఱతెంచి= వచ్చి; పతి, అడుగుల, పయిన్= భర్త పాదాల మీద; పడి; ఏడ్చుచు+ఉన్నన్= దూషించుచుండగా; ఎఱింగి= తెలిసికొని; శతశృంగ, నివాసులు+అగు మునులు+ఎల్లన్= శతశృంగ పర్వతమున నివసించు ముని లందరూ; తెరలి= కలతచెంది; వచ్చి; చూచి;శోక, విస్మయ+ఆకులిత, చిత్తులు+అయిరి= దుఃఖంచేత, ఆశ్చర్యంచేత కలత చెందిన మనస్సు కలవాళ్ళు అయ్యారు; అంతన్= అప్పుడు, కుంతీదేవి; మాద్రికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దానివలన ప్రాణాలు కోల్పోయిన ఆ పాండురాజును కౌగలించుకొని మాద్రి అరుస్తూ ఉన్నది. దాని యేడుపు సవ్వడి విని భయపడి కొడుకులతోసహా కుంతీదేవి వచ్చి, భర్తపాదాలమీద పడి ఏడ్వసాగింది. ఆ సంగతి తెలిసికొని శతశృంగంలో నివసిస్తున్న మునులంతా గుమికూడి వచ్చి చూచి దుఃఖంతో, ఆశ్చర్యంతో కలతచెందిన మనస్సు కలవా రయ్యారు. అప్పుడు కుంతి మాద్రితో ఈ విధంగా అనింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. 'నా కెడ యిమ్ము, లెమ్ము, కురునాథమనఃప్రియధర్మపత్ని నే
నేకత మెట్టు లుండుదు? మహీపతితోడన పోదుఁ; బుత్త్రులం
జేకొని పెన్చు; నా పసుపుఁ జేయుము' నావుడు మాద్రి దద్దయున్
శోకపరీతచిత్త యగుచుం బృథ కి ట్లనియెం బ్రియంబునన్. 144

ప్రతిపదార్థం: నాకు; ఎడ= చోటు; ఇమ్ము; లెమ్ములే; కురునాథు, మనస్+ప్రియ, ధర్మపత్నిన్= కురురా జైన పాండురాజుయొక్క మనస్సుకు ప్రియ మైన భార్యను; ఏన్= నేను; ఏకతము+అ= ఒంటరిగా; ఎట్టుల; ఉండుదున్; మహీపతితోడన= రాజుతోనే; పోదున్= పోతాను - అనగా ప్రాణాలు విడుస్తాను; పుత్త్రులన్; చేకొని= తీసికొని; పెన్పు= పెంచుము; నా, పసుపున్= నా యొక్క ఆజ్ఞను; చేయుము; నావుడు= అనగా; మాద్రి; తద్దయున్= మిక్కిలి; శోక, పరీత, చిత్త, అగుచున్= దుఃఖంచే చుట్టబడిన మనస్సు కలదై; ప్రియంబునన్= అనువుగా; పృథకున్= కుంతికి; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: 'నీవు లేచి నాకు చో టిమ్ము. నేను పాండురాజుమనస్సుకు ప్రియ మైన ధర్మపత్నిని. ఆయనను విడిచి ఉండలేను. ఆయనతో వెళ్ళిపోతాను. నీవు కొడుకులను పెంచుము' అని కుంతి అనగా మాద్రి ఎంతో దుఃఖంతో ఆమెమనస్సుకు ప్రియంగా ఇట్లా పలికింది.

విశేషం: కురునాథుమనఃప్రియధర్మపత్ని - అని మాద్రిని సంబోధించి - నేను, ఏకతమ ఎలా ఉండగలను అని కుంతి అన్నట్లు కూడా గ్రహింపవచ్చు. ఆ సంబోధనలో కుంతి మాద్రిని ఎత్తిపొడవడం ధ్వనిస్తుంది. - పాండురాజు మనస్సుకు ప్రియమైన నీ ధర్మపత్నీత్వం ఇదేనా? భర్త ప్రాణం పోవడానికి కారణభూతురాలవు అయ్యావు - అనేనింద అందులో స్ఫురించక మానదు, అట్లా కాక కుంతి తనే కురునాథుమనఃప్రియధర్మపత్నిన్ అని చెప్పుకొని, ఏన్= నేను, ఏకతమ= ఒంటరిగా, ఎట్లా ఉండగలను అన్నట్లు భావించినా అందులోనూ కొంత ఎత్తిపొడుపు లేకపోలేదు. పాండురాజుకు నేను నీ కన్నా తక్కువ ప్రియమైన భార్యను కాను; అయినా మైమరచి నీవలె ఆయనకు ప్రాణాపాయం కలిగింపని ధర్మపత్నిని సుమా! ఆయన ధర్మపత్నిని అయిన నేను ఆయన లేకుండా ఎట్లా జీవించగలను అనే పదునైనభావం పరోక్షంగా మాద్రికి ఎత్తుపొడుపే. అప్పటి పరిస్థితుల్లో కుంతి ఎంత సానుభూతితో మాద్రిని చూచినా, ఆమెమీద కుంతికి ఒకింత కోపం, సపత్నీభావం లోలోపల కలగటం సహజమే. తదనుగుణంగా ఆమె మాటలలో కొంత ఎత్తిపొడుపు చోటుచేసికొనడంకూడా సహజమే. అలతి అలతి మాటలతో కూడినవాక్యాలు శోకతీవ్రతను వ్యక్తంచేస్తున్న ట్లున్నాయి. మాధుర్యగుణం ఈ పద్యంలో నాటకీయంగా పోషింపబడింది.

మాద్రి సహగమనము సేయుట (సం. 1-116-25)

తరువోజ.

కురువంశ నిస్తారకుల ధర్మయుక్తిఁ గొడుకులఁ బడసి యి క్కురుకుంజరునకుఁ
గరము మనఃప్రీతి గావించి పుణ్యగతికిఁ గారణమవై కమలాక్షి! నీవు
దిరముగా నిష్టంబు దీర్చి; తే నిందు ధృతిఁ బతియిష్టంబు దీర్పన; కాన
యరిగెదఁ బతితోడ నన్యలోకంబునం దైనఁ బ్రీతిసేయఁగఁ గాంతు ననియు. 145

ప్రతిపదార్థం: కమలాక్షి= తామరలవంటి కన్నులు కలదానా! ఓ కుంతీ!; నీవు; కురు, వంశ నిస్తారకులన్= కురువంశాన్ని తరింప చేసేవారిని; కొడుకులన్; ధర్మ, యుక్తిన్= ధర్మంతోడి కూడికచేత - అనగా ధర్మమార్గంలో; పడసి= పొంది; ఈ+కురు,

కుంజరునకున్= ఈ కురుశ్రేష్ఠు డైన పాండురాజుకు; కరము= మిక్కిలి; మనఃప్రీతి= మనస్సంతోషాన్ని; కావించి; పుణ్య, గతికిన్= పుణ్యలోకానికి; కారణమవు+ఐ= హేతువై; తిరముగాన్= శాశ్వతంగా; ఇష్టంబున్ తీర్చితి= అభీష్టాన్ని నెరవేర్చావు; ఏన్= నేను; ఇందున్= ఈ లోకంలో; ధృతిన్= సంతోషంతో; పతి, ఇష్టంబున్= భర్తయొక్క కోరికను; తీర్పను+అ= తీర్చనే లేదు; కానన్= అందుచేత; అన్య, లోకంబు, అందు+ఐనన్= పరలోకంలో నైనా; ప్రీతి= ఇష్టం; చేయఁగన్; కాంతున్= చూస్తాను; పతితోడన్= భర్తతోకూడా; అరిగెదన్= వెళ్తాను; అనియు.

తాత్పర్యం: కుంతీ! నీవు కురువంశాన్ని తరింప చేసే కొడుకులను ధర్మమార్గంలో కని, ఈ కురుశ్రేష్ఠు డైన పాండురాజుకు మిక్కిలి సంతోషం కలిగించి, పుణ్యలోకం పొందడానికి కారణ మయ్యావు. శాశ్వతంగా ఆయన కోర్కె తీర్చావు. నేను ఈ లోకంలో భర్తకోర్కె తీర్చనే లేదు. అందువలన పరలోకంలో నైనా తీర్చటానికి ఆయన వెంట వెళ్తాను.

విశేషం: తరువోజ లక్షణానికి ఆది. 5.28 చూడండి. ఎత్తిపొడుపుగా పలికిన కుంతితో గడుసరిగా మాద్రి మాట్లాడింది. కుంతి ఎత్తిపొడుపును తనమాటలలో ఎంత గోప్యంగా మలచిందో, మాద్రికూడా తన గడుసరితనాన్ని అంత నిపుణంగా గోప్యంచేసి సహజసంభాషణవలె పలికింది. ముందటి పద్యంలో 'మనఃప్రియధర్మపత్నిగా భావిస్తే ఆమె పాండురాజు అనుమతితో మంత్రశక్తివలన పుణ్యగతికి కారకు లైన కొడుకులను కని ఆయనకు పుణ్యగతిని, మనఃప్రీతిని కలిగించింది. మాద్రికి మంత్రశక్తి లేదు కాని అందమైన ఆకృతి ఉన్నది. దానిని పాండురాజు కోరాడు. కాని, దానివలన పాండురాజుకు మనఃప్రీతి కలిగించలేక పోయింది. శాపకారణంగా, మనఃప్రీతిని కలిగించటంలో కుంతి కృతార్థురాలైంది. తాను కాలేకపోయింది అని వాచ్యమైన అర్థం. వ్యంగార్థ్యప్రతీతికూడా కలుగుతున్నది. కుంతీ! నీవు పాండురాజు ఇష్టం తీర్చినదానవు. ఆ యిష్టపూర్తివలన ఆ వాచ్యంవెంట ఇహలోకసుఖంకంటె పరలోకసుఖమే కలుగుతుంది. పాండురాజు నన్ను కోరింది ఇహలోక సుఖాన్ని. దాన్ని తీర్చే అవకాశం లేదు-ఈ లోకంలో. అందువలన ఆయనతోపాటు నేనుకూడా సహగమనంచేసి ఆ కోర్కె పరలోకంలోనైనా తీరుస్తాను అన్నది-మాద్రి. 'పతికి మనఃప్రియధర్మపత్ని' అని ఎత్తిపొడుపుగా మాద్రిని సంబోధించిన అర్థాన్ని పురస్కరించుకొని తానే సహగమనయోగ్యత కలిగినదాని నని, అదే పాండురాజుకు మనఃప్రియహేతు వని చెప్పింది. మాద్రిశోకపరీతచిత్తప్రవృత్తి వ్యంజకంగా కాంతిగుణంతో కూడిన తరువోజ సార్థకం. (సంపా.)

వ. 'మఱియు మృగశాపభయం బెఱింగియు ని ట్లేమఱిన యతిప్రమత్తురాల; నే నిందుండి పుత్త్రుల రక్షింప నేర; నన్ను వారింప వలవదు; కొడుకుల నేమఱక రక్షించునది' యని చెప్పి కుంతీదేవి వీడ్కొని మునిసహస్రంబునకు మ్రొక్కి మద్రరాజపుత్త్రి పతితోడన చితారూఢ యై యగ్నిశిఖల నపగత ప్రాణ యయ్యె; నంత నయ్యిరువుర యంగంబులు సంగ్రహించుకొని మహామునులు కుంతీదేవిం గొడుకుల నూరార్చి. 146

ప్రతిపదార్థం: మఱియు; మృగ, శాప, భయంబు= జింకయొక్క శాపంవలనకలిగే భయం; ఎఱింగియున్= తెలిసికూడ; ఇట్లు; ఏమఱిన= మరచిపోయిన; అతి, ప్రమత్తురాలన్= మిక్కిలి మత్తు గొన్న దానను - అనగా జాగరూకత లేనిదానను; ఏన్=నేను; ఇందు+ఉండి; పుత్రుల; రక్షింపనేరన్= కాపాడలేను; నన్నున్, వారింప, వలవదు= అడ్డగించవద్దు; కొడుకులన్; ఏమఱక= మరువకుండా; రక్షించునది= కాపాడేది; అని, చెప్పి; కుంతీదేవిన్; వీడ్కొని= వీడి; ముని, సహస్రంబునకు= మునులు వేయిమందికి (మునుల సమూహానికి); మ్రొక్కి= నమస్కరించి; మద్రరాజ, పుత్రి; పతితోడన= భర్తతో కూడా; చితా+ఆరూఢ+ఐ= చితిపైకి ఎక్కిందై; అగ్ని శిఖలన్= నిప్పుమంటలలో; అపగత, ప్రాణ= పోయిన ప్రాణాలు కలది; అయ్యెన్= అయినది; అంతన్= అటుపై; ఆ+ఇరువుర, అంగంబులు= ఆ ఇద్దరిఅవయవాలు (శవదహనం తరువాతి రోజు ఆయా అవయవాల

ఎముకలు); సంగ్రహించుకొని= సమకూర్చుకొని - అనగా ఒకటిగా చేర్చి తీసికొని; మహామునులు; కుంతీదేవిన్, కొడుకులన్= కుంతిని, ఆమెపుత్త్రుల్ని; ఊరార్చి= ఓదార్చి.

తాత్పర్యం: 'మృగశాపంవలన కలిగే భయం తెలిసికూడా ఈవిధంగా జాగ్రత్త లేనిదాన్ని అయిన నేను, ఇక్కడ ఉండి కొడుకులను కాపాడ లేను. నన్ను అడ్డుకోవద్దు. జాగ్రత్తతో నీవే కొడుకులను కాపాడుము' అని కుంతీదేవికి చెప్పి; వెయ్యి మంది(అనేకులైన) మహర్షులకు మ్రొక్కి, భర్తశవంతోపాటు తానుకూడా చితి ఎక్కి, మంటలలో మాద్రి ప్రాణాలు వదిలింది. తరువాత మహామునులు మాద్రీపాండురాజుల అస్థిసంచయనం చేసి, కుంతీదేవినీ, ఆమె కొడుకులను ఓదార్చి.

విశేషం: కిందము డిచ్చిన శాపంప్రకారం పాండురాజు ఏ సతితో క్రీడింపబోతాడో ఆమెకూడా చనిపోతుంది. అది ఇక్కడ నిజమయింది.

క. **ధరణీరాజ్యవిభూతియు । పరిజనులను బాంధవులను బ్రజ విడిచి తప**
శ్చరణతపస్వుల తనకున్ । శరణం బని నమ్మి పాండుజనపతి నెమ్మిన్. **147**

ప్రతిపదార్థం: పాండు, జనపతి= పాండురాజు; ధరణీ, రాజ్య విభూతియు= భూరాజ్యసంపదను; పరిజనులను= సేవకులను; బాంధవులను= చుట్టాలను; ప్రజ= ప్రజలను; విడిచి; తపస్+చరణ= తపస్సుచేసే; తపస్వులు+అ= ఋషులే; తనకున్; శరణంబు+అని= దిక్కని; నమ్మి; నెమ్మిన్= ప్రీతితో.

తాత్పర్యం: పాండురాజు రాజ్యసంపదను, సేవకులను, చుట్టాలను ప్రజలను వదలి తపస్సుచేసే ఋషులు మాత్రమే తనకు దిక్కని నమ్మి నిశ్చింతగా.

క. **కొడుకుల నిందఱ కిల్లడ । యిడి పరలోకమున కరిగె; నెడసేయక యి**
ప్పుడ వీరలఁ గురువృద్ధుల । కడకుం గొని పోవ వలయు గజపురమునకున్. **148**

ప్రతిపదార్థం: కొడుకులన్; ఇందఱకున్= ఇంతమందికి - (ఇంతమంది మహర్షులకు); ఇల్లడ, ఇడి= ఇల్లడ పెట్టి, అప్పగించి; పరలోకమునకున్= స్వర్గానికి; అరిగెన్= వెళ్ళాడు; ఎడ, చేయక= ఆలస్యం చేయక; ఇప్పుడు+అ; వీరలన్= పాండవులను; గజ, పురమునకున్= హస్తినాపురానికి; కురు, వృద్ధుల కడకున్= కురువంశంలోని పెద్దల దగ్గరకు; కొనిపోవవలయున్= తీసికొనిపోవాలి.

తాత్పర్యం: కొడుకులను మనందరికి అప్పగించి పాండురాజు స్వర్గానికి వెళ్ళాడు. మనం ఆలస్యం చేయకుండా ఇప్పుడే ఈ పాండవులను హస్తినాపురంలో కురువంశంలోని పెద్దలదగ్గరకు తీసికొనిపోవాలి.

విశేషం: ఎవరైనా తీర్థయాత్రాదులకు పోతూ తిరిగివచ్చేంతవరకూ ఒకరివద్ద భద్రంగా ఉంచి, మరల తిరిగి ఇచ్చేటట్లు అర్థాన్ని (డబ్బు, వస్తువులు) ఉంచటం ఇల్లడపెట్టటం అంటారు. ఇక్కడ పాండవులు పాండురాజుకు, అతని వంశానికి సంబంధించిన ధనంవంటివారు. పాండురాజు పరలోకగతుడైనవాడు కాబట్టి అతనివంశానికి వారసులైన పుత్రులను ఆ వంశంలోని పెద్దలకు ఒప్పచెప్పటం న్యాయం. ఋషులు ధర్మబుద్ధితో తమకు ఆ కర్తవ్య మున్న దని భావించటం మానవసంబంధాలలో ఉండదగిన ఒక మహనీయలక్షణంగా కావ్యోపదేశం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మునులు పాండవులను హస్తినాపురంబునకుం గొనివచ్చి ధృతరాష్ట్రున కొప్పగించుట (సం.1-117-6)

వ. అని తమలో విచారించి, కుంతీదేవిని గుమారులం దోడ్కొని మునులెల్ల హస్తిపురంబునకు వచ్చి రంత.149

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; తమలోన్; విచారించి= ఆలోచించి; కుంతీదేవిని; ఆమె కుమారులన్= ఆమె కుమారుల్ని; తోడ్కొని= తీసికొనివచ్చి; మునులు+ఎల్లన్= మునులందరు; హస్తి, పురంబునకున్= హస్తినాపురానికి; వచ్చిరి; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: అని మునులు తమలో ఆలోచించి కుంతీదేవిని, కుమారులను వెంటపెట్టుకొని హస్తినాపురానికి వచ్చారు. అప్పుడు.

చ. 'సురల వరప్రసాదమునఁ జూవె సుపుత్త్రులఁ బాండురాజు భా
సురముగఁ గాంచెఁ ; దత్సుతులఁ జూతము రం' డని పౌరు లెల్ల నొం
డొరులకుఁ జెప్పుచుం దెరలి యొండొరులం గడవంగ వచ్చి చూ
చిరి భుజవిక్రమాధరిత సింహకిశోరులఁ బాండవేయులన్. 150

ప్రతిపదార్థం: పౌరులు+ఎల్లన్= హస్తినాపుర ప్రజలందరును; పాండురాజు; సురల, వరప్రసాదమునన్+చూవె= దేవతలయొక్క వరప్రసాదంచేత సుమా; సు, పుత్త్రులన్= యోగ్యులైన కొడుకులను; భాసురముగన్= ప్రకాశించేటట్లు; కాంచెన్= కన్నాడు; తత్+సుతులన్= ఆయనయొక్క కొడుకులను; చూతము+రండు+అని; ఒండు+ఒరులకున్= ఒకరి కొకరు; చెప్పుచున్= పలకరించుకుంటూ; తెరలి= బయలుదేరి; ఒండు+ఒరులన్= ఒకరు మరొకరిని; కడవంగన్= దాటి; వచ్చి; భుజ, విక్రమ+అధరిత, సింహ, కిశోరులన్= బాహు పరాక్రమంచే తక్కువగా చేయబడిన సింహపుపిల్లలు కలవారిని - అనగా సింహపుపిల్లలను మించిన పరాక్రమవంతులను; పాండవేయులన్= పాండుపుత్త్రులను; చూచిరి.

తాత్పర్యం: 'పాండురాజు దేవతల అనుగ్రహంచేత సుపుత్రులను కన్నాడు. వారిని చూద్దాం రం'డని హస్తినాపుర ప్రజ లందరూ ఒకరితో ఒకరు చెప్పుకొంటూ, ఒకరికంటె ఒకరు ముందుమిగిలి సింహపుపిల్లలకంటె పరాక్రవంతులైన పాండుకుమారులను చూచారు.

విశేషం: హస్తినాపురానికి దూరమై చాలకాలంగా అడవులలో పాండురాజు ఉంటున్నా, ఆ నగరంలో, రాజ్యంలో, ప్రజలలో అతనికి ఉన్నపలుకుబడి, గౌరవం ఈ పద్యంలో వ్యంగ్యం. ఈ పద్యరచనలో సమాధి అనే శబ్దగుణం సార్థకంగా పోషించబడింది. పాండవులను చూడా లన్నఉత్కంఠను క్రమంగా పౌరులు పెంచుకొంటూ వచ్చి, చివరకు పాండవులను చూచినట్లు ఈ పద్యరచన చిన్నచిన్న పదాలతో, సమాసాలతో సాగి పాండవులను, 'భుజవిక్రమాధరితసింహకిశోరులు'గా వర్ణించిన దీర్ఘసమాసంతో ముగియటంతో ఆరోహగతిని సూచిస్తూ, చూపరుల ఆసక్తినీ, అద్భుతాన్నీ ధ్వనింపచేస్తున్నది. 'పాండవేయులన్' అన్న చివరివిశేషణం 'తండ్రికి తగిన తనయులు' అనే భావం ప్రజలకు కలిగిం దని ధ్వనింపజేస్తున్నది.

ఉ. 'వీరలు దైవశక్తిఁ బ్రభవించిన వా రగు టేమి సందియం?
బీరమణీయకాంతి నుపమింపఁగ వేల్పుల కారె? యిట్టి యా
కారవిశేషసంపదఁ బ్రకాశితతేజముపేర్మిఁ జూడ సా
ధారణమర్త్యులే!' యని ముదంబునఁ బౌరులు దమ్ముఁ జూడఁగన్. 151

ప్రతిపదార్థం: వీరలు= వీళ్ళు; దైవ,శక్తిన్= దేవతలప్రభావంచేత; ప్రభవించిన వారు+అగుట= పుట్టినవాళ్ళుకావటంలో; ఏమి, సందియంబు= అనుమానం ఏ మున్నది? ఈ, రమణీయ, కాంతిన్= ఈ మనోహరమైన కాంతిని; ఉపమింపఁగన్= పోల్చి చూడగా; వేల్పులు+అ, కారె= దేవతలే కదా; ఇట్టి, ఆకార, విశేష, సంపదన్= ఈ విధమైన రూపవిశేషంయొక్క అతిశయాన్ని; ప్రకాశిత, తేజము, పేర్మిన్= ప్రకటం చేయబడిన తేజస్సు యొక్క అతిశయాన్ని; చూడన్= చూడగా; సాధారణ, మర్త్యులే= సామాన్య మానవులా; అని= ఆ విధంగా; పౌరులు= పురప్రజలు; ముదంబునన్= సంతోషంతో; తమ్మున్= తమను; చూడఁగన్= కనుగొనగా.

తాత్పర్యం: 'వీళ్ళు దైవశక్తివలన పుట్టిన వా ళ్ళవటంలో సందేహం ఏముది? ఈ మనోహరమైన కాంతిని పోల్చి చూస్తే వీరు దేవతలే. ఈ విధమైన రూపసంపద, తేజస్సు సామాన్యమానవులకు ఉంటాయా?' - అని పౌరులు తమను సంతోషంతో చూడగా.

విశేషం: పాండవులను చూడాలన్న ప్రజలఆసక్తిని ముందుపద్యంలో వర్ణించి, వాళ్ళను చూచిన తరువాత ప్రజలు వాళ్ళనుగూర్చి చేసే ప్రశంసను ఈ పద్యంలో నన్నయ వర్ణించాడు. పై పద్యంలో కర్తృపదస్థానీయులు ప్రజలు, ఈ పద్యంలోని ప్రజలవాక్యాలలో చూడటానికి వచ్చినప్రజలను ఆకట్టుకొని వారిని తమ అభిమానులుగా మార్చుకొంటున్న పాండవుల మహిమ వ్యంగ్యం. పాండురాజు తరువాత పాండవులే హస్తినకు ప్రభువు లన్నది ధ్వని.

వ. ముని సహస్ర పరివృతులయి జననీ సహితంబు పాండురాజ కుమారులు రాజమార్గంబు దఱియవచ్చి రాజమందిర ద్వారాసన్ను లగునంత, మంత్రి పురోహిత బ్రాహ్మణ నివహంబులు దుర్యోధన దుశ్శాసన ప్రముఖ ధార్తరాష్ట్రశతంబును నెదురు వచ్చి పాండవులం దోడ్కొని తెచ్చిన, భీష్మ విదుర ధృతరాష్ట్ర సత్యవత్యం బికాంబాలికలు మొదలుగా నమ్మునులకు నమస్కరించి; రంతం దమకు మ్రొక్కిన కుమారుల నతిస్నేహంబున నెత్తికొని. కుంతిని బ్రియపూర్వకంబున సంభావించి, పాండురాజవియోగదుఃఖితు లయి మహాశోకంబునం దేలుచున్న విదుర ధృతరాష్ట్రుల గాంధారీ సహితం బూరార్చి, యమ్మునులయం దొక్కవృద్ధతపస్వి ముని సహస్రానుమతంబున ని ట్లనియె. 152

ప్రతిపదార్థం: ముని, సహస్ర, పరివృతులు+అయి= మునులు వెయ్యి మందిచే (అనేకులచే) చుట్టబడినవాళ్ళయి; జననీ, సహితంబు= తల్లితోకూడా; పాండురాజ, కుమారులు; రాజమార్గంబు; దఱియ, వచ్చి= చేరవచ్చి; రాజ, మందిర, ద్వార+ఆసన్నులు+అగునంతన్= రాజభవనంయొక్క ద్వారం దగ్గరకు వచ్చినవారు కాగానే; మంత్రి, పురోహిత, బ్రాహ్మణ, నివహంబులు= మంత్రుల, పురోహితుల, బ్రాహ్మణుల యొక్క సమూహాలు; దుర్యోధన, ప్రముఖ, ధార్తరాష్ట్ర, శతంబును= దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైన ధృతరాష్ట్రుని కుమారులు వందమంది; ఎదురువచ్చి; పాండవులన్; తోడ్కొని, తెచ్చినన్= తీసికొనిరాగా; భీష్మ, విదుర, ధృతరాష్ట్ర, సత్యవతి+అంబికా+అంబాలికలు= భీష్ముడు, విదురుడు, ధృతరాష్ట్రుడు, సత్యవతి, అంబిక, అంబాలిక; మొదలుగాన్= ముందుగా; ఆ+మునులకు; నమస్కరించిరి; అంతన్= ఆ సమయంలో; మ్రొక్కిన+కుమారులన్= తమకు నమస్కరించిన పుత్రుల్ని; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రేమతో; ఎత్తికొని= పైకెత్తి; కుంతినిన్, ప్రియ, పూర్వకంబునన్= ప్రీతిగా; సంభావించి= గౌరవించి; పాండురాజ, వియోగ, దుఃఖితులు+అయి= పాండురాజు యొక్క ఎడబాటుచే (మరణంచే) దుఃఖాన్ని పొందినవాళ్ళయి; మహా, శోకంబునన్= పెద్దదుఃఖంలో; తేలుచున్న= తేలిపోతూ ఉండే; విదుర, ధృతరాష్ట్రుల, గాంధారీ, సహితంబున్= విదురునీ, ధృతరాష్ట్రునీ, గాంధారితో కూడా; ఊరార్చి= ఓదార్చి;

ఆ+మునులయందు= ఆ మహర్షులలో; ఒక్క; వృద్ధ, తపస్వి= వృద్ధ ముని;, సహస్ర+అనుమతంబునన్= ఋషులు వెయ్యిమందియొక్క అనుమతితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: వెయ్యిమంది మునులు తమను చుట్టి వెంట రాగా, తల్లితోకూడి పాండవులు, రాజమార్గాన్ని చేరటానికి వచ్చి, రాజభవనద్వారాన్ని సమీపించగానే మంత్రులు, పురోహితులు, బ్రాహ్మణులు, దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైన ధృతరాష్ట్రునికొడుకులు వందమంది ఎదురువచ్చి, వారిని తోడ్కొని లోపలికి తీసికొనివచ్చారు. భీష్ముడు, విదురుడు, సత్యవతి, ధృతరాష్ట్రుడు, అంబిక, అంబాలిక ముందుగా ఆ మునులకు నమస్కరించి, తమకు మ్రొక్కిన పాండవులను ప్రేమతో ఎత్తుకొని, కుంతిని ఎంతోప్రీతితో గౌరవించారు. పాండురాజుమరణానికి పెద్దగా దుఃఖిస్తున్న విదురధృతరాష్ట్రులనూ, గాంధారినీకూడా ఓదార్చి, ఆ మునులలో పెద్దవాడైన ఒకమహాముని మిగతా మును లందరి అనుమతితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇది - ఒక రాజకుటుంబాన్ని రాజకుటుంబసభ్యులు ఆహ్వానించే తీరును తెలిపే వర్ణన. ప్రజాపరిషత్తులలోనూ, సామూహికంగా రాజును దర్శించే సందర్భాలలోనూ అందరూ మాట్లాడకుండా వారిచేత అనుతింపబడిన ప్రతినిధులే మాట్లాడే సాంఘిక సంప్రదాయం వృద్ధతపస్వి మాట్లాడటంలో కనపడుతున్నది.

ఉ. భానునిభుండు పాండుజనపాలుఁడు ఘోరతపంబు సేసి ధ
ర్మానిలవాసవాశ్వినుల దైనవరంబున శక్తిపేర్మితో
నీ నరనాథనందనుల నేవుర వంశవివృద్ధిపొంటెఁ బం
చాననసత్త్వులం బడసె నాశతశృంగమహానగంబునన్. 153

ప్రతిపదార్థం: భాను, నిభుండు= సూర్యునితో సమానుడు; పాండు, జన, పాలుఁడు= పాండురాజు, ఆ శతశృంగ, మహా నగంబునన్= ఆ శతశృంగ మనే గొప్పపర్వతంమీద; ఘోర, తపంబు= భయంకర మైన తపస్సు; చేసి; ధర్మ+ అనిల, వాసవ+అశ్వినులది+ఐన= యమునియొక్క, వాయుదేవునియొక్క, దేవేంద్రునియొక్క, అశ్వినీదేవతలయొక్క; వరంబున, శక్తి, పేర్మితో= వరప్రభావంయొక్క అతిశయంతో; వంశ; వివృద్ధి, పొంటెన్= వంశంయొక్క గొప్పపెంపుదలకొరకు; ఈ, నరనాథ, నందనులన్= ఈ రాజకుమారులను; పంచానన, సత్త్వులన్= సింహంయొక్క బలంవంటి బలంకలవాళ్ళను; ఏవురన్= ఐదుగురిని; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: సూర్యునితో సమాను డైన పాండురాజు, శతశృంగపర్వతంమీద పెద్దతపస్సు చేసి, యమ, వాయు, దేవేంద్ర, అశ్వినీదేవతలయొక్క వరప్రసాదంతో, వంశాభివృద్ధికొరకు సింహాలవలె బలవంతు లైన అయిదుగురు కొడుకులను కన్నాడు.

విశేషం: ఈ పద్యరచనలో అర్థవ్యక్తి అనే గుణం సార్థకం. వృద్ధతపస్వి మాట్లాడినమాటలలో వంశవృద్ధికొరకు పాండురాజు దేవతలవరాలతో పుత్రులను ఏ విధంగా పొందాడో ప్రతిపదసార్థకంగా వివరించాడు. వస్తుస్వభావాన్ని ఝటితిస్ఫూర్తితో వ్యక్తమయ్యేటట్లు చెప్పటం అర్థవ్యక్తిగుణస్వభావం. పాండురాజు ఘోరతపస్సుచేత సూర్యునివలె ప్రకాశించాడు. దానికి దేవతలు మెచ్చి వరాలుగా తనయుల నిచ్చారు. అరణ్యంలో పెరిగిన పాండవులు సింహసత్త్వులుగా శ్రేష్ఠు లనిపించుకొన్నారు. దీనికి శతశృంగాలతో కూడుకొన్న ఆ పర్వతంమీది వేలాదిమునులు సాక్ష్యం! అని ప్రత్యక్షప్రమాణంగా పాండవులను పరిచయం చేశాడు. (సంపా.)

**క. త్రిదశాధినాథసదృశుఁడు । ద్రిదశాలయమునకు మాద్రిదేవియుఁ దానున్
ముదమొనర నరిగె నేఁటికిఁ । బదియేడగునాఁడు దురితబంధచ్యుతుఁ డై. 154**

విశేషం: త్రిదశ+అధినాథ, సదృశుఁడు= దేవేంద్రునితో సమాన మైనవాడు - పాండురాజు; మాద్రిదేవియున్+ తానున్= మాద్రి మరియు తానూ; దురిత, బంధ, చ్యుతుఁ డై= పాపబంధాలనుండి విడువబడినవాడై; నేటికిన్; పది+ఏడగు, నాఁడు= పదిహేడో రోజు; త్రిదశ+ఆలయమునకున్= స్వర్గానికి; ముదము= సంతోషం, ఒనరన్= ఒప్పుగా; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: దేవేంద్రునితో సమాను డైన పాండురాజు మాద్రితో పాపబంధాలనుండి విముక్తుడై పదిహేడు రోజులక్రితం స్వర్గానికి వెళ్ళాడు.

విశేషం: మాద్రీపాండురాజులు మరణించారు అని వాచ్యంగా చెప్పకుండా స్వర్గస్థు లైనా రని పౌరుష్యం లేనట్లుగా ముని చెప్పటంలో సౌకుమార్యం అనే శబ్దగుణం పోషింపబడింది. ఉత్తమసంతానంవలన పాండురాజుకు ఉత్తమగతి - అంటే స్వర్గలోక ప్రాప్తి - లభించిం దని వ్యంగ్యం. భూలోకంలో ఇంద్రునివలె బ్రతికిన పాండురాజు స్వర్గానికి వెళ్ళేటప్పుడు-శచీసమేతంగా ఇంద్రుడు వెళ్ళినట్లుగా మాద్రీసహితంగా వెళ్ళా డనీ, సతీసమేతుడై స్వర్గగమనంచేసిన పాండురాజు పాపబంధా లన్నీ తెగిపోవటంవలన శాశ్వతస్వర్గాలోకావాప్తిని పొందా డనీ వస్తుధ్వని. (సంపా.)

**క. కమనీయలీల నొక్కట । నమరపురంబునకుఁ జనిన యయ్యిరువుర యం
గము లివి; పితృమేధవిధి । క్రమ మొనరఁగ సంస్కరింపఁ గడఁగుఁడు వీనిన్. 155**

ప్రతిపదార్థం: కమనీయ, లీలన్= మనోహర మైన విలాసంతో; ఒక్కటన్= ఒకరితో ఒకరు; అమర, పురంబునకున్= స్వర్గానికి; చనినన్ = వెళ్ళగా; ఆ+ఇరువుర, అంగములు= ఆ ఇద్దరియొక్క అస్థులు; ఇవి; పితృమేధ, విధి, క్రమము= ఉత్తర క్రియలయొక్క విధానం; ఒనరన్= ఒప్పేటట్లు; వీనిన్= ఈ అస్థుల్ని; సంస్కరింపన్= సంస్కరించటానికి; కడఁగుఁడు= ప్రయత్నించండి.

తాత్పర్యం: ఆ విధంగా ఒకటిగా స్వర్గానికి వెళ్ళిన ఆ ఇద్దరి అస్థు లివి. ఉత్తరక్రియలు శాస్త్రోక్తంగా జరిపి, వీటిని సంస్కరించటానికి ప్రయత్నించండి.

వ. 'ఈ దేవియును బతితోడన పోవ సమకట్టినం బుత్త్రరక్షణార్థంబు మునిగణ ప్రార్థిత యై యెట్టకేనియు ధృతప్రాణ యయ్యెఁ; నిక్కుమారులు కురుకులవిస్తారకులు, దేవమూర్తులు. యుధిష్ఠిరభీమార్జున నకులసహదేవు లనంగా దేవాధిష్ఠితనామంబులు దాల్చి, బ్రహ్మర్షి ప్రణీతోపనయను లై శ్రుతాధ్యయన సంపన్ను లగుచుఁ బెరుఁగుచున్నవారు వీరలం జేకొని కురువృద్ధులు ధర్మబుద్ధి రక్షించునది' యని చెప్పి సిద్ధచారణగణంబులతో నమ్మహామును లంతర్ధానంబు సేసి; రంత వ్యాస భీష్మ ధృతరాష్ట్రుల యనుమతంబున. 156

ప్రతిపదార్థం: ఈ, దేవియును= ఈ కుంతీదేవికూడ; పతితోడన్+అ= భర్తతోనే; పోవన్= వెళ్ళటానికి; సమకట్టినన్= పూనుకోగా; పుత్త్ర, రక్షణ+అర్థంబు= కొడుకులను కాపాడటంకొరకు; ముని, గణ, ప్రార్థిత+ఐ= ఋషులసమూహంచేత ప్రార్థింపబడిందై; ఎట్టకు+ఏనియు= చిట్టచివరకు; ధృత, ప్రాణ= ధరింపబడిన ప్రాణాలు కలది; అయ్యెన్= అయింది; ఈ+కుమారులు= ఈ పాండవులు; కురు, కుల, విస్తారకులు= కురువంశాన్ని వృద్ధిచేసేవారు; దేవమూర్తులు= దేవతాస్వరూపులు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యుధిష్ఠిర, భీమ+అర్జున, నకుల, సహదేవులు; అనంగాన్; దేవ+అధిష్ఠిత= దేవతలచేత ప్రభావితా లైన; నామంబులు= పేర్లు; తాల్చి= ధరించి; బ్రహ్మ+ఋషి, ప్రణీత+ఉపనయనులు+ఐ= బ్రహ్మర్షులచేత చేయబడిన ఉపనయనం కలవాళ్ళయి; శ్రుత+అధ్యయన, సంపన్నులు= వేదాధ్యయనం అనే సంపద కలవాళ్ళు; అగుచున్; పెరుఁగుచున్నవారు= పెరుగుతూ ఉన్నారు; వీరలన్= వీళ్లను; చేకొని= తీసికొని; కురు, వృద్ధులు= కురువంశంలోని పెద్దలు; ధర్మ, బుద్ధిన్= ధర్మంతో కూడిన బుద్ధితో; రక్షించునది= కాపాడవలసింది; అని= ఆ విధంగా; చెప్పి= వివరించి; సిద్ధ, చారణ, గణంబులతోన్= సిద్ధుల, చారణుల యొక్క సమూహాలతో; ఆ+మహా, మునులు; అంతర్ధానంబు+ చేసిరి= కనపడకుండా పోయారు; అంతన్= తరువాత; వ్యాస, భీష్మ, ధృతరాష్ట్రుల, అనుమతంబునన్= వ్యాస, భీష్మ, ధృతరాష్ట్రులయొక్క అనుమతితో.

తాత్పర్యం: 'ఈ కుంతీదేవికూడా భర్తతో సహగమనం చేయటానికి పూనుకొన్నది. అయితే, ఋషులు ప్రార్థించటం చేత కొడుకులను రక్షించటానికి బ్రతికి ఉన్నది. ఈ కొడుకులు కురువంశాన్ని వృద్ధి చేస్తారు; దేవతాస్వరూపులు; యుధిష్ఠిర భీమార్జున నకుల సహదేవు లని దేవతల ప్రభావం కల పేర్లు ధరించి, బ్రహ్మర్షులు ఉపనయనం చేయగా, చక్కగా వేదాధ్యయనం చేస్తూ పెరుగుతున్నారు. కురువంశంలో పెద్ద లైనమీరు వీళ్ళను చేరదీసి ధర్మబుద్ధితో రక్షించండి' - అని చెప్పి, ఆ మహామునులు సిద్ధచారణులతోసహా అంతర్ధాన మయ్యారు. తరువాత వ్యాస భీష్మ ధృతరాష్ట్రుల అనుమతితో.

విశేషం: శతశృంగపర్వతంలో జరిగిన వృత్తాంతా న్నంతా వృద్ధమునిచేత సంగ్రహంగా చెప్పించి, హస్తినాపుర కథ కొక సంబంధాన్ని పునరుద్ధరించాడు-నన్నయ. భర్తతోపాటు సహగమనం చేస్తా నని మాద్రి చెప్పినమాటలే పూర్వకథలో ఉన్నాయి. ఆ తరువాత కుంతి తానుకూడా సహగమనానికి సిద్ధమైనట్లూ, మాద్రియే కాక, మునిగణాలు ఆమెకు ఎంతోనచ్చజెప్పి పుత్రరక్షణార్థం బ్రతుకు మని బోధించా రనే వివరణం ఇక్కడ చెప్పాడు-నన్నయ. సమయసందర్భా లెరిగి కథార్థాలను ఉత్కంఠావహంగా కూర్చటం ప్రసన్నకథాకలితార్థయుక్తిలక్షణం. (సంపా.)

సీ. **వెలయంగఁ బితృమేధవిధి విచక్షణశీల। సద్భూసురోపదేశక్రమమున**
నధికవిభూతితో నతిపవిత్రప్రదే। శమున నయ్యంగముల్ సంస్కరించి,
పుణ్యస్వధామృతంబుల నొప్పఁగా। శ్రాద్ధవిధి యొనరించి, సద్విప్రతతికి
నగ్రహారములు దివ్యాంబరాభరణ శ। య్యాసనచ్ఛత్త్రగవాశ్వకరుల

ఆ. **నిచ్చి, సర్వజనుల కెల్లను భోజన। దాన మొనరఁ జేసి, ధర్మవిదుఁడు**
విదురుఁ డట్లు పాండువిభునకుఁ జేయించె। నన్యలోకహితంబు లైన విధులు. 157

ప్రతిపదార్థం: ధర్మ, విదుఁడు= ధర్మం తెలిసినవాడు; విదురుఁడు; వెలయంగన్= ఒప్పేటట్లు; పితృమేధ, విధి, విచక్షణ, శీల, సత్+భూసుర+ఉపదేశ, క్రమమునన్= పితృయజ్ఞ విధానంలో పండితస్వభావం కల ఉత్తము లైన బ్రాహ్మణులు చెప్పిన విధంగా; అధిక, విభూతితోన్= మిక్కిలి ఐశ్వర్యంతో; అతి, పవిత్ర, ప్రదేశమునన్= మిక్కిలి పవిత్రమైన స్థలంలో; ఆ+అంగముల్= ఆ అస్థికలు; సంస్కరించి= సంస్కారం జరిపించి; పుణ్య, స్వధా+అమృతంబులన్= పుణ్య మైన హోమాలతో, జలతర్పణాలతో; ఒప్పఁగాన్= తగు విధముగా; శ్రాద్ధ, విధి= శ్రాద్ధకర్మను; ఒనరించి= చేసి; సత్+విప్ర, తతికిన్= ఉత్తమ బ్రాహ్మణుల సమూహానికి; అగ్రహారాలు= కొన్నిగ్రామాలు; దివ్య+అంబర+ఆభరణ, శయ్యా+ఆసన, ఛత్త్ర, గో+అశ్వ, కరులన్= శ్రేష్ఠమైన వస్త్రాలను, ఆభరణాలను, పడకలను, ఆసనాలను, గొడుగులను, గోవులను, గుర్రాలను, ఏనుగులను; ఇచ్చి; సర్వ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జనులకు+ఎల్లన్= ప్రజలకు అందరికి; భోజన, దానమున్= అన్నదానాన్ని; ఒనరన్= తగినట్లు; చేసి; పాండువిభునకు= పాండురాజుకు; అన్యలోక, హితములు+ఐన= పరలోకంలో మేలు చేసేవి అయిన; విధులు= కర్మలు; అట్లు; చేయించెన్.

తాత్పర్యం: ధర్మజ్ఞు డైన విదురుడు పితృయజ్ఞవిధానం చక్కగా తెలిసిన బ్రాహ్మణోత్తములు చెప్పినప్రకారం మిక్కిలి వైభవంగా మహాపవిత్రస్థలంలో ఆ అస్థికలకు సంస్కారం జరిపించి, పుణ్యహోమంతో, జలతర్పణాలతో శ్రాద్ధకర్మ చేయించి, సద్బ్రాహ్మణులకు అగ్రహారాలు, వస్త్రాలు, ఆభరణాలు, పడకలు, ఆసనాలు, గొడుగులు, గోవులు, గుఱ్ఱాలు, ఏనుగులు దానా లిచ్చి, ప్రజ లందరికీ అన్నదానం చేసి, పాండురాజుకు ఉత్తరక్రియలు చేయించారు.

విశేషం: గో+అశ్వ= గవాశ్వ - అయవాయావాదేశసంధి. దేవతలకు 'స్వాహా'శబ్దంతో, పితరులకు 'స్వధా' శబ్దంతో హోమాలు చేయడం శాస్త్రవిధానం.

వ. అంతఁ గృష్ణద్వైపాయనుండు వారి కందఱకు దుఃఖోపశమనంబుసేసి, యొక్కనాఁడు సత్యవతికి నేకాంతంబున ని ట్లనియె. 158

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; కృష్ణద్వైపాయనుండు; వారికి+అందఱకున్= వా ళ్లందరికి; దుఃఖ+ఉపశమనంబు చేసి= దుఃఖం తగ్గేటట్లు ఓదార్చి; ఒక్కనాఁడు; సత్యవతికిన్= తనతల్లి సత్యవతితో; ఏకాంతంబునన్= రహస్యంగా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: తరువాత కృష్ణద్వైపాయనుడు వా ళ్ళందరినీ ఓదార్చి, ఒకనాడు సత్యవతితో రహస్యంగా ఇట్లా అన్నాడు.

క. మతిఁ దలఁపఁగ సంసారం । బతి చంచల మెండమావులట్టుల సంప
త్ప్రతతు లతిక్షణికంబులు; । గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్. 159

ప్రతిపదార్థం: మతిన్= బుద్ధితో; తలఁపఁగన్= ఆలోచించగా; సంసారంబు;అతి, చంచలము= మిక్కిలి చలించునది; ఎండమావులు+అట్టులన్= ఎండమావులవలె; సంపత్+ప్రతతులు= సంపదలయొక్క సమూహాలు; అతి, క్షణికంబులు= మిక్కిలి త్వరగా నశించేవి; గత కాలము= గడచిన కాలం; వచ్చు, కాలముకంటెన్= రాబోయే కాలంకంటె; మేలు= మంచిది, ఉత్తమమైంది.

తాత్పర్యం: ఆలోచించి చూస్తే సంసారం ఎండమావులవలె అతిచంచలం. సంపదలు అశాశ్వతాలు. రాబోయే రోజులకంటె గడచిపోయిన రోజులే మేలు.

విశేషం: అలం: ఉపమ. అతిప్రసిద్ధా లైన నన్నయసూక్తులలో ఇది ఒకటి. ఏ యుగంలో నైనా, ఎవరికైనా ఇది సత్య మనిపిస్తుంది.

క. క్రూరులు విలుప్త ధర్మా । చారులు ధృతరాష్ట్రసుతు లసద్వృత్తులు ని
ష్కారణవైరులు వీరల । కారణమున నెగ్గు పుట్టుఁ గౌరవ్యులకున్. 160

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర, సుతులు= ధృతరాష్ట్రుని యొక్క కొడుకులు; క్రూరులు; విలుప్త, ధర్మ+ఆచారులు= నశించిన ధర్మ బద్ధమైన నడవడి కలవారు; అసత్+వృత్తులు= మంచివి కాని పనులు కలవాళ్ళు; నిష్కారణ, వైరులు= కారణం

లేకుండానే శత్రువులయేవాళ్ళు; వీరల, కారణమునన్; కౌరవ్యులకున్= కురువంశంలో పుట్టిన వాళ్ళకు; ఎగ్గు= కీడు; పుట్టున్= కలుగుతుంది.

తాత్పర్యం: ధృతరాష్ట్రునికొడుకులు దుర్మార్గులు. కారణం లేకుండానే వైరం వహించేవారు. వారికారణంగా కౌరవవంశానికి కీడు కలుగుతుంది.

వ. 'దాని ధృతరాష్ట్రుండు తాన యనుభవించుంగాని మీ రీ దారుణంబుఁ జూడక వీరి విడిచి తపోవనంబున కరుగుం' డని చెప్పి చనిన సత్యవతియుఁ బారాశర్యునుపదేశంబు భీష్మవిదురుల కెఱింగించి కోడండ్ర నంబికాంబాలికలం దోడ్కొని వనంబునకుం జని, తానును వారు నతిఘోరతపంబు సేసి కొండొక కాలమునకు శరీరంబులు విడిచి పుణ్యగతికిం బోయి; రిట ధృతరాష్ట్రుండును. 161

ప్రతిపదార్థం: దానిన్= ఆ కీడును; ధృతరాష్ట్రుండు; తాను+అ= తానే; అనుభవించున్= అనుభవిస్తాడు; కాని; మీరు; ఈ, దారుణంబున్= ఈ దారుణాన్ని; చూడక= చూడకుండా; వీరిన్= వీరిని; విడిచి= వదలి; తపోవనంబునకున్= తపస్సు చేయు అడవికి; అరుగుండు= వెళ్ళండి; అని= ఆ విధంగా; చెప్పి= తెలిపి; చనినన్= పోగా; సత్యవతియున్= సత్యవతికూడా; పారాశర్యు, ఉపదేశంబు= పరాశరునికొడుకైన కృష్ణద్వైపాయనుని ఉపదేశాన్ని; భీష్మ, విదురులకున్= భీష్మునికి, విదురునికి; ఎఱింగించి= తెలిపి; కోడండ్రన్= కోడళ్లైన; అంబికా+అంబాలికలన్= అంబికను, అంబాలికను; తోడ్కొని= తీసికొని; వనంబునకున్= అడవికి; చని= వెళ్ళి; తానును= తానూ; వారు= వాళ్ళూ; అతి, ఘోర, తపంబు= మిక్కిలి భయంకర మైన తపస్సు; చేసి; కొండొక, కాలమునకున్= కొంతకాలానికి; శరీరంబులు; విడిచి; పుణ్య, గతికిన్= స్వర్గానికి; పోయిరి; ఇట; ధృతరాష్ట్రుండును-

తాత్పర్యం: 'దానిని ధృతరాష్ట్రుడు తానే అనుభవిస్తాడు. కాబట్టి మీరు ఈ దారుణాన్ని చూడకుండా వీళ్ళను విడిచిపెట్టి తపోవనానికి వెళ్ళండి' అని చెప్పి వెళ్ళగా, సత్యవతికూడ వ్యాసుని ఉపదేశాన్ని భీష్మునికీ, విదురునికీ తెలిపి, కోడళ్ళయిన అంబిక, అంబాలికలను వెంటతీసికొని అడవికి వెళ్ళి, తానూ వాళ్ళూ తీవ్రమైన తపస్సుచేసి, కొంతకాలానికి శరీరాలు విడిచి స్వర్గానికి చేరారు. ఇక ఇక్కడ ధృతరాష్ట్రుడు.

విశేషం: ద్రష్ట అయిన కృష్ణద్వైపాయనుడు కౌరవుల స్వభావాలు, భవిష్యత్పరిణామాలు దర్శించాడు. కౌరవ వంశాభ్యుదయంమీద కొండంత ఆశ పెట్టుకొన్న సత్యవతీదేవిగుండె బ్రద్దలు కాకుండ ముందుగానే దాన్ని తెలిపి, ఆమెను తపోవనానికి పంపాడు.

కురుపాండుకుమారుల బాలక్రీడలు (సం. 1-119-13)

క. తన సుతులు పాండు సుతు లని। మనమున భేదింప కతిసమంజసభావం
బున నొక్క రూపకాఁ జే। కొని యుండెం బాండురాజుకొడుకులఁ బ్రీతిన్. 162

ప్రతిపదార్థం: తన, సుతులు= తన కొడుకులు; పాండు, సుతులు= పాండురాజు, కొడుకులు; అని= ఆ విధంగా; మనమునన్= మనస్సులో; భేదింపక= తేడా చూపక; అతి, సమంజస, భావంబునన్= మిక్కిలి న్యాయబుద్ధితో; ఒక్కరూపు+అ, కాన్= ఒకే విధంగా, ప్రీతిన్= ప్రేమతో; పాండురాజు, కొడుకులన్= పాండవుల్ని; చేకొని+ఉండెన్= చేపట్టి ఉన్నాడు.

తాత్పర్యం: తనకొడుకులు, పాండురాజుకొడుకులు అనే భేదభావం లేక, మిక్కిలిన్యాయబుద్ధితో అందరినీ ఒకే విధంగా చూస్తూ పాండవులను ప్రేమతో పెంచుతూ ఉన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ధృతరాష్ట్రునెయ్యమున సం । తతవర్ధితు లగుచుఁ బాండుతనయులు వినయా
న్వితులు కుమారక్రీడా । రతు లయి యొడఁగూడి ధార్తరాష్ట్రులతోడన్. 163

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రు, నెయ్యమునన్= ధృతరాష్ట్రునిప్రేమతో; సంతత, వర్ధితులు+అగుచున్= ఎల్లప్పుడు పెంచబడిన వాళ్ళయి; వినయ+అన్వితులు= వినయంతో కూడినవారు; పాండు, తనయులు= పాండురాజుకొడుకులు; ధార్తరాష్ట్రుల తోడన్= ధృతరాష్ట్రునికొడుకులతో; ఒడన్+కూడి= కలిసి; కుమార, క్రీడా, రతులు+అయి= బాలక్రీడలలో ఆసక్తి కలవాళ్ళయి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుని ప్రేమచేత పెరుగుతూ వినయవంతు లైన పాండవులు కౌరవులతో కలిసి బాలక్రీడల మీద ఆసక్తి కలవాళ్ళయి.

క. గిఱుపునెడ నేయునెడ వడిఁ । బఱచునెడం బెనఁగునెడ నపార బలంబుల్
మెఱయునెడ భీమునకు నం । దొఱుఁ గీడ్పడఁ దొడఁగి రుద్ధతులు రాజసుతుల్. 164

ప్రతిపదార్థం: గిఱుపు, ఎడన్= తిరిగేటప్పుడు; ఏయు, ఎడన్= కొట్టేటప్పుడు; వడిన్= వేగంగా; పఱచు, ఎడన్= పరుగెత్తేటప్పుడు; పెనఁగు, ఎడన్= పెనగులాడేటప్పుడు; అపార, బలంబుల్= అంతులేని బలాలను; మెఱయు, ఎడన్= చూపేటప్పుడు; ఉద్ధతులు= గర్వించినవారు; రాజ, సుతుల్= రాజకుమారులు; అందొఱున్= అందరూ; భీమునకున్; కీడ్పడన్= తక్కువ అవటానికి; తొడఁగిరి= పూనుకొన్నారు.

తాత్పర్యం: గుండ్రంగా తిరిగేటప్పుడు, కొట్టేటప్పుడు, వేగంగా పరుగెత్తేటప్పుడు, పెనగులాడేటప్పుడు, అపార బలాలను ప్రదర్శించేటప్పుడు గర్వంతో ఉన్న రాజకుమారు లంతా భీమునికన్నా తక్కువ అవుతున్నారు.

క. వదలక పెనఁగి పదుండ్రం । బదియేవుర నొక్కపెట్ట పట్టి ధరిత్రి
జెదరఁ బడవైచి పవనజుఁ । డదయుండయి వీఁపు లొలియ నందఱ నీడ్చున్. 165

ప్రతిపదార్థం: వదలక; పెనఁగి= పోరాడి; పదుండ్రన్= పదిమందిని; పదియేవురన్= పదిహేనుమందిని; ఒక్కపెట్టు+అ= ఒక్కసారిగ; పట్టి; ధరిత్రిన్= భూమిమీద; చెదరన్= చెల్లాచెదురుగా; పడవైచి= క్రిందపడవేసి; పవనజుఁడు= వాయుదేవునికి పుట్టినవాడు - భీముడు; అదయుండు+అయి= దయలేనివాడై; వీఁపులు+ఒలియన్= వీపుల చర్మం ఊడిపోయేట్లుగ; అందఱన్, ఈడ్చున్= అందరినీ, ఈడ్చేవాడు.

తాత్పర్యం: వదలక పోరాడి, పది లేదా పదిహేనుమందిని ఒక్కసారిగా పట్టి, నేలమీద చెల్లాచెదురుగా పడవేసి, భీముడు దయలేనివాడై అందరివీపులచర్మాలు లేచిపోయేట్లు ఈడ్చేవాడు.

సీ. కూడి జలక్రీడ లాడుచోఁ గడఁగి యా । ధృతరాష్ట్రతనయుల నతులశక్తి
లెక్కించియుఁ బదుండ్ర నొక్కొక్క భుజమున । నెక్కించుకొని, వారి యుక్కడంగఁ
గ్రంచఱ నీరిలో ముంచుచు నెత్తుచుఁ । గారించి తీరంబు చేరఁ బెట్టుఁ ;
గోరి ఫలార్థు లై వారల యెక్కిన । వ్రూఁకుల మొదళుల వీఁకఁ బట్టి

ఆ. వడిఁ గదల్చుఁ బండ్లు దడఁబడువారల । తోన ధరణిమీఁదఁ దొరఁగుచుండ;
నిట్టిపాట గాడ్పుపట్టిచే దుశ్శాస । నాదు లెల్ల బాధితాత్ము లైరి. 166

ప్రతిపదార్థం: కూడి; జలక్రీడలు; ఆడుచోన్; కడఁగి= పూని; ఆ ధృతరాష్ట్ర, తనయులన్= ఆ ధృతరాష్ట్రుని కొడుకులను; అతుల, శక్తిన్= సాటిలేని బలంతో; లెక్కించియున్= లెక్కపెట్టి; పదుండ్రన్= పదిమందిని; ఒక్క+ఒక్క, భుజమునన్= ఒక్కొక్క భుజంమీద; ఎక్కించుకొని; వారి, ఉక్కు= వాళ్ల బలం; అడంగన్= అణగేటట్లుగా; క్రంచఱ= వేగంగా; నీరిలోన్; ముంచుచున్; ఎత్తుచున్; కారించి= బాధించి; తీరంబు= గట్టును; చేరన్= చేరేట్లు; పెట్టున్; కోరి; ఫల+అర్థులు+ఐ= పండ్లు కోరినవాళ్ళయి; వారల, ఎక్కిన మ్రాకులమొదళ్లను= వా రెక్కినట్టి చెట్లమొదళ్ళను; వీఁకన్= బలంతో; పట్టి; తడఁబడు, వారలతోనన్; పండ్లు; ధరణి, మీఁదన్= భూమిమీద; తొరఁగుచుండన్= పడుతుండగా; వడిన్= వేగంగా; కదల్చున్= కదలించేవాడు; ఇట్టిపాట= ఈ విధంగా; గాడ్పు, పట్టిచే= వాయుదేవుని కొడుకైన భీమునిచేత; దుశ్శాశన+ఆదులు+ఎల్లన్= దుశ్శాసనుడు మొదలైనవాళ్లంతా; బాధిత+ఆత్ములు+ఐరి= బాధింపబడిన శరీరాలుకలవాళ్ళు అయ్యారు.

తాత్పర్యం: అంతా చేరి జలక్రీడలు ఆడేటప్పుడు భీముడు సాటిలేని బలంతో పూని ధృతరాష్ట్రునికొడుకులను ఒక్కొక్క భుజంమీద పదిమందిని లెక్కపెట్టి ఎక్కించుకొని, వాళ్ళ బలం అణగేటట్లు వేగంగా నీటిలో ముంచుతూ, పై కెత్తుతూ బాధించి, గట్టుకు చేర్చేవాడు. వాళ్ళు పండ్లు కోయడానికి ఎక్కిన చెట్లమొదళ్ళను బలంగా వేగంగా కదల్చి, వాళ్ళూ, పండ్లూ నేలమీద రాలేటట్లు చేసేవాడు. ఈ విధంగా దుశ్శాసనుడు మొదలైనవాళ్ళంతా భీమునిచేత బాధింపబడుతూ ఉండేవాళ్ళు.

వ. దాని సహింపనోపక యొక్కనాఁడు దుర్యోధనుండు శకుని దుశ్శాసనాదులతో విచారించి యి ట్లనియె.167

ప్రతిపదార్థం: దానిన్= భీమునిచేత కలిగేబాధను; సహింపన్+ఓపక= ఓర్చుకోలేక; ఒక్కనాఁడు; దుర్యోధనుండు; శకుని; దుశ్శాసన+ఆదులతో= శకుని, దుశ్శాసనుడు మొదలైనవాళ్ళతో; విచారించి= ఆలోచించి; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: భీమునిచేత కలిగేబాధను ఓర్చుకోలేక, ఒకనాడు దుర్యోధనుడు శకుని, దుశ్శాసనుడు మొదలైన వాళ్ళతో ఆలోచించి ఈ విధంగా అన్నాడు.

పృథ్వి.

ఉపాంశువధఁ జేసి మధ్యము మదోద్ధతుం జంపి ని
స్సపత్నముగ ధర్మనందను నశక్తు బంధించి యే
నపాండవముగా సముద్రవలయాఖిలక్షోణి మ
త్కృపాణపటుశక్తి నత్యధికకీర్తి నై యేలెదన్. 168

ప్రతిపదార్థం: మద+ఉద్ధతున్= గర్వంతో విజృంభించినవాడిని; మధ్యమున్= నడిమివాడిని - అనగా కుంతీదేవికొడుకులలో మధ్యమంవాడైన భీముడిని; ఉపాంశు, వధన్+చేసి= రహస్యంగా హత్యచేసి; చంపి; అశక్తు= శక్తిలేనివా డైన; ధర్మనందనున్; బంధించి; నిస్సపత్నముగన్= శత్రువు లేకుండా; అపాండవముగాన్= పాండవులు లేకుండా; సముద్ర, వలయ+అఖిల, క్షోణిన్= సముద్రంచేత చుట్టబడిన సమస్తభూమండలాన్ని; మత్, కృపాణ, పటు, శక్తిన్= నా కత్తియొక్క గట్టిబలంతో; అతి+అధిక, కీర్తిని+ఐ= మిక్కిలి ఎక్కువ కీర్తిగలవాడనై; ఏలెదన్= పరిపాలిస్తాను.

తాత్పర్యం: గర్వంతో విజృంభిస్తున్న భీముడిని రహస్యంగా చంపి, అశక్తు డైన ధర్మరాజును చెరసాలలో పెట్టి, శత్రువు అనేవాడు లేకుండా, అపాండవంగా సమస్తభూమండలాన్నీ నాకత్తికి ఎదురులేకుండా అఖండకీర్తితో పరిపాలిస్తాను.

విశేషం: పాండవులకు బలం, తనకు ప్రబలశత్రువు భీముడుమాత్రమే అని దుర్యోధనుని భావన. అతడిని ప్రత్యక్షంగా ఎదుర్కొని చంపడం సాధ్యపడదు. అందువలన అతడిని రహస్యంగా చంపి, తనకన్నా పెద్దవాడైన ధర్మరాజును చెరసాలలో పెడితే-ఇక తనను ఎదిరించే శత్రువు లుండ రనీ, మిగతావారిలో తానే పెద్ద కనుక రాజ్యాధికారం తనకే సంక్రమిస్తుం దనీ, సమస్తభూమండలాన్ని తానే పరిపాలించవ చ్చనీ దుర్యోధనుని దురాలోచన. అప్పటి కింకా అర్జున నకుల సహదేవుల శక్తి సామర్థ్యాలు దుర్యోధనుని దృష్టికి వచ్చినట్లు లేదు. పాండవధార్తరాష్ట్రుల విభేదానికి బీజం భీమునిబల మనీ, దుర్యోధనుని దుశ్చింత అనీ వస్తుధ్వని. (సంపా.)

ఛందశ్శిల్పం: పృథ్వీవృత్తంలోని ప్రతిపాదంలోనూ 17 అక్షరా లుంటాయి. జ, స, జ, స, య, లగ - అనే గణాలు వరుసగా అమరి ఉంటాయి. 12వ అక్షరం యతిస్థానం. ఈ సందర్భంలో నన్నయ పృథ్వీవృత్తం వాడటంలో గల సార్థక్యాన్ని గురించీ, ఈ పద్యరచనలోని అక్షరరమ్యత, వాక్యవృత్తులగురించీ డాక్టర్ పాటిబండమాధవశర్మగా రిట్లా వ్యాఖ్యానించారు. "పృథ్వీరాజ్య హరణోత్సాహమును, తదంగమైన పృథానందనోత్సాహమును పృథ్వీవృత్తమున నిబంధించుట వృత్తనామాశ్రితమైన శిల్పము. పద్య మందలి పూర్వోత్తరార్ధములందు అక్షర, పదరచనా రూపమైన శిల్పమును గుర్తింపవచ్చును. పూర్వార్ధమందలి మహాప్రాణవ్యంజనము, నీచమధ్యస్వరములు, వ్యస్తపదములు దుర్యోధనుఁ డా వాక్యఖండములను రహస్యముగ, అనుదాత్తస్వరమున, సనిశ్శ్వసితముగ, ససంభ్రమముగ నుచ్చరించె నని స్పష్టము చేయుచున్నది. ఉత్తరార్ధమునందలి సమస్తపదములు, నాదాక్షరములు, విశేషించి చతుర్థపాదము నందలి ఉదాత్తస్వరములు దుర్యోధను డావాక్యమును అనర్గలముగ క్రమవర్ధమానస్వరమున ఉచ్చరించె నని స్ఫుటము చేయుచున్నవి. భీమవధ, ధర్మజబంధనములు రహస్యవిషయములు. అపాండవమైన క్షోణీరాజ్యపాలనము ప్రకాశవిషయము, స్వరవ్యంజనవిన్యాస శిల్పము వాక్యార్థవ్యంజకమైన వాచికాభినయనమునకు చక్కగా నుపకరించుచున్నది. 'అసమాసైః పదై ర్భాతి పృథ్వీ పృథ్వీ పృథక్ స్థితైః (సువృత్తతిలకం 2-27). వ్యస్తములైన యసమస్త పదములచే పృథ్వీవృత్తము పృథువుగా భాసించు నని క్షేమేంద్రుఁ డొకరహస్యమును వెల్లడించెను. నన్నయ యారహస్యమునే పైపద్యమందలి పూర్వార్ధమున ప్రదర్శించెను'' (ఆంధ్రమహాభారతము: ఛందశ్శిల్పము - పు.280,281)

దుర్యోధనుఁడు భీమునిఁ జంపింపఁ దివురుట (సం. 1-119-28)

వ. అని పాపబుద్ధియందుఁ గృతనిశ్చయుం డై దుర్యోధనుండు భీష్మ విదురు లెఱుంగకుండ భీమున కపాయంబు సేయ సమకట్టి, యంతరం బన్వేషించుచున్నంత నొక్కనాఁడు జలక్రీడావసరంబున. 169

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పాప, బుద్ధియందున్= చెడ్డఆలోచనతో; కృత, నిశ్చయుండు+ఐ= చేయబడిన నిర్ణయం కలవాడై; దుర్యోధనుండు; భీష్మ, విదురులు ఎఱుంగకుండన్= భీష్మునికి విదురునికి తెలియనీయకుండా; భీమునకున్; అపాయంబు, చేయన్= అపాయం కలిగించటానికి; సమకట్టి= పూనుకొని; అంతరంబు= అవకాశాన్ని; అన్వేషించుచున్= వెదకుతూ; ఉన్నంతన్= ఉండగా; ఒక్కనాఁడు; జల, క్రీడా+అవసరంబునన్= జలక్రీడలు ఆడేసమయంలో.

తాత్పర్యం: అని దురాలోచనతో దుర్యోధనుడు భీష్మవిదురులకు తెలియకుండా భీమునికి కీడు చేయా లని అవకాశంకొరకు వెదకుతుండగా ఒకరోజు జలక్రీడలు ఆడేసమయంలో.

ఉ. వేడుక నొక్కరుండు శతవీరకుమారులతోడఁ జల్లుఁ బో
రాడి జయించి యందఱ, ననంతపరిశ్రమపారవశ్యముం
గూడి ప్రమాణకోటి ననఘుండు సమీరణనందనుండు మే
యాడక నిద్రవోయె శిశిరానిలముల్ పయి వీచుచుండఁగన్. 170

ప్రతిపదార్థం: అనఘుండు= పాపంలేనివాడు; సమీరణ, నందనుండు= వాయుదేవునికొడుకైన భీముడు; వేడుకన్= వేడుకతో; ఒక్కరుండు= ఒక్కడు; శత, వీర, కుమారులతోడన్= నూరుమంది వీరులైనకురుకుమారులతో- దుర్యోధనాదులతో; చల్లున్+పోరు+ఆడి= నీళ్ళలో దిగి ఒకరిమీద ఒకరు నీళ్ళు చల్లుకొనే ఆట ఆడి; అందఱన్; జయించి; అనంత, పరిశ్రమ, పారవశ్యమున్= అంతులేని శ్రమవల్ల కల్గిన మైమరపుతో; కూడి= ఉండి; ప్రమాణకోటిన్= ప్రమాణకోటి అనే స్థలంలో; శిశిర+అనిలముల్= చల్లనిగాలులు; పయిన్= మీద; వీచుచుండఁగన్; మెయి= దేహం; ఆడక= కదలక; నిద్ర, పోయెన్.

తాత్పర్యం: పాపరహితుడు, వాయుపుత్రుడు అయిన భీముడు ఒక్కడే వేడుకగా వందమందికౌరవులతో జలక్రీడలాడి అందరినీ జయించి, అంతులేని శ్రమచేత కలిగిన అలసటవలన మైమరచి ప్రమాణకోటి అనే స్థలంలో చల్లగాలులు వీస్తూ ఉండగా మేను కదల్చకుండ గాఢనిద్రలో ఉన్నాడు.

విశేషం: ధార్తరాష్ట్రు లందరినీ మట్టుపెట్టగలదిట్ట భీము డనే అర్థాన్ని వ్యంగ్యంగా, బీజతుల్యంగా ఈ సన్నివేశం వ్యక్తంచేస్తున్నది.

క. ఆ పవనజు నతిఘనలతి । కాపాశావలుల నంటఁ గట్టించి మహా
కోపమున గంగమడువునఁ । ద్రోపించె సుయోధనుండు దురితకరుం డై. 171

ప్రతిపదార్థం: సుయోధనుండు= దుర్యోధనుడు; దురిత, కరుండు+ఐ= పాపం చేసేవాడై; ఆ, పవనజున్= ఆ వాయుపుత్రుడైన భీముడిని; అతి, ఘన, లతికా, పాశ+ఆవలులన్= మిక్కిలి గట్టివైన తీగ లనే తాళ్ళ సమూహంచే; అంటన్+కట్టించి= శరీరానికి అతుక్కొనిపోయే విధంగా కట్టించి; మహాకోపమునన్= మిక్కిలికోపంతో; గంగమడువునన్= గంగమడుగులోకి; త్రోపించెన్= త్రోయించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు దుర్మార్గుడై భీముడిని గట్టి తీగలచే గట్టిగా కట్టించి, మహాకోపంతో గంగమడుగులోకి త్రోయించాడు.

క. అనిలసుతుం డంతన మే । ల్కని నీల్గుడు నతని వజ్రఘనకాయముఁ బొం
దినలతికాపాశము లె । ల్లను ద్రెస్సె మృణాళనాళలతికలపోలెన్. 172

ప్రతిపదార్థం: అనిల, సుతుండు= వాయుదేవునికొడుకు - భీముడు; అంతన= అప్పటికప్పుడే - అంతలోనే; మేల్కని= మేలుకొని; నీల్గుడున్= ఒళ్ళు విరుచుకోగా; అతని, వజ్ర, ఘనకాయమున్= అతనియొక్క వజ్రంవంటి ధృఢమైన దేహాన్ని; పొందిన= తగులుకొన్న; లతికా, పాశములు+ఎల్లను= తీగ లనే త్రా ళ్ళన్నీ; మృణాళ, నాళ, లతికల, పోలెన్= లేత తామరతూళ్ళతీగలవలె; త్రెస్సెన్= తెగాయి.

తాత్పర్యం: భీముడు అప్పటి కప్పుడు మేల్కొని ఒళ్ళు విరువగానే, వజ్రంవలె కఠినమైన అతనిశరీరానికి కట్టిన తీగలతా ళ్ళన్నీ లేతతామరతూళ్ళతీగలవలె సులభంగా తెగిపోయాయి.

విశేషం: అలం: ఉపమ.

ఆ. కర్మబంధనములు గ్రక్కునఁ బాయుడుఁ । బుణ్యగతికి నెగయు పురుషు నట్లు
బంధనంబు లెల్లఁ బాయుడు భీముండు । నీరిలోననుండి నెగయుదెంచె. 173

ప్రతిపదార్థం: కర్మ, బంధనములు= కర్మబంధాలు; గ్రక్కునన్= తటాలున; పాయుడున్= తొలగిపోగా; పుణ్యగతికిన్= పుణ్యాలోకానికి; ఎగయు, పురుషునట్లు= ఎగిరిపోయే పురుషునివలె; బంధనంబులు+ఎల్లన్= కట్లన్నీ; పాయుడున్= తొలగిపోగా; భీముండు= భీముడు; నీరిలోన, నుండి= నీళ్ళలోనుండి; నెగయుదెంచెన్= పైకి లేచాడు.

తాత్పర్యం: కర్మబంధాలు తొలగిపోగా పురుషుడు(జీవుడు) స్వర్గానికి ఎగిరిపోయినట్లు, కట్లు తెగగానే భీముడు నీటినుండి పైకి లేచి వచ్చాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. మఱియు నొక్కనాఁడు. 174

తాత్పర్యం: ఇంకా మరొకరోజు.

క. జనపతి పనుపఁగ సారథి । ఘనవిషకృష్ణోరగములఁ గఱపించె శ్రమం
బున నిద్రితుఁ డైన ప్రభం । జనసుతుసర్వాంగమర్మసంధుల నెల్లన్. 175

ప్రతిపదార్థం: జన, పతి= రాజు - దుర్యోధనుడు; పనుపఁగన్= ఆజ్ఞాపించగా; సారథి; శ్రమంబునన్= అలసటచేత; నిద్రితుఁడు+ఐన= నిద్రపోయినవాడైన; ప్రభంజన; సుతు, సర్వ+అంగ, మర్మ, సంధులన్, ఎల్లన్= వాయుపుత్రుని అన్ని అవయవాల కీలకస్థానాల కూడిక లన్నింటను; ఘన, విష, కృష్ణ+ఉరగములన్= గొప్పవిషం కల నల్లత్రాచుపాములచేత; కఱపించెన్= కరిపించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఆజ్ఞాపించగా సారథి, అలసి నిద్రపోయిన భీమసేనుని అన్ని అవయవాల మర్మస్థానాల సంధు లన్నిటా గొప్పవిషంగల నల్లత్రాచుపాములతో కరిపించాడు.

క. అవిరళవిషఫణిదంష్ట్రలు । పవనజువజ్రమయతనువుపయితోలును నో
పవ భేదింపఁగఁ; బాప । వ్యవసాయులచెయ్వు లర్థవంతము లగునే? 176

ప్రతిపదార్థం: అవిరళ, విష, దంష్ట్రలు= దట్టమైన విషం ఉన్న పాములకోరలు; పవనజు, వ్రజమయ, తనువు, పయితోలునున్= వాయుపుత్రుని వజ్రంవంటి (అనగా వజ్రంవలె గట్టిదైన) శరీరంమీది చర్మాన్నికూడ; భేదింపఁగన్= చీల్చటానికి; ఓపవ= సమర్థమైనవి కాలేకపోయాయి; పాప, వ్యవసాయుల, చెయ్వులు= పాపం చేయడంలో నిశ్చితమైనబుద్ధి కలవాళ్ళచేష్టలు; అర్థవంతములు= ఫలాన్ని కూర్చేవి; అగునే= అగునా? - కావు.

తాత్పర్యం: దట్ట మైనవిష మున్న ఆ పాములకోరలు, భీమసేనుని వజ్రంవంటి శరీరం పై తోలునుకూడా చీల్చ లేక పోయాయి. పాపబుద్ధి కలవారిపను లెప్పుడూ ఫలించవు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

చ. అలఘుబలుండు భీముఁడును నంతన మేల్కని యవ్విషోరగం
బులఁ జరణంబులం జమరి, ముక్కున వాతను నెత్తు రొల్కగాఁ
దలరఁగ సారథిం జఱచెఁ దా నపహస్తమునన్, వసుంధరా
తలమునఁ ద్రెళ్ళె సారథియుఁ దత్క్షణమాత్రన ముక్తజీవుఁ డై. 177

ప్రతిపదార్థం: అలఘు, బలుండు= తక్కువ కాని బలం కలవాడు; భీముఁడును; అంతన= అప్పుడే; మేల్కని; ఆ+విష+ ఉరగంబులన్= ఆ విషపుపాములను; చరణంబులన్= కాళ్ళతో; చమరి= రాచి; ముక్కున; నోట; నెత్తురు; ఒల్కగాన్= కారేటట్లు; తలరఁగన్= చలించునట్లుగా; తాన్= తాను - అనగా భీముడు; అపహస్తమునన్= పెడచేత్తో; సారథిన్; చఱచెన్= కొట్టాడు; సారథియున్= సారథికూడా; తత్+క్షణ, మాత్రన= ఆ క్షణంలోనే; ముక్త జీవుఁడు+ఐ= విడువబడిన ప్రాణాలు కలవాడై; వసుంధరాతలమునన్= నేలమీద; త్రెళ్ళెన్= చచ్చిపడ్డాడు.

తాత్పర్యం: మహాబలవంతు డైన భీముడు; అప్పుడే మేల్కొని ఆ పాములను కాళ్ళతో రాచి, చంపి, ముక్కున నోట నెత్తురు కారేటట్లు సారథిని పెడచేత్తో కొట్టాడు. సారథి ఆ క్షణంలోనే చచ్చి నేలమీద పడ్డాడు.

క. మఱియును నొకనాఁ డెవ్వరు । నెఱుఁగక యుండంగఁ గౌరవేంద్రుఁడు ధర్మం
బెఱుఁగక విష మన్నముతో । గుఱుకొని పెట్టించె గాడ్పుకొడుకున కలుకన్. 178

ప్రతిపదార్థం: మఱియునున్= ఇంకనూ; ఒకనాఁడు; ఎవ్వరున్= ఎవరుకూడా; ఎఱుఁగక, ఉండంగన్= తెలియక ఉండేటట్లు; కౌరవ+ఇంద్రుఁడు= కౌరవరాజు - దుర్యోధనుడు; ధర్మంబు= ధర్మాన్ని; ఎఱుఁగక= ఆలోచించక; గాడ్పు, కొడుకునకున్= వాయుదేవుని కుమారునికి - భీమునికి; అలుకన్= కోపంతో; విషము; అన్నముతో; గుఱుకొని= పూని; పెట్టించెన్.

తాత్పర్యం: ఇంకోరోజు ఎవ్వరికీ తెలియకుండా దుర్యోధనుడు, ధర్మాన్నిగూర్చి ఆలోచించక, కోపంతో విషాన్ని అన్నంలో కలిపి భీమునికి పెట్టించాడు.

క. సముఁ డై యుయుత్సుఁ డయ్య । న్నము దుష్టం బగుటఁ జెప్పినను గుడిచె విషా
న్నము నాఁకటిపెలుచను; నది । యమృతాన్నం బయ్యె జీర్ణ మై మారుతికిన్. 179

ప్రతిపదార్థం: యుయుత్సుఁడు= ధృతరాష్ట్రునికి వైశ్యవనితయందు పుట్టినవాడు; వయసులో దుర్యోధనుని తరువాతివాడు; సముఁడు+ఐ= సమబుద్ధి కలవాడై; ఆ+అన్నము; దుష్టంబు= చెడ్డది; అగుటన్= కావడం; చెప్పినను= చెప్పినప్పటికి; ఆఁకటి, పెలుచనున్= ఆకలియొక్క అతిశయంతో; విష+అన్నమున్= విషభోజనాన్ని; కుడిచెన్= తిన్నాడు; అది= ఆ విషాన్నం; మారుతికిన్= వాయుపుత్రుడైన భీమునికి; జీర్ణము+ఐ= అరిగినదై; అమృత+అన్నంబు= అమృతభోజనము; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: యుయుత్సుడు సమబుద్ధి కలవాడై ఆ అన్నం చెడ్డ దని చెప్పినా, భీముడు అధిక మైన ఆకలివలన దాన్ని తిన్నాడు. అది అతనికి జీర్ణ మై అమృతంవంటిది అయింది.

వ. ఇట్లు దుర్యోధనుండు భీమునకుఁ దనచేసిన యెగ్గు లెల్లను గృతఘ్నునకుం జేసిన లగ్గులునుంబోలె నిష్ఫలంబు లైన సిగ్గువడి, వెండియుఁ బాండవుల కెల్ల నపాయంబు సేయ నుపాయంబుఁ జింతించుచుండె; నంత భీష్మ నియోగంబున. 180

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దుర్యోధనుండు; భీమునకున్; తన, చేసిన, ఎగ్గులు+ఎల్లను= తాను చేసిన అపకారాలన్నీ; కృతఘ్నునకున్, చేసిన= మేలు మర్చిపోయేవాడికి చేసిన; లగ్గులునున్+పోలె= ఉపకారాలవలె; నిష్ఫలంబులు+ఐన= వ్యర్థం కాగా; సిగ్గు, పడి; వెండియున్= మరల, పాండవులకు+ఎల్లన్= పాండవులందరికి; అపాయంబు= కీడు; చేయన్= చేయుటకై; ఉపాయంబున; చింతించుచు+ఉండెన్= ఆలోచిస్తూ ఉండినాడు; అంతన్= అప్పుడు, భీష్మ, నియోగంబునన్= భీష్ముని ఆజ్ఞతో.

తాత్పర్యం: ఈ విధంగా దుర్యోధనుడు భీమునికి చేసిన అపకారా లన్నీ కృతఘ్నునికి చేసిన ఉపకారాలవలె వ్యర్థం కాగా, సిగ్గుపడి, మళ్ళీ పాండవు లందరికి కీడు చేయా లని ఉపాయం ఆలోచిస్తూ ఉన్నాడు. అప్పుడు భీష్ముని ఆజ్ఞవలన.

విశేషం: ఒక్క భీముడిని చంపితే పాండవులు నిర్వీర్యు లౌతా రని దుర్యోధనుడు భావించి విఫలు డైనాడు. తర్వాత పాండవు లందరిని కలిపి ఒక్కసారిగా చంపటానికి ఆలోచించాడు.

క. విలువిద్యఁ గఱచుచుండిరి । బలయుతులు కుమారకులు కృపద్రోణాచా
ర్యులతోడఁ గలసి యొక్కట । నలఘుపరాక్రమసమేతు లధికస్పర్ధన్. 181

ప్రతిపదార్థం: బలయుతులు= బలంతో కూడినవాళ్ళు; అలఘు, పరాక్రమ, సమేతులు= గొప్పపరాక్రమంతో కూడినవాళ్ళు; కుమారకులు= పాండవులు కౌరవులు; ఒక్కటన్= ఒకటిగా; కలసి; కృప, ద్రోణ+ఆచార్యులతోడన్= కృపద్రోణాచార్యులవద్ద; అధిక, స్పర్ధన్= అధికమైనపోటీతో; విలువిద్యన్; కఱచుచున్+ఉండిరి= నేర్చుకొంటూ ఉన్నారు.

తాత్పర్యం: బలవంతులు, పరాక్రమవంతులు అయిన కురుపాండవులు, ఒక్కటిగా కలిసి, కృపద్రోణాచార్యులవద్ద, ఒకరిని మించవలె నని మరొకరు పోటీపడుతూ, విలువిద్య నేర్చుకుంటూ ఉన్నారు.

విశేషం: 'స్పర్ధయా వర్ధతే విద్యా' అని పండితోక్తి. విలువిద్యను కురుకుమారులు ఒకరికంటె మరొకరు మించా లని స్పర్ధతో నేర్చుకుంటున్నా రన్నమాట!

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 182

తాత్పర్యం: అని చెప్పగా విని వైశంపాయనునితో జనమేజయుడు ఈ విధంగా అన్నాడు.

తే. కృపుఁడు ద్రోణుండు నన౯గ సత్కీర్తులైన । వారిజన్మప్రకారంబు, వారు వచ్చి
కౌరవులకెల్ల గురు లైన కారణంబు । విప్రముఖ్య! నా కెఱుఁగంగ విస్తరింపు. 183

ప్రతిపదార్థం: కృపుఁడు; ద్రోణుండున్; అనఁగన్= అనగా; సత్+కీర్తులు+ఐన= మంచికీర్తి కలవా ళ్ళయిన; వారి, జన్మ, ప్రకారంబు= వాళ్ళ పుట్టుకయొక్క విధం; వారు, వచ్చి; కౌరవులకు+ఎల్లన్= కురుకుమారు లందరికీ; గురులు+ఐన=

ఆచార్యులైన; కారణంబున్= విధానాన్ని; విప్ర, ముఖ్య= బ్రాహ్మణోత్తమా! వైశంపాయనమహర్షీ!; నాకున్; ఎఱుఁగంగ= తెలిసేటట్లు; విస్తరింపు= వివరంగా చెప్పుము.

తాత్పర్యం: ఓ వైశంపాయనమహర్షీ! కృపుడు, ద్రోణుడు పుట్టినవిధాన్నీ, వాళ్ళు వచ్చి కురుకుమారు లందరికీ గురువు లైనవిధాన్నీ నాకు తెలిసేటట్లుగా వివరంగా చెప్పుము.

వ. అని యడిగిన వైశంపాయనుం డి ట్లనియె. 184

తాత్పర్యం: అని అడుగగా వైశంపాయనుడు ఇట్లా చెప్పాడు.

కృపాచార్యుల జన్మవృత్తాంతము (సం. 1-120-2)

సీ. విన వయ్య! గౌతముం డనఁ బ్రసిద్ధుం డైన । మునికి శరద్వంతుఁ డను మహాత్ముఁ
దురుతరతేజుఁ డై శరసమూహంబుతో । నుదయించి, వేదముల్ చదువ నొల్ల
కతిఘోరతపమున నుతభూసురోత్తముల్ । వేదముల్ చదువున ట్లాదరమున
సర్వాస్త్రవిదుఁడు ధనుర్వేద మొప్పఁగఁ బడసి, మహానిష్ఠఁ గడఁగి తపము

ఆ. సేయుచున్న దివిజనాయకుఁ డతిభీతి । నెఱిఁగి, వానితపముఁ జెఱుపఁ బనిచె
జలజనయనఁ దరుణి జలపద యనియెడు । దాని; నదియు వచ్చె వానికడకు. 185

ప్రతిపదార్థం: వినవయ్య= అయ్యా! వినుము; గౌతముండు; అనన్; ప్రసిద్ధుండు+ఐన; మునికి; శరద్వంతుడు+అను; మహాత్ముఁడు; ఉరుతర, తేజుఁడు+ఐ= ఎంతో (మిక్కిలి) తేజస్సు కలిగినవాడై; శర, సమూహంబులతోన్= బాణాల సమూహంతో; ఉదయించి= పుట్టి; వేదముల్; చదువన్= పఠించటానికి; ఒల్లక= ఇష్టపడక; అతి, ఘోర, తపమునన్= ఎంతో భయంకర మయిన తపస్సుచేత; నుత, భూసుర+ఉత్తముల్= పొగడబడిన బ్రాహ్మణశ్రేష్ఠులు; వేదముల్; చదువునట్లు; ఆదరమునన్= ప్రీతితో; సర్వ+అస్త్ర, విదుఁడు= అన్ని అస్త్రాలూ తెలిసినవాడు; ధనుర్వేదమున్= ధనుర్వేదాన్ని; ఒప్పఁగన్= తగునట్లు; పడసి= పొంది; మహా, నిష్ఠన్= గొప్ప నియమంతో; కడఁగి= పూని; తపము; చేయుచున్+ఉన్నన్= చేస్తూ ఉండగా; దివిజ, నాయకుఁడు= దేవేంద్రుడు; ఎఱిఁగి= తెలిసికొని; అతిభీతిన్= మిక్కిలి భయంతో; వాని= అతని; తపమున్= తపస్సును; చెఱుపన్= భంగపరచటానికై; జలజనయనన్= కమలాలవంటి కన్నులు కలదానిని; తరుణిన్= యౌవనంలో ఉన్నదానిని; జలపద, అనియెడు దానిన్= జలపద అను పేరుగల దానిని; పనిచెన్= పంపినాడు; అదియున్= ఆ యౌవనవతియు; వాని; కడకున్; వచ్చెన్.

తాత్పర్యం: గౌతము డనే పేరుగల (గౌతము డనే పేరుతో ప్రసిద్ధుడైన) మహామునికి, శరద్వంతు డనే మహాత్ముడు గొప్పతేజస్సుతో, బాణసమూహంతో పుట్టి, వేదాలు చదవటానికి ఇష్టపడక, అతిభయంకర మయిన తపస్సు చేసి, బ్రాహ్మణోత్తములు వేదాలు చదివేవిధంగా తాను ధనుర్వేదాన్ని సాధించి, మహానిష్ఠతో తపస్సు చేస్తుండగా దేవేంద్రుడు అది తెలిసికొని భయపడి, అతనితపస్సును భగ్నం చెయ్యా లని కమలాలవంటి కన్నులు గల 'జలపద' అనే యౌవనవతిని పంపించాడు. ఆమె అతనిదగ్గరికి వచ్చింది.

విశేషం: 'జలపద'కు జానపది, జాలవతి, జలవతి అనే పాఠాంతరా లున్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అమ్ముదితఁ జూచి కాముశ । రమ్ములచే విద్ధుఁ డై శరద్వంతుఁడు చి
త్త మ్మలర మదనరాగర । సమ్మునఁ ద న్నెఱుఁగకుండెఁ జంచలతనుఁ డై. 186

ప్రతిపదార్థం: ఆ+ముదితన్= ఆ కాంతను; చూచి; శరద్వంతుఁడు; కాము, శరమ్ములచే= మన్మథునియొక్క బాణాలచేత; విద్ధుఁడు+ఐ= కొట్టబడినవాడై; చిత్తమ్ము= మనస్సు; అలరన్= వికసించగా; మదన, రాగ, రసమ్మునన్= మన్మథరాగం అనే ఆనందంలో; చంచల, తనుఁడు+ఐ= చలిస్తున్న శరీరం కలిగినవాడై; తన్నున్+ఎఱుఁగక+ఉండెన్= తనను తాను తెలియక ఉన్నాడు.

తాత్పర్యం: ఆ కాంతను చూచి శరద్వంతుడు మన్మథబాణంచేత పీడింపబడి, మనసు చెదరి మన్మథరాగంలో మైమరచి ఉన్నాడు.

క. ఆ తరుణికటాక్షేక్షణ । పాతము గౌతమున కపుడు పటుబాణధనుః
పాతముతోడన రేతః । పాతము గావించె రాగపరవశుఁ డగుటన్. 187

ప్రతిపదార్థం: ఆ, తరుణి, కటాక్ష+ఈక్షణ, పాతము= ఆ కాంతయొక్క కడగంటిచూపు పడటంతోనే; అపుడు; రాగ, పరవశుఁడు+అగుటన్= మన్మథరాగానికి స్వాధీనం అయినవాడు అవటంచేత; గౌతమునకున్= గౌతముని కుమారుడైన శరద్వంతునికి; పటు, బాణ, ధనుః, పాతముతోడన= గట్టివైన బాణాలు గల ధనుస్సు పడటంతోనే; రేతస్ పాతము= వీర్యం పడటం; కావించెన్= చేసింది.

తాత్పర్యం: ఆ కాంత కడగంటిచూపు శరద్వంతునిమీద పడగానే, అతడు మన్మథరాగపరవశు డై ఉండటం చేత, అతనిచేతిధనుర్బాణాలతోపాటు వీర్యంకూడా జారిపడింది.

విశేషం: అలం: సహోక్తి.

వ. దాని నెఱింగి శరద్వంతుం డయ్యాశ్రమంబు విడిచి చని యొండుచోటం దపంబు సేయుచుండె; నవ్వీర్యం బొక్క శరస్తంబంబున ద్వివిధం బయి పడిన, నందొక కొడుకునుం గూఁతురుం బుట్టి; రంత శంతనుండు మృగయా వినోదార్థం బరిగిన వానిసేనాచరుం డా శరస్తంబంబున నున్న కొడుకుం గూఁతుఁ దత్సమీపంబున నున్న శరచాప కృష్ణాజినంబులుం జూచి, యివి యెయ్యేనియు నొక్కధనుర్వేదవిదుం డయిన బ్రాహ్మణునపత్యం బగు నని శంతనునకుం జూపిన, శంతనుండును వారలఁ జేకొని కృపాయత్తచిత్తుం డయి పెనుచుటం జేసి యయ్యిరువురుఁ గృపుఁడును గృపియు నన బెరుఁగుచున్నంత. 188

ప్రతిపదార్థం: దానిన్= ఆ సంఘటనను; ఎఱింగి= తెలిసికొని; శరద్వంతుండు; ఆ+ఆశ్రమంబు; విడిచి; చని= వెళ్ళి; ఒండు, చోటన్= మరొకచోట; తపంబు= తపస్సు; చేయుచున్+ఉండెన్= చేస్తూ ఉండినాడు; ఆ+వీర్యంబు= ఆ రేతస్సు; ఒక్క; శర, స్తంబంబునన్= రెల్లుగంటలో; ద్వివిధంబు+అయి= రెండుభాగాలు కలిగినదై; పడినన్= పడగా; అందున్= అందులోనుండి; ఒక్క+కొడుకునున్+కూతురున్ = ఒక్కకుమారుడు, ఒకకుమార్తె; పుట్టిరి= జన్మించారు; అంతన్= తర్వాత; శంతనుండు= శంతనమహారాజు; మృగయా, వినోద+అర్థంబు= వేటకోసం; అరిగినన్= వెళ్ళగా; వాని, సేనా చరుండు= అతనియొక్క సేనలో తిరిగేవాడు; ఆ శర, స్తంబంబునన్= ఆ రెల్లు గంటలో; ఉన్న= ఉండే; కొడుకున్+కూతున్; తద్+సమీపంబునన్, ఉన్న=

దానికి దగ్గరగా ఉన్న; శర, చాప, కృష్ణ+అజినంబులున్= బాణాలు, ధనుస్సు, జింకచర్మం; చూచి; ఇవి= ఈ కనిపించేవి అన్నీ; ఏ+ఏవియున్= ఎవరేని; ఒక్క= ధనుర్వేద, విదుండు+అయిన= ఒక్కవిలువిద్యలో పండితుడైన; బ్రాహ్మణు, అపత్యంబు= బ్రాహ్మణునియొక్క సంతానం; అగును= అయిఉండును; అని= ఆ విధంగా; శంతనునకున్= శంతనుమహారాజుకు; చూపినన్= చూపగా; శంతనుండును= శంతనమహారాజును; వారలన్= ఆ ఇద్దరినీ; చేకొని= తీసికొని; కృపా+ఆయత్త, చిత్తుండు+అయి= దయతో కూడిన మనస్సు కలిగినవాడై; పెనుచుటన్+చేసి= పెంచటంచేత; ఆ+ఇరువురున్; కృపుఁడును; కృపియు; అనన్= అనే పేర్లతో; పెరుగుచున్+ఉన్నంతన్= పెరుగుతూ ఉండగా.

తాత్పర్యం: దానిని తెలిసికొని శరద్వంతుడు ఆ ఆశ్రమాన్ని విడిచివెళ్ళి, వేరొకచోట తపస్సు చేసికొంటూ ఉన్నాడు. ఆయనవీర్యం ఒకరెల్లుగంటలో రెండు భాగాలుగా పడింది. దానినుండి ఒకకొడుకు, ఒకకూతురు పుట్టారు. తర్వాత ఒకరోజు శంతనుమహారాజు వేటకు రాగా, అతని సైనికులలో ఒకడు ఆ రెల్లుగంటలో ఉన్నపిల్లలనూ, అక్కడే పడి ఉన్న ధనుర్బాణాలనూ, జింకచర్మాన్నీ చూచి, వీ ళ్ళెవరో ఒక ధనుర్వేదపండితు డైన బ్రాహ్మణునిసంతానం అని తలచి, శంతనునికి చూపించగా, ఆయన వాళ్ళను తీసికొని కృపతో పెంచటంచేత వా ళ్ళిద్దరూ కృపుడు, కృపి అనే పేర్లతో పెరుగుతూ ఉండగా.

క. చనుదెంచి శరద్వంతుం। డనవద్యుఁడు దనయపత్య మని వారిని శం
తనున కెఱిఁగించి కృపు న। త్యనుపము నుపనీతుఁ జేసె నధికప్రీతిన్. 189

ప్రతిపదార్థం: అనవద్యుఁడు= దోషంలేనివాడు; శరద్వంతుండు; చనుదెంచి= వచ్చి; తన, అపత్యము+అని= తనసంతానం అని; వారిని= ఆ ఇద్దరిని; శంతనునకున్; ఎఱిఁగించి= తెలియజేసి; అతి+అనుపమున్= ఏమాత్రం సాటిలేనివాడిని; కృపున్= కృపుని; అధిక, ప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; ఉపనీతున్= ఉపనయనసంస్కారం కలవాడినిగా; చేసెన్.

తాత్పర్యం: పవిత్రు డైన శరద్వంతుడు వచ్చి, వాళ్ళు తనసంతాన మని శంతనునికి తెలిపి, అద్వితీయు డైన కృపునికి అమిత మైన ప్రేమతో ఉపనయనసంస్కారం చేశాడు.

శా. వేదంబుల్ చదివించె భూసురులతో విఖ్యాతిగా, నాత్మసం
వేదిం జేసెఁ, జతుర్విధం బగు ధనుర్వేదంబు నానాస్త్రవి
ద్యాదాక్షిణ్యముతోడఁ దాన కఱపెం, దద్విత్తముల్ సూచి సం
వాదుల్గాఁ దననందనుం గృపు శరద్వంతుండు దాంతాత్ముఁ డై. 190

ప్రతిపదార్థం: దాంత+ఆత్ముఁడు+ఐ= నిగ్రహించబడిన మనస్సు కలిగినవాడై; శరద్వంతుండు; తన; నందనున్= తన యొక్క కుమారుడిని; కృపున్= కృపుని; విఖ్యాతిగాన్= ప్రసిద్ధిగా; వేదంబుల్; భూసురులతోన్= బ్రాహ్మణులతో; చదివించెన్= చదివింపజేసినాడు; ఆత్మ, సంవేదిన్= ఆత్మ నెరిగినవానిగా; చేసెన్; చతుర్విధంబు+అగు= నాలుగువిధాలు కలిగినదైన; (రథ, గజ, తురగ, పదాతి సంబంధాలు కలిగినది); ధనుర్వేదంబు; నానా+అస్త్ర, విద్యా, దాక్షిణ్యము, తోడన్= అనేకవిధాలైన అస్త్రవిద్యలలోని నేర్పుతో; తద్+విత్తముల్= ఆ ధనుర్వేదాన్ని తెలిసినగొప్పవారు - అంటే ధనుర్వేదపండితులు; చూచి; సంవాదుల్= ఏకీభవించేవారు; కాన్= అయ్యేటట్లు; తాను+అ= తానే; కఱపెన్= నేర్పించాడు.

తాత్పర్యం: శరద్వంతుడు బ్రాహ్మణులవద్ద తనకుమారుడికి వేదాలు చెప్పించి, ఆత్మజ్ఞానం కలవాడినిగా చేశాడు. రథ, గజ, తురగ, పదాతిబలాలతో సంబంధం ఉన్న ధనుర్వేదాన్ని, నానావిధాలైన అస్త్రప్రయోగ నైపుణ్యంతో, ధనుర్వేదపండితులు చూచి మెచ్చుకొనేవిధంగా తానే నేర్పించాడు.

వ. అట్టి కృపాచార్యు రావించి భీష్ముం డతిభక్తిం బూజించి వానితోడఁ దన మనుమల నందఱ విలువిద్య గఱవం బంచిన. 191

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; కృపాచార్యు= కృపాచార్యుని; రావించి=రప్పించి; భీష్ముండు; అతి భక్తిన్= మిక్కిలిభక్తితో; పూజించి; వానితోడన్= అతనితో; తన, మనుమలన్; అందఱన్; విలువిద్య; కఱవన్= నేర్చుకొనటానికి; పంచినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: అటువంటి కృపాచార్యుడిని రప్పించి భీష్ముడు, మిక్కిలి భక్తితో గౌరవించి, తన మనుమల నందరినీ విలువిద్య నేర్చకొనటానికి ఆజ్ఞాపించగా.

క. సవిశేషముగ ధనుర్వే । దవిశారదు లైరి కడు జితశ్రములై పాం
డవ ధృతరాష్ట్రాత్మజ యా । దవు లాదిగ రాజసుతులు తత్కృపుశిక్షన్. 192

ప్రతిపదార్థం: పాండవ, ధృతరాష్ట్ర+ఆత్మజ, యాదవులు+ఆదిగ= పాండవులు, ధృతరాష్ట్రునికొడుకులు, యాదవులు మొదలైన; రాజ, సుతులు= రాజకుమారులు; తద్+కృపు, శిక్షన్= ఆ కృపుని శిక్షణచేత; సవిశేషముగన్= అతిశయంతో కూడినట్లు; కడున్= మిక్కిలి; జిత, శ్రములు+ఐ= జయించబడిన శ్రమ కలిగినవారై; ధనుర్వేద, విశారదులు+ఐరి= విలువిద్యలో పండితు లయ్యారు.

తాత్పర్యం: పాండవులు, కౌరవులు, యాదవులు మొదలైన రాకుమారులు కృపునిశిక్షణలో శ్రమను జయించి, విలువిద్యలో గొప్పపండితు లయ్యారు.

ద్రోణాచార్యుల జన్మవృత్తాంతము (సం. 1-121-3)

వ. 'మఱియు వారల కాచార్యుం డైన ద్రోణుజన్మంబును వానిచరిత్రంబును జెప్పెద విను' మని జనమేజయునకు వైశంపాయనుం డి ట్లనియె. 193

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; వారలకున్= ఆ కౌరవపాండవులకు; ఆచార్యుండు+ఐన= గురు వైన; ద్రోణు= ద్రోణుని యొక్క; జన్మంబును=పుట్టుకను; వాని, చరిత్రంబును= అతనిచరిత్రను; చెప్పెదన్; వినుము; అని= ఆ ప్రకారంగా; జనమేజయునకున్= జనమేజయమహారాజుకు; వైశంపాయనుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అంతేకాక, కురుపాండవులకు ఆచార్యు డైన ద్రోణునిపుట్టుకనూ, చరిత్రనూ తెలుపుతాను' విను మని జనమేజయునితో వైశంపాయనుడు ఈ విధంగా అన్నాడు.

క. సద్వినుతచరిత్రుండు భ । రద్వాజుం డను మునీశ్వరప్రవరుఁడు గం
గాద్వారమునఁ దపంబు జ । గద్వంద్యుఁడు సేయుచుండె గతకల్మషుఁ డై. 194

ప్రతిపదార్థం: సత్+వినుత, చరిత్రుండు= సత్పురుషులచేత పొగడబడిన నడవడి కలవాడు; జగత్+వంద్యుఁడు= లోకాలచేత నమస్కరింపదగినవాడు; భరద్వాజుండు, అను; ముని+ఈశ్వర, ప్రవరుఁడు= ఋషి శ్రేష్ఠులలో ఉత్తముడు; గత, కల్మషుఁడు+ఐ= పోయిన పాపం కలిగినవాడై; గంగా, ద్వారమునన్= గంగానదిద్వారముకడ; తపంబున్= తపస్సును; చేయుచున్ ఉండెన్= చేస్తూ ఉండినాడు.

తాత్పర్యం: సత్పురుషులచేత ప్రశంసించబడిన నడవడి కలిగినవాడు, లోకంచేత నమస్కరింపదగినవాడు, పవిత్రుడు అయిన భరద్వాజమహాముని గంగాద్వారంవద్ద తపస్సు చేస్తూ ఉన్నాడు.

సీ. అమ్ముని యొక్కనాఁ డభిషేచనార్థంబు । గంగకుఁ జని, మున్న కరము లీల
నందు జలక్రీడ లాడుచున్నున్న య । ప్సరస ఘృతాచి యన్సదమలాంగి
పటుపవనాపేత పరిధాన యైన య । య్యవసరంబునఁ జూచి, యమ్మృగాక్షిఁ
గామించి యున్నఁ, దత్కామరాగంబున । యతిరేకమునఁ జేసి యాక్షణంబ

తే. తనకు శుక్లపాతం బైన, దానిఁ దెచ్చి । ద్రోణమున సంగ్రహించిన, ద్రోణుఁ డనఁగఁ
బుట్టె శుక్రునంశంబునఁ బుణ్యమూర్తి । ధర్మతత్త్వజ్ఞుఁ డగు భరద్వాజమునికి. 195

ప్రతిపదార్థం: ఆ+ముని= ఆ భరద్వాజుడు; ఒక్కనాఁడు; అభిషేచన+అర్థంబు= స్నానంకొరకు; గంగకున్+చని; మున్ను+అ= ముందుగానే; కరము= మిక్కిలి, లీలన్= విలాసంతో; అందున్= ఆ గంగలో; జలక్రీడలు+ఆడుచున్= జలక్రీడలు ఆడుతూ ఉండే; అప్సరసన్; ఘృతాచి, అన్= ఘృతాచి, అనేపేరుకల; సత్+అమల+అంగిన్= మిక్కిలి నిర్మలం అయిన దేహంగలది; పటు, పవన+అపేత, పరిధాన+ఐన= పెద్దగాలిచేత తొలగించబడిన చీర కలది కాగా; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; చూచి; ఆ+మృగ+అక్షిన్= ఆ జింకకన్నులవంటి కన్నులు కల స్త్రీని; కామించి+ఉన్నన్= కామించిఉండగా; తద్+కామ, రాగంబున, అతిరేకమునన్+చేసి= ఆ మన్మథరాగంయొక్క అతిశయంచేత; ఆ, క్షణంబు+అ= ఆ నిమిషంలోనే; తనకున్; శుక్ల, పాతంబు+ఐనన్= వీర్యం జారిపడగా; దానిన్= ఆ వీర్యాన్ని; తెచ్చి; ద్రోణమునన్= కలశంలో; సంగ్రహించినన్= పట్టిపెట్టగా; శుక్రు, అంశంబునన్= శుక్రునియొక్క అంశచేత; పుణ్య, మూర్తి= పుణ్యాత్ముడు; ధర్మ, తత్త్వజ్ఞుఁడు= ధర్మంయొక్క తత్త్వాన్ని తెలిసినవాడు; అగు= అయినట్టి; భరద్వాజ, మునికిన్; ద్రోణుఁడు+అనఁగన్+పుట్టెన్= ద్రోణుడు అనేవాడు పుట్టాడు.

తాత్పర్యం: ఆ భారద్వాజముని ఒకనాడు స్నానానికై గంగానదికి వెళ్ళాడు. ఎదురుగా మహావిలాసంతో జలక్రీడలాడుతూ, పెనుగాలిచేత చీరతొలగి నిర్మల మైనదేహంతో ఉన్న ఘృతాచి అనే అప్సరసను చూచి కామించాడు. ఆ మన్మథరాగాతిశయంచేత ఆ క్షణంలోనే తనకు వీర్యస్ఖలనం కాగా, ఆ వీర్యాన్ని తెచ్చి, కలశంలో పెట్టాడు. దానినుండే శుక్రునిఅంశతో పుణ్యాత్ముడు, ధర్మతత్త్వం తెలిసినవాడు అయిన భరద్వాజమునికి ద్రోణుడు పుట్టాడు.

విశేషం: 'తెచ్చి ద్రోణమున సంగ్రహించిన' అనే దానికి 'చేతిద్రోణమున సంగ్రహించిన' అనే పాఠాంతరం ఉన్నది. ఆ పరిస్థితులలో వీర్యాన్ని తెచ్చి ద్రోణంలో సంగ్రహించా డనటంకంటె, స్నానార్థమై వెళ్ళిన ద్రోణుడు చేతిద్రోణంలో సంగ్రహించా డనటం ఎక్కువ సమంజసం అనిపిస్తుంది. 'శుక్రునంశంబున' అనే దానికి గురునియంశంబున అనే పాఠాంతరంకూడా ఉన్నది.

వ. మఱియు ననంతరంబ భరద్వాజసఖుండైన పృషతుం డను పాంచాలపతి మహాఘోరతపంబు సేయుచు నొక్కనాఁడు దనసమీపంబున వాసంతికాపచయవినోదంబున నున్న యప్సరస మేనక యను దానిం జూచి, మదనరాగంబున రేతస్స్కందం బయిన దానిం దన పాదంబునఁ బ్రచ్ఛాదించిన, నందు ద్రుపదుం డనుకొడుకు మరుదంశంబునఁ బుట్టిన, వాని భరద్వాజాశ్రమంబునఁ బెట్టి చని పృషతుండు పాంచాలదేశంబున రాజ్యంబు సేయుచుండె, ద్రుపదుండును ద్రోణునితోడ నొక్కట వేదాధ్యయనంబు సేసి విలువిద్యయుం గఱచి యా పృషతు పరోక్షంబునం బాంచాలదేశంబున కభిషిక్తుం డయ్యె; ద్రోణుండును నగ్నివేశ్యుం డను మహామునివలన ధనుర్విద్యా పారగుం డై తత్ప్రసాదంబున నాగ్నేయాస్త్రం బాదిగా ననేకదివ్యబాణంబులు వడసి, భరద్వాజు నియోగంబునఁ బుత్రలాభార్థంబు కృపుని చెలియలిఁ గృపి యనుదాని వివాహం బయి, దానియం దశ్వత్థామ యను కొడుకుం బడసి, యొక్కనాఁడు. 196

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; అనంతరంబు+అ= ఆ తరువాత; భరద్వాజ, సఖుండు+ఐన= భరద్వాజునియొక్క స్నేహితు డైన; పృషతుండు+అను; పాంచాల, పతి= పాంచాలదేశపురాజు; మహా, ఘోర, తపంబు= గొప్ప తీవ్రతపస్సు; చేయుచున్= చేస్తూ; ఒక్కనాఁడు; తన, సమీపంబునన్= తనకు దగ్గర; వాసంతికా, కుసుమ+అపచయ, వినోదంబునన్= వసంతోత్సవ పుష్పాలను కోసే వేడుకలో; ఉన్న; అప్సరస, మేనక, అను, దానిన్= అప్సరసయైన మేనక అను పేరుగల దానిని; చూచి; మదన, రాగంబునన్= మన్మథరాగంచేత; రేతస్+స్కందంబు+అయినన్= వీర్యం జారిపడగా; 'రేతస్థలనంబు' అని పాఠాంతరం ఉన్నది; దానిన్= ఆ రేతస్సును; తన, పాదంబునన్= తనకాలితో; ప్రచ్ఛాదించినన్= కప్పివేయగా; అందున్, ద్రుపదుండు= అందుండి ద్రుపదుడు; అను, కొడుకు= పేరుగల కుమారుడు; మరుత్+అంశంబునన్= మరుత్తుయొక్క అంశలో; పుట్టినన్= పుట్టగా; వానిన్= అతనిని; భరద్వాజ+ఆశ్రమంబునన్= భరద్వాజుని ఆశ్రమంలో; పెట్టి= ఉంచి; చని= వెళ్ళి, పృషతుండు= పృషతుడు; పాంచాల, దేశంబునన్= పాంచాలదేశంలో; రాజ్యంబు, చేయుచున్= రాజ్యం చేస్తూ; ఉండెన్; ద్రుపదుండును; ద్రోణునితోడన్= ద్రోణునితోటి; ఒక్కట= ఒకటిగా; వేద+అధ్యయనంబు= వేదాధ్యయనం (వేదాలను చదవడం); చేసి; విలువిద్యయున్= విలువిద్యనుకూడా; కఱచి= నేర్చి; ఆ, పృషతు, పరోక్షంబునన్= ఆ పృషతుని తర్వాత; పాంచాల, దేశంబునకున్; అభిషిక్తుండు+అయ్యెన్= అభిషేకింపబడ్డ వా డయినాడు; ద్రోణుండును; అగ్నివేశ్యుండు+అను; మహా, ముని వలనన్; ధనుర్విద్యా, పారగుండు+ఐ= విలువిద్యయొక్క అంతాన్ని (చివరిని) ముట్టినవాడై; తద్+ప్రసాదంబునన్= అతడి (అగ్నివేశ్యుని) యొక్క దయచేత; ఆగ్నేయ+అస్త్రంబు; ఆదిగాన్= మొదలుగా; అనేక, దివ్య, బాణంబులు= అనేకమయిన దేవతాసంబంధాలైన బాణాలు; పడసి= పొంది; భరద్వాజ, నియోగంబునన్= భరద్వాజునియొక్క ఆజ్ఞచేత; పుత్ర, లాభ+అర్థంబు= పుత్రులను పొందటంకొరకు; కృపుని, చెలియలిన్= కృపుని చెల్లెలిని; కృపి, అనుదానిన్= కృపి అను పేరుగల ఆమెను; వివాహంబు+అయి= పెండ్లి అయి; దాని అందున్= ఆమెయందు; అశ్వత్థామ, అను; కొడుకున్; పడసి= పొంది; ఒక్కనాఁడు.

తాత్పర్యం: భరద్వాజునిస్నేహితు డైన పృషతు డనే పాంచాలదేశపు రాజు మహాభయంకర మయిన తపస్సు చేస్తూ, ఒక రోజు తనసమీపంలో వసంతకుసుమాలను కోస్తున్న మేనక అనే అప్సరసను చూచాడు. మన్మథరాగంచేత వీర్యస్థలనం కాగా, దానిని తనపాదంతో కప్పివేశాడు. అందులోనుండి ద్రుపదు డనే కొడుకు మరుత్తుని అంశతో జన్మించాడు. ఆ బాలుడిని భరద్వాజాశ్రమంలోనే ఉంచి, పృషతుడు వెళ్ళి పాంచాలరాజ్యం పాలిస్తూ ఉన్నాడు. ద్రుపదుడు ద్రోణునితో కలిసి వేదాలు చదివి, విలువిద్యను నేర్చి, పృషతునితర్వాత పాంచాలదేశానికి రా జయ్యాడు. ద్రోణుడు అగ్నివేశ్యుడనే మహామునివద్ద ధనుర్విద్యాపారంగతుడై, అతనిఅనుగ్రహంచేత ఆగ్నేయాస్త్రం మొదలుగా

అనేకదివ్యాస్త్రాలు పొంది, భరద్వాజుని ఆజ్ఞచేత పుత్రులను పొందటానికి కృపునిచెల్లెలైన కృపిని వివాహమాడాడు. ఆమెవలన అశ్వత్థామ అనే కొడుకును కన్నాడు. ఒకనాడు -

క. అనవరతము బ్రాహ్మణులకుఁ । దనియఁగ ధన మిచ్చు జామదగ్న్యుఁడు రాముం
డను జనవాదపరంపర । విని యరిగెను వానికడకు విత్తాపేక్షన్. 197

ప్రతిపదార్థం: అనవతరము= ఎల్లప్పుడూ; బ్రాహ్మణులకున్; తనియఁగ= తృప్తిపొందే విధంగా, జామదగ్న్యుఁడు=జమదగ్ని కుమారుడు; రాముండు= పరశురాముడు; ధనము=ధనాన్ని; ఇచ్చున్= ఇస్తున్నాడు; అను, జన, వాద, పరంపర= అనే జనుల మాటల వరుసను; విని; వాని కడకున్= అతనిదగ్గరకు; విత్త+అపేక్షన్= ధనంమీదికోరికచేత; అరిగెను=వెళ్ళాడు.

తాత్పర్యం: ఎప్పుడూ బ్రాహ్మణులకు తృప్తి కలిగేవిధంగా జమదగ్నికుమారు డైన పరశురాముడు ధన మిస్తున్నా డని అందరూ అనుకుంటుంటే విని, అతనివద్దకు ధనాపేక్షతో వెళ్ళాడు.

క. అరిగి మహేంద్రాచలమునఁ । బరమతపోవృత్తి నున్న భార్గవు లోకో
త్తరు భూరికర్మనిర్మల । చరితుని ద్రోణుండు గాంచి సద్వినయమునన్. 198

ప్రతిపదార్థం: అరిగి=వెళ్ళి; మహేంద్ర+అచలమునన్= మహేంద్రపర్వతంవద్ద; పరమ, తపస్+వృత్తిన్= గొప్పతపస్సు చేసే పనితో; ఉన్న; భూరి, కర్మ, నిర్మల చరితుని= గొప్పపనులచేత పరిశుద్ధం అయిన నడవడి కలవాడిని; భార్గవు= భృగువంశంవా డైన పరశురాముడిని; ద్రోణుండు= ద్రోణుడు; కాంచి=చూచి; సత్+వినయంబునన్= మంచి వినయంతో.

తాత్పర్యం: వెళ్లి, మహేంద్రపర్వతంవద్ద ఘోరతపస్సు చేస్తున్నవాడూ, లోకంలో శ్రేష్ఠుడూ, గొప్పపనులు చేయటం చేత పరిశుద్ధమయిన నడవడి గలవాడూ అయిన పరశురాముడిని చూచి మంచివినయంతో.

వ. 'ఏను భారద్వాజుండ, ద్రోణుం డనువాఁడ; నర్థార్థి నై నీకడకు వచ్చితి' ననినఁ బరశురాముం డి ట్లనియె.199

ప్రతిపదార్థం: ఏను= నేను; భరద్వాజుండ= భరద్వాజుని కుమారుడను; ద్రోణుండు; అనువాఁడన్; అర్థ+అర్థిని+ఐ= ధనాన్ని కోరినవాడినై; నీ, కడకున్= నీ దగ్గరికి; వచ్చితిన్; అనినన్; పరశురాముండు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నేను భరద్వాజునికుమారుడ నైన ద్రోణుడిని. ధనాన్ని ఆశించి నీదగ్గరకు వచ్చాను' అని అనగా పరశురాముడు ఈ విధంగా బదులు పలికాడు.

చ. కలధన మెల్ల ముందఱ జగన్నుత । విప్రుల కిచ్చి, వార్ధిమే
ఖలనిఖిలోర్వి యంతయును గశ్యపుఁ డ న్ముని కిచ్చితిన్, శరం
బులును శరీరశస్త్రములుఁ బొల్పుగ నున్నవి; వీనిలోన నీ
వలసినవస్తువుల్ గొను ధ్రువంబుగ నిచ్చెద నీకు నావుడున్. 200

విశేషం: జగత్+నుత= లోకంచేత పొగడబడేవాడా!; కల, ధనము+ఎల్లన్= ఉన్న ధనా న్నంతటినీ; ముందఱ= ముందుగానే,; విప్రులకున్= బ్రాహ్మణులకు; ఇచ్చి; వార్ధి, మేఖల, నిఖిల+ఉర్వి, అంతయును= సముద్రం ఒడ్డాణంగా కలిగిన సమస్త

భూమండలాన్నీ; కశ్యపుఁడు= కశ్యపుడు; అన్, మునికిన్, ఇచ్చితి; శరంబులును= బాణాలు; శరీర, శస్త్రముల్= శరీరం, ఆయుధాలు; పొల్పుగన్= ఒప్పుగా; ఉన్నవి; వీనిలోనన్= వీటిలో; నీ, వలసిన, వస్తువుల్= నీవు కోరుకొన్న వస్తువులను; కొను= తీసికొమ్ము; నీకున్= నీకు; ధ్రువంబుగన్= తప్పకుండా; ఇచ్చెదన్; నావుడున్= అని పరశురాముడు అనగా.

తాత్పర్యం: 'లోకంచేత పొగడ్త లందుకొన్న ఓ ద్రోణా! నేను ఉన్నధనం అంతా ముందే బ్రాహ్మణులకు ఇచ్చివేశాను. సముద్రం ఒడ్డాణంగా చుట్టిన భూమి నంతటినీ కశ్యపమహర్షికి ఇచ్చివేశాను. ఇక శస్త్రాస్త్రాలు, శరీరం మిగిలి ఉన్నాయి. వీటిలో నీకు కావలసినవాటిని తీసికొమ్ము తప్పక ఇస్తాను' అని పరశురాముడు అనగా.

క. ధనములలో నత్యుత్తమ । ధనములు శస్త్రాస్త్రములు; ముదంబున వీనిం
గొని కృతకృత్యుఁడ నగుదును । జననుత ! నా కొసఁగు మస్త్రశస్త్రచయంబుల్. 201

ప్రతిపదార్థం: జన, నుత= జనులచేత కొనియాడబడేవాడా! ఓ పరశురామా!; ధనములలోన్; అతి+ఉత్తమ+ధనములు= మిక్కిలి శ్రేష్ఠములైన ధనాలు; శస్త్ర+అస్త్రములు; ముదంబునన్= సంతోషంతో; వీనిన్= వీటిని; కొని=తీసికొని; కృతకృత్యుఁడను= నెరవేరిన పనికలవాడిని; అగుదును= అయ్యేదను; నాకున్; అస్త్ర,శస్త్రచయంబుల్= అస్త్ర శస్త్రాల సమూహాలు; ఒసఁగుము= ఇమ్ము.

తాత్పర్యం: జనులచేత ప్రశంసించబడే ఓ పరశురామా! ధనాలలో మిక్కిలి మేలైనధనాలు శస్త్రాస్త్రాలు. కాబట్టి సంతోషంతో వీటిని తీసికొని కృతార్థుడ నవుతాను. శస్త్రాస్త్రసమూహాన్ని నాకు ఇమ్ము.

వ. అని పరశురాముచేత దివ్యాస్త్రంబులు ప్రయోగరహస్యమంత్రంబులతోడం బడసి, ధనుర్విద్యయు నభ్యసించి, ధనార్థియయి తన బాలసఖుండైన ద్రుపదుపాలికిం జని 'యేను ద్రోణుండ, నీ బాలసఖుండ, సహాధ్యాయుండ నన్నెఱుంగుదే' యని ప్రణయపూర్వకంబుగాఁ బలికిన విని యప్పలుకులు విన సహింపక ద్రుపదుం డలిగి యి ట్లనియె. 202

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; పరశురాముచేత; దివ్య+అస్త్రంబులు= దేవతాసంబంధమైన అస్త్రాలు; ప్రయోగ, రహస్య, మంత్రంబులతోడన్= ప్రయోగించటంలోని మర్మాలతో, మంత్రాలతో; పడసి= పొంది; ధనుర్విద్యయున్= విలువిద్యనుకూడా; అభ్యసించి= నేర్చుకొని; ధన+అర్థి+అయి= ధనాన్ని కోరినవాడై; తన, బాల, సఖుండు+ఐన= తనయొక్క చిన్ననాటి స్నేహితుడైన; ద్రుపదు, పాలికిన్= ద్రుపదుని దగ్గరకి; చని= వెళ్లి; ఏను= నేను; ద్రోణుండన్= ద్రోణుడను; నీ, బాల సఖుండన్= నీ చిన్ననాటి మిత్రుణ్ణి; సహ+అధ్యాయుండన్= నీతో కలిసి చదివినవాడిని; నన్నున్= నన్ను; ఎఱుంగుదే= తెలిసి ఉన్నావు కదా, గుర్తుపట్టావుకదా!; అని= ఆ ప్రకారంగా; ప్రణయ, పూర్వకంబుగా= స్నేహభావం ఉట్టిపడగా; పలికినన్= మాట్లాడగా; ఆ+పలుకులు; వినన్ సహింపక= వినటానికి ఇష్టపడక; ద్రుపదుండు; అలిగి= కోపపడి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పరశురామునిచేత దివ్యాస్త్రాలను, వాటిప్రయోగమర్మాలతో, మంత్రాలతోకూడా పొంది, విలువిద్యను అభ్యసించి, ధనాన్ని కోరి తనచిన్ననాటి స్నేహితు డైన ద్రుపదుదగ్గరికి వెళ్లి, 'నేను నీ బాల్యమిత్రుడిని, నీతో కలిసి చదువుకొన్నవాడిని. తెలుసుకదా' అని స్నేహపూర్వకంగా మాట్లాడగా, ద్రుపదు డామాటలను సహించలేక కోపించి ఈ విధంగా అన్నాడు.

ద్రోణుఁడు ద్రుపదునిచే నవమానితుఁ డగుట (సం. 1-122-2)

చ. కొలఁది యెఱుఁగ కిట్టి పలుకుల్ పలుకం దగుఁ గాదు నా కనన్
బలుగుఁదనంబునం బలుకఁ బాడియె నీ సఖి నంచుఁ? బేదవి
ప్రులకును ధారుణీశులకుఁ బోలఁగ సఖ్యము సంభవించునే?
పలుకక వేగ పొ; మ్మకట పాఱుఁడు సంగడికాఁడె యెందునన్ ? 203

ప్రతిపదార్థం: కొలఁది= అంతరం; ఎఱుఁగక= తెలియక; ఇట్టి పలుకుల్= ఇటువంటి మాటలు; పలుకన్= మాటాడుటకు; తగున్, కాదు= తగినది, కాదు; నాకు+అనన్= నాకు అనగా; పలుగు+తనంబునన్= నిందాపూర్వకంగా; నీ, సఖిన్= నీ స్నేహితుడిని; అంచున్= అంటూ; పలుకన్; పాడియె= న్యాయమా!; పేద, విప్రులకును= బీద బ్రాహ్మణులకు; ధారుణి+ఈశులకున్= రాజులకు; పోలఁగన్= సమానమైనట్లు; సఖ్యము= స్నేహం; సంభవించునే= కలుగుతుందా?; పలుకక= మాట్లాడ కుండా; వేగన్= త్వరగా; పొమ్ము= వెళ్లు; అకట= అయ్యో!; పాఱుఁడు= బ్రాహ్మణుడు; ఎందునన్= ఎక్కడైనా; సంగడికాఁ డు+ఎ= స్నేహితుడా?

తాత్పర్యం: మన ఇద్దరి అంతరం తెలియకుండా, 'నాకు ఈ విధంగా మాట్లాడ తగునా, కూడదా' అని అనుకోకుండా, నన్ను నీ స్నేహితుడి నని చెప్పడం న్యాయంగా ఉందా? బీదబ్రాహ్మణులకూ మహారాజులకూ స్నేహం ఎట్లా సాధ్యపడుతుంది? మారుమాట్లాడక పొమ్ము. అయ్యో! అసలు బ్రాహ్మణుడు ఎక్కడైనా చెలికా డౌతాడా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

చ. ధనపతితో దరిద్రునకుఁ, దత్త్వవిదుం డగు వానితోడ మూ
ర్ఖునకుఁ, బ్రశాంతుతోడఁ గడుఁ గ్రూరునకున్, రణశూరుతోడ భీ
రునకు, వరూథితోడ నవరూథికి, సజ్జనుతోడఁ గష్టదు
ర్జనునకు నెవ్విధంబునను సఖ్యము దా నొడఁగూడ నేర్చునే? 204

ప్రతిపదార్థం: ధనపతితోన్= ధనానికి ప్రభువైనవానితో - అంటే సంపదకలవానితో; దరిద్రునకున్; తత్త్వ, విదుండు+ అగువానితోడన్= తత్త్వం తెలిసినవానితో; మూర్ఖునకున్; ప్రశాంతుతోడన్= మిక్కిలి శాంతం కలిగినవానితో; కడున్+క్రూరునకున్= మిక్కిలి క్రూరుడైనవానికి; రణ, శూరుతోడన్= యుద్ధంలో పరాక్రమవంతు డైన వానితో; భీరునకున్= పిరికివానికి; వరూథితోడన్= కవచం కలిగినవానితో; అవరూథికిన్= కవచం లేనివానికి; సజ్జనుతోడన్= సన్మార్గునితో; కష్ట, దుర్జనునకున్= పాపి అయిన దుర్మార్గునికి; సఖ్యము= స్నేహం; ఏ+విధంబునను= ఎట్లు; తాన్= తాను; ఒడగూడన్+నేర్చునే= కలుగుతుందా? కలుగ దని భావం.

తాత్పర్యం: ధనవంతునితో దరిద్రునికి, పండితునితో మూర్ఖునికి, ప్రశాంతునితో క్రూరునికి, వీరునితో పిరికివానికి, కవచరక్షణ కలవానితో రక్షాకవచం లేనివానికి, సజ్జనునితో దుర్మార్గునికి స్నేహం ఏ విధంగా కలుగుతుంది?

విశేషం: ఈ పద్యం నన్నయరుచిరార్థసూక్తులలో ఒకటి. ద్రుపదుడు చిన్ననాటి నెచ్చెలిని గుర్తించికూడా, పేదవాడూ, ధనవంతుడూ అనే భేదభావంతో అతనిని తిరస్కరించాడు. అంతటితో ఆగకుండా తన ప్రవర్తనను ధర్మబద్ధమైనదానిగా

సమర్థించుకొన్నాడు. అందుకై ముందు పద్యంలో మహారాజుకూ పేదబాపనికీ ఎక్కడి సంబంధం అని ఎత్తిపొడిచాడు. ధనాపేక్షతో వచ్చిన ద్రోణుని మనసు అతని పేదరికాన్ని ఎత్తిచూపుతున్నందుకు చివుక్కుమనేటట్లు చేశాడు. అంతటితో ఆగక అసలు బ్రాహ్మణుడు స్నేహంచేయ తగినవాడా? అని అధిక్షేపించాడు. ఇది అతని వర్ణాన్నీ, స్వభావాన్నీ నిందించేవాక్యం. అర్థహీనుడైనా ద్రోణుడు అభిమానహీనుడు కాడు. అందువలన ఆవాక్యం అతడిని రెచ్చగొట్టుంది. పైపెచ్చు ఈపద్యంలో ద్రుపదుడు తన ప్రవర్తనకు లోకధర్మాన్ని సూక్తిగా చెప్పి సమర్థించుకొంటున్నాడు. ఇందులో పేర్కొన్న పోలికలవలన ద్రుపదుడు తనను ధనపతిగా, తత్త్వవేత్తగా, ప్రశాంతునిగా, రణశూరునిగా, సురక్షితునిగా, ఉత్తమునిగా చెప్పుకొని ఆత్మప్రశంస చేసికొన్నాడు. ద్రోణుడిని వరుసగా దరిద్రునిగా, మూర్ఖునిగా, క్రూరునిగా, పిరికిపందగా, అరక్షితునిగా, పరమదుర్మార్గునిగా నిందించి, నిష్కారణమైన పరనిందకు పాల్పడ్డాడు. ముందు పద్యంలోని మాటలే ద్రోణునిమనసును పుండుచేసి ఉంటాయి; పైపెచ్చు ఈ మాటలు పుండుమీద కారం చల్లిన ట్లుంటాయి. సూక్తులను కథార్థపోషకాలుగా వాడేనన్నయకథాకథనశిల్ప మిది.

క. సమశీలశ్రుతయుతులకు । సమధనవంతులకు సమసుచారిత్రులకుం

దమలో సఖ్యమును వివా । హము నగుఁ గా; కగునె రెండు నసమానులకున్. 205

ప్రతిపదార్థం: సమ, శీల, శ్రుత, యుతులకున్= సమానమైన స్వభావంతో, విద్యతో కూడిన వాళ్ళకు, సమ, ధనవంతులకున్= సమానంగా ధనవంతు లైనవాళ్ళకు; సమ, సుచారిత్రులకున్= సమాన మైన మంచి నడవడిక కలిగినవాళ్ళకు; తమలోన్; సఖ్యమును= స్నేహం; వివాహము= పెండ్లి; అగున్, కాక= ఏర్పడుతాయికానీ; రెండున్= మైత్రి, - వివాహము, అను రెండును; అసమానులకున్= సమానులు కానివాళ్ళకు; అగునె= ఔతాయా? (కా వని భావం)

తాత్పర్యం: సమానమైన స్వభావం, విద్య కలవాళ్ళకు, సమానమైన సంపద కలవాళ్ళకు, సమానమైన మంచినడవడి కలవాళ్ళకు స్నేహం, వివాహం ఏర్పడుతాయి. కాని సమానులు కానివాళ్ళకు అవి ఏర్పడతాయా? (ఏర్పడ వని భావం)

విశేషం: కయ్యానికీ వియ్యానికీ సామ్యం ఉండా లనే జనసూక్తి కీపద్యం రమణీయపద్యాకృతి.

వ. 'మఱి యట్లుంగాక రాజులకుఁ గార్యవశంబునం జేసి మి త్రామిత్ర సంబంధములు సంభవించుం గావున మా యట్టి రాజులకు మీయట్టిపేదపాఱువారలతోఁ గార్యకారణం బైన సఖ్యం బెన్నండును గానేర' దని ద్రుపదుం డైశ్వర్యగర్వంబున మెచ్చక పలికిన విని, ద్రోణుం డవమానజనితమన్యుఘూర్ణమానమానసుం డయి యెద్దియుం జేయునది నేరక పుత్త్రకళత్రాగ్నిహోత్రశిష్యగణంబులతో హస్తిపురంబునకు వచ్చె; నంత నప్పురబహిరంగణంబున ధృతరాష్ట్రపాండునందను లందఱుఁ గందుకక్రీడాపరు లయి వేడుకతో నాడుచున్నంత నక్కాంచనకందుకం బొక్కనూతం బడిన. 206

ప్రతిపదార్థం: మఱి= ఇంకా; అట్లున్+కాక= ఆ విధంగా కాకుండా; రాజులకున్; కార్య, వశంబునన్ చేసి= అవసరంచేత; మిత్ర+అమిత్ర, సంబంధములు= స్నేహ, వైర సంబంధాలు; సంభవించున్= కలుగుతాయి, కావునన్; మీయట్టి, పేద, పాఱు వారలతోన్= మీవంటి బీదబ్రాహ్మణులతో; కార్య, కారణంబు+ఐన= ప్రయోజనకర మైన; సఖ్యంబు= మైత్రి; ఎన్నండును= ఎప్పటికినీ; కానేరదు=కలుగబోదు; అని= ఆ ప్రకారంగా; ద్రుపదుండు; ఐశ్వర్య గర్వంబునన్= సంపదవలన కలిగినపొగరుచేత; మెచ్చక= లక్ష్యపెట్టకుండా (నిర్లక్ష్యంగా); పలికినన్; విని; ద్రోణుండు; అవమాన, జనిత, మన్యు, ఘూర్ణమాన, మానసుండు+అయి= అవమానంవలన పుట్టినకోపంచేత తిరుగుడు పడుతున్న మనసు కలిగినవా డై; ఎద్దియున్, చేయునది, నేరక= ఏమిచేయాలో

తెలియక; పుత్ర, కళత్ర+అగ్నిహోత్ర, శిష్య, గణంబులతో= కొడుకుతో, భార్యతో, అగ్నిహోత్రంతో, శిష్యసమూహంతో; హస్తి, పురంబునకున్; వచ్చెన్; అంతన్= అప్పుడు; ఆ+పుర, బహిస్+అంగణంబునన్= ఆ పట్టణం వెలుపల; ధృతరాష్ట్ర, పాండు నందనులు= ధృతరాష్ట్రుని కుమారులు, పాండురాజు కుమారులు (కౌరవ పాండవులు); అందఱున్= అంతా; కందుక, క్రీడాపరులు+అయి= చెండాట ఆడటంలో ఆసక్తి కలిగినవారై; వేడుకతోన్= సంతోషంతో; ఆడుచు+ఉన్నంతన్= ఆడుతూ ఉండగా; ఆ+కాంచన, కందుకంబు= ఆ బంగారు చెండు (బంతి); నూతన్= బావిలో; పడినన్= పడగా.

తాత్పర్యం: 'అంతేకాదు; రాజులకు అవసరాన్నిబట్టి మిత్రత్వశత్రుత్వాలు ఏర్పడుతుంటాయి; అందుచేత మా వంటి రాజులకు, మీవంటి పేదబ్రాహ్మణులతో ప్రయోజనం ఏమీ లేదు కాబట్టి స్నేహం ఎప్పుడూ ఏర్పడదు' అని ద్రుపదరాజు ఐశ్వర్యగర్వంతో తిరస్కరించి మాట్లాడగా ద్రోణుడు అవమానంచేత కలిగిన కోపంవలన కలతచెందిన మనసు కలవాడై, ఏమీచేయటానికీ తోచక, కొడుకుతో, భార్యతో, అగ్నిహోత్రంతో, శిష్యసమూహాలతో హస్తినాపురానికి వచ్చాడు. అప్పుడు ఆ పట్టణంబయట ధృతరాష్ట్రునికుమారులు, పాండురాజుకుమారులు చెండాట ఆడుకొంటూ ఉండగా వా ళ్ళాడుతున్న బంగారుబంతి బావిలో పడింది. అప్పుడు.

ఆ. నీరిలోనఁ దోఁచు తారక ప్రతిబింబ । మొక్కొ యనఁగ వెలుఁగుచున్నదాని
రాచకొడుకులెల్లఁ జూచుచునుండిరి । దానిఁ బుచ్చుకొనువిధంబు లేక. 207

ప్రతిపదార్థం: నీరిలోనన్= నీటిలో; తోఁచు= కనిపిస్తున్న; తారక, ప్రతిబింబము+ఒక్కొ= నక్షత్రంయొక్క ప్రతిబింబమా?; అనఁగన్= అనేటట్లుగా; వెలుఁగుచున్+ఉన్న= ప్రకాశిస్తూ ఉన్న; దానిన్= ఆ బంతిని; రాచ, కొడుకులు+ఎల్లన్= రాకుమారులంతా; దానిన్= ఆ బంతిని; పుచ్చుకొను, విధంబు= తీసికొనే మార్గం; లేక= తెలియక; చూచుచున్; ఉండిరి.

తాత్పర్యం: నీటిలో ప్రతిఫలిస్తున్న నక్షత్రమా అన్నట్లుగా వెలుగుతున్న ఆ బంగారుబంతిని తీసికొనేమార్గం లేక రాకుమారులంతా ఊరకే చూస్తున్నారు.

విశేషం: అలం : ఉత్ప్రేక్ష.

వ. అట్టి యవసరంబున. 208

తాత్పర్యం: అటువంటి సమయంలో.

ద్రోణుఁడు హస్తిపురంబునకు వచ్చుట. (సం. 1-122-14)

క. నానావిధశరశరధుల । తో నున్నతచాపధరుఁడు ద్రోణుఁడు వారిం
గానఁ జనుదెంచి యంతయుఁ । దా నప్పు డెఱింగి రాజతనయుల కనియెన్. 209

ప్రతిపదార్థం: నానా, విధ, శర, శరధులతోన్= అనేకవిధా లైన బాణాలతో, అమ్ములపొదులతో; ఉన్నత, చాప, ధరుఁడు= పొడవైన ధనుస్సు ధరించినవాడు; ద్రోణుఁడు; వారిన్= ఆ కౌరవ పాండవుల్ని; కానన్= చూడటానికై; చనుదెంచి= వచ్చి; తాన్= తాను; అప్పుడు; అంతయున్; ఎఱింగి; రాజ, తనయులకున్= రాకుమారులతో; అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: అనేకవిధా లైన బాణాలతో, అమ్ములపొదులతో, ఎత్తైన ధనుస్సును ధరించిన ద్రోణుడు వాళ్ళ దగ్గరికి వెళ్ళి, విషయమంతా తెలిసికొని ఆ రాజకుమారులతో ఇట్లా అన్నాడు.

చ. భరతకులప్రసూతులరు భాసురశస్త్రమహాస్త్ర విద్యలం
గరము ప్రసిద్ధుఁ డై పరఁగు గౌతమశిష్యుల; రిట్టి మీకు దు
ష్కరముగ నూతిలోఁ బడిన కాంచనపిండుఁ గొనంగనేర కొం
డొరుల మొగంబు చూచి నగుచుండఁగఁ జన్నె యుపాయహీనతన్. 210

ప్రతిపదార్థం: భరత, కుల, ప్రసూతులరు= భరతవంశంలో పుట్టినవారు; భాసుర, శస్త్ర, మహా+అస్త్ర, విద్యలన్= ప్రకాశిస్తున్న శస్త్రవిద్యలలో, గొప్ప అస్త్రవిద్యలలో; కరము= మిక్కిలి; ప్రసిద్ధుఁడు+ఐ= పేరు పొందినవాడై; పరఁగు= ఒప్పు; గౌతమ, శిష్యులరు= కృపాచార్యుని శిష్యులు; ఇట్టి; మీకున్; దుష్కరముగన్= కష్టంగా; నూతిలోన్= బావిలో; పడిన, కాంచన, పిండున్= బంగారు బంతిని; కొనంగ, నేరక= పైకితీయకలేక; ఉపాయ హీనతన్= ఉపాయం లేక; ఒండు+ఒరుల, మొగంబు= ఒకరిముఖాన్ని ఒకరు; చూచి; నగుచున్+ఉండఁగన్= నవ్వుతూ (నిస్సహాయంగా)ఉండటం; చన్నె= తగినపనా?

తాత్పర్యం: మీరు భరతవంశంలో పుట్టి; శస్త్రాస్త్రవిద్యలలో మహాప్రసిద్ధు డైన కృపాచార్యునిశిష్యులై, బావిలో పడిన బంతిని తీసికొనటం చేతకాక ఒకరిముఖం ఒకరు చూచుకుంటూ నవ్వుకొనటం మీకు తగినపనా?

విశేషం: బాణవిద్యలో ప్రౌఢుడై ద్రోణుడు - బావిలో పడినబంతిని పైకితీసికొనలేక వెలవెలపోతున్న పాండవులతో, ధార్తరాష్ట్రులతో అవహేళనగా మాట్లాడటం వాళ్ళను అవమానించటం కాదు. ఉత్తమవంశంలో పుట్టి, ఉత్తమగురువుకు శిష్యులై సమయోచితమైన ఉపాయం ఆలోచించకుండ ఉద్విగ్నులు కావటం వీరులకు ఉచితం కా దని హెచ్చరించటానికి. ఆ తరువాత తనవిద్యను, యోగ్యతను ప్రదర్శించాడు. ఈ సన్నివేశం కృపాచార్యునికంటె ద్రోణుడు గొప్పవా డనీ, అతనిశిక్షణ రాజకుమారుల కవసర మనీ భీష్ముడు భావించేటట్లు చేసిం దని వస్తుధ్వని. (సంపా.)

వ. 'దీని బాణపరంపరం జేసి పుచ్చి యిచ్చెదఁ జూడుఁ; డీ విద్య యొరు లెవ్వరు నేర' రని ద్రోణుం డొక్కబాణం బభి మంత్రించి దృష్టి ముష్టి సౌష్ఠవంబు లొప్ప నక్కందుకంబు నాట నేసి దానిపుంఖంబు మఱియొక బాణంబున నేసి తత్పుంఖం బొండొకబాణంబున నేసి వరుసన బాణరజ్జువు గావించి దానిం దిగిచికొని యిచ్చినం జూచి రాజకుమారు లెల్ల విస్మయం బంది ద్రోణుం దోడ్కొని చని భీష్మున కంతయు నెఱింగించిన నాతండును. 211

ప్రతిపదార్థం: దీనిన్= ఈ బంతిని; బాణ, పరంపరన్+చేసి= బాణాల వరుసతో; పుచ్చి= తీసికొని; ఇచ్చెదన్; చూడుఁడు= చూస్తూ ఉండండి; ఈ, విద్య; = ఈ విలువిద్యను; ఒరులు+ఎవ్వరున్= ఇతరు లెవ్వరూ; నేరరు= నేర్వలేదు; అని= ఆ విధంగా; ద్రోణుండు; ఒక్క, బాణంబు= ఒక్క బాణాన్ని; అభిమంత్రించి= మంత్రంతో పిలిచి; దృష్టి, ముష్టి, సౌష్ఠవంబులు= చూపు యొక్క, పిడికిలి యొక్క చక్కదనాలు; ఒప్పన్= ఒప్పునట్లుగా; ఆ+కందుకంబు= ఆ బంతిని; నాటన్+ఏసి= గ్రుచ్చుకునేట్లుగా కొట్టి; దాని= ఆ బాణం యొక్క; పుంఖంబు= క్రింది చివర; మఱియొక, బాణంబునన్= ఇంకొక బాణంతో; ఏసి= కొట్టి; తద్+పుంఖంబు= దానియొక్క చివరిఅంచును; ఒండు+ఒక, బాణంబునన్= మరొక బాణంచేత; ఏసి=కొట్టి; వరుసన; బాణ, రజ్జువు= బాణాల తాడును; కావించి= అగునట్లు చేసి; దానిన్= ఆ బంతిని; తిగిచికొని= లాగుకుని; ఇచ్చినన్= ఈయగా; చూచి= కనుగొని; రాజకుమారులు+ఎల్లన్= రాజకుమారు లందరు; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; ద్రోణుని= ద్రోణుణ్ణి; తోడ్కొని= తీసికొని; చని= వెళ్ళి; భీష్మునకున్, అంతయున్, ఎఱింగించినన్= భీష్మునికి అంతా తెలుపగా; అతండున్= అతడుకూడా.

తాత్పర్యం: 'ఈ బంతిని బాణపరంపరతో తీసి ఇస్తాను చూడండి. ఈ విద్య ఇతరు లెవ్వరికీ రాదు' అని ద్రోణుడు ఒక బాణాన్ని అభిమంత్రించి, చూపును, పిడికిలిని చక్కగా నిలిపి, ఆ బంతికి నాటుకునే విధంగా ఆ బాణాన్ని కొట్టి, ఆబాణంచివరికి మరో బాణాన్ని, దాని చివరికి ఇంకో బాణాన్నీ కొట్టి, వరుసగా బాణాలతాడు చేసి బంతిని లాగి ఇచ్చాడు. అది చూచి, రాకుమారు లందరూ ఆశ్చర్యపడి, ద్రోణుడిని తీసికొని వెళ్ళి భీష్మునికి జరిగినదంతా చెప్పారు. ఆయనకూడా.

క. **ఆసన్నపలితు ననఘు శ । రాసనగురు భూరిసత్త్వు నసితకృశాంగున్**
భూసురవరు ద్రోణు గుణో । ద్భాసితు వినినట్ల చూచి పరమప్రీతిన్. **212**

ప్రతిపదార్థం: ఆసన్న, పలితున్= సమీపించిన తెలనెరిసినవాడిని; అనఘున్= పాపంలేనివాడిని; శర+ఆసన, గురున్= ధనుర్విద్యకు గురువైనవాడిని; భూరి, సత్త్వున్= గొప్పబలం కలిగినవాడిని; అసిత, కృశ+అంగున్= నల్లని, సన్నబడిన శరీరం కలవాడిని; భూసుర, వరున్= బ్రాహ్మణ శ్రేష్ఠుడిని; గుణ+ఉద్భాసితున్= మంచిగుణాలచేత ప్రకాశిస్తున్నవాడిని; ద్రోణున్= ద్రోణుణ్ణి; వినినట్లు+అ= మునుపు వినినట్లే; చూచి= కనుగొని; పరమ, ప్రీతిన్= మిక్కిలి సంతోషంతో.

తాత్పర్యం: తల నెరియటం మొదలైనవాడు, పుణ్యాత్ముడు, ధనుర్విద్యాచార్యుడు, మహాబలవంతుడు, నల్లని బక్కచిక్కిన శరీరం కలవాడు, బ్రాహ్మణశ్రేష్ఠుడు, మంచిగుణాలచేత ప్రకాశించేవాడు అయిన ద్రోణుడిని తాను ముందే విన్నట్లుగా చూచి భీష్ముడు ఎంతో సంతోషంతో.

క. **'ఎందుండి వచ్చి తిందుల; । కెం దుండఁగ నీకు నిష్ట మెఱిఁగింపుము స**
ద్వందిత!' యని యడిగిన సా । నందుఁడు ద్రోణుండు భీష్మునకు ని ట్లనియెన్. **213**

ప్రతిపదార్థం: ఎందు+ఉండి= ఎక్కడనుండి; ఇందులకున్= ఇక్కడికి; వచ్చితివి= వచ్చావు? నీకున్; ఎందు+ఉండఁగన్= ఎక్కడ ఉండటానికి; ఇష్టము= అభిలాష; ఎఱిఁగింపుము= తెలియజేయుము; సద్+వందిత= సజ్జనులచేత పొగడబడేవాడా!; అని= ఆ ప్రకారంగా; అడిగినన్= అడుగగా; స+ఆనందుఁడు= ఆనందంతో కూడినవాడైన; ద్రోణుండు; భీష్మునకున్; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: 'సజ్జనులచేత పొగడబడేవాడా! ఓ ద్రోణాచార్యా! నీవు ఎక్కడనుండి ఇక్కడకు వచ్చావు? ఎక్కడ ఉండటం నీ కిష్టం? చెప్పుము' అని అడుగగానే ద్రోణుడు సంతోషించి భీష్మునితో ఈ విధంగా అన్నాడు.

వ. **ఏను ద్రోణుం డనువాఁడ; భరద్వాజపుత్త్రుండ నగ్నివేశ్యుండను మహామునివరునొద్ద బ్రహ్మచర్యాశ్రమంబున వేదాధ్యయనంబు సేసి ధనుర్వేదం బభ్యసించుచున్ననాఁడు, పాంచాలపతి యైన పృషతుపుత్త్రుండు ద్రుపదుం డను వాఁడు నా కిష్టసఖుం డయి యెల్లవిద్యలు గఱచి, 'యేను పాంచాలవిషయంబునకు రా జయిననాఁడు నా యొద్దకు వచ్చునది; నా రాజ్యభోగంబులు నీవు ననుభవింప నర్హుండ' వని నన్నుఁ బ్రార్థించి చని, పృషతుపరోక్షంబునఁ దద్దేశంబునకు రా జయి యున్న, నేను గురునియుక్తుండ నై గౌతమిం బాణిగ్రహణంబు సేసి యొక్కుమారు నశ్వత్థామ నధికతేజస్వి నాత్మజుం బడసి, ధనంబు లేమిం గుటుంబభరణంబునం దసమర్థుండ నయి యుండియు.** **214**

ప్రతిపదార్థం: ఏను= నేను; ద్రోణుండు+అను వాఁడన్; భరద్వాజ, పుత్త్రుండన్= భరద్వాజమహర్షి కుమారుణ్ణి; అగ్నివేశ్యుండు= అగ్నివేశ్యుడను పేరుగల; మహాముని, వరున్+ఒద్ద= గొప్ప మునిశ్రేష్ఠుని దగ్గర; బ్రహ్మచర్య+ఆశ్రమంబునన్; వేద+ అధ్యయనంబు= వేదాలు చదవటం; చేసి; ధనుర్వేదంబు= విలువిద్యను; అభ్యసించుచున్= నేర్చుకొంటూ; ఉన్న, నాఁడు= ఉన్నప్పుడు; పాంచాల, పతి+ఐన= పాంచాలదేశపురాజైన, పృషతు, పుత్త్రుండు= పృషతు డనేవానికుమారుడు; ద్రుపదుండు+ అనువాడు; నాకు; ఇష్ట, సఖుండు+ఐ= ప్రియమైన స్నేహితుడై; ఎల్ల, విద్యలు; కఱచి= నేర్చుకొని; ఏను= నేను; పాంచాల, విషయంబునకున్= పాంచాలదేశానికి; రాజు+అయిన, నాఁడు= రాజైనప్పుడు; నా, ఒద్దకున్= నా దగ్గరికి; వచ్చునది= రమ్ము; నా, రాజ్య, భోగంబులు; నీవున్= నీవు కూడా; అనుభవింపన్= అనుభవించుటకు; అర్హుండవు= తగినవాడివి; అని; నన్నున్; ప్రార్థించి; చని= వెళ్ళి; పృషతు, పరోక్షంబునన్= పృషతుని తర్వాత, తద్+దేశంబునకున్= ఆ దేశానికి; రాజు+అయి, ఉన్నన్= ప్రభువైఉండగా; నేను= నేను; గురు, నియుక్తుండను+ఐ= తండ్రిచేత ఆజ్ఞాపించబడినవాడినై; గౌతమిన్= కృపిని; పాణిగ్రహణంబు+చేసి= వివాహమాడి; ఈ+కుమారున్; అశ్వత్థామన్; అధిక, తేజస్విన్= మిక్కిలి తేజశ్శాలిని; ఆత్మజున్= కుమారుని; పడసి= పొంది; ధనంబు, లేమిన్= ధనం లేకపోవటంచేత; కుటుంబ, భరణంబు, అందు= సంసారాన్ని భరించటంలో; అసమర్థుండను; అయి; ఉండియున్= శక్తిలేనివాడనై ఉండికూడా.

తాత్పర్యం: నాపేరు ద్రోణుడు. భరద్వాజునికుమారుడిని. అగ్నివేశ్య డనే గొప్పమునిశ్రేష్ఠునిదగ్గర బ్రహ్మచర్య వ్రతం అవలంబించి వేదాధ్యయనం చేసి, ధనుర్వేదం నేర్చుకొంటున్నకాలంలో, పాంచాలరాజైన పృషతునికుమారుడు ద్రుపదు డనేవాడు నాకు ప్రియమిత్రుడై అన్నివిద్యలూ గురువుదగ్గర నేర్చి, 'నేను పాంచాలదేశానికి రాజైనప్పుడు నీవు నా దగ్గరికి రావాలి సుమా! నా రాజ్యభోగాలు నీవు కూడా అనుభవించటానికి అర్హుడ' వని నన్ను ప్రార్థించి వెళ్ళాడు. పృషతునితర్వాత ద్రుపదుడు ఆ దేశానికి రా జయ్యాడు. నేనుకూడా తండ్రిఆజ్ఞచేత కృపిని వివాహమాడి, గొప్పతేజస్సుకల ఈ బాలుడు అశ్వత్థామను కొడుకుగా పొంది, ధనం లేమిచేత సంసారాన్ని భరించలేనివాడినై ఉండికూడా -

క. పురుషవిశేష వివేకా । పరిచయు లగు ధరణిపతుల పాలికిఁ బోవం
బరులందు దుష్ప్రతిగ్రహ । భర మెదలో రోసి ధర్మపథమున నున్నన్. 215

ప్రతిపదార్థం: పురుష, విశేష, వివేక+అపరిచయులు+అగు= పురుషునియొక్క గొప్పతనాన్ని గురించిన ఆలోచనలందు పరిచయం లేనివాళ్ళయిన; ధరణి, పతుల, పాలికిన్= రాజుల దగ్గరికి; పోవన్= వెళ్ళటం; పరులందు= ఇతరుల దగ్గర; దుష్ప్రతిగ్రహ, భరము= చెడుదానాలను తీసికొనటంయొక్క కష్టాన్ని; ఎదలో= మనసులో; రోసి= అసహ్యించుకొని; ధర్మ, పథమునన్= ధర్మమార్గంలో; ఉన్నన్= ఉండగా.

తాత్పర్యం: వ్యక్తులయోగ్యతను గుర్తించలేని రాజులదగ్గరికి వెళ్లటానికీ, ఇతరులనుండి చెడుదానాలు తీసికొనటానికీ, ఇష్టపడక ధర్మమార్గంలో జీవితం గడపుతుండగా.

క. ధనపతుల బాలురు ముదం । బున నిత్యముఁ బాలు ద్రావఁబోయిన నస్మ
త్తనయుండు వీఁడు బాల్యం । బున నేడ్చెను బాలు నాకుఁ బోయుం డనుచున్. 216

ప్రతిపదార్థం: ధన, పతుల, బాలురు= ధనవంతుల పిల్లలు; ముదంబునన్= సంతోషంతో; నిత్యమున్= ప్రతిదినం; పాలు, త్రావన్ పోయినన్= పాలుత్రాగుచుండగా; అస్మద్+తనయుండు= నా కుమారుడు; వీఁడు= ఈ బాలుడు; బాల్యంబునన్= బాల్యమునందు; నాకున్, పాలు, పోయుండు; అనుచున్; ఏడ్చెన్.

తాత్పర్యం: ధనవంతుల బిడ్డలు ప్రతిదినం సంతోషంతో పాలు త్రాగుతూండగా, నా కుమారుడు వీడు బాల్యంలో 'నాకుకూడా పాలు పోయం'డని ఏడ్చాడు.

వ. దానిం జూచి 'దారిద్ర్యంబునకంటెఁ గష్టం బొం డెద్దియు లేదు; దీని నా బాలసఖుండగు పాంచాలు పాలికిం బోయి పాచికొందు; నాతండు తనదేశంబున కభిషిక్తుండు గాఁ బోవుచుండి నన్ను రాఁ బనిచి పోయె'. 217

ప్రతిపదార్థం: దానిన్+చూచి= ఆ సన్నివేశాన్ని చూచి; దారిద్ర్యంబునకంటెన్= లేమిడి కన్నా; కష్టంబు= కష్టము; ఒండు+ ఎద్దియున్= మరొకటి ఏదీ; లేదు; దీనిన్= ఈ పేదరికాన్ని; నా, బాల, సఖుండు= నా చిన్ననాటి స్నేహితుడు; అగు= అయినట్టి; పాంచాలు, పాలికిన్= పాంచాలదేశపు రాజైన ద్రుపదుని దగ్గరికి; పోయి; పాచికొందున్= పోగొట్టుకొంటాను; అతండు= ఆ ద్రుపదుడు; తన, దేశంబునకున్= తన రాజ్యానికి; అభిషిక్తుండు+కాన్= రాజు కావడానికి; పోవుచుండి= పోతూ ఉండి; నన్నున్= నన్ను; రాన్+పనిచి= రమ్మని చెప్పి; పోయెన్.

తాత్పర్యం: దానిని చూచి దారిద్ర్యంకంటే కష్టం మరొకటి లే దని తలచి 'ఈ దారిద్ర్యాన్ని నా బాల్యమిత్రు డైన పాంచాలరాజు ద్రుపదునిదగ్గరకు పోయి తొలగించుకుంటాను. అతడు తనదేశానికి రాజు కావటానికి వెళ్తూ నన్ను ఆహ్వానించి వెళ్ళాడు'.

మత్తకోకిల

వేఁడు టెంతయుఁ గష్టమైనను వేఱులేని సుహృజ్జనున్
వేఁడికో లుచితంబ కావున వేడ్కతోఁ జని సోమకున్
వేఁడినన్ ధన మోపఁడేనియు వీనిమాత్రకు నాలుగేన్
పాఁడికుఱ్ఱుల నీఁడె వీనికిఁ బాలు ద్రావుచునుండఁగన్. 218

ప్రతిపదార్థం: వేఁడుట= యాచించటం; ఎంతయున్= మిక్కలి; కష్టము+ఐనను= కష్టమైనపని అయినప్పటికీ; వేఱులేని= భేదంలేని; సుహృత్+జనున్= మిత్రుడిని; వేఁడికోలు= వేడుకోవటం; ఉచితంబు+అ= తగినదే; కావునన్; వేడ్కతోన్= సంతోషంతో; చని= వెళ్ళి; సోమకున్= ద్రుపదుడిని; వేఁడినన్= ప్రార్థింపగా; ధనము+ఓపఁడు+ఏనియున్= ధనం ఇవ్వలేకపోయినప్పటికీ; వీని మాత్రకు= వీడికి (అశ్వత్థామకు) సరిపోయేంతగా; నాలుగు+ఏన్= నాలుగైనా; పాఁడి, కుఱ్ఱులన్= పాడి ఆవులను; వీనికిన్= ఈ అశ్వత్థామకు; పాలు; త్రావుచున్, ఉండఁగన్= పాలుత్రాగటానికి; ఈఁడె= ఇవ్వడా!

తాత్పర్యం: యాచించటం ఎంతో కష్టమైన పని. అయినప్పటికీ భేదం లేని మిత్రుడిని యాచించటం ఉచితమే. అందుచేత సంతోషంగా వెళ్లి ద్రుపదుడిని అడిగినట్లయితే, ధనం ఇవ్వలేకపోయినా, అశ్వత్థామ పాలు త్రాగటానికి సరిపోయేటట్లుగా నాలుగుపాడిఆవులనైనా ఇవ్వడా?

విశేషం: మత్తకోకిలపాదంలో ర, స, జ, జ, భ, ర - అనే గణాలు వరుసగా ఉంటాయి. 11వ అక్షరం యతిస్థానం. ప్రాస నియమం ఉన్నది.

వ. 'అని నిశ్చయించి ద్రుపదునొద్దకుం బోయి న న్నెఱింగించిన, నాతండు దన రాజ్యమదంబున నన్నును దన్నును నెఱుంగక' యేను రాజను నీవు పేదపాఱుండవు; నాకును నీకును నెక్కడి సఖ్యం?' బలి పలికిన వానిచేత నవమానితుండ నయి వచ్చితి' నని ద్రోణుండు దనవృత్తాంతం బంతయుఁ జెప్పిన. 219

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; నిశ్చయించి= నిర్ణయించుకొని; ద్రుపదు+ఒద్దకున్= ద్రుపదుడి దగ్గరికి; పోయి; నన్నున్+ఎఱింగించినన్= నన్ను నేను పరిచయం చేసికొనగా; ఆతండు= ఆ ద్రుపదుడు; తన, రాజ్య మదంబునన్= తన యొక్క రాజ్యంవలన కలిగిన పొగరుచేత; నన్నును= నన్ను; తన్నును= తనను; ఎఱుంగక= తెలియక; ఏను= నేను; రాజను; నీవు; పేద, పాఱుండవు= బీదబ్రాహ్మణుడివి; నాకును; నీకునున్; ఎక్కడి= ఎక్కడ; సఖ్యంబు= స్నేహం; అని, పలికినన్; వానిచేతన్= ఆ ద్రుపదునిచే; అవమానితుండను+అయి= అవమానించబడినవాడి నై; వచ్చితిని; అని; అట్లు; ద్రోణుండు; తన+వృత్తాంతంబు+అంతయున్, చెప్పినన్= తన వృత్తాంతాన్ని అంతా చెప్పగా-

తాత్పర్యం: 'అని నిర్ణయించుకొని ద్రుపదునిదగ్గరికి వెళ్ళి, నన్ను నేను పరిచయం చేసికొనగా, అతడు రాజ్యమదంచేత నన్నూ, తననూ ఎరుగకుండా 'నేను రాజును నీవు బీదబ్రాహ్మణుడివి. నాకూ నీకూ స్నేహం ఎక్కడిది?' అని పలికాడు. ఆ విధంగా అతనిచేత అవమానం పొంది వచ్చా' నని ద్రోణుడు తనవృత్తాంతం అంతా చెప్పగా-

క. విని రోయుతీఁగ గాళ్ళం । బెనఁగెం దా ననుచుఁ బొంగి భీష్ముఁడు ద్రోణున్
ఘనభుజు నభీష్టపూజా । ధనదానవిధానముల ముదంబునఁ దనిపెన్. 220

ప్రతిపదార్థం: విని= ఆ ద్రోణవృత్తాంతాన్ని ఆలకించి; భీష్ముఁడు; రోయు, తీఁగ= వెదకుతున్న తీగ; తాన్; కాళ్ళన్; పెనఁగన్= చుట్టుకొన్నది; అనుచున్= అంటూ; పొంగి= సంతోషించి; ఘన, భుజున్= గొప్పభుజాలు కలిగినవాడిని; ద్రోణున్= ద్రోణుణ్ణి; అభీష్ట, పూజా, ధన, దాన, విధానములన్= ఇష్టమైన పూజలు చేయటం, ధనాన్ని దానం ఇవ్వటం అనే పద్ధతులచేత; ముదంబునన్= సంతోషంతో; తనిపెన్= తృప్తిపరచాడు.

తాత్పర్యం: అది విని, భీష్ముడు వెదుకబోయిన తీగ కాళ్లకు చుట్టుకున్నట్లు సంతోషించి, ద్రోణునికి ఇష్టమైన పూజలు చేసి, ధనదానా లిచ్చి తృప్తిపరచాడు.

వ. మఱియును. 221

తాత్పర్యం: అంతటితో ఆగక.

భీష్ముఁడు కురుపాండుకుమారులకు ద్రోణుని గురువుగా నియమించుట (సం. 1-122-40)

చ. మనుమల నెల్లఁ జూపి మతిమంతుఁడు శాంతనవుండు 'వీరిఁ జే
కొని గురువృత్తిమైఁ గఱపు ఘోరశరాసనవిద్యలెల్లఁ ; బెం
పున జమదగ్నిసూనుఁడును బోలఁడు' ని న్నని విందు విల్లునే
ర్పున నయనైపుణంబునను భూరిపరాక్రమగర్వసంపదన్. 222

ప్రతిపదార్థం: మతిమంతుఁడు= గొప్పబుద్ధికలవాడు; శాంతనవుండు= భీష్ముడు; మనుమలన్; ఎల్లన్; చూపి; వీరిన్; చేకొని= గ్రహించి; ఘోర+శర+ఆసన, విద్యలు+ఎల్లన్= భయంకరమైన ధనుర్విద్య లన్నింటినీ; పెంపునన్= అతిశయంగా; గురు, వృత్తిమైన్= గురుత్వంచేత; కఱపు= నేర్పుము; నిన్నున్; విల్లు, నేర్పునన్= విలువిద్యా నైపుణ్యంలో; నయ, నైపుణంబునను= నీతినేర్పులో; భూరి, పరాక్రమ, గర్వ, సంపదన్= గొప్పబలం కలిగిన గర్వమనే కలిమిలో; జమదగ్ని సూనుఁడును= జమదగ్నికుమారు డైన పరశురాముడుకూడా; పోలడు, అని, విందున్= సరిపోలడు అని విన్నాను.

తాత్పర్యం: మతిమంతుడైన భీష్ముడు తనమనుమళ్ళందరిని ద్రోణునికి చూపించి 'వీరికి గురుత్వం వహించి గొప్పగా విలువిద్య లన్నింటినీ నేర్పుము. విలువిద్యలో, నీతిలో, పరాక్రమంలో పరశురాముడుకూడా నిన్ను పోల డని విన్నాను'.

వ. అని కుమారుల నెల్లం జూపి ద్రోణునకు శిష్యులంగా సమర్పించిన, ద్రోణుండును వారలం జేకొని యందఱ కి ట్లనియె. 223

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; కుమారులను+ఎల్లన్= కుమారు లందరినీ; చూపి; ద్రోణునకున్; శిష్యులన్+కాన్= శిష్యు లయ్యేటట్లుగా; సమర్పించినన్= సమర్పింపగా; ద్రోణుండును; వారలన్; చేకొని= (శిష్యులుగా) గ్రహించి; అందఱకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికి కుమారు లందరినీ చూపి, వాళ్ళను ద్రోణునికి శిష్యులుగా సమర్పించాడు. ద్రోణుడు వాళ్ళందరినీ దగ్గరికి తీసి ఈ విధంగా అన్నాడు.

తే. 'అస్త్రవిద్యలు గఱచి నా దైన యిష్ట। మొగిన తీర్పంగ నిం దెవ్వఁ డోపు' ననినఁ
బాయ మొగమిడి కౌరవుల్ పలుకకుండి;। 'రేను దీర్చెద' నని పూనె నింద్రసుతుఁడు. 224

ప్రతిపదార్థం: అస్త్ర; విద్యలు= అస్త్రములయొక్క విద్యలు; కఱచి= నేర్చి; నాది+ఐన; ఇష్టము= నాదగు కోర్కె; ఒగిన్+అ= క్రమంగా; తీర్పంగన్= తీర్పగా; ఇందున్= ఇచ్చట; ఎవ్వఁడు= ఎవడు; ఓపున్= సరిపోతాడు; అనినన్= అని అనగా; పాయమొగము= మారుమొగం; ఇడి= పెట్టి; కౌరవుల్= కౌరవులు; పలుకక+ఉండిరి= పలుకకుండా ఊరక ఉండిరి; ఇంద్ర, సుతుఁడు= ఇంద్రుని కుమారుడైన అర్జునుడు; ఏను= నేను; తీర్చెదను+అని+పూనెన్= తీరుస్తాను అని పూనుకున్నాడు.

తాత్పర్యం: 'నా దగ్గర అస్త్రవిద్యలు నేర్చి నాకోరిక మీలో ఎవ్వడు తీర్చగల' డని అడుగగా కౌరవు లందరూ పెడమొగాలు పెట్టి మౌనం వహించారు. అర్జునుడు 'నేను తీరుస్తా'నని ముందుకు వచ్చాడు.

వ. ఇట్లు దన యిష్టంబు దీర్పం బూనిన యర్జును నాచార్యుం డతిస్నేహంబునఁ గౌఁగిలించుకొని కరంబు సంతసిల్లి కుమారుల కెల్ల విలువిద్యఁ గఱపుచున్న, నానాదేశంబులం గల రాజపుత్రులెల్ల వచ్చి వారితోడఁ గలసి కఱచుచుండిరి; మఱియు, సూతపుత్రుం డయిన రాధేయుండును ధనుర్విద్యాకౌశలంబున నర్జుననితోడ మచ్చరించుచు దుర్యోధనపక్షపాతి యై యుండె; నంత. 225

ప్రతిపదార్థం: ఇట్లు; తన, ఇష్టంబు= తన కోరికను; తీర్పన్+పూనిన= తీర్చటానికి పూనుకొన్న; అర్జునున్; ఆచార్యుండు; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రేమతో; కౌఁగిలించుకొని; కరంబు= మిక్కిలి; సంతసిల్లి; కుమారులకు+ఎల్లన్= కురుకుమారు లందరికీ; విలు, విద్యన్= కఱపుచు+ఉన్నన్= నేర్పుతూ ఉండగా; నానా దేశంబులన్, కల= అనేకదేశాలలో ఉండే; రాజపుత్రులు+ఎల్లన్, వచ్చి= రాజకుమారులు అందరూ వచ్చి; వారితోడన్, కలసి= ఆ కురుకుమారులతో కలిసి; కఱచుచు+ఉండిరి= నేర్చుకొంటూ ఉన్నారు; మఱియున్; సూత, పుత్త్రుండు+అయిన= సూతుని కొడుకైన; రాధేయుండును; ధనుర్విద్యా, కౌశలంబునన్= విలువిద్యలోని నేర్పుతో; అర్జుననితోడ; మచ్చరించుచు= ద్వేషం వహిస్తూ; దుర్యోధన, పక్షపాతి+ఐ= దుర్యోధనుని పక్షాన ఉన్నవాడై; ఉండెన్= ఉన్నాడు; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: ఈ విధంగా తనకోరికను తీరుస్తా నని ముందుకు వచ్చినఅర్జునుడిని అపారప్రేమతో కౌగిలించుకొని, ఎంతో సంతోషించి, కురుకుమారు లందరికీ విలువిద్య నేర్పుతుండగా, నానాదేశాలనుండి రాకుమారులు వచ్చి, వారితో కలిసి ఆ విద్య నేర్చుకొంటున్నారు. సూతునికుమారుడైన రాధేయుడు విలువిద్యా నైపుణ్యంలో అర్జుననితో ద్వేషంవహిస్తూ దుర్యోధనునిపక్షంలో చేరి ఉన్నాడు.

క. నరుఁ డస్త్రశస్త్రవిద్యా। పరిణతి నధికుఁ డయి వినయపరుఁ డయి శశ్వ
ద్గురుపూజాయత్నంబునఁ। బరఁగుచు సంప్రీతుఁ జేసె భారద్వాజున్. 226

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; అస్త్ర, శస్త్ర, విద్యా, పరిణతిన్= అస్త్రశస్త్రవిద్యాదులలో పక్వతతో; అధికుఁడు+అయి= గొప్పవాడై; వినయపరుఁడు+అయి=అణకువ ప్రధానంగా కలవాడై; శశ్వత్+గురు, పూజా, యత్నంబునన్= నిరంతరం గురువును పూజించే ప్రయత్నంలో; పరఁగుచున్= ప్రవర్తిస్తూ; భారద్వాజున్= భరద్వాజుని కుమారు డైన ద్రోణుణ్ణి; సంప్రీతున్= సంతోషించిన వాణ్ణిగా; చేసెన్.

తాత్పర్యం: అర్జునుడు శస్త్రాస్త్రవిద్యానైపుణ్యంలో అధికు డై; వినయంతో ఎప్పుడూ గురుపూజ చేస్తూ ద్రోణుణ్ణి సంతోషపరిచాడు.

విశేషం: శిష్యుడు ఉత్తమగురువుకొరకు ఎట్లా అన్వేషిస్తాడో; గురువుకూడా ఉత్తమశిష్యుడికొరకు అట్లా అన్వేషిస్తాడు, సాధిస్తాడు. ఇక్కడ ఉభయత్రా సార్థక్యం ఏర్పడింది.

వ. అ య్యర్జునుతోడి విద్యామత్సరంబునఁ జీఁకటి నాతం డేయ నేరకుండవలయు నని తలంచి యశ్వత్థామ రహస్యంబున నన్నసాధకుం బిలిచి 'యెన్నండును నరునకు నంధకారంబునఁ గుడవం బెట్టకుమీ!' యని పంచిన వాఁడును దద్వచనానురూపంబు సేయుచున్న నొక్కనాఁటి రాత్రియందు. 227

ప్రతిపదార్థం: ఆ+అర్జునుతోడి; విద్యా, మత్సరంబునన్= విద్యలో పోటీచేత; చీఁకటిన్= చీకట్లో; ఆతండు= అర్జునుడు; ఏయ, నేరకుండ వలయును+అని= బాణాలు వేయటం నేర్వకుండా ఉండా లని; తలంచి; అశ్వత్థామ= ద్రోణునికొడుకు; రహస్యంబునన్= రహస్యంగా; అన్నసాధకున్= వంటవాడిని; పిలిచి; ఎన్నండును= ఎప్పుడుగానీ; నరునకున్= అర్జునునికి; అంధకారంబునన్= చీకట్లో; కుడువన్= తినటానికి; పెట్టకుమీ= పెట్టవద్దు సుమా!; అని; పంచినన్= ఆజ్ఞాపించగా; వాఁడును; తద్+వచన+అనురూపంబు= అతని మాటప్రకారం; చేయుచున్+ఉన్నన్; ఒక్కనాఁటి; రాత్రి; అందున్.

తాత్పర్యం: అర్జుననితో ఉన్న విద్యాస్పర్ధతో అశ్వత్థామ-చీకట్లో బాణాలు వేయటం అర్జునుడు నేర్చుకోకుండా ఉండా లని తలచి, వంటవాడిని పిలిచి, 'చీకట్లో అర్జునుడికి అన్నం పెట్టవ' ద్దని ఆజ్ఞాపించగా, అతనిమాట ప్రకారం వంటవాడు అదేవిధంగా చేస్తుండగా, ఒకనాటిరాత్రి.

ఉ. వాసవనందనుండు గుడువం గుడువం బటుమారుతాహతిం
జేసి చలించి దీపశిఖ చెచ్చెరఁ బాయుడు భోజనక్రియా
భ్యాసవశంబునం గుడిచి 'పన్నుగ నిట్టుల విద్య లెల్ల న
భ్యాసవశంబునం బడయ భారము లే దని నిశ్చితాత్ముఁ డై. 228

ప్రతిపదార్థం: వాసవ, నందనుండు= ఇంద్రకుమారుడు - అర్జునుడు; కుడువన్, కుడువన్= తింటూ తింటూ ఉండగా; పటు, మారుత+ఆహతిన్+చేసి= పెద్దగాలితాకిడిచేత; చలించి= కదిలి; దీప, శిఖ= దీపపుమంట; చెరన్+చెరన్= తటాలున; పాయుడున్= తొలగిపోగా(ఆరిపోగా); భోజన, క్రియా+అభ్యాస, వశంబునన్= అన్నం తినటం అనే పని చేయటంలో అలవాటు చొప్పున; కుడిచి= తిని; పన్నుగన్= ఒప్పేటట్లుగా; ఇట్టులన్= ఈ విధంగా; విద్యలు+ఎల్లన్= విద్యలు అన్నీ; అభ్యాస వశంబునన్= సాధన చేయటంచేత; పడయన్= పొందటం; భారము= కష్టం; లేదు; అని= ఆ ప్రకారం; నిశ్చిత+ఆత్ముఁడు+ఐ= నిశ్చయం పొందిన మనసు కలవాడై.

తాత్పర్యం: ఇంద్రునికొడుకైన అర్జునుడు అన్నం తింటూండగా పెద్దగాలికి తటాలున దీపం ఆరిపోయింది. అయినా, అలవాటు ప్రకారం ఆ చీకటిలోనే తిని, ఈ విధంగానే విద్య లన్నింటినీ సాధన చేసి నేర్చుకొనవచ్చని నిశ్చయించుకొని.

క. **పాయక చీఁకటియందును। నేయంగా నభ్యసించు నిట్టియెడం గౌం**
తేయు ధనుర్జ్యా ధ్వని విని। ధీయుక్తుఁడు ద్రోణుఁ డరుగుదెంచి ముదమునన్. 229

ప్రతిపదార్థం: పాయక= విడవకుండా; చీఁకటియందును; ఏయన్, కాన్= బాణాలు వేయటాన్ని; అభ్యసించి= సాధన చేసే; ఇట్టి ఎడన్= ఈ సమయంలో; కౌంతేయు; ధనుః+జ్యా, ధ్వని= అర్జుననివింటియొక్క అల్లెత్రాటిధ్వని; విని; ధీ, యుక్తుఁడు= బుద్ధితో కూడినవాడు; ద్రోణుఁడు; ముదమునన్= సంతోషంతో; అరుగుదెంచి= వచ్చి.

తాత్పర్యం: పట్టుపట్టి చీకట్లోకూడా ఎప్పుడు విలువిద్యను అభ్యసించసాగాడో అప్పుడు అర్జుననివింటియొక్క అల్లెత్రాటిధ్వని విని, మేధావి అయిన ద్రోణుడు సంతోషంతో అక్కడకు వచ్చి.

సీ. **ఆతని యస్త్రవిద్యాభియోగమునకుఁ। బ్రియశిష్యవృత్తికిఁ బెద్ద మెచ్చి**
'యన్న! ధనుర్ధరు లన్యులు నీకంటె। నధికులు గాకుండునట్లు గాఁగఁ
గఱపుదు విలువిద్య ఘనముగా' నని పల్కి। ద్వంద్వసంకీర్ణయుద్ధముల తెఱఁగు
రథమహీవాజివారణములపై నుండి। దృఢచిత్రసౌష్ఠవస్థితుల నేయ

తే. **బహువిధవ్యూహభేదనోపాయములను। సంప్రయోగరహస్యాతిశయము గాఁగఁ**
గఱపె నర్జునుఁ దొంటి భార్గవుఁడు వింట। నిట్టిఁ డే! యని పొగడంగ నెల్ల జనులు. 230

ప్రతిపదార్థం: అతని, అస్త్ర, విద్యా+అభియోగమునకున్= ఆ అర్జునుని అస్త్రవిద్యలందలి పూనికకూ; ప్రియ, శిష్య, వృత్తికిన్= ప్రియమైన శిష్యుడినడవడికీ; పెద్ద మెచ్చి= మిక్కిలి సంతోషించి; అన్న! (ప్రేమపూర్వకసంబోధన); అన్యులు= ఇతరులు; ధనుర్ధరులు= విల్లును చేపట్టినవాళ్ళు; నీ కంటెన్; అధికులు; కాకుండునట్లు; కాఁగన్; ఘనముగాన్= గొప్పగా; విలువిద్య కఱపుదున్= ధనుర్విద్య నేర్పుతాను; అని= ఆ విధంగా; పలికి; ద్వంద్వ, సంకీర్ణ, యుద్ధముల, తెఱఁగు= ద్వంద్వ యుద్ధంయొక్క, సంకుల యుద్ధంయొక్క పద్ధతి; రథ, మహీ, వాజి, వారణములపైన్, ఉండి= రథంమీద, నేలమీద, గుఱ్ఱంమీద, ఏనుగుమీద ఉండి; దృఢ, చిత్ర, సౌష్ఠవ, స్థితులన్= గట్టిగా; చిత్రంగా, చక్కగా ఉన్న స్థితులలో; ఏయన్= కొట్టటానికి; బహు, విధ, వ్యూహ, భేదన+ఉపాయములను= అనేకవిధాలైన వ్యూహాలను భేదించే ఉపాయాలను; సంప్రయోగ, రహస్య+అతిశయము, కాఁగన్= ప్రయోగ రహస్యాల అతిశయంతో కూడుకొనేట్లుగా; తొంటి, భార్గవుఁడు= ఒకనాటి పరశురాముడు; వింటన్= విలువిద్యలో; ఇట్టిఁడే= ఇటువంటివాడా!; అని; ఎల్ల, జనులు; పొగడంగన్; అర్జునున్= అర్జునుడికి; కఱపెన్= నేర్పాడు.

తాత్పర్యం: అస్త్రవిద్యలో అర్జునునికి గల పట్టుదలకు, అతని గురుభక్తికి ద్రోణుడు ఎంతో సంతోషించాడు. 'అన్న! నీకంటె వే రెవ్వరూ అధికులు కానట్లుగా విలువిద్య నేర్పిస్తా'నన్నాడు. ద్వంద్వయుద్ధ, సంకులయుద్ధ పద్ధతులను, రథంమీద, నేలమీద, గుఱ్ఱాలమీద, ఏనుగులమీద ఉండి దృఢం, చిత్రం, సౌష్ఠవం అయిన స్థితులలో బాణాలు వేయటాన్ని, బహువిధా లైన వ్యూహాలను భేదించే ఉపాయాలను, బాణప్రయోగరహస్యాలను 'ఇదివరకటి ఆ పరశురాముడుకూడా విలువిద్యలో ఇంతటివాడు కా డని' ప్రజలు అర్జునుడిని పొగడేటట్లుగా అతనికి నేర్పాడు.

విశేషం: ఇద్దరువీరులమధ్య యుద్ధం ద్వంద్వయుద్ధం. చాలామందివీరులు కలియబడి చేసేయుద్ధం సంకీర్ణయుద్ధం.

ఏకలవ్యుం డనువాఁడు ద్రోణు నారాధించి విలువిద్య గఱచుట (సం. 1-123-10)

వ. మఱియు గదాకార్ముకప్రాసాసితోమరకుంతశక్త్యాది వివిధాయుధంబులయందును గుమారుల నందఱ జితశ్రములం జేయుచున్న ద్రోణాచార్యుల మహాప్రసిద్ధి విని హిరణ్యధన్వుం డను నెఱుకురాజుకొడు కేకలవ్యుం డనువాఁడు ధనుర్విద్యాగ్రహణార్థి యయి వచ్చినవాని నిషాదపుత్త్రుం డని శిష్యుంగాఁ జేకొన కున్న, వాఁడును ద్రోణుననుజ్ఞ వడసి చని వనంబులోన. 231

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; గదా, కార్ముక, ప్రాస+అసి, తోమర, కుంత, శక్తి+ఆది, వివిధ+ఆయుధంబులయందును= గద, ధనుస్సు, ఈటె, కత్తి, తోమరం, కుంతకం, శక్తి మొదలైన అనేకాలైన ఆయుధాలలో; కుమారులన్, అందఱన్= కురు కుమారుల్ని అందరినీ; జిత, శ్రములన్= జయించిన శ్రమగలవాళ్ళుగా (నేర్పరులుగా); చేయుచున్+ఉన్న= చేస్తూ ఉన్న; ద్రోణాచార్యుల; మహా, ప్రసిద్ధి = గొప్ప పేరు; విని= ఆలకించి; హిరణ్యధన్వుండు; అను; ఎఱుకు, రాజు, కొడుకు; ఏకలవ్యుండు; అనువాఁడు; ధనుర్విద్యా, గ్రహణ+అర్థి+అయి= విలువిద్యను నేర్చుకొనా లన్న కోరిక కలవాడై; వచ్చిన; వానిన్= ఆ ఏకలవ్యుడిని; నిషాద, పుత్త్రుండు+అని= ఎరుకలవాని కొడు కని; శిష్యున్+కాన్; చేకొనక+ఉన్నన్= గ్రహింపకుండగా; వాఁడును= ఆ ఏకలవ్యుడును; ద్రోణున్; అనుజ్ఞ= అనుమతి; పడసి= పొంది; చని= వెళ్లి; వనంబులోన్= అడవిలో.

తాత్పర్యం: అంతేకాకుండా గద, ధనుస్సు, ఈటె,కత్తి, తోమరం, కుంతం, శక్తి మొదలైన అనేకవిధాలైన ఆయుధవిద్యలలో రాకుమారు లందరినీ నేర్పరులను చేస్తున్న ద్రోణాచార్యులకీర్తి విని, హిరణ్యధన్వు డనే ఎరుకరాజుకొడుకు ఏకలవ్యు డనేవాడు విలువిద్యను నేర్చుకోవా లని వచ్చాడు. ఏకలవ్యుడు ఎరుకువాని కుమారు డని ద్రోణుడు శిష్యునిగా అంగీకరింపలేదు. అప్పుడు ఏకలవ్యుడు ద్రోణునిఅనుమతి పొంది వెళ్లి అడవిలో.

తే. వినయమున ద్రోణురూపు మన్నున నమర్చి । దాని కతిభక్తితోడఁ బ్రదక్షిణంబుఁ
జేసి మ్రొక్కుచు సంతతాభ్యాసశక్తి । నస్త్రవిద్యారహస్యంబు లర్థిఁ బడసె. 232

ప్రతిపదార్థం: వినయమునన్=అణకువతో; ద్రోణు, రూపు= ద్రోణుని బొమ్మను; మన్నునన్= మట్టితో; అమర్చి= చేసి; దానికిన్= ఆ బొమ్మకు; అతి, భక్తితోన్= మిక్కిలి భక్తితో; ప్రదక్షిణంబున్; చేసి; మ్రొక్కుచు; సంతత+అభ్యాస, శక్తిన్= ఎడతెగని అభ్యాసబలంచేత; అస్త్ర, విద్యా, రహస్యంబులు= విలువిద్యలోని మర్మాలు; అర్థిన్= సంతోషంతో; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: వినయంతో ఏకలవ్యుడు ద్రోణునిబొమ్మను మట్టితో చేసి నిలిపి, దానికి భక్తితో ప్రదక్షిణ నమస్కారాలు చేస్తూ, ఎడతెగని సాధనబలంచేత తానే విలువిద్యా రహస్యాలన్నీ గ్రహించాడు.

విశేషం: ఇది ఏకలవ్యునిముగ్ధ మైన స్థిరభక్తికి అద్దంపట్టే పద్యం. గురుముఖతః నేర్చుకొన్నవిద్యకంటె గురువుకు దూరంగా ఉన్నా, భక్తితో అధికమైనవిద్యను సాధించవచ్చు ననీ, విద్యాప్రాప్తికి గురుసాన్నిధ్యంకంటె గురుభక్తియే ముఖ్యం అనీ ఈ పద్యం బోధిస్తున్నది. గురుభక్తిని మించిన శక్తి లే దనే ఒక అర్థాంతరన్యాసాలంకారస్ఫూర్తినికూడా కలిగిస్తున్నది. అందువలన ఇందులో స్వతస్సంభవ్యర్థశక్త్యుద్భవాలంకారకృతవస్తుధ్వని ఉన్నది (సంపా.)

క. ఇట పాండవకౌరవు లొ ।క్కొట నందఱు గురుననుజ్ఞఁ గొని మృగయాలం
పటు లై వనమున కరిగిరి । పటుతరజవసారమేయభటనివహముతోన్. 233

ప్రతిపదార్థం: ఇట= హస్తినాపురంలో; పాండవ, కౌరవులు; ఒక్కొటన్= ఒకటిగా; అందఱు; గురు, అనుజ్ఞన్= గురువుయొక్క ఆజ్ఞను; కొని= పొంది; మృగయా, లంపటులు+ఐ= వేట అంటే ఎంతో ఆసక్తి కలిగినవా ళ్ళయి; పటుతర, జవసారమేయ, భట నివహముతోన్= మిక్కిలి ఎక్కువైనవేగం గల కుక్క లున్న భటులసమూహంతో; వనమునకున్= అడవికి; అరిగిరి= వెళ్లారు.

తాత్పర్యం: ఇక్కడ హస్తినాపురంలో పాండవులు, కౌరవులు కలిసి ద్రోణాచార్యుని అనుమతి పొంది, వేటపట్ల ఎంతో ఆసక్తి కలవా ళ్ళయి, మిక్కిలివేగం గల వేటకుక్కలతోకూడిన భటసమూహంతో అడవికి వెళ్ళారు.

వ. ఇ ట్లరిగి వనంబులోఁ గ్రమ్మరుచున్న నం దొక్క భటునికుక్క తోడు దప్పి పఱచి యొక్కెడ నేకతంబ యేయుచున్న నేకలవ్యుసమీపంబున మొఱింగిన, నయ్యేలుంగు విని దానిముఖంబునం దేడుబాణంబు లొక్కటఁ దొడిగి యక్కజంబుగా నతిలాఘవంబున వాఁ డేసిన, నది శరపూరితముఖం బయి కురుకుమారుల యొద్దకుం బాఱిన దానిం జూచి విస్మయం బంది య ట్లేసినవాఁ డెవ్వఁడో యని రోయుచు వచ్చువారు ముందఱ. 234

ప్రతిపదార్థం: ఇట్లు, అరిగి= ఈ విధంగా వెళ్లి, వనంబులోన్= అడవిలో; క్రుమ్మరుచున్+ఉన్నన్= తిరుగుతూఉండగా; అందున్= వానిలో; ఒక్క, భటుని, కుక్క= ఒకానొక భటునియొక్క కుక్క; తోడు; తప్పి; పఱచి= పరిగెత్తి; ఒక్క+ఎడన్= ఒకచోట; ఏకతంబు+అ= ఒంటరిగానే; ఏయుచున్నన్= బాణాలు వేస్తున్న; ఏకలవ్య, సమీపంబునన్= ఏకలవ్యుని దగ్గర; మొఱింగినన్= మొరవగా; ఆ+ఎలుంగు= ఆ కంఠధ్వని; విని, దాని, ముఖంబున+అందు= దాని నోటిలో; ఏడు, బాణంబులు; ఒక్కటన్= ఒకటిగా; తొడిగి= ధనుస్సులో ఎక్కుపెట్టి; అక్కజంబుగాన్= ఆశ్చర్యకరంగా; అతి లాఘవంబునన్= ఎంతో చాకచక్యంతో; వాఁడు= ఏకలవ్యుడు; ఏసినన్= కొట్టగా; అది= ఆ కుక్క; శర, పూరిత, ముఖంబు+అయి= బాణాలతో నిండిన నోరు కలిగిన దై; కురు కుమారుల, ఒద్దకున్= కౌరవపాండవుల కడకు; పాఱినన్= పరుగెత్తగా; దానిన్= ఆ కుక్కను; చూచి; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; అట్లు= ఆ విధంగా; ఏసినవాఁడు= కొట్టినవాడు; ఎవ్వఁడో= ఎవరో; అని= ఆ విధంగా; రోయుచున్= వెదకుతూ; వచ్చువారు= వస్తున్నవాళ్ళు; ముందఱన్= ఎదురుగా.

తాత్పర్యం: ఈ విధంగా వెళ్లి వెళ్లి, అడవిలో తిరుగుతూ ఉండగా, ఒక భటుడికుక్క తోడు తప్పి పరుగెత్తి ఒకచోట ఒంటరిగా బాణాలు వేస్తున్న ఏకలవ్యుడికి దగ్గరగా వెళ్ళి మొరిగింది. అతడు ఏడుబాణాలను ఒక్కటిగా వింట సంధించి అతిచాకచక్యంగా, ఆశ్చర్యకరంగా ఆ కుక్కనోట కొట్టాడు. అది బాణాలతో నిండిన నోటితో కురుకుమారుల దగ్గరికి పరుగెత్తింది. దానిని చూచివాళ్ళు ఆశ్చర్యపడి ఆ విధంగా కొట్టినవా డెవ్వడా అని వెదకుతూ వస్తుండగా - ఎదురుగా -

ఉ. తేజితబాణహస్తు, దృఢదీర్ఘమలీమసకృష్ణదేహుఁ, గృ
ష్ణాజినవస్త్రు నస్త్రవిషయాస్తవిషాదు నిషాదుఁ జూచి యా
రాజకుమారు లందఱుఁ బరస్పరవక్త్రవిలోకనక్రియా
వ్యాజమునం దదీక్షణనివారితు లై రతిమత్సరంబునన్. 235

ప్రతిపదార్థం: తేజిత, బాణ, హస్తున్= పదును పెట్టబడిన బాణం చేతిలో కలిగినవాడిని; దృఢ దీర్ఘ, మలీమస, కృష్ణ దేహున్= దిట్టమైనదీ, పొడవైనదీ, మురికి పట్టినదీ, నల్లనిదీ అయిన శరీరం కలవాడిని; కృష్ణ+అజిన, వస్త్రున్= జింకచర్మాన్ని వస్త్రంగా కలిగిన వాణ్ణి; అస్త్ర, విషయ+అస్త, విషాదున్= అస్త్రాల విషయంలో పోయిన దుఃఖం కలవాడిని; నిషాదున్= ఎరుకవాడిని; చూచి; ఆ, రాకుమారులు; అందఱున్; పరస్పర, వక్త్ర, విలోకన, క్రియా, వ్యాజమునన్= ఒకరిముఖాన్ని ఒకరు చూచుకొనటం అనే పని నెపంతో; అతి, మత్సరంబునన్= మిక్కిలి స్పర్ధచేత; తద్+ఈక్షణ, నివారితులు+ఐరి= అతడిని చూడడంనుండి తొలగించబడిన వా ళ్ళయ్యారు.

తాత్పర్యం: పదునుపెట్టినబాణాన్ని చేత పట్టుకొన్నవాడు, దిట్టమైనదీ, పొడవైనదీ, మురికిపట్టినదీ, నల్లనిదీ అయిన దేహాన్ని కలిగినవాడు, జింకచర్మాన్ని వస్త్రంగా ధరించినవాడు, అస్త్రవిద్యలో లోటు లేనివాడు అయిన ఏకలవ్యుడిని చూచి, ఆ రాకుమారులంతా విపరీతమయిన మాత్సర్యంచేత అతడిని చూడలేక ఒకరిముఖం ఒకరు చూచుకొన్నారు.

విశేషం: ఈపద్యశైలి ప్రసాదవిశిష్టమైన ఓజోగుణంతో పాత్రవిశిష్టతను ధ్వనింపచేస్తున్నది. అక్షరరమ్యం, ఉదాత్తమనోహరం అయిన నన్నయశైలికి ఉత్తమ ఉదాహరణాలుగా నిల్చే పద్యాలలో ఇది ఒకటి. స్థిరచిత్రాలను వర్ణించటంలో నన్నయ చూపిన నైపుణ్యానికి ఇదొక నిలువెత్తు సాక్ష్యం. (సంపా.) 'అస్త్ర' విషయాస్త' -కు 'అస్త్ర విషయాప్త' అని పాఠాంతరం ఉన్నది.

వ. అ క్కుమారులు వానిశరలాఘవంబునకు మెచ్చి 'నీ వెవ్వండ వెవ్వరిచేత విలువిద్యఁ గఱచి?' తని యడిగిన వారికి నయ్యెఱు కి ట్లనియె. 236

ప్రతిపదార్థం: ఆ+కుమారులు= ఆ కురు కుమారులు; వాని= ఆ ఏకలవ్యుని; శర, లాఘవంబునకున్= బాణప్రయోగంలో నేర్పునకు; మెచ్చి= పొగడి; నీవు, ఎవ్వండవు= నీవు ఎవడవు; ఎవ్వరిచేతన్= ఎవరిచేత; విలువిద్యన్= ధనుర్విద్యను; కఱచితివి= నేర్చావు? అని= ఆ విధంగా; అడిగినన్= అడుగగా; వారికిన్= ఆ కుమారులకు; ఆ+ఎఱుకు= ఆ ఎరుకవాడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ కుమారులు అతని బాణప్రయోగంలోని నేర్పరితనానికి మెచ్చి, 'నీ వెవ్వడవు? నీవు ఎవ్వరివద్ద విలువిద్య నేర్చుకొన్నావు?' అని అడుగగా వారితో ఆ బోయవాడు ఈ విధంగా అన్నాడు.

క. వినుఁ! డే హిరణ్యధన్వుం । డను వనచరనాథుకొడుక; నాచార్యుఁడు ద్రో
ణునకున్ శిష్యుఁడ; నెందును । ననవద్యుఁడ ; నేకలవ్యుఁ డనువాఁడ మహిన్. 237

ప్రతిపదార్థం: వినుఁడు; ఏన్= నేను; హిరణ్యధన్వుండు+అను= హిరణ్యధన్వుడు అనే పేరుగల; వనచరనాధుకొడుకన్= అడవిలో తిరిగేవాడైన ఎఱుకలరాజు కుమారుడిని; ఆచార్యుఁడు= గురువు; ద్రోణునకున్; శిష్యుఁడన్; ఎందునున్; అనవద్యుఁడన్= దోషంలేనివాడిని; మహిన్= భూమిలో; ఏకలవ్యుఁడు; అనువాఁడన్= అను పేరుగలవాడిని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వినండి. నేను హిరణ్యధన్వు డనే కిరాతరాజకుమారుడిని. ద్రోణాచార్యుల శిష్యుడిని. ఏదోషం లేని వాడిని. నాపేరు ఏకలవ్యుడు.

వ. అనిన విని కురుకుమారు లందఱు మగుడి వచ్చి ద్రోణున కంతయుఁ జెప్పి; రంత నర్జునుం డేకాంతంబ యొక్కనాఁ డాచార్యున కి ట్లనియె. 238

విశేషం: అనినన్= అని అనగా; విని; కురుకుమారులు; అందఱు; మగుడి, వచ్చి= తిరిగి వచ్చి; ద్రోణునకున్; అంతయున్; చెప్పిరి; అంతన్= అప్పుడు; అర్జునుండు= అర్జునుడు; ఏకాంతంబు+అ= రహస్యంగా; ఒక్క నాఁడు= ఒకరోజు; ఆచార్యునకున్= ద్రోణునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ఏకలవ్యు డనగా విని, కురుమారు లందరూ తిరిగివచ్చి ద్రోణునికి ఆ సంగతినంతా చెప్పారు. ఆ పైన అర్జునుడు ఏకాంతంగా ఒకనాడు ద్రోణునితో ఈ విధంగా అన్నాడు.

క. విలువిద్య నొరులు నీ క । గ్గలముగ లేకుండ నిన్నుఁ గఱపుదు నని మున్
బలికితిరి; నాక కా దీ । త్రిలోకముల కధికుఁ జూచితిమి యొక యెఱుకున్. 239

ప్రతిపదార్థం: విలువిద్యన్= విలువిద్యలో; ఒరులు= ఇతరులు; నీకున్; అగ్గలముగన్= అధికంగా; లేకుండ; నిన్నున్= నీకు; కఱపుదున్= నేర్పుతాను; అని= ఆ విధంగా; మున్= మునుపు లేదా ఇదివరకు; పలికితిరి= చెప్పినారు; నాకు+అ= నా ఒక్కనికే; కాదు; ఈ, త్రిలోకములకున్= ఈ ముల్లోకాలకూ; అధికున్= అధికమైనవానిని; ఒక, ఎఱుకున్= ఒక ఎరుకువాడిని; చూచితిమి.

తాత్పర్యం: విలువిద్యలో నీకంటె అధికులు లేనట్లుగా నేర్పుతా నని ఇదివరకు నాతో చెప్పారు. ఇప్పుడు నాకే కాదు, ఈ ముల్లోకాలకంటె అధికు డైన ఒకఎరుకను చూచాము.

క. నాకంటెను మీకంటెను । లోకములో నధికుఁ డతిబలుండు ధనుర్వి
ద్యాకౌశలమున; నాతఁడు । మీకుం బ్రియశిష్యుఁ డటె యమిథ్యావచనా ! 240

ప్రతిపదార్థం: అమిథ్యా, వచనా= అసత్యంకాని మాట కలవాడా!; ఆతఁడు= ఆ ఎరుకవాడు; ధనుర్విద్యా, కౌశలమునన్= విలువిద్యలోని నేర్పులో; లోకములో; నాకంటెను; మీకంటెను; అధికుఁడు; అతి, బలుండు= ఎంతో బలశాలి; మీకున్, ప్రియ, శిష్యుఁడు= మీకు ఇష్టమైన శిష్యుడు; అటె= ఔనటకదా!

తాత్పర్యం: అసత్యం కానిమాట గల ఆచార్యవర్యా! ఆ ఎరుకులవాడు విలువిద్యా నైపుణ్యంలో నాకంటె, మీకంటె ఈ లోకంలో అధికుడు, మహాబలవంతుడు, అతడు మీకు ప్రియశిష్యు డట కదా!

విశేషం: ఏకలవ్యుని విలువిద్యానైపుణ్యం అర్జునునికి ఆశ్చర్యజనకం, మాత్సర్యహేతువు కాగా, అతడు తాను ద్రోణాచార్య శిష్యుడి నన్న మాట పిడుగు పాటైంది. కాగా, ఆచార్యుడు చెప్పినమాటకు, చేసిన పనికి ఎంత భేదం! అర్జునునిహృదయం తుకతుక లాడిపోయింది, అయినా అర్జునునివంటి సంస్కారసంపన్నుడు అంతటి గురుదేవుడిని ఏ మనగలడు? అట్లా అని ఏమీ అనకుండా ఎట్లా ఉండగలడు? అందుచేతనే 'అమిథ్యావచనా'! - అసత్యం కానిమాట కలవాడా! అని ఒక్కమాట

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అన్నాడు. ఆ మాటలోని ఎత్తిపొడుపు ఈటెపోటు వంటిది. కాగా, అలతి, అలతి పదాలతో అతితీవ్రభావాలను ప్రకటించే నన్నయపద్యాలలో ఇది ఒకటి. నన్నయ సందర్భోచితంగా 'అర్థవ్యక్తి' అనే శబ్దగుణాన్ని వాడి, అర్జునుని మనసులోని బాధను, అమర్షను, అసూయను వ్యక్తంచేసే శక్తి కల సర్వనామాలను, అవ్యయాలను, నిపాతాలను నిపుణంగా ప్రయోగించి నాటకీయతను పోషించాడు. 'నాకంటె అధికుడు, మీకంటె అతిబలుడు అనటంలోనూ, 'మీకున్' ప్రియశిష్యుడు 'అటె' అనటంలోనూ గూఢమైన కోపంతోకూడిన అధిక్షేపం ఉన్నది. నిపాతాలనుసైతం కథాధ్వనికి వ్యంజకాలుగా వాడటం ఇక్కడివిశేషం. (సంపా.)

క. అనిన విని ద్రోణుం డదరిపడి 'వానిం జూతము ర'మ్మని యర్జునుం దోడ్కొని, యనవరతశరాసనాభ్యాసనిరతుం డయి యున్న యేకలవ్యుకడ కేఁగిన, నెఱింగి వాఁడు నెదురు పఱతెంచి ద్రోణునకు మ్రొక్కి తన శరీరంబు సర్వస్వంబును నివేదించి, 'యేను మీ శిష్యుండ; మి మ్మారాధించి మీ ప్రసాదంబున నివ్విలువిద్యఁ గఱచితి' నని కరంబులు మొగిచియున్నం జూచి, ద్రోణుం 'డట్లేని మాకు గురుదక్షిణ యి'మ్మనిన సంతసిల్లి వాఁ డిట్లనియె. 241

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; విని; ద్రోణుండు; అదిరిపడి= ఉలిక్కిపడి; వానిన్= అతనిని; చూతము= చూస్తాము; రమ్ము; అని; అర్జునున్, తోడ్కొని= తీసికొని; అనవరత, శర+ఆసన+అభ్యాస, నిరతుండు+అయి= ఎడతెగని విలువిద్యయొక్క అభ్యాసంలో మిక్కిలి ఆసక్తికలవాడై; ఉన్న; ఏకలవ్య, కడకున్= ఉండే ఏకలవ్యుని దగ్గరకు; ఏఁగినన్= వెళ్లగా; ఎఱింగి= (వారి రాకను) తెలిసికొని; వాఁడు= ఏకలవ్యుడు; ఎదురు, పఱతెంచి= ఎదురుగా వచ్చి; ద్రోణునకున్; మ్రొక్కి; తన, శరీరంబు= తనయొక్క దేహము; సర్వస్వంబును=మొత్తం సంపదను; నివేదించి= అర్పించి; ఏను, మీ, శిష్యుండన్= నేను మీ శిష్యుణ్ణి; మిమ్ము+ఆరాధించి= మిమ్మల్ని సేవించి; మీ, ప్రసాదంబునన్= మీ అనుగ్రహంచేత; ఈ విలువిద్యన్= ఈ ధనుర్విద్యను; కఱచితిని= నేర్చుకొన్నాను; అని= అంటూ; కరంబులు= చేతులు; మొగిచి= ముడిచి; ఉన్నన్= ఉండగా; చూచి= కనుగొని; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; అట్లు+ఏని= అలా అయినట్లయితే; మాకున్; గురుదక్షిణ+ఇమ్ము= గురుదక్షిణ నిమ్ము; అనినన్= అనగా; సంతసిల్లి=సంతోషించి; వాఁడు= ఆ ఏకలవ్యుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని ద్రోణుడు అదిరిపడి అతడిని చూద్దాం ర మ్మని అర్జునుని తీసికొని, నిరంతరం విలువిద్యను సాధనచేయటంలో మునిగి ఉన్న ఏకలవ్యునిదగ్గరకు వెళ్లాడు. వాళ్ళ రాకను ఏకలవ్యుడు తెలిసికొని, ఎదురు వచ్చి ద్రోణునికి నమస్కరించి, తనశరీరాన్నీ, మొత్తం సంపదనూ ఆయనకు సమర్పించి, 'నేను మీ శిష్యుడిని. మిమ్మల్ని సేవించి ఈ విలువిద్య నేర్చుకొన్నాను' అని చేతులు జోడించి నిలిచినాడు. అతడిని చూచి ద్రోణుడు 'అయితే నాకు గురుదక్షిణ ఇ'మ్మన్నాడు. అందుకు సంతోషించి ఏకలవ్యుడు ఇట్లా అన్నాడు.

క. 'ఇది దేహం; బిది యర్థం; । బిది నా పరిజనసమూహ; మిన్నిటిలో నె
య్యది మీ కిష్టము దానిన । ముద మొదవఁగ నిత్తుఁ గొనుఁ డమోఘం' బనినన్. 242

ప్రతిపదార్థం: ఇది, దేహంబు; ఇది; అర్థంబు= ధనం; ఇది; నా, పరిజన, సమూహము= నా సేవకుల సమూహం; ఇన్నిటిలోన్; ఏ+అది; మీకున్; ఇష్టము; దానిన్+అ= దానినే; ముదము= సంతోషం; ఒదవఁగన్= కలిగేట్లుగా; ఇత్తున్; కొనుఁడు= తీసికొనండి; అమోఘంబు= ఇది తప్పనిది - అంటే దీనికి తిరుగులేదు; అనినన్= అని అనగానే.

తాత్పర్యం: 'ఇది నాదేహం, ఇది నాధనం. ఇది నాసేవకసమూహం. వీటిలో మీ కేది ఇష్టమో దానిని తప్పకుండా, సంతోషంగా ఇస్తాను. తీసికొనండి. దీనికి తిరుగులేదు' అని అనగా.

విశేషం: అంతటిగురువు తానై వచ్చి గురుదక్షిణ కోరటమే కొండంత భాగ్యంగా భావించి, ఉన్న దంతా ఆయన ముందుంచిన ఏకలవ్యుని ఉన్నతోన్నతగురుభక్తికి ఈ పద్యం అద్దంవంటిది. అతనిమాటలలో సర్వార్పణభావంతోడి ముగ్ధభక్తి మూర్తికట్టింది.

క. 'నెమ్మిని నీ దక్షిణహ । స్తమ్మున పెనువ్రేలు దునిమి దక్షిణ యి; మ్మి
ష్ట మ్మిది నా 'కనపుడు విన । యమ్మున వాఁ డిచ్చె దాని నాచార్యునకున్. 243

ప్రతిపదార్థం: నెమ్మిని= ప్రీతితో; నీ, దక్షిణ, హస్తమ్మున, పెను, వ్రేలు= నీ కుడిచేతి బొటన వ్రేలిని; తునిమి= కోసి; దక్షిణ= దక్షిణగా; ఇమ్ము; ఇది; నాకున్; ఇష్టమ్ము; అనవుడు= అని అనగా; వాఁడు= ఆ ఏకలవ్యుడు; వినయమ్మునన్= వినయముతో; దానిన్= ఆ బొటనవ్రేలిని; ఆచార్యునకున్= ద్రోణాచార్యులకు; ఇచ్చెన్.

తాత్పర్యం: ' నీ కుడిచేతి బొటనవ్రేలిని కోసి ప్రీతితో నాకు గురుదక్షిణగా ఇమ్ము. అది నా కిష్టం' అని ద్రోణు డనగానే ఏకలవ్యుడు వినయంతో దానిని ఆచార్యునికి ఇచ్చాడు.

తే. దక్షిణాంగుష్ఠ మిచ్చిన దానఁ జేసి । బాణసంధానలాఘవభంగ మయిన
నెఱుకు విలువిద్య కలిమికి హీనుఁ డయ్యెఁ; బార్థునకును మనోరుజ పాసె నంత. 244

ప్రతిపదార్థం: దక్షిణ+అంగుష్ఠము = కుడిచేతి బొటనవ్రేలిని; ఇచ్చిన; దానన్+చేసి = ఇచ్చినందువలన; బాణ, సంధాన, లాఘవ, భంగము= బాణాన్ని కూర్చటంలోని నేర్పుకు లోపం; అయినన్= కాగా; ఎఱుక= ఆ ఏకలవ్యుడు; విలువిద్య, కలిమికి= ధనుర్విద్య అనే సంపదకు; హీనుఁడు= లేనివాడు; అయ్యెన్= అయ్యాడు; పార్థునకును= అర్జునునికిని; మనస్+రుజ= మానసిక దుఃఖం; పాసెన్= తొలగింది; అంతన్= అనంతరం.

తాత్పర్యం: కుడిచేతిబొటనవ్రేలు ఇవ్వటంచేత బాణాన్ని కూర్చటంలో నేర్పు లోపించి ఏకలవ్యుడు విలువిద్యా సంపద కోల్పోయాడు. దానివలన అర్జునునికి దుఃఖం తొలగింది.

క. 'విలువిద్య నొరులు నీ క । గ్గలముగ లేకుండ నిన్నుఁ గఱపుదు' నని మున్
బలరిపుసుతునకుఁ బలికిన । పలు కప్పడు గురుఁడు సేసెఁ బరమార్థముగన్. 245

ప్రతిపదార్థం: విలువిద్యన్= విలువిద్యలో; ఒరులు= ఇతరులు; నీకున్; అగ్గలముగన్= అధికంగా; లేకుండన్= లేకుండునట్లు; నిన్నున్; కఱపుదున్= నేర్పుతాను; అని= ఆ విధంగా; మున్= పూర్వం; బల, రిపు, సుతునకున్= బలు డనే రాక్షసుడికి శత్రువైన ఇంద్రునికుమారునికి - అర్జునునికి; పలికిన, పలుకు= చెప్పిన మాటను; అప్పుడు; గురుఁడు= ద్రోణుడు; పరమార్థముగన్= సత్యంగా; చేసెన్.

తాత్పర్యం: 'విలువిద్యలో ఇతరులు నీకంటె అధికులు కాకుండా నీకు నేర్పుతా' నని, ఇదివరకు ద్రోణుడు అర్జునుని కిచ్చిన మాట అప్పుడు నిజం చేశాడు.

మత్తకోకిల.

భూపనందను లివ్విధంబున భూరిశస్త్రమహాస్త్రవి
ద్యోపదేశపరిగ్రహస్థితి నున్న నందఱయందు వి

ద్యోపదేశము దుల్య మైనను నుత్తమోత్తముఁ డయ్యె వి

ద్యాపరిశ్రమకౌశలంబున దండితారి నరుం డిలన్. 246

ప్రతిపదార్థం: భూప, నందనులు= రాకుమారులు; ఈ+విధంబునన్; భూరి, శస్త్ర, మహా+అస్త్ర, విద్యా+ఉపదేశ, పరిగ్రహ, స్థితిన్= గొప్ప ఆయుధవిద్యయొక్క, గొప్ప అస్త్రవిద్యయొక్క బోధను గ్రహించటం అనే స్థితిలో; ఉన్నన్= ఉండగా; అందఱు, అందున్= అందరిలో; విద్యా+ఉపదేశము= విద్యాబోధన; తుల్యము= సమానం; అయినను= అయినప్పటికి; దండిత+అరి= శిక్షించబడిన శత్రువులు గలవాడు; నరుండు= అర్జునుడు; విద్యా, పరిశ్రమ, కౌశలంబునన్= విద్యయొక్క అభ్యాసపు నేర్పుచేత; ఇలన్= భూమిలో; ఉత్తమ+ఉత్తముఁడు= శ్రేష్ఠులలో శ్రేష్ఠుడు; అయ్యెన్.

తాత్పర్యం: రాజకుమారులు ద్రోణునివలన గొప్పశస్త్రాస్త్రవిద్యాబోధనను పొందటంలో అంతా సమానమే అయినా, అర్జునుడు విశేషంగా సాధన చేసి సర్వశ్రేష్ఠు డయ్యాడు.

విశేషం: మత్తకోకిలపాదంలో ర,స,జ,జ,భ, ర - అనే గణాలు వరుసగా ఉంటాయి. 11వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది.

క. అనిలాత్మజు బలమును న। ర్జును కార్ముక కౌశలంబు శూరగుణంబుల్

మనమున సహింపనోపక। వనరుచు ధృతరాష్ట్రసుతులు వందిరి తమలోన్. 247

ప్రతిపదార్థం: అనిల+ఆత్మజు, బలమును= వాయుపుత్రుడైన భీముని బలాన్ని; కార్ముక, కౌశలంబు= అర్జునుని విలువిద్యా నైపుణ్యం; శూర, గుణంబుల్= వీరలక్షణాలు; మనమునన్= మనసులో; సహింపన్+ఓపక= ఓర్వలేక; ధృతరాష్ట్ర సుతులు= కౌరవులు; వనరుచున్ = బాధపడుతూ; తమలోన్; వందిరి= దుఃఖించారు.

తాత్పర్యం: భీమునిబలాన్నీ, అర్జునుని విలువిద్యానైపుణ్యాన్నీ, వీరలక్షణాలనూ చూచి, సహించలేక కౌరవులు తమలో తాము ఎంతో దుఃఖాన్ని పొందారు.

ద్రోణుఁ డస్త్రవిద్యం దనశిష్యులఁ బరీక్షించుట (సం.1-123-15)

వ. అ క్కుమారుల ధనుర్విద్యా కౌశలం బెఱుంగ వేఁడి యొక్కనాఁడు ద్రోణుండు కృత్రిమం బయిన భాసం బను పక్షి నొక్క వృక్షశాఖాగ్రంబున లక్ష్యంబుగా రచియించి, దాని నందఱకుఁ జూపి 'మీమీ ధనువుల బాణంబులు సంధించి నా పంచిన యప్పుడ యిప్పక్షి తలఁ దెగ నేయుం; డే నొక ళ్లొకళ్లన పంచెద' నని ముందఱ ధర్మనందనుం బిలిచి 'యీ వృక్షశాఖాగ్రంబున నున్న పక్షి నిమ్ముగా నీక్షించి మద్వచనానంతరంబున శరమోక్షణంబు సేయు మనిన నతండును వల్లె యని గురువచనంబు సేసి యున్న నయ్యుధిష్ఠిరునకు ద్రోణుం డి ట్లనియె. 248

ప్రతిపదార్థం: ఆ కుమారుల= ఆ కురుకుమారులయొక్క; ధనుర్విద్యా, కౌశలంబు= విలువిద్యలోని నేర్పు; ఎఱుంగన్= తెలుసుకొనాలని; వేఁడి=కోరి; ఒక్కనాఁడు= ఒకరోజు; ద్రోణుండు; కృత్రిమంబు+అయిన= కల్పించబడిన దైన; భాసంబు= గ్రద్ద; అను, పక్షిన్= అనే పక్షిని; ఒక్క; వృక్ష, శాఖా+అగ్రంబున= ఒక చెట్టుకొమ్మచివరిలో; లక్ష్యంబుగాన్= గురిగా; రచియించి= కూర్చి; దానిన్; అందఱకున్= అందరికి; చూపి; మీ, మీ, ధనువులన్= మీమీవిండ్లయందు; బాణంబులు; సంధించి= ఎక్కుపెట్టి; నా, పంచిన, అప్పుడు+అ= నేను ఆజ్ఞాపించిన సమయంలోనే; ఈ, పక్షి, తలన్= ఈ పక్షి యొక్క తలను; తెగన్= తెగేట్లుగా; ఏయుండు= కొట్టండి; ఏన్= నేను; ఒకళ్లు+ఒకళ్లన= ఒక్కొక్కరినీ; పంచెదన్= ఆజ్ఞాపిస్తాను;

అని= ఆ ప్రకారంగా; ముందఱ; = మొదట; ధర్మనందనున్, పిలిచి = ఆ ధర్మరాజుని పిలిచి; ఈ, వృక్ష, శాఖా+అగ్రంబునన్= ఈ చెట్టుకొమ్మ కొనలో; ఉన్న= ఉండు; పక్షిన్= పక్షిని; ఇమ్ముగాన్= తగిన విధంగా; ఈక్షించి= చూచి; మద్+వచన+అనంతరంబునన్; నా మాట తర్వాత; శర, మోక్షణంబు= బాణాన్ని వదలటం; చేయుము; అనినన్= అనగా; అతండును = ఆ ధర్మరాజును; వల్లె, అని= సరే, అని; గురు, వచనంబు= గురువుగారి మాటను; చేసి= సిద్ధము గావించి; ఉన్నన్= ఉండగా; ఆ+యుధిష్ఠిరునకున్= ఆ ధర్మరాజుతో; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ కురుకుమారుల విలువిద్యా నైపుణ్యాన్ని తెలిసికొన గోరి ఒకనాడు ద్రోణుడు, భాస మనే పక్షిని రూపొందించి, ఒకచెట్టుకొమ్మచివరన కట్టి, దానిని అందరికీ చూపి, 'నేను చెప్పినప్పుడు మీమీ ధనువులు ఎక్కు పెట్టి, ఆ పక్షితలను తెగగొట్టండి. నేను ఒక్కొక్కరినే ఆజ్ఞాపిస్తాను' అని ముందుగా ధర్మరాజును పిలిచి 'ఈ చెట్టుకొమ్మ కొసన ఉండే పక్షిని చక్కగా చూచి, నేను చెప్పినప్పుడు బాణంతో కొట్టుము', అనగా, అతడు సరే అని గురువుమాట ప్రకారం సిద్ధంగా ఉండగా, ద్రోణుడు ఇట్లా అన్నాడు.

తే. 'వృక్షశాఖాగ్రమున నున్న పక్షిశిరము । దెల్లముగఁ జూచితే మహీవల్లభుండ!'
యనిన నిమ్ముగఁ జూచితి ననిన, వెండి । యును గురుఁడు ధర్మజున కిట్టు లనియెఁ బ్రీతి. 249

ప్రతిపదార్థం: మహీ, వల్లభుండ= ఓ రాజా!; వృక్ష, శాఖా+అగ్రమునన్= చెట్టుకొమ్మచివరన; ఉన్న, పక్షి, శిరము= ఉండే పక్షితల; తెల్లముగన్= స్పష్టంగా; చూచితే= చూచావా?; అనినన్= అనగా; ఇమ్ముగాన్= చక్కగా; చూచితిని; అనినన్= అని చెప్పగా; వెండియును= మఱియును; గురుఁడు= ద్రోణుడు; ప్రీతిన్= ప్రీతితో; ధర్మరాజునకున్; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! చెట్టుకొమ్మచివర ఉన్న పక్షితలను స్పష్టంగా చూచావా' అని అడుగగా; చక్కగా చూచా నని అతడు చెప్పగా, మరల ద్రోణుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

క. జననుత! యా ద్రూనిని న । న్నును మఱి నీ భ్రాతృవరులనుం జూచితె నీ?'
వనవుడుఁ జూచితి నన్నిటి । ననఘా! వృక్షమున నున్న యవ్విహగముతోన్. 250

ప్రతిపదార్థం: జన, నుత,= జనులచేత పొగడబడేవాడా! ఓ ధర్మరాజా!; ఆ, ద్రూనిని= ఆ చెట్టును; నన్నును= నన్ను; మఱి= ఇంకా; నీ, భ్రాతృ, వరులనున్= నీయొక్క ఉత్తములైన తమ్ములను; నీవు; చూచితె= చూశావా; అనవుడు= అని అనగా; అనఘా= పాపంలేనివాడా! ఓ ద్రోణాచార్యా!; వృక్షమునన్, ఉన్న= చెట్టుపై నున్నట్టి; ఆ+విహంగముతోన్= ఆ పక్షితోసహా; అన్నిటిన్; చూచితిన్.

తాత్పర్యం: 'జనులచేత పొగడబడే ఓ ధర్మరాజా! ఆమానును, నన్ను, నీతమ్ముళ్లని చూశావా?' అని ద్రోణుడు అడుగగానే, 'పుణ్యాత్మా! చెట్టుమీద నున్న ఆ పక్షితోపాటు అన్నిటినీ చూచా'నని ధర్మరాజు అన్నాడు.

వ. అనిన విని ద్రోణుండు ధర్మజుం బదరి 'నీ దృష్టి చెదరె; నీవు దీని నేయనోపవు పాయు' మని యివ్విధంబున దుర్యోధనాదు లైన ధార్తరాష్ట్రులను భీమసేన నకుల సహదేవులను నానాదేశాగతు లైన రాజపుత్త్రులను గ్రమంబున నడిగిన వారలు ధర్మనందను చెప్పినట్ల చెప్పిన, నందఱ నిందించి, పురందరనందనుం బిలిచి వారి నడిగిన యట్ల యడిగిన నాచార్యునకు నర్జునుం డి ట్లనియె. 251

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ద్రోణుండు; ధర్మజున్; పదరి= నిందించి; నీ, దృష్టి= నీ చూపు; చెదరెన్= చెదరింది; నీవు, దీనిన్= నీవు ఈ పక్షిని; ఏయన్+ఓపవు= కొట్టలేవు; పాయుము= తప్పుకో; అని= అంటూ నిర్దేశించి; ఈ+విధంబునన్= ఈ రీతిగా; దుర్యోధన+ఆదులు+ఐన= దుర్యోధనుడు మొదలైనవారైన; ధార్తరాష్ట్రులను; నానా, దేశ+ఆగతులు+అయిన= వివిధదేశాలనుండి వచ్చినవా రైన; రాజ, పుత్రులను= రాకుమారుల్ని; క్రమంబునన్= వరుసగా; అడిగినన్= అడుగగా; వారలు= వాళ్లు; ధర్మనందను, చెప్పినట్లు+అ= ధర్మరాజు చెప్పినట్లే; చెప్పినన్= చెప్పగా; అందఱన్= అందరినీ; నిందించి= దూషించి; పురందర, నందనున్= దేవేంద్రుని కుమారుడైన అర్జునుడిని; పిలిచి= చెంతకు పిలిచి; వారిన్= వాళ్లను; అడిగిన, అట్లు+అ= అడిగిన విధంగానే; అడిగినన్= అడుగగా; ఆచార్యునకున్= ద్రోణునకు; అర్జునుండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని ద్రోణుడు ధర్మరాజును నిందించి 'నీ దృష్టి చెదిరింది. నీవు దీనిని కొట్టలేవు. ప్రక్కకు తప్పుకొమ్మ' అన్నాడు. అదే విధంగా దుర్యోధనుడు మొదలైన కౌరవులను, భీమసేననకులసహదేవులను, వివిధ దేశాలనుండి వచ్చిన రాకుమారులను వరుసగా అడుగగా, వా ళ్ళంతా ధర్మరాజు ఇచ్చిన సమాధానమే ఇచ్చారు. ద్రోణుడు అందరినీ నిందించి, తర్వాత అర్జునుడిని పిలిచి వాళ్ళను అడిగినట్లే అడుగగా అత డిట్లా అన్నాడు.

క. 'పక్షిశిరంబు దిరంబుగ । నీక్షించితి; నొండు గాన నెద్దియు' ననినన్
లక్షించి యేయు మని సూ । క్ష్మేక్షణు ద్రోణుండు పనిచె నింద్రతనూజున్. 252

ప్రతిపదార్థం: పక్షి, శిరంబు= పక్షితలను; తిరంబుగన్= చక్కగ; ఈక్షించితిన్= చూచాను; ఒండు= ఇతరం; ఎద్దియున్= ఏదీ కూడా; కానన్= చూడటం లేదు; అనినన్= అని తెల్పగా; లక్షించి= గురిపెట్టి; ఏయుము= కొట్టుము; అని= ఆ ప్రకారం; ద్రోణుండు; సూక్ష్మ+ఈక్షణున్= సునిశిత మైన దృష్టి గల; ఇంద్రతనూజున్= అర్జునుని; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: 'పక్షితలను చక్కగా చూచాను. ఇం కేదీ నాకు కనిపించటం లేదు' అని అర్జునుడు అనగా, ద్రోణుడు 'గురి చూచి కొట్టుము' అని సూక్ష్మదృష్టి గల అర్జునుని ఆజ్ఞాపించాడు.

క. గురువచనానంతరమున । నరుఁ డప్పుడు శరవిమోక్షణము సేయుఁడుఁ జె
చ్చెరఁ బక్షిశిరము దెగి త । ద్ధరణీరుహశాఖనుండి ధారుణిఁ బడియెన్. 253

ప్రతిపదార్థం: గురు, వచన+అనంతరమునన్= గురువుమాట తర్వాత; నరుఁడు= అర్జునుడు; అప్పుడు; శర, మోక్షణము= బాణాన్ని విడవటం; చేయుఁడున్= చేయగా; చెరన్+చెరన్= తత్క్షణమే; పక్షి, శిరము= పక్షితల; తెగి; తద్+ధరుణీరుహ, శాఖ నుండి= ఆ చెట్టుకొమ్మనుండి; ధారుణిన్= భూమిమీద; పడియెన్= పడింది.

తాత్పర్యం: గురువు చెప్పిన తర్వాత అర్జునుడు బాణాన్ని వదిలాడు. ఆ పక్షితల తత్క్షణమే తెగి చెట్టుకొమ్మ నుండి నేలమీద పడింది.

వ. ఇ ట్లశ్రమంబునఁ గృత్రిమపక్షితలఁ దెగనేసిన యర్జును నచలితదృష్టికి లక్ష్యవేధిత్వంబునకు మెచ్చి ద్రోణుం డాతనికి ధనుర్వేదరహస్యంబు లుపదేశించె; నంత. 254

ప్రతిపదార్థం: ఇట్లు; అశ్రమంబునన్= సులువుగా; కృత్రిమ, పక్షి తలన్= కల్పింపబడిన పక్షియొక్క తలను; తెగన్, ఏసిన= తెగునట్లు కొట్టిన; అర్జును= అర్జునునియొక్క; అచలిత దృష్టికి= చెదిరిపోని దృష్టికి; లక్ష్య, వేధిత్వంబునకున్= గురిని

కొట్టగలిగినందుకు; మెచ్చి= పొగడి; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; అతనికి= అర్జునునికి; ధనుర్వేద, రహస్యంబులు= విలువిద్యలోని రహస్యాలు; ఉపదేశించెన్; అంతన్= తర్వాత.

తాత్పర్యం: ఈ విధంగా సులువుగా ఆ కల్పితపక్షితలను తెగగొట్టిన అర్జుననినిశ్చలదృష్టికీ, గురిని కొట్టే సామర్థ్యానికీ, ద్రోణుడు మెచ్చి, అతనికి విలువిద్యారహస్యాలు ఉపదేశించాడు. తర్వాత.

అర్జునుఁడు ద్రోణుని మొసలినుండి విడిపించుట (సం. 1-123-68)

క. మానుగ రాజకుమారుల । తో నొక్కట నొక్కనాఁడు ద్రోణుఁడు గంగా
స్నానార్థ మరిగి యందు మ । హా నియమస్థుఁ డయి నీళ్ల నాడుచునున్నన్. 255

ప్రతిపదార్థం: మానుగన్= ఒప్పుగ; రాజ, కుమారులతోన్= కురుకుమారులతో; ఒక్కటన్= ఒక్కటిగా; ఒక్కనాఁడు; ద్రోణుఁడు; గంగా, స్నాన+అర్థము= గంగానదిలో స్నానం చేయటంకొరకు; అరిగి= వెళ్లి; అందున్= ఆ నదిలో; మహా, నియమస్థుఁడు+అయి= గొప్పనియమం కలిగినవా డై; నీళ్లన్, ఆడుచున్= స్నానం చేస్తూ; ఉన్నన్= ఉండగా.

తాత్పర్యం: ఒకనాడు రాకుమారు లందరితో కలిసి ద్రోణుడు గంగాస్నానం చేయటానికై వెళ్లి, ఎంతోనిష్ఠతో నీటిలో స్నానం చేస్తుండగా.

క. వెఱచఱవ నీరిలో నొ । క్కెఱగా నొక మొసలి చూడ్కి కగోచర మై
పఱతెంచి కుంభసంభవు । చిఱుదొడ వడిఁ బట్టికొనియె శిష్యులు బెదరన్. 256

ప్రతిపదార్థం: వెఱచఱవ= భయపడేట్లుగా; నీరిలోన్= నీటిలో; ఒక్కెఱగాన్= భయంకరంగా; ఒక; మొసలి= మొసలి; చూడ్కికిన్= చూడటానికి; అగోచరము+ఐ= కనిపించనిదై; పఱతెంచి= వచ్చి; కుంభసంభవు, చిఱుతొడ= ద్రోణునియొక్క పిక్కను; శిష్యులు, బెదరన్= శిష్యులంతా బెదరునట్లు; వడిన్= వేగంగా; పట్టుకొనియెన్= పట్టుకొన్నది.

తాత్పర్యం: నీళ్ళల్లో భయంకరంగా ఒకమొసలి కంటికి కనపడకుండా వచ్చి, శిష్యులంతా బెదిరేటట్లుగా ద్రోణాచార్యుని పిక్కను వెంటనే పట్టుకొన్నది.

క. దాని విడిపింప ద్రోణుఁడు । దా నపుడు సమర్థుఁ డయ్యుఁ దడయక పనిచెన్
'దీని విడిపింపుఁ' డని నృప । సూనుల శరసజ్యచాపశోభితకరులన్. 257

ప్రతిపదార్థం: దానిన్= ఆ మొసలిని; విడిపింపన్= విడిపించటానికి; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; తాన్; అపుడు= ఆ సమయంలో; సమర్థుఁడు+అయ్యున్= సామర్థ్యం కలిగినవాడు అయికూడా; తడయక= ఆలస్యం చేయకుండా; దీనిన్= ఈ మొసలిని; విడిపింపుఁడు; అని; శర, సజ్య, చాప, శోభిత, కరులన్= బాణాలచేత, అల్లెత్రాళ్లచేత కూడిన ధనుస్సులతో ప్రకాశిస్తున్న చేతులు కలవారిని; నృప, సూనులన్= రాకుమారులను; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: ఆ మొసలిని విడిపించటానికి ద్రోణు డపుడు తాను సమర్థు డైకూడా ఆలస్యం లేకుండా దీన్ని విడిపించం డని ధనుర్బాణాలు చేత ధరించిఉన్నరాకుమారులను ఆజ్ఞాపించాడు.

శా. దానిన్ నేరక యందఱున్ వివశు లై తా రున్న నన్నీరిలోఁ
గానం గాని శరీరముం గల మహోగ్ర గ్రాహమున్ గోత్ర భి
త్సూనుం డేనుశరంబులన్ విపులతేజుం డేసి శక్తిన్ మహా
సేనప్రఖ్యుఁడు ద్రోణుజంఘ విడిపించెన్ విక్రమం బొప్పఁగన్. 258

ప్రతిపదార్థం: దానిన్= ఆ మొసలిని విడిపించటం; నేరక= చేతకాక; అందఱున్; వివశులు+ఐ= మైమరచినవాళ్ళయి; తారు= తాము; ఉన్నన్= ఉండగా; ఆ+నీరిలోన్; కానన్+కాని= చూడటానికి సాధ్యపడని; శరీరమున్+కల= దేహంఉండే; మహా+ఉగ్ర, గ్రాహమున్= మిక్కిలి భయంకరం అయిన మొసలిని; విపుల, తేజుండు= ఎంతో పరాక్రమం కలవాడు; శక్తిన్= బలంలో; మహాసేన, ప్రఖ్యుఁడు= కుమారస్వామితో సమానుడు; గోత్ర, భిత్+సూనుండు= కొండలను చీల్చిన దేవేంద్రునియొక్క కుమారుడు; ఏను, శరంబులన్= అయిదు బాణాలతో; ఏసి= కొట్టి; విక్రమంబు= పరాక్రమం; ఒప్పఁగన్= ప్రకాశించేటట్లు; ద్రోణు, జంఘన్= ద్రోణాచార్యునియొక్క పిక్కను; విడిపించెన్.

తాత్పర్యం: ఆ రాకుమారులంతా మొసలిని విడిపించటం చేతకాక దిక్కుతెలియనిస్థితిలో ఉండగా, మహాపరాక్రమశాలి, శక్తిలో కుమారస్వామివంటివాడు, పర్వతాలరెక్కలు నరికిన దేవేంద్రునిపుత్త్రుడు అయిన అర్జునుడు, నీటిలో కనిపించకుండా ఉన్న ఆ భయంకరమైన మొసలిని అయిదుబాణాలతో కొట్టి, ద్రోణాచార్యుని పిక్కను విడిపించాడు.

వ. అ మ్మహోగ్రగ్రాహంబు పార్థబాణపంచకవిభిన్నదేహం బయి పంచత్వంబుఁ బొందినం జూచి, ద్రోణుం డర్జును ధనుఃకౌశలంబునకుఁ దనయం దతిస్నేహంబునకు మెచ్చి, వీనిచే ద్రుపదుండు బంధుసహితంబు పరాజితుండగు నని తనమనంబున సంతోషించి, వానికి ననేకదివ్యబాణంబు లిచ్చె నని యర్జునుకొండుకనాఁటి పరాక్రమ గుణసంపదలు వైశంపాయనుండు జనమేజయునకుం జెప్పె నని. 259

ప్రతిపదార్థం: ఆ+మహా=ఉగ్ర, గ్రాహంబు= ఆ గొప్ప భయంకరమయిన మొసలి; పార్థ, బాణ, పంచక, విభిన్న, దేహంబు+అయి= అర్జునునిబాణాలు అయిదింటిచేత చీల్చబడిన శరీరం కలదై; పంచత్వంబున్= మరణాన్ని; పొందినన్= పొందగా; చూచి= కనుగొని; ద్రోణుండు; అర్జును, ధనుస్+కౌశలంబునకున్= అర్జునుని విలువిద్యానైపుణ్యానికి; తనయందు= తనపై; అతి, స్నేహంబునకున్= మిక్కిలి ప్రీతికి; మెచ్చి= పొగడి; వీనిచే= వీనివల్ల; ద్రుపదుండు; బంధు, సహితంబు= బంధువులతో సహా, పరాజితుండు= ఓడగొట్టబడినవాడు; అగున్= కాగలడు; అని= అని; తన, మనంబునన్; సంతోషించి; వానికిన్= ఆ అర్జునునికి; అనేక, దివ్య, బాణంబులు= అనేకదేవతాసంబంధమైనబాణాలు; ఇచ్చెన్; అని; అర్జును, కొండుకనాఁటి= అర్జునుని యొక్కచిన్ననాటి; పరాక్రమ, గుణ, సంపదలు= పరాక్రమంయొక్క, గుణాలయొక్కగొప్పలు; వైశంపాయనుండు; జనమేజయునకున్; చెప్పెన్; అని.

తాత్పర్యం: 'ఆ అతిభయంకరమయిన మొసలి అర్జునుని అయిదుబాణాలచేత శరీరం చీలి మరణించింది. అది చూచి ద్రోణుడు అర్జునుని విలువిద్యానైపుణ్యానికి, తనపట్ల గల ప్రేమకు మెచ్చి, అతనిచేత ద్రుపదుడు బంధువులతో సహా ఓడిపోగల' డని సంతోషించి అనేకదివ్యబాణాలు అతనికిచ్చాడు' - అని అర్జునునిచిన్ననాటి పరాక్రమ గుణవిశేషాలు వైశంపాయనుడు జనమేజయునికి చెప్పె నని.

విశేషం: ద్రోణుడు ధృతరాష్ట్రపాండురాజకుమారులకు విలువిద్య నేర్పటంలో కొంత స్వార్థం ఉంది. అది ద్రుపదుడిని తన శిష్యులచేత అవమానింప చేయటం, భీష్ముడు తన మనుమ లందరినీ శిష్యులుగా చేసిన మరుక్షణమే గురువుగా తనకోర్కెను

తీర్చేవా ళ్ళెవ రని వాళ్ళని ప్రశ్నించాడు. అర్జును డొక్కడే అనుకూలంగా స్పందించాడు. మొసలిని చంపి ద్రోణుడిని కాపాడటంతో విలువిద్యాభ్యాసం పూర్తి అయినట్లు వస్తుధ్వని. అర్జునుడు ఏకైక వీరుడిగా ప్రకాశించాడు. ద్రోణునికోర్కె తీరింది. ద్రుపదుడిని సపరివారంగా ఓడించ గలిగిన ఒక మహావీరుడిని తయారు చేయగలిగినందుకు ద్రోణుడు సంతోషించాడు. ఇది భావికథకు నాంది. పూర్వాపరసంబంధం కల కథాకథనశిల్పం. (సంపా.)

ఆశ్వాసాంతము

క. వ్యసనవివర్జిత ! మాన । వ్యసగోత్రపవిత్ర! విష్ణువర్ధననృప! స

ప్తసముద్రముద్రితాఖిల । వసుధాజనగీతకీర్తి! వాసవమూర్తీ!. 260

ప్రతిపదార్థం: వ్యసన, వివర్జిత= వ్యసనాలచేత విడువబడినవాడా!; మానవ్య, సగోత్ర, పవిత్ర= మానవ్య, సగోత్రంలో పవిత్ర మైన వాడా!; విష్ణు, వర్ధన, నృప= విష్ణువర్ధన మహారాజా!; సప్తసముద్ర, ముద్రిత+అఖిల, వసుధా, జన, గీత, కీర్తి= ఏడు సముద్రాలచేత గుర్తు వేయబడినటువంటి సమస్త భూప్రజలచేత పొగడబడిన కీర్తి కలవాడా!; వాసవ, మూర్తీ= ఇంద్రునివంటి రూపం కలవాడా!

తాత్పర్యం: ఏ వ్యసనం లేనివాడా! మానవ్య సగోత్రంలో పవిత్రుడ వైనవాడా! విష్ణువర్ధనమహారాజా! సప్త సముద్రాలచేత ముద్రవేయబడిన సమస్తభూమండలప్రజలచేత పొగడబడిన కీర్తి కలవాడా! ఇంద్రునివంటి రూపం కలవాడా!

విశేషం: రాజరాజనరేంద్రుడు మొదట వైయాఘ్రపాదగోత్రుడు. విష్ణువర్ధనుని మానవ్య సగోత్రుడైన హారితపుత్త్రుడు పెంచుకొన్నందు వలన మానవ్య సగోత్రు డైనాడు.

వనమయూరం.

రాజకులశేఖర! పరంతప! వివేక । భ్రాజిత! జగద్వలయభాసురసముద్య

త్తేజ! నిరవద్య! యువతీమదన! వీరో । గ్రాజివిజయా! త్రిభువనాంకుశ! నరేంద్రా. 261

ప్రతిపదార్థం: రాజ, కుల, శేఖర= రాజవంశమందు లేదా చంద్రవంశమందు శ్రేష్ఠుడయిన వాడా!, పరంతప= శత్రువులను నాశనం చేసేవాడా! వివేక, భ్రాజిత= విచక్షణజ్ఞానంచేత ప్రకాశింపచేయబడినవాడా!; జగత్+వలయ, భాసుర, సముద్యత్, తేజ= భూమండలంలో ప్రకాశిస్తూ పెరుగుతున్న కాంతి కలవాడా!; నిరవద్య= దోషం లేనివాడా!; యువతీ, మదన= యౌవనంలో ఉన్నస్త్రీలకు మన్మథుడైనవాడా!; వీర+ఉగ్ర+ఆజి, విజయా= వీరులతోడి భయంకరమయిన యుద్ధంలో గెలుపు కలిగినవాడా!; త్రిభువన+అంకుశ= మూడులోకాలకు అంకుశంవంటివాడా! (ఇది రాజరాజుబిరుదం); నర+ఇంద్రా= మానవులకు ప్రభు వైనవాడా- ఓ రాజరాజనరేంద్రా!

తాత్పర్యం: రాజవంశానికి లేదా చంద్రవంశానికి అలంకార మైనవాడా! శత్రువులను నాశనం చేసేవాడా! వివేకం చేత ప్రకాశించేవాడా! భూమండలంలో ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్న తేజస్సు కలవాడా!, యువతులకు మన్మథునివంటివాడా!, వీరులతో భయంకరయుద్ధంలో విజయం కలవాడా!, త్రిభువనాంకుశ అనే బిరుదం కలవాడా! రాజరాజనరేంద్రా!

విశేషం: ఇవికూడా రాజరాజనరేంద్రునిగుణవిశేషాలు. ఆశ్వాసాంతంలో కృతిపతిసంబోధనలు. వనమయూరపాదానికి భ, జ, స, న, గగ - అనే గణాలు వరుసగా ఉంటాయి. 9వ అక్షరం యతిస్థానం. ప్రాసనియతి ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గద్యము.

ఇది సకలసుకవిజనవినుతనన్నయభట్టప్రణీతం బైన శ్రీ మహాభారతంబునం దాదిపర్వంబున ధృతరాష్ట్ర పాండురాజుల వివాహంబును, బాండురాజదిగ్విజయంబును, బాండవధార్తరాష్ట్రసంభవంబును, బాండురాజు నిర్యాణంబును, గృపద్రోణజన్మకథనంబును, గుమారాస్త్రవిద్యాగ్రహణంబును నన్నది పంచమాశ్వాసము. 262

తాత్పర్యం: ఇది, సకలసత్కవుల ప్రశంస లందుకొన్న నన్నయభట్టు రచించిన శ్రీమహాభారతంలో - ఆదిపర్వంలో- ధృతరాష్ట్రపాండురాజులవివాహం, పాండురాజుదిగ్విజయం, పాండవధార్తరాష్ట్రులజననం, పాండురాజు మరణం, కృపాచార్యద్రోణాచార్యులపుట్టుకనుగూర్చి చెప్పటం, కురుకుమారులు అస్త్రవిద్యను అభ్యసించటం - అనే కథార్థాలు కల ఐదవఆశ్వాసం.

ఆదిపర్వంలో పంచమాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము - షష్ఠాశ్వాసము

శ్రీ జయవిభాసి! వినమ । ద్రాజన్య కిరీటమణి విరాజిత పాదాం
భోజ! భువనైకసుందర । రాజాన్వయతిలక! రాజరాజనరేంద్రా! 1

ప్రతిపదార్థం: రాజరాజనరేంద్రా!; శ్రీ= సంపదచేత; జయ= జయంచేత; విభాసి= ప్రకాశించేవాడా; వినమత్+రాజన్య, కిరీట, మణి, విరాజిత, పాద+అంభోజ= వంగి నమస్కరిస్తున్న రాజులయొక్క కిరీటాలలోని మణులవలన మిక్కిలి ప్రకాశిస్తున్న పద్మాలవంటి పాదాలు గలవాడా!; భువన+ఏక, సుందర= లోకంలో నీకు నీవే సాటి అయిన అందగాడా!; రాజ+అన్వయ, తిలక= చంద్రవంశంలో శ్రేష్ఠుడవైనవాడా!

తాత్పర్యం: సంపదతో, విజయంతో వెలుగొందుతూ, వంగి నమస్కరిస్తున్న రాజుల కిరీటాలలోని మణుల కాంతులవలన ఎంతో ప్రకాశించే పాదపద్మాలు కలిగి, లోకమంతటికీ అందగాడివై, చంద్రవంశశ్రేష్ఠుడవైన ఓ రాజరాజనరేంద్రా!

విశేషం: ఆశ్వాసారంభపద్యాన్ని శ్రీకారంతో ప్రారంభించి, కృతిపతిగుణవిశేషాలు కొనియాడుతూ అతడిని సంబోధించి, కథ మొదలుపెట్టటం, నన్నయ ఏర్పరచిన సంప్రదాయం. తర్వాతి తెలుగుకవులు చాలామంది దీన్ని పాటించటం జరిగింది.

వ. అ క్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె; నట్లు కృతాస్త్ర శస్త్రులయిన రాజకుమారుల విద్యాకౌశలంబు వ్యాస గాంగేయ విదుర కృప శల్య శకుని సోమదత్తాదుల సమక్షంబునం జూప సమకట్టి యొక్కనాఁడు ద్రోణుండు ధృతరాష్ట్రున కి ట్లనియె. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= కథను చెప్పుతున్న ఆతడు - రౌమహర్షణి; శౌనక+ఆది, మహామునులకున్= శౌనకుడు మొదలయిన గొప్ప ఋషులకు; చెప్పెన్; అట్లు= ఆ విధంగా; కృత+అస్త్ర, శస్త్రులు+అయిన= చేయబడిన (అంటే నేర్పబడిన) అస్త్రాలు, శస్త్రాలు కలవారైన; రాజకుమారుల; విద్యా, కౌశలంబు= విద్యలోని నేర్పు; వ్యాస, గాంగేయ, విదుర, కృప, శల్య, శకుని, సోమదత్త+ఆదుల= వ్యాసుడు, భీష్ముడు, విదురుడు, కృపుడు, శల్యుడు, శకుని, సోమదత్తుడు మొదలైనవాళ్ళయొక్క; సమక్షంబునన్= ఎదుట; చూపన్= చూపటానికి; సమకట్టి= పూనుకొని; ఒక్కనాఁడు= ఒక రోజు; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: శౌనకుడు మొదలైన మహామునులకు మహాభారతకథను చెపుతున్న రౌమహర్షణి- 'ఆ విధంగా శస్త్రాస్త్రవిద్యలు నేర్చుకొన్న కురుకుమారుల విద్యానైపుణ్యాన్ని - వ్యాసుడు, భీష్ముడు, విదురుడు, కృపుడు, శల్యుడు,

శకుని, సోమదత్తుడు మొదలైన పెద్దలముందు ప్రదర్శింపచేయాలనుకొన్న ద్రోణాచార్యుడు -ధృతరాష్ట్రునితో ఇట్లా అన్నా' డని మళ్ళీ కథను ప్రారంభించి చెప్పాడు.

విశేషం: రాజకుమారుల-అంటే ఇక్కడ ధృతరాష్ట్ర, పాండురాజకుమారుల-అని గ్రహించాలి.

కుమారాస్త్రవిద్యాసందర్శనము (సం.1-124-1)

క. ఘోరాస్త్రశస్త్రవిద్యల। నారూఢత మిగుల నిపుణు లైరి కుమారుల్
మీరలు వీరల విద్యా। పారము సను టెఱుఁగవలయు భవదీయ సభన్. 3

ప్రతిపదార్థం: కుమారుల్ (కౌరవులు, పాండవులు); ఘోర+అస్త్ర, శస్త్ర, విద్యలన్= భయంకరాలైన అస్త్రశస్త్రవిద్యలలో; ఆరూఢతన్= మీదికి ఎదుగుటచేత; మిగులన్= మిక్కిలి; నిపుణులు+ఐరి= నేర్పరులయ్యారు; మీరలు= మీరు; భయదీయ సభన్= మీయొక్కసభలో; వీరల, విద్యా, పారము+చనుట= వీళ్ళయొక్క విద్యయొక్క ఆవలిఒడ్డును చేరటాన్ని - అంటే వీళ్ళు శస్త్రాస్త్రవిద్యసంతతినీ నేర్చుకొని సాధించిన నైపుణ్యాన్ని; ఎఱుఁగవలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: భయంకరాలైన శస్త్రాస్త్రవిద్యలను సమగ్రంగా అభ్యసించి, కౌరవులు, పాండవులు, ఆ విద్యలలో మిక్కిలి నేర్పరులయ్యారు. మీరు సభలో వాళ్ళనేర్పును తెలిసికొనాలి.

వ. అనిన నట్ల చేయుదు నని ధృతరాష్ట్రుండు 'గుమారుల విద్యాసందర్శనరంగంబు రమ్యంబుగాఁ జేయింపు' మని విదురుం బంచిన, నతండును దాని శాస్త్రవిహిత ప్రమాణోపేత వృత్తాయామంబును, నపాకృత వృక్ష గుల్మ వల్మీకంబును, నంగీకృత పూర్వోత్తరప్లవంబును, సమీకృత నిమ్నోన్నత ప్రదేశంబును, దూరీకృత కంటక పాషాణ శల్య శకలంబును, విరజీకృత రజోధూసర స్థలంబును, విరచిత బహువిధ ప్రేక్షాగారాంచిత మణిమయమంచ ప్రపంచంబును,నానాధ్వజనవపల్లవరంభాస్తంభమాలాలంకృతద్వారతోరణంబును, బ్రతిదిశనిర్వర్తిత శాంతిక బలి విధానంబునుంగాఁ జేయించినం, బంచాంగశుద్ధదినశుభముహూర్తంబున ధృతరాష్ట్రుండు గాంధారీ పురస్కృత దేవీశతపరివృతుం డై, వివిధభూషణ భూషితానేక విలాసినీనివహంబుతోఁ జనుదెంచి, విలంబిత కదంబక స్థూలముక్తాఫలదామ రమణీయం బై, యాబద్ధమరకత వజ్రవైడూర్య పద్మరాగప్రభాప్రకర వ్యతికర విరచితా పూర్వ సురచాపచారుగౌరవం బై, యతిమనోహరం బైన శాతకుంభమయ ప్రేక్షాగారంబున నున్న. 4

విశేషం: అనినన్= ద్రోణాచార్యుడు ఆ విధంగా చెప్పగా; అట్లు+అ= ఆ విధంగానే; చేయుదున్+అని= చేస్తాను అని; ధృతరాష్ట్రుండు; కుమారుల, విద్యా, సందర్శన, రంగంబు= రాజకుమారుల విద్యలను చూపే ప్రదేశాన్ని; రమ్యంబు, కాన్= అందంగా ఉండేటట్లుగా; చేయింపుము; అని; విదురున్= విదురుణ్ణి; పంచినన్= ఆజ్ఞాపించగా; అతండును; దానిన్= ఆ ప్రదేశాన్ని - ఆ రంగస్థలాన్ని; శాస్త్ర, విహిత, ప్రమాణ+ఉపేత, వృత్త+ఆయామంబునున్= శాస్త్రంలో విధించబడిన కొలతలతో కూడుకొన్న చుట్టుకొలత, పొడవు కలదీ; అపాకృత, వృక్ష, గుల్మ, వల్మీకంబును= తొలగించబడినచెట్లు, పొదలు, పుట్టలు కలదీ; అంగీకృత, పూర్వ+ఉత్తర, ప్లవంబును= అవయవాలుగా చేయబడిన - అంటే అవయవాలవలె అతుక్కొని రంగస్థల భాగాలుగా ఉండేటట్లు చేయబడిన - తూర్పు, ఉత్తర, దిక్కుల్లో వాటమైన పల్లపునేలలు కలదీ; సమీకృత, నిమ్న+ఉన్నత, ప్రదేశంబును= చదరం చేయబడిన పల్లాలూ, మిట్టప్రదేశాలూ కలదీ; దూరీకృత, కంటక, పాషాణ, శల్య, శకలంబును= దూరం చేయబడిన - అంటే తొలగించబడిన ముళ్ళూ, రాళ్ళూ, ఎముకముక్కలూ కలదీ; విరజీకృత, రజస్+ధూసర,

స్థలంబును= దుమ్ముతొలగించి, శుభ్రంచేయబడిన స్థలాలు కలదీ; విరచిత, బహు, విధ, ప్రేక్షా+అగార+అంచిత, మణిమయ, మంచ, ప్రపంచంబును= నిర్మించబడిన, అనేకవిధాలైన, చూడటం కోసమైన ఇండ్లయొక్కయు, అలంకరింపబడిన మణులతో నిండిన మంచలయొక్కయు, సమూహంతో కూడిందీ; నానాధ్వజ, నవ, పల్లవ, రంభా, స్తంభ, మాలా+అలంకృత, ద్వార, తోరణంబును= పలువిధాలైన జెండాలతో, క్రొత్తచివుళ్ళతో, అరటిస్తంభాలతో, పూలమాలలతో అలంకరింపబడిన లోపలివాకిళ్ళు; వెలుపలివాకిళ్ళు కలదీ; ప్రతిదిశ, నిర్వర్తిత, శాంతిక, బలి, విధానంబునను, కాన్= ప్రతిదిక్కులలోను నెరవేర్చబడిన శాంతిని కలిగించే బలులతో కూడిన పూజావిధులు కలది అగునట్లుగా; చేయించినన్= చేయించగా; పంచ+అంగ, శుద్ధ, దిన, శుభ, ముహూర్తంబునన్= = పంచాంగాలచేత (తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలచేత) పవిత్రమైన శుభసమయంలో; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; గాంధారీ, పురస్, కృత, దేవీ, శత, పరివృతుండు+ఐ= గాంధారి ముందుండేటట్లుగా చేయబడిన భార్యలు వందమందిచేత చుట్టబడినవాడై; వివిధ, భూషణ, భూషిత+అనేక, విలాసినీ, నివహంబుతోన్= పలువిధాలైన సొమ్ములతో అలంకరింపబడిన పెక్కుమంది స్త్రీల సమూహంతో; చనుదెంచి= వచ్చి; విలంబిత, కదంబ, స్థూల, ముక్తాఫల, దామ, రమణీయంబు+ఐ= వ్రేలాడగట్టిన కడిమి మొగ్గలవలె పెద్దవైన ముత్యాలయొక్క దండలచేత అందమైనదై; ఆబద్ధ, మరకత, వజ్ర, వైడూర్య, పద్మరాగ, ప్రవాళ, ప్రభా, ప్రకర, వ్యతికర, విరచిత+ అపూర్వ, సుర, చాప, గౌరవంబు+ఐ= కట్టబడిన పచ్చలయొక్క, వజ్రాలయొక్క, వైడూర్యాలయొక్క, పద్మరాగాలయొక్క, పగడాలయొక్క, కాంతులసమూహంయొక్క పరస్పరంకూడికచేత నిర్మింపబడిన అరుదైన ఇంద్రధనుస్సు అందంయొక్క గొప్పతనం కలదై; అతిమనోహరంబు+అయిన= మిక్కిలి అందమైనదైన; శాతకుంభమయ, ప్రేక్షా+అగారంబునన్= (ప్రదర్శన) చూడటంకొరకు బంగారుతో నిర్మించిన ఇంటిలో; ఉన్నన్=ఉండగా.

తాత్పర్యం: ఆ విధంగా ద్రోణాచార్యుడు చెప్పగా, అట్లే చేస్తానని ధృతరాష్ట్రుడు 'కురుకుమారుల శస్త్రాస్త్ర విద్యా ప్రదర్శనకు అందమైన రంగస్థలాన్ని సిద్ధంచేయించుమని విదురుడిని ఆజ్ఞాపించాడు. విదురుడు శాస్త్రప్రకారం చుట్టుకొలత, పొడవు ఉండేటట్లు, చెట్లను, పొదలను, పుట్టలను తీసివేయించి, అవయవాలవలె అంటి ఉంటేటట్లు తూర్పుభాగంలో, ఉత్తరభాగంలో వాటమైన పల్లపుప్రదేశాలను ఏర్పాటుచేయించి, మిట్టపల్లాలను చదునుచేయించి, ముళ్ళను, రాళ్ళను, ఎముకముక్కల్ని ఏరివేయించి, దుమ్మును అణగగొట్టించి, ప్రేక్షకులు కూర్చొని చూడడానికి పలువిధాలైన ఇండ్లను, మణులతో అలంకరించిన మంచెలను నిర్మింపజేశాడు. లోపలి వాకిళ్ళను, వెలుపలవాకిళ్ళను జెండాలతో, క్రొత్తచిగుళ్ళతో, అరటిస్తంభాలతో, పూలమాలలతో అలంకరింపజేసి, అన్నిదిక్కులలో శాంతిపూజలు జరిపించాడు. రంగస్థలాన్ని సర్వాంగసుందరంగా సిద్ధంచేయించాడు. పంచాంగం ప్రకారం మంచిరోజున, శుభముహూర్తంలో ధృతరాష్ట్రుడు గాంధారీదేవి ముందు నడుస్తుండగా వందమంది భార్యలతో, పలువిధాలైన సొమ్ములు అలంకరించుకొన్న పెక్కుమంది స్త్రీలతో వచ్చి, వ్రేలాడే కడిమిమొగ్గలవలె పెద్దవైన ముత్యాలతో కూర్చిన దండలతో చూడముచ్చటయిందీ, అమర్చిన మరకత వజ్ర వైడూర్య పద్మరాగ ప్రవాళకాంతుల కలయికతో అపూర్వమైన ఇంద్రధనుస్సు అందాన్ని మించిందీ, మనోహరమైందీ, బంగారుతో నిర్మించిందీ అయిన ఇంటిలో - (కురుకుమారాస్త్రవిద్యాప్రదర్శనను లోపలకూర్చొని చూడటానికి నిర్మించిన ఇంటిలో) - ఉండగా.

విశేషం: అలం: ఉదాత్తం, ఉపమ, అంత్యానుప్రాసం. ఈ రంగస్థలంయొక్క అధునాతనరూపమే ఇప్పటి 'స్టేడియం'.

తే. **అందుఁ గరమొప్పి సుందరీబృంద మఖిల । రత్నరాజితకనకధరాధరేంద్ర**
కందరాంతరమున నున్న సుందరామ్య । తాశనాంగనాబృందంబు ననుకరించె. **5**

ప్రతిపదార్థం: అందున్= ఆ ఇంటిలో (ఆ ప్రేక్షాగారంలో); సుందరీ, బృందము= స్త్రీలయొక్క సమూహం; కరము= మిక్కిలి; ఒప్పి= తగినట్లుండి; అఖిల, రత్న, రాజిత, కనక, ధరాధర+ఇంద్ర, కందర+అంతరమునన్+ఉన్న= అన్నిరత్నాలతో ప్రకాశింపజేయబడిన బంగారుపర్వతశ్రేష్ఠముయొక్క-అంటే మేరుపర్వతంయొక్క-గుహలలోపల ఉన్న; సుందర+అమృత+ఆశన+అంగనా, బృందంబున్= అందమైన దేవతాస్త్రీలసమూహాన్ని; అనుకరించెన్= పోలింది.

తాత్పర్యం: ఆ ఇంట్లో ఉండే స్త్రీలసమూహం సకలరత్నకాంతులతో ప్రకాశించేమేరుపర్వతగుహలో ఉన్న సుందరదేవతాస్త్రీలసమూహాన్ని పోలి ఉన్నది.

విశేషం: అలంకారం: ఉపమ. అమృతాన్ని ఆహారంగా కలవారు దేవతలు.

తే. **సుతులవిద్యాప్రవీణతఁ జూచువేడ్క। నెంతయును సంతసంబునఁ గుంతిదేవి**
రాజసన్నిధి గాంధారరాజపుత్రి। కెలన నుండె నున్మీలితనలిననేత్ర. 6

ప్రతిపదార్థం: ఉత్+మిలీత, నలిన, నేత్ర= విప్పారిన తామరలవంటి కన్నులు గలది; సుతుల=కొడుకులయొక్క; విద్యా ప్రవీణతన్= విద్యలోని నేర్పును; చూచు, వేడ్కన్= చూడాలనే కుతూహలంతో; ఎంతయున్= మిక్కిలి; సంతసంబునన్= సంతోషంతో; కుంతీదేవి; రాజ, సన్నిధిన్= రాజుదగ్గర; గాంధార, రాజ, పుత్రి, కెలనన్= గాంధారరాజుకూతురైన గాంధారిప్రక్క; ఉండెన్.

తాత్పర్యం: వికసించిన తామరపూలవంటి కన్నులున్న కుంతీదేవి, తనకుమారుల విద్యానైపుణ్యాన్ని చూడాలన్న కుతూహలంతో, ధృతరాష్ట్రునిదగ్గర-గాంధారిప్రక్కన ఎంతో సంతోషంతో ఉండింది.

విశేషం: కొడుకుల విద్యానైపుణ్యాన్ని కళ్ళార చూడగోరే మాతృమూర్తియొక్కమానసికస్థితికి - 'ఉన్మీలితనలిననేత్ర' అనే విశేషం ఎంతో ఉచితంగా ఉన్నది. కళ్ళకు గంతలు గట్టుకొన్న గాంధారిప్రక్కన విప్పారిన కన్నులు గల కుంతి కూర్చోవటం విశేషం. తులనాత్మకసౌందర్యాన్ని వెలార్చే స్థిరచిత్ర మిది.

వ. **మఱియును.** 7

తాత్పర్యం: ఇంకా.

సీ. **వ్యాసపురస్కృతావనిదేవనివహంబుఁ, గృప శల్య శకుని గాంగేయ విదుర**
సోమదత్తాది భాసురగురుబాంధవ। మిత్త్రవర్గంబు, నమేయ మంత్రి
సామంత మండలేశ్వరసమూహంబును,। గాయక వైతాళికప్రవరులుఁ
దమతమ నియమిత స్థానంబులం దోలి। నుండిరి; బోరన నులిసె భేరు;

ఆ. **లస్త్రదర్శనాగతాఖిల క్షత్రియ। వైశ్యశూద్రవివిధవర్ణజనుల**
కలకలంబు ప్రళయకాలసంక్షోభితాం। భోనిధిస్వనంబుఁ బోలెఁ జెలఁగె. 8

ప్రతిపదార్థం: వ్యాస, పురస్+కృత+అవని, దేవ, నివహంబున్= వ్యాసుడు ముందుగా ఉండే భూసురుల - అంటే బ్రాహ్మణుల సమూహం; కృప, శల్య, శకుని, గాంగేయ, విదుర, సోమదత్త+ఆది, భాసుర, గురు, బాంధవ, మిత్ర, వర్గంబున్= కృపాచార్యుడు,

శల్యుడు, శకుని, భీష్ముడు, విదురుడు, సోమదత్తుడు మొదలైన ప్రకాశించే గురువులయొక్క, బంధువులయొక్క, మిత్రులయొక్క సమూహం; అమేయ, మంత్రి, సామంత, మండల+ఈశ్వర, సమూహంబును= అపరిమితమైన మంత్రులయొక్క, సామంతులయొక్క, మండలాధిపతులయొక్క సమూహం; గాయక, వైతాళిక, ప్రవరులున్= శ్రేష్ఠులైన పాటలు పాడేవారు, వేకువనే రాజును మేలుకొలిపేవారు; తమ, తమ, నియమిత స్థానంబుల+అందున్= తమ తమకు నియమింపబడిన ప్రదేశాలలో; ఒలిన్= వరుసగా; ఉండిరి= కూర్చున్నారు; భేరులు; బోరనన్= బోరుమని; ఉలిసెన్= మ్రోగాయి; అస్త్ర, దర్శన+ఆగత+అఖిల, క్షత్రియ, వైశ్య, శూద్ర, వివిధ, వర్ణ, జనుల కలకలంబు= అస్త్రవిద్యాప్రదర్శనోత్సవాన్ని చూడటానికి వచ్చిన అందరు క్షత్రియులయొక్క, వైశ్యులయొక్క, శూద్రులయొక్క, వివిధజాతుల జనులయొక్క పెద్దశబ్దం; ప్రళయకాల, సంక్షోభిత+అంభోనిధి, స్వనంబున్= ప్రళయకాలంచేత మిక్కిలి కలతపెట్టబడిన సముద్రశబ్దాన్ని; పోలెన్= వలె; చెలఁగెన్= ఒప్పారెను.

తాత్పర్యం: వ్యాసమహర్షిని ముందుగా కల బ్రాహ్మణులసమూహం; కృపాచార్యుడు, శల్యుడు, శకుని, భీష్ముడు, విదురుడు, సోమదత్తుడు మొదలైన గురుబంధుమిత్రులసమూహం, అపరిమితమైన మంత్రిసామంత మండలాధిపతుల సమూహం, గాయకవైతాళికశ్రేష్ఠులు - ఎవరికి నియమించినస్థానాలలో వాళ్ళు వరుసగా కూర్చున్నారు. భేరులు మ్రోగాయి. అస్త్రవిద్యా ప్రదర్శనోత్సవం చూడడానికి వచ్చిన క్షత్రియవైశ్యశూద్రాదివివిధజాతి జనుల కలకలం ప్రళయకాలసముద్రఘోషవలె ఉండింది.

విశేషం: అలం: ఉపమ.

వ. అట్టియవసరంబున నాచార్యుండు శుక్లాంబరాభరణమాల్యానులేపన యజ్ఞోపవీతపలితకేశశ్మశ్రు శోభిత దేహుండై రంగమధ్యంబున నశ్వత్థామసహితుం డై, విముక్తజలదజాలవియన్మధ్యంబున నంగారకసహితుం డైన యాదిత్యుండునుంబోలె నున్న నగణ్యభూసురవరేణ్యపుణ్యాహవాచనానంతరంబున. 9

ప్రతిపదార్థం: అట్టి అవసరంబునన్= అటువంటి సమయాన; ఆచార్యుండు= ద్రోణాచార్యుడు; శుక్ల+అంబర+ఆభరణ, మాల్య+అనులేపన, యజ్ఞ+ఉపవీత, పలిత, కేశ, శ్మశ్రు, శోభిత, దేహుండు+ఐ= తెల్లనివస్త్రాలతో, సొమ్ములతో, పూలదండలతో, గంధంతో, జందెంతో, నెరసిన వెంద్రుకలతో, గడ్డంతో, మీసంతో, ప్రకాశిస్తున్నదేహం కలవాడై; రంగ, మధ్యంబునన్; అశ్వత్థామ, సహితుండు+ఐ= అశ్వత్థామతో కూడినవాడై; విముక్త, జలద, జాల, వియత్+మధ్యంబునన్= విడువబడిన మేఘాలసమూహం గల ఆకాశంయొక్క మధ్యప్రదేశంలో; అంగారక, సహితుండు+ఐన= అంగారకునితో కూడుకొన్నవా డైన; ఆదిత్యుండునున్, పోలెన్= సూర్యునివలె; ఉన్నన్= ఉండగా; అగణ్య, భూసుర, వరేణ్య, పుణ్యాహవాచన+అనంతరంబునన్= లెక్కకు మిక్కిలి అయిన బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క పుణ్యాహవాచనానికి తర్వాత.

తాత్పర్యం: అటువంటి సమయంలో ద్రోణాచార్యుడు - తెల్లనివస్త్రాలతో, సొమ్ములతో, పూలదండలతో, గంధంతో, జందెంతో, నెరసిన వెంద్రుకలతో, గడ్డంతో, మీసంతో, ప్రకాశిస్తున్న దేహం కలవాడై- రంగమధ్యంలో అశ్వత్థామతో కూడి, మేఘాలు వీడి నిర్మలమైన ఆకాశమధ్యంలో అంగారకగ్రహసహితుడై ప్రకాశించే సూర్యునివలె ఉన్నాడు. పెక్కుమంది బ్రాహ్మణోత్తముల పుణ్యాహవాచనంతర్వాత.

విశేషం: అలం: ఉపమ. అంగారకసహితుండైన యాదిత్యుండునుంబోలె - అనేచోట మూలం ఇట్లా ఉన్నది. 'సాంగారక ఇవాంశుమాన్. సాంగారకః సభౌమః, అంశుమాన్ చంద్రః' అని నీలకంఠీయం - చిత్రశాలాప్రతి పుట 236, చూడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మహాభారతసంశోధితప్రతి. పుట.323, ధనుర్విద్యాభాస్కరుడైన ద్రోణాచార్యుని సూర్యునితోను, రాక్షసావేశపరు డైన అశ్వత్థామను అగ్నిగ్రహమైన అంగారకునితోను పోల్చటం ఎంతో ఉచితంగా ఉన్నది. తండ్రికొడుకు లిద్దరు ఆ రెండుగ్రహాలవలె మహాతేజస్వులు.

శా. ద్రోణాచార్యుపిఱుంద నొప్పి దృఢహస్తుల్, బద్ధగోధాంగుళీ
త్రాణుల్, మార్గణపూర్ణతూణులు, మహాధన్వుల్ కుమారుల్ తను
త్రాణోపేతులు రంగమధ్యమున నంతన్ నిల్చి రుద్యద్గుణ
శ్రేణీరమ్యులు ధర్మజప్రముఖు లై జ్యేష్ఠానుపూర్వంబుగన్. 10

ప్రతిపదార్థం: దృఢ, హస్తుల్= బలమైన చేతులు కలవాళ్ళు; బద్ధ, గోధా+అంగుళీ, త్రాణుల్= కట్టబడిన ఉడుముచర్మపు వ్రేళ్ళకవచాలు కలవాళ్ళు; మార్గణ, పూర్ణ, తూణులు= బాణాలతో నిండిన అమ్ములపొదులు కలవాళ్ళు; మహా, ధన్వుల్= గొప్ప ధనుస్సులు కలవాళ్ళు; తను, త్రాణ+ఉపేతుల్= కవచాలతో కూడినవాళ్ళు; ఉద్యత్+గుణ, శ్రేణీ, రమ్యులు= ఉన్నతగుణాల వరుసతో మనోహరమైనవాళ్ళు; రాజకుమారుల్= కురురాజకుమారులు; ద్రోణ+ఆచార్యు, పిఱుందన్, ఒప్పి= ద్రోణాచార్యుని వెనుక అందంగా; ధర్మజ, ప్రముఖులు+ఐ= ధర్మరాజును మొట్టమొదట కలవాళ్ళయి; జ్యేష్ఠ+అనుపూర్వంబుగన్= పెద్దవాళ్ళు ముందు ఉండేటట్లుగా; అంతన్= అప్పుడు; రంగమధ్యంబునన్= రంగంయొక్కమధ్యన; నిల్చిరి= నిలిచారు.

తాత్పర్యం: బలమైనహస్తాలు కలవాళ్ళు, అల్లెత్రాటిదెబ్బ తగులకుండా ఉడుముతోలుతో కుట్టినకవచాలు వ్రేళ్ళకు తొడుక్కొన్నవాళ్ళు, బాణాలు నిండుగా ఉండే అమ్ములపొదులు కలవాళ్ళు, గొప్పధనుస్సులు, కవచాలు ధరించినవాళ్ళు, ఉన్నతగుణాలచేత రాణించేవాళ్ళు అయిన పాండవులు, కౌరవులు, ద్రోణాచార్యుని వెనుక, ధర్మరాజుప్రక్కన వయోధర్మాన్నిబట్టి వరుసగా రంగమధ్యంలో నిలిచారు.

వ. అట్లు నిలిచి, రక్తచందనదిగ్ధాంగులు రక్తమాల్యాంబరాభరణులు రక్తపతాకులు రక్తాంతలోచను లై యాచార్యు ననుమతంబున. 11

ప్రతిపదార్థం: అట్లు= ఆవిధంగా; నిలిచి; రక్త, చందన, దిగ్ధ+అంగులు= ఎఱ్ఱగంధంచేత పూయబడిన దేహాలు కలవాళ్ళు; రక్త, మాల్య+అంబర+ఆభరణులు= ఎఱ్ఱనిపూలదండలు, వస్త్రాలు, సొమ్ములు కలవాళ్ళు; రక్త, పతాకులు= ఎఱ్ఱనిజెండాలు కలవాళ్ళు; రక్త+అంత+లోచనులు+ఐ= ఎఱ్ఱని కొలుకులు ఉండే కన్నులు కలవాళ్ళయి; ఆచార్యు+అనుమతంబునన్= ద్రోణాచార్యుని ఆజ్ఞచేత.

తాత్పర్యం: ఆ విధంగా నిలబడి - ఎఱ్ఱగంధాన్ని దేహానికి పూసికొని, ఎఱ్ఱటి పూలదండలు, వస్త్రాలు, సొమ్ములు ధరించి, ఎఱ్ఱజెండాలు చేత పట్టుకొని, ఎఱ్ఱబడ్డకనుగొలకులతో ఉన్నవాళ్ళు - ద్రోణాచార్యుని ఆజ్ఞతో.

విశేషం: రక్తవర్ణం వీరరౌద్రరసస్ఫోరకం. రసోచితవిభావవర్ణనం ప్రసన్నకథాకవితలో ఒక శిల్పం.

సీ. అసిచర్మకౌశలం బమరంగఁ జూపెడు । వారును, దృఢసౌష్ఠవంబు లొప్పఁ
దమతమనామాంకితము లైన శరముల । నేర్పడ లక్ష్యంబు లేయువారు,
హయ మదద్విరద రథారూఢ దక్షతఁ । బ్రకటించువారును, బ్రాసశక్తి
కుంత తోమర గదాకుశలత్వ మెఱిఁగించు । వారునుగా నిట్లు వసుధలోని

ఆ. రాజసుతులతోడ రమణఁ బాండవధృత । రాష్ట్రసుతులు వృద్ధరాజులొద్దఁ
దద్దయును ముదమునఁ దమతమవిద్యలు । మెఱసి రెల్లజనులు మెచ్చి పొగడ. 12

ప్రతిపదార్థం: పాండవ, ధృతరాష్ట్ర, సుతులు= పాండవులు, ధృతరాష్ట్రునికుమారులు - కౌరవులు; రమణన్= మనోహరంగా; వసుధలోని= భూమిలోని; రాజసుతులతోడన్= రాకుమారులతో; అసి, చర్మ, కౌశలంబు= కత్తులలోని, డాలులోనినేర్పును; అమరంగన్= ఒప్పిదంగా; చూపెడు వారును= చూపుతున్నవాళ్ళూ; దృఢ, సౌష్ఠవంబులు+ఒప్పన్= బలం నిండుదనం ఒప్పగా; తమ, తమ; నామ+అంకితములు+ఐన= పేర్లతో గుర్తులు వేయబడినవైన; శరములన్= బాణాలతో; ఏర్పడన్= వేరయ్యేటట్లు; లక్ష్యంబులన్= గురిచేసి కొట్టదలచినవాటిని; ఏయువారు= కొట్టేవాళ్ళు; హయ, మద, ద్విరద, రథ+ఆరూఢ, దక్షతన్= గుఱ్ఱాలను, మదపుటేనుగులను, రథాలను ఎక్కటంలోని నేర్పును; ప్రకటించువారును= ప్రదర్శించేవాళ్ళు; ప్రాస, శక్తి, కుంత, తోమర, గదా, కుశలత్వము= ఈటెలలో, శక్తులలో, బల్లేలలో, చిల్లకోలలలో, గదలలో నేర్పును - అంటే వీటిని ప్రయోగించటంలోని నేర్పును; ఎఱిగించువారును= తెలియజేసేవాళ్ళు; కాన్= అగునట్లు; ఇట్లు= ఈ విధంగా, తద్దయును= మిక్కిలి; ముదమునన్= సంతోషంతో; తమ, తమ, విద్యలు= వారివారివిద్యలు; ఎల్ల, జనులు; మెచ్చి; పొగడన్; వృద్ధ, రాజుల+ఒద్ద= పెద్దరాజులదగ్గర; మెఱసిరి= ప్రకాశించారు.

తాత్పర్యం: పాండవులు, కౌరవులు చూడముచ్చటగా లోకంలోని రాకుమారులతో కూడి - కత్తి, డాలు, విన్యాసాలలో తాము గడించిన నేర్పునూ, తమపేర్లు పాదిగిన బాణాలు వేసి లక్ష్యాన్ని ఛేదించటంలో సాధించిన సామర్థ్యాన్నీ, గుఱ్ఱాలను, మదపుటేనుగులను, రథాలను అధిరోహించటంలో ఆర్జించిన నైపుణ్యాన్నీ, ఈటె మొదలైన ఆయుధాలను ప్రయోగించటంలో తాము పొందిన కౌశలాన్నీ ప్రజలందరూ చూచి సంతోషించి కొనియాడేటట్లు పెద్దరాజుల ఎదుట ప్రదర్శించారు.

భీమదుర్యోధనులు తమగదాకౌశలంబు సూపుట (సం. 1-124-30)

వ. అంత ననంతబలపరాక్రము లగు భీమదుర్యోధను లుద్యద్గదాహస్తు లయి మహామత్సరంబుతో నేక శృంగసముత్తుంగశైలద్వయంబు ననుకరించుచు వశానిమిత్తక్రుద్ధగంధసింధురంబులుంబోలె నొండొరులం దాఁకి సవ్యాపసవ్యచిత్రమండలమార్గంబుల గదాకౌశలంబు మెఱయునెడ. 13

ప్రతిపదార్థం: అంతన్= ఆ తరువాత; అనంత, బల, పరాక్రములు+అగు= అంతులేని - అంటే అమితమైన బలపరాక్రమాలు కలవాళ్ళయిన; భీమదుర్యోధనులు; ఉద్యత్+గదా, హస్తులు+అయి= ఎత్తబడిన గదలతో కూడిన చేతులు గలవాళ్ళయి; మహా, మత్సరంబుతోన్= మిక్కిలి క్రోధంతో; ఏక, శృంగ, సమ్+ఉత్+తుంగ, శైల, ద్వయంబున్= ఒక్కశిఖరం ఉండే మిక్కిలి ఎత్తైన పర్వతాల జంటను; అనుకరించుచున్= పోలుతూ; వశా, నిమిత్త, క్రుద్ధ, గంధ, సింధురంబులున్+పోలెన్= ఆడ ఏనుగు కారణంగా కోపించిన మదపుటేనుగువలె; ఒండొరులన్= ఒకరినొకరు; తాఁకి= ఎదుర్కొని; సవ్య+అపసవ్య, చిత్ర, మండల, మార్గంబులన్= ఎడమనుంచి కుడికి, కుడినుండి ఎడమవైపునకు, చిత్రమైనవలయాకార (తిరిగే) పద్ధతులలో; గదా, కౌశలంబు= గదలోని నేర్పును - అంటే గదాయుద్ధంలోని నేర్పును; మెఱయు+ఎడన్= ప్రదర్శించేసమయంలో.

తాత్పర్యం: ఆ తర్వాత- అంతులేని బలపరాక్రమాలు గల భీమదుర్యోధనులు, చేత గదలెత్తుకొని, మహాక్రోధంతో ఒకే శిఖరం ఉన్న మిక్కిలిఎత్తైనపర్వతాలజంటవలె, ఆడఏనుగు కారణంగా కోపించిన మదపుటేనుగుల జంటవలె,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒకరినొకరు తాకి, ఎడమనుండి కుడికి, కుడినుండి ఎడమకు చిత్రమైన వలయాకారపద్ధతులలో తిరుగుతూ, గదాయుద్ధనైపుణ్యాన్ని ప్రదర్శించారు.

విశేషం: అలం: ఉపమ. చేత గదలు ధరించి, యుద్ధానికి సిద్ధమైన భీమదుర్యోధనులను ఒకే శిఖరం ఉన్న మిక్కిలి ఎత్తైన పర్వతాలజంటతో, ఆడఏనుగు కారణంగా కోపించి కలబడే మదపుటేనుగుల జంటతో పోల్చటంవలన వాళ్ళ ఉన్నతాకారం, బలసమానత, మాత్సర్యతీవ్రత చక్కగా వ్యక్తమౌతున్నాయి.

మ. అవనీచక్రము పాదఘాతహతి నల్లాడంగ నత్యుగ్రభై
రవహుంకార రవంబునన్ వియదగారంబెల్ల భేదిల్లఁ బాం
డవకౌరవ్యగదావిఘట్టన మకాండప్రోత్థమై భావిపాం
డవకౌరవ్యరణాభిసూచన పటిష్ఠం బయ్యె ఘోరాకృతిన్. 14

ప్రతిపదార్థం: అవనీ, చక్రము= భూమండలం; పాద, ఘాత, హతిన్= పాదాలతొక్కిళ్ళదెబ్బలతో; అల్లాడంగన్= కదలగా; అతి+ఉగ్ర, భైరవ, హుంకార, రవంబునన్= మిక్కిలితీవ్రమై భయంకరమైన హుంకారధ్వనిచేత; వియత్+అగారంబు+ఎల్లన్= ఆకాశమనే ఇల్లంతా; భేదిల్లన్= బ్రద్దలుకాగా; పాండవ, కౌరవ్య, గదా, విఘట్టనము= భీమదుర్యోధనుల గదలయొక్క తీవ్రమైన తాకిడి; అకాండ, ప్ర+ఉత్థము+ఐ= అకాలంలో లెస్సగా పుట్టిందై; ఘోర+ఆకృతిన్= భయంకరమైన రూపంతో; భావి, పాండవ, కౌరవ్య, రణ+అభిసూచన, పటిష్ఠంబు+అయ్యెన్= ముందు జరగబోయే పాండవ కౌరవ యుద్ధాన్ని ఇప్పటికిప్పుడే సూచించటంలో సమర్థమైనదయింది.

తాత్పర్యం: కాళ్ళతొక్కుడు దెబ్బలతో భూమండలం చలించగా, మహాభయంకరహుంకారధ్వనితో ఆకాశమనే ఇల్లంతా బ్రద్దలయ్యేటట్లు, భీమదుర్యోధన గదలతాకిడి, అకాలంలో ఏర్పడి, భయంకరరూపంతో మున్ముందు రాబోయే కురుపాండవమహాసంగ్రామాన్ని ఇప్పటికిప్పుడే స్పష్టంగా సూచించేదయింది.

విశేషం: కురుక్షేత్రయుద్ధంలోని చివరిఘట్టం భీమదుర్యోధనుల గదాయుద్ధం. దానికి ఈ గదాయుద్ధ ప్రదర్శనం వ్యంజకంగా ఉన్నది. ఇదొక వస్తుధ్వనిశిల్పవిశేషం. అంతేకాదు, ఓజోగుణం విభావయుద్ధోద్రేకాన్ని ధ్వనింపచేస్తున్నది.

క. ఆ రాజసుతులవిద్యా । పారగపటు చేష్టితములఁ బరువడి నగ్గాం
ధారీధృతరాష్ట్రుల కతి । ధీరుఁడు విదురుండు సెప్పి తెలుపుచునుండెన్. 15

ప్రతిపదార్థం: ఆ, రాజ,సుతుల= ఆ కురుపాండవులైన రాకుమారులయొక్క; విద్యా, పారగ, పటు, చేష్టితములన్= విద్యయొక్క పరిణతిని సాధించటాన్ని తెలిపే సమర్థాలైన చేష్టలను (అంటే విద్యాప్రదర్శనలను); అతి, ధీరుఁడు= గొప్పవిద్వాంసుడైన విదురుడు; పరువడిన్= వరుసగా; ఆ+గాంధారీ, ధృతరాష్ట్రులకున్ చెప్పి, తెలుపుచున్, ఉండెన్= గాంధారికి ధృతరాష్ట్రునికి చెప్పి వివరిస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: ఆ రాకుమారుల విద్యాపారంగత్వాన్ని తెలిపే ఆ విద్యాప్రదర్శనలనుగూర్చి విద్వాంసుడైన విదురుడు వరుసగా ఆ గాంధారీధృతరాష్ట్రులకు తెలియచెప్పుతూ ఉన్నాడు.

వ. అంత భీమదుర్యోధనుల గదా కౌశలంబు సూచుజనులపక్షపాతజనిత పరస్పర క్రోధ వచనంబులు విని ద్రోణుండు రంగభంగభయంబున నశ్వత్థామంబంచి వారి నిద్దఱ వారించి, వారాశియుంబోలె బోరన మ్రోయుచున్న వాదిత్రశబ్దంబు లుడిపి, 'నా ప్రియశిష్యుండయిన యర్జును ధనుర్విద్యాకౌశలంబుఁ జూడుం' డనిన నయ్యాచార్య వచనానంతరంబున. 16

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; భీమ, దుర్యోధనుల, గదా, కౌశలంబు= భీమదుర్యోధనులయొక్క గదావిద్యలోని నేర్పు; చూచు, జనుల, పక్షపాత, జనిత, పరస్పర, క్రోధ, వచనంబులు= చూస్తున్నట్టి ప్రజలయొక్క పక్షపాతంవలన పుట్టిన ఒండొరులకోపవాక్యాలు; విని; ద్రోణుండు; రంగ, భంగ, భయంబున్= విద్యాప్రదర్శనరంగం చెడిపోతుందనే భయంవలన; అశ్వత్థామన్; పంచి= పంపి; వారిన్; ఇద్దఱన్; ఆ భీమదుర్యోధనులిద్దరిని; వారించి= తొలగించి; వారాశియున్+పోలెన్= సముద్రంవలె; బోరు+అన; మ్రోయుచున్+ఉన్న; వాదిత్ర, శబ్దంబులు= వాద్యాలయొక్క ధ్వనులను; ఉడిపి= మాన్పించి; నా, ప్రియ, శిష్యుండు+అయిన; అర్జును, ధనుస్+విద్యా, కౌశలంబున్= అర్జునునియొక్క ధనుర్విద్యలోని నేర్పును; చూడుండు; అనినన్= అని అనగా; ఆ+ఆచార్య, వచన+అనంతరంబున= ఆ ద్రోణాచార్యుని మాటలతర్వాత.

తాత్పర్యం: అప్పుడు భీమదుర్యోధనుల గదాకౌశలం చూచే ప్రజలు, పక్షపాతంతో కోపావేశాలు పెంచుకొని, ఒకరి నొకరు అనుకొంటున్నమాటలు విని, అస్త్రవిద్యాప్రదర్శనరంగం భగ్నమవుతుందన్నభయంతో, ద్రోణాచార్యుడు అశ్వత్థామను పంపి, ఆ భీమదుర్యోధనులను తొలగించి, సముద్రఘోషవలె మ్రోగుతున్న వాద్యధ్వని మాన్పించి, 'నా ప్రియశిష్యుడైన అర్జునుని ధనుర్విద్యానైపుణ్యాన్ని చూడం' డని ప్రకటించిన తర్వాత.

విశేషం: ఆటలపోటీలలో పాల్గొనేవాళ్ళసంగతి ఎట్లా ఉన్నా - ఆ పోటీలను చూచేప్రేక్షకులు పక్షాలు వహించటం; అరుపులతో, కేకలతో, మాటలతో పరస్పరం క్రోధావేశాలు రెచ్చగొట్టుకొనటం, ఒక్కొక్కసారి ఆ పోటీలు పెద్ద పోట్లాటలుగా మారటం లోకసహజమే. ప్రస్తుతం భీమదుర్యోధనుల గదాకౌశలప్రదర్శనలో కూడా అలాంటి వాతావరణమే ఏర్పడింది. రంగస్థలం రణభూమిగా మారే ప్రమాదం ఏర్పడింది. అందుచేతనే ఆచార్యుడు ఆ ప్రదర్శనను ఆపివేయించటం జరిగింది. కాగా, మానవహృదయంమీద ధ్వనిప్రభావం మెండు. వివిధవాద్యధ్వనులు వివిధరసోద్దీపకాలు. అందుచేతనే క్రోధావేశప్రేరకాలైన వాద్యధ్వనులను ఆచార్యుడు ఆపివేయించాడు. తతం, ఆనద్ధం, సుషిరం, ఘనం అనే వాద్యచతుష్టయానికి వాదిత్రనామమండన్నది.

ఉ. హారివిచిత్రహేమకవచావృతుఁ, డున్నతచాపచారుదీ
ర్ఘోరుభుజుండు, భాస్వదసితోత్పలవర్ణుఁడు, సేంద్రచాపశం
పారుచిమేఘమో యనఁగ బాండవమధ్యముఁ డొప్పి బద్ధతూ
ణీరుఁడు రంగమధ్యమున నిల్చె జనంబులు దన్నుఁ జూడఁగన్. 17

ప్రతిపదార్థం: హారి, విచిత్ర, హేమ, కవచ+ఆవృతుఁడు= మనోహరమై వింతవింత రంగులు గలదైన బంగారు కవచంతో కప్పబడినవాడు; ఉన్నత, చారు, చాప, దీర్ఘ+ఉరు+భుజుండు= అందమైన ధనుస్సుతో పొడవైన, శ్రేష్ఠమైన హస్తం కలవాడు; బద్ధ తూణీరుఁడు= కట్టబడిన అమ్ములపొదులు గలవాడు; భాస్వత్+అసిత+ఉత్పల, వర్ణుఁడు= ప్రకాశిస్తున్న నల్లకలువ వన్నె కలవాడు; పాండవమధ్యముఁడు= పాండవులలో నడిమివాడైన అర్జునుడు; జనంబులు; తన్ను= తనను; చూడఁగన్= చూస్తుండగా; స+ఇంద్ర+చాప, శంపా, రుచి, మేఘమో, అనఁగన్= ఇంద్రధనుస్సుతో, మెరుపుకాంతితో కూడుకొన్న మేఘమా అనేటట్లు; ఒప్పి= అందంగాఅమరి; రంగ, మధ్యమునన్; నిల్చెన్.

తాత్పర్యం: మినమినలాడే నల్లకలువ వన్నెవాడు, పాండవులలో నడిమివాడు అయిన అర్జునుడు - మనోహరమై, వింతవింత రంగుల బంగారుకవచం తొడుక్కొని, దీర్ఘం, శ్రేష్ఠం అయిన తన హస్తానికి అందమిచ్చిన ఎత్తైన ధనుస్సు ధరించి, అమ్ములపొదులు కట్టుకొని, జనులంతా తనను చూస్తుండగా - ఇంద్రధనుస్సుతో, మెరుపుకాంతితో కూడినమేఘమా అన్నట్లు రంగమధ్యంలో అందంగా నిలిచాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. పద్యంలో ప్రసాదవిశిష్టమైన ఓజోగుణం ధీరోదాత్తుడైన అర్జునుని రూపవర్ణనకు అనుగుణంగా ఉన్నది.

క. నరు నింద్రాత్మజు నింద్రా। వరజసఖున్ వీరుఁ బాండవప్రవరు ధను
ర్ధరుఁ జూచి, చూపటెల్లం। బరమాద్భుతచిత్తు లగుచుఁ బలికిరి తమలోన్. 18

ప్రతిపదార్థం: నరున్= అర్జునుని; ఇంద్ర+ఆత్మజున్= ఇంద్రునియొక్క కుమారుడైనవానిని; ఇంద్ర+అవరజ, సఖున్= ఇంద్రునితమ్ముడైన ఉపేంద్రునియొక్క - శ్రీకృష్ణునియొక్క స్నేహితుడిని; వీరున్= వీరుడైనవానిని; పాండవ, ప్రవరున్= పాండవులలో శ్రేష్ఠమైనవాడిని; ధనుః+ధరున్= ధనుస్సును ధరించినవాడిని; (అర్జునుడిని) చూచి; చూపఱు+ఎల్లన్= ప్రేక్షకులంతా - చూచేవాళ్ళంతా; పరమ+అద్భుత, చిత్తులు+అగుచున్= మిక్కిలి ఆశ్చర్యంతో కూడిన మనస్సులు కలవాళ్ళయి; తమలోన్= తమలో తాము; పలికిరి= పలికారు, మాట్లాడుకొన్నారు.

తాత్పర్యం: నరుడు ఇంద్రతనయుడు, ఉపేంద్రుడైన శ్రీకృష్ణునిస్నేహితుడు, వీరుడు, పాండవశ్రేష్ఠుడు, ధనుర్ధరుడు అయిన అర్జునుడిని చూచి, అమితాశ్చర్యంతో ప్రేక్షకులు తమలో తాము ఇట్లా అనుకొన్నారు.

విశేషం: ఈ పద్యంలో అర్జునుణ్ణి "ఇంద్రావరజసఖున్" అని చెప్పడం జరిగింది. ఈ 'కుమారాస్త్రప్రదర్శన' సమయం నాటికి కృష్ణుడు - పాండవులతో సమావేశం కాలేదుకదా! అని సంశయం కల్గుతుంది. 'ఉపేంద్రుడైన కృష్ణుని సఖుడు' - అర్జునుడనే మాట కవి చెప్పిందే కానీ, పాత్ర లెవ్వరూ చెప్పింది కాదు. కవికి కథపూర్తిగా తెలుసుగనుక-"కృష్ణసఖుడు" అనడం- భవిష్యత్ సూచకం కూడా కాగలదు. పాత్రనైతే ఆక్షేపించవచ్చు. కవికి కృష్ణార్జునుల జన్మాంతర నారాయణనరఋషిత్వాలు తెలుసు కనుక ఇక్కడ 'సఖ' శబ్దం అనౌచిత్యం కాదు. మూలంలో "ఇంద్రానుజసమః" అని ఉంది. 'సఖ' శబ్దం 'సమాన' మనే అర్థంలో చెప్పడం కద్దు. కనుక కృష్ణసమానుడని కూడ చెప్పుకోవచ్చు.

తే. వీఁడె కృతహస్తుఁ డఖిలాస్త్రవిద్యలందు। వీఁడె యగ్రగణ్యుఁడు ధర్మవిదులలోన,
వీఁడె భరతవంశం బెల్ల వెలుఁగఁ గుంతి। కడుపు చల్లఁగాఁ బుట్టిన ఘనభుజుండు. 19

ప్రతిపదార్థం: వీఁడె= ఇతడే; అఖిల+అస్త్ర, విద్యల+అందు= అన్ని అస్త్రవిద్యలలో; కృత, హస్తుఁడు= నేర్పరి; వీఁడె= ఇతడే; ధర్మ, విదులలోన= ధర్మం తెలిసినవారిలో; అగ్ర, గణ్యుఁడు= మొదట లెక్కించదగినవాడు; వీఁడె= ఇతడే; భరత, వంశంబు+ఎల్లన్= భరతునియొక్క వంశమంతా; వెలుఁగన్= ప్రకాశించగా; కుంతి, కడుపు, చల్లఁగాన్= కుంతీదేవికడుపు చల్లగా; పుట్టిన; ఘన, భుజుండు= గొప్పహస్తాలు గలవాడు.

తాత్పర్యం: ఇతడే (ఈ అర్జునుడే) అస్త్రవిద్యలన్నింటిలో నేర్పరి. ఇతడే ధర్మం తెలిసినవాళ్ళలో మొదట లెక్కపెట్ట తగినవాడు. ఇతడే భరతవంశానికంతటికీ కీర్తి వచ్చేటట్లు కుంతికడుపు చల్లగా పుట్టిన గొప్పభుజాలు కలవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: రంగస్థలంలో ప్రవేశించిన వీరులందరిలో ప్రదర్శనకు పూర్వమే ప్రజల ప్రశంసలందుకొన్న వాడిగా అర్జునుని వర్ణనలో అతని అత్యధికవీరత్వం ధ్వనిస్తూ ఉన్నది.

క. అని పలుకుజనులపలుకులు । విని గొంతి యనంతహర్షవిస్తారితలో
చన యై నందను నృపనం । దనసంఘములోనఁ జూచి తద్దయుఁ బొంగెన్. 20

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలుకు; జనుల పలుకులు విని; గొంతి= కుంతీదేవి; అనంత, హర్ష, విస్తారిత, లోచన+ఐ= అంతులేని ఆనందంచేత విప్పారిన నేత్రాలు కలదై; నందనున్= కుమారుడిని - అర్జునుడిని; నృప, నందన, సంఘములోనన్= రాజకుమారులయొక్క సమూహంలో; చూచి; తద్దయున్= మిక్కిలి; పొంగెన్= సంతోషించింది.

తాత్పర్యం: ఆ విధంగా పలికే జనులపలుకులు విని, కుంతీదేవి అంతులేనిఆనందంతో విప్పారినకళ్ళతో తన కుమారుడైన అర్జునుడిని రాకుమారులసమూహంలో చూచి ఎంతో సంతోషించింది.

క. చారుమనస్సమ్మదరస । పూరము వెలివేర్చునట్లు పొలఁతికి విగళ
ద్భూరిస్తనజనితపయో । ధారలు నానందబాష్పధారలు నొప్పెన్. 21

ప్రతిపదార్థం: చారు, మనస్+సమ్మద, రస, పూరము= చక్కనిమనస్సులోని సంతోషమనే జలప్రవాహం; వెలివేర్చున్+అట్లు= బయల్పడేట్లు; పొలఁతికిన్= స్త్రీకి - అంటే కుంతీదేవికి; విగళత్+భూరి, స్తన, జనిత, పయస్+ధారలున్= కారుతున్న పెద్ద పాలిండ్లనుండి పుట్టిన పాలధారలును; ఆనంద, బాష్ప, ధారలున్= ఆనందంవల్లవచ్చే కన్నీటిధారలును; ఒప్పెన్= అమరినాయి-తగువిధంగా ఏర్పడినాయి.

తాత్పర్యం: మనస్సులోని సంతోషజలప్రవాహం వెలుపలికి వచ్చినట్లు, కుంతీదేవిపాలిండ్లనుండి పాలధారలు, కన్నులనుండి ఆనందబాష్పధారలు బయటికి వచ్చాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. కొడుకు గొప్పతనాన్ని లోకమంతా మెచ్చుకుంటే ఓ మాతృమూర్తి హృదయం ఎంతగా పులకిస్తుందో ఈ పద్యంలో చూడవచ్చును. లోకులందరి ఆనందం ఒకవైపు, తల్లిపొందే ఆనందం మరొకవైపు వర్ణించి సామ్యపరిశీలనవలన కలిగే రమణీయభావచిత్రాన్ని పఠితకు నన్నయ అందించాడు. కుంతి ఉద్విగ్నప్రవృత్తికలదిగా చిత్రించబడింది. వత్సలభావాన్ని సాత్త్వికభావాలతో వ్యక్తంచేయటం అందుకు సాక్ష్యం. పాలిండ్లనుండి పాలధారలు, కన్నులనుండి కన్నీటిధారలు రావటం వాత్సల్యరసాన్ని వ్యంజింపచేసే మాతృసహజమైన సాత్త్వికభావాభివ్యక్తులు. (సంపా.)

వ. అయ్యర్జునుస్తుతివచనంబు లొక్కట జనసంఘంబువలన నెగసి వియత్తలవిదళనం బయిన నమ్మహాధ్వని విని యదరిపడి ధృతరాష్ట్రుం 'డిది యేమి రభసం?' బని విదురు నడిగిన నాతం డి ట్లనియె. 22

ప్రతిపదార్థం: ఆ+అర్జును, స్తుతివచనంబులు= ఆ అర్జుననిగూర్చిన పొగడ్తలు; ఒక్కట= ఒక్కమారుగ; జన, సంఘంబు వలనన్= జనసమూహంనుండి; ఎగసి= పైకి లేచి; వియత్+తల, విదళనంబు+అయినన్= ఆకాశప్రదేశాన్ని చీల్చేది కాగా; ఆ+మహా, ధ్వని= ఆ పెద్దశబ్దాన్ని; విని; అదరిపడి= భయపడి; ధృతరాష్ట్రుండు; ఇది; ఏమి, రభసంబు= ఇదేమి అలజడి; అని; విదురున్+అడిగినన్= విదురుడిని అడుగగా; ఆతండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ అర్జునుడినిగూర్చినపొగడ్తలు ఒక్కమారుగా జనసమూహంనుండి పైకి లేచి ఆకాశాన్ని బ్రద్దలు చేసేట్లు ఉండగా, ఆ మహాధ్వనిని విని ధృతరాష్ట్రుడు భయపడి 'ఇదేమి అలజడి' అని విదురుడిని అడిగాడు. విదురుడు అతనితో ఇట్లా అన్నాడు.

విశేషం: ధృతరాష్ట్రుడు ఆ మహాధ్వనిని విని, మొదట భయపడ్డాడు. ఇది 'ఫలానా' ధ్వని అని తెలిశాక సంతోషించాడు.

క. భూరిభుజుం డర్జునుఁ డతి । శూరుఁడు దనయస్త్రవిద్యఁ జూపఁగ రంగ
త్ప్రారంభుఁ డయిన నతని న । వారితముగఁ బొగడుజనరవం బిది యధిపా! 23

ప్రతిపదార్థం: అధిపా= ఓ రాజా!; ఇది; భూరి, భుజుండు= పెద్దభుజాలు గలవాడు; అతి, శూరుఁడు= మిక్కిలి పరాక్రమవంతుడు - అయిన; అర్జునుఁడు; తన, అస్త్ర, విద్యన్; చూపఁగన్; రంగత్+ప్రారంభుఁడు+అయినన్= ప్రకాశిస్తున్న ప్రారంభం కలవాడు కాగా; అతనిన్= ఆ అర్జునుని; అవారితముగన్= అడ్డులేకుండగా; పొగడు= కొనియాడు; జన, రవంబు= జనులయొక్కశబ్దం.

తాత్పర్యం: ఓ రాజా! ఇది - గొప్పభుజాలు కలవాడు, మిక్కిలి పరాక్రమవంతుడు అయిన అర్జునుడు - తన అస్త్రవిద్యాప్రదర్శనను, శోభాయమానంగా ప్రారంభించగా, అతడిని ఎడతెరిపిలేకుండా ప్రశంసించే ప్రజల ధ్వని.

క. అనవుడు ధృతరాష్ట్రుఁడు దన । మనమున సంతోషమంది మానుగ వీనుల్
గనిన ఫల మిపుడు గంటిన్ । వినఁ గంటినిఁ బాండుసుతుల విద్యాశక్తుల్. 24

ప్రతిపదార్థం: అనవుడు= అని విదురు డనగా; ధృతరాష్ట్రుఁడు; తన, మనమునన్= తనయొక్క మనస్సులో; సంతోషము+అంది= సంతోషాన్ని పొంది; మానుగన్= ఒప్పుగా; వీనుల్= చెవులు; కనిన= పొందిన; ఫలము; ఇప్పుడు; కంటిన్= పొందాను; పాండు, సుతుల, విద్యా, శక్తుల్= పాండురాజుకొడుకుల విద్యలలోని సామర్థ్యాలను; వినన్+కంటిని= వినగలిగాను.

తాత్పర్యం: అని విదురుడు చెప్పగా ధృతరాష్ట్రుడు, తన మనస్సులో సంతోషించి 'చెవులున్న ఫలాన్నిప్పుడు పొందాను; పాండుకుమారుల విద్యాశక్తులనుగూర్చి ఇప్పుడు వినగలిగాను' అన్నాడు.

క. భూరినిజద్యుతితోడఁ బృ । థారణిసంభూతపాండవాగ్నిత్రితయం
బారఁగ నస్మత్కులదురి । తోరుతరారణ్యదాహ మున్నతిఁ జేయున్. 25

ప్రతిపదార్థం: పృథా+అరణి, సంభూత, పాండవ+అగ్ని, త్రితయంబు= కుంతి అనే అరణిలో పుట్టిన పాండవులనే అగ్నులు మూడు; భూరి, నిజ, ద్యుతి, తోడన్= గొప్పదైన తమకాంతితో; ఆరఁగన్= పూర్తిగా; అస్మత్+కుల, దురిత+ఉరుతర+అరణ్య, దాహము= నా వంశంయొక్క పాపమనే మిక్కిలి పెద్ద అరణ్యాన్ని కాల్చటం; ఉన్నతిన్= గొప్పగా; చేయున్= చేయగలవు.

తాత్పర్యం: కుంతి అనే అరణిలో పుట్టిన మూడుఅగ్నులూ (అంటే ధర్మరాజు, భీముడు, అర్జునుడు) తమ గొప్పకాంతితో నావంశంయొక్క పాపమనే పెద్దఅరణ్యాన్ని పూర్తిగా దహించివేయగలవు.

విశేషం: అలం: రూపకం. కుంతికి పుట్టిన ముగ్గురు కొడుకులు త్రేతాగ్నులనీ, ఆ ముగ్గురూ కురువంశంలో పుట్టిన పాప మనే అరణ్యాన్ని దహించివేస్తారనీ, అప్రయత్నంగా ధృతరాష్ట్రుడే అనటంలో - పాండవుల పరాక్రమంమాత్రమే కాక, వాళ్ళ

వ్యక్తిత్వాల పవిత్రత, అంతేకాక ముమ్ముందు మహాభారతసంగ్రామంలో ఈ ముగ్గురే కౌరవులను హతమారుస్తారన్న భావికథార్థం, 14వ పద్యంలోవలె వాచ్యంగా కాకుండా వ్యంగ్యరమణీయంగా ధ్వనిస్తున్నాయి.

అర్జునుండు తనయస్త్రవిద్యాకౌశలంబు సూపుట (సం.1-125-18)

వ. అని పొగడుచుండ నర్జునుం డాచార్యుననుమతంబున నస్త్రలాఘవవైచిత్ర్య ప్రకాశనపరుం డయి యెల్లవారును జూచుచుండ. 26

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పొగడుచున్+ఉండన్; అర్జునుండు; ఆచార్య+అనుమతంబునన్= ద్రోణాచార్యునియొక్క అనుమతితో; అస్త్ర, లాఘవ, వైచిత్ర్య, ప్రకాశన, పరుండు+అయి= అస్త్రవిద్యానైపుణ్యంలోని విచిత్రాన్ని (అనగా ఆశ్చర్యకరాలైన నానావిధ అస్త్ర విద్యా విన్యాసాలను) ప్రకటించటమే ప్రధానమైనదానినిగా కలవాడై; ఎల్లవారును= అందరును; చూచుచున్+ఉండన్= చూస్తుండగా.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు పొగడుతూ ఉండగా అర్జునుడు ద్రోణాచార్యుని అనుమతితో, మంత్రప్రధానాలైన గొప్పగొప్ప అస్త్రాలను ప్రయోగించే విద్యలోగల అద్భుత నైపుణ్యాలను ప్రదర్శించటంలో ఆసక్తికలవాడై, అక్కడున్న వాళ్ళందరూ చూస్తూ ఉండగా....

సీ. ఆగ్నేయశరమున నతిభీకరాగ్నియు । వారుణాస్త్రమున దుర్వారజలము
ననిలబాణంబున నధికానిలంబును । మేఘాస్త్రమున మహామేఘచయముఁ
బుట్టించు మఱియును భూమిబాణంబున । భూప్రవిష్టుం డగు, భూరిఘోర
శైలబాణంబున శైలరూపము దాల్చు । వీరుఁ, డదృశ్యాస్త్రవిద్యపేర్మిఁ

తే. దా నదృశ్యదేహుం డగుఁ, దత్క్షణంబ । హ్రస్వుఁ డగు దీర్ఘుఁ డగు సూక్ష్ముఁ డగు రయంబు
తోడ రథమధ్యగతుఁ డగు ధూర్గతుండు । నగు మహీతలగతుఁ డగు నద్భుతముగ. 27

ప్రతిపదార్థం: వీరుఁడు= వీరుడైన అర్జునుడు; అద్భుతముగ= ఆశ్చర్యకరంగా; ఆగ్నేయశరమునన్= అగ్నిసంబంధమైన బాణంచేత; అతి, భీకర+అగ్నియు= మిక్కిలి భయంకరమైన నిప్పును; వరుణ+అస్త్రమునన్= వరుణసంబంధమైన అస్త్రంచేత; దుర్+వార, జలమున్= ఆపటానికి సాధ్యం కాని నీటిని; అనిలబాణంబునన్= వాయుసంబంధమైన బాణంచేత, అంటే వాయవ్యాస్త్రంచేత; అధిక+అనిలంబును= మిక్కిలిగాలిని; మేఘ+అస్త్రమునన్= మేఘసంబంధమైన అస్త్రంచేత; మహా, మేఘ, చయమున్= పెద్దమేఘాల సమూహాన్ని; పుట్టించున్; మఱియును= ఇంకా; భూమి, బాణంబునన్= భూబాణంచేత; భూ, ప్రవిష్టుండు+అగున్= భూమిలో ప్రవేశించినవాడౌతాడు; భూరి, ఘోర, శైల, బాణంబునన్= పెద్దది, భయంకరమైనది అయిన పర్వతబాణంచేత; శైల, రూపము= పర్వతరూపాన్ని; తాల్చున్= ధరిస్తాడు; అదృశ్య+అస్త్ర విద్య, పేర్మిన్= అగుపించకుండ చేసే అస్త్రవిద్యలోని అతిశయంచేత; తాను; అదృశ్య, దేహుండు+అగున్= అగుపించని దేహం కలవాడౌతాడు; తత్+క్షణంబు+అ= ఆ నిమిషాననే; హ్రస్వుఁడు, అగున్= పొట్టివాడవుతాడు; దీర్ఘుఁడు+అగున్= పొడవైనవాడవుతాడు; సూక్ష్ముఁడు+అగున్= సన్నని వాడవుతాడు; రయంబుతోడ= వేగంతో; రథ, మధ్య, గతుఁడు+అగున్= రథంయొక్క మధ్యానికి వెళ్ళినవాడౌతాడు; ధూర్గతుండున్+అగున్ = నొగలనడుమ ఉన్నవాడవుతాడు; మహీతల, గతుఁడు+అగున్= భూమిమీద ఉన్నవాడౌతాడు.

తాత్పర్యం: వీరుడైన అర్జునుడు అందరికీ ఆశ్చర్యం కలిగేటట్లు ఆగ్నేయాస్త్రంతో అతిభయంకరమైన అగ్నిని, వారుణాస్త్రంతో వారింప సాధ్యంగాని నీటిని, వాయువ్యాస్త్రంచేత విపరీతమైన గాలిని, మేఘాస్త్రంచేత మహామేఘ సమూహాన్ని పుట్టించాడు. అంతేకాక భౌమాస్త్రంచేత భూమిలో ప్రవేశించాడు. శైలాస్త్రంచేత పర్వతరూపాన్ని పొందాడు. అదృశ్యాస్త్రంచేత అగుపడకుండా పోయాడు. అప్పటికప్పుడు పొట్టివాడయ్యాడు; పొడుగువాడయ్యాడు; సన్ననివాడయ్యాడు; మహావేగంగా రథమధ్యంలోకి వెళ్ళాడు, వెంటనే నొగలపై కూర్చున్నాడు; నేలమీద నిలిచాడు.

వ. మఱియుం బాఱెడుసింహవ్యాఘ్రవరాహాదిమృగంబుల ముఖంబులం దొక్కొక్కయ మ్మేసినట్ల యేనేసి యమ్ము లతిలాఘవంబున నేసియు, రజ్జుసమాలంబితం బయిన గోశృంగంబునం దేకవింశతిశరంబులు వరుసన నాట నేసియు, ని ట్లస్త్రవిద్యావైచిత్ర్యంబు మెఱసి గదాఖడ్గాదివివిధాయుధదక్షతం జూపి యర్జునుండు జనుల కాశ్చర్యంబు సేయుచున్నంతఁ, గర్ణుండును నిజవిద్యాకౌశలంబు మెఱయ సమకట్టి రంగద్వారంబున నిలిచి భుజాస్ఫాలనంబు సేసిన. 28

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; పాఱెడు, సింహ, వ్యాఘ్ర, వరాహ+ఆది, మృగంబుల, ముఖంబుల+అందు= పరుగెత్తుతున్న సింహం, పెద్దపులి, పంది మొదలయిన జంతువులయొక్క నోళ్ళలో; ఒక్కొక్క; అమ్ము+ఏసినట్లు+అ= బాణాన్ని వేసినవిధంగా; ఏనేసి, అమ్ములు= ఐదేసిబాణాలు; అతిలాఘవంబునన్= మిక్కిలిసులువుగా; ఏసియున్= వేసినతర్వాత; రజ్జు, సమ్+ ఆలంబితంబు+అయిన= త్రాటికి చక్కగా వేలాడగట్టబడిన; గో, శృంగంబు+అందు= ఆవుకొమ్మునందు; ఏకవింశతి, శరంబులు= ఇరవైఒక్కబాణాలు; వరుసన, నాటన్+ఏసియున్= నాటుకొనేటట్లు; వేసి; ఇట్లు+అస్త్ర, విద్యా, వైచిత్ర్యంబు= ఈవిధంగా అస్త్రవిద్యలోని విచిత్రతను - అంటే అస్త్రవిద్యలోని ఆశ్చర్యకరమైన తన నైపుణ్యాన్ని; మెఱసి= ప్రదర్శించి; గదా, ఖడ్గ+ఆది, వివిధ+ఆయుధ, దక్షతన్= గద, కత్తి మొదలయిన పలువిధాల ఆయుధాలలోని నేర్పును; చూపి; అర్జునుండు; జనులకు+ ఆశ్చర్యంబు+ చేయుచున్+ఉన్న+అంతన్= ప్రజలకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుండగా; కర్ణుండును= కర్ణుడుకూడా; నిజ, విద్యా, కౌశలంబు= తనయొక్క విద్యలోని నేర్పును; మెఱయన్= ప్రదర్శించుటకు; సమకట్టి= పూనుకొని; రంగ, ద్వారంబునన్; నిలిచి; భుజా+ఆస్ఫాలనంబు= భుజం చరచటాన్ని; చేసినన్= చేయగా.

తాత్పర్యం: అంతేకాక పరుగెత్తుతున్న సింహం, పెద్దపులి, పంది మొదలయిన మృగాలనోళ్ళలో ఒక్కొక్క బాణాన్ని వేసినట్లు ఐదేసిబాణాలను అతిసులభంగా వేసి, తర్వాత త్రాటికి వేలాడగట్టబడిన ఆవుకొమ్మున నాటుకొనేటట్లు వరుసగా ఇరవయ్యొక్క బాణాలను వేశాడు. ఈ విధంగా తన అస్త్రవిద్యావిచిత్రాలను ప్రదర్శించి, గద, కత్తి మొదలయిన అనేకవిధాలైన ఆయుధవిద్యల్లో తనకున్న నైపుణ్యాన్ని చూపి జనులను ఆశ్చర్యపరవశులను చేస్తుండగా; కర్ణుడు తన విద్యానైపుణ్యాన్ని ప్రదర్శింప పూనుకొని రంగద్వారంలో నిలిచి భుజం చరచగా.

విశేషం: రంగస్థలంలో పరుగెత్తే సింహాలకు, పెద్దపులులకు ప్రసక్తి ఎట్లని కొంతకు కొంత సందేహం కలగటం సహజం. రంగస్థలం సువిశాలమైన భద్రతకు తగిన ఏర్పాట్లు చేసినప్పుడు ఆయామృగాలను ప్రవేశపెట్టటం అసాధ్యం కాదు. కాని అవి లోహమయాలైన కృత్రిమజంతువులు అనే సూచన కొన్ని సంస్కృత భారత పాఠాలలో ఉన్నట్లు మహాభారత సంశోధితప్రతిలో పేర్కొనటం జరిగింది. "భ్రమతశ్చ వరాహస్య లౌహస్యప్రముఖే సమమ్ పంచబాణానసంసక్తా సమ్ముమో చైకబాణవత్." 'లౌహస్య' అనటానికి 'భ్రమరస్య, కామస్య, సింహస్య' అనే పాఠాలుకూడా ఉన్నాయి". - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.328.

మ. జనులెల్లం గడుసంభ్రమింపఁగ నజస్రంబై భుజాస్ఫాలన
ధ్వని శైలప్రకరంబుపైఁ బడు మహాదంభోళిశబ్దంబొకో
యన వీతెంచినఁ బాండవుల్ సనిరి ద్రోణాచార్యు డాయన్, సుయో
ధను వేష్టించిరి తమ్ము లందఱును దద్ద్వారంబు వీక్షించుచున్. 29

ప్రతిపదార్థం: జనులు+ఎల్లన్= ప్రజలందరు; కడున్= మిక్కిలి; సంభ్రమింపఁగన్= భయపడగా; అజస్రంబు+ఐ= ఎడతెరిపిలేనిదై; భుజా+ఆస్ఫాలధ్వని= భుజం చరచటంవలన కలిగినశబ్దం; శైల, ప్రకరంబు, పైన్= కొండల సమూహం మీద; పడు= పడుతూఉన్న; మహా, దంభోళి, శబ్దంబు+ఒకో= గొప్పవజ్రాయుధంయొక్కశబ్దమా; అనన్= అనేటట్లు; వీతెంచినన్= రాగా; పాండవులు; ద్రోణాచార్యు డాయన్= ద్రోణాచార్యుణ్ణి సమీపించటానికి; చనిరి= వెళ్ళారు; తమ్ములు+అందరును= (దుర్యోధనుడి) తమ్ములందరు; తద్+ద్వారంబు= ఆ వాకిలిని - అంటే ఆ శబ్దం వచ్చినవాకిలిని; వీక్షించుచున్= చూస్తూ; సుయోధనున్, వేష్టించిరి= దుర్యోధనుని చుట్టూ చేరారు.

తాత్పర్యం: ప్రజలంతా ఎంతో భయపడి ఎడతెరిపిలేనిదై భుజం చరచటంవలన పుట్టిన ఆ శబ్దం, పర్వత సమూహంపై పడే మహావజ్రాయుధశబ్దమా అనేటట్లు రాగా, పాండవులు ద్రోణాచార్యునిదగ్గరకు చేరారు. దుర్యోధనుని తమ్ముళ్లందరూ శబ్దం వచ్చిన ఆ వాకిలివైపు చూస్తూ దుర్యోధనునిచుట్టూ చేరారు.

విశేషం: ఆ ధ్వనితీవ్రత కర్ణునిహృదయబాధాతీవ్రతను చక్కగా ధ్వనింపచేస్తున్నది.

వ. అంత. 30

తాత్పర్యం: అప్పుడు.

కర్ణుఁడు ప్రవేశించి అర్జును నధిక్షేపించుట (సం. 1-126-2)

శా. సాలప్రాంశు నిజోజ్జ్వలత్కవచు శశ్వత్కుండలోద్భాసితున్
బాలార్క ప్రతిమున్ శరాసనధరున్ బద్ధోగ్రనిస్త్రింశు శౌ
ర్యాలంకారు సువర్ణవర్ణు ఘనుఁ గర్ణాఖ్యున్ జగత్కర్ణపూ
ర్ణాలోలద్గుణుఁ జూచి చూపఱు ప్రభూతాశ్చర్యులై రచ్చటన్. 31

ప్రతిపదార్థం: అచ్చటన్= అక్కడ; సాల, ప్రాంశున్= మద్దిచెట్టువలె పొడవైనవాడిని; నిజ+ఉత్+జ్వలత్+కవచున్= సహజమై మిక్కిలి ప్రకాశిస్తున్న కవచం గలవాడిని; శశ్వత్+కుండల+ఉద్భాసితున్= శాశ్వతాలయిన కుండలాలతో గొప్పగా వెలుగుతున్నవాడిని; బాల+అర్క, ప్రతిమున్= బాలసూర్యునిపోలినవాడిని; శర+ఆసన, ధరున్= ధనుస్సును ధరించినవాడిని; బద్ధ+ఉగ్ర, నిస్త్రింశున్= కట్టబడిన భయంకరమైన ఖడ్గం కలవాడిని; శౌర్య+అలంకారున్= శౌర్యమే అలంకారంగా కలవాడిని; సువర్ణ, వర్ణున్= బంగారువన్నెకలవాడిని; ఘనున్= గొప్పవాడిని; జగత్+కర్ణ, పూర్ణ+ఆలోలత్+గుణున్= లోకంయొక్క చెవులలో నిండి, వ్యాపిస్తున్న గుణాలు కలవాడిని; కర్ణ+ఆఖ్యున్= కర్ణుడనేపేరు కలవాడిని; చూచి, చూపఱు= చూచేవారు; ప్రభూత+ఆశ్చర్యులు+ఐరి= మిక్కిలి ఆశ్చర్యం కలవాళ్ళయ్యారు.

తాత్పర్యం: మద్దిచెట్టువలె ఎంతో ఎత్తైనవాడు, సహజకవచకుండలాలతో చాలా ఎక్కువగా ప్రకాశించేవాడు, బాలసూర్యుడిని పోలినవాడు, ధనుస్సును ధరించినవాడు, మొలలో భయంకరమైన కత్తిని కట్టుకొన్నవాడు, శౌర్యమే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అలంకారంగా కలవాడు, బంగారువన్నెవాడు, గొప్పవాడు, లోకం చెవులలో నిండి వ్యాపిస్తున్న మంచిగుణాలు కలవాడు అయిన కర్ణుడిని చూచి ప్రేక్షకులంతా ఎంతో ఆశ్చర్యపడ్డారు.

విశేషం: మహాభారతంలో ఇది ఒక ప్రసిద్ధ పద్యం; నన్నయనాటకీయరచనకు పతాకవంటిపద్యం. హస్తినాపురరంగమధ్యంలో ప్రేక్షకులు చూచిన కర్ణునిమహనీయవ్యక్తిత్వాన్ని, దీప్తిని, విజృంభణాన్ని పాఠకుల కంటికి కట్టినట్లు వ్రాసిన ఛాయాచిత్రంవంటి పద్యం. ఇందులోని ఉదాత్తమనోహరశైలి, శార్దూలవృత్తం కర్ణుని ఔన్నత్యవిజృంభణలకు చక్కని ఉద్దీపకాలు. నన్నయ ప్రసన్నకథాకవితలో స్థిరచిత్రవర్ణనశిల్పానికి ఈ పద్యం ఒక మచ్చుతునక. 17వ పద్యంలోని అర్జునునివర్ణనకు ఇది దీటుగా నిలుస్తుంది. ప్రసాదమిశ్రితమైన ఓజోగుణం ఈ పద్యరచనలోని విభావవిస్ఫోరకంగా రాణిస్తున్నది.

వ. కర్ణుండును జనుల నందఱ నదల్చి చొత్తెంచి, రంగమధ్యంబున నిలిచి, కలయం జూచి, కృపద్రోణాచార్యులకు నమస్కరించి, సజలజలధరధ్వానగంభీరవచనంబుల నర్జును నాక్షేపించి యి ట్లనియె. 32

ప్రతిపదార్థం: కర్ణుండును= కర్ణుడుకూడా; జనులన్+అందరన్= ప్రజలను అందరినీ; అదల్చి= బెదిరి తొలగిపోయేటట్లు చేసి; చొచ్చు+తెంచి= ప్రవేశించి; రంగమధ్యంబునన్= రంగమధ్యంలో; నిలిచి= నిలబడి; కలయన్+చూచి= అంతటా చూచి; కృప, ద్రోణ+ఆచార్యులకున్; నమస్కరించి; సజల, జలధర, ధ్వాన, గంభీర, వచనంబులన్= నీటితో కూడిన మేఘంయొక్క ఉరుములవలె గంభీరాలైన మాటలచేత; అర్జునున్= అర్జునుణ్ణి; ఆక్షేపించి= అడ్డగించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కర్ణుడుకూడా ప్రజలంతా బెదిరి తొలగిపోయేటట్లు చేసి ప్రవేశించి, రంగమధ్యంలో నిలిచి, అంతటా కలయ చూచి కృపద్రోణాచార్యులకు నమస్కరించి, నీటితో కూడిన మేఘం ఉరిమినట్లు గంభీరంగా మాట్లాడుతూ అర్జునుడిని అడ్డగించి ఈ విధంగా అన్నాడు.

విశేషం: ఇది కర్ణునిచలద్రూపవర్ణన; నన్నయనాటకీయరచన, కర్ణుడు జనులందరిని అదల్చి ప్రవేశించటం, రంగమధ్యంలో నిల్చి కలయచూడటం, కృపద్రోణాచార్యులకు నమస్కరించటం, అర్జునునికి అడ్డంగా నిలబడి గంభీరస్వరంతో మాట్లాడటం - భావుకుడైన పాఠకుడు చలనచిత్రంలోవలె ఈ వచనంలో దర్శించవచ్చును.

క. నీవ కడునేర్పుకాఁడవు। గా వలవదు; వీనిఁ గొన్ని గఱచితి మేమున్
నీవిద్యలెల్లఁ జూపుదు। మే వీరుల సూచి మేలుమే లని పొగడన్. 33

ప్రతిపదార్థం: నీవు+అ= నీవే; కడున్= మిక్కిలి; నేర్పుకాఁడవు= నేర్చినవాడివి; కావలవదు= కానక్కరలేదు; ఏమున్= మేము కూడ; వీనిన్= ఈ విద్యలను; కొన్ని= కొన్నింటిని; కఱచితిమి= నేర్చుకొన్నాము; నీ, విద్యలు+ఎల్లన్= నీవు చూపించిన విద్య లన్నింటిని; వీరులు+అ= వీరులైనవారే; చూచి; మేలు; మేలు; అని; పొగడన్= కొనియాడగా; చూపుదుము+ఎ= చూపుతాంకదా!

తాత్పర్యం: నీవే పెద్దనేర్పరి కానక్కరలేదు. మేముగూడా ఈ విద్యలు కొన్ని నేర్చి ఉన్నాం. నీవు చూపిన అన్ని విద్యలు - ఈ సామాన్యజనులు కాదు - వీరులైనవాళ్ళుకూడా చూచి మేలు మే లని పొగడేటట్లు చూపుతాం గదా!

విశేషం: ఇది నన్నయనాటకీయసంభాషణ, కర్ణునిస్వభావానికి అద్దంపట్టే సంభాషణ. స్వాతిశయంవైపు మొగ్గుతున్న అతని ఆత్మవిశ్వాసాన్ని, అర్జునమాత్సర్యంవైపు మొగ్గుతున్న అతనివిద్యాస్పర్ధను ధ్వనింపజేయటం ఇందులో చూడవచ్చు. అధిక్షేపోక్తికి ఇదొక చక్కని ఉదాహరణం.

క. అనిన నినతనయుపలుకులు । జనులకు విస్మయము, సవ్యసాచికిఁ గోపం
బును సిగ్గును, మఱి దుర్యో । ధనునకుఁ బ్రీతియును జేసెఁ దత్క్షణమాత్రన్. 34

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; ఇన, తనయు, పలుకులు= సూర్యునికుమారుడైన కర్ణునిమాటలు; జనులకు; విస్మయము= ఆశ్చర్యాన్ని; సవ్యసాచికిన్= అర్జునునికి; కోపంబును= కోపాన్ని; సిగ్గును; మఱి= మరియు; దుర్యోధనునకున్; ప్రీతియును= సంతోషాన్నీ; తద్+క్షణ, మాత్రన్= ఆ నిమిషంలోనే; చేసెన్= కలుగజేశాయి.

తాత్పర్యం: కర్ణునిమాటలు ఆ క్షణాన ప్రజలకు ఆశ్చర్యాన్నీ, అర్జునునికి కోపాన్నీ, సిగ్గునూ, దుర్యోధనునికి సంతోషాన్నీ కలిగించాయి.

విశేషం: అలం: ఉల్లేఖం; చూపరులకు కర్ణుని భుజస్ఫాలనం భయాన్నీ, ఆకారం అద్భుతాన్నీ కలిగించాయి. అనుకోని విధంగా అతడు అర్జునుణ్ణి ధిక్కరించి పలికిన మాటలు వివిధవ్యక్తులకు వివిధభావాలు కలిగించాయి. ప్రజలకు అసంభవమైనది సంభవమైనట్లు ఆశ్చర్యం కలిగించాయి. తనకు ఎవ్వరూ సాటిలేరని అనుకొంటున్న అర్జునునికి కోపాన్నీ, సిగ్గునూ కలిగించాయి. పాండవమధ్యమునితో దీటైన వీరుడు తనవైపు లేడని నిరాశతో ఉన్న దుర్యోధనునికి సంతోషాన్ని కలిగించాయి.

వ. అంత ద్రోణుచేత ననుజ్ఞాతుం డయి కర్ణుం డర్జునుచూపిన యస్త్రవిద్యావిశేషంబులెల్ల నశ్రమంబునఁ జూపినఁ జూచి, దుర్యోధనుండు దానుం దమ్ములును గర్ణునిం గౌఁగిలించుకొని 'నాతో బద్ధసఖ్యుండ వయి నాకును బాంధవులకును హితంబు సేసి నారాజ్యభోగంబులను నీవును నుపయోగింపు' మనిన 'నట్ల చేయుదు' నని కర్ణుం డాతనితోడి యిష్టసఖిత్వంబున కొడంబడి, 'యిమ్మూఁగిన రాజలోకంబును నీవును జూడఁ బార్థుతో ద్వంద్వయుద్ధంబు చేయవలయు' ననిన ధార్తరాష్ట్రమధ్యంబున నున్న యక్కర్ణుం జూచి పార్థుం డి ట్లనియె. 35

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; ద్రోణునిచేతన్; అనుజ్ఞాతుండు+అయి= అనుమతింపబడినవాడై; కర్ణుండు; అర్జునుడు, చూపిన= అర్జునుడు ప్రదర్శించిన; అస్త్ర, విద్యా, విశేషంబులు+ఎల్లన్= అస్త్రవిద్యలోని ప్రత్యేకతలన్నింటిని; అశ్రమంబునన్= శ్రమలేకుండ - సులభంగా; చూపినన్= చూపగా; చూచి; దుర్యోధనుండు; తానున్= తానునూ; తమ్ములును= తమ్ములున్నూ; కర్ణునిన్; కౌఁగిలించుకొని; నాతో (దుర్యోధనుడితో); బద్ధసఖ్యుండవు+అయి= కట్టబడినస్నేహం కలవాడివై; నాకును; బాంధవులకును= చుట్టాలకూ; హితంబు+చేసి= మేలుచేసి; నా, రాజ్యభోగంబులను; నీవును= నీవు కూడా; ఉపయోగింపుము= వినియోగించుకొమ్ము; అనినన్= అని అనగా; అట్లు+అ= అట్లే; చేయుదును= చేస్తాను; అని= ఆ విధంగా; కర్ణుండు; అతనితోడన్= దుర్యోధనునితో; ఇష్టసఖిత్వంబునకు= ఇష్టమైన స్నేహానికి; ఒడంబడి= ఒప్పుకొని; ఈ+మూగిన, రాజ, లోకంబును= ఈ చేరిన రాజుల సమూహమూ; నీవును= నీవూ; చూడన్= చూస్తుండగా; పార్థుతో= అర్జునునితో; ద్వంద్వ, యుద్ధంబు= జతగా పోరాడేయుద్ధం; చేయవలయున్= చేయాలి; అనినన్= అనగా; ధార్తరాష్ట్ర, మధ్యంబునన్+ఉన్న= ధృతరాష్ట్రునికుమారులైన కౌరవులమధ్యన ఉండే; ఆ+కర్ణున్; చూచి; పార్థుండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అప్పుడు ద్రోణుడు అనుమతించగా కర్ణుడు, అర్జునుడు చూపిన అస్త్రవిద్యావిశేషాలన్నీ అతి సులభంగా చూపాడు. అది చూచి దుర్యోధనుడు - తాను, తమ్ములు కర్ణుణ్ణి కౌగలించుకొని, 'నాతో చెలిమి చేసి నాకు, బంధువులకు మేలు కూర్చి, నా రాజ్యభోగాలు నీవుగూడా అనుభవించు' మని అన్నాడు. కర్ణుడు అట్లే అని అతనితో స్నేహంచేయటానికి సమ్మతించి, 'ఇక్కడ చేరిన ఈ రాజసమూహం, నీవూ చూస్తుండగా అర్జునునితో ద్వంద్వయుద్ధం చేయా' లని అన్నాడు. అప్పుడు కౌరవులమధ్యనున్న ఆ కర్ణుడిని చూచి అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: 'నా రాజ్యభోగంబులను నీవు నుపయోగింపుము' - అనే దానికి 'నన్నుం గురురాజ్యం బేలించి నా యైశ్వర్యంబు...' అనే పాఠాంతరం కొన్నిప్రతులలో ఉన్నది. మూలం: అహం చ కురురాష్ట్రం చ యథేచ్ఛ ముపభుజ్యతామ్ (పి.పి.యస్. ప్రతి, పుట. 850) - శ్రీమదాంధ్రమహాభారతసంశోధిత ప్రతి, పుట. 330.

క. పిలువంగఁబడక సభలకు । బలిమిం జని పలుకు పాపభాగుల లోకం
బులకుఁ జన వేఁడి పలికెదు । పలువ! యెఱుంగవు పరాత్మపరిమాణంబుల్. 36

ప్రతిపదార్థం: పిలువంగన్+పడక= పిలువబడకుండ - ఆహ్వానం లేకుండా; సభలకున్= సభలకు; బలిమిన్= బలంతో; చని=వెళ్ళి; పలుకు= మాట్లాడే; పాప, భాగుల, లోకంబులకున్= పాపం పొందినవాళ్ళలోకాలకు, చనన్= వెళ్ళటానికి, వేఁడి= కోరి; పలికెదు= మాటాడుతున్నావు; పలువ= దుర్మార్గుడా; పర+ఆత్మ, పరిమాణంబుల్= ఎదుటివాళ్ళయొక్క, నీయొక్క కొలదులు; ఎఱుంగవు= తెలియవు.

తాత్పర్యం: పిలుపు లేకుండానే సభలకు బలగర్వంతో వెళ్ళి, నోటికివచ్చినట్లు మాట్లాడే పాపాత్ములు వెళ్ళే లోకాలకు (నరకాలకు) పోవాలనుకొని మాట్లాడుతున్నావు. దుర్మార్గుడా! నీవు ఎదుటివాళ్ళకొలది, నీ కొలది తెలియనివాడవు.

క. అనిన విని పార్థునకు ని । ట్లనియె నినాత్మజుఁడు 'దుర్బలాశ్వాసక్షే
పనిబంధమ్ములు వలుకక । ఘననిశితాస్త్రములఁ బలుకఁ గడఁగుము నాతోన్'. 37

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ఇన+ఆత్మజుఁడు= సూర్యునియొక్క కుమారుడైన కర్ణుడు; పార్థునకున్= అర్జునునితో; ఇట్లు+అనియెన్; నాతోన్=నాతో; దుర్+బల+ఆశ్వాస, క్షేప, నిబంధమ్ములు= బలహీనులను ఊరడించటంకోసం కాలంపుచ్చే మాటలు; పలుకక; ఘన, నిశిత+అస్త్రములన్= గొప్ప వాడియైన బాణాలతో; పలుకన్= పలకటానికి; కడఁగుము= ప్రయత్నించుము.

తాత్పర్యం: అర్జునునిమాటలు విని కర్ణుడు - 'బలహీనులను ఊరడించటానికి చెప్పేమాటలు మాని, గొప్ప పదునైనబాణాలతో మాట్లాడుము' అని పలికాడు.

విశేషం: దుర్బలాశ్వాసక్షేపనిబంధమ్ములు - అనే దానికి మూలం: "సంక్షేపైః దుర్బలాశ్వాసైః శరైః కథయ భారత" - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట 330. 'చేతకానివారికి సంతోషం కలిగించే పొల్లుమాటలు కట్టిపెట్టి, వాడిబాణాలతో సమాధానం చెప్పుము' - అని పలికిన కర్ణునివాక్యంలో అత్యంతతిరస్కృతవాచ్యధ్వని ఉన్నది. బాణాలతో పలకటం - అనేది లక్ష్యార్థవిశేషం. 'అర్జునా! నీవలె నేను వాచాశూరుడిని కాదు. కార్యశూరుడిని. మాటలతో కాలం వ్యర్థం చేయక చేతనైతే యుద్ధం చేయుము' అన్నది కర్ణుని అధిక్షేపం.

క. ఈ రంగభూమి యస్త్రవి । శారదు లగువారి కెల్ల సామాన్యముగా
కారయ వీరికిఁ జొర నగు । వీరికిఁ గా దను విచారవిషయము గలదే?. 38

ప్రతిపదార్థం: ఆరయన్= విచారిస్తే; ఈ, రంగ, భూమి; అస్త్ర, విశారదులు+అగు, వారికి+ఎల్లన్= అస్త్రాలలో నేర్పరులైనవారి కందరికి; సామాన్యము, కాక= సమానం కాకుండా; వీరికిన్= వీళ్ళకు; చొరన్+అగున్= ప్రవేశించవచ్చు; వీరికిన్= వీళ్ళకు; కాదు+అను= ప్రవేశించకూడదనే; విచార, విషయము= ఆలోచించదగిన అంశం; కలదే= ఉన్నదా?

తాత్పర్యం: విచారించి చూస్తే ఈ రంగభూమి అస్త్రవిద్యావేత్తలందరికి సమానం గాకుండా - వీళ్ళకు ప్రవేశం ఉన్నది, వీళ్ళకు ప్రవేశం లేదు అని విచారించవలసింది ఏమైనా ఉన్నదా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని గర్వించి దుర్యోధనానుమతంబునఁ బార్థుతో ద్వంద్వయుద్ధంబు సేయంబూని రణసన్నద్ధుం డయి రవితనయుండు రంగమధ్యంబున నున్నంత, నర్జునుండును నాచార్యభ్రాతృచోదితుం డై యుగాంత కాలానలుండునుంబోలెఁ బ్రతిఘటించి నిలిచిన. 39

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; గర్వించి= పొగరుతోకూడి; దుర్యోధన+అనుమతంబునన్= దుర్యోధనునియొక్క అనుమతితో; పార్థుతో= అర్జునునితో; ద్వంద్వయుద్ధంబు= ఇద్దరు ఒకరితో ఒకరు చేసేయుద్ధం; చేయన్= చేయటానికి; పూని= ప్రయత్నించి; రణ, సన్నద్ధుండు+అయి= యుద్ధంకోసం బాగా సిద్ధమైనవాడై; రవి, తనయుండు= సూర్యునియొక్క కుమారుడైన కర్ణుడు; రంగమధ్యంబునన్= రంగమధ్యంలో; ఉన్న+అంతన్= ఉండిన సమయంలో; అర్జునుండును=అర్జునుడు కూడా; ఆచార్య, భ్రాతృ, చోదితుండు+ఐ= గురువులచేత, సోదరులచేత పురికొల్పబడినవాడై; యుగ+అంత; కాల+అనలుండునున్, పోలెన్= ప్రళయకాలంలోని అగ్నివలె; ప్రతిఘటించి=ఎదిరించి; నిలిచినన్= నిలువగా.

తాత్పర్యం: అని కర్ణుడు గర్వపడి దుర్యోధనుని అనుమతితో - అర్జునునితో ద్వంద్వయుద్ధం చేయటానికై సిద్ధమై రంగమధ్యంలో ఉండగా, గురువులచేత, సోదరులచేత ప్రేరేపింపబడినవాడై అర్జునుడు ప్రళయకాలాగ్నివలె ఎదిరించి నిలువగా.

విశేషం: కర్ణుడు రంగప్రవేశం చేయగానే కురుకుమారులు రెండు వర్గాలుగా చీలిపోవటం కళ్ళకు కట్టినట్లు అందరికి అగుపించింది. కర్ణునికి మిత్రుడు, గురువు, దైవం అన్నీ దుర్యోధనుడే. అర్జునునికి గురువులు, సోదరులు మార్గదర్శకులు. పాండవులకు పెద్దలున్నారు. దుర్యోధనుడు తనకు తానే పెద్ద. అర్జునునిది ధర్మనిర్ణయం. కర్ణునిది, దుర్యోధనునిది స్వయంనిర్ణయం. ఇక ముందు కథలో ఈధోరణి ఇంతే! భావికురుకుమారవిభేదక్రమానికి ఇది నాంది.

కర్ణార్జునుల ద్వంద్వయుద్ధము (సం.1-126-23)

మ. జనితామర్షుఁడు డంతఁ బార్థుపయిఁ బర్జన్యాస్త్ర మక్కర్ణుఁ డే
సె; నపారం బయి భూనభోంతరముఁ దజ్జీమూతయూథంబు గ
ప్పినఁ దద్ధ్వాంతతిరోహితాపఘనుఁ డై బీభత్సుఁ డుండెన్; విరో
చనుఁ డాత్మద్యుతి విస్తరించె సుతుపై సంప్రీతచేతస్కుఁ డై. 40

ప్రతిపదార్థం: జనిత+అమర్షణుఁడు= పుట్టబడినకోపం గలవాడు; ఆ+కర్ణుఁడు; అంతన్= అప్పుడు; పార్థు, పయిన్= అర్జునునిమీద; పర్జన్య+అస్త్రము= మేఘాస్త్రాన్ని; ఏసెన్= వేశాడు; తత్+జీమూత, యూథంబు= దానియొక్కమేఘాలసమూహం; అపారంబు+అయి= హద్దు లేనిదై; భూ, నభస్+అంతరమున్= భూమ్యాకాశాల మధ్యప్రదేశాన్ని; కప్పినన్= కప్పివేయగా; బీభత్సుఁడు= అర్జునుడు; తద్+ధ్వాంత, తిరోహిత+అపఘనుఁడు+ఐ= ఆ చీకటిచేత మరుగుపడినదేహం కలవాడై; ఉండెన్; విరోచనుఁడు= సూర్యుడు; సంప్రీత, చేతస్కుఁడు+ఐ= మిక్కిలి ఆనందించిన మనస్సు కలవాడై; ఆత్మ, ద్యుతిన్= తన యొక్కకాంతిని; సుతుపైన్= కుమారుని (కర్ణుడి) మీద; విస్తరించెన్= ప్రసరించాడు.

తాత్పర్యం: కర్ణుడు కోపంతో అర్జునునిమీద మేఘాస్త్రాన్ని ప్రయోగించాడు. అంతులేని మేఘసమూహం భూమ్యాకాశమధ్యప్రదేశాన్ని కప్పివేయగా అర్జునుడు ఆ చీకటిలో మరుగుపడిపోయాడు. సూర్యుడు సంతోషించి కుమారుడైన కర్ణునిమీద తనకాంతిని ప్రసరించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'తద్ధ్వాంత తిరోహితాపఘనుడై బీభత్సు డుండెన్' - అనేదానికి - తద్ధ్వాంతము వాయ వాయుశరముం బీభత్సు డేసెన్ - అనే పాఠాంతరమున్నది. మూలం: మేఘచ్ఛాయోపగూఢస్తు తతోఽదృశ్యత పాండవః । సూర్యాతప పరిష్వక్తః కర్ణోఽపి సమదృశ్యత. - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.331.

వ. **అయ్యవసరంబున దుర్యోధనుండొట్టి ధృతరాష్ట్రనందను లందఱుఁ గర్ణువలన నుండిరి; భీష్మద్రోణకృప పాండవులు పార్థువలన నుండి రంత.** **41**

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; దుర్యోధనున్+తొట్టి= దుర్యోధనుడు మొదలుకొని; ధృతరాష్ట్రనందనులు+ అందఱున్= కౌరవులందరూ; కర్ణువలనన్= కర్ణునివైపు; ఉండిరి; భీష్మ, ద్రోణ, కృప, పాండవులు; పార్థువలనన్= అర్జునునివైపు; ఉండిరి; అంతన్= అటుపై.

తాత్పర్యం: ఆ సమయంలో ఒకవైపు దుర్యోధనుడుమొదలు ధృతరాష్ట్రునికొడుకులంతా కర్ణునిపక్షంలో నిలిచారు. మరొకవైపు భీష్ముడు, ద్రోణుడు, పాండవులు అర్జునునిపక్షంలో నిలిచారు. అప్పుడు.

క. **రవిసుతపార్థులఘోరా । హవమునకును వెఱచుచున్నయది కుంతి తదు**
ద్భవఘనతరశరతిమిరౌ । ఘవృతాంగుఁ దనూజుఁ జూడఁ గానక వంతన్. **42**

ప్రతిపదార్థం: రవిసుత, పార్థుల, ఘోర+ఆహవమునకును= కర్ణార్జునులయొక్క భయంకరమైన యుద్ధానికి; వెఱచుచున్+ఉన్న, అది, కుంతి= భయపడుతూన్న కుంతీదేవి; తత్+ఉద్భవ, ఘనతర, శర, తిమిర+ఓఘ, వృత+అంగున్= దానినుండి పుట్టిన చాలాగొప్పదైన బాణంవలన కలిగిన చీకట్ల సమూహంచేత కప్పబడిన దేహం గలవాడిని; తనూజున్= కుమారుడిని, అర్జునుని; చూడన్+కానకన్= చూడలేక; వంతన్= దిగులుతో.

తాత్పర్యం: కర్ణార్జునులద్వంద్వయుద్ధం చూచి భయపడుతూన్న కుంతి, కర్ణునిపర్జన్యాస్త్రం (మేఘాస్త్రం) వలన కలిగినచీకట్లసమూహంచేత కప్పబడి, అర్జునుడు అగుపించకపోగా అప్పుడు.

క. **ధృతి దఱిఁగి మోహమూర్ఛా । న్విత యైనను సంభ్రమించి విదురుఁడు ప్రత్యా**
గతజీవఁ జేసె నప్పడ । యతిశీతలచందనోదకాసేకమునన్. **43**

ప్రతిపదార్థం: ధృతి= ధైర్యం; తఱిఁగి= తగ్గి; మోహ, మూర్ఛా+అన్విత+ఐనను= మోహంవలన, మూర్ఛతో కూడుకొన్నది కాగా; విదురుడు; సంభ్రమించి= త్వరపడి; అప్పుడు+అ= అప్పటికప్పుడే; అతి శీతల, చందన+ఉదక+ఆసేకమునన్= మిక్కిలి చల్లని గంధపునీళ్లను చల్లటంచేత; ప్రతి+ఆగత, జీవన్= మరలివచ్చిన ప్రాణం గలదాన్నిగా; చేసెన్.

తాత్పర్యం: ధైర్యం తగ్గి, మోహంతో కుంతీదేవి మూర్ఛిల్లగా, విదురుడు వెంటనే చల్లనిగంధపునీళ్లను చల్లి ఆమెకు ప్రాణం మళ్ళీ వచ్చేటట్లు చేశాడు.

విశేషం: కుంతీదేవి పుత్రవాత్సల్యాన్ని వ్యక్తంచేయటంలో ప్రదర్శించే ఉద్విగ్నప్రవృత్తిని ఈ సన్నివేశం మరొకసారి ధ్వనింప చేస్తున్నది. మూర్ఛ అన్నది సాత్త్వికభావంవంటిది. వాత్సల్యం హర్షంతో ఉప్పొంగితే పాలధారలు, ఆనందబాష్పాలు (21వపద్యం); భయభావంతో ఉప్పొంగితే మూర్ఛిల్లటం - అనేవి సాత్త్వికచేతనను వ్యక్తంచేస్తున్నాయి. వస్తుధ్వనిని రసధ్వనికి అంగంగా పోషించే కథాకథనశిల్పమిది. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అంత నర్జునుం డనిలబాణంబున నమ్మేఘపటలంబు పఱవనేసి యాదిత్యసమతేజుం డయి యుండె; నంత విదురదర్శితు లైన యక్కర్ణార్జునులం జూచి కుంతి సంతసిల్లె; నపుడు ధర్మవిదుం డఖిలద్వంద్వయుద్ధసమాచార నిపుణుండు కృపాచార్యుం డయ్యిద్దఱ నడుమ నిలిచి కర్ణున కి ట్లనియె. 44

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; అర్జునుండు; అనిల, బాణంబునన్= వాయవ్యాస్త్రంచేత; ఆ+మేఘ, పటలంబు= ఆ మేఘాల సమూహాన్ని; పఱవన్+ఏసి= పారిపోయేటట్లు కొట్టి; ఆదిత్య, సమ, తేజుండు+అయి= సూర్యునితో సమానమైన కాంతి కలవాడై; ఉండెన్; అంతన్= తర్వాత; విదుర, దర్శితులు+ఐన= విదురునిచేత చూపబడినవారైన; ఆ+కర్ణ+అర్జునులన్; చూచి; కుంతి; సంతసిల్లెన్= సంతోషించింది; అపుడు; ధర్మ, విదుండు= ధర్మం తెలిసినవాడు; అఖిల, ద్వంద్వ, యుద్ధ, సమాచార, నిపుణుండు= అన్ని ద్వంద్వయుద్ధాలను చక్కగా నడపటంలో నేర్పరి అయినవాడు; కృపాచార్యుండు; ఆ+ఇద్దఱ, నడుమన్= ఆ ఇద్దరిమధ్య; నిలిచి; కర్ణునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అప్పు డర్జునుడు వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించి, ఆ మేఘసమూహాన్ని పారద్రోలి, సూర్యునివలె వెలుగుతూ నిలిచాడు. విదురుడు చూపిస్తే ఆ కర్ణార్జునులను కుంతి చూచి సంతోషించింది. ధర్మజ్ఞుడూ, ద్వంద్వయుద్ధాలను చక్కగా నడపటంలో నిపుణుడూ అయిన కృపాచార్యుడు ఆ కర్ణార్జునులనడుమ నిలిచి కర్ణునితో ఇట్లా అన్నాడు.

విశేషం: కర్ణార్జును లిద్దరికీ తల్లి కుంతి. వాళ్ళిద్దరి ద్వంద్వయుద్ధం చూచి జనులంతా పొందే స్పందన ఒక యెత్తు; ఆ తల్లి పొందే స్పందన ఒకయెత్తు అని కథనశిల్పం చెపుతున్నది. కర్ణునిమేఘాస్త్రంవలన అర్జునుడు కప్పివేయబడటం చూచి ఓర్చుకోలేక మూర్ఛితురాలైంది. మబ్బులు వీడినతరువాత అర్జునుడిని చూచి ఆనందించింది. అర్జునుడు లోకానికి తెలిసిన కుంతికొడుకు. కర్ణుడు తెలియనికొడుకు. ఇద్దరినీ చూచి రెండుకన్నులతో సంతోషించటం సార్థకం. ఈ సన్నివేశం భావికథలో పాండవులను కర్ణుడు చంపుతాడేమో అన్న భయంతో ఆమె అతడిని రహస్యంగా వరంకోరే ఘట్టానికి బీజప్రాయంగా భాసిస్తుంది.

చ. కురుకులజుండు పాండునకుఁ గుంతికిఁ బుత్త్రుడు, రాజధర్మబం
ధురచరితుండు; నీ వితనితోడ రణం బొనరించెదేని వి
స్తరముగ నీదువంశమును దల్లిని దండ్రిని జెప్పు; చెప్పినన్
దొరయగుదేని నీ కెదిరి దోర్బలశక్తి నితండు సూపెడిన్. 45

ప్రతిపదార్థం: కురు, కులజుండు= కురువంశంలో పుట్టినవాడు; పాండునకున్= పాండురాజుకు; కుంతికిన్; పుత్త్రుడు; రాజ, ధర్మ, బంధుర, చరితుండు= రాజధర్మంచేత ఒప్పిన నడవడి కలవాడు; నీవు; ఇతనితోడన్= ఈ అర్జునునితో; రణంబు= యుద్ధం; ఒనరించెదు+ఏని= చేసేటట్లయితే; విస్తరముగన్= వివరంగా; నీదు, వంశమును; తల్లిని, తండ్రిని= తల్లిదండ్రుల్ని; చెప్పు= చెప్పుము; చెప్పినన్= అట్లా చెప్పితే; దొర+అగుదువు+ఏని= సమానుడవైతే, క్షత్రియుడవైతే; ఇతండు= ఈ అర్జునుడు; నీకున్+ఎదిరి= నీకు ఎదురు నిలిచి; దోస్+బల, శక్తిన్= భుజబలశక్తిని; చూపెడిన్= చూపగలడు.

తాత్పర్యం: అర్జునుడు కురురాజువంశంలో పుట్టినవాడు. పాండురాజుకు, కుంతీదేవికి పుత్రుడు. రాజధర్మంచేత ప్రకాశించేప్రవర్తన కలవాడు. నీవు ఇతనితో యుద్ధం చేయదలిస్తే నీవంశాన్నీ, తల్లిదండ్రులనూ వివరంగా చెప్పుము. సమానుడవైతే ఇతడు నిన్నెదిరించి భుజశక్తి చూపిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: శబ్దశక్తిమూలధ్వనికి ఈ పద్యం అమూల్యోదాహరణం. 'కృపాచార్యుడు పలికిన వాక్యాలలో 'కుల', 'రాజ', 'దొర' - అనే మూడు శబ్దాలు సాభిప్రాయాలు. కులమంటే వంశమనీ, వర్ణమనీ రెండర్థాలున్నాయి. అర్జునుడు కురువంశానికీ, వాళ్ళకులానికీ (క్షత్రియవర్ణం) చెందినవాడు; రాజశబ్దానికి రాజ్యంచేసేవాడనీ, క్షత్రియుడనీ అర్థాలేర్పడతాయి. వంశాన్ని తల్లిని తండ్రిని పేర్కొని నీవు దొరవు (క్షత్రియుడవు, రాజువు, సమానమైనవాడవు)గా నిరూపించుకొను మని కృపాచార్యుడు కర్ణుడిని అడిగాడు. దొర శబ్దంలోని ప్రభువు అనే అర్థాన్ని గ్రహించి, దుర్యోధనుడు ఆ కర్ణుడిని అంగరాజ్యాధిపతిని చేస్తాడు. పరాక్రమంలో అర్జునునితో కర్ణుడు సమానమని సూచించాడు. తల్లిదండ్రులు, కులం అనే అంశాలను శూరులపట్ల పట్టించుకొనకూడదని వారించాడు. 'అనిలజ' అని భీముడిని ఎత్తిపొడిచాడు. ఈ పద్యంలోని రమణీయమైన వ్యంగ్యార్థమంతా 'దొర' అనే శబ్దప్రయోగంమీద అధారపడి ఉన్నది. ప్రభువనే అర్థం వాచ్యంలో, సమానుడనే అర్థం వ్యంగ్యంలో స్ఫురిస్తుంది. 'వివాహశ్చ వివాదశ్చ సమయోరేవ శోభతే' అనే న్యాయం ధ్వనిస్తుంది. భావికథకు అదే మూలమౌతుంది. కాబట్టి ఇది శబ్దశక్తిమూలధ్వని. చమత్కారమేమంటే పఠితకు కర్ణుడి తల్లిదండ్రులసంగతి తెలుసు.. సన్నివేశంలో ఉన్నవారికి తెలియదు. కర్ణునిస్థితి పఠితలో సానుభూతిని రేకెత్తిస్తుంది. ఇది రసవిషయకమైన రహస్యం. (సంపా.)

వ. అనిన విని కర్ణుండు దనకులంబును దల్లిదండ్రులను జెప్ప సిగ్గుపడి తలవాంచి యున్నం జూచి దుర్యోధనుండు గృపున కి ట్లనియె. 46

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; కర్ణుండు; తన, కులంబును; తల్లి, దండ్రులను; చెప్పన్= చెప్పటానికి; సిగ్గుపడి; తలవాంచి= తలనువంచి; ఉన్నన్= ఉండగా; దుర్యోధనుండు; కృపునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని కర్ణుడు తన కులాన్నిగురించి, తల్లిదండ్రులనుగురించి చెప్పటానికి సిగ్గుపడి, తలవంచుకొని ఉండగా చూచి దుర్యోధనుడు కృపాచార్యునితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: కర్ణుడు తాను సూతనందనుడననీ, రాధేయుండననీ చెప్పటానికి సిగ్గుపడి ఊరుకొనటమే ప్రకరణౌచిత్యం. అత డెవరి కొడుకో పఠితకు తెలుసు. పెంచినతండ్రిని తండ్రిగా చెప్పుకొనటం అవమానంగా భావించాడని తలంచటం ఉచితం కాదు. తనను పెంచిన తల్లిదండ్రులు వంశగౌరవంలో కుంతీపాండురాజులతో సమానులు కారని చెప్పటం కర్ణునికి ఇష్టం లేదు. అందువలన సిగ్గుపడి ఊరుకొన్నాడు.

క. కులముగలవాఁడు, శౌర్యము। గలవాఁడును, నధికసేన గలవాఁడును, భూ
తలమున రా జను నామము। విలసిల్లఁగఁ దాల్చు మూఁడువిధముల పేర్మిన్. 47

ప్రతిపదార్థం: కులము, కలవాఁడు; శౌర్యము, కలవాఁడునున్= పరాక్రమం కలవాడును; అధిక, సేన, కలవాఁడును= ఎక్కువ సేన కలవాడును; భూతలమునన్= భూమిమీద; పేర్మిన్= గొప్పగా; మూడు విధముల; రాజు+అను, నామమున్= రాజు అనే పేరును; విలసిల్లగన్= ఒప్పుగా; తాల్చున్= ధరిస్తాడు.

తాత్పర్యం: కులమున్నవాడు, శౌర్యమున్నవాడు, అధికసేనాబలమున్నవాడు, భూమిమీద మూడువిధాల రాజనే పేరు గొప్పగా పెట్టుకొంటున్నాడు.

విశేషం: కృపాచార్యుడు పేర్కొన్న 'దొర' అనే పదానికి రూఢిలో ఉన్న అర్థాలు చెప్పి, కర్ణుని దొరతనాన్ని నిలపటానికి దుర్యోధనుని ప్రయత్నం ఇది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. రాజవరుఁ డైన పార్థుతో రాజు గాని । యీతఁ డని సేయఁగాఁ దగఁడేని వీని
నెల్లవారును జూడంగ నీక్షణంబ । రాజుఁ జేసెద నే నంగరాజ్య మిచ్చి. 48

ప్రతిపదార్థం: రాజ, వరుఁడు+ఐన, పార్థుతో= రాజులలో శ్రేష్ఠుడైన అర్జునునితో; రాజు, కాని, ఈతఁడు= రాజు కానట్టి ఈ కర్ణుడు; అని= యుద్ధం; చేయఁగాన్= చేయటానికి; తగఁడు+ఏని= తగనివాడైతే; వీనిన్= ఈ కర్ణుడిని; ఎల్ల, వారును= అందరును; చూడంగన్= చూస్తూఉండగా; అంగరాజ్యము+ఇచ్చి; నేను; రాజున్+చేసెదన్= రాజుగా చేస్తాను.

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడైన అర్జునునితో - రాజు కానట్టి ఈ కర్ణుడు యుద్ధం చేయటానికి తగనివాడైతే అందరూ చూస్తుండగా ఇతనికి నేను అంగరాజ్యమిచ్చి, రాజుగా చేస్తాను.

దుర్యోధనుఁడు కర్ణుని నంగరాజ్యమున కభిషిక్తుం జేయుట (సం. 1-126-36)

వ. అని యప్పుడ భీష్మధృతరాష్ట్రులకుం జెప్పి వారియనుమతంబున మహామహీసురసహస్రంబునకు గోసహస్రాయుతంబు దానంబు సేసి 'యంగరాజ్యంబునకు వీఁ డర్హుం డయ్యెడు' మను బ్రాహ్మణవచనంబు వడసి, కర్ణుం గాంచనపీఠంబున నునిచి యంగరాజ్యమున కభిషిక్తుం జేసినఁ, గర్ణుండును మణిమకుట కేయూర హారాది భూషణ భూషితుం డై సకలరాజచిహ్నంబుల నొప్పి పరమహర్షంబుతోడం గురుపతి కి ట్లనియె. 49

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; అప్పుడు+అ= అప్పటికప్పుడే; భీష్మ, ధృతరాష్ట్రులకున్= భీష్మునికి, ధృతరాష్ట్రునికి; చెప్పి= తెలిపి; వారి, అనుమతంబునన్= వారి అనుమతితో; మహామహీసుర, సహస్రంబునకున్= ఉత్తములయిన బ్రాహ్మణులు వేయిమందికి; గో, సహస్ర+అయుతంబు= కోటిఆవులను [అయుతము= 10వేలు; సహస్ర అయుతము 1000X 10,000= 1,00,00,000(కోటి);] దానంబు; చేసి; అంగ, రాజ్యంబునకున్; వీఁడు= ఈతడు - ఈ కర్ణుడు; అర్హుండు+అయ్యెడుము= తగినవాడు అయ్యెడుగాక; అను= అనునట్టి; బ్రాహ్మణ, వచనంబు= బ్రాహ్మణులయొక్క మాట; పడసి= పొంది; కర్ణున్= కర్ణుణ్ణి; కాంచన, పీఠంబునన్= బంగారు సింహాసనంమీద; ఉనిచి= ఉంచి; అంగ,రాజ్యమునకున్; అభిషిక్తున్= అభిషేకించినవానిని; చేసినన్= చేయగా; కర్ణుండును; మణి, మయ, మకుట, కేయూర, హార+ఆది, భూషణ, భూషితుడు+ఐ= మణులతో నిండిన కిరీటం, భుజకీర్తులు, దండలు మొదలయిన సొమ్ములతో అలంకరింపబడినవాడై; సకల, రాజ చిహ్నంబులన్= అన్నివిధాలైన రాజలాంఛనాలతో - అంటే అన్నివిధాలైన రాచరికపు గుర్తులతో; ఒప్పి= ప్రకాశించి; పరమ, హర్షంబుతోడన్= మిక్కిలిసంతోషంతో; కురుపతికిన్= దుర్యోధనునికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఈ విధంగా పలికి, అప్పటికప్పుడే భీష్మధృతరాష్ట్రులకు చెప్పి - వాళ్ళ అనుమతితో వేయిమందిబ్రాహ్మణోత్తములకు కోటి గోవులను దానంగా ఇచ్చి, ఆ బ్రాహ్మణులచేత అంగరాజ్యానికి కర్ణుడు అర్హుడయ్యెడు గాక అని ఆశీర్వదింపజేసి, బంగారుసింహాసనంమీద కర్ణుడిని కూర్చుండబెట్టి అంగరాజుగా అతడిని అభిషేకించాడు. కర్ణుడు మణిమయ కిరీటంతో, భుజకీర్తులతో, హారాలతో, అనేకవిధాలైన ఆభరణాలతో, సకలరాజలాంఛనాలతో శోభిల్లి మహానందంతో దుర్యోధనునితో ఇట్లా అన్నాడు.

విశేషం: దుర్యోధనుడు చేసిన ఈ మహోపకారమే కర్ణునిజీవితాన్నీ, మహాభారతకథనూ మలుపు తిప్పింది. సూతసుతుడిని అంగరాజుగా మార్చింది. జీవితాంతం కృతజ్ఞతాభావబంధంతో కర్ణుడిని కౌరవపక్షానికి కట్టివేసింది. అర్జునునికి సమానుడైన విలుకాడు తనపక్షాన ఉన్నాడన్న ఆత్మవిశ్వాసాన్ని సుయోధనునిలో పెంచింది. గోదాన విషయం మూలంలో లేదు. అక్కడ

"విప్రైశ్చ ప్రదత్వా హ్యమితం వసు" అనే ఉంది. 'వసు' అంటే 'బంగారం, రత్నం, ధనం' అని అర్థాలు. గోదాన వైశిష్ట్యాన్ని గుర్తించిన నన్నయ - వసుదానాన్ని "గోసహస్రాయుతంబు దానంబుసేసి" అని వివరించాడు.

క. బృహదబ్ధిమేఖలాఖిల । మహీతలక్షత్త్రవరసమక్షమున మహా
మహిమాన్వితుఁగా నన్నును । మహీశుఁగాఁ జేసి తతిసమర్థత వెలయన్. 50

ప్రతిపదార్థం: బృహత్= అబ్ధి, మేఖలా+అఖిల, మహీతల, క్షత్త్ర, వర, సమక్షమునన్= మహాసముద్రాన్ని మొలనూలుగా గల సమస్త భూమండలంలోని రాజశ్రేష్ఠులయొక్క ఎదుట; అతి, సమర్థత= మిక్కిలి నేర్పు; వెలయన్= ప్రకాశించగా; నన్నును= నన్ను కూడా; మహా, మహిమ+అన్వితుఁగాన్= మిక్కిలిగొప్పతనంతో కూడుకొన్నవాణ్ణిగా; మహీ+ఈశున్+కాన్= భూపతిని అగునట్లుగా - అంటే రాజగునట్లుగా; చేసితి= చేశావు.

తాత్పర్యం: మహాసముద్రాన్ని మొలనూలుగా (ఒడ్డాణంగా) గల సమస్తభూమండలంలోని రాజశ్రేష్ఠుల సమక్షంలో మిక్కిలినేర్పు మెరయ నన్నెంతో గౌరవించి రాజుగా చేశావు.

క. 'దీనికి సదృశముగా మఱి । యే నేమి యొనర్తు నీకు నిష్టం?' బనినన్
'మానుగ నాతోఁ జెలిమి మ । హీనుతముగఁ జేయు; మిదియ యిష్టము నాకున్.' 51

ప్రతిపదార్థం: దీనికిన్= ఈ గొప్ప ఉపకారానికి; సదృశముగాన్= సమానంగా; మఱి= మరల; ఏను= నేను; ఏమి= ఏది; ఇష్టంబు= ఇష్టమైన దానిని; ఒనర్తున్= చేస్తాను; అనినన్= అని అనగా; మానుగన్= ఒప్పుగా; నాతోన్; చెలిమి= స్నేహం; మహీ, నుతముగన్= లోకం కొనియాడేటట్లుగా; చేయుము; నాకున్; ఇదియ, ఇష్టము = ఇదే ఇష్టం.

తాత్పర్యం: 'నీవు చేసిన ఈ మహోపకారానికి సమానంగా నేను నీ కిష్టమైంది ఏంచేయగలను?' - అని కర్ణు డడుగగా, 'లోకం కొనియాడేటట్లు నాతో స్నేహం చేయుము; ఇదే నా కిష్టం' అని దుర్యోధనుడన్నాడు.

విశేషం: ఏ ముహూర్తంలో 'నాతో చెలిమి మహీనుతముగా' చేయు మని దుర్యోధనుడు కర్ణుడిని కోరాడో - ఏ ముహూర్తంలో కర్ణుడు దుర్యోధనునితో చెయ్యి కలిపాడో - వాళ్ళమైత్రి మహీనుతమే అయింది. మహాభారతంలో అతిప్రధానపాత్ర నిర్వహించింది. కర్ణుని స్వామిభక్తి లోకం కొనియాడదగిందే. కాని అది ఆంజనేయుని స్వామిభక్తివంటిది కాదు. కర్ణుని స్వామిభక్తి కృతజ్ఞతారూపం. ఆంజనేయుని స్వామిభక్తి శ్రీరామసుగుణపరవశతారూపం; స్వార్థరహితం.

వ. అనిన విని దుర్యోధనున కెంతయు సంతోషంబుగాఁ గర్ణుం డతనితోడి యిష్ట సఖిత్వంబున కొడంబడియె, నంతఁ గొడుకు రాజ్యాభిషేకోత్సవంబు సూచి హర్షపరవశుం డయి సూతుండు రథంబు డిగ్గి కర్ణునొద్దకుం బఱతెంచినఁ, గర్ణుండును బితృగౌరవంబున సంభ్రమించి వానికి వినయవినమితోత్త మాంగుండయిన. 52

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; దుర్యోధనునకున్; ఎంతయున్= మిక్కిలి; సంతోషంబుగాన్= సంతోషంగా; కర్ణుండు; అతనితోడి; ఇష్ట, సఖిత్వంబునకున్= అతనితో ఇష్టమైన స్నేహితుడుగా ఉండటానికి; ఒడంబడియెన్=ఒప్పుకొన్నాడు; అంతన్= అప్పుడు; కొడుకు= పెంచిన కుమారునియొక్క; రాజ్య+అభిషేక+ఉత్సవంబున్= రాజ్యానికి అభిషిక్తుడైన పండుగను; చూచి; సూతుండు= రథంనడిపేవాడు- అతిరథుడు- కర్ణునిపెంచినతండ్రి; హర్ష, పరవశుండు+అయి= సంతోషంతో మైమరచినవాడై;

రథంబు, డిగ్గి= రథంనుండి దిగి; కర్ణు+ఒద్దకున్= కర్ణునిదగ్గరకు; పఱతెంచినన్= పరుగెత్తి రాగా; కర్ణుండును; పితృగౌరవంబునన్= తండ్రిమీది భక్తిచేత; సంభ్రమించి= వేగిరపడి; వానికిన్= ఆ సూతునికి; వినయ, వినమిత+ఉత్తమ+ అంగుండు= వినయంచేత (అణకువచేత) వంగినశిరస్సు కలవాడు; అయినన్= కాగా.

తాత్పర్యం: అని దుర్యోధనుడనగా, ఎంతో సంతోషంతో కర్ణుడాతనికి ప్రియమిత్రుడుగా ఉండటానికి అంగీకరించాడు. అప్పుడు కుమారుని అంగరాజ్యాభిషేకోత్సవాన్ని చూచి అతిరథుడు రథం దిగి పరుగుపరుగున కర్ణునిదగ్గరకు రాగా, కర్ణుడుకూడా తండ్రిమీదిగౌరవంతో త్వరత్వరగా లేచి వినయంతో శిరస్సువంచి నమస్కరించాడు.

విశేషం: ఇది తండ్రికొడుకుల జీవితంలో ఒక రసోజ్జ్వలమైనసన్నివేశం.

తే. కడఁగి సూతుండు పుత్త్రకుఁ గౌఁగిలించి। కొని తదీయమూర్ధాఘ్రాణ మొనరఁ జేసి
యంగరాజ్యాభిషేకార్ద్రమైన శిరముఁ। దడిపె వెండియు హర్షాశ్రుతతుల నొప్ప. 53

ప్రతిపదార్థం: సూతుండు= అతిరథుడు; కడఁగి= ప్రయత్నించి; పుత్త్రకున్= ప్రియకుమారుడిని; కౌఁగలించుకొని; తదీయ, మూర్ధ+ఆఘ్రాణము= అతనియొక్క తలను మూర్కొనటాన్ని; ఒనరన్= ఇంపుగా, ప్రియమార; చేసి= గావించి; అంగ+రాజ్య+ అభిషేక+ఆర్ద్రము+ఐన= అంగరాజ్యానికి అభిషేకించటంచేత తడిసిందైన; శిరమున్= తలను; వెండియున్= మళ్ళీ; హర్ష+అశ్రు, తతులన్= ఆనందబాష్పసమూహాలచేత; ఒప్పన్= అందంగా; తడిపెన్= తడిపాడు.

తాత్పర్యం: అతిరథుడు ప్రయత్నించి పుత్రుడిని కౌగలించుకొని ప్రియమార అతనితలను మూర్కొని అంగ రాజ్యాభిషేకంచేత తడిసిన అతనితలను మళ్ళీ తన ఆనందాశ్రువులచేత తడిపాడు.

విశేషం: కర్ణుడు తనకుమారుడే అయినా ఇప్పుడతడు అంగరాజు. ఇప్పుడు అతడిని ఇదివరకటివలె కౌగలించుకొనటం ఎట్లా? పైగా ఎవరేమనుకొంటారో? అందుచేతనే కాబోలు 'కడగి' సూతు డాతనికి కౌగలించుకొన్నాడని చెప్పటం.

వ. దానిం జూచి భీముండు గర్ణుని సూతకులసంభవుంగా నెఱింగి నగుచు ని ట్లనియె. 54

ప్రతిపదార్థం: దానిన్+చూచి= అతిరథుడు కర్ణుడిని కౌగలించుకొనటాన్ని చూచి; భీముండు; కర్ణునిన్; సూత, కుల, సంభవున్, కాన్= సూతకులంలో (రథంనడిపేవారికులంలో) పుట్టినవాడినిగా; ఎఱింగి= తెలిసికొని; నగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అతిరథుడు కర్ణుడిని కౌగలించుకొనటం గమనించి, అతడు సూతకులంలో పుట్టినవాడని తెలిసికొని భీముడు అవహేళనగా నవ్వుతూ ఈవిధంగా అన్నాడు.

క. నీదు కులమునకుఁ దగఁగఁ బ్ర। తోదము గొని రథము గడపఁ దొరఁగుము నృపధ
ర్మోదయుఁ డగు నర్జునుతోఁ। గా దనక రణంబు సేయఁగా నీ కగునే? 55

ప్రతిపదార్థం: నీదు, కులమునకున్; తగఁగన్= తగినట్లు; ప్రతోదము, కొని= మునికోలను తీసికొని; రథమున్= రథాన్ని; కడపన్= నడపటానికి; తొడుగుము= పూనుకో; నీకున్, నృప, ధర్మ+ఉదయుఁడు+అగు+అర్జుతోన్= రాజధర్మంలో పుట్టినవా డైన అర్జునునితో; కాదు+అనక= కాదనకుండ - తగదు నని; రణంబు, చేయఁగా= యుద్ధంచేయటం; అగునే= తగునా!

తాత్పర్యం: నీ కులానికి తగ్గట్లు మునికోల పుచ్చుకొని నీవు రథం నడప ప్రయత్నించాలి గాని, రాజధర్మంలో జన్మించిన అర్జుననితో కాదనకుండా యుద్ధంచేయటం నీకు తగునా!

వ. మఱి యదియునుం గాక. 56

తాత్పర్యం: ఇంకా, అంతేకాక.

తే. ఉత్తమక్షత్త్రియప్రవరోపయోగ్య । మైన యంగరాజ్యంబు నీ కర్హ మగునె?
మంత్రపూత మై గురుయజమానభక్ష్య । మగుపురోడాశ మది గుక్క కర్హ మగునె! 57

ప్రతిపదార్థం: ఉత్తమ, క్షత్త్రియ, ప్రవర+ఉపయోగ్యము+ఐన= ఉత్తముడైన క్షత్రియశ్రేష్ఠునిచేత అనుభవించదగినదైన; అంగ రాజ్యంబు; నీకున్+అర్హము+అగునె= నీకు తగినటువంటిది అవుతుందా; మంత్ర, పూతము+ఐ= మంత్రంచేత పవిత్రమై; గురు, యజమాన, భక్ష్యము+అగు= గొప్పయజ్ఞకర్త తినదగినదైన; పురోడాశము= యజ్ఞంకొరకు చేసిన పిండివంట; కుక్కకున్; అర్హము= తగింది; అగునె= ఔతుందా? (కాదని భావం)

తాత్పర్యం: ఉత్తమక్షత్రియశ్రేష్ఠునిచేత అనుభవించదగిందైన అంగరాజ్యం నీకు అనుభవించ తగిందవుతుందా? గొప్పయజ్ఞకర్త భుజించదగిన యజ్ఞశేషమైనపిండివంట కుక్క తినటం తగునా!

విశేషం: అలం : దృష్టాంతం.

వ. అనినం గర్ణుండు వెల్లనయి యెద్దియుం జేయునది నేరక దీర్ఘోష్ణనిశ్వాసవ్యాకులిత వదనుం డయి యాకాశంబు వలన నున్న యాదిత్యుం జూచుచు మిన్నకుండె; నంత నంతర్విలులితుం డయిన యక్కర్ణుం జూచి భ్రాతృపద్మవన మధ్యంబుననుండి దుర్యోధనమదాంధగంధసింధురంబు వెలువడి వచ్చి కడు నలిగి భీమున కి ట్లనియె. 58

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; కర్ణుండు; వెల్లనయి= వెలవెలబోయి; ఎద్దియున్, చేయునది= ఏదీ చేయటానికి; నేరక= తెలియక; దీర్ఘ+ఉష్ణ, నిశ్వాస, వ్యాకులిత, వదనుండు+అయి= పొడవై వేడి అయిన నిట్టూర్పుచేత కలత చెందిన ముఖం కలవాడై; ఆకాశంబువలనన్= ఆకాశంవైపు; ఉన్న; ఆదిత్యున్= సూర్యుడిని; చూచుచున్; మిన్నక+ఉండెన్= ఊరకున్నాడు; అంతన్= తర్వాత; అంతః+విలులితుండు+అయిన= లోలోపల (మనస్సులో) కలతచెందుతున్నవాడైన; ఆ+కర్ణున్; చూచి; భ్రాతృ, పద్మ, వన, మధ్యంబుననుండి= తమ్ములు అనే తామరవనం మధ్యనుండి; దుర్యోధన, మద+అంధ, గంధ, సింధురంబు= దుర్యోధనుడనే మదంచేత కన్నులు కానని మదపుటేనుగు; వెలువడి= బయటకు నడచి; వచ్చి; కడున్= మిక్కిలి; అలిగి= కోపించి; భీమునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీముడు అట్లా మాట్లాడగానే కర్ణుడు వెలవెలపోయి, ఏమీ చేయటానికి తోచక, పెద్దవేడినిట్టూర్పు విడిచి, కలతచెందినముఖంతో ఆకాశంలో ఉన్న ఆ సూర్యునివైపు చూస్తూ ఊరకున్నాడు. మనసులో మిక్కిలి కలత చెందుతున్న ఆ కర్ణుడిని చూచి, తమ్ములనే తామరవనమధ్యంనుండి దుర్యోధనుడనే మదపుటేనుగు వెలుపలికి వచ్చి ఎంతో కోపంతో భీమునితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: రూపకం. తన కులాన్ని, తండ్రిని, తల్లినిగురించి పదిమంది ఎదుట నిలదీసి అడిగినపుడు బదులు చెప్పలేక ఏమిచేయటానికీ దిక్కుతోచక బాధపడుతూ- అన్నీ తెలిసి, ఏమీ తెలియనట్లు నంగనాచివలె నింగిలో ఉన్న కర్మసాక్షివైపు చూచే కర్ణుని భంగిమలోని నాటకీయత, ఔచిత్యం, విశేషించి భావుకులకు రసానందహేతువులు. అట్లే తమ్ములనే తామరవనమధ్యం బునుండి మదపుటేనుగువలె కన్నుమిన్నుకానక ముందుకు నడచివచ్చే దుర్యోధనుని భంగిమకూడా రూపకోచితం. (సంపా.)

క. అనిలజ! నీ కి ట్లని ప । ల్కను దలఁపను నగునె? లేడి కడుపునఁ బులి పు
ట్టునె? యిట్టి దివ్యతేజం । బున వాఁ డధమాన్వయమునఁ బుట్టునె చెపుమా! 59

ప్రతిపదార్థం: అనిలజ= వాయువువల్ల పుట్టినవాడా!; నీకున్; ఇట్లు+అని= ఈ ప్రకారంగా; పల్కను= మాటాడటానికి; తలఁపనున్= ఆలోచించటానికి; అగునె= తగునా; లేడి, కడుపునన్; పులి; పుట్టునె; ఇట్టి; దివ్య, తేజంబునవాఁడు= శ్రేష్ఠమైన కాంతి కలవాడు; అధమ+అన్వయమునన్= నీచమైన కులంలో; పుట్టునె, చెపుమా!= జన్మించునా! చెప్పు.

తాత్పర్యం: వాయువువల్ల పుట్టిన ఓ భీమా! ఇట్లా మాట్లాడటం, ఆలోచించటం నీకు తగునా? లేడికడుపున పులి పుట్టుతుందా? ఇంత గొప్పకాంతికలవాడు నీచకులంలో పుట్టుతాడా?

విశేషం: భీముడిని 'అనిలజ' అని సంబోధించటంలో నీ పుట్టుక సంగతి ఏమిటనే ఎత్తిపొడుపు ధ్వనిస్తున్నది. అలం: అర్థాంతరన్యాసం.

వ. శూరులజన్మంబు సురలజన్మంబును । నేఱులజన్మంబు నెఱుఁగ నగునె?
మొగిని దధీచియెమ్మునఁ బుట్టదయ్యెనే । వాసవాయుధ మైన వజ్ర మదియు;
గాంగేయుఁ డన మఱి కార్తికేయుం డన । నాగ్నేయుఁ డన రౌద్రుఁ డనఁగ శరవ
ణోద్భవుం డన గుహుం డుద్భవిల్లఁడె? శర । స్తంబజన్ముఁడు గాఁడె ధర్మవిదుఁడు

తే. కృపుఁడు? ఘటసంభవుఁడు గాఁడె కీర్తిపరుఁడు । వరుఁడు ద్రోణుండు? విప్రులవలనఁ బుట్ట
రైరె సత్క్షత్రియుల్ ఘను లవనిఁ గావఁ? గడఁగి మీ జన్మములు నిట్ల కావె వినఁగ. 60

ప్రతిపదార్థం: శూరుల, జన్మంబున్; సురల, జన్మంబునున్= దేవతలయొక్క పుట్టుకను; ఏఱుల, జన్మంబున్= నదుల పుట్టుకను; ఎఱుఁగన్+అగునె= తెలిసికొనటం సాధ్యమా!; మొగిని= క్రమంగా; వాసవ+ఆయుధము+ఐన= దేవేంద్రునియొక్క ఆయుధమైన వజ్రము; అదియున్= అది; దధీచి, ఎమ్మునన్= దధీచి ఎముకలో; పుట్టదు+అయ్యెనే= పుట్టలేదా?; గాంగేయుఁడు+అనన్= గంగకొడు కనగా; ఆగ్నేయుడు+అనన్= అగ్ని కొడుకనగా; రౌద్రుఁడు+అనంగన్= రుద్రునికొడు కనగా; శరవణ ఉద్భవుండు+అనన్= రెల్లుగడ్డిపొదలో పుట్టినవాడనగా; గుహుండు= కుమారస్వామి; ఉద్భవిల్లఁడె= పుట్టలేదా; ధర్మవిదుఁడు= ధర్మాన్ని తెలిసినవాడు; కృపుఁడు= కృపాచార్యుడు; శర, స్తంబ, జన్ముఁడు= రెల్లుగంటలో పుట్టుక కలవాడు; కాఁడె; కీర్తిపరుఁడు= కీర్తిగలవాడు; వరుఁడు= శ్రేష్ఠుడు; ద్రోణుండు; ఘట, సంభవుఁడు= కుండలో పుట్టినవాడు; కాఁడె= కాదా!; అవనిన్+ భూమిని; కావన్=కాపాడటానికి; కడఁగి= పూనుకొని; ఘనులు= గొప్పవారు; సత్+క్షత్రియుల్= ఉత్తములైనరాజులు; విప్రులవలనన్= బ్రాహ్మణులవలన; పుట్టరు+ఐరె= పుట్టినవారు కాలేదా; వినఁగన్= వినటాన్ని బట్టి (తెలియగా), మీ జన్మములున్= మీ యొక్క పుట్టుకలుకూడా; ఇట్లు+అ, కావె= ఈ విధమైనవే కదా!

తాత్పర్యం: శూరుల పుట్టుక, దేవతల పుట్టుక, నదుల పుట్టుక తెలిసికొనటం సాధ్యమా? దేవేంద్రుని వజ్రాయుధం దధీచి ఎముకనుండి పుట్టలేదా? గంగకొడుకుగా, కృత్తికలకొడుకుగా, అగ్నికొడుకుగా, రుద్రునికొడుకుగా, రెల్లుపొదలలో జన్మకలవాడుగా కుమారస్వామి పుట్టలేదా? ధర్మమెరిగిన కృపాచార్యుడు రెల్లుగడ్డిగంటలో పుట్టలేదా? కీర్తిమంతుడు, శ్రేష్ఠుడు అయిన ద్రోణుడు కుండలో పుట్టలేదా? భూమిని కాపాడటానికై ఉత్తమ క్షత్రియులు బ్రాహ్మణులవలన పుట్టలేదా? విన్నదానినిబట్టి మీ పుట్టుకలుకూడా ఇట్టివే కదా!

విశేషం: 'శూరులజన్మంబు సురలజన్మంబును నేఱులజన్మంబు నెఱుఁగనగునె' - అనేదానికి మూలం:- "శూరాణాంచ నదీనాంచ దుర్విదాః ప్రభవాః కిల" (చిత్రకళాప్రతి) - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.335. పెద్దలముందు మిత్రు డైన కర్ణుడిని నిందించిన భీముడిని అధిక్షేపిస్తూ దుర్యోధనుడు పెద్దలందరిపుట్టుకతో కలిపి పాండవుల పుట్టుకలను గురించికూడా పేర్కొన్నాడు. మీరందరూ శూరులైతే గూఢజన్ముడైకూడా గొప్పవాడుగా కనపడుతున్న కర్ణుడు శూరుడు కాలేకపోతాడా? అని తార్కికంగా మాట్లాడాడు. తెలియక, అభిమానంతో మాట్లాడుతున్న దుర్యోధనునిమాటలతో నిజం తెలిసిన పఠితల మనస్సులు అభిమానిస్తాయి. కర్ణుడిలోని విషాదాంతనాయకలక్షణాలలో ఇది ఒకటి. అన్ని మంచిగుణాలున్నా ఏదో ఒక అనివార్యమైన లోపంవలన కర్ణుడు విషాదాంతం పొందుతూ పఠితల సానుభూతిని పొందుతాడని వస్తుధ్వని. (సంపా.)

వ. 'వానితోడి దేమి? దివ్యలక్షణలక్షితుండును సహజకవచకుండలమండితుండును గాని ప్రకృతిపురుషుండు గాఁడు; తన బాహుబలంబున నీ యంగరాజ్యంబునక కాదు సకలమహీరాజ్యంబునకు నర్హుం డగు' ననుచున్నయంత నాదిత్యుం డస్తంగతుం డైన, నస్త్రసందర్శనరంగంబు వెలువడి దుర్యోధనుండు గర్ణుం దోడ్కొని కరదీపికా సహస్రం బుతో నిజమందిరంబున కరిగెఁ; బాండవులును భీష్మద్రోణవిదుర కృపాచార్యులతో నిజనివాసంబుల కరిగిరి. 61

ప్రతిపదార్థం: వానితోడిది+ఏమి= వాటితో పనేమి? (అంటే ఆ జన్మలగురించి తర్కించి ఏం ప్రయోజనం); (కర్ణుడు) దివ్య, లక్షణ, లక్షితుండును= శ్రేష్ఠాలైనలక్షణాలచేత గుర్తింపబడేవాడును; సహజ, కవచ, కుండల, మండితుండును, గాని= సహజా లైన కవచకుండలాలచేత అలంకరింపబడినవాడుగాని; ప్రకృతిపురుషుండు, కాఁడు= సామాన్య మానవుడు కాడు; తన బాహుబలంబునన్= తనయొక్క బాహుబలంచేత; ఈ, అంగరాజ్యంబునక, కాదు= ఈ అంగరాజ్యానికి మాత్రమే కాదు; సకల, మహీ, రాజ్యంబునకున్= మొత్తం ప్రపంచంయొక్క దొరతనానికి; అర్హుండు+అగున్= తగినవాడవును; అనుచున్+ఉన్న, అంతన్= అని పలుకుతుండగా; ఆదిత్యుండు= సూర్యుడు; అస్తంగతుండు+ఐనన్= అస్తమించే కొండవైపు వెళ్ళినవాడు కాగా - అంటే అస్తమించగా; దుర్యోధనుండు; అస్త్ర, సందర్శన, రంగంబు= అస్త్రవిద్యను చూపే ప్రదేశంనుండి; వెలువడి= బయటకు వచ్చి; కర్ణున్= కర్ణుడిని; తోడు+కొని= వెంటపెట్టుకొని; కర, దీపికా, సహస్రంబుతో= దివ్విటీలు వెయ్యింటితో; నిజ, మందిరంబును= తనయొక్క ఇంటికి; అరిగెన్= వెళ్ళాడు; పాండవులును; భీష్మ, ద్రోణ, విదుర, కృపాచార్యులతో; నిజ, నివాసంబులకున్= తమయొక్క ఇండ్లకు; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: 'ఆ జన్మలతో ఏం పని? కర్ణుడు దివ్యలక్షణాలు కలవాడు. సహజకవచకుండలాలు కలవాడు. సామాన్యుడు కాదు. తనబాహుబలంచేత ఈ అంగరాజ్యాన్నే కాదు ఈ భూమండలాన్నంతా పరిపాలించగల సమర్థుడు' అని అంటూండగా, సూర్యు డస్తమించాడు. దుర్యోధనుడు అస్త్రవిద్యారంగాన్ని విడిచి కర్ణుని వెంటబెట్టుకొని వెయ్యి దివ్విటీలు వెలుగుతుండగా తన ఇంటికి వెళ్ళాడు. పాండవులుకూడా భీష్మ ద్రోణ విదుర కృపాచార్యులతో కలిసి తమతమ ఇండ్లకు వెళ్ళారు.

విశేషం: దుర్యోధనుని అధిక్షేపాలకు ఏఒక్కరుకూడా ప్రతిసమాధానం ఇచ్చినట్లు చెప్పకుండా ఉండటమే ప్రకరణౌచిత్యం. ప్రతిభావంతుడైన నాటకకర్త ఒకరంగాన్ని అద్భుతంగా నిర్వహించినట్లు ఈ ముగింపు గోచరిస్తుంది. కర్ణునికీర్తి చివరకు జగజ్జేగీయమానంగా ప్రకాశిస్తుంది. కాని, సూర్యుడు అస్తమించటంతో రంగం ముగుస్తుంది. సూర్యసుతుడైన కర్ణుడు జగత్ప్రసిద్ధిని పొందుతాడు కాని విషాదాంతాన్ని చవిచూస్తాడు అని వస్తుధ్వని. వేయిదివిటీలతో వెలుగుతూ నిష్క్రమించిన దుర్యోధనుడు కర్ణుడి స్నేహంవలన భావిచరిత్రలో వేయివిధాల వెలుగబోతున్నాడని వస్తుధ్వని. కాలాన్ని వస్తుధ్వనిగా వాడుకొనే శిల్పం అనల్పం. కాళిదాసాదిమహాకవులనాటకశిల్పమర్మాలను నన్నయ తనరచనలో ప్రవేశపెట్టి కథార్థసంవిధానాన్ని చేశాడు. (సంపా.)

ఆ. **కుంతి యంత సహజకుండలకవచాభి । రాముఁ గర్ణుఁ జూచి రవి సమానుఁ**
బ్రత్యభిజ్ఞ నెఱిఁగి ప్రథమపుత్త్ర స్నేహ । మెఱుకపడక యుండ నింతి యుండె. 62

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు, కుంతి; సహజ, కుండల+అభిరామున్= పుట్టుకతో వచ్చిన కుండలాలతో, కవచంతో మనోహరమైన వాడిని; రవి, సమానున్= సూర్యునితో సమానమైనవాడిని; కర్ణున్, చూచి; ప్రతి+అభిజ్ఞన్= గుర్తుచేత; ఎఱిఁగి= తెలుసుకొని; ఇంతి= స్త్రీ - కుంతీదేవి; ప్రథమ, పుత్త్ర, స్నేహము= మొదటి కుమారునిమీది ప్రేమ; ఎఱుక, పడక, ఉండన్= బయటపడకుండేటట్లు; ఉండెన్.

తాత్పర్యం: అప్పుడు కుంతీదేవి సహజకవచకుండలాలచేత మనోహరుడై, సూర్యసమానుడైన కర్ణుడిని చూచి, గుర్తుపట్టినా, ఆ మొదటికొడుకుమీద తనకున్నప్రేమను బయటపడనీకుండా ఉండింది.

విశేషం: కుమారాస్త్రవిద్యాసందర్శనఘట్టంవలన కర్ణుడు హస్తినాపురంలోనే సూతపుత్రుడుగా పెరిగి, దుర్యోధనునికి మిత్రుడై, అంగరాజై ఉన్నాడని కుంతికి తెలిసింది. కాని, ఆమె నిజం బయటపెట్టక దాచి ఉంచింది. ఇది కర్ణునిజీవితం విషాదాంతం కావటానికి ప్రధానమైన శాపం అయింది. (సంపా.)

క. **వినుతధనుర్విద్యావిదు । ఘనుఁ గర్ణు సహాయుఁ బడసి కౌరవవిభుఁ డ**
ర్జునువలనిభయము సెడి ఱొ । మ్మునఁ జేయిడి నిద్రవోయె ముదితాత్ముం డై. 63

ప్రతిపదార్థం: వినుత, ధనుః+విద్యా, విదున్= పొగడబడిన విలువిద్యను తెలిసినవాడిని; ఘనున్= గొప్పవాడిని; కర్ణున్= కర్ణుడిని; సహాయున్= స్నేహితుడిని; పడసి= పొంది; కౌరవ, విభుఁడు= దుర్యోధనుడు; ముదిత+ఆత్ముండు+ఐ= సంతోషించిన మనస్సు కలవాడై; అర్జునువలని= అర్జునునివలన; భయము, చెడి= భయంపోయి; ఱొమ్మునన్+చేయి+ఇడి= గుండెమీద చేయి వేసికొని; నిద్రపోయెన్.

తాత్పర్యం: పొగడదగిన విలువిద్యానిపుణుడైన కర్ణుడిని మిత్రుడిగా పొంది దుర్యోధనుడు సంతోషించి, అర్జునునివలన భయం లేకుండా గుండెమీద చెయ్యివేసికొని నిద్రపోయాడు.

విశేషం: అర్జునునికి ప్రతివీరుడిగా కర్ణుడిని నిలిపిన దుర్యోధనునినైపుణ్యం ప్రశంసనీయంగా మిగిలింది ఈ రంగంచివర. కురుకుమారులలో భీమదుర్యోధనులపోరు పెద్దలచేత వారింపబడవచ్చునేమో కాని, కర్ణార్జునుల వైరంమాత్రం కాలం తీర్చవలసిందే అనే సూచన కథాంతంలో నన్నయ ధ్వనింపచేశాడు. (సంపా.)

కౌరవపాండవులు గురుదక్షిణార్థంబు ద్రుపదుం బట్టఁ జనుట (సం. 1-127-1)

వ. అంతఁ బ్రభాతం బగుటయు సమయనియమంబులు దీర్చి యాచార్యుండు శిష్యులనెల్ల రావించి 'మీరు నాకు గురుదక్షిణ యిం' డనిన నందఱు మ్రొక్కి యెదుర నిలిచి 'మీ కెద్ది యిష్టంబు సెప్పుం' డనిన విని 'యవివేక కారణ దారుణైశ్వర్యావలిప్తుం డైన ద్రుపదు నోడిచిపట్టి తెం; డిదియ నా కిష్టం బైన గురుదక్షిణ' యని పంచిన. 64

ప్రతిపదార్థం: అంతన్= తర్వాత; ప్రభాతంబు+అగుటయు= తెల్లవారగా; సమయ, నియమంబులు= ఆయా సమయాలలో చేయవలసిన పనులు; తీర్చి= పూర్తిచేసుకొని; ఆచార్యుండు= గురువైన ద్రోణుడు; శిష్యులను+ఎల్లన్= శిష్యులందరినీ; రావించి; మీరలు; నాకున్; గురుదక్షిణ; ఇండు= ఈయవలసింది; అనినన్= అనగా; అందఱు; మ్రొక్కి; ఎదుర,నిలిచి= ఎదుట నిలబడి; మీకున్+ఎద్ది= మీకు ఏది; ఇష్టంబు= ఇష్టమో; చెప్పుండు= చెప్పండి; అనినన్= అనగా; విని; అవివేక, కారణ, దారుణ+ఐశ్వర్య+అవలిప్తుండు+ఐన= అవివేకానికి కారణమైన భయంకరమైన సంపదచేత గర్వించినవాడైన; ద్రుపదున్; ఒడిచి= ఓడించి; పట్టి; తెండు= తీసికొని రండు; ఇదియ; నాకు+ఇష్టంబు+ఐన= నాకు ప్రీతికరమైన; గురుదక్షిణ; అని= ఆవిధంగా; పంచినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: తెల్లవారగానే ఆయా సమయాలలో చేయవలసిన పనులు పూర్తిచేసుకొని ద్రోణాచార్యుడు శిష్యులను పిలిచి 'మీరు నాకు గురుదక్షిణ ఇవ్వండి' అన్నాడు. శిష్యులందరు ఆయనకు మ్రొక్కి ఎదుట నిలబడి 'మీ కేది ఇష్టమో సెలవీయం' డని అడిగారు. అందుల కాయన 'అత్యధికసంపదచేత గర్వించి వివేకాన్ని కోల్పోయిన ద్రుపదుడిని ఓడించి పట్టి తీసికొని రండి. ఇదే నా కిష్టమైన గురుదక్షిణ' అని ఆజ్ఞాపించాడు. కాగా.

క. వల్లె యని రాజనందను । లెల్లను సమకట్టి, రథము లెక్కి దిశల్ భే
దిల్లఁగ గర్జిల్లి , నిశా । తోల్లసిత కృపాణ కార్ము కోద్యతకరు లై. 65

ప్రతిపదార్థం: వల్లె, అని= సరే అని, రాజనందనులు+ఎల్లను= రాజకుమారులంతా; సమకట్టి= పూనుకొని; రథములు+ఎక్కి; దిశల్= దిక్కులు; భేదిల్లఁగన్= బ్రద్దలయ్యేట్లు; గర్జిల్లి= సింహనాదం చేసి - పెద్ద యుద్ధధ్వని చేసి; నిశాత+ఉల్లసిత, కృపాణ, కార్ముక+ఉద్యత, కరులు+ఐ= వాడియై ప్రకాశిస్తున్న కత్తులతో, విల్లులతో ఎత్తబడిన చేతులు కలవాళ్ళయి.

తాత్పర్యం: ద్రోణుడు కోరినగురుదక్షిణకు సరే అని రాజకుమారులంతా పూనుకొని రథాలెక్కి దిక్కులు పిక్కటిల్లేట్లుగా సింహనాదాలు చేసి, చేత ఖడ్గాలు, ధనుస్సులు ధరించి.

ఉత్సాహము.

'ఏల దీని నెడయుఁ జేయ? నీ క్షణంబ యేఁగి పాం
చాలుఁ బట్టి తెత్త మధికశౌర్యలీల మెఱయఁగాఁ
బోలు' ననుచుఁ బెఱిఁగి రాజపుత్త్రు లెల్ల నరిగి పాం
చాలుపురము ముట్టికొని రసంఖ్య బలసమేతు లై. 66

ప్రతిపదార్థం: రాజ, పుత్త్రులు+ఎల్లన్= రాజకుమారులంతా; దీనిన్= ఈ పనిని అంటే ద్రుపదుడిని ఓడించి పట్టితెచ్చేపనిని; ఎడయున్+చేయ= ఆలస్యంచేయటం; ఏల= ఎందులకు; ఈ క్షణంబు+అ= ఈ నిముషంలోనే, ఏఁగి= వెళ్ళి; పాంచాలున్+పట్టి=

పాంచాలరాజైన ద్రుపదుడిని పట్టుకొని; తెత్తము (తెచ్చుదము)= తీసుకొనివద్దాము; అధిక, శౌర్య, లీల= అధికశూరత్వం యొక్క విలాసం; మెఱయఁగాన్= ప్రదర్శించగా; పోలున్= తగును; అనుచున్= అంటూ; పెరిఁగి= విజృంభించి; అరిగి= వెళ్ళి; అసంఖ్య, బల, సమేతులు+ఐ= లెక్కించ సాధ్యం గాని సైన్యంతో కూడుకొన్నవాళ్ళయి; పాంచాలు, పురమున్= ద్రుపదుని పట్టణాన్ని; ముట్టికొనిరి= ముట్టడించారు.

తాత్పర్యం: రాజకుమారులంతా 'ఈ పనికి ఆలస్యంచేయడమెందుకు?' అని ఈ క్షణమే వెళ్ళి ద్రుపదుడిని పట్టి తెద్దామనీ, ఇది అధికశౌర్యవిలాసాన్ని ప్రదర్శించదగినసమయమనీ, విజృంభించి అసంఖ్యాకసైన్యంతో వెళ్ళి, ద్రుపదుపురాన్ని ముట్టడించారు.

విశేషం: ఉత్సాహం జాతివృత్తం. అందులో ప్రతిచరణంలోనూ ఏడు సూర్యగణాలు, ఒక గురువు ఉంటాయి. అయిదవగణం మొదటి అక్షరం యతి. ఉత్సాహం వీరరసస్థాయిభావం. ఆ పేరుతో వెలసిన వృత్తం ఇక్కడ కురుకుమారులు యుద్ధోత్సాహాన్ని ప్రదర్శించే సందర్భంలో వాడబడింది. 'ఉత్సాహ స్సర్వకృత్యేషు సత్వరా మానసీక్రియా' అన్న భావప్రకాశోక్తికి అనుగుణంగా కురుకుమారుల వేగవంతమైన మానసికప్రక్రియను ఈ వృత్తం ధ్వనింప చేస్తున్నది. కాబట్టి నన్నయ మొదటిసారిగా వాడిన ఉత్సాహవృత్తాన్ని కథార్థయోజనకు అనుగుణంగా నిర్వహించాడు. (సంపా.)

వ. పాండవులును రథంబు లెక్కి ద్రోణుం బరివేష్టించి పిఱుంద నరిగి; రంత నర్జునుం డాచార్యున కి ట్లనియె.67

ప్రతిపదార్థం: పాండవులును; రథంబులు+ఎక్కి; ద్రోణున్= ద్రోణాచార్యుని; పరివేష్టించి= చుట్టువచ్చి; పిఱుందన్= వెనుక; అరిగిరి= వెళ్ళారు; అంతన్= అప్పుడు; అర్జునుండు; ఆచార్యునకున్= ద్రోణాచార్యునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: పాండవులుకూడా రథాలెక్కి ద్రోణుణ్ణి మధ్యలో ఉంచి చుట్టూ తాము గుమిగూడి రక్షించుకొంటూ కౌరవులవెనుకనే బయలుదేరి వెళ్ళారు. అప్పుడు అర్జునుడు ద్రోణునితో ఇట్లా అన్నాడు.

క. వడిగొని కౌరవు లొండొరుఁ । గడవఁగ మును చనిరి; వారిగర్వము సూడం
గడిమిని ద్రుపదాధిపుతోఁ । బొడువఁగఁ దమ కలవియగునె భుజవీర్యమునన్. 68

ప్రతిపదార్థం: కౌరవులు; వడిగొని= వేగంగా; ఒండొరున్= ఒకరినొకరు; కడవఁగన్= మీరునట్లుగా; మును, చనిరి= ముందు వెళ్ళారు; వారిగర్వము; చూడన్= చూడగా; భుజ, వీర్యమునన్= భుజశక్తిలోని; కడిమిని= అతిశయంతో; ద్రుపద+అధిపుతోన్= ద్రుపదరాజుతో; పొడువఁగన్= యుద్ధంచేయటానికి; తమకు+అలవి, అగునె= తమకు సాధ్యమవుతుందా?

తాత్పర్యం: కౌరవులు వేగంగా ఒకరినొకరు మీరి ముందుగా వెళ్ళారు గాని - వాళ్ళగర్వం చూస్తే - భుజబలంలో ద్రుపదరాజును మించి యుద్ధంచేయటం వాళ్ళకు సాధ్యమా?

విశేషం: ఇది ద్రుపదునిబలం ఏపాటిదో తెలిసికొనాలని పార్థుడు సాగించినసంభాషణ, ఉత్తమవీరుడు శత్రుబలాన్ని అంచనా వేసుకోకుండా యుద్ధానికి దిగడు. కౌరవులు తామే ద్రుపదుడిని పట్టితెచ్చామన్న కీర్తి రావాలని, ద్రోణునిమెప్పు పొందాలని, అవిచారంగా, ఆవేశంతో ముందుకు దూకారు. అర్జునుడు అట్లా చేస్తాడా? దెబ్బతిని తిరిగి వస్తాడా? పైగా అస్త్రవిద్యాభ్యాసం తరువాత ఇదే తానెదుర్కొనే ప్రథమయుద్ధం. అందులోనూ ద్రుపదునితో. అందుకే ఇంత ఆలోచన. తన గురువును అంతటి అస్త్రవిద్యాచార్యుడిని తిరస్కరించిన ద్రుపదుడు అంత తక్కువవాడుగా ఉంటాడా? కాని ద్రుపదుని బలపరాక్రమాల కొలదిని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గూర్చి గురువుగారిని ప్రత్యక్షంగా అడగటం ఎట్లా? అర్జునుడు జంకుతున్నాడనే భావన ఆయనకు వస్తుందేమో? అంతేకాదు, తన ఆత్మాభిమానం ఏమి కావాలి? అందుకే అర్జునుడు అంతనేర్పుగా ద్రోణునితో సంభాషణ ఆరంభించాడు; కౌరవుల స్వాతిశయాన్ని, తొందరపాటును గూర్చి అనుకొంటున్నట్లు ఆరంభించాడు.

క. అతగులచే ద్రుపదుఁ డనవ । హితుఁ డై పట్టువడ నంతహీనుఁడె? శౌర్యో

న్నతుఁ డధికధనుర్విద్యా । న్వితుఁడు భవత్సఖుఁ డనంగ వినరొకొ వానిన్. 69

ప్రతిపదార్థం: ద్రుపదుఁడు; అనవహితుడు+ఐ= ఎచ్చరిక లేనివాడై; అతగులచే= బలహీనులచే; పట్టు పడన్=చిక్కుటకు; అంత, హీనుఁడె= అంతతక్కువవాడా!; వానిన్= ఆ ద్రుపదుడిని; శౌర్య+ఉన్నతుఁడు= శూరత్వంచేత గొప్పవాడు; అధిక, ధనుః+విద్యా+అన్వితుఁడు= గొప్ప ధనుర్విద్యతో కూడుకొన్నవాడు; భవత్+సఖుఁడు= మీయొక్క స్నేహితుడు; అనంగన్= అని అంటుండగా; వినరు+ఒకొ= వినలేదా ఏమి?

తాత్పర్యం: ఏమరుపాటున బలహీనులచేత పట్టువడటానికి ద్రుపదుడంత తక్కువవాడా? ద్రుపదుడు గొప్ప శౌర్యవంతుడనీ, గొప్ప ధనుర్విద్యాసంపన్నుడనీ, మీ స్నేహితుడనీ వినలేదా ఏమి ?

విశేషం: గురువుగారుమాత్రం తక్కువవారా! శిష్యునిశక్తిసామర్థ్యాలు ఆయనకు తెలియవా. పరీక్షకు ముందే శిష్యునికి సమాధానాలు చెపుతాడా? అందుకే ద్రోణునిమౌనం. ప్రియశిష్యునియుద్ధనైపుణ్యాని కిది ప్రథమపరీక్ష. ఆ శిష్యుడే అన్నీ ఆలోచించుకోవాలి. అంచనా వేసుకోవాలి. యుద్ధం చేయాలి. విజయం సాధించాలి. గురుదక్షిణ ఇవ్వాలి.

వ. అనుచుం బాంచాలుపురం బాసన్నంబు గాఁ జనుదెంచునంతకు ముందఱ చని దుర్యోధన యుయుత్సు దుశ్శాసనవికర్ణజలసంధాదు లైన ధార్తరా ష్ట్రు లనేకనృపకుమారసహితు లై పాంచాలుపురం బవరోధించినఁ బాంచాలపతి యలిగి యపారచతురంగబలసమేతుం డై కౌరవులం దాఁకి. 70

ప్రతిపదార్థం: అనుచున్; పాంచాలు, పురంబు= ద్రుపదునియొక్క నగరం; ఆసన్నంబు, కాన్= దగ్గర అయ్యేటట్లు; చనుదెంచు+అంతకున్= రాగా; చని= ముందుగా వెళ్ళి; దుర్యోధన, యుయుత్సు, దుశ్శాసన, వికర్ణ, జలసంధ+÷ఆదులు+ఐన= దుర్యోధనుడు, యుయుత్సుడు, దుశ్శాసనుడు, వికర్ణుడు, జలసంధుడు మొదలైన; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుని కుమారులు; అనేక, నృప, కుమార, సహితులు+ఐ= పెక్కుమంది రాకుమారులతో కూడినవాళ్ళయి; పాంచాలు, పురంబు; అవరోధించినన్= అడ్డగించగా; పాంచాల, పతి= పాంచాలరాజు - ద్రుపదుడు; అలిగి= కోపించి; అపార, చతురంగ, బల, సమేతుండు+ఐ= అంతులేని రథ గజ తురగ పదాతి సైన్యంతో కూడుకొన్నవాడై; కౌరవులన్; తాఁకి= ఎదుర్కొని.

తాత్పర్యం: ద్రుపదునినగరం దగ్గరపడగా దుర్యోధనుడు, యుయుత్సుడు, దుశ్శాసనుడు, వికర్ణుడు, జలసంధుడు మొదలైన ధృతరాష్ట్రునికుమారులు, పెక్కుమంది రాకుమారులతో కలిసి, ఆ ద్రుపదుని నగరాన్ని ముట్టడించగా, ద్రుపదుడు కోపించి అంతులేని రథగజతురగపదాతిసైన్యంతో కౌరవుల నెదుర్కొని.

క. శరనికరసహస్రంబులఁ । బరువడి నందఱను గప్పెఁ బ్రావృడ్ధారా

ధర మురుధారాజలముల । సరసిజములఁ గప్పునట్లు సంరంభమునన్. 71

ప్రతిపదార్థం: ప్రావృట్+ధారా, ధరము= వర్షాకాల మేఘం; ఉరు, ధారా, జలముల= పెద్ద ధారలైన నీళ్ళతో; సరసిజములన్= పద్మాలను; కప్పునట్లు= క్రమ్మే విధంగా; సంరంభమునన్= త్వరపడి; శర, నికర, సహస్రంబులన్= వేలబాణసమూహాలతో; పరువడిన్= వరుసగా; అందఱను= వారిని అందరినీ; కప్పెన్= కప్పాడు.

తాత్పర్యం: వర్షాకాలమేఘం పెద్ద జలధారలతో పద్మాలను కప్పివేసినట్లు ద్రుపదుడు త్వరపడి బాణ సమూహాలు వేలకువేలు వేసి, వాళ్ళనందరినీ వరుసగా కప్పివేశాడు.

విశేషం: అలం: ఉపమ.

క. కలయ నసిముసల దండం । బులు గొని కాంపిల్యనగరమున జను లెల్లన్
నలి రేఁగి యార్చి కౌరవ । బలసుభటులఁ బొడిచి రాజి బడలు వడంగన్. 72

ప్రతిపదార్థం: కాంపిల్య, నగరమునన్, జనులు+ఎల్లన్= కాంపిల్యనగరంలోని ప్రజలంతా; నలి= మిక్కిలి; రేఁగి= విజృంభించి; ఆర్చి= సింహనాదాలు చేసి; కలయన్= అంతటా; అసి, ముసల, దండంబులు= కత్తులను, రోకళ్ళను, కర్రలను; కొని= చేతపట్టి; ఆజిన్= యుద్ధంలో; కౌరవ, బల, సుభటులన్= కౌరవ సైన్యంలోని మేటి వీరులను; బడలుపడంగన్= శ్రమపడేట్లుగా; పొడిచిరి= యుద్ధంచేశారు.

తాత్పర్యం: కాంపిల్యనగరంలోని ప్రజలంతా విజృంభించి సింహనాదాలు చేసి, కత్తులు, రోకళ్ళు, కర్రలు చేతపట్టి కౌరవసేనలోని మేటివీర లందరు బడలికపొందేటట్లు యుద్ధం చేశారు.

క. ధృతరాష్ట్రకుమారకు లవ । హితు లై పాంచాలుమీఁద నేసిరి సాంద్రా
తతబాణప్రకరతిరో । హిత మై రవికిరణజాల మేర్పడకుండన్. 73

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రకుమారులు= ధృతరాష్ట్రునియొక్క ప్రియపుత్రులు; అవహితులు+ఐ= ఎచ్చరిక గలవాళ్ళయి - సావధానులై; సాంద్ర+ఆతత, బాణ, ప్రకర, తిరోహితము+ఐ= దట్టములై అధికములైన బాణాల సమూహంచేత కప్పబడినదై; రవి, కిరణ, జాలము= సూర్యునియొక్కకిరణాలసమూహం; ఏర్పడక+ఉండన్= బయటపడకుండ ఉండేటట్లుగా; పాంచాలుమీఁదన్= ద్రుపదునిమీద; ఏసిరి= కొట్టారు.

తాత్పర్యం: కౌరవులు సావధానులై సూర్యకిరణాలుకూడా బయల్పడకుండేటట్లు దట్టమై అధికమైన బాణ సమూహాన్ని ద్రుపదునిమీద వేశారు.

క. వారల శరములు నడుమన । వారించుచు నధికలాఘవంబున వారిన్
ఘోరశరవిద్ధమర్ములఁ । గా రణమున సోమకుండు ఘనుఁ డై యేసెన్. 74

ప్రతిపదార్థం: సోమకుండు= ద్రుపదుడు; రణమునన్= యుద్ధంలో; ఘనుఁడు+ఐ= గొప్పవాడై - అధికుడై; వారల, శరములు= వాళ్ళయొక్క - కౌరవులయొక్క బాణాలు; నడుమన= నడుమనే; వారించుచున్= తొలగిస్తూ; అధిక, లాఘవంబునన్= మిక్కిలి సులువుగా; వారిన్= వాళ్ళను; ఘోర, శర, విద్ధ, మర్ములన్+కా= భయంకరాలైన బాణాలచేత బాధింపబడిన ఆయువుపట్లు కలవాళ్ళనుగా; ఏసెన్= కొట్టినాడు.

తాత్పర్యం: యుద్ధంలో ద్రుపదుడు పెచ్చుపెరిగినవాడై కౌరవుల బాణాలను నడుమనే తొలగించి, అతిసులభంగా వారిఆయువుపట్లు అదరేటట్లు భయంకరాలైన బాణాలతో కొట్టాడు.

క. నానావిధ మార్గణముల । నానామార్గముల నేసినం, గురువీరుల్
వానిం జూచి భయంపడి । నానాతనుఁగా మనంబునన్ వగచి రనిన్. 75

ప్రతిపదార్థం: నానావిధ, మార్గణముల= పలురకాలైన బాణాలచేత; నానామార్గములన్= పలువైపులనుండి; ఏసినన్= కొట్టగా; కురు, వీరుల్= కౌరవవీరులు; అనిన్= యుద్ధంలో; వానిన్= ఆ ద్రుపదుడిని; చూచి; భయంపడి; నానాతనున్+కా= అనేకవిధాలైన రూపాలు కలవాడినిగా; మనంబునన్= మనస్సులో; వగచిరి= తలచారు.

తాత్పర్యం: పలువిధాలైన బాణాలచేత పలువైపులనుండి కొట్టగా, కురువీరులు యుద్ధంలో ఆ ద్రుపదుణ్ణి చూచి భయపడి, అతణ్ణి నానారూపాలు కలవాణ్ణిగా మనస్సులో తలచారు.

వ. ఇట్లు పాంచాలుబాణవృష్టికి నిలుపోపక కురుకుమారులు కుమారశరనిహత సురారికుమారులుంబోలె వెఱచఱిచి పాండవులయొద్దకుం బఱతెంచినం జూచి, యర్జునుం డాచార్యధర్మజులకు నమస్కరించి 'మీర లింద యుండుం; డే నీక్షణంబ యప్పాంచాలుం బట్టి తెచ్చెద' నని విజృంభించి, సంరంభంబున భీమసేనుండు దనకు సేనాగ్రచరుండుగా మాద్రేయులు రథచక్రరక్షకులుగా ద్రుపదరాజవాహినీసముద్రంబు దఱియం జొచ్చిన. 76

ప్రతిపదార్థం: ఇట్లు; పాంచాలు, బాణ, వృష్టికిన్= ద్రుపదునియొక్క బాణాల వానకు; నిలుపు+ఓపక= నిలువలేక; కురుకుమారులు; కుమార, శర, నిహత, సుర+అరి, కుమారులున్+పోలెన్= కుమారస్వామియొక్క బాణాలతో కొట్టబడిన రాక్షసకుమారులవలె; వెఱచఱిచి= భయపడి; పాండవుల, ఒద్దకున్= పాండవులదగ్గరకు; పఱతెంచినన్= పరుగెత్తుకొనిరాగా; చూచి, అర్జునుండు; ఆచార్య, ధర్మజులకు= ద్రోణాచార్యునికి, ధర్మరాజుకు; నమస్కరించి; మీరలు; ఇందు+అ= ఇక్కడే; ఉండుండు= ఉండండి; ఏను= నేను; ఈ క్షణంబు+అ= ఈ నిమిషాన్నే; ఆ+పాంచాలున్= ఆ ద్రుపదుడిని; పట్టి; తెచ్చెదను+అని; విజృంభించి; సంరంభంబునన్= వేగిరపాటుతో; భీమసేనుండు; తనకున్; సేనా+అగ్రచరుండు+కా= సేనయొక్క ముందుభాగానికి వెళ్ళేవాడుగా; మాద్రేయులు= మాద్రితనయులైన నకులసహదేవులు; రథ, చక్ర, రక్షకులుగా= రథంయొక్కచక్రాలను రక్షించేవాళ్ళుగా; ద్రుపద, రాజ, వాహినీ, సముద్రంబున్= ద్రుపదరాజుయొక్కసేన అనే సముద్రాన్ని; తఱియన్= సమీపించేటట్లు; చొచ్చినన్= ప్రవేశించగా.

తాత్పర్యం: ద్రుపదునిబాణవర్షానికి నిలువలేక కౌరవులు కుమారస్వామిబాణాలచేత కొట్టబడిన రాక్షసకుమారులవలె భయపడి పాండవులదగ్గరకు పరుగెత్తారు. అది చూచి అర్జునుడు ద్రోణధర్మరాజులకు నమస్కరించి 'మీ రిక్కడే ఉండండి. నేను ఈ క్షణాన్నే ద్రుపదుణ్ణి పట్టి తెస్తా' నని ఆటోపంతో, భీమసేనుడు తనసైన్యానికి ముందు నడువగా, నకులసహదేవులు తనచక్రరక్షకులు కాగా, ద్రుపదుడిసైన్యమనే సముద్రాన్ని సమీపించాడు.

విశేషం: అలం: ఉపమ, రూపకం. అర్జునుడు గురువైన ద్రోణునికి, పెద్దన్న అయిన ధర్మరాజుకు నమస్కరించటం గురుజనభక్తికి నిదర్శనం. అర్జునుడికి గురు వెంతటి దైవమో, అన్నకూడా అంతటి దైవం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీమార్జునులు ద్రుపదునిసేనను దునుమాడుట (సం. అను.1-78-40 పంక్తి)

క. కరిఘటలం దాఁకి భీముఁడు । కరటికటీకుంభదంతకరముఖముల జ
ర్జరితములం జేసె నిష్ఠుర । తరవజ్రనిపాతపటుగదాఘాతములన్. 77

ప్రతిపదార్థం: కరి, ఘటలన్= ఏనుగుల సమూహాలను; తాఁకి= ఎదుర్కొని; భీముఁడు; నిష్ఠురతర, వజ్ర, నిపాత, పటు, గదా, ఘాతములన్= మిక్కిలి కఠినాలైన వజ్రాయుధంయొక్క దెబ్బలవలె బలమైన గదయొక్క దెబ్బలచేత; కరటి, కటీ, కుంభ, దంత, కర, ముఖములన్= ఏనుగులయొక్క చెక్కిళ్ళను, కుంభస్థలాలను, దంతాలను, తొండాలను, ముఖాలను; జర్జరితములన్+చేసెన్= పగులగొట్టబడినవాటినిగా చేశాడు.

తాత్పర్యం: భీముడు ఏనుగుల సమూహాలను ఎదుర్కొని వజ్రపాతంవంటి గదాఘాతాలచేత వాటిచెక్కిళ్ళను, కుంభస్థలాలను, దంతాలను, తొండాలను, ముఖాలను పగులగొట్టాడు.

ఉ. దారుణమౌ వృకోదరు గదాకులిశాహతి నన్యవాహినీ
వారణసంచయం బభినవక్షతజారుణధార లొప్ప సం
చారితధాతునిర్ఝరవిశాలశిలోచ్చయ సంచయాభమై
వీరరణంబునం బడియె విక్షతహస్తిపవృక్షపంక్తితోన్. 78

ప్రతిపదార్థం: దారుణము+ఔ= భయంకరమైనట్టి; వృక+ఉదరు, గదా, కులిశ+ఆహతిన్= తోడేలు కడుపువంటి కడుపు కలవాడైన భీమునియొక్క గద అనే వజ్రాయుధంయొక్క దెబ్బచేత, అన్య, వాహినీ, వారణ, సంచయంబు= శత్రుసేనలోని ఏనుగులగుంపు; అభినవ, క్షతజ+అరుణ, ధారలు+ఒప్పన్= కొత్తనెత్తురుయొక్క ఎఱ్ఱనిధారలు ఒప్పగా; సంచారిత, ధాతు, నిర్ఝుర, విశాల, శిలా+ఉచ్చయ, సంచయ+ఆభము+ఐ= సంచరింపజేయబడిన గైరికధాతువులతో కూడిన సెలయేళ్ళతో విశాలమైన పర్వత సమూహం యొక్క కాంతి గలదై; విక్షత, హస్తిప, వృక్ష, పంక్తితోన్= కొట్టబడిన మావటీళ్ళనే వృక్షాల సమూహంతో, వీర, రణంబునన్= వీరులయొక్కయుద్ధంలో; పడియెన్= పడింది.

తాత్పర్యం: భయంకరమైన వజ్రాయుధంవంటి భీమునిగదాఘాతంచేత శత్రుసైన్యంలోని ఏనుగులగుంపు - క్రొత్తనెత్తుటిధారలతో - గైరికాదిధాతువులతో కూడిన సెలయేళ్ళతో, విశాలమైన సంచార పర్వత సమూహంవలె, కొట్టబడిన మావటీళ్ళనే వృక్షసమూహంతోకూడి ఆ యుద్ధంలో పడింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. 'పర్వతసమూహంవలె' అని ఉంటే ఉపమ అవుతుంది. కాని, 'సంచారపర్వతసమూహంవలె' అనే భావన దీన్ని ఉత్ప్రేక్షగా మారుస్తున్నది.

చ. అనిలజుఁ డుగ్రుఁ డై ద్రుపదుహస్తిఘటావళి నశ్వసంహతిన్
ఘనరథకోటి భగ్నములుగా సమరంబునఁ జేసి పేదదు
ర్మనుజులఁ జంప నేల యని మానుగ గోపుఁడు గోగణంబులన్
గొనకొని రొప్పునట్టు లధికుం డెగిచెం బృథుదండహస్తుఁ డై. 79

ప్రతిపదార్థం: అనిలజుఁడు= వాయుదేవునికుమారుడైన భీముడు; ఉగ్రుఁడు+ఐ= భయంకరమైనవాడై; సమరంబునన్= యుద్ధంలో; ద్రుపదు, హస్తి, ఘటా+ఆవలిన్= ద్రుపదునియొక్క ఏనుగు మందలయొక్క సముదాయాన్ని; అశ్వ, సంహతిన్= గుఱ్ఱాల సమూహాన్ని; ఘన, రథ, కోటిన్= గొప్ప రథాల సమూహాన్ని; భగ్నములు+కాన్= దెబ్బతిన్నవాటినిగా; చేసి, పేద, దుర్+మనుజులన్= బలహీనులైన దుష్ట మానవులను; చంపన్+ఏల= చంపటం ఎందుకు; అని= అనుకొని; మానుగన్= ఒప్పుగా; అధికుండు= గొప్పవాడు - భీముడు; పృథు, దండ, హస్తుఁడు+ఐ= పెద్దగద చేతిలో గలవాడై; గోపుఁడు= ఆవులకాపరి; గో, గణంబులన్= ఆవుల సమూహాలను; కొనకొని= పూని; రొప్పునట్టుల= అరచి తరిమినట్లుగా; ఎగిచెన్= తరిమాడు.

తాత్పర్యం: భీముడు భయంకరుడై యుద్ధంలో ద్రుపదునిగజాశ్వరథసమూహాలను భగ్నంచేసి, బలహీనులైన దుష్టమానవులను చంపటం ఎందుకులే అని గొల్లవాడు గోవులమందను అరచి తరిమినట్లు తరిమాడు.

విశేషం: అలం: ఉపమ. భీమపరాక్రమాన్ని వర్ణించిన 77, 78, 79 పద్యాలు ఓజోగుణరమణీయాలు.

స్రగ్ధర.

> **అంతఁ గౌంతేయుఁ డత్యాయతభుజుఁడు నరుం డల్గి పాంచాలు దంతి**
> **ధ్వాంతంబున్ వానివాహోత్తమతుహినతతిం దద్భటోదారతారా**
> **సంతానంబున్ శరాంశూచ్చయవిభవమునన్ శాంతిఁ బొందించి యుద్య**
> **ద్ధ్వాంతారాతిప్రభుం డై తనరుచు వెలిఁగెన్ దద్రణవ్యోమవీథిన్.** **80**

ప్రతిపదార్థం: అంతన్= తర్వాత; అతి+ఆయత, భుజుఁడు= మిక్కిలి విశాలాలైన భుజాలు కలవాడు; కౌంతేయుఁడు= కుంతీదేవి కుమారుడు; నరుండు= అర్జునుడు; అల్గి= కోపించి; పాంచాలు, దంతి, ధ్వాంతంబున్= ద్రుపదునియొక్కఏనుగుల సమూహమనే చీకటిని; వాని, వాహ+ఉత్తమ, తుహిన, తతిన్= అతనియొక్క అశ్వశ్రేష్ఠాలనే మంచుసమూహాన్ని; తత్+భట+ఉదార, తారా, సంతానంబున్= అతనియొక్క భటులు అనే గొప్పనక్షత్రాల సమూహాన్ని; శర+అంశు+ఉచ్చయ, విభవమునన్= బాణాలు అనే కిరణాల సమూహంయొక్కసంపదచేత; శాంతిన్+పొందించి= అణగేటట్లు చేసి; తత్+రణ, వ్యోమ, వీథిన్= ఆ యుద్ధమనే ఆకాశమార్గంలో; ఉద్యత్+ధ్వాంత+అరాతి, ప్రభుండు+ఐ= ప్రకాశిస్తున్నసూర్యునికాంతివంటి కాంతి గలవాడై; తనరుచున్= ఒప్పుతూ; వెలిఁగెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: తర్వాత విశాలాలైన భుజాలు కలవాడూ, కుంతీకుమారుడూ అయిన అర్జునుడు ఆగ్రహించి, ద్రుపదుని ఏనుగులసమూహమనే చీకటిని, అశ్వసమూహమనే మంచును, సైనికసమూహమనే నక్షత్రసముదాయాన్ని తన బాణాలనే కిరణసంపదచేత అణగేటట్లు చేసి, యుద్ధమనే ఆకాశవీథిలో సూర్యుడివలె ప్రకాశించాడు.

విశేషం: అలం: రూపకం. స్రగ్ధరావృత్తంలో ప్రతిపాదంలోనూ మ, ర, భ, న, య, య, య అనే గణాలుంటాయి. 8, 15 అక్షరాలతో యతిమైత్రి. నన్నయ వాడిన స్రగ్ధరావృత్త మిదే. "వీరస్య భుజదండానాం వర్ణనే స్రగ్ధరా భవేత్" అని కాత్యాయనుడు చెప్పినట్లు అభినవగుప్తపాదులు పేర్కొన్నారు. అత్యాయుతభుజుడైన అర్జునుని బాణప్రయోగాన్ని సూర్యుని కర (కిరణ) ప్రయోగాలుగా రూపకం చేయటంతో ఛందశ్శిల్పంతోపాటు అలంకారసార్థక్యాన్నికూడా నన్నయ ప్రదర్శించాడు. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఆతనిఁ జూచి సహింపక । యాతతకార్ముకుఁడు ద్రుపదుననుజుఁడు శౌర్యో

పేతుఁడు సత్యజితుం డను । నాతఁడు ధీరుఁ డయి తాఁకె నతిరభసమునన్. 81

ప్రతిపదార్థం: ఆతనిన్= ఆ అర్జునుడిని; చూచి; సహింపలేక= ఓర్వలేక; ఆతత, కార్ముకుఁడు= గొప్పవిల్లు కలవాడు; శౌర్య+ ఉపేతుఁడు= శౌర్యంతో కూడుకొన్నవాడు; ద్రుపదున్+అనుజుఁడు= ద్రుపదుడిని అనుసరించి పుట్టినవాడు - తమ్ముడు; సత్యజితుండు; అను; అతడు; ధీరుఁడు+అయి= ధైర్యంగలవాడై; అతి, రభసమునన్= మిక్కిలి ఆటోపంతో; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: అర్జునునివిజృంభణం చూచి ఓర్వలేక ద్రుపదునితమ్ముడు సత్యజితుడనేవాడు గొప్పవిల్లు చేపట్టి శౌర్యధైర్యాలు గలవాడై అమితమైన ఆటోపంతో ఆతణ్ణి ఎదుర్కొన్నాడు.

క. కడఁగి ద్రుపదానుజుఁడు నె । వ్వడిఁ గవ్వడి నేసె నూఱువాఁడిశరములం

గడు నలిగి వాని నన్నియు । నడుమన తునియంగ నేసె నరుఁ డస్త్రములన్. 82

ప్రతిపదార్థం: ద్రుపద+అనుజుఁడు= ద్రుపదునితమ్ముడు; కడఁగి= పూనుకొని; నెఱ+వడిన్= నిండువేగంతో; నూఱు, వాఁడి, శరములన్= వంద పదునైన బాణాలచేత; కవ్వడిన్= అర్జునుడిని; ఏసెన్= కొట్టాడు; నరుఁడు= అర్జునుడు; కడున్= మిక్కిలి; అలిగి= కోపించి; వానిన్= ఆ బాణాలను; అన్నియున్= అన్నింటిని; నడుమన్+అ= మధ్యలోనే; తునియంగన్= ముక్కలయ్యేటట్లు; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: ద్రుపదుని తమ్ముడు ఎంతో ప్రయత్నించి, మహావేగంగా వందవాడిబాణాలతో అర్జునుడిని కొట్టాడు. అందుకు అర్జునుడు ఆగ్రహించి, తనబాణాలతో నడుమనే వాటినన్నింటిని ముక్కలు చేశాడు.

క. వివిధాస్త్రకోవిదుఁడు వా । సవి వానిరథంబుఁ బార్ష్ణిసారథుల మహిం

గువలు వడ నేసె నుగ్రా । హవమునకును వాఁడు విముఖుఁడై చెడి పఱవన్. 83

ప్రతిపదార్థం: వివిధ+అస్త్ర, కోవిదుఁడు= అనేకవిధాలైన అస్త్రాలను తెలిసినవాడు; వాసవి= ఇంద్రునికొడుకైన అర్జునుడు; వాని, రథంబున్= అతనియొక్క రథాన్ని; పార్ష్ణి సారథులన్= వెనుక కాపలాకాసేవాళ్ళను, సారథులను; వాఁడు= ఆ ద్రుపదుని తమ్ముడు; ఉగ్ర+ఆహవమునకును= భయంకరమైనయుద్ధానికి; విముఖుఁడు+ఐ= పెడమొగంగలవాడై; చెడి= కనబడకుండ; పఱవన్= పరుగెత్తిపోయేటట్లు; మహిన్= భూమిమీద; కువలుపడన్= కుప్పలుపడేట్లుగా; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: అనేకవిధాలైన అస్త్రాలు తెలిసిన అర్జునుడు - ద్రుపదుడితమ్ముడు గొప్పయుద్ధానికి భయపడి పరుగెత్తిపోయేటట్లు - అతనిరథాన్నీ, సారథులనూ నేలమీద కుప్పలు పడేటట్లు కొట్టాడు.

వ. అంత. 84

తాత్పర్యం: ఆ పైన.

క. శరమోక్షణవేగనిరం । తరమండలితోరుచాపదండుఁ డకాండో

ద్ధురదండధరుఁడపోలెను । హరినందనుఁ దాఁకె ద్రుపదుఁ డత్యుద్ధతుఁ డై. 85

ప్రతిపదార్థం: శర, మోక్షణ, వేగ, నిరంతర, మండలిత+ఉరు, చాప, దండుఁడు= బాణాలను వదలటంలోని వేగంచేత ఎడతెగక వలయాకారంగా చేయబడిన గొప్ప ధనుస్సుయొక్క కర్రగలవాడు; ద్రుపదుఁడు; అతి+ఉద్ధతుఁడు+ఐ= మిక్కిలి గర్వించినవాడై; అకాండ+ఉద్ధుర, దండ, ధరుఁడు+అ, పోలెను= అకాలంలో విజృభించిన యముడో అనేటట్లు; హరి, నందనున్= దేవేంద్రుని కుమారుడైన అర్జునుణ్ణి; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: వ్యవధి లేకుండ వేగంగా బాణాలు వదలటంవలన వలయాకారం పొందిన ధనుస్సుయొక్క కర్ర కలవాడైన ద్రుపదుడు, మిక్కిలిగర్వంతో అకాలంలో విజృంభించిన యముడో అన్నట్లు అర్జునుడిని ఎదుర్కొన్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. 'చాపదండుఁ డకాండోద్ధుర....' అనేదానికి 'చాపదండు నకాండోద్ధుర...' అనే పాఠాంతరమున్నది. అట్లయితే ఆ విశేషం అర్జునునకు అన్వయిస్తుంది.

మ. పరమాస్త్రైకవిశారదుల్ బలయుతుల్ పాంచాలకౌంతేయు లొం
డొరులన్ మార్కొని యేయునప్పుడు తదీయోగ్రాజిరంగంబు దు
స్తర నీరంధ్ర నిశాత సాయక తమస్సంఛన్న మైనం బర
స్పరయుద్ధంబులు దక్కి యోధులు నిశాభ్రాంతాత్ము లై రచ్చటన్. 86

ప్రతిపదార్థం: పరమ+అస్త్ర+ఏక, విశారదుల్= ఉత్తమాలైన అస్త్రాలలో మిక్కిలిపండితులూ; బలయుతుల్= బలంతో కూడుకొన్నవాళ్ళు అయిన; పాంచాల, కౌంతేయులు= పాంచాలరాజైన ద్రుపదుడు, కుంతీ తనయుడైన అర్జునుడు; ఒండు+ఒరులన్= ఒకరినొకరు; మార్కొని= ఎదుర్కొని; ఏయు+అప్పుడు= బాణాలు ప్రయోగించేటప్పుడు; తదీయ+ఉగ్ర+ఆజి, రంగంబు= వాళ్ళయొక్క భయంకరమైన యుద్ధభూమి; దుస్+తర, నీరంధ్ర, నిశాత, సాయక, తమస్+సంఛన్నము+ఐనన్= దాటరానివి, దట్టమైనవి, వాడిఅయినవి అయిన బాణాలవలన కలిగిన చీకటిచేత కప్పబడగా; అచ్చటన్= అక్కడగల; యోధులు= వీరులు; పరస్పర యుద్ధంబు= ఒకరితో నొకరు పోరాడటాలు, తక్కి= మాని; నిశా, భ్రాంత+ఆత్ములు+ఐరి= రాత్రి అయిందనే భ్రాంతిని పొందిన మనస్సులు కలవాళ్ళు అయ్యారు.

తాత్పర్యం: అస్త్రవిద్యలో పండితులు, బలవంతులు అయిన ద్రుపదపార్థులు, ఒకరినొకరు ఎదుర్కొని బాణాలు ప్రయోగించుకొనేటప్పుడు - భయంకరమైన వాళ్ళయుద్ధభూమి, దాటరాని దట్టమైన వాడిబాణాలతో కప్పబడి చీకటిమయం కాగా, అచ్చటివీరులు ఒకరితో ఒకరు పోరాటడం మాని రాత్రి అయిందని భ్రాంతిపడ్డారు.

విశేషం: అలం: భ్రాంతిమంతం.

అర్జునుఁడు ద్రుపదుం బట్టి కట్టి తెచ్చుట (సం.1-128-3)

వ. అట్టి మహాద్వంద్వయుద్ధంబున విజిగీషుం డయి పాంచాలుండు పాండవమధ్యముధనుర్మధ్యంబు భగ్నంబుగా నొక్కబాణంబున నేసి యార్చిన, నలిగి వాసవసుతుం డుద్యతాసిహస్తుం డయి శైలస్థలంబుమీఁదికి లంఘించుకొదమసింగంబునుంబోలె ద్రుపదురథంబుమీఁదికి లంఘించి వానిం బట్టికొనినఁ దత్సైన్యంబు హాహాకారంబు లెసంగ మహార్ణవంబునుంబోలె మ్రోయుచుండె నంత. 87

ప్రతిపదార్థం: అట్టి; మహా, ద్వంద్వ, యుద్ధంబునన్= అటువంటి గొప్ప జంటపోరులో; విజిగీషుండు+అయి= జయించాలన్నకోరిక మిక్కుటంగా కలవాడై; పాంచాలుండు= ద్రుపదుడు; పాండవ, మధ్యము, ధనుః+మధ్యంబు= పాండవులలో

నడిమివాడైన అర్జునుని విల్లుయొక్క నడిమిభాగం; భగ్నంబు, కాన్= విరిగేటట్లుగా; ఒక్క, బాణంబునన్= ఒక్క బాణంతో; ఏసి= కొట్టి; ఆర్చినన్= సింహనాదం చేయగా; వాసవ, సుతుండు= దేవేంద్రునియొక్క కుమారుడైన అర్జునుడు; అలిగి= కోపించి; ఉద్యత+అసి, హస్తుండు+అయి= ఎత్తబడిన కత్తిని చేతిలో కలవాడై; శైల, స్థలంబు, మీఁదికిన్= కొండ ప్రదేశం మీదికి; లంఘించు= ఎగిరిదూకే; కొదమ, సింగంబునున్+పోలెన్= పిల్లసింహంవలె; ద్రుపదు రథంబు, మీఁదికి= ద్రుపదుని తేరుపైకి; లంఘించి= దూకి; వానిన్= ఆ ద్రుపదుడిని; పట్టికొనినన్= పట్టుకోగా; తత్+సైన్యంబు= అతనియొక్క సైన్యం; హాహాకారంబులు= హాహా శబ్దాలు; ఎసంగన్= అతిశయించగా; మహా+అర్ణవంబునున్+పోలెన్= మహాసముద్రంవలె; మ్రోయుచున్+ఉండెన్= ఘోషిస్తూ ఉండింది; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: ఆ గొప్పద్వంద్వయుద్ధంలో జయించాలన్నకోరిక మిక్కుటంగా కలవాడై ద్రుపదుడు, అర్జునుని విల్లు నడిమిభాగం విరిగేటట్లు ఒక బాణం వేసి పెద్దగా అరచాడు. అందుకు అర్జునుడు ఆగ్రహించి, చేత కత్తి నెత్తుకొని కొండమీదికి దూకే కొదమసింహంవలె ద్రుపదునిరథంమీదికి ఎగిరి దూకి, అతణ్ణి పట్టుకొన్నాడు. అప్పుడు ద్రుపదునిసైన్యం పెద్దహాహాకారాలతో మహాసముద్రంవలె ఘోషిస్తూ ఉండింది.

విశేషం: అలం: ఉపమ.

క. ప్రక్షీణదర్పు ద్రుపదు ర । థాక్షముతోఁ గట్టి తెచ్చి యర్జునుఁడు క్రియా
దక్షుం డయి గురునకు గురు । దక్షిణగా నిచ్చి చేసెఁ దత్సమ్మదమున్. 88

ప్రతిపదార్థం: అర్జునుఁడు; క్రియా, దక్షుండు+అయి= కార్యంలో సమర్థుడై - అంటే చేయవలసిన పనిని చేయడంలో సమర్థుడై; ప్రక్షీణ, దర్పున్= మిక్కిలి తగ్గిపోయినగర్వం గలవాడిని; ద్రుపదున్= ద్రుపదుడిని, రథ+అక్షముతోన్= తేరి ఇరుసుతో (ఇరుసుకు); కట్టి, తెచ్చి; గురునకున్= గురువైన ద్రోణాచార్యునికి; గురుదక్షిణగాన్; ఇచ్చి; తత్+సమ్మదమున్= అతనికి సంతోషాన్ని; చేసెన్= కలిగించాడు.

తాత్పర్యం: అర్జునుడు కార్యసాధనసమర్థుడై గర్వం కోల్పోయిన ద్రుపదుణ్ణి తేరి ఇరుసుకు కట్టి తెచ్చి , గురుదక్షిణగా ఇచ్చి ద్రోణాచార్యుణ్ణి సంతోషపెట్టాడు.

విశేషం: అక్షరరమ్యతలో అనురణనధ్వనికి ఉపకరణంగా వాడే నన్నయరచనాశిల్పంలో ఒక మెలకువ ఈ పద్యంలో ఉన్నది. పద్యంలో 'క్ష' ప్రాసాక్షరం. చివరి పాదంలోని 'గురుదక్షిణ' అనే పదం. ఈ పద్యంలో ఆయువుపట్టు. గురుదక్షిణకు గౌరవాన్ని కలిగించే క్షకారప్రాస అనురణనసౌందర్యాన్ని కలిగిస్తున్నది. పూర్వార్ధంలోని క్షకారప్రాస ద్రుపదుని దైన్యాన్ని ధ్వనిచూస్తుంటే, ఉత్తరార్ధంలోని క్షకారప్రాస అర్జునుని ప్రతాపాన్ని ధ్వనిస్తున్నది. 'గురుదక్షిణ' అంటే గురువుకొరకైనదక్షిణ అనీ, గొప్పదైన దక్షిణ అనీ అర్థవైచిత్రి ఏర్పడి 'గురువునకు గురుదక్షిణ' తగినవిధంగా - కొండంతదేవుడికి కొండంతపత్రి నిచ్చినట్లు - ఇచ్చాడనే అర్థం అనురణన సామర్థ్యంతో ఏర్పడుతున్నది. అందువలన ఈ పద్యంలో శబ్దశక్తిమూలక అనురణనధ్వని ఉన్నది. (సంపా.)

వ. ద్రోణుండును నర్జునుచేసిన పరాక్రమంబునకుఁ బరమహృష్టహృదయుం డై ద్రుపదుం జూచి నగుచు ని ట్లనియె. 89

ప్రతిపదార్థం: ద్రోణుండును; అర్జును= అర్జునుడు; చేసిన= కావించిన; పరాక్రమంబునకున్; పరమ, హృష్ట, హృదయుండు+ఐ= మిక్కిలి ఆనందించిన హృదయం కలవాడై; ద్రుపదున్+చూచి; నగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ద్రోణుడుకూడా అర్జునుని పరాక్రమం చూచి ఆనందించి నవ్వుతూ ద్రుపదునితో ఇట్లా అన్నాడు.

క. వీ రెవ్వ రయ్య? ద్రుపదమ । హారాజులె! యిట్లు కృపణు లయి పట్టువడన్
వీరికి వలసెనె? యహహా! మ । హారాజ్యమదాంధకార మది వాసెనొకో?. 90

ప్రతిపదార్థం: వీరు+ఎవ్వరు+అయ్య= వీ రెవ్వరండి!; ద్రుపద, మహారాజులె= ద్రుపదమహారాజులుగారేనా!; ఇట్లు= ఈ విధంగా; కృపణులు+అయి= దిక్కులేనివారై; పట్టు+పడన్= పట్టుపడటానికి; వీరికిన్= వీరికి; వలసెన్+ఎ= ఆవశ్యకమయిందా! అహహా= ఔరా!; మహా, రాజ్య, మద+అంధకారము= గొప్పరాజ్యగర్వంచేత కలిగిన గ్రుడ్డితనం; అది= అది; పాసెన్+ఒకో= తొలగిపోయిందా ఏమి?

తాత్పర్యం: వీ రెవ్వ రయ్యా? ద్రుపదమహారాజులే! ఈ విధంగా దిక్కులేక పట్టుపడవలసిన పరిస్థితి ఏర్పడిందే! అహహా! మహారాజ్యమదంచేత కలిగిన కన్నుగాననితనం తొలగిపోయిందా?

విశేషం: వ్యంగ్యంగా అధిక్షేపించే వాక్యపద్ధతికి ఈ పద్యం తెలుగులో హృద్యమైన ఉదాహరణగా నిలిచిపోయింది. ద్రోణుని గూఢాభిమానాన్ని ఈ పద్యం వ్యంగ్యసుందరంగా వ్యక్తం చేస్తున్నది. ద్రోణుడు అధిక్షేపంగా పలికేటప్పుడు - అయ్య! మహారాజులె, వీరికి వలసెనె; అదివాసెనొకో! - అనే మాటలనేప్పుడు ఒక వింతవెటకారం ధ్వనిస్తుంది. దానిని కాకువు అంటారు. ఆ కాకువులు పూర్వం ద్రుపదుడు ద్రోణుడిని అవమానించినమాటలవరుసను స్ఫురింపచేస్తూ, వాటికి ప్రతిగా ద్రోణుడు అధిక్షేపిస్తున్నట్లు ధ్వని. మొదట ద్రోణుడు తమ పాతస్నేహాన్ని జ్ఞాపకంచేస్తూ గుర్తించావా? అని ప్రశ్నించినప్పుడు, ద్రుపదుడు తనకు తెలియదన్నాడు. దానికి ఎద్దేవగా 'నీ వెవరయ్యా?' అని వ్యంగ్యంగా ప్రశ్నించటం. మహారాజుతో పేద బాపడికి సంబంధం ఎట్లా కలుగుతుంది? అని ప్రశ్నించిన ద్రుపదుడిని 'ఇప్పుడు నా ఎదుట ఉన్నది ద్రుపదమహారాజులా?' అని వెటకారపుతిరుగుప్రశ్న. 'రాజ్యంపోయిన పేదవాడివి నీవు' అని వ్యంగ్యమైన అధిక్షేపం. 'ఈ విధంగా దిక్కులేకుండా పట్టుపడవలసి వచ్చిందా?' అని పరిహసించినప్పుడు పూర్వం తన దయనీయస్థితిని చూచికూడా జాలిపడక 'మిత్రామిత్రత్వాలు రాజులకు కార్యవశంగా ఏర్పడతాయి' అన్న ద్రుపదునిమాటకు తిరుగుదెబ్బ వినపడుతుంది. ఐశ్వర్యగర్వంచేత ద్రోణుని విలువ తెలిసికొనకుండ మాట్లాడిన గ్రుడ్డితనం ఇప్పుడు తొలగిందా, 'నీ ఐశ్వర్యం, నీ పరాక్రమం, నా శిష్యులఅధీనం, నా దయాభిక్ష' అని తలపింపచేసి, తన ఔన్నత్యాన్నీ, అదృష్టాన్నీ వ్యంగ్యంగా ద్రోణుడు ధ్వనింపచేశాడు. (సంపా.)

ఆ. 'ఇంక నైన మమ్ము నెఱుఁగంగ నగునొక్కొ!' యనుచు నుల్లసంబు లాడి ద్రుపదు
విడిచిపుచ్చె గురుఁడు; విప్రులయలుకయుఁ దృణహుతాశనంబు దీర్ఘ మగునె?. 91

ప్రతిపదార్థం: ఇంకన్+ఐన= ఇక ముందైన; మమ్మున్= మమ్ములను; ఎఱుంగన్+అగున్+ఒక్కొ= గుర్తించుకోతగునుసుమా!; అనుచున్= అంటూ; ఉల్లసంబులు+ఆడి= ఎగతాళి మాటలు మాట్లాడి; గురుఁడు= ద్రోణాచార్యుడు; ద్రుపదున్= ద్రుపదుడిని; విడిచి, పుచ్చెన్= వదిలివేశాడు; విప్రుల+అలుకయున్= బ్రాహ్మణులయొక్కకోపం; తృణ, హుతాశనంబు= గడ్డినిప్పు; దీర్ఘము+అగునె= ఎక్కువకాలం ఉంటుందా!

తాత్పర్యం: 'ఇక ముందైనా మమ్మల్ని గుర్తుంచుకోగలరా?' అని ఎగతాళి చేసి, ద్రోణుడు ద్రుపదుణ్ణి విడిచి పెట్టాడు. బ్రాహ్మణునికోపం, గడ్డినిప్పు ఎక్కువకాలం ఉంటాయా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ఇప్పటికైనా న న్నెప్పుడూ గుర్తుంచుకుంటావా? - అనే కాకువువలన కలిగే అధిక్షేపార్థం ద్రుపదునికి గుండెలో ములుకువలె కలకాలం గుర్తుంటుంది. చేసిన స్నేహాన్ని మరిచేవారికి తగినవాఙ్మయాస్త్రం ద్రోణుని

అధిక్షేపోక్తి. భీమార్జునులు ద్రుపదునితో యుద్ధం చేసినఘట్టంలో దాదాపు ప్రతిపద్యంలోనూ అలంకారప్రయోగం చేశాడు-నన్నయ. కథార్థాలను ప్రసన్నంచేయటానికి అర్థాలంకారప్రయోగంకూడా అర్థయోజనశిల్పంలో ఒకభాగం. (సంపా.)

ధృతరాష్ట్రుఁడు యుధిష్ఠిరుని యౌవరాజ్యాభిషిక్తునింజేయుట (సం.1-79-191)

వ. ఇట్లు ద్రుపదుండు ద్రోణుచేత విముక్తుం డయ్యుఁ గోపపాశబద్ధుం డయి యప్పరిభవంబునకుం బ్రతీకారంబు సేయ
సమకట్టి బ్రాహ్మణోపాస్తి సేయుచుండె; నంత నిట ధృతరాష్ట్రుండు యుధిష్ఠిరు రాజ్యభారధురంధరుంగా నెఱింగి
భీష్మవిదురులతో విచారించి యౌవరాజ్యాభిషిక్తుం జేసిన. 92

ప్రతిపదార్థం: ఇట్లు; ద్రుపదుండు; ద్రోణుచేతన్; విముక్తుండు+అయ్యున్= విడువబడినవాడైనా; కోప, పాశ, బద్ధుండు+అయి= కోప మనే తాటిచేత కట్టబడినవాడై; ఆ+పరిభవంబునకున్= ఆ అవమానానికి; ప్రతీకారంబు= తిరిగి అపకారం; చేయన్= చేయటానికి; సమకట్టి= పూనుకొని; బ్రాహ్మణ+ఉపాస్తి= బ్రాహ్మణులయొక్క సేవను; చేయుచున్+ఉండెను= చేస్తూఉన్నాడు; అంతన్= తర్వాత; ఇటన్= హస్తినాపురంలో; ధృతరాష్ట్రుండు, యుధిష్ఠిరున్= ధర్మరాజును; రాజ్య, భార, ధురంధరున్+కాన్= రాజ్యంయొక్క భారాన్ని వహించేసమర్థుడిగా; ఎఱింగి= తెలిసికొని; భీష్మ, విదురులతో; విచారించి= ఆలోచించి; యౌవ, రాజ్య+అభిషిక్తున్= యౌవరాజ్యంలో అభిషేకింపబడినవానినిగా; చేసినన్= చేయగా.

తాత్పర్యం: ఈ విధంగా ద్రుపదుడు ద్రోణునిచేత విడిచిపెట్టబడినా - అతడు కోపమనే తాటితో కట్టబడినవాడై, ద్రోణుడు తనకు చేసినఅవమానానికి తిరిగి అపకారం చేయాలని బ్రాహ్మణులసేవ చేస్తున్నాడు. అట హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు యౌవరాజ్యభారం వహించటానికి యుధిష్ఠిరుడు తగినవాడని భీష్మ, విదురులతో విచారించి, అతణ్ణి యౌవరాజ్యాభిషిక్తుణ్ణి చేయగా.

విశేషం: 'బ్రాహ్మణోపాస్తి సేయుచుండె' - అనే దానికి బ్రాహ్మణోపాస్తిచేయుచు పురంబు సొరనొల్లక యుండె' - 'సేయుచుండె ద్రోణుండు రాజకుమారసహితుండై హస్తిపురంబునకు మగుడి వచ్చె నంత' అనే పాఠాంతరాలున్నాయి. - శ్రీమదాంధ్ర మహాభారతము సంశోధితప్రతి, పుట. 341. ద్రోణుడు తరువాత రాజకుమారసహితుడై హస్తినాపురానికి తిరిగిరావటం విశేషంగాదు. కాని ద్రుపదుడు అవమానాన్ని భరించలేక బ్రాహ్మణోపాస్తి చేస్తూ తనపురం సొర నొల్లకుండటం విశేషం.

చ. నలువురు దమ్ములున్ బలిమి నాలుగుదిక్కులు నోర్చి సర్వభూ
తలమున రాజనందనులదర్ప మడంచుచు భూరివస్తురా
సులు గొనివచ్చి యీఁగొని విశుద్ధయశోనిధి యొప్పె ధర్మజుం
డలఘుఁడు యౌవరాజ్యయుతుఁ డయ్యును బెంపున సార్వభౌముఁ డై. 93

ప్రతిపదార్థం: నలువురు, తమ్ములున్; బలిమిన్= బలంతో; నాలుగు, దిక్కులున్= నాలుగుదిక్కుల్ని; ఓర్చి= ఓడించి; సర్వ, భూతలమునన్= మొత్తంభూమిమీద; రాజ, నందనుల, దర్పము= రాజకుమారులయొక్క గర్వాన్ని; అడంచుచున్= అణచివేస్తూ; భూరి, వస్తు, రాసులు= పెద్దవైన పదార్థరాసులను; కొనివచ్చి= తీసికొనివచ్చి; ఈన్= ఈయగా; కొని= తీసుకొని; విశుద్ధ, యశస్+నిధి= స్వచ్ఛమైనకీర్తికి స్థానమైనవాడు; అలఘుఁడు= తక్కువవాడుకానివాడు - అంటే గొప్పవాడు; ధర్మజుండు= యౌవ, రాజ్య, యుతుఁడు+అయ్యును =యౌవరాజ్యంతో కూడుకొన్నవాడే అయినప్పటికీ; పెంపునన్= గొప్పతనంచేత; సార్వభౌముఁడు+ఐ= సమస్తభూమిని పరిపాలించే రాజై; ఒప్పెన్= వెలిగాడు.

తాత్పర్యం: నలుగురుతమ్ములు తమబలంతో నాలుగుదిక్కులు జయించి, భూమిమీది రాకుమారు లందరి పొగ రణచి, ఎంతోవిలువైన పదార్థరాసులను తెచ్చి ఇయ్యగా, వాటిని గ్రహించి స్వచ్ఛమైనకీర్తితో గొప్పవాడైన ధర్మరాజు యువరాజే అయినా చక్రవర్తివలె వెలిగాడు.

విశేషం: అలం: కావ్యలింగం. 'సమర్థనీయస్యార్థస్య కావ్యలింగం సమర్థనమ్'. ధర్మరాజు పదవిలో యువరాజైనా మహిమలో సార్వభౌముడు. తమ్ములు నలుదిక్కుల రాజులను జయించి సంపదలు తెచ్చి అతని అధీనం చేయటంవలన అతడు సార్వభౌముడనే భావం సమర్థనీయమైనది. ఇక్కడ ధర్మరాజుని నాయకత్వంతోపాటు భీమాదుల అనునాయకత్వంకూడ వస్తుధ్వని. భీమాదుల వీరవృత్తాలన్నీ ధర్మజునిధర్మవీరప్రవృత్తికి పోషకాలే. అంగిని పోషించే అంగా (అంగరసా) లే అని తాత్పర్యం. ధర్మజుడివర్ణనం ప్రసాదగుణభూయిష్ఠమై ఉండటం సార్థకం. (సంపా.)

వ. మఱియును. 94

తాత్పర్యం: ఇంకా.

క. బద్ధపరంపర నొప్పె మ। దోద్ధతగజరథతురంగయుద్ధముల గదా
యుద్ధములఁ జూడ నెందుఁ బ్ర। సిద్ధుఁడు మధ్యముఁడ యను విశిష్టస్తవముల్. 95

ప్రతిపదార్థం: మద+ఉద్ధత, గజ, రథ, తురంగ, యుద్ధముల= మదంచేత గర్వించిన ఏనుగులబలంతో, రథబలంతో, అశ్వ బలంతో యుద్ధాలు చేయటంలో; చూడన్= చూడగా; ఎందున్= దేనిలోనైనా; మధ్యముఁడు+అ= కుంతీపుత్త్రులలో నడిమివాడైన భీముడే; ప్రసిద్ధుడు= పేరుకెక్కినవాడు; అను; విశిష్ట, స్తవముల్= గొప్పపొగడ్తలు; బద్ధ, పరంపరన్= కట్టబడ్డవరుసచేత; ఒప్పెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: గజరథాశ్వయుద్ధాలలో, గదాయుద్ధంలో - దేనిలోనైనా కుంతీపుత్రులలో నడిమివాడైన భీముడే పేరు కెక్కినవాడన్న పొగడ్తలు పరంపరగా వ్యాపించాయి.

చ. అనుపమకార్ముకాదివివిధాయుధవిద్యలయందుఁ గోవిదుం
డనఁగ నజయ్యుఁ డై పరఁగు నర్జునుఁ బోలఁగ నన్యు లెందు లే
రను జనఘోష ముచ్చరిత మయ్యె మరుచ్చలితోచ్చవీచి ని
స్వనముఖరాబ్ధివేష్టిత విశాలమహీవలయాంతరంబునన్. 96

ప్రతిపదార్థం: అనుపమ, కార్ముక+ఆది, వివిధ+ఆయుధ విద్యల+అందు= సాటిలేని ధనుస్సు మొదలుగా నానావిధాలైన ఆయుధ విద్యలలో; కోవిదుండు= పండితుడు; అనఁగన్; అజయ్యుఁడు+ఐ= గెలువసాధ్యంగానివాడై; పరఁగు= ఒప్పునట్టి; అర్జునునన్; పోలఁగన్; అన్యులు= ఇతరులు; ఎందున్= ఎచ్చటను; లేరు; అను; జన, ఘోషము= జనులయొక్కధ్వని; మరుత్+ చలిత+ఉచ్చ, వీచి, నిస్వన, ముఖర+అబ్ధి, వేష్టిత, విశాల, మహీ, వలయ+అంతరంబునన్= గాలిచేత ఎగురుతున్న ఎత్తైన అలలయొక్క శబ్దంచేత ధ్వనిస్తున్నసముద్రాలచేత చుట్టబడిన విశాలభూమండలంయొక్క మధ్యప్రదేశంలో; ఉత్+చరితము= మీది కెగసింది; అయ్యెన్.

తాత్పర్యం: ధనుర్విద్య మొదలుగా వివిధాలైన ఆయుధవిద్యలలో పండితుడై, అజేయుడైన అర్జునునితో పోల్చటానికి ఇతరు లెక్కడా లేరనే జనఘోష భూమండలంలో అంతటా మీదికి ఎగసింది.

విశేషం: ప్రసాదగుణ విశిష్టమైన ఓజోగుణం ఈ రచనలో అర్జునుడిఅనంతకీర్తిని ధ్వనింపచేస్తున్నది. ధర్మజుడిని, అర్జునుడిని చంపకమాలలో వర్ణించటం, భీముడిని, కవలను కందపద్యాలలో వర్ణించటం నన్నయ ఛందశ్శిల్పంద్వారా ప్రదర్శిస్తున్న పాత్రల కీర్తుల తారతమ్యానుశీలనం, అక్షరరమ్యాలైన ఛందస్సులనుకూడా వ్యంజకాలుగా నిబంధించే నన్నయరుచిరార్థసూక్తినిధిత్వం పాండవవర్ణనంలో ప్రౌఢంగా ప్రదర్శించబడింది. (సంపా.)

క. యము లమితశౌర్యు లరినృప । యము లమలచరిత్రనిరతు లనఁగా నత్యు
త్తమభక్తి నన్నలకు విన । యము మెఱయుచు నుండి రధికు లై బహుకళలన్. 97

ప్రతిపదార్థం: యములు= కవలలు - నకులసహదేవులు; అమిత, శౌర్యులు= మిక్కిలిపరాక్రమం కలవాళ్ళు; అరి, నృప, యములు= శత్రురాజులకు యమధర్మరాజువంటివాళ్ళు; అమల, చరిత్ర, నిరతులు= నిర్మలమైన నడవడిలో ఆసక్తిగలవాళ్ళు; అనఁగాన్= అని చెప్పబడగా; బహుకళలన్= అనేకవిద్యల్లో; అధికులై= గొప్పవాళ్ళయి; అతి+ఉత్తమ, భక్తిన్= మిక్కిలి శ్రేష్ఠమైన భక్తితో; అన్నలకున్; వినయము; మెఱయుచున్= చూపుతూ; ఉండిరి.

తాత్పర్యం: నకులసహదేవులు - మిక్కిలి పరాక్రమం కలవాళ్ళు. శత్రురాజులకు యమధర్మరాజువంటివాళ్ళు. స్వచ్ఛమైన నడవడిగలవాళ్ళు - అనే పేరు పొంది అనేకవిద్యలలో ఆరితేరి అత్యుత్తమభక్తితో అన్నలపట్ల వినయం చూపుతూన్నారు.

భారద్వాజుం డర్జునునకు బ్రహ్మశిరోనామకదివ్యబాణం బొసఁగుట (సం.1-80-20)

వ. ఇట్లు పాండుకుమారు లపారగుణంబుల నెల్లవారికి నారాధ్యు లయి పరఁగుచున్న నందు ధనుర్విద్య నర్జును దృఢముష్టిలాఘవలక్ష్యవేధిత్వదూరాపాత జితశ్రమత్వంబులకు నసిగదాశక్తితోమరాదిప్రహరణప్రవీణతకుం బరమహీపాల పరాజయోత్పాదన పరాక్రమంబునకుఁ దనవలని భక్తిస్నేహంబులకు మెచ్చి భారద్వాజుండు వానికి బ్రహ్మశిరం బను దివ్యబాణంబు సప్రయోగనివర్తనంబుగా నిచ్చి యి ట్లనియె. 98

ప్రతిపదార్థం: ఇట్లు; పాండు, కుమారులు= పాండవులు; అపార, గుణంబులన్= అంతులేని (మంచి) గుణాలతో; ఎల్లవారికిన్= అందరికీ; ఆరాధ్యులు+అయి= పూజింపదగినవాళ్ళయి; పరగుచున్+ఉన్నన్= ప్రవర్తిల్లుతుండగా; అందున్= అందులో; ధనుః+విద్యన్= ధనుర్విద్యలో; అర్జును, దృఢ, ముష్టి, లాఘవ, లక్ష్యవేధిత్వ, దూర+ఆపాత, జిత, శ్రమత్వంబులకున్= అర్జునునియొక్క గట్టిపిడికిలికీ, వేగానికీ (నైపుణ్యానికీ), గురిని కొట్టటానికీ, దూరప్రయోగానికీ, జయింపబడిన అలసట కలవాడవటానికీ; అసి, గదా, శక్తి, తోమర+ఆది, ప్రహరణ, ప్రవీణతకున్= కత్తి, గద, బల్లెం, చిల్లకోల మొదలయిన వాటితో కొట్టటంలోని నేర్పుకు; పర, మహీపాల, పరాజయ+ఉత్పాదన, పరాక్రమంబునకున్= శత్రురాజులకు అపజయాన్ని కలిగించేటి పరాక్రమానికీ; తనవలనిభక్తి, స్నేహంబులకున్= తనపట్ల ఉండే భక్తిప్రేమలకు; మెచ్చి; భారద్వాజుండు= ద్రోణుడు; వానికిన్= అర్జునునికి; బ్రహ్మశిరంబు+అను; దివ్య, బాణంబున్= దేవతాసంబంధమైన బాణాన్ని; సప్రయోగ, నివర్తనంబుగాన్= ప్రయోగ, ఉపసంహారాలతో కూడినట్లుగా; ఇచ్చి= ఒసగి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా పాండవులు అంతులేని మంచిగుణాలతో అందరికీ పూజ్యులై ప్రవర్తిల్లుతుండగా- వారిలో అర్జునునియొక్క పిడికిలిబిగువుకు, వేగానికి (నైపుణ్యానికి), గురి కొట్టే నేర్పుకు, దూరాన పడేటట్లు ప్రయోగించే సామర్థ్యానికి, అలసటలేనితనానికీ; కత్తి, గద, బల్లెం, చిల్లకోల మొదలైన ఆయుధవిద్యలలో ఆర్జించుకొన్న ప్రావీణ్యానికీ,

శత్రురాజుల జయింపగల పరాక్రమానికీ, తనపట్ల చూపుతున్న భక్తిప్రేమలకు మెచ్చి, ద్రోణాచార్యుడు 'బ్రహ్మశిర' మనే పేరుగల దివ్యాస్త్రాన్ని ప్రయోగోపసంహారాలతో ఉపదేశించి ఇచ్చి, ఇట్లా అన్నాడు.

ఉ. దీని నగస్తి నాఁ బరగు దివ్యమునీంద్రుఁడు దొల్లి ప్రీతితో
భూనుత! యగ్నివేశుఁ డను భూరిమునీంద్రున కిచ్చె; వారలున్
మానుగ నాకు నిచ్చిరి; క్రమంబున నేనును నీకు నిచ్చితిన్;
దీనికి నీవ యర్హుఁడవు తేజమునం గడుఁ బెద్ద గావునన్. 99

ప్రతిపదార్థం: భూనుత!= భూమిపై పొగడబడేవాడా!; దీనిన్= ఈఅస్త్రాన్ని; తొల్లి= పూర్వం; అగస్తినాన్+పరగు= అగస్తి అనే పేరుతో ఒప్పే; దివ్యముని+ఇంద్రుఁడు= గొప్పమునిశ్రేష్ఠుడు; ప్రీతితోన్= ప్రేమతో; అగ్నివేశుఁడు+అను; భూరి; ముని+ఇంద్రునకున్= గొప్ప మునిశ్రేష్ఠునికి; ఇచ్చెన్; వారలున్= వారు; మానుగన్= అయితే; ఒప్పుగ; నాకున్= నాకు; ఇచ్చిరి= ఇచ్చారు; నేనును= నేనుకూడా; క్రమంబునన్= వరుసగా; నీకున్; ఇచ్చితిని; తేజంబునన్= పరాక్రమంలో; కడున్= మిక్కిలి; పెద్ద; కావునన్; దీనికిన్; నీవు+అ= నీవే; అర్హుఁడవు= తగినవాడివి.

తాత్పర్యం: లోకంలో పొగడ్తలందుకొన్న ఓ అర్జునా! అగస్తి మహాముని ఈ అస్త్రాన్ని ప్రేమతో అగ్నివేశునికి ఇచ్చాడు. ఆయన నా కిచ్చాడు. నేను నీ కిచ్చాను. పరాక్రమంలో గొప్పవాడివి కనుక దీనికి నీవే తగినవాడివి.

వ. 'దీని మానవులయందుఁ బ్రయోగింపకుండునది; యల్పతేజులయందుఁ బ్రయుక్తం బయి యిది జగంబులఁ గాల్చు; నిన్ను బాధించు నట్టి మానవులు గలిగిరేని ప్రయోగించునది; వారి నశ్రమంబున సాధించు' నని దాని మహిమ చెప్పి 'నీవు నీ బంధుసమక్షంబున నాకు గురుదక్షిణ యి; మ్మిది యెయ్యది యనిన నాయుద్ధంబుసేయునపుడు నాతో నెన్నడుఁ బ్రతియుద్ధంబు సేయకుండు; మిదియ నాకు గురుదక్షిణ' యనిన నర్జునుండు వల్లె యని యాచార్యునకు నమస్కరించి దాని కొడంబడియె; నంత దుర్యోధనుండు యుధిష్ఠిరుయౌవరాజ్యాభిషేకంబునకు భీమార్జునయములపరాక్రంబునకు మనంబున సహింపనోపక కర్ణశకునిదుశ్శాసనులతో మంతనం బుండి యి ట్లనియె. 100

ప్రతిపదార్థం: దీనిన్= ఈ బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని; మానవుల+అందున్= మానవులపై; ప్రయోగింపక+ఉండునది= ప్రయోగించకుండా ఉండవలసింది; అల్ప, తేజుల+అందు= తక్కువశక్తి కలవారిమీద; ప్రయుక్తంబు+అయి= ప్రయోగింపబడినదై; ఇది= ఈ అస్త్రం; జగంబులన్= లోకాలను; కాల్చున్; నిన్నున్; బాధించు, అట్టి= బాధకలిగించునట్టి; మానవులు; కలిగిరి+ఏని= ఉన్నట్లయితే; ప్రయోగించునది= ప్రయోగించుము; వారిన్; అశ్రమంబునన్= శ్రమలేకుండ - సులభంగా; సాధించున్= లోబరుచుకొంటుంది; అని; దాని, మహిమన్= దాని ప్రభావాన్ని; చెప్పి; నీవు; నీ, బంధు, సమక్షంబునన్= నీయొక్క బంధువుల ఎదుట; నాకున్; గురుదక్షిణ; ఇమ్ము; ఇది= ఈ గురుదక్షిణ; ఏ+అది= ఏది; అనినన్= అనగా; నా, యుద్ధంబు, చేయు, అపుడు= నేను యుద్ధం చేసేప్పుడు; నాతోన్= నాతో; ఎన్నడున్= ఎప్పుడూ; ప్రతి, యుద్ధంబు= ఎదురుయుద్ధం; చేయక+ఉండుము; ఇదియ= ఇదే; నాకున్, గురుదక్షిణ; అనినన్= అనగా; అర్జునుండు; వల్లె= సరే; అని; ఆచార్యునకున్= ద్రోణునికి; నమస్కరించి; దానికిన్; ఒడంబడియెన్= అంగీకరించాడు; అంతన్= తరువాత; దుర్యోధనుండు; యుధిష్ఠిరు= ధర్మరాజుయొక్క;, యౌవరాజ్యాభిషేకంబునకు; భీమ+అర్జున, యముల, పరాక్రమంబునకు= భీయునియొక్క అర్జునునియొక్క,

నకులసహదేవులయొక్క పరాక్రమానికి; మనంబునన్; సహింపన్+ఓపక= ఓర్వలేక; కర్ణ, శకుని, దుశ్శాసనులతో; మంతనంబు+ ఉండి= ఆలోచనచేస్తూ ఉండి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఈ బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని మానవులమీద ప్రయోగించవద్దు. అల్పశక్తిగల వారిమీద ప్రయోగిస్తే ఇది లోకాలనే మాడ్చివేస్తుంది. నిన్ను బాధించే మానవులుంటే వాళ్ళమీద ప్రయోగించు. అతిసులభంగా ఇది వాళ్ళను పడగొట్టగలుగుతుంది' - అని ఆ అస్త్రమహిమ తెలియజెప్పి - 'నీ బంధువు లందరియెదుట నా కొక గురుదక్షిణ ఇమ్ము. అది ఏమంటే నేను యుద్ధం చేసేప్పుడు నీవు నాతో ఎదురుయుద్ధం చేయకుండటం' అని ద్రోణాచార్యు డనగా విని అందుకు అర్జునుడు అంగీకరించాడు. తర్వాత దుర్యోధనుడు భీమార్జుననకుల సహదేవులపరాక్రమం చూచి ఓర్వలేక, కర్ణశకునిదుశ్శాసనులతో ఆలోచనచేస్తూ ఇట్లా అన్నాడు.

కణికనీతి (సం. 1-81-10)

సీ. **'ఆయుధవిద్యలయందు జితశ్రము । లనియును రణశూరు లనియు సంత**
తోత్సాహు లనియు నత్యుద్ధతు లనియును । భయమందుచుండుదుఁ బాండవులకు;
దానిపై నిప్పుడు ధర్మజు యువరాజుఁ । జేసె రా; జే నేమి సేయువాఁడ?
నృపనీతి యెయ్యది? నిరతంబుగా మీర । నా కెఱిఁగింపుఁడు నయముతోడ'

ఆ. **ననిన వినియుఁ గణికుఁ డనువాఁడు, సౌబలు । నాప్తమంత్రి, నీతులందుఁ గరము**
కుశలుఁ డైనవాఁడు కురుకులవల్లభు । నిష్టమునకుఁ దగఁగ నిట్టు లనియె. **101**

ప్రతిపదార్థం: ఆయుధ, విద్యల+అందు; జితశ్రములు+అనియును= అలసట ఎరుగనివారు, పండితులనీ; రణ, శూరులు+ అనియు= యుద్ధంలో శౌర్యంకలవారనీ; సంతత+ఉత్సాహవంతులు+అనియున్= ఎడతెగని ఉత్సాహం కలవారనీ; అతి+ ఉద్ధతులు= మిక్కిలి గర్వించినవాళ్ళు; అనియును= అనికూడా; పాండవులకు= పాండవులను జూచి; భయము+ అందుచు+ ఉండుదున్= భయపడుతుంటాను; దానిపైన్= దానికితోడు; రాజు= ధృతరాష్ట్ర మహారాజు; ధర్మరాజున్= ధర్మరాజును; యువరాజున్+చేసె= యువరాజుగా చేశాడు; ఏమి, చేయు, వాఁడన్; నృపనీతి= రాజనీతి; ఏ+అది=ఏది; మీరు+అ= మీరే; నయముతోడన్= ప్రీతితో; నిరంతరంబుగాన్= నిత్యంగా; నాకున్+ఎఱిఁగింపుఁడు= నాకు తెలియచెప్పండి; అనినన్= అనగా; వినియున్= వినికూడా; నీతుల+అందున్; కరము, కుశలుఁడు+ఐనవాఁడు= నీతులలో మిక్కిలినేర్పరి ఐనవాడు; సౌబలు+ఆప్త, మంత్రి= సుబలునికుమారుడైన శకునియొక్క ప్రియమైనమంత్రి; కణికుఁడు+అనువాఁడు; కురు, కుల, వల్లభు+ఇష్టమునకున్= కురువంశరాజైన దుర్యోధనుని కోరికకు; తగఁగన్= తగినట్లుగా; ఇట్టుల+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఆయుధవిద్యలలో పండితులనీ, రణశూరులనీ, ఎడతెగనిఉత్సాహవంతులనీ, మిక్కిలి గర్వించినవాళ్ళనీ పాండవులకు భయపడుతుంటాను. దానికితోడు ధృతరాష్ట్రమహారాజు, ధర్మరాజును యువరాజుగా చేశాడు. ఏం చేయాలో తోచటంలేదు. ప్రీతితో రాజనీతి నా కుపదేశించండి' - అని దుర్యోధనుడనగా, నీతుల్లో నేర్పరీ, శకునికి ప్రియమంత్రీ అయిన కణికుడు దుర్యోధనునికోరికకు తగినట్లు ఈ విధంగా చెప్పాడు.

విశేషం: కణికుడు - అనే పేరుకు 'కణింకుఁడు' , 'గిణికుఁడు' అనే పాఠాంతరాలున్నాయి. అంతేగాక సంస్కృతభారతం పి.పి.యస్.శాస్త్రిప్రతి, 904 పుటలో "తతః కణింక మానాయ్య ధృతరాష్ట్రోఽబ్రవీ దిదమ్" అని ఉంది. సంస్కృతభారతం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చిత్రశాలాప్రతి, 244 పుటలో "కణికం మంత్రిణాం శ్రేష్ఠం ధృతరాష్ట్రోఽబ్రవీ ద్వచః"అని ఉన్నది. చూడు, - శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పుట 344. కణికుడు - కిణింకుడైనాఁ గిణికుడైనా - అతనిపేరు సంగతి ఎలా ఉన్నా పైన పేర్కొన్న సంస్కృతభారత ప్రతులనుబట్టి కణికుడిని పిలిపించి ఉపదేశం పొందినవాడు ధృతరాష్ట్రుడు. కాని నన్నయ భారతంలో కణికోపదేశాన్ని పొందింది దుర్యోధనుడు. ఇది పెద్దమార్పు. ఇది ఇట్లా ఉండగా భాండార్కరుప్రతిలో నన్నయభారతంలోని కణికనీతిప్రక్షిప్తమనే అభిప్రాయం వ్యక్తంచేయబడినట్లు, తాము చూచిచ తాళపత్రప్రతుల్లో, ముద్రితప్రతుల్లో కణికనీతి ఉన్నట్లు శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతిని సిద్ధం చేసినవారు చెప్తున్నారు. "భాండార్కరు ప్రతిలో (అధ్యాయాలు 128, 129) కణికనీతి విడువబడింది. 574 పుటలోని జ్ఞాపిక చూడనవును. నన్నయ (క్రీ.శ.1050) భారతంలో కణికనీతిప్రశంస లే దని భాండార్కరు నుడువుతున్నది. క్షేమేంద్రుని భారతమంజరిలో గూడ ఇది లేదని భాండార్కరు సంస్థవారు వ్రాస్తున్నారు. జావాప్రతి (క్రీ.శ.1000)లో గూడ ఇది లేదని వారే చెప్తున్నారు. మూలభారతంమీద రచింపబడిన వ్యాఖ్యలలో కణికనీతి వ్యాఖ్యానింపబడలేదని భాండార్కరుప్రతి తెలుపుచున్నది. శాంతిపర్వంలో శత్రుంజయునికి భరద్వాజునిచేత ఉపదేశించబడిన రాజనీతిసారాంశమే- కణికనీతి అని వీరిమతం. కాని మేము చూచిన తాళప్రతులలోను, ముద్రితప్రతులలోను కణికనీతి కనబడుచున్నది. నన్నయభారతములో ఇది ప్రక్షిప్తమనుటకు ఆధారమేమో తెలియదు. పర్వానుక్రమణిక, పర్వసంగ్రహములందు మాత్రం కణికనీతి ప్రశంస లేదు". - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుటలు 344, 345.

తరువోజ.

ధరణీశుఁ డుద్యతదండుఁ డై యుచిత । దండవిధానంబుఁ దప్పక ధర్మ
చరితులఁగా మహీజనుల రక్షించి । సద్వృత్తుఁ డగునది; సర్వవర్ణములు
వరుసన తమతమ వర్ణధర్మముల । వర్తిల్లుదురు గడవక దండభీతి
నరిమిత్రవర్జితుఁ డై సమబుద్ధి । యగు మహీవల్లభు ననుశాసనమున. 102

ప్రతిపదార్థం: ధరణి+ఈశుడు= భూపతి, రాజు; ఉద్యత, దండుఁడు+ఐ= పైకెత్తబడిన రాజదండం గలవాడై; ఉచిత, దండ, విధానంబున్= తగిన దండనీతి పద్ధతిని; తప్పక; మహీ, జనులన్= భూమిలోని ప్రజలను; ధర్మ, చరితులన్+కాన్= ధర్మమైన నడవడి కలవాళ్ళనుగా; రక్షించి= సత్+వృత్తుఁడు+అగునది= మంచి నడవడి కలవాఁడు కావాలి; దండనీతిన్= దండ నీతిలో; అరి, మిత్ర, వర్జితుఁడు+ఐ = శత్రువులు, మిత్రులు లేనివాడై; సమ, బుద్ధి+అగున్= సమానమైన బుద్ధి కల వాడవుతాడు; మహీ, వల్లభు+అనుశాసనమునన్= రాజుయొక్క ఆజ్ఞచేత; సర్వ, వర్ణములు= అన్నిజాతులు; వరుసన= క్రమంగా; తమ, తమ వర్ణ ధర్మముల= తమ తమ జాతులయొక్క ధర్మాలను; కడవక= దాటక; వర్తిల్లుదురు= ప్రవర్తిస్తారు.

తాత్పర్యం: ప్రభువు ప్రబలమైన అధికారం గలవాడై, తగిన దండనీతిని అవలంబించి, ప్రజలను ధర్మమార్గాన నడిపించి, మంచి ప్రవర్తన గలవాడుగా ఉండాలి. దండనీతిలో స్వపరభేదభావం లేకుండ సమబుద్ధితో ఉండే రాజుయొక్కఆజ్ఞచేత అన్నిజాతులవాళ్ళూ తమతమజాతిధర్మాలను ఉల్లంఘించక ప్రవర్తిస్తారు.

విశేషం: ఉత్తమపాలనకు అధికారబలం ఒక్కటే ప్రభువుకు చాలదు. నిష్పక్షపాతం, సత్ప్రవర్తనం ప్రభుతకు పెద్దబలాన్ని చేకూర్చే గుణాలు. ఇవికూడా ప్రభువుకు ఉండాలి. తరువోజ లక్షణానికి ఆది. 5,28, 145 పద్యాల విశేషవ్యాఖ్యలు చూడండి.

క. గుఱుకొని కార్యాకార్యము । లెఱుఁగక దుశ్చరితుఁ డై యహితుఁ డగు నేనిన్
మఱవక గురు నైనను జను ।లెఱుఁగఁగ శాసించునది మహీశుఁడు బుద్ధిన్. 103

ప్రతిపదార్థం: గుఱుకొని= ప్రయత్నించి; కార్య+అకార్యములు= చేయదగిన పనులు, చేయకూడని పనులు; ఎఱుఁగక= తెలియక; దుః+చరితుఁడు+ఐ= చెడునడవడి కలవాడై; అహితుఁడు+అగున్+ఏనిన్= మేలుకోరేవాడు కాకుంటే; మహీ +ఈశుఁడు= భూపతి - రాజు; గురున్+ఐనను= గురువునైనా; మఱవక= మరచిపోకుండా; బుద్ధిన్= తెలివితేటలతో - వివేకంతో; జనులు+ఎఱుఁగఁగన్= ప్రజలకందరికీ తెలిసేటట్లు; శాసించునది= శిక్షించవలసింది.

తాత్పర్యం: ఇవి చేయదగిన పనులు, ఇవి చేయగూడని పనులు - అని తెలిసికొనకుండ, చెడు నడవడి గలవాడై, మేలుకోరేవాడు కాకుంటే - తండ్రినైనా (లేదా గురువునైనా) సరే విడిచిపెట్టక, వివేకంతో, ప్రజలందరికీ తెలిసేటట్లు అతడిని ప్రభువు శిక్షించాలి.

విశేషం: గురు శబ్దానికి పాఠాంతరం సుతుశబ్దం ఉంది. మూలంలో దీనికి సరిపడే శ్లోకం కనిపించదు - శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పు. 345

క. **ధీరమతియుతులతోడ। విచారము సేయునది మును, విచారితపూర్వ**
ప్రారబ్ధమైన కార్యము। పారముఁ బొందును విఘాతపదదూరం బై. **104**

ప్రతిపదార్థం: మును= ముందుగా; ధీర, మతి, యుతులతోడన్= గొప్ప బుద్ధి గలవాళ్ళతో; విచారము= ఆలోచన; చేయునది= చేసేది; విచారిత, పూర్వ, ప్ర+అరబ్ధము+ఐన, కార్యము= ముందుగా ఆలోచించబడిందై గొప్పగా మొదలుపెట్టబడిన పని; విఘాత, పద, దూరంబు+ఐ= చెడిపోవటం అనే మాటకు దూరమైనదై - అంటే చెడిపోకుండ; పారమున్+పొందును= తుదముట్టును - పూర్తి అవుతుంది.

తాత్పర్యం: ఏ పనినైనా బుద్ధిమంతులతో ముందుగా విచారించి చేయాలి. ముందుగా విచారించి చక్కగా ప్రారంభించిన పని చెడిపోకుండా సఫలమవుతుంది.

క. **జనపాలుఁడు మృదుకర్మం। బున నైనను గ్రూరకర్మమున నైనను నే**
ర్పున నుద్ధరించునది త - న్ననపాయతఁ బొంది చేయునది ధర్మంబుల్. **105**

ప్రతిపదార్థం: జన, పాలుఁడు= ప్రజలను పాలించేవాడు - రాజు; నేర్పునన్= నేర్పుతో; తన్నున్= తనను; మృదు, కర్మంబునన్+ఐనను= మెత్తనిపనిచేతకాని; క్రూర, కర్మమునన్+ఐనను= భయంకరమైనపనిచేతగాని; ఉద్ధరించునది= రక్షించుకోవాలి; అనపాయతన్= ప్రమాదం లేకుండటాన్ని; పొంది= కలిగి; ధర్మంబుల్; చేయునది= చేయాలి.

తాత్పర్యం: రాజు నేర్పుతో మెత్తనిపనిచేతగాని, భయంకరమైనపనిచేతగాని, మొదట తనను తాను రక్షించుకోవాలి. తనకు ప్రమాదం లేకుండ చూచుకొని రాజధర్మాలు నడపాలి.

క. **అమలినమతి నాత్మచ్ఛి। ద్రము లన్యు లెఱుఁగకుండఁ దా నన్య చ్ఛి**
ద్రము లిమ్ముగ నెఱుఁగుచు దే। శముఁ గాలము నెఱిఁగి మిత్రసంపన్నుం డై. **106**

ప్రతిపదార్థం: అమలినమతిన్= స్వచ్ఛమైన బుద్ధితో; ఆత్మ, ఛిద్రములు= తనయొక్క లోపాలు; అన్యులు= ఇతరులు; ఎఱుఁగకుండ = తెలిసికొనకుండా; తాను, అన్య, ఛిద్రములు= ఇతరులయొక్క లోపాలు; ఇమ్ముగన్= అనుకూలంగా; ఎఱుఁగుచున్= తెలిసికొంటూ; దేశమున్= దేశపరిస్థితులను; కాలమున్= కాల పరిస్థితులను; ఎఱిఁగి= తెలిసికొని; మిత్ర, సంపన్నుండు+ఐ= స్నేహితులయొక్క బలంకలవాడై.

తాత్పర్యం: అచ్చపుబుద్ధితో తన లోపాలు ఇతరులు తెలిసికోకుండ ఇతరుల లోపాలను తాను తెలిసికొంటూ, దేశకాలపరిస్థితులను ఎరిగి, మిత్రబలం గలవాడై, రాజు తనరాజధర్మాలను నిర్వర్తించాలి.

క. బలహీను లైనచో శ। త్రులఁ జెఱచుట నీతి, యధిక దోర్వీర్య సుహృ
ద్బలు లైన వారిఁ జెఱుపఁగ। నలవియె యక్లేశ సాధ్యు లగుదురె మీఁదన్. 107

ప్రతిపదార్థం: బల, హీనులు+ఐనచో= బలాన్ని కోల్పోయినవాళ్ళయితే; శత్రువులన్; చెఱచుట= చంపటం; నీతి= రాజనీతి; అధిక, దోః+వీర్య, సుహృత్+బలులు+ఐన, వారిన్= ఎక్కువ బాహుబలం, మిత్రబలం గలవాళ్ళయినవారిని; చెఱుపఁగన్= చంపటం; అలవియె= సాధ్యమా; మీఁదన్= తర్వాత; అక్లేశ, సాధ్యులు+అగుదురు+ఎ= (వారు) కష్టం లేకుండా - అంటే సులభంగా జయింపబడినవాళ్ళవుతారా!

తాత్పర్యం: బలహీను లైనపుడే శత్రువులను చంపటం రాజనీతి. వాళ్ళు అధికబాహుబలం, మిత్రబలం కూర్చుకొన్న తర్వాత వాళ్ళని చంపటం సాధ్యమా? జయించటం సులభమా? (కాదు అని భావం)

క. అలయక పరాత్మ కృత్యం। బులఁ బతి యెఱుఁగునది దూతముఖమునఁ, బరభూ
ముల వృత్తాంతము లెఱుఁగఁగఁ। బలుమఱుఁ బుచ్చునది వివిధ పాషండ తతిన్. 108

ప్రతిపదార్థం: పతి= రాజు; అలయక= విసుగుచెందక; దూత, ముఖమునన్= దూతవలన; పర+ఆత్మ, కృత్యంబులన్= తనయొక్క, శత్రువులయొక్క పనులను; ఎఱుంగునది= తెలుసుకోవాలి; పర, భూముల, వృత్తాంతములు= శత్రుదేశాలయొక్క సమాచారాలు; ఎరుఁగఁగన్= తెలిసికొనటానికి; వివిధ, పాషండ, తతిన్= పలువిధాలైన పాషండుల సమూహాన్ని; పలుమఱున్= పెక్కుమారులు; పుచ్చునది= పంపించాలి.

తాత్పర్యం: రాజు విసుగులేకుండా తన పనులనుగురించి, శత్రువుల పనులనుగురించి దూతలవలన తెలిసికొనాలి. శత్రుదేశవిషయాలను తెలిసికొనటానికి పలువిధాలైన పాషండులసమూహాల్ని పంపాలి.

విశేషం: శత్రువుల కృత్యాలనుగూర్చి దూతల వలన తెలిసికొనవలసిన అవసరం రాజులకు ఉన్నది. అంతేకాదు; తమ పనులను గూర్చి ప్రజలేమనుకొంటున్నారో, తమపనులప్రభావం దేశప్రజలమీద, శత్రువులమీద ఏ విధంగా ఉన్నదో మదింపువేసుకొనటం కూడా రాజుకు అవసరమే. పాషండు లంటే వేదబాహ్యులు.

క. నానావిహార శైలో। ద్యాన సభా తీర్థ దేవతాగృహ మృగయా
స్థానముల కరుగునెడ మును। మానుగ శోధింపవలయు మానవపతికిన్. 109

ప్రతిపదార్థం: మానవ, పతికిన్= రాజుకు; నానా, విహార, శైల+ఉద్యాన, సభా, తీర్థ, దేవతా, గృహ, మృగయా, స్థానములకున్+అరుగు+ఎడన్= పలువిధాలైన క్రీడాపర్వతాలకు, ఉద్యానవనాలకు, సభలకు, పుణ్యతీర్థాలకు, దేవాలయాలకు, వేటాడే ప్రదేశాలకు వెళ్ళేటప్పుడు; మును= ముందుగా; మానుగన్= తగు విధంగా; శోధింపవలయున్= పరిశుద్ధంచేయాలి - అంటే ప్రభువుకు ప్రమాదం కలిగించే వ్యక్తులు, ఆయుధాలు దాగి ఉండకుండా పరిశీలించి, ఉంటే తొలగించి ఆయా స్థలాలను ప్రమాదరహితంగా శుద్ధంచేయాలి.

తాత్పర్యం: పలువిధాలైన క్రీడాపర్వతాలకు, ఉద్యానవనాలకు, సభలకు, పుణ్యతీర్థాలకు, దేవాలయాలకు, వేటాడే ప్రదేశాలకు వెళ్ళేటప్పుడు - ప్రభువుకు ప్రమాదాలు కలుగకుండ, ఆయాప్రదేశాలను ముందుగా తగువిధంగా పరిశీలించి, ప్రమాదంకలిగించే వ్యక్తులు, ఆయుధాలు ఉంటే తొలగించి పరిశుద్ధంగా ఉండేటట్లు చేయాలి.

విశేషం: ఈ పద్ధతులు ఈనాడుగూడ ఆచరణలో ఉన్నాయి. ఇవి ప్రభువుకు రక్షణ కల్పించటంలో భాగాలు.

తే. **వీరు నమ్మంగఁ దగుదురు వీరు నమ్మఁ । దగరు నాకు నా వలవదు; తత్త్వబుద్ధి**
నెవ్వరిని విశ్వసింపక యెల్ల ప్రొద్దు । నాత్మరక్షాపరుం డగు నది విభుండు. **110**

ప్రతిపదార్థం: విభుండు= రాజు; నాకున్; వీరు; నమ్మంగన్ తగుదురు= నమ్మదగినవాళ్ళు; వీరు; నమ్మన్, తగరు= నమ్మదగనివాళ్ళు; నా, వలవదు= అని అనవద్దు; తత్త్వ, బుద్ధిన్= నిశ్చయబుద్ధిచేత; ఎవ్వరిని= ఎవరినికూడా; విశ్వసింపక= నమ్మక; ఆత్మ, రక్షా, పరుండు+అగునది= తన్ను తాను రక్షించుకోవటమే ప్రధానంగా కలవాడు కావాలి.

తాత్పర్యం: రాజైనవాడు 'నాకు వీరు నమ్మదగినవారు, వీరు నమ్మగూడనివారు'అని అనగూడదు. నిశ్చయబుద్ధి చేత ఎవ్వరినీ నమ్మకుండా తనరక్షణ తానే ప్రధానంగా చూచుకోవాలి.

ఉ. **ఇమ్ముగ నాత్మరక్ష విధియించువిధంబున మంత్రరక్ష య**
త్నమ్మునఁ జేయఁగావలయుఁ; దత్పరిరక్షణశక్తి నెల్ల కా
ర్యమ్ములు సిద్ధిఁ బొందుఁ బరమార్థము; మంత్రవిభేద మైనఁ గా
ర్యమ్ములు నిర్వహింపఁగ బృహస్పతికైనను నేరఁబోలునే. **111**

ప్రతిపదార్థం: ఇమ్ముగన్= బాగుగా; ఆత్మ, రక్ష= తనను రక్షించుకోవటాన్ని; విధియించు, విధంబున= చేసికొన్నట్లే; మంత్ర, రక్ష= రహస్యంయొక్క కాపాడటాన్ని; యత్నమ్మునన్= ప్రయత్నంతో; చేయగావలయున్= చేసుకోవాలి; తత్+పరిరక్షణ, శక్తిన్= ఆ రహస్యాలోచనాన్ని రక్షించటంయొక్క బలంచేత; ఎల్ల, కార్యమ్ములు= అన్ని పనులు; సిద్ధిన్+పొందున్= సఫలతను పొందుతాయి; పరమ+అర్థము= నిశ్చయం; మంత్ర, విభేదము+ఐనన్= రహస్యంయొక్క వెల్లడిఅయితే; కార్యమ్ములు= పనులు; నిర్వహింపఁగన్= జరపటానికి; బృహస్పతికిన్+ఐనను; నేరన్+పోలునే= సాధ్యమవుతుందా?

తాత్పర్యం: ప్రభువు తనను తాను జాగ్రత్తగా రక్షించుకొన్నట్లే, తన రహస్యాలోచనాన్నిగూడ రక్షించుకోవాలి. రహస్యాలోచన వెల్లడి కాకుండ రక్షించుకొనే బలంచేతనే అన్నిపనులు ఫలవంతాలవుతాయి. రహస్యాలోచన వెల్లడి అయితే పనులను ఫలవంతం కావించటం ఆ బృహస్పతికైనా సాధ్యంకాదు. (బుద్ధిబలంలో బృహస్పతిని మించిన వాళ్ళులేరు కనుక అతనికికూడా సాధ్యం కాదనటం.)

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. **పలుమఱు శపథంబులు నం । జలియును నభివాదనమును సామప్రియభా**
షలు మిథ్యావినయంబులుఁ । గలయవి దుష్టస్వభావకాపురుషులకున్. **112**

ప్రతిపదార్థం: దుష్టస్వభావ, కాపురుషులకున్= చెడుస్వభావం గల నీచ మానవులకు; పలుమఱు= చాలామార్లు; శపథంబులున్= ఒట్టుపెట్టుకోవటాలు; అంజలియును= చేతులు జోడించటాలు; అభివాదనమును= నమస్కారాలు; సామ, ప్రియ, భాషలు= సామోపాయం, (అనుకూల ప్రవర్తన రూపమైన ఉపాయం), ఇంపైన మాటలు; మిథ్యా, వినయంబులు= కపటపు వినయాలు; కల, అవి= ఉన్నాయి.

తాత్పర్యం: చెడు స్వభావం గల నీచులు మాటిమాటికీ ఒట్టుపెట్టుకుంటారు. చేతులు జోడిస్తారు. నమస్కారాలు చేస్తారు. సామోపాయంతో కూడిన ఇంపైన మాటలు మాట్లాడుతారు. కపటపువినయాలు ప్రదర్శిస్తారు.

విశేషం: ఉపాయాలు - సామ, దాన, భేద, దండాలు - అనేవి నాలుగు.

క. **తన కిమ్మగు నంతకు దు । ర్జనుఁ డిష్టుఁడపోలె నుండి సర్పమపోలెం**
దన కిమ్మగుడును గఱచును । ఘనదారుణకర్మగరళ ఘనదంష్ట్రములన్. **113**

ప్రతిపదార్థం: దుర్జనుఁడు= దుర్మార్గుడు; తనకు; ఇమ్ము+అగు+అంతకు= అనుకూలం అయ్యేవరకు; ఇష్టుఁడు+అ, పోలెన్= ఇష్టమైనవాడివలె - మిత్రుడివలె; ఉండి= వర్తించి; తనకున్; ఇమ్ము+అగుడును= అవకాశం లభించినంతనే; సర్పము+పోలెన్= పామువలె; ఘన, దారుణ, కర్మ, గరళ, ఘన దంష్ట్రములన్= మిక్కిలి క్రూరాలయిన పనులు అనే విషంచే పెద్దవైన కోరలచేత; కఱచును= కరుస్తాడు.

తాత్పర్యం: దుర్మార్గుడు తనకు అనుకూల మయ్యేంతవరకు మిత్రుడివలె నటించి, అనుకూలత ఏర్పడిన వెంటనే పామువలె తన క్రూరకృత్యా లనే కోరలతో కరుస్తాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **కడునలుకయుఁ గూర్మియు నే । ర్పడ నెఱిఁగించునది వాని ఫలకాలమునన్**
బిడుగును గాడ్పును జనులకుఁ । బడుటయు వీచుటయు నెఱుకపడియెడుభంగిన్. **114**

ప్రతిపదార్థం: కడున్= మిక్కుటమైన; అలుకయున్= కోపమూ; కూర్మియున్= స్నేహమూ; వాని, ఫల, కాలమునన్= వాటియొక్క ఫలంయొక్క సమయాన - అంటే ఆ రెండింటియొక్క అనుభవకాలాన; పిడుగును; గాడ్పును= గాలియును; పడుటయు; వీచుటయున్; జనులకున్; ఎఱుకపడియెడు, భంగిన్= తెలిసేటట్లుగా; ఏర్పడన్= స్పష్టమయ్యేట్లు; ఎఱిఁగించునది= తెలియజేయాలి.

తాత్పర్యం: పిడుగుపడటం, గాలివీచటం - అవి జరిగినపుడే జనులకు తెలిసినట్లు - మిక్కుటమైన కోపంగాని, స్నేహంగాని వాటి అనుభవకాలానికే ఇతరులకు తెలియజేయాలి.

విశేషం: అలం: క్రమం, ఉపమ.

క. **తఱియగునంతకు రిపుఁ దన । యఱకటఁ బెట్టికొనియుండునది; దఱియగుడుం**
జెఱచునది ఱాతిమీదను । వఱలఁగ మృద్ఘటము నెత్తి వైచిన భంగిన్. **115**

ప్రతిపదార్థం: తఱి= సమయం; అగునంతకున్= వచ్చేవరకు; రిపున్= శత్రువును; తన, అఱకటన్= తనయొక్క భుజం మీద; పెట్టుకొని; ఉండునది = ఉండాలి; తఱి, అగుడున్= సమయం వచ్చినపుడు; మృత్+ఘటమున్= మట్టికుండను; వఱలఁగన్= ఒప్పుగా - ప్రకాశించేటట్లు; ఱాతిమీదను; ఎత్తివైచిన, భంగిన్= ఎత్తి పడవేసిన విధంగా; చెఱుచునది= నాశనమయ్యేటట్లు చేయాలి.

తాత్పర్యం: తగిన సమయం వచ్చేవరకు శత్రువును భుజంమీదికి ఎక్కించుకొని మోస్తూ, తగిన సమయం రాగానే మట్టికుండను రాతిమీద ఎత్తికొట్టినట్లు అతడిని నాశనం చేయాలి.

విశేషం: అలం: ఉపమ. ఈ పద్యం పెక్కు ప్రతుల్లో లేనట్లు శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి పుట,348లో ఉన్నది.

క. తన కపకారము మునుఁ జే। సిన జనుఁ డల్పుఁ డని నమ్మి చేకొని యుండం
జన; దొకయించుక ముల్లయి। నను బాదతలమున నున్న నడవఁగ నగునే. 116

ప్రతిపదార్థం: మును= ముందు - ఇదివరకు; తనకున్; అపకారము= కీడు; చేసిన; జనుఁడు; అల్పుఁడు+అని= తక్కువవాడని; నమ్మి; చేకొని= ఆదరించి; ఉండన్+చనదు= ఉండకూడదు; ఒక, ఇంచుక= ఒకకొద్దిపాటి; ముల్లు+అయినను; పాద, తలమునన్= పాదప్రదేశంలో - అంటే పాదంలో; ఉన్నన్= ఉంటే; నడువఁగన్= నడవటానికి; అగునే= సాధ్యమవుతుందా?

తాత్పర్యం: ఇంతకుముందు తనకు అపకారం చేసిన మానవుడు తక్కువవాడుకదా అని, అతడిని ఆదరించకూడదు. ముల్లు చిన్నదే అయినా అది పాదంలో ఉంటే నడవటానికి సాధ్యమవుతుందా?

విశేషం: అలం: అర్థాంతర్యాసం. ఈ పద్యానికి పాఠాంతరంగా కొన్ని ప్రతుల్లో ఉన్న పద్యం: "తన కపకారము చేసిన, జనుఁ డల్పుం డనుచు నమ్మి జడమతి యై చే, కొనఁ జన దించుక ముల్లయి, నను బద్ధతులందు నున్న నడువఁగ నగునే." - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి పుట,347

క. బాలుఁ డని తలఁచి రిపుతో। నేలిదమునఁ గలిసియునికి యిది కార్యమె? యు
త్కీలానలకణ మించుక। చాలదె కాల్పంగ నుగ్రశైలాటవులన్. 117

ప్రతిపదార్థం: బాలుఁడు+అని; తలఁచి; రిపుతోన్= శత్రువుతో; ఏలిదమునన్= చులకనభావంతో; కలిసి, ఉనికి= కలిసి ఉండటం; ఇది= ఇట్లుండటం; కార్యమె= చేయదగిన పనియా; ఉగ్ర, శైల+అటవులన్= భయంకరాలైన పర్వతాలలోని అడవులను; కాల్పంగన్= కాల్చడానికి; ఉత్, కీలా+అనల, కణము= పెద్దమంటయొక్క నిప్పురవ్వ; ఇంచుక= కొంచెం; చాలదె= సరిపోదా.

తాత్పర్యం: బాలుడు కదా అని చులకన భావం వహించి శత్రువుతో కలిసి ఉండకూడదు. భయంకరాలైన పర్వతారణ్యాలను కాల్చుటానికి చిన్న నిప్పురవ్వ చాలదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. మొనసి యపకారిఁ గడ నిడి। కొనియుండెడు కుమతి దీర్ఘకుజశాఖాగ్రం
బున నుండి నిద్రవోయెడు। మనుజునకు సమాన మగుఁ బ్రమత్తత్వమునన్. 118

ప్రతిపదార్థం: మొనసి= పూని; అపకారిన్= కీడుచేసినవాడిని; కడన్+ఇడికొని+ఉండెడు= దగ్గర ఉంచుకొని ఉండే; కుమతి= చెడుబుద్ధికలవాడు - ఇట బుద్ధిలేనివాడని గ్రహింపవచ్చు; ప్రమత్తత్వమునన్= ఏమరినవాడు కావటంలో; దీర్ఘ, కుజ, శాఖా+ అగ్రంబునన్+ఉండి= ఎత్తైనచెట్టు కొమ్మయొక్క చివరలో పరుండి; నిద్ర+పోయెడు; మనుజునకున్ సమానము+అగున్= నిద్రించేవాడితో సమానం అగుచున్నాడు.

తాత్పర్యం: ప్రయత్నించి తన కపకారం చేసినవాడిని దగ్గర ఉంచుకొన్న బుద్ధిహీనుడు ఏమరుపాటుతో ఎత్తైన చెట్టుకొమ్మచివర నిద్రించేవాడితో సమానం.

విశేషం: అలం: ఉపమ.

చ. **తడయక సామభేదముల దానములన్ దయతోడ నమ్మఁగా**
నొడివియు సత్యమిచ్చియుఁ జనున్ జననాథ! కృతాపకారులం
గడఁగి వధింపఁగాఁ గనుట కావ్యమతం బిది; గాన యెట్టులుం
గడుకొని శత్రులం జెఱుపఁగాంచుట కార్యము రాజనీతిమైన్. **119**

ప్రతిపదార్థం: జననాథ= ఓరాజా!; కృత+అపకారులన్= చేయబడిన అపకారాలు కలవాళ్ళను; తడయక= ఆలస్యంచేయక; సామ భేదములన్= సామోపాయంచేత, భేదోపాయంచేత; దానములన్= దానాలచేత; దయతోడ; నమ్మన్+కాన్= నమ్మకం కలిగించేటట్లుగా; నొడివియున్= మాట్లాడి; సత్యము+ఇచ్చియున్= ఒట్టుపెట్టుకొని; కడఁగి= ప్రయత్నించి; వధింపన్+కాన్+కనుట= చంపబడేటట్లు చూడటం - అంటే చంపటం; చనున్= తగును; ఇది= ఈ నీతి; కావ్య, మతంబు= శుక్రాచార్యునియొక్క అభిప్రాయం; కానన్= కనుక; ఎట్టులున్= ఏ విధంగానైనా; కడుకొని= ప్రయత్నించి; రాజనీతిమైన్= రాజనీతిచేత; శత్రువున్= పగవాణ్ణి, చెఱుపన్, కాంచుట= నశించేటట్లు చూడటం; కార్యము= చేయదగిన పని.

తాత్పర్యం: ఓ రాజా! అపకారాలు చేసినవాళ్ళను - సామదానభేదోపాయాలచేత లేదా దయ చూపి నమ్మకం కలిగేట్లుగా మాట్లాడి లేదా ఒట్టుపెట్టుకొని, నమ్మకం కలిగించి ఆలస్యం జరగకుండా చంపాలి. ఇది శుక్రుని అభిప్రాయం. అందుచేత ఏ విధంగా నైనా రాజనీతితో శత్రువులను హతమార్చాలి.

విశేషం: కావ్యమతం బిది - అనే దానికి కావ్యమతం బిది, కార్యమతం బిది, కావ్యమతం బిది అనే పాఠాంతరాలున్నాయి. శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి పుట,348

వ. **'కావున సర్వప్రకారంబుల నపకారకారణు లయిన వారిం బరుల నయిన బాంధవుల నయిన నుపేక్షింపక యాత్మరక్షాపరుండ వయి దూరంబుసేసి దూషించునది' యనినఁ గణికుమతంబు విని దుర్యోధనుండు చింతాపరుం డై యొక్కనాఁడు ధృతరాష్ట్రున కేకాంతంబున ని ట్లనియె.** **120**

ప్రతిపదార్థం: కావునన్; సర్వ, ప్రకారంబులన్= అన్నివిధాలచేత; అపకార, కారణులు+అయిన, వారిన్= అపకారాలు చేసిన వారిని; పరులన్+అయినన్= శత్రువులనైనా; బాంధవులన్+అయినన్; ఉపేక్షింపక= అశ్రద్ధచేయక; ఆత్మ, రక్షాపరుండవు+అయి= నిన్ను నీవు రక్షించుకొనటంలో మనస్సు కలవాడవై; దూరంబు+చేసి= (వారిని) దూరంగా ఉంచి; దూషించునది= తిట్టాలి (ఇట చంపాలి అనే అర్థం సమంజసం); అనినన్= అని అనగా; కణికు, మతంబు= కణికునియొక్క అభిప్రాయం; విని;

దుర్యోధనుండు; చింతా, పరుండు+ఐ= దుఃఖం నిండిన మనస్సు కలవాడై; ఒక్కనాఁడు; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రునితో; ఏకాంతంబునన్= ఒంటరిగా ఉన్నప్పుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అందుచేత అపకారాలు చేసినవాళ్ళు శత్రువులైనా బంధువులైనా అశ్రద్ధచేయకూడదు. ఆత్మరక్షణకొరకు అన్నివిధాలా వాళ్ళను హతమార్చా' లని కణికుడు చెప్పగా విని, చింతాక్రాంతుడై దుర్యోధనుడు ఒకనాడు ధృతరాష్ట్రుడు ఒంటరిగా ఉన్నప్పుడు అతనితో ఇట్లా అన్నాడు.

దుర్యోధనుఁడు తండ్రితోఁ దన మనోదుఃఖంబుఁ దెలుపుట (సం.1-129-10)

తే. **వీరు లని పాండుసుతులకు వెఱతు నేను; । వెఱచుటకుఁ దోడుగా నిప్డు విభుఁడ వీవు**
పాండవజ్యేష్ఠునకుఁ బ్రీతిఁ బరమయౌవ । రాజ్య మిచ్చితి కురువృద్ధరాజులొద్ద. 121

ప్రతిపదార్థం: నేను; వీరులు+అని; పాండు, సుతులకున్= పాండురాజుయొక్క కుమారులకు - పాండవులకు; వెఱతున్= భయపడతాను; వెఱచుటకున్= భయపడటానికి; తోడు, కాన్= తోడయినట్లు; విభుఁడవు+ఈవు= రాజువైన నీవు; కురు, వృద్ధ, రాజుల+ఒద్ద= కురువంశపు పెద్దలయొక్క, రాజులయొక్క ఎదుట; ప్రీతిన్= ప్రేమతో; పాండవ, జ్యేష్ఠునకున్= పాండవులలో పెద్దవాడైనవానికి, ధర్మరాజుకు; పరమ, యౌవ, రాజ్యము= ప్రధానమైన యౌవరాజ్యాన్ని; ఇచ్చితి= ఇచ్చావు.

తాత్పర్యం: పాండవులు వీరులని నేను భయపడుతున్నాను. నేను భయపడటానికి తగ్గట్లే ప్రభువైన నీవు కురువంశపుపెద్దలయెదుట, రాజులయెదుట పాండవులలో పెద్దవాడైన ధర్మరాజును ప్రేమతో యువరాజును చేశావు.

విశేషం: వ్యక్తిబలాన్ని అంతకంత పెంచేది అధికారం. పాండవులు మొదలే బలవంతులు. అందుకుతోడు యుధిష్ఠిరుడిప్పుడు యువరాజైనాడు. ఆ యౌవరాజ్యాధికారం అతనికి ఎవరో ఇచ్చింది కాదు. రాజైన ధృతరాష్ట్రుడే స్వయంగా ఇచ్చాడు. పైగా చాటుమాటుగా ఏదో మాటవరుస ఇవ్వలేదు. పదిమందిఎదుట శాస్త్రోక్తంగా కట్టబెట్టాడు. దాన్ని కాదనటం ఎట్లా? పాండవులను ఎదిరించటం ఎట్లా? అదే దుర్యోధనునిబాధ, భయం. అతనిమానసికస్థితిని తెలియపరచేదే ఈ తేటగీతి.

వ. **'దాననచేసి పౌర జానపద బ్రాహ్మణ ప్రధానవరులు ధర్మజున కనురక్తు లయి, నిన్నును భీష్ముని నాదరింపక, ప్రజ్ఞాచక్షుండు రాజ్యరక్షణంబు సేయ సమర్థుండు గాఁడు, భీష్ముండు సమర్థుం డయ్యును ముందఱ రాజ్యభార నివర్తనంబునందుఁ గృతప్రతిజ్ఞుం డయ్యెం; గావునఁ బాండవజ్యేష్ఠుం డైన యుధిష్ఠిరునకు రాజ్యాభిషేకంబు సేయుద; మతండు తరుణుం డయ్యును గుణవృద్ధుండు ధర్మశీలుండు పరాక్రమవంతు లైన తమ్ములుగలవాడు రాజ్యప్రతిష్ఠితుం డయ్యెనేని వృద్ధుల నమాత్యుల బంధుమిత్రులను దొల్లింటికంటె మిక్కిలిగాఁ బూజార్హుల నెల్లం బూజించుఁ, బితామహుండైన భీష్ముని సపుత్త్రకుండైన ధృతరాష్ట్రుని నతిభక్తి నభీష్టభోగానుభవపరులంగా సుఖంబున నునుచు, దీనికి విదురుండును నొడంబడు నని యెప్పుడుఁ దమలో విచారింతు రని వింటిఁ; గర్ణశూలాయమానంబు లైన మూర్ఖప్రకృతుల పలుకులు విననోపఁ; బాండవుల నిప్పరంబువలనఁ బాయునట్లుగాఁ జేయవలయు; నేమి సేయుదు?' ననినఁ గొడుకునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె.** 122

ప్రతిపదార్థం: దాననచేసి= దానివలన - ధర్మరాజుకు యౌవరాజ్యం ఇచ్చినందువలన; పౌర, జానపద, బ్రాహ్మణ, ప్రధానవరులు= పట్టణప్రజలు, పల్లెప్రజలు, బ్రాహ్మణులు, మంత్రిశ్రేష్ఠులు; ధర్మజునకు= ధర్మరాజునకు; అనురక్తులు+అయి= అనురాగం

- ప్రేమ కలవాళ్ళయి; నిన్నును; భీష్మునిన్= భీష్ముని; ఆదరింపక= లెక్కచేయక; ప్రజ్ఞాచక్షుండు= బుద్ధియే కన్నుగా కలవాడు- ధృతరాష్ట్రుడు; రాజ్య, రక్షణంబు, చేయన్= రాజ్యాన్ని రక్షించటానికి; సమర్థుఁడు; కాఁడు; భీష్ముండు; సమర్థుండు+అయ్యును; ముందఱ= మున్ను, రాజ్య, భార, నివర్తనంబు+అందు= రాజ్యభారంనుండి మరలటంలో; కృత ప్రతిజ్ఞుండు= చేయబడినప్రతిజ్ఞ కలవాడు; అయ్యెన్; కావునన్; పాండవ, జ్యేష్ఠుండు+ఐన= పాండవులలో పెద్దవాడైన; యుధిష్ఠిరునకున్= ధర్మరాజునకు; రాజ్య+అభిషేకంబు; చేయుదము; అతండు= ఆ ధర్మరాజు; తరుణుండు+అయ్యును= యువకుడైనా; గుణ, వృద్ధుండు= గుణంచేత పెద్దవాడు; ధర్మశీలుండు= ధర్మాన్నే స్వభావంగా కలవాడు; వృద్ధులన్= పెద్దలను; అమాత్యులన్= మంత్రులను; బంధు, మిత్రులను; తొల్లింటికంటె= మునుపటికంటె; మిక్కిలిగా= ఎక్కువగా; పూజా+అర్హులన్+ఎల్లన్= గౌరవానికి తగినవాళ్ళ నందరినీ; పూజించున్= గౌరవిస్తాడు; పితామహుండు+ఐన= తాతగారైన; భీష్ముని; స, పుత్త్రుకుండు+ఐన= కుమారులు గల వాడైన; ధృతరాష్ట్రునిన్; అతి, భక్తిన్= మిక్కిలిభక్తితో; అభి+ఇష్ట, భోగ+అనుభవ, పరులన్+కాన్= కోరుకొన్న భోగాలను అనుభవించటంలో లగ్నమైన మనస్సులు గలవాళ్ళనుగా; సుఖంబునన్= సుఖంతో; ఉనుచున్= ఉంచుతాడు; దీనికిన్= ఈ విధంగా చేయటానికి; విదురుండునున్= విదురుడుకూడా; ఒడంబడును+అని= ఒప్పుకొంటాడని; ఎల్లప్పుడు; తమలోన్= తమలో తాము; విచారింతురు= ఆలోచిస్తారు; అని= అనికూడా; వింటిన్= విన్నాను; కర్ణ, శూలాయమానంబులు+ఐన= చెవులకు బల్లేలవంటివైన; మూర్ఖ, ప్రకృతుల, పలుకులు= మూర్ఖులైన జనులయొక్క మాటలు; వినన్+ఓపన్= వినలేకున్నాను; పాండవులన్; ఈ+పురంబువలనన్= ఈ నగరంనుండి; పాయు+అట్లు+కాన్= తొలగేటట్లుగా; చేయవలయున్; ఏమి; చేయుదున్; అనినన్; కొడుకునకున్; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ధర్మరాజుకు యౌవరాజ్యం ఇవ్వటంవలన పట్టణప్రజలు, పల్లెప్రజలు, మంత్రిశ్రేష్ఠులు అతనిపట్ల అనురాగంకలవాళ్ళయి, నిన్నూ; భీష్ముడినీ లెక్కచేయక, ధృతరాష్ట్రుడు రాజ్యాన్ని రక్షించలేడు. భీష్ముడు రాజ్యాన్ని రక్షించగలవాడే అయినా రాజ్యభారం స్వీకరించనని ప్రతిజ్ఞచేసి ఉన్నాడు. అందుచేత ధర్మరాజునే రాజుగా చేద్దా మనీ, అతడు యువకుడైనా గుణవంతుడనీ, ధర్మాత్ముడనీ, పరాక్రమవంతులైన తమ్ములు గలవాడనీ, అటువంటివాడిని రాజుగా చేస్తే మంత్రులను, బంధువులను, మిత్రులను, గౌరవించదగినవాళ్ళందరినీ మునుపటికంటె ఎక్కువగా గౌరవిస్తాడనీ, తాతగారైన భీష్ముడిని, పుత్రులున్న ధృతరాష్ట్రుడిని మిక్కిలిభక్తితో పూజిస్తాడనీ, వారి కిష్టమైన భోగాలను అనుభవింపజేసి సుఖంగా ఉంచుతాడనీ, ఇందుకు విదురుడుకూడ అంగీకరిస్తాడనీ ఎప్పుడూ తమలో తాము అనుకొంటున్నారు. చెవులకు బల్లెములవలె తగిలే ఈ మూర్ఖజనుల మాటలను నేను వినలేకున్నాను. పాండవులను ఈ పురం వదలిపోయేటట్లు చేయం' డని దుర్యోధనుడనగా అతనితో ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు.

చ. జనపతి యైనవానికిఁ బ్రచండమహాతుములాహవాంతరం
బున మృతిఁబొందియుండె, మఱి పుత్త్రులపైఁ దనరాజ్యభార మె
ల్లను నియమించి యేఁగి గిరులం దప మొప్పఁగఁ జేసి యుండెఁ గా
కనిమిషలోకభోగసుఖ మందఁగఁ బోలునె శాశ్వతంబుగన్. 123

ప్రతిపదార్థం: జనపతి+ఐన, వానికిన్= రాజైనవానికి; ప్రచండ, మహా, తుముల+ఆహవ+అంతరంబునన్= సహింప శక్యంగాని పెద్ద సంకులయుద్ధంయొక్క మధ్యంలో; మృతిన్= మరణాన్ని; పొంది; ఒండెన్= కాని; మఱి= అట్లా కాక; పుత్త్రుల పైన్; తన, రాజ్య, భారము+ఎల్లను= తనయొక్క రాజ్యంయొక్కభారాన్నంతను; నియమించి= ఏర్పాట్లుచేసి; ఏఁగి= వెళ్ళి; గిరులన్= పర్వతాలలో; తపము= తపస్సు; ఒపన్+కన్= తగినట్లుగా; చేసి; ఒండెన్= కాని; కాక= కాకుండా; శాశ్వతంబుగన్= శాశ్వతంగా; అనిమిష, లోక, భోగ, సుఖము= స్వర్గలోకాన్ని అనుభవించటంలోని సుఖాన్ని; అందన్+కన్= పొందటానికి; పోలునె= సాధ్యమగునా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజైనవాడు మహాయుద్ధంలో మరణించి గాని, రాజ్యభారాన్ని కొడుకులకు అప్పగించి కొండలపై గొప్పతపస్సు చేసి గాని, శాశ్వతమైన స్వర్గసుఖాన్ని పొందగలడేగాని, వేరే విధంగా దాన్ని పొందగలడా!

వ. రా జయ్యెడువాఁడు తన రాజ్యభారంబు దాన చూచి యరయవలయు; నేను షడంగసహితంబుగా వేదాధ్యయనంబు సేసియు నర్థశాస్త్రంబునందుఁ గృతనిశ్చయుండ నయి బలంబు గలిగియు నంగవైకల్యంబునం బరచక్రంబులకుం బ్రతివ్యూహంబు రచియింప నేరమింజేసి రాజ్యంబునకుఁ దగకున్న. 124

ప్రతిపదార్థం: రాజు+అయ్యెడు, వాడు= రాజైనవాడు; తన, రాజ్య, భారంబు= తనరాజ్యభారాన్ని; తానే; చూచి, అరయ, వలయున్= విచారించుకోవాలి; ఏను= నేను; షట్+అంగ, సహితంబుగా= ఆరు అంగాలతో కూడిన; వేద+అధ్యయనంబు= వేదాన్ని చదవటం; చేసియున్=చేసికూడా; అర్థశాస్త్రంబు+అందు= ద్రవ్యనీతిశాస్త్రంలో; కృత, నిశ్చయుండను+అయి= నేర్పబడిన సిద్ధాంతాలు కలవాడినై; బలంబు; కలిగియు; అంగ, వైకల్యంబునన్= అవయవంయొక్క లోపంచేత; పర, చక్రంబులకున్= శత్రువులయొక్క సైన్యాలకు; ప్రతివ్యూహంబులు= ఎదురు పన్నుగడలు; నేరమిన్+చేసి= కూర్చటానికి చేతకాకపోవటంవలన; రాజ్యంబునకున్, తగక+ఉన్నన్= రాజ్యపాలనకు తగనివాడనై ఉండటంచేత.

తాత్పర్యం: రాజైనవాడు తన రాజ్యవిషయాలు తానే విచారించుకొనాలి. నేను ఆరుఅంగాలతో కూడిన వేదాన్ని చదివి అర్థనీతిశాస్త్రాన్ని నేర్చుకొన్నా, బలంకలవాణ్ణి అయినా, అంధుడిని కావటంచేత శత్రు సైన్యాలకు ఎదురు వ్యూహాలు కూర్చలేనివాడినై రాజ్యపాలనకు తగనివాడను కావటంచేత.

విశేషం: షడంగాలు - శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిష్యం, కల్పం.

ఉ. లోకనుతుండు పాండుఁ డమలుండు మహాగుణరత్నపూర్ణర
త్నాకరుఁ డత్యుదారమతి నంధుఁడ నైనను నన్ను రాజుఁగాఁ
జేకొని నాకు భక్తిఁ బనిసేయుచు సర్వజగజ్జిగీషుఁ డై
యీకురువంశరాజ్యభర మింతయుఁ దాల్చెఁ బరాక్రమంబునన్. 125

ప్రతిపదార్థం: లోక, నుతుండు= ప్రపంచంచేత కొనియాడబడినవాడు; అమలుండు= దోషంలేనివాడు- పవిత్రుడు; మహా, గుణ, రత్న, పూర్ణ, రత్న+ఆకరుఁడు= గొప్పవైన మంచిగుణాలనే రత్నాలచేత నిండిన సముద్రునివంటివాడు; పాండుఁడు= పాండురాజు; అతి+ఉదారమతిన్= మిక్కిలి గొప్పమనస్సుతో; అంధుఁడను+ఐనను= గ్రుడ్డివాడను అయినప్పటికీ; నన్నున్; రాజున్+కాన్= రాజును కావించి; చేకొని; నాకున్; భక్తిన్= భక్తితో; పనిచేయుచు; సర్వ, జగత్+జిగీషుఁడు+ఐ= మొత్తం ప్రపంచాన్ని జయించ గోరేవాడై; పరాక్రమంబునన్; ఈ, కురు, వంశ, రాజ్య, భరము+ఇంతయున్= ఈ కురువంశ రాజ్యభారాన్నంతటినీ; తాల్చెన్= ధరించాడు.

తాత్పర్యం: ప్రపంచప్రశంసలందుకొన్నవాడు, పవిత్రుడు, సద్గుణాలనే రత్నాలకు సముద్రునివంటివాడు అయిన పాండురాజు గొప్పమనస్సుతో, గ్రుడ్డివాడినైన నన్ను రాజుగా స్వీకరించి, భక్తితో సేవచేస్తూ, సర్వప్రపంచాన్ని జయింపగోరేవాడై పరాక్రమంతో ఈ కురువంశరాజ్యభారాన్నంతా వహించాడు.

క. పరచక్రపతులచే భీ। కరుఁ డై ధనరాసు లదిమి కప్పము గొని చె
చ్చెరఁ దెచ్చియిచ్చి నన్నును। భరతకులశ్రేష్ఠుఁ డునిచె బహుయజ్ఞములన్. 126

ప్రతిపదార్థం: భరత, కుల, శ్రేష్ఠుండు= భరతవంశంలో పేరు కెక్కినవాడు; భీకరుఁడు+ఐ= భయాన్ని కలిగించేవాడై; అదిమి= అణచి; ధన, రాసులు; పర, చక్ర, పతులచే= శత్రురాజ్యాలయొక్క రాజులచేత; కప్పము; కొని= తీసికొని; చెర+ చెరన్= వెంటనే; తెచ్చి, ఇచ్చి; నన్నును= నన్నుకూడా; బహు, యజ్ఞములన్= అనేకయజ్ఞాలలో; ఉనిచెన్= ఉండేట్లు చేశాడు - అంటే అనేక యజ్ఞాలు నాచేత చేయించాడు.

తాత్పర్యం: భరతవంశశ్రేష్ఠుడైన పాండురాజు శత్రుభయంకరుడై శత్రువులను అణచి, కప్పం గ్రహించి ధనరాసులు వెంటనే తెచ్చి, ఇచ్చి నా చేత అనేకయజ్ఞాలు చేయించాడు.

వ. 'మఱియు వానికంటె గుణంబుల మిక్కిలి యయి జనంబులకు ననురక్తు లై పరగుచున్నపాండురాజు కుమారుల నెవ్విధంబునఁ బాపనేర్తు' నని దుఃఖించిన ధృతరాష్ట్రునకు దుర్యోధనుం డి ట్లనియె. 127

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకనూ, వానికంటెన్= ఆ పాండురాజుకంటె; గుణంబుల= మంచిగుణాలలో; మిక్కిలి, అయి= ఎక్కువై; జనంబులకున్, అనురక్తులు+ఐ= అనురాగం - ప్రేమ - కలవారై; పరగుచున్+ఉన్న= ఒప్పుతున్న; పాండు రాజ, కుమారులన్= పాండవులను; ఏవిధంబునన్= ఏ విధంగా, పాపనేర్తును= తొలగించగలను, అని; దుఃఖించిన= దుః ఖించు; ధృతరాష్ట్రునకు; దుర్యోధనుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఆ పాండురాజుకంటె గుణాలలో అధికు లై ప్రజలప్రేమ గలిగి ప్రకాశిస్తున్న పాండవులను ఏ విధంగా తొలగించగల?' నని ధృతరాష్ట్రుడు దుఃఖించగా, దుర్యోధనుడు ఇట్లా అన్నాడు.

సీ. పైతృకం బగు లక్ష్మి పాండుభూపతి మున్ను। తాల్చుటఁజేసి తత్తనయుఁ డైన
ధర్మజుఁ డిప్పుడు దాల్చిన, నాతని। తనయుండు మఱి దానిఁ దాల్చు, మీఁద
నిప్పాటఁ బాండువంశేశుల వసుమతీ। రాజ్యార్హు లగుదురు; రాజ్యమునకుఁ
బరువడి మే మింతఁ బాసిన మాపుత్ర పౌత్ర వర్గంబునుఁ బాయు; నింక

ఆ. నొరులఁ గొలిచి కుడువనోప మే; మట్లుగా। కుండ మమ్ముఁ జేయనోపుదేని
పాండురాజుతోంటిభక్తియు నప్పాండు। తనయులందు దయయుఁ దలఁపకుండు. 128

ప్రతిపదార్థం: పైతృకంబు+అగు, లక్ష్మి= పితరులనుండి వచ్చిందైన సంపదను; పాండు, భూపతి= పాండురాజు; మున్ను= ముందు; తాల్చుటన్+చేసి= ధరించటంవలన; తత్+తనయుఁడు+ఐన, ధర్మజుడు= అతనియొక్క కుమారుడైన ధర్మరాజు; ఇప్పుడు= ఈ సందర్భంలో; తాల్చినన్= ధరిస్తే; అతని, తనయుండు= అతనియొక్క - ధర్మరాజుయొక్కకుమారుడు; మఱి= మళ్ళీ; దానిన్= ఆ సంపదను; తాల్చున్= ధరిస్తాడు; మీఁదన్= తర్వాత; ఈ+పాటను= ఈవిధంగా; పాండు, వంశ+ ఈశులు+అ= పాండువంశరాజులే; వసుమతీ, రాజ్య+అర్హులు= భూమిదొరతనానికి తగినవారు; అగుదురు; రాజ్యమునకున్= రాజ్యానికి; పరువడి= క్రమంగా; మేము; ఇంతన్= ఈ కొలది; పాసినన్= దూరమైతే; మా, పుత్ర, పౌత్ర, వర్గంబునున్= మాయొక్క కొడుకులయొక్క, మనుమలయొక్క సమూహం; పాయున్= దూరమవుతుంది; ఇంకన్= ఇకముందు; ఏము;

ఒరులన్= ఇతరులను; కొలిచి= సేవించి; కుడువన్+ఓపము= తినటాన్ని, త్రాగటాన్ని చేయలేము - అంటే బ్రతుకు గడపలేము; అట్లు; కాక+ఉండ; మమ్మున్; చేయన్+ఓపుదు+ఏని= నీవు చేయగలిగితే; పాండురాజు, తొంటి, భక్తియున్= పాండురాజుయొక్క మునుపటి భక్తిని; ఆ+పాండు, తనయుల+అందు= ఆ పాండవులపట్ల; దయయున్; తలఁపక+ఉండు= ఆలోచించకుండా ఉండుము.

తాత్పర్యం: వంశపారంపర్యంగా తాత తండ్రులనుండి వచ్చే రాజ్యసంపదను ఇదివరకు పాండురాజు చేపట్టి ఉండటంచే ఇప్పుడు ధర్మరాజు చేపడితే, తరువాత అతనితనయుడు చేపడతాడు. ఈ విధంగా పాండురాజు వంశంవాళ్ళే రాజ్యార్హులౌతారు. మేము రాజ్యాధికారానికి దూరమైతే క్రమంగా మాకొడుకులు, మనుమలు దూరమౌతారు. ఇకముందు ఇతరులకు సేవలుచేసి మేము బ్రదుకలేము. మాకు అటువంటి గతిపట్టకుండా నీవు చేయగలిగితే పాండురాజు నీపట్ల ఇదివరకు చూపిన భక్తిని, పాండవులపట్ల నీ కున్న దయను మనస్సులో నిలుపవద్దు.

దుర్యోధనుఁడు పాండవులను వారణావతంబునకుఁ బంపు మని తండ్రితోఁ జెప్పుట (సం. 1-130-8)

వ. 'ఈరాజ్యంబు మొదలింటంగోలె భవదీయం బయినది; ప్రకృతిజనులు వశ్యులు గాకున్నను గ్రమాగతంబయి మాకు నప్రయత్నలభ్యంబగుఁ దొల్లి పాండురాజు రా జై గుణంబులం బ్రజానురాగంబు వడయుటంజేసి యెల్లవారును ధర్మరాజురాజ్యంబ వలతురు; దాని నెఱింగియ కాదె యేను నిత్యదానసమ్మానంబులం బ్రకృతిజనంబులకు సంతోషంబు సేయుచునుండుదు; నిందుల దుష్టజనులపక్షపాతవచనంబు లుడుగునంతకు నుపాయంబునఁ గొంతినిఁ బాండవులను దదీయభృత్యామాత్యవర్గంబుతో వారణావతంబునకుం బుత్తము; మనకు రాజ్యంబు సుప్రతిష్ఠితం బైన మఱి వార లిందులకు వత్తు' రనిన దుర్యోధనునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. 129

ప్రతిపదార్థం: ఈ, రాజ్యంబు; మొదలింటన్+కోలె= మొదటినుండి; భవదీయంబు+అయినది= నీదైనది; ప్రకృతి, జనులు= స్వామి, అమాత్య, సుహృత్కోశాదులకు సంబంధించినప్రజలు; వశ్యులు+కాక+ఉన్నను= లోబడినవారు కాకపోయినా; క్రమ+ఆగతంబు+అయి= వరుసగా వచ్చినదై; మాకున్, అప్రయత్న, లభ్యంబు= శ్రమపడకుండా దొరికింది; అగున్= అవుతుంది; తొల్లి= ఇదివరకు; పాండురాజు; రాజు+ఐ; గుణంబులన్= మంచి గుణాలచేత; ప్రజా+అనురాగంబు= ప్రజల యొక్క ప్రేమ; పడయుటన్+చేసి= పొందటంవలన; ఎల్లవారును= అందరూ; ధర్మరాజు, రాజ్యంబు= ధర్మరాజుయొక్క రాజ్యాన్నే, వలతురు= కోరుకొంటారు, దానిన్=దాన్ని; ఎఱింగియు, కాదె= తెలిసికొనేకదా; ఏను= నేను; నిత్య, దాన, సమ్మానం బులన్= ప్రతిదినం దానాలచేతను, గౌరవాలచేతను; ప్రకృతి, జనంబులకున్= స్వామి, అమాత్య, సుహృత్కోశాదులకు సంబంధించిన ప్రజలకు; సంతోషంబు= సంతోషాన్ని; చేయుచున్+ఉండుదున్= కలిగిస్తూఉన్నాను; ఇందుల= ఇచ్చట; దుష్ట, జనుల, పక్షపాత, వచనంబులు= చెడ్డజనులయొక్క పక్షపాతపు మాటలు; ఉడుగు+అంతకున్= మానునంతవరకు; ఉపాయం బునన్= ఉపాయంతో; గొంతినిఁ= కుంతీదేవిని; పాండవులను; తదీయ, భృత్య+అమాత్య, వర్గంబుతో= వారియొక్క సేవకులయొక్క, మంత్రులయొక్క సమూహంతో; వారణావతంబునకున్= వారణావతానికి; పుత్తము= పంపుదాము; మనకున్; రాజ్యంబు= అధికారం; సుప్రతిష్ఠింబు+ఐనన్= బాగుగా స్థిరపడగానే; మఱి=తర్వాత; వారలు= వాళ్లు; ఇందులకున్= ఇక్కడికి; వచ్చుదురు= వస్తారు; అనినన్= అని అనగా; దుర్యోధనునకు; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఈ రాజ్యం మొదటినుండి నీది. నీవు ఒకవేళ స్వామి అమాత్యసుహృత్కోశాదులకు సంబంధించిన వాళ్ళు విధేయులు కాకున్నా, అప్రయత్నంగా రాజ్యం క్రమపద్ధతిలో మా చేతి కందుతుంది. ఇదివరకు పాండురాజు

రాజై తనగుణగణాలచేత ప్రజానురాగం పొందిన కారణంగా అందరూ ధర్మరాజురాజ్యాన్ని కోరుకొంటున్నారు. దాన్ని గ్రహించేకదా నేను ప్రతిదినం దానాలచేత, సమ్మానాలచేత ప్రకృతిజనులను సంతోషపరుస్తున్నాను. ఇచ్చట చెడ్డవాళ్ళ పక్షపాతపుమాటలు ఆగిపోయేంతవరకు కుంతీదేవిని, పాండవులను, వారిసేవకులతో, అమాత్యులతోసహా ఉపాయంతో వారణావతం పంపుదాము. మనకు రాజ్యాధికారం స్థిరపడిన తర్వాత వాళ్ళిక్కడికి వస్తారు' అని దుర్యోధనుడనగా అతనితో ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు.

విశేషం: సప్తప్రకృతులు - స్వామి, అమాత్యుడు, సుహృత్తు, కోశం, రాష్ట్రం, దుర్గం, బలం.

తరువోజ.

'ఏ నెల్లప్రొద్దు నా యెడ లోనఁ దలఁతు నీయభిప్రాయంబ; యిది దారుణంబు
గాన వాకునకుఁ జుల్కన తేరనోపఁ; గడఁగి పాండవుల నేకత మెట్టు లనుప
గా నగు? మఱి దీని గాంగేయవిదురకలశజాశ్వత్థామ గౌతముల్ బుద్ధి
గా నొడంబడుదురె? కా దయ్య!' యనినఁ గౌరవజ్యేష్ఠుండు ఘనుఁ డిట్టు లనియె. 130

ప్రతిపదార్థం: ఏను= నేను; ఎల్ల, ప్రొద్దు= అన్ని వేళలా; నా, ఎడలోనన్= నాహృదయంలో; ఈఅభిప్రాయంబు+అ; తలఁతున్= ఆలోచిస్తాను; ఇది= ఈ అభిప్రాయం; దారుణంబు= భయంకరమైనది; కానన్= అగుటచేత; చుల్కన= సులువుగా; వాకునకున్= మాటకు; తేరన్+ఓపన్= తీసుకొనిరాలేను; కడఁగి= పూని; పాండవులన్; ఏకతము= ఒంటరిగా; ఎట్టుల= ఏ విధంగా; అనుపగాన్+అగున్= పంపటానికి వీలగును; మఱి= ఇక; దీనిన్= దీన్ని; గాంగేయ, విదుర, కలశజ+అశ్వత్థామ, గౌతముల్= భీష్ముడు, విదురుడు, ద్రోణుడు, అశ్వత్థామ, కృపాచార్యుడు; బుద్ధిగాన్= మనస్ఫూర్తిగా; ఒడంబడుదురె= ఒప్పుకొంటారా; కాదు+అయ్య= సాధ్యంకాదయ్యా; అనినన్= అని అనగా; కౌరవ, జ్యేష్ఠుండు= కౌరవులలో పెద్దవాడైన దుర్యోధనుడు; ఘనుఁడు= అసాధ్యుడు; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: 'ఎప్పుడూ నా హృదయంలో ఈ అభిప్రాయమే ఉన్నది. ఇది ఘోరమైనది కనుక సులభంగా పైకి చెప్పలేకున్నాను. ఒంటరిగా పాండవులను పంపటానికి ఏ విధంగా వీలవుతుంది? మరి, దీనికి భీష్మ ద్రోణ విదురాశ్వత్థామకృపులు మనఃపూర్వకంగా అంగీకరిస్తారా? సాధ్యం కాదు' - అని ధృతరాష్ట్రుడనగా తండ్రితో దుర్యోధనుడు ఇట్లా అన్నాడు.

విశేషం: ఇది ధృతరాష్ట్రుని ఆంతర్యాన్ని తెలిపే పద్యం. మొదటిపాదానికి - "ఏను నిక్కార్యంబ(బు) హృదయంబులోన నెప్పుడుఁ జింతింతు నిది దారుణంబు" అనేపాఠాంతరం ఉంది. - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.352. ద్విపదపాదద్వయం తరువోజ ఏకపాదం. లక్షణానికి చూడు - ఆది.2.151.

వ. 'భవదనుజ్ఞాగౌరవంబున గాంగేయాదులు దీనికి నొడంబడుదురు; వారు కౌరవులకెల్ల సము లై యుండియు నావారల; యెట్లనిన; నశ్వత్థామ నా కిష్టుం డగుట నన్నుఁ బాయకుండు; పుత్త్రస్నేహంబున ద్రోణుండును భారద్వాజుని భాగినేయునిం బాయనేరమింజేసి కృపాచార్యుండును నాయొద్దన యుందురు; మఱి భీష్ముండు మధ్యస్థుం డగుటఁ బాండవులం బరిగ్రహింపఁడు; విదురుండు పాండవపక్షపాతి యయ్యును నొక్కరుండు నా కహితంబు

సేయనోపండు; గావున నిక్కార్యంబున దోషంబు లేదు; వినిద్రకరణం బయిన నాహృదయశల్యంబు బాచి న న్నుద్ధరింపు' మని ధృతరాష్ట్రు నెట్టకేలకు నొడంబఱిచి దుర్యోధనుం డప్పుడు. 131

ప్రతిపదార్థం: భవత్+అనుజ్ఞా, గౌరవంబున= నీయొక్క ఆజ్ఞలోని గౌరవంచేత; గాంగేయ+ఆదులు= భీష్ముడు మొదలయిన వాళ్ళు; కౌరవులకు+ఎల్లన్= కురువంశంవాళ్ళందరికీ; సములు+ఐ= సమానమైన భావం కలవాళ్ళయి - అంటే కురువంశం వాళ్ళందరిపట్ల సమభావం కలవాళ్ళయి; ఉండియు; నా, వారలు+అ= నావాళ్ళే; అనినన్; అశ్వత్థామ; నాకు; ఇష్టుండు+అగుటన్= ప్రియమైనవాడు కావటంచేత; నన్నున్; పాయక+ఉండున్= వదలక ఉంటాడు; పుత్ర, స్నేహంబునన్= పుత్రునిమీది ప్రేమచేత; ద్రోణుండును; భారద్వాజుని= ద్రోణుని; భాగినేయునిన్= చెల్లెలిభర్తను; పాయ, నేరమిన్+చేసి= వదలలేకుండటంచేత; కృపాచార్యుండును; నా, ఒద్దన= నా దగ్గరే; ఉందురు; మఱి; భీష్ముండు; మధ్యస్థుండు+అగుటన్= నడుమఉండి రెండువైపుల వారికి పక్షపాతంలేక న్యాయం చెప్పేవాడు కావటంచేత; పాండవులన్; పరిగ్రహింపఁడు= ప్రియంతో తీసుకోడు - అంటే పాండవులవైపు వెళ్ళడు; విదురుండు; పాండవ, పక్షపాతి= పాండవులపట్ల పక్షపాతం కలవాడు; అయ్యును; ఒక్కరుండు; నాకు; అహితంబున్+అ= కీడు; చేయన్, ఓపండు= చేయలేడు; కావునన్, ఈ+కార్యంబునన్= ఈ పనిలో - పాండవులను పంపేపనిలో; దోషంబు= లోపం; లేదు; వినిద్రకరణంబు+అయిన= నిద్రలేనట్లు చేసేదైన; నా, హృదయ, శల్యంబున్= నా గుండెలోని ముల్లును; పాచి= తొలగించి; నన్నున్; ఉద్ధరింపుము= పైకి తెమ్ము; అని; ధృతరాష్ట్రున్; ఎట్టకేలకున్= చిట్టచివరికి; ఒడంబఱిచి= ఒప్పించి; దుర్యోధనుండు; అప్పుడు= అంతట.

తాత్పర్యం: 'మీ ఆజ్ఞమీదిగౌరవంచేత భీష్ముడు, ద్రోణుడు మొదలయినవాళ్ళు దీనికి ఒప్పుకొంటారు. వాళ్ళు కురుపాండవులపట్ల సమభావం కలవాళ్ళే అయినా నావాళ్ళే. ఎ ట్లనగా; అశ్వత్థామ నాకు ఇష్టమైనవాడు. అందుచేత నన్ను వదలిపోడు. కొడకుమీదిప్రేమచేత ద్రోణుడు, చెల్లెలి భర్త అయిన ద్రోణుడిని వదలలేక కృపుడు నా వైపే ఉంటారు. భీష్ముడు మధ్యస్థుడు కనుక పాండవులవైపు వెళ్ళడు. విదురుడు పాండవపక్షపాతియే. కాని ఆత డొక్కడు నాకు కీడు చేయలేడు. అందుచేత ఈ కార్యక్రమంలో ఏ లోపం లేదు. నాకు నిద్రలేకుండా చేసే ఈ గుండెలోని ముల్లును తొలగించి, నన్ను జీవితంలో పైకితీసికొని రమ్ము' - అని చిట్టచివరికి ధృతరాష్ట్రుడిని ఒప్పించి దుర్యోధనుడు.

క. వలను గల మంత్రివరులం । బిలిచి పృథానందనులకుఁ బ్రియముగ మీ రి
మ్ముల వారణావతంబును । వెలయఁగఁ బొగడుండు వారు విని తగుల నెడన్. 132

ప్రతిపదార్థం: వలను, కల= నేర్పుగల; మంత్రివరులన్= మంత్రిశ్రేష్ఠులను; పిలిచి, మీరు; పృథా, నందనులకున్= కుంతీదేవి యొక్కకొడుకులకు; ప్రియముగన్= ఇష్టమయ్యేటట్లు; వారు; విని; ఎడన్= మనస్సులో; తగులన్= ఆశపడేటట్లు; ఇమ్ములన్= ఇంపుగా; వారణావతంబును; వెలయఁగన్= ప్రకాశించేటట్లు - అంటే గొప్పగా; పొగడుండు = ప్రశంసించండి.

తాత్పర్యం: నేర్పరులు, మంచివాళ్ళు అయిన మంత్రులను పిలిచి, 'మీరు పాండవులు వినేటట్లు, విని వాళ్ళు ఆశపడేటట్లు, వారణావతాన్ని గొప్పగా పొగడండి'.

వ. అని పంచిన వారును వారణావతంబు ననవరతసురభికుసుమఫలభారనమ్రశాఖావిశాలతరువనరేఖాలంకృతం బనియును, వనజలకేళీకందుకమృగయాదివివిధవిహారహారిప్రదేశాభిశోభితం బనియును, నవసుధా ధౌతసౌధ సుధాకరనికరప్రభాపటలప్రధ్వంసితాసితపక్షదోషం బనియును, నిరస్తదోషానుషంగమంగళ మహారత్న

రాజివిరాజితవిపులవిపణివీథీవిహసితాలకావిలాసం బనియును, మనోరమానేకసుఖానుభోగ భోగిమహాభాగ జనసమృద్ధం బనియును, బుణ్యనదీప్రవాహశోభితం బనియును వర్ణించి యప్పురంబునంద పాండునందనుల జాతకౌతూహలచిత్తులం జేసి యున్న, గొండొకకాలంబునకు ధృతరాష్ట్రుండు దుర్యోధనదుష్టవచనప్రబోధితుం డయి యొక్కనాఁడు. **133**

ప్రతిపదార్థం: అని, పంచిన= ఆజ్ఞాపించగా; వారును; వారణావతంబున్; అనవరత, సురభి, కుసుమ, ఫల, భార, నమ్ర, శాఖా, విశాల, తరు, వనరేఖా+అలంకృతంబు+అనియును= ఎల్లప్పుడు మంచివాసనగల పూలయొక్క, పండ్లయొక్క బరువుచేత వంగిన కొమ్మలచేత విశాలమైన చెట్లు ఉండే తోపులయొక్క వరుసలచేత అలంకరింపబడిందనీ, వన, జల, కేళీ, కందుక, మృగయా+ఆది, వివిధ, విహార, హారి, ప్రదేశ+అభిశోభితంబు+అనియును= ఉద్యానవనం, జలక్రీడ, చెండ్లాట, వేట మొదలయిన అనేకవిధాలైన క్రీడలకు మనోహరాలైన ప్రదేశాలతో ఒప్పిందనీ; నవ, సుధా, ధౌత, సౌధ సుధాకర, నికర, ప్రభాపటల, ప్రధ్వంసిత+అసిత, పక్షదోషంబు+అనియును= క్రొత్తదైన సున్నంచేత తెల్లగా చేయబడిన మేడలు అనే చంద్రుల సమూహంయొక్క కాంతిసమూహంచేత పూర్తిగా నశింపజేయబడిన కృష్ణపక్షంలోని రాత్రులు కలది అనీ; నిరస్త, దోషా+అనుషంగ, మంగళ, మహత్, రత్న, రాజి, విరాజిత, విపుల, విపణి, వీథీ, విహసిత+అలకా, విలాసంబు+అనియును= తీసివేయబడిన దోషసంబంధం గల శుభాన్ని కూర్చే గొప్పరత్నాలయొక్క సమూహంచేత మిక్కిలి ప్రకాశిస్తున్న విశాలమైన అంగడివీథులచేత ఎగతాళి చేయబడిన అలకాపట్టణంయొక్క శోభకలది అనీ; మనోరమా+అనేక, సుఖ+అనుభోగ, భోగి, మహాభాగ, జన, సమృద్ధంబు+అనియును= మనోహరాలైన పెక్కుసుఖాలయొక్క అనుభవాలను అనుభవించేటి పుణ్యావంతులయిన జనులచేత నిండినట్టిదనీ; పుణ్య,నదీ,ప్రవాహ,శోభితంబు+అనియును= పవిత్రాలైన నదులయొక్క ప్రవాహాలతో ప్రకాశించేది అనీ; వర్ణించి; ఆ+పురంబు+అందు+అ= ఆ నగరమందే; పాండునందనుల= పాండవుల, జాత, కౌతూహల, చిత్తులన్+చేసి= పుట్టిన ఆశ కల మనస్సుకలవాళ్ళనుగా చేసి; ఉన్నన్; కొండొక, కాలంబునకు= కొద్దికాలానికి; ధృతరాష్ట్రుండు; దుర్యోధన, దుష్ట, వచన, ప్రబోధితుండు+అయి= దుర్యోధనునియొక్క చెడు మాటలచేత లెస్సగా తెలుపబడినవాడై; ఒక్కనాఁడు= ఒకదినం.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించగా - ఆ మంత్రులు - వారణావతం ఎల్లప్పుడూ పూలబరువుచేత, పండ్లబరువుచేత వంగిన కొమ్మలుగల పెద్దచెట్లతో - ఉద్యానవనవిహారం, జలక్రీడ, చెండ్లాట, వేట మొదలైన పెక్కుక్రీడలకు తగిన మనోహరప్రదేశాలతో - కృష్ణపక్షరాత్రులను (చీకట్లను) తమ క్రొత్తసున్నపుపూత కాంతులతో పారద్రోలే చంద్రులవంటి పెద్ద మేడలతో - దోషం లేనివి, శుభాన్ని కూర్చేవి, అయిన గొప్ప రత్నాలతో అలకానగర శోభనే అపహాస్యంచేసే పెద్ద అంగడి వీథులతో - అనేకభోగాలను అనుభవించే పుణ్యాత్ములైన ప్రజలతో - పవిత్రనదీ ప్రవాహాలతో ప్రకాశిస్తున్నదనీ, ఆ నగరంమీద పాండవులకు అపరిమితమైన కోరిక కలిగేటట్లు వర్ణించారు. కొద్దికాలం తర్వాత ధృతరాష్ట్రుడు దుర్యోధనుని చెడుమాటలు మనస్సుకు పట్టినవాడై.

విశేషం: అలం: రూపకం, ఉపమ, అంత్యానుప్రాసం, వృత్త్యనుప్రాసం.

ధృతరాష్ట్రుండు పాండవులను వారణావతనగరంబునకుఁ బోవఁ బనుచుట (సం. 1-131-2)

ఉ. పాండుకుమారులం బిలువఁబంచి సుహృన్నివహంబు నొద్ద న
ప్పాండుఁ దలంచి నిర్గళితబాష్పకరాళకపోలయుగ్ముఁ డై
పాండుమహీశుకంటె నతిభక్తుల మి మ్మొకఁ డేను బంచెదం
బాండుయశోఽర్థులార! యిది పథ్యము కాఁగఁ దలంపుఁ డాత్మలోన్. **134**

ప్రతిపదార్థం: పాండు, కుమారులన్; పిలువన్; పంచి= ఆజ్ఞాపించి; సుహృత్+నివహంబు+ఒద్దన్= ఆప్తుల సమూహంయొక్క ఎదుట; ఆ+పాండున్= ఆ పాండురాజును; తలంచి= గుర్తు చేసికొని; నిర్గళిత, బాష్ప, కరాళ, కపోల, యుగ్ముఁడు+ఐ= కారుతున్న కన్నీళ్ళ మిట్టపల్లాలైన చెక్కిళ్ళజంట కలవాడై; పాండు, మహి+ఈశునికంటెన్= పాండురాజుకంటె; అతి, భక్తులన్= మిక్కిలి భక్తి గల వాళ్ళయిన; మిమ్మున్; ఏను= నేను; ఒకఁడు, పంచెదన్= ఒకటి ఆజ్ఞాపిస్తాను; పాండు, యశః+అర్థులారా!= పాండురాజుయొక్క కీర్తిని కోరేవాళ్ళారా! లేదా తెల్లనికీర్తిని కోరేవాళ్ళారా!; ఆత్మలోన్= మనస్సులో; ఇది= నేను ఆజ్ఞాపించునది; పథ్యము, కాఁగన్= చేయదగినది, అయినట్లుగా; తలంపుఁడు= ఆలోచించండి.

తాత్పర్యం: పాండవులను పిలిపించి, ఆప్తులందరి ఎదుట పాండురాజును స్మరించి కన్నీరు నింపుకొని, పాండు రాజుకంటె ఎక్కువ భక్తిగలవాళ్ళయిన మిమ్మల్ని నేనొకటి ఆజ్ఞాపిస్తాను. పాండురాజుకీర్తిని కోరేవాళ్ళారా! ఇది చేయదగినది అని ఆలోచించండి. (లేదా నిర్మలకీర్తిని కోరే మీరు ఇది చేయదగినది అని ఆలోచించండి.)

విశేషం: 'పాండు' శబ్దంలో శ్లేష ఉన్నది. తండ్రికీర్తిని కోరేవాళ్ళు తండ్రి అడుగుజాడలలో నడుస్తారు. అందుచేత ధృతరాష్ట్రుడు - తండ్రికీర్తిని కోరే ఓ పాండవులారా! మీ తండ్రి నా పట్ల భక్తికలవాడు. మీరు కూడా నా పట్ల అతనికంటె ఎక్కువభక్తి కలవాళ్ళు. మీతండ్రి అడుగుజాడలలో నడిచి నేను చెప్పినట్లు అతనివలె మీరుకూడా చేయండనటం. పాండుయశోఽర్థులారా - అనేదాన్ని తెల్లనికీర్తిని కోరేవాళ్ళారా అని అన్వయిస్తే - పెద్దలమాట వినటం కీర్తికరం. కీర్తిని కోరే ఓ పాండవులారా! ఈ పెదతండ్రి చెప్పినట్లు చేయండి అనటం. కీర్తివర్ణం తెలుపు అని కవిసమయం.

క. విదితంబుగఁ బుణ్యామర । నదీ సమీపమున వారణావత నగరం
బది సర్వసుఖాస్పద మని । వదలక వర్ణింతు రెల్లవారును దానిన్. 135

ప్రతిపదార్థం: విదితంబుగన్= ప్రసిద్ధంగా; పుణ్య+అమర, నదీ, సమీపమునన్= పవిత్రమైన గంగానది దగ్గర; వారణావత, నగరంబు; అది= ఆ నగరం; సర్వ, సుఖ+ఆస్పదము+అని= అన్ని సుఖాలకు చోటు అని; ఎల్లవారును= అందరూ; దానిన్= దాన్ని; వదలక; వర్ణింతురు.

తాత్పర్యం: పవిత్రమైన గంగానదీసమీపంలో ప్రసిద్ధమైన వారణావతనగరం సర్వసుఖాలకు స్థానమని అందరూ ప్రశంసిస్తారు.

క. మీరును గుంతియు సహపరి । వారమహామాత్య భృత్యవర్గులరై నా
నారాజ్యలీలతోఁ జని । సారమతిం జేయుఁ డందు సతతోత్సవముల్. 136

ప్రతిపదార్థం: మీరును; కుంతియున్; సహపరివార, మహా+అమాత్య, భృత్య, వర్గులరు+ఐ= పరివారంతోను, మహా మంత్రులతోను; సేవకులసమూహాలతోను కూడినవాళ్ళయి; నానా, రాజ్య, లీలతోన్= పలువిధాలైన రాజ్యవిలాసంతో; చని= వెళ్ళి; అందున్= ఆ నగరంలో; సారమతిన్= మేలిమిబుద్ధితో; సతత+ఉత్సవముల్= ఎడతెగనిపండుగలను; చేయుఁడు= ఆచరించండి.

తాత్పర్యం: మీరూ, కుంతీదేవితో, పరివారంతో, అమాత్యులతో, సేవకులతో కూడి నానావిధరాజ్యవైభవంతో అక్కడకు వెళ్ళి హాయిగా పండుగలను చేసికొనండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. 'పశుపతి నివాసం బయిన యప్పుణ్యస్థానంబునం బాండుహితంబుగా నగణ్యగోహిరణ్యాదిమహాదానంబుల బ్రాహ్మణసంతర్పణంబులు సేసి యందుఁ గొండొకకాలం బుండి వచ్చునది' యని పంచిన వల్లె యని పాండవులు గాంధారీధృతరాష్ట్రులకు మ్రొక్కి వీడ్కొని, దుర్యోధనాదుల నందఱం బ్రియపూర్వకంబుగా సంభావించి, భీష్మద్రోణవిదురకృపాదులకు మ్రొక్కి యనేకవృద్ధబ్రాహ్మణులకు నమస్కారంబు సేసి వారలవలన దీర్ఘాయురారోగ్య స్వస్తివచనంబులతోఁ బునర్దర్శనం బయ్యెడ మని దీవనలు సేకొనుచు జననీసహితంబుగా వారణావతంబునకు గమనోన్ముఖు లయినంత. 137

ప్రతిపదార్థం: పశుపతి, నివాసంబు+అయిన= శివునియొక్క ఉనికిపట్టయిన; ఆ+పుణ్య, స్థానంబునన్; పాండు, హితంబుగాన్= పాండురాజుకు ఇష్టమయ్యేటట్లుగా; అగణ్య, గో హిరణ్య+ఆది, మహా, దానంబులన్= లెక్క లేనన్ని గోవులు బంగారం మొదలైన మహాదానాలచేత; బ్రాహ్మణ, సంతర్పణంబులు= బ్రాహ్మణులను బాగుగా తృప్తిపరచటం; చేసి; అందున్= ఆ వారణావత నగరంలో; కొండొక; కాలంబు= కొద్దికాలం; ఉండి; వచ్చునది= రండు; అని, పంచినన్= ఆజ్ఞాపించగా; వల్లె; అని= సరే అని; పాండవులు; గాంధారీ, ధృతరాష్ట్రులకున్= గాంధారీధృతరాష్ట్రులకు, మ్రొక్కి= నమస్కరించి; వీడ్కొని= సెలవుతీసికొని; దుర్యోధన+ఆదులన్= దుర్యోధనుడు మొదలయినవాళ్ళను; అందరన్= అందరిని; ప్రియ పూర్వకంబుగా= సంతోషపూర్వకంగా; సంభావించి= సమ్మానించి; భీష్మ, ద్రోణ, విదుర, కృప+ఆదులకు= భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, కృపుడు మొదలయినవారికి; మ్రొక్కి; అనేక, వృద్ధ, బ్రాహ్మణులకు; నమస్కారంబు, చేసి; వారలవలనన్= వారివల్ల; దీర్ఘ+ఆయుః +ఆరోగ్య, స్వస్తి, వచనంబులతోన్= నిడుపైన-అంటే ఎక్కువైన -ఆయుష్యం, ఆరోగ్యం, శుభం కలుగుతుందనే మాటలతో; పునః+దర్శనంబు= మరలచూడటం; అయ్యెడము+అని= అగునుగాక అని; దీవనలు= ఆశీస్సులు; చేకొనుచున్= తీసికొంటూ; జననీ సహితంబుగా= తల్లితోకూడా; వారణావతంబునకు; గమన+ఉన్ముఖులు+అయినన్= పోవటానికి పూనుకొన్నవాళ్ళు కాగా; అంతన్= తర్వాత.

తాత్పర్యం: 'శివుని నివాసస్థానమైన ఆ పవిత్రస్థలంలో పాండురాజుకు ప్రీతిగా అనేక గోదానాలు; సువర్ణదానాలు మొదలయిన మహాదానాలు చేసి, బ్రాహ్మణులను తృప్తిపరుస్తూ, కొద్దికాలం ఉండి తిరిగిరం' డని ఆజ్ఞాపించగా, పాండవులు అందుకు అంగీకరించి గాంధారీధృతరాష్ట్రులకు మ్రొక్కి, వారిదగ్గర సెలవు తీసికొని దుర్యోధనాదు లందరిని సంతోషపూర్వకంగా సమ్మానించి, పెక్కుమంది వృద్ధబ్రాహ్మణులకు నమస్కారాలుచేసి, వారివలన దీర్ఘఆయురారోగ్యశుభాలు కలిగేట్లు ఆశీర్వచనాలు పొంది, తల్లితోకూడ వారణావతానికి పోవటానికి పూనుకోగా - తరువాత.

విశేషం: భీష్మద్రోణవిదురాదులకు మ్రొక్కి - అనేదానికి "విదుర సోమదత్త బాహ్లిక కురువృద్ధులకున్ ద్రోణకృపాచార్యాది బ్రాహ్మణసమూహంబునకుఁ బ్రియపూర్వకంబుగా మ్రొక్కి" - విదురసోమదత్తబాహ్లికకురువృద్ధులకు ద్రోణకృపాచార్యాశ్వత్థామాది బ్రాహ్మణసమూహంబునకు ప్రియపూర్వకంబుగా నమస్కరించి - అనే పాఠాంతరాలున్నాయి. - శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పుట. 354.

దుర్యోధనుఁడు లాక్షాగృహనిర్మాణమునకై పురోచనుని వారణావతంబునకుఁ బంపుట (సం.1-132-2)

క. తనవగచినకార్యము దొర । కొనుటకు ధృతరాష్ట్రపుత్త్రకుఁడు పొంగి పురో
చనుఁ బిలిపించి రహస్యం । బున వానికిఁ గరమునెయ్యమున ని ట్లనియెన్. 138

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర, పుత్త్రకుఁడు= ధృతరాష్ట్రునియొక్క ప్రియపుత్రుడు - దుర్యోధనుడు; తనవగచిన, కార్యము= తనయొక్కతలచినపని; దొరకొనుటకు= ఈడేరటానికి - ఫలించినందుకు; పొంగి= సంతోషించి; పురోచనున్= పురోచనుణ్ణి; పిలిపించి; రహస్యంబునన్= గోప్యంగా; వానికిన్= అతనికి; కరము= మిక్కిలి; నెయ్యమునన్= స్నేహంతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దుర్యోధనుడు తాను తలంచినపని ఫలించినందుకు సంతోషించి, పురోచనుడిని పిలిపించి రహస్యంగా అతనితో మిక్కిలిస్నేహంగా ఇట్లా అన్నాడు.

తరలము.

అలఘుతేజుల వారణావత మన్పురంబునఁ బాండవే
యులఁ బ్రియంబున నుండఁబంచె గుణోన్నతుండు కురుప్రభుం;
డలయ కిప్పడు నీవు మున్ చని యందు వారికి నుండఁగా
నిలయముల్ రచియింపు నీదగునేర్పుఁ జూతము చెచ్చెరన్. **139**

ప్రతిపదార్థం: గుణ+ఉన్నతుండు= మంచిగుణాలచేత గొప్పవాడైన; కురు, ప్రభుండు= కురురాజు - ధృతరాష్ట్రుడు; అలఘు, తేజులు= తక్కువకాని కాంతిగలవాళ్ళయిన; పాండవేయులన్= పాండవులను; వారణావతము+అన్+పురంబునన్; ప్రియంబునన్= ప్రేమతో; ఉండన్= ఉండటానికి; పంచెన్= ఆజ్ఞాపించాడు; అలయక= విసుగుకోకుండ; నీవు; మున్= ముందు; చని= వెళ్ళి; అందున్= అక్కడ - అంటే వారణావతంలో; వారికిన్= పాండవులకు; ఉండఁగాన్= ఉండటానికి; నిలయముల్= ఇండ్లు; చెర+చెరన్= వెంటనే; రచియింపు= నిర్మించు; నీది+అగు; నేర్పున్; చూతము= నీ నైపుణ్యాన్ని చూద్దాము.

తాత్పర్యం: గొప్పగుణవంతుడైన ధృతరాష్ట్రమహారాజు తేజోవంతులైన పాండవులను ప్రేమతో వారణావతమనే నగరంలో నివసించటానికి ఆజ్ఞాపించాడు. నీవు విసుగుకోకుండ వెంటనే వాళ్ళకు అక్కడ ఇండ్లు నిర్మించుము. నీ నేర్పు చూద్దాం. తరలము లేక తరళము అనగా చలించునది, ప్రకాశించునది. చంచలమైన ధృతరాష్ట్రుని మనస్సు దుర్యోధనుని దుర్బుద్ధికి లొంగి పాండవులను వారణావతానికి తరలించే తరుణంలో ఈ తరలము ప్రయుక్తం. దివ్యప్రకాశం ఎక్కడ ఉన్నా అది మణియై శోభిస్తుంది. హారంవంటి పాండవుల ఔజ్జ్వల్యం సర్వప్రకాశనిలయం.

విశేషం: తరలంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, భ, ర, స, జ, జ, గ అనే గణాలుంటాయి. 12వ అక్షరం యతి.

వ. **నాకుం బరమవిశ్వాసివి నీ వొక్కరుండవ; యిది యనన్యవిషయం బయిన కార్యంబు; కావున నీవ దీనిం జేయవలయు; వాయుజవంబు లయిన వేసడంబులఁ బూనిన యరదం బెక్కి, నేఁడ చని వారణావతంబున లాక్షాసర్జకరసమిశ్రం బై ఘృతతైలార్ద్రంబయిన మృత్తికాపుంజంబున నొక్క చతుశ్శాల విశాలంబుగా నాయుధశాల సమీపంబున మనోహరంబుగా నవిరళసుధాధవళితంబుగా నిర్మించి యందుఁ బాండవుల నునిచి వార లేమఱి నమ్మి కొండొకకాలం బుండ, ని న్నోరు లెఱుంగకుండ నిమ్మయినయవసరంబునం దద్గృహద్వారంబునందు ఘోరానలంబు దరికొలిపి పగఱ పంచత్వం బెఱింగి రమ్ము.** **140**

ప్రతిపదార్థం: నాకున్; పరమవిశ్వాసివి= మిక్కిలి నమ్మదగినవాడివి; నీవు+ఒక్కరుండవు+అ= నీవొక్కడివే; ఇది= ఈపని; అనన్య, విషయంబు+అయిన= ఇతరులకు గోచరం కానిదైన; కార్యంబు= పని; కావునన్; నీవు+అ= నీవే; దీనిన్; చేయవలయు; వాయు, జవంబులు+అయిన= గాలివేగంతో సమానమైన వేగం గలవైన; వేసడంబులన్= కంచరగాడిదలను; పూనిన= తాల్చిన; అరదంబు= రథం; ఎక్కి; నేఁడు+అ= ఈ రోజే; చని= వెళ్ళి; వారణావతంబునన్; లాక్షా, సర్జక, రస, మిశ్రంబు+ఐ= లక్క, మద్దిచెట్టుబంక కలసిందై; ఘృత, తైల+ఆర్ద్రంబు+అయిన= నెయ్యితోను, నూనెతోను తడిసిందైన; మృత్తికా, పుంజంబునన్= మట్టికుప్పచేత; ఒక్క, చతుశ్శాలన్= ఒక నాలుగిండ్ల భవంతిని; విశాలంబుగాన్= విడిదికలదిగా; ఆయుధశాల, సమీపంబునన్= ఆయుధాలుండే మేడకు దగ్గరగా; మనోహరంబుగాన్= మనస్సు ఆకర్షించేటట్లు; అవిరళ, సుధా, ధవళితంబుగాన్= దట్టమైన సున్నంచే తెల్లగా చేయబడిందిగా, నిర్మించి; అందున్; పాండవులన్; ఉనిచి; వారలు; ఏమఱి= (అజాగ్రత్తగా) మరచి; నమ్మి; కొండొక, కాలంబు= కొద్దికాలం; ఉండన్= ఉండగా; ఇమ్ము+అయిన= అనుకూలమయిన; అవసరంబునన్= సమయంలో; తత్+గృహ, ద్వారంబు, అందున్= ఆ యింటియొక్కవాకిట్లో; ఘోర+అనలంబు= భయంకరమైన నిప్పును; దరికొలిపి= మండించి; పగఱ, పంచత్వంబు= శత్రువులయొక్కచావును; ఎఱింగి= తెలిసికొని; రమ్ము.

తాత్పర్యం: నీవు నాకు మిక్కిలి నమ్మదగినవాడివి. ఇది ఇతరులకు సాధ్యం కాని పని. అందుచేత నీవే చేయాలి. వాయువేగంతో సమానమైన వేగం కలిగిన కంచరగాడిదలు పూనినరథం ఎక్కి ఈ రోజే వారణావతం వెళ్ళి అక్కడ లక్క, మద్దిబంక కలిపిన నేతితో, నూనెతో తడిపినమట్టితో ఒక నాలుగిండ్ల భవంతిని ఆయుధశాల దగ్గర మనోహరంగా దట్టమైన సున్నంకొట్టి తెల్లగా నిర్మించి, అందులో పాండవులను ఉంచి, వాళ్ళు ఏమరుపాటున నమ్మి కొంతకాలం ఉన్న తర్వాత, ఆ యింటి వాకిటికి నిప్పుపెట్టి, శత్రువులైన పాండవుల చావును తెలిసికొని రమ్ము.

క. ఈ కార్య సిద్ధి యగుడును । నీ కతమున నఖిల ధారుణీ రాజ్యము నా
కేకాధిష్ఠిత మగు నిది । నీకును నిత్యోపభోగనిలయమ కాదే. 141

ప్రతిపదార్థం: ఈకార్యసిద్ధి= ఈ పనియొక్క సఫలత; అగుడును= అయితే, అయినవెంటనే; నీ కతమునన్= నీ కారణాన; అఖిల, ధారుణీ, రాజ్యము= మొత్తం భూమిమీద అధికారం; నాకున్; ఏక+అధిష్ఠితము= ఒకనిచేతనే పొందబడింది; అగున్= అవుతుంది; ఇది= ఈ పని; నీకును= నీకు కూడా, నిత్య+ఉపభోగ, నిలయము+అ= శాశ్వతమైన సుఖాలకు స్థానం; కాదే= కాదా.

తాత్పర్యం: ఈ పని సఫలమైతే నీ కారణంగా సమస్తరాజ్యాధికారం నా చేతికి వస్తుంది. ఈ విధంగా జరిగితే నీవు శాశ్వతసుఖాలను అనుభవించవచ్చునుగదా!

వారణావతప్రస్థానము - విదురోపదేశము (సం. 1-133-4)

వ. అని పంచినం బురోచనుం డతిత్వరితగతి నరిగి దుర్యోధను కఱపిన రూపున వారణావతంబున లాక్షాగృహంబు రచియించుచుండె; నిట యుధిష్ఠిరభీమార్జునయములుం గ్రమంబునం దొల్లి షోడశపంచదశ చతుర్దశత్రయోదశవర్షజాతు లయి శతశృంగంబున నుండి హస్తిపురంబునకు వచ్చి యందుఁ గౌరవులం గలసి యస్త్ర విద్యలం గఱచుచుం బదమూడేం డ్లుండి, యపుడు ధృతరాష్ట్రునియోగంబున వారణావతంబునకు జననీ సహితంబుగాఁ బోవ సమకట్టి మహాజవసత్త్వసమేతంబు లయిన హయంబులం బూనిన రథంబు లెక్కి ధనుర్ధరు లయి హస్తిపురంబు వెలువడు నపు డప్పురంబునం గల బ్రాహ్మణక్షత్రియప్రముఖానేక జనంబులు శోక సంతప్తహృదయు లయి. 142

ప్రతిపదార్థం: అని; పంచినన్= ఆజ్ఞాపించగా; పురోచనుండు; అతి, త్వరిత, గతిన్= మిక్కిలి వేగంతో గూడిన విధంగా; అరిగి= వెళ్ళి; దుర్యోధను, కఱపిన, రూపునన్= దుర్యోధనుడు చెప్పినవిధంగా; వారణావతంబునన్; లాక్షాగృహంబు= లక్క ఇల్లు; రచియించుచున్+ఉండెన్= నిర్మిస్తూ ఉన్నాడు; ఇట; యుధిష్ఠిర, భీమ+అర్జున, యములున్= ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులసహదేవులు; క్రమంబునన్= వరుసగా; తొల్లి= పూర్వం; షోడశ, పంచదశ, చతుర్దశ, త్రయోదశ, వర్ష, జాతులు+అయి= పదహారు, పదిహేను, పధ్నాలుగు, పదమూడు సంవత్సరాల పుట్టుక (వయస్సు) కలవాళ్ళయి; శతశృంగం బుననుండి= శతశృంగపర్వతంనుండి; హస్తి, పురంబునకున్= హస్తినాపురానికి; వచ్చి; అందున్= ఆ హస్తినాపురంలో; కౌరవులన్+కలిసి= కౌరవులతో కలిసి; అస్త్రవిద్యలన్; కఱచుచున్= నేర్చుకొంటూ; పదమూడు+ఏండ్లు+ఉండి; అప్పుడు; ధృతరాష్ట్రు, నియోగంబునన్= ధృతరాష్ట్రునియొక్క ఆజ్ఞచేత; వారణావతంబునకున్; జననీసహితంబుగాన్= తల్లితోకూడ; పోవన్= పోవటానికి; సమకట్టి= పూనుకొని; మహా, జవ, సత్త్వ, సమేతంబులు+అయిన= గొప్పవేగంతో, బలంతో కూడుకొనిన వైన; హయంబులన్= గుఱ్ఱాలను; పూనిన= ఏర్పాటుచేసిన; రథంబులు; ఎక్కి; ధనుః+ధరులు+అయి= విండ్లను చేపట్టినవాళ్ళయి; హస్తి, పురంబు= హస్తినాపురం; వెలువడునపుడు= వెలువడే సమయంలో; ఆ+పురంబునన్= ఆ నగరంలో; కల= ఉన్న; బ్రాహ్మణ; క్షత్త్రియ, ప్రముఖ+అనేక, జనంబులు= బ్రాహ్మణులు; క్షత్రియులు; మొదలయిన పెక్కుమంది ప్రజలు; శోకసంతప్తహృదయులు+అయి= దుఃఖంచేత మిక్కిలి కాల్పబడిన మనస్సులు కలవాళ్ళయి.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించగా, పురోచనుడు మిక్కిలి వేగంగా వెళ్ళి, దుర్యోధనుడు చెప్పినట్లు వారణావతంలో లక్కఇల్లు నిర్మిస్తూ ఉన్నాడు. ఇక్కడ క్రమంగా పదహారు, పదిహేను, పధ్నాలుగు, పదమూడుసంవత్సరాల వయస్సు కల ధర్మజభీమార్జుననకులసహదేవులు శతశృంగపర్వతంనుండి హస్తినకు వచ్చి, కౌరవులతో కలిసి అస్త్రవిద్యలు నేర్చుకొంటూ పదమూడేండ్లు ఉండి, ధృతరాష్ట్రుని ఆజ్ఞప్రకారం తల్లితోకూడ వారణావతానికి పోవ సమకట్టి, గొప్పవేగం, బలంగల గుఱ్ఱాలు పూనినరథాలెక్కి, చేత ధనుస్సులు ధరించి, హస్తిపురం వెలువడేటప్పుడు ఆ పురంలోని బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలయినవాళ్ళంతా మిక్కిలి దుఃఖంతో;

విశేషం: వారణావతానికి వెళ్ళేనాటికి ధర్మరాజు వయస్సు 29 సంవత్సరాలు - భీమునిది 28 సంవత్సరాలు - అర్జుననిది 27 సంవత్సరాలు - నకులసహదేవులది (కవలలు) 26 సంవత్సరాలు.

సీ. **'ఇప్పాండుపుత్త్రుల నేలకో ధృతరాష్ట్రు । డేకత మనుపంగ నిచ్చగించె;**
నిది యధర్మం బని యెఱిఁగి గాంగేయాదు । లేల వారింపరో యెఱుఁగరొక్కొ;
పితృపితామహులచే భృతపూర్వమై క్రమా । గత మైన రాజ్యంబుఁ గరము నెమ్మిఁ
బాండుసుతజ్యేష్ఠు భరతకులశ్రేష్ఠు । ధర్మజుఁ బూన్పక ధర్ము వుడిపి

ఆ. **యేల వృద్ధరాజు లెడసేసిరో; పార్థుఁ దరుగు నెడక మనము నరిగి యతని**
యున్న చోన ప్రీతి నుండుద; మిం దుండ । నేల?' యనుచుఁ బౌరు లెల్లఁ దెరలి. 143

ప్రతిపదార్థం: పౌరులు+ఎల్లన్= హస్తినాపుర ప్రజలంతా; ఈ+పాండు, పుత్త్రులన్= ఈ పాండురాజు కుమారులను, పాండవులను; ఏల+ఒకో= ఎందుచేతనోగదా!; ధృతరాష్ట్రుఁడు; ఏకతము= ఒంటరులను చేసి, వేరుచేసి, ప్రత్యేకంగా; అనుపంగన్= పంపటానికి; ఇచ్చగించెన్= ఇష్టపడ్డాడు; ఇది= ఈ పని; అధర్మంబు; అని; ఎఱిఁగి= తెలిసి; గాంగేయ+ఆదులు= భీష్ముడు మొదలయినవాళ్ళు; ఏల= ఎందుచేత; వారింపరో= అడ్డగించరో; ఎఱుఁగరు+ఒక్కొ= వారికి తెలియదేమొ! పితృ, పితామహులచే=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తండ్రితాతలచేత; భృత, పూర్వము+ఐ= ముందు భరింపబడినదై; క్రమ+ఆగతము+ఐన= వరుసగా వచ్చేదైన; రాజ్యంబునన్; కరము= మిక్కిలి; నెమ్మిన్= ప్రీతితో; పాండు, సుత, జ్యేష్ఠున్= పాండురాజు కుమారులలో పెద్దవాణ్ణి; భరతకుల, శ్రేష్ఠున్= భరతునియొక్క వంశంలో శ్రేష్ఠుణ్ణి; ధర్మజున్= ధర్మరాజును; పూన్పక= వహించేట్లు చేయక; ధర్మువు+ఉడిపి= ధర్మాన్ని తొలగించి; వృద్ధ, రాజులు; ఏల= ఎందుకు; ఎడ= దూరము; చేసిరో; పార్థుఁడు= పృథ - అంటే కుంతి-కనుక కుంతీతనయు డైన ధర్మరాజు; అరుగు+ఎడకు+అ= వెళ్ళేచోటికే; మనమున్= మనంకూడ; అరిగి=పోయి; అతని, ఉన్న చోన= ఆయన ఉండే చోటనే; ప్రీతిన్, ఉండుదము= ప్రీతితో ఉందాము; ఇందున్= ఈ హస్తినలో; ఉండన్+ఏల= ఉండటమెందుకు; అనుచున్= అంటూ; తెరలి= కదలి.

తాత్పర్యం: 'ఈ పాండవులను ఎందుచేతనో ధృతరాష్ట్రుడు తన ఆలోచనతో హస్తిననుండి ఒంటరులుగా చేసి పంపివేయాలనుకొన్నాడు. ఇది అధర్మమని తెలిసికూడా భీష్ముడూ మొదలయినవాళ్ళు ఎందుచేత అడ్డగించలేదో? తండ్రితాతలనుండి వరుసగా వచ్చిన రాజ్యాన్ని - పాండుపుత్రులలో పెద్దవాడూ, భరతవంశంలో శ్రేష్ఠుడూ అయిన ధర్మరాజు ధరించేటట్లు చేయక, ధర్మం తప్పి ఎందుచేత వృద్ధరాజులు అతణ్ణి దూరం చేశారో? ధర్మరాజు వెళ్ళే చోటికే మనంగూడా వెళ్ళుదాము. అతడున్న చోటనే మనంగూడా ప్రీతితో ఉందాం. ఈ హస్తినలో ఉండట మెందుకు' అని పౌరులందరూ బయలుదేరారు.

వ. తన పిఱుందన వచ్చువారిం బ్రియపూర్వకంబున నూరార్చి 'పితృవచనంబు సేయకునికి ధర్మవిరుద్ధంబు గావున వారణావతంబునకుం బోయి వచ్చెద' మని యందఱం గ్రమ్మఱించి, చనుచున్న ధర్మనందను పిఱుంద నొక్కింతనేల యరిగి, విదురుం డొరులు వినియును నెఱుంగరాని వచనంబుల బహుప్రకారవచనరచనా విశారదుం డైన యుధిష్ఠిరున కెల్ల కార్యంబులు గఱపి, కొడుకులం గౌఁగిలించుకొని, కుంతీదేవికి మ్రొక్కి పాండురాజుం దలంచి బాష్పపూరితనయనుం డై క్రమ్మఱి చనియె; నిట కుంతియు ధర్మరాజు డాయ వచ్చి యి ట్లనియె. 144

ప్రతిపదార్థం: తన, పిఱుందన్= తనవెంట; వచ్చు వారిన్ = వచ్చేవాళ్లను; ప్రియ, పూర్వకంబునన్= స్నేహం మొదలుగా - అంటే స్నేహంతో; ఊరార్చి= ఊరడించి; పితృ, వచనంబు= తండ్రియొక్క మాట; చేయక+ఉనికి= పాటించకుండటం; ధర్మ విరుద్ధంబు= ధర్మానికి వ్యతిరేకం; కావునన్; వారణావతంబునకున్= వారణావతానికి; పోయి= పోయి; వచ్చెదము= వస్తాము; అని; అందరన్= అందరినీ; క్రమ్మరించి= మరలించి; చనుచున్+ఉన్న= వెళ్ళుతున్న; ధర్మనందను, పిఱుందన్= ధర్మరాజుయొక్క వెనుక; ఒక్కింత, నేల, అరిగి= కొద్దిదూరం వెళ్ళి; విదురుండు; ఒరులు= ఇతరులు; వినియును= వినికూడా; ఎఱుంగరాని= తెలిసికొనటానికి సాధ్యంగాని; వచనంబులన్= మాటలతో; బహు, ప్రకార, వచన, రచనా, విశారదుండు+ఐన= పలువిధాలైన మాటలను కూర్చటంలో పండితుడైన; యుధిష్ఠిరునకున్= ధర్మరాజుకు; ఎల్ల కార్యంబులు= అన్ని చేయదగ్గ పనులను; కఱపి= బోధించి; కొడుకులన్= కుమారుల్ని; కౌఁగిలించుకొని; కుంతీదేవికిన్= కుంతికి; మ్రొక్కి= నమస్కరించి; పాండురాజున్= పాండురాజును; తలంచి= గుర్తుచేసికొని; బాష్ప, పూరిత, నయనుండు+ఐ= కన్నీళ్ళతో నిండిన కన్నులు కలవాడై; క్రమ్మఱి= మరలి; చనియెన్= వెళ్ళాడు; ఇట= ఇచ్చట; కుంతియున్= కుంతీదేవియు; ధర్మరాజున్, డాయ, వచ్చి= ధర్మరాజు సమీపానికి వచ్చి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: తన వెంట వచ్చేవాళ్ళను స్నేహపూర్వకంగా ఓదార్చి 'తండ్రిమాట పాటించకపోవటం ధర్మవిరుద్ధమనీ, అందుచేత వారణావతం పోయివస్తా' మనీ చెప్పి వాళ్ళందరినీ వెనుకకు పంపి, వెళ్ళుతున్న ధర్మరాజువెంబడి - విదురుడు కొద్దిదూరం వెళ్ళి, ఇతరులు విన్నా వాళ్ళకు అర్థంగాని మాటలతో మాటనేర్పరి అయిన ధర్మరాజుకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వారణావతాన చేయదగిన పనులన్నింటినీ బోధించి, పాండవులను కౌగిలించుకొని, కుంతీదేవికి మ్రొక్కి, పాండురాజును స్మరించి కన్నీళ్ళు నించి, వెనుదిరిగి వెళ్ళాడు. తరువాత కుంతీదేవి ధర్మరాజుకు దగ్గరగా వచ్చి ఇలా అన్నది.

తే. విదురుఁ డేతెంచి యొరులకు వినియు నెఱుఁగఁ గానియ ట్లుండఁ బలికి నిన్ గఱపె బుద్ధి;
నట్ల చేయుదు నంటి వీ; వతని మతము । సెప్పనగునేని యెఱుఁగంగఁ జెప్పు మయ్య! 145

ప్రతిపదార్థం: విదురుఁడు; ఏతెంచి= వచ్చి; ఒరులకున్= ఇతరులకు; వినియున్= విని కూడా; ఎఱుఁగన్+కాని= అర్థంకాని; అట్లు+ఉండన్= ఆ విధంగా ఉండేటట్లు; పలికి; బుద్ధిన్= తెలివిని - సలహాను; నిన్+కఱపెన్= నీకు చెప్పాడు; నీవు; అట్లు= ఆ విధంగానే; చేయుదున్= చేస్తాను; అంటి=అన్నావు; అతని, మతము= అతనియొక్క (విదురునియొక్క) అభిప్రాయం; చెప్పన్+అగున్+ఏని= చెప్పదగిందైతే; నీవు; ఎఱుఁగంగన్= తెలిసేటట్లు; చెప్పుము+అయ్య= చెప్పుము నాయనా!

తాత్పర్యం: విదురుడు వచ్చి ఇతరులు విన్నా అర్థంకాని విధంగా నీకు సలహా చెప్పాడు. నీవుకూడా చెప్పినట్లుగానే చేస్తానని అతనితో అన్నావు. చెప్పదగిందైతే అతనిఅభిప్రాయం నాకు తెలియజెప్పుము.

వ. అనిన నగుచు ధర్మతనయుండు విదురువచనంబుల యభిప్రాయంబులు దల్లి కి ట్లని చెప్పె. 146

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; నగుచున్= నవ్వుతూ; ధర్మతనయుండు= ధర్మరాజు; విదురు+వచనంబుల+ అభిప్రాయంబులు= విదురుని మాటలలోని అభిప్రాయాలు; తల్లికిన్= తల్లి కుంతీదేవికి; ఇట్లు+అని+చెప్పెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అనగా ధర్మరాజు నవ్వుతూ విదురునిమాటలలోని తాత్పర్యాన్ని తల్లికి ఈ విధంగా చెప్పాడు.

ఆ. ఎల్లకార్యగతులు నెఱుఁగుదు; రయినను । నెఱుఁగఁ జెప్పవలయు నెఱిఁగినంత;
పనియులేక మిమ్ముఁ బనిచిన కురుపతి । హితుఁడపోలె మీఁద నెగ్గు సేయు. 147

ప్రతిపదార్థం: ఎల్ల, కార్య గతులున్= అన్ని పనుల విధాలు; ఎఱుఁగుదురు= మీకు తెలియును; అయినను= అయినప్పటికి; ఎఱిఁగిన+అంత= తెలిసినంతవరకు; ఎఱుఁగన్+చెప్పవలయున్= తెలియచెప్పాలి; పనియు; లేక= ఏ పనిగూడ లేకుండ; మిమ్మున్; పనిచిన= పంపిన; కురు, పతి= ధృతరాష్ట్రుడు; హితుఁడపోలెన్= మేలు చేసేవానివలె ఉండి; మీఁదన్= తర్వాత; ఎగ్గు= కీడు; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: చేయదగిన పనుల పద్ధతులన్నింటిని మీ రెరుగుదురు. అయినా నాకు తెలిసినంతవరకూ మీకు తెలియచెప్పాలి. ఏ పనీ లేకుండా మిమ్ములను వారణావతం పంపించే ధృతరాష్ట్రుడు మీకు మేలు చేసేవాడివలె ఉండి, తర్వాత కీడు చేస్తాడు.

వ. 'కావున మీర లేమఱక విషాగ్నులవలన నప్రమత్తుల రై యెఱుక గలిగి యుండునది' యని బుద్ధిగఱపి మఱియు' దుర్యోధనుచేసెడు దుష్క్రియ లిమ్ముగా నెఱింగి వానికిం బ్రతీకారంబు సెప్పి పుత్తెంచెద ననియె' నని చెప్పిన విని, విదురుబుద్ధికిఁ దమవలని నెయ్యంబునకు సంతసిల్లుచునిట్లు బాండవులు కతిపయప్రయాణంబుల వారణావతంబున కరుగునంత. 148

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; మీరలు= మీరు; ఏమఱక= ఏమరుపాటు లేక; విష+అగ్నులవలనన్= విషంవలనను, అగ్నివలనను; అప్రమత్తులరు+ఐ= ఏమరుపాటు లేనివాళ్ళయి; ఎఱుక= తెలివి; కలిగి ఉండునది= కలిగి ఉండండి అని; బుద్ధి, కఱపి= సలహా చెప్పి; మఱియున్= ఇంకా; దుర్యోధను, చేసెడు, దుష్క్రియలు= దుర్యోధనునియొక్క చేస్తున్న చెడ్డపనులు - అంటే దుర్యోధనునిచెడ్డపనులు; ఎఱింగి= తెలిసికొని; వానికిన్= ఆ చెడ్డ పనులకు; ప్రతీకారంబు= విరుగుడు; చెప్పి; పుత్తెంచెదన్= పంపిస్తాను; అనియెన్= అని; చెప్పినన్= ధర్మరాజు చెప్పగా; విని; విదురు, బుద్ధికిన్= విదురునియొక్క సలహాకు; తమ, వలని= తమవైపు ఉన్న; నెయ్యంబునకున్= స్నేహానికి; సంతసిల్లుచున్= సంతోషిస్తూ; ఇట్లు; పాండవులు; కతిపయ, ప్రయాణంబులన్= కొన్నిరోజులప్రయాణాలతో; వారణావతంబునకున్+అరుగు+అంత= వారణావతానికి వెళ్ళినతర్వాత.

తాత్పర్యం: 'అందుచేత మీరు ఏమరుపాటు లేకుండా విషంవల్ల, అగ్నివల్ల కలిగే ప్రమాదాల విషయంలో జాగరూకులై ఉండుండని సలహా చెప్పి, దుర్యోధనుడు చేసే చెడుపనులు తెలిసికొని, ఆ చెడుపనులకు విరుగుడులుకూడా చెప్పి పంపిస్తానని విదురు డన్నా' డని ధర్మరాజు చెప్పగా - కుంతీదేవి, పాండవులు విదురుడు చెప్పిన సలహాకు, అతనికి తమపట్ల ఉండే స్నేహభావానికి సంతోషిస్తూ కొన్నిరోజులు ప్రయాణంచేసి వారణావతానికి చేరుకొన్న తర్వాత.

పాండవులు జననీసహితంబుగా వారణావతంబుఁ జేరుట (సం. 1-134-1)

సీ. **వారణావతమునవా రెల్లఁ బాండవా । గమనంబు విని సంతసమునఁ బెరిఁగి**
కరమొప్పఁ గరిరథతురగబలాఢ్యు లై । యెదురు వచ్చిరి మహాముదముతోడఁ;
గలయంగ గృహములఁ గలువడములు గడు - విలసిల్లె నంబరతలము గప్పి
మలయజమృగమదావిలసలిలంబుల । నిమ్ముగా నార్ద్రీకృతమ్ము లయిన

తే. **యంగణముల నొప్పెఁ గర్పూరరంగవల్లు । లంగనలు గయిసేసి యుత్తుంగహర్మ్య**
తలము లెక్కిరి తత్పురీవిలసంబుఁ । జూచు పాండుకుమారులఁ జూచువేడ్క. **149**

ప్రతిపదార్థం: పాండవ+ఆగమనంబు= పాండవులయొక్క రాక; విని; వారణావతమున, వారు+ఎల్లన్= వారణావతంలోని జనులంతా; సంతసమునన్= సంతోషంతో; పెరిగి= ఉబ్బి; కరము= మిక్కిలి; ఒప్పన్= అందంగా; కరి, రథ, తురగ, బల+ఆఢ్యులు+ఐ= ఏనుగులతో, రథాలతో, గుర్రాలతో; సైన్యంతో కూడినవాళ్ళయి; మహాముదముతోడన్= మహాసంతోషంతో; ఎదురు, వచ్చిరి; కలయంగన్= అంతటా; గృహములన్= ఇండ్లలో; కలువడములు= ధ్వజస్తంభాలకు కట్టే బంగారుకలువపూదండలు; అంబర, తలము= ఆకాశంయొక్క క్రిందిభాగాన్ని; కప్పి; కడున్= మిక్కిలి; విలసిల్లెన్= ప్రకాశించాయి; మలయజ, మృగమద+ఆవిల, సలిలంబులన్= మంచిగంధంతోను, కస్తూరితోను; కలిసిననీటిచేత; ఇమ్ముగాన్= ఇంపుగా; ఆర్ద్రీకృతమ్ములు+అయిన= తడుపబడినవి అయిన; అంగణులన్= రాజవీథులందు; కర్పూరరంగవల్లులు= కర్పూరపుపొడితో వేసిన ముగ్గులు; ఒప్పెన్= ప్రకాశించాయి; అంగనలు= స్త్రీలు; కయిసేసి= అలంకరించి; తత్+పురీ, విలసంబున్= ఆ పట్టణంయొక్క శోభను, చూచు, పాండుకుమారులన్= పాండవులను; చూచు= చూడాలనే; వేడ్కన్= కుతూహలంతో; ఉత్తుంగ= ఎత్తైన; హర్మ్య, తలములు= మేడలమీది సమప్రదేశాలు; ఎక్కిరి.

తాత్పర్యం: పాండవులరాకనుగురించి విని, వారణావతంలోని ప్రజలంతా ఎంతో ఆనందించి, చతురంగ బలాలతో వారికి ఎదురేగారు. ఇండ్ల ధ్వజస్తంభాలకు కట్టిన బంగారుకలువపూదండలు ఆకాశాన్ని కప్పి మిక్కిలి ప్రకాశించాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మంచిగంధం, కస్తూరి కలిపిననీటితో తడిసిన రాజమార్గాలలో కర్పూరపుముగ్గులు కళకళలాడాయి. ఆడవాళ్ళు అలంకరించుకొని ఆ నగరశోభను చూస్తున్నపాండవులను చూడటానికి మేడలెక్కారు.

వ. పాండుకుమారులు ననేకభూసురాశీర్వాదనాదాభినందితు లై ఫాల్గునమాసంబున శుక్లపక్షమున నష్టమియు రోహిణినాడు వారణావతంబు సొచ్చి సర్వాలంకారసుందరం బయిన రాజమందిరంబున నున్న, కొన్ని దినంబులకుం బురోచనుండు దనచేసినచతుశ్శాల సకలజననయనాభిరామం బైన దానిం జూపినం జూచి పాండుసుతులు సంతసిల్లి, పురోచనశిల్పాచార్యులం, బూజించి పుణ్యాహరవపురస్సరంబుగా గృహప్రవేశంబు సేసి; రంతం బరాభిప్రాయమాయోపాయ ప్రయోగవిదుం డైన ధర్మతనయుండు దాని కృత్రిమరమణీయత నుపలక్షించి యల్లన భీమున కి ట్లనియె. 150

ప్రతిపదార్థం: పాండుకుమారులున్= పాండవులు; అనేక, భూసుర+ఆశీర్వాదనాద+అభినందితులు+ఐ= పెక్కుమంది బ్రాహ్మణులయొక్క ఆశీర్వాద ధ్వనులచేత కొనియాడబడినవాళ్ళయి; ఫాల్గున,మాసంబున; శుక్లపక్షంబున; అష్టమియు; రోహిణినాడు; వారణావతంబు; చొచ్చి= ప్రవేశించి; సర్వ+అలంకార, సుందరంబు+అయిన= అన్నిఅలంకారాలచేత అందమైన దైన; రాజ మందిరంబునన్; ఉన్నన్= ఉండగా; కొన్ని, దినంబులకున్; పురోచనుండు; తన, చేసిన= తనయొక్క చేసిన - అంటే తాను నిర్మించిన; చతుశ్శాల= నాలుగిండ్ల భవంతి; సకల, జన, నయన+అభిరామంబు+ఐన= అందరు ప్రజలయొక్క కన్నులకు ఇంపు గొలిపేది అయిన; దానిన్; చూపినన్= చూపగా; చూచి; పాండుసుతులు= పాండురాజుయొక్క కుమారులు; సంతసిల్లి= సంతోషించి; పురోచన; శిల్ప+ఆచార్యులన్= పురోచనుడనే పేరుగల శిల్పాచార్యులను; పూజించి; పుణ్యాహ, రవ, పురస్సరంబుగాన్= పుణ్యాహవచనం మున్నుగా; గృహ, ప్రవేశంబు; చేసిరి; అంతన్= అటుపై; పర+అభిప్రాయ, మాయ+ఉపాయ, ప్రయోగ విదుండు+ఐన= ఇతరుల అభిప్రాయాలను, కపటోపాయ ప్రయోగాలను ఎరిగినవాడైన; ధర్మతనయుండు= ధర్మరాజు; దాని= ఆ చతుశ్శాలయొక్క కృత్రిమ రమణీయతన్= సహజంకాని కేవలం కల్పింపబడినదైన అందాన్ని; ఉపలక్షించి= చూచి; అల్లనన్= మెల్లగా; భీమునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: పాండవులు పెక్కుమందిబ్రాహ్మణుల ఆశీర్వచనాలు పొంది, ఫాల్గున శుద్ధఅష్టమి రోహిణీ నక్షత్రం రోజున వారణావతంలో ప్రవేశించి; అన్నివిధాల అందమైన రాజమందిరంలో ఉంటూఉండగా, పురోచనుడు తాను నిర్మించిన మహామనోహరమైన చతుశ్శాలను చూపించాడు. పాండవులు సంతోషించి, పురోచనుడిని సమ్మానించి, పుణ్యాహవచనాలతో అందు ప్రవేశించారు. ఇతరుల అభిప్రాయాలను, మాయోపాయప్రయోగాలను ఎరిగిన ధర్మరాజు ఆ చతుశ్శాలకృత్రిమరమణీయతను చూచి మెల్లగా భీమునితో ఇట్లా అన్నాడు.

విశేషం: పుణ్యాహవాచనము - శుభంకలగటానికి పుణ్యాహమనే శబ్దాన్ని మూడుమారులు చెప్పే శుభకర్మం. 'అష్టమియు రోహిణి నాడు' - అనే దానికి 'సిద్ధార్థి సంవత్సర ఫాల్గున శుద్ధ అష్టమి రోహిణియందు', అనే ఒకపాఠాంతరం గూడ ఉన్నది. - శ్రీమదాంధ్ర మహాభారతసంశోధితప్రతి, పుట 358.

క. ఈ గృహ కుడ్యంబులు లా। క్షాగర్భము లాజ్య తైలగంధులు మఱి శ
స్త్రాగారసమీపము మా - యాగృహ మగు నిది యవశ్య మాగ్నేయం బై. 151

ప్రతిపదార్థం: ఈ, గృహ, కుడ్యంబులు= ఈ యింటియొక్క గోడలు; లాక్షా, గర్భములు= లక్కను లోపల కలిగినట్టివి; ఆజ్య, తైల, గంధులు= నేతియొక్కయు, నూనెయొక్కయు వాసన గలవి; మఱి= అంతేగాక; శస్త్ర+అగార, సమీపము= ఆయుధాలుండేచోటికి దగ్గరగా ఉన్నది; అవశ్యము= తప్పక; ఆగ్నేయంబు+ఐ= అగ్నిచే దహింపదగిందై; ఇది; మాయా, గృహము+అగున్= మోసపుటిల్లుగా ఉన్నది.

తాత్పర్యం: ఈ యింటిగోడలలో లక్క ఉన్నది. ఇవి నేతివాసన, నూనెవాసన కలిగి ఉన్నాయి. అంతేగాక ఇది ఆయుధాలుండే చోటికి దగ్గరగా ఉన్నది. తప్పక ఇది నిప్పుచేత తగులబడే మోసపుటిల్లు.

క. దీని తెఱఁ గెఱిఁగినట్ల మ। హానిపుణుఁడు విదురుఁ డురువిషాగ్నులవలనన్
మానుగ నేమఱకుం డని। తాను బ్రబోధించె నేకతమ ననుఁ బ్రీతిన్. 152

ప్రతిపదార్థం: దీని, తెఱఁగు= ఈ యింటియొక్కపద్ధతి; ఎఱిఁగినట్లు+అ= తెలిసినట్లే; మహానిపుణుఁడు= గొప్పనేర్పరి; విదురుఁడు; ఉరు, విష+అగ్నులవలనన్= గొప్ప విషంవలన, అగ్నివలన; ఏమఱకుండు+అని= మైమరచి ఉండవద్దని; మానుగన్= ఒప్పుగా; తాను; ఏకతమ= ఒంటరిగా; ననున్; ప్రీతిన్= ప్రేమతో; ప్రబోధించెన్= ఉపదేశించాడు.

తాత్పర్యం: ఈ యింటి విషయం తనకు తెలిసినట్లే మహామేధావి అయిన విదురుడు విషం, నిప్పు విషయాలలో ఏమరి ఉండవద్దని ఎవ్వరూ లేకుండా చూచి ఒంటరిపాటున నాకు హెచ్చరిక చేశాడు.

వ. 'కావున మన మిందు విశ్వసించియుండవలవ; దవశ్యం బగ్నిభయం బగు' ననిన విని భీముం డి ట్లనియె. 153

ప్రతిపదార్థం: కావున; మనము; ఇందున్= ఈ యింటిలో; విశ్వసించి= నమ్మి; ఉండవలవదు= ఉండకూడదు; అవశ్యంబు= తప్పక; అగ్ని, భయంబు+అగున్= నిప్పువలన భయం కలుగుతుంది; అనిన్; విని; భీముండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కాబట్టి, మనం ఈ యింట్లో నమ్మి ఉండకూడదు; తప్పక ఈ యింట అగ్నిభయం కలుగుతుంది అని ధర్మరాజు పలుకగా విని భీముడు ఈ విధంగా అన్నాడు.

ఆ. 'ఇట్టిదేని మనకు నిం దుండఁగా నేల? । యరిగి ముందు నున్నయంద యుండి,
యెఱిఁగి దీనితోన యుప్పరోచనుఁ గాల్చి । పోద' మనిన ధర్మపుత్త్రుఁ డనియె. 154

ప్రతిపదార్థం: ఇట్టిది+ఏని= ఇటువంటిదైతే; మనకున్; ఇందున్= ఈయింటిలో; ఉండఁగాన్+ఏల= ఉండట మెందుకు; అరిగి= వెళ్ళి; ముందు+ఉన్న+అందు+అ= ఇదివరకు ఉన్నచోటనే; ఉండి= వసించి; ఎఱిఁగి= తెలిసి; ఈ+పురోచనున్; దీనితోనన్= ఈ యింటితోకూడ; కాల్చి; పోదము= పోవుదము; అనినన్= అనగా; ధర్మపుత్త్రుడు= ధర్మరాజు; అనియెన్= ఇట్లన్నాడు.

తాత్పర్యం: 'ఇటువంటిదైతే ఈయింట్లో మనం ఉండటమెందుకు? ఇదివరకున్న ఇంట్లోనే ఉందాము. ఈ యింటితో పురోచనుడినిగూడ దహించి పోదాము' అని భీము డనగా అతనితో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. ఎఱిఁగితిమి దీని తెఱఁ; గే। మఱ కెఱుఁగనియట్లు గూఢమతి నుండుద మిం
దఱముఁ బురోచనుకృతకము। నెఱి నేర్పడునంతకును వినీతాత్మల మై. 155

ప్రతిపదార్థం: దీని, తెఱఁగు= ఈ యింటి పద్ధతి; ఎఱిఁగితిమి= తెలిసికొన్నాము; ఏమఱక= పరాకులేకుండ; ఎఱుఁగని+అట్లు= తెలియనట్లు; పురోచను, కృతకము= పురోచనునిచేత చేయబడినది - అంటే పురోచనునిమోసం - నెఱిన్= పూర్తిగా; ఏర్పడు+అంతకును= బయటపడేంతవరకు; వినీత+ఆత్ములము+ఐ= నిగ్రహించిన మనస్సులు కలవారమై; గూఢ మతిన్= రహస్యమైన తలంపుతో; ఇందఱము= ఇంతమందిమి; ఉండుదము= ఉందాము.

తాత్పర్యం: మనం ఈ యింటి సంగతి తెలిసికొన్నాము. పరాకు లేకుండా ఏమీ తెలియనట్లే పురోచనుడిమోసం పూర్తిగా బయటపడేవరకు మనస్సును నిగ్రహించుకొని రహస్యమైన ఆలోచనతో అందరం ఇందే ఉందాము.

వ. ఇప్పాపగృహప్రకారంబు మన మెఱింగుట పురోచనుం డెఱింగెనేని దుర్యోధనునియోగంబు విఫలం బగు నట్లు గాకుండ శీఘ్రకారుల మై దీని దహించిన నక్కడ భీష్మవిదురులు విని కోపించినం గురుకులసముద్రక్షోభం బగు; మఱి దాహభయంబున మన మొండుగడకుం బోయిన నెఱింగి మనయంతరంబ రోయుచు నద్దురాత్ముండు దుర్యోధనుండు వెండియు మన కపాయంబు సేయు నె ట్లనిన. 156

ప్రతిపదార్థం: ఈ+పాప, గృహ, ప్రకారంబు= ఈ పాపమైన ఇంటి విధం; మనము; ఎఱుంగుట; పురోచనుండు; ఎఱింగెన్+ఏని= తెలిసికొన్నట్లయితే; దుర్యోధను, నియోగంబు= దుర్యోధనునియొక్క ఆజ్ఞ; విఫలంబు+అగున్= వ్యర్థమవుతుంది; అట్లు, కాక+ఉండ= అలా కాకుండా; శీఘ్ర, కారులము+ఐ= త్వరపడి చేసేవాళ్ళమై; దీనిన్= ఈ యింటిని; దహించినన్= కాల్చివేస్తే; అక్కడ= హస్తినలో; భీష్మ, విదురులు= భీష్మ విదురులు; విని; కోపించినన్= కోపపడగా; కురు, కుల, సముద్ర క్షోభంబు+అగున్= కురువంశమనే సముద్రంలో గగ్గోలు కలుగుతుంది; మఱి= అట్లుగాక; దాహ, భయంబునన్= కాల్చువలని భయంచేత; మనము; ఒండు, కడకున్= ఇంకొకచోటికి; పోయినన్= పోయినచో; ఎఱింగి= తెలిసికొని; మన, అంతరంబు+అ= మనయొక్కమఱుగునే - అంటే మనం దాగిఉండే చోటునే; రోయుచున్= వెదుకుతూ; ఆ+దురాత్ముండు= ఆ దుర్మార్గుడు; దుర్యోధనుఁడు; వెండియున్= మరల; మనకున్; అపాయంబు= కీడును; చేయును= చేస్తాడు; ఎట్లు+అనినన్= ఏ విధంగాఅంటే.,

తాత్పర్యం: ఈ పాపపుఇంటిసంగతి మనకు తెలిసినట్లు పురోచనుడికి తెలిస్తే; దుర్యోధనుని ఆజ్ఞ విఫలమవుతుంది. అట్లా కాకుండా మనం తొందరపడి ఈ యింటిని దహించివేస్తే, అక్కడ హస్తినలో భీష్మవిదురులు ఇది విని కోపిస్తే, కురువంశమనే మహాసముద్రంలో సంక్షోభం కలుగుతుంది. అట్లా కాక ఇల్లు కాలుతుందనే భయంచేత వేరొక చోటికి వెళ్తే ఆ దుర్మార్గుడు దుర్యోధనుడు మనం దాగినచోటునే వెదుకుతూ మళ్లీ మనకు కీడు చేస్తాడు. అది ఎట్లా గంటే.

సీ. 'రాజ్యపదస్థుం డరాజ్యపదస్థులఁ। బక్షబలాఢ్యుఁ డపక్షబలుల
విపులార్థవంతుండు విగతార్థసార్థుల। నవసరం బెఱిఁగి వాఁ డశ్రమమున
దూష్యులఁ దుదిదాఁక దూషించు మనల న। న్నిష్ఠురునకు నది నీతిగాదె!
కావున నోరు లెఱుంగకయుండఁ గడు నమ్మి। నట్టుల యుండుద' మని దినంబు

తే. లెల్ల వేఁటలాడుచు రాత్రులెల్ల నుద్య। తాయతాయుధహస్తు లై యనుదినంబు
నప్పురోచను వంచించి యనఘు లుండి। రప్రమాదు లై పాండవు లప్పురమున. 157

ప్రతిపదార్థం: రాజ్యపదస్థుండు= రాజ్యస్థానంలో ఉన్నవాడు - అంటే రాజ్యాధికారంలో ఉన్నవాడు; అరాజ్య, పదస్థులన్= రాజ్యాధికారంలో లేనివాళ్ళను; పక్షబల+ఆఢ్యుఁడు= సహాయబలం కలవాడు; అపక్ష, బలులన్= సహాయబలం లేనివాళ్ళను; విపుల+అర్థవంతుండు= ఎక్కువ డబ్బున్నవాడు; విగత+అర్థసార్థుల= కోల్పోయిన ధనం గలవాళ్ళను; అవసరంబు= సమయం; ఎఱిఁగి= తెలుసుకొని; అ(శ్రమమునన్= సులువుగా; వాఁడు= ఆ దుర్యోధనుడు; మనలన్= మనల్ని; దూష్యులన్= నిందింపదగినవాళ్ళను; (ఇట చెరుపదగినవాళ్ళనని భావించాలి); తుది, తాఁకన్= చివరివరకు; దూషించున్= నిందిస్తాడు- చెరుస్తాడు; ఆ+నిష్ఠురునకున్= ఆ క్రూరుడికి; అది; నీతి; కాదె= కాదా! కావునన్; ఒరులు= ఇతరులు, ఎఱుంగక+ఉండన్= తెలిసికొనకుండ; నమ్మినట్లులన్= నమ్మినట్లే; ఉండుదము= ఉందాము; అని= ఆ ప్రకారం; దినంబులు+ఎల్లన్= పగటిపూటలం దెల్ల; వేఁటలు+ఆడుచు; రాత్రులు+ఎల్లన్; ఉద్యత+ఆయత+ఆయుధ, హస్తులు+ఐ= ఎత్తబడిన గొప్ప ఆయుధాలు కల చేతులు కలవాళ్ళయి; అప్రమాదులై= ఏమరుపాటు లేనివాళ్ళయి; అనుదినంబు= ప్రతిదినం; ఆ+పురోచనున్; వంచించి= మోసగించి; ఆ+పురమునన్= ఆ వారణావతనగరంలో; అనఘులు= పాపంలేనివాళ్ళు - పుణ్యాత్ములు; పాండవులు; ఉండిరి.

తాత్పర్యం: రాజ్యాధికారంలో ఉన్నవాడు, సహాయబలం కలవాడు, గొప్పసంపద కలవాడు అయిన దుర్యోధనుడు - రాజ్యాధికారం, సహాయబలం లేక సంపద కోల్పోయిన మనలను సమయం చూచి తుదముట్ట చెరచటానికి ప్రయత్నిస్తాడు. ఆ దుర్మార్గుడికి అదియేనీతి. అందుచేత ఇతరులు తెలిసికొనకుండా నమ్మినట్లే ఉందాము- అని పుణ్యాత్ములైన పాండవులు ప్రతిదినం పగలెల్ల వేటాడుతూ, రాత్రులలో ఆయుధాలు చేత ధరించి అప్రమత్తులై ఆ వారణావతంలో ఉన్నారు.

విశేషం: విగతార్థసార్థుల - అనేదానికి 'విగతార్థవంతుల,' 'విగతార్థసాధుల' అనే పాఠాంతరాలున్నాయి. హస్తినాపురం వదలి బయటికి వచ్చిన పాండవులస్థితి, హస్తినాపురంలో రాజైన ధృతరాష్ట్రుని సంతతిస్థితి ధర్మజుని వాక్యాలలో నిరూపితమయ్యాయి. పాండవులకు హస్తినలోని బందుగుల బలం దూరమైనది. రాజ్యాధికారం, బంధువులబలగం, అపారసంపద, దుర్యోధనాదులకు దక్కాయి. పాండవులు ఏకాకులు, నిస్సహాయులు అయ్యారు. ఇక క్రమంగా వాళ్ళకు ద్రుపదునితో బంధుత్వం, కృష్ణునితో చెలిమి ఏర్పడితేకాని కౌరవులకంటె బలంలోనూ, బలగంలోనూ, సంపదలోనూ అధికులు కారు.

లాక్షాగృహదహనము (సం. 1-135-1)

వ. అట హస్తిపురంబున విదురుండు దుర్యోధనుదుర్మంత్రం బంతయు నిమ్ముగా నెఱింగి, కడువిశ్వాసి నొక్క ఖనకు నతి కుశలుం బాండవులపాలికిం బుత్తెంచిన వాఁడును వచ్చి రహస్యంబునం బాండవులం గని తన్ను నమ్మునట్లుగా విదురుసాభిజ్ఞానవచనంబు లెఱింగించి 'యీకృష్ణచతుర్దశినాఁటిరాత్రి పురోచనుండు లక్కయింట దహనంబు దరికొల్పుం గావున నిందుండి మీకు వెలువడిపోవునట్టియుపాయంబు మారాజు నియోగంబునం జేయవచ్చితి' నని చెప్పి, లక్కయిల్లు వెలువడునట్లుగా నొక్కబిలంబు నెవ్వరు నెఱుంగకుండం జేసి, వారల కెఱింగించిన భీముండు దాని నిమ్ముగా శోధించి యెఱింగి యుండు నంత. 158

ప్రతిపదార్థం: అట, హస్తినాపురంబునన్= హస్తినాపురంలో; విదురుండు; దుర్యోధన, దుర్మంత్రంబు+అంతయును= దుర్యోధనుని యొక్క చెడ్డఆలోచన అంతా; ఇమ్ముగాన్= స్పష్టంగా; ఎఱింగి; కడున్= మిక్కిలి; విశ్వాసిన్= నమ్మదగినవాడిని; అతికుశలున్= మిక్కిలి నేర్పుగల వాడిని; పాండవులపాలికిన్= పాండవుల దగ్గరకు; పుచ్చు+తెంచినన్= పంపించగా; వాఁడును; వచ్చి; రహస్యంబునన్= చాటుగా; పాండవులన్; కని= చూచి; తన్ను, నమ్మునట్లుగ; విదురు, స+అభిజ్ఞాన, వచనంబులు=

విదురునియొక్కగుర్తుతో కూడిన మాటలు; ఎఱిఁగించి= తెలిపి; ఈ, కృష్ణ, చతుర్దశినాటి, రాత్రి; పురోచనుండు; లక్కయింట; దహనంబు= నిప్పు; దరికొల్పున్= మండిస్తాడు; కావునన్; ఇందుండి= ఈ యింటినుండి; మీకున్; వెలువడి, పోవునట్టి= బయటపడిపోవునట్టి; ఉపాయంబు; మా, రాజు, నియోగంబునన్= మా దొర అయిన విదురునియొక్క ఆజ్ఞచేత; చేయన్= చేయటానికై; వచ్చితిన్= వచ్చాను; అని; చెప్పి; లక్క, ఇల్లు, వెలువడునట్లుగాన్= లక్కయింటినుండి బయటికిపోయి ఉండేటట్లుగా; ఒక్క= ఒక; బిలంబున్= సొరంగాన్ని; ఎవ్వరున్, ఎఱుంగకుండన్= ఎవ్వరుకూడా తెలుసుకోకుండ; చేసి; వారలకున్= పాండవులకు; ఎఱింగించినన్= తెలియజేయగా; భీముండు; దానిన్= ఆ సొరంగాన్ని; ఇమ్ముగా= పూర్తిగా; శోధించి= పరిశీలించి; ఎఱింగి= తెలిసికొని; ఉండునంతన్= ఉన్నతర్వాత.

తాత్పర్యం: హస్తినాపురంలో విదురుడు దుర్యోధనునిదురాలోచననంతటిని స్పష్టంగా తెలిసికొని, మిక్కిలి విశ్వాసపాత్రుడు, నేర్పరి అయిన ఒక ఖనకుడిని పిలిచి, పాండవుల దగ్గరకు పంపించగా, వాడు పాండవులను రహస్యంగా కలిసి, విదురుడు తనను గుర్తించటానికి చెప్పిన మాటలు చెప్పి, 'రానున్న కృష్ణపక్షచతుర్దశినాటి రాత్రి పురోచను డీ లక్కయింటిని తగులబెడతాడు. అందుచేత ఈ యింటినుండి మీరు బయటపడి వెళ్ళటానికి తగినమార్గం విదురుని ఆజ్ఞమేరకు నేరవేర్చటానికి వచ్చా' నని, లక్కయింటినుండి బయటికి ఒక రహస్యపుసొరంగాన్ని ఎవ్వరికీ తెలియకుండా త్రవ్వి పాండవులకు తెలియజేయగా, దాన్ని భీముడు పూర్తిగా పరిశీలించి తెలిసికొన్నాడు. తర్వాత.

విశేషం: ఈ కృష్ణ చతుర్దశి - ఇది రౌద్రి సంవత్సర భాద్రపద బహుళ చతుర్దశి అని భారతకూలంకషవ్యాఖ్య. శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పుట 361.

క. ధనదానములను బ్రియభో। జనదానములను విశిష్టసద్ద్విజతతులం
దనుపుచు నుండఁగఁ దత్పుర। మున షణ్మాసమున భరతముఖ్యుల కరిగెన్. 159

ప్రతిపదార్థం: ధన, దానములన్= ధనదానాలచేత; ప్రియ, భోజన, దానములను= ప్రియమైన భోజనదానాలచేతను; విశిష్ట, సత్+ద్విజ, తతులన్= గొప్పవారైన మంచిబ్రాహ్మణులను; తనుపుచున్= తృప్తిపరుస్తూ; ఉండఁగన్= ఉండగా; తత్+పురమునన్= ఆ నగరాన - వారణావతనగరాన; భరత, ముఖ్యులకున్= భరతవంశంలో ముఖ్యులైన పాండవులకు; షట్+మాసములు= ఆరునెలలు; అరిగెన్= గడిచాయి.

తాత్పర్యం: ధనదానాలచేత; ఇష్టమైన భోజనదానాలచేత బ్రాహ్మణసమూహాలను తృప్తిపరుస్తుండగానే వారణావతంలో పాండవులకు ఆరునెలలు గడిచాయి.

వ. ఆ కృష్ణచతుర్దశినాఁడు కుంతీదేవి యప్పురంబునం గల బ్రాహ్మణ పుణ్యాంగనా జనంబుల కెల్ల నిష్టాన్న పానదానంబులం దుష్టి చేసి దేవపూజ గావించి యున్నెడం, బురోచనుపంపిననిషాదవనిత సపుత్త్రయై బహువిధవన్యమూల ఫలంబులు దెచ్చి యిచ్చుచుం గుంతీదేవింబాయక సేవించి పాండవ కృత్యంబులు నిత్యంబును నెఱింగించు చుండెడు నది, నాఁటిరాత్త్రి యుత్సవంబునం గాలచోదిత యై తానునుం దన యేవురు కొడుకులు నధికమధుపాన మదంబున మెయి యెఱుంగక లక్కయింటి పక్కంబున నిద్రవోయిన, నర్ధరాత్రంబునప్పడు భీముండు మేల్కని పురోచనుకంటె ముందఱఁ దాన యుత్సహించి వానిశయనగృహద్వారంబున ఘోరానలంబు దరికొలిపి,

చెచ్చెరఁ దల్లిని నన్ననుం దమ్ములను బిలంబులోని కనిచి, యాయుధాగారంబుతోడన లాక్షాగారంబు హుతాశనున కశనంబు సేసి, ఖనకునకుం దమకుశలగమనం బెఱింగించి, బిలప్రవిష్టుం డయి కుంతిని ధర్మార్జుననకుల సహదేవులను బిలంబు వెలువరించి తోడ్కొని చనునప్పుడు. **160**

ప్రతిపదార్థం: ఆ, కృష్ణ, చతుర్దశినాఁడు; కుంతీదేవి; ఆ+పురంబునన్+కల= ఆ వారణావతనగరంలో ఉన్న; బ్రాహ్మణ, పుణ్యాంగనా, జనంబులకు+ఎల్లన్= బ్రాహ్మణముత్తైదువుల కందరికి; ఇష్ట+అన్న, పాన, దానంబులన్; తుష్టి+చేసి= తృప్తిపెట్టి; దేవపూజ; కావించి; ఉన్న+ఎడన్= ఉన్నసమయాన; పురోచను, పంపిన, నిషాద, వనిత= పురోచనుడు పంపిన బోయస్త్రీ; సపుత్ర+ఐ= కొడుకులతో కూడిందై; బహు, విధ, వన్య, మూల, ఫలంబులు= అనేకవిధాలైన అడవిలో పుట్టిన వైన వేళ్ళను, పండ్లను; తెచ్చి; ఇచ్చుచున్= ఇస్తూ; కుంతీదేవిన్; పాయక= వదలక; సేవించి; పాండవ, కృత్యంబులు= పాండవులయొక్క పనులు; నిత్యంబును= ప్రతిదినము; ఎఱింగించుచున్= తెలియజేస్తూ; ఉండెడు+అది= ఉన్నట్టిది; నాఁటి, రాత్రి= ఆ కృష్ణచతుర్దశినాటిరాత్రి; ఉత్సవంబునన్= పండుగనందు; కాల, చోదిత+ఐ= మృత్యువుచేత ప్రేరేపింపబడిందై; తానునున్; తన, ఏవురు= తన అయిదుగురు; కొడుకులున్=కుమారులును; అధిక, మధుపాన, మదంబునన్= ఎక్కువ కల్లుయొక్క త్రాగుడుచేత కలిగిన మత్తుచేత; మెయి= దేహం; ఎఱుంగక= తెలియక, లక్కయింటి; పక్కంబునన్= లక్కయింటిప్రక్కన; నిద్రపోయినన్= నిద్రించగా; అర్ధరాత్రంబు+అప్పుడు; భీముండు; మేల్కని; పురోచనుకంటె; ముందఱన్; తాను+అ= తానే, ఉత్సహించి= పూనుకొని; వాని, శయన, గృహ, ద్వారంబునన్= వాడియొక్క పడకటింటివాకిట్లో; ఘోర+అనలంబున్= భయంకరమైనఅగ్నిని; దరికొలిపి= మండించి; చెర+చెరన్= వెనువెంటనే; తల్లినిన్; అన్ననున్; తమ్ములను; బిలంబులోనికి= సొరంగంలోనికి; అనిచి= పంపి; ఆయుధ+ అగారంబుతోడన= ఆయుధాలయొక్క ఇంటితోసహా, లాక్షా+అగారంబు= లక్కయిల్లు; హుత+ అశనునకున్= అగ్నిహోత్రునికి; అశనంబు+చేసి= ఆహారంగా చేసి; ఖనకునకున్; తమ, కుశల, గమనంబు= తమయొక్క క్షేమగమనాన్ని; ఎఱిఁగించి= తెలియజేసి; బిల, ప్రవిష్టుండు+అయి= సొరంగంలో ప్రవేశించినవాడై; కుంతిని; ధర్మ+అర్జున; నకుల, సహదేవులను; బిలంబు, వెలువరించి= సొరంగంనుండి బయల్పడేటట్లు చేసి; తోడ్కొని= తీసుకొని; చనునప్పుడు= వెళ్ళేటప్పుడు.

తాత్పర్యం: ఆ కృష్ణచతుర్దశినాడు కుంతీదేవి వారణావతనగరంలో ఉండే బ్రాహ్మణముత్తైదువుల కందరికి ఇష్టమైన భోజనం తృప్తిగా పెట్టి, దేవపూజ చేసింది. పురోచనుడు పంపిన బోయస్త్రీ కొడుకులు గలది కనుక అడవిలో అనేకవిధాలైన మూలాలు, ఫలాలు తెచ్చి యిస్తూ కుంతీదేవిని వదలక సేవిస్తూ; పాండవులు చేసే పనులన్నింటిని ప్రతిదినం ఆ పురోచనుడికి తెలియజేస్తూ ఉన్నది. చావు మూడిందై ఆ బోయెత తాను, తన కొడుకులు ఆ కృష్ణచతుర్దశి నాటిరాత్రి పండుగనందు పెల్లుగా కల్లు త్రాగి, మత్తెక్కి మైమరచి ఆ లక్కయింటిప్రక్క నిదురించగా, భీముడు పురోచనుడికంటె ముందే తానే పూనుకొని వాడిపడకింటి వాకిటికి పెద్దగా నిప్పు అంటించి, వెంటనే తల్లిని, అన్నను, తమ్ములను ఆ సొరంగంలో పంపి, ఆయుధాలున్న ఆ యింటితోకూడా లక్కయింటిని తగులబెట్టాడు. విదురుడు పంపిన ఖనకుడికి తాము క్షేమంగా వెళ్ళటాన్ని తెలియజేశాడు. సొరంగంలో ప్రవేశించి, కుంతిని, ధర్మార్జుననకులసహదేవులను ఆ సొరంగంనుండి బయల్పడేటట్లు చేసి తోడ్కొని వెళ్ళేటప్పుడు.

విశేషం: ఆ బోయవనితకు కూడా కుంతీదేవివలె ఐదుగురు కొడుకులుండటం విశేషం. వాళ్ళు కుంతిని, ఆమెపుత్రులను గమనిస్తూ నిత్యం రహస్యసమాచారాన్ని అందించటానికి నియుక్తులైన వారన్నమాట.

సీ. **కడునిద్రఁ గానక తొడరుచు వడిగొని । నడవంగ నేరక తడయుచున్న**

నెఱిఁగి, చెచ్చెరఁ దల్లి నఱకట నిడి, ధర్మ । సుతవిజయులఁ దనవితతబాహు

యమళంబు నెక్కించి, యముల నుత్సంగంబు । లెక్కించుకొని భీముఁ డక్కజముగ

నరిగెడు రయమునఁ దరులు సొల్పడి మ్రొగ్గఁ । బదఘట్టనంబులఁ జదిసి ఱాలు

ఆ. నుఱుము గాఁగ నిట్లు నెఱయంగ సత్త్వంబు । మెఱసి రాతి రెల్ల నుఱక పవన

తనయుఁ డరిగెఁ బవలు సనినట్లు చీఁకటి । యనక ముండ్లు గండ్లు ననక తెరలి. 161

ప్రతిపదార్థం: కడు, నిద్రన్= ఎక్కువ నిద్రచేత; కానక= చూడలేక; తొడరుచున్= తొట్రుపడుతూ; వడిగొని= వేగాన్ని పొంది; నడవంగనేరక= నడవలేక; తడయుచు+ఉన్నన్= ఆలస్యంచేస్తున్న; ఎఱిఁగి= తెలిసికొని; భీముఁడు; చెర+చెరన్= వేగమే; తల్లిన్; అఱకటన్= మూపుమీద; ఇడి= ఉంచి; ధర్మసుత, విజయులన్= ధర్మరాజును, అర్జునుణ్ణి; తన, వితత, బాహు, యమళంబున్= తనయొక్క విశాలమైన బాహువుల (భుజాల) యొక్కజంటపై; ఎక్కించి; యములన్; కవలను - నకుల సహదేవులను; ఉత్సంగంబులు= ఒడులు - తొడలపైభాగాలపై; ఎక్కించుకొని; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; అరిగెడు= వెళ్ళునట్టి; రయంబునన్= వేగంచేత; తరులు= చెట్లు; సాలు+పడి= వరుసగా; మ్రొగ్గన్= పడగా; పద, ఘట్టనంబులన్= పాదాల తొక్కిళ్ళచేత; చదిసి= నలిగి; ఱాలు= రాళ్ళు; నుఱుము= పొడి; కాఁగన్= కాగా; ఇట్లు= ఈ విధంగా; సత్త్వంబు= బలం; నెఱయంగన్= నిండుగ; మెఱసి= చూపి; రాతిరి+ఎల్లన్= రాత్రినికూడ; ఉఱక= లెక్కచేయక; చీఁకటి;అనక= అనకుండా; ముండ్లు, గండ్లన్= ముళ్ళు, పగుళ్ళు; అనక= అని అనకుండ; తెరలి= కదిలి; పవలు= పగటిపూట; చనినట్లు= పోయినట్లు; పవన, తనయుండు= వాయుదేవునియొక్కకుమారుడైన భీముడు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: మిక్కుటమైన నిద్రతో తొట్రుపడుతూ వడివడిగా నడవలేని తల్లిని మూపుమీద, ధర్మజార్జునులను భుజాలమీద, నకులసహదేవులను ఒడులలో ఎత్తుకొని, భీముడు తన గమనవేగంవలన వృక్షాలు వరుసగా పడేటట్లు; పాదాల త్రొక్కిళ్ళచేత నలిగి రాళ్ళు పొడి అయ్యేటట్లు తన బలం చూపి, రాత్రిని కూడలెక్కచేయకుండా, చీకటని అనుకోకుండా, ముండ్లు, పగుళ్ళు అని కూడచూడకుండా, పగటిపూట నడిచినట్లు నడిచి వెళ్ళాడు.

విశేషం: 'గండ్లు' అనేదానికి 'గుండ్లు' అనే పాఠాంతరం ఉంది. గుండ్లు అంటే రాళ్ళు.

వ. ఇట వారణావతంబున. 162

తాత్పర్యం: ఇక ఇక్కడ వారణావతనగరంలో.

చ. అనుపమనిత్యసత్యరతు లై వినయాన్వితు లైన పాండునం

దనులకు ధర్మమూర్తులకు ధర్ము వెఱుంగక యిట్టు లెగ్గు సే

సిన ధృతరాష్ట్రజాధము నశేషసుహృత్సుతబంధుదాహసూ

చనమయి లక్కయి ల్లతికృశానుశిఖాహతిఁ గ్రాఁగె గ్రక్కునన్. 163

ప్రతిపదార్థం: అనుపమ, నిత్య, సత్య, రతులు+ఐ= సాటిలేని నిత్యమైన సత్యంపై ఆసక్తిగలవారై; వినయ+అన్వితులు+ఐన= అణకువతో కూడినవారైన; పాండు, నందనులకు= పాండురాజుయొక్క కుమారులకు - పాండవులకు; ధర్మమూర్తులకు= ధర్మంయొక్క ఆకారమైనవారికి; ధర్ము వు+ఎఱుంగక= ధర్మాన్ని తెలియక; ఇట్టులు= ఈ విధంగా; ఎగ్గు= కీడు; చేసిన; ధృతరాష్ట్రజ+అధమున్= ధృతరాష్ట్రునికుమారుడైన నీచుడిని; అశేష; సుహృత్+సుత, బంధు, దాహ, సూచనము+అయి=

మొత్తంమిత్రులయొక్క, కొడుకులయొక్క, బంధువులయొక్క కాలటాన్ని సూచించేటిదై; లక్క ఇల్లు; అతి, కృశాను, శిఖాహతిన్= అధికమైన అగ్నిజ్వాలలయొక్క దెబ్బచేత; గ్రక్కునన్= వెంటనే; క్రాఁగెన్= కాలింది.

తాత్పర్యం: సత్యంమీద ఆసక్తి కలవాళ్ళు; వినయవంతులు, ధర్మస్వరూపులు అయిన పాండునందనులకు, ధర్మం తప్పి ఈ విధంగా కీడుచేసిన నీచ దుర్యోధనుని మిత్రులు, పుత్రులు, బంధువులు కాలటాన్ని సూచించేదై - లక్కయిల్లు అధికమైన అగ్నిజ్వాలలచేత కాలిపోయింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. "అత్యుత్కటైః పుణ్యాపాపైః ఇహైవ ఫల మశ్నుతే" అన్నట్లు ధర్మమార్గవర్తనులైన పాండవులను సజీవదహనం చేయాలనేది దుర్యోధనుని దురాలోచన. కాని అతడు ఈ జీవితకాలంలోనే బంధుమిత్ర సంతతితో నశించిపోవటం తథ్యమని లక్కయింటి మంట ధ్వనింపచేసింది.

వ. తదనంతరంబ ప్రభాతసమయం బగుడును. 164

ప్రతిపదార్థం: తత్+అనంతరంబు+అ= ఆ తర్వాత; ప్రభాత, సమయంబు= తెల్లవారటం; అగుడును= కాగా;

తాత్పర్యం: ఆ తరువాత తెల్లవారగా.

చ. అతిదురితక్రియాభిరతుఁడైన పురోచనుతోన భస్మసా
త్కృత మయి చెడ్డ తద్విపులగేహముఁ దత్క్షణదగ్ధ మైనయా
కృతక విభూతి జాతుష నికేతనమున్ మఱి శస్త్ర వేశ్మమున్
ధృతి సెడి చూడఁగా నరుఁగుదెంచి జనుల్ గడు సంభ్రమంబుతోన్. 165

ప్రతిపదార్థం: అతి, దురిత, క్రియా+అభిరతుఁడు+ఐన= మిక్కిలిపాపకార్యంలో ఆసక్తిగలవాడైన; పురోచనుతోనన్= పురోచనునితో సహా; భస్మ, సాత్కృతము+అయి= బూడిదచేయబడినదై; చెడ్డ= చెడినట్టి; తత్+విపుల, గేహమున్= ఆ విశాల మైన ఇంటిని; తత్; క్షణ, దగ్ధము+ఐన= ఆక్షణానే కాలిపోయిందైన; ఆ కృతక, విభూతి, జాతుష, నికేతనమున్= ఆ యొక్క కృత్రిమ మైన వైభవంగలదైన లక్కయింటిని; మఱి= మరియు; శస్త్ర, వేశ్మమున్= ఆయుధాలయొక్క ఇంటిని, ధృతి+చెడి= సంతోషాన్ని కోల్పోయి; జనుల్= ప్రజలు; చూడఁగాన్= చూడటానికి; అరుగుదెంచి= వచ్చి; కడు, సంభ్రమంబుతోన్= మిక్కిలివేగిరపాటుతో.

తాత్పర్యం: పాపపుపనులు చేయటంలో ఆసక్తి కల ఆ పురోచనునితోసహా బూడిద అయిన ఆ కృత్రిమ శోభగల లక్కయింటినీ, ఆయుధగారాన్నీ సంతోషం కోల్పోయి చూడటానికి జనులు, మిక్కిలి వేగిరపాటుతో వచ్చి.

మధ్యాక్కర.

ప్రో వైన భస్మంబు వాయఁ ద్రోచి య బ్బూదిలో నడఁగి
యేవురు గొడుకులతోడ నం దొక్క యింతి యత్యుగ్ర
పావకదగ్ధ యై యున్నఁ జూచి, యప్పౌరులు దాని
భావించి కుంతియు సుతులు నని శోకపరవశు లగుచు. 166

ప్రతిపదార్థం: ప్రోవు+ఐన= కుప్పగా పడ్డ; భస్మంబు= బూడిదను; పాయన్+త్రోచి= తొలగేటట్లుగా త్రోసి; ఆ+బూదిలోన్= ఆ బూడిదలో; అడఁగి=అణగి; ఏవురు, కొడుకులతోడన్= ఐదుగురు కొడుకులతో కూడ; అందు+÷ఒక్క; ఇంతి= ఆడది; అతి+ఉగ్ర, పావక, దగ్ధ+ఐ= మిక్కిలి భయంకరమైన అగ్నిచేత కాల్చబడిందై; ఉన్నన్= ఉండగా; చూచి, ఆ+పౌరులు; దానిన్= ఆ స్త్రీని; కుంతియున్, సుతులన్+అని= కుంతీదేవియు, కుమారులనియు - అంటే పాండవులని; భావించి= తలంచి; శోక, పరవశులు= దుఃఖంతో మైమరచినవారు - అనగా అమితదుఃఖం పొందినవారు; అగుచున్= అవుతూ.

తాత్పర్యం: కుప్పగా ఉండే బూడిదను తొలగద్రోసి అందులో అయిదుగురు కొడుకులతోసహా కాలిపడి ఉండే స్త్రీని చూచి - వాళ్ళే కుంతీ, పాండవులని భావించి, పౌరులు పెద్దదుఃఖంతో.

విశేషం: మధ్యాక్కరచరణంలో క్రమంగా 2 ఇంద్ర - 1 సూర్య - 2 ఇంద్ర - 1 సూర్యగణాలుంటాయి. నన్నయ అయిదవగణం మొదటి అక్షరంతో యతిమైత్రి చేశాడు. ప్రాస ఉన్నది. కోపం, పశ్చాత్తాపం, దుఃఖం, ప్రబోధం, ప్రార్థనం, అధిక్షేపం, విస్మయం, నింద,స్తుతి, ఉత్సాహం మొదలైన భావాలను వర్ణించేటప్పుడు ఈ వృత్తం సాధారణంగా ప్రయోగింపబడుతుంది. ఇక్కడ దుఃఖభావ వ్యంజకంగా మధ్యాక్కరను నన్నయ రచించాడు. (సంపా.)

మ. 'బలవంతుల్ భరతాన్వయస్థితికరుల్ భాస్వద్భుజావీర్యని
ర్దళితారాతులు భూరి భూభర మహాధౌరేయకుల్ పాండవే
యులు నిష్కారణ మిట్లు వచ్చి ధృతరాష్ట్రోపాయమాయోత్థిత
జ్వలనజ్వాలలఁ గ్రాఁగిరే' యనుచు సంజాతార్తులై రెంతయున్. 167

ప్రతిపదార్థం: బలవంతుల్; భరత+అన్వయ, స్థితి, కరుల్= భరతవంశానికి నిలుకడను కూర్చేవాళ్ళు; భాస్వత్+భుజా, వీర్య, నిర్దళిత+అరాతులు= ప్రకాశిస్తున్న భుజాలయొక్క బలంచేత చీల్చబడిన శత్రువులు కలవాళ్ళు; భూరి, భూ, భర, మహా, ధౌరేయకుల్= గొప్పదైన భూమియొక్క భారాన్ని గొప్పగా మోసేవాళ్ళు; పాండవేయులు= పాండవులు; నిష్కారణము= కారణంలేకుండానే, ఇట్లు; వచ్చి; ధృతరాష్ట్ర+ఉపాయ, మాయ+ఉత్థిత, జ్వలన, జ్వాలలన్= ధృతరాష్ట్రునియొక్క ఉపాయమైన మోసంచేత పైకిలేచిన నిప్పుమంటలలో; క్రాఁగిరే= కాలిపోయారు కదా; అనుచున్; ఎంతయున్= మిక్కిలి; సంజాత+ఆర్తులు+ఐరి= పుట్టిన దుఃఖం కలవాళ్ళయ్యారు.

తాత్పర్యం: 'బలవంతులు, భరతవంశం నిలిపేవాళ్ళు, భుజబలంచేత శత్రువులను సంహరించినవాళ్ళు, భూభారాన్ని వహించగలవాళ్ళు అయిన పాండవులు - ఏ కారణం లేకుండా - ఈ విధంగా ధృతరాష్ట్రుని కపటోపాయంతో పైకెగిసిన నిప్పుమంటల్లో మాడిపోయారు గదా!' అని మిక్కిలి దుఃఖించారు.

వ. అంత విదుర ప్రేషితుం డయిన ఖనకుండు పౌరులం గలసి భస్మంబు వాయఁ ద్రోచువాఁడపోలె నెవ్వరు నెఱుంగకుండఁ దనచేసిన బిలంబుద్వారంబు గప్పి లక్కయింట నొక్కనిషాదవనిత యేవురుగొడుకులతో దగ్ధ యగుట యెఱింగి గజపురంబునకుం జని తద్వృత్తాంతంబును బాండవుల కుశలగమనంబును విదురునకుం జెప్పె; నిట వారణావతమ్మునవా రెల్ల నిట్టిదారుణంబు దుర్యోధనకారితంబకా నెఱింగి శోకించి, కుంతీ పాండవులపంచత్వంబు ధృతరాష్ట్రునకుం జెప్పి పుచ్చిన. 168

ప్రతిపదార్థం: అంతన్= అనంతరం; విదుర, ప్రేషితుండు+అయిన= విదురునిచేత పంపబడినవాడైన; ఖనకుండు= త్రవ్వేవాడు; పౌరులన్= ఆ నగరప్రజలను; కలసి; భస్మంబు= బూడిదను; పాయన్+త్రోచు, వాడ, పోలెన్= తొలగత్రోసేవానివలె; తన, చేసిన, బిలంబు, ద్వారంబు= తాను చేసిన సొరంగంయొక్క వాకిలిని; కప్పి= మూసివేసి; లక్క, ఇంటన్= లక్క యింటిలో; ఒక్క; నిషాద, వనిత= బోయకాంత; ఏవురు కొడుకులతో= ఐదుగురు కొడుకులతో; దగ్ధ+అగుట= కాలిపోయిం దవటం; ఎఱింగి= తెలిసికొని, గజ, పురంబునకున్= హస్తినాపురానికి; చని= వెళ్ళి; తత్+వృత్తాంతంబును= ఆ విషయాన్ని; పాండవుల, కుశల, గమనంబును= పాండవులయొక్క క్షేమగమనాన్ని; విదురునకున్; చెప్పెన్; ఇట= ఇక్కడ; వారణా వతమ్మునవారు+ఎల్లన్= వారణవతాన ఉన్నవాళ్ళంతా; ఇట్టి, దారుణంబు= ఈ విధమైన ఘోరం; దుర్యోధనకారితంబు+అ+కాన్= దుర్యోధనునియొక్క చేష్టయే; అని, ఎఱింగి= తెలిసికొని; శోకించి= దుఃఖించి; కుంతీ, పాండవుల, పంచత్వంబు= కుంతియొక్క, పాండవులయొక్క మరణం; ధృతరాష్ట్రునకున్; చెప్పి, పుచ్చినన్= చెప్పిపంపగా.

తాత్పర్యం: విదురుడు పంపిన ఆ ఖనకుడు వారణావతనగరప్రజలతో కలిసి బూడిదను ఆవలికి తోసేవాడిలా ప్రవర్తించి, ఇతరు లెవ్వరు చూడకుండ తాను త్రవ్విన సొరంగద్వారాన్ని కప్పివేశాడు. లక్కయింట కాలిపోయింది బోయెత, ఆమెఐదుగురుకొడుకులు అని తెలిసికొని హస్తినాపురానికి వెళ్ళి, ఆ విషయాన్నీ, పాండవులు క్షేమంగా అక్కడనుండి వెళ్ళటాన్నీ విదురునికి చెప్పాడు. వారణావతప్రజలంతా - ఈ ఘోరకృత్యం దుర్యోధనుడు చేసిందే- అని దుఃఖించి కుంతీపాండవుల మరణవార్తను ధృతరాష్ట్రునికి చెప్పి పంపారు.

పాండవులు లక్కయింటఁ జచ్చి రని ధృతరాష్ట్రుండు దుఃఖించుట (సం.1-137-10)

ఉ. బాధిత శత్రు వర్గు లగు పాండుకుమారుల దుఃఖవార్త మ
ర్త్యాధము లైన సౌబలదినాధిపసూనులయొద్ద నప్డు దు
ర్యోధనుఁ డాదిగాఁగ సుతు లున్న సభన్ విని దుఃఖితాత్ముఁ డై
యా ధృతరాష్ట్రుఁ డా వఱచిన ట్లఱచెన్ వివిధప్రలాపుఁ డై. 169

ప్రతిపదార్థం: ఆ ధృతరాష్ట్రుఁడు; మర్త్య+అధములు+ఐన= మానవుల్లో తక్కువవారైన - నీచులైన; సౌబల, దిన+అధిప, సూనుల+ఒద్దన్= శకుని కర్ణుల దగ్గర; దుర్యోధనుఁడు+ఆది, కాఁగన్= దుర్యోధనుడు మొదలుగా; సుతులు= కొడుకులు; ఉన్న సభన్= ఉన్నట్టి సభలో; బాధిత, శత్రు, వర్గులు+అగు= బాధింపబడిన శత్రువుల సమూహం కలవాళ్ళయిన; పాండు, కుమారుల, దుఃఖ, వార్త= పాండవులయొక్క దుఃఖసమాచారం - అంటే పాండవుల మరణవార్త; విని; దుఃఖిత+ ఆత్ముఁడు+ఐ= బాధింపబడిన మనస్సుకలవాడై; వివిధ, ప్రలాపుఁడు+ఐ= అనేకవిధాలైన ఏడ్పటాన్ని కలవాడై; (పాండవులను గూర్చి అనేక విధాలుగా భావిస్తూ ఏడ్చినా డని భావం) ఆవు+అఱచినట్లు; అఱచెన్.

తాత్పర్యం: దుర్యోధనుడు మొదలగు కొడుకులు ఉన్నసభలో నీచులైన శకుని కర్ణుల ఎదుట, పాండవుల మరణవార్త విని, మిక్కలి బాధపడుతూ, అనేకవిధాల వాళ్ళను గూర్చి భావించి, దుఃఖిస్తూ, ధృతరాష్ట్రుడు ఆవు అరచినట్లు అరచాడు.

విశేషం: అలం: ఉపమ. పరమదారుణమైన ఈ సంఘటన వెనుక తన పుత్రుని మాయోపాయం ఉందని తెలిసి ఏడ్చినా; తెలియక ఏడ్చినా -నిజంగా ఏడ్చినా, అబద్ధంగా ఏడ్చినా - మొత్తానికి ధృతరాష్ట్రుడు, అందరిముందు అంతపెద్దగా ఏడ్చాడట

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

- 'ఆ వఱచి న ట్లఱచి' ఏడ్చాడట. సుబలుని తనయుడు సౌబలుడు - శకుని. దినాధిపుడు - పగటికిరాజు - సూర్యుడు. సూర్యసూనుడు - సూర్యుని కుమారుడు- కర్ణుడు. వీళ్లతో దుర్యోధనుణ్ణి కలిపి మర్త్యాధము లనటం సార్థకం. సహృదయ సంవాదం కలిగించే విశేషణం.

వ. మఱియు గాంధారిం దొట్టి దేవీజనులయాక్రందనధ్వను లంతఃపురంబున నెగసె; భీష్మాదికురువృద్ధులును విప్రులుం బౌరులును శోకాక్రాంతు లయిరి; విదురుండు పాండవులకుశలస్థితి యెఱింగియు నెఱుంగనియ ట్లందఱం గలసి దుఃఖితుండపోలె నుండె; నంత ధృతరాష్ట్రుండు గొడుకులుం దానును బాంధవులును గుంతీపాండవుల కుదకదానంబు సేసి సంస్కారాదిపరలోకక్రియలు గంగాతీరంబునం జేయ సమకట్టించి తగువారి బ్రాహ్మణుల నపారధనంబులతోడం బుచ్చిన. 170

ప్రతిపదార్థం: మఱియున్; గాంధారిన్+తొట్టి= గాంధారి మొదలుగా; దేవీ, జనుల+ఆక్రందన, ధ్వనులు= అంతఃపుర స్త్రీల ఏడుపుశబ్దాలు; అంతఃపురంబునన్; ఎగసెన్= పైకిలేచాయి; భీష్మ+ఆది, కురు, వృద్ధులును= భీష్ముడు మొదలైన కురువంశపు పెద్దలును; విప్రులున్= బ్రాహ్మణులును; పౌరులును= పుర ప్రజలును; శోక+ఆక్రాంతులు= దుఃఖంచేత ఆక్రమింపబడినవాళ్ళు; అయిరి; విదురుండు; పాండవుల, కుశలస్థితి= పాండవులయొక్క క్షేమంగా ఉండే స్థితిని, ఎఱింగియు; ఎఱుంగని+అట్లు; అందఱన్+కలసి= అందరితో కూడి; దుఃఖితుండ పోలెను= దుఃఖించినవానివలె; ఉండెన్= ఉన్నాడు; అంతన్= అటుపై; ధృతరాష్ట్రుండు; కొడుకులున్; తానును; బాంధవులును = చుట్టాలుకూడా; కుంతీ, పాండవులకున్= కుంతికీ పాండవులకు; ఉదక, దానంబు+చేసి= నీటిని వదలి; సంస్కార+ఆది, పరలోక, క్రియలు= దహనం మొదలైన పరలోకానికి సంబంధించిన అంత్యక్రియలు; గంగా, తీరంబునన్; చేయన్= చేయటానికి; సమకట్టించి= ఏర్పాటు చేయించి; తగువారిన్= తగినట్టివాళ్ళను; బ్రాహ్మణులను; అపార, ధనంబులతోడన్= అంతులేని ధనాలతో, పుచ్చినన్= పంపగా;

తాత్పర్యం: అంతేగాక గాంధారీదేవి మొదలయిన అంతఃపురకాంతల ఏడుపు ధ్వనులు పెల్లుబికాయి. భీష్ముడు మొదలైన కురువంశపు పెద్దలు దుఃఖించారు. విదురుడు, పాండవులు క్షేమంగా ఉన్నారని తెలిసినా అందరితోపాటు తానుకూడ దుఃఖించేవానివలె ఉన్నాడు. ధృతరాష్ట్రుడు, కొడుకులు, తాను, బంధువులు, కుంతీదేవికి, పాండవులకు నీళ్ళు వదలి, పరలోకక్రియలు గంగాతీరాన జరిపించటానికి ఏర్పాట్లు చేయించి, యోగ్యులైన బ్రాహ్మణులకు అంతులేని ధనాలిచ్చి పంపగా.

క. మతిఁ బాండుకుమారుల పం । చత విని దుర్యోధనుండు సంతసపడియెన్;
హితుఁ డయిన పురోచను పం । చత కెంతయు జాతదుఃఖచంచలుఁ డయ్యెన్. 171

ప్రతిపదార్థం: దుర్యోధనుండు; పాండుకుమారుల, పంచత= పాండవులయొక్కమరణం, విని; మతిన్= మనస్సులో; సంతసపడియెన్= సంతోషించాడు; హితుఁడు+అయిన= మేలు కోరేవాడయిన; పురోచను పంచతకున్= పురోచనునియొక్క మరణానికి; ఎంతయున్= మిక్కిలి; జాత, దుఃఖచంచలుఁడు+అయ్యెన్= పుట్టబడిన దుఃఖంచేత చలించినవాడు అయ్యాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు పాండవుల మరణానికి సంతోషించాడు. తనమేలుకోరేవాడైన పురోచనుని మరణానికి మాత్రం ఎంతో దుఃఖించాడు.

విశేషం: పురోచనుణ్ణి ముందుగా కాల్చటంవల్ల పాండవులు తప్పించుకొన్నారన్నవార్త రహస్యంగా ఉండగలిగింది.

పాండవులు వారణావతమునసుండి దక్షిణదిశగా నడచుట (సం. 1-137-17)

వ. అట పాండవులును భాగీరథి లంఘించి దక్షిణాభిముఖు లయి మారుతమార్తాండమరీచిగోచరంబు గాని గహనంబున నరుగుచు నధికక్షుత్పిపాసాపరవశు లయి నడవనోపకయున్న నెప్పటియట్ల యందఱ నెత్తికొని వాయుతనయుండు వాయువేగంబునఁ జని సాయాహ్నంబున నొక్కవటమహీజాతశీతల శిలాతలంబున నునిచి దాని యగ్రవిటపం బెక్కి నీ రారయుచున్నంత ననతిదూరంబున. 172

ప్రతిపదార్థం: అట, పాండవులును; భాగీరథి, లంఘించి= గంగను దాటి; దక్షిణ+అభిముఖులు+అయి= దక్షిణానికి ఎదురుగా ముఖాలు గలవాళ్ళయి; మారుత, మార్తాండ, మరీచి, గోచరంబు, కాని= గాలికిని; సూర్యునికాంతికిని చొరగాని; గహనంబునన్= అడవిలో; అరుగుచున్= వెళ్ళుతూ; అధిక, క్షుత్+పిపాసా, పరవశులు+అయి= మిక్కిలి ఆకలిదప్పులకు లోనైనవాళ్ళయి, నడవన్+ఓపక= నడవలేక; ఉన్నన్; ఎప్పటి, అట్ల= ఎప్పటిమాదిరిగానే; అందఱన్; ఎత్తికొని; వాయు, తనయుండు= వాయుదేవునియొక్క కుమారుడు-భీముడు; వాయు, వేగంబునన్, చని= వాయువేగంతోపోయి; సాయ+అహ్నంబునన్= సాయంకాలాన; ఒక్క, వట, మహీజాత, శీతల, శిలా తలంబునన్= ఒక మఱ్ఱిచెట్టుయొక్క చల్లని రాతిప్రదేశంలో; ఉనిచి= ఉంచి; దాని= ఆ మఱ్ఱిచెట్టుయొక్క; అగ్ర, విటపంబు= చివరి కొమ్మ; ఎక్కి; నీరు+అరయుచు+ఉన్న+అంతన్= నీటిని వెదకుతుండగా; అనతి, దూరంబునన్= ఎక్కువ కాని దూరాన - అంటే కొద్ది దూరాన.

తాత్పర్యం: పాండవులు గంగానదిని దాటి దక్షిణంవైపు సాగి, గాలి, సూర్యకిరణాలు చొరరాని దట్టమైన అడవిలో నడిచివెళ్ళుతూ, ఎక్కువ ఆకలి దప్పులకు లోనైన వాళ్ళయి నడవలేకపోగా, భీమసేనుడు ఎప్పటివలె తక్కినవాళ్ళను ఎత్తుకొని వాయువేగాన వెళ్ళి, సాయంకాలాన ఒక మఱ్ఱి చెట్టుక్రింద ఉండే చల్లని రాతిప్రదేశాన ఉంచి, ఆ మఱ్ఱిచెట్టు చివరికొమ్మ నెక్కి నీళ్ళకొరకు వెదకుతుండగా కొంతదూరంలో.

మ. ప్రమదాపాదిపయఃప్రపూర్ణ మిది యౌఁ బద్మాకరం బంచుఁ ద
త్కమలామోదసుగంధ మారుతము వీఁకన్ ము న్నెఱింగించినన్
రమణం బిల్చె సరోవరం బనిలజున్ రాజీవరాజీ వస
త్సముదాళివ్రజచక్రవాక బక హంస క్రౌంచ నాదంబులన్. 173

ప్రతిపదార్థం: ప్రమద+ఆపాది, పయః ప్రపూర్ణము= సంతోషాన్ని కలిగించే నీటితో నిండినది; పద్మ+ఆకరంబు= పద్మాలకు స్థానమైనది - కొలను; ఇది+ఔన్= ఇది అగునని; అంచున్= అనుకుంటూ; తత్+కమల+ఆమోద, సుగంధ, మారుతము= ఆ కొలనులోని తామరలయొక్క మంచివాసనతో కూడివీస్తున్న గాలి; వీఁకన్= ఉత్సాహంతో; మున్ను+ఎఱింగించినన్= ముందుగా తెలియజేయగా, రాజీవ, రాజీ, వసత్+సమద+ఆళి, వ్రజ, చక్రవాక, బక, హంస, క్రౌంచ, నాదంబులన్= కమలాలయొక్క సమూహంలో ఉన్నట్టి మదించిన తుమ్మెదల సమూహంయొక్క, చక్రవాకపక్షులయొక్క, కొంగలయొక్క, క్రౌంచపక్షులయొక్క ధ్వనులచేత; సరోవరంబు= కొలను; రమణన్= ప్రీతితో; అనిలజున్= వాయుపుత్రుడైన భీముడిని; పిల్చెన్= పిలిచింది.

తాత్పర్యం: ఆహ్లాదాన్ని కలిగించే నీటితో నిండినదీ, పద్మాలకు నెలవైనదీ అని, తామరపూల మంచివాసనతో కలిసి వీస్తున్నగాలి ముందుగా పరిచయం చేస్తుండగా -కమలాలలో దాగిన మదించిన తుమ్మెదల గుంపులు, చక్రవాకపక్షులు, కొంగలు, క్రౌంచపక్షులు చేసేధ్వనులతో సరోవరం వాయుపుత్త్రుడైన భీముడిని పిలిచింది.

విశేషం: ఈ పద్యరచనలో సమాధి అనే గుణం ఉన్నది. 'రాజీవరాజీవ' అనేచోట యమకం. కథాప్రసన్నతకు భంగం కలిగించే విస్తృతి లేక, అక్షరరమ్యం, మనోహరం అయిన సరోవరమిది. సరోవరం (వనితవలె) భీముడిని ఆహ్వానిస్తున్నదనే వర్ణనం భావికథలో హిడింబ పవనసుతుడిని, తనంతట తాను కోరుకొనే కథార్థాన్ని సూచిస్తున్నది. భావికథార్థ ధ్వనిని ఇందులో నన్నయ నిబంధించాడు. (సంపా.)

వ. ఆ దిక్కున కా క్షణంబ యరిగి య క్కొలను గని యందుఁ గృతావగాహుం డై కడుపునిండ నీళ్ళు ద్రావి యచ్ఛిద్ర కమల పత్త్ర పుటికల నీళ్ళు గొని భీముండు గ్రమ్మఱి వచ్చునంత. 174

ప్రతిపదార్థం: ఆ, దిక్కునకున్; ఆ, క్షణంబు+అ= ఆ నిమిషాన్నే; అరిగి= వెళ్ళి; ఆ+కొలనున్; కని= చూచి; అందున్; కృత+అవగాహుండు+ఐ= చేయబడిన స్నానం గలవాడై; కడుపునిండ; నీళ్ళు; త్రావి; అచ్ఛిద్ర, కమల, పత్త్ర పుటికల= చినగని తామరాకు దొప్పలలో; నీళ్ళు; కొని= తీసికొని; భీముండు; క్రమ్మఱి= మరలి; వచ్చు+అంత= వచ్చేటప్పుడు.

తాత్పర్యం: ఆ వైపు వెంటనే వెళ్ళి ఆ సరోవరాన్ని చూచి, అందులో స్నానం చేసి, కడుపునిండా నీళ్ళుత్రాగి చినగని తామరాకుదొప్పలలో నీళ్ళు నింపుకొని భీముడు తిరిగివచ్చేటప్పుడు.

క. ధరణీ దిశాప్రసారిత । గురుకరనికరంబు లుడిచికొని దీర్ఘనిరం
తరగతి ఖిన్నుఁడపోలెను । హరిదశ్వుఁడు విశ్రమించె నస్తాద్రిదరిన్. 175

ప్రతిపదార్థం: హరిదశ్వుఁడు= సూర్యుడు; దీర్ఘ, నిరంతర గతిన్= నిడుపైన ఎడతెగనినడకచేత; ఖిన్నుఁడపోలెను= అలసిపోయిన వాడా అనేటట్లు; ధరణీ, దిశా, ప్రసారిత, గురు, కర, నికరంబులు= భూమిలోను, దిక్కులలోను చాపబడిన గొప్పకిరణాలయొక్క లేదా చేతులయొక్క సమూహాలు; ఉడిచికొని= అణచుకొని(ముడుచుకొని); అస్త+అద్రి, దరిన్= అస్తమించే పర్వతగుహలో; విశ్రమించెన్= పరుండినాడు.

తాత్పర్యం: సూర్యుడు తనసుదీర్ఘమైన ఎడతెగని నడకచేత అలసిపోయినాడా అన్నట్లు - భూమిమీద దిక్కులలో చాచిన తనకిరణాలనే చేతులను ముడుచుకొని అస్తగిరిగుహలో విశ్రమించాడు.

విశేషం: అలం; ఉత్ప్రేక్ష. హరిదశ్వుడు - పచ్చనికాంతిగల గుఱ్ఱాలు కలవాడు - సూర్యుడు. కరము - అనే శబ్దానికి కిరణం, చేయి అనే రెండు అర్థాలున్నాయి.

ఉ. అంబురుహాప్తుఁ డస్తశిఖరాంతరితుం డగుడున్ సమస్త జీ
వంబులు నెల్లచో నిజ నివాసముఁ బొందునెడం దమిస్రపుం
జంబులపోలె వెల్వడియె శైలవిశాలగుహాలినుండి నా
గంబులయూథముల్ సరసఘాసపరిగ్రహణోత్సుకంబు లై. 176

ప్రతిపదార్థం: అంబురుహ+ఆప్తుడు = తామరలకు చుట్టమైన సూర్యుడు; అస్త, శిఖర+అంతరితుండు+అగుడున్= అస్త పర్వతంయొక్క శిఖరంచేత మరుగుపరుపబడినవాడు కాగా; సమస్త జీవంబులున్= అన్ని ప్రాణులు; ఎల్లచోన్= అన్నిచోట్ల; నిజ, నివాసమున్= తమయొక్క నివాసస్థలాలను; పొందు+ఎడన్= పొందునట్టి సమయాన; నాగంబుల, యూథముల్= ఏనుగుల గుంపులు; సరస, ఘాస, పరిగ్రహణ+ఉత్సుకంబులు+ఐ= రుచితో కూడిన గడ్డిని ప్రియమార పుచ్చుకోవాలన్న

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉత్సాహంగలవై; తమిస్ర, పుంజంబుల, పోలెన్= చీకట్ల గుంపులవలె; శైల, విశాల, గుహా+ఆలినుండి= కొండలలోని గుహల సమూహంనుండి; వెల్వడియెన్= బయటికి వచ్చాయి.

తాత్పర్యం: సూర్యాస్తమయం కాగానే అన్నిప్రాణులు తమ తమనివాసస్థానాలకు పోతుండగా, ఏనుగుల గుంపులు పచ్చిగడ్డిని ప్రియమార భుజించాలన్న ఉత్సాహంతో చీకట్లగుంపులవలె కొండగుహలనుండి వెలుపలికి వచ్చాయి.

విశేషం: అలం: ఉపమ. గుహలు వెలువడుతున్న ఏనుగులగుంపును వర్ణించే ఈ రచనలో ఆరోహావరోహక్రమస్ఫూర్తి కల సమాధి అనే శబ్దగుణం సార్థకంగా పోషింపబడింది. (సంపా.)

భీముఁడు నిద్రితు లైన జననీసోదరులను జూచి చింతిల్లుట (సం. 1-138-14)

వ. **భీమసేనుండును దద్వటవృక్షంబుక్రింద నధికపథిశ్రాంతులై పయి పుట్టంబులు పఱచుకొని తమ బాహుదండంబులు దలగడలుగా నిద్రితులయియున్న సహోదరులం దల్లినిం జూచి పరమదుఃఖితుం డై యాత్మగతంబున.** **177**

ప్రతిపదార్థం: భీమసేనుండును; తత్+వట, వృక్షంబు క్రిందన్= ఆ మఱ్ఱిచెట్టుక్రింద; అధిక, పథిశ్రాంతులు+ఐ= ఎక్కువ దారినడకవలన బడలినవాళ్ళయి; పయి, పుట్టంబులు= పైగుడ్డలు; పఱచుకొని= నేలపై పరచి; తమ, బాహు, దండంబులు= తమ చేతులు; తలగడలుగా= దిండ్లుగా; నిద్రితులు+అయి= నిద్రపోయినవాళ్ళయి; ఉన్న= ఉండే; సహా+ఉదరులన్= తోబుట్టువులను; తల్లినిన్= తల్లిని; చూచి= కాంచి; పరమ+దుఃఖితుండు+ఐ= మిక్కిలిదుఃఖించినవాడై, ఆత్మగతంబునన్= తనమనస్సులో.

తాత్పర్యం: ఎక్కువ దారినడకవలన బడలిక పొందినవాళ్ళయి పై గుడ్డలు పరచుకొని చేతులు దిండ్లుగా పెట్టుకొని ఆ మఱ్ఱిచెట్టు క్రింద నిద్రించేసోదరులను, తల్లిని చూచి భీమసేనుడు మిక్కిలి దుఃఖించి తన మనస్సులో.

క. **త్రిభువనసామ్రాజ్యశ్రీ । ప్రభుఁ డగు ధర్మాత్మజుండు ప్రాకృతజనున**
ట్లభిరూక్షతలంబున ని । ట్లభిభూతుం డగునె నిద్ర నతిఖిన్నుం డై. **178**

ప్రతిపదార్థం: త్రిభువ, సామ్రాజ్యశ్రీ, ప్రభుఁడు+అగు= ముల్లోకాలసామ్రాజ్యలక్ష్మికి ప్రభువైన; ధర్మ+ఆత్మజుండు= ధర్మరాజు; ప్రాకృతజనున్+అట్లు= సామాన్యమానవునివలె; ఇట్లు; అభిరూక్షతలంబునన్= మిక్కిలికఠినమైన ప్రదేశాన; అతి, ఖిన్నుండు+ఐ= మిక్కిలి దుఃఖం పొందినవాడై; నిద్రన్= నిద్రలో; అభిభూతుండు+అగునె= త్రోసిపుచ్చబడినవాడయ్యాడుగదా.

తాత్పర్యం: ముల్లోకాలకు ప్రభువైన ధర్మరాజు సామాన్య మానవునివలె ఈ విధంగా మిగుల దుఃఖం పొంది, కఠినమైన ఈ నేలమీద నిద్రించటమా!

విశేషం: అలం: విషమం.

సీ. **కుంతిభోజాధిపుకూఁతురు వసుదేవు । చెలియలు మఱియు విచిత్రవీర్యు**
కోడలు కౌరవకులవిభూషణుఁ డైన । పాండుమహాదేవి పరమధర్మ
పరు లైన కొడుకులం బడసినయది పుష్ప । సుకుమారతరమూర్తి శుచిపరార్ధ్య
శయనతలంబున శయనించియును నిద్ర । వోవనియది దప్పిఁ బొంది కటికి

ఆ. నేల గుండ్లు లొత్త నిద్ర వోయిన యది; । తల్లికంటె నిద్రఁ దగిలి సుతులు
వాలుమృగము లున్న వన మని వగవక । మఱచియుండి; రేమి మాడ్కి యొక్కొ! 179

ప్రతిపదార్థం: కుంతిభోజ+అధిపు, కూతురు= కుంతిభోజుడనే పేరుగల రాజుయొక్కకూతురు; వసుదేవు, చెలియలు; మఱియు; విచిత్రవీర్యు, కోడలు; కౌరవకుల, విభూషణుఁడు+ఐన= కౌరవవంశానికి ఆభరణంవంటివాడైన; పాండు మహాదేవి= పాండురాజుయొక్క పట్టపురాణి; పరమ, ధర్మపరులు+ఐన= మిక్కిలిధర్మాత్ములైన; కొడుకులను; పడసిన+అది= కన్నట్టిది; పుష్ప, పరమ, సుకుమారతర, మూర్తి= పూవుకంటె సుకుమారమైన శరీరం కలది; శుచి, పరార్థ్య, శయన, తలంబునన్= పరిశుద్ధత ముఖ్యమైన పడకమీద; శయనించియును= పడుకొనికూడ; నిద్ర+పోవని+అది= నిద్రపోనిది; దప్పిపొంది= దాహంవేసి; కటికినేలన్= ఆచ్ఛాదనంలేని కఠినమైన గట్టి నేలమీద; గుండ్లలు+ఒత్తన్= రాళ్ళు ఒత్తుకొంటూ ఉండగా; నిద్ర పోయిన+అది= నిద్రపోయింది; తల్లి కంటెన్; నిద్రన్+తగిలి= నిద్రలో చిక్కుకొని; సుతులు= కొడుకులు; వాలు, మృగములు+ఉన్న= క్రూరమృగాలుండే; వనము+అని= అడవి అని; వగవక= విచారింపక; మరచి+ఉండిరి; ఏమి, మాడ్కి+ఒక్కొ= ఏవిధమో కదా!.

తాత్పర్యం: కుంతిభోజునికూతురు, వసుదేవునిచెల్లెలు, విచిత్రవీర్యునికోడలు, పాండురాజుపట్టపురాణి, పరమ ధర్మాత్ములైన కొడుకుల కన్నతల్లి, పూవుకంటె సుకుమారమైన శరీరం కలది, పరిశుభ్రమైన పడకమీద పరుండి కూడ నిద్రపోవనిది - అయిన కుంతీదేవి, అలసిపోయి కటికినేలమీద రాళ్ళొత్తుకొంటున్నా నిద్రపోయింది. తల్లికంటె గాఢంగా నిద్రలో ఉన్న కొడుకులు ఇది క్రూరమృగాలుండే అడవి అనికూడ ఆలోచించకుండా నిద్రపోతున్నారు. ఇదేమి చిత్రమో కదా!

విశేషం: అలం: విషమం.

వ. 'వీరికి నిద్రాభంగంబు సేయనోపఁ; దమకుం దార మేల్కొని నీళ్ళు ద్రావుదురుగాక!' యని యక్కమలపత్త్ర పుటికల నీ ళ్ళిమ్ముగా సంగ్రహించి వెండియుం దనమనంబున. 180

ప్రతిపదార్థం: వీరికిన్; నిద్రా, భంగంబు= నిద్రను చెరచటం; చేయన్+ఓపన్= చేయలేను; తమకున్+తారు+అ= తమకు తామే; మేలుకొని; నీళ్ళు; త్రావుదురు+కాక= తాగుదురులే అనీ; ఆ+కమల, పత్త్ర, పుటికల= ఆ తామరాకుదొప్పల్లో; నీళ్ళు+ఇమ్ముగా= నీళ్ళు తగురీతిగా; సంగ్రహించి= కుదించిఉంచి; వెండియున్= మరల; తన, మనంబున= తనమనస్సులో.

తాత్పర్యం: 'వీళ్ళకు నిద్రాభంగం చేయలేను; వీళ్ళు తమంత తామే మేల్కొని నీళ్ళు తాగుతారులే' అని నీళ్ళను తగు విధంగా తామరాకుదొప్పల్లో భద్రపరచి మళ్ళీ తనమనస్సులో.

క. ఖలుఁ డై ధృతరాష్ట్రుఁడు పు । త్త్రులుఁ దానును గూడి మమ్ము దూరస్థులఁ గా
నిలు వెలువరించి లాక్షా । నిలయంబున నునిచెఁ బాపనిష్ఠితబుద్ధిన్. 181

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుఁడు; ఖలుఁడు+ఐ= దుర్మార్గుడై; పుత్త్రులున్, తానును; కూడి= కలిసి; మమ్మున్; దూరస్థులన్+కాన్= దూరంగా ఉండేవాళ్ళు అగునట్లుగా; ఇలు, వెలువరించి= ఇంటినుండి బయటికి పంపి; పాపనిష్ఠిత, బుద్ధిన్= పాపంలో ఉంచబడిన బుద్ధితో; లాక్షా, నిలయంబునన్= లక్కయింటిలో; ఉనిచెన్= ఉంచాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు దుర్మార్గుడై, కొడుకులూ, తానూ కలిసి, మమ్మల్ని దూరం చేయటానికై ఇంటి నుండి బయటికి పంపి దుర్బుద్ధితో లక్కయింట్లో ఉంచాడు.

క. కులపాంసను లై యహితం । బులు సేయుచునుండుచుట్టములఁ బొందక యి
మ్ముల నుండువాఁడ పుణ్యుఁడు, । వెలయఁగ గ్రామస్థితైకవృక్షమపోలెన్. 182

ప్రతిపదార్థం: కుల, పాంసనులు+ఐ= వంశనాశనం చేసే వాళ్ళయి; అహితంబులు= అపకారాలు; చేయుచున్+ఉండు, చుట్టములన్= చేస్తూ ఉండే చుట్టాలను; పొందక= చేరక; వెలయఁగన్= ఒప్పుగ; గ్రామస్థిత+ఏకవృక్షము+అ పోలెన్= గ్రామంలో ఉండే ఒకే ఒకచెట్టువలె; ఇమ్ములన్= అనుకూలస్థానాల్లో; ఉండు, వాఁడు+అ= ఉండేటివాడే; పుణ్యుఁడు= పుణ్యాత్ముడు.

తాత్పర్యం: వంశనాశనం చేసేవాళ్ళయి, అపకారం చేసే దుర్మార్గులైన చుట్టాల చెంత చేరకుండా - గ్రామంలోని ఒకేఒకవృక్షంలా (అది అందరి ఆదరాన్ని పొంది క్షేమంగా ఉంటుంది) తన కనుకూలమైన స్థానంలో ఉండే వాడే పుణ్యాత్ముడు.

విశేషం: అలం: ఉపమ. నన్నయకవితలో రుచిరార్థసూక్తి.

క. పరహితఫలవంతులు సు । స్థిరమూలాన్వితు లపాపధీరతులు పర
స్పరసంశ్రయమున జీవిం । తురు మనుజులు వనములోని ద్రుమములపోలెన్. 183

ప్రతిపదార్థం: పరహిత, ఫలవంతులు= ఇతరుల మేలునే ఫలంగా కలవాళ్ళు (ఇతరుల మేలుకొరకు ఫలాలను కలిగినవి - అని వృక్షపరమైన అర్థం); సుస్థిర, మూల+అన్వితులు= మిక్కిలి స్థిరమైన మూలధనంతోకూడినవాళ్ళు (మిక్కిలి స్థిరమైన వేళ్ళతో కూడినవి - అని వృక్షపరమైన అర్థం); అపాప, ధీ, రతులు= పాపబుద్ధిలో ఆసక్తిలేనివాళ్ళు (పాపబుద్ధిలేనివి - అని వృక్షపరమైన అర్థం); మనుజులు; వనములోని= అడవిలోని; ద్రుమములపోలెన్= వృక్షాలవలె; పరస్పర, సంశ్రయమునన్= ఒండొరుల ఆశ్రయంచేత, జీవింతురు= జీవిస్తారు.

తాత్పర్యం: ఇతరుల మేలు కోరుతూ, సుస్థిరమైన మూలధనం గలిగి, పాపబుద్ధి లేని మానవులు - అడవిలో ఒకదానితో ఒకటి కలిసి పెనగి ఉండే వృక్షాలవలె కలిసిమెలసి జీవిస్తారు.

విశేషం: అలం: శ్లేష, ఉపమ. ఫలశబ్దానికి 'బల' అనే పాఠాంతరం ఉన్నది. అలాగే 'అపాపధీరతులు' అనే దానికి 'అపారధీయుతులు', 'అపారధీమతులు', 'అపారధిక్కృతుల్' అనే పాఠాంతరాలున్నాయి. - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.368.

వ. అని ధృతరాష్ట్రుబాంధవంబు నిందించుచు నిబిడాంధకారనీరంధ్రంబు లయిన దిశలు సూచి యున్నంత, జన రభసంబు దవ్వుల వీతెంచిన ముందటం బురంబు గలుగవలయు, వీరల మేల్కొనునంతకు నే నిచ్చోట నేమరకుండవలయు నని. 184

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; ధృతరాష్ట్ర, బాంధవంబు= ధృతరాష్ట్రునియొక్క బంధుత్వాన్ని; నిందించున్, నిబిడ+అంధకార, నీరంధ్రంబులు+అయిన= దట్టమైన చీకటిచేత నిండి సందులేనివైన; దిశలు; చూచి; ఉన్న+అంతన్= ఉన్నతర్వాత; జన, రభసంబు= జనులసందడి; దవ్వుల, వీతెంచినన్= దూరంనుండి వినరాగా; ముందటన్, పురంబు= నగరం;

కలుగవలయున్= ఉండాలి; వీరలు= వీళ్ళు; మేలుకొనునంతకున్= మేలుకొనేవరకు; ఏన్= నేను; ఈ+చోటన్; ఏమరక+ఉండవలయున్= పరాకు లేక ఉండాలి; అని.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రునితో ఉన్న బంధుత్వాన్ని నిందిస్తూ పూర్తిగా చీకటిపడిన తర్వాత దూరంనుండి జనుల సందడి వినిపించగా, ముందువైపు పట్టణ మొకటి ఉన్నదని తెలిసికొని, అయినా తల్లీ, సోదరులూ మేల్కొనేవరకూ జాగ్రత్తగా ఉండాలి అని.

క. ఆ కాననాంతరంబునఁ । బ్రాకటభుజవిక్రముండు పాండవవజ్ర
ప్రాకారుఁడు జాగరమున । శోకమనస్కుఁ డయి పవనసూనుం డుండెన్. 185

ప్రతిపదార్థం: ఆ, కానన+అంతరంబునన్= ఆ అడవినడుమ; ప్రాకట, భుజ, విక్రముండు= ప్రసిద్ధమైన భుజపరాక్రమం కలవాడు; పాండవ, వజ్ర, ప్రాకారుఁడు= పాండవులకు వజ్ర ప్రహరిగోడ అయినవాడు; పవన సూనుఁడు= వాయుదేవునియొక్క కుమారుడు; భీముడు; శోకమనస్కుఁడు+అయి= దుఃఖమొందిన మనస్సు కలవాడయి; జాగరమునన్= మెలకువతో; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: ఆ అడవిమధ్య, ప్రసిద్ధమైన బాహుపరాక్రమం కలవాడు, పాండవులకు వజ్రప్రహరిగోడవంటివాడు అయిన భీముడు దుఃఖంతోకూడిన మనస్సుతో మెలకువగా ఉన్నాడు.

వ. తత్సమీపంబున బాలసాలతరుషండమండపంబుననుండి హిడింబుఁ డను నొక్కరాక్షసుండు వారి దవ్వులం జూచి మైపెంచి రూక్షకేశంబులు విద్రిచి యావులించి నీల్గి 'నీరసవన్యమృగమాంసఖాదనజాతనిర్వేదనపరుండ నయి పెద్దకాలంబునకు మానవమాంసం బాస్వాదింప గంటి' నని తన చెలియలి హిడింబ యనుదానిం బిలిచి యిట్లనియె. 186

ప్రతిపదార్థం: తత్+సమీపంబునన్= దానికి దగ్గరగా; బాల, సాల, తరు, షండ, మండపంబునన్= లేతవైన మద్దిచెట్టు సమూహమనే మండపంలో; ఉండి; హిడింబుఁడు+అను; ఒక్క, రాక్షసుండు; వారిన్= వాళ్ళను - అంటే పాండవులను, కుంతిని; దవ్వులన్= దూరాన; చూచి; మై+పెంచి= శరీరాన్ని పెద్దదిగా చేసి; రూక్ష, కేశంబులు= కఱకువెంట్రుకలు; విద్రిచి= విదిల్చి; ఆవులించి; నీల్గి= ఒడలు విరిచికొని; నీరస, వన్య, మృగ, మాంస, ఖాదన, జాత, నిర్వేదన, పరుండును+అయి= రుచిలేని అడవి జంతువుల మాంసాన్ని తినటంచేత కలిగిన రోత ప్రధానంగా కలవాడినై; పెద్ద, కాలంబునకు= చాలాకాలానికి; మానవ, మాంసంబు= మనుష్యులయొక్క మాంసాన్ని; ఆస్వాదింపన్+కంటిని+అని= రుచి చూడగలిగానని; తన, చెలియలిన్= తనయొక్క చెల్లెలిని; హిడింబ= హిడింబ అను పేరుగల, దానిన్= దాన్ని; పిలిచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అడవి మధ్య పాండవులుండే ప్రదేశానికి దగ్గరగా మద్దిచెట్ల నడుమ హిడింబు డనే రాక్షసు డొకడు వాళ్లను చూచి మేను పెంచి, తన కరకు వెంట్రుకలు విదిలించి, ఆవులించి, నీల్గి, రుచిలేని అడవి జంతువుల మాంసం తిని తిని రోత పుట్టిన తనకు చాలా కాలం తర్వాత మానవమాంసం రుచి చూచే అవకాశం కలిగిందని చెల్లెలు హిడింబను పిలిచి ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: స్వభావోక్తి. 'బాల సాల తరు షండ మండపంబున' అనే దానికి బాల రసాల తరు షండ మండిత మంటపంబున - బాల రసాల తరు షండ మండపంబున - ఇత్యాది పాఠాంతరాలు ఉన్నాయి - శ్రీమదాంధ్ర మహాభారతసంశోధితప్రతి, పుట. 369.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ఇందుల కిమ్మెయిన్ మనుజు లెన్నఁడు వత్తురె? వత్తురేని యా

నందముఁ బొంది నిర్భయమునన్ శయనింతురె? యిట్లు వంటయిల్

కుందెలు సొచ్చె; వేగ చని కోమలి ! వారలఁ జంపి తెచ్చి నా

కొందగ వండి పెట్టుము రసోత్కట మానవ మాంస ఖండముల్. 187

ప్రతిపదార్థం: కోమలి= సుకుమారమైనదానా!; ఇందులకున్= ఇక్కడికి; ఈ+మెయిన్= ఈ విధంగా; మనుజులు; ఎన్నఁడు= ఎప్పుడైన; వచ్చుదురె= వస్తారా!; వచ్చుదురు+ఏని= ఒకవేళ వచ్చినప్పటికీ; ఆనందమున్; పొంది; నిర్భయమునన్= భయంలేకుండ; శయనించుదురె= పడుకొంటారా!; ఇట్లు= ఈ విధంగా; వంటయిల్= వంట ఇంటిలో; కుందెలు= కుందేలు; చొచ్చెన్= ప్రవేశించింది; వేగన్= వేగంగా; చని= వెళ్ళి; వారలన్= వాళ్ళను; చంపి, రస+ఉత్కట, మానవ, మాంస, ఖండముల్= రుచిలో అధికమైన మానవులయొక్క మాంసపుముక్కలను; నాకు+ఒందగన్= నాకు ఒప్పేటట్లు; వండి; పెట్టుము.

తాత్పర్యం: 'ఇక్కడికి ఈ విధంగా మానవులు ఎప్పుడైనా వస్తారా! ఒకవేళ వస్తే సంతోషంగా, నిర్భయంగా ఇట్లా నిద్రిస్తారా! కుందేలు వంటింట్లోకి వచ్చింది. వెంటనే వెళ్ళి వాళ్ళని చంపి మిక్కిలి రుచి గల మానవమాంసఖండాలు చక్కగా నాకు వండిపెట్టు' మని హిడింబుడు చెల్లెలితో చెప్పాడు.

విశేషం: వంటయిల్ కుందెలు సొచ్చె - జాతీయం - అవసరమైనది తానై స్వాధీనమయిం దనటం. నన్నయగారి పాత్రోచిత సంభాషణరచనకు ఈ పద్యం చక్కని ఉదాహరణ.

హిడింబ భీమసేనునిం జూచి మోహించుట (సం. 1-139-1)

వ. అని పంచిన నదియును నతి త్వరితగతిం జని, ముందఱ వారల డాయ శంకించి, యొక్క వృక్షంబు మఱువునం గొండొక ప్రొ ద్దుండి. 188

ప్రతిపదార్థం: అని; పంచినన్= ఆజ్ఞాపించగా; అదియును= ఆ హిడింబకూడ; అతి, త్వరిత, గతిన్= మిక్కిలి వేగంగా; చని= వెళ్ళి; ముందఱ= ముందు; వారలకున్= వాళ్ళను; డాయన్= సమీపించటానికి; శంకించి= వెనుకాడి; ఒక్క; వృక్షంబు, మఱువునన్= చెట్టుయొక్క చాటున; కొండు+ఒక, ప్రొద్దు+ఉండి= కొంతసేపు ఉండి;

తాత్పర్యం: అని హిడింబుడు ఆజ్ఞాపించగా హిడింబ మిక్కిలి త్వరగా వెళ్ళి ముందు వాళ్ళను సమీపించటానికి జంకి ఒక చెట్టుచాటున కొంతసేపు ఉండి.

మ. వనజాతాయతనేత్రు నున్నతబృహద్వక్షఃస్థలున్ సింహసం

హననుం బాండవసింహమున్ హృదయజన్మాకారు నుద్యన్మహా

శనికల్పస్థిరబాహుఁ జూచుచు మనోజాతాగ్నిసంజాతవే

దన యై రాక్షసి కామరూపధర మర్త్యస్త్రీస్వరూపంబుతోన్. 189

ప్రతిపదార్థం: వనజాత+ఆయత, నేత్రున్= పద్మాలవలె విశాలమైన నేత్రాలు కలవానిని; ఉన్నత, బృహత్, వక్షస్+స్థలున్= ఎత్తైన విశాలమైన రొమ్ము గలవానిని; సింహసంహననున్= సింహంవంటి చక్కనినడుము కలవాడిని; హృదయ, జన్మ+ఆకారున్=

మనస్సునుండి పుట్టినవాడైన మన్మథునిఆకారంవంటి ఆకారం కలవాడిని; ఉద్యత్+మహత్+అశని, కల్ప, స్థిరబాహున్= ప్రకాశించేగొప్పవజ్రాయుధంతో సమానమైన దృఢమైన చేతులుగలవాడిని; పాండవ, సింహమున్= పాండవులలో శ్రేష్ఠుడిని- భీముణ్ణి; చూచుచున్= చూస్తూ; రాక్షసి= హిడింబ; మనో, జాత+అగ్ని, సంజాత, వేదన, ఐ= మన్మథాగ్నివలన పుట్టిన బాధ కలదై; కామ, రూప, ధర= ఇచ్ఛ వచ్చిన రూపాన్ని ధరించేది - రాక్షసి హిడింబ; మర్త్య స్త్రీ, స్వరూపంబుతోన్= మానవకాంతరూపంతో;

తాత్పర్యం: పద్మాలవలె విశాలమైన నేత్రాలు; ఎత్తైన విశాలమైన వక్షస్థలం, సింహంవంటి సన్నని నడుంతోకూడిన చక్కని శరీరం, మన్మథునివంటి అందం, వజ్రాయుధంవంటి దృఢమైన బాహువులు కల భీమసేనుడిని హిడింబ చూచి, మోహించి, కామరూపం ధరించి, మానవకాంతరూపంతో.

విశేషం: అలం: ఉపమ. ఈఘట్టంలో ఆకర్షించిన భీమసేనుని రూపవర్ణనకు మత్తేభవృత్తం, ఉదాత్తరమణీయశైలి ఎంతో ఉచితంగా ఉన్నాయి. మాధుర్యంతో, ఓజస్సుతో కూడిన ఈ రచన హిడింబకు, మనోహరుడు, మహావీరుడయిన భీమునికి తగినట్లున్నది.

క. వితత బహురత్నరుచిశో । భితభూషణములు వెలుంగ, బెడఁగగు నవపు
ష్పితజంగమలతక్రియ ను । న్నతకుచ సనుదెంచెఁ బవననందను డాయన్. 190

ప్రతిపదార్థం: ఉన్నత కుచ= ఎత్తైన రొమ్ములు కలది - హిడింబ; వితత, బహు, రత్న, రుచి, శోభిత, భూషణములు= గొప్పవై అనేకాలైన రత్నకాంతులచేత ప్రకాశిస్తున్న సొమ్ములు; వెలుంగన్= ప్రకాశించగా; నవ, పుష్పిత, జంగమ, లత, క్రియన్= క్రొత్తగా పుష్పించిన నడతీగవలె; పవన, నందనున్= వాయుపుత్రుడైన భీమసేనుడిని; డాయన్= సమీపించటానికి; చనుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: హిడింబ రత్నకాంతులతో శోభిల్లే సొమ్ములు ధరించి, క్రొత్తగా పుష్పించిన నడతీగవలె భీమసేనుని దగ్గరకు వచ్చింది.

విశేషం: అలం: ఉపమ. ఉన్నత బృహద్వక్షస్సలుడైన భీమసేనునికి దీటైన నాయిక ఉన్నతకుచ అయిన హిడింబ అని చమత్కారం. పూలు విరగబూసిన జంగమ లత పవనతనయుడిని సమీపించిందనటంలో భావుకమైన సౌందర్యం ఉన్నది. పూలతీవెయొక్క యౌవనసౌగంధ్యాన్ని గాలి వహిస్తాడని వస్తుధ్వని.

క. రమణి నిజభ్రాతృనియో । గముఁ దలఁపక యపుడు భీముఁ గదిసెఁ; బతిస్నే
హము కామినులకు బలవం । తము; పెఱనెయ్యములు వేయుఁ దత్సదృశములే? 191

ప్రతిపదార్థం: రమణి= ఆ కాంత; నిజ, భ్రాతృ, నియోగమున్= తన అన్నయొక్క ఆజ్ఞను; తలపక= ఆలోచించక- మరచి; అపుడు; భీమున్; కదిసెన్= చేరుకొన్నది; కామినులకున్= కాంతలకు; పతిస్నేహము+అ= భర్తమీదిప్రేమే; బలవంతము= బలమైనది; పెఱ, నెయ్యములు= తక్కిన ప్రేమలు; వేయున్= వెయ్యి అయినా, తత్+సదృశములే= దానితో సమానాలా?

తాత్పర్యం: హిడింబ తనఅన్న ఆజ్ఞను మరచి భీముడిని కూడుకొన్నది. కాంతలకు భర్తమీది స్నేహమే బలమైనది. తక్కిన స్నేహాలు వెయ్యి అయినా దానితో సమానాలు కావు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. ఇట్లు మన్మథవ్యధాశిథిలితమానమానస యయి తనయొద్దకు వచ్చుదానిం బవమానసూనుం డవమాన పూర్వకంబున 'నీ వెందులదాన? వింతప్రొ ద్దిందుల కేల వచ్చి? తెటవోయె? దెడ గలిగి పొ' మ్మనిన విని హిడింబ యి ట్లనియె. 192

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మన్మథ, వ్యధా, శిథిలిత, మాన, మానస+అయి= మన్మథబాధచే పోగొట్టబడ్డ అభిమానంగల మనస్సుగలదై; తన, ఒద్దకున్= తనదగ్గరికి; వచ్చు, దానినన్= వస్తున్న హిడింబను; పవమాన, సూనుండు= వాయుదేవునియొక్క కుమారుడు; అవమాన, పూర్వకంబునన్= అవమానం ముందు కలిగేట్లుగా; నీవు; ఎందుల, దానవు= ఎక్కడి దానివి; ఇంత, ప్రొద్దు= ఇంత, పొద్దు పోయినతర్వాత - అంటే ఇంతరాత్రివేళ; ఇందులకున్= ఇక్కడికి; ఏల, వచ్చితి= ఎందుకు వచ్చావు; ఎట+పోయెదు= ఎక్కడికి పోతున్నావు; ఎడ, కలిగి= దూరంగా; పొమ్ము+అనినన్= పో అనగా; విని; హిడింబ = హిడింబ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: మన్మథబాధచేత అభిమానాన్ని కోల్పోయి తన దగ్గరకు వచ్చే హిడింబను చూచి భీముడు అవమాన పూర్వకంగా 'నీవు ఎక్కడిదానవు; ఇంతరాత్రివేళ ఇక్కడికి ఎందుకు వచ్చావు; దూరంగా తొలగిపో' అని అనగా హిడింబ అతనితో ఇట్లా అన్నది.

క. జననుత ! యేను హిడింబుం । డను రక్కసుచెలియలం బ్రియంబున నినుఁ జూ
చినయప్పటఁగోలెను గడు । మనోభవనిపీడ్యమానమానస నయితిన్. 193

ప్రతిపదార్థం: జన, నుత= ప్రజలచేత కొనియాడబడేవాడా!; ఏను= నేను; హిడింబుండు+అను; రక్కసు, చెలియలన్= రాక్షసునియొక్క చెల్లెలిని; ప్రియంబునన్= ప్రేమతో; నినున్= నిన్ను; చూచిన+అప్పటన్, కోలెన్= చూచినప్పటినుండి; కడు= మిక్కిలి; మనోభవ, నిపీడ్యమాన, మానసను+అయితిన్= మన్మథునిచేత ఎక్కువగా బాధింపబడే మనస్సు గల దానిని అయ్యాను.

తాత్పర్యం: జనులచేత కొనియాడబడేవాడా! నేను హిడింబుడనే రాక్షసుడికి చెల్లెలిని. నిన్ను చూచింది మొదలు మన్మథబాధకు గురిఅయ్యాను.

క. నాకుఁ బతి వయిన నిన్నుం । జేకొని మాయన్న యెగ్గుసేయక కాచున్;
నాకు మఱి నీవ పతివి గు । ణాకర యి జ్జన్మమున మహాస్నేహమునన్. 194

ప్రతిపదార్థం: నాకున్; పతివి= భర్తవు; అయినన్= అయితే; మా+అన్న; నిన్నున్+చేకొని= తీసికొని - అంటే నిన్ను తనవానినిగా భావించి; ఎగ్గు+చేయక= కీడుచేయక; కాచున్= రక్షిస్తాడు; గుణ+ఆకర= మంచిగుణాలకు స్థానమైనవాడా! ఈ+జన్మమునన్; మన, స్నేహమునన్= మిక్కిలి ప్రేమచేత; నీవు+అ= నీవే; నాకున్; మఱి; పతివి= భర్తవు.

తాత్పర్యం: నీవు నాకు భర్త వైతే మా అన్న నిన్ను తన వాడినిగా స్వీకరిస్తాడు. కీడుచేయకుండా నిన్ను కాపాడుతాడు. అమితప్రేమచేత ఈ జన్మలో నువ్వే నాకు భర్తవు.

విశేషం: హిడింబ జన్మచే రాక్షసవనిత. కాని, ఉత్తమ మానవలక్షణాలతో కూడుకొన్న పతివ్రత. హాస్యానికై అబద్ధం పలకదు. ఆమె భీముడిని చూచింది. మన్మథభావానికి గురిఅయింది. అయినా, ఆమె భీముడిని కామంతో చంచలదృష్టితో చూడలేదు. అతడే ఆమెకు జన్మంతా భర్తగా ఉండాలని భావించింది. అతనికొరకు తన అన్నను వదలివేయటానికికూడా వెనుకాడలేదు. జనానంతర సౌహృదాల జాగృతివలన భీముడిని భర్తగా కోరిన ఉత్తమఇల్లాలు హిడింబ. పాండవులకు ప్రథమ సంతతిని ప్రసాదించబోయే ఆ పాత్రను నన్నయ ఉదాత్తంగా పోషించాడు.

చ. ఉఱడు సురేంద్రు నైన బలియుండు హిడింబుఁడు వానిబారికిన్
వెఱవనివారలుం గలరె? వీరలు ముంద రెఱుంగ రక్కటా!
యెఱిఁగిరయేని యిట్లు దమయిండులనుండిన యట్లు మెచ్చ కే
మఱి శయనింతురే; కడుఁ బ్రమాదము సేసిరి బుద్ధిహీను లై. 195

ప్రతిపదార్థం: బలియుండు= బలవంతుడైనవాడు; హిడింబుఁడు; సుర+ఇంద్రున్+ఐన= దేవేంద్రుడి నైనా; ఉఱఁడు= లెక్కపెట్టడు; వాని, బారికిన్= వాని హింసకు; వెఱువని, వారలున్= భయపడనివారు; కలరె= ఉన్నారా!; వీరలు= వీరు; అక్కటా= అయ్యో!; ముందర+ఎఱుఁగరు= ముందుగా తెలియరు; ఎఱిఁగిర+ఏని= తెలిసికొని ఉంటే; ఇట్లు= ఈ విధంగా; తమ, ఇండులన్= తమయొక్క ఇండ్లల్లో; ఉండిన+అట్లు = ఉన్నవిధంగా; మెచ్చక+ఏ= లెక్కచేయకే; మఱి; శయనించుదురె= పడుకొంటారా; కడు, బుద్ధి, హీనులు+ఐ= చాలాబుద్ధిలేనివారై; కడు= మిక్కలి; ప్రమాదము= పొరపాటు; చేసిరి.

తాత్పర్యం: హిడింబుడు బలవంతుడు. దేవేంద్రుడినికూడా లెక్కపెట్టడు. అతనిదెబ్బకు భయపడనివాళ్ళు లేరు. అయ్యో! వీళ్ళకు ముందుగా తెలియదు. తెలిసి ఉంటే ఈ విధంగా తమ ఇండ్లలో ఉన్నట్టు ఇతడిని లెక్కచేయకుండా ఇట్లా పడుకొంటారా! బుద్ధిహీనులై పెద్దపొరపాటు చేశారు.

విశేషం: 'ఉఱడు సురేంద్రు నైన' అనే దానికి ఉఱుకు సురేంద్రుఁడైన' అనే పాఠాంతరం ఉంది.

వ. 'ఇది హిడింబువనంబు; దీనం జొచ్చి వెలువడుట జముకుత్తుకఁ జొచ్చి వెలువడునట్లు; యాతం డింతకు వచ్చు; వీరితోడి దేమి; నీవు నాకుఁ బతి వై ప్రాణంబు రక్షించుకొని నావలన నిష్టోపభోగంబు లందు; మేనును గామచారిణిని; నీ కిష్టం బైన చోటికి నిన్నుఁ దోడ్కొనిపోవనేర్తు ననిన దానికి భీముం డి ట్లనియె. 196

ప్రతిపదార్థం: ఇది; హిడింబు, వనంబు= హిడింబునియొక్క అడవి; దీనిన్+చొచ్చి= దీనిలో ప్రవేశించి; వెలువడుట= బయటపడటం; జము, కుత్తుకన్= యముడియొక్క గొంతులో; చొచ్చి= ప్రవేశించి; వెలువడునట్లు+అ= బయటికి వచ్చినట్లే; అతండు= హిడింబుడు; ఇంతకున్= ఇంతలో; వచ్చున్= రానున్నాడు; వీరితోడిది+ఏమి= వీళ్ళతో ఏం పని; నీవు; నాకున్; పతివి+ఐ= భర్తవై; ప్రాణంబు; రక్షించుకొని; నావలనన్; ఇష్ట+ఉపభోగంబులు+అందుము= ఇష్టమైన సుఖాలు అనుభవించుము; ఏనును= నేనుకూడ; కామ, చారిణిన్= ఇచ్ఛ వచ్చిన చోటికి పోయేదాన్ని; నీకు+ఇష్టంబు+ఐన, చోటికిన్; నిన్నున్+తోడ్కొని= నిన్ను తీసుకొని; పోవనేర్తున్= పోగలను; అనినన్= అనగా; దానికిన్= హిడింబకు; భీముండు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఇది హిడింబాసురుడి అడవి. దీంట్లో ప్రవేశించి బయటికి పోవటం యముడి కుత్తుకలో ప్రవేశించి బయటపడటమే. ఇప్పుడే హిడింబుడు రాబోతున్నాడు. తక్కినవాళ్లసంగతి మన కెందుకు? నీవు నాకు భర్తవై ప్రాణాలు రక్షించుకొని నావలన కోరినసుఖాలు అనుభవించుము. నేను కోరినచోటికి పోగలదాన్ని. నీ కిష్టమైన చోటికి నిన్ను తీసికొని పోతాను' అని అనగా హిడింబతో భీముడు ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. విను బేల! యెట్టికష్టుఁడుఁ । దన పురుష గుణంబు పెడఁగఁ దల్లిని దోఁబు
ట్టినవారి విడిచి రాగం । బునఁ జపల స్త్రీ సుఖంబుఁ బొందునె చెపుమా. 197

ప్రతిపదార్థం: విను= వినుము; బేల= అమాయకురాలా; ఎట్టి, కష్టుఁడున్= ఎటువంటి నీచుడైనా; తన, పురుష, గుణంబు+చెడఁగన్= తన పురుష లక్షణం చెడిపోయేటట్లు; తల్లిని; తోన్+పుట్టినవారిన్= సోదరుల్ని; విడిచి; రాగంబునన్= మోహంచేత; చపల, స్త్రీ, సుఖంబున్= నిలుకడలేని స్త్రీవలనిసుఖాన్ని; పొందునె, చెపుమా= పొందుతాడా! చెప్పుము.

తాత్పర్యం: అమాయకురాలా! ఎంతటి నీచపురుషుడైనా తనపురుష లక్షణం పోగొట్టుకొని - తల్లిని, తోబుట్టువులను వదలి మోహంలో పడి చంచలమైన స్త్రీసుఖాన్ని పొందుతాడా! చెప్పుము.

విశేషం: 'బేల!', 'చపల స్త్రీ సుఖంబు' అనే రెండు శబ్దప్రయోగాల శక్తివలన ప్రతీయమానమయ్యే ధ్వని ఈ పద్యంలో ప్రాణం. వనంలో ప్రవేశించి సుఖంగా నిద్రిస్తున్న ధర్మజాదులను బుద్ధిహీనులనుగా భావించే హిడింబ, భీమునికి అమాయకురాలుగా అనిపించింది. మనసులో మెరసిన మదనభావానికి బానిస అయి ఆప్తులను వదలుకొనే లక్షణం చపల స్త్రీలకు సహజం. ఆమె భర్త మీదకూడ చపల ప్రణయమే కలిగిఉంటుందని భీముని వ్యాఖ్య. అందువలన ఇకపై హిడింబ తాను బేల కాదనీ, చపల కాదనీ మాటలతో, చేతలతో నిరూపించుకొని తనగాఢమైన ప్రేమను చాటుకొంది. భీముడు తాను ప్రౌఢుడనని, బంధుప్రీతి కలవాడననీ చెప్పుకొన్నాడు. హిడింబాభీముల ప్రవృత్తులు విరుద్ధాలని భీముని భావనం. (సంపా.)

వ. అనిన విని హిడింబ వీరి 'నందఱ రక్షించుట నీకుఁ బ్రియం బేని య ప్పురుషాదుండు రాకుండ ముంద వీరి నెత్తుకొని పోయెద; వీరలఁ బ్రబోధింపు' మనిన భీముం డి ట్లనియె. 198

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; విని; హిడింబ; వీరిన్+అందఱన్= వీళ్ళను అందరినీ; కాపాడుట= రక్షించుట; నీకు; ప్రియంబు+ఏని= ఇష్టమైతే; ఆ+పురుషాదుండు= ఆ మనుష్యులను తినేవాడు - ఆ రాక్షసుడు; రాకుండన్, ముంద= రాక; ముందుగానే; వీరిన్= వీళ్లను; ఎత్తుకొని, పోయెదన్; వీరలన్+ప్రబోధింపుము= వీరిని మేల్కొనుపుము; అనినన్= అనగా; భీముండు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'వీరి నెత్తుకొని పోయెద' అనిన విని హిడింబ భీమునితో 'వీ ళ్ళందరిని రక్షించటం నీ కిష్ట మైతే నరమాంసభక్షకుడైన ఆ రాక్షసుడు రాకముందే వీళ్ళను మేల్కొలుపుము' అనగా భీముడు ఇట్లా అన్నాడు.

విశేషం: సతికి తోబుట్టువుకోరికకంటె కట్టుకొన్నవాడిఇష్టమే ఎక్కువ అని వ్యంగ్యంగా హిడింబ చెప్పింది.

తే. అధికవీరుండు రక్కసుఁ డరుగుదెంచు । నని మనంబున భయమంది వనజనేత్ర!
వీరిసుఖసుప్తులై యున్నవారి నిద్ర। సెడఁగ బోధింప నోప; నాకడిమి వినుము. 199

ప్రతిపదార్థం: వనజ, నేత్ర= పద్మాలవంటి కన్నులు కలదానా!; అధిక వీరుండు= మేటివీరుడు; రక్కసుఁడు; అరుగుదెంచున్+అని= వస్తాడని; మనంబునన్, భయము+అంది= భీతి చెంది; సుఖ, సుప్తులు+ఐ+ఉన్నవారి= సుఖంగా నిద్రిస్తున్న వాళ్ళయిన వాళ్ళని; వీరిన్= వీళ్ళని; నిద్ర+చెడఁగన్= నిద్ర చెడిపొయ్యేటట్లు; బోధింపన్+ఓపన్= మేల్కొలుపలేను; నా, కడిమి= నా యొక్కబలం; వినుము.

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు కలదానా! మేటి వీరుడైన ఒక రాక్షసుడు వస్తున్నాడని సుఖంగా నిద్రిస్తున్న వీళ్ళను నిద్ర చెడిపొయ్యేటట్లు మేల్కొలుపలేను. నా బలాన్నిగూర్చి వినుము.

విశేషం: 'కన్యా వరయతే రూపం' అనే న్యాయంతో భీముడిని మనోహరరూపాన్ని చూచి అతడిని వలచింది హిడింబ. పరుల ఆధిక్యాన్ని తన యెదుట కీర్తిస్తే సహించలేని ఆత్మాభిమానం గల మహావీరుడు భీముడు. అయితే అతడు స్వభావంచేత ఉద్ధతుడు. తన పరాక్రమాదులను తానే కీర్తించకొనబోతున్నాడు. అతని మాటలవలన భీమునికి రూపానికి అనువైన పౌరుషంకూడా ఉన్నదని హిడింబకు తెలుస్తుంది. (సంపా.)

ఉ. క్రచ్చఱ నొక్కరక్కసుఁడ కాఁడు సురాసురులెల్ల నొక్కటై
వచ్చిన నీవ చూడఁగ నవార్యబలోన్నతిఁజేసి వారలన్
వ్రచ్చి వధింతుఁగాక; యిటు వచ్చి శ్రమంపడియున్న నిచ్చట
న్మెచ్చగువీరి దైన సుఖనిద్రకు భంగము సేయనేర్తునే. 200

ప్రతిపదార్థం: క్రచ్చు+అఱన్= మాంద్యము - మెల్లదనం - తొలగేటట్లుగా - అంటే వేగంగా; ఒక్క, రక్కసుఁడు+అ, కాఁడు= ఒక్కరాక్షసుడు మాత్రమే కాదు; సుర+అసురులు+ఎల్లన్= దేవతలు, రాక్షసులు అందరు; ఒక్కటి+ఐ= ఏకమై; వచ్చినన్= వచ్చినప్పటికీ; ఈవు+అ= నీవే; చూడగఁన్= చూస్తుండగా; అవార్య, బల+ఉన్నతిన్+చేసి= అడ్డుకొన సాధ్యం కాని బలంయొక్క ఆధిక్యంతో; వారలన్=వాళ్లను; వ్రచ్చి= చీల్చి; వధింతున్+కాక= చంపుతాను కాని; ఇటు, వచ్చి= ఈ విధంగా వచ్చి; శ్రమంపడి= అలసట పొంది; ఉన్నన్=ఉండగా; ఇచ్చటన్= ఇక్కడ; మెచ్చు+అగు= మెచ్చుకోదగిందైన; వీరిది+అగు= వీళ్ల; సుఖ, నిద్రకున్= సుఖమైన నిద్రకు; భంగము= ఆటంకం; చేయనేర్తునే= కలిగిస్తానా!

తాత్పర్యం: వేగంతో ఒక్క రాక్షసుడే కాదు దేవదానవులంతా ఏకమై వచ్చినా, నీవు చూస్తుండగా అపారబలంతో వాళ్ళను చీల్చి చంపుతాను. కాని, ఈ విధంగా వచ్చి అలసటచెంది సుఖంగా నిద్రించే వీళ్ళనిద్రకు భంగం కలిగిస్తానా?

విశేషం: పరపరాక్రమ వర్ణనంవలన ఏర్పడిన సాహంకారక్రోధంతో ఆత్మప్రశంసారూపమైన ప్రతాపోక్తులు పలకటం భీమపాత్రకు సహజం. క్రోధభాద్రమైన ఉత్సాహభావాన్ని దీప్తరసత్వం కల ఉజ్జ్వలవాక్యాలలో వ్యక్తంచేసిన భీముడిమాటలను కాంతిగుణంలో ప్రకాశింపచేయటం నన్నయ రుచిరార్థసూక్తినిధిత్వ లక్షణం. (సంపా.)

వ. 'పెక్కులు వలుకక యారక్కసురాఁ బనుపు' మని భీమసేనుండు విజృంభించి పలుకుచున్నంత నట హిడింబుండు హిడింబ మసలుటకు మహాక్రోధానలజ్వలితచిత్తుం డయి. 201

ప్రతిపదార్థం: పెక్కులు+పలుకక= ఎక్కువమాటలాడక; ఆ, రక్కసున్, రాన్+పనుపుము= ఆ రాక్షసుడిని వచ్చేట్లు పంపుము; అని= ఆ ప్రకారం; భీమసేనుండు; విజృంభించి; పలుకుచు+ఉన్న+అంతన్= పలుకుతూ ఉండే సమయంలో; అట హిడింబుండు= హిడింబాసురుడు; హిడింబ; మసలుటకు= ఆలస్యం చేయటానికి; మహా+క్రోధ+అనల, జ్వలిత, చిత్తుండు+అయి= మిక్కిలి కోపమనే నిప్పుచేత మండుతున్న మనస్సుకలవాడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఎక్కువగా మాట్లాడక ఆ రాక్షసుడిని ఇక్కడికి పంపు' మని భీమసేనుడు పెచ్చుపెరిగి పలుకుతుండగా - అక్కడ హిడింబుడు, హిడింబ ఆలస్యం చేసినందుకు మిక్కిలి కోపించి.

సీ. **కాలమేఘంబునుబోలె విశాల మై। నీల మై దేహంబు గ్రాలుచుండ**
ఘనతటిల్లతలయ ట్లెనిమిది దంష్ట్రలు। మెఱవంగఁ బండులుఁ గొఱికి పెలుచ
నతిరోషలోహితాయతవృత్తనేత్రముల్। దిరుగంగఁ బెట్టుచుఁ బరుషకేశ
జాలంబు గాడ్పునఁ దూలంగఁ గాలోప। మానుఁ డై చనుదెంచి మానుషాదుఁ.

ఆ. **దనుజఁ జూచి 'కష్టమనుజులఁ గూడి నా। పనుపు సేయకుండఁ జనునె నీకు?'**
ననుచు నుదరిపలుక విని హిడింబయుఁ గడు। వెఱచి భీమసేను మఱువు సొచ్చె. **202**

ప్రతిపదార్థం: కాల, మేఘంబును+పోలెన్= నల్లనిమేఘంవలె; విశాలము+ఐ; నీలము+ఐ= నీలిరంగు గల దేహంబు; గ్రాలుచున్+ఉండన్= ఒప్పుతూ ఉండగా; ఘన, తటిత్+లతల+అట్లు= మేఘంలోని మెరుపుతీవలవలె; ఎనిమిది, దంష్ట్రలు= ఎనిమిదికోరలు; మెఱవంగన్= ప్రకాశిస్తుండగా; పెలుచన్= గట్టిగా; పండులు= పండ్లు; కొఱికి, అతి, రోష, లోహిత+ఆయత, వృత్త, నేత్రముల్= మిక్కిలికోపంతో ఎఱ్ఱనై, నిడుపులై గుండ్రనివైన కన్నులు; తిరుగంగన్+పెట్టుచున్= తిప్పుతూ; పరుష, కేశ, జాలంబు= బిరుసైన వెండ్రుకల సమూహం; గాడ్పునన్= గాలిచేత; తూలంగన్= కదలగా; కాల+ఉపమానుఁడు+ఐ= యమునితో పోల్చదగినవాడై; చనుదెంచి= వచ్చి; మానుషాదుఁడు= మానవమాంసం తినేవాడు-రాక్షసుడు; అనుజన్= తోబుట్టువును - చెల్లెలిని; చూచి; కష్ట, మనుజులన్+కూడి= నీచులైన మానవులతో కూడి; నా, పనుపు+చేయకుండన్= నాయొక్క ఆజ్ఞను పాటించకుండటం; నీకున్; చనునె= తగునా; అనుచున్= అని అంటూ; ఉదరి= పైకెగసి; పలుకన్= మాటాడగా; విని=ఆలకించి; హిడింబయున్; కడున్= మిక్కిలి; వెఱచి= భయపడి; భీమసేను, మఱువు+చొచ్చెన్= భీమునిచాటుకు వెళ్ళింది.

తాత్పర్యం: నల్లనిమబ్బువంటి పెద్దదేహంతో, మేఘంలోని మెరపు తీగలవంటి ఎనిమిదికోరలతో, గట్టిగా పండ్లుకొరికి; కోపంతో ఎఱ్రబడి, నిడుపులై, గుండ్రనివైన కళ్ళు తిప్పుతూ, బిరుసువెండ్రుకలు గాలికి కదులుతూ ఉండగా - యముడివంటిరాక్షసుడు హిడింబుడు వచ్చి, చెల్లెలిని చూచి 'నీవు నీచులైన మానవులతో కలిసి నా ఆజ్ఞ త్రోసిపుచ్చటం తగునా?' అని గద్దించి పలుకగా హిడింబ మిక్కిలి భయపడి భీమునిచాటుకు వెళ్ళింది.

విశేషం: అలం: ఉపమ.

భీమసేనహిడింబాసురుల యుద్ధము (సం.1-141-15)

వ. **అంత.** **203**

తాత్పర్యం: అప్పుడు.

ఉ. **పన్నగవైరి విక్రముఁడు పాండవ సింహము దానిఁ జూచి 'మీ**
యన్నను నన్నుఁ జూడుము భయంపడకుండుమ' యంచు, వాని న
త్యున్నతిఁ దాఁకి 'రాక్షస! వధోచిత! నీ బల గర్వ మేదఁగా
నిన్ను వధించి యివ్వనము నెట్టన చేసెద నిర్భయంబుగన్'. **204**

ప్రతిపదార్థం: పన్నగవైరి, విక్రముఁడు= పాములకు శత్రువైన గరుడునివంటి పరాక్రమం కలవాడు; పాండవ, సింహము= పాండవులలో శ్రేష్ఠుడు - భీముడు; దానిన్= ఆ హిడింబను; చూచి, మీ, అన్నను; నన్నున్, చూడుము; భయంపడక+ఉండుము= భయపడకుండా ఉండు; అంచున్= అనుచు; వానిన్= ఆ హిడింబాసురుని; అతి+ఉన్నతిన్= పెద్దఎత్తున; తాఁకి= ఎదుర్కొని; రాక్షస= ఓ రాక్షసుడా!; వధ+ఉచిత= చంపదగినవాడా!; నీ, బల, గర్వము+ఏదఁగాన్= నీ యొక్క బలంయొక్క పొగరు నశించేటట్లుగా; నిన్నున్; వధించి= చంపి; ఈ+వనమునన్= ఈ అడవిని; నెట్టన= తప్పనిసరిగా; నిర్+భయంబుగన్= భయంలేని దానినిగా, చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: గరుత్మంతునివంటి పరాక్రమం కల భీముడు, ఆ హిడింబతో -'మీ అన్నను, నన్ను చూడుము. భయపడకుము' అని పలికి ఆ హిడింబాసురుని పెద్దఎత్తున ఎదుర్కొని 'రాక్షసా! నీవు చంపదగినవాడివి; నీ బలగర్వం నశించేటట్లు నిన్ను చంపి, ఈ అడవిని తప్పక భయం లేని దాన్నిగా చేస్తాను' అన్నాడు.

విశేషం: హిడింబునికి భయపడి భీముని అండజేరింది-హిడింబ. భీముడిబాధ్యత పెరిగింది. తన బలానికీ హిడింబుడి బలానికీ గల భేదాన్ని చూడటానికి ఆమెను అక్కడే నిలవబడుమన్నాడు-భీముడు. 'తొలగిపొమ్ము' నుండి 'భయపడకుండా నిలిచిచూడు' అన్నంతవరకు మాట మారింది. ఆ మార్పుకు అభిమానమే కారణం, కాని భీమునికి ఆమెపట్ల కలిగిన వలపు కాదు. ఏమైనా వైముఖ్యంనుండి సౌముఖ్యంవరకు దిగేటట్లు భీముడిని ఆకట్టుకొనగలిగింది హిడింబ. (సంపా.)

క. 'చక్క నగు' మనిన రక్కసుఁ । డక్కజముగఁ బెరిఁగి 'యియ్యయగు నిప్పడు, నీ
యుక్కును బీరముఁ జూచెదఁ । జిక్కక నిలు' మనుచుఁ గడు విజృంభించి వడిన్. 205

ప్రతిపదార్థం: చక్కనగుము= చక్కగా, నిలువు; అనినన్= అనగా; రక్కసుఁడు; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; పెరిగి= విజృంభించి; ఇయ్య+అగున్= అంగీకారమవుతుంది; ఇప్పుడు; నీ+ఉక్కును= నీయొక్క బలాన్ని; బీరమున్= పరాక్రమాన్ని; చూచెదన్= చూస్తాను; చిక్కక= వెనుదీయక; నిలుము; అనుచున్= అంటూ; కడున్= మిక్కిలి; విజృంభించి= పెచ్చుపెరిగి; వడిన్= వేగంగా.

తాత్పర్యం: 'చక్కగా నిలువు' మనగానే రాక్షసుడు ఆశ్చర్యకరంగా విజృంభించి, సరే, అని 'నీ బల పరాక్రమాలను చూస్తాను గాక! వెనుదీయక నిలబడు' అని పెచ్చుపెరిగి వేగంగా.

క. చే సమరికొంచుఁ బొడువఁగ । డాసినఁ దద్భుజముతోన డగ్గఱఁగ జయో
ద్భాసి యయి పట్టికొనియె మ । హాసత్త్వుఁడు భీమసేనుఁ డమ్మనుజాదున్. 206

ప్రతిపదార్థం: చే, సమరికొంచున్= చేయి చరుచుకొంటూ; పొడువఁగన్= కొట్టడానికి; డాసినన్= సమీపించగా; మహాసత్త్వుఁడు= మిక్కిలి బలం గలవాడు; భీమసేనుఁడు, జయ+ఉత్+భాసి+అయి= విజయంతో మిక్కిలి ప్రకాశించేవాడై; ఆ+మనుజాదున్= ఆ రాక్షసుడిని; తత్+భుజముతోన, డగ్గఱఁగన్= ఆ భుజంతోగూడ దగ్గరగా; పట్టుకొనియెన్.

తాత్పర్యం: చేయి చరచి కొట్టటానికి మీదికి రాగా, మహాబలవంతుడైన భీముడు గెలుపు పొంది వెలిగేవాడై ఆ రాక్షసుణ్ణి వాడిచేతితోసహా దగ్గరగా పట్టుకొన్నాడు.

క. 'నిరుపద్రవసుఖనిద్రా । నిరతాత్మకు లయిన వీరినిద్రకు నస్మ
చ్చరణభుజఘాతశబ్దం । బరుదుగ విఘ్నంబు సేయు' నని వగచి మదిన్. 207

ప్రతిపదార్థం: నిర్+ఉపద్రవ, సుఖ, నిద్రా, నిరత+ఆత్మకులు+అయిన= హానిలేని సుఖమైన నిద్రలో తగిలిన మనస్సు కలవాళ్ళయిన; వీరి+నిద్రకున్; అస్మత్+చరణ, భుజ, ఘాత, శబ్దంబు= మాయొక్కకాళ్ళయొక్క చేతులయొక్క దెబ్బలధ్వని; అరుదుగన్= ఆశ్చర్యంగా; విఘ్నంబు+చేయున్+అని= ఆటంకం కలిగిస్తుందని; మదిన్= మనస్సులో; వగచి= బాధపడి.

తాత్పర్యం: భంగం లేని సుఖనిద్రలో ఉండే వీళ్ళనిద్రకు, తమకాళ్ళచేతుల దెబ్బల ధ్వని ఆటంకం కలిగిస్తుందని మనసులో బాధపడి.

క. **వడముడి యారక్కసు న। య్యెడ కష్టధనుఃప్రమాణ మెడ గలుగఁగ నె**
వ్వడి నీడ్చె నల్పమృగమును। విడువక గజవైరి యీడ్చువిధమునఁ బెలుచన్. **208**

ప్రతిపదార్థం: వడముడి= భీముడు; ఆ రక్కసున్; ఆ+ఎడకున్= ఆ ప్రదేశానికి; అష్ట, ధనుః, ప్రమాణము= ఎనిమిది విండ్లకొలత; ఎడ+కలుగఁగన్= దూరం ఉండేటట్లు; నెఱ+వడిన్= మిక్కిలి వేగంతో; గజవైరి= ఏనుగుల శత్రువైన సింహం; అల్ప, మృగమును= చిన్నజంతువును; విడువక; పెలుచన్= గట్టిగా; ఈడ్చు, విధమునన్; ఈడ్చెన్= ఈడ్చాడు.

తాత్పర్యం: భీము డా రాక్షసుణ్ణి - సింహం చిన్న జంతువును వదలక గట్టిగా ఈడ్చేటట్లు - ఆ ప్రదేశానికి ఎనిమిది ధనుస్సుల కొలత గల దూరానికి మిక్కిలి వేగంగా ఈడ్చాడు.

విశేషం: అలం: ఉపమ. ధనుస్సు= నాల్గుమూరలకొలత. అష్టధనుస్సులు కనుక ముప్పైరెండు మూరల దూరం.

వ. **అట్టియెడ.** **209**

తాత్పర్యం: అటువంటి సమయంలో.

చ. **చరణహతిన్ మహాతరులు సాల్పడి జర్జరితంబు లై మహిం**
దొరఁగఁగ నిట్టు లొండొరులతోడ మదోద్ధతషష్టిహాయన
ద్విరదములట్లు ఘోరరణవీరులు సేసిరి మల్లయుద్ధ ము
ద్ధురబలు లై సమీరణసుతుండు హిడింబుఁడు తద్వనంబునన్. **210**

ప్రతిపదార్థం: ఘోర, రణ, వీరులు= భయంకరమైన యుద్ధవీరులు; సమీరణ, సుతుండు= వాయుదేవునియొక్క కుమారుడు - భీముడు; హిడింబుఁడు; చరణ, హతిన్= కాళ్ళయొక్క త్రొక్కిడిచేత; మహా, తరులు= పెద్దచెట్లు; చాలు+పడి= వరుసగా పడి; జర్జరితంబులు+ఐ= విరిగినవై; మహిన్+తొరగఁగన్= భూమిమీద పడగా; ఒండు+ఒరులతోడన్= ఒకరితో నొకరు; ఇట్టులు= ఈ విధంగా; మద+ఉద్ధత, షష్టి, హాయన, ద్విరదముల+అట్లు= మదంచేత గర్వించిన అరవయ్యేండ్ల మదపుటేనుగులవలె; ఉద్ధుర, బలులు+ఐ= ఎక్కువైన బలంగలవాళ్ళయి; తత్+వనంబునన్= ఆ అడవిలో; మల్లయుద్ధము; చేసిరి.

తాత్పర్యం: భయంకర యుద్ధవీరులైన భీమహిడింబులు - తమకాళ్ళతొక్కిడికి వరుసగా పెద్దపెద్ద వృక్షాలు విరిగి నేల కొరిగేటట్లు, అరవయ్యేండ్ల మదపుటేనుగులవలె ఆ అడవిలో ఒకరితో ఒకరు మల్లయుద్ధం చేశారు.

విశేషం: అలం: ఉపమ.

క. భూరిపదఘాతజాత ధ ।రారేణుప్రకరధూసరశరీరకు లై
వా రిద్దఱు నొప్పిరి నీ । హారచ్ఛన్నంబు లయిన యద్రులపోలెన్. 211

ప్రతిపదార్థం: భూరి, పద, ఘాత, జాత, ధరా, రేణు, ప్రకర, ధూసర, శరీరకులు+ఐ= గొప్పవైన కాళ్ళయొక్క తొక్కిళ్ళవలన పుట్టిన భూమియొక్క దుమ్ముకణాల సమూహంచేత బూడిదరంగు గల దేహం కలవాళ్ళయి; వారు+ఇద్దఱున్= భీమ హిడింబు లిద్దరు; నీహార, చ్ఛన్నంబులు+అయిన= మంచుచేత కప్పబడ్డవైన, అద్రుల, పోలెన్= పర్వతాలవలె; ఒప్పిరి=ఉండిరి.

తాత్పర్యం: గొప్పవైన కాళ్ళతొక్కిళ్ళచేత పుట్టిన దుమ్ము కప్పి, బూడిదరంగుదేహాలు కలవాళ్ళయి భీమ హిడింబు లిద్దరు మంచుచేత కప్పబడిన కొండలవలె ఉన్నారు.

విశేషం: అలం: ఉపమ.

క. ఆరాక్షసుండు భీము న । పారభుజాబంధనమున బంధించి మహా
ధీరధ్వని రోదోంతర। పూరిత మగునట్లు గాఁగ బొబ్బిడి యార్చెన్. 212

ప్రతిపదార్థం: ఆ, రాక్షసుండు; భీమున్; అపార, భుజా, బంధమునన్= అంతులేని చేతుల బిగింపుచే; బంధించి= కట్టివేసి; మహాధీర, ధ్వని= గొప్ప ధీరునియొక్క ధ్వని - గొప్ప ధైర్యంతో కూడినశబ్దం; రోదోంతర, పూరితము+అగునట్లు+కాఁగన్= భూమ్యాకాశాల నడుమ నిండింది అయ్యేట్లుగా; బొబ్బ+ఇడి= సింహనాదం చేసి; ఆర్చెన్= అరచాడు.

తాత్పర్యం: ఆ రాక్షసుడు భీముణ్ణి గట్టిగా చేతులతో బంధించి గొప్పధీరునివలె భూమ్యాకాశాల మధ్య భాగమంతా నిండేట్లు పెద్దగా సింహనాదం చేసి అరచాడు.

వ. అమ్మహాధ్వని విని కుంతియుఁ గొడుకులును మేల్కని, తమసమీపంబున నతిమానుషం బయిన రూప సౌందర్యములతో నున్న హిడింబం జూచి, 'యిది వనదేవతయో సురకన్యయో' యనుచు విస్మయంబందిరి; రంతం గుంతి శాంతవచనంబుల 'నీ వెందులదాన? విట కేల వచ్చి?' తని యడిగిన నది యి ట్లనియె. 213

ప్రతిపదార్థం: ఆ+మహాధ్వని= ఆ పెద్దశబ్దం; విని, కుంతియున్, కొడుకులున్; మేలు+కని= మేల్కొంచి, నిద్ర తెలిసి; తమ, సమీపంబునన్; అతి, మానుషంబు+అయిన= మానవులకు అతిక్రమించిందైన - అంటే, మానవులకు లేనట్టిదైన; రూప, సౌందర్యములతోన్= ఆకారంతో, అందంతో; ఉన్న= ఉండిన; హిడింబన్; చూచి, ఇది; వన, దేవతయో= వనదేవతయో; సుర, కన్యయో= దేవతాకాంతయో; అనుచున్= అని తలస్తూ; విస్మయంబు+అందిరి= ఆశ్చర్యపడ్డారు; అంతన్= తరువాత; కుంతి; శాంత, వచనంబులన్= మెల్లనిమాటలతో; నీవు, ఎందుల, దానవు= నీవు ఎక్కడిదానివి; ఇటకు+ఏల= ఇక్కడికి ఎందులకు; వచ్చితివి+అని-వచ్చా వని; అడిగినన్= అడుగగా; అది= ఆ హిడింబ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ పెద్దశబ్దం విని కుంతీదేవీ, కొడుకులూ మేల్కొని తమసమీపంలో మానవాతీతమైన రూప సౌందర్యాలతో ఉన్న హిడింబను చూచి, ఇది వనదేవతో లేక దేవకాంతో అని ఆశ్చర్యపడ్డారు. తర్వాత కుంతి మెల్లని మాటలతో 'నీవు ఎక్కడి దానివి? ఇక్కడి కేల వచ్చావు?' అని అడుగగా అమెతో ఆ హిడింబ ఇట్లా చెప్పింది.

సీ. నీలజీమూతంబులీల నాక్షేపించి । నల్ల నై తోతెంచు నల్లగృహము
గల హిడింబుం డను బలితంపురక్కసు । చెలియల; నాతండు వెలయ మీకు
రోయక యహితంబు సేయ నన్ బంచినఁ । జనుదెంచి, యేను మీ తనయునందుఁ
బతిబుద్ధిఁ దాల్చి యుద్ధతమన్మథార్త నై । మసలితి; మసలిన నసుర వచ్చి.

తే. యలిగి, మీతోడ నన్నును గలయఁ బట్టి । మ్రింగ నున్న నయ్యసురతోడం గడంగి
మల్లయుద్ధంబు సేయుచు నల్లచోట । నున్నవాఁడు మీసుతుఁడు దర్పోన్నతుండు. 214

ప్రతిపదార్థం: నీల, జీమూతంబు, లీలన్= నల్లనిమేఘంయొక్క విలాసాన్ని; ఆక్షేపించి= త్రోసిపుచ్చి, నల్లన+ఐ=నల్లగా; తోతెంచు= కనిపించేటి; అల్ల, గృహము= ఆ యిల్లు; కల= కలిగిన; హిడింబుండు+అను; బలితంపు, రక్కసు, చెలియలన్= బలవంతుడైన రాక్షసునియొక్క చెల్లెలిని; అతండు= ఆ హిడింబుడు; వెలయన్= ప్రకాశించగా; రోయక= విడువక; మీకున్= మీకు అందరికీ; అహితంబు+చేయన్= కీడుచేయటానికి; నన్= నన్ను (హిడింబను); పంచినన్= ఆజ్ఞాపించగా; ఏను= నేను, మీ, తనయునందు= మీ కుమారునిమీద; పతి, బుద్ధిన్= భర్త అనే మనస్సును; తాల్చి= ధరించి; ఉద్ధత, మన్మథ+ఆర్తను+ఐ= మిక్కిలి మన్మథబాధను పొందినదాన్నై; మసలితిన్= ఆలస్యంచేశాను; మసలినన్= ఆలస్యం చేయగా; అసుర= రాక్షసుడు; వచ్చి, అలిగి= కోపించి; మీతోడన్= మీతో; నన్నును= నన్నుకూడా; కలయన్+పట్టి= మిక్కిలి గట్టిగా నిర్బంధించి; మ్రింగన్+ఉన్నన్= మ్రింగబోతుండగా; ఆ, అసురతోడన్= ఆ రాక్షసునితో; కడంగి= పూనుకొని; మల్లయుద్ధంబు+చేయుచున్; దర్ప+ఉన్నతుండు= గర్వంలో అధికుడైనవాడు; మీ సుతుఁడు= మీ కుమారుడు; అల్ల, చోటన్= ఆ ప్రదేశాన; ఉన్నవాఁడు= ఉన్నాడు.

తాత్పర్యం: మేఘకాంతిని మించిన నల్లదనంతో కన్పట్టే ఆ యిల్లు గల హిడింబుడనే రాక్షసుడి చెల్లెలిని. అతడు మీకు కీడు చెయ్యమని నన్ను పంపిస్తే, నేను మీ కుమారుణ్ణి భర్తగా భావించి, మన్మథబాధ పొంది ఆలస్యం చేయటంచేత, అతడు వచ్చి కోపించి మీతో పాటు నన్నుగూడ మ్రింగబోయాడు. అప్పుడు గర్వాధికుడైన మీ కుమారుడు పూనుకొని అతనితో మల్లయుద్ధం చేస్తూ అదిగో అక్కడ ఉన్నాడు.

విశేషం: అన్నిచోట్ల ప్రాసయతి గల సీసం. ప్రసాదగుణంగల రచనలో - ప్రసన్నంగా మాట్లాడిన హిడింబమాటలు రచించటం, ఒక్కగుక్కలో ఎంతోకథను చెప్తుతున్న స్ఫూర్తిని సీసపద్యరచనలో కలిగించటం నన్నయ కథాకథనశిల్పం. హిడింబమాటలు పొల్లులేనివి, సార్థకమైనవి, సాభిప్రాయమైనవి. 'మీ తనయునందు పతిబుద్ధి తాల్చి, ఉద్ధతమన్మథార్తనై మసలితిని' అన్న వాక్యం ఆమె సంభాషణలో ఆయువుపట్టు. అదే కుంతిమనసును ఆకట్టుకొన్న సమ్మోహనాస్త్రం. 'మీ సుతుడు దర్పోన్నతుండు' అనే మాట కోడలు అత్తతో అనదగిన ఆప్యాయపు అభివ్యక్తి. రాబోయే కథను వస్తుధ్వనితో ప్రసన్నంచేశాడు నన్నయ. (సంపా.)

వ. 'నన్నును మిమ్మును రక్షించి యా రక్కసు నుక్కడంగ నశ్రమంబున నిప్పడు చంపుం జూడుం' డనిన నందఱు లేచి యుద్ధతులై మల్లయుద్ధంబు సేయుచున్న భీమహిడింబులం జూచి; రంత నచ్చోటికిం జని యర్జునుండు భీమసేనున కి ట్లనియె. 215

ప్రతిపదార్థం: నన్నునున్; మిమ్మునున్; రక్షించి= కాపాడి; ఆ, రక్కసు+ఉక్కు+అడంగన్= ఆ రాక్షసుడిబలం నశించేటట్లు; అశ్రమంబునన్= సులువుగా; ఇప్పుడు= ఈ సమయంలోనే; చంపున్= చంపుతాడు; చూడుండు+అనినన్; అందఱున్, లేచి; ఉద్ధతులు+ఐ= గర్వించినవాళ్ళై, మల్ల, యుద్ధంబు; చేయుచున్+ఉన్న= మల్లయుద్ధం చేస్తూ ఉన్న; భీమ, హిడింబులన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీముడిని, హిడింబుని; చూచిరి; అంతన్= అప్పుడు; అర్జునుండు; ఆ+చోటికిన్ చని= అక్కడకు వెళ్ళి; భీమసేనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నన్నూ మిమ్మల్నీ రక్షించి, ఆ రాక్షసుణ్ణి ఇప్పుడు సులభంగా చంపగలడు చూడండి' అని అనగా- అందరూ లేచి, గర్వించి మల్లయుద్ధం చేసే ఆ భీమహిడింబులను చూచారు. అప్పుడు అర్జునుడు వాళ్ళు యుద్ధం చేసే చోటికి పోయి భీమునితో ఇట్లా అన్నాడు.

విశేషం: 'నన్నూ మిమ్మూ రక్షించి' అనటంలో కలుపుగోలుతనాన్నీ, ఆత్మీయతనూ; ' ఆ రాక్షసుడు' అని అన్నను పేర్కొనటంలో పుట్టింటి సంబంధాన్ని త్రెంచుకొని అత్తవారింటిలో కలిసిపోయిన ఆప్యాయతను అద్భుతంగా ప్రదర్శించింది హిడింబ.

ఉ. **తూ ర్పరుణంబుగాఁ దొడఁగె దుష్టనిశాచరవేళ యయ్యెడున్**
మార్పుము కాలయాపన మమర్పక యప్పిశితాశిఁ బట్టి పా
లార్పఁగ నేల నావుడు బలాఢ్యుఁడు భీముఁడు మల్లవిద్య నే
ర్పేర్పడఁగా హిడింబు బలహీనపరాక్రముఁ జేసెఁ జెచ్చెరన్. **216**

ప్రతిపదార్థం: తూర్పు+అరుణంబు+కాన్+తొడఁగెన్= తూర్పుదిక్కు ఎఱ్ఱపడటం మొదలైంది; దుష్ట, నిశా, చర, వేళ+ అయ్యెడున్= దుర్మార్గులైన రాక్షసుల వేళ అవుతున్నది; కాల, యాపనము+అమర్పక= ఆలస్యం చేయక; ఆ+పిశితాశిన్+పట్టి= ఆ రాక్షసుడిని పట్టి; మార్పుము= చంపుము; పాలార్పఁగన్+ఏల= ఉపేక్షించుట ఎందుకు?; నావుడున్= అని అనగా; బల+ ఆఢ్యుఁడు= బలంతో కూడినవాడు; భీముఁడు; మల్ల, విద్య, నేర్పు+ఏర్పడఁగాన్= మల్లవిద్యలోని నైపుణ్యం ప్రకాశించేటట్లు; హిడింబున్= హిడింబాసురుణ్ణి; చెర+చెరన్= వెంటనే; బలహీన, పరాక్రమున్= బలం నశించిన పరాక్రమం కలవాణ్ణిగా; చేసెన్.

తాత్పర్యం: 'తూర్పు ఎఱ్ఱబడుతున్నది. దుష్టరాక్షసులకు అనుకూల సమయం ఆసన్నమౌతున్నది. ఆలస్యం చేయక ఆ రాక్షసుణ్ణి చంపుము' అని అర్జునుడనగా తనమల్లయుద్ధనైపుణ్యం మెరయగా భీముడు హిడింబాసురుణ్ణి బలహీనుణ్ణి చేశాడు.

విశేషం: సంధ్యాసమయం రాక్షసుల కనుకూలమట! పూర్వసంధ్యాసమయంలో రౌద్రముహూర్తం వస్తుందట! అప్పుడు రాక్షసు లెక్కువ శక్తిమంతులవుతారట! 'పుర స్సంరజ్యతే ప్రాచీ । పూర్వా సంధ్యా ప్రవర్తతే । రౌద్రే ముహూర్తే రక్షాంసి । భవంతి బలవంతి చ' - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.376.

క. **వడి నసురవాత ముక్కున । నుడుగక రక్తప్రవాహ మొలుకుచు నుండన్**
గడకాలు వట్టి వానిని । మడవక పవనజుఁడు నూఱు మాఱులు వీచెన్. **217**

ప్రతిపదార్థం: వడిన్= వేగంగా; అసుర, వాత= రాక్షసునియొక్కనోటనుండి; ముక్కునన్= ముక్కునుండి; ఉడుగక= ఆగక; రక్త, ప్రవాహము= నెత్తుటిధార; ఒలుకుచున్, ఉండన్= కారుతూ ఉండగా; పవనజుఁడు= వాయుపుత్త్రుడైన భీముడు; కడ, కాలు, పట్టి= కాలి చివరిభాగం పట్టుకొని; వానిన్= ఆ హిడింబాసురుడిని; మడవక= వెనుకాడక; నూఱు, మాఱులు; వీచెన్= విసిరాడు (గిరగిర త్రిప్పాడు)

తాత్పర్యం: హిడింబాసురుడి నోట, ముక్కున ఆగకుండా నెత్తురుధారలు కారుతూ ఉండగా, భీముడు అతడి కడకాలుపట్టి గాలిలోకి ఎత్తి గిరగిరా వందసార్లు త్రిప్పాడు.

విశేషం: విసరటం పవనగుణం. హిడింబుడి కడకాలు పట్టి అతడిని వంగనీయక అతివేగంగా నూరుమారులు విసరిన భీముడిని పవనజుడని సంబోధించటం ఎంతో ఉచితంగా ఉన్నది.

ఆ. లావు సెడఁగ నిట్లు వీవంగఁ బడి గత। చేష్టుఁ డయిన యసురుఁ జిక్కఁ బట్టి
నేలఁ బెట్టి వాని కోలెమ్ము బ్రల్లన। విఱిచి నడుము ద్రుంచి వీచి వైచె. 218

ప్రతిపదార్థం: లావు+చెడఁగన్= బలం నశించేటట్లు; ఇట్లు= ఈ విధంగా; వీవంగన్+పడి= విసరబడి; గత, చేష్టుఁడు+అయిన= పోయినచేష్టలు కలవాడైన; అసురన్= రాక్షసుడిని; చిక్కన్+పట్టి= బిగియపట్టి; నేలన్+పెట్టి= నేలమీద పెట్టి; వాని, కోలెమ్ము= వాడి వెన్నెముకను; బ్రల్లు+అనన్= భళ్ళుమనేటట్లు; విఱిచి; నడుము; త్రుంచి; వీచి, వైచెన్= గాలి విసురునట్లు విసరివేశాడు.

తాత్పర్యం: బలం క్రుంగేటట్లు ఈ విధంగా విసరటంచేత అవయవాల కదలికలు కోల్పోయిన హిడింబుణ్ణి బిగియబట్టి, నేలమీద పెట్టి, అతడి వెన్నెముక విరిచి, నడుము త్రుంచి విసరివేశాడు.

విశేషం: అలతి అలతి పదాలతో కూడిన ఈ ఆటవెలది ఆ హిడింబుడి ప్రాణాలతో భీముడాడుకొన్న అతిభయంకరమైన తీరును అద్దంలోవలె పాఠకునికి ప్రదర్శిస్తున్నది.

వ. అట్టి చిత్ర వధం జూచి చిత్రీయమాణచిత్తు లై భీమసేను పరాక్రమంబు వొగడుచు నందఱు హిడింబానుగమ్యమాను లై చని; ర ట్లరుగునెడ భీముండు హిడింబ రాక కొడంబడక 'రాక్షసులు వైరంబుఁ దలంచి మాయలు సేయుదురు కావున నీవు మాతోడ రావలవదు; నిన్ను విశ్వసింపము; నీవును మీయన్న వోయిన తెరువున పొ' మ్మనిన నది భయంపడి వడవడ వడంకుచున్న దానిం జూచి కరుణారసార్ద్రచిత్తుం డయి ధర్మరాజు భీమున కి ట్లనియె. 219

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; చిత్ర, వధన్= చిత్రమైన చంపటాన్ని; చూచి; చిత్రీయమాణ, చిత్తులు+ఐ= ఆశ్చర్యపడుతున్న మనస్సు కలవాళ్ళయి; భీమసేను, పరాక్రమంబు= భీమునిపరాక్రమాన్ని; పొగడుచున్= పొగడుతూ; అందఱు; హిడింబ+అనుగమ్యమానులు+ఐ= హిడింబచేత వెంబడింపబడినవాళ్ళయి; చనిరి=వెళ్ళారు; అట్లు+అరుగు+ఎడన్= ఆ విధంగా వెళ్ళేటప్పుడు; భీముండు; హిడింబ, రాకకు+ఒడంబడక= హిడింబ రావటానికి ఇష్టపడక; రాక్షసులు= రక్కసులు; వైరంబున్= పగను; తలంచి= మనస్సులోఉంచి; మాయలు; చేయుదురు= చేస్తారు; కావునన్; నీవు; మాతోడ; రా, వలవదు= రావద్దు; నిన్నున్= నిన్ను; విశ్వసింపము= నమ్మము; నీవును; మీ+అన్న+పోయిన; తెరువునన్= మార్గాన; పొమ్ము+అనినన్= పొమ్మని అనగా (అన్నపోయినమార్గం మరణమే); అది= ఆ హిడింబ; భయంపడి= భీతిచెంది; వడవడ, వడంకుచున్+ఉన్న దానిన్+చూచి= వడవడ వణకుతూ ఉండేది చూచి; కరుణా, రస+ఆర్ద్ర, చిత్తుండు+అయి= దయారసంచేత తడిసిన మనస్సు కలవాడై; ధర్మరాజు; భీమునకున్+ఇట్లు+అనియెన్= భీమునితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా హిడింబుణ్ణి చిత్రవధ చేయటంచూచి ఆశ్చర్యపడి, భీమునిపరాక్రమాన్ని పొగడుతూ, హిడింబ తమ వెంట రాగా, అందరూ అతనిదగ్గరకు వెళ్ళారు. భీముడు హిడింబ రాకకు ఇష్టపడక' రాక్షసులు పగబట్టి మాయలు చేస్తారు. అందుచేత నీవు మాతో రావద్దు. నీవుకూడా మీ అన్న చనిపోయినట్లే చావు' మని అనగా, ఆ రాక్షసి భయపడి వడవడ వణుకుతుండటం చూచి దయతో ధర్మరాజు భీమునితో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. వధకు నర్హుఁడై వచ్చినవానిఁ జంపి । తదియు ధర్మువ; యిది చాల నబల; దీని
కలుగఁ జన; దాత్మరక్షకు నగ్గలంబు । ధర్మరక్షయ యుత్తమధార్మికులకు. 220

ప్రతిపదార్థం: వధకున్+అర్హుఁడు+ఐ= చంపబడటానికి తగినవాడై; వచ్చినవానిన్= వచ్చిన అతణ్ణి; చంపితివి= చంపావు; అదియు= అది; ధర్మువు+అ= ధర్మమే; ఇది= ఈ హిడింబ; చాలన్, అబల= ఏ మాత్రం బలం లేనిది - ఆడది; దీనికిన్+అలుగన్= దీనిమీద కోపపడటం; చనదు= కూడదు; ఉత్తమ, ధార్మికులకు= ఉత్తములైన ధర్మాత్ములకు; ధర్మ, రక్షయ= ధర్మాన్ని రక్షించటమే; ఆత్మరక్షకున్= తనరక్షణకంటె; అగ్గలంబు= అధికం.

తాత్పర్యం: చంపదగినవాణ్ణి చంపావు. అది ధర్మమే. ఈ హిడింబ చాలా అబల. దీనిమీద కోపపడ కూడదు. ఉత్తములైన ధర్మాత్ములకు ఆత్మరక్షణకంటె ధర్మరక్షణమే ఉత్తమం.

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తినిధిలో ఇదొక సూక్తిరత్నం. సమస్యను విశ్లేషించి నిర్ణయించటంలో ధర్మజునివివేకం అపూర్వం. హిడింబను రక్షించటం ధర్మరక్షణం; శిక్షించటం ఆత్మరక్షణానికి సంబంధించింది. ఆత్మరక్షణకొరకు చూడక ధర్మరక్షణచేయటం ఉత్తమధార్మికుల కర్తవ్యమని ధర్మజుని తీర్పు.

క. ఆపద యైనను ధర్మువ । ప్రాపుగ రక్షింపవలయుఁ బరమార్థము; ధ
ర్మాపాయమ ధార్మికులకు । నాపద జన్మాంతరమున ననుగత మగుటన్. 221

ప్రతిపదార్థం: ఆపద+ఐనను= ప్రమాదం కలిగినా; ధర్మువు+అ= ధర్మాన్నే; ప్రాపుగన్= ఆధారంగా; రక్షింప, వలయున్= కాపాడాలి; పరమ+అర్థము= సత్యం; జన్మ+అంతరమునన్= ఇంకొక పుట్టుకలోకూడ; అనుగతము+అగుటన్= వెంబడించేది కావటంవల్ల; ధార్మికులకున్= ధర్మం ఆచరించేవారికి; ధర్మ+అపాయము+అ= ధర్మం చెడటమే; ఆపద= కీడు.

తాత్పర్యం: తనకు ఆపద కలిగినా ధర్మాత్ములు ధర్మాన్నే రక్షించాలి. ఇది నిజం. ఎందుచేతనంటే ఇంకొక జన్మలో కూడా వెంటవచ్చేది కావటంచేత ధర్మం చెడిపోవటమే ధర్మాత్ములకు నిజమైన ఆపద.

విశేషం: ధర్మప్రబోధానికి, ధర్మసూక్ష్మవివరణకు కథాగమనంలో ఎక్కడ ఏ అవకాశం వచ్చినా నన్నయ దాన్ని జారవిడువడు. కథా ప్రసన్నతకు భంగం లేకుండా, సూటిగా, సులభశైలిలో, రమణీయంగా ధర్మాన్నిగూర్చి చెప్పి ఆవలికథను కొనసాగించటం ఆయన పద్ధతి.

వ. 'దీనియందు రాక్షసభావం బుపలక్షింపవలవదు; మాకు నాత్మీయబుద్ధియ యుండు' ననిన హిడింబ ధర్మరాజునకుం గుంతీదేవికి మ్రొక్కి యేకాంతంబునఁ గుంతి కి ట్లనియె; 'నవ్వా! సర్వప్రాణులకు సామాన్యం బయ్యును మనోజరాగంబు వనితల కసహ్యం బయి విశేషంబయి యుండు; నేను వృకోదరునిమిత్తంబు మదనబాణబాధిత నయి నాచుట్టంబులను జెలులను విడిచితి; నాయిష్టంబు మీరు గావింపనినాఁ డిప్పడ ప్రాణంబులు విడుతు; నన్ను రక్షించిన మీకు నిష్టంబులయినవాని నెల్లం దలంచి చేయుదు; నిమ్ముగానియెడ మి మ్మందఱ నెత్తికొని మీమెచ్చినచోటికిఁ బోవనేర్తు; నాపలుకులు నమ్ము నది; యే నతీతానాగతవర్తమానంబు లెల్లను దెల్లంబుగా నెఱుంగుదు; వలయునేని యనాగతంబు సెప్పెద వినుండు; ముందట నొక్క సరోవరంబును

నొక్కవనస్పతియునుం గల; వవి రెండును శాలిహోత్రుం డనుమహామునిచేతం దపఃప్రభావంబునం బడయంబడినయవి; యక్కొలనినీళ్ళు ద్రావినవారికి నెన్నండును నాఁకలియును నీరువట్టును లే; వవ్వనస్పతియు శీతవాతాతపవర్షంబులవలన రక్షించు; మీర లందున్న మీ కడకుఁ గృష్ణద్వైపాయనుండు వచ్చి మీకు హితోపదేశంబు సేయు నని చెప్పిన. 222

ప్రతిపదార్థం: దీని+అందున్= ఈ హిడింబపట్ల; రాక్షస భావంబు; ఉపలక్షింపవలవదు= చూడవద్దు; మాకున్; ఆత్మీయ, బుద్ధియు+అ= బంధువనే తలంపే; ఉండున్= ఉన్నది; అనినన్; హిడింబ; ధర్మరాజునకున్, కుంతీదేవికిన్; మ్రొక్కి; ఏకాంతంబునన్= ఒంటరిగా; కుంతికిన్; ఇట్లు+అనియెన్; అవ్వా= అమ్మా; సర్వ, ప్రాణులకున్= అన్ని జీవులకు; సామాన్యంబు+ అయ్యును= సాధారణమే అయినను; మనోజ, రాగంబు= మన్మథునివలన కోరిక; వనితలకున్= స్త్రీలకు; అసహ్యంబు+అయి= ఎక్కువైనదై; ఉండున్= ఉంటుంది; నేను; వృక+ఉదరు, నిమిత్తంబు= భీమునికారణంగా; మదన, బాణ, బాధితను+అయి= మన్మథునియొక్కబాణాలచేత బాధింపబడినదాననై; నా, చుట్టంబులనున్; చెలులనున్=స్నేహితులను; విడిచితిన్= వదలిపెట్టాను; నా+ఇష్టంబు= నాయొక్క కోరికను; మీరు, కావింపనినాఁడు= మీరు తీర్చని రోజు; ఇప్పుడు+అ= ఇప్పటికిప్పుడే; ప్రాణంబులు విడుతున్= ప్రాణాలు వదలివేస్తాను; నన్నున్; రక్షించినన్; మీకున్ ఇష్టంబులు+అయిన, వానిన్+ఎల్లన్= మీకిష్టమైన అన్నింటిని; తలంచి= ఆలోచించి; చేయుదున్= చేస్తాను; ఇమ్ము, కాని+ఎడన్= అనుకూలం కానిదైన చోట; మిమ్మున్+అందఱన్= మిమ్మల్ని అందరినీ; ఎత్తికొని; మీ మెచ్చిన, చోటికిన్ = మీరు కోరిన ప్రదేశానికి; పోవన్; నేర్తు= పోగలను; నా పలుకులు= నా మాటలు; నమ్ముఁడి= నమ్మండి; ఏన్= నేను; అతీత+అనాగత, వర్తమానంబులు+ఎల్లను= భూత భవిష్య, ద్వర్తమానాల నన్నింటిని; తెల్లంబుగాన్= స్పష్టంగా; ఎఱుంగుదున్; వలయున్+ఏని= అవసరమైతే; అనాగతంబు= రాబోయేదాన్ని; చెప్పెదన్; వినుండు; ముందటన్; ఒక్క సరోవరంబును= ఒక కొలను; ఒక్క, వనస్పతియున్= ఒక్క చెట్టు; కలవు; అవి, రెండును; శాలిహోత్రుండు+అను= శాలిహోత్రుడు అనే పేరుగల; మహామునిచేతన్= మహర్షి చేత; తపఃప్రభావంబునన్, పడయన్+ పడిన+అవి= తపస్సు యొక్క ప్రభావంతో. పొందబడినవి; ఆ+కొలని= ఆ కొలనులోని; నీళ్ళు; త్రావిన, వారికిన్; ఎన్నండును= ఎప్పుడునూ; ఆఁకలియును; నీరుపట్టును= దప్పికయును; లేవు; ఆ+వనస్పతియున్= ఆ చెట్టుకూడ; శీత+వాత+ఆతప, వర్షంబువలనన్= చలి, గాలి, ఎండ, వానలనుండి; రక్షించున్= కాపాడుతుంది; మీరలు, అందు+ఉన్నన్= అచ్చట ఉండగా; మీ, కడకున్= మీ చెంతకు; కృష్ణద్వైపాయనుండు= వేదవ్యాసమహర్షి; వచ్చి; మీకున్, హిత+ఉపదేశంబు= మేలును కలిగించేమాటలు; చేయున్= చెప్తాడు; అని; చెప్పినన్.

తాత్పర్యం: 'ఈ హిడింబను రాక్షసిగా చూడవద్దు. మాకు ఈమెపట్ల బంధుభావమే ఉన్నది' అని ధర్మరాజు అనగా - హిడింబ, ధర్మజునికి, కుంతీదేవికి మ్రొక్కి ఏకాంతంలో కుంతితో 'అమ్మా! సర్వప్రాణులకు కామవాంఛ సమానమే. అయినా స్త్రీలవిషయంలో ఇది ఓర్చుకొనరానిదై ఉంటుంది. నేను భీమునిమీద మనసుపడి బంధువులను, స్నేహితులను వదలుకొన్నాను. నాకోరికను మీరు తీర్చకుంటే ప్రాణాలు విడుస్తాను. నన్ను రక్షిస్తే మీ కిష్టమైన వాటిని చేస్తాను. మీకు మార్గం అనుకూలంగా లేనప్పుడు మీరు కోరినచోట్లకు మిమ్మల్ని ఎత్తుకొని పోయి చేర్చగలను. భూతభవిష్యద్వర్తమానాలను ఎరిగి చెప్పగలను. ఇప్పుడు రాబోయేదాన్ని గురించి చెప్తాను-వినండి. ముందర కొంత దూరాన ఒక సరోవరం, ఒక వృక్షం ఉన్నాయి. అవి రెండూ శాలిహోత్రుడనే మహామునితపఃప్రభావంచేత ఏర్పడ్డాయి. ఆ సరోవరంలోని నీళ్ళు త్రాగితే ఆకలిదప్పులుండవు. ఆ చెట్టు - చలి, గాలి, ఎండ, వానలనుండి రక్షించగలదు. మీ రక్కడ ఉండగా కృష్ణద్వైపాయనుడు వచ్చి మీకు మేలుకలిగేమాటలు చెప్తాడు' - అని చెప్పగా.

క. విని కుంతియుఁ బాండవులును। మనమున విస్మయముపడి సమంజసభావం
బున దాని దివ్యవనితయ। యని తద్దయు నాదరించి రప్పడు కరుణన్. 223

ప్రతిపదార్థం: విని, కుంతియున్; పాండవులును; మనమునన్; విస్మయముపడి= ఆశ్చర్యపడి; సమంజస, భావంబునన్= మంచి అభిప్రాయంతో; దానిన్= ఆ హిడింబను; దివ్యవనితయ+అని= దేవతాస్త్రీ అని; అప్పుడు; కరుణన్= దయతో; తద్దయున్= మిక్కిలి; ఆదరించిరి.

తాత్పర్యం: హిడింబమాటలు విని కుంతీదేవి, పాండవులు ఆశ్చర్యపడి మంచి అభిప్రాయంతో ఆమెను దేవతా కాంతగా భావించి మిక్కిలిదయతో అదరించారు.

వ. అంత దాని వినయంబునకు ననాగతం బెఱుంగుటకు సంతసిల్లి కుంతి భీమున కి ట్లనియె. 224

ప్రతిపదార్థం: అంత= తరువాత; దాని, వినయంబునకున్= ఆ హిడింబయొక్క అణకువకు; అనాగతంబు+ఎఱుంగుటకున్= రాబోయేదాన్ని తెలిసికొనగలగటానికి; సంతసిల్లి= సంతోషించి; కుంతి; భీమునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ తరువాత హిడింబయొక్క అణకువకు, భవిష్యత్తును తెలిసికొనగలిగిన వివేకానికి సంతోషించి, కుంతీదేవి భీమునితో ఈ విధంగా అన్నది.

భీముఁడు తల్లియనుమతంబున హిడింబను బరిగ్రహించుట (సం. 1-143-1)

క. అన్న! యిది ధర్మ్మ వని మీ । యన్నను నన్నును నతిప్రియంబున నెదలో
మన్నించి, యేమి వనిచినఁ గ్రన్నన మా పసుపు సేయఁ గడఁగుము బుద్ధిన్. 225

ప్రతిపదార్థం: అన్న= నాయనా భీమసేనా! ఇది; ధర్మ్మవు+అని= ధర్మమని; మీ, అన్నను= మీ అన్న అయిన ధర్మరాజును; నన్నును= నన్ను; అతిప్రియంబునన్= మిక్కిలి ప్రీతితో; ఎదలో= మనస్సులో; మన్నించి= గౌరవించి; ఏమి+పనిచినన్- ఏమి ఆజ్ఞాపించినా; క్రన్నన= వెంటనే; మా, పసుపు+చేయన్= మాయొక్క ఆజ్ఞ చేయటానికి; బుద్ధిన్= ఇష్టపడి; కడఁగుము= పూనుకొమ్ము.

తాత్పర్యం: నాయనా! భీమసేనా! మీ అన్న ధర్మరాజునూ, నన్నూ గౌరవించి, మేము ఏమి ఆజ్ఞాపించినా అది ధర్మ మని తలచి, వెంటనే చేయుము.

విశేషం: 'అన్న' - వాత్సల్యపూరితమైన సంబోధన. 'బుద్ధిన్' అనే దానికి 'భక్తిన్' అనే పాఠాంతరం కూడ ఉన్నది.

క. ఇది పరమ సాధ్వి, దీనిని । మది నొండుగఁ దలఁప వలదు, మానుగఁ బుత్త్రా
భ్యుదయ మగుఁ; బాండుహితముగ । నిది కార్యం బని పరిగ్రహింపుము నెమ్మిన్. 226

ప్రతిపదార్థం: ఇది= ఈ హిడింబ; పరమసాధ్వి= ఉత్తమ పతివ్రత; మదిన్= మనస్సులో; దీనిన్= ఈమెను; ఒండుగన్= వేరొక విధంగా; తలఁపవలదు= భావించవద్దు; మానుగన్= ఒప్పుగా; పాండు, హితముగన్= పాండురాజుకు మేలు కలిగేటట్లు; పుత్త్ర+అభ్యుదయము+అగున్= పుత్త్రుడు పుట్టటం జరుగుతుంది; నెమ్మిన్= సంతోషంతో; ఇది; కార్యంబు+అని= ఇది చేయదగిన పని అని; పరిగ్రహింపుము= చేపట్టుము.

తాత్పర్యం: ఈ హిడింబ ఉత్తమపతివ్రత. మనస్సులో దీన్ని గురించి వేరొక విధంగా భావించవద్దు. పాండురాజుకు కూడా మేలుకలిగేటట్లు పుత్రుడు పుడతాడు. ఇది చేయదగినపని అనే తలంపుతో దీన్ని చేపట్టుము.

విశేషం: వంశంలో పుత్రపౌత్రాభివృద్ధి పితృదేవతలకు హితమైనది. అందుచేతనే కుంతి పాండుహితంగా పుత్రాభ్యుదయం అవుతుందనటం.

వ. అని భీమసేను నొడంబఱిచి హిడింబ కనురాగంబుగాఁ జెప్పి 'నీవు శుచి వయి యుత్తమ స్త్రీ గుణంబులు దాల్చి భీమునకు మనఃప్రియంబు సేయుము; పగ ళ్లెల్లను మీ యిష్టంబున విహరించి రాత్రులు మాయొద్దన యుండు నది' యని నియమించిన భీముండును 'బుత్త్రజన్మం బగునంతకు దీని మీవచనంబునఁ బరిగ్రహించెద' నని వారల సమక్షంబున సమయంబు సేసె; నంతఁ బాండవులు జననీసహితంబు శాలిహోత్రునాశ్రమంబునకుం జని ప్రభాతసమయంబున నక్కొలనఁ గృతస్నాను లయి సంధ్యావందనంబులు దీర్చి; శాలిహోత్రుచేతం బూజితు లయి తద్వనస్పతి చ్ఛాయా శీతల తలంబున విశ్రమించి విగత క్షుత్పిపాసు లై సుఖం బున్నంత. 227

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; భీమసేనున్, ఒడంబఱచి= ఒప్పించి; హిడింబకున్; అనురాగంబుగాన్= ప్రేమగా; చెప్పి; నీవు; శుచివి+అయి= పరిశుద్ధురాలవై; ఉత్తమ, స్త్రీగుణంబులు+తాల్చి= ఉత్తమస్త్రీయొక్క లక్షణాలను కలిగి; భీమునకున్; మనఃప్రియంబున్= మనస్సుకు సంతోషాన్ని; చేయుము= కలిగించుము; పగళ్లు+ఎల్లను= పగలంతా, మీ ఇష్టంబున= మీయొక్క ఇష్టం వచ్చినట్లు; విహరించి= తిరిగి; రాత్రులు; మా+ఒద్దన= మాదగ్గరే; ఉండునది= ఉండండి; అని= ఆ విధంగా; నియమించినన్= కట్టడి చేయగా; భీముండును; పుత్త్ర, జన్మంబు+అగు+అంతకు= కొడుకు పుట్టేవరకు; దీనిన్= హిడింబను; మీ వచనంబునన్= మీయొక్క మాటచేత; పరిగ్రహించెదను+అని= చేపడతానని. వారల= వాళ్లయొక్క; సమక్షంబునన్= ఎదుట; సమయంబు+చేసెన్= ప్రతిజ్ఞ చేసినాడు; అంతన్= ఆ తరువాత; పాండవులు= పాండుకుమారులు; జననీసహితంబు= తల్లితోకూడి; శాలిహోత్రు+ఆశ్రమంబునకున్= శాలిహోత్రునియొక్క ఆశ్రమానికి; చని=పోయి (వెళ్లి); ప్రభాత సమయంబునన్= ప్రొద్దుననే; ఆ+ కొలనన్= ఆ సరోవరంలో; కృత+స్నానులు+అయి= చేయబడ్డ స్నానము కలవారై; సంధ్యావందనంబులు= సంధ్యాసమయంలోని నమస్కారాలు; తీర్చి= తీర్చుకొని; శాలిహోత్రు+చేతన్= శాలిహోత్రమునిచేత; పూజితులు+అయి= గౌరవింపబడ్డవాళ్లై; తత్+వనస్పతి+ఛాయా+శీతల+తలంబునన్= ఆ వనస్పతి అను చెట్టు నీడయొక్క చల్లని ప్రదేశంలో; విశ్రమించి= విశ్రాంతి తీసుకొని; విగత+క్షుత్+పిపాసులు+ఐ= బొత్తిగా పోయిన (పూర్తిగా పోగొట్టబడిన) ఆకలి, దప్పిక కలవాళ్లై; సుఖంబు= సుఖంగా; ఉన్నంతన్= ఉన్న అనంతరం.

తాత్పర్యం: అని భీమసేనుణ్ణి ఒప్పించి, హిడింబకు ప్రియంగా జెప్పి, 'నీవు పరిశుద్ధురాలవై ఉత్తమ స్త్రీగుణాలతో భీముణ్ణి సంతోషపెట్టుము. పగలు నీ ఇష్టం వచ్చిన చోట తిరిగి, రాత్రులు మా దగ్గరే ఉండండి' అని నియమించగా భీముడుకూడ 'కొడుకు పుట్టేవరకు హిడింబను మీ మాటప్రకారం చేపడతా' నన్నాడు. తరువాత పాండవులు తల్లితో కలిసి శాలిహోత్రుని ఆశ్రమానికి వెళ్ళారు. ప్రొద్దున్నే అక్కడికొలనులో స్నానంచేసి, సంధ్యావందనాలు తీర్చుకొని, శాలిహోత్రునిచే గౌరవింపబడ్డారు. అక్కడిచెట్టునీడయొక్క చల్లదనంలో విశ్రాంతి తీసికొని, ఆకలిదప్పికలు తీరి సుఖంగా ఉన్నారు.

పాండవులకు వ్యాసుఁడు హితోపదేశము సేయుట (సం.1-144-7)

ఉ. పుణ్యతపోమయుండు మునిపూజ్యుఁడు బ్రహ్మసమప్రభుండు బ్ర
హ్మణ్యుఁడు ప్రావృషేణ్యజలదాసితవర్ణుఁ డశేషకిల్బిషా

రణ్యద వానలుం డగు పరాశరనందనుఁ డేగుదెంచెఁ ద

త్పుణ్యచయస్వరూపమునుబోలెఁ గరంబు మనోముదంబుగన్. 228

ప్రతిపదార్థం: పుణ్యతపః+మయుండు= పవిత్రమైన తపస్సు నిండుగా గలవాడు; ముని, పూజ్యుఁడు= మునులచేత పూజింప దగినవాడు; బ్రహ్మసమప్రభుండు= బ్రహ్మదేవునితేజస్సుతో సమానమైన తేజస్సు కలవాడు; బ్రహ్మణ్యుఁడు= బ్రాహ్మణులకు హితుడైనవాడు; ప్రావృషేణ్య, జలద+అసిత, వర్ణుఁడు= వర్షాకాలంలలోని మేఘంవలె నల్లనైన రంగు కలవాడు; అశేష కిల్బిష+అరణ్య; దవానలుండు+అగు= సర్వపాపాలు అనే అడవికి కార్చిచ్చువంటి వాడైన; పరాశర, నందనుఁడు= పరాశరుని యొక్క కుమారుడు, వ్యాసుడు; తత్+పుణ్య, చయ, స్వరూపమును+పోలెన్= ఆ కుంతీ పాండవులయొక్క పుణ్యసమూహంయొక్క ఆకారంవలె; కరంబు= మిక్కిలి; మనస్ ముదంబుగన్= మనస్సుకు సంతోషం కలిగేటట్లు; ఏగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: పవిత్రమైన తపస్సు నిండుగా కలవాడు, మునులచేత పూజింపదగినవాడు; బ్రహ్మదేవునితో సమానమైన తేజస్సు కలవాడు; బ్రాహ్మణులకు హితుడైనవాడు; వర్షాకాలమేఘంవంటి రంగుకలవాడు; సర్వపాపాలను హరించేవాడు అయిన వ్యాసుడు; ఆ కుంతీపాండవులయొక్క పుణ్యస్వరూపంవలె, వాళ్ళ మనస్సులకు ఆనందం కలిగేటట్లుగా వచ్చాడు.

విశేషం: అలం: ఉపమ, రూపకం.

వ. ఇట్లు వచ్చిన వేదవ్యాసమునీంద్రునకు నందఱు నతిభక్తి నమస్కరించి యాస నార్ఘ్యాది విధులం బూజించి యున్నవారలం గరుణార్ద్రదృష్టిం జూచి కృష్ణద్వైపాయనుం డి ట్లనియె. 229

ప్రతిపదార్థం: ఇట్లు; వచ్చిన; వేదవ్యాస, ముని+ఇంద్రునకున్= వేదవ్యాసమునిశ్రేష్ఠునికి; అందఱున్; అతి, భక్తిన్= మిక్కిలి భక్తితో; నమస్కరించి; ఆసన+అర్ఘ్య+ఆది, విధులన్= ఆసనం, అర్ఘ్యం, మొదలైన ఏర్పాట్లతో; పూజించి; ఉన్నన్=ఉండగా; వారలన్= వాళ్లను; కరుణా+ఆర్ద్ర, దృష్టిన్= దయచేత తడియైన చూపుతో; చూచి; కృష్ణద్వైపాయనుండు= కృష్ణద్వైపాయనుడైన వ్యాసుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా వచ్చిన మునిశ్రేష్ఠుడైన వేదవ్యాసునికి అందరూ భక్తితో నమస్కరించి, ఆసనం, అర్ఘ్యం మొదలైన ఉపచారాలతో పూజించి ఉండగా, వాళ్ళందరినీ దయార్ద్రదృష్టితో చూచి, వ్యాసుడు ఈ విధంగా అన్నాడు.

పద్మకము.

కొడుకు పల్కు విని కూడదు నాక దుర్మాతుఁడై

కడఁగి మీకు నపకారము సేసి ధరిత్రి వె

ల్వడఁగఁబంచెఁ గడుఁబాపమతిన్ ధృతరాష్ట్రుఁ, డె

య్యెడల దుర్జనుల నేమఱి నమ్మఁగఁ బోలునే. 230

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుడు; కొడుకు, పల్కు= కొడుకుయొక్క మాట; విని; కూడదు= తగదు; నాక= అని అనక; దుర్మాతుఁడు+ఐ= చెడుమనస్సు కలవాడై; కడఁగి= పూని; మీకున్; అపకారము, చేసి; ధరిత్రి= భూమి అనగా (రాజ్యం యొక్క పొలిమేరలను); వెలువడఁగన్= దాటిపోయేటట్లు; కడున్+పాపమతిన్= మిక్కిలిచెడుబుద్ధితో; పంచెన్= పంపించాడు; ఏ+ఎడలన్= ఎచ్చటైనా; దుర్జనులన్= దుర్మార్గులను; ఏమఱి= ఉపేక్షించి; నమ్మగన్+పోలునే= నమ్మవచ్చునా!

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు కొడుకుమాట విని, ఇది తగదని చెప్పక దుర్మార్గుడై మీకు అపకారం చేసి, మిమ్మల్ని రాజ్యంనుండి వెళ్ళగొట్టాడు. దుర్మార్గులను ఎక్కడైనా ఎప్పుడైనా ఉపేక్షించకూడదు, నమ్మకూడదు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. పద్మకవృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, భ, జ, జ, జ, గ - అనే గణాలుంటాయి. లాక్షణికులు 11వ అక్షరం యతిస్థానంగా పేర్కొన్నారు. కాని, నన్నయ 8వ అక్షరాన్ని యతిగా నిలిపాడు. ఆంధ్రమహాభారతమంతటిలో నన్నయమాత్రమే - ఒక్కసారిమాత్రమే - వాడినవిశేషవృత్తాల్లో ఇదొకటి కావటం విశేషం. ఇదికాక, రథోద్ధతం, మణిభూషకం, దండకం అనేవి ఈ కోవకు చెందుతాయి. (సంపా.)

వ. 'దీని నెఱింగి మీకు హితోపదేశంబు సేయ వచ్చితి; నిఖిల ధర్మవిదుల రయి వినీతుల రయిన మీకు బాంధవవియోజనం బయిన యీ కర్మంబు పురాకృతంబు; దీనికి శోకింపవలవదు; కొండొకకాలంబునకు మీరును బాంధవులం గలసి యెప్పటియట్ల రాజ్యంబు సేయుదు; రిది శాలిహోత్రుతపఃప్రభావంబున నైన కొలను; దీని జలంబు లుపయోగించినవారికి బుభుక్షాపిపాసలు లే; వివ్వనస్పతియును శీతవాతాతపవర్షంబువలన రక్షించు; నిం దొరు లెఱుంగకుండఁ గార్యార్థుల రై కతిపయదినంబు లుండి యేకచక్రపురంబున కేఁగి బ్రాహ్మణభావంబున బ్రాహ్మణగోష్ఠి నుండి నారాక ప్రతీక్షించియుండు నది' యని కఱపి తనకు వినయావనతులయి కృతాంజలు లయిన మనుమల దీవించి కౌఁగలించుకొని, బాష్పపూరితనయన యయి మ్రొక్కియున్న కోడలి నూరార్చి; 'నీకొడుకు ధర్మనిత్యుం; డీ యుధిష్ఠిరుండు నారాయణుభుజంబులంబోని తననలువురుదమ్ములబలంబున సర్వపార్థివుల శాసించి సార్వభౌముం డై రాజసూయాశ్వమేధాదిక్రతువులు సేసి పితృపైతామహం బైన రాజ్యలక్ష్మి ననుభవించుచుం గురుకులంబునెల్లఁ బవిత్రంబు సేయు' నని శోకోపశమనంబుఁ జేసి; హిడింబం జూచి 'దీనిపేరు కమలపాలిక యిది భీమునకు వశవర్తి యయి పరిచరించి మహాసత్త్వుం డయిన కొడుకుం గాంచు; నాతండు మి మ్మందఱ నాపద్విషయంబున నుద్ధరించు' నని చెప్పి మునివరుండు తిరోహితుం డైన. 231

ప్రతిపదార్థం: దీనిన్; ఎఱింగి= తెలిసికొని; మీకు; హిత+ఉపదేశంబు+చేయన్= మేలును కూర్చే మాటలు చెప్పటానికి; వచ్చితిన్; నిఖిల, ధర్మ, విదులరు+అయి= అన్నిధర్మాలు తెలిసికొన్న వాళ్ళయి; వినీతులరు= వినయం కలవాళ్లు; అయిన= అయినట్టి; మీకున్, బాంధవవియోజనంబు+అయిన= బంధువులకు దూరమైన; ఈ, కర్మంబు; పురాకృతంబు= గతజన్మంలో చేయబడింది; దీనికిన్; శోకింపన్, వలవదు= దుఃఖింప నక్కరలేదు; కొండొకకాలంబునకున్= కొంతకాలానికి; మీరును= మీరుకూడా; బాంధవులన్+కలిసి; ఎప్పటి+అట్ల= ఎప్పటివలెనే; రాజ్యంబు+ చేయుదురు; ఇది; శాలిహోత్రు, తపః, ప్రభావంబునన్+ ఐన= శాలిహోత్రుడనే మహామునియొక్క తపస్సుయొక్క మహిమచేత ఏర్పడిన; కొలను; దీని, జలంబులు; ఉపయోగించినవారికి; బుభుక్షా, పిపాసలు= ఆకలిదప్పులు; లేవు; ఈ+వనస్పతియును= ఈ చెట్టుకూడ; శీత, వాత+ఆతప, వర్షంబువలనన్= చలి, గాలి, ఎండ, వానలనుండి; రక్షించున్= కాపాడుతుంది; ఇందున్= ఇక్కడ; ఒరులు= ఇతరులు; ఎఱుంగక+ఉండన్= తెలుసుకొనకుండ; కార్య+అర్థులరు+ఐ= ప్రయోజనాన్ని కోరే వాళ్ళయి; కతిపయ, దినంబులు= కొన్నిరోజులు; ఉండి; ఏకచక్ర, పురంబునకున్= ఏకచక్రమనే పేరుగల పట్టణానికి; ఏఁగి= వెళ్ళి; అందున్= ఆ పట్టణంలో; బ్రాహ్మణభావంబునన్= బ్రాహ్మణులయొక్క పద్ధతిలో; బ్రాహ్మణులగోష్ఠిన్+ఉండి= బ్రాహ్మణులయొక్క సభలో ఉండి; నా రాక, ప్రతీక్షించి= నా యొక్క రాకను ఎదురుచూచి; ఉండునది= ఉండండి; అని= ఆప్రకారం; కఱపి= బోధించి; తనకున్; వినయ+అవనతులు+అయి= వినయంతో వంగినవారై; కృత+అంజలులు+అయిన= చేయబడిన చేతులజోడింపు కలవాళ్ళయిన - అంటే చేతులు జోడించి

నమస్కరించిన; మనుమలన్= మనుమల్ని; దీవించి= ఆశీర్వదించి; కౌఁగలించుకొని= ఆలింగనంచేసి; బాష్ప, పూరిత, నయన+అయి= కన్నీటిచే నిండిన కళ్ళు కలదై; మ్రొక్కి+ఉన్న= నమస్కరించిన; కోడలిన్= కోడలిని, కుంతిని; ఊరార్చి= ఓదార్చి; నీ, కొడుకు= నీ కుమారుడు; ఈ యుధిష్ఠిరుండు= ఈ ధర్మరాజు; ధర్మ, నిత్యుండు= ఎడతెగని ధర్మం కలవాడు; నారాయణ, భుజంబులన్+పోని= శ్రీమహావిష్ణువుయొక్క చేతులవంటి; తన, నలువురు+తమ్ముల, బలంబునన్; సార్వభౌముండు+ఐ= సమస్త భూమండలాన్ని ఏలువాడై; రాజసూయ+అశ్వమేధ+ఆది, క్రతువులు+చేసి= రాజసూయం, అశ్వమేధం మొదలయిన యాగాలు చేసి; పితృపైతామహంబు+ఐన= తండ్రితాతలకు సంబంధించిందైన; రాజ్యలక్ష్మిన్= రాజ్యసంపదను; అనుభవించుచున్= అనుభవిస్తూ; కురు, కులంబును+ఎల్లన్= కురువంశాన్నంతటినీ; పవిత్రంబు+చేయున్= పవిత్రం చేస్తాడు; అని= అని; శోక+ఉపశమనంబున్+చేసి= దుఃఖం తగ్గేటట్లు చేసి; హిడింబన్+చూచి; దీని, పేరు= ఈమె పేరు; కమలపాలిక; ఇది= ఈమె, భీమునకున్= భీమునికి; వశవర్తిని+అయి= లొంగినదై; పరిచరించి= సేవచేసి; మహా, సత్త్వుండు+అయిన= మిక్కిలి బలం గలవాడయిన; కొడుకున్= కుమారుణ్ణి; కాంచున్= పొందుతుంది; ఆతండు= ఆ కుమారుడు; మిమ్ము+అందఱన్= మిమ్మల్ని అందరినీ; ఆపత్+విషయంబునన్= ప్రమాదానికి సంబంధించిన సందర్భంలో; ఉద్ధరించున్= మీది కెత్తుతాడు - అంటే రక్షిస్తాడు; అని, చెప్పి; ముని, వరుండు= మునిశ్రేష్ఠుడు; తిరోహితుండు+ఐనన్= అగుపించకుండాపోయినవాడు కాగా - అంటే అంతర్ధానమందినవాడు కాగా.

తాత్పర్యం: 'ఆ విషయాన్ని తెలిసికొని మీకు హితోపదేశం చేయాలని వచ్చాను. అన్నిధర్మాలు తెలిసినవాళ్ళు, వినయవంతులు అయిన మీకు బంధువులతో ఎడబాటు కలగటం పూర్వజన్మకృతం. దీనికి దుఃఖించవద్దు. కొంతకాలానికి మీరుకూడా బంధువులతో కలిసి ఎప్పటివలె రాజ్యం చేస్తారు. ఇది శాలిహోత్రమహాముని తపః ప్రభావంచేత ఏర్పడిన సరోవరం. దీనినీళ్ళు త్రాగినవాళ్ళకు ఆకలిదప్పులుండవు. ఈ చెట్టుకూడ చలి, గాలి, ఎండ, వానలనుండి మిమ్మల్ని కాపాడుతుంది. ఇక్కడ ఇతరులకు కన్పించకుండ మీ పని నెరవేరేవరకు కొన్ని రోజులుండి, తరువాత ఏకచక్రపురానికి పోయి, అక్కడ బ్రాహ్మణరూపంలో బ్రాహ్మణులతో కలిసి ఉండి, నా రాకకోసం ఎదురుచూడం' డని బోధించాడు. తనకు శిరస్సువంచి నమస్కరించి, చేతులు జోడించి నిలిచిన మనుమలను దీవించి కౌగలించుకొని, కన్నీరు కారుస్తున్న కోడలు కుంతిని ఓదార్చి, 'నీకొడుకు యుధిష్ఠిరుడు ధర్మాత్ముడు. అతడు నారాయణునిభుజాలవంటి నలువురుతమ్ముళ్ల బలంచేత రాజులందరిని శాసించి సార్వభౌముడు చేసే, రాజసూయాశ్వమేధాదియాగాలు చేసి, తాతతండ్రులరాజ్యం ఏలగలుగుతాడు. కురువంశాన్నంతటిని పవిత్రం చేస్తాడు' అని వారిశోకాన్ని ఉపశమింపచేశాడు. హిడింబను చూచి 'దీని పేరు కమలపాలిక. ఇది భీమునికి వశమై సేవ చేసి మహాబలవంతుడైన కొడుకును కంటుంది. అతడు మిమ్ములన్నందరినీ ఆపత్సమయంలో రక్షిస్తాడు' అని చెప్పి వ్యాసమహర్షి అదృశ్యమయ్యాడు.

క. అమ్మునివరు కఱపిన మా । ర్గమ్మునఁ బాండవులు విగతకల్మషు లవిషా
దమ్మున సుఖముండిరి విన । య మ్మొప్పఁగ శాలిహోత్రునాశ్రమభూమిన్. 232

ప్రతిపదార్థం: ఆ+ముని, వరు, కఱపిన, మార్గమ్మునన్= ఆ మునిశ్రేష్ఠుడైన వ్యాసమహర్షి బోధించిన పద్ధతిలో; పాండవులు= పాండుకుమారులు; విగత, కల్మషులు= పోయినపాపంకలవాళ్ళు - అంటే పుణ్యాత్ములు; వినయమ్ము+ఒప్పఁగన్= వినయం ప్రకాశించగా; శాలిహోత్రు+ఆశ్రమ, భూమిన్= శాలిహోత్రునియొక్క ఆశ్రమప్రదేశంలో; అవిషాదమ్మునన్= దుఃఖంలేకుండా; సుఖము+ఉండిరి= సుఖంగా ఉన్నారు.

తాత్పర్యం: ఆ మునిశ్రేష్ఠుడైన వ్యాసమహర్షి బోధించినవిధంగా పుణ్యాత్ములైన పాండవులు వినయంతో శాలిహోత్రునిఆశ్రమంలో దుఃఖం లేకుండా సుఖంగా ఉన్నారు.

వ. అంత. 233

తాత్పర్యం: ఆ సమయంలో.

చ. పవనతనూజుఁ డక్కమలపాలికచేత వినీతుఁ డై మహా
ర్ణవవృతభూమిలోఁ గల వనంబుల హంసబలాకసారసా
రవరుచిరాపగావరసరఃపులినంబులఁ బర్వతంబులన్
వివిధవిహారుఁ డై యనుభవించె నభీష్టమనోజభోగముల్. 234

ప్రతిపదార్థం: పవన, తనూజుఁడు= వాయుదేవునికుమారుడైన భీముడు; ఆ+కమలపాలికచేతన్= ఆ హిడింబచేత; వినీతుఁడు+ఐ= నడిపించబడినవాడై; మహా+అర్ణవ, వృత, భూమిలోన్= పెద్దసముద్రాలచే చుట్టబడిన భూమిలో; కల= ఉన్న; వనంబులన్= అడవులలో; హంస, బలాక, సారస+ఆరవ, రుచిర+ఆపగా, వర, సరః+పులినంబులన్= హంసలయొక్క, కొంగలయొక్క, బెగ్గురుపక్షులయొక్క ధ్వనులచేత మనోహరాలైన నదులయొక్క, శ్రేష్ఠాలైన కొలనులయొక్క ఇసుకతిన్నెలలో; పర్వతంబులన్= కొండలలో; వివిధ, విహారుఁడు+ఐ= పలువిధాలైన విహారాలు కలవాడై; అభీష్ట, మనోజ, భోగముల్= మనస్సు కింపైన మన్మథసుఖాలను; అనుభవించెన్.

తాత్పర్యం: హిడింబ తనను అనుసరించగా భీముడు భూమండలంలోని అనేకవనాలలో, హంసలు, కొంగలు, బెగ్గురుపక్షులు మొదలయినవాటిధ్వనులచేత మనోహరాలైన నదులయొక్క, కొలనులయొక్క ఇసుకతిన్నెలలో; పర్వతాలలో అనేకవిధాల విహరించి మనసు కింపయిన మన్మథసుఖాలను అనుభవించాడు.

విశేషం: ఇందులో కమలపాలికాభీముల ప్రణయవిహారాలనే మనోహరసన్నివేశాలను మసృణమైన పదరచనతో నన్నయ వర్ణించి శ్లేషమనే గుణాన్ని పోషించాడు. శృంగారసస్ఫోరకమైన అక్షరరమ్యతతో రచనను అలంకరించాడు. (సంపా.)

హిడింబయందు ఘటోత్కచుండు పుట్టుట (సం.1-143-27)

చ. నరవరుఁడైన భీమువలనం బ్రభవించె హిడింబకున్ సుతుం
డురుతర భీమ రూపుఁడు ఘటోత్కచ నాముఁడు విస్ఫుర ద్భయం
కర వదనంబు శంకునిభకర్ణములున్ వికృతాక్షులుం బయో
ధరవరవర్ణమున్ వికటదారుణదంష్ట్రలు నొప్పచుండఁగన్. 235

ప్రతిపదార్థం: నర, వరుఁడు+ఐన= మానవులలో శ్రేష్ఠుడైన, భీమువలనన్= భీమునివల్ల; హిడింబకున్; విస్ఫురత్+భయంకర, వదనంబు= ప్రకాశిస్తున్న భయంకరమైన ముఖం; శంకు, నిభ, కర్ణములున్= మోడువంటిచెవులు; వికృత+అక్షులున్= వికారమైన కన్నులును; పయోధర, వర, వర్ణమున్= మేఘంయొక్క శ్రేష్ఠమైన రంగు, వికట, దారుణ, దంష్ట్రలున్= హెచ్చు తగ్గులై భయంకరాలైన కోరలు; ఒప్పుచున్+ఉండఁగన్= ప్రకాశిస్తుండగా; ఉరుతర, భీమ, రూపుఁడు= మిక్కిలి గొప్పదైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భయంకరమైన రూపంకలవాడు; ఘటోత్కచనాముఁడు= ఘటోత్కచుడనే పేరు కలవాడు; సుతుండు= కుమారుడు; ప్రభవించెన్= పుట్టాడు.

తాత్పర్యం: భీమహిడింబలకు భయంకరమైన ముఖం, మోడువంటిచెవులు, వికారాలైన కన్నులు, నల్లనిరంగు, హెచ్చుతగ్గులై భయంకరాలైన కోరలు, భీతి గొలిపే పెద్దదేహం కల ఘటోత్కచ నామధేయుడు కుమారుడొకడు పుట్టాడు.

విశేషం: శంకునిభకర్ణములున్- అనేదానికి శంఖనిభకర్ణములున్ అనే పాఠాంతరం ఉన్నది. మూలంలో 'శంకుకర్ణం విభీషణమ్' అని ఉంది - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.382.

వ. ఇట్లు సద్యోగర్భంబునం గామరూపధరుం డై ఘటోత్కచుండు పుట్టి తత్క్షణంబ నవయౌవనుండును ననేకాస్త్రశస్త్ర కుశలుండును నపరిమిత రాక్షస పిశాచ బలపరివృతుండును నై తల్లిదండ్రులకుఁ గుంతీదేవికి మ్రొక్కిన, నగ్రనందనుం డగుట నందఱును గరంబు గారవంబునఁ గొనియాడం గొన్నిదినంబు లుండి; యొక్కనాఁ డంజలి పుటఘటితమస్తకుం డయి 'రాక్షసపిశాచబలంబులతోడ నాయిమ్ముల నుండెదం; బని గలయప్పుడు నన్నుఁ దలఁ చునది; యాక్షణంబ వత్తు' నని యందఱిచేత ననుజ్ఞాతుండై తల్లిం దోడ్కొని, యుత్తరాభిముఖుం డయి యరిగె; నిట పాండవులును శాలిహోత్రునొద్ద ననేకధర్మశాస్త్రనీతిశాస్త్రంబు లభ్యసించి యమ్మునివరు వీడ్కొని చని విదర్భమత్స్య త్రిగర్తకీచక విషయంబులు గడచి యేకచక్రం బను నగ్రహారంబు గని. 236

ప్రతిపదార్థం: ఇట్లు; సద్యః+గర్భంబునన్= అప్పటికప్పుడు కలిగిన కడుపున; కామ, రూప, ధరుండు+ఐ= ఇచ్ఛవచ్చిన రూపాన్ని ధరించేవాడై; ఘటోత్కచుండు, పుట్టి; తత్+క్షణంబు+అ= ఆ నిమిషాన్నే; నవ, యౌవనుండును= క్రొత్తగా ఏర్పడిన యౌవనం కలవాడును; అనేక+అస్త్ర, శస్త్ర, కుశలుండునున్= పలువిధాలైన అస్త్రాలలో, శస్త్రాలలో నేర్పుకలవాడును; అపరిమిత, రాక్షస, పిశాచ, బల పరివృతుండునున్+ఐ= అంతులేని రాక్షసపిశాచబలంచేత చుట్టబడినవాడును అయి; తల్లి, తండ్రులకున్; కుంతీదేవికిన్; మ్రొక్కినన్= నమస్కరింపగా; అగ్ర, నందనుండు+అగుటన్= పెద్దకొడుకు కావటంచేత; అందఱును; కరంబు= మిక్కిలి; గారవంబునన్= ప్రేమతో; కొనియాడన్= పొగడగా; కొన్ని, దినంబులు+ఉండి; ఒక్కనాఁడు; అంజలి పుట, ఘటిత, మస్తకుండు+అయి= దొప్పవంటి చేమోడ్పులచే కూడిన తల కలవాడై; రాక్షస,పిశాచ, బలంబులతోడన్; ఆ+ఇమ్ములన్= ఆ ప్రదేశాలలో; ఉండెదన్; పని, కల+అప్పుడు= పని ఉండే సమయంలో; నన్నున్, తలంచునది= తలచండి; ఆ+క్షణంబు+అ= ఆ నిమిషాననే; వచ్చుదును+అని= వస్తానని; అందఱిచేతన్, అనుజ్ఞాతుండు+ఐ= అనుమతింపబడినవాడై; తల్లిన్+తోడ్కొని= తల్లిని తీసుకొని; ఉత్తర+అభిముఖుండు+అయి= ఉత్తరానికి ఎదురుగా ముఖం కలవాడై- అంటే ఉత్తరంవైపు తిరిగినవాడై; అరిగెన్= వెళ్ళాడు; ఇట; పాండవులును= పాండవులు కూడా; శాలిహోత్రు+ఒద్దన్= శాలిహోత్రునిదగ్గర; అనేక ధర్మశాస్త్ర, నీతి శాస్త్రంబులు= చాలా ధర్మశాస్త్ర నీతిశాస్త్ర విషయాలు; అభ్యసించి= నేర్చుకొని; ఆ+ముని, వరున్= ఆ మునిశ్రేష్ఠుడిని; వీడ్కొని= వదలి; చని= వెళ్ళి; విదర్భ, మత్స్య, త్రిగర్త, కీచక, విషయంబులు= విదర్భ, మత్స్య, త్రిగర్త, కీచక దేశాలు, కడచి= దాటి; ఏకచక్రంబు+అను+అగ్రహారంబు; కని= చూచి.

తాత్పర్యం: ఈ విధంగా అప్పటికప్పుడు కలిగిన గర్భంలో తనకు ఇచ్ఛవచ్చినరూపాన్ని ధరించగలవాడైన ఘటోత్కచుడు పుట్టి, తత్క్షణమే నవయౌవనం, వివిధశాస్త్రాలలో నైపుణ్యం కలవాడై, అపరిమితరాక్షసపిశాచబలంతో కూడి తల్లిదండ్రులకు, కుంతీదేవికి నమస్కరించాడు. ఘటోత్కచుడు మొదట పుట్టినకుమారుడు కావటంవలన

అతణ్ణి అందరు ఆదరించగా - అతడు కొన్నిదినాలుండి, ఒకనాడు అందరికీ నమస్కరించి - 'నేను రాక్షస పిశాచబలాలతో ఆయాప్రదేశాల్లో ఉంటాను. అవసరమైనప్పుడు నన్ను తలిస్తే ఆ క్షణాన్నే వస్తా' నన్నాడు. తరువాత అందరి అనుమతి పొంది తల్లిని వెంటతీసికొని ఉత్తరదిశగా వెళ్ళాడు. ఇట పాండవులు కూడా శాలిహోత్రుని దగ్గర అనేకధర్మశాస్త్రాలు, నీతిశాస్త్రాలు అభ్యసించి, ఆయనదగ్గర సెలవు తీసికొని విదర్భ, మత్స్య, త్రిగర్త, కీచకదేశాలు దాటి, ఏకచక్రమనే అగ్రహారాన్ని చూచి.

విశేషం: 'నాయిమ్ముల' - నాకు ఇష్టమైనట్లు - అనుకూలమైనట్లు అనిగూడ అన్వయించడానికి అవకాశం ఉన్నది. 'ఏకచక్రం బనునగ్రహారంబు' - ఏకచక్రాపురము అని మూలం. 'ఏకచక్రామ్ గతా స్తే తు' - చిత్రశాలాప్రతి, ఘటోత్కచజన్మము చైత్రబహుళ అష్టమి - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.383.

పాండవు లేకచక్రపురంబున విప్రగృహంబున నుండుట (సం.1-145-1)

క. లలితజటాజినకుశవ - ల్కలధరు లై వేద మొప్పఁగాఁ జదువుచు ని
మ్ముల బ్రహ్మచారివృత్తిని । వెలయఁగ నం దుండి రొక్కవిప్రగృహమునన్. 237

ప్రతిపదార్థం: లలిత, జటా+అజిన, కుశ, వల్కల, ధరులు, ఐ= చక్కనిజడలను, జింకతోళ్ళను, దర్భలను, నారచీరలను కట్టినవారై; వేదము= వేదాన్ని; ఒప్పఁగాన్= తగువిధంగా; చదువుచున్; ఇమ్ములన్=సుఖంగా; బ్రహ్మచారి, వృత్తిని= బ్రహ్మచారియొక్క నడవడితో; వెలయఁగన్= ప్రకాశించేటట్లు; ఒక్క, విప్ర, గృహమునన్= ఒక బ్రాహ్మణుని ఇంటిలో; అందున్= ఆ ఏకచక్రపురంలో; ఉండిరి.

తాత్పర్యం: (పాండవులు) చక్కనిజడలతో, జింకతోళ్ళతో, దర్భలతో, నారచీరలతో వేదపఠనం చేస్తూ బ్రహ్మచర్యవృత్తి నవలంబించి సుఖంగా ఆ ఏకచక్రపురంలో ఒక బ్రాహ్మణునిఇంట్లో ఉన్నారు.

క. ధృతిఁ జదువుచు భిక్షార్థము । ప్రతిగృహమున కరుగుచున్న భవ్యుల మౌన
వ్రతులం దృప్తులఁ జేసిరి । సతతము నందుల గృహస్థ సద్విజులు దయన్. 238

ప్రతిపదార్థం: ధృతిన్, చదువుచున్= సంతోషంతో చదువుతూ; భిక్షా+అర్థము= భిక్షకోసం; ప్రతిగృహమునకున్= ఇంటింటికి; అరుగుచున్+ఉన్న= వెళ్ళుతున్న; భవ్యులన్= మంచివాళ్ళను; మౌన, వ్రతులన్= మాటాడక ఉండే వ్రతాన్ని అవలంబించిన వాళ్ళను; అందుల= అక్కడి; గృహస్థ, సత్+ద్విజులు= ఏకచక్రపురంలోని గృహస్థులైన మంచి బ్రాహ్మణులు; దయన్= దయతో; సతతము= ఎల్లప్పుడు; తృప్తులన్+చేసిరి= తృప్తి పొందినవారినిగా చేశారు.

తాత్పర్యం: సంతోషంతో చదువుతూ భిక్షకోసం ప్రతిగృహానికి వెళుతున్న మౌనవ్రతులు, మంచివాళ్ళు అయిన పాండవులను ఏకచక్రపురంలోని సద్బ్రాహ్మణగృహస్థులు దయతో ఎల్లప్పుడు తృప్తిపరచారు.

క. 'జలజప్రియతేజుల వీ । రల ధీరుల ధరణివలయరాజ్యశ్రీయో
గ్యుల ని ట్లేలొకొ భిక్షా । శులఁ జేసె విధాతృఁ' డంచు శోకింప జనుల్. 239

ప్రతిపదార్థం: జలజ, ప్రియ, తేజులన్= నీటినుండి పుట్టిన పద్మానికి ప్రియుడైన సూర్యునివంటి కాంతి కలవాళ్ళను; ధీరులన్; ధరణి, వలయ, రాజ్యశ్రీ, యోగ్యులన్= భూమండలంయొక్క రాజ్యలక్ష్మికి తగినవాళ్ళను; వీరలన్= వీళ్ళను;

విధాతృఁడు= బ్రహ్మదేవుడు; ఏల+ఒకొ= ఎందుచేతనో; ఇట్లు= ఈ విధంగా; భిక్షా+అశులన్= భిక్షాన్నం తినేవాళ్ళుగా; చేసెన్; అంచున్= అంటూ; జనుల్; శోకింపన్= విచారింపగా.

తాత్పర్యం: 'సూర్యతేజులు, ధీరులు, భూమండలరాజ్యలక్ష్మికి తగినవాళ్ళు అయిన వీళ్ళను (పాండవులను) బ్రహ్మదేవుడు ఎందుచేత భిక్షాన్నం తినేవాళ్ళుగా చేశాడో కదా!' అని జనులంతా దుఃఖించగా.

క. పరమాన్నభక్ష్యభిక్షా। పరిపూర్ణతరంబు లయిన పాత్రము లయ్యే
వురు నిత్యంబు నివేదిం। తురు దల్లికిఁ గరముభక్తితో వినయమునన్. 240

ప్రతిపదార్థం: ఆ+ఏవురు= ఆ ఐదుగురు; నిత్యము= ప్రతిదినం; కరము= మిక్కిలి; భక్తితో; వినయమునన్= వినయంతో; పరమ+అన్న+భక్ష్య, భిక్షా, పరిపూర్ణతరంబులు+అయిన= పాయసంచేతను, పిండివంటలచేతను, అన్నంచేతను పూర్తిగా నిండినవైన; పాత్రములు= పాత్రములను; కుంతీదేవికి; నివేదింతురు= సమర్పిస్తారు, ఇస్తారు.

తాత్పర్యం: పాండవులైదుగురు ప్రతిదినం మిక్కిలి భక్తివినయాలతో పాయసం, పిండివంటలు, అన్నం నిండిన పాత్రలను తెచ్చి తల్లికి అందజేస్తారు.

వ. కుంతియు దాని రెండుభాగంబులు సేసి యం దొక్క భాగంబు భీమునకుం బెట్టి, తక్కిన భాగంబు గడమ కొడుకులుం దానును గుడుచుచు నిట్లు ప్రచ్ఛన్ను లై యేకచక్రపురంబున నున్నంత, నొక్కనాఁడు ధర్మార్జునయములు భిక్షార్థం బరిగిన నిట కుంతియు భీముండును దమ విడిసిన విప్రగృహంబున నున్నంత, నం దొక్కపెట్ట యార్తధ్వని యెగసిన విని కుంతీదేవి యెంతయు సంతాపించి భీమున కి ట్లనియె. 241

ప్రతిపదార్థం: కుంతియున్; దానిన్= ఆ ఆహారాన్ని; రెండు, భాగంబులు+చేసి; అందు+ఒక్క, భాగంబు; భీమునకున్+పెట్టి; తక్కినభాగంబు; కడమకొడుకులున్= తక్కినకొడుకులును; తానును= తానూ; కుడుచుచున్= తింటూ; ఇట్లు; ప్రచ్ఛన్నులు+ఐ= కప్పబడినవాళ్ళయి అంటే మారువేషాలలో ఉన్న వాళ్ళయి; ఏక, చక్ర, పురంబునన్; ఉన్న+అంతన్; ఉండగా; ఒక్కనాఁడు; ధర్మ+అర్జున+యములు= ధర్మరాజు, అర్జునుడు, నకులసహదేవులు; భిక్షా+అర్థంబు= భిక్షకోసం; అరిగినన్= వెళ్ళగా; ఇట, కుంతియు, భీముండును; తమ విడిసిన, విప్ర, గృహంబునన్= తమయొక్క విడిదిచేసిన బ్రాహ్మణగృహంలో; అంటే తా ముండే బ్రాహ్మణులఇంటిలో; ఉన్న+అంతన్= ఉండగా; అందున్= ఆ ఇంటిలో; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; ఆర్త, ధ్వని= ఏడుపుశబ్దం; ఎగసినన్= వ్యాపింపగా; విని; కుంతీదేవి, ఎంతయున్; మిక్కిలి; సంతాపించి= దుఃఖించి; భీమునకున్+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కుంతీదేవి ఆ ఆహారాన్ని రెండుభాగాలు చేసి ఒకభాగం భీమునికి పెట్టి, తక్కిన భాగాన్ని తానూ, తక్కినకొడుకులూ తింటూ, మారువేషంలో కాలం గడుపుతూండగా, ఒకనాడు ధర్మార్జుననకులసహదేవులు భిక్షకు వెళ్ళినసమయంలో తానూ భీముడూ ఇంట్లో ఉండగా, తా ముండే ఆ బ్రాహ్మణగృహంలో ఒక్కసారిగా పెద్దఏడుపు వినిపించింది. అది విని కుంతీదేవి ఎంతో బాధపడి భీమునితో ఇట్లా అన్నది.

తే. ఇందు సుఖ ముండితిమి యొరు లెఱుఁగకుండ। నేలొకో యిప్ప డీ విప్రు నింట నార్త
రవము వీతెంచె? దీని నారసి యెఱుంగ। వలయుఁ; దత్ప్రతీకారంబు వలయుఁ జేయ. 242

ప్రతిపదార్థం: ఒరులు+ఎఱుఁగక+ఉండన్= ఇతరులకు తెలియకుండ; ఇందున్= ఈ బ్రాహ్మణుని ఇంటిలో; సుఖము+ ఉండితిమి= సుఖంగా ఉన్నాం; ఇప్పుడు+ఈ, విప్రుని+ఇంటన్= ఇప్పు డీ బ్రాహ్మణుని ఇంట్లో; ఆర్త, రవము= ఏడుపుధ్వని; ఏల+ఒకో= ఎందుచేతనోకదా!; వీతెంచెన్= వ్యాపించింది; దీనిన్+ఆరసి= దీన్ని విచారించి; ఎఱుంగవలయున్= తెలిసికోవాలి; తత్+ప్రతీకారంబు= దానికి మారుచేతను; చేయ, వలయున్= చేయాలి, అనగా వాళ్ల బాధ తొలగించాలి.

తాత్పర్యం: ఇతరులకెవ్వరికీ తెలియకుండ ఇక్కడ సుఖంగా ఉన్నాం. ఎందుచేతనో ఇప్పు డీ బ్రాహ్మణుని ఇంట్లో ఏడుపుధ్వని వినవస్తున్నది. దీన్ని విచారించి తెలిసికొని వాళ్లబాధను తొలగించాలి.

వ. పరమోపకారి యైన యీ బ్రాహ్మణునకు నేమి ప్రియము సేయ సమకూరునో యని చింతించుచున్నచో నిప్ప డెద్ది యేనియు నొక్క దుస్తరం బయిన దుఃఖం బీ గృహస్థున కయ్యెం గావలయు; నా మనంబు మలమల మఱిఁగెడుఁ గావున దీనిం దలఁగి వీరికి మనఃప్రియంబు సేయవలయు. 243

ప్రతిపదార్థం: పరమ+ఉపకారి+ఐన= మిక్కిలిఉపకారం చేసినవాడైన; ఈ, బ్రాహ్మణునకున్; ఏమి, ప్రియము= ఏమిఇష్టం; చేయన్; సమకూరునో= కలుగుతుందో; అని= ఆ విధంగా; చింతించుచున్+ఉన్నచోన్= ఆలోచిస్తూ ఉండగా; ఇప్పుడు; ఎద్ది+ఏనియున్= ఏదోఒక; దుస్తరంబు+అయిన= దాటరానిదైన; దుఃఖంబు= కష్టం; ఈ గృహస్థునకున్; అయ్యెన్+కావలయున్= అయి ఉండాలి; నా, మనంబు= నా యొక్క మనస్సు; మలమల= మలమలమాడినట్లు; మఱిఁగెడున్= కాగుతున్నది - తపిస్తున్నది; కావునన్; దీనిన్= ఈ కష్టాన్ని; తలఁగి= తొలగించి; వీరికిన్; మనఃప్రియంబు= మనస్సుకు సంతోషాన్ని; చేయవలయున్= కలిగించాలి.

తాత్పర్యం: మనకు మహోపకారం చేసిన ఈ బ్రాహ్మణునికి ఏదైనా ఇష్టమైనది చేయాలని ఆలోచిస్తుండగా ఇప్పు డేదో దాట శక్యంకాని కష్టం ఈ యింటి యజమానికి కలిగినట్లున్నది. నా మనస్సు చాలా బాధపడుతున్నది. అందుచేత ఆ కష్టాన్ని తీర్చి' వారికి మనస్సంతోషాన్ని కలిగించాలి.

క. కృత మెఱుఁగుట పుణ్యము; స ၊ న్మతి దానికి సమముసేఁత మధ్యము; మఱి త
త్కృతమున కగ్గలముగ స ၊ త్కృతిసేయుట యుత్తమంబు కృతబుద్ధులకున్. 244

ప్రతిపదార్థం: కృతబుద్ధులకున్= చేయబడినబుద్ధిగలవాళ్ళకు - అంటే పండితులకు; కృతము= చేయబడినదాన్ని; ఎఱుఁగుట= తెలిసికొనటం; పుణ్యము; సత్+మతిన్= మంచిబుద్ధితో; దానికిన్= చేసినమేలుకు; సమము= సమమైనదాన్ని - ప్రత్యుపకారాన్ని; చేఁత= చేయటం; మధ్యము= మధ్యమార్గం; మఱి= అంతేకాక; తత్+కృతమునకున్= ఆ చేయబడినదానికంటె; అగ్గలముగన్= అధికంగా; సత్+కృతి= మంచిపని; ప్రత్యుపకారం; చేయుట; ఉత్తమంబు.

తాత్పర్యం: బుద్ధిమంతులైనవాళ్ళు-ఎదుటివాళ్ళు చేసిన ఉపకారాన్ని గుర్తించటమే గొప్ప పుణ్యకార్యం. మంచిబుద్ధితో దానికి సమానమైన ప్రత్యుపకారం చేయటం మధ్యమమార్గం. అట్లాకాక చేసిన ఉపకారంకంటె ఎక్కువగా ప్రత్యుపకారం చేయటం ఉత్తమపద్ధతి.

విశేషం: నన్నయనానారుచిరార్థసూక్తి కిది ఒక చక్కని ఉదాహరణం.

వ. అనిన విని భీమసేనుం డి ట్లనియె. 245

తాత్పర్యం: అని కుంతీదేవి పలుకగా భీముడు విని ఈ విధంగా అన్నాడు.

వ. ఎఱిఁగి నాకుఁ జెప్పు; మిది యేమి? యెవ్వరి । వలన నింతయయ్యె? వగవ నేల?
యెంత కడిఁది యైన నిది యేను దీర్చి యీ । విప్రునకుఁ బ్రియంబు విస్తరింతు. 246

ప్రతిపదార్థం: ఇది; ఏమి= ఈ దుఃఖం ఏమిటి!; ఎవ్వరివలనన్= ఎవరివల్ల; ఇంత+అయ్యెన్= ఇంత జరిగింది - అంటే ఇంతదుఃఖం కలిగింది; ఎఱిఁగి= తెలిసికొని; నాకున్+చెప్పుము; వగవన్+ఏల= దుఃఖించటమెందుకు? ఎంత, కడిఁది+ఐనన్= ఎంతకష్టమైనదైనా; ఇది= దీన్ని; ఏను= నేను; తీర్చి= నెరవేర్చి, చక్కజేసి; ఈ, విప్రునకున్= ఈ బ్రాహ్మణునికి; ప్రియంబు= సంతోషాన్ని; విస్తరింతున్= అధికం చేస్తాను.

తాత్పర్యం: ఇ దేమి దుఃఖం? ఎవరివల్ల ఇంత జరిగింది? తెలిసికొని నాతో చెప్పుము. దుఃఖించటం ఎందుకు? ఇది ఎంత కష్టమైనదైనా నేను దీన్ని తీర్చి ఈ బ్రాహ్మణునికి మిక్కిలి సంతోషాన్ని కలిగిస్తాను.

వ. అనినం గుంతి యట్ల చేయుదు నని చని దుఃఖపరవశు లయి పరిదేవనంబు సేయుచున్న వారలం జూచి యడుగ
నేరక మిన్న కున్నంత బ్రాహ్మణుండు దనబాంధవులు విన ని ట్లనియె. 247

ప్రతిపదార్థం: అనినన్=అనిచెప్పగా; కుంతి; అట్లు+అ= ఆ విధంగానే; చేయుదున్+అని= చేస్తాను అని చెప్పి; చని= వెళ్ళి; దుఃఖపరవశులు+అయి= దుఃఖానికి పూర్తిగా లొంగిపోయినవాళ్ళయి - అంటే పూర్తిగా దుఃఖంలో మునిగిపోయినవాళ్ళయి; పరిదేవనంబు; చేయుచున్+ఉన్న, వారలన్= ఏడుస్తూ ఉండే వాళ్లను; చూచి; అడుగనేరక= అడుగలేక; మిన్నక+ఉన్న+అంతన్= ఊరుకున్న తర్వాత; బ్రాహ్మణుండు; తన, బాంధవులు; వినన్= వినేటట్లుగా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని భీము డనగా కుంతి అట్లాగే చేస్తా నని వెళ్ళి, పూర్తిగా దుఃఖంలో మునిగి ఏడుస్తున్నవాళ్ళను చూచి ఏమీ అడుగలేక ఊరకుండగా బ్రాహ్మణుడు తనబంధువులు వినేటట్లుగా ఇట్లా అన్నాడు.

బకున కాహారముగాఁ బోవుటనుగూర్చి బ్రాహ్మణకుటుంబము విచారించుట (సం.1-145-20)

క. నలసారము సంసార మ । ఖిలదుఃఖావహము భయనికేతన మతిచం
చలము పరాధీనం బిం । దుల జీవన మేల నమ్ముదురు తత్త్వవిదుల్. 248

ప్రతిపదార్థం: సంసారము; నలసారము= గడ్డియొక్కసారంవంటి సారంగలది - అంటే నిస్సారమైనది; దుఃఖ+ఆవహము= దుఃఖాన్ని కలిగించేది; భయ, నికేతనము= భయానికి ఇల్లు అయినట్టిది; అతి, చంచలము= మిక్కిలిచలించేది- స్థిరత్వం లేనట్టిది; పర+అధీనంబు= ఇతరులకు లొంగినట్టిది; తత్త్వవిదుల్= నిజాన్ని తెలిసికొన్నవారు - అంటే పండితులు; ఇందుల, జీవనము= సంసారంలోని బ్రతుకును; ఏల! నమ్మెదురు= ఎందుకు నమ్ముతారు.

తాత్పర్యం: సంసారం గడ్డివలె నిస్సారమైనది; దుఃఖాన్ని కలిగించేది; భయానికి స్థానమైనది; మిక్కిలి చంచలమైనది; ఇతరులకు లొంగేది; పండితులైనవాళ్ళు ఈ సంసారజీవనం సత్యమైనదని ఎట్లా నమ్ముతారు?

విశేషం: కథాప్రసన్నతకు భంగంలేకుండ, సందర్భోచితంగా మానవునికి వెలుగునిచ్చే నన్నయనానారుచిరార్థసూక్తులలో ఇది ఒకటి. నలసారము - నలస్యతృణస్యసారఇసారోయస్య సః - భా.కూ. - శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పుట.386.

క. ఆదిని సంయోగవియో । గాదిద్వంద్వములు దేహి యగు వానికి సం
పాదిల్లక తక్కవు పూ । ర్వోదయ కర్మమున నెట్టి యోగికి నయినన్. 249

ప్రతిపదార్థం: ఎట్టి, యోగికిన్+అయినన్= ఎట్లాంటి యోగాభ్యాసంచేసే వానికైనా లేదా ఎట్లాంటి అదృష్టవంతునికైనా; పూర్వ+ఉదయ, కర్మమునన్= పూర్వజన్మంలోని కర్మవలన; ఆదిని= మొదట; సంయోగ, వియోగ+ఆది, ద్వంద్వములు= కలవటం, విడిపోవటం మొదలయిన జంటలు; దేహి+అగువానికిన్= దేహంగలవాడైన వానికి - అంటే ప్రతిమనుజునికి; సంపాదిల్లక= కలుగక; తక్కవు= తప్పవు.

తాత్పర్యం: ఎంతయోగికైనా - ఏ మానవుడికైనా - పూర్వజన్మకర్మవలన కలవటం, విడిపోవటం ద్వంద్వాలను అనుభవించటం తప్పదు.

విశేషం: మానవజీవితతత్త్వాన్ని తెలిపే నన్నయ రుచిరార్థసూక్తులలో ఇది ఒకటి.

తరువోజ :-

ఏనును బ్రజలును నీధర్మసతియు నే యుపాయంబున నిబ్బారిఁ గడవఁ
గానేర్తు? మెయ్యది గర్జ? మిందుండఁ గా దేగుదము యొండు గడ కని ముంద
రే నెంత సెప్పిన నెన్నండు వినద యిది; యిట్టిదారుణ మిమ్మెయిఁ జేయఁ
గా నున్న విధి యేల కడవంగ నిచ్చుఁ? గర్మవిపాకంబు గడవంగ లావె. 250

ప్రతిపదార్థం: ఏనును= నేనూ; ప్రజలును= బిడ్డలును; ఈ, ధర్మ, సతియున్= ఈధర్మపత్ని - అంటే ఈ నా భార్యా; ఏ+ఉపాయంబునన్= ఏ ఉపాయంచేత; ఈ+బారిన్= ఈ ఆపదను; కడవంగన్= దాటగా; నేర్తుము (నేర్చుదము); ఏ+అది= ఏది; కర్జము= చేయదగింది; ఇందు+ఉండన్+కాదు= ఇక్కడ ఉండకూడదు; ఒండు+కడకున్= వేరొకచోటికి; ఏగుదము+అ= వెళ్ళుదామే; అని; ముందరన్+ఏను+ఎంత+చెప్పినన్= ముందుగా నే నెంతచెప్పినా; ఇది= ఈమె (భార్య); ఎన్నండు= ఎప్పుడూ; వినదు+అ= వినలేదు; ఇట్టి, దారుణము= ఇంతటిఘోరాన్ని; ఈ+మెయిన్= ఈవిధంగా; చేయన్+కాన్+ఉన్న= చేయటానికై ఉంటే; విధి= బ్రహ్మ; ఏల= ఎట్లు; కడవంగనిచ్చున్= పోనిస్తాడు; కర్మ విపాకంబు= కర్మఫలం; కడవంగన్= తప్పించుకోవటానికి; లావె= సాధ్యమా?

తాత్పర్యం: నేను, బిడ్డలు, నా భార్య ఏ ఉపాయంచేత ఈ ఆపదను దాటగలం? ఏం చేయాలో తోచకుండా ఉన్నది. ఇక్కడ ఉండకూడదు, వే రొకచోటికి వెళ్ళుదామే అని ముందుగా నే నే నెంత చెప్పినా నా భార్య వినలేదు. ఇంతటి ఘోరాన్ని ఈ విధంగా చేయబోతున్న బ్రహ్మ మమ్మల్ని ఎందుకు పోనిస్తాడు? కర్మఫలం తప్పించుకోవటం సాధ్యమా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. తరువోజకు 3 ఇంద్రగణాలు, 1 సూర్యగణం, మళ్ళీ 3 ఇంద్రగణాలు, 1 సూర్యగణం ఉంటాయి. 1-3-7 గణాల మొదటి అక్షరాలకు యతిమైత్రి ఉంటుంది. ప్రాసనియతి ఉన్నది. 102వ పద్యం చూడండి.

సీ. మంత్రయుక్తంబుగా మత్పరిణీత యై । ధర్మచారిణి యగు దాని వినయ
వతిఁ బ్రజావతి ననువ్రత నెట్టు లసురకు । భక్ష్యంబ వగు మని పనుపనేర్తు?

ధర్మాభివృద్ధిగాఁ దగు వరునకు నీగ । నిల్లడ బ్రహ్మచే నిడఁగఁబడిన

యిక్కన్య యతిబాల యిం దుద్భవం బగు । దౌహిత్రలాభంబు దలుఁగ నెట్లు

ఆ. దీనిఁ బుత్తు? మఱి మదీయ పిండోదక । నిధిఁ దనూజుఁ గులము నిస్తరించు

వానిఁ బితృగణంబువలని ఋణంబుఁ బా । చిన మహోపకారిఁ జిఱుతవాని. 251

ప్రతిపదార్థం: మంత్రయుక్తంబుగాన్= మంత్రంతో కూడుకొన్నదిగా; మత్+పరిణీత+ఐన= నాచే వివాహమాడబడిన; ధర్మ, చారిణి+అగు, దానిన్= ధర్మంలో నడిచేదానిని; వినయవతిన్= వినయవంతురాలైనదానిని; అనువ్రతన్= అనుసరించి నడచుకొనేదానిని; ఎట్టుల= ఏ విధంగా; అసురకున్= రాక్షసునికి; భక్ష్యంబవు+అగుము+అని= తినదగిన దానివి కమ్ము అని; పనుప, నేర్తున్= పంపించగలను; ధర్మ+అభివృద్ధిగాన్= ధర్మం ఎక్కువగా పెరిగేటట్లు; తగు, వరునకున్= తగిన మగనికి; ఈగన్= ఇవ్వటానికి; బ్రహ్మచే= బ్రహ్మదేవునిచేత; ఇల్లడ= అడిగినప్పుడు ఇమ్మని ఉంచిన వస్తువుగా; ఇడఁగన్+పడిన= ఉంచబడిన; ఈ+కన్య; అతిబాల= చాలా చిన్నది; ఇందు+ఉద్భవంబు+అగు= దీనిద్వారా కలిగేటి; దౌహిత్ర, లాభంబు= కూతురికొడుకు - మనుమడు పుట్టటం; తలఁగన్= తొలగిపోయేటట్లు; ఎట్లు= ఏ విధంగా; దీనిని= ఈ కూతురిని; పుత్తున్= పంపిస్తాను; మఱి= అంతేకాక; మదీయ, పిండ+ఉదక, నిధిన్= నాయొక్క పితృదేవతల కిచ్చే అన్నపుముద్దలకు, నీళ్లకు స్థానమైనవాడిని; తనూజున్= శరీరంనుండి జన్మించినవాడిని - కుమారుడిని; కులము, నిస్తరించువానిన్= వంశాన్ని తరింపజేసేవాడిని; పితృగణంబువలని, ఋణంబున్+పాచిన, మహా+ఉపకారిన్= పితృదేవతలయొక్క సమూహంనుండి ఋణాన్ని తొలగించి గొప్ప ఉపకారం చేసినవాణ్ణి; చిఱుతవానిన్= చిన్నవాడిని.

తాత్పర్యం: వేదమంత్రపూర్వకంగా వివాహమాడి నాతోగూడ ధర్మమార్గాన చరిస్తూ వినయవతి అయి నన్ననుసరించి నడచుకొనే భార్యను రాక్షసునికి ఆహారం క మ్మని ఎలా పంపగలను? ధర్మం అభివృద్ధి చెందేటట్లు తగిన వరుడి కిచ్చి వివాహం చేయటానికి నా దగ్గర బ్రహ్మదేవుడు ఇల్లడగా ఉంచిన ఈ కన్యను నా కూతురిని - దౌహిత్రుడు నాకు లేకుండాపోయేటట్లు రాక్షసునికి ఆహారంగా ఎట్లా పంపగలను? అంతే కాదు, నా పితృదేవతలకు పిండోదకా లిచ్చే కుమారుడిని, వంశాన్ని తరింపజేసేవాడిని, పితృదేవతల ఋణం తీర్చే మహోపకారిని, ఈ చిన్నవాడిని.

ఆ, ఎట్టు సూచి చూచి యిది పాప మనక య । య్యసుర వాతఁ ద్రోతు నదయవృత్తి;

నరిగి యేన యిప్ప డసురకు నాహార । మగుదు వీరిఁ బుచ్చ నగునె నాకు. 252

ప్రతిపదార్థం: ఎట్టు= ఏవిధంగా; చూచి, చూచి; ఇది= ఈ పని; పాపము+అనక; ఆ+అసురవాతన్= ఆ రాక్షసుని నోట; అదయ, వృత్తిన్= దయలేనినడవడికతో - అంటే క్రూరంగా; త్రోతున్= తోస్తాను; ఏన= నేనే; అరిగి= వెళ్ళి; ఇప్పుడు+అ= ఇప్పుడే; అసురకున్= రాక్షసునికి; ఆహారము+అగుదున్= ఆహారం అవుతాను; నాకున్; వీరికిన్; పుచ్చన్+అగునె= పంపతగునా!

తాత్పర్యం: ఏ విధంగా చూచి చూచి ఇది పాపమని అనక ఈ చిన్నవాడిని క్రూరంగా ఆ రాక్షసునినోట తోస్తాను? నేనే వెళ్ళి ఇప్పుడే ఆ రాక్షసునికి ఆహారమవుతాను. వీళ్ళను నేను పంపదగునా?

వ. అని యాత్మపరిత్యాగంబునందుఁ గృతనిశ్చయుం డై యున్న బ్రాహ్మణుం జూచి బ్రాహ్మణి యి ట్లనియె. 253

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; ఆత్మ, పరిత్యాగంబునందున్= తనను తాను అర్పించుకోవటంలో; కృత, నిశ్చయుండు+ఐ= చేయబడిన నిర్ణయం కలవాడై; ఉన్న; బ్రాహ్మణున్+చూచి; బ్రాహ్మణి= బ్రాహ్మణునిభార్య; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని తనను తాను అర్పించుకోవటానికి నిర్ణయించుకొన్న బ్రాహ్మణుణ్ణి చూచి, ఆ బ్రాహ్మణుని భార్య ఈ విధంగా అన్నది.

క. మనుజులకు నెవ్విధంబున । ననతిక్రమణీయ మైన యాపద్విషయం
బున సంతాపింపఁగ జన । దని యెఱిఁగియు నగునె యెట్టు లని శోకింపన్. 254

ప్రతిపదార్థం: మనుజులకున్; ఏ+విధంబునన్= ఏ విధంగానైనా; న+అతిక్రమణీయము+ఐన= దాటరానిదైన; ఆపత్+విషయంబునన్= ఆపద విషయంలో; సంతాపింపఁగన్+చనదు+అని= దుఃఖించకూడదని; ఎఱిఁగియున్= తెలిసియు, ఎట్టుల+అని= ఎట్లా అని; శోకింపన్= దుఃఖించగా; అగునె= తగునా!

తాత్పర్యం: మానవులకు ఏవిధంగాను దాటరానిదైన ఆపదవిషయంలో శోకించగూడదని తెలిసికూడా ఎట్లా అని శోకింపవచ్చా? (కూడ దని భావం.)

వ. ఆ రక్కసున కే నశనం బయ్యెద; మీరు వగవకుండుఁడు; భార్యయందుఁ బడయంబడు నపత్యంబు నాయందు మున్న పడసితి; రేనును ఋణవిముక్త నయితిం; బ్రాణవియోగంబు సేసి యయినను భార్య పతికి హితంబు సేయవలయు; మఱి యట్లుంగాక. 255

ప్రతిపదార్థం: ఆ, రక్కసునకున్= ఆ రాక్షసునికి; ఏను+అశనంబు+అయ్యెదన్= నేను ఆహారమవుతాను; మీరు; వగవక+ఉండుఁడు= దుఃఖించకండి; భార్య+అందున్, పడయన్+పడు+అపత్యంబు= భార్యవల్ల పొందబడే సంతానం; నా+అందున్= నా యందు; మున్న= ముందే; పడసితిరి= పొందారు; ఏనును= నేనుకూడా; ఋణ, విముక్తను+అయితిన్= ఋణాన్ని తీర్చుకొన్న దాన్ని అయ్యాను; ప్రాణ, వియోగంబు+చేసి+అయినను= ప్రాణాలు వదలి అయినా; భార్య; పతికిన్= భర్తకు; హితంబు+చేయవలయున్= మేలు చేయాలి; అట్లున్+కాక= ఆవిధంగా కాకుండా.

తాత్పర్యం: ఆ రాక్షసునికి నేను ఆహారమవుతాను. మీరు దుఃఖించకండి. భార్యద్వారా పొందవలసిన సంతానాన్ని నాయందు ఇదివరకే మీరు పొందారు. నేను నా ఋణం తీర్చుకొన్నాను. ప్రాణాలు వదలి అయినా భార్య భర్తకు మేలుచేయాలి. అట్లాకాక-

ఆ. పురుషుకంటె మున్ను పరలోక మేఁగిన । సతియ నోఁచినదియు సతులలోనఁ;
బురుషహీన యైనఁ బరమపతివ్రత । యయ్యు జగముచేతఁ బ్రయ్యఁబడదె. 256

ప్రతిపదార్థం: పురుషుకంటెన్, మున్ను= భర్తకంటె ముందుగా; పరలోకము+ఏఁగిన, సతియ= పరలోకానికి పోయిన భార్యయే; సతులలోనన్= పతివ్రతలలో; నోచినదియు= పుణ్యంకలది; పురుష, హీన+ఐనన్= భర్తను కోల్పోయిందైతే; పరమ, పతివ్రత+అయ్యున్= పరమపతివ్రత అయికూడా; జగముచేతన్= లోకంచేత; ప్రయ్యన్+పడదె= నిందను పొందదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: భర్తకంటె ముందు మరణించినభార్యే పతివ్రతలలో మిక్కిలి పుణ్యాత్మురాలు. పరమపతివ్రత అయినా భర్తలేని స్త్రీ లోకంచేత నింద పొందుతుంది గదా!

ఆ. పడిన యామిషంబు పక్షు లపేక్షించు । నట్లు పురుషహీనయయిన యువతిఁ
జూచి యెల్లవారుఁ జులుక నపేక్షింతు । రిదియుఁ బాప మనక హీనమతులు. 257

ప్రతిపదార్థం: పడిన+ఆమిషంబు= క్రింద పడిన మాంసపుముక్కను; పక్షులు+అపేక్షించునట్లు= పక్షులు కోరేవిధంగా; పురుష, హీన+అయిన, యువతిన్+చూచి= భర్తలేని స్త్రీని చూచి; ఎల్లవారున్= అందరు; హీనమతులు= నీచమైన బుద్ధికలవాళ్ళు; ఇదియున్= ఇది; పాపము+అనక; చులుకన్= తేలికగా; అపేక్షింతురు= కోరుకుంటారు.

తాత్పర్యం: క్రిందపడిన మాంసపుముక్కను పక్షులు కోరేవిధంగా భర్తను కోల్పోయిన స్త్రీని చూచి నీచులు ఇది పాప మని కూడా అనుకోక తేలికగా ఆమెను కోరతారు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. సతి విముక్త యయినఁ బతికిఁ బునర్దార । సంగ్రహంబు సేఁత శాస్త్రమతము;
పతి విముక్తుఁ డయిన సతి కన్యపురుషసం । గ్రహముసేఁత లోకగర్హితంబు. 258

ప్రతిపదార్థం: సతి, విముక్త+అయినన్= భార్య విడువబడినదైతే - అంటే భార్య మరణిస్తే; పతికిన్= భర్తకు; పునః+దార, సంగ్రహంబు+చేత= మరల భార్యను చేపట్టటం; శాస్త్ర, మతము= శాస్త్రంయొక్క పద్ధతి; పతి, విముక్తుఁడు+అయినన్= భర్త విడువబడ్డ వాడయితే - అంటే భర్త మరణిస్తే; సతికిన్= భార్యకు, అన్య, పురుష, సంగ్రహము+చేఁత= మరొక భర్తను చేపట్టటం; లోక, గర్హితంబు= లోకంచేత నిందింపబడింది.

తాత్పర్యం: భార్య మరణిస్తే భర్త మరొక భార్యను స్వీకరించటం శాస్త్రసమ్మతమే. భర్త మరణిస్తే భార్య మరొక భర్తను స్వీకరించటం లోకంచేత నిందింపబడింది.

వ. 'కావున నేను భవద్విహీన నయి యొక్క నిమేషం బేనియు జీవింపనేర; నేర్చితినేనియు ని క్కుమారుల రక్షింపనేర; నె ట్లనిన శూద్రులు వేదశ్రుతిం బ్రార్థించునట్లు కులాచారసదృశులు గానివా రిక్కన్యం బ్రార్థించినం దత్ప్రతీకారంబు సేయను నిక్కుమారునందు గుణాధానంబు సేయను నాకొలంది గాదు; మత్పరోక్షంబునం బునర్దార పరిగ్రహంబు సేసి గృహస్థధర్మంబును నగ్నిహోత్రంబునుం బుత్త్రులను రక్షించునది । యనుచు మరణవ్యవసాయంబునం దున్న తల్లిని దండ్రిం జూచి కూఁతు రి ట్లనియె. 259

ప్రతిపదార్థం: కావున, నేను; భవత్+విహీనన్+అయి= మీయొక్కలేకుండటాన్ని గలదాననై - అంటే మీరు లేనిదానినై; ఒక్కనిమేషంబు+ఏనియు= ఒక నిమిషమైనా; జీవింపనేరన్= బ్రతుకలేను; నేర్చితిన్+ఏనియు= ఒకవేళ బ్రతుకనేర్చినా; ఈ+కుమారులన్= ఈ బిడ్డలను; కుల+ఆచార, సదృశులు, కాని వారు= కులంయొక్క ఆచారానికి సరిపోలనివాళ్ళు; ఈ+కన్యన్; ప్రార్థించినన్= కోరితే; తత్+ప్రతీకారంబు+చేయను= దానికి పరిహారం చేయటానికి; ఈ+కుమారుని+అందున్= ఈ కుమారునియెడ; గుణ+ ఆధానంబు+చేయను= గుణాలు ఉంచటాన్ని చేయటానికి - అనగా నేను చనిపోయింతర్వాత; పునః +దార, పరిగ్రహంబు+చేసి= మళ్ళీ భార్యను చేపట్టి; గృహస్థ; ధర్మంబును= గృహస్థునియొక్క ధర్మాన్ని - భార్యను పరిగ్రహించి

ధర్మార్థకామాలను నడుపుతూ, వేదపాఠం, వైశ్వదేవాదిహోమం, అతిథిపూజ, పితృతర్పణం, భూతబలి అనే పంచయజ్ఞాలు చేయటం; అగ్నిహోత్రంబునున్; పుత్రులను; రక్షించునది= కాపాడండి; అనుచున్, మరణ, వ్యవసాయంబు+అందు+ఉన్న= చనిపోయే ప్రయత్నంలో ఉన్న; తల్లిని, తండ్రిని+చూచి; కూతురు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'కావున నేను మీరు లేకుండ ఒక్క నిమిషమైనా జీవించలేను. ఒకవేళ జీవించినా ఈ బిడ్డలను రక్షించలేను. ఎట్లంటే వేదాధికారం లేని శూద్రులు వేదం వినటాన్ని కోరినట్లు, కులాచారానికి సరిపోనివాళ్ళు ఈ కన్యను కోరితే దానికి ప్రతీకారం చేయటానికికాని, ఈ కుమారునికి మంచిగుణాలు అలవడేటట్లు తగినశిక్షణ ఇవ్వటానికి కాని - నాకు శక్తి లేదు. నేను మరణించినా మీరు మరొక భార్యను చేపట్టి గృహస్థ ఆచరించవలసిన ధర్మాన్ని, అగ్నిహోత్రాన్ని, పుత్రులను రక్షించండి' - అని చనిపోయే ప్రయత్నంలో ఉన్న తల్లిని, తండ్రిని చూచి కూతురు ఈ విధంగా అన్నది.

ఆ. ఒలసి యెంతకాల ముండిన నేను మీ । దానఁ గాన, యొరుల ధనము; నన్ను
నెన్నఁడయిన నొరుల కిచ్చుచో నసురకు । భోజనముగ నిచ్చి పుచ్చుఁ డిపుడ. 260

ప్రతిపదార్థం: ఒలసి= కలిసి; ఎంతకాలము+ఉండినన్= ఎంతకాలం మీతో ఉన్నా; ఏను= నేను; మీ, దానన్, కాను+అ= మీ దాన్ని కాను (ఆడదాన్నే); ఒరుల, ధనము+అ= ఇతరులయొక్క సొమ్మునే; నన్నున్= నన్ను; ఎన్నఁడు+అయినన్= ఏ రోజైనా; ఒరులకున్= ఇతరులకు; ఇచ్చుచోన్= ఇవ్వవలసిఉండగా, ఇపుడు+అ= ఇప్పుడే; అసురకున్= రాక్షసునికి; భోజనముగన్= ఆహారంగా; ఇచ్చి, పుచ్చుడు= ఇచ్చిపంపండి.

తాత్పర్యం: ఎంతకాలం మీతో కలిసి ఉన్నా నేను మీదాన్ని కాను, ఇతరుల సొమ్మునే. ఎప్పుడైనా నన్ను ఇతరుల కివ్వటం తప్పనప్పుడు ఇప్పుడే ఈ రాక్షసునికి ఆహారంగా ఇచ్చి పంపండి.

తే. తండ్రిచేయు తిలోదక దాన విధులు । పొందుఁ బరలోకగత యైన పుత్త్రియందుఁ;
బుత్త్రి చేసిన విధులు దత్పురుషుఁ గాని । తల్లిదండ్రులఁ బొందవు ధర్మయుక్తి. 261

ప్రతిపదార్థం: తండ్రి, చేయు, తిల+ఉదక, దాన, విధులు= నువ్వులు, నీళ్ళువదలటంవంటి తర్పణక్రియలు; పర, లోకగత+ఐన= స్వర్గలోకానికి వెళ్ళిందైన; పుత్త్రి+అందున్= కుమార్తెకు; పొందున్= చేరుతాయి; పుత్త్రి= కూతురు; చేసిన; విధులు= చేసేకర్మలు; తత్+పురుషునకున్+కాని= దానియొక్క భర్తకే కాని; తల్లి, తండ్రులన్; ధర్మయుక్తిన్= ధర్మంప్రకారం; పొందవు= చేరవు.

తాత్పర్యం: తండ్రి వదలే నువ్వులు, నీళ్ళు మరణించిన కూతురుకి చెందుతాయి. కాని, కూతురు చేసే కర్మలు ధర్మప్రకారం ఆమె భర్తకే కాని, తల్లిదండ్రులకు చెందవు.

విశేషం: సందర్భం వచ్చినపుడంతా నన్నయ సంక్షిప్తంగా వైదికవిధులు వివరిస్తాడు.

వ. 'మీకు నాయం దయ్యెడు దౌహిత్ర లాభంబునకంటె మీ రిద్దఱు జీవించిన ననేక పుత్త్ర పౌత్త్ర లాభం బగు; దానంజేసి కులంబు నిలుచుం గావున నన్నుఁ బుచ్చుం' డనినఁ గూఁతుం గౌఁగిలించుకొని యేడ్చుచున్న వారల కన్నీళ్ళు దుడుచుచు. 262

ప్రతిపదార్థం: మీకున్; నా+అందు+అయ్యెడు= నాయందు కలిగే; దౌహిత్ర, లాభంబునకంటెన్= మనుమని పుట్టుకకంటె; మీరు+ఇద్దఱు; జీవించినన్= బ్రదికిఉంటే; అనేక, పుత్త్ర, పౌత్త్ర, లాభంబు+అగున్= పెక్కుమందికుమారులు, మనుమలు కలగటం జరుగుతుంది; దానన్+చేసి= దానివలన; కులంబు= వంశం; నిలుచున్= నిలుస్తుంది; కావునన్, = కాబట్టి; పుచ్చుండు+అనినన్= పంపండి అని అనగా; కూఁతున్= కుమార్తెను; కౌఁగిలించుకొని; ఏడ్చుచున్+ఉన్న; వారల= తల్లిదండ్రుల; కన్నీళ్ళు, తుడుచుచున్.

తాత్పర్యం: 'మీకు నాయందు మనుమడు పుట్టటం అనే లాభంకంటె, మీ రిద్దరు బ్రతికి ఉంటే పెక్కుమంది కుమారులు, మనుమలు పుడతారు. వారివల్ల వంశం నిలుస్తుంది. అందుచేత నన్ను రాక్షసునికి ఆహారంగా పంపం'డని పలికిన కూతురుని కౌగలించుకొని ఏడుస్తున్న తల్లిదండ్రుల కన్నీళ్ళు తుడుస్తూ.

తే. బాలకుం డొక కొండుక కోల చేతఁ। బట్టికొని యేన రక్కసుఁ గిట్టి చంపి
చులుక వత్తు మీ రేడ్వఁగా వలవ, దనుచుఁ। గలయ నూరార్చెఁ దన తొక్కుఁబలుకు లొప్ప. 263

ప్రతిపదార్థం: బాలకుండు= చిన్నపిల్లవాడు; ఒక, కొండుక, కోల= ఒక చిన్నకర్రను; చేతన్+పట్టికొని= చేతిలో పట్టుకొని; ఏన= నేను; రక్కసున్= రాక్షసుణ్ణి; కిట్టి= సమీపించి, చంపి; చులుక= సులువుగ; వత్తున్= వస్తాను; మీరు+ఏడ్వఁగా, వలవదు+అనుచున్= మీరు ఏడ్వవద్దంటూ; తన, తొక్కున్, పలుకులు= తనయొక్క అవ్యక్తపు మాటలు - అంటే వచ్చీరాని మాటలు; ఒప్పన్= అందగింపగా; కలయన్= అందరినీ చేరి; ఊరార్చెన్= ఓదార్చాడు.

తాత్పర్యం: చిన్నపిల్లవాడు ఒకచిన్నకఱ్ఱను చేత పట్టుకొని 'నేనే ఆ రాక్షసుడిదగ్గరకు వెళ్ళి సులువుగా తిరిగివస్తాను; మీరు ఏడ్వవద్దు' అని వచ్చీరానిమాటలతో అందరినీ చేరి ఓదార్చాడు.

విశేషం: తొక్కుపలుకులు - అనేదానికి ముద్దుపలుకులు, తొట్రుపలుకులు, తొత్తుపలుకులు - అనేపాఠాంతరాలున్నాయి. - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.389. కుమారాస్త్రవిద్యాప్రదర్శనఘట్టంలోవలె నన్నయనాటకీయత ఈ తేటగీతిలో తాండవించింది. చిన్నకర్ర చేతపట్టుకొని, తడబడే అడుగులతోవచ్చీరానిమాటలతో అందరినీ చేరి ఓదార్చే ఆ బాలకుడిని భావుకుడైన ప్రతిపాఠకుడు చూడగలడు. పై పద్యంలో అన్నీ ప్రాసయతులే.

వ. వాని యవ్యక్తవచనంబులు విని యందఱు నే డ్పుడిగిన, నయ్యవసరంబునం గుంతీదేవి వారల డాయంబోయి. 264

ప్రతిపదార్థం: వాని, అవ్యక్త, వచనంబులు= ఆ బాలకునియొక్క స్పష్టతలేని మాటలు - వచ్చీరాని మాటలు; విని; అందఱున్= ఇంటివాళ్ళు అందరు; ఏడ్పు+ఉడిగినన్= ఏడుపు మానగా; ఆ+అవసరంబునన్= ఆ సమయాన; కుంతీదేవి; వారల, డాయన్+పోయి= వారలదగ్గరకు వెళ్ళి.

తాత్పర్యం: ఆ బాలకుని వచ్చీరాని మాటలు విని అందరూ ఏడ్పు మానగా, కుంతీదేవి వాళ్ళదగ్గరకు వెళ్ళి.

క. 'ఇది యేమి తెఱఁగు? దీనికి। మొద లెయ్యది నాకుఁ దెల్లముగఁ జెప్పుఁడు తీ
ర్చెద' నని విగతాసులఁ దన। మృదు వచన ప్రశ్న మను నమృతమున నెత్తెన్. 265

ప్రతిపదార్థం: ఇది= ఈ దుఃఖకారణము; ఏమి, తెఱఁగు= ఏమి పద్ధతి; దీనికిన్; మొదలు= కారణం; ఏ+అది; నాకున్, తెల్లముగన్= స్పష్టంగా; చెప్పుఁడు; తీర్చెదన్+అని= తొలగిస్తానని; విగత+అసులన్= పోయినప్రాణాలు కలవాళ్ళను; తన, మృదు, వచన, ప్రశ్నము+అను= తనయొక్క మెత్తనైన మాటలతో కూడిన ప్రశ్న అనే; అమృతమునన్= అమృతంచేత; ఎత్తెన్=పైకెత్తింది - అంటే బ్రతికించింది.

తాత్పర్యం: 'ఇది ఏమిటి? దీనికి కారణమేమి? నాకు స్పష్టంగా చెప్పండి. నే నీ ఆపదను తొలగిస్తాను' అని తన మృదువైన మాటలతో కూడిన ప్రశ్న అనే అమృతంతో వాళ్ళను బ్రతికించింది.

విశేషం: అలం: రూపకం.

వ. ఇ ట్లడిగినఁ గుంతీదేవికి నవ్విప్రుం డి ట్లనియె. 266

తాత్పర్యం: ఈ విధంగా అడిగిన కుంతీదేవికి ఆ బ్రాహ్మణుడు ఇట్లా అన్నాడు.

కుంతీదేవికి బ్రాహ్మణుండు తనదుఃఖకారణంబును దెలుపుట (సం.1-148-1)

సీ. ఏ నేమి సెప్పుదు దీని నెవ్వరికిని । మానుషంబునఁ దీర్పరాని దాని;
నయినను జెప్పెదఁ బ్రియహితవచన । యీ । ప్రోలికి నామడనేల నల్ల
యమునానదీగహ్వరమున బకుం డను । రక్కసుం డుండి వాఁ డక్కజముగ
నిందుల కాఁపుల నందఱఁ దొల్లి యి । ల్వరుస మ్రింగుచు నున్నఁ బరమసాధు

ఆ. లగు ధరామరేంద్రు లగణితజపహోమ । దానవిధులఁ జేసి వానివలనఁ
గ్రమము వడసి యొక్క సమయంబుఁ జేసిరి; । యొనర దాని తెఱఁగు వినుము తల్లి! 267

ప్రతిపదార్థం: మానుషంబునన్= మానవప్రయత్నంచేత; ఏ+వారికిని= ఎవరికికూడా; తీర్పరాని, దానిన్= తీర్చటానికి సాధ్యం కానిదానిని; దీనిన్= ఈ విపత్తును; ఏను= నేను; ఏమి+చెప్పుదున్= ఏమని చెప్పగలను? అయినను; ప్రియ, హిత, వచన= వినటానికి ఇంపై మేలుచేసే మాటలు గలదానా! చెప్పెదను; ఈప్రోలికిన్= ఈ పట్టణానికి; ఆమడ, నేలన్= ఆమడదూరంలో; అల్ల, యమునా, నదీ, గహ్వరమున= ఆ యమునానది దగ్గర కొండగుహలో; బకుండు+అను; రక్కసుండు+ఉండి= రాక్షసుడు ఉండి; వాఁడు+అక్కజముగన్= వాడు ఆశ్చర్యకరంగా; ఇందుల కాపులన్+అందఱన్= ఈ పట్టణంలో కాపురముండేవాళ్ళనందరిని; తొల్లి= ఇదివరకు; ఇల్+వరుసన్= ఇంటివరుసన; మ్రింగుచున్+ఉన్నన్= మ్రింగుతూ ఉండగా; పరమ, సాధులు+అగు= మిక్కిలి మంచి వాళ్ళయిన; ధర+అమర+ఇంద్రులు= భూమియందు దేవతలు - అంటే బ్రాహ్మణశ్రేష్ఠులు; అగణిత, జప, హోమ, విధులన్+చేసి= లెక్కింపసాధ్యంగాని జపాలు, హోమాలు, దానాలు అనేకకర్మలను చేసి; వాని, వలనన్; క్రమము+పడసి= మార్గాన్ని పొంది; ఒక్క, సమయంబున్= ఒక ఏర్పాటును; చేసిరి; తల్లి= ఓ తల్లీ! ఒనరన్= ఒప్పగా; దాని, తెఱఁగు= దానియొక్కవిధం; వినుము.

తాత్పర్యం: మానవ ప్రయత్నంచేత ఎవ్వరికీ తీర్ప సాధ్యంగాని ఆపదనుగురించి ఏమని చెప్పగలను? ప్రియంగా, హితంగా మాట్లాడే ఓ తల్లీ! ఈ పట్టణానికి ఆమడదూరాన యమునానదీతీరంలో ఉండే అడవిలో బకుడనే రాక్షసు

డున్నాడు. వాడీపట్టణవాసులను ఇంటివరుసగా మింగుతుండగా పరమసాధువులైన బ్రాహ్మణశ్రేష్ఠులు లెక్కకు మిక్కిలి జప హోమ దాన సత్కర్మలు చేసి, అతనితో ఒక ఏర్పాటు చేసికొన్నారు. అది నీకు చెప్తాను. వినుము.

వ. నిత్యంబు నిలువరుస నొక్కమానిసి రెం డెనుపోతులం బూన్చిన శకటంబున నపరిమితభక్ష్యపిశిత మిశ్రాన్నంబు నించికొని పోయిన దానిని, వానిని, నయ్యెనుపోతులను భక్షించుచు. 268

ప్రతిపదార్థం: నిత్యంబున్= ప్రతిదినం; ఇలువరుసన్= ఇంటి వరుసబట్టి; ఒక్క, మానిసి= ఒక్కమనిషి; రెండు+ఎనుపోతులన్= రెండు దున్నపోతులను; పూన్చిన= కట్టిన; శకటంబునన్= బండిలో; అపరిమిత, భక్ష్య, పిశిత, మిశ్ర+అన్నంబు= అంతులేని తినుబండారాలతో, మాంసంతో కలిపిన అన్నం; నించికొని= నింపుకొని; పోయినన్= పోతే; దానిన్= ఆ అన్నాన్ని; వానిని= ఆ మనిషినీ; ఆ+ఎనుపోతులను=ఆ దున్నపోతుల్నీ; భక్షించుచున్= తింటూ.

తాత్పర్యం: ప్రతిదినం ఇంటివరుసన ఒక మనిషి రెండు దున్నపోతులను కట్టిన బండిలో అపరిమితమైన తినుబండారాలూ, మాంసంతో కలిపిన అన్నాన్నీ నింపుకొని వెళ్ళితే, వాడు ఆ అన్నాన్నీ, మనిషినీ, ఆ దున్నపోతుల్నీ తింటూ.

ఆ. మనుజభక్షుఁ డిదియ తనకు నప్పనముగా । నొరులవలనిబాధ నొరయకుండ
దీనిఁ గాచుచుండు నీనాఁటిరాజును । దలఁపఁ డసుర నోర్వ బలిమిలేమి. 269

ప్రతిపదార్థం: మనుజ, భక్షుఁడు= మానవులను తినేవాడు - రాక్షసుడు; ఇదియ= ఇదే; తనకున్, అప్పనముకాన్= కానుకగా; ఒరుల, వలని, బాధన్= ఇతరులవలన కలిగేబాధను; ఒరయక+ఉండన్= కలుగకుండ; దీనిన్= ఈపట్టణాన్ని; కాచుచుండున్= రక్షిస్తూఉన్నాడు; ఈ, నాఁటి, రాజును= ఈ దేశపు రాజుకూడ; అసురన్= రాక్షసుడిని; ఓర్వన్= అణచటానికి; బలిమిలేమిన్= బలంలేకుండటంచేత; తలపఁడు= దీన్నిగురించి ఆలోచించడు.

తాత్పర్యం: రాక్షసుడు ఇదే తనకు కానుకగా భావించి, ఇతరులవలన ఈ పట్టణానికి బాధ కలుగకుండ రక్షిస్తూ ఉన్నాడు. ఈ దేశప్రభువుకూడ రాక్షసుడిని చంపగలశక్తి లేనివాడవటంచేత దీన్ని గురించి ఆలోచించడు.

విశేషం: అప్పనము - అనేదానికి జీవితము, వర్తనము, వేతనము, జీవనము అనే పాఠాంతరాలున్నాయి. శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పుట.290,

ఉ. పోలఁగ ధర్మశీలుఁ డయి భూరిబలాధికుఁ డైన ధారుణీ
పాలకు రక్ష ము న్పడసి భార్యను బుత్త్రుల నర్థయుక్తితో
నోలిన మేలుగాఁ బడసి యూళ్ళను నున్నది యట్లుగాని నాఁ
డేల గృహస్థవృత్తి సుఖ మేఁగి వనంబున నున్కి కష్టమే. 270

ప్రతిపదార్థం: పోలఁగన్= ఒప్పుగ; ధర్మ, శీలుఁడు+అయి= ధర్మం స్వభావంగా కలవాడై; భూరి, బల+అధికుఁడు+ఐన= పెద్దబలంచేత గొప్పవాడైన; ధారుణీ, పాలకు, రక్ష=భూమిని ఏలే రాజుయొక్క అండ; మున్+పడసి= ముందుగా పొంది; భార్యను; పుత్త్రులన్; అర్థ, యుక్తితోన్= ధనంయొక్కకూడికతో - అంటే ధనం కలిగి; ఓలిన= వరుసగా; మేలుగాన్= మేలు కలదిగా; పడసి= పొంది; ఊళ్ళను+ఉన్నది= ఊళ్ళలో కాపురమున్నట్టిది (తగినపద్ధతి); అట్లు+కాని, నాఁడు= ఆ విధంగా కాని

నాడు; ఏల= ఎందుకు? గృహస్థ, వృత్తి= గృహస్థధర్మం; సుఖమె=సుఖమా! ఏఁగి= వెళ్ళి; వనంబునన్= అడవిలో; ఉనికి= ఉండటం; కష్టమే= కష్టమా!

తాత్పర్యం: ధర్మాత్ముడు, బలవంతుడు అయిన రాజుయొక్క రక్షణ పొందిన తర్వాత వివాహమాడి, పిల్లలను కని, ధనం సంపాదించి, ఊళ్ళలో కాపురముండాలి కాని, అది లేనినాడు గృహస్థవృత్తి ఎందుకు? అది సుఖాన్ని ఇయ్యగలదా! వెళ్ళి అడవిలో ఉండటం కష్టమా! అదే సుఖం గదా!

విశేషం: సందర్భోచితంగా ఈ పద్యం రాజధర్మాన్ని చెప్పుతున్నది.

క. అరి యని విప్రులచేతను। ధరణీశులు పోఁకయును మొదలుగాఁ గొన రె
వ్వరు నిప్పాపుఁడు మానిసి। నరిగొనియెడు భక్షణార్థి యై విప్రులచేన్. 271

ప్రతిపదార్థం: ధరణి+ఈశులు= భూమికిప్రభువులు - రాజులు; ఎవ్వరున్= ఎవరుకూడ; విప్రులచేతను= బ్రాహ్మణులచేత; అరి+అని= కప్పమని; పోఁకయును, మొదలుగాన్= వక్కనుకూడ; కొనరు= తీసికొనరు; ఈ+పాపుఁడు= ఈ పాపాత్ముడైన రాక్షసుడు; భక్షణ+అర్థి+ఐ= తిండికోరినవాడై; విప్రులచేన్= బ్రాహ్మణులచేత; మానిసిన్= మనిషిని; అరిగొనియెడున్= కప్పంగా తీసికొంటున్నాడు.

తాత్పర్యం: రాజులు బ్రాహ్మణులనుండి పోకచెక్కనుకూడా కప్పంగా తీసికొనరు. కాని ఈ పాపాత్ముడైన రాక్షసుడు తిండికొరకు విప్రులనుండి మనిషినే కప్పంగా తీసికొంటున్నాడు.

విశేషం: 'పోఁకయు' అనేదానికి 'రూకయు, రూఁకయు' అనే పాఠాంతరాలున్నాయి - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.391.

వ. 'పెద్దకాలంబునకు నీ యిలువరుస నేఁడు మాకు వచ్చె; ని చ్చిఱుత వాని నా రాక్షసునకు భక్ష్యంబుగాఁ బుచ్చనోప; నేన పోయెద' నని దుఃఖించి పలికిన బ్రాహ్మణునకుఁ గుంతి యి ట్లనియె; 'నయ్యా! దీనికి సంతాపింపవలవ; దీయాపద దలఁగునట్టి యుపాయంబు గంటి; నీకుం గొడు కొక్కరుండ; వాఁడును గడుబాలుండు; బలిగొనపోవ నర్హుండు గాఁడు; నా కేవురుగొడుకులు గలరు; వారలలో నొక్కరుం డారక్కసునకు భవదర్థంబుగా బలి గొని పోయెడు' ననిన దాని విననోడి బ్రాహ్మణుండు చెవులు మూసికొని యి ట్లనియె. 272

ప్రతిపదార్థం: పెద్దకాలంబునకున్= చాలాకాలానికి; ఈ+ఇలు, వరుస= ఈ ఇంటివరుస; నేఁడు= ఈ రోజు; మాకున్= మాకు (వంతుగా); వచ్చెన్= వచ్చింది; ఈ+చిఱుత, వానిన్= ఈ చిన్నవాడిని; ఆ రాక్షసునకున్= ఆ రక్కసునికి; భక్ష్యంబు+కాన్= ఆహారంగా; పుచ్చన్+ఓపన్= పంపలేను; నేను+అ= నేనే; పోయెదను+అని= పోతానని; దుఃఖించి=విలపించి; పలికిన= మాటాడిన; బ్రాహ్మణునకున్= విప్రునికి; కుంతి=కుంతీదేవి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది; అయ్యా!; దీనికిన్; సంతాపింపన్, వలవదు= దుఃఖించవద్దు; ఈ+ఆపద, తలఁగునట్టి= ఈవిపత్తు తొలగిపోయేటి; ఉపాయంబు+కంటిన్= ఉపాయాన్ని కనుగొన్నాను; నీకున్; కొడుకు; ఒక్కరుండు+అ= ఒక్కడే; వాఁడును= వాడుకూడా; కడున్= మిక్కిలి; బాలుండు= పసివాడు; బలికొనిపోవన్= ఆహారం తీసికొనిపోవటానికి; అర్హుండు= తగినవాడు; కాఁడు= కానేరడు; నాకున్+ఏవురు, కొడుకులు= నాకు ఐదుగురు కొడుకులు; కలరు=ఉన్నారు; వారలలోన్, ఒక్కరుండు= ఆ అయిదుమందిలో ఒకడు; ఆ రక్కసునకున్; భవత్+అర్థంబుగాన్= మీకోసం; బలి, కొని, పోయెడున్= కప్పం తీసికొనివెళ్ళగలడు; అనినన్= అని అనగా; దానిన్= ఆ మాటను; వినన్+ఓడి= వినలేక; బ్రాహ్మణుండు; చెవులు, మూసికొని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'చాలా కాలానికి ఈ యింటివరుస నేడు మా యింటికి వచ్చింది. ఈ పసిబాలుణ్ణి రాక్షసునికి ఆహారంగా పంపలేను. నేను పోతాను' అని బ్రాహ్మణుడు దుఃఖంతో పలుకగా, కుంతి 'అయ్యా! దీనికి దుఃఖించవద్దు. ఈ ఆపద తొలగే ఉపాయం నేను ఆలోచించాను. నీకు ఒక్కడే కొడుకు. వాడు పసివాడు. బకుడికి బలితీసుకొనిపోవటానికికూడా అర్హుడు కాడు. నాకు ఐదుగురు కొడుకులు. వాళ్ళలో ఒకడు మీకు బదులుగా ఈ బలి తీసికొని వెళ్ళగలడు' అని అంటూనే బ్రాహ్మణుడు ఆ మాటలు వినలేక చెవులు మూసికొని ఆమెతో ఇట్లా అన్నాడు.

మధ్యాక్కర.

అతిథి యై వచ్చిన బ్రాహ్మణున్ జీవితార్థి నై నాకు
హితముగా రక్కసువాతఁ ద్రోవ నే నె ట్లొడంబడుదు?
మతి నవమానింపఁగా దనిన విప్రుమరణంబు దలఁచు
టతిపాతకము; పాతకములలో బ్రహ్మహత్యయ పెద్ద. 273

ప్రతిపదార్థం: అతిథి+ఐ= అతిథిగా; వచ్చిన; బ్రాహ్మణున్= విప్రుడిని; జీవిత+అర్థిని+ఐ= బ్రతుకు కోరుకొన్నవాడినై; నాకున్, హితముగా= నాకు మేలుకలిగేటట్లుగా; రక్కసు; వాతన్= రాక్షసుడి నోటిలో; త్రోవన్= త్రోయటానికి; ఏన్= నేను; ఎట్లు= ఏవిధంగా; ఒడంబడుదున్= ఒప్పుకొంటాను; మతిన్= మనస్సులో; అవమానింపన్+కాదు+అనినన్= అవమానించతగదు అనగా; విప్ర, మరణంబు= బ్రాహ్మణునియొక్క చావును; తలఁచుట= సంకల్పించటం; అతి, పాతకము= మహాపాపం; పాతకములలోన్= పాపాలలో; బ్రహ్మహత్యయు+అ= బ్రాహ్మణుడినిచంపటమే; పెద్ద= పెద్దపాపం.

తాత్పర్యం: అతిథిగా వచ్చిన బ్రాహ్మణుడిని, నా జీవితాన్ని నిలుపుకొనే కోరికతో - నాకు మేలు కలిగేటట్లుగా - రాక్షసునిబారిన పడవేయటానికి నే నెట్లా అంగీకరిస్తాను? అసలు బ్రాహ్మణులను అవమానించే సంకల్పమే పాపమైతే విప్రుని మరణాన్ని సంకల్పించటం మరెంత పాపమో! పాతకాలన్నింటిలో బ్రాహ్మణహత్య మహాపాపం. (పెద్దది)

విశేషం: మధ్యాక్కర లక్షణం చూడు. ఆది. 6.166. ఇది ధార్మికసూక్తి.

క. **ధృతి సెడి వేఁడెడువానిని । నతిథిని నభ్యాగతుని భయస్థుని శరణా**
గతుఁ జంపఁగ నొడఁబడు దు । ర్మతి కిహముం బరముఁ గలదె మదిఁ బరికింపన్. 274

ప్రతిపదార్థం: ధృతి+చెడి= ధైర్యంపోయి; వేఁడెడు, వానినిన్= ప్రార్థించేవాడిని; అతిథిని= తిథిలేకుండావచ్చే ఆగంతకుణ్ణి; అభి+అగతుని= భోజనమయానికి రమ్మని ఆహ్వానింపగా వచ్చిన అతిథిని; భయస్థునిన్= భయపడేవాడిని; శరణ+ఆగతున్= శరణుకోరి వచ్చినవాడిని; చంపఁగన్= చంపటానికి; ఒడన్, పడు= ఇష్టపడు; దుర్+మతికిన్= చెడ్డబుద్ధికలవాడికి; మదిన్= మనస్సులో; పరికింపన్= ఆలోచిస్తే; ఇహమున్+పరమున్= ఇహలోకపరలోకసుఖం; కలదె= కలదా! (లేదని భావం)

తాత్పర్యం: ధైర్యాన్ని కోల్పోయి ప్రార్థించేవాడిని, అతిథిని, అభ్యాగతుడిని, భయపడేవాడిని, శరణు కోరి వచ్చిన వాడిని చంపాలనుకొనే దుర్మార్గునికి ఇహలోకపరలోకసుఖముంటుందా! (ఉండదు).

వ. 'మఱి యాత్మఘాతంబు మహాపాతకంబు; దాని కెట్లొడంబడి తంటేని యది యనతిక్రమణీయం బయి యప్రతీకారం బయి యొరులచేతం జేయంబడుటంజేసి నాకుం బాతకంబు లేదు; దానిం జేసినవానికి మహాపాతకం బగుం గావున బ్రాహ్మణహింస కే నొడంబడ నోప' ననినఁ గుంతి యి ట్లనియె. 275

ప్రతిపదార్థం: మఱి ఆత్మ, ఘాతంబు= తనను తాను చంపుకోవటం; మహా, పాతకంబు= మిక్కిలిపాపం; దానికిన్= ఆ ఆత్మహత్యకు; ఎట్లు+ఒడంబడితివి+అంటి+ఏని= ఏ విధంగా అంగీకరించావు అని అంటావేమో; అది; న+అతిక్రమణీయంబు+ అయి= మారుసేత లేనిదై; ఒరులచేతన్+చేయన్+పడుటన్+చేసి= ఇతరులచేత చేయబడటంవలన; నాకున్; పాతకంబు= పాపం; లేదు, దానిన్+చేసిన, వానికిన్= ఆ పనిగావించిన అతనికి; మహా, పాతకంబు= మిక్కిలిపాపం; అగున్=అవుతుంది; కావునన్; బ్రాహ్మణ, హింసకున్= బ్రాహ్మణమరణానికి; ఏన్= నేను; ఒడంబడన్+ఓపన్= ఇష్టపడలేను; అనినన్= అనగా; కుంతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'తనను తాను చంపుకొనటం (ఆత్మహత్య) మహాపాపం కదా! దానికెట్లా అంగీకరించావని అంటావేమో - అది దాటరానిదై, మారుచేయటానికి వీలులేనిదై, ఇతరులచేత చేయబడుతున్నది కనుక నాకు పాపం లేదు. దానిని చేసినవాళ్ళకే మహాపాపం కనుక నేను బ్రాహ్మణహింసకు (అంటే మీ కుమారుడిని బకుడికి ఆహారంగా పంపటానికి) ఇష్టపడలే' నని పలుకగా కుంతి ఇట్లా అన్నది.

బకునిఁ జంప భీమునిఁ బంపుటకుఁ గుంతి నిశ్చయించుట (సం.1-149-13)

క. ఏనును దీనిన తలఁచి మ । హీనుత! విప్రవధ యెద సహింపక మఱి నా
సూను సమర్పించితి; మ । త్సూను వధింపంగ రక్కసునకు వశంబే? 276

ప్రతిపదార్థం: మహీ, నుత= లోకంచేత కొనియాడబడేవాడా; ఏనును= నేనుకూడ; దీనిన్+అ= దీన్నే; తలఁచి= ఆలోచించి; విప్ర, వధ= బ్రాహ్మణుడిని చంపటాన్ని; ఎదన్, సహించక= మనస్సులో ఓర్వలేక; మఱి; నా, సూనున్= నాయొక్కకుమారుడిని; సమర్పించితిన్= ఇచ్చాను; మత్+సూనున్+వధింపంగన్= నాయొక్కకుమారుడిని చంపటం; రక్కసునకున్= రాక్షసుడికి; వశంబె= సాధ్యమా; (కాదని భావం)

తాత్పర్యం: నేనుగూడ దీన్నే ఆలోచించి బ్రాహ్మణవధను సహింపక నా కుమారుణ్ణి బకాసురుడికి అర్పిస్తానన్నాను. నా కుమారుడిని చంపటం ఆ రాక్షసుడికి సాధ్యం కాదు.

క. ఖలు నసుర నోర్వ నోపెడు । బలయుతుఁగా నెఱిఁగి కొడుకుఁ బనిచెదఁ గా; కి
మ్ముల శతపుత్త్రులు గల ధ । న్యుల కైన ననిష్టుఁ డగు తనూజుఁడు గలఁడే ? 277

ప్రతిపదార్థం: ఖలున్+అసురన్+ఓర్వన్+ఓపెడు= దుర్మార్గుడైన రాక్షసుడిని చంపగలిగిన; బలయుతుగాన్= బలంతో కూడుకొన్నవానిగా; ఎఱిఁగి= తెలిసికొని; కొడుకున్; పనిచెదన్= పంపుతున్నాను; కాక= అట్లా కాక; ఇమ్ములన్= సుఖంగా; శత, పుత్త్రులు= నూరుమంది కొడుకులు; కల= ఉన్నట్టి; ధన్యులకున్+ఐనన్= పుణ్యాత్ములకైనా; అనిష్టుఁడు+అగు= ఇష్టంకానివాడైన; తనూజుఁడు= పుత్రుడు; కలఁడే= ఉన్నాడా? (ఉండడని భావం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దుర్మార్గుడైన రాక్షసుడిని చంపగల బలవంతుడని తెలిసే నా కుమారుడిని పంపుతున్నాను. కాకుంటే వందమంది కొడుకులున్నవాళ్ళకయినా ఇష్టంకాని కొడుకు ఉంటాడా?

వ. 'ఈతనిచేతఁ దొల్లియుఁ బెక్కం డ్రసురులు నిహతు లయిరి' వీఁడు మహాబలసంపన్నుండు మంత్రసిద్ధుం; డని భీముం బిలిచి 'యీ బ్రాహ్మణునాపదం దలఁగి నాకు మనఃప్రియంబు సేయు' మనిన వల్లె యని భీముం డారక్కసుఁ జంప బూనె; బ్రాహ్మణుండును దనబంధువర్గంబుతో సంతసిల్లె; నంత ధర్మార్జుననకుల సహదేవులు వచ్చి పరమహర్ష పరిపూర్ణుండై యున్న పవనతనయునాకారం బుపలక్షించి విస్మితు లగుచుండ ధర్మతనయుం డల్లనఁ దల్లికి ని ట్లనియె. 278

ప్రతిపదార్థం: ఈతనిచేతన్= ఈ నా కుమారునిచేత; తొల్లియున్= ఇదివరకుకూడ; పెక్కండ్రు+అసురులు= పెక్కుమంది రాక్షసులు; నిహతులు+అయిరి= చంపబడినవాళ్ళయ్యారు; వీఁడు= ఇతడు; మహాబల, సంపన్నుండు= మిక్కిలి బలసంపద కలవాడు; మంత్రసిద్ధుండు= మంత్రసిద్ధి కలవాడు; అని= అని చెప్పి; భీమున్, పిలిచి; ఈ, బ్రాహ్మణు+ఆపదన్= ఈ బ్రాహ్మణుని యొక్క విపత్తును; తలఁగి= తొలగించి; నాకున్; మనఃప్రియంబు= మనస్సుకు సంతోషం; చేయుము; అనినన్= అనగా; వల్లె+అని= సరే అని; భీముండు; ఆ, రక్కసున్= ఆ రాక్షసుని; చంపన్+పూనెన్= చంపటానికి పూనుకొన్నాడు; బ్రాహ్మణుండును= బ్రాహ్మణుడుకూడా; తన, బంధు, వర్గంబుతో= తనయొక్క బంధువుల సమూహంతో; సంతసిల్లెన్= సంతోషించాడు; అంతన్= తర్వాత; ధర్మ+అర్జున, నకుల, సహదేవులు= ధర్మరాజు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు; వచ్చి; పరమ, హర్ష, పరిపూర్ణుండు+ఐ= మిక్కిలిసంతోషంతో నిండినవాడై; ఉన్న= ఉండే; పవన, తనయు+ఆకారంబున్= వాయుపుత్రుడైన భీమునియొక్క రూపాన్ని; ఉపలక్షించి= చూచి; విస్మితులు+అగుచున్+ఉండన్= ఆశ్చర్యం పొందినవా రవుతుంటే; ధర్మతనయుండు= ధర్మరాజు; అల్లనన్= మెల్లగా; తల్లికిన్= తల్లితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఇతడు ఇదివరకుకూడా పెక్కుమంది రాక్షసులను చంపాడు. ఇతడు మహాబలవంతుడు. మంత్రసిద్ధి కలవాడు' అని భీముడిని పిలిచి 'ఈ బ్రాహ్మణుని ఆపద తీర్చి నా మనసుకు సంతోషాన్ని కూర్చు'మనగా సరే అని భీముడు ఆ రాక్షసుడిని చంపటానికి పూనుకొన్నాడు. బ్రాహ్మణుడుకూడ తనబంధువులతో కలిసి సంతోషించాడు. తరువాత ధర్మరాజు, అర్జునుడు, నకులసహదేవులు వచ్చి మహానందంతో ఉన్న భీముని రూపాన్ని చూచి ఆశ్చర్యపడుతుండగా ధర్మరాజు మెల్లగా తల్లితో ఇట్లా అన్నాడు.

చ. నరనుతకీర్తి యీ యనిలనందనుఁ డెవ్వరితోడనేని భీ
కరసమరంబు సేయ సమకట్టినయట్లు మహానురాగ ని
ర్భరమున నున్నవాఁ; డితనిభావము సూడఁగ వేఱు; వీని సు
స్థిరబలు మీరు పంచితిరొ? చెచ్చెరఁ దాన యుపక్రమించెనో? 279

ప్రతిపదార్థం: నర, నుత, కీర్తి= మనుష్యులచేత పొగడబడిన కీర్తిగలవాడు; ఈ+అనిలనందనుడు= ఈ వాయుపుత్రుడు - భీముడు; ఎవ్వరితోడన్+ఏని= ఎవ్వరితోనైనా; భీకర, సమరంబు+చేయన్= భయంకరమైన యుద్ధం చేయటానికి; సమకట్టిన+అట్లు= పూనుకొన్నట్లు; మహా+అనురాగ, నిర్భరమునన్+ఉన్నవాఁడు= గొప్పసంతోషంచేత నిండినట్లున్నాడు; ఇతని, భావము+చూడఁగన్= ఇతనియొక్క స్థితిని చూస్తే; వేఱు= మార్పుగ ఉన్నది; సుస్థిరబలున్= మిక్కిలి నిలకడగల బలంగలవాడిని; వీనిన్= ఈ భీముడిని; మీరు; పంచితిరొ= ఆజ్ఞాపించారా; చెర+చెరన్= వెంటనే; తాను+అ= తనంటత తానే; ఉపక్రమించెనో= పూనుకొన్నాడో!

తాత్పర్యం: భీముడు ఎవరితోనో భయంకర యుద్ధం చేయటానికి పూనుకొన్నట్లు మహాసంతోషంగా ఉన్నాడు. ఇతనిస్థితి చూస్తే ఎప్పటిలాగ లేదు. ఈ భీముడిని మీరు ఆజ్ఞాపించారా? లేక తనంతట తానే యుద్ధానికి పూనుకొన్నాడా?

వ. అని యడిగిన ధర్మతనయునకుఁ గుంతీదేవి 'యీ యేకచక్రపురంబున బ్రాహ్మణుల బకాసురుండు బాధించుటయుఁ దమ విడిసిన యింటిబ్రాహ్మణుని కైన యాపదయు, దానిం దీర్పం బవనతనయు బ్రాహ్మణార్థంబుగాఁ దనసమర్పించుటయుం జెప్పిన విని ధర్మజుండు దుఃఖించి 'యిది యేమి సాహసంబు సేసితి? రొడ్లకొడుకులకుంగాఁ దమకొడుకుల విడుచు దుర్బుద్ధులునుం గలరె; యిది లోకాచారవిరుద్ధంబు; మఱి భీమసేనుఁడు మీకు విడువందగియెడు కొడుకే'? 280

ప్రతిపదార్థం: అని; అడిగిన; ధర్మతనయునకున్= ధర్మరాజుకు; కుంతీదేవి, ఈ+ఏకచక్ర, పురంబున, బ్రాహ్మణులన్= ఈ ఏకచక్రపురంలోని బ్రాహ్మణులను; బక+అసురుండు= బకుడు అను రాక్షసుడు; బాధించుటయున్; తమ, విడిసిన= తమయొక్క విడిది చేసిన; ఇంటి= ఇంటిలోని; బ్రాహ్మణునికిన్+ఐన= బ్రాహ్మణునికి కలిగిన; ఆపదయు, దానిన్+తీర్పన్= దానిని తీర్చటానికి; పవన, తనయున్= వాయుదేవునియొక్కకుమారుడైన భీముడిని; బ్రాహ్మణ+అర్థంబుగాన్= బ్రాహ్మణునికొఱకు; తన, సమర్పించుటయున్= తనయొక్కఇవ్వటం - అంటే తా నివ్వటం; చెప్పినన్= చెప్పగా; విని; ధర్మజుండు= ధర్మరాజు; దుఃఖించి; ఇది+ఏమి+సాహసంబు+చేసితిరి; ఒడ్ల, కొడుకులన్+కాన్= ఇతరులయొక్క కొడుకులకొరకు; తమ, కొడుకులన్; విడుచు= వదిలే; దుర్+బుద్ధులునున్= చెడుబుద్ధి కలవారుకూడ; కలరె= ఉన్నారా? ఇది; లోక+ఆచార, విరుద్ధంబు= ఇది లోకంయొక్కపద్ధతికి వ్యతిరేకమైనది; మఱి= అంతేకాక; భీమసేనుఁడు; మీకున్; విడువన్+తగియెడి; కొడుకే. (విడువదగిన కొడుకు కాడని భావం.)

తాత్పర్యం: అని అడిగిన ధర్మరాజుకు కుంతీదేవి ఏకచక్రపురంలోని బ్రాహ్మణులను బకాసురుడు బాధించటాన్నీ, తాము విడిది ఉన్న ఇంటిబ్రాహ్మణునికి కలిగిన ఆపదను, దాన్ని తీర్చటానికి బ్రాహ్మణునికొరకు తాను భీముడిని పంపటాన్నీ చెప్పగా విని ధర్మరాజు దుఃఖించి - 'ఇదేమి సాహసం? ఇతరుల కొడుకులను రక్షించటానికి తమ కొడుకులను కోల్పోయే దుర్బుద్ధులూ ఉన్నారా! ఇది లోకపద్ధతికి విరుద్ధం. అంతేకాదు, భీమసేనుడు మీకు విడువదగిన కుమారుడా?

సీ. ఇతని విక్రమ మాశ్రయించియ కాదె య । య్యెడ లక్కయిల్లు వెల్వడఁగఁ గంటి;
మడవిలో నిద్రావశాత్ముల మై యున్న । మననిద్రఁ జెఱుపఁగా దని హిడింబు
నెడగల్గఁ గొనిపోయి యెక్కటి సంపిన । దండితశత్రుఁ డీతండ కాఁడె!
యితనిబల్మిన కాదె యెంతయు భీతు లై । ధృతరాష్ట్రనందనుల్ ధృతియుఁ దఱఁగి

ఆ. నిద్రలేక తమకు నిలుచు నుపాయంబు । లొండుదక్కి వెదకుచున్నవారు;
బలియు నిట్టిభీము బ్రాహ్మణార్థమ్ముగా । నసురవాతఁ ద్రోతు రవ్వ! యిట్లు. 281

ప్రతిపదార్థం: ఇతని, విక్రమము+ఆశ్రయించియ, కాదె= ఇతనిపరాక్రమాన్ని ఆధారం చేసికొనేకదా; ఆ+ఎడ= ఆ చోట; లక్క+ఇల్లు; వెలువడన్+కంటిమి= లక్కయింటినుండి బయటపడగలిగాము; అడవిలో; నిద్రా+అవశ+ఆత్ములము+ఐ= నిద్రలో

స్వాధీనం లేని దేహాలు గలవారమై; ఉన్న, మన, నిద్రన్; చెఱుపఁగన్+కాదు+అని= చెడగొట్టకూడదని; హిడింబున్= హిడింబాసురుణ్ణి, ఎడ+కలుగన్= దూరముండేటట్లు - అంటే దూరంగా; కొనిపోయి= తీసికొని పోయి; ఎక్కటి= ఒక్కడుగా; చంపిన, దండిత, శత్రుఁడు= దండింపబడిన శత్రువులు కలవాడు; ఈతండు+అ, కాడె= ఇతడే కదా! ఇతని బల్మిన, కాదె= ఇతనిబలంచేతనే కదా; ఎంతయు= ఎంతేని - అంటే మిక్కిలి; భీతులు+ఐ= భయపడినవారై; ధృతరాష్ట్రనందనుల్= ధృతరాష్ట్రునియొక్క కుమారులు - కౌరవులు; ధృతియున్+తఱిగి = ధైర్యం తగ్గి; నిద్రలేక; తమకున్, నిలుచు+ఉపాయంబులు+ ఒండు+తక్కి= తమకు నిలబడునట్టి ఉపాయాలు ఇతరాలు లేక; వెదకుచున్+ఉన్నవారు; బలియున్= బలవంతుడైనవాడిని; ఇట్టి, భీమున్= ఇటువంటి భీముడిని; బ్రాహ్మణ+ అర్థంబుగాన్= బ్రాహ్మణునికోసం; అసుర, వాతన్= రాక్షసునినోట; అవ్వ= అమ్మా; ఇట్లు, త్రోతురె= తోస్తారా!

తాత్పర్యం: ఇతని పరాక్రమాన్ని ఆశ్రయించే కదా అక్కడ లక్కయింటినుండి బయటపడగలిగాము. మనం మైమరచి నిద్రించేటప్పుడు మననిద్రకు భంగం కలగకూడదని, హిడింబాసురుడిని దూరంగా తీసికొనిపోయి ఒంటరిగా చంపినవాడితడే కదా! ఇతని బలం చూచేగదా భయపడి కౌరవులు నిద్రలేక తమకు నిలిచే ఉపాయాలు - అంటే బ్రతికిబట్టకట్టే ఉపాయాలు - వెదకుతున్నారు. అమ్మా! అట్లాంటి బలవంతుడైన భీముడిని బ్రాహ్మణునికోసం బకాసురుని నోట్లో ఇట్లా తోస్తారా!

వ. 'అక్కట! దుఃఖాతిశయంబున మతిభ్రమణం బయ్యెం గా కేమి?' యనినఁ గొడుకునకుఁ గుంతి యి ట్లనియె.282

ప్రతిపదార్థం: అక్కట= అయ్యో!; దుఃఖ+అతిశయంబునన్= దుఃఖంయొక్క ఆధిక్యం(ఎక్కువ) వల్ల; మతి, భ్రమణంబు+ అయ్యెన్+ కాక+ఏమి= బుద్ధి తిరుగుడుపడటం జరిగిందా ఏమి - అంటే చిత్తచాంచల్యం ఏర్పడిందా ఏమి? అనినన్= అనగా; కొడుకునకున్= ధర్మరాజుతో; కుంతి, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అయ్యో! దుఃఖం అమితంగా ఏర్పడటంవలన మతిభ్రమణం జరిగిందా ఏమి?' అని అనగా ధర్మరాజుతో కుంతీదేవి ఈ విధంగా పలికింది.

ఆ. భ్రమవిమోహలోభభయపరిభూత నై । కొడుకు విడువ నంత వెడఁగ నయ్య!
యేను భీముశక్తి యెఱుఁగక పంచిన । దానఁ గాను; వినుము వీనిశక్తి. 283

ప్రతిపదార్థం: భ్రమ, విమోహ, లోభ, భయ, పరిభూతన్+ఐ= భ్రాంతిచేత, మిక్కిలిమోహంచేత, ఆశచేత, భయంచేత, పీడింపబడినదాన్నై; కొడుకున్= కొడుకును; విడువన్= వదలిపెట్టటానికి; అంత, వెడఁగన్+అయ్య= అంత వెఱ్ఱిదాన్నటయ్యా!; ఏను= నేను; భీము, శక్తి= భీమునియొక్కశక్తి; ఎఱుగఁక= తెలియక; పంచినదానను= ఆజ్ఞాపించినదానిని; కాను= కాదు; వీని, శక్తి; వినుము.

తాత్పర్యం: భ్రాంతికి, మోహానికి, ఆశకు, భయానికి వశమై కొడుకును పోగొట్టుకొనటానికి నేనంత వెఱ్ఱిదాన్నటయ్యా! భీమునిశక్తి తెలియక నే నీ పని అప్పగించలేదు. ఇతనిశక్తి వినుము.

తే. వీఁడు పుట్టిన పదియగునాఁడు పెలుచఁ । బడియె నాచేతనుండి య ప్పర్వతమునఁ;
బడినవడిఁ జేసి బాలకు నొడలు దాఁకి । యచటి రాలెల్లఁ బెల్లు ను గ్గయ్యెఁ జూవె. 284

ప్రతిపదార్థం: వీఁడు= ఈ భీముడు; పుట్టిన; పది+అగు, నాఁడు= పదవరోజు; నాచేతన్+ఉండి= నాచేతిలోనుండి; ఆ+పర్వతమునన్= ఆ కొండమీద; పెలుచన్= గట్టిగా; పడియెన్; పడిన వడిన్+చేసి= పడినవేగంచేత; బాలకు+ఒడలు+ తాఁకి= బాలకునియొక్క శరీరం తగిలి; అచటి; రాలు+ఎల్లన్= రాళ్ళన్నీ; పెల్లు= అధికంగా; నుగ్గు+అయ్యెన్+చూవె= పొడి అయ్యాయి సుమా!

తాత్పర్యం: ఈ భీముడు పుట్టిన పదవరోజు నా చేతినుండి జారి ఆ పర్వతంమీద గట్టిగా పడ్డాడు. వేగంతో పడ్డవాడిశరీరం తగిలి అక్కడి రాళ్ళన్నీ పొడి అయ్యాయి సుమా!

వ. అట్టి వజ్రకాయుండు వజ్రధరు నయిన నోర్వనోపు నట్టి సమర్థుండు; రక్కసు నశ్రమంబునం జంపి యిందుల బ్రాహ్మణులబాధ యుడుచుం; బవనతనయు నుద్దేశించి సంతాపింపవలవదు; మనకు సుఖనివాసంబు సేసి పరమోపకారి యైన యీబ్రాహ్మణునకుఁ బ్రత్యుపకారంబు సేయ సమకూరె. 285

ప్రతిపదార్థం: అట్టి, వజ్రకాయుండు= వజ్రంవంటి దేహం కలవాడు; వజ్రధరున్+అయినన్= వజ్రాయుధాన్ని ధరించిన దేవేంద్రుడిని అయినా; ఓర్వన్+ఓపునట్టి, సమర్థుండు= జయించగలిగినట్టి శక్తికలవాడు; రక్కసున్= రాక్షసుడిని; అశ్రమంబునన్= శ్రమలేకుండ - సులువుగా; చంపి; ఇందుల= ఈ ఏకచక్రపురంలోని; బ్రాహ్మణుల, బాధ, ఉడుచున్= బ్రాహ్మణుల బాధను పోగొట్టుతాడు; పవన, తనయున్+ఉద్దేశించి= భీముడిని గురించి; సంతాపింప, వలవదు= దిగులుపడవద్దు; మనకున్; సుఖ, నివాసంబు+చేసి= సుఖమైన ఉనికిని కల్గించి; పరమ+ఉపకారి+ఐన= మిక్కిలి మేలుచేసేవాడైన; ఈ, బ్రాహ్మణునకున్; ప్రతి+ఉపకారంబు= బదులుమేలు; చేయన్= చేయటానికి; సమకూరెన్= (అవకాశం) లభించింది.

తాత్పర్యం: ఆ విధంగా వజ్రంవంటి దేహం గల భీముడు వజ్రాయుధుడైన దేవేంద్రుడినైనా జయించగల సమర్థుడు. రాక్షసుడిని సులభంగా చంపి ఈ ఊరి బ్రాహ్మణులబాధ తీర్చగలడు. అతడిని గురించి దిగులుపడ నక్కరలేదు. మనం సుఖంగా ఉండటానికి తగిన నివాసాన్ని కూర్చి మిక్కిలి ఉపకారం చేసిన ఈ బ్రాహ్మణునికి ప్రత్యుపకారం చేయటానికి తగిన అవకాశం లభించింది.

కుంతి ధర్మజునకుఁ బరదుఃఖనివారణము పరమపుణ్యం బని తెలుపుట (సం. 1-150-20)

సీ. ఉత్తమక్షత్త్రియుం డొరులదుఃఖంబులు । దలఁగంగఁ బుట్టిన ధర్మశీలుఁ;
డలయక మృత్యుభయం బైనచో విప్రుఁ । గాచి సత్పుణ్యలోకములు వడయు;
ధన్యుఁడై క్షత్త్రియు దయఁ గాచి బుధలోక । కీర్తనీయంబగు కీర్తి వడయు;
వైశ్యశూద్రులఁ గాచి వసుధాతలస్థిత । సర్వప్రజానురంజనము వడయు;

ఆ. ననఘ! సన్మునీంద్రుఁ డయిన వేదవ్యాసు । వలన దీని నిక్కువముగ వింటి;
బ్రాహ్మణులకుఁ బ్రియము పాయక చేయంగఁ । గాన్ప చూవె పుణ్యకర్మఫలము. 286

ప్రతిపదార్థం: ఉత్తమ, క్షత్త్రియుండు; ఒరుల, దుఃఖంబులు= ఇతరులయొక్క దుఃఖాలను; తలఁగంగన్= తొలగించటానికి; పుట్టిన; ధర్మశీలుఁడు = ధర్మాన్నే స్వభావంగా కలవాడు; అలయక= ఆలస్యం చేయక; మృత్యు, భయంబు+ఐనచో= మృత్యువు వలన భయం కలిగితే; విప్రున్= బ్రాహ్మణుడిని; కాచి= రక్షించి, సత్+పుణ్య, లోకములు= మంచిపుణ్య లోకాలను; పడయున్= పొందుతాడు; ధన్యుఁడు+ఐ= పుణ్యవంతుడై; క్షత్రియున్= క్షత్రియుని; దయన్+కాచి= దయతో రక్షించి; బుధ,

లోక, కీర్తనీయంబు +అగు= పండితులయొక్క సమూహంచేత పొగడదగిందైన; కీర్తి+పడయున్= కీర్తిని పొందుతాడు; వైశ్య+శూద్రులన్+కాచి= వైశ్యులను, శూద్రులను రక్షించి; వసుధా, తల, స్థిత, సర్వ, ప్రజల+అనురంజనము+పడయు= భూమండలంలో ఉన్న ప్రజలందరియొక్క అనురాగాన్ని పొందుతాడు; దీనిన్= ఈ విషయాన్ని; అనఘు= పాపంలేనివాడా - పుణ్యాత్మా; సత్+ముని+ఇంద్రుఁ+డు+అయిన= గొప్పమునుల్లో శ్రేష్ఠుడైన; వేదవ్యాసువలనన్; నిక్కువముగన్= నిజంగా; వింటిన్; బ్రాహ్మణులకున్; ప్రియము= ఇష్టమైనది; పాయక, చేయంగన్+కాన్ప, చూవె= తప్పక చేయచూడటమే సుమా; పుణ్య, కర్మ, ఫలము= పవిత్రాలైన పనులు చేయటంవలన పొందేఫలం - మహాపుణ్యం.

తాత్పర్యం: ఉత్తమక్షత్రియుడు ఇతరుల దుఃఖాలు తొలగించటానికి పుట్టినధర్మశీలుడు, ఆలస్యం చేయక మృత్యుభయం కలిగిన బ్రాహ్మణుడిని కాపాడితే అతడు పుణ్యలోకాలు పొందుతాడు. ధన్యుడై క్షత్రియుడిని దయతో రక్షిస్తే పండితుల చేత ప్రశంసించదగిన కీర్తిని పొందుతాడు. వైశ్యులను, శూద్రులను రక్షిస్తే భూమండలంలో ప్రజలందరి అనురాగాన్ని పొందుతాడు. ఈ విషయం మునిశ్రేష్ఠుడైన వేదవ్యాసుడు చెప్పితే విన్నాను. బ్రాహ్మణులకు ఇష్టమైనది తప్పక చేయచూడటమే సుమా మహాపుణ్యఫలం.

క. జననుత! బ్రాహ్మణకార్యము । సనఁ జేసిన బ్రాహ్మణప్రసాదంబున నీ
కును నీతమ్ములకును నగు । ననవరతశ్రీసుఖాయురైశ్వర్యంబుల్. 287

ప్రతిపదార్థం: జన, నుత= జనులచేత కొనియాడబడేవాడా!; బ్రాహ్మణ, కార్యము; చనన్+చేసినన్= జరిగేటట్లు చేస్తే; బ్రాహ్మణ, ప్రసాదంబునన్= బ్రాహ్మణులయొక్క అనుగ్రహంచేత; నీకును, నీ, తమ్ములకును, అనవరత, శ్రీ, సుఖ, ఆయుః+ఐశ్వర్యంబుల్= ఎడతెగని సంపద, సుఖం, ఆయువు, ప్రభుత; అగున్= కలుగుతాయి.

తాత్పర్యం: బ్రాహ్మణకార్యం పూర్తిచేస్తే వారిఅనుగ్రహంవలన నీకు, నీ తమ్ములకు అంతులేని సంపద, సుఖం, ఆయువు, ప్రభుత కలుగుతాయి.

వ. అనిన విని ధర్మతనయుండు గుంతీదేవి కారుణ్యబుద్ధికి బ్రాహ్మణభక్తికి ధర్మనిత్యతకు సంతసిల్లి తానును భీమసేను నియోగించె; నంత భీముం డవ్విప్రున కి ట్లనియె. 288

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ధర్మతనయుండు= ధర్మరాజు; కుంతీదేవి, కారుణ్య బుద్ధికిన్= కుంతీదేవియొక్క దయతోకూడిన మనసుకు; బ్రాహ్మణభక్తికిన్= బ్రాహ్మణులపట్లగల భక్తికి; ధర్మ, నిత్యతకు= ధర్మంయొక్క ఎడతెగనితనానికి - అంటే ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆచరించటానికి; సంతసిల్లి= సంతోషించి; తానును= తానుకూడా; భీమసేనున్; నియోగించెన్= ఆజ్ఞాపించాడు; అంతన్= అంతట; భీముండు; ఆ+విప్రునకున్= ఆ బ్రాహ్మణునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చెప్పగా విని ధర్మరాజు కుంతీదేవియొక్క దయార్ద్రబుద్ధికి, బ్రాహ్మణభక్తికి; ధర్మాచరణానికి సంతోషించి, తానుకూడా భీమసేనుడిని ఆజ్ఞాపించాడు. అప్పుడు భీమసేనుడు బ్రాహ్మణునితో ఇట్లా అన్నాడు.

విశేషం: తల్లిగా కుంతీదేవి కొడుకులను దిద్దితీరుస్తున్న ఉదాత్తవైఖరిని తెలిపే రెండవ సన్నివేశమిది. అన్నంపెట్టి కొడుకులను పోషించటంలోకూడా ఆమె తీర్పరితనం గోచరించింది. ధర్మాన్ని బోధించి, దానిని ఆచరించే పద్ధతిలోకూడ, తాను ఆచరిస్తూ కొడుకుల మొదటిగురువైన తల్లిగా తెలియచెప్పే నేర్పరితనం ప్రదర్శించింది. ధర్మరాజుకుసైతం వివేకం కలిగించే ధర్మబోధ

చేసింది. ఆ తెలివిడి వేదవ్యాసులవలన కలిగిందని ప్రామాణికభావం కలిగించింది. భీముడిని ధర్మాచరణశీలునిగా మలచింది. బుద్ధిశక్తినీ, బాహుబలాన్నీ ధర్మశక్తికి అనుకూలంగా ఎలా రూపొందించాలో తెలిసిన వివేకమూర్తి పాండవమాతృమూర్తి.

ఆ. కడుపునిండఁ గుడువఁ గానమి రేయెల్లఁ । గన్నువొందకున్నఁ గరము డస్సి
యున్నవాఁడ; నాకు నోపుదురేని యా । హారతృప్తిసేయుఁ; డట్టు లయిన. 289

ప్రతిపదార్థం: కడుపు నిండన్= కడుపునిండుగా; కుడువన్+కానమి= తినటానికి లేకుండటంచేత - అంటే కడుపునిండా తిండి లేకుండటంచేత; రేయి+ఎల్లన్= రాత్రి అంతా; కన్ను+పొందక+ఉన్నన్= కన్ను మూయకుండుటవలన - అంటే నిద్రలేకపోవటంచేత; కరము= మిక్కిలి; డస్సి+ఉన్నవాఁడన్= అలసిఉన్నాను; ఓపుదురు+ఏని= చేయగలిగితే; నాకున్; ఆహార, తృప్తి+చేయుఁడు= ఆహారంచేత తృప్తి చేయండి; అట్టులు+అయినన్= ఆ విధంగా అయితే.

తాత్పర్యం: కడుపునిండ తిండి లేకుండటంచేత రాత్రి పూర్తిగా నిద్రలేదు. అందుచేత మిక్కిలి డస్సి ఉన్నాను. పెట్టగలిగితే నాకు ఆహారం తృప్తిగా పెట్టండి. అట్లయితే.

ఆ. 'బలము పెద్ద గలిగి పాపిష్ఠు రక్కసుఁ । జంపి యిప్పురమున జనుల కెల్ల
హర్ష మే నొనర్తు' ననవుడు విప్రుఁడు । దానుఁ జుట్టములును దత్క్షణంబ. 290

ప్రతిపదార్థం: బలము; పెద్ద+కలిగి= ఎక్కువగా పొంది; పాపిష్ఠు, రక్కసున్= పాపి అయిన రాక్షసుని; చంపి, ఈ+పురమునన్= ఈ పట్టణంలోని; జనులకున్+ఎల్లన్= ప్రజలందరికీ; హర్షము= సంతోషం; ఏను= నేను; ఒనర్తున్= చేస్తాను; అని అనగా విని, విప్రుఁడు= బ్రాహ్మణుడు; తానున్; చుట్టములును; తత్క్షణంబు+అ= అప్పటికప్పుడే.

తాత్పర్యం: 'బలం ఎక్కువగా పొంది, ఆ పాపాత్ముడైన రక్కసుడిని చంపి, ఈ పురజనులందరికి సంతోషాన్ని కలిగిస్తా' నని అనగా - బ్రాహ్మణుడు, తాను, చుట్టాలు అప్పటికప్పుడే.

తరలము

పలుదెఱంగుల పిండివంటలుఁ బప్పుఁ గూడును నేతికుం
డలు గుడంబు దధిప్రపూర్ణఘటంబులుం గొనివచ్చి యీ
నలఘుసత్త్వుఁడు మారుతాత్మజుఁ డన్నిటన్ గతఖేదుఁడై
బలము గల్గి కడంగె నప్పుడు బ్రాహ్మణార్థము సేయఁగన్. 291

ప్రతిపదార్థం: పలు+తెఱంగుల= అనేక విధాలైన; పిండి, వంటలును; పప్పున్= పప్పును; కూడును= అన్నము; నేతి, కుండలు= నెయ్యిగల కుండలు; గుడంబు= బెల్లం; దధి, ప్రపూర్ణ, ఘటంబులున్= పెరుగుతో పూర్తిగా నిండిన కుండలు; ఈన్= ఈయగా; అలఘు, సత్త్వుఁడు= తక్కువకాని బలం కలవాడు - మహాబలవంతుడు; మారుత+ఆత్మజుఁడు= వాయుతనయుడైన భీముడు; అన్నిటన్= అన్నింటిచేత; గత, ఖేదుఁడు+ఐ= పోయిన బడలిక కలవాడై; బలము+కల్గి; అప్పుడు; బ్రాహ్మణ+అర్థము+చేయఁగన్= బ్రాహ్మణునియొక్క పని చెయ్యటానికి; కడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: అనేక విధాలైన పిండివంటలు, పప్పు, కూడు, నేతికుండలు, బెల్లం, పెరుగు నిండినకుండలు తీసుకొని వచ్చి ఇస్తే - వాటి నన్నింటిని భక్షించి బలవంతుడైన భీముడు బడలిక తీరి బ్రాహ్మణుని ఆపద తీర్చటానికి, బకాసురునిమీదికి వెళ్ళటానికి పూనుకొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: నన్నయ ఈ ఆశ్వాసంలో రెండు తరలవృత్తాలను వాడాడు. ఒకటి దుర్యోధనుడు పురోచనుని లక్కయిల్లు కట్టటానికి పంపిన ఘట్టంలో ఉన్నది. (ఆది.6.139) రెండోది ఇది. బ్రాహ్మణార్థము అనేమాట బ్రాహ్మణులకొరకు చేసే ఏ పనికైనా వర్తించే అర్థంలో నన్నయచేత వాడబడింది. కాని, అది ఇప్పుడు అర్థపరిణామం పొంది బ్రాహ్మణులఇంట ఆబ్దికానికి భోక్తగా ఒప్పుకొని చేసే పనికే రూఢి కెక్కింది.

భీముఁడు బకాసురునిఁ జంపఁబోవుట (సం. 1-151-1)

వ. ఇట్లు భీమసేనుం డిష్టాన్నోపభోగంబునం దృప్తుం డయి భక్ష్యాన్నపూర్ణం బయిన శకటంబు నెక్కి దక్షిణాభిముఖుం డయి బకాసురుం డున్నచోటికిం జని యార్ద్రశుష్కకళేబరదుర్గంధనిందితం బయిన బకస్థానంబు డాయక యెడగలిగి యమునాతీరంబున శకటంబు నిలిపి యారక్కసుం బిలుచుచు వానివచ్చునంతకు మిన్నకుండ నేల యని కాళ్లుసేతులుఁ గడిగికొని యాచమించి యాశకటంబుపయి కూడు గుడుచుచుండె; నటబకాసురుండును.292

ప్రతిపదార్థం: ఇట్లు; భీమసేనుండు; ఇష్ట+అన్న+ఉపభోగంబునన్= ఇష్టమైన ఆహారాన్ని భుజించటంచేత; తృప్తుండు+అయి= తృప్తిపొందినవాడయి; భక్ష్య+అన్న, పూర్ణంబు+అయిన= పిండివంటలతో, అన్నంతో నిండినదైన; శకటంబున్=బండిని; ఎక్కి; దక్షిణ+అభిముఖుండు+అయి= దక్షిణదిశకు ఎదురుగా ముఖం కలవాడై; బకాసురుండు; ఉన్న; చోటికిన్; చని= వెళ్ళి; ఆర్ద్ర, శుష్క, కళేబర, దుర్గంధ, నిందితంబు+అయిన= పచ్చివి, ఎండినవి అయిన పీనుగుల దుర్వాసనచేత దూషింపబడిం దైన; బక, స్థానంబు= బకాసురుడియొక్కచోటు - ఉన్నచోటు; డాయక= సమీపించక; ఎడ+కలిగి= దూరంగా ఉండి; యమునా తీరంబునన్= యమునానదియొక్క ఒడ్డు దగ్గర; శకటంబు= బండి; నిలిపి; ఆ, రక్కసున్= ఆ రాక్షసుడిని; పిలుచుచున్= పిలుస్తూ; వాని, వచ్చు+అంతకున్= వాడియొక్క రాక వరకు; మిన్నక+ఉండన్+ఏల+అని= ఊరకుండుట ఎందులకని; కాళ్లు+చేతులు; కడిగికొని; ఆచమించి= ఆచమనం చేసి; ఆ, శకటంబుపయి= ఆ బండిమీద ఉండే; కూడు= అన్నం; కుడుచుచున్+ఉండెన్= తింటూ ఉన్నాడు; అట= అక్కడ; బకాసురుండును= బకాసురుడుకూడా.

తాత్పర్యం: ఈ విధంగా భీమసేనుడు ఇష్టమైన ఆహారాన్ని భుజించి, తృప్తినొంది, పిండివంటలతో, అన్నంతో నిండిన బండినెక్కి, దక్షిణదిశగా బకాసురుడుండేచోటికి వెళ్ళి, పచ్చివి, ఎండినవి అయిన పీనుగుల కంపు కొట్టే బకాసురుని నివాసస్థానాన్ని సమీపించక, యమునానదీ తీరాన్నే బండి నిలిపి, ఆ రాక్షసుణ్ణి పిలుస్తూ, వాడు వచ్చేవరకు ఊరకుండుట ఎందుకని కాళ్ళుచేతులు కడుక్కొని ఆచమనం చేసి బండిమీదికూడు తినసాగాడు. అట బకాసురుడు.

ఆ. 'ప్రొద్దు నేఁడు పెద్దపోయె నిత్యము నిట। తెచ్చియిచ్చుబలియుఁ దెచ్చి యీఁగ
నొల్ల కెలుఁగు లిచ్చుచున్నవాఁ డమ్మను। జాధముండు మెచ్చఁ డయ్యె' ననుచు. 293

ప్రతిపదార్థం: నేఁడు= ఈరోజు; ప్రొద్దు= కాలం; పెద్ద+పోయెన్= ఎక్కువ గడిచింది; నిత్యమున్= ప్రతిదినం; ఇట= ఇక్కడకు; తెచ్చి+ఇచ్చు; బలియున్= (ఆహారరూపమైన) కానుక; తెచ్చి+ఈఁగన్+ఒల్లక= తెచ్చి ఇవ్వటానికి ఇష్టపడక; ఆ+మనుజ+అధముండు= ఆ నీచమానవుడు; ఎలుఁగులు+ఇచ్చుచున్+ఉన్నవాఁడు= పిలుపు ఇస్తున్నాడు; - అంటే పిలుస్తున్నాడు; మెచ్చఁడు+అయ్యెన్+అనుచున్= నన్ను లెక్కపెట్టలేదంటూ.

తాత్పర్యం: 'ఈ రోజు ప్రొద్దు పోయింది. ప్రతిదినం ఇక్కడికి తెచ్చి యిచ్చే బలి తెచ్చి ఇవ్వటం ఇష్టపడక, ఆ నీచమానవుడు నన్ను లెక్కపెట్టక పిలుస్తున్నాడు' అని.

ఆ. అలిగి యౌడుగఱచి యాఁకటి పెలుచన । నిలువనోప కసుర నింగి దాఁకఁ
బెరిఁగి యరుగుదెంచె భీమరూపంబుతో । నుగ్రభంగి భీముఁ డున్న దెసకు. 294

ప్రతిపదార్థం: అసుర= రాక్షసుడు; అలిగి= కోపించి; ఔడు+కఱచి= పెదవి బిగబట్టి; ఆఁకటి, పెలుచనన్= ఆకలియొక్క అతిశయంతో; నిలువన్+ఓపక= నిలువలేక; నింగి+తాఁకన్= ఆకాశమంటేటట్లు; పెరిఁగి= విజృంభించి; భీమ, రూపంబుతోన్= భయంకరమైన ఆకారంతో; ఉగ్ర, భంగిన్= అధికమైన కోపంగల వైఖరితో; భీముఁడు+ఉన్న, దెసకున్= భీముడుండే దిక్కుకు; అరుగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: బకాసురుడు కోపించి, అధికమైన ఆకలికి తాళలేక, ఆకాశం ఎత్తున విజృంభించి, భయంకరమైన ఆకారంతో భయంకరమైన విధంగా భీముడుండే దిక్కుకు వచ్చాడు.

సీ. చనుదెంచి ముందట శకటంబుపైనుండి । యోడక కుడుచుచు నున్న భీము
దవ్వులఁ జూచి 'నిత్యము నాకు నియమించి । కొనివచ్చు కూ డేల కుడిచె దీవు?
గడుఁ గ్రొవ్వి, రేకచక్రంబునవారల । కే నింత యెల్లిద మేల యైతి?'
నని డాయ వచ్చి యయ్యనిలనందనువీఁపుఁ । బిడికిటఁ బొడిచిన, బెదర కసుర

ఆ. వలను సూడ కొండు వగవక యెప్పటి । యట్లు కుడుచుచున్న నలిగి బకుఁడు
'వీని బాగు సూడ వే' అంచు డాసిన । తరువుఁ బెఱికి కొనుచుఁ దాఁకుఁ దెంచె. 295

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; ముందటన్; శకటంబు పైన్+ఉండి= బండిమీదనుండి; ఓడక= భయపడక; కుడుచుచున్+ఉన్న= ఆహారం తింటున్న; భీమున్; దవ్వులన్= దూరంగా; చూచి; నిత్యము= ప్రతిదినం; నాకున్; నియమించుకొనివచ్చు= ఏర్పాటు చేసుకొని వచ్చే; కూడు+ఏల= అన్నాన్ని ఎందుచేత; ఈవు= నీవు; కుడిచెదు= తింటున్నావు; కడుఁగ్రొవ్విరి= మిక్కిలి పొగరు పట్టినారు; ఏక, చక్రంబున, వారలకు= ఏకచక్రపురంలో ఉండేవాళ్ళకు; ఏను= నేను; ఇంత+ఎల్లిదము= ఇంతచులకన; ఏల+ఐతిని; అని; డాయ, వచ్చి= దగ్గరగా వచ్చి; ఆ+అనిల, నందను, వీఁపున్= ఆ భీమునియొక్క వీపును; పిడికిటన్ పొడిచినన్= పిడికిటితో పొడవగా; బెదరక= భయపడక; అసుర, వలను+చూడక= ఆ రాక్షసునివైపు చూడకుండ; ఒండు వగవక= వేరేమీ ఆలోచించకుండ; ఎప్పటి+అట్లు; కుడుచుచున్+ఉన్నన్= తింటూఉండగా; బకుఁడు; అలిగి= కోపించి; వీని, బాగుచూడన్+వేఱు+అంచున్= వీడివిధం చూస్తే వేరుగా ఉన్నదని; డాసిన, తరువున్= దగ్గరగా ఉండే చెట్టును; పెఱికికొనుచున్; తాఁకుదెంచెన్= దగ్గరకు వచ్చాడు.

తాత్పర్యం: వచ్చి, తనను చూచి భయపడక, బండిమీద ఉండి ఆహారం తింటున్న భీమసేనుడిని - దూరాన్నుండి చూచి 'ప్రతిదినం నాకై తెచ్చే అన్నాన్ని నీ వేల తింటున్నా'వనీ, 'ఏకచక్రపురవాసులు పొగరుపట్టారు. వాళ్ళకు నే నెందువలన ఇంత చులకన అయ్యాను?' అనీ, సమీపించి, భీముడివీపున పిడికిట పొడిచాడు. భీముడు బెదరక, ఆ రాక్షసుడివైపు కూడ చూడకుండ, వేరేమీ ఆలోచించక, ఎప్పటివలె అన్నం తింటుండగా, బకుడు కోపించి, వీడితీరు వేరుగా ఉన్నదని పక్కనుండే చెట్టును పెరికికొని భీమునిదగ్గరకు వచ్చాడు.

విశేషం: వీని బాగు - అనే దానికి వీనిబాస, వీనిలావు, వీనిభంగి - అనే పాఠాంతరాలున్నాయి. శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పుట.397.

వ. అంతకు ముందఱ భీమసేనుం డంత కూడునుం గుడిచి యనంతబలసమేతుం డై యంతకాకారంబున మల్లసఱచుకొని యార్చుచు. 296

ప్రతిపదార్థం: అంతకు, ముందఱ= అంతకు మునుపు; భీమసేనుండు; అంత, కూడునున్= మొత్తం ఆహారాన్ని; కుడిచి= తిని; అనంత, బల, సమేతుండు+ఐ= అంతులేనిబలంతో కూడుకొన్నవాడై; అంతక+ఆకారంబునన్= యమధర్మరాజుయొక్క రూపంతో; మల్ల, చఱచుకొని= భుజంతట్టుకొని; ఆర్చుచున్= అరుస్తూ.

తాత్పర్యం: అంతకు ముందు భీమసేనుడు మొత్తం ఆహారాన్ని తిని మిక్కిలి బలవంతుడై యమధర్మరాజు రూపం దాల్చి భుజం తట్టి అరుస్తూ.

ఉ. ఇంచుకయేని పాపమున కెన్నఁడు రోయక యెల్లవారి బా
ధించి మనుష్యమాంసములు దించును గ్రొవ్వితి; వాని నెల్లఁ గ్ర
క్కించెద, నీమదాంధ్య ముడిగించెద, నిప్పడ కాలుప్రోలి కే
గించెదఁ జక్కనై నిలుము గిట్టి రణంబున రాక్షసాధమా! 297

ప్రతిపదార్థం: రాక్షస+అధమా!= రాక్షసులలో నీచుడైనవాడా! ఎన్నడు= ఎప్పుడుకూడ; పాపమునకున్; ఇంచుక+ఏని= కొద్దిగా కూడ; రోయక= రోతచెందక; ఎల్లవారిన్= అందరినీ; బాధించి; మనుష్య, మాంసములు= మానవుల మాంసాలు; తించును= తినుచును, తింటూ; క్రొవ్వితివి= పొగరెక్కావు; వానిన్+ఎల్లన్= వాటినన్నింటిని; క్రక్కించెదన్= క్రక్కిస్తాను; నీ మద+ఆంధ్యము= నీ పొగరు= యొక్క గ్రుడ్డితనం; ఉడిగించెదన్= పోగొట్టుతాను; ఇప్పుడు+అ= ఇప్పటికిప్పుడే; కాలు+ప్రోలికిన్+ఏగించెదన్= యమధర్మరాజుయొక్క పట్టణానికి పంపిస్తాను; కిట్టి= సమీపించి; రణంబునన్= యుద్ధంలో; చక్కన+ఐ= సరిగా; నిలుము= నిలబడుము.

భీమసేనుఁడు బకాసురుం జంపుట (సం. 1-151-15)

వ. అనుచు సమీరణసుతుండు దన సమీపంబున నున్న విశాలసాలవృక్షంబు పెఱికికొని రక్కసునిపై వైచిన వాఁడును దన చేతివృక్షంబున దాని భగ్నంబుఁ జేసె; ని ట్లిరువురు నొక్కవడి వృక్షయుద్ధంబు సేసి యాసన్న మహీరుహంబులు సమసిన మల్లయుద్ధసన్నద్ధులై. 298

ప్రతిపదార్థం: అనుచున్= అనిఅంటూ; సమీరణ, సుతుండు= వాయుపుత్రుడైన భీముడు; తన, సమీపంబునన్= తన దగ్గరలో ఉండే; విశాల, సాల, వృక్షంబున్= పెద్ద మద్దిచెట్టును; పెఱికికొని= ఊడదీసి; రక్కసు, పైన్= రాక్షసుని మీద; వైచినన్= వేయగా; వాఁడును= ఆ రాక్షసుడు కూడా; తన, చేతి వృక్షంబునన్= తనచేతిలోని చెట్టుచేత; దానిన్= ఆ పెద్దమద్దిచెట్టును; భగ్నంబున్+చేసెన్= విరుగగొట్టాడు; ఇట్లు+ ఇరువురున్= ఈ విధంగా ఇద్దరున్నూ; ఒక్క, వడిన్= ఒక్కవేగంలో; వృక్ష, యుద్ధంబు+చేసి= చెట్లతో యుద్ధం చేసి; ఆసన్న, మహీరుహంబులు= దగ్గరుండే చెట్లు; సమసినన్= నశింపగా; మల్ల, యుద్ధ, సన్నద్ధులు+ఐ= మల్లయుద్ధానికి పూనుకొన్నవాళ్ళయి.

తాత్పర్యం: అని అంటూ, వాయుపుత్రుడైన భీముడు తనకు సమీపాన ఉన్న ఒకపెద్దమద్దిచెట్టును పెరికి రాక్షసుడిమీద వేయగా - వాడు తనచేతిలో ఉండే చెట్టుతో దాన్ని విరుగగొట్టాడు. ఈ విధంగా ఇద్దరూ చెట్లతో యుద్ధం చేసి, చుట్టుప్రక్కల ఉండే చెట్లన్నీ నశించగా మల్లయుద్ధానికి పూనుకొన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. పరువడి నొండొరుం బెనఁగి పట్టుచుఁ ద్రోచుచు నీడ్చుచుం బర
స్పరజయకాంక్షులైన బక పాండవవీరుల పాదఘట్టనన్
ధరణితలంబు గ్రక్కదలెఁ, దన్నికటద్రుమవల్లు లెల్ల జ
ర్జరితము లయ్యెఁ, నిష్ఠురవిశాలశిలల్ నుఱుమయ్యె నయ్యెడన్. 299

ప్రతిపదార్థం: పరువడిన్= క్రమంగా; ఒండు+ఒరున్= ఒకరితో నొకరు; పెనఁగి= కలియబడి; పట్టుచున్= పట్టుకొంటూ; త్రోచుచున్= తోసుకొంటూ; ఈడ్చుచున్= ఈడ్చుకొంటూ; పరస్పర, జయ, కాంక్షులు+ఐన= ఒకరినొకరు జయించాలన్న కోరిక కలవాళ్ళయిన; బక, పాండవ, వీరుల, పాద, ఘట్టనన్= వీరులైన బక భీములయొక్క పాదాలయొక్క తొక్కిడిచేత; ఆ+ఎడన్= ఆ ప్రదేశాన; ధరణి, తలంబు= భూభాగం, క్రక్కదలెన్= మిక్కిలి చలించింది; తత్+నికట, ద్రుమ, వల్లులు+ఎల్ల= దానికి సమీపంలో ఉండేచెట్లు, తీగలు, అన్నీ; జర్జరితములు+అయ్యెన్= శిథిలమయ్యాయి - చెల్లాచెదరయ్యాయి; నిష్ఠుర, విశాల, శిలల్= కఠినాలైన పెద్దబండలు; నుఱుము+అయ్యెన్= పిండి అయ్యాయి.

తాత్పర్యం: క్రమంగా భీమబకాసురులు ఒకరితో ఒకరు కలియబడి పట్టుకొంటూ; త్రోసుకొంటూ, ఈడ్చుకొంటూ విజయం సాధించాలని మల్లయుద్ధం చేస్తుంటే, అక్కడి భూభాగం ఎక్కువగా చలించింది. ప్రక్కల ఉండే అన్నిచెట్లూ, తీగెలు చెల్లాచెదరయ్యాయి. కఠినాలైన పెద్దబండలుకూడా పిండి అయ్యాయి.

ఉ. ఇద్దఱ హుంకృతిధ్వనులు నిద్దఱ భూరిభుజారవంబు న
య్యిద్దఱముష్టిఘాతజనితేరితదారుణనిస్వనంబు న
య్యిద్దఱపాదఘట్టితమహీరవమున్ విని చూప ఱెల్లనుం
దద్దయు భీతి నచ్చటికిఁ దా రెడగల్గఁగఁ బాఱి రొక్కఁడై. 300

ప్రతిపదార్థం: ఇద్దఱ, హుంకృతి, ధ్వనులున్= భీమబకాసురులిద్దరియొక్క హుంకారశబ్దాలు; ఇద్దఱ, భూరి, భుజా, రవంబున్= ఆ యిద్దరియొక్క పెద్దభుజాలు తట్టేచప్పుడు; ఆ+ఇద్దఱ, ముష్టి, ఘాత, జనిత+ఈరిత, దారుణ, నిస్వనంబున్= ఆ యిద్దరియొక్క పిడికిలిపోట్లనుండి పుట్టి త్రోయబడిన భయంకరమైన శబ్దం; ఆ+ఇద్దఱ, పాద, ఘట్టిత, మహీ, రవమున్= ఆ యిద్దరియొక్క పాదాలచే త్రొక్కబడిన భూమియొక్కశబ్దం; విని; చూపఱు+ఎల్లనున్= చూచేవాళ్ళంతా; తద్దయు, భీతిన్= మిక్కిలిభయంతో; తారు= తాము; ఒక్కడు+ఐ= ఒక్కటై; అచ్చటికిన్; ఎడ, కల్గఁగన్= దూరమవునట్లుగా - దూరంగా; పాఱిరి= పరుగెత్తారు.

తాత్పర్యం: భీమ బకాసురులిద్దరియొక్క హుంకారాలు, భుజాల చప్పుడు, పిడికిటిపోట్ల ధ్వని, కాళ్ళ తొక్కిళ్ళచేత భూమినుండి పుట్టిన శబ్దం విని, చూచేవాళ్ళంతా మిక్కిలి భయపడి ఒక్కటిగా అక్కడినుండి పరుగెత్తారు.

విశేషం: వీరరసోచితంగా ఓజోగుణప్రధానమైన ఈ పద్యంలో - ద్విత్వాక్షర ప్రాస, ద్విత్వాక్షరాలు, విశేషించి మహాప్రాణాక్షరాలు- భీమ బకాసురుల ద్వంద్వయుద్ధాన్ని - అందులోనూ మల్లయుద్ధశబ్దాల్ని అద్భుతంగా ధ్వనింప చేసేవిగా ఉన్నాయి. అక్షర రమ్యమైన నన్నయశైలికి ఇదొక చక్కని ఉదాహరణ.

వ. ఇట్లు భీమ బకాసురు లాసురంబునం బెనంగి మల్లయుద్ధంబు సేయునెడ. 301

ప్రతిపదార్థం: ఇట్లు; భీమ, బక+అసురులు+ఆసురంబునన్= భీముడు, బకాసురుడు, అసురకృత్యం చేత; పెనంగి= కలియబడి; మల్ల, యుద్ధంబు+చేయు+ఎడ= మల్లయుద్ధం చేసే సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా భీమబకాసురులు రాక్షసంగా కలియబడి మల్లయుద్ధం చేసే సమయంలో.

క. కడఁగి వృకోదరుఁ డసురం । బడఁగా ధర వైచి వామపాదంబునఁ జే
ద్పడ వానిఱొమ్ముఁ దాఁచెం । గడుకొని యసురయును లేచి కడునుద్ధతుఁ డై. 302

ప్రతిపదార్థం: కడఁగి= పూనుకొని; వృక+ఉదరుఁడు= తోడేలుకడుపువంటి కడుపుకలవాడు - భీముడు; అసురన్= రాక్షసుడిని; పడఁగా= పడేటట్లు; ధరన్ వైచి= భూమిమీద పడవేసి; వామ, పాదంబునన్= ఎడమకాలితో; వాని, ఱొమ్మున్= అతనియొక్క ఎదను; తాఁచెన్= తన్నాడు; కడుకొని= పూనుకొని; అసురయును= రాక్షసుడుకూడ; లేచి= పైకిలేచి; కడున్+ఉద్ధతుఁడు+ఐ= మిక్కిలి విజృంభించినవాడై.

తాత్పర్యం: ప్రయత్నించి భీముడు బకాసురుడిని నేలమీద పడవేసి, అతనిఎదను ఎడమకాలితో తన్నాడు. వాడుకూడా ప్రయత్నించి, లేచి, మిక్కిలి విజృంభించి.

క. అనిలసుతుఁ బట్టికొని పె । ల్చన త్రోచి కడంగి కనకశైలనికుంజం
బునుబోని వానివక్షముఁ । దనదృఢతరముష్టిఁ బొడిచెఁ దద్దయు నలుకన్. 303

ప్రతిపదార్థం: అనిలసుతున్= వాయుపుత్రుడైన భీముడిని; పట్టికొని= బిగియపట్టి; పెల్చన్= గట్టిగా; త్రోచి= నెట్టి; కడంగి= పూని; కనక, శైల, నికుంజంబును+పోని= బంగారుకొండలోని పొదరింటిని పోలిన; వాని, వక్షమున్= భీమునియొక్క రొమ్మును; తద్దయున్= మిక్కిలి; అలుకన్= కోపంతో; తన, దృఢ, తర, ముష్టిన్= తనయొక్క మిక్కిలి గట్టి పిడికిలితో; పొడిచెన్.

తాత్పర్యం: భీముడిని గట్టిగా పట్టుకొని మేరుపర్వతంమీది పొదరింటినిపోలిన అతని ఎదను అమితమైన కోపంతో గట్టిగా తన పిడికిలితో పొడిచాడు.

విశేషం: అలం: ఉపమ. కనకశైలనికుంజంబునుబోని - అనేదానికి శైలోచ్ఛ్రాయంబునుంబోని - అనే పాఠాంతరం ఉంది. మూలం; "వ్యాత్తాననేన ఘోరేణ లంబజిహ్వేన రక్షసా తే నాభిద్రుత్య భీమేన భీమో మూర్ధ్ని సమాహితః" - శ్రీమదాంధ్ర మహాభారతసంశోధితప్రతి, పుట. 398.

వ. భీముండును వాని హీనసత్త్వుంగా నెఱింగి సుర హస్తి హస్తానుకారంబు లైన సవ్య దక్షిణ హస్తంబుల న మ్మనుజ కంటకు కటి కంఠ ప్రదేశంబులు వట్టికొని. 304

ప్రతిపదార్థం: భీముండును= భీముడుకూడా; వానిన్= ఆ బకాసురుణ్ణి; హీన, సత్త్వున్+కాన్= నశించినబలం కలవాడినిగా; ఎఱింగి= తెలుసుకొని; సుర; హస్తి, హస్త+అనుకారంబులు+ఐన= ఐరావతంయొక్క తొండాలను పోలినవైన; సవ్య, దక్షిణ, హస్తంబులన్= ఎడమకుడి చేతులతో; ఆ+మనుజ, కంటకు, కటి, కంఠ, ప్రదేశంబులు+పట్టికొని= మానవులకు శత్రువైన ఆ బకాసురుడి నడుము, గొంతు పట్టుకొని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: భీముడుకూడా - ఆ బకాసురుడు బలహీనుడు కావటాన్ని గమనించి, ఐరావతంయొక్క తొండాలవంటి బలమైన తన ఎడమకుడిచేతులతో వాడినడుమూ, గొంతూ పట్టుకొని.

ఉ. **దారుణ జానుదండమున దండధర ప్రతిముండు భీకరా**
కారుఁడు వానివీఁపు విఱుగంబొడిచెం బిశితంబుతో నవ
ద్వారములన్ మహారుధిరధారలు బోరన నొల్కి మాంస పం
కారుణవారిఘోరనదు లై పఱవన్ విపినాంతరంబునన్. **305**

ప్రతిపదార్థం: భీకర+ఆకారుఁడు= భయంకరమైన రూపం కలవాడు; దండ, ధర, ప్రతిముండు= యమధర్మరాజుతో సమానమైనవాడు - అయిన భీముడు; దారుణ, జాను, దండమునన్= కఠినమైన తనమోకాలనే దండంతో; పిశితంబుతోన్= మాంసంతో; నవ, ద్వారంబులన్= తొమ్మిదిమార్గాలనుండి; మహా, రుధిర, ధారలు= పెద్ద నెత్తుటి ధారలు; బోరనన్+ఒల్కి= బోరన చింది; విపిన+అంతరంబునన్= అడవి మధ్యభాగంలో; మాంస, పంక+అరుణ, వారి, ఘోర, నదులు+ఐ= మాంస మనే బురదతో ఎఱ్ఱనినీటితో భయంకరాలైన నదులై; పఱవన్= పారగా; వాని, వీఁపు= ఆ బకాసురునియొక్క వీపు; విఱుగన్= విరిగేటట్లు; పొడిచెన్.

తాత్పర్యం: భీముడు దండధరునివలె - అంటే యమునివలె - భయంకరాకారుడై, మహాకఠినమైన తన మోకాలనే దండంతో - బకాసురునినవద్వారాలనుండి మాంసంతో కూడిన నెత్తుటిధారలు ఉరవడిగా వెలికివచ్చి, అడవిమధ్యలో మాంసం అనే బురదతో, ఎఱ్ఱనినీటితో భయంకరాలైన నదులవలె ప్రవహించేటట్లు - ఆ రాక్షసుడివీపు విరిగేలా పొడిచాడు.

విశేషం: నవద్వారాలు - నేత్రాలు -2; శ్రోత్రాలు -2, నాసారంధ్రాలు-2, ముఖరంధ్రం-1, మలమూత్రవిసర్జన రంధ్రాలు-2, అలం: రూపకం. ఉపమ, అతిశయోక్తి. శ్రవ్యకావ్యంలో స్థిరరూపవర్ణనకంటె, చలద్రూపవర్ణన చాల కష్టం. అయినా పాఠకుని దృష్టిని విశేషంగా ఆకర్షించేది, అతడిని అధికంగా రసపరవశుడిని చేసేది - చలద్రూపవర్ణనమే. ఈ సన్నివేశంలో నన్నయ మల్లయుద్ధం చేస్తున్న భీమబకాసురుల చలద్రూపాలను మనకళ్ళకు కట్టినట్లు మనోహరంగా చిత్రించాడు. ఆ యిద్దరియుద్ధాన్ని చూస్తున్న అనుభూతిని కలిగించాడు. కాగా, అలంకారాన్ని ప్రయోగించి వస్తువును, రసాన్ని ధ్వనింప చెయ్యటం ఒక గొప్ప కవితా శిల్పం. ఈ పద్యంలో నన్నయ - భీముని మోకాటిని యమదండంతో రూపించి, భీముడిని యమధర్మరాజుతో పోల్చి - బకాసురుని పాలిటికి భీముడు సాక్షాత్తు యముడే అని, ఆ రాక్షసునికి మరణం తప్పదని ధ్వనింపచేశాడు. అట్లాగే భీమునిదెబ్బకు బకాసురుని నవరంధ్రాలనుండి మాంసంతో కూడిన నెత్తురు ఏరులై పారిందన్న అతిశయోక్తితో - భయానక బీభత్స రసస్ఫూర్తి కలిగించాడు. విశేషించి - 297వ పద్యంలో భీముడు ప్రతిజ్ఞ చేసినట్లు - బకాసురుడు ఇన్నాళ్ళూ తిన్న మానవమాంసాన్నీ, త్రాగినరక్తాన్నీ క్రక్కించినట్లుంది - ఈ పద్యవర్ణన. అంతేకాదు హిడింబ బకాసురులవధలలో శత్రువును వెన్నువిరిచి చంపే మల్లవిద్యను భీముడు సమంగా ప్రదర్శించటం గమనార్హం. ఇటువంటి సంవాదశిల్పపూర్వాపరసంవిధానంతో నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తిని సాధించటం ఇందులోని విశేషం.

వ. **ఇట్లు బకాసురుండు భీముచేత నిహతుం డయి విగతజీవితుం డగుచుండి యఱచిన నమ్మహాధ్వని విని, వాని బాంధవు లైన రక్కసులు పెక్కండ్రు పఱతెంచిన వారలం జూచి భీముం డి ట్లనియె.** **306**

ప్రతిపదార్థం: ఇట్లు; బకాసురుండు; భీముచేత; నిహతుండు+అయి= చంపబడినవాడై; విగజీవితుండు+అగుచున్+ఉండి= కోల్పోయిన ప్రాణం కలవాడవుతూ; అఱచినన్ = అరవగా; ఆ+మహా, ధ్వని= ఆ పెద్దశబ్దాన్ని; విని; వాని బాంధవులు+ఐన= వాడియొక్క బంధువులయిన; రక్కసులు= రాక్షసులు; పెక్కంఁడ్రు= చాలామంది; పఱతెంచినన్= రాగా; వారలన్+చూచి; భీముండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: బకాసురుడు భీమునిచేత హతుడై ప్రాణం పోయేటప్పుడు పెద్దగా అరవగా; ఆ ధ్వని విని అతని బంధువులైన పెక్కుమందిరాక్షసులు పరుగెత్తుకొని రాగా వారిని చూచి భీముడిట్లా అన్నాడు.

తే. 'ఇంక నెన్నండు రక్కసు లిద్దురాత్ము । నట్లు మనుజులఁ దినకుండుఁ; డడరి మనుజ
భక్షణము సేసితిరయేని బకుని యట్లు చత్తు' రని రక్కసుల కెల్లఁ జాటె వినఁగ. 307

ప్రతిపదార్థం: ఇంకన్+ఎన్నండున్= ఇంకెప్పుడుకూడ; రక్కసులు; ఈ దురాత్ము+అట్లు= ఈ దుర్మార్గుడివలె; మనుజులన్= మానవులను; తినక+ఉండుఁడు; అడరి= పూనుకొని; మనుజ, భక్షణము+చేసితిర+ఏని= మానవులను తినటం చేస్తే - అంటే మానవులను తింటే; బకుని+అట్లు; చత్తురు (చచ్చుదురు)+అని; రక్కసులు+ఎల్లన్= రాక్షసులందరు; వినఁగన్= వినేటట్లు; చాటెన్= ప్రకటించాడు.

తాత్పర్యం: 'ఇంకెప్పుడు మీరు ఈ దుర్మార్గునివలె మానవులను తినవద్దు. తింటే ఈ బకాసురుడివలె మీకు కూడ చావు తప్ప'దని ఆ రాక్షసులందరు వినేటట్లు భీముడు ప్రకటించాడు.

వ. అంత నారాక్షసులు భీతు లై భీము సేసిన సమయంబున కొడంబడి నాఁటంగోలె నేకచక్రనివాసులకు నుపద్రవంబుఁ చేయనోడి; రట్లు భీముండు బకాసురుం జంపి, వానిం జంపుట జగద్విదితంబుగాఁ దత్కళేబరం బీడ్చుకొని వచ్చి, నగర ద్వార సమీపంబున వైచి, యందుల విప్రులకు సంతోషంబు సేసి, నిజ నివాసంబునకుం జని త ద్వృత్తాంతం బంతయుఁ దల్లికి సహోదరులకుం జెప్పి యున్నంత. 308

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; ఆ, రాక్షసులు; భీతులు+ఐ= భయపడినవారై; భీము, చేసిన, సమయంబునకున్= భీముడు చేసిన నియమానికి; ఒడంబడి= ఒప్పుకొని; నాఁటన్+కోలెన్= ఆ రోజునుండి; ఏకచక్ర, నివాసులకున్= ఏకచక్రపురంలో కాపురముండేవారికి; ఉపద్రవంబున్= హాని; చేయన్+ఓడిరి= చేయటానికి భయపడ్డారు; అట్లు; భీముండు; బకాసురున్; చంపి; వానిన్= బకాసురుని; చంపుట; జగత్+విదితంబు+కాన్= ప్రపంచానికంతటికీ తెలిసేటట్లు; తత్+కళేబరంబున్= అతనియొక్క శవాన్ని; ఈడ్చుకొని, వచ్చి; నగర, ద్వార, సమీపంబునన్= నగరంయొక్క ద్వారం దగ్గర; వైచి= పడవేసి; అందుల, విప్రులకున్= అందుండే బ్రాహ్మణులకు; సంతోషంబు+చేసి; నిజ, నివాసంబునకున్+చని= తానుండే ఇంటికి వెళ్ళి; తత్+వృత్తాంతంబు+అంతయున్= ఆ విషయాన్నంతటినీ; తల్లికిన్, సహ+ఉదరులకున్= తల్లికి, తోబుట్టువులకు; చెప్పి+ఉన్న+అంతన్= తెలిపి ఉన్న సమయంలో;

తాత్పర్యం: అప్పుడు రాక్షసులు భయపడి భీముడు చేసిన నియమానికి అంగీకరించారు. ఆ రోజునుండి ఏకచక్ర పురవాసులకు కీడు చేయటానికి భయపడ్డారు. బకాసురవధ లోకానికంతటికి తెలిసేటట్లు భీముడు ఆ రాక్షసునిశవాన్ని ఈడ్చుకొనివచ్చి, ఏకచక్రనగరద్వారం దగ్గర పడవేసి, ఆ నగరంలోని బ్రాహ్మణుల కెల్ల సంతోషం కలిగించి, తన ఇంటికి వెళ్ళి, తల్లికి, సోదరులకు జరిగిన వృత్తాంతం చెప్పాడు. అప్పుడు.

ఉ. వీఁ డొక మంత్రసిద్ధుఁ డగు విప్రుఁ; డసాధ్యబలున్ బకాసురున్
నేఁ డనిఁ జంపెనట్టె! యితనిం జని చూతమ యంచుఁ జెచ్చెరం
బోఁడిగ వేత్రకీయమున భూసురు లాదిగ వచ్చి చూచి ర
వ్వాఁడిమగంటిమిన్ వెలయువాని వృకోదరు నెల్లవారలున్. 309

ప్రతిపదార్థం: వీఁడు+ఒక, మంత్రసిద్ధుఁడు+అగు, విప్రుఁడు= వీ డొకమంత్రంచేత ఫలాన్ని పొందిన బ్రాహ్మణుడు; అసాధ్యబలున్= జయించటానికి శక్యంగాని బలం కలవాడిని; బకాసురున్= బకుడు అనే రాక్షసుణ్ణి; నేఁడు; అనిన్= యుద్ధంలో; అట్టె, చంపెన్= అంతసులువుగా చంపాడు; చని= వెళ్ళి; ఇతనిన్; చూచుదుము+అ+అంచున్= చూద్దామా అంటూ; చెర+చెరన్= త్వరత్వరగా; వేత్రకీయమునన్= ఏకచక్రపురంలో; భూసురులు+ఆదిగన్= బ్రాహ్మణులు మొదలుగా; ఎల్లవారలున్= అందరును; ఆ+వాఁడిమగంటిమిన్, వెలయువానిన్, వృక+ఉదరున్= ఈ తీక్ష్ణమైన పౌరుషంచేత ప్రకాశించేవా డైన భీముడిని; పోఁడిగ= ఒప్పుగా; వచ్చి, చూచిరి.

తాత్పర్యం: 'వీ డొక మంత్రసిద్ధి గల బ్రాహ్మణుడు. జయించ సాధ్యంగాని బలవంతుడైన బకాసురుడిని ఈరోజు యుద్ధంలో సులువుగా చంపాడు. వెళ్ళి చూద్దాం' అని ఏకచక్రపురంలో బ్రాహ్మణులు మొదలుగా అందరూ త్వరత్వరగా వచ్చి తీక్ష్ణమైన పౌరుషంచేత ప్రకాశించే భీముడిని చూచారు.

విశేషం: వేత్రకీయము - అనేది ఏకచక్రపురానికి సంజ్ఞ. ఇచట భారతకూలంకషంలో ఇట్లా ఉంది. 'వేత్రకీయమున - ఏక చక్రాపురమున - అద్యప్రభృతి స్వప్యంతే వేత్రకీయ నివాసినః' - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.399. బకాసురవధకు నాయకుని వంటివాడు భీముడు. హిడింబుడిని కారడవిలో చంపి, ఆత్మీయులైన అన్నదమ్ముల కుంతీహిడింబల ప్రశంసల నందుకొన్నాడు. అది ఆత్మరక్షణకోసం చేసిన రాక్షససంహారం. బకాసురవధ పరహితార్థమై కృతజ్ఞతాభావంతో ఏకచక్రపురవాసులకు పాండవులు చేసిన ప్రత్యుపకారం. అందువలన కార్యసాధకుడైన భీమునికి ప్రజలప్రశంస.

క. అని యిట్లు పాండునృపనం । దనుల చరిత్రంబు సెప్పెఁ దా వైశంపా
యనుఁడు జనమేజయున కని । జనవినుతచరిత్రపాత్ర ! సౌజన్యనిధీ! 310

ప్రతిపదార్థం: జన, వినుత, చరిత్ర, పాత్ర= జనులచేత పొగడబడిన నడవడికి స్థానమైన వాడా!; సౌజన్య, నిధీ= మంచితనానికి ఉనికిపట్టయినవాడా - రాజరాజనరేంద్రా!; అని; ఇట్లు; పాండు, నృప, నందనుల, చరిత్రంబు= పాండురాజుయొక్క కొడుకుల కథను; వైశంపాయనుడు; తాన్= తాను; జనమేజయునకున్; చెప్పెన్; అని-

తాత్పర్యం: జనులచే కీర్తింపబడిన చరిత్ర కలిగి, మంచితనానికి నిధివైన ఓ రాజరాజనరేంద్రా! ఈవిధంగా పాండవుల చరిత్రను వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పాడు - అని సూతుడు శౌనకాదిమహామునులకు చెప్పాడు.

విశేషం: చరిత్ర అంటే కథ అనీ, శీలం అనీ అర్థాలున్నాయి. ఇక్కడ రెండర్థాలూ సార్థకాలే. కథాపరంగా, సంఘటనలపరంగా, మనస్తత్త్వాలపరంగా - మహాభారతంలో ఈ ఆరవ ఆశ్వాసానికి ఒక ప్రత్యేకత ఉన్నది; ప్రాధాన్యం ఉన్నది. నన్నయ నాటకీయ రచనకు నిలువెత్తు నిదర్శనంవలె నిలిచి, కురుకుమారుల అస్త్రవిద్యాప్రదర్శనతో ఆరంభమైన ఈ ఆశ్వాసంలో - భీమదుర్యోధనుల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గదాయుద్ధఘట్టంలో - కురు పాండవ విభేదాలు అందరిముందు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. కర్ణుని రంగప్రవేశంతో, అతని అంగరాజ్యాభిషేకంతో అవి ఘనీభవించాయి. అందరు చూచి ఆనందించవలసిన అస్త్రవిద్యాప్రదర్శన - ముమ్ముందు రానున్న మహాభారత సంగ్రామానికి నాందివలె మారింది. అర్ధాంతరంగా ముగిసింది. అంతబలవంతుడైన ద్రుపదుడిని అట్లాపట్టి కట్టితెచ్చి, గురుదక్షిణగా ద్రోణునికి ఇవ్వటంలో అర్జునుని అద్వితీయసామర్థ్యసౌశీల్యాలు అందరిదృష్టిని ఆకర్షించాయి. ధర్మజుని యౌవరాజ్యాభిషేకం, అతని నలుగురు తమ్ముల దిగ్విజయ యాత్ర, పాండవుల మీద - ప్రత్యేకించి ధర్మరాజు మీద పెల్లుబికిన ప్రజానురాగం, పాండవుల నాయకత్వ నైపుణ్యాన్ని నిరూపించాయి. ప్రతినాయకుడైన దుర్యోధనుడు పాండవులకు వ్యతిరేకంగా తన సహాయులతో సాగించిన దురాలోచన, పాండవుల ప్రాణాలు తీయాలని జరిపించిన లాక్షాగృహదహనం - అతని దుర్మార్గప్రవృత్తిని ప్రస్ఫుటం చేశాయి. దుర్యోధనుడు తండ్రితో తన మనోదుఃఖాన్ని వెళ్ళబోసుకొనే ఘట్టం - కురుపాండవ కథాగతిని ప్రభావితం చేసే - ధృతరాష్ట్ర మహారాజు మనస్తత్వాన్ని వ్యక్తం చేసింది. లాక్షాగృహదహనం నుండి పాండవులు ప్రాణాలతో బయటపడటం, ధర్మవిజయానికి, అధర్మపరాజయానికి, మొత్తం మహాభారత సందేశానికి చక్కని సంకేతమై నిలిచింది. లాక్షగృహదహనం తరువాతి కథ అంతా భీమనాయకంగానే సాగింది. హిడింబాసుర బకాసురులవధలు భీముని బలపరాక్రమాలకు విజయపతాకాలు. తల్లి శాసనాన్ని, అన్నగారి నిర్దేశాన్ని అనుసరించి, ఇద్దరి గురుత్వాన్ని శిరసావహించి పాండవపక్షాన ప్రవర్తిల్లే ప్రబల క్రియాశక్తి భీముడు. హిడింబను అతడు వివాహమాడటం ఇందుకొక నిదర్శనం. హిడింబా భీమసేనుల వివాహఫలమే - మాయాయుద్ధనిపుణుడు, మహాశక్తి సంపన్నుడు అయిన ఘటోత్కచుని జననం. అతని జననం పాండవపక్షానికి పెద్దబలం. పాండవపక్షాన జ్ఞానశక్తి వ్యాసుడు; ఇచ్ఛాశక్తి కుంతి; ధార్మికశక్తి ధర్మరాజు; క్రియాశక్తులు భీమార్జునులు; రక్షాశక్తులు నకుల సహదేవులు. ఆరవ ఆశ్వాసకథ ఆసక్తికరమైన కథ; ముమ్ముందు రానున్న మలుపులను సూచించే కథ.

ఆశ్వాసాంతము

క. మలహరినాథ ! విలస । చ్చళుక్యకులతిలక! రాజసర్వజ్ఞ! రిపు
ప్రలయప్రతాప ! పరనృప । లలనాననకమలహరిణలాంఛనమూర్తీ! 311

ప్రతిపదార్థం: మలహరి, నాథ= మలహరిదేశానికి ప్రభువైనవాడా!; విలసత్+చళుక్య, కుల, తిలక= ప్రకాశిస్తున్న చాళుక్యవంశానికి అలంకారమైనవాడా!; రాజ, సర్వజ్ఞ= రాజపరమేశ్వరా! రిపు, ప్రలయ, ప్రతాప= శత్రువులకు నాశనం కలిగించేటి ప్రతాపం కలవాడా!; పర, నృప, లలనా+ఆనన, కమల, హరిణ, లాంఛన, మూర్తీ= శత్రువులయొక్క స్త్రీలముఖాలనే పద్మాలకు చంద్రునివంటి ఆకారం గలవాడా!

తాత్పర్యం: మలహరిదేశప్రభూ! చాళుక్యవంశాలంకారా! రాజపరమేశ్వరా! శత్రురాజులను నశింపజేసే పరాక్రమం కలవాడా! శత్రువులయొక్క స్త్రీల ముఖాలనే పద్మాలు ముడుచుకొని పోయేటట్లు చేసే చంద్రుని వంటివాడా!

విశేషం: ఇవి ఆశ్వాసాంతంలో కృతిపతి అయిన రాజరాజనరేంద్రుడిని ప్రశంసిస్తూ చేసే సంబోధనలు.

మాలిని.

ప్రణమదఖిలధాత్రీపాలకాలోలచూడా । మణిగణకిరణశ్రీమండితాంఘ్రీ! నరేంద్రా
గ్రణి ! నిఖిలమహీరక్షామణీ! రాజనారా । యణ ! విమలమతీ! శీతాంశువంశప్రకాశీ! 312

ప్రతిపదార్థం: ప్రణమత్+అఖిల, ధాత్రీ, పాలక+ఆలోల, చూడామణి, గణ, కిరణశ్రీ, మండిత+అంఘ్రీ= నమస్కరిస్తున్న అందరు రాజులయొక్క కదలుతున్న శిరోరత్నాల సమూహాల కాంతులయొక్క సంపదచేత అలంకరింపబడిన పాదాలు కలవాడా!; నరేంద్ర+అగ్రణి= రాజులలో శ్రేష్ఠుడా!; నిఖిల, మహీ, రక్షా, మణీ= సమస్త భూమండలాన్ని రక్షించుటయందు శ్రేష్ఠుడా!; రాజనారాయణ!= రాజనారాయణుడు అనే బిరుదు కలవాడా!; విమల, మతీ= నిర్మలమైన బుద్ధికలవాడా!; శీత+అంశు, వంశ, ప్రకాశీ= చల్లని కిరణాలు కలవాడైనచంద్రునివంశాన్ని ప్రకాశింప చేసేవాడా!

తాత్పర్యం: నమస్కరిస్తున్న రాజులందరి చలించేశిరోరత్నసమూహాల కాంతిసంపదచేత అలంకరింపబడిన పాదాలుకలవాడా! రాజశ్రేష్ఠా! సమస్త భూమండలాన్ని రక్షించడంలో శ్రేష్ఠుడా! రాజనారాయణ బిరుదాంకితా! నిర్మలమైన బుద్ధికలవాడా! చంద్రవంశాన్ని ప్రకాశింపజేసేవాడా! - ఓ రాజరాజనరేంద్రా!

విశేషం: మాలిని వృత్తపాదంలో వరుసగా న, న, మ, య, య గణాలుంటాయి. 9వ అక్షరం యతిస్థానం. 'కుర్యాత్ సర్గస్య పర్యన్తే మాలినీం ద్రుతతాలవత్' అని క్షేమేంద్రుడు సువృత్తతిలకంలో తెలిపినట్లే ఇచ్చట షష్ఠాశ్వాసాంతంలో మాలినివృత్తం కూర్పబడింది. రాజరాజనరేంద్రుణ్ణి "నారాయణాఖ్య" అని ఆదిపర్వం ద్వితీయాశ్వాసాంతంలోని ఆశ్వాసాంతపద్యాల్లో (పద్యం-237) కూడా ఉంది. కనుక 'రాజనారాయణ' అనేది ఇతని బిరుదు.

గద్యము

ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దాదిపర్వంబునం గుమారాస్త్రవిద్యాసందర్శనంబును, ద్రుపదగ్రహణమోక్షణంబును, దుర్యోధనుదుర్మంత్రంబును, వారణావతయాత్రయు, జతుగృహదాహంబును, విదురోపదిష్టద్వారంబునం బాండవాపక్రమణంబును, హిడింబు వధయును, హిడింబావివాహంబును, వ్యాససందర్శనంబును, ఘటోత్కచసంభవంబును, విప్రగృహంబున నజ్ఞాతచర్యయును, బకాసురవధయును నన్నది షష్ఠాశ్వాసము. **313**

తాత్పర్యం: ఇది, సకల సత్కవుల ప్రశంసలందుకొన్న నన్నయభట్టు రచించిన శ్రీ మహాభారతంలో ఆదిపర్వంలో - కురుకుమారుల అస్త్రవిద్యాప్రదర్శన చూడటం, ద్రుపదరాజును యుద్ధంలో బంధించి విడిచిపెట్టటం, దుర్యోధనుని దురాలోచనం, పాండవులు - వారణావతానికి వెళ్ళటం, లక్కయింటిని తగులబెట్టటం, విదురుడు ఉపదేశించిన మార్గంలో పాండవులు బయటపడటం, హిడింబాసురుడుని సంహరించటం, భీమసేనుడు హిడింబను వివాహమాడటం, వ్యాసమహర్షి దర్శనమివ్వటం, ఘటోత్కచుడు జన్మించటం, పాండవులు బ్రాహ్మణుని ఇంట అజ్ఞాతంగా మెలగటం, బకాసురుడిని హతమార్చటం- అనే అంశాలు కలది ఆరవఆశ్వాసం.

ఆదిపర్వంలో షష్ఠాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము - సప్తమాశ్వాసము

శ్రీ రాజరాజ! వీర । శ్రీరమణీరమ్య । గంధసింధుర హయ శి
క్షారూఢిదక్ష ! దక్ష మ । ఖారిదయాలబ్ధ సుస్థిరైశ్వర్యపదా ! 1

ప్రతిపదార్థం: శ్రీరాజరాజ! వీర, శ్రీ, రమణీ, రమ్య! = వీరలక్ష్మి అనే కాంతకు మనోహరుడ వైనవాడా!; గంధ, సింధుర, హయ, శిక్షా+ఆరూఢి, దక్ష!= మదపుటేనుగులను, గుఱ్ఱాలను శిక్షించటంలోను, ఎక్కటంలోను సమర్థుడ వైనవాడా! దక్ష, మఖ+అరి దయా, లబ్ధ, సుస్థిర+ఐశ్వర్య, పదా!= దక్షుడి యజ్ఞానికి శత్రు వైన శివుడిదయతో పొందబడిన శాశ్వతమైన ఐశ్వర్య స్థానం - అనగా రాజ్యపదవి కలవాడా!

తాత్పర్యం: ఓ రాజరాజనరేంద్రా! వీరలక్ష్మి అనే కాంతకు మనోహరుడ వైనవాడా! మదపుటేనుగులను, గుఱ్ఱాలను శిక్షించటంలోను, అధిరోహించటంలోను సమర్థుడైనవాడా! దక్షయజ్ఞానికి శత్రు వైన శివునిదయతో పొందిన శాశ్వతరాజ్యపదవి కలవాడా!

ధృష్టద్యుమ్న ద్రౌపదుల యుత్పత్తి వృత్తాంతము (సం. 1-153-1)

వ. అ క్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె; నట్లు పాండవులు విప్రవేషంబున నేకచక్రపురంబునందు వేదాధ్యయనంబు సేయుచు విప్రగృహంబున నున్న కొన్ని దినంబులకు నొక్కబ్రాహ్మణుండు ద్రుపదు పురంబున నుండి చనుదెంచి విశ్రమార్థి యైన, నాగృహస్థుండు వాని నభ్యాగతపూజల సంతుష్టుం జేసి యున్నంతఁ, గుంతీదేవి గొడుకులుం దాను నవ్విప్రు నతిప్రీతి నుపాసించి 'యయ్యా! మీర లెందుండి వచ్చితి? రే దేశంబులు రమ్యంబు? లెందుల రాజులు గుణవంతు? లని యడిగిన' న వ్విప్రుం డి ట్లనియె. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= మహాభారతకథను చెప్పే ఆ ఉగ్రశ్రవసుడు; శౌనక+ఆది, మహామునులకున్= శౌనకుడు మొదలైన మహర్షులకు; చెప్పెన్; అట్లు= ఆ విధంగా; పాండవులు; విప్ర వేషంబునన్= బ్రాహ్మణవేషంతో; ఏకచక్రపురంబునందు; వేద+అధ్యయనంబు+చేయుచున్= వేదాన్ని గురుముఖంగా చదువుకొంటూ; విప్ర, గృహంబునన్= బ్రాహ్మణుని ఇంట్లో; ఉన్నన్= ఉండగా; కొన్ని, దినంబులకున్; ఒక్క, బ్రాహ్మణుండు; ద్రుపదు, పురంబుననుండి= ద్రుపదుని పట్టణంనుండి; చనుదెంచి= వచ్చి; విశ్రమ+అర్థి, ఐనన్= విశ్రాంతిని కోరినవాడు కాగా; ఆ గృహస్థుండు= పాండవులున్న ఆ యింటి యజమాని; వానిన్= ఆ బ్రాహ్మణుడిని; అభ్యాగత పూజలన్= అభ్యాగతులకు చేసే పూజలతో; సంతుష్టున్= తృప్తి పొందిన

వాడినిగా; చేసి, ఉన్నంతన్= ఉన్న అంతట; కొడుకులున్; తానున్; కుంతీదేవి; ఆ+విప్రున్= వచ్చి ఉన్న ఆ బ్రాహ్మణుడిని; అతిప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; ఉపాసించి= సేవించి; అయ్యా!;= అయ్యా; మీరలు, ఎందుండి= మీ రెక్కడినుండి; వచ్చితిరి= వచ్చినారు; ఏ దేశంబులు; రమ్యంబులు= అందమైనవి; ఎందుల రాజులు= ఏ దేశాలలోని రాజులు; గుణవంతులు= మంచిగుణాలు కలవారు; అని; అడిగినన్= అడుగగా; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: మహాభారతకథను చెప్తున్న ఉగ్రశ్రవసుడు, శౌనకాది మహామునులకు - భీముడు బకాసురుడిని వధించేవరకు జరిగినకథను వివరించాడు. ఆ విధంగా పాండవులు బ్రాహ్మణవేషాలతో ఏకచక్రపురంలో వేదాధ్యయనం చేస్తూ ఒక బ్రాహ్మణుని ఇంట్లో ఉండగా, కొన్ని రోజుల తర్వాత ఒక బ్రాహ్మణుడు ద్రుపదరాజు పట్టణంనుండి వచ్చి విశ్రాంతి కోరగా, పాండవు లున్న ఇంటియజమాని అతడిని అభ్యాగత పూజలతో తృప్తిపరచాడు. ఆ సమయంలో కుంతీదేవి - కొడుకులు, తాను ప్రీతితో ఆ బ్రాహ్మణుడిని సేవించి, 'అయ్యా! మీరు ఎక్కడినుంచి వచ్చారు? ఏ దేశాలు అందమైనవి? ఏ దేశాల రాజులు గుణవంతులు?' అని అడుగగా ఆ బ్రాహ్మణుడు ఇట్లా అన్నాడు.

చ. సొలయక యెల్ల దేశములుఁ జూచితి; నందుఁ బ్రసిద్ధు లైన రా
జుల సుచరిత్ర సంపదలుఁ జూచితి; నా ద్రుపదేశుదేశముం
బొలుపున నొండు దేశములు పోల్పఁగ నెవ్వియు లేవు; సద్గుణం
బులఁ బరు లెవ్వరున్ ద్రుపదుఁ బోలఁగ లేరు ధరాతలంబునన్. 3

ప్రతిపదార్థం: సొలయక= అలసట చెందక; ఎల్ల, దేశములున్; చూచితిన్; అందున్, ప్రసిద్ధులు+ఐన= వాటిలో ముఖ్యులైన; రాజుల; సుచరిత్ర, సంపదలున్= మంచి నడవడి అనే సంపదలను; చూచితిన్; ధరాతలంబునన్= భూమిమీద; ఆ, ద్రుపద+ఈశు, దేశమున్= ఆ ద్రుపదరాజుయొక్క దేశమును; పొలుపునన్= అందంలో; పోల్పఁగన్= పోల్చటానికి; ఒండు, దేశములు= ఇతర దేశాలు; ఎవ్వియున్, లేవు= ఏవీ లేవు; సద్గుణంబులన్= మంచిగుణాలలో; పరులు= ఇతరులు; ఎవ్వరున్= ఎవరూగానీ; ద్రుపదున్; పోలఁగలేరు= సరిపోలేరు.

తాత్పర్యం: అలసట చెందకుండా నేను అన్నిదేశాలను చూచాను. వాటిలో ప్రసిద్ధు లైన రాజుల మంచి నడవడి అనే సంపదలూ చూచాను. ఈ భూమిమీద అందంలో ఆ ద్రుపదరాజుదేశంతో పోల్చటానికి ఇతరదేశా లేవీ లేవు. సద్గుణాలలో ఇతరు లెవ్వరూ ఆ ద్రుపదుడిని సరిపోలలేరు.

వ. 'ఆ ద్రుపదుండు దన కూఁతు నగ్నికుండసముద్భవ యైనదాని నయోనిజ నగణ్యపుణ్యలావణ్యగుణసమన్విత ననురూపుఁ డైన రాజపుత్రునకు వివాహంబు సేయంగానక, స్వయంవరంబు రచియించుచున్నవాఁ' డనినం, గుంతియు ధర్మ తనయుండును విస్మితులై 'యది యేమి కారణంబున నయోనిజ యయ్యె? నక్కన్య నెవ్విధంబున ద్రుపదుండు వడసె? దీని సవిస్తరంబుగాఁ జెప్ప' మనిన నవ్విప్రుండు వారల కి ట్లనియె. 4

ప్రతిపదార్థం: ఆ, ద్రుపదుండు; తన, కూఁతున్= తన పుత్రికను; అగ్ని, కుండ, సముద్భవ, ఐన, దానిన్= అగ్నిగుండం నుండి గొప్పగా జన్మించిన దానిని; అయోనిజన్= స్త్రీ గర్భంనుండి పుట్టని దానిని; అగణ్య, పుణ్య, లావణ్య, గుణ, సమన్వితన్= లెక్కించటానికి సాధ్యం కాని పుణ్యంతో, కాంతితో, గుణంతో కూడుకొన్నదానిని; అనురూపుఁడు+ఐన=

తగినవాడైన; రాజపుత్రునకున్; వివాహంబు+చేయన్+కానక= పెళ్ళిచేయటం సాధ్యం కాక; స్వయంవరంబు; రచియించుచున్న వాఁడు= రూపొందిస్తున్నాడు; అనినన్= అని ఆ బ్రాహ్మణుడు చెప్పగా; కుంతియున్; ధర్మతనయుండును= ధర్మరాజును; విస్మితులు+ఐ= ఆశ్చర్యపడినవాళ్ళయి; అది= ద్రౌపది; ఏమి, కారణంబునన్= ఏకారణంచేత; అయోనిజ, అయ్యెన్= అయోనిజ అయినది; ఆ+కన్యన్; ఏ+విధంబునన్; ద్రుపదుండు; పడసెన్= పొందినాడు; దీనిన్= ఈ వృత్తాంతాన్ని; సవిస్తరంబుగాన్= విపులంగా; చెప్పుము; అనినన్= అనిఅనగా; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; వారలకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అగ్నిగుండంనుండి ఆవిర్భవించిందీ, మానవకాంతకు జన్మించనిదీ, అపార మైన పుణ్యంతో, కాంతితో, గుణంతో కూడుకొన్నదీ అయిన తన పుత్రిక ద్రౌపదికి వివాహం చేయా లనుకొన్న ద్రుపదునికి తగిన రాకుమారుడు దొరకలేదు; అందుకే ఆయన స్వయంవరాన్ని ఏర్పాటు చేస్తున్నాడు' అని ఆ బ్రాహ్మణుడు చెప్పగా, కుంతీ ధర్మరాజులు ఆశ్చర్యపడి ' ఆ ద్రౌపది ఏ కారణంచేత మానవకాంతకు జన్మించని దైనది? ద్రుపదుడు ఆమెను ఏ విధంగా కూతురుగా పొందాడు? ఈ వృత్తాంతం విపులంగా చెప్పండి' అని అడుగగా, ఆ బ్రాహ్మణుడు వాళ్ళతో ఇట్లా అన్నాడు.

సీ. ఆది భరద్వాజుఁ డను ముని కలశంబు । నం దుద్భవించిన యనఘమూర్తి
ద్రోణుండు మఱి పృషతున కుద్భవించిన । ద్రుపదుండు నొక్కటఁ దొడఁగి యిష్ట
సఖు లయి వేదముల్ సదివి, ధనుర్వేద । మగ్నివేశులతోడ నర్థిఁ గఱచి
చని, ద్రుపదుండు పాంచాలభూములకు రా । జైన, భారద్వాజుఁ డతని కడకు.

ఆ. నరిగి, వానిచేత నవమానితుం డయి । హస్తిపురికి వచ్చి, యఖిలకురుకు
మారవరుల నెల్ల మానుగా శస్త్రకో । విదులఁ జేసె లోకవిదితయశుఁడు. 5

ప్రతిపదార్థం: ఆదిన్= మొదట; భరద్వాజుఁడు, అను; ముని, కలశంబునందు= మునియొక్క కుండయందు; ఉద్భవించిన= పుట్టిన; అనఘమూర్తి= పాపరహితుడైనవాడు; ద్రోణుండు; మఱి= మఱియు; పృషతునకున్; ఉద్భవించిన= పుట్టిన; ద్రుపదుండున్; ఒక్కటన్= ఒకచోట; తొడఁగి= పూనుకొని; ఇష్ట, సఖులు+అయి= ప్రియస్నేహితులై; వేదముల్, చదివి; ధనుర్వేదము= ధనుర్వేదాన్ని; అగ్నివేశులతోడన్= అగ్నివేశు డనే మునిదగ్గర; అర్థిన్= కోరి; కఱచి= నేర్చుకొని; చని= వెళ్ళి; ఆ ద్రుపదుండు; పాంచాల భూములకున్= పాంచాలదేశానికి; రాజు+ఐనన్= రాజు కాగా; భారద్వాజుఁడు= భరద్వాజుని కుమారు డైన ద్రోణుడు; అతని, కడకున్= ఆ ద్రుపదుని దగ్గరకు; అరిగి= వెళ్ళి; వానిచేతన్; =అతనివల్ల; అవమానితుండు+ అయి= అవమానింపబడినవా డై; హస్తి, పురికిన్; వచ్చి; అఖిల, కురు, కుమార, వరులన్+ఎల్లన్= కురుకుమార శ్రేష్ఠుల నందరిని; లోక, విదిత, యశుఁడు= ప్రపంచాని కంతటికి తెలియబడిన కీర్తికలవాడు - ద్రోణుడు; మానుగాన్= ఒప్పుగా; శస్త్ర, కోవిదులన్= శస్త్ర విద్యలలో మిక్కిలి నేర్పరులనుగా; చేసెన్.

తాత్పర్యం: భరద్వాజ మహర్షి కలశంనుండి పుట్టిన పుణ్యాత్ముడు ద్రోణుడు, పృషతుని పుత్రుడైన ద్రుపదుడు- ఒకచోట ఉండి ప్రియ స్నేహితు లై, వేదాలను చదివారు. తరువాత ధనుర్వేదాన్ని అగ్నివేశుని దగ్గర అభ్యసించారు. ద్రుపదుడు పాంచాలదేశానికి ప్రభువుకాగా, ద్రోణుడు అతనిదగ్గరకు వెళ్ళి అవమానం పొందాడు. ప్రపంచ ప్రసిద్ధ మైన కీర్తి గల ఆ ద్రోణుడు హస్తినాపురానికి వచ్చి, కురుకుమారుల నందరినీ శస్త్రవిద్యలో ఎంతో నేర్పరులుగా తీర్చిదిద్దాడు.

వ. ఇట్లు దనవలన విలువిద్య గఱచిన పాండవ కౌరవ కుమారులం జూచి ద్రోణుండు' నా కవమానంబు సేసిన యప్పాంచాలు నోడించి పట్టికొని తెం; డిదియ నాకు గురుదక్షిణ యగు' నని పంచిన, వల్లె యని యందఱు నా ద్రుపదుపయిం బోయి, వానిచేత నిర్జితు లయిన, నర్జునుండు ద్రుపదుతోడ మహాయుద్ధంబుసేసి, వానిం బట్టికొని వచ్చి, ద్రోణున కొప్పించిన నతండును. 6

ప్రతిపదార్థం: ఇట్లు, తనవలన; విలువిద్య; కఱచిన= నేర్చుకొన్న; పాండవ, కౌరవ, కుమారులన్= పాండుకుమారుల్ని, కౌరవుల్ని; చూచి, ద్రోణుండు; నాకున్; అవమానంబు, చేసిన= అవమానం కలిగించిన; ఆ+పాంచాలున్= పాంచాల దేశ రాజైన ద్రుపదుడిని; ఓడించి, పట్టికొని, తెండు= ఓడించిపట్టి తీసుకొనిరండు; ఇదియ; నాకున్; గురుదక్షిణ; అగున్= అవుతుంది; అని; పంచినన్= పంపగా; వల్లె, అని= సరే అని; అందఱున్= అందరూ; ఆ, ద్రుపదు, పయిన్= ఆ ద్రుపదుని మీదికి పోయి; వానిచేతన్, నిర్జితులు+అయినన్= అతనిచేత ఓడింపబడినవాళ్ళు కాగా; అర్జునుండు; ద్రుపదుతోడన్= ద్రుపదునితో; మహాయుద్ధంబు; చేసి, వానిన్, పట్టికొని; వచ్చి; ద్రోణునకున్; ఒప్పించినన్= అప్పగించగా; అతండును= ఆ ద్రోణుడు.

తాత్పర్యం: ఈ విధంగా తనవలన విద్య నేర్చుకొన్న కురు పాండవకుమారులను చూచి ద్రోణుడు - 'నన్ను అవమానించిన ద్రుపదుడిని ఓడించి, పట్టికొని రండి. ఇదే నాకు గురుదక్షిణ' అని పంపగా; సరే అని, అందరు ఆ ద్రుపదునిమీదికి దండెత్తిపోయి ఓడిపోయారు. అర్జునుడు అతనితో మహాయుద్ధం చేసి, అతడిని పట్టుకొని వచ్చి ద్రోణునికి అప్పగించాడు. అప్పుడు ఆ ద్రోణుడు.

విశేషం: కౌరవులుమాత్రమే ముందు వెళ్ళి, ఓడినట్లు పూర్వకథ. ఇక్కడ అర్జునుడు తప్ప తక్కినవా ళ్ళంతా ఓడిన ట్లున్నది.

ఆ. ఉల్లసంబు లాడి యోడకు పొ మ్మని । ద్రుపదు విడిచి పుచ్చె; ద్రోణుచేత
నట్లు విడువఁబడి తదవమాన తప్తుఁడై । పృషతనందనుండు పెద్ద యలిగి 7

ప్రతిపదార్థం: ఉల్లసంబులు+ఆడి= దెప్పిపొడుపుమాటలు మాట్లాడి; ఓడకు= భయపడవద్దు; పొమ్ము=పో; అని, ద్రుపదున్; విడిచి, పుచ్చెన్= విడిచిపెట్టాడు; పృషత, నందనుండు= పృషతునియొక్క కుమారుడు-ద్రుపదుడు; ద్రోణుచేతన్, అట్లు; విడుబడి= వదలిపెట్టబడి; తద్+అవమాన, తప్తుఁడు+ఐ= ఆ అవమానంచేత బాధింపబడినవా డై; పెద్ద, అలిగి= మిక్కిలి కోపించి.

తాత్పర్యం: దెప్పి పొడుపుమాటలు మాట్లాడి, అవమానించి, భయపడవద్దు పొ మ్మని ద్రుపదుడిని విడిచిపెట్టాడు. ద్రుపదుడు ఆ విధంగా విడువబడి, ఆ అవమానంతో బాధపడి, మిక్కిలి కోపించి.

వ. రణరంగంబున ద్రోణు వధియించునట్టి కొడుకును, నర్జునునకు దేవి యగునట్టి కూఁతునుం బడయుదు నని బ్రహ్మవిదు లయిన బ్రాహ్మణులనివాసంబులకుం జని, నిత్యంబును బ్రాహ్మణోపాస్తి సేయుచు, నొక్కనాఁడు గంగాకూలంబునందు వానప్రస్థవృత్తి నున్న యాజోపయాజు లనువారి నిద్దఱ ననవరతవ్రతవ్యాసక్తులం గాశ్యపగోత్రులం గని వారికి నమస్కరించి, యందుఁ గొండుక యయ్యును దపోమహిమ నెవ్వరికంటెఁ బెద్దయైన వాని నుపయాజు నుపాసించి యి ట్లనియె. 8

ప్రతిపదార్థం: రణ, రంగంబునన్= యుద్ధభూమిలో; ద్రోణున్, వధియించునట్టి= ద్రోణుడిని చంపునట్టి; కొడుకునున్; అర్జుననకున్; దేవి యగునట్టి; కూఁతునున్; పడయుదున్+అని= పొందుతాను అని, బ్రహ్మ, విదులు+అయిన= బ్రహ్మజ్ఞాన సంపన్నులైన, బ్రాహ్మణుల, నివాసంబులకున్= బ్రాహ్మణులుండే స్థలాలకు; చని= వెళ్ళి; నిత్యంబును= ప్రతిదినము; బ్రాహ్మణ+ఉపాస్తి= బ్రాహ్మణసేవ; చేయుచున్, ఒక్కనాఁడు; గంగా, కూలంబునందున్= గంగాతీరంలో; వానప్రస్థ, వృత్తిన్= వానప్రస్థాశ్రమ జీవనంలో; ఉన్న; యాజ+ఉపయాజులు= యాజుడు, ఉపయాజుడు; అను, వారిన్= అనే వాళ్ళను; ఇద్దఱన్= ఇరువురిని; అనవరత, వ్రత, వ్యాసక్తులన్= సర్వదా నియమనిష్ఠల్లో మిక్కిలి ఆసక్తి గలవాళ్ళను; కాశ్యప, గోత్రులన్= కాశ్యప గోత్రంవాళ్ళను; కని= చూచి; వారికిన్, నమస్కరించి; అందున్= వారిలో; కొండుక, అయ్యును= చిన్నవాడైనను; తపోమహిమన్= తపోమహిమచే; ఎవ్వరికంటెన్= ఇతరులందరికంటెపెద్ద, ఐన, వానిన్= గొప్ప వాడైన వానిని; ఉపయాజున్; ఉపాసించి= పూజించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: యుద్ధరంగంలో ద్రోణుడిని చంపగల పుత్రుడిని, అర్జునునికి భార్య కాగల పుత్రికను పొందా లని ద్రుపదుడు బ్రహ్మజ్ఞానసంపన్ను లైన బ్రాహ్మణు లున్న ప్రదేశాలకు వెళ్ళి, ప్రతిదినం బ్రాహ్మణసేవ చేయసాగాడు. అతడు ఒకనాడు గంగాతీరంలో వానప్రస్థ ఆశ్రమజీవితం గడుపుతున్న యాజ, ఉపయాజు లనే ఇద్దరిని చూచాడు. వాళ్ళు కాశ్యపగోత్రులు; సర్వదా నియమనిష్ఠాచరణంలో మిక్కిలి ఆసక్తి కలవాళ్ళు. వాళ్ళకు నమస్కరించి, వాళ్ళలో చిన్నవాడైనా తపోమహిమలో అందరికంటె పెద్దవా డైన ఉపయాజిని పూజించి, ఇట్లా అన్నాడు.

విశేషం: తనను ఓడించి పట్టి తెచ్చిన అర్జునునిపై శాశ్వతక్రోధం పెట్టుకోకుండా, అతని పరాక్రమాన్ని మనసారా మెచ్చుకొన్న ద్రుపదుని సహృదయత, అంతటి వీరకిశోరుడిని తన అల్లుడిగా చేసికొనా లన్న తలంపు ప్రశంసింప దగినవే! ఆశ్చర్యకరమైనవే! చతుర్విధ - ఆశ్రమాలు: 1. బ్రహ్మచర్యం, 2.గార్హస్థ్యం, 3. వానప్రస్థం, 4. సన్న్యాసం.

క. మునినాథ! నాకు సత్సుత । జననం బగునట్టి క్రతువు సద్విధిఁ గావిం
చినఁ గృతకృత్యుఁడ నగుదుం; । గొను మిచ్చెద నీకు లక్ష గోధేనువులన్. 9

ప్రతిపదార్థం: మునినాథ!= మునిశ్రేష్ఠా; నాకున్; సత్+సుత, జననంబు+అగు= మంచి కుమారుడిని కలిగించే; క్రతువున్= యజ్ఞాన్ని; సత్+ విధిన్= శాస్త్రంలో చెప్పిన పద్ధతి ప్రకారం; కావించినన్= జరిపిస్తే; కృత, కృత్యుఁడన్= నెరవేరిన కోరిక కలవాడను; అగుదున్= అవుతాను; నీకున్; లక్ష, గో, ధేనువులన్= లక్ష ఆవులను, లేగలతో కూడిన పాడిఆవులను; ఇచ్చెదన్, కొనుము= ఇస్తాను, తీసికొనుము.

తాత్పర్యం: ఓ మునిశ్రేష్ఠా! నాకు మంచి కుమారుడిని ప్రసాదించే యజ్ఞాన్ని జరిపిస్తే ధన్యుడ నౌతాను. నీకు లక్ష ఆవులను, లేగదూడలతో కూడిన పాడిఆవులను ఇస్తాను. తీసికొమ్ము.

విశేషం: 'గోధేనువులన్' అనే చోట ' గో ధనచయమున్' అనే పాఠాంతరం ఉంది. గో శబ్దానికున్న నానార్థాలలో ఆవు, ఎద్దు అనేవి ప్రకృతానికి సంబంధించినవి. వాటిలోను 'ఆవు' అనే అర్థమే ఎక్కువ ఉచితంగా ఉన్నది. ధేనువు అంటే లేగదూడకు పాలు కుడిపే ఆవు.

వ. అనిన నుపయాజుం 'డే నిట్టి ఫలంబు నపేక్షింప; నెవ్వరేని ఫలార్థు లగుదు రందుల కేఁగు' మనిన ద్రుపదుండు
వెండియు వానిన యొక్క సంవత్సరం బారాధించిన నమ్ముని వాని కి ట్లనియె. 10

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; ఉపయాజుండు; ఏన్= నేను; ఇట్టి= ఈ విధమైన; ఫలంబున్= ఫలితాన్ని; అపేక్షింపన్= కోరుకొనను; ఎవ్వరు+ఏని= ఎవరైనా; ఫల+అర్థులు+అగుదురు= ఫలం కోరుకొనేవా రున్నట్లైతే; అందులకున్= అక్కడకు; ఏఁగుము= వెళ్ళుము; అనినన్= అనిచెప్పగా; ద్రుపదుండు; వెండియున్= మరల; వానిన్+అ= ఆ ఉపయాజినే; ఒక్క సంవత్సరంబు; ఆరాధించినన్= సేవించగా; ఆ+ముని= ఆ ఉపయాజి; వానికిన్= ద్రుపదునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ద్రుపదుడు పల్కగా; ఉపయాజుడు 'నేను అట్లాంటి ఫలాన్ని ఆశించను. ఎవరైనా ప్రతిఫలం ఆశించేవా ళ్ళుంటే వెళ్లుము' అన్నాడు. ద్రుపదుడు మళ్ళీ ఒక సంవత్సరం ఆ మునినే సేవించగా, అతడు ద్రుపదునితో ఇట్లా అన్నాడు.

విశేషం: కార్యార్థి ఎదుటివారితత్త్వం తెలిసికొనకుండా 'ఉపకారం చేస్తే ప్రతిఫలం ఇస్తా' నని పలకటం అవివేకం. అల్పులు అందుకు సంతోషిస్తారేమో కాని, మహాత్ములు దాన్ని మెచ్చరు. అంతేకాక దాన్ని అవినయంగా, అవినీతిగా, అహంకారంగా కూడా పరిగణిస్తారు.

తే. **అనఘచరితుఁడు మాయన్న వనములోనఁ**
జనుచు నొక్కనాఁ డొక్కపం డొనరఁ గాంచి
కొనియె శుచి యగు శుచియుఁ గా దని యెఱుంగఁ
బడని భూమితలంబుపైఁ బడిన దాని. **11**

ప్రతిపదార్థం: అనఘ, చరితుఁడు= పాపరహితమైన నడవడి కల వాడు; మా, అన్న (యాజుడు); వనములోన్= అడవియందు; చనుచున్= వెళ్ళుతూ; ఒక్క,నాఁడు; శుచి, అగు= శుభ్రమైనది; శుచియున్+కాదు= శుభ్రమైనది కాదు; అని= అని; ఎఱుంగన్+పడని= తెలియని; భూమి, తలంబు, పైన్+ భూప్రదేశంమీద; పడిన దానిన్= పడినదాన్ని; ఒక్క, పండు= ఒక పండును; ఒనరన్= ఒప్పుగ, కాంచి= చూచి; కొనియెన్= తీసికొన్నాడు.

తాత్పర్యం: పాప రహితమైన నడవడి గల మా అన్న యాజుడు అడవిలో వెళ్తూ ఒకనాడు 'ఇది శుభ్రమైనది, కాదు' అని తెలియని నేలమీద పడిన ఒక పండును చూచి, దాన్ని తీసికొన్నాడు.

విశేషం: పై పద్యంలో మొదటిమూడు పాదాల్లో ప్రాసయతులే ఉన్నాయి.

వ. **'ఫలార్థి యయినవాఁడు తత్ఫలానుబంధంబు లయిన దోషంబులు పరికింపండు గావున నమ్మునివరుండు నీ కభిమతంబు సేయుం బో' మ్మనిన ద్రుపదుం డరిగి, సంహితాధ్యయనాది పంచమహాయజ్ఞంబులు సేయుచు, శిలోంఛవృత్తి భైక్షసంపాదిత కుటుంబభారుం డై, ఘోరతపోవృత్తి నున్న యాజుం గని, నమస్కరించి యి ట్లనియె.** **12**

ప్రతిపదార్థం: ఫల+అర్థి, అయినవాఁడు= ఫలాన్ని కోరుకొనేవాడు; తద్+ఫల+అనుబంధంబులు+అయిన= ఆ ఫలానికి సంబంధించినవైన; దోషంబులు; పరికింపండు= లెక్కపెట్టడు; కావునన్; ఆ+ముని, వరుండు= ఆ మునిశ్రేష్ఠుడు; నీకున్; అభిమతంబు= ఇష్టమైనది; చేయున్; చేస్తాడు; పొమ్ము+అనినన్= పో అని చెప్పగా; ద్రుపదుండు; అరిగి= వెళ్ళి; సంహితా+ అధ్యయన+ఆది= వేదాన్ని అధ్యయనం చేయటం మొదలైన; పంచ, మహాయజ్ఞంబులు; చేయుచున్; శిల+ఉంఛ, వృత్తి, భైక్ష,

సంపాదిత, కుటుంబ, భారుండు+ఐ= పైరు కోసిన తరువాత మళ్ళయందు జారిపడిన వెన్ను గింజలు మొదలగు వాటిని ఏరికొనే జీవనోపాయంచేత, భిక్షా సంబంధంగా- అనగా బిచ్చమెత్తి సంపాదించబడిన దానిచేత, కుటుంబ భారాన్ని వహించిన వా డై; ఘోర, తపో, వృత్తిన్+ఉన్న= భయంకరమైన తపస్సు చేస్తున్న; యాజున్= యాజమునిని; కని= చూచి; నమస్కరించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఫలాన్ని కోరేవాడు దానికి సంబంధించిన దోషాలను లెక్కపెట్టడు. అందువలన ఆ మునిశ్రేష్ఠుడు నీవు కోరిన దానిని చేస్తాడు, వెళ్ళుము' అని చెప్పగా, ద్రుపదుడు యాజుని వద్దకు వెళ్ళాడు. అతడు వేదాధ్యయనం మొదలైన పంచమహాయజ్ఞాలు చేసేవాడు. పైరు కోసిన తర్వాత మళ్లలో జారిపడిన వెన్నులు, గింజలు మొదలైన వాటిని ఏరుకొనే జీవనోపాయంచేత, బిచ్చమెత్తి సంపాదించిన దానిచేత - కుటుంబభారాన్ని వహిస్తూ, భయంకరమైన తపస్సు చేస్తున్నాడు. అతడిని చూచి ద్రుపదుడు నమస్కరించి ఇట్లా అన్నాడు.

విశేషం: పంచమహాయజ్ఞాలు: (1) దేవయజ్ఞం (దేవతలతృప్తికొఱకు అగ్నిహోత్రంలో హవిస్సులు వేసి హోమం చేయటం), (2) పితృయజ్ఞం (పితృదేవతలతృప్తికొఱకు స్వధాకారంతో తర్పణం చేసి, బ్రాహ్మణులకు భోజనం పెట్టటం), (3) భూతయజ్ఞం (వైశ్వదేవం చేసిన తర్వాత బహిర్దేశంలో భూతాలతృప్తికొఱకు బలి యివ్వటం), (4) మనుష్యయజ్ఞం (యథాశక్తిగా అతిథులకు అన్నం పెట్టటం) (5) బ్రహ్మయజ్ఞం (వేదాధ్యయనం - ఒక ఋక్కును గాని, యజస్సును గాని, సామాన్ని గాని, శక్తి కొద్దీ నిత్యం అభ్యసించటం).

క. మునినాథ! నాకు సత్సుత । జననం బగునట్టి క్రతువు సద్విధి గావిం
చినఁ గృతకృత్యుఁడ నగుదుం । గొను మిచ్చెద నీకు లక్ష గో ధేనువులన్. 13

ప్రతిపదార్థం: (ప్రతిపదార్థ, తాత్పర్యాలకొరకు తొమ్మిదవ పద్యం చూడండి).

విశేషం: యాజుడు ఫలార్థి అని ముందే అతని తమ్ముడు చెప్పాడు. కనుక ద్రుపదుడు 'లక్ష గోధేనువులను ప్రతిఫలంగా ఇస్తాను' అనటంలో తప్పు లేదు. నన్నయ 9వ పద్యాన్నే యథాతథంగా మరల వాడుకొన్నాడు. అంటే తమ్ముని దగ్గర ఒకమాట, అన్నదగ్గర మరొకమాట చెప్పకుండా తన ధ్యేయాన్ని యథాతథంగా తెలిపాడు-ద్రుపదుడు అనటానికి నిదర్శనంగా తొమ్మిదవపద్యాన్ని ఇక్కడకూడా ఒక పలుకైనా తప్పకుండా అర్థిస్తూ తెలిపాడు.

వ. అని ప్రార్థించి వెండియు నా ద్రుపదుండు యాజున కి ట్లనియె. 14

ప్రతిపదార్థం: అని, ప్రార్థించి; వెండియున్= మరల; ఆ ద్రుపదుండు; యాజునకున్, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని వేడికొని మరల ఆ ద్రుపదుడు యాజునితో ఈ విధంగా చెప్పాడు.

క. భారతవంశాచార్యుఁడు । భారద్వాజుండు నా కపాయము సేసెన్
ఘోరాజి నతని నోర్చున । పారపరాక్రమసుపుత్త్రుఁ బడయఁగ వలయున్. 15

ప్రతిపదార్థం: భారతవంశ+ఆచార్యుఁడు=భరతునికి సంబంధించిన వంశానికి గురువు; భారద్వాజుండు= భరద్వాజునికి పుత్రు డైన ద్రోణుడు; నాకున్; అపాయము= కీడు; చేసెన్; అతనిన్; ఘోర+ఆజిన్= భయంకరమైన యుద్ధంలో; ఓర్చు= ఓడించే; అపార, పరాక్రమున్= అంతులేని పరాక్రమం కలవాడిని; సుపుత్త్రున్= మంచి కుమారుడిని; పడయఁగవలయున్= పొందవలెను.

తాత్పర్యం: భరతవంశానికి గురువు, భరద్వాజునికి పుత్రుడు అయిన ద్రోణుడు, నాకు హాని చేశాడు. అతడిని మహాయుద్ధంలో ఓడించే మంచిపుత్రుడిని పొందాలి.

క. షడరత్ని ధనుర్ధరుఁ డె । య్యెడ నజితుఁడు గాన వాని హీనుంగాఁ జే
యుఁడు నాకుఁ జతుర్వర్గము । వడయుట యని పృషతసుతుఁడు ప్రార్థించె మునిన్. 16

ప్రతిపదార్థం: షట్+అరత్ని; ధనుస్+ధరుడు= చిటికెన వ్రేలు చాచిన ఆరు పిడిమూరల ధనుస్సును ధరించినవాడు, ద్రోణుడు; ఎయ్యెడన్= ఎక్కడ కూడ; అజితుఁడు, కాన= జయించబడనివాడు కావున; వానిన్= అతణ్ణి; హీనుంగాన్= తక్కువైన వాడినిగా; చేయుఁడు= చేసినచో; నాకున్= నాకు; చతుర్వర్గము= ధర్మార్థ కామమోక్షాలు; పడయుట= పొందుట; అని; పృషత, సుతుఁడు= పృషతుని కుమారుడైన ద్రుపదుడు; మునిన్= యాజుని; ప్రార్థించెన్.

తాత్పర్యం: 'ఆరుమూరల పొడవైన ధనుస్సును ధరించిన ద్రోణుడు ఎక్కడకూడ జయింపబడనివాడు కనుక, అట్లాంటివాడిని తక్కువ చేస్తే, ధర్మార్థకామమోక్షాలైన నాలుగుపురుషార్థాలు నేను పొందినట్లే' అని ద్రుపదుడు యాజుణ్ణి ప్రార్థించాడు.

విశేషం: 'అరత్ని' శబ్దానికి 'చిటికెన వ్రేలు చాచిన పిడి మూర మో చేయి' అని గుప్తార్థప్రకాశిక.

వ. అ య్యాజుండును యాజకత్వంబున కొడంబడి 'నీ కోర్కికిం దగినయట్టి కొడుకునుం గూఁతురుం బుట్టుదు; రోడకుండు మని యజ్ఞోపకరణద్రవ్యంబులు సమకట్టికొని; యథావిధి నుపయాజుండు సహాయుండుగా సౌత్రామణి యయిన కోకిలాదేవి పత్నిగా ద్రుపదుం బుత్రకామేష్టి సేయించిన, నందు మంత్రాహుతులం దృప్తుం డయిన యగ్నిదేవుని వలన. 17

ప్రతిపదార్థం: ఆ+యాజుండును; యాజకత్వంబునకు= యజ్ఞం చేయించే యాజ్ఞికుడిగా ఉండటానికి; ఒడంబడి= ఒప్పుకొని; నీ, కోర్కికిన్; తగిన, అట్టి; కొడుకున్; కూతురున్, పుట్టుదురు; ఓడకుండుము= భయపడవద్దు; అని= అనిపలికి; యజ్ఞ+ఉపకరణ, ద్రవ్యంబులు= యజ్ఞసాధనములను, పదార్థములను; సమకట్టికొని= సిద్ధం చేసికొని; యథావిధిన్= శాస్త్ర పద్ధతి ప్రకారం; ఉపయాజుండు (తమ్ముడు) సహాయుండుగా; సౌత్రామణి, అయిన కోకిలాదేవి (ద్రుపదుని భార్య), పత్నిగా= యజ్ఞాది ధర్మ కార్య నిర్వహణల్లో భర్తను అనుసరించే భార్యగా; ద్రుపదున్; పుత్రకామ+ఇష్టిన్= పుత్రులను కోరిచేసే యజ్ఞాన్ని; చేయించినన్; అందున్= ఆ యజ్ఞంలో; మంత్ర+ఆహుతులన్= మంత్రాలచేత, వ్రేల్చిన హోమద్రవ్యాలచేత; తృప్తుండు= తృప్తిపొందినవాడు; అయిన; అగ్నిదేవువలనన్= అగ్నిదేవునివల్ల.

తాత్పర్యం: ఆ యాజుడు యజ్ఞం చేయించే యాజ్ఞికుడిగా ఉండటానికి అంగీకరించి, 'నీ కోరికకు తగిన కొడుకు, కూతురు జన్మిస్తారు; భయపడవద్దు' అని - యజ్ఞసాధనాలను, పదార్థాలను సిద్ధం చేసికొని, తమ్ముడు ఉపయాజుడు సహాయుడుగా, ద్రుపదుని భార్య కోకిలాదేవి ధర్మపత్నిగా, ద్రుపదునిచేత శాస్త్రోక్తంగా యజ్ఞం చేయించాడు. మంత్రాలతో ఆహుతులుగా వ్రేల్చిన పదార్థాలతో, తృప్తి పొందిన అగ్నిదేవునివలన.

విశేషం: భార్య అనగా భరింపబడేది. జాయ సంతానాన్ని కూర్చేది. గృహిణి గృహాన్ని నిర్వహించేది. రాజులకు పెక్కుమంది భార్య లున్నా, యజ్ఞాలవంటి ధర్మకార్యాలలో భర్తను అనుసరించే వ్యక్తిని, పత్ని, ధర్మపత్ని అని వ్యవహరిస్తారు. పుత్రకామేష్టి

పుత్రులను కోరి చేసే యజ్ఞం. పూర్వం దశరథ మహారాజు ఈ యజ్ఞం చేశాడు. యజ్ఞసమయంలో ధర్మపత్ని తప్పక యజమానితో ఉండితీరాలి. ఈ సందర్భంలో ద్రుపదుని భార్య పేరు ప్రస్తావించటం గమనార్హం. ఇక్కడ కోకిలాదేవి అను పేరుకు ముందు 'సౌత్రామణి అయిన' అనే విశేషణం ఉన్నది. సౌత్రామణి అనగా తూర్పు అంటే తూర్పు దిక్కుకలదియై ఆమె యజ్ఞం చేసే సమయంలో కూర్చొని ఉన్న దని గ్రహించాలి.

క. జ్వాలాభీలాంగుఁడు కర । వాల బృహచ్చాపధరుఁడు వరవర్మ కిరీ

టాలంకారుఁడు వహ్నియ । పోలె రథారూఢుఁ డొక్క పుత్త్రుఁడు పుట్టెన్. 18

ప్రతిపదార్థం: జ్వాలా+ఆభీల+అంగుడు= అగ్నిజ్వాలవలె భయంకరమైన శరీరం కలవాడు; కరవాల, బృహత్+చాప, ధరుఁడు= ఖడ్గాన్ని, పెద్ద ధనుస్సును ధరించినవాడు; వర, వర్మ, కిరీట+అలంకారుఁడు= శ్రేష్ఠమైన కవచం, కిరీటం అలంకారంగా కలవాడు; రథ+ఆరూఢుఁడు= రథాన్ని ఎక్కిఉన్నవాడు; వహ్నియ పోలెన్= అగ్నిహోత్రునివలె; ఒక్క, పుత్త్రుఁడు; పుట్టెన్.

తాత్పర్యం: అగ్నిజ్వాలవలె భయంకరమైన శరీరం కలవాడు, ఖడ్గాన్నీ, పెద్ద ధనుస్సును ధరించినవాడు, శ్రేష్ఠమైన కవచంతో కిరీటంతో అలంకరింపబడినవాడు; రథాన్ని అధిరోహించినవాడు అయిన ఒక పుత్రుడు అగ్నిహోత్రుని వలె ఉదయించాడు.

విశేషం: అలం; ఉపమ.

వ. మఱియు 19

తాత్పర్యం: ఇంకా.

తరలము.

కుల పవిత్ర, సితేతరోత్పలకోమలామలవర్ణ, యు

త్పలసుగంధి, లసన్మహోత్పలపత్త్రనేత్ర, యరాళకుం

తల విభాసిని, దివ్యతేజముఁ దాల్చి యొక్క కుమారి త

జ్జ్వలనకుండమునందుఁ బుట్టెఁ బ్రసన్నమూర్తి ముదంబుతోన్. 20

ప్రతిపదార్థం: కుల, పవిత్ర= వంశాన్ని పవిత్రం చేసేది; సిత+ఇతర+ఉత్పల; కోమల+అమల, వర్ణ= తెల్లదికాని కలువవలె సుకుమారమూ స్వచ్ఛమూ అయిన రంగు కలది - అనగా నల్లకలువవంటి శరీరవర్ణం కలది; ఉత్పల, సుగంధి= కలువవంటి సువాసన కలది; లసత్+మహా+ఉత్పల, పత్త్ర, నేత్ర = ప్రకాశించే పెద్ద కలువ రేకులవంటి నేత్రాలు కలది; అరాళ, కుంతల, విభాసిని= వంకరలు తిరిగిన వెంద్రుకలతో వెలిగేది; దివ్య, తేజమున్= దివ్యకాంతిని; తాల్చి= ధరించి; ప్రసన్నమూర్తి= హాయిని గొలుపు ఆకారం కలది; ముదంబుతోన్= సంతోషంతో; ఒక్క, కుమారి= ఒక కన్య; తద్+జ్వలన, కుండము+అందున్= ఆ అగ్నికుండంలోనుండి; పుట్టెన్.

తాత్పర్యం: వంశాన్ని పావనం చేసేది, నల్లకలువవంటి శరీరవర్ణం కలది, కలువగంధంవంటి సుగంధం కలది, కళకళలాడే పెద్ద కలువరేకులవంటి కన్నులు కలది, వంకరలు తిరిగిన వెంద్రుకలతో వెలిగేది, దివ్య తేజస్సును ధరించింది; మనోహరమైన ఆకారం కలది అయిన ఒకకన్య సంతోషంతో ఆ అగ్నికుండంలో ఉదయించింది.

విశేషం: అలం: ఉపమ. నన్నయ తరల వృత్తాన్ని ఆది సభా పర్వాలలో ప్రతి ఆశ్వాసంలోనూ కనీసం ఒకటి రచించాడు. ఆదిపర్వంలోని చతుర్థ, పంచమ, అష్టమాశ్వాసాలలో ఒక్కొక్కటి చొప్పున, మిగిలిన వాటిల్లో రెండు చొప్పున వాడాడు. సభాపర్వంలో ప్రథమాశ్వాసంలో మూడు, ద్వితీయాశ్వాసంలో అయిదు వాడాడు. అరణ్యపర్వంలో ద్వితీయాశ్వాసంలో తప్ప ప్రథమ తృతీయాశ్వాసాలలో రెండేసి రచించాడు. నన్నయ అభిమాన విశేష వృత్తాలలో ఇది ఒకటి. లక్షణం ఇదివరలో చెప్పబడింది. (చూడు ఆది. 3-142) (సంపా.) తరలము లేదా తరళము అనగా ప్రకాశించేది. ఇచ్చట దివ్యతేజస్సు ధరించిన కన్య అగ్నికుండంలోనుండి ఆవిర్భవించింది కాబట్టి ఈ సందర్భంగా ప్రస్తుత ఛందోవిశేషం ఎంతో ఔచిత్యవంతం.

వ. ఇట్లు పుట్టిన యక్కొడుకునకుం గూఁతునకు ధృష్టద్యుమ్నుండును గృష్ణయు నను నామంబు లాకాశవాణి జన విదితంబుగా నుచ్చరించె; నట్లు ద్రుపదుండు లబ్ధసంతానుం డయి, సంతసిల్లి యాజునకు యథోక్త దక్షిణ లిచ్చి, బ్రాహ్మణులం బూజించి, ధృష్టద్యుమ్నుని ధనుర్వేదపారగుం జేయించి యున్నంత, నక్కన్య యిపుడు వివాహసమయప్రాప్త యయిన. 21

ప్రతిపదార్థం: ఇట్లు; పుట్టిన; ఆ+కొడుకునకున్; కూఁతునకున్; ధృష్టద్యుమ్నుండును, కృష్ణయున్, అను, నామంబులు= ధృష్టద్యుమ్నుడు, కృష్ణ అను పేర్లు; ఆకాశవాణి; జన, విదితంబుగాన్= జనులకు తెలిసేటట్లుగా; ఉచ్చరించెన్= పలికెను; అట్లు= ఆ విధంగా; ద్రుపదుండు; లబ్ధ, సంతానుండు+అయి= పొందిన సంతానం కలవాడై; సంతసిల్లి= సంతోషించి; యాజునకున్= యాజ మునికి; యథా+ఉక్త, దక్షిణలు= చెప్పిన ప్రకారం దక్షిణలు; ఇచ్చి; బ్రాహ్మణులన్; పూజించి; ధృష్టద్యుమ్నుని; ధనుర్వేద పారగున్= ధనుర్వేదము యొక్క ఆవలి ఒడ్డు చేరినవాడినిగా - అనగా ధనుర్వేదాన్ని పూర్తిగా నేర్చినవాడినిగా; చేయించి; ఉన్నంతన్= ఉన్నంతలో; ఆ+కన్య= ఆ కృష్ణ; ఇపుడు; వివాహ, సమయ, ప్రాప్త, అయినన్= వివాహసమయం సమీపించింది కాగా.

తాత్పర్యం: ఈ విధంగా పుట్టిన కుమారునికి, కూతురికి - ధృష్టద్యుమ్నుడు, కృష్ణ అనే పేర్లను ప్రజ లందరికీ తెలిసే విధంగా ఆకాశవాణి పలికింది. ఆ విధంగా ద్రుపదుడు సంతానం పొంది, సంతోషించి, యాజునికి చెప్పిన ప్రకారం దక్షిణ లిచ్చి, బ్రాహ్మణులను పూజించాడు. ధృష్టద్యుమ్నుడిని ధనుర్వేదపారంగతుడిని చేయించాడు. ఇప్పుడు ఆ కన్యకు వివాహసమయం సమీపించగా;

విశేషం: ధృష్టద్యుమ్నుడు= గొప్ప బలంకలవాడు; కృష్ణ= నల్లని శరీరం కలది.

ద్రౌపదీవివాహప్రయత్నము (అమూలకము)

ఉ. మానితు లైన పాండవకుమారులుఁ గుంతియు లక్కయింట ను
గ్రానలదగ్ధు లై రని ధరామరముఖ్యు లెఱింగి చెప్పఁగా
నా నరనాయకుండు విని యాతత శోకమహానలజ్వల
న్మానసుఁ డయ్యె బంధుజనమంత్రిపురోహిత విప్రసన్నిధిన్. 22

ప్రతిపదార్థం: మానితులు+ఐన= గౌరవింపబడినవా రైన; పాండవ కుమారులున్= పాండవులూ; కుంతియున్; లక్క, ఇంటన్= లక్కయింటిలో; ఉగ్ర+అనల, దగ్ధులు+ఐరి+అని= భయంకరమైన అగ్నిచేత కాలిపోయా రని; బంధు, జన, మంత్రి, పురోహిత, విప్ర, సన్నిధిన్= బంధుజనులయొక్క, మంత్రులయొక్క, పురోహితులయొక్క, బ్రాహ్మణులయొక్క ఎదుట;

ధరా+అమర ముఖ్యులు= బ్రాహ్మణశ్రేష్ఠులు; ఎఱింగి= తెలిసికొని; చెప్పఁగాన్; ఆ, నర నాయకుండు= ఆ రాజు - ద్రుపదుడు; విని, అతత, శోక, మహా+అనల, జ్వలత్+మానసుఁడు+అయ్యెన్= మిక్కుటమైన దుఃఖ మనెడి గొప్ప అగ్నిచేత దహింప బడుతున్న మనస్సు కల వా డయ్యాడు.

తాత్పర్యం: గొప్పవా ళ్ళయిన పాండవులు, కుంతి లక్కయింట్లో భయంకరమైన అగ్నికి ఆహుతి అయ్యా రని బంధువుల, మంత్రుల, పురోహితుల, బ్రాహ్మణుల సమక్షంలో బ్రాహ్మణశ్రేష్ఠులు చెప్పగా, విని ద్రుపదుడు అధికదుఃఖ మనే అగ్నిచే దహింపబడుతున్న మనస్సు కలవా డయ్యాడు.

విశేషం: అలం: రూపకం. జ్వలత్+మానసుడు= జ్వలన్మానసుడు - అనునాసికసంధి.

వ. మఱియును. **23**

తాత్పర్యం: అంతటితో ఆగక.

సీ. 'ఇంద్రసమానున కిందీవరశ్యామ । సుందరాంగున కింద్రనందనునకు
దేవిఁగాఁ బ్రీతితో దీని నీఁ గాంచితి । నని యున్నచో విధాతృనకు నిట్లు
పాడియే విఘ్న మాపాదింప; నమ్మహా । ధ్వరమునఁ బుట్టిన సరసిజాక్షి
నే నెట్టు లొరులకు నీ నేర్తు' నని దుఃఖ । పరవశుఁడయి యున్న ధరణిపతికిఁ

ఆ. దత్పురోహితుండు దా నిట్టు లనియె 'న । ప్పాండవులనుగుఱిచి బహువిధంబు
లగు నిమిత్తములు నయంబునఁ జూచితి; । నెగ్గు లేదు; వారి కెల్ల లగ్గు'. **24**

ప్రతిపదార్థం: ఇంద్ర, సమానునకున్= ఇంద్రునితో సమానమైనవానికి; ఇందీవర, శ్యామసుందర+అంగునకున్= నల్లకలువవలె నల్ల నై అందమైన శరీరం కలవానికి; ఇంద్ర, నందనునకున్= ఇంద్రుని కుమారు డైన అర్జునునికి; ప్రీతితోన్= ప్రేమతో; దీనిన్= ఈ కృష్ణను, దేవిగాన్= భార్యగా; ఈన్+కాంచితిన్= ఇవ్వగలిగాను; అని, ఉన్నచో= అని ఉండగా; విధాతృనకున్= బ్రహ్మదేవునికి; ఇట్లు; విఘ్నము= చెఱుపు; ఆపాదింపన్= కలిగించుట; పాడియే= న్యాయమా; ఆ+మహా+అధ్వరమునన్= ఆ మహాయజ్ఞంలో; పుట్టిన; సరసిజ+అక్షిన్= సరస్సునుండి పుట్టిన పద్మమువంటి కన్నులు కలదానిని; ఏన్= నేను; ఎట్టుల= ఏ విధంగా; ఒరులకున్= ఇతరులకు; ఈ, నేర్తును= ఇవ్వగలను; అని= అని తలచి; దుఃఖ, పరవశుఁడు+అయి= దుఃఖానికి పూర్తిగా లొంగిపోయినవా డై- అనగా మిక్కిలి దుఃఖం పొందినవా డై; ఉన్న, ధరణి, పతికిన్= ఉండు భూపతికి - ద్రుపదరాజుకు; తద్+పురోహితుండు= అతని పురోహితుడు; తాన్= తాను; ఇట్లు+అనియెన్; ఆ+పాండవులను; గుఱిచి= గురించి; బహువిధంబులు+అగు= పెక్కు విధాలైన; నిమిత్తములు= శకునాలు; నయంబునన్= నేర్పుగా; చూచితిన్; వారికిన్= ఆ పాండవులకు; ఎగ్గు= కీడు; లేదు; ఎల్ల= అంతయు; లగ్గు= మేలు.

తాత్పర్యం: 'ఇంద్రునితో సమానుడు, నల్లకలువవలె నల్లని అందమైన శరీరం కలవాడు. ఇంద్రుని కుమారుడు అయిన అర్జునునికి ప్రేమతో కృష్ణను భార్యగా ఇవ్వా లని ఉండగా, బ్రహ్మదేవుడు ఈ విధంగా చెరుపు చేయటం న్యాయమా? ఆ మహాయజ్ఞంలో పుట్టిన ద్రౌపదిని ఏ విధంగా ఇతరులకు ఇవ్వగలను? అని ద్రుపదుడు దుఃఖంలో మునిగిపోయాడు. అప్పు డతని పురోహితుడు ఇట్లా అన్నాడు. 'ఆ పాండవులను గురించి అనేకవిధా లైన శుభశకునాలను నిపుణంగా చూచాను. వారికి కీడు లేదు. అంతా మేలే'.

విశేషం: అర్జునుడు ఇందీవరశ్యాముడు. అగ్నినుండి పుట్టిన కృష్ణకూడ 'సితేతరోత్పల కోమలామలవర్ణ' - (ఉత్పల, పత్రనేత్ర, ఉత్పలసుగంధి కూడ). అర్జునునికొరకే ద్రౌపది పుట్టింది కనుక ఇద్దరిలో ఈ రూపసామ్యం ఒక విశేషం.

వ. 'తొల్లి దేవేంద్రుండు గొండొకకాలం బదృశ్యుం డై యుండిన, నతనిం గానక శచీదేవి శోకింపం బోయిన నుపశ్రుతిం జేసి బృహస్పతి దానికి దేవేంద్రాగమనంబు సెప్పె నని వేదంబుల వినంబడుం; గావున నేను నుపశ్రుతిం జూచితి; నిది దప్పదు; పాండవులు పరలోకగతులు గారు; పరమానందంబున నున్నవారు; వార లెందుండియు నిందులకు వత్తురు; నీవును సుచిత్తుండ వయి స్వయంవరం బిప్పురంబున ఘోషింపం బంపు; మిది కన్యాదానంబునందు రాజులకు శాస్త్రచోదితం' బనినం బురోహితువచనంబునంజేసి, యూఱడి ద్రుపదుండు నేఁటికి డెబ్బదియేనగు దివసంబునం బౌషమాసంబున శుక్లపక్షంబున నష్టమియు రోహిణినాఁడు స్వయంవరం బని ఘోషింపం బంచి. 25

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; దేవేంద్రుండు; కొండు+ఒక, కాలంబు= కొంత కాలం; అదృశ్యుండు+ఐ= అగుపడనివా డై; ఉండినన్= ఉండగా; అతనిని= ఆ ఇంద్రుని; కానక= చూడక; శచీదేవి; శోకింపన్+పోయినన్= దుఃఖించపోగా; ఉపశ్రుతిన్+చేసి= శుభాశుభ సూచకమైన ఇతరుల సంభాషణ ధ్వనిని వినటంచేత; బృహస్పతి; దానికిన్= ఆ శచీదేవికి; దేవేంద్ర+ఆగమనంబు= దేవేంద్రుని యొక్క రాకను; చెప్పెన్+అని= చెప్పాడు అని; వేదంబులన్= వేదాలలో; వినంబడున్= వినబడుతూ ఉంది; కావునన్= కాబట్టి; నేనున్= నేనుకూడా; ఉపశ్రుతిన్; = ఆ ఉపశ్రుతిని; చూచితిన్, ఇది; తప్పదు; పాండవులు; పరలోకగతులు, కారు= స్వర్గలోకానికి వెళ్ళినవారు కారు - అనగా మరణించలేదు; పరమ+ఆనందంబునన్= మిక్కిలి సంతోషంతో; ఉన్న, వారు; వారలు; ఎందు+ఉండియున్= ఎక్కడ ఉన్నా; ఇందులకున్= ఇక్కడికి; వత్తురు= వచ్చుదురు; నీవును; సు చిత్తుండవు+ అయి= కలతలేని మంచి మనస్సు కలవాడవై; స్వయంవరంబు= స్వయంవరాన్ని; ఈ+పురంబునన్= ఈ నగరంలో; ఘోషింపన్= చాటించటానికి; పంపుము= ఆజ్ఞాపించు; ఇది= ఈ స్వయంవరం; కన్యా, దానంబునందున్= కన్యాదానమున; రాజులకున్; శాస్త్ర, చోదితంబు= శాస్త్రంచేత చెప్పబడింది; అనినన్= అని అనగా; పురోహితు, వచనంబునన్+చేసి= పురోహితుని యొక్క మాటలతో; ఊఱడి= ఓదార్పునొంది; ద్రుపదుండు; నేఁటికిన్= ఈనాటికి; డెబ్బది, ఏను+అగు= డెబ్బది యైదవది అగు; దివసంబునన్= రోజున; పౌష, మాసంబునన్= పుష్యమాసంలో; శుక్ల, పక్షంబునన్, అష్టమియు= శుక్లపక్షం అష్టమితిథి; రోహిణినాడు= రోహిణీ నక్షత్ర మున్ననాడు; స్వయంవరంబు+అని; ఘోషింపన్= చాటించటానికి; పంచి= ఆజ్ఞాపించి.

తాత్పర్యం: 'పూర్వం దేవేంద్రుడు కొంతకాలం కనబడకపోగా, శచీదేవి శోకించిం దనీ, శుభసూచకమైన ఇతరుల సంభాషణనుబట్టి బృహస్పతి ఆమెకు దేవేంద్రుని రాకనుగురించి చెప్పా డనీ వేదాలవలన తెలుస్తున్నది. కనుక నేనుకూడ అట్లాంటి శుభశకునాలే చూచాను. ఇది తప్పదు. పాండవులు మరణించలేదు. పరమానందంతో ఉన్నారు. వా ళ్ళెక్కడున్నా ఇక్కడికి వస్తారు. నీవు నిర్మల మైన మనస్సుతో ఈ పట్టణంలో స్వయంవరాన్ని చాటించడానికి ఆజ్ఞాపించుము. స్వయంవరం కన్యాదానంలో రాజులకు శాస్త్రవిహితమే - ఈ విధంగా చెప్పిన పురోహితునిమాటలతో ఊరటచెంది, ద్రుపదుడు - ఈ నాటినుండి డెబ్బై ఐదవరోజు పుష్యమాస, శుక్ల పక్ష అష్టమి, రోహిణీనక్షత్రం ఉన్నరోజు స్వయంవరం జరుగుతుం దని చాటించటానికి ఆజ్ఞాపించాడు.

విశేషం: కొన్ని ప్రతులలో 'అష్టమి'కి బదులు పంచమి అని ఉన్నది. ఉపశ్రుతి అంటే ఒకరు మాట్లాడుతున్నప్పుడు అనుకోకుండా శుభాశుభసూచకమైన ఇతరుల సంభాషణ వినటం. ఇది శకునం. దీన్నిబట్టి భవిష్యత్తులో జరుగబోయే శుభాశుభాలను శకునశాస్త్రం చెప్పేవాళ్లు చెప్పుతారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఎవ్వరికిని మోపెట్టను । దివ్వను శక్యంబు గాని దృఢకార్ముకమున్
దవ్వై దివమునఁ దిరిగెడు । నవ్విలసత్కనకమత్స్య యంత్రముఁ జేసెన్. 26

ప్రతిపదార్థం: ఎవ్వరికిని; మోపెట్టను= ఎక్కు పెట్టటానికి; తివ్వను= లాగటానికి; శక్యంబు+కాని= సాధ్యం కాని; దృఢ; కార్ముకమున్= బలమైన ధనుస్సును; దవ్వు+ఐ= దూరమై; దివమునన్= ఆకాశంలో; తిరిగెడు= తిరుగునట్టి; ఆ+విలసత్+కనక, మత్స్యయంత్రమున్= ప్రకాశించే బంగారుచేపతో కూడిన యంత్రాన్ని; చేసెన్= రూపొందించాడు.

తాత్పర్యం: ఎక్కుపెట్టటానికికాని, లాగటానికి కాని ఎవ్వరికీ సాధ్యంకాని ఒక బలమైన ధనుస్సునూ, దూరంగా ఆకాశంలో తిరిగే ప్రకాశవంత మైన బంగారు మత్స్యయంత్రాన్నీ రూపొందించాడు.

క. 'ధరణిఁ గల రాజులెల్లను । బురుడునఁ గాంపిల్య నగరమున కరిగెద రొం
డొరులం గడవఁగ, నని భూ । సురువరుఁ డెఱిఁగించెఁ బృషతసుతుకథయెల్లన్. 27

ప్రతిపదార్థం: ధరణిన్= భూమిమీద; కల= ఉన్న; రాజులు+ఎల్లన్= రాజులంతా; పురుడునన్= సమానంగా; కాంపిల్య నగరమునకు (ఇది ద్రుపదుపురం); ఒండొరులన్+కడవఁగన్= ఒకరికంటె ముందుగా మరొకరు; అరిగెదరు= వెళ్ళుతారు; అని= ఆప్రకారం, భూసుర, వరుఁడు= బ్రాహ్మణ శ్రేష్ఠుడు; పృషత, సుతు, కథ, ఎల్లన్= ద్రుపదుడి కథ అంతా; ఎఱిఁగించెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'భూమిమీద ఉన్న రాజులంతా ఒకరికొకరు (ముందుగా వెళ్ళా లని) పోటీపడుతూ ద్రుపదుని కాంపిల్య నగరానికి వెళ్లుతున్నా' రని ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు ద్రుపదునికథ అంతా చెప్పాడు.

వ. దాని విని పాండునందను లందులకుం బోవనున్నఁ గొడుకుల యభిప్రాయం బెఱింగి కుంతీదేవి యి ట్లనియె. 28

ప్రతిపదార్థం: దానిన్= ఆ వృత్తాంతమును; విని, పాండునందనులు= పాండుకుమారులు; అందులకున్= కాంపిల్యనగరానికి; పోవన్+ఉన్నన్= పోవలె నని ఉండగా; కొడుకుల; అభిప్రాయంబు; ఎఱింగి; కుంతీదేవి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ వృత్తాంతాన్ని విని పాండవులు కాంపిల్యనగరానికి పోవా లనే అభిప్రాయంతో ఉండగా; దానిని గ్రహించి కుంతీదేవి వాళ్ళతో ఈ విధంగా అనింది.

పాండవులు పాంచాలపురంబునకు బయలుదేరుట. (సం. 1-156-2)

క. కడుఁబెద్దకాల ముండితి । మొడఁబడి; యిం దెంతకాల మున్నను మన క
య్యెడు లాభ మేమి? మఱి యె । ప్పుడు నుచితమె యొరుల యిండ్ల పొత్తున నుండన్. 29

ప్రతిపదార్థం: కడున్= చాల; పెద్ద, కాలము= ఎక్కువ కాలం; ఒడఁబడి= ఇష్టపడి; ఉండితిమి= ఉంటిమి; ఇందు+ఎంతకాలము+ ఉన్నను= ఇక్కడ ఎంతకాలం ఉన్నా; మనకున్; అయ్యెడు= కలిగే; లాభము+ఏమి; మఱి; ఎప్పుడున్; ఒరుల= ఇతరుల; ఇండ్ల, పొత్తునన్= ఇండ్లల్లో; ఉండన్= ఉండటం; ఉచితమె= తగునా?

తాత్పర్యం: ఏకచక్రపురంలోని ఈ బ్రాహ్మణుని ఇంట్లో చాలా యెక్కువకాలం ఎట్లాగో ఉన్నాం. ఇక్కడ ఎంత కాల మున్నా మనకు కలిగే లాభ మే ముంది? అంతేకాక ఎప్పుడూ ఇతరుల యిండ్లలో కలిసి ఉండటం ఉచితం కాదు కదా!

వ. దక్షిణపాంచాలంబు గరంబు రమ్యం బనియును, బాంచాలపతి పరమధార్మికుం డనియును వింటిమి; మఱి యట్లుం గాక. 30

ప్రతిపదార్థం: దక్షిణ, పాంచాలంబు= దక్షిణపాంచాలదేశం; కరంబు= మిక్కిలి; రమ్యంబు+అనియును= అందమైన దనీ, పాంచాల పతి= పాంచాలరాజు; పరమ, ధార్మికుండు+అనియును= మిక్కిలి ధర్మబుద్ధికలవా డనీ; వింటిమి= విన్నాము; మఱి= ఇక; అట్లున్+కాక= ఆ విధంగా కాకుండా;

తాత్పర్యం: దక్షిణపాంచాలదేశం ఎంతో అందమైన దనీ, పాంచాలాన్ని పాలించే రాజు మిక్కిలి ధర్మబుద్ధి కలవా డనిన్నీ విన్నాము; అంతేకాక.

క. అడుగకయు విప్రవరులకు । నడరఁగ నద్దేశమున గృహస్థులు భక్తిం
గుడువఁగఁ బెట్టుదు రెప్పడుఁ । గడు హృద్యము లయిన మోదకంబులతోడన్. 31

ప్రతిపదార్థం: ఆ+దేశమునన్= ఆ పాంచాలదేశంలో; గృహస్థులు= ఇంటి యజమానులు; అడరఁగన్= ఒప్పుగ; విప్ర, వరులకున్= బ్రాహ్మణ శ్రేష్ఠులకు; అడుగకయు= అడుగకుండానే; భక్తిన్= భక్తితో; ఎప్పుడున్= ఎల్లప్పుడు; కడున్= మిక్కిలి; హృద్యములు+ అయిన= ఇంపైన; మోదకంబులతోడన్= కుడుములతో; కుడువగన్= తినటానికి (భోజనం); పెట్టుదురు.

తాత్పర్యం: ఆ పాంచాలదేశంలో గృహస్థులు బ్రాహ్మణశ్రేష్ఠులకు అడుగకుండానే భక్తితో, మనోహరా లైన మోదకాలతో ఎప్పుడూ భోజనం పెడుతూ ఉంటారు.

వ. 'అందులకుం బోవుద' మనినం గొడుకులెల్ల వల్లె యని 'మీ పంచిన విధంబ చేయం గలవార' మని యొడంబడి తమయున్న యింటిబ్రాహ్మణునకుం జెప్పి వీడ్కొని. 32

ప్రతిపదార్థం: అందులకున్= ఆ పాంచాలదేశానికి; పోవుదము+అనినన్= పోదాం అని అనగా; కొడుకులు+ఎల్ల= కొడుకులంతా; వల్లె, అని= సరే అని; మీ, పంచిన, విధంబు+అ= మీరు ఆజ్ఞాపించినట్లే; చేయన్+కలవారము+అని= చేస్తాము అని; ఒడంబడి= సమ్మతించి; తమ, ఉన్న= తామున్న; ఇంటి= ఇంటి; బ్రాహ్మణునకున్, చెప్పి; వీడ్కొని= సెలవు తీసికొని.

తాత్పర్యం: పాంచాలపురానికి వెళ్దా మని కుంతి అనగానే కొడుకులంతా సరే అని 'మీరు చెప్పినట్లే చేస్తా' మని ఒప్పుకొని, తా మున్న యింటి బ్రాహ్మణునికి చెప్పి అతనిదగ్గర సెలవు తీసికొని.

పాండవులు ద్రుపదుపురంబున కరుగుచు వ్యాసమహర్షిం గనుట (సం. 1-157-1)

చ. ఉరుసరసీవనంబులు మహోగ్రనగంబులు నేఱులున్ సుదు
స్తరవిపినంబులుం గడచి ధన్యులు పాండుకుమారకుల్ నిరం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తరగతి నేఁగుచుం గనిరి ధర్మసమేతుఁ బితామహుం దమో

హరు హరిమూర్తి నార్తిహరు నాదిమునీంద్రుఁ బరాశరాత్మజున్. **33**

ప్రతిపదార్థం: ఉరు, సరసీవనంబులు= పెద్ద సరస్సుల సమూహాలు; మహా+ఉగ్ర, నగంబులున్= మిక్కిలి భయంకరా లైన పర్వతాలు; ఏఱులున్= నదులు; సు, దుస్తర, విపినంబులున్= దాటటానికి చాలా కష్టమైన అడవులు; కడచి= దాటి; ధన్యులు= పుణ్యావంతులైన; పాండుకుమారకుల్= పాండురాజుకుమారులు; నిరంతర, గతిన్= ఎడతెగని ప్రయాణంతో; ఏఁగుచున్= వెళ్ళుతూ; ధర్మ, సమేతున్= ధర్మంతో కూడుకొన్నవాడిని - అనగా ధర్మాత్ముడిని; పితామహున్= తాతను; తమోహరున్= అజ్ఞానాన్ని తొలగించేవాడిని; హరిమూర్తిన్= విష్ణుస్వరూపుని; ఆర్తి, హరున్= దుఃఖాన్ని తొలగించే వాడిని; ఆది, మునీంద్రున్= తొలి ముని శ్రేష్ఠుడిని; పరాశర+ఆత్మజున్= పరాశరునియొక్క కుమారుడిని - వేదవ్యాసుడిని; కనిరి= చూచారు.

తాత్పర్యం: పెద్ద సరస్సుల సమూహాలను, భయంకరా లైన పర్వతాలను, నదులను - దాటడానికి చాలా కష్టమైన అడవులను దాటి - పుణ్యాత్ములైన పాండవులు నిరంతరం ప్రయాణం చేస్తూ - ధర్మాత్ముడు, పితామహుడు, అజ్ఞానాన్ని తొలగించేవాడు, విష్ణుస్వరూపుడు, దుఃఖాన్ని హరించేవాడు, ఆదిమునీంద్రుడు, పరాశరపుత్రుడు అయిన వ్యాసమహర్షిని దర్శించారు.

వ. కని వినయమ్మున నమ్మునీంద్రునకు నందఱు నమస్కారంబు సేసిన వారలం జూచి కరుణారస పూరితాంతః
కరణుం డయి వ్యాసభట్టారకుం డి ట్లనియె. **34**

ప్రతిపదార్థం: కని= చూచి; వినయమ్మునన్; ఆ+మునీంద్రునకున్= ఆ వ్యాసమహర్షికి; అందఱు; నమస్కారంబు; చేసిన; వారలన్; చూచి; కరుణా, రస, పూరిత+అంతఃకరణుండు+అయి= దయారసంతో నిండిన మనస్సు కలవాడై; వ్యాసభట్టారకుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: పాండవులు వ్యాసమహర్షిని చూచి వినయంతో ఆయనకు నమస్కరించగా; ఆ మునీంద్రుడు కరుణారసంతో నిండినహృదయంతో వాళ్ళను చూచి ఈ విధంగా అన్నాడు.

క. ధర్మసుతుఁ డున్న చోటను । ధర్మువునకు హాని గలదె ధారుణి; నైనన్
ధర్మువ తాత్పర్యముగా । నిర్మలమతి నెగడునది వినీతాత్ముల రై. **35**

ప్రతిపదార్థం: ధర్మసుతుఁడు= ధర్మరాజు; ఉన్న, చోటను= ఉండే ప్రదేశంలో; ధర్మువునకున్= ధర్మానికి; హానికలదె= హాని ఉంటుందా?; ధారుణిన్= భూమిమీద; అయినన్= అయినప్పటికి; ధర్మువు+అ= ధర్మమే; తాత్పర్యముగా= ముఖ్యసారాంశంగా; నిర్మలమతిన్= మాలిన్యం లేని మనస్సుతో; వినీత+ఆత్ములరు+ఐ= వినయవంతు లై; నెగడునది= నడచుకోండి.

తాత్పర్యం: ధర్మరాజు ఉన్నచోట ధర్మానికి హాని ఉంటుందా? (ఉండ దని భావం). అయినప్పటికీ ధర్మమే ప్రధానంగా, నిర్మలమైన మనస్సుతో వినయవంతు లై మెలగండి.

సీ. తా నొక్క మునికన్య దన కర్మవశమునఁ । బతిఁ బడయంగ నోపక యుపేత
దౌర్భాగ్య యై ఘోరతప మొనరించిన । దానికి శివుఁడు ప్రత్యక్షమయ్యు,

'వేఁడుము వర' మన్న వేడ్కతోఁ బతిదాన । మని యేనుమాఱు లయ్యబల వేఁడె;

'నట్లేని నీకు దేహాంతరంబునఁ బతు । లగుదు రేవురు పరమార్థ' మనియు

ఆ. హరుఁడు కరుణ నిచ్చె; నది యిప్డు పాంచాల । పతికిఁ గృష్ణ యనఁగఁ బంకజాక్షి

యుద్భవిల్లి పెరుఁగుచున్నది; తత్స్వయం । వరము సేయుచున్నవాఁడు నేఁడు. 36

ప్రతిపదార్థం: తాను; ఒక్క మునికన్య; తన, కర్మవశమునన్= తన పూర్వజన్మ కర్మవలన; పతిన్= భర్తను; పడయంగన్+ఓపక= పొందలేక; ఉపేత, దౌర్భాగ్య+ఐ= కూడుకొన్న దురదృష్టం కలదై - అనగా దురదృష్టవంతురాలై; ఘోర, తపము= కఠినమైన తపస్సు; ఒనరించినన్= చేయగా; దానికిన్= ఆమెకు; శివుఁడు; ప్రత్యక్షము+అయ్యు= అగుపించి; వరము, వేడుము, అన్నన్= వరాన్ని కోరుకో, అని అనగా; వేడ్కతోన్= సంతోషంతో; పతి, దానము+అని= భర్తను దానం చేయం డని; ఏను+మారులు= ఐదుసారులు; ఆ+అబల= ఆ కాంత; వేఁడెన్= ప్రార్థించింది; అట్లు+ఏని= అట్లయితే; నీకున్, దేహాంతరంబునన్= మరొక దేహాన్ని పొందినపుడు - అనగా మరొక జన్మలో; ఏవురు= ఐదుగురు; పతులు అగుదురు= భర్తలు ఔతారు; పరమార్థము+ అనియు= సత్యము అని; హరుఁడు= శివుడు; కరుణన్= దయతో; ఇచ్చెన్= వరం ఇచ్చాడు; అది= ఆ మునికన్య; ఇప్డు= ఇప్పుడు; పంకజ+అక్షి - పద్మాలవంటి కన్నులు కలది; కృష్ణ, అనఁగన్= కృష్ణ అనే పేరుతో; పాంచాల, పతికిన్= పాంచాలరాజుకు; ఉద్భవిల్లి= పుట్టి; పెరుగుచున్+ఉన్నది= పెరుగుతూ ఉన్నది; తద్+స్వయంవరము= ఆమెయొక్క స్వయంవరం; నేఁడు= ఈ రోజు; చేయుచున్+ఉన్నవాఁడు= చేస్తున్నాడు లేదా ప్రకటిస్తున్నాడు.

తాత్పర్యం: ఒక మునికన్య తన పూర్వజన్మకర్మవశాత్తు భర్తను పొందలేక దురదృష్టవంతురా లై కఠోర మైన తపస్సు చేయగా, ఆమెకు శివుడు ప్రత్యక్షమై వరం కోరుకో మన్నాడు. అప్పు డామె సంతోషంతో పతిదాన మి మ్మని ఐదుసార్లు అడిగింది. శివుడు దయతో - 'అట్లయితే నీకు మరుసటిజన్మలో భర్తలు ఐదుగురు అవుతారు, ఇది సత్య' మని వర మిచ్చాడు. ఆ కన్య ఇప్పుడు కృష్ణ అనే పేరుతో పాంచాలరాజు కూతురుగా పుట్టి పెరుగుతూ ఉన్నది. ద్రుపదుడు ఆమె స్వయంవరాన్ని ఈ రోజు జరుపుతున్నాడు.

విశేషం: హరుడు - ప్రళయకాలంలో సర్వాన్నీ హరించేవాడు, భక్తుల పీడను హరించేవాడు - శివుడు. 'చేయుచున్నవాఁడు నేఁడు' అనేదానికి 'చేయుచున్నవాఁడు వాఁడు' అనే పాఠాంతరం ఉన్నది. 'నేడు' అనేదానికంటే ఇదే సముచితంగా కనపడుతున్నది. ఎందువలననంటే, పాండవులు ఈ మాట విన్న తరువాత కొన్నిరోజులు రాత్రింబవళ్ళు ప్రయాణంచేసి ద్రుపదుని నగరానికి వెళ్ళినట్లు చెప్పబడింది.

వ. 'మీరు ద్రుపదపురంబునకుం జక్క నరుగునది; యందు మీకు ల గ్గగు' నని చెప్పి కృష్ణద్వైపాయనుం డరిగినఁ బాండునందనులు జననీసహితం బనవరతంబు రాత్రులుం బగళ్ళును బయనంబు వోవువా రొక్కనాఁ డర్ధరాత్రంబున గంగయందు సోమశ్రవం బను తీర్థంబున స్నానార్థు లై, యర్జునుండు ప్రకాశార్థంబును రక్షణార్థంబునుంగా నొక్కకొఱవి సేతఁ బట్టుకొని ముందఱం బోవ, నందఱు నరుగునెడ, నంగారపర్ణుఁ డను గంధర్వుం డంగనాసహితంబు గంగకు నంతప్రొద్దు జలక్రీడార్థంబు వచ్చిన; వాఁ డప్పాండవుల పాదధ్వని విని యలిగి, విల్లుగొని గుణధ్వనిం జేసి వారి కి ట్లనియె. 37

ప్రతిపదార్థం: మీరు; ద్రుపదు, పురంబునకున్= ద్రుపదుని నగరానికి; చక్కన్= నేరుగా; అరుగునది= వెళ్ళండి; అందున్= అక్కడ; మీకున్; లగ్గు= మేలు; అగున్, అని, చెప్పి; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; అరిగినన్= వెళ్ళగా; పాండు,

నందనులు= పాండుకుమారులు; జననీ, సహితంబు= తల్లితో కలిసి; అనవరతంబు= ఎడతెగకుండ; రాత్రులున్, పగళ్ళును; పయనంబు, పోవువారు= ప్రయాణం చేసేవాళ్ళు; ఒక్కనాఁడు; అర్ధరాత్రంబునన్= నడిరేయిలో; గంగ, అందున్= గంగానదిలోని, సోమశ్రవంబు= సోమశ్రవము అను పేరుగల తీర్థములో; స్నాన+అర్థులై= స్నానాన్ని చేయగోరిన వాళ్ళయి; అర్జునుండు; ప్రకాశ+అర్థంబును= వెలుగు కొరకూ; రక్షణ= అర్థంబునున్+కాన్= రక్షణ కొరకూ; ఒక్క; కొఱవి= మండుచున్న కొయ్య; చేతన్+పట్టుకొని; ముందఱన్+పోవన్= ముందుకు పోగా; అందఱున్= అందరూ; అరుగునెడన్= వెళ్ళుతూ ఉండగా; అంగార పర్ణుఁడు+అను; గంధర్వుఁడు; అంగనా, సహితంబు= భార్యలతో గూడి; గంగకున్; అంతఃప్రొద్దు= అంతరాత్రి సమయంలో; జలక్రీడా+అర్థంబు= జలక్రీడకొరకు; వచ్చినన్= రాగా; వాఁడు; ఆ+పాండవుల, పాదధ్వని= కాళ్ళచప్పుడు; విని=ఆలకించి; అలిగి= కోపించి; విల్లు, కొని= విల్లు తీసికొని; గుణధ్వని= అల్లెత్రాడు లాగినశబ్దం చేసి; వారికిన్= వాళ్ళకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'మీరు ద్రుపదపురానికి చక్కగా వెళ్ళండి. అక్కడ మీకు మేలు కలుగుతుంది' అని చెప్పి వ్యాసుడు వెళ్ళగా - పాండవులు తల్లితోకూడి రాత్రింబగళ్లు ఎడతెగకుండా ప్రయాణం చేశారు. ఒకనాటి అర్ధరాత్రి గంగానదిలో - సోమశ్రవ మనే తీర్థంలో - స్నానం చెయ్యా లని అనుకొన్నారు. అర్జునుడు వెలుగుకొరకూ, రక్షణకొరకూ ఒక కొరవిని చేత బట్టుకొని ముందుపోతూ ఉండగా; అందరూ అతనివెంట వెళ్తూ ఉన్నారు. అప్పుడు అంగారపర్ణుడు అనే గంధర్వుడు తన భార్యలతో కూడి ఆ రాత్రివేళ జలక్రీడ లాడటానికి గంగానదికి వచ్చాడు. ఆ పాండవుల పాదధ్వని విని, కోపించి ధనుస్సు చేతబట్టి, అల్లెత్రాటి శబ్దం చేసి, వాళ్ళతో ఇట్లా అన్నాడు.

క. ఇల నర్ధరాత్రమును, సం । ధ్యలు రెండును, భూత యక్ష దానవ గంధ
ర్వులు గ్రుమ్మరియెడు ప్రొద్దులు; । వెలయఁగ నిం దవనిచరులు వెఱతురు నడవన్. 38

ప్రతిపదార్థం: ఇలన్= భూమిమీద; అర్ధ, రాత్రమును= నడిరేయి; సంధ్యలు, రెండును= ఉదయం సాయంసంధ్యలు; భూత, యక్ష, దానవ, గంధర్వులు= భూతాలు, యక్షులు, రాక్షసులు, గంధర్వులు; క్రుమ్మరియెడు= తిరిగెడు; ప్రొద్దులు= వేళలు; వెలయఁగన్= ఒప్పగా; ఇందున్= ఈ వేళలలో; అవని, చరులు= భూమిమీద నడిచేవారు - అనగా మానవులు; నడవన్, వెఱతురు= తిరగటానికి భయపడతారు.

తాత్పర్యం: ఈ భూమిమీద అర్ధరాత్రిసమయంలో; ఉదయసాయంసంధ్యలలో భూతాలు, యక్షులు, రాక్షసులు, గంధర్వులు తిరుగుతూ ఉంటారు. కనుక ఆ వేళలలో మానవులు తిరగటానికి భయపడతారు.

విశేషం: సంధ్య: రాత్రింబవళ్ల సంధికాలం. ప్రాతస్సంధ్య: సూర్యోదయానికి ముందు మూడుఘడియలనుండి సూర్యోదయం వరకు గల కాలం. సాయంసంధ్య: సూర్యాస్తమయానికి ముందు మూడుఘడియల నుండి సూర్యాస్తమయంవరకు గల కాలం.

అర్జునుఁ డంగారపర్ణుని జయించుట (1-158-9)

వ. 'ఇ వ్వేళయందుఁ గ్రుమ్మరియెడువారి నెంత బలవంతుల నైనను రాజుల నయినను నిగ్రహింతుము; నన్ను డాయకుం; డెడగలిగి పొం; డే నంగారపర్ణుం డను గంధర్వుండఁ, గుబేరుసఖుండ; నెప్పుడు నిందు విహరించుచుండుదు; న న్నె ఱుంగరె! యి వ్వనంబును గంగాతీరంబును నంగారపర్ణంబులు నా జగద్విదితంబులు; దీని మానవులు సార నోడుదు' రనిన వాని కర్జునుం డి ట్లనియె. 39

ప్రతిపదార్థం: ఈ+వేళ+అందున్= ఈ సమయాలలో; క్రుమ్మరియెడు, వారిన్= తిరిగేవాళ్ళని; ఎంత, బలవంతులన్+ఐనను; రాజులన్+అయినను; నిగ్రహింతుము= నిగ్రహించుదుము, పడద్రోయగలం; నన్నున్; డాయకుండుఁడు= సమీపించకండి; ఎడ, గలిగి, పొండు= దూరంగా తొలగిపొండి; ఏన్= నేను; అంగారపర్ణుండు; అను, గంధర్వుండన్; కుబేర, సఖుండన్= కుబేరునికి స్నేహితుడిని; ఎప్పుడున్; ఇందున్= ఇక్కడ; విహరించుచుందున్= విహరిస్తూ ఉంటాను; నన్నున్; ఎఱుంగరె= తెలియరా?; ఈ, వనంబును= అ అడవీ; గంగాతీర్థంబును; అంగారపర్ణంబులునా= అంగారపర్ణుడి వని; జగత్+విదితంబులు= ప్రపంచానికి తెలియబడినవి; దీనిన్; మానవులు; చొరన్= ప్రవేశించటానికి; ఒడుదురు= భయపడతారు; అనినన్= అని అనగా; వానికిన్= ఆ అంగారపర్ణునికి; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ సమయాలలో తిరిగేవాళ్ళు ఎంత బలవంతు లైనా, రాజు లైనా వాళ్ళను పడద్రోయగలం; నా దగ్గరికి రాకండి; దూరంగా తొలగిపొండి. నేను అంగారపర్ణు డనే గంధర్వుడిని. కుబేరుడి మిత్రుడిని. ఎప్పుడూ ఇక్కడ విహరిస్తుంటాను. నన్ను గురించి తెలియదా? ఈ అడవి, గంగాతీరం అంగారపర్ణుడి వని ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. ఈ ప్రాంతంలో ప్రవేశించటానికి మానవులు భయపడతారు-అని పల్కగా, అతనితో అర్జునుడు ఇట్లా అన్నాడు.

క. నడురేయి సంధ్యలందును । నడవఁగ నోడుదు రశక్తనరు లొరులు; భయం
పడుదుమె యే మెయ్యెడ నె । ప్పడు నడతుమ యధికశక్తి పురుషుల మగుటన్. 40

ప్రతిపదార్థం: అశక్త, నరులు= బలహీనులైన మానవులు; ఒరులు= ఇతరులు; నడురేయి= అర్ధరాత్రి; సంధ్యల+అందును= ఉభయసంధ్యలలో; నడవఁగన్= నడవటానికి; ఓడుదురు= జంకుతారు; ఏము= మేము; భయంపడుదుమె= భయపడుతామా?; అధిక, శక్తి, పురుషులము+అగుటన్= మిక్కిలి శక్తి కల మగవార మవటంచేత; ఏ+ఎడన్= ఎక్కడ నైనా; ఎప్పుడున్= ఎప్పుడైనా; నడతుము+అ= నడుస్తాము.

తాత్పర్యం: బలహీనులైన ఇతరమానవులు అర్ధరాత్రి, సంధ్యాసమయాలలో నడవటానికి భయపడతారు. మేము భయపడతామా? మహాశక్తి కల వీరులం కావటంచేత ఎక్కడైనా; ఎప్పుడైనా సంచరిస్తూ ఉంటాము.

క. అడవులు నేఱులు నివి నీ । పడసిన యవి యట్టె; పుణ్య భాగీరథి యి
ప్పడమిఁ గల జనుల కెల్లను । నెడపక సేవ్యంబ కాక యిది నీయదియే? 41

ప్రతిపదార్థం: అడవులున్, ఏఱులున్, ఇవి, నీ, పడసిన, అవి, అట్టె= అరణ్యాలు, నదులు ఇవి నీవు సంపాదించినట్టివా ఏమి?; పుణ్య, భాగీరథి= పవిత్రమైన గంగ; ఈ+పుడమిన్= ఈ భూమియందు; కల= ఉన్న; జనులకు+ఎల్లను= జనులందరికీ; ఎడపక= ఎల్లప్పుడు; సేవ్యంబు+అ, కాక= సేవింప దగింది కాక; ఇది, నీ యదియే= ఇది నీకు మాత్రమే సంబంధించినదా?

తాత్పర్యం: అడవులు, నదులు నీవు సంపాదించినవా ఏమి? పవిత్ర గంగానది భూమిమీది జను లందరికి తప్పక సేవింపదగిందే. ఇది నీదా?

విశేషం: అడవులు, నదులు, పర్వతాలు, సముద్రాలు ఏ మానవుడూ భూమిమీదికి తెచ్చినవి కావు. అవి ప్రకృతి ప్రసాదించినవి. అందరూ సమానంగా అనుభవించవలసినవి. ఇది ఈ నాటి సామ్యవాదానికి పునాది భావన. భగీరథుడి ప్రయత్నంచేత గంగ ఈ లోకానికి తీసికొనిరాబడింది కనుక దానికి భాగీరథి అని పేరు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. హైమవతోత్తుంగ హేమశృంగంబున । నుండి భూమికి వచ్చి యుదధిఁ గూడె
గంగనా; మూఁడు దెఱంగుల నదియు; మం । దాకిని నా సత్పథంబునందు
సురసిద్ధముని వియచ్చర సేవ్య యయ్యె; న । య్యధమలోకంబునయందు భోగ
వతి యన నొప్పె నున్నతి; నిట్లు త్రిభువన । పావని యైన యిప్పరమమూర్తిఁ

ఆ. బార్వతీశమకుటబంధబంధురతరా । వాస గంగ నాడ వచ్చి నీవు
వలవ దనిన నుడుగువారము గాము; నీ । విఘ్నవచనములకు వెఱతు మెట్లు? 42

ప్రతిపదార్థం: హైమవత+ఉత్తుంగ, హేమ, శృంగంబున నుండి= హిమవత్పర్వతముయొక్క ఎత్తైన బంగారు శిఖరంనుండి; భూమికి వచ్చి; గంగనాన్= గంగ అను పేరుతో; ఉదధిన్= సముద్రమును; కూడెన్= కలిసెను; అదియు, మూఁడు; తెఱంగులన్= మూడు మార్గాలలో; సత్+పథంబు+అందున్= నక్షత్ర మార్గంలో - అనగా ఆకాశంలో; మందాకినినాన్= మందాకిని అనే పేరుతో; సుర, సిద్ధ, ముని, వియత్+చర, సేవ్య, అయ్యెన్= సురలు, సిద్ధులు, మునులు మొదలైన ఆకాశ సంచారులకు సేవింపదగిందయ్యెను; అధమ, లోకంబునన్, అందున్= పాతాళలోకంలో; భోగవతి, అనన్= భోగవతి అనే పేరుతో; ఒప్పెన్= ఉన్నది; ఇట్లు; ఉన్నతిన్= గొప్పగ; త్రిభువన; పావని, ఐన= మూడులోకాలను పవిత్రం చేసే దైన; ఈ+పరమమూర్తి= ఈ పవిత్రమూర్తి; పార్వతీ+ఈశ, మకుట, బంధ, బంధురతర+ఆవాస= పార్వతీపతి యైన శివుని జటాజూటంలో మిక్కిలి ఒప్పైన స్థానం గల దైన; గంగన్= గంగయందు; ఆడవచ్చి= స్నానం చేయవచ్చి; నీవు; వలవదు+అనినన్= వద్దనిన; ఉడుగువారము= మానుకొనేవారం; కాము= కాము; నీ, విఘ్న వచనములకున్= నీ ఆటంకపు మాటలకు; వెఱతుము= వెఱచుదుము; ఎట్లు= ఎట్లా భయపడతాము? (భయపడ మని భావం)

తాత్పర్యం: హిమాలయంలోని ఎత్తైన బంగారు శిఖరంనుండి భూమికి వచ్చి, గంగ అనే పేరుతో సముద్రంలో కలిసింది. అది మూడు మార్గాలలో సాగింది. ఆకాశమార్గంలో మందాకిని అనే పేరుతో దేవతలు, సిద్ధులు, మునులు మొదలైన ఆకాశసంచారులకు సేవించదగింది అయింది. పాతాళ లోకంలో 'భోగవతి' అనే పేరుతో ఉంది. ఈ విధంగా మూడులోకాలను గొప్పగా పవిత్రం చేసే ఈ పుణ్యమూర్తి, శివునిజటాజూటంలో ఉచితస్థానం గలది - అయిన ఈ గంగలో స్నానం చేయటానికి వచ్చి, నీవు వ ద్దన్నంత మాత్రాన మానుకొనే వాళ్ళం కాము. నీ అడ్డుమాటలకు ఎట్లా భయపడతాము?

వ. అనుచు నిజ జననీ భ్రాతృ సహితుం డయి గంగాభిషేకార్థంబు చనుదెంచు న య్యర్జునునిపయి నంగారపర్ణుం డతినిశిత సాయకంబు లేసిన, నర్జునుం డలిగి తనచేతికొఱవి విదిర్చి యయ్యమ్ములు దన్నుం దాఁకకుండం గాచి కొని వాని కి ట్లనియె. 43

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; నిజ, జననీ, భ్రాతృ, సహితుండు+అయి= తన తల్లితో, తోబుట్టువులతో కూడినవాడై; గంగా+అభిషేక+అర్థంబు= గంగలో స్నానం చేయటంకొరకు; చనుదెంచు= వచ్చు; ఆ+అర్జునుని, పయిన్= ఆ అర్జునుని మీద; అంగారపర్ణుండు; అతి, నిశిత, సాయకంబులు= మిక్కిలివాడియైన బాణాలను; ఏసినన్= ప్రయోగింపగా; అర్జునుండు= అర్జునుడు; అలిగి= కోపించి; తన, చేతి= తన చేతిలోని; కొఱవి= దివిటీని; విదిర్చి= విదిలించి; ఆ+అమ్ములు= ఆ బాణాలు; తన్నున్= తనను; తాఁకకుండన్= తగలకుండా; కాచికొని= కాపాడుకొని; వానికిన్= ఆ అంగారపర్ణునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పల్కుతూ, తన తల్లితో, అన్నదమ్ములతో గంగాస్నానం చేయటానికి వస్తున్న ఆ అర్జుననిమీద అంగారపర్ణుడు మిక్కిలి వాడిబాణాలు వేయగా, అర్జునుడు కోపించి, తనచేతి కొరవి విదిల్చి, ఆ బాణాలు తనను తాకకుండా కాపాడుకొని, అతనితో ఇట్లా అన్నాడు.

ఆ. వెడఁగ! యిట్టి పాటి వెఱపించుటలును మా । యలును నేమి సేయు నస్త్రవిదులఁ ;
బెక్కులయ్యు నీ బిభీషికల్ నుఱువులు । విరియునట్టు లిందు విరియుఁ జూవె. 44

ప్రతిపదార్థం: వెడఁగ! = వెర్రివాడా!; ఇట్టి, పాటి= ఈ మాత్రపు; వెఱపించుటలును= బెదరింపులు; మాయలును; అస్త్ర, విదులన్= అస్త్రరహస్యాలు తెలిసినవాళ్ళను; ఏమి, చేయున్= ఏమి చేయగలవు; పెక్కులు+అయ్యున్; నీ బిభీషికల్= నీయొక్క బడాయి మాటలు; నుఱువులు= నీటిపై నురుగులు; విరియునట్టులన్= చెదరిపోయేటట్లు; ఇందున్= ఇచ్చట; విరియున్= చెదరిపోతాయి; చూవె= చూడుము సుమా!

తాత్పర్యం: వెర్రివాడా! ఈ మాత్రపు బెదిరింపులు, మాయలు అస్త్రవేత్తలను ఏమి చేయగలవు? నీ బెదిరింపులు ఎన్నైనా అవి నురుగులవలె చెదరినట్లు చెదరిపోతాయి, చూడుము.

విశేషం: అలం: ఉపమ.

సీ. అగ్నిదేవుండు బృహస్పతి కిచ్చె ము, । న్నతఁడు భరద్వాజుఁ డనఁగఁ బరఁగు
ముని కిచ్చె, నమ్మహాముని భార్గవున కిచ్చె । భార్గవుండును గుంభభవున కిచ్చె
నమ్మహాత్ముండు నా కతిదయ నిచ్చె ని । య్యనలాస్త్ర మని దాని నమ్మహోగ్ర
గంధర్వుపై వైచె ఘనుఁ డింద్రసుతుఁ డంతఁ । దద్రథం బప్పడ దగ్ధ మయిన,

ఆ. నగ్నిదాహభీతి నంగారపర్ణుండు । బమ్మరిల్లి నేలఁబడిన, వానిఁ
గొప్పు వట్టి యీడ్చికొని వచ్చె ధర్మజు । కడకు నింద్రసుతుఁడు కడిమి మెఱసి. 45

ప్రతిపదార్థం: ఈ+అనల+అస్త్రము= ఈ ఆగ్నేయాస్త్రం; అగ్నిదేవుండు; మున్ను= పూర్వం; బృహస్పతికిన్+ఇచ్చెన్; అతఁడు= ఆ బృహస్పతి; భరద్వాజుఁడు, అనఁగన్= భరద్వాజు డనే; పరఁగు= ఒప్పునట్టి; మునికిన్+ఇచ్చెన్= మునికి ఇచ్చాడు; ఆ+మహాముని= ఆ మహర్షి; భార్గవునకున్= పరశురామునికి; ఇచ్చెన్= ఇచ్చాడు; భార్గవుండును= పరశురాముండును; కుంభ, భవునకున్= కుండనుండి పుట్టినవానికి-ద్రోణునికి; ఇచ్చెన్; ఆ+మహాత్ముండును; నాకున్; అతి, దయన్ ఇచ్చెన్= మిక్కిలి దయతో ఇచ్చాడు; అని= అనుచు; దానిన్= ఆ అస్త్రాన్ని; ఆ+మహా+ఉగ్ర, గంధర్వు, పై = మహాభయంకరు డైన ఆ గంధర్వునిమీద; ఘనుఁడు= గొప్పవాడు; ఇంద్ర, సుతుఁడు= ఇంద్రుని కుమారుడైన అర్జునుడు; వైచెన్= వేశాడు; అంతన్= అంతలో; తత్+ రథంబు= అతనియొక్క (అంగారుపర్ణుడియొక్క) రథము; అప్పుడు+అ= అప్పటికప్పుడే; దగ్ధము+అయినన్= తగులబడినదికాగా; అగ్ని, దాహ; భీతిన్= నిప్పు కాల్పువలన భయంతో; అంగారపర్ణుండు; బమ్మరిల్లి= దిమ్మతిరిగి; నేల, పడినన్= నేలపై పడగా; వానిన్= ఆ గంధర్వుని; కొప్పుపట్టి= జుట్టు పట్టి; ఇంద్ర, సుతుఁడు= అర్జునుడు; కడిమి= పరాక్రమం, మెఱసి=ప్రకాశించగా; ధర్మజు, కడకున్= ధర్మరాజు దగ్గరకు; ఈడ్చికొని; వచ్చెన్.

తాత్పర్యం: 'ఈ ఆగ్నేయాస్త్రాన్ని పూర్వం అగ్నిదేవుడు బృహస్పతి కిచ్చాడు. అతడు భరద్వాజముని కిచ్చాడు. ఆ ముని పరశురామునికి, అతడు ద్రోణునికి, ఆ మహాత్ముడు అతిదయతో నాకు ఇవ్వటం జరిగింది' అని మహావీరుడైన అర్జునుడు దానిని ఆ భయంకరు డైన గంధర్వునిమీద ప్రయోగించాడు. తత్క్షణమే అతని రథం దగ్ధమైపోగా; నిప్పుకాల్పువల్ల కలిగిన భయంతో అతడు దిమ్మతిరిగి నేలమీద పడిపోయాడు. అర్జునుడు తన పరాక్రమం ప్రకాశించగా, అతడిని జుట్టుపట్టి ధర్మరాజు దగ్గరికి ఈడ్చుకొని వచ్చాడు.

క. వాని మనోవల్లభ కుం । భీనసి యనునది గరంబు భీతి 'నశేషో
ర్వీనాథులార! దయఁ బతి । దానము నా కిండు మీకు ధర్మువు పెరుఁగున్'. 46

ప్రతిపదార్థం: వాని, మనో, వల్లభ= ఆ అంగారపర్ణుని ప్రాణేశ్వరి - భార్య; కుంభీనసి; అనునది= అనే పేరుకలది; కరంబు, భీతిన్= మిక్కిలి భయంతో; అశేష+ఉర్వీనాథులార!= సమస్త భూమికి ప్రభువులారా!; దయన్= కరుణతో; పతిదానము= పతియొక్క దానం; నాకున్+ఇండు= నాకు ప్రసాదించండి; మీకున్; ధర్మువు= ధర్మంపెరుఁగున్.

తాత్పర్యం: ఆ అంగారపర్ణునిభార్య కుంభీనసి మిక్కిలిభయంతో - 'ఈ సమస్తభూమికి ప్రభువులారా! దయతో నాకు పతిదానం చేయండి. మీకు ధర్మం పెరుగుతుంది'.

విశేషం: అప్పటికి పాండవులు బ్రాహ్మణవేషాలలో ఉన్నారు. కుంభీనసి వాళ్ళను 'అశేషోర్వీనాథులారా!' అని సంబోధించటం ఆశ్చర్యకరంగా ఉన్నా - అంగారపర్ణుడు పాండవులను ముందే గుర్తించినట్లు చెప్పాడు కదా. (చూ.ప.57, ప.58) అందువలన బ్రాహ్మణవేషధారులై వచ్చిన వాళ్ళు పాండవు లని కుంభీనసికి భర్త ముందే చెప్పాడేమో. అందువలననే ఆమె అట్లా అన్నదేమో. కాగా, కుంభీనసి ప్రార్థనను మన్నించి 'గంధర్వా! కురువంశ ప్రభువు ధర్మరాజు కరుణతో నిన్ను విడువు మన్నాడు. ఇక భయపడకు' మని కూడా అర్జునుడు అన్నాడు.

క. అని యఱచుచున్నదానికి । ననఘుఁడు గరుణించి పాండవాగ్రజుఁ డయ్య
ర్జునుఁ జూచి 'వీని విడువుము । యని నోడినవాని హీను నపగతశౌర్యున్'. 47

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; అఱచుచున్+ఉన్న= ఏడ్చుచున్న; దానికిన్= ఆ కుంభీనసికి; అనఘుఁడు= పాపంలేనివాడు; పాండవ+అగ్రజుఁడు= పాండవులందు ముందు పుట్టినవాడు - ధర్మరాజు; కరుణించి= దయతలచి; ఆ+అర్జునున్; చూచి; అనిన్= యుద్ధంలో; ఓడినవాడిని; హీనున్= క్రుంగిపోయినవాడిని; అపగతశౌర్యున్= పోయిన శౌర్యం కలవాడిని; వీనిన్= ఈ అంగారపర్ణుడిని; విడువుము+అ.

తాత్పర్యం: అని ఆక్రోశిస్తున్న కుంభీనసిపట్ల పుణ్యాత్ముడు, పాండవాగ్రజుడు అయిన ధర్మరాజు దయతలచి, అర్జునుడిని చూచి, యుద్ధంలో ఓడినవాడు, క్రుంగిపోయినవాడు, శౌర్యం కోల్పోయినవాడు అయిన ఈ అంగారపర్ణుడిని విడిచిపెట్టుము.

ఆ. అనిన నరుఁడు వల్లె యని వాని కనియె 'గం । ధర్వ! నిన్నుఁ గరుణ ధర్మరాజు
కురుకులేశ్వరుం డశరణశరణ్యుండు । విడువఁ బనిచె నింక వెఱవకుండు'. 48

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; నరుఁడు= అర్జునుడు; వల్లె, అని= సరే అని; వానికిన్ అనియెన్= అంగారపర్ణునితో ఇట్లా అన్నాడు; గంధర్వ!; నిన్నున్; కురుకుల+ఈశ్వరుండు= కురువంశ ప్రభువు; అ, శరణ, శరణ్యుండు= శరణులేనివారికి శరణు పొందతగినవాడు; ధర్మరాజు; కరుణన్= దయతో; విడువన్, పనిచెన్= వదిలిపెట్టుమని ఆజ్ఞాపించాడు; ఇంకన్; వెఱవక= భయపడక; ఉండు.

తాత్పర్యం: అని పల్కగా అర్జునుడు సరే అని అంగారపర్ణునితో ఇట్లా అన్నాడు - 'ఓ గంధర్వుడా! కురువంశ ప్రభువు, శరణులేని వారికి శరణు పొందదగినవాడు అయిన ధర్మరాజు దయతో నిన్ను విడువటానికి ఆజ్ఞాపించాడు.

వ. అని వాని నాశ్వాసించి విడిచిన నట్లు నిర్జితుండై యర్జునున కంగారుపర్ణుం డి ట్లనియె. 49

ప్రతిపదార్థం: అని, వానిన్; ఆశ్వాసించి= ఓదార్చి; విడిచినన్= విడిచిపెట్టగా; అట్లు= ఆ విధంగా; నిర్జితుండు+ఐ= ఓడింపబడినవా డై; అర్జునునకున్; అంగారపర్ణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అంగారపర్ణుడిని ఓదార్చి విడుదల చేయగా, ఓడిపోయిన అంగారపర్ణుడు అర్జునునితో ఈ విధంగా అన్నాడు.

అంగారపర్ణుం డర్జునునితో సఖ్యము సేయుట (1-158-35)

మ. అని నీచేతఁ బరాజితుండ నయి నా యంగారపర్ణత్వ మిం
కను దాల్చన్ మది నంత నిస్త్రపుఁడనే; గర్వం బడంగన్ రణం
బున మున్నోడియుఁ బూర్వనామమున బెంపున్ గర్వముం దాల్చువాఁ
డనఘా! సత్సభలందు మెచ్చఁబడునే హాసాస్పదీభూతుఁ డై. 50

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!, ఓ అర్జునుడా!; అనిన్= యుద్ధంలో; నీచేతన్; పరాజితుండన్+అయి= ఓడింపబడిన వాడి నై; నా, అంగారపర్ణత్వము= అంగారపర్ణుడనే నా పేరును; ఇంకను; తాల్చన్= ధరించుటకు; మదిన్= మనస్సునందు; అంత నిస్త్రపుఁడనే= అంతగా సిగ్గులేనివాడనా; గర్వంబు+అడంగన్= పొగరు అణగగా; రణంబునన్= యుద్ధంలో; మున్ను; ఓడియున్= ఓడిపోయికూడా; పూర్వనామమునన్= మొదటిపేరుతో; పెంపున్= గొప్పతనాన్ని; గర్వమున్, తాల్చువాఁడు= దర్పముతో ధరించువాడు; హాస+ఆస్పదీ, భూతుఁడు+ఐ= ఎగతాళికి ఉనికి పట్టయినవా డై; సత్+సభల, అందున్= సజ్జనుల సభలలో; మెచ్చన్+పడునే= గౌరవింపబడతాడా, కీర్తింపబడతాడా! (పడ డని భావం.)

తాత్పర్యం: పుణ్యాత్మా! అర్జునా! యుద్ధంలో నీ చేతిలో ఓడిపోయి, ఇంకా అంగారపర్ణు డనే పేరు ధరించటానికి నే నంత సిగ్గు లేనివాడినా? మొదట యుద్ధంలో గర్వం అణగిపోయేవిధంగా ఓడిపోయికూడా - మొదటిపేరుతోనే గొప్పతనాన్నీ, గర్వాన్నీ పొందేవాడు సజ్జనుల సభలలో ఎగతాళికి గురౌతాడు కాని, మెప్పు పొందగలడా?

వ. నీ యాగ్నేయాస్త్రంబున దగ్ధరథుండ నయ్యును గంధర్వమాయ ననేక రత్నవిచిత్రం బైన రథంబు వడసి, యిది మొదలుగాఁ జిత్రరథుండ నయ్యెద; నీ పరాక్రమంబునకు మెచ్చితి; నీతోడి సఖ్యంబు నా కభిమతం బయిన యది; నా తపంబునం బడయంబడిన చాక్షుషి యనువిద్య నీ కిచ్చెద; దీనిం దొల్లి మనువువలన సోముండు పడసె; సోమునివలన గంధర్వపతి యయిన విశ్వావసుండు వడసె; నాతనివలన నేనుఁ బడసితి; నెవ్వండేని

మూఁడులోకంబులుం జూడ నిచ్చగించు నాతండు దనయిచ్చకుం దగ నివ్విద్యపెంపున సర్వస్వంబును గంజూచు; నేము దీనన చేసికాదె మానవులకు విశేషుల మై వేల్పులచేత శాసింపంబడక జీవించెద; మిది కాపురుషప్రాప్తం బైఫలియింపదు; నీవు తాపత్యవంశవర్ధ నుండవు; మహాపురుషుండవు; నీకు సఫలంబగు, నీదివ్యవిద్యఁ గొను మిచ్చెద; దీనిఁ గొనునప్పుడు షణ్మాసవ్రతంబు సేయవలయు; నీవు నాకు నాగ్నేయాస్త్రం బిచ్చునది; మఱి మహా జవసత్త్వంబులుఁ గామగమనంబులు నయిన గంధర్వహయంబుల మీ కేవురకుం జెఱు నూఱేసి యిచ్చెద. 51

ప్రతిపదార్థం: నీ, ఆగ్నేయ+అస్త్రంబునన్; దగ్ధ, రథుండను+అయ్యును= కాలిపోయిన రథం కలవాడనయినా; గంధర్వ, మాయన్= గంధర్వమాయచేత; అనేక, రత్న, విచిత్రంబు+ఐన= వివిధరత్నాలచేత ఆశ్చర్యకరమైన; రథంబు; పడసి= పొంది; ఇది, మొదలుగా= నేటినుండి; చిత్రరథుండన్= చిత్రరథుడు అనుపేరుగలవాడను; అయ్యెదన్= అవుతాను; నీ పరాక్రమంబునకు; మెచ్చితిన్; నీతోడి; సఖ్యంబు= స్నేహం; నాకున్; అభిమతంబు= ఇష్టము అయిన; అది= ఇష్టమైనది; నా తపంబునన్, పడయన్+పడిన= పొందబడిన; చాక్షుషి, అను, విద్య, నీకున్= చాక్షుషి అనుపేరుగల విద్యను నీకు ఇస్తున్నాను; దీనిన్; తొల్లి= పూర్వం; మనువువలన, సోముండు= చంద్రుడు; పడసెన్= పొందినాడు; సోముని వలన= చంద్రునివలన; గంధర్వ, పతి, అయిన= గంధర్వరాజైన; విశ్వావసుండు; పడసెన్= పొందినాడు; అతనివలన= ఆ విశ్వావసునివల్ల; నేను; పడసితిన్= పొందాను; ఎవ్వండేని; మూడు, లోకంబులున్, చూడన్= ఎవ్వరైనా ముల్లోకాలను చూచుటకు; ఇచ్చగించునో= కోరుకొనునో; అతండు; తన ఇచ్చకున్= తన కోరికకు; తగన్= తగినట్లు; ఈ+విద్య, పెంపునన్= ఈ విద్యయొక్క మహిమచేత; సర్వస్వంబునున్= మొత్తాన్నీ; చూచున్= చూస్తాడు; ఏము= మేము; దీనన, చేసి= దీనివలననే; కాదె= కదా!; మానవులకు; విశేషులము+ఐ= శ్రేష్ఠులమై, వేల్పుల చేత= దేవతలచేత; శాసింపన్+పడక= ఆజ్ఞాపించబడక; జీవించెదము= జీవిస్తాము; ఇది, కాపురుష, ప్రాప్తంబు+ఐ= చెడుమానవులచే పొందబడినచో; ఫలియింపదు= ఫలవంతం కాదు; నీవు, తాపత్య, వంశ, వర్ధనుండవు= తపతికి సంబంధించిన వంశాన్ని పెంపుచేసేవాడవు; మహాపురుషుండవు; నీకున్, సఫలంబు+అగున్= నీకు ఫలముతో కూడినది అగును; ఈ దివ్య, విద్యన్; కొనుము= తీసికొనుము; ఇచ్చెదన్; దీనిన్; కొనునప్పుడు; షట్+మాస, వ్రతంబు= ఆరు నెలల వ్రతం; చేయవలయు; నీవు; నాకున్; ఆగ్నేయ+అస్త్రంబు; ఇచ్చునది; మఱి= అంతేగాక; మహా, జవ, సత్త్వంబులున్= మిక్కిలి వేగం, బలం కలవీ; కామ, గమనంబులున్= కోరినచోటికి వెళ్ళగలవీ; అయిన= అయినటికీ; గంధర్వ, హయంబులన్= గంధర్వ జాతిగుర్రాలను; మీకున్+ఏవురకున్= మీ అయిదుగురికి; చెఱు, నూఱు+ఏసి= ఒక్కొక్కరికి వందవంతున; ఇచ్చెదన్= ఇస్తాను.

తాత్పర్యం: నీ ఆగ్నేయాస్త్రంవలన దగ్ధరథుడిని అయినప్పటికి, గంధర్వమహిమతో వివిధ రత్నాలచేత విచిత్రమైన రథాన్ని పొంది, ఇది మొదలు 'చిత్రరథుడు' అనే పేరు కలవాడ నౌతాను. నీ పరాక్రమానికి మెచ్చాను. నీతో స్నేహం చెయ్యా లని కోరుతున్నాను. నేను తపస్సుచేత సాధించిన చాక్షుషీవిద్యను నీ కిస్తాను. దీనిని పూర్వం మనువునుండి చంద్రుడు, అతడినుండి గంధర్వా జైన విశ్వావసుడు పొందారు. అతడినుండి నేను పొందాను. మూడులోకాలూ చూడగోరేవాడు తన కోరికకు తగినట్లు ఈ విద్యాప్రభావంచేత సర్వం చూడగలడు. మేము ఈ విద్యవలననే గదా మానవులకంటె శ్రేష్ఠుల మై, దేవతలచే ఆజ్ఞాపింపబడక జీవిస్తున్నాము. ఈ విద్య దుర్మార్గులకు లభిస్తే ఫలించదు. నీవు తపతికి సంబంధించిన వంశాన్ని వర్ధిల్లజేసేవాడివి. నీ కిది సఫలమవుతుంది. ఈ విద్యను నీ కిస్తాను. తీసికొమ్ము. దీనిని గ్రహించే సమయంలో ఆరు నెలలు వ్రతం చేయాలి. నీవు నాకు ఆగ్నేయాస్త్రాన్ని ఇవ్వు. నేను ఇంకా మీ అయిదుగురికి మహావేగం, బలం గల గంధర్వజాతి గుర్రాలను ఒక్కొక్కరికి వంద ఇస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **వృత్రుపై గీర్వాణవిభుఁ డల్గి వజ్రంబు । వైచిన నది వాని వజ్ర కఠిన**
పటు మస్తకంబునఁ బడి పాతరయమునఁ । బదివ్రయ్యలైనఁ దద్భాగచయము
క్రమమున బ్రాహ్మణ క్షత్ర విట్ఛూద్రుల । యందు వేదంబులు నాయుధములు
హలము శుశ్రూషయు నయ్యె వజ్రంబులు । వాహంబులందు జవంబు నయ్యె

తే. **నట్టి జవమున నభిమతం బగుచు నున్న । యట్టి హయసమూహం బయ్యె నవనిపతుల**
కఖిల భువనముల్ రక్షించునపుడు సకల । సాధనములలో నుత్తమసాధనంబు. **52**

ప్రతిపదార్థం: వృత్రు, పై= వృత్రు డనే రాక్షసుని మీద; గీర్వాణవిభుఁడు= దేవతలరాజు, దేవేంద్రుడు; అల్గి= కోపించి; వజ్రంబు= వజ్రాయుధం; వైచినన్= వేయగా; అది, వాని, వజ్ర, కఠిన, పటు, మస్తకంబునన్= అది అతనియొక్క వజ్రంవలె గట్టిదైన పెద్ద తలమీద; పడి, పాత, రయమునన్= పడిన వేగంచేత; అది= ఆ వజ్రాయుధం; పది, వ్రయ్యలు+ఐనన్= పదిముక్కలు కాగా; తద్+భాగ, చయము= ఆ ముక్కల సమూహం, క్రమమునన్= వరుసగా; బ్రాహ్మణ, క్షత్ర, విట్, శూద్రుల, అందున్= బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య శూద్రులలో; వేదంబులున్; ఆయుధములు; హలము= నాగలి; శుశ్రూషయున్= సేవయు; అయ్యెన్= అయినవి; వజ్రంబులు; వాహల్ంబు+అందు= గుర్రాలలో; జవంబు= వేగం; అయ్యెన్= అయినవి; అట్టి, జవమునన్= వేగంచేత; అభిమతంబు+అగుచున్+ఉన్న= ఇష్టమౌతున్న; అట్టి; హయ, సమూహము= గుర్రాల సమూహం; అవని, పతులకు= భూపతులకు- రాజులకు; అఖిల, భువనముల్= అన్ని లోకాలు; రక్షించునపుడు; సకల, సాధనములలోన్; ఉత్తమ, సాధనము, అయ్యెన్= అన్ని సాధనాలలో శ్రేష్ఠమైన సాధనం అయింది.

తాత్పర్యం: వృత్రు డనే రాక్షసునిమీద దేవేంద్రుడు కోపించి వజ్రాయుధం వేయగా, అది వజ్రంవలె కఠినమైన అతని పెద్ద తల మీద పడి, పతనవేగంతో పది ముక్కలైంది. ఆ ముక్కల సమూహం వరుసగా బ్రాహ్మణులలో వేదశక్తిగా, క్షత్రియులలో ఆయుధశక్తిగా; వైశ్యులలో నాగలిశక్తిగా; శూద్రులలో సేవాశక్తిగా; గుర్రాలలో వేగంగా రూపొందింది. ఆ విధమైన వేగం కారణంగా రాజులకు ఇష్టమౌతున్న గుర్రాల సమూహం వాళ్ళ లోకా లన్నింటిని రక్షించటానికి ఉపయోగించే సాధనాలలో ఉత్తమసాధనం అయింది.

వ. **అనిన వాని కర్జునుం డి ట్లనియె.** **53**

తాత్పర్యం: అని అనగా, అంగారపర్ణునితో అర్జునుడు ఈ విధంగా అన్నాడు.

ఆ. **ఎంత మిత్రు లైన నెన్నండు నొరులచే । విద్యయును జయంబు విత్తచయము**
గొనఁగ నొల్ల! నాకుఁ గూర్తేని యనలాస్త్ర । మనఘ ! నీవు గొనుము హయము లిమ్ము. **54**

ప్రతిపదార్థం: ఎంత, మిత్రులు+ఐనన్= ఎంత స్నేహితు లైనను; ఎన్నండున్= ఎన్నడైనను; ఒరులచే= ఇతరులచేత; విద్యయును= విద్యను; జయంబు= విజయాన్ని; విత్త, చయము= ధనసమూహం; కొనఁగన్= తీసికొనుటకు; ఒల్లన్= ఇష్టపడను; నాకున్= నాకు; కూర్తు+ఏని= మిత్రుడ వైతే- ఈయ తలిస్తే; అనఘ!= పాపరహితుడా! అనల+అస్త్రము= ఆగ్నేయాస్త్రం; నీవు, కొనుము= తీసికొనుము; హయములు= గుర్రాలు; ఇమ్ము= ఇవ్వవలసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఎంత స్నేహితు లైనా ఇతరులనుండి విద్యను, విజయాన్ని, ధనసమూహాన్ని స్వీకరించటానికి ఎప్పుడూ నే నిష్టపడను. కాని, నీవు నాకు ఇవ్వదలచుకొంటే; ఓ పుణ్యాత్మా! ఈ ఆగ్నేయాస్త్రాన్ని తీసికొని, ఆ గుఱ్ఱాలను ఇవ్వుము.

వ. 'నీతోడ సఖ్యంబుఁ జేసెద; మఱి మమ్ముఁ బరమధార్మికులం బరమబ్రహ్మణ్యుల నేమి కారణంబున నుదరి పలికి?' తనిన గంధర్వుం డి ట్లనియె. 55

ప్రతిపదార్థం: నీతోడన్; సఖ్యంబు= స్నేహం; చేసెదన్= చేస్తాను; మఱి= అయితే; మమ్ముస్= మమ్మల్ని; పరమ, ధార్మికులను= మహాధర్మబుద్ధికలవాళ్ళను; పరమ, బ్రహ్మణ్యులన్= మిక్కిలిగా బ్రాహ్మణహితం కోరేవాళ్ళను; ఏమి, కారణంబునన్= ఏ కారణంచేత; ఉదరి= అదిరించి; పలికితి(వి)= మాటాడితివి; అనినన్= అని అనగా; గంధర్వుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీతో స్నేహం చేస్తాను. అయితే మిక్కిలిగా మేము బ్రాహ్మణహితం కోరేవాళ్ళం. మహాధర్మబుద్ధి కలవాళ్ళం. ఎందుచేత మమ్మల్ని అధిక్షేపించి మాట్లాడావు? అని ప్రశ్నించగా గంధర్వుడు ఇట్లా అన్నాడు.

క. విమలము లయి లోకత్రిత । యమునఁ బ్రవర్తిల్లు మీ మహాగుణములు ని
త్యము విందు నారదప్రము । ఖ మునీశ్వర సిద్ధసాధ్య గణములవలనన్. 56

ప్రతిపదార్థం: విమలములు+అయి= పవిత్రాలై; లోక; త్రితయమునన్= ముల్లోకాలలో; ప్రవర్తిల్లు= నడుచు; మీ, మహా, గుణములు= మీ యొక్క గొప్పగుణాలు; నారద, ప్రముఖ, ముని+ఈశ్వర, సిద్ధ, సాధ్య, గణములవలనన్= నారదుడు మొదలైన ప్రసిద్ధ మునీశ్వరుల, సిద్ధుల, సాధ్యుల సమూహాలచేత; నిత్యము= ప్రతిదినం; విందున్= వింటాను.

తాత్పర్యం: పవిత్రా లై ముల్లోకాలలో వ్యాపించిన మీ గొప్ప గుణాలు నారదుడు మొదలైన మునీశ్వరులు, సిద్ధ, సాధ్యసమూహాలు చెప్పగా ప్రతిదినం వింటూ ఉంటాను.

క. మేరునగోత్తంసమహీ । భారధురంధరుల మిమ్ముఁ బాండవుల గుణో
దారుల ధీరుల నెఱుఁగని । వా రెవ్వరుఁ గలరె భరతవంశోత్తములన్. 57

విశేషం: మేరు, నగ+ఉత్తంస, మహీ, భార, ధురంధరుల= మేరుపర్వతాన్ని సిగబంతిగా గల భూమండలభారాన్ని వహించిన; మిమ్మున్; పాండవులన్= పాండవుల్ని; గుణ+ఉదారులన్= గుణంచేత గొప్పవారైనవాళ్ళను; ధీరులన్= ధీరుల్ని; భరతవంశ+ ఉత్తములన్= భరతవంశ శ్రేష్ఠులను; ఎఱుఁగనివారు= తెలియనివాళ్ళు; ఎవ్వరున్+కలరె= ఎవరైనా ఉన్నారా?

తాత్పర్యం : మేరుపర్వతాన్ని సిగబంతిగా గల భూమండల భారాన్ని వహించినవాళ్ళు, సద్గుణాలచేత గొప్పవాళ్ళు, ధీరులు, భరతవంశశ్రేష్ఠులు అయిన మిమ్మల్ని - పాండవులను - తెలియని వా ళ్ళెవరైనా ఉన్నారా?

వ. ఏను మిమ్ము నెఱింగియు, మీకు నగ్నిపరిగ్రహంబును, బ్రాహ్మణసంగ్రహంబును లేమింజేసి పరుసంబులు పలికితి; మఱియును. 58

ప్రతిపదార్థం: ఏను= నేను; మిమ్మున్, ఎఱింగియు; మీకున్; అగ్ని, పరిగ్రహంబును= అగ్నిహోత్రస్వీకారం; బ్రాహ్మణ, సంగ్రహంబును= బ్రాహ్మణుడిని గ్రహించటం; లేమిన్+చేసి= లేకుండటంవలన; పరుసంబులు= కఠినాలైన మాటలు; పలికితిన్; మఱియును= ఇంకా.

తాత్పర్యం: నాకు మీరు తెలిసినా, మీకు అగ్నిహోత్రం, బ్రాహ్మణుడు లేనందువలన కఠినంగా మాట్లాడాను. అంతేకాక.

ఉ. ఇంతుల గోష్ఠి నున్నయతఁ డెంత వివేకము గల్గెనేని య
త్యంత మదాభిభూతుఁ డగు; ధర్మువు దప్పుఁ; బ్రియం బెఱుంగఁ; డే
నెంత వివేకి నయ్యును సహింపక యింతుల యొద్దఁ బల్కితిన్;
వింతయె? కాము శక్తి యుడివింపఁగ శక్యమె యెట్టివారికిన్! 59

ప్రతిపదార్థం: ఇంతుల, గోష్ఠిన్= స్త్రీలతో సల్లాపాలాడుతూ; ఉన్న; అతఁడు; ఎంత; వివేకము; కలిగెన్+ఏని; అత్యంత, మద+అభిభూతుఁడు+అగున్= ఎంతో ఎక్కువైన మదంచేత తిరస్కరింపబడినవా డౌతాడు - అనగా మిక్కిలి దురభిమానంతో కూడుకొన్న వా డౌతాడు; ధర్మువు, తప్పున్= ధర్మాన్ని తప్పుతాడు; ప్రియంబు+ఎఱుంగఁడు= ప్రీతిగా మెలగటం తెలియడు; ఏన్= నేను; ఎంత, వివేకిన్+అయ్యును= వివేకం కలవాడ నైనా; సహింపక= ఓర్పులేక; ఇంతుల, ఒద్దన్= భార్యల ఎదుట; పల్కితిన్= ఆ విధంగా మాట్లాడాను; వింతయె?= ఇది ఆశ్చర్యమా?; కాము, శక్తి= మన్మథునియొక్క శక్తిని; ఉడివింపఁగన్= మాన్పించటం- అనగా లేకుండ చేయటం; ఎట్టివారికిన్; శక్యమె= సాధ్యమా?

తాత్పర్యం: స్త్రీల గోష్ఠిలో ఉండేవాడు ఎంత వివేకి అయినా, అహంకారపూరితు డౌతాడు. ధర్మం తప్పి వ్యవహరిస్తాడు. ప్రియంగా వ్యవహరించలేడు. నేను వివేకంగలవాడినే అయినా నిగ్రహం కోల్పోయి, భార్యల యెదుట ఆ విధంగా మీతో మాట్లాడాను. ఇది అసహజం కాదు గదా! మన్మథుని శక్తిని అణచటం ఎంతవారికైనా సాధ్యమా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. స్త్రీలయెదుట స్వాతిశయభావం పెంచుకొని ఇతరులతో వ్యవహరించటం పురుషసహజం.

క. సుర గరుడ విషోరగ య। క్ష రాక్షస పిశాచ, భూత గంధర్వులు నో
పరు ధిక్కరింప బ్రాహ్మణ। పురస్కృతులఁ బుణ్యమతుల భూతలపతులన్. 60

ప్రతిపదార్థం: బ్రాహ్మణ, పురస్కృతులన్= బ్రాహ్మణుడిని ముందుంచుకొన్న వాళ్ళను; పుణ్య, మతులన్= పవిత్రమైన మనస్సుకల వాళ్ళను; భూతల, పతులన్= రాజులను; సుర, గరుడ, విష+ఉరగ, యక్ష, రాక్షస, పిశాచ, భూత, గంధర్వులు= దేవతలు, గరుడులు, నాగులు, యక్షులు, రాక్షసులు, పిశాచాలు, భూతాలు, గంధర్వులు; ధిక్కరింపన్= తిరస్కరించటానికి; ఓపరు= చాలరు.

తాత్పర్యం: బ్రాహ్మణుడిని ముందుంచుకొన్న పవిత్రహృదయులైన రాజులను - సురలు కాని, గరుడులు కాని, నాగులుకాని, యక్ష, రాక్షస పిశాచభూతగంధర్వులు కాని ధిక్కరించలేరు.

అంగారపర్ణుఁడు పాండవులకుఁ బురోహితునిఁ బురస్కరింపుఁ డని చెప్పుట (సం.1-159-17)

సీ. అనవద్యు వేదవేదాంగ విశారదు। జప హోమ యజ్ఞ ప్రశస్తు సత్య
వచను విప్రోత్తము వర్గచతుష్టయ। సాధనసఖు సదాచారు సూరి
సేవ్యుఁ బురోహితుఁ జేసిన భూపతి। యేలు నుర్వీతలం బెల్ల; నిందుఁ
బరలోకమునఁ బుణ్యపరుల లోకంబులు। వడయు; జయస్వర్గఫలము సూవె

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. రాజ్య; మదియు నుర్వరాసురవిరహితుఁ । డయిన పతికిఁ గేవలాభిజాత్య
శౌర్యమహిమఁ బడయ సమకూరునయ్య తా । పత్య! నిత్యసత్యభాషణుండ !. 61

ప్రతిపదార్థం: తాపత్య= తపతికి సంబంధించిన వంశంవాడా!; నిత్య, సత్య, భాషణుండ= ఎల్లప్పుడు సత్యాన్ని మాటాడే వాడా!; అనవద్యున్= ఏ లోపమూ లేనివాడిని; వేద, వేదాంగ, విశారదున్= వేదాలలో, వేదాంగాలలో- జ్యోతిష్యాకరణాదిశాస్త్రాలలో విద్వాంసుడిని; జప, హోమ, యజ్ఞప్రశస్తున్= జపంచేత, హోమంచేత, యజ్ఞంచేత ప్రసిద్ధుడైన వాడిని; విప్ర+ఉత్తమున్= బ్రాహ్మణ శ్రేష్ఠుని, వర్గ, చతుష్టయ, సాధన, సఖున్= ధర్మార్థ కామమోక్షాలను సాధించటంలో మిత్రుడైనవాడిని; సదాచారున్= మంచి నడవడి గలవాడిని; సూరి, సేవ్యున్= పండితులచేత సేవింపబడేవాడిని; పురోహితున్= పురోహితునిగా; చేసిన= చేసుకొన్న; భూపతి= రాజు; ఇందున్= ఈ లోకాన; ఉర్వీ, తలంబు+ఎల్లన్= భూమండలాన్నిఅంతా; ఏలున్= పాలిస్తాడు; పరలోకమునన్= పరలోకంలో; పుణ్యపరుల= పుణ్యాత్ముల; లోకంబులు; పడయున్= పొందుతాడు; రాజ్యము; జయ, స్వర్గ ఫలము= జయాన్నీ, స్వర్గాన్నీ, ఫలంగా గలిగినట్టిది; సూవె= సుమా; అదియున్= ఆ ఫలం; ఉర్వరా; సుర, విరహితుఁడయిన పతికిన్= భూసురుడు - అనగా బ్రాహ్మణుడు లేనిరాజుకు; కేవల+ఆభిజాత్య, శౌర్య, మహిమన్= కేవలం వంశంయొక్క పరాక్రమంయొక్క గొప్పతనంచేత; పడయన్, సమకూరున్+అయ్య= పొందటం సాధ్యమగునా? (సాధ్యం కాదని భావం)

తాత్పర్యం: తపతికి సంబంధించినవంశంలో జన్మించినవాడా! నిత్యసత్యభాషీ! అర్జునా! ఏ లోపం లేనివాడిని, వేద వేదాంగాలలో పండితుడిని, జప, హోమయజ్ఞాలు చేయటంచేత ప్రసిద్ధ డైనవాడిని, సత్యభాషిని, బ్రాహ్మణ శ్రేష్ఠుని, ధర్మార్థ కామమోక్ష సాధనలో మిత్రుడిని, మంచినడవడిగలవాడిని పురోహితుడిగా చేసికొన్న రాజు, ఈ లోకంలో భూమండలమంతా పరిపాలిస్తాడు; పరలోకంలో పుణ్యగతులు పొందుతాడు; జయ,ం, స్వర్గం రాజ్యం వలన లభిస్తాయి. బ్రాహ్మణుడు లేకుండా రాజుకు కేవలం వంశపరాక్రమాల గొప్పతనంచేతనే అటువంటి ఫలాన్ని పొందటం సాధ్యం కాదు.

విశేషం: ఈ పద్యం రాజ్యవ్యవస్థలో పురోహితుని ప్రాధాన్యాన్నీ, అతని యోగ్యతలను వివరిస్తుంది. అర్జునుణ్ణి తాపత్యుడనడానికి గల విశేషాలు ఇదే ఆశ్వాసంలో 67 పద్యంనుండీ ఉన్నాయి. చూడవచ్చు.

వ. మీరు ధర్మానిలశక్రాశ్వినులవరంబునం బాండురాజునకుం గుంతీమాద్రులకుం బుట్టినవారలు ధర్మవిదులరు; వేదవేదాంగ ధనుర్వేదపారగుం డయిన భారద్వాజు శిష్యుల; రఖిలలోకహితులరుం గావునం బురోహిత రహితులరై యుండఁ దగదు. 62

ప్రతిపదార్థం: మీరు; ధర్మ+అనిల, శక్ర+అశ్వినుల, వరంబునన్= యమధర్మరాజు, వాయుదేవుడు, దేవేంద్రుడు, అశ్వినీదేవతలు - వీరి వరంవలన; పాండురాజునకున్, కుంతీ, మాద్రులకున్, పుట్టినవారలు; ధర్మ, విదులరు= ధర్మం తెలిసినవాళ్ళు; వేద, వేద+అంగ, ధనుర్వేద, పారగుండు+అయిన= వేద వేదాంగ ధనుర్వేదాల యొక్క ఆవలి ఒడ్డు చేరినవాడైన - అనగా వేద వేదాంగ ధనుర్వేదాలను పూర్తిగా నేర్చినవాడైన; భారద్వాజు, శిష్యులరు= భరద్వాజుని కుమారుడైన ద్రోణునియొక్క శిష్యులు; అఖిల, లోకహితులరున్= అన్ని లోకాల మేలు కోరేవాళ్ళున్నూ; కావునన్= కాబట్టి; పురోహితరహితులరు+ఐ= పురోహితుడు లేనివాళ్లై; ఉండన్+తగదు= ఉండటం యోగ్యం కాదు.

తాత్పర్యం: మీరు, యమ, వాయు, దేవేంద్ర, అశ్వినీదేవతల వరాలతో పాండురాజుకు, కుంతీమాద్రులకు జన్మించినవాళ్ళు. ధర్మం తెలిసినవాళ్ళు. వేదవేదాంగధనుర్వేదాలను పూర్తిగా తెలిసిన ద్రోణాచార్యుని శిష్యులు. అన్ని లోకాలమేలు కోరేవాళ్ళు. అందుచేత పురోహితుడు లేకుండా ఉండటం తగదు.

విశేషం: వేదాలు నాలుగు: ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. వేదాంగాలు ఆరు; శిక్ష (కర్త-పాణిని), వ్యాకరణం (కర్త-పాణిని), ఛందం (కర్త-పింగళముని), నిరుక్తం (కర్త-యాస్కుడు), జ్యోతిషం (కర్తలు-ఆదిత్యాదులు), కల్పం (కర్తలు-ఆశ్వలాయన, కాత్యాయన, ఆపస్తంబాదులు). ఉపవేదాలు నాలుగు : ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వవేదం, అర్థవేదం.

ఆ. పాండుపుత్త్ర ! నీవు బ్రహ్మచర్యస్థుండ । వగుటఁ జేసి మన్మథార్తు నన్ను
నొడిచి తిందు రాత్రి యుద్ధంబు సేసి; కా । మోపభోగనిరతుఁ డోటు వడఁడె? 63

ప్రతిపదార్థం: పాండు, పుత్త్ర= పాండురాజుకుమారా!; నీవు, బ్రహ్మచర్యస్థుండవు+అగుటన్+చేసి= బ్రహ్మచర్య ఆశ్రమంలో ఉన్నవాడవు కనుక; ఇందున్= ఇక్కడ; రాత్రి, యుద్ధంబు, చేసి; మన్మథ+ఆర్తున్= మన్మథునిచేత పీడితు డనైన; నన్నున్= నన్ను; ఒడిచితివి= ఓడించావు; కామ+ఉపభోగ, నిరతుఁడు= కామసుఖానుభవాలలో మిక్కిలి ఆసక్తిగొన్నవాడు ఓటు, పడఁడె= ఓడిపోడా?

తాత్పర్యం: పాండుకుమారా! ఓ అర్జునా! నీవు బ్రహ్మచర్యంలో ఉన్నవాడివి కావటంచేత మన్మథపీడితుడ నైన నన్ను ఇక్కడ రాత్రియుద్ధం చేసి ఓడించావు. కామసుఖానుభవంలో నిమగ్నుడైనవాడు ఓడిపోడా?

విశేషం: అలం : అర్థాంతరన్యాసం.

వ. మఱియుఁ గామ ప్రవృత్తుం డయ్యును మహీపతి మహీసురవరపురస్సరుం డగు నేని యెల్ల యుద్ధంబుల శత్రుల జయించు. 64

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక; కామప్రవృత్తుండు+అయ్యును= కామమునందు ప్రవర్తిల్లేవాడైనా; మహీపతి= రాజు; మహీసుర, వర, పురస్+సరుండు+అగున్+ఏని= బ్రాహ్మణశ్రేష్ఠుని ముందుంచుకొన్నవా డైతే; ఎల్ల, యుద్ధంబులన్= అన్ని యుద్ధాలలో; శత్రులన్, జయించున్= శత్రువుల్ని జయించగలుగుతాడు.

తాత్పర్యం: అంతేకాక రాజు కామభోగాలలో ప్రవర్తిల్లేవా డైనా, పురోహితుడిని ముందుంచుకొంటే, అన్ని యుద్ధాలలో శత్రువులను జయించగలడు.

ఉ. వేదము వేదియుం గలుగు విప్రవరేణ్యుఁ డగణ్యపుణ్య సం
పాది పురోహితుం డయినఁ బాపము పొందునె భూపతిం బ్రతా
పోదయ! కాన మీదగు గుణోన్నతికిం దగ ధర్మతత్త్వ సం
వేదిఁ బురస్కరింపుఁడు పవిత్రచరిత్రు మహీసురోత్తమున్. 65

ప్రతిపదార్థం: ప్రతాప+ఉదయ!= ఓ పరాక్రమశాలీ! అర్జునా!; వేదము; వేదియున్= యజ్ఞవేదికయు; కలుగు; విప్ర, వరేణ్యుఁడు= బ్రాహ్మణశ్రేష్ఠుడు; అగణ్య, పుణ్య, సంపాది= లెక్కకు మిక్కిలియైన పుణ్యాలను సంపాదించినవాడు; పురోహితుండు+ అయినన్= పురోహితుడు అయితే; భూపతిన్= రాజును, పాపము; పొందునె= పాపం అంటునా; కాన= అందుచేత; మీది+అగు; గుణ+ఉన్నతికిన్= గుణాల గొప్పతనానికి; తగన్= తగినట్లు; ధర్మ, తత్త్వ, సంవేదిన్= ధర్మతత్త్వాన్ని బాగా

తెలిసినవాడిని; పవిత్ర, చరిత్రున్= పుణ్యప్రవర్తన కలవాడిని; మహీ, సుర+ఉత్తమున్= బ్రాహ్మణశ్రేష్ఠుడిని; పురస్కరింపుఁడు= ముం దిడుకొనండి - అనగా పురోహితునిగా చేసుకోండి.

తాత్పర్యం: పరాక్రమశాలీ! ఓ అర్జునా! వేదం, యజ్ఞవేదిక కల బ్రాహ్మణశ్రేష్ఠుడు, అత్యధిక పుణ్యాన్ని సంపాదించిన వాడు - పురోహితుడైతే, ఇక రాజుకు పాపం అంటుతుందా? అందుచేత మీ గుణాల గొప్పతనానికి తగినట్లు ధర్మతత్త్వాన్ని బాగా తెలిసినవాడు, పవిత్రమైన నడవడి కలవాడు అయిన బ్రాహ్మణ శ్రేష్ఠుడిని మీ పురోహితునిగా చేసుకోండి.

తే. అనిన వానికి నర్జునుం డనియె 'మమ్ము । ననఘ! తాపత్యు లని పల్కి తతిముదమున
నేము కౌంతేయులము మఱి యెట్లు సెప్ప । మయ్య తపతి కపత్యుల మైన తెఱఁగు'. 66

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; వానికిన్= ఆ అంగారపర్ణునికి; అర్జునుండు; అనియెన్; అనఘ!= పాప రహితుడా! అతి ముదమునన్= మిక్కిలి సంతోషంతో; మమ్మున్, తాపత్యులు+అని= తపతిసంతతివా రని; పల్కితి(వి)= పలికితివి; ఏము= మేము; కౌంతేయులము= కుంతీపుత్రులం; తపతికిన్; అపత్యులము+ఐన= తపతికి సంతతివార మైన ; తెఱఁగు= విధం; మఱి; ఎట్లు; చెప్పుము+అయ్య= మరి ఏ విధంగానో తెలపండయ్యా!

తాత్పర్యం: అని పల్కగా ఆ గంధర్వునితో అర్జునుడు ఇట్లా అన్నాడు. 'పుణ్యాత్మా! నీవు సంతోషంతో మమ్మల్ని 'తపతిసంతతివారు' అని పేర్కొన్నావు. మేము కుంతీపుత్రులం. మరి యే విధంగా మేము తపతి సంతతివార మయ్యామో తెలియచెప్పవలసింది'.

తపతీసంవరణోపాఖ్యానము (సం. 1-160-3)

వ. అనిన నర్జునునకు నంగారపర్ణుం డి ట్లనియె. 67

తాత్పర్యం: అని పలికిన అర్జునునితో అంగారపర్ణుడు ఈ విధంగా అన్నాడు.

సీ. ఆదిత్యునకుఁ బుత్త్రి యనఘ సావిత్రికిని । ననుజ యుత్తమలక్షణామలాంగి
తపతి; యక్కన్య ధవళాయతేక్షణ । యౌవనసంప్రాప్త యైన, దానిఁ
జూచి యక్కన్యక సురుచిరగుణముల । కనుగుణుం డగు నిర్మలాభిజాత్యుఁ
బతి నెవ్విధంబునఁ బడయుదునో యని । తలఁచుచు నున్న యత్తపనుగుఱిచి

ఆ. భక్తిఁ దపము సేసెఁ బ్రభుఁ డజామీఢనం । దనుఁడు భరతకులుఁడు ధర్మవిదుఁడు
సర్వగుణయుతుండు సంవరణుం డను । వాఁడు కృతజపోపవాసవిధుల. 68

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా- ఓ అర్జునా!; ఆదిత్యునకున్= సూర్యునికి; పుత్రి= కూతురు; సావిత్రికిన్; అనుజ= అనుసరించి జన్మించినది - అనగా చెల్లెలు; ఉత్తమ, లక్షణ+అమల+అంగి= శ్రేష్ఠమైన లక్షణాలతో కూడిన నిర్మల మైన శరీరం కలది; తపతి; ఆ+కన్య = ఆ కన్యక; ధవళ+ఆయత+ఈక్షణ= తెల్లని విశాలములైన కన్నులు కలది; యౌవన, సంప్రాప్త, ఐన, దానిన్= యౌవనవతి అయినదానిని; చూచి; ఆ+కన్యక= ఆ తపతియొక్క; సురుచిర గుణములకున్=

ఒప్పిదమైన గుణాలకు - అనగా మంచి గుణాలకు; అనుగుణుండు+అగు= తగినగుణాలు కలవా డైన; నిర్మల+ఆభిజాత్యున్= స్వచ్ఛమైన వంశం కలవాడిని; పతిన్= భర్తను; ఏ+విధంబునన్, పడయుదునో= ఏ విధంగా పొందుతానో; అని; తలఁచుచున్+ఉన్న= ఆలోచిస్తున్న; ఆ+తపను గుఱిచి= ఆ సూర్యుడినిగూర్చి; ప్రభుఁడు= రాజు; అజామీఢ, నందనుఁడు= అజామీఢుని యొక్క కుమారుడు; భరత, కులుఁడు= భరత వంశపువాడు; ధర్మ విదుఁడు= ధర్మం తెలిసినవాడు, సర్వ, గుణయుతుండు= అన్ని మంచి గుణాలతో కూడుకొన్నవాడు అయిన; సంవరణుండు+అను, వాఁడు; కృత, జప+ఉపవాస, విధులన్= చేయబడిన జపం, ఉపవాసం, మొదలైన నియమాలచేత; భక్తిన్= భక్తితో; తపము; చేసెన్.

తాత్పర్యం: సూర్యునికి కూతురు, సావిత్రికి చెల్లెలు, ఉత్తమ లక్షణాలు, నిర్మల శరీరం, తెల్లని నేత్రాలు కలది, యౌవనవతి అయిన తపతి అనే కన్యకను చూచి - ఆమెఉత్తమగుణాలకు తగినగుణాలుకలవాడు, మంచివంశం కలవాడు అయిన భర్తను ఏ విధంగా పొందుతానా అని సూర్యుడు ఆలోచిస్తుండగా - ఆ సూర్యుడినిగూర్చి - ప్రభువు అజామీఢుని పుత్రుడు, భరతవంశంవాడు, ధర్మం తెలిసినవాడు, సర్వసద్గుణాలతో కూడుకొన్నవాడు అయిన సంవరణుడు - జపం, ఉపవాసం, మొదలైన నియమాలతో భక్తితో తపస్సు చేశాడు.

విశేషం: ఋక్షకుని కుమారుని పేరుకూడా సంవరణుడే.

చ. 'గగనమునందు నెందు నధికప్రభ నేను వెలుంగు నట్టు లి
జ్జగతిఁ బ్రసిద్ధుఁడై వెలుఁగు సంవరణుండ మదీయపుత్త్రికిం
దగుపతి; వీని కిచ్చెద ముదంబున నీలలితాంగి' నంచు మా
నుగ నెడ నిశ్చయించెఁ దపనుండు దదీయతపః ప్రసన్నుఁడై. 69

ప్రతిపదార్థం: గగనమునందున్= ఆకాశంలో; ఎందున్= ఎక్కడైనా; ఏను= నేను; అధిక, ప్రభన్= మిక్కిలికాంతితో; వెలుంగు నట్టులు= ప్రకాశిస్తూ ఉన్నట్లే; ఈ+జగతిన్= ఈ ప్రపంచంలో; ప్రసిద్ధుఁడు+ఐ; వెలుఁగు= ప్రకాశించే; సంవరణుండు+అ= సంవరణుడే; మదీయ, పుత్త్రికిన్= నా యొక్క పుత్రికకు; తగు, పతి= తగిన భర్త; ముదంబునన్= సంతోషంతో; ఈ, లలిత+అంగిన్= ఈ సుకుమారమైన శరీరం కలదానిని; వీనికిన్, ఇచ్చెదన్= ఇతనికి ఇస్తాను; అనుచున్= అంటూ; సూర్యుడు, తదీయ, తపః+ప్రసన్నుఁడు+ఐ= ఆ సంవరణునియొక్క తపస్సునకు సంతోషించినవాడై; మానుగన్= ఒప్పుగా; ఎడన్= హృదయంలో; నిశ్చయించెన్= నిర్ణయించుకొన్నాడు.

తాత్పర్యం: 'ఆకాశంలో అధికకాంతితో నేను వెలుగుతున్నట్లే ఈ ప్రపంచంలో సంవరణుడు ప్రసిద్ధు డై వెలుగుతున్నాడు. కనుక ఇతడే నా పుత్రికకు తగిన భర్త. ఈ సుకుమారిని సంతోషంతో ఇతని కిస్తాను' అని సంవరణుని తపస్సుకు సంతోషించిన సూర్యుడు తనమనస్సులో చక్కగా నిశ్చయించుకొన్నాడు.

వ. అంత నొక్కనాఁడు సంవరణుండు మృగయావినోదార్థి యయి వనంబునఁ బరిభ్రమించి అధికక్షుత్పిపాసాపీడిత పతితతురంగుం డయి యేకతంబ పాదచారి యై చని యొక్క పర్వతవనోద్దేశంబునందు. 70

ప్రతిపదార్థం: అంతన్= అటుపై; ఒక్కనాఁడు; సంవరణుండు; మృగయా, వినోద+అర్థి, అయి= వేటయొక్క వినోదంకొరకు; వనంబునన్= అడవిలో; పరిభ్రమించి= తిరిగి; అధిక, క్షుత్+పిపాసా, పీడిత, పతిత, తురంగుండు+అయి= మిక్కిలి ఆకలిచేత, దప్పికచేత, పీడింపబడి పడిపోయిన గుఱ్ఱం కలవాడై; ఏకతంబు+అ= ఒంటరిగా; పాదచారి+ఐ= కాలినడకతో; చని= వెళ్ళి; ఒక్క, పర్వత, వన+ఉత్+దేశంబునందు= ఒక పర్వతంయొక్క అరణ్యంలోని ఎత్తైన ప్రదేశంలో.

తాత్పర్యం: తర్వాత ఒకనాడు సంవరణుడు వేటకై అడవికి వెళ్ళాడు. తిరిగి తిరిగి అధికమైన ఆకలిదప్పులతో తన గుర్రం పడిపోగా, తాను ఒంటరిగా కాలినడకతో వెళ్ళి ఒక కొండ అడవిలోని ఎత్తైన ప్రదేశంలో.

క. కనియె నొక కన్యఁ గోమలిఁ । గనకప్రభ నిజ శరీరకాంతి నుపాంతం
బున వృక్షలతావలిఁ గాం । చనమయముగఁ జేయుచున్న చంద్రనిభాస్యన్. 71

ప్రతిపదార్థం: ఒక, కన్యన్= ఒక వివాహంకాని అమ్మాయిని; కోమలిన్= సుకుమారిని; కనక, ప్రభ,నిజ, శరీర కాంతిన్= బంగారు కాంతితో సమానమైన తన శరీరకాంతిచేత; ఉపాంతంబునన్= సమీపంలోని; వృక్ష, లతా+ఆవలిన్= చెట్ల తీవల సమూహాన్ని; కాంచన మయముగన్= బంగారుమయంగా చేయుచున్న; చేస్తున్న; చంద్ర, నిభ+ఆస్యన్= చంద్రునితో సమానమైన ముఖం కలిగిన దానిని; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: సుకుమారి, బంగారుకాంతివంటి తన శరీరకాంతితో ప్రక్క నున్న చెట్లను, తీవలను బంగారుమయం చేస్తున్నట్టిది, చంద్రునివంటి అందమైన ముఖంకలది అయిన ఒకకన్యను చూశాడు.

విశేషం: అలం: ఉపమ, తద్గుణం.

సంవరణుండు తపతింజూచి మోహించుట (సం. 1-160-25)

వ. కని యనిమిషలోచనుం డయి మనంబున ని ట్లని వితర్కించె. 72

ప్రతిపదార్థం: కని= చూచి; అనిమిష, లోచనుండు+అయి= రెప్పవాల్చని కన్నులు కలవాడై; మనంబునన్= మనస్సునందు; ఇట్లు+అని= ఈ విధంగా; వితర్కించెన్= ఊహించాడు.

తాత్పర్యం: చూచి కనురెప్పపాటుకూడా లేని ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ మనస్సులో ఈ విధంగా భావించాడు.

సీ. త్రిభువనలక్ష్మి యేతెంచి యేకాంత మి । ట్లేలొకో యున్నది యివ్వనమున,
గగనమణిప్రభ గగనంబునం దుండి । యవనీతల ప్రాప్త మయ్యె నొక్కొ
శంభుండు లావణ్యసద్గుణసముదాయ । మింద యిమ్ముగ సంగ్రహించె నొక్కొ
దీని యంగములఁ బొందిన యివ్విభూషణ । శ్రీ యేమి పుణ్యంబుఁ జేసె నొక్కొ

ఆ. యమరకన్యయొక్కొ యక్షకన్యక యొక్కొ । సిద్ధకన్య యొక్కొ శ్రీసమృద్ధి
సర్వలక్షణ ప్రశస్తాంగి యిది దివ్య । కన్య యగు ననంతకాంతిపేర్మి. 73

ప్రతిపదార్థం: త్రిభువన లక్ష్మి= మూడులోకాలలక్ష్మి; ఏతెంచి= వచ్చి; ఏకాంతము= ఒంటరిగా; ఈ వనమునన్= ఈ అడవిలో; ఇట్లు+ఏల+ఒకో= ఈ విధంగా ఎందుకు; ఉన్నది= ఉన్నదో; గగనమణిప్రభ= సూర్యునియొక్కకాంతి; గగనంబు+అందున్+ఉండి= ఆకాశంనుండి; అవనీతల, ప్రాప్తము+అయ్యెన్+ఒక్కొ= భూతలంమీదికి వచ్చినదా! శంభుండు= బ్రహ్మదేవుడు; లావణ్య, సద్గుణ, సముదాయము= సౌందర్యం యొక్క మంచిగుణాల సమూహం; ఇందు+అ= దీని యందే; ఇమ్ముగన్= ఒప్పుగ; సంగ్రహించెన్, ఒక్కొ= కూర్చినాడా; దీని= ఈ కన్యకయొక్క; అంగంబులన్= అవయవాలను; ఈ+విభూషణ, శ్రీ= ఈ అలంకారాల శోభ; ఏమి, పుణ్యంబున్= ఏ పుణ్యాన్ని; చేసెన్+ఒక్కొ= చేసిందో కదా!; అమర, కన్య,

ఒక్కొ= దేవతాకన్యయా!; యక్ష, కన్యక+ఒక్కొ= యక్ష కన్యయా; సిద్ధ కన్య+ఒక్కొ = సిద్ధ కన్యయా; శ్రీ సమృద్ధి, సర్వ, లక్షణ ప్రశస్త+అంగి= శోభచే నిండి, అన్ని శుభలక్షణాలచేత ప్రశంసింప తగిన శరీరం కలది; అనంత కాంతి పేర్మిన్= అంతం లేని కాంతియొక్క అతిశయంచేత; ఇది, దివ్య, కన్య, అగున్= ఈమె దివ్యకన్యయే అవుతుంది.

తాత్పర్యం: త్రిలోకలక్ష్మి ఒంటరిగా ఈ వనంలో ఈ విధంగా ఎందు కున్నదో! సూర్యకాంతి ఆకాశంనుండి భూమిమీదికి అవతరించిందో! బ్రహ్మదేవుడు సౌందర్య సద్గుణాల సముదాయాన్ని ఈమెలోనే సమకూర్చాడేమో! ఈమె అవయవాలను పొందిన ఈ అలంకారాల శోభ యేపుణ్యం చేసిందో! ఈమె దేవకన్యో, యక్షకన్యో, సిద్ధకన్యో, శోభాసమృద్ధితో, అపారమైన కాంతితో, సకలశుభలక్షణాలతో ప్రశంసింప దగిన శరీరం గల ఈమె ఒక దివ్యకన్యే అయి ఉంటుంది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. సంవరణుని హృదయంలో అభిలాష జనించటానికి కారణ మైన తపతినిగురించి ఉత్ప్రేక్షలో వర్ణించిన ఈ పద్యరచనలోని మాధుర్య మనే శబ్దగుణం రసపోషకం. (సంపా.) శంభు శబ్దం శివుడు, విష్ణువు, బ్రహ్మ అని ముగ్గురకు వర్తిస్తుంది. కాని ఈ పద్యంలో 'బ్రహ్మ' అనే అర్థంలోనే గ్రహించడమైనది.

చ. నెఱికురులున్ విలోలసితనేత్రయుగంబును నొప్పులొల్కు వా
తెఱయును దీని యాననముతెల్వి కరంబు మనోహరంబు; నా
యెఱిఁగిన యంతనుండి సతి నిట్టిలతాలలితాంగిఁ జూచి యే
నెఱుఁగ; సురేంద్రకన్యకలు నిట్టిరె రూపవిలాససంపదన్. 74

ప్రతిపదార్థం: నెఱి, కురులున్= అందమైన జుట్టు; విలోల, సిత, నేత్ర యుగంబునున్= చలిస్తున్న తెల్లని కన్నుల జంట; ఒప్పులు+ఒల్కు, వా తెఱయును= అందాలు చిందే పెదవీ; దీని, ఆననము, తెల్వి= దీని ముఖకాంతి; కరంబు= మిక్కిలి; మనోహరంబు= మనస్సును దోచుకొనునట్టిది; నా ఎఱిఁగిన, అంత నుండి= నేను పుట్టి బుద్ధి ఎఱిగినప్పటి నుండి; ఇట్టి; లతా, లలిత+అంగిన్= ఇటువంటి తీగవలె సుకుమారమైన శరీరం కల దానిని; సతిన్= కాంతను; ఏన్= నేను; చూచి, ఎఱుఁగన్= చూచి ఎరుగుట లేదు అనగా చూడలేదు; రూప, విలాస, సంపదన్= అందంయొక్క శృంగార కళా విశేషం యొక్క ఆధిక్యంలో; సుర+ఇంద్ర, కన్యకలున్= దేవేంద్రునియొక్క కన్యకలైనా; ఇట్టిరే= ఇట్టివారా?

తాత్పర్యం: ఈమె అందమైన కేశపాశం, చలించే తెల్లని కన్నుల జంట, ఒప్పు లొలికే పెదవి, ముఖకాంతి ఎంతో మనోహరంగా ఉన్నాయి. నేను పుట్టి బుద్ధి యెఱిగిననాటినుండి - తీవవలె ఇంత సుకుమారమైన స్త్రీని చూడలేదు. అందంలో శృంగారకళావిశేషంలో దేవతాకన్యకలలో నైనా ఇట్లాంటివా ళ్ళున్నారా?

విశేషం: అలం: ఉదాత్తం. ఈ పద్యంలోకూడ అభిలాషను ధ్వనింపచేసే మాధుర్యగుణం పోషింపబడింది. (సంపా.)

వ. అని వితర్కించుచు మదనకర్కశమార్గణలక్షీభూతచేతస్కుం డయి తదీయగుణమయపాశబద్ధుండునుం బోలెఁ గదలనేరక తన్నివేశితచేతనుండునుంబోలెఁ ద న్నెఱుంగక తద్రూపామృతపానంబున ననిమిషత్వంబునం బొందిన తన నయనంబుల దానియంద నిలిపి సంవరణుం డక్కన్యక కి ట్లనియె. 75

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; వితర్కించుచున్= ఊహిస్తూ; మదన, కర్కశ, మార్గ; లక్షీభూత, చేతస్కుండు+అయి= మన్మథునియొక్క కరకైన బాణాలకు గురిచేయబడిన మనస్సు కలవాడై; తదీయగుణమయ, పాశబద్ధుండునున్+పోలెన్= దానియొక్క గుణాలనెడి త్రాళ్ళచేత కట్టివేయబడినవానివలె; కదలనేరక= చలింపక; తద్+నివేశిత, చేతనుండునున్+పోలెన్= దానియందు ఉంచబడిన చైతన్యం కలవానివలె; తన్ను+ఎఱుంగక= తన్ను తాను మరచి; తద్+రూప+అమృత, పానంబునన్= దానియొక్క రూపమనెడి అమృతాన్ని త్రాగటంచేత; అనిమిషత్వంబునన్= రెప్పపాటు లేమిని అనగా దేవతాత్వమును; పొందిన; తన, నయనంబులన్= తన కన్నులను; దాని; అందు+అ= ఆ తపతియందే; నిలిపి, సంవరణుండు; ఆ+కన్యకకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ఊహిస్తూ తనమనస్సు మన్మథబాణాలకు గురికాగా, సంవరణుడు ఆమె గుణా లనే త్రాళ్ళతో కట్టివేయబడ్డవానివలె కదలలేక, తన చైతన్యా న్నంతా ఆమెలో ఉంచినట్లు తనను తాను మరచి ఆమెరూప మనే అమృతాన్ని త్రాగడంచేత రెప్పపాటు లేనికళ్ళను ఆమెవైపే నిలిపి, ఆ కన్యతో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: రూపకం. చక్షుఃప్రీతి అనే మన్మథావస్థ.

ఆ. **ఎఱుఁగఁ జెప్పు మబల ! యెవ్వరి దాన; వి । ట్లేల యున్నదాన వేకతంబ;**
క్రూర వన మృగములు గ్రుమ్మరుచున్న యీ । విజన విషమ శైల విపిన భూమి. **76**

ప్రతిపదార్థం: అబల!= ఓ కాంత!; ఎవ్వరిదానవు= ఎవరికి సంబంధించినదానివి; ఎఱుఁగన్+చెప్పుము; క్రూర, వన, మృగములు, క్రుమ్మరుచు+ఉన్న= క్రూరమైన అడవిమృగాలు తిరుగుతున్న; ఈ, విజన, విషమ, శైల, విపిన, భూమిన్= ఈ మనుష్యులులేని ఎగుడుదిగుడు పర్వతారణ్య ప్రదేశంలో; ఇట్లు= ఈవిధంగా; ఏల= ఎందుకు; ఏకతంబు+అ= ఒంటరిగా; ఉన్నదానవు= ఉన్నావు.

తాత్పర్యం: ఓ కాంతా! నీ వెవరో వివరంగా చెప్పుము. క్రూరమైన అడవిమృగాలు తిరుగుతున్న ఈ ప్రాంతంలో మనుష్యులు లేని ఎగుడుదిగుడు పర్వతారణ్యప్రదేశంలో ఈ విధంగా ఒంటరిగా ఎందు కున్నావు?

క. **అని పలుకుచున్న నృపనం । దనునకు మఱుమాట యీక తామరసనిభా**
నన మేఘమధ్యసౌదా । మనివోలె నడంగె దృష్టిమార్గము గడవన్. **77**

ప్రతిపదార్థం: అని, పలుకుచు, ఉన్న; నృప, నందనునకు= రాజకుమారునికి; మఱుమాట= సమాధానం; ఈక=ఇవ్వకుండా; తామరస, నిభ+ఆనన= పద్మంవంటి ముఖం కల ఆ తపతి; మేఘ, మధ్య, సౌదామని, పోలెన్= మేఘాలమధ్య మెరపు తీగవలె; దృష్టిమార్గము= చూపు ప్రసరించే త్రోవ; కడవన్= దాటి; అడంగెన్= మాయమయింది.

తాత్పర్యం: అని మాట్లాడుతున్న రాజకుమారునికి బదులు చెప్పకుండా పద్మంవంటి ముఖం కల ఆ తపతి మేఘాలమధ్య మెరపుతీగవలె కంటికి కన్పించకుండా మాయమైపోయింది.

విశేషం: అలం: ఉపమ.

వ. **ఇ ట్లదృశ్యం బయిన యక్కన్యకం గానక మానవపతి మానరహితుం డయి మహీతలంబు పయిం బడి ప్రలాపించు చున్న, నాతని నభినవయౌవనవిభ్రమోద్భాసితు నంగజాకారుం జూచి తపతి తానును**

మదనబాణబాధిత యై, తన రూపంబుఁ జూపి మధురవచనంబుల 'ని ట్లేల మోహగతుండ వయి?' తని పలికిన, దానికి సంవరణుం డి ట్లనియె. **78**

ప్రతిపదార్థం: ఇట్లు+అదృశ్యంబు+అయిన= ఈ విధంగా అగుపడకుండ పోయిన; ఆ+కన్యకన్= ఆ కన్నెను; కానక= కనజాలక; మానవపతి= రాజు (సంవరణుడు); మానరహితుండు+అయి= అభిమానాన్ని కోల్పోయినవాడై; మహీతలంబు+పయిన్+పడి= నేలమీదపడి; ప్రలాపించుచున్నన్= ఏడ్చుచుండగా; ఆతనిన్= ఆ సంవరణుడిని; అభినవ యౌవన విభ్రమ+ఉద్భాసితున్= సరిక్రొత్త యౌవన విలాసంచేత లెస్సగా ప్రకాశించేవాడిని; అంగజ+ఆకారున్= మన్మథునివంటి ఆకారం కలవాడిని; చూచి; తపతి; తాను; మదన బాణ బాధిత, ఐ= మన్మథ బాణాలచేత బాధింపబడినదై; తన, రూపంబున్, చూపి= తన రూపాన్ని చూపి; మధుర, వచనంబులన్= తీయని మాటలతో; ఇట్లు+ఏల= ఈ విధంగా ఎందుకు; మోహ, గతుండవు= మోహాన్ని పొందినవాడవు; అయితి(వి)= అయితివి; అని పలికినన్= అని పలుకగా; దానికిన్= ఆ తపతికి; సంవరణుండు= సంవరణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ఆమె అదృశ్యమై పోగా, సంవరణుడు ఆమెను కనుగొనలేక అభిమానాన్ని కోల్పోయి, నేలమీద పడి దుఃఖించాడు. నవయౌవనవిలాసంతో ప్రకాశించేవాడు, మన్మథాకారుడు అయిన అతడిని చూచి తపతి తానుకూడ మన్మథబాణాలచేత బాధింపబడిం దై, అతనియెదుట నిలిచి, తీయనిమాటలతో ' ఈ విధంగా ఎందుకు మోహం పొందావు?' అని అడుగగా ఆమెతో సంవరణుడు ఇట్లా అన్నాడు.

చ. ధరణి నతిప్రతాపబలదర్పములన్ విన నేన పెద్ద; నె
వ్వరికిని మున్ భయంపడనివాఁడ; భయార్తుఁడ నైతి నిప్డు; పం
కరుహదళాయతాక్షి! దయఁ గావుము నన్ను; భవన్నిమిత్త దు
ర్భరతర పంచబాణహతిఁ బంచతఁ బొందకయుండునట్లుగన్. **79**

ప్రతిపదార్థం: వినన్= వినగా; ధరణిన్= భూమిమీద; అతి, ప్రతాప, బల, దర్పములన్= గొప్ప పరాక్రమంచేత, బలంచేత, గర్వం చేత; నేను+అ, పెద్దన్= నేనే పెద్దను; మున్= ఇదివరకు; ఎవ్వరికిని; భయంపడనివాఁడన్= ఎవ్వరికీ భయపడనివాడిని; ఇప్డు= ఇప్పుడు; భయ+ఆర్తుఁడన్+ఐతిన్= భయంచేత దుఃఖాన్ని పొందినవాడ నైనాను; పంకరుహ, దళ+ఆయత+అక్షి= పద్మపత్రాలవంటి విశాలా లయిన కన్నులు కలదానా; భవత్+నిమిత్త; దుర్భరతర, పంచబాణ, హతిన్= నీ కారణంగా భరింప సాధ్యం కాని మన్మథుని యొక్క దెబ్బచే; పంచతన్= మరణాన్ని; పొందక; ఉండునట్లుగన్= ఉండే విధంగా; దయన్= దయతో; కావుము= కాపాడుము.

తాత్పర్యం: గొప్పబలగర్వపరాక్రమాలలో ఈ భూమిమీద నేనే గొప్పవాడిని. ఇంతవరకు ఎవ్వరికీ భయపడనివాడిని; కాని ఇప్పుడు భయంతో బాధితుడ నయ్యాను. ఓ పద్మాక్షీ! నీ కారణంగా భరింపరాని మన్మథునిదెబ్బతో మరణం పొందకుండ, దయతో నన్ను రక్షింపుము.

వ. 'నన్ను గాంధర్వవివాహంబున వరియింపు' మనిన సంవరణునకుఁ దపతి యి ట్లనియె. **80**

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను; గాంధర్వవివాహంబునన్= గాంధర్వ వివాహ పద్ధతిలో; వరియింపుము= కోరి పెండ్లాడు; అనినన్= అని అడుగగా; సంవరణునకున్= సంవరణునికి; తపతి=తపతి; ఇట్లు= ఈ విధంగా; అనియె= అన్నది.

తాత్పర్యం: 'నన్ను గాంధర్వవివాహపద్ధతిలో పెండ్లి చేసికొను' మని అడుగగా; సంవరుణునితో తపతి ఈ విధంగా పలికింది.

విశేషం: గాంధర్వ వివాహాలు: వధూవరులు పరస్పరం ప్రేమించుకొని పెద్దలతో అవసరం లేకుండా రహస్యంగా, అమంత్రకంగా చేసికొనే వివాహం. వివాహాలు ఎనిమిది విధాలు. (1) బ్రాహ్మం (2) దైవం (3) ఆర్షం (4) ప్రాజాపత్యం (5) రాక్షసం (6) ఆసురం (7) గాంధర్వం (8) పైశాచం (వివరాలకు చూడు. ఆది.4.55)

క. భువనైకదీపకుం డగు । సవితృనకుఁ దనూజ; మఱియు సావిత్రికి నే
నవరజ, నవినయవర్జిత; నవనీశ్వర! వినుము తపతి యను సురకన్యన్. 81

ప్రతిపదార్థం: అవని+ఈశ్వర= భూపతీ! సంవరణ మహారాజా!; వినుము; ఏన్= నేను; భువన+ఏక, దీపకుండు, అగు= లోకాన్ని అంతటిని వెలిగించేవా డైన; సవితృనకున్= సూర్యునికి; తనూజన్= కూతురిని; మఱియు; సావిత్రికిన్= సావిత్రికి; అవరజన్= తోబుట్టువును- చెల్లెలిని; అవినయ, వర్జితన్= అవినయంచేత విడువబడినదానిని - అనగా గర్వంలేనిదానిని; తపతి అను; సురకన్యన్= దేవకన్యను.

తాత్పర్యం: ఓ రాజా! విను. లోకాన్ని వెలిగించే సూర్యునికూతురిని. సావిత్రికి చెల్లెలిని. గర్వం లేనిదానిని. తపతి అనే పేరుగల దేవకన్యను.

వ. 'నాయందు నీకుం బ్రియంబు గలదేని మదీయ జనకు నడుగుము; న న్నిచ్చు; నింతులకు స్వాతంత్ర్యంబు లేమి నీ వెఱుంగుదువు గాదె! కావున ననవరతజపనియమప్రణిపాతంబుల నాదిత్యు నారాధింపు' మని చెప్పి తపతి యాదిత్యమండలంబున కరిగె; నంత సంవరణుండు మూర్ఛాగతుం డయి పడియున్న, నాతని యమాత్యుండు వచ్చి శీతలపరిషేచనంబు సేసిన మూర్ఛదేఱి యమ్మహీపతి మహాభక్తి నప్పర్వతంబున నుండి సూర్యు నారాధించుచు. 82

ప్రతిపదార్థం: నాయందున్= నాపై; నీకున్; ప్రియంబు= ప్రేమ; కలదు+ఏనిన్= ఉన్నచో; మదీయ, జనకున్= నాయొక్క తండ్రిని; అడుగుము; నన్నున్+ఇచ్చున్= నన్ను నీ కిచ్చి వివాహం చేస్తాడు; ఇంతులకున్; స్వాతంత్ర్యంబు, లేమి= స్వేచ్ఛలేకుండుట; నీవు; ఎఱుంగుదువుకాదె= తెలియుదువు కదా; కావునన్= కాబట్టి; అనవరత, జప, నియమ, ప్రణిపాతంబులన్= ఎడతెగని జపాలచేత, నియమాలచేత, నమస్కారాలచేత; ఆదిత్యునిన్= సూర్యుడిని; ఆరాధింపుము= సేవింపుము; అని, చెప్పి; తపతి; ఆదిత్య, మండలమునకున్= సూర్యమండలానికి; అరిగెన్= వెళ్ళింది; అంతన్= తరువాత; సంవరణుండు; మూర్ఛా, గతుండు+ అయి= మూర్ఛపోయినవాడై; పడియున్నన్, ఆతని= ఆ సంవరణునియొక్క; అమాత్యుండు= మంత్రి; వచ్చి; శీతల, పరిషేచనంబు, చేసినన్= చల్లని నీళ్ళు చల్లగా; మూర్ఛ, తేరి= మూర్ఛనుండి తేరుకొని; ఆ+మహీపతి= ఆ రాజు (సంవరణుడు); మహా భక్తిన్= మిక్కిలి భక్తితో; ఆ+పర్వతంబునన్= ఆ కొండమీద; ఉండి= నివసించి; సూర్యున్= సూర్యుణ్ణి; ఆరాధించుచున్=సేవిస్తూ.

తాత్పర్యం: 'నాపై నీకు ప్రేమ ఉంటే, మా తండ్రిని అడుగుము; న న్నిస్తాడు. స్త్రీలకు స్వాతంత్ర్యం లే దని నీకు తెలుసుకదా! కనుక నిరంతరజపాలతో, నియమాలతో, నమస్కారాలతో సూర్యుడిని ఆరాధించుము' అని పలికి తపతి సూర్యమండలానికి వెళ్ళిపోయింది. తరువాత సంవరణుడు మూర్ఛపడి ఉండగా, అతనిమంత్రి వచ్చి చల్లని నీటితో మూర్ఛతేర్చాడు. ఆ మహారాజు ఆ పర్వతంమీదనే ఉండి, మహాభక్తితో సూర్యుడిని ఆరాధించాడు.

వసిష్ఠుఁడు తపతినిఁ గొనితెచ్చి సంవరణునకు వివాహంబు సేయించుట (సం.1-162-12)

చ. ప్రతిహత రాగ కోపభయుఁ బంకరుహప్రభవప్రభావు దూ
రితదురితున్ మునీశ్వరవరిష్ఠు వసిష్ఠమహామునిం బురో
హితు నతిభక్తితోఁ దలఁచె; నిష్ట మెఱింగి వసిష్ఠుఁడున్ సమా
హితమతి నేఁగుదెంచి కనియెం బ్రభు సంవరణుం బ్రియంబునన్. 83

ప్రతిపదార్థం: ప్రతిహత, రాగ, కోప, భయున్= నిరోధింపబడిన రాగం, కోపం, భయం కలవాడూ; పంకరుహ, ప్రభవ, ప్రభావున్= పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవునివంటి మహిమ కలవాడూ; దూరిత దురితున్= దూరం చేయబడిన పాపం కలవాడూ - అనగా ఏ పాపమూ చేయనివాడూ; ముని+ఈశ్వర, వరిష్ఠున్= మునిశ్రేష్ఠులలో ఉత్తముడైనవాడూ; అయిన; వసిష్ఠ, మహామునిన్= వసిష్ఠ మహర్షిని; పురోహితున్= తన పురోహితునిగా; అతి, భక్తితోన్= మిక్కిలి భక్తితో; తలఁచెన్= స్మరించాడు; ఇష్టము+ఎఱింగి= అతని కోరికను తెలిసికొని; వసిష్ఠుఁడున్= వసిష్ఠుడుకూడా; సమాహిత, మతిన్= ప్రసన్నమైన మనస్సుతో; ఏఁగుదెంచి= వచ్చి; ప్రభున్; సంవరణున్= సంవరణుడిని; ప్రియంబునన్= ప్రేమతో; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: రాగం, కోపం,భయం లేనివాడు బ్రహ్మదేవునితో సమానమైన ప్రభావం గలవాడు, పాపరహితుడు, మునీశ్వరశ్రేష్ఠుడు, తమ పురోహితుడు అయిన వసిష్ఠమహామునిని సంవరణుడు మిక్కిలి భక్తితో స్మరించాడు. అతని కోరికను తెలిసికొని, ఆ మహాముని ప్రసన్నమైన మనసుతో వచ్చి, ఆ ప్రభువును ప్రేమతో దర్శించాడు.

వ. ఇట్లు దలంచిన పంద్రెం డగు దివసంబునకు వచ్చి వసిష్ఠుం డవిరతవ్రతోపవాసకృశీభూతశరీరుం డయి యున్న సంవరణుం జూచి యాతండు తపనసుత యయిన తపతియందు బద్ధానురాగుం డగుట తన యోగ దృష్టి నెఱింగి. 84

ప్రతిపదార్థం: ఇట్లు; తలంచిన= స్మరించిన; పంద్రెండు+అగు= పన్నెండవది అయిన; దివసంబునకున్= రోజునకు; వచ్చి; వసిష్ఠుండు; అవిరత, వ్రత+ఉపవాస, కృశీభూత, శరీరుండు+అయి= ఎడతెగని వ్రతోపవాసాలచేత బక్కచిక్కిన దేహం కలవాడై; ఉన్న, సంవరణున్= ఉండే సంవరుణ్ణి; చూచి; ఆతండు= ఆ సంవరణుడు; తపన, సుత, అయిన= సూర్యుని కూతురైన; తపతి అందున్ = తపతిపై; బద్ధ+అనురాగుండు+అగుటన్= కట్టివేయబడిన ప్రేమ కలవా డగుటను; తన, యోగదృష్టిన్= తన యోగదృష్టితో; ఎఱింగి= తెలిసికొని.

తాత్పర్యం: ఈ విధంగా సంవరణుడు తలచుకొన్న పన్నెండవ రోజున వసిష్ఠుడు వచ్చి, ఎడతెగని వ్రతోపవాసాలతో కృశించి ఉన్న అతడిని చూచి, అతడు సూర్యపుత్రిక అయిన తపతిపై గాఢమైన ప్రేమ కలిగి ఉన్నా డని తన యోగ దృష్టితో తెలిసికొని.

చ. జగదభివంద్యుఁ డాక్షణమ సమ్మతి సంవరణ ప్రయోజనం
బొగి నొనరింపఁగా నయుతయోజనముల్ చని లోకలోచనుం
డగు దిననాథు నాతతసహస్రకరుం గని సంస్తుతించె న
త్యగణితవేదమంత్రముల నమ్మునినాథుఁ డతిప్రియంబునన్. 85

ప్రతిపదార్థం: జగత్+అభివంద్యుఁడు= లోకంచేత నమస్కరింపదగినవాడు - వసిష్ఠుడు; ఆ, క్షణము+అ= అప్పటికప్పుడే; సమ్మతిన్= అంగీకారంతో; సంవరణ ప్రయోజనంబు= సంవరణునియొక్క పని; ఒగిన్= క్రమంగా; ఒనరింపఁగాన్= చేయటానికి; అయుత; యోజనముల్= పదివేల ఆమడలదూరం; చని= వెళ్ళి; లోక, లోచనుండు+అగు= లోకాలకు కన్నైనవాడగు; దిన, నాథున్= పగటికి ప్రభు వైనవాడిని; ఆతత, సహస్రకరున్= విస్తారమైన వేయికిరణాలు కలవాడిని; కని= చూచి; ఆ+మునినాథుఁడు= ఆ మునిశ్రేష్ఠుడైన, వసిష్ఠుడు; అతి+ప్రియంబునన్= మిక్కిలి ప్రీతితో; అతి+అగణిత, వేదమంత్రములన్= లెక్కలేనన్ని వేదమంత్రాలతో; సంస్తుతించెన్= స్తోత్రం చేశాడు.

తాత్పర్యం: జగత్పూజ్యుడైన వసిష్ఠమహాముని అప్పటి కప్పుడే సంవరణునికోర్కె తీర్చటానికి అంగీకరించి పదివేల ఆమడలు పయనించి, లోకాలకు కన్నైనవాడు, పగటికి ప్రభువు, విస్తారమైన వేయికిరణాలు కలవాడు అయిన సూర్యుడిని చూచి మిక్కిలి ప్రీతితో అనేకవేదమంత్రాలతో స్తోత్రం చేశాడు.

వ. సూర్యుండును వసిష్ఠమహాముని నతిగౌరవంబున సంభావించి 'భవదాగమన ప్రయోజనంబు సెప్పు' మనిన వసిష్ఠుం
డి ట్లనియె. **86**

ప్రతిపదార్థం: సూర్యుండును= సూర్యుడుకూడ; వసిష్ఠమహామునిన్= వసిష్ఠమహర్షిని; అతి, గౌరవంబునన్= మిక్కిలిగౌరవంతో; సంభావించి= పూజించి; భవత్+ఆగమన, ప్రయోజనంబు= మీరు వచ్చిన పని; చెప్పుము+అనినన్= చెప్పండి అనగా; వసిష్ఠుండు= వసిష్ఠుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: సూర్యుడుకూడ వసిష్ఠమహర్షిని మిక్కిలి మర్యాదతో పూజించి 'మీ రాకకు కారణ మేమి? చెప్పం' డని వసిష్ఠుణ్ణి అడిగాడు. అపుడు వసిష్ఠుడు ఈ విధంగా అన్నాడు.

సీ. 'అలఘుండు పౌరవకులశేఖరుండు సం । వరణుఁ డన్వాఁ డనవరత కీర్తి
విదితుండు ధర్మార్థవిదుఁడు నీ పుత్త్రికి । నగణిత గుణములఁ దగు వరుండు
గావున నతనికి దేవిగాఁ దపతి నీ । వలయుఁ; గూఁతులఁ గన్నఫలము దగిన
వరులకు సద్ధర్మచరితుల కీఁ గాన్న । కాదె!' నావుడు సూర్యుఁ డాదరించి

ఆ. 'వరుఁడు రాజవంశకరుఁడు సంవరణుండ । యనుగుణుండు దీని' కని కరంబు
గారవమున నిచ్చి యా ఋషితోడఁ బు । త్తెంచెఁ దపతిఁ గురుకులాంచితునకు. **87**

ప్రతిపదార్థం: అలఘుండు= తక్కువవాడు కానివాడు - అనగా గొప్పవాడు; పౌరవ, కులశేఖరుండు= పూరువుయొక్క వంశానికి శిరోభూషణమైనవాడు; సంవరణుండు; అన్+వాఁడు= అనేవాడు; అనవరత; కీర్తి, విదితుండు= ఎల్లప్పుడు కీర్తిచేత తెలియబడిన వాడు - అనగా కీర్తిచేత ప్రసిద్ధుడు; ధర్మ+అర్థ, విదుఁడు= ధర్మార్థాలను తెలిసినవాడు; నీ పుత్త్రికిన్= నీకుమార్తెకు; అగణిత, గుణములన్= లెక్కలేనన్ని సుగుణాలచేత; తగు, వరుండు= తగిన భర్త; కావునన్; తపతిన్; అతనికిన్, దేవికాన్= అతనికి భార్యగా; ఈవలయున్= ఇయ్యవలసింది; కూఁతులన్= కుమార్తెల్ని; కన్న= కనినందులకు; ఫలము= ఫలితము; తగిన, వరులకున్= యోగ్యులైనవరులకు; సత్+ధర్మ, చరితులకున్= చక్కని ధర్మంతో కూడిన నడవడి కలవారికి; ఈన్+కాన్న+అ కాదె= ఇవ్వగలగటమే కదా!; నావుడు= అని అనగా; సూర్యుఁడు; ఆదరించి; దీనికిన్= ఈ తపతికి; వరుఁడు= భర్త (కోరదగినవాడు); రాజవంశకరుఁడు= సంతానంవలన చంద్రవంశాన్ని నిలిపేవాడు; సంవరణుండు+అ= సంవరణుడే;

అనుగుణుండు= తగిన గుణాలు కలవాడు; అని= అని తలచి; కరంబు= మిక్కిలి; గౌరవమునన్= ప్రేమతో; తపతిన్; కురు, కుల+అంచితునకున్= కురుకులంచేత పూజింపబడేవానికి; ఇచ్చి; ఆ ఋషితోడన్= ఆ ఋషివెంట; పుత్తెంచెన్= పంపాడు.

తాత్పర్యం: 'గొప్పవాడు, పూరువుయొక్క వంశానికి శిరోభూషణమైనవాడు, ఎల్లప్పుడు కీర్తిచేత ప్రసిద్ధుడు, ధర్మార్థాలు తెలిసినవాడు అయిన సంవరణుడు అనేకసద్గుణాలచేత నీపుత్రికకు తగినవరుడు. కనుక అతనికి భార్యగా తపతిని ఇవ్వాలి. కుమార్తెలను కన్నందుకు ఫలం -ధర్మబద్ధమైన నడవడిగల తగినవరులకు ఇవ్వగలగటమే కదా!' అని పల్కగా, సూర్యుడు వసిష్ఠునిమాట ఆదరించి, 'చంద్రవంశాన్ని నిలిపేవాడైన సంవరణుడే ఈమెకు తగిన వరు డని - మిక్కిలిప్రీతితో, కురుకులంచేత పూజింపబడే అతనికి తపతి నిచ్చి ఆ ఋషివెంట సాగనంపాడు.

వ. ఇ ట్లొక్కనిమిషంబున మున్నూటయఱువదినాలుగు యోజనంబులు పఱచు నాదిత్యురథంబుతో నశ్రమంబున నరిగి, తపనదత్త యయిన తపతిం దోడ్కొని వచ్చి, వసిష్ఠుండు విధివంతంబుగా సంవరణునకుం దపతి వివాహంబు సేయించెఁ; గావున మహాత్ము లయిన పురోహితులం బడసిన రాజుల కభీష్టంబు లయిన శుభంబు లగుట నిశ్చయం; బిట్లు సంవరణుండు దపతి వివాహంబయి. 88

ప్రతిపదార్థం: ఇట్లు+ఒక్క, నిమిషంబునన్; మున్నూట అరువది నాలుగు యోజనంబులు; పఱచు= పరుగెత్తు; ఆదిత్యు రథంబుతోన్= సూర్యునియొక్క రథంతో; అ(శ్రమంబునన్= శ్రమలేకుండా; అరిగి= వెళ్ళి; తపన, దత్త, అయిన= సూర్యునిచే ఇవ్వబడినదైన; తపతిన్; తోడ్కొనివచ్చి= తీసికొనివచ్చి; వసిష్ఠుండు; విధివంతంబుగాన్= శాస్త్రపద్ధతిగా; సంవరణునకున్, తపతిన్, వివాహంబు; చేయించెన్, కావునన్; మహత్+ఆత్ములు+ఐన= మహనీయులైన; పురోహితులన్; పడసిన= పొందిన; రాజులకున్; అభీష్టంబులు+అయిన= కోరబడినవైన; శుభంబులు+అగుట; నిశ్చయంబు; ఇట్లు; సంవరణుండు; తపతిన్; వివాహంబు+అయి= పెండ్లి చేసికొని.

తాత్పర్యం: ఈ విధంగా, నిముషానికి మూడువందల అరవైనాలుగు ఆమడలు పరుగెత్తే సూర్యుని రథంతోపాటు శ్రమలేకుండ వెళ్ళి, అత డిచ్చిన తపతిని తనవెంట తీసికొనివచ్చి, వసిష్ఠుడు శాస్త్రోక్తంగా తపతీసంవరణులకు వివాహం జరిపించాడు. అందుచేత మహాత్ములైన పురోహితులను పొందినరాజులకు కోరుకొన్న శుభాలు కలగటం నిశ్చయం. ఈ విధంగా సంవరణుడు తపతిని వివాహం చేసికొని.

క. ఆ తరుణియందుఁ జేతో । జాత సుఖప్రీతిఁ దగిలి శైలాటవులన్
వీతనృపకార్యధర్మ । వ్రాతుం డయి పదియురెండువర్షము లుండెన్. 89

ప్రతిపదార్థం: ఆ, తరుణియందున్= ఆ కాంతయందు; చేతోజాత; సుఖప్రీతిన్= మన్మథ సుఖప్రీతితో; తగిలి= తగులుకొని, ఆసక్తి కలిగి; వీత, నృపకార్య ధర్మవ్రాతుండు+అయి= వదలిన రాచకార్య ధర్మసమూహం కలవాడై; శైల+అటవులన్= కొండలందు, అడవులందు; పదియు, రెండు, వర్షములు= పండ్రెండేండ్లు; ఉండెన్.

తాత్పర్యం: మన్మథసుఖప్రీతితో ఆ తపతితోనే కాపురం చేస్తూ, రాచకార్యాలను, ధర్మాలను వదలి పన్నెండేళ్లు కొండలలో, అడవులలో ఉండిపోయాడు.

వ. 'దానం జేసి మహీతలంబున కనావృష్టి యయిన నెఱింగి వసిష్ఠుండు శాంతికపౌష్టికవిధు లొనరించి, సంవరణుం దోడ్కొని హస్తినాపురంబున కరిగిన నఖిలప్రజకు ననురాగం బయ్యె; ననావృష్టి దోషంబునుం బాసె; నంత సంవరణునకుఁ దపతికిం దాపత్యుండై వంశకరుండు కురుండు పుట్టె, నది మొదలుగా మీరును దాపత్యుల రయితి' రని గంధర్వుండు చెప్పిన నర్జునుండు వెండియు ని ట్లనియె. 90

ప్రతిపదార్థం: దానన్+చేసి= అందువలన; మహీ, తలంబునకున్= భూమండలానికి; అనావృష్టి, అయినన్= వానలేమి ఏర్పడగా; ఎఱింగి= తెలిసికొని; వసిష్ఠుండు; శాంతి, పౌష్టిక, విధులు= శాంతికములు, పౌష్టికములు అయిన వేదకర్మలను; ఒనరించి= చేసి; సంవరణున్= సంవరణుని; తోడ్కొని= తీసికొని; హస్తినాపురంబునకున్= హస్తినాపురానికి; అరిగినన్= వెళ్ళగా; అఖిల= సమస్త; ప్రజకున్= జనులకు; అనురాగంబు+అయ్యెన్= ప్రీతికలిగింది; అనావృష్టి, దోషంబునున్= వానలేమి లోపంకూడ; పాసెన్= తొలగింది; అంతన్= అటు; సంవరణునకున్, తపతికిన్; తాపత్యుండు+ఐ= తపతి కుమారు డై; వంశకరుండు= సంతానం వలన వంశాన్ని నిలిపేవాడేకాక వంశానికి పేరు తెచ్చేవాడు; కురుండు= కురువు; పుట్టెన్; అది, మొదలుగాన్= ఆనాటి నుండి; మీరును; తాపత్యులరు= తపతి సంతానమైనవారు; అయితిరి; అని, = ఆ విధంగా; గంధర్వుండు; చెప్పినన్= చెప్పగా; అర్జునుండు; వెండియున్, మరలా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'దానివలన భూమండలంలో అనావృష్టి ఏర్పడగా, అది తెలిసికొని వసిష్ఠుడు శాంతిక, పౌష్టిక, వైదిక క్రియలు చేసి, సంవరణుడిని తనవెంట పిలిచికొని హస్తినాపురానికి వెళ్ళాడు. ప్రజలంతా ఆనందించారు. అనావృష్టి తొలగింది. తరువాత సంవరణుడిని తనవెంట పిలిచికొని హస్తినాపురానికి వెళ్ళాడు. ప్రజ లంతా ఆనందించారు. అనావృష్టి తొలగింది. తరువాత సంవరణునికి, తపతికి వంశకర్త అయిన కురుడు పుట్టాడు. అప్పటినుండి మీరు కూడా తాపత్యు లయ్యారు, అని గంధర్వుడు చెప్పగా, అర్జునుడు మరల ఇట్లా అన్నాడు.

విశేషం: 'హిమకరుఁదొట్టి పూరుభరతేశకురుప్రభుపాండుభూపతుల్ । క్రమమున వంశకర్త లనఁగా మహినొప్పిన' (1.14) చంద్ర వంశంలోని వంశకర్తల చరిత్రలు పాండవుల చరిత్రకంటె ముందు చెప్పటం మహాభారతంలో కాలక్రమంలో చెప్పే కథాకథనశిల్పం. భరతుని తరువాత కురుమహారాజు జననం చెప్పి ఉండవలసింది. కాని, అంగారపర్ణునికథలో పాండవులు - కౌరవు లనేకాదు, తాపత్యులు అనికూడా వాళ్ళు పిలువబడతా రనే అంశం చెప్పవలసివచ్చినప్పుడు కురుజన్మవృత్తాంతం చెప్పటం జరిగింది. ఇది కార్యకారణసంబద్ధమైన కథాకథనపద్ధతి. చంద్రవంశంలోని రాజులను వంశకర్తలపేర్లతో (అంటే వారి సంతాన మని) పిలిచే పద్ధతి ఉన్నది. అంటే - పాండవులనుకూడా పౌరవు లనీ, భారతు లనీ, కౌరవు లనీ పిలుస్తారు. ఇంతేకాక - వంశకర్తల భార్యల పేర్లతో (వారిసంతాన మని) పిలిచే సంప్రదాయంకూడా ఉన్నది. అటువంటి విశిష్ట గౌరవం ఇద్దరు ముగ్గురికిమాత్రమే దక్కింది. అందులో ముఖ్యులు, తపతి, కుంతి, సత్యవతి. పాండవులను 'తాపత్యు'లని అంగారపర్ణుడు కావా లనే పేర్కొన్నాడు. తీగలాగితే డొంకంతా కదలినట్లు 'మేము తాపత్యుల మె ట్లయ్యాం?' అన్న ప్రశ్నతో తపతీసంవరణోపాఖ్యానం అంతా చెప్పాడు అయితే ఈ కథ వంశకథమాత్రమే కాదు; మరేవంశకర్తజీవితంలోనూ కనపడని పురోహిత మాహాత్మ్యాన్ని చెప్పేకథ. సంవరణమహారాజువలె పాండవులుకూడా పురోహితపురస్సరులై ఉండా లని అంగారపర్ణునిహితబోధ. పురోహితునివలన హితం కలిగిన వంశకర్తకథ విన్న తరువాత, ఆ పురోహితుడైన వసిష్ఠునిమహత్త్వాన్నిగురించి అర్జునుడు తెలిసికొనగోరటం సహజం. ఒక కథలోనుండి మరొక కథ సహజంగా ఉద్భవించే కథాకథన శిల్పం ఇది. నన్నయగారి ప్రసన్నకథాకవితార్థయుక్తికి అత్యంత సహజంగా ఆవిష్కరించిన కథార్థాలు ఈ ఘట్టంలోనే ఉన్నాయి.

క. నుతముగ నస్మత్కుల భూ । పతులకు నాద్యులకుఁ బుణ్యభాగులకుఁ బురో
హితుఁ డయిన వసిష్ఠ మహా। త్మతఁ జెప్పుము వినఁగ వలతు మది నేర్పడఁగన్. 91

ప్రతిపదార్థం: నుతముగన్= కొనియాడదగినట్లుగా; అస్మత్+కుల, భూపతులకున్= నా (మా) యొక్క వంశమందలి రాజులకు; ఆద్యులకున్= మొదటివారలకు; పుణ్యభాగులకున్= పుణ్యదంపతులకు; పురోహితుఁడు+అయిన= పురోహితుడు అయిన; వసిష్ఠ= వసిష్ఠునియొక్క; మహా+ఆత్మతన్= మహిమను; మదిన్= మనస్సునందు; ఏర్పడఁగన్= చెప్పుము; వినఁగన్+వలతున్= వినటానికి, కోరుకొంటాను.

తాత్పర్యం: మా వంశంలో మొదటివారు, పుణ్యాత్ములు అయిన ప్రభువులకు పురోహితుడుగా ప్రశంస లందుకొన్న వసిష్ఠులవారిమహిమను మనసుకు వచ్చే విధంగా స్పష్టంగా వినా లని ఉన్నది; తెలియజేయండి.

వ. అనిన గంధర్వుం డి ట్లనియె. 92

ప్రతిపదార్థం: అనినన్= అని అడుగగా; గంధర్వుండు= అంగారపర్ణు డనే గంధర్వరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని అనగా గంధర్వుడైన అంగారపర్ణుడు ఈ విధంగా అన్నాడు.

క. ధృతి నెవ్వని నేని పురో । హితుగాఁ బుణ్యమునఁ బడసి యిక్ష్వాకుకులో
దితు లైన పతులు రాజ్యో - న్నతి నొప్పం జేసి రుర్వి నానాక్రతువుల్. 93

ప్రతిపదార్థం: ఇక్ష్వాకు, కుల+ఉదితులు+అయిన= ఇక్ష్వాకువంశంలో జన్మించిన; పతులు= రాజులు; ధృతిన్= సంతోషంతో; ఎవ్వనిన్+ఏని= ఎవరినైతే; పురోహితుఁగాన్= పురోహితునిగా; పుణ్యమునన్= పుణ్యంచేత; పడసి= పొంది; ఉర్విన్= భూమిమీద; రాజ్య+ఉన్నతిన్= రాజ్యముయొక్క గొప్పతనం; ఒప్పన్= ప్రకాశింపగా; నానా, క్రతువుల్= అనేకవిధా లైన యజ్ఞాలు; చేసిరి.

తాత్పర్యం: ఇక్ష్వాకువంశరాజులు పుణ్యవశంచేత ఎవరిని పురోహితునిగా పొంది, రాజ్యగౌరవం ప్రకాశించగా, భూమిమీద పెక్కువిధా లైన యజ్ఞాలు చేశారో.

క. బలమఱి కామక్రోధం । బులు రెండు జయింపఁబడి తపోవీర్య బలం
బులఁ జేసి చేయునవి ని । చ్చలు నెవ్వనియేని పాద సంవాహంబుల్. 94

ప్రతిపదార్థం: నిచ్చలున్= ఎల్లప్పుడు; ఎవ్వని+ఏని= ఎవరియొక్క; పాద, సంవాహంబుల్= పాదాలు ఒత్తుటలు; బలము+అఱి= బలం నశించి; కామ, క్రోధంబులు= కామము, క్రోధము; రెండు= రెండూ; జయింపన్+పడి= జయింపబడి; తపోవీర్య బలంబులన్+చేసి= తపముయొక్క ప్రభవాతిశయంవలన; చేయునవి.

తాత్పర్యం: ఎల్లప్పుడు ఎవరి పాద సంవాహనం చేస్తే కామక్రోధాలు రెండూ బలహీనాలై జయింపబడి, తపస్సు యొక్క ప్రభావాతిశయాలచేత చేసే పను లౌతాయో.

విశేషం: తపశ్శక్తియొక్క బలంచేత, కామక్రోధాలు బలహీనమై జయింపబడి నిత్యం ఎవ్వరి పాదసంవాహాలను చేస్తాయో - అంటే ఎవరికి అధీనాలు అవుతాయో అనికూడా చెప్పవచ్చును.

సీ. 'శమహీనుఁ డైన విశ్వామిత్రు చేసిన । యపకారమునఁ జేసి యాత్మసుతులు
యమసదనంబున కరిగిన, వారలఁ । దనతపోవీర్యసత్త్వముల పేర్మిఁ
గ్రమ్మఱింపఁగ శక్తి కలిగియు, వేల న । య్యంబుధి గడవనియట్ల శాంతుఁ
డయి యెవ్వఁడేని కృతాంతకుఁ గడవంగ । నొల్లండ, యట్టి యత్యుగ్రతేజుఁ

ఆ. డగు వసిష్ఠముని మహాత్మతఁ జెప్ప నా । యలవియయ్య'! యనిన నవ్వసిష్ఠ
గాధిసుతుల కేమికారణంబున నిట్టి । వైర మయ్యె నెఱుఁగ వలతు దీని. 95

ప్రతిపదార్థం: శమ, హీనుఁడు+ఐన= శాంతం లేనివాడైన; విశ్వామిత్రు, చేసిన= విశ్వామిత్రుడు చేసిన; అపకారమునన్+చేసి= అపకారంవలన; ఆత్మసుతులు = తన కుమారులు; యమ, సదనంబునకున్=యముని ఇంటికి; అరిగినన్= వెళ్ళగా; వారలన్= వాళ్ళను; తన, తపోవీర్య, సత్త్వముల, పేర్మిన్= తనతపస్సుయొక్క ప్రభావబలాల అతిశయంతో; క్రమ్మఱింపఁగన్= మరలించటానికి; శక్తి కలిగియున్= బలము ఉండియు; వేలన్= చెలియలికట్టను; ఆ+అంబుధి= ఆ సముద్రం; కడవని, అట్లు+అ= దాటనివిధంగానే; శాంతుఁడు+అయి= శాంతం కలవాడై; ఎవ్వఁడు+ఏని= ఎవరైనా; కృత+అంతకున్= యమధర్మరాజును; కడవంగన్= దాటివెళ్ళడానికి; ఒల్లండు+అ= ఇష్టపడడో; అట్టి; అతి+ఉగ్ర, తేజుఁడు= అటువంటి మిక్కిలి భయంకరమైన తేజస్సు కలవాడు; అగు, వసిష్ఠముని; మహత్+ఆత్మతన్=మహానుభావతను; చెప్పన్= చెప్పటానికి; నా, అలవి, అయ్య!= నాకు సాధ్య మౌతుందటయ్యా!; అనినన్= అని అనగా; ఆ+వసిష్ఠ, గాధిసుతులకున్= ఆ వసిష్ఠవిశ్వామిత్రులకు; ఏమి, కారణంబునన్= ఎందువల్ల; ఇట్టి, వైరము+అయ్యెన్= శత్రుత్వం కలిగిందో; దీనిన్= దీనిని; ఎఱుఁగన్ వలతున్= తెలిసికొనగోరుతున్నాను.

తాత్పర్యం: 'శాంతస్వభావం లేని విశ్వామిత్రుడు చేసిన అపకారంవలన, తనకుమారులు యమలోకానికి వెళ్లగా, వాళ్ళను తనతపఃప్రభావంతో మరలించటానికి సమర్థు డై ఉండికూడ, చెలియలికట్టను సముద్రం దాటనట్లే, శాంతుడై, యమధర్మరాజును అతిక్రమించటానికి ఎవరు ఇష్టపడలేదో - అట్లాంటి మహాభయంకరమైన తేజస్సు కల వసిష్ఠమహాముని మహిమను చెప్పటం నా తరమా? అని గంధర్వుడు పల్కగా 'ఆ వసిష్ఠ విశ్వామిత్రులకు ఏ కారణంచేత ఇటువంటివైరం ఏర్పడిందో వినగోరుతున్నాను'.

విశేషం: అలం: ఉపమ.

అంగారపర్ణుఁడు అర్జునునకు వసిష్ఠమహిమ చెప్పుట (సం.1-165-2)

వ. చెప్ప మని యర్జును౦ డడిగిన గంధర్వుం డి ట్లని చెప్పెఁ; దొల్లి కన్యాకుబ్జంబున గాధిపుత్త్రుండు విశ్వామిత్రుం డనురాజు నిరమిత్రంబుగా ధాత్రి నేలుచు, నొక్కనాఁడు మృగయార్థం బరిగి, యపారబలసమేతుం డయి ఘోరారణ్యంబున గ్రుమ్మరి, వడంబడి కడు డస్సి వసిష్ఠునాశ్రమం బాశ్రయించిన, నమ్మునివరుండు విశ్వామిత్రు నతిప్రీతిం బూజించి, వానికిని వానిసేనకు నభిమతంబు లైన యాహారంబులు గురియ నందిని యను తన హోమధేనువుం బంచిన నదియు. 96

ప్రతిపదార్థం: చెప్పుము+అని; అర్జునుండు; అడిగినన్; గంధర్వుండు= అంగారపర్ణుడు; ఇట్లు+అని; చెప్పెన్; తొల్లి= పూర్వం; కన్యాకుబ్జంబునన్= కన్యాకుబ్జంలో; గాధిపుత్త్రుండు= గాధియొక్క కుమారుడు; విశ్వామిత్రుండు+అను; రాజు; నిర్+అమిత్రంబుగాన్= శత్రువులు లేకుండ; ధాత్రిన్= భూమిని; ఏలుచున్= పాలిస్తూ; ఒక్కనాఁడు; మృగయా+అర్థంబు= వేటకొరకు; అరిగి= వెళ్ళి; అపార, బల, సమేతుండు+అయి= అంతులేని సైన్యంతో కూడినవాడై; ఘోర+అరణ్యంబునన్= భయంకరమైన అడవియందు; క్రుమ్మరి= తిరిగి; వడన్+పడి= తాపం పొంది; కడున్, డస్సి= మిక్కిలి అలసి; వసిష్ఠ+ఆశ్రమంబు= వసిష్ఠునియొక్క ఆశ్రమాన్ని; ఆశ్రయించినన్= (విశ్రాంతికొరకు) చేరగా; ఆ+ముని, వరుండు= ఆ మునిశ్రేష్ఠుడు; విశ్వామిత్రున్= విశ్వామిత్రుని; అతి, ప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; పూజించి; వానికిని = అతనికి; వాని, సేనకున్= అతని సైన్యానికి; అభిమతంబులు+ఐన= ఇష్టములైన; ఆహారంబులు= భోజనాలు; కురియన్= వర్షించుటకై; నందిని; అను, హోమ, ధేనువున్; పంచినన్= ఆజ్ఞాపించగా; అదియున్= ఆ ధేనువు.

తాత్పర్యం: చెప్పవలసిం దని అర్జునుడు అడుగగా, గంధర్వుడు ఈ విధంగా చెప్పాడు. పూర్వం కన్యాకుబ్జంలో గాధికుమారుడు, విశ్వామిత్రుడు అనే రాజు, శత్రువులు లేకుండా భూమిని పరిపాలించాడు. అతడు ఒకనాడు వేట కొరకు అపారమైన సైన్యంతో వెళ్ళి, భయంకరమైన అరణ్యంలో తిరిగి, తాపం పొంది, మిక్కిలి అలసి, విశ్రాంతికొరకు వసిష్ఠుని ఆశ్రమం చేరాడు. ఆ మునిశ్రేష్ఠుడు విశ్వామిత్రుడిని మిక్కిలిప్రేమతో పూజించి, అతనికీ, అతనిసేనకూఇష్ట మైన ఆహారపదార్థాలు సమృద్ధిగా అందజేయటానికి 'నందిని' అనే తన హోమధేనువును ఆజ్ఞాపించాడు. అప్పు డది.

క. ఘృతనదులును, నోదన ప । ర్వతములు, దధి కుల్యములు, నవారిత రసపూ
రిత బహువిధోపదంశో । న్నత పుంజంబులును దత్క్షణంబునఁ గురిసెన్. 97

ప్రతిపదార్థం: ఘృత, నదులునున్= నేతి నదులూ; ఓదన పర్వతములు= అన్నపు కొండలూ; దధి కుల్యములున్= పెరుగు కాలువలూ; అవారిత, రసపూరిత, బహువిధ, ఉపదంశ+ఉన్నత, పుంజములును= ఆపుటకు సాధ్యం కాని రసంతో నిండిన అనేకవిధాలైన ఊరుగాయలయొక్క గొప్పరాసులూ; తద్+క్షణంబునన్= ఆ క్షణంలోనే; కురిసెన్= కురిపించింది.

తాత్పర్యం: నేతినదులను, అన్నపు కొండలను, పెరుగుకాల్వలను, ఎడతెరపి లేని రసంతో నిండిన అనేక విధాలైన గొప్ప ఊరుగాయల రాసులను అప్పటి కప్పుడే వర్షించింది.

వ. ఇట్లు చతుర్విధాహారంబుల నందఱం దృప్తులం జేసి యున్న యా నందినిం జూచి విశ్వామిత్రుండు విస్మితుం డయి యాత్మగతంబున. 98

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; చతుర్విధ+ఆహారంబులన్= నాలుగురకాలైన ఆహారపదార్థాలతో; అందఱన్= అందరినీ; తృప్తులన్+చేసి= సంతృప్తి కలిగించి; ఉన్న+ఆ; నందినిన్= ఆ నందినీ ధేనువును; చూచి; విశ్వామిత్రుండు; విస్మితుండు+అయి= ఆశ్చర్యపడినవాడై; ఆత్మ, గతంబునన్= తన మనస్సులో.

తాత్పర్యం: ఈ విధంగా భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్య లనే నాలుగువిధాలైన ఆహారపదార్థాలతో అందరినీ తృప్తిపరచి ఉన్న ఆ నందినీధేనువును చూచి, విశ్వామిత్రుడు ఆశ్చర్యపడి, తన మనస్సులో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మధ్యాక్కర.

మృదురోమములును, శంకునిభకర్ణముల్, మెత్తని వలుఁద
పాదుగును, నిడుదచన్నులును గుఱుచలై పొలుచు కొమ్ములును,
సదమలశరదిందుశంఖనిభ మైన చాయయుఁ గలుగు
మొద విది నిధి చేరినట్లు చేరె నిమ్మునికిఁ బుణ్యమున. 99

ప్రతిపదార్థం: మృదురోమములును= మృదువైన వెంట్రుకలూ; శంకు, నిభ, కర్ణముల్= బాణాగ్రాలతో సమానమైన చెవులూ; మెత్తని, వలుద, పాదుగును= మెత్తని పెద్దదియైన పాదుగును; నిడుద, చన్నులును= పొడవైన చన్నులూ; కుఱుచలు+ఐ= పొట్టివై; పొలుచు= ఒప్పు; కొమ్ములును= కొమ్ములూ; సత్+అమల, శరద్+ఇందు, శంఖ, నిభము+ఐన= నిర్మలమైన శరత్కాల చంద్రునితో, శంఖంతో సమానమైన; చాయయున్= రంగును; కలుగు=కలిగిన; మొదవు= పాడి ఆవు; ఇది; నిధి= ధనపు పాతర; చేరినట్లు= చేరిన విధంగా; పుణ్యమునన్= పుణ్యంచేత; ఈ+మునికిన్= ఈ వసిష్ఠమహామునికి; చేరెన్.

తాత్పర్యం: మెత్తని వెంట్రుకలు, బాణాగ్రాలవంటి చెవులు, మెత్తని పెద్దపొదుగు, పొడవైన చన్నులు, ఒప్పిదమయిన పొట్టి కొమ్ములు; నిర్మలమైన శరత్కాల చంద్రునితో; శంఖంతో సమానమైన రంగు కల ఈ పాడిఆవు పెన్నిధి చేరినట్లు పుణ్యంవలన ఈ వసిష్ఠమహామునిని చేరింది.

విశేషం: అలం: ఉపమ. చంద్రునిలో మచ్చ ఉంటుంది. హోమధేనువు నందిని రంగు ఏ మాత్రం మచ్చలేని తెలుపు - అని తెలపటానికి సదమలశరదిందుశంఖనిభమైన చాయ అనటం జరిగింది. నన్నయ ఈ ఆశ్వాసంలో అయిదు మధ్యాక్కరలను వాడాడు. అందులో ఇది మొదటిది. ఆదిపర్వంలో ఎక్కువ సంఖ్యలో మధ్యాక్కరలు వాడిన ఆశ్వాసం ఇదే. (సంపా.)

వ. అని పెద్దయుం బ్రొద్దు చింతించి తత్పరిగ్రహకుతూహలహృదయుం డయి విశ్వామిత్రుండు
వసిష్ఠున కి ట్లనియె. 100

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; చింతించి= ఆలోచించి; తద్+పరిగ్రహ, కుతూహల, హృదయుండు+అయి= దానిని తీసికొనటంలో ఉబలాటపడే హృదయం కలవాడై; విశ్వామిత్రుండు; వసిష్ఠునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చాలాసేపు ఆలోచించి ఆ ఆవును తీసికొనాలనే ఉబలాటపడే హృదయంతో విశ్వామిత్రుడు వసిష్ఠునితో ఈ విధంగా అన్నాడు.

తే. దీనికంటెను నొప్పెడి వాని నొక్క । లక్ష మొదవుల నిచ్చెద నక్షయముగ
రాజ్యమయిన నిచ్చెద జగత్పూజ్య! నాకు । నిమ్ము నీ హోమధేనువు నెమ్మితోడ. 101

ప్రతిపదార్థం: జగత్+పూజ్య!= లోకంచేత పూజింపదగినవాడా!; దీని కంటెను; ఒప్పెడి, వానిన్= బాగున్నవాటిని; ఒక్క, లక్ష, మొదవులన్= పాడి ఆవులను; అక్షయముగన్= తరుగకుండ; ఇచ్చెదన్; రాజ్యము+అయినన్; ఇచ్చెదన్; నాకున్; నీ, హోమధేనువు; నెమ్మితోడన్= ప్రీతితో; ఇమ్ము= నీ యొక్క హోమధేనువును ఇష్టంతో ఈయవలసింది.

తాత్పర్యం: ప్రపంచంచేత పూజలు పొందదగిన ఓ వసిష్ఠమహర్షీ! దీనికంటె బాగున్న ఒక లక్షపాడిఆవులను తరుగులేకుండా నీ కిస్తాను. రాజ్యమైనా ఇస్తాను. ప్రీతితో నీ హోమధేనువును నా కిమ్ము.

చ. అనిన వసిష్ఠుఁ డి ట్లనియె; 'నంత ధనంబును నట్టి రాజ్యముం
గొననగు నయ్య యిచ్చిడిపికుట్టికి? నీ కిది యేల? యేను దీ
నన పితృదేవతాతిథిజనంబులఁ దృప్తులఁ జేయుచుండుదున్;
జనసుత! దీనిఁ బ్రోచుటయ చాలుఁ దపస్వుల కేల సంపదల్?' **102**

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; వసిష్ఠుఁడు; ఇట్లు+అనియెన్; ఈ+చిడిపి, కుట్టికిన్= ఈ చిన్న ఆవునకు; అంత, ధనంబునున్= అంత అధికధనాన్ని; అట్టి; రాజ్యమున్; కొనన్+అగునయ్య= తీసికొనవచ్చునా; నీకున్; ఇది; ఏల?= ఇది ఎందుకు; ఏను; దీనన్+అ= నేను ఈ ఆవుచేతనే; పితృదేవతా+అతిథి, జనంబులన్= పితృదేవతలను, అతిథులను; తృప్తులను= తృప్తి పొందినవారిగా; చేయుచున్+ఉండుదున్= చేస్తూ ఉంటాను; జన, నుత!= జనులచే పొగడబడువాడా!; దీనిన్= ఈ ధేనువును; ప్రోచుటయు+అ= కాపాడుటయే; చాలున్= రక్షించుకొంటేనే చాలు; తపస్వులకున్= ఋషులకు; సంపదల్; ఏల?

తాత్పర్యం: పై విధంగా విశ్వామిత్రుడు పలుకగా, వసిష్ఠుడు ఇట్లా అన్నాడు - 'ఈ చిన్ని ఆవుకై అంత ఎక్కువ ధనాన్ని, అంత గొప్పరాజ్యాన్ని తీసికొనవచ్చునా? ఇది నీకు ఎందుకు? నేను దీనిచేత పితృదేవతలను, అతిథి జనులను తృప్తిపరుస్తూ ఉంటాను. ప్రజలచేత పొగడబడే ఓ విశ్వామిత్రా! ఈ ఆవును ఒక్కదానిని కాపాడుకొంటే చాలు; ఋషులకు సంపద లెందుకు?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. 'దీని నొరున కీఁ గా' దనిన నలిగి విశ్వామిత్రుండు 'నేను క్షత్రియుండ నిగ్రహానుగ్రహసమర్థుండ, నీవు బ్రాహ్మణుండవు శాంతుండ; వేమి సేయ నోపుదు? దీనికి లక్షమొదవుల నీఁబోయిన నొల్లవ యిమ్మొదవు నవశ్యంబును బలిమి నైనం బరిగ్రహింతు' నని నందినిం బట్టికొనఁ బంచినం బలుకక వసిష్ఠుండు చూచుచుండె. **103**

ప్రతిపదార్థం: దీనిని= ఈ ఆవును; ఒరునకున్= ఇతరునికి; ఈన్+కాదు= ఇచ్చుటకు వీలేకాదు; అనినన్=అని చెప్పగా; అలిగి= కోపించి; విశ్వామిత్రుండు; నేను; క్షత్రియుండన్; నిగ్రహ+అనుగ్రహ, సమర్థుండన్= శిక్షించుటకు, దయచూపుటకు శక్తి కలవాడను; నీవు; బ్రాహ్మణుండవు; శాంతుండవు= శాంత గుణం కలవాడవు; ఏమి; చేయన్+ఓపుదు= ఏమి, చేయగలవు; దీనికిన్= ఈ ఆవుకు; లక్ష మొదవులన్= ఒక లక్ష పాడి ఆవులను; ఈన్+పోయినన్= ఇవ్వబోగా; ఒల్లవు+అ= ఇష్టపడ వైతివి; ఈ+మొదవున్= ఈ పాడిఆవును, ఈ నందినీ ధేనువును; అవశ్యంబును= తప్పక; బలిమిన్+ఐనన్= బలవంతంగా నైనాసరే; పరిగ్రహింతున్= తీసికొని పోతాను; అని= అని అంటూ; నందినిన్= నందినిని; పట్టికొనన్= పట్టుకొనటానికి; పంచినన్= ఆజ్ఞాపించగా; పలుకక= మారుమాటాడకుండా; వసిష్ఠుండు; చూచుచున్+ఉండెన్= చూస్తూ ఉండిపోయాడు.

తాత్పర్యం: 'దీనిని మరొకరికి ఇవ్వటానికి వీలు కాదు' అనగా విశ్వామిత్రుడు కోపించి, 'నేను క్షత్రియుడను. శిక్షించటానికి; దయచూపటానికి సమర్థుడను. నీవు బ్రాహ్మణుడవు. శాంతుడవు. ఏమి చేయగలవు? దీనికి బదులుగా

లక్షపాడిఆవులను ఇవ్వబోతే వద్దన్నావు. ఈ ఆవును బలాత్కారంగా నైనా తప్పక గ్రహిస్తాను' అని నందినిని పట్టుకొనేందుకు ఆజ్ఞాపించగా, వసిష్ఠుడు మారు మాటాడక చూస్తూ ఉండిపోయాడు.

ఆ. పరులవలన బాధ పొరయకుండఁగ సాధు । జనుల ధనము గాచు జనవిభుండు
కరుణ తప్పి తాన హరియించువాఁ డగు । నేని సాధులోక మేమి సేయు?. 104

ప్రతిపదార్థం: పరులవలనన్= ఇతరులవలన; బాధ; పొరయక+ఉండఁగన్= కలుగకుండ; సాధుజనుల, ధనము= మంచివారి ధనాన్ని; కాచు= కాపాడు; జనవిభుండు= రాజు; కరుణ, తప్పి= దయలేక; తాను+అ= తానే; హరియించువాఁడు అగున్+ఏని= అపహరించే వాడైతే; సాధు, లోకము= సాధువుల సమూహం; ఏమి, చేయున్= ఏమి చేయగలుగుతుంది.

తాత్పర్యం: ఇతరులవలన బాధ కలుగకుండ, సాధుజనుల ధనాన్ని కాపాడవలసిన ప్రభువే దయ తప్పి, తాను అపహరించేవా డైతే; సాధు జనులసమూహం ఏం చేయగలదు?

వ. ఇట్లు విశ్వామిత్రుండు వసిష్ఠ హోమధేనువుం బట్టికొనఁ బంచిన పట్టీక జనులవలని కశాదండతాడనంబులం బీడింపం బడి యఱచుచు వసిష్ఠునొద్దకు వచ్చి యి ట్లనియె. 105

ప్రతిపదార్థం: ఇట్లు, విశ్వామిత్రుండు; వసిష్ఠ, హోమధేనువున్= వసిష్ఠుని హోమధేనువును; పట్టికొనన్= పట్టుకొనుటకు; పంచినన్= పంపగా; అది= ఆ ధేనువు; పట్టు+ఈక= పట్టుపడక; జనులవలని= సైనికులవలన; కశా, దండ, తాడనంబులన్= కొరడాల యొక్క, కఱ్ఱలయొక్క దెబ్బలతో; పీడింపన్+పడి= బాధింపబడి; అఱచుచున్= అరుస్తూ; వసిష్ఠ+ఒద్దకు= వసిష్ఠుని దగ్గరకు; వచ్చి, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా విశ్వామిత్రుడు, వసిష్ఠుని హోమధేనువును పట్టుకొనేందుకు తన సైనికులను పంపగా, అది పట్టువడక, వాళ్ళ కొరడాల, కఱ్ఱల దెబ్బలచేత బాధింపబడి అరుస్తూ వసిష్ఠుని దగ్గరికి వచ్చి ఇట్లా పలికింది.

క. 'న న్నేల యుపేక్షించితి? రిన్నరుల కధర్మపరుల కిచ్చితిరే? వి
ద్వన్నాథ! యిదియు ధర్మువె?' । యన్నను విని పలుకకుండె నమ్ముని యంతన్. 106

ప్రతిపదార్థం: విద్వత్+నాథ!= పండితులకు ప్రభువైనవాడా - ఓ వసిష్ఠా!; నన్నున్+ఏల= న న్నెందుకు; ఉపేక్షించితిరి= నా సంగతి ఎందుకు పట్టించు కొనకుండ అశ్రద్ధతో ఉన్నారు; అధర్మపరులకున్= అధర్మమే ప్రధానంగా కలవాళ్ళకు; ఈ+నరులకున్= ఈ ప్రజలకు; ఇచ్చితిరి+ఏ; ఇచ్చినారా!; ఇదియు= ఇది; ధర్మువు+ఎ= ధర్మమా; అన్నను= అని నందిని అనగా; విని; ఆ+ముని= ఆ వసిష్ఠ మహాముని; పలుకక+ఉండెన్= మాటాడకుండా ఉన్నాడు; అంతన్= తరువాత.

తాత్పర్యం: పండితులకు ప్రభు వైన ఓ వసిష్ఠమహామునీ! మీరు న న్నెందుకు విడిచారు? అధర్మపరులైన ఈ నరులకు ఎందు కిచ్చారు? ఇది ధర్మమా? అని పల్కగా, ఆ ముని మౌనంగానే ఉండిపోయాడు. తరువాత.

వ. తదీయాభిప్రాయం బెఱింగి నందినియుఁ దనవత్సంబుఁ బట్టికొన వచ్చిన జనుల కలిగి చిందఱేఁగి నిదాఘ సమయమధ్యందినదినకరమూర్తియుం బోలె దుర్నిరీక్ష్య యయి, యంగవిక్షేపంబున నంగారవృష్టిఁ గురియుచు, వాలంబున శబరులను, శకృన్మూత్రంబుల శక యవన పుండ్ర పుళింద ద్రవిళ సింహళులను, ఫేనంబున దరదబర్బరు లను బుట్టించిన. 107

ప్రతిపదార్థం: తదీయ+అభిప్రాయంబు= అతని యొక్క అభిప్రాయాన్ని; ఎఱింగి= తెలిసికొని; నందినియున్= నందినికూడా; తన వత్సంబున్= తన దూడను; పట్టికొనన్= పట్టుకొనుటకై; వచ్చిన= వచ్చిన; జనులకున్= జనానికి; అలిగి= కోపించి; చిందఱరేగి= ఆవేశంతో చెలరేగి; నిదాఘ, సమయ, మధ్యందిన, దినకరమూర్తియున్+పోలెన్= వేసవికాలంలోని మధ్యాహ్న సూర్యుని ఆకారం వలె; దుర్నిరీక్ష్య+అయి= చూడ సాధ్యం గాని దై; అంగ, విక్షేపంబునన్= దేహాన్ని విదిలించటంచేత; అంగారవృష్టిన్= నిప్పుల వానను; కురియుచున్= కురిపిస్తూ; వాలంబునన్= తోకనుండి; శబరులను; శకృత్+మూత్రంబులన్= పేడనుండి, పంచితంనుండి; శక, యవన, పుండ్ర, పుళింద, ద్రవిళ, సింహళులను; ఫేనంబునన్= నురుగునుండి; దరద, బర్బరులను; పుట్టించినన్= పుట్టించగా.

తాత్పర్యం: వసిష్ఠుని అభిప్రాయాన్ని తెలిసికొని నందినికూడ, తన దూడను పట్టుకొనటానికి వచ్చిన జనులను చూచి, కోపించి ఆవేశంతో చెలరేగి, వేసవికాలంలోని మధ్యాహ్నసూర్యునివలె తేరిపార చూడరానిదై, దేహాన్ని విదిల్చి, నిప్పులవాన కురిపిస్తూ, తోకనుండి శబరులను, మలమూత్రాలనుండి శక, యవన, పుండ్ర, పుళింద, సింహళులను, నురుగునుండి దరద బర్బరులను పుట్టించగా.

క. నలి రేఁగి కడఁగి తద్బల । ములు విశ్వామిత్రు సైన్యముల కేనుమడుం
గులు పెరిఁగి మూఁడుయోజన ।ములు వాఱఁగ నెగిచె నొక్కమొగిఁ బ్రతిబలమున్. 108

ప్రతిపదార్థం: నలిరేఁగి= విజృంభించి; కడఁగి= పూని; తత్+బలములు= ఆ సైన్యములు - శబర, శక, యవన, పుండ్ర, పుళింద, ద్రవిళ, సింహళ సైన్యములు; విశ్వామిత్రు, సైన్యములకు= విశ్వామిత్రునియొక్క సేనలకు; ఏను, మడుంగులు= అయిదురెట్లు; పెరిఁగి; ప్రతిబలమున్= శత్రుసైన్యాన్ని - అనగా విశ్వామిత్రుని సైన్యాన్ని; ఒక్క మొగిన్= ఒక్క పూనికతో; మూఁడు, యోజనముల్= మూడు ఆమడలు; పాఱఁగన్= పరుగెత్తేటట్లు; ఎగిచెన్= తరిమెను.

తాత్పర్యం: నందినినుండి పుట్టిన ఆ సైన్యాలు చెలరేగి, విశ్వామిత్రుని సైన్యాలకంటె అయిదురెట్లు అధికమై, శత్రుసైన్యాన్ని ఒక్కఊపున మూడామడలు పరుగెత్తే విధంగా తరిమివేశాయి.

వ. అట్టి బ్రహ్మతేజోజనితం బయిన ప్రభావంబుఁ జూచి విశ్వామిత్రుండు విలక్షముఖుం డై, క్షాత్రబలంబు నిందించి, యెల్ల బలంబులకు మిక్కిలి తపోబలంబ యని. 109

ప్రతిపదార్థం: అట్టి, బ్రహ్మతేజస్+జనితంబు+అయిన= బ్రాహ్మణుని తేజస్సునుండి పుట్టిన దైన; ప్రభావంబున్= మహిమను; చూచి; విశ్వామిత్రుండు; విలక్ష, ముఖుండు+ఐ= సిగ్గుపడిన ముఖం కలవా డై; క్షాత్ర, బలంబు= క్షత్రియబలాన్ని; నిందించి; ఎల్ల, బలంబులకున్= అన్ని బలాలకు; మిక్కిలి= ఎక్కువైనది; తపస్+బలంబు+అ= తపోబలమే; అని.

తాత్పర్యం: అట్టి బ్రాహ్మణ తేజస్సునుండి పుట్టిన మహిమను చూచి, విశ్వామిత్రుడు సిగ్గుపడి, క్షత్రియబలాన్ని నిందించి, అన్ని బలాలకంటె ఎక్కువైనది తపోబలమే అని.

చ. పొలుపగు రాజ్యసంపదుపభోగములెల్లఁ దృణంబుగా మదిం
దలఁచి విరక్తుఁ డై విడిచి, దారుణశైలవనాతరంబులన్
వెలయఁ దపంబు సేసి, గుణవిశ్రుతుఁడై పడసెన్ మహాతపో
బలమున సర్వసంపదలు బ్రహ్మఋషిత్వము దివ్యశక్తియున్. 110

ప్రతిపదార్థం: పొలుపు+అగు= స్థిరమైన; రాజ్య, సంపద్+ఉపభోగములు= రాజ్యసందవలని భోగానుభవాలు; ఎల్లన్= అన్నింటిని; తృణంబుగాన్= ఒక్క గడ్డిపరకగా; మదిన్; తలఁచి; విరక్తుఁడు+ఐ= వైరాగ్యభావం పొందినవా డై; విడిచి= వదలిపెట్టి; దారుణ, శైల, వన+ అంతరంబులన్= భయంకరమైన కొండల, అడవుల మధ్య; వెలయన్= ఒప్పునట్లు; తపంబు; చేసి; గుణ, విశ్రుతుఁడు+ఐ= గుణాలచే ప్రసిద్ధుడై; మహా, తపస్+బలమునన్= గొప్ప తప శ్శక్తిచేత; సర్వ, సంపదలు; బ్రహ్మ ఋషిత్వము= బ్రహ్మర్షి అగుటను; దివ్య, శక్తియున్= దేవతాసంబంధమైన మహిమను; పడసెన్= పొందెను.

తాత్పర్యం: స్థిరమైన రాజ్యసంపదతో అనుభవించే భోగా లన్నింటిని గడ్డిపరకగా భావించి, విరక్తి చెంది, వాటిన న్నింటిని విడిచి, భయంకరమైన కొండలు, అడవుల మధ్యకు వెళ్ళి, గొప్పతపస్సు చేసి, సద్గుణాలతో ప్రసిద్ధ డై తపోమహిమవలన సర్వసంపదలను, బ్రహ్మర్షిత్వాన్ని, దివ్యశక్తిని పొందాడు.

వ. ఆ విశ్వామిత్త్రుం డిక్ష్వాకు కుల సంభవు డైన కల్మాషపాదుం డను రాజునకు యాజకత్వం బపేక్షించి తత్పురోహితుం డైన వసిష్ఠుతో బద్ధవైరుం డయి, తదపకారంబు రోయుచున్నంత, నొక్కనాఁడు కల్మాషపాదుండు వేఁట పోయి, రమ్యారణ్య భ్రమణ ఖిన్నుం డయి, విశ్రమార్థంబు వసిష్ఠాశ్రమంబునకుం జనువాఁడు దన కభిముఖుం డయి వచ్చువాని వసిష్ఠ పు త్త్రుం బుత్త్రశతాగ్రజు నధికతపశ్శక్తియుక్తు శక్తియనుమహామునిం గని, తెరువు దొలంగు మని రాజాభిమానంబున మెచ్చక పలికిన, నమ్మునివరుం డి ట్లనియె. 111

ప్రతిపదార్థం: ఆ, విశ్వామిత్త్రుండు, ఇక్ష్వాకు, కుల, సంభవుండు+అయిన= ఇక్ష్వాకువంశంలో, జన్మించినవా డైన; కల్మాష పాదుండు+అను, రాజునకు; యాజకత్వంబు= యజ్ఞం చేయించే వా డగుటను; అపేక్షించి= కోరి; తద్+పురోహితుండు= అతని యొక్క పురోహితుడు; అయిన, వసిష్ఠుతో; బద్ధవైరుండు+ఐ= కట్టుబడిన వైరం గలవా డై - అనగా మనస్సున తీవ్రంగా నిలిచిన పగ కలవా డై; తద్+అపకారంబు= ఆ వసిష్ఠునికి కీడును; రోయుచున్= వెదకుతూ; ఉన్నంతన్= ఉండగా; ఒక్కనాఁడు; కల్మాషపాదుండు; వేఁట పోయి; రమ్య+అరణ్య, భ్రమణ, ఖిన్నుండు+అయి= అందమైన అడవులలో తిరగటంచేత బడలిక నొందిన వాడై; విశ్రమ+అర్థంబు= విశ్రాంతికొరకు; వసిష్ఠ+ఆశ్రమంబునకున్= వసిష్ఠునియొక్కఆశ్రమానికి; చను వాఁడు= వెళ్లేవాడు; తనకు+అభిముఖుండు+అయి= తనకు ఎదురై; వచ్చు, వానిన్= వస్తున్న వాడిని; వసిష్ఠ, పుత్త్రున్= వసిష్ఠుని కుమారుణ్ణి; పుత్త్ర, శత+అగ్రజున్= పుత్త్రులు నూఱుగురియందు పెద్దవాడిని; అధిక, తపస్+శక్తి, యుక్తున్= మిక్కిలి తపోబలంతో కూడుకొన్నవాడిని; శక్తి, అను; మహా, మునిన్; కని= చూచి; తెరువు= మార్గం; తొలంగుము+అని; తప్పుకొమ్మని; రాజ+ అభిమానమునన్= రాజుననేగర్వంతో; మెచ్చక= లక్ష్యపెట్టక; పలికినన్= పలుకగా; ఆ+ముని వరుండు= ఆ మునిశ్రేష్ఠుడు (శక్తి); ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ విశ్వామిత్రుడు ఇక్ష్వాకువంశంలో జన్మించిన కల్మాషపాదు డనే రాజుకు యాజకుడు కావా లని కోరి, అతని పురోహితుడైన వసిష్ఠునితో తీవ్రవైరం కలవాడై, అతనికి అపకారం చెయ్యా లని ఆలోచిస్తుండగా, ఒకనాడు కల్మాషపాదుడు వేటకు పోయి, అందమైన అడవులలో తిరిగి, ఆ అలసట తీర్చుకోవటానికి వసిష్ఠుని ఆశ్రమానికి వెళ్తూ, తనకు ఎదురుగా వస్తున్న వసిష్ఠపుత్రుడిని చూచాడు. అతడు నూరుమందిపుత్రులలో పెద్దవాడు; అధికతపశ్శక్తి కలవాడు; శక్తి అను పేరు గలవాడు, మహాముని. అతడిని చూచి కల్మాషపాదుడు రాజుననేగర్వంతో త్రోవనుండి తప్పుకొ మ్మని అతడిని లక్ష్యపెట్టకుండా పలికాడు. అప్పుడు ఆ మునిశ్రేష్ఠుడు (శక్తి) ఇట్లా అన్నాడు.

ఆ. ఎట్టి రాజులును మహీసురోత్తము లెదు । రరుగుదెంచు నప్పు డధికభక్తిఁ
దెరలి ప్రియము వలికి తెరువిత్తు రిట్టిద । ధర్మ; మీవు దీనిఁ దలఁప వెట్టు? 112

ప్రతిపదార్థం: ఎట్టి రాజులును= ఎంతటి రాజులైనా; మహీసుర+ఉత్తములు= బ్రాహ్మణోత్తములు; ఎదురు+అరుగు దెంచునప్పుడు= ఎదురుగా వచ్చునపుడు; అధికభక్తిన్= మిక్కిలి భక్తితో; తెరలి= తొలగి; ప్రియము= ఇంపైన మాటను; పలికి; తెరువు= మార్గము; ఇత్తురు (ఇచ్చుదురు) = ఇస్తారు; ఇట్టిది+అ, ధర్మువు= ఇదే ధర్మం; నీవు; దీనిన్= ఈ ధర్మాన్ని; తలఁపవు+ఎట్టు= ఎందుచేత దీనిని ఆలోచించవు.

తాత్పర్యం: ఎంత గొప్పరాజులైనా బ్రాహ్మణు లెదురుగా వచ్చినప్పుడు, మిక్కిలిభక్తితో తాము ప్రక్కకు తొలగి, ప్రియంగా మాటాడి, దారి యిస్తారు. ఇది ధర్మం. దీన్నిగురించి నీ వెందుకు ఆలోచించటం లేదు?

శక్తిమహాముని కల్మాషపాదుని శపియించుట (సం.1-166-7)

వ. 'ఏను ధర్మపథంబున నున్నవాఁడ; నేల తొలంగుదు'? ననిన నలిగి కల్మాషపాదుండు దనచేతి కశకోలనమ్మునీంద్రుని వ్రేసిన నవమానితుం డయి కోపారుణితనయనంబుల నతనిం జూచి 'నీవు రాక్షసభావంబున నకారణంబ నాకు నికారంబు సేసితి కావున రాక్షసుండ వయి మనుష్యపిశితం బశనంబుగా నుండు' మని శాపం బిచ్చినఁ, గల్మాషపాదుం డమ్మహామునివరు వసిష్ఠతనయుంగా నెఱింగి 'నాకు శాపవ్యపాయంబు ప్రసాదింప వలయు' నని ప్రార్థించుచున్న నచ్చోటికి విశ్వామిత్రుండు వచ్చి వారలు దన్నెఱుంగకుండ నంతర్హితుం డయి కల్మాషపాదు నంతర్గతుం డయి యుండ, నొక్కరక్కసుం గింకరుం డను వానిం బంచిన వాఁడు విశ్వామిత్రునాదేశంబునను, శక్తిశాపంబుననుం జేసి కల్మాషపాదునంతరాత్మ నావేశించి యున్నంత. 113

ప్రతిపదార్థం: ఏను= నేను; ధర్మ, పథంబునన్= ధర్మమార్గంలో; ఉన్న, వాఁడన్= ఉన్నాను; ఏల= ఎందుకు; తొలంగుదున్= తొలగుతాను; అనినన్= అని అనగా; అలిగి= కోపించి, అవమానింపబడినవాడై; కోప+అరుణిత, నయనంబులన్= కోపంచేత ఎఱ్ఱవిగా చేయబడిన కన్నులతో; అతనిన్= ఆ రాజును; చూచి; నీవు, రాక్షస భావంబునన్= నీవు రాక్షస బుద్ధిచేత; అకారణంబు+అ= కారణం లేకుండానే; నాకున్; నికారంబు= అవమానం; చేసితి(వి)= చేసితివి; కావునన్= కాబట్టి; రాక్షసుండవు+అయి; మనుష్య, పిశితంబు= మానవ మాంసం; అశనంబుగాన్= ఆహారంగా; ఉండుము+అని; శాపంబు; ఇచ్చినన్; కల్మాషపాదుండు; ఆ+మహా, మునివరున్= ఆ మహర్షి శ్రేష్ఠుని; వసిష్ఠ, తనయున్+కాన్= వసిష్ఠునియొక్క కుమారునిగా; ఎఱింగి= తెలిసికొని; నాకున్, శాప, వ్యపాయంబు= శాపముయొక్క తొలగింపును; ప్రసాదింపవలయున్+అని= దయతో ఇవ్వవలసిం దని; ప్రార్థించుచున్నన్= వేడుకొంటూ ఉండగా; ఆ+చోటికిన్= ఆచోటికి; విశ్వామిత్రుండు; వచ్చి; వారలు; తన్నున్+ఎఱుంగకుండన్= తనను తెలియకుండా; అంతర్హితుండు+అయి= చాటున నున్నవా డై; కల్మాషపాదున్; అంతర్గతుండు+అయి= కల్మాషపాదుని లోపల చేరి; ఉండన్= ఉండుటకు; ఒక్క, రక్కసున్= ఒక్క రాక్షసుడిని; కింకరుఁడు; అను, వానిన్; పంచినన్= ఆజ్ఞాపించగా; వాడు= ఆ కింకరుడు; విశ్వామిత్రు+ఆదేశంబునను= విశ్వామిత్రుని ఆజ్ఞచేత; శక్తి, శాపంబుననున్+చేసి= శక్తియొక్క శాపంవలన; కల్మాషపాదు+అంతరాత్మన్= కల్మాషపాదునియొక్క మనస్సును; ఆవేశించి= ప్రవేశించి; ఉన్న+అంతన్= ఉండిన అనంతరం.

తాత్పర్యం: 'నేను ధర్మమార్గంలో ఉన్నాను. ఎందుకు తొలగుతాను' అని పల్కగా కోపించి కల్మాషపాదుడు తన చేతికొరడాకర్రతో ఆ మునీశ్వరుడిని కొట్టాడు. ఆ విధంగా అవమానింపబడిన ఆ ముని, కోపంతో ఎరుపెక్కిన కళ్ళతో అతడిని చూచి నీవు రాక్షసబుద్ధితో అకారణంగా నన్ను అవమానించావు. కనుక రాక్షసుడ వై నరమాంసం ఆహారంగా జీవించు' మని శాపమిచ్చాడు. అప్పుడు కల్మాషపాదుడు అతణ్ణి వసిష్ఠుని కుమారునిగా గుర్తించి 'శాపవిమోచనం ప్రసాదించండి' అని ప్రార్థిస్తూ ఉండగా - విశ్వామిత్రుడు అక్కడికి వచ్చి, కనబడకుండ దాగి కల్మాషపాదుని మనస్సులో చేరవలసిం దని కింకరు డనే రాక్షసుడిని ఆజ్ఞాపించాడు. వాడు విశ్వామిత్రుని ఆజ్ఞతో శక్తిశాపంతో కల్మాషపాదుని అంతరాత్మలో ప్రవేశించాడు. ఆ పరిస్థితిలో.

తే. రాక్షసావిష్టుఁ డైనప్డు రాజ్యలీల। విడిచి త న్నెఱుంగక, తదావేశరహితుఁ
డైన యప్పుడు రాచకార్యంబులందు। బద్ధబుద్ధి యై కల్మాషపాదుఁ డుండె. 114

ప్రతిపదార్థం: కల్మాషపాదుఁడు; రాక్షస+ఆవిష్టుఁడు= రాక్షసునిచేత ఆవేశింపబడినవాడు; అయినప్డు= అయిన సందర్భంలో; రాజ్యలీలన్= రాజ్యవిలాసాలను; విడిచి; తన్నున్+ఎఱుంగక= తనను తాను తెలియక; తద్+ఆవేశ, రహితుఁడు+అయిన, అప్పుడు= ఆ రాక్షసుడు ఆవేశించనప్పుడు; రాచకార్యంబులందు; బద్ధ, బుద్ధి+ఐ= కట్టుబడిన బుద్ధికలవాడై; ఉండెన్.

తాత్పర్యం: కల్మాషపాదుడు - రాక్షసుడు త న్నావేశించినప్పుడు రాజ్యవ్యవహారాలు విచారించక తనను తాను మరచి, ఆవేశించనప్పుడు రాజ్యవ్యవహారాలు చూస్తూ ఉండేవాడు.

వ. ఆ కల్మాషపాదు నొక్కనాఁ డొక్కబ్రాహ్మణుం డధిక క్షుధార్తుం డయి వచ్చి సమాంసంబయిన భోజనం బడిగిన నిచ్చి, పోయిన వాఁ డంతఃపురంబున నుండి మఱచి యర్ధరాత్రంబునప్పడు దలంచికొని తన బానసంబు వానిం బిలిచి 'యే నొక్కబ్రాహ్మణునకుం గుడువ నిచ్చి వచ్చి మఱచియుండితిం; జెచ్చెర నవ్విప్రునకు మాంసంబుతోఁ గుడువంబెట్టు' మని పంచిన, వాఁడు నింతప్రొద్దు మాంసంబు వడయనేర ననిన నప్పు డారాజు రాక్షసాధిష్ఠితుం డగుటం జేసి 'మనుష్యమాంసంబుతో నయినం గుడువం బెట్టు' మనిన సూపకారుండు వధ్యస్థానంబునకుఁ జని మనుష్య మాంసంబు దెచ్చి యిమ్ముగా వండి పెట్టిన, నవ్విప్రుండు దన దివ్యదృష్టిం జూచి దాని మానవమాంసంగా నెఱింగి కడు నలిగి. 115

ప్రతిపదార్థం: ఆ, కల్మాషపాదున్= ఆ కల్మాషపాదుణ్ణి; ఒక్కనాఁడు; ఒక్క, బ్రాహ్మణుండు; అధిక= మిక్కిలి; క్షుధా+ఆర్తుండు+అయి= ఆకలిచేత పీడింపబడిన వాడై; వచ్చి= అరుదెంచి; సమాంసంబు+అయిన= మాంసంతో కూడిన; భోజనంబు; అడిగినన్= అడుగగా; ఇచ్చి= పెట్టుతా నని మాట ఇచ్చి; పోయినన్= పోగా; వాఁడు= అతడు-ఆరాజు; అంతః పురంబునన్= అంతఃపురంలోనే ఉండి; మఱచి; అర్ధ, రాత్రంబు= సగం రాత్రిలో; తలంచికొని= గుర్తుచేసికొని; బానసంబు, వానికిన్= తన వంటవాణ్ణి; పిలిచి; ఏన్= నేను; ఒక్క బ్రాహ్మణునకున్= ఒక బ్రాహ్మణునికి; కుడువన్= తినుటకు; ఇచ్చి, వచ్చి= మాట ఇచ్చి వచ్చి; మఱచి+ఉండితిన్= మరచిపోయాను; చెరన్+చెరన్= వెంటనే; ఆ+విప్రునకున్= ఆ బ్రాహ్మణునికి; మాంసంబుతోన్; కుడువన్+పెట్టుము+అని= భుజించుటకై పెట్టు అని; పంచినన్= ఆజ్ఞాపించగా; వాఁడున్= అతడును; ఇంత ప్రొద్దు= ఇంత రాత్రిపూట; మాంసంబు= మాంసాన్ని; పడయ, నేరన్= పొందలేను; అనినన్= అని అనగా; అప్పుడు, ఆ రాజు= ఆ సమయంలో ఆ రాజు; రాక్షస+అధిష్ఠితుండు=రాక్షసునిచేత ఆవేశింపబడినవాడు; అగుటన్+చేసి= అయినందువల్ల;

మనుష్య, మాంసంబుతోన్+అయినన్= నరమాంసంతోనైనా సరే; కుడువన్; పెట్టుము; అనినన్= అనగా; సూపకారుండు= వంటవాడు; వధ్యస్థానంబునకున్= చంపునట్టి స్థలానికి; చని= వెళ్ళి; మనుష్య, మాంసంబు = మానవ మాంసాన్ని; తెచ్చి= తీసికొనివచ్చి; ఇమ్ముగాన్= ఇంపుగా; వండిపెట్టినన్= వండిపెట్టగా; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; తన, దివ్య, దృష్టిన్= తన దివ్యదృష్టితో; దానిన్, మానవ, మాంసంబుగాన్= దానిని నరమాంసంగా; ఎఱింగి= తెలిసికొని; కడున్=మిక్కిలి; అలిగి= కోపించి.

తాత్పర్యం: ఒకనాడు ఆ కల్మాషపాదుని దగ్గరకు ఒక బ్రాహ్మణుడు మిక్కిలి ఆకలితో బాధపడుతూ వచ్చాడు. మాంసాహారం కావా లని అడిగాడు. అతడు సరే అని మాట ఇచ్చి అంతఃపురానికి వెళ్ళి మరచిపోయాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుకు వచ్చి, వంటవాడిని పిలిచి, 'నే నొక బ్రాహ్మణునికి భోజనం పెడతా నని చెప్పి వచ్చి మరచి పోయాను. వెంటనే అతనికి మాంసంతో భోజనం పెట్టు' మని ఆజ్ఞాపించాడు. వాడు ఆ అర్ధరాత్రి పూట మాంసాన్ని సంపాదించ లే నని అన్నాడు. అప్పు డారాజు రాక్షసునిచేత ఆవేశింపబడినవాడు కావటంచేత 'నరమాంసంతో నైనా అతనికి భోజనం పెట్టు' మని పల్కగా, ఆ వంటవాడు వధ్యస్థానానికి వెళ్ళి మనుష్యమాంసం తెచ్చి, రుచిగా వండిపెట్టాడు. ఆ బ్రాహ్మణుడు దివ్యదృష్టితో అది మానవమాంసం అని తెలిసికొని, మిక్కిలి కోపించి,

క. 'తివిరి యభోజ్యం బగు మా । నవ మాంసముతోడ భోజనము పెట్టినవాఁ
డవు నీవు మనుష్యాదుఁడ । వవు' మని వాఁ డిచ్చె శాప మన్నరపతికిన్. 116

ప్రతిపదార్థం: తివిరి= పూని; అభోజ్యంబు+అగు= తినగూడని దైన; మానవ, మాంసముతోడన్; భోజనము, పెట్టినవాఁడవు; నీవు; మనుష్యాదుఁడవు+అగుము+అని= మనుష్యమాంసం తినేవాడి వగు మని - అనగా రాక్షసుడవు కమ్మని; ఆ+నరపతికిన్= ఆ రాజుకు; వాఁడు= ఆ బ్రాహ్మణుడు; శాపము; ఇచ్చెన్.

తాత్పర్యం: 'తినగూడని నరమాంసంతో నాకు భోజనం పెట్టావు. నీవు మనుష్యమాంసం తినే రాక్షసుడవు అగుదువు గాక!' అని ఆ బ్రాహ్మణుడు రాజైన కల్మాషపాదుడిని శపించాడు.

వ. ఇట్లు బ్రాహ్మణ శాపంబునం గల్మాషపాదుండు మానుష భావంబు విడిచి, రాక్షసుం డై శక్తి యొద్దకు వచ్చి 'నీ కారణంబున నిట్టి శాపవ్యాపారంబు సంభవించె; దీని ఫలంబు ముందఱ నీవ యనుభవింపు' మని శక్తి నపగత ప్రాణుం జేసి, విశ్వామిత్రుచేతఁ బ్రచోదితుం డయి పదంపడి వసిష్ఠపుత్త్రుల నందఱ వధియించిన. 117

ప్రతిపదార్థం: ఇట్లు; బ్రాహ్మణ, శాపంబునన్= బ్రాహ్మణ శాపంచేత; కల్మాషపాదుండు; మానుష భావంబు= మనుష్యత్వమును; విడిచి; రాక్షసుండు+ఐ; శక్తి, ఒద్దకున్; వచ్చి; నీ కారణంబునన్= నీ కారణంచేత; ఇట్టి, శాప, వ్యాపారంబు= ఇటువంటి శాపం కలిగేపని; సంభవించెన్= ఏర్పడింది; దీని, ఫలంబు= దీని ఫలితం; ముందఱ= ముందుగానే; నీవు+అ= నీవే; అనుభవింపుము; అని= అని; శక్తిన్= శక్తిమహామునిని; అపగత, ప్రాణున్+చేసి= పోయిన ప్రాణం కలవాడినిగా చేసి 'అనగా చంపి; విశ్వామిత్రుచేతన్; ప్రచోదితుండు+అయి= విశ్వామిత్రునిచే పురికొల్పబడినవాడై; పదంపడి= పిమ్మట; వసిష్ఠ, పుత్త్రులన్= వసిష్ఠుని కుమారుల్ని; అందఱన్= అందరినీ; వధియించినన్= చంపగా.

తాత్పర్యం: ఈ విధంగా బ్రాహ్మణశాపంచేత కల్మాషపాదుడు మనుష్యత్వాన్ని విడిచి, రాక్షసుడైన శక్తి మహాముని దగ్గరికి వచ్చి 'నీ కారణంగా ఈ శాపవ్యవహారం ఏర్పడింది. దీనిఫలం నీవే మొదట అనుభవించు' మని అతడిని చంపేశాడు. తరువాత విశ్వామిత్రునిప్రేరణతో వసిష్ఠునిపుత్రు లందరినీ వధించాడు.

పుత్రశోకమున వసిష్ఠుఁడు ఆత్మహత్యకుఁబ్రయత్నించుట (సం.1-166-40)

తే. సుతుల రాక్షసనిహతులఁ జూచి పరమ । యోగధరుఁ డయ్యుఁ బుత్త్ర వియోగశోక
భరము దాల్చె వసిష్ఠుం డపారభూరి । ధరణిభరము నగేంద్రుండు దాల్చునట్లు. 118

ప్రతిపదార్థం: రాక్షస, నిహతులన్= రాక్షసునిచేత చంపబడినవాళ్ళను; సుతులన్= పుత్త్రులను; చూచి; వసిష్ఠుండు; పరమ, యోగ, ధరుఁడు+అయ్యున్= ఉత్తమమైన యోగశక్తిని ధరించేవాడే అయినా; అపార, భూరి, ధరణి, భరమున్= అంతులేని గొప్ప భూభారాన్ని; నగ+ఇంద్రుఁడు= పర్వతాలకు రాజైన హిమవంతుడు; తాల్చునట్లు= ధరించునట్లు; పుత్త్ర వియోగ, శోక, భరమున్= కొడుకుల ఎడబాటువలన కలిగిన దుఃఖంయొక్కభారాన్ని; తాల్చెన్= ధరించాడు.

తాత్పర్యం: వసిష్ఠుడు గొప్ప యోగశక్తి కలవాడే అయినా - రాక్షసునిచేత చచ్చిన తనకొడుకులను చూచి, పర్వత రాజైన హిమవంతుడు అంతులేని గొప్పభూభారాన్ని ధరించినట్లు పుత్రుల ఎడబాటువలన కలిగిన దుఃఖభారాన్ని వహించాడు.

విశేషం: అలం: ఉపమ. 'నగేంద్రుండు' అనే చోట 'ధరణి' భర మురగేంద్రుండు' అని పెక్కు ప్రతులలో; 'ధరణి భరము నాగేంద్రుండు' అని కొన్ని ప్రతులలో పాఠాంతరా లున్నాయి. ఉరగేంద్రుడు, నాగేంద్రుడు అంటే ఆదిశేషుడు. అతడు భూభారం వహించేవాడే. పర్వతానికి 'ధరణీ ధరం' అనే పేరుంది. గనుక నగేంద్రు డైన హిమవంతుడుకూడ భూభారం వహించేవాడే!

చ. అమిత వివృద్ధ శోక వివశాత్మకుఁ డై మది నాత్మఘాతదో
షమును దలంప కెంతయు విషాదమునన్ బలవద్దవాగ్ని మ
ధ్యము వడిఁ జొచ్చినన్ బృహదుదగ్రశిఖానల మాక్షణంబ యు
ష్ణము చెడి శీత మయ్యె మునినాథున కుగ్రతపంబుపెంపునన్. 119

ప్రతిపదార్థం: అమిత, వివృద్ధ, శోక, వివశ+ఆత్మకుఁడు+ఐ= మిక్కిలి ఎక్కువైన దుఃఖంచేత పరవశమైన మనస్సు కలవాడై; మదిన్= మనస్సునందు; ఆత్మ, ఘాత, దోషమును= ఆత్మహత్య అనే పాపాన్ని; తలంపక= ఆలోచింపక; ఎంతయున్= మిక్కిలి; విషాదమునన్= దుఃఖంచేత; బలవత్+దవ+అగ్ని, మధ్యము= అధికమైన కార్చిచ్చునడుమ; వడిన్= వేగమే; చొచ్చినన్= ప్రవేశించగా; బృహత్+ఉదగ్ర, శిఖా+అనలము= పెద్ద భయంకరమైన మంటలు కల అగ్ని; మునినాథునకున్= మునిశ్రేష్ఠు డైన ఆ వసిష్ఠునకు; ఉగ్ర, తపంబు, పెంపునన్= గొప్ప తపస్సుయొక్క అతిశయంచేత; ఆ క్షణంబు+అ= అప్పటికప్పుడే; ఉష్ణము= వేడి; చెడి=పోయి; శీతము= చల్లనిది; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: మిక్కిలి ఎక్కువైన దుఃఖంతో మనస్సు స్వాధీనం తప్పి, ఆత్మహత్య పాప మని కూడ భావించక, అమిత మైన బాధతో పెద్ద కార్చిచ్చులోకి వడిగా ప్రవేశించాడు. అయితే, మునిశ్రేష్ఠు డైన ఆ వసిష్ఠుని తపోమహిమచేత ఆ కార్చిచ్చు వేడిని కోల్పోయి చల్లబడింది.

విశేషం: శోకభావ తీవ్రతచేత వసిష్ఠుడు ఆత్మహత్య చేసికొనటానికి చేసే ప్రయత్నాలను అయిదింటిని - పంచప్రాణాలు తీసికొనే యత్నాలకు వ్యంజకాలుగా - నన్నయ రచించాడు. ఒక్కొక్క పద్యంలో ఒక్కొక్క ప్రయత్నం ఒక్కొక్క ఘటనగా

రాణిస్తుంది. ఘటనాచిత్రణంలో శ్లేష అనే గుణం శోభిస్తుంది. బహుపదాలు ఏకపదవద్భావం పొందే మసృణ మైన రచనను శ్లేష మని అంటారు. ప్రసాదంకంటె విలక్షణంగా ఉండే ఇటువంటి రచనను 119 నుండి 123 పద్యంవరకు శ్లేషగుణసుందరంగా రచించి, సంఘటనౌచిత్యాన్ని పాటించాడు - నన్నయ. (సంపా.)

ఉ. పంబిన శోక భారమునఁ బ్రాణ విమోక్షముఁ గోరి కంఠ దే
శంబున రాయి గట్టికొని సన్మునినాథుఁడు నిశ్చితాత్ముఁడై
యంబుధిఁ జొచ్చినం గడు భయంపడి వార్ధి లసత్తరంగ హ
స్తంబుల నెత్తిపట్టె నుచితస్థితిఁ దీరముఁ జేర మ్మునిన్. 120

ప్రతిపదార్థం: పంబిన= మిక్కుటమైన; శోకభారమునన్= దుఃఖంయొక్క బరువుచేత; సత్+ముని, నాథుఁడు= గొప్ప మునిశ్రేష్ఠు డైన ఆ వసిష్ఠుడు; నిశ్చిత+ఆత్ముఁడు+ఐ= నిర్ణయించుకొన్న మనస్సు కలవాడై; ప్రాణ, విమోక్షమున్= ప్రాణమును వదలుటను; కోరి= కోరుకొని; కంఠదేశంబునన్= మెడలో; రాయి, కట్టికొని= రాతిని కట్టుకొని; అంబుధిన్= సముద్రంలో; చొచ్చినన్= ప్రవేశింపగా; వార్ధి= సముద్రం; కడున్= మిక్కిలి; భయంపడి; ఆ+మునిన్= ఆ వసిష్ఠుని; ఉచిత, స్థితిన్= తగినట్లుగ; తీరమున్= గట్టును; చేరన్= చేరునట్లుగ; లసత్, తరంగ, హస్తంబులన్= ప్రకాశిస్తున్న అలలుఅనెడి చేతులతో; ఎత్తి పట్టెన్=ఎత్తి పట్టింది.

తాత్పర్యం: మిక్కుటమైన దుఃఖభారంతో మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుడు ఎలాగైనా ప్రాణం విడువా లని నిశ్చయించుకొని, మెడకు రాయికట్టుకొని సముద్రంలో దూకగా - ఆ సముద్రుడే భయపడి, ప్రకాశించే తన అల లనే చేతులతో ఎత్తిపట్టి తగువిధంగా ఆయనను ఒడ్డుకు చేర్చాడు.

విశేషం: అలం: రూపకం.

చ. సుతశతవర్జితాశ్రమము చూడఁగ నోపక మేరుపర్వతో
న్నతపృథుశృంగ మెక్కిపడినన్, మునివల్లభుదేహబంధ మ
క్షత మయి తూలసంచయనికాశత నొప్పెఁ; ననంత సంతత
వ్రతనియమప్రభావు లగువారలఁ బొందునె దేహదుఃఖముల్. 121

ప్రతిపదార్థం: సుత, శత, వర్జిత+ఆశ్రమము= కొడుకులు నూఱుమందిచేత విడువబడిన ఆశ్రమాన్ని; చూడన్+కన్+ఓపక= చూడటానికి ఇష్టపడక; మేరుపర్వత+ఉన్నత, పృథు, శృంగము+ఎక్కి= మేరుపర్వతపు ఎత్తైన విశాలశిఖరాన్ని ఎక్కి; పడినన్= పడగా; మునివల్లభు, దేహబంధము= మునినాథు డైన వసిష్ఠుని శరీరముయొక్క కూర్పు; అక్షతము+అయి= గాయం కానిది అయి; తూల, సంచయ, నికాశతన్= దూదిమూటయొక్క సమానత్వంతో; ఒప్పెన్= ప్రకాశించింది; అనంత, సంతత, వ్రత, నియమ, ప్రభావులు+అగు= అంతులేని ఎడతెగని వ్రతనియమాలయొక్క ప్రభావం కలవాళ్ళయిన; వారలన్= వాళ్లను; దేహ, దుఃఖముల్= శరీర సంబంధ మైన దుఃఖాలు; పొందునె= కలుగుతాయా? (కలుగవు అనిభావం).

తాత్పర్యం: నూరుమంది కొడుకులు మరణించటంతో శూన్యమైన తనఆశ్రమాన్ని చూడలేక మునిశ్రేష్ఠు డైన వసిష్ఠుడు మేరుపర్వతపు ఎత్తైన శిఖరం ఎక్కి క్రిందికి దూకగా, అతనిదేహం దూదిమూటవలె గాయపడలేదు. ఎల్లప్పుడు అంతులేని వ్రతనియమాలప్రభావం కలవాళ్ళను దేహకష్టాలు దరిచేరవుకదా!

విశేషం: అలం : అర్థాంతరన్యాసం, ఉపమ.

మధ్యాక్కర.

వదలక మరణార్థి యగుచు మునినాథవరుఁడు దా నొక్క
నది నుదగ్రగ్రాహవతిఁ బ్రవేశించినను ముని నంట
నది యోడి శతవిధంబులఁ బరిద్రుతయయి స్థలం బయిన
నది యాదిగాఁగ శతద్రునామ యై యన్నది యొప్పె. 122

ప్రతిపదార్థం: వదలక= విడిచిపెట్టక; మరణ+అర్థి= చావును కోరినవాడు; అగుచున్= అవుతూ; మునినాథ, వరుఁడు= మునిశ్రేష్ఠులలో ఉత్తముడు; తాన్= తాను; ఉదగ్ర, గ్రాహవతిన్= మిక్కిలి భయంకరమైన మొసళ్ళు కలదానిని; ఒక్క, నదిన్= ఒక్క నదిలో; ప్రవేశించినను= ప్రవేశించినప్పటికీ; అది= ఆ నది; మునిన్= వసిష్ఠుని; అంటన్= తాకుటకు; ఓడి= భయపడి; శతవిధంబులన్= నూఱుమార్గాల; పరిద్రుత; అయి= పారినదై; స్థలంబు+అయినన్= మెరక కాగా; ఆదికాఁగన్= అది మొదలుగా; ఆ+నది; శతద్రు, నామ+ఐ= శతద్రువు అనే పేరు కలదై; ఒప్పెన్= ప్రసిద్ధికెక్కింది.

తాత్పర్యం: మునిశ్రేష్ఠులలో ఉత్తముడైన వసిష్ఠుడు మరణించా లన్న కోరికను ఇంకా వదలకుండా మహా భయంకరమైన మొస ళ్ళున్న ఒకనదిలో ప్రవేశించాడు. ఆ నది ఆయనను తాకటానికి భయపడి, నూరు మార్గాలలో ప్రవహించి మెరక అయిపోయింది. అప్పటినుండి ఆ నది శతద్రువు అనే పేరుతో ప్రసిద్ధి చెందింది.

మధ్యాక్కర.

ఘనపాశములఁ జేసి యెల్ల యంగముల్ గలయ బంధించి
కొని యొక్కనదిఁ జొచ్చి మునిఁగినను వంతఁ గూరి యన్నదియుఁ
దన దివ్యశక్తి నప్పాశముల విడిచి తన్మునినాథుఁ
బనుగొనఁ దీరంబు చేరఁ బెట్టి విపాశనాఁ బరఁగె. 123

ప్రతిపదార్థం: ఘన, పాశములన్+చేసి= గొప్ప త్రాళ్ళచేత; ఎల్ల అంగముల్= అన్ని అవయవాలను; కలయన్= ఒకటిగా చేర్చి; బంధించికొని= కట్టివేసికొని; ఒక్కనదిన్; చొచ్చి= ప్రవేశించి; మునిఁగినన్= మునుగగా; ఆ+నదియున్= ఆ నదిగూడ; వంతన్+కూరి= దుఃఖాన్ని పొంది; తన దివ్య, శక్తిన్= తనయొక్క ఆశ్చర్యకరమైన శక్తిచేత; ఆ+పాశములన్= ఆ త్రాళ్ళను; విడిచి= విడిపించి; తద్+మునినాథున్= ఆ మునిశ్రేష్ఠుడిని; పనుగొనన్= చక్కనగునట్లు; తీరంబు, చేరన్= ఒడ్డు చేరునట్లు; పెట్టి= చేసి; విపాశ నాన్= విపాశ (పాశములు లేనిది) అనే పేరుతో; పరఁగెన్= ఒప్పింది.

తాత్పర్యం: వసిష్ఠుడు పెద్దత్రాళ్ళతో తన అవయవా లన్నిటినీ ఒకటిగా చేర్చి కట్టుకొని ఒక నదిలో మునిగాడు. ఆ నదికూడ మిక్కిలి దుఃఖించి తన దివ్యశక్తితో అతనికట్లను విప్పి, ఒడ్డుచేర్చి తాను 'విపాశ' అనే పేరుతో ప్రసిద్ధి చెందింది.

వ. ఇట్లు పెక్కువిధంబుల నాత్మపరిత్యాగంబునందుఁ గృతనిశ్చయుం డయ్యును నప్రాప్తమరణుం డయి వసిష్ఠుండు నిజాశ్రమంబునకు వచ్చువాఁడు దన పిఱుంద వచ్చు కోడలి నదృశ్యంతి యను దాని శక్తిభార్య నప్పు డెఱింగి, దాని యుదరంబుననుండి షడంగాలంకృత వేదధ్వని గరంబు మధురం బై వీతెంచిన విని విస్మితుం డయి. 124

ప్రతిపదార్థం: ఇట్లు; పెక్కు విధంబులన్=ఎన్నో రకాలుగా; ఆత్మ; పరిత్యాగంబునందున్= దేహాన్ని విడుచుటయందు; కృత, నిశ్చయుండు= చేయబడిన నిశ్చయం కలవాడు; అయ్యును= అయినప్పటికీ; అప్రాప్త; మరణుండు+అయి= పొందబడని చావుకలవా డై; వసిష్ఠుండు= వసిష్ఠుడు; నిజ+ఆశ్రమంబునకున్= తనయొక్క ఆశ్రమానికి; వచ్చువాఁడు= వచ్చునటువంటివాడు; తన పిఱుందన్= తన వెనుక; వచ్చు= వస్తూ ఉన్న; కోడలిన్; అదృశ్యంతి అనుదానిన్ = అదృశ్యంతి అను పేరుగల ఆమెను; శక్తి, భార్యన్= శక్తి మహామునియొక్క భార్యను; అప్పుడు; ఎఱింగి= చూచి; దాని= ఆమెయొక్క; ఉదరంబుననుండి= కడుపులో నుండి; షడంగ+అలంకృత వేద, ధ్వని= ఆరు అంగములచేత అలంకరింపబడిన వేదంయొక్క ఉచ్చారణ ధ్వని; కరంబు= మిక్కిలి; మధురంబు+ఐ= వినసొంపై; వీతెంచినన్= రాగా; విని; విస్మితుండు+అయి= ఆశ్చర్యపడినవాడై.

తాత్పర్యం: ఈ విధంగా వసిష్ఠుడు ఆత్మహత్య చేసికొనా లని పెక్కుమార్గాలలో దృఢంగా ప్రయత్నించినా, మరణం పొందలేక తన ఆశ్రమానికి తిరిగివస్తూ, తన వెనుకనే వస్తున్న తన కోడలిని గమనించాడు. ఆమె శక్తి మహాముని భార్య. ఆమె పేరు అదృశ్యంతి. ఆమె గర్భంనుండి షడంగాలతో అలంకృతమైన వేద ధ్వని మిక్కిలి మనోహరంగా వినిపించసాగింది. దానిని విని వసిష్ఠుడు ఆశ్చర్యపడి.

విశేషం: షడంగాలు: అనుద్రుతం, ద్రుతం, లఘువు, గురువు, ప్లుతం, కాకపాదం.

తే. **శక్తి చదువును బోలె సువ్యక్త మగుచు । వీనులకు నిది యమృతోపమాన మయ్యె**
వేదనాదంబు; దీని పుణ్యోదరమున । నున్నవాఁడు సుతుండు విద్వన్నుతుండు. **125**

ప్రతిపదార్థం: శక్తి, చదువును+పోలె= శక్తిమహాముని చదువువలె; సువ్యక్తము= మిక్కిలి స్పష్టమైనది; అగుచున్= అవుతూ; ఇది, వేద, నాదంబు= ఇది వేద ధ్వని; వీనులకున్= చెవులకు; అమృత+ఉపమానము+అయ్యెన్= అమృతమువంటి దయింది; దీనిన్= ఈ అదృశ్యంతి యొక్క; పుణ్య+ఉదరమునన్= పవిత్రమైన గర్భంలో; విద్వత్+నుతుండు= విద్వాంసులచేత పొగడబడువాడు; సుతుండు= కుమారుడు; ఉన్నవాడు= ఉన్నాడు.

తాత్పర్యం: శక్తిమహాముని చదివినట్లు మిక్కిలి స్పష్టమై ఈ వేదనాదం చెవులకు అమృతంవలె వినిపిస్తున్నది. ఈమె పుణ్యగర్భంలో విద్వాంసులచేత పొగడబడే కుమారుడు ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ. ఈ తేటగీతిలో నాల్గుపాదాల్లోనూ ప్రాసయతి గలదు.

వ. **'అనవరత వేదాధ్యయనశీలుం డయిన శక్తిచదువు వినుచుం బండ్రెండేఁడులు గర్భంబునుండి సకల వేదంబులు ధరియించినవాఁ డీ పౌత్రుముఖంబు చూచి యేను గృతార్థుండ నగుదు' నని వసిష్ఠుండు మరణ వ్యవసాయ నివృత్తుం డై నిజాశ్రమంబున నుండునంత; నొక్కనాఁడు రాక్షసరూపధరుం డై రౌద్రాకారంబున వచ్చు కల్మాషపాదుం జూచి యదృశ్యంతి వెఱచిన దాని నోడుకుండు మని మునివరుండు హుంకారంబున రాక్షసు వారించి, వానిపయి మంత్రపూతంబు లైన కమండలుజలంబు లొలికిన.** **126**

ప్రతిపదార్థం: అనవరత, వేద+అధ్యయన, శీలుండు+అయిన= ఎల్లప్పుడు వేదాలను పఠించటమే స్వభావంగా గలవాడైన; శక్తి, చదువు= శక్తి మహామునియొక్క చదువు; వినుచున్= వింటూ; పంద్రెండు+ఏడులున్= పన్నెండు సంవత్సరాలు; గర్భంబునుండి= కడుపులో ఉండి; సకల, వేదంబులు= అన్ని వేదాలు; ధరియించినవాఁడు= నేర్చిన అతడు; ఈ; పౌత్రు,

ముఖంబున్= ఈ మనుమడి యొక్క ముఖాన్ని; చూచి; ఏను= నేను; కృతార్థుండను= తీరిన కోరికకలవాడను; అగుదున్+అని= అవుతా నని; వసిష్ఠుండు; మరణ, వ్యవసాయ, నివృత్తుండు+ఐ= చావుకొరకు చేసే ప్రయత్నంనుండి వెనుదిరిగినవా డై - అనగా ఆత్మహత్యా ప్రయత్నాన్ని మాని; నిజ+ఆశ్రమంబునన్= తన ఆశ్రమంలో; ఉండునంతన్= ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజు; రాక్షస, రూప, ధరుండు+ఐ= రాక్షస రూపాన్ని ధరించినవా డై; రౌద్ర+ఆకారంబునన్= భయంకరమైన రూపంతో; వచ్చు= వస్తున్న; కల్మాషపాదున్; చూచి; అదృశ్యంతి (వసిష్ఠుడి కోడలు); వెఱచిన= భయపడిన; దానిన్= ఆమెను; ఓడక+ ఉండుము+అని= భయపడకుండు మని; మునివరుండు= మునిశ్రేష్ఠు డైన వసిష్ఠుడు; హుంకారంబున్= హుం అనే పెద్ద ధ్వనితో; రాక్షసున్= రక్కసుని; వారించి= ఆపి; వానిపై; మంత్ర, పూతంబులు+ఐన= మంత్రాలచేత పవిత్రాలైన; కమండలు, జలంబులు= కమండలంలోని నీళ్ళు; ఒలికినన్= చల్లగా.

తాత్పర్యం: 'ఎల్లప్పుడు వేదాలు చదవటమే స్వభావంగా శక్తియొక్కచదువు వింటూ పన్నెండుసంవత్సరాలు గర్భంలో ఉండి అన్నివేదాలు నేర్చుకొన్న ఈ మనుమడిముఖం చూచి, నేను కృతార్థుడ నౌతాను' అని వసిష్ఠుడు ఆత్మహత్యాప్రయత్నం మాని, తన ఆశ్రమంలో ఉండిపోయాడు. ఒకనాడు కల్మాషపాదుడు రాక్షస రూపాన్ని ధరించి రాగా అతడిని చూచి అదృశ్యంతి భయపడింది. వసిష్ఠుడు ఆమెను భయపడ వద్దని చెప్పి, తన హుంకారంతో ఆ రాక్షసుడిని నిలిపి, మంత్రపూతమైన కమండలుజలాన్ని అతనిపై చల్లాడు.

వసిష్ఠువలనఁ గల్మాషపాదుండు శాపవిముక్తిఁ జెందుట (సం.1-168-5)

క. భూపాలకుండు బ్రాహ్మణ । శాపంబునఁ బదియురెండుసంవత్సరముల్
పాపమతి నుండి రాక్షస । రూపము చెడి యపుడు మనుజరూపముఁ దాల్చెన్. 127

ప్రతిపదార్థం: భూపాలకుండు= రాజైన కల్మాషపాదుడు; బ్రాహ్మణ, శాపంబునన్= బ్రాహ్మణశాపంచేత; పదియు, రెండు, సంవత్సరముల్= పండ్రెండేళ్ళు; పాప, మతిన్= పాపబుద్ధితో; ఉండి= ధరించి; అప్పుడు, రాక్షస, రూపము; చెడి= కోల్పోయి; మనుజ, రూపమున్; తాల్చెన్.

తాత్పర్యం: కల్మాషపాదమహారాజు బ్రాహ్మణశాపంవలన పన్నెండేళ్లు పాపబుద్ధితో ఉండి, అప్పుడు రాక్షస రూపాన్ని వదలి, మానవరూపాన్ని పొందాడు.

వ. ఇట్లు శాపవిముక్తుం డై కల్మాషపాదుండు వసిష్ఠునకు నమస్కరించి ముకుళితకరకమలుఁ డై 'మునీంద్రా! నీ ప్రసాదంబున శాపంబువలనం బాసి కృతార్థుండ నయితి' ననిన వానికి వసిష్ఠుం డి ట్లనియె. 128

ప్రతిపదార్థం: ఇట్లు; శాప, విముక్తుండు+అయి= శాపంచేత విముక్తి పొందినవాడై; కల్మాషపాదుండు; వసిష్ఠునకున్, నమస్కరించి; ముకుళిత, కర, కమలుండు+ఐ= మోడ్పుగా చేయబడిన కమలాలవంటి చేతులు కలవాడై; ముని+ఇంద్రా!= మునిశ్రేష్ఠా!; నీ, ప్రసాదంబునన్= నీ దయచేత; శాపంబువలనన్= శాపంనుండి; పాసి= విముక్తినొంది; కృత+అర్థుండను= నెరవేరిన కోరిక కలవాడను; అయితిన్= అయినాను; అనినన్= అని చెప్పగా; వానికిన్= ఆ కల్మాషపాదునికి; వసిష్ఠుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా శాపవిముక్తి పొంది కల్మాషపాదుడు వసిష్ఠునికి నమస్కరించి చేతులు జోడించి 'మునిశ్రేష్ఠా! నీ దయవలన శాపవిముక్తి పొంది కృతార్థుడ నయ్యాను' అని పల్కగా, అతనితో వసిష్ఠుడు ఇట్లా అన్నాడు.

చ. గుణముల నొప్పి బ్రాహ్మణులకుం గడుభక్తుఁడ వై సమస్త ధా
రుణి ప్రజ గూర్పఁగా విగతరోషుఁడ వై సుఖ ముండు మింక బ్రా
హ్మణుల కవజ్ఞసేయక శమంబును చేకొను; మింద్రుఁడైన బ్రా
హ్మణుల కవజ్ఞసేసి యవమానముఁ బొందుఁ బ్రతాపహీనుఁడై. 129

ప్రతిపదార్థం: గుణములన్= మంచిగుణాలచేత; ఒప్పి= ప్రకాశించి; బ్రాహ్మణులకున్; కడున్= మిక్కిలి; భక్తుఁడవు+ఐ; సమస్త; ధారుణి, ప్రజ= మొత్తం భూమియందలి ప్రజలు; కూర్పఁగా= ప్రేమింపగా; విగత, రోషుఁడవు+ఐ= పోయిన కోపం కలవాడ వై; సుఖము+ఉండుము= సుఖంగా ఉండుము; ఇంకన్= ఇకమీదట; బ్రాహ్మణులకున్; అవజ్ఞ= అవమానం; చేయక= కలిగించకుండా; శమంబును= శాంతిని; చేకొనుము= పొందుము; ఇంద్రుఁడు+ఐనన్= ఇంద్రుడు అయినప్పటికీ; బ్రాహ్మణులకున్; అవజ్ఞ= అవమానం; చేసి; ప్రతాప; హీనుఁడు+ఐ= పరాక్రమాన్ని కోల్పోయినవా డై; అవమానమున్, పొందున్= అవమానాన్ని పొందుతాడు.

తాత్పర్యం: మంచిగుణాలతో బ్రాహ్మణభక్తుడ వై; భూమిమీద ప్రజ లందరికీ ఇష్టుడ వై, కోపం లేకుండా, సుఖంగా జీవించుము. బ్రాహ్మణులను అవమానించక శాంతిని పొందుము. బ్రాహ్మణులకు అవమానం చేస్తే, ఇంద్రుడైనా పరాక్రమహీనుడై అవమానం పొందగలడు.

విశేషం: అలం : అర్థాంతరన్యాసం.

నన్నయకు "ధారుణి" (భూమి అని అర్థం) పదప్రయోగం చాలా ఇష్టం. ఈ పద్యం రెండవపాదంలో "ధా/రుణి....రోష" అని యతి స్థానములో 'ధారుణి'లోని "రు" వచ్చి-ఈ రూపాన్ని స్థిరపరచింది.

వ. అని కఱపిన నట్లచేయుదు నని యమ్మహీపతి వసిష్ఠుం దోడ్కొని, యయోధ్యాపురంబున కరిగి, సకల ప్రజానురాగ కరుం డయి యమ్మునివరు నతిభక్తిం బూజించుచుఁ, దొల్లి రాక్షసుం డయి మదయంతీ సహితంబు వనంబునం గ్రుమ్మరియెడి కాలం బొక్క బ్రాహ్మణ మిథునంబు ఋతుకాలప్రవృత్తి నున్నం గని యాఁ కంటి పెలుచన నందు బ్రాహ్మణుం బట్టికొని భక్షించిన, నతిదుఃఖిత యై యాబ్రాహ్మణభార్య పరమ పతివ్రత యాంగిరసి యనునది పురుషవియోగంబునం ఋత్త్రార్థంబయిన నిజప్రయత్నంబు విఫలం బగుటకు శోకించి, 'వనితాసంభోగంబున నీవును నా పురుషునట్లు పంచత్వంబునుం బొందు' మని శాపం బిచ్చి వసిష్ఠువలన నీకుఁ బుత్త్రలాభం బగు నని చెప్పి, యగ్నిప్రవేశంబు సేసినం, బదంపడి దీని నంతయు మదయంతివలన నెఱింగినవాఁ డై, తనకుఁ బుత్త్రోత్పాదన సామర్థ్యంబు లేమిం దలంచి కల్మాషపాదుండు పుత్త్రార్థి యయి వసిష్ఠున కి ట్లనియె. 130

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; కఱపినన్= బోధించగా; అట్లు+అ; చేయుదున్+అని; ఆ+మహీ, పతి= ఆ రాజు (కల్మాషపాదుడు); వసిష్ఠున్ తోడ్కొని= వెంటపెట్టుకొని; అయోధ్యాపురంబునకున్; అరిగి= వెళ్ళి; సకల, ప్రజా+అనురాగ, కరుండు+అయి= అందరు ప్రజలకు ప్రేమను, కలిగించువా డై; ఆ+ముని, వరున్= ఆ మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుడిని; అతి భక్తిన్= మిక్కిలి భక్తితో సేవిస్తూ; పూజించుచున్; తొల్లి= పూర్వం; రాక్షసుండు+అయి; మదయంతీ, సహితంబు= మదయంతితో

కూడి; వనంబునన్= అడవియందు; క్రుమ్మరియెడి= తిరిగెడి; కాలంబు= కాలంలో; ఒక్క; బ్రాహ్మణ, మిథునంబు= బ్రాహ్మణ దంపతుల జంట; ఋతుకాల, ప్రవృత్తిన్= కామకేళియందు; ఉన్నన్= ఉండగా; కని=చూచి; ఆఁకంటి, పెలుచనన్= ఆకలియొక్క అతిశయంచేత; అందున్= ఆ జంటలో; బ్రాహ్మణున్= బ్రాహ్మణుని; పట్టికొని, భక్షించినన్= తినగా; ఆ బ్రాహ్మణ భార్య= ఆ బ్రాహ్మణుని ఇల్లాలు; పరమ, పతివ్రత= మహాపతివ్రత; ఆంగిరసి అనునది= ఆంగిరసి అను ఆమె; అతి, దుఃఖిత+ఐ= మిక్కిలి దుఃఖించిన దై; పురుష, వియోగంబునన్= భర్తను కోల్పోవటంచేత; పుత్త్ర+అర్థంబు+అయిన= పుత్రుని కొరకైన; నిజ, ప్రయత్నంబు= తన యొక్క ప్రయత్నం; విఫలంబు+అగుటన్= ఫలము లేని దగుటకు; శోకించి= దుఃఖించి; వనితా, సంభోగంబునన్= స్త్రీతో రమించేటప్పుడు; నీవును= నీవు కూడా; నా, పురుషున్+అట్ల= నా భర్తవలె; పంచత్వంబునున్= మరణమును; పొందుము+అని; శాపంబు+ఇచ్చి; వసిష్ఠునివలనన్; నీకున్; పుత్త్ర, లాభంబు; అగున్+అని= చెప్పి; అగ్ని, ప్రవేశంబు= నిప్పులో దూకుట; చేసినన్= చేయగా; పదంపడి= పిమ్మట; దీనిన్+అంతయున్= ఈ జరిగినదాని నంతయు; మదయంతివలనన్= తనభార్య యైన మదయంతివలన; ఎఱింగినవాడై= తెలిసిన వాడై; తనకున్; పుత్త్ర+ఉత్పాదన, సామర్థ్యంబు లేమిన్= కొడుకును పుట్టించే శక్తి లేకుండుటను; తలంచి; కల్మాష పాదుండు; పుత్త్ర+అర్థి, అయి= పుత్త్రుడిని కోరినవాడై; వసిష్ఠునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని వసిష్ఠుడు బోధింపగా, ఆ విధంగానే చేస్తా నని ఆ రాజు వసిష్ఠుడిని వెంటబెట్టుకొని అయోధ్యా నగరానికి వెళ్లి, ప్రజలందరికి ఇష్టు డై ఆ ముని శ్రేష్ఠుణ్ణి అతిభక్తితో పూజించసాగాడు. పూర్వం తాను రాక్షసుడై, తనభార్య మదయంతితో కూడి అడవిలో తిరిగేకాలంలో ఒక బ్రాహ్మణదంపతులజంట కామకేళిలో ఉండటం చూచి, అధికమైన ఆకలితో బ్రాహ్మణుడిని పట్టుకొని భక్షింపగా, అతనిభార్య పరమపతివ్రత 'ఆంగిరసి' మిక్కిలి దుఃఖించి, భర్తను కోల్పోవటంవలన కొడుకు పుట్టా లన్న తనకోరిక విఫలమైన దని శోకించి, 'స్త్రీతో రమించినప్పుడు నీవుకూడా నా భర్తవలె అకాలమరణం పొందుతావు' అని శపించి, 'వసిష్ఠునివలన నీకు పుత్రలాభం కలుగుతుంది' అని చెప్పి, అగ్నిప్రవేశం చేసింది. తరువాత ఈ విషయమంతా మదయంతి ద్వారా తెలిసికొని, తనకు పుత్రులను పొందే యోగ్యత లే దని ఆలోచించి, కల్మాషపాదుడు పుత్రుణ్ణి కోరినవాడై వసిష్ఠునితో ఇట్లా అన్నాడు.

వసిష్ఠప్రసాదంబునఁ గల్మాషపాదుఁడు పుత్త్రవంతుఁడగుట (సం.1-168-11)

క. మనుకుల పవిత్రుఁ బుత్త్రకు । నినసన్నిభు ! నాకుఁ బడయు; మే నట్లయినన్
మునినాథ! నీ ప్రసాదం । బునఁ బితరులవలన ఋణవిముక్తుఁడ నగుదున్. 131

ప్రతిపదార్థం: మను, కుల, పవిత్రున్= మనువువంశాన్ని పరిశుద్ధం చేసేవాడిని; పుత్త్రకున్= చక్కటి కుమారుడిని; ఇన, సన్నిభున్= సూర్యుడితో సమానమైనవాడిని; నాకున్; పడయుము= పొందుము; ఏను= నేను; అట్లు+అయినన్= ఆ విధంగా అయితే కానీ; మునినాథ!= ఓ మునిశ్రేష్ఠా!; నీ ప్రసాదంబునన్= నీదయచేత; పితరులవలనన్= పితృదేవతలవలన; ఋణ, విముక్తుఁడన్= అప్పునుండి విడువబడినవాడను; అగుదున్= ఔతాను.

తాత్పర్యం: ఓ వసిష్ఠమహర్షీ! మనువువంశాన్ని పవిత్రంచేసేవాడు, సూర్యునితో సమానమైనవాడు అయిన సుపుత్రుడిని నాకు కలిగించుము. నేను ఆ విధంగా నీదయతో పితృదేవతల ఋణంనుండి విముక్తుడ నౌతాను.

వ. అని తన భార్యయైన మదయంతి యనుదానిని ఋతుమతి సమర్పించిన, నదియు వసిష్ఠుప్రసాదంబున గర్భిణి యయి పండ్రెండేఁడులు గర్భంబు మోచి వేసరి, యొక్క యశ్మశకలంబున నుదరభేదనంబుఁ జేసిన నశ్మకుం

డను రాజర్షి పుట్టె; నట యదృశ్యంతికిం బరాశరుం డుదయించి వసిష్ఠ నిర్మిత జాతకర్మాదికుండయి పెరుఁగుచు నొక్క నాఁడు రాక్షసభక్షణంబునం దనజనకు పంచత్వంబు దల్లివలన విని కోపదహనదందహ్యమాన హృదయుం డయి 'తపోమహత్త్వంబున నఖిలలోకసంహారంబు సేయుదు' నని యున్న మనుమని వారించి వసిష్ఠుం డి ట్లనియె. **132**

ప్రతిపదార్థం: అని= ఆప్రకారం; తన భార్య, ఐన, మదయంతి అను దానిని= మదయంతి అనే పేరుగల ఆమెను; ఋతుమతిన్= రజస్వల యైన దానిని; సమర్పించినన్= ఈయగా; అదియు= ఆమెయు; వసిష్ఠు, ప్రసాదంబునన్= వసిష్ఠుని దయచేత; గర్భిణి; అయి; పంద్రెండు+ఏఁడులు= పంద్రెండు సంవత్సరాలు; గర్భంబు, మోచి= గర్భాన్ని మోసి; వేసరి= విసుగుచెంది; ఒక్క; అశ్మ, శకలంబునన్= రాతిముక్కచేత; ఉదర భేదనంబునున్= కడుపు చీల్చుటను; చేసినన్= చేయగా; అశ్మకుండు, అను, రాజర్షి; పుట్టెన్= పుట్టాడు; అట; అదృశ్యంతికిన్= అదృశ్యంతికి; పరాశరుండు; ఉదయించి= పుట్టి; వసిష్ఠ, నిర్మిత, జాతకర్మ+ఆదికుండు+అయి= వసిష్ఠునిచేత చేయబడిన జాతకర్మం మొదలైనవి కలవాడై; పెరుగుఁచు; ఒక్కనాఁడు; రాక్షస, భక్షణంబునన్= రాక్షసుడు తినటంచేత; తన, జనకు, పంచత్వంబు= తనతండ్రియొక్క మరణం; తల్లివలన; విని; కోప, దహన, దందహ్యమాన హృదయుండు+అయి= కోప మనే అగ్నిచేత మిక్కిలిగా కాల్చబడుతున్న మనస్సు కలవా డై; తపస్+మహత్త్వంబునన్= తపస్సు యొక్క మహిమచేత; అఖిల, లోక, సంహారంబునన్= అన్ని లోకాలను చంపటం; చేయుదును=చేస్తాను; అని (కోపంతో) ఉండే; మనుమని, వారించి= పౌత్రుణ్ణి ఆపి; వసిష్ఠుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని, రజస్వల అయిన తన భార్య మదయంతిని వసిష్ఠునికి సమర్పించగా ఆమె అతని అనుగ్రహంతో గర్భిణి అయి, పన్నెండేళ్ళు గర్భం మోసి విసిగి, ఒక రాతిముక్కతో కడుపు చీల్చుకొనగా, అశ్మకుడు అనే రాజర్షి జన్మించాడు. అక్కడ అదృశ్యంతికి (శక్తి భార్యకు) పరాశరుడు జన్మించాడు. అతనికి వసిష్ఠుడు జాతకర్మాదులు జరిపించాడు. అతడు పెరుగుతూ 'రాక్షసుడు భక్షించటంచేత తనతండ్రి మరణించా' డని ఒకనాడు తల్లి ద్వారా తెలిసికొని, కోపాగ్నితో మండుతున్న హృదయం కలవాడై తన తపోమహిమతో అఖిలలోకాలను నాశనం చేస్తా నని పూనుకొనగా అతడిని ఆపి, వసిష్ఠమహాముని ఇట్లా అన్నాడు.

సీ. వినవయ్య! కృతవీర్యుఁ డను జనపతి దొల్లి । భృగు వంశ యాజ్యుఁ డై పెక్కుక్రతువు
లొనరించి, యగణిత ధనదానముల వారిఁ । దృప్తులఁ గావించి దివికిఁ జనిన,
నతనివంశమున వా రతిధనలుబ్ధులై । కృత్యవీర్యు ధనమెల్లఁ గ్రప్తి సేసి
కొని డాఁచియున్న వా రని భార్గవుల నెల్లఁ । బలికిన భార్గవుల్ భయము వొంది.

తే. కొంద ఱర్థము వారిక కూర్చి యిచ్చి; । రవనిసురవంశ్యులకు నిచ్చి రందుఁ గొంద,
ఱెవ్వరికి నీక తమ తమ యిండ్లఁ బాఁతి । కొని సుఖం బుండి రధము లై కొంద ఱందు. **133**

ప్రతిపదార్థం: వినవయ్య!= అయ్యా! విను; కృతవీర్యుఁడు; అను, జన, పతి= అనెడి రాజు; తొల్లి= పూర్వం; భృగు, వంశ, యాజ్యుఁడు+ఐ= భృగువంశం వారిని యాజ్యులుగా - అనగా యజ్ఞం చేయించే యాజ్ఞికులుగా కలవా డై; క్రతువులు= అనేక యజ్ఞాలు; ఒనరించి= చేసి; అగణిత, ధన, దానములన్= లెక్కలేనన్ని ధనదానాలచేత; వారిన్= వాళ్ళను; తృప్తులన్+కావించి= తృప్తినొందిన వారినిగా చేసి; దివికిన్= స్వర్గానికి; చనినన్= వెళ్ళగా; అతని, వంశము, వారు; అతి ధనలుబ్ధులు+ఐ= మిక్కిలిగా

ధనమునందు ఆశకలవారై; కృతవీర్య, ధనము+ఎల్లన్= కృతవీరునియొక్క ధనాన్ని అంతా; క్లృప్తి, చేసికొని= ఏర్పాటు చేసికొని; డాఁచి, ఉన్నవారు= దాచుకొని ఉన్నారు; అని= అని; భార్గవులన్+ఎల్లన్= భృగువంశం వారి నందరిని ఉద్దేశించి; పలికినన్= పలుకగా; భార్గవుల్= ఆ భృగువంశ బ్రాహ్మణులు; భయము, పొంది; కొందరు; అర్థము= ధనాన్ని; వారికి+అ= వారికే; కూర్చి= ఒకటిగా చేర్చి; ఇచ్చిరి= ఇచ్చారు; అందున్= వారిలో; కొందఱు= కొంతమంది; అవని, సుర, వంశ్యులకున్= బ్రాహ్మణ వంశాన పుట్టిన వారికి; ఇచ్చిరి; అందు, కొందఱు= అందులో మరికొంతమంది; ఎవ్వరికిన్= ఎవ్వరికికూడా; ఈక= ఇవ్వక; అధములు+ఐ= నీచులై; తమతమ, ఇండ్లన్; పాతికొని, సుఖంబు+ఉండిరి= తమ తమ ఇళ్ళలో పాతిపెట్టుకొని సుఖంగా ఉన్నారు.

తాత్పర్యం: వినవయ్యా! పూర్వం కృతవీర్య డనే రాజు భృగువంశబ్రాహ్మణులను యాజ్ఞికులుగా పొంది, పెక్కు యాగాలు చేసి, లెక్కలేనన్ని ధనదానాలచే వాళ్ళను తృప్తిపరచి స్వర్గానికి వెళ్ళాడు. అతనివంశంవాళ్ళు ధన లోభంతో 'కృతవీరుని ధనాన్నంతా భృగువంశబ్రాహ్మణులు సంగ్రహించి దాచుకొని ఉన్నారు' అని పలుకగా, ఆ బ్రాహ్మణులు కొందరు భయపడి తమ దగ్గర ఉన్న ధనాన్ని ఒకచోట చేర్చి వాళ్ళకే ఇచ్చారు. మరికొందరు తమధనాన్ని వేర్వేరు బ్రాహ్మణవంశాలవాళ్ళకు ఇచ్చారు. ఇంక కొందరు తమ ఇళ్లలో పాతిపెట్టుకొన్నారు.

వ. అంత నా క్షత్రియు లొక్క భార్గవుని యిల్లు గ్రొచ్చి యనంతం బయిన యర్థంబు గని యలిగి, రాజధన వంచకులై రని భార్గవుల నెల్ల నిగ్రహించి, గర్భంబుల నున్న యర్భకులు మొదలుగా వధించిన, వెఱచి భార్గవుల భార్యలెల్ల హిమవంతంబునకుం బాఱిన; నం దొక్క భృగుపత్ని భయంపడి, తన యూరుదేశంబున గర్భంబు ధరియించిన, నెఱింగి క్షత్రియులు దాని భేదింప సమకట్టి వచ్చిన నంతకు ముందఱ. 134

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; ఆ క్షత్రియులు= ఆ రాజులు; ఒక్క, భార్గవుని, ఇల్లు= ఒక భృగువంశ బ్రాహ్మణుని ఇల్లు; క్రొచ్చి= త్రవ్వి; అనంతంబు+అయిన= అంతం లేనిదైన అనగా అత్యధిక మైన, అర్థంబున్= ధనాన్ని; కని= చూచి; అలిగి= కోపించి; రాజ, ధనవంచకులు+ఐరి+అని= రాజుయొక్క ధనాన్ని అపహరించిన వాళ్ళు అయ్యా రని; భార్గవులన్+ఎల్లన్= భృగువంశ బ్రాహ్మణుల నంతా; నిగ్రహించి= పడద్రోసి; గర్భంబులన్+ఉన్న= కడుపు లో ఉన్న; అర్భకులు= బాలురు; మొదలుగా; వధియించినన్= చంపగా; వెఱచి= భయపడి; భార్గవుల; భార్యలు+ఎల్లన్= భార్గవుల, భార్యలందరు; హిమవంతంబు నకున్= హిమాలయ పర్వతానికి; పాఱినన్= పరుగెత్తగా; అందు+ఒక్క= వారిలో ఒక్క; భృగుపత్ని= భృగువంశపు బ్రాహ్మణుని భార్య, భయంపడి; తన; ఊరు, దేశంబునన్= తొడయందు; గర్భంబు= గర్భాన్ని; ధరియించినన్= ధరింపగా; ఎఱింగి= తెలిసికొని; క్షత్రియులు= రాజులు; దానిన్= దానిని; భేదింపన్= చీల్చుటకు; సమకట్టి= పూనుకొని; వచ్చినన్= రాగా; అంతకు ముందఱ= అంతకంటె మునుపే.

తాత్పర్యం: తర్వాత ఆ క్షత్రియులు ఒక భృగువంశబ్రాహ్మణుని ఇల్లు త్రవ్వి అత్యధికమైన ధనం చూచి, కోపించి, రాజధనం వంచనతో గ్రహించా రని ఆ భృగువంశబ్రాహ్మణుల నందరినీ పడద్రోసి, కడుపులలో ఉన్న బాలురు మొదలుగా అందరినీ చంపగా, వాళ్ళభార్యలంతా భయపడి హిమాలయానికి పరుగెత్తారు. వాళ్ళలో ఒక బ్రాహ్మణునిభార్య తనతొడలో గర్భాన్ని ధరించగా, క్షత్రియులు అది తెలిసికొని దానినికూడ విచ్ఛిన్నం చేయా లని రాగా, అంతకు ముందే.

భార్గవుండైన ఔర్వునిజననము (సం.1-169-20)

క. భువనోపప్లవసమయో । ద్భవ భానునిభప్రభావిభాసితుఁ డయి భా
ర్గవుఁ డూరుదేశమున ను । ద్భవించె మహి వెలుఁగుచుండఁ బ్రభ నౌర్వుఁ డనన్. 135

ప్రతిపదార్థం: భువన+ఉపప్లవ, సమయ+ఉద్భవ, భాను, నిభ, ప్రభా, విభాసితుఁడు+అయి= లోకాలయొక్క ప్రళయకాలమందు పుట్టిన సూర్యునితో సమానమైన కాంతిచేత ప్రకాశించేవా డై; భార్గవుఁడు= భృగువంశంవాడు; ఊరు, దేశమునన్= తొడయందు; ఔర్వుఁడు+అనన్= ఔర్వు డనే పేరుతో; ప్రభన్= కాంతితో; మహిన్= భూమిమీద; వెలుఁగుచుండన్= ప్రకాశించేటట్లుగా; ఉద్భవించెన్= పుట్టెను.

తాత్పర్యం: ప్రళయకాలసూర్యునివంటి కాంతితో భృగువంశంవాడు తొడనుండి పుట్టి ఔర్వు డనే పేరుతో లోక ప్రసిద్ధు డయ్యాడు.

మ. అమితౌజుం డగు వానిఁ జూచి కృతవీర్యామ్నాయజ క్షత్రియా
ధములెల్లన్ హతదృష్టు లై కృపణతం దత్పర్వతారణ్యదే
శములం గ్రుమ్మరుచుండి రంధు లయి; నిశ్శంకం బ్రతిక్రూరక
ర్మములం దుద్యతు లైన వారికి నశర్మప్రాప్తి గాకుండునే. 136

ప్రతిపదార్థం: అమిత+ఓజుండు+అగు= మిక్కిలి తేజస్సు కలవాడైన; వానిన్= ఆ ఔర్వుని; చూచి; కృతవీర్య+ఆమ్నాయజ, క్షత్రియ+అధములు+ఎల్లన్= కృతవీర్యుని వంశంలో పుట్టిన నీచులైన క్షత్రియులంతా; హత, దృష్టులు+ఐ= కొట్టబడిన చూపులు కలవాళ్ళయి అనగా నాశమైన దృష్టి కలవాళ్ళయి; అంధులు+అయి= గ్రుడ్డివాళ్ళయి; కృపణతన్= దీనత్వంతో; తద్+పర్వత, అరణ్య, దేశములన్= ఆ కొండలయొక్క, అడవులయొక్క ప్రదేశాలలో; క్రుమ్మరుచుండిరి= తిరుగుతూ ఉన్నారు; నిశ్శంకంబు= జంకులేకుండ; అతి, క్రూర, కర్మములందు= మిక్కిలి దుర్మార్గపు పనులలో; ఉద్యతులు+ఐన; వారికిన్= ప్రయత్నం కలవాళ్ళకి; అశర్మప్రాప్తి= సంతోషం కానిదానిని పొందటం - అనగా దుఃఖాన్ని పొందటం; కాకుండునే= జరుగకుండునా.

తాత్పర్యం: అమితమైన తేజస్సు కల ఆ ఔర్వుడిని చూచిన వెంటనే కృతవీర్యుని వంశంలో పుట్టిన క్షత్రియాధము లంతా దృష్టి కోల్పోయి, గ్రుడ్డివా ళ్ళయి దైన్యంతో ఆ పర్వతారణ్యప్రదేశాలలో తిరుగుతూ ఉండిపోయారు. జంకు లేకుండ పరమదుర్మార్గపుపనులు చేయటానికి ప్రయత్నించేవాళ్ళకు దుఃఖం ప్రాప్తించకుండా ఉంటుందా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. అ ట్లా క్షత్రియు లందఱు నంధు లై భృగుపత్ని యొద్దకు వచ్చి, మాకు దృష్టిదానంబుఁ బ్రసాదింపవలయు నని వేఁడిన నది వారల కి ట్లనియె. 137

ప్రతిపదార్థం: అట్లు; ఆ క్షత్రియులు; అందఱున్; అంధు లై= గ్రుడ్డివాళ్ళయి; భృగుపత్ని= భృగువు భార్య; వద్దకు= దగ్గరకు; వచ్చి= చనుదెంచి; మాకున్; దృష్టి= చూపు; దానంబున్= ఇచ్చుట; ప్రసాదింపవలయును; అని= అని; వేఁడినన్= ప్రార్థింపగా; అది, వారలకున్= ఆమె వాళ్లతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ విధంగా ఆ క్షత్రియులంతా గ్రుడ్డివాళ్ళయి భృగుభార్యవద్దకు వచ్చి 'మాకు చూపు మరల ప్రసాదించు' మని వేడుకోగా ఆమె వాళ్ళతో ఇట్లా అన్నది.

మధ్యాక్కర.

ఏను మీ దృష్టులు గొన్నదానఁ గా; నిక్కుమారుండు
భానుతేజుండు మీచేఁ దనగురులు పరిభూతు లయిన
దానికి నలిగి మీ పాపబుద్ధికిఁ దగ నిట్లు సేసె;
వీని మే రెఱుఁగరె భార్గవకులము వెలిఁగించువాని. 138

ప్రతిపదార్థం: ఏను= నేను; మీ, దృష్టులు= మీ చూపులను; కొన్న, దానన్= తీసికొన్న దానను - అనగా మీకు లేకుండ చేసిన దానను; కాన్= కాను; ఈ+కుమారుండు; భాను, తేజుండు= సూర్యునితో సమానమైన తేజస్సుకలవాడు; మీచేన్= మీ చేత; తన, గురులు= తన తండ్రి తాతలు; పరిభూతులు= అవమానింపబడినవాళ్ళు; అయిన, దానికిన్= అయినందుకు; అలిగి= కోపించి; మీ, పాప, బుద్ధికిన్= మీ యొక్క పాపచింతనకు; తగన్= తగినట్లు; ఇట్లు; చేసెన్; భార్గవ, కులము; వెలిఁగించువాని; వీని, మీరు+ఎఱుఁగరే= ఇతనిని మీరు ఎరుగరా?

తాత్పర్యం: మీ చూపులను నేను పోగొట్టలేదు. ఈ కుమారుడు సూర్యసమానమైన తేజస్సు కలవాడు. తన తండ్రితాతలను మీరు అవమానించా రని కోపించి, మీ పాపబుద్ధికి తగినట్లు ఇట్లా చేశాడు. భార్గవకులాన్ని ప్రకాశింపజేసే వీడిని మే రెరుగరా?

వ. 'ఇ క్కుమారుండు నూఱు సంవత్సరములు నా యూరు గర్భంబున నుండి సకల వేదవేదాంగంబులు నేర్చినవాఁడు, మహాతపోనిధి; మీకుం గరుణించు నితనిం బ్రార్థింపుం', డనిన, నాక్షత్రియులు నతిభక్తులై యౌర్వుం బ్రార్థించి తత్ప్రసాదంబున దృష్టులు వడసి చని; రంత నౌర్వుండు దన పితృబంధుజనులెల్ల నొక్కటం బరలోక గతు లగుటకు దుఃఖించి, సకలలోక ప్రలయార్థంబుగా ఘోరతపంబు సేయందొడంగిన. 139

ప్రతిపదార్థం: ఈ+కుమారుండు; నూఱు, సంవత్సరములు; నా, ఊరు గర్భంబునన్= నా తొడయందు; ఉండి= నివసించి; సకల, వేద, వేద+అంగంబులు= అన్ని వేదములు, వేద వేదాంగములు; నేర్చినవాఁడు= అభ్యసించినవాడు; మహా, తపోనిధి= గొప్ప తపస్సునకు స్థానమైనవాడు; మీకున్= మిమ్ము; కరుణించున్= కరుణిస్తాడు; ఇతనిన్= వీనిని; ప్రార్థింపుండు= ప్రార్థించండి; అనినన్= అనగా; ఆ క్షత్రియులున్= ఆ క్షత్రియులు; అతి, భక్తులు+ఐ= మిక్కిలి భక్తికలవారై; ఔర్వున్, ప్రార్థించి= ఔర్వుని ప్రార్థించి (వేడుకొని); తత్+ప్రసాదంబునన్= అతనియొక్క దయచేత; దృష్టులు= చూపులు; పడసి= పొంది; చనిరి= వెళ్ళారు; అంతన్= అటుపై; ఔర్వుండు= ఔర్వుడు; తన, పితృ బంధుజనులు+ఎల్లన్= తన తండ్రులు, బంధువులు అందరు; ఒక్కటన్= ఒక్కటిగా, ఒక్కసారిగా; పరలోక, గతులు+అగుటకున్= మరొకలోకానికి వెళ్లినవారగుటకు; - అనగా మరణించినందుకు; దుఃఖించి; సకలలోక; ప్రలయ+అర్థంబుగాన్= అన్ని లోకాల నాశనంకొరకు; ఘోర తపంబు= భయంకరమైన తపస్సు; చేయన్+ తొడంగినన్= చేయటానికి పూనుకొనగా.

తాత్పర్యం: 'ఈ కుమారుడు వందసంవత్సరాలు నా ఊరువులో ఉండి వేదవేదాంగా లన్నిటిని నేర్చాడు; మహాతపోనిధి. ఇతడిని ప్రార్థించండి. మిమ్ములను కరుణిస్తాడు' అని పల్కగా, ఆ క్షత్రియులు మిక్కిలి భక్తి కలవాళ్ళయి ఔర్వుని

ప్రార్థించి, అతని దయతో తిరిగి దృష్టిని పొంది వెళ్ళిపోయారు. తర్వాత ఔర్వుడు తన తండ్రులు, బంధువులు అందరు ఒక్కసారిగా మరణించినందుకు దుఃఖించి, లోకాలన్నింటిని నాశనం చేసేందుకు భయంకరమైన తపస్సు చేయ పూనుకొన్నాడు.

చ. అతని తపంబు పెంపునఁ జరాచరసంభృతమైన విష్టప
త్రితయము భీతిఁ బొందిన, ధృతిం బితృలోకనివాసు లైన త
త్పితృవరు లెల్ల వచ్చి కడుఁ బ్రీతి నపాకృత గర్వు నౌర్వు న
ప్రతిమతపోవిభాసిఁ గని పల్కిరి తద్దయు శాంతచిత్తులై. 140

ప్రతిపదార్థం: అతని, తపంబు, పెంపునన్= ఆ ఔర్వుని తపస్సుయొక్క అధిక్యంచేత; చర+అచర, సంభృతము+అయిన= కదలిక కలవాటితో, కదలికలేని వాటితో నిండిన; విష్టప, త్రితయము= లోకాలు మూడు; భీతిన్= భయాన్ని; పొందినన్= పొందగా; ధృతిన్= సంతోషంతో; పితృలోక, నివాసులు+ఐన= పితృలోకంలో ఉన్నవాళ్ళయిన; తద్+పితృ, వరులు+ఎల్లన్= అతనియొక్క ఉత్తములైన తండ్రులంతా; వచ్చి; కడున్= మిక్కిలి; ప్రీతిన్= ప్రేమతో; అపాకృత, గర్వున్= తొలగింపబడిన గర్వం కలవాడిని; అప్రతిమ, తపస్+విభాసిన్= సాటిలేని తపస్సుచే ప్రకాశించేవాడిని; ఔర్వున్= ఔర్వుని; కని= చూచి; తద్దయున్= మిక్కిలి; శాంతచిత్తులు+ఐ= శాంతంతో కూడిన మనస్సుకలవాళ్ళయి; పలికిరి.

తాత్పర్యం: ఆ ఔర్వుని తీవ్రతపస్సుకు చరాచరాలతో కూడిన ముల్లోకాలు భీతిచెందగా, పితృలోకవాసులైన అతని తాతతండ్రులంతా సంతోషంతో వచ్చి మిక్కిలిప్రేమతో - గర్వం లేనివాడు, సాటిలేని తపస్సుతో ప్రకాశించేవాడు అయిన ఔర్వుడిని చూచి మిక్కిలి శాంతచిత్తులై ఈ విధంగా పలికారు.

పితృదేవతలు ఔర్వుని శాంతచిత్తునిఁ జేయుట (సం.1-170-14)

వ. 'అయ్యా! నీ తపో మహత్త్వంబుఁ జూచి లోకంబు లెల్ల భయంపడియెడు; లోకానుగ్రహంబుగా నీరోషంబు విడువుము; మే మసమర్థుల మై క్షత్రియులచేత వధియింపం బడిన వారము గాము; ధనలుబ్ధుల మయి ధనంబు దాఁచినవారము గాము; ధనము వలసినం గుబేరుండు దాన మాకుఁ దెచ్చి యిచ్చుం; దపోమహత్త్వంబున మాకు నాయువు గడుంబెద్దయైన నిర్వేదించి మనుష్యలోకంబున నుండ నొల్లక యాత్మఘాతంబునం బుణ్యలోకంబులు లేమిం జేసి దానిం బరిహరించి యా క్షత్రియులతో వైరం బమర్చికొని తన్నిమిత్తంబున దేహంబులు విడిచితిమి; భార్గవులతేజంబు నొరులు పరిభవింప నోపుదురె? కావున నీవు దీనికింగా సర్వజనోపద్రవంబు సేయవల; దిది మా కభీష్టం' బనిన నౌర్వుండు వారల కి ట్లనియె. 141

ప్రతిపదార్థం: అయ్యా; నీ, తపస్+మహత్త్వంబున్= నీ తపస్సుయొక్క గొప్పతనాన్ని; చూచి; లోకంబులు+ఎల్లన్; భయంపడియెడు; లోక+అనుగ్రహంబుగా= లోకాలకు మేలు కలిగేటట్లుగా; నీ, రోషంబు= నీ కోపాన్ని; విడువుము; మేము= అందరము; అసమర్థులము+ఐ= శక్తిలేని వారమై; క్షత్రియులచేత; వధియింపన్+పడిన, వారము కాము= చంపబడినవాళ్ళం కాము; ధన, లుబ్ధులము+అయి= ధనమునందు మిక్కిలి ఆశ కలవాళ్ళ మై; ధనంబు= ధనాన్ని; దాచిన వారము కాము= దాచిపెట్టిన వాళ్లం కాము; ధనము; వలసినన్= అవసరమైతే; కుబేరుండు; తాన్+అ= తానే; మాకున్; తెచ్చి ఇచ్చున్; తపస్+మహత్త్వంబునన్=

తపస్సుయొక్క మహిమచేత; మాకున్= మాకు; ఆయువు= ఆయుష్యం; కడున్= మిక్కిలి; పెద్ద, ఐనన్= ఎక్కువ కాగా; నిర్వేదించి= విరక్తి చెంది; మనుష్య లోకంబునన్= మానవలోకంలో; ఉండన్= ఉండటానికి; ఒల్లక= ఇష్టపడక; ఆత్మ, ఘాతంబునన్= ఆత్మహత్యవలన; పుణ్యలోకంబులు; లేమిన్+చేసి= లేకుండటంవలన; దానిన్= ఆత్మహత్యను; పరిహరించి= వదలి; ఆ, క్షత్రియులతో; వైరంబు; అమర్చికొని= ఏర్పాటు చేసికొని; తద్+నిమిత్తంబునన్= ఆ కారణంగా; దేహంబులు, విడిచితిమి; భార్గవుల= భృగువంశం బ్రాహ్మణులయొక్క; తేజంబున్= కాంతిని, పరాక్రమాన్ని; ఒరులు= ఇతరులు; పరిభవింపన్+ ఓపుదురే= అవమానింపగలరా; కావునన్; నీవు; దీనికిన్+కా= దీనికొరకని; సర్వ, జన+ఉపద్రవంబు= అందరు ప్రజలకు హాని; చేయ, వలదు= చేయవద్దు; ఇది; మాకు; అభీష్టంబు= కోరిక; అనినన్= అని చెప్పగా; ఔర్వుండు; వారలకున్= వాళ్లకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నాయనా! నీ తపోమహిమ చూచి లోకా లన్నీ భయపడుతున్నాయి. లోకాలకు మేలు కలిగే విధంగా నీ కోపాన్ని వదలిపెట్టుము. మేము అసమర్థుల మై క్షత్రియులచేత వధింపబడ లేదు. ధనంమీది పేరాసతో ధనాన్ని దాచలేదు. మాకు ధనం అవసరమైతే, కుబేరుడు తానే తెచ్చి యిస్తాడు. తపోమహిమతో మాకు ఆయుష్యం మిక్కిలియెక్కువ కాగా విరక్తి చెంది, మానవలోకంలో ఉండటానికి ఇష్టం లేక, ఆత్మహత్య చేసికొంటే పుణ్యలోకాలు రావని, దాన్ని వదలి, ఆ క్షత్రియులతో వైరం తెచ్చుకొన్నాం. ఆ కారణంగా దేహాలు విడిచాం. భృగువంశ బ్రాహ్మణులు తేజస్సును ఇతరులు పరాభవించగలరా? కనుక దీనికై నీవు ప్రజలందరికీ హాని చేయవద్దు. ఇది మా కోరిక' అని పల్కగా ఔర్వుడు వాళ్ళతో ఇట్లా అన్నాడు.

మత్తకోకిలము.

మానితం బగు నా తపోమహిమం బ్రిలోక పరాభవం
బేను జేయఁగఁ బూని చేసితి నిట్టి దొక్క ప్రతిజ్ఞ మున్,
దీని నెట్టులు గ్రమ్మఱింతు మదీయ భాషిత మెన్నఁడు
న్నేని మోఘము గాదు దిగ్ధరణీరవీందు లెఱుంగఁగన్. **142**

ప్రతిపదార్థం: మానితంబు+అగు= పూజింపబడినదయిన; నా, తపోమహిమన్ = నా తపస్సుయొక్క గొప్పతనంచేత; ఏను=నేను; త్రిలోక, పరాభవంబున్= ముల్లోకాల నాశనాన్ని; చేయఁగన్= చేయటానికి; పూని= ప్రయత్నించి; పూర్వము; ఇట్టిది= ఇటువంటిదైన, ఒక్క, ప్రతిజ్ఞ= ఒక్క ప్రతిన; చేసితిన్= చేశాను; దీనిన్= దీన్ని; ఎట్టులు= ఏ విధంగా; క్రమ్మరింతున్= మరలిస్తాను; దిక్+ధరణీ, రవి+ఇందులు= దిక్కులు, భూమి, సూర్యుడు, చంద్రుడు; ఎఱుంగఁగన్= తెలియగా; మదీయ, భాషితము= నాదైన మాట; ఎన్నఁడున్+ఏని= ఎన్నడైనా; మోఘము= వ్యర్థం; కాదు= కాజాలదు.

తాత్పర్యం: ప్రశస్తమైన నా తపోమహిమతో ముల్లోకాలను నాశనం చేస్తా నని పూర్వం నే నొక ప్రతిజ్ఞ చేశాను. దీనిని ఏ విధంగా మరలిస్తాను. దిక్కులు, భూమి, సూర్యచంద్రులు సాక్షులుగా నా మాట ఎన్నడూ వ్యర్థం కాదు.

విశేషం: ఔర్వుడు తన ప్రతిజ్ఞ వ్యర్థం కాదు అని చెప్పే సందర్భంలో ప్రతిజ్ఞాపాలన తప్పు దని నిర్ధారించాడు. అట్టి నిర్ధారణ వాక్యం ఏ స్వరంలో ఏ విధంగా ప్రకటించాలో ప్రస్తుత పద్యగతిలో ప్రతీయమానమైంది.

క. మతి మఱచి యనిస్తీర్ణ । ప్రతిజ్ఞుఁ డగు వాని కోపపటుదహన మని
ర్గత మయి వడి నరణి సము । త్థిత దహనమపోలె నాత్మదేహము నేర్చున్. **143**

ప్రతిపదార్థం: మతిన్= మనస్సునందు; మఱచి; అనిస్తీర్ణ, ప్రతిజ్ఞుఁడు= దాటబడని ప్రతిజ్ఞ కలవాడు; అగు, వాని, కోప, పటు, దహనము= అయిన వ్యక్తియొక్క కోపం అనెడి గొప్ప అగ్ని; అనిర్గతము+అయి= బయటికి వెలువడని దై; అరణి, సమ్+ఉత్థిత, దహనము+అ పోలెన్= అరణియందు పుట్టిన నిప్పువలె, వడిన్= వేగమే; ఆత్మదేహమున్= తన శరీరాన్ని; ఏర్చున్= కాల్చును.

తాత్పర్యం: మరచిపోయి తన ప్రతిజ్ఞను నేరవేర్చుకొననివాడి కోపాగ్ని వెలుపలికి రానిదై, అరణిలో పుట్టిన అగ్నివలె వెంటనే అతనిశరీరాన్ని కాల్చివేస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

క. అలయక నిమిత్తజంబగు। నలుకను క్షమియించి శాంతుఁ డగు పురుషుం డి
మ్ముల రక్షింపఁగ నోపునె। పొలుపుగ ధర్మార్థకామములు సమములుగన్. 144

ప్రతిపదార్థం: అలయక= శ్రమపడక; నిమిత్తజంబు+అగు, అలుకను= కారణంవలన పుట్టిన దైవ కోపాన్ని; క్షమించి= ఓర్చి; శాంతుఁడు+అగు= శాంతం కలవాడైన; పురుషుండు= మానవుడు; పొలుపుగా= చక్కగా; ధర్మ+అర్థ, కామములు= ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలు; సమములుగన్= సమానాలుగా; ఇమ్ములన్= తగినట్లుగా; రక్షింపఁగన్+ఓపునె= రక్షింప కలుగునా.

తాత్పర్యం: ఒక కారణంవలన కలిగిన కోపాన్ని తీర్చుకొనటానికి శ్రమపడక, సహించి శాంతు డైన మానవుడు ధర్మార్థకామాలను చక్కగా, సమానంగా రక్షించగలడా?

తే. పాపు లై క్షత్రియాధముల్ భార్గవులకు। నట్లు హింస గావించు నాఁ డార్తనాద
మూరుగర్భగతుండనై యుండి వినిన। నాఁడ కోప మసహ్యమై నన్నుఁ బొందె. 145

ప్రతిపదార్థం: పాపులు+ఐ= దుర్మార్గు లై; క్షత్రియ+అధముల్= నీచు లైన క్షత్రియులు; భార్గవులకున్= భృగువంశ బ్రాహ్మణులకు; అట్లు; హింస, కావించునాఁడు= ఆ విధంగా హింస చేసే రోజు, ఆర్తనాదము= దుఃఖధ్వని; ఊరు, గర్భ, గతుండను+ఐ= తొడలోపల ఉన్నవాడనై; ఉండి= వసించి; వినిన, నాఁడు+అ= వినిన రోజే; కోపము; అసహ్యము+ఐ= ఓర్వరాని దై; నన్నున్; పొందెన్.

తాత్పర్యం: దుర్మార్గులై, నీచు లైన క్షత్రియులు - భృగువంశ బ్రాహ్మణులను ఆ విధంగా హింసిస్తున్నవాడే, వాళ్ళ దుఃఖధ్వనిని నేను తొడలోపల ఉండి విన్నప్పుడే నాకు సహించరాని కోపం కలిగింది.

తే. ఎఱుక గలఁ డేని మఱి శక్తుఁ డేని యన్యు। లన్యులకు హింస గావించునపుడు దానిఁ
బూని వారింపకున్న నప్పురుషుఁ డేఁగు। హింస చేసినవారల యేఁగుగతికి. 146

ప్రతిపదార్థం: ఎఱుక=జ్ఞానం; కలఁడు+ఏని= ఉన్నవాడైతే; అన్యులు= ఇతరులు; అన్యులకున్= ఇతరులకు; హింస, కావించు, నపుడు; దానిన్= ఆ హింసను; పూని= ప్రయత్నించి; వారింపక+ఉన్నన్= ఆపకున్నట్లయితే; ఆ+పురుషుఁడు; హింస, చేసిన వారల; ఏఁగు గతికిన్= వెళ్ళే మార్గానికి (చోటుకి) (నరకానికి అని భావం).

తాత్పర్యం: జ్ఞానవంతుడు, సమర్థుడు అయినవాడు - ఒకరు మరొకరిని హింసించే సమయంలో ప్రయత్నించి ఆ హింసను నివారించకుంటే, అతడుకూడ ఆ హింస చేసినవాళ్ళగతినే (నరకాన్నే) పొందుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తి.

వ. 'కావున లోకంబులయందు సామర్థ్యంబు గలిగి పాప ప్రతిషేధంబు సేయని వారల నుద్దేశించి యలిగితి; నేనును మీ వచనంబతిక్రమింప నోడుదు; నఖిలలోకదహనోద్యతం బయిన నా కోపదహనంబు నిగృహీతం బయిన నన్ను దహించు; నేమి సేయు వాఁడ? మీరు సర్వలోకహితులరు; నాకును లోకంబులకును హితం బగునట్లుగా నుపదేశింపుఁ' డనిన నౌర్వునకుం బితరు లి ట్లనిరి. 147

ప్రతిపదార్థం: కావునన్; లోకంబుల అందున్= లోకాలలో; సామర్థ్యంబు; కలిగి; పాప, ప్రతిషేధంబు= పాపాన్ని ఆపటాన్ని; చేయని వారలన్= చేయనివాళ్లను; ఉద్దేశించి; అలిగితిని= కోపించాను; ఏనును= నేనుకూడ; మీ, వచనంబు= మీ మాట; అతిక్రమింపన్= దాటుటకు; ఓడుదును= భయపడతాను; అఖిల, లోక, దహన+ఉద్యతంబు+అయిన= అన్ని లోకాలను కాల్చటానికి పూనుకొన్న; నా, కోప, దహనంబు= నా కోప మనే నిప్పు; నిగ్రహీతంబు+అయినన్= నివారింపబడిన దైతే; నన్ను+అ= నన్నే; దహించున్= కాల్చును; ఏమి, చేయువాఁడన్= నేనేమి చేయాలి; మీరు; సర్వలోక, హితులరు= అన్ని లోకాలకు మేలు కోరేవారు; నాకును, లోకంబులకును, హితంబు+అగునట్లుగాన్= నాకూ, లోకాలకూ మేలు కలిగేటట్లుగా; ఉపదేశింపుఁడు; అనినన్= అని అడుగగా; ఔర్వునకున్= ఔర్వునికి; పితరులు= పితృదేవతలు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: 'అందుచేత లోకాలలో - సామర్థ్యం ఉండి, పాపాన్ని ఆపటానికి ప్రయత్నంచేయనివాళ్ళను ఉద్దేశించి కోపం వహించాను. నేను మీ మాట దాటటానికి భయపడతాను. లోకాలన్నింటిని దహించటానికి పూనుకొన్న నా కోపాగ్నిని ఆపితే, అది నన్నే దహిస్తుంది. ఇప్పు డేం చేయాలి? నాకూ, ఈ లోకాలకూ మేలు కలిగే విధంగా ఉపదేశించండి' అని పల్కగా ఔర్వునితో పితృదేవతలు ఇట్లా అన్నారు.

ఆ. జలములంద యుండు సర్వలోకంబులు । గాన నీ మహోగ్ర కలుష వహ్ని
జలధిలోన విడిచి సత్యప్రతిజ్ఞుండ । వగుము; జలధి జలము నది దహించు. 148

ప్రతిపదార్థం: సర్వ, లోకంబులు= అన్ని లోకాలు; జలములు+అంద= నీటియందే; ఉండున్= ఉంటాయి; కాన= కనుక; నీ, మహా+ఉగ్ర, కలుషవహ్నిన్= నీయొక్క మిక్కిలి భయంకరమైన కోప మనే అగ్నిని; జలధిలోనన్= సముద్రంలో; విడిచి; సత్య, ప్రతిజ్ఞుఁడవు= సత్యమైన ప్రతిజ్ఞ కలవాడవు; అగుము= కావలసింది; ఆ కోపాగ్ని; జలధి, జలమున్= సముద్రపు నీటిని; దహించున్= కాల్చుతుంది.

తాత్పర్యం: అన్నిలోకాలూ నీటిలోనే ఉంటాయి. కనుక మహాభయంకరమైన నీ కోపాగ్నిని సముద్రంలో విడిచిపెట్టి; నీ ప్రతిజ్ఞ నెరవేర్చుకో. అది సముద్రంలోని నీటిని దహిస్తుంది.

వ. 'అనిన నౌర్వుండు పితృదేవతాదేశంబునఁ దన కోపానలంబు సముద్రంబులో వైచిన, నది యౌర్వానలంబు నా నశ్వముఖంబున నబ్ధిజలంబులఁ ద్రావుచుండు; నిది వేదంబులయందు వినంబడియెడుకథ గావున నీవును నౌర్వునట్ల ధర్మవిదుండవు భువనపరిభావి యైన యీ క్రోధంబు విడువు' మనిన వసిష్ఠు వచనంబునం బరాశరుండు గోపం బుపసంహరించి, రాక్షసవినాశార్థంబుగా సత్త్రయాగంబు సేయం గడంగిన. 149

ప్రతిపదార్థం: అనినన్= అని తెలుపగా; ఔర్వుండు; పితృదేవతా+ఆదేశంబునన్= పితృదేవతలయొక్క ఆజ్ఞచేత; తన, కోప+అనలంబు= కోపమనే అగ్నిని; సముద్రంలో= సాగరంలో; వైచినన్= విసరివేయగా; అది= అదే; ఔర్వ+అనలంబు, నాన్= ఔర్వాగ్ని అనే పేరుతో; అశ్వముఖంబునన్= గుర్రపుముఖంతో; అబ్ధి, జలంబులన్= సముద్రపు నీటిని; త్రావుచున్+ఉండున్= త్రాగుతూ ఉన్నది; ఇది, వేదంబులన్ అందు= ఇది వేదాలలో; వినంబడియెడు= వినిపించెడి; కథ= కథ; కావునన్= కాబట్టి; నీవును= నీవు కూడా; ఔర్వు, అట్ల= ఔర్వునివలె; ధర్మ, విదుండవు= ధర్మాన్ని తెలిసినవాడవు; భువన, పరిభావి,ఐన= లోకములను నశింపచేసేది ఐన; ఈ, క్రోధంబున్= ఈ కోపాన్ని; విడువుము+అనిన= వదలిపెట్టు అని పలికినట్టి; వసిష్ఠ, వచనంబునన్= వసిష్ఠునిమాటప్రకారం; పరాశరుండు; కోపంబు= కోపాన్ని; ఉపసంహరించి= మరలించి; రాక్షస, వినాశ+అర్థంబుగాన్= రాక్షసులచావుకొరకు; సత్రయాగంబు= సత్రయాగాన్ని; చేయన్= చేయటానికి; కడంగినన్= పూనుకొనగా.

తాత్పర్యం: అని పల్కగా ఔర్వుడు పితృదేవతల ఆజ్ఞ ప్రకారం తన కోపాగ్నిని సముద్రంలో వేయగా, అది ఔర్వాగ్ని అనే పేరుతో గుర్రపుముఖంతో సముద్రపునీటిని త్రాగుతూ ఉంటుంది. ఇది వేదాలలో వినిపించే కథ. 'నీవుకూడా ఔర్వునివలె ధర్మం తెలిసినవాడవు కనుక లోకాలను నశింపజేసే ఈ కోపాన్ని విడిచిపెట్టుము' అని పల్కగా, వసిష్ఠునిమాట ప్రకారం పరాశరుడు కోపాన్ని ఉపసంహరించి, రాక్షసవినాశంకొరకు సత్రయాగం చేయాలని పూనుకొన్నాడు.

పరాశరుఁడు రాక్షసవినాశార్థంబు సత్రయాగంబు సేయుట (సం.1-172-2)

తే. శక్తి రాక్షసనిహతుఁ డై చనిన శోక । దహనహతుఁ డై వసిష్ఠుండు దానిఁ దలఁచి
కడుఁ బ్రశాంతాత్ముఁ డయ్యు రాక్షసవినాశ । మొలసి మనుమని వారింపకుండె నంత. 150

ప్రతిపదార్థం: శక్తి= శక్తిమహాముని; రాక్షస, నిహతుఁడు+ఐ= రాక్షసునిచేత చంపబడినవాడై; చనినన్= చనిపోగా; వసిష్ఠుండు, ప్రశాంత+ఆత్ముఁడు+అయ్యున్= శాంతమైన మనస్సు కలవాడే అయినా; దానిన్= దానిని; తలఁచి= తలచుకొని; శోక, దహన, హతుఁడు+ఐ= శోక మనే అగ్నిచేత మనస్సు చెడినవాడై; రాక్షస, వినాశము= రాక్షసులయొక్క చావు; ఒలసి= కాంక్షించి; మనుమనిన్= మనుమడైన పరాశరుణ్ణి; వారింపక= ఆపక; ఉండెన్; అంతన్= అటుపై.

తాత్పర్యం: శక్తి మహాముని రాక్షసనిహతు డై గతింపగా, వసిష్ఠుడు శాంతమైన మనస్సు కలవాడే అయినప్పటికీ, దానిని తలచుకొని దుఃఖాగ్నితో మనస్సు చెడినవాడై; తన మనుమ డైన పరాశరుడు రాక్షసవినాశనార్థం చేసే యాగప్రయత్నాన్ని నివారించలేదు.

క. ఘోరాకారులు కృతహా । హారవులు సబాలవృద్ధు లయి పడిరి దురా
చారులు రాక్షసులు ముని । ప్రారబ్ధాధ్వరసమిద్ధపావకశిఖలన్. 151

ప్రతిపదార్థం: ఘోర+ఆకారులు= భయంకరమైన రూపం కలవాళ్ళు; కృత, హాహా, రవులు= చేయబడిన హాహా అనేధ్వని కలవాళ్ళు; దుర్+ఆచారులు= చెడుప్రవర్తన కలవాళ్ళు; రాక్షసులు, స, బాల, వృద్ధులు+అయి= బాలురతో, ముసలి వాండ్రతో కూడినవాళ్లయి; ముని, ప్ర+ఆరబ్ధ+అధ్వర, సమిద్ధ, పావక, శిఖలన్= పరాశరమునిచేత గొప్పగా ప్రారంభింపబడిన యజ్ఞమునందలి మండుతున్న అగ్నిజ్వాలలలో; పడిరి.

తాత్పర్యం: దుర్మార్గులైన రాక్షసులు, భయంకరమైన హాహాకారాలతో, బాలురతో, వృద్ధులతో సహా పరాశరుడు ప్రారంభించిన యాగంలో - మండుతున్న అగ్నిజ్వాలలలో పడిపోయారు.

వ. ఇట్లు పరాశరుండు గావించు సత్త్రయాగంబున నైన రాక్షసకులప్రళయంబుఁ జూచి పులస్త్యపులహక్రతువులు మహామునిసంఘుంబులతో వసిష్ఠాశ్రమంబునకు వచ్చి. 152

ప్రతిపదార్థం: ఇట్లు, పరాశరుండు; కావించు= చేయు; సత్త్ర, యాగంబునన్+ఐన= సత్రయాగంలో జరిగిన; రాక్షస, కుల, ప్రళయంబున్= రాక్షసవంశ నాశనాన్ని; చూచి, పులస్త్య= పులస్త్యుడు; పులహ= పులహుడు; క్రతువులు= క్రతువు లనేవాళ్లు; మహాముని, సంఘంబులతోన్= మహామునుల సమూహాలతో; వసిష్ఠ+ఆశ్రమంబునకున్= వసిష్ఠుని ఆశ్రమానికి; వచ్చి.

తాత్పర్యం: ఈ విధంగా పరాశరుడు చేసే సత్త్రయాగంలో జరిగిన రాక్షసనాశనాన్ని చూచి - పులస్త్యుడు, పులహుడు, క్రతువు మహర్షులసమూహంతో వసిష్ఠాశ్రమానికి వచ్చి.

విశేషం: పులస్త్యుడు, పులహుడు, క్రతువు - బ్రహ్మమానసపుత్రులు.

క. అగ్నిహతిఁ జేసి మానవ । భుగ్నివహము మరణబాధఁ బొందించుచు మూఁ
డగ్నులయొద్దను నాలవ । యగ్నియనన్ వెలుఁగుచున్న యమ్మునినాథున్. 153

ప్రతిపదార్థం: అగ్ని, హతిన్+చేసి= అగ్నిలో పడటంచేత; మానవ, భుక్+నివహము= మానవులను తినే రాక్షసుల సమూహాన్ని; మరణబాధన్= చావుకు సంబంధించిన దుఃఖాన్ని; పొందించుచున్= కలిగిస్తూ; మూఁడు, అగ్నుల ఒద్దను= మూడు విధాలైన అగ్నుల దగ్గర; నాలవ, అగ్ని అనన్= నాల్గవ అగ్నియో అన్నట్లుగా; వెలుఁగుచు+ఉన్న= ప్రకాశిస్తున్న; ఆ+ముని నాథున్= ఆ మునిశ్రేష్ఠుడైన పరాశరుడిని.

తాత్పర్యం: మానవులు భక్షించే రాక్షససమూహాన్ని అగ్నిలో పడేటట్లు చేయటంద్వారా వాళ్ళకు మరణబాధ కలిగిస్తూ, మూడగ్నులదగ్గర నాల్గవఅగ్నివలె ఉన్న ఆ మునిశ్రేష్ఠుడిని.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. త్రేతాగ్నులు - ఆహవనీయం, దక్షిణాగ్ని, గార్హపత్యం - ఇవి మూడు యజ్ఞవేదికి క్రమంగా తూర్పు, దక్షిణం, పడమర - ఈ దిక్కులలో ఉంటాయి.

క. పరమతపోనిలయు దినే । శ్వరదీప్తిసహస్రతేజు శాక్తేయుఁ బరా
శరుఁ గని యందఱుఁ బ్రార్థిం । చిరి రాక్షసమారణంబు సేయకు మనుచున్. 154

ప్రతిపదార్థం: పరమ, తపస్+నిలయున్= గొప్ప తపస్సుకు ఉనికిపట్టయినవాడిని; దిన+ఈశ్వర, దీప్తి, సహస్ర, తేజున్= పగటి ప్రభువైన సూర్యునికాంతికి వేయిరెట్లుకాంతి కలవాడిని - అనగా వేయిమందిసూర్యులవలె ప్రకాశించేవాణ్ణి; శాక్తేయున్= శక్తి మహామునియొక్క పుత్రుని; పరాశరున్; కని= చూచి; అందఱున్= మునులుఅంతా; రాక్షస, మారణంబున్= రాక్షసులను చంపటాన్ని; చేయకుము= చేయవద్దు; అనుచున్; ప్రార్థించిరి.

తాత్పర్యం: మహాతపస్సంపన్నుడు, వెయ్యిమంది సూర్యుల కాంతితో ప్రకాశించేవాడు, శక్తిమహాముని కుమారుడు అయిన పరాశరుడిని చూచి, రాక్షససంహారం మానండని అందరు ప్రార్థించారు.

వ. 'పరాశరుండును బులస్త్యాదిమహామునిప్రార్థితుం డై రాక్షససత్త్రయాగం బుపసంహరించి, తన్నియోగంబున నయ్యగ్ని హిమవదుత్తరపార్శ్వంబున వైచిన, నదియును బర్వంబుల నందు వృక్షలతా గుల్మ శిలాభక్షణంబు

సేయుచుండె' నని యిట్లు గంధర్వుండు తాపత్యవసిష్ఠౌర్వోపాఖ్యానంబు చెప్పిన విని యర్జునుండు వాని కి ట్లనియె. 155

ప్రతిపదార్థం: పరాశరుండును, పులస్త్య+ఆది, మహాముని, ప్రార్థితుండు+ఐ= పులస్త్యుడు మొదలైన మహామునులచేత ప్రార్థింపబడినవా డై; రాక్షస, సత్త్రయాగంబు= రాక్షససత్త్రయాగాన్ని; ఉపసంహరించి= ఆపి; తద్+నియోగంబునన్= వారి ఆజ్ఞచేత; ఆ+అగ్ని; హిమవత్+ఉత్తర, పార్శ్వంబునన్= హిమాలయపర్వతంయొక్క ఉత్తరపు ప్రక్క; వైచినన్= వేయగా; అదియును= అ ఆగ్నియు; పర్వంబుల, అందున్= పర్వదినాలలో, ఆ ఉత్తరపు ప్రక్కన; వృక్ష, లతా, గుల్మ, శిలా, భక్షణంబు= చెట్లను, తీవలను, పొదలను, రాళ్ళను తినుటను; చేయుచు+ఉండెన్= చేస్తూ ఉండింది; అని= అని; ఇట్లు; గంధర్వుండు; తాపత్య వసిష్ఠ+ఔర్వ+ఉపాఖ్యానంబు= తాపత్యులయొక్క, వసిష్ఠునియొక్క, ఔర్వునియొక్క కథను; చెప్పినన్= చెప్పగా; విని=ఆలకించి; అర్జునుండు= అర్జునుడు; వానికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పరాశరుడుకూడ - పులస్త్యుడు మొదలైన మహామునులు ప్రార్థించగా రాక్షసవినాశనంకొరకు చేసే ఆ సత్త్రయాగాన్ని ఆపి, ఆ మునుల ఆజ్ఞతో ఆ యాగాగ్నిని హిమాలయానికి ఉత్తరంవైపు వేయగా, అది పర్వదినాలలో చెట్లను, తీగలను, పొదలను, శిలలను భక్షిస్తూ ఉండింది' అని గంధర్వుడు తాపత్య - వసిష్ఠ - ఔర్వుల కథను చెప్పగా విని, అర్జునుడు అతనితో ఇట్లా అన్నాడు.

ఉ. మాకు నతిప్రియుండవు సమస్తవిదుండవు చెప్పుమయ్య! యీ
లోకములోని వర్తనములుం దగువారి నెఱుంగు; దెవ్వనిం
బ్రాకటధర్మతత్త్వవిదు బ్రాహ్మణముఖ్యుఁ బురోహితుండుగాఁ
జేకొనువార? మట్టి బుధసేవితుఁ గానఁగ మాకు నెం దగున్? 156

ప్రతిపదార్థం: మాకున్, అతి, ప్రియుండవు= మిక్కిలి ఇష్టమైనవాడవు; సమస్త, విదుండవు= అన్నీ తెలిసినవాడవు; చెప్పుము+అయ్య= అయ్యా! వివరించు; ఈ లోకములోని, వర్తనములున్= ఈ లోకమందలి నడవడులను; తగువారిన్= తగినవారిని; ఎఱుంగుదు= తెలియుదువు; ఎవ్వనిన్= ఎవ్వరిని; ప్రాకట, ధర్మ, తత్త్వవిదున్= ప్రసిద్ధంగా ధర్మతత్త్వాన్ని తెలిసిన వాడిని; బ్రాహ్మణ; ముఖ్యున్= బ్రాహ్మణులలో శ్రేష్ఠు డైనవాడిని; పురోహితుండు, కాన్= పురోహితు డయ్యేటట్లు; చేకొనువారము= గ్రహించగలవారం; అట్టి= అటువంటి; బుధ, సేవితున్= పండితులచే పూజింపబడేవాడిని; మాకున్; కానఁగన్= చూచుటకు; ఎందు+అగున్= ఎచ్చట జరుగుతుంది?

తాత్పర్యం: మాకు మిక్కిలి ఇష్టమైనవాడవు, అన్నింటిని తెలిసినవాడవు, అంతేకాదు ఈ లోకవ్యవహారాలను, తగిన వ్యక్తులను తెలిసినవాడవు. ధర్మతత్త్వం బాగా తెలిసినవాడు, బ్రాహ్మణశ్రేష్ఠుడు అయిన ఏవ్యక్తిని పురోహితునిగా మేము స్వీకరించాలో, పండితులచే పూజింపబడే అట్టివ్యక్తి మాకు ఎక్కడ లభిస్తాడో తెల్పకోరుతాను.

వ. అనిన గంధర్వుండు పెద్దయుంబ్రొద్దు విచారించి 'యిచ్చోటికిం గుఱంగట నుత్కచం బను పుణ్యతీర్థంబునం దపంబు సేయుచున్నవాని ధౌమ్యుం డను బ్రాహ్మణునిఁ బురోహితుఁగాఁ బ్రార్థింపుం; డమ్మహాత్ముండు మీకుఁ బురోహితుం డైన సర్వార్థసిద్ధి యగు' ననిన సంతసిల్లి వానికి నాగ్నేయాస్త్రంబు విధ్యుక్తంబుగా నిచ్చి 'మాకు నీ యిచ్చిన హయంబుల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నీయంద సంగ్రహించి యుండుము; ప్రయోజనంబు గలనాఁడు గొనిపోయెద' మని గంధర్వు వీడ్కొని పాండవులు భాగీరథి నుత్తరించి యుత్కచం బను పుణ్యతీర్థంబున కరిగి యందు. 157

ప్రతిపదార్థం: అనినన్= అని అడుగగా; గంధర్వుండు; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; విచారించి= ఆలోచించి; ఈ+చోటికిన్= ఇచ్చటికి; కుఱంగటన్= సమీపాన; ఉత్కచంబు; అను, పుణ్య, తీర్థంబునన్= అను పుణ్యతీర్థంలో; తపంబు; చేయుచు; ఉన్నవాని; ధౌమ్యుండు; అను; బ్రాహ్మణునిన్; పురోహితున్+కాన్= పురోహితు డయ్యేటట్లుగా; ప్రార్థింపుండు= ప్రార్థించండి; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడు; మీకున్, పురోహితుండు+ఐనన్= పురోహితుడైతే; సర్వ+అర్థ, సిద్ధి= అన్ని ప్రయోజనాలు సమకూరటం; అగున్= జరుగును; అనినన్= అని తెల్పగా; సంతసిల్లి; వానికిన్= అతనికి; ఆగ్నేయ+అస్త్రంబు; = ఆగ్నేయాస్త్రాన్ని; విధి+ఉక్తంబుగాన్= నియమం ప్రకారం; ఇచ్చి; మాకున్; నీ ఇచ్చిన, హయంబులన్= నీవు ఒసగిన గుఱ్ఱాలను; నీ; అందు+అ= నీ దగ్గరే; సంగ్రహించి= దాచి; ఉండుము= ఉంచు; ప్రయోజనంబు, కలనాఁడు= అవసరమేర్పడిన రోజు; కొని పోయెదము= తీసికొనిపోతాము; అని, గంధర్వున్= ఆవిధంగా గంధర్వుణ్ణి; వీడ్కొని; పాండవులు; భాగీరథిన్= గంగను; ఉత్తరించి= దాటి; ఉత్కచంబు, అను, పుణ్యతీర్థంబునకున్; అరిగి= వెళ్ళి, అందున్= అక్కడ.

తాత్పర్యం: అని పల్కగా, గంధర్వుడు చాలాసేపు ఆలోచించి 'ఇక్కడికి సమీపంలో ఉత్కచం అనే పుణ్యతీర్థం ఉన్నది. అక్కడ తపస్సు చేసికొంటున్న ధౌమ్యుడనే బ్రాహ్మణుడిని పురోహితునిగా ప్రార్థించండి. ఆ మహాత్ముడు మీకు పురోహితుడైతే అన్ని ప్రయోజనాలు సిద్ధిస్తా'యని తెల్పగా, సంతోషించి, అతనికి ఆగ్నేయాస్త్రాన్ని యథావిధిగా ఇచ్చి, 'మాకు నీ విచ్చిన గుఱ్ఱాలను నీ దగ్గరే ఉంచుము. అవసరమైనప్పుడు తీసికొంటాము' అని ఆ గంధర్వుడిని వీడ్కొని, పాండవులు గంగానదిని దాటి, ఉత్కచ మనే పుణ్యతీర్థానికి వెళ్ళి, అక్కడ.

పాండవులు ధౌమ్యునిఁ బురోహితుఁగా వరియించుట (సం.1-174-6)

ఉ. వీత సమస్త దోషుఁ డయి వేడ్క దపం బొనరించుచున్న వి
ఖ్యాతుఁ బురోహితప్రవరుఁగా వరియించిరి భక్తితో జగ
త్పూతచరిత్రు సాధుజనపూజితు ధార్మికు ధౌమ్యు దేవల
భ్రాతృవరున్ మహాత్ము హితభాషణు భూసురవంశభూషణున్. 158

ప్రతిపదార్థం: వీత, సమస్త, దోషుఁడు+అయి= పోయిన ఎల్లపాపాలు కలవాడై; వేడ్కన్= కుతూహలంతో, తపంబు; ఒనరించుచున్+ఉన్న= చేస్తూఉన్న; విఖ్యాతున్= ప్రసిద్ధుడిని; జగత్+పూత, చరిత్రున్= లోకాలలో పవిత్రమైన నడవడి కలవాడిని; సాధుజన, పూజితున్= సజ్జనులచేత పూజింపబడినవాడిని; ధార్మికున్= ధర్మం చేసేవాడిని; మహాత్మున్= మహాత్ముడైన వాడిని; హిత, భాషణు=ఉపకారం చేసేమాటలుకలవాడిని; భూసుర, వంశ, భూషణున్= బ్రాహ్మణవంశానికి అలంకారమైనవాడిని; దేవల, భ్రాతృ, వరున్= దేవలుని తోబుట్టువులలో శ్రేష్ఠుడైనవాడిని; ధౌమ్యున్= ధౌమ్యుని; పురోహిత, ప్రవరున్+కాన్= పురోహిత శ్రేష్ఠునిగా, భక్తితోన్; వరియించిరి= కోరారు.

తాత్పర్యం: పాపరహితుడు, కుతూహలంతో తపస్సు చేస్తున్నవాడు, ప్రసిద్ధుడు, లోకంలో పవిత్రమైనచరిత్ర కలవాడు, సజ్జనులచేత పూజింపబడేవాడు, ధార్మికుడు, మహాత్ముడు, మేలు కలిగించే మాటలు పలికేవాడు, బ్రాహ్మణవంశానికి అలంకారమైనవాడు, దేవలుని తోబుట్టువులలో శ్రేష్ఠుడు అయినధౌమ్యుడిని తమకు పురోహితశ్రేష్ఠునిగా పాండవులు స్వీకరించారు.

వ. ధౌమ్యుండును వారి నతిప్రీతిం బూజించి పురోహితత్వంబుం బరిగ్రహించె; నట్లు తేజోరూపబుద్ధివిభవంబుల బృహస్పతిసదృశుం డై వేదవేదాంగవిదుం డైన ధౌమ్యుం బురోహితుంగాఁ బడసి, పాండునందను లశేష మహీరాజ్యంబు వడసినంతియ సంతసిల్లి, తత్కృతస్వస్త్యయను లయి, జననీ సహితంబు దక్షిణ పాంచాలం బున కరుగువారు ముందఱ ద్రుపదుపురంబునకుఁ బోయెడు బ్రాహ్మణులం గని 'మీ రెందులకుం బోయెద'? రని యడిగిన వా రి ట్లనిరి. 159

ప్రతిపదార్థం: ధౌమ్యుండును; వారిన్= ఆ పాండవుల్ని; అతి, ప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; పూజించి, పురోహితత్వంబున్; పరిగ్రహించెన్= చేకొని, గ్రహించాడు; అట్లు; తేజస్, రూప, బుద్ధి, విభవంబులన్= తేజస్సుచేతను, రూపంచేతను, బుద్ధిచేతను, గొప్పతనంచేతను; బృహస్పతి, సదృశుండు+ఐ= బృహస్పతితో సమాన మైనవాడై; వేద, వేద+అంగ, విదుండు+ఐన= వేదాలను, వేదాంగాలను తెలిసినవాడైన; ధౌమ్యున్= ధౌమ్యుణ్ణి; పురోహితున్+కాన్= పురోహితునిగా; పడసి= పొంది; పాండునందనులు= పాండవులు; అశేష, మహీ, రాజ్యంబున్= మొత్తం భూమిమీద అధికారాన్నిఅంతయు; పడసిన, అంతియ= పొందినంతగా; సంతసిల్లి; తత్+కృత, స్వస్తి+అయనులు+అయి= అతనిచేత చేయబడిన ఆశీర్వాదం కలవా ళ్ళయి; జననీ, సహితంబు= తల్లితో కలిసి; దక్షిణ, పాంచాలంబునకున్, అరుగువారు= దక్షిణ పాంచాలదేశాలకు వెళ్ళే వాళ్ళు; ముందరన్= ముందుగా; ద్రుపదు, పురంబునకున్ = ద్రుపదుని నగరానికి; పోయెడు= పోయే; బ్రాహ్మణులన్+కని= బ్రాహ్మణులను చూచి; మీరు; ఎందులకున్= ఎక్కడికి; పోయెదరు+అని= పోతూఉన్నారని; అడిగినన్= అడుగగా; వారు, ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ధౌమ్యుడుకూడా వాళ్ళను మిక్కిలి ప్రేమతో పూజించి, పురోహితత్వాన్ని స్వీకరించాడు. ఆ విధంగా తేజస్సుచేత, రూపంచేత, బుద్ధిచేత, గొప్పతనంచేత, బృహస్పతితో సమానుడై, వేదవేదాంగాలను పూర్తిగా తెలిసిన ధౌమ్యుడిని పురోహితునిగా పొంది, పాండవులు సమస్తభూమండలరాజ్యాన్ని పొందినంతగా సంతోషించి, ధౌమ్యుని ఆశీర్వచనం పొంది, తల్లితోకూడ దక్షిణపాంచాలదేశానికి వెళ్ళుతూ, తమకు ముందు ద్రుపదుని నగరానికి వెళ్లే బ్రాహ్మణులను చూచి, 'మీ రెక్కడికి వెళ్లుతున్నారు' అని అడుగగా, వా రిట్లా అన్నారు.

సీ. యజ్ఞసేన ప్రభు యజ్ఞమహావేదిఁ । గవచశరాసనఖడ్గబాణ
రథయుక్తుఁ డై మహారథుఁడు ధృష్టద్యుమ్నుఁ । డన నుదయించిన, నతనితోడ
నొక్కటఁ బుట్టిన యక్కన్యకను గృష్ణ । నసితోత్పల శ్యామలామలాంగి
మెఱుపునుం బోలెను వఱలు నుత్పలగంధి । బంధుర తను సౌరభంబు గలుగు

ఆ. దాని ద్రుపదరాజుతనయఁ దదీయ స్వ । యంవరోత్సవంబు నపుడు చూడఁ
గనినవారు దృష్టు గనిన ఫలం బెల్లఁ । గనినవారు పరమకౌతుకమున. 160

ప్రతిపదార్థం: యజ్ఞసేన, ప్రభు, యజ్ఞమహావేదిన్= ద్రుపదమహారాజుయొక్క యజ్ఞమునందలి గొప్పవేదియందు; కవచ, శర+ ఆసన, ఖడ్గ, బాణ, రథ, యుక్తుఁడు+ఐ= కవచంతో, ధనుస్సుతో; ఖడ్గంతో, బాణాలతో, రథంతో కూడినవాడై; మహా రథుఁడు; ధృష్టద్యుమ్నుఁడు; అనన్= అనగా; ఉదయించినన్= పుట్టగా; అతనితోడన్; ఒక్కటన్= ఏకకాలంలో; పుట్టిన = ఉదయించిన; ఆ+కన్యకను= ఆ కన్నెను; కృష్ణన్= కృష్ణ అను పేరు కలదానిని, అసిత+ఉత్పల, శ్యామల+అమల+అంగిన్= నల్లకలువవలె నల్లని నిర్మల మైన దేహం కలదానిని; మెఱుపునున్+పోలెను= మెఱపువలె; వఱలు= ప్రకాశించే; ఉత్పల,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గంధిన్= కలువ పూవు వాసనవంటి వాసనకలదానిని; బంధుర, తను, సౌరభంబు, కలుగు, దానిన్= గాఢమైన మేని సువాసన కలదానిని; ద్రుపదరాజు తనయన్= ద్రుపదరాజుయొక్క పుత్రికను; తదీయ, స్వయంవర+ఉత్సవంబు, అపుడు= ఆమె స్వయంవరంయొక్క ఉత్సవమునందు; పరమ, కౌతుకమునన్= మిక్కిలి ఆసక్తితో; చూడన్+కనిన, వారు= చూడగలిగిన వారు; దృష్టు కనిన= కన్నులను (చూపులను) పొందిన; ఫలంబు+ఎల్లన్= ఫలితాన్ని అంతా; కనిన, వారు= పొందినవారు.

తాత్పర్యం: ద్రుపదమహారాజుయజ్ఞవేదికనుండి కవచంతో, ధనుస్సుతో, ఖడ్గంతో, బాణాలతో, రథంతో మహారథుడైన ధృష్టద్యుమ్నుడు ఉద్భవించాడు. అతనితోపాటు 'కృష్ణ' అనే పేరు కల కూతురుకూడ జన్మించింది. ఆమె నల్లకలువలవలె నల్లని నిర్మలమైన దేహంకలది. మెఱుపుతీగవలె ప్రకాశిస్తూ, నల్లకలువగంధంవంటి మనోహరమైన శరీరసుగంధం కలది. కనుక అటువంటి ఆ ద్రౌపదిని మిక్కిలి కుతూహలంతో స్వయంవరోత్సవ సమయంలో చూడగలిగినవాళ్ళే కన్నులున్న ఫలం పొందినవారు.

విశేషం: అలం: ఉపమ. మహారథుడు: - పదకొండువేలమంది విలుకాండ్రతో యుద్ధంచేయగల యోధుడు. మరొకవిధంగా - 'తనను, సారథిని, గుర్రాలను కాపాడుకొంటూ పోరాడే యోధుడు మహారథుడు' అని కొందరు అంటారు.

వ. అట్టి మహోత్సవంబు చూడ ద్రుపదు పురంబునకుం బోయెద; మందులకు నుత్సవ దర్శనోత్సుకు లై దర్శనీయులుం దరుణులును నపారభూరిదక్షిణయజ్ఞకరులును ననేకశ స్త్రాస్త్రవిదులును నయిన నానాదేశాధిపతులు నింతకుఁ జనుదెంతు; రనంతధనంబును బ్రాహ్మణులకు వా రిత్తు; రట్టె మీరును వారిం జూడ వచ్చెదరేని యొక్కటఁ బోదము రండు. 161

ప్రతిపదార్థం: అట్టి, మహా+ఉత్సవంబున్= గొప్ప ఉత్సవాన్ని; చూడన్= చూచుటకై; ద్రుపదుపురంబునకున్= ద్రుపదుని నగరానికి; పోయెదము= పోతూఉన్నాము; అందులకున్; ఉత్సవ, దర్శన+ఉత్సుకులు+ఐ= స్వయంవరోత్సవాన్ని చూచుటయందు ఉత్సాహం కలిగినవాళ్ళూ; దర్శనీయులున్= చూడదగినవాళ్ళూ; తరుణులునున్= యౌవనంలో ఉన్నవాళ్ళూ; అపార, భూరి, దక్షిణ, యజ్ఞకరులునున్= అంతులేని అధికమైన దక్షిణలతో యజ్ఞాలు చేసేవాళ్ళూ; అనేక శస్త్ర+అస్త్ర, విదులునున్= పెక్కు, మంత్రరహిత, మంత్రసహిత బాణవిద్యలు తెలిసినవాళ్ళూ; అయిన; నానా, దేశ+అధిపతులున్= వివిధ దేశాలరాజులు; ఇంతకున్= ఇప్పటికే; చనుదెంతురు= వచ్చిఉంటారు; అనంత, ధనంబును= అంతులేని డబ్బును; బ్రాహ్మణులకు; వారు+ఇత్తురు= వారు ఇస్తారు; అట్టె; మీరునున్= అట్లే మీరుకూడా; వారిన్= వాళ్ళను; చూడన్ వచ్చెదరు+ఏని= చూచుటకు వచ్చేవారయితే; ఒక్కటన్= ఒకటిగా; కలిసి, పోదము, రండు= కలసిపోదాం రండి.

తాత్పర్యం: అటువంటి స్వయంవరమహోత్సవాన్ని చూడటానికి ద్రుపదునినగరానికి మేము వెళ్తున్నాము. ఆ ఉత్సవం చూడాలన్న కుతూహలంతో చూడముచ్చటైనవాళ్ళు, యౌవనంలో ఉన్నవాళ్ళు, అంతులేని గొప్ప దక్షిణలతో యజ్ఞాలుచేసినవాళ్ళు, అనేకశస్త్రాస్త్రాలు తెలిసినవాళ్ళు అయిన వివిధదేశాల రాజులు ఈ పాటికి అక్కడికి వచ్చిఉంటారు. వాళ్ళు బ్రాహ్మణులకు అపారమైన ధనాన్ని ఇస్తారట. మీరుకూడ వాళ్ళను చూడడానికి వచ్చేట్టయితే, కలిసిపోదాం రండి.

క. మీ యం దీ కృష్ణ నుదం। సాయతభుజుఁ జూచి తాన హర్షముతోడం
దోయజముఖి వరియించును। మా యెఱిఁగినకార్య మిది సమంజసబుద్ధిన్. 162

ప్రతిపదార్థం: మీ+అందున్= మీలో; ఈ కృష్ణున్= ఈ నల్లని వాడిని; ఉత్+అంస+ఆయత, భుజున్= గొప్ప భుజశిఖరాలు కల నిడుపైన బాహువులు కల వాడిని; చూచి; తోజయ, ముఖి= నీటినుండి పుట్టిన పద్మాలవంటి ముఖం కలది - ద్రౌపది; తాను+అ= తనంతట తానే; వరియించును= కోరుకుంటుంది; ఇది, సమంజస; బుద్ధిన్= ఇది మిక్కిలి ఒప్పుతున్న బుద్ధితో, మా, ఎఱిఁగిన, కార్యము= మాకు తెలిసిన కార్యం.

తాత్పర్యం: మీలో నల్లనివాడు, గొప్ప భుజశిఖరాలతో కూడిన నిడుపైన చేతులు కలవాడు అయిన ఇతడిని చూచి, ద్రౌపది తనంతట తానే వరిస్తుంది. ఇది మా మనస్సుకు తోచిన సమంజసమైన కార్యం.

విశేషం: విప్రుల మాటలలో ఉపశ్రుతివంటి శుభశకునం భావికథార్థాన్ని ధ్వనింపచేస్తున్నది. (ఉపశ్రుతినిగురించి చూడు. ఆది. 7.24.25)

వ. అని మాటలాడుచు వచ్చు బ్రాహ్మణులతోడఁ బాండవులు ద్రుపదుపురంబున కరుగు వా రెదుర. 163

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; మాటలాడుచు; వచ్చు=వచ్చే; బ్రాహ్మణులతో=బ్రాహ్మణులతో; పాండవులు= పాండుకుమారులు; ద్రుపదు, పురంబునకున్= ద్రుపదు నగరానికి; అరుగువారు= వెళ్ళేవాళ్ళు; ఎదురన్= ఎదుట.

తాత్పర్యం: అని మాట్లాడుకొంటూ వచ్చే బ్రాహ్మణులతో కలిసి పాండవులు ద్రుపదునిపట్టణానికి వెళ్లుతూ ఎదుట.

క. కృష్ణమృగాజినధరుఁ దరు। ణోష్ణద్యుతితేజుఁ బంకజోద్భవసదృశుం
గృష్ణద్వైపాయను గత। తృష్ణామయుఁ గాంచి రరుగుదెంచు మహాత్మున్. 164

ప్రతిపదార్థం: కృష్ణ, మృగ+అజిన, ధరున్= నల్లని జింకతోలు వస్త్రంగా కట్టుకొన్నవాడిని; తరుణ+ఉష్ణ, ద్యుతి, తేజున్= మధ్యాహ్న సూర్యునివంటి కాంతి కలవాడిని; పంకజ+ఉద్భవ, సదృశున్= పద్మమునుండి పుట్టిన బ్రహ్మతో సమానుడైనవాడిని; గత, తృష్ణా; మయున్= పోయిన ఆశ కల వాడిని; అరుగుదెంచు= వస్తున్న; మహాత్మున్= మహానుభావుడిని; కృష్ణద్వైపాయనున్= వేదవ్యాసుడిని; కాంచిరి= చూచిరి.

తాత్పర్యం: నల్లచి జింకచర్మం ధరించినవాడు, మధ్యాహ్న సూర్యునివంటి కాంతికలవాడు, పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవునితో సమానమైనవాడు అయిన వేదవ్యాసుడు, తమకు ఎదురు వస్తుండగా పాండవులు ఏ ఆశాలేని ఆ మహానుభావుడిని చూచారు.

విశేషం: అలం: ఉపమ.

వ. కని వినయమ్మున న మ్మునీంద్రునకు నందఱు నమస్కరించి కృతాంజలు లై యున్న వారికి హృదయానందంబుగా సత్యవతీనందనుం డాగామి శుభంబు లావేదించి చనినఁ; బాండవులును గతిపయ దినంబులకు ద్రుపదుపురంబు సొచ్చి నాలుగు సముద్రంబులుం బోలె ఘూర్ణిల్లి మ్రోయుచుం బురంబు నాలుగుదిక్కుల విడిసియున్న నానాదేశాగత మహీనాథుల బహువిధస్కంధావారంబులఁ జూచుచుం జని, యొక్కకుంభకారగృహంబున విడిసి, త మ్మెవ్వరు నెఱుంగకుండ బ్రాహ్మణవృత్తి నుండు నంతఁ, బాంచాలపతి పార్థునకుఁ గూఁతు నీ సమకట్టి పాండవుల నన్వేషించి యెందునుం గానక. 165

ప్రతిపదార్థం: కని= చూచి; వినయమ్మునన్; ఆ+మునీంద్రునకున్= ఆ మునిశ్రేష్ఠుడైన వేదవ్యాసునకు; అందరున్; నమస్కరించి; కృత+అంజలులు+ఐ= చేతులు జోడించిన వాళ్ళయి; ఉన్నన్= ఉండగా; వారికిన్= ఆ పాండవులకు; హృదయ+ ఆనందంబుగాన్= మనస్సుకు సంతోషం కలిగేటట్లు; సత్యవతీ, నందనుండు= సత్యవతియొక్క కుమారుడు, వ్యాసుడు; ఆగామి, శుభంబులు= రానున్న శుభాలను; ఆవేదించి= తెలిపి; చనినన్= వెళ్ళగా; పాండవులును; కతిపయ, దినంబులకున్= కొన్ని రోజులకు; ద్రుపదుపురంబు= ద్రుపదు నగరాన్ని; చొచ్చి= ప్రవేశించి; నాలుగు, సముద్రంబులున్+పోలెన్= నాలుగు సముద్రాలవలె; ఘూర్ణిల్లి= కలతనొంది; మ్రోయుచున్= శబ్దిస్తూ, ఘోషిస్తూ; పురంబు, నాలుగు దిక్కులన్= ఊరికి నాలుగు దిక్కులలో; విడిసి, ఉన్న= విడిది చేసి ఉన్న; నానా, దేశ+ఆగత, మహీనాథుల= వివిధ దేశాలనుండి వచ్చిన రాజులయొక్క; బహువిధ, స్కంధావారంబులన్= అనేక విధాలైన సైన్యం విడిదిచేసిన చోట్లను; చూచుచున్= చూస్తూ; చని= వెళ్ళి; ఒక్క, కుంభకార గృహంబునన్= ఒక కుమ్మరిఇంటియందు; విడిసి= విడిది చేసి; తమ్ము+ఎవ్వరున్= తమను ఎవ్వరుకూడ; ఎఱుంగ కుండ= తెలియకుండ; బ్రాహ్మణ, వృత్తిన్= బ్రాహ్మణ వృత్తిలో; ఉండునంతన్= ఉన్న సమయంలో; పాంచాలపతి= పాంచాలదేశపురాజు - ద్రుపదుడు; పార్థునకున్= అర్జునునకు; కూఁతున్= పుత్రికను; ఈన్= ఇచ్చుటకు; సమకట్టి=పూనుకొని; పాండవులన్= పాండవుల్ని; అన్వేషించి= వెదకి; ఎందునన్= ఎక్కడ కూడ; కానక= చూడక.

తాత్పర్యం: చూచి, వినయంతో ఆ వేదవ్యాసునికి అందరు నమస్కరించి, చేతులు జోడించి, నిలువగా - వాళ్ళకు సంతోషం కలిగే విధంగా ఆ సత్యవతీనందనుడైన వ్యాసుడు రానున్న శుభాలను గురించి తెలిపి వెళ్ళాడు. తర్వాత పాండవులు కొద్దిరోజులలో ద్రుపదుని నగరానికి చేరి, నగరం నాలుగుదిక్కుల నాలుగు సముద్రాలవలె ఘూర్ణిస్తూ, వివిధ దేశాలనుండి వచ్చిన రాజులబహువిధసైన్యాలు విడిదిచేసిన స్థావరాలను చూస్తూ, నగరంలో ప్రవేశించి, ఒక కుమ్మరిఇంట్లో విడిది చేసి, ఎవరూ గుర్తించకుండా బ్రాహ్మణవృత్తిలో ఉన్నారు. పాంచాలరాజు అర్జునునికి తన కుమార్తె నివ్వా లని ప్రయత్నించి, పాండవులకొరకు వెదకి, వాళ్ళను ఎక్కడా కనుగొనలేక.

విశేషం: అలం: ఉపమ.

ద్రౌపదీస్వయంవరము (సం.1-176-11)

సీ. వైహాయసం బైన వరమత్స్యయంత్రంబు । ని వ్విల్లు మోపెట్టి యెవ్వఁ డేను
శరముల నేయు నశ్రమమున నతఁడ నా । తనయకు వరుఁ డగు ధర్మయుక్తి
నని చాటఁ బంచిన నా ఘోషణము విని । యుర్వీశులెల్ల నొండొరులఁ గడవఁ
గడువేడ్కఁ దొడి పూసి కట్టి విభూతితోఁ । దమతమచిహ్నముల్ దనరి యెఱుక

ఆ. పడఁగ వేలువేల పన్ని భూతలము గ్ర । క్కదల సైన్యపాదఘట్టనమునఁ
బొలుచు ద్రుపదరాజపుత్రీస్వయంవర । రంగమునకుఁ జనిరి రమణతోడ. 166

ప్రతిపదార్థం: వైహాయసంబు+ఐన= ఆకాశంలో ఉన్నట్టిదైన; వర, మత్స్యయంత్రంబున్= శ్రేష్ఠమైన మత్స్యయంత్రాన్ని; ఈ+విల్లు= ఈ ధనుస్సును; మోపెట్టి= ఎక్కుపెట్టి; ఎవ్వఁడున్; ఏను, శరములన్= ఐదు బాణాలతో; అశ్రమమునన్= శ్రమ పడకుండా - అనగా సులభంగా; ఏయున్= కొట్టునో; అతఁడు+అ= అతడే; నా, తనయకున్= నా కూతురికి; ధర్మయుక్తిన్= ధర్మంతోడి కూడికతో అనగా ధర్మబద్ధంగా; వరుఁడు= మగడు; అగున్= అవుతాడు; అని, చాటన్, పంచినన్= చాటింపువేయండని ఆజ్ఞాపించగా; ఆఘోషణము= ఆ చాటింపు; విని; ఉర్వీ+ఈశులు= భూపతులు, రాజులు; ఎల్లన్= అందరు; ఒండొరులన్=

ఒకరి నొకరు; కడవన్= మీరునట్లు; కడున్= మిక్కిలి; వేడ్కన్= సంతోషంతో; తొడి= సొమ్ములు ధరించి (తొడుగుకొని); పూసి= మైపూతలు పూసి; కట్టి= (మంచి) వస్త్రాలు కట్టి; విభూతితోన్= సంపదతో; తమ తమ చిహ్నములన్= తమ తమ గుర్తులతో (ధ్వజములు మొదలుగునవి) తనరి= ఒప్పి; ఎఱుకపడఁగన్= తెలిసేటట్లు; వేఱువేఱు+అ= విడివిడిగా, పన్ని= సిద్ధపడి; సైన్య, పాద, ఘట్టనమునన్= సైన్యాలయొక్క కాలిత్రొక్కుడుచేత; భూతలము= భూమి; క్రక్కదల (కదల+కదల)= మిక్కిలి చలింపగా; పొలుచు= ఒప్పునట్టి; ద్రుపదరాజు పుత్త్రి, స్వయంవర, రంగమునకున్= ద్రౌపదియొక్క స్వయంవర స్థానానికి; రమణతోడన్= ప్రీతిగా; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: 'ఆకాశంలో కట్టిన మత్స్యయంత్రాన్ని ఈ విల్లు ఎక్కుపెట్టి ఐదు బాణాలతో ఎవడు పడగొడతాడో అతడే ధర్మప్రకారం నా పుత్రికకు భర్త అవుతాడు' అని ద్రుపదుడు చాటింపు వేయగా, ఆ చాటింపు విని రాజులంతా ఒకరికంటె ముందు మరొకరు ఎంతో సంతోషంగా ఆభరణాలు ధరించి, మైపూతలు పూసికొని, మంచి వస్త్రాలు కట్టుకొని, ఐశ్వర్యంతో తమ తమ ధ్వజాలు మొదలైన చిహ్నాలు స్పష్టంగా కనబడే విధంగా సిద్ధమై, సైన్యాల కాళ్లతాకిడికి భూతలం కంపించగా, ద్రౌపదీస్వయంవరమండపానికి ప్రీతితో వెళ్ళారు.

వ. అదియును బురంబు పూర్వోత్తరదిగ్భాగంబునం జందనోదకసంసిక్త సమీకృతస్థలం బయి, యగాధోన్నత పరిఖాప్రాకారంబులను విశాలద్వారతోరణంబులను గైలాసశైలవిలాసాపహాసిభాసురగగనతలోల్లేఖిశిఖర రమ్యహర్మ్యతలంబులను బహుప్రకారంబు లైన సారువులనుం జేసి యొప్పుచున్న, నందు యథాస్థానంబుల నానాదేశాధిపతుల నుండంబంచి ద్రుపదుండు వారల నెల్లం బూజించెఁ; బరమబ్రహ్మణ్యు లగు బ్రాహ్మణులతోడం గలసియున్న పాండవులును బ్రాహ్మణసమూహంబులో నుండి పాంచాలరాజు సమృద్ధినిం జూచి సంతసిల్లి రంత. 167

ప్రతిపదార్థం: అదియును= ఆ ద్రౌపదీ స్వయంవరరంగం; పురంబు, పూర్వ+ఉత్తర దిక్+భాగంబునన్= పట్టణంయొక్క ఈశాన్య దిక్కున ఉన్న ప్రదేశంలో; చందన+ఉదక, సంసిక్త, సమీకృత, స్థలంబు+అయి= మంచి గంధపు నీటిచే తడుపబడి చదరంగా చేయబడిన స్థలం కలదై; అగాధ+ఉన్నత, పరిఖా, ప్రాకారంబులను= లోతైన అగడ్తలతో, ఎత్తైన ప్రహరులతో; విశాల, ద్వార, తోరణంబులను= పెద్దవైన వెలుపలి వాకిళ్ళతో, తోరణాలతో; కైలాస, శైల, విలాస+అపహాసి, భాసుర, గగనతల+ఉల్లేఖి, శిఖర, రమ్య, హర్మ్య, తలంబులను= కైలాసపర్వతంయొక్క చక్కదనాన్ని ఎగతాళి చేసేటట్లు ప్రకాశిస్తూ ఆకాశప్రదేశాన్ని తాకుతున్న కొనలచేత అందమైన మేడల ప్రదేశాలతో; సారువులనున్ చేసి= మంచెలతో; ఒప్పుచున్నన్= వెలుగుతుండగా; అందున్= అక్కడ; యథా, స్థానంబుల= ఆయాప్రదేశాలలో; నానా, దేశ+అధిపతులన్= వివిధ దేశాల రాజులను; ఉండన్+పంచి= ఉండునట్లుగా నియమించి; ద్రుపదుండు; వారలన్+ఎల్లన్, పూజించెన్; పరమ, బ్రహ్మణ్యులు+అగు= మిక్కిలిగ బ్రాహ్మణత్వము కలిగియున్న వాళ్ళయిన; బ్రాహ్మణులతోడన్= బ్రాహ్మణులతో; కలిసి, ఉన్న, పాండవులును; బ్రాహ్మణ సమూహంబులోన్; ఉండి; పాంచాలరాజు, సమృద్ధినిన్= ద్రుపదునియొక్క గొప్పఐశ్వర్యాన్ని; చూచి; సంతసిల్లిరి; అంతన్.

తాత్పర్యం: ఆ ద్రౌపదీ స్వయంవరరంగం నగరానికి ఈశాన్యదిక్కున, మంచిగంధపునీటితో తడుపబడి చదరంగా చేయబడిన స్థలం కలదై, లోతైన అగడ్తలతో, ఎత్తైన ప్రాకారాలతో, విశాలా లైన ద్వారాలతో, వెలుపలి వాకిళ్లతో, కైలాస పర్వత సౌందర్యాన్ని ఎగతాళిచేసే విధంగా ప్రకాశిస్తూ, ఆకాశా న్నంటే శిఖరాలు కల అందమైన సౌధ

ప్రదేశాలతో, అనేకవిధా లైన మంచెలతో అమరి ఉండగా, అందులో వివిధదేశాల రాజులకు ఆయా ప్రదేశాలలో విడిది కల్పించి, ద్రుపదుడు వా ళ్ళందరిని పూజించాడు. ఉత్తమబ్రాహ్మణులతో కలిసి ఉన్న పాండవులు, ఆ బ్రాహ్మణసమూహంలో ఉంటూనే, పాంచాలరాజు ఐశ్వర్యాతిశయాన్ని చూచి, సంతోషించారు. తరువాత.

సీ. ధవళవిభూషణ దామానులేపనా । మలినాంగి సితపుష్పమాల చేతఁ
గొని పుష్పసాయకు కుసుమేతరం బైన । యాఱగు సాయకం బనఁగ జనులు
ధవళాక్షి రంగమధ్యంబునఁ దనుమధ్య । దా నొప్పి పాంచాలతనయ యున్న
భూసురప్రవరుల పుణ్యాహఘోషంబు । విలసిల్లె నాశీర్వివృద్ధితోడ

ఆ. ద్రుపదపతి పురోహితుండును గృతపరి । స్తరణుఁ డై ప్రయోగదక్షుఁ డగ్ని
ముఖము సేసి వేల్వ మొనసి వివాహోప । కరణ వస్తుచయము గాచియుండె. 168

ప్రతిపదార్థం: ధవళ, విభూషణ, దామ+అనులేపన+అమలిన+అంగి= తెల్లని ఆభరణాలను. మాలలను, మైపూతను కల నిర్మల మైన దేహం కలది; ధవళ+అక్షి= తెల్లని కన్నులు కలది; తను, మధ్య= సన్నని నడుం కలది; పాంచాల, తనయ= పాంచాల రాజు కూతురు అయిన ద్రౌపది; సిత, పుష్పమాల= తెల్లని పూలదండను; చేతన్+కొని= చేతిలో ధరించి; జనులు= ప్రజలు; పుష్ప, సాయకు, కుసుమ+ఇతరంబు+ఐన= పూవులను బాణాలుగా గల మన్మథునియొక్క పూవులకంటె ఇతరమైన; ఆఱు+అగు, సాయకంబు+అనఁగన్= ఆరవ బాణమా అని అనగా; రంగమధ్యంబునన్= స్వయంవరరంగమధ్యంలో; తాన్= తాను; ఒప్పి= ప్రకాశించి; ఉన్నన్= ఉండగా; భూసుర, ప్రవరుల, పుణ్యాహఘోషంబు= బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క పుణ్యాహము అనే ధ్వని; ఆశీస్+వివృద్ధితోడన్= ఆశీర్వాదాల అతిశయంతో; విలసిల్లెన్= ఒప్పెను; ప్రయోగ దక్షుఁడు= వైదికకర్మలు చేయించటంలో సమర్థుడు; ద్రుపద పురోహితుండును= ద్రుపదుని యొక్క పురోహితుడుకూడ; కృత, పరిస్తరణుఁడు+ఐ= చేయబడిన పరిస్తరణం కలవాడై- అనగా అగ్నిచుట్టును దర్భల సమూహాన్ని అలంకరించినవాడై; అగ్నిముఖము= అగ్నియొక్క హోమారంభం; చేసి= కావించి; వివాహ+ఉపకరణ, వస్తు చయము= పెండ్లికి సాధనాలైన వస్తువుల సమూహాన్ని; వేల్వన్= హోమం చేయటానికి; మొనసి= పూని; కాచి, ఉండెన్= వేచిఉన్నాడు.

తాత్పర్యం: పాంచాలరాజతనయ ద్రౌపది - అందమైన సన్ననినడుముతో, తెల్లని కళ్ళతో, అలంకరించుకొన్న తెల్లని ఆభరణాలతో, పూలదండతో, మైపూతతో, నిర్మలదేహకాంతితో, తెల్లటి పూదండ ఒకటి చేత ధరించి ప్రజలంతా తనను చూచి 'ఈమె మన్మథునిఅయిదుపూలబాణాలకంటే వేరైన ఆరవపూబాణమా అని అనుకొంటుండగా - స్వయంవర రంగమధ్యంలో నిలిచి ఉన్నది. బ్రాహ్మణ శ్రేష్ఠుల పుణ్యాహధ్వని, ఆశీర్వచనాలు అతిశయిల్లాయి. వైదిక కర్మలు చేయించటంలో చాలా సమర్థుడైన ద్రుపదపురోహితుడు అగ్నిచుట్టూ దర్భలు అలంకరించి, హోమారంభంచేసి, వివాహానికి తగిన వస్తుసమూహంతో హోమం చేయటానికి సిద్ధంగా వేచి ఉన్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. అట్టి యవసరంబున బోరన మ్రోయు జనులయులివును వాదిత్రనాదంబును వారించి ధృష్టద్యుమ్నుండు మూఁగినరాజలోకంబు నెల్లం జూచి యగ్నిసమీపంబున గంధపుష్పధూపదీపార్చితం బైన విల్లును నమ్ములను వైహాయసం బైన లక్ష్యంబును వారలకుం జూపి యి ట్లనియె. 169

ప్రతిపదార్థం: అట్టి, అవసరంబునన్= అట్టి సమయంలో; బోరన, మ్రోయు= హోరుమని మ్రోగే; జనుల, ఉలివును= జనులు మాట్లాడుకొనే మాటల సవ్వడిని; వాదిత్రనాదంబును= వాద్యాల ధ్వనిని; వారించి= ఆపి; ధృష్టద్యుమ్నుండు; మూఁగిన= కూడిఉన్న; రాజ, లోకంబున్+ఎల్లన్= రాజుల సమూహాన్నంతా; చూచి; అగ్ని, సమీపంబునన్, అగ్నిహోత్రం దగ్గర; గంధ, పుష్ప, ధూప, దీప+అర్చితంబు+అయిన= గంధంచేత, పూవులచేత, ధూపంచేత, దీపంచేత, పూజింపబడిన దైన; విల్లును= ధనుస్సును; అమ్ములను= బాణాలను; వైహాయసంబు+ఐన= ఆకాశాన ఉన్నట్టి దైన; లక్ష్యంబును= గురియైన మత్స్యయంత్రాన్ని; వారలకున్, చూపి= వాళ్లకు చూపించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ సమయంలో హోరు మనే ప్రజలధ్వనినీ, వాద్యాలధ్వనినీ ఆపి, ధృష్టద్యుమ్నుడు అక్కడ చేరిన రాజ సమూహా న్నంతా చూచి, అగ్నిహోత్రం దగ్గర గంధపుష్పధూపదీపాలతో పూజింపబడిన ధనుస్సును, బాణాలను, ఆకాశంలో ఉన్న మత్స్యయంత్రాన్ని వాళ్ళకు చూపి, ఈ విధంగా పలికాడు.

తరువోజ.

> **ఈ విల్లు మోపెట్టి యేను బాణముల । నీ యంత్రమత్స్యంబు నేసినవాఁడ**
> **భావజప్రతిముఁ డిబ్బాలకుఁ దగిన । పతి; యిది మునిశక్తిఁ బడసిన విద్య;**
> **గావున మీ రిప్డు గావింపుఁ డిదియ । ఘనతర కార్ముక కౌశలోన్నతియు**
> **లావును గలవారలకు నవసరము । లలితయశంబుఁ గల్యాణంబుఁ బడయ.** **170**

ప్రతిపదార్థం: ఈ, విల్లు= ఈ ధనుస్సును; మోపెట్టి= ఎక్కుపెట్టి; ఏను, బాణములన్= ఐదుబాణాలచేత; ఈ యంత్ర, మత్స్యంబున్= ఈ యంత్రంలోని చేపను; ఏసిన, వాఁడు+అ= కొట్టినవాడే; భావజ, ప్రతిముఁడు= మన్మథుని పోలినవాడు; ఈ, బాలకున్= ఈ కన్యకు - ద్రౌపదికి; తగిన, పతి= తగిన మగడు; ఇది= ఈ మత్స్యయంత్రం; ముని, శక్తిన్= ఋషి యొక్క శక్తి చేత; పడసిన= పొందిన; విద్య; కావునన్; మీరు; ఇప్డు= ఇప్పుడు; కావింపుడు= ప్రయత్నింపుడు; ఘనతర, కార్ముక, కౌశల+ ఉన్నతియున్= మిక్కిలి గొప్పదైన ధనుస్సునందలి నైపుణ్యంయొక్క అతిశయాన్ని; లావును= బలమును; కలవారలకున్= కలిగినవారికి; ఇదియు+అ= ఇదే; లలిత, యశంబున్= చక్కని కీర్తిని; కల్యాణంబున్= శుభాన్ని, వివాహాన్ని; పడయన్= పొందటానికి; అవసరము= (తగిన) సమయం.

తాత్పర్యం: ఈ విల్లును ఎక్కుపెట్టి, ఐదు బాణాలతో ఈ యంత్రంలోని మత్స్యాన్ని కొట్టినవాడే ఈ కన్యకు తగిన మన్మథసమాను డైన భర్త. ఈ మత్స్యయంత్రం మునిశక్తితో పొందినవిద్య. కనుక ఇప్పుడు మీరు ప్రయత్నించండి. విలువిద్యలో గొప్పసామర్థ్యం, బలం కలవాళ్ళు చక్కనికీర్తిని, కల్యాణాన్ని పొందటానికి ఇదే సరైన సమయం.

వ. **అని ధృష్టద్యుమ్నుండు మూఁగిన రాజపుత్త్రులకు నెల్ల నెఱుంగ జెప్పి, ద్రుపదరాజపుత్త్రిం జూచి 'యఖిలజలధి వేలావలయవలయిత మహీతలంబునం గల రాజనందను లెల్ల నీస్వయంవరంబునకు వచ్చినవారు; వీరలం జూడు' మని దుర్యోధనదుశ్శాసనదుర్ముఖప్రముఖు లయిన ధృతరాష్ట్రనందనుల నూర్వురం, దత్సమీపంబున నున్న కర్ణాశ్వత్థామ సోమదత్త భూరిశ్రవశ్శ్రుతసేనాదులను, బుత్త్రభ్రాతృసమేతు లయి యున్న శల్య విరాట జరాసంధ గాంధారపతులను, నక్రూర సారణ సాత్యకి సాంబ సంకర్షణ ప్రద్యుమ్న కృష్ణ కృతవ ర్మానిరుద్ధ యుయుధాన ప్రముఖులైన యదువృష్ణి భోజాంధకవరులను, సుమిత్ర సుకుమార సుశర్మ సుదక్షిణ సుషేణ**

సేనాబిందు చంద్రసేన సముద్రసే నౌశీనర చేకితాన శిశుపాల శ్రేణిమ జ్జనమేజయ జయద్రథ బృహద్రథ సత్యవ్రత చిత్రాంగద శుభాంగద భగీరథ భగదత్త పౌండ్రకవాసుదేవ వత్సరాజ ప్రభృతు లయిన నానాదేశాధీశులను వేదధ్వని సనాథం బై యొప్పచున్న బ్రాహ్మణసమూహంబునుం జూపి. 171

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; ధృష్టద్యుమ్నుండు; మూఁగిన= చేరిన; రాజ, పుత్త్రులకున్+ఎల్లన్= రాజకుమారు లందరికీ; ఎఱుంగన్+చెప్పి= తెలియునట్లుచెప్పి; ద్రుపదరాజ, పుత్త్రిన్+చూచి= ద్రౌపదిని చూచి; అఖిల, జలధి, వేలా, వలయ, వలయిత, మహీతలంబునన్+కల= అన్ని సముద్రాల చెలియలికట్టలు అనే వలయంచేత చుట్టబడిన భూప్రదేశంలో; కల= ఉన్న; రాజ, నందనులు+ఎల్లన్= రాజకుమారులందరు; నీ, స్వయం వరమునకు ; వచ్చినవారు= వచ్చారు; వీరలన్= వీళ్లను, చూడుము+అని; దుర్యోధన, దుశ్శాసన, దుర్ముఖ, ప్రముఖులు+అయిన= దుర్యోధనుడు, దుశ్శాసనుడు, దుర్ముఖుడు మొదలైన; ధృతరాష్ట్ర, నందనులన్= ధృతరాష్ట్రుని కుమారుల; నూర్వురన్= నూరుమందినీ; తద్+సమీపంబునన్= అక్కడికి దగ్గరగా నున్న; కర్ణ+అశ్వత్థామ, సోమదత్త, భూరిశ్రవస్, శ్రుతసేన, ఆదులను= కర్ణుడు, అశ్వత్థామ, సోమదత్తుడు, భూరిశ్రవుడు, శ్రుతసేనుడు, మొదలగువారినీ; పుత్ర, భ్రాతృ, సమేతులు+అయి ఉన్న= కొడుకులతో, తోబుట్టువులతో కూడిఉన్న; శల్య, విరాట, జరాసంధ, గాంధార పతులనున్; అక్రూర, సారణ, సాత్యకి, సాంబ, సంకర్షణ, ప్రద్యుమ్న, కృష్ణ, కృతవర్మ+అనిరుద్ధ, యుయుధాన; ప్రముఖులు+అయిన= మొదలైన; యదు, వృష్ణి, భోజ+అంధక, వరులను= యదు, వృష్ణి, భోజ, అంధక వంశ శ్రేష్ఠులనూ; సుమిత్ర, సుకుమార, సుశర్మ, సుదక్షిణ, సుషేణ, సేనాబిందు, చంద్రసేన, సముద్రసేన, ఔశీనర, చేకితాన, శిశుపాల, శ్రేణి మత్+జనమేజయ, జయద్రథ, బృహద్రథ, సత్యవ్రత, చిత్రాంగద, శుభాంగద, భగీరథ, భగదత్త, పౌండ్రకవాసుదేవ, వత్సరాజ, ప్రభృతులు+అయిన= మొదలగు వారైన; నానా, దేశ+అధీశులను= వివిధదేశాల రాజులనూ; వేద, ధ్వని సనాథంబు+ఐ= వేద ధ్వనులతో కూడినదై; ఒప్పుచున్న= ప్రకాశిస్తున్న; బ్రాహ్మణ, సమూహంబునున్= బ్రాహ్మణులయొక్క సమూహాన్నీ; చూపి.

తాత్పర్యం: అని ధృష్టద్యుమ్నుడు అక్కడ చేరిన రాజపుత్రుల కందరికీ తెలియజెప్పాడు. ద్రౌపదిని చూచి 'సమస్త భూమండలంలో కల రాజకుమారులంతా నీ స్వయంవరానికి వచ్చారు. వీళ్ళను చూడు' మని దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైన ధృతరాష్ట్రకుమారులు నూరుగురినీ - ఆ సమీపంలో ఉన్న కర్ణుడు, అశ్వత్థామ, సోమదత్తాదులనూ, కొడుకులతో సోదరులతో కూడి ఉన్న శల్య, విరాటాదులనూ - అక్రూరుడు, సారణుడు, సాత్యకి మొదలైన యదు వృష్ణి భోజ అంధక వంశ శ్రేష్ఠులనూ - సుమిత్రుడు, సుకుమారుడు మొదలైన వివిధ దేశాల రాజులనూ, వేదధ్వనితో ప్రకాశిస్తున్న బ్రాహ్మణసమూహాన్నీ చూపి.

గమనిక: ఇందలి పేర్ల వరుస మొత్తము వచనభాగాన్ని చదివి గ్రహింప ప్రార్థన.

విశేషం: స్వయంవరం - క్షత్రియకన్యలు-వివిధదేశాలనుండి వచ్చి చేరిన రాజకుమారుల సభలో, స్వయంగా తనకు ఇష్టమైన వరుణ్ణి వరించే ఉత్సవం. ఇక్కడ బాలుడైన అనిరుద్ధుడూ, వృద్ధుడైన సోమదత్తుడూ స్వయంవరానికి వచ్చిన వాళ్లలో ఉన్నారు. మూలంలోనూ ఇట్లే ఉంది. వచ్చినవాళ్లందరూ వరించడానికే కాదు-చూడడానికీ, ఆశీర్వదించడానికీ వచ్చినవాళ్లూ ఉంటారు. బలరామకృష్ణులూ ఇలా వచ్చినవాళ్లే!

రాజపుత్త్రులు మత్స్యయంత్రమును భేదింపఁబోయి భంగపడుట. (సం -177-22)

ఆ. **'ఇందు లక్ష్య మెవ్వఁ డేసె నాతని వరి । యింపు నెమ్మితోడ నిందువదన!'**
యనిన రాజపుత్త్రు లవ్విల్లు మోపెట్టి । యేయఁ గడఁగి కదలి రెల్లవారు. 172

ప్రతిపదార్థం: ఇందు, వదన= చంద్రునివంటిముఖం కలదానా!; ఇందున్= వీరందరిలో; లక్ష్యము= గురి అయిన మత్స్యయంత్రాన్ని; ఎవ్వఁడు; ఏసెన్= కొట్టాడో; అతనిన్= వానిని; నెమ్మితోడన్= ప్రేమతో; వరియింపు= వరింపుము; అనినన్= అనిపలుకగా; రాజ, పుత్త్రులు; ఎల్లవారు=అందరు, ఆ+విల్లు= ఆ ధనుస్సును; మోపెట్టి= ఎక్కుపెట్టి; ఏయన్= కొట్టటానికి; కడఁగి= పూనుకొని; కదలిరి= ముందుకు సాగారు.

తాత్పర్యం: 'చంద్రునివంటి ముఖం కల ఓ ద్రౌపదీ! వీరిలో మత్స్యయంత్రాన్ని కొట్టినవాడిని ప్రేమతో వరించుము' అని పల్కగా రాజకుమారు లంతా ఆ విల్లు ఎక్కుపెట్టి కొట్టటానికి పూనుకొని కదిలారు.

సీ. **అమ్మహోత్సవము నెయ్యమ్మునఁ జూడంగఁ। దివిరి యేతెంచిన దివిజ ఖచర**
గరుడ గంధర్వ కిన్నరుల విమానముల్ । విలసిల్లె నంబరతలమునందుఁ;
బణవవీణావేణురణితానుసార మై । రసగీతరవ మెల్ల దెసల నెసఁగెఁ;
బోరన వివిధతూర్యారవంబులు మహా । వననిధిధ్వానంబు ననుకరించె;

ఆ. **దివ్యమాల్యములయు దివ్యానులేపన । ములయు సౌరభంబు వెలయఁ దాల్చి**
రంగమధ్యజనులకుం గడు తనుపుగాఁ జేరి వీచె దివ్య మారుతంబు. 173

ప్రతిపదార్థం: ఆ+మహోత్సవమున్= ఆ గొప్ప ఉత్సవాన్ని; నెయ్యమ్మునన్= ప్రీతితో; చూడంగన్; తివిరి= కోరి; ఏతెంచిన= (విచ్చేసిన) వచ్చిన; దివిజ, ఖచర, గరుడ, గంధర్వ, కిన్నరుల విమానముల్; అంబరతలంబునందున్= ఆకాశ ప్రదేశంలో; విలసిల్లెన్= ప్రకాశించాయి; పణవ, వీణా, వేణు, రణిత+అనుసారము+ఐ= మద్దెలల, వీణల, పిల్లనగ్రోవుల ధ్వనిని అనుసరించిన దై; రస, గీత, రవము= ఆనందాన్ని కలిగించే సంగీతధ్వని; ఎల్ల దెసలన్= అన్నిదిక్కుల; ఎసఁగెన్= వ్యాపించెను; బోరన; వివిధ తూర్య+ఆరవంబు= బోరు మని అనేక విధాలైన వాద్యాల ధ్వనులు; మహా, వన, నిధి ధ్వానంబున్= మహాసముద్రముయొక్క ధ్వనిని; అనుకరించెన్= పోలెను; దివ్య, మాల్యములయు= మంచిపూలదండలయొక్క; దివ్య+అనులేపనములయు = మంచిపూతలయొక్క - అనగా గంధం మొదలైన మైపూతద్రవ్యాలయొక్క; సౌరభంబు= సువాసన; వెలయన్= ఒప్పగా; తాల్చి= ధరించి; రంగ, మధ్య, జనులకున్= స్వయంవరరంగమధ్యంలో ఉన్న జనులకు; కడున్= మిక్కిలి; తనుపుగాన్= తృప్తిగా; దివ్య, మారుతంబు= మంచి గాలి; వీచెన్= వీచింది.

తాత్పర్యం: దేవతలు, ఆకాశసంచారులు, గరుడులు, గంధర్వులు, కిన్నరులు ఆ ద్రౌపదీ స్వయంవరమహోత్సవాన్ని చూడగోరి ప్రీతితో రాగా, వాళ్ళవిమానాలు ఆకాశంలో ప్రకాశించాయి. మద్దెలల, వీణల, పిల్లనగ్రోవుల ధ్వనిని అనుసరిస్తూ రసమయసంగీతధ్వని అన్నిదిక్కుల వ్యాపించింది. అనేకవిధాలైన వాద్యాల ధ్వనులహోరు మహాసముద్ర ధ్వనినిపోలి ఉండింది. మంచిపూదండలు, గంధంవంటి మంచిమైపూతలు మొదలైనవవాటి సువాసనతో కూడిన మంచిగాలి, స్వయంవరరంగమధ్యంలో ఉన్న జనులకు తృప్తి కలిగేవిధంగా వీచింది.

విశేషం: అలం: ఉపమ.

చ. **అవిరళభస్మమధ్యమున నగ్నికణంబుల పోలె బ్రాహ్మణ**
ప్రవరులలోన నేర్పడక పాండవు లేవురు నున్నఁ జూచి యా

దవ వృషభుండు కృష్ణుఁడు ముదంబున వారి నెఱింగి, పార్థుఁ డీ
యువతిఁ బరిగ్రహించు ననియుం దలఁచెన్ హృదయంబులోపలన్. 174

ప్రతిపదార్థం: అవిరళ, భస్మ, మధ్యమునన్= దట్టమైన బూడిద నడుమ; అగ్ని కణంబుల, పోలెన్= నిప్పు ముక్కలవలె; బ్రాహ్మణ, ప్రవరులలోనన్= బ్రాహ్మణశ్రేష్ఠులలో; పాండవులు+ఏవురున్= పాండవు లైదుగురూ; ఏర్పడక= తెలియరాక; ఉన్నన్= ఉండగా; చూచి; యాదవ, వృషభుండు= యాదవులలో శ్రేష్ఠుడు-కృష్ణుడు; ముదంబునన్= సంతోషంతో; వారిన్= వాళ్ళను; ఎఱింగి= తెలిసికొని; పార్థుఁడు= అర్జునుడు; ఈ, యువతిన్= ఈ కన్యను - ద్రౌపదిని; పరిగ్రహించున్= చేపట్టును; అనియున్, హృదయంబులోపలన్, తలఁచెన్= అని కూడ హృదయంలో అనుకొన్నాడు.

తాత్పర్యం: దట్టమైన బూడిద నడుమ నిప్పు కణాలవలె బ్రాహ్మణ శ్రేష్ఠుల మధ్య పాండవులైదుగురూ స్పష్టంగా తెలియరాకుండా ఉండటం చూచి, ఆ యాదవ శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు సంతోషంతో వాళ్ళను గుర్తించి, అర్జునుడు ఈ ద్రౌపదిని చేపట్టగల డనికూడ మనస్సులో అనుకొన్నాడు.

విశేషం: అలం: ఉపమ. సత్త్వగుణ ప్రధానులు, పవిత్రులు అయిన బ్రాహ్మణశ్రేష్ఠుల సమూహాన్ని భస్మంతో, సత్త్వరజోగుణ ప్రధానులు-బ్రాహ్మణ వేషాలతో బ్రాహ్మణులమధ్యలో ఉన్న పాండవులను అగ్నికణాలతో పోల్చటం అర్థవంతంగా మనోహరంగా ఉన్నది. పాండవులను నివురుకప్పిన నిప్పుకణాలుగా వర్ణించటం రుచిరార్థసూక్తిమత్త్వం. బ్రాహ్మణవేషాలు తొలగి నిజరూపాలు వెలువడే సమయం వచ్చిం దని రంగమధ్యంలోని గాలి ధ్వనిస్తున్నది. నివురుకప్పిన నిప్పులను సైతం గుర్తింపగలిగిన శ్రీకృష్ణుని దివ్యప్రతిభ ఇందులో గమ్యమానం. 'ఏర్పడక పాండవు లేవురు నున్నన్ - చూచి' అన్నప్పుడు ఉండగా చూచి, అనిన్నీ, ఉన్నప్పటికీ గమనింప కలిగి (తెలిసికొని చూచి) అనిన్నీ చెప్పుకొనేటట్లు రచించటం నన్నయ సూక్తిప్రయోగనైపుణ్యం. శ్రీకృష్ణాదులు మత్స్యయంత్ర భేదనంలో పాల్గొనకపోవటానికి కారణం ధ్వనిమయం చేసి కథను ప్రసన్నం చేశాడు నన్నయ. (సంపా.)

వ. అంత నా రాజనందనులు ద్రుపదరాజనందనం జూచి కందర్పబాణబాధితు లయి తమ్మును దమ సామర్థ్యము నెఱుంగక యర్థిత్వంబున నవ్విల్లు మోపెట్టఁ బోయి. 175

ప్రతిపదార్థం: అంతన్= అనంతరం; ఆ రాజనందనులు= ఆ రాజకుమారులు, ద్రుపదరాజనందనన్= ద్రుపదరాజుయొక్క కూతురైన ద్రౌపదిని; చూచి; కందర్ప, బాణ, బాధితులు+అయి= మన్మథునిబాణాలచేత బాధింపబడినవాళ్ళయి; తమ్మునున్= తమను; తమ సామర్థ్యమ్మును; ఎఱుంగక= తెలియక; అర్థిత్వంబునన్= ఆశచేత; ఆ+విల్లు= ఆ ధనుస్సును; మోపెట్టన్+పోయి= ఎక్కుపెట్టపోయి.

తాత్పర్యం: తరువాత ఆ రాజకుమారులు ద్రౌపదిని చూచి మన్మథబాణపీడితులై తమను, తమ పరాక్రమాన్ని అంచనా వేసుకోలేక ఆశతో ఆ విల్లును ఎక్కుపెట్టటానికి పోయి.

క. వడి నౌడు గఱచి, వలకేల్ । నిడుచన గనయమునఁ బెనఁచి, నీల్గి, బలం బే
ర్పడ విల్లు వంపనోపక । యుడిగిరి నృపసుతులు గొంద ఱొయ్యన లజ్జన్. 176

ప్రతిపదార్థం: నృప, సుతులు= రాజపుత్రులు; కొందరు; వడిన్= వేగమే; ఔడు, కఱచి= పెదవిని పళ్ళతో బిగబట్టి; వలకేల్= కుడిచేతిని; నిడుచన= పొడవగునట్లు; గనయమునన్= వింటికొప్పునందు; పెనఁచి= చుట్టి; నీల్గి= ఒళ్ళువిరుచుకొని; బలంబు=

శక్తి; ఏర్పడన్= బైటపడగా; విల్లు= ధనుస్సు; వంపన్+ఓపక= వంచలేక; ఒయ్యనన్= తిన్నగా; లజ్జన్= సిగ్గుచేత; ఉడిగిరి= ప్రయత్నాన్ని మానుకొన్నారు.

తాత్పర్యం: రాజకుమారులు కొందరు వేగంగా తమ పెదవిని పళ్ళతో బిగబట్టి, కుడిచేతిని చాచి, వింటికొప్పును పట్టి, నీల్గి తమబలం బైటపడగా, ఆ వింటిని వంచలేక సిగ్గుపడి ఆ ప్రయత్నం మెల్లగా మానుకొన్నారు.

క. బలవంతుల బలమఱగా । మలువక ప్రాన్ప్రానిపాట మాయాధను వి
మ్ములఁ జేసిన మోపెట్టఁగఁ । గొలఁదియె యని డాయ రైరి కొందఱు దానిన్. 177

ప్రతిపదార్థం: కొందరు; బలవంతులు; బలము; అఱఁగాన్= నశించేటట్లు; మలువక= వంపక; ప్రాన్+ప్రాని పాట= ప్రాకులలో పెద్ద ప్రాకువలె; మాయా, ధనువు= మాయా ధనుస్సును; ఇమ్ములన్= చక్కగా; చేసినన్= చేసినచో; మోపెట్టఁగన్= ఎక్కుపెట్టుటకు; కొలదియె= సాధ్యమా; అని= తలంచి; దానిన్= ఆ ధనుస్సును; డాయరు+అయిరి= దగ్గరకే పోక పోయారు.

తాత్పర్యం: 'బలవంతుల బలం అణగేవిధంగా దానిని వంచక' ప్రానులలో పెద్దప్రానువలె ఉన్న ఈ మాయా ధనుస్సును ఈ విధంగా చేస్తే ఎవరు ఎక్కుపెట్టగలరు? అని కొందరు రాకుమారులు దాని దగ్గరకే పోలేదు.

మ. 'ఇది యెట్లున్ సమకూర దెవ్వరికి; ము న్నీ విల్లు మోపెట్టఁ బో
లదు; మోపెట్టియు నంతరిక్షమున నా లక్ష్యంబు భేదింపఁగా
నది బ్రహ్మాదుల కైన నిం దలవిగా' దంచున్ విచారించి ని
ర్మదు లై కొందఱు రాజు లేఁగిరి నిజక్ష్మామార్గముల్ చూచుచున్. 178

ప్రతిపదార్థం: ఇది= ఈ ద్రౌపది; ఎట్లున్= ఏ విధంగా కూడ; ఎవ్వరికీ= ఎవరికీ; సమకూరదు= లభించదు; మున్ను= ముందు; ఈ, విల్లు; మోపెట్టన్= ఎక్కుపెట్టటానికి; పోలదు= సాధ్యంకాదు; మోపెట్టియున్= ఎక్కుపెట్టినప్పటికి; అంతరిక్షమునన్= ఆకాశంలో; ఆ, లక్ష్యంబున్= ఆ గురిని - మత్స్యయంత్రాన్ని; భేదింపఁగాన్= కొట్టటం; అది= అనేది; బ్రహ్మ+ఆదులకు+ఐనన్= బ్రహ్మ మొదలైన వాళ్ళకు కూడ; ఇందున్= ఇక్కడ; అలవి, కాదు= సాధ్యం కాదు; అంచున్= అని అంటూ; విచారించి= ఆలోచించి; కొందఱు, రాజులు; నిర్మదులు+ఐ= మదంలేనివాళ్ళయి; నిజ, క్ష్మా, మార్గముల్= తమ భూముల త్రోవలు - అనగా తమ ఊరిత్రోవలు; చూచుచున్; ఏఁగిరి= వెళ్ళిరి.

తాత్పర్యం: 'ఈ ద్రౌపది యే విధంగాకూడా ఎవ్వరికీ లభించదు. మొదట ఈ విల్లు ఎక్కుపెట్టటమే సాధ్యం కాదు. ఎక్కుపెట్టినా, ఆకాశంలోని ఆ మత్స్యయంత్రాన్ని భేదించటం బ్రహ్మాదులకైనా అలవికాదు' అని ఆలోచించి, కొందరు రాజులు గర్వం వదలి, తమఊరిదారి పట్టారు.

విశేషం: భూవలయంలో ఉన్న రాజులంతా మూగిన సభ అది. చాలమంది విల్లును ఎత్తే శక్తిలేక ఓటుపడ్డారు. వాళ్ళంతా ఆ విల్లెత్తటం, ఆపైన మత్స్యయంత్రాన్ని భేదించటం సాధ్యమయ్యే పని కా దనీ, ద్రౌపదిస్వయంవరం సఫలం కా దనీ భావించి, తమ తమ దేశాలకు తిరిగిపోయారు. ఈ వర్ణనం మత్స్యయంత్రాన్ని భేదించే అర్జునునీ. అర్జునుని సామర్థ్యాతిశయాన్నీ మరింత ప్రకాశింపచేసేదిగా ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అర్జునుఁడు మత్స్యయంత్రంబుఁ దెగ నేయుట (సం.1-179-4)

వ. ఇట్లు రాజపుత్త్రు లవ్విల్లు మోపెట్ట నోపక నివృత్తు లయిరి; మఱి యదు వృష్ణి భోజాంధకులు కృష్ణానుమతంబున సజ్య కర్మంబునం దనారంభు లయి మిన్నకుండి; రంత శిశుపాల జరాసంధ శల్యకర్ణులు దర్పితు లై తమ తమ లావులు మెఱసి క్రమంబున నలువురు మాష యవముద్గరోమమాత్రంబులు దక్క గొనయం బెక్కించియు మోపెట్ట నశక్యంబయిన నుక్కుసెడి స్రుక్కిన; వారలం జూచి యగ్రజు ననుమతంబున విప్రసభ వెలువడి విజయుండు ధనుస్సమీపంబున కరిగిన, నాతని యుత్సాహంబున కచ్చెరువడి కొందఱు బ్రాహ్మణులు దమలో ని ట్లనిరి.179

ప్రతిపదార్థం: ఇట్లు; రాజపుత్త్రులు; ఆ+విల్లు= ఆ ధనుస్సును; మోపెట్టన్+ఓపక= ఎక్కుపెట్టలేక; నివృత్తులు+ఐరి= వెనుదిరిగి పోయారు; మఱి= ఇక; యదు, వృష్ణి; భోజ+అంధకులు= యాదవులు, వృష్ణులు, భోజులు, అంధకులు; కృష్ణ+అనుమతంబునన్= కృష్ణుని అభిప్రాయాన్ని అనుసరించి; సజ్య, కర్మంబునందు= విల్లు ఎక్కుపెట్టే పనియందు; అనారంభులు+ఐ= ఆరంభం చేయని వా ళ్ళయి - అనగా ప్రయత్నం చేయనివాళ్ళయి; మిన్నక+ఉండిరి= ఊరకున్నారు; అంతన్= అటుపై; శిశుపాల, జరాసంధ; శల్య, కర్ణులు; దర్పితులు+ఐ= గర్వంతో కూడుకొన్నవారై; తమ తమ లావులు= తమతమ బలాలు; మెఱసి= ప్రకటించి; క్రమంబునన్= వరుసగా; నలువురు; మాష, యవ, ముద్గ, రోమ, మాత్రంబులు= మినుపగింజ, యవగింజ, పెసరగింజ, వెంట్రుక అంత మాత్రములు; తక్క= తక్కువగా, (మిగులునట్టుగా); గొనయంబు= అల్లెత్రాటిని; ఎక్కించియు; మోపెట్టన్= ఎక్కుపెట్టుటకు; అశక్యంబు+అయినన్= సాధ్యం కాకపోగా; ఉక్కు, చెడి= బలం లేక; స్రుక్కినన్= సోలగా; వారలన్= వాళ్ళను; చూచి, అగ్రజు, అనుమతంబునన్= అన్న యైన ధర్మరాజుయొక్క సమ్మతిచేత; విప్రసభ= బ్రాహ్మణుల సభనుండి; వెలువడి= బయలుదేరి; విజయుండు= అర్జునుడు; ధనుస్+సమీపంబునకు= విల్లు దగ్గరకు; అరిగినన్= వెళ్లగా; అతని ఉత్సాహంబునకున్; అచ్చెరువు, పడి= ఆశ్చర్యపడి; కొందరు, బ్రాహ్మణులు; తమలోన్; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ఈ విధంగా రాజకుమారులు ఆ ధనుస్సులు ఎక్కుపెట్టలేక వెనుదిరిగి పోయారు. యదువృష్ణి, భోజాంధకులు శ్రీకృష్ణుని అభిప్రాయాన్ని అనుసరించి ధనుస్సును ఎక్కుపెట్టే ప్రయత్నమే చేయలేదు. శిశుపాల, జరాసంధ, శల్య, కర్ణులు గర్వితులై తమ తమ బలాలు వెల్లడి కాగా - క్రమంగా మినుపగింజ, యవగింజ, పెసరగింజ, వెంట్రుక - అంతమాత్రం తక్కువగా అల్లెత్రాటిని ఎక్కించి కూడ, ఆ ధనుస్సును ఎక్కుపెట్టలేక బలం చెడి సోలిపోయారు. వాళ్ళను చూచి అర్జునుడు తన అన్న ధర్మరాజు అనుమతిని పొంది, బ్రాహ్మణసభ నుండి వెలువడి ధనుస్సు దగ్గరికి వెళ్లగా, అతని ఉత్సాహానికి ఆశ్చర్యపడి కొందరు బ్రాహ్మణులు తమలో ఇట్లా మాట్లాడుకొన్నారు.

విశేషం: అలం: క్రమము. మత్స్యయంత్రం భేదించలేని రాజులను నన్నయ నాల్గు విధాలుగా వర్గీకరించి వర్ణించాడు. 1. విల్లు నెత్తటానికి ప్రయత్నించి విఫలు లైనవారు. 2. విల్లు నెత్తటం, మత్స్యయంత్రం కొట్టటం సాధ్యం కా దని భావించి పోటీ మానుకొని ఇండ్లకు పోయినవారు. 3. ఆ పోటీలో పాల్గొనా లని వచ్చి పోటీలో పాల్గొనక నిర్లిప్తులుగా ఉండిపోయినవారు. 4. పోటీలో పాల్గొన్నా అల్లెత్రాటిని ఎక్కించేవరకు వచ్చి కొద్దిలో తప్పినవారు. ఈ నాల్గువర్గాల రాజకుమారులందరి ప్రయత్నాలు ముగిసిన తరువాత బ్రాహ్మణవర్గంలో నుండి విజయుడు లేచి విల్లును సమీపించాడు. అర్జునుడిని ఈ సమయంలో 'విజయుడు' అని పేర్కొనటం (అతని విజయాన్ని సూచిస్తూ) ఎంతో ఉచితంగా ఉన్నది.

ఉ. ఇ మ్మనుజేంద్రనందను లహీనబలుల్ దృఢదీర్ఘ బాహువీ
ర్యమ్ములవార లోపర శరాసనకర్మమునం ; దయుక్త ద
ర్పమ్మున నిప్డు నవ్వు పఱుపన్ సమకట్టె నితండు విప్రవం
శమ్మునవారినెల్లఁ దనశక్తి యెఱుంగక దుర్విదగ్ధుఁ డై. 180

ప్రతిపదార్థం: ఈ+మనుజ+ఇంద్ర, నందనులు= ఈ రాజశ్రేష్ఠుల కుమారులు; దృఢ, దీర్ఘ, బాహు, వీర్యమ్ముల వారలు= దృఢాలై పొడవైన బాహువుల పరాక్రమాలు గలవారు; అహీన, బలుల్= తక్కువగాని బలం కలవారు; శర+ఆసన, కర్మమునందు= ధనుస్సు యొక్క పనియందు అనగా ధనుస్సును ఎక్కుపెట్టి మత్స్యయంత్రాన్ని కొట్టేపనిలో; ఓపరు+అ= చేతగాని వారైరికదా; ఇప్పుడు, ఇతండు; అయుక్త, దర్పమ్మునన్= తగని గర్వంచేత; తన శక్తి; ఎఱుంగక= తెలియక; దుర్విదగ్ధుఁడు+ఐ= అవివేకి అయి; విప్ర, వంశంబునన్, వారిన్+ఎల్లన్= బ్రాహ్మణవంశంలోని వారినందరిని; నవ్వుపఱుపన్= నవ్వుల పాలయ్యేటట్లు చేయటానికి; సమకట్టెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: ఈ మహారాజకుమారులు దృఢాలైనవి, పొడవైనవి అగు బాహువుల పరాక్రమంలో ఏమాత్రం తక్కువ కాని బలంకలవాళ్ళు. వాళ్ళే ఈ విల్లును ఎక్కుపెట్టి కొట్టలేక పోయారు. ఇప్పు డితడు అనుచిత మైన గర్వంతో, తనశక్తి యెంతో తెలుసుకోలేక, అవివేకి అయి బ్రాహ్మణవంశంవాళ్ళనంతా నవ్వులపాలు చేయటానికి పూనుకొన్నాడు.

క. అనువారు, నందుఁ గొందఱు । ఘనుఁ డీతఁడు; వీరికంటెఁ గార్ముక విద్యం
దనరిన వాఁ డయి దీనికి । మొనసెంగా; కన్యుఁ డిట్లు మొనయం గలఁడే! 181

ప్రతిపదార్థం: అనువారున్= అని పలికేవాళ్లు; అందున్= వారిలో; కొందఱు; ఈతఁడు; ఘనుఁడు; కార్ముక విద్యన్= విలువిద్యలో; వీరికంటెన్; తనరినవాఁడు+ఐ= ఒప్పినవా డై; దీనికిన్= ఈ పనికి, మొనసెన్+కాక= పూనుకొన్నాడు కాని; అన్యుఁడు= ఇతరుడు; ఇట్లు; మొనయన్+కలఁడు+ఏ= పూనుకొనగలడా.

తాత్పర్యం: అని పలుకుతూ ఉండగా; అందులో కొందరు 'ఇతడు గొప్పవాడు. వీళ్ళకంటె విలువిద్యలో నేర్పు కలవా డై ఈ పనికి పూనుకొన్నాడుకాని సామాన్యుడు ఈ విధంగా పూనుకొనగలడా?'

మ. అమితోత్సాహుఁడు దీర్ఘ బాహుపరిఘుం డత్యంతతేజస్వి స
ద్విమలాచారుఁడు విప్రభక్తిపరుఁ డీ విప్రుండు విప్రప్రసా
దమునన్ విప్రుల కెల్ల సంతసముగాఁ దత్కర్మసంసిద్ధి ను
త్తముఁడై పొందెడు మంచు నుండిరి దయన్ ధాత్రీసురుల్ ప్రీతు లై. 182

ప్రతిపదార్థం: అమిత+ఉత్సాహుఁడు= అపరిమితమైన ఉత్సాహం కలవాడు; దీర్ఘ; బాహు, పరిఘుండు= పొడవైన ఇనుప గుదియలవంటి బాహువులు కలవాడు; అత్యంత, తేజస్వి= మిక్కిలి తేజస్సు కలవాడు; సత్+విమల, ఆచారుఁడు= శ్రేష్ఠమూ; నిర్మలమూ అయిన నడవడి కలవాడు; విప్ర, భక్తిపరుఁడు= బ్రాహ్మణభక్తి ప్రధానంగా కలవాడు; ఈ, విప్రుండు= ఈ బ్రాహ్మణుడు; విప్ర, ప్రసాదమునన్= బ్రాహ్మణుల అనుగ్రహంవలన; విప్రులకున్+ఎల్లన్= బ్రాహ్మణులందరికి; సంతసముగాన్= సంతోషమయ్యేటట్లు; తద్+కర్మ; సంసిద్ధిన్= ఆ కార్యంయొక్క నెఱవేరుటను; ఉత్తముఁడు+ఐ; పొందెడుము= పొందుగాక;

అంచున్= అని పలుకుతూ; ధాత్రీ, సురుల్= బ్రాహ్మణులు; ప్రీతులు+ఐ= సంతోషించినవా ళ్ళయి; దయన్= దయతో; ఉండిరి= ఉన్నారు.

తాత్పర్యం: అపరిమితమైన ఉత్సాహం కలవాడు, దీర్ఘమైన ఇనుపగుదియలవంటి బాహువులు కలవాడు, మిక్కిలి తేజస్సు కలవాడు, శ్రేష్ఠము, నిర్మలము అయిన నడవడి కలవాడు, బ్రాహ్మణభక్తి కలవాడు అయిన ఈ బ్రాహ్మణుడు - బ్రాహ్మణుల అనుగ్రహంచేత బ్రాహ్మణులందరికి సంతోషం కలిగేవిధంగా కార్యసిద్ధి పొందుగాక! అని బ్రాహ్మణులు సంతోషించినవాళ్ళయి అర్జునునిపట్ల దయతో ఉన్నారు.

విశేషం: అర్జునుడు ధనువుదగ్గరికి పోతున్న సమయంలో బ్రాహ్మణవర్గంవాళ్ళు అతడినిగురించి భావించిన పద్ధతులను మూడురకాలుగా ఒక క్రమంలో చిత్రించటం నన్నయ కథాకథనశిల్పం. ఒకరకంవాళ్ళు భయస్థులు. మహాపరాక్రమవంతు లైన రాకుమారులే ఎక్కుపెట్టలేని విల్లును చేపట్టి మత్స్యయంత్రాన్ని కొట్టటానికి యత్నించి విఫలుడై బ్రాహ్మణవర్గాన్ని నవ్వులపాలు చేయటానికి పూనుకొన్నా డని వాళ్ళు భావించారు. రెండవ రకంవాళ్ళు వివేచనపరులు. రాకుమారులకంటె బలవంతుడై ఉండబట్టే ప్రయత్నిస్తున్నా డని భావించారు. మూడవ రకంవాళ్ళు విజ్ఞులు. విజయుని రూపతేజోబలాదులను గణించి, విజయం తథ్యమని నిశ్చయించినవారు. ఈ బ్రాహ్మణవర్గాలవారి వ్యాఖ్యలు అర్జునుని సామర్థ్యాన్ని, విజయాన్ని ప్రకాశింపచేసే వస్తుధ్వని విశేషాలు. క్షత్రియులు మాట్లాడకుండా ఉండటంకూడా ఇందులో ఒక విశేషమే. బ్రాహ్మణహృదయం బయటపడినట్లుగా క్షత్రియహృదయం బయటపడదు. బహుశః కొందరు క్షత్రియులు ఆశ్చర్యచకితులై అర్జునునివైపు అలా చూస్తూ ఉన్నారేమో - ఇతడు ఏం చేస్తాడో చూద్దా మని. మరికొందరు అతని ప్రయత్నాన్ని ఉపేక్షించి ఊరకున్నారేమో! మొత్తానికి క్షత్రియులు మాట్లాడలేదు.

వ. అంత న య్యర్జునుండు న వ్వింటిసమీపంబునకు వచ్చి గురువులం దలంచి నమస్కారంబు సేసి, ధనువునకుఁ బ్రదక్షిణంబుఁ జేసి మ్రొక్కి దాని నెత్తికొని పూర్వపరిచితం బైనవిల్లు మోపెట్టిన ట్లశ్రమంబున మోపెట్టి, జను లాశ్చర్యంబునుం బొందుచుండ, నే నమ్ముల న మ్మత్స్యయంత్రంబు నాక్షణంబ యురుల నేసినం జూచి బ్రాహ్మణ క్షత్త్రియ ప్రముఖు లయిన జనులెల్ల విస్మితు లయి. 183

ప్రతిపదార్థం: అంతన్= అటుపై; ఆ+అర్జునుండున్= ఆ అర్జునుడుకూడా; ఆ+వింటి= ఆ ధనుస్సుయొక్క; సమీపంబునకున్= దగ్గరకు; వచ్చి; గురువులన్; తలంచి; నమస్కారంబు, చేసి; ధనువునకున్= ధనుస్సుకు; ప్రదక్షిణంబున్ చేసి= చుట్టుతిరిగి; మ్రొక్కి; దానిన్, ఎత్తికొని= ఆ వింటిని ఎత్తుకొని; పూర్వ, పరిచితంబు+ఐన= ఇంతకు ముందే అలవాటుపడిన; విల్లు= ధనుస్సు; మోపెట్టిన+అట్లు= ఎక్కుపెట్టినట్లు; అ(శమంబునన్= శ్రమలేకుండా, సులభంగా; మోపెట్టి= ఎక్కుపెట్టి; జనులు, ఆశ్చర్యంబునున్, పొందుచుండన్= ఆశ్చర్యాన్ని పొందగా; ఏను+అమ్ములన్= ఐదుబాణాలచేత; ఆ+మత్స్య యంత్రంబున్= ఆ మత్స్యయంత్రాన్ని; ఆ, క్షణంబు+అ= ఆ క్షణమే; ఉరులన్= పడేటట్లు; ఏసినన్= కొట్టగా; చూచి; బ్రాహ్మణ, క్షత్త్రియ, ప్రముఖులు+ఐన= బ్రాహ్మణులు, క్షత్రియులతో ముఖ్యులైన; జనులు+ఎల్లన్= ప్రజలు అందరూ; విస్మితులు+అయి= ఆశ్చర్యపడిన వాళ్ళయి.

తాత్పర్యం: తరువాత అర్జునుడు ఆ ధనుస్సు దగ్గరికి వచ్చి, గురువులను స్మరించుకొని నమస్కారం చేసి, ధనుస్సుకు ప్రదక్షిణనమస్కారాలు చేసి, దాన్ని ఎత్తుకొని, అలవా టైన ధనుస్సును సంధించినట్లు సులభంగా సంధించి, ప్రజలంతా ఆశ్చర్యపడుతుండగా, ఐదు బాణాలతో ఆ మత్స్యయంత్రాన్ని ఒక్క క్షణంలోనే పడగొట్టాడు. అది చూచి బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలైన జనులంతా ఆశ్చర్యపరవశు లయ్యారు.

విశేషం: అర్జునుడు విల్లును ఎక్కుపెట్టటానికి ముందు గురువులను స్మరించి నమస్కరించటం, విల్లుకు ప్రదక్షిణం చేసి మ్రొక్కటం - అనేవి ధనుర్వేదవిద్యను పవిత్రభావంతో ఉపాసించే మేటివీరుని లక్షణం. గర్వితులైనవారికి విల్లు వశం కాలేదు. మత్స్యయంత్రం ఒక ఋషి కల్పించిన విద్య అని ధృష్టద్యుమ్నుడు చెప్పనే చెప్పాడు. విద్యను గౌరవించటం విద్వాంసునికే తెలుసు అని అర్జునునిపాత్రను చిత్రించటం - ఇక్కడ విశేషం. విద్య వినయవంతులకే ప్రసన్నమౌతుం దనే సత్యంకూడ ఇక్కడ స్పష్టమౌతున్నది. మత్స్యయంత్రభేదనంవంటి మహత్తరవిషయాన్ని నన్నయ చిన్నవచనంలో చెప్పి ముగించాడు. అర్జునుని ప్రశంసించిన వాక్యాలను వృత్తాలలో నిబంధించాడు. మత్స్యయంత్రం కొట్టిన అర్జునునికి అది ఒక గొప్ప ప్రదర్శనం కాదు. కాని, ఆ సభలో ఉన్నవాళ్ళ కంతా అది ఒక అద్భుతం. అవలీలగా ప్రదర్శితమైన జగదేకవీరుడైన అర్జునుని వీరరసాన్ని వచనంలోనూ, దానినుండి పుట్టిన అద్భుతాన్ని పద్యాలలోనూ రచించటం నన్నయగారి సార్థక ఛందఃప్రయోగశిల్పం.

చ. ఫలపవనాంబుభోజన శుభవ్రతవృత్తులఁ జేసి చూడ దు
ర్బలతను లయ్యు బ్రాహ్మణు లపారతపోబలసంపదన్ మహా
బలయుతు; లట్టి వారలకు భవ్యుల కెందు నసాధ్య మెద్దియుం
గలదె? చరాచరాఖిలజగంబులఁ బెద్దలు కారె సద్ద్విజుల్. 184

ప్రతిపదార్థం: బ్రాహ్మణులు; ఫల, పవన+అంబు, భోజన, శుభ, వ్రత, వృత్తులన్+చేసి= పండ్లు, గాలి, నీరు భక్షించటంచేత, పుణ్యాలయిన వ్రతాలను చేయటంచేత; చూడన్= చూడటానికి; దుర్బల తనులు+అయ్యున్= బలహీనమైన శరీరం కలవారు అయినప్పటికీ; అపార, తపస్+బల, సంపదన్= అమితమైన తపోబలంయొక్క అతిశయంచేత; మహా, బల, యుతులు= గొప్ప బలంతో కూడినవారు; అట్టి, వారలకు; భవ్యులకున్= మహనీయులకు; ఎందున్, అసాధ్యము= ఎచ్చటను సాధ్యం కానిది; ఎద్దియున్, కలదె= ఏదైనా ఉన్నదా?; సత్+ద్విజుల్= ఉత్తములైన బ్రాహ్మణులు; చర+అచర+అఖిల, జగంబులన్= కదలునవి, కదలనివి అయిన అన్ని లోకాలలో; పెద్దలు+అ, కారె= పెద్దలే కదా.

తాత్పర్యం: బ్రాహ్మణులు ఫలాలను, గాలిని, నీటిని భక్షించటంచేత, పుణ్యవ్రతాలు చేయటంచేత; చూడటానికి బలహీనమైన దేహంకలవా ళ్ళయినా, అపారతపోబలసంపదచేత వాళ్ళు మహాబలవంతులు. అటువంటి మహనీయులకు ఎక్కడా అసాధ్యమైనది ఏదీ లేదు. సమస్తచరాచరలోకాలలో సద్బ్రాహ్మణులే గొప్పవాళ్ళుగదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. నిమిషాంతరమున ని ట్ల। శ్రమమున మర్త్యులకు నేయ సమకూరునె యు
త్తముఁ డీతఁడు బ్రాహ్మణ రూ। పమున సురేశ్వరుఁడొ హరుఁడొ భానుఁడొ గుహుఁడో! 185

ప్రతిపదార్థం: నిమిష+అంతరమునన్= క్షణం లోపల; ఇట్లు; అశ్రమమునన్= అనాయాసంగా; మర్త్యులకున్= మానవులకు; ఏయన్= మత్స్యయంత్రాన్ని పడవేయటం; సమకూరునె= సాధ్యమౌతుందా; ఈతఁడు, ఉత్తముఁడు; బ్రాహ్మణ రూపమునన్= బ్రాహ్మణ రూపంలో ఉన్న; సుర+ఈశ్వరుఁడొ= దేవేంద్రుడో; హరుఁడొ= శివుడో; భానుఁడొ= సూర్యుడో; గుహుఁడో= కుమారస్వామియో.

తాత్పర్యం: క్షణకాలంలోపలనే ఈ విధంగా అనాయాసంగా మత్స్యయంత్రాన్ని కొట్టటం మానవులకు సాధ్యమౌతుందా? ఉత్తము డైన ఇతడు బ్రాహ్మణరూపంలో ఉన్న దేవేంద్రుడో! శివుడో! సూర్యుడో! కుమారస్వామియో!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, ఉల్లేఖం.

క. అని ధరణి నుండి పొగడెడు । జనుల నిరంతరరవంబు, జలధరమార్గం
బున నుండి పొగడు దివ్యుల । యనవరతరవంబు నొక్కఁ డయి కడు నొప్పెన్. 186

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; ధరణిన్+ఉండి= భూమిమీద ఉండి; పొగడెడు, జనుల, నిరంతర, రవంబు= పొగడునట్టి మనుష్యులయొక్క ఎడతెగని శబ్దం; జలధర, మార్గంబున నుండి = మేఘమార్గము - అనగా ఆకాశమార్గమునుండి; పొగడు, దివ్యుల అనవరత, రవంబున్ = పొగడునటువంటి దేవతలయొక్క ఎడతెగనిశబ్దం; ఒక్కఁడు+అయి= ఒకటి అయి; కడున్= మిక్కిలి; ఒప్పెన్= అనువుగా అమరాయి.

తాత్పర్యం: అని భూమిమీద ఉండి పొగడే జనుల ఎడతెగని ధ్వని, ఆకాశంనుండి పొగడే దేవతల ఎడతెగని ధ్వని కలిసి మిక్కిలి అనువుగా అమరాయి.

విశేషం: ఇటు నేలమీదనుండి పొగడే జనాల సవ్వడి, అటు ఆకాశంనుండి పొగడే దేవతల సవ్వడి సమంగా ఏర్పడి అర్జునుని ప్రశంస భూనభోంతరాళాలలో వ్యాపించిం దని భావనామయంగా వర్ణించాడు నన్నయ. ఈ పద్యరచనానిర్ధారణంలోని సమత అనే గుణం ఈ వస్తుగుణాన్ని రమణీయంగా పోషిస్తున్నది. అద్భుతం ఆశ్చర్యభావంయొక్క ఉత్కటదశ. అది వాచికంగా వ్యక్తమైన మూడుదశలను మూడుపద్యాలలో నన్నయ చిత్రించటం గమనార్హం. రాబోయే పద్యంలో చేష్టాత్మకమైన ఆశ్చర్యాన్ని వర్ణించటం శిల్పం. (సంపా.)

క. చెలఁగె సురదుందుభిస్వన । ములు ముదమున భూసురోత్తములు పయిపుట్టం
బులు వీచివీచి యార్చిరి । వెలయఁగ నరుమీఁదఁ బుష్పవృష్టియుఁ గురిసెన్. 187

ప్రతిపదార్థం: సుర, దుందుభి, స్వనములు= దేవతలయొక్కభేరులధ్వనులు; చెలఁగెన్= మ్రోగాయి; భూసుర+ఉత్తముల్= బ్రాహ్మణ శ్రేష్ఠులు; ముదమునన్= సంతోషంతో; పయి, పుట్టంబులు= మీది వస్త్రాలు - అనగా ఉత్తరీయాలు; వీచి, వీచి, ఆర్చిరి= మిక్కిలి వీచుతూ అరచారు; వెలయఁగన్= ఒప్పగా; నరుమీఁదన్= అర్జునుని మీద; పుష్పవృష్టియున్= పూలవానకూడ; కురిసెన్.

తాత్పర్యం: అప్పుడు దేవతల భేరీధ్వనులు మ్రోగాయి. బ్రాహ్మణోత్తములు తమ ఉత్తరీయాలను పదే పదే వీచుతూ పెద్దగా కేకలు వేశారు. అర్జుననిమీద పూలవాన అందంగా కురిసింది.

విశేషం: అంతమందిలో తమవాడు గెలిచా డని ఆనందాతిశయంతో బ్రాహ్మణులు ఉత్తరీయాలను పదేపదే వీచుతూ పెద్దగా కేకలు వేయటం ఎంతో సహజంగా, నాటకదృశ్యంగా కళ్ళకు కట్టిన ట్లున్నది.

వ. అ య్యవసరంబున ధర్మనందనుండు నకుల సహదేవానుగమ్యమానుం డయి నిజనివాసంబునకుం జనియె; నిట ధృష్టద్యుమ్న సహితుం డయి యజ్ఞసేనుండు మహాసేనతో నర్జుననకు సహాయుండుగా నరిగె; నంత. 188

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; ధర్మనందనుండు; నకుల, సహదేవ+అనుగమ్యమానుండు+అయి= నకుల, సహదేవులచే వెంబడింప బడినవాడై; నిజ, నివాసంబునకున్= తన ఇంటికి; చనియెన్= వెళ్ళాడు; ఇట; ధృష్టద్యుమ్న,

సహితుండు+ అయి= ధృష్టద్యుమ్మునితో కూడి; యజ్ఞసేనుండు= ద్రుపదుడు; మహా, సేనతోన్= గొప్ప సైన్యంతో; అర్జుననకున్= అర్జునునికి; సహాయుండుగాన్= సహకరించువాడై; అరిగెన్= వెళ్ళాడు; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: ఆ సమయంలో ధర్మరాజు నకులసహదేవులు వెంటరాగా తమ యింటికి వెళ్ళిపోయాడు. ఇక్కడ ధృష్టద్యుమ్మునితో కూడి ద్రుపదుడు గొప్పసేనతో అర్జునునికి సహాయుడుగా వెళ్ళాడు. అప్పుడు.

ద్రౌపది యర్జునుని వరించుట (సం. 1-179-22)

సీ. ధరణీశ నందనుల్ ద న్నతిప్రీతితోఁ జూచుచు నుండంగ సుందరాంగి
తోయజదళనేత్ర ద్రుపదరాజాత్మజ। కమనీయ గజరాజగమనలీలఁ
జనుదెంచి సురరాజసన్నిభు నభినవ। యౌవనోద్భాసితు నసితరత్న
రుచిరాంగు నంగజరూపు ధనంజయుఁ। దనచేతి సితపుష్పదామకమునఁ

ఆ. బొలఁతి ముదముతోడఁ బూజించె; నట్టియు। త్సవముఁ జూచి దాని సైఁప కపుడు
కౌరవేంద్రుఁ డాదిగాఁ గల భూపతు। లెల్ల నలిగి కలయు నేపు రేఁగి. 189

ప్రతిపదార్థం: ధరణి+ఈశ, నందనుల్= రాజకుమారులు; తన్నున్; అతి, ప్రీతితోన్, చూచుచున్, ఉండంగన్ = మిక్కిలి ప్రీతితో చూస్తూ ఉండగా; సుందర+అంగి= అందమైన శరీరం కలది; తోయజ, దళ, నేత్ర= తామర రేకులవంటి కన్నులు కలది; ద్రుపదరాజ+ఆత్మజ= ద్రుపదరాజుయొక్క కూతురు-ద్రౌపది; కమనీయ, గజరాజ, గమన, లీలన్= మనోహరమైన ఏనుగు శ్రేష్ఠముయొక్క నడకవంటి విలాసంతో; చనుదెంచి= వచ్చి; సురరాజ, సన్నిభున్= దేవేంద్రునితో సమానుడైనవాడిని; అభినవ, యౌవన+ఉద్భాసితున్= క్రొత్త యౌవనంచే ప్రకాశించే కాంతికల దేహం కలవాడిని; అంగజ, రూపున్= మన్మథుని వంటి రూపం కలవాడిని; ధనంజయున్= అర్జునుడిని; తన, చేతి, సిత, పుష్ప, దామకమునన్= తనచేతిలో ఉన్న తెల్లని పూదండచేత; పొలఁతి= ఆ కాంత; ముదముతోడన్= సంతోషంతో; పూజించెన్; అట్టి, ఉత్సవమున్, చూచి; సైఁపక= ఓర్వక; అపుడు; కౌరవ+ఇంద్రుఁడు= దుర్యోధనుడు; ఆదికాన్+కల= మొదలుగా కల; భూపతులు= రాజులు; ఎల్లన్= అందరు; అలిగి= కోపించి; కలయన్= అంతటను; ఏపురేఁగి= విజృంభించి.

తాత్పర్యం: రాజకుమారులంతా తనను మిక్కిలి ప్రీతితో చూస్తూ ఉండగా - అందమైనశరీరం కలది, తామరరేకులవంటి కన్నులు కలది అయిన ద్రౌపది, మనోహర మైన మదపుటేనుగునడకవంటి నడకతో విలాసంగా వచ్చి - దేవేంద్రునితో సమానమైనవాడు, నూత్నయౌవనంతో ప్రకాశించేవాడు, ఇంద్రనీలంవంటి కాంతిగల దేహం కలవాడు; మన్మథునివంటి రూపం కలవాడు అయిన అర్జునుడిని తనచేతితెల్లని పూలదండతో పూజించింది. అటువంటి ఉత్సవాన్ని చూచి ఓర్వలేక, అప్పుడు దుర్యోధనుడు మొదలైనరాజులంతా కోపించి అంతటా విజృంభించారు.

విశేషం: రాజకుమారులంతా ద్రౌపది యొక్క అందమైన ఆకారాన్నీ, తామరరేకులవంటి కన్నులనూ, మదేభగమనంవంటి నడకహొయలనూ కన్నార్పకుండా చూచారు. అంతటి సౌందర్యరాశి అర్జునునికి అంకితమైపోతున్నదే అని వారి అసూయ. ఆమె సౌందర్యం, దాని ఫలితం తరువాతి పద్యంలో నన్నయ చెప్పబోతున్నాడు. దానికి హేతువును కల్పించుకొన్నా డిక్కడ. ఇది ప్రసన్న కథాకలితార్థయుక్తి. రాజకుమారులంతా ద్రౌపదిని చూస్తుండగా, ఆమెమాత్రం అర్జునుడినే ఏకాగ్రతతో చూస్తున్నది. అతడు మొదట దేవేంద్రునితో సమానుడైనవాడుగా కనిపించాడట! ఈ 'సురరాజసన్నిభుడు' అనే విశేషణం రమణీయార్థవ్యంజకం.

వస్తుధ్వని పోషకం. అర్జునుడు ఇంద్రునివరంవలన పుట్టినవా డన్నది ఒక అర్థం, రాబోయే కథలో పంచేంద్రోపాఖ్యానంలో చెప్పబోయే కథార్థాలలో ఇంద్రత్వభావనం పతిత ఇక్కడ అనుసంధించుకొనవలసివస్తుంది. పూర్వాపర కావ్యార్థభావనవలన అర్జునుడుగా ఉన్న ఇంద్రుడు నిజానికి అయిదురూపాలకు ప్రతినిధి. అందువలననే అంతగా ఆసక్తితో చూస్తున్న ద్రౌపదియందు అర్జునుని మనసు మన్మథాయత్తమైనట్లు నన్నయ వర్ణించాడు. ఇది కథాకథనశిల్పరహస్యం. 213వ పద్యంలో ఈ రహస్యం గమనింపవచ్చును. ఇంద్రత్వమే కాక యౌవనం, కాంతి, రూపం అనే గుణాలను ద్రౌపది అర్జునునిలో చూచి అతనిమెడలో దండవేసింది. 'కన్యా వరయతే రూపం'. (సంపా.)

మత్తకోకిలము.

ఏల రాఁ బనిచెన్ మహీశుల నెల్లఁ జుట్టమపోలె ము
న్నేల సత్కృతిఁ జేసె నిందఱ? కిమ్మహారథు లుండఁగా
నేల కన్యక నిచ్చె విప్రున కిందు నేఁడు శఠుండు పాం
చాలుఁ, డిప్పడ వీని నిర్గతసత్త్వుఁ జేయుద మాజిలోన్. **190**

ప్రతిపదార్థం: మహీ+ఈశులన్+ఎల్లన్= రాజులందరిని; ఏల, రాన్+పనిచెన్= ఎందుకు రప్పించాడు? చుట్టమ, పోలెన్= చుట్టంవలె; మున్ను= ముందు; ఇందఱకున్= ఇంతమందికి; ఏల, సత్కృతిన్= ఎందుకు సమ్మానం; చేసెన్= చేశాడు; ఈ+మహారథులు+ ఉండఁగాన్= ఇంతమంది మహావీరు లుండగా; నేఁడు; ఏల= ఎందుకు; ఇందున్= ఇచ్చట; విప్రునకున్= బ్రాహ్మణునికి; కన్యకన్; ఇచ్చెన్; పాంచాలుఁడు= ద్రుపదుడు; శఠుండు= మోసగాడు; ఇప్పుడు+అ= ఇప్పటి కిప్పుడే; వీనిన్= ఈ ద్రుపదుడిని; ఆజిలోన్= యుద్ధంలో; నిర్గత, సత్త్వున్= కోల్పోయిన బలం కలవాణ్ణిగా; చేయుదము= చేస్తాము.

తాత్పర్యం: రాజు లందరినీ ఎందుకు రప్పించాడు? చుట్టంవలె ఇందరికి ముందుగా ఎందుకు సమ్మానం చేశాడు? ఈ మహావీరులంతా ఉండగా ఈనాడు ఇక్కడ ఒక బ్రాహ్మణుడికి కన్యకను ఎందు కిచ్చాడు? ద్రుపదుడు మోసగాడు. ఇప్పుడే యుద్ధంలో ఇతని బలాన్ని అణచివేద్దాం.

విశేషం: ద్రౌపదీస్వయంవరానికి విచ్చేసి పరాభూతులైన భూపతుల కోపాగ్ని ఈ పద్యంలో ప్రకటితం. చిన్న చిన్న వాక్యాలలో ఎక్కడికక్కడ ఆగిపోయే ఈ వాక్యాలనుబట్టి వారి కోపతాపాలు పూర్తిగా నిర్వీర్యము లని సూచన.

క. తన విద్య పేర్మి నృపనం। దనఁ బడసెను విప్రుఁ; డితని తప్పే? కడుదు
ర్జనుఁ డీ ద్రుపదుఁడు నృపతుల। ననయంబున మెచ్చఁ డయ్యె నతిగర్వితుఁడై. **191**

ప్రతిపదార్థం: విప్రుఁడు= బ్రాహ్మణుడు; తన, విద్య, పేర్మిన్= తన విద్యయొక్క గొప్పతనంచేత; నృప, నందనన్= రాజు కూతురైన ద్రౌపదిని; పడసెను= పొందాడు; ఇతని తప్పు+ఏ= ఇతని త ప్పేమున్నది; ఈ ద్రుపదుఁడు; దుర్జనుఁడు= దుర్మార్గుడు; అతి గర్వితుఁడు+ఐ= మిక్కిలి గర్వించినవాడై; నృపతులన్= రాజులను; అనయంబునన్= అవినీతితో; మెచ్చఁడు+అయ్యెన్= మెచ్చని వాడు అయ్యాడు.

తాత్పర్యం: ఈ బ్రాహ్మణుడు తన విద్యాబలంతో ద్రౌపదిని పొందాడు. ఇతని తప్పు ఏ మున్నది? ద్రుపదుడు దుర్మార్గుడు. అతడు అతిగర్వంతో రాజులను ఏమాత్రం లెక్కపెట్టలేదు.

వ. 'ఏమిదోషంబు సేసియు బ్రాహ్మణుండు వధ్యుండు గాఁడు; మన రాజ్యంబును నర్థంబును బ్రాహ్మణార్థంబ; కావున న విప్రుతోడి దేమి? యని ద్రుపదుపయి నెత్తుదెంచిన, ద్రుపదుండును కడుభీతుం డై బ్రాహ్మణుల మఱువు సొచ్చె;

నిట్లు శరణాగతుం డయిన ద్రుపదు నోడకుండు మని బ్రాహ్మణులు దమ తమ దండాజినంబు లెత్తికొని ప్రతిబలంబులపయి వీచుచున్నంత, వారలం జూచి నగుచు నర్జునుం డి ట్లనియె. 192

ప్రతిపదార్థం: ఏమి, దోషంబు, చేసియు; బ్రాహ్మణుండు; వధ్యుండు= చంపదగినవాడు; కాఁడు; మన, రాజ్యంబునున్; అర్థంబును= సంపదయు; బ్రాహ్మణ+అర్థంబు+అ= బ్రాహ్మణుల కొరకే; కావునన్, ఆ+విప్రుతోడిది+ఏమి= ఆ బ్రాహ్మణునితో మన కేమి; అని= అని తలచి; ద్రుపదు పయిన్= ద్రుపదునిమీద; ఎత్తుదెంచినన్= దండెత్తి రాగా; ద్రుపదుండును; కడున్= మిక్కిలి; భీతుండు+ఐ= భయపడినవాడై; బ్రాహ్మణుల, మఱువు= బ్రాహ్మణులచాటున; చొచ్చెన్= చేరెను; ఇట్లు; శరణ+ ఆగతుండు+అయిన= శరణుకోరి వచ్చిన; ద్రుపదున్= ద్రుపదుని; ఓడకుండుము+అని= భయపడ వద్దని; బ్రాహ్మణులు; తమతమ, దండ+అజినంబులు= చేతికఱ్ఱలను, (యోగదండములు మొదలైనవి) జింకచర్మములను; ఎత్తికొని; ప్రతిబలం బుపయిన్= శత్రుసేనలమీద; వీచుచున్; ఉన్నంతన్= వీచుచుండగా; వారలన్+చూచి= వాళ్ళను కనుగొని; నగుచున్= నవ్వుతూ; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఏ తప్పుచేసినా బ్రాహ్మణుడు చంపదగినవాడు కాదు. మనరాజ్యం, సంపద బ్రాహ్మణులకొరకే. కనుక ఈ బ్రాహ్మణునితో మన కేమి పని?' అని ద్రుపదుడిమీదికి దండెత్తి రాగా, అతడు మిక్కిలి భయపడి, బ్రాహ్మణుల చాటున చేరాడు. ఈ విధంగా శరణుకోరివచ్చిన ద్రుపదునికి అభయమిచ్చి బ్రాహ్మణులు తమ తమ దండాలను, జింక చర్మాలను ఎత్తుకొని శత్రుసేనలమీద వీచుతుండగా వారిని చూచి నవ్వుతూ అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: దుర్యోధనుడి దురహంకారం, కులాహంకారం, కుత్సితనీతి, అధర్మప్రవృత్తి ఈ సన్నివేశంలో బైటపడ్డాయి. మత్స్యయంత్రం కొట్టిన బ్రాహ్మణుడు అవధ్యుడు కాబట్టి అతడిని వదలిపెట్టటం న్యాయం అన్నాడు. క్షత్రియు లుండగా బ్రాహ్మణుడికి అవకాశం కలిగించి రాజకులానికి అవమానం కలిగించిన ద్రుపదుడిపై ఆగ్రహించాడు. పూర్వాపరాలను గాని, స్వపరసామర్థ్యాలను గాని ఆలోచించని దుర్విదగ్ధుడు దుర్యోధనుడు. కన్యను గెలుచుకొన్నవాడు రాజలోకం తిరగబడితే వారిని జయించి తన యోగ్యతను నిరూపించుకోవటం స్వయంవరరాజధర్మం. దుర్యోధనుడు సమర్థుడైతే బ్రాహ్మణుడి (అర్జునుడి)తో తలపడాలి. ఆ ధర్మం అతడు పాటించలేదు. ద్రుపదుడు బ్రాహ్మణుల నాశ్రయించటం సందర్భోచితం. అర్జునుడు తన యోగ్యతను నిరూపించుకొనా లని వీరసూచనంకూడా అది. అర్జునుడు దానిని పసికట్టాడు. బ్రాహ్మణులు దండాలతో విజృంభిస్తే వారిని వారించాడు. భీముడితో కలిసి రంగంలో నిలువబడి తనయోగ్యతను నిరూపించుకొనే ప్రయత్నంచేయటానికి పూర్వరంగం కలిగించాడు దుర్యోధనుడు. స్వయంవరసభలోకూడ దుర్యోధనుడు తన వర్గంతో కూడి, ప్రతినాయకప్రవృత్తిని ప్రదర్శించటం వస్తుధ్వనికి పరోక్షపోషకం. (సంపా.)

క. కడఁగి మదీయాస్త్రము లని । యెడు పటుమంత్రముల నిప్పు డీ నృపురిపుల
న్కడిఁది విషాహుల దర్పం । బుడిగించెదఁ దొలఁగి చూచుచుండుఁడు మీరల్. 193

ప్రతిపదార్థం: కడఁగి= పూని; మదీయ+అస్త్రములు= నా బాణాలు; అనియెడు= అనెడి; పటు, మంత్రములన్= గొప్ప మంత్రాలచేత; ఇప్పుడు; ఈ, నృపు, రిపులు+అన్= ఈ రాజుయొక్క శత్రువులనెడి - అనగా ద్రుపదుడి శత్రువులు అనే; కడిఁది విష+అహుల, దర్పంబు= పెద్ద విషసర్పాల గర్వాన్ని; ఉడిగించెదన్= అణచెదను; మీరల్= మీరు; తొలఁగి= ప్రక్కకు తొలగి; చూచుచు+ ఉండుఁడు =చూస్తూ ఉండండి.

తాత్పర్యం: పూనుకొని, నా అస్త్రా లనే గొప్పమంత్రాలతో ఇప్పు డీ ద్రుపదునిశత్రువు లనే పెద్దవిషసర్పాల గర్వం అణచివేస్తాను. మీరు ప్రక్కకు తొలగి చూస్తూ ఉండండి.

విశేషం: అలం: రూపకం. అలంకారవస్తుధ్వనికి పోషణం కావటానికి ఈ పద్యం రమణీయోదాహరణం. దుర్యోధనాదులు దుష్టసర్పాలు. అవి కాటువేయటానికి పూనుకొన్నాయి. అవి కాటువేయకుండా మంత్రగానివలె వాటిని నిర్వీర్యం చేస్తా నని సూచించాడు అర్జునుడు. 'ప్రతివీరులను చంపకుండా భంగపాటుకు గురిచేస్తాను చూడండి' అని వస్తుధ్వని. విషసర్పోపమానం దుర్యోధనాదుల కుటిలస్వభావానికీ, క్రూరత్వానికీ వ్యంజకం.

అర్జునుండు కర్ణునితో యుద్ధంబు సేసి జయించుట (సం.1-181-3)

వ. అని తానును భీమసేనుండును గడఁగి రిపుబలంబుపయి నపరిమితశరంబు లేసె; భీమసేనుం డొక్క వృక్షంబు పెఱికికొని దండ హస్తుం డయిన దండధరుండునుంబోలె నర్జునునకు సహాయుం డయి నిలిచె; నంత న య్యిద్దఱ మహా సంరంభంబుఁ జూచి విస్మితుఁ డై కృష్ణుండు బలదేవుని కి ట్లనియె. 194

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; తానును, భీమసేనుండును; కడఁగి= పూనుకొని; రిపు, బలంబుపయిన్= శత్రుసైన్యంమీద; అపరిమిత, శరంబులు= లెక్కలేనన్ని బాణాలు, ఏసెన్= వేశాడు; భీమసేనుండున్= భీమసేనుడుకూడా; ఒక్క, వృక్షంబు= ఒక చెట్టును; పెఱికి= పెరికి; దండ, హస్తుండు+అయిన= దండమును చేతియందు కలవా డైన; దండధరుండునున్+పోలెన్= యమధర్మరాజువలె; అర్జునునకున్= అర్జునునికి; సహాయుండు+అయి= సహకరించేవాడై; నిలిచెన్= నిలిచాడు; అంతన్= అటుపై; ఆ+ఇద్దఱ, మహా, సంరంభంబున్= ఆ ఇరువురి గొప్పవిజృంభణాన్ని; చూచి; కృష్ణుండు; విస్మితుఁడు+ఐ= ఆశ్చర్యపడినవాడై; బలదేవునకున్= బలరామునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా పల్కి, తానూ భీమసేనుడూ పూనుకొని శత్రుసైన్యంమీద లెక్కలేనన్ని బాణాలు వేశాడు. భీమసేనుడు ఒక పెద్దచెట్టును పెకలించుకొని, దండాయుధాన్ని ధరించిన యమధర్మరాజువలె అర్జునునికి సహాయుడుగా నిలిచాడు. అప్పుడు వా ళ్ళిద్దరి మహావిజృంభణం చూచి కృష్ణుడు ఆశ్చర్యపడి బలరామునితో ఇట్లా అన్నాడు.

సీ. 'తాలాభ మగు విల్లు దాల్చి విరోధుల । నెగచుచున్నవాఁ డింద్రతనయుఁ;
డాతని కెలన మహావృక్షహస్తుఁడై । యున్న వీరుండు వృకోదరుండు;
యంత్రంబు నరుఁ డేసి నప్పుడు పోయిన । యగ్గౌరవర్ణుండు యమతనూజుఁ;
డాతనితోడన యరిగిన యిరువురుఁ । గవల వా రర్కప్రకాశ తేజు'

ఆ. లనిన 'లక్కయింట నగ్నిదాహంబున । నెట్లు బ్రదికి రొక్కొ! యిమ్మహాత్ము;
లెట్టి పుణ్యదినమొ యేవురఁ జూచితి' । మనుచు సంతసిల్లె హలధరుండు. 195

ప్రతిపదార్థం: తాల+ఆభము= తాటిచెట్టు వంటిది; అగు= అయిన, విల్లు= ధనుస్సు; తాల్చి= ధరించి; విరోధులన్= శత్రువులను, ఎగచుచున్= తోలుచు; ఉన్నవాఁడు; ఇంద్ర, తనయుఁడు= ఇంద్రుని కుమారుడైన అర్జునుడు; అతని, కెలనన్= అతనికి ప్రక్క; మహా, వృక్ష, హస్తుఁడు+ఐ= గొప్ప చెట్టును చేత కలవాడై; ఉన్న= ఉండే; వీరుండు; వృకోదరుండు= భీముడు; యంత్రంబున్= మత్స్యయంత్రమును; నరుఁడు= అర్జునుడు; ఏసిన+అప్పుడు= కొట్టినప్పుడు; పోయిన, ఆ, గౌర, వర్ణుండు= తెల్లని వన్నె కల అతడు; యమ, తనూజుఁడు= యముని పుత్త్రుడైన ధర్మరాజు; అతని తోడన= అతని వెంట; అరిగిన= వెళ్ళిన; ఇరువురున్= ఇద్దరును; కవలవారు= నకుల సహదేవులు; అర్క, ప్రకాశతేజులు= సూర్యకాంతివంటి తేజస్సు

కలవాళ్ళు; అనినన్= అని పల్కగా; లక్క, ఇంటన్= లక్క ఇంటిలో; అగ్ని దాహంబునన్= నిప్పు మంటనుండి; ఈ మహాత్ములు; ఎట్లు; బ్రదికిరి+ఒక్కొ; ఎట్టి, పుణ్యదినమొ= ఎటువంటి పవిత్రమైన రోజో; ఏవురన్= ఐదుగురిని; చూచితిమి; అనుచున్= అనుకొంటూ; హలధరుండు= నాగలిని ధరించినవాడు - బలరాముడు; సంతసిల్లెన్= సంతోషించాడు.

తాత్పర్యం: 'తాటిచెట్టువంటి పెద్దవిల్లు ధరించి, శత్రువులను తరుముతున్నవాడు అర్జునుడు. అతని ప్రక్కనే గొప్పవృక్షాన్ని చే పట్టి ఉన్నవీరుడు భీముడు. అర్జునుడు మత్స్యయంత్రాన్ని పడగొట్టగానే సభనుండి వెళ్లిపోయిన తెల్లనివన్నెగలఅతడు-ధర్మరాజు. అతనివెంట వెళ్ళిన సూర్యసమానతేజు లిద్దరు నకులసహదేవులు' అని శ్రీకృష్ణుడు చెప్పగా 'లక్కయింటిలో నిప్పుమంటనుండి వీ రెట్లా బ్రతికారో! ఈ ఐదుగురుని చూచాము. ఇది ఎంత సుదినం!' అని బలరాముడు సంతోషించాడు.

విశేషం: వృకోదరుడు - వృకము=తోడేలు; తోడేలు కడుపువంటి కడుపు గలవాడు - భీముడు.

వ. అంత. **196**

ప్రతిపదార్థం: అంతన్= అంతలో.

తాత్పర్యం: అప్పుడు.

క. కురుపతి సూడఁగఁ గర్ణుఁడు । నరుఁ దాఁకెను; శల్యుఁ డనిల నందనుఁ దాఁకెన్
సరభసమున, విస్మయ మం । దిరి ధరణీదేవమనుజదేవప్రవరుల్. **197**

ప్రతిపదార్థం: కురుపతి= దుర్యోధనుడు; చూడఁగన్= చూస్తూఉండగా; కర్ణుఁడు; నరున్= అర్జునుని; తాఁకెను= ఎదుర్కొనెను; సరభసమునన్= వేగిరపాటుతో కూడినట్లుగ; శల్యుఁడు; అనిల, నందనున్= వాయుదేవుని కుమారుడైన భీముని; తాఁకెన్= ఎదుర్కొన్నాడు; ధరణీ, దేవ, మనుజ, దేవ ప్రవరుల్= బ్రాహ్మణశ్రేష్ఠులు, మానవశ్రేష్ఠులు దేవతా శ్రేష్ఠులు; విస్మయము+అందిరి= ఆశ్చర్యాన్ని పొందారు.

తాత్పర్యం: కురుపతి అయిన దుర్యోధనుడు చూస్తూ ఉండగా కర్ణుడు అర్జునుడిని ఎదుర్కొన్నాడు. వెంటనే వేగంగా శల్యుడు భీముడిని ఎదుర్కొన్నాడు. అది చూచి బ్రాహ్మణ, మానవ, దేవతా శ్రేష్ఠులు ఆశ్చర్యపడ్డారు.

శా. కర్ణుండున్ విజయుండు నొండొరులఁ జుల్కం దాఁకి; చాపంబు లా
కర్ణాంతం బగుచుండఁగాఁ దిగిచి యుగ్రక్రోధులై యేసి; రా
పూర్ణంబయ్యెఁ దదీయ బాణతతి నంభోభృత్పథం బెల్ల; నా
స్తీర్ణం బయ్యె ధరిత్రి యెల్ల; నవిసెన్ దిక్చక్ర మెల్లన్ వడిన్. **198**

ప్రతిపదార్థం: కర్ణుండున్, విజయుండున్= కర్ణుడును, అర్జునుడును; ఒండొరులన్= ఒకరినొకరు; చుల్కన్= సులభంగా; తాఁకి= ఎదుర్కొని; చాపంబులు= ధనుస్సులను; ఆకర్ణ+అంతంబు= చెవికొనవరకు పోవునవి; అగుచున్+ఉండఁగాన్= అవుతూ ఉండగా; తిగిచి= లాగి; ఉగ్ర, క్రోధులు+ఐ= భయంకరమైన కోపం కలవాళ్ళయి; ఏసిరి= బాణాలను వేశారు; తదీయ, బాణతతిన్= వారియొక్క బాణాల సమూహంచేత; వడిన్= వెంటనే; అంభో, భృత్+పథంబు+ఎల్లన్= నీటిని ధరించిన

మేఘాలయొక్క మార్గమంతా - అనగా ఆకాశమంతా; ఆపూర్ణంబు= నిండినది; అయ్యెన్= అయింది; ధరిత్రి, ఎల్లన్= భూమి అంతా; ఆస్తీర్ణంబు+అయ్యెన్= పరచబడింది అయింది; దిక్+చక్రము= దిక్కుల సమూహం; ఎల్లన్= అంతయు; వడిన్= వేగంగా; అవిసెన్= పగిలెను.

తాత్పర్యం: కర్ణార్జునులు ఒకరినొకరు సులభంగా ఎదుర్కొని, ధనుస్సులను ఆకర్ణాంతం లాగి, భయంకరమైన కోపంతో పరస్పరం బాణప్రయోగం చేసికొన్నారు. వాళ్లబాణాలసమూహంతో భూమీ, ఆకాశం నిండిపోయాయి. దిక్కులు పగిలిపోయాయి.

క. వీరుఁడగు నరుని యేయు న । పార శరావలుల నడుమ వారింపంగా
నేరక యే టుడిగి మహా । శూరుఁడు రాధేయుఁ డింద్రజున కి ట్లనియెన్. 199

ప్రతిపదార్థం: వీరుఁడు+అగు; నరుని; ఏయు, అపార, శర+ఆవళులన్= అర్జునునియొక్క వేయునటువంటి అనంతాలైన బాణాల సమూహాలను; నడుమన్= మధ్యలో; వారింపఁగన్= ఆపటానికి; నేరక= చేతకాక; మహాశూరుఁడు; రాధేయుఁడు= కర్ణుడు; ఏటు+ఉడిగి= బాణాలు వేయటం మాని; ఇంద్రజునకున్= అర్జునునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: వీరు డైన అర్జునుడు వేసే అంతులేని బాణపరంపరను నడుమ అడ్డుకొనలేక, మహాశూరుడైన కర్ణుడు బాణప్రయోగం మాని ఇంద్రకుమారు డైన అర్జునునితో ఇట్లా అన్నాడు.

విశేషం: నరుని యేయు - నరునియొక్క ఏయు - అనగా, నరుడు ఏయు. ఇక్కడ ప్రథమకు షష్ఠి వచ్చింది.

క. నా యెదురఁ జక్కనై యని । సేయఁగ భార్గవునకును శచీవరునకుఁ గౌం
తేయుఁ డగు విజయునకుఁ గా । కాయతభుజశక్తి నొరుల కలవియె ధరణిన్. 200

ప్రతిపదార్థం: నా, ఎదురన్= నా సమక్షంలో; చక్కన+ఐ= చక్కగా నిలబడి; అని= యుద్ధం; చేయఁగన్= చేయటానికి; భార్గవునకును= పరశురామునికి; శచీవరునకున్= శచీదేవి భర్తయైన దేవేంద్రునికి; కౌంతేయుఁడు+అగు= కుంతికొడుకు అయిన; విజయునకున్= అర్జునునికి; కాక= తప్ప; ఆయత, భుజ, శక్తిన్= అధికమైన భుజబలంచేత; ధరణిన్= భూమియందు; ఒరులకున్= ఇతరులకు; అలవియె= సాధ్యమా!; (కా దని భావం.)

తాత్పర్యం: నా యెదుట చక్కగా నిలిచి, యుద్ధంచేయటానికి పరశురామునికి, దేవేంద్రునికి, కుంతి కొడుకైన అర్జునునికి మాత్రమే సాధ్యమవుతుంది. కాని, గొప్పభుజశక్తితో న న్నెదుర్కొనటానికి ఈ భూమిమీద ఇతరులకు సాధ్యమవుతుందా?

క. నీ వప్రాకృతబలుఁడవు; । నీ విక్రమమునకు విల్లునేర్పునకు మహీ
దేవకులోత్తమ ! మెచ్చితి; । నావుడుఁ బార్థుండు గర్ణునకు ని ట్లనియెన్. 201

ప్రతిపదార్థం: నీవు+అప్రాకృత, బలుఁడవు= నీవు సామాన్యంకాని బలం కలవాడవు; మహీదేవ, కుల+ఉత్తమ= బ్రాహ్మణ కులంలో శ్రేష్ఠుడా; నీ విక్రమునకున్= నీ పరాక్రమానికి; విల్లు; నేర్పునకున్= విలువిద్యానైపుణ్యానికి; మెచ్చితిన్; నావుడున్= అని అనగా; పార్థుండు= అర్జునుడు; కర్ణునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! నీవు అసాధారణమైన బలం కలిగి ఉన్నావు. నీ పరాక్రమానికి, విలువిద్యా నైపుణ్యానికి మెచ్చాను' అని పల్కగా అర్జునుడు కర్ణునితో ఇట్లా అన్నాడు.

మధ్యాక్కర.

ఏను నీ చెప్పిన వారిలోపల నెవ్వఁడఁ గాను;
గాని నే సర్వశస్త్రాస్త్రవిద్యలఁ గడుఁ బ్రసిద్ధుండ;
భూనుత బ్రహ్మతేజో౽ధికుఁడ; నిన్నుఁ బోరిలో నోర్వఁ
గా నున్న వీరుండ; నొండు దక్కి లోఁగక చక్క నిలుము. 202

ప్రతిపదార్థం: ఏను= నేను; నీ, చెప్పిన, వారిలోపలన్= నీయొక్క చెప్పినవారియందు - అనగా నీవు చెప్పినవారిలో; ఎవ్వఁడన్ కాను;= ఎవరినీకాను; కాని= అయితే; నే= నేను; సర్వ, శస్త్ర+అస్త్ర, విద్యలన్= అన్ని శస్త్రాస్త్రవిద్యలందు; కడున్= మిక్కిలి; ప్రసిద్ధుండన్= ప్రముఖుడిని; భూనుత, బ్రహ్మతేజస్+అధికుఁడన్= భూమియందు పొగడబడిన బ్రహ్మతేజస్సుచేత గొప్పవాడను; నిన్నున్= నిన్ను; పోరిలోన్= యుద్ధంలో; ఓర్వన్+కాన్+ఉన్న= ఓడించటానికి సిద్ధంగా ఉన్న; వీరుండన్= వీరుణ్ణి; ఒండు= ఇతరములు; తక్కి= విడిచి; లోఁగక= వెనుదీయక; చక్క, నిలుము= గట్టిగ ఎదురుగా నిలబడుము.

తాత్పర్యం: నేను నీవు చెప్పినవాళ్ళలో ఎవ్వడినీ కాను. కాని అన్ని శస్త్రాస్త్రవిద్యలలో మిక్కిలి ప్రసిద్ధుడిని. లోకం కొనియాడే బ్రహ్మతేజస్సుతో గొప్పవాడిని. నిన్ను యుద్ధంలో ఓడించటానికి సిద్ధంగా ఉన్న వీరుడిని. తక్కిన మాటలు కట్టిపెట్టి గట్టిగా నిలబడు.

విశేషం: 'కాని నే' - అనే దానికి బదులు 'కానీన' అని అర్జునుడు కర్ణుడిని సంబోధించినట్లు కొన్ని ప్రతులలో ఉన్న పాఠం సరైందిగా తోచదు. కన్యాపుత్రుడు కానీనుడు, కర్ణుడు కన్యాపుత్రుడే అయినా అప్పటి కావిషయం అర్జునుడికి తెలియదు. అందుచేత కర్ణుడిని 'కానీన' అని సంబోధించటం అసంబద్ధం. 'కాని, నే' అనే ప్రస్తుతపాఠమే అన్నివిధాల ఉత్తమమైనది.

మరొక విశేషం: 'ఏను నీ చెప్పినవారిలోపల నెవ్వఁడఁగాను' అని నిశ్చయార్థంలో అంటే సందర్భోచితంగా అర్జునుడు మాట్లాడి నట్లవుతుందే కాని, అబద్ధం పలికినదోషం కలుగుతుంది. అందువలన నానారుచిరార్థ సూక్తి నిపుణుడైన నన్నయ ఆవాక్యాన్ని ప్రశ్నార్థకంగా, కాకువులో ఉచ్చరించటానికి వీలుగా కూడా నిబంధించాడు. అప్పుడు కర్ణుడు చెప్పినవారిలో అర్జునుడు ఎవ్వడు కాడు? అందరూ అవుతాడు - ముగ్గురు కలిసినా వారితో సమాను డౌతాడు అనే అర్థచమత్కారం ఏర్పడుతుంది. 'కాని, నే సర్వశస్త్రాస్త్రవిద్యలఁ గడు బ్రసిద్ధుండ' - అనే అర్జునునివాక్యంలో - 'కాని, నేను పైన నీవు చెప్పిన అందరియొక్క శస్త్రాస్త్రవిద్యలలో ఎంతో ప్రసిద్ధిపొందాను' అనే అర్థం కాకువులోనే సిద్ధిస్తుంది. అసత్యదోషం నివారితమవుతుంది. 'నిన్నుఁ బోరిలో నోర్వఁగ నున్న వీరుండన్' అని పలికినప్పుడు 'నిన్ను యుద్ధంలో ఓడించటానికే ఇంకా బ్రతికి ఉన్నాను, అదే నా జీవిత లక్ష్యం' అని అర్జునుడు వ్యంగ్యంగా చెప్పినట్లు భావించటానికి వీలుంది. మధ్యాక్కర మాటనేర్పరితనానికి వాడటం ఛందశ్శిల్పం. అర్జునుడు తన ఉనికిని గూఢంగా నిబంధించి వాఙ్మయ నైపుణ్యాన్ని ప్రదర్శించినట్లు చిత్రించాడు నన్నయ. (సంపా.)

వ. అనిన విని కర్ణుండు బ్రహ్మతేజం బజేయం బని విజయుతోడియుద్ధం బొల్లక క్రమ్మఱియె; మఱిశల్య భీమసేనులు పెనంగి మల్లయుద్ధంబు సేయునెడ భీముండు భీమబలంబునం బట్టుకొని శల్యుం ద్రెళ్ళ వైచిన. 203

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అని అర్జునుడు పలుకగా; విని, కర్ణుండు; బ్రహ్మతేజంబు; అజేయంబు= జయింప సాధ్యంకానిది; అని; విజయుతోడి= అర్జునునితో; యుద్ధంబు+ఒల్లక= యుద్ధం చేయటానికి ఇష్టపడక; క్రమ్మఱియెన్= వెనుదిరిగాడు; మఱి= పిమ్మట; శల్య, భీమసేనులు= శల్యుడు, భీముడు; పెనంగి= కలియబడి; మల్లయుద్ధంబున్; చేయు, ఎడ= చేసేటప్పుడు; భీముండు; భీమ, బలంబునన్= భయంకరమైన బలంచేత; శల్యున్= శల్యుని; పట్టుకొని= బిగియపట్టి; త్రెళ్ళవైచినన్= పడవేయగా.

తాత్పర్యం: అని అర్జునుడు పల్కగా, కర్ణుడు విని బ్రాహ్మణతేజస్సును జయించటం సాధ్య కా దని, అర్జునునితో యుద్ధం చేయటానికి ఇష్టపడక వెనుదిరిగి వెళ్ళాడు. శల్యభీమసేనులు కలియబడి మల్లయుద్ధం చేశారు. అప్పుడు భీముడు భయంకరమైన బలంతో శల్యుడిని పట్టుకొని పడవేశాడు.

ఆ. సెల్లుఁ డట్లు నేల ద్రెళ్ళి చెచ్చెర లేచి । యొడలు దుడిచికొనుచు నొయ్యఁ జనియె;
వానిఁ జూచి నగుచు మానుగా విప్రులు । భూరిసత్త్వు భీముఁ బొగడి రంత. 204

ప్రతిపదార్థం: సెల్లుఁడు= శల్యుడు; అట్లు; నేలన్= భూమిమీద; త్రెళ్ళి= పడి; చెరన్+చెరన్= బిరబిరా; లేచి; ఒడలు= దేహాన్ని; తుడిచి కొనుచున్; ఒయ్యన్= తిన్నగా; చనియెన్= వెళ్ళాడు; వానిన్= ఆ శల్యుణ్ణి; చూచి; విప్రులు= బ్రాహ్మణులు; నగుచున్= నవ్వుతూ; మానుగాన్= ఒప్పుగా; భూరి, సత్త్వు, భీమున్= గొప్ప బలవంతుడైన భీముడిని; అంతన్= అప్పుడు; పొగడిరి.

తాత్పర్యం: శల్యు డా విధంగా నేలపై పడి వెంటనే లేచి, శరీరం తుడుచుకొంటూ, తిన్నగా వెళ్ళిపోయాడు. అతడిని చూచి బ్రాహ్మణులు నవ్వుతూ మహాబలవంతు డైన భీముడిని గొప్పగా ప్రశంసించారు.

ఆ. పరశురాముఁ డొండె హరుఁ డొండె నరుఁ డొండె । గాక యొరులు గలరె కర్ణు నోర్వ!
బలిమి భీముఁ డొండె బలదేవుఁ డొండెఁ గా। కొరులు నరులు శల్యు నోర్వఁ గలరె! 205

ప్రతిపదార్థం: పరశురాముఁడు; ఒండె= కాని; హరుఁడు= శివుడు; ఒండె= కాని; నరుఁడు= అర్జునుడు; ఒండె= కాని; కాక= తప్ప; కర్ణున్+ఓర్వన్= కర్ణుని ఓడించటానికి; ఒరులు= ఇతరులు; కలరె= ఉన్నారా; బలిమిన్= బలంచేత; భీముఁడు; ఒండె= కాని; బలదేవుఁడు= బలరాముడు; ఒండెన్= కాని; కాక= తప్ప; ఒరులు= ఇతరులు; నరులు= మానవులు; శల్యున్+ఓర్వన్, కలరె= శల్యుడిని ఓడించగలరా! (లే రని భావం)

తాత్పర్యం: పరశురాముడో, శివుడో, అర్జునుడో కాక ఇతరులు కర్ణుడిని ఓడించగలరా? బలంలో భీముడో, బలరాముడో కాక తక్కినమానవులు శల్యుడిని ఓడించగలరా?

వ. 'వీ రెవ్వరో యెం దుండుదురో యెఱుంగవలయు' నని దుర్యోధనాదు లయిన రాజపుత్త్రు లెల్ల విస్మితు లయి యున్న వారలం జూచి కృష్ణుం డి ట్లనియె. 206

ప్రతిపదార్థం: వీరు; ఎవ్వరో= వీరెవరో; ఎందు+ఉండుదురో= ఎక్కడ ఉంటారో; ఎఱుంగవలయున్= తెలిసికోవాలి; అని= అని తలంచి; దుర్యోధన+ఆదులు+అయిన= దుర్యోధనుడు మొదలైన; రాజ, పుత్త్రులు+ఎల్లన్= రాజకుమారులంతా; విస్మితులు+అయి= ఆశ్చర్యపడినవారై; ఉన్నన్= ఉండగా; వారలన్, చూచి; కృష్ణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'వీ ళ్ళెవరో, ఎక్కడ ఉంటారో తెలిసికొనాలి' అని దుర్యోధనుడు మొదలైన రాకుమారు లంతా ఆశ్చర్యంతో ఉండగా, వాళ్ళను చూచి కృష్ణుడు ఈవిధంగా అన్నాడు.

చ. పరులకు దుష్కరంబయిన భాసుర కార్యము సేసి, తత్స్వయం
వరమునఁ బత్నిఁగాఁ బడసె వారిరుహాయత నేత్రఁ గృష్ణ నీ
ధరణిసురాన్వయోత్తముఁడు ధర్మవిధిం; జెపుఁడయ్య యింక నె
వ్వరికిని జన్నె వీని ననవద్యపరాక్రము నాక్రమింపఁగన్. 207

ప్రతిపదార్థం: పరులకున్= ఇతరులకు (శత్రువులకు అని దుర్యోధనపరమైన చమత్కారార్థం); దుష్కరంబు+అయిన= చేయటానికి అలవి గానిదైన; భాసుర, కార్యము= గొప్పపని; చేసి; ఈ, ధరణి, సుర+అన్వయ+ఉత్తముఁడు= ఈ బ్రాహ్మణ వంశమందలి శ్రేష్ఠుడు; తద్+స్వయంవరంబునన్= ఆ స్వయంవరంలో; వారిరుహ+ఆయత, నేత్రన్= పద్మాలవంటి విశాలాలైన కన్నులు కలదానిని; కృష్ణన్= ద్రౌపదిని; ధర్మవిధిన్= ధర్మంప్రకారం; పత్నిన్+కాన్= భార్యగా; పడసెన్= పొందాడు; ఇంకన్= మరి; వీనిన్= ఇతనిని; అనవద్య, పరాక్రమున్= సాటిలేని పరాక్రమం కలవాడిని; ఆక్రమింపన్+కన్= జయించటానికి; ఎవ్వరికిన్= ఎవ్వరికైనా; చన్నె= సాధ్యమా; చెపుడు+÷అయ్య!= చెప్పండయ్యా!

తాత్పర్యం: ఇతరులు చేయటానికి సాధ్యం కాని గొప్పపని చేసి ఈ బ్రాహ్మణశ్రేష్ఠుడు ఆ స్వయంవరంలో పద్మాలవంటి కన్నులు కల ద్రౌపదిని ధర్మమార్గంలో భార్యగా పొందాడు. ఈ సాటిలేని పరాక్రమశాలిని జయించటం ఇక ఎవరికి సాధ్యమో చెప్పండి.

విశేషం: మహాభారతంలో శ్రీకృష్ణుడు పాఠకులకు మొట్టమొదట కనిపించేది ఈ ఘట్టంలోనే. ఆయన మహనీయవ్యక్తిత్వం, సర్వజ్ఞత, చతురత అద్దంలోవలె మొదట అగుపించేదికూడ ఈ ఘట్టంలోనే. శ్రీకృష్ణుడు- బ్రాహ్మణవేషాల్లో బ్రాహ్మణులమధ్య కూర్చున్న పాండవులను మొదట కనిపెట్టాడు. ద్రౌపదిని గెలుచుకొనగల అర్జునుని ధనుర్విద్యాకౌశలాన్ని కూడా దర్శించాడు. ఎంతో దూరదృష్టితో యదు, వృష్ణి, భోజ, అంధక వంశాల వీరులు పోటీలో పాల్గొనకుండా తప్పించాడు. పాండవులందరిని బలరామునికి పరిచయంచేశాడు. అసూయాద్వేషాలతో పాండవుల ఉనికిపట్టు కనిపెట్టా లని ఆరాటపడే దుర్యోధనాది రాకుమారులందరి ప్రయత్నాన్ని విరమింపజేశాడు. అర్జునుని సామర్థ్యాన్ని అతిచతురంగా శ్లాఘించి, అన్యుల అసమర్థతను అవహేళన చేశాడు. కథాకథనశిల్పం ఆ మహాసభలో శ్రీకృష్ణుని పురుషోత్తమత్వాన్ని అద్భుతంగా ధ్వనింపజేసింది.

వ. 'వలవ దుడుగుం, డని వారించిన; నట్లు కృష్ణుచేత నివారితులయి రాజపుత్త్రులు దమతమదేశంబులకుం జని; రంత భీమార్జునులు బ్రాహ్మణపరివృతు లయి ద్రుపదరాజపుత్త్రిం దోడ్కొని వచ్చునంత. 208

ప్రతిపదార్థం: వలవదు= వద్దు; ఉడుగుండు= మానుడు; అని; వారించినన్= ఆపగా; అట్లు, కృష్ణుచేత; నివారితులు+అయి= ఆపబడినవా ళ్ళయి; రాజపుత్త్రులు, తమతమ, దేశంబులకున్=వారివారిదేశాలకు పోయారు; అంతన్= అటుపై; భీమ+అర్జునులు= భీముడు, అర్జునుడు; బ్రాహ్మణ, పరివృతులు+అయి= బ్రాహ్మణులచేత చుట్టబడినవాళ్ళయి; ద్రుపదరాజ పుత్త్రిన్= ద్రౌపదిని; తోడ్కొని= తీసికొని; వచ్చునంతన్= వచ్చుచుండగా; (వస్తూ ఉన్న సమయంలో)

తాత్పర్యం: 'వద్దు. వా ళ్ళెవరో తెలుసుకొనే ప్రయత్నం మానండి' అని శ్రీకృష్ణుడు ఆ రాకుమారు లందరిని ఆపగా, వాళ్ళు తమ తమ దేశాలకు తిరిగి వెళ్ళారు. అప్పుడు భీమార్జునులు బ్రాహ్మణులు చుట్టూ గుమిగూడి రాగా ద్రౌపదిని తమతో తీసుకొని ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు.

సీ. **'ఉత్సవ సందర్శనోత్సుకు లై పోయి। కడుఁ బెద్ద ప్రొ ద్దయ్యెఁ; గొడుకు లేల**
మసలిరో? కౌరవుల్ విసువక వైరంబు। గావించు పాపస్వభావు; లెఱిఁగి
క్రందునఁ జంపిరో? యందుల కేవురు। లీలతో నొక్కట నేల యరిగి?
రవ్యయుం డయిన వేదవ్యాసువచనంబు। నిక్కంబుగాకుండు నొక్కొ? వేల్పు

ఆ. **లార! భూసురేశులార! మీ శరణంబ। కాని యొండుగతియుఁ గాన; నాకు**
శరణ మగుఁడు; సుతులఁ గరుణతో రక్షింపుఁ' । డనుచుఁ గుంతి వగచి వనరుచుండె. **209**

ప్రతిపదార్థం: ఉత్సవ, సందర్శన+ఉత్సుకులు+ఐ= స్వయంవరోత్సవాన్ని చూడగోరినవాళ్ళయి; కొడుకులు; పోయి; కడున్= మిక్కిలి; పెద్ద, ప్రొద్దు= ఎక్కువసేపు; అయ్యెన్= అయింది; ఏల= ఎందుచేత; మసలిరొ= ఆలస్యం చేశారో; విసువక= విసుగు లేకుండ, వైరంబు= పగను; కావించు= పూను; పాపస్వభావులు= దుర్మార్గపుబుద్ధికలవాళ్ళు; కౌరవుల్; ఎఱిఁగి= తెలిసికొని; క్రందునన్= సందడిలో; చంపిరో= చంపినారా!; అందులకున్= అక్కడకు; ఏవురు= ఐదుగురు; లీలతోన్= విలాసంగా; ఒక్కటన్= ఒక్కటిగా; ఏల= ఎందుచేత; అరిగిరి= వెళ్లారు; అవ్యయుండు+అయిన= నాశము లేనివా డైన; వేదవ్యాసు, వచనంబు= వేదవ్యాసునిమాట; నిక్కంబు= నిజము; కాక+ఉండున్+ఒక్కొ= కాకుండునా?; వేల్పులార= దేవతలార; భూసుర+ఈశులార= బ్రాహ్మణోత్తములారా; మీ, శరణంబు= మీశరణము; కాని= తప్ప; ఒండు= వేరొక; గతియున్= మార్గమును; కానన్= చూడలేదు; నాకున్= నాకు; శరణము+అగుఁడు= దిక్కుకండి; సుతులన్= కొడుకులను; కరుణతోన్= దయతో; రక్షింపుఁడు= కాపాడండి; అనుచున్= అని అంటూ; కుంతి; వగచి= విచారించి; వనరుచున్+ఉండెన్= ఏడుస్తూ ఉండెను (ఉండింది.)

తాత్పర్యం: 'కొడుకులు స్వయంవరోత్సవాన్ని చూడబోయి చాలా సేపైనది. ఇంకాతిరిగి రాక యెందుకు ఆలస్యం చేశారో? విసుగులేని వైరం పూనిన పాపస్వభావు లైన కౌరవులు వీరిని గుర్తించి ఆ సందడిలో చంపేశారేమో? విలాసంగా అక్కడికి ఐదుగురు ఒకేసారి యెందుకు వెళ్ళారు? అవ్యయుడైన వేదవ్యాసుని మాట సత్యం కాకుండా ఉంటుందా? దేవతలారా! బ్రాహ్మణోత్తములారా! మీరే నాకు దిక్కు. వేరే మార్గమేదీ లేదు. నన్ను రక్షించండి. నా కుమారులను దయతో కాపాడండి' అని కుంతి విచారించి, దుఃఖిస్తూ ఉండింది.

విశేషం: చిన్నప్పటినుంచి దుర్యోధనాదులు భీమాదులపై పగబూని ఉన్నారు. ఒక్కొక్కరిని (ముందుగా భీముడిని) చంపేయత్నం చేసి విఫలు లయ్యారు. ఆ తరువాత పాండవులందరినీ ఒక్కుమ్మడిగా చంపా లని యత్నించి లాక్షాగృహాన్ని కల్పించారు. అందువలన కౌరవులు విసుగులేని వైరం సాగించేవా ళ్ళని కుంతి పేర్కొన్నది. పాండవులంతా ఒక్కసారి ఒక్కచోట దొరికితే కౌరవులు చంపేస్తారేమో అనే భయం ఈ ఘట్టంలో కుంతికి కలగటం సహజం. దేవతలనూ, బ్రాహ్మణులనూ శరణు కోరింది. శరణుకోరినవారిని రక్షించటం వారి ధర్మ మనే భక్తివిశ్వాసాలు కల తల్లి ఆమె.

అర్జునుండు ద్రౌపదిం దెచ్చి తల్లికి నివేదించుట (సం.1-182-1)

వ. **అట్టి యవసరంబునఁ దల్లియొద్దకు ధర్మరాజును గవలవారు మున్న వచ్చియున్నఁ, దదనంతరంబ భీమార్జునులు ద్రౌపదీసహితు లయి చనుదెంచి మ్రొక్కి 'మే మొక్క భిక్ష దెచ్చితి' మని తల్లికి నివేదించిన, నెఱుంగక యెప్పటి యట్ల**

కా వగచి కుంతీదేవి సంతసిల్లి దాని 'మీ రేవురు నుపయోగింపుఁ' డని కొడుకుల నియోగించి, భువన త్రయ రాజ్య లక్ష్మియుం బోలె నున్న యక్కన్నియం జూచి లజ్జించి, యధర్మభీత యయి ధర్మతనయున కి ట్లనియె. 210

ప్రతిపదార్థం: అట్టి; అవసరంబునన్= సమయాన; తల్లి, ఒద్దకున్= తల్లి దగ్గరకు; ధర్మరాజును; కవలవారున్= నకుల సహదేవులును; మున్న, వచ్చి= ముందుగానే వచ్చి; ఉన్నన్= ఉండగా; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; భీమ+అర్జునులు= భీముడు, అర్జునుడు; ద్రౌపదీ, సహితులు+అయి= ద్రౌపదితో కూడుకొన్నవాళ్లై; చనుదెంచి= వచ్చి; మ్రొక్కి; మేము+ఒక్క; భిక్ష; తెచ్చితిమి+అని; తల్లికి; నివేదించినన్= తెలుపగా; ఎఱుంగక= తెలియక; ఎప్పటి, అట్ల, కా= ఎప్పటివలె అయినట్లు; వగచి= తలచి; కుంతీదేవి; సంతసిల్లి; దానిన్; మీరు; ఏవురు= ఐదుగురును; ఉపయోగింపుఁడు= వినియోగించుకొనండి, అనుభవించండి; అని= అని అంటూ; కొడుకులన్; నియోగించి= నియమించి; భువన, త్రయ, రాజ్య, లక్ష్మియున్, పోలెన్= లోకములు మూడింటియొక్క రాజ్య లక్ష్మివలె; ఉన్న= ఉన్నట్టి; ఆ+కన్నియన్= ఆకన్నెను; చూచి= కనుగొని; లజ్జించి= సిగ్గుపడి; అధర్మ, భీత+అయి= అధర్మానికి భయపడిన దై; ధర్మతనయునకున్= ధర్మనందనునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అటువంటి సమయంలో ధర్మరాజు, నకులసహదేవులు తల్లి దగ్గరికి ముందుగానే వచ్చి ఉండగా, తర్వాత భీమార్జునులు ద్రౌపదితో కూడా వచ్చి నమస్కరించి 'మే మొక భిక్ష తెచ్చాము' అని తల్లికి నివేదించారు. ఆమె ఆ భిక్షనుగూర్చి తెలియక ఎప్పటివంటిదానిగానే భావించి, సంతసించి, 'దానిని మీ రైదుగురు ఉపయోగించుకొండి' అని కొడుకులను ఆజ్ఞాపించింది. అయితే, ముల్లోకాల రాజ్యలక్ష్మివలె ఉన్న ఆ కన్యను (ద్రౌపదిని) చూచి, సిగ్గుపడి, అధర్మానికి భయపడి ధర్మరాజుతో ఇట్లా పలికింది.

సీ. 'ఈ తన్విఁ దోడ్కొని నీ తమ్ము లిరువురు । ప్రీతి నేతెంచి 'యీ భిక్ష యెప్పఁ
గొను' మని నాకుఁ జెప్పినను 'నేవురు నుప । యోగింపుఁ' డంటి; నాయుక్తి దొల్లి
యనృత మెన్నండుఁ గా దనఘ! మీ రెప్పుడు । మద్వచనాతిక్రమంబు సేయ;
రిది లోకమున లేని యది; యేమి సేయంగ । నగు?' నని చింతాకులాత్మ యైనఁ

తే. దల్లి నూరార్చి, వాసవతనయుఁ జూచి । 'పార్థ! నీచేతఁ బడయంగఁ బడిన దీని
నగ్ని సన్నిధిఁ బాణిగ్రహణంబు నీవ । చేయు' మన ధర్మజునకును జిష్ణుఁ డనియె. 211

ప్రతిపదార్థం: ఈ, తన్విన్= ఈ కాంతను; తోడ్కొని= తీసికొని; నీ తమ్ములు= నీ తమ్ముళ్లు; ఇరువురు= ఇద్దరూ; ప్రీతిన్= సంతోషంతో; ఏతెంచి= వచ్చి; ఈ, భిక్ష= ఈ భిక్షను; ఒప్పన్= ఒప్పుగా; కొనుము+అని= గ్రహింపు మని; నాకున్; చెప్పినను= చెప్పగా; ఏవురున్= ఐదుగురును; ఉపయోగింపుఁడు= ఉపయోగించుకొండి; అంటిన్= అని అన్నాను; నా, ఉక్తి= నా మాట; తొల్లి= పూర్వం; ఎన్నండును= ఎప్పుడుకూడా; అనృతము= అబద్ధం; కాదు= కాలేదు; అనఘ= పాపరహితుడా! - ఓ ధర్మరాజా!; మీరు; ఎప్పుడు= ఏనాడుకూడా; మద్+వచన+అతిక్రమంబు= నామాట దాటుటను; చేయరు; ఇది= ఈ పద్ధతి; లోకాన, లేని, అది= లోకంలో లేనిది; ఏమి చేయంగన్+అగున్= ఏమి చేయగలం; అని= అంటూ; చింతా+ఆకుల+ఆత్మ+ఐనన్= చింతచేత కలత నొందిన మనస్సు కలది కాగా; తల్లిన్; ఊరార్చి= ఓదార్చి; వాసవ, తనయున్= దేవేంద్రుని కుమారుడైన అర్జునుడిని; చూచి; పార్థా!= అర్జునా; నీచేతన్= నీచేత; పడయంగన్+పడిన= పొందబడిన; దీనిన్= ఈ స్త్రీని; అగ్ని, సన్నిధిన్= అగ్ని ఎదుట; నీవు+అ= నీవే; పాణిగ్రహణంబు, చేయుము= పెళ్ళాడుము; అనన్= అని అనగా; ధర్మజునకును; జిష్ణుఁడు= అర్జునుడు; అనియెన్= ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఈ కాంతను తోడ్కొని నీ తమ్ము లిద్దరు సంతోషంతో వచ్చి ఈ భిక్ష గ్రహించు మని నాతో చెప్పగా, 'మీ రైదుగురు ఉపయోగించుకొండి' అని అన్నాను. నా మాట ఇంతవరకు ఎన్నడు అసత్యం కాలేదు. ధర్మజా! మీ రెప్పుడు నా మాట జవదాటరు. కాని, ఇది లోకవిరుద్ధం. ఏం చేద్దాం' అని చింతతో కలతచెందిన తల్లిని ఓదార్చి, అర్జునుని వైపు చూచి 'అర్జునా! నీవు సంపాదించిన ఈమెను అగ్నిసన్నిధిలో నీవే వివాహం చేసికొమ్ము' అని పల్కగా ధర్మజునితో అర్జునుడు ఇట్లా అన్నాడు.

వ. 'పెద్దవాఁ డుండఁ గొండుక వానికి వివాహం బగుట ధర్మ విరుద్ధంబు గావున దీని నగ్రమహిషిఁగాఁ బరిగ్రహింపుము; మా నలువుర యనుమతంబును నిట్టిద' యనుచున్న యవసరంబున విధిప్రేరణవశంబున. 212

ప్రతిపదార్థం: పెద్దవాడు; ఉండన్= ఉండగా; కొండుకవానికిన్= చిన్నవానికి; వివాహంబు+అగుట= పెండ్లి అగుట; ధర్మ, విరుద్ధంబు= ధర్మానికి విరుద్ధం; కావున= కాబట్టి; దీనిన్= ఈమెను; అగ్ర, మహిషిన్, కాన్= పెద్దభార్యగా; పరిగ్రహింపుము; మా నలువుర, అనుమతంబునున్= మా నలుగురి సమ్మతికూడా; ఇట్టిది+అ= ఇదే; అనుచున్+ఉన్న= అనుకుంటూ ఉండే; అవసరంబునన్= సమయాన; విధి, ప్రేరణ, వశంబునన్= విధిప్రేరణచేత.

తాత్పర్యం: 'పెద్దవాడు ఉండగా చిన్నవాడికి పెళ్లికావటం ధర్మవిరుద్ధం. అందుచేత ఈమెను పెద్దభార్యగా పరిగ్రహింపుము. మా నలువురికి సమ్మత మైనదికూడ ఇదే'! అని అంటున్న సమయంలో విధిప్రేరణతో.

ఉ. ఆ లలితాంగియందు హృదయంబులు దృష్టులు నిల్పి పాండుభూ
పాల తనూజపంచకము పంచశరాహతిఁ బొంది నొక్కతన్
బాలికఁ దొల్లి యేవురకు భామినిఁగా సృజియించి యున్న య
య్యాలరి బ్రహ్మ చెయ్ది పరమార్థముగా కది యేల యొం డగున్. 213

ప్రతిపదార్థం: ఆ, లలిత+అంగి, అందు= ఆ అందమైనశరీరం కల ద్రౌపదియందు; హృదయంబులు= మనస్సులు; దృష్టులు= చూపులు; నిల్పి= పాదుకొల్పి, నెలకొనజేసి; పాండుభూపాల, తనూజ, పంచకము= పాండురాజు కొడుకు లైదుగురి సమూహం; పంచ, శర+ఆహతిన్= ఐదుబాణాలు కలవాడైన మన్మథునియొక్క దెబ్బను; పొందెన్= పొందాడు; ఒక్కతన్, బాలికన్= ఒక కన్యకను; తొల్లి= పూర్వం; ఏవురకున్= ఐదుగురికి; భామినిన్+కాన్= భార్యగా; సృజియించి= సృష్టించి; ఉన్న= ఉండే; ఆ+అలరి, బ్రహ్మ, చెయ్ది= ఆ తుంటరిఅయిన బ్రహ్మయొక్కచేష్ట అయినది; పరమ+అర్థము= సత్యము కాక; ఒండు= ఇతరం; ఏల, అగున్= ఎందుకు ఔతుంది?

తాత్పర్యం: ఆ అందమైనశరీరం కల ద్రౌపదిమీద పాండురాజు కుమారు లైదుగురు తమ మనస్సులను, చూపులను నిల్పి, మన్మథబాధ పొందారు. ఒక కన్యకను ఐదుగురికి భార్యగా భావించి, ముందే సృష్టించి ఉన్న తుంటరి బ్రహ్మచేసినపని సత్యంకాక, వేరొక విధంగా ఎలా అవుతుంది?

విశేషం: పాండుభూపాల తనూజ 'పంచకం' - అన ప్రయోగంలో సమాహారమైన 'పంచకం' అనే శబ్దానికి వ్యంగ్యార్థస్ఫూర్తి ఉన్నది. ద్రౌపదిపట్ల పాండవులకు ఉండే ఏకతాభావాని కిది సూచన. పంచేంద్రోపాఖ్యానంలో చెప్పబడబోయే ఏకైకతత్త్వాని కిది ధ్వని. ద్రౌపదియందు పాండవులు అయిదుగురు ఒక్కసారి మన్మథభావం పొందా రని చెప్పటం సాభిప్రాయం. ఆపైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్రౌపదికూడ పాండవులందరియందు అనురక్తురా లౌతుంది. ఇది చిత్రమైన సన్నివేశం. భార్యాభర్తలనడుమ ఉదయించే రతిభావం, అనురాగం, జననాంతరసౌహృదరూపం కాని తాత్కాలికం కా దని ఇందులో ధ్వనింపబడింది. అంతేకాదు - మత్స్యయంత్రం భేదించిన తరువాత ద్రౌపది మన్మథునివంటి అర్జునుని మెడను కల్యాణమాలతో అలంకరించినట్లు కవి చెప్పినా వారిరువురి మనస్సులలో మారవికారం కలిగినట్లు చెప్పక, ఇక్కడ అందరికీ ఒకేసారి మన్మథభావం ఉదయ మైన దని వర్ణించడం నన్నయ కథాకథనశిల్పం. (సంపా.)

వ. ఇట్లు పాంచాలియందు బద్ధానురాగు లయియున్న తమ యేవుర యభిప్రాయం బెఱింగి వేద వ్యాస వచనంబులుం దలంచి ధర్మతనయుండు దమ్ముల కి ట్లనియె. 214

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాంచాలి, అందున్= ద్రౌపదియందు; బద్ధ+అనురాగులు+అయి= తగులుకొన్న ప్రేమకలవా ళ్ళయి; ఉన్న= ఉన్నటువంటి; తమ, ఏవుర= తమ ఐదుగురి; అభిప్రాయంబు; ఎఱింగి= తెలిసికొని; వేదవ్యాస, వచనంబులున్= వేదవ్యాసుని వాక్కులు కూడా; తలంచి= తలచుకొని; ధర్మతనయుండు= ధర్మరాజు; తమ్ములకున్= సోదరులతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ద్రౌపదియందు అనురక్తు లై ఉన్న తమ అయిదుగురి అభిప్రాయం తెలిసికొని, వేదవ్యాసునిమాటలు తలచి, ధర్మరాజు తమ్ములతో ఈ విధంగా అన్నాడు.

క. గురువచనస్థితి మన కే। గురకును నిది పత్నిగాఁ దగుం గావున ని
త్తరుణిని బరిగ్రహింతము । తిరముగ; గురువచన మొండుదెఱఁ గేల యగున్. 215

ప్రతిపదార్థం: గురు, వచన, స్థితి= పెద్దవారియొక్కమాట ఉండటంచేత; మనకు+ఏగురకునున్= మన ఐదుగురికి; ఇది= ఈ ద్రౌపది; పత్ని= భార్య; కాన్, తగున్= కాదగును; కావునన్= కాబట్టి; ఈ+తరుణినిన్= ఈ కాంతను; తిరముగా= స్థిరంగా; పరిగ్రహింతము= పరిగ్రహించుదము-పెండ్లాడుదాం; గురు, వచనము= పెద్దవారిమాట; ఒండు, తెఱఁగు= వేరు విధంగా; ఏల, అగున్= ఎందుకు అవుతుంది.

తాత్పర్యం: పెద్దల మాట ప్రకారం మన ఐదుగురికి ఈమె భార్య కాదగును. కనుక ఈమెను నిశ్చితంగా మనం వివాహం చేసుకొందాము. పెద్దలమాట వ్యర్థం కాదుగదా!

వ. అని పలుకుచున్న యవసరంబున. 216

ప్రతిపదార్థం: అని= ఆప్రకారంగా; పలుకుచు+ఉన్న= మాటాడుతూఉండే; అవసరంబునన్= సమయంలో.

తాత్పర్యం: అని అంటున్న సమయంలో.

శ్రీకృష్ణ బలరాములు ధర్మరాజాదులఁజూడవచ్చుట (సం.1-183-2)

శా. రాజత్కీర్తులు వచ్చి కాంచి రనఘుల్ రాముండు గృష్ణుండు న
య్యాజామీఢు నజాతశత్రు నృపలోకారాధ్యు నుద్యద్గుణ

భ్రాజిష్ణుం దమ మేనయత్త కొడుకున్ బాలార్కతుల్యోజ్జ్వల
త్తేజున్ భ్రాతృచతుష్కమధ్యగతుఁ గౌంతేయాగ్రజున్ ధర్మజున్. **217**

ప్రతిపదార్థం: రాజత్+కీర్తులు= ప్రకాశిస్తున్న కీర్తికలవాళ్ళు; అనఘుల్= పాపం లేనివాళ్ళు; రాముండు= బలరాముడు; కృష్ణుండున్; వచ్చి; ఆ+అజామీఢున్= ప్రసిద్ధమయిన అజామీఢునివంశంలో పుట్టినవాడిని; అజాతశత్రున్= పుట్టబడని శత్రువులు కలవాడిని; నృప, లోక+ఆరాధ్యున్= రాజసమూహంచేత సేవింపదగినవాడిని; ఉద్యత్+గుణ, భ్రాజిష్ణున్= ఉన్నత మైన గుణాలచేత ప్రకాశించేవాడిని; తమ, మేనయత్త= తన మేనత్త; కొడుకున్= కుమారుణ్ణి; బాల+అర్క, తుల్య+ఉత్+జ్వలత్+తేజున్= బాలసూర్యునితో సమానంగా ప్రకాశిస్తున్న తేజస్సు కలవాడిని; భ్రాతృ, చతుష్క, మధ్య, గతున్= తమ్ములు నలుగురిమధ్య ఉన్నవాడిని; కౌంతేయ+అగ్రజున్= కుంతికొడుకులలో పెద్దవాడిని; ధర్మరాజున్; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: ప్రకాశిస్తున్న కీర్తి కలవాళ్ళు, పాపంలేనివాళ్ళు అయిన బలరామకృష్ణులు వచ్చి - అజామీఢుని వంశంలో పుట్టినవాడు, శత్రువులు లేనివాడు, రాజసమూహం సేవింప తగినవాడు, ఉన్నతగుణాలతో వెలిగేవాడు, తమ మేనత్తకొడుకు, బాలసూర్యునితో సమానమైన ఉజ్జ్వలతేజస్సు కలవాడు, తమ్ములు నలుగురిమధ్యలో ఉన్నవాడు, కుంతికొడుకులలో పెద్దవాడు అయిన ధర్మజుడిని చూచారు.

విశేషం: మహాభారతంలో ఇది శ్రీకృష్ణపాండవుల ప్రథమసమావేశం. నన్నయగారి వస్తుధ్వని శిల్పానికి ఇది ఉత్తమ ఉదాహరణం. ఇది ఒక అపూర్వ ప్రథమ సమావేశం. శ్రీకృష్ణుడు పాండవులను చూచా డని వర్ణించలేదు నన్నయ. నలుగురు తమ్ముల నడుమనున్న ధర్మరాజును చూచినట్లు వర్ణించాడు. అంతేకాదు బ్రాహ్మణ వేషధారిగా కాక 'నృపలోకారాధ్యుడి'గా దర్శించినట్లు వర్ణించటం సాభిప్రాయం. శ్రీకృష్ణకృపాకటాక్షాలతో ధర్మజుడు రాజసూయాగాదులు నిర్వహించి సకల రాజలోక పూజితుడౌతా డని వస్తుధ్వని. 'బాలార్కతుల్యోజ్జ్వలత్తేజు' డనటం మరొక విశేషం. ఇక్కడినుండి ధర్మరాజు జీవితంలో ఉజ్జ్వల అధ్యాయం మొదలౌతున్న దని భావం. ముందుపద్యం (213)లో పాండవ పంచకం అనే సమాసం వ్యక్తులుగా వా రైదుగురైనా తత్త్వంలో ఒకరే అని ధ్వనింపజేస్తున్నది. అందువలననే నాయికగా ద్రౌపది ఒక్కతే. మహాభారతంలో నాయకులు పాండవులు, అందులోనూ ప్రధానుడు ధర్మరాజు. భీమాదులు అనునాయకులు. అనునాయకు లంటే స్వీయప్రయోజనం లేకుండా ప్రధాననాయకకార్యమే తమ కార్యాలుగా భావించే అద్వైతచిత్తవృత్తులు కలవారు. శ్రీకృష్ణుడు పాండవులకు దైవంవంటి మిత్రుడు, గురువు, బంధువు. అందువలన మహాభారతంలో కృష్ణుడు ఉపనాయకుడు. స్వీయప్రయోజనంతోపాటు నాయక ప్రయోజనాన్ని కూడా సాధించి పెట్టేవాడు ఉపనాయకుడు. ఒక్కొక్కసారి నాయకునికంటె ఉపనాయకుడు మహిమాన్వితుడు కావచ్చును. ఇటువంటి సందర్భమే ధర్మరాజుకు సిద్ధించింది. దానివలన ధర్మరాజు ఉభయార్థసిద్ధి అయ్యాడు. శ్రీకృష్ణుడు, పాండవులు, ద్రౌపది, కుంతి - అనే పాత్రలు పాండవపక్షంలో ఇక ముందుకథలో ప్రధానపాత్రలు నిర్వహించబోతున్నారన్న అర్థాన్ని ధ్వనిమయం చేశాడు నన్నయ. (సంపా.)

వ. కని త మ్మెఱింగించి యతిస్నేహంబున నయ్యుధిష్ఠిరునకుం గుంతీదేవికి మ్రొక్కి భీమార్జుననకుల సహదేవులం గౌఁగిలించుకొని, పరమసమ్మదరసపూరితహృదయు లై యున్న, వారల కుశలం బడిగి ధర్మరా జి ట్లనియె. **218**

ప్రతిపదార్థం: కని= చూచి; తమ్ము+ఎఱింగించి= తమను పరిచయం చేసికొని; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రేమతో; ఆ యుధిష్ఠిరునకున్= ఆ ధర్మరాజుకు; కుంతీదేవికిన్, మ్రొక్కి; భీమ+అర్జున, నకుల, సహదేవులన్= భీముని, అర్జునుని నకులుని సహదేవుని; కౌఁగిలించుకొని; పరమ, సమ్మద, రస, పూరిత, హృదయులు+ఐ= మిక్కిలి ఆనంద మనే రసంచేత

నిండిన హృదయాలు కలవాళ్ళయి; ఉన్నన్= ఉండగా; వారల= వారియొక్క; కుశలంబు= క్షేమం; అడిగి; ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: చూచి, తమను పరిచయం చేసికొని మిక్కిలిప్రేమతో ధర్మజునికి, కుంతీదేవికి నమస్కరించి, భీమార్జుననకులసహదేవులను కౌగలించుకొని పరమానందంతో నిండిన హృదయాలతో ఉండగా, వాళ్ళను కుశల మడిగి ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. ఒవ్వమిఁ గౌరవులకుఁ గడు । దవ్వయి మఱి విప్రవేషధారుల మయి మ
మ్మెవ్వరు నెఱుంగకుండఁగ । నివ్విధమున నున్న నెట్టు లెఱిఁగితి రీరల్. 219

ప్రతిపదార్థం: ఒవ్వమిన్= విరోధంచేత; కౌరవులకున్; కడున్= మిక్కిలి; దవ్వు+అయి= దూరమై; మఱి= ఇంకా; విప్ర, వేష, ధారులము+అయి= బ్రాహ్మణవేషాలను ధరించినవాళ్ళమై; మమ్ము+ఎవ్వరున్= మమ్మల్ని ఎవరుకూడా; ఎఱుంగక; ఉండఁగన్= తెలియకుండగ; ఈ, విధమునన్= ఈ విధంగా; ఉన్నన్= ఉండగా; ఈరల్+మీరు; ఎట్టులు= ఏవిధంగా; ఎఱిఁగితిరి= గుర్తించినారు?

తాత్పర్యం: విరోధంతో కౌరవులకు మేము దూరమై, బ్రాహ్మణ వేషాలు ధరించి, మమ్మల్ని ఎవ్వరూ గుర్తించకుండ ఈ విధంగా ఉంటే, మీ రెట్లా తెలిసికొన్నారు?

వ. అనిన నగుచు వాసుదేవుం డి ట్లనియె. 220

ప్రతిపదార్థం: అనినన్= అని ధర్మరాజు అనగా; నగుచున్= నవ్వుతూ; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని ధర్మరాజు అనగా శ్రీకృష్ణుడు నవ్వుతూ ఈ విధంగా అన్నాడు.

ఉ. అంబుజమిత్రుఁ డంబుదచయాంతరితుం డగుడుం దదీయ తే
జంబు జగజ్జనంబులకు శక్యమె కప్పఁగ; మీరు గూఢభా
వంబున నున్న మీదగు నవారితతేజము భూజనప్రసి
ద్ధం బగుఁ గాక; దానిఁ బిహితంబుగ నెవ్వరుఁ జేయనేర్తురే. 221

ప్రతిపదార్థం: అంబుజ, మిత్రుఁడు= నీటినుండి పుట్టిన పద్మాలకు స్నేహితు డైన సూర్యుడు; అంబుద, చయ, అంతరితుండు= మేఘ సమూహంచేత కప్పబడినవాడు; అగుడున్= కాగా; తదీయ, తేజంబు= అతనియొక్క తేజస్సు; జగత్+జనంబులకున్= లోకంలోని మానవులకు; కప్పఁగన్= అగుపడకుండ చేయుట; శక్యమే= సాధ్యమా; మీరు; గూఢ భావంబునన్= రహస్య మైన విధంగా; ఉన్నన్= ఉండగా; మీది+అగున్= మీకు సంబంధించినదగు; ; అవారిత, తేజము= అడ్డగింప సాధ్యం కాని తేజస్సు; భూ, జన, ప్రసిద్ధంబు= భూమి యందలి జనులకు తెలిసినదే; అగున్= ఔనుకదా!; కాక, దానిన్= ఆ తేజస్సును; పిహితంబుగన్= కప్పబడిన దానినిగా; ఎవ్వరున్= ఎవరైనను; చేయ, నేర్తురే= చేయగలరా!

తాత్పర్యం: సూర్యుడిని మేఘసమూహం కప్పినా అతనితేజస్సును లోకంలోని జనులకు కనిపించకుండ చేయటం సాధ్యమా? అట్లాగే మీరు రహస్యంగా మారువేషంలో ఉన్నా, అడ్డగించ సాధ్యం కాని మీ తేజస్సు లోకంలోని ప్రజలకు ప్రసిద్ధమే. దానిని అగుపడకుండ ఎవ్వరు చేయగలరు?

విశేషం: అలం: దృష్టాంతం. పాండవులు ఎన్నో కష్టా లనుభవించి, చివరకు గొప్పగా ద్రౌపదిని గెల్చుకొని మహానందంతో ఉన్న సమయంలో శ్రీకృష్ణుడు మొదటిసారిగా కలిసి చేసిన ఈ ప్రశంస, వారి ఆనందాన్ని అంతకు అంత పెంచటమే గాక వారి హృదయాలను గట్టిగా తనవశం చేసుకోగలదు.

పాండవుల వంశాదికము నెఱింగి ర మ్మని ద్రుపదుండు ధృష్టద్యుమ్నుం బనుచుట (సం.1-184-3)

వ. 'సకలరాజసమక్షంబున నిట్టి యతిమానుషం బయిన యద్భుతకర్మం బర్జునునక కా కన్యులకుఁ జేయ శక్యంబె? యని యెఱింగితిమి; మీపరాక్రమంబ మిమ్ము నెఱింగించె; నధర్మనిరతు లగు ధృతరాష్ట్రదుర్యోధనులు సేసిన లాక్షాగారదాహప్రయోగంబువలన విముక్తుల రయితి; రింక మీకు ల గ్గగు' నని చెప్పి బలదేవసహితుం డయి వాసుదేవుం డరిగిన; నిట ద్రుపదుండు దనకూఁతునకు వరుం డైన వాఁ డెవ్వఁడో యేవంశంబునవాఁడో వాని చరితం బెట్టిదో యెఱింగి రమ్మని ధృష్టద్యుమ్నుం బనిచిన, నతండు భీమార్జున ద్రౌపదుల పిఱుందన వచ్చి త న్నొఱు లెఱుంగకుండ నక్కుంభకారగృహంబున నుండి యంత వృత్తాంతంబు నెఱింగిపోయి ద్రుపదున కి ట్లనియె.222

ప్రతిపదార్థం: సకల, రాజ సమక్షంబునన్= అందరు రాజుల ఎదుట; ఇట్టి; అతిమానుషంబు+ఐన= మానవులకు సాధ్యంకాని దైన; అద్భుత, కర్మంబు= ఆశ్చర్యకరమైన పని; అర్జునునకు+అ+కాక= అర్జునునకు తప్ప; అన్యులకున్= ఇతరులకు; చేయ; శక్యంబె= సాధ్యమా; అని= అని; ఎఱింగితిమి= తెలిసికొంటిమి; మీ, పరాక్రమంబు+అ=మీ పరాక్రమమే; మిమ్మున్+ ఎఱింగించెన్= తెలియజేసింది; అధర్మ, నిరతులు+అగు= అధర్మంలో ఇష్టంకలవాళ్ళయిన; ధృతరాష్ట్ర, దుర్యోధనులు= ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు; చేసిన; లాక్షా+అగార, దాహ, ప్రయోగంబువలనన్= లక్కయింటిని తగులబెట్టే ప్రయత్నంనుండి; విముక్తులరు+అయితిరి= తప్పించుకొన్నవా ళ్ళయితిరి; ఇంకన్= ఇకపై; మీకు; లగ్గు= మేలు; అగున్= అవుతుంది; అని; చెప్పి; బలదేవ, సహితుండు+అయి= బలరామునితో కూడి; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; అరిగినన్= వెళ్ళగా; ఇట; ద్రుపదుండు= ద్రుపదమహారాజు; తన, కూఁతునకు= తన కుమార్తెకు; వరుండు+ఐన, వాఁడు= భర్త అయిన, అతడు; ఎవ్వడో= ఎవరో; ఏ వంశంబున వాఁడో= ఏ వంశంలోని అతడో; వాని చరితంబు= అతని చరిత్ర; ఎట్టిదో= ఎటువంటిదో; ఎఱింగి= తెలుసుకొని; రమ్ము+అని; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుని; పనిచినన్= పంపగా; అతండు; ఆ ధృష్టద్యుమ్నుడు; భీమ+అర్జున, ద్రౌపదుల; పిఱుందన్+అ= భీముడు అర్జునుడు ద్రౌపది వెనుకనే; వచ్చి; తన్నున్= తనను; ఒరులు= ఇతరులు; ఎఱుంగక+ఉండన్= తెలియకుండ; ఆ+కుంభకార, గృహంబునన్= ఆ కుండలు చేసేవాని ఇంట్లో; ఉండి= విశ్రమించి; అంత, వృత్తాంతంబున్= విషయము అంతా; ఎఱింగి= తెలిసికొని; పోయి; ద్రుపదునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అందరు రాజులముందు మానవులకు అసాధ్యమైన ఇటువంటి అద్భుతకార్యం చేయటం అర్జునునికి కాక ఇతరులకు సాధ్యమా? అని తెలిసికొన్నాము. మీ పరాక్రమమే మిమ్మల్ని తెలియపరచింది. అధర్మంలో ఆసక్తి కలవా ళ్ళయిన ధృతరాష్ట్ర దుర్యోధనులు చేసిన లాక్షాగృహ దహనంనుండి తప్పించుకొన్నారు. ఇక మీకు మేలు కలుగుతుంది' అని చెప్పి బలరామునితోగూడి శ్రీకృష్ణుడు వెళ్ళిపోయాడు. ఇక్కడ ద్రుపదుడు తన పుత్రికకు భర్త

అయినవాడు ఎవ్వడో? ఏ వంశంవాడో; అతనిచరిత్ర ఎటువంటిదో? తెలిసికొని ర మ్మని ధృష్టద్యుమ్నుడిని పంపాడు. అతడు భీమార్జునద్రౌపదుల వెనుకనే వచ్చి, ఇతరులు తనను చూడకుండ, ఆ కుమ్మరివాని యింట్లో ఉండి, వృత్తాంతమంతా గ్రహించి వెళ్లి ద్రుపదునితో ఈ విధంగా చెప్పాడు.

సీ. **అ య్యిద్దఱును గృష్ణ న ట్లొప్పఁ దోడ్కొని । చని యొక్క ముదుసలి సాని కపుడు**
మ్రొక్కి యక్కన్యను మ్రొక్కించి మఱియొక్క । గౌరవర్ణుఁడు పంపఁ గడఁకతోడ
నలువురు భూసురనాథగృహంబుల । కరిగి భైక్షము దెచ్చి యంతగూడు
నొగిన యయ్యవ్వకు నొప్పించియున్న న । య్యవ్వయు ద్రౌపది నర్థిఁ బిలిచి

ఆ. **బలివిధానములకు బ్రాహ్మణాతిథులకు । నన్నకాంక్షు లైన యధ్వగులకు**
నగ్రమిందుఁ బుచ్చి యయ్యగ్రశేషంబుఁ । జెలువ రెండు పాళ్ళు సేయు మొనర. **223**

ప్రతిపదార్థం: ఆ+ఇద్దఱును; కృష్ణన్= ద్రౌపదిని; అట్లు; ఒప్పన్= తగు విధంగా; తోడ్కొని; చని; ఒక్క, ముదుసలి, సానికి= ఒక ముసలి అవ్వకు; అపుడు= ఆ సందర్భంలో; మ్రొక్కి; ఆ+కన్యను= ఆ కన్నెను; మ్రొక్కించి= నమస్కరింపజేసి; మఱి= పిదప; ఒక్క= ఇంకొక; గౌరవర్ణుఁడు= తెల్లని వన్నెగలవాడు-ధర్మరాజు; పంపన్= ఆజ్ఞాపింపగా; కడఁకతోడన్= ప్రయత్నంతో; నలువురు= నలుగురు; భూసుర, నాథ, గృహంబులకున్= బ్రాహ్మణ శ్రేష్ఠుల ఇండ్లకు; అరిగి= వెళ్ళి; భైక్షము= భిక్షాసమూహం; తెచ్చి= తీసికొనివచ్చి; అంత, కూడున్= అంత అన్నమును; ఒగిన్= క్రమముగ; ఆ+అవ్వకున్; ఒప్పించి= అప్పగించి; ఉన్నన్= ఉండగా; ఆ+అవ్వయున్= ఆ అవ్వకూడా; ద్రౌపదిన్; అర్థిన్= ప్రీతితో; పిలిచి; చెలువ= సుందరీ; బలివిధానములకు= బలులు వేయుటకు; బ్రాహ్మణ+అతిథులకున్= బ్రాహ్మణులైన అతిథులకు; అన్న, కాంక్షులు+ఐన= అన్నమును కోరేవా ళ్ళయిన; అధ్వగులకున్= బాటసారులకు; ఇందున్= దీనిలో; అగ్రము= అధికభాగం; పుచ్చి= గ్రహించి; ఆ+అగ్రశేషంబున్= అగ్రభాగం పోగా మిగిలిన దానిని; రెండు, పాళ్ళు; ఒనరన్= ఒప్పగ; చేయుము.

తాత్పర్యం: 'ఆ యిద్దరు (భీమార్జునులు) ద్రౌపదిని ఆ విధంగా తమవెంట పిలిచికొని పోయి, ఒక ముసలి అవ్వకు నమస్కరించారు. ఆ కన్యచేతకూడా మ్రొక్కించారు. ధర్మరాజు ఆజ్ఞాపించగా పూనికతో తక్కిన నలుగురు, బ్రాహ్మణశ్రేష్ఠుల గృహాలకు వెళ్లి, భిక్షాసమూహాన్ని తెచ్చి, ఆ ఆహారాన్నంతా ఆ అవ్వకు అప్పగించారు. ఆ అవ్వ ద్రౌపదిని ఆప్యాయంగా పిలిచి, 'సుందరీ! ఇందులో అగ్రభాగం బలివిధానాలకు, బ్రాహ్మణాతిథులకు, అన్నం కోరి వచ్చే బాటసారులకు వేరుగా ఉంచి, మిగిలినదాన్ని రెండు భాగాలు చేయు' మని చెప్పింది.

విశేషం: భిక్షాన్నంలో కూడా అన్యులకు అగ్రభాగం సమర్పించే ఆర్షసంప్రదాయం అమోఘం. కోడలుగా ఇంట్లో అడుగుబెట్టిన ద్రౌపదికి అత్తగారైన కుంతి తనయింటి ఆచారవ్యవహారాలను, సంస్కృతి విశేషాలను తెలియజెప్పి, వాటి బాధ్యతలను ఆమెకు అనుభవ మయ్యేటట్లు బోధించటం ఉత్తమగృహస్థాశ్రమధర్మం. అత్తాకోడళ్ళు ఒక వంశంలో సాగే అవిచ్ఛిన్న సంప్రదాయాన్ని పోషించే ధర్మకర్త లనే భారతీయసంప్రదాయంకూడా ఇందులో రమణీయంగా చిత్రించబడింది.

క. **వెడఁదయురంబును నన్నువ । కడుపును దృఢకఠినతనువుఁ గల యాతని కిం**
దడర నొకపాలు వెట్టుము । వడి; నాగాయుతబలంబువాఁ డతఁ డబలా! **224**

ప్రతిపదార్థం: అబలా= ఓకాంతా!; వెడద, ఉరంబునున్= విశాలమైన రొమ్మును; అన్నువ కడుపును= సన్నని కడుపును; దృఢ, కఠిన, తనువున్= దృఢమైన కఠినమైన దేహమును; కల= కలిగిన; అతనికిన్= అతనికి; ఇందున్+అడరన్= ఇందులో ఒప్పుగా; ఒక, పాలు= ఒక భాగం; వడి= వేగమే; పెట్టుము; అతడు= ఆ వ్యక్తి; నాగ+అయుత; బలంబువాడు= పదివేల ఏనుగుల బలం కలవాడు.

తాత్పర్యం: ఓ కాంతా! విశాలమైన రొమ్ము, సన్నని కడుపు, దృఢము కఠినము అయిన దేహం కల అతనికి వెంటనే ఒకభాగం ఆహారం పెట్టుము. అతడు పదివేల యేనుగుల బలం కలవాడు.

విశేషం: 'అమ్మ కడుపు చూస్తుంది. ఆలు వీపు చూస్తుంది' అని సామెత. అంటే ఊరినుండి వచ్చినబిడ్డలకయ్యే ఆకలిని ముందుగా గమనించి అన్నంపెట్టి ఆనందపెట్టేది తల్లి. ఊరినుండి ఏమి సంపాదించి తెచ్చాడో ముందుగా మగని వీపుమీది మూటను గమనించేది భార్య అని దీనిభావం. ఇల్లాలుగా బాధ్యతలు నిర్వహించటంలో ద్రౌపది తల్లిమనసుకూడా పెంచుకొన్న దని చెప్పటం ఇందులో ధ్వని. బిడ్డలు పెక్కుమంది ఉన్నప్పుడు తల్లి వివేకవతి అయి వారివారి అవసరాలను గుర్తించి ఆహారం పెట్టటం ధర్మం. భీమునికి భిక్షలో సగం పెట్టటానికి హేతువునుకూడా కుంతి చెప్పింది. అది పక్షపాతం కా దని తెలియచెప్పింది. పాండవులకు భీమునిబలమే పెద్దరక్ష అని వస్తుధ్వని. (సంపా.)

వ. 'మఱియు రెండగుపా లన్నలువురకుం బెట్టి తద్భుక్తశేషం బేనును నీవు నుపయోగింత' మని పంచినఁ; గృష్ణయు నయ్యవ్వ పంచినరూపున నందఱకుం గుడువం బెట్టి, తానును గుడిచి, దర్భపూరులు విద్రిచి యందఱకు వేఱువేఱ శయనమ్ము లిమ్ముగా రచియించి, వానిపయి వారల కృష్ణాజినంబులు పఱచి సుఖశయను లై యున్న వారి పాదంబులకు నుపధానభూత యై శయనించి. 225

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; రెండు+అగు, పాలు= రెండవ భాగం; ఆ నలువురకున్= ఆ నలుగురికి; పెట్టి; తద్+భుక్త, శేషంబు= వారిచే తినబడగా మిగిలిన దానిని; ఏనును= నేనూ; నీవున్= నీవూ; ఉపయోగింతము= ఉపయోగిద్దాం; అని= అంటూ; పంచినన్= ఆజ్ఞాపించగా; కృష్ణయున్= ద్రౌపదియు; ఆ+అవ్వ; పంచిన= ఆజ్ఞాపించిన; రూపునన్= తీరున; అందరకున్= అందరికీ; కుడువన్+పెట్టి= తినటానికి పెట్టి; తానును, కుడిచి; దర్భపూరులు= దర్భపోచలు; విద్రిచి= విదిలించి; అందఱకున్= అందరికీ; వేఱువేఱు+అ= విడివిడిగా; శయనమ్ములు= పడకలు; ఇమ్ముగా= ప్రీతిగా; రచియించి= ఏర్పాటు చేసి; వాని, పయి= వాటిమీద; వారల, కృష్ణ+అజినంబులు= వాళ్ళవైన జింకచర్మాలు; పఱచి; సుఖశయనులు+ఐ= సుఖంగా పడుకొన్నవా ళ్ళయి; ఉన్నన్= ఉండగా; వారి, పాదంబులకున్= వారికాళ్లకు; ఉపధాన, భూత+ఐ= దిండువంటి దై; శయనించి= పడుకొని.

తాత్పర్యం: 'రెండవభాగం అన్నం ఆ నలుగురికి పెట్టి, వాళ్ళు తినగా మిగిలిన దానిని నేనూ, నీవూ ఉపయోగిద్దా' మని ఆజ్ఞాపించగా ద్రౌపది ఆమె చెప్పినట్లే అందరికీ అన్నం పెట్టి, తానూ తిన్నది. దర్భగడ్డిపోచలు విదిలించి, అందరికీ వేరువేరుగా పడకలు ప్రీతితో వేసి, వాటిమీద జింకచర్మాలు పరచింది. వాళ్ళు సుఖంగా పడుకొన్న తర్వాత వాళ్ళపాదాలకు దిండువలె తాను పడుకొన్నది.

ఆ. కఱకు దర్భపూరి పఱపులు; భిక్షాన్న । మశన; మట్టివారి నతిముదమున
నాదరించెఁ బ్రీతి; నాదిగర్భేశ్వరి । యయ్యు నేవగింపదయ్యెఁ గృష్ణ. 226

ప్రతిపదార్థం: కఱకు, దర్భపూరి, పఱవులు= కఠినమైన దర్భగడ్డి పఱుపులు; భిక్షా+అన్నము= బిచ్చమెత్తుకొని తెచ్చిన అన్నం; అశనము= ఆహారం; అట్టివారిన్= అటువంటి వాళ్లను; కృష్ణ= ద్రౌపది; ఆది, గర్భ+ఈశ్వరి= మొదటినుండి - గర్భంలో ఉన్నప్పటినుండి సంపద కలది; అయ్యున్= అయినను; అతి, ముదమునన్= మిక్కిలి సంతోషంతో; ప్రీతిన్= ప్రేమతో; ఆదరించెన్; ఏవగింపదు+అయ్యెన్= అసహ్యపడదయ్యెను.

తాత్పర్యం: దర్భగడ్డి పరుపులు; భిక్షాన్నం ఆహారం - వీటిని ఆగర్భశ్రీమంతురా లైనా ద్రౌపది మిక్కిలి సంతోషంతో, ప్రేమతో ఆదరించింది కాని, ఏవగించుకొనలేదు.

క. కడవసములుఁ గోలలుఁ గ । ప్పడములు వీరలధనంబు పరికింపఁగ నె
క్కడి దేశికు లని వగవక । మడవక తనుమధ్య నిండుమనమున నుండెన్. 227

ప్రతిపదార్థం: కడవసములున్= జింకచర్మాలూ; కోలలున్= దండాలూ; కప్పడములు= చినిగిన గుడ్డలూ; వీరల, ధనంబు= వీళ్ల ధనం; పరికింపఁగన్= ఆలోచించగా; ఎక్కడి, దేశికులు= ఎక్కడి పెద్దలు - అనగా ఏమి భర్తలు; అని= అని తలచి; వగవక= దుఃఖించక; మడవక= ఏవగించక; తనుమధ్య= సన్నని నడుము కల ద్రౌపది; నిండుమనమునన్, ఉండెన్= నిండుమనస్సుతో ఉన్నది.

తాత్పర్యం: జింకచర్మాలు, దండాలు, చినిగిన గుడ్డలు - వీళ్ళ ధనాలు. ఆలోచిస్తే వీ ళ్ళేం భర్తలు? అని దుఃఖించక, అసహ్యపడక ద్రౌపది నిండుమనస్సుతో ఉన్నది.

సీ. 'అంత నయ్యేవురు నయ్యయికథ లొప్పఁ । జెప్పుచు మఱి రథసింధురాశ్వ
విషయంబులును, సమవిషమ మహావ్యూహ । నిర్భేదనోపాయనిపుణవిధులు,
నాయుధవిద్యారహస్య ప్రయుక్తులుఁ । బలికిరి; పలికినబాసఁ జూడ
నత్యుత్తమక్షత్రియాన్వయు లగుదురు; । చరితఁ జూడఁగ విప్రజాతు లగుదు;

ఆ. రెఱుఁగరాదు వారి; నీ రెండు జాతుల । వార కాని, కారు వైశ్య శూద్ర
హీనజాతు' లనిన నెంతయు సంతస । మందెఁ బృషతపుత్త్రుఁ డాత్మలోన. 228

ప్రతిపదార్థం: అంతన్= ఆ సమయంలో; ఆ+ఏవురున్= ఆ ఐదుగురు; అయ్యయి, కథలు= ఆయా కథలు; ఒప్పన్= తగు విధంగా; చెప్పుచున్= చెప్పుకొంటూ; మఱి; రథ, సింధుర+అశ్వ విషయంబులును= రథముల, ఏనుగుల, గుర్రాల సంగతులూ; సమ, విషమ, మహావ్యూహ, నిర్భేదన+ఉపాయ, నిపుణ, విధులున్= సమములు, విషమములు అయిన మహాయుద్ధ వ్యూహాలను భేదించునట్టి ఉపాయాలయొక్క నిపుణ మైన పద్ధతులూ; ఆయుధ, విద్యా, రహస్య, ప్రయుక్తులున్= ఆయుధవిద్యయందలి రహస్య ప్రయోగాలూ; పలికిరి; పలికిన, బాసన్= మాటాడిన మాటతీరును; చూడన్= పరిశీలింపగా; అత్యుత్తమ, క్షత్రియ+అన్వయులు= మిక్కిలి శ్రేష్ఠమయిన రాజవంశం కలవాళ్ళు; అగుదురు= అవుతారు; చరితన్= నడతను; చూడఁగన్= గమనింపగా; విప్ర, జాతులు= బ్రాహ్మణజాతికలవారు; అగుదురు= అవుతారు; వారిన్= వారలను; ఎఱుఁ గరాదు= తెలియటం సాధ్యపడదు; ఈరెండు జాతులవారు+అ= ఈ రెండుజాతులకు చెందినవారే; కాని; వైశ్య, శూద్ర, హీన, జాతులు, కారు; అనినన్= అని అనగా; పృషత; పుత్త్రుఁడు= పృషతుని కుమారు డైన ద్రుపదుడు; ఆత్మలోనన్= మనస్సులో; ఎంతయున్= ఎంతో; సంతసము, అందెన్= సంతోషాన్ని పొందాడు.

తాత్పర్యం: 'అప్పుడు ఆ ఐదుగురు ఆ యా కథలు చెప్పుకొంటూ రథాలు, ఏనుగులు, గుర్రాలు - వీటికి సంబంధించిన విషయాలు, సమవిషమాలైన మహాయుద్ధవ్యూహాలను భేదించే ఉపాయాలలో నిపుణమైన పద్ధతులు, ఆయుధాల రహస్యప్రయోగాలు మాట్లాడుకొన్నారు. మాటాడిన మాటలు చూస్తే, వాళ్ళు మిక్కిలి శ్రేష్ఠమైన రాజవంశంవాళ్ళుగా ఉన్నారు. ప్రవర్తన చూస్తే బ్రాహ్మణజాతివా ళ్ళనిపిస్తుంది. వా ళ్ళెవరో స్పష్టంగా తెలిసికొనటం సాధ్యపడదు. కాని, వాళ్ళు ఈ రెండుజాతులవాళ్ళే! వైశ్య, శూద్ర, హీనజాతులవాళ్ళుమాత్రం కాదు' అని తెల్పగా, ద్రుపదుడు మనస్సులో మిక్కిలి ఆనందం పొందాడు.

విశేషం: ద్రౌపదికి స్వయంవరం ప్రకటించిన ద్రుపదుడు ఆశించింది ఒకటి - అయింది ఇంకొకటి. అర్జునుడు లేదా ఏ రాకుమారుడో మత్స్యయంత్రాన్ని భేదించి ద్రౌపదిని చేపట్టగల డని ఆశిస్తే - ఒక బ్రాహ్మణుడు దాన్ని కొట్టాడు; ఆమెను చేపట్టాడు. ఒక మహారాజ పుత్రి పేద బ్రాహ్మణుని వెంట జీవితం పంచుకొనటానికి వెళ్ళింది. ఎంత చిత్రమైన మలుపు! సహజంగానే ఏ తల్లిదండ్రులైనా తమ పిల్ల వెళ్ళినచోట ఎలా ఉందో - అల్లుడు ఏలాంటివాడో - తెలిసికొనటానికి పరోక్షంగా లేదా ప్రత్యక్షంగా ప్రయత్నిస్తారు. అటువంటప్పుడు ముక్కూ మొగం తెలియని ఒక బ్రాహ్మణుని వెంట ఎక్కడికో వెళ్ళిన తన కూతురి స్థితిగతులు తెలిసికొనా లని ద్రుపదుడు తహతహలాడటంలో ఆశ్చర్యమేముంది? అందుకే ఆ మహారాజు మొదట కొడుకును పంపాడు. పిల్లనిచ్చినవాళ్ళు తమను పరిశీలిస్తున్నా రని తెలిస్తే అత్తింటివాళ్ళు గ్రహించే అవకాశం ఉన్నది. అందుకే ధృష్టద్యుమ్నుడు రహస్యంగా విషయం సేకరించి వచ్చాడు. మాటలు చూస్తే వాళ్ళు రాకుమారు లని, ప్రవర్తన చూస్తే బ్రాహ్మణు లని, ఇతర జాతుల వాళ్ళు ఏ మాత్రం కా రని చెప్పాడు. అంతమాత్రాన తండ్రి ఉత్కంఠ ఆగుతుందా? వా ళ్ళెవరో వివరంగా తెలియాలికదా. అందుకే ద్రుపదుడు మళ్ళీ తన పురోహితుడిని పంపాడు. మహాభారతంలో చిత్రమైన మలుపులతో సహజమనోహరంగా సాగిన కథాకథన మిది.

వ. వెండియు వారల నిమ్ముగా నెఱుంగవేఁడి తనపురోహితుం బుత్తెంచినం, బురోహితుండును బ్రాహ్మణ సమూహంబుతోడ వచ్చి పాండవులం గని ధర్మరాజు నియోగంబున భీమసేనుచేత నర్ఘ్యాదివిధుల నర్చితుం డయి యి ట్లనియె. **229**

ప్రతిపదార్థం: వెండియున్= మఱియు; వారలన్= వాళ్లను; ఇమ్ముగాన్= చక్కగా; ఎఱుంగన్= తెలియుటకై; వేఁడి= ప్రార్థించి, తన పురోహితున్; పుత్తెంచినన్= పంపగా; పురోహితుండును= పురోహితుడుకూడా; బ్రాహ్మణ, సమూహంబుతోడన్= బ్రాహ్మణ సమూహంతో; వచ్చి= వచ్చి; పాండవులన్; కని= చూచి; ధర్మరాజు= ధర్మరాజుయొక్క; నియోగంబునన్= ఆజ్ఞచే; భీమసేనుచేతన్; అర్ఘ్య+ఆది, విధులన్= అర్ఘ్యం మొదలైన పూజాపద్ధతులచేత; అర్చితుండు+అయి= పూజింపబడినవా డై; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇంకా వాళ్ళవిషయం చక్కగా తెలిసికొని ర మ్మని తన పురోహితుడిని ప్రార్థించి, పంపగా, అతడు బ్రాహ్మణసమూహంతో వచ్చి పాండవులను చూచి - ధర్మరాజు ఆజ్ఞాపించగా భీమసేనుడు ఇచ్చిన అర్ఘ్యాది పూజలు అందుకొని, ఇట్లా అన్నాడు.

ఉ. మీ కులగోత్ర నామములు మిమ్మును నెమ్మి నెఱుంగవేఁడి చిం
తాకులు డైనవాఁడు ద్రుపదాధిపుఁ; డాతనికిం బ్రియంబుగా
నా కెఱిఁగింపుఁ డింతయు; ఘనంబుగ నద్భుతయంత్ర మత్స్యమున్
వీకున నట్టు లేసిన సువిక్రము నాతఁడు గోరుఁ జూడఁగన్. **230**

ప్రతిపదార్థం: మీ, కుల గోత్ర, నామములన్= మీయొక్క కులం గోత్రం పేర్లు; మిమ్ములన్= మిమ్మల్ని; నెమ్మిన్= ప్రీతితో; ఎఱుంగన్= తెలియుటకై; వేఁడి= కుతూహలపడి; ద్రుపద+అధిపుఁడు= ద్రుపద మహారాజు; చింతా+ఆకులుఁడు+ఐనవాఁడు= చింతచేత కలతచెందినవాడైనాడు; అతనికిన్; ప్రియంబుగాన్= ప్రీతిగా; ఇంతయున్= అంతా; నాకున్+ఎఱిఁగింపుడు; ఘనంబుగన్= గొప్పగా; అద్భుత, యంత్ర మత్స్యమున్= ఆశ్చర్యకరమైన మత్స్యయంత్రాన్ని; వీకునన్= పరాక్రమంతో; అట్టుల= ఆ విధంగా; ఏసిన= కొట్టిన; సువిక్రమున్= మంచిపరాక్రమం కల వాడిని; ఆతడు, చూడఁగన్, కోరున్= ఆతడు చూచుటకై కోరుతూ ఉన్నాడు.

తాత్పర్యం: మీ కులం, గోత్రం, పేర్లు, మిమ్మల్నిగురించి ప్రీతితో తెలిసికొనా లని ద్రుపదమహారాజు చింతిస్తున్నాడు. ఆయనకు సంతోషం కలిగే విధంగా అంతా నాకు తెలియజేయండి. ఆశ్చర్యకరమైన ఆ మత్స్యయంత్రాన్ని తన పరాక్రమంతో ఆ విధంగా పడగొట్టిన మహావీరుడిని అతడు చూడగోరుతున్నాడు.

వ. అనిన విని నగుచు ధర్మతనయుండు ద్రుపద పురోహితున కి ట్లనియె. 231

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; నగుచున్= నవ్వుతూ; ధర్మతనయుఁడు= ధర్మరాజు; ద్రుపద, పురోహితునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని నవ్వుతూ ధర్మరాజు ద్రుపదపురోహితునితో ఈ విధంగా అన్నాడు.

క. ఇవ్వైహాయసలక్ష్యం। బివ్విలు మోపెట్టి నెట్టనేసిన వీరుం
డివ్వనితకు వరుఁ డగు నని। నెవ్వగ మీ రాజు చులక నియమము సేసెన్. 232

ప్రతిపదార్థం: ఈ+వైహాయస, లక్ష్యంబు= ఈ ఆకాశమందలి గుఱిని; ఈ+విలున్= ఈ ధనుస్సును; మోపెట్టి= ఎక్కుపెట్టి; నెట్టన్= క్రమముగ; ఏసిన= కొట్టిన; వీరుండు; ఈ+వనితకు= ఈ ద్రౌపదికి; వరుఁడు= మగడు; అగున్= అవుతాడు; అని; నెవ్వగన్= నిండైన ఆలోచనతో; మీ, రాజు; చులక, నియమము= సులువైన ఏర్పాటు; చేసెన్.

తాత్పర్యం: 'ఈ ఆకాశ మత్స్యయంత్రాన్ని, ఈ విల్లు ఎక్కుపెట్టి కొట్టినవీరుడు ఈ వనితకు భర్త అవుతాడు'- అని మీ ద్రుపదమహారాజు ఎంతో ఆలోచించి సులువైన నియమం చేశాడు.

తే. అతని నియమించి నట్లు యయ్యంత్ర మేసి। యీతఁ డిక్కన్యఁ బడసె నుర్వీశు లొద్ద;
నేల మమ్ముఁ దా నెఱిఁగెడు? నెఱిఁగి యేమి। సేయువాఁ డింక మీ పతి సెప్పుమయ్య! 233

ప్రతిపదార్థం: అతని, నియమించిన +అట్టుల+అ= అతనియొక్క నియమించినట్లుగ - అనగా అతడు చెప్పినట్లు; ఆ+యంత్రము; ఏసి= పడగొట్టి; ఈతఁడు; ఉర్వీ+ఈశుల+ఒద్దన్= రాజుల ఎదుట; ఈ+కన్యన్; పడసెన్= పొందాడు; మీ, పతి= మీ రాజు; ఏల= ఎందుకు; మమ్మున్= మమ్మల్ని; తాన్= తాను; ఎఱిఁగెడున్= తెలియగోరుతున్నాడు; ఇంకన్= ఇకపై; ఎఱిఁగి= తెలిసికొని; ఏమి, చేయువాఁడు= ఏమి చేయగలవాడు; చెప్పుము+అయ్య.

తాత్పర్యం: అతడు చెప్పినట్లే ఆ మత్స్యయంత్రాన్ని పడగొట్టి ఇత డీ కన్యను రాజు లందరి సమక్షంలో పొందాడు. ఇక మీ రాజు మమ్మల్ని తెలిసికొనటం యెందుకు? తెలిసికొని ఏం చేస్తాడు? చెప్పండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. బలహీనుఁ డైన వానికి । నలవియె? మోపెట్టి తివియ న క్కార్ముకముం;
గులహీనున కకృతాస్త్రున । కలవియె? యా లక్ష్యమేయ? నశ్రమలీలన్. 234

ప్రతిపదార్థం: బలహీనుఁడు+ఐన, వానికిన్ = బలము లేనివానికి; ఆ+కార్ముకము= ఆ విల్లును; మోపెట్టి= ఎక్కుపెట్టి; తివియన్= లాగుట; అలవియె= శక్యమా; కులహీనునకున్= కులంతక్కువవానికి; అకృత+అస్త్రునకున్= నేర్వబడని అస్త్రములు కలవానికి - అంటే అస్త్రవిద్య తెలియనివానికి; ఆ, లక్ష్యము = ఆ గుఱిని; అశ్రమలీలన్= శ్రమలేని విలాసంతో; ఏయన్= కొట్టటం; అలవియే= సాధ్యమా!

తాత్పర్యం: ఆ విల్లును ఎక్కుపెట్టి లాగటం బలహీను డైనవానికి సాధ్యమౌతుందా? కులహీనుడికి, అస్త్రవిద్య నేర్వనివాడికి ఆ లక్ష్యాన్ని (మత్స్యయంత్రాన్ని) అనాయాసంగా కొట్టటం సాధ్య మౌతుందా?

పాండవులు ద్రుపదమహారాజు గృహంబునకుఁ బోవుట (సం.1-185-25)

వ. ' మీ రాజు మనోరథంబు సఫలం బయ్యె వగవ నేల?' యనిన ధర్మరాజుపలుకు విని పురోహితుండు వోయి ద్రుపదున కెఱింగించిన; ద్రుపదుండు ధృష్టద్యుమ్నుం జూచి 'చాతుర్వర్ణ్యోచితంబు లయిన రథంబులు గొనిపోయి వారల దోడ్కొని ర' మ్మని పంచిన వాఁడును నాక్షణంబ పాండవుల పాలికి వచ్చి 'యీరథంబు లెక్కి మారాజునొద్దకు రం' డనినఁ బాండవులు రాజయోగ్యంబు లయి రత్నాంచితంబు లయిన కాంచన రథంబు లెక్కి కుంతీదేవిని, ద్రౌపదిని నొక్కరథం బెక్కించి తోడ్కొని ధృష్టద్యుమ్నుతో ద్రుపదరాజనివేశంబున కరుగుదెంచునంత ద్రుపదుండును వారల కనేకవిధంబు లైన వస్తువు లతిప్రీతిం బుత్తెంచినఁ, బరార్థ్యంబు లైన యొండువస్తువులఁ బరిగ్రహింపక సాంగ్రామికంబు లైన యసిచర్మకార్ముకబాణతూణీరరథవరూథ వాజివారణ నివహంబులఁ బరిగ్రహించి తనయొద్దకు వచ్చువారి. 235

ప్రతిపదార్థం: మీ, రాజు; మనోరథంబు= కోరిక; సఫలంబు+అయ్యెన్= సఫలం అయింది; వగవన్+ఏల= చింతించటం ఎందుకు; అనినన్= అనిఅనగా; ధర్మరాజు పలుకు; విని; పురోహితుండు; పోయి; ద్రుపదునకున్; ఎఱింగించినన్= తెలుపగా; ద్రుపదుండు= ద్రుపదుడు; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; చూచి= కాంచి; చాతుర్వర్ణ్య+ఉచితంబులు= నాలుగుజాతులవారికి తగినవి; అయిన= అయినటువంటి; రథంబులు; కొనిపోయి= తీసుకునివెళ్లి; వారలన్= వాళ్లను; తోడ్కొని= తీసికొని; రమ్ము+అని= రమ్ము అని; పంచినన్= ఆజ్ఞాపించగా; వాఁడునున్= ఆ ధృష్టద్యుమ్నుడుకూడా; ఆ, క్షణంబు+అ= ఆ క్షణమే; పాండవుల, పాలికిన్= పాండవుల దగ్గరకు; వచ్చి; ఈ, రథంబులు+ఎక్కి; మా, రాజు, ఒద్దకు; రండు; అనినన్; పాండవులు; రాజ యోగ్యంబులు+అయి= రాజులకు తగిన వై; రత్న+అంచితంబులు+అయిన= రత్నములచేత ఒప్పుచున్న వైన; కాంచన, రథంబులు= బంగారు తేరులు; ఎక్కి; కుంతీదేవిని; ద్రౌపదిని; ఒక్క, రథంబు= ఒక్క తేరుపై; ఎక్కించి= ఎక్కునట్లు చేసి; తోడ్కొని= తీసికొనివచ్చి; ధృష్టద్యుమ్నుతో; ద్రుపదరాజ= ద్రుపదరాజునియొక్క; నివేశంబునకున్= ద్రుపదమహారాజుయొక్క నివాసానికి; అరుగుదెంచున్+అంత= వస్తుండగా; ద్రుపదుండును= ద్రుపద మహారాజుకూడ; వారలకున్= వాళ్లకు; అనేక, విధంబులు+ఐన= అనేకరకాలైన; వస్తువులు= కానుకలైన పదార్థాలు; అతి, ప్రీతిన్= అమితమైన సంతోషంతో; పుత్తెంచినన్= పంపగా; పరార్థ్యంబులు+ఐన= శ్రేష్ఠము లైన; ఒండు, వస్తువులన్= ఇతర వస్తువులను; పరిగ్రహింపక=తీసుకొనక; సాంగ్రామికంబులు+ఐన= యుద్ధానికి సంబంధించిన వైన; అసి, చర్మ, కార్ముక, బాణ, తూణీర, రథ, వరూథ, వాజి, వారణ, నివహంబులన్= కత్తులయొక్క, డాలులయొక్క, విండ్లయొక్క, బాణాలయొక్క, అమ్ములపొదులయొక్క, రథాలయొక్క,

రథములమీది కప్పులయొక్క, గుఱ్ఱాలయొక్క, ఏనుగులయొక్క సమూహాలను; పరిగ్రహించి=తీసికొని; తన ఒద్దకు= తన దగ్గరకు; వచ్చువారిన్= వస్తూ ఉన్న పాండవులను.

తాత్పర్యం: 'మీ రాజుకోరిక సఫలమైనది. విచారించటం ఎందుకు? అని ధర్మరాజు పల్కగా విని, పురోహితుడు వెళ్ళి ద్రుపదునికి తెలియజేశాడు. అతడు ధృష్టద్యుమ్నుడిని చూచి, 'నాలుగుజాతులవాళ్ళకు ఉచితా లైన రథాలను తీసికొనివెళ్ళి, వాళ్ళను తోడ్కొని ర' మ్మని ఆజ్ఞాపించాడు. అతడు తత్క్షణమే పాండవులదగ్గరకి వెళ్ళి; 'ఈ రథా లెక్కి మా రాజు దగ్గరికి రండి' అని పల్కగా, వాళ్ళు రత్నాలు పొదిగినవి, రాజులకు తగినవి అయిన బంగారు రథాలెక్కి కుంతీదేవిని, ద్రౌపదిని ఒక రథంలో కూర్చొబెట్టి తోడ్కొని ధృష్టద్యుమ్నునితో గూడి ద్రుపదమహారాజు ఇంటికి వచ్చారు. అప్పుడు ద్రుపదుడు వాళ్ళకు అనేకవిధాలైన వస్తువులను మిక్కిలి ప్రేమతో పంపాడు. వాటిలో శ్రేష్ఠాలైన ఇతర వస్తువులను పరిగ్రహించక, యుద్ధసంబంధాలైన కత్తులు, డాలులు, ధనుస్సులు, బాణాలు, అమ్ముల పొదులు, రథాలు, రథంమీదికప్పులు, గుఱ్ఱాలు, ఏనుగులు - వీటి సమూహాలను మాత్రమే స్వీకరించారు. ఈ విధంగా స్వీకరించి తనదగ్గరకు వస్తున్న పాండవులను.

విశేషం: ధర్మరాజు గంభీరుడు; వాగ్మి; కార్యచతురుడు అని ఈ ఘట్టం నిరూపిస్తున్నది. తననుగురించి సాటివాడైన ద్రుపదరాజుకే చెప్పుతాడు కాని ఇతరులకు చెప్పని ఆత్మాభిమాని. 'మీరాజు పెద్దగా ఆలోచించి ఈ చిన్న నియమాన్ని పెట్టా' డని తన ఔన్నత్యాన్ని తెలిపాడు. నియమమే ముఖ్య మన్నాడు. కాని ద్రుపదుడు ఇతర వివరాలను ప్రకటించలేదుకదా. నియమం ప్రకారం ద్రౌపదిని గెలుచుకొన్న తరువాత వివరాలను గురించి విచారించి దుఃఖించటం ఎందుకని పలికి వివేకాన్ని ప్రదర్శించాడు. అంతటి బలపరాక్రమాలను ప్రదర్శించినవాళ్ళు సామాన్యులు కా రని తెలిసికొనటం సులభమేకదా? అని విజ్ఞత ప్రదర్శించాడు. చివరకు ముక్తాయింపుగా 'మీ రాజుమనోరథం సఫలం అయ్యింది. ఇంకా చింతించడం దేనికి'? అని అన్నాడు. ఈ వాక్యం ధర్మరాజు నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నది. పైకి చూస్తే అనుకొన్నట్లుగా మత్స్యయంత్రం భేదించి కన్యను వివాహమాడ గలిగిన వరుడు దొరికాడు. ద్రుపదునికోరిక తీరిం దని భావం. లో నారసి చూస్తే 'అర్జునునికే ద్రౌపది నిద్దా మని ద్రుపదుని మనోరథంకదా! అది తీరింది. ఇంకా విచారమెందుకు? అని రమణీయార్థం. ఈ రెండర్థాలలో ధర్మజుని అంతరార్థాన్ని తెలుసుకుందా మని ద్రుపదుడు రథాలను పంపాడు. వివిధ వస్తువులను కానుకలుగా పంపాడు. ధర్మజుడు తాము బ్రాహ్మణులం కా మని, సుక్షత్రియుల మని తమ చర్యలద్వారా వ్యక్తం చేశాడు. వస్తుధ్వని సహజంగా పండిన కథాశిల్పక్షేత్రం ఈ ఘట్టం. (సంపా.)

సీ. అజినోత్తరీయుల నతిసంభృత బ్రహ్మ । తేజుల సముదితాదిత్యసముల
నాజానులంబి మహాబాహుపరిఘుల । నత్యున్నతాంసుల నతివిశాల
వక్షుల నవిరళవ్యాయామ దృఢ కఠి । నాంగుల వృషభాక్షు లయిన వారిఁ
బాండుకుమారుల భరతవంశేశులఁ । జూచి సుతభ్రాతృ సుహృదమాత్య

ఆ. బంధుజనులతోడఁ బరమవిద్వన్మహీ । సురగణంబుతోడ సోమకుండు
గరము సంతసిల్లె ఘనుల నత్యుత్తమ । క్షత్త్రవంశవరులఁ గా నెఱింగి. 236

ప్రతిపదార్థం: అజిన+ఉత్తరీయులన్= జింకచర్మం పైగుడ్డగా కలవాళ్ళను; అతి, సంభృత, బ్రహ్మ, తేజులన్= మిక్కిలిగా భరించబడిన బ్రహ్మతేజస్సు కలవాళ్ళను; సముదిత+ఆదిత్య, సములన్= ఉదయించిన సూర్యుడితో సమానమైనవాళ్ళను;

ఆజాను, లంబి, మహాబాహు; పరిఘులన్= మోకాలివరకు వ్రేలాడుతున్న ఇనుపగుదియలవంటి పెద్దబాహువులు కలవాళ్ళను; అతి+ఉన్నత+అంసులన్= మిక్కిలి ఎత్తైన భుజశిఖరాలు కలవాళ్ళను; అతి, విశాల, వక్షులన్= మిక్కిలి వెడ ల్పయిన రొమ్ములు కల వాళ్ళను; అవిరళ, వ్యాయామ, దృఢ, కఠిన+అంగులన్= ఎడతెగని వ్యాయామంచేత గట్టిపడి కఠినా లైన అవయవాలు కలవాళ్ళను; వృషభ+అక్షులు+అయిన, వారిన్= ఆబోతు కన్నులవంటి కన్నులు కలవాళ్ళను; భరత వంశ+ఈశులన్= భరతవంశరాజులను; ఘనులన్= గొప్పవాళ్ళను; పాండు, కుమారులన్= పాండవులను; చూచి= కనుగొని; సోమకుండు= ద్రుపదుడు; అతి+ఉత్తమ, క్షత్త్ర, వంశ, వరులన్+కాన్= మిక్కిలి శ్రేష్ఠమైన క్షత్రియవంశమందు పుట్టిన శ్రేష్ఠులుగా; ఎఱింగి= తెలిసికొని; సుత, భ్రాతృ, సుహృత్+అమాత్య, బంధుజనుల తోడన్= కొడుకులతో; తమ్ములతో, స్నేహితులతో, మంత్రులతో, బంధువులతో; పరమ, విద్వత్+మహీసుర, గణంబుతోడ= గొప్పవిద్వాంసు లైన బ్రాహ్మణసమూహంతో; కరము= మిక్కిలి; సంతసిల్లెన్= సంతోషించాడు.

తాత్పర్యం: జింకచర్మం ఉత్తరీయంగా కలవాళ్ళు, అత్యధికమైన బ్రహ్మతేజస్సు కలవాళ్ళు, ఉదయించిన సూర్యుడితో సమానులైనవాళ్ళు, మోకాలివరకు వ్రేలాడే ఇనుపగడియలవంటిచేతులు కలవాళ్ళు; మిక్కిలి ఎత్తైన భుజశిఖరాలు కలవాళ్ళు, అతివిశాలమైన వక్షఃస్థలం కలవాళ్ళు, ఎడతెగని వ్యాయామంతో గట్టిపడి, కఠినమైన అవయవాలు కలవాళ్ళు, ఆబోతుకన్నులవంటికన్నులు కలవాళ్ళు, భరతవంశరాజులు, ఘనులు అయిన పాండుకుమారులను చూచి, వాళ్ళు అత్యుత్తమక్షత్రియవంశశ్రేష్ఠు లని తెలిసికొని - పుత్రులతో, తమ్ములతో, మిత్రులతో, మంత్రులతో, బంధువులతో, మహావిద్వాంసులైన బ్రాహ్మణసమూహాలతో కలిసి ద్రుపదుడు మిక్కిలి సంతోషించాడు.

విశేషం: ఆబోతుకన్నులు గుండ్రంగా-ఎర్రగా అందంగా ఉంటాయి. పాండవులకన్నులు అంత పౌరుషవంతంగా, అందంగా ఉన్నాయి.

వ. **'మఱియుం దనయొద్దకు వచ్చి యశంకితు లయి క్షత్త్రియోచితంబు లైన మహార్హాసనంబుల నున్నవారల రాజపుత్త్రులంగా నెఱింగియు, సంశయాపనోదనపరుండై ధర్మతనయునకు ద్రుపదుం డి ట్లనియె 'నయ్యా! మీరు క్షత్త్రియులరో బ్రాహ్మణులరో మాయావు లయి క్రుమ్మరుచున్న మంత్రసిద్ధులరో కాక కృష్ణాపరిగ్రహణార్థంబు దివంబున నుండి వచ్చిన దివ్యులరో యెఱుంగము; మాకు సందేహం బయి యున్నయది; మీ కలరూ పెఱింగి కాని యిక్కన్య వివాహంబు సేయనేర' మనిన ద్రుపదునకు ధర్మతనయుం డి ట్లనియె.** **237**

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకనూ; తన, ఒద్దకు వచ్చి= తన కడకు వచ్చి; అశంకితులు+అయి= జంకులేనివాళ్ళయి; క్షత్రియ+ఉచితంబులు+ఐన= రాజులకు తగినవైన; మహా+అర్హ+ఆసనంబులన్= ఉత్తమా లైన ఆసనములందు; ఉన్న= ఉండేవాళ్ళను; రాజపుత్త్రులన్, కాన్= రాజకుమారులుగా; ఎఱింగియు= తెలిసికొనియు; సంశయ+అపనోదన, పరుండు+ఐ= సందేహాన్ని తీర్చుకొనటమే ప్రధానంగా కలవా డై; ధర్మ, తనయునకున్= ధర్మరాజునకు; ద్రుపదుండు; ఇట్లు+అనియెన్; అయ్యా; మీరు= తమరు; క్షత్రియులరో= రాజులో; బ్రాహ్మణులరో= బ్రాహ్మణులో; మాయావులు+అయి= మాయచేయువా ళ్ళయి; క్రుమ్మరుచున్న= తిరుగుచున్న; మంత్ర, సిద్ధులరో = మంత్రసిద్ధి కలవారో; కాక; కృష్ణా, పరిగ్రహణ+అర్థంబు= కృష్ణను (ద్రౌపది) పెండ్లాడటం కొరకు; దివంబున నుండి= స్వర్గం నుండి; వచ్చిన= విచ్చేసిన; దివ్యులరో= దేవతలో; ఎఱుంగము; మాకున్= మాకు; సందేహంబు+అయి+ఉన్న+అది= సంశయం కలిగి ఉన్నది; అది; మీ, కలరూపు= మీ నిజరూపం; ఎఱింగి= గ్రహించి; కాని= తప్ప; వివాహంబు= పెండ్లి; చేయనేరము= చేయజాలము; అనిన= అని అనగా; ద్రుపదునకున్= ద్రుపదమహారాజుకు; ధర్మతనయుండు= ధర్మజుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అంతేకాక, తన దగ్గరికి వచ్చి జంకులేక క్షత్రియులకు తగిన ఉన్నతాసనాలపై కూర్చొన్న పాండవులను-రాజపుత్రులుగా తెలిసికొన్నప్పటికి, సందేహం తీర్చుకొనా లని ద్రుపదుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు - 'అయ్యా! మీరు క్షత్రియులో? బ్రాహ్మణులో? మాయావు లై తిరుగుతున్న మంత్రసిద్ధులో? లేక ద్రౌపదిని వివాహ మాడటానికి దేవలోకంనుండి దిగివచ్చిన దేవతలో? తెలియడంలేదు. మాకు సందేహంగా ఉన్నది. మీ నిజస్థితి తెలిసికొని కాని ఈ కన్యకు వివాహం చేయలేము' అని ద్రుపదుడు పల్కగా అతనితో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. క్షత్రియులము, పాండుప్రియ । పుత్త్రుల; మే నగ్రజుండ, భూనుతులు మరు
త్పుత్త్రార్జునయము లమల చ । రిత్రులు నలువురును వీ రరిందము లెందున్. 238

ప్రతిపదార్థం: క్షత్రియులము, పాండు, ప్రియపుత్త్రులము= క్షత్రియులము, పాండురాజుయొక్క ప్రియమైన కుమారులం; ఏన్= నేను; అగ్రజుండు+అ= ముందుపుట్టినవాడను; భూ, నుతులు= భూమియందు కొనియాడబడినవాళ్ళు; మరుత్+పుత్త్ర+అర్జున, యములు= వాయుపుత్త్రుడైన భీముడు, అర్జునుడు, కవ లైన నకులసహదేవులు; వీరు; నలువురును; అమల, చరిత్రులు= నిర్మలమైన నడవడి కలవాళ్ళు; ఎందున్= ఎక్కడైన; అరిందములు= శత్రువులను జయించేవాళ్ళు.

తాత్పర్యం: మేము క్షత్రియులం. పాండురాజు ప్రియపుత్రులం. నేను పెద్దవాడను. లోకంకొనియాడే భీమార్జున నకులసహదేవు లైన వీళ్ళు నలుగురు నిర్మలమైన నడవడి కలవాళ్ళు. ఎక్కడైనా శత్రువులను జయించగలవాళ్ళు.

వ. 'వీరు కుంతీమహాదేవు' లని తన్నును దమ్ములనుం దల్లిని నెఱింగించిన, ద్రుపదుం డతిహర్షరసావేశపరవశుం డయి పెద్దయుం బ్రొద్దునకుఁ దెలిసి, యానందజలభరితనయనుం డగుచు 'నా పుణ్యంబున లాక్షాగృహదాహం బువలన విముక్తుల రయితి' రని సంతసిల్లి తద్వృత్తాంతం బంతయు ధర్మతనయునివలన విని, ధృతరాష్ట్ర దుర్యోధనుల నిందించి, సామప్రియభాషణంబుల నభీష్టసత్కారంబులను వారిం బూజించి, యొక్కనాఁడు పుత్త్రమిత్త్రామాత్య బాంధవబ్రాహ్మణపరివృతుం డయి ద్రుపదుండు సుఖాసీను లయి యున్న పాండవుల కి ట్లనియె. 239

ప్రతిపదార్థం: వీరు, కుంతీమహాదేవులు= కుంతీమహాదేవిగారు; అని= అని; తన్నునున్= తనను; తమ్ములనున్= తమ్ముళ్లను; తల్లినిన్= తల్లిని; ఎఱింగించినన్= తెలుపగా; ద్రుపదుండు; అతి, హర్ష, రస+ఆవేశ, పరవశుండు+అయి= మిక్కిలి ఆనంద రసముయొక్క కూడికచే మైమరచినవాడై; పెద్దయున్+ప్రొద్దునకున్, తెలిసి; ఆనంద, జల, భరిత, నయనుండు+అగుచున్= సంతోషంచేత కలిగిన కన్నీటితో నిండిన కన్నులు కలవాడౌతూ; నా, పుణ్యంబునన్= నా అదృష్టంవలన; లాక్షా, గృహ, దాహంబువలనన్= లక్కఇంటి నిప్పునుండి; విముక్తులరు= బయటపడినవారు; అయితిరి= అయినారు; అని=అని; సంతసిల్లి= సంతోషించి; తద్+వృత్తాంతంబు= ఆ కథను; అంతయున్= అంతా; ధర్మతనయునివలనన్= ధర్మరాజువల్ల; విని; ధృతరాష్ట్రుని, దుర్యోధనుల= ధృతరాష్ట్ర, దుర్యోధనుని; నిందించి= తూలనాడి; సామ, ప్రియ భాషణంబులన్= మంచిఇష్టమైన మాటలతో; అభీష్ట, సత్కారంబులను= మిక్కిలిప్రియాలైన సమ్మానాలచేత; వారిన్, పూజించి; ఒక్కనాఁడు= ఒకనాడు; పుత్త్ర, మిత్ర+అమాత్య, బాంధవ, బ్రాహ్మణ, పరివృతుండు+అయి= పుత్త్రులతో, మిత్రులతో, మంత్రులతో, బంధువులతో, బ్రాహ్మణులతో చుట్టబడినవాడై; ద్రుపదుండు= ద్రుపదమహారాజు; సుఖ+ఆసీనులు+అయి= సుఖంగా కూర్చున్న వాళ్ళయి; ఉన్నన్= ఉండగా; పాండవులకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'వీరు కుంతీమహాదేవులు' అని తనను, తమ్ములను, తల్లిని తెలియజేయగా - ద్రుపదుడు - అత్యధిక సంతోష రసావేశంలో మైమరచి, చాలాసేపటికి తేరుకుని, ఆనందబాష్పాలతో నిండిన కళ్ళతో 'నా పుణ్యం వలన లాక్షాగృహదహనంనుండి మీరు తప్పించుకొన్నారు' అని సంతోషించి, ఆ కథనంతా ధర్మరాజువలన విని, ధృతరాష్ట్రదుర్యోధనులను నిందించి, ఇంపైన మాటలతో, ఇష్టమైనసమ్మానాలతో వాళ్ళను పూజించాడు. తరువాత ఒకరోజు పుత్రులతో, మిత్రులతో, మంత్రులతో, బంధువులతో, బ్రాహ్మణులతో కూడి ద్రుపదుడు సుఖాసీను లై ఉన్న పాండవులతో ఇట్లా అన్నాడు.

క. సుత్రామపుత్త్రుఁ డభిజన । పాత్త్రుండు, విచిత్ర వీర్యుపౌత్త్రుఁడు, శుభ చా
రిత్రుం డీ విజయుఁడు మ । త్పుత్రికి వరుఁ డయ్యె నెట్టి పుణ్యోదయమో! 240

ప్రతిపదార్థం: సుత్రామ, పుత్త్రుఁడు= ఇంద్రునియొక్క కుమారుడు; అభిజన, పాత్రుండు= వంశానికి తగినవాడు; విచిత్రవీర్యు, పౌత్త్రుండు= విచిత్రవీర్యుని మనుమడు; శుభ, చారిత్రుండు= మంచి నడవడి కలవాడు; ఈ, విజయుఁడు= ఈ అర్జునుడు; మత్+పుత్రికి= నా యొక్క కూతురికి; వరుఁడు+అయ్యెన్= భర్త అయ్యాడు; ఎట్టి, పుణ్య+ఉదయమో= ఎంతటి పుణ్యముయొక్క అతిశయమో.

తాత్పర్యం: ఇంద్రునికుమారుడు, జన్మించిన వంశానికి తగినవాడు, విచిత్రవీర్యుని మనుమడు, మంచినడవడి కలవాడు అయిన ఈ అర్జునుడు నాకుమార్తెకు భర్త అయ్యాడు. నా భాగ్య మేమన గలను?

వ. 'స్వయంవర లబ్ధ యయిన యి క్కన్యక నర్జునుండు ధర్మవిధిం బాణిగ్రహణంబు సేయువాఁ' డనిన ద్రుపదునకు ధర్మతనయుం డి ట్లనియె; 'నది యె? ట్లేను వివాహం బైనఁ బదంపడి భీమసేనుండు వివాహం బయిన మఱి యర్జునుండు వివాహం బగుఁగాక! ముంద రర్జునునకుఁ బాణిగ్రహణంబు సేయ నె ట్లగు?' ననిన ద్రుపదుండు ధర్మతనయున కి ట్లనియె. 241

ప్రతిపదార్థం: స్వయంవర, లబ్ధ+అయిన= స్వయంవరమునందు పొందబడిన దైన; ఈ+కన్యకన్; అర్జునుండు; ధర్మవిధిన్= ధర్మప్రకారంగా; పాణిగ్రహణంబు, చేయువాఁడు= పెండ్లిచేసికొంటాడు; అనినన్= అని అనగా; ద్రుపదునకున్= ద్రుపదునితో; ధర్మతనయుండు; ఇట్లు+అనియెన్; అది, ఎట్లు= అది ఏ విధంగా!; ఏను= నేను; వివాహంబు+ఐనన్= పెళ్ళి చేసుకొంటే; పదంపడి= తరువాత; భీమసేనుండు; వివాహంబు+అయిన= వివాహం కాగా; మఱి= అటుపై; అర్జునుండు; వివాహంబు+ అగున్+కాక; పెండ్లాడతాడు కాని; ముందరన్= ముందుగా; అర్జుననకున్= అర్జునునికి; పాణిగ్రహణంబు= పెండ్లి; చేయన్= చేయుట; ఎట్లు+అగున్= ఏ విధంగా అవుతుంది; అనినన్= అని అనగా; ద్రుపదుండు; ధర్మతనయునకున్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'స్వయంవరంలో లభించిన ఈ కన్యకను అర్జునుడు ధర్మపద్ధతిలో వివాహం చేసికొంటాడు' అని ద్రుపదుడు పల్కగా; ధర్మరాజు ఇట్లా అన్నాడు ' అదెలా వీలవుతుంది? నేను పెళ్లాడిన తర్వాత భీమసేనుడు పెళ్లాడతాడు. తరువాత అర్జునుడు. ముందుగానే అర్జునుడు పెళ్లాడటం ఎట్లా జరుగుతుంది? అనగా ద్రుపదుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తే. 'అట్ల యగునేని యిక్కన్య నభిమతముగ। వసుమతీనాథ। నీవ వివాహ మగుము;
ధర్మమార్గ మెవ్వరికిని దప్ప నగునె?'। యనిన నాతని కనియె ధర్మాత్మజుండు. 242

ప్రతిపదార్థం: అట్లు+అ= ఆ విధంగానే; అగున్=ఏని= అయ్యే పక్షంలో; ఈ+కన్యన్= ఈ కన్నెను; వసుమతీనాథ= ఓ రాజా; నీవు+అ= నీవే; అభిమతముగన్= ఇష్టముగా; వివాహము+అగుము= పెండ్లిచేసుకో; ధర్మ, మార్గము= ధర్మమార్గాన్ని; ఎవ్వరికిన్= ఎవ్వరికైనను; తప్పన్+అగునె= తప్పవచ్చునా; అనినన్= అని అనగా; ధర్మ+ఆత్మజుండు= ధర్మరాజు; అతనికిన్, అనియెన్= ఆ ద్రుపదునితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'అట్లయితే ఓ రాజా! నీ ఇష్టప్రకారం ఈ కన్యను నీవే వివాహం చేసికొమ్ము. ధర్మమార్గం ఎవరూ తప్పరాదు కదా!' అని ద్రుపదుడు చెప్పగా, ధర్మరాజు అతనితో ఇట్లా అన్నాడు.

వ. 'ఏన కా, దిక్కన్యక నే మేవురము వివాహం బయ్యెద; మస్మన్మాతృ నియోగం బిట్టిద; యది మాకు నలంఘనీయం' బనిన విని విస్మితుం డై ద్రుపదుం డి ట్లనియె. 243

ప్రతిపదార్థం: ఏను+అ= నేనొక్కడినే; కాదు= కాదు; ఈ+కన్యకన్= ఈ కన్నెను; ఏము= మేము; ఏవురము= ఐదుగురం; వివాహంబు+అయ్యెదము= పెండ్లి చేసుకొంటాము; అస్మద్+మాతృ, నియోగంబు+ఇట్టిది+అ= మాతల్లి ఆజ్ఞ ఇట్టిదై ఉన్నది; అది= ఆ ఆజ్ఞ; మాకున్= మాకు; అలంఘనీయంబు= దాటరానిది; అనినన్= అని తెల్పగా; విని= ఆలకించి; విస్మితుండు+ఐ= ఆశ్చర్యపడినవా డై; ద్రుపదుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నేనే కాదు. ఈ కన్యను మే మైదుగురం వివాహం చేసికొంటాము. ఇదే మా తల్లి ఆజ్ఞ. అది మాకు దాటరానిది' అనగా విని ద్రుపదుడు ఆశ్చర్యపడి ఇట్లా అన్నాడు.

క. ఒక్క పురుషునకు భార్యలు। పెక్కం డ్రగు టెందుఁ గలదు; పెక్కండ్రకు నా
లొక్కత యగు టే యుగముల। నెక్కథలను వినియు నెఱుఁగ మెవ్వరివలనన్. 244

ప్రతిపదార్థం: ఒక్క, పురుషునకున్; భార్యలు; పెక్కండ్రు= అనేకులు; అగుట= కావటం; ఎందున్= ఎక్కడ; కలదు= ఉన్నది; పెక్కండ్రకున్= పలువురికి; ఆలు= భార్య, ఒక్కతి+అ= ఒక్కతయే; అగుట= కావటం; ఏయుగములన్, ఏ+కథలను, ఎవ్వరి వలనన్, వినియున్, ఎఱుంగము= ఏ యుగాలలో, ఏ కథలలో, ఎవరివల్ల వినికూడా తెలియము,

తాత్పర్యం: ఒక్కమగవానికి పెక్కుమంది భార్య లుండటం ఎక్కడైనా ఉన్నది. కాని పెక్కుమంది మగవాళ్ళకి ఒక్కతే భార్యకావటం ఏ యుగాలలోను, ఏ కథలలోను, ఎవ్వరివలనా విని ఎరుగం.

వ. 'నీవు లౌకిక వైదిక ధర్మస్వరూప విదుండవు ధర్మాత్మజుండవు; నీ పలుకులు ధర్మవిరుద్ధంబులు నా నోడుదు; మయినను లోకంబున నిది యశ్రుతపూర్వంబు; దీని నింక నీవును నేనును గుంతీదేవియును ధృష్టద్యుమ్నుండును విచారించి యెల్లి నిశ్చయింత' మని. 245

ప్రతిపదార్థం: నీవు; లౌకిక, వైదిక, ధర్మ, స్వరూప, విదుండవు= లోకసంబంధమైన, వేదసంబంధమైన, ధర్మస్వరూపాన్ని తెలిసిన వాడవు; ధర్మ+ఆత్మజుండవు= ధర్మదేవతయొక్క కుమారుడవు; నీ పలుకులు; ధర్మ, విరుద్ధంబులు= ధర్మానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యతిరేకమైనవి; నాన్= అని అనటానికి; ఒడుదుము= భయపడతాము; అయినను; లోకంబునన్= లోకంలో; ఇది, అశ్రుత, పూర్వంబు= మున్నెన్నడు వినబడనట్టిది; దీనిన్= దీన్ని; ఇంక= ఇంకనూ; నీవును= నీవు; నేనును= నేను; కుంతీదేవియును= కుంతీదేవి; ధృష్టద్యుమ్నుండును; విచారించి= ఆలోచించి; ఎల్లి= రేపు; నిశ్చయించుదము= నిర్ణయిద్దాం; అని.

తాత్పర్యం: 'నీవు లోక సంబంధమైన, వేదసంబంధమైన ధర్మస్వరూపం తెలిసినవాడవు, ధర్ముని కుమారుడవు. నీ మాటలు ధర్మవిరుద్ధా లని అనటానికి వెనుకాడుతాము. అయినా ఇది లోకంలో ముం దెన్నడు విననట్టిది. దీనిని గురించి నీవు, నేను, కుంతీదేవి, ధృష్టద్యుమ్నుడు మరింత ఆలోచించి రేపు నిర్ణయిద్దాం' అని.

వ్యాసమహాముని ద్రుపదునియొద్దకు వచ్చుట (సం.1-186-38)

ఉ. ఈహితకార్యసిద్ధి యిది యెట్లొకో తా సమకూరు నంచు సం
దేహముఁ బొంది సోమక యుధిష్ఠిరు లున్నఁ, దదీయధర్మసం
దేహనివృత్తిపొంటెఁ జనుదెంచెఁ బరాశరసూనుఁ డాత్మతే
జోహృతసూర్యతేజుఁ డగుచున్ దిశలెల్ల వెలుంగుచుండఁగన్. 246

ప్రతిపదార్థం: ఈహిత, కార్యసిద్ధి= కోరుకొన్న కార్యం నెఱవేరటం; ఇది; ఎట్లు+ఒకొ= ఇది ఏ విధంగా; తా= తాను; సమకూరున్= నెఱవేరుతుంది; అనుచున్; సందేహమున్; పొంది; సోమక, యుధిష్ఠిరులు= ద్రుపద, ధర్మజులు; ఉన్నన్= ఉండగా; తదీయ, ధర్మ,సందేహ, నివృత్తిపొంటెన్= వాళ్ళయొక్క ధర్మసందేహాన్ని నివారించటంకొఱకు; పరాశర, సూనుఁడు= పరాశరుని కుమారు డైన వ్యాసుడు; ఆత్మ, తేజోహృత, సూర్యతేజుఁడు= తన తేజస్సుచేత అణచబడిన సూర్యతేజస్సు కలవాడు; అగుచున్= అవుతూ; దిశలు+ఎల్లన్, వెలుంగుచుండఁగన్= దిక్కులు అన్నీ వెలుగుతూ ఉండగా; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: కోరుకొన్న కార్యం నెరవేరటం ఎట్లా అని ద్రుపద ధర్మజులు సందేహపడుతూ ఉండగా, వాళ్ళ ధర్మ సందేహాన్ని నివారించటానికై వ్యాసమహాముని - సూర్యతేజస్సును అణచే తన తేజస్సుతో దిక్కులన్నీ వెలుగుతుండగా అక్కడికి వచ్చాడు.

విశేషం: అలం: ఉపమ. కొఱకు - అనే అర్థంలో నన్నయనా డున్న 'పొంటెన్' అనే చతుర్థీవిభక్తిప్రత్యయం ఈనాటి తెలుగుభాషలో లేదు.

వ. ఇట్లు వచ్చిన కృష్ణద్వైపాయనునకుఁ గుంతీదేవియుఁ బాండవులును బాంచాలుండు నతిభక్తి మ్రొక్కి యమ్మహామునిం గాంచనమణిమయోచ్చాసనంబున నునిచి యర్ఘ్యపాద్యాదివిధులం బూజించి యున్న వారల కుశలం బడిగి హిత మధురసత్యసంభాషణామృతరసప్రవాహసందోహంబున నందఱం బరమానందహృదయులం జేసియున్న యమ్మునీంద్రునకు ముకుళితకరకమలుండయి ద్రుపదుం డి ట్లనియె. 247

ప్రతిపదార్థం: ఇట్లు; వచ్చిన; కృష్ణద్వైపాయనునకున్= వ్యాసునికి; కుంతీదేవియున్; పాండవులును; పాంచాలుండున్= ద్రుపదుడును; అతి=మిక్కిలి; భక్తిన్= భక్తితో; మ్రొక్కి; ఆ+మహామునిన్= ఆమహర్షిని; కాంచన, మణిమయ+ ఉచ్చ+ ఆసనంబునన్= బంగారుతో, మణులతో చేయబడిన ఎత్తైన ఆసనంమీద; ఉనిచి= కూర్చుండబెట్టి; అర్ఘ్య, పాద్య+ఆది,

విధులన్= అర్ఘ్యం, పాద్యం మొదలైన పూజాపద్ధతులచేత; పూజించి= సేవించి; ఉన్నన్= ఉండగా; వారల= వాళ్ల; కుశలంబు= క్షేమాన్ని; అడిగి= అడిగి; హిత, మధుర, సత్య, సంభాషణ+అమృత, రస, ప్రవాహ, సందోహంబునన్= మేలు చేయునది, మనస్సుకు హాయి కొలుపునది, సత్యమైనది అయిన సంభాషణ మనెడి అమృతరస ప్రవాహాల సమూహాలచేత; అందఱన్= అందరినీ; పరమ+ఆనంద, హృదయులన్= మిక్కిలి ఆనందించిన మనస్సులు కలవాళ్ళనుగా; చేసి= కావించి; ఉన్న= ఉండు; ఆ+మునీంద్రునకున్= ఆ మునిశ్రేష్ఠునికి; ముకుళిత, కర, కమలుండు+అయి= ముడిచిన కమలములవంటి చేతులు కలవాడై; ద్రుపదుండు= ద్రుపదమహారాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా వచ్చిన వేదవ్యాసునికి కుంతీదేవి, పాండవులు, ద్రుపదుడు మిక్కిలి భక్తితో నమస్కరించారు. బంగారుతో, మణులతో చేసిన ఎత్తైన ఆసనంమీద ఆ మహామునిని కూర్చుండబెట్టారు. అర్ఘ్యపాద్యాదు లిచ్చి పూజించారు. ఆ మహాముని వాళ్ళను కుశల మడిగి, మనస్సుకు హాయి కలిగించే, సత్య సంభాషణ అనే అమృతరససమూహంలో అందరు పరమానందహృదయు లయ్యేటట్లు చేశాడు. అప్పుడు ద్రుపదుడు తనకరకమలాలను జోడించి నమస్కరిస్తూ ఇట్లా అన్నాడు.

క. తన పలుకు లోక మెల్లను । గొనియాడఁగఁ దగిన లోకగురుఁ డీ యమనం
దనుఁ డే మేవురమును నీ । తనుమధ్య వివాహ మయ్యెదము నని పలికెన్. 248

ప్రతిపదార్థం: తన పలుకు= తనమాట; లోకము+ఎల్లను= లోకం అంతా; కొనియాడఁగన్= మెచ్చుటకు; తగిన= యోగ్యుడైన; లోకగురుఁడు= లోకానికి ఆచార్యుడు; ఈ, యమనందనుఁడు= ఈ ధర్మరాజు; ఏము= మేము; ఏవురమును= ఐదుగురమును; ఈ, తనుమధ్యన్= ఈ సన్నని నడుము కల దానిని - ద్రౌపదిని; వివాహము= పెండ్లి; అయ్యెదము= చేసుకుంటాము; అని, పలికెన్.

తాత్పర్యం: లోకమంతా మెచ్చుకొనదగిన మాట కలవాడు, లోకగురుడు అయిన ఈ ధర్మరాజు 'మే మైదుగురమూ ఈ ద్రౌపదిని వివాహం చేసికొంటాము' అని అన్నాడు.

క. మీ రెఱుఁగనట్టి లోకా । చారము గలదయ్య? తొల్లి చన్న మహాత్ముల్
ధీరమతు లిట్లు సేసిన । వా రెవ్వరుఁ గలరె యాప్తవచనానుమతిన్. 249

ప్రతిపదార్థం: మీరు; ఎఱుఁగని అట్టి= తెలియనటువంటి; లోక+ఆచారము కలదయ్య?;= లోకాచారం ఉన్నదా? తొల్లి= పూర్వం; చన్న= గతించిన; మహాత్ముల్= పెద్దలు; ధీర, మతులు= గొప్పబుద్ధి కలవారు; ఆప్త, వచన+అనుమతిన్= పెద్దల మాట సమ్మతిచేత; ఇట్లు= ఈ విధంగా; చేసినవారు; ఎవ్వరున్= ఎవరైనా; కలరె?= ఉన్నారా!

తాత్పర్యం: మీకు తెలియని లోకాచారం లేదు. పూర్వం గతించిన మహాత్ములు, ధీరమతులు ఎవరైనా పెద్దల సమ్మతితో ఇట్లా చేసినవారు ఉన్నారా?

క. విమలమతి యన్యులకు విష । యమె ధర్మాధర్మనిర్ణయము సేయఁగ ది
వ్యమునీంద్ర । దీని సువిచా । రము సేయుము ధర్మసంకరము గాకుండన్. 250

ప్రతిపదార్థం: దివ్య, ముని+ఇంద్ర=మునీంద్రా; విమలమతి= నిర్మలమైన బుద్ధి కలవాడా!; ధర్మ+అధర్మ, నిర్ణయము= ధర్మా ధర్మములను గూర్చిన నిర్ణయం; చేయఁగన్= చేయటానికి; అన్యులకున్= ఇతరులకు; విషయమె= సాధ్యమా?; ధర్మ, సంకరము= ఇది ధర్మం, ఇది కాదు అని తెలియని సంకటస్థితి; కాక, ఉండన్= ఏర్పడకుండ ఉండేటట్లు; దీనిన్= దీన్ని; సువిచారము= చక్కని విమర్శ; చేయుము.

తాత్పర్యం: దివ్యమునీంద్రా! నిర్మలమైన బుద్ధి కలవాడా! ధర్మాధర్మనిర్ణయం చేయటం ఇతరు లెవ్వరికీ సాధ్యం కాదు. ధర్మసంకరం ఏర్పడకుండా మీరే దీనిని ఆలోచించండి.

విశేషం: ద్రుపదుడు వ్యాసునితో ఇట్లా అనటం ధర్మరాజు ధార్మికతను శంకించి కాదు, చిన్నచూపు చూచీ కాదు, విచిత్రము, అసహజము, అశ్రుతపూర్వము అయిన ఆచారాన్ని జీర్ణించుకోలేక. ధర్మరాజు ధార్మికతను ముందే మనసారా అంగీకరించాడు ద్రుపదుడు. (చూ.ప.245) కాని ధర్మరాజు చెప్పేది - ఏ ఆడపిల్ల తండ్రి అయినా అన్నివిధాల ఆలోచించి, మనః స్ఫూర్తిగా చేయవలసిన పని. అంతేకాదు - ధార్మికదృష్టితో చూస్తే, ఇది సామాన్యమైన విషయం కాదు. లోకధర్మానికి, వ్యక్తి ధర్మానికి ఏర్పడిన సంఘర్షణ. అందువలన ఈ విషయంలో సువిచారం చాలా అవసరం. అందుకే ద్రుపదుడు ధర్మజుని ధార్మికతమీద ఎంతగౌరవం ఉన్నా త్వరపడి నిర్ణయం తీసికొనక, నీవూ, నేనూ, కుంతీదేవీ, ధృష్టద్యుమ్నుడూ విచారించి రేపు నిర్ణయిద్దాం' అన్నాడు. ఇంతలో అర్థించకుండానే విజ్ఞానసంపద్విఖ్యాతుడు, సంయమిప్రకరసంభావ్యానుభావుడు వేదవ్యాస మహామునీంద్రుడు వచ్చాడు. ద్రుపదుడు తన మనస్సును ఊగిసలాడించే అనుమానాన్ని ఆయన ముందుంచాడు. అంతే.

వ. అనిన నా ద్రుపదునకుఁ గృష్ణద్వైపాయను సమక్షంబున ధర్మజుం డి ట్లనియె. 251

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ, ద్రుపదునకున్= ఆ ద్రుపదునికి; కృష్ణద్వైపాయను, సమక్షంబునన్= వ్యాసుని ఎదుట; ధర్మజుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అనగా ఆ ద్రుపదునితో వ్యాసునిఎదుట ధర్మరాజు ఈ విధంగా పలికాడు.

చ. నగియును బొంకునందు వచనంబు, నధర్మువునందుఁ జిత్తముం
దగులదు నాకు నెన్నఁడును; ధర్ము వవశ్యము; నట్ల కావునన్
వగవక మాకు నేవురకు వారిజలోచనఁ గృష్ణ నీఁ దగుం
దగ దను నీ విచారములు దక్కి వివాహ మొనర్పు మొప్పఁగన్. 252

ప్రతిపదార్థం: నగియును= నవ్వులాట కైనా; బొంకునందు= అసత్యమునందు; వచనంబున్= మాటా; అధర్మువు నందున్= అధర్మమునందు; చిత్తమున్= మనస్సు; నాకున్= నాకు; ఎన్నడును= ఎప్పుడుకానీ; తగులదు= తగులుకోదు; అవశ్యమున్= తప్పక; ధర్మువు= ధర్మము; అట్లు+అ= అట్లే; కావునన్; వగవక= విచారించక; మాకున్; ఏవురకున్= ఐదుగురకు; వారిజ, లోచనన్= పద్మముల వంటి కన్నులు కలదానిని; కృష్ణన్= ద్రౌపదిని; ఈన్+తగున్= ఈయతగును; తగదు+అను= ఈయతగదు అనే; నీ, విచారములు= నీ ఆలోచనలు; తక్కి= మాని; ఒప్పుఁగన్= చక్కగా; వివాహము+ ఒనర్పుము= పెండ్లి చేయుము.

తాత్పర్యం: నవ్వులాటకైనా నా మాట అసత్యంలో, నా మనస్సు అధర్మంలో ఎన్నడూ తగులుకొనదు. ధర్మం ఆ విధంగానే ఉన్నది. అందువలన పద్మాలవంటి కన్నులు కల ద్రౌపదిని 'ఇవ్వదగును, ఇవ్వకూడదు' అని ఆలోచించడం మానుకొని, బాధపడకుండా, మా ఐదుగురికి ఇచ్చి వివాహం జరిపించుము.

వ. మఱియుం దొల్లి గౌతమి యయిన జటిల యను ఋషికూఁతురు తపఃప్రభావంబున నేడ్వురు ఋషులకు నొక్కతియ భార్య యయ్యె ననియును, దాక్షాయణి యను మునికన్యక యేకనామంబునఁ బ్రచేతసు లనంబరఁగిన పదుండ్రకు నొక్కతియ భార్యయయ్యె ననియును గథల వినంబడు; మఱి యట్లుం గాక. 253

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; తొల్లి= పూర్వం, గౌతమి+అయిన= గౌతముని వంశంలో పుట్టిన దైన; జటిల; అను; ఋషి, కూఁతురు= ఋషి కుమార్తె; తపస్+ప్రభావంబునన్= తపస్సు యొక్క ప్రభావంచేత; ఏడ్వురు= ఏడుగురు; ఋషులకున్; ఒక్కతియ= ఒక్కతె; భార్య, అయ్యెన్= భార్య అయింది; అనియును; దాక్షాయణి, అను= దాక్షాయణి అనే; మునికన్యక= మునికన్య; ఏక, నామంబునన్= ఒకే పేరున; ప్రచేతసులు; అనన్= అనగా; పరఁగిన= ఒప్పిన; పదుండ్రకున్= పదిమందికి; ఒక్కతియ= ఒక్కతె; భార్య= భార్య; అయ్యెన్+అనియును= భార్య అయింది అనికూడా; కథలన్= కథలలో; వినంబడున్= వినబడుతూ ఉంది; మఱి; అట్లున్+కాక= ఇక ఆ విధంగానే కాక.

తాత్పర్యం: అంతేగాక పూర్వం గౌతమునివంశంలో పుట్టిన జటిల అనే ఋషికూతురు తన తపఃప్రభావం చేత ఏడుగురు ఋషులకు ఒక్కతే భార్య అయిం దనీ, దాక్షాయణి అనే మునికన్యక ఒకే పేరుతో ప్రచేతసు లనబడే పదిమందికీ భార్య అయిం దనీ కథలలో వినబడుతూ ఉన్నది. అంతేకాక ఇంకా.

విశేషం: 'గౌతమి యయిన జటిల యను ఋషి కూతురు' అనే దానికి బదులు 'గౌతముం డయిన జటిలుం డను ఋషి కూతురు' అని కొన్ని ప్రతులలో పాఠాంతరం ఉన్నది.

ఆ. 'గురులలోనఁ బరమగురువు దల్లియ; యట్టి । తల్లి వచనమును, విధాతృకృతము
నన్యథాకరింప నలవియే?' యనిన నం । దొఱకు నిట్టు లనియె ద్రుపదవిభుఁడు. 254

ప్రతిపదార్థం: గురులలోనన్= గురువులలో; తల్లి+అ= తల్లియే; పరమ, గురువు= శ్రేష్ఠమైన గురువు; అట్టి= అటువంటి; తల్లి, వచనమును= తల్లిమాటను; విధాతృ, కృతమున్= బ్రహ్మదేవునిచేత చేయబడినదానిని; అన్యథాకరింపన్= వేరుగా చేయటం; అలవియే= సాధ్యమా?; అనినన్; ద్రుపద విభుఁడు= ద్రుపదరాజు; అందొఱకున్= అందరికి; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: గురువులలో తల్లి ఉత్తమగురువు. అటువంటి తల్లిమాటను, బ్రహ్మ చేసిన పనిని మార్పుచేయటం సాధ్యమా? అని ధర్మజుడు పల్కగా, అందరితో ద్రుపదరాజు ఇట్లా అన్నాడు.

విశేషం: యువకుడైన ధర్మరాజు - వయోవృద్ధు, జ్ఞానవృద్ధు, మహాతపస్వి, అన్నింటిని మించి తమ శ్రేయోభిలాషి అయిన వ్యాసుని ముందు తన మాటను తాను సమర్థించుకొన్నాడు. తాను చెప్పిన దానికి కొన్ని ఉదాహరణలుకూడా చూపాడు.

వ. 'ధర్మసూక్ష్మత నిర్ణయింప మన కశక్యంబు; త్రిలోకవంద్యుండు త్రికాలప్రవర్తనవిజ్ఞాననిధి యీ కృష్ణద్వైపాయనుండు విచారించి యెద్ది యాన తిచ్చె నదియ యిప్పుడు కర్తవ్యం' బనిన విని యమ్మునివరుండు ద్రుపదునకి ట్లనియె. 255

ప్రతిపదార్థం: ధర్మ, సూక్ష్మత= ధర్మంలోని రహస్యాన్ని; నిర్ణయింపన్= నిర్ణయించడానికి; మనకున్; అశక్యంబు= అసాధ్యం; త్రిలోక, వంద్యుండు= మూడులోకాలచే నమస్కరింప తగినవాడు; త్రికాల, ప్రవర్తన, విజ్ఞాన నిధి= మూడులోకాలలో ప్రవర్తిల్లే

విజ్ఞానానికి నిధి అయినవాడు; ఈ, కృష్ణద్వైపాయనుండు= ఈ వేదవ్యాసుడే; విచారించి= ఆలోచించి; ఎద్ది= ఏది; ఆనతి+ఇచ్చెన్= ఆజ్ఞాపిస్తాడో; అదియ= అదే; ఇప్పుడు= ఇపుడు; కర్తవ్యంబు= చేయదగినది; అనినన్= అని అనగా; విని; ఆ+మునివరుండు= ఆ మునిశ్రేష్ఠుడు - వ్యాసుడు; ద్రుపదునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ధర్మసూక్ష్మాన్ని నిర్ణయించటం మనకు సాధ్యం కాదు. ముల్లోకాలచే నమస్కరింప దగినవాడు, మూడులోకాల్లో ప్రవర్తిల్లే విజ్ఞానానికి నిధి అయిన ఈ వేదవ్యాసుడు ఆలోచించి ఏది ఆజ్ఞాపిస్తే, అదే ఇప్పుడు చేయదగింది' అని పల్కగా విని, ఆ మునిశ్రేష్ఠుడు ద్రుపదునితో ఇట్లా అన్నాడు.

విశేషం: సంశయగ్రస్తుడైన ద్రుపదుడు ఒకవైపు, నిశ్చితధర్మబుద్ధి అయిన ధర్మరాజు మరొకవైపు తమతమ వాదాలను పేర్కొన్న తరువాత, ద్రుపదుడు నిర్ణయాధికారాన్ని వ్యాసమహామునికి అప్పగించాడు. ఇక వ్యాసుడు చెప్పిందే ధర్మం,తీర్పు.

సీ. 'ధర్మతత్త్వజ్ఞుఁ డీ ధర్మతనూజుండు । ధర్మమార్గం బేల తప్పఁబలుకు?
దేవతామూర్తి యిద్దేవి మాధవి యేల । తా నెఱుంగక యనృతంబు పలుకు?
వీరల పలుకులు వేల్పుల మతమును । నొక్కండ కావున నొండు దక్కి
యీ యేవురకుఁ గూఁతు నిచ్చి వివాహంబుఁ । గావింపు; మఱి దీని కల తెఱంగు.

ఆ. వినఁగ నిష్టమేని విను 'మని ద్రుపదు చే । యూఁది యింటిలోని కొనర నరిగి.
తాను నతఁడు నేకతమ యుండి, వాని కం । తయును జెప్పఁదొడఁగె ధర్మవిదుఁడు. 256

ప్రతిపదార్థం: ధర్మ, తత్త్వజ్ఞుఁడు= ధర్మతత్త్వమును తెలిసినవాడు; ఈ, ధర్మతనూజుండు= ఈ ధర్మరాజు; ఏల=ఎందుకు; ధర్మమార్గంబు; తప్పన్= తప్పునట్లుగా; పలుకున్= మాటాడుతాడు; దేవతా, మూర్తి= దేవతామూర్తి అయిన; మాధవి= కుంతి; ఏల= ఎందుకు; తాన్= తాను; ఎఱుంగక= తెలియక; అనృతంబు= అసత్యం; పలుకున్= మాట్లాడుతుంది; వీరల, పలుకులు; వేల్పుల, మతమునన్= దేవతల అభిప్రాయం కూడ; ఒక్కండు+అ= ఒకటే; కావునన్; ఒండు= ఇతర విచారము; తక్కి= మాని; ఈ, ఏవురకున్= ఈ ఐదుగురుకి; కూతున్+ఇచ్చి; వివాహంబున్, కావింపు= పెండ్లి చేయవలసింది; మఱి= ఇక; దీని= దీనియొక్క; కలతెఱంగు= యథార్థము; వినఁగన్= వినటానికి; ఇష్టము+ఏని= ఇష్టమైతే; వినుము+అని= విను అని; ద్రుపదు, చేయి= ద్రుపదునియొక్క చేతిని; ఊఁది= పట్టుకొని; ఇంటిలోనికి; ఒనరన్= ఒప్పుగా; అరిగి= వెళ్ళి; తానున్= తాను (వ్యాసుడు); అతఁడున్= అతడు అనగా ద్రుపదుడు; ఏకతము+అ= ఒంటరిగా; ఉండి; వానికిన్, అంతయును= ఆ ద్రుపదునికి అంతా; ధర్మవిదుఁడు= ధర్మము నెఱింగిన వ్యాసుడు; చెప్పన్+తొడఁగెన్= చెప్పటానికి ప్రారంభించాడు.

తాత్పర్యం: 'ఈ ధర్మరాజు ధర్మతత్త్వం తెలిసినవాడు. ధర్మమార్గం తప్పి ఎందుకు మాట్లాడుతాడు? దేవతామూర్తి అయిన ఈ కుంతీదేవి తెలియక ఎందుకు అసత్యం పలుకుతుంది? వీళ్ళమాటలు, దేవతల అభిప్రాయం ఒక్కటే. అందువలన వేరే ఆలోచన మాని, ఈ ఐదుగురికి నీ కుమార్తె నిచ్చి వివాహం చెయ్యి. దీని యథార్థస్థితి వినటం నీ కిష్టమైతే వినుము' అని ద్రుపదుని చేయి పట్టుకొని ఇంటిలోపలికి పిలిచికొని వెళ్ళి, ధర్మం' తెలిసిన వ్యాసుడు ఏకాంతంగా అతనికి విషయమంతా చెప్ప నారంభించాడు.

విశేషం: కుంతీధర్మజుల అభిప్రాయాలూ, దేవతల అభిప్రాయాలూ ఒకటే అని వేదవ్యాసుడు చెప్పాడు. లౌకికు లైన వీళ్ళు మాటలలో దేవతల సంకల్పాలు ఎట్లా ప్రతిఫలిస్తున్నాయో వివరించటమే వ్యాసుడు చేయవలసిన పని. అది దేవరహస్యం.

అందువలననే ఆ ఏకాంతసంభాషణ, ఆ దివ్యదృష్టిప్రసాదం. వీటి అవసరం లేకుండానే విషయాన్ని గ్రహించిన దార్శనికుడు ధర్మజుడు. ప్రత్యక్ష ప్రమాణంతో అనుమానం తీర్చుకొన్నవాడు ద్రుపదుడు. మాధవి= కుంతి; యదువంశంలో మధుడనేవాడు ఒక ప్రసిద్ధుడు. అతని వంశంలో జన్మించింది కనుక కుంతికి మాధవి అనే పేరు వచ్చింది.

ద్రుపదునకు వేదవ్యాసుండు ఇంద్రసేనయను పతివ్రతకథ సెప్పుట (సం.1-100-60)

వ. ఇది తొల్లి నాలాయని యైన యింద్రసేన యనంబరఁగిన పరమ పతివ్రత; మౌద్గల్యుం డను మహామునికి భార్య యయి, కర్మవశంబున నమ్మునిం గుష్ఠవ్యాధిబాధితత్వగస్థిభూతకష్టశరీరు వయోవృద్ధు వలిపలితధరు దుర్గంధవదను దుఃఖజీవు నతికోపను విశీర్యమాణనఖత్వచుం బరమభక్తి నారాధించి తదుచ్ఛిష్టంబు కుడుచుచున్న నొక్కనాఁడు. 257

ప్రతిపదార్థం: ఇది= ఈమె; తొల్లి= పూర్వం; నాలాయని+ఐన; నలునికుమార్తెఐన; ఇంద్రసేన; అనన్= అనుపేరుతో; పరఁగిన= ఒప్పిన; పరమ, పతివ్రత= మహా పతివ్రత; మౌద్గల్యుండు+అను; మహా, మునికి; భార్య; అయి; కర్మవశంబునన్= చేసినకర్మ కారణంగా; కుష్ఠ, వ్యాధి, బాధిత, త్వక్+అస్థి, భూత, కష్ట, శరీరున్= కుష్ఠరోగంచేత బాధింపబడిన దై చర్మం ఎముకలు మాత్రమే అయి బాధతో కూడిన శరీరం కలవాడిని; వయోవృద్ధున్= వయస్సుచేత వృద్ధుడైనవాడిని; వలి, పలితధరున్= కడుపుమీద ముడుతలు కల వాడిని, నెఱసిన వెంద్రుకలను ధరించినవాడిని; దుర్గంధ, వదనున్= చెడువాసనతో కూడుకొన్న ముఖం కలవాడిని; దుఃఖజీవున్= దుఃఖంతో జీవించేవాడిని; అతి, కోపనున్= మిక్కిలి కోపం కలవాడిని; విశీర్యమాణ, నఖ, త్వచున్= ఊడిపోతున్న గోళ్ళు, చర్మం కలవాడిని; ఆ+మునిన్= అగు ఆ మునిని; పరమ, భక్తిన్= మిక్కిలి భక్తితో; ఆరాధించి= సేవించి; తత్+ ఉచ్ఛిష్టంబు= అతని ఎంగిలి-అనగా అతడు తినగా మిగిలింది; కుడుచుచున్= తింటూ; ఉన్నన్= ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజు.

తాత్పర్యం: ఈమె పూర్వం నలుని కుమార్తెఐన ఇంద్రసేన అనే పరమపతివ్రత. ఈమె మౌద్గల్యుడు అనే మహామునికి భార్య అయింది. అతడు ముసలివాడు; కుష్ఠరోగ పీడితుడై చర్మం ఎముకలు మాత్రమే మిగిలినవాడు. బాధతో కూడిన శరీరం కలవాడు. కడుపుమీద చర్మపుముడుతలు కలవాడు, నెరసిన వెంద్రుకలు ఉన్నవాడు. దుర్వాసనతో కూడినముఖం కలవాడు. దుఃఖంతో జీవించేవాడు, మిక్కిలికోపం కలవాడు, ఊడిపోతున్న గోళ్లు, చర్మం కలవాడు, అటువంటి ఆ మునిని ఆమె కర్మవశంతో, పరమభక్తితో సేవించింది. ఒకనాడు అతడు తిని విడిచినయెంగిలిఅన్నం తింటూ ఉండగా-ఒకరోజు

విశేషం: ఈ నాలాయన్యుపాఖ్యానం భండార్కర్ ప్రతి, నీలకంఠప్రతి, వావిళ్ల ప్రతి మొదలైన సంస్కృతభారతప్రతులలో మూలగ్రంథ భాగంలో లేదు. నీలకంఠీయవ్యాఖ్యలో మాత్రం దీనిప్రశంస ఉన్నది. అందులో దీనికి 'నారాయణ్యుపాఖ్యానం' అనే పేరు కనిపిస్తున్నది.

తే. కుడుచునెడ వాని పెనువ్రేలు కూటిలోనఁ । దునిసి పడియున్న వ్రేల్ వుచ్చి తోయజాక్షి
యేవగింపక యుచ్ఛిష్ట మిష్టలీలఁ । దగిలి కుడుచుచున్నంత నత్తరుణిఁ జూచి. 258

ప్రతిపదార్థం: కుడుచు, ఎడన్= తినునప్పుడు; వాని= ఆ మునియొక్క; పెను, వ్రేలు= పెద్దవ్రేలు; కూటిలోన్= అన్నములో; తునిసి= తునిగి; పడి, ఉన్నన్= పడిఉండగా; తోయజాక్షి= నీటినుండి పుట్టిన కమలాలవంటి కన్నులు కల ఆ ఇంద్రసేన;

వ్రేల్= వ్రేలిని; పుచ్చి= తీసివేసి; ఏవగింపక= అసహ్యపడకుండ; ఉచ్ఛిష్టము= ఎంగిలి అన్నాన్ని; ఇష్ట, లీలన్= ఇష్టమైన పద్ధతిగా, సంతోషంగా; తగిలి= ఆసక్తితో; కుడుచుచున్= తినుచు; ఉన్నంతన్= ఉన్నప్పుడు; ఆ+తరుణిన్= ఆ కాంతను; చూచి.

తాత్పర్యం: తింటూ ఉండగా, అతని బొటనవ్రేలు తునిగి అన్నంలో పడి ఉండటం చూచి, పద్మాలవంటి కన్నులు కల ఆ ఇంద్రసేన ఆ వ్రేలిని తీసివేసి, అసహ్యపడక ఆ ఎంగిలి అన్నాన్ని మిక్కిలి ప్రీతితో తినసాగింది. అప్పుడామెను చూచి.

వ. దానిదయిన పతిభక్తి గుణంబునకు మెచ్చి మౌద్గల్యుండు ప్రసన్నుం డయి 'నీ కెద్ది యిష్టంబు వేఁడు మిచ్చెద' ననిన నది యి ట్లనియె; 'మునీంద్రా! నాకుం గామోపభోగేచ్ఛ పెద్ద గలదు; నీవునుం దపశ్శక్తిఁ గామరూప ధరుండ వయి యీ బీభత్సంబగు రూపం బుడిగి, మనోహరం బయిన రూపంబునం బంచధా విభక్తుండవయి నన్ను రమియించి కామభోగంబులం దనుపు' మనిన దాని కిష్టంబైనవిధంబున నేను దేహంబులు దాల్చి మర్త్య దేవలోకంబులయందు బ్రహ్మర్షిదేవర్షిపూజితుం డై సూర్యరథం బెక్కి చని యాకాశగంగాజలంబుల నాప్లుతదేహుం డయి శీతాంశునంశు జాలంబుల వసియించి మేరుకైలాసంబులయందుఁ గ్రీడించుచు ననేకస్థానంబుల ననేక సహస్రవర్షంబులు నాలాయని యైన యింద్రసేన నుపభోగించి తృప్తుం డై, మౌద్గల్యుండు దాని విడిచి ఘోరతపంబు సేసి బ్రహ్మమయుం డై బ్రహ్మలోకంబునకుఁ జనిన; నది కామభోగములందుఁ దనియక కాలవశంబున శరీరము విడిచి కాశిరా జను రాజర్షికిం బుట్టి పెరుగుచుం గన్యాత్వమునఁ బెద్దకాలం బుండి తన దౌర్భాగ్యమునకు నిర్వేదించి, పతిం గోరి పశుపతి నుద్దేశించి యుగ్రతపంబు సేయుచున్నంత. 259

ప్రతిపదార్థం: దానిది+అయిన= ఆమెకు సంబంధించినదైన; పతిభక్తి, గుణంబునకున్= పతిభక్తి గుణానికి; మెచ్చి= కొనియాడి; మౌద్గల్యుండు; ప్రసన్నుండు+అయి= దయతలచినవా డై; నీకున్; ఎద్ది, ఇష్టంబో= ఏది ఇష్టమో; వేడుము= కోరుకో; ఇచ్చెదన్= ఇస్తాను; అనినన్= అని అనగా; అది; ఇట్లు+అనియెన్; ముని+ఇంద్ర= మునిశ్రేష్ఠా; నాకున్= నాకు; కామ+ఉపభోగ+ ఇచ్ఛ= కామాన్ని అనుభవించటంలో కోరిక; పెద్ద, కలదు= మిక్కిలి ఉన్నది; నీవునున్= నీవుకూడా; తపః+శక్తిన్, కామరూప, ధరుండవు+అయి= ఇష్టమైన రూపాన్ని ధరించినవాడవై; ఈ, బీభత్సంబు+అగు= ఈ అసహ్యమైన; రూపంబు= రూపాన్ని; ఉడిగి= మాని; మనోహరంబు+అయిన, రూపంబునన్= అందమైన రూపంలో; పంచధా, విభక్తుండవు+అయి= ఐదు విధాలుగా విభాగం పొందిన వాడవై; నన్నున్; రమియించి; కామ భోగంబులన్; తనుపుము= తృప్తిపొందింపుము; అనినన్= అనిఅనగా; ఆ+ముని; దానికిన్, ఇష్టంబు+ఐన= ఆమెకు ఇష్టమైన; విధంబునన్= విధంగా; ఏను= ఐదు; దేహంబులు= శరీరాలు; తాల్చి= ధరించి; మర్త్య, దేవ, లోకంబుల, అందున్= మనుష్యలోకంలో; దేవలోకంలో; బ్రహ్మర్షి, దేవర్షి, పూజితుండు+ఐ= బ్రహ్మర్షులచేత, దేవర్షులచేత పూజింపబడినవాడై; సూర్య, రథంబు+ఎక్కి= సూర్యుని రథంఎక్కి; చని= వెళ్ళి; ఆకాశ, గంగా, జలంబులన్= ఆకాశగంగలోని నీళ్లతో; ఆప్లుతదేహుండు+అయి= తడిసిన శరీరం కలిగినవాడయి అంటే స్నానం చేసినవాడయి; శీత+అంశున్+ అంశు, జాలంబుల= చల్లని కిరణాల గల చంద్రుని కిరణ సమూహాలలో; వసియించి= నివసించి; మేరు, కైలాసంబుల, అందున్= మేరువులో, కైలాసంలో; క్రీడించుచున్= క్రీడిస్తూ; అనేక, స్థానంబులన్= అనేక ప్రదేశాలలో; అనేక, సహస్ర, వర్షంబులు= ఎన్నో, వేల సంవత్సరాలు; నాలాయని, ఐన ఇంద్రసేనన్= నాలాయని అగు ఇంద్రసేనను; ఉపభోగించి= అనుభవించి; తృప్తుండు+ఐ= తృప్తి పొందినవా డై; మౌద్గల్యుండు, దాని; విడిచి= ఆమెను వదలి; ఘోర, తపంబు; చేసి= కఠోర తపస్సు గావించి; బ్రహ్మమయుండు+ఐ= బ్రహ్మత్వాన్ని పొందినవాడై; బ్రహ్మ, లోకంబునకున్; చనినన్= వెళ్ళగా; అది= ఇంద్రసేన; కామభోగంబులన్= ఇష్టభోగాలతో; తనియక= తృప్తిపొందక; కాలవశంబునన్= కాలవశాన; శరీరంబు= దేహము;

విడిచి; కాశిరాజు+అను; రాజ+ఋషికిన్= రాజర్షికి; పుట్టి; పెరుగుచున్= పెరుగుతూ; కన్యాత్వమునన్= కన్యగానే; పెద్దకాలంబు= చాలాకాలం; ఉండి; తన, దౌర్భాగ్యంబునకున్= తన యొక్క దురదృష్టానికి; నిర్వేదించి= నిరాశచెంది; పతిన్= భర్తను; కోరి; పశుపతిని, ఉద్దేశించి= శివుని గూర్చి; ఉగ్ర, తపంబు= భయంకరమైన తపస్సు; చేయుచున్+ఉన్నంతన్= చేస్తూఉండగా.

తాత్పర్యం: ఆమెపతిభక్తి గుణానికి మెచ్చి మౌద్గల్యుడు దయతో 'నీ కేది ఇష్టమో కోరుకో. ఇస్తాను' అన్నాడు. ఆమె 'మునీంద్రా! నాకు కామాన్ని అనుభవించాలన్న కోరిక మిక్కిలిగా ఉన్నది. నీవు తపశ్శక్తితో కోరిన రూపాన్ని ధరించి, ఈ అసహ్యమైన రూపాన్ని వదలి, మనోహరమైన రూపంతో ఐదు విభాగాలుగా విభాగం పొంది నాతో రమించు. కామభోగాలతో నన్ను తృప్తి పరచుము' అని కోరగా ఆ మహాముని ఆమెకు ఇష్టమైన విధంగా ఐదు దేహాలు ధరించాడు. మానవలోకంలో, దేవలోకంలో బ్రహ్మర్షులు, దేవర్షులు తనను పూజించగా, సూర్యరథాన్ని ఎక్కి, ఆకాశగంగలో స్నానం చేసి, చంద్రునికిరణసమూహంలో నివసించి, మేరుకైలాసపర్వతాలలో క్రీడిస్తూ ఎన్నో చోట్ల వేల సంవత్సరాలు నాలాయని అయిన ఇంద్రసేనను అనుభవించి తృప్తిపడ్డాడు. తరువాత ఆమెను విడిచి, గొప్పతపస్సు చేసి బ్రహ్మత్వాన్ని పొంది, బ్రహ్మలోకానికి వెళ్లాడు. కాని ఆమె ఆ కామభోగాలతో తృప్తిపడక కాలవశాన శరీరం వదలి, కాశిరాజు అనే రాజర్షికి పుత్రికగా జన్మించింది. కన్యగానే చాలాకాలం ఉండి, తనదౌర్భాగ్యానికి బాధపడి, భర్తకొరకు శివుణ్ణిగూర్చి భయంకరమైన తపస్సుచేస్తుండగా.

తే. దానికడకుఁ బ్రత్యేకంబ ధర్మవాయు । వాసవాశ్వినుల్ ప్రీతు లై వచ్చి దాని
నాత్మ దేహాంశజులకు దేహాంతరమునఁ । బత్నిగాఁ గోరి రధికసౌభాగ్యయుక్తి. 260

ప్రతిపదార్థం: దాని, కడకున్= దానిదగ్గరకు; ప్రత్యేకంబు+అ= వేరువేరుగా; ధర్మ, వాయు, వాసవ+ఆశ్వినుల్= యముడును, వాయువును, ఇంద్రుడును, అశ్వినీదేవతలును; ప్రీతులు+ఐ= సంతోషంపొందినవాళ్ళయి; వచ్చి; దానిన్= ఆమెను; ఆత్మ, దేహ+అంశజులకున్= తమదేహాలయొక్క అంశాలవలన పుట్టినవాళ్ళకు; దేహాంతరమునన్= మరొకజన్మలో; అధిక, సౌభాగ్య, యుక్తిన్= ఎక్కువ అందముయొక్క పొందికచేత; పత్నిన్+కాన్= భార్య అయ్యేటట్లు; కోరిరి= కోరారు.

తాత్పర్యం: ఆమెదగ్గరకు యముడు, వాయువు, ఇంద్రుడు, అశ్వినీదేవతలు సంతోషంతో వేర్వేరుగా వచ్చి, జన్మాంతరంలో తమ తమఅంశలతో పుట్టినవాళ్ళకు అధికసౌందర్యంతో ఆమె భార్య కావా లని కోరారు.

వ. అదియును గొండొకకాలంబు జలానిలాహార యై, కొండొకకాలంబు నిరాహార యై, కొండొకకాలం బేకపాదంబున నిల్చి, కొండొకకాలంబు పంచాగ్నిమధ్యంబున నుండి యత్యుగ్రతపంబు సేసిన నీశ్వరుండు ప్రసన్నుం డయి వరంబు వేఁడు మనిన, నక్కన్యక 'నాకు బతిదానంబుఁ బ్రసాదింపు' మని యర్థిత్వంబున నేనుమాఱులు వేఁడినం గరుణించి యీశ్వరుండు 'నీకు దేహాంతరంబున నేవురుపతు లగుదు' రనిన నది యి ట్లనియె. 261

ప్రతిపదార్థం: అదియును= ఆ ఇంద్రసేనయు; కొండొకకాలంబు= కొంతకాలం; జల+అనిల+ఆహార+ఐ= నీటిని, గాలిని, ఆహారంగా కలదై; కొండొకకాలంబు= కొంతకాలం; నిరాహార+ఐ= ఆహారం లేనిదై; కొండొకకాలంబు= కొంతకాలం; ఏక, పాదంబునన్= ఒకే పాదంతో; నిల్చి; కొండొకకాలంబు; పంచ+అగ్ని, మధ్యంబునన్= అయిదు అగ్నులనడుమ; ఉండి; అతి+ఉగ్ర, తపంబు= మిక్కిలి భయంకరమైన తపస్సు; చేసినన్= చేయగా; ఈశ్వరుండు= పరమేశ్వరుడు; ప్రసన్నుండు+అయి= ప్రత్యక్ష మైనవాడై; వరంబు= వరం; వేడుము+అనినన్= కోరుకో అనగా; ఆ+కన్యక; నాకున్; పతిదానంబు= పతిదానాన్ని;

ప్రసాదింపుము+అని= ఇమ్ము అని; అర్థిత్వంబునన్= కోరికచేత; ఏను, మాఱులు= ఐదుసార్లు; వేఁడినన్= ప్రార్థింపగా; కరుణించి= దయ తలచి; ఈశ్వరుండు; నీకున్, దేహ+అంతరంబునన్= నీకు మరొకదేహమునందు - అనగా మరుసటిజన్మలో; ఏవురు= ఐదుగురు; పతులు= భర్తలు; అగుదురు= అవుతారు; అనినన్= అనగా; అది= ఆమె; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: తరువాత ఆమె కొంతకాలం నీరు, గాలి ఆహారంగా, కొంతకాలం ఆహారమే లేకుండా, కొంతకాలం ఒకేపాదంమీద నిల్చి, కొంతకాలం ఐదుఅగ్నులమధ్యలో ఉండి, మహాభయంకరమైన తపస్సు చేసింది. ఈశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరు కొ మ్మనగా, ఆ కన్యక 'నాకు పతిదానం ఇ' మ్మని ప్రబలమైన కోరికతో ఐదుసార్లు అడిగింది. ఈశ్వరుడు కరుణించి 'నీకు మరొకజన్మలో ఐదుగురు భర్తలౌతా' రని అనగా - ఆమె ఇట్లా అన్నది.

ఆ. సతికి నొక్కరుండ పతిగాక యెందును । బతులు పలువు రవుట కతలఁ గలదె?
లోకనాథ! యిట్టి లోకవిరుద్ధంపు । వరము వడయ నమరవరద! యొల్ల. 262

ప్రతిపదార్థం: సతికిన్= స్త్రీకి; ఒక్కరుండు+అ= ఒక్కడే; పతి= భర్త; కాక; ఎందును= ఎచ్చటనైన; పతులు= భర్తలు; పలువురు= అనేకులు; అవుట= కావటం; కతలన్= కథలందు; కలదె= ఉన్నదా? లోకనాథ!= లోకాలకు ప్రభువైనవాడా; అమర, వరద= దేవతలకు వరము లిచ్చేవాడా! ఓ పరమేశ్వరా; ఇట్టి; లోకవిరుద్ధంపు= లోకానికి విరుద్ధమైన; వరము= కోరిక; పడయన్= పొందటానికి; ఒల్లన్= ఇష్టపడను.

వ. అనిన దానికి రుద్రుం డి ట్లనియె. 263

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; దానికిన్= ఆ ఇంద్రసేనకు; రుద్రుండు= శివుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా ఆమెతో ఈశ్వరుడు ఈ విధంగా అన్నాడు.

క. నా వచనంబున నీ క । య్యేవురు పతులందు ధర్మ వెడపకయుండుం
గావున నిట్టి వరం బిం । దీవరదళనేత్ర! యిచ్చితిని దయతోన్. 264

ప్రతిపదార్థం: నా, వచనంబునన్= నా మాటచేత; నీకున్; ఆ+ఏవురు, పతులందున్= ఆ ఐదుగురు భర్తలందును; ధర్మమవు= ధర్మం; ఎడపక= తొలగక; ఉండున్= ఉంటుంది; కావునన్; ఇందీవర, దళ, నేత్ర= నల్లకలువరేకులవంటి కన్నులు కలదానా!; ఇట్టి వరంబున్; దయతోడన్; ఇచ్చితిని.

తాత్పర్యం: నల్లకలువరేకులవంటి కన్నులు కల ఓ కన్యకా! నా మాటవలన నీకు ఆ ఐదుగురుభర్తలలో ధర్మం తప్పకుండ ఉంటుంది. అందువల్లనే దయతో నేను నీ కీ వర మిచ్చాను.

వ, 'అనిన నది యట్లేని నయ్యేవురుపతులయందును బ్రత్యేకసంగమంబునను నాకుఁ గౌమారంబును బతిశుశ్రూషా సిద్ధియుఁ గామభోగేచ్ఛయు సౌభాగ్యంబునుం బ్రసాదింప వలయు' ననిన రుద్రుండు దాని కోరిన వరంబు లెల్ల నిచ్చి, గంగాతీరంబున నున్న యింద్రు నాయొద్దకుం దోడ్కొని ర మ్మని పంచిన వల్లె యని. 265

ప్రతిపదార్థం: అనినన్, = అని అనగా; అది= ఆమె; అట్లు+ఏని= అట్లయినచో; ఆ ఏవురు= ఐదుగురు; పతుల, అందును= భర్తలందును; ప్రత్యేక, సంగమంబునను= ఒక్కొక్కరితోడి కలయికయందును; నాకున్= నాకు; కౌమారంబునున్= కన్యాత్వమును; పతి, శుశ్రూషా, సిద్ధియున్= పతిసేవాభాగ్యము; కామ, భోగ+ఇచ్ఛయు= కామాన్ని అనుభవించేకోరిక; సౌభాగ్యంబునున్= ముత్తైదువతనము; ప్రసాదింపవలయున్= అనుగ్రహింపవలయును; అనినన్= అని అనగా; రుద్రుండు= శివుడు; దాని, కోరిన, వరంబులు+ఎల్లన్= ఆమె (యొక్క) కోరిన వరాలన్నింటిని; ఇచ్చి, గంగా, తీరంబునన్; ఉన్న; ఇంద్రున్= ఇంద్రుణ్ణి; నా+ఒద్దకున్; తోడ్కొని; రమ్ము+అని; పంచినన్= ఆజ్ఞాపించగా; వల్లె, అని= సరే అని.

తాత్పర్యం: అని పల్కగా ఆమె 'అట్లైతే, ఆ అయిదుగురు భర్తలలో ఒక్కొక్కరితో కలయిక ఉన్నప్పటికి నాకు కన్యాత్వం, పతిసేవాభాగ్యం, కామాన్ని అనుభవించా లనే కోరిక, ముత్తైదువతనం అనుగ్రహించ వలసిం'దని కోరగా, శివుడు ఆమె కోరినవరాలన్నీ ఇచ్చి, గంగాతీరంలో ఉన్న ఇంద్రుడిని నాదగ్గరికి తోడ్కొని రమ్మని పంపాడు. ఆమె సరే అని.

క. దక్షాధ్వరమథనునకుఁ బ్ర। దక్షిణపూర్వముగ మ్రొక్కి తడయక చని ప
ద్మేక్షణ సహస్రచక్షుఁ బ్ర।తీక్షించుచు నుండె సురనదీతీరమునన్. 266

ప్రతిపదార్థం: పద్మ+ఈక్షణ= పద్మాలవంటికన్నులు కలది - ఆ కాశీరాజుకూతురు; దక్ష+అధ్వర, మథనునకున్= దక్షయజ్ఞాన్ని చెడగొట్టిన శివునికి; ప్రదక్షిణ, పూర్వముగన్= ముందుగా ప్రదక్షిణం చేసి; మ్రొక్కి; తడయక= ఆలస్యం చేయక; చని= వెళ్ళి; సురనదీ, తీరమునన్= గంగానది ఒడ్డున; సహస్ర, చక్షున్= వేయికన్నులు కలవాడైన ఇంద్రునికొరకు; ప్రతీక్షించుచున్= ఎదురు చూస్తూ; ఉండెన్.

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు కల ఆ కాశీరాజుకూతురు శివునికి ప్రదక్షిణం చేసి, నమస్కరించి వెంటనే గంగాతీరానికి వెళ్ళి, ఇంద్రునిరాకకై యెదురుచూస్తూ ఉండింది.

ద్రుపదునకు వ్యాసుండు పంచేంద్రోపాఖ్యానంబు సెప్పుట (సం.1-189-1)

వ. అట వైవస్వతుండును నైమిశారణ్యంబున సత్త్రయాగదీక్షితుం డయి ప్రాణిహింస సేయకుండుటం జేసి మానవు లప్రాప్తమరణు లయి వర్తించుచున్న దాని సహింపనోపక యింద్రాదిదేవతలందఱు బ్రహ్మపాలికిం జని 'భట్టారకా! మర్త్యు లమర్త్యు లయి వర్తిల్లువా రయిన వారికిని మాకును విశేషం బెద్ది?' యని దుఃఖించిన నయ్యమరుల కమరజ్యేష్ఠుం డి ట్లనియె. 267

ప్రతిపదార్థం: అట= అచ్చట; వైవస్వతుండును= యముడును; నైమిశ+అరణ్యంబునన్= నైమిశారణ్యంలో; సత్త్రయాగ దీక్షితుండు+అయి= సత్రయాగంలో దీక్షపూనినవాడై; ప్రాణి హింస= ప్రాణులను చంపటం; చేయక+ఉండుటన్+చేసి= చేయకుండుటం చేత; మానవులు; అప్రాప్త, మరణులు+అయి= పొందబడని చావుకలవా ళ్ళయి - అనగా చావులేనివాళ్ళయి; వర్తించుచున్+ఉన్నన్= వర్తిస్తూ ఉండగా; దానిన్= దానిని; సహింపన్+ఓపక= ఓర్చుకొనలేక; ఇంద్ర+ఆది, దేవతలు+అందరు= ఇంద్రుడు మొదలైన దేవతలంతా; బ్రహ్మపాలికిన్= బ్రహ్మ దగ్గరకు; చని= వెళ్ళి; భట్టారకా= ఓమహామునీ!; మర్త్యులు= చావుకలవాళ్ళు - మనుష్యులు; అమర్త్యులు+అయి= చావులేని వాళ్ళయి; వర్తిల్లువారు+ఐనన్= జీవించే వా ళ్ళయితే; వారికిని; మాకును; విశేషంబు= భేదం; ఎద్ది= ఏది; అని; దుఃఖించినన్= దుఃఖించగా; ఆ+అమరులకున్= ఆ దేవతలకు; అమర, జ్యేష్ఠుండు= దేవతలందరిలో పెద్దవాడైన బ్రహ్మ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అక్కడ యముడు నైమిశారణ్యంలో సత్రయాగదీక్షవహించి, ప్రాణిహింస మానివేయటంవలన మానవులు మరణం లేనివాళ్ళయి జీవించసాగారు. దానిని ఓర్వలేక ఇంద్రుడు మొదలైన దేవతలంతా బ్రహ్మదేవునిదగ్గరికి వెళ్ళి, 'మహామునీ! మృతి చెందే మానవులు మృతిలేనివాళ్ళయి జీవిస్తే, వాళ్ళకూ మాకూ భేద మేమిటి?' అని దుఃఖించగా వాళ్ళతో బ్రహ్మ ఇట్లా అన్నాడు.

క. ఎంతకుఁ గృతకార్యుం డగు । నంతకుఁ డీ రంతకును భయం బందక ని
శ్చింతమున నుండుఁ; డాతం । డంతము నొందించుఁ దొంటియట్టుల నరులన్. 268

ప్రతిపదార్థం: అంతకుఁడు= యముడు; ఎంతకున్= ఎప్పటికి; కృత, కార్యుండు= చేయబడిన సత్రయాగకార్యం కలవాడు; అగున్= అగునో; ఈరు= మీరు; అంతకును= అంతవరకు; భయంబు+అందక; నిశ్చింతమునన్= చింతలేనివిధంగా; ఉండుఁడు; ఆతండు= ఆ యముడు; తొంటి; అట్టులు+అ= మునుపటివలెనే; నరులన్= మానవుల్ని; అంతమున్+ఒందించున్= చంపును.

తాత్పర్యం: యమునిసత్రయాగం ఎప్పటికి పూర్తి అవుతుందో అప్పటివరకు మీరు భయపడకుండా నిశ్చింతగా ఉండండి. అతడు మునుపటివలెనే మానవులను అంత మొందిస్తాడు.

క. ఆ వైవస్వతు వీర్యము । మీ వీర్యముఁ దాల్చి సూర్యమితతేజులు దా
రేవు రుదయింతు రాతని । కావించు విధానమునకుఁ గారణ మగుచున్. 269

ప్రతిపదార్థం: ఆ, వైవస్వతు, వీర్యము= ఆ యమునియొక్క తేజస్సును; మీ, వీర్యమును= మీ తేజస్సును; తాల్చి= ధరించి; సూర్య, మిత, తేజులు= సూర్యుని అంతటి తేజస్సు కలవాళ్ళు; తారు= తాము; ఏవురు= ఐదుగురు; అతని, కావించు, విధానమునకున్= ఆ యముడు చేసే పనికి; కారణము+అగుచున్= కారణం అవుతూ; ఉదయింతురు= పుట్టుతారు.

తాత్పర్యం: ఆ యమునితేజస్సు, మీతేజస్సు ధరించి, సూర్యునంతటితేజస్సు కలవాళ్ళు అయిదుగురు, యముడు చేసేపనికి సాధనంగా జన్మిస్తారు.

వ. అనిన నమరపతి పురోగము లయిన యమరు లెల్ల నమరాపగాసమీపంబునకుం జనునప్పుడు, తత్సలిలమధ్యంబున నొక్కకన్యక యేడ్చుచున్న, దానికన్నీళ్ళు కనకకమలంబు లయినం జూచి వేల్పులుం దానును విస్మయం బంది, యింద్రుఁ డక్కన్యకయొద్దకుం జని 'యేడ్చెద వెందుల దాన?' వని యడిగిన నది యింద్రున కి ట్లనియె. 270

ప్రతిపదార్థం: అనినన్= అని బ్రహ్మదేవుడు పలుకగా; అమరపతి, పురోగములు+అయిన= దేవేంద్రుడు ముందు నడచువాడుగా కలవాళ్ళయిన; అమరులు+ఎల్లన్= దేవతలంతా; అమర+ఆపగా, సమీపంబునకున్= దేవనది యైన గంగానదిదగ్గరకు; చనునప్పుడు= వెళ్ళునప్పుడు; తత్+సలిల, మధ్యంబునన్= ఆ నీళ్ళనడుమ; ఒక్క; కన్య; ఏడ్చుచున్+ఉన్నన్; దాని, కన్నీళ్ళు= ఆమె కన్నీరు; కనక, కమలంబులు+అయినన్= బంగారుతామరలు కాగా; చూచి= కనుగొని; వేల్పులున్= దేవతలును; తానును= తాను; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; ఇంద్రుఁడు; ఆ+కన్యక, ఒద్దకున్= ఆ కన్యదగ్గరకు; చని= వెళ్ళి; ఏడ్చెదవు= ఏడుస్తూ ఉన్నావు; ఎందులదానవు= ఎక్కడిదానవు; అని, అడిగినన్= అని అడుగగా; అది= ఆమె; ఇంద్రునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని బ్రహ్మదేవుడు పల్కగా, దేవతలంతా వెనుదిరిగి, దేవేంద్రుడు ముందు నడువగా గంగానది దగ్గరకు వెళ్లాడు. ఆ సమయంలో ఆ నీటిమధ్యలో ఒకకన్య యేడుస్తుండగా, ఆమెకన్నీళ్లు బంగారుతామరలు కావటంచూచి, దేవతలూ, ఇంద్రుడూ ఆశ్చర్యపడ్డారు. ఆకన్యదగ్గరికి వెళ్ళి 'ఎందుకు ఏడుస్తున్నావు? ఏ ప్రదేశానికి చెందినదానవు?' అని అడుగగా ఆమె ఇంద్రునితో ఇట్లా పలికింది.

ఆ. 'నాదు రోదనంబు, నన్ను నెఱుంగఁగ । వలతయేని యమరవల్లభుండ!
నా పిఱుంద రమ్ము' నావుడు నప్ప డ । వ్వనితపజ్జ నరిగె వాసవుండు. 271

ప్రతిపదార్థం: నాదు, రోదనంబున్= నా ఏడ్పును; నన్నున్; ఎఱుంగఁగన్= తెలిసికొనటానికి; వలతు+అ, ఏని= కోరుదువేని; అమర, వల్లభుండ!= దేవతల రాజైన ఓ దేవేంద్రా!; నా పిఱుందన్= నా వెంట రమ్ము; నావుడున్= అని అనగా; వాసవుండు= దేవేంద్రుడు; అప్పుడు; ఆ+వనిత, పజ్జన్= ఆ కన్యవెంబడి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'దేవేంద్రా! నా దుఃఖాన్నిగురించి, నన్నుగురించి తెలిసికొనా లనుకుంటే, నావెంట రమ్ము!' అని ఆ కన్య చెప్పగా దేవేంద్రుడు ఆమెను అనుసరించి వెళ్లాడు.

వ. ఇ ట్లక్కన్యక పిఱుంద నరుగువాఁడు ముందఱ హిమవదచలకందరారచితరత్నవేదికాతలంబున సింహాసనాసీనుం డయి తరుణరూపంబున నొక్కతరుణితో జూదం బాడుచున్న యాదిదేవుం గని తరుణుండ కా వగచి సురపతి కరం బలిగి యి ట్లనియె. 272

ప్రతిపదార్థం: ఇట్లు; ఆ+కన్యక పిఱుందన్= ఆ కన్య వెంట; అరుగువాఁడు= వెళ్తున్న దేవేంద్రుడు; ముందఱ= ఎదుట; హిమవత్+అచల, కందరా, రచిత, రత్న, వేదికా, తలంబునన్= హిమాలయపర్వతముయొక్క గుహయందు రూపొందించబడిన రత్నపుటరుగుమీద; సింహాసన+ఆసీనుండు+అయి= సింహాసనంమీద కూర్చున్నవాడై; తరుణ, రూపంబునన్= యౌవనంలో ఉన్న వాని రూపమున; ఒక్క+తరుణితోన్= యౌవనంలో ఉన్న ఒక కాంతతో; జూదంబు+ఆడుచున్+ఉన్న= జూదం ఆడుతూ ఉండే; ఆదిదేవున్= శివుడిని; కని= చూచి; తరుణుండు+అకా= యౌవనంలో ఉన్నవాడు అని; వగచి= తలచి; సుర, పతి= దేవేంద్రుడు; కరంబు= మిక్కిలి; అలిగి= కోపించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా ఆ కన్యకవెంట వెళ్తూ దేవేంద్రుడు - ఎదుట హిమాలయపర్వతగుహాలో నిర్మించబడిన రత్నపుటరుగుమీద సింహాసనంపై కూర్చొని యువకునిరూపంలో ఒక యువతితో జూదమాడుతున్న పరమేశ్వరుడిని చూచి, అతడిని సాధారణయువకుడు అని భావించి, దేవేంద్రుడు మిక్కిలి కోపించి ఇట్లా అన్నాడు.

మ. అమితస్థావరజంగమం బయిన బ్రహ్మాండంబు దా నింతయున్
మమతాగోచర మీ త్రిలోకములు నస్మద్బాహువజ్రానుపా
ల్యము ; లే నింద్రుఁడ; నిట్టి న న్నుఱక లీలన్ జూదమాడంగ ను
త్తమసింహాసన మెక్క నీకుఁ జనునే దర్పించి నాముందటన్. 273

ప్రతిపదార్థం: అమిత, స్థావర, జంగమంబు+అయిన= అంతులేని స్థావరాలు (కదలిక లేనివి); జంగమాలు (కదలిక కలవి) కలదైన; బ్రహ్మాండంబు= బ్రహ్మాండము; తాన్= తాను; ఇంతయున్= అంతా; మమతా గోచరము= నాదిగా అగుపించునట్టి;

ఈ, త్రిలోకములున్= ఈమూడులోకాలూ; అస్మత్+బాహు, వజ్ర+అనుపాల్యములు= నా చేతిలోని వజ్రాయుధంచేత పాలించదగినవి; ఏన్= నేను; ఇంద్రుఁడన్= ఇంద్రుణ్ణి; ఇట్టి= ఇటువంటి; నన్నున్= నన్ను; ఉఱక= లెక్కపెట్టక; దర్పించి= గర్వించి; నా, ముందటన్= నా ఎదుట; ఉత్తమ, సింహాసనము; ఎక్కన్= ఎక్కటానికి; లీలన్= విలాసంగా; జూదము+ఆడంగన్= జూదమాడటానికి; నీకున్+చనునే= నీకు తగునా!

తాత్పర్యం: అంతులేని స్థావరజంగమాలతో నిండిన ఈ బ్రహ్మాండమంతా నాది. ఈ మూడులోకాలు నా చేతి వజ్రాయుధంతో పాలించబడుతూ ఉన్నాయి. నేను దేవేంద్రుడిని. ఇటువంటి నన్ను లెక్కపెట్టక, గర్వించి నా యెదుట విలాసంగా జూదమాడటం, పెద్దసింహాసన మెక్కటం నీకు తగునా?

వ. అనిన రుద్రుం డలిగి రౌద్రాకారంబున వానిం జూచి 'మదీయ క్రీడారసభంగంబుఁ జేసిన యిద్దుర్మదుం బట్టి తె' మ్మని యక్కన్యకం బంచిన నప్పుడు దానికరస్పర్శనంబున విచేష్టితుం డయి మహీతలంబుపయిం బడిన యయ్యింద్రునకు రుద్రుం డి ట్లనియె. 274

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; రుద్రుండు= శివుడు; అలిగి= కోపించి; రౌద్ర+ఆకారంబునన్= భయంకరమైన రూపంతో; వానిన్= ఆ దేవేంద్రుడిని; చూచి; మదీయ, క్రీడా, రస, భంగంబున్= నా యొక్క ఆటయందలి ఆనందానికి ఆటంకం; చేసిన= కలిగించిన; ఈ+దుర్మదున్= ఈ పొగరుబోతును; పట్టితెమ్ము+అని= పట్టి తీసుకొని రా అని; ఆ+కన్యకన్= ఆ కన్యను; పంచినన్= పంపగా; అప్పుడు; దాని, కర, స్పర్శనంబునన్= ఆమెచేతితాకిడిచేత; విచేష్టింతుడు+అయి= చేష్టలు కోల్పోయినవా డై; మహీతలంబు, పయిన్= నేలమీద; పడిన= పడిపోయిన; ఆ+ఇంద్రునకున్; రుద్రుండు= పరమేశ్వరుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని దేవేంద్రుడు పల్కగా శివుడు కోపించి, భయంకరమైన ఆకారంతో అతణ్ణి చూచి 'నా ఆటలోని ఆనందాన్ని ఆటంకపరచిన ఈ పొగరుబోతును పట్టి తె'మ్మని ఆ కన్యను పంపగా, అప్పు డామె చేతిస్పర్శతో చేష్టలు లేనివాడై నేలమీద పడిన ఇంద్రునితో శివుడు ఇట్లా అన్నాడు.

క. 'గర్వించి పలికి, తగు, నీ । గర్వము భుజవీర్యమును బ్రకాశంబుగ నీ
పర్వతవివరము దెర్చి వి । గుర్వింపుము చూత' మనిన గోత్రభిదుండున్. 275

ప్రతిపదార్థం: గర్వించి= దర్పించి -పొగరుగలిగి; పలికితి= పలికితివి; అగున్= అట్లే అగుగాక; నీ, గర్వము; భుజ, వీర్యమును= బాహుబలమును; ప్రకాశంబుగన్= వెల్లడి అయ్యేటట్లు; ఈ పర్వత, వివరము= ఈ పర్వతంయొక్క రంధ్రం; తెర్చి= తెరచి; విగుర్వింపుము= విరువుము; చూతము= చూస్తాము; అనినన్= అని పలుకగా; గోత్రభిదుండున్= పర్వతాలయొక్కరెక్కలను విరిచిన దేవేంద్రుడు.

తాత్పర్యం: 'గర్వంతో మాట్లాడావు. నీ గర్వం, బాహుబలం వెల్లడి అయ్యేటట్లు ఈ పర్వతరంధ్రాన్ని తెరచి, విరువుము చూద్దాం' అని శివుడు పల్కగా, దేవేంద్రుడు.

విశేషం: 'వివరము' అనే పదానికి బదులు కొన్నిప్రతులలో ఉన్న 'శిఖరము' అనే పాంఠాంతరం మేల్తర మనిపిస్తుంది. 'తెర్చి' అనే దానికి 'తీర్చి' అనే పాంఠాంతరం ఉంది. వివరాన్ని విరవటం కంటె శిఖరాన్ని విరవటం సమంజసం. 'శిఖరం బెత్తి

విగుర్వింపుము' అనే పాఠం అన్నిటికంటె స్పష్టార్థాన్ని కలిగివున్నది. కాని శివు డున్నది గుహలో కనుక ఇక్కడ 'వివరము' అనే పాఠాన్నే గ్రహించటం జరిగింది.

సీ. హరువచనమున నా గిరిరాజవివరంబు । గరములఁ బట్టి చెచ్చెర దినేశ
చండమయూఖముల్ రెండు విధంబు లై । యుండంగఁ దెర్చి యాఖండలుండు
దనయట్టివారల ఘనశరీరుల నందు । నలువుర నన్యుల వెలయఁ జూచి,
'యే నిట్టు లేలొకో యేనుప్రకారంబు । లయితి నిం?' దనుచు విస్మయముఁ బొంది

ఆ. యున్నఁ జూచి హరుఁడు గ్రన్న నయ్యింద్రుల । నేవురను మహానుభావ మెసఁగ
మనుజయోనిఁ బుట్టుఁ డని పంచె గీర్వాణ । హితము సేయుపొంటె మతిఁ దలంచి. 276

ప్రతిపదార్థం: హరు, వచనమునన్= శివునియొక్క మాటచేత; ఆ, గిరి, రాజ, వివరంబు= ఆ పర్వత శ్రేష్ఠంయొక్క రంధ్రమును; కరములన్+పట్టి= చేతులతో పట్టుకొని; చెరన్+చెరన్ = వేగమే; దిన+ఈశ, చండ, మయూఖముల్= సూర్యునియొక్క వేడికిరణాలు; రెండు; విధంబులు+ఐ= రెండు పాయలై; ఉండంగన్= ఉండగా; తెర్చి= తెరచి; ఆఖండలుండు= దేవేంద్రుడు; తన అట్టి, వారలన్; ఘన, శరీరులన్= గొప్ప శరీరాలు కలవారిని; నలువురన్= నలుగురిని; అన్యులన్= ఇతరులను; అందున్= ఆ రంధ్రమునందు; వెలయన్= మెరయగా; చూచి; ఏను= నేను; ఇట్టులన్; ఏల+ఒకో= ఎందుచేతనో; ఏను, ప్రకారంబులు= అయిదువిధాలు; ఇందున్= ఇచ్చట; అయితిన్= అయినాను; అనుచున్; విస్మయమున్= ఆశ్చర్యాన్ని; పొంది= పొంది; ఉన్నన్= ఉండగా; చూచి= కనుగొని; హరుఁడు= శివుడు; క్రన్నన్= వెంటనే; ఆ+ఇంద్రులన్, ఏవురను= ఆ ఇంద్రులను ఐదుగురను; మహా+అనుభావము= గొప్ప వ్యక్తిత్వము; ఎసఁగన్= అతిశయించగా; మనుజ, యోనిన్= మానవస్త్రీయందు పుట్టుడు; అని; గీర్వాణ, హితము= దేవతలకు మేలు; చేయు, పొంటెన్= చేయుటకొరకు; మతిన్= బుద్ధియందు; తలంచి= భావించి; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: శివుని మాటప్రకారం దేవేంద్రుడు ఆ పర్వతరంధ్రాన్ని రెండుచేతులతో పట్టుకొని సూర్యుని కిరణాలు రెండుపాయలైనట్లుగా తెరచి, ఆ రంధ్రంలో తనవలె గొప్పశరీరంకలవాళ్ళు మరో నలుగురు వెలుగుతుండటం చూచి, 'నే నెందుకు అయిదువిధాలుగా అయ్యా' నని ఆశ్చర్యపడగా, శివుడు వెంటనే ఆ ఇంద్రులైదుగురిని దేవతల మేలు కోరి, 'మానవస్త్రీయందు మహానుభావులుగా జన్మించండి' అని ఆజ్ఞాపించాడు.

వ. 'వారలు ధర్మానిలశక్రాశ్వినులు దమకు నాధారకర్తలుగా ధర్మజభీమార్జుననకులసహదేవు లనంగాఁ బుట్టిరి; కమలభవప్రముఖనిఖిలసురగణప్రార్థితుం డయి నారాయణుసితాసితకేశద్వయంబు బలదేవవాసుదేవు లై దేవహితార్థం బుద్భవించిన, నందు వాసుదేవుండు వారలకుఁ గార్యసహాయం డయ్యె; నయ్యింద్రుల కేవురకును నేకపత్నిగాఁ దపంబుసేసి శ్రీమూర్తి యయిన యాజ్ఞసేని యజ్ఞవేదిం బుట్టె; నమ్మవేని వీరల పూర్వదేహంబులఁ జూడు' మని కృష్ణద్వైపాయనుండు ద్రుపదునకు దివ్యదృష్టి యిచ్చి చూపిన. 277

ప్రతిపదార్థం: వారలు= వాళ్లు; ధర్మ+అనిల, శక్ర+అశ్వినులు= యముడు, వాయుదేవుడు, ఇంద్రుడు, అశ్వినీదేవతలు; తమకున్, ఆధారకర్తలుగా; ధర్మజ, భీమ+అర్జున, నకుల, సహదేవులు; అనన్+కాన్= అనే పేర్లతో; పుట్టిరి; కమలభవ, ప్రముఖ, నిఖిల, సురగణ, ప్రార్థితుండు+అయి= పద్మంనుండి జన్మించిన బ్రహ్మ మొదలైన అందరు దేవతల సమూహంచేత

ప్రార్థింపబడినవాడై; నారాయణు, సిత+అసిత, కేశ, ద్వయంబు= విష్ణుమూర్తి యొక్క తెల్లని, నల్లని వెంట్రుకల జంట; బలదేవ, వాసుదేవులు+ఐ= బలరామశ్రీకృష్ణు లై; దేవహిత+అర్థంబు= దేవతలమేలుకొరకు; ఉద్భవించెన్= పుట్టగా; అందున్= వారిలో; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; వారలకున్= వారికి; కార్య సహాయుండు= కార్యాలందు సాయం చేసేవాడు; అయ్యెన్= అయినాడు; ఆ+ఇంద్రులకు; ఏవురకున్= ఆ ఇంద్రులైన ఐదుగురికి; ఏకపత్నిగాన్= ఒకే భార్యగా; తపంబు; చేసి, శ్రీమూర్తి, అయిన= లక్ష్మీదేవి ఆకారమైన; యాజ్ఞసేని= ద్రౌపది; యజ్ఞవేదిన్= యజ్ఞ వేదికలో ; పుట్టెన్= జన్మించింది; నమ్మవు+ఏని= నమ్మకున్నచో; వీరల, పూర్వ, దేహంబులన్= వీళ్ల ముందటి శరీరాలు; చూడుము+అని; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; ద్రుపదునకున్= ద్రుపదునికి; దివ్య, దృష్టి, ఇచ్చి, చూపి= దివ్యదృష్టి ప్రసాదించి చూపి.

తాత్పర్యం: ఆ అయిదుగురు ఇంద్రులు యముడు, వాయుదేవుడు, ఇంద్రుడు, అశ్వినీదేవతలు ఆధార కర్తలుగా ధర్మజ భీమార్జున నకులసహదేవులు అనే పేర్లతో జన్మించారు. బ్రహ్మాదిదేవత లంతా ప్రార్థింపగా విష్ణుమూర్తి యొక్క తెల్లని నల్లని వెంట్రుకల జంట, దేవతల మేలుకొరకు బలరామకృష్ణులుగా అవతరించారు. వారిలో శ్రీకృష్ణుడు ఆ అయిదుగురికి వాళ్ళపనులలో సాయంచేసేవా డయ్యాడు. ఆ అయిదుగురు ఇంద్రులకు ఒకే భార్యగా తపస్సుచేసి లక్ష్మీస్వరూపురాలైన యాజ్ఞసేని (ద్రౌపది) యజ్ఞవేదిలో జన్మించింది. నీకు నమ్మకం లేకుంటే వీళ్ళ పూర్వదేహాలు చూడు' అని వ్యాసుడు ద్రుపదునికి దివ్యదృష్టి నిచ్చి చూపాడు.

ఉ. చారు మణి ప్రభా పటల జాల విచిత్ర కిరీట మాలికా
భారములన్ సముద్యదినపావక వర్ణములన్ సువర్ణకే
యూర విభూషణావళుల నొప్పుచునున్న తదీయదేహముల్
ధీరుఁడు సూచెఁ దాళసమదీర్ఘతఁ బొల్చినవాని నేనిటిన్. 278

ప్రతిపదార్థం: చారు, మణి, ప్రభా, పటల, జాల విచిత్ర, కిరీట, మాలికా, భారములన్= అందమైన రత్నాలకాంతి సమూహాల వలలచే మిక్కిలి చిత్రమైన రంగులు కల కిరీటాలయొక్క, దండలయొక్క బరువులచేత; సముద్యత్+ఇన, పావక, వర్ణములన్= లెస్సగా ప్రకాశించే సూర్యునియొక్క, అగ్నియొక్క రూపాలచేత; సువర్ణ కేయూర, విభూషణ+ఆవళులన్= బంగారు సందె కడియంవంటి ఆభరణసమూహాలచేత; ఒప్పుచున్+ఉన్న= ప్రకాశిస్తూ ఉండే; తదీయ, దేహముల్= వారియొక్క శరీరాలు; తాళ, సమ, దీర్ఘతన్= తాటిచెట్టుతో సమానమైన పొడవుతో; పొల్చిన, వానిన్= ఒప్పిన వాటిని; ఏనిటిన్= ఐదింటిని; ధీరుఁడు= ధైర్యశాలి, ద్రుపదుడు; చూచెన్.

తాత్పర్యం: అందమైనరత్నకాంతిసమూహాలవలలచే మిక్కిలిచిత్రమైనరంగులు కల కిరీటాల, దండల భారాలతో, లెస్సగా ప్రకాశించే సూర్యునివంటి, అగ్నివంటిరూపాలతో, బంగారు సందెకడియాలవంటి ఆభరణాలతో ఒప్పుతూ, తాటిచెట్టంత పొడవైన వాళ్ళ దేహా లైదింటిని ద్రుపదుడు చూచాడు.

వ. మఱియు సకలలావణ్యమూర్తు లయి వారల కేవురకుఁ బత్నిగాఁ దపంబు సేసిన యక్కన్యకపూర్వదేహంబును జూచి విస్మితుం డయి హర్షించి యున్న ద్రుపదునకు వెండియుం గృష్ణద్వైపాయనుం డి ట్లనియెఁ; 'దొల్లి నితంతుం డను రాజర్షికొడుకు లనంతబలపరాక్రములు సాల్వేయ శూరసేన శ్రుతసేన బిందుసారాతిసారు లను వా రేవురుం బరస్పర స్నేహవినయంబుల నతిప్రసిద్ధు లయి పెరుఁగుచు నౌశీనరపతి కన్యక నజిత యను దాని స్వయం వరంబునఁ బడసి వివాహం బయి. 279

ప్రతిపదార్థం: మఱియున్; సకల, లావణ్య, మూర్తి+ఐ= సమస్తసౌందర్యంయొక్క స్వరూపమై; వారలకున్; ఏవురకున్= ఐదుగురకు; పత్ని, కాన్= భార్య అగుటకు; తపంబు, చేసి,= తపస్సు కావించి; ఆ+కన్యక, పూర్వ, దేహంబును= ఆ కన్యకయొక్క (తొలుతటి ఇంద్రసేన, ఇప్పటి కృష్ణ) మొదటిశరీరాన్ని; చూచి; విస్మితుండు+అయి= ఆశ్చర్యపడినవా డై; హర్షించి= సంతోషించి; ఉన్న= ఉండు; ద్రుపదునకున్; వెండియున్= మరల; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; ఇట్లు+అనియెన్; తొల్లి= పూర్వం; నితంతుండు+అను= నితంతుడు అనే పేరుగల; రాజర్షి= రాజర్షియొక్క; కొడుకులు; అనంత, బల, పరాక్రములు= అంతులేని బలం, పరాక్రమం కలవారు; సాల్వేయ= శూరసేన, శ్రుతసేన, బిందుసార+అతిసారులు; అనువారు; ఏవురున్= ఐదుగురును; పరస్పర, స్నేహ, వినయంబులన్= ఒకరిమీద మరొకరికి కల ప్రేమ; వినయాలతో; అతి, ప్రసిద్ధులు; అయి, పెరుఁగుచు; ఔశీనరపతి= ఔశీనరపతి యొక్క; కన్యకన్= కన్యను; అజిత; అను, దానిన్= అనుదానిని; స్వయంవరంబునన్; పడసి= పొంది; వివాహంబు+అయి= పెండ్లాడి.

తాత్పర్యం: అంతేగాక, సమస్త సౌందర్యం రూపుదాల్చిం దై, ఆ అయిదుగురికి భార్య కావటానికి తపస్సు చేసిన ఆ కన్యయొక్కమొదటిదేహాన్ని చూచి ఆశ్చర్యపడి, సంతోషించి ఉన్నద్రుపదునితో మరల వ్యాసుడు ఇట్లా అన్నాడు. ' పూర్వం నితంతు డనే రాజర్షికుమారులు సాల్వేయ, శూరసేన, శ్రుతసేన, బిందుసార, అతిసారు లైదుగురు అంతులేని బలపరాక్రమాలు కలవాళ్ళు. వాళ్ళు పరస్పరం ప్రేమ, వినయం కలిగి మహాప్రసిద్ధు లై పెరుగుతూ ఔశీనరపతిపుత్రికను స్వయంవరంలో పొంది వివాహమాడారు.

విశేషం: 'నితంతుడు' అనే పేరుకు బదులు కొన్ని ప్రతులలో సితతంతుడు, శిలావంతుడు అనే పేర్లు ఉన్నాయి. అట్లే బిందుసారుడికి బదులుగా తిందుసారుడు, అతిసారునికి బదులుగా అద్రిసారుడు అనే పాఠాలు శ్రీ పి.పి.యస్.శాస్త్రి గారి సంస్కృత భారతప్రతిలో ఉన్నాయి.

క. కాంతి విశేష విలాసా। నంతశ్రీఁ దనరు నజితయం దనఘులు నై
తంతువు లేవురుఁ బడసిరి। సంతానము వేఱువేఱ సత్కుల మెసఁగన్. 280

ప్రతిపదార్థం: కాంతి, విశేష, విలాస+అనంత శ్రీన్= అధికకాంతియొక్క విలాసంయొక్క అంతులేని సంపదతో; తనరు= ఒప్పు; అజిత, అందున్= ఆ అజితలో; అనఘులు= పాపరహితులైన వాళ్ళు; నైతంతువులు= నితంతుని కుమారులు; ఏవురున్= ఐదుగురును; సత్+కులము= మంచివంశం; ఎసఁగన్= వృద్ధిపొందగా; వేఱు వేఱు+అ= విడివిడిగా; సంతానము; పడసిరి= పొందారు.

తాత్పర్యం: అధికకాంతి, విలాసాలు - అనే అంతులేని సంపదతో ప్రకాశంతో ఆ అజితయందు, పుణ్యాత్ములైన నితంతునికుమారు లైదుగురు మంచివంశం వృద్ధి పొందేటట్లు విడివిడిగా సంతానాన్ని పొందారు.

వ. 'తొల్లింటి మహాత్ములయందును నిట్టి చరితంబులు గలవుం గావున బాండవుల కేవురకు ద్రౌపదిం గ్రమంబునఁ బాణిగ్రహంబు సేయింపు; మిది మన చేసినయది గాదు; దైవాధిష్ఠితం' బని ద్రుపదు నొడంబఱచి కుంతియుఁ, బాండవులు నున్న చోటికి ద్రుపద సహితుం డయి కృష్ణద్వైపాయనుండు వచ్చి యుధిష్ఠిరున కి ట్లనియె. 281

ప్రతిపదార్థం: తొల్లింటి= పూర్వపు; మహా+ఆత్ముల అందునున్= మహాత్ముల యందుకూడా; ఇట్టి; చరితంబులు; కలవు; కావునన్; పాండవులకున్; ఏవురకున్= ఐదుగురికి; ద్రౌపదిన్= ద్రౌపదిని; క్రమంబునన్= వరుసగా; పాణి, గ్రహణంబు=

వివాహం; చేయింపుము= జరిపించు; ఇది, మన, చేసిన, అది= ఇది మనం చేసింది; కాదు; దైవ+అధిష్ఠితంబు= దైవము నాశ్రయించింది - అనగా దేవునిచేత చేయబడింది; అని= అని; ద్రుపదున్= ద్రుపదుణ్ణి; ఒడంబఱిచి= ఒప్పించి; కుంతియున్; పాండవులున్, ఉన్న; చోటికిన్; ద్రుపద, సహితుండు+అయి= ద్రుపదునితో కూడినవాడై; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; వచ్చి; యుధిష్ఠిరునకున్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పూర్వపుమహాత్ములలోకూడ ఇటువంటిచరిత్ర లున్నాయి. అందువలన పాండవు లైదుగురికి ద్రౌపది నిచ్చి వరుసగా వివాహం జరిపించుము. ఇది మనం చేసింది కాదు. దైవనిర్ణయం' అని ద్రుపదుడిని ఒప్పించి వ్యాసుడు అతనితోకూడ కుంతీపాండవు లున్నచోటికి వెళ్లి, ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

ద్రౌపదీవివాహమహోత్సవము (1-190-5)

ఆ. నేఁడు పుణ్యదినము నెమ్మితో రోహిణీ। యుక్తుఁ డయి శశాంకుఁ డున్నవాఁడు;
మంత్రవంతముగఁ గ్రమంబున నేవురుఁ। బెండ్లియగుఁడు కృష్ణఁ బ్రీతితోడ. 282

ప్రతిపదార్థం: నేఁడు= ఈ దినం; పుణ్య, దినము; నెమ్మితో= ప్రేమతో; శశాంకుఁడు= కుందేలును గుర్తుగా కల చంద్రుడు; రోహిణీ; యుక్తుఁడు+అయి= రోహిణీ నక్షత్రంతో కూడి; ఉన్నవాఁడు= ఉన్నాడు; మంత్రవంతముగన్= మంత్రాలతో; ఏవురున్= ఐదుగురూ; ప్రీతితోడన్= సంతోషంతో; కృష్ణన్= ద్రౌపదిని; క్రమంబుగన్= వరుసగా; పెండ్లి, అగుడు= పెండ్లి చేసికొనండి.

తాత్పర్యం: ఈ రోజు పుణ్యదినం. చంద్రుడు ప్రేమతో రోహిణీనక్షత్రాన్ని కూడి ఉన్నాడు. మంత్రయుక్తంగా మీ రైదుగురు సంతోషంగా ద్రౌపదిని వివాహం చేసికొనండి.

విశేషం: వ్యాసమహర్షి ద్రుపదరాజుకు ద్రౌపదీపాండవుల పుట్టుక వెనుక ఉన్న దివ్యరహస్యాలు తెలియచెప్పాడు. వాటిని దర్శించటానికి అవసరమైన దివ్యదృష్టిని అనుగ్రహించాడు. ఇదివరలో కూడ ఇటువంటిది ఉన్న దని ఒక ఉదాహరణ ఇచ్చాడు. ఆ కన్యాదాత మనస్సును ఆవరించిన అనుమానతిమిరాన్ని పూర్తిగా తొలగించాడు. 'గతం న శోచామి కృతం న స్మరామి' అన్నట్లు కర్తవ్యాన్ని నిర్ణయించాడు. ద్రౌపదీ వివాహానికి ఆటంకమే లేని రాచబాట వేశాడు. ధర్మజుని తీర్పే వ్యాసుని తీర్పుకావటం, ధర్మజుని స్థాయి మరో మెట్టు ఈ ఘట్టంలో పెరగటం విశేషం.

వ. అని నిశ్చయించి పంచినం బాంచాలపతియును గరం బనురాగంబునఁ బురం బష్టశోభనంబు సేయించి, సమారబ్ధవివాహమహోత్సవుం డయ్యె; నంత నిరంతర క్రముకకదళీస్తంభ శుంభత్సంభృత నవామ్రాశ్వత్థ పల్లవ మాలాలంకృత ద్వారతోరణంబులను, జందనోదక సంస్తిక ప్రాంగణ రంగవల్లీ కృత కర్పూరమౌక్తిక ప్రకరంబులను, గౌతుకోత్సవమంగళశృంగార వారాంగనా ప్రవర్తమాన స్వనియోగకృత్యంబులను, నుత్సవ సందర్శనాగతానేకరాజన్య సుహృద్బాంధవబ్రాహ్మణ సంకులంబుననుం జేసి యొప్పుచున్న ద్రుపదరాజ మందిరంబునం బూర్వోత్తర దిగ్భాగంబున విచిత్రనేత్ర వితత వితాన ముక్త మౌక్తిక కుసుమ మాలాలంబనాభిరామంబును, సమీచీన చీనాంశుక విరచితస్తంభ వేష్టనంబును, బ్రత్యగ్ర పల్లవ శాల్యక్షతాంచిత కాంచన పూర్ణ కలశోపశోభితంబును, లాజాజ్య సంపూర్ణ సౌవర్ణ పాత్ర నవసౌరభ బహువిధపుష్ప సమిత్కుశాశ్మశమ్యాభిరమ్యంబును, నవగోమయ శ్యామ మరకత మణి ప్రభాపటల

విలిప్త హిరణ్మయవేదీమధ్యసమిద్ధాగ్నికుండమండితంబును, సర్వాలంకారసుందరంబును నయిన వివాహ మంటపంబునకుం జని నిజ పురోహితుం డయిన ధౌమ్యుం డాదిగా ననేకవిద్వన్మహీసుర నివహంబుతోఁ గరం బొప్పి. 283

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; నిశ్చయించి; పంచినన్= ఆజ్ఞాపించగా; పాంచాల, పతియును= ద్రుపదుడును; కరంబు= మిక్కిలి; అనురాగంబునన్= ప్రీతితో; పురంబున్= నగరాన్ని; అష్టశోభనంబు= ఎనిమిదివిధాల మంగళాలంకారం; చేయించి; సమారబ్ధ, వివాహ, మహా+ఉత్సవుండు= చక్కగా ఆరంభింపబడిన వివాహమహోత్సవం కలవాడు; అయ్యెన్= అయ్యాడు; అంత= అప్పుడు; నిరంతర, క్రముక, కదళీస్తంభ, శుంభత్+సంభృత, నవ+ఆమ్ర+అశ్వత్థ, పల్లవ, మాలా+అలంకృత, ద్వారతోరణంబులను= ఎడతెగని పోకల అరటుల స్తంభాలందు ప్రకాశిస్తూ నిండుగా భరింపబడిన క్రొత్త మామిడి, రావి చివుళ్ళ దండనల చేత అలంకరింపబడిన లోపలి వెలుపలి ద్వారాలచేత; చందన+ఉదక, సంసిక్త, ప్రాంగణ, రంగవల్లీకృత, కర్పూర మౌక్తిక ప్రకరంబులను= మంచి గంధపు నీటిచేత చక్కగా తడుపబడిన ముంగిళ్ళయందు ముగ్గులుగా చేయబడిన పచ్చకర్పూరాలయొక్క, ముత్యాలయొక్క సమూహాలచేత; కౌతుక+ఉత్సవ, మంగళ, శృంగార, వార+అంగనా, ప్రవర్త్యమాన, స్వనియోగ, కృత్యంబులను= వివాహ మహోత్సవంకొఱకైన మంగళాలంకారాలు కల వేశ్యలచే చేయబడుతున్న, తమకు నియమింపబడిన పనులచేత; ఉత్సవ, సందర్శన+ఆగత+అనేక, రాజన్య, సుహృత్+బాంధవ, బ్రాహ్మణ, సంకులంబునున్+చేసి= వివాహమహోత్సవాన్ని చూడటానికి వచ్చిన పెక్కుమంది రాజులతో, మిత్రులతో, బంధువులతో, బ్రాహ్మణులతో క్రిక్కిరియటంచేత; ఒప్పుచు+ఉన్న; ద్రుపదరాజు, మందిరంబునన్= ద్రుపదరాజుయొక్క ఇంటిముందు; పూర్వ+ఉత్తర, దిక్+భాగంబునన్= ఈశాన్యదిక్కునందు; విచిత్ర, నేత్ర, వితత, వితాన, ముక్త, మౌక్తిక, కుసుమ, మాలా+ఆలంబన+అభిరామంబును= రంగురంగుల వస్త్రాలయొక్క విశాలాలైన మేల్కట్లనుండి క్రిందికి విడువబడిన ముత్యాలయొక్క పూలయొక్క దండలు వ్రేలాడటంచేత మనోహరమైనదీ; సమీచీన, చీన+అంశుక, విరచిత, స్తంభ, వేష్టనంబును= చక్కని పట్టువస్త్రాలచేత కల్పించబడిన స్తంభపు చుట్టు కలదీ; ప్రత్యగ్ర, పల్లవ, శాలి+అక్షత+అంచిత, కాంచన, పూర్ణ, కలశ+ఉపశోభితంబును= క్రొత్త చిగుళ్ళచేత, వరి అక్షతలచేత ఒప్పుచున్న బంగారు పూర్ణకలశాలచేత ప్రకాశిస్తున్నదీ; లాజ+ఆజ్య, సంపూర్ణ, సౌవర్ణ, పాత్ర, నవ, సౌరభ, బహువిధ, పుష్ప, సమిత్, కుశ+అశ్మ, శమ్యా, అభిరమ్యంబును= పేలాలతో, నేతితో నిండిన బంగారు పాత్రలచేత, క్రొత్త వాసనలతో, దర్భలచేత, సన్నెకల్లుచేత, యజ్ఞపాత్రలచేత మనోహర మైనదీ; నవ, గోమయ, శ్యామ, మరకత, మణి, ప్రభా, పటల, విలిప్త, హిరణ్మయ, వేదీ, మధ్య, సమిద్ధ+అగ్ని కుండ, మండితంబును= క్రొత్త ఆవుపేడవలె నల్లనిమరకతమణుల కాంతిసమూహంచేత అలుకబడిన బంగారుపెండ్లిఅరుగునడుమ మండుతున్న హోమగుండంచేత అలంకరింపబడినదీ; సర్వ+అలంకార, సుందరంబును= అన్ని అలంకారాలచేత అందమైనదీ అయిన, వివాహ మంటపంబునకున్; చని= వెళ్ళి; పురోహితుండు+అయిన= తనయొక్కపురోహితు డైన; ధౌమ్యుండు+ఆది, కాన్+అనేక, విద్వత్+మహీసుర, నివహంబుతోన్= ధౌమ్యుడు మొదలైన పెక్కుమంది పండితులగు బ్రాహ్మణసమూహంతో; కరంబు= మిక్కిలి; ఒప్పి= ప్రకాశించి.

తాత్పర్యం: అని నిర్ణయించి వ్యాసమహర్షి ఆజ్ఞాపించగా, ద్రుపదరాజుకూడ మిక్కిలిప్రీతితో పురానికి ఎనిమిది, విధా లైన మంగళాలంకారాలు చేయించి, వివాహమహోత్సవాన్ని చక్కగా ప్రారంభించాడు. అప్పుడు ఎడతెగని పోక, అరటిస్తంభాలతో, నిండుగా ధరించిన క్రొత్తమామిడి, రావిచివుళ్లదండలతో అలంకరించబడిన లోపలి వెలుపలి ద్వారాలతోను, మంచిగంధపునీటితో చక్కగా తడుపబడిన ముంగిళ్లలో ముగ్గులుగా చేయబడిన పచ్చకర్పూరాల, ముత్యాల సమూహాలతో, వివాహమహోత్సవంకొరకు కావించుకొన్న మంగళాలంకారాలు కల వేశ్యలు చేస్తున్న నియమితకార్యాలతో, వివాహమహోత్సవం చూడవచ్చిన పెక్కుమందిరాజులతో, మిత్రులతో, బంధువులతో, బ్రాహ్మణులతో క్రిక్కిరిసి శోభిల్లుతున్న ద్రుపదునిఇంటిలో - ఈశాన్యదిక్కున రంగు రంగులవస్త్రాలతో నిర్మించబడిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశాలమైన మేల్కట్లనుండి క్రిందికి విడువబడిన ముత్యాల పూలదండలు వ్రేలాడటంచేత మనోహర మైనదీ, చక్కని పట్టువస్త్రాలతో కల్పింపబడిన స్తంభపుచుట్లు కలదీ, క్రొత్తచివుళ్లతో, బియ్యపు అక్షతలతో ఒప్పుతున్న బంగారుపూర్ణకలశాలతో ప్రకాశిస్తున్నదీ, పేలాలతో నేతితో నిండిన బంగారుపాత్రలతో, క్రొత్త వాసనలతో కూడిన పెక్కువిధా లైన పువ్వులతో సమిధలతో, దర్భలతో, సన్నెకల్లుతో, యజ్ఞపాత్రలతో మనోహర మైనదీ, అప్పుడే పెట్టిన ఆవుపేడవలె నల్లనిమరకతమణుల కాంతిసమూహంతో అలుకబడిన బంగారు వివాహవేదికనడుమ మండుతున్న హోమకుండంచేత అలంకరింపబడినదీ, అన్ని అలంకారాలతో అందమైనదీ అయిన కల్యాణమంటపానికి వెళ్లి, తమ పురోహితుడైన ధౌమ్యుడు మొదలైన పెక్కుమంది పండిత బ్రాహ్మణసమూహంతో మిక్కిలి ఒప్పి.

సీ. అనఘులు కృతమంగళాభిషేకులు, ధృత । సముచిత వేష ప్రశస్త రత్న
భూషణుల్, కౌరవపుంగవు లేవురు । నేతెంచి ; రంతఁ బూర్ణేందువదన
యధికవిదగ్ధ పుణ్యాంగనా విరచిత । లలిత ప్రసాధనాలంకృతాంగి
కమలాక్షి కమనీయకాంతాసహస్రంబు । తోఁ జనుదెంచె నాద్రుపదతనయ;

ఆ. భూరి భూసురేంద్ర పుణ్యాహరవమును । మంగళ ప్రగీత మధురరవము
వివిధతూర్యవేణు వీణారవంబును । విస్తరిల్లె దిశల విభవయుక్తి. 284

ప్రతిపదార్థం: అనఘులు= పాపంలేనివారు; కృత, మంగళ+అభిషేకులు= చేయబడిన మంగళస్నానం కలవారు; ధృత, సముచిత, వేష, ప్రశస్త, రత్న, భూషణుల్= ధరించబడిన తగినవేషాలు, ప్రసిద్ధా లైన రత్నాభరణాలు కలవారు; కౌరవ, పుంగవులు= కురు వంశంలో పుట్టినవారిలో శ్రేష్ఠులైన పాండవులు; ఏవురున్= ఐదుగురు; ఏతెంచిరి= వచ్చారు; అంతన్= అప్పుడు; పూర్ణ+ఇందు, వదన= నిండు చంద్రునివంటి ముఖం కలది, అధిక, విదగ్ధ, పుణ్యాంగనా, విరచిత, లలిత, ప్రసాధన+అలంకృత+అంగి= మిక్కిలి నేర్పరు లైన ముత్తైదువులచేత కూర్చబడిన అంద మైన అలంకారాలచేత అలంకరించబడిన అవయవాలు కలది; కమల+అక్షి= కమలాలవంటి కన్నులు కలది; ఆ, ద్రుపద, తనయ= ఆ ద్రౌపది; కమనీయ, కాంతా, సహస్రంబుతోన్= అందమైన స్త్రీలు వేయిమందితో; చనుదెంచెన్= వచ్చెను; భూరి, భూసుర+ఇంద్ర, పుణ్యాహధ్వని= బ్రాహ్మణశ్రేష్ఠుల పుణ్యాహవచనాల అధికమైన ధ్వని; మంగళ, ప్రగీత, మధుర, రవము= మంగళగానాలయొక్క మధురమైన ధ్వని; వివిధ, తూర్య, వేణు, వీణా, రవంబును= వివిధాలైన వాద్యాలయొక్క, పిల్లనగ్రోవులయొక్క, వీణలయొక్క ధ్వని; విభవ, యుక్తిన్= వైభవంతో; దిశలన్=దిక్కులలో; విస్తరిల్లెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: పుణ్యాత్ములు, మంగళస్నానం చేసినవాళ్ళు, తగినవేషం, ప్రసిద్ధమైన రత్నాభరణాలు ధరించినవాళ్ళు, కురువంశశ్రేష్ఠులు అయిన పాండవులు అయిదుగురు వచ్చారు. అప్పుడు నిండుచంద్రుని ముఖంవంటి ముఖం కలది, మిక్కిలినేర్పరులైన ముత్తైదువులచేత అలంకరించబడిన అవయవాలు కలది, కమలాలవంటి కన్నులు కలది అయిన ద్రౌపది అందమైన స్త్రీలు వేయిమందితో కలిసి వచ్చింది. పెక్కుమంది బ్రాహ్మణశ్రేష్ఠుల పుణ్యాహధ్వని, మంగళగీతాల మధురధ్వని, పిల్లనగ్రోవుల, వీణల వివిధవాద్యాలధ్వని - మహావైభవంతో దిక్కులకు వ్యాపించాయి.

క. వితత ప్రదక్షిణావ । ర్తితదీప్త శిఖానలమున ధృతి వేల్చెఁ బురో
హితుఁ డగు ధౌమ్యుఁడు బుధ స । మ్మతుఁడు వివాహప్రయుక్త మంత్రాహుతులన్. 285

ప్రతిపదార్థం: బుధ, సమ్మతుఁడు= పండితులకు ఇష్టమైనవాడు; పురోహితుఁడు; అగు; ధౌమ్యుఁడు; వివాహ; ప్రయుక్త, మంత్ర+ ఆహుతులన్= పెండ్లికొరకు చేయవలసిన మంత్రపూర్వకా లైన ఆహుతులను; ధృతిన్= సంతోషంతో; వితత, ప్రదక్షిణ+ఆవర్తిత, దీప్త, శిఖా+అనలమునన్= విస్తరిల్లి ప్రదక్షిణంగా చుట్టు తిరిగిన వై మండు మంటలు కల అగ్నియందు; వేల్చెన్= దహనమయ్యేటట్లు చేశాడు.

తాత్పర్యం: పండితులకు ఇష్టమైనవాడు, పురోహితుడు అయిన ధౌమ్యుడు వివాహసమయంలో చేయవలసిన మంత్రపూర్వకాలైన ఆహుతులను - విస్తరిల్లి ప్రదక్షిణంగా చుట్టు తిరిగి మండే మంటలున్న అగ్నిహోత్రంలో దహన మయ్యేటట్లు వేశాడు.

విశేషం: వేదధర్మోద్ధరణ మహాభారతరచనాలక్ష్యాలలో ప్రధానమైనది కనుక వైదికాంశాలు, వేదోక్త క్రియాకలాపాలు కథలో ఎక్కడ వచ్చినా నన్నయ విశేషించి ప్రవర్తిస్తాడు. వేదోక్తంగా సాగిన ద్రౌపదీపాండవుల వివాహవైభవవిపులవర్ణన అట్లాంటిదే.

వ. ఇట్లు వేల్చి ముందఱ ధర్మపుత్రునకు ద్రుపదరాజపుత్త్రిం బాణిగ్రహణంబు సేయించి, తొల్లి యేవురకు వివాహంబు సేయునప్పుడు కన్యాత్వంబు దూషితంబు గాకుండ నీశ్వరువరంబునం గౌమారంబు వడసిన యక్కన్యకం గ్రమంబున భీమార్జున నకుల సహదేవులకుం బాణిగ్రహణంబు సేయించిన. 286

ప్రతిపదార్థం: ఇట్లు; వేల్చి= ఆహుతులువేసి; ధర్మపుత్రునకున్; ద్రుపదరాజు; పుత్త్రిన్= ద్రౌపదిని; పాణిగ్రహణంబు= వివాహం; చేయించి; తొల్లి= పూర్వం; ఏవురకున్= ఐదుగురకు; వివాహంబు, చేయునప్పుడు; కన్యాత్వంబు= కన్నెరికం; దూషితంబు, కాకుండన్= చెడకుండ; ఈశ్వరు, వరంబునన్= ఈశ్వరుని వరముచే; కౌమారంబు= కన్యాత్వం; పడసిన= పొందిన; ఆ+కన్యకన్= ఆ కన్యను; క్రమంబునన్ =క్రమంగా; భీమ+అర్జున, నకుల, సహదేవులకున్; పాణిగ్రహణంబు= వివాహం; చేయించినన్= కావింపగా.

తాత్పర్యం: ఈ విధంగా ఆహుతులువేసి, మొదట ధర్మజునికి ద్రౌపది నిచ్చి వివాహం చేయించాడు. అయిదుగురిని వివాహం చేసికొన్నా కన్యాత్వం చెడకుండ ఈశ్వరునివలన పూర్వం వరంపొందినద్రౌపది మళ్ళీ కన్యాత్వం పొందగా, ఆమెను వరుసగా భీమార్జుననకులసహదేవుల కిచ్చి వివాహం చేయించాడు. అప్పుడు.

తే. జనుల ఆశీరవంబును జదలఁ దివురు । దేవ దుందుభినాదంబు దివ్యగంధ
మందగంధవహామోదమానకుసుమ । వృష్టియును మహాముదముతో విస్తరిల్లె. 287

ప్రతిపదార్థం: జనుల, ఆశీరవంబును= జనులయొక్క ఆశీర్వాదధ్వని; చదలన్= ఆకాశమున; తివురు= మ్రోగునట్టి; దేవ, దుందుభి, నాదంబు= దేవతల యొక్క భేరులయొక్క ధ్వని; దివ్య, గంధ, మంద, గంధవహ+ఆమోదమాన, కుసుమ, వృష్టియును= మంచివాసన కల మెల్లని గాలిచే పరిమళిస్తున్న పూలవాన; మహా, ముదముతోన్= మిక్కిలి సంతోషంతో; విస్తరిల్లెన్= అతిశయించాయి.

తాత్పర్యం: జనుల ఆశీర్వాద ధ్వని, ఆకాశంలో మ్రోగే దేవతల భేరుల ధ్వని, మంచివాసన కల మందమారుతంతో పరిమళించే పూలవాసన మిక్కిలిసంతోషంతో అతిశయించాయి.

వ. అని వైశంపాయనుండు జనమేజయునకుం జెప్పె నని. 288

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; వైశంపాయనుండు; జనమేజయునకున్= జనమేజయునికి; చెప్పెన్, అని= చెప్పాడని.

తాత్పర్యం: అని వైశంపాయనుడు జనమేజయునికి చెప్పా డని.

ఆశ్వాసాంతము

క. విద్యావిలాస ! పార్థివ । విద్యాధర ! నిఖిలరాజవిద్యానిధి ! శీ
తద్యుతి విశదయశః ప్రస । రద్యోతిత సర్వలోక! రాజమహేంద్రా! 289

ప్రతిపదార్థం: విద్యా, విలాస= విద్యలచేత ప్రకాశించేవాడా!; పార్థివ, విద్యాధర=రాజులలో విద్యాధరుడైన జీమూతవాహనుని వంటివాడా! - అనగా మహాదాతా అని భావం; నిఖిల, రాజవిద్యా, నిధి= అన్ని రాజవిద్యలకు నిధియైనవాడా!; శీత, ద్యుతి, విశద, యశస్, ప్రసర, ద్యోతిత, సర్వలోక= చల్లనికాంతి కల చంద్రునివలె తెల్లనికీర్తియొక్క వ్యాప్తిచేత ప్రకాశింప చేయబడిన అన్ని లోకాలు కలవాడా!; రాజమహేంద్రా= ఓ రాజరాజ నరేంద్రా!

తాత్పర్యం: విద్యలలో ప్రకాశించేవాడా! రాజులలో విద్యాధరుడైన జీమూతవాహనునివంటివాడా! అన్ని రాజవిద్యలకు నిధివైనవాడా! చంద్రునివలె తెల్లని కీర్తియొక్క వ్యాప్తితో అన్నిలోకాలను ప్రకాశింప చేసినవాడా! ఓ రాజరాజ నరేంద్రా!

స్వాగతము.

రాజరాజ ! గుణరాజిత ! రాజ । త్తేజ! రాజకులదీప ! విశిష్టాం
భోజమిత్ర! నృపపూజిత పాదాం । భోజ! భూవినుత! పుణ్యవరేణ్యా! 290

ప్రతిపదార్థం: రాజరాజ!= రాజరాజుఅనే పేరుగలవాడా!; గుణ; రాజిత= మంచి గుణాలచేత ప్రకాశించేవాడా!; రాజత్+తేజ= ప్రకాశించే పరాక్రమం కలవాడా!; రాజ, కుల, దీప= రాజవంశంలో దీపమువంటివాడా!; విశిష్ట+అంభోజ, మిత్ర= సదాచార సంపన్నులు అనే కమలాలకు సూర్యుడి వంటివాడా!; నృప, పూజిత, పాద+అంభోజ= రాజులచేత పూజింపబడిన పద్మాలవంటి పాదాలు కలవాడా!; భూ, వినుత= లోకంచేత కొనియాడబడేవాడా!; పుణ్య, వరేణ్యా= పుణ్యాత్ములలో శ్రేష్ఠుడా!

తాత్పర్యం: రాజరాజ! మంచిగుణాలతో ప్రకాశించేవాడా! ప్రకాశించేపరాక్రమం కలవాడా! రాజవంశంలో దీపం వంటివాడా! సదాచారసంపన్నులు అనే కమలాలకు సూర్యునివంటివాడా! రాజుల పూజలందుకొన్న పాదపద్మాలు కలవాడా! లోకప్రశంసలు పొందినవాడా! పుణ్యాత్ములలో శ్రేష్ఠుడా!

విశేషం: ఈ వృత్తంలోని ప్రతిపాదంలో వరుసగా ర, న, భ, గగ అనే గణా లుంటాయి. 7వ అక్షరం యతిమైత్రి స్థానం.

గద్యము.

ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్ట ప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దాదిపర్వంబున ధృష్టద్యుమ్న ద్రౌపదీసంభవకథనంబును, గృష్ణద్వైపాయనసందర్శనంబును, గంగాతీరంబున నంగారపర్ణు నర్జునుండు

జయించుటయుఁ, దాపత్యవసిష్ఠౌర్వోపాఖ్యానంబును, ద్రౌపదీస్వయంవరంబును, బంచేంద్రోపాఖ్యానంబును, ద్రౌపదీవివాహంబును నన్నది సప్తమాశ్వాసము. **291**

తాత్పర్యం: ఇది, సకలసత్కవుల ప్రశంస లందుకొన్న నన్నయభట్టు రచించిన శ్రీమహాభారతంలో మొదటిదైన ఆదిపర్వంలో - ధృష్టద్యుమ్నద్రౌపదుల జన్మనుగూర్చి చెప్పటం, వేదవ్యాసమహామునీంద్రులను దర్శించటం, గంగాతీరంలో అంగారపర్ణుడిని అర్జునుడు జయించటం, తపతీసంవరణ, వసిష్ఠ, ఔర్వుల కథాకథనం, ద్రౌపదీ స్వయంవరం, పంచేంద్రోపాఖ్యానం, ద్రౌపదీవివాహం - అనే అంశాలు కల ఏడవఆశ్వాసం.

ఆదిపర్వంలో సప్తమాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము - అష్టమాశ్వాసము

శ్రీవిభవనిత్యనిలయ! ద । యావర్ధితధారుణీసురాన్వయ ! వేంగీ
భూవల్లభ! నిఖిలజగ । త్పావనశుభచరిత! భావభవనిభసుభగా! 1

ప్రతిపదార్థం: శ్రీ, విభవ, నిత్య, నిలయ= ఐశ్వర్యాతిశయానికి శాశ్వతస్థానమైనవాడా!; దయా, వర్ధిత, ధారుణీసుర+అన్వయ= దయతో వృద్ధిపొందించబడిన బ్రాహ్మణవంశాలు కలవాడా!; వేంగీ, భూ, వల్లభ= వేంగీదేశపురాజా!; నిఖిల, జగత్+పావన, శుభ, చరిత= లోకాలన్నింటినీ పవిత్రం చేసే శుభమైన నడవడి కలవాడా!; భావభవ, నిభ, సుభగా= మన్మథునితో సమానమైన సౌందర్యం కలవాడా!

తాత్పర్యం: ఐశ్వర్యాతిశయానికి శాశ్వతస్థానమైనవాడా! దయతో వృద్ధిపొందించిన బ్రాహ్మణవంశాలు కలవాడా! వేంగీదేశప్రభూ! లోకాలన్నింటినీ పవిత్రంచేసే శుభచరిత్ర కలవాడా! మన్మథునితో సమానమైన సౌందర్యం కలవాడా!

విశేషం: భావభవుడు - భావంలో పుట్టేవాడు మన్మథుడు. ఇది రాజరాజుయొక్క ప్రశంసాపూర్వకమైన ఆశ్వాసారంభపద్యం.

పాండవులు ద్రుపదరాజుపురంబున నిష్టోపభోగంబు లనుభవించుచు సుఖంబుండుట (సం.1-190-25)

వ. అ క్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె; నట్లు పాండవు లేవురకుం బాంచాలిం బరమోత్సవంబున వివాహంబు సేయించి ద్రుపదుం డయ్యేవురకు వేఱువేఱ యనర్ఘ్యమణిఖచితంబులైన యాభరణంబులను నపరిమితంబు లైన యర్థరాసులను, సౌవర్ణంబు లయిన శయ్యాసనపరికరంబులను, నూఱేసిభద్రగజంబులను, నూఱేసి కాంచనరథంబులను, వేయేసికాంభోజహయంబులను, పదివేవురేసి వరవస్త్రాభరణభూషితు లగు దాసదాసీజనంబులను, నూఱేసివేలు పాఁడిమొదవులను నగ్నిసాక్షికంబుగా నరణం బిచ్చిన. 2

ప్రతిపదార్థం: ఆ, కథకుండు= ఆ కథను చెప్పేవాడు - ఉగ్రశ్రవసుడు; శౌనక+ఆది, మహామునులకున్= శౌనకుడు మొదలైన మహామునులకు; చెప్పెన్; అట్లు; పాండవులు+ఏవురకున్= పాండవులు ఐదుగురకు; పాంచాలిన్= ద్రౌపదిని; పరమ+ఉత్సవంబునన్= మహావైభవంగా; వివాహంబు, చేయించి= పెండ్లి గావించి; ద్రుపదుండు= ద్రుపదుడు; ఆ+ఏవురకున్= ఆ ఐదుగురికి; వేఱువేఱు+అ= విడివిడిగా; అనర్ఘ్య, మణి, ఖచితంబులు, ఐన= వెలలేనిరత్నాలు పొదగబడినవైన; ఆభరణంబులనున్= భూషణాలను; అపరిమితంబులు+ఐన= పరిమితంకానివైన; అర్థ, రాసులను= ధనరాసులను; సౌవర్ణంబులు+అయిన= బంగారంతో చేయబడిన; శయ్యా+ఆసన, పరికరంబులను= పాన్పులు, పీటలు, ఇతరవస్తువులను; నూఱు+ఏసి= వందవంతున; భద్రగజంబులను= మదపుటేనుగులను; నూఱు+ఏసి= వందవంతున; కాంచన, రథంబులను= బంగారు రథాలను; వేయి+ఏసి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వేయి వంతున; కాంభోజ, హయంబులను= కాంభోజదేశపుగుర్రాలను; పదివేవురు+ఏసి= పదివేలమందివంతున; వర, వస్త్ర+ఆభరణ, భూషితులు+ అగు= శ్రేష్ఠాలైన వస్త్రాలతో సొమ్ములతో అలంకరిచబడినవాళ్ళయిన; దాన, దాసీ, జనంబులను= సేవకులను, పనిగత్తెలను; నూఱు+ఏసి, వేలు= లక్షవంతున; పాఁడి, మొదవులనున్= పాడి ఆవులను; అగ్ని, సాక్షికంబుగాన్= అగ్నిసాక్షిగా; అరణంబు= అల్లుడికి, కూతురికి ఇచ్చే సొమ్ముగా; ఇచ్చినన్= ఈయగా.

తాత్పర్యం: ఆ కథను చెప్పే ఉగ్రశ్రవసుడు, శౌనకుడు మొదలైన మహామునులకు చెప్పాడు; ఆ విధంగా పాండవులు అయిదుగురికి ద్రౌపదిని ఇచ్చి మహావైభవంగా వివాహం చేయించి, ద్రుపదుడు ఆ అయిదుగురికి వేరువేరుగా ఎంతో విలువైన మణులు పొదిగినఆభరణాలను, బంగారంతో చేసినపానుపులను, పీటలను, ఇతరవస్తువులను, నూరేసి మదపుటేనుగులను, నూరేసి బంగారు రథాలను, వేయేసి కాంభోజ దేశపు గుర్రాలను, శ్రేష్ఠమైన వస్త్రాలతో అలంకరించిన పదివేలదాసదాసీజనాలను, లక్షపాడిఆవులను అరణంగా ఇచ్చాడు.

క. చతురుదధివలయ నిఖిల । క్షితితలసామ్రాజ్యలక్ష్మి కిని మూలం బై
సతి యాజ్ఞసేని పతులకు । నతిముద మొనరించెఁ దుల్యమగు శుశ్రూషన్. 3

ప్రతిపదార్థం: చతుః+ఉదధి, వలయ, నిఖిల, క్షితి, తల, సామ్రాజ్యలక్ష్మికిని= నాలుగుసముద్రాలు చుట్టుకొని ఉన్న సమస్త భూమండలంయొక్క సామ్రాజ్యాధికారసంపదకు; మూలంబు+ఐ= కారణమై; సతి, యాజ్ఞసేని= పతివ్రత అయిన ద్రౌపది; తుల్యము+అగు= సమానమైన; శుశ్రూషన్= సేవతో; పతులకున్= భర్తలకు; అతి, ముదము= మిక్కిలి సంతోషాన్ని; ఒనరించెన్= కలిగించింది.

తాత్పర్యం: నాలుగుసముద్రాలు చుట్టుకొనిఉన్న సమస్తభూమండల సామ్రాజ్యాధికారసంపదకు కారణమై పతివ్రతద్రౌపది, సమానంగా సేవచేసి భర్తలందరికీ మిక్కిలిసంతోషాన్ని కలిగించింది.

సీ. కోడలి యుత్తమ గుణముల కెంతయు । సంతుష్టచిత్త యై కుంతిదేవి
'లలితాంగి! హరియందు లక్ష్మిని, మఱి చంద్రు । నందు రోహిణి, నింద్రునందు శచిని
నవ్వసిష్ఠమునీంద్రునం దరుంధతిఁ బోలి । సుందరి! నీపతులందుఁ బ్రీతిఁ
బతిభక్తి యొప్ప నపత్యంబుఁ బడయుము; । గురు వృద్ధబాంధవాతుర విశిష్ట

ఆ. జనుల నతిథిజనుల సతతంబుఁ బూజింపు, । మన్నదానమున ధరామరేంద్ర
వరులఁ దనుపు, మఖిలవసుమతీప్రజ కెల్లఁ । గరుణ గలుగు మమ్మ కమలనేత్ర! 4

ప్రతిపదార్థం: కోడలి, ఉత్తమ, గుణములకున్, ఎంతయు, సంతుష్టచిత్త ఐ, కుంతిదేవి; లలిత+అంగి!= సుకుమారమైన శరీరం కలదానా!; హరియందున్= విష్ణుమూర్తియందు; లక్ష్మిని; మఱి, చంద్రుని, అందున్; రోహిణిన్; ఇంద్రుని, అందున్; శచినిన్= శచీదేవిని; ఆ+వసిష్ఠముని+ఇంద్రు, అందున్; అరుంధతిన్; పోలి; సుందరి!; నీ పతుల, అందున్; ప్రీతిన్= ప్రేమతో; పతి, భక్తి; ఒప్పన్; అపత్యంబున్= సంతానాన్ని; పడయుము= పొందుము; గురు, వృద్ధ, బాంధవ+ఆతుర+విశిష్టజనులన్= గురువులను, వృద్ధులను, బంధువులను, రోగులను, పూజ్యులను; అతిథిజనులన్= అతిథులుగా విచ్చేసినవారిని; సతతంబున్= ఎల్లప్పుడు; పూజింపుము; అన్న, దానమునన్= అన్నదానంతో; ధర+అమర+ఇంద్ర, వరులన్= బ్రాహ్మణ శ్రేష్ఠులను; తనుపుము= తృప్తిపరచుము; కమల, నేత్ర= పద్మాలవంటి కన్నులు కలదానా!; అఖిల, వసుమతీ, ప్రజకు+ఎల్లన్= సమస్త భూమండలంమీది ప్రజలందరికీ; కరుణ= దయ; కలుగుము+అమ్మ= కలిగి ఉండుము తల్లీ!

తాత్పర్యం: కుంతీదేవి, కోడలి ఉత్తమగుణాలకు ఎంతో సంతోషించి, 'ద్రౌపదీ! విష్ణుమూర్తిపై లక్ష్మీదేవివలె, చంద్రునిమీద రోహిణీదేవివలె, ఇంద్రునిమీద శచీదేవివలె, వసిష్ఠునిపై అరుంధతివలె నీ భర్తల మీది ప్రేమతో పతిభక్తి ప్రకాశించగా సంతానాన్ని పొందుము. గురువులను, వృద్ధులను, బంధువులను, రోగులను, పూజ్యులను, అతిథులను అన్నివేళలా పూజించుము. అన్నదానంతో శ్రేష్ఠులైన బ్రాహ్మణులను తృప్తిపెట్టుము. భూమిమీదిప్రజలందరిపట్ల దయ కలిగి ఉండుము.

ఉ. పూని పరాక్రమం బెసఁగ భూతలనాథుల నోర్చి, వీరు లై
యీ నవఖండమండితమహీతల మేలుచు, నీపతుల్ పయో
జానన! రాజసూయమఖ మాదిగ నధ్వరపంక్తి సేయుచో
మానుగఁ బత్ని వీ వగుము మానితధర్మవిధానయుక్తితోన్. 5

ప్రతిపదార్థం: పయోజ+ఆనన= పద్మంవంటి ముఖం కలదానా!; నీ, పతుల్= నీ భర్తలు; పూని= ప్రయత్నించి; పరాక్రమంబు; ఎసఁగన్= అతిశయించగా; భూతలనాథులన్= రాజులను; ఓర్చి= జయించి; వీరులు+ఐ= పరాక్రమముకలవారై ఈ, నవ ఖండ, మండిత, మహీతలము= ఈ తొమ్మిది దీవులతో అలంకరించబడిన భూమండలాన్ని; ఏలుచున్= పాలించుచు; రాజసూయ, మఖము+ఆదిగన్= రాజసూయయాగం మొదలైన; అధ్వర, పంక్తి= యాగాల సమూహం; చేయుచో; ఈవు= నీవు; మానిత, ధర్మ, విధానయుక్తితోన్= గౌరవించబడిన ధర్మపద్ధతియొక్క కూడికతో; మానుగన్= ఒప్పుగా; పత్నివి= యజ్ఞంవంటి ధర్మకార్య సంబంధం కల భార్యవు; అగుము= కావలసింది.

తాత్పర్యం: పద్మంవంటిముఖం కల ఓ ద్రౌపదీ! నీ భర్తలు పూనికతో, పరాక్రమాతిశయంతో రాజులను జయించి, వీరులై, ఈ తొమ్మిదిదీవులతో అలంకరించబడిన భూమండలాన్ని పరిపాలిస్తూ రాజసూయయాగం మొదలైన అనేకయాగాలు చేసేటప్పుడు, నీవు వాళ్ళ ధర్మపత్నిగా ఉండుము.

విశేషం: నవఖండాలు- భరత, ఇంద్ర, పురు, గభస్తి, నాగ, తామ్ర, వారుణ, సౌమ్య, గంధర్వ ఖండాలు. జాయ, దార, కళత్రం, పత్ని- మొదలైనవి 'భార్యకు' పర్యాయపదాలే అయినా యజ్ఞంవంటి ధర్మకార్యాలలో భర్తప్రక్కన కూర్చుండి పాలుపంచుకొనే భార్యనే ప్రత్యేకించి 'పత్ని' అనటం ఉన్నది. తన పుత్రులు రాజసూయం చేయాలనేభావం ఆ రాజమాత అయిన కుంతీదేవి హృదయంలో ఇంతముందుగా మొసులెత్తింది. పాండవుల భవిష్యదుజ్జ్వల జీవితాన్నిగురించి ఆకాశవాణి, దేవతలు, వ్యాసాది మహర్షులు చెప్పినవాక్యాలు ఆమె ఆశలకు, ఆశయాలకు ఆలంబనాలై ఉంటాయి. ఆ రాజసూయం మహాభారతకథనే మలుపు తిప్పింది.

క. 'ఇందీవరలోచన! నీ । యం దే నభినందితాత్మ నైనట్టులు నీ
నందనులయందుఁ బౌత్రుల । యందును నభినంద్య వగుమ' యని దీవించెన్. 6

ప్రతిపదార్థం: ఇందీవర, లోచన= నల్లకలువలవంటి కన్నులు కలదానా!; ఏను= నేను; నీయందు; అభినందిత+ఆత్మను= సంతోషించిన మనస్సు కలదానిని; ఐన, అట్టులు= అయినవిధంగా; నీ, నందనుల, అందున్= నీ కుమారులలో; పౌత్రుల, అందున్= మనుమలలో; అభినంద్యవు= సంతోషించదగినదానివి; అగుము+అ; అని, దీవించెన్= కమ్మని దీవించింది.

తాత్పర్యం: 'నల్లకలువలవంటి కన్నులు కల ఓ ద్రౌపదీ! నేను నిన్ను పొంది సంతోషించినట్లే, నీవు కూడా నీ కొడుకులను, మనుమలను పొంది సంతోషించు' అని దీవించింది.

విశేషం: "నీవు సంతోషించదగిన యోగ్యులైన కొడుకులు, మనుమలు నీకు కలుగుదురు గాక"! అని కుంతీదేవి దీవెన. ఏ స్త్రీమూర్తికైనా జీవితంలో ఇది గొప్ప దీవెనే.

వ. అట వాసుదేవుండు ద్రౌపదిని బాండవు లేవురు వివాహం బగుట విని సంతసిల్లి, వా రేవురకు వజ్ర వైడూర్య మరకత మౌక్తిక విభూషణంబులును, నానాదేశవిచిత్రవస్త్రంబులును, ననేకకరితురంగరథరత్న శిబికావిలా సినీనివహంబులుం బుత్తెంచిన. 7

ప్రతిపదార్థం: అట= అక్కడ; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; ద్రౌపదిని; పాండవులు; ఏవురు= ఐదుగురు; వివాహంబు+అగుట= పెండ్లిచేసుకొనుట; విని= ఆలకించి; సంతసిల్లి; వారు+ఏవురకున్= ఆ పాండవులైదుగురికి; వజ్ర, వైడూర్య,మరకత, మౌక్తిక, విభూషణంబులును= వజ్రాలు, వైడూర్యాలు, మరకతం, ముత్యాల ఆభరణాలు; నానాదేశ; విచిత్ర, వస్త్రంబులునున్= అనేక దేశాలకు సంబంధించిన విచిత్రవస్త్రాలు; అనేక, కరి, తురంగ, రథ, రత్న, శిబికా, విలాసినీ, నివహంబులున్= పెక్కు ఏనుగుల, గుర్రాల, రథాల, రత్నాల, పల్లకీల, వేశ్యల సమూహాలను; పుత్తెంచిన= పంపిన.

తాత్పర్యం: పాండవులైదుగురు ద్రౌపదిని వివాహమాడటం విని ద్వారకలో ఉన్న శ్రీకృష్ణుడు సంతోషించాడు. ఆ అయిదుగురికి వజ్రాలు, వైడూర్యాలు, మరకతాలు, ముత్యాలు పొదిగిన ఆభరణాలను, వివిధ దేశాలకు సంబంధించిన చిత్రవిచిత్రాలైన వస్త్రాలను, ఎన్నో ఏనుగుల, గుర్రాల, రథాల, రత్నాల, పల్లకీల, వేశ్యల సమూహాలను పంపించాడు.

చ. విలసిత రాజ్యలీలఁ బరవీరభయంకరు లై గుణంబులన్
వెలయుచుఁ బాండవుల్ విదితవిక్రము లుండుటఁజేసి దేవతా
దులవలనన్ భయంబు ద్రుపదుం డెఱుఁగండ; తదీయదేశముల్
దలరక యొప్పె రోగ భయ తస్కర డామర వర్జితంబు లై. 8

ప్రతిపదార్థం: విలసిత, రాజ్య, లీలన్= ప్రకాశిస్తున్న రాజ్యాధికారవిలాసంతో; పర, వీర, భయంకరులు+ఐ= శత్రువీరులకు భయాన్ని కలిగించేవాళ్ళయి; గుణంబులన్= మంచిగుణాలతో; వెలయుచున్= ఒప్పుతూ (ప్రకాశిస్తూ); విదిత, విక్రములు= ప్రసిద్ధమైన పరాక్రమం కలవాళ్ళు; పాండవుల్; ఉండుటన్+చేసి= ఉండటంచేత; ద్రుపదుండు; దేవతా+ఆదుల, వలనన్= దేవతలు మొదలైన వారివలనకూడా; భయంబు= భీతిని; ఎఱుఁగండు+అ= పొందలేదు; దేశముల్= అతనియొక్క దేశాలు; రోగ భయ, తస్కర, డామర, వర్జితంబులు+ఐ= రోగభయంచేత, దొంగలచేత, కొల్లగొట్టుటచేత విడువబడినవై - అంటే రోగం, దొంగలు, కొల్లగొట్టటాలు లేనివై; తలరక= కలతపొందక; ఒప్పెన్= ప్రకాశించాయి.

తాత్పర్యం: వెలుగుతున్న రాజ్యాధికారవిలాసంతో, శత్రువీరులకు భయం కలిగించేవాళ్ళయి, సుగుణాలతో ప్రకాశిస్తూ, మహాపరాక్రమశాలులైన పాండవులు ఉండటంవలన ద్రుపదునికి దేవతలవలనకూడా భయం లేకుండా ఉన్నది. అతని దేశాలు - రోగాలు, దొంగలు, కొల్లగొట్టటాలు లేనివై కలతలేక సుఖంగా ఉన్నాయి.

చారులవలన పాండవుల యభ్యుదయమును విని దుర్యోధనుఁడు నిర్వేదించుట (సం.1-191-1)

వ. ఇట్లు పాండవులు ద్రుపదుపురంబున నఖిలరాజ్యవిభవసమన్వితు లయి యొక్క సంవత్సరం బుండునంత నంతయు నెఱింగి దుర్యోధనగూఢచారు లరిగి కర్ణదుశ్శాసనసౌబలసోమదత్తపరివృతుం డయి యున్న దుర్యోధనునకు మ్రొక్కి యి ట్లనిరి. 9

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవులు= పాండుకుమారులు; ద్రుపదు, పురమునన్= ద్రుపదునినగరంలో; అఖిల, రాజ్య, విభవ, సమన్వితులు+అయి= సమస్తరాజ్యవైభవంతో కూడుకొన్నవాళ్ళయి; ఒక్క, సంవత్సరంబు; ఉండునంతన్= ఉండగా; అంతయున్= అంతా; ఎఱింగి= తెలిసికొని; దుర్యోధన, గూఢ+చారులు= దుర్యోధనునివేగులవాళ్ళు; అరిగి= వెళ్ళి; కర్ణ, దుశ్శాసన, సౌబల, సోమదత్త, పరివృతుండు+అయి= కర్ణ దుశ్శాసన శకుని సోమదత్తులచే కొలువబడినవాడై, ఉన్న= ఉండు దుర్యోధనునకున్; మ్రొక్కి; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ఈ విధంగా పాండవులు ద్రుపదునినగరంలో సమస్తరాజ్యవైభవంతో ఒక్కసంవత్సరం ఉండగా; విషయాన్నంతా తెలిసికొని దుర్యోధనునివేగులవాళ్ళు, హస్తినాపురానికి వెళ్ళి, కర్ణ దుశ్శాశన శకుని సోమదత్తులు చుట్టూ చేరి ఉండగా, కొలువున్న దుర్యోధనునికి మ్రొక్కి ఇట్లా అన్నారు.

సీ. కర్ణశల్యులు మొదల్గాఁ గల భూపతు । లత్యంత బలవంతు లస్త్రవేదు
లుద్ధతుల్ మోపెట్టనోపని చాప మ । శ్రమమున మోపెట్టి, చదలఁ దిరుగు
నయ్యంత్ర మేసి, మీయందఱముందరఁ । గృష్ణఁ దోడ్కొని యొక్క కృష్ణవర్ణుఁ
డెక్కటి రణములో నేపునఁ గానీను । నోడించి జయలీల నున్న యాతఁ

ఆ. డర్జునుండు; మఱిమహాబాహుబలమున । శల్యుఁ ద్రెళ్ల వైచి శత్రువరుల
నెల్లఁ దల్లడిల్ల నెగచిన యాతండు । భీమసేనుఁ డమితభీమబలుఁడు. 10

ప్రతిపదార్థం: కర్ణ, శల్యులు= కర్ణుడు, శల్యుడు; మొదల్, కాన్+కల= ఆదిగా ఉన్న; భూపతులు= రాజులు; అత్యంత, బలవంతులు= మిక్కిలి బలముకలవాళ్లు; అస్త్ర, వేదులు= అస్త్రవిద్యను ఎరిగినవాళ్ళు; ఉద్ధతుల్= గర్వించినవాళ్ళు; మోపెట్టన్= ఎక్కుపెట్టటానికి; ఓపని= సాధ్యంకాని; చాపము= ధనుస్సును; అశ్రమమునన్= సులువుగా; మోపెట్టి= ఎక్కుపెట్టి; చదలన్= ఆకాశంలో; తిరుగు, ఆ+యంత్రము= కదిలే ఆ మత్స్యయంత్రాన్ని; ఏసి= కొట్టి; మీ, అందఱ ముందరన్= మీ అందరి సమక్షంలో; కృష్ణన్= ద్రౌపదిని; తోడ్కొని= తీసికొని; ఎక్కటి, రణములోన్= ద్వంద్వయుద్ధంలో; ఏపునన్= పరాక్రమంతో; కానీనున్= కన్యాపుత్రుడు అయిన కర్ణుడిని; ఓడించి; జయ, లీలన్= జయముయొక్కవిలాసంతో; ఉన్న= ఉండే, ఆతఁడు= అతడు; ఒక్క= ఆ ఒకే ఒక్క; కృష్ణవర్ణుఁడు= నల్లటికాంతికలవాడు; అర్జునుండు; మఱి= ఇక; మహా, బాహు, బలమునన్= గొప్ప భుజబలంతో; శల్యున్= శల్యుణ్ణి; త్రెళ్ళ, వైచి= పడవేసి; శత్రు, వరులన్= మేటి శత్రువులందరిని; తల్లడిల్లన్= భయపడగా, బాధపడగా; ఎగచిన= తరిమిన; ఆతండు; అమిత, భీమ, బలుఁడు= అంతులేనిభయంకరమైన బలం కలవాడు; భీమసేనుఁడు;

తాత్పర్యం: మహాబలవంతులు, అస్త్రవిద్యావేత్తలు, గర్వితులు అయిన కర్ణుడు, శల్యుడు మొదలైన రాజులంతా ఎక్కుపెట్టలేని ధనుస్సును సులభంగా ఎక్కుపెట్టి, ఆకాశంలో తిరిగే మత్స్యయంత్రాన్ని కొట్టి, అందరిఎదుట ద్రౌపదిని చేపట్టి, ద్వంద్వయుద్ధంలో తన పరాక్రమం ప్రకాశించేటట్లు కర్ణుడిని ఓడించి విజయవిలాసంతో ఉన్న ఆ

నల్లటివాడు - అర్జునుడు. గొప్ప భుజబలంతో శల్యుడిని పడవేసి, మేటిశత్రువులందరినీ తల్లడిల్లజేసి తరిమిన, ఆ మహాభయంకరమైన బలం గలవాడు భీముడు.

చ. 'అనిమొన నట్లు దాఁకిన మహారథులన్ ధృతరాష్ట్రరాజనం
దనుల బలాఢ్యులన్ దళితదర్పులఁ జేసినవారు ధర్మనం
దనయము లుగ్రవీరు' లని తద్విధమంతయు నేర్పడంగఁ జె
ప్పిన విని కౌరవప్రభుఁడుఁ బెల్కుఱి తద్దయు దుఃఖితాత్ముఁ డై. 11

ప్రతిపదార్థం: అని, మొనన్= యుద్ధంమొదట; అట్లు; తాఁకిన= ఎదుర్కొన్న; మహారథులన్= గొప్పయోధుల్ని; బల+ఆఢ్యులన్= బలవంతులను; ధృతరాష్ట్రరాజ, నందనులన్= ధృతరాష్ట్రమహారాజు కుమారులను; దళిత, దర్పులన్= ఖండింపబడిన గర్వం కలవాళ్ళనుగా - అంటే అణచివేయబడిన గర్వం కలవాళ్ళనుగా; చేసినవారు= చేసినవాళ్ళు; ఉగ్రవీరులు= భయంకరమైన పరాక్రమం కలవాళ్ళు; ధర్మనందన, యములు= ధర్మరాజు, కవల లైన నకులసహదేవులు; అని= ఆ ప్రకారం; తత్+విధము= ఆ విధం; అంతయున్, ఏర్పడంగన్= స్పష్టం అయ్యేటట్లు; చెప్పినన్= చెప్పగా; విని; కౌరవ, ప్రభుఁడున్= దుర్యోధనుడు కూడ; పెల్కుఱి= వెలవెలపోయి; తద్దయున్= మిక్కిలి; దుఃఖిత+ఆత్ముఁడు+ఐ= దుఃఖించిన మనస్సు కలవాడై.

తాత్పర్యం: యుద్ధప్రారంభంలో ఆ విధంగా ఎదుర్కొని మహారథులూ, బలవంతులూ అయిన ధృతరాష్ట్ర మహారాజుకుమారులగర్వాన్ని అణచినవాళ్ళు - ధర్మజ నకుల సహదేవులనీ, ఆ విషయాన్నంతా స్పష్టంగా చెప్పగా విని, దుర్యోధనుడు వెలవెలబోయి మిక్కిలి దుఃఖించాడు.

విశేషం: ఈ వివరాలు ద్రౌపదీస్వయంవరఘట్టంలో చెప్పకుండ ఇక్కడ చారులచేత చెప్పించటంవలన పునరుక్తిదోషం కలుగకుండ విశేష వృత్తాంతాన్ని ప్రతిపాదించి కథాంశాలకు ఉత్కంఠ నాపాదించటం జరిగింది. ఈ వివరణ లేకపోతే ధర్మరాజు, నకులసహదేవులు సభను వీడి ఎందుకు ముందుగానే వెళ్ళారో, భీము డొక్కడే సభలో ఎందుకు ఆగాడో తెలియదు. ఇప్పుడు స్వయంవర ఘట్టంలో పాండవులు కూడబలుకుకొని కార్యాన్ని సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించినట్లు స్పష్టమవుతున్నది.

వ. 'అక్కట! పురోచనుం డొక్కరుండ లక్కయింట దగ్ధుం డయ్యెం గా కేమి; దైవానుకూల్యంబు లేక మానుషం బెంతయయ్యు నేమి సేయుఁ; బాండవు లేమిదైవసంపన్నులైరో యని వగచి, యీ యవసరంబున ద్రుపదు భేదించి పాండవుల నుత్సాదింపవలయు నె ట్లనిన. 12

ప్రతిపదార్థం: అక్కట= అయ్యో!; పురోచనుండు; ఒక్కరుండు+అ= ఒక్కడే; లక్కయింటన్= లక్కఇంటిలో; దగ్ధుండు+ అయ్యెన్= కాలిపోయాడు; కాక+ఏమి= కాబోలు; దైవ+అనుకూల్యంబు= దైవముయొక్కతోడ్పాటు; లేక= లేకుండా; మానుషంబు= మానవప్రయత్నం; ఎంత, అయ్యున్= ఎంతయినా; ఏమి, చేయున్= ఏమి చేయగలదు!; పాండవులు; ఏమి= ఎంత; దైవసంపన్నులు+ ఐరో= దైవబలసంపదతో కూడినవాళ్ళు అయ్యారో; అని= ఆ విధంగా; వగచి= విచారించి; ఈ, అవసరంబునన్= ఈ సమయంలో; ద్రుపదున్, భేదించి= ద్రుపదుడిని వేరుచేసి; పాండవులన్; ఉత్సాదింపవలయున్= పెకలించాలి; ఎట్లు+అనినన్= ఏ విధంగా అంటే.

తాత్పర్యం: 'అయ్యో! పురోచనుడు ఒక్కటే లక్క ఇంటిలో మాడిపోయాడు కాబోలు! దైవం అనుకూలించకుంటే మానవప్రయత్నం ఎంత ఉన్నా ప్రయోజనం ఏమిటి? పాండవులు ఎంతదైవబలసంపన్నులో గదా!' అని చింతించి, ఈ సమయంలో ద్రుపదుడిని వేరు చేసి పాండవులను పెకలించివేయాలి. ఎట్లాగంటే.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

ఉ. యాదవవృష్ణిభోజవరు లందఱుఁ బాండవపక్షపాతు; ల
చ్చేదివిభుండు వారలన చేకొనువాఁడగు; వీరలెల్ల నా
త్మోదయవృద్ధి పొంటెను దదున్నతిఁ గోరుదు; రట్లు గావునన్
భేదము సేయఁగావలయుఁ బెల్చన యందఱుఁ గూడకుండఁగన్. 13

ప్రతిపదార్థం: యాదవ, వృష్ణి, భోజ, వరులు= యాదవ, వృష్ణి, భోజ(కుల)శ్రేష్ఠులు; పాండవపక్షపాతులు= పాండవులపై పక్షపాతం కలవాళ్లు; ఆ+చేది, విభుండు= ఆ చేది రాజైన శిశుపాలుడూ; వారలన్+అ= వారినే; చేకొనువాఁడు= చేపట్టేవాడు- అంటే వారి పక్షాన్నే గ్రహించేవాడు; అగున్= అగును; వీరలు+ఎల్లన్= వీళ్ళంతా; ఆత్మ+ఉదయ, వృద్ధిపొంటెను= తమ అభ్యుదయం యొక్క అభివృద్ధికంటె; తత్+ఉన్నతిన్= ఆ పాండవులయొక్క అభివృద్ధిని; కోరుదురు= కోరుతారు; అట్లు+కావునన్= అందువల్ల; అందఱు= వీళ్ల అంతా; కూడక+ఉండఁగన్= కలియకుండా ఉండేటట్లు; పెల్చనన్= వెంటనే; భేదము= వేర్పాటు; చేయఁగావలయున్= కలిగించాలి.

తాత్పర్యం: యాదవ వృష్ణి భోజ కుల శ్రేష్ఠులంతా పాండవ పక్షపాతులు. ఆ చేది రాజైన శిశుపాలుడుకూడా వాళ్ళ పక్షం వహించేవాడే. వీళ్ళంతా తమ అభ్యుదయంకంటె పాండవుల అభివృద్ధినే కోరుతారు. అందువలన వీళ్ళంతా ఒకటి కాకుండా భేదం కల్పించాలి.

విశేషం: పాండవులకు పెదతండ్రి కొడుకులైన దుర్యోధనాదులు శత్రువులయ్యారు. ద్రుపదరాజు పుత్రికను వివాహంచేసికొనటంవలన, పాండవులకు బంధువర్గం ఏర్పడింది. ఈ సంగతి వ్యాసు డిదివరకే సూచించాడు. పాండవ మిత్రులూ, బంధువులూ వారివారి స్వార్థాలకంటె పాండవుల అభ్యుదయాన్నే కోరుతారు. కౌరవపక్షం దానికి విరుద్ధం. వారికి స్వార్థమే లక్ష్యం. ఈ సంగతి తెలిసికొన్న దుర్యోధనుడు పాండవబలాన్ని అంచనావేసి, భయపడి, వాళ్ళపట్ల భేదోపాయాన్ని ప్రయోగించాలని యోచించాడు. కణికుడు బోధించిన శుక్రనీతి ప్రకారం శత్రువుల పట్ల భేదోపాయాన్ని ప్రయోగించటానికి దుర్యోధనుడు ప్రయత్నం చేస్తున్నాడు. (కణికనీతి. చూడు: ఆది. 6.119,120).

వ. అని దుర్యోధనుండు పాండవ పాంచాల విభేదనోపాయంబుఁ జింతించుచుండె; నంత విదురుండు పాండవాభ్యుదయంబును బాంచాలీస్వయంవరంబును దుర్యోధనాదులు భగ్నదర్పు లగుటయు విని సంతసిల్లి, పాండవులు ద్రుపదరాజపుత్త్రిం బెండ్లి యై ద్రుపదుపురంబున సుఖంబున్న వా రని ధృతరాష్ట్రునకుం జెప్పిన నతం డి ట్లనియె. 14

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; దుర్యోధనుండు; పాండవ, పాంచాల, విభేదన+ఉపాయంబున్= పాండవులను ద్రుపదుడిని వేరుపరచే ఉపాయాన్ని; చింతించుచుండెన్= ఆలోచిస్తూఉన్నాడు; అంతన్= అంతలో; విదురుండు= విదురుడు; పాండవ+

అభ్యుదయంబును= పాండవుల అభివృద్ధిని; పాంచాలీ, స్వయంవరంబును= ద్రౌపదీ స్వయంవరాన్ని; దుర్యోధన+ఆదులు= దుర్యోధనుడు మొదలైనవాళ్ళు; భగ్న; దర్పులు= పోయినగర్వం కలవాళ్ళు; అగుటయును= కావటం; విని= ఆలకించి; సంతసిల్లి; పాండవులు= పాండుకుమారులు; ద్రుపదరాజు, పుత్త్రిని= ద్రౌపదిని; పెండ్లి+ఐ= పెండ్లాడి; ద్రుపదు, పురంబునన్= ద్రుపదుని నగరంలో; సుఖంగా+ఉన్నవారు= సుఖంగా ఉన్నారు; అని= ఆ విధంగా; ధృతరాష్ట్రునకున్, చెప్పినన్= ధృతరాష్ట్రునికి చెప్పగా; అతండు= ఆ ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని దుర్యోధనుడు పాండవులను ద్రుపదునుండి వేరుచేసే ఉపాయాన్ని ఆలోచిస్తూ ఉన్నాడు. అంతలో విదురుడు పాండవుల అభ్యుదయాన్నీ, ద్రౌపదీస్వయంవరాన్నీ, దుర్యోధనుడు భంగపడటాన్ని విని సంతోషించి, పాండవులు ద్రౌపదిని పెండ్లిచేసికొని ద్రుపదుడినినగరంలో సుఖంగా ఉన్నారని ధృతరాష్ట్రునికి చెప్పగా, అతడు ఇట్లా అన్నాడు.

ఆ. యజ్ఞసేనుకూఁతు నభిజాత నాతని । యజ్ఞవేది నుదిత యయినదాని
ననఘవిధి వివాహ మయి పాండునందనుల్ । మిగుల మిత్త్రబలసమృద్ధు లయిరి. 15

ప్రతిపదార్థం: యజ్ఞసేనుకూఁతున్= ద్రుపదునికూతురిని; అభిజాతన్= ఉత్తమవంశం కలదానిని; అతని= ఆ ద్రుపదుని; యజ్ఞవేదిన్= యజ్ఞవేదికలో; ఉదిత, అయిన, దానిన్= పుట్టిన దానిని; అనఘ, విధిన్= దోషం లేని పద్ధతిలో; వివాహము+అయి= పెండ్లాడి; పాండు, నందనుల్= పాండుకుమారులు; మిగులన్= మిక్కిలి; మిత్ర, సమృద్ధులు= మిత్రబలంతో నిండినవాళ్ళు; అయిరి= అయ్యారు.

తాత్పర్యం: యజ్ఞవేదికలో పుట్టి, ఉత్తమవంశం కల ద్రౌపదిని చక్కగా వివాహమాడటంవలన పాండవులు మిక్కిలిమిత్రబలాన్ని పొందారు.

విశేషం: గృహస్థధర్మంలో ఉత్తమవంశంలో పుట్టి గుణవతి అయిన వధువుకుండే ప్రాధాన్యం ధృతరాష్ట్రునిమాటలో ధ్వనిస్తున్నది.

క. కొడుకుల యభ్యుదయము విని । కడు సంతస మయ్యె నిపుడు; కౌరవకుల మే
ర్పడ వెలిఁగె నెల్లరాజుల । నొడిచిన భుజవీర్యమున మహోత్సాహమునన్. 16

ప్రతిపదార్థం: కొడుకుల, అభ్యుదయము= కొడుకుల అభివృద్ధిగురించి; విని, కడు=మిక్కిలి; సంతసము+అయ్యెన్; ఇపుడు; కౌరవకులము= కౌరవవంశం; ఎల్ల, రాజులన్= అందరి రాజుల్ని; ఒడిచిన= ఓడించిన; భుజ, వీర్యమునన్; మహా+ఉత్సాహమునన్= గొప్ప ఉత్సాహంతో; ఏర్పడన్= స్పష్టంగా; వెలిఁగెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: పాండవుల అభివృద్ధినిగూర్చి వినటంవలన ఎంతోసంతోషం కలిగింది. ఇప్పుడు కౌరవవంశం రాజులందరినీ ఓడించిన భుజబలంతో, మహోత్సాహంతో బాగా ప్రకాశించింది.

వ. అని విదురునకు మనఃప్రియంబుగాఁ బలికి, యంతఃపురంబునకుం జని యంతస్తాపం బేర్పడకుండ నుండునంత; గర్ణ దుర్యోధనులు ధృతరాష్ట్రు పాలికిం జని యి ట్లనిరి. 17

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; విదురునకున్= విదురునితో; మనఃప్రియంబుగాన్= మనసుకు సంతోషం కలిగేటట్లు; పలికి, అంతఃపురంబునకున్= అంతఃపురానికి; చని= వెళ్ళి; అంతస్+తాపము= లోపలి దుఃఖం - అంటే మనస్సులోని

దుఃఖం; ఏర్పడకుండన్= బయటపడకుండా; ఉండున్, అంతన్= ఉన్న సమయంలో; కర్ణదుర్యోధనులు= కర్ణుడు, దుర్యోధనుడు; ధృతరాష్ట్ర, పాలికిన్= ధృతరాష్ట్రుని దగ్గరకు; చని= వెళ్ళి; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: అని విదురునిమనస్సుకు సంతోషం కలిగేటట్లు పలికి, అంతఃపురానికి వెళ్ళి, తనమనస్సులోని దుఃఖం బయటపడకుండా ఉండగా - కర్ణదుర్యోధనులు, ధృతరాష్ట్రునిదగ్గరకు వెళ్ళి ఇట్లా అన్నారు.

దుర్యోధనుఁడు తండ్రితోఁ బాండవపాంచాలవిభేదనోపాయంబు నాలోచించుట (సం.1-192-25)

క. రేయును బగలును విదురుఁడు । నీయొద్దన యునికిఁజేసి నేరము పలుకన్
మాయిష్టం బెఱిఁగింపఁగ । ధీయుత ! యెడఁ గంటి మిన్ని దివసంబులకున్. 18

ప్రతిపదార్థం: రేయును= రాత్రి; పగలును= పగలూ; విదురుఁడు; నీ, ఒద్దన= నీ ప్రక్కనే; ఉనికిన్+చేసి= ఉండటంచేత; పలుకన్, నేరము= చెప్పలేకపోయాము; ధీయుత= బుద్ధిబలంతో కూడినవాడా!; ఇన్ని, దివసంబులకున్= ఇన్నిరోజులకు; మా, ఇష్టంబు= మా కోరిక; ఎఱిఁగింపఁగన్= తెలపటానికి; ఎడన్= అవకాశాన్ని; కంటిమి= పొందాము.

తాత్పర్యం: రాత్రీ పగలూ విదురుడు నీ వద్దనే ఉండటంచేత మా మనస్సులోని మాట చెప్పలేకపోయాము. మేధావీ! మా కోరిక తెలపటానికి ఇన్నిరోజులకు అవకాశం ఏర్పడింది.

క. విదురుఁడు పాండవహితుఁ డని । మొదలన యెఱిఁగియును నతి విమోహంబున న
వ్విదురువచనంబ నిలుపుదు । హృదయంబున; నతఁడు పెద్దయిష్టుఁడు మీకున్. 19

ప్రతిపదార్థం: విదురుఁడు; పాండవ, హితుఁడు= పాండవుల మేలు కోరేవాడు; అని, మొదలన= అని స్పష్టంగా మొదటనే; ఎఱిఁగియును= తెలిసికూడా; అతి, విమోహంబునన్= మిక్కిలి అజ్ఞానంచేత; ఆ+విదురు, వచనంబు+అ= ఆ విదురునియొక్క మాటే; హృదయంబునన్= మనసులో; నిలుపుదు= నిలుపుకొంటావు; అతడు= ఆ విదురుడు; మీకున్; పెద్ద= మిక్కిలి; ఇష్టుఁడు= ఇష్టమైనవాడు.

తాత్పర్యం: విదురుడు పాండవుల మేలు కోరేవాడని మొదటనే తెలిసికూడా మిక్కిలి అజ్ఞానంతో ఆ విదురుడి మాటే మనస్సులో నిలుపుకొంటావు. అతడు మీకు బాగా ఇష్టమైనవాడు.

విశేషం: ఈ మాటలు ధృతరాష్ట్రుడిని వ్యంగ్యంగా నిష్ఠూరమాడుతున్నట్లున్నాయి. మనసును విరిచే మాటలు ఇట్లాగే ఉంటాయి.

వ. అనిన వారలకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. 20

ప్రతిపదార్థం: అనినన్= అని మాటాడగా; వారలకున్= ఆ కర్ణ దుర్యోధనులకు; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని అనగా వారితో ధృతరాష్ట్రుడు ఈ విధంగా అన్నాడు.

సీ. 'పలుకులఁ జెయ్వులఁ బాండవులకుఁ బ్రీతి । గలయట్ల యుండుదుఁగాని నాదు
హృదయంబు విదురున కెన్నండు నెఱిఁగింప; నేను మీతలఁచిన యివ్విధంబ

తలఁచుచు నుండుదు; దైవసంపద గల । వారలఁ బాండవవరుల నేమి

సేయంగ నగు? నెద్ది చెప్పుఁ డిష్టం బింక?' । ననిన విచిత్రవీర్యాత్మజునకు

ఆ. దుష్టచేష్టితుండు దుర్యోధనుం డిట్టు । లనియెఁ 'జిత్తగింపు మవనినాథ!

పాండురాజసుతులఁ బాంచాలపతియొద్ద । నుండకుండఁ జేయు టుచిత మిపుడు' **21**

ప్రతిపదార్థం: పలుకులన్= మాటలలో; చెయ్వులన్= చేతలలో; పాండవులకున్; ప్రీతి= ప్రీతి; కల, అట్లు+అ= ఉన్నట్లే; ఉండుదున్+కాని= ఉంటానుకానీ; నాదు, హృదయంబు= నా మనస్సు; విదురునకున్; ఎన్నండున్= ఎప్పుడుగానీ; ఎఱిఁగింపన్= చెప్పను; ఏను= నేను; మీ, తలఁచిన, ఈ+విధంబు+అ= మీరు ఆలోచించినట్లే; తలఁచుచున్= ఆలోచిస్తూ; ఉండుదున్= ఉంటాను; దైవ, సంపద= దైవబల సంపత్తి; కల= కలిగిన; వారలన్= వాళ్ళను; పాండవ, వరులన్= ఉత్తములైన పాండవులను; ఏమి; చేయంగన్+అగున్= ఏమి చేయగలం!; ఇంకన్= ఇంకా; ఎద్ది= ఏది; ఇష్టంబు= ఇష్టమో; చెప్పుఁడు= చెప్పండి; అనినన్= అని అనగా; విచిత్రవీర్య+ఆత్మజునకున్= విచిత్రవీర్యుని కుమారుడైన ధృతరాష్ట్రునికి; దుష్ట, చేష్టితుండు= చెడ్డపనులు చేసేవాడు; దుర్యోధనుండు; ఇట్టులు, అనియెన్; అవనినాథా= మహారాజా!; చిత్తగింపుము= దయతో వినుము; పాండురాజు సుతులన్= పాండురాజుకుమారులైన పాండవులను; పాంచాలపతి, ఒద్దన్= ద్రుపదునిదగ్గర; ఉండకుండన్, చేయుట= ఉండకుండా చేయడం; ఉచితము= తగినపని.

తాత్పర్యం: 'మాటలలో, చేతలలో పాండవులపట్ల ప్రీతి ఉన్నట్లే ఉంటాను. కాని, నా మనస్సును విదురునికి ఎన్నడూ తెలియనీయలేదు. మీ అభిప్రాయమే నా అభిప్రాయం. పాండవులు దైవబలం కలవాళ్ళు. ఏం చేయగలం? ఇక మీకు ఏది ఇష్టమో చెప్పండి' అని ధృతరాష్ట్రుడు అనగా దుర్మార్గపు పనులు చేసే దుర్యోధనుడు ఈ విధంగా అన్నాడు. 'మహారాజా! చిత్తగించండి. పాండవులను పాంచాలరాజు దగ్గర ఉండకుండా చేయటం ఇప్పుడు ఉచితమైన పని.

విశేషం: ఇది ధృతరాష్ట్రునిస్వభావాన్ని వ్యక్తంచేసే సీసం. బహిరంగంగా పాండవప్రీతి, అంతరంగంలో పాండవద్వేషం అతని స్వభావం. అందులో తండ్రికొడుకులు బింబ ప్రతిబింబాలు. ఆలోచన కొడుకుది, ఆచరణ తండ్రిది. సీసంవంటి కఠిన పాషాణ హృదయం ఈ సీసపద్యంలో సూచితం.

వ. అది యె ట్లనినం బుత్త్ర మిత్త్ర బాంధవ బలసంపన్నుం డైన ద్రుపదునొద్దఁ బాండవు లుండువా 'రైన వారలం గృష్ణబలదేవులు యదువృష్ణిభోజాంధకవర్గములతో వచ్చి కూడిన నెవ్వరు సాధింపనోపరు; గావున, నెడసేయక ద్రుపదుండు పాండవుల విడుచునట్లుగా భేదింత; మొండె, వలనుగలవారలం బంచి కౌంతేయమాద్రేయులను దమలో విరక్తు లగునట్లుగాఁ జేయింత; మొండె నతిలలితప్రమదాజనంబులఁ బ్రత్యేకంబ యేవురకుం బ్రయోగించి ద్రౌపదివలన విరక్తిఁ బుట్టింత; మొండె, నేవురకు నొక్కతియ యా లగుట కష్టం బని ద్రోవదిఁ బాండవులవలన విగత స్నేహఁ గావింత; మొండె, నుపాంశుప్రయోగంబుల భీము వధియించి తక్కినవారల బలహీనులం జేయుదము. **22**

ప్రతిపదార్థం: అది= ఆ కార్యం; ఎట్లు+అనినన్= ఏ విధంగా అంటే; పుత్త్ర, మిత్త్ర, బాంధవ, బల, సంపన్నుండు+ఐన= పుత్రులతో, స్నేహితులతో, బంధువులతో, బలంతో నిండినవాడైన; ద్రుపదు, ఒద్దన్= ద్రుపదుని దగ్గర; పాండవులు= పాండు కుమారులు; ఉండువారు+ఐన= ఉండేవాళ్లైతే; వారలన్= వాళ్ళను; కృష్ణ, బలదేవులు; యదు, వృష్ణి, భోజ+అంధక, వర్గములతో; వచ్చి= చనుదెంచి; కూడినన్= కలిసినట్లైతే; ఎవ్వరు= ఎవ్వరు కూడా; సాధింపన్+ఓపరు= జయించలేరు; కావునన్= కాబట్టి;

ఎడచేయక= ఆలస్యం చేయక; ద్రుపదుండు; పాండవులన్= పాండవుల్ని; విడుచునట్లుగా; భేదింతము= చీలిక కలిగింతము; ఒండెన్= కానియెడల; వలను, కలవారలన్= నేర్పుకలవాళ్ళను; పంచి= పంపి; కౌంతేయ, మాద్రేయులను= కుంతికొడుకులను, మాద్రికొడుకులను; తమలో= వారిలో; విరక్తులు+అగునట్లుకాన్= ప్రేమలేనివాళ్ళు అయ్యేటట్లుగా; చేయింతము= చేయిద్దాము; ఒండెన్= కాదేని; అతి, లలిత, ప్రమదా, జనంబులన్= మిక్కిలి అందమైన స్త్రీలను; ఏవురకున్= ఐదుగురకు; ప్రయోగించి= ఉపయోగించి; ద్రౌపదివలనన్= ద్రౌపదియెడ; విరక్తిన్= ఏవగింపు; పుట్టింతము= కలిగిస్తాము; ఒండెన్= కాదేని; ఏవురకున్= ఐదుగురికి; ఒక్కతియు+అ= ఒకతె; ఆలు+అగుట= భార్య కావటం; కష్టంబు+అని= కష్టం అని; ద్రోవదిన్= ద్రౌపదిని; పాండవులవలన= పాండవులపై; విగత, స్నేహన్= తొలగిన ప్రేమకలదానినిగా; కావింతము= చేద్దాం; ఒండెన్= కాదేని; ఉపాంశు, ప్రయోగంబులన్= రహస్యాలైన మంత్రతంత్రాలచేత; భీమున్= భీముణ్ణి, వధియించి= చంపి; తక్కిన, వారలన్= మిగతావాళ్లను, బలహీనులన్, చేయుదము.

తాత్పర్యం: అది ఎట్లాగంటే, పుత్రమిత్రబంధుబలం సమృద్ధిగా కల ద్రుపదుని దగ్గర పాండవులుండి, వాళ్ళకుతోడుగా శ్రీకృష్ణబలరాములు యదువృష్ణి భోజాంధకవర్గాలతో వచ్చి చేరితే, ఇక వాళ్ళను జయించటం ఎవ్వరికీ సాధ్యం కాదు. అందువలన ఆలస్యం చేయక ద్రుపదుడు పాండవులను వదిలేటట్లుగా చీలిక కలిగిద్దాం. లేకుంటే, నేర్పరులైన వాళ్ళను పంపి కుంతికొడుకులకు, మాద్రికొడుకులకు తమలో తాము ప్రేమ లేని వాళ్ళయ్యేటట్లు చేద్దాం. అట్లా కాకుంటే, మిక్కిలి అందగత్తెలైన ఆడవాళ్ళను పాండవులైదుగురిపై ప్రయోగించి, ద్రౌపదిపట్ల ఏవగింపు పుట్టిద్దాం. కాకుంటే, ఐదుగురికి ఒక్కతె భార్య కావటం కష్టం అని ద్రౌపదిని పాండవుల మీద ప్రేమలేనిది అయ్యేటట్లుగా చేద్దాం. లేకుంటే చాటుమాటు మంత్రతంత్రాలు నడిపి భీముడిని చంపి మిగిలినవాళ్ళను బలహీనులుగా చేద్దాం.

విశేషం: సామదానాలు ఫలించినప్పుడు భేదోపాయాన్ని ప్రయోగించటం రాజనీతి. అవసరాన్నిబట్టి దుర్యోధనుడు ముందుగానే ప్రయోగిస్తున్నాడు. ఇందులో ఆరురకాల భేదోపాయాలను తంత్రిముందు ప్రతిపాదిస్తున్నాడు. అవి 1.బంధువులబలగం కూడి ఒక కూటమిగా ఏర్పడకుండ చూడటం. 2. పాండవులకూ వారిబంధువులలో ముఖ్యుడైన ద్రుపదునికీ నడుమ భేదం కలిగించటం, 3. బంధువుల మధ్య భేదోపాయం పనిచేయకపోతే అన్నదమ్ముల మధ్య సవతితల్లుల బిడ్డలనే భావంతో కౌంతేయులు, మాద్రేయులు అనే భేదం కలిగించటం, 4. ద్రౌపదికంటె అందగత్తెలను పాండవులమీద ప్రయోగించి భర్తలకు భార్యపట్ల మక్కువలేకుండా చేయటం. 5. పంచభర్తృక అయిన ద్రౌపదికి భర్తలపై భేదభావం కలిగించటం. 6. పాండవబల మూలస్తంభంగా భావించబడే భీముడిని వధించి, వాళ్ళను నిర్వీర్యం చేయటం. ఇది దుర్యోధనుని దుర్విదగ్ధత, దుర్మార్గ ప్రవృత్తి, ప్రతిఫలించే ప్రతిపాదనలు. (సంపా.)

ఆ. గాడ్పుచూలి పిఱుఁదుఁ గావంగ నర్జును। నోర్వ నమరులైన నోప రాజి;
నతఁడు నిహతుఁ డగుడు నశ్రమంబునఁ। బార్థు నొక్కరుండ కర్ణుఁ డోర్వ నోపు. 23

ప్రతిపదార్థం: గాడ్పు, చూలి= వాయుతనయుడు - భీముడు; పిఱుఁదున్= వెనుకభాగాన్ని; కావంగన్= కాపాడగా; ఆజిన్= యుద్ధంలో; అర్జునున్= అర్జునుణ్ణి; ఓర్వన్= జయించటానికి; అమరులు+ఐనన్= దేవతలైన; ఓపరు=చాలరు; అతఁడు= ఆ భీముడు; నిహతుఁడు= చంపబడినవాడు; అగుడున్= కాగా; పార్థున్= అర్జునుణ్ణి; కర్ణుఁడు; ఒక్కరుండు+అ= ఒక్కడే; అశ్రమంబునన్= సులభంగా; ఓర్వన్+ఓపున్= జయించగలడు.

తాత్పర్యం: వాయుపుత్రుడైన భీముడు సహాయంగా వెనుక నిలిస్తే - అర్జునుడిని యుద్ధంలో జయించటం ఆ దేవతలకైనా సాధ్యం కాదు. భీముడిని చంపితే అర్జునుణ్ణి కర్ణ డొక్కడే అనాయాసంగా జయించగలడు.

విశేషం: దుర్యోధనుని అంచనాలో పాండవబలానికి పెట్టనికోట భీమసేనుడు. అతడు అండగా నిలిస్తేనే అర్జునుని పరాక్రమం దేవతలకుకూడా అసాధ్యమౌతుందట. భీముడు లేకపోతే అర్జునుడు కర్ణునికి అసాధ్యుడు కా డని అతనివాదం. వాస్తవానికి అది నిజం కాదు. మత్స్యయంత్రసభలో అర్జునునిచేతిలో ఓడిపోయిన కర్ణుడిని సమర్థించుకొనే కుంటిసాకు ఇది. దుర్విదగ్ధులవాదం ఇట్లాగే ఉంటుంది.

వ. 'ఈ యుపాయంబులలో నెయ్యది యుచితంబును నపగతదోషంబును నదీర్ఘసూత్రంబును నగు నట్టి దానిం జెచ్చెర ననుష్ఠించు నది' యనినఁ గర్ణుం డి ట్లనియె. 24

ప్రతిపదార్థం: ఈ, ఉపాయంబులలోన్= ఈ నాలుగువిధాల ఉపాయాలలో; ఏ+అది, ఉచితంబును= ఏది తగినదీ; అపగత, దోషంబునున్= పోయినదోషం కలదీ - అంటే లోపం లేనిది; అదీర్ఘ, సూత్రంబునున్= ఆలస్యంచేయకుండా చేయదగిందీ; అగున్= అవుతుందో; అట్టి= అటువంటి; దానిన్= దాన్ని; చచ్చెరన్= వేగమే; అనుష్ఠించునది= ఆచరించవలసింది; అనినన్= అని అనగా; కర్ణుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ ఉపాయాలలో ఏది యోగ్యమవుతుందో, ఏది దోషం (లోపం) లేకుండా ఉంటుందో, చాలాకాలం పట్టకుండా స్వల్పకాలంలోనే సత్ఫలితాల నిస్తుందో అటువంటిదానిని వెంటనే ఆచరించవలసింది' అని దుర్యోధనుడనగా, కర్ణుడు ఈ విధంగా పలికాడు.

విశేషం: చతుర్విధోపాయాలను ప్రయోగించేటప్పుడు తీసికొనవలసిన జాగ్రత్తలు మూడింటిని ఇందులో సూచించటం జరిగింది.

సీ. ఆర్యవృత్తుండు రాజాన్వయసమ్మతుఁ। డభిమతసంబంధుఁ డయినవాఁడు
గుణవంతు లగుచున్న కొడుకులు గలవాఁడు। పాంచాలుఁ డేల యప్పాండుసుతుల
వినయసంపన్నుల విడుచువాఁడగు?; మఱి। పాండునందను లేకపత్నియందు
కర మనురక్తులు గావునఁ దమలోన। నేల భేదిల్లుదు?; రెన్నఁడయ్యు

ఆ. నొక్కసతికిఁ బతులు పెక్కండ్రు రగు టిది। సతులకోర్కిగాన యతివ కృష్ణ
సుందరాంగి వారియం దేల యపరక్త। యగు మనోముదంబుఁ దగులుఁ గాక. 25

ప్రతిపదార్థం: ఆర్య, వృత్తుండు= మంచినడవడి కలవాడు; రాజ+అన్వయ, సమ్మతుఁడు= రాజవంశాలకు ఇష్టమైనవాడు; అభిమత, సంబంధుఁడు= ఇష్టమైన చుట్టరికం కలవాడు; అయినవాఁడు= అయినటువంటి అతడు; గుణవంతులు+అగుచు+ఉన్న; కొడుకులు; కలవాడు; పాంచాలుఁడు= ద్రుపదుడు; ఏల= ఎందువల్ల; ఆ+పాండు, సుతులన్= ఆ పాండురాజు కుమారులైన పాండవులను; వినయ, సంపన్నులన్= అణకువ మిక్కిలిగా కలవాళ్ళను; విడుచువాఁడు, అగున్ = వదలేవాడు అవుతాడు; మఱి= ఆపై; పాండు, నందనులు= పాండవులు; ఏక, పత్ని, అందు+అ= ఒక భార్యమీదనే; కరము= మిక్కిలి; అనురక్తులు= ప్రేమకలవాళ్ళు; కావునన్; తమలోనన్; ఏల= ఎందుకు; భేదిల్లుదురు= విరోధం వహిస్తారు; ఎన్నఁడు+అయ్యున్= ఎప్పుడైనా; ఒక్క, సతికిన్= ఒక్క స్త్రీకి; పతులు= భర్తలు; పెక్కండ్రురు= పెక్కుమంది; అగుట= కావటం; ఇది; సతుల, కోర్కి= స్త్రీల కోరిక; కాన; సుందర+అంగి= అందమైనదేహం కలది; అతివ= స్త్రీ, కృష్ణ= ద్రౌపది; వారి, అందు, ఏల= ఆ పాండవులపై ఎందుకు; అపరక్త= ప్రేమలేనిది; అగున్= అవుతుంది; మనస్ ముదంబున్= మనస్సులోని సంతోషంతో; తగులున్, కాక= ప్రేమించునుకదా!, అనగా ఆసక్తితో ఉంటుంది కదా!

తాత్పర్యం: మంచి నడవడికలవాడు, రాజవంశాలకు ఇష్టమైనవాడు; ప్రియమైన బంధుబలంకలవాడు; గుణవంతులైన కొడుకులుకలవాడు అయిన ద్రుపదుడు, వినయసంపన్నులైన ఆ పాండవులను ఎందువలన వదలివేస్తాడు? అంతేకాదు, పాండవులంతా ఒకే భార్యమీద మిక్కిలిప్రేమకలవాళ్ళు. అందువలన వాళ్ళమధ్య ఎందుకు వైరం ఏర్పడుతుంది? కాగా, ఎప్పుడైనా స్త్రీలు, పెక్కుమందిభర్తలను కోరుకొంటారు. అందువలన అందగత్తె ద్రౌపది పాండవులను మనసారా ప్రేమిస్తుందే కాని తిరస్కరిస్తుందా?

విశేషం: అలంకారం - కావ్యలింగం. దుర్యోధనుడు ప్రతిపాదించిన భేదోపాయాలన్నీ సఫలాలు కావని కర్ణుడు సహేతుకంగా పేర్కొన్నాడు.

వ. మఱి భీమసేనుండు దొల్లి మీచేసిన యుపాంశువధల నేమి యయ్యె? నింకను నట్ల కావున నీ యుపాయప్రయోగంబు లన్నియు నుడిగి యిప్పడ పాండవులయందు విక్రమంబు ప్రయోగించుట కార్యంబు. 26

ప్రతిపదార్థం: మఱి= ఇక; భీమసేనుండు; తొల్లి= ఇంతకుముందు; మీ, చేసిన= మీయొక్క చేసిన - మీరు చేసిన; ఉపాంశు, వధలన్= రహస్య హత్యా ప్రయత్నాలచేత; ఏమి అయ్యెన్= ఏమైనాడు; ఇంకను; అట్లు+అ= ఇకముందుకూడా అంతే; కావునన్; ఈ, ఉపాయ, ప్రయోగంబులు= ఈ ఉపాయాలకు సంబంధించిన; అన్నియున్= అన్నీ; ఉడిగి= మాని; ఇప్పుడు+అ= ఇపుడే; పాండవుల, అందున్= పాండవుల మీద; విక్రమంబు= పరాక్రమం; ప్రయోగించుట; కార్యంబు= చేయదగిన పని.

తాత్పర్యం: అంతే కాదు, ఇదివరకు మీరు చేసిన రహస్యహత్యాప్రయత్నాలతో భీముడు ఏమయ్యాడు? ఇక ముందుకూడా అంతే. అందువలన ఈ ఉపాయాలు మాని ఇప్పుడు పాండవులమీద పరాక్రమం ప్రయోగించటమే మనకర్తవ్యం.

చ. ఘన మగు విక్రమంబునన కాదె జగత్త్రితయంబుఁ బాకశా
సనుఁడు జయించె; భూతలము సర్వము మున్ భరతుండు విక్రమం
బునన జయించె; విక్రమము భూరి యశఃప్రియు లైన రాజనం
దనులకు సర్వసాధనము, ధర్మువు శత్రునిబర్హణంబులన్. 27

ప్రతిపదార్థం: పాకశాసనుఁడు= దేవేంద్రుడు; జగత్+త్రితయంబున్= లోకాలు మూడింటిని; ఘనము+అగు= గొప్పదైన; విక్రమంబునన, కాదె= పరాక్రమంచేతనేకదా; జయించెన్= జయించాడు; భరతుండు; భూతలము, సర్వము= భూమండలాన్నంతా; మున్= మునుపు; విక్రమంబునన= పరాక్రమంచేతనే; జయించెన్= జయించాడు; భూరి, యశః ప్రియులు+ఐన= గొప్ప కీర్తి మీద ఇష్టంకలవాళ్ళు అయిన; రాజనందనులకున్= రాజకుమారులకు; విక్రమము= పరాక్రమమే; సర్వసాధనము= అన్నింటిని సాధించేది; శత్రు, నిబర్హణంబులన్= శత్రువధలు చేయటంలో; ధర్మువు= ధర్మం.

తాత్పర్యం: దేవేంద్రుడు ముల్లోకాలను గొప్ప పరాక్రమం చేతనే కదా జయించాడు. భరతుడు భూమండలాన్నంతా పూర్వం జయించింది పరాక్రమంచేతనే కదా! గొప్పకీర్తిని కోరుకొనే రాజకుమారులకు పరాక్రమమే సర్వసాధనం; శత్రువధలలో ధర్మం.

విశేషం: అలంకారం - అర్థాంతరన్యాసం. పాకశాసనుడు = వృత్రాసురుని సోదరుడైన పాకాసురుడిని చంపినవాడు - దేవేంద్రుడు. కర్ణుడు వీరుడు. దుర్యోధనధృతరాష్ట్రులవలె కపటికాడు, సామదానభేదోపాయాలు విఫలమైన తరువాత దండోపాయం ప్రయోగించాలి - రాజనీతిప్రకారం. దుర్యోధనుడు ప్రయోగించదలచుకొన్న భేదోపాయం ఫలవంతం కాదని కర్ణుడు నిరూపించి ప్రతాపప్రదర్శకమైన యుద్ధమే (దండోపాయం) శరణ్యమని పేర్కొన్నాడు. యుద్ధమే వీరధర్మమని ప్రతిపాదించాడు.

వ. 'కావునఁ జతురంగ బల సాధనసన్నద్ధుల మయి యుద్ధంబునం బాంచాలు భంజించి పాండవుల నొండుగడ నుండనీక తోడ్కొనితెత్త' మనినఁ గర్ణుపలుకు లాకర్ణించి ధృతరాష్ట్రుం 'డిది యకార్యం బగు; నయినను మతిమంతులతో విచారించి చేయుద మని భీష్మద్రోణవిదురశల్యకృపాశ్వత్థామసోమదత్తాదులం బిలువంబంచి యంతయు నెఱింగించిన భీష్ముండు దుర్యోధనుం జూచి యి ట్లనియె. 28

ప్రతిపదార్థం: కావునన్; చతురంగ, సాధన, సన్నద్ధులము+అయి= రథ గజ తురగ పదాతి బలాలతో, యుద్ధపరికరాలతో సిద్ధమై; యుద్ధంబునన్= యుద్ధంలో; పాంచాలున్= ద్రుపదుని; భంజించి= ఓడించి; పాండవులన్; ఒండు, కడన్= మరొకచోట; ఉండనీక= ఉండనీయకుండా; తోడ్కొని తెత్తము = తీసికొనివద్దాం; అనినన్= అని అనగా; కర్ణు, పలుకులు= కర్ణుని మాటలు; ఆకర్ణించి= విని; ధృతరాష్ట్రుండు; ఇది, అకార్యంబు+అగున్= చేయతగని పని అవుతుంది; అయినను; మతిమంతులతోన్= బుద్ధిబలం కలవారితో; విచారించి= ఆలోచించి; చేయుదము=చేద్దాం; అని= అని చెప్పి; భీష్మ, ద్రోణ, విదుర, శల్య, కృప+అశ్వత్థామ, సోమదత్త+ఆదులన్= భీష్ముడు; ద్రోణుడు మొదలైన వారిని; పిలువన్+పంచి= పిలిపించి; అంతయున్= అంతా; ఎఱింగించినన్= తెలియపరచగా; భీష్ముండు; దుర్యోధనున్; చూచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అందువలన చతురంగబలాలతో, యుద్ధపరికరాలతో సిద్ధమై వెళ్ళి, యుద్ధంలో ద్రుపదుడిని ఓడించి, పాండవులను వేరొకచోట ఉండనీయక వెంటతీసికొని వద్దాం' అని కర్ణుడు అనగా - అతనిమాటలు విని ధృతరాష్ట్రుడు, 'ఇది చేయ తగని పని, అయినా బుద్ధిబలం గలవాళ్ళతో ఆలోచించి చేద్దాం' అని భీష్ముడు, ద్రోణుడు, విదురుడు మొదలైనవాళ్ళను పిలిపించి జరిగినదంతా చెప్పాడు. అప్పుడు భీష్ముడు దుర్యోధనుడిని చూచి ఇట్లా అన్నాడు.

విశేషం: మహాభారతంలో మహావీరుడు కర్ణుడు చేసిన యుద్ధప్రతిపాదనలలో ఇదొకటి. కర్ణుడు చేసే యుద్ధప్రతిపాదనలను దుర్యోధనుడు అంగీకరిస్తాడు. అందుకు ప్రధానకారణం - పాండవులను పరిమార్చాలన్న ద్వేషం. కాని కర్ణుని యుద్ధ ప్రతిపాదనలకు ప్రధానకారణం పార్థుడిని యుద్ధంలో ఓడించి, అతడిని మించిన వీరుడని కీర్తి గడించాలనే ఆశయం.

ధృతరాష్ట్రుడు కర్ణదుర్యోధనుల ప్రతిపాదనలు విన్నాడు. దుర్యోధనునిది కుటిలభేదోపాయప్రతిపాదన. కర్ణునిది వీరోచితయుద్ధ ప్రతిపాదన. అయితే దుర్యోధనుని ప్రతిపాదన కర్ణుడే ఖండించాడు. ఇబ్బంది లేదు. ఇక మిగిలింది కర్ణుని యుద్ధ ప్రతిపాదన. పుత్రమమకారపీడితుడు, లోభగుణపూరితుడు అయిన ధృతరాష్ట్రునికి నొసటి కళ్ళు లేవుగాని - కడుపు నిండా కళ్ళే. ఆ వృద్ధరాజు లోతైన ఆలోచన కల వ్యక్తి. అందుకే యుద్ధ ప్రతిపాదన వినగానే ఇదేమి దుర్బుద్ధి అని కొడుకును, కర్ణుడిని గట్టిగా మందలించలేదు; ప్రతిపాదనను తత్క్షణమే పూర్తిగా తిరస్కరించనూలేదు. 'మతిమంతులతో విచారించి చేయుదము' అన్నాడు. భీష్మద్రోణవిదురాదులను పిలిపించాడు. యుద్ధ ప్రతిపాదన కార్యరూపం దాల్చి, సఫలం కావాలంటే భీష్మద్రోణ విదురాదుల సహకారం కావాలి. భీష్మ ద్రోణులకు ద్రుపదుడు ఇష్టుడు కాదు. అందుకు ఎవరి కారణం వారికి ఉన్నది. కాబట్టి భీష్మ ద్రోణులు అంగీకరిస్తే యుద్ధ ప్రతిపాదన బాగా సఫలమౌతుంది. కొడుకులకు గొప్పగా లాభిస్తుంది. లేకుంటే ఆ పెద్దలే కర్ణదుర్యోధనులకు బుద్ధి చెపుతారు. తాను అప్రియంగా మాట్లాడవలసిన అవసరం తప్పుతుంది. ఆ దుడుకుయువకుల అసంతృప్తిని, ఆగ్రహాన్ని ఆ పెద్దలే పంచుకొంటారు.

మత్తకోకిల.

ధీరు లౌ ధృతరాష్ట్రపాండు లతిప్రశస్తగుణుల్ ప్రసి
ద్ధోరుకీర్తులు; నాకు నిద్దఱు నొక్కరూప; తలంపఁగా
వీరు వా రను నట్టిబుద్ధివిభేద మెన్నఁడు లేదు గాం
ధారిపుత్త్రశతంబునందుఁ బృథాతనూజులయందునున్. 29

ప్రతిపదార్థం: ధీరులు+ఔ= ధైర్యవంతులైన; ధృతరాష్ట్ర, పాండులు= ధృతరాష్ట్రుడు,పాండురాజు; అతి, ప్రశస్త, గుణుల్= మిక్కిలి శ్రేష్ఠములైన గుణాలు కలవారు; ప్రసిద్ధ+ఉరు, కీర్తులు= ప్రసిద్ధమైన గొప్ప కీర్తి కలవారు; ఇద్దఱున్; నాకున్; ఒక్కరూపు+అ= ఒక్కవిధమే; గాంధారి, పుత్త్ర, శతంబు, అందున్= గాంధారియొక్క కొడుకులు నూరుగురిలో; పృథా, తనూజుల, అందునున్= కుంతీదేవికొడుకులలో; వీరు, వారు, అనునట్టి; బుద్ధి, విభేదము= బుద్ధిలో భేదభావం; ఎన్నఁడు, లేదు= ఏనాడూ లేదు.

తాత్పర్యం: ధైర్యవంతులు, మిక్కిలి శ్రేష్ఠమైనగుణాలు కలవాళ్ళు, ప్రసిద్ధమైన గొప్పకీర్తి కలవాళ్ళు అయిన ధృతరాష్ట్ర పాండురాజు లిద్దరూ నా కొక్కటే. గాంధారికొడుకులలో, కుంతికొడుకులలో వీళ్ళు, వాళ్ళు అనే భేదభావం నా కెన్నడూ లేదు.

విశేషం: వృత్తలక్షణానికి చూడు: ఆది.1.153 విశేషం. ఇది భీష్ముని సమత్వదృష్టిని ప్రకటించటంలో ఒక ప్రత్యేకతను, విశిష్టతను విస్పష్టం చేస్తూ ఉన్నది.

భీష్మద్రోణులు దుర్యోధనునకు బుద్ధి సెప్పుట (సం.1-195-1)

వ. అప్పాండవులతోడి విగ్రహంబుసేఁత కెన్నండును నొడంబడనేరఁ; బితృపైతామహం బయిన రాజ్యంబునకు నీయట్లు వారు నర్హులు; గావున వారికి నర్ధరాజ్యం బిచ్చిన నీకును నీ బాంధవులకును లోకంబులకును బ్రియం బగు; నట్లు గానినాఁ డపకీర్తి యగుఁ; గీర్తి నిలుపుటయ కాదె రాజులకు జన్మఫలంబు. 30

ప్రతిపదార్థం: ఆ+పాండవులతోడి; విగ్రహంబు, చేఁతకు= యుద్ధంచేయుటానికి; ఎన్నండును= ఎప్పుడుకానీ; ఒడంబడనేరన్= సమ్మతించలేను; పితృ, పైతామహంబు+అయిన= తండ్రితాతలకు సంబంధించిన; రాజ్యంబునకున్; మీ, అట్లు= మీవలె; వారున్= వాళ్లుకూడా; అర్హులు= యోగ్యులు; కావునన్= కాబట్టి; వారలకున్= వాళ్లకు; అర్ధ, రాజ్యంబు= సగం రాజ్యం; ఇచ్చినన్= ఇస్తే; నీకును; నీ, బాంధవులకును; లోకంబులకును; ప్రియంబు= సంతోషం; అగున్= అవుతుంది; అట్లు, కాని నాఁడు= ఆవిధంగా జరుగనినాడు; అపకీర్తి, అగున్; కీర్తి, నిలుపుటయకాదె= కీర్తిని నిల్పుకోవటమేకదా; రాజులకున్, జన్మ, ఫలము= క్షత్రియులకు పుట్టుకతో వచ్చినఫలం.

తాత్పర్యం: ఆ పాండవులతో యుద్ధం చేయటానికి నేను ఎన్నడూ సమ్మతించను. తండ్రితాతలరాజ్యానికి మీవలెనే వాళ్ళుకూడా అర్హులు. కాబట్టి వాళ్ళకు సగంరాజ్యం ఇస్తే నీకూ, నీ చుట్టాలకూ, లోకాలకూ సంతోషం కలుగుతుంది. అట్లా కాకపోతే అపకీర్తి కలుగుతుంది. కీర్తి నిలపటమే రాజులకు జన్మఫలం.

ఆ. కీర్తి లేనివానికిని జీవనంబు ని । రర్థకంబ చూవె! యవనిమీఁద
నిత్య మయిన ధనము నిర్మల కీర్తియ; । యట్టి కీర్తి వడయు టశ్రమంబె? 31

ప్రతిపదార్థం: కీర్తిలేనివానికిని; జీవనంబు= బ్రదుకు; నిరర్థకంబు+అ= వ్యర్థమే; చూవె= సుమా; అవనిమీఁదన్= భూమిమీద; నిత్యము+అయిన= శాశ్వతమైన; ధనము; నిర్మల, కీర్తి+అ=స్వచ్ఛమైన కీర్తి మాత్రమే; అట్టి; కీర్తి, పడయుట= కీర్తిని పొందుట; అశ్రమంబె= సులభమా?

తాత్పర్యం: కీర్తి లేనివానిబ్రతుకు వ్యర్థమే. భూమిమీద శాశ్వతమైన ధనం స్వచ్ఛమైన కీర్తే. అట్లాంటి కీర్తిని పొందటం సులభమా?

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తులలో కీర్తినిగూర్చిన సూక్తి ఇది.

క. ఇలఁ గీర్తి యెంత కాలము । గలిగి ప్రవర్తిల్లె నంతకాలంబును ని
త్యుల కారె కీర్తి గల పు । ణ్యులు; కీర్తివిహీనుఁ డెందునుం బూజ్యుండే. **32**

ప్రతిపదార్థం: ఇలను= భూమిమీద; కీర్తి; ఎంతకాలము, కలిగి= నిలిచి; ప్రవర్తిల్లెన్= ఉంటుందో; అంత, కాలంబును; కీర్తి, కల, పుణ్యులు= కీర్తి గల పుణ్యాత్ములు; నిత్యులు= శాశ్వతంగా ఉండేవాళ్ళు; కారె?; కీర్తి, విహీనుఁడు= కీర్తిలేనివాడు; ఎందునున్= ఎక్కడైనా; పూజ్యుండే= పూజింపతగినవాడా? (కాడని భావం)

తాత్పర్యం: లోకంలో కీర్తి ఎంత కాలం నిలిచి ఉంటుందో, కీర్తిమంతులైన పుణ్యాత్ములు అంత కాలం జీవించి ఉంటారు. కీర్తి లేనివాడు ఎక్కడైనా పూజార్హుడవుతాడా?

వ. 'కీర్తియు నపకీర్తియు జనులకు స్వర్గ నరక నిమిత్తంబులు గావున, నపకీర్తి పరిహరించి, కీర్తిం బ్రతిష్ఠించి, పైతృకం బగు రాజ్యంబు పాండవుల కిచ్చి, వారితోడ బద్ధప్రణయుండవయి కీర్తి నిలుపు' మనిన భీష్మపలుకులకు సంతసిల్లి ద్రోణుండు దుర్యోధనున కి ట్లనియె. **33**

ప్రతిపదార్థం: కీర్తియున్, అపకీర్తియున్; జనులకు= ప్రజలకు; స్వర్గ, నరక, నిమిత్తంబులు= స్వర్గానికి, నరకానికి కారణాలు; కావునన్; అపకీర్తిన్= చెడ్డపేరును; పరిహరించి= వదలి; కీర్తిన్= మంచిపేరును; ప్రతిష్ఠించి= నిలుపుకొని; పైతృకంబు+అగు= తండ్రివలన వచ్చినదైన; రాజ్యంబు= రాజ్యాన్ని; పాండవులకున్+ఇచ్చి; వారితోడన్; బద్ధ, ప్రణయుండవు+అయి= చేయబడిన స్నేహం కలవాడవయి; కీర్తి; నిలుపుము= కీర్తిని నిలుపుకో; అనినన్= అని చెప్పగా; భీష్మ పలుకులకున్= భీష్ముని మాటలకు; సంతసిల్లి; ద్రోణుండు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'కీర్తి మానవులకు స్వర్గకారణం. అపకీర్తి నరకకారణం. అందువలన అపకీర్తి వదలి కీర్తిని నిలుపుకొమ్ము. వంశపారంపర్యంగా వచ్చినరాజ్యం పాండవుల కిచ్చి వాళ్ళతో స్నేహంగా ఉండి కీర్తిని నిలుపుము' అని భీష్ముడు అనగా, ఆయనమాటలకు సంతసిల్లి ద్రోణుడు దుర్యోధనునితో ఇట్లా అన్నాడు.

చ. బహుగుణ ముత్తమోత్తమము పథ్యము ధర్మ్యము సాధుసమ్మతం
బహిత బలప్రమాథివిపులార్థయుతం బగుటన్ భవత్పితా
మహువచనంబుఁ జేకొనుము; మానుగ వారలతోడ నీవు వి
గ్రహ మొనరింప నేమిటికిఁ గౌరవసౌబలకర్ణశిక్షలన్. **34**

ప్రతిపదార్థం: బహుగుణము= అనేకవిధాల మంచిదైనది; ఉత్తమ+ఉత్తమము= మహాశ్రేష్ఠమైనది; పథ్యము= మేలు చేసేది; ధర్మ్యము= ధర్మమైనది; సాధు, సమ్మతంబు= సజ్జనులకు ఇష్టమైనది; అహిత, బల, ప్రమాథి= శత్రుబలాన్ని చంపటానికి తగినది; పీడింప (హింసింప) కలది; విపుల+అర్థ, యుతంబు= అధికమైన ప్రయోజనంతో కూడినది; అగుటన్= కావటంచేత; భవత్+పితామహు, వచనంబు= నీ తాత అయిన భీష్మునిమాటను; మానుగన్= చక్కగా; చేకొనుము= గ్రహించుము; నీవు; కౌరవ, సౌబల, కర్ణ, శిక్షలన్= కౌరవులయొక్క, శకునియొక్క, కర్ణునియొక్క ఉపదేశాలతో; వారలతోడన్= పాండవులతో; విగ్రహము= యుద్ధం; ఒనరింపన్=చేయుటం; ఏమిటికిన్= ఎందుకు?

తాత్పర్యం: నీ తాత భీష్మునిమాట అనేకవిధాల మంచిది. మిక్కిలి శ్రేష్ఠమైనది. మేలు చేసేది. ధర్మమైనది. సజ్జనులకు ఇష్టమైనది. శత్రుబలాన్ని అణచేది. అధికమైన లాభం కలది. అందువల్ల ఆయనమాట స్వీకరించుము. కౌరవులు, శకుని, కర్ణుడు చెప్పేమాటలు విని, నీవు పాండవులతో యుద్ధం చేయటం ఎందుకు?

విశేషం: కౌరవ శబ్దాన్ని దుర్యోధనుని గురించిన సంబోధనగా కూడా గ్రహింపవచ్చు. భీష్ముని వాక్యాలు నిర్దేశాత్మకంగా, సూటిగా ఉన్నాయి. ద్రోణునిమాటలు నిషేధాత్మకమార్గంలో నడిచాయి. ఉభయుల స్వభావాలు వాళ్ళమాటలలో ప్రతిఫలించాయి.

మ. విలసద్ధర్మవిశుద్ధవృత్తులు వయోవృద్ధుల్ కుశాగ్రీయబు
ద్ధులు మధ్యస్థులు కార్యనిర్ణయసమర్థుల్ మానమాత్సర్యదూ
రులు నాఁ జాలినవారిపల్కులకు వైరుద్ధ్యంబు గావించున
జ్ఞులు భూనాథున కాప్తులున్ సఖులు నై శోషింతు రత్యంతమున్. 35

ప్రతిపదార్థం: విలసత్+ధర్మ, విశుద్ధ, వృత్తులు= ప్రకాశించేటటువంటి ధర్మంతో పరిశుద్ధమైన నడవడి గలవాళ్ళు; వయోవృద్ధుల్= వయస్సులో పెద్దవాళ్ళు; కుశాగ్రీయ బుద్ధులు= దర్భకొనలవంటి పదునైన బుద్ధికలవాళ్ళు; మధ్యస్థులు= పక్షపాతం లేనివాళ్ళు; కార్య, నిర్ణయ, సమర్థుల్= చేయదగిన పనిని నిర్ణయించటంలో నిపుణులు; మాన మాత్సర్య, దూరులు= కోపానికి, మాత్సర్యానికి దూరమైనవాళ్ళు; నాన్+చాలిన= అని అనదగిన; వారి, పల్కులకు; వైరుద్ధ్యంబు= విరోధాన్ని; కావించు, అజ్ఞులు= చేయు (కల్పించు) అవివేకులు; భూనాథునకున్= రాజునకు; ఆప్తులున్= చుట్టాలూ; సఖులున్+ఐ= స్నేహితులై; అత్యంతమున్= మిక్కిలి; శోషింతురు= పాడయిపోతారు.

తాత్పర్యం: ధార్మికులు, వృద్ధులు, బుద్ధిబలం కలవాళ్ళు, పక్షపాతం లేనివాళ్ళు, చేయదగిన దానిని నిర్ణయించటంలో సమర్థులైనవాళ్ళు, కోపం, మాత్సర్యం లేనివారు అని చెప్పదగినవాళ్ళమాటలను కాదనే అవివేకులు - రాజుకు ఆప్తులు, స్నేహితులై అతడిని పాడుచేయడమేగాక, తామూ పాడయిపోతారు.

విశేషం: మతిమంతుల మాటలను కాదనే అవివేకులను ప్రభువు స్నేహితులుగా గౌరవించరాదని ధ్వని.

చ. తనరుచు దైవయుక్తి మెయి ధర్మువు సత్యముఁ దప్పకున్న య
య్యనఘుల పైతృకం బయిన యంశము మిన్నక వజ్రపాణి కై
నను గొనఁబోలు నయ్య కురునందన! పాండుతనూజు లున్న వా
రని విని వారికిం దగు ప్రియం బొనరింపక యున్కి ధర్మువే? 36

ప్రతిపదార్థం : దైవయుక్తి మెయిన్= దైవయోగంచేత; తనరుచున్= ఒప్పుతూ; ధర్మువు= ధర్మము; సత్యమున్= సత్యము; తప్పక+ఉన్న= విడువకుండా ఉండు; ఆ+అనఘుల= ఆ పాపరహితులైన పాండవులయొక్క; పైతృకంబు+అయిన= తండ్రిదైన; అంశము= భాగం; మిన్నక= ఊరక; కొనన్= తీసికొనటానికి; వజ్రపాణికిన్+ఐనను= దేవేంద్రునికైనా; పోలును+అయ్యె= సాధ్యమగునా? కురునందన= కురువంశకుమారా! ఓ దుర్యోధనా!; పాండు, తనూజులు= పాండవులు; ఉన్న, వారు+అని= సుఖంగా ఉన్నారని; విని= ఆలకించి; వాళ్లకున్; తగు; ప్రియంబు= తగినట్లు సంతోషకరమైన పని; ఒనరింపక= చేయక; ఉనికి= ఉండటం; ధర్మువే= ధర్మమా? (కాదని భావం.)

తాత్పర్యం: దైవయోగంవలన వెలుగుతూ - ధర్మాన్ని, సత్యాన్ని తప్పని పుణ్యాత్ములైన పాండవులతండ్రి భాగాన్ని ఊరకే తీసికొనటం ఆ వజ్రాయుధుడైన దేవేంద్రునికికూడా సాధ్యం కాదు. దుర్యోధనా! పాండవులు సుఖంగా జీవించి ఉన్నారని విని, వాళ్ళకు సంతోషకరమైన పని చేయకుండుట ధర్మమా?

విశేషం: పాండవులకు వచ్చే రాజ్యభాగాన్ని నిష్కారణంగా అపహరించటానికి దేవేంద్రునికైనా సాధ్యం కాదని చెప్పటంలో ద్రోణుని సత్యప్రతిపాదనం ఎంత కనపడుతున్నదో నిర్మొగమాటంకూడా అంతే స్పష్టమౌతున్నది. పాండవులను చంపటానికి యత్నించికూడా, వాళ్ళు బ్రతికారని తెలిసినప్పుడు గౌరవించకుండా ఉండటం అధర్మమని ముఖంమీద గ్రుద్దినట్లు విప్రస్వాభావికంగా చెప్పాడు.

వ. 'వారితో విగ్రహించుట కార్యంబు గాదు; 'కావునఁ బాండవద్రుపదధృష్టద్యుమ్నకుంతీద్రౌపదులకుఁ బ్రియపూర్వకంబున నుచితభూషణాంబరావళులు వేఱు వేఱ యిచ్చిపుచ్చి, పాండవుల నిందులకుఁ దోడ్కొనివచ్చువారుగా దుశ్శాసనవికర్ణ ప్రభృతుల సమకట్టి పంపు' మనిన ద్రోణుపలుకు లవకర్ణించి కర్ణుం డి ట్లనియె. 37

ప్రతిపదార్థం: వారితోన్= ఆ పాండవులతో; విగ్రహించుట= యుద్ధంచేయటం; కార్యంబు= చేయదగిన పని; కాదు; కావునన్, పాండవ= పాండవులకు; ద్రుపద= ద్రుపదునికి; ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నునికి; కుంతీ, ద్రౌపదులకున్= కుంతికీ, ద్రౌపదికీ; ప్రియ, పూర్వకంబునన్= స్నేహపూర్వకంగా; ఉచిత, భూషణ+అంబర+ఆవళులు= తగినసొమ్ములయొక్క, వస్త్రాలయొక్క, సమూహాలను; వేఱు, వేఱ= విడివిడిగా; ఇచ్చి, పుచ్చి= ఇచ్చిపంపి; పాండవులన్= పాండవుల్ని; ఇందులకున్= ఇక్కడికి; తోడ్కొనివచ్చువారుగా= పిలుచుకొనివచ్చేవాళ్ళుగా; దుశ్శాసన, వికర్ణ, ప్రభృతులన్= దుశ్శాసనుడు, వికర్ణుడు మొదలైనవాళ్ళని; సమకట్టి= సిద్ధంచేసి; పంపుము= పంపవలసింది; అనినన్= అనగా; ద్రోణు, పలుకులు= ద్రోణుని మాటలు; అవకర్ణించి= పెడ చెవిని పెట్టి; కర్ణుండు= కర్ణుడు, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పాండవులతో యుద్ధం చేయటం తగని పని. అందువలన పాండవులకు, ద్రుపదునికి, ధృష్టద్యుమ్నుడికి, కుంతీదేవికి, ద్రౌపదికి స్నేహపూర్వకంగా తగినసొమ్ములను, వస్త్రాలను వేర్వేర ఇచ్చి పంపి, పాండవులను ఇక్కడికి పిలిచికొని రావటానికి దుశ్శాసనుడు, వికర్ణుడు మొదలైనవాళ్ళని సిద్ధంచేసి పంపుము' అని అనగా ద్రోణునిమాటలు పెడచెవిని పెట్టి కర్ణుడు ఇట్లా అన్నాడు.

విశేషం: భీష్మద్రోణులు చేసిన తొలిసంధి ప్రయత్నం. భీష్ముడు అర్ధరాజ్యప్రతిపాదననుకూడా మొదటిసారి ఈ ఘట్టంలోనే చేశాడు. భీష్ముడు కీర్తి, అపకీర్తులను నిరూపించి, వ్యంగ్యంగా పాండవ కౌరవ తారతమ్యానుశీలనం చేశాడు. ద్రోణుడు భీష్ముడిని సమర్థించి శకుని కర్ణుల బోధనలను అధిక్షేపించి, పాండవపరాక్రమాన్ని కీర్తించి, వాస్తవాలను వాచ్యం చేశాడు. దుర్యోధనుడు కర్ణాదుల చెప్పుడుమాటలవలన చెడిపోతున్నట్లు ద్రోణుడు చెప్పటంతో కర్ణుడు కోపగించి అధిక్షేపిస్తూ వాదానికి దిగాడు.

తే. ముదుసలులు దమ కిమ్ముగాఁ జదివికొండ్రు । గాక పతులకు హిత మగు కర్జ మేల
యొలసి చెప్పదు? రహితుఁ గలపికొనుట । ధర్మ్మ వని; రిది నయవిరుద్ధంబు గాదె? 38

ప్రతిపదార్థం: ముదుసళులు= ముసలివారు; తమకున్+ఇమ్ముగాన్= తమకు అనుకూలంగా; చదివికొండ్రు, కాక= చెప్పుదురుగాని; పతులకున్= రాజులకు; హితము+అగు= మేలగు; కర్జంబు= కార్యం; ఏల=ఎందుకు; ఒలసి= పూనుకొని; చెప్పుదురు= చెప్పుతారు; అహితులన్= మేలుకోరనివారిని - శత్రువులను; కలపికొనుట= చేర్చుకోవటం; ధర్మువు= ధర్మం; అనిరి= అన్నారు; ఇది, నయ, విరుద్ధంబు= ఇది న్యాయానికి విరుద్ధమైనది; కాదె= అగునుకదా!

తాత్పర్యం: ముసలివాళ్ళు తమకు అనుకూలంగా ఉండేటట్లు చెప్పుతారు కాని రాజులకు మేలుకలిగేటట్లు చెప్పరు. శత్రువులైన పాండవులను చేర్చుకోవటం ధర్మం అన్నారు. ఇది న్యాయవిరుద్ధం కాదా?

విశేషం: భీష్మాదులకు కర్ణాదులకు వాదుపెట్టే ఈ సన్నివేశం ధృతరాష్ట్రుడే (సం) కల్పించాడు. ఇరువర్గాల విభిన్నమతాలకు సంఘర్షణ గమ్యమానమౌతుంది-ఇక్కడ. ధార్తరాష్ట్రులకు పాండవు లహితు లని కర్ణుడు బహిర్గతంగా ప్రకటించాడు. భీష్మాదులు మనసులో ఒకటి పెట్టుకొని పైకి మరొకటి మాట్లాడే అహితులైన అమాత్యులవంటివారని వ్యాఖ్యానించాడు. దుర్యోధనుడిని మెప్పించే ప్రియమే ధర్మమని వాదించి తన మిత్రత్వాన్ని ప్రకటించుకొన్నాడు-కర్ణుడు. నిందకు ప్రతినింద ఈ వాక్య సముదాయం.

వ. 'మంత్రులు దమ తమ బుద్ధిదోషంబులు నెట్లునుం బలుకుదురు. వారల సాధుత్వంబును నసాధుత్వంబును నెఱుంగవలయు; నె ట్లనినఁ దొల్లి నితంతు వను మగధరాజు వికలేంద్రియవర్గుం డయి శ్వాసమాత్రంబ తక్కి రాజ్యతంత్రంబునం దసమర్థుం డై యున్న నాతనిమంత్రి యేకప్రధానుం డయి రాజ్యతంత్రం బెల్లఁ దనవశంబ యగుటంజేసి వాని నవమానించి తదీయరాజ్యవిభవం బెల్లఁ జేకొనియె; వాఁడును విక్రమహీనుం డయి రాజ్యంబు గోల్పడియెం; గావున మంత్రులు హితులపోలె నుండి యహితం బాచరింతురు; మీ యిద్దఱపలుకులు మాకుం జూడ నహితంబు' లనిన నలిగి వానికి ద్రోణుం డి ట్లనియె. 39

ప్రతిపదార్థం: మంత్రులు; తమతమ, బుద్ధి దోషంబులన్= తమ మనస్సులలో ఉండే కల్మషాలను; ఎట్లునున్= ఎట్లయినా; పలుకుదురు=పలుకుతారు; వారల; సాధుత్వంబును= మంచితనాన్ని; అసాధుత్వంబును= చెడుతనాన్ని; ఎఱుంగవలయున్= తెలిసికొనాలి; ఎట్లు= ఏవిధంగా; అనినన్= అంటే; తొల్లి= పూర్వం; నితంతువు+అను= నితంతువు అనే ; మగధరాజు= మగధరాజు; వికల+ఇంద్రియ, వర్గుండు+అయి= చెడిన ఇంద్రియాల సమూహం కలవాడై; శ్వాస, మాత్రంబు= ఊపిరిమాత్రమే; తక్కి= మిగిలి; రాజ్య, తంత్రంబు, అందున్= రాజ్యపరిపాలనలో; అసమర్థుండు+ఐ= నేర్పులేనివాడై; ఉన్నన్= ఉండగా; అతని, మంత్రి= ఆ రాజుయొక్క మంత్రి; ఏక, ప్రధానుండు+అయి= ఒక్కడే ముఖ్యుడై; రాజ్యతంత్రంబు+ఎల్లన్= రాజ్యపాలన అంతా, తన, వశంబు= తన స్వాధీనం; అగుటన్+చేసి=కావటంచేత; వానిన్= ఆ నితంతుమహారాజును; అవమానించి; తదీయ, రాజ్య, విభవంబు+ఎల్లన్= ఆతని రాజ్యసంపదనంతా; చేకొనియెన్= గ్రహించాడు; వాఁడును= ఆ మంత్రికూడా; విక్రమ, హీనుండు+అయి= పరాక్రమం లేని వాడై; రాజ్యంబున్, కోల్పడియెన్; కావునన్= కాబట్టి; మంత్రులు= అమాత్యులు; హితులపోలెన్+ఉండి= మేలుకోరేవారివలె కనిపించి; అహితంబు= కీడు; ఆచరింతురు= చేస్తారు; మీ, ఇద్దఱు+అ= మీ ఇరువురి; పలుకులు= మాటలు; మాకున్; చూడన్= పరికింపగా; అహితంబులు= కీడు చేసేవి; అనినన్= అని పలుకగా; ద్రోణుండు; అలిగి= కోపించి; వానికిన్= కర్ణునికి (కర్ణుడితో); ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'మంత్రులు తమమనస్సులలో కల్మషం ఉంచుకొని ఏదో విధంగా మాట్లాడతారు. వాళ్ళ మంచితనాన్ని, చెడ్డతనాన్ని తరచి తెలుసుకోవాలి. పూర్వం నితంతువు అనే మగధరాజు శక్తి సన్నగిల్లి, ఇంద్రియాలు చెడి, ఊపిరి మాత్రమే మిగిలి రాజ్యపాలనలో అసమర్థుడై ఉండగా; అతనిమంత్రి తా నొక్కడే ప్రాధాన్యం వహించి రాజ్యపాలన నంతా తన వశం చేసికొని, నితంతుమహారాజును త్రోసిపుచ్చి, అతని రాజ్యసంపదనంతా గ్రహించాడు. ఆ మంత్రికూడా పరాక్రమహీనుడై రాజ్యాన్నే కోల్పోయాడు. ఈ విధంగా మంత్రులు మేలు కోరేవాళ్ళవలెనే ఉండి, కీడు చేస్తారు. మీ ఇద్దరిమాటలూ మాకు కీడు చేసేటటువంటివి' అని అనగా, ద్రోణుడు కోపించి, కర్ణునితో ఇట్లా అన్నాడు.

విశేషం: భీష్మద్రోణులు కర్ణుని యుద్ధ ప్రతిపాదనలు పూర్తిగా తిరస్కరించారు. పైగా భీష్ముడు అర్ధరాజ్యప్రతిపాదన చేశాడు. దాన్ని ద్రోణుడు బలపరిచాడు. విశేషించి - పాండవులను, ద్రుపదధృష్టద్యుమ్నకుంతీద్రౌపదులను విలువైన కానుకలిచ్చి గౌరవించండని అంటున్నాడు. కయ్యానికి కాలుదువ్వే కర్ణునిభావావేశప్రవాహానికి పెద్దబండ అడ్డుపడ్డది. అతనిభావావేశం ప్రక్కకు తిరుగక తప్పదు. అందుకే అతడు తన కనుకూలమైన నీతులవైపు మళ్ళాడు. భీష్మ ద్రోణుల మీద విరుచుకు పడ్డాడు. వాళ్ళ చిత్తశుద్ధిని, విశ్వసనీయతను ధృతరాష్ట్రదుర్యోధనులు శంకించేటట్లు నేర్పుగా నీతులను సమన్వయించాడు.

క. ఉడుగక యే మహితముఁ బలి । కెడు వారము; నీవు హితవు క్రియ గొనఁగాఁ బ
ల్కెడు వాఁడవు; మాకంటెను । గడు హితుఁడవు నీవ కావె కౌరవ్యులకున్. 40

ప్రతిపదార్థం: ఉడుగక= మానక; ఏము= మేము; అహితమున్= మేలుకాని దానిని; పలికెడు వారము= పలికేవాళ్లము; నీవు; హితవు= మేలు; క్రియ, కొనఁగాన్= ఫలించేటట్లు; పల్కెడువాఁడవు= పలికేవాడివి; కౌరవ్యులకున్= కౌరవులకు; మాకంటెను= మాకంటే; నీవ, కావె= నీవే కదా; కడు, హితుఁడవు= మిక్కిలి మేలుకోరేవాడివి.

తాత్పర్యం: మేము చెడు చెప్పేవాళ్ళమా? నీవు హితం చెప్పేవాడివా? కౌరవులకు మా కంటె నీవే హితుడవా?

విశేషం: కాకువుతో చేసే అధిక్షేపోక్తికి ఈ పద్యం చక్కని ఉదాహరణం. కర్ణుని అధిక్షేపానికి ద్రోణునిప్రత్యాఖ్యానం.

క. నీకలుపుల నిక్కురుకుల । మాకులతం బొందు టేమి యాశ్చర్యము? సౌ
మ్యాకృతులు గానివారల । వాకులు శిక్షలు నుపద్రవంబుల కావే! 41

ప్రతిపదార్థం: నీ, కఱపులన్= నీ బోధనంవలన; ఈ+కురుకులము= ఈ కురువంశం; అకులతన్= కలతను; పొందుట; ఏమి; ఆశ్చర్యము; సౌమ్య+ఆకృతులు= శాంతమైన ఆకారం కలవాళ్ళు; కాని, వారల, వాకులు, శిక్షలున్= కానట్టివారల యొక్క మాటలు, ఉపదేశాలు; ఉపద్రవంబులు+అ, కావే, = హానికరాలే కదా!

తాత్పర్యం: నీ ఉపదేశాలవల్ల ఈ కురుకులం కలత పొందటం ఆశ్చర్యం కాదు. శాంతమైన ఆకారం లేనివాళ్ళ మాటలు, ఉపదేశాలు కీడునే కలిగిస్తాయి కదా!

విశేషం: అలంకారం: అర్థాంతరన్యాసం.

వ. అనుచున్న సమయంబున నయ్యిద్దఱ వారించి విదురుండు ధృతరాష్ట్రున కి ట్లనియె. 42

ప్రతిపదార్థం: అనుచున్+ఉన్న= అని అంటూ ఉండే; సమయంబునన్= సమయంలో; ఆ+ఇద్దఱన్= ఆ ద్రోణకర్ణులను; వారించి= ఆపి; విదురుండు; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అంటూ ఉన్నసమయంలో ఆ ద్రోణకర్ణుల నిద్దరినీ ఆపి, విదురుడు ధృతరాష్ట్రునితో ఈ విధంగా అన్నాడు.

సీ. ధర్మార్థవిత్తముల్ తథ్యవాదులు వయో । వృద్ధులు మధ్యస్థవిమలమతులు
ద్రోణగాంగేయులు దురితవిదూరులు । ని న్నెద్దిగఱపిరి నెమ్మితోడ
దానిన చేయుట ధర్మువు; వారల । కంటె హితుల్ నీకుఁ గలరె యొరులు;
దుర్యోధనుండును దుశ్శాసనుండును । గర్ణుండు శకునియుఁ గరము బాలు;

ఆ. రెఱుఁగ రిదియు ధర్మ విది యధర్మం బని; । యట్టివారిపలుకు లాదరించి
వినక పాండుసుతుల వేగ రావించి వా । రలకుఁ బ్రీతి నర్ధరాజ్య మిమ్ము. 43

ప్రతిపదార్థం: ధర్మ+అర్థ, విత్తముల్= ధర్మమును, అర్థమును తెలిసినవాళ్ళలో శ్రేష్ఠులు, తథ్య, వాదులు= నిజం చెప్పేవాళ్ళు; వయోవృద్ధులు= వయస్సులో పెద్దవారు; మధ్యస్థ, విమల, మతులు= పక్షపాతం లేని నిర్మలమైన బుద్ధికలవాళ్ళు; దురిత, విదూరులు= పాపానికి దూరమైనవాళ్ళు; ద్రోణ, గాంగేయులు= ద్రోణభీష్ములు; నిన్నున్; నెమ్మితోడన్= ప్రేమతో; ఎద్ది; కఱపిరి= బోధించారో; దానిన్+అ= దానినే; చేయుట; ధర్మువు= ధర్మం; వారలకంటెన్= వాళ్లకన్న; హితుల్= మేలుకోరేవాళ్ళు; నీకున్= నీకు; ఒరులు= ఇతరులు; కలరె= కలరా?; దుర్యోధనుండును; దుశ్శాసనుండును; కర్ణుండు, శకునియున్; కరము= మిక్కిలి; బాలురు= అజ్ఞానులు; ఇదియు, ధర్మువు= ఇది ధర్మం; ఇది, అధర్మంబు= ఇది ధర్మము కాదు; అని, ఎఱుఁగరు= అని తెలియరు; అట్టివారి, పలుకులు= అటువంటివాళ్లమాటలు; ఆదరించి, వినక= పాటించి వినకుండా; పాండుసుతులన్= పాండవుల్ని; రావించి= రప్పించి; ప్రీతిన్= ప్రేమతో;, అర్ధ, రాజ్యము; ఇమ్ము= సగం రాజ్యాన్ని ఇవ్వడంమంచిది.

తాత్పర్యం: ధర్మార్థాలను తెలిసినవాళ్ళలో శ్రేష్ఠులు, సత్యం చెప్పేవాళ్ళు, వయస్సులో పెద్దవాళ్ళు, పక్షపాతం లేని నిర్మలబుద్ధి కలవాళ్ళు, పుణ్యాత్ములు అయిన ద్రోణభీష్ములు నీ కేది ఉపదేశించారో దానిని చేయటమే ధర్మం. ఆ యిద్దరికంటె నీ మేలు కోరేవాళ్ళు ఇంకెవరున్నారు? దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని చాలా అవివేకులు. ఇది ధర్మమనీ, ఇది అధర్మమనీ వాళ్ళకు తెలియదు. అట్లాంటివాళ్ళమాటలు వినక పాండవులను వెంటనే రప్పించి ప్రేమతో వారికి అర్ధరాజ్యాన్ని ఇమ్ము.

విశేషం: ధర్మార్థవిత్తముల్ - అనేసమాసంలో 'అర్థ' శబ్దానికి ప్రయోజనం అనే అర్థాన్ని గ్రహించాలి. ద్రోణ, భీష్ములు ధర్మాన్నే కాక నీకు ఏది ప్రయోజనకరమో అదికూడా తెలిసినవాళ్ళని భావం. విదురుడి వాక్యాలను తర్కబద్ధంగా నిబంధించటం ఇక్కడ గమనింపదగినవిశేషం. పాత్ర ఒక అంశంమీద దీర్ఘసంభాషణం చేసేటప్పుడు నన్నయ తర్కశాస్త్రసంబంధాలైన అంశాలను పొందుపరచటం సహజంగా కనబడుతుంది. ప్రమాణాదిషోడశపదార్థాలు న్యాయశాస్త్రం పరిశీలించేవి. 'ప్రమాణ ప్రమేయ సంశయ ప్రయోజనదృష్టాంతసిద్ధాంతావయవతర్కనిర్ణయవాదజల్పవితండాహేత్వాభాసచ్ఛలజాతినిగ్రహస్థానానాం తత్త్వజ్ఞానాన్నిశ్శ్రేయసాధిగమః' అని న్యాయసూత్రం. ఈ పద్యంలో యథార్థ జ్ఞానాన్ని కలిగించే ద్రోణ గాంగేయుల వాక్యాలు ప్రమాణాలు. కర్ణాదుల వాక్యాలు అప్రమాణాలు. పాండవులను రావించి అర్ధరాజ్యం ఇమ్మనటం యథార్థజ్ఞాన విషయమైన ప్రమేయం.(సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. తమకుం దార యజేయు లెవ్వరికి దోర్దర్పంబునన్, దానిపై
శమితారాతి బలుండు వారలకుఁ బాంచాల ప్రభుం డిప్డు సు
ట్టము దా నయ్యెఁ; దదాత్మజుండయిన ధృష్టద్యుమ్నుడున్ వారితో
సమవీర్యుం డొడఁగూడె నిష్ట సఖుఁ డై సంబంధబంధంబునన్. 44

ప్రతిపదార్థం: తమకున్, తార= తమంతట తామే; దోః+దర్పంబునన్= బాహుబలగర్వంతో; ఎవ్వరికిన్= ఎవరికికూడా; అజేయులు= జయింపసాధ్యంకానివాళ్ళు; దానిపైన్= దానికిపైగా, మీదుమిక్కిలి; శమిత+అరాతి, బలుండు= అణగించబడిన శత్రుబలం కలవాడు; పాంచాల, ప్రభుండు= పాంచాలరాజైన ద్రుపదుడు; ఇపుడు= ఇప్పుడు; వారలకున్; తాను= ఆ ద్రుపదుడు; చుట్టము; అయ్యెన్; తత్+ఆత్మజుండు+అయిన= అతని కుమారుడైన; ధృష్టద్యుమ్నుడున్= ధృష్టద్యుమ్నుడు కూడ; వారితోన్= ఆ పాండవులతో; సమ, వీర్యుండు= సమానమైన బలం కలవాడు; సంబంధ, బంధంబునన్= బంధుత్వ మనే కట్టుచేత; ఇష్ట, సఖుఁడు+ఐ= ఆప్తుడైన స్నేహితుడై; ఒడన్+÷కూడెన్= చేరాడు.

తాత్పర్యం: పాండవులు తమంతట తామే ఎవరికీ జయింప శక్యంకానివాళ్ళు. మీదుమిక్కిలి శత్రువులందరినీ అణచిన మహాబలవంతుడైన పాంచాలరాజు వాళ్ళకు ఇప్పుడు చుట్టం. అతని కుమారుడు ధృష్టద్యుమ్నుడు పాండవులతో సమానమైన పరాక్రమంకలవాడు, బాంధవ్యబంధంవలన ఇష్టమిత్రుడై వాళ్ళతో చేరాడు.

మ. బలదేవాచ్యుతసాత్యకుల్ దమకు నొప్పన్ మిత్రులుం గూర్చు మం
త్రులుఁగా దైవము మానుషంబుఁ గల నిత్యుల్, నీకు దుర్యోధనా
దులకంటెం గడుభక్తు లెంతయు వినీతుల్, వీరు లప్పాండుపు
త్రులు నీపుత్రుల కారె ! వారిఁ దగునే దూరస్థులం జేయఁగన్. 45

ప్రతిపదార్థం: బలదేవ+అచ్యుత, సాత్యకుల్= బలరాముడు, శ్రీకృష్ణుడు, సాత్యకి; తమకున్= పాండవులకు; కూర్చు= ప్రియమైన; మంత్రులున్+కాన్= మంత్రులుగా; దైవము= దైవబలం; మానుషంబున్= మానవబలం; కల= కలిగిన; నిత్యుల్= నిలుకడవాళ్ళు; నీకున్; దుర్యోధన+ఆదులకంటెన్= దుర్యోధనుడు మొదలైనవాళ్ళకంటె; కడున్= మిక్కిలి; భక్తులు= భక్తికలవాళ్ళు; ఎంతయున్= మిక్కిలి; వినీతులు= వినయం కలవాళ్ళు; వీరులు; ఆ+పాండు, పుత్రులు= ఆ పాండవులు; నీ, పుత్రుల; కారె?; వారిన్= వాళ్లను; దూరస్థులన్= దూరంగా ఉన్నవాళ్ళుగా; చేయన్+కన్; తగునె= చేయటం న్యాయమౌతుందా?

తాత్పర్యం: బలరాముడు, శ్రీకృష్ణుడు, సాత్యకి పాండవులకు మిత్రులు, ప్రియమంత్రులు. ఆ విధంగా దైవబలం మానవబలం కూడి, నిలుకడ కలిగి, నీ పట్ల దుర్యోధనాదులకంటె భక్తి వినయాలు కల పాండవవీరులు నీకు పుత్రులు కారా? వాళ్ళని దూరం చేయటం తగునా?

విశేషం: "పాండుపుత్రులు నీ పుత్రుల కారె? వారిఁ దగునే దూరస్థులన్ జేయగన్" అని ధృతరాష్ట్రుని హృదయంలో పాండవులపట్ల ఉన్న అనుమానాలను తొలగించి 'సంశయము'ను తొలగించ యత్నించాడు-విదురుడు. సంశయనివారణమనే ఈ అంశం 44, 45 పద్యాలలో వ్యాపించి ఉన్నది. అందువలన ఈ రెండింటిని మత్తేభవిక్రీడితాలుగా రచించి ఛందశ్శిల్పాన్నికూడా నన్నయ పాటించాడు. ధార్తరాష్ట్రుల కెంత బలగం ఉందో అంతకంటె మిన్న అయిన బలగం కలిగి, దైవమానుషశక్తులతో

ఒప్పారే పాండవులు ఆదరణీయులని చెప్పి, బలవన్నిరాకరణం భంగపాటుకు దారితీస్తుందని విదురుడు వ్యంగ్యంగా హెచ్చరించాడు. వస్తుస్వభావాన్ని స్ఫుటంగా వ్యక్తంచేసే ఝటితీత్యర్థప్రతిపత్తిహేతుత్వం ఉండటంచేత 44, 45 పద్యాలలో అర్థవ్యక్తి అనే గుణం సార్థకంగా పోషింపబడింది. (సంపా.)

ఉ. ఆహవభూమిలోనఁ బరమార్థము పార్థుఁడు వైరివాహినీ
వ్యూహము వ్రచ్చుచోట మఘవుండును వానికి మార్కొనంగ ను
త్సాహముసేయఁ డన్న; లఘుసారు లధీర లసాహసుల్ నిరు
త్సాహులు ద్రోహులై యెదిరి చత్తురొ మందురొ మానవేశ్వరా! 46

ప్రతిపదార్థం: మానవ+ఈశ్వరా!= ధృతరాష్ట్రమహారాజా!; ఆ, భూమిలోనన్= ఆ యుద్ధరంగంలో; పరమ+అర్థము= పరమ ప్రయోజనం కొరకు - అంటే శత్రువుల అంతు తేల్చటంకొరకు; పార్థుఁడు= అర్జునుడు; వైరి, వాహినీ, వ్యూహము= శత్రుసైన్యంయొక్క మొగ్గరాన్ని; వ్రచ్చుచోటన్= చీల్చేచోట; మఘవుండును= దేవేంద్రుడుకూడా; వానికిన్= ఆ అర్జునునికి; మార్కొనంగన్= ఎదుర్కొనటానికి; ఉత్సాహము, చేయఁడు= ఉత్సాహంతో పూనుకోడు; అన్న= అని అనగా; లఘు, సారులు= తక్కువ బలం కలవాళ్ళు; అధీరులు= ధైర్యం లేనివాళ్ళు; అసాహసుల్= తెగింపులేనివాళ్ళు; నిరుత్సాహులు= ఉత్సాహంలేనివాళ్ళు; ద్రోహులు+ఐ= కీడు చేసే తలంపు కలవాళ్ళయి; ఎదిరి= ఎదిరించి; చత్తురొ= చస్తారో; మందురొ - (మనుదురా)= బతుకుతారో?

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రమహారాజా! యుద్ధభూమిలో శత్రువీరుల అంతు తేల్చటానికి పార్థుడు శత్రుసేనా వ్యూహాన్ని చీల్చేచోట దేవేంద్రుడుకూడా అతడిని ఎదుర్కోటానికి పూనుకోలేడు. ఇక పెద్దబలం, ధైర్యం, సాహసం, ఉత్సాహం లేనివాళ్ళు ద్రోహబుద్ధితో ఎదుర్కొని చస్తారో, బ్రతుకుతారో నీవే ఆలోచించుకొమ్ము.

విశేషం: విదురుడు పాండవులను పిలిచి వాళ్ళకు అర్ధరాజ్యమిచ్చి కుమారుల నడుమ శాంతిసౌఖ్యాలు కలిగించటం మంచి దని చెప్పటంతోనే ఆగలేదు. దుర్యోధనుని దుష్టచరిత్రంవలన లోకానికి హాని కలుగుతుంది. అతడు పుట్టిననాటినుండి చెప్పుతున్న విషయాన్ని జ్ఞాపకం చేసి, ఇప్పటి అతని వర్తనమే జననాశనానికి కారణం కావచ్చునని హెచ్చరించాడు. దానికి దృష్టాంతంగా ఈ పద్యం చెప్పాడు. ప్రతిపాదించదలచుకొన్న విషయాన్ని సమర్థించటానికై ప్రసిద్ధమైన దృష్టాంతం చూపించటం న్యాయ ప్రయోగ విషయం. అర్జునుని పరాక్రమాన్ని ఎదుర్కొనటానికి ఇంద్రుడే వెనకాడతాడనీ, ఇక దుర్యోధనాదులు బలహీనులనీ, అధీరులనీ, అసాహసులనీ, నిరుత్సాహులనీ, ద్రోహులనీ, వాళ్ళు అర్జునునెదిరించి చావటం తథ్యమనీ హెచ్చరిస్తాడు. ద్రౌపదీస్వయంవరంలో కర్ణదుర్యోధనాదుల వర్తనాలను గమనిస్తే పై విశేషణాలు వాళ్ళ నుద్దేశించినవే అని తెలుస్తుంది.(సంపా.)

ఉ. ఆయతబాహుఁ డాతనికి నగ్రజుఁ డగ్రణి పోరులందు నా
గాయుతసత్త్వుఁ డుద్ధతయుగాంతకృతాంతనిభుండు భీముఁ డ
వ్వాయుజసవ్యసాచుల నవార్యబలోన్నతిఁ బోలుచున్న మా
ద్రేయు లజేయు లెవ్వరికి దేవసముల్ సమరాంతరంబునన్. 47

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ అర్జునునికి; అగ్రజుఁడు= అన్న, భీముఁడు; ఆయత, బాహుఁడు= పొడవైన చేతులు కలవాడు; పోరులందు= యుద్ధాలలో; అగ్రణి= ముందుండేవాడు; నాగ+అయుత, సత్త్వుఁడు= పదివేలఏనుగుల బలమంతటి బలం కలవాడు; ఉద్ధత, యుగ+అంత, కృత+అంత, నిభుండు= విజృంభించిన ప్రళయకాలయమునితో సమానమైనవాడు; ఆ+వాయుజ, సవ్యసాచులన్= ఆ భీమార్జునులను; అవార్య, బల+ఉన్నతిన్= అడ్డగింపరాని బలాతిశయంతో; పోలుచున్+ఉన్న; మాద్రేయులు=

నకులసహదేవులు; దేవ, సముల్= దేవతలతో సమానమైనవాళ్ళు; సమర+అంతరంబునన్= యుద్ధ మధ్యంలో; ఎవ్వరికిన్= ఎవరికీ; అజేయులు= జయించటానికి సాధ్యం కానివాళ్ళు?

తాత్పర్యం: ఆ అర్జునుని అన్న భీముడు మహావీరుడు. యుద్ధరంగంలో ముందుండేవాడు. వెయ్యి ఏనుగుల బలం కలవాడు. విజృంభిస్తే ప్రళయకాలయమునితో సమానమైనవాడు. ఆ భీమార్జునులను బలాధిక్యంలో పోలుతూ, దేవతలతో సమానులైన నకులసహదేవులనుకూడా యుద్ధమధ్యంలో జయించటం ఎవ్వరికీ సాధ్యం కాదు.

విశేషం: అర్జునుడే అంతటివాడు. ఇక అతని అన్న భీముడు 'ఉద్ధతయుగాంతకృతాంతనిభుండు' అని చెప్పటం సార్థకం. కౌరవులనందరినీ మట్టుబెట్టే భీమపరాక్రమాన్ని ఉదాహరిస్తున్నప్పుడు భావికథార్థాలు స్ఫురించి వస్తుధ్వని రాణిస్తుంది. ఇందులోకూడ 'దృష్టాంతం' అనే అంగం పోషింపబడింది. యుద్ధవీరులైన అర్జున భీముల చైతన్యమూర్తులను వీరరసోజ్జ్వలమైన కాంతి అనే గుణంతో 46, 47 పద్యాలను ఉత్పలమాలావృత్తాలలో రచించటం రచనాశిల్పం. దృష్టాంతమనే అంగాన్ని ప్రదర్శిస్తున్న పద్యాలు రెండింటి ఛందస్సామ్యం. గుణసామ్యం సార్థకం. రసపోషకం. (సంపా.)

క. తమ్ములయట్టుల తనకు వ । శమ్మయి ధర్మువును ధృతియు సత్యముఁ గారు
ణ్యమ్మును నొప్పఁగఁ బేర్మి ని । జమ్ముగ మను ధర్మజున కసాధ్యము గలదే! 48

ప్రతిపదార్థం: తమ్ముల, అట్టుల= తమ్ములవలె; తనకున్; ధర్మువునున్= ధర్మమూ; ధృతియున్= ధైర్యమూ; సత్యమున్= సత్యమూ; కారుణ్యమ్మునున్= దయా; వశమ్ము+అయి= స్వాధీనమై; ఒప్పఁగన్= ప్రకాశింపగా; నిజమ్ముగన్= నిజముగా; పేర్మి= గొప్పతనంతో; మను= ఉండేటటువంటి; ధర్మజునకున్; అసాధ్యము= పొందలేనిది; కలదె?= ఉన్నదా?(లేదని భావం.)

తాత్పర్యం: తమ్ములవలె తనకు ధర్మం, ధైర్యం, సత్యం, దయ వశమై గొప్పగా జీవించే ఆ ధర్మరాజుకు అసాధ్యమైనది ఏముంది?

విశేషం: సద్గుణప్రధానుడైన ధర్మరాజువ్యక్తిత్వాన్ని ప్రసాదగుణబంధురంగా చిత్రించటం సార్థకం. (సంపా.)

వ. 'వారల బలపరాక్రమంబు లెల్లవారికి దృష్టపూర్వంబుల; యట్టివారితోడ విగ్రహంబు సేయు దుర్బుద్ధులుం గలరె? నీపుణ్యమ్మున నమ్మహాత్ములు జననీసహితంబు లక్కయింట బ్రతికిరి; నీయందుఁ బురోచనదిగ్ధం బయిన దుర్యశః పంకంబుఁ బాండవానుగ్రహజలంబులం జేసి కడిగికొనుము; దుర్యోధనాపరాధంబున నఖిల మహీప్రజకు నపాయం బగు నని తొల్లియు నీకుం జెప్పితి; నట్లు గాకుండ రక్షింపు' మనిన ధృతరాష్ట్రుండు విదురున కి ట్లనియె. 49

ప్రతిపదార్థం: వారల, బల, పరాక్రమంబులు= వాళ్ల శక్తిశౌర్యాలు; ఎల్లవారికిన్= అందరికీ; దృష్ట, పూర్వంబులు+అ= ముందు చూడబడినవే; అట్టివారితోడన్= అటువంటివాళ్లతో; విగ్రహంబు, చేయు= యుద్ధం చేసే; దుర్బుద్ధులున్= దుష్టబుద్ధులు; కలరె= ఉన్నారా!; నీ, పుణ్యమ్మునన్= నీ పుణ్యంవల్ల; ఆ+మహాత్ములు; జననీసహితంబు= తల్లితోకూడా; లక్కయింటన్= లక్కయింటిలో; బ్రతికిరి; నీ, అందున్= నీలోని; పురోచన, దిగ్ధంబు+అయిన= పురోచనునిచే పూయబడిన; దుర్+యశ, పంకంబున్= అపకీర్తి అనే బురదను; పాండవ+÷అనుగ్రహ, జలంబులన్‌చేసి= పాండవులమీద దయచూపటం అనే నీళ్ళతో; కడిగికొనుము= కడుక్కో; దుర్యోధన+అపరాధంబునన్= దుర్యోధనుడితప్పువలన; అఖిల, మహీ, ప్రజకున్= సమస్తభూమండలం మీదిప్రజలకు; అపాయంబు= హాని; అగును= కలుగుతుంది; అని= అని; తొల్లియు= ఇదివరకు కూడా; నీకున్, చెప్పితిన్; అట్లుకాకుండ; రక్షింపుము; అనినన్; విని; ధృతరాష్ట్రుండు; విదురునకున్= విదురునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'వాళ్ళబలపరాక్రమాలు అందరూ ఇదివరకు చూచినవే. అట్లాంటివాళ్ళతో యుద్ధం చేసే దుర్బుద్ధు లున్నారా? నీ పుణ్యంవలన ఆ మహాత్ములు లక్కయింట్లో తల్లితోకూడ బ్రతికారు. పురోచనునివలన నీ కంటిన అపకీర్తి అనే బురదను, పాండవులపట్ల దయ చూపటం అనే నీళ్ళతో కడుక్కో. దుర్యోధనుడు చేసే తప్పువలన లోకంలోని ప్రజలందరికీ అపాయం కలుగుతుందని ఇంతకుముందే నీకు చెప్పాను. అట్లా కాకుండా రక్షించు' అనగా విని ధృతరాష్ట్రుడు విదురునితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: రూపకం. పాండవుల పరాక్రమాలు 'దృష్టపూర్వములే' అని చెప్పి, ప్రసిద్ధమైన దృష్టాంతాలుగా పరిగణించాడు. ఆ తరువాత పాండవులను గౌరవిస్తే లాక్షాగృహదహనంవలన ఏర్పడిన అపకీర్తిని మాపుకొనవచ్చు నని 'ప్రయోజనం' చూపించాడు. ఆపైన దుర్యోధనుడు చేసే పాపంవలన భూప్రజలకు అపాయంరాకుండా చూడుమని సిద్ధాంతీకరించాడు. ఈ విధంగా ఆరువిధాల తర్కశాస్త్ర, న్యాయశాస్త్రాంశాలను ప్రయోగించి, వాదకుశలునిగా విదురుడిని నన్నయ తీర్చిదిద్దాడు.(సంపా.)

క. నీవును భీష్ముఁడు ద్రోణుఁడు । భూ వినుత విశుద్ధ ధర్మబుద్ధుల రగుటన్
మీ వచనమున కవజ్ఞత । గావింపఁగ నంత కార్యగతి మూఢుఁడనే? 50

ప్రతిపదార్థం: నీవును= నీవూ; భీష్ముఁడు; ద్రోణుఁడు; భూ వినుత, విశుద్ధ, ధర్మ, బుద్ధులరు+అగుటన్= భూమిమీద పొగడబడిన పరిశుద్ధమైన ధర్మబుద్ధి కలవాళ్ళు అవటంచేత; మీ, వచనమునకున్= మీమాటకు; అవజ్ఞత= త్రోసిపుచ్చటం; కావింపఁగన్= చేయటానికి; అంత, కార్యగతి, మూఢుఁడనే= అంత, పని వైనం తెలియని అవివేకినా?

తాత్పర్యం: నీవు, భీష్మద్రోణులు లోక ప్రశంసలందుకొన్న ధర్మబుద్ధి కలవాళ్ళు. మీ మాటను త్రోసిపుచ్చుతానా? అంత పనివైనం తెలియని అవివేకినా?

విశేషం: విదురుని తర్కబద్ధమైన వాదం ఫలించింది. వక్రబుద్ధి అయిన ధృతరాష్ట్రుడు సవ్యమైన నిర్ణయం తీసికొనలేక తప్పలేదు.

పాండవులను దోడ్తేర ధృతరాష్ట్రుండు విదురునిఁ బంచుట (సం.1-198-3)

వ. 'మీపంచినవిధంబున నప్పాండవుల కర్ధరాజ్యం బిచ్చెద' నని భీష్మవిదురద్రోణాదు లయిన బాంధవప్రధానులయు దుర్యోధనాదు లయిన పుత్త్రులయు సమక్షంబున నిశ్చయించి, యప్పుడ పాండవులం దోడ్తేర విదురుం బంచిన, నాతండును ధృతరాష్ట్రుశాసనంబున ద్రుపదుపురంబునకుం జని, పుత్త్రభ్రాతృపరివృతుం డై యున్న ద్రుపదుని వాసుదేవసహితులై యున్న పాండవులనుం గాంచి ధృతరాష్ట్రుండు పుత్తెంచిన వివిధరత్నభూషణాదుల వేఱువేఱ యిచ్చి తానును వారిచేతఁ బ్రతిపూజితుం డై కేశవపాండవసమక్షంబున విదురుండు ద్రుపదున కి ట్లనియె. 51

ప్రతిపదార్థం: మీ, పంచిన, విధంబునన్= మీరు ఆజ్ఞాపించినపద్ధతిలో; ఆ+పాండవులకున్; అర్ధ, రాజ్యంబు= సగంరాజ్యం; ఇచ్చెదన్+అని; భీష్మ, విదుర, ద్రోణ+ఆదులు+అయిన= భీష్ముడు, విదురుడు, ద్రోణుడు మొదలైన; బాంధవ, ప్రధానులయు= బంధువులయొక్క, మంత్రులయొక్క; దుర్యోధన+ఆదులు+అయిన= దుర్యోధనుడు మొదలగువాళ్ళయిన; పుత్త్రులయు= కుమారులయొక్క; సమక్షంబునన్= ఎదుట; నిశ్చయించి; అప్పుడు+అ= వెంటనే; ఆ, పాండవులన్; తోడ్తేరన్= తీసికొనిరావటానికి; విదురున్= విదురుణ్ణి; పంచినన్= పంపగా; ఆతండును= ఆ విదురుడుకూడా; ధృతరాష్ట్ర, శాసనంబునన్= ధృతరాష్ట్రునియొక్క ఆజ్ఞచేత; ద్రుపదు= ద్రుపదుని; పురంబునకున్= నగరానికి; చని= వెళ్ళి; పుత్త్ర, భ్రాతృ, పరివృతుండు+ఐ= కొడుకులచే,

తోబుట్టువులచే చుట్టబడినవాడై; ఉన్న; ద్రుపదునిన్; వాసుదేవ, సహితులు+ఐ= శ్రీకృష్ణునితో కూడినవాళ్ళయి; ఉన్న; పాండవులనున్; కాంచి= చూచి; ధృతరాష్ట్రుండు; పుత్తెంచిన= పంపిన; వివిధ, రత్న, భూషణ+ఆదుల= నానావిధాలైన రత్నాలు, సొమ్ములు మొదలైనవాటిని; వేఱువేఱ, ఇచ్చి; తానును; వారిచేతన్; ప్రతి, పూజితుండు+ఐ= మారుగా పూజించబడినవాడై; కేశవ, పాండవ, సమక్షంబునన్= శ్రీకృష్ణునియొక్క, పాండవులయొక్క ఎదుట; విదురుండు; ద్రుపదునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'మీరు ఆజ్ఞాపించిన విధంగా ఆ పాండవులకు సగభాగం రాజ్యం ఇస్తాను' అని భీష్ముడు, ద్రోణుడు, విదురుడు మొదలైన బంధువులు, మంత్రులూ, దుర్యోధనుడు మొదలైన పుత్రులూ ఉన్నప్పుడు అందరి ఎదుట నిర్ణయించి, పాండవులను పిలుచుకొని రావటానికి విదురుడిని పంపాడు. విదురుడు ధృతరాష్ట్రుని ఆజ్ఞప్రకారం ద్రుపదుని పురానికి వెళ్ళి - కొడుకులతో తోబుట్టువులతో కూడిఉన్న ద్రుపదుడిని, శ్రీకృష్ణునితో కూడిఉన్న పాండవులను చూచి, ధృతరాష్ట్రుడు పంపిన వివిధరత్నాలను, ఆభరణాలను ఎవరి కీయవలసినవి వాళ్ళకిచ్చి, తానుకూడా వాళ్ళచేత పూజితుడై శ్రీకృష్ణపాండవులయెదుట ద్రుపదునితో ఇట్లా అన్నాడు.

మ. అభిజాతుండవు ధర్మశీలుఁడవు నీయం దైన సంబంధ మిం
దభిరమ్యం బనురూప మిష్ట మని సౌహార్దంబునన్ జాహ్నవీ
ప్రభవుండున్ ధృతరాష్ట్రుఁడుం గృపుఁడుఁ గుంభప్రోద్భవుండున్ యశో
విభవాలంకృత! సంతసంబువడి రుర్వీవంద్యు లిష్టంబునన్. 52

ప్రతిపదార్థం: యశస్+విభవ+అలంకృత= కీర్తితో, ఐశ్వర్యంతో అలంకరించబడినవాడా!; అభిజాతుండవు= మంచివంశం కలవాడవు; ధర్మశీలుఁడవు= ధర్మస్వభావం కలవాడవు; నీ, అందు+ఐన, సంబంధము= నీతో ఏర్పడిన బంధుత్వం; ఇందున్= ఇచ్చట; అభిరమ్యంబు= మనోహరం; అనురూపము= తగినది; ఇష్టము= ఇష్టమైనది; అని= అని; సౌహార్దంబునన్= స్నేహభావంతో; జాహ్నవీ, ప్రభవుండున్= గంగాదేవికి జన్మించినవాడు - భీష్ముడు; ధృతరాష్ట్రుండున్; కృపుఁడున్= కృపాచార్యుడు; కుంభ, ప్ర+ఉద్భవుండున్= కుండనుంచి పుట్టినవాడు - ద్రోణుడు కూడా; ఉర్వీ, వంద్యులు= భూమిలో పొగడదగినవాళ్ళు; ఇష్టంబునన్= ప్రీతితో; సంతసంబు, పడిరి=సంతోషాన్ని పొందారు.

తాత్పర్యం: కీర్తి, ఐశ్వర్యం అలంకారాలుగా కల ఓ ద్రుపదమహారాజా! నీవు మంచివంశం కలవాడవని, ధర్మస్వభావం కలవాడవని, నీతో ఏర్పడిన బంధుత్వం మనోహరమైనది, తగినదని, ఇష్టమైనదని - లోకం కొనియాడదగిన భీష్మ, ధృతరాష్ట్ర, కృప, ద్రోణులు స్నేహభావంతో సంతోషించారు.

ఉ. తల్లియుఁ బుత్రులేవురు నుదాత్తమతుల్ దమయొద్ద వాసినం
దల్లడమంది యందఱును దద్దయు దుఃఖితచిత్తు లైరి, నీ
యల్లురఁ బాండుపుత్రులఁ బ్రియంబునఁ జూడఁగఁ గోరుచున్న వా
రెల్ల జనంబులుం గురుకులేశ్వరుఁ డాదిగ బంధువర్గమున్. 53

ప్రతిపదార్థం: ఉదాత్త, మతుల్= గొప్పబుద్ధికలవాళ్ళు; తల్లియున్= తల్లి కుంతీదేవి; పుత్రులు+ఏవురున్= కొడుకులు ఐదుగురుకూడా; తమ, ఒద్ద, పాసినన్= తమదగ్గరనుంచి వెళ్ళగా; తల్లడము+అంది= చలించి; అందఱును= అందరూ; తద్దయున్= మిక్కిలి; దుఃఖిత చిత్తులు= దుఃఖపడిన మనస్సు కలవాళ్ళు; అయిరి= అయ్యారు; కురు, కుల+

ఈశ్వరుఁడు= కురువంశప్రభువైన ధృతరాష్ట్రుడు; ఆదిగ= మొదలుగా; బంధు, వర్గమున్= బంధువుల సమూహం; ఎల్ల, జనంబులున్= ప్రజలంతా, నీ అల్లురన్, పాండు, పుత్త్రులన్= నీ అల్లుళ్లైన పాండుకుమారుల్ని; ప్రియంబునన్= ప్రీతితో; చూడఁగన్= చూడటానికై; కోరుచున్+ఉన్నవారు= ఇష్టపడుతూ ఉన్నారు.

తాత్పర్యం: గొప్ప బుద్ధి కలవాళ్ళయిన కుంతీదేవి, పాండవులు తమ దగ్గరనుండి వెళ్ళటంవలన చలించి అంతా ఎంతో దుఃఖించారు. కురువంశప్రభువైన ధృతరాష్ట్రుడు మొదలుకొని సమస్తబంధువర్గం, సకలప్రజలు నీ అల్లుళ్ళైన పాండవులను ప్రియమార చూడగోరుతున్నారు.

విశేషం: విదురుడు వెళ్ళిన పని అంతసులభమైనది కాదు - లక్కయింటిలో పాండవులను తగులబెట్టిన కౌరవులవద్దకు మళ్ళీ పాండవులను పంపండని అడగటం, వాళ్ళను వెంట పిలుచుకొనిరావటం. దానికి ద్రుపదుని అనుమతి కావాలి. అందువలననే విదురుడు చాలా నేర్పుగా మొదట ద్రుపదుడిని పొగడాడు. పాండవుల అభ్యుదయానికి, మీతో ఏర్పడిన బాంధవ్యానికి హస్తినలో అంతా ఆనందిస్తున్నారనీ, పాండవులను ప్రియమార చూడగోరుతున్నారనీ, వాళ్ళను పంపవలసిన దనీ, ఎంతో చాకచక్యంగా ద్రుపదుడిని అడుగుతున్నాడు.

క. గురుగుణయుతు లగు కొడుకులఁ। గురుకులము వెలుంగ నయిన కోడలిఁ గృష్ణం
బరమపతివ్రత గొంతిని। గరుణను రాఁ బనిచె రాజు గజపురమునకున్. 54

ప్రతిపదార్థం: గురు, గుణ యుతులు+అగు= గొప్పగుణాలతో కూడుకొన్నవాళ్ళయిన; కొడుకులన్; కురు, కులము= కురువంశం; వెలుంగన్+అయిన= ప్రకాశించటానికై ప్రాప్తించిన; కోడలిన్, కృష్ణన్= కోడలగు ద్రౌపదిని; పరమ పతివ్రత= పరమ పతివ్రతయైన; గొంతిని= కుంతీదేవిని; రాజు= ధృతరాష్ట్ర మహారాజు; గజ,. పురమునకున్= హస్తినాపురానికి; కరుణన్= దయతో; రాన్+పనిచెన్= పిలుచుకొని రమ్మని పంపాడు.

తాత్పర్యం: గొప్పగుణాలతో కూడుకొన్న కొడుకులను, కురువంశం వెలిగేటట్లుగా కోడలైన ద్రౌపదిని, పరమపతివ్రత అయిన కుంతిని దయతో ధృతరాష్ట్రమహారాజు హస్తినాపురానికి పిలుచుకొని రమ్మన్నాడు.

వ. 'నీచేత ననుజ్ఞాతు లై కాని వీరలు రా నేరరు గావున వీరలం బుత్తెంచు నది' యనిన విదురునకు ద్రుపదుం డి ట్లనియె. 55

ప్రతిపదార్థం: నీచేతన్; అనుజ్ఞాతులు+ఐ, కాని= అనుమతింపబడినవాళ్ళయితే తప్ప; వీరలు= వీళ్లు; రానేరరు= రాజాలరు; కావునన్; వీరలన్= వీళ్లను; పుత్తెంచునది= పంపునది; అనినన్; విదురునకున్; ద్రుపదుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీ అనుమతి లభిస్తేనే పాండవులు రాగలరు. అందుచేత వీళ్ళను మీరు పంపండి' అని అనగా విదురునితో ద్రుపదుడు ఇట్లా అన్నాడు.

చ. రవినిభతేజుఁ డైన ధృతరాష్ట్రుఁడు పంపఁగ నీవు కార్యగౌ
రవమున వచ్చినప్పుడ తిరంబుగ వీరికి నిష్టసిద్ధి దా
నవు టది యేమి సందియమె; యంబుజనాభుఁడు నీవుఁ బాండవ
ప్రవరుల కెల్లప్రొద్దును శుభంబ తలంతురుకాదె నెమ్మితోన్. 56

ప్రతిపదార్థం: రవి, నిభ, తేజుఁడు+ఐన= సూర్యునితో సమానమైన తేజస్సు కలవాడైన; ధృతరాష్ట్రుఁడు, పంపఁగన్= పంపగా; నీవు= నీవు; కార్య, గౌరవమునన్= పనియొక్క గొప్పతనంవలన; వచ్చినప్పుడు+అ= ఏతెంచిన ఆ క్షణమే; తిరంబుగన్= స్థిరంగా; వీరికిన్= వీళ్లకు; ఇష్ట, సిద్ధి= ఇష్టమైనది లభించటం; తాన్, అవుట, అది; ఏమి; సందియమె; అంబుజనాభుఁడు= శ్రీకృష్ణుడు; నీవున్; పాండవ, ప్రవరులకున్= శ్రేష్ఠులైన పాండవులకు; ఎల్ల, ప్రొద్దును= ఎల్లప్పుడుకూడా; నెమ్మితోన్= స్నేహంతో; శుభంబు+అ= శుభాన్నే; తలంతురు కాదె= కోరుతారు కదా.

తాత్పర్యం: సూర్యునితో సమానమైన తేజస్సు కల ధృతరాష్ట్రుడు పంపగా, గొప్ప పని బూని నీవు రాగా, పాండవులకు ఇష్టమైనది లభిస్తుందనటంలో సందేహం లేదు. శ్రీకృష్ణుడు, నీవు, ఉత్తములైన పాండవులకు ఎల్లప్పుడూ స్నేహంతో శుభమే కోరుతారుకదా!.

విశేషం: ఇక్కడ ద్రుపదుడుకూడా ఎంతో నేర్పుగా మాట్లాడాడు. పాండవుల యోగక్షేమాలు చూచేబాధ్యతను పరోక్షంగా విదురునికి అప్పగించాడు. శ్రీకృష్ణుడిని కూడా విదురునితో చేర్చాడు.

క. నీవును ద్రోణుండును వసు । దేవతనూజుండు భీష్మధృతరాష్ట్రులు స
ద్భావమున నెద్ది సేయం । గా వగచితి రది హితంబ కా కొం డగునే? 57

ప్రతిపదార్థం: నీవును= నీవూ; ద్రోణుండును= ద్రోణుడూ; వసుదేవ, తనూజుండు= శ్రీకృష్ణుడుకూడా; భీష్మ, ధృతరాష్ట్రులు= భీష్ముడు, ధృతరాష్ట్రుడు; సత్+భావమునన్= మంచిఉద్దేశంతో; ఎద్ది, చేయన్+కాన్= ఏది చేయటానికి; వగచితిరి= తలంచారో; అది= అది; హితంబు+అ, కాక= మేలుచేసేదికాకుండా; ఒండు= మరొకటి; అగునే= ఔతుందా? (కాదని భావం)

తాత్పర్యం: నీవు, ద్రోణుడు, శ్రీకృష్ణుడు, భీష్ముడు, ధృతరాష్ట్రుడు మంచిఉద్దేశంతో ఏది చేయ తలచారో అది పాండవులకు మేలే అవుతుంది కాని మరొకటి కాదు.

వ. అనిన వాసుదేవుం డి ట్లనియె. 58

ప్రతిపదార్థం: అనినన్= అని ద్రుపదుడు అనగా; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

క. ఎవ్వరును నేమి సేయుదు । రివ్విదురుఁడు పాండవులకు హిత మొనరింపన్
నెవ్వగ నొండు దలంపకుఁ డీవ్వీరుల కగు నభీష్ట మిది మొదలుంగాన్. 59

ప్రతిపదార్థం: ఈ+విదురుఁడు; పాండవులకున్; హితము= మేలు; ఒనరింపన్= చేస్తుండగా; ఎవ్వరున్, ఏమి; చేయుదురు; నెఱ+వగన్= మిక్కిలి విచారంతో; ఒండు= వేరొకటి; తలంపకుఁడు= ఆలోచింపకండి; ఈ+వీరులకున్= ఈ వీరులైన పాండవులకు; ఇది, మొదలున్+కాన్= ఇది మొదలుకొని; అభీష్టము= కోరుకొన్నది; అగున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: ఈ విదురుడు పాండవులకు మేలు చేసేవాడై ఉండగా - వాళ్ళను ఎవరు ఏమి చేయగలరు? అతిగా విచారించి వేరొకవిధంగా మీరు ఆలోచించ వద్దు. ఇది మొదలుగా పాండవులకు కోరుకొన్నది సిద్ధిస్తుంది.

విశేషం: ఇక కృష్ణుడు మాత్రం తక్కువవాడా? ఆయన పాండవుల శ్రేయోబాధ్యతను, అభీష్టసిద్ధిని మొత్తం విదురునికి

అప్పుడెప్పాడు. విదురుడు సామాన్యవ్యక్తి కాదు. పరమధార్మికుడు. గొప్పతాత్త్వికుడు. విశేషించి, హస్తినాపురరాజ్యవ్యవహారాలలో ప్రముఖపాత్ర నిర్వహించే మంత్రిసత్తముడు.

వ. అనిన నందఱకు ధర్మనందనుం డి ట్లనియె. 60

ప్రతిపదార్థం: అనినన్= అని శ్రీకృష్ణుడు అనగా; అందఱకున్= అందరితో; ధర్మనందనుండు= ధర్మరాజు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని అనగా అందరితో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. కురు ముఖ్యులు ధృతరాష్ట్రవి । దుర భీష్ములు గురులు మాకు; ద్రుపదప్రభుఁడున్
గురుఁడు; మురాంతకుఁడు జగ । ద్గురుఁ; డిందఱ మతమునను నగున్ శుభయుక్తుల్. 61

ప్రతిపదార్థం: కురు, ముఖ్యులు= కురువంశశ్రేష్ఠులు; ధృతరాష్ట్ర, విదుర, భీష్ములు= ధృతరాష్ట్రుడు, విదురుడు, భీష్ముడు; మాకున్=మాకు; గురులు= పెద్దలు; ద్రుపదప్రభుఁడున్= ద్రుపదరాజుకూడా; గురుఁడు= పెద్ద; మురాంతకుఁడు= మురుడు అనే రాక్షసుడిని సంహరించిన శ్రీకృష్ణుడు; జగత్+గురుఁడు= లోకానికే పెద్ద; ఇందఱ= వీళ్లందరియొక్క; మతమునను= సమ్మతితో; శుభ, యుక్తుల్= శుభంతోడి కూడికలు; అగున్= అవుతాయి.

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠులైన ధృతరాష్ట్ర విదుర భీష్ములు మాకు పెద్దలు. అట్లాగే ద్రుపద మహారాజుకూడా పెద్దలే. ఇక శ్రీకృష్ణుడు లోకానికంతా పెద్ద. వీళ్ళందరిసమ్మతివలన మాకు శుభాలే కలుగుతాయి.

పాండవులు హస్తిపురంబునకు వచ్చుట (సం. 1-199-10)

వ. అని యుధిష్ఠిరుండు వారి యనుమతంబు వడసి, తమ్ములు దానును హస్తిపురంబునకుఁ బోవ నిశ్చయించి, ద్రుపదు వీడ్కొని ప్రయాణోన్ముఖుం డయ్యె; నిట్లు విదురుండు పాండవులఁ బాంచాలిని గుంతీదేవినిం దోడ్కొని వాసుదేవ ధృష్టద్యుమ్ను లపరిమిత సేనాసమన్వితు లై తోడ రాఁగా వచ్చునంత, వారలరాక విని ధృతరాష్ట్రుండు వికర్ణ చిత్రసేన ద్రోణ కృపాచార్యుల నెదురు పుత్తెంచినం దత్సైన్యసమేతులయి మహోత్సవంబుతోఁ బాండవులు గజపురప్రవేశంబు సేయునప్పుడు వారలం జూచి. 62

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; వారి= వాళ్లయొక్క; అనుమతంబు= అనుమతి; పడసి= పొంది; తమ్ములు; తానును= తానూ; హస్తిపురంబునకున్= హస్తినాపురానికి; పోవన్= పోవటానికై; నిశ్చయించి= నిర్ణయించి; ద్రుపదున్, వీడ్కొని= ద్రుపదునిదగ్గర సెలవు తీసికొని; ప్రయాణ+ఉన్ముఖుండు= ప్రయాణంవైపు ఎత్తినముఖం కలవాడు - అంటే ప్రయాణానికి పూనుకొన్నవాడు; అయ్యెన్= అయ్యాడు; ఇట్లు= ఈ విధంగా; విదురుండు= విదురుడు; పాండవులన్= పాండవుల్ని; పాంచాలిని= ద్రౌపదిని; కుంతీదేవినిన్; తోడ్కొని= వెంటతీసుకొని; వాసుదేవ= శ్రీకృష్ణుడు; ధృష్టద్యుమ్నులు= ధృష్టద్యుమ్నుడు; అపరిమిత, సేనా, సమన్వితులు+ఐ= అంతులేని సైన్యంతో కూడినవాళ్ళయి; తోడ రాఁగా= వెంటరాగా; వచ్చునంతన్= వస్తూ ఉండగా; వారల, రాక, విని; ధృతరాష్ట్రుండు; వికర్ణ, చిత్రసేన, ద్రోణ, కృపాచార్యులన్; ఎదురు= ఎదురుగా; పుత్తెంచినన్= పంపగా; తత్+సైన్య, సమేతులు+అయి= ఆ సైన్యంతో కూడినవాళ్ళయి; మహా+ఉత్సవంబుతోన్= గొప్ప ఉత్సాహంతో; పాండవులు; గజపుర, ప్రవేశంబు; చేయునప్పుడు= హస్తినాపురంలో ప్రవేశించేటప్పుడు; వారలన్+చూచి;

తాత్పర్యం: అని ధర్మరాజు తనవాళ్ళ అనుమతి పొంది, తమ్ములు, తాను హస్తినాపురం వెళ్ళాలని నిశ్చయించాడు. ద్రుపదునిదగ్గర సెలవు తీసుకొని ప్రయాణానికి పూనుకొన్నాడు. ఈ విధంగా విదురుడు పాండవులను, ద్రౌపదిని, కుంతిని తోడ్కొని, శ్రీకృష్ణధృష్టద్యుమ్నులు, అంతులేనిసైన్యంతో వెంటరాగా, హస్తినాపురానికి వస్తూండగా, వాళ్ళరాక విని ధృతరాష్ట్రుడు, వికర్ణ, చిత్రసేన, ద్రోణ, కృపాచార్యులను ఎదురు పంపగా, సైన్యసమేతులై పాండవులు మహోత్సవంతో హస్తినాపురం ప్రవేశించేటప్పుడు వాళ్ళను చూచి.

విశేషం: అపారసైన్యం పాండవుల అపాయనివారకం, ఐశ్వర్యప్రదర్శకం. వాసుదేవ ధృష్టద్యుమ్నులు పాండవులకేర్పడిన నిజమైన అండదండలు.

సీ. **పుర జను లెల్లను గర మనురక్తు లై । 'ధర్మస్వరూపుఁ డీ ధర్మతనయుఁ**
డనుజులుఁ దానును జనుదెంచెఁ; బాండుభూ । జనపతి జీవించి మనలఁ గావఁ
బ్రీతితోఁ దా నిప్పు డేతెంచె, మే లయ్యెఁ; । నిమ్మహాత్ములకు దైవమ్ముఁ బురుష
కారంబుఁ గలుగంగ ధారుణీరాజ్యంబు । వాయునే యాపదల్ వాయుఁగాక;

ఆ. **దాన హోమ జప విధానముల్ మన కివి । గలవయేని ధరణివలయరాజ్య**
మింద యుండి ధర్మనందనుఁ డొనరించు । చుండుఁ గావుతమ యఖండితముగ. **63**

ప్రతిపదార్థం: పుర, జనులు ఎల్లను; కరము= మిక్కిలి; అనురక్తులు+ఐ= ప్రేమ కలవాళ్ళయి; ధర్మ, స్వరూపుఁడు; ఈ, ధర్మతనయుఁడు; అనుజులున్= తమ్ములుకూడా; తానును= తానూ; చనుదెంచెన్= వచ్చాడు; పాండుభూజనపతి= పాండురాజు; జీవించి= మళ్లీ బ్రతికి; మనలన్= మనల్ని; కావన్= కాపాడటానికి; ప్రీతితోన్= ప్రేమతో; తాన్= తానే; ఇప్పుడు; ఏతెంచెన్= వచ్చాడు; మేలు+అయ్యెన్= శుభం అయింది; ఈ+మహా+ఆత్ములకున్= ఈ మహనీయులకు; దైవమ్మున్= దైవబలం; పురుషకారంబున్= మానవబలం; కలుగన్+కన్= ఉండగా; ధారుణీరాజ్యంబు= భూసామ్రాజ్యం; పాయునే= తొలగునా; ఆపదల్= ఆపదలు; పాయున్+కాక= తొలగిపోవునుకాని; మనకున్= మనకు; దాన, హోమ, జప, విధానముల్= దానాలు, హోమాలు, జపాలు; చేయటాలు; ఇవి కలవు+అ; ఏని= ఇవి ఉన్నట్లయితే; ధర్మనందనుఁడు= ధర్మరాజు; ఇందు+అ, ఉండి= ఈ హస్తినాపురంలోనే ఉండి; అఖండితముగన్= అవిచ్ఛిన్నంగా; ధరణివలయరాజ్యము= భూమండలపాలనం; ఒనరించుచున్= చేస్తూ; ఉండున్= ఉండటం; కావుతమ= అగుగాక.

తాత్పర్యం: నగరంలోని జనులంతా పాండవులను చూచి మిక్కిలి ప్రేమతో ఇట్లా అనుకొన్నారు. 'ధర్మస్వరూపుడైన ధర్మరాజు తమ్ములతోకూడి ఇక్కడకి వచ్చాడు. పాండురాజే మళ్ళీ బ్రతికి మనలను కాపాడటానికి ప్రీతితో తాను ఇపుడు వచ్చినట్లున్నది. మనకు మేలైనది. మహాత్ములైన ఈ పాండవులకు దైవబలం మానవబలం ఉండటంవలన ఆపదలు తొలగుతాయి కాని రాజ్యం తొలగిపోతుందా? మనం చేసిన దానహోమజపాల పుణ్యమే ఉన్నట్లైతే ఈ ధర్మరాజు ఈ హస్తినాపురిలోనే ఉండి అవిచ్ఛిన్నంగా భూమండలాన్ని పరిపాలిస్తూ ఉండుగాక'.

విశేషం: పాండవులు హస్తినాపురంలో ప్రవేశించేటప్పుడూ, ఏ కారణంవలననైనా హస్తినాపురి వదలిపోవలసివచ్చినపుడూ ప్రజలు వారిపట్ల ప్రదర్శించే ఆదరాభిమానాలను వాచికంగా, ఆంగికంగా, సాత్త్వికంగా ప్రదర్శించినట్లు వర్ణించటం నన్నయరచనలోనే కానవచ్చే సంవాదరచనాశిల్పం. పాండవులే హస్తినాపురానికి పాండురాజు తరువాత పరిపాలించ తగినవాళ్ళని ప్రజాభిప్రాయం. రాజ్యంలో పాండవులకు ఉన్న ప్రజానురాగానికి ఇది పెద్దతార్కాణం. దుర్యోధనాదులకు ఇటువంటి ప్రజాదరణ లేదు.(సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పౌరులెల్ల దీవించుచుండఁ బౌరవకులనందను లయిన పాండునందనులు వచ్చి, భీష్మధృతరాష్ట్రాది కురువృద్ధులకు మ్రొక్కి, సకలజనానురాగం బొనరించుచు దుర్యోధనాదులతోఁ గలసి యెప్పటియట్ల రాజ్యవిద్యా వినోదంబుల నేను సంవత్సరంబు లుండు నంత, నొక్కనాఁడు ధృతరాష్ట్రుండు భీష్మవిదురద్రోణ దుర్యోధనాదుల సమక్షంబునఁ బాండవుల కి ట్లనియె. 64

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పౌరులు+ఎల్లన్= పురప్రజలంతా; దీవించుచున్+ఉండన్= దీవిస్తూ ఉండగా; పౌరవ, కుల, నందనులు+అయిన= పూరువంశకుమారులైన; పాండు, నందనులు= పాండురాజుపుత్రులు; వచ్చి; భీష్మ, ధృతరాష్ట్ర+ఆది= భీష్ముడు, ధృతరాష్ట్రుడు మొదలైన; కురు, వృద్ధులకున్= కురువంశంలోని పెద్దలకు; మ్రొక్కి; సకల, జన+అనురాగంబు= ఎల్ల జనులకు సంతోషం; ఒనరించుచున్= కలిగిస్తూ; దుర్యోధన+ఆదులతోన్= దుర్యోధనుడు మొదలైన వాళ్ళతో; కలిసి= కలిసిమెలసి; ఎప్పటి+అట్లు+అ= ఎప్పటివలెనే; రాజ్య, విద్యా, వినోదంబులన్= రాజ్యానికి, విద్యకు సంబంధించిన వేడుకలతో; ఏను, సంవత్సరంబులు= ఐదు సంవత్సరాలు; ఉండునంతన్= ఉండగా; ఒక్కనాఁడు= ఒక్కరోజు; ధృతరాష్ట్రుండు; భీష్మ, విదుర, ద్రోణ, దుర్యోధన+ఆదుల, సమక్షంబునన్= భీష్ముడు, విదురుడు, ద్రోణుడు, దుర్యోధనుడు మొదలైనవారి ఎదుట; పాండవులకున్, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని హస్తినాపురపౌరులంతా ఆశీర్వదిస్తుండగా పూరువంశరాజకుమారులు పాండవులు వచ్చి కురువంశపు పెద్దలైన భీష్ముడు, ధృతరాష్ట్రుడు మొదలైనవాళ్ళకి నమస్కరించి, సకలజనులకు సంతోషం కలిగిస్తూ దుర్యోధనాదులతో కలిసి, ఎప్పటివలె రాజ్యవిషయాలకు, విద్యావిషయాలకు సంబంధించిన వినోదాలతో ఐదుసంవత్సరాలు గడపగా, ఒకరోజు ధృతరాష్ట్రుడు- భీష్మ, ద్రోణ, దుర్యోధనాదుల సమక్షంలో పాండవులతో ఇట్లా అన్నాడు.

విశేషం: రాజ్యవిద్యావినోదాలు - అనేచోట రాజ్యానికి, విద్యకు సంబంధించిన వినోదాలనే గాక-రాజ్యవిద్యకు సంబంధించిన వినోదాలనికూడా చెప్పుకోవచ్చు. రాజ్యవిద్య అంటే రాజనీతి.

ఆ. సర్వలోక కర్మసాక్షి యీకృష్ణుండు । సాక్షి గాఁగ మీకు సకలవృద్ధ
రాజు లొద్ద నర్ధరాజ్య మిచ్చితిఁ బాండు । రాజవిభవ మెల్ల రమణఁ గొనుఁడు. 65

ప్రతిపదార్థం: సర్వలోక, కర్మసాక్షి= సర్వజనులయొక్క కర్మములకు సాక్షి అయినవాడు; ఈ, కృష్ణుండు; సాక్షి, కాఁగన్= సాక్షిగా; మీకున్, సకల, వృద్ధ, రాజుల+ఒద్దన్= అందరు పెద్దలయొక్క, రాజులయొక్క ఎదుట, అర్ధరాజ్యము= సగరాజ్యం; ఇచ్చితిని; పాండురాజ, విభవము+ఎల్లన్= పాండురాజుయొక్క ఐశ్వర్యాన్నంతా; రమణన్= సంతోషంతో; కొనుఁడు= తీసికొనండి.

తాత్పర్యం: సర్వజనులకర్మసాక్షి అయిన ఈ కృష్ణుడు సాక్షిగా, అందరు పెద్దలఎదుట, రాజులఎదుట మీకు అర్ధరాజ్యం ఇచ్చాను. పాండురాజు ఐశ్వర్యమంతా సంతోషంతో స్వీకరించండి.

విశేషం: ఇదివరకు (అంటే లాక్షాగృహదహనానికి ముందు) ధర్మరాజును యువరాజుగా అభిషేకించింది-అర్ధరాజ్యానికి కాదు. ఇప్పుడు ధర్మరాజును అభిషేకించేదిమాత్రం అర్ధరాజ్యానికి. దానిలో మీ తండ్రి పాండురాజుకు సంబంధించిన సగభాగానికి అనే సూచనకూడా ఉన్నది.

వ. అని ధర్మరాజు నభిషిక్తుం జేసి. 66

ప్రతిపదార్థం: అని= అనిపలికి; ధర్మరాజున్=ధర్మరాజును; అభిషిక్తున్+చేసి= అభిషేకించి.

తాత్పర్యం: అని పలికి ధర్మరాజును రాజుగా అభిషేకించి.

క. 'నెమ్మిఁ జని ఖాండవప్ర। స్థమ్ము నివాసమ్ముఁ జేసి తద్దయు ననురా
గ మ్మెసఁగ నుండుఁ డందుఁ ది। రమ్ముగ' నని పనిచెఁ బాండురాజాత్మజులన్. 67

ప్రతిపదార్థం: నెమ్మిన్= సంతోషంతో; చని= వెళ్ళి; ఖాండవప్రస్థమ్ము= ఖాండవప్రస్థము అను ప్రదేశాన్ని; నివాసమ్మున్+చేసి= నివసించేచోటు చేసికొని; తద్దయున్= మిక్కిలి; అనురాగమ్ము= స్నేహం; ఎసఁగన్= పెంపొంద; అందున్= అక్కడ; తిరమ్ముగన్= స్థిరంగా; ఉండుఁడు= ఉండండి; అని= అని చెప్పి; పాండురాజ+ఆత్మజులన్= పాండురాజుయొక్క కుమారులను; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: 'సంతోషంగా వెళ్ళి ఖాండవప్రస్థాన్ని రాజధానిగా చేసికొని స్నేహం పెంపొందేటట్లు అక్కడ స్థిరంగా ఉండండి' అని పాండవులను ఆజ్ఞాపించాడు.

వ. పాండవులును ధృతరాష్ట్రశాసనంబునను, భీష్మాదులయనుమతంబునను వాసుదేవసహితు లయి ఖాండవప్రస్థమ్మునకుం జని రంత. 68

ప్రతిపదార్థం: పాండవులును= పాండవులు కూడా; ధృతరాష్ట్ర, శాసనంబునను= ధృతరాష్ట్రునియొక్క ఆజ్ఞవలన; భీష్మ+ఆదుల, అనుమతంబునను= భీష్ముడు మొదలైన వాళ్ళయొక్క అంగీకారంతో; వాసుదేవ, సహితులు+అయి= శ్రీకృష్ణునితో కూడినవాళ్ళయి; ఖాండవప్రస్థమ్మునకున్= ఖాండవప్రస్థానికి; చనిరి= వెళ్ళారు; అంత= తర్వాత.

తాత్పర్యం: ధృతరాష్ట్రుని ఆజ్ఞతో, భీష్మాదుల అంగీకారంతో పాండవులు వాసుదేవునితో కలిసి ఖాండవప్రస్థానికి వెళ్ళారు. ఆ తరువాత.

విశ్వకర్మ యింద్రప్రస్థపట్టణమును నిర్మించుట (1-199-28)

క. హరి యింద్రుఁ దలఁచె; నింద్రుఁడు। కర మనురాగమున విశ్వకర్మను బనిచెన్
'సురపురమున కెన యగు పుర। మరుదుగ నిర్మింపు ముర్వి' నని కడుఁ బ్రీతిన్. 69

ప్రతిపదార్థం: హరి= శ్రీకృష్ణుడు; ఇంద్రున్= ఇంద్రుణ్ణి; తలఁచెన్; ఇంద్రుఁడు; కరము= మిక్కిలి; అనురాగమునన్= ప్రేమతో; సుర, పురమునకున్= దేవతలనగరమైన అమరావతికి; ఎన, అగు= సాటి అయిన; పురము= నగరం; ఉర్విన్= భూమిమీద; అరుదుగన్= ఆశ్చర్యకరంగా; నిర్మింపుము; అని; కడున్, ప్రీతిన్= మిక్కిలి ప్రీతితో; విశ్వకర్మను; పనిచెన్= ఆజ్ఞాపించెను.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ఇంద్రుడిని తలవగా ఇంద్రుడు 'అమరావతికి దీటైన పట్టణాన్ని భూమిమీద ఆశ్చర్యకరంగా నిర్మించు' మని ప్రియమార దేవశిల్పి విశ్వకర్మను ఆజ్ఞాపించాడు.

విశేషం: ఒకరు తలచారు. మరొకరు ఆజ్ఞాపించారు. పని చకచక జరిగిపోవాలనే వారిఆకాంక్ష. లఘుబహుళమైన కందపద్యపు ఉత్తరార్ధంలోని ద్రుతగతి త్వరత్వరగా పని జరిగేతీరుకు అనుగుణంగా కూర్చబడింది. ఇది అక్షరరమ్యంగా ధ్వనింపచేస్తున్నది. (సంపా.)

సీ. ద్వైపాయనుండును ధౌమ్యుండు నాదిగా । భూసురుల్ సూత్రవిన్యాస మమరఁ
జేసి, శాంతికవిధుల్ సేయంగ, సుప్రశ । స్తం బైన రమ్యదేశంబునందు,
వాసవాదిష్టుఁ డై వసుధకు నేతెంచి । పేర్మితో నవ్విశ్వకర్మ పురము
నిర్మించె, నదియును నిరుపమలీలలఁ । దనరి యింద్రప్రస్థ మనఁగ నింద్రు

ఆ. పురముతోఁ గుబేరుపురముతో వరుణేంద్రు । పురవరంబుతోడ నురగరాజ
పురవిభూతితోడ నురువిలాసంబుల । సరి యనంగ నొప్పె ధరణిమీఁద. 70

ప్రతిపదార్థం: ద్వైపాయనుండును= వ్యాసుడూ; ధౌమ్యుండున్= పాండవపురోహితుడైన ధౌమ్యుడూ; ఆదిగాన్= మొదలుగా; భూసురుల్= బ్రాహ్మణులు, సూత్రవిన్యాసము= దారంతో కొలవటాన్ని; అమరన్= ఒప్పుగా; చేసి= కావించి; శాంతిక, విధుల్+ గ్రహశాంతిని కలిగించేటటువంటికర్మలు; చేయన్+కన్= ఒనరింపగా; సుప్రశస్తంబు+ఐన= మిక్కిలిశ్రేష్ఠమైన; రమ్య, దేశంబు, అందున్= అందమైన ప్రదేశంలో; ఆ+విశ్వకర్మ= దేవశిల్పి అయిన ఆ విశ్వకర్మ; వాసవ+ఆదిష్టుఁడు+ఐ= దేవేంద్రునివలన ఆజ్ఞాపించబడినవాడై; వసుధకున్= భూమికి; ఏతెంచి= వచ్చి; పేర్మితోన్= గొప్పగా; పురము= నగరాన్ని; నిర్మించెన్= నిర్మించాడు; అదియును= ఆ నగరం; నిరుపమ, లీలలన్= సాటిలేని విలాసాలచేత; తనరి= ఒప్పి; ఇంద్రప్రస్థము, అనఁగన్= ఇంద్రప్రస్థం అను పేరుతో; ఇంద్రు, పురముతోన్= ఇంద్రునిరాజధానితో; కుబేరు, పురముతో= కుబేరునిరాజధానితో; వరుణ+ఇంద్రు, పుర, వరంబుతోడన్= వరుణరాజుయొక్క శ్రేష్ఠమైనరాజధానితో; ఉరగ, రాజ, పుర, విభూతితోడన్= నాగరాజుయొక్క రాజధానిసంపదతో; ఉరు, విలాసంబులన్= గొప్పవిలాసాలచేత; సరి, అనంగన్= సాటి అన్నట్లుగా; ధరణి మీఁదన్= భూమిమీద; ఒప్పెన్= వెలిగింది.

తాత్పర్యం: వ్యాసుడు, ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణులు కొలతలు ఏర్పరచి, శాంతికర్మలు చేసిన తరువాత, శ్రేష్ఠమైన, అందమైన ప్రదేశంలో, ఇంద్రుని ఆదేశానుసారం విశ్వకర్మ భూలోకానికి వచ్చి, సాటిలేని విలాసాలతో వెలిగే, ఇంద్రప్రస్థం అనే పేరుగల మహానగరాన్ని నిర్మించాడు. అది ఇంద్ర కుబేర వరుణ నాగరాజుల రాజధానులతో సరిపోలి ప్రకాశించింది.

విశేషం: ఇంద్రునిరాజధాని అమరావతి. కుబేరునిరాజధాని అలకాపట్టణం. వరుణునిరాజధాని శ్రద్ధావతి. నాగరాజురాజధాని భోగవతి.

ఉ. ఇమ్ముగ విశ్వకర్మ రచియించిన కాంచన హర్మ్య తుంగ శృం
గమ్ముల రశ్మిరేఖలు ప్రకాశములై కడుఁ బర్వి, తత్సమీ
పమ్మునఁ బాఱుచున్న ఘన పంక్తులయం దచిరద్యుతి ప్రతా
నమ్ములఁ గ్రేణి సేయుచు ననారతమున్ విలసిల్లుఁ దత్పురిన్. 71

ప్రతిపదార్థం: తత్+పురిన్= ఆ ఇంద్రప్రస్థపురంలో; ఇమ్ముగన్= ఇంపుగా; విశ్వకర్మ= దేవశిల్పి ఆ విశ్వకర్మ; రచియించిన= నిర్మించిన; కాంచన, హర్మ్య, తుంగ, శృంగమ్ముల, రశ్మి, రేఖలు= బంగారుమేడల ఎత్తైన శిఖరాల కాంతివరుసలు; ప్రకాశములు+ఐ= వెలువడినవై; కడున్= మిక్కిలి; పర్వి= వ్యాపించి; తత్+సమీపమ్మునన్= ఆ శిఖరాలదగ్గర; పాఱుచున్+ఉన్న= పోతూఉన్న; ఘన, పంక్తుల, అందున్= మేఘసమూహాల్లో; అచిర, ద్యుతి, ప్రతానమ్ములన్= మెరుపుల సమూహాలను; క్రేణి, చేయుచున్= గేలి చేస్తూ; అనారతమున్= ఎల్లప్పుడు; విలసిల్లున్= ఒప్పి ఉంటాయి.

తాత్పర్యం: ఆ ఇంద్రప్రస్థనగరంలో విశ్వకర్మ ప్రియమార నిర్మించిన బంగారుమేడల ఎత్తైనశిఖరాల కాంతిరేఖలు విశేషంగా వ్యాపించి, వాటి సమీపాన పోతున్న మేఘాలలోని మెరుపుతీగలను ఎగతాళిచేస్తూ ప్రకాశిస్తున్నాయి.

విశేషం: అలం: అతిశయోక్తి, ఉపమ.

చ. అలఘుతరంబు లై తుహినహారిసుధారుచి నిందురోచిరా
కులశశికాంతవేది పృథుకుంజగళ జ్జలనిర్ఝరంబులన్
విలసిత జాహ్నవీ విమలవీచి విలోల లసత్పతాకలం
బొలుపగుఁ దత్పురీభవనముల్ హిమశైలముఁ బోలి యున్నతిన్. 72

ప్రతిపదార్థం: తుహిన, హారి, సుధారుచిన్= మంచువోలె మనోహరమైన సున్నపుకాంతిచేత; ఇందు, రోచిః+ఆకుల, శశికాంత, వేది, పృథు, కుంజ, గళత్+జల, నిర్ఝురంబులన్= చంద్రుని కిరణాలచేత కలత నొందిన (కరగిన) చంద్రకాంత మణుల తిన్నెలు కల పెద్ద పొదరిండ్లనుండి జాలువారుతున్న నీటిప్రవాహాలచేత; విలసిత, జాహ్నవీ, విమల, వీచి, విలోల, లసత్+పతాకలన్= మెరుస్తున్న గంగానదియొక్క నిర్మలాలైన తరంగాలవలె చలిస్తూ ప్రకాశించే జెండాలచేత; తత్+పురీ, భవనముల్= ఆ పట్టణంలోని మేడలు; అలఘుతరంబులు+ఐ= మిక్కిలి గొప్పవై; ఉన్నతిన్=ఎత్తులో; హిమ, శైలమున్= హిమాలయపర్వతాన్ని; పోలి; పొలుపు+అగున్= ఒప్పి అందంగా ఉన్నాయి.

తాత్పర్యం: మంచువలె మనోహరమై, సున్నపుకాంతిచేత, చంద్రునికిరణాలచేత కరిగిన చంద్రకాంతమణుల అరుగులు గల పెద్దపొందరిండ్ల నుండి జాలువారే నీటిప్రవాహాలచేత, గంగానదీనిర్మలతరంగాల వలె చలిస్తూ ప్రకాశించేజెండాలచేతనూ, ఆ ఇంద్రప్రస్థపురంలోని ఎత్తైన పెద్దమేడలు హిమాలయపర్వతాన్ని పోలి వెలుగుతున్నాయి.

విశేషం: అలం: ఉపమ. ఆ పట్టణంలోని మేడలు ఎంతపెద్దవో, ఎంతఎత్తైనవో ఈ పద్యం ధ్వనింపచేస్తున్నది. కావ్యాలలో కథావసరాన్నిబట్టి అష్టాదశవర్ణనలుంటాయి. వాటిలో పురవర్ణనకు ఒజ్జబంతిగా నన్నయ అలంకారసుందరంగా ఇంద్రప్రస్థపుర వర్ణనం చేశాడు. కావ్యేతిహాసనిర్మాణంలో కావ్యస్ఫురణను వెలార్చే రచనాశిల్పంలో ఇదొక విశేషం. (సంపా.)

చ. వననిధిలోని రత్నములు వాసుకిమూర్ధజరత్నసంఘముల్
గొనఁగ నవశ్యమున్ జనులకున్ సమకూరదు గాన నెప్పుడుం
గొనుఁడు పరార్థ్యరత్నములు గోరినవానిన యిత్తు మన్తెఱం
గునఁ బచరింతు రంగడులఁ గోమటు లప్పురి నిద్ధరత్నముల్. 73

ప్రతిపదార్థం: ఆ+పురిన్= ఆ పట్టణంలో; కోమటులు; వన, నిధి, లోని, రత్నములు= సముద్రంలో ఉన్నరత్నాలూ; వాసుకి, మూర్ధజ, రత్న, సంఘముల్= వాసుకియొక్క శిరస్సులో పుట్టినరత్నాల సమూహాలూ; కొనఁగన్= కొనటానికి; జనులకున్; అవశ్యమున్= తప్పక; సమకూరదు, కానన్= లభించదు కనుక; పరార్ఘ్య, రత్నములు= శ్రేష్ఠములైన రత్నాలను; కోరిన, వానిన్+అ= కోరినవాటినన్నిటిని; ఇత్తుము= ఇస్తాము; ఎప్పుడున్= ఎల్లప్పుడు; కొనుఁడు= కొనండి; అన్+తెఱంగునన్= అనేవిధంగా; అంగడులన్= అంగళ్లలో; ఇద్ధ, రత్నముల్= కాంతి గల రత్నాలను; పచరింతురు= (అంగళ్లలో అమ్మటానికి) అమర్చిపెడతారు.

తాత్పర్యం: సముద్రంలోని రత్నాలను, వాసుకి శిరస్సుమీది రత్నాలను కొనటం జనులకు సాధ్యం కాదు కాబట్టి, 'మీరు కోరిన శ్రేష్ఠరత్నాలన్నింటినీ మీకు ఇస్తాము, ఎప్పుడైనా కొనండి' అన్నట్లు ఆ పట్టణంలోని కోమట్లు కాంతిమంతాలైనరత్నాలను అంగళ్ళలో అమ్మటానికి అమరుస్తారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. చాతుర్వర్ణ్యాన్ని ఉదాత్తంగా వర్ణించటం పురవర్ణనంలో ఒక అంశం. అందులో వైశ్యులవర్ణన మిది.

సీ. **వలరాజు సచివుల వడువున బెడఁగగు । కర్కశస్తనములఁ గరమువాఁడి**
చూడ్కుల నతిరాగసురుచిరాధరముల । మదవిలాసాలసమందగతుల
వక్రాలకంబుల వలుఁదపిఱుందుల । దర్పగద్గదభాషితములఁ జేసి
జనులచిత్తములకు సంక్షోభ మొనరించు । కామినీజనములు గలిగి, సకల

తే. **కామభోగములకు సదేకాంతగృహముఁ । బోలి పొలిచియు, ధర్మార్థములకు నిదియ**
యాస్పదంబు నా వర్గత్రయావిరుద్ధు । లైన జనుల కెంతయు నొప్పు నప్పురంబు. 74

ప్రతిపదార్థం: వలరాజు, సచివుల, వడువునన్= మన్మథునిసహాయులవలె; బెడఁగు+అగు= అందమైన; కర్కశ, స్తనములన్= కఠినములైన చన్నులచేతను; కరము, వాఁడి, చూడ్కులన్= మిక్కిలి పదునైన చూపులచేతను; అతి, రాగ, సురుచిర+అధరములన్= మిక్కిలి ఎర్రనైన, మనోహరాలైన పెదవులచేతను; మద, విలాస+అలస, మంద, గతులన్= మదంయొక్క ఒయ్యారంతో, సోమరితనంతో కూడిన మెల్లని నడకలచేతను; వక్ర+అలకంబులన్= వంకరలు తిరిగిన ముంగురుల చేతను; వలుద, పిఱుందులన్= లావైన పిరుదులచేతను; దర్ప, గద్గద; భాషితములన్+చేసి= గర్వంతో తడబడుతున్న మాటలచేతను; జనుల, చిత్తములకున్, ప్రజల మనస్సులకు; సంక్షోభము+ఒనరించు= కలత కలిగించే; కామినీ, జనములు= స్త్రీ జనాలు; కలిగి= ఉండి, వసించి; సకల, కామ, భోగములకున్= అన్ని విధాలైన కామభోగాలు అనుభవించటానికి; సత్+ఏకాంత, గృహమున్= మంచి రహస్యగృహాన్ని; పోలి, పొలిచియున్= ఒప్పారి ఉన్నప్పటికి; ధర్మ+అర్థములకున్= ధర్మానికీ, అర్థానికీ, ఇదియు+అ= ఈ పట్టణమే; ఆస్పదంబు= ఉనికిపట్టు; నాన్= అని అనేటట్లు; వర్గత్రయ+అవిరుద్ధులు+ఐన= ధర్మార్థకామాలు మూడింటికీ విరోధులు కాని - అంటే మూడు పురుషార్థాలలో ఆసక్తి కలవాళ్ళయిన; జనులకున్; ఆ+పురంబు= ఆ ఇంద్రప్రస్థపురం; ఎంతయున్= మిక్కిలి; ఒప్పున్= ప్రకాశిస్తూ ఉన్నది.

తాత్పర్యం: మన్మథుని సహాయంచేసేవాళ్ళవలె - అందమై, కఠినాలైన స్తనాలచేతా, పదునైన చూపులచేతా, ఎర్రనై మనోహరాలైనపెదవులచేతా, మదంయొక్కఒయ్యారంతో మెల్లనైననడకలచేతా, పెద్దపిరుదులచేతా, గర్వంతో తడబడే మాటలచేతా, జనులమనస్సులను కలవరపరిచే స్త్రీలను కలిగి, కామభోగాలన్నిటికీ ఏకాంత మందిరమువలె ఉండి, 'ధర్మార్థాలకు ఇదే స్థానం' అన్నట్లు, ధర్మార్థకామాలు మూడింటిలోనూ ఆసక్తులైనవాళ్ళకు ఆ ఇంద్రప్రస్థపురం ఎంతో తగి ఉన్నది.

విశేషం: అలం: ఉపమ, ఉత్ప్రేక్ష. పురవర్ణనంలో వేశ్యావర్ణనం ఒక అంశం. ధర్మమూర్తి అయిన ధర్మరాజుయొక్క ముఖ్య పట్టణమైన ఇంద్రప్రస్థపురంలో నన్నయ 'కామినీజన' వర్ణనం చేశాడు. కామినీశబ్దానికి వేశ్య అనే అర్థం రూఢిలో ఏర్పడిందేకాని, వస్తుతః అది స్త్రీవాచకమే. ప్రియసంగమంలో మిక్కిలి ఆసక్తిగల ఆడుది అనే అర్థవిశేషం కలది. ఆ పురకామినులు విలాస సంపదచేత మారవికారాలు కలిగించేవాళ్ళయినా, ధర్మార్థకామసాధకులై ఆ పౌరజనుల ధార్మికప్రవృత్తికి విరుద్ధలు కారని వర్ణించి నన్నయ ఔచిత్యాన్ని పాటించాడు. 'కామినీజనములు' అనే సమాసం రుచిరార్థసూక్తి. (సంపా)

క. శరనిధినినాదనిభ మగు । పురఘోషముఁ గీడుపఱిచి పొలుపగుఁ గర మ
ప్పురి బ్రహ్మపురి మహీసుర । వరవేదాధ్యయనరవ మవార్యం బగుచున్. 75

ప్రతిపదార్థం: ఆ+పురి, బ్రహ్మ, పురి= ఆ ఇంద్రప్రస్థపురంలోని బ్రాహ్మణపురంలో; మహీసుర, వర, వేద+అధ్యయన,రవము= బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క వేదం చదివే ధ్వని; అవార్యంబు+అగుచున్= అడ్డగింపరానిదై; శరనిధి, నినాద, నిభము+అగు= సముద్రధ్వనితో సమానమైన; పుర, ఘోషమున్= పట్టణ ధ్వనిని; కీడు, పఱిచి= అణచివేసి; కరము= మిక్కిలి; పొలుపు+అగున్= ఒప్పును.

తాత్పర్యం: ఆ ఇంద్రప్రస్థంలోని బ్రాహ్మణపురంలో బ్రాహ్మణశ్రేష్ఠుల వేదాధ్యాయనధ్వని, ఆపటానికి సాధ్యం కానిదై, సముద్రధ్వనితో సమానమైన ఆ పట్టణధ్వనిని మించి మిక్కుటంగా వినిపిస్తూ ఉంది.

విశేషం: అలం: పర్యాయోక్తం, ఉపమ. పురధ్వనికంటె వేదధ్వని మించిందని చెప్పటంవలన పురజనులలో అందరికంటె బ్రాహ్మణులకు అధిక గౌరవం లభిస్తున్నదని పర్యాయంగా చెప్పినట్లయింది. నిరంతరం యజ్ఞయాగాదులు జరుగుతున్నా యనికూడా చెప్పవచ్చును. వేదాధ్యయనపరులైన బ్రాహ్మణులను వర్ణించటం పురవర్ణనలోని చాతుర్వర్ణ్యవర్ణనలో ఒకటి.

చ. పరిఘుజలంబులం దమలపంకరుహోత్పలకైరవాదిసుం
దరకుసుమంబులున్ ఘనపథంబున నుజ్జ్వలతారకానిరం
తరకుసుమంబులున్ వెలయుఁ దత్పురవప్రము పాదపీఠికా
శిరముల కొప్ప నర్చనలు సేసిన పువ్వుల యవ్విధంబునన్. 76

ప్రతిపదార్థం: పరిఘ, జలంబులందున్= అగడ్తనీళ్ళలో; అమల, పంకరుహ+ఉత్పల, కైరవ+ఆది, సుందర, కుసుమంబులున్= నిర్మలమైన పద్మాలు, నల్లకలువలు, తెల్లకలువలు, మొదలైన అందమైన పూలూ; ఘన, పథంబునన్= ఆకాశంలో; ఉజ్జ్వల, తారకా, నిరంతర, కుసుమంబులున్= బాగాప్రకాశించే నక్షత్రాలనే దట్టమైన పూలూ; తత్+పుర, వప్రము, పాదపీఠికా, శిరములకున్= ఆ పట్టణముయొక్క ప్రాకారపాదపీఠానికి, శిరస్సుకు; ఒప్పన్= ఒప్పునట్లుగా; అర్చనలు= పూజలు; చేసిన= కావించిన; పువ్వుల, ఆ+విధంబునన్= పువ్వులా అన్నట్లు; వెలయున్= ప్రకాశిస్తున్నాయి.

తాత్పర్యం: అగడ్త నీళ్ళల్లో ఉన్న పద్మాలు, నల్లకలువలు, తెల్లకలువలు మొదలైన అందమైన పూలు, ఆకాశంలో బాగా ప్రకాశించే నక్షత్రాలనే దట్టమైన పూలు, ఆ పట్టణంయొక్క ప్రాకారపాదపీఠానికి, శిరస్సుకు పూజచేసిన పువ్వులా అన్నట్లు ప్రకాశిస్తున్నాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, క్రమం. ఆ పట్టణప్రాకారాలు ఆకాశాన్ని అంటేటంత ఎత్తైనవని ధ్వని. ఎత్తైనకోటను, లోతైన అగడ్తల వైభవాన్ని వర్ణించటం పురవర్ణనాంశంలో ఒకటి.

చ. తమము నడంచుచున్ వెలుఁగుతత్పురగోపురశాతకుంభకుం
భముల విచిత్రసన్మణిగభస్తివితానములన్ విచిత్రవ
ర్ణములగు నాత్మవాహముల నమ్మక పల్మఱుఁ జూచి యన్యవా
హము లని సంశయప్రణిహితాత్ముఁ డగున్ హరిదశ్వుఁ డెప్పడున్. 77

విశేషం: తమమున్= చీకటిని; అడంచుచున్= అణచివేస్తూ; వెలుఁగు= ప్రకాశిస్తున్న; తత్+పుర, గోపుర, శాతకుంభ, కుంభముల, విచిత్ర, సత్+మణి, గభస్తి వితానములన్= ఆ పుర ద్వార గోపురాలయొక్క బంగారుకలశాల చిత్రవిచిత్రాలైన మంచిమణుల కాంతుల సమూహాలచేత; విచిత్ర, వర్ణములు+అగు= నానావిధాలైన రంగులు కలవైన; ఆత్మవాహములన్= తన గుర్రాలను; నమ్మక= విశ్వసింపక; పల్మఱున్= అనేక పర్యాయాలు; చూచి; అన్య, వాహములు+అని= ఇతరాలైన గుర్రాలని; హరిదశ్వుఁడు= పచ్చనిగుర్రాలు గల సూర్యుడు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; సంశయ, ప్రణిహిత+ఆత్ముఁడు= సందేహంలో ఉంచబడిన మనస్సు కలవాడు; అగున్= అవుతూ ఉంటాడు.

తాత్పర్యం: చీకటిని అణచివేస్తూ వెలుగుతున్న ఆ ఇంద్రప్రస్థపురద్వారగోపురాలమీది బంగారుకలశాలకు పొదిగిన చిత్రవిచిత్రాలైన రత్నకాంతులసమూహంవలన తనగుర్రాలరంగు నానావిధాలుగా మారిపోయి, పసుపుపచ్చగుర్రాలు కల సూర్యుడు, అనేకపర్యాయాలు తనగుర్రాలను చూచుకొని, అవి తనగుర్రాలని నమ్మక, వేరే గుర్రాలని ఎప్పుడూ సందేహపడుతూంటాడు.

విశేషం: అలం: అతిశయోక్తి, సందేహం. ఆ పట్టణద్వారగోపురాలు అంత ఎత్తు ఉన్నవని ధ్వని.

చ. సరళ తమాల తాల హరిచందన చంపక నారికేళ కే
సర కదలీ లవంగ పనస క్రముకార్జున కేతకీలతా
గరుఘనసార సాల సహకార మహీరుహరాజ రాజి సుం
దర నవనందనావళులఁ దత్పురబాహ్యము లొప్పఁ జూడఁగన్. 78

ప్రతిపదార్థం: తత్+పుర, బాహ్యములు= ఆ పట్టణంయొక్క వెలుపలి ప్రదేశాలు; చూడఁగన్= చూడగా; సరళ, తమాల, తాల, హరిచందన, చంపక, నారికేళ, కదలీ, లవంగ, పనస, క్రముక+అర్జున, కేతకీలతా+అగరు, ఘనసార, సాల, సహకార, మహీరుహ, రాజ, రాజి, సుందర, నవ, నందన+ఆవళులన్= తెల్లతెగడ, చీకటి, తాటి, మంచిగంధం, సంపెంగ, కొబ్బరి, కేసర, అరటి, లవంగ, పనస, పోక, ఏరుమద్ది, మొగలి, అగరు, పచ్చకర్పూరం, మద్ది, మామిడి - శ్రేష్ఠమైన వృక్షాల వరుసలతో అందమైన క్రొత్త ఉద్యానవనాల సమూహాలచే; ఒప్పున్= ప్రకాశించాయి.

తాత్పర్యం: ఆ ఇంద్రప్రస్థంయొక్క వెలుపలిప్రదేశాలు తెల్లతెగడ, తాటి, మామిడి మొదలైన చెట్లవరుసలతో, అందమైన క్రొత్తఉద్యానవనాలతో చూడ ముచ్చటగా ఉంటాయి.

మ. అనిలం బప్పురిఁ బౌరచిత్తముల కత్యానంద మొందంగ నం
దిని యన్నేటితరంగలం బెనఁగుచున్ దివ్యద్రుమాకీర్ణ నం
దనసందోహముఁ దూఱుచున్ వికచకేతక్యాదినానాలతాం
తనవామోదముఁ బొందుచున్ సుడియు నిత్యంబుం గరం బిష్ట మై. 79

ప్రతిపదార్థం: ఆ+పురిన్= ఆ ఇంద్రప్రస్థపురంలో; అనిలంబు= గాలి; పౌర, చిత్తములకున్= ఆ పురంలో నివసించే జనులమనస్సులకు; అత్యానందము= మహానందం; ఒందంగన్= కలిగేటట్లు; నందిని అన్= నందిని అనేటటువంటి; ఏటి, తరంగలన్= ఏటిఅలలతో; పెనఁగుచున్= కూడుచు; దివ్య, ద్రుమ+ఆకీర్ణ, నందన, సందోహమున్= శ్రేష్ఠములైన వృక్షాలచే

దట్టమైన ఉద్యానవనాల సమూహాన్ని; తూలుచున్= చొచ్చుతూ; వికచ, కేతకీ+ఆది, నానా, లతాంత, నవ+ఆమోదమున్= వికసించిన మొగలిపువ్వుమొదలుగా గల వివిధాలైన పుష్పాలయొక్క క్రొత్తసువాసనను; పొందుచున్= పొందుతూ; కరంబు= మిక్కిలి; ఇష్టము+ఐ= ఇష్టమైనదియై, నిత్యంబున్= నిరంతరం; సుడియున్= వీస్తుంది.

తాత్పర్యం: ఆ ఇంద్రప్రస్థపురంలోని గాలి పౌరజనులమనస్సులకు మహానందం కలిగేటట్లు నందిని అనే నది అలలమీదుగా వచ్చి, శ్రేష్ఠాలైన వృక్షాలచే దట్టమైన ఉద్యానవనాలలో దూరి, వికసించిన మొగలిపూలు మొదలైన వివిధ, పుష్పాలక్రొత్తవాసనలను సమకూర్చుకొని మిక్కిలిప్రియంగా వీస్తుంది.

విశేషం: నది అలలమీదుగా, ఉద్యానవనాలమధ్యగా రావటంవలన ఆ గాలికి చల్లదనం, పూలసువాసనలను గ్రహించటంవలన పరిమళం, సమకూరి అది ఆ పురజనులకు హాయిని గొలుపుతూ ఉన్నది. పురవర్ణనాన్ని మందమలయానిలప్రశస్తితో ముగించటం ఒక ఔచిత్యం. సుగంధమయమైన గాలి ఆ పట్టణజీవితంలోని ఉత్తమవాసనలను ధ్వనింపచేస్తుంది. వాసనలంటే భావాలనీ అర్థం.

ఈ ఇంద్రప్రస్థపురవర్ణన తరువాతి కవులకావ్యాలలోని పురవర్ణనలకు మార్గదర్శకం అయ్యేటట్లు నడిచింది. కావ్యంలో అష్టాదశవర్ణనలుండటం లక్షణం. ఆ వర్ణనలో పురవర్ణనం ఒకటి. కావ్యలక్షణవిశిష్టమైన ఇతిహాసాన్ని (కావ్యేతిహాసాన్ని) నన్నయ రచిస్తున్నాడు కాబట్టి ఈ పురవర్ణనం కావ్యేతిహాసంలో కావ్యస్వభావాన్ని పెంచే ఒక రమణీయమైన అంశం. (సంపా.)

వ. ఇట్టి యింద్రప్రస్థపురంబున నింద్రవిలాసంబుతో వ్యాసవాసుదేవానుమతుం డై ధర్మతనయుండు ధౌమ్యపురస్సర మహీసురప్రవరవేదఘోషంబులు, సకలజనాశీర్వాదనాదంబులు, మృదుమధుర మంగళ సంగీత రవంబులు, వివిధ తూర్యధ్వనులు నతిసమృద్ధంబులై యెసంగ వర్గచతుష్టయంబునుం బోని యనుజవర్గంబుతో శుభముహూర్తం బునం బురప్రవేశంబు సేసి సర్వప్రకృతిజనానురాగకరుం డయి. 80

ప్రతిపదార్థం: ఇట్టి= ఇటువంటి; ఇంద్రప్రస్థ, పురంబునన్= ఇంద్రప్రస్థనగరంలో; ఇంద్ర, విలాసంబుతోన్= ఇంద్రునియొక్క విలాసంవంటి విలాసంతో; వ్యాస, వాసుదేవ+అనుమతుండు+ఐ= వ్యాసునితో, శ్రీకృష్ణునితో అనుమతి పొందినవాడై; ధర్మతనయుండు= ధర్మరాజు; ధౌమ్య, పురస్సర, మహీసుర, ప్రవర, వేదఘోషంబులు= ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణశ్రేష్ఠుల యొక్క వేదధ్వనులూ; సకల, జన+ఆశీర్వాద, నాదంబులును= ప్రజలందరియొక్క ఆశీర్వాదశబ్దాలూ; మృదు, మధుర, మంగళ, సంగీత, రవంబులు= సున్నితాలూ, మనోహరాలూ, శుభంకరాలూ అయిన సంగీతనాదాలూ; వివిధ, తూర్య, ధ్వనులున్= అనేకవిధాలైన వాద్యధ్వనులూ; అతి, సమృద్ధంబులు+ఐ= మిక్కిలి నిండినవై; ఎసంగన్= అతిశయించగా; వర్గ, చతుష్టయంబునున్+పోని= ధర్మార్థకామమోక్షాలు అనే నాలుగుపురుషార్థాలనుపోలిన; అనుజ, వర్గంబుతోన్= తమ్ముల సమూహంతో; పుర, ప్రవేశంబు, చేసి= నగర ప్రవేశం గావించి; సర్వ, ప్రకృతి, జన+అనురాగ, కరుండు+అయి= సామాన్య జనులందరికీ సంతోషం కలిగించేవాడై.

తాత్పర్యం: ఈవిధమైన ఇంద్రప్రస్థపురంలో దేవేంద్రునివలె విలాసంతో, వ్యాస, శ్రీకృష్ణుల అనుమతితో ధౌమ్యుడుమొదలైన బ్రాహ్మణశ్రేష్ఠుల వేదధ్వనులు, సకలజనులఆశీర్వాదశబ్దాలు, మృదు, మధుర, శుభ, సంగీతనాదాలు, వివిధవాద్యధ్వనులు మిక్కిలి అతిశయించగా, నాలుగువిధాలైన పురుషార్థాలనుపోలిన నలుగురితమ్ములతో పురప్రవేశం చేసి, ప్రజలందరికీ ఆనందం కలిగించేవాడై.

చ. అనుజులు నల్వురుం దనకు నత్యనురాగమునన్ విధేయు లై
తనరుచు నుండ వేదవిహితం బగు యజ్ఞమపోలె సర్వపా

వనశుభమూర్తి యై భువనవంద్యుఁడు ధర్మపరుండు ధర్మనం

దనుఁడు ధరాధిరాజ్యము ముదంబునఁ జేయుచునుండెఁ బేర్మితోన్. 81

ప్రతిపదార్థం: అనుజులు= తమ్ములు; నల్వురున్= నలుగురూ; తనకున్; అతి+అనురాగమునన్= మిక్కిలి ప్రేమతో; విధేయులు+ఐ= లొంగినవాళ్ళయి; తనరుచున్= ఒప్పుతూ; ఉండన్= ఉండగా; వేద, విహితంబు+అగు= వేదముచే విధింపబడిన దైన; యజ్ఞముపోలె; సర్వ, పావన, శుభమూర్తి+ఐ= సమస్తాన్ని పవిత్రం చేసే శుభకరమైన ఆకారం కలవాడై; భువన వంద్యుఁడు =లోకాలచే నమస్కరించతగినవాడు; ధర్మపరుండు= ధర్మమే ప్రధానంగా కలవాడు; ధర్మనందనుఁడు= ధర్మరాజు; ధర+అధిరాజ్యము= భూమండల పరిపాలనం; ముదంబునన్= సంతోషంతో; పేర్మితోన్= గొప్పతనంతో; చేయుచున్, ఉండెన్= చేస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: తమ్ములు నలుగురు ఎంతో ప్రేమతో తనకు విధేయులై వెలుగుతుండగా, వేదం విధించిన యజ్ఞం వలె సమస్తాన్నీ పవిత్రం చేసే శుభకరమైన ఆకారం కలవాడై లోకాలచే నమస్కరించదగినవాడు, ధర్మమే ప్రధానంగా కలవాడు అయిన ధర్మరాజు సంతోషంతో గొప్పగా రాజ్యపాలన చేస్తూ ఉన్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. రాజ్యపాలనాన్ని ధర్మరాజు పవిత్రమైన యజ్ఞంగా భావించాడు. నలువురు తమ్ములూ నలువురు ఋత్విక్కులు.

సీ. అనఘు వేదాధ్యయనాసక్తు నారభ్య । మాణమహాధ్వరు మనుచరిత్రు

సర్వవర్ణాశ్రమసంరక్షణక్షము । సత్యసంధాను నజాతశత్రు

భరతవంశోత్తముఁ బ్రభు ధర్మనందను । రాజుఁగాఁ బడసి సురాజ యయ్యె

వసుధ, యధిష్ఠానవతి యయ్యె మఱి లక్ష్మి । బంధుమంతం బయ్యెఁ బరమధర్మ

ఆ. మన్నరేంద్రునందు నాపూర్ణతరశర । ద్రైందవాతపంబునందుఁ బ్రీతి

సమమ కా సమస్తజనులచిత్తంబు లా । నందరసభరంబు నొందఁ దాల్చె. 82

ప్రతిపదార్థం: అనఘున్= పాపంలేనివాడిని; వేద+అధ్యయన+ఆసక్తున్= వేదాన్ని చదువుకోవటంలో ఆసక్తికలవాడిని; ఆరభ్యమాణ, మహా+అధ్వరున్= ఆరంభం కానున్న గొప్పయజ్ఞాలు కలవాడిని; మనుచరిత్రున్= వైవస్వతమనువుయొక్క చరిత్రవంటి చరిత్రకలవాడిని; సర్వ, వర్ణాశ్రమ, సంరక్షణ, క్షమున్= అన్నివర్ణాలను, ఆశ్రమాలను సంరక్షించటంలో సమర్థుడైనవాడిని; సత్యసంధానున్= ఆడితప్పనివాడిని, అజాతశత్రున్= పుట్టబడనిశత్రువులు కలవాడిని - అంటే శత్రువులు లేనివాడిని; భరతవంశ+ఉత్తమున్= భరతవంశంలో శ్రేష్ఠుడిని; ప్రభున్= ప్రభువైన; ధర్మనందనున్= ధర్మరాజును; రాజున్+కాన్= రాజుగా; పడసి= పొంది; వసుధ= భూమి, సురాజ అయ్యెన్= మంచిరాజు కలిగినది అయింది; మఱి= అటుపై; లక్ష్మి; అధిష్ఠానవతి= ఆక్రమించుకొన్నభర్త కలది; అయ్యెన్= అయింది; ఆ+నర+ఇంద్రు, అందున్= ఆ రాజులోన; ఆపూర్ణతర, శరత్+ఐందవ+ ఆతపంబునందున్= మిక్కిలి నిండైన శరత్కాలంలోని చంద్రసంబంధమైన కాంతిలోను; ప్రీతి= ప్రీతి; సమమకా= సమానం కాగా; సమస్త, జనుల, చిత్తంబులు= అందరు ప్రజల మనస్సులు; ఆనందరస, భరంబున్= సంతోషాతిశయాన్ని; ఒందన్= కలిగేటట్లు; తాల్చెన్= ధరించాయి.

తాత్పర్యం: పుణ్యాత్ముడు, వేదాన్ని చదువుకోవటంలో ఆసక్తి కలవాడు, గొప్పయజ్ఞాలు ప్రారంభించేవాడు, మనువువంటి ధార్మికమైన నడవడి కలవాడు, అన్నివర్ణాలను ఆశ్రమాలను రక్షించే సమర్థత కలవాడు, ఆడి తప్పనివాడు, శత్రువులు లేనివాడు, భరతవంశశ్రేష్ఠుడు అయిన ధర్మరాజును రాజుగా పొంది- భూమండలం మంచిరాజును కలది అయింది. లక్ష్మి స్థిరమైన భర్త కలది అయింది. ధర్మం మంచి బంధువు కలది అయింది. జనులు శరత్కాలపూర్ణచంద్రుని వెన్నెల్లోను, ఆ ధర్మరాజులో సమానమైన ప్రీతికలవాళ్ళయి సంతోషిస్తూ ఉన్నారు.

విశేషం: వర్ణాలు నాలుగు - బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు. ఆశ్రమాలు నాలుగు - బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాలు. అలం: ప్రహర్షణం, తుల్యయోగిత. పై పద్యంలో వర్ణించిన వన్నీ ధీరోదాత్తనాయకలక్షణాలే.

క. ధరణిప్రజ ధర్మసుతు సు । స్థిరనిర్మలధర్మచరితఁ జేసి రుజా త
స్కరపరరాష్ట్రవిబాధలఁ । బొరయక సంతతసమృద్ధిఁ బొందె విభూతిన్. 83

ప్రతిపదార్థం: ధరణిప్రజ= భూమిమీదిజనులు; ధర్మసుతు, సుస్థిర, నిర్మల, ధర్మ, చరితన్+చేసి= ధర్మరాజుయొక్క మిక్కిలి స్థిరమై, స్వచ్ఛమైన ధర్మం గల నడవడితో; రుజా, తస్కర, పరరాష్ట్ర, విబాధలన్= రోగాలవలన, దొంగలవలన, శత్రుదేశాలవలన విశేషమైన బాధలు; పొరయక= పొందక, విభూతిన్= ఐశ్వర్యంతో; సంతత, సమృద్ధిన్= ఎడతెగని సంపూర్ణతను; పొందెన్= పొందారు.

తాత్పర్యం: ధర్మరాజు మిక్కిలి స్థిరమైన స్వచ్ఛమైన ధర్మప్రవర్తన కలవాడుకావటంచేత ప్రజలు రోగాలవలన, దొంగలవలన, శత్రుదేశాలవలన బాధలు లేక ఎడతెగని సంపదలు సమృద్ధిగా పొందారు.

క. తనరిరి తద్దేశంబున । ననవరతము యజనయాజనాధ్యయనాధ్యా
పనదానములుఁ బ్రతిగ్రహ । మును నను షట్కర్మములను భూసురవంశ్యుల్. 84

ప్రతిపదార్థం: భూసుర, ముఖ్యుల్= ఉత్తములైన బ్రాహ్మణులు, తత్+దేశంబునన్= ఆ దేశంలో; అనవరతము= ఎల్లప్పుడు; యజన, యాజన+అధ్యయన+అధ్యాపన, దానములున్= యజ్ఞం చేయటం, చేయించటం, వేదం చదివించటం, దానం చేయటం; ప్రతిగ్రహమును= దానం పుచ్చుకోవటం; అను; షట్+కర్మములను= ఆరుకర్మ(ము)లచేత; తనరిరి= ఒప్పారు.

తాత్పర్యం: ఆ దేశంలోని బ్రాహ్మణోత్తములు యజ్ఞంచేయటం, చేయించటం, వేదం చదవటం, చదివించటం, దానం చేయటం, పుచ్చుకోవటం అనే ఆరుకర్మలను ఎల్లప్పుడూ ఆచరిస్తూ ఉన్నారు.

క. పంబి యజనాధ్యయన దా । నంబుల వర్తిల్లె బ్రాహ్మణప్రియ మయి ధ
ర్మ్యం బయి క్షత్రియవైశ్యకు । లం బవిరతపుణ్యకర్మలాలస మగుచున్. 85

ప్రతిపదార్థం: క్షత్రియ, వైశ్య, కులంబు; పంబి= వృద్ధి పొంది; బ్రాహ్మణ, ప్రియము+అయి= బ్రాహ్మణులు ఇష్టమైన వాళ్ళుగా కలదై; ధర్మ్యంబు+అయి= ధర్మంనుండి తొలగనిదై; అవిరత, పుణ్యకర్మ, లాలసము+అగుచున్= ఎడతెగని పుణ్యకార్యాల్లో ప్రీతి కలది అవుతూ; యజన+అధ్యయన, దానంబులన్= యజ్ఞం చేయటంలోను; వేదం చదవటంలోను, దానం చేయటంలోను; వర్తిల్లెన్= ఉన్నది.

తాత్పర్యం: క్షత్రియులు, వైశ్యులు వృద్ధిపొంది, బ్రాహ్మణభక్తి గలవారై, ధర్మమార్గం తప్పక, ఎల్లప్పుడు పుణ్యకార్యాల్లో ప్రీతి కలిగి, యజ్ఞాలు చేస్తూ, వేదాలు చదువుతూ, దానాలు చేస్తూ జీవిస్తూ ఉన్నారు.

క. పరమద్విజశుశ్రూషా । పరు లయి శూద్రాదు లవనిఁ బరగిరి ధర్మ
స్థిరమతు లయి ధర్మజు ధర్మరాజ్య మభివృద్ధిఁ బొందె మహిమాన్విత మై. 86

ప్రతిపదార్థం: శూద్ర+ఆదులు= శూద్రులు మొదలైనవాళ్ళు; పరమ, ద్విజ, శుశ్రూషా, పరులు+అయి= కేవలం బ్రాహ్మణులకు సేవచేయటంలో మిక్కిలి కోరిక కలవాళ్ళయి; ధర్మ, స్థిర, మతులు+అయి= ధర్మంమీద నిలకడ గల బుద్ధిగలవాళ్ళయి; పరగిరి= ప్రవర్తిల్లారు; ధర్మజు, ధర్మరాజ్యము; మహిమ+అన్వితము+ఐ= గొప్పతనంతో కూడినదై; అభివృద్ధిన్, పొందెన్= అభివృద్ధి పొందింది.

తాత్పర్యం: శూద్రులు మొదలైనవాళ్ళు కేవలం బ్రాహ్మణులకు సేవచేయటంలో ఎంతో ఆసక్తి కలవాళ్ళయి; ధర్మం మీద స్థిరమైన బుద్ధికలవాళ్ళయి నడుచుకొన్నారు. ధర్మజుని ధర్మరాజ్యం గొప్పగా అభివృద్ధి పొందింది.

విశేషం: రాజధానిలోనే కాక రాజ్యమంతటాకూడా చాతుర్వర్ణ్యప్రజలు వర్ణాశ్రమధర్మాలతో ధర్మం తప్పక బ్రాహ్మణభక్తితో వర్ధిల్లుతున్నారని చెప్పి, 'యథా రాజా తథా ప్రజా' అనే సూక్తి సార్థకమైనట్లు ధ్వనింపచేశాడు నన్నయ.

వ. అంత. 87

తాత్పర్యం: అట్లా ఉండగా.

క. 'నారదుఁడు వచ్చుఁ; దద్వచ । నారంభుల రగుఁడు మీర' లని కఱపి మహో
దారుఁడు వారల వీడ్కొని । నారాయణుఁ డరిగెఁ దత్క్షణమ తనపురికిన్. 88

ప్రతిపదార్థం: నారదుఁడు; వచ్చున్= వస్తాడు; మీరలు; తత్+వచన+ఆరంభులరు= అతనిమాటప్రకారం చేసేవాళ్ళు; అగుఁడు, అని= కండి అని; కఱపి= బోధించి; మహా+ఉదారుఁడు= మిక్కిలి గొప్పవాడు; నారాయణుఁడు= శ్రీకృష్ణుడు; వారలన్; వీడ్కొని= వీడి; తత్+క్షణము+అ= వెంటనే; తన, పురికిన్= తననగరానికి - ద్వారకానగరానికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'మీ దగ్గరకు నారదుడు వస్తాడు. అతడు చెప్పిన విధంగా మీరు నడచుకోండి' అని పాండవులకు చెప్పి మహాత్ముడైన శ్రీకృష్ణుడు వెంటనే ద్వారకానగరానికి వెళ్ళాడు.

వ. పాండవులును పరాక్రమ, ప్రణయ, వశీకృతాఖిలరాజన్యు లయి సుఖం బుండు నంత నొక్కనాఁడు. 89

ప్రతిపదార్థం: పాండవులును; పరాక్రమ, ప్రణయ, వశీకృత+అఖిల, రాజన్యులు+అయి= పరాక్రమంచేత, స్నేహంచేత స్వాధీనులుగా చేసికొనబడిన ఎల్లరాజులు కలవాళ్ళయి - అనగా పరాక్రమంచేత, స్నేహంచేత రాజులందరినీ తమవశం చేసికొని; సుఖంబు+ఉండు; అంతన్= సుఖంగా ఉండగా; ఒక్కనాఁడు.

తాత్పర్యం: పాండవులు తమపరాక్రమంతో, స్నేహంతో రాజులందరినీ తమ వశం చేసికొని సుఖంగా ఉండగా, ఒకనాడు.

నారదుఁడు పాండవులపాలికి వచ్చుట (సం. 1-200-8)

తరలము.

ప్రవిమలాగమతత్త్వవేది తపఃప్రభాసి జగత్త్రయీ
శివకరుండు హితోపదేశము సేయఁగాఁ గడువేడ్కతో
దివిజవంద్యుఁడు ప్రీతితోఁ జనుదెంచె నారదుఁ డంబుజో
ద్భవతనూజుఁడు భానుతేజుఁడు పాండవేయులపాలికిన్. **90**

ప్రతిపదార్థం: ప్రవిమల+ఆగమ, తత్త్వ, వేది= పరిశుద్ధములైన వేదాలయొక్క తత్త్వాన్ని తెలిసినవాడు; తపః, ప్రభాసి= తపస్సుచే ప్రకాశించేవాడు; జగత్+త్రయీ, శివకరుండు= లోకాలు మూడిటికీ మేలుచేసేవాడు; దివిజ, వంద్యుఁడు= దేవతలచే పూజింపదగినవాడు; భాను, తేజుఁడు= సూర్యునితో సమానమైన తేజస్సు కలవాడు; అంబుజ+ఉద్భవ, తనూజుఁడు= పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవుని కుమారుడు; నారదుఁడు; హిత+ఉపదేశము= మంచి ఉపదేశం; చేయఁగాన్= చేయటానికి; కడు, వేడ్కతోన్= మిక్కిలి సంతోషంతో; పాండవేయుల, పాలికిన్= పాండవులదగ్గరకు; ప్రీతితోన్= ప్రేమతో; చనుదెంచెన్.

తాత్పర్యం: పవిత్రాలైన వేదాలతత్త్వం తెలిసినవాడు, తపస్సుచేత ప్రకాశించేవాడు, ముల్లోకాలకు శుభం చేకూర్చేవాడు, దేవతలచేత పూజించదగినవాడు, సూర్యునితో సమానమైన తేజస్సు గలవాడు, బ్రహ్మదేవుని పుత్రుడు అయిన నారదుడు హితాన్ని ఉపదేశించటానికి మిక్కిలి సంతోషంతో పాండవుల దగ్గరకు వచ్చాడు.

మానిని

తమ్ములుఁ దానును ధర్మతనూజుఁడు తత్‌క్షణసంభృతసంభ్రముఁ డై
యమ్మునినాథవరేణ్యునకున్ వినయమ్మున మ్రొక్కి సమున్నతపీ
ఠమ్మున నుంచి యథావిధి పూజ లొడంబడఁ జేసి మునీశ్వర నె
య్యమ్మున నీ విట వచ్చుటఁజేసి కృతార్థుల మైతిమి యిందఱమున్. **91**

ప్రతిపదార్థం: ధర్మతనూజుఁడు= ధర్మరాజు; తమ్ములున్= తమ్ముళ్లు; తానును= తానూ; తత్+క్షణ, సంభృత, సంభ్రముఁడు+ఐ= ఆ క్షణంలో చక్కగా భరింపబడిన ఆదరం కలవాడై; ఆ+ముని, నాథ, వరేణ్యునకున్= ఈ ఋషిశ్రేష్ఠుడైన నారదునకు; వినయమ్మునన్= వినయంతో; మ్రొక్కి= నమస్కరించి; సమున్నత, పీఠమ్మునన్= మిక్కిలి ఎత్తైన పీఠంపై; ఉంచి= కూర్చుండబెట్టి; యథావిధి= శాస్త్రవిధిగా; పూజలు= పూజలు; ఒడంబడన్= అంగీకరించేటట్లు; చేసి; ముని+ఈశ్వర= మునిశ్రేష్ఠా!; నెయ్యమ్మునన్= స్నేహంతో; నీవు; ఇటన్= ఇచ్చటకు; వచ్చుటన్+చేసి= రావటంవలన; ఇందఱమున్= ఇంతమందిమి; కృతార్థులము+ ఐతిమి= ఈడేరిన కోరిక కలవారమయ్యాము.

తాత్పర్యం: ధర్మరాజు తమ్ములతో కూడ అమితమైన ఆదరభావంతో ఈ ఋషిశ్రేష్ఠుడైన నారదునికి వినయంగా మ్రొక్కి, మిక్కిలి ఎత్తైన పీఠంమీద కూర్చుండబెట్టి, యథావిధిగా పూజలు చేసి, 'మునీశ్వరా! మీరు స్నేహంతో ఇక్కడికి రావటంవలన మేమంతా కృతార్థులం అయ్యాం' అన్నాడు.

విశేషం: వృత్తలక్షణానికి చూడు. ఆది. 4.20 విశేషం. మానినీవృత్తాన్ని నన్నయ ఆదిపర్వంలో రెండుసార్లు, తిక్కన స్త్రీపర్వంలో రెండుసార్లు వాడారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. 'మాపుణ్యంబునంజేసి భవద్దర్శనంబు సంభవించె' నని పరమప్రీతిహృదయులై పలికి, పరమభక్తిం బాంచాలిమ్రొక్కించి యున్నంత, నందఱ నాశీర్వచనంబుల నభినందించి వారల కుశలం బడిగి నారదుండు ద్రౌపదిం బోవం బనిచి, వా రేవురకు నేకాంతంబున ని ట్లనియె. 92

ప్రతిపదార్థం: మా, పుణ్యంబునన్+చేసి= మా పుణ్యంవలన; భవత్+దర్శనంబు= మీ దర్శనం; సంభవించెన్= కలిగింది; అని= అని; పరమ, ప్రీత, హృదయులు+ఐ= మిక్కిలి సంతోషించిన హృదయం కలవాళ్ళయి; పలికి; పరమ, భక్తిన్= మహాభక్తితో; పాంచాలిన్= ద్రౌపదిని; మ్రొక్కించి; ఉన్నంతన్= ఉండునంతలో; అందఱన్= అందరిని; ఆశీర్వచనంబులన్= దీవెనలతో; అభినందించి= కొనియాడి; వారల, కుశలంబు+అడిగి; నారదుండు; ద్రౌపది, పోవన్+పనిచి= వెళ్ళవలసిందని ఆజ్ఞాపించి; వారు+ఏవురకున్= పాండవులైదుగురికి; ఏకాంతంబునన్= రహస్యంగా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'మా పుణ్యంవలన మీ దర్శనం మాకు లభించింది' అని పాండవులు మిక్కిలి సంతోషంతో పలికి, మహాభక్తితో ద్రౌపదిచేత ఆ మహర్షికి మ్రొక్కించాడు. నారదమహర్షి అందరినీ ఆశీర్వదించి, కొనియాడి, కుశల మడిగి, ద్రౌపదిని పొమ్మని పాండవులైదుగురితో రహస్యంగా ఇట్లా అన్నాడు.

సీ. సర్వధర్మజ్ఞుల రుర్వీశపూజ్యుల । రన్యోన్యనిత్యసౌహార్దయుతుల
రగణితగుణయుక్తిఁ బొగడంగఁ దగువార । లిట్టి మీ కేవుర కిపుడు ద్రుపద
సుత యొక్కతియ ధర్మమతి ధర్మపత్ని యై । నది; యీక్రమంబు లోకాగమంబు
లందు విరుద్ధ; మీసుందరికారణం । బున మీకు విప్రీతి పుట్టకుండ

ఆ. నుండవలయుఁ; బ్రియసహోదరుల్ దొల్లి సుం । దోపసుందు లొక్కయువతి కడరి
విగ్రహించి యసురవీరులు దమలోనఁ । బొడిచి మృత్యునిలయమునకుఁ జనిరి. 93

ప్రతిపదార్థం: సర్వ, ధర్మజ్ఞులరు= అన్నిధర్మాలు తెలిసినవాళ్ళు; ఉర్వీ+ఈశ, పూజ్యులరు= రాజులచే పూజింపతగినవాళ్ళు; అన్యోన్య నిత్య, సౌహార్దయుతులరు= పరస్పరం శాశ్వతమైన స్నేహంతో కూడినవాళ్ళు; అగణిత, గుణ, యుక్తిన్= లెక్కలేనన్ని గుణాల కూడికచే; పొగడంగన్= కొనియాడ; తగు= తగిన, వారలు= వాళ్లు; ఇట్టి, మీకున్= ఇటువంటి మీకు; ఏవురకున్= ఐదుగురికి; ఇపుడు, ద్రుపద, సుత= ద్రుపదరాజుకూతురు; ఒక్కతియ= ఒక్కతియే; ధర్మమతిన్= ధర్మబుద్ధితో; ధర్మ, పత్ని= ఇల్లాలు, ఐనది, ఈ క్రమంబు= ఈ పద్ధతి; లోక+ఆగమంబుల+అందున్= లోకంలో, శాస్త్రంలో; విరుద్ధము= పొసగనట్టిది; ఈ, సుందరి= ఈ అందగత్తె; కారణంబునన్= కారణంగా; విప్రీతి= విరోధం; పుట్టకుండన్= కలుగకుండా; ఉండవలయునన్; తొల్లి= పూర్వం; అసుర, వీరులు= రాక్షసవీరులు; ప్రియ, సహోదరుల్= ప్రేమగల అన్నదమ్ములు; సుంద+ఉపసుందులు= సుందుడు, ఉపసుందుడు; ఒక్క, యువతికిన్= ఒక్కస్త్రీకోసం; అడరి= అతిశయించి; తమలోనన్= తమలో తాము; విగ్రహించి= కలహించి; పొడిచి= కొట్టుకొని; మృత్యు, నిలయమునకున్= యముని ఇంటికి; చనిరి= వెళ్ళారు. (మరణించారు.)

తాత్పర్యం: మీరు అన్నిధర్మాలు తెలిసినవాళ్ళు. రాజులచే పూజింపదగినవాళ్ళు. ఒకరిపై ఒకరు శాశ్వతస్నేహం కలవాళ్ళు. లెక్కలేనన్ని మంచిగుణాలు కలవాళ్ళు. కొనియాడదగిన వాళ్ళు. ఇట్లాంటి మీ అయిదుగురికి ఇప్పుడు ద్రౌపది ఒక్కతే భార్య అయింది. ఈ పద్ధతి లోకవిరుద్ధం, శాస్త్రవిరుద్ధం. ఈ అందగత్తె కారణంగా మీలో మీకు

విరోధం పుట్టకూడదు. పూర్వం ప్రేమగల అన్నదమ్ములు, సుందోపసుందులు అనే రాక్షసవీరులు, ఒక స్త్రీకోసం కలహించి కొట్టుకొని మృతిచెందారు.

క. అనిన నది యెట్టు లని యమ। తనయుఁడు గడువేడ్కతోడఁ ద న్నడిగిన నా
తనికిఁ దదీయానుజులకు। నినసన్నిభుఁ డమ్మునీంద్రుఁ డి ట్లని చెప్పెన్. 94

ప్రతిపదార్థం: అనినన్= అని నారదుడు చెప్పగా; అది, ఎట్టుల+అని= అది ఏ విధంగా అని; యమ, తనయుఁడు= యముని కుమారుడైన ధర్మరాజు; కడున్= మిక్కిలి; వేడ్కతోడన్= కుతూహలంతో; తన్నున్+అడిగినన్= తనను అడిగినంతనే; అతనికిన్= ఆ ధర్మరాజుకు; తదీయ, అనుజులకున్= అతని తమ్ములకు; ఇన, సన్నిభుఁడు= సూర్యునితో సమానమైనవాడు; ఆ+ మునీంద్రుఁడు= ఆ మునిశ్రేష్ఠుడైన నారదుడు; ఇట్లు+అని, చెప్పెన్= ఈ విధంగా అని చెప్పాడు.

తాత్పర్యం: అని నారదుడు చెప్పగా ధర్మరాజు మిక్కిలి కుతూహలంతో అది ఎట్లని అడుగగా, అతనికి, అతని తమ్ములకు సూర్యసమానుడైన నారదమునీంద్రుడు ఇట్లా చెప్పాడు.

సుందోపసుందోపాఖ్యానము (సం.1-201-1)

వ. తొల్లి దితిపుత్త్రుండైన హిరణ్యకశిపువంశంబున నికుంభుం డనువానికి సుందోపసుందు లన నిద్దఱుగొడుకులు పుట్టి, నియతాత్ములయి తపంబునన కాని సర్వంబునుం బడయంగా దని యేకనిశ్చయులై, వింధ్యాచలంబున కరిగి నిగృహీతేంద్రియు లై నిదాఘకాలం బెల్లఁ బంచాగ్నిమధ్యంబున నిలిచి, వానకాలంబును శీతకాలంబును జలాశయంబుల వసియించి, మఱియు వాయుభక్షులు నేకపాదస్థితులు నూర్ధ్వబాహులు నధోముఖులును నై పెద్దకాలంబు తపంబు సేసిన. 95

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; దితి, పుత్త్రుండు+ఐన= దితియొక్క కుమారుడైన; హిరణ్యకశిపు= హిరణ్యకశిపుని; వంశంబున= వంశంలో; నికుంభుండు= నికుంభుడు; అను వానికిన్= అనేపేరుగల వానికి; సుంద+ఉపసుందులు= సుందుడు, ఉపసుందుడు; అనన్= అనగా; ఇద్దఱు, కొడుకులు, పుట్టి= ఇరువురు కొడుకులు కలిగి; నియత+ఆత్ములు+అయి= నిగ్రహించబడిన మనస్సు కలవారై; తపంబునన, కాని= తపముచేత తప్ప; సర్వంబునున్= అంతా; పడయన్+కాదు+అని= పొందటం సాధ్యపడదని; ఏక, నిశ్చయులు+ఐ= ఒకే నిర్ణయంకలవాళ్ళయి; వింధ్య+అచలంబునకున్= వింధ్యపర్వతానికి; అరిగి= వెళ్ళి; నిగృహీత+ఇంద్రియులు+ఐ= అదుపులో పెట్టబడిన ఇంద్రియాలు కలవాళ్ళయి; నిదాఘకాలంబు+ఎల్లన్= ఎండకాలమంతా; పంచ+అగ్ని, మధ్యంబునన్= అయిదుఅగ్నులమధ్య; నిలిచి=నిల్చుకొని; వాన, కాలంబును= వర్షాకాలం; శీత, కాలంబును= చలికాలముకూడా; జల+ఆశయంబులన్= నీటి మడుగులలో; వసియించి= ఉండి; మఱియున్= ఇంకా; వాయు, భక్షులున్= గాలిని తిన్నవాళ్ళు; ఏక, పాద, స్థితులున్= ఒంటికాలిమీద నిలబడేవాళ్ళు; ఊర్ధ్వ, బాహులును= మీదికి ఎత్తిన చేతులు కలవాళ్ళూ; అధో, ముఖులును= వంచినముఖాలు కలవాళ్ళూ; ఐ; పెద్ద, కాలంబు= చాలాకాలం; తపంబు, చేసినన్= తపస్సు గావింపగా.

తాత్పర్యం: పూర్వం దితి కుమారుడైన హిరణ్యకశిపునివంశంలో నికుంభుడు అనే వానికి సుందోపసుందులనే ఇద్దరు కుమారులు జన్మించారు. వాళ్ళు నిగ్రహంతో కూడిన మనస్సు కలవాళ్ళయి తపస్సుచే తప్ప సర్వాన్ని

పొందటం సాధ్యం కాదని ఒకే నిర్ణయం కలవాళ్ళయి, వింధ్యపర్వతానికి వెళ్ళారు. ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని, వేసవికాలం అయిదుఅగ్నులమధ్య; వర్షాకాలంలో, చలికాలంలో నీటిమడుగులలో ఉండి, గాలిని భక్షిస్తూ, ఒంటికాలిమీద నిలబడి, చేతులు పైకెత్తి తలలు వంచి చాలాకాలం తపస్సు చేయగా.

విశేషం: పంచాగ్నులు - పూర్వాగ్ని, దక్షిణాగ్ని, పశ్చిమాగ్ని, ఉత్తరాగ్ని, సూర్యుడు. (నాల్గుదిక్కుల్లో అగ్ని-పైనసూర్యుడు)

సీ. వారిదారుణతపోవహ్నిదాహంబున । వింధ్యాద్రిదరుల నావిర్భవించి,
యత్యుచ్చ మయి ధూమ మాకాశమెల్లను । గప్పిన, నమరులు గరము వెఱచి,
రత్నంబులను వధూరత్నంబులను జేసి । తత్తపోవిఘ్నవిధాననిరతు
లయి ప్రబోధింపంగ నలవిగాకున్న, దో । యజుగర్భుపాలికి నరిగి యసుర

ఆ. వరులతపముఁ జెఱుపవలయు నావుడుఁ, గమ । లాసనుండు త్రిభువనార్చితుండు
సురహితంబుపొంటె సుందోపసుందుల । కడకు వచ్చె వరము కరుణ నీఁగ. 96

ప్రతిపదార్థం: వారి, దారుణ, తపస్+వహ్ని, దాహంబునన్= ఆ సుందోపసుందులయొక్క భయంకరమైన తపస్సు అనే అగ్నియొక్క కాల్చటంచేత; వింధ్య+అద్రి, దరులన్= వింధ్యపర్వతంయొక్క గుహలలో; ధూమము= పొగ; ఆవిర్భవించి= పుట్టి, అతి+ఉచ్చము+ అయి= మిక్కిలిగా పైకి వ్యాపించినదై; ఆకాశము+ఎల్లను= ఆకాశంఅంతా; కప్పినన్= కప్పివేయగా; అమరులు= దేవతలు; కరము= మిక్కిలి; వెఱచి= భయపడి; రత్నములను= రత్నాలచేతా; వధూ, రత్నంబులను+చేసి= ఉత్తమస్త్రీలచేతా; తత్+తపస్+విఘ్న, విధాన, నిరతులు+అయి= వారితపస్సుకు ఆటంకం కలిగించటంలో మిక్కుటమైన కోరికగలవాళ్ళయి; ప్రబోధింపంగన్= మేలుకొలుపటానికి; అలవి, కాకున్నన్= సాధ్యం కాకపోగా; తోయజ, గర్భు, పాలికిన్= బ్రహ్మదేవునిదగ్గరకు; అరిగి= వెళ్ళి; అసుర, వరుల, తపమున్= రాక్షసశ్రేష్ఠులైన ఆ సుందోపసుందులతపస్సును; చెఱుపవలయున్, నావుడున్= చెడగొట్టాలని అనగా; త్రిభువన+అర్చితుండు= ముల్లోకాలచే పూజింపబడినవాడు; కమల+ఆసనుండు= పద్మాన్ని పీఠంగా కల బ్రహ్మదేవుడు; సుర, హితంబు, పొంటెన్= దేవతలకు మేలు చేయటంకోసం; కరుణన్= దయతో; వరము= వరాన్ని; ఈఁగన్= ఇవ్వటానికి; సుంద+ఉపసుందుల, కడకున్; వచ్చెన్= సుందోపసుందుల దగ్గరకు వచ్చాడు.

తాత్పర్యం: వాళ్ళ భయంకరమైన తపస్సు అనే అగ్ని కాల్చటంచేత వింధ్యపర్వతగుహలలో పొగ పుట్టి, ఎంతో పైకెగసి, ఆకాశం అంతా కప్పగా, దేవతలు భయపడ్డారు. రత్నాలచేత, అందమైన స్త్రీలచేతా వాళ్ళతపస్సుకు విఘ్నం కలిగించా లని ప్రయత్నించారు. విఫలులయి బ్రహ్మదేవునిదగ్గరకు వెళ్ళి, ఆ రాక్షసులతపస్సు చెడగొట్టాలని అనగా - ముల్లోకాలచే పూజింపబడినవాడు, పద్మం పీఠంగా కలవాడు అయిన ఆ బ్రహ్మదేవుడు దేవతలకు మేలు చేయా లని, దయతో వరం ఇవ్వటానికి సుందోపసుందుల దగ్గరకు వచ్చాడు.

వ. ఇట్లు పితామహుండు సుందోపసుందులతపంబునకు మెచ్చి సన్నిహితుం డయి 'మీ కిష్టం బైన వరం బిచ్చెద వేఁడుం' డనిన వారలు వారిజాసనునకు ముకుళితకరకమలు లయి 'దేవా! మాయిష్టంబు దయసేయ మీ కిష్టం బేని, మాకుఁ గామరూపత్వంబును గామగమనత్వంబును సకలమాయావిత్వంబును నన్యులచేత నవధ్యత్వంబును నమరత్వంబునుం బ్రసాదింపుం' డనిన. 97

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; పితామహుండు= బ్రహ్మదేవుడు; సుంద+ఉపసుందులు= సుందుని, ఉపసుందుని; తపంబునకున్= తపస్సుకు; మెచ్చి= పొగడి; సన్నిహితుండు+అయి= ఎదుట నిలిచినవాడై; మీకున్+ఇష్టంబు+ఐన= మీకు ఇష్టమైన; వరంబు= వరాన్ని; ఇచ్చెదన్= ఇస్తాను; వేఁడుండు= వేడుకొనండి; అనినన్= అని అనగా; వారలు= వాళ్లు; వారిజ+ఆసనునకున్= నీటినుండి పుట్టినపద్మాన్ని పీఠంగా గల ఆ బ్రహ్మదేవునికి; ముకుళిత, కర, కమలులు+అయి= ముడిచిన కమలాలవంటిచేతులు కలవాళ్ళయి; దేవా!= ప్రభూ! మా; ఇష్టంబు= మాకోరిక; దయ, చేయన్= అనుగ్రహించటానికి; మీకు+ఇష్టంబు, ఏనిన్ = మీకు ఇష్టమైతే; మాకున్= మా ఇరువురికి; కామరూపత్వంబును= కోరినరూపాన్ని కలిగి ఉండటాన్ని; కామగమనత్వంబును= కోరిన విధంగా వెళ్ళగలగటాన్ని; సకల, మాయావిత్వంబును= అన్నిమాయలు కలిగిఉండటాన్ని; అన్యులచేతన్= ఇతరులచేత; అవధ్యత్వంబునున్= చంపబడకుండటాన్ని; అమరత్వంబునున్= చావులేకుండటాన్ని; ప్రసాదింపుండు= అనుగ్రహించండి; అనినన్= అని కోరగా.

తాత్పర్యం: ఈ విధంగా బ్రహ్మదేవుడు సుందోపసుందులతపస్సుకు మెచ్చి; వాళ్ళకు ప్రత్యక్షమై, 'మీకు ఇష్టమైన వరం ఇస్తాను. వేడండి' అనగా వాళ్ళు చేతులు జోడించి, 'మా కోర్కె తీర్చటానికి మీకు ఇష్టం ఉన్నట్లయితే, కోరినరూపం కలిగి ఉండటాన్ని, కోరిన విధంగా వెళ్ళగలగటాన్ని, అన్ని మాయలు కలిగి ఉండటాన్ని, ఇతరులచేత చావు లేకుండటాన్ని, అసలు చావే లేకుండటాన్ని అనుగ్రహించం' డని కోరారు.

ఆ. కమలభవుఁడు వారి కమరత్వ మొక్కటి । దక్కఁ గోర్కులెల్ల నక్కజముగఁ
గరుణ నిచ్చె, నిట్లు సరసిజగర్భుచే । వరము వడసి యసురవరులు పెఱిగి. 98

ప్రతిపదార్థం: కమలభవుఁడు= పద్మంనుండి పుట్టినవాడు - బ్రహ్మ; వారికిన్= ఆ ఇద్దరికీ; అమరత్వము= చావులేకుండటం; ఒక్కటి, తక్కన్= ఒకటి తప్ప; కోర్కులు+ఎల్లన్= కోరికలు అన్నింటినీ; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; కరుణన్= దయతో; ఇచ్చెన్= ఇచ్చాడు; ఇట్లు=ఈ విధంగా; సరసిజ, గర్భుచేన్= సరస్సునుంచి పుట్టినపద్మం పుట్టుకస్థానంగా కలవాడైన బ్రహ్మదేవునిచే; వరము; పడసి= వరాన్ని పొంది; అసుర, వరులు= రాక్షసశ్రేష్ఠులైన సుందోపసుందులు; పెఱిగి= విజృంభించి.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు వాళ్ళకు 'చావు లేకుండటం' అనే వరం ఒక్కటి తప్ప తక్కినవాటినన్నింటిని దయతో అనుగ్రహించాడు. ఈ విధంగా వాళ్ళు బ్రహ్మవలన వరాలు పొంది చెలరేగి.

క. అనుపమరాజ్యవిభూతిం । దనరి జగద్విజయకాంక్ష దైత్యులకు ముదం
బొనరఁగ నకాలకౌముది । యను నుత్సవ మొప్పఁ జేసి రగణితబలు లై. 99

ప్రతిపదార్థం: అనుపమ, రాజ్య విభూతిన్= సాటిలేని రాజ్యవైభవంతో; తనరి= ఒప్పి; జగత్+విజయకాంక్షన్= లోకాన్ని జయించాలనే కోరికచేత, దైత్యులకున్= రాక్షసులకు; ముదంబు= సంతోషం; ఒనరఁగన్= కలిగేటట్లు; అకాలకౌముది; అను ఉత్సవము; అగణిత, బలులు+ఐ= లెక్కలేనంతబలం కలవాళ్ళయి; ఒప్పన్; చేసిరి.

తాత్పర్యం: సాటిలేని రాజ్యవైభవంతో వెలిగి, లోకాన్ని జయించాలనే కోరికతో, రాక్షసులకు ఆనందం కలిగించేటట్లు అకాలకౌముది అనే ఉత్సవాన్ని, లెక్కింప సాధ్యం కానంత బలం కలవాళ్ళయి చేసిరు.

విశేషం: కౌముది అనే ఉత్సవాన్ని ఆశ్వయుజపౌర్ణమినాడు లేదా కార్తికపౌర్ణమినాడు జరుపుతారు. ప్రజలంతా ఈ ఉత్సవంతో సంతోషిస్తారు. సుందోపసుందులు దీనిని ఇతరకాలంలో చేయటంవలన ఇది 'అకాలకౌముదిఉత్సవం'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. సురగరుడోరగకిన్నర । పురములు వడిఁ జూఱకొనుచు భూలోకమునం
బరఁగిన రాజర్షి మహీ । సురవరులకు బాధసేయుచును గర్వమునన్. 100

ప్రతిపదార్థం: గర్వమునన్= గర్వంతో; సుర, గరుడ+ఉరగ, కిన్నర, పురములు= దేవతల, గరుడుల, ఉరగుల, కిన్నరుల నగరాలు; వడిన్= వేగమే; చూఱకొనుచున్= కొల్లగొట్టుతూ; భూలోకమునన్= భూలోకంలో; పరఁగిన= ఒప్పిన; రాజ+ఋషి, మహీసుర, వరులకున్= రాజులకు; ఋషులకు, బ్రాహ్మణశ్రేష్ఠులకు; బాధ, చేయుచును= బాధ కలిగిస్తూ;.

తాత్పర్యం: ఆ సుందోపసుందులు గర్వించి దేవతలయొక్క, గరుడులయొక్క, నాగులయొక్క, కిన్నరులయొక్క పురాలను వేగంగా కొల్లగొట్టుతూ; భూలోకంలోని రాజులను, ఋషులను, బ్రాహ్మణశ్రేష్ఠులను బాధిస్తూ.

క. ద్విజవరవినిర్మితము లగు । యజనస్వాధ్యాయకవ్యహవ్యతపోదా
నజపంబులఁ బితృదేవత । లజస్రమును దృప్తు లగుదు రని కడునలుకన్. 101

ప్రతిపదార్థం: ద్విజ, వర, వినిర్మితములు+అగు= బ్రాహ్మణశ్రేష్ఠులచే చేయబడిన వైన; యజన, స్వాధ్యాయ, కవ్య, హవ్య, తపస్; దాన, జపంబులన్= యజ్ఞాలచేతా, వేదాధ్యయనాలచేతా, శ్రాద్ధాలచేతా, హోమాలచేతా, తపస్సులచేతా, దానాలచేతా, జపాలచేతా; పితృదేవతలు; అజస్రమును= ఎల్లప్పుడూ; తృప్తులు+అగుదురు+అని= తృప్తిపొందినవాళ్ళవుతారని; కడున్= మిక్కిలి; అలుకన్= కోపంతో.

తాత్పర్యం: బ్రాహ్మణోత్తములు చేసిన యజ్ఞాలచేతా, వేదాధ్యయనాలచేతా, శ్రాద్ధాలచేతా, హోమాలచేతా, తపస్సులచేతా, దానాలచేతా, జపాలచేతా, పితృదేవతలు ఎల్లప్పుడూ తృప్తిపొందుతున్నారని కోపించి.

వ. పుణ్యవంతుల నిత్యనైమిత్తికకర్మంబులకు విఘ్నంబులు సేయుచు, సింహవ్యాఘ్రగజరూపధరు లై వనంబులం దిరుగుచు, మునిపల్లియలు సొచ్చి మునులకుఁ బ్రాణభయంబు సేయుచున్న వారలక్రూరకర్మంబులకు వెఱచి వేల్పులును మునులును బురాణముని యైన బ్రహ్మపాలికిం జని కృతాంజలు లయి జగంబులకు సుందోపసుందులు సేయు నుపద్రవంబులు సెప్పిన విని విశ్వగురుండు విస్మితుం డయి వార లన్యులచేత వధ్యులు గారు గావున పరస్పర యుద్ధంబునఁ బంచత్వంబుఁ బొందవలయు నని విచారించి, విశ్వకర్మ రావించి 'రూపలావణ్యవతియైన యొక్క యువతి సృజియింపు' మని పంచినఁ బ్రసాదం బని మ్రొక్కి యప్పుడు. 102

ప్రతిపదార్థం: పుణ్యవంతుల= పుణ్యాత్ముల; నిత్య, నైమిత్తిక, కర్మంబులకున్= ప్రతిరోజు చేసే బ్రహ్మయజ్ఞం మొదలైన కర్మలకు, కారణం ఏర్పడటంవలన గ్రహణంమొదలైన వాటిలో చేసే కర్మలకు; విఘ్నంబులు= ఆటంకాలు; చేయుచున్= కలిగిస్తూ; సింహ, వ్యాఘ్ర, గజ, రూప, ధరులు+ఐ= సింహం, పెద్దపులి, ఏనుగు రూపాలను ధరించినవాళ్ళయి; వనంబులన్= అడవులలో; తిరుగుచున్; ముని, పల్లియలు= మునుల పల్లెల్ని; చొచ్చి= ప్రవేశించి; మునులకున్= మునులకు; ప్రాణభయంబు= ప్రాణభీతి; చేయుచున్+ఉన్నన్= కలిగిస్తూ ఉండగా; వారల, క్రూర, కర్మంబులకున్= వాళ్ల భయంకరమైన పనులకు; వెఱచి= భయపడి; వేల్పులును= దేవతలూ; మునులును= ఋషులూ; పురాణ, ముని+ఐన= పురాతనముని అయిన; బ్రహ్మ, పాలికిన్= బ్రహ్మదగ్గరికి; చని= వెళ్ళి; కృత+అంజలులు+అయి= చేయబడిన కైమోడ్పుకలవాళ్ళయి - అంటే నమస్కరించి; జగంబులకున్= లోకాలకు; సుంద+ఉపసుందులు= సుందుడు, ఉపసుందుడు; చేయు ఉపద్రవంబులు= కలిగించే కష్టాలు; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; విశ్వ, గురుండు= విశ్వానికి పెద్ద అయిన బ్రహ్మదేవుడు; విస్మితుండు+అయి= ఆశ్చర్య

పడినవాడై; వారలు= వాళ్లు; అన్యులచేతన్= ఇతరులచేత; వధ్యులుకారు= చంపబడరు; కావున= కాబట్టి; పరస్పర, యుద్ధంబునన్= ఒకరితో ఒకరు చేసే యుద్ధంలో; పంచత్వంబున్= మృతిని; పొందవలయున్= పొందాలి; అని= అని; విచారించి= ఆలోచించి; విశ్వకర్మన్= విశ్వకర్మను; రావించి= రప్పించి; రూప, లావణ్యవతి+ఐన= అందమైన రూపం, కాంతికల; ఒక్క, యువతిన్= ఒక స్త్రీని; సృజియింపుము+అని= సృష్టించుము అని; పంచినన్= ఆజ్ఞాపించగా; ప్రసాదంబు+అని= మీరు దయతో అప్పగించినపని చేస్తానని; మ్రొక్కి= నమస్కరించి; అప్పుడు= ఆ సందర్భంలో.

తాత్పర్యం: పుణ్యవంతుల నిత్యనైమిత్తికకర్మలకు ఆటంకాలు కలిగిస్తూ, సింహం, పెద్దపులి, ఏనుగు రూపాలు ధరించి అడవులలో తిరుగుతూ, మునిపల్లెల్లో ప్రవేశించి మునులకు ప్రాణభయం కలిగిస్తూ ఉండగా, మునులంతా బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళి, లోకాలకు సుందోపసుందులు కలిగించే ఉపద్రవాలనుగూర్చి చెప్పారు. బ్రహ్మ మునులు చెప్పింది విని, ఆశ్చర్యపడి, వాళ్ళు ఇతరులచేత చావరనీ, ఒకరితో మరొకరు యుద్ధం చేసి మాత్రమే మరణించా లనీ ఆలోచించి, విశ్వకర్మను పిలిపించి 'అందం, కాంతి గల ఒకస్త్రీని సృజింపు' మని ఆజ్ఞాపించాడు. అతడు మహాప్రసాదం అని బ్రహ్మకు మ్రొక్కి, అప్పుడు.

పృథ్వి.

తిలాణుమణికోటి సంఘటిత దివ్యదేహంబుతోఁ
దిలోత్తమ యనంగ నొక్కయువతీలలామంబు ను
త్పలాక్షి నొనరించె సర్వగుణభాసిరూపక్రియా
కలావిదుఁడు విశ్వకర్మ తనకౌశలం బేర్పడన్. **103**

ప్రతిపదార్థం: సర్వగుణ, భాసి, రూప, క్రియా, కలా, విదుఁడు= అన్నిగుణాలచే ప్రకాశించే రూపాన్ని చేసే కళను ఎరిగినవాడు; విశ్వకర్మ; తన, కౌశలంబు= తననేర్పు; ఏర్పడన్= తెలిసేటట్లు; తిల+అణు, మణి, కోటి, సంఘటిత, దివ్య, దేహంబుతోన్= నువ్వులవలె సూక్ష్మములైన మణుల సమూహంతో కూర్చబడిన ఉత్తమదేహంతో; తిలోత్తమ= తిలోత్తమ; అనంగన్= అనగా; ఒక్క= ఒక; యువతీ, లలామంబున్= ఉత్తమ స్త్రీని; ఉత్పల+అక్షిన్= నల్లకలువలవంటి కన్నులు కలదానిని; ఒనరించెన్= సృజించాడు.

తాత్పర్యం: సర్వగుణాలతో ప్రకాశించే రూపాన్ని చేసే కళను ఎరిగిన విశ్వకర్మ, తన నేర్పు ప్రకాశించగా, నువ్వులవలె సూక్ష్మాలైన రత్నాలుకూర్చి చక్కటిదేహం గల తిలోత్తమ అనే ఉత్తమస్త్రీని, నల్లకలువలవంటి కన్నులు గలదానిని సృజించాడు.

విశేషం: వృత్తలక్షణానికి చూడు; ఆది. 2.165 విశేషం.

వ. **అదియును సురేంద్రప్రముఖ బృందారక మునిబృంద పరివృతుండై యున్న పరమేష్ఠికిం బరమభక్తిం బ్రణమిల్లి పనియేమి యని ముందట నిలిచిన, నరవిందసంభవుం డాసుందరిం జూచి 'సుందోపసుందు లను దైత్యులు దర్పితు లయి జగంబుల కహితంబులు సేయుచు వింధ్యాచలకందరంబున నున్నవారు; వార లిద్దరు నీకారణంబునం దమలో నొండొరులతోఁ బొడిచి దండధరుపురంబున కరుగునట్లుగాఁ జేయు' మని పంచిన వల్లె యని.** **104**

ప్రతిపదార్థం: అదియును= ఆ తిలోత్తమ; సుర+ఇంద్ర, ప్రముఖ, బృందారక, ముని, బృంద, పరివృతుండు+ఐ= దేవేంద్రుడు మొదలుగా గల దేవతలయొక్క, మునులయొక్క సమూహంచే చుట్టబడినవాడై; ఉన్న= ఉండు; పరమేష్ఠికిన్= బ్రహ్మదేవునికి; పరమ, భక్తిన్= మిక్కిలి భక్తితో; ప్రణమిల్లి= నమస్కరించి; పని; ఏమి; అని= అని పలికి; ముందటన్= సమక్షంలో; నిలిచినన్= నిలువగా; అరవింద, సంభవుండు= పద్మంనుండి పుట్టినవాడైన బ్రహ్మ; ఆ, సుందరిన్= ఆ అందగత్తెను; చూచి; సుంద+ఉపసుందులు= సుందుడు, ఉపసుందుడు; అను= అనే; దైత్యులు= రాక్షసులు; దర్పితులు+అయి= గర్వించినవాళ్ళయి; జగంబులకున్= లోకాలకు; అహితంబు= కీడు; చేయుచున్= చేస్తూ; వింధ్య+అచల, కందరంబునన్= వింధ్యపర్వతగుహాలో; ఉన్నవారు= ఉన్నారు; వారలు+ఇద్దఱు= వాళ్లిరువురు; నీ, కారణంబునన్= నీ కారణంచేత; తమలోన్= తమలో; ఒండు+ఒరులతో= ఒకరితో ఒకరు; పొడిచి= కొట్లాడుకొని; దండధరు, పురంబునకున్= యమలోకానికి; అరుగునట్లుగా= వెళ్ళునట్లుగా; చేయుము+అని= చేయవలసింది అని; పంచినన్= ఆజ్ఞాపించగా; వల్లె, అని= సరే అని.

తాత్పర్యం: దేవేంద్రుడు మొదలైన దేవతల సమూహాలూ, మునుల సమూహాలూ కొలుస్తూఉన్న బ్రహ్మదేవునికి ఆ తిలోత్తమ మహాభక్తితో నమస్కరించి 'పని ఏమి?' అని ఎదుట నిలిచింది. బ్రహ్మదేవుడు ఆ అందగత్తెను చూచి, 'సుందుడు, ఉపసుందుడు అనే రాక్షసులిద్దరూ పొగరెక్కి లోకాలకు కీడుచేస్తూ వింధ్యపర్వతగుహాలో ఉన్నారు. వాళ్ళిద్దరు నీ కారణంగా తమలో తాము పోరాడుకొని మరణించేటట్లుగా చేయు' మని ఆజ్ఞాపించాడు. తిలోత్తమ 'అట్లాగే' అని.

సీ. **అబ్జజు వీడ్కొని యది దేవసభకుఁ బ్ర । దక్షిణం బొనరించెఁ; దత్క్షణంబ**
తద్రూపసౌందర్యదర్శనలోలుఁ డై । యజుఁడు నాలుగుదిక్కులందుఁ దనకు
గావించుకొనియె ముఖంబులు; మఱిరెండు । కన్నులఁ జూచినం గాదు తృప్తి
యని సురేంద్రుండు సహస్రాక్షుఁ డయ్యె; న । య్యమరులు కామమోహాంధు లైరి;

ఆ. **ముదిత యిట్లు సర్వమోహిని యై మర్త్య । భువనమునకు మెఱుఁగుఁ బోలె నొప్పి**
యరుగుదెంచె సుందరాంగి వింధ్యాచల । విపినదేశ మెల్ల వెలుఁగుచుండ. 105

ప్రతిపదార్థం: అది= ఆ తిలోత్తమ; అబ్జజు= పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవుడిని; వీడ్కొని= పోయివస్తానని చెప్పి వదలి; దేవసభకున్= దేవసభకు; ప్రదక్షిణంబు= ప్రదక్షిణం; ఒనరించెన్= చేసింది; తత్+క్షణంబు+అ= ఆ క్షణమే; తత్+రూప, సౌందర్య, దర్శన, లోలుఁడు+ఐ= దానిరూపంయొక్క చక్కదనాన్ని చూడటంలో ఆసక్తుడై; అజుఁడు= బ్రహ్మదేవుడు; తనకున్= తనకు; నాలుగు, దిక్కుల+అందున్= నాలుగు దిక్కులలో; ముఖములు= ముఖాలు; కావించుకొనియెన్= చేసికొన్నాడు; మఱి= ఇక; రెండు; కన్నులన్= రెండుకళ్ళతో; చూచినన్= చూస్తే; తృప్తి, కాదు అని= సంతృప్తి కలగదని; సుర+ఇంద్రుండు= దేవేంద్రుడు; సహస్ర+అక్షుడు+అయ్యెన్= వేయికన్నులు కలవాడు అయ్యాడు; ఆ+అమరులు= ఆ దేవతలు; కామ, మోహ+అంధులు+ఐరి= మన్మథమోహంచేత గ్రుడ్డివాళ్ళు అయ్యారు; ముదిత= ఆ స్త్రీ; ఇట్లు= ఈ విధంగా; సర్వ, మోహిని+ఐ= అందరినీ మోహింపచేసేదై; మర్త్య, భువనమునకున్= మనుష్యలోకానికి; మెఱుఁగున్+పోలెన్= మెరుపుతీగవలె; ఒప్పి= ప్రకాశించి; సుందర+అంగి= అందమైన శరీరం గల ఆ తిలోత్తమ; వింధ్య+అచల,విపిన, దేశము+ఎల్లన్= వింధ్యపర్వతంయొక్క అరణ్యప్రాంతమంతా; వెలుగుచుండన్= వెలుగుకలుగుతున్నట్లు; అరుగుదెంచెన్= వచ్చింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తిలోత్తమ బ్రహ్మదగ్గర సెలవు తీసికొని, దేవసభకు ప్రదక్షిణం చేసింది. అప్పుడు బ్రహ్మ దాని సౌందర్యాన్ని చూడటానికి తనకు నాలుగుదిక్కులలో ముఖాలు కల్పించుకొని చతుర్ముఖుడు అయ్యాడు. దేవేంద్రుడు తన రెండుకళ్ళతో చూస్తే తృప్తి కలగదని వేయికళ్ళవాడయ్యాడు. దేవతలు కామమోహితులయ్యారు. ఈ విధంగా తిలోత్తమ అందరినీ మోహింపజేసి, మానవలోకానికి మెరుపుతీగవలె ప్రకాశిస్తూ, వింధ్యపర్వత అరణ్యప్రాంతం అంతా వెలుగుతుండగా వచ్చింది.

విశేషం: అలం: కావ్యలింగం, ఉపమ.

క. అమ్ముదితఁ జూచి యన్నయుఁ దమ్ముఁడు నొక్కట మనోజతాడితు లై రా
గమ్మున నన్యోన్యస్నే । హమ్ములు చెడి దృష్టు నిలిపి రయ్యువతిపయిన్. 106

ప్రతిపదార్థం: ఆ+ముదితన్= ఆ కాంతను; చూచి; అన్నయున్, తమ్ముఁడున్= అన్నా తమ్ముడూ; ఒక్కటన్= ఒకే సమయంలో; మనోజ, తాడితులు+ఐ= మన్మథునిచే కొట్టబడినవాళ్ళయి; రాగమ్మునన్= అనురాగంతో; అన్యోన్య, స్నేహమ్ములు= ఒకరిమీద మరొకరికి గల స్నేహాలు; చెడి= నశించి; ఆ+అతివ= ఆ స్త్రీమీద; దృష్టు= చూపులు; నిలిపిరి= నిలిపారు.

తాత్పర్యం: సుందోపసుందులు ఆ తిలోత్తమను చూచి, ఒక్కసారిగా మన్మథపీడితులై, పరస్పరస్నేహాన్ని వదలి, అనురాగంతో ఆమెమీద చూపులు నిలిపారు.

క. ఘను లయ్యిరువురు నేకా । సనభోజనయాననిలయశయనక్రియలం
దనరెడువా రేకస్త్రీ । వినిహితకాము లయి రపుడు విధినియమమునన్. 107

ప్రతిపదార్థం: ఘనులు= బలవంతులైన; ఆ+ఇరువురున్= ఆ సుందోపసుందులిద్దరూ; ఏక+ఆసన, భోజన, యాన, నిలయ, శయన, క్రియలన్= ఒకే ఆసనంచేత, భోజనంచేత, వాహనంచేత, గృహంచేత, పడకచేత, పనిచేత; తనరెడు, వారు= ఒప్పేవాళ్ళు; అపుడు= ఆ సమయంలో; విధి, నియమమునన్= దైవనిర్ణయంచేత; ఏకస్త్రీ, వినిహిత, కాములు+అయిరి= ఒకే స్త్రీమీద (ఉంచబడిన) కామం కలవాళ్ళు అయ్యారు.

తాత్పర్యం: ఒకే ఆసనంమీద కూర్చొంటూ, ఒకే ఆహారం భుజిస్తూ, ఒకే వాహనం ఎక్కుతూ, ఒకే ఇంట్లో ఉంటూ, ఒకే పడకమీద పడుకొంటూ, ఒకే పనిచేస్తూ, ఒకటిగా ఉన్న బలవంతులు ఆ సుందోపసుందులిద్దరూ దైవనిర్ణయంవలన ఒకే స్త్రీని కామించారు.

క. ఇది నావల్లభ యిది నా । హృదయేశ్వరి యనుచుఁ గోరి యిరువురు మదనో
న్మదు లయి పరిగ్రహించిరి । తదీయ కమనీయ సవ్యదక్షిణకరముల్. 108

ప్రతిపదార్థం: ఇది; నా, వల్లభ= ఇది నా భార్య; ఇది; నా, హృదయ+ఈశ్వరి= ఇది నా హృదయానికి రాణి - నా భార్య; అనుచున్= అంటూ; కోరి= ఇష్టపడి; ఇరువురు= ఇద్దరూ; మదన+ఉన్మదులు+అయి= మన్మథునిచేత మిక్కిలిమదించినవాళ్ళయి; తదీయ, కమనీయ, సవ్య, దక్షిణ, కరముల్= ఆమెయొక్క చక్కని యెడమ కుడి చేతులు; పరిగ్రహించిరి=పట్టుకొన్నారు.

తాత్పర్యం: వాళ్ళిద్దరు మన్మథునివలన మిక్కిలి మదించినవాళ్ళయి 'ఇది నా భార్య', ఇది నా భార్య' అని ఆమె ఎడమకుడిచేతులను పట్టుకొన్నారు.

విశేషం: 'సవ్య' శబ్దానికి ఎడమ, కుడి - అని రెండర్థాలూ ఉన్నాయి. పద్యంలో 'సవ్య దక్షిణ', శబ్దాలు ఉన్నందున- 'సవ్య=ఎడమ. దక్షిణ= కుడి-' అని గ్రహించాలి. 'దక్షిణ'మంటే 'కుడి' అనియే అర్థం.

వ. ఇట్లు పట్టుకొని 109

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పట్టుకొని= బిగియపట్టి, గట్టిగా బంధించి.

తాత్పర్యం: ఈ విధంగా ఆమె రెండుచేతులు పట్టుకొని.

క. 'సుందరి । మాయిద్దఱలో । నిం దెవ్వరి వలతు చెప్పు మీ' వనవుడుఁ బూ
ర్ణేందుముఖి వారి కను 'మీ । యం దెవ్వఁడు పొడిచి యొడుచు నతనిన వలతున్'. 110

ప్రతిపదార్థం: సుందరి! = ఓ సుందరీ!; మా, ఇద్దఱలోన్= మా ఇరువురిలో; ఇందున్= ఇచ్చట; ఎవ్వరిన్, వలతు(వు)= ఎవరిని కోరుతావో; ఈవు= నీవు; చెప్పుము; అనవుడున్= అని, సుందోపసుందు లడుగగా; పూర్ణ+ఇందు, ముఖి= పూర్ణచంద్రునివంటి ముఖం కలది; వారికిన్= వాళ్లతో; అనున్= అనింది; మీ, అందున్= మీలో; ఎవ్వఁడు= ఎవ్వడు; పొడిచి= పోరాడి; ఒడుచున్= గెలుస్తాడో; అతనిన్+అ= అతనినే; వలతున్= కోరుతాను.

తాత్పర్యం: 'సుందరీ! మా ఇద్దరిలో నీవు ఎవ్వరిని కోరుతావో చెప్పు' మని సుందోపసుందులడుగగా 'మీలో మీరు యుద్ధం చేసి, ఎవడు గెలుస్తాడో అతడినే కోరుతాను' అని తిలోత్తమ చెప్పింది.

విశేషం: కొన్నిప్రతుల్లో ఈ పద్యం లేదు. దీని స్థానంలో ఈక్రింది వచనం ఉన్నది 'నీ వెవ్వరివల' తనిన అది రూప సౌందర్యంబుల మీ రొక్కరూప, కావున మి మ్మొకళ్ళ గోరనేర, మీలో పొడిచినవాని వలతు' ననిన. (శ్రీమదాంధ్ర మహాభారతసంశోధితప్రతి, పు.500)

సుందోపసుందు లొండొరులతోఁ బోరి చచ్చుట

క. అనవుడు నిద్దఱుఁ దమలోఁ । బొనుపడ కొండొరులతోడ భుజబలు లలుకన్
ఘనవజ్రతనులు దాఁకిరి । తనరఁగ నటఁ గొండ గొండఁ దాఁకినభంగిన్. 111

ప్రతిపదార్థం: అనవుడున్= అని తిలోత్తమ చెప్పగా; ఇద్దఱున్= ఇరువురున్నూ; పొనుపడక= ఉడుగక; తమలోన్= తమలో; ఒండొరులతోడన్= ఒకరితో ఒకరు; అలుకన్= కోపంతో; భుజ, బలులు= భుజబలం కలవాళ్ళు; ఘన, వజ్ర, తనులు= గొప్ప వజ్రంవంటి (అంటే వజ్రంవలె కఠినమైన) శరీరం కలవాళ్ళు; తనరఁగన్= విజృంభించి; అటన్= అక్కడ; కొండ= పర్వతం; కొండన్= పర్వతాన్ని; తాఁకిన, భంగిన్= ఎదుర్కొన్న విధంగా; తాకిరి= (ఒకరిని ఒకరు) ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: అని తిలోత్తమ చెప్పగా ఇద్దరూ తగ్గక భుజబలం కలవారు, వజ్రంవంటి శరీరం కలవాళ్ళు అయిన సుందోపసుందులు తమలో తాము విజృంభించి, కొండను కొండ ఎదుర్కొన్నట్లుగా ఒకరినొకరు ఎదుర్కొన్నారు.

విశేషం: అలం: ఉపమ.

క. విపరీతమతిని సుందుఁడు । నుపసుందుఁడుఁ దాఁకి పొడిచి రొండొరుతోడం
గుపితాత్ము లయి తిలోత్తమ । నెపమున దృఢముష్టిఘాతనిర్ఘాతములన్. 112

ప్రతిపదార్థం: విపరీత, మతిని= విరుద్ధమైన బుద్ధిచేత; సుందుఁడున్= సుందుడూ; ఉపసుందుఁడున్=ఉపసుందుడూ; తిలోత్తమ, నెపమునన్= తిలోత్తమ కారణంగా; కుపిత+ఆత్ములు+అయి= కోపంతో కూడిన మనస్సు కలవాళ్ళయి; దృఢ, ముష్టి, ఘాత, నిర్ఘాతములన్= పిడుగులవంటి గట్టి పిడికిటి పోట్లచేత; ఒండు+ఒరుతోడన్= ఒకరిని ఒకరు; తాఁకి= ఎదుర్కొని; పొడిచిరి= పోరాడినారు.

తాత్పర్యం: తిలోత్తమ కారణంగా సుందోపసుందులు వ్యతిరేకబుద్ధితో కోపాత్ములై పిడుగులవంటి గట్టి పిడికిలి పోట్లతో ఒకరినొకరు పోరాడినారు.

క. అన్యోన్యప్రియభాషణు । లన్యోన్యహితైషు లసుర లన్యులపోలెన్
మన్యుపరిప్రేరితు లై । యన్యోన్యాభిహతిఁ జనిరి యమపురమునకున్. 113

ప్రతిపదార్థం: అన్యోన్య, ప్రియ, భాషణులు= పరస్పరం సంతోషకరాలైన మాటలు కలవాళ్ళు; అన్యోన్య, హితైషులు= పరస్పరం మేలుకోరేవాళ్ళు; అసురులు= రాక్షసులు; అన్యుల, పోలెన్= పరాయివాళ్ళవలె; మన్యు, పరిప్రేరితులు+ఐ= కోపంచేత మిక్కిలి ప్రేరేపింపబడినవాళ్ళయి; అన్యోన్య+అభిహతిన్= ఒకరిని ఒకరు కొట్టుకొనటంచేత; యమ, పురమునకున్= యమ నగరానికి; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ఒకరితో ఒకరు సంతోషకరంగా మాట్లాడేవాళ్ళు, ఒకరి మేలు ఒకరు కోరేవాళ్ళు అయిన ఆ రాక్షసులు పరాయివాళ్ళవలె కోపంతో రెచ్చిపోయి, ఒకరినొకరు కొట్టుకొని చనిపోయారు.

విశేషం: పద్యంలోని అన్యోన్య శబ్ద పునరావృత్తి, నకార, యకార సంయోగం సుందోపసుందుల అన్యోన్యత ఎంతటిదో తెలియజేసేదిగా ఉన్నది. అభిహతిలో కూడా - అంటే కొట్టుకోవటంలో కూడా కనిపించే అన్యోన్యత చాలా చమత్కారమైనది.

క. ఇంతుల నిమిత్తమున ధృతి । మంతులుఁ బొందుదురు భేదమతి గావున మీ
రింతయు నెఱింగి యొండులు । చింతింపక సమయ మిందు సేయుఁడు బుద్ధిన్. 114

ప్రతిపదార్థం: ఇంతుల, నిమిత్తమునన్= స్త్రీల కారణంగా; ధృతి, మంతులున్= ధైర్యంకలవాళ్ళుకూడా; భేద, మతిన్= విరోధబుద్ధిని; పొందుదురు= పొందుతారు; కావునన్= కాబట్టి; మీరు, ఇంతయున్= ఇది అంతా; ఎఱింగి= తెలిసి; ఒండులు= ఇతరములు; చింతింపక= ఆలోచించక; సమయము= ఏర్పాటు; బుద్ధిన్= మనఃపూర్వకంగా; ఇందున్, చేయుఁడు= ఇచ్చట చేయండి.

తాత్పర్యం: ధైర్యవంతులు కూడా స్త్రీల కారణంగా విరోధం పొందుతారు. కాబట్టి దీనిని అంతా తెలిసి, ఇతర ఆలోచనలు చేయకుండా బుద్ధిపూర్వకంగా ఒక ఏర్పాటు చేసికొనండి.

నారదప్రేరితులయి పాండవులు సమయము సేయుట (సం.1-204-27)

సీ. అనిన నారదమహామునిపల్కు చేకొని । దమలో నొడంబడి విమలబుద్ధి
నేవురయందును ద్రోవది ప్రీతితో । నొక్కొక్కయింట దా నొక్కయేఁడు

క్రమమున నుండను; గమలాక్షి యెవ్వరి । యింటఁ దా నుండె నయ్యింటివలనఁ

బెఱవారు చనకుండ; నెఱుఁగక చనిరేని । వెలయఁగఁ బండ్రెండునెలలు తీర్థ

ఆ. సేవ సేయుచును విశేషవ్రతంబులు । ధీరవృత్తిఁ జలుపువారుగాను

సన్మునీంద్రునొద్ద సమయంబు సేసిరి । రాజనుతులు పాండురాజసుతులు. 115

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన; నారదమహాముని; పల్కు= మాట; చేకొని= గ్రహించి - అనగా అంగీకరించి; రాజ, నుతులు= రాజులచే కొనియాడబడేవాళ్ళు; పాండురాజసుతులు= పాండురాజుయొక్క కుమారులు - పాండవులు; విమల, బుద్ధిన్= నిర్మలమైన మనస్సుతో; ఒడంబడి= ఒప్పుకొని; ఏవుర, అందును= పాండవులు అయిదుగురిపట్ల; ద్రోవది= ద్రౌపది; ప్రీతితోన్= ప్రేమతో; తాన్= తాను; ఒక్కొక్క, ఇంటన్= ఒక్కొక్క ఇంటిలో; ఒక్క, ఏఁడు= ఒక సంవత్సరం; క్రమమునన్= వరుసగా; ఉండన్= ఉండటానికి; కమల+అక్షి= పద్మాలవంటి కన్నులు కలది - ద్రౌపది; ఎవ్వరి, ఇంటన్= ఎవ్వరి ఇంటిలో; తాన్= తాను; ఉండెన్= ఉంటుందో; ఆ+ఇంటివలనన్= ఆ ఇంటివైపు; పెఱవారు= ఇతరులు; చనకుండన్= వెళ్ళకుండా; ఎఱుఁగక= తెలియక; చనిరి+ఏని= వెళ్ళినట్లయితే; వెలయఁగన్= ఒప్పుగా; పండ్రెండు నెలలు= ఒక సంవత్సరం అంటే పన్నెండు మాసాలు; తీర్థసేవ; చేయుచును= చేస్తూ; విశేష, వ్రతంబులు= విశేషాలైన వ్రతాలు; ధీర, వృత్తిన్= ధైర్యంతో; చలుపువారుగాను= చేసేవాళ్ళుగా; సత్+ముని+ఇంద్రు, ఒద్దన్= నారదమహామునిఎదుట; సమయంబు= ప్రతిజ్ఞ; చేసిరి= చేశారు.

తాత్పర్యం: రాజులందరి ప్రశంసలందుకొనే పాండవులు నారదమహాముని చెప్పిన మాటను గ్రహించి, అరమరికలు లేని మనస్సుతో ఒప్పుకొనినారు. పాండవులైదుగురిపట్ల ద్రౌపది ప్రేమతో ఒక్కొక్కరి ఇంట ఒక్కొక్క సంవత్సరం క్రమంగా ఉండటానికీ, ద్రౌపది ఉన్న ఇంటివైపు ఇతరులు వెళ్ళకుండా ఉండటానికీ, ఒకవేళ ఎవరైనా తెలియక వెళ్ళితే, అతడు పన్నెండునెలలు తీర్థయాత్రలు, విశేషవ్రతాలు చేయటానికీ అంగీకరించారు. ఆ మేరకు ఆ మహర్షి ఎదుట ప్రతిజ్ఞ చేశారు.

విశేషం: కలసిఉన్నవారి నడుమ కలహాలు కల్పించటం కలహభోజనుడైన నారదుని స్వభావం. కాని ఇక్కడ పాండవుల మధ్య ద్రౌపది కారణంగా ఎప్పుడూ కలహాలు ఏర్పడకుండ నారదమహర్షి ప్రయత్నించటం ఒక పెద్ద ప్రత్యేకత. నారదమహర్షి ప్రయత్నం పాండవుల దైవానుగ్రహానికి పరోక్షచిహ్నం.

వ. ఇట్లు హితోపదేశంబు సేసి నారదుం డరిగినం బాండవులు దమచేసినసమయస్థితిం దప్పక సలుపుచు సుఖంబుండఁ; గొండొకకాలంబున కొక్కనాఁ డొక్కబ్రాహ్మణుండు ముచ్చులచేతఁ దనహోమధేనువు గోల్పడి వచ్చి యాక్రోశించిన, నశ్రుతపూర్వం బయిన యయ్యాక్రోశంబు విని విస్మితుం డయి విజయుండు విప్రులకయిన బాధ దీర్పక యుపేక్షించుట పాతకం బని యప్పుడ యవ్విప్రు రావించి 'యిది యేమి కారణం?' బని యడిగిన నర్జునునకు విప్రుం డి ట్లనియె. 116

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; హిత+ఉపదేశంబు, చేసి= మేలు కలిగించే మాటలు చెప్పి; నారదుండు; అరిగినన్= వెళ్ళగా; పాండవులు, తమ, చేసిన; సమయ, స్థితిన్= తాము కావించిన ప్రతిజ్ఞావిధాన్ని; తప్పక= విడువక; సలుపుచున్= శ్రద్ధతో పాటిస్తూ; సుఖంబు+ఉండన్= సుఖంగా ఉండగా; కొండు+ఒక, కాలంబునకున్= కొంత కాలానికి; ఒక్కనాఁడు; ఒక్క,

బ్రాహ్మణుండు; ముచ్చులచేతన్= దొంగలచేత; తన= తన; హోమధేనువు= యాగసంబంధమైన ఆవును; కోలు+పడి= పోగొట్టుకొని; వచ్చి, ఆక్రోశించినన్= ఏడ్వగా; అశ్రుతపూర్వంబు+అయిన= ఇదివరకు వినబడనిదైన; ఆ+ఆక్రోశంబు= ఆ ఏడుపు; విని, విజయుండు= అర్జునుడు; విస్మితుండు+అయి= ఆశ్చర్యపడినవాడై; విప్రులకున్+అయిన= బ్రాహ్మణులకు కలిగిన; బాధ; తీర్పక; ఉపేక్షించుట= ఊరకుండుట; పాతకంబు= పాపము అని; అప్పుడు+అ= అప్పటికప్పుడే; ఆ+విప్రున్= ఆ బ్రాహ్మణుని; రావించి= రప్పించి; ఇది, ఏమి, కారణంబు అని = ఈ దుఃఖం ఏ కారణంగా అని; అడిగినన్= అడుగగా; అర్జుననకున్= అర్జునునికి; విప్రుండు= బ్రాహ్మణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా హితోపదేశం చేసి నారదుడు వెళ్ళగా, పాండవులు తమప్రతిజ్ఞను తప్పక పాలిస్తూ సుఖంగా ఉన్నారు. కొంతకాలంతర్వాత ఒకనాడు ఒక బ్రాహ్మణుడు తన హోమధేనువును దొంగలచే పోగొట్టుకొని వచ్చి ఏడ్వగా, అర్జునుడు పూర్వం ఎప్పుడూ వినని ఆ ఏడ్పు విని, బ్రాహ్మణులకు ఏర్పడిన బాధ తీర్చకపోతే పాపం వస్తుం దని ఆ బ్రాహ్మణుని దుఃఖకారణాన్ని అడుగగా, అతడు ఇట్లా అన్నాడు.

విశేషం: అశ్రుతపూర్వంబయిన అనే దానికి కొన్ని ప్రతులలో 'శ్రుత పూర్వం బయిన' అనే పాఠాంతరంకూడా ఉన్నది. అపుడు 'ముందు విన్నట్టిదైన' అని అర్థం.

క. యమతనయు ధర్మరాజ్యము । తమరాజ్యమ యని మహాముదంబున విప్రో
త్తము లున్నచోటనే బ । న్నమువడి కోల్పడితి గోధనము ముచ్చులచేన్. 117

ప్రతిపదార్థం: యమతనయు= ధర్మరాజుయొక్క; ధర్మరాజ్యము= ధర్మసామ్రాజ్యం; తమ, రాజ్యము= తమ రాజ్యమే అని; మహా, ముదంబునన్= మిక్కిలి సంతోషంతో; విప్ర+ఉత్తములు= బ్రాహ్మణశ్రేష్ఠులు; ఉన్నచోటనే; బన్నము+పడి= ఆపదపొంది; ముచ్చులచేన్= దొంగలచేత; గోధనము; కోల్పడితిన్= కోల్పోయాను.

తాత్పర్యం: ధర్మజుని ధర్మసామ్రాజ్యం తమరాజ్యమే అని బ్రాహ్మణోత్తములు మహానందంతో ఉన్నచోటనే ఆపదనొంది, దొంగలచేత గోధనాన్ని నేను కోల్పోయాను.

విశేషం: పూర్వం ధనమంటే గోధనమే. గోవులు ఎక్కువగా ఉండటం ఆనాటి గృహస్థులకు ఉత్తమధనం.

సీ. 'వదలక ముచ్చుల వధియించి నాహోమ । ధేనువుఁ గ్రమ్మఱఁ దెచ్చియిమ్ము
జననుత! దానివత్సంబు నిన్నటఁగోలె । నుడుగక యఱచుచునున్నయదియ;
పలుకుల కెడ లేదు; బాణాసనము గొని । చనుదెమ్ము నాతోడఁ జట్ట' ననిన
ద్రౌపదీసహితుఁ డై ధర్మరాజాయుధా । గారంబునం దున్న గార్ముకంబుఁ

ఆ. బుచ్చికొనఁగఁ దనకుఁబోలమి యెఱిఁగియు । విప్రునార్తరవము వినఁగ నోప
కర్జునుండు నిజశరాసనగ్రహణార్థ । మాయుధాలయమున కరిగె నపుడు. 118

ప్రతిపదార్థం: జననుత!= ప్రజలచే కీర్తింపబడేవాడా! ఓ అర్జునా!; వదలక= విడిచిపెట్టక; ముచ్చులన్= దొంగలను; వధియించి= చంపి; నా, హోమధేనువున్= నా హోమధేనువును; క్రమ్మఱన్= మరల; తెచ్చిఇమ్ము; దాని, వత్సంబు= దానిదూడ;

నిన్నటన్+కోలెన్= నిన్నటినుండి; ఉడుగక= ఆపక; అఱచుచున్+ఉన్న, అది+అ= అరుస్తూనే ఉన్నది; పలుకులకున్= మాటలకు; ఎడలేదు= అవకాశం లేదు; చట్టన్= శీఘ్రమే; బాణ+ఆసనము= ధనుస్సు; కొని= తీసికొని; నాతోడన్= నాతోకూడ; చను దెమ్ము= రమ్ము; అనినన్= అని చెప్పగా; ధర్మరాజు, ద్రౌపదీసహితుఁడు+ఐ= ద్రౌపదీదేవితో కూడినవాడై; ఆయుధ+ అగారము+ అందున్= ఆయుధాలున్న ఇంటిలో; ఉన్నన్= ఉండగా; కార్ముకంబు= ధనుస్సు; పుచ్చుకొనఁగన్= తీసికొనటం; తనకున్= తనకు; పోలమి= సరికాకుండటం; ఎఱిఁగియు= తెలిసికూడా; అర్జునుండు= అర్జునుడు; విప్రు+ఆర్తరవము= బ్రాహ్మణుడియొక్క ఏడ్పు; వినఁగన్+ఓపక= వినలేక; నిజ= తనయొక్క; శర+ఆసన, గ్రహణ+అర్థము= ధనుస్సు తీసికొనటంకొరకు; ఆయుధ+ఆలయమునకున్= ఆయుధాలున్న ఇంటికి; అపుడు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'జనులచే కీర్తింపబడే ఓ అర్జునా! దొంగలను వదలక బంధించి, నా హోమధేనువును మళ్ళీ తెచ్చి నాకు ఇమ్ము. దానిదూడ నిన్నటినుండి అట్లాగే అరుస్తూ ఉన్నది. మాటలకు వ్యవధి లేదు. వెంటనే ధనుస్సు తీసికొని నావెంట రమ్ము' అని ఆ బ్రాహ్మణుడు అనగా ధర్మరాజు ద్రౌపదితో కూడి ఆయుధాల ఇంట్లో ఉన్నాడనీ, అక్కడికి వెళ్ళి ధనుస్సు తీసికొనటం తప్పనీ తెలిసికూడా, అర్జునుడు విప్రునిఏడ్పు వినలేక తనధనుస్సు తీసికొనటానికి ఆయుధాలున్న ఆ ఇంటికి అప్పుడు వెళ్ళాడు.

క. 'ధరణీసురవరులకుఁ గడుఁ సెరగై నెడ నెఱిఁగి యెడయుఁ జేయుదురె మహా
పురుషు' లని నరుఁడు విలుగొని । యరిగెను ద్రుచ్చులపిఱుంద నవ్విప్రుపనిన్. 119

ప్రతిపదార్థం: మహాపురుషులు= దైవాంశగల గొప్పవాళ్లు; ధరణీ, సుర, వరులకున్= బ్రాహ్మణోత్తములకు; కడున్= మిక్కిలి; సెరగు+ఐన= ఆపద కలిగిన; ఎడన్= చోటును; సమయాన్ని; ఎఱిఁగి= తెలిసి; ఎడయున్+చేయుదురె= తొలగుతారా - అంటే ముఖం తప్పించి వెళ్తారా; అని; నరుఁడు= అర్జునుడు; విలు= విల్లు; కొని= తీసికొని; ఆ+విప్రు, పనిన్= ఆ బ్రాహ్మణునియొక్క పనిమీద; ద్రుచ్చుల; పిఱుందన్= దొంగలవెంబడించి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'బ్రాహ్మణోత్తములకు ఆపద ఏర్పడిన సంగతి తెలిసి మహాపురుషులు మొహం తప్పించి వెళ్తారా? అని అర్జునుడు ధనుస్సు తీసికొని, ఆ విప్రునిపనిమీద దొంగలవెంట పడ్డాడు.

విశేషం: ఉత్తమక్షత్రియులకు తమకు సంబంధించిన ధర్మంకంటె సంఘానికి సంబంధించిన ధర్మం అవశ్య కర్తవ్యం. ఒక్కొకసారి వ్యక్తి (స్వీయ) ధర్మానికి ఆపదవాటిల్లినా సామాజికధర్మాన్ని మాత్రం తప్పకుండ నిర్వర్తించాలి. పాండవులు చేసికొన్న నియమాన్ని అనుసరించి ద్రౌపది ఎవరి ఇంటిలో ఉంటుందో ఆ యింటికి మిగిలినవాళ్ళు వెళ్ళకూడదు. ఇది జరిగినప్పుడు ద్రౌపది ధర్మరాజు వద్ద ఉన్నది. అతడు ఆమెతో కలిసి ఆయుధాగారంలో ఉన్నాడు. అది ధర్మజు ఇల్లు కాదు. ఆయుధాగారం పాండవులందరు ఉపయోగించతగినదే. అందువలన, అర్జునుడు ద్రౌపది ఉన్న ఆ చోటికి పోవటం అధర్మం అనటానికీ వీలు లేదు. కాని, ద్రౌపది ధర్మజునితో కలిసి ఉన్న ఏ ఇంటిలోనైనా ప్రవేశించకూడదనే నియమాన్ని వ్యాఖ్యానించుకొంటే అది తప్పు అవుతుంది. అయితే, ఈ ధర్మాధర్మవిచారం చేయడానికీ, ధర్మరాజుకుముందుగా తెలియపరచి, ద్రౌపదితోకూడా అతడు అవతలికి పోయినతర్వాత ఆయుధాగారంలోని విల్లును తీసికొనిపోవటానికీ వ్యవధానం లేదు. ధర్మనిర్వహణలో తనకు కలిగే కష్టంకంటె సమాజానికి కలిగే నష్టాన్ని పరిగణించి ప్రవర్తించే ధర్మవీరుడు-అర్జునుడు. అట్లా ప్రవర్తించటం ఉత్తమవీరలక్షణం.

వ. ఇ ట్లరిగి యర్జునుం డతివీరు లయిన చోరుల వధియించి, బ్రాహ్మణునకు గోధనంబు నిచ్చి క్రమ్మఱ వచ్చి ధర్మజునకు మ్రొక్కి, 'లోకంబులమర్యాదలు విచారించి రక్షించుచున్న మనయందు మర్యాదాభంగం బయ్యె నను నింతకంటె

దుర్యశం బొండెద్దియు లేదు గావున నాకు ద్వాదశమాసికవ్రతంబు సలుపవలయు' నని పోవ సమకట్టి యున్న నర్జుననకు యుధిష్ఠిరుం డి ట్లనియె. 120

ప్రతిపదార్థం: ఇట్లు+అరిగి= ఈవిధంగా వెళ్ళి; అర్జునుండు; అతి, వీరులు+అయిన= గొప్ప వీరులైన; చోరులన్= దొంగలను; వధియించి= చంపి; బ్రాహ్మణునకున్= ఆ విప్రునికి; గోధనంబున్= గోరూపధనాన్ని; ఇచ్చి= తెచ్చిఇచ్చి; క్రమ్మఱి= తిరిగి; వచ్చి= ఇంటికివచ్చి; ధర్మజునకున్= ధర్మరాజునకు; మ్రొక్కి= నమస్కరించి; లోకంబుల, మర్యాదలు= లోక నియమాలు; విచారించి= ఆలోచించి; రక్షించుచున్+ఉన్న= కాపాడుతూ ఉండే; మనయందున్= మనలో; మర్యాదా, భంగంబు= నియమభంగం; అయ్యెన్= అయింది; ఇంతకంటెన్= ఇంతకన్న; దుర్+యశంబు= అపకీర్తి; ఒండు= మరొకటి; ఎద్దియున్, లేదు = ఏదీ లేదు; కావునన్= కాబట్టి; నాకున్= నేను; ద్వాదశమాసికవ్రతంబు= పండ్రెండు నెలల వ్రతం; సలుపవలయున్= చేయాలి; అని= అని చెప్పి; పోవన్= పోవటానికి; సమకట్టి= పూని; ఉన్నన్= ఉండగా; అర్జుననకున్= అర్జునునికి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా వెళ్ళి అర్జునుడు అతివీరులైన ఆ దొంగలను చంపి, బ్రాహ్మణునికి గోధనాన్ని ఇచ్చి, తిరిగి వచ్చి, ధర్మజునికి మొక్కి - 'లోకనియమాలను విచారించి రక్షిస్తున్న మనలోనే నియమభంగం జరిగిందన్న అపకీర్తికి మించింది మరొకటి లేదు. అందువలన నేను ద్వాదశమాసికవ్రతాన్ని చేయాలి' అని వెళ్ళడానికి సిద్ధంకాగా, అతనితో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

ఆ. క్రూర కర్ము లయ్యు గో బ్రాహ్మణుల కగు । బాధ లుడుచుజనులఁ బాపచయము
లెట్టియెడలఁ బొంద వింద్రనందన! నీకు । సమయభంగభీతిఁ జనఁగ నేల? 121

ప్రతిపదార్థం: ఇంద్రనందన= ఇంద్రుని కుమారుడవైన ఓ అర్జునా!; క్రూర, కర్ములు+అయ్యున్= పాపపు పనులు చేసిన వారైనా; గో, బ్రాహ్మణులకున్+అగు= ఆవులకు, బ్రాహ్మణులకు కలిగే, బాధలు; ఉడుచు= పోగొట్టే; జనులన్= ప్రజల్ని; పాప, చయములు= పాపాల సమూహాలు; ఎట్టి, ఎడలన్= ఎటువంటి చోట్లలో గూడా; పొందవు= చేరవు; నీకున్; సమయ, భంగ, భీతిన్= నియమం చెడింది అనే భయంతో; చనఁగన్= వెళ్ళటం; ఏల= ఎందుకు?

తాత్పర్యం: అర్జునా! ఎంత దుర్మార్గులైనా ఆవులకు, బ్రాహ్మణులకు కలిగిన బాధలను తొలగించే జనులను పాపాలు ఎటువంటి చోట్ల కూడా పొందవు. అట్లాంటప్పుడు నీవు నియమభంగం అయిందన్న భయంతో పోవటం ఎందుకు?

విశేషం: రెండుధర్మాలకు సంఘర్షణ ఏర్పడినప్పుడు ధర్మసూక్ష్మాన్ని అనుసరించటం లోకధర్మం. ద్రౌపది ధర్మజునితో కూడి ఏ ఇంట్లో ఉన్నా, ఆ ఇంట్లోకి మిగిలిన పాండవులు వెళ్ళకూడదని నియమం. ఆ నియమం తప్పినట్లు అర్జునుడు భావించి, ప్రాయశ్చిత్తాన్ని చేసికొనటానికి అన్నను అనుమతి కోరాడు. ధర్మజుడు బ్రాహ్మణబాధను తొలగించే సందర్భంలో ఎటువంటిచోట్ల కూడా పాపాలు పొందవనే ధర్మసూక్ష్మాన్ని ప్రతిపాదించాడు. అది అపద్ధర్మమౌతుందనీ, ప్రజలు దానిని నిందించే అవకాశం ఉంటుందనీ అర్జునుడు భావించాడు.

వ. 'మఱి యట్లుంగాక తస్కరవధోపేక్షల నశ్వమేధ భ్రూణహత్యల ఫలం బగు నని వేదంబులయందు వినంబడుఁ; దస్కరుల వధియించి బ్రాహ్మణహితంబు చేసినవాఁడవు; నీకు సమయోల్లంఘనప్రాయశ్చిత్తంబు సేయ నేల?' యనిన నర్జునుం డి ట్లనియె. 122

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మఱి= ఇంకా; అట్లున్+కాక= ఆ విధంగానూకాక; తస్కర, వధ+ఉపేక్షలన్= దొంగలను చంపటంవలన, వదలివేయటం వలన; అశ్వమేధ, భ్రూణ, హత్యల, ఫలంబు= అశ్వమేధయాగం చేయటంవలన, పసిబిడ్డను చంపటంవలన కలిగేఫలం; అగును+అని= అవుతుంది అని; వేదంబుల, అందున్= వేదాలలో; వినన్+పడున్= వినపడుతూంది; తస్కరులన్= దొంగలను; వధియించి= చంపి; బ్రాహ్మణ, హితంబు= బ్రాహ్మణునికి మేలు; చేసినవాడవు= చేసినావు; నీవు= నీవు; సమయ+ఉల్లంఘన, ప్రాయశ్చిత్తంబు= నియమాన్ని తప్పి నడచుకొన్న పాపాన్ని పోగొట్టుకోవటానికి చేసే పని; చేయన్+ఏల= చేయటం ఎందుకు; అనినన్= అని అనగా; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అంతేకాక దొంగలను చంపటంవలన అశ్వమేధం చేసినంత పుణ్యఫలం, వాళ్ళను వదలివేస్తే (కడుపులో) పసిబిడ్డను చంపినంత పాపఫలం కలుగుతుందని వేదాలవలన వింటున్నాం. దొంగలను చంపి బ్రాహ్మణుడికి మేలు చేసిన నీవు నియమం తప్పి నడచుకొన్నందుకు చేసికొనే ప్రాయశ్చిత్తాన్ని చేసికొనటం ఎందుకు?' అని ధర్మజుడు అనగా అర్జునుడు ధర్మజునితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: క్రమాలంకారం. ఒకవేళ అర్జునుడు చేసింది పాపమని గ్రహించి దానికి ప్రాయశ్చిత్తం చేసికొనటానికే ద్వాదశమాసవ్రతం పాటించినట్లయితే తస్కరవధవలన అశ్వమేధయాగం చేసిన పుణ్యం వస్తుందనీ, ఆ పుణ్యప్రభావంవలన పాపప్రాయశ్చిత్తం అవసరంలేదనీ ధర్మజుడి ప్రతిపాదన. పుణ్యప్రాప్తి పాపప్రాయశ్చిత్తానికి ప్రత్యామ్నాయం కాదని అర్జునుడి అభిప్రాయం.

క. భూజనపరివాదం బ । వ్యాజంబునఁ బరిహరింపవలయును మనకున్
వ్యాజమున ధర్మలోపం । బాజిజయా! పరిహరింతురయ్య మహాత్ముల్. 123

ప్రతిపదార్థం: ఆజి, జయా = యుద్ధంలో జయించేవాడా! ఓ ధర్మరాజా!; అవ్యాజంబునన్= కారణం లేకపోయినా; భూజన; పరివాదంబు= భూమిలోని ప్రజలవలన కలిగేనిందను; మనకున్= మనకు; పరిహరింపవలయును= తొలగించాల్సిఉంది; మహాత్ములు= మహనీయులు; వ్యాజమునన్= సాకుతో; ధర్మ, లోపంబున్= ధర్మం తప్పటాన్ని; పరిహరింతురు+అయ్య= త్రోసి పుచ్చుతారా!

తాత్పర్యం: యుద్ధంలో జయించే ఓ ధర్మరాజా! అకారణంగా భూజనులవలన కలిగిన నిందనైనా మనం తొలగించాలి. అటువంటప్పుడు ఏదో సాకు పెట్టి మహాత్ములైనవాళ్ళు ధర్మం తప్పటాన్ని త్రోసిపుచ్చుతారా?

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తి అనదగిన సుభాషితం. ఏ కారణం లేకుండానే రాజులకు ఒక్కొక్కసారి నిందలు వస్తూ ఉంటాయి. కారణం లేదుకదా అని దానిని నిర్లక్ష్యం చేయకుండా ఆ నిందను తొలగించుకొనటానికి ప్రయత్నించటం రాజధర్మం. మరి ఇక్కడ 'ఏదో ఒక సాకు చెప్పి నియమాన్ని పాటించామని పాండవులు సమర్థించుకొన్నారు' అని సహేతుకంగా ప్రజలు విమర్శించటానికి పాలకులు అవకాశం కలిగించటం సమర్థనీయం కాదని అర్జునుడు పేర్కొని, నిర్మల ధర్మ కర్మ దీక్షాపరతంత్రుడనిపించుకొన్నాడు. ధర్మజుడు అతనిమాటను కాదనలేకపోయాడు.

సమయభంగకారణమున నర్జునుండు తీర్థయాత్రకుం జనుట (సం.1-206-12)

వ. కావున వ్రతదానంబు నా కనుగ్రహింప వలయు' నని మ్రొక్కి యర్జునుం డగ్రజు వీడ్కొని గురుజనానుమతుం డై యఖిలవేదవేదాంగపారగు లైన బ్రాహ్మణులు ననేకశాస్త్రవిదు లయి వివిధకథాకథనదక్షు లయిన పౌరాణికులును దనకు సహాయులుగా నరిగి సకలతీర్థసేవచేయుచు నయ్యైతీర్థంబులందు. 124

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కావున వ్రతదానంబు= కాబట్టి ద్వాదశమాసికవ్రతం అనే దానాన్ని; నాకున్; అనుగ్రహింపవలయును= ఇవ్వాలి; అని= అని చెప్పి; మ్రొక్కి; అర్జునుండు= అర్జునుడు; అగ్రజున్, వీడ్కొని= అన్నదగ్గర సెలవు తీసికొని; గురుజన+ అనుమతుండు+ఐ= పెద్దలచే అనుమతించబడినవాడై; అఖిల వేద, వేద+అంగ, పారగులు+ఐన= అన్ని వేదాలను, వేదాంగాలను, తుదముట్ట చదివిన; బ్రాహ్మణులున్= విప్రులూ; అనేక, శాస్త్ర, విదులు+అయి= పెక్కుశాస్త్రాలు తెలిసినవాళ్ళయి; వివిధ, కథా, కథన, దక్షులు+అయిన= అనేక విధాలైన కథలను చెప్పటంలో సమర్థులైన పౌరాణికులును; తనకున్= తనకు; సహాయులుకాన్= తోడైనవాళ్ళుగా; అరిగి= పోయి; సకలతీర్థసేవ చేయుచున్= అన్నితీర్థాలు సేవిస్తూ; అయ్యైతీర్థముల, అందున్= ఆయా తీర్థాలలో.

తాత్పర్యం: 'అందుచేత నాకు ద్వాదశమాసికవ్రతదానాన్ని అనుగ్రహించండి' అని నమస్కరించి అర్జునుడు అన్నదగ్గర సెలవుతీసికొని, పెద్దలందరి అనుమతి పొంది, అన్నివేదాలు, వేదాంగాలు తుదముట్ట చదివిన బ్రాహ్మణులూ, పెక్కుశాస్త్రాలూ తెలిసి అనేక విధాలైనకథలు చెప్పటంలో సమర్థులైన పౌరాణికులూ తనకు తోడై రాగా ఆ యాతీర్థాలు సేవిస్తూ.

ఆ. ధరణిసురుల గురులఁ బరమయోగుల మహా । భాగు లయిన యట్టి భాగవతుల
రాజవంశవరుఁడు పూజించుచును వారి । వలనఁ బుణ్యకథలు వెలయ వినుచు. 125

ప్రతిపదార్థం: రాజవంశవరుఁడు= చంద్రవంశశ్రేష్ఠుడైన అర్జునుడు; ధరణిసురులన్= బ్రాహ్మణులను; గురులన్= పెద్దలను; పరమయోగులన్= గొప్పయోగులను; మహాభాగులు+అయిన+అట్టి= నిర్మలమనస్సు గల ప్రసిద్ధులైనట్టి; భాగవతులన్= పుణ్యాత్ములను; పూజించుచును= పూజిస్తూ; వారివలనన్= వాళ్లవల్ల; పుణ్యకథలు= పుణ్యకథలను; వెలయన్= ఒప్పుగ; వినుచున్= వింటూ.

తాత్పర్యం: చంద్రవంశశ్రేష్ఠుడైన అర్జునుడు బ్రాహ్మణులను, పెద్దలను, పరమయోగులను, గొప్ప పుణ్యాత్ములను పూజిస్తూ, వారివలన పుణ్యకథలు వింటూ.

క. గంగాధర పింగజటా । సంగమ మంగళ విశాల చటుల తరంగన్
గంగానది సేవించెను । గంగాద్వారమున విగతకల్మషుఁ డగుచున్. 126

ప్రతిపదార్థం: గంగాధర, పింగ, జటా, సంగమ, మంగళ, విశాల, చటుల, తరంగన్= శివునియొక్క గోరోచనపువర్ణంగల జటలతో కలియటంచేత మంగళకరాలై, విశాలాలై చలించే అలలు కలదానిని; గంగానదిన్; గంగా, ద్వారమునన్= గంగానదియొక్క ద్వార ప్రదేశంలో; విగత, కల్మషుఁడు+అగుచున్= తొలగిన పాపాలు కలవాడవుతూ; సేవించెన్= సేవించాడు.

తాత్పర్యం: శివునిగోరోచనపురంగు జటలతో కలవటంవలన మంగళకరాలై, విశాలాలై, చలించేఅలలుగల గంగానదిని, గంగాద్వారంలో అర్జునుడు తనపాపాలు తొలగిపోయేటట్లు సేవించాడు.

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం. గంగాతరంగనాదసౌందర్యాన్ని బిందుపూర్వక గకారంతో ధ్వనింపచేయటం అక్షరరమ్యత.

వ. అందు నిత్యంబును గంగాస్నానంబు సేసి తత్తీరంబున హోమంబు సేయుచు వాసవసుతుండు మహీసురవర సహితుం డయి కొన్ని దివసంబులు వసియించి, యొక్కనాఁడు ప్రభాతంబ విధిపూర్వకంబునం గృతాభిషేకుం డయి దేవర్షి పితృతర్పణంబులు సేసి. 127

విశేషం: అందున్= గంగానదీద్వారంలో; వాసవ, సుతుండు= దేవేంద్రుని కుమారుడైన అర్జునుడు; నిత్యంబును= ప్రతిదినమూ; గంగా, స్నానంబు చేసి; = గంగలో స్నానం చేసి; తత్+తీరంబునన్= ఆ గంగానది ఒడ్డున; హోమంబు, చేయుచున్= హోమం చేస్తూ; మహీసుర, వర, సహితుండు+అయి= బ్రాహ్మణోత్తములతో కూడినవాడై; కొన్ని, దివసంబులు= కొన్నిరోజులు; వసియించి= ఉండి; ఒక్కనాఁడు; ప్రభాతంబు+అ= వేకువనే; విధిపూర్వకంబునన్= నియమప్రకారం; కృత+ అభిషేకుండు+అయి= చేయబడిన స్నానం కలవాడై - అంటే స్నానంచేసి; దేవ+ఋషి, పితృ, తర్పణంబులు, చేసి= దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు తర్పణాలు చేసి.

తాత్పర్యం: ఆ గంగానదీద్వారంలో అర్జునుడు ప్రతిదినం (గంగా) స్నానం చేసి, గంగ ఒడ్డున హోమంచేస్తూ, బ్రాహ్మణశ్రేష్ఠులతో కూడి, కొన్నిరోజులు గడిపి, ఒకనాడు వేకువనే లేచి, నియమంప్రకారం స్నానం చేసి, దేవ, ఋషి, పితృతర్పణాలు చేసి.

ఉలూచి యర్జునునిఁ గామించుట (సం. 1-206-12)

సీ. **వేల్వంగ సమకట్టి వెలువడ నున్న న । య్యింద్రనందను రుచిరేంద్రనీల**
సుందరశ్యామాంగు సురరాజకరికరా । కారమహాబాహుఁ గట్టిఁ జూచి
నలినాక్షి యం దొక్కనాగకన్యక కామ । పరవశ యై వానిఁ బట్టి తిగిచి
కొని నాగపురమునకును జని నిజరమ్య । హర్మ్యంబునందు నెయ్యమున నునిచె;

ఆ. **నందు నగ్ని తొంటియట్టు లభ్యర్చితం । బయి వెలుంగుచున్న నర్జునుండు**
హోమకార్య మొప్ప నొనరించి యప్పు డ । య్యింతిఁ జూచి నగుచు నిట్టు లనియె. 128

ప్రతిపదార్థం: వేల్వంగన్= హోమం చేయటానికి; సమకట్టి= పూనుకొని; వెలువడన్+ఉన్న= వెలుపలికి రానున్న; ఆ+ఇంద్ర, నందనున్= ఇంద్రుని కుమారుడైన అర్జునుడిని; రుచిర+ఇంద్రనీల, సుందర, శ్యామ+అంగున్= కాంతిమంతమైన ఇంద్రనీలమణివలె అందమైన నల్లని శరీరం కలవాడిని; సుర, రాజ, కరి, కర+ఆకార, మహాబాహున్= దేవతలరాజైన దేవేంద్రుని ఏనుగుతొండంవంటి గొప్ప బాహువులు కలవాడిని; కట్టిన్= నల్లనివాడైన అర్జునుడిని; చూచి; అందున్= అచ్చట; ఒక్క; నలిన+అక్షి= పద్మంవంటి కన్నులు కలది; నాగకన్యక= నాగజాతికన్య; కామ, పరవశ+ఐ= కామానికి మిక్కిలి లొంగిపోయినదై; వానిన్= ఆ అర్జునుడిని; పట్టి= బంధించి; తిగిచికొని= లాగికొని; నాగపురమునకును; చని= వెళ్ళి; నిజ, రమ్య, హర్మ్యంబు, అందున్= అందమైన తన మేడలో; నెయ్యమునన్= స్నేహంతో; ఉనిచెన్= ఉంచింది; అందున్= ఆ నాగపురంలో; అగ్ని= అగ్ని; తొంటి, అట్టుల= పూర్వంవలెనే; అభి+అర్చితంబు+అయి= పూజింపబడినదై; వెలుంగుచున్నన్= వెలుగుతూఉండగా; అర్జునుండు; హోమకార్యము; ఒప్పన్; ఒనరించి= చేసి; అప్పుడు+అ= ఆ క్షణమే; ఆ+ఇంతిన్= ఆ నాగకన్యకను; చూచి; నగుచున్= నవ్వుతూ; ఇట్టుల+అనియెన్.

తాత్పర్యం: హోమం చేయపూని వెలుపలికి వచ్చిన ఆ పార్థుడిని, ఇంద్రనీలంవలె అందమైన నల్లటిశరీరం గలవాడిని, ఐరావతంతొండంవంటి పెద్దబాహువులు కలవాడిని-చూచి, కమలాలవంటి కన్నులు కల నాగకన్యక, కామపరవశ అయి అతడిని పట్టి లాక్కొని నాగపురానికి వెళ్ళి, అందమైన తనమేడలో ప్రేమతో ఉంచింది. అక్కడ వెలుగుతున్న అగ్నిలో అర్జునుడు హోమకార్యం జరిపి, ఆ నాగకన్యను చూచి నవ్వుతూ ఇట్లా అన్నాడు.

క. 'తామరసనేత్ర! నీ పే । రేమీ? యెవ్వరితనూజ; వి ట్లేల మహా
వ్యామోహిత వై?' తనవుడుఁ గోమలి సురరాజపుత్త్రకున కి ట్లనియెన్. 129

ప్రతిపదార్థం: తామరసనేత్ర= తామరలవంటి కన్నులు కలదానా!; నీపేరు; ఏమీ; ఎవ్వరి, తనూజవు= ఎవ్వరికూతురివి; ఇట్లు; ఏల= ఎందుకు; మహా, వ్యామోహితవు+ఐతి(వి)= మిక్కిలి వలపు కొన్నదానివి అయ్యావు; అనవుడున్= అని అనగా; కోమలి= సుకుమారి - ఆ నాగకన్యక, సురరాజ, పుత్త్రకునకున్= దేవేంద్రుని కుమారునికి (అర్జునునికి); ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కలదానా! నీపేరేమి? నీ వెవ్వరి కూతురివి? ఈ విధంగా ఎందుకు ఇంత వలపు గొన్నదానివి అయ్యావు? అని అనగా ఆ నాగకన్యక అర్జునునితో ఇట్లా అన్నది.

వ. ఏ నులూచి యను నాగకన్యక; నైరావతకులసంభవుం డయిన కౌరవ్యుకూఁతుర; నిన్నుం జూచి మనోజబాణబాధిత నయితి; నామనోరథంబు సలుపుము. 130

ప్రతిపదార్థం: ఏను= నేను; ఉలూచి; అను, నాగకన్యకను; ఐరావత, కుల, సంభవుండు+అయిన= ఐరావతవంశంలో పుట్టినవాడైన; కౌరవ్యుకూతురన్= కౌరవ్యుని కుమార్తెను; నిన్నున్; చూచి, మనోజ, బాణ, బాధితను+అయితిన్= మన్మథబాణాలచేత బాధింపబడిన దాననయ్యాను; నా, మనోరథంబు= నా కోరిక; సలుపుము= ఈడేర్చుము.

తాత్పర్యం: నేను ఉలూచి అనే నాగకన్యకను. ఐరావతవంశంలో పుట్టిన కౌరవ్యుని కూతురిని. నిన్ను చూచి వలచాను. నా కోరిక తీర్చుము.

విశేషం: ఐరావతము - కద్రువకుమారులలో ఒకడు. అతనివంశంలో పుట్టిన కౌరవ్యునికూతురు ఉలూచి. ఉలూచికి ఉలూపి అనే పాఠాంతరం అనేకప్రతులలో ఉన్నది.

క. నీ గుణములు దొల్లియు నా । గీగీతములందు విని తగిలి యిపుడు మనో
రాగమునఁ జూడఁ గంటిని । భాగీరథియందు నిన్నుఁ బరహితచరితా! 131

ప్రతిపదార్థం: పరహిత, చరితా= ఇతరులకు మేలు చేసే నడవడి కలవాడా!; నీ, గుణములు; తొల్లియు= ఇదివరకే; నాగీ, గీతముల+అందున్= నాగకన్యకలపాటలలో; విని; తగిలి= ఆసక్తి కలిగి; ఇపుడు; మనోరాగమునన్= ప్రేమతో; నిన్నున్= నిన్ను; భాగీరథి, అందున్= గంగానదిలో; చూడన్+కంటిని= చూడగలిగాను.

తాత్పర్యం: ఇతరులకు మేలు చేసేనడవడి కల ఓ అర్జునా! ఇదివరకే నీ గుణాలు నాగకన్యకలపాటలలో విని, ఆసక్తి గొన్నాను. ఇపుడు ప్రేమతో నిన్ను గంగానదిలో చూడగలిగాను.

విశేషం: పరహితచరితా! అనే సంబోధనలో - ఇతరులమేలుకోరి నడుచుకొనే నీవు ఇపుడు నా మేలు కోరి నా కోరిక మన్నింపుము అనే ఉలూచి హృదయం చక్కగా వ్యక్తమవుతున్నది. పార్థుని ఈ తీర్థయాత్రలకు కారణంకూడా పరహితచరితమే కదా! భగీరథుడు భూమిమీదకు తీసికొనిరావటంవలన గంగకు భాగీరథి అనే పేరు వచ్చింది.

వ. అనిన దాని కర్జునుం డి ట్లనియె. 132

ప్రతిపదార్థం: అనినన్= అని ఉలూచి అనగా; దానికిన్= ఆమెకు; అర్జునుఁడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని పలికిన ఉలూచితో అర్జునుడు ఇట్లా అన్నాడు.

మధ్యాక్కర.

> **ద్వాదశమాసికవ్రతము సలుపుదుఁ దరుణి! మాయన్న**
> **యాదేశమునఁ జేసి సర్వతీర్థము లాడుచు బ్రహ్మ**
> **వాదులసంగతి బ్రహ్మచర్యసువ్రతుఁడ నై యుండి**
> **నీదుమనోరథ మెట్లు సలుపంగనేర్తు నే నిపుడు? 133**

ప్రతిపదార్థం: తరుణి! = ఓకాంతా!; మా, అన్న= మా అన్నగారి; ఆదేశమునన్+చేసి= ఆజ్ఞతో; ద్వాదశమాసికవ్రతమున్= ద్వాదశమాసవ్రతాన్ని; సలుపుదున్= చేస్తున్నాను; సర్వతీర్థములు+ఆడుచున్= అన్ని పుణ్యతీర్థాలలో స్నానం చేస్తూ; బ్రహ్మవాదుల, సంగతి= వేదవిదులయినవారితో కలిసి; బ్రహ్మచర్య, సువ్రతుఁడను+ఐ= బ్రహ్మచర్యవ్రతం ఆచరిస్తూ; ఉండి= ఉంటూ; నేను; ఇపుడు= ఇప్పుడు; నీదు, మనోరథము= నీకోరిక; ఎట్లు; సలుపంగనేర్తున్= ఏవిధంగా తీర్చగలను?

తాత్పర్యం: ఓ కాంతా! మా అన్నగారి ఆజ్ఞతో ద్వాదశమాసికవ్రతం చేస్తూ, అన్ని పుణ్యతీర్థాలలో స్నానమాడుతూ వేదవిదులైన బ్రాహ్మణోత్తములతో కలిసి బ్రహ్మచర్యవ్రతాన్ని సలుపుతూ ఉండగా, నేను ఇపుడు నీ కోర్కెను ఎట్లా తీర్చగలను?

విశేషం: వృత్తలక్షణానికి చూడు. ఆది.2.183 విశేషం.

వ. అనిన నవనతానన యయి నాగకన్యక యర్జును జూచి ' ద్రుపదరాజపుత్త్రియందు మీచేసిన సమయంబును, భవత్తీర్థాగమననిమిత్తంబును వ్రతంబును నెఱుంగనిదానఁ గాను; సర్వతీర్థసేవనంబును సర్వవ్రతంబులు సలుపుటయును సర్వదానధర్మక్రియలును బ్రాణదానంబుతో సమానంబులు గావు; నామనోరథంబు విఫలం బయిన మనోజానలంబునం బ్రాణపరిత్యాగం బగుం గావున నన్ను రక్షింపుము; దీన నీకు వ్రతభంగంబు గా' దనిన నర్జునుండు దానిమనోరథంబు సలిపి యారాత్రి నాగభువనంబున వసియించి నాగకన్యకయందు సద్యోగర్భంబున నిరావంతుం డను కొడుకుం బడసి, నాగలోకంబు వెలువడి యాదిత్యోదయంబుతోడన గంగాద్వారంబునకు వచ్చి, తద్వృత్తాంతం బంతయుఁ దనసహాయు లయిన విప్రులకుం జెప్పి, వారలకు హృదయానందంబు సేయుచు. 134

ప్రతిపదార్థం: అనినన్= అని అర్జునుడు; చెప్పగా; అవనత+ఆనన, అయి= వంచిన ముఖం కలదై; నాగకన్యక; అర్జునున్, చూచి; ద్రుపదరాజ, పుత్త్రి, అందున్= ద్రౌపదియందు; మీ, చేసిన= మీయొక్క చేసిన- అంటే మీరు చేసిన; సమయంబును= ప్రతిజ్ఞను; భవత్+తీర్థ+ఆగమన, నిమిత్తంబును= మీ తీర్థయాత్రాకారణాన్ని; వ్రతంబునున్; ఎఱుంగదానన్, కాను= తెలియనిదానను కాను; సర్వ, తీర్థ, సేవనంబును= అన్ని తీర్థాలను సేవించుట; సర్వ, వ్రతంబులు, సలుపుటయున్= అన్ని వ్రతాలు చేయటం; సర్వ, దాన, ధర్మ, క్రియలును= అన్ని దానాల ధర్మాల పనులు; ప్రాణదానంబుతోన్+సమానంబులు= ప్రాణదానంతో సరికావు; నా, మనోరథంబు= నా కోరిక; విఫలంబు+అయినన్= నెరవేరకుంటే; మనోజ+అనలంబునన్= మన్మథాగ్నిలో; ప్రాణ, పరి త్యాగంబు+అగున్= ప్రాణం వదలటం జరుగుతుంది; కావునన్; నన్నున్; రక్షింపుము; దీనన్=

దీనవలన; నీకున్; వ్రత, భంగంబు= వ్రతానికి భంగపాటు; కాదు= కలుగదు; అనినన్= అని అనగా; అర్జునుండు; దాని= ఆ ఉలూచియొక్క; మనోరథంబు= కోరిక; సలిపి= తీర్చి; ఆ రాత్రి; నాగభువనంబునన్= నాగలోకంలో; వసియించి= నివసించి; నాగకన్యక+అందున్= నాగకన్యకయందు; సద్యస్+గర్భంబునన్= అప్పటికప్పుడు కలిగిన గర్భంలో; ఇరావంతుండు+ అను= ఇరావంతుడు అను పేరుగల; కొడుకున్; పడసి= పొంది; నాగలోకంబు= నాగలోకంనుండి; వెలువడి= వెలుపలికివచ్చి; ఆదిత్య+ఉదయంబుతోడన= సూర్యోదయంతోనే; గంగా ద్వారంబునకున్= గంగాద్వారానికి; వచ్చి= చని; తత్+వృత్తాంతంబు= ఆ సంగతి; అంతయున్= అంతా; తన; సహాయులు+ అయిన= తోడుగా ఉన్న; విప్రులకున్= బ్రాహ్మణులకు; చెప్పి; వారలకున్, హృదయ+ఆనందంబు, చేయుచున్= ఆ బ్రాహ్మణులకు మనస్సంతోషము కలిగిస్తూ.

తాత్పర్యం: అని అర్జునుడు చెప్పగా ఉలూచి తలవంచి అర్జునుడిని చూచి - 'ద్రౌపదివిషయంలో మీరు చేసిన ప్రతిజ్ఞ, మీతీర్థయాత్రకారణం, మీవ్రతం తెలియని దాన్ని కాను. అన్నితీర్థాలు సేవించటం, అన్నివత్రాలు సలపటం; అన్నిదానాలు, ధర్మకర్మలు చేయటం, ప్రాణదానంతో సమానం కావు. నా కోర్కె నెరవేరకుంటే మన్మథాగ్నిలో ప్రాణం వదలటం జరుగుతుంది. కాబట్టి నన్ను రక్షించు. దీనివలన నీకు వ్రతభంగం కాదు' అనగా అర్జునుడు ఉలూచి కోరిక తీర్చి, ఆ రాత్రి నాగలోకంలో గడిపి, ఆమెయందు సద్యోగర్భంలో ఇరావంతుండు అనే కొడుకును పొంది, సూర్యోదయంకాగానే గంగాద్వారానికి వచ్చి, జరిగిన వృత్తాంతమంతా తనకు తోడుగా ఉన్న బ్రాహ్మణులకు చెప్పి, వాళ్ళకు హృదయానందం కలిగిస్తూ.

క. వితతయశుఁ డరిగి హిమప । ర్వతపార్శ్వంబున నగస్త్యవటమును నత్యు
న్నతభృగుతుంగముఁ జూచుచు । ధృతి నేఁగి హిరణ్యబిందుతీర్థంబునకున్. 135

ప్రతిపదార్థం: వితత, యశుఁడు= విశాలమైన కీర్తికలవాడు - అర్జునుడు, అరిగి= వెళ్ళి, హిమపర్వత, పార్శ్వంబునన్= హిమాలయ పర్వతంప్రక్కన; అగస్త్యవటమున్ (పుణ్యక్షేత్రం); అతి+ఉన్నత, భృగుతుంగమున్= మిక్కిలి ఎత్తైన భృగుతుంగక్షేత్రాన్ని; చూచుచున్; ధృతిన్= సంతోషంతో; హిరణ్య, బిందు తీర్థంబునకున్= హిరణ్యబిందు తీర్థానికి; ఏఁగి= వెళ్ళి.

తాత్పర్యం: విశాలమైన కీర్తి గల అర్జునుడు హిమాలయం ప్రక్కన ఉన్న అగస్త్యవటక్షేత్రాన్ని, మిక్కిలి ఎత్తైన భృగు తుంగక్షేత్రాన్ని చూస్తూ సంతోషంతో హిరణ్యబిందుతీర్థానికి వెళ్ళి.

వ. అందును గోదాన భూదాన హిరణ్యదానంబు లాదిగాఁ బెక్కుదానంబులు సేసి, యజ్ఞార్థంబుగా భూసురోత్తములకు గోసహస్రంబు లిచ్చి, ప్రాగ్దేశంబున కరిగి నైమిశారణ్యంబునందు జగన్నాథునారాయణు నారాధించి యుత్పలినియుఁ గౌశికియు నందయు నపరనందయు గయయు గంగయు గంగాసాగరసంగమంబును జూచుచు. 136

ప్రతిపదార్థం: అందును= ఆ హిరణ్యబిందుతీర్థంలో; గోదాన, భూదాన, హిరణ్యదానంబులు= ఆవులను దానంచేయుటం, భూములనుదానంచేయుట; బంగారాన్ని దానంచేయటం; ఆదిగాన్= మొదలుగా; పెక్కు; దానంబులు; చేసి; యజ్ఞ+అర్థంబుగాన్= యజ్ఞంకొరకు; భూసుర+ఉత్తములకున్= బ్రాహ్మణోత్తములకు; గోసహస్రంబులు= వేలకొద్దిఆవులు; ఇచ్చి= దానమొసగి; ప్రాక్+దేశంబులకున్= తూర్పుదేశానికి; అరిగి= వెళ్ళి, నైమిశ+అరణ్యంబునందున్= నైమిశారణ్యంలో; జగన్నాథు నారాయణున్= లోకప్రభువైన నారాయణుని; ఆరాధించి= పూజించి; ఉత్పలినియున్= ఉత్పలిని; కౌశికియున్= కౌశికిని; నందయున్= నందను; అపరనందయున్= అపరనందను; గయయున్= గయను; గంగయున్= గంగను; గంగాసాగరసంగమంబును= గంగానది సముద్రంలో కలిసేచోటును; చూచుచున్= చూస్తూ.

తాత్పర్యం: ఆ హిరణ్యబిందుతీర్థంలో గోదాన, భూదాన, సువర్ణదానాది అనేకదానాలు చేసి, యజ్ఞంకొరకు బ్రాహ్మణోత్తములకు వేలాది ఆవులను ఇచ్చి, తూర్పుదేశానికి పోయి నైమిశారణ్యంలోని జగన్నాథుడిని ఆరాధించి ఉత్పలిని, కౌశిక, నంద, అపరనంద, గయ, గంగ, గంగాసాగరసంగమస్థలం మొదలైన ప్రదేశాలను చూస్తూ.

క. ఏలావనరమ్యము లగు । వేలావనములను బవనవిచలద్వీచీ
లాలితసముద్రవిద్రుమ । మాలాపులినస్థలముల మసలుచు లీలన్. 137

ప్రతిపదార్థం: ఏలా, వన, రమ్యములు+అగు= ఏలకితీగలతోటలచే అందములైన; వేలా, వనములను= సముద్రతీరపు అడవులలో; పవన, విచలత్+వీచీ, లాలిత, సముద్ర, విద్రుమ, మాలా, పులిన, స్థలముల= గాలిచే కదలుతున్న అలలచే ఊగించ బడిన సముద్రంయొక్క పగడపుచెట్ల వరుసలతో కూడిన ఇసుక తిన్నెలున్న ప్రదేశాలలో; లీలన్= విలాసంగా; మసలుచున్= తిరుగుతూ.

తాత్పర్యం: ఏలకితీగలతోటలలో అందంగా ఉన్న సముద్రతీరవనాలతో, గాలికి కదలే అలలు ఊగించే పగడపు చెట్లవరుసలతో కూడిన ఇసుకతిన్నెలున్నప్రదేశాలలో విలాసంగా తిరుగుతూ.

వ. కళింగవిషయంబు సొచ్చు నంతఁ దోడిబ్రాహ్మణులు కొందఱు కళింగద్వారంబునఁ గ్రమ్మఱి యుత్తర కురుదేశంబులకుం జనిన; నందుం గతిపయబ్రాహ్మణసహాయుం డయి పార్థుం డరిగి పూర్వసముద్రతీరంబునఁ బురుషోత్తమదేవరకు నమస్కరించి మహేంద్రపర్వతంబు చూచుచు. 138

ప్రతిపదార్థం: కళింగ, విషయంబు= కళింగదేశం; చొచ్చునంతన్= ప్రవేశించగానే; తోడి బ్రాహ్మణులు; కొందఱు= వెంటగల బ్రాహ్మణులు కొంతమంది; కళింగద్వారంబునన్= కళింగద్వారంలో; క్రమ్మఱి= మరలి;ఉత్తర, కురుదేశంబులకున్; చనినన్= వెళ్ళగా; అందున్= అక్కడి; కతిపయ, బ్రాహ్మణ, సహాయుండు+అయి= కొద్దిమంది బ్రాహ్మణుల సహాయం కలవాడై; పార్థుండు= అర్జునుడు; అరిగి= వెళ్ళి; పూర్వ, సముద్ర, తీరంబునన్= తూర్పుసముద్రతీరంలో; పురుషోత్తమదేవరకున్= జగన్నాథస్వామికి; నమస్కరించి; మహేంద్రపర్వతంబు, చూచుచున్= మహేంద్రపర్వతాన్ని చూస్తూ.

తాత్పర్యం: కళింగదేశంలో ప్రవేశించగానే అర్జునునివెంట వచ్చిన బ్రాహ్మణులలో కొందరు కళింగదేశ ద్వారం నుండి తిరిగి ఉత్తరకురుదేశాలకు వెళ్ళారు. మిగిలినవాళ్ళసాయంతో పార్థుడు తూర్పుసముద్రతీరంలో ఉన్న జగన్నాథస్వామిని సేవించి, మహేంద్రపర్వతం చూస్తూ.

సీ. దక్షిణగంగ నాఁ దద్దయు నొప్పిన । గోదావరియు, జగదాది యైన
భీమేశ్వరంబును, బెడఁగగుచున్న శ్రీ । పర్వతంబును జూచి, యుర్విలోన
ననఘు మై శిష్టాగ్రహారభూయిష్ఠ మై । ధరణీసురోత్తమాధ్వరవిధాన
పుణ్యసమృద్ధమై పొలుచు వేంగీదేశ । విభవంబుఁ జూచుచు విభుఁడు దక్షి

తే. ణాంబురాశితీరంబున కరిగి, దురిత । హారి యైన కావేరీమహాసముద్ర
సంగమంబున భూసురేశ్వరుల కభిమ । తార్థదానంబుఁ జేసి కృతార్థుఁ డగుచు. 139

ప్రతిపదార్థం: విభుఁడు= ప్రభువు - అర్జునుడు; దక్షిణగంగ; నాన్= అన్నట్లు; తద్దయున్= మిక్కిలి; ఒప్పిన= ప్రకాశించిన; గోదావరియు= గోదావరిని; జగత్+ఆది, ఐన= లోకానికి మొదలైన; భీమేశ్వరంబును= భీమేశ్వరాన్ని; బెడఁగు+అగుచున్+ఉన్న= మనోహరమైన; శ్రీపర్వతంబును= శ్రీశైలాన్ని; చూచి= కాంచి; ఉర్విలోనన్= భూమిలో; అనఘము+ఐ= పవిత్రమైన; శిష్ట+అగ్రహార, భూయిష్ఠము+ఐ= సదాచారసంపన్నులయొక్క అగ్రహారాలతో నిండినదై; ధరణీసుర+ఉత్తమ, అధ్వర, విధాన, పుణ్య, సమృద్ధము+ఐ= బ్రాహ్మణోత్తములయొక్క యజ్ఞకార్యాలచే కలిగే పుణ్యంతో నిండినదై; పొలుచు= ఒప్పు; వేంగిదేశ, విభవంబున్= వేంగిదేశంయొక్క వైభవాన్ని; చూచుచున్= చూస్తూ; దక్షిణ+అంబురాశి, తీరంబునకున్= దక్షిణ సముద్రతీరానికి; అరిగి= వెళ్ళి; దురిత, హారి+ ఐన= పాపాన్ని పోగొట్టేదైన; కావేరీ, మహాసముద్ర, సంగమంబునన్= కావేరీనది సముద్రంలో కలిసే చోట; భూసుర+ ఈశ్వరులకున్= బ్రాహ్మణశ్రేష్ఠులకు; అభిమత+అర్థ, దానంబున్+చేసి= కోరుకొన్నవాటిని దానం ఇచ్చి; కృత+అర్థుఁడు+అగుచున్= ధన్యుడై.

తాత్పర్యం: అర్జునుడు దక్షిణగంగ అని ప్రసిద్ధి పొందిన గోదావరీనదిని, లోకానికే మొదలు అనిపించుకొన్న భీమేశ్వరాన్ని, మనోహరమైన శ్రీశైలాన్ని చూచి, పవిత్రమై, శ్రోత్రియుల అగ్రహారాలకు నిలయమై, బ్రాహ్మణోత్తముల యజ్ఞకార్యాల పుణ్యఫలంతో నిండినదై వెలసి ఉన్న వేంగిదేశవైభవాన్ని చూస్తూ దక్షిణసముద్రతీరానికి వెళ్ళిపాపాలను పోగొట్టే కావేరీసముద్రసంగమంలో బ్రాహ్మణశ్రేష్ఠులకు ఇష్టమైన దానాలన్నీ ఇచ్చి, ధన్యుడయ్యాడు.

విశేషం: మనోహరమైన ఈ వేంగిదేశవర్ణనం స్వీయదేశాభిమానంతో నన్నయ తెలుగుభారతంలో చొప్పించిందే. ఇది అమూలకం. గోదావరిప్రశంసమాత్రం పి.పి.యస్.శాస్త్రిగారిప్రతిలో ఉన్నది.

అర్జునుండు చిత్రాంగదను వివాహంబగుట (సం.1-207-14)

వ. పదుమూఁడగు మాసంబున మణిపూరపురంబునకుంజని, యందున్న రాజుఁ జిత్రవాహనుం గని, వానిచేతం బూజితుం డయి, తత్పుత్త్రిఁ జిత్రాంగద యనుదాని వివాహంబుగా నపేక్షించిన, నయ్యర్జుననభిప్రాయం బాప్తులవలన నెఱింగి చిత్రవాహనుం డర్జునున కి ట్లనియె. 140

ప్రతిపదార్థం: పదుమూఁడు+అగు= పదమూడవనెలలో; మణిపూర, పురంబునకున్= మణిపూర నగరానికి; చని= వెళ్ళి; అందున్+ఉన్న, రాజున్= అక్కడ ఉన్న రాజును; చిత్రవాహనున్= చిత్రవాహనుణ్ణి; కని= చూచి; వానిచేతన్= ఆ రాజుచే; పూజితుండు+అయి= పూజింపబడినవాడై; తత్+పుత్రిన్= అతని కుమార్తెను; చిత్రాంగద, అను, దానిన్= చిత్రాంగద అను పేరుగల ఆమెను; వివాహంబు, కాన్= పెండ్లిచేసుకొనటానికి; అపేక్షించినన్= కోరగా; ఆ+అర్జును= ఆ అర్జునుని; అభిప్రాయంబు= అభిప్రాయాన్ని; ఆప్తులవలనన్= ఆప్తులమూలంగా; ఎఱింగి= తెలిసికొని; చిత్రవాహనుండు= చిత్రవాహనుడు; అర్జుననకున్= అర్జుననికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అర్జునుడు పదమూడవమాసంలో మణిపూరమనే నగరానికి వెళ్లాడు. ఆ దేశపురాజైన చిత్రవాహనుణ్ణి చూచాడు. అతనిగౌరవం పొందాడు. అతనికూతురైన చిత్రాంగదను ప్రేమించాడు. వివాహంచేసికొనాలని అనుకొన్నాడు. అతనిఅభిప్రాయాన్ని ఆప్తులవలన తెలిసికొన్న చిత్రవాహనుడు అర్జునునితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: అర్జునుని వ్రతం ద్వాదశ మాసాత్మకం-అంటే సంవత్సరం. ఇట "పదుమూడవమాసంబున" అనుటచే పంద్రెండుమాసాలు దాటాయికదా! వ్రతం ముగిసినా-అర్జునుడు ఇంకా పుణ్యతీర్థాటనం చేస్తూనే ఉన్నాడనుకోవాలి.

క. ధన్యుండ నైతి నీ కీ । కన్యక నీఁ గాంచి; యైనఁగలతెఱఁగు జగ
న్మాన్య! యెఱిఁగింపవలయు; న । నన్యమనస్కుండ వయి దయన్ విను మనఘా! 141

ప్రతిపదార్థం: జగత్+మాన్య= లోకంచే పూజింపబడేవాడా! నీకున్; ఈ, కన్యకన్= ఈ కన్నెను; ఈన్+కాంచి= ఈయగలిగి; ధన్యుండన్+ఐతిని= కృతార్థుణ్ణి అయ్యాను; ఐనన్= అయినప్పటికి; కల, తెఱఁగు= ఉన్నసంగతి; ఎఱిఁగింపవలయున్= తెలపాలి; అనఘా!= పాపరహితుడా! అనన్యమనస్కుఁడవు+అయి= మరొకదానిలో మనస్సు లేనివాడవై; దయన్= దయతో; వినుము.

తాత్పర్యం: అర్జునా! నీకు ఈ కన్యకను ఇవ్వగలిగి ధన్యుడనయ్యాను. అయినా ఉన్న సంగతి చెప్పాలి. పుణ్యాత్మా! సావధానంగా దయతో వినుము.

క. మా కులమునందుఁ దొల్లి ప్ర । భాకరుఁ డను రాజవరుఁ డపత్యము దనకున్
లేకున్న నుమేశ్వరునకుఁ । బ్రాకటముగ భక్తితోఁ దపం బొనరించెన్. 142

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; మా కులమునందు; ప్రభాకరుఁడు+అను; రాజ, వరుఁడు= రాజశ్రేష్ఠుడు; తనకున్; అపత్యము= సంతానం; లేకున్నన్= లేకపోగా; ప్రాకటముగన్= ప్రసిద్ధంగా; ఉమా+ఈశ్వరునకున్= ఉమాదేవి భర్తఅయిన పరమేశ్వరుడినిగూర్చి; భక్తితోన్= భక్తితో; తపంబు= తపస్సు; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: పూర్వం మా వంశంలో ప్రభాకరుడు అనే రాజశ్రేష్ఠుడు తనకు సంతానం లేకపోవటంవలన పరమేశ్వరుడినిగూర్చి భక్తితో తపస్సు చేశాడు.

వ. పరమేశ్వరుండును వానికిం గరుణించి నీకు నొక్కపుత్త్రుం డుద్భవించు; నీకులంబున వారికెల్ల సంతానం బిట్లయగు నని వరం బిచ్చిన; నది మొదలుగా మావంశంబునవారికెల్ల నొక్కొక్కపుత్త్రుండ కా జన్మించుచు వచ్చిన నిప్పడు నాకు నిక్కన్యక పుట్టె; నేను దీనిం బుత్త్రీకరణంబునం బెనిచితి. 143

ప్రతిపదార్థం: పరమ+ఈశ్వరుండును= పరమశివుడును; వానికిన్= ఆ ప్రభాకరునికి; (అతనిని); కరుణించి; నీకున్; ఒక పుత్త్రుండు; ఉద్భవించున్= పుట్టుతాడు; నీ, కులంబునవారికిన్+ఎల్లన్= నీ వంశంలోనివాళ్ళందరికీ; ఇట్లు+అ= ఈ విధంగానే; సంతానంబు= సంతతి; అగున్= కలుగుతుంది; అని, వరంబు= అని వరం; ఇచ్చినన్= ఈయగా; అదిమొదలు= నాడు మొదలుగా; మా, వంశంబునవారికిన్+ఎల్లన్= మా వంశలోనివాళ్లకు అందరికీ; ఒక్కొక్కపుత్త్రుండు+అ, కా= ఒక్కొక్కకొడుకే; జన్మించుచున్= పుట్టుతూ; వచ్చినన్= రాగా; ఇప్పుడు; నాకున్= నాకు; ఈ+కన్యక; పుట్టెన్= జన్మించింది; నేను; దీనిన్= ఈ కన్నెను; పుత్త్రీకరణంబునన్= పుత్త్రికగా; పెనిచితిన్= పెంచాను.

తాత్పర్యం: పరమేశ్వరుడు ఆ ప్రభాకరుడిని అనుగ్రహించి, 'నీ కొకకొడుకు పుడతాడు. నీ వంశంలోని వాళ్ళందరికీ ఇట్లాగే సంతానం కలుగుతుంది. (అంటే ఒక్కొక్కకొడుకుమాత్రమే పుట్టటం) అని వరమిచ్చాడు. అది మొదలుగా మా వంశంలోని వాళ్ళందరికీ ఒక్కొక్కకొడుకే జన్మిస్తూ వచ్చాడు. ఇప్పుడు నా కీ కన్యక పుట్టింది. నేను ఈ కన్యకను వంశం నిలిపే దానినిగా పెంచాను.

విశేషం: ఏ కుమారికి పుట్టిన పుత్రుడు తనకు పుత్రుడు కావాలని తండ్రి తలుస్తాడో ఆ కుమారికి పుత్రిక అనే సంజ్ఞ ఉన్నది. 'పుత్రీకరణంబునం' అనేదానికి. 'పుత్రాకారంబున' అనే పాఠాంతరం కూడా ఉన్నది. మొత్తం మీద చిత్రాంగద కుమారుడు (దౌహిత్రుడు) తన వంశకరుడు కావాలని చిత్రవాహనుని అభిమతం.

తే. ఇందుఁ బుట్టినసుతుఁడు మా కిందువంశ్య! । వంశవిస్తారకుండు గావలయు; నిదియ
యీలతాంగికి నుంకు; వి ట్లీఁగనోపు । దేని పెండిలి యగుమ యీయింతిఁ బ్రీతి. 144

ప్రతిపదార్థం: ఇందున్= ఈ చిత్రాంగదకు; పుట్టిన, సుతుఁడు= పుట్టిన కుమారుడు; మాకున్; ఇందువంశ్య= చంద్రవంశానికి చెందినవాడా! ఓ అర్జునా!; వంశ, విస్తారకుండు= వంశాన్ని వృద్ధి చేసేవాడు; కావలయున్= కావాలి; ఇదియ= ఇదే; ఈ, లతా+అంగికిన్= ఈ సుకుమారికి; ఉంకువ= శుల్కం; ఇట్లు; ఈఁగన్= ఇవ్వటానికి; ఓపుదు(వు)+ఏని= చాలుదువేని; ఈ, ఇంతిన్= ఈ కాంతను; ప్రీతిన్= ప్రేమతో; పెండిలి, అగుము+అ= పెండ్లాడుమా!

తాత్పర్యం: అర్జునా! ఈ చిత్రాంగదకు పుట్టినకుమారుడు మా వంశం నిలిపేవాడు కావాలి. ఇదే నీవు ఈ కన్యకు ఇవ్వవలసిన శుల్కం. ఇట్లా ఇవ్వగలిగితే ప్రేమతో ఆమెను పెళ్ళి చేసికొమ్ము.

వ. అనిన నర్జునుండు చిత్రవాహనువచనంబున కొడంబడి చిత్రాంగద వివాహం బై. 145

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; అర్జునుండు= అర్జునుడు; చిత్రవాహనువచనంబునకున్= చిత్రవాహను మాటకు; ఒడంబడి= సమ్మతించి; చిత్రాంగదన్; వివాహంబు+ఐ= పెండ్లాడినవాడై, పెండ్లి చేసికొని.

తాత్పర్యం: అని అనగా అర్జునుడు చిత్రవాహనునిమాటకు ఒప్పుకొని చిత్రాంగదను పెండ్లాడి.

ఉ. అంగజరాజ్యలక్ష్మి పొడవైనదియొక్కొ యనంగ నొప్పు చి
త్రాంగదయందుఁ బార్థుఁడు మహాప్రణయప్రవణాంతరంగుఁ డై
యంగజభోగసంగమున నమ్మణిపూరపురిన్ సమస్తలో
కాంగణరంగసంగతవిహారయశోంగదుఁ డుండె లీలతోన్. 146

ప్రతిపదార్థం: అంగజ, రాజ్యలక్ష్మి= మన్మథునియొక్క రాజ్యలక్ష్మి; పొడవు+ఐనది, ఒక్కొ= రూపుతాల్చిందా; అనంగన్= అనునట్లు; ఒప్పు= ప్రకాశించు; చిత్రాంగద; అందున్= చిత్రాంగదపై; సమస్త, లోక+అంగణ, రంగ, సంగత, విహార, యశోంగదుఁడు= అన్నిలోకాల ముంగిళ్ళు అనే రంగస్థలాలలో కూడుకొన్న విహారం కల కీర్తి అనెడి బాహుపురి (సందికడియం) గలవాడు - అంటే అన్నిలోకాలలో వ్యాపించిన కీర్తి కలవాడు; పార్థుఁడు= అర్జునుడు; మహా, ప్రణయ, ప్రవణ+అంతరంగుఁడు+ఐ= మిక్కిలి ప్రేమలో ఆసక్తి కల మనస్సు కలవాడై; అంగజ, భోగ, సంగమునన్= మన్మథభోగాలతో కూడి; లీలతోన్= విలాసంగా; ఆ+మణిపూర, పురిన్, ఉండెన్= ఆ మణిపూరనగరంలో ఉండినాడు.

తాత్పర్యం: మన్మథుని రాజ్యలక్ష్మి రూపు తాల్చిందా అన్నట్లు మహాసౌందర్యవతి అయిన చిత్రాంగద మీద తగులుకొన్న మనస్సుతో, మన్మథభోగాలనుభవిస్తూ, మహాకీర్తిమంతుడైన అర్జునుడు మణిపూరపురంలో విలాసంతో ఉన్నాడు.

విశేషం: అలం : ఉత్ప్రేక్ష. మన్మథరాజ్యలక్ష్మివంటి ఆ చిత్రాంగదమీద తనివి తీరక అలలు అలలుగా పెల్లుబికిన పార్థుని శృంగారభావం - ప్రాసస్థానంలోనే గాక పద్యమంతటా ప్రయోగించబడిన బిందుపూర్వక 'గ' కారంతో చక్కగా వ్యక్తం చేయబడింది. అక్షరరమ్యమైన నన్నయపద్యాలలో ఇది ఒకటి.

అర్జునుండు పంచతీర్థంబులం దప్సరసలను శాపవిముక్తుల నొనరించుట (సం.1-208-1)

వ. ఇట్లుండి యొక్కనాఁడు తపోధనబ్రాహ్మణసమేతుం డై తత్సమీపంబున సముద్రతీరతీర్థంబులు చూచుచుం జని సౌభద్రం బను తీర్థంబుఁ గని యందు స్నానంబు సేయ సమకట్టిన నర్జునుం జూచి యందుల మును లి ట్లనిరి. 147

ప్రతిపదార్థం: ఇట్లు+ఉండి; ఒకనాఁడు; తపస్+ధన, బ్రాహ్మణ, సమేతుండు+ఐ= తపస్సే ధనంగా కల బ్రాహ్మణులతో కూడుకొన్నవాడై; తత్+సమీపంబునన్= ఆ మణిపూరపురానికి దగ్గర; సముద్రతీర, తీర్థంబులు= సముద్రం ఒడ్డున గల తీర్థాలు; చూచుచున్= చూస్తూ; చని=వెళ్ళి; సౌభద్రంబు+అను= సౌభద్రం అను పేరుగల ; తీర్థంబున్= తీర్థాన్ని; కని= చూచి; అందున్= ఆ తీర్థంలో; స్నానంబుచేయన్= స్నానం చేయటానికి; సమకట్టినన్= పూనుకోగా; అర్జునున్= అర్జునుణ్ణి; చూచి= కనుగొని; అందులన్= అందున్న; మునులు= ఋషులు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ఈ విధంగా ఉన్న అర్జునుడు ఒకనాడు తపోధనులైన బ్రాహ్మణులతో కలిసి ఆ మణిపూరపురానికి దగ్గరగా ఉన్న సముద్రతీరతీర్థాలను చూస్తూ సౌభద్రతీర్థాన్ని దర్శించాడు. అందులో స్నానం చేయటానికి పూనుకోగా, అక్కడ ఉన్న మునులు అతనితో ఇట్లా అన్నారు.

తరలము.

ఇది సొరంగ నసాధ్య మెవ్వరి కిందువంశవరేణ్య! వి
న్మిదియ కా దివి యేనుతీర్థము లీసముద్రతటంబునన్
విదితముల్ దురితాపహంబులు వీని నెన్నఁడు నాడనో
డుదురు సన్మును లిందుఁ గోల్మొసళుల్ గొనున్ వడిఁ జొచ్చినన్. 148

ప్రతిపదార్థం: ఇందు, వంశ, వరేణ్యా= చంద్రవంశశ్రేష్ఠుడా!; ఓఅర్జునా!; ఇది= ఈ తీర్థం; చొరంగన్= ప్రవేశించటానికి; ఎవ్వరికిన్= ఎంతటివారికైనా; అసాధ్యము= వీలుకాదు; వినుము; ఇదియ, కాదు= ఇది ఒక్కటే కాదు; ఇవి, ఏను, తీర్థముల్= ఇవి అయిదు తీర్థాలు; సముద్ర, తటంబునన్= ఈ సముద్రతీరాన; విదితముల్= ప్రసిద్ధాలు; దురిత+అపహంబులు= పాపాన్ని పోగొట్టేవి; సత్+మునులు = మహామునులు; వీనిన్= వీటిలో; ఎన్నఁడున్= ఎప్పుడును; ఆడన్= స్నానమాడటానికి; ఓడుదురు= భయపడతారు; ఇందున్= ఈ నీటిలో; చొచ్చినన్= ప్రవేశిస్తే; వడిన్= వెంటనే; కోల్+మొసళుల్= పెద్ద మొసళ్ళు; కొనున్= పట్టుకొంటాయి.

తాత్పర్యం: చంద్రవంశశ్రేష్ఠా! ఓ అర్జునా! ఈ తీర్థాన్ని ప్రవేశించటం ఎవ్వరికీ సాధ్యం కాదు. వినుము. ఇదే కాదు. ఈ సముద్రతీరాన ప్రసిద్ధాలు, పాపహరాలు అయిన అయిదుతీర్థాలు ఉన్నాయి. మహామునులుకూడా వీటిలో స్నానం చేయటానికి భయపడతారు. దీనిలో ప్రవేశిస్తే వెంటనే పెద్దమొసళ్ళు పట్టుకొంటాయి.

విశేషం: వృత్తలక్షణానికి చూడు. ఆది. 1.21.విశేషం.

వ. 'సౌభద్ర పౌలోమ కారంధమ ప్రసన్న భారద్వాజంబు లను నామంబుల దక్షిణసముద్ర తీరంబునం బ్రసిద్ధంబు లయిన యిప్పంచతీర్థంబు లిప్పుడు నూతేండ్లంగోలె నుగ్రగ్రాహగృహీతంబు లయి దుర్జనగృహీతంబు లయిన

రాజులవిభవంబులుంబోలె సాధుజనవర్జితంబు లయి యుండు' ననిన విని విజయుం 'డశేషతీర్థసేవార్థి నయి వచ్చిన నాకు నీతీర్థంబు లాడకునికి పౌరుషంబు గా' దని యందు. 149

ప్రతిపదార్థం: సౌభద్ర, పౌలోమ, కారంధమ, ప్రసన్న, భరద్వాజంబులు, అను, నామంబులన్= సౌభద్రము, పౌలోమము, కారంధమము, ప్రసన్నము, భారద్వాజము లను పేర్లతో; దక్షిణ, సముద్రతీరంబునన్ = దక్షిణసముద్రపు ఒడ్డులో; ప్రసిద్ధంబులు+అయిన; ఈ+పంచ, తీర్థంబులు= ఈ అయిదు తీర్థాలు; ఇప్పుడు; నూతేండ్లన్+కోలెన్= నూరుసంవత్సరాల నుండి; ఉగ్ర, గ్రాహ, గృహీతంబులు+అయి= భయంకరాలైన మొసళ్ళచే గ్రహింపబడినవై; దుర్జన, గృహీతంబులు+అయిన= దుర్మార్గులచే గ్రహింపబడిన; రాజుల, విభవంబులున్+పోలెన్= రాజుల ఐశ్వర్యాలవలె; సాధుజన, వర్జితంబులు+అయి= మునీశ్వరులచేత విడువబడినవై; ఉండున్= ఉన్నాయి; అనినన్= అని అనగా; విని; విజయుండు= అర్జునుడు; అశేష, తీర్థసేవా+అర్థిన్+అయి= అన్ని తీర్థాలు సేవించాలన్న కోరిక కలవాడినై; వచ్చిన; నాకున్; ఈ, తీర్థంబులు; ఆడక+ఉనికి= స్నానమాడకుండటం; పౌరుషంబు; కాదు; అని; అందున్ = ఆ తీర్థాలలో;

తాత్పర్యం: 'సౌభద్ర, పౌలోమ, కారంధమ, ప్రసన్న, భారద్వాజంబు లనే పేర్లతో దక్షిణసముద్రతీరంలో ప్రసిద్ధా లైన ఈ అయిదు తీర్థాలను నూరేండ్లనుండి భయంకరాలైన మొసళ్ళు ఆక్రమించాయి. దుర్మార్గులవశం అయిన రాజుల ఐశ్వర్యాలవలె ఇవి మునీశ్వరులచేత విడువబడి ఉన్నాయి' - అనగా విని అర్జునుడు, 'అన్ని తీర్థాలు సేవించగోరిన నాకు ఈ తీర్థాలలో స్నానం చేయకుండా ఉండటం పౌరుషం కాదు' అని.

విశేషం: అలం: ఉపమ.

క. సాహసికుం డై నరుఁ డవ। గాహము సేయుటయు జలము గ్రక్కదల మహా
గ్రాహము బీభత్సు బృహ। ద్బాహుబలుం బట్టికొనియెఁ బఱతెంచి వడిన్. 150

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; సాహసికుండు+ఐ= సాహసంకలవాడై; అవగాహము= స్నానం; చేయుటయు; మహాగ్రాహము= పెద్దమొసలి; జలము= నీరు; కదల+కదల= మిక్కిలి కలత చెందగా; వడిన్= వేగంగా; పఱతెంచి= పరుగెత్తి వచ్చి; బృహత్+బాహుబలున్= గొప్పభుజంబలంకలవాడిని; బీభత్సున్= అర్జునుడిని; పట్టుకొనియెన్= పట్టుకొన్నది.

తాత్పర్యం: అర్జునుడు సాహసించి స్నానం చేయుటానికి నీటిలో మునుగగా; పెద్దమొసలి ఒకటి నీరంతా కలత చెందేటట్లు వేగంగా పరుగెత్తి వచ్చి అతడిని పట్టుకొన్నది.

ఆ. దాని నశ్రమమునఁ దజ్జలాశయము వె। ల్వడఁగ వైచె నరుఁడు బాహుశక్తి;
నదియుఁ దత్క్షణంబ యభినవ యౌవనో। ద్భాసమాన దివ్యభామ యయ్యె. 151

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; బాహుశక్తిన్= భుజబలంతో; దానిన్= ఆ మొసలిని; అశ్రమమునన్= సులువుగా; తత్+జల+ఆశయము= ఆ మడుగునుండి; వెల్వడఁగన్= బయటపడేటట్లు; వైచెన్= విసరివేశాడు; అదియున్= ఆ మొసలికూడా; తత్+క్షణంబు+అ= ఆ క్షణమే; అభినవ, యౌవన+ఉద్భాసమాన, దివ్యభామ= కొత్తయౌవనంతో ప్రకాశిస్తున్న దివ్యస్త్రీ; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: అర్జునుడు తన భుజబలంతో ఆ మొసలిని సులభంగా మడుగునుండి బయటపడేటట్లు విసిరాడు. అది వెంటనే నూత్నయౌవనంతో ప్రకాశించే దివ్యకాంత అయింది.

ఉ. ఆ లలితాంగిఁ జూచి నరుఁ డద్భుత మంది 'మృగాయతాక్షి! యి
ట్లేల జలేచరత్వమున నిజ్జలధిన్ వసియించి? తిప్పు డి
ట్లేల సురూప భామ వయి? తెందులదానవు నీవు?' నావుడున్
బాలిక పాండుపుత్త్రునకుఁ బార్థున కి ట్లనియెం బ్రియంబునన్. 152

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; ఆ, లలిత+అంగిన్= ఆ అందమైన శరీరం కలదానిని; చూచి, అద్భుతము+అంది= ఆశ్చర్యపడి; మృగ+ఆయత+అక్షి= లేడి కన్నులవంటి విశాలమైన కన్నులు కలదానా!; ఇట్లు, ఏల = ఈ విధంగా ఏల; జలేచరత్వమునన్= నీటిలో తిరిగే ప్రాణివి - మొసలివి కావటంవలన; ఈ+జలధిన్= ఈ మడుగులో; వసియించితి(వి)= ఉన్నావు; ఇప్పుడు= ఇపుడు; ఇట్లు; ఏల= ఎందుకు; సు, రూప, భామవు+అయితి(వి)= అందమైన కాంతవు అయ్యావు; నీవు, ఎందుల, దానవు= నీవు, ఎక్కడిదానవు; నావుడున్= అని అనగా; బాలిక= ఆ కాంత; పాండుపుత్త్రునకున్= పాండుకుమారునికి; పార్థునకున్= అర్జునునకు; ప్రియంబునన్= ప్రీతితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అందమైన ఆ కాంతను చూచి అర్జునుడు ఆశ్చర్యపడి 'నీ వేల మొసలివై ఈ విధంగా మడుగులో ఉన్నావు? ఇప్పుడు ఈ విధంగా ఎందుకు అందాలభామవయ్యావు? ఎక్కడి దానవు? అని అడుగగా ఆమె అర్జునునితో ఇట్లా అన్నది.

వ. 'ఏను వంద యను నప్సరసఁ, గుబేరుననుంగ; నాసఖులు సౌరభేయియు సమీచియు బుద్బుదయు లతయు ననువారలు నలువురు నాయట్ల యత్తీర్థంబులం దున్నవారలు; వారిని శాపవిముక్తలం జేసి రక్షింపు' మనిన దానికి నర్జునుం డి ట్లనియె. 153

ప్రతిపదార్థం: ఏను= నేను; వంద, అను= వంద అనే పేరుగల; అప్సరసన్= అప్సరసను; కుబేరు, అనుంగన్= కుబేరునియొక్క చెలిని; నా సఖులు= నా స్నేహితురాండ్రు; సౌరభేయియు; సమీచియు; బుద్బుదయు; లతయున్; అనువారలు= అనేవాళ్లు; నలువురు= నలుగురు; నాయట్ల= నావలెనే; ఆ తీర్థంబులందున్= ఆ తీర్థాలలో; ఉన్నవారలు= ఉన్నారు; వారిని= వాళ్లను; శాపవిముక్తలన్= శాపంనుండి తొలగచేసి; రక్షింపుము= కాపాడు; అనినన్= అనిఅనగా; దానికిన్= ఆ అప్సరసకు; అర్జునుండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నా పేరు వంద, కుబేరుని స్నేహితురాలిని. నా స్నేహితురాండ్రు సౌరభేయి, సమీచి, బుద్బుద, లత అనేవాళ్ళు నలుగురూ నావలె తీర్థాలలో ఉన్నారు. వాళ్ళనికూడా శాపవిముక్తులను చేసి రక్షింపుము' అని అనగా ఆమెతో అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: వంద అనేదానికి అనేకప్రతులలో నంద అనే పాఠాంతరం ఉన్నది. భాండార్కరు ప్రతి అథస్సూచికలో వర్షా; వర్చా, వృందా, వర్ధా, వందా, విందా, నందా అనేవిధంగా అనేక పాఠాలున్నాయి. మూలభారతం వావిళ్ళవారి తెలుగులిపి ప్రతిలో 'అహం చ సౌరభేయీచ, సమీచీ బుద్బుదా లతా' అని ఉన్నది.

క. 'వనజాక్షి! యేమికారణ । మున నుగ్రగ్రాహరూపములు దాల్చితి రీ?'
రని యడిగిన వేడుక నా । తని కది యి ట్లనుచుఁ జెప్పెఁ దద్విధమెల్లన్. 154

ప్రతిపదార్థం: వనజ+అక్షి!= పద్మాలవంటి కన్నులుకలదానా! ఈరు= మీరు; ఏమి, కారణమునన్= ఏకారణంచేత; ఉగ్ర, గ్రాహ, రూపములు= భయంకరాలైన మొసళ్ళ రూపాలు; తాల్చితిరి= ధరించారు; అని, అడిగినన్= అని అడుగగా; అది= ఆ అప్సరస; వేడుకన్= సంతోషంతో; అతనికిన్= అర్జునునికి; ఇట్లు+అనుచున్= ఈ విధంగా అంటూ; తత్+విధము+ఎల్లన్= ఆ విధమంతా చెప్పెన్.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కలదానా! ఏ కారణంవలన మీరు భయంకరాలైన ఈ మొసళ్ళరూపాలు తాల్చారు?' అని అడుగగా, ఆమె సంతోషంతో ఆ విధమంతా చెప్పింది.

వ. వినవయ్య! యే మేవురము నఖిలలోకపాలపురంబులు చూచుచు భూలోకంబునకు వచ్చి యొక్క వనంబునం దుగ్రతపంబు సేయుచున్నవాని నత్యంతశాంతు నేకాంతచారి నగ్నికల్పు నొక్కబ్రాహ్మణుం గని వానితపంబునకు విఘ్నంబు సేయ సమకట్టి. 155

ప్రతిపదార్థం: వినవయ్య!; ఏము= మేము; ఏవురము= అయిదుగురం; అఖిల, లోకపాల, పురంబులు= అందరు దిక్పాలకుల పట్టణాలు; చూచుచున్; భూలోకంబునకున్; వచ్చి; ఒక్క, వనంబునందున్= ఒక అడవిలో; ఉగ్ర, తపంబు= భయంకరమైన తపస్సు; చేయుచున్+ఉన్న= చేస్తూ ఉన్న; వానిన్= అతనిని; అత్యంత, శాంతున్= మిక్కిలిశాంతం కలవాడిని; ఏకాంతచారిన్= ఒంటరిగా ఉన్నవాడిని; అగ్నికల్పున్= అగ్నిదేవునితో సమానమైనవాడిని; ఒక్క, బ్రాహ్మణునిన్; కని= చూచి; వాని, తపంబునకున్; విఘ్నంబు, చేయన్= భంగం కలిగించటానికి; సమకట్టి= పూనుకొని.

తాత్పర్యం: మే మైదుగురం దిక్పాలకులందరిపట్టణాలు చూస్తూ, భూలోకానికి వచ్చాము. ఒక అడవిలో ఒంటరిగా కూర్చుండి భయంకరమైన తపస్సు చేస్తూ మిక్కిలిశాంతంగా, అగ్నిదేవునితో సమానంగా ఉన్న ఒక బ్రాహ్మణుడిని చూచి అతనితపస్సు చెడగొట్ట పూనుకొని.

విశేషం: ఆ బ్రాహ్మణుడు అత్యంతశాంతుడు, అగ్నికల్పుడు అని చెప్పటం పరస్పరవిరుద్ధంగా భాసించినా - కాని, అతడు సహజంగా అత్యంతశాంతుడనీ, ఆగ్రహిస్తే అగ్నితో సమానుడనీ ఇక్కడ గ్రహించాలి. అగ్నిహోత్రుడు పవిత్రతకు పెట్టింది పేరు కాబట్టి అగ్నికల్పుడనటంలో ఆ బ్రాహ్మణుని పవిత్రతకూడా వ్యక్తమవుతున్నది.

క. వేడుక నమ్ముని ముందటఁ । బాడితి మాడితిమి; పెక్కుపరిహాసంబుల్
రూఢిగఁ బలికితి; మెట్లుం । జూడఁడు మావలను; నీరసుం డన నుండెన్. 156

ప్రతిపదార్థం: వేడుకన్= వినోదంగా; ఆ+ముని, ముందటన్; పాడితిమి; ఆడితిమి; పెక్కు, పరిహాసంబుల్; రూఢిగన్=ప్రసిద్ధంగా; పలికితిమి; ఎట్లున్= ఏవిధంగానూ; మావలను= మావైపు; చూడడు; నీరసుండు+అనన్= అనురాగం లేనివాడు అన్నట్లు; ఉండెన్.

తాత్పర్యం: మేము వినోదంగా ఆ మునిముందట పాడాము. ఆడాము, అనేకపరిహాసాలు పలికాము. ఆయన ఏ విధంగా కూడా మా వైపు చూడక అనురాగం లేని వానివలె ఉన్నాడు.

క. ధృతిహీనులచిత్తము ల । ట్లతివలయం దేల తగులు నత్యంతదృఢ
వ్రతులమనంబులు వారల । మతులఁ దృణస్త్రైణములు సమంబుల కావే. 157

ప్రతిపదార్థం: ధృతి; హీనుల, చిత్తముల్+అట్ల= ధైర్యంలేని వాళ్ళ మనస్సులవలె; అత్యంత, దృఢవ్రతుల, మనంబులు= మిక్కిలి దృఢమైన నిష్ఠ కలవారి మనస్సులు; అతివల, అందున్= స్త్రీలలో; ఏల; తగులున్= తగుల్కొంటాయి; వారల, మతులన్= మిక్కిలి దృఢవ్రతులైనవారి మనస్సులలో; తృణ, స్త్రైణములు= గడ్డి, స్త్రీలసమూహం; సమంబులు+అ= సమానములే; కావె= కదా!

తాత్పర్యం: మనోనిగ్రహం కలవారిమనస్సులు, నిగ్రహం లేనివారి మనస్సులవలె స్త్రీల విషయంలో ఎందుకు తగులుకొంటాయి? నిగ్రహపరుల దృష్టిలో స్త్రీలు, గడ్డిపరకలు సమానములే కదా!

వ. ఏము రాగకారణవికారంబులు గావించిన నవి దనకుం గోపకారణంబు లయిన నతికుపితుం డయి బ్రాహ్మణుండు మమ్మేవురను మహాగ్రాహంబులుగా శపియించిన నమ్మునివరునకు ముకుళితహస్తుల మై యి ట్లంటిమి. 158

ప్రతిపదార్థం: ఏము= మేము; రాగ, కారణ, వికారంబు= అనురాగాన్ని కలిగించే పనులు; కావించినన్, అవి; తనకున్; కోప, కారణంబులు+అయినన్= కోపాన్ని కలిగించినవి కాగా; అతి, కుపితుండు+అయి= మిక్కిలికోపం కలవాడై; బ్రాహ్మణుండు; మమ్ము+ఏవురను= మా అయిదుగురిని; మహా, గ్రాహంబులు, కాన్= పెద్ద మొసళ్ళు అయ్యేటట్లు; శపియించినన్; ఆ+మునివరునకున్= ఆ మునిశ్రేష్ఠునికి; ముకుళిత, హస్తలము+ఐ = చేతులు జోడించినవాళ్ళమై - అంటే నమస్కరించి; ఇట్లు+అంటిమి.

తాత్పర్యం: మేము అనురాగాన్ని రేకెత్తించే చిలిపిచేష్టలు చేయగా - అవి, అతనికి కోపం తెప్పించాయి. ఆ బ్రాహ్మణుడు బాగా కోపించి మా అయిదుగురిని పెద్దమొసళ్ళు కండని శపించాడు. అప్పుడు మేము చేతులు జోడించి ఈ విధంగా అన్నాం.

చ. అలుగుదురయ్య విప్రులు ? మహాపురుషుల్ పరుషాపరాధముల్
దలిఁగెడువారు ధర్మువులు దప్పక సల్పెడువారు సత్యముల్
పలికెడువారు; వారల కపాయము డెందములం దలంచు మూ
ర్ఖులకు విధాతృచెయ్వున నగున్ దురితంబులు దుర్యశంబులున్. 159

ప్రతిపదార్థం: మహాపురుషులు= ఎంతోగొప్పవాళ్ళు; పరుష+అపరాధముల్= కఠినమైన మాటలను, తప్పులను; తలిఁగెడువారు= తొలగించేవాళ్ళు అంటే కఠినంగా మాట్లాడనివాళ్ళు, తప్పులను చేయనివాళ్ళు; ధర్మువులు= ధర్మాలను; తప్పక; సలిపెడువారు= ఆచరించేవాళ్ళు; సత్యముల్; పలికెడువారు; అయిన; విప్రులు= బ్రాహ్మణులు; అలుగుదురు+అయ్య= కోపపడతారా?; వారలకున్= అట్లాంటి బ్రాహ్మణులకు; అపాయము= హాని; డెందములన్= మనస్సులలో; తలంచు= ఆలోచనచేసే; మూర్ఖులకున్= బుద్ధి లేనివాళ్ళకు; విధాతృ, చెయ్వునన్= బ్రహ్మదేవునిచేష్టలవలన దురితంబులు= పాపాలు; దుర్+యశంబులున్= అపకీర్తులు-అంటే చెడ్డపేరు; అగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఎంతో గొప్పవాళ్ళు, కఠినంగా మాట్లాడనివాళ్ళు, తప్పులు చేయనివాళ్ళు, ధర్మంగా నడచుకొనేవాళ్ళు; సత్యాలు పలికేవాళ్ళు అయిన బ్రాహ్మణులు కోపించటం తగునా? అట్లాంటి బ్రాహ్మణులకు హాని తలపెట్టే మూర్ఖులు బ్రహ్మదేవునివలన పాపాలు, అపకీర్తులు పొందుతారు.

విశేషం: అలుగుదురయ్య విప్రులు అని ప్రారంభించి సంస్కృతభాషాసంప్రదాయానుసారంగా విశేష్యం తరువాత పెక్కు విశేషణాలను ప్రయోగించటం భావతీవ్రతను పెంచటానికి బాగా దోహదం చేసింది.

వ. 'కావున మాచేసిన యజ్ఞానంబు సహించి మాకు శాపమోక్షంబుఁ బ్రసాదింపు' మనిన నవ్విప్రుండును గరుణించి 'యెవ్వండేని మీచే గృహీతుం డయి మీయున్న జలాశయంబు మిమ్ము వెలువరించు నాతండ మీకు శాపమోక్షకారణుం డగు' ననిన. 160

ప్రతిపదార్థం: కావున; మా, చేసిన= మేముచేసిన; అజ్ఞానంబు = తెలివితక్కువతనాన్ని; సహించి= ఓర్చుకొని; మాకున్; శాప, మోక్షంబున్= శాపం తొలగటాన్ని; ప్రసాదింపుము= అనుగ్రహింపుము - ఇమ్ము; అనినన్= అని అనగా; ఆ+విప్రుండును= ఆ బ్రాహ్మణుడుకూడా; కరుణించి= దయతలచి; ఎవ్వండు+ఏని= ఎవడైతే; మీచేతన్; గృహీతుండు+అయి= పట్టుకొన బడినవాడై; మీ, ఉన్న= మీరున్న; జల+ఆశయంబు= మడుగునుండి; మిమ్మున్, వెలువరించున్= బయటకు వేయునో; ఆతండు+అ= అతడే; మీకున్; శాప, మోక్ష, కారణుండు= శాపాన్ని తొలగించటానికి కారణమైనవాడు; అగున్; అనినన్.

తాత్పర్యం: 'అందువలన మా తెలివితక్కువతనాన్ని సహించి మాకు శాప విమోచనాన్ని ప్రసాదించండి' అని అడుగగా, ఆ బ్రాహ్మణుడుకూడా దయతలచి, 'మీరు పట్టుకున్నపుడు ఎవడైతే మిమ్మల్ని మీ మడుగునుండి బయటకు పడవేస్తాడో వాడే మీ శాపవిమోచనానికి కారకుడు అవుతాడు' అనగా.

సీ. అట్టిమహాబాహుఁ డత్యంతబలుఁ డెవ్వఁ । డగునొక్కొ! యనుచు నే మరుగుదెంచు
వారము త్రైలోక్యవర్తి నంబుజభవ । ప్రభువు నారదుఁ గని భక్తితోడ
మ్రొక్కిన మమ్ము నమ్ముని చూచి 'యి ట్లేల । వగఁ బొంది కందినవార?' లనియు
నడిగి మావృత్తాంత మంతయు మాచేత । విని, 'విప్రునలుకయు విధికృతంబుఁ

ఆ. గ్రమ్మఱింప లావె! కావున దక్షిణ । జలధితీరమునఁ బ్రశస్త పంచ
తీర్థములకు నేఁగి ధృతి నందు నూతేఁడు । లుండుఁ డట్లు మీర లుండు నంత'. 161

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; మహా, బాహుఁడు= పెద్దచేతులు గలవాడు; అత్యంత, బలుఁడు= మిక్కిలిబలంకలవాడు; ఎవ్వఁడు+అగున్+ఒక్కొ= ఎవడై ఉన్నాడో; అనుచున్= అని అనుకొంటూ; ఏము= మేము; అరుగుదెంచువారము= వస్తున్నవాళ్ళము; త్రైలోక్యవర్తిన్= మూడులోకాలు తిరిగేవాడిని; అంబుజభవ, ప్రభవు= పద్మంనుండి జన్మించిన బ్రహ్మదేవుడికి పుట్టినవానిని; నారదున్= నారదమహర్షిని; కని= చూచి; భక్తితోడన్= భక్తితో; మ్రొక్కి= నమస్కరించి; మమ్మున్= మమ్ములను; ఆ+ముని= ఆ నారదుడు; చూచి; ఇట్లు; ఏల= ఎందుకు; వగన్= దుఃఖాన్ని; పొంది; కందినవారలు= నలుపెక్కినవారు; అనియున్= అనికూడా; అడిగి; మా వృత్తాంతము+అంతయు; మాచేతన్= మావల్ల; విని; విప్రు, అలుకయున్= బ్రాహ్మణునియొక్క కోపాన్ని; విధి, కృతంబున్= బ్రహ్మచేసిన పనిని; క్రమ్మఱింపన్= మరల్చటానికి; లావె= సాధ్యమా (కాదనిభావం); కావున; దక్షిణ, జలధి, తీరమునన్= దక్షిణసముద్రతీరంలో; ప్రశస్త, పంచ, తీర్థములకున్= ప్రసిద్ధిపొందిన అయిదు నీటిమడుగులకు; ఏఁగి= వెళ్ళి; ధృతిన్= ధైర్యంతో; అందున్= ఆ మడుగులలో; నూఱు+ఏఁడులు= వందసంవత్సరాలు; ఉండుఁడు= ఉండండి; అట్లు, మీరలు= ఆ విధంగా మీరు; ఉండు, అంతన్= ఉండగా.

తాత్పర్యం: అట్లాంటి (మాచేత పట్టుబడి మమ్మల్ని మడుగులనుండి బయట పడవేయగలిగిన) గొప్ప చేతులు కలవాడు; మిక్కిలి బలం కలవాడు; ఎవడా? అని అనుకొంటూ వస్తున్న మేము, ముల్లోకాలలో సంచరించే, బ్రహ్మపుత్రుడైన నారదుడిని చూచి, భక్తితో నమస్కరించాము. ఆ మహాముని మమ్మల్ని చూచి 'ఇట్లా ఎందుకు దుఃఖంతో నల్లబడ్డా'? రని అడిగాడు. మా వృత్తాంతమంతా చెప్పగా విని, 'బ్రాహ్మణులకోపం, బ్రహ్మదేవునిచేష్ట మరలింప సాధ్యం కాని' వని 'దక్షిణసముద్రతీరంలో ప్రసిద్ధికెక్కిన అయిదు మడుగులకు వెళ్ళి, వాటిలో ధైర్యంగా నూరుసంవత్సరాలు ఉండండి; అట్లా మీరు ఉండగా'.

క. 'జననుతుఁడు పాండుతనయుఁడు । ధనంజయుఁ డశేషతీర్థదర్శనకాంక్షం
జనుదెంచి మీకు దయ నమ్ముని చెప్పినయట్ల శాపమోక్షము సేయున్'. 162

ప్రతిపదార్థం: జన, నుతుఁడు= ప్రజలచే కొనియాడబడేవాడు; పాండు, తనయుఁడు= పాండురాజుకుమారుడు; ధనంజయుఁడు= అర్జునుడు; అశేష, తీర్థ, దర్శన కాంక్షన్= అన్ని పుణ్యతీర్థాలను చూడాలనే కోరికతో; చనుదెంచి= వచ్చి; ఆ+ముని; చెప్పిన, అట్ల= చెప్పినట్లే; దయన్= దయతో; మీకున్, శాప, మోక్షము= మీకు శాపాన్ని తొలగించటం; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: ప్రజల ప్రశంసలందుకొన్నవాడు, పాండురాజుకుమారుడు అయిన అర్జునుడు అన్ని పుణ్యతీర్థాలను చూడాలన్న కోరికతో వస్తాడు. ఆ ముని చెప్పినట్లే దయతో మీకు శాపవిమోచనాన్ని కలిగిస్తాడు.

వ. 'అనిన నన్నారదువచనంబులు విని వచ్చి మహోగ్రగ్రాహముల మై భవదాగమనంబు ప్రతీక్షించుచు నిప్పంచతీర్థంబుల నుండి నేఁడు నీకారణంబునం గృతార్థుల మయితి' మనిన నర్జునుండును గరుణాయత్తచిత్తుం డయి వంద చెప్పినయన్నలువురకు శాపమోక్షణంబు సేసిన, నమరకన్యక లతిహర్షంబున నమరేంద్రనందను దీవించి దేవలోకంబున కరిగి; రదిమొదలుగా నిప్పంచతీర్థంబులు నారీతీర్థంబులు నాఁ బరగె; నర్జునుండును గ్రమ్మఱి మణిపూరపురంబునకు వచ్చి రాజ్యలీల సుఖంబుండి చిత్రాంగదయందు బభ్రువాహనుం డను పుత్త్రుం బడసి చిత్రవాహనునకు వంశకరుంగా నిచ్చి, వాని వీడ్కొని గోకర్ణంబుఁ జూచుచుఁ బశ్చిమసముద్రపార్శ్వంబునఁ బ్రభాసం బను తీర్థంబునకుఁ జని, యందులకు ద్వారవతి పురంబు కుఱంగలి యని విని. 163

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; ఆ+నారదు, వచనంబులు= ఆ నారదుని మాటలు; విని; వచ్చి; మహా+ఉగ్ర, గ్రాహములము+ఐ= మిక్కిలి భయంకరమైన మొసళ్ళమై; భవత్+ఆగమనంబు= మీయొక్క రాకను; ప్రతీక్షించుచున్= ఎదురుచూస్తూ; ఈ+ పంచ తీర్థంబులన్= ఈ అయిదు తీర్థాలలో; ఉండి; నేఁడు= ఈ దినం; నీ, కారణంబునన్= నీ వల్ల; కృత+అర్థులము= తీరిన కోరిక కలవాళ్ళం; అయితిమి; అనినన్= అని అనగా; అర్జునుండును; కరుణా+ఆయత్త, చిత్తుండు+అయి= దయతో కూడిన మనస్సు కలవాడై; వంద, చెప్పిన= వంద తెలిపిన; ఆ+నలువురకున్= ఆ నలుగురికి; శాప, మోక్షణంబు= శాపంనుండి విడిపించటాన్ని; చేసినన్= చేయగా; అమర, కన్యకలు= దేవకన్యకలు; అతి, హర్షంబునన్= మిక్కిలి సంతోషంతో; అమర+ఇంద్ర, నందనున్= దేవేంద్రుని కుమారుడైన అర్జునుడిని; దీవించి= ఆశీర్వదించి; దేవ లోకంబునకు= దేవలోకానికి; అరిగిరి= వెళ్ళారు; అదిమొదలుగాన్; ఈ+పంచతీర్థంబులు= ఈ ఐదు తీర్థాలు; నారీ, తీర్థంబులునాన్= నారీ తీర్థాలని; పరఁగెన్= ఒప్పిఉన్నాయి; అర్జునుండును; క్రమ్మఱి= తిరిగి; మణిపూర, పురంబునకున్ =

మణిపూర నగరానికి; వచ్చి, రాజ్యలీల, సుఖంబు+ఉండి= రాజ్యభోగాలతో సుఖంగా ఉండి; చిత్రాంగద, అందున్= చిత్రాంగదయందు; బభ్రువాహనుండు+అను; పుత్త్రున్= కుమారుని; పడసి= పొంది; చిత్రవాహనునకున్= చిత్రవాహనునికి; వంశకరున్+కాన్= వంశంనిలిపేవాడినిగా - అంటే వంశంవృద్ధి చేసేవాడినిగా; ఇచ్చి; వానిన్= ఆ చిత్రవాహనుడిని; వీడ్కొని; గోకర్ణంబున్= గోకర్ణతీర్థాన్ని; చూచుచున్, పశ్చిమ, సముద్ర, పార్శ్వంబునన్= పడమటి సముద్రం ప్రక్క; ప్రభాసంబు+అను, తీర్థంబునకున్= ప్రభాసం అనే పేరుగల తీర్థానికి; చని= వెళ్ళి; అందులకున్= అక్కడికి; ద్వారవతి, పురంబు= ద్వారకా నగరం; కుఱంగలి= దగ్గర; అని; విని.

తాత్పర్యం: 'అని చెప్పిన ఆ నారదునిమాలు విని వచ్చి, మిక్కిలి భయంకరమైన మొసళ్ళమై, మీ రాకకోసం ఎదురుచూస్తూ, నేడు నీవలన కోరిక తీరినవాళ్ళం అయ్యాము' - అని అనగా అర్జునుడుకూడా వంద అడిగినట్లు ఆ నలుగురికి దయతో శాపవిమోచనం కావించాడు. ఆ దేవకన్యలు ఎంతో సంతోషించి, దేవేంద్రతనయుడైన అర్జునుడిని ఆశీర్వదించి దేవలోకానికి వెళ్ళారు. ఆనాటినుండి ఆ పంచతీర్థాలకు నారీతీర్థాలనే పేరు కలిగింది. అర్జునుడుకూడా మణిపూరపురానికి తిరిగి వచ్చి రాజ్యభోగాలనుభవిస్తూ చిత్రాంగదయందు బభ్రువాహనుడనే కుమారుడిని పొంది, ఆ బాలుడిని చిత్రవాహనునికి వంశకరునిగా - అంటే వంశం నిలిపేవాడిగా ఇచ్చి, అక్కడి నుండి బయలుదేరి గోకర్ణతీర్థాన్ని చూస్తూ, పడమటిసముద్రంప్రక్కన ప్రభాసతీర్థానికి వెళ్ళి, అక్కడికి ద్వారవతి దగ్గర, అని విని.

విశేషం: చిత్రవాహనుడు కోరినట్లు (చూడు.144. పద్యం) చిత్రాంగదకు పుట్టిన బభ్రువాహనుడిని (దౌహిత్రుడిని) వంశకరునిగా అర్జునుడు అతనికి ఇవ్వటం జరిగింది.

సీ. 'అందుల కేఁగి యే నిందీవరశ్యాము । నరవిందనాభు నంబురుహనేత్రు
సన్మిత్రుఁ జూచి నాజన్మంబు సఫలంబు । సేయుదు నఘములు వాయుపొంటె;
నదియునుంగాక, మున్ గదుఁ డనువానిచే । వింటిఁ దిలోత్తమకంటె రూప
వతియట్టె సద్గుణాన్వితయట్టె నా కట్టి । భద్రేభగమన సుభద్రఁ జూచు

ఆ. వేడుకయును గలదు; విష్ణుభట్టారకు । దయ నభీష్టసిద్ధి దనరు' ననుచుఁ
దద్ద సంతసిల్లి తద్ద్వారకాపురి । కరుగ నిశ్చయించె నర్జునుండు. 164

ప్రతిపదార్థం: అందులకున్= ఆ ద్వారవతికి; ఏఁగి= వెళ్ళి; ఏన్=నేను; ఇందీవర, శ్యామున్= నల్లకలువవంటి నల్లనిరంగు కలవాడిని; అరవింద, నాభున్= పద్మాన్ని బొడ్డుగా కలవాడిని; అంబురుహ, నేత్రున్= పద్మాలవంటి కన్నులు కలవాడిని; సత్+మిత్రున్= మంచిస్నేహితుడిని; చూచి, నా, జన్మంబు; సఫలంబు; చేయుచున్; అఘములు= పాపాలు; పాయుపొంటెన్= పోగొట్టుకోవటం కొరకు; అదియునున్+కాక= అదీకాక; మున్= పూర్వం; గదుఁడు+అనువానిచే; వింటిన్; (సుభద్ర) తిలోత్తమకంటెన్; రూపవతి; అటె= అందమైనదట; సద్గుణ+అన్విత, అట్టె= మంచిగుణాలతో కూడుకొన్నదట; నాకున్; అట్టి; భద్ర+ఇభ, గమన= మదపుటేనుగువంటి నడకకలదైన - అంటే అందమైన నడకగల; సుభద్రన్; చూచు; వేడుకయును= కుతూహలంకూడా; కలదు; విష్ణుభట్టారకు, దయన్= శ్రీకృష్ణునియొక్క దయచేత; అభీష్ట, సిద్ధి= కోరిక నెరవేరటం; తనరున్= ఒప్పును (కలుగుతుంది); అనుచున్= అంటూ; తద్ద= మిక్కిలి; సంతసిల్లి; అర్జునుండు; తత్; ద్వారకాపురికిన్= ఆ ద్వారకానగరానికి; అరుగన్= వెళ్ళటానికి; నిశ్చయించెన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అక్కడికి వెళ్ళి నల్లకలువవంటి నల్లనిశరీరం కలవాడు, పద్మాన్ని బొడ్డుగా కలవాడు; పద్మంవంటి కన్నులు కలవాడు; నాకు మంచి స్నేహితుడు అయిన శ్రీకృష్ణుడిని చూచి, జన్మ సఫలత పొందేటట్లు, పాపాలు పోగొట్టుకొంటాననీ - ఇదివరకు గదుడు అనేవాడు చెప్పగా తిలోత్తమకంటె రూపవతి, సుగుణాలరాశి అని విన్న ఆ అందమైన నడక గల సుభద్రను చూచేవేడుక కూడ కలదనీ- శ్రీకృష్ణునిదయతో తనకోరికకూడా (సుభద్రను చేపట్టాలన్న కోరిక) నెరవేరుతుందనీ - ఎంతో సంతోషించి అర్జునుడు ఆ ద్వారకానగరానికి వెళ్ళాలని నిశ్చయించాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. మఱియు నప్పురంబునం ద న్నొరు లెఱుంగకుండ వలయు ననియు, యాదవులు యతుల కతిభక్తు లనియును మనంబునం దలంచి కృతకయతివేషధరుం డయి. 165

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఆ+పురంబునన్= ఆ ద్వారవతీనగరంలో; తన్ను= తనను; ఒరులు= ఇతరులు; ఎఱుంగకుండవలయున్= తెలియకుండా ఉండాలి; అనియున్= అని; యాదవులు; యతులకున్= సన్న్యాసకులకు; అతిభక్తులు= మిక్కిలి భక్తులని; అనియును; మనంబునన్= మనస్సులో; తలంచి= అనుకొని; కృతక, యతి, వేష, ధరుండు+అయి= కపట సన్న్యాసివేషాన్ని ధరించినవాడై.

తాత్పర్యం: అంతేకాక ఆ ద్వారవతీనగరంలో తన్ను ఇతరులు తెలిసికొనకుండా ఉండాలని, యాదవులు సన్న్యాసులపట్ల మిక్కిలి భక్తి గలవాళ్ళని - ఆలోచించి, కపటసన్న్యాసి వేషాన్ని ధరించి.

విశేషం: ఇంతవరకు అర్జునుడు వ్రతయాత్రా సముచిత వేషంతోనే ఉన్నాడు. ఇప్పుడు మాత్రమే కృతక యతివేషధరు డయ్యాడు.

క. పరమబ్రహ్మణ్యు జగద్గురు । గరుడధ్వజు ననంతగుణు నేకాగ్ర
స్థిరమతి యై నిజహృదయాం । తరసుస్థితుఁ జేసి భక్తిఁ దలఁచుచు నుండెన్. 166

ప్రతిపదార్థం: పరమబ్రహ్మణ్యున్= మిక్కిలిగా బ్రాహ్మణులమేలు కోరేవాడిని; జగత్+గురున్= లోకానికంతకూ గురుడైన వాడిని; గరుడ, ధ్వజున్= గరుత్మంతుడిని రథకేతనంగా కలవాడిని; అనంత, గుణున్= అంతులేని సుగుణాలు కలవాడిని; ఏక+అగ్ర, స్థిరమతి+ఐ= ఒకదానిపైనే స్థిరమైన బుద్ధికలవాడై; నిజ, హృదయ+అంతర, సుస్థితున్+చేసి= తన మనస్సులో చక్కగా ఉన్నవాడిని చేసి; భక్తిన్= భక్తితో; తలఁచుచున్, ఉండెన్ = భావిస్తూ (ధ్యానిస్తూ) ఉండినాడు.

తాత్పర్యం: మిక్కిలిగా బ్రాహ్మణులమేలుకోరేవాడు, లోకానికంతకూ గురుడైనవాడు, గరుత్మంతుని ధ్వజంగా కలవాడు, అంతులేని సుగుణాలు కలవాడు అయిన శ్రీకృష్ణుడిని ఏకాగ్రచిత్తుడై మనస్సులో నిలిపి భక్తితో ధ్యానించాడు.

క. నరు నునికి యెఱిఁగి కృష్ణుడు । తిరముగ దయతోఁ బ్రభాసతీర్థమునకు నొ
క్కరుఁడ చనుదెంచె; సర్వే । శ్వరుఁ డెప్పుడు భక్తులకుఁ బ్రసన్నుఁడ కాఁడే. 167

ప్రతిపదార్థం: నరు, ఉనికి= అర్జునుడు ఉండటాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; కృష్ణుఁడు; తిరముగన్= స్థిరంగా; దయతోన్= అనుగ్రహంతో; ఒక్కరుఁడు+అ= ఒక్కడే; ప్రభాసతీర్థమునకున్; చనుదెంచెన్= వచ్చాడు; సర్వ+ఈశ్వరుఁడు= సర్వమునకు ప్రభువైన భగవంతుడు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; భక్తులకున్; ప్రసన్నుఁడు+అ, కాఁడే= అనుగ్రహించేవాడే కదా!

తాత్పర్యం: అర్జునుడున్నాడని తెలిసికొని దయతో శ్రీకృష్ణుడు తానొక్కడే ప్రభాసతీర్థానికి వచ్చాడు. భగవంతుడు ఎల్లప్పుడు భక్తులకు ప్రసన్నుడే గదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

అర్జునుండు ద్వారకానగరంబునకుఁ జనుట (సం. 1-210-4)

వ. ఇట్లు దనకడకు వచ్చిన యాదిదేవునకు దేవకీనందనునకు నతిసంభ్రమంబున నమస్కరించి పురందరనందనుం
డానందజలభరితనయనుం డయి యి ట్లనియె. 168

ప్రతిపదార్థం: ఇట్లు; తన, కడకున్= తన దగ్గరకు; వచ్చిన= విచ్చేసిన; ఆదిదేవునకున్= శ్రీమహావిష్ణువుకు; దేవకీ, నందనునకున్= దేవకీదేవియొక్క కుమారునికి, శ్రీకృష్ణునికి; అతి, సంభ్రమంబునన్= మిక్కిలి వేగిరపాటుతో; నమస్కరించి; పురందర, నందనుండు= దేవేంద్రునికుమారుడు - అర్జునుడు; ఆనంద, జల, భరిత, నయనుండు+అయి= ఆనందబాష్పాలతో నిండిన కన్నులు కలవాడై; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా తన దగ్గరకు వచ్చిన మహావిష్ణువు, దేవకీదేవి తనయుడు అయిన శ్రీకృష్ణునికి ఎంతో వేగిరపాటుతో నమస్కరించి అర్జునుడు ఆనందబాష్పాలు నిండిన కన్నులతో ఇట్లా అన్నాడు.

ఉ. ద్వాదశమాసికవ్రతము ధర్మవిధిం జలుపంగ నేఁగి గం
గాదిమహానదీహిమవదాదిమహాగిరిదర్శనంబు మీ
పాదపయోజదర్శనముఁ బన్నుగఁ జేయుటఁ జేసి పూర్వసం
పాదిత సర్వపాపములుఁ బాసె భృశంబుగ నాకు నచ్యుతా! 169

ప్రతిపదార్థం: అచ్యుతా= శ్రీకృష్ణా!; ద్వాదశ, మాసిక, వ్రతము= పండ్రెండునెలల వ్రతము; ధర్మ, విధిన్= ధర్మపద్ధతిగా; చలుపంగన్= చేయటానికి; ఏఁగి= వెళ్ళి; గంగా+ఆది; మహా, నదీ, హిమవత్+ఆది, మహా, గిరి, దర్శనంబు= గంగ మొదలైన మహానదులయొక్క, హిమాలయం మొదలైన మహాపర్వతాలయొక్క దర్శనం; మీ, పాద, పయోజ, దర్శనమున్= మీ పాదపద్మాలయొక్క దర్శనాన్ని; పన్నుగన్= క్రమంగా; చేయుటన్+చేసి= చేయటంవలన; నాకు= నాకు; పూర్వ; సంపాదిత,సర్వ, పాపములు= ఇదివరకు సంపాదించుకొన్న అన్నిపాపాలు; భృశంబుగన్= అధికంగా - అంటే పూర్తిగా; పాసెన్= తొలగిపోయాయి.

తాత్పర్యం: శ్రీకృష్ణా! ద్వాదశమాసికవ్రతాన్ని ధర్మపద్ధతిగా ఆచరించటంకోసం వెళ్ళి, గంగ మొదలైన మహానదుల దర్శనం, హిమాలయం మొదలైన మహాపర్వతాల దర్శనం, మీ పదపద్మాల దర్శనం చేయటం వలన నాకు పూర్వ పాపాలన్నీ పూర్తిగా తొలగిపోయాయి.

విశేషం: 'ద్వాదశమాసికవ్రతము'ను గురించి పళ్ళె పూర్ణప్రజ్ఞాచార్యులు ఈ విధంగా వివరించారు. "సంస్కృతభారతము, శ్లో॥ ద్రౌపద్యా వ స్సమాసీన మన్యోన్యం యోఽభిదర్శయేత్, సనోద్వాదశవర్షాణి బ్రహ్మచారీ వనే వసేత్॥" - ఈ విధముగా పండ్రెండేళ్ళు వ్రతము సలుపవలెనని యుండఁగా నన్నయభట్టారకుఁడు 'ద్వాదశమాసికవ్రతము' అని సంవత్సరపదమునకు మాసమని అర్థము చెప్పుట మీమాంసాద్యనుసారముగా నని యెఱుంగునది. మీమాంసశాస్త్రమందు సహస్రసంవత్సరవ్రతము మనుష్యులకెట్లు సాధ్యమగునని విచారించి యొకపక్షంబున సంవత్సరశబ్దము మాసపర్యాయమని చెప్పఁబడినది. దానికి

శ్రుతిప్రమాణముకలదు - 'యో మాస స్సంవత్సరః' (శ్రీమదాంధ్రమహాభారతము ఆదిపర్వము లఘుటీక) ద్వాదశమాసికవ్రతం ప్రాయశ్చిత్తరూపమైన వ్రతం. సకల తీర్థ స్నానాలవలన పూర్వం చేసిన పాపాలు తొలగిపోతాయని సామాన్యులైన తైర్థికుల అభిప్రాయం. కాని, అర్జునుడు నారాయణభక్తుడు. గంగాస్నానం చేయటంవలననే కాక ఆ గంగ పుట్టినచోటైన నారాయణ పాదపద్మాలను దర్శించినప్పుడే పూర్వ (జన్మ) పాపాలన్నీ పోయి నిర్వాణం సిద్ధిస్తుందని అర్జునుని ప్రౌఢోక్తి. అందుకే చివరి క్షేత్రం ద్వారవతి కావటం విశేషం. ప్రౌఢోక్తిమూలమైన వస్తుధ్వని గమ్యమానం. అర్థవ్యక్తి అనే శబ్దగుణాన్ని ఈ రచనలో సార్థకంగా ప్రయోగించాడు నన్నయ.

వ. అనిన విని నగుచు నబ్జనాభుం డర్జును నతిస్నేహంబునం గౌఁగిలించుకొని యెల్లవారల కుశలంబును నడిగి, యాతని తీర్థాభిగమననిమిత్తంబును సుభద్రయందు బద్ధానురాగుం డగుటయు నుపలక్షించి, ద్వారకాపురంబునకుఁ దోడ్కొని యరిగి. 170

ప్రతిపదార్థం: అనినన్= అనిఅనగా; విని; నగుచున్= నవ్వుతూ; అబ్జనాభుండు= పద్మనాభుడైన శ్రీకృష్ణుడు; అర్జునున్; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రీతితో; కౌఁగిలించుకొని; ఎల్లవారల, కుశలంబును= అందరి క్షేమాన్ని; అడిగి; అతని; తీర్థ+అభిగమన; నిమిత్తంబును= తీర్థయాత్రలకు వెళ్ళటానికి కల కారణాన్ని; సుభద్ర, అందున్; బద్ధ+అనురాగుండు+ అగుటయున్= తగులుకొన్న ప్రేమ కలవాడు కావటమూ; ఉపలక్షించి= గమనించి; ద్వారకా, నగరంబునకున్; తోడ్కొని= తీసికొని; అరిగి= వెళ్ళి.

తాత్పర్యం: అర్జుననిమాటలు విని శ్రీకృష్ణుడు నవ్వుతూ అతడిని గాఢంగా కౌగిలించుకొని, ఇంద్రప్రస్థంలో అందరి కుశలం అడిగి, అతడు తీర్థయాత్రలు చేయటానికి గల కారణాన్నీ, సుభద్రపై అతనికున్న అనురాగాన్నీ తెలిసికొని ద్వారకానగరానికి పిలిచికొని వెళ్ళి.

విశేషం: ఆ జగన్నాటకసూత్రధారి శ్రీకృష్ణుని నవ్వులో, కౌగిలింతలో అర్జునుని రాకవలన, అతనిభక్తిస్నేహాలవలన కలిగిన ఆనందం ఉన్నది. సుభద్రను చేపట్టాలన్న అతని ఆంతర్యాన్నిగూర్చిన అవగాహనం ఉన్నది. అది సఫలం చేస్తానన్న సూచనకూడ ఉన్నది.

ఉ. భ్రాజితశాతకుంభగృహపంక్తులఁ బుష్పితవల్లివేల్లితో
ర్వీజవనావృతిన్ విమలవిద్రుమవజ్రవిచిత్రవేదికా
రాజిఁ గరంబు రమ్య మగు రైవతకాచలకందరంబునన్
రాజకులైకసుందరుఁ బురందరనందను నుంచి లీలతోన్. 171

ప్రతిపదార్థం: భ్రాజిత, శాతకుంభ, గృహ, పంక్తులన్= ప్రకాశిస్తున్న బంగారుమేడలసమూహాలచేతా; పుష్పిత, వల్లి, వేల్లిత+ఉర్వీజ, వన+ఆవృతిన్= పూసినతీగలచే చుట్టబడిన చెట్లు కల పెంపుడువనాలు చుట్టబడటంచేతను; విమల, విద్రుమ, వజ్ర, విచిత్ర, వేదికా, రాజిన్= నిర్మలాలైన పగడాలచేతా, వజ్రాలచేత, వింతయైన అరుగుల సమూహంచేతా; కరంబు= మిక్కిలి; రమ్యము+అగు= అందమైన; రైవతక+అచల, కందరంబునన్= రైవతకమనే పేరుకల పర్వతంయొక్క గుహలో; రాజ, కుల+ఏక, సుందరున్= రాజవంశానికంతటికీ అందగాడైన వాడిని; పురందర, నందనున్= దేవేంద్ర తనయుడిని - అర్జునుడిని; ఉంచి= ఉండునట్లు చేసి; లీలతోన్= విలాసంతో.

తాత్పర్యం: మెరుస్తున్న బంగారు మేడల సమూహాలు, పూసినతీగల పెనవేసికొన్న చెట్లతో కూడిన ఉద్యానవనాలు చుట్టూ ఉండగా నిర్మలాలైన పగడాలతో, వజ్రాలతో, చిత్రవిచిత్రాలైన అరుగులతో ఎంతో అందమైన రైవతకాద్రి గుహలో రాజవంశానికంతా అందగాడైన అర్జునుడిని ఉంచి - విలాసంతో.

విశేషం: ఇందులో శ్లేష అనే గుణం సందర్భోచితంగా పోషింపబడింది. రమణీయమైన అర్థఘటనతో కూడిన మసృణత్వం ఇందులో సార్థకం. రాజకులైకసుందరుడు - అన్నప్పుడు రాజంటే క్షత్రియుడు, రాజు, చంద్రుడనే అర్థాలు చెప్పుకొనవచ్చు. అంటే అర్జునుడు చంద్రునివంశంలో అందమైనవాడు, పైపెచ్చు పురందరనందనుడు. అతనియోగ్యతకు తగినస్థలం రైవతకాద్రి. బంగారుమేడలు, తోటలు, అరుగులు మొదలైనవి రాజభోగాల చిహ్నాలు. రమణీయసన్నివేశాన్ని అక్షరరమ్యంగా, బహుపదాలు ఏకపదవద్భావం పొందినట్లుగా చేసిన రచన శ్లేష. అది ఇందులో అనువుగా అందగించింది. (సంపా.)

క. **శ్రీపతి గడునెయ్యంబున। నాపోవక పార్థునొద్ద నారాత్రి ప్రియా**
లాపములఁ దగిలి యుండెను। దీపమణుల్ వెలుఁగ భువనదీపుఁడు దానున్. **172**

ప్రతిపదార్థం: భువనదీపుఁడు= లోకాలను వెలిగించేవాడు; తానున్= తానూ; శ్రీపతి= శ్రీకృష్ణుడు; కడున్= మిక్కిలి; నెయ్యంబునన్= స్నేహంచేత; ఆపు+ఓవక= తనివితీరక; పార్థు, ఒద్దన్= అర్జునునిదగ్గర; ఆ, రాత్రి; దీప, మణుల్= మణిదీపాలు; వెలుఁగన్; ప్రియ+ఆలాపములన్= ఇష్టమైన సంభాషణలతో; తగిలి; ఉండెను.

తాత్పర్యం: ఆ రాత్రి మణిదీపాలు వెలుగుతుండగా శ్రీకృష్ణుడు స్నేహాతిశయంతో తనివితీరక అర్జునునితో ఇష్టమైనసంభాషణలతో గడిపాడు.

వ. **ఇట్లు పరమపురుషు లయిన నరనారాయణులు దమ పూర్వజన్మ సహవాసంబున య ట్లప్పుడు పరమానందంబునఁ బరస్పరప్రియమధురసంభాషణంబుల నొక్కటనుండి యారాత్రి సలిపి; రంతఁ బ్రభాతంబ వాసుదేవుండు వాసవనందను నంద యుండం బంచి కాంచనరథారూఢుం డయి పురంబునకుం జని పౌరజనప్రధానసమక్షంబున రైవతకమహోత్సవంబు ఘోషింపం బంచిన.** **173**

ప్రతిపదార్థం: ఇట్లు; పరమపురుషులు+అయిన= మహాపురుషులైన; నర, నారాయణులు= అర్జునుడు, శ్రీకృష్ణుడు; పూర్వజన్మ, సహవాసంబునన్= తాము పూర్వజన్మలో కూడి ఉండటంవలన (బదరికాశ్రమంలో ఇద్దరూ తపస్సు చేశారు); అట్లు= అప్పుడు; పరమ+ఆనందంబునన్= మిక్కిలి సంతోషంతో; పరస్పర, ప్రియ, మధుర, సంభాషణంబులన్= ఒకరితో ఒకరు ఇంపైన తీయని మాటలతో; ఒక్కటన్+ఉండి= ఒకటిగా ఉండి; ఆ రాత్రి= ఆ దినం రాత్రి; సలిపిరి= గడిపారు; అంతన్= తరువాత; ప్రభాతంబు+అ= వేకువనే; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; వాసవ, నందనున్= దేవేంద్రతనయుడిని - అర్జునుడిని; అందు+అ= అక్కడే; ఉండన్; పంచి= ఉండుటకై నియోగించి; కాంచన; రథ+ఆరూఢుండు+అయి= బంగారురథాన్ని ఎక్కినవాడై; పురంబునకున్= ద్వారకానగరానికి; చని= వెళ్ళి; పౌరజన, ప్రధాన, సమక్షంబునన్= పురజనులయొక్క, మంత్రులయొక్క ఎదుట; రైవతక= రైవతకపర్వత సంబంధమైన; మహా+ఉత్సవంబు= గొప్పపండుగను; ఘోషింపన్= చాటటానికి; పంచినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఈ విధంగా పరమపురుషులైన అర్జునుడు; శ్రీకృష్ణుడు తాము పూర్వజన్మలో నరనారాయణులుగా బదరికాశ్రమంలో తపస్సు చేస్తూ సహవాసం చేశారు కనుక - మహానందంతో, పరస్పరం ఇంపైన తీయని మాటలతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ రాత్రి గడిపారు. వేకువనే శ్రీకృష్ణుడు అర్జునుడిని అక్కడే ఉండవలసిందని చెప్పి, తాను బంగారురథం ఎక్కి, ద్వారకాపురానికి వెళ్ళి, పురజనుల, మంత్రుల సమక్షంలో రైవతకమహోత్సవాన్ని చాటించటానికి ఆజ్ఞాపించాడు.

చ. పొలుపుగఁ బూసి కట్టి తొడి భూరివిభూతిప్రకాశితంబుగాఁ
గలయఁగఁ దత్పురీజనులు కాంస్యమృదంగముకుందవేణుకా
హలపటహధ్వనుల్ చెలఁగ నాటలుఁ బాటలు నొప్పె నెల్లవా
రలుఁ జని చేసి రర్చనలు రైవతకాద్రికి నుత్సవంబుతోన్. 174

ప్రతిపదార్థం: తత్+పురీ, జనులు= ఆ ద్వారకానగర ప్రజలు; ఎల్లవారలున్= అందరూ; పొలుపుగన్= అందంగా; పూసి= మైపూతలు పూసుకొని; కట్టి= వస్త్రాలు కట్టి; తొడి= సొమ్ములు ధరించి; భూరి, విభూతి= గొప్పసంపద; ప్రకాశితంబు, కాన్= ప్రకటమయ్యేటట్లుగా; కలయఁగన్= కూడగా; కాంస్య, మృదంగ, ముకుంద, వేణు, కాహళ, పటహ, ధ్వనుల్= కంచుతాళాల యొక్క, మృదంగాలయొక్క, ముకుంద వాద్య విశేషాలయొక్క, పిల్లన గ్రోవులయొక్క, కాహళవాద్యాలయొక్క, తప్పెటలుయొక్క; శబ్దాలు; చెలఁగన్= వ్యాపించగా; ఆటలున్, పాటలున్= ఆటలూ, పాటలూ; ఒప్పన్= తనరగా; రైవతక+అద్రికిన్= రైవతక పర్వతానికి; ఉత్సవంబుతోన్= పండుగగా (ఊరేగింపుగా) చని= వెళ్ళి; అర్చనలు=పూజలు; చేసిరి= చేశారు.

తాత్పర్యం: ఆ ద్వారకానగరప్రజలంతా - అందంగా, మైపూతలు పూసికొని, మంచివస్త్రాలు కట్టుకొని, సొమ్ములు అలంకరించుకొని ఐశ్వర్యమంతా ప్రకటమయ్యేటట్లు కలిసి బయలుదేరారు. వివిధ వాద్యాల ధ్వనులు చెలరేగగా -ఆటలతో, పాటలతో రైవతకాద్రికి ఊరేగింపుగా వెళ్ళి, అక్కడ పూజలు చేశారు.

విశేషం: అలం: స్వభావోక్తి. పృథక్పదత్వంతోకూడిన మాధుర్యగుణం జనుల హృదయోల్లాసాన్ని ధ్వనింపచేస్తున్నది.

చ. గురు కుచ యుగ్మముల్ గదలఁ గ్రొమ్ముడులందుల పుష్పముల్ పయిం
దొరఁగ నిదాఘబిందువితతుల్ చెదరన్ మదిరామదంబునన్
బరవశ లయ్యు నింపెసఁగఁ బాడుచుఁ దాళము గూడ మెట్టుచుం
దరుణియ లొప్ప నాడిరి ముదంబునఁ దమ్ము జనాలి మెచ్చఁగన్. 175

ప్రతిపదార్థం: తరుణియలు= యౌవనవతులు; జన+ఆలి= జనసమూహం; ముదంబునన్= సంతోషంతో; మెచ్చఁగన్= మెచ్చుకోగా; గురు, కుచ, యుగ్మముల్= పెద్దపాలిండ్లజంటలు; కదలన్= చలింపగా; క్రొత్త+ముడులందుల, పుష్పముల్= క్రొత్త ముడులలోని పూలు; పయిన్+తొరగన్= మీదికి జారగా; నిదాఘబిందు, వితతుల్= చెమట బిందువుల సమూహాలు; చెదరన్= చెదరగా; మదిరా మదంబునన్= మద్యం త్రాగటంవలన కలిగిన మదంచేత; పరవశలు+అయ్యున్= మైమరచినవాళ్ళయి కూడా; ఇంపు+ఎసఁగన్= ఆనందం అధికం అయ్యేటట్లు; పాడుచున్= పాడుతూ; తాళము కూడ, మెట్టుచున్= తాళానికి తగినట్లు అడుగులు వేస్తూ; ఒప్పన్, ఆడిరి= అందంగా నాట్యం చేశారు.

తాత్పర్యం: యౌవనంలో ఉన్న ఆడవాళ్ళు, జనసమూహం సంతోషంతో తమను చూచి మెచ్చగా - పెద్ద చన్నుల జంటలు కదలగా, క్రొత్తగా ముడిచిన కొప్పులలోని పూలు మీదికి జారగా, చెమటబిందువులు చెదరగా, మద్యపానమదంచేత మైమరిచినా, ఇంపార పాడుతూ, తాళానికి తగినట్లు అడుగులు వేస్తూ నాట్యం చేశారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: స్వభావోక్తి. రచనలో ఉదారత అనే గుణం పోషింపబడటంవలన ఈ పద్యం రసవత్తరంగా ఉన్నది. మదిరాపానంచేత పరవశులై ఉన్నా, కొప్పులూడేటట్లు, కుచాలు కదిలేటట్లు, చెమటబిందువులు చిందేటట్లు నాట్యంచేస్తున్నా తాళం తప్పకుండా ఆడుతూ, శ్రుతులు తప్పకుండా పాడుతున్న తరుణుల నాట్యం అగ్రామ్యత్వానికీ, నృత్యత్వదవద్భావానికీ (వికటత్వం) రూపుకట్టటంతో 'ఉదారత' రక్తికట్టింది. గ్రామ్యత్వం ప్రదర్శింపబడవలసినచోట మదిరాపానమత్తులైన యువతులు అగ్రామ్యత్వాన్ని సందర్భోచితంగా నాట్యంలో ప్రదర్శించే ఈ సన్నివేశవర్ణనం ఉదారతకు ఉత్తమోదాహరణం. (సంపా.)

సీ. **సారణ సత్య కాక్రూర విదూరథ। సాంబ సంకర్షణ శంబరారి**
భాను సుషే ణోగ్రసేన శైనే యాని। రుద్ధ హార్దిక్య గ దోద్ధవాది
యాదవు లధికప్రమోదు లై యొక్కటఁ। దరుణులుఁ దారును గరికరేణు
హయశిబికారూఢు లయి తదుత్సవమున। కరిగిరి; మఱి జగద్గురుఁడు గృష్ణుఁ

ఆ. **డింద్రలీలతో నుపేంద్రుండు రుక్మిణీ। దేవి మొదలుగాఁగ దేవు లెల్ల**
నొప్పతోడ రాఁగ నప్పర్వతమునకుఁ। జనియె సకలజనులుఁ దనకు నెరఁగ. **176**

ప్రతిపదార్థం: సారణ, సత్యక+అక్రూర, విదూరథ, సాంబ, సంకర్షణ, శంబర+అరి, భాను, సుషేణ, ఉగ్రసేన, శైనేయ, అనిరుద్ధ, హార్దిక్య, గద, ఉద్ధవ; ఆది= మొదలైన; యాదవులు= యదువంశీయులు; అధిక, ప్రమోదులు+ఐ= మిక్కిలి ఆనందించినవాళ్ళయి; ఒక్కటన్= ఒకటిగా; తరుణులు= భార్యలు; తారును= తామూ; కరి, కరేణు, హయ, శిబికా+ఆరూఢులు+అయి= ఏనుగులను, ఆడయేనుగులను; గుర్రాలను, పల్లకీలను ఎక్కినవాళ్ళయి; తత్+ఉత్సవమునకున్= ఆ రైవతకాద్రి మహోత్సవానికి; అరిగిరి= వెళ్ళారు; మఱి= అటుపై; జగత్+గురుఁడు= లోకానికంతటికి గురుడైనవాడు - కృష్ణుడు; ఇంద్ర, లీలతోన్= దేవేంద్రుని (వంటి) వైభవంతో; ఉపేంద్రుఁడు= శ్రీకృష్ణుడు; రుక్మిణీదేవి; మొదలుగాఁగ= మొదలైన; దేవులు+ఎల్లన్= భార్యలంతా; ఒప్పుతోడన్= అందంగా; రాఁగన్= వెంటరాగా; సకల, జనులు; తనకున్= శ్రీకృష్ణునికి; ఎరఁగన్= నమస్కరించగా; ఆ+పర్వతమునకున్= ఆ రైవతకపర్వతానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: సారణుడు, సత్యకుడు, అక్రూరుడు, ఉగ్రసేనుడు, గదుడు, ఉద్ధవుడు మొదలైన యాదవులంతా మహానందంగా భార్యలతో కూడి - ఏనుగులను, ఆడఏనుగులను, గుర్రాలను, పల్లకీలను అధిరోహించి ఆ ఉత్సవానికి వెళ్ళారు. జగద్గురుడైన శ్రీకృష్ణుడుకూడా రుక్మిణి మొదలైన భార్యలంతా వెంటరాగా, జనులంతా తనకు నమస్కరించగా దేవేంద్రవైభవంతో ఆ రైవతకాద్రికి వెళ్ళాడు.

వ. **ఇ ట్లరిగి జనార్దనుండు ధనంజయుం దలంచి, తత్సమీపగతుం డై తోడ్కొని, యాతనికి న ప్పర్వత రమణీయ ప్రదేశంబులం జూపుచు విహరించి, యిద్దఱు నొక్కవిమలమణివేదికయం దభిమతసంభాషణంబుల నుండు నంత.** **177**

ప్రతిపదార్థం: ఇట్లు+అరిగి= ఈ విధంగా వెళ్ళి; జనార్దనుండు= శ్రీకృష్ణుడు; ధనంజయున్= అర్జునుడిని; తలంచి= అనుకొని; తత్+సమీప, గతుండు+ఐ= అతనిదగ్గరకు వెళ్ళినవాడై; తోడ్కొని= అతనినివెంట తీసికొని; ఆతనికిన్= అర్జునునికి; ఆ+పర్వత, రమణీయ, ప్రదేశంబులన్= ఆ పర్వతమందలి అందమైన చోట్లను; చూపుచున్; విహరించి; ఇద్దఱున్; ఒక్క, విమల, మణి, వేదిక, అందున్= ఒక నిర్మలములైన మణులతో నిర్మించిన అరుగుమీద; అభిమత, సంభాషణములన్= ఇష్టములైన సంభాషణలలో; ఉండు, అంతన్= ఉండగా.

తాత్పర్యం: ఈ విధంగా వెళ్ళి శ్రీకృష్ణుడు అర్జునునిగూర్చి ఆలోచించి, అతనిదగ్గరకు వెళ్ళి, అతడిని వెంటబెట్టుకొని, ఆ పర్వతమందలి అందమైన ప్రదేశాలను చూపుతూ విహరించాడు. తరువాత ఇద్దరూ నిర్మల మణులతో నిర్మితమైన ఒక అరుగుమీద కూర్చుండి ఇష్టాగోష్ఠి సలుపుతుండగా.

చ. **క్వణదణుకింకిణీకలితకాంచనకాంచికలాపమున్ రణ**
న్మణికలనూపురంబులు సమధ్వని నొప్పఁగ భక్తిఁ బాదచా
రిణి యయి కన్యకాజనపరీత సుభద్ర తదద్రిపూజన
ప్రణతులు సేసె నింద్రసుతుఁ బార్థు నిజేశ్వరుఁగాఁ దలంచుచున్. **178**

ప్రతిపదార్థం: క్వణత్+అణు, కింకిణీ, కలిత, కాంచన, కాంచి, కలాపమున్= మ్రోయుచున్న చిరుగజ్జెలతో కూడిన బంగారు మొలనూళ్ళ సమూహాన్ని; రణత్+మణి, కల, నూపురంబులు= ధ్వనిస్తూ మణులచే మనోహరాలైన అందెలూ; సమ, ధ్వనిన్= సమాన ధ్వనిలో; ఒప్పఁగన్= ఒప్పుచుండగా; భక్తిన్= భక్తితో; పాదచారిణి, అయి= కాలినడకన వెళ్ళినదై; కన్యకా, జన, పరీత= పెళ్ళికాని ఆడపిల్లలతో చుట్టబడినదైన; సుభద్ర; ఇంద్రసుతున్= దేవేంద్రునియొక్క కుమారుడిని; పార్థున్= పృథ (కుంతీదేవి) పుత్త్రుడైన అర్జునుడిని; నిజ+ఈశ్వరున్+కాన్= తనభర్త అయ్యేటట్లు; తలంచుచున్= భావించుచూ; తద్+అద్రి, పూజన, ప్రణతులు= ఆ రైవతకపర్వతాన్ని పూజించటాన్ని, మ్రొక్కటాన్ని; చేసెన్= చేసింది.

తాత్పర్యం: మ్రోగుతున్న చిరుగజ్జెలతో కూడిన బంగారు మొలనూళ్ళ సమూహం, మణులచేత మనోహరాలై మ్రోగుతున్న అందెలు సమానధ్వనితో ఒప్పుతుండగా, కన్యకాజనం తనచుట్టు రాగా, సుభద్ర అర్జునుడిని భర్తగా తనమనస్సులో తలచి భక్తితో కాలినడకన తిరిగి, ఆ రైవతకాద్రికి పూజలూ, నమస్కారాలు చేసింది.

విశేషం: నన్నయ అక్షరరమ్యతకు ఈ పద్యం ఒక చక్కని ఉదాహరణం. అర్జునునిమనస్సును ఆకర్షించి, అతనిలోని అనురాగాన్ని పెంచిన సుభద్ర కాంచీ కలాప కింకిణీ ధ్వనులు, మణి నూపుర ధ్వనులు - పదాల కూర్పులో 'ణ'కార పునరావృత్తిలో చక్కగా ధ్వనిస్తున్నాయి. ఈ పద్యంలో సమాధి అనే గుణం సమగ్రంగా పోషింపబడింది. సుభద్ర తన మొలను గల గజ్జెలూ కాలిఅందెలూ సమంగా మ్రోగుతూ ఉండగా నడచివచ్చి అర్జునుడు తనకు భర్త కావాలని గాఢంగా భావిస్తూ (సమాధి) రైవతకాద్రిని పూజించి నమస్కరించింది. పద్యంకూడా సుభద్రవలెనే నడిచింది. మొదటి రెండుచరణాల్లో నాయిక నడకసొబగు, ఆ తరువాత ఆగి పూజించి నమస్కరించిన విశ్రాంతి సౌందర్యం పద్యగతిలో అవరోహక్రమంలో చిత్రించటం గమనార్హం. దానివలన నాయిక మనోభీష్టంలో (త్వరగా అర్జునుడు భర్తకావాలన్న తీవ్రమైన ఆకాంక్ష) అర్థదర్శనం కావటం గమనిస్తే నన్నయగారి సమాధిగుణపద్యరచనకు ఈ పద్యం సార్థకోదాహరణం. (సంపా.)

ఉ. **దాని సుభద్రఁగా నెఱిఁగి తత్క్షణజాతమనోజసంచల**
న్మానసుఁ డైన యవ్విజయు మానుగఁ జూచి 'మునీంద్ర! నీకుఁ జ
న్నే నలినాక్షులందు మది నిల్పఁగ' నంచును మందహాసగ
ర్భాననుఁ డై రథాంగధరుఁ డాతని కి ట్లనియెం బ్రియంబునన్. **179**

ప్రతిపదార్థం: దానిన్= ఆమెను; సుభద్రన్+కాన్, ఎఱిఁగి; తత్+క్షణ, జాత, మనోజ, సంచలత్+మానసుఁడు+ఐన= ఆ క్షణంలో పుట్టిన మన్మథునిచే చలింపబడిన మనస్సు కలవాడైన; ఆ+విజయున్= ఆ అర్జునుణ్ణి; మానుగన్= మనోహరంగా;

చూచి; ముని+ఇంద్ర= మునిశ్రేష్ఠా!; నలిన+అక్షుల+అందున్= పద్మాలవంటి కన్నులు కలవారైన స్త్రీలపై; మదిన్= మనస్సును; నిల్పఁగన్= నిలుపగా; నీకున్; చన్నే= తగునా; అంచును= అని అంటూ; రథ+అంగ, ధరుఁడు= చక్రాన్ని ధరించేవాడు - శ్రీకృష్ణుడు; మందహాస, గర్భ+ఆననుఁడు+ఐ= చిరునవ్వు నిండిన ముఖం కలవాడై; ఆతనికిన్= అర్జునునికి; ప్రియంబునన్= ప్రీతిగా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆమె సుభద్ర అని తెలిసికొని, ఆ క్షణమే పుట్టిన మన్మథునిచే చలింపచేయబడిన మనస్సు కలవాడైన ఆ విజయుడిని, శ్రీకృష్ణుడు మనోహరంగా చూచి, 'మునీంద్రా! స్త్రీలమీద మనసు నిలపటం నీకు తగునా?' అని చిరునవ్వు నిండినముఖంతో అతనితో ప్రియమార ఇలా అన్నాడు.

విశేషం: ఈసందర్భంలో శ్రీకృష్ణుని సరసపుచూపులో, మాటలో, చిరునవ్వులో ఎంతో ఆనందం ఉన్నది; కొంత కొంటెతనం కూడ ఉన్నది. మునివేషంలో ఉన్న అర్జునుడు సుభద్రను చూచినంతనే మన్మథావేశాన్ని ప్రదర్శించబోవటం సందర్భౌచిత్యం కాదు. పాత్రౌచిత్యంకూడా కాదు. పైపెచ్చు జగద్గురువైన శ్రీకృష్ణుడి సన్నిధానంలో ఆ విధంగా బైటపడటం అనుదాత్తం. దానిని తెలిసిన శ్రీకృష్ణుడు అర్జునుడిని పరుషంగా మందలించవలసిన తరుణమది.కాని, అతనిపై గల అపారమైన అనురాగంవలన నవ్వుతూ వ్యంగ్యంగా హెచ్చరించాడు. అంటే పరుషార్థప్రకటనం చేయవలసినచోట అపారుష్యాన్ని ప్రదర్శించాడన్నమాట. ఇదే సౌకుమార్యమనే గుణం. సౌకుమార్యం శ్రీకృష్ణుడివాక్కులో అజరరత్వంగా, ఆసక్తికరంగా అనుసంధింపబడింది. (సంపా.)

వ. 'నీవు సుభద్రయందు బద్ధానురాగుండ వగుట తొల్లియు నే నెఱుంగుదు; నోడకుండుము; నీ కోర్కి వసుదేవ దేవకీ దేవులకుం జెప్పి సఫలంబు సేయుదు' నని యర్జునునకు హృదయానందంబుగాఁబలికి, యప్పుడ వడిగల చారుల రావించి ద్వారవతియం దర్జునుం డున్న వాఁ డనుకుశలవార్త ధర్మజున కెఱింగింప నింద్రప్రస్థపురంబునకుం బుచ్చియున్నంత; నచ్చటికి వచ్చి బలదేవాదియాదవు లతిభక్తులై యతియకా వగచి యర్జునునకు నమస్కరించి యాతనివలన సర్వతీర్థంబులుఁ దత్సేవాఫలంబులును విని సంతసిల్లి, యి వ్వర్షాకాలంబు మాయంద యుండి చాతుర్మాస్యంబు సేసి మమ్ముం గృతార్థులం జేయుం డని ప్రార్థించి, పార్థుం దోడ్కొని చని, వానికి నన్నపానాది విధులం బరిచరింప సుభద్రం బంచి, కన్యాపురంబునందు నివాసంబు సేసిన. 180

ప్రతిపదార్థం: నీవు; సుభద్ర+అందున్= సుభద్రపై; బద్ధ+అనురాగుండవు= కట్టివేయబడిన ప్రేమకలవాడవు, సుభద్రను ప్రేమించినవాడవు; అగుట, తొల్లియున్= ఇదివరకుకూడా; నేను= నేను; ఎఱుంగుదున్= తెలుసుకున్నాను; ఓడక+ఉండుము= భయపడకుము; నీ, కోర్కి= నీ ఇష్టం; వసుదేవ, దేవకీదేవులకున్= వసుదేవునికి, దేవకీదేవికి; చెప్పి; సఫలంబు= ఫలించునట్లు; చేయుదున్+అని= చేస్తాను అని; అర్జునునకున్; హృదయ+ఆనందంబుకాన్= మనస్సుకు సంతోషం కలిగేటట్లుగా; పలికి= చెప్పి; అప్పుడు+అ= అప్పటికప్పుడే; వడిగల= వేగంగల; చారులన్= వేగులవారిని; రావించి= రప్పించి; ద్వారవతి, అందున్= ద్వారకావతి నగరంలో; అర్జునుండు; ఉన్నవాఁడు= ఉన్నాడు; అను, కుశలవార్త= అనే క్షేమవృత్తాంతం; ధర్మజునకున్; ఎఱిగింపన్= తెలపటానికి; ఇంద్రప్రస్థ పురంబునకున్; పుచ్చి= పంపి; ఉన్న+అంతన్= ఉండగా; బలదేవ+ఆది, యాదవులు= బలరాముడు మొదలైన యాదవులు; అచ్చటికిన్; వచ్చి; అతి భక్తులు+ఐ= మిక్కిలిభక్తికలవాళ్ళయి; యతి+అ+కా ముని అని; వగచి= తలచి; అర్జునునకున్; నమస్కరించి; అతనివలన; సర్వ, తీర్థంబులున్= అన్నిపుణ్యతీర్థాలు; తత్+సేవా, ఫలంబులును= వాటిని సేవించటంవలన కలిగే ఫలాలు; విని, సంతసిల్లి; ఈ+వర్షాకాలంబు; మా, అందు+అ, ఉండి= మాదగ్గరే ఉండి; చాతుర్మాస్యంబున్= యతులు నాలుగునెలలు చేసే వ్రతాన్ని; చేసి; మమ్మున్; కృత+అర్థులన్= నెరవేరిన కోరిక కలవాళ్ళనుగా; చేయుండు+అని= చేయండి అని; ప్రార్థించి; పార్థున్= అర్జునుని; తోడ్కొని= వెంటతీసికొని; చని=వెళ్ళి; వానికిన్= అతనికి;

అన్న, పాన+ఆది, విధులన్= అన్నం; పానం మొదలైనవాటి ఏర్పాట్లలో; పరిచరింపన్= సేవ చేయటానికి; సుభద్రన్; పంచి= నియమించి; కన్యా, పురంబు, అందున్= కన్యలయొక్క అంతఃపురంలో; నివాసంబు= ఉనికి; చేసినన్= ఏర్పాటుచేయగా.

తాత్పర్యం: 'నీకు సుభద్రమీద అనురాగం ఉన్నసంగతి నాకు ఇదివరకే తెలుసు. భయపడకుము. నీ కోర్కె వసుదేవునికి, దేవకీదేవికి చెప్పి సఫలం చేస్తాను' అని అర్జుననిమనస్సుకు ఆనందం కలిగేటట్లుగా పలికాడు. అప్పటి కప్పుడే వడి గల వేగులవాళ్ళను పిలిచి ద్వారవతిలో అర్జునుడు ఉన్నాడన్న కుశలవార్తను ధర్మరాజుకు తెలియజేయటానికి ఇంద్రప్రస్థపురానికి పంపాడు. కృష్ణుడు అక్కడ ఉండగానే బలరాముడు మొదలైన యాదవులంతా అక్కడి వచ్చారు. అతిభక్తులై అర్జునుడిని యతిగా భావించి, ఆయనకు నమస్కరించారు. ఆయనవలన పుణ్యతీర్థవిశేషాలు, వాటిని సేవించటంవలన కలిగే ఫలాలు విని సంతోషించి 'ఈ వర్షాకాలంలో ఇక్కడే ఉండి చాతుర్మాస్యవ్రతం జరిపి మమ్ములను కృతార్థులను చేయండి' అని ప్రార్థించి అర్జునుడిని తోడ్కొని వెళ్ళి, ఆయనకు అన్నపానాదులతో సేవ చేయటానికి సుభద్రను నియోగించి, కన్యాంతఃపురంలోనే ఆయన ఉండటానికి ఏర్పాటు చేయగా.

విశేషం: చాతుర్మాస్యం - ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధఏకాదశి మొదలు కార్తిక శుద్ధఏకాదశి వరకు నాలుగు నెలలు చేసే వ్రతం. ఈ వర్షాకాలంలో యతులు తీర్థయాత్రలు సాగించకుండా ఒక్కచోటనే ఉండి ఈ వ్రతం ఆచరిస్తాను.

అర్జునుండు యతిరూపంబున కన్యాపురంబున నుండుట (సం- అను. 1-114-64 పంక్తి)

క. అందు ధృతిమందరుండు పు । రందర నందనుఁడు దనకు రమణి గుణశ్రీ
సుందరి సుభద్ర నెయ్యం । బొందఁగఁ బరిచర్య సేయుచుండఁగ నుండెన్. 181

ప్రతిపదార్థం: అందున్= ఆ కన్యాంతఃపురంలో; ధృతి, మందరుండు= ధైర్యంలో మందరపర్వతంవంటివాడు; పురందర, నందనుఁడు= దేవేంద్రుని కుమారుడైన అర్జునుడు; తనకున్; రమణి= అందమైనది; గుణశ్రీ, సుందరి= సుగుణాల సంపదచేత మనోహరమైనది; సుభద్ర; నెయ్యంబు+ఒందఁగన్= ప్రేమతో; పరిచర్య= సేవ; చేయుచున్+ఉండఁగన్, ఉండెన్= చేస్తూ ఉండగా, ఉన్నాడు.

తాత్పర్యం: ధైర్యంలో మందరపర్వతంవంటివాడైన అర్జునుడు - రూపవతి, గుణవతి అయిన సుభద్ర తనకు సేవచేస్తూ ఉండగా ఆ కన్యాంతఃపురంలో ఉన్నాడు.

క. ధీరుఁడు యతిరూపంబున । నారఁగ నిందున్నయాతఁ డర్జునుఁ డని స
త్యారుక్మిణులకుఁ జెప్పె ము । రారాతి రహస్యమున ననంత ప్రీతిన్. 182

ప్రతిపదార్థం: ముర+అరాతి= మురుడు అనే రాక్షసునికి శత్రువైనవాడు - శ్రీకృష్ణుడు; అనంత, ప్రీతిన్= మిక్కిలిసంతోషంతో; సత్యా, రుక్మిణులకున్= సత్యభామకు, రుక్మిణీదేవికి; ధీరుఁడు= ధైర్యవంతుడు; యతి, రూపంబునన్= యతివేషంలో; ఆరఁగన్= ఒప్పుగా; ఇందున్+ఉన్న= ఇక్కడ ఉండేవాడు; ఆతఁడు, అర్జునుఁడు; అని= అని; రహస్యమునన్, చెప్పెన్= రహస్యంగా చెప్పాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు మహాసంతోషంతో - 'ఇక్కడ యతివేషంలో ఉన్న ధీరుడు అర్జునుడు' అని సత్యభామకు, రుక్మిణీదేవికి రహస్యంగా చెప్పాడు.

చ. అలయక నాఁడు నాఁటికి లతాంగి యపూర్వము లైన భోజనం
బులు గడుభక్తిఁ బెట్టుచు, నపూర్వము లైన వపుర్విలాస యు
క్తులు వెలయించుచున్, ముదముతోఁ బెనిచెన్ మఱి నాఁడునాఁటి క
గ్గల మగుచుండ నెయ్యమును గామవికారము సవ్యసాచికిన్. 183

ప్రతిపదార్థం: లతా+అంగి= లతవంటి సుకుమారమైన శరీరంకలది - సుభద్ర; అలయక= విసుగులేకుండా; నాఁడు, నాఁటికిన్= ఏరోజు కా రోజు; అపూర్వములు+ఐన= ముందులేనివైన, క్రొత్తవైన; భోజనంబులు; కడు, భక్తిన్= మిక్కిలి భక్తితో; పెట్టుచున్= పెట్టుతూ; అపూర్వములు+ఐన= సరిక్రొత్తవైన; వపుస్+విలాస, యుక్తులు= శరీర విలాసాల కూడికలు - అంటే అందాల హొయలు; వెలయించుచున్= ప్రకటిస్తూ; మఱిన్= పైగా; సవ్యసాచికిన్= అర్జునునికి; నెయ్యమును= స్నేహాన్ని; కామ, వికారమున్= శృంగారభావాన్ని; నాఁడు, నాఁటికిన్= నానాటికి; అగ్గలము+అగుచుండన్= ఎక్కువగుచుండగా; ముదముతోన్= సంతోషంతో; పెనిచెన్= పెంచింది.

తాత్పర్యం: సుందరాంగి సుభద్ర విసుగులేకుండా ఏరోజు కారోజు సరిక్రొత్త భోజనాలు భక్తితో పెట్టుతూ, తన శరీరంలో సరిక్రొత్త అందాలు ప్రదర్శిస్తూ, ఏరోజు కా రోజు అర్జునునిలో స్నేహాన్నీ, శృంగారభావాన్నీ పెంచింది.

విశేషం: సుభద్ర సహజతనూవిలాసాలను ప్రదర్శిస్తూ మునిసేవ చేస్తున్నది. ప్రతిదిన ప్రవర్ధమానమౌతున్న ఆమె యౌవనం రోజురోజుకూ అర్జునునికి ఆసక్తిని పెంచుతున్నది. ఇది మధురమైన సన్నివేశం. మధురభావముద్రితం. అందువలననే నన్నయ మాధుర్యమనే గుణాన్ని పద్యరచనలో ప్రపంచించి ప్రౌఢిని ప్రదర్శించాడు. ఈ మాధుర్యాన్నే రాబోయే రెండుపద్యాలలో వరుసగా పోషించటం శిల్పం. (సంపా.)

వ. మఱియును. 184

ప్రతిపదార్థం: అంతేకాకుండా.

సీ. అలినీలకుంతలుం డనియును హరినీల । సమవర్ణుఁ డనియు నాజానులంబి
తాయతస్థిరబాహుఁ డనియును రక్తాంత । నలినదళాకారనయనుఁ డనియు
నుత్తుంగఘనవిశాలోరస్కుఁ డనియును । గవ్వడి యనియును గరము వేడ్క
వివ్వచ్చు నెప్పుడు వినియెడునది; దన । వినినట్ల యతిఁ జూచి, 'వీఁడు విజయుఁ

ఆ. డొక్కొ!' యనుచు సంశయోపేతచిత్త యై । యుండి, యుండ నోప కొక్కనాఁడు
భోజనావసానమున నున్న యమ్ముని । కిందువదన ప్రీతి నిట్టు లనియె. 185

ప్రతిపదార్థం: అలి, నీల, కుంతలుండు+అనియును= తుమ్మెదవలె నల్లనివెంట్రుకలు కలవాడని; హరినీల, సమ, వర్ణుఁడు+అనియున్= ఇంద్రనీలమణితో సమానమైన రంగుకలవాడని; ఆజాను, లంబిత+ఆయత, స్థిర, బాహుఁడు+అనియును= మోకాళ్ళదాకా వ్రేలాడుతున్న పొడవైన, బలమైన బాహువులు కలవాడని; రక్త+అంత, నలిన, దళ+ఆకార, నయనుఁడు+అనియున్= ఎర్రనికొలకులు కలిగి తామరరేకులవంటి ఆకారం గల కన్నులు కలవాడని; ఉత్తుంగ, ఘన, విశాల+ఉరస్కుడు+అనియును= మిక్కిలి ఎత్తైన కఠినం, విశాలమైన వక్షఃస్థలం కలవాడని; కవ+వడి= రెండుచేతుల వడిగలవాడు; అనియును;

కరము, వేడ్కన్= మిక్కిలి కుతూహలంతో; విష్వచ్చున్= అర్జునునిగూర్చి; ఎప్పుడున్= ఎల్లప్పుడు; వినియెడు, అది= వినునట్టి సుభద్ర; తన, వినిన+అట్లు+అ= తాను విన్నవిధంగానే; యతిన్= యతిని; చూచి; వీఁడు= ఇతడు; విజయుఁడు+ఒక్కొ, అనుచున్= అర్జునుడో ఏమో అని; సంశయ+ఉపేత, చిత్త+ఐ= అనుమానంతో కూడుకొన్న మనసు కలదై; ఉండి= ఉంటూ; ఉండన్+ఓపక= ఉండలేక; ఒక్కనాఁడు; భోజన+అవసానమునన్= భోజనం చివర; ఉన్న= ఉండే; ఆ+మునికిన్= ఆ యతిని; ఇందు, వదన= చంద్రబింబంవంటి ముఖం కలది - సుభద్ర; ప్రీతిన్= ప్రేమతో; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: తుమ్మెదవలె నల్లని జుట్టు కలవాడని, ఇంద్రనీలపు రంగువాడని, మోకాలివరకు వ్రేలాడే పొడవైన, బలమైన బాహువులు కలవాడని, ఎర్రని కొలకులతో తామరరేకులవంటి కళ్ళు కలవాడని, ఎంతో ఎత్తై కఠినం, విశాలం అయిన వక్షఃస్థలం కలవాడని, రెండుచేతులు వడి కలవాడని - మిక్కిలి కుతూహలంతో అర్జునుని గూర్చి ఎప్పుడూ వినే సుభద్ర, తాను విన్నవిధంగానే ఆ యతిని చూచి, ఇతడు విజయుడో ఏమో అని అనుమానించి, ఉండలేక ఒకనాడు భోజనంచివర ఆ మునితో ప్రియమార ఇట్లా అన్నది.

విశేషం: అలం: ఉపమ, సందేహం. రసానుకూలంగా అలంకారాన్ని ధ్వనిమయంగా నిర్వహించాడు నన్నయ. విశేషం ఏమంటే ఉపమాలంకారంతో మొదలై అది మధ్యలో వదలిపెట్టబడి సందేహాలంకారంతో పద్యాన్ని ముగించటం ఇందులోని శిల్పం. అర్జునుని పోలికలు యతిలో కనపడుతున్నాయి. అతడే అర్జునుడేమో అని మనస్సు సంశయిస్తున్నది. కాని, నిశ్చయంగా తెలియకపోయినప్పుడు ఆ భావంలో రమించటం ఉచితం కాదు. రతిభావపోషణకనువైన విభావస్ఫూర్తి యతిరూపంలో కనపడుతున్నా బింబమని భ్రమించి ప్రతిబింబాన్నే రమిస్తే రసభంగమౌతుందన్నసందేహంతో ఆమె సముచితంగా ఆగినట్లు వర్ణించటం రసధ్వనిశిల్పం. సుభద్రాహృదయగత మధురభావాన్ని మాధుర్యగుణముద్రితమైన పద్యరచనలో ప్రదర్శించటం నన్నయరసవద్గుణపోషణకు నిదర్శనం. (సంపా.)

వ. మునీంద్రా! నీ యాడనితీర్థంబులుం జూడనిపురంబులు నెఱుంగనిరాజకులంబును లే వని విచారింతు. 186

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా= మునిశ్రేష్ఠా!; నీ, ఆడని= నీయొక్క స్నానం చేయని - అనగా నీవు స్నానమాడని; తీర్థంబులున్= తీర్థాలూ; చూడని= సందర్శించని; పురంబులున్= నగరాలూ; ఎఱుంగని= తెలియని; రాజకులంబును= రాజసమూహాలూ; లేవు+అని= లేవని; విచారింతున్= అనుకొంటాను.

తాత్పర్యం: మునివరా! నీవు స్నానం చేయని పుణ్యతీర్థాలూ, చూడని పట్టణాలూ, తెలియని రాజవంశాలూ లేవని అనుకొంటాను.

సీ. 'అమరావతికి నెన యనఁగ నివ్వసుమతిఁ । బరఁగు నింద్రప్రస్థపురవరంబు
చూచితిరే? పాండుసుతు లందు సుఖ మున్న । వారె? మాయత్త యంభోరుహాక్షి
కుంతీమహాదేవి కుశలయే? యమ్మహా । వీరుఁ డర్జునుఁడు జితారి తీర్థ
గమనోత్సుకుం డయ్యెఁ; గ్రమ్మఱి వచ్చెనే? । యెఱుఁగుదురేని నా కెఱుఁగఁ జెప్పుఁ'

ఆ. డనిన నేన చూవె యయ్యర్జునుండ; నీ । యొద్ద నివ్విధమున నున్నవాఁడఁ;
దరుణి! నీకు నాకు ధరణీధరుం డను । జలజభవుఁడు సేసె సంగమంబు. 187

ప్రతిపదార్థం: అమరావతికిన్= (దేవేంద్రుడిరాజధాని) అమరావతీనగరానికి; ఎన= సాటి; అనఁగన్= అనునట్లుగా; ఈ+వసుమతిన్= ఈ భూమిమీద; పరఁగు= ఒప్పు; ఇంద్రప్రస్థ, పుర, వరంబున్= ఇంద్రప్రస్థం అనేపేరుగల గల పురశ్రేష్ఠాన్ని - అంటే గొప్పదైన ఇంద్రప్రస్థపురాన్ని; చూచితిరే= చూచినారు కదా; పాండు, సుతులు= పాండవులు; అందున్= అక్కడ; సుఖము+ఉన్నవారె= సుఖంగా ఉన్నారా; మా, అత్త, అంభోరుహ+అక్షి= పద్మాలవంటి కన్నులు కలది; కుంతీమహాదేవి; కుశలయే= క్షేమంగా ఉన్నదా?; ఆ+మహావీరుఁడు; జిత+అరి= జయింపబడిన శత్రువులు కలవాడు; అర్జునుఁడు; తీర్థ, గమన+ఉత్సుకుండు= తీర్థయాత్రలకు వెళ్ళటంలో ఉత్సాహం కలవాడు; అయ్యెన్= అయ్యాడు; క్రమ్మఱి= తిరిగి; వచ్చెనే= వచ్చినాడా? ఎఱుగుదురు+ఏని= తెలిస్తే; నాకున్; ఎఱుఁగన్; చెప్పుఁడు= తెలియచేయండి; అనినన్= అని అనగా; తరుణి= ఓ కాంతా!; నేను+అ= నేనే; చూవె= సుమా; ఆ+అర్జునుండ; నీ, ఒద్దన్= నీ దగ్గర; ఈ+విధమునన్= ఈ విధంగా; ఉన్నవాఁడన్= ఉన్నాను; నీకున్; నాకున్; ధరణీ, ధరుండు+అను= భూమిని ధరించినవాడు - శ్రీకృష్ణుడు అనే; జలజభవుఁడు= బ్రహ్మదేవుడు-పద్మంనుండి పుట్టినవాడు; సంగమంబు= కలయిక; చేసెన్= ఏర్పాటు చేశాడు.

తాత్పర్యం: 'దేవేంద్రుని రాజధాని అమరావతితో సమానమని ఈ భూమిమీద పేరుపొందిన ఇంద్రప్రస్థపురశ్రేష్ఠాన్ని మీరు చూచారా? అందు పాండవులు సుఖంగా ఉన్నారా? మా అత్త కుంతీదేవి కుశలమా? ఆ మహావీరుడు, శత్రువులను జయించినవాడు అయిన అర్జునుడు తీర్థయాత్రలకు వెళ్ళాలన్న ఉత్సాహంతో ఉండేవాడే - ఆయన తీర్థయాత్రలనుండి తిరిగి వచ్చాడా? తెలిసినట్లైతే నాకు చెప్పండి' అని సుభద్ర అడుగగా, 'ఓ కాంతా! నేనే అర్జునుడను; ఈ విధంగా నీవద్ద ఉన్నాను. శ్రీకృష్ణుడు అనే బ్రహ్మ నిన్నూ నన్నూ కలిపాడు'.

విశేషం: పృథక్పదత్వం, ఉక్తివైచిత్ర్యం అనే లక్షణాలు గల మాధుర్యగుణవద్రచనకు ఈ పద్యం హృద్యమైన ఉదాహరణం. రూపసామ్యం గల యతి అర్జునుడేమో అని ఆమె అనుమానం. కాని, ఆ విషయం సూటిగా అడగటానికి వీలులేదు. అందువలన చేపకొరకు గాలంవేస్తున్నట్లు సంభాషణ సాగించింది. తీర్థయాత్రలమీద ఆసక్తిగల ఆ అర్జునుడు తిరిగి ఇంద్రప్రస్థపురం చేరాడా? అని చివరి ప్రశ్న. చేరితే ఈ యతి అర్జునుడు కాడు. చేరకపోతే యతి ఎవరో తెలుస్తుంది - మాటనేర్పరితనం గల సుభద్ర ఉక్తిచమత్కారంతో సత్యం బైట పెట్టించింది. అందుకే అర్జునుడు మరేమీ చెప్పక తన ఉనికిని బయటపెట్టుకొన్నాడు. సుభద్రార్జునుల మధురాభిలాషల మధురాభివ్యక్తికి మాధుర్యగుణం మధుర సాధనమైనది. (సంపా.)

వ. 'బ్రాహ్మంబు మొదలుగాఁ గల యెనిమిది వివాహంబులయందును గాంధర్వరాక్షసంబులు క్షత్త్రియులకు నుత్తమ వివాహంబులు గావున నిది గాంధర్వ వివాహంబున కవసరం' బనిన సుభద్ర లజ్జావనతవదన యయి. 188

ప్రతిపదార్థం: బ్రాహ్మంబు= బ్రాహ్మం; మొదలుగాన్+కల= ఆదిగా ఉండే; ఎనిమిది, వివాహంబుల, అందున్= ఎనిమిదిరకాల వివాహాలలోనూ; గాంధర్వ, రాక్షసంబులు= గాంధర్వం, రాక్షసం; క్షత్రియులకున్= క్షత్రియులకు; ఉత్తమ= శ్రేష్ఠమైన; వివాహంబులు= వివాహాలు; కావునన్= కాబట్టి; ఇది = ఈ సందర్భం; వివాహంబునకున్= గాంధర్వ వివాహానికి; అవసరంబు= సమయంబు; అనినన్= అని అనగా; సుభద్ర= సుభద్ర; లజ్జా+అవనత, వదన, అయి= సిగ్గుచేత వంచుకొన్న ముఖం కలదై.

తాత్పర్యం: 'బ్రాహ్మము మొదలైన ఎనిమిదిరకాలవివాహాలలో గాంధర్వరాక్షసాలు క్షత్త్రియులకు ఉత్తమ వివాహాలు కాబట్టి ఇది గాంధర్వవివాహానికి సమయం' అనగానే సుభద్ర సిగ్గుతో తలవంచుకొని.

విశేషం: ఎనిమిది రకాల వివాహాలు - బ్రాహ్మము, దైవము, ఆర్షము, ప్రాజాపత్యము, ఆసురము, గాంధర్వము, రాక్షసము, పైశాచము. వివరాలకు చూడు (ఆది.4-55)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. 'నన్ను నీ నర్హు లెల్ల నిం దున్నవారు;। వార యెఱిఁగి చేయుదురు వివాహ' మనుచు
వనజనేత్ర యంతఃపురంబునకుఁ జనియె; నరిగెఁ దన లతాగృహమున కర్జునుండు. 189

ప్రతిపదార్థం: నన్నున్; ఈన్= ఇవ్వటానికి; అర్హులు+ఎల్లన్= తగినవారంతా; ఇందున్= ఇక్కడ; ఉన్నవారు= ఉండేవారే; వారు+అ= వారే; ఎఱిఁగి చేయుదురు= తెలిసి చేస్తారు; వివాహము= పెండ్లి; అనుచున్= అంటూ; వనజ, నేత్ర= పద్మాలవంటికన్నులు కలది-సుభద్ర; అంతఃపురంబునకున్= అంతఃపురానికి; చనియెన్= వెళ్ళింది; అర్జునుండు; తన= తనయొక్క; లతా, గృహమునకున్= తీగెలతో నిర్మించిన ఇంటికిన్, పొదరింటికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'నన్ను ఇవ్వటానికి అర్హులైనవాళ్ళంతా ఇక్కడే ఉన్నారు. వాళ్ళే తెలిసికొని వివాహం చేస్తా' రంటూ సుభద్ర అంతఃపురానికి వెళ్ళింది. తరువాత అర్జునుడు తన పొదరింటికి వెళ్ళాడు.

విశేషం: శ్రీకృష్ణుడే సుభద్రార్జునుల వివాహవ్యూహాన్ని రచించాడని తెలిసిన తరువాత సుభద్ర తనంత తాను గాంధర్వ వివాహానికి ఒడబడటం ఉచితం కాదు. సూత్రధారుడు అయిన కృష్ణుడే సమయాన్ని గమనించి సముచిత విధంగా సమర్పించ నున్నాడని సన్నివేశం ధ్వనింపచేస్తున్నది. అంతరంగంలో ఇష్టమే కాని ఈ అంతర్నాటకమెందుకో తెలిసిన తరువాతనే వివాహంకావటం ఇరువురికీ మంచిది అన్న భావాన్ని వ్యంగ్యంగా సూచించిన వివేకవతి, లజ్జావతి సుభద్ర. అర్జునునికి రహస్యం చెప్పి తనకు చెప్పకుండా ఉంచిన పెద్దలే తనను ఇస్తారులే; అంతవరకు నాకు తెలిసిందని నేను ఎందుకు బైటపడాలి? అన్న గూఢాభిమానంకూడా ఆమె మాటలలో ప్రతీయమానమౌతున్నది. పైపెచ్చు ఆ మాటలు తేటగీతి పూర్వార్ధంలో సమతను ప్రదర్శించటం, ఉత్తరార్ధంలో వాళ్ళచర్యలు సమంగా రెండుచరణాలలో వర్ణింపబడటంవలన పద్య రచనలో సమత అనే గుణం శోభిస్తున్నది. (సంపా.)

వ. అయ్యిరువుర యన్యోన్యప్రణయంబులు దనదివ్యజ్ఞానంబునం జేసి దివ్యపురుషుండు పురుషోత్తముం డెఱింగి, యర్జునునకు భోజనవిధు లమర్ప రుక్మిణీదేవిం బంచి, యొక్కనాఁ డేకాంతంబున దేవకీవసుదేవప్రద్యుమ్న సాంబసంకర్షణసారణసాత్యకు లకు నర్జును స్థితియును' నాతనియందు సుభద్రనెయ్యంబును నెఱింగించి, తమతొల్లింటి విచారంబున కనుగుణం బగుటకు సంతసిల్లి, బలదేవాదు లెఱుంగకుండ సుభద్రార్జునుల వివాహంబు సేయ సమకట్టి, తమనిశ్చయం బయ్యిరువురకుం జెప్పి, పశుపతిపూజా మహోత్సవవ్యాజంబున నఖిలయాదవ భోజాంధకవృష్ణివరులతో నంతర్ద్వీపంబునకుం జని. 190

ప్రతిపదార్థం: ఆ+ఇరువుర= ఆ సుభద్రార్జునులయొక్క; అన్యోన్య, ప్రణయంబులు= పరస్పరప్రేమలు; తన దివ్యజ్ఞానంబునన్+చేసి= తన దివ్యజ్ఞానంచేత; దివ్య, పురుషుండు; పురుష+ఉత్తముండు= పురుషులలో శ్రేష్ఠుడు - శ్రీకృష్ణుడు; ఎఱింగి= తెలిసికొని; అర్జుననకున్= అర్జునునికి; భోజన, విధులు= భోజన సంబంధకార్యములు; అమర్పన్= అమర్చుటకు; రుక్మిణీదేవిన్; పంచి= పంపి; ఒక్కనాఁడు; ఏకాంతంబునన్= ఏకాంతంలో; దేవకీ, వసుదేవ, ప్రద్యుమ్న, సాంబ, సంకర్షణ, సారణ, సాత్యకులకున్; అర్జును స్థితియును= అర్జునుని ఉనికిని; అతని అందున్= అతనిపై; సుభద్ర, నెయ్యంబును= సుభద్రయొక్క స్నేహాన్ని; ఎఱింగించి= తెలిపి; తమ, తొల్లింటి= తమ పూర్వపు; విచారంబునకున్= ఆలోచనకు; అనుగుణంబు= తగినది; అగుటకున్= కావటానికి; సంతసిల్లి; బలదేవ+ఆదులు= బలరాముడు మొదలైనవాళ్ళు; ఎఱుంగకుండన్= తెలియకుండా; సుభద్రా+అర్జునుల= సుభద్రార్జునుల; వివాహంబు= పెండ్లి; చేయన్= చేయటానికి; సమకట్టి= పూనుకొని; తమ, నిశ్చయంబు=

తమ నిర్ణయం; ఆ+ఇరువురకున్= ఆ ఇద్దరికి; పశుపతి, పూజా, మహా +ఉత్సవ, వ్యాజంబునన్= శివపూజా మహోత్సవం నెపంతో; అఖిల, యాదవ, భోజ+అంధక, వృష్ణి, వరులతోన్= యాదవ, భోజ, అంధక, వృష్ణివంశ శ్రేష్ఠులందరితో; అంతర్+ద్వీపంబునకున్= లోపలి ద్వీపానికి; చని= వెళ్ళి.

తాత్పర్యం: ఆ సుభద్రార్జునుల పరస్పరానురాగాలు తనదివ్యజ్ఞానంతో శ్రీకృష్ణుడు తెలిసికొని, అర్జునునికి భోజనవిధులు అమర్చటానికి రుక్మిణీదేవిని పంపి, ఏకాంతంలో దేవకీ వసుదేవ ప్రద్యుమ్న సాంబ సంకర్షణ సారణ సాత్యకులకు అర్జునునిఉనికిని, అతనిపై సుభద్రకున్న ప్రేమను తెలియజేశాడు. మొదటినుండి తమకున్న ఆలోచనకు అది అనుకూలమే కనుక సంతోషించాడు. బలరాముడు మొదలైనవాళ్ళకు తెలియకుండా సుభద్రార్జునుల వివాహం చేయటానికి నిశ్చయించాడు. తమనిశ్చయాన్ని ఆ ఇద్దరికి చెప్పాడు. శివపూజా మహోత్సవం నెపంతో అఖిలయాదవ భోజాంధకవృష్ణివంశశ్రేష్ఠులతో ఆంతరద్వీపానికి వెళ్ళి.

వ. అం దమరబృందవంద్యున । కిందుకళాభరణునకు నుమేశ్వరునకు నా
నందం బొందఁగ నందఱ । నందకధరుఁ డుత్సవం బొనర్పఁగఁ బంచెన్. 191

విశేషం: నందక, ధరుడు= నందకం అనే పేరుకల ఖడ్గాన్ని ధరించినవాడు - విష్ణుమూర్తి - కృష్ణుడు; అందున్= ఆంతర ద్వీపంలో; అమర, బృంద, వంద్యునకున్= దేవతాసమూహానికి పూజ్యుడైనవానికి; ఇందు, కళా+ఆభరణునకున్= చంద్రకళ ఆభరణంగా కలవానికి; ఉమా+మహేశ్వరునకున్= ఉమాదేవి భర్తకు; ఆనందంబు= సంతోషం; ఒందఁగన్= కలిగేటట్లు; ఉత్సవంబు= పండుగ; ఒనర్పఁగన్= చేయటానికి; అందఱన్= అందరినీ; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: 'ఆంతరద్వీపంలో దేవతలందరికీ పూజ్యుడు, చంద్రశేఖరుడు ఉమాపతి అయిన పరమేశ్వరునికి ప్రీతిగా ఉత్సవం చేయండి' అని శ్రీకృష్ణుడు అందరినీ ఆజ్ఞాపించాడు.

క. తగఁగ వివాహం బెన్నం । డగునొకొ, యెన్నండు సంగమావాప్తియు మా
కగునొకొ యని యెడఁ గోరుచు । నొగి నిట యుండిరి సుభద్రయును విజయుండున్. 192

ప్రతిపదార్థం: తగన్+కన్= తగురీతిగా; వివాహంబు= పెండ్లి; ఎన్నండు= ఎప్పుడు; అగున్+ఒకొ= అవుతుందోకదా!; ఎన్నండు= ఎప్పుడు; సమాగమ+అవాప్తియున్= కలయిక లభించటం; మాకున్= మాకు; అగున్+ఒకొ= కలుగుతుందోకదా!; అని; ఎడన్= హృదయంలో; కోరుచున్= కోరుకొంటూ; సుభద్రయును= సుభద్రయును; విజయుండును= అర్జునుడూ; ఒగిన్= క్రమంగా; ఇటన్= ద్వారవతిలో; ఉండిరి= ఉన్నారు.

తాత్పర్యం: 'తగురీతిలో వివాహం ఎన్నడు జరుగుతుందో! మాకు సమాగమ - అవకాశం ఎన్నడు లభిస్తుందో!' అని హృదయంలో కోరుకొంటూ సుభద్రార్జునులు ద్వారకలో ఉన్నారు.

విశేషం: నాయికానాయకులలో రతిభావం దేదీప్యమానంగా (ఉజ్జ్వలంగా) ధ్వనింపచేయటంలో నన్నయ 'కాంతి' అనే గుణాన్ని కమనీయంగా పోషించాడు. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **హరిఁ దలఁచె సుభద్ర ; పురం । దరుఁ దలఁచె ధనంజయుండు; దడయక వా ర**
య్యిరువురఁ బెండిలి సేయఁగ । వరదులు తద్ద్వారవతికి వచ్చిరి ప్రీతిన్. 193

ప్రతిపదార్థం: సుభద్ర, హరిన్= శ్రీకృష్ణుడిని; తలఁచెన్= తలచింది; ధనంజయుండు= అర్జునుడు; పురందరున్= దేవేంద్రుడిని; తలఁచెన్= అనుకున్నాడు; వరదులు= వరాలిచ్చేవారు; వారు= ఆ శ్రీకృష్ణదేవేంద్రులు; తడయక= ఆలస్యంచేయక; ఆ+ఇరువురన్= ఆ ఇద్దరిని; పెండిలి= పెండ్లి; చేయఁగన్= చేయటానికి; ప్రీతిన్= ప్రేమతో; తత్+ద్వారవతికిన్= ఆ ద్వారకానగరానికి; వచ్చిరి= వచ్చారు.

తాత్పర్యం: సుభద్ర మనస్సులో శ్రీకృష్ణుడిని తలచుకొన్నది. అర్జునుడు దేవేంద్రుడిని తలచుకొన్నాడు. వరాలిచ్చే వాళ్ళిద్దరు వెంటనే వాళ్ళపెండ్లి చేయటానికి ప్రీతితో ద్వారవతీనగరానికి (ద్వారకానగరానికి) వచ్చారు.

విశేషం: ఈ పద్యంలో నాయికానాయకుల సంకల్పాలలోనూ, ఇంద్రోపేంద్రుల ఆగమనంలోనూ, పద్యనిర్మాణంలోనూ సమతాగుణం సార్థకం. (సంపా.)

అర్జునుండు సుభద్రను వివాహంబగుట (సం. అను 1-144-270 పంక్తి)

వ. **ఇట్లు వాసుదేవుండు వసుదేవాక్రూరసారణసాంబసాత్యకిసహితంబుగా నంతర్ద్వీపంబుననుండి వచ్చిన యనంతరంబ యమరావతినుండి యమరసిద్ధసాధ్యమునిగణపరివృతుం డై యమరేంద్రుండు వచ్చె; నంత బృహస్పతి యిచ్చిన యుత్తమలగ్నంబున నగ్నియమనిర్భృతివరుణవాయుధనదేశానాదిసురవరులు, నత్రిభృగు నారద వసిష్ఠవామ దేవప్రభృతి మహామునులును సదస్యులుగాఁ, గశ్యపప్రజాపతి హోమకర్తగా, నరుంధతియు శచియు సత్యభామయు రుక్మిణియు నప్సరోగణంబులతోడం బురంధ్రీకార్యంబులు నిర్వహింప సుభద్రార్జునుల వివాహమహోత్సవం బతిరమ్యం బయ్యె నంత.** 194

ప్రతిపదార్థం: ఇట్లు; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు, వసుదేవ+అక్రూర, సారణ, సాంబ, సాత్యకి, సహితంబుగాన్= వసుదేవుడు, అక్రూరుడు మొదలైన వాళ్ళతోకూడి; అంతర్+ద్వీపంబునుండి; వచ్చిన= వచ్చిన; అనంతరంబు+అ= తరువాత; అమరావతినుండి; అమర, సిద్ధ, సాధ్య, ముని, గణ పరివృతుండు+ఐ= దేవతలతో, సిద్ధులతో, సాధ్యులతో, మునిసమూహాలతో చుట్టబడినవాడై; అమర+ఇంద్రుండు= దేవేంద్రుడు; వచ్చెన్; అంతన్; బృహస్పతి; ఇచ్చిన= పెట్టిన; ఉత్తమ, లగ్నంబునన్= మంచి ముహూర్తంలో; అగ్ని, యమ, నిర్భృతి, వరుణ, వాయు, ధనద+ఈశాన+ఆది, సుర, వరులున్= అగ్నిదేవుడు, కుబేరుడు, ఈశానుడు (అష్టదిక్పాలకులు) మొదలైన దేవతాశ్రేష్ఠులూ; అత్రి, భృగు, నారద, వసిష్ఠ, వామదేవ, ప్రభృతి, మహామునులు= అత్రి, భృగువు, నారదుడు, వసిష్ఠుడు, వామదేవుడు మొదలైన మహామునులూ; సదస్యులుగాన్= సభలోని సభ్యులుగా; కశ్యప, ప్రజాపతి= కశ్యప ప్రజాపతి; హోమకర్తగాన్= హోమం చేసేవాడుగా; అరుంధతియు= అరుంధతి; శచియు, సత్యభామ, రుక్మిణియును= శచీదేవి, సత్యభామ, రుక్మిణి; అప్సరస్+గణంబులతోడన్= అప్సరసలసమూహాలతో; పురంధ్రీ, కార్యంబులు= ముత్తైదువులు చేయదగినపనులు; నిర్వహింపన్= నిర్వహించగా; సుభద్రా+అర్జునుల= సుభద్రార్జునుల; వివాహ= పెండ్లి; మహా+ఉత్సవంబు= గొప్ప పండుగ; అతి, రమ్యంబు= ఎంతో చూడముచ్చటైనది; అయ్యెన్= జరిగింది; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: ఈ విధంగా శ్రీకృష్ణుడు వసుదేవ అక్రూర సారణ సాంబ సాత్యకులతో ఆంతరద్వీపంనుండి వచ్చిన తర్వాత దేవేంద్రుడు అమర సిద్ధ సాధ్య ముని సమూహాలతో అమరావతినుండి వచ్చాడు. బృహస్పతి పెట్టిన ఉత్తమ లగ్నంలో అష్టదిక్పాలకులు మొదలైన దేవతాశ్రేష్ఠులు, అత్రి, భృగు, నారదాదిమహామునులు సదస్యులుగా, కశ్యప ప్రజాపతి హోమకర్తగా, అరుంధతీ శచీ సత్యభామా రుక్మిణులు అప్సరసల సాయంతో ముత్తైదువులు చేసే పనులన్నీ నిర్వహించగా, సుభద్రార్జునుల వివాహం చూడముచ్చటగా జరిగింది. అప్పుడు.

తరువోజ.

అనిమిషప్రభుఁడు నిజాత్మజు ననఘు । నర్జునుఁ బ్రీతితో నభిషిక్తుఁ జేసి
మనుజేంద్రుఁ గాంచనమణిమయోత్తుంగ । మకుటవిభూషణమస్తకుఁ జేసి
యనుపమకేయూరహారాదిభూష । ణాభిశోభితుఁ జేసి యప్పు డానంద
జనితాంబుకణికార్ద్రచక్షుస్సహస్ర । జలరుహంబులు దాల్చె సమ్మదం బెసఁగ. 195

ప్రతిపదార్థం: అనిమిష, ప్రభుఁడు = దేవేంద్రుడు; నిజ+ఆత్మజున్= తన కుమారుడిని; అనఘున్= పాపరహితుడిని; అర్జునున్= అర్జునుని; ప్రీతితోన్, అభిషిక్తున్+చేసి= అభిషేకింపబడినవాడినిగా చేసి, మనుజ+ఇంద్రున్= రాజును; కాంచన, మణిమయ+ఉత్తుంగ, మకుట, విభూషణ, మస్తకున్= బంగారంతో, మణులతో నిర్మించిన కిరీటంచేత అలంకరింపబడిన శిరస్సుకలవాడిని; చేసి; అనుపమ, కేయూర, హార+ఆది, భూషణ+అభిశోభితున్= సాటిలేని బాహుపురులు, హారాలు మొదలైన ఆభరణాలచే ప్రకాశించేవాడినిగా; చేసి, అప్పుడు; ఆనంద, జనిత+అంబు, కణిక+ఆర్ద్ర, చక్షుస్+సహస్ర, జల రుహంబులు= ఆనందంనుండి పుట్టిన నీటిబిందువులచే తడిసిన పద్మాలవంటి కళ్ళు వేయింటిని; సమ్మదంబు= సంతోషం; ఎసఁగన్= అతిశయించగా; తాల్చెన్= ధరించాడు.

తాత్పర్యం: దేవేంద్రుడు - తన కుమారుడు, పుణ్యాత్ముడు అయిన అర్జునుడిని అభిషేకించి (మంగళస్నానం చేయించి), బంగారంతో మణులతో రూపొందించిన కిరీటాన్ని శిరస్సుపై అలంకరించి, సాటిలేని బాహుపురులు, హారాలు మొదలైన ఆభరణాలు - అలంకరించి' ఆనంద బాష్పాలచేత తడిసిన పద్మాలవంటి కళ్ళు వేయింటిని సంతోషం అతిశయిల్లగా ధరించాడు.

విశేషం: అలం: రూపకం. అనిమిషులు అంటే రెప్పపాటులేనివారు - దేవతలు. వృత్తలక్షణానికి చూడు. ఆది.2-150 విశేషం. ఈ పద్యంలో ఓజోగుణంతోకూడికొన్న ప్రసాదగుణం సన్నివేశగతమైన ఉదాత్తతను ప్రసన్నంగా పోషిస్తున్నది. (సంపా.)

మాలిని.

నరునకు దయ ని ట్లానంద మొందించి యింద్రుం
డరిగె దివికి దివ్యానంతరత్నాంశుజాల
స్ఫురితసురవిమానంబుల్ నభోభాగ మెల్ల
న్మెరసి వెలుఁగుచుండన్ నిర్జరశ్రేణితోడన్. 196

ప్రతిపదార్థం: ఇంద్రుండు= దేవేంద్రుడు; నరునకున్= అర్జునునికి; ఇట్లు= ఈ విధంగా; ఆనందము= సంతోషం; ఒందించి= కూర్చి; దివ్య+అనంత, రత్న+అంశు, జాల, స్ఫురిత, సుర, విమానంబుల్= శ్రేష్ఠములైన అంతులేని రత్నకిరణాల సమూహంతో ప్రకాశిస్తున్న దేవతా విమానాలు; నభస్+భాగము+ఎల్లన్= ఆకాశమంతటా; మెరసి= బయల్పడి; వెలుఁగుచున్+ఉండన్= ప్రకాశిస్తూ ఉండగా; నిర్జర, శ్రేణితోడన్= దేవతల సమూహంతో; దివికిన్= స్వర్గానికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: దేవేంద్రుడు అర్జునునికి ఇట్లా ఆనందం కలిగించి - శ్రేష్ఠాలైన అనంత రత్నకిరణ సమూహంతో ప్రకాశించే దేవతావిమానాలు ఆకాశమంతా వెలుగుతుండగా దేవతలతో కలిసి స్వర్గలోకానికి వెళ్ళాడు.

విశేషం: వృత్తలక్షణానికి చూడు. ఆది. 2-81 విశేషం.

వ. ఇట్లు నారాయణుండు నిజారంభంబు సఫలం బగుటకు సంతసిల్లి, సంప్రాప్తమనోరథుం డయిన యప్పార్థుం గౌఁగిలించుకొని, 'యక్షయబాణతూణీరబాణాసనసనాథం బయి పవనజవనహయంబులం బూన్చిన యక్కాంచనరథం బెక్కి సుభద్రం దోడ్కొని యింద్రప్రస్థపురంబున కరుగు' మని పంచి, యనంతరం బంతర్ద్వీపంబున కరిగిన. 197

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నారాయణుండు= శ్రీకృష్ణుడు; నిజ+ఆరంభంబు= తనప్రయత్నం; సఫలంబు+అగుటకున్= సఫలం కావటానికి; సంతసిల్లి= సంతోషించి; సంప్రాప్త; మనోరథుండు+అయిన= పొందబడిన కోరిక గలవాడైన; ఆ+పార్థున్= ఆ అర్జునుడిని; కౌఁగిలించుకొని= ఆలింగనంచేసి; అక్షయ, బాణ, తూణీర, బాణ+ఆసన, సనాథంబు+అయి= తరుగని బాణాల అమ్ములపొదితో, ధనుస్సుతో కూడినదై; పవన, జవన, హయంబులన్= వాయువేగం గల గుర్రాలను; పూన్చిన= కట్టిన; ఆ+కాంచన, రథంబు= ఆ బంగారురథాన్ని; ఎక్కి, సుభద్రన్= సుభద్రను; తోడ్కొని= వెంటతీసుకొని; ఇంద్రప్రస్థ, పురంబునకున్= ఇంద్రప్రస్థ నగరానికి; అరుగుము= వెళ్ళుము; అని= అని పలికి; పంచి= పంపి; అనంతరంబు+అ= తరువాత; అంతర్+ద్వీపంబునకున్= అంతర్ద్వీపానికి; అరిగినన్= వెళ్ళగా.

తాత్పర్యం: ఈ విధంగా శ్రీకృష్ణుడు తన ప్రయత్నం సఫలం అయినందుకు సంతోషించి, కోరిక నెరవేరిన అర్జునుడిని కౌగిలించుకొని, 'తరుగని బాణాల అమ్ములపొదితో, ధనుస్సుతో కూడి, వాయువేగం గల గుర్రాలను పూన్చిన ఆ బంగారురథం ఎక్కి సుభద్రతో ఇంద్రప్రస్థపురానికి వెళ్ళు' మని పంపి, తరువాత తాను కూడ అంతర ద్వీపానికి వెళ్ళగా.

క. హరి పంచిన మార్గంబునఁ । గురువిభుఁడు సుభద్రఁ దోడుకొని చనునెడఁ ద
త్పురపరిరక్షకు లతిభీ । కరులు పృథుశ్రవసుఁ డాదిగాఁ గల వీరుల్. 198

ప్రతిపదార్థం: హరి= శ్రీకృష్ణుడు; పంచిన= పంపిన; మార్గంబునన్= దారిలో; కురు, విభుఁడు= కురువంశరాజు అర్జునుడు; సుభద్రన్= సుభద్రను; తోడుకొని= వెంట తీసికొని; చను+ఎడన్= వెళ్ళేటప్పుడు; తత్+పుర, పరిరక్షకులు= ఆ పట్టణానికి కాపలా ఉండేవాళ్ళు; అతి, భీకరులు= మిక్కిలి భయాన్ని కలిగించేవాళ్ళు; పృథుశ్రవసుడు+ఆదిగాన్+కల= పృథుశ్రవసుడు మొదలుగా ఉన్న; వీరుల్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు పంపినమార్గంలో అర్జునుడు సుభద్రను తోడ్కొని వెళ్ళుతుండగా, ఆ పట్టణానికి కాపలా ఉన్న పృథుశ్రవసుడు మొదలైన భయంకరవీరులు.

ఉ. 'వీరుఁడు వీఁడు పాండవుఁడు వృష్ణికులోత్తము లైన సీరిదై
త్యారు లెఱుంగకుండఁగ మహారథుఁ డై తరుణిన్ సుభద్ర నం
భోరుహనేత్రఁ దోడ్కొనుచుఁ బోయెడి; నీతనిఁ బోవనిచ్చినన్
ధీరుఁడు మాధవుండు బలదేవుఁడు నల్గుదు' రంచు నడ్డ మై. 199

ప్రతిపదార్థం: వీఁడు= ఇతడు; పాండవుఁడు= పాండురాజుకుమారుడు; వీరుఁడు; వృష్ణి, కుల+ఉత్తములు+ఐన= వృష్ణివంశశ్రేష్ఠులైన; సీరి, దైత్య+అరులు= బలరామ శ్రీకృష్ణులు; ఎఱుంగక+ఉండఁగన్= తెలియకుండా; మహారథుఁడు+ఐ= గొప్ప రథంమీద కూర్చున్నవాడై; తరుణిన్= కాంతను; సుభద్రన్= సుభద్రను; అంభోరుహ, నేత్రన్= పద్మాలవంటి కళ్ళు కలదానిని; తోడ్కొనుచున్= వెంటతీసికొంటూ; పోయెడిన్= పోతున్నాడు; ఈతనిన్= ఇతనిని; పోవనిచ్చినన్= పోనిస్తే; ధీరుఁడు; మాధవుండు= శ్రీకృష్ణుడు; బలదేవుఁడున్= బలరాముడు; అల్గుదురు+అంచున్= కోపపడతారని; అడ్డమై= అడ్డగించి.

తాత్పర్యం: ఇతడు పాండవవీరుడు - వృష్ణికులశ్రేష్ఠులైన బలరామశ్రీకృష్ణులకు తెలియకుండా పెద్ద రథాన్ని ఎక్కి, పద్మాలవంటి కన్నులు గల సుభద్రాకాంతను తోడ్కొని పోతున్నాడు. ఇతడిని వదలితే ధీరులు శ్రీకృష్ణుడు, బలరాముడు కోపపడతారని అడ్డగించి.

విశేషం: "వీరుడు వీఁడు" అనే ప్రశంసాత్మకవాక్యంతో ప్రారంభమయ్యే ఈ పద్యంలో అర్జునుడి వీరకృత్యం భటులచేత వితర్కింపబడింది. ఇది అర్థవైమల్యాన్ని వ్యక్తం చేసే ప్రసాదగుణ విశిష్టరచన. (సంపా.)

క. వీఁకఁ బఱతెంచి నలుగడఁ । దాఁకినఁ గడు నలిగి ఘోరతరశరహతి న
మ్మూఁకలు విరియఁగ నర్జునుఁ । డాఁకరమున నేసె నుగ్రుఁ డయి రణభూమిన్. 200

ప్రతిపదార్థం: వీఁకన్= పరాక్రమంతో; పఱతెంచి= పరుగెత్తివచ్చి; నలుగడన్= నాలుగువైపుల; తాఁకినన్= ఎదుర్కోగా; అర్జునుఁడు; కడున్+అలిగి= మిక్కిలికోపించి; ఉగ్రుఁడు+అయి= భయంకరుడై; రణ, భూమిన్= యుద్ధరంగంలో; ఘోరతర, శర+ఆహతిన్= మిక్కిలి భయంకరాలైన బాణాల దెబ్బలచే; ఆ+మూఁకలు= ఆ సేనలు; విరియఁగన్= చెల్లాచెదురయ్యేటట్లు; ఆఁకరమునన్= ఆగ్రహంతో; కోపంతో; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: పరాక్రమంతో పరుగెత్తి వచ్చి నలువైపుల ముట్టడించగా అర్జునుడు భయంకరుడై యుద్ధరంగంలో మిక్కిలి తీవ్రాలైన బాణాలతో ఆ సేనలు చెల్లాచెదరయ్యేటట్లు కోపంతో కొట్టాడు.

చ. హరితనయుండు పార్థుఁడు రయంబున నందఱ నాహవక్రియా
విరతులఁ జేసి యప్పురమువీథుల వేదుల రమ్యహర్మ్య గో
పురములఁ దద్గిరీంద్రమణిభూముల భూరితటాకపంకజా
కరనవనందనావకులఁ గాండమయంబులఁ జేసె నీసునన్. 201

ప్రతిపదార్థం: హరి, తనయుండు= దేవేంద్రునికుమారుడు; పార్థుఁడు= అర్జునుడు; రయంబునన్= వేగంగా; అందఱన్= ఆ సైనికులందరినీ; ఆహవ, క్రియా విరతులన్+చేసి= యుద్ధపు పనినుండి విరమించుకొన్నవాళ్ళనుగా చేసి; ఈసునన్= కోపంతో; ఆ+పురము= ఆ పట్టణంయొక్క; వీథులన్; వేదులన్= అరుగులను, రమ్య, హర్మ్య, గోపురములన్= అందములైన మేడల గోపురాలను; తత్+గిరి+ఇంద్రమణి, భూములన్= ఆ పర్వతశ్రేష్ఠంయొక్క రత్నాల నేలలను; భూరి, తటాక, పంకజ+ఆకర,

నవ, నందన+ఆవళులన్= పెద్దచెరువులయొక్క, పద్మాలకు నిలయాలైన సరస్సులయొక్క, కొత్తఉద్యానవనాలయొక్క సమూహాలను; కాండమయంబులన్= బాణాలతో నిండినవాటినిగా; చేసెన్.

తాత్పర్యం: దేవేంద్రునితనయుడైన అర్జునుడు వెంటనే ఆ సైనికులు యుద్ధం విరమించుకొనేటట్లు చేసి, ఆ కోపంతో ఆ పట్టణంలోని వీథులను, అరుగులను, అందాలైన మేడల గోపురాలను, ఆ మహాపర్వతంయొక్క రత్నాల నేలలను, పెద్దచెరువులను, సరస్సులను, ఉద్యానవనాలను బాణాలతో నింపాడు.

విశేషం: అర్జునుని యుద్ధక్రీడ రమణీయం. ద్వారవతీనగర రక్షకులను, యాదవసైన్యాలను అంతమొందించటం ఆయన లక్ష్యం కాదు - తనకు అడ్డురాకుండా చెల్లాచెదురు చేయటం, మళ్ళీ విజృంభించకుండా తన శక్తిసామర్థ్యాలు చూపి, చతికిల పడేటట్లు చేయటం ఆయన ఉద్దేశం. అందుకే ఆయన ద్వారవతి వీథులను, అరుగులను, మేడల గోపురాలను, పర్వతప్రదేశాలను, చెరువులను, సరస్సులను, ఉద్యానవనాలను తన బాణాలతో నింపాడు. అడుగు ముందుకు వేస్తారేమో - జాగ్రత్త! అన్నట్లు - భాషతో కాక బాణాలతో హెచ్చరించి వెళ్ళాడు. అందువలన నన్నయ ఈ పద్యంలో శుద్ధఓజస్సును పోషించకుండ ప్రసాదగుణయుక్తమైన ఓజస్సునే ప్రదర్శించాడు. రసోదంచితగుణవద్రచన కిది ఉదాహరణం. ఈవిధంగా సుభద్రావివాహఘట్టంలో నన్నయ దశగుణాలను ఆవిష్కరించే రచనను చేసి తన శైలియొక్క ప్రత్యేకతను ప్రదర్శించాడు. (సంపా.)

క. అమరేంద్రసుతుఁడు దనకుం । గమలాక్షి సుభద్ర రథముఁ గడపఁగ ననిలో
నమిత యదుసైన్యముల న । శ్రమమున నోడించి లబ్ధ జయుఁ డయి యరిగెన్. 202

ప్రతిపదార్థం: అమర+ఇంద్ర, సుతుఁడు= దేవేంద్రునియొక్కకుమారుడు - అర్జునుడు; తనకున్; కమల+అక్షి= పద్మాలవంటి కన్నులు కలది; సుభద్ర; రథమున్= రథాన్ని; కడపన్+కన్= నడపగా; అనిలోన్= యుద్ధంలో; అమిత, యదు, సైన్యములన్= పరిమితి లేని యాదవసైన్యాలను; అశ్రమమునన్= సులభంగా; ఓడించి, లబ్ధ, జయుఁడు+అయి= జయాన్ని పొందినవాడై - అంటే జయాన్ని పొంది; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఇంద్రతనయుడైన అర్జునుడు తనకు సుభద్ర రథం నడుపగా - యుద్ధంలో అపరిమితాలైన యాదవసైన్యాలను సులభంగా ఓడించి, విజయాన్ని పొంది వెళ్ళాడు.

వ. అంత సభాపాలుండు ప్రబల జలధార ధ్వాన గంభీరభేరీధ్వనిచే నర్జునుపరాక్రమం బెఱింగించిన దాని విని యంతర్ద్వీపంబున నున్న బలదేవాదియాదవులందఱు నాక్షణంబ పురంబునకు వచ్చి సభాసీను లయి. 203

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; సభాపాలుండు; ప్రబల, జలధర, ధ్వాన, గంభీర, భేరీ, ధ్వనిచేన్= గొప్ప మేఘధ్వనివంటి గంభీరమైన నగారా మ్రోతచేత; అర్జును= అర్జునుని; పరాక్రమంబున్= పరాక్రమాన్ని; ఎఱింగించినన్= తెలుపగా; దానిన్= దానిని; విని; అంతర్+ద్వీపంబునన్, ఉన్న, బలదేవ+ఆది, యాదవులు+అందఱున్= అంతర్ద్వీపంలో ఉండే బలరాముడు మొదలైన యాదవులంతా; ఆ, క్షణంబు+అ= ఆ వెంటనే; పురంబునకున్= ద్వారవతీపురానికి; వచ్చి; సభా+ఆసీనులు+అయి= సభలో కూర్చున్నవాళ్ళయి.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా విజయాన్ని సాధించి వెళ్ళిన తరువాత - సభాపాలుడు పెద్ద మేఘధ్వనివంటి గంభీరమైన నగారామ్రోతతో అర్జునునిపరాక్రమం తెలుపగా, అది విని, అంతర్ద్వీపంలో ఉన్న బలరాముడు మొదలైన యాదవులంతా అప్పటికప్పుడే ద్వారవతీపురానికి వచ్చి సభ చేసి.

క. యాదవుల నాదరింపక । యాదవిఁ దోడ్కొని కిరీటి యరిగెను గంభీ

రోదధిఁ గరముల నీఁదం । గా దనక కడంగె నధికగర్వోద్ధతుఁ డై. 204

ప్రతిపదార్థం: కిరీటి= అర్జునుడు; యాదవులన్= యాదవుల్ని; ఆదరింపక= లెక్కపెట్టక; యాదవిన్= యాదవకాంతను; తోడ్కొని= వెంటతీసికొని; అరిగెను= వెళ్ళాడు; గంభీర+ఉదధిన్= లోతైన మహాసముద్రాన్ని; కరములన్= చేతులతో; ఈఁదన్+కాదు+అనక= ఈదటం సాధ్యం కాదనకుండా; అధిక, గర్వ+ఉద్ధతుఁడు+ఐ= మిక్కిలిగర్వంతో విజృంభించినవా డై; కడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: యాదవులను లెక్కపెట్టక అర్జునుడు యాదవకాంతను తోడ్కొని వెళ్ళాడు. లోతైన మహాసముద్రాన్ని చేతులతో ఈదటం సాధ్యం కాదని తెలిసికొనకుండా గర్వాతిశయంతో విజృంభించి ఈ పనికి పూనుకొన్నాడు.

మత్తకోకిల.

ఏల పార్థుపరాక్రమంబు సహింప? నాతని నాహవ

వ్యాలు నిప్పుడ పట్టి తెత్తము; వాతధూతదవానల

జ్వాలకున్ వనరాశివేల కసంఖ్యయాదవసేనకున్

దేలిపోవక చక్కనయ్యెడు ధీరు లెవ్వరు పోరిలోన్. 205

ప్రతిపదార్థం: పార్థు, పరాక్రమంబున్= అర్జునునియొక్క పరాక్రమాన్ని; సహింపన్= ఓర్చుకొనటం; ఏల= ఎందుకు? ఆహవ, వ్యాలున్= యుద్ధంలో పొగరుపట్టిన ఏనుగువంటివాడిని; అతనిన్= అతనిని; ఇప్పుడు+అ; పట్టితెత్తము= పట్టి తెస్తాము; వాత, ధూత, దవానల, జ్వాలకున్= గాలిచే కదలింపబడిన దావాగ్నిజ్వాలకు; వనరాశి, వేలకున్= సముద్రం ఉప్పెనకు; అసంఖ్య, యాదవ, సేనకున్= అంతులేని యాదవసైన్యానికి; పోరిలోన్= యుద్ధంలో; తేలిపోవక= తొలగిపోక; చక్కన+అయ్యెడు= ఎదుట నిలువగల; ధీరులు= ధైర్యవంతులు; ఎవ్వరు?= ఎవరు?

తాత్పర్యం: అర్జునునిపరాక్రమాన్ని సహించటం ఎందుకు? యుద్ధంలో మదించిన ఏనుగువంటి అతడిని పట్టుకొని తీసికొనివద్దాము. గాలిచే రగుల్కొన్న దావాగ్ని జ్వాలకు, సముద్రపుటుప్పెనకు, అంతులేని యాదవసైన్యానికి యుద్ధంలో తొలగిపోకుండా ఎదరు నిలువగలిగిన ధైర్యవంతులెవరు?

విశేషం: అలం: దీపకం, ఉపమ. వృత్తలక్షణాలకు చూడు; ఆది.1.153.విశేషం.

వ. అని విజృంభించి విలయసమయ సముద్ధూత వారాశియుంబోలె ఘూర్ణిల్లుచున్న యాదవవీరుల వారించి వాసుదేవుం జూచి, బలదేవుం డి ట్లనియె. 206

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; విజృంభించి= అతిశయించి; విలయ, సమయ, సముద్ధూత, వారాశియున్+పోలెన్= ప్రళయకాలంలో మిక్కిలి వృద్ధి పొందింపబడిన సముద్రంవలె; ఘూర్ణిల్లుచున్+ఉన్న= తిరుగుపడుతున్న; యాదవ, వీరులన్= యాదవవీరుల్ని; వారించి= అడ్డగించి; వాసుదేవున్= శ్రీకృష్ణుణ్ణి; చూచి; బలదేవుండు= బలరాముడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని విజృంభించి ప్రళయకాలంలో పొంగిన మహాసముద్రంవలె తిరుగుడుపడుతున్న యాదవ వీరులను ఆపి, శ్రీకృష్ణునితో బలరాముడు ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. 'నీ వెఱుఁగకుండ గర్వము । తో విజయుఁడు దా సుభద్ర దోడ్కొని బలిమిం
బోవఁగ నంతసమర్థుఁడె' । నావుడుఁ గృష్ణుండు రాముననకు ని ట్లనియెన్. 207

ప్రతిపదార్థం: నీవు+ఎఱుంగకుండన్= నీకు తెలియకుండానే; విజయుఁడు= అర్జునుడు; గర్వముతోన్, తాన్= తాను; బలిమిన్= బలవంతంగా; సుభద్రన్; తోడ్కొని= వెంటతీసికొని; పోవఁగన్= పోవటానికి; అంత, సమర్థుఁడు+ఎ= అంత మొనగాడా? నావుడున్= అనిఅనగా; రామునకున్= బలరామునికి; కృష్ణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీకు తెలియకుండానే అర్జునుడు గర్వంతో బలవంతంగా సుభద్రను తోడ్కొని పోవటానికి అంత సమర్థుడా!' అని అనగా బలరామునితో శ్రీకృష్ణుడు ఈ విధంగా అన్నాడు.

విశేషం: గూఢమైన అధిక్షేప చతురోక్తికి ఇది చక్కని ఉదాహరణ.

సీ. భరతకులాగ్రణి పాండవసింహంబు । సర్వధర్మజ్ఞుఁ డాసవ్యసాచి
దనమేనమఱఁదలి ధవళాక్షిఁ దోడ్కొని । చనియె; నాతని కది చనదె చెప్పుఁడ!
యప్పార్థుపిఱుఁద మీ రరుగంగ వాఁ డంత । యశ్రమసాధ్యుఁడె యాహవమున?
నఖిలాస్త్రవిదుఁడు ద్రోణాచార్యశిష్యుండు । జితకాశి యని వానిఁ జెప్ప వినరె?

ఆ. వలవ దుడుగుఁ' డనిన వామను పలు కను । వేలఁ గడవదయ్యె వృష్ణిభోజ
యాదవాంబురాశి యట ధనంజయుఁ డవి । జేయుఁ డభిమతార్థసిద్ధిఁ బొంది. 208

ప్రతిపదార్థం: భరత, కుల+అగ్రణి= భరతవంశశ్రేష్ఠుడు; పాండవ, సింహంబు= పాండవశ్రేష్ఠుడు; సర్వ, ధర్మజ్ఞుఁడు= అన్నిధర్మాలు తెలిసినవాడు; సవ్యసాచి= అర్జునుడు; తన= తనయొక్క; మేనమఱఁదలిన్= మేనమరదలిని; ధవళ+అక్షిన్= తెల్లని కన్నులు కలదానిని, అందమైన కన్నులు కలదానిని; తోడ్కొని= వెంటతీసికొని; చనియెన్= వెళ్లాడు; అతనికిన్= ఆ అర్జునునికి; అది, చనదె= అది తగదా; చెప్పుఁడు+అ= చెప్పండి; ఆ+పార్థు, పిఱుఁదన్= ఆ అర్జునుని వెనుక; మీరు+అరుగంగన్= మీరు వెళ్ళగా - అంటే దండెత్తి వెళ్ళగా; వాఁడు= అతడు; ఆవహామునన్= యుద్ధంలో; అంత, అశ్రమ, సాధ్యుఁడు+ఎ= అంత సులభంగా లొంగేవాడా; వానిన్= అతనిని; అఖిల+అస్త్ర, విదుఁడు= అన్ని అస్త్రాలు తెలిసినవాడు; ద్రోణ+ఆచార్య, శిష్యుండు; జితకాశి= యుద్ధంలో జయించి ప్రకాశించేవాడు; అని= అని; చెప్పన్; వినరె= అనగా వినలేదే మీరు; వలవదు= వద్దు; ఉడుగుఁడు= (మీ ప్రయత్నం) మానుకోండి; అనినన్= అని చెప్పగా; వామను, పలుకు= శ్రీకృష్ణునియొక్క మాట; అను; వేలన్= చెలియలికట్టను; వృష్ణి, భోజ, యాదవ; అంబు, రాశి=వృష్ణి, భోజ, యాదవ వంశాలవాళ్ళనే సముద్రం; కడవదు+అయ్యెన్= దాటదాయెను; అవిజేయుఁడు= జయింపసాధ్యం కానివాడు; ధనంజయుఁడు= అర్జునుడు; అభిమత+అర్థ, సిద్ధిన్= ఇష్టమైన కోరిక సఫలం కావటాన్ని; పొంది.

తాత్పర్యం: 'భరతవంశశ్రేష్ఠుడు, పాండవశ్రేష్ఠుడు, సర్వధర్మాలు తెలిసినవాడూ అయిన అర్జునుడు తన మేనమరదలిని తోడ్కొని వెళ్ళటం తగదా? చెప్పండి. మీరు అతడిని వెంబడించి దండెత్తితే యుద్ధంలో అతడంత సులభ సాధ్యుడా? అతడు అన్నిఅస్త్రాలు తెలిసినవాడనీ, అంతటి ద్రోణాచార్య శిష్యుడనీ, యుద్ధంలో జయించి

ప్రకాశించేవాడనీ, మీరు వినలేదా?' - అని శ్రీకృష్ణుడన్నాడు. శ్రీకృష్ణునిమాట అనే చెలియలికట్టను వృష్ణి భోజ యాదవ వంశాలవారనే సముద్రం దాటలేకపోయింది. జయింపసాధ్యం కాని అర్జునుడు తాను కోరినదానిని పొందాడు.

విశేషం: అలం: రూపకం. యాదవులమీద శ్రీకృష్ణుని పట్టు, వ్యూహరచనలో ఆయన నేర్పు, మాటల చాకచక్యం ఈ ఘట్టంలో స్పష్టం.

అర్జునుండు సుభద్రాసహితుండై యింద్రప్రస్థపురంబునకుఁ జనుట (సం.1-213-13)

వ. ఇ ట్లింద్రప్రస్థపురంబున కభిముఖుం డై యానర్తకదేశంబులకుం జని, యందు ముందఱ ముకుందప్రేషితు లయిన దాశార్హవీరులతో నగణ్యారణ్యంబులు గడచుచుఁ, బుణ్యతీర్థంబుల నాడుచు నానాజనపదంబుల విహరించుచు వచ్చి యింద్రప్రస్థపురసమీపంబున. 209

ప్రతిపదార్థం: ఇట్లు; ఇంద్రప్రస్థ, పురంబునకున్; అభిముఖుండు+ఐ= ఎదురు ముఖం కలవాడై - అంటే ఇంద్రప్రస్థపురంవైపు పయనించినవాడై; ఆనర్తక, దేశంబులకున్= ఆనర్తక దేశాలకు; చని= వెళ్ళి; అందున్= అచ్చట; ముందఱన్= ముందుగా; ముకుంద, ప్రేషితులు+అయిన= శ్రీకృష్ణునిచే పంపబడినవాళ్ళయిన; దాశార్హ, వీరులతోన్= దాశార్హునివంశానికి సంబంధించిన వీరులతో; అగణ్య+అరణ్యంబులు= లెక్కించటానికి సాధ్యం కానన్ని అడవులు; కడచుచున్= దాటుతూ; పుణ్య తీర్థంబులన్= పుణ్య తీర్థాలలో; ఆడుచున్= స్నానమాడుతూ; నానా జనపదంబులన్= అనేక గ్రామాలలో; విహరించుచున్; వచ్చి; ఇంద్రప్రస్థ, పుర, సమీపంబునన్= ఇంద్రప్రస్థనగరానికి దగ్గరలో.

తాత్పర్యం: ఈ విధంగా ఇంద్రప్రస్థపురం వైపు పయనించి, ఆనర్తకదేశాలకు వెళ్ళి, అక్కడ శ్రీకృష్ణుడు పంపిన దాశార్హవంశవీరులతో కలిసి లెక్కించసాధ్యంకానన్ని అడవులను దాటుతూ, పుణ్యతీర్థాలలో స్నానమాడుతూ అనేక గ్రామాలలో విహరిస్తూ వచ్చి, ఇంద్రప్రస్థపురానికి సమీపంలో.

ఆ. ఘనభుజుండు నరుఁడు దనతొల్లుపట్టుల । విశ్రమించి భువనవిశ్రుతుండు
మతిఁ దలంచి యాత్మహిత మగు నట్లుగా । నిష్టమున సుభద్ర కిట్టు లనియె. 210

ప్రతిపదార్థం: ఘన, భుజుండు= దృఢమైన భుజాలు కలవాడు; భువన, విశ్రుతుండు= ప్రపంచమంతటా ప్రసిద్ధి కెక్కినవాడు; నరుఁడు; తన, తొల్లుపట్లున్= తన ఆవులమందలున్నచోట; విశ్రమించి= అలసట తీర్చుకొని; మతిన్= మనస్సులో; తలంచి= ఆలోచించి; ఆత్మ, హితము+అగునట్లుగాన్= తనకు మేలు కలిగేటట్లుగా; సుభద్రకున్; ఇష్టమునన్= ప్రీతితో; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: బలమైన భుజాలు కలవాడు, ప్రపంచంలో ప్రసిద్ధికెక్కినవాడు అయిన అర్జునుడు తన ఆవులమంద లున్నచోట విశ్రమించి, తనకు మేలు కలిగేటట్లుగా ఆలోచించి ప్రియమార సుభద్రతో ఇట్లా అన్నాడు.

విశేషం: తొల్లుపట్టు అంటే ఆలమంద. ఆలమందలు సామాన్యంగా ఊరి పొలిమేరలలో ఉంటాయి. అర్జునుడు తన 'తొల్లుపట్టుల' విశ్రమించాడనగా ఇంద్రప్రస్థపట్టణపు పొలిమేరలకు చేరి విశ్రమించాడని భావం. ఇక మిగిలింది ఇంద్రప్రస్థపురప్రవేశమే. మూలంలో పి.పి.యస్.శాస్త్రిగారి ప్రతిలో "క్రోశమాత్రేపురస్యాసీత్ గోష్ఠం పార్థస్యశోభనం" అని ఉన్నది.

వ. 'మన మివ్విధంబునఁ జనునప్పుడు నిన్నుఁ జూచి ద్రుపదరాజపుత్త్రి యప్రియంబులు వలుకునో; యప్పరమ పతివ్రతపలుకు నిక్కువం బగుం గావున, నీ వేకతంబ గోపాలబాలికలతో ముందఱ నరిగి యక్కోమలిం గను మని

పనిచిన సుభద్రయు నిజేశ్వరుపంచిన మార్గంబున నింద్రప్రస్థపురంబునకుం బోయి కుంతీదేవికి ద్రౌపదికి మ్రొక్కిన. **211**

ప్రతిపదార్థం: మనము; ఈ+విధంబునన్; చను, అప్పుడు= వెళ్ళేటప్పుడు; నిన్నున్= నిన్ను; చూచి, ద్రుపద, రాజ, పుత్రి= ద్రుపదరాజుయొక్క కూతురు-ద్రౌపది; అప్రియంబులు= కఠినమైన మాటలు; పలుకునో= అంటుందో ఏమో; ఆ+పరమ, పతివ్రత పలుకు= ఆ మహాపతివ్రత మాట; నిక్కువంబు= నిజం; అగున్= అవుతుంది; కావునన్; నీవు; ఏకతంబు+అ= ఒక్కదానివే; గోపాల, బాలికలతో= గొల్లపిల్లలతో; ముందఱన్= ముందుగా; అరిగి= వెళ్ళి; ఆ+కోమలిన్= ఆ అందగత్తెను - ద్రౌపదిని; కనుము= చూడుము; అని; పనిచిన= ఆజ్ఞాపించగా; సుభద్రయున్= సుభద్రకూడా; నిజ+ఈశ్వరు, పంచిన, మార్గంబునన్= తన భర్త ఆజ్ఞాపించిన విధంగా; ఇంద్రప్రస్థ, పురంబునకున్; పోయి= వెళ్ళి; కుంతీదేవికిన్, ద్రౌపదికిని; మ్రొక్కినన్= నమస్కరింపగా.

తాత్పర్యం: 'మనం ఈ విధంగా కలిసి వెళ్ళితే నిన్ను చూచి ద్రౌపది పరుషవాక్యాలు పలుకుతుందేమో! ఆ పరమపతివ్రత పలుకు నిజమవుతుంది. అందువలన నీవే ప్రత్యేకంగా గోపబాలికలతో కలిసి ముందుగా వెళ్ళి ఆమెను చూడుము' అని ఆజ్ఞాపించగా - సుభద్ర తనభర్త ఆజ్ఞాపించిన విధంగానే ఇంద్రప్రస్థపురానికి వెళ్ళి కుంతీదేవికి, ద్రౌపదికి మ్రొక్కగా.

విశేషం: సామాన్యంగా ఏ ఇల్లాలుకూడా తన మగడు మరొక కాంతను వెంటబెట్టుకొని రావటాన్ని సహించదు కదా! అందువలననే అర్జునుడు సుభద్రకు ఆ ఉపాయం చెప్పాడు. దక్షిణనాయకులకు ఈ దూరదృష్టి, ఉపాయజ్ఞత ఉండక తప్పదు. కొన్ని భారతప్రతులలో 'కని యడుగులం బడు మని' అర్జునుడు సుభద్రకు చెప్పినట్లు కూడా ఉన్నది.

తే. 'పంకజాక్షి! నీపతి ప్రతిపక్షవీర । విజయుఁ డయ్యెడు; నీవును వీరపుత్ర
జనని వగు' మని దీవించె సంతసంబు । తోడ వసుదేవపుత్త్రి నాద్రుపదపుత్త్రి. **212**

ప్రతిపదార్థం: పంకజ+అక్షి= పద్మాలవంటి కన్నులు కలదానా!; నీ, పతి= నీయొక్క భర్త; ప్రతిపక్ష, వీర, విజయుఁడు= శత్రుపక్షవీరులను జయించేవాడు; అయ్యెడున్= అగుగాక; నీవును= నీవుకూడా; వీర, పుత్ర, జననివి= వీరుడైన పుత్రునికి తల్లివి - అనగా వీరమాతవు కమ్ము; అని; ఆ, ద్రుపద, పుత్రి= ఆ ద్రుపదరాజు కూతురు - ద్రౌపది; వసుదేవుని, పుత్రిన్= వసుదేవుని కూతురైన సుభద్రను; సంతసంబుతోడన్, దీవించెన్= సంతోషంతో దీవించింది.

తాత్పర్యం: పద్మాలవంటి అందమైన కన్నులు కలదానా! నీ భర్త శత్రుపక్ష వీర విజయుడు అగుగాక! నీవు కూడా వీరమాతవు అగుదువు గాక! అని ఆ ద్రౌపది సంతోషంతో సుభద్రను దీవించింది.

విశేషం: విజయుడు అనే పదం ఈ సందర్భంలో విశేషార్థాన్ని సాధించింది. నీ భర్త శత్రుపక్షవీరులను జయించే వాడగు గాక - అనే అర్థంలో ద్రౌపది ఆ పదాన్ని ప్రయోగించినా, అర్జునునికి విజయుడు అనే పేరు ఉండటంవలన - నీ భర్త శత్రుపక్ష వీరులను జయించే అర్జునుడగుగాక అనే అర్థంకూడా ఇక్కడ విశేషించి వ్యక్తమవుతున్నది. 'అప్పరమపతివ్రత పలుకు నిక్కువం బగు' అని అర్జునుడు అంతకుముందే సుభద్రతో అన్నట్లు - ద్రౌపది తెలిసి పలికినా, తెలియక పలికినా సుభద్రకు విజయుడే భర్త అయ్యాడు. అంతేకాక 'వీరపుత్ర జనని వగుము' అని దీవించింది. మున్ముందు ఆమె అభిమన్యునివంటి వీరాగ్రేసరుణ్ణి కని వీరమాత ఔతుంది. ఇది భావికథార్థ వ్యంజకమైన పతాకస్థానం.

వ. ఇట్లు ద్రోవదిచేత దీవనలు సేకొని కుంతీదేవియొద్ద సుభద్ర యున్నంత; నట యర్జునుండును నసంఖ్యాకదాశార్హసైన్య సమేతుం డై యనేకబ్రాహ్మణాశీర్వాదంబు లెసంగ నింద్రప్రస్థపురంబుం బ్రవేశంబుసేసి ధౌమ్యునకు ధర్మరాజునకు భీమునకుఁ గుంతీదేవికి మ్రొక్కి; తనకు మ్రొక్కిన కవలం గౌఁగిలించుకొని పరమానందంబున నుండు నంత. 213

ప్రతిపదార్థం: ఇట్లు; ద్రోవదిచేత= ద్రౌపదిచేత; దీవెనలు= ఆశీర్వాదాలు; చేకొని= గైకొని; కుంతీదేవి, ఒద్దన్= కుంతీదేవి దగ్గర; సుభద్ర; ఉన్నంతన్= ఉండగా; అచట= అచ్చట; అర్జునుండును= అర్జునుడుకూడ; అసంఖ్యాక, దాశార్హ, సైన్య, సమేతుండు+ఐ= లెక్కింప సాధ్యంకాని దాశార్హమైన సైన్యంతో కూడుకొన్నవాడై; అనేక, బ్రాహ్మణ+ఆశీర్వాదంబులు= పలువురు విప్రుల దీవెనలు; ఎసంగన్= అతిశయిల్లగా; ఇంద్రప్రస్థ, పురంబున్= ఇంద్రప్రస్థపురాన్ని; ప్రవేశంబు, చేసి,= ప్రవేశించి; ధౌమ్యునకున్= ధౌమ్యునికి; ధర్మరాజునకున్= ధర్మరాజునకు; భీమునకున్= భీమునికి; కుంతీదేవికిన్; మ్రొక్కి; తనకున్; మ్రొక్కిన= నమస్కరించినట్టి; కవలన్= నకులసహదేవులను; కౌఁగిలించుకొని; పరమ+ఆనందంబునన్= మిక్కిలి సంతోషంతో; ఉండు+అంతన్= ఉండగా;

తాత్పర్యం: ఈ విధంగా సుభద్ర ద్రౌపదిచేత దీవెనలు పొంది కుంతీదేవిదగ్గర ఉండగా, అర్జునుడు అపరిమితమైన దాశార్హసైన్యంతో; పెక్కుమంది బ్రాహ్మణులఆశీర్వచనాలతో ఇంద్రప్రస్థపురంలో ప్రవేశించి తమ పురోహితుడైన ధౌమ్యునికి, అన్నలైన ధర్మజభీములకు, తల్లి కుంతీదేవికి మ్రొక్కి, తనకు మ్రొక్కిన తమ్ములు నకులసహదేవులను కౌగిలించుకొని పరమానందంతో ఉండగా.

క. చెలియలు మఱఁదియుఁ జని యి । మ్ముల నింద్రప్రస్థనగరమున నభిమతబం
ధులయొద్ద నున్నవా రని । జలశయనుఁడు విని కరంబు సంతుష్టుం డై. 214

ప్రతిపదార్థం: చెలియలు= చెల్లెలు; మఱఁదియున్= మరిది; చని= వెళ్ళి; ఇమ్ములన్= సుఖంగా; ఇంద్రప్రస్థ, నగరమునన్; అభిమత, బంధుల, ఒద్దన్= ఇష్టమైన బంధువులదగ్గర; ఉన్నవారు= ఉన్నారు; అని= అని; జల, శయనుఁడు= నీటిమీద పవళించేవాడు- శ్రీమహావిష్ణువు- శ్రీకృష్ణుడు; విని= విని; కరంబు= మిక్కిలి; సంతుష్టుండు+ఐ= సంతోషం పొందినవాడై.

తాత్పర్యం: చెల్లెలు సుభద్ర, మరది అర్జునుడు ఇంద్రప్రస్థపురానికి వెళ్ళి, సుఖంగా ఇష్టమైన బంధువులతో కలిసి ఉన్నారని విని - శ్రీకృష్ణుడు సంతోషించినవాడై.

శ్రీకృష్ణబలదేవాదులు పాండవులకుఁ గానుకలు తెచ్చియిచ్చుట (సం.1-213-23)

సీ. బలదేవ సాత్యకి ప్రద్యుమ్న వసుదేవు । లాదిగా బెరసిన యాదవాగ్ర
గణ్యులుఁ దాను నగణ్యమహావస్తు । వాహనంబులు గొని వాసుదేవుఁ
డనుజకు నరణ మీ నర్థితోఁ జనుదెంచె; । హరిరాక యెఱిఁగి ధర్మాత్మజుండు
గరము గారవమునఁ గవలను గృష్ణున । కెదురు పుత్తెంచిన నింద్రలీల

ఆ. నిందువంశవిభుఁ డుపేంద్రుఁ డింద్రప్రస్థ । పురము సొచ్చె నతివిభూతి మెఱసి
యనుజవరులతోడ నంతఁ బ్రత్యుద్గతుం । డై యుధిష్ఠిరుండు హర్ష మెసఁగ. 215

ప్రతిపదార్థం: వాసుదేవుఁడు= శ్రీకృష్ణుడు; అనుజకున్= చెల్లెలికి-సుభద్రకు; అరణము= ఆడపడుచులను అత్తవారింటికి పంపినపుడు ఇచ్చే ధనం, ఇచ్చే కానుకలను; ఈన్= ఇవ్వటానికి; అగణ్య, మహా, వస్తు, వాహనంబులు= లెక్కింపసాధ్యం కానన్ని గొప్పవస్తువులు, వాహనాలు; కొని= తీసికొని; బలదేవ, సాత్యకి, ప్రద్యుమ్న, వసుదేవులు+ఆదిగాన్= బలరాముడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు, వసుదేవుడు మొదలుగా; బెరసిన= కూడిన; యాదవ+అగ్రగణ్యులు= యాదవశ్రేష్ఠులు; తానున్; అర్థితోన్= వేడ్కతో; చనుదెంచెన్= వచ్చాడు; ఇందువంశ, విభుఁడు= చంద్రవంశపురాజు; ధర్మ+ఆత్మజుండు= ధర్ముని యొక్క కుమారుడు- ధర్మరాజు; హరి, రాక= శ్రీకృష్ణునిరాక; ఎఱిఁగి= తెలుసుకొని; కరము= మిక్కిలి; గారవమునన్= ప్రీతితో; ఇంద్రలీలన్= దేవేంద్రునివలె; కవలను= నకుల సహదేవులను; కృష్ణునకున్; ఎదురు, పుత్తెంచినన్= ఎదురు పంపగా; ఉపేంద్రుఁడు= శ్రీకృష్ణుడు; ఇంద్రప్రస్థ, పురము= ఇంద్రప్రస్థపురాన్ని; చొచ్చెన్= ప్రవేశించాడు; అంతన్= అపుడు; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అతి, విభూతిన్= మిక్కిలి ఐశ్వర్యంతో; మెఱసి= ప్రకాశించి; అనుజ, వరులతోడన్= శ్రేష్ఠులైన తమ్ములతో కూడా; ప్రతి+ఉద్గతుండు+ఐ= ఎదురేగినవాడై; హర్షము= సంతోషం; ఎసఁగన్= అతిశయిల్లగా.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు చెల్లెలికి అరణంగా ఇవ్వటానికి లెక్కింప సాధ్యంకానన్ని గొప్ప వస్తువులను, వాహనాలను తీసికొని - బలరాముడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు, వసుదేవుడు మొదలైన యాదవకులశ్రేష్ఠులతో కలిసి ఎంతో సంతోషంతో వచ్చాడు. చంద్రవంశప్రభువైన ధర్మరాజు శ్రీకృష్ణునిరాక తెలిసికొని మిక్కిలిగౌరవంతో, దేవేంద్ర విలాసంతో, నకులసహదేవులను ఎదురు పంపగా, ఆయన ఇంద్రప్రస్థపురంలో ప్రవేశించాడు. అప్పుడు యుధిష్ఠిరుడు శ్రేష్ఠులైన తమ్ములతో తానుకూడా ఎదురేగి ఆనందాతిశయంతో.

వ. **వసుదేవాది యాదవవృద్ధుల కెల్ల మ్రొక్కి బలదేవ వాసుదేవ సాత్యకి సారణ ప్రద్యుమ్నాదుల నుచితప్రియ పూర్వకంబున సత్కృతులం జేసిన.** **216**

ప్రతిపదార్థం: వసుదేవ+ఆది= వసుదేవుడు మొదలైన, యాదవ, వృద్ధులకున్+ఎల్లన్= యాదవవృద్ధుల కందరికీ; మ్రొక్కి; బలదేవ, వాసుదేవ, సాత్యకి, సారణ, ప్రద్యుమ్న+ఆదులన్= బలరాముడు, శ్రీకృష్ణుడు, సాత్యకి, సారణుడు, ప్రద్యుమ్నుడు మొదలైనవారిని; ఉచిత, ప్రియ, పూర్వకంబునన్= ప్రేమతో తగినరీతిగా; సత్కృతులన్+చేసినన్= సమ్మానింపగా.

తాత్పర్యం: వసుదేవుడు మొదలైన యాదవవృద్ధులకు నమస్కరింపగా - వాసుదేవుడు, సాత్యకి, సారణుడు, ప్రద్యుమ్నుడు మొదలైనవాళ్ళను ప్రియమార గౌరవింపగా.

ఉ. **ఆనకదుందుభిప్రభృతియాదవులుం గురుముఖ్యులున్ మృదం**
గానకదుందుభుల్ సెలఁగ నత్యనురాగముతో నిరంతర
శ్రీనుతు లొప్ప నుత్సవము సేసిరి సప్తదినంబు లిష్టస
మ్మానములన్ మహీసురసమాజసమీహితపూజనంబులన్. **217**

ప్రతిపదార్థం: ఆనకదుందుభి= వసుదేవుడు; ప్రభృతి= మొదలైన; యాదవులున్=యాదవులు; కురు, ముఖ్యులున్= కురువంశశ్రేష్ఠులు; మృదంగ+ఆనక, దుందుభుల్, చెలఁగన్= మద్దెలలు, తప్పెటలు; భేరులు, మ్రోగుతుండగా; నిరంతరశ్రీ, నుతులు= ఎడతెగని సంపద, పొగడ్తలు; ఒప్పన్= ఒప్పగా; ఇష్ట, సమ్మానములన్= ఇష్టములైన గౌరవాలచేత (బంధువులకు); మహీసుర, సమాజ, సమీహిత, పూజనంబులన్= బ్రాహ్మణ సమూహంచే కోరబడిన పూజలచేత; అతి+అనురాగముతో= మిక్కిలి ప్రీతితో; సప్త, దినంబులు= ఏడురోజులు; ఉత్సవము, చేసిరి= పండుగచేశారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వసుదేవుడు మొదలైన యాదవులు, కురువంశప్రముఖులు - మద్దెలలు, తప్పెటలు, నగారాలు మ్రోగుతుండగా - అంతులేని సంపద, స్తోత్రాలు శోభిల్లగా - బంధువులను గౌరవించి, బ్రాహ్మణసమూహాన్ని కోరుకొన్న విధంగా పూజించి ఎంతో ప్రీతితో ఏడురోజులు పండుగ చేశారు.

విశేషం: వసుదేవుడు దేవమీఢునికి, మారిషకు పుట్టిన కుమారుడు. ఇతడు పుట్టేటప్పుడు ఆకాశంలో దుందుభులు మ్రోగాయి. అందువలన ఇతనికి ఆనకదుందుభి అనే పేరుకూడా కలిగింది. వసుదేవునికి రోహిణియందు బలరాముడు, గదుడు, సారణుడు మొదలైనవాళ్ళు జన్మించారు. దేవకియందు కీర్తిమంతుడు, సుషేణుడు, భద్రుడు, సంకర్షణుడు, శ్రీకృష్ణుడు మొదలైనవాళ్ళు జన్మించారు. దేవమీఢునికే 'శూరు' డని పేరు.

వ. అంత. 218

తాత్పర్యం: అప్పుడు.

క. నిరుపమపరార్ధ్యరుచి సుం । దరరత్నావళుల శోభితము లగువానిన్
వరదుఁడు సహస్రసంఖ్యా । భరణంబులఁ బార్థునకు సుభద్రకు నిచ్చెన్. 219

ప్రతిపదార్థం: వరదుఁడు= వరాలను ఇచ్చేవాడు - శ్రీకృష్ణుడు; నిరుపమ, రుచి, సుందర, రత్న+ఆవళులన్= సాటిలేని ఉత్తమకాంతిచే అందమైన రత్న సమూహాలతో; శోభితములు+అగు, వానిన్= ప్రకాశిస్తున్న వాటిని; సహస్రసంఖ్య+ ఆభరణంబులన్= వేయి సొమ్ములను; పార్థునకున్= అర్జునునికి; సుభద్రకున్, ఇచ్చెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు - సాటిలేని శ్రేష్ఠమైనకాంతితో, అందమైన రత్నసమూహాలతో ప్రకాశించే వెయ్యి ఆభరణాలను అర్జునునికి, సుభద్రకు ఇచ్చాడు.

వ. మఱియును. 220

తాత్పర్యం: అంతేకాక.

సీ. అవిరళక్షరితదానార్ద్రగండస్థల । గజసహస్రంబును, గనకరత్న
రచిత మై తురగసారథిసహితం బైన । రథసహస్రంబును, రమ్యభూష
ణాలంకృతస్త్రీసహస్రంబుఁ, గాంచన । శిబికాసహస్రంబుఁ, జిత్రలలిత
గతి నొప్ప నేనూఱుగాడిదలను, సింధు । బాహ్లికకాంభోజపారసీక

ఆ. జాత మైన తురగశతసహస్రము, లక్ష । గోధనంబు, నధికఘోరవీర
దర్పయుక్తు లైన దశలక్షదాశార్హ । వరుల నరణ మిచ్చె వామనుండు. 221

ప్రతిపదార్థం: అవిరళ, క్షరిత, దాన+ఆర్ద్ర, గండస్థల, గజ, సహస్రంబును= ఎడతెగకుండా కారుతున్న మదజలంతో తడిసిన చెక్కిళ్ళు గల ఏనుగులు వేయింటిని; కనక, రత్న, రచితము+ఐ= బంగారంతో; రత్నాలతో నిర్మింపబడి, తురగ, సారథి,

సహితంబు+ఐన= గుర్రాలతో, సారథితో కూడుకొన్న; రథ, సహస్రంబును= రథాలు వెయ్యింటిని; రమ్య, భూషణ+అలంకృత, స్త్రీ, సహస్రంబున్= అందమైన ఆభరణాలచే అలంకరింపబడిన స్త్రీలను వెయ్యిమందిని; కాంచన, శిబికా, సహస్రంబును= బంగారు పల్లకీలు వెయ్యింటిని; చిత్ర, లలిత, గతిన్= చిత్రమూ, మనోహరమూ అయిన నడకతో; ఒప్పు= శోభిల్లు; ఏనూఱు, గాడిదలను= ఐదువందల గాడిదలను; సింధు, బాహ్లిక, పారసీక, జాతము+ఐన= సింధు బాహ్లిక కాంభోజ పారసీక దేశాలలో పుట్టిన; తురగ, శత, సహస్రము= గుర్రాలు నూరువేలను; లక్ష, గోధనంబున్= లక్ష గోరూప ధనాన్ని; అధిక, ఘోర, వీర, దర్ప, యుక్తులు+ఐన= మిక్కిలి భయంకరమైన వీరగర్వంచే కూడుకొన్న; దశ, లక్ష, దాశార్హ, వరులన్= పదిలక్షలమంది దాశార్హ వీరశ్రేష్ఠులను; వామనుండు= శ్రీకృష్ణుడు, అరణము+ఇచ్చెను= అత్తవారింటికి పంపిన ఆడపడుచులకు ఇచ్చే కానుకగా ఇచ్చాడు.

తాత్పర్యం: ఎడతెగకుండా కారుతున్న మదజలంచేత తడిసిన చెక్కిళ్ళు గల ఏనుగులు వెయ్యింటిని, బంగారుతో రత్నాలతో రూపొంది, గుర్రాలతో సారథితో కూడుకొన్న రథాలు వెయ్యింటిని, అందమైన ఆభరణాలతో అలంకరించిన స్త్రీలను వెయ్యిమందిని, బంగారు పల్లకీలను వెయ్యింటిని, చిత్రమై అందమైన నడకతో ఒప్పే గాడిదలు అయిదు వందలను, సింధు బాహ్లిక కాంభోజ పారశీకదేశాలలో పుట్టిన గుర్రాలను నూరువేలను; ఆవులు ఒక లక్షను, మహాభయంకరమైన వీరగర్వం కల దాశార్హవీరులను పదిలక్షలమందిని - శ్రీకృష్ణుడు అరణంగా ఇచ్చాడు.

క. క్రమముననుఁ గొంతిదేవిని । యమనందను భీముఁ గవల నాద్రౌపది ను

త్తమరత్నాభరణాదుల । నమరఁగ వేర్వేఱ నెయ్యుఁ డయి పూజించెన్. 222

ప్రతిపదార్థం: క్రమముననుఁ= వరుసగా; గొంతిదేవిని= కుంతీదేవిని; యమ, నందనున్=ధర్మరాజును; భీమున్= భీముని; కవలన్= నకుల సహదేవులను; ఆ, ద్రౌపదిన్= ఆ ద్రౌపదిని; ఉత్తమ, రత్న+ఆభరణాదులన్= శ్రేష్ఠములైన రత్నాభరణాలతో; వేరు+వేఱు+అ= వేరువేరుగా; నెయ్యుఁడు+అయి= స్నేహితుడై; అమరఁగన్= ఒప్పుగా; పూజించెన్.

తాత్పర్యం: క్రమంగా కుంతీదేవిని, ధర్మరాజును, భీముడిని, కవలలను, ద్రౌపదిని శ్రేష్ఠాలైన రత్నాభరణాలతో వేరువేరుగా పూజించాడు.

వ. మఱియు బలదేవాదియాదవముఖ్యు లెల్ల సుభద్రార్జునులం బూజించి, పాండవులచేతం బ్రతిపూజితు లై ద్వారవతికిం జని; రుపేంద్రుం డింద్రనందనుతోడి యిష్టవినోదంబుల నింద్రప్రస్థపురంబున నుండె నంత. 223

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; బలదేవ+ఆది; యాదవ, ముఖ్యులు+ఎల్లన్= బలరాముడు మొదలైన యాదవ ప్రముఖులంతా; సుభద్రా+అర్జునులన్= సుభద్రను అర్జునుని; పూజించి= పూజించి; పాండవులచేతన్= పాండుకుమారులచేత; ప్రతిపూజితులు+ఐ= ఎదురు పూజింపబడినవాళ్ళయి; ద్వారవతికిన్= ద్వారవతికి; చనిరి= వెళ్ళారు; ఉపేంద్రుండు= శ్రీకృష్ణుడు; ఇంద్ర, నందనుతోడి= అర్జునునితో; ఇష్ట, వినోదంబులన్= ఇష్టములైన వినోదాలతో; ఇంద్రప్రస్థ, పురంబునన్= ఇంద్రప్రస్థపురంలో; ఉండెన్= ఉన్నాడు; అంతన్= అటుపై.

తాత్పర్యం: బలరాముడు మొదలైన యాదవప్రముఖులంతా సుభద్రార్జునులను పూజించి, పాండవులచేత బదులు పూజలు అందుకొని ద్వారవతికి వెళ్ళారు. శ్రీకృష్ణుడు అర్జునునితో కలిసి ఇంద్రప్రస్థంలో ఇష్ట వినోదాలలో ఉన్నాడు. తరువాత.

అభిమన్యు ప్రభృతుల జననము (సం.1-213-58)

ఉ. ధన్యుల కా సుభద్రకు శతక్రతుపుత్త్రున కుద్భవించె స
మ్మాన్య యశుండు పుత్త్రుఁ డభిమన్యుఁడు వైన్యనిభుం డనన్యసా
మాన్యపరాక్రమప్రబలమాన్యుఁడు పుణ్యచరిత్రుఁ డన్యరా
జన్యభయంకరుండు రణశౌర్యుఁడు పాండవవంశకర్త యై. 224

ప్రతిపదార్థం: ధన్యులకున్= పుణ్యవంతులకు; ఆ, సుభద్రకున్; శతక్రతు, పుత్త్రునకున్= దేవేంద్రుని కుమారునకు - అర్జునునకు; సమ్మాన్య, యశుండు= మిక్కిలి పూజింపదగిన కీర్తి గలవాడు; వైన్య, నిభుండు= పృథుచక్రవర్తితో సమాన మైనవాడు; అనన్య, సామాన్య, పరాక్రమ, ప్రబల, మాన్యుఁడు= ఇతరులెవ్వరికీ లేని పరాక్రమాధిక్యంచేత గౌరవించదగినవాడు; పుణ్య, చరిత్రుఁడు= పవిత్రమైన నడవడిక కలవాడు; అన్య, రాజన్య, భయంకరుడు= ఇతరరాజులకు భయాన్ని కలిగించేవాడు; రణ, శౌర్యుఁడు= యుద్ధంలో శూరత్వం కలవాడు; అభిమన్యుడు; పాండవ, వంశ, కర్త+ఐ= పాండవవంశాన్ని నిలిపేవాడై; ఉద్భవించెన్= జన్మించాడు.

తాత్పర్యం: పుణ్యవంతులైన సుభద్రార్జునులకు - మిక్కిలి పూజింపదగిన కీర్తికలవాడు, పృథుచక్రవర్తితో సమానమైనవాడు, ఇతరులెవ్వరికీ లేని పరాక్రమాధిక్యంచేత గౌరవింపదగినవాడు, పవిత్రమైన నడవడిక కలవాడు, ఇతరరాజులకు భయాన్ని కలిగించేవాడు, యుద్ధంలో శౌర్యం కలవాడు అయిన కుమారుడు - పాండవవంశం నిలిపేవాడై జన్మించాడు.

విశేషం: అభిమన్యుడు సుభద్రార్జునులకు పుట్టినకొడుకు. అతడు పుట్టినప్పుడు ఆకాశవాణులు పలుకలేదు. దేవతలు పూలవానలు కురిపించలేదు. అయితే, అతనిజీవితంలో క్రమంగా ఆవిష్కృతమయ్యేవీ, భావికథాసూచకాలూ అయిన సార్థక విశేషణాలు నన్నయ వాడి ప్రసన్నకథాకలితార్థయోజనం సాధించాడు. అతడు పుట్టుకతోనే పృథుచక్రవర్తివంటివాడు - పరాక్రమవంతుడు, పుణ్యచరిత్రుడు, శత్రుభయంకరుడు, వంశకర్త - అనే విశేషణాలు అభిమన్యుని జీవితచరిత్రకు సూచకాలు. సుభద్రార్జునులు నిజంగా ధన్యులు!

చ. సుతజననోత్సవంబున విశుద్ధయశుండు యుధిష్ఠిరుండు సం
భృతహృదయప్రమోదుఁ డయి పెంపున నిచ్చె సువర్ణభూషణ
ప్రతతులు గోధనాయుతము బ్రాహ్మణముఖ్యులకున్ నిరంతర
వ్రతులకు వేదవేదులకు వారిజసంభవునట్టివారికిన్. 225

ప్రతిపదార్థం: సుత, జనన+ఉత్సవంబునన్= కుమారుడు పుట్టినపుడు చేసే పండుగలో; విశుద్ధ, యశుండు= స్వచ్ఛమైన కీర్తి కలవాడు; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; సంభృత, హృదయ, ప్రమోదుఁడు+అయి= నిండిన హృదయానందం కలవాడై; వారిజ, సంభవు, అట్టివారికిన్= పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవునివంటివారికి; వేద, వేదులకున్= వేదాలు తెలిసినవారికి - వేదపండితులకు; నిరంతర వ్రతులకున్= ఎల్లప్పుడు వ్రతాలు చేసేవారికి; బ్రాహ్మణ, ముఖ్యులకున్= బ్రాహ్మణ శ్రేష్ఠులకు; సువర్ణ, భూషణ, ప్రతతులు= బంగారు ఆభరణాల సమూహాలు; గోధన+అయుతము= గో ధనం పదివేలు - అంటే పదివేల గోవులు; పెంపునన్= సమృద్ధిగా; ఇచ్చెన్.

తాత్పర్యం: అభిమన్యుడు పుట్టినపుడు జరిపినపండుగలో స్వచ్ఛమైన కీర్తిగల ధర్మరాజు - మహానందంతో బ్రహ్మదేవునివంటివాళ్ళు, వేదవేత్తలైనవాళ్ళు, ఎల్లప్పుడు వ్రతాలు చేసేవాళ్ళు అయిన బ్రాహ్మణశ్రేష్ఠులకు బంగారు ఆభరణాలు, పదివేలగోవులు సమృద్ధిగా ఇచ్చాడు.

వ. ఇట్లుదయించిన యభిమన్యుండు దల్లిదండ్రులకు సకల జనులకు నానందం బొనరించుచు ధౌమ్య నిర్మిత జాతకర్మ చౌలోపనయనుం డయి పెరుఁగుచు. 226

ప్రతిపదార్థం: ఇట్లు; ఉదయించిన= జన్మించిన; అభిమన్యుండు; తల్లిదండ్రులకున్; సకల, జనులకున్; ఆనందంబు; ఒనరించుచున్= కూర్చుచు; ధౌమ్య, నిర్మిత, జాతకర్మ, చౌల+ఉపనయనుండు= పురోహితుడైన ధౌమ్యునిచే చేయబడిన, జాతకర్మ, ఉపనయనం కలవాడు; అయి; పెరుఁగుచున్= పెరుగుతూ.

తాత్పర్యం: ఇట్లా జన్మించిన అభిమన్యుడు తల్లిదండ్రులకూ, జనులకూ ఆనందం కలిగిస్తూ, ధౌమ్యుడు జాతకర్మను, ఉపనయనాన్నీ చేయగా, పెరుగుతూ.

విశేషం: జాతకర్మ, చౌలం, ఉపనయనం - షోడశకర్మలలోనివి. జాతకర్మ - పుట్టినప్పుడు చేసే క్రియ. చౌలం - జుట్టుపెట్టి తలవెంట్రుకలు తీయటం; ఉపన యనం - వేదవిద్యాభ్యాస యోగ్యతను కలిగించే సంస్కారం.

మత్తకోకిల.

ఆదిఁగోలెను గృష్ణుచే దయ నావృతుం డయి ధౌమ్యుతో
వేద మంగయుతంబుగాఁ జదివెన్, ధనంజయుతో ధను
ర్వేద మిమ్ముగ నభ్యసించెఁ; బ్రవీరవైరిపతాకినీ
భేదమార్గము లెల్ల నేర్చె నభేద్యవిక్రమసంపదన్. 227

ప్రతిపదార్థం: ఆదిన్+కోలెన్= మొదటినుండి; కృష్ణుచే=కృష్ణునిచే; దయన్= దయతో;ఆవృతుండు+అయి= చుట్టబడినవాడై; ధౌమ్యుతోన్= ధౌమ్యునిద్వారా; వేదము; అంగ, యుతంబుగాన్= అంగాలతోకూడి; చదివెన్; ధనంజయుతోన్= అర్జునునిద్వారా; ఇమ్ముగన్= విరివిగా; ధనుర్వేదము= ధనుర్వేదాన్ని; అభ్యసించెన్= నేర్చుకొన్నాడు; అభేద్య, విక్రమ, సంపదన్= ఓడింప సాధ్యంకాని పరాక్రమం అనే సంపదచే; ప్రవీర, వైరి, పతాకినీ, భేద, మార్గములు+ఎల్లన్= మిక్కిలి శూరులైన శత్రువుల సైన్యాలను భేదించే విధాలన్నింటినీ; నేర్చెన్= నేర్చుకొన్నాడు.

తాత్పర్యం: మొదటినుండి అభిమన్యుడు - శ్రీకృష్ణుని దయ నిండుగా కలిగి పాండవపురోహితుడైన ధౌమ్యుని దగ్గర ఆరు అంగాలతో కూడి వేదవిద్యను చదివాడు. తండ్రి అర్జునునిదగ్గర విరివిగా ధనుర్వేదాన్ని అభ్యసించాడు. అభేద్యమైన పరాక్రమసంపదతో ప్రబలశత్రుసైన్యాలను భేదించే విధాలన్నింటినీ నేర్చుకొన్నాడు.

విశేషం: వేదాంగాలు - శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిష్యం, కల్పం. మత్తకోకిల వృత్తలక్షణం. చూడు. ఆది.1.153 విశేషం. అభిమన్యుడు 'కృష్ణునిదయనావృతుడై' పెరిగెనని చెప్పటం సార్థకం. సారమతులైనవాళ్ళు అభిమన్యు మరణానంతరం అతని సంతానాన్ని రక్షించటంలో చూపించే దయ ఇక్కడ వస్తుధ్వని.

వ. అంత ద్రుపదరాజనందనయుం గ్రమంబునఁ బాండురాజనందనులవలనఁ బ్రతివింధ్య శ్రుతసోమ శ్రుతకీర్తి శతానీక శ్రుతసేను లనువారిఁ బంచోపపాండవులను సుపుత్త్రులం బడసిన. 228

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; ద్రుపదరాజ, నందనయున్= ద్రుపదరాజుకూతురుకూడా - అంటే ద్రౌపదికూడా; క్రమంబునన్= వరుసగా; పాండురాజ, నందనులవలనన్= పాండురాజుకుమారులవలన - పాండవులవలన; ప్రతివింధ్య, శ్రుతసోమ, శ్రుతకీర్తి, శతానీక, శ్రుతసేనులు+అను= అనే పేర్లుగలవాళ్లను; వారిన్, పంచ+ఉపపాండవులు+అను= ఐదుగురు ఉపపాండవులు అనే; సుపుత్త్రులన్= మంచికుమారులను; పడసినన్= పొందగా.

తాత్పర్యం: తరువాత ద్రౌపదికూడా వరుసగా పాండవులవలన అయిదుగురు ఉపపాండవులు అనే సుపుత్రులను పొందింది. ఆ అయిదుగురు - ప్రతివింధ్య, శ్రుతసోమ, శ్రుతకీర్తి, శతానీక, శ్రుతసేనులు.

విశేషం: ఉపపాండవులు - ప్రతివింధ్యుడు ద్రౌపదికి ధర్మరాజువలన జన్మించినవాడు; శ్రుతసోముడు భీమునివలన జన్మించినవాడు; శ్రుతకీర్తి అర్జునునివలన జన్మించినవాడు; శతానీకుడు నకులునివలన జన్మించినవాడు; శ్రుతసేనుడు సహదేవునివలన జన్మించినవాడు.

క. సుతవంతు లయి విశుద్ధ । శ్రుతనయవంతు లయి పాండుసుతు లతులగుణా
న్వితులు జగజ్జన నుత వి । శ్రుతులు మహారాజ్యలీల సుఖ మున్నంతన్. 229

ప్రతిపదార్థం: పాండు, సుతులు= పాండురాజు కుమారులు - పాండవులు; సుతవంతులు+అయి= కొడుకులను కలిగినవాళ్ళయి; విశుద్ధ, శ్రుత, నయవంతులు+అయి= నిర్మలమైన విద్య, నీతి కలవాళ్ళయి; అతుల, గుణ+అన్వితులు= సాటిలేని సద్గుణాలతో కూడినవాళ్ళు; జగత్+జన, నుత, విశ్రుతులు= లోకంలోని జనులచే పొగడబడిన ప్రసిద్ధులు; మహా, రాజ్యలీలన్= మహారాజ్యవిలాసంతో; సుఖము+ఉన్నంతన్= సుఖంగా ఉండగా.

తాత్పర్యం: పాండవులు కొడుకులను పొంది, నిర్మలమైన నీతి కలవాళ్ళయి, సాటిలేనిసద్గుణాలతో, ప్రపంచ ప్రజల ప్రశంసలు అందుకొన్న ప్రసిద్ధులై మహారాజ్యవిలాసంతో సుఖంగా ఉండగా.

చ. ఉరుతర దావపావక శిఖోత్కలిత శ్వసనంబులున్, సితే
తరగతి తీవ్రతిగ్మకరధామ సహస్రములున్, బహుప్రవా
హరహితనిమ్నగాతతులు నై, కడుదీర్ఘము లై, నిదాఘవా
సరములు సర్వజీవుల కసహ్యము లయ్యెను దారుణంబు లై. 230

ప్రతిపదార్థం: నిదాఘ, వాసరములు= వేసవి కాలపు పగళ్ళు; ఉరుతర, దావ, పావక, శిఖా+ఉత్కలిత, శ్వసనంబులున్= మిక్కిలి గొప్పవైన కార్చిచ్చు మంటలతో కూడిన గాడ్పులు కలవీ; సిత+ఇతర, గతి, తీవ్ర, తిగ్మ, కర, ధామ, సహస్రములున్= నిప్పులవలె తీక్ష్ణములైన సూర్యకిరణకాంతులు వేయి కలవీ; బహు, ప్రవాహ, రహిత, నిమ్నగా, తతులును+ఐ= గొప్ప ప్రవాహాలు లేని నదుల సమూహాలు కలవై; కడు, దీర్ఘములు+ఐ= మిక్కిలి పొడవైనవై; దారుణంబులు+ఐ= భయంకరాలై; సర్వ జీవులకున్= అన్నిప్రాణులకు; అసహ్యములు+అయ్యెను= ఓర్చుకొనటానికి సాధ్యం కానివి అయ్యాయి.

తాత్పర్యం: వేసవిలో పగటిపూట మహాతీవ్రాలైన కార్చిచ్చుమంటలతో కూడినగాడ్పులతో నిప్పులవలె తీక్ష్ణములైన సూర్య సహస్రకిరణకాంతులతో, ప్రవాహాలు పెద్దగా లేని నదులసమూహాలతో - మిక్కిలి పొడవైనవి, భయంకరాలైనవి, ప్రాణులన్నింటికీ ఓర్చుకొనటానికి సాధ్యం కానివి అయ్యాయి.

విశేషం: వేసవిలో పగటిపూట ప్రొద్దెక్కువ. అందువలన వేసవిలో పగళ్ళు దీర్ఘాలనటం, వర్ణనం. స్వభావోక్తిసుందరం. ఓజోగుణభరితం.

వ. అట్టి ఘర్మ దివసంబులు సహింప నోప కర్జునుం డొక్కనాఁడు కృష్ణున కి ట్లనియె. 231

ప్రతిపదార్థం: అట్టి; ఘర్మ, దివసంబులు= వేసవికాలపు పగళ్ళు; సహింపన్+ఓపక= ఓర్చుకొనలేక; అర్జునుండు; ఒక్కనాఁడు; శ్రీకృష్ణునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అటువంటి వేసవికాలపుఎండలు తట్టుకొనలేక అర్జునుడు శ్రీకృష్ణునితో ఇట్లా అన్నాడు.

చ. జలరుహనాభ! రమ్యగిరిసానువనంబుల వేఁటలాడుచున్
జలుపుద మీనిదాఘదివసంబుల నీవును నేను నున్మిష
న్నలిన రజస్సుగంధి యమునాహ్రద తుంగ తరంగ సంగతా
నిలశిశిరస్థలాంతరవినిర్మితనిర్మలహర్మ్యరేఖలన్. 232

ప్రతిపదార్థం: జలరుహ, నాభ= పద్మనాభా! - ఓ కృష్ణా!; నీవును= నీవూ; నేనున్= నేనూ; రమ్య, గిరి, సాను, వనంబులన్= మనోహరాలైన కొండచరియలలోని అడవులలో; వేటలాడుచున్= వేటాడుతూ; ఉన్మిషత్+నలిన, రజస్+సుగంధి, యమునా, హ్రద, తుంగ, తరంగ, సంగత+అనిల, శిశిర, స్థల+అంతర, వినిర్మిత, నిర్మల, హర్మ్యరేఖలన్= వికసిస్తున్న పద్మాలయొక్క పరాగంచే మంచివాసన కల యమునానది మడుగుయొక్క ఎత్తైన అలలతో కూడిన గాలులచేత చల్లనైన ప్రదేశాల మధ్య గొప్పగా కట్టబడిన పరిశుద్ధమైన మేడలయొక్క వరుసలలో; ఈ, నిదాఘ, దివసంబులన్= ఈ వేసవి రోజులను; చలుపుదము= గడుపుదాము.

తాత్పర్యం: శ్రీకృష్ణా! నీవూ, నేనూ మనోహరాలైన కొండచరియలలోని అడవులలో వేటాడుతూ, వికసిస్తున్న పద్మపరాగంతో మంచివాసన గల యమునానదిమడుగుయొక్క ఎత్తైనఅలలమీది గాలులచే చల్లనైన ప్రదేశాల మధ్య, గొప్పగా నిర్మించబడిన నిర్మలంగా ఉన్న మేడల వరుసలో ఈ వేసవిరోజులు గడుపుదాము.

విశేషం: వేసవినుండి తప్పించి శీతలసుఖపవనాల నిచ్చే పర్వతసానువులలో కట్టబడిన మేడలపై యమునానదినుండి వచ్చే గాలులను అనుభవిద్దామని అర్జునుడు కృష్ణుడితో చెబుతున్నాడు. ఆయా వస్తువులవలన కలిగే సుఖాలను ధ్వనింపచేసే అక్షరరమ్యతను సంతరించటం మొదట గమనింపదగింది. ఆ గాలులనూ, ఆ మేడలనూ మనసులో రూపుకట్టేటట్లు వర్ణించటంలో నన్నయ సమాధి అనే గుణాన్ని సాధించి ఆరోహక్రమంలో పద్యరచనచేసి, భావనాసుందరంగా శ్రోత అనుభవించేటట్లు చేయటం తరువాత తెలియదగింది. అక్షరరమ్యమైన నన్నయశైలికి అద్దంపట్టే పద్యాల్లో ఇదొకటి. (సంపా.)

వ. అని పురందరనందనుండు గోవిందు ననుమతంబు వడసి మిత్రామాత్యభృత్యసమేతులయి యిద్దఱు నరిగి యథారుచి ప్రదేశంబుల విహరించుచు నొక్కనాఁడు ఖాండవవనసమీపంబున నొక్కచందనలతాభవన

చంద్రకాంతవేదికయందు మందశీతలసురభిమారుతం బనుభవించుచు నిష్టకథావినోదంబుల నుండునంత.233

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; పురందర, నందనుండు= దేవేంద్రునికుమారుడు - అర్జునుడు; గోవిందు, అనుమతంబు= శ్రీకృష్ణునియొక్క సమ్మతిని; పడసి= పొంది; మిత్ర+అమాత్య, భృత్య, సమేతులు+అయి= స్నేహితులతో, మంత్రులతో, సేవకులతో కూడుకొన్నవాళ్ళయి; ఇద్దఱున్; అరిగి= వెళ్ళి; యథారుచి, ప్రదేశంబులన్= ఇష్టమైనచోట్ల; విహరించుచున్= విహరిస్తూ; ఒక్కనాఁడు; ఖాండవ, వన, సమీపంబునన్= ఖాండవవనానికి దగ్గరగా; ఒక్క; చందన, లతా, భవన, చంద్రకాంత, వేదిక, అందున్= మంచిగంధపు తీవల ఇంటిలోని చలువరాతి తిన్నెపై; మంద, శీతల, సురభి, మారుతంబు= మెల్లగా వీచేది, చల్లనిది, సువాసన కలది అయిన గాలిని; అనుభవించుచున్= అనుభవిస్తూ; ఇష్టకథా, వినోదంబులన్= ఇష్టములైన కథలతో, వినోదాలతో; ఉండు, అంతన్= ఉండగా.

తాత్పర్యం: అని అర్జునుడు శ్రీకృష్ణుని అనుమతి పొంది స్నేహితులతో, మంత్రులతో, సేవకులతో కూడి వెళ్ళి, ఇద్దరు (కృష్ణార్జునులు) ఇష్టమైన చోట్ల విహరిస్తూ, ఒక రోజు ఖాండవవనానికి దగ్గరగా ఒక మంచిగంధపు తీగెల ఇంటిలోని చలువరాతిఅరుగుమీద కూర్చుండి - మెల్లగా వీచేది, చల్లనిది, సువాసన కలది అయిన గాలిని అనుభవిస్తూ, ఇష్టకథలతో వినోదిస్తూ ఉండగా.

అగ్నిదేవుఁడు ఖాండవసమీపమున విహరించుచున్న కృష్ణార్జునులకడకు వచ్చుట (సం.1-214-29)

మాలిని.

అసితపథుఁడు విప్రుం డై మహాశ్రాంతలీలన్
మసృణకపిలకేశశ్మశ్రు లొప్పంగఁ దేజం
బెసఁగ ముదముతో నయ్యిద్దఱన్ డాయవచ్చెన్
వసునిభు లగు వారిన్ వాసవిన్ వాసుదేవున్. 234

ప్రతిపదార్థం: అసిత, పథుఁడు= తెల్లదికాని (నల్లని) మార్గం కలవాడు - అగ్నిదేవుడు; విప్రుండు+ఐ= బ్రాహ్మణుడై; మహా, శ్రాంత, లీలన్= మిక్కిలి బడలిక పొందిన వాని విధంగా; మసృణ, కపిల, కేశ, శ్మశ్రులు= నునుపైన గోరోజనం వంటి రంగు గల వెంట్రుకలు, మీసాలు; ఒప్పంగన్= అందగింపగా; తేజంబు= కాంతి; ఎసఁగన్= అతిశయిల్లగా; వసు, నిభులు+అగు, వారిన్= వసువులు అనే దేవతల సమానమైనవాళ్ళను, వాసవిన్= వాసవుని (దేవేంద్రుడి) కుమారుడిని - అర్జునుడిని; వాసుదేవున్= శ్రీకృష్ణుడిని; ఆ+ఇద్దఱన్= ఆ ఇరువురినీ; ముదముతో= సంతోషంతో; డాయవచ్చెన్= సమీపించాడు.

తాత్పర్యం: ఎంతో ప్రకాశిస్తూ సమానులైన ఆ కృష్ణార్జునులదగ్గరకు అగ్నిదేవుడు బ్రాహ్మణరూపంలో మిక్కిలి బడలిక పొందినవాడివలె, నునుపైన గోరోజనంరంగు గల వెంట్రుకలతో, మీసాలతో సంతోషంగా వచ్చాడు.

విశేషం: వృత్తలక్షణానికి చూడు. ఆది.2.81 విశేషం.

వ. వారు న వ్విప్రు నతిభక్తిఁ బూజించిన, వారలకు నవ్విప్రుం డి ట్లనియె. 235

ప్రతిపదార్థం: వారున్= ఆ శ్రీకృష్ణార్జునులుకూడా; ఆ+విప్రున్= ఆ బ్రాహ్మణుడిని; అతి, భక్తిన్= మిక్కిలి భక్తితో; పూజించినన్= పూజింపగా; వారలకున్= వాళ్లతో; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ కృష్ణార్జునులు ఆ బ్రాహ్మణుడిని ఎంతో భక్తితో పూజించారు. ఆ బ్రాహ్మణుడు వాళ్ళతో ఈ విధంగా అన్నాడు.

క. ఏ నమితభోజనుండ న। హీనాగ్నిబలుండ నాకు నిష్టాన్నము స
మ్మానముగఁ బెట్టుఁ డోపుదు। రేని సుతృప్తుండ నగుదు నే న ట్లయినన్. 236

ప్రతిపదార్థం: ఏను= నేను; అమిత, భోజనుండన్= పరిమితి లేకుండా భోజనం చేసేవాడిని; అహీన+అగ్ని, బలుండన్= మిక్కిలి జఠరాగ్ని - అంటే ఆకలి కలవాడిని; ఓపుదురు+ఏనిన్= చేతనైనవాళ్ళయితే - అంటే మీ చేతనైతే; నాకున్= నాకు; ఇష్ట+అన్నము= ఇష్టమైన ఆహారం; సమ్మానముగన్= గౌరవంగా; పెట్టుఁడు= పెట్టండి; అట్లు+అయినన్= ఆ విధంగా అయితే; నేను= నేను; సుతృప్తుండన్= బాగుగా తృప్తిపొందినవాడిని; అగుదున్= అవుతాను.

తాత్పర్యం: నేను అమితంగా భోజనం చేసేవాడిని. మిక్కిలి ఆకలి గలవాడిని. మీకు చేతనైతే నాకు ఇష్టమైన అన్నం గౌరవంగా పెట్టండి. నేను బాగా తృప్తి పొందుతాను.

విశేషం: బ్రాహ్మణుడికి, అగ్నికి అన్వయించే విశేషణాలను చతురంగా వాడటం ఈ పద్యంలోని రుచిరార్థసూక్తినైపుణ్యం. బ్రాహ్మణుడు అమితభోజనుడు, అగ్నిసర్వభక్షకుడు. బ్రాహ్మణుడు అహీనమైన జఠరాగ్ని కలవాడు. అగ్ని అనంతమైన దహనశక్తి కలవాడు. ఈ రెండుగుణాలూ అగ్నిలోని ఖాండవదహనశక్తికి వ్యంజకాలు. బ్రాహ్మణుడగ్నివంటివాడనీ, అతని కోర్కె తీర్చటం యజ్ఞక్రియవంటిదనీ ధ్వని.

వ. అనిన 'నీ కెద్దిభోజనం బిష్టంబు, దానిన పెట్టెద' మడుగు; మనిన వారికి నవ్విప్రుం డి ట్లనియె. 237

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; నీకున్; ఎద్ది, భోజనంబు= ఏ భోజనం; ఇష్టంబు; దానిన్+అ= దానినే; పెట్టెదము; అడుగుము= అడుగు; అనినన్=అనగా; వారికిన్; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా, 'నీకు ఏ భోజనం ఇష్టమో దానినే పెడతాము అడుగుము' అని అనగా వారితో ఆ బ్రాహ్మణుడు ఈ విధంగా అన్నాడు.

ఆ. అగ్ని నేను; నాకు నాహార మయ్యింద్రు। ఖాండవంబు; దీనిఁ గాల్పఁ గడఁగి
యెగువఁ బడితి ముంద రింద్రుపంచిన మహా॥ దారుణాంబుధరశతంబుచేత. 238

ప్రతిపదార్థం: ఏను= నేను; అగ్నిన్= అగ్నిదేవుడిని; నాకున్; ఆహారము; ఆ+ఇంద్రు, ఖాండవంబు= ఆ దేవేంద్రునియొక్క ఖాండవవనం; దీనిన్= దీనిని; కాల్పన్= కాల్చుటకై; కడఁగి= పూనుకొని; ముందర= ఇదివరకు; ఇంద్రు, పంచిన= ఇంద్రుడు పంపిన; మహా, దారుణ+అంబుధర, శతంబుచేతన్= మిక్కిలి భయంకరాలైన మేఘాలు నూరింటిచేత; ఎగువన్+పడితిన్= తరుమబడ్డాను.

తాత్పర్యం: నేను అగ్నిదేవుడిని; నాకు ఆహారం ఆ దేవేంద్రుని ఖాండవవనం. ఇదివరకు దీనిని కాల్చటానికి పూనుకొన్నాను. ఇంద్రుడు మహాభయంకరాలైన వందమేఘాలను పంపాడు. అవి నన్ను తరిమివేశాయి.

వ. తక్షకుం డను పన్నగేంద్రుఁ డింద్రున కిష్టసఖుం డయి ఖాండవంబునం దుండుటంజేసి దీని నమృతంబు రక్షించున ట్లతిప్రయత్నంబున నింద్రుండు రక్షించుకొనియుండు; నది నిమిత్తంబుగా సర్వసత్త్వంబులు నిందు సుఖం బుండు; మీరు మహాసత్త్వుల రఖిలాస్త్రవిదులు; రమరేంద్రుండు గావించువిఘాతంబులు మీయస్త్రబలంబున వారింపనోపుదు; రేనును దీని ననాకులంబున నుపయోగించి కృతార్థుండ నగుదు. 239

ప్రతిపదార్థం: తక్షకుండు, అను; పన్నగ+ఇంద్రుండు= నాగరాజు; ఇంద్రునకున్= దేవేంద్రునికి; ఇష్ట, సఖుండు+అయి= ప్రియమిత్రుడై; ఖాండవంబు+అందున్= ఖాండవవనంలో; ఉండుటన్+చేసి= ఉండటంచేత; దీనిన్= దీనిని; అమృతంబున్= అమృతాన్ని; రక్షించు+అట్లు= కాపాడునట్లు; అతి, ప్రయత్నంబుననన్= మిక్కిలి ప్రయత్నంతో; ఇంద్రుండు; రక్షించుకొని= కాపాడుతూ; ఉండున్= ఉంటాడు; అది, నిమిత్తంబుగా= అది, కారణంగా; సర్వ, సత్త్వంబులున్= అన్నిప్రాణులు; ఇందున్= ఇక్కడ; సుఖంబు+ఉండున్= సుఖంగా ఉంటాయి; మీరు; మహాసత్త్వులరు= మిక్కిలి బలం కలవారు; అఖిల+అస్త్ర, విదులరు= అన్ని అస్త్రాలు తెలిసినవారు; అమర+ఇంద్రుండు= దేవేంద్రుడు; కావించు= చేయు; విఘాతంబులు= ఆటంకాలు; మీ, అస్త్ర, బలంబుననన్= మీయొక్క అస్త్రాలబలంచేత; వారింపన్+ఓపుదురు= తొలగించగలరు; ఏనును= నేనుకూడా; దీనిన్= ఈ ఖాండవవనాన్ని; అనాకులంబుననన్= అడ్డులేకుండా; ఉపయోగించి= వినియోగించి అనగా ఆరగించి; కృత+అర్థుండన్= నెరవేరిన కోరిక కలవాడను; అగుదున్= అవుతాను.

తాత్పర్యం: తక్షకుడు అనే నాగరాజు దేవేంద్రునికి ప్రియమిత్రుడై, ఈ ఖాండవవనంలో ఉండటంవలన దీన్ని అమృతాన్ని రక్షిస్తున్నట్లు అతిప్రయత్నంతో ఇంద్రుడు రక్షిస్తూ ఉంటాడు. ఆ కారణంవలన అన్నిప్రాణులు ఈ వనంలో సుఖంగా ఉంటాయి. మీరు మహాబలవంతులు, అన్నిశాస్త్రాలు తెలిసినవాళ్ళు. దేవేంద్రుడు కలిగించే ఆటంకాలను మీ అస్త్రబలంచేత తొలగించగలరు. నేను ఈ ఖాండవాన్ని అడ్డులేకుండా భుజించి (దహించి) కృతార్థుడినవుతాను.

క. అని యగ్నిదేవుఁ డయ్య । ర్జునదామోదరుల శౌర్యశోభితులఁ బ్రియం
బునఁ బ్రార్థించెను బలసూ । దనరక్షితఖాండవప్రదాహోత్సుకుఁ డై. 240

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; బలసూదన, రక్షిత, ఖాండవ, ప్రదాహ+ఉత్సుకుఁడు+ఐ= దేవేంద్రునిచేత రక్షింపబడినదైన ఖాండవవనాన్ని లెస్సగా దహించటంలో ఉత్సాహం కలవాడై; శౌర్య, శోభితులన్= పరాక్రమంచేత ప్రకాశించేవాళ్ళను; ఆ+అర్జున, దామోదరులన్= ఆ అర్జునుడిని, శ్రీకృష్ణుడిని; ప్రియంబునన్, ప్రార్థించెన్= ప్రీతితో ప్రార్థించాడు.

తాత్పర్యం: అని దేవేంద్రుడు రక్షించేఖాండవవనాన్ని బాగా దహించాలన్న ఉత్సాహం కల అగ్నిదేవుడు పరాక్రమంతో ప్రకాశించే కృష్ణార్జునులను ప్రీతితో ప్రార్థించాడు.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 241

తాత్పర్యం: అనగా విని జనమేజయుండు వైశంపాయనునితో ఇట్లా అన్నాడు.

ఆ. 'ఏమి కారణమున నింద్రుఖాండవ మగ్ని । దేవుఁ డట్లు గాల్పఁ దివిరె? దీని
విప్రముఖ్య నాకు వినఁగ వేడుకయయ్యె; । నెఱుఁగఁ జెప్పుమయ్య యిదియు' ననిన. 242

ప్రతిపదార్థం: ఏమి; కారణమునన్; ఇంద్రు, ఖాండవము= ఇంద్రునియొక్క ఖాండవవనాన్ని; అగ్నిదేవుఁడు; అట్లు; కాల్పన్; తివిరెన్= ప్రయత్నించాడు; విప్రముఖ్య= ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! - వైశంపాయనమహర్షీ! నాకున్; దీనిన్; వినఁగన్; వేడుక, అయ్యెన్= కుతూహలం కలిగింది; ఇదియున్= ఈ విషయం కూడా; ఎఱుఁగన్; చెప్పుము+అయ్య= తెలియచెప్పవయ్యా; అనినన్.

తాత్పర్యం: 'ఓ వైశంపాయనమహర్షీ! ఏ కారణంచేత ఇంద్రునిఖాండవవనాన్ని అగ్నిదేవుడు ఆ విధంగా కాల్చ ప్రయత్నించాడో వినాలని నాకు కుతూహలంగా ఉన్నది. తెలిసేటట్లు చెప్పండి' అన్నాడు.

శ్వేతకి యను రాజర్షి వృత్తాంతము (సం.1-215-11 (అను 1-18))

వ. జనమేజయునకు వైశంపాయనుం డి ట్లని చెప్పెఁ; దొల్లి శ్వేతకి యనురాజర్షి ఘృతసంపూర్ణదక్షిణానేకాధ్వరుం డయి శతవార్షికసత్త్రయాగంబు సేయ సమకట్టి ఋత్విజులం బ్రార్థించిన, ఋత్విజులు 'నేము నిరంతర క్లేశంబున కోపము; నీ వనవరతయజనశీలుండవు; నీకు నీశ్వరుండ యాజకత్వంబు సేయనోపుంగాని, యొరు లోప' రని విసివి పలికిన, నాతండును గైలాసంబున కరిగి, కైలాసవాసు నిఖిలలోకవంద్యు నిందుశేఖరు నీశ్వరు నుద్దేశించి యుగ్రతపంబు సేసినఁ బరమేశ్వరుండు ప్రత్యక్షం బయి వాని కి ట్లనియె. 243

ప్రతిపదార్థం: జనమేజయునకున్= జనమేజయునికి; వైశంపాయనుఁడు; ఇట్లు+అని= ఈ విధంగా నిర్దేశించి; చెప్పెన్; తొల్లి= పూర్వం; శ్వేతకి, అను; రాజ+ఋషి; ఘృత, సంపూర్ణ, దక్షిణా+అనేక+అధ్వరుండు+అయి= నేతితో నిండిన, దక్షిణలతో కూడిన అనేక యజ్ఞాలు కలవాడై; శత, వార్షిక సత్త్రయాగంబు= నూరుసంవత్సరాలు సత్త్రయాగం; చేయన్= చేయటానికి; సమకట్టి= పూనుకొని; ఋత్విజులన్= యజ్ఞంచేయించే బ్రాహ్మణులను; ప్రార్థించినన్= వేడగా; ఋత్విజులున్= యజ్ఞంచేయించే విప్రులు ; ఏము= మేము; నిరంతర, క్లేశంబునకున్= ఎడతెగని కష్టానికి; ఓపము= ఓర్చుకోలేము; నీవు; అనవరత, యజన, శీలుండవు= నీవు ఎల్లప్పుడు యజ్ఞం చేసే స్వభావం కలవాడవు; నీకున్, ఈశ్వరుండు+అ= శివుడే; యాజకత్వంబున్= యజ్ఞం చేయంచే పని; చేయన్+ఓపున్+కాని= చేయకలడు కాని; ఒరులు= ఇతరులు; ఓపరు+అని= చేయ లేరని; విసివి= విసుగుచెంది; పలికినన్= మాట్లాడగా; ఆతండును= ఆ శ్వేతకియు; కైలాసంబునకున్; అరిగి= వెళ్ళి; కైలాస, వాసున్= కైలాసంలో నివసించేవాడిని; నిఖిల, లోక, వంద్యున్= అన్నిలోకాలకు పూజ్యుడైనవాడిని; ఇందు, శేఖరున్= చంద్రుని సిగదండగా కలవాడిని; ఈశ్వరున్= శివుడిని; ఉద్దేశించి= గురించి; ఉగ్ర, తపంబు= భయంకరమైన తపస్సు; చేసినన్= చేయగా; పరమ+ఈశ్వరుండు; ప్రత్యక్షంబు+అయి= సాక్షాత్కరించి; వానికిన్= శ్వేతకికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: జనమేజయునకు వైశంపాయనుడు ఈ విధంగా చెప్పాడు - పూర్వం శ్వేతకి అనే రాజర్షి సమృద్ధిగా నేతితో, దక్షిణలతో అనేకయజ్ఞాలు చేసి, నూరుసంవత్సరాలు చేసే సత్రయాగాన్ని చేయటానికి పూనుకొన్నాడు. ఆ యాగం చేయించే బ్రాహ్మణులను ప్రార్థించగా, వాళ్ళు - 'మేము ఎడతెగని శ్రమకు ఓర్వలేము. నీవు ఎల్లప్పుడు యజ్ఞం చేసే స్వభావం కలవాడివి. ఈశ్వరుడే నీ యజ్ఞానికి ఋత్విక్కుగా ఉండి దాన్ని చేయించగలడు కాని ఇతరులకు అది సాధ్యం కాదు' - అని విసుగుతో అన్నందువలన శ్వేతకి కైలాసానికి వెళ్ళాడు. అక్కడ కైలాసవాసుడు, సకలలోకపూజ్యుడు, చంద్రశేఖరుడు అయిన శివుడినిగూర్చి తీవ్రమైన తపస్సు చేశాడు. పరమేశ్వరుడు ప్రత్యక్షమై అతనితో ఇట్లా అన్నాడు.

క. 'శ్వేతకి! నీతపమున కేఁ । బ్రీతాత్ముఁడ నయితి; నీకుఁ బ్రియ మెయ్యది వి
ఖ్యాతముగ నిత్తు దానిన; । యాతతమతి వేఁడు' మనిన నన్నరపతియున్. 244

ప్రతిపదార్థం: శ్వేతకి= ఓ శ్వేతకీ!; నీ, తపమునకున్= నీ తపస్సుకు; ఏన్= నేను; ప్రీత+ఆత్ముఁడన్= తృప్తి పొందిన మనస్సు కలవాడను; అయితిన్= అయ్యాను; నీకున్; ప్రియము= ఇష్టమైనది; ఎయ్యది= ఏది; దానిన్+అ= దానినే; ఆతత మతిన్= నిండుమనస్సుతో; విఖ్యాతముగన్= ప్రసిద్ధంగా; ఇత్తున్= ఇస్తాను; వేడుము= కోరుకొమ్ము; అనినన్= అని అనగా; ఆ+నరపతియున్= ఆ రాజు (శ్వేతకి) కూడా.

తాత్పర్యం: 'ఓ శ్వేతకీ! నీ తపస్సుకు నేను తృప్తిపొందాను. నీ కేది ఇష్టమో దానినే నిండు మనస్సుతో గొప్పగా ఇస్తాను. కోరుకొమ్ము' అని అనగా ఆ శ్వేతకి.

వ. 'దేవా! నీప్రసాదంబున శతవార్షికసత్త్రయాగంబు చేసెద; నాకు నీవు ఋత్విజుండవు గావలయు' నని ప్రార్థించినం గరుణించి' యాజకత్వంబు బ్రాహ్మణులకు విధిదృష్టం బగుటంజేసి దాని నొరులకుఁ జేయంగాదు గావున, నింక నీవు బ్రహ్మచర్యంబునఁ బండ్రెండేండ్లు నిరంతరఘృతధారంజేసి హుతాశనుఁ దృప్తుం జేయు' మనిన వాఁడును బరమేశ్వరుపంచిన విధంబున నగ్నితర్పణంబు సేసిన సంతుష్టుండై యీశ్వరుండు వానిపాలికి వచ్చి యప్పుడ దుర్వాసు రావించి. 245

ప్రతిపదార్థం: దేవా!; నీ ప్రసాదంబునన్= నీ అనుగ్రహంచేత; శత, వార్షిక, సత్త్రయాగంబు= నూరు సంవత్సరాల సత్త్రయాగాన్ని; చేసెద= చేస్తాను; నాకున్, నీవు; ఋత్విజుండవు= యజ్ఞంచేసేవాడవు; కావలయును; అని; ప్రార్థించినన్= వేడుకోగా; కరుణించి= దయతలచి; యాజకత్వంబు= యజ్ఞం చేయించే పని; బ్రాహ్మణులకున్; విధి, దృష్టంబు= శాస్త్రం చేత చెప్పబడింది; అగుటన్+చేసి= అట్లు కావటంచేత; దానిన్= దాన్ని; ఒరులకున్= ఇతరులకు; చేయన్+కాదు= చేయకూడదు; కావునన్; ఇంకన్= ఇక; నీవు; బ్రహ్మ, చర్యంబునన్= బ్రహ్మచర్యవ్రతంచేత; పండ్రెండు+ఏండ్లు; నిరంతర, ఘృత, ధారన్+చేసి= ఎడతెగని నేతిధారతో; హుత+అశనున్= అగ్నిదేవుడిని; తృప్తున్= తృప్తిపొందినవాడినిగా; చేయుము; అనినన్= అని అనగా; వాడును= ఆ శ్వేతకికూడా; పరమేశ్వరు, పంచిన, విధంబునన్= శివుడు ఆజ్ఞాపించిన విధంగా అగ్ని, తర్పణంబు= అగ్నితృప్తి; చేసినన్= చేయగా; ఈశ్వరుండు; సంతుష్టుండు+ఐ= బాగా తృప్తి పొందినవాడై; వాని, పాలికిన్= ఆ శ్వేతకి దగ్గరకు; వచ్చి; అప్పుడు+అ= ఆ క్షణమే; దుర్వాసున్= దుర్వాసుని; రావించి= రప్పించి.

తాత్పర్యం: 'దేవా! నీ దయవలన నూరుసంవత్సరాల సత్రయాగం చేస్తాను. నీవు నాకు ఋత్విజుడివి కావాలి' -అని ప్రార్థించగా - పరమేశ్వరుడు, 'యజ్ఞం చేయించేపని శాస్త్రంలో బ్రాహ్మణులకు చెప్పబడింది. ఇతరులు యాజకత్వం వహించకూడదు. అందుచేత నీవు బ్రహ్మచర్యవ్రతం పూని పండ్రెండేళ్ళు ఎడతెగని నేతిధారతో అగ్నిదేవుడిని తృప్తిపొందించుము' అన్నాడు. ఆ శ్వేతకికూడా పరమేశ్వరుడు ఆజ్ఞాపించిన విధంగా అగ్నిదేవునికి తృప్తి కావించగా, ఈశ్వరుడుకూడా తృప్తిపొంది, శ్వేతకి దగ్గరకు వచ్చి, దుర్వాసుణ్ణి రప్పించి.

వ. 'ఈతఁ డనవరతయజన । ప్రీతుం; డీతనికి దురితభీతునకు మనః
ప్రీతిగ నార్త్విజ్యమ్ము మ । హాతేజోఽధికుఁడ! చేయు' మని దయఁ బంచెన్. 246

ప్రతిపదార్థం: ఈతడు; అనవరత, యజన, ప్రీతుండు= ఎడతెగక యజ్ఞాలు చేయటంలో ప్రీతి కలవాడు; దురిత, భీతునకున్= పాపాలకు భయపడేవానికి; ఈతనికిన్= ఈ శ్వేతకికి; మనఃప్రీతిఁగన్= మనస్సుకు సంతోషం కలిగించేటట్లు; మహా, తేజస్+అధికుఁడ!= గొప్పతేజస్సుచేత అధికుడవైనవాడా; ఆర్త్విజ్యమ్ము= యాజకత్వం; చేయుము+అని= కావింపుమని; దయన్= దయతో; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: 'ఈ శ్వేతకి ఎడతెగకుండా యజ్ఞాలు చేయటంలో ప్రీతి కలవాడు. పాపభీతి కలవాడు. ఇతని మనస్సుకు సంతోషం కలిగేటట్లు గొప్పతేజస్సుచే అధికుడవైన ఓ దుర్వాసమహర్షీ! యజ్ఞం చేయించుము' అని దయతో శివుడు ఆజ్ఞాపించాడు.

వ. శ్వేతకియుఁ దనకు దుర్వాసుండు ఋషిగణంబులతో ఋత్విజుండుగా నభిమతం బయిన సత్త్రయాగంబు సేసె; న ట్లాశ్వేతకి చేసిన నిరంతరఘృతధారాకారణంబున నగ్నిదేవుండు దన కగ్నిమాంద్యంబును దేజోహీనతయు దప్పియు నైన; బితామహుపాలికిం జని తనశరీరస్థితి చెప్పినఁ బితామహుండును దాని నపరిమితఘృతోపయోగంబున నయిన మహావ్యాధిఁగా నెఱింగి యగ్నిదేవున కి ట్లనియె. 247

ప్రతిపదార్థం: శ్వేతకియున్= శ్వేతకికూడా; తనకున్; దుర్వాసుండు; ఋషి, గణంబులతోన్= ఋషులసమూహాలతో; ఋత్విజుండుగాన్= యజ్ఞం చేయించేవాడుగా; అభిమతంబు+అయిన= ఇష్టమైన; సత్త్రయాగంబు= సత్రయాగం; చేసెన్; అట్లు; ఆ, శ్వేతకి; చేసిన= కావించిన; నిరంతర, ఘృత, ధారా, కారణంబునన్= ఎడతెరపి లేని నేతిధార కారణంగా; తనకున్, అగ్ని, మాంద్యంబును= జీర్ణశక్తి తగ్గటమూ; తేజస్+హీనతయున్= కాంతి పోవటమూ; దప్పియున్= దప్పికా; ఐనన్= కలుగగా; పితామహు, పాలికిన్= బ్రహ్మదేవుని దగ్గరకు; చని= వెళ్ళి; తన, శరీర, స్థితి= తన దేహ పరిస్థితి; చెప్పినన్= చెప్పగా; పితామహుండును= బ్రహ్మదేవుడుకూడా; దానిన్= దానిని; అపరిమిత; ఘృత+ఉపయోగంబునన్= మిక్కిలి ఎక్కువగా నేతిని ఉపయోగించటంవలన; అయిన, మహా, వ్యాధిన్+కాన్= పెద్దజబ్బుగా; ఎఱింగి= తెలిసికొని; అగ్నిదేవునకున్= అగ్నిదేవునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్వేతకికూడా ఋషుల సమూహాలతో దుర్వాసుడు తనకు ఋత్విజుడు (యజ్ఞం చేయించేవాడు) కాగా, తన కిష్టమైన సత్రయాగాన్ని చేశాడు. ఆ విధంగా శ్వేతకి చేసినయాగంలోని ఎడతెరపి నేతిధార కారణంగా అగ్నిదేవునికి జీర్ణశక్తి తగ్గింది, కాంతి సన్నగిల్లింది, దప్పిక ఎక్కువైంది. ఆయన బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళాడు. తన శరీరస్థితి చెప్పుకొన్నాడు. బ్రహ్మదేవుడు అది నేతిని అపరిమితంగా ఉపయోగించటంవలన కలిగిన మహావ్యాధిగా గ్రహించి అగ్నిదేవునితో ఇట్లా అన్నాడు.

క. 'ఈవ్యాధి యొంటఁ దీఱదు; । దివ్యౌషధయుక్త మైన దివిజవనంబున్
హవ్యాశన! భక్షింపు; మ । హావ్యాధి శమంబు దాన నగు నీ' కనినన్. 248

ప్రతిపదార్థం: ఈ, వ్యాధి; ఒంటన్= మరొకదానిచేత; తీఱదు; హవ్య+అశన= దేవతలకు ఈయదగిన అన్నాన్ని ఆహారంగా కలవాడా- అగ్నిహోత్రా!; దివ్య+ఔషధ, యుక్తము+ఐన= దేవలోకసంబంధమైన మందుచెట్లతో కూడిన; దివిజ, వనంబున్= దేవతావనాన్ని; భక్షింపు(ము); దానన్= దానివలన; నీకున్= నీకు; మహా, వ్యాధి, శమంబు= గొప్పజబ్బు తగ్గటం; అగున్= జరుగుతుంది; అనినన్= అని అనగా.

తాత్పర్యం: 'ఈ వ్యాధి మరొక దానిచేత తీరదు. అగ్నిహోత్రా! దివ్యౌషధాలతో కూడిన దేవతావనాన్ని భక్షించు. దానివలన నీ మహావ్యాధి పోతుం' దని అనగా.

క. చని ఖాండవంబుఁ గాల్పఁగ । మొనసి మహాహస్తియూథములఁ బోని ఘనా
ఘనములచే బాధితుఁ డయి । వనజజుకడ కరిగి హవ్యవాహనుఁ డనియెన్. 249

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; ఖాండవంబున్= ఖాండవవనాన్ని; కాల్పన్+కన్= దహింపగా; మొనసి= పూని; మహా, హస్తి, యూథములన్+పోని= గొప్ప ఏనుగుల గుంపులనుపోలిన; ఘనా ఘనములచేన్= వర్షించే మేఘాలతో; బాధితుఁడు+అయి= బాధింపబడినవాడై; హవ్యవాహనుఁడు= దేవతలకు ఇవ్వదగిన అన్నాన్ని మోసేవాడు - అగ్నిహోత్రుడు; వనజజు, కడకున్= నీటినుండి పుట్టిన పద్మంనుండి జన్మించిన బ్రహ్మదేవునిదగ్గరకు; అరిగి= వెళ్ళి; అనియెన్.

తాత్పర్యం: అగ్నిహోత్రుడు ఖాండవవనాన్ని దహించటానికి పూనుకొన్నాడు. పెద్దఏనుగుగుంపులవంటి వర్షించే మేఘాలు బాధించగా ఆయన బ్రహ్మదేవునిదగ్గరకు వెళ్ళి ఇట్లా అన్నాడు.

వ. 'ఏను మీయానతిచ్చినవిధంబున ఖాండవం బుపయోగింపం బోయి, తద్రక్షకులు గావించువిఘాతంబులు వారింపనేరక యేడుమాఱులు విఫలప్రయత్నుండ నైతి; నింక నెద్ది యుపాయంబు? నాకు నెవ్విధంబున ఖాండవభక్షణంబు దొరకొను? నని దుఃఖించిన యతనిం జూచి కమలభవుండు కరుణించి, భావికార్యం బప్పడు దలంచియుఁ; 'గొంతకాలంబునకు నరనారాయణు లను నాదిమునులు నరలోకంబున దేవహితార్థం బర్జునవాసుదేవు లయి జన్మించి యాఖాండవసమీపంబున విహరింతురు; వారు భవత్ప్రార్థితు లై తమ యస్త్రబలంబున నఖిలవిఘ్నంబుల నపనయించి నిరాకులంబున నీకు ఖాండవోపయోగంబు ప్రసాదింతు' రనిన, నగ్నిదేవుండు గరంబు సంతసిల్లి, కమలజువచనం బవలంబంబుగాఁ బెద్దకాలం బుండి, తద్వనమార్గంబున నప్పడు కృష్ణార్జునులం గని ఖాండవదహనార్థంబు ప్రార్థించిన నగ్నిదేవున కర్జునుం డి ట్లనియె. 250

ప్రతిపదార్థం: ఏను= నేను; మీ, ఆనతి+ఇచ్చిన, విధంబున= మీ యొక్క ఆజ్ఞ ఇచ్చిన విధంగా - అంటే మీరు ఆజ్ఞాపించినట్లుగా; ఖాండవంబు; ఉపయోగింపన్, పోయి; తత్+రక్షకులు= దాన్ని రక్షించేవాళ్ళు; కావించు; విఘాతంబులు= ఆటంకాలు; వారింపన్= నివారించటానికి; నేరక= చేతగాక; ఏడు, మాఱులు, విఫల, ప్రయత్నుండన్= నెరవేరనిప్రయత్నం కలవాడిని; ఐతిన్= అయ్యాను; ఇంకన్, ఎద్ది= ఇక ఏది; ఉపాయంబు; నాకున్; ఏ+విధంబునన్= ఏ విధంగా; ఖాండవ, భక్షణంబు= ఖాండవవనాన్ని తినటం; దొరకున్= లభిస్తుంది; అని, దుఃఖించినన్= అంటూ విలపింపగా; అతనిన్, కని= అతనిని చూచి; కమల భవుండు= పద్మంనుండి పుట్టినవాడు-బ్రహ్మదేవుడు; కరుణించి= దయదలచి; భావి, కార్యంబు= మున్ముందు జరిగేపని; అప్పుడు= ఆ క్షణంబు; తలంచియున్= తలచికూడా; కొంత, కాలంబునకున్= కొంత కాలానికి; నరనారాయణులు; అను; ఆది, మునులు= నరుడు నారాయణుడు అనే మొట్టమొదటి మునులు; నర, లోకంబునన్= మానవలోకంలో; దేవ, హిత+అర్థంబు= దేవతల మేలుకోసం; అర్జున, వాసుదేవులు+ఐ; జన్మించి= పుట్టి; ఆ, ఖాండవ, సమీపంబునన్= ఆ ఖాండవవనం దగ్గర; విహరింతురు= విహరిస్తారు; వారు= ఆ ఇరువురు; భవత్+ప్రార్థితులు+ఐ= నీచే ప్రార్థింపబడినవాళ్ళయి; తమ, అస్త్ర, బలంబునన్= తమ అస్త్రబలంచేత; అఖిల, విఘ్నంబులన్ = అన్ని ఆటంకాలను; అపనయించి= తొలగించి; నిర్+అకులంబునన్= నిరాటంకంగా; నీకున్; ఖాండవ+ఉపయోగంబు= ఖాండవవనాన్ని ఉపయోగించటాన్ని - అంటే ఖాండవవనాన్ని దహించటాన్ని; ప్రసాదింతురు= దయతో కలుగజేస్తారు; అనినన్= అని అనగా; అగ్నిదేవుండు; కరంబు= మిక్కిలి; సంతసిల్లి; కమలజు, వచనంబు= పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవునిమాట; అవలంబంబుగాన్= ఊతగా; పెద్ద, కాలంబు= చాలాకాలం; ఉండి, తత్+వచన, మార్గంబునన్= అతనియొక్క మాటప్రకారం; అప్పుడు; కృష్ణ+అర్జునులన్= కృష్ణుని అర్జునుని; కని= చూచి; ఖాండవ, దహన+అర్థంబు= ఖాండవవనాన్ని కాల్చటంకోసం; ప్రార్థించినన్= ప్రార్థింపగా; అగ్నిదేవునకున్= అగ్నిదేవునితో; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నేను మీరు ఆజ్ఞాపించిన విధంగా ఖాండవవనాన్ని దహించబోయాను. దాన్ని రక్షించేవాళ్ళు కల్పించిన ఆటంకాలు నివారించలేకపోయాను. ఏడుసార్లు నా ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇక నాకు ఉపాయమేది? ఏ

విధంగా ఖాండవవనాన్ని దహిస్తాను? అని దుఃఖించగా అతడిని చూచి బ్రహ్మదేవుడు దయతలచి, ముమ్మందు జరుగ వలసిన పనిని తలచి - 'కొంతకాలానికి ఆదిమునులైన నరనారాయణులు మానవలోకంలో దేవతల మేలుకోరి అర్జునుడు-కృష్ణుడుగా జన్మిస్తారు. ఆ ఖాండవవనందగ్గర విహరిస్తారు. వాళ్ళను నీవు ప్రార్థిస్తే తమ అస్త్రాలబలంతో అన్నిఆటంకాలు తొలగించి, నీవు ఖాండవవనాన్ని దహించేటట్లు చేస్తారు' అని అనగా -అగ్నిదేవుడు ఎంతో సంతోషించగా, బ్రహ్మదేవునిమాట ఆధారంగా చాలాకాలం ఉండి, ఆయన మాటప్రకారం అప్పుడు కృష్ణార్జునులను చూచి ఖాండవవనాన్ని కాల్చటంకోసం ప్రార్థించగా, అగ్నిదేవునితో అర్జునుడు ఇట్లా అన్నాడు.

అగ్నిదేవుండు కృష్ణార్జునులకుఁ జక్రకార్ముకాదు లొసంగుట (సం.1-215-12)

సీ. వారణహస్తానుకారంబు లగు వారి। ధారలు గురియు దుర్వారఘోర
తరవారివాహప్రకరములు వారింప। సురనివహంబుతో సురగణేశు
నైన నోర్వ సుశక్త మైన మహాదివ్య। శరసంచయము నా కపరిమితంబు
గల; దట్టిసాయకావలికి నాదగు భుజ। బలశీఘ్రసంధానములకుఁ దగిన.

ఆ. ధనువు సర్వవహనఘనరథాశ్వములుఁ గృ ష్ణునకు నాయుధములు ననఘ! యిపుడు
లేమిఁ జేసి చూవె యీమహాకార్యంబు। గడఁగకున్నవార మెడయుఁ జేసి. 251

ప్రతిపదార్థం: అనఘ= పాపరహితుడా!; వారణ; హస్త+అనుకారంబులు+అగు= ఏనుగుతొండాన్ని పోలినవైన; వారి, ధారలు= నీటిధారలు; కురియు= కురిసే; దుర్+వార; ఘోరతర, వారి, వాహ, ప్రకరములు= నివారింప సాధ్యం కాని మిక్కిలి భయంకరాలైన మేఘాల సమూహాలను; వారింపన్= అడ్డగించటానికి; సుర, నివహంబులతోన్= దేవతల సమూహంతో; సుర, గణ+ఈశున్+ఐనన్= దేవతా సమూహాల రాజునైనా - అంటే దేవేంద్రుడినైనా; ఓర్వన్= ఓడించుటకు; సుశక్తము+ఐన= మంచి సమర్థవంతమైన; మహా, దివ్య, శర, సంచయము= గొప్ప దేవతా సంబంధాలైన అస్త్రాల సమూహం; నాకున్, అపరిమితంబు= లెక్కలేనంత; కలదు= ఉన్నది; అట్టి= అటువంటి; సాయక+ఆవలికిన్= బాణాల సమూహానికి; నాది+అగు= నాదయిన; భుజ, బల, శీఘ్ర, సంధానములకున్= బాహుబలానికి, వేగంగా బాణాలను వింటినారిలో కూర్చటానికి; తగిన= తగినట్టి; ధనువు= విల్లు; సర్వ, వహన, ఘన, రథ+అశ్వములున్= అన్నింటిని మోయగల గొప్పరథం, గుర్రాలూ; కృష్ణునకున్= కృష్ణునికి; ఆయుధములు; ఇపుడు; లేమిన్+చేసి= లేకుండటంచేత; చూవె= సుమా!; ఈ, మహా, కార్యంబు= ఈ మహాకార్యం; ఎడయున్+చేసి= ఆలస్యంచేసి; కడగక+ఉన్న, వారము= పూనుకొనకున్నాము.

తాత్పర్యం: పుణ్యాత్మా! అగ్నిహోత్రా! ఏనుగు తొండమంతటి నీటిధారలను కురిసే దుర్వారాలైన మహా భయంకర మేఘసమూహాల్ని తొలగించటానికి, దేవతాసమూహంతో కూడిన దేవేంద్రుడినైనా ఓడించటానికి - సమర్థాలైన దివ్యాస్త్రసమూహం నా దగ్గర లెక్కలేనంత ఉన్నది. అట్లాంటి అస్త్రసమూహానికి, నా భుజబలానికి, వేగంగా బాణాలను వింటిలో సంధించే నేర్పుకు తగిన ధనుస్సు - అన్నింటిని మోయగల గొప్పరథం- శ్రీకృష్ణునికి ఆయుధాలు, ఇప్పుడు లేవు. అందువలననే సుమా ఆలస్యంచేసి ఈ మహాకార్యానికి పూనుకొనకుండా ఉన్నాం.

వ. అనిన నగ్నిదేవుండును నప్పుడ వరుణుం దలంచి వానిం దనకు సన్నిహితుం జేసికొని, 'తొల్లి నీకు సోముం డిచ్చిన బ్రహ్మనిర్మితకార్ముకంబు నక్షయతూణీరయుగళంబును, గంధర్వజహయంబులం బూన్చిన రథంబు నియ్యతిరథుం

డయిన యర్జునున కిమ్ము; మఱి చక్రంబును గదయును వాసుదేవున కి' మ్మని పంచిన. 252

ప్రతిపదార్థం: అనినన్= అని అర్జునుడనగా; అగ్నిదేవుండును; అప్పుడు+అ= అప్పటికప్పుడే; వరుణున్= వరుణుని; తలంచి= స్మరించి; వానిన్= అతనిని; తనకున్= తనకు; సన్నిహితున్= దగ్గరకు వచ్చినవాడిగా; చేసికొని=ఒనరించుకొని; తొల్లి= పూర్వం; నీకున్; సోముండు+ఇచ్చిన= చంద్రుడిచ్చినట్టి; బ్రహ్మ, నిర్మిత, కార్ముకంబున్= బ్రహ్మచే రూపొందించబడిన ధనుస్సును; అక్షయ, తూణీర, యుగళంబును= తరుగులేని బాణాలు గల అమ్ములపొదల జంటను; గంధర్వజ, హయంబులన్= గంధర్వలోకంలో పుట్టిన గుర్రాలను; పూన్చిన= కట్టిన; రథంబున్= రథాన్ని; ఈ+అతి, రథుండు= పెక్కుమంది విలుకాండ్రతో పోరాడే ఈ మహావీరుడు; అయిన, అర్జుననికిన్; ఇమ్ము; మఱి= ఇక; చక్రంబును= చక్రాన్ని; గదయును= గదను; వాసుదేవునకున్= శ్రీకృష్ణునకు; ఇమ్ము= ఈయవలసింది; అని= అంటూ; పంచినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: అని అర్జునుడు చెప్పగా అగ్నిదేవుడు అప్పటికప్పుడే వరుణుని స్మరించాడు. తన దగ్గరకు రప్పించాడు. 'పూర్వం నీకు చంద్రుడిచ్చిన బ్రహ్మనిర్మితమైన ధనుస్సును, తరుగులేని బాణాలు కల అమ్ముల పొదుల జంటను; గంధర్వలోకంలో పుట్టిన గుర్రాలను కట్టిన రథాన్ని అతిరథుడైన ఈ అర్జునునికి - చక్రాన్ని, గదను శ్రీకృష్ణుడి కిమ్ము' అని ఆజ్ఞాపించగా.

మ. అమరాహీంద్రవియచ్చరాదుల కజేయం బప్రధృష్యం బభే
ద్యము వజ్రస్థిర మన్యసాధనభిదాదక్షంబు నై సర్వలో
కమనోజ్ఞం బయి దివ్య మై వెలుఁగు నగ్గాండీవ మన్ చాప ర
త్నము నిచ్చెన్ వరుణుండు పార్థునకు నుద్యద్విక్రమోద్భాసికిన్. 253

ప్రతిపదార్థం: వరుణుండు; ఉద్యత్+విక్రమ+ఉత్+భాసికిన్= వృద్ధి పొందుతున్న పరాక్రమంచేత గొప్పగా ప్రకాశించేవానికి; పార్థునకున్= అర్జునునికి; అమర+అహి+ఇంద్ర, వియత్+చర+ఆదులకున్= దేవతలు, నాగరాజులు, గంధర్వులు మొదలైనవాళ్ళకు; అజేయంబు= జయింపసాధ్యంకానిది; అప్రధృష్యంబు= త్రోసిపుచ్చటానికి సాధ్యంకానిది; అభేద్యము= చీల్చటానికి సాధ్యం కానిది; వజ్రస్థిరము= వజ్రంవలె గట్టిది; అన్య, సాధన, భిదా, దక్షంబును+ఐ= ఇతరములైన ఆయుధాలను భేదించటంలో సమర్థమైనదై; సర్వ, లోక, మనోజ్ఞంబు+ఐ= అన్నిలోకాలకు మనోహరమైనదై; దివ్యమై= దేవతాసంబంధమైనదై; వెలుఁగు= ప్రకాశించునట్టి; ఆ+గాండీవము; అన్= అనే; చాప, రత్నమును= శ్రేష్ఠమైన ధనుస్సును; ఇచ్చెన్.

తాత్పర్యం: వరుణుడు, వృద్ధిపొందే పరాక్రమంలో ప్రకాశిస్తున్న అర్జునునికి- దేవతలు, నాగరాజులు, గంధర్వులు మొదలైనవాళ్ళకు జయించ శక్యంకానిదీ, త్రోసిపుచ్చ వీలుకానిదీ, భేదించ సాధ్యంకానిదీ, వజ్రంవలె కఠినమైనదీ, ఇతర ఆయుధాలను నాశనంచెయ్యటంలో సమర్థమైనదీ, అన్ని లోకాలకు మనోహరమైనదీ, దివ్యమైనదీ - అయి వెలుగుతున్న ఆ గాండీవం అనే ఉత్తమధనుస్సును ఇచ్చాడు.

విశేషం: సమాసఘటితం, సంధిబంధురం అయిన నన్నయరచన. ఓజోగుణవిశిష్టమై ఇక్కడ గాండీవంయొక్క ఔన్నత్యాన్నీ దృఢత్వాన్నీ భీకరత్వాన్నీ స్ఫురింపచేసేదిగా ఉన్నది.

వ. మఱియుఁ బ్రతిపక్ష సంక్షయకరంబులయిన యక్షయబాణంబులు గల తూణీరంబులును, వివిధాయుధభరితం బై, సింహలాంగూలకపిధ్వజవిరాజమానంబై, మహాంబుధరధ్వానబంధురంబై, మనోవాయువేగసితవాహవాహ్యమానం

బై, రణితరమణీయమణికింకిణీకలాపాలంకృతం బై, సకలదిగ్విజయాధిష్ఠానంబై యొప్పుచున్న దివ్యరథంబు నర్జునున కిచ్చి, సహస్రకరసహస్రదుస్సహమహఃపటలభాసురం బగుచు దేవదైత్యదానవయక్షరాక్షసపిశాచోరగప్రశమనంబయి వెలుంగుచున్న సుదర్శనం బను చక్రంబును, గౌమోదకి యను గదయును నారాయణున కిచ్చె; నట్లు సంప్రాప్తదివ్య చాపరథాయుధు లయి యున్న నరనారాయణులం జూచి యగ్నిదేవుం డి ట్లనియె. 254

ప్రతిపదార్థం: మఱియున్; ప్రతిపక్ష, సంక్షయ, కరంబులు+అయిన= శత్రువులను నాశనం చేసేటటువంటివైన; అక్షయ, బాణంబులు కల; తూణీరంబులును= అమ్ములపొదులూ; వివిధ+ఆయుధ, భరితంబు+ఐ= నానావిధాలైన ఆయుధాలతో నిండి; సింహ, లాంగూల, కపి, ధ్వజ, విరాజమానంబు+ఐ= సింహపు తోకవంటి (తోకగల) కోతిగుర్తు కల జెండాచే ప్రకాశించేటటువంటిదై; మహా+అంబుధర, ధ్వాన, బంధురంబు+ఐ= గొప్పమేఘంయొక్క ధ్వనిలాంటి ధ్వనితో నిండినదై; మనో, వాయు, వేగ, సిత, వాహ, వాహ్యమానంబు+ఐ= మనస్సుయొక్క, గాలియొక్క వేగంవంటి వేగంకల తెల్లనిగుర్రాలచే లాగబడుతున్నదై; రణిత, రమణీయ, మణి, కింకిణీ, కలాప+అలంకృతంబు+ఐ= ధ్వనిస్తున్న అందాలైన రత్నాల చిరుగంటల సమూహాలచే అలంకరింపబడినదై; సకల, దిక్+విజయ+అధిష్ఠానంబు+ఐ= అన్ని దిక్కులను జయించటానికి స్థానమై; ఒప్పుచున్+ఉన్న= ప్రకాశిస్తున్న; దివ్య, రథంబున్= దేవతా సంబంధమైన రథాన్ని; అర్జునునకున్+ఇచ్చి; సహస్రకర, సహస్ర, దుస్+సహ, మహఃపటల, భాసురంబు= వేయికిరణాలు గల సూర్యులు వేయిమందివంటి ఓర్వరాని గొప్పకాంతులచే ప్రకాశించేది; అగుచున్= అవుతూ; దేవ, దైత్య, దానవ, యక్ష, రాక్షస, పిశాచ+ఉరగ, ప్రశమనంబు+అయి= దేవతలను, దైత్యులను, దానవులను, యక్షులను, రాక్షసులను, పిశాచాలను, నాగులను; అణగింపజేయునట్టిదై; వెలుంగుచున్+ఉన్న= ప్రకాశిస్తూ ఉండే; సుదర్శనంబు; అను= సుదర్శనం అనే; చక్రంబును= చక్రాన్ని; కౌమోదకి; అను, గదయును= కౌమోదకి అను పేరుగల గదనుకూడా; నారాయణునకున్= శ్రీకృష్ణునికి; ఇచ్చెన్= ఇచ్చాడు; అట్లు+ఆవిధంగా; సంప్రాప్త, దివ్య, చాప; రథ+ఆయుధులు+అయి= పొందిన దివ్యధనుస్సును, రథాన్ని, ఆయుధాలను కలవారై; ఉన్న; నర, నారాయణులన్= అర్జునశ్రీకృష్ణులను; చూచి; అగ్నిదేవుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అంతేకాక శత్రువులను నాశనంచేసేటటువంటివి, తరుగని బాణాలు కల అమ్ములపొదులను, వివిధాయుధాలతో నిండి, సింహపుతోకవంటి తోక గల కోతిగుర్తున్న జెండాతో ప్రకాశిస్తూ, గొప్ప మేఘధ్వనివంటి ధ్వని కలిగి, మనోవేగ, వాయువేగాలవంటి వేగం గల తెల్లటిగుర్రాలు లాగుతూండగా, మ్రోగుతున్న అందాల రత్నపు చిరుగంటల సమూహాలతో అలంకరించబడి, అన్నిదిక్కులను జయించటానికి స్థానమై ప్రకాశిస్తున్న దివ్యరథాన్ని అర్జునుని కిచ్చాడు. వేయిసూర్యులవలె ఓర్వరాని గొప్ప కాంతులతో ప్రకాశిస్తూ, దేవ, దైత్య, దానవ, యక్ష, రాక్షస, పిశాచ, నాగులను అణచివేసే సుదర్శనచక్రాన్ని, కౌమోదకి అనే గదను శ్రీకృష్ణునికి ఇచ్చాడు. ఆ విధంగా దివ్య ధనుస్సును, రథాన్ని, ఆయుధాలను పొంది ఉన్న అర్జున శ్రీకృష్ణులను చూచి అగ్నిదేవుడు ఇట్లా అన్నాడు.

విశేషం: దైత్యులు - కశ్యపునికి దితియందు పుట్టినవాళ్ళు. దానవులు - కశ్యపునికి దనువునందు జన్మించినవాళ్ళు.

క. ఘనభుజ! యిది గాండీవం। బనఁబరఁగిన ధనువు దీని నస్త్రావలి పె
ల్చన తాఁకి భగ్న మగు న। త్యనుపమవజ్రాభిహతశిలావలి వోలెన్. 255

ప్రతిపదార్థం: ఘన, భుజ= గొప్పభుజాలు కలవాడా! - ఓ అర్జునా!; ఇది= ఇది; గాండీవంబు+అనన్= గాండీవం అనగా; పరఁగిన= ఒప్పిన; ధనువు= ధనుస్సు; దీనిని= దీన్ని; అస్త్ర+ఆవలి= మంత్రసహిత బాణాల సమూహం; పెల్చనన్= గట్టిగా;

తాఁకి= తాకి, తగిలి; అతి+అనుపమ, వజ్ర+అభిహత, శిలా+ఆవలి పోలెన్=మిక్కిలి సాటిలేని వజ్రాయుధంచేత కొట్టబడిన రాళ్ళ సమూహంవలె; భగ్నము+అగున్= ముక్కలైపోతాయి.

తాత్పర్యం: ఉన్నత భుజాలు కల ఓ అర్జునా! ఇది గాండీవం అనే ధనుస్సు. మంత్రసహిత బాణసమూహాలు సైతం దీన్ని తాకి వజ్రాయుధంచేత కొట్టబడిన రాళ్ళవలె ముక్కలవుతాయి.

విశేషం: అలం: ఉపమ.

క. ఈ రథ మప్రతిహతము, స । మీరజవోపేతహయసమేతము; దీనిన్
భూరిబలుఁ డెక్కి సోముఁడు । ధీరుం డయి తొల్లి యెల్లదిక్కుల నొడిచెన్. **256**

ప్రతిపదార్థం: రథము= ఈ రథం; అప్రతిహితము=ఎదురులేనిది; సమీర, జవ+ఉపేత, హయ, సమేతము= వాయువేగంతో కూడుకొన్న గుర్రాలతో కూడినది; తొల్లి= పూర్వం; దీనిన్= దీన్ని; భూరి, బలుఁడు=గొప్ప బలం కలవాడు; సోముఁడు= చంద్రుడు; ఎక్కి; ధీరుండు+అయి= ధైర్యవంతుడై; ఎల్ల, దిక్కులన్= అన్ని దిక్కుల్ని; ఒడిచెన్= ఓడించాడు.

తాత్పర్యం: ఈ రథం ఎదురులేనిది. వాయువేగం కల గుర్రాలతో కూడుకొన్నది, పూర్వం దీన్ని మహాబలుడైన చంద్రుడుఎక్కి అన్నిదిక్కులు జయించాడు.

క. ఈ చక్రము మధుసూదన! । నీచేత విముక్త మగుచు నీరిపులఁ ద్రియా
మాచరులఁ జంపి క్రమ్మఱ । నీచేతికి వచ్చు దేవనిర్మితశక్తిన్. **257**

ప్రతిపదార్థం: మధు, సూదన= మధువు అనే రాక్షసుడిని సంహరించినవాడా! - శ్రీకృష్ణా!; ఈ చక్రము; నీచేతన్= నీచే; విముక్తము= విడువబడినది; అగుచున్= అవుతూ; నీ, రిపులన్= నీ శత్రువులను, త్రియామా, చరులన్= రాత్రులలో తిరిగేవాళ్ళను- రాక్షసులను; చంపి= సంహరించి; దేవ, నిర్మిత, శక్తిన్= దేవతలచే కూర్పబడిన శక్తిచేత; క్రమ్మఱన్= మరల; నీచేతికిన్ వచ్చున్= నీచేతికి వచ్చి చేరుతుంది.

తాత్పర్యం: శ్రీకృష్ణా! ఈ చక్రాన్ని నీవు ప్రయోగిస్తే నీ శత్రువులైన రాక్షసులను సంహరించి, దేవతలు కూర్చిన శక్తితో మళ్ళీ నీ చేతికి వచ్చి చేరుతుంది.

కృష్ణార్జును లగ్నిహోత్రునిచే ఖాండవంబు దహింపఁజేయుట (సం-1-216-28)

వ. అని తత్ప్రభావప్రకారంబు చెప్పినఁ గృష్ణార్జునులు సంతసిల్లి, సన్నద్ధు లయి రథం బెక్కి, యగ్నిదేవుం జూచి 'సురాసుర పరివృతుండయి సురపతి వచ్చినను జయింతు' మింక శంకింపక ఖాండవదహనార్థం బుపక్రమింపు మనిన నగ్నిదేవుండు హర్షించి తైజసంబయిన రూపంబు ధరియించి. **258**

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; తత్+ప్రభావ, ప్రకారంబు= వాటియొక్క ప్రభావవిధం; చెప్పినన్= చెప్పగా; కృష్ణ+అర్జునులు= కృష్ణుడు, అర్జునుడు; సంతసిల్లి= సంతోషించి; సన్నద్ధులు+అయి= పూనుకొని; రథంబు+ఎక్కి= రథమెక్కి; అగ్నిదేవున్+చూచి= అగ్నిదేవుణ్ణి చూచి; సుర+అసుర, పరివృతుండు+అయి= దేవ దానవులచేత చుట్టబడినవాడై; సుర, పతి= దేవేంద్రుడు;

వచ్చినను= వచ్చినప్పటికి; జయింతుము= జయిస్తాము; ఇంకన్= ఇక; శంకింపక= అనుమానించక; ఖాండవదహన+అర్థంబు= ఖాండవవనాన్ని దహించటంకొరకు; ఉపక్రమింపుము= ప్రారంభించుము; అనినన్= అని అనగా; అగ్నిదేవుండు; హర్షించి= సంతోషించి; తైజసంబు+అయిన= కాంతిమంతమైన, రూపంబు= రూపాన్ని; ధరియించి= తాల్చి.

తాత్పర్యం: అని వాటియొక్క ప్రభావాన్ని గూర్చిచెప్పగా - కృష్ణార్జునులు సంతోషించి, పూని రథం ఎక్కి, అగ్నిదేవుడిని చూచి - 'దేవేంద్రుడు దేవదానవులతో కలిసి దండెత్తి వచ్చినా జయిస్తాము. ఇంక సంకోచించవద్దు. ఖాండవవనాన్ని దహించటానికి ప్రారంభించుము' అని అనగా, అగ్నిదేవుడు సంతోషించి కాంతిమంతమైన రూపం ధరించి.

చ. **పెడిలి సువర్ణపర్వతము పెక్కుదెఱంగుల వ్రయ్యునట్టు ల**
ప్పుడు వివిధప్రకారముల భూరిశిఖావలి ఖాండవంబు న
ల్గడఁ గడుఁబర్వఁగాఁ బెఱిఁగి కాల్పఁదొడంగె హుతాశనుండు సే
ద్పడఁగ వనంబులోని మృగపక్షిభుజంగమభూతసంఘముల్. **259**

ప్రతిపదార్థం: సువర్ణ, పర్వతము= బంగారుకొండ (మేరువు); పెడిలి= పెట్లి; పెక్కు, తెఱంగులన్= అనేకవిధాలుగా; వ్రయ్యునట్టులు= ముక్కలయ్యేటట్లు; అప్పుడు; హుతాశనుండు= అగ్నిహోత్రుడు; భూరి, శిఖా+ఆవలి= పెద్దమంటల సమూహం; వివిధ ప్రకారములన్= అనేకవిధాల; ఖాండవంబు, నల్గడన్= ఖాండవవనంలో నాలుగువైపుల; కడున్= మిక్కిలి, పర్వఁగాన్= వ్యాపించగా; పెఱిఁగి= విజృంభించి, వనంబులోని= అడవిలోని; మృగ, పక్షి, భుజంగమ, భూత, సంఘముల్= మృగాలయొక్క, పక్షులయొక్క, పాములయొక్క, ప్రాణులయొక్క సమూహాలు; చేద్పడఁగన్= బాధపడేటట్లు; కాల్పన్= కాల్చటానికి; తొడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: మేరుపర్వతం పెట్లి పెక్కువిధాల ముక్కలయ్యేటట్లు అగ్నిహోత్రుడు తనయొక్క పెద్ద మంటల సమూహం అనేకవిధాల ఖాండవవనంలో వ్యాపించగా విజృంభించాడు. మృగాల పక్షుల పాముల ప్రాణుల సమూహాలు బాధపడేటట్లు కాల్చటానికి పూనుకొన్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. **అంత.** **260**

తాత్పర్యం: అప్పుడు.

సీ. **చక్రధరుం డయ్యు జలరుహనాభుండు । గాండీవధరుఁ డయ్యుఁ బాండవుండు**
నుండి రవ్వనమున కుభయపార్శ్వంబులఁ । దొల్లింటి యట్టులు పెల్లు రేఁగి
యనలంబు నార్పంగ నార్చుచుఁ బఱతెంచి । వనరక్షకులు పార్థు సునిశితాస్త్ర
ధారల నపగతదర్పు లై యరిగిరి । యమసదనంబున కమితబలులు;

ఆ. **శిఖియు నుగ్రదీర్ఘజిహ్వలు సాఁచి యు । ద్ధురసమీరణంబు తోడు సేసి**
కొని యుగాంతకాల కుపితానలాకారుఁ డయ్యె ఖాండవమున కద్భుతముగ. **261**

ప్రతిపదార్థం: ఆ+వనమునకున్= ఆ ఖాండవవనానికి; ఉభయ, పార్శ్వంబులన్= రెండువైపుల; చక్ర, ధరుండు+అయ్యు= చక్రాయుధాన్ని ధరించినవాడై; జలరుహనాభుండు= పద్మం నాభిలో కలవాడు - శ్రీకృష్ణుడు; గాండీవ, ధరుఁడు+అయ్యున్= గాండీవాన్ని ధరించినవాడై; పాండవుండు= అర్జునుడు; ఉండిరి; తొల్లింటి; అట్టులు= పూర్వంవలె; పెల్లురేఁగి= విజృంభించి; అమితబలులు= మిక్కిలి బలం కలవాళ్ళు; వన, రక్షకులు= ఆ ఖాండవవనాన్ని రక్షించేవాళ్ళు; అనలంబున్= నిప్పును; ఆర్పంగన్= ఆర్పటానికి; ఆర్చుచున్= అరచుచు; పఱతెంచి= పరుగెత్తుకొని వచ్చి; పార్థు, సునిశిత+అస్త్రధారలన్= అర్జునుని యొక్క మిక్కిలి వాడి అయిన బాణాల వర్షంచే; అపగత, దర్పులు+ఐ= కోల్పోయిన గర్వం కలవాళ్ళయి; యమ, సదనంబునకున్= యముని ఇంటికి; అరిగిరి= వెళ్ళారు - అనగా, మరణించారు; శిఖియున్= అగ్నిదేవుడుకూడా; ఉగ్ర, దీర్ఘ, జిహ్వలు= భయం కరాలు, దీర్ఘాలు అయిన నాలుకలు; చాచి= చాచి; ఉద్ధుర, సమీరణంబు= విజృంభించిన గాలిని; తోడు= సహాయంగా; చేసికొని= గావించుకొని; ఖాండవమునకున్= ఖాండవానికి; అద్భుతముగన్= ఆశ్చర్యకరంగా; యుగాంత, కాల, కుపిత+అనల+ఆకారుఁడు= ప్రళయకాలకోపంలో ఉన్న అగ్నివంటి ఆకారం కలవాడు; అయ్యెన్.

తాత్పర్యం: ఆ ఖాండవవనానికి రెండువైపులా - చక్రాయుధాన్ని ధరించి శ్రీకృష్ణుడూ, గాండీవాన్ని ధరించి అర్జునుడూ నిలబడ్డారు. అంతకుముందువలె అమితబలులైన ఖాండవవనరక్షకులు నిప్పు నార్పటానికి అరుస్తూ పరుగెత్తుకొని వచ్చారు. అర్జునుని వాడిబాణాలవర్షంవల్ల గర్వాన్ని కోల్పోయి మరణించారు. అగ్నిదేవుడు భయంకరాలైన పొడవైన నాలుకలు చాచి, విజృంభించిన గాలిని తోడుచేసికొని, ఆ ఖాండవానికి ప్రళయకాలాగ్నివంటివాడయ్యాడు.

మ. ఘనధూమధ్వజ దహ్యమాన లవలీ కర్పూర తక్కోల చం
దన కాలాగరు సల్లకీతరుల యుద్యద్ధూమధూపానువా
సన నొప్పెన్ సురభీకృతంబు లగుచున్ సంక్రీడమానామృతా
శనవిద్యాధరసద్విమానవితతుల్ సావిత్రవర్త్మంబునన్. 262

ప్రతిపదార్థం: ఘన, ధూమ, ధ్వజ, దహ్యమాన, లవలీ, కర్పూర, తక్కోల, చందన, కాలాగరు, సల్లకీ, తరుల= గొప్పవాడు పొగను జెండాగా కలవాడు అయిన అగ్నిహోత్రునిచే కాల్చబడుతున్న లవలి తీవలు, తక్కోలాలు, మంచిగంధాలు, నల్లఅగరులు, అందుగులు అనే వృక్షాలయొక్క; ఉద్యత్+ధూమ, ధూప+అను, వాసనన్= మీది కెగుస్తూ ఉన్న పొగ అనే ధూపాన్ని అనుసరించిన వాసనచేత; సావిత్ర, వర్త్మంబునన్= సూర్యునిదైన మార్గంలో - అంటే ఆకాశమంతటా; సంక్రీడమాన+ అమృత+అశన, విద్యాధర, సత్+విమాన, వితతుల్= విహరిస్తున్న దేవతలయొక్క, విద్యాధరులయొక్క ఉత్తమాలైన విమానాల సమూహాలు; సురభీ, కృతంబులు+అగుచున్= మంచివాసన కలవిగా చేయబడినవై; ఒప్పెన్= ప్రకాశించాయి.

తాత్పర్యం: బాగా విజృంభించిన అగ్నిహోత్రుడు కాల్చే లవలితీగలు, కర్పూరాలు, తక్కోలాలు, మంచిగంధాలు, నల్లఅగరులు, అందుగులు అనే వృక్షాలనుండి మీది కెగుస్తున్న పొగ అనే ధూపాన్ని అనుసరించిన వాసనచేత- ఆకాశమందంతటా విహరించే దేవతలయొక్క, విద్యాధరులయొక్క ఉత్తమవిమానాలు మంచివాసనతో ప్రకాశించాయి.

విశేషం: అలంకారం - రూపకం, అతిశయోక్తి. అగ్నిహోత్రుని మహాభయంకరవిజృంభణం పద్యంలో ఓజోగుణవిశిష్టంగా ప్రకాశిస్తున్నది.

చ. జ్వలన శిఖాలియున్ విజయుసద్విశిఖాలియుఁ జుట్టుముట్టినం
దలరి భయాకులంబు లగు తద్వనజీవులయార్తనాద మం

దులియుచు నొక్కపెట్ట దివి నుద్గత మయ్యె నమందమందరా

చలపరివర్తనప్రసభసంక్షుభితార్ణవఘోషఘోర మై. 263

ప్రతిపదార్థం: జ్వలన, శిఖా+ఆలియున్= అగ్నిహోత్రునియొక్క మంటల సమూహం; విజయు, సత్+విశిఖ+ఆలియున్= అర్జునునియొక్క మేలిమి బాణాల సమూహం; చుట్టు, ముట్టిన్; తలరి= కలత నొంది; భయ+ఆకులంబులు+అగు= భయంతో చెదరినవైన; తత్+వన, జీవుల, ఆర్తనాదము= ఆ ఖాండవవనంలోని ప్రాణులయొక్క ఏడుపు; అందు, ఉలియుచున్= మ్రోగుతూ; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; అమంద, మందర+ఆచల, పరివర్తన, ప్రసభ, సంక్షుభిత+అర్ణవ; ఘోరము+ఐ= తక్కువ కాని మందరపర్వతంయొక్క తిరుగుడువలన బలవంతంగా కలతనొందింపబడిన సముద్రంయొక్క శబ్దంవలె భయంకరమై; దివిన్= ఆకాశంలో; ఉద్గతము+అయ్యెన్= మీదికి లేచింది.

తాత్పర్యం: అగ్నిహోత్రుని మంటల సమూహం, అర్జుననిమేలిమిబాణాలసమూహం చుట్టుముట్టగా, ఆ ఖాండవవనంలో కలతనొంది భయంతో చెల్లాచెదురైన ప్రాణుల ఏడ్పుధ్వని - ఎంతోపెద్ద మందరపర్వతం తిరగటంవలన కలతనొందిన మహాసముద్రధ్వనివలె భయంకరమై ఒక్కసారిగా ఆకాశంలో మీదికి ఎగిసింది.

విశేషం: అలం: ఉపమ. నన్నయరచనలో అక్షరరమ్యత కిది చక్కని ఉదాహరణ. శిఖాలి. విశిఖాలి చుట్టుముట్టినవైనం లకార ప్రాసలో సూచింపబడింది. చివరి పంక్తిలో పరుష స్థిరాక్షర సంయోజనంతో సంక్షోభం ధ్వనింపచేయబడింది.

క. నెగయుడు నెగసి పిఱుందం । దగిలెడు మిడుఁగుఱులచేత దగ్ధచ్ఛద మై

గగనమునఁ బఱవ నోపక । ఖగనివహము వహ్నియంద కడువడిఁ బడియెన్. 264

ప్రతిపదార్థం: నెగయుడున్= ఎగురగానే; ఎగసి= మీదికి లేచి; పిఱుందన్= వెనుకనే; తగిలెడు; మిడుగుఱులచేతన్= తాకుతున్న నిప్పు రవ్వలచేత; దగ్ధ, ఛదము+ఐ= కాల్చబడిన రెక్కలుకలదై; గగనమునన్= ఆకాశంలో; పఱవన్+ఓపక= పరుగెత్తలేక; ఖగ, నివహము= పక్షులసమూహం; వహ్ని, అందు+అ= నిప్పులలోనే; కడున్, వడిన్= మిక్కిలివేగంగా; పడియెన్= పడ్డాయి.

తాత్పర్యం: అక్కడి పక్షులు తప్పించుకొని వెళ్ళాలని మీదికి ఎగురగానే, వాటిని వెంబడించి తాకే నిప్పురవ్వలచే రెక్కలు కాలి ఆకాశానికి ఎగురలేక అగ్నిలోనే పడ్డాయి.

విశేషం: అలం: స్వభావోక్తి. లఘుబహుళమైన ఈ కందం సత్వరగతినీ, పతనాన్నీ అక్షరరమ్యంగా సూచిస్తున్నది.

క. తనతేజోజాలము ప । ర్విన దగ్ధము లగు ననేకవిధదేహుల దే

హనికాయంబుల బహువిధ । తనువులు గలవాఁడవోలె దహనుం డొప్పెన్. 265

ప్రతిపదార్థం: తన, తేజస్+జాలము= తనయొక్క కాంతుల సమూహం; పర్వినన్= వ్యాపించగా; దగ్ధములు+అగు= కాలిపోతున్న; అనేక, విధ, దేహుల, దేహ, నికాయంబులన్= పెక్కు విధాలైన ప్రాణులయొక్క దేహాల సమూహాలచేత; దహనుండు= అగ్నిహోత్రుడు; బహువిధ, తనువులు, కలవాడు+అ, పోలెన్= అనేక విధాలైన దేహాలు కలవానివలె; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: తన కాంతిసమూహం వ్యాపించగా కాలిపోతున్న అనేకవిధాలైన ప్రాణుల సమూహాలతో అగ్నిదేవుడు అనేకవిధాలైన దేహాలు కలవానివలె ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ.

చ. **అమితకృశానుదగ్ధ మగు నయ్యమరేంద్రువనంబులోని యు**
త్తమసలిలాశయావళుల తప్తజలంబులయం దపేతజీ
వము లయి తేలుచుండె వరవారిచరంబులు వారిపక్షులుం;
గమరె నశేషకోకనదకైరవపంక్తులు శైవలంబులున్. **266**

ప్రతిపదార్థం: అమిత, కృశాను, దగ్ధము+అగు= అంతులేని అగ్నిచేత కాల్చబడినదగు; ఆ+అమర+ఇంద్రు, వనంబులోని= ఆ దేవేంద్రునియొక్క ఉద్యానవనంలోని; ఉత్తమ, సలిల+ఆశయ+ఆవళుల= శ్రేష్ఠములైన నీటిమడుగుల సమూహాలయొక్క; తప్త, జలంబుల, అందున్= కాగిననీటిలో; వర, వారి, చరంబులు= శ్రేష్ఠములైన నీటిలో చరించే ప్రాణులు; వారి, పక్షులున్= నీటిపక్షులూ; అపేత, జీవములు+అయి= పోయిన ప్రాణాలు కలవై; తేలుచున్= తేలుతూ; ఉండెన్= ఉన్నవి; అశేష, కోకనద, కైరవపంక్తులు= అన్ని ఎఱ్ఱకలువల, తెల్లకలువల సమూహాలు; శైవలంబులున్= నాచుతీగలు; కమరెన్= మాడిపోయాయి.

తాత్పర్యం: అపరిమితంగా విజృంభించిన అగ్నిచేత కాల్చబడిన ఆ ఖాండవవనంలోని శ్రేష్ఠాలైన నీటిమడుగుల కాగిన నీటిలో - జలచరాలు, నీటిపక్షులు చచ్చి తేలాడుతూ ఉన్నాయి. ఎఱ్ఱకలువలు, తెల్లకలువలు, నాచుతీగలు మాడిపోయాయి.

విశేషం: మహాప్రమాదకరమైన అగ్నిహోత్రుని విజృంభణాన్ని ఈ పద్యం చక్కగా ప్రకటం కావిస్తూ ఉన్నది. సరోవరాలను వర్ణించే ఈ పద్యంలో అంతస్థాల, నాదాక్షరాల పునరావృత్తి అక్షరరమ్యతను వ్యక్తీకరిస్తున్నది.

క. **అలుగుల పడి ఖాండవమునఁ । గల యాశీవిషమహోరగము లెల్ల విషా**
గ్నులు గ్రక్కుచు నత్యుగ్రా । నలబహులజ్వాలలందు నాశము వొందెన్. **267**

ప్రతిపదార్థం: అలుగులపడి= బాధపడి; ఖాండవమునన్+కల= ఖాండవవనంలో ఉండే; ఆశీ, విష, మహా+ఉరగములు+ఎల్లన్= ముఖంలో విషం కల పెద్దపాములన్నీ; విష+అగ్నులు= విషమనే నిప్పులను; క్రక్కుచున్= క్రక్కుతూ; అతి+ఉగ్ర+అనల, బహుల, జ్వాలల, అందున్= మిక్కిలి భయంకరమైన అగ్నియొక్క పెక్కుమంటలలో; నాశము; పొందెన్= నశించిపోయాయి, నాశాన్ని పొందాయి.

తాత్పర్యం: ఖాండవవనంలో నివసించే పెద్ద పాములన్నీ బాధపడి విషమనే నిప్పులు క్రక్కుతూ మహాభయంకరమైన అగ్నియొక్క అనేకజ్వాలలలో పడి నశించిపోయాయి.

వ. **అంత దేవత లెల్ల మహావహ్నిశిఖాహతికి వెఱచి దేవేంద్రుపాలికిం బోయి ఖాండవవనంబున కైనయకాండ ప్రళయంబు సెప్పిన విని యదరిపడి యింద్రుండు తక్షకరక్షణాపేక్ష ననేకధారాధరనివహంబుతో నతిత్వరితగతి ఖాండవంబునకు వచ్చి హుతాశనుమీఁద మహావారిధారలు గురియించిన.** **268**

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; దేవతలు+ఎల్లన్= దేవతలు అందరూ; మహా, వహ్ని, శిఖా, హతికి= గొప్పనిప్పుమంటలదెబ్బకు; వెఱచి= భయపడి; దేవేంద్రు; పాలికిన్= దేవేంద్రునిదగ్గరకు; పోయి= వెళ్ళి; ఖాండవంబునకున్+ఐన= ఖాండవానికి జరిగిన; అకాండ, ప్రళయంబు= అకాల వినాశం; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; అదరిపడి= త్రుళ్లిపడి; ఇంద్రుండు= మహేంద్రుడు; తక్షక, రక్షణ+అపేక్షన్= తక్షకుడిని కాపాడాలన్న కోరికతో;, అనేక, ధారాధర, నివహంబుతోన్= పెక్కు మేఘాల సమూహంతో; అతి, త్వరిత, గతిన్= మిక్కిలివేగంగా; ఖాండవంబునకున్= ఖాండవవనానికి వచ్చి; హుతాశనుమీదన్= అగ్నిహోత్రునిమీద; మహా, వారి, ధారలు= పెద్దనీటిధారలు; కురియించినన్= కురిపించగా.

తాత్పర్యం: అప్పుడు దేవతలంతా ఆ గొప్ప నిప్పుమంటల దెబ్బకు భయపడి, దేవేంద్రునిదగ్గరకు వెళ్ళారు. ఖాండవవనానికి జరిగిన అకాలవినాశాన్నిగూర్చి చెప్పారు. అది విని దేవేంద్రుడు అదిరిపడ్డాడు. తక్షకుణ్ణి కాపాడా లనే కోరికతో అనేకమేఘాలను వెంట పెట్టుకొని, వేగంగా వచ్చి, అగ్నిహోత్రునిమీద పెద్దనీటిధారలు కురిపించాడు.

విశేషం: తక్షకుడు కద్రువపుత్రుడు. పాము. ఉదంకుని కుండలాలు అపహరించిందీ, పరీక్షిత్తును కాటువేసి చంపిందీ ఇతడే. జనమేజయుని సర్పయాగంలో అగ్నిలో పడకుండా ఇతడు దేవేంద్రుడిని శరణువేడి, అతని సింహాసనాన్ని కౌగలించుకొన్నాడు.కడకు ఆస్తీకుని అనుగ్రహంవలన అగ్నిలో పడకుండా బ్రతికాడు.

క. ఆ వారిధార లెల్ల మ । హావహ్ని శిఖాహతంబు లయి శుష్కము లై
లావఱి నడుమన యడఁగుటఁ । బావకు పయి నొక్కచినుకుఁ బడదయ్యె వడిన్. **269**

ప్రతిపదార్థం: ఆ, వారి, ధారలు+ఎల్లన్= నీటిధారలన్నీ; మహా, వహ్ని, శిఖా, హతంబులు+అయి= గొప్పఅగ్నియొక్క మంటలచే కొట్టబడినవై; శుష్కములు+ఐ= ఎండిపోయినవై; లావు+అఱి= బలం చెడి; నడుమన్+అ= నడుమనే; అడఁగుటన్= నాశనం కావటంచేత; పావకు, పయిన్= అగ్నిహోత్రునిమీద; ఒక్క, చినుకున్= ఒక్క చినుకుకూడా; వడిన్= వేగంగా; పడదు+అయ్యెన్= పడలేదు.

తాత్పర్యం: ఆ నీటిధారలన్నీ గొప్ప నిప్పుమంటలచేత కొట్టబడి, ఎండి, బలం చెడి, నడుమనే నాశనం కావటంవలన అగ్నిహోత్రునిమీద ఒక్కచినుకైనా వేగంగా పడలేదు.

క. ఉఱుముచు మెఱుముచుఁ బిడుగులు । వఱలఁగ నలుగడలఁ బడ నవారితవృష్టుల్
గుఱుకొని కురియఁగఁ బంచెను । మఱియును నయ్యనలుమీఁద మఘవుం డలుకన్. **270**

ప్రతిపదార్థం: మఘవుండు= దేవేంద్రుడు; అలుకన్= కోపంతో; ఉఱుముచున్; మెఱుముచున్; పిడుగులు; వఱలఁగన్= ప్రకాశిస్తూ; నలుగడలన్= నాలుగువైపుల; పడన్= పడేటట్లుగా; మఱియును= ఇంకా; ఆ+అనలుమీదన్= ఆ అగ్నిహోత్రుని మీద; గుఱుకొని= ప్రయత్నించి; అవారిత, వృష్టుల్= అడ్డగింప సాధ్యంకాని వానలు; కురియఁగన్= కురియుటకై; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: ఉరుముతూ, మెరుస్తూ, నాలుగువైపుల పిడుగులు పడేటట్లు - అడ్డగించ సాధ్యంకాని వానలు - మళ్ళీ ఆ అగ్నిహోత్రుని మీద ప్రయత్నించి గొప్పగా కురవండని దేవేంద్రుడు కోపంతో మేఘాలను ఆజ్ఞాపించాడు.

క. పాండుసుతుఁ డంత నానా । కాండసహస్రముల నేసి ఘనముగఁ జేసెన్
ఖాండవగృహము నఖండా । ఖండలధారలకు దూఱఁ గాకుండంగన్. **271**

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు, పాండు, సుతుఁడు= పాండురాజు కుమారుడైన అర్జునుడు; అఖండ+ఆఖండల, ధారలకున్= ఎడతెగని దేవేంద్రుని వర్షధారలకు; దూఱన్+కాకుండన్+కన్= దూరుటకు వీలులేకుండా; నానా, కాండసహస్రములన్= అనేక విధాలైన బాణాలు వేలకొద్దిగా; వేసి= వేసి, ప్రయోగించి; ఖాండవ, గృహమున్= ఖాండవవనానికి ఇంటిని; ఘనముగన్= గొప్పగా; చేసెన్= నిర్మించాడు.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడు దేవేంద్రుడు కురిపించే వర్షధారలు దూరటానికి వీలులేకుండా అనేక విధాలైన బాణాలు వేలకువేలు ప్రయోగించి ఖాండవవనానికి గొప్పగా ఇల్లు కట్టాడు.

వ. ఇట్లు కావించిన. 272

తాత్పర్యం: ఈ విధంగా చేయగా.

తే. దాని వెల్వడనేరక తద్వనంబు । జీవులెల్లను బావకశిఖలఁ జేసి
దగ్ధ లగుచున్నఁ దక్షకతనయుఁ డశ్వ । సేనుఁ డను భుజంగమ మగ్నిశిఖల కపుడు. 273

ప్రతిపదార్థం: దానిన్= ఆ గృహాన్ని; వెల్వడనేరక= దాటి బయటకు రాలేక; తత్+వనంబు, జీవులు+ఎల్లను= ఆ వనంలోని ప్రాణులన్నీ; పావక, శిఖలన్+చేసి= నిప్పుమంటలవలన; దగ్ధలు+అగుచున్+ఉన్నన్= కాలిపోతుండగా; తక్షక, తనయుఁడు= తక్షకుని యొక్క కుమారుడు; అశ్వసేనుఁడు; అను; భుజంగమము= పాము; అగ్ని, శిఖలకున్= నిప్పుమంటలకు; అపుడు= అప్పుడు.

తాత్పర్యం: అర్జునుడు నిర్మించిన ఆ ఇంటిని దాటి బయటకు రాలేక, ఆ వనంలోని ప్రాణులన్నీ నిప్పు మంటల వలన కాలిపోతుండగా, తక్షకునికుమారుడైన అశ్వసేనుడు అనే పాము ఆ నిప్పుమంటలకు అప్పుడు.

ఆ. వెఱచి తల్లిఁదోఁకఁ గఱపించుకొని దివిఁ । బఱచువానిఁ జూచి పార్థుఁ డలిగి
వానితల్లిశిరముతోన తత్పుచ్ఛంబు । దునిసి యగ్నిశిఖలఁ దొరఁగ నేసె. 274

ప్రతిపదార్థం: వెఱచి= భయపడి; తల్లిన్= తల్లిని; తోకన్= తోకయందు; కఱపించుకొని= కరిపించుకొని; దివిన్= ఆకాశంలో; పఱచు, వానిన్= పరుగెత్తేవాడిని; చూచి= కనుగొని; పార్థుఁడు= అర్జునుడు; అలిగి= కోపించి; వాని, తల్లి= అతని తల్లి; శిరముతోన= తలతోకూడా; తత్+పుచ్ఛంబు= అతనియొక్కతోక; తునిసి= తెగి; అగ్ని, శిఖలన్= నిప్పుమంటలలో; తొరఁగన్= పడేటట్లు; ఏసెన్= కొట్టాడు. (బాణం ప్రయోగించాడు.)

తాత్పర్యం: భయపడి తల్లిని తనతోకయందు కరపించుకొని ఆకాశంలో పరిగెత్తే ఆ అశ్వసేనుడిని అర్జునుడు చూచాడు. కోపపడ్డాడు. తల్లి తలతోకూడా అతనితోక తెగి నిప్పుమంటలలో పడేటట్లు కొట్టాడు.

వ. వెండియు నశ్వసేను నేయసమకట్టిన యప్పార్థునకుఁ దత్క్షణంబ మోహిని యను మాయ గావించి యమరేంద్రుఁ డశ్వసేను విడిపించి యందుఁ దక్షకుండు దగ్ధుం డయ్యెను కా వగచి కడు నలిగి. 275

ప్రతిపదార్థం: వెండియున్= మరల; అశ్వసేనున్; ఏయన్= కొట్టటానికి; సమకట్టిన= పూనుకొన్నట్టి; ఆ+పార్థునకున్= ఆ అర్జునునికి; తత్+క్షణంబు+అ= ఆ క్షణమే; మోహిని= మోహిని; అను= అనే; మాయ= మాయను; కావించి= చేసి; అమర+

ఇంద్రుఁడు= దేవేంద్రుడు; అశ్వసేనున్; విడిపించి; అందున్= ఆ ఖాండవవనంలో; తక్షకుండు; దగ్ధుండు+అయ్యెను, కా, వగచి= కాలిపోయాడని తలచి; కడున్= మిక్కిలి; అలిగి= కోపించి.

తాత్పర్యం: మళ్ళీ అశ్వసేనుడిని కొట్టటానికి పూనుకోగా, దేవేంద్రుడు వెంటనే అర్జునునికి మోహిని అనే మాయ కావించి, అశ్వసేనుడిని విడిపించి, ఖాండవవనంలో తక్షకుడు కాలిపోయాడేమో అని భావించి మహాకోపంతో.

ఇంద్రుండు కృష్ణార్జునులతోఁ బోరుట (సం 1-218-13)

ఉ. ఆ నరుమీఁద ఘోరనిశితాశని వైచె నఖండ చండ ఝం
ఝానిలజర్జరీకృతమహాజలధారలతో నిరంతరా
నూన పయోధరప్రకర ముద్ధత మై హరిదంతరంబులన్
భానుపథంబు నొక్కమొగిఁ బర్వి భయంకరలీలఁ గప్పఁగన్. 276

ప్రతిపదార్థం: అఖండ, చండ, ఝుం ఝా+అనిల, జర్జరీకృత, మహా, జల, ధారలతో= తక్కువకాని భయంకరమైన గాలివానచే చెదరగొట్టబడిన పెద్ద నీటిధారలతో; నిరంతర+అనూన, పయోధర, ప్రకరము= ఎడతెగనట్టి వెలితిలేని నీటిని ధరించే మేఘాల సమూహం - అంటే ఎడతెగని నిండైన మేఘాల సమూహం; ఉద్ధతము+ఐ= విజృంభించి; హరిత్+ అంతరంబులన్= దిక్కుల మధ్య భాగాలను; భాను, పథంబున్= సూర్యునిమార్గాన్ని - అంటే ఆకాశాన్ని; ఒక్క, మొగిన్= ఒక్కసారిగా; పర్వి= పరుగెత్తి (వ్యాపించి); భయంకరలీలన్= భయం కలిగించే విధంగా; కప్పఁగన్= కప్పివేయగా; ఆ, నరు, మీఁదన్= ఆ అర్జునునిమీద; ఘోర, నిశిత+అశనిన్= భయంకరమైన వజ్రాయుధాన్ని; వైచెన్= వేశాడు.

తాత్పర్యం: తక్కువ కానిది, భయంకరమైనది అయిన గాలివానచేత చెదరగొట్టబడిన పెద్ద నీటిధారలతో - ఎడతెగని పెద్ద మేఘాల సమూహం విజృంభించి - ఒక్కసారి పరుగెత్తి దిక్కుల మధ్య ప్రదేశాలను ఆకాశాన్ని కప్పివేయగా - దేవేంద్రుడు ఆ అర్జునునిమీద భయంకరమైన వజ్రాయుధాన్ని ప్రయోగించాడు.

ఉ. అ న్నవవారివాహ నివహమ్ములఁ జూచి భయప్రపన్నుఁ డై
యున్నహుతాశనున్ విజయుఁ డోడకు మంచును మారుతాస్త్రమ
త్యున్నతచిత్తుఁ డేసె; నదియున్ విరియించె రయంబుతో సము
త్పన్నసమీరణాహతి నపార పయోద కదంబకంబులన్. 277

ప్రతిపదార్థం: ఆ+నవ, వారివాహ, నివహమ్ములన్= ఆ కొత్తమేఘాల సమూహాలను; చూచి, భయ, ప్రపన్నుఁడు+ఐ= భయంచే శరణువేడినవాడై; ఉన్న= ఉన్నట్టి; హుతాశనున్= అగ్నిహోత్రుడిని; అతి+ఉన్నత, చిత్తుఁడు= మిక్కిలి గొప్పదైన మనస్సు కలవాడు; విజయుఁడు= అర్జునుడు; ఓడకుము= భయపడకుము; అంచును= అంటూ; మారుత+అస్త్రము= వాయువ్యాస్త్రాన్ని; ఏసెన్= ప్రయోగించాడు; అదియున్= ఆ వాయవ్యాస్త్రమూ; సముత్పన్న, సమీరణ+ఆహతిన్= అప్పటికప్పుడు గొప్పగా పుట్టిన గాలిదెబ్బచే; అపార, పయోద, కదంబకంబులన్= అంతులేని మేఘాలగుంపులను; రయంబుతో= వేగంతో; విరియించెన్= చెదరగొట్టింది.

తాత్పర్యం: ఆ క్రొత్త మేఘాల సమూహాలను చూచి, భయపడి శరణువేడిన అగ్నిహోత్రుడిని చూచి, అర్జునుడు పెద్దమనస్సుతో - భయపడవద్దని చెప్పి, వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ వాయవ్యాస్త్రం అప్పటికప్పుడు పుట్టిన గాలిదెబ్బచే అంతులేని ఆ మేఘాలగుంపులను వెంటనే చెదరగొట్టింది.

విశేషం: ఇక్కడ అర్జునుడు విజయుడనటంలో మున్ముందు అతడు సాధించబోయే విజయంకూడా ధ్వనింపచేయబడింది.

వ. అంత. **278**

తాత్పర్యం: అప్పుడు.

సీ. బలవైరి కృష్ణుపైఁ బార్థుపై గడునల్గి । పంచినఁ గలయంగఁ బన్ని కడఁగి
సురగరుడోరగాసురసిద్ధగంధర్వు । లార్చుచుఁ దాఁకి యుగ్రాహవంబు
సేసిన నమరులఁ జెచ్చెరఁ బార్థుండు । భంజించెఁ దనదివ్యబాణశక్తిఁ;
జక్రధరుండును జక్రబలంబున । గరుడోరగాసురఖచరవరులఁ

ఆ. దత్క్షణంబ విగతదర్పులఁ జేసె; న । య్యిద్దఱకు సురాసురేశు లెల్ల
భీతు లగుట చూచి పెద్దయు విస్మిత । హృదయుఁ డయ్యెఁ సురగణేశ్వరుండు. **279**

ప్రతిపదార్థం: బలవైరి= దేవేంద్రుడు; కృష్ణు, పైన్= కృష్ణుని మీద; పార్థు, పైన్= అర్జునుని మీద; మిక్కిలి, అలిగి= చాలా కోపించి; పంచినన్= ఆజ్ఞాపించగా; సుర, గరుడ+ఉరగ+అసుర, సిద్ధ, గంధర్వులు= సురాసురులు గరుడోరగులు సిద్ధగంధర్వులు; కలయంగన్= కలిసి; పన్ని= యుద్ధం చేయటానికి వ్యూహం తీర్చి; కడఁగి= పూని; ఆర్చుచున్= అరుస్తూ; తాఁకి= ఎదుర్కొని; ఉగ్ర+ఆహవంబు= భయంకరమైన యుద్ధం; చేసినన్= చేయగా; పార్థుండు= అర్జునుడు; తన, దివ్య, బాణ, శక్తిన్= తనయొక్క దివ్యమైన బాణాల శక్తిచేత; అమరులన్= దేవతలను; చెచ్చెరన్+చెరన్= తత్క్షణమే; భంజించెన్= ఓడించాడు; చక్ర, ధరుండును= శ్రీకృష్ణుడుకూడా; చక్ర, బలంబునన్= చక్రాయుధంయొక్క బలంచేత; గరుడ+ఉరగ+అసుర, ఖచర, వరులన్= శ్రేష్ఠులైన గరుడులను, నాగులను, అసురులను, ఆకాశసంచారులను; విగత, దర్పులన్= కోల్పోయిన గర్వం కలవాళ్ళనుగా; చేసెన్; ఆ+ఇద్దఱకున్= ఆ కృష్ణార్జునులకు; సుర+అసుర+ఈశులు+ఎల్లన్= దేవదైత్యనాయకులంతా; భీతులు+అగుట= భయం పొందినవాళ్ళు కావటం; చూచి; సుర, గణ+ఈశ్వరుండు= దేవతా సమూహాల ప్రభువు- దేవేంద్రుడు; పెద్దయున్= మిక్కిలి; విస్మిత హృదయుఁడు= ఆశ్చర్యం పొందిన మనస్సు కలవాడు; అయ్యెన్.

తాత్పర్యం: దేవేంద్రుడు కృష్ణార్జునులపై మిక్కిలి కోపించి ఆజ్ఞాపించగా - సురలు, గరుడులు, నాగులు, అసురులు, సిద్ధులు, గంధర్వులు ఏకమై వ్యూహం తీర్చి, పూనికతో అరుస్తూ ఎదుర్కొని భయంకర యుద్ధం చేశారు. అర్జునుడు తనదివ్యబాణాల శక్తిచేత దేవతలను తత్క్షణమే ఓడించాడు. శ్రీకృష్ణుడుకూడా తన చక్రబలంతో గరుడులకు, నాగులకు, అసురులకు, ఆకాశ సంచారులకు గర్వభంగం కావించాడు. ఆ కృష్ణార్జునులకు దేవదైత్యనాయకులంతా భయపడటం చూచి, దేవేంద్రుడు ఆశ్చర్యపడ్డాడు.

వ. మఱియును వారల బల పరాక్రమంబు లెఱుంగ వేఁడి శక్రుండు శిలావర్షంబుఁ గురియించిన. **280**

ప్రతిపదార్థం: మఱియును= అంతేగాక; వారల= కృష్ణార్జునులయొక్క; బల, పరాక్రమంబులు; ఎఱుంగన్+వేఁడి= తెలిసికొనాలనుకొని; శక్రుండు= దేవేంద్రుడు; శిలా, వర్షంబున్= రాళ్ళవానను; కురియించినన్= కురిపించగా.

తాత్పర్యం: అంతేకాక కృష్ణార్జునుల బలపరాక్రమాలను తెలిసికొనగోరి ఇంద్రుడు రాళ్ళవాన కురిపించగా,

క. నిశితశరవర్షమున ను । గ్రశిలావర్షమ్ముఁ జిత్రగతి నస్త్రకలా
కుశలుఁడు నరుఁ డశ్రమమునఁ । బ్రశాంతిఁ బొందించె నమరపతి వెరఁగందన్. 281

ప్రతిపదార్థం: అస్త్ర, కలా, కుశలుఁడు= బాణప్రయోగకళలో నేర్పరి అయినవాడు; నరుఁడు= అర్జునుడు; నిశిత, శర, వర్షమునన్= వాడి అయిన బాణ వర్షంచేత; చిత్ర, గతిన్= ఆశ్చర్యకరమైన విధంగా; ఉగ్ర, శిలా, వర్షమునన్= భయంకరమైన రాళ్ళవాన; అమర, పతి= దేవేంద్రుడు; వెరఁగు+అందన్= ఆశ్చర్యంపొందగా; అ(శ్రమమునన్= శ్రమలేకుండా - సులువుగా; ప్రశాంతిన్+పొందించెన్= అణగిపోయేటట్లు చేశాడు.

తాత్పర్యం: బాణ ప్రయోగకళలో నిపుణుడైన అర్జునుడు, వాడి అయిన తన బాణాల వర్షంతో ఆశ్చర్యకరంగా, భయంకరమైన ఆ రాళ్ళవానను దేవేంద్రుడుకూడా ఆశ్చర్యపడేటట్లు అవలీలగా అణగించాడు.

క. కొడుకుభుజవిక్రమమునకుఁ । గడుసంతసపడియుఁ దృప్తిగానక చల మే
ర్పడఁగ హుతాశను నార్పం । గడఁగి మహారౌద్రభంగిఁ గౌశికుఁడు వడిన్. 282

ప్రతిపదార్థం: కౌశికుఁడు = దేవేంద్రుడు; కొడుకు= కుమారుడైన అర్జునుని; భుజపరాక్రమానికి= బాహుబలానికి; కడున్= మిక్కిలి; సంతసపడియున్= సంతోషంపొందికూడా; తృప్తి, కానక= తృప్తిలేక; చలము= కోపం; ఏర్పడన్+కన్= బయలుపడేటట్లు; హుతాశనున్-హుత+అశనున్= అగ్నిహోత్రుడిని; ఆర్పన్= అణచటానికి; కడఁగి= పూనుకొని; మహా, రౌద్ర, భంగిన్= మిక్కిలి భయంకరమైన విధంగా; వడిన్= వేగమే.

తాత్పర్యం: దేవేంద్రుడు తన కుమారుడైన అర్జునుని బలపరాక్రమం చూచి, మిక్కిలి సంతోషించి, తృప్తిపొందక కోపంతో అగ్నిహోత్రుడిని ఆర్పివేయటానికి పూనుకొని మహాభయంకరంగా వేగమే.

చ. అరుదుగ దివ్యరత్ననివహంబులఁ జేసి వెలుంగుచున్న మం
దర శిఖరంబు నెత్తికొని తద్దహనార్చు లడంగునట్లుగాఁ
దెరలఁగ వైచినం దపనతేజుఁడు పాండుసుతుండు దానిజ
ర్జరితము సేసె వజ్రమయశాతశిలీముఖచండధారలన్. 283

ప్రతిపదార్థం: అరుదుగన్= ఆశ్చర్యం కలిగించేటట్లు; దివ్య, రత్న, నివహంబులన్+చేసి= శ్రేష్ఠాలైన రత్న సమూహాలతో; వెలుంగుచున్+ఉన్న= వెలుగుతూఉండే; మందర, శిఖరంబున్= మందరపర్వతంయొక్క శిఖరాన్ని; ఎత్తికొని; తత్+దహన+ అర్చులు= ఆ అగ్నిహోత్రునిమంటలు; అడంగు, అట్లుగాన్= అణగిపోయేటట్లుగా; తెరలన్+కన్= కలతనొందేటట్లుగా; వైచినన్= వేయగా; తపన, తేజుఁడు= సూర్యునివంటి కాంతి కలవాడు; పాండు, సుతుండు= పాండురాజు కుమారుడు - అర్జునుడు; దానిన్= ఆ మందరపర్వతశిఖరాన్ని; వజ్రమయశాత, శిలీముఖ, చండ, ధారలన్= వజ్రాయుధంవలె వాడి అయిన బాణాల భయంకర వర్షాలచేత; జర్జరితము= శిథిలం; చేసెన్.

తాత్పర్యం: ఆశ్చర్యకరంగా దివ్యరత్న సమూహాలతో వెలుగుతున్న మందరపర్వతశిఖరాన్ని ఎత్తి దేవేంద్రుడు అగ్నిహోత్రునిమంటలు అణగేటట్లు వేయగా, సూర్యునివంటి కాంతిమంతుడైన అర్జునుడు వజ్రాయుధంవలె వాడి అయిన బాణవర్షాలతో దాన్ని ముక్కలు చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ధరణీధరుచక్రమునకుఁ । బురుహూతతనూజుబాణముల కనిలో నె
వ్వరు మార్కొ ననోపరు సుర । గరుడోరగ సిద్ధసాధ్యగణములలోనన్. 284

ప్రతిపదార్థం: ధరణీధరు, చక్రమునకున్= భూమిని ధరించినవాడైన శ్రీకృష్ణుని చక్రాయుధానికి; పురుహూత, తనూజ, బాణములకున్= దేవేంద్రుని కుమారుడైన అర్జునునియొక్క బాణాలకు; అనిలోన్= యుద్ధంలో; సుర, గరుడ+ఉరగ, సిద్ధ, సాధ్య, గణములలోనన్= దేవతలయొక్క, గరుడులయొక్క, నాగులయొక్క, సిద్ధులయొక్క, సాధ్యులయొక్క సమూహాలలో; ఎవ్వరున్= ఎవరుకూడా; మార్కొనన్+ఓపరు= ఎదుర్కోలేరు.

తాత్పర్యం: శ్రీకృష్ణునిచక్రాయుధాన్ని, అర్జునునిబాణాలను, యుద్ధంలో దేవ గరుడ నాగ సిద్ధ సాధ్యుల సమూహాలలో ఎవ్వరుకూడా ఎదుర్కొనలేరు.

విశేషం: ధరణీధరుడు - భూమిని ధరించిన - శ్రీమహావిష్ణువు - ఇక్కడ అతని అవతారమైన శ్రీకృష్ణుడు. పురుహూతుడనగా- యజ్ఞాలలో ప్రచురమైన పిలుపుకలవాడు; పురువను రక్కసుడిని చంపినవాడు - దేవేంద్రుడు.

వ. అంత నొక్కయశరీరవాణి పాకశాసనున కి ట్లనియె. 285

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; ఒక్క; అశరీరవాణి= ఆకాశవాణి; పాకశాసనునకున్= దేవేంద్రునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అప్పుడు ఒక ఆకాశవాణి ఇంద్రునితో ఇట్లా అన్నది.

విశేషం: పాకశాసనుడు - వృత్రాసురుని సోదరుడైన పాకాసురుడిని చంపినవాడు - దేవేంద్రుడు.

క. పరమమును లయిన తొల్లిటి । నరనారాయణులు కృష్ణనామంబుల ను
ర్వర నుదయించిరి; నీ క । య్యిరువుర పేర్మియును వింతయే దివిజేంద్రా! 286

ప్రతిపదార్థం: దివిజ+ఇంద్రా!= దేవేంద్రా; పరమ, మునులు; అయిన= శ్రేష్ఠ మునీశ్వరులైన; నర, నారాయణులు; కృష్ణ, నామంబులన్= కృష్ణులు అనే పేర్లతో; ఉర్వరన్= భూమియందు (పై); ఉదయించిరి= పుట్టారు; నీకున్= నీకు; ఆ+ఇరువుర= ఆ ఇద్దరియొక్క; పేర్మియును= గొప్పతనం; వింతయే= ఆశ్చర్యకరమా?

తాత్పర్యం: దేవేంద్రా! పరమమునులైన నరనారాయణులు కృష్ణులనే పేర భూమిమీద పుట్టారు. ఆ ఇద్దరి గొప్పతనం నీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదా?

విశేషం: శ్రీకృష్ణునికే గాక అర్జునునికి కూడా కృష్ణుడు అనే పేరు ఉన్నది. శ్లో॥ అర్జునః ఫల్గుణః పార్థః, కిరీటీ శ్వేతవాహనః । బీభత్సో విజయః, కృష్ణ, స్సవ్యసాచీ, ధనంజయః ॥ అని అర్జునుని పేర్లు.

చ. అలఘులు కృష్ణపార్థులు మహాత్ములు యాదవకౌరవాన్వయం
బులు వెలుఁగించుచున్న నృపపూజ్యులు; వీరల నీకు నోర్వఁగా
నలవియె? వీరు దొల్లియు సురాసుర యుద్ధమునాఁడు దైత్యులన్
వెలయఁగ నోర్చియున్న రణవీరులు గావుట ము న్నెఱుంగవే? 287

ప్రతిపదార్థం: కృష్ణ, పార్థులు= కృష్ణార్జునులు; అలఘులు= తక్కువ కాని వాళ్ళు - అంటే గొప్పవాళ్ళు; మహా+ఆత్ములు = మహనీయులు; యాదవ, కౌరవ+అన్వయంబులు= యాదవ కౌరవవంశాలు; వెలుఁగించుచున్+ఉన్న= వెలిగించే; నృప, పూజ్యులు= పూజించదగిన రాజులు; వీరలన్= వీళ్లను; నీకున్; ఓర్వఁగాన్= ఓడించడానికి; అలవియె= సాధ్యమా?; వీరు= వీళ్లు, తొల్లియున్= పూర్వంకూడా; సుర+అసుర, యుద్ధము, నాఁడు= దేవ దానవ యుద్ధ సమయంలో; దైత్యులన్= రాక్షసులను; వెలయన్+కన్= గొప్పగా; ఓర్చి, ఉన్న= ఓడించిఉన్న; రణ, వీరులు= యుద్ధవీరులు, కావుట= కావటం; మున్ను= ఇదివరకు; ఎఱుంగవే= తెలిసికొనలేదా!

తాత్పర్యం: కృష్ణార్జునులు గొప్పవాళ్ళు, మహాత్ములు. యాదవ కౌరవ వంశాలను వెలిగించే పూజ్య ప్రభువులు. వీళ్ళను ఓడించడం నీకు సాధ్యమా. పూర్వం దేవదానవయుద్ధంలో రాక్షసులను వీళ్ళు ఓడించడం ఇదివరకు నీకు తెలియదా?

వ. నీయిష్టసఖుం డయిన తక్షకుం డిం దుండక ముందరన కురుక్షేత్రంబున కరిగి ఖాండవప్రళయంబునకుఁ దప్పెఁ; ఖాండవం బగ్నిచేత దగ్ధం బగు నని తొల్లి బ్రహ్మవచనంబు గలుగుటం జేసి యిది హుతాశనున కశనం బయ్యెఁ; నింక దీనికి వగవం బనిలేఁ; దనిన దాని విని సురపతి సురగణంబులతో మరలిన. 288

ప్రతిపదార్థం: నీ, ఇష్ట, సఖుండు+అయిన= నీకు మిక్కిలి ఇష్టమైన స్నేహితుడైన; తక్షకుండు; ఇందున్= ఇక్కడ; ఉండక= వసింపక; ముందరన= ముందుగానే; కురుక్షేత్రంబునకున్= కురుక్షేత్రానికి; అరిగి= వెళ్ళి; ఖాండవ, ప్రళయంబునకున్= ఖాండవవనంలోని ప్రమాదానికి; తప్పెన్= దూరమయినాడు; ఖాండవంబు; అగ్నిచేతన్= అగ్నిచే; దగ్ధంబు+అగున్= కాలిపోతుంది; అని= అని; తొల్లి= పూర్వం; బ్రహ్మ, వచనంబు= బ్రహ్మదేవునిమాట; కలుగుటన్+చేసి= ఉండటంచేత; ఇది, హుతాశనునకున్= అగ్నిహోత్రుడికి; అశనంబు= ఆహారం; అయ్యెన్= అయింది; ఇంకన్= ఇంక; దీనికి= దీనికై; వగవన్= చింతింప; పనిలేదు; అనినన్= అని అనగా; దానిన్= ఆ మాటను విని; సుర, పతి= దేవతలరాజు - దేవేంద్రుడు; సుర, గణంబులతోన్= దేవతా సమూహాలతో; మరలినన్= తిరిగి వెళ్ళగా.

తాత్పర్యం: 'నీ ప్రియమిత్రుడైన తక్షకుడు ఇక్కడ లేడు. ముందుగానే కురుక్షేత్రానికి వెళ్ళి, ఈ ఖాండవ దహనంవలన కలిగే ప్రమాదాన్ని తప్పించుకొన్నాడు. అగ్నిచే ఖాండవం కాలిపోతుందని పూర్వమే బ్రహ్మ చెప్పాడు. అందుచేత ఇది అగ్నిహోత్రునికి ఆహారమైనది. ఇక దీనికి దుఃఖింపనక్కరలేదు' అని చెప్పగా విని దేవేంద్రుడు దేవతాసమూహాలతో తిరిగి వెళ్ళగా.

క. బలయుతులు మనుజసింహులు । నలిఁ గృష్ణార్జునులు సింహనాదముల వియ
త్తలమును దిక్కులు బధిరం । బులుగాఁ జేసిరి త్రిలోకములు భయ మందన్. 289

ప్రతిపదార్థం: బల, యుతులు= బలంతో కూడినవాళ్ళు; మనుజ, సింహులు= మానవశ్రేష్ఠులు; కృష్ణ+ అర్జునులు= కృష్ణుడు, అర్జునుడు; నలిన్= అతిశయంగా; సింహనాదములన్= సింహనాదాలచేత; వియత్+తలమును= ఆకాశంయొక్క క్రిందిభాగం; దిక్కులు= అన్ని దిక్కులు; బధిరంబులు+కాన్= చెవిటివి అయ్యేటట్లుగా; త్రిలోకములు= మూడులోకాలు; భయము+అందన్= భయపడగా; చేసిరి= చేశారు;

తాత్పర్యం: బలవంతులు, మానవశ్రేష్ఠులు అయిన కృష్ణార్జునులు ముల్లోకాలు భయపడేటట్లుగా-ఆకాశం, దిక్కులు చెవిటివయ్యేటట్లుగా పెద్ద సింహనాదాలు చేశారు.

వ. అట్టియవసరంబున నముచి యను దనుజుననుజుండు మయుం డనువాఁడు ఖాండవంబు వెలువడనేరక తక్షకుగృహంబునఁ బరిభ్రమించుచున్నంతఁ ద నన్గ్ని చుట్టుముట్టిన నచ్యుతుండును జంప వచ్చిన నతిభీతుం డై యర్జునుమఱువు సొచ్చిన. 290

ప్రతిపదార్థం: అట్టి, అవసరంబునన్= అటువంటి సమయంలో; నముచి, అను= నముచి అనే పేరుగల; దనుజ; అనుజుండు= రాక్షసుడిని అనుసరించి పుట్టినవాడు; మయుండు= మయుడు; అనువాఁడు; ఖాండవంబు, వెలువడన్, నేరక= ఖాండవవనంనుండి బయటకి రాలేక; తక్షకు, గృహంబునన్; పరిభ్రమించుచున్= అంతటా తిరుగుతూ; ఉన్న+అంతన్= ఉండగా; తన్నున్= తనను; అగ్ని= అగ్ని; చుట్టుముట్టినన్= చుట్టుముట్టగా; అచ్యుతుండును= శ్రీకృష్ణుడుకూడా; చంపవచ్చినన్= చంపుటకైరాగా; అతి, భీతుండు+ఐ= మిక్కిలిభయపడినవాడై; అర్జును, మఱువు= అర్జునునిచాటు; చొచ్చినన్= ప్రవేశింపగా.

తాత్పర్యం: అట్లాంటి సమయంలో నముచి అనే రాక్షసునితమ్ముడు, మయుడు అనేవాడు ఖాండవవనంనుండి బయటపడలేక తక్షకుని ఇంట్లో దిక్కుతోచక తిరుగుతూ, తనను అగ్ని చుట్టుముట్టగా, శ్రీకృష్ణుడు చంపటానికి రాగా, మిక్కిలి భయపడి అర్జునునిచాటు చొచ్చాడు.

వ. శరణాగతరక్షణత। త్పరుఁడు ధనంజయుఁడు మయునిప్రాణము గాచెం;
గరుణను శరణాగతులగు। పురుషుల రక్షించునంత పుణ్యము గలదే. 291

ప్రతిపదార్థం: శరణ+ఆగత, రక్షణ, తత్+పరుఁడు= శరణుకోరివచ్చినవాళ్ళను రక్షించటంలో మనస్సు కలవాడు; ధనంజయుఁడు= అర్జునుడు; మయుని= మయుని; ప్రాణము= ప్రాణాన్ని; కాచెన్= కాపాడాడు; కరుణను= దయతో; శరణ+ఆగతులు+అగు= శరణుకోరి వచ్చిన వాళ్ళయిన; పురుషులన్= పురుషులను; రక్షించు, అంత= రక్షించేంతటి; పుణ్యము, కలదే= వేరే ఉన్నదా? (లేదని భావం).

తాత్పర్యం: శరణుకోరివచ్చినవాళ్ళను రక్షించటంలో మనస్సు కల అర్జునుడు మయునిప్రాణాలు కాపాడాడు. శరణుకోరినవాళ్ళను దయతో రక్షించటంవంటిపుణ్యం ఇంకొకటి కలదా! (లేదని భావం)

విశేషం: అలంకారం - అర్థాంతరన్యాసం. నానారుచిరార్థసూక్తినిధి అయిన నన్నయ కవితలో 'శరణాగతరక్షణ మహాపుణ్యాకార్య' మని ప్రవచించిన ఈ సూక్తి ఒక మేలిమిరత్నం.

తే. మయుఁడు నశ్వసేనుండును మందపాల। సుతులు నలువురు శార్ఙ్గకు లతులదావ
దాహభీతి కయ్యార్వురుఁ దప్పి రన్య। జీవులెల్ల నం దపగతజీవు లైరి. 292

ప్రతిపదార్థం: మయుడున్, అశ్వసేనుండును; మందపాల, సుతులు= మందపాలునియొక్క కుమారులు; శార్ఙ్గకులు= శార్ఙ్గకులు, నలువురు= నలుగురు; ఆ+ఆర్వురు= ఆ ఆరుగురు; అతుల, దావ, భీతికిన్= సాటిలేని కార్చిచ్చువలన కలిగే భయానికి; తప్పిరి= తప్పించుకొన్నారు; అన్య, జీవులు+ఎల్లన్= తక్కినప్రాణులన్నీ; అందున్= ఆ అగ్నిలో; అపగత, జీవులు+ఐరి= ప్రాణాలు కోల్పోయారు.

తాత్పర్యం: మయుడు, అశ్వసేనుడు, మందపాలుని కుమారులు శార్ఙ్గకు లనేవాళ్ళు నలుగురు - మొత్తం ఆరుమంది ఆ దావాగ్నినుండి తప్పించుకొన్నారు. తక్కిన ప్రాణులన్నీ ఆ దావాగ్నిలో మరణించాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మందపాలోఖ్యానము (సం. 1-220-1)

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 293

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; జనమేజయుండు; వైశంపాయనునకున్; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని జనమేజయుండు వైశంపాయనునితో ఇట్లా అన్నాడు.

క. మయభుజగమోక్షణము ని । ర్ణయముగ నెఱిఁగితి, నెఱుంగ నా కర్థిత్వం

బయినది నలుగురు శార్ఙ్గకు । లయు మోక్షణ మెట్లు నిర్మలజ్ఞాననిధీ! 294

ప్రతిపదార్థం: నిర్మల, జ్ఞాన, నిధీ= అచ్చపు జ్ఞానానికి స్థానమైనవాడా! ఓ వైశంపాయనమహర్షీ!, మయ, భుజగ, మోక్షణము= మయునియొక్క, పామైన అశ్వసేనునియొక్క విముక్తి - అంటే మయుడు, అశ్వసేనుడు ఆ దావాగ్నినుండి తప్పించుకొని బయటపడిన విధం; నిర్ణయముగన్= నిశ్చయంగా అంటే పూర్తిగా; ఎఱిఁగితిన్= తెలిసికొన్నాను; నలుగురు; శార్ఙ్గకులయు, మోక్షణము= నలుగురు శార్ఙ్గకులు తప్పించుకోవటం; ఎట్లు= ఏ విధంగా జరిగిందో; నాకున్= నాకు ; ఎఱుంగన్= తెలిసికోవటానికి; అర్థిత్వంబు+అయినది= కోరిక కలిగింది.

తాత్పర్యం: నిర్మల జ్ఞానానికి నిధివంటి ఓ వైశంపాయనమహర్షీ! మయుడు, అశ్వసేనుడు ఆ దావాగ్నినుండి తప్పించుకొన్నవిధం పూర్తిగా తెలుసుకొన్నాను. మందపాలుడి కుమారులైన నలుగురు శార్ఙ్గకు లెట్లా తప్పించుకొన్నారో తెలిసికొనాలనే కోరిక కలిగింది.

వ. అని యడిగిన జనమేజయునకు వైశంపాయనుం డి ట్లనియె. 295

ప్రతిపదార్థం: అని, అడిగినన్= అని అడుగగా; జనమేజయునకున్= జనమేజయమహారాజుకు; వైశంపాయనుండు= వైశంపాయనమహర్షి; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని అడుగగా వైశంపాయనుడు జనమేజయునితో ఈ విధంగా అన్నాడు.

క. జనపాల! మందపాలుం । డనుమునిముఖ్యుండు దొల్లి యత్యుగ్రతపం

బొనరించె బ్రహ్మచర్యం । బున దివ్యసహస్రవర్షములు నైష్ఠికుఁ డై. 296

ప్రతిపదార్థం: జనపాల= జనులను పాలించేవాడా! ఓ జనమేజయమహారాజా!; తొల్లి= పూర్వం; మందపాలుండు; అను; ముని, ముఖ్యుండు= ప్రసిద్ధుడైన ముని; బ్రహ్మచర్యంబునన్= బ్రహ్మచర్యవ్రతాన్ని అవలంబిస్తూ; దివ్య, సహస్ర, వర్షములు= వెయ్యి దేవతాసంవత్సరాలు; నైష్ఠికుఁడు+ఐ= నిష్ఠకలవాడై - అంటే స్థిరమైన బుద్ధి కలవాడై; అతి+ఉగ్ర, తపంబున్= మిక్కిలి భయంకరమైన తపస్సును; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! పూర్వం మందపాలుడనే మహాముని బ్రహ్మచర్యవ్రతాన్ని అవలంబించి వెయ్యిదేవతాసంవత్సరాలు నిష్ఠతో భయంకరమైనతపస్సు చేశాడు.

క. అమ్ముని యోగాభ్యాసవ । శమ్మున దేహంబు విడిచి చని పుణ్యు లలో
కమ్ములు సొరఁ గానక వడిఁ । ద్రిమ్మరి దేవతలఁ గాంచి ధృతి ని ట్లనియెన్. 297

ప్రతిపదార్థం: ఆ+ముని= ఆ మందపాలమహాముని; యోగ+అభ్యాస, వశమ్మునన్= యోగాభ్యాసంచేత; దేహంబు= శరీరం; విడిచి= వదలి; చని= వెళ్లి; పుణ్యుల, లోకమ్ములు= పుణ్యం చేసికొన్నవాళ్ళు ఉండే లోకాలు - దివ్యలోకాలు; చొరన్+కానక= ప్రవేశించలేక; వడిన్= వేగమే; త్రిమ్మరి= వెనుదిరిగి; దేవతలన్= దేవతలను; కాంచి= చూచి; ధృతిన్= ధైర్యంతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ మందపాలమహాముని యోగాభ్యాసంచేత శరీరం విడిచి, పుణ్యలోకాలను ప్రవేశించలేక, వెంటనే వెనుదిరిగి దేవతలతో ధైర్యంగా ఇట్లా అన్నాడు.

వ. 'నాకుఁ బుణ్యలోకంబులు లేకుండ నే నేమి దుష్కృతంబు సేసితి?' ననిన నమ్మునీంద్రునకు దేవత లి ట్లనిరి. 298

ప్రతిపదార్థం: నాకున్; పుణ్య, లోకంబులు; లేకుండన్= లేకుండుటకు; ఏను= నేను; ఏమి; దుష్కృతంబు చేసితిన్= పాపం చేసితిని; అనినన్= అని అనగా; ఆ+ముని+ఇంద్రునకున్= ఆ మునీశ్వరునికి; దేవతలు, ఇట్లు+అనిరి.

తాత్పర్యం: 'నాకు పుణ్యలోకాలు లేకుండా పోవటానికి నే నేమి పాపం చేశాను?' అని అనగా ఆ మునిశ్రేష్ఠునితో దేవతలు ఇట్లా అన్నారు.

క. ఎంతతపం బొనరించియు । సంతానము లేనివారు సద్గతిఁ బొందం
గాంతురె? నీతప మేటికి । సంతానమువడయు మరిగి సన్మునినాథా! 299

ప్రతిపదార్థం: సత్+ముని, నాథా!= పూజింపదగిన మునిశ్రేష్ఠా!; ఎంత= ఎంతగా; తపంబు= తపస్సు; ఒనరించియు= చేసినా; సంతానము; లేని; వారు; సత్+గతిన్= మోక్షాన్ని; పొందన్+కాంతురె= పొందగలరా?; నీ, తపము= నీ తపస్సు; ఏటికి= ఎందుకు; అరిగి= వెళ్ళి; సంతానము= సంతానాన్ని; పడయుము= పొందుము.

తాత్పర్యం: పూజింప తగిన ఓ మునీశ్వరా! ఎంత తపస్సు చేసినా సంతానం లేనివాళ్ళు మోక్షాన్ని పొందకలరా? నీ తపస్సెందుకు? వెళ్ళి సంతానం పొందుము.

వ. అనిన విని మందపాలుండు మర్త్యలోకంబునకుఁ దిరిగివచ్చి 'నాకుం జెచ్చెరం బెక్కండ్రుపుత్త్రుల నెవ్విధంబునం బడయనగునో' యని చింతించి, పక్షులయందు వేగంబ యపత్యంబు పెద్ద యగుటం జూచి, తానును శార్ఙ్గకుండై, జరిత యను లావుక పెంటియందు రమియించి, దానివలన జరితారి సారిసృక్కస్తంబమిత్ర ద్రోణు లనువారల నలువురఁ గొడుకులఁ బరమబ్రహ్మవిదులం బడసి, వారల ఖాండవవనంబునం బెట్టి, తనపూర్వభార్యయైన లపితయుం దానును విహరించుచు నొక్కనాఁడు ఖాండవదహనోద్యతుండై వచ్చుచున్న యగ్నిభట్టారకుం గని, యగ్నిసూక్తంబుల స్తుతియించి యి ట్లనియె. 300

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; విని, మందపాలుండు, మర్త్య, లోకంబునకున్= మానవలోకానికి; తిరిగివచ్చి, నాకున్, చెరన్+చెరన్= వేగమే; పెక్కండ్రు= పలువురు; పుత్త్రులన్= కుమారులను; ఏ, విధంబునన్; పడయన్= పొందటానికి; అగునో= సాధ్యపడునో; అని= అంటూ; చింతించి = ఆలోచించి; పక్షుల, అందు= పక్షులలో, వేగంబు+అ= త్వరగా, అపత్యంబు=

సంతానం; పెద్ద, అగుటన్= ఎక్కువకావటాన్ని; చూచి= గ్రహించి; తానును; శార్ఙ్గకుండు+ఐ= శార్ఙ్గకపక్షి (లావుకపక్షి) రూపం దాల్చినవాడై; జరిత, అను; లావుక, పెంటియందున్= ఆడు లావుక పక్షియందు; రమియించి= సంభోగించి; దానివలనన్= జరితారి, సారిసృక్క, స్తంబమిత్ర, ద్రోణులు; అనువారలన్= అనే వాళ్ళను, నలువురన్= నలుగురిని; కొడుకులన్= కొడుకులను; పరమ, బ్రహ్మ, విదులన్= గొప్ప బ్రహ్మజ్ఞానం కలవాళ్ళను; పడసి= పొంది; వారలన్= వాళ్ళను; ఖాండవంబునన్= ఖాండవవనంలో; పెట్టి= ఉంచి; తన, పూర్వ, భార్య+ఐన= తన మొదటి భార్య అయిన; లపితయున్= లపితయూ, తానును= తానూ; విహరించుచున్= విహరించుచు; ఒక్కనాఁడు; ఖాండవ, దహన+ఉద్యతుండు+ఐ= ఖాండవవనాన్ని కాల్చటానికి పూనుకొన్నవాడై; వచ్చుచున్+ఉన్న= వస్తూ ఉండే; అగ్నిభట్టారకున్= అగ్నిహోత్రుడిని; కని=చూచి; అగ్ని, సూక్తంబులన్= అగ్నిని స్తుతించే వేదమంత్రాలతో; స్తుతియించి= స్తోత్రంచేసి-కొనియాడి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దేవతలు ఆ విధంగా చెప్పగా విని, మందపాలుడు మానవలోకానికి తిరిగివచ్చాడు. త్వరగా తాను పుత్రులను పొందటం ఏ విధంగా సాధ్యమౌతుందో నంటూ ఆలోచించాడు. పక్షులలో సంతానం చాలా ఎక్కువ కావటం చూచి, మగలావుకపక్షిరూపం తాల్చాడు. ఆడులావుకపక్షి అయిన జరితతో సంభోగించాడు. జరితారి, సారిసృక్క, స్తంబమిత్ర, ద్రోణు లనే నలుగురు కొడుకులను - గొప్ప బ్రహ్మజ్ఞానంకలవాళ్ళను కన్నాడు. వాళ్ళను ఖాండవవనంలో ఉంచి తాను మొదటి భార్య అయిన లపితతో కలిసి విహరిస్తూ ఒక రోజు ఖాండవవనాన్ని కాల్చే ప్రయత్నంతో వస్తున్న అగ్నిహోత్రుడిని చూచి, అగ్నిసూక్తాలతో ఆయనను స్తోత్రం చేసి ఇట్లా అన్నాడు.

విశేషం: కథాప్రసన్నతను దృష్టిలో ఉంచుకొని నన్నయ ఇక్కడ మూలంలోని అగ్నిస్తోత్రాత్మకాలైన శ్లోకాలను అనువదించక వదిలాడు.

క. నీ వఖిల ధర్మమూర్తివి; । నావీర్యప్రభవు లయిన నలువురుసుతులన్
లావుకలఁ గరుణఁ గావుము । పావక! భువనోపకారపర్యాప్తమతీ! 301

ప్రతిపదార్థం: భువన+ఉపకార= లోకానికి ఉపకారం చేయటంలో; పర్యాప్తమతీ!= శక్తిమంతమైన మనస్సుకలవాడా!; పావక!= ఓ అగ్నిహోత్రా!; నీవు, అఖిల, ధర్మ మూర్తివి= సర్వధర్మస్వరూపుడవు; నా, వీర్య, ప్రభవులు+అయిన= నా వీర్యం నుండి పుట్టిన వాళ్ళయిన; నలువురు, సుతులన్= నలుగురు కుమారులను; లావుకలన్= లావుక పిట్టలను; కరుణన్= దయతో; కావుము= కాపాడుము.

తాత్పర్యం: లోకానికి ఉపకారం చేయటంలో శక్తిమంతమైన మనస్సు గలవాడా! ఓ అగ్నిహోత్రా! నీవు పరిపూర్ణ ధర్మమూర్తివి. నా వీర్యంనుండి పుట్టిన నలుగురు కుమారులు లావుకపిట్టలను దయతో రక్షింపుము.

వ. అనిన నమ్మందపాలుప్రార్థనంజేసి యానలువురు శార్ఙ్గకులను నగ్నిదేవుండు రక్షించువాఁ డయ్యె; నంత నిట 302

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; ఆ+మందపాలు= ఆ మందపాలునియొక్క; ప్రార్థనన్, చేసి= ప్రార్థనవల్ల; ఆ నలువురు శార్ఙ్గకులను= నలుగురు కుమారులైన శార్ఙ్గకుల్ని; అగ్నిదేవుండు= అగ్నిదేవుడు; రక్షించువాఁడు= కాపాడగల్గినవాడు; అయ్యెన్= అయ్యాడు; అంతన్= అంతలో.

తాత్పర్యం: అనగా, ఆ మందపాలుని ప్రార్థనవలన ఆ నలుగురు శార్ఙ్గకులను అగ్నిదేవుడు రక్షించాడు. ఇక ఇక్కడ.

క. తనయుల నజాతపక్షుల । ననలశిఖాభీతిచంచలాత్ముల నెటయుం
జననేరనిబాలకులను । జననియు వీక్షించి శోకసంతాపిత యై. 303

ప్రతిపదార్థం: అజాత, పక్షులన్= మొలవని రెక్కలు కలవాళ్ళను; అనల, శిఖా, భీతి, చంచల+ఆత్ములన్= అగ్నిజ్వాలలవలన కలిగే భయంవలన కంపించే హృదయాలు కలవాళ్ళను; ఎటయున్= ఎక్కడికీ; చననేరని= వెళ్ళలేని; బాలకులను= చిన్నపిల్లలను; తనయులన్= కుమారులను; జననియు= తల్లికూడా; వీక్షించి= చూచి; శోక, సంతాపిత+ఐ= దుఃఖంచేత మిక్కిలితాపం పొందినదై.

తాత్పర్యం: రెక్కలు మొలవనివాళ్ళు, నిప్పుమంటలు చూచి భయంచేత చలించే మనస్సు కలవాళ్ళు, ఎక్కడికీ వెళ్ళ లేనివాళ్ళు, పసివాళ్ళు అయిన కుమారులను చూచి తల్లికూడా మిక్కిలి దుఃఖించింది.

క. వీరలఁ దోడ్కొనిపోవఁగ । నేరను బాలకులఁ బెట్టి నిర్దయబుద్ధిన్
వీరలతండ్రిక్రియం జన । నేరను; విధికృతము గడవనేరఁగ లావే. 304

ప్రతిపదార్థం: వీరలన్= వీళ్లను; తోడ్కొని= వెంటపెట్టుకొని; పోవఁగన్, నేరను= పోలేను; వీరల, తండ్రి, క్రియన్= వీళ్ళతండ్రివలె; బాలకులన్= పసివాళ్లను; పెట్టి= ఇక్కడే వదలిపెట్టి; నిర్దయ, బుద్ధిన్= దయలేని మనస్సుతో; చన నేరను= వెళ్ళలేను; విధికృతము= బ్రహ్మచే చేయబడింది; కడవనేరఁగన్= దాట కలగటం; లావే= అశక్యమేకదా!

తాత్పర్యం: వీళ్ళను వెంటబెట్టుకొని పోలేను. వీళ్ళతండ్రివలె దయమాలి ఇక్కడే విడిచిపోలేను. విధికృతం తప్పించుకోవటం ఎవరికి సాధ్యం?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'విధికృతము గడవనేరఁగ లావే' - నన్నయ నానారుచిరార్థసూక్తులలో ఇది ఒకటి.

చ. ఇది ప్రళయాగ్నిపోలె దెసలెల్లను గప్పఁగ విస్ఫులింగముల్
వదలక వాయుసారథిజవంబునఁ దా నిట వచ్చె నేమి సే
యుదు సుతులార! యీబిలము నొయ్యన పోయి చొరుండు దీనిఁ గ
ప్పెద ఘనపాంసుజాలముల భీమశిఖావళి దాఁకకుండఁగన్. 305

ప్రతిపదార్థం: సుతులార!= కుమారులారా!; ఇది, ప్రళయ+అగ్ని, పోలెన్= ప్రళయకాలంలోని అగ్నివలె; విస్ఫులింగముల్= నిప్పుకణాలు; వదలక= విడువక; దెసలు+ఎల్లను= దిక్కులన్నింటా; కప్పఁగన్= కప్పివేయగా; వాయు, సారథి= గాలిని సారథిగా కలవాడు - అగ్నిదేవుడు; జవంబునన్= వేగంగా; తాన్= తాను; ఇట= ఇటువైపు; వచ్చెన్; ఏమి; చేయుదున్; ఈ, బిలమున్= ఈ రంధ్రాన్ని; ఒయ్యనన్= చక్కగా; పోయి, చొరుండు+అ= ప్రవేశించండి; భీమ, శిఖా+ఆవళి= భయంకరాలైన మంటల సమూహాలు; తాఁకకుండఁగన్= తగలకుండా; ఘన, పాంసు, జాలములు= గొప్ప దుమ్ముకణాల సమూహాలచే - అంటే పెద్ద దుమ్ముచేత; దీనిన్= ఈ రంధ్రాన్ని; కప్పెదన్= కప్పివేస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పుత్త్రులారా! ప్రళయాగ్నివలె నిప్పుకణాలు దిక్కులన్నింటినీ కప్పగా అగ్నిదేవుడు వేగంగా ఇటువైపు వచ్చాడు. ఏం చేయాలి? తిన్నగా మీరు ఈ బొరియలో ప్రవేశించండి. భయంకరాలైన మంటలు తాకకుండా పెద్ద దుమ్ముతో నేను ఈ బొరియను కప్పేస్తాను.

చ. కొడుకుల బ్రహ్మవిత్తములఁ గోరినయట్టుల వీరి నల్వురం
బడసితి; నిమ్మహాత్ముల నపాయము నొందకయుండఁ బెంచుచున్
నడపుమటంచు నన్ను మునినాథుఁడు మీజనకుండు పంచి యి
ప్పుడ యెటయేనిఁ బోయె హుతభుక్ప్రళయంబు దలంప కక్కటా! 306

ప్రతిపదార్థం: ముని, నాథుఁడు= మునీంద్రుడైన మందపాలుడు; మీ, జనకుండు= మీ తండ్రి; కోరిన, అట్టులు+అ= కోరుకొన్నట్లే; బ్రహ్మవిత్తములన్= బ్రహ్మజ్ఞానం కలవాళ్ళలో శ్రేష్ఠులను; కొడుకులన్; వీరి= వీళ్ల; నల్వురన్= నలుగురిని; పడసితిన్= పొందాను; ఈ+మహాత్ములన్= ఈ మహనీయుల్ని; అపాయము; ఒందక, ఉండన్= పొందకుండా; పెంచుచున్= పెంచుతూ; నడపుము= ప్రవర్తిల్లుము; అటంచున్= అంటూ; నన్నున్= నన్ను; పంచి= ఆజ్ఞాపించి; హుత్‌భుక్+ప్రళయంబు= అగ్నిప్రమాదాన్ని; తలంపక= ఆలోచించక; అక్కటా;= అయ్యో!; ఇప్పుడు+అ= ఇప్పుడే - అంటే ఈ ప్రమాదపరిస్థితులేర్పడిన సమయంలోనే; ఎట, ఏనిన్= ఎక్కడికో; పోయెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: మునీశ్వరుడైన మీ తండ్రి కోరుకొన్నట్లు బ్రహ్మజ్ఞానం కలవాళ్ళను నలుగురుకొడుకులను కన్నాను. 'ఈ మహాత్ములకు అపాయం కలగకుండా పెంచు' అని నన్నాజ్ఞాపించి, అగ్నిప్రమాదాన్ని తలపక, ఈ ప్రమాదపరిస్థితులేర్పడినప్పుడే ఎక్కడికో వెళ్ళాడు.

వ. అని దుఃఖిత యై యున్న తల్లిం జూచి యగ్రతనయుం డైన జరితారి యి ట్లనియె. 307

ప్రతిపదార్థం: అని= అంటూ; దుఃఖిత+ఐ= దుఃఖించినదియై; ఉన్న= ఉన్నట్టి; తల్లిం+చూచి= తల్లిని చూచి; అగ్రతనయుండు+ఐన= పెద్ద కొడుకైన జరితారి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని దుఃఖించే తల్లిని చూచి పెద్దకొడుకైన జరితారి ఇట్లా అన్నాడు.

తే. బిలము సొచ్చితిమేని నం దెలుక చంపు; । నింద యుండితిమేనిఁ దా నేర్చు నగ్ని;
యెలుకచేఁ జచ్చుకంటె నీజ్వలన శిఖలఁ । గ్రాఁగి పుణ్యలోకంబులఁ గాంతు మేము. 308

ప్రతిపదార్థం: బిలము= రంధ్రం; చొచ్చితిమి+ఏనిన్= ప్రవేశిస్తే; అందున్= అందులో; ఎలుక; చంపున్= చంపుతుంది; ఇందు+అ= ఇక్కడే; ఉండితిమి+ఏనిన్= ఉంటిమా; అగ్ని; తాన్= తాను; ఏర్చున్= కాలుస్తాడు; ఎలుకచేన్= ఎలుకచేత; చచ్చుకంటెన్= చావటంకంటే; ఏము= మేము; ఈ, జ్వలన, శిఖలన్= ఈ అగ్నిహోత్రునిమంటలలో; క్రాఁగి= మాడి; పుణ్యలోకంబులన్= పుణ్యలోకాలను; కాంతుము= పొందుతాము.

తాత్పర్యం: కలుగులోకి దూరితిమా అందులో ఎలుక మమ్మల్ని చంపేస్తుంది. ఇక్కడే ఉన్నామా అగ్నిదేవుడు కాలుస్తాడు. ఎలుకచేత చావటంకంటె అగ్నిజ్వాలలోపడి మాడి పుణ్యలోకాలకు పోవటం మాకు మేలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియు మాంసపిండంబుల మయియున్న మాకు బిలప్రవేశంబున మూషకభయంబు నియతం బింద యుండిన నగ్నిభయంబు సంశయితం బె ట్లనిన. 309

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; మాంస, పిండంబులము= మాంసపు ముద్దలం; అయి= అయి; ఉన్న=ఉండే; మాకున్, బిల, ప్రవేశంబునన్= రంధ్రప్రవేశంలో; మూషక, భయంబు= ఎలుకవలనిభయం; నియతంబు= తప్పనిది; ఇందు+అ= ఇక్కడే; ఉండినన్= ఉంటే; అగ్ని, భయంబు= నిప్పులవలనిభయం; సంశయితంబు= అనుమానింపదగింది; ఎట్లు+అనినన్= ఏ విధంగా అంటే.

తాత్పర్యం: అంతేకాక మేము మాంసపుముద్దలమై ఉన్నందున నేల బొరియలో ప్రవేశిస్తే ఎలుకవలన ప్రమాదం తప్పదు. ఇక్కడే ఉంటే అగ్నిభయం అనుమానాస్పదం. ఎట్లా అంటే.

క. జ్వలనంబు వాయువశమునఁ । దొలఁగుడు జీవనము మాకు దొరకొనుఁ; గృచ్ఛ్రం
బుల సంశయయుతకార్యం । బులు గర్తవ్యములు; నియతములు వర్జ్యమ్ముల్. 310

ప్రతిపదార్థం: జ్వలనంబు= మంట; వాయు, వశమునన్= గాలికి లొంగటంవలన; తొలఁగుడు= తొలగిపోతే; మాకున్; జీవనము= బ్రతుకు; దొరకొనున్= కలుగుతుంది; కృచ్ఛ్రంబుల= బాధలలో; సంశయ, యుత, కార్యంబులు= అనుమానంతో కూడుకొన్న పనులు - అంటే బాధ కలిగితే కలుగవచ్చు లేకుంటే తప్పిపోవచ్చు అనే పనులు; కర్తవ్యములు= చేయదగినవి; నియతములు= తప్పనివి - అంటే బాధ తప్పక కలుగుతుంది అని తోచేపనులు ; వర్జ్యమ్ముల్= విడువదగినవి.

తాత్పర్యం: మంట గాలివశాన తొలగిపోతే మేము బ్రతుకుతాము. కష్టసమయాలలో బాధ కలిగితే కలుగవచ్చు లేకుంటే తప్పిపోవచ్చు అని అనిపించే పనులు చేయతగినవి. బాధ తప్పదు అని అనిపించే పనులు విడువదగినవి.

విశేషం: కష్టసమయాలలో కరదీపికవలె మానవునికి ఉపయోగించే ఈ సూక్తి నానారుచిరార్థసూక్తినిధి అయిన నన్నయ కవితలో ఒక మేలిమి రత్నం.

వ. 'కావున నీవు మెచ్చినచోటికిఁ బోవనోపము; మావలని మోహంబు విడిచి యరుగు; మేము దహనక్లేశంబునం బొందినను నీవు జీవించి పుత్త్రులం బడయనోపుదువు; నీపుణ్యవశంబున మాకు నగ్నిభయంబు దొలంగెనేని నీవు మాయొద్దకు వచ్చి యెప్పటియట్ల రక్షింతు' వని కొడుకు లెల్ల మ్రొక్కినం జూచి, జరితయు బాష్పపూరితనయన యై యాసన్నతరుగుల్మగహనదహనమహోత్సాహుం డయి వచ్చు హవ్యవాహనుం జూచి, ప్రాణభయంబున గగనంబున కెగసి చనె నంత. 311

ప్రతిపదార్థం: కావునన్; నీవు, మెచ్చిన= నీ కిష్టమైన; చోటికిన్= ప్రదేశానికి, బిలంలోకి; పోవన్+ఓపము= పోలేము; మావలని; మోహంబు, విడిచి= మా మీద మమకారం వదలి; అరుగుము= వెళ్ళుము; ఏము= మేము; దహనక్లేశంబునన్= కాలుట అనే కష్టంలో; పొందినను= మేము కాలిపోయినా; నీవు, జీవించి, పుత్త్రులన్; పడయన్+ఓపుదువు= పొందగలుగుతావు; నీ, పుణ్య, వశంబునన్= నీ పుణ్యంకారణంగా; మాకున్= మాకు; అగ్నిభయంబు= అగ్నివలన భయం; తొలంగెన్+ఏని= తొలగిపోతే; నీవు, మా, ఒద్దకున్, వచ్చి; ఎప్పటి, అట్లు+అ= ఎప్పటివలె; రక్షింతువు= కాపాడుతావు; అని= అని; కొడుకులు+ఎల్లన్= కుమారులందరు; మ్రొక్కినన్= నమస్కరింపగా; చూచి, జరితయు=.జరిత; బాష్ప, పూరిత, నయన+ఐ= కన్నీటిచే నిండిన కన్నులు గలదై; ఆసన్న, తరు, గుల్మ, గహన, దహన, మహా+ఉత్సాహుండు+అయి= దగ్గరగా ఉన్న చెట్లను, పొదలను,

అడవులను దహించటంలో మిక్కిలి ఉత్సాహం కలవాడై; వచ్చు; హవ్య, వాహనున్= అగ్నిహోత్రుడిని; చూచి, ప్రాణభయంబునన్=ప్రాణభీతితో; గగనంబునకున్= ఆకాశానికి; ఎగసి= ఎగిరి; చనెన్= వెళ్ళింది; అంతన్= అంతట.

తాత్పర్యం: 'అందువలన మేము నీవు చెప్పినట్లు బిలంలోకి వెళ్ళం. నీవు మా మీద మమకారాన్ని వదలి వెళ్ళు. మేము కాలిపోయినా నీవు జీవించి ఉంటే మళ్ళీ పుత్రులను పొందగలవు. నీ పుణ్యంవలన మాకు అగ్నిభయం తొలగిపోతే నీవు మా వద్దకు వచ్చి ఎప్పటిలాగా రక్షిస్తావు' అని కొడుకులంతా మ్రొక్కగా, వాళ్ళను చూచి జరిత కన్నీరు నిండిన కన్నులు కలదై, ప్రక్కనున్న చెట్లను, పొదలను, అడవులను దహించటానికి ఉత్సాహంతో వస్తున్న అగ్నిహోత్రుడిని చూచి ప్రాణభయంతో ఆకాశానికి ఎగిరింది.

క. నలుగురు నాలుగు వేద । మ్ములమంత్రము లొప్ప బ్రహ్మముఖములు వోలెన్
వెలయంగ సంస్తుతించుచు । నలఘులు మా కభయ మభయ మని రయ్యనలున్. 312

ప్రతిపదార్థం: అలఘులు= తక్కువవారు కానివాళ్ళు - అంటే గొప్పవాళ్ళు; నలుగురు; నాలుగువేదమ్ముల= నాలుగువేదాల; మంత్రములు= మంత్రాలు; ఒప్పన్= బాగుగా; బ్రహ్మ, ముఖములు, పోలెన్= బ్రహ్మదేవునియొక్క నాలుగు ముఖాలవలె; వెలయంగన్= ప్రకాశించగా; సంస్తుతించుచున్= గొప్పగా స్తోత్రం చేస్తూ; ఆ+అనలున్= ఆ అగ్నిదేవుడిని; మాకున్, అభయము, అభయము; అనిరి= అన్నారు.

తాత్పర్యం: మహాత్ములైన శార్ఙ్గకులు నలుగురూ బ్రహ్మదేవుని నాలుగు ముఖాలవలె నాలుగు వేదమంత్రాలతో గొప్పగా స్తోత్రం చేస్తూ మాకు అభయం ఇమ్మని అగ్నిహోత్రుడిని ప్రార్థించారు.

విశేషం: అలం: ఉపమ. 'ఆదరాత్ ద్విరుక్తిః, అనాదరాత్ ద్విరుక్తిః' అన్నట్లు ఒక పదాన్ని ఒకటికి రెండుమార్లుగా పలికినప్పుడు అది అప్పటి పరిస్థితి యొక్క తీవ్రతను ధ్వనింపజేస్తుంది. అందులోనూ అది స్తోత్రించే సందర్భం. అప్పటి ఆద్రుతగతిని హ్రస్వాక్షరాలు సన్నివేశం సముచితంగా అక్షరరమ్యతను కథాగమనాన్ని సమన్వయింపజేశాయి.

వ. అగ్నిదేవుం డప్పుడు మందపాలుప్రార్థనం దలంచి యన్నలువురు శార్ఙ్గకులు నున్న వృక్షంబు భక్షింపక పరిహరించిన జరితయు దానిం జూచి సంతసిల్లి కొడుకులయొద్దకు వచ్చి సుఖం బుండె; నంత నక్కడ మందపాలుండు పురందరువనంబు దహనుచేత దగ్ధం బగుట యెఱింగి, యం దున్న జరితను బుత్త్రులం దలంచి యతిదుఃఖితుం డయి లపిత కిట్లనియె. 313

ప్రతిపదార్థం: అగ్నిదేవుండు; అప్పుడు = ఆ సందర్భంలో; మందపాలు= మందపాలుని; ప్రార్థనన్; తలంచి= జ్ఞప్తికి తెచ్చుకొని; ఆ+నలువురు= ఆ నలుగురు పుత్త్రులు; శార్ఙ్గకులు= శార్ఙ్గకులు; ఉన్న= ఉండే; వృక్షంబున్= చెట్టును; భక్షింపక= తినక; పరిహరించినన్= వదలివేయగా; జరితయు= జరిత; దానిన్= తనకొడుకులను అగ్ని భక్షింపక వదలివేయటం; చూచి= కనుగొని; సంతసిల్లి= సంతోషించి; కొడుకుల= కుమారుల; ఒద్దకున్= దగ్గరకు; వచ్చి; సుఖంబు+ఉండెన్= సుఖంగా ఉండింది; అంతన్= అప్పుడు; అక్కడ; మందపాలుండు; పురందరు, వనంబు= దేవేంద్రునియొక్కతోట ఖాండవం; దహనుచేత= అగ్నిదేవునిచేత; దగ్ధంబు= కాలిపోయింది; అగుట; ఎఱింగి= తెలిసికొని; అందున్+ఉన్న= ఆ ఖాండవవనంలో ఉన్న; జరితను= జరితను; పుత్త్రులన్= కుమారుల్ని; తలంచి= తలచుకొని; అతి, దుఃఖితుండు, అయి= మిక్కిలి దుఃఖం పొందినవాడై; లపితకున్= లపితకు (తో); ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అగ్నిదేవుడు మందపాలుని ప్రార్థనను గుర్తు తెచ్చుకొని ఆ నలుగురు శార్ఙ్గకులున్న చెట్టును భక్షించకుండా వదలివేయగా, జరిత దానిని చూచి సంతోషపడి, కొడుకుల దగ్గరకు వచ్చి సుఖంగా ఉన్నది. అప్పుడు మందపాలుడు దేవేంద్రునివనం ఖాండవం అగ్నిదేవునిచేత కాల్చబడినట్లు తెలిసికొని, దానిలో ఉన్న తనభార్యాపుత్రులను తలచి మిక్కిలి దుఃఖించి, తన మొదటిభార్య అయిన లపితతో ఇట్లా అన్నాడు.

క. తరుణుల నజాతపక్షులఁ । జరణంబులు లేనివారి శార్ఙ్గేయుల న

ల్వుర నొక్కతె యెట దోడ్కొని । యరుగంగా నేర్చు జరిత యాపద గడవన్. 314

ప్రతిపదార్థం: తరుణులన్= చిన్నవారిని; అజాత, పక్షులన్= పుట్టని రెక్కలు కలవారిని-రెక్కలు రానివాళ్లను; చరణంబులు= కాళ్ళు; లేని, వారిన్; శార్ఙ్గేయుల= శార్ఙ్గేయులైన; నల్వురన్= నలుగురు కుమారుల్ని; జరిత, ఒక్కతె; ఆపద, కడవన్ (ఆపద) విపత్తు దాటునట్లు; ఎట= ఎక్కడికి; తోడ్కొని= వెంటతీసికొని; అరుగన్+కాన్= వెళ్ళటానికి; నేర్చున్= ఓపును.

తాత్పర్యం: చిన్నవాళ్ళు, రెక్కలు రానివాళ్ళు, కాళ్ళు రానివాళ్ళు అయిన శారఙ్గేయులు నలుగురిని జరిత ఒక్కతే ఆపద గడచేటట్లు ఎక్కడి తీసికొని వెళ్ళగలదు?

క. మఱచునొకొ! మఱవకుండియు । నెఱుఁగక యుండునొకొ! యనలుఁ డెఱిఁగియు నెడ నే

మఱునొకొ! పుత్త్రులఁ గావక । గుఱుకొని; నమ్మంగ నగునె క్రూరాత్మకులన్. 315

ప్రతిపదార్థం: అనలుఁడు= అగ్నిహోత్రుడు; మఱచున్+ఒకొ= నా ప్రార్థనను మఱచిపోవునో ఏమో; మఱవకుండియున్= మరవకపోతే; ఎఱుఁగక(తెలియక); ఉండున్+ఒకొ= వీరు నా పుత్త్రులు, శార్ఙ్గకులని తెలిసికొనలేకపోవునేమో!; ఎఱిఁగియున్= తెలిసికొనికూడా; ఎడన్= సమయం వచ్చినపుడు; గుఱుకొని= యత్నించి; పుత్త్రులన్= కుమారుల్ని; కావక= రక్షించక; ఏమఱున్+ఒకొ= మోసంచేయునేమో; క్రూర+ఆత్ములకున్= క్రూరమైన మనస్సు గలవాళ్ళను - అంటే దుర్మార్గులను; నమ్మన్+కన్+అగునె= నమ్మతగునా!

తాత్పర్యం: అగ్నిహోత్రుడు నా ప్రార్థనను మరచిపోతాడేమో? ఒకవేళ మరవకపోయినా నా పుత్త్రులైన శార్ఙ్గకులను గుర్తించలేకపోతాడేమో! లేదా గుర్తించినసమయం వచ్చినప్పుడు ప్రయత్నించి రక్షించక మోసగిస్తాడేమో. దుర్మార్గులను నమ్మతగదుకదా!

విశేషం: సర్వాన్ని దహించి బాధించే స్వభావం కలవాడు కావటంవలన అనలుడు క్రూరాత్ముడని అనటం. తనయుల క్షేమాన్ని గూర్చిన తండ్రి హృదయాందోళన ప్రతిఫలించే పద్యం ఇది. ఎఱుకలో కృతజ్ఞతను, మఱపులో కృతఘ్నతను నన్నయ ఎంతో ప్రసన్నగంభీరంగా ఈ కందపద్యంలో ప్రతిపాదించాడు. అనేక లఘువుల మధ్య ఎక్కడనో ఒక గురువు ప్రయోగించి అది హృదయాందోళనకు సూచికగా ఛందశ్శిల్పౌచితి పాటించిన విధానం అనుపమానం.

వ. అనిన విని లపిత యిట్లనియె. 316

ప్రతిపదార్థం: అనినన్= అని మందపాలుడు అనగా; విని; లపిత= లపిత; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: అతనిమాటలు విని లపిత ఇట్లా అన్నది.

క. నాయొద్దన ప్రార్థించిన । వాయుసఖుం డపుడు నీకు వరదుం డయి శార్
ఙ్గేయుల నలువురఁ గాతును । ధీయుత! యని పలికె మఱచితే మునినాథా! 317

ప్రతిపదార్థం: ముని, నాథా! = మునీశ్వరా!; నా, ఒద్దన= నా దగ్గర; ప్రార్థించినన్= ప్రార్థింపగా; వాయు, సఖుండు= గాలి దేవుని యొక్క స్నేహితుడు - అగ్నిదేవుడు; అపుడు, నీకున్, వరదుండు+అయి= వరాన్ని ఇచ్చేవాడై; శార్ఙ్గేయుల నలువురన్, శార్ఙ్గేయుల్ని నలుగురిని; కాతును= రక్షిస్తాను; ధీయుత!= ఓ బుద్ధిమంతుడా; అని; పలికెన్, మఱచితే= మరచిపోయావా?

తాత్పర్యం: మునీశ్వరా! నా ఎదుట నీవు ప్రార్థించినప్పుడు ఆ అగ్నిదేవుడు శార్ఙ్గేయులు నలుగురిని రక్షిస్తానని పలికిన సంగతి మరచిపోయావా!

వ. 'ఆలికి నెయ్యుండ వయి దానియోగక్షేమం బరయం దలంచి; తది పులుఁ గెటయేనియుం బఱచుం గా కేమి యయ్యెడు; వగవకుండు' మనిన మందపాలుండు మందస్మితవదనుం డగుచు 'వసిష్ఠు నట్టి పురుషు నైన నరుంధతియట్టి భార్య యైనను నిర్నిమిత్తంబున స్త్రీవిషయంబునందు సంశయింపకుండ' దిది స్త్రీలకు నైజంబ యని పలికి లపిత వీడ్కొని, ఖాండవంబునకు వచ్చి పుత్త్రసహిత యయి కుశలిని యయి యున్న జరితం జూచి సంతుష్టుండై నిజేచ్ఛ నరిగె; నగ్నిదేవుండు నిట్లు నిర్విఘ్నంబున ఖాండవవనౌషధంబు లుపయోగించి విగతరోగుండయి కృష్ణార్జునుల దీవించి చనియె; నంత. 318

ప్రతిపదార్థం: ఆలికిన్= భార్యకు; నెయ్యుండవు+అయి= స్నేహితుడవై; దాని= ఆ జరితయొక్క; యోగ, క్షేమంబు; అరయన్= విచారింప; తలంచితి(వి)= తలచావు; అది; పులుఁగు= పక్షి; ఎట, ఏనియున్= ఎక్కడికైనా; పఱచున్+కాక= పరుగెత్తగలదు; ఏమి, అయ్యెడు= (దానికి) ఏమవుతుంది; వగవక+ఉండుము= విచారింపకుము; అనినన్= అని పలుకగా; మందపాలుండు; మంద, స్మిత, వదనుండు= చిరునవ్వుతో కూడినముఖం కలవాడు; అగుచున్= అవుతూ; వసిష్ఠు, అట్టి= వసిష్ఠుని అంతటి; పురుషుని+ఐనన్= పురుషుణ్ణి అయినా; అరుంధతి, అట్టి భార్య= అరుంధతి వంటి భార్య; ఐనను= అయినను; నిర్+నిమిత్తంబునన్= కారణంలేకయే; స్త్రీ, విషయంబు, అందున్= స్త్రీ విషయంలో; సంశయింపక= అనుమానింపక; ఉండదు= ఉండదు కదా!, ఇది; స్త్రీలకున్; నైజంబు+అ= సహజమే; అని; పలికి, లపిత= లపితను; వీడ్కొని= వీడి; ఖాండవంబునకున్= ఖాండవవనానికి; వచ్చి= చనుదెంచి; పుత్త్ర, సహిత, అయి= కొడుకులతో కూడినదై; కుశలిని, అయి= క్షేమం కలదై; ఉన్న= ఉన్నట్టి; జరితన్= జరితను; చూచి= కనుగొని; సంతుష్టుండు+ఐ= తృప్తి పొందినవాడై; నిజ+ఇచ్ఛన్= తన ఇచ్ఛవచ్చినట్లు; అరిగెన్= వెళ్ళాడు; అగ్నిదేవుండును= అగ్నిదేవుడుకూడా; ఇట్లు= ఈ విధంగా; నిర్విఘ్నంబునన్= అడ్డులేకుండా; ఖాండవ, వన+ఔషధంబులు= ఖాండవవనంలోని (వృక్షసంబంధాలైన) మందులు; ఉపయోగించి= భక్షించి, అనుభవించి; విగత, రోగుండు+అయి= పోయిన రోగం కలవాడై; కృష్ణ+అర్జునులన్= కృష్ణుని అర్జునుని; దీవించి; చనియెన్= వెళ్ళాడు; అంతన్= అనంతరం.

తాత్పర్యం: 'భార్యమీది ప్రేమతో నీవు దాని యోగక్షేమాలు విచారిస్తున్నావు. అది (జరిత)పక్షి. ఎక్కడికైనా పరుగెత్తగలదు. దానికేమీ కాదు. చింతించకు' అని లపిత అనగా మందపాలుడు చిరునవ్వుతో 'వసిష్ఠునివంటి పురుషుడిని అయినా అరుంధతివంటి భార్యకూడా స్త్రీ విషయంలో అనుమానించకుండా ఉండదు. ఇది స్త్రీలకు సహజమే'- అని లపితను వదలి, ఖాండవవనానికి వచ్చి కొడుకులతో కూడి క్షేమంగా ఉన్న జరితను చూచి తృప్తిపొంది, తన ఇష్టం వచ్చిన

చోటికి వెళ్ళాడు. అగ్నిదేవుడుకూడా ఏ ఆటంకం లేకుండా ఖాండవవనంలోని మందులను ఉపయోగించి, రోగం తొలగిపోగా కృష్ణార్జునులను దీవించి వెళ్ళాడు. ఆ తరువాత

విశేషం: యోగక్షేమాలు - యోగం అంటే ఇంతకుముందు లేని భాగ్యం కలగటం; క్షేమం అంటే కలిగినది చెడకుండా ఉండటం. అరుంధతీవసిష్ఠులు ఆదర్శదంపతులు. అట్టిదంపతులలో కూడా స్త్రీ విషయంలో భార్య భర్తను శంకిస్తుందని అభిప్రాయం. లోకంలో అన్యస్త్రీయోగక్షేమాలలో భర్త ఆసక్తి చూపటాన్ని ఏ భార్యకూడా సహించదు. అది స్త్రీసహజం.

ఇంద్రుం డర్జునునకు నాగ్నేయ వారుణ వాయవ్యాది దివ్యబాణంబు లిచ్చుట (సం- 1-225-7)

వ. అతిమానుష మత్యద్భుత । మతిదుష్కర మయిన కేశవార్జునకృతి గో
పతి చూచి మెచ్చి సురపరి । వృతుఁ డయి చనుదెంచెఁ గృష్ణవిజయులకడకున్. 319

ప్రతిపదార్థం: అతి, మానుషము= మానవులకు మించింది - మానవాతీతం; అతి+అద్భుతము= మిక్కిలి ఆశ్చర్యకరమైనది; అతి, దుష్కరము= మిక్కిలి కష్టమైనది; అయిన, కేశవ+అర్జున, కృతి= కృష్ణార్జునులు చేసినపని; గోపతి= స్వర్గాధిపతి - దేవేంద్రుడు; చూచి, మెచ్చి; సుర, పరివృతుఁడు+అయి= దేవతలచే చుట్టబడినవాడై - అంటే దేవతలు చుట్టు చేరి రాగా; కృష్ణ, విజయుల, కడకున్= కృష్ణార్జునుల దగ్గరకు; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: మానవులు చేయలేనిది, మిక్కిలి ఆశ్చర్యకరమైనది, మహోత్కృష్టమైనది అయిన కృష్ణార్జునుల ఘన కార్యాన్ని చూచి మెచ్చుకొని దేవేంద్రుడు, దేవతలంతా తనచుట్టు చేరి రాగా, వాళ్ళవద్దకు వచ్చాడు.

క. అనఘులు నరనారాయణు । లన నాదియుగంబునన్ సురాసురనుతు ల
య్యును నపుడు మనుజు లగుటను । వినయంబున మ్రొక్కి రమరవిభునకు నంతన్. 320

ప్రతిపదార్థం: అనఘులు= పాపంచేయనివాళ్ళు - పుణ్యాత్ములు; ఆది, యుగంబునన్= తొలియుగంలో; నర, నారాయణులు; అనన్= అనగా; సుర+అసుర, నుతులు+అయ్యును=దేవతలచేత, దేవతలు కానివాళ్ళచేత (రాక్షసులచేత) స్తుతింపబడినవాళ్ళయి కూడా; అపుడు= ఆ సందర్భంలో; మనుజులు+అగుటను= మానవులు కావటంవలన; అమర, విభునకున్= దేవేంద్రునికి; వినయంబునన్= వినయంతో; మ్రొక్కిరి= నమస్కరించారు; అంతన్= తరువాత.

తాత్పర్యం: పుణ్యాత్ములు తొలియుగంలో నర నారాయణులుగా ప్రసిద్ధిపొంది, దేవదానవులచేత స్తుతింపబడిన వాళ్ళయినా, అపుడు మానవులు కావటంవలన కృష్ణార్జునులు దేవేంద్రునికి వినయంతో మ్రొక్కారు.

వ. ఇంద్రుండు నుపేంద్రార్జునుల నతిస్నేహంబునఁ గౌఁగిలించుకొని యర్జునునకు నాగ్నేయవారుణ వాయవ్యాది దివ్యబాణంబు లిచ్చి, 'వీని కెప్పుడు నిష్టసఖుండ వయి యుండు' మని కృష్ణుం బ్రార్థించి, దివ్యవిమానారూఢుం డయి దివిజాప్సరోగణసేవితుం డయి దివంబున కరిగె; నిట వాసుదేవార్జునులు మయుం దోడ్కొని మగిడి యింద్రప్రస్థపురంబునకు వచ్చి, ధర్మరాజునకు మ్రొక్కి ఖాండవదహనప్రకారంబు సెప్పి మయుం జూపి సుఖం బుండి రని. 321

ప్రతిపదార్థం: ఇంద్రుండున్= ఇంద్రుడుకూడా; ఉపేంద్ర+అర్జునులన్= కృష్ణార్జునులను; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రీతి(మైత్రి)తో; కౌఁగిలించుకొని; అర్జునునకున్; ఆగ్నేయ, వారుణ, వాయవ్య+ఆది= ఆగ్నేయం (అగ్నిసంబంధం కలది),

వారుణం (వరుణ సంబంధం కలది); వాయవ్యం (వాయుసంబంధం కలది); మొదలైన, దివ్య, బాణంబులు= దేవతాసంబంధాలైన బాణాలు; ఇచ్చి= ప్రసాదించి; వీనికిన్= ఈ అర్జునునికి; ఎప్పుడున్= ఎల్లప్పుడు; ఇష్ట, సఖుండవు+అయి= ప్రియమిత్రుడవై; ఉండుము= ఉండు; అని= ఆ విధంగా; కృష్ణున్, ప్రార్థించి, దివ్య, విమాన+ఆరూఢుండు+అయి= దేవతాసంబంధమైన విమానాన్ని ఎక్కినవాడై; దివిజ+అప్సరస్+గణ, సేవింతుడు+అయి= దేవతలయొక్క, అప్సరసలయొక్క సమూహంచేత కొలువబడినవాడై; దివంబునకున్= స్వర్గానికి; అరిగెన్= వెళ్ళాడు; ఇట= ఇక్కడ; వాసుదేవ+అర్జునులు= కృష్ణార్జునులు; మయున్= మయుడను విశ్వశిల్పిని; తోడ్కొని= వెంటబెట్టుకొని; మగిడి= తిరిగి; ఇంద్రప్రస్థ, పురానికి = ఇంద్రప్రస్థనగరానికి; వచ్చి= ఏతెంచి; ధర్మరాజునకున్, మ్రొక్కి, ఖాండవ, దహన, ప్రకారంబున్= ఖాండవవనం కాలిపోయిన విధం; చెప్పి; మయున్, చూపి; సుఖంబు, ఉండిరి= సుఖంగా ఉన్నారు, అని; ఆ ప్రకారంగా.

తాత్పర్యం: ఇంద్రుడుకూడా కృష్ణార్జునులను మిక్కిలిప్రేమతో కౌగిలించుకొని - అర్జునునికి ఆగ్నేయం, వారుణం, వాయవ్యం మొదలైన దివ్యాస్త్రాలిచ్చి, 'నీవు ఈ అర్జునునికి ఎల్లప్పుడూ ప్రియమిత్రుడవై ఉండు' మని శ్రీకృష్ణుడిని ప్రార్థించి, దివ్యవిమానం ఎక్కి, దేవతలు, అప్సరసలు తనను సేవిస్తుండగా స్వర్గానికి వెళ్ళాడు. ఇక్కడ కృష్ణార్జునులుకూడా మయుడిని వెంటబెట్టుకొని మళ్ళీ ఇంద్రప్రస్థానికి వచ్చి, ధర్మరాజుకు మ్రొక్కి, ఖాండవం కాలిపోయిన విధం చెప్పి, మయుడిని పరిచయం చేసి సుఖంగా ఉన్నారు - ఆ ప్రకారంగా.

క. జనమేజయజనపాలున । కనఘచరిత్రునకుఁ బ్రీతుఁ డయి వైశంపా
యనుఁ డాదిపర్వకథ యె । ల్లను నిమ్ముగఁ జెప్పె నని విలాసమహేంద్రా! 322

ప్రతిపదార్థం: విలాస, మహేంద్రా= విలాసంలో దేవేంద్రునివంటివాడా - రాజరాజనరేంద్రా! అని= అంటూ; జనమేజయ, జనపాలునకున్= జనమేజయమహారాజుకు; అనఘ, చరిత్రునకున్= పాపం లేని నడవడి కలవానికి; వైశంపాయనుఁడు; ప్రీతుఁడు+అయి= సంతోషించినవాడై; ఆది, పర్వ, కథ, ఎల్లనున్= ఆదిపర్వ కథ నంతా; ఇమ్ముగన్= ఇంపుగా; చెప్పెన్= చెప్పాడు; అని= అని;

తాత్పర్యం: విలాసంలో దేవేంద్రునివంటివాడవైన రాజరాజనరేంద్రా! - పుణ్యచరిత్రుడైన జనమేజయ మహారాజుకు వైశంపాయనుడు ప్రీతితో ఆదిపర్వకథ అంతా ఇంపుగా చెప్పాడు - అని సూతుడు శౌనకాదిమహామునులకు చెప్పాడు.

ఆశ్వాసాంతము

క. అభిమానమహార్ణవ! హరి । నిభ విభవ విభాసమాన! నిరవద్య! రవి
ప్రభ! రాజమనోహర! వై । రిభయంకరశౌర్య! నృపవరేణ్యశరణ్యా! 323

ప్రతిపదార్థం: అభిమాన, మహా+అర్ణవ= అభిమానానికి సముద్రునివంటివాడా! (అంటే గొప్ప అభిమానం కలవాడా!); హరి, నిభ, విభవ, విభాసమాన= ఇంద్రునివంటి ఐశ్వర్యంచేత ప్రకాశించేవాడా!; నిరవద్య= నిందింపదగనివాడా! (స్తుతింపదగినవాడా); తక్కువతనం లేనివాడా!; రవి, ప్రభ= సూర్యునితేజస్సువంటి తేజస్సు కలవాడా!; రాజ, మనోహర= చంద్రునివలె అందమైనవాడా!; వైరి, భయంకర, శౌర్య= శత్రువులకు భయాన్ని కలిగించే పరాక్రమం కలవాడా!; నృప, వరేణ్య, శరణ్యా= రాజశ్రేష్ఠులకు శరణు పొందదగినవాడా!

తాత్పర్యం: అభిమానానికి సముద్రునివంటివాడా! ఇంద్రునితో సమానమైన ఐశ్వర్యంతో ప్రకాశించేవాడా! స్తుతిపాత్రమైనవాడా! సూర్యునివంటి తేజస్సు కలవాడా! చంద్రునివలె అందమైనవాడా! శత్రువులకు భయం కలిగించే పరాక్రమంకలవాడా! రాజశ్రేష్ఠులకు శరణుపొంద తగినవాడా! అని ప్రశంసాపూర్వకంగా నన్నయమహాకవి ఆశ్వాసాంతంలో రాజరాజనరేంద్రుడిని సంబోధిస్తున్నాడు.

మత్తకోకిల

రాజభూషణ! నిత్యసత్య! సరస్వతీవిలసన్ముఖాం
భోజ! రాజమనోజ! భూజనపూజ్యమాన! మహాయశో
రాజహంసపయోజినీవనరమ్యదిజ్ముఖ! విక్రమో
ద్వేజితాహిత! విష్ణుసన్నిభ! విష్ణువర్ధనభూపతీ! 324

ప్రతిపదార్థం: రాజ, భూషణ= రాజులకు అలంకారమైనవాడా!; నిత్య, సత్య= శాశ్వతసత్యాన్ని కలవాడా! సరస్వతీ, విలసత్+ ముఖ+అంభోజ= సరస్వతీదేవిచేత ప్రకాశించే పద్మంవంటి ముఖంకలవాడా! (అంటే విద్యా తేజస్సుతో ప్రకాశించే ముఖం కలవాడా!); రాజ, మనోజ= రాజులలో మన్మథునివంటివాడా! భూ, జన, పూజ్యమాన= భూమిలోని జనులచేత పూజింపబడువాడా!; మహా, యశో, రాజహంస, పయోజినీ, వన, రమ్య, దిక్+ముఖ=గొప్పకీర్తి అనే రాజహంసకు పద్మవనమైన చక్కనిదిగ్భాగాలు కలవాడా! (అంటే దిక్కులలో వ్యాపించిన గొప్పకీర్తి కలవాడా!); విక్రమ+ఉద్వేజిత+అహిత= పరాక్రమంచేత భయపెట్టబడిన శత్రువులు కలవాడా!; విష్ణు, సన్నిభ= విష్ణుమూర్తితో సమానమైనవాడా; విష్ణువర్ధన, భూపతీ!= విష్ణువర్ధనమహారాజా!

తాత్పర్యం: రాజులకు అలంకారమైనవాడా! ఎల్లప్పుడు సత్యం చెప్పేవాడా! విద్యా తేజస్సుతో ప్రకాశించే పద్మం వంటి ముఖం కలవాడా! రాజులలో మన్మథునివంటివాడా! భూమిమీద ప్రజలచేత పూజింపబడేవాడా! దిక్కులన్నిటా వ్యాపించిన గొప్పకీర్తి కలవాడా!; పరాక్రమంచేత భయపెట్టబడిన శత్రువులు కలవాడా! విష్ణుమూర్తితో సమానమైనవాడా! విష్ణువర్ధనమహారాజా!

గద్యము

ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దాదిపర్వంబున విదురాగమనంబును, గృష్ణసందర్శనంబును, రాజ్యార్ధలాభంబును, ఖాండవప్రస్థనివాసంబును, సుందోపసుందోపాఖ్యానంబును, నారదువచనంబున ద్రౌపదియందు సమయక్రియయు, నర్జునుతీర్థాభిగమనంబును, నులూచిసమాగమంబును, జిత్రాంగదయందు బభ్రువాహనుజన్మంబును, ద్వారకాగమనంబును, వాసుదేవానుమతుం డయి యర్జునుండు సుభద్ర వివాహం బగుటయు, సుభద్రాహరణంబును, హరణహారికయు, నభిమన్యుసంభవంబును, గాండీవ దివ్యరథాశ్వలాభంబును, ఖాండవదహనంబును, నగ్నిభయంబువలన మయభుజంగమోక్షణంబును, మందపాలోపాఖ్యానంబును నన్నది సర్వంబును నష్టమాశ్వాసము. 325

శ్రీ మహాభారతమునందలి యాదిపర్వము సమాప్తము

తాత్పర్యం: ఇది ఉత్తమకవులందరిచేత స్తుతింపబడిన నన్నయభట్టు అనే పేరుగల కవిచేత రచింపబడిన శ్రీమహాభారత మనే గ్రంథంలో మొదటిదైన ఆదిపర్వంలో - విదురునిరాక, శ్రీకృష్ణుడు పాండవులను దర్శించటం, అర్ధరాజ్యం

పాండవులకు లభించటం, ఖాండవప్రస్థంలో పాండవులు ద్రౌపదియందు నియమాన్ని పాటించటం, అర్జునుడు తీర్థయాత్రలకు పోవటం, అర్జునుడు ఉలూచిని కూడటం, చిత్రాంగద బభ్రువాహనునికి జన్మనివ్వటం, అర్జునుడు ద్వారకానగరానికి రావటం; వాసుదేవుని అంగీకారంతో అర్జునుడు సుభద్రను పెండ్లాడటం, సుభద్రను తనతో తీసికొనిపోవటం, సుభద్రకు యాదవముఖ్యులు అరణాలను అందించటం, అభిమన్యుడు జన్మించటం, గాండీవం, దివ్యరథం; దివ్యాశ్వాలూ అర్జునుడికి లభించటం, ఖాండవవనాన్ని దహించటం, అగ్నిభయంనుండి మయుడిని, అశ్వసేనుడిని రక్షించటం, మందపాలునికథ - మొత్తం ఎనిమిదవ ఆశ్వాసం.

ఆదిపర్వంలో అష్టమాశ్వాసం సమాప్తం.

శ్రీమహాభారతంలో ఆదిపర్వం ముగిసింది.

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపుటం -2

ఆదిపర్వము

రెండవ భాగము (5, 6, 7, 8 ఆశ్వాసములు)

గద్యపద్య ప్రథమపాదసూచి

పద్యము	పుట
అ	
అంగరాజ్యలక్ష్మి	920
అంగములలోన	472
అంత	474
అంత	597
అంత	619
అంత	674
అంత	688
అంత	810
అంత	895
అంత	954
అంత	971
అంత	978
అంతఁ గౌంతేయుఁడు	618
అంతఁ గృష్ణద్వైపాయనుండు	542
అంతఁ బ్రభాతం బగుటయు	612
అంతకు ముందఱ	713
అంత దానివినయంబునకు	683
అంత దేవతలెల్ల	974
అంత ద్రుపదరాజనందనయుం	958
అంత ద్రోణుచేత	599
అంతనట	528
అంత ననంతబల	589
అంత నయ్యర్జునుండు నవ్వింటి	803
అంత నయ్యేవురు నయ్యయి	824
అంత నర్జునుం డనిల	603
అంత నాక్షత్రియు లొక్క	779
అంత నాదిత్యుం	479
అంత నారాక్షసులు	717
అంత నారాజనందనులు	799
అంత నొక్కయశరీరవాణి	980
అంత నొక్కనాఁడు	750
అంత భీమదుర్యోధనుల	591
అంత విదురప్రేషితుండైన	659
అంత సభాపాలుండు	947
అందమరబృందవంద్యున	942
అందుఁ గరమొప్పి సుందరీ	585
అందు ధృతిమందరుండు	937
అందు నిత్యంబును	912
అందును గోదాన భూదాన	916
అందులకుం బోవుద మనినం	734
అందుల కేఁగి యే నిందీవర	928
అంబుజమిత్రుఁ డంబుద	820
అంబురుహాప్తుఁ డస్త	663
అక్కట దుఃఖాతిశయంబున	707
అక్కట పురోచనుం డొక్కరుండ	860
అక్కథకుండు శౌనకాది	467
అక్కథకుండు శౌనకాది	583
అక్కథకుండు శౌనకాది	721
అక్కథకుండు శౌనకాది	855
అక్కన్యయు నట్టి	477
అక్కశ్యపుండును జనుదెంచి	529
అక్కుమారుల ధనుర్విద్యా	576
అక్కుమారులు వాని	572
అగ్నిదేవుం డప్పుడు	989
అగ్నిదేవుండు బృహస్పతి	740
అగ్ని నేను నాకు నాహార	961
అగ్ని హతిఁ జేసి మానవ	787
అజినోత్తరీయుల నతి	828
అట పాండవులును	662
అట వాసుదేవుండు	858
అట వైవస్వతుండును	842
అట హస్తిపురంబున	654
అట్టి కృపాచార్యు రావించి	554
అట్టి ఘర్మదివసంబులు	959
అట్టి చిత్రవధం జూచి	680
అట్టి బ్రహ్మతేజోజనితం బయిన	766
అట్టి మహాద్వంద్వయుద్ధంబున	620
అట్టి మహాబాహుఁ	926
అట్టి మహోత్సవంబు చూడ	791
అట్టి యవసరంబున	561
అట్టి యవసరంబున	587
అట్టి యవసరంబున	795
అట్టి యవసరంబున	815
అట్టి యవసరంబున	982
అట్టియెడ	676

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అట్టి వజ్రకాయుండు	708
అట్టి వృషితాశ్వుండు	505
అట్లయగునేని యిక్కన్య	832
అ ట్లా క్షత్రియు లందఱు	780
అట్లు నిలిచి రక్తచందన	588
అడవులు నేఱులు నివి	738
అడుగకయు విప్ర	734
అతగులచే ద్రుపదుఁ డనవ	614
అతని నియమించినట్లు	826
అతని తపంబు	782
అతిథియై వచ్చిన	703
అతిదురితక్రియాభి	658
అతిమానుష మత్యద్భుత	992
అతిరౌద్రాకారలీలా	485
అతులప్రతాపలీలా	484
అతులబలప్రతాప	504
అది కారణంబుగా	498
అదియును గొండొక	840
అదియును బురంబు	794
అదియును సురేంద్ర	902
అది యెట్లనినం బుత్ర	864
అధికవీరుండు రక్కసుఁ	672
అనఘచరితుఁడు	726
అనఘులు కృతమంగళాభి	851
అనఘులు నరనారాయణు	992
అనఘు వేదాధ్యయనాసక్తు	893
అనపత్యుఁడనై	502
అనవద్యు వేదవేదాంగ	746
అనవరతము	557
అనవరతవేదాధ్యయన	774
అనవుడు ధృతరాష్ట్రుఁడు	594
అనవుడు నిద్దఱుఁ	905
అని కఱపినట్ల	776
అని కుమారుల నెల్లం జూపి	567
అని కేలు మొగిచి	477
అని గర్వించి	601
అని గాంధారిం బదరి	515
అని తత్ప్రభావప్రకారంబు	970
అని తనభార్యయైన	777
అని తన్ను నిందించి	492
అని తమలో విచారించి	536
అని తానును భీమ	809
అని దుఃఖించి	501
అని దుఃఖితయై	987
అని దుర్యోధనుండు	861
అని ధరణినుండి	805
అని ధర్మరాజు నభిషిక్తుం	885
అని ధృతరాష్ట్రబాంధవంబు	666
అని ధృష్టద్యుమ్నుండు	796
అనినం గర్ణుండు	608
అనినం గుంతి యట్ల	693
అనిన గంధర్వుం డి ట్లనియె	760
అనిన గంధర్వుండు	788
అనిన దాని కర్జునుం	914
అనిన దానికి రుద్రుం	841
అనిన నందఱకు	883
అనిన నగుచు ధర్మతనయుండు	649
అనిన నగుచు వాసుదేవుం	820
అనిన నగ్నిదేవుండును	967
అనిన నట్ల చేయుదు నని	584
అనిన నది యట్లేని	841
అనిన నది యెట్లు లని	898
అనిన నన్నారదు	927
అనిన నమరపతి	843
అనిన నమ్మందపాలు	985
అనిన నరుఁడు వల్లె యని	741
అనిన నర్జునునకు	749
అనిన నర్జునుండు	920
అనిన నవనతానన	915
అనిన నాద్రుపదునకుఁ	835
అనిన నారద మహాముని	906
అనిన నినతనయు	599
అనిన నీకెద్ది భోజనం	961
అనిన నుపయాజుండే నిట్టి	725
అనిన నౌర్వుండు	785
అనిన రుద్రుం డలిగి	845
అనిన వసిష్ఠుఁ	764
అనిన వాని కర్జునుం	744
అనిన వానికి నర్జునుం	749
అనిన వారలకు	863
అనిన వారిపలుకులు	473
అనిన వాసుదేవుం	883
అనిన విని కర్ణుండు	604
అనిన విని కర్ణుండు	812
అనిన విని కురుకుమారు	573
అనిన విని జనమేజయుండు	550
అనిన విని జనమేజయుండు	962
అనిన విని జనమేజయుండు	983
అనిన విని దుర్యోధనున	606
అనిన విని ద్రోణుం డదరి	574
అనిన విని ద్రోణుండు	578
అనిన విని ధర్మతనయుండు	709
అనిన విని నగుచు	826
అనిన విని నగుచు	931
అనిన విని నరుల	499
అనిన విని పార్థునకు	600
అనిన విని భీమసేనుం	693
అనిన విని మందపాలుండు	984
అనిన విని లపిత	990
అనిన సూర్యుండు	479
అనిన విని హిడింబ	672
అని నియోగించినఁ గుంతియుం	511
అని నియోగించినఁ గుంతియుం	523
అని నిశ్చయించి గొంతిని	495
అని నిశ్చయించి ద్రుపదు	566
అని నిశ్చయించి పంచినం	849

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అని నీచేతఁ బరాజితుండ	742	అని వగచుచు	527	అమూల్యమణి	496
అని పంచినం బురోచనుం	646	అని వాని నాశ్వాసించి	742	అమ్మంత్రముఁ దనదగు	476
అని పంచిన నదియును	668	అని విజృంభించి	948	అమ్మహాధ్వని విని	677
అని పంచిన వారును	641	అని విదురునకు	862	అమ్మహోగ్రగ్రాహంబు	580
అని పనిచిన నెప్పటియట్ల	516	అని వితర్కించుచు	752	అమ్మహోత్సవము	798
అని పలికి యప్పుడ	527	అని వైశంపాయనుండు	853	అమ్ముదితఁ జూచి	552
అని పలుకుచున్న	818	అనుచుం బాంచాలపురం	614	అమ్ముదితఁ జూచి	904
అని పలుకుచున్న నృప	753	అనుచు నిజజననీ	739	అమ్ముని యొక్కనాఁ డభి	555
అని పలుకుజనుల	593	అనుచున్న సమయంబున	874	అమ్ముని యోగాభ్యాస	984
అని పాపబుద్ధియందు	546	అనుచు సమీరణసుతుండు	714	అమ్మునివరు కఱపిన	687
అని పుత్త్రముఖావలోకన	510	అనుజులు నల్వురుం	892	అయ్యర్జునుతోడి విద్యా	568
అని పురందరనందనుండు	959	అనుపమకార్ముకాది	624	అయ్యర్జునుస్తుతి	593
అని పెద్దయుంబ్రొద్దు	763	అనుపమనిత్యసత్య	657	అయ్యవసరంబున	123
అని పొగడుచుండ	595	అనుపమరాజ్యవిభూతిం	900	అయ్యవసరంబున	602
అని పొరులెల్ల దీవించు	885	అనువారు నందుఁ గొందఱు	802	అయ్యవసరంబున	805
అని ప్రార్థించి వెండియు	727	అన్న యిది ధర్మువని	683	అయ్యాజుండును	728
అని భీమసేను	684	అన్నవవారివాహనివహ	977	అయ్యా నీతపోమహత్త్వంబుఁ	782
అని మాటలాడుచు	792	అన్యోన్య ప్రియభాషణు	906	అయ్యిద్దఱును గృష్ణ	822
అనిమిషప్రభుఁడు	944	అపుత్రస్యగతి ర్నాస్తి	499	అయ్యిరువుర యన్యోన్య	941
అని మొననట్లు దాఁకిన	860	అప్పాండవులతోడి	869	అరిగి మహేంద్రాచలమున	557
అని యగ్నిదేవుఁ డయ్యర్జున	962	అబ్జజు వీడ్కొని	903	అరియని విప్రులచేతను	702
అని యడిగిన	983	అభిజాతుండవు	880	అరుదుగ దివ్యరత్న	979
అని యడిగిన ధర్మ	706	అభిమానమహార్ణవ	993	అలఘుండు పౌరవ	757
అని యడిగిన వైశంపాయనుం	551	అమరగణంబులోనఁ	522	అలఘుతరంబులై	888
అని యప్పుడ భీష్మ	605	అమరాపగాసుతు	468	అలఘుతేజుల	645
అని యఱచుచున్న	741	అమరావతికి నెన	939	అలఘుబలుండు	549
అని యాత్మపరిత్యాగంబునందుఁ	696	అమరాహీంద్రవియచ్చరాదుల	968	అలఘులు కృష్ణపార్థులు	980
అని యిట్లు పాండునృప	719	అమరేంద్రసుతుఁడు	947	అలయక ధర్మశాస్త్రముల	509
అని యుధిష్ఠిరుండు	883	అమలాచారపవిత్ర	468	అలయక నాఁడునాఁటికి	938
అనిలం బప్పురిఁ	891	అమలినమతి నాత్మ	629	అలయక నిమిత్తజంబగు	784
అనిలజ నీ కిట్లని	609	అమవస గావున	498	అలయక పరాత్మ	630
అనిలజుఁ డుగ్రుఁడై	617	అమితకృశాను దగ్ధమగు	974	అలిగి యోడుగఱచి	712
అనిలజు పుట్టిన దివసము	517	అమితవివృద్ధశోక	771	అలినీలకుంతలుం	938
అనిలసుతుం డంతన	547	అమితస్థావరజంగమం	844	అలుగుదురయ్య	925
అనిలసుతుఁ బట్టికొని	715	అమితోత్సాహుఁడు	802	అలుగుల పడి ఖాండవమునఁ	974
అనిలాత్మజు బలమును	576	అమితౌజుండగు వానిఁ	780	అవనీచక్రముపాద	590

పద్యము	పుట
అవిరళక్షరితదానార్ద్ర	954
అవిరళభస్మమధ్యమున	798
అవిరళవిషఫణి	548
అసిచర్మకౌశలం	588
అసితపథుఁడు విప్రుం డై	960
అస్త్రవిద్యలు గఱచి	567
ఆ	
ఆ కల్మాషపాదు	769
ఆ కాననాంతరంబునఁ	667
ఆ కృష్ణచతుర్దశినాఁడు	655
ఆగ్నేయశరమున	595
ఆతనిఁ జూచి సహింపక	619
ఆతని యజ్ఞంబున	505
ఆతని యస్త్రవిద్యా	569
ఆ తనూజుల	518
ఆ తరుణి కటాక్షేక్షణ	552
ఆ తరుణియందుఁ	758
ఆదిఁ గోలెను గృష్ణుచే	957
ఆ దిక్కున కాక్షణంబ	663
ఆదిత్యునకుఁ బుత్త్రి	749
ఆదిని సంయోగవియోగా	694
ఆది భరద్వాజుఁ డను ముని	723
ఆ దుర్యోధనుఁడుద్భవిల్లుడును	517
ఆ ద్రుపదుండు దనకూఁతు	722
ఆనకదుందుభిప్రభృతి	953
ఆ నరుమీఁద ఘోరనిశితాశని	977
ఆపదయైనను ధర్మువ	681
ఆ పవనుజు నతిఘన	547
ఆయతబాహుఁ డాతనికి	877
ఆ యుముగర్వమున్	470
ఆయుధవిద్యలయందు	627
ఆ రక్కసునకే నశనం	696
ఆ రాక్షసుండు భీము	677
ఆ రాజసుతుల విద్యా	590
ఆర్యవృత్తుండు	866
ఆ లలితాంగిఁ జూచి	923
ఆ లలితాంగియందు	817
ఆలికి నెయ్యుండవయి	991
ఆ వారిధారలెల్ల	975
ఆ విశ్వామిత్రుం డిక్ష్వాకు	767
ఆ వైవస్వతువీర్యము	843
ఆసన్నపలితు నసఘు	563
ఆహవభూమిలోనఁ	877
ఇ	
ఇంక నెవ్వండు రక్కసు	717
ఇంకనైన మమ్ము నెఱుఁగంగ	622
ఇంచుకయేని పాపమున	713
ఇంతులగోష్ఠి నున్న	746
ఇంతుల నిమిత్తమున	906
ఇందీవరలోచన	857
ఇందుఁ బుట్టిన సుతుఁడు	920
ఇందుల కిమ్మెయిన్	668
ఇందు లక్ష్య మెవ్వఁ డేసె	797
ఇందు సుఖ ముండితిమి	692
ఇంద్రసమానున	731
ఇంద్రియార్థంబులం	494
ఇంద్రుండు నుపేంద్రార్జునుల	992
ఇక్కుమారుండు	781
ఇక్కుమారున కెందు	475
ఇట పాండవకౌరవ	571
ఇట వారణావతంబున	657
ఇట్టిదేని మనకు	652
ఇట్టి యింద్రప్రస్థ	892
ఇ ట్లక్కన్యక పిఱుంద	844
ఇ ట్లడిగినఁ గుంతీదేవికి	700
ఇ ట్లతినిష్ఠ నేకపాద	521
ఇ ట్లదృశ్యంబయిన	753
ఇ ట్లరిగి జనార్దనుండు	934
ఇ ట్లరిగి యర్జునుండతి	909
ఇ ట్లరిగి వనంబులో	571
ఇ ట్లశ్రమంబున	579
ఇ ట్లింద్రప్రస్థపురంబున	950
ఇ ట్లుండి యొక్కనాఁడు	921
ఇట్లు కావించిన	976
ఇట్లు చతుర్విధా హారంబుల	762
ఇట్లు దనకడకు వచ్చిన	930
ఇట్లు దనయిష్టంబు	567
ఇట్లు దనవలన విలువిద్య	724
ఇ ట్లుదయించిన	957
ఇట్లు దలంచిన	757
ఇట్లు దుర్యోధనుండు	550
ఇట్లు ద్రుపదుండు ద్రోణుచేత	623
ఇట్లు ద్రోవదిచేత	952
ఇట్లు నారాయణుండు	945
ఇట్లు పట్టుకొని	905
ఇట్లు పరమపురుషు	932
ఇట్లు పరాశరుండు	787
ఇట్లు పాంచాలియందు	818
ఇట్లు పాంచాలు బాణవృష్టికి	616
ఇట్లు పాండవులు ద్రుపదు	859
ఇట్లు పాండుకుమారు లపార	625
ఇట్లు పాండురాజు	486
ఇట్లు పితామహుండు	899
ఇట్లు పుట్టిన	730
ఇట్లు పుత్త్రోదయంబునఁ	514
ఇట్లు పెక్కువిధంబుల	773
ఇట్లు బకాసురుండు భీము	717
ఇట్లు బ్రహ్మోత్తరంబుగా	469
ఇట్లు బ్రాహ్మణశాపంబునం	770
ఇట్లు భీమబకాసురు	715
ఇట్లు భీమసేనుం డిష్టాన్నోప	711
ఇట్లు మన్మథవ్యథా	670
ఇట్లు రాజపుత్త్రు లవ్విల్లు	801
ఇట్లు రాజ్యంబు సేయుచు	470
ఇట్లు వచ్చిన కృష్ణద్వైపాయనునకుఁ	833

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఇట్లు వచ్చిన వేదవ్యాస	685
ఇట్లు వసునివహంబుతో	482
ఇట్లు వాసుదేవుండు	943
ఇట్లు విశ్వామిత్రుండు	766
ఇట్లు వేల్చి ముందఱ	852
ఇట్లు శతశృంగంబున	498
ఇట్లు శాపవిముక్తుండై	775
ఇట్లు సద్యోగర్భంబునం	689
ఇట్లు సర్వభూత	532
ఇట్లు హితోపదేశంబు	907
ఇ ట్లేకోత్తరశతపుత్రులం	518
ఇ ట్లేసి యబ్బాణంబులు	490
ఇ ట్లొక్క నిమిషంబున	758
ఇతని విక్రమ	707
ఇది తొల్లి నాలాయనియైన	838
ఇది దేహం బిది యర్థం బిది	574
ఇది నావల్లభ	904
ఇది పరమసాధ్వి	683
ఇది ప్రళయాగ్ని	986
ఇది యాదిగా సతు లెన్నండు	507
ఇది యెట్లున్ సమకూర	800
ఇది యేమి తెఱఁగు	700
ఇది సకలసుకవిజన	262
ఇది సకలసుకవిజన	720
ఇది సకలసుకవిజన	853
ఇది సకలసుకవిజన	994
ఇది సారంగ నసాధ్య	921
ఇది హిడింబువనంబు	671
ఇద్దఱు హుంకృతిధ్వనులు	714
ఇనసమతేజులై	491
ఇప్పాండుపుత్రుల నేలకో	647
ఇప్పావగృహప్రకారంబు	653
ఇమ్మనుజేంద్రనందను	802
ఇమ్మాంస పేశి	515
ఇమ్ముగ నాత్మరక్ష	631
ఇమ్ముగ విశ్వకర్మ	887
ఇలఁ గీర్తి యెంతకాలము	870
ఇల నర్ధరాత్రమును	737
ఇవ్వేళయందుఁ	737
ఇవ్విహాయసలక్ష్యం	826
ఈ	
ఈకార్యసిద్ధి యగుడును	646
ఈకులము వివర్ధింపగ	471
ఈగృహకుడ్యంబులు	651
ఈచక్రము మధుసూదన	970
ఈతఁ డనవరతయజన	964
ఈతనిచేతఁ దొల్లియుఁ	705
ఈతన్విఁ దోడ్కొని	816
ఈదేవియును బలితోడన	540
ఈబాలు నెత్తుకొని	481
ఈయుపాయంబులలో	866
ఈరంగభూమి యస్త్ర	600
ఈరథ మప్రతిహతము	970
ఈరాజ్యంబు మొదలింటంగోలె	639
ఈ వంశము విచ్ఛేదము	471
ఈ విల్లుమోపెట్టియేను	796
ఈవ్యాధియొంటఁ దీఱదు	965
ఈహితకార్యసిద్ధి	833
ఉ	
ఉడుగక యే మహితముఁ	874
ఉత్తమక్షత్రియప్రవరోప	608
ఉత్తమక్షత్రియుం	708
ఉత్సవసందర్శనోత్సుకులై	815
ఉపాంశువధఁ జేసి	545
ఉరుతరదావపావక	958
ఉరుశార్దూలభయంబునఁ	520
ఉరుసరసీవనంబులు	734
ఉఱఁడు సురేంద్రునైన	671
ఉఱుముచు మెఱుముచుఁ	975
ఉల్లాసంబులాడి	724
ఊ	
ఊర్జితులు యుధిష్ఠిర	528
ఋ	
ఋతిమతి వయిన	506
ఎ	
ఎంతకుఁ గృతకార్యుం	843
ఎంత తపం బొనరించియు	984
ఎంత మిత్రులైన	744
ఎందుండి వచ్చి తిందుల	563
ఎట్టి రాజులును	768
ఎట్టి విశిష్టకులంబున	493
ఎట్టు సూచి సూచి	695
ఎఱుఁగఁ జెప్పు మబల	753
ఎఱుకలేమిఁజేసి	478
ఎఱిఁగితిమి దీని	652
ఎఱిఁగి నాకుఁ జెప్పు	693
ఎఱుకగలఁడేని	784
ఎల్ల కార్యగతులు	649
ఎవ్వరికిని మోపెట్టను	733
ఎవ్వరును నేమి సేయుదు	883
ఏ	
ఏనకా దిక్కన్యక	832
ఏ నమితభోజనుండ	961
ఏను ధర్మపథంబున	768
ఏను ద్రోణుం డనువాఁడ	563
ఏను నీచెప్పిన	812
ఏనును దీనిన తలఁచి	704
ఏనును బ్రజలును	694
ఏను భారద్వాజుండ	557
ఏను మంత్రశక్తి యెఱుఁగక	478
ఏను మిమ్ము నెఱింగియు	745
ఏను మీ దృష్టులు	781
ఏను మీయానతిచ్చిన	966

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఏ నులూచియను	914
ఏను వందయను	923
ఏ నెల్లప్రొద్దు నాయెడలోనఁ	640
ఏ నేమి సెప్పుదు	700
ఏమి కారణమున	962
ఏమి దోషంబు	807
ఏము రాగకారణ	925
ఏల దీని నెడయుఁ	612
ఏల పార్థు పరాక్రమంబు	948
ఏల యమ్ముని నాకు నిచ్చె	480
ఏల రాఁ బనిచెన్	807
ఏలావనరమ్యము	917
ఒ	
ఒక్కపురుషునకు	832
ఒలసి యెంతకాల	698
ఒవ్వమిఁ గౌరవులకుఁ	820
ఔ	
ఔరసక్షేత్రజ	502
క	
కడఁగి ద్రుపదానుజుఁడు	619
కడఁగి మదీయాస్త్రముల	808
కడఁగి వృకోదరుఁ	715
కడఁగి సూతుండు	607
కడవసములుఁ గోలలుఁ	824
కడుఁ బెద్దకాల ముండితి	733
కడునలుకయుఁ గూర్మియు	632
కడునిద్రఁ గానక	656
కడుపునిండఁ గుడువఁ	710
కని త మ్మెఱింగించి	819
కని యనిమిషలోచనుండయి	751
కనియె నొక కన్యఁ	751
కని వినయమ్మున	735
కని వినయమ్మున	792
కమనీయలీల నొక్కట	540
కమలభవుఁడు వారి	900
కమ్మనిలతాంతములకు	530
కరిఘటలఁదాకి భీముఁడు	617
కర్ణశల్యులు మొదలగాఁ	859
కర్ణుండున్ విజయుండు	810
కర్ణుండును జనుల నందఱ	598
కర్మబంధనములు	548
కఱకుదర్భపూరి	823
కలధనమెల్ల ముందఱ	557
కలయ నసి ముసల దండం	615
కళింగవిషయంబు	917
కవలవారు సూర్యేందు	528
కాంతివిశేషవిలాస	848
కాదేని నాకు నీ పుణ్యమూర్తి	506
కామవ్యామోహితుండయి	493
కాలమేఘంబునుబోలె	674
కావునఁ జతురంగబల	868
కావున ధృతరాష్ట్రునకు	471
కావున నిప్పుడ	519
కావున నీవు మెచ్చిన	988
కావున నేను భవద్విహీన	697
కావున మన మిందు	652
కావున మా చేసిన	926
కావున మీర లేమఱక	649
కావున లోకంబులయందు	785
కావున వ్రతదానంబు	911
కావున సర్వప్రకారంబుల	634
కిందముశాపము డెందము	533
కీర్తియు నపకీర్తియు	870
కీర్తి లేనివానికిని	869
కుంతిభోజాధిపు కూఁతురు	664
కుంతి యంత సహజ	611
కుంతియు నమ్మునివరు	476
కుంతియు దాని	691
కుడుచునెడవాని	838
కురుకులజుండు పాండునకుఁ	603
కురుకులవిభుఁడగు	513
కురుపతి సూడఁగఁ	810
కురుముఖ్యులు ధృతరాష్ట్ర	883
కురువంశనిస్తారకులఁ	534
కులపవిత్రసితేత	729
కులపాంసనులై	666
కులము గలవాఁడు	604
కులమునకు నఖిల	519
కులమును రూపము శీలము	474
కూడి జలక్రీడ లాడుచో	544
కృత మెఱుఁగుట పుణ్యము	692
కృపుఁడు ద్రోణుండు	550
కృష్ణమృగాజినధరుఁ	792
కొడుకుం ద్రిలోకవిజయుం	521
కొడుకు పల్కు విని	685
కొడుకు భుజవిక్రమమునకుఁ	979
కొడుకుల నిందఱ కిల్లడ	536
కొడుకుల బ్రహ్మవిత్తములఁ	987
కొడుకుల యభ్యుదయము	862
కొలఁ యెఱుంగ కిట్టి	559
కోడలి యుత్తమగుణముల	856
కోరిన కోర్కికి	526
క్రచ్చఱ నొక్కరక్కసుఁడ	673
క్రమమునను	955
కృతమెఱుఁగుట	692
క్రూరకర్మ లయ్యు	910
క్రూరులు విలుప్తధర్మా	542
క్వణదను కింకిణీ	935
క్ష	
క్షత్రియులము పాండుప్రియ	830
ఖ	
ఖలు నసుర నోర్వనోపెడు	705
ఖలుండై ధృతరాష్ట్రుఁడు	665

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
గ	
గంగాధర పింగజటా	912
గగనమునందు నెందు	750
గర్వించి పలికి	845
గాడ్పుచూలి పిఱుఁదుఁ	865
గిఱుపునెడ నేయునెడ	544
గుణముల నొప్పి	776
గురుకుచయుగ్మముల్	933
గురుగుణయుతులగు	881
గురులలోనఁ బరమ	836
గురువచనస్థితి	818
గురువచనానంతరమున	578
గుఱుకొని కార్యాకార్యము	628
ఘ	
ఘనధూమధ్వజదహ్యమాన	972
ఘనపాశములఁజేసి	773
ఘనభుజ యిదిగాండీవం	969
ఘనభుజుండు నరుఁడు	950
ఘనభుజుండు రాధయను	482
ఘనమగు విక్రమంబునన	867
ఘను లయ్యిరువురు	904
ఘృతనదులును	762
ఘోరాకారులు కృతహాహా	786
ఘోరాస్త్రశస్త్రవిద్యల	584
చ	
చందనతమాలతరులందు	531
చక్కనగు మనిన రక్కసుఁ	675
చక్రధరుం డయ్యు	971
చతురుదధివలయ	856
చని ఖాండవంబుఁ గాల్పఁగ	965
చనుదెంచి ముందట	712
చనుదెంచి శరద్వంతుండ	553
చరణహతిన్ మహాతరులు	676
చారుమణి ప్రభాపటల	847
చారుమనస్సమ్మద	593
చారుసువర్ణహాసి	532
చెప్పు మని యర్జునుం	761
చెలఁగె సురదుందుభి	805
చెలియలు మఱఁదియుఁ	952
చేసమరికొంచుఁ బోడువఁగ	675
జ	
జగదభి వంద్యుఁ డాక్షణమ	756
జననుత బ్రాహ్మణకార్యము	709
జననుత యాగ్రమానిని	577
జననుత యేను	670
జననుతుఁడు పాండు	927
జనపతి పనుపఁగ	548
జనపతియైనవానికిఁ	636
జనపాల మందపాలుం	983
జనపాలుఁడు మృదు	629
జనమేజయ జనపాలున	993
జనమేజయునకు వైశంపాయ	963
జనితామర్షణుఁ డంత	601
జనుల ఆశీరవంబును	852
జనులెల్లం గడు	597
జలజప్రియతేజుల	690
జలములంద యుండు	785
జలరుహనాభ	959
జ్వలనంబువాయు	988
జ్వలనశిఖాలియున్	972
జ్వాలాభీలాంగుఁడు	729
త	
తండ్రిచేయు తిలోదకదాన	698
తక్షకుం డను పన్నగేంద్రుఁ	962
తగఁగ వివాహం	942
తడయక సామభేదముల	634
తత్సమీపంబున	667
తదనంతరంబ	658
తదీయాభిప్రాయం బెఱింగి	765
తన కపకారము మునుఁ	633
తన కిమ్మగునంతకు	632
తనతేజోజాలము	973
తనపలుకు లోక మెల్లను	834
తనపిఱుందన వచ్చు	648
తనభార్యకు రాధకు	482
తనయుల నజాతపక్షుల	986
తనరిరి తద్దేశంబున	894
తనరుచు దైవయుక్తిమెయి	871
తనవగచిన కార్యము	644
తనవిద్యపేర్మి నృపనందన	807
తనసుతులు పాండుసుతు లని	543
తమకుం దార యజేయు	876
తమము నడంచుచున్	890
తమ్ముల యట్టుల తనకు	878
తమ్ములుఁ దానును	896
తరుణుల నజాతపక్షులఁ	990
తఱియగునంతకు రిపుఁ	632
తల్లియుఁ బుత్రు లేవురు	880
తా నొక్క మునికన్య	735
తామరసనేత్ర నీపే రేమీ	914
తాలాభమగు విల్లు దాల్చి	809
తిలాణుమణికోటి	902
తివిరి యభోజ్యంబగు	770
తూ ర్పరుణంబుగాఁ దొడఁగె	679
తేజితబాణహస్తు	572
తొల్లింటి మహాత్ములయందును	848
తొల్లి దితిపుత్రుండైన	898
తొల్లి దేవేంద్రుండు	732
తొల్లి యగస్త్య మహామునీంద్రుండు	492
త్రిదశాధినాథ సదృశుఁడు	540
త్రిభువనలక్ష్మి యేతెంచి	751
త్రిభువన సామ్రాజ్యశ్రీ	664
ద	
దక్షాధ్వరమథనునకుఁ	842
దక్షిణగంగనాఁదద్దయు	917
దక్షిణపాంచాలంబు	734

పద్యము	పుట
దక్షిణాంగుష్ఠ మిచ్చిన	575
దానంజేసి మహీతలంబునం	759
దానంజేసి విగతజీవుండై	533
దాననచేసి పౌరజానపద	635
దానములం దపంబుల	501
దానిం జూచి దారిద్ర్యంబున	565
దానిం జూచి పాండురాజు	520
దానిం జూచి భీముండు	607
దానికడకుఁ బ్రత్యేకంబ	840
దాని దయినపతిభక్తి	839
దాని ధృతరాష్ట్రుండు	543
దానిన్ నేరక యందఱన్	580
దాని నశ్రమమునఁ	922
దాని నెఱింగి పరాశర	514
దాని నెఱింగి శరద్వంతుండు	552
దాని విడిపింప ద్రోణుఁడు	579
దాని విని పాండునందను	733
దాని వెల్వడ నేరక	976
దాని సహింప నోపక	545
దాని సుభద్రఁగా నెఱిఁగి	935
దారుణజానుదండమున	716
దారుణమౌ వృకోదరు	617
దీనికంటెను నొప్పెడివాని	763
దీనికి సదృశముగా	606
దీని తెఱఁ గెఱిఁగినట్ల	652
దీని నగస్తి నాఁబరగు	626
దీని నెఱింగి మీకు హితోప	686
దీని నోరున కీఁ గా దనిన	764
దీని బాణపరంపరం జేసి	562
దీని మానవులయందుఁ	626
దీనియందు రాక్షసభావంబు	681
దేవా నీ ప్రసాదంబున	964
దేహనాశంబుతోడన	501
ద్రోణాచార్యు పిఱుంద నొప్పి	588
ద్రోణుండును నర్జునుచేసిన	621
ద్వాదశమాసికవ్రతము	915
ద్వాదశమాసికవ్రతము	930
ద్విజవరవినిర్మితములగు	901
ద్వైపాయనుండును ధౌమ్యుండు	887
ధ	
ధనదానములను బ్రియ	655
ధనపతితో దరిద్రునకు	559
ధనపతుల బాలురు	564
ధనమున విద్యను సంతతిఁ	522
ధనములతో నత్యుత్తమ	558
ధన్యుండ నైతి నీ కీకన్యక	919
ధన్యుల కా సుభద్రకు	956
ధరణిఁ గల రాజులెల్లను	733
ధరణి నతిప్రతాపబల	754
ధరణిప్రజ ధర్మసుతు	894
ధరణీసురుల గురులఁ	912
ధరణీదిశా ప్రసారిత	663
ధరణీధరుచక్రమునకుఁ	980
ధరణీరాజ్య విభూతియు	536
ధరణీశ నందనుల్	806
ధరణీశుఁ డుద్యతదండుఁడై	628
ధరణీసురవరులకుఁ	909
ధరణీసురు లాదిగ	513
ధర్మతత్త్వజ్ఞుఁ డీ ధర్మతనూజుండు	837
ధర్మసుతుఁ డున్నచోటను	735
ధర్మసూక్ష్మత నిర్ణయింప	836
ధర్మార్థవిత్తముల్	875
ధవళ విభూషణ	795
ధీరమతియుతులతోడ	629
ధీరుఁడు యతిరూపంబున	937
ధీరులౌ ధృతరాష్ట్రపాండు	869
ధృతరాష్ట్రకుమారకు	615
ధృతరాష్ట్రు నెయ్యమున	544
ధృతిఁ జదువుచు భిక్షార్థము	690
ధృతి దఱిఁగి మోహమూర్చా	602
ధృతి నెవ్వనినేని	760
ధృతిసెడి వేఁడెడువానిని	704
ధృతిహీనుల చిత్తముల	924
ధౌమ్యుండును వారి నతిప్రీతిం	790
ధ్వజినీపాతభరంబునం	484
న	
నగియును బొంకునందు	835
నడురేయి సంధ్యలందును	738
నన్ను గాంధర్వ వివాహంబున	754
నన్ను నీ నర్వులెల్ల	941
నన్నును మిమ్మును రక్షించి	678
నన్నేల యుపేక్షించితి	765
నరనుతకీర్తి యీయనిల	706
నరవరుఁడైన భీము	688
నరుఁ డస్త్ర శస్త్ర విద్యా	508
నరునకు దయ నిట్లానంద	944
నరు నింద్రాత్మజు నింద్రా	592
నరు నునికి యెఱిఁగి	929
నలసారము సంసార	693
నలిరేఁగి కడఁగి తద్బల	766
నలువురుదమ్ములున్	623
నలుగురు నాలుగువేదమ్ముల	989
నాకంటెను మీకంటెను	573
నాకుం బరమవిశ్వాసివి	645
నాకుఁ బతివయిన నిన్నుం	670
నాకుఁ బుణ్యలోకంబులు	984
నాకెడ యిమ్ము లెమ్ము	533
నాదు రోదనంబు నన్ను	844
నానాద్రవ్యనిరంతర	488
నానావిధమార్గణముల	616
నానావిధశరశరధుల	561
నానావిహారశైలోద్యాన	630
నాయందు నీకుం బ్రియంబు	755
నాయెదురఁ జిక్కనై	811
నాయొద్దన ప్రార్థించిన	991

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
నారదుఁడు వచ్చుఁ దద్వచ	895
నా వచనంబున	841
నా వచనమున నపత్యముఁ	527
నిత్యంబు నిలువరున	701
నిమిషాంతరమున	804
నిరుపద్రవసుఖనిద్రా	675
నిరుపమకీర్తి	515
నిరుపమపరార్ధ్యరుచి	954
నిశితశరవర్షమున	979
నీకఱవుల నిక్కురుకుల	874
నీగుణములు దొల్లియు	914
నీచేత ననుజ్ఞాతులై	881
నీతోడ సఖ్యంబుఁ జేసెద	745
నీదు కులమునకుఁ దగఁగఁ	607
నీయాగ్నేయాస్త్రంబున	742
నీయిష్టసఖుం డయిన	981
నీరిలోనఁ దోఁచు తారక	561
నీలజీమూతంబులీల	678
నీవ కడునేర్పుకాఁడవు	598
నీ వఖిలధర్మమూర్తివి	985
నీ వప్రాకృతబలుఁడవు	811
నీవును ద్రోణుండును	883
నీవును భీష్ముఁడు ద్రోణుఁడు	879
నీవు లౌకిక వైదిక ధర్మ	832
నీవు సుభద్రయందు	936
నీ వెఱుఁగకుండ గర్వము	949
నుతముగ నస్మత్కుల	760
నెగయుడు నెగసి పిఱుందం	973
నెమ్మిఁ జని ఖాండవప్రస్థమ్ము	886
నెమ్మి నీ దక్షిణహస్తమ్మున	575
నెఱికురులున్ విలోలసిత	752
నేఁడు పుణ్యదినము	849
ప	
పంకజాక్షి నీపతి ప్రతిపక్ష	951
పంబినశోకభారమునఁ	772
పంబి యజనాధ్యయనదానం	894
పక్షిశిరంబు దిరంబుగ	578
పడినయామిషంబు	697
పఱుగఁ గని సైతురేనియు	492
పతి నియోగించిన దానిం	509
పతియు లేక జీవించు	505
పదుమూఁడగు మాసంబున	918
పన్నగవైరి విక్రముఁడు	674
పరచక్రపతులచే	638
పరమతపోనిలయు	787
పరమద్విజశుశ్రూషా	895
పరమబ్రహ్మణ్యు	929
పరమమునులయిన	980
పరమాన్న భక్ష్య భిక్షా	691
పరమాస్త్రైకవిశారదుల్	620
పరమేశ్వరుండును వానికిం	919
పరమోపకారియైన	692
పరశురాముఁ డొండె హరుఁ	813
పరహితఫలవంతులు	666
పరాశరుండును బులస్త్యాది	787
పరిఘజలంబులం	890
పరులకు దుష్కరంబయిన	814
పరులవలన బాధ	765
పరువడి నొండొరుం బెనఁగి	714
పఱవనోపకయున్న	491
పలుకులఁ జెయ్యులఁ	863
పలుదెఱంగుల పిండివంటలు	710
పలుమఱు శపథంబులు	631
పవనతనూజుఁ డక్కమల	688
పశుపతినివాసంబయిన	644
పాండవులును ధృతరాష్ట్రు	886
పాండవులును పరాక్రమ	895
పాండవులును రథంబు లెక్కి	613
పాండుకుమారులం బిలువఁ	642
పాండుకుమారులు ననేక	651
పాండుపుత్త్ర నీవు	748
పాండురాజును బరమోత్సవంబునం	526
పాండుసుతుఁ డంత	975
పాపులై క్షత్త్రియాధముల్	784
పాయక చీఁకటియందును	569
పిలువంగఁ బడక	600
పుణ్యతపోమయుండు	685
పుణ్యవంతుల నిత్యనైమిత్తిక	901
పుత్త్రుఁడు నీ కుదయించు	521
పురజను లెల్లను	884
పురుషవిశేషవివేకా	564
పురుషుకంటె మున్ను	696
పురుషులచే ధర్మస్థితి	508
పూని పరాక్రమం బెసఁగ	857
పెక్కులు వలుకక	673
పెడిలి సువర్ణపర్వతము	971
పెద్దకాలంబునకు నీయిలు	702
పెద్దవాఁడుండఁ గొండుకవానికి	817
పైతృకంబగులక్ష్మి	638
పొలుపగు రాజ్యసంపదుప	766
పొలుపుగఁ బూసికట్టి	933
పోలఁగ ధర్మశీలుఁడయి	702
ప్రక్షీణదర్పు ద్రుపదు	621
ప్రణమదఖిలధాత్రీ	720
ప్రతిహతరాగకోపభయుఁ	756
ప్రమదాపాదిపయఃప్రపూర్ణ	662
ప్రవిమలాగమతత్త్వవేది	896
ప్రొద్దు నేఁడు పెద్దపోయె	712
ప్రోవైన భస్మంబు వాయఁ	658
ఫ	
ఫలపవనాంబుభోజన	804
ఫలార్థియయినవాఁడు	726
బ	
బద్ధపరంపర నొప్పె	624
బలదేవసాత్యకిప్రద్యుమ్న	952

పద్యము	పుట
బలదేవాచ్యుత సాత్యకుల్	876
బలమఱి కామక్రోధంబులు	760
బలము పెద్ద గలిగి	710
బలయుతులు మనుజసింహులు	981
బలవంతుల్ భరతాన్వయస్థితి	659
బలవంతుల బలమఱఁగా	800
బలవైరి కృష్ణుపైఁ బార్థుపైఁ	978
బలహీనుఁ డైనవానికి	827
బలహీను లైనచో శత్రులఁ	630
బహుగుణ ముత్తమోత్తమము	870
బాధితశత్రువర్గులగు	660
బాలకుం డొక కొండుక	699
బాలుఁ డని తలఁచి రిపుతో	633
బిలము సొచ్చితిమేని	987
బృహదబ్ధిమేఖలాఖిల	606
బ్రాహ్మంబు మొదలుగాఁగల	940
భ	
భరతకులప్రసూతులరు	562
భరతకులశ్రేష్ఠుఁడ వయి	504
భరతకులాగ్రణి	949
భర్తచేత నియోగింపఁ బడక	509
భవత్ప్రసాదంబున	504
భవదనుజ్ఞాగౌరవంబున	640
భానునిభుండు పాండుజనపాలుఁడు	539
భారతవంశాచార్యుఁడు	727
భీమసేనుండును దద్వట	664
భీముండును వాని హీనసత్త్వుంగా	716
భువనైకదీపకుండగు	755
భువనోపప్లవసమయోద్భవ	780
భూజనపరివాదం	911
భూపనందను లివ్విధంబున	576
భూపాలకుండు బ్రాహ్మణ	775
భూరినిజద్యుతితోడఁ	594
భూరిపదఘాతజాతధరా	677
భూరిభుజుం డర్జునుఁ డతి	594
భ్రమవిమోహ లోభభయ	707
భ్రాజితశాతకుంభగృహ	931
మ	
మండితగుణసంపద	488
మంత్రయుక్తంబుగా	695
మంత్రులు దమతమబుద్ధి	873
మతిఁ దలపఁగ సంసారం	542
మతిఁ బాండుకుమారుల	661
మతిమఱచి యనిస్త్రీర్ణ	783
మనదుర్యోధను జన్మంబునఁ	519
మన మివ్విధంబునఁ	950
మనసిజరాగంబున	489
మనుకులపవిత్రుఁ బుత్త్రకు	777
మనుజభక్షుఁ డిదియ	701
మనుజులకు నెవ్విధంబున	696
మనుమల నెల్లఁ జూపి	566
మయభుజగమోక్షణము	983
మయుఁడు నశ్వసేనుండును	982
మఱచునొకొ మఱవకుండియు	990
మఱి భీమసేనుండు దొల్లి	867
మఱి యట్లుంగాక	910
మఱి యట్లుంగాక రాజులకుఁ	560
మఱి యదియునుంగాక	608
మఱి యాత్మఘాతంబు	704
మఱియు	729
మఱియు నప్పురంబునం	930
మఱియుం గల వస్తువులెల్లను	497
మఱియుం దనయొద్దకు వచ్చి	829
మఱియుం దొల్లి గౌతమి	836
మఱియుం బాటెడు	596
మఱియుఁ గామప్రవృత్తుం డయ్యు	748
మఱియుఁ దనకు ధృతరాష్ట్రుం	489
మఱియుఁ దిర్యగ్యోనులయందు	508
మఱియుఁ బ్రతిపక్షసంక్షయ	968
మఱియు గదాకార్ముక	570
మఱియు గాంధారిందొట్టి	661
మఱియు దుర్యోధన	518
మఱియు ననంతరంబ	556
మఱియు ననేకవినోదంబుల	488
మఱియు నప్పాండురాజు	487
మఱియు నప్పురంబునం	929
మఱియును	566
మఱియును	586
మఱియును	624
మఱియును	731
మఱియును	938
మఱియును	954
మఱియును నొకనాఁ డెవ్వరు	549
మఱియును వారల బల	978
మఱియు నొక్కనాఁడు	548
మఱియు బలదేవాది	955
మఱియు భీష్మానుమతంబున	483
మఱియు మరీచ్యాది	524
మఱియు మాంసపిండంబుల	988
మఱియు మృగశాపభయం	535
మఱియు రెండగు	823
మఱియు వానికంటె	638
మఱియు వారలకాచార్యుండైన	554
మఱియు సకలలావణ్య	847
మలహారినాథ	719
మాకు నతిప్రియుండవు	788
మాకులమునందుఁ దొల్లి	919
మానితంబగు నాతపోమహిమం	783
మానితులైన పాండవ	730
మానుగ రాజకుమారులతో	579
మాపుణ్యంబునం జేసి	897
మీకు నాయం దయ్యెడు	699
మీకులగోత్రనామములు	825
మీపంచిన విధంబున	879
మీయం దీకృష్ణును	791
మీరాజుమనోరథంబు	827

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
మీరు ద్రుపదుపురంబునకుం	736
మీరు ధర్మానిలశక్రాశ్వినుల	747
మీరును గుంతియు	643
మీ రెఱుఁగనట్టి లోకాచారము	834
ముదుసలులు దమకిమ్ముగాఁ	873
మునినాథ నాకు సత్పుత	725
మునినాథ నాకు సత్పుత	727
మునిసహస్రపరివృతులయి	538
మునీంద్రా నీయాడనితీర్థంబులుం	939
మృగములమైయున్న మమ్ము	490
మృగశాపభయమున	529
మృదురోమములును	763
మేరునగోత్తుంగ మహీ	745
మొనసి యుపకారిఁ గడనిడి	633
య	
యజ్ఞసేనప్రభు యజ్ఞమహా	790
యజ్ఞసేనుకూఁతు నభిజాత	862
యతిసంఘంబుల సంగతిన్	497
యదుకుల విమలపయః	483
యమతనయు ధర్మరాజ్యము	908
యము లమితశౌర్యు లరిన్నప	625
యాదవకులవిభుఁడగు	475
యాదవవృష్ణిభోజవరు	861
యాదవుల నాదరింపక	948
ర	
రణరంగంబున ద్రోణు	724
రమణి నిజభ్రాతృనియోగముఁ	669
రవినిభజతేజుఁడైన	881
రవిసుతపార్థుల	602
రాక్షసావిష్టుఁ డైనప్పు	769
రాజకులశేఖర	581
రాజత్కీర్తులు వచ్చి	818
రాజభూషణ నిత్యసత్య	994
రాజయ్యెడువాఁడు	637
రాజరాజగుణరాజిత	853
రాజవరుఁడైన పార్థుతో	605
రాజ్యపదస్థుండ	653
రేయును బగలును	863
ల	
లలితజటాజినకుశ	690
లలితహయద్విపంబుల	485
లలితాంగి యెల్లలో కంబులు	510
లావు పెడఁగ	680
లోకనుతుండు పాండుఁడ	637
వ	
వందురి వగచుచున్న	481
వడముడి యారక్కసు	676
వడిగొని కౌరవు లొండొరుఁ	613
వడి నసురవాత ముక్కున	679
వడి నౌడుగఱచి వలకేల్	799
వదలక పెనంగి	544
వదలక మరణార్థి యగుచు	773
వదలక ముచ్చుల	908
వధకు నర్హుఁడై వచ్చిన	681
వనజాక్షి యేమికారణమున	923
వనజాతాయతనేత్రు	668
వననిధిలోని రత్నములు	888
వలనుగలమంత్రివరులం	641
వలరాజు సచివుల	889
వలవ దుడుగు	814
వల్లె యని రాజనందను	612
వసుదేవాదియాదవ	953
వానితోడిదేమి దివ్య	610
వానిమనోవల్లభకుం	741
వానియవ్యక్తవచనంబులు	699
వారణహస్తానుకారంబు	967
వారణావతమున	650
వారల బలపరాక్రమంబు	878
వారల శరములు నడుమన	615
వారలు ధర్మానిలశక్రాశ్వినులు	846
వారితో విగ్రహించుట	872
వారిదారుణతపోవహ్ని	899
వారు నప్పుప్రునతిభక్తిఁ	960
వాసవనందనుండు గుడువం	569
వాసవసన్నిభుండు	488
వితతప్రదక్షిణావర్తిత	851
వితతబహురత్నరుచి	669
వితతయశుఁ డరిగి	916
విదితంబుగఁ బుణ్యామర	643
విదితముగ నీకు వర మిచ్చెద	506
విదురుఁడు పాండవహితుఁడని	863
విదురుఁ డేతెంచి యొరులకు	649
విద్యావిలాసపార్థివ	853
వినయమున ద్రోణురూపు	570
వినవయ్య కృత్యవీర్యుఁ డను	778
వినవయ్య గౌతముం డన	551
వినవయ్య యే మేవురము	924
విని కుంతియుఁ బాండవులును	683
విని రోయుతీఁగ గాల్లం	566
వినుఁ డే హిరణ్యధన్వుం	573
విను కార్తవీర్యుకంటెను	523
వినుతధనుర్విద్యావిదు	611
వినుతయశుండు పాండు	486
విను బేల యెట్టికష్టుఁడుఁ	672
విపరీతమతిని	906
విమలమతి యన్యులకు	834
విమలములయి లోకత్రిత	745
విలసద్ధర్మవిశుద్ధవృత్తులు	871
విలసితరాజ్యలీలఁ	858
విలువిద్యఁ గఱచుచుండిరి	550
విలువిద్య నొరులు	573
విలువిద్య నొరులు	575
వివిధాస్త్రకోవిదుఁడు	619
వీఁకఁ బఱతెంచి నలుగడ	946
వీఁడు పుట్టిన పదియగువాఁడు	708

పద్యము	పుట
వీఁడె కృతహస్తుఁ డఖిలాస్త్ర	592
వీఁ డొక మంత్రసిద్ధుండగువిప్రుఁ	718
వీతసమస్తదోషుఁడయి	789
వీరలఁ దోడ్కొనిపోవఁగ	986
వీర లతిలలితమృదులా	499
వీరులు దైవశక్తిఁ బ్రభవించిన	537
వీరికి నిద్రాభంగంబు సేయనోపఁ	665
వీరుఁడగునరుని	811
వీరుఁడు పాండుమహీపతి	520
వీరుఁడు వీఁడు పాండవుఁడు	946
వీరు కుంతీమహాదేవు లని	830
వీరు నమ్మంగఁ దగుదురు	631
వీరు లని పాండుసుతులకు	635
వీ రెవ్వరయ్య ద్రుపద	622
వీ రెవ్వరో యెం దుండుదురో	813
వృక్షశాఖాగ్రమున నున్న	577
వృత్రుపై గీర్వాణవిభుఁ డల్గి	744
వెండియు నశ్వసేను నేయ	976
వెండియు వారల నిమ్ముగా	825
వెడఁగ యిట్టిపాటి	740
వెడఁద యురంబును	823
వెఱచఱవ నీరిలో	579
వెఱచి తల్లిఁ దోఁక	976
వెలయంగఁ బితృమేధ	541
వేఁడు టెంతయుఁ	565
వేడుక నమ్మని	924
వేడుక నొక్కరుండు	547
వేదంబుల్ చదివించె	553
వేదంబులందుఁ బ్రవీణుఁడై	474
వేదము వేదియుం గలుగు	748
వేల్పంగ సమకట్టి	913
వైహాయసంబైన పరమత్స్య	793
వ్యసనవివర్జితమాన	581
వ్యాసపురస్కృతావని	586

శ

పద్యము	పుట
శక్తి చదువునుబోలె	774
శక్తి రాక్షసనిహతుఁడై	786
శతశృంగనగేంద్రము	525
శతశృంగ నిలయులగు	513
శమహీనుఁడైన విశ్వామిత్రు	761
శరణాగతరక్షణ	982
శరనికరసహస్రంబులఁ	614
శరనిధినినాద	890
శరనిధిపరివృతవిశ్వం	486
శరమోక్షణవేగనిరంతర	619
శాత్రవ జైత్రతేజమున	511
శూరుల జన్మంబు	609
శ్రీజయవిభాసి వినమ	583
శ్రీనాథమూర్తి విభుద	467
శ్రీపతి గడు నెయ్యంబున	932
శ్రీరాజరాజవీర శ్రీరమణీ	721
శ్రీవిభవ నిత్యనిలయ	855
శ్వేతకి నీతపమునకేఁ	963
శ్వేతకియుఁ దనకు	965

ష

పద్యము	పుట
షడరత్నిధనుర్ధరుఁ డెయ్యెడ	728

స

పద్యము	పుట
సకలరాజసమక్షంబున	821
సతికి నొక్కరుండ పతిగాక	841
సతివిముక్త యయినఁ బతికిఁ	697
సద్వినుత చరిత్రుండు	554
సమశీల శ్రుతుయుతులకు	560
సముఁడై యుయుత్సు డయ్యన్నము	549
సరససురవధూ	525
సరళతమాలతాల	891
సర్వధర్మజ్ఞులరుర్వీశ	897
సర్వలోక కర్మసాక్షి	885
సలలితమైన పుట్టు	479
సవిశేషముగ ధనుర్వేద	554
సారణసత్యకాక్రూర	934
సాలప్రాంశు నిజోజ్జ్వల	597
సాహిసకుండైనరుఁడ	922
సుందరి మాయిద్దఱలో	905
సుతజననోత్సవంబున	956
సుతవంతులయి విశుద్ధ	958
సుతశత వర్జితాశ్రమము	772
సుతుఁడు నభస్వదంశమున	516
సుతుల రాక్షసనిహతులఁ	771
సుతుల విద్యాప్రవీణత	586
సుత్రామపుత్త్రుఁ డభిజన	831
సురగరుడ విషోరగ	746
సురగరుడోరగకిన్నర	901
సురల వరప్రసాదమున	537
సూర్యుండును నీకు దుర్వాసుం	478
సూర్యుండును వసిష్ఠమహాముని	757
సెల్లుఁ డట్లు నేలద్రెళ్ళి	813
సౌలయక యెల్లదేశములుఁ	722
సౌభద్ర పౌలోమ కారంధమ	921
స్థిరపౌరుషుండు లోకోత్తరుఁ	523
స్వయంవరలబ్ధ యయిన	831

హ

పద్యము	పుట
హరిఁ దలఁచె సుభద్ర	943
హరితనయుండు పార్థుఁడు	946
హరి పంచిన మార్గంబునఁ	945
హరిపరాక్రమ యేను	490
హరి యింద్రుఁ దలఁచె	886
హరువచనమున	846
హారివిచిత్రహేమకవచా	591
హైమవతోత్తుంగహేమ	739

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 3

సభాపర్వము

కృతికర్త

నన్నయభట్టారకుడు

వ్యాఖ్యాత

డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ప్రధాన సంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Sabhaparvamu of Nannaya Bhattarakudu
Vol. III.

Commentary by
Dr. Appajodu venkatasubbaiah

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Series No.602
First Edition : August 2000
First Re-print : 2006

Second Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D., Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియు వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

మహాభారతం మన జాతీయ కావ్యం (National Epic). ఈ ఇతిహాసంలో వ్యాసమహర్షి ధర్మం, అర్థం, కామం, మోక్షం - అనే నాలుగు పురుషార్థాలను సాధించటానికి అవసరమయ్యే విజ్ఞానం అంతా చక్కగా ఇమిడ్చాడు. వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తుల సారం ఇందులో సముచితంగా చోటుచేసికొన్నందువల్ల, ఈ గ్రంథం 'పంచమవేదం'గా, 'భారతీయ విజ్ఞాన సర్వస్వం'గా ప్రశస్తి పొందింది.

వ్యాసభగవానుడు లోకశ్రేయస్సును కోరి మూడు సంవత్సరాలు నిష్ఠతో భారతకథను 'జయ' కావ్యంగా రచించాడు. దానిని తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశాడు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అట్లా వినిపింపగా పెంపొందిన కావ్యాన్ని 'భారత' మని పిలిచారు. తరువాత ఆ కథను రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. అక్కడి మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిసి భారతం 'మహాభారతం'గా వాసి గాంచింది.

ఉగ్రశ్రవసుడు (సూతుడు) శౌనకాది మునులకు భారత కథనంతా చెప్పి, చివర ఇలా అంటాడు-

"యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి న తత్ క్వచిత్"

'ఇందులో ఉండేదే ఎక్కడైనా ఉంటుంది, ఇందులో లేనిది ఎక్కడా లేదు' (What is in Mahabharata is every where; what is not in Mahabharata is nowhere) - అని.

ఆసక్తికరమైన విషయం, ఏమంటే మహాభారతం ప్రపంచంలోని గ్రంథాలన్నింటిలోకి గొప్పది. ఉదాహరణకు "ఇలియడ్", "ఒడెస్సీ"- అనేవి గ్రీకుల ప్రాచీన ప్రసిద్ధ వీరకావ్యాలు. మహాభారతం ఆ రెంటికన్నా అనేకరెట్లు పెద్దది. ఈ పెద్దతనం ఒక పరిమాణంలోనేగాక, పాత్ర చిత్రణ (Character delineation), భావాల వైవిధ్యం (Range of emotion) వంటి అంశాల్లో స్పష్టంగా తెలుస్తుంది.

మహాభారతంలో పాండవుల ఉత్తమ చరిత్ర, కౌరవుల దుర్వృత్తం చక్కగా ఆవిష్కరింపబడ్డాయి. పాండవులు ధార్మిక, సాత్త్విక, దైవీశక్తులు; కౌరవులు అధార్మిక, రాజస, తామసిక, ఆసురీశక్తులు. ఈ రెండురకాల శక్తుల నడుమ జరిగిన సంఘర్షణయే కురుక్షేత్ర సంగ్రామం. అందులో ధార్మికశక్తులకు జయాన్ని కలిగించి, అధర్మశక్తులను అంతమొందించి, అవతార పురుషుడుగా, జగద్గురువుగా నిలిచి ఉపదేశించిన దివ్యశక్తి శ్రీకృష్ణుడు.

భగవద్గీత భారతానికి ఆత్మ; పాండవుల చరిత్ర శరీరం; చతుర్విధ పురుషార్థ విజ్ఞానం జీవితం; ఇతిహాసాలు, ఉపాఖ్యానాలు జవసత్త్వాలు.   మానవ జీవితమనే మహాసముద్రాన్ని మథించి బాదరాయణుడు మానవాళికి అందించిన

అమృతకలశం మహాభారతం. మానవజీవిత క్రమానికి మహాభారత ఇతివృత్తగమనానికి ఎంతో సాదృశ్యం గోచరిస్తుంది. ఒక్కమాటలో మానవ ధార్మిక జీవన ప్రవృత్తికి మహాభారతం ప్రాణాధారం.

మహాభారతం వేదాలు మొదలుకొని పురాణాలవరకు గల భారతీయ వాఙ్మయంయొక్క సారాంశాన్ని అందించటమేగాక, ఆ యా అంశాలకు వైరుధ్యం ఏర్పడినప్పుడు, వాటికి సామరస్యపూర్వక మార్గాన్ని నిర్దేశించే సమన్వయ సంహితగా పేరు గాంచింది:

"వేదములకు, అఖిలస్మృతి
వాదములకు, బహుపురాణ వర్గంబులకున్
వాదైన చోటులను తా
మూదల ధర్మార్థకామమోక్షస్థితికిన్"

ఈ విధంగా ఆర్షవాఙ్మయానికి అంతటికీ మూదల (ప్రమాణం) అయి ఉండటం మహాభారతం యొక్క ప్రత్యేకత!

దేవభాషలో అవతరించిన భారతం కాలక్రమేణ తమిళ, కర్ణాటాది దేశభాషలలోనికి అనువదింపబడుతూ వచ్చింది. ప్రాంతీయ భాషలలో వెలువడిన ఆ యా భారత అనువాదాలన్నిట్లోనూ తెలుగులో 'కవిత్రయం' వారు రచించిన ఆంధ్రమహాభారతానికి ఒక ప్రత్యేకత నెలకొనిఉంది. తెనుగుభారతం కేవల అనువాదం కాదు; కృష్ణద్వైపాయనుడు వైదికమైన ఏ పరమార్థాన్ని మూలంలో నిరూపించాడో, ఆ నిరూపితార్థం చెక్కుచెదరకుండా పుణికిపుచ్చుకొని అవతరించిన స్వతంత్ర రచన ఆంధ్రమహాభారతం. కవిత్రయం కావించిన పునఃసృష్టి!

'తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి,' 'భారతం చదివినవాడు పండితుడు'- ఇత్యాది లోకోక్తులు తెలుగులో వెలిశాయంటే ఆంధ్రులకు మహాభారతమంటే ఎంతటి ఆదరమో తేటపడుతోంది. ఆంధ్రావళికి అలాంటి ఆదికావ్యాన్ని ప్రసాదించిన మహాకవులు ముగ్గురూ త్రిమూర్తుల లాంటివారు. వారిలో ఆదికవియే విష్ణువు, కవిబ్రహ్మయే బ్రహ్మదేవుడు, ప్రబంధ పరమేశ్వరుడే పరమేశ్వరుడు. ఈ ముగ్గురు సారస్వత మూర్తులు వేరువేరు కాలాల్లో, తెలుగుదేశంలోనూ వేరువేరు ప్రాంతాల్లో తమతమ రచనల్ని కొనసాగించినప్పటికీ, కవిత్రయ భారతం స్వరూపంలోనూ, సందేశంలోనూ ఏకవాక్యతతో విలసిల్లుతూవుంది. ఇది ఆంధ్రావనికి దైవికంగా సిద్ధించిన అదృష్ట విశేషం. తరతరాల తెలుగుజాతికి ఆదర్శంగా తెనుగు సంస్కృతి మందిరంపై నిర్మించిన సమున్నత స్వర్ణగోపురం ఆంధ్రమహాభారతం. ఆ సుందర గోపురాన్ని నెలకొల్పిన అక్షర శిల్పులు "కవిత్రయం" అందరకూ ఆరాధ్యులు.

పై త్రిమూర్తుల్లో ఆద్యుడు, ఆంధ్రసారస్వతానికి 'అపర వాల్మీకి' నన్నయభట్టారకుడు. ఆ మహాకవి వేంగీదేశపు రాజధాని అయిన రాజమహేంద్రవరంలో చాళుక్యవంశ ప్రభువగు రాజరాజుయొక్క ప్రోత్సాహంతో క్రీ.శ. 1053 ప్రాంతంలో వ్యాసభారత ఆంధ్రీకరణకు శ్రీకారం చుట్టాడు. ఆంధ్రవాఙ్మయ చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయ సన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982-83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం"గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్రాబ్ది జయంతి- ఉత్సవాలు తెలుగుదేశంలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడినాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ సందర్భంలో తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షధర్మానికి, ఆంధ్రభాషా సాహిత్యాలకు, సంస్కృతీ సభ్యతలకు మార్గదర్శకమైన ఆది కావ్యానికి - ముఖ్యంగా తొలి మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచే ప్రతిపదార్థ, తాత్పర్య, విశేషాలను వ్రాయించి ప్రచురించే ధార్మిక కార్యక్రమాన్ని ఆసక్తితో చేపట్టారు. తొలుదొలుత నన్నయ భారతభాగంతో ఆరంభమైన ఈ కార్యక్రమం క్రమేణ తరువాతి పదిహేను పర్వాలకు కూడా వ్యాఖ్య వ్రాయించాలనే ఉదాత్త సంకల్పానికి దారితీసింది.

ఈనాటి విద్యార్థుల పాఠ్యప్రణాళికల్లో భారతీయ సంస్కృతి వైశిష్ట్యాన్ని బోధించే అంశాలకు తగినంత ప్రాధాన్యం లేక, అరుదైపోతూ ఉన్నందున, కవిత్రయమహాభారతం అందించే సందేశం సామాన్య జనులకూ, అలాగే నేటి యువతరానికీ అందేటట్లు చేయవలసిన ఆవశ్యకతను గుర్తించి, తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యానసహిత కవిత్రయ భారత ప్రచురణను అందుకు అనువైన మహోద్యమంగా చేపట్టి పురోగమిస్తున్నది.

మొదట నన్నయ భారతభాగానికి సరళగ్రాంథికంలోనూ, తరువాత తిక్కన భారత భాగానికి శిష్టవ్యావహారిక భాషలోనూ- అందులోనూ భిన్న భిన్నశైలులలో - వ్యాఖ్య రచింపబడి ఉన్నందున, ఈ మొత్తం సంపుటాల వ్యాఖ్యాన స్వరూపానికి ఏకవాక్యతనూ, సామాన్యపాఠకులకు సైతం సుబోధంగా ఉండే విశిష్ట వ్యావహారికరీతినీ సంతరించటానికి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని సంపాదకులుగా నియమించటమైనది.

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యానికే కీర్తికిరీటమైన ఆంధ్రమహాభారతాన్ని సరళవ్యాఖ్యతో అచిరకాలంలో సమగ్రంగా ముద్రించి, ఈ రీతిగా ఆంధ్రావళికి సమర్పింపగలుగుతున్నందుకు తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం ఎంతో సంతోషిస్తూన్నది.

ఆదికవి నన్నయభట్టారకుణ్ణి ఆంధ్రమహాభారత రచనకు ప్రోత్సహించిన రాజరాజు క్రీ.శ. 1022 ఆగస్టు 22వ తేదిన పట్టాభిషిక్తుడయ్యాడు. ఈ అద్వితీయ చారిత్రక సన్నివేశాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం ఈ సంవత్సరం ఆగస్టు 22న శ్రీ పద్మావతీ శ్రీనివాసుల మంగళాశాసనములతో ఆది, సభా పర్వాలను తిరుపతిలో ఆవిష్కరించడం జరిగింది. ఆదినుండి ఈ వాఙ్మయయజ్ఞంలో పాలుపంచుకొన్న సుగృహీతనామధేయులయిన విద్వాంసులందరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతూ వున్నాము.

వేదత్రయమూర్తి అయిన వేంకటేశ్వరుని అనుగ్రహంవల్ల, వ్యాఖ్యానసహితమైన ఈ 'జయేతిహాసం' సర్వులకు జయప్రదము, ఆనంద సంధాయకము కాగలదని మా ఆశయము, ఆకాంక్ష.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనతి కాలంలోనే ప్రతులన్నీ చెల్లిపోయిన కారణంగా పునర్ముద్రిస్తున్నాము (2006). ఎప్పటిలాగే పాఠకులు సమాదరిస్తారని ఆశిస్తున్నాను.

వ్యాసరచిత భారతామ్నాయ మాంధ్రభా
షగనొనర్చి జగతిఁ బొగడు గనిన
నన్నపార్యుఁ, దిక్కనను గృతక్రతు, శంభు
దాసు నెఱ్ఱసుకవిఁ దలఁతు భక్తి.

కార్యనిర్వహణాధికారి
తి.తి. దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యానుగ్రహంతో తిరమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమస్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 - 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జూలై 11వ తేదీన హైదరాబాదు బాలాజీభవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయముగైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అరసున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో ఏకరూపత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముగ్గురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిక్రమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగా పర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జూలై 3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డిగారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్ కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగస్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యవంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥ కే. సర్వోత్తమరావు	**శ్రీ డి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥ రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిన అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జూలై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీ డి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్నభిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీ స్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలోని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అందరికీ అవగాహనకావడానికి ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్ల కొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పంద్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులుబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి. విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి".

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాస్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదకమండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంపాదక మండలి సభ్యులు

ఆచార్య నందూరి రామకృష్ణమాచార్యులు
శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
ప్రొ॥ ఎస్.బి.రఘునాథాచార్య
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
ఆచార్య కె.జె.కృష్ణమూర్తి
ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

ప్రొ॥ బిరుదురాజు రామరాజు
ప్రొ॥ ఎస్.బి.రఘునాథాచార్య
ఆచార్య నందూరి రామకృష్ణమాచార్యులు
శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
ఆచార్య ఎం. కులశేఖరరావు
ఆచార్య కె.జె.కృష్ణమూర్తి
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు
డా॥ మేడసాని మోహన్
ఆచార్య ఎం. బుద్ధన్న
ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానంద

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలుల లోని సభ్యుల సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారతసంపుటా లన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్తపాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ఇప్పుడు ప్రథమ సంపుటం– ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం – సభాపర్వం వెలువడినాయి. తరువాతి సంపుటాలు సైతం త్వరలోనే వెలుగుచూడనున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారతం' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయసాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముఖ్యకారకులైన సహృదయులు తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారులు డా॥ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారికి అనేక ధన్యవాదాలు.

ఈ ప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధానపాత్ర వహించిన - వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదకమండలి, సలహామండలి) యందలి విద్యావేత్తలు ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు - ఈ విద్వాంసులందరికి నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు.

"సప్తగిరి" సంపాదకులుగా ఉండి, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి ప్రముఖ పాత్ర వహించిన కీ.శే. కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. "సప్తగిరి" సంపాదక కార్యాలయ ప్రచురణల విభాగంలో 'సబ్ ఎడిటరు'గా ఉద్యోగిస్తూ 1995లో పదవినుండి విరమించేదాకా ఈ ప్రణాళిక విషయమై మిగుల సహకరించిన విద్వత్కవివర్యులు శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులుగారికి, ఆచార్య కె.జె.కృష్ణమూర్తి (కంట్రోలర్ ఆఫ్ పబ్లికేషన్స్) గారికి అనేక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోదువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంట్ శ్రీ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె. రాధారమణ, డాక్టర్ ఎ. సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి.ఎన్.శ్రీనివాసన్ గారలకు, తదితర సిబ్బందికి, టి.టి.డి. ముద్రణాలయ అధికారి శ్రీ ఎం. లక్ష్మణరావు గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహ విశేషం వల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ ఎన్.ఎస్.రామమూర్తి
కన్వీనర్
సంపాదకుడు - సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి సభ్యులు

డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., అధ్యక్షులు

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకుడు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం

ఆచార్య నండూరి రామకృష్ణమాచార్యులు
శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
ప్రొ॥ఎస్.బి. రఘునాథాచార్య
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
ఆచార్య కె.జె. కృష్ణమూర్తి
ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు
ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్యులు
శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
ఆచార్య ఎం. కులశేఖరరావు
ఆచార్య కె.జె. కృష్ణమూర్తి
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు
డా॥ మేడసాని మోహన్
ఆచార్య ఎం. బుద్ధన్న
ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానంద

డా॥ ఎన్.ఎస్.రామమూర్తి, కన్వీనర్

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com
www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా. 1,2
4. డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్నశాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	అను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	అను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	అను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

సంకేతాక్షర సూచి

ఆది.	–	ఆదిపర్వం
సభా.	–	సభాపర్వం
ఆర.	–	ఆరణ్యపర్వం
విరా.	–	విరాటపర్వం
ఉద్యో.	–	ఉద్యోగపర్వం
భీష్మ.	–	భీష్మపర్వం
ద్రోణ.	–	ద్రోణపర్వం
కర్ణ.	–	కర్ణపర్వం
శల్య.	–	శల్యపర్వం
సౌప్తి.	–	సౌప్తికపర్వం
స్త్రీ.	–	స్త్రీ పర్వం
శాంతి.	–	శాంతిపర్వం
అను.	–	అనుశాసనికపర్వం
అశ్వ.	–	అశ్వమేధపర్వం
ఆశ్ర.	–	ఆశ్రమవాసపర్వం
మౌస.	–	మౌసలపర్వం
మహా.	–	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	–	స్వర్గారోహణపర్వం
సం.	–	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	–	సంస్కృత మహాభారతము
అను.	–	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	–	ప్రధాన సంపాదకుడు

క.	–	కందపద్యం
వ.	–	వచనం
ఆ.	–	ఆటవెలది
తే.	–	తేటగీతి
సీ.	–	సీసం
ఉ.	–	ఉత్పలమాల
చ.	–	చంపకమాల
మ.	–	మత్తేభవిక్రీడితం
శా.	–	శార్దూలవిక్రీడితం
ఆశ్వా.	–	ఆశ్వాసం
క్రీ.శ.	–	క్రీస్తుశకం
య.	–	యగణం
మ.	–	మగణం
త.	–	తగణం
ర.	–	రగణం
జ.	–	జగణం
భ.	–	భగణం
న.	–	నగణం
స.	–	సగణం
ల.	–	లఘువు
గ.	–	గురువు
అలం.	–	అలంకారం
సం.	–	సంవత్సరం
మొ.	–	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పీఠిక

[**పీఠిక విషయసూచిక:-** 1. సభాపర్వంలో రెండు మహావృక్షాలు- పు.13 * 2. సభాపర్వం: నామసార్థక్యం- పు.16 * 3. నన్నయ రచనలో నాటకీయత - పు.17 * 4. శిశుపాలవధ-సమగ్ర వ్యాయోగప్రయోగం - పు.19 * 5. కుమారాస్త్రవిద్యా ప్రదర్శనం- బహిరంగ వ్యాయోగ ప్రదర్శనం - పు.28 * 6. వ్యాయోగం: సమవకారం - పు.31 * 7. జరాసంధవధ- సమగ్ర సమవకారం - పు.32 * 8. హిడింబాసురవధ- పాక్షిక సమవకారం- పు.37 * 9. బకాసురవధ- సలక్షణసమవకారం - పు.40 * 10. ద్యూతసభ- డిమ ప్రయోగం - పు.40 * 11. సాత్త్వతీ- ఆరభటీవృత్తుల సమగ్ర నిర్వహణ- పు.41 * 12. ప్రసన్నకథాకలితార్థయుక్తి- పు.52 (1) సభాపర్వంలో ద్రౌపదికి గల ప్రాధాన్యం - పు.54 (2) ద్రౌపదీ వస్త్రాపహరణం- వివస్త్రత - పు.55 (3) సంబుద్ధి-సంస్కృతి - పు.56 (4) అన్నగారి అదుపు-అంతరార్థం - పు.57 * 13. నన్నయ కథాకథన శిల్పం - పు.58 (1) కార్యకారణపద్ధతి -పు.58 (2)సమన్వయ సూత్రం -పు.59 (3)ప్రశంసలు: ప్రయోజనాలు - పు.59 * 14. సహానుభూతి-సానుభూతి-పు.60 * 15. ప్రథమాశ్వాసంలో సహానుభూతి: ద్వితీయాశ్వాసంలో సానుభూతి - పు.61 * 16. 'ఎఱుఁగఁ జెప్పుము దీని నీ వెఱుఁగుదేని' - పు.62 * 17. పాండవ దిగ్విజయం- ప్రాచీన భారతం- పు.72 * 18. సభాపర్వం సూక్తిసుధాకరం- పు.75 * 19.సభాపర్వం: ఉద్యోగపర్వం- పు.76 * 20. శబ్దగుణశాలి నన్నయ చతురశైలి- అర్థగుణశాలి తిక్కనయజ్వశైలి- పు.77 * 21. నన్నయ కవితలో ఓజస్సు- పు.80 * 22. నన్నయ కవితలో ప్రసాదం- పు.87 * 23. నన్నయ కవితలో మాధుర్యం- పు.89 * 24. సభాపర్వం - సందేశం - పు.94 * 25. కవిత్రయ మహాభారతం - వ్యాఖ్యానం - పు.96] [అనుబంధం: సభాపర్వ కథాసారం - పు.98]

ఆ. "ధర్మజుండు ధర్మతరు, వర్జునుఁడు ఘన
స్కంధ, మనిలసుతుఁడు శాఖ, కవలు
పుష్పఫలము, లేను భూసురులును వేద
ములుఁ దదీయ మైన మూలచయము."

ఆ. "రోషమయ మహాతరువు సుయోధనుఁ, డురు
స్కంధ మందులోనఁ గర్ణుఁ, డలరుఁ,
గొమ్మ సౌబలుండు, గుసుమఫలములు దు
శ్శాసనుండు, మూలశక్తి తండ్రి." **(ఉద్యో. 1. 356, 355)**

సభాపర్వంలో రెండు మహావృక్షాలు

ధర్మరాజు ధర్మవృక్షం. దుర్యోధనుడు రోషవృక్షం. వీరిద్దరూ మహావృక్షాలుగా సభాపర్వంలో దర్శన మిస్తారు. ఉద్యోగపర్వంలో ఘర్షణపడతారు. చెట్టు మహావృక్షం కావాలంటే కొమ్మలతో విస్తరిల్లాలి. మూలబలంతో స్కంధం చేవతేలాలి. పూలుపండ్లు దాని వైభవంగా నిలవాలి. అది ధర్మవృక్ష మైతే లోకహితంకొరకు సువాసనలు విరజిమ్ముతుంది. అధర్మవృక్ష మైతే స్వార్థంతో లోకప్రళయానికి దోహదం చేస్తుంది. ఇటువంటి రెండు విరుద్ధవృక్షాల ప్రకృతిని, విస్తృతిని దర్శింపచేసే పర్వం సభాపర్వం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆంధ్రమహాభారతంలోని పదునెనిమిది పర్వాలను నాలుగుభాగాలుగా విభజించుకొని చదివే పరిపాటి ఆంధ్రులలో కనపడుతుంది. మొదటిభాగం - ఆదిపంచకం (ఆది, సభా, అరణ్య, విరాట, ఉద్యోగపర్వాలు); రెండవభాగం- యుద్ధషట్కం (భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు); మూడవభాగం- శాంతిత్రయం (శాంతి, అనుశాసనిక, అశ్వమేధపర్వాలు); నాల్గవభాగం- ఆశ్రమవాస చతుష్టయం (ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణపర్వాలు).

పదునెనిమిది పర్వాలలో సభాపర్వం కీలక మైనది. ఇది లేకపోతే తరువాతి కథ లేదు. మహాభారతాన్ని ఒక మహానాటకంగా భావిస్తే, అందులో సభాపర్వం ప్రతిముఖసంధిస్థానంలో ఉంటుంది. ఆదిపర్వం ముఖసంధిస్థానీయం. బీజ, బిందు, పతాక, ప్రకరీ, కార్యాలు అర్థప్రకృతులు. ఆరంభ, యత్న, ప్రాప్త్యాశా, నియతాప్తి, ఫలాగమాలు అవస్థలు. అర్థప్రకృతులు అవస్థ లైదింటితో వరుసగా కలిసి ప్రవర్తిల్లటంవలన పంచసంధులు ఏర్పడతాయి. ముఖ, ప్రతిముఖ, గర్భ, అవమర్శ(విమర్శ), నిర్వహణ సంధులు అయిదు.

చతుర్విధపురుషార్థ సాధనాత్మకమైన జీవితాన్ని నడుపుతూ, అధర్మవర్తనులను శిక్షించి, ధర్మాన్ని ఉద్ధరించి చంద్రవంశచరిత్రలో సమగ్రగుణోపేతులు కావాలని పాండవుల ధర్మవీరవ్రతం. పాండవులు పుట్టినప్పటినుండి దివ్యశక్తియుతులు కావటంచేత దుర్యోధనాదులచేత ద్వేషించబడుతూనే ఉన్నారు. ఉపాంశువధనుండి భీముడు ఎన్నోసార్లు బయటపడ్డాడు. కుమారాస్త్రవిద్యాసందర్శన ఘట్టంలో పాండవకౌరవులు వైరివర్గాలుగా చీలిపోయారు. పాండవుల నందరినీ సామూహికంగా చంపాలనే పన్నాగంలో భాగంగా దుర్యోధనుడు పన్నిన లాక్షాగృహదహన వ్యూహంవలన పాండవులకు కౌరవులు దాయాదులైనా ప్రబలశత్రువులుగా పరిణమించారు. ద్రౌపదీవివాహానంతరం పాండవులకు క్రొత్తగా ఏర్పడిన బంధుమిత్రుల బలాన్నీ, బలగాన్నీ గమనించి కౌరవులు పాండవులకు రాజ్యంలో భాగ మివ్వటంతో పైకి సయోధ్యతలు కుదిరినా అంతశ్శైత్యాలు అట్లాగే ఉండిపోయాయి. ఆదిపర్వం ముగిసేనాటికి శ్రీకృష్ణుడి ప్రేరణచేత విశ్వకర్మ నిర్మించియిచ్చిన ఇంద్రప్రస్థంలో పాండవులు ప్రజారంజకులుగా ప్రకాశిస్తు ఉన్నారు. కథలో బీజారంభాల ప్రకాశనం ప్రకృష్టంగా జరిగింది. ముఖసంధి ముచ్చటగా రూపుకట్టింది.

సభాపర్వంలో ధర్మరాజు పాండురాజాదులకు ఉత్తమగతులు కలగటానికి రాజసూయం తలపెట్టాడు. శ్రీకృష్ణుడి సహాయంతో మయసభను పొందాడు; జరాసంధుడిని వధించి వివిధదేశాధిపతులకు విముక్తిని ప్రసాదించి వారిని మిత్రులుగా చేసికొన్నాడు. నలుగురు తమ్ములతో నాలుగుదిక్కులను జయించి అపారసంపదను గడించాడు. రాజసూయాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి, శ్రీకృష్ణుడిని పూజించి, శిశుపాలుడి అడ్డు తొలగించి, సమ్రాట్టుగా సత్కీర్తిని సంపాదించాడు. ధర్మరాజుజీవితంలో రాజసూయం ఒక మహాయోగం!

ధర్మరాజుచరిత్ర రెండుయజ్ఞాలతో ప్రకాశించిన ప్రఖ్యాతేతివృత్తం; ఒకటి రాజసూయం, మరొకటి అశ్వమేధం. ధృతరాష్ట్రుడు, భీష్ముడు, ద్రోణుడు, కృపాశ్వత్థామలు, దుర్యోధనాదులు ఉండగా ధర్మజుడు స్వతంత్రించి సమ్రాట్టుగా ప్రకాశింపచేసిన యజ్ఞం రాజసూయం. దానివలన ఇహంలో ప్రజలు, పరంలో పాండురాజు లాభించారు. కాని, భవిష్యత్తులో విస్తారంగా ప్రజాక్షయ మయ్యే మహాయుద్ధం జరిగే ప్రమాదం ఏర్పడింది. దానికి చూళికవలె జ్వలించి, పాండవవైభవాన్ని చూచి దుర్యోధనుడి గుండెలో రగిలిన ఈర్ష్యాగ్ని పాండవులకు అష్టకష్టాలు కలిగించింది. మయసభలో ఎంత ఐశ్వర్యాన్ని పొందాడో ధర్మరాజు మాయాద్యూతసభలో అంత కోల్పోయాడు. తననూ తన తమ్ములనూ భార్యనూ జూదంలో ఓడిపోయాడు. పాంచాలి నిండుసభలో అవమానించబడింది. వస్త్రాపహరణ సమయంలో ఆమెను శ్రీకృష్ణుడు రక్షించాడు. దుశ్శకునాలు వెలువడ్డాయి. ధృతరాష్ట్రుడు గాంధారీవిదుర ప్రేరితుడై ద్రౌపదికి వరాలరూపంగా రాజ్యాన్నంతా ఇచ్చి దాసదాసీత్వాలను తొలగించాడు. పునర్ద్యూతంలో కూడా ధర్మజుడు ఓడిపోయి తమ్ములతో భార్యతో కూడి అరణ్య అజ్ఞాతవాసాలు చేయటానికి పూనుకొన్నాడు. శకునిమాయవలన దుర్యోధనుడు అతిసులభంగా అనంతసంపదను సంపాదించి అడ్డులేని అహంకారంతో వ్యవహరించాడు. అతడి దుష్ప్రవర్తనాన్ని ఎవ్వరూ ఆపలేకపోయారు. వికర్ణవిదురాదులు ధర్మంచెప్పబోయి మాటపడ్డారు. పాండవులు వెంటనే ప్రతీకారం తీర్చికొనే అవకాశం లేకపోయినా, భవిష్యత్కాలంలో జరిగే భయంకరమైన యుద్ధంలో ధార్తరాష్ట్రులనందరినీ, కర్ణశకునులను చంపుతామని భీమాదులు భీకర ప్రతిజ్ఞలు చేశారు. సభాపర్వంలోని ప్రథమాశ్వాసంలో ధర్మతేజం సముజ్జ్వలంగా ప్రకాశించింది. ద్వితీయాశ్వాసంలో కుత్సిత స్వార్థ దురహంకారం అసూయాగ్నితో విజృంభించి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మతేజాన్ని చుట్టుముట్టింది. రెండురకాల విరుద్ధ విచిత్ర శక్తుల మహాప్రతాపం ప్రజ్వరిల్లింది. ఆదిపర్వంలో ఆరిపోయినట్లు కనిపించిన పాండవ కౌరవద్వేషం సభాపర్వంలో కార్చిచ్చువలె రగులుకొని వ్యాపించి ధార్తరాష్ట్రవనాన్ని కాల్చటానికి పూనుకొన్నది. అరణ్యవాసమంతా పాండవులు కౌరవులపై పగసాధించి విజయం పొందటానికి కావలసిన తపస్సంపదను, శస్త్రాస్త్ర సంపదను పొందటానికే వినియోగించుకొన్నారు. ఆపైన కురుక్షేత్రయుద్ధంలో ధార్తరాష్ట్రులను చంపి, ప్రతిజ్ఞ లన్నీ నెరవేర్చి విజయాన్ని పొందారు. అంటే- రాజసూయంలో ధర్మరాజు సంపాదించిన వైభవాన్ని, తీవ్రయత్నంతో యుద్ధానంతరం తిరిగిపొందా డన్నమాట!

యుద్ధానికి పూర్వం రాజసూయంలో ధర్మరాజు సమ్రాట్టు. యుద్ధానంతరం అశ్వమేధంలో మరల సమ్రాట్టు. ఈ రెండు యాగాలూ అతడి చరిత్రలో రెండు మహర్దశలు. ఈ రెండింటి నడుమ సాగిన సంఘర్షణ భారతంలోని ప్రధానకథ. అందులో 'బిందువు' మాయాద్యూతం. 'యత్నం' పాండవ శపథాలు. అందువలననే ఆదిపర్వం ముఖసంధి కాగా, సభాపర్వం ప్రతిముఖసంధి అవుతుంది.

ధర్మరాజు ధర్మతరువుగా యౌవరాజ్య పట్టాభిషేకంతో నిలిచాడు. కాని, రాజసూయంలోమాత్రమే కొమ్మలు సాచి విస్తృతినీ, వైభవాన్నీ ప్రదర్శించకలిగాడు. ఆదిపర్వంలో భీమార్జునుల బలపరాక్రమాలు ప్రకటితా లైనాయి. సభాపర్వప్రథమాశ్వాసంలో దిగ్విజయసాధనలో తమ్ములప్రతాపం ప్రకాశితమైనది. ధర్మం, శ్రీకృష్ణుడు, ధౌమ్యుడు, ధర్మజుడి ఔన్నత్యానికి మూలబలంగా నిలిచారు. భూతలంమీద నున్న రాజులందరి మ్రొక్కు లందుకొన్న ధర్మరాజు మూర్తికట్టిన ధర్మంగా కీర్తించబడ్డాడు. "రామో విగ్రహవాన్ ధర్మః" అని శ్రీరామచంద్రుడు ప్రశంసితు డైనట్లే 'ధర్మజో విగ్రహవాన్ ధర్మః' అని యుధిష్ఠిరుడు ప్రఖ్యాతి నొందాడు. పుష్పఫలాలతో చేవతో పెరిగిన ధర్మ మహాకల్పవృక్షం ధర్మరాజు. యజ్ఞదీక్షితు డైన ధర్మజుడు మూర్త మైన ధర్మ మని కీర్తించాడు నన్నయ.

ఉ. "సమ్మదమంది చూచిరి భృశంబుగ భూజను లెల్ల బ్రహ్మతే
జమ్మును రాజతేజమును సద్బహుభూషణరత్నరాజితే
జమ్మును విస్తరించుచు నిజద్యుతి యొప్పఁగ మూర్త మైన ధ
ర్మమ్మునుబోలె నున్న గుణమండితు దీక్షితు ధర్మనందనున్." (సభా. 1.290)

మహాభారతంలో ప్రతినాయకు డైన దుర్యోధనుడు మూర్తీభవించిన క్రోధం. రోషమయమహాతరువు. క్రోధప్రధానుడు- ఉద్ధతుడు, అర్థ పురుషార్థ సాధకుడు, అధర్మరతుడు, ఆత్మశ్లాఘానిరతుడు, కపటి, నయవంచకుడు కావటం సహజం. కణికనీతి బోధతో దుర్యోధనుడు రోషవృక్షంగా అవతరించాడు. అతడికి కర్ణుడు చేవగల స్కంధం అయ్యాడు. కుమారాస్త్రవిద్యా ప్రదర్శనంలో ఆ చెట్టుకు ఆ బోదె సిద్ధించింది. శకుని మాయోపాయాలు ఆ చెట్టుకు కొమ్మలు. లాక్షాగృహదహనం, మాయాద్యూతం, అనుద్యూతం ఆ కొమ్మల విలాసాలు. శకుని దుర్మంత్రానికీ, దుర్యోధనుడి అసూయాగ్రహాలకూ అనుస్పందించి, అనుమతించి, కపటనాటకం ఆడగలిగిన రెండునాల్కల ధృతరాష్ట్రుడు ఆ చెట్టుకు మూలబలం. అది శ్రీకృష్ణుడంతటి దృఢమైనది కాదు. భయ మోహాలచేత కంపించిపోయేది. అందువలన రోషతరువు ఎప్పటికైనా కూలేదే. ధృతరాష్ట్రుడివలన దుర్యోధను డనే చెట్టు నిలిచింది. కర్ణుడివలన చేవ తేలింది. శకునివలన విస్తరించింది. దుశ్శాసనుడివలన దుర్వాసనలను వెదజల్లింది. ధృతరాష్ట్రాదులు దుర్యోధనుడి ఈర్ష్యాగ్నిని చూచి భయపడ్డారు. శకుని ఆజ్యం పోశాడు. కర్ణుడు గాలిగా వీచి రెచ్చగొట్టాడు. దుశ్శాసనుడు జ్వాలాజిహ్వలవలె పెచ్చుపెరిగి శత్రువులను అవమానాలతో దహించాడు. భీముడు చేసిన ప్రతిజ్ఞలు దుర్యోధన దుశ్శాసనులను సంహరించటానికి ఉద్దేశించబడినవి. వాటికి బలమైన హేతువు కర్ణుడు. ద్రౌపదికి జరిగిన ఘోరమైన పరాభవానికి కారణం కర్ణుడి మాటలూ, సూచనలే. నిండుసభలో బంధకిని వివస్త్రను చేసినా తప్పులేదన్నదీ, జూదంలో ఓడని ఆరవ భర్తను ఎన్నుకొనుమని అవహేళనం చేసిందీ కర్ణుడే. అతడి మాటలు, దుర్యోధనుడు పాండవ ధర్మపత్నిని తన తొడపై కూర్చొను మని చేసిన సైగలు, దుశ్శాసనుడు లజ్జలేక ఆమె శిరోజాలు పట్టి లాగి వస్త్రాపహరణం చేసిన దుశ్చర్యలు భావికాలంలో పాండవుల మనస్సులలో ములుకులై బాధించి ప్రతీకారజ్వాలలను ప్రజ్వలింపచేశాయి.

దుర్యోధనుడి దౌష్ట్యవిశ్వరూపం చూడగలిగిన పర్వం సభాపర్వమే! అర్థలోభంవలన కల్పవృక్షాలనుసైతం బొగ్గులకొరకు కాల్చే అంగారకారుడివంటి కరుణారహితుడు దుర్యోధనుడు. విదురుడు ధృతరాష్ట్రుడితో అన్నమాటలలో-

మధ్యాక్కర.

"అంగారములు గొనువేడ్కఁ బుష్పఫలావళీలలిత
తుంగద్రుమప్రకరంబుఁ గరుణావిదూరుఁడై కాల్చు
నంగారకారుఁ బోలంగ సమకట్టె నర్థలోభంబు
నం గురుకులహానికరుఁడు ధారుణీనాథ! నీసుతుఁడు." **(సభా. 2.182)**

ఈవిధంగా ధర్మవృక్ష రోషవృక్ష సమగ్ర విస్ఫూర్తులు సభాపర్వంలో రూపుకట్టాయి.

సభాపర్వం: నామసార్థక్యం

ఆంధ్రమహాభారతంలోని అష్టాదశపర్వాలలో రంగస్థలసూచకా లైనవి సభాపర్వం, అరణ్యపర్వం, విరాటపర్వం, ఉద్యోగపర్వం. సభలను ఆలంబనంగా చేసికొని ప్రవర్తిల్లిన పాండవ జీవితవృత్తాన్ని అధికరించి చెప్పేది సభాపర్వం. వనవాసవ్రతాన్ని నిర్వహిస్తూ అరణ్యాలలో గడపిన పాండవ జీవిత విశేషాలను ఆయా ఘట్టాలలో వివరించేది అరణ్యపర్వం. విరాటనగరంలో మారువేషాలతో ఎవ్వరికీ తెలియరాకుండ అజ్ఞాతవాసాన్ని పాండవులు నిర్వహించిన ఆసక్తికరమైన కథను వివరించేది విరాటపర్వం. ఉపప్లావ్యంలోని ధర్మరాజు సభలోనూ, హస్తినాపురంలోని ధృతరాష్ట్రుడి సభలోనూ దూతకార్యాలు నాటకీయంగా నిర్వహించే వస్తువు కలది ఉద్యోగపర్వం. ఇవి వేర్వేరు పర్వాలుగా కనపడుతున్నా తత్త్వతః ఒక్కటే మహాపర్వం అనవచ్చును. సభాపర్వంలో జరిగిన కథకు అనుబంధాలే అరణ్య విరాట ఉద్యోగాలు. ఉద్యోగపర్వం ఆది సభాపర్వ కథార్థాల పునర్విచారణమే. అందులోనూ పాండవ కౌరవ సభలలో దౌత్యాలు నడుస్తాయి. కురుక్షేత్రయుద్ధానికి శంఖాలు పూరించబడతాయి. ఈవిధంగా భారతంలోని ఆది పంచకంలో సభలు కీలకపాత్రలు నిర్వహిస్తున్నాయి. ఆ యా సభలలో సాగిన కథార్థాలకు మూల మైనది మయసభ. అది దివ్యసభ. దానికి ప్రతిగా ధృతరాష్ట్రుడు నిర్మించింది మణిమయ (ద్యూత)సభ- ఫలితాలనుబట్టి చూస్తే అతడి సంతానానికి యమసభ. పుణ్యం ప్రోగుచేసింది మయసభ. పాపం మూటకట్టింది ధృతరాష్ట్రసభ. 'అత్యుత్కటైః పుణ్యపాపైః ఇహైవ ఫల మశ్నుతే' అన్న న్యాయానికి ఆ సభలు బొమ్మాబొరుసులు!

సభాపర్వంలోని రెండుసభలూ, ఉద్యోగపర్వంలోని రెండుసభలూ శ్రీకృష్ణ మహిమలకు వ్యంజకాలుగా నిలవటం పాండవుల దైవీసంపదకు నిదర్శనం. 'ధర్మో రక్షతి రక్షితః' అనే న్యాయాన్ని అనుసరించి శ్రీకృష్ణుడు ధర్మరక్షకుడుగా పాండవులను నాలుగురకాలుగా ఆదుకొన్నాడు నాలుగుసభలలో. రాజసూయయాగంలో మయసభలో ధర్మజుడిని సమ్రాట్టుగా నిలిపింది శ్రీకృష్ణుడే. అతడి వ్యూహబలమే ధర్మజుడి మూలబలం. ధృతరాష్ట్రనిర్మిత మైన సభలో అంతసంపదను ఆ విధంగా మాయాద్యూతంలో కోల్పోతున్న సందర్భంలోకూడా ధర్మజుడుకాని, అతడి తమ్ములుకాని శ్రీకృష్ణుని స్మరించలేదు. బలవంతంగానైనా పిలువబడినప్పుడు క్షత్రియుడు జూదమాడక తప్పదనే ధర్మపన్నం చదివాడేకాని ధర్మరాజు తనకు హృదయస్థానీయు డైన శ్రీకృష్ణపరమాత్మను తలంచనేలేదు. కాని, విపత్తులో మునిగిన ద్రౌపది శ్రీకృష్ణుడిని స్మరించి తనను తాను ఉద్ధరించుకొనటమే కాక పాండవులను కూడ ఉద్ధరించగలిగింది. అనుద్యూతంలోకూడా ధర్మజుడికి శ్రీకృష్ణుడు తలపులో నిలువలేదు. వ్యసనమున్నచోట వాసుదేవు డుండడు కాబోలు! అయినా ధర్మాన్ని రక్షించే పాండవులను మయసభలో ప్రత్యక్షంగానూ, ధృతరాష్ట్రసభలో పరోక్షంగానూ రక్షించి శ్రీకృష్ణుడు దివ్యశక్తిని ప్రదర్శించాడు.

ఉద్యోగపర్వంలో ఉపప్లావ్యంలోని ధర్మజుడిసభలో తీర్పరిగా నిలిచి సంజయురాయబారంలోని బండారాన్ని బయటపెట్టాడు. హస్తినాపురసభలో మధ్యవర్తిగా నిలిచి ధార్తరాష్ట్రుల అధర్మప్రవృత్తినీ, పాండవుల నీతివర్తనాన్నీ లోకంలో ప్రకటమయ్యేటట్లు వర్తించి నైతికమైన విజయాన్ని పాండవులకు సాధించిపెట్టాడు.

సభాపర్వంలో శ్రీకృష్ణుడు పాండవులకు యోగదాయకుడు. ఉద్యోగపర్వంలో క్షేమకారకుడు. ఇది సభల కథలవలన ప్రతీయమానమయ్యే ప్రబంధధ్వని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మయసభ ఇంద్ర, యమ, వరుణ, కుబేర, బ్రహ్మసభలకంటె మనోహరంగా ఉన్నదని నారదుడు చెప్పటం యథార్థంగా కథార్థంగా నిలిచినా, పాండురాజు యమసభలో, హరిశ్చంద్రుడు ఇంద్రసభలో ఉండట మెందు కనే ప్రశ్న ధర్మజుడికి పుట్టటం, పరమార్థంగా పాండురాజు ధర్మరాజును రాజసూయం చేయుమని ఆదేశించిన వార్తచెప్పటానికి పోషకంగా, హరిశ్చంద్ర మాహాత్మ్యాన్ని చెప్పటానికి ఉపాయంగా సాగింది సభాప్రశంస. మయసభ రాజసూయసంకల్పానికి రంగమై నిలిచింది. రాజసూయసంకల్పం ప్రజాక్షయాన్ని కలిగించే మహాయుద్ధానికి పూర్వరంగమై తారసిల్లింది. ఎంతోసేపు ఆలోచించి మయసభా నిర్మాణాన్ని సూచించిన శ్రీకృష్ణుడిసంకల్పంలోనే మహాభారతయుద్ధప్రయోగానికి ప్రరోచనం జరిగింది.

సభాపర్వాని కున్న ఇన్నిరకాల ప్రాముఖ్యాన్ని నన్నయ సారమతిగా భావించి, రంగస్థలప్రాధాన్య మున్న కథలోని సన్నివేశ చారుత్వాన్ని వివేచించి, నాటకీయతను ప్రసన్నకథాకలితార్థయుక్తితో మేళవించి, అపూర్వఫణితిలో రచించాడు. అంటే- శ్రవ్యకావ్య మర్యాదలలో దృశ్యకావ్యమర్యాదలను ప్రవేశపెట్టి రూపకమర్యాదావిశిష్టమైన కావ్యకళను ఇతిహాసేతివృత్తంలో నిబంధించా డన్నమాట. ఆంధ్రమహాభారతాన్ని కావ్యేతిహాస మనే మిశ్రప్రక్రియలో రచించటమే కాకుండ శ్రవ్య దృశ్య కావ్య మిశ్రప్రయోగాన్ని సాధించి నన్నయ తన ప్రత్యేకతను ప్రదర్శించాడు. అందుచేతనే సభాపర్వం- 'పండిత చేతో నిర్వృతి' చేస్తూ 'రమ్యం'గా ఉంటుందన్నాడు నన్నయ పర్వసంగ్రహంలో. (ఆది. 1.38) 'కావ్యేషు నాటకం రమ్యం' అనికదా ఆర్యోక్తి!

నన్నయరచనలో నాటకీయత

'నాటకీయత' అనంగానే తెలుగులో తిక్కనసోమయాజి జ్ఞాపకం వస్తాడు. కాని, తిక్కనకుకూడ మార్గదర్శి నన్నయభట్టారకుడే. నన్నయ నాటకీయతకు మార్గంవేసి మనోజ్ఞంగా చూపించాడు. తిక్కన దానిని ఘంటాపథంగా మార్చి రసవంతంగా అలంకరించాడు.

శ్రవ్యకావ్యంలో నాటకీయతను వివేచించటానికి నన్నయరచనాశిల్పం బాగా తోడ్పడుతుంది. ఈ క్రింది అంశాలు అందులో ముఖ్యంగా పరిగణించదగినవి.

1. **రంగపరికల్పన:** కథలో ప్రదర్శన కనుకూలంగా ఉండే ఘట్టాలను గుర్తించి, వాటిని నిర్వహించేటప్పుడు కథాకథనంకంటె పాత్రల చేష్టలకు సంభాషణలకు ప్రాధాన్యం కలిగించి, ఒక నాటకరంగాన్ని చూస్తున్న అనుభూతిని పఠితలకు కలిగించటం.

2. **దశరూపకవివేకం:** కథలో వచ్చే ఉపాఖ్యానాలనుకాని, రసవత్తరఘట్టాలనుకాని లోతుగా పరిశీలించి, వాటి నిర్మాణ స్వభావాలనుబట్టి దశవిధరూపకాలలో వేటికైనా దగ్గరగా ఉన్నాయేమో వివేచించి, ఆ యా రూపకలక్షణాలు అచ్చుపడేటట్లు వాటిని రూపొందించటం.

3. **చతుర్విధాభినయవిన్యాసం:** దృశ్యకావ్యం అభినయప్రధాన మైనది. అభినయం నాలుగువిధాలు. ఆంగికం, ఆహార్యం, వాచికం, సాత్త్వికం. శరీరావయవాలవలన ప్రకటితమయ్యే హావభావముద్రల విన్యాసం ఆంగికం. వేషభూషాదులవలన వ్యక్తమయ్యే భావవిన్యాసం ఆహార్యం. వాక్యవిన్యాసంతో పాత్రోచితంగా, సందర్భోచితంగా, రసోచితంగా సాగే సంభాషణశిల్పంవలన వ్యక్తమయ్యే భావవిన్యాసం వాచికం. సమాహితచిత్తం సత్త్వం. దానినుండి పుట్టిన అభినయం సాత్త్వికం. కంప స్వేదరోమాంచ వైవర్ణ్యస్తంభాదులవలన వ్యక్తమయ్యే భావవిన్యాసం సాత్త్వికాభినయం. ఈ నాలుగురకాల అభినయాలకు ప్రాధాన్యం కలిగించే వర్ణనలను కావ్యంలో ప్రవేశపెట్టటంవలన నాటకీయత రక్తికట్టుతుంది.

4. **రసపోషణ:** శ్రవ్యకావ్యంలో శబ్దార్థ, అలంకార, గుణ, రీతి, వృత్తులను రసాభివ్యక్తికి అనుకూలంగా, పోషకంగా నిర్వహించటంవలన రసదీప్తి కలుగుతుంది. నాటకంలో రచనకంటె కథ కెక్కువ ప్రాముఖ్యం ఉంటుంది. కథలో నాయకుడు కాని, ప్రధానపాత్రకాని, లేదా వ్యక్తివంటి శక్తికాని ఒక ప్రధానకార్యాన్ని ఆరంభించి నిర్వహించటంలో స్థాయి భావోత్కటస్థితిని నిర్వహించటంద్వారా రసపోషణం చేయటం దృశ్యకావ్య మర్యాద. కథా కార్యపరంగానూ,

కవితాపరంగానూ నాయకాశ్రిత మైన స్థాయిభావాన్ని పోషించి రసాభివ్యక్తిని కలిగించటం నాటకీయతలో గోచరించే శిల్పం. అంటే అది శ్రవ్య దృశ్య రసపోషణ విధానాల సమష్టిశిల్ప మన్నమాట!

5. **నాటకరచనాంగాల ప్రకాశనం:** సంధి, సంధ్యంగాలు, వృత్తులు, పతాక, గండం, పూర్వాపరకథార్థసూచన, మొదలైన నాటకరచనాంగాలను యథావకాశంగా ఆ యా సందర్భాలకు సముచితంగా సమకూర్చటం.

సభాపర్వంలో సహజంగా నాలుగుఘట్టాలు నాటకీయతకు అనుగుణంగా అమరి ఉన్నాయి. అవి- జరాసంధవధ, శిశుపాలవధ, మాయాద్యూతం (ద్రౌపదీవస్త్రాపహరణం), దుర్యోధనుడి భంగపాటు. మొదటి మూడూ స్వయంసమగ్రమైన కథలుగా, నాటకాలుగా, హరికథలుగా, జానపదకళారూపాలుగా లోకంలో ప్రచారం పొందిఉన్నాయి. తెలుగువారిరంగప్రక్రియలలో ఏకపాత్రాభినయం ఇప్పుడు ఎనలేని ప్రచారం పొందిఉన్నది. ఆ ప్రక్రియలో ప్రథమతాంబూలం అందుకొనేది మయసభలో దుర్యోధనుడి భంగపాటు. పాండవులు మయసభలో జీవించిన వృత్తాంతాలు విశేషాలు తెలుగువారి కంతగా తెలియవు కాని, దుర్యోధనుడు మయసభలో ఉన్న ఆ మధుర(విషమ)క్షణాలు చరిత్రలో కలకాలం కళాత్మకంగా నిలిచిపోయాయి. ఈ ఘట్టాలన్నీ ఇంత రక్తికట్టటానికి కారణం ఏమిటి? అని ప్రశ్నించుకొంటే- నన్నయ ఆ సన్నివేశాలను నాటకీయంగా దిద్ది తీర్చిన శిల్పమే- అని సమాధానం వస్తుంది. నేటికీ పద్యనాటకాలలో సైతం ఆ యా ఘట్టాలలో నన్నయ వ్రాసిన పద్యాలే ఒరవళ్ళుగా, ఒజ్జబంతులుగా నిలుస్తున్నాయి- అంటే నన్నయరచనలో నాటకీయత ఎంత గొప్పదో స్పష్టమౌతుంది.

సభాపర్వంలో పురుషులే పాల్గొన్న యుద్ధప్రాయా లైన సన్నివేశాలు ఎక్కువగా ఉండటంచేత నన్నయ వ్యాయోగ, సమవకార, డిమాలనే రూపకాలలక్షణాలు అచ్చుపడిన శ్రవ్యకావ్య ఘట్టాలుగా వాటిని గుర్తించి, ఆ రూపకచ్ఛాయలు ముద్రిత మయ్యేటట్లు దిద్దితీర్చి నాటకీయతను పోషించాడు. ఆది సభారణ్యపర్వ కథాఘట్టాలలో శ్రీకృష్ణుడు, భీముడు, అర్జునుడు శత్రువులతో తలపడి వారిని వధించిన ఆయా సన్నివేశాలు రూపక ప్రయోగప్రాయాలే. శ్రీకృష్ణుడు శిశుపాలుడిని వధించాడు; భీముడు జరాసంధుడిని ఈ పర్వంలోనే చంపాడు; ఆదిపర్వంలో హిడింబుడిని, బకుడిని, అరణ్యపర్వంలో కిమ్మీరుడిని వధించాడు; కృష్ణార్జునులు ఖాండవదహనాన్ని చేశారు; ఆదిపర్వంలోని కుమారాస్త్రవిద్యాప్రదర్శన సందర్భంలో భీమార్జునులు దుర్యోధనకర్ణులతో తలపడ్డారు.

వాటిలో శ్రీకృష్ణుడు చేసిన శిశుపాలవధను నాట్యశాలలో ప్రదర్శించిన సమగ్రసుందర మైన వ్యాయోగంగానూ, కుమారాస్త్ర విద్యాప్రదర్శనను బహిరంగ ప్రదేశంలో ప్రదర్శించిన వ్యాయోగంగానూ నన్నయ తీర్చిదిద్ది ప్రకరణ గౌరవాన్ని సమున్నతంగా నిలిపాడు. ఆ తరువాత భీమనాయకమైన రాక్షసవధ ఘట్టాలను వీరరౌద్రరసరమ్యంగా సమవకారాలుగా చిత్రించాడు. మాయాద్యూత ఘట్టంలో డిమ లక్షణాలను సమగ్రంగా నిలిపి రసవత్తరంగా నాటకీయతను పోషించాడు. అంతేకాదు, స్వతంత్రోపాఖ్యానాలుగా లెక్కించదగిన యయాతి, దుష్యంత, నలమహారాజులచరిత్రలలో నాటకలక్షణాలను అచ్చుపడేటట్లు రూపొందించాడుకూడ నన్నయ. ఈవిధంగా నన్నయ రచనలో తొమ్మిదిఘట్టాలలో దశరూపకప్రయోగనాటకశిల్పాన్ని దర్శనీయమయేటట్లు స్పష్టంగా చిత్రించి తెలుగుకావ్యరచనలో నాటకీయతను పోషించటం ఒక అనివార్యలక్షణంగా భావితరాలకు సూచించాడు; తిక్కనాదులకు త్రోవచూపించాడు. ఇంతేకాక దుర్యోధనుడు మయసభను దర్శించి భంగపడిన ఘట్టం తెలుగువారికి 'ఏకపాత్రాభినయ'మనే ప్రక్రియకు పురుడుపోసింది. అందులో వర్ణ్యవస్తువు, రచనాశైలి నన్నయ చూపించిన బాటలోనే నడవటం ఒక సంప్రదాయమైపోయింది. ఈ విధంగా రెండున్నర పర్వాలలో పదిదృశ్యకావ్యశిల్పాలను ప్రదర్శించటం సామాన్యమైన విషయం కాదు.

కథాస్వభావాన్నిబట్టి రూపకచట్రాన్ని అమర్చి శ్రవ్యకావ్యంలో దృశ్యకావ్యదర్శనం చేయించటం నన్నయనాటకీయత. మూలంలోని వస్తువును రూపకమర్యాదలకు అనువుగా మలచుకొని పునర్నిర్మించటంలోనూ, కథాకథనసంభాషణాదుల నిష్పత్తిని సవరించుకొని సంవిధానంచేయటంలోనూ, నన్నయ నాటకీయతనుకూడా దృష్టిలో ఉంచుకొనటంవలన ఆంధ్రమహాభారతం పునస్సృష్టిగా గోచరించింది. నన్నయరచనలోని నాటకీయత వ్యాసుడిలో లేదా? అని కొందరు ప్రశ్నిస్తారు. అందుకు శ్రీ ఎస్వీ.భుజంగరాయశర్మగారి సమాధానం గమనించతగింది- "ఈ నాటకీయత సంస్కృతభారతంలో లేదా అని

ప్రశ్న. సంస్కృతభారతంలోనూ- ఉంది. ఫోకస్ తప్పిన ఫోటోగ్రాఫ్‌లా, బూజర బూజరగా! నన్నయగారి కున్నంతటి స్పష్టమైన నాటకీయదర్శనం వ్యాసునిలో కనపడదు. ఎన్ని శిల్పాలకో ఒరవడిపెట్టినట్లు నాటకీయశిల్పానికికూడా తెలుగులో ఒరవడిపెట్టింది నన్నయగారే అనుకొంటాను." (నన్నయభారతి- వ్యాససంకలనం- ప్రథమసంపుటి. నన్నయనాటకీయత (వ్యా.) పు.561)

నన్నయనాటకీయతలో ఆకృతిశిల్పం అగ్రతాంబూలం అందుకొంటుంది; తిక్కననాటకీయతలో అభినయశిల్పం అగ్రస్థానంలో నిలుస్తుంది. నన్నయనాటకీయత ప్రయోగసంబంధి; తిక్కననాటకీయత ప్రదర్శనసంబంధి.

శిశుపాలవధ - సమగ్రవ్యాయోగప్రయోగం

ఆంధ్రమహాభారత సభాపర్వ ద్వితీయాశ్వాసారంభంలో శిశుపాలవధఘట్టాన్ని నన్నయ 72 పద్యగద్యాలలో రచించాడు. ధర్మజ రాజసూయాధ్వరంలో శ్రీకృష్ణుడిని పూజించే ప్రతిపాదనంతో ప్రారంభమైన ఈ ఘట్టం శిశుపాలవధానంతరం యజ్ఞసమాప్తితో ముగుస్తున్నది. (సభా. 2.1-72)

శిశుపాలవధ కథాఘట్టంలో దశరూపకాలలో ఒకటైన 'వ్యాయోగం' అనే రూపకలక్షణాలు * అధికంగా అమరి ఉన్నాయి. యుద్ధప్రాయమైన వ్యాయోగంలో పురుషులే వర్తిస్తారు కాబట్టి దాని కా పేరు వచ్చింది. దానిలక్షణాలు ఈ కథాఘట్టానికి సమన్వయిస్తున్నాయి. ఇందులోని వస్తువు ప్రఖ్యాతమే. నాయకుడు ప్రసిద్ధుడే. స్త్రీ పాత్ర లేనే లేదు. ఇందులో వీరరసం అంగి, రౌద్రరసం అంగం. శిశుపాలాదుల పరుషవాక్యాలతో నిండిన రణవిజృంభణం, భీష్మకృతధిక్కారవచనాలు, భీమసహదేవుల రౌద్రోద్రేకం, శ్రీకృష్ణుడి పౌరుషపరాక్రమ ప్రదర్శనం, ధర్మజుడి నయనీతివర్తనం- ఈ ఘట్టంలో బహుపురుషుల యుద్ధాభిముఖ్యాన్ని గోచరింపజేస్తున్నవి. కాబట్టి శ్రవ్యకావ్యమర్యాదలలో ఒదిగియున్న వ్యాయోగంగా ఈ ఘట్టం సహజస్వభావాన్ని సంతరించుకొని ఉన్నది. నన్నయ ఈ రహస్యాన్ని గుర్తించి ఆ యా రూపకలక్షణాలు ప్రస్ఫుట మయ్యేటట్లు రచించి, తన కథాకథనకౌశలానికి ఒక వైశిష్ట్యాన్ని సంతరించుకొన్నాడు.

నాందీప్రయోగం సర్వరూపకసామాన్యలక్షణం. 'ఆశీ ర్నమస్క్రియా వస్తునిర్దేశో వాఽపి తన్ముఖమ్' అని దానినియమం. ఆశీర్నమస్క్రియలలో ఏదో ఒకదానిని ఎన్నుకొని వస్తునిర్దేశాన్నిమాత్రం తప్పక పాటించటం రూపకరచయితల పరిపాటి. అది శబ్దంచేత కాని, అర్థంచేత కాని సూచించబడవచ్చును. నన్నయ ఈ అదను కనిపెట్టి సభాపర్వ ద్వితీయాశ్వాసారంభంలో కృతిపతిని సంబోధించే పద్యాన్నే నాందిగా తీర్చిదిద్దాడు. ఇది ఒక అపూర్వమైన నాటకీయరచనాప్రయోగం.

క. "శ్రీరమణీప్రియ! ధర్మవి
శారద! వీరావతార! సౌజన్యగుణా
ధార! భువనైకసుందర!
వీరశ్రీరమ్య! బుధవివేకనిధానా" **(సభా. 2.1)**

ఇందులోని సంబోధన లన్నీ బహువ్రీహులై అన్యపదార్థ మైన రాజరాజనరేంద్రు డనే అర్థాన్ని కలిగిస్తున్నాయి. ఈ పద్యం నన్నయ రాజరాజును సంబోధిస్తూ చెప్పిందని తెలియపరచకుండా ఏ పరితకైనా వినిపిస్తే ఇది రాజరాజు నుద్దేశించిన దని తెలియటం కష్టం! ఈ పద్యంలో సంబోధనం కాదు కావ్యార్థసూచనం ముఖ్యం.

కావ్యార్థసూచనంలో కథార్థాలను సూచించటం ఒక పద్ధతి. కావ్య పాత్రలపేర్లను నిర్దేశించి ముద్రాలంకారంగా నాందీపద్యాన్ని రచించటం మరొకపద్ధతి. నన్నయ రెండవదానిని పాటించాడు. ఈ కథాఘట్టంలో నాయకపక్షంలో కానవచ్చే

---

* "వ్యాయోగస్తు విధిజ్ఞైః కార్యః ప్రఖ్యాత నాయక శరీరః । అల్పస్త్రీ జనయుక్త స్త్వేకాహకృత స్తథా చైవ ॥
బహవ స్తత్ర చ పురుషాః కవిభిః కార్యా యథా సమవకారే । న చ తత్ప్రమాణయుక్తాః కార్యా ఏకాంక ఏవాయమ్ ॥
న చ దివ్యనాయక కృతః కార్యో రాజర్షి నాయక నిబద్ధః । యుద్ధ నియుద్ధాక(ధ)రణ సంహ(ఘ)ర్ష కృతశ్చ కర్తవ్యః ॥
ఏవం విధాస్తు కార్యో వ్యాయోగో దీప్త కావ్య రసయోనిః"

- భరతనాట్యశాస్త్రమ్. 16 అధ్యా. శ్లో. 142-145

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాత్రలు ప్రధానంగా ఏడుగురు. వారిలో శ్రీకృష్ణుడు పూజనీయుడు. కాబట్టి అతడు ప్రథమగణ్యుడు. తరువాత నాయకులైన పాండవులు. ఆ తరువాత- వారికి ధర్మనిర్దేశం చేసిన కురుపితామహుడు భీష్ముడు. వీరిని చెపితే కథార్థాలను సూచించినట్లే అవుతుంది. నన్నయ నాందీపద్యరచనా సంప్రదాయంలోని ఈ విధానాన్ని ఇందులో అనుసరించాడు.

శ్రీరమణీప్రియు డంటే రమావల్లభు డైన శ్రీమహావిష్ణువు. ఇక్కడ తదవతారమూర్తి అయిన శ్రీకృష్ణుడు. ధర్మవిశారదు డంటే ధర్మాచరణకోవిదు డైన ధర్మరాజు. వీరావతారు డంటే భీముడు. ధర్మతేజమైన ధర్మరాజుకు ఆతడు కార్యసాధనంలో పురుషకారసాధకుడు, ఉత్సాహమూర్తి. సౌజన్యగుణాధారు డనే సమాసంలోని 'గుణాధార' శబ్దార్థశక్తిచేత ప్రతీయమాన మయ్యే గాండీవం, దాన్ని ధరించే పార్థుడు సూచించబడుతున్నారు. సౌజన్య(స్నేహ) గుణానికి ఆధారుడనే అర్థం స్వీకరించినా నరనారాయణ స్నేహాన్ని పురస్కరించుకొని అర్జునుడు స్ఫురిస్తాడు. సౌజన్యగుణమంటే దేవతాగుణమనీ, అందులోనూ ఇంద్రుడి గుణమనీ దానికి ఆధారమైనవాడు అర్జునుడనీ ఊహకు అందుతాడు. భువనైకసుందరు డనే విశేషణంవలన నకులుడు స్ఫురణకు తగులుతున్నాడు. స్వర్గారోహణపర్వంలో అతడి పతనానికి కారణంగా అతడి సౌందర్యగర్వాతిశయం చెప్పబడి ఉండటం గమనించదగిన అంశం. 'వీరశ్రీరమ్య' అనే విశేషణం ఈ కథాఘట్టంలోని సహదేవుడికి అన్వర్థమౌతుంది. శిశుపాలవిజృంభణంతో సంకులమైన సభను తన వీరోక్తులతో అనుశాసించి దేవతల మెప్పులను పొందిన ఆ వీరుడు పరాక్రమసంపదచేత అందమైనవా డనటం సార్థకం. అశ్వినీదేవతల వరంవలన పుట్టిన నకులసహదేవు లిద్దరూ అందమైనవారే. అయితే వారిలో అన్నకంటె తమ్ముడు రణపాండిత్యంలో రెండాకులు ఎక్కువ చదివాడు. అందువలన వీరశ్రీరమ్యుడు. ఇక- 'బుధవివేకనిధానా!' అనే సంబుద్ధి భీష్ముడిని స్మరింపజేస్తున్నది. బుధు డనగా పండితుడు. "పండానామ ఆత్మవిషయక జ్ఞానః." ఆత్మజ్ఞానవేత్త బుధుడు. అతడి వివేకం సదసద్వివేకం. సత్తు పరమాత్మ. తద్వివేకానికి నిధానమైనవాడు జ్ఞాని. భీష్ముడు అట్టి జ్ఞాని. కాబట్టే భావికథలో శ్రీకృష్ణుడి పరమాత్మతత్త్వాన్ని ఆతడు ధర్మరాజుకు నిరూపించిచెప్పాడు. ఆశ్వాసాదిపద్యాన్ని పఠితలు అంతగా పట్టించుకోరు- అందులో రసభావాలు ఉండవు కనుక. కాని, నన్నయ రచనలో అట్టి నీరసపద్యంకూడ నాటకీయ రచనాశిల్పానికి ఒక అనర్ఘపద్యరత్నమై నాందీశ్లోకగౌరవాన్ని పొందగలుగుతున్నది. మహాకవి సృష్టి అటువంటిది!

నాంది ముగిసిన తరువాత స్థాపకు డనే రెండవసూత్రధారుడు రంగంలో ప్రవేశించి ప్రస్తావన అనే పూర్వరంగప్రయోగాన్ని నిర్వహించటం రూపకసంప్రదాయం. ప్రస్తావనలోని చివరి అంశం పాత్రప్రవేశసూచనం. నన్నయ ఈ అంశాన్ని నారదపాత్రను ప్రవేశపెట్టి నిర్వహించాడు. సభాపర్వద్వితీయాశ్వాసం ఈ క్రింది వచనంతో ఆరంభమౌతున్నది:

"అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె: నట్లు రాజసూయ మహోత్సవంబు నొప్పను ధర్మరాజు ధర్మనిత్యతయును స్తుతియించి నారదుం డాసదంబున సకలరాజసమూహంబును రాజలోకంబులో మనుష్యసామాన్యం డయియున్న జగన్మాన్యు జనార్దనుం జూచి, తొల్లి బ్రహ్మాది సురగణ ప్రార్థితుం డయి యఖిల మహీభారావతరణార్థంబు నారాయణుండు యదువంశంబున నుదయించుటయు, నయ్యుయిక్షత్రియ కులంబుల సురదైత్యదానవ యక్ష రాక్షస గంధర్వాదుల యంశావతారంబులుం దలంచి భవిష్యద్భారతరణంబునకు సంహృష్టహృదయుం డయి యుండునంత"

(సభా. 2.2)

మహాభారతంలో నాయకుడు ధర్మరాజు. అతడు ధర్మనిరతుడు. అతడి ధర్మనిత్యతను నారదుడు మొదట స్తుతించాడని చెప్పటంచేత కథానాయకప్రశస్తిని. అంగిరస సూచనను నన్నయ చేశాడు. ఆ తరువాత అవతారపురుషు డైన శ్రీకృష్ణుడి మహత్త్వాన్ని కీర్తించాడు. అతడికి ప్రత్యర్థు లై ఉన్న రాజలోకాన్నీ, భక్తు లై ఉన్న పార్థివసమూహాన్నీ పేర్కొన్నాడు. కలహభోజనుడైన నారదుడి దృష్టి సహజవిరోధవర్గాలు బలసి ఉన్న సభపై పడిందంటే అక్కడ చిచ్చు పుట్టినట్లే. ఈ కథాఘట్టానికి సంబంధించినంతవరకు శిశుపాలుడితో జరిగే సంఘర్షణం ముఖ్యం. కాని, మహాభారతకథాదృష్టికి కురుక్షేత్రసంగ్రామం ముఖ్యం. ఆ మహాఫలాన్ని అందుకొనటానికి ఏర్పడిన కథాసోపానాలలో ఈ ఘట్టం బలమైనది. అట్లవటంచేత ప్రస్తుతసంఘర్షణను వ్యంగ్యంగానూ, భారతరణాన్ని వాచ్యంగానూ నన్నయ నారదుడితలపులో సూచ్యమయ్యేటట్లు నిబంధించాడు. పూర్వరంగప్రక్రియకును, రూపకప్రయోగప్రక్రియకును భేదం సూచించేందుకు నన్నయ ఇట్లా రచించాడు.

నన్నయ ఈ ఘట్టంలో కథాకథనాన్ని సంగ్రహంగానూ, సంభాషణలను అధికంగానూ రచించి నాటకీయతను అచ్చుపడేటట్లు చేశాడు; వాక్క్రియారూప సంఘర్షణలలో వాగ్రూప మైనదానిని అధికంగా చిత్రించాడు. శ్రీకృష్ణుడు శిశుపాలుడిని వధించిన క్రియను నన్నయ ఒకపద్యంలో చెప్పాడు. మిగిలినదంతా ధర్మజ భీష్మ శ్రీకృష్ణాదులకున్నూ, శిశుపాలునకున్నూ నడుమ జరిగిన వాగ్వివాదమే. కాబట్టి ఈ ఘట్టంలో సంభాషణలు ఉద్దీప్తాలై, శక్తిమంతాలై, పూర్వాపరసమన్వయ సంబద్ధాలై సంఘర్షణను సృష్టింపజేయగలిగినట్టివిగా రూపొందించటంలోనే నాటకీయరచనాశిల్పం రాణించ వీలౌతున్నది. నన్నయ దానిని నిపుణంగా నిర్వహించాడు.

నిజానికి ఈ ఘట్టంలో చెప్పుకొనదగిన కథే లేదు. రాజసూయం ఉత్తమపూజతో ముగియాలి. అట్టి ఉత్తముడు శ్రీకృష్ణ డని భీష్ముడు ప్రతిపాదించాడు. ధర్మజుడు అతడిని పూజించాడు. కార్యం అంతటితో ముగియనుండగా శిశుపాలుడు 'శ్రీకృష్ణుడు పూజార్హుడు కా'డని అధిక్షేపించాడు. అతడు ధర్మజుడితో, భీష్ముడితో వితండవాదం చేశాడు. వారు యథాశక్తి నయానా భయానా అతడిని ఒడబడేటట్లు చేయటానికి యత్నించారు. అతడు సభను వెలువడి యుద్ధసన్నద్ధు డైనాడు. యజ్ఞదీక్షితు డైన ధర్మజుడు యుద్ధంచేయటానికి వీలు లేదు. పైపెచ్చు అతడు రాజలోకాన్ని ఆహ్వానించిన యజమాని. భీష్ముడు సమర్థుడే. అతడినికూడా శిశుపాలుడు పడతిట్టాడు. కాని, శిశుపాలుడిమరణం శ్రీకృష్ణుడిచేత వ్రాయబడిఉన్నదని తెలిసిన విజ్ఞు డాతడు. అందువలన భీష్ముడు శ్రీకృష్ణుడి మాహాత్మ్యాన్ని కీర్తించటమే కాకుండా, అతడిని శిశుపాలవధోన్ముఖుడిగా పురికొల్పాడు. పూజ గైకొన్న పురుషోత్తముడే తన ఉత్తమత్వాన్ని స్థాపించుకొనవలసివచ్చింది. చేసిన వాగ్దానాన్ని అనుసరించి శ్రీకృష్ణుడు శిశుపాలుడిని చంపవలసివచ్చింది. దానితో యజ్ఞం సమాప్త మైనది. పాండవులకార్యం సఫల మైనది. ఈ ఘట్టంలో 'శ్రీకృష్ణుడు పూజార్హుడా?' అనే అంశంపై జరిగిన వాదోపవాదాలు ఏవిధంగా ఒకదానిపై ఒకటి కార్యకారణసంబద్ధాలై శిశుపాలవధ కార్యానికి దోహదాలైనవో గమనించటమే సంభాషణశిల్పాన్ని సమీక్షించటం.

కథారంభంలో నన్నయ- భీష్ముడు ప్రశాంతు డనీ, ధర్మజుడు ధృతిమంతు డనీ, సత్యధర్మమతి అనీ పరిచయం చేశాడు. ధర్మమతికి ప్రశాంతుడి హితబోధ కలిగింది. అది ధృతిమంత మైన ఉత్సాహంతో ఆచరించబడింది. అత్యంత క్లిష్టపరిస్థితులలోకూడ చలించని ధీశక్తి ధృతి. అది దీప్తిమంతం కావాలంటే బంగారం పుటంపెట్టబడినట్లు కథలో అత్యంత సంఘర్షణానికి గురి అయి సమర్థవంతంగా విజయం సాధించాలి. అంటే- శిశుపాలుడి దుర్వ్యవసాయం ధర్మజుడిధృతిని, ధర్మనియతిని ప్రకాశింపజేసేటట్లు కథలో నిబంధించబడిం దని నన్నయసూచన. పరమశాంతు డైన భీష్ముడు పరతత్త్వప్రతిపాదనసమర్థు డని తాత్పర్యం.

మత్తకోకిల.

"స్నాతకుండును ఋత్విజుండును సద్గురుండును నిష్టుఁడున్
భూతలేశుఁడు సంయుజుండును బూజనీయులు వీరిలోఁ
బ్రీతి నెవ్వఁడు సద్గుణంబులఁ బెద్ద యట్టి మహాత్ము వి
ఖ్యాతుఁ బూజితుఁ జేయు మొక్కనిఁ గౌరవాన్వయవర్ధనా!" (సభా. 2.4)

అని భీష్ముడు ధర్మరాజును ప్రబోధించాడు. ధర్మజుడు యజ్ఞంలో భీష్మద్రోణులను 'కృతాకృత పరిజ్ఞానంబునందు' నియోగించాడు. అందువలన భీష్ముడు కర్తవ్యాన్ని తెలియపరచాడు. ఆ చెప్పటంలో పూజార్హు డైన మహాత్ముడి లక్షణాలు పేర్కొని భీష్ముడు ఆతడి నామనిర్దేశం చేయకుండా ధర్మజుడినిర్ణయానికి వదలివేశాడు. ధర్మజుడు తాతకు దగ్గులు నేర్పగల చతురుడు. నిర్ణయం తానే తీసికొంటే దానికి బాధ్యుడు తానే ఔతాడు. కాబట్టి ఆ పాపపుణ్యాలనుకూడ ఆ తాతపైనే త్రోయనెంచి 'అట్టివా డెవ్వండు? నా కెఱింగింపు' మని భీష్ముడినే అడిగాడు. మనుమ డిచ్చే పెద్దరికానికి అన్నింటా తగిన పితామహు డాతడు. అందువలన నిశ్శంకగా అఖిలలోకపూజ్యు డైన శ్రీకృష్ణుడినే (అచ్యుతుడినే) పూజార్హుడుగా నిర్దేశించాడు. తాను తలచిందే తాత చెప్పాడు. సహదేవుడు అర్ఘ్యపాద్యాది పూజాద్రవ్యాలు తెచ్చాడు. ధర్మరాజు వాసుదేవుడికి పూజ చేశాడు. శ్రీకృష్ణుడు కిమ్మనకుండ పూజలు స్వీకరించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శిశుపాలుడు గోపాలుడికి బద్ధవిరోధి. భీష్ముడిహితబోధ, ధర్మజుడివర్తనం, శ్రీకృష్ణుడిఅంగీకారం ఒక్కొక్కటే అతడి చిత్తాన్ని ఉడు కెక్కించాయి. ఆ పూజకు కర్త ధర్మరాజు. ప్రేరకుడు తాత. ఫలభాక్కు గోవిందుడు. అందువలన శిశుపాలుడు ధర్మరాజును కేంద్రంగా చేసి ఆ ముగ్గురిని అధిక్షేపించాడు. గాంగేయుడి దుర్వ్యవసాయానికి లొంగి కష్టచరితు డైన కృష్ణుడిని పూజించి ధర్మజుడు తన అవివేకాన్ని ప్రకటించా డనీ, 'దాశార్హుడు పూజార్హుడు' కాడనీ అతడిఅభ్యంతరం. వాది యెదుటివారి వాదాన్ని మొదట ఖండిస్తాడు. ఆపైన దానిలోని అసంబద్ధాలైన అంశాలను ఉటంకించి వరుసగా అధిక్షేపిస్తాడు. శిశుపాలుడు అటువంటి వాదకౌశలాన్ని ప్రకటించాడు.

శిశుపాలుడు ధర్మతాత్పర్యాన్ని ప్రతిపాదించే తలంపుతో వాదాన్ని ఆరంభించినప్పటికీ అందులో వ్యక్తిదూషణానికి తావు కల్పించాడు. అది వాదకుశలుడు చేసేపని కాదు. దానికితోడు శిశుపాలుడు తనకు తలకుమించిన ధర్మపన్నాలు చదివి, తన వివేకాన్ని ప్రదర్శించబోయి కొన్నియెడల ఆ వాక్యాలు తనకే తగిలివచ్చేటట్లు మాట్లాడి ఎదుటివారి వాదానికి బలంచేకూర్చే బలహీనతకు గురిఅయ్యాడు.

చ. "కడుకొని ధర్మతత్త్వ మెఱుఁగంగ నశక్యము; ధర్మబాహ్యు ని
న్నొడఁబడ నిష్టుఁడై కఱపి యుత్తము లుండఁగ వాసుదేవుఁ డ
న్జడునకుఁ బూజ యిమ్మని విచారవిదూరుఁడు భీష్ముఁ డెంతయున్
వెడఁగుఁదనంబునం బనిచె; వృద్ధులబుద్ధులు సంచలింపవే?". **(సభా. 2.9)**

భీష్ముడు వృద్ధుడే కావచ్చును. అతడిబుద్ధి వార్ధక్యంవలన చలించియే ఉండవచ్చును. కాని, అతడు విచారవిదూరు డని అనటం, అతనిది 'వెడఁగుదన'మని వెక్కిరించటం, అతడు ధర్మబాహ్యు డని నిందించటం, వాసుదేవుడు జడు డని నోటికసి తీర్చికొనటం- శిశుపాలుడివాదబలంకంటె, ఎదుటివాడిని అధిక్షేపించే చిత్తవృత్తిని, వాక్పారుష్యాన్నీ పట్టియిస్తున్నాయి. 'కడుకొని ధర్మతత్త్వ మెఱుఁగంగ నశక్య' మనే సత్యాన్ని చెప్పిన శిశుపాలుడు మత్సరగ్రస్తుడు కావటం విచారం. తా నన్నమాట తగిలివస్తున్న దన్న వివేకం లే దతనికి. సద్ధర్మాన్ని చూచి అధర్మ మని శంకించే అజ్ఞానినోట సాభిప్రాయంగా ఆ మాటను అనిపించటం నన్నయ చేసిన చమత్కారం. ధర్మరా జున్న సభలో ధర్మస్థాపనం చేయాలని అతడి ప్రయత్నం! అది అనధికారిచేత పడి హాస్యాస్పద మౌతున్నదని కవి సాధించిన వ్యంగ్యం!

ఈవిధంగా నోటికసి తీర్చికొని, శిశుపాలుడు పూజార్హు డైనవాడి కుండదగిన వని భీష్ముడు నిర్దేశించిన గుణగణాలు శ్రీకృష్ణుడియందు లేవని వరుసగా ఖండించటం ప్రారంభించాడు. పై మత్తకోకిలలోని గుణాలన్నింటిలో పాండవులు సమర్థించుకొనటానికి బాగా సులభమైనది- శ్రీకృష్ణుడు వారికి ఇష్టుడై ఉండటం. ఇష్టుడైనంతమాత్రాన సభలో అర్హులైనవా రుండగా అతడికి పూజచేయటం పాడి కాదని శిశుపాలుడు మొదట వాదించాడు.

చ. "ఇతనికిఁ గూర్తు రేని ధన మిత్తు రభీష్టము లైన కార్యముల్
మతి నొనరింతు రిష్టుఁ డని మంతురుగాక మహాత్ము లైన భూ
పతులయు విప్రముఖ్యులసభన్ విధిదృష్టవిశిష్టపూజనా
యతికి ననర్హు నర్హుఁ డని యచ్యుతు నర్చితుఁ జేయఁ బాడియే?" **(సభా. 2.10)**

పూజార్హు డైనవాడు ఇష్టుడై ఉన్నా, తగిన అర్హతలుకూడా కలవాడై ఉండాలని ఈ పద్యంలో శిశుపాలుడు నిష్కర్షించాడు. ఆపైన తరువాతి అర్హతలుకూడ ఆ అచ్యుతుడియందు లేవని వరుసగా ఖండించాడు. వసుదేవాదు లుండగా కృష్ణుడు వృద్ధు డెట్లా ఔతాడు? వ్యాసు డుండగా అతడు ఋత్విజు డనీ, ద్రోణకృపాదు లుండగా ఆతడు ఆచార్యుడనీ, భూనాథు లనేకులు ఉండగా యాదవు డైన ఆతడు రాజనీ ఎట్లా పూజించటానికి అర్హుడైనా డని ప్రశ్నించాడు. ఆవిధంగా నిండుసభలో అనర్హుడిని పూజించటం ధర్మజుడి గౌరవానికీ, భూమీశుల విశ్వాసానికీ గొడ్డలిపెట్టని వర్ణించాడు. ధర్మజుడు శ్రీకృష్ణుడిని పూజించి సభికు లైన ధారుణీశ్వరులను అవజ్ఞ చేశాడనీ, అది ధర్మవిరుద్ధ మనీ అధిక్షేపించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంతటితో ఆగక ధర్మనందనుడితో-

క. “నీ వెఱుఁగక యిచ్చిన నిది
నా విషయమె యని మనంబునం దలఁపక ల
జ్జావిరహితుఁ డయి యర్ఘ్యము
గోవిందుఁడు గొనియెఁ దనకుఁ గొను టుచితంబే?” (సభా. 2.13)

అని ముకుందుడిని మొగం మొత్తేటట్లు ఎత్తిపొడిచాడు. అంతటితో తనివితీరక-

క. “చనఁ బేడికి దారక్రియ
యును జెవిటికి మధురగీతియును జీకున క
త్యనుపమసురూపదర్శన
మును జేయుటఁ బోలుఁ గృష్ణుఁ బూజించు టిలన్.” (సభా. 2.14)

అని వాక్కండూతిని తీర్చుకొన్నాడు. ధర్మరాజుపేరు నిరర్థకమై నవ్వులపాలైపోయిందని నోటితో నొవ్వబలుకుతూ శిశుపాలుడు సపుత్రబలుడై సభను వీడి బయటికి వెళ్లిపోయాడు.

శిశుపాలుడి అధిక్షేపంవలన కథలో రెండంశాలు ప్రశ్నించబడుతున్నాయి. ఒకటి: శ్రీకృష్ణుడి పరమేశ్వరత్వం. రెండు: పాండవుల ధర్మపరత్వం. మహాభారతంలో ఈ రెండూ పరస్పరపోషకాలు. వీటిలో మొదట నిరూపించబడవలసింది శ్రీకృష్ణుడి పరమేశ్వరత్వం. అప్పుడు రెండోది తనంతట తానే నిరూపిత మౌతుంది. ధర్మరాజు ఈ అంశాన్ని గుర్తించాడు. సదస్యులను ఆహ్వానించిన యజమానిగా తన సభ్యతను ప్రకటిస్తూ శిశుపాలుడివెంట పోయి ధర్మనందనుడు ప్రియవచనాలతో అతడిని అనునయించాడు. సమయోచిత ప్రజ్ఞాప్రదర్శనంలో ధర్మజుడు అందెవేసిన చేయి!

ధర్మజుడు మాట్లాడిన అనునయవాక్యాలు ఎంత మెత్తగా ఉంటాయో అంత వాడిగాకూడా ఉంటాయి. ‘మెత్తనిపులి’ అయిన ధర్మజుడి లక్షణం అది. అన్నిమాటలన్న శిశుపాలుడిమీద మరొకడైతే అగ్గిమీద గుగ్గిలంవలె భగ్గుమనేవాడు. ప్రశాంతు డైన భీష్ముడే ఈ ఘట్టంలో భీషణహుతాశనకీలవలె మండిపడ్డాడు. తాతకన్న మనుమడు ధృతిమంతు డని నన్నయ అందుకే నిర్దేశించాడు. ధర్మరాజుమాటలు సంగ్రహాలు, సారవంతాలు, సార్థకాలు. నారసతుల్యాలు.

క. “భూరిగుణోన్నతు లనఁ దగు
వారికి ధీరులకు ధరణివల్లభులకు వా
క్పారుష్యము చన్నె? మహా
దారుణ మది విషముకంటె దహనముకంటెన్”. (సభా. 2.17)

శిశుపాలుడివాదనలో వాక్పారుష్యాన్ని తొలగిస్తే వాక్యతాత్పర్యం మిగులుతుంది. పారుష్యం భావప్రకటనంలో వ్యక్తిసంస్కారాన్ని తెలుపుతుంది. వాక్యతాత్పర్యం వ్యక్తివివేకాన్ని తెలుపుతుంది. ధర్మజుడు మొదట అతడి సంస్కారాన్ని ఎత్తిచూపించాడు. వాక్పారుష్యం ఉండకూడనివాడికి ఉంటే ఆతడి భూరిగుణౌన్నత్యం, ధీరత్వం, ప్రభుత్వం రాణించవని ధర్మజుడి తాత్పర్యం. అంటే- శిశుపాలుడియందు ఆ మూడు లక్షణాలు వాక్పారుష్యంవలన దూషితా లైనవని వ్యంగ్యమైన ధర్మజుడి అధిక్షేపం. వాక్పారుష్యం విషంకంటెను, దహనంకంటెను మహాదారుణ మైనదని ధర్మజుడి బెదిరింపు. విషంవలన మూర్ఛ కలుగుతుంది. అది మంత్రతంత్రాలవలన నివారించదగింది. దహనం అట్టిది కాదు. మనిషిని బూడిద చేస్తుంది. వాక్పారుష్యం ఈ రెండింటికంటె మహాభయంకర మైనదట! వాక్శక్తి ఎఱిగినవాడు ధర్మజుడు. అందువలననే ఇంత తీవ్రమైన విషయాన్ని, ప్రతిపాదిస్తున్నా పారుష్యం కానుపించ దాతడిపలుకులలో. ఎత్తుకొనటంలోనే ప్రతివాదిదోషాన్ని నిరూపించి, అతడిని అప్రతిభుడిని చేసే వాదకౌశలం ధర్మజుడు ప్రదర్శించాడు. ఆపైన తనయందు దోషం లే దని వాదించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. “ఆదిజుఁ డైన బ్రహ్మయుదయంబున కాస్పద మైనవాఁడు వే
దాది సమస్తవాఙ్మయములందుఁ బ్రశంసితుఁ డైనవాఁడు లో
కాది త్రిలోకపూజ్యుఁ డని యాత్మ నెఱింగి పితామహుండు దా
మోదరుఁ జెప్పెఁ బూజ్యుఁ డని; యుక్తమ కా కిది యేమి దోసమే!” (సభా. 2.18)

ఆదిదేవు డైన బ్రహ్మకు ఆదియై, ఆదివాఙ్మయ మైన వేదానికి ఆదియై, లోకత్రయసృష్టికి మూలమైనవాడు దామోదరు డని పితామహుడు చెప్పాడట! ‘పితామహ’ శబ్దప్రయోగంలో ఈ పద్యప్రాణం ఉన్నది. దానికి బ్రహ్మ అనీ, భీష్మ డనీ అర్థాలు చెప్పవచ్చును. భీష్మార్థం ప్రకృతం. బ్రహ్మ అనే అర్థం అప్రకృతం, వ్యంగ్యం. బ్రహ్మ చెప్పినదే తాత చెప్పాడని చమత్కారం. పూర్వప్రసిద్ధ సిద్ధాంతాలను ప్రమాణంగా చూపించి వాదానికి బలం కల్పించుకొనే నేర్పు ఈ ధర్మరాజువాక్కులలో ధ్వనించబడుతున్నది.

క. “పరమార్థప్రతిభఁ దమో
హరు నచ్యుతు భీష్ముఁ డెఱిఁగిన ట్లెఱుఁగఁగ నీ
కరిది శిశుపాల! పెద్దల
చరితం బల్పులకు నెఱుఁగ శక్యమె యెందున్?” (సభా. 2.19)

అచ్యుతుడి తత్త్వాన్ని నిరూపించటానికి పరమార్థప్రతిభ కావాలనీ, అది భీష్మడి కున్నట్లుగా శిశుపాలుడికి లేదనీ చెప్పి ప్రతివాది అజ్ఞానాన్ని ధర్మజుడు బయటపెట్టటమే కాక- “పెద్దలచరితం బల్పులకు నెఱుఁగ శక్యమె యెందున్!’ అనే అర్థాంతరన్యాసంచేత తన వాక్యార్థాలను సమర్థించుకొన్నాడు. ‘పిన్నలకు’ అని వాడినా సరిపోయేచోట ‘అల్పుల’ కని వాడటం ధర్మరాజువాక్కులోని గూఢ మైన తీక్ష్ణత.

ఇప్పటికి ధర్మజుడు శిశుపాలుడిదోషాన్నీ, శ్రీకృష్ణుడిపూజార్హతనూ, భీష్మడిపరమార్థప్రతిభనూ వరుసగా నిరూపించాడు. పూజనీయు లైన పురుషులు సభలో ఉండగా శ్రీకృష్ణ డేవిధంగా పూజ్యుడైనా? డని శిశుపాలుడు చేసిన వితండవాదానికి కీలెరిగి వాతపెట్టినట్లు సమాధానం చెప్పాడు.

క. “గురుఁ డని సమస్తలోకో
త్తరుఁ డని నీకంటె వృద్ధతము లైన నరే
శ్వరు లచ్యుతు నర్చననెడఁ
గర మభినందింప నీకుఁ గాదనఁ దగునే?” (సభా. 2.20)

పూజార్హు లని శిశుపాలుడు చెప్పినవారే అచ్యుతుడిని పూజార్హు డని అభినందించగా, కా దనిన శిశుపాలుడివాదంలోకంటె వ్యక్తిస్వభావంలోనే దోషం ఉన్నదని ధర్మజుడు ఈ వాక్యంవలన నిరూపించాడు. అది తరువాతి భీష్మడివాక్యాలకున్నూ, శిశుపాలుడి వధకున్నూ పోషకమై ఉండటం సంభాషణక్రమవిన్యాసశిల్పానికి చక్కని ఉదాహరణం.

ధర్మజుడు ఈ పద్యచతుష్టయంలో ప్రతిపాదించిన అంశాలు శిశుపాలుడివాదాన్ని నిర్వీర్యంచేశాయి; శిశుపాలుడిని ఒక అవివేకిగా నిరూపించాయి. ధర్మజుడిపాత్ర ఈ ఘట్టంలో నిర్వహించవలసిన పని అయిపోయింది. ఇక ఆ పాత్ర ఈ విషయమై మాటలాడితే చర్వితచర్వణ మౌతుంది. ధర్మజుడివాక్కులలో గూఢమైన వాడిమి ఉన్నది. అది ప్రజ్వలనప్రక్రియకు తోడుపడదు. సన్నివేశంలో సంఘర్షణ సృష్టించబడాలి. యజమానివాక్కులు అనునయాత్మకాలు కావటంచేత ప్రతినాయకుడిలో కోపాగ్నిని ప్రజ్వలింపజేయవు. అందువలన కథలో భీష్మడు ఉద్రేకంతో శిశుపాలుడికి ఉడు కెక్కించేమాట లన్నట్లు చిత్రించబడినాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీష్ముడు ధర్మరాజుతో అనిన మాట లివి-

ఉ. "పాలితదుర్ణయుండు శిశుపాలుఁడు బాలుఁడు; వీని నేల భూ
పాలక! నీకుఁ బట్టువఱుపన్? మఱి ధర్ము వెఱుంగ వీనికిం
బోలునె రాగకోపపరిభూతమనస్కున కల్పరాజ్యల
క్ష్మీలలనాంధబుద్ధి కనిమిత్తమహత్పరివాదశీలికిన్." (సభా. 2.22)

ఎదుటివాడు తూలనాడినప్పుడు ఓరిమితో పరువం చెడకుండ ప్రవర్తించే నిగ్రహం ధర్మజుడి కున్నంతగా భీష్ముడికి లేదు. అందువలననే భారతంలో తాతకన్న మనుమనికి గౌరవం. భీష్ముడు ఉపాలంభనంతో మొదలు పెట్టాడు సంభాషణను. శిశుపాలుడు తననుగురించి అన్నమాటలకు ఆ వృద్ధసింహం క్రుద్ధమై నెమరువేసికొంటూ ఎదురుదెబ్బ తీయటానికి యత్నించింది. శిశుపాలుడిలో మొదట విమర్శించతగింది అవినయం. దానివలన పెద్దలను దూషించే వాక్పారుష్య మేర్పడింది. తరువాతివి అజ్ఞానం, అప్రౌఢత్వం. వాటివలన అతడు ధర్మాధర్మవివేచనం లేని మాటలు వ్యక్తిదూషణ ప్రధానంగా మాటలాడాడు. ధర్మరాజు అతడిని బ్రతిమిలాడవలసిన అవసరం లేదనటంలో శిశుపాలుడి అయోగ్యత నిరూపించబడింది. ఈ మాటలన్నీ ఒక యెత్తు! 'కడుకొని ధర్మతత్త్వ మెఱుఁగంగ నశక్యము' అనే అధిక్షేపానికి ఈ వాక్యం ప్రత్యాఖ్యానం. అతడి గూఢామర్షకు తార్కాణం. ధర్మనిర్ణయవేత్త అయినవాడి కుండకూడని మూడుగుణాలు శిశుపాలుడిలో ఉన్నాయని భీష్ముడు అధిక్షేపించాడు. అవి:- 1. రాగకోపదూషిత మైన మనస్సు కలిగిఉండటం. 2. రాజ్యసంపదవలని మదంచేత వివేకాన్ని కోల్పోవటం. 3. నిష్కారణవాదబుద్ధి. తుల్యపరిశీలనంవలన పఠితకు ఈ అవలక్షణాలు ధర్మజుడిలో లేకపోవటంచేత అతడిఉత్తమత్వం ద్యోతమానం అవుతున్నది.

భీష్ముడు ధర్మరాజును వారించి శిశుపాలుడితో ముఖాముఖి వాదానికి దిగాడు. అతడివాద మంతా శ్రీకృష్ణుడి పూజార్హతను నిరూపించటానికి వెచ్చించబడింది. వాదాంశ విశ్లేషణంలోనూ, విశ్లిష్టాంశవివరణంలోనూ, తాత్పర్యాంశ ప్రతిష్ఠాపనంలోనూ భీష్ముడు కడు శ్రద్ధవహించాడు. 'వృద్ధుల బుద్ధులు సంచలింపవే' అనిన శిశుపాలుడితో సుసంగత మైన తాత్పర్యాలు గల వాక్యాలను మాట్లాడి తన సుస్థిరవివేకచిత్తాన్ని సభకు వ్యక్తం చేసికొన్నాడు.

సభలో శ్రీకృష్ణుడి పూజార్హతను ప్రతిపాదించినవాడు భీష్ముడు కావటంచేత అతడే దానిని సమర్థిస్తూ మాటలాడటం సమంజసంగా ఉన్నది. దానికి శిశుపాలుడు ఒడబడేటట్లు లేడు. ధర్మజుడి నయవాక్యాలవెంట వెలువడిన భీష్ముడి వివేకవాక్యాలుకూడా విఫలాలైతే ఇక కార్యం ఎట్లా సఫలమయ్యేటట్లు? కోపం వచ్చి కొలువు వీడిపోయే కొరకరానికొయ్యపై కఱకుమాటలూ, చేష్టలూ పనిచేస్తాయని భావించి సహదేవుడు సంక్షుభితసభ స్తంభించేటట్లు భీషణప్రతిజ్ఞ చేశాడు.

చ. "ఎడపక యర్ఘ్య మచ్యుతున కిచ్చితి; మిచ్చిన దీనికిం దొడం
బడమని దుర్జనత్వమునఁ బల్కెడు వీరుల మస్తకంబుపై
నిడియెద నంచు దాఁ జరణ మెత్తె సభన్ సహదేవుఁ డట్టిచో
నుడిగి సభాసదుల్ వలుకకుండిరి తద్దయు భీతచిత్తులై" (సభా. 2.30)

ఇది సహదేవుడి సమయోచిత ప్రజ్ఞాప్రదర్శనం. దీనికి దేవతలు పూలవాన కురిపించారు. సభికులు విస్మయభావావిష్టులైనారు. నారదు డానందంతో చిందులు త్రొక్కాడు.

కథ కిది ఒక విశ్రాంతిస్థానం. నాయకపక్షాన ఆరంభ, ప్రయత్నావస్థలు స్ఫురించాయి. బీజబిందువు లనే అర్థప్రకృతులు సార్థకంగా ప్రయుక్తా లైనవి. ప్రతిముఖసంధి ప్రత్యక్షమై ఉన్న ఈ కథాఘట్టంలో ముఖసంధిలోని బీజార్థాలు విచ్ఛిన్నమయ్యేటంతటి సంఘర్షణ సృష్టించబడాలి. గర్భ అవమర్శసంధులు వ్యాయోగంలో ప్రత్యక్షం కాకపోయినా వాటి ప్రభావం ప్రదర్శితం కావచ్చున్నారు. అందువలననే అంతటి సహదేవప్రతిజ్ఞను ధిక్కరించి శిశుపాలుడి సేనాపతి అయిన సునీథుడు విజృంభించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రళయజలధివలె పరవాహిను లుప్పొంగివచ్చాయి. క్రియాబహుళమైన ఈ సన్నివేశాన్ని నన్నయ రసోదంచితమైనఛందోవిన్యాసంచేత వ్యంగ్యరమణీయం చేశాడు.

చ. “రయవిచలత్తురంగమతరంగములన్ మదనాగనక్రసం
చయముల సంచలచ్చటులసైనికమత్స్యములన్ భయంకరం
బయి యదు వృష్ణి భోజ కుకురాంధక వాహినియుం గలంగె ని
ర్దయతరరోషమారుతనితాంతసమీరిత మై క్షణంబునన్”. **(సభా. 2.33)**

ఇందులోని శ్లేష సన్నివేశంలోని సంశ్లిష్టతను, రూపకాలంకారం రూపకరసప్రక్రియను వ్యంజింపజేస్తున్నాయి.

ఆ సైన్య సంక్షోభాన్ని చూచి ధర్మజుడు భయసంభ్రమాక్రాంత మనస్కుడై తాతతో ఇట్లని విన్నవించుకొన్నాడు.

తరలము.

“ధరణిలోఁ గల రాజు లెల్లను దారుణక్షయకాలసా
గరము లట్లు గలంగి రిప్డు; మఖప్రయోగము విఘ్నముం
బొరయకుండఁ బ్రజాపకారము పుట్టకుండఁగ నీవు చె
చ్చెరఁ బితామహ! వీరి కిచ్చటఁ జిత్తశాంతి యొనర్పవే!” **(సభా. 2.35)**

నన్నయ కథాకథనంలో ప్రయోగించిన రూపకాలంకారాన్నీ, ధర్మరాజపాత్రముఖాన ఉపమాలంకారాన్నీ నిబంధించి నాటకీయసంభాణశిల్పాన్ని పోషించాడు. పై వర్ణనాత్మక పద్యాన్ని వీడి ధర్మజుడి పద్య మొక్కటి చదువుకొన్నా కథాప్రభావం చెడకుండ రక్షించటం ఈ రచనలోని శిల్పం! తాత చెప్పిన సలహాను పాటించటంవలన ధర్మరాజుకు శత్రువ్రాతాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది. వారిని ఉపశాంతింపజేసే బాధ్యత మరల ఆ తాతపై ఉంచటం ఆ మనుమని లౌకికప్రజ్ఞావిశేషం. కథ భీష్ముడిసంభాషణలతో ముందుకు సాగుతుం దని సూచన. రంగంమీద ప్రదర్శనకు అసాధ్య మైన యుద్ధక్రీడకు బదులు వాగ్వివాదం ప్రవేశపెట్టే అవకాశం ఆ ధర్మరాజువాక్యంవలన కథలో సిద్ధిస్తున్నది.

భీష్ముడు తనబాధ్యత నిపుణంగా శ్రీకృష్ణుడిమీద ఉంచాడు-

క. “నీ యజ్ఞమునకు విఘ్నము
సేయఁగ నోపుదురె యొరులు జితదైత్యుఁడు నా
రాయణుఁడు యజ్ఞపురుషుఁ డ
జేయపరాక్రముఁడు దీనిఁ జేకొని కావన్” **(సభా. 2.37)**

అనటంలో కథ ఒక క్రొత్తమలుపు తిరిగింది. సవనప్రయోగ భంగభీతి కలిగిన నాయకుడికి శ్రీకృష్ణుడి అండ చూపి భీష్ముడు ప్రాప్త్యాశ అనే అవస్థను కల్పించాడు. శ్రీకృష్ణుడే యజ్ఞరక్షకు డనేసరికి శిశుపాలుడికి మహామర్షం పొడుచుకొని వచ్చింది. శ్రీకృష్ణుడి పరాక్రమాలన్నిటినీ విపరీతార్థాలతో అధిక్షేపిస్తూ నిష్ఠురాలకు దిగాడు శిశుపాలుడు. స్త్రీగోవధపాపాలను ఆ గోవిందుడికి అంటగట్టి నిండుసభలో అతడిని గర్హించాడు. ఆపైన భీష్ముడి దుర్వ్యవసాయాన్ని దృష్టాంతరూపంగా చెప్పి దుయ్యబట్టటానికి వృద్ధహంసోపాఖ్యానం చెప్పాడు. నన్నయ శిశుపాలుడు ‘రూక్షాక్షరవచనంబుల’ నాక్షేపించాడని వర్ణించి సంభాషణస్వభావాన్ని ధ్వనింపచేశాడు.

గురునింద చేస్తున్న శిశుపాలుడివాక్కులు భీముడికి భీషణరౌద్రోద్రేకాన్ని కలిగించాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. "ప్రకటితకోపవేగమునఁ బద్మదళాయతనేత్రముల్ భయా
నకతరలీలఁ దాల్చె నరుణద్యుతి నుద్యతమై త్రిశాఖ మై
భ్రుకుటి లలాటదేశమునఁ బొల్చెఁ ద్రికూటతటిత్రిమార్గగా
నుకృతిఁ బ్రభంజనప్రియతనూజున కంతకమూర్తి కచ్చటన్". (సభా. 2.51)

భీముడు శిశుపాల నిర్మూలనాభిలసంరంభంతో ముందుకు ఉరికాడు. భీష్ముడు అతడిని వారించి, శిశుపాలుడివృత్తాంత మంతా చెప్పి, అతడు శ్రీకృష్ణుడివలనతప్ప, ఇతరులచేత అసాధ్యు డనే సత్యం తేటపడేటట్లు చేశాడు. అట్లా కాకపోతే-

చ. "ఇతనికి నిట్లు న న్నుఱక యెగ్గులు వల్కఁగఁ బోలెఁగాక! యు
ద్ధతిమతి నన్యు లీతనివిధంబునఁ బల్కి మదీయచాపని
ర్గతచటులోగ్రమార్గణనికాయపయోధి మునుంగ కిట్లు ద
ర్పితు లయి పోవనేర్తురె? గభీరపరాక్రమ! మారుతాత్మజా!" (సభా. 2.61)

అని అనునయించి మనుమడిక్రోధోద్రేకాన్ని మాన్పాడు.

కథలో శ్రీకృష్ణుడే శిశుపాలుడిని వధించగలిగినవాడనే తాత్పర్యం ఈ సంభాషణలచేత స్థిరీకరించి నాటకీయతను పోషించటంతోపాటు కథలో నిర్వహణ సంధిని సూచించాడు నన్నయ. వృద్ధహంసోపాఖ్యానాన్ని, శిశుపాలవృత్తాంతాన్ని పాత్రసంభాషణలలో నిబంధించటం రూపకమర్యాద!

శిశుపాలుడు శ్రీకృష్ణుడిని యుద్ధానికి ఆహ్వానించటంకంటె మరొక గత్యంతరం లేనిస్థితిలో పడ్డాడు. అతడి యుద్ధాహ్వానాన్ని మన్నించిన శ్రీకృష్ణుడు అతడి వధార్హతను నిరూపించే దుశ్చేష్టితాలను ఏకరువు పెట్టాడు. సహనానికీ, సమయపాలనానికీ సమయం తీరిందని సూచించాడు. శిశుపాలుడు శ్రీకృష్ణుడి మనసును మండించేమాట లన్నాడు-

"నీ కూర్మియు నీ యలుకయు
నా కవి యేమిటికి దుర్గుణప్రియ! మొదలన్
నా కిచ్చిన యక్కన్యకఁ
జేకొని నీ కిట్లు వలుక సిగ్గును లేదే?" (సభా. 2.67)

అర్హతానర్హతల చర్చతో ఆరంభమైన వాదులాట అంతఃపురచరిత్రలను తడవుకొనేంతవరకు ముదరజొచ్చింది. చక్రధారి ఇక శిశుపాలుడికథకు చక్రం అడ్డంవేశాడు. శిశుపాలుడిమొండెం నేల కొరిగింది. తేజం విశ్వాత్ము డైన శ్రీకృష్ణుడిలో లీనమైపోయింది. రూపకతుల్య మైన ఈ సన్నివేశం నిర్వహణంలో అద్భుతంగా ముగిసింది.

నన్నయ ఈ ఘట్టంలో యజ్ఞవిధానాన్ని పేర్కొంటూ ప్రయోగశబ్దాన్ని వాడటం గమనించ తగింది.

"మఖప్రయోగము విఘ్నముం బొరయకుండన్" (సభా. 2-35)

"జగన్నాథరక్షితంబయి రాజసూయమహాధ్వరంబు సమాప్తప్రయోగం బయిన" (సభా. 2-72)

ఈ ప్రయోగంవెనుక నాందినుండి నిర్వహణంవరకు సాంగంగా నిర్వహించిన తన రూపకప్రయోగ సంవిధానాన్ని నన్నయ వ్యంగ్యంగా సూచించా డనటం కావ్యశిల్పాంశం! నన్నయనాటకీయశిల్పప్రపంచంలో ఇది ఒక కళారేఖ!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కుమారాస్త్రవిద్యాప్రదర్శనం: బహిరంగవ్యాయోగప్రదర్శనం

రూపకప్రయోగం నాట్యమంటపంలోనూ, బహిరంగ మంటపంలోనూ ప్రదర్శించబడటం ప్రాచీనకాలంలో పరిపాటిగా ఉండేది. ఆ సంప్రదాయాన్ని అనుసరించి నన్నయ శిశుపాలవధ సభామంటపంలో జరిగిన వ్యాయోగంగానూ, కుమారాస్త్ర విద్యాసందర్శనం బహిరంగప్రదేశంలో ప్రయోగించబడిన వ్యాయోగంగానూ రూపొందించి తన రచనలోని నాటకీయతలో వైవిధ్యం ప్రదర్శించాడు. ఈ ఘట్టం ఆదిపర్వ షష్ఠాశ్వాసంలో 60 పద్యగద్యాలలో వ్యాపించిఉన్నది. (ఆది.6. 2-61)

పాండవధార్తరాష్ట్రకుమారులు శస్త్రాస్త్రవిద్యలలో ఆరితేరారు. వారి విద్యానైపుణ్యాన్ని ధృతరాష్ట్రాదులముందు ప్రదర్శించి చూపించటానికి ఒకసభను ఏర్పాటుచేయుమని ద్రోణుడు రాజును కోరాడు. ధృతరాష్ట్రుడు విదురుడిని కుమారాస్త్రవిద్యా ప్రదర్శన సందర్శనలకు అనుకూలమైన ఒక రంగాన్ని సిద్ధం చేయించుమన్నాడు. వెంటనే శాస్త్రోక్తంగా ఒక అపూర్వమైన రంగం సిద్ధమైనది. నన్నయ ఆ రంగాన్ని నాటకీయంగా బహిరంగప్రదర్శనంగా రచనలో వాడుకొని నాటకీయతనుకూడా కలిపి సంయుక్తంగా సాగించాడు. కన్నులపండువుగా ప్రదర్శనసందర్శనరంగాలు అలంకరించబడ్డాయి. ప్రదర్శకులు ప్రదర్శనరంగంమీద కనపడతారు. ప్రేక్షకులు సందర్శనరంగంలో ఉపవిష్టులై ఉంటారు. ప్రదర్శనను చూచిన ప్రేక్షకుల స్పందనలుకూడ నాటకీయంగా వర్ణించబడుతుంటాయి. అది యొక మిశ్రమప్రయోగం.

ప్రదర్శనరంగమధ్యంలో తెల్లనివస్త్రాలతో, ఆభరణాలతో అలంకరించుకొన్నవాడు, తెల్లనిగడ్డాలు మీసాలతో ఒప్పారేవాడు అయిన ద్రోణుడు శిష్యగణంతో వచ్చి నిలిచాడు. రణరంగోచిత వేషాలతో ఆహార్యాభినయం అచ్చుపడేటట్లు ధర్మజాదులు వీరవేషాలలో ఉన్నారు. రంగం నిండుగా రంగురంగుల శృంగారాలంకారాలతో రంజిల్లిపోయింది. ప్రదర్శన ప్రారంభమైనది. కత్తులు, బాణాలు, గుర్రాలు, ఏనుగులు, కుంతకాలు, గదలు మొదలైన వాహన, ఆయుధాలలో తమతమ ప్రజ్ఞలను రాజకుమారులు సామూహికంగా ప్రదర్శించారు. ద్రోణుడు అందరి ప్రదర్శన లైపోయిన తరువాత భీమదుర్యోధనుల గదాయుద్ధాన్ని ప్రదర్శింపజేయించాడు. వా రిద్దరూ మదగజాలవలె గదాయుద్ధం సాగించారు. చూచేవారిలో భీమదుర్యోధనుల అభిమాను లేర్పడ్డారు. వారుకూడా తమ తమ అభిమానవీరులు గెలవాలని కేకలు వేయటం పరుషంగా పరస్పరం మాట్లాడుకొనటం మొదలుపెట్టారు. రంగభంగ మయ్యే పరిస్థితి ఏర్పడింది. ద్రోణుడు అశ్వత్థామను పంపి భీమదుర్యోధనుల బలప్రదర్శనను ఆపించాడు. దానిని నన్నయ ఇట్లా వర్ణించాడు.

మ. “అవనీచక్రము పాదఘాతహతి నల్లాడంగ నత్యుగ్ర భై
రవహుంకారరవంబునన్ వియదగారం బెల్ల భేదిల్లఁ బాం
డవకౌరవ్యగదావిఘట్టన మకాండప్రోత్థమై భావిపాం
డవకౌరవ్యరణాభిసూచనపటిష్ఠంబయ్యె ఘోరాకృతిన్”. **(ఆది. 6.14)**

ఇది నన్నయ తీర్చిదిద్ద దలచుకొన్న వ్యాయోగానికి చూళిక.

అసలురంగం మొదలుకావటానికి ముందు ఇంతవరకు పూర్వరంగం ప్రవర్తిల్లింది. ఆచార్యుడు సూత్రధారుడు. మిగిలిన రాజకుమారులందరి ప్రదర్శన ప్రస్తావన. భీమ దుర్యోధనుల గదాయుద్ధం విష్కంభం. అందులో వారి పోరు కురుక్షేత్రయుద్ధాన్ని సూచించింది. ప్రజలుకూడా పాండవ కౌరవపక్షవర్తులై పరస్పరక్రోధవచనాలకు దిగారు. అటువంటి సంకుల సంక్షుభితవాతావరణం ఈ బహిరంగ ప్రయోగంగా సాగబోయే అర్జునుడి శస్త్రాస్త్రప్రయోగరంగ మనే వ్యాయోగానికి భిత్తికవలె చిత్రించి నన్నయ ఒక మహానాటకకర్తలక్షణాన్ని వెలార్చాడు.

ద్రోణుడు 'నా ప్రియశిష్యుడైన అర్జునుడి ధనుఃకౌశలాన్ని చూడండి' అని ప్రకటించాడు. రంగంమీద ఏకైకవీరుడు అర్జునుడు నిలబడ్డాడు. అప్పటికి భీముడికి దుర్యోధనుడు ఎదురున్నాడు. కాని, అర్జునుడికి సాటివీరుడు లేడని గురువు సూచించాడు. అతడి శస్త్రాస్త్ర ప్రదర్శన గురువుగారి గొప్పతనానికి కీర్తికిరీటంవలె నిలుస్తుంది. అదే కథావస్తువైతే అందులో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నాటకీయత లేదు. ప్రతివీరుడు లేడని ప్రకటించిన పార్థుడికి ప్రతివీరుడు రంగంమీదకు రావటం, అతడిని పాండవవర్గంవారు ప్రతివీరుడు కా డని అధిక్షేపించటం, దుర్యోధనవర్గంవారు అతడిని ప్రతివీరుడిగా రంగంమీద ప్రతిష్ఠాపించటం ఈ రంగంలోని ఉద్వేగకరమైన వస్తువు. ఒక అంకంవలె సాగే ఈ ఘట్టంలో పాత్రలు పరుషవాక్యాలతో పరాక్రమప్రదర్శనకు పూనుకొని వాక్క్రియారూపసంఘర్షణను సృష్టించారు కాబట్టి దీనిని వ్యాయోగంగా పరిగణించ వీలున్నది. నన్నయ దీని కా రూపకశిల్ప వైభవాన్ని సంతరించి కృతకృత్యు డైనాడు.

ఉదాహరణకు కొన్ని నాటకీయాంశాలు గమనించదగినవి.

1. నాయకప్రతినాయకస్థానీయులుగా ఆ రంగంలో నిలిచినవారు అర్జునకర్ణులు. వారి వీరాకృతులను వర్ణించి వీరవిభావ విస్ఫూర్తిని రంగసుందరంగా వెలార్చాడు నన్నయ. అర్జునుడు రంగంమీదకు రాగానే ఇట్లా కనపడ్డాడు-

ఉ. "హారివిచిత్రహేమకవచావృతుఁ, డున్నతచాపచారుదీ
ర్ఘోరుభుజుండు, భాస్వదసితోత్పలవర్ణుఁడు, సేంద్రచాపశం
పారుచిమేఘమో యనఁగఁ బాండవమధ్యముఁ డొప్పి బద్ధతూ
ణీరుఁడు రంగమధ్యమున నిల్చె జనంబులు దన్నుఁ జూడఁగన్". **(ఆది. 6.17)**

ఇంద్రధనుస్సుతో ఇంపుగా సొంపారే నల్లనిమేఘమో అన్నట్లు అందరిచూపులను ఆకట్టుకొన్న అందమైన వీరరసమూర్తి అర్జునుడు. అడ్డులేని చాపవీరుడుగా వెలిగిపోతున్న అర్జునుడిపై సవాలు విసురుతూ పిడుగువంటి శబ్దం పుట్టేటట్లు భుజాస్ఫాలనంచేసి రంగద్వారం వద్ద- అందరూ తనవైపు ఆశ్చర్యంతో చూచేటట్లు- నిలిచాడు కర్ణుడు.

శా. "సాలప్రాంశు నిజోజ్జ్వలత్కవచు శశ్వత్కుండలోద్భాసితున్
బాలార్కప్రతిమున్ శరాసనధరున్ బద్ధోగ్రనిస్త్రింశు శౌ
ర్యాలంకారు సువర్ణవర్ణు ఘనుఁ గర్ణాఖ్యున్ జగత్కర్ణపూ
ర్ణాలోలద్గుణుఁ జూచి చూపఱు ప్రభూతాశ్చర్యులై రచ్చటన్.". **(ఆది. 6.31)**

నల్లకలువ వన్నెవాడు అర్జునుడు. అందువలననే మేఘంవలె మనోహరంగా ఉన్నాడు. అతనికి కోదండం అద్భుత విశేషం. కవచం ఒక వైచిత్రి. భుజబలం ఒక అలంకారం. బంగారు మేనిచాయవాడు కర్ణుడు. అందువలననే సూర్యబింబంవలె ప్రకాశమానంగా ఉన్నాడు. అతడి కవచకుండలాలే అద్భుతవిశేషాలు. నిస్త్రింశం ఒక వైచిత్రి. శౌర్యం ఒక అలంకారం. అర్జునుడు ఆహ్లాదాన్ని కలిగించాడు; కర్ణుడు ఆశ్చర్యం కలిగించాడు. అర్జునుడిఆకృతిలో అగ్రగణ్యం కోదండం. కర్ణుడిఆకృతిలో కవచకుండలాలు. ఒకడు పరాక్రమానికీ మరొకడు శౌర్యానికీ ప్రతీకలు. ఈ తారతమ్యాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే కర్ణుడికంటె అర్జును డధికుడని వస్తుధ్వని. శ్రవ్యకావ్యమర్యాద రంగమధ్యంలో దృశ్యకావ్యమర్యాదగా ఆకృతులు పొంది నిలిచినట్లు సాగింది.

2. కర్ణుడు రంగప్రవేశం చేసి అర్జునుడు ప్రదర్శించిన విద్యలన్నీ ప్రదర్శించి చూపటంతో కౌరవపక్షానికి ఒక ఆశాకిరణం ఆవిర్భవించింది. దుర్యోధనుడు కర్ణుడిని చేరదీసి, స్నేహం కలిపి, తనచేత కురురాజ్యం ఏలించు మని రంగమధ్యంలోనే కోరాడు; అర్జునుడితో పోటీపెట్టి ద్వంద్వయుద్ధం చేయించాడు. కృపాచార్యుడు కర్ణుడిని కులగోత్రాలను చెప్పమని అధిక్షేపించగా కర్ణుడు తలవంచి నిలబడినప్పుడు దుర్యోధను డతనికి రంగమధ్యంలోనే అంగరాజ్య పట్టాభిషేకం చేశాడు. దానికి ప్రత్యుపకారంగా కర్ణుడి స్నేహాన్ని వాగ్దత్తంగా తీసికొన్నాడు. కర్ణుడు సూతపుత్రు డని తెలియగానే భీముడు అధిక్షేపించాడు. కర్ణుడు మహాపురుషు డై ఉంటా డని వాదించి దుర్యోధనుడు కర్ణసహాయుడై ఇంటికిపోయాడు. ఈ అంకంలో చర్య లెన్ని ఉన్నాయో సంభాషణ లన్ని ఉన్నాయి. అందువలన కథనంతోపాటు నాటకీయతకూడా సమంగా రాణించింది.

3. "నీవ కడు నేర్పుకాడవు గావలవదు"- (ఆది. 6.33) అనే పద్యం కర్ణుడి పౌరుషోక్తికి, "పిలువంగఁబడక సభలకు బలిమిం జని పలుకు పాపభాగుల లోకంబులకు" (ఆది. 6.36) అనే పద్యం అర్జునుడి పరుషోక్తికి. 'ఘననిశితాస్త్రములఁ బలుకఁ గడఁగుము నాతోన్' "ఈ రంగభూమి" (6.37,38) మొదలైన పద్యాలు కర్ణుడివీరోక్తులకు ప్రసిద్ధోదాహరణాలు. "కురుకులజుండు పాండునకుఁ గుంతికిఁ బుత్త్రుఁడు"........ "ధారయగుదేని నీకెదిరి దోర్బలశక్తి నితండు సూపెడిన్" (6.45) అనే పద్యంలో కృపాచార్యుడి అధిక్షేపోక్తులు, "కులము గలవాఁడు...." "రాజవరుఁడైన పార్థుతో....." (6.47,48) మొదలైన పద్యాలలో దుర్యోధనుడి అభిమానోక్తులు, "నీదు కులమునకుఁ దగఁగఁ....." "ఉత్తమక్షత్త్రియప్రవరోపయోగ్యమైన...." (6.55.57) అనే పద్యాలలో భీముడి నిందోక్తులు, "అనిలజ! నీ కిట్లని పల్కను దలఁపను...." "శూరులజన్మంబు....." (6.59,60) అనే పద్యాలలో దుర్యోధనుని అధిక్షేపోక్తులు ఈ ఘట్టంలో వాగ్యుద్ధవాతావరణాన్ని కలిగించి వ్యాయోగస్వభావాన్ని పోషించాయి. వీరరౌద్రరసముద్రితమైన ఈ రంగం దీప్తసత్వానికి ఆలవాలమై సహృదయరంజకంగా సాగింది.

4. ఈ రంగాన్ని ప్రదర్శనసందర్శనరంగంగా నన్నయ తీర్చిదిద్దటంతో- రంగంమీద నిలిచి మాటలతో చేతలతో అభినయించేవారిని ఎంత శ్రద్ధగా చిత్రించాడో, వారిని చూచి స్పందించిన ప్రేక్షకలోకాన్నికూడా అంత శ్రద్ధగా చూపించాడు.

ఉదాహరణకు-

(1) "నరు, నింద్రాత్మజు నింద్రావరజసఖున్ వీరుఁ బాండవప్రవరు, ధనుర్ధరుఁ జూచి చూపఱెల్లన్ - పరమాద్భుత చిత్తులగుచు" అర్జునుడిని ప్రశంసించారట (ఆది. 6. 18).

(2) ప్రజల ప్రశంసలు విని కుంతి ఉప్పొంగిపోయి 'అనంతహర్షవిస్తారితలోచన' అయిందట! (6.20)

క. "చారుమనస్సమ్మదరస
పూరము వెలివేర్చునట్లు పాలఁతికి విగళ
ద్భూరిస్తనజనితపయో
ధారలు నానందబాష్పధారలు నొప్పెన్!" **(ఆది. 6.21)**

(3) రంగద్వారం వద్ద కర్ణుడు భుజాస్ఫాలనం చేయగానే పాండవ కౌరవులలో కలిగిన ప్రతిస్పందన రమణీయంగా వర్ణించాడు నన్నయ.

మ. "జను లెల్లం గడు సంభ్రమింపఁగ నజస్రంబై భుజాస్ఫాలన
ధ్వని శైలప్రకరంబుపైఁ బడు మహాదంభోళిశబ్దంబొకో
యన వీతెంచినఁ బాండవుల్ సనిరి ద్రోణాచార్యు డాయన్, సుయో
ధను వేష్టించిరి తమ్ము లందఱును దద్ద్వారంబు వీక్షించుచున్." **(ఆది. 6.29)**

భయసంభ్రమాలు కలిగినప్పుడు తమకు రక్షకు డనీ ఆత్మీయుడనీ ఎవరిని భావిస్తుంటారో వారివద్దకు అప్రయత్నంగా పరుగెత్తటం మానవసహజం. పాండవులు ద్రోణుడిని సమీపించారు. ధార్తరాష్ట్రులు దుర్యోధనుడిచుట్టూ చేరారు. ఈ సన్నివేశంలో బెదరక కుదురుగా నిలిచింది ద్రోణుడు, దుర్యోధనుడు. మిగిలినవారు రెండు పక్షాలుగా చీలి వా రిద్దరినీ ఆశ్రయించారు. పాండవ కౌరవులు ఆవిధంగా చీలిపోవటానికీ, పాండవుల గురుభక్తి, కౌరవుల భ్రాతృభక్తి ప్రకాశంకావటానికీ కర్ణుడు భవిష్యత్కథలో కారకుడు కాగలడనీ ఈ వర్ణనద్వారా వస్తుధ్వనిని సాధించాడు నన్నయ.

(4) కర్ణుడి అధిక్షేపోక్తులు వినగానే జనులకు ఆశ్చర్యం కలిగిందట. అర్జునుడికి కోపం, సిగ్గూ రెండూ మొలుచుకొని వచ్చాయట. దుర్యోధనుడికి ప్రీతి కలిగిందట. ఈవిధంగా సహృదయస్పందనను ప్రదర్శనకళగా నాటకీయతతో చేర్చటం నన్నయ తిక్కనకు చూపించిన వెలుగుబాట.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(5) కర్ణుడు వేసిన పర్జన్యాస్త్రంవలన మేఘాలు క్రమ్మి అర్జును డందులో మరుగుపడి కనపడకపోయినప్పుడు కన్నతల్లి కుంతి మోహమూర్ఛాన్విత అయినదట. ఆమెను చల్లనీళ్ళతో సేదదీర్చవలసివచ్చిందట! (ఆది. 6. 42,43).

(6) కర్ణుడు తన తల్లిదండ్రులపేర్లను చెప్పటానికి సిగ్గుపడి తలవంచాడట(ఆది. 6. 46); దుర్యోధనుడు అతడికి అంగరాజ్యాభిషేకం చేయగా 'పరమహర్షం' ప్రకటించాడట (ఆది. 6. 49); సూతుడు కర్ణుడిని కౌగిలించుకొని మూర్ధాన్ని ఆఘ్రాణించాడట, అభిషేకంతో అసలే తడిసి ఉన్న కొడుకుతలను హర్షాశ్రువులతో మరొకసారి తడిపివేశాడట! (ఆది. 6. 53).

(7) భీముడు కర్ణుడిని అధిక్షేపించినప్పుడు కర్ణుడు "వెల్లనయి యెద్దియుం జేయునది నేరక దీర్ఘోష్ణ నిశ్వాసవ్యాకులితవదనుం డయి యాకాశంబువలన నున్న యాదిత్యుం జూచుచు మిన్నకుండె"నట. (ఆది. 6.63)

(8) ధనుర్విద్యాపారగుడైన కర్ణుడు మిత్రుడు కావటంచేత అర్జునుడివలని భయంపోయి ఆనాటిరాత్రి దుర్యోధనుడు 'ముదితాత్ముడై' నిశ్చింతగా గుండెమీద చేతులుపెట్టుకొని నిద్రించాడట. (ఆది. 6. 63)

విభావానుభావ సాత్త్వికభావవర్ణనంలో నన్నయ తిక్కనకు గురుపీఠమని ఈ ఘట్టంలో నిరూపించుకొన్నాడు. శిశుపాలవధ ఘట్టంవలెనే, కుమారాస్త్రవిద్యాప్రదర్శనంకూడా ఆశ్వాసాదిలో ఉన్నది. అయినా ఆశ్వాసాదిపద్యాన్ని శిశుపాలవధలో నాందిగా నిలిపినట్లు కుమారాస్త్రవిద్యాప్రదర్శనంలో కూర్చలేదు. ఇది ఆదిపర్వంకంటె సభాపర్వంలో నన్నయ సాధించిన నాటకీయశిల్పపరిణతి అనవచ్చును. లేదా బయలురంగంలో ప్రదర్శించే రూపకంకంటె నాటకశాలలో ప్రదర్శించే రూపకప్రయోగంలో నాంది ఉండటం ఔచిత్యమని భావించియుండవచ్చును. ఏమైనా రంగ-బహిరంగ ప్రయోగంగా వ్యాయోగాన్ని శ్రవ్యకావ్యరంగంమీద ప్రదర్శించిచూపిన ఆదికవి నన్నయ అభినందనీయుడు!

వ్యాయోగం: సమవకారం

వాగ్రూపయుద్ధం విస్తారంగా ప్రవర్తిల్లి, తదనుబంధంగా క్రియారూపయుద్ధం సాగినట్లు సూచించే ఘట్టాలలో వ్యాయోగలక్షణాలను ఉపలక్షించవచ్చును. దీనికి విపరీతంగా ఉంటే- అంటే క్రియారూపయుద్ధానికి ఉపస్కారకంగా, ఉపబలకంగా వాగ్రూపయుద్ధంగాని, వాగ్వివాదంగాని ప్రవర్తిల్లినట్లు వర్ణించి యుద్ధాన్ని ఫలంగా నిర్వహించే ఘట్టాలలో 'సమవకార' స్వభావాన్ని ఎక్కువగా సంలక్షించవచ్చును. ఆదిసభారణ్యపర్వాలలో భీముడు రాక్షసులను సంహరించిన ఘట్టాలు ప్రసిద్ధాలు. అతడు హిడింబ, బకాసుర, కిమ్మీర, జటాసురులను ఏకవీరుడై సంహరించాడు. అరిభయంకరుడైన జరాసంధుడిని శ్రీకృష్ణార్జున సహాయంతో స్వయంగా మల్లయుద్ధంలో సంహరించాడు. భీముడు రాక్షసులను చంపిన ఘట్టాలన్నీ ఒకయెత్తు, రాక్షసుడు కాని జరాసంధుడిని చంపిన ఘట్టం ఒక్కటీ మరొక యెత్తు. స్వీయరక్షణార్థం గానీ, జనరక్షణార్థం గానీ భీముడు రాక్షససంహారం చేశాడు. రాజసూయయాగం నిరంతరాయంగా సాగటానికీ, అతడిచేత బంధితులైన సమస్త భూపతులను చెర విడిపించి ధర్మాన్ని రక్షించటానికీ, భీముడు జరాసంధుడిని వ్యూహంతో చంపాడు.

సమవకారంలో దేవతలకు, అసురులకు సంబంధించిన ఫలాన్ని సాధించే ఉపాయం బీజంగా ఉంటుంది. అందులో 12మంది నాయకు లుండవచ్చును. వారు ప్రఖ్యాతులూ, ఉదాత్తులూ అయి ఉండాలి. సమవకారంలో మూడు అంకా లుంటాయి. అందులో సందర్భానుకూలంగా మూడురకాల కపటచర్యలూ, మూడురకాల విద్రవాలూ (ఉపద్రవాలూ), మూడురకాల శృంగారాలూ నిబంధించబడవచ్చును. సుఖాన్నీ కానీ దుఃఖాన్ని కానీ కలిగించటానికి చేసే వంచనలు కపటచర్యలు. అవి మూడురకాలుగా ఉంటాయి. 1. వస్తుక్రమ విహితాలైనవి- అంటే కార్యసాధకుడిదోషం లేకపోయినా వంచకులచేత కలిగే మోసం. 2. పరప్రయుక్తం- అంటే కార్యసాధకుడు చేసే అపరాధాన్ని ఆసరాగా చేసికొని వంచకులు చేసే మోసం. 3. దైవవశాగతం- అంటే దైవవశాన కాకతాళీయంగా సంభవించే మోసం. విద్రవం అంటే చెదరిపోవటం. ప్రజలను చెదరిపోయేటట్లు చేసేవి విద్రవాలు. దాన్నే మనం ఇప్పుడు ఉపద్రవాలు అని అంటున్నాం. ఇవి మూడురకాలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

1. అచేతనకృతాలు- నీటివలన కలిగే వానలు, తుఫానులు, వరదలు, ఉప్పెనలు మొ॥నవి. వాయువువలన అగ్నివలన కలిగే అపాయాలు. 2. చేతనకృతాలు- క్రూరవన్యమృగాలవలన కలిగే సంక్షోభాలవంటివి. 3. ఉభయకృతాలు- యుద్ధాలు, నగరాలముట్టడులు, రాక్షసబాధలు మొ॥నవి. శృంగారాలుకూడా ధర్మ, అర్థ, కామసంబంధాలని మూడువిధాలు. వీటిలో వేటినైనా యథావకాశంగా మూడు అంకాలలోనూ ప్రయోగించాలి. రచనలో విశేషవృత్తాలు వాడాలి. మొత్తంమీద సమవకారం నానారసాశ్రయంగా రాణించాలి. నన్నయ భీమనాయక మైన ఘట్టాలలో సమవకారస్వభావాలను సమయోచితంగా రంగరించి తనరచనలో నాటకీయతను పోషించాడు.

జరాసంధవధ: సమగ్రసమవకారం

సమవకారస్వభావాన్ని ఎక్కువగా సంతరించుకొన్న సన్నివేశం సభాపర్వంలోని జరాసంధవధఘట్టం. ధర్మరాజుకోర్కెపై శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థానికి వచ్చి రాజసూయయాగం చేయా లని ప్రోత్సహించి, దానికి ముందుగా జరాసంధుడిని వధించా లని సూచించి, వ్యూహం నిర్ణయించి, దానిప్రకారం కార్యం నిర్వహించి, విడుదలైన రాజుల నందరిని ధర్మజుడికి ఒప్పగించి, తిరిగి ద్వారకకు వెళ్ళిపోయేవరకు గల 124 పద్యగద్యాల భాగం (సభా. 1.101-224) జరాసంధవధఘట్టం. ఇందులో ప్రధాననాయకుడు ధర్మరాజు, అతడిపక్షాన జ్ఞానేచ్ఛాక్రియాశక్తులకు ప్రతినిధులవలె శ్రీకృష్ణార్జునభీములు జరాసంధవధను నిర్వహించారు. అంటే నలుగురు ధీరోదాత్తులు నాయకులుగా ఉండి కార్యాన్ని ముందుకు తీసికొనిపోయి నిర్వహించి ఫలాన్ని అనుభవించేవారుగా గోచరిస్తున్నారు. ఈ కార్యమంతా రాజసూయం చేయటానికి, తద్వారా పాండురాజాదులకు ఉత్తమగతులు కలిగించటానికి, శ్రీకృష్ణాదులకు ఇబ్బందులు కలిగించేవారిని తొలగించటానికి ఉద్దేశించబడింది కాబట్టి పితృదేవతల, అవతారపురుషుడైన శ్రీకృష్ణుడికార్యాలను సాధించటానికి ఉపాయాన్ని వెదకటం బీజంగా సాగింది కాబట్టి సమవకార వస్తుస్వభావం సహజంగా అమరింది. కార్యం సార్థకంగా సాగింది.

జరాసంధవధ ఘట్టాన్ని మూడుభాగాలుగా విభజించవచ్చును. అవి సమవకారంలోని మూడంకాలుగా రాణిస్తున్నాయి. మొదటి అంకంవంటి కథాభాగం- ప. 101-171 వరకున్నది. ఇందులో జరాసంధుడి బలపరాక్రమాలూ, అతడి పుట్టుపూర్వోత్తరాలూ, మిత్రులబలాబలాలూ చెప్పి, అతడిని వధించటంలో కల ఆవశ్యకతను పేర్కొని, అతడిని మల్లయుద్ధంలోమాత్రమే చంపే అవకాశం ఉండటాన్నీ, భీముడిని అతనిపై ప్రయోగించి ఉపాయంతో చంపటాన్నీ నిశ్చయించే కథ యీ భాగంలో చెప్పబడింది. ఇక రెండవ అంకంవంటి కథాభాగం - ప. 172-200 వరకున్నది. ఇందులో శ్రీకృష్ణార్జునభీములు కపటస్నాతకవేషాలతో గిరివ్రజపురం చేరి అపసవ్యంగా వెనుకద్వారంనుండి నగరంలో ప్రవేశించి, బలవంతాన రాజమందిరంలోకి చేరి, జరాసంధుడితో వాదించి, తమ ప్రవర్తనను సమర్థించుకొని, తమ లక్ష్యాలను వివరించి, భీముడితో ద్వంద్వ(మల్ల) యుద్ధానికి జరాసంధుడిని ఆహ్వానించిన ఘట్టం వివరించబడింది. ఆ తరువాత మూడోఅంకంవంటి కథాభాగం- భీమజరాసంధుల మల్లయుద్ధాన్ని వర్ణించే ఘట్టం- ప. 201-224. జరాసంధవధ జరిపించి, చెరలో ఉన్న రాజులను విడిపించి, సహదేవుడికి రాజ్య మిచ్చి, జరాసంధుడి దివ్యరథమెక్కి శ్రీకృష్ణుడు అందరితో కలిసి ఇంద్రప్రస్థానికి వచ్చి, విజయఫలాన్ని ధర్మరాజుకు సమర్పించటం ఇందులో ప్రధాన కథాంశాలు. ఈ మూడు ఘట్టాలలోని మొదటి రెండింటిలో కథాకథనంకంటె సంభాషణశిల్పాన్ని నన్నయ ఎక్కువగా పాటించి నాటకీయతను రక్తికట్టించాడు. మూడవది మల్లయుద్ధవర్ణనం కావటంచేత కథాకథనపద్ధతిలో సాగింది. నాటకంలో వేదికమీద మల్లయుద్ధం ప్రదర్శనయోగ్యమైనది కాదు. కాని, శ్రవ్యకావ్యప్రక్రియలో సాక్షాత్తు వేదికమీద జరుగుతుండగా మనోనేత్రంతో చూచి హర్షించేటట్లు నన్నయ దిద్దితీర్చాడు. రెండురంగాల దృశ్యకావ్య రచనాప్రభావం మూడోరంగాన్ని ముంచెత్తుతూ సమవకార స్వభావాన్ని సుసంపన్నం చేస్తున్నది.

జరాసంధవధ ఘట్టంలో మూడువిధాలైన కపటచర్యలూ, ఉపద్రవాలూ, యథావకాశంగా వర్ణించబడ్డాయి. జరాసంధుడు పద్నాలుగు రాజవంశాలలో పుట్టిన క్షత్రియుల నందరినీ జయించాడు. అతడికి మహాబలుడైన శిశుపాలుడు సేనానిగా, హంసడిభకులు సహాయకులుగా ఉండి దండయాత్రలలో సహాయం చేశారు. శ్రీకృష్ణుడు కంసుడిని వధించటంవలన ఆ కంసుడిభార్య జరాసంధుడి కూతురు కావటంచేత, జరాసంధుడు శ్రీకృష్ణుడిపై పగసాధించేయత్నంతో అనేకఉపద్రవాలు కలిగించాడు. జరాసంధుడు, హంసడిభకులు కలిసి రణరంగంలో నిలిస్తే లోకంలో వారికి ఎదురులేదు. వారు ముగ్గురూ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆయుధాలతో చావని వరాలు పొందినవారు కావటంచేత వారు మధురపై దండెత్తి వృష్ణిభోజాంధకవీరులను యుద్ధాలతో పీడిస్తుండేవారు. ఈ ఉపద్రవంనుండి తప్పించుకొనటానికి శ్రీకృష్ణాదులు ఒక చిన్న మోసం చేశారు. హంసడిభకు లిద్దరూ ఒకరిని వదలి మరొకరు బ్రతకలేనివారు. అందువలన హంసుడు యుద్ధంలో చనిపోయా డని డిభకుడికి చెప్పించాడు కృష్ణుడు. ఆ మాటను నమ్మి హంసుడు లేనిలోకంలో తాను జీవించలేనని శోకించి డిభకుడు నీటిలో మునిగి ప్రాణాలు వదిలాడు. డిభకుడు చనిపోయాడని తెలిసిన హంసుడుకూడ తమ్ముడిమీది ప్రేమతో నీటమునిగి అసువులు పోగొట్టుకొన్నాడు. మిత్రుల మరణానంతరం జరాసంధుడు మగధకు తిరిగివెళ్ళిపోయాడు. శ్రీకృష్ణాదులు జరాసంధుడికి భయపడి మధుర సురక్షితప్రాంతం కాదని రైవతకపర్వతంమీద దుర్గాన్ని నిర్మించుకొని అక్కడ ఉండసాగారు. పాండవులు వారికి అండగా నిలిచారు.

జరాసంధుడు ఆవిధంగా విజృంభించి భూతలంమీద ఉన్న రాజుల నందరినీ యుద్ధాలలో ఓడించి, బంధించి తెచ్చి గిరివ్రజపురంలో బందీలుగా ఉంచి ప్రతిరోజూ ఒక్కొక్కరిని భైరవపూజలో బలియిస్తూ ఉగ్రవర్తనుడై వ్యవహరించాడు. కాబట్టి అతడిని చంపితేనే సామ్రాజ్యవైభవం సుస్థిర మౌతుందనీ, రాజసూయం చేయటం సుగమమౌతుందనీ శ్రీకృష్ణుడు ధర్మరాజుకు సలహా చెప్పాడు.

నన్నయ ఈ కథాభాగాన్ని కథాకథనంగా కాకుండా శ్రీకృష్ణుడు చేసిన దీర్ఘసంభాషణగా తీర్చిదిద్దటం నాటకీయత. జరాసంధుడివలన కలిగిన యుద్ధోపద్రవం, హంసడిభకులను చంపటంలో శ్రీకృష్ణుడు చేసిన వంచనశిల్పం ఈ కథాభాగంలో ముఖ్యమైనవి. వంచనను వంచనతోనే వంచాలని శ్రీకృష్ణుడి వ్యూహం. ఆయుధాలచేత చావని శత్రువీరులను ఉపాయంచేతనే వధించాలని అతడి రాజనీతి. జరాసంధుడి వృత్తాంతాన్ని శ్రీకృష్ణుడు సంగ్రహంగా వినిపించి, అతడి వధోపాయాన్ని నిశ్చయించటంతో మొదటిభాగం ముగుస్తుంది ప్రథమాంకంవలె.

ఈ కథలో కాగల కార్య మిది-

ఉ. “అమ్మగధేశు నుగ్రబలు నాయుధయుద్ధమునన్ జయింపఁగా
నిమ్మహి నోప రెవ్వరు; నుమేశ్వరుఁ డట్టివరమ్ము వానికిన్
నెమ్మిన యిచ్చెఁ; గావున వినీతుఁడు వాయుసుతుండు మల్లయు
ద్ధమ్మున నోర్చు నాతని నుదగ్రమహాభుజశక్తి యేర్పడన్”. **(సభా. 1.162)**

రెండవ అంకంగా భాసించే భాగంలో శ్రీకృష్ణార్జునభీములు గిరివ్రజపురంలో అమార్గాన ప్రవేశించటం, శత్రువులవలె వ్యవహరించటం, గమనిస్తే జరాసంధుడిపట్ల వా రనుసరించిన పద్ధతి గత్యంతరంలేని వంచనగా స్ఫురించటం స్పష్టం. ఆ భాగంలో శ్రీకృష్ణుడు వారివర్తనాన్ని సహేతుకంగా సమర్థించుకొన్నట్లు సంభాషణను చిత్రించటం నన్నయ రూపకరచనాశిల్పం!

అభ్యాగతులవలె శ్రీకృష్ణభీమార్జునులు జరాసంధుడిగృహంలో ప్రవేశించారు. జరాసంధుడు వారికి ఎదురువచ్చి ఆహ్వానించాడు. ఆ తరువాత వారినడుమ జరిగే సంభాషణ ఒక రమణీయ మైన రంగంవలె రాణిస్తుంది. దానిని ఇలా అన్వయించుకొనవచ్చును.

జరా: మీరు నిజంగా స్నాతకులే అయితే, పూలనూ చందనాన్నీ బలవంతాన గ్రహించటం న్యాయమా? చైత్యకాద్రితటాన్ని పగులగొట్టి మీరు చులుకదనంతో అద్వారాన నగరంలో ప్రవేశించటం తగునా? నే నిచ్చిన మధుపర్కాలను గ్రహించకుండట మెందువలన? మీ వేషాలు బ్రాహ్మణులవి, రూపాలు క్షత్రియులవి. మీరు వేషధారులవలె ఉన్నారు. ఎవరు మీరు?

కృష్ణుడు: స్నాతకులు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యజాతులలో ఉండటం సనాతనంగా వస్తున్న ఆచారం. మేము క్షత్రియజాతిస్నాతకులం. మిత్రులగృహాన్ని ముఖద్వారంనుండి, శత్రువులగృహాన్ని మారుమార్గంనుండి ప్రవేశించటం క్షత్రియులకు ఉచితం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గంధపుష్పాలలో లక్ష్మి ఉంటుంది కాబట్టి వాటిని మేము బలాత్కారంగా గ్రహించాం. ఇది క్షత్రియాచారం. నీతో మాకు వేరేపని ఉండటంచేత నీ విచ్చిన అర్ఘ్యాన్నీ మధుపర్కాలనూ గ్రహించలేదు.

జరా: మీరు నాకూ, నేను మీకూ ఎన్నడూ కీడు చేసినదిలేదు. నే నెట్లా మీకు శత్రువు నయ్యాను? నేను పాపరహితుడిని, గుణవంతుడిని. సురమునిబ్రాహ్మణభక్తుడిని, ఉత్తమక్షత్రియకులాచారపరుడిని.

కృష్ణుడు: సమస్తక్షత్రియవంశాలనూ ఉద్ధరించే సమర్థుడైన ధర్మరాజుఆనతిమేరకు క్షత్రియకులాన్ని రక్షించటానికీ, అపజయమెరుగని శత్రువుల అకుంఠితపరాక్రమాన్నిసైతం వమ్ముచేయటానికీ, దుర్మార్గులను దూషించటానికీ మేము ఇక్కడికి వచ్చాం. జరాసంధా! నీ వేమో 'ఉత్తమక్షత్రియుడ' నన్నావు; ఎవ్వరికీ కీడు చేయలే దన్నావు. మరి నీవలె మూర్ధాభిషిక్తులైన రాజులను చెరబట్టి తెచ్చి, క్రూరంగా పశుపతికి బలియిచ్చినవా రెవరైనా ఉన్నారా? ఇంతకు మించిన కీడు మరేదైనా ఉన్నదా? కారణం లేకుండా సాధుజనులను హింసించే దుర్మార్గుడు అందరికీ శత్రువేకదా! ఉత్తములకు ఇంతకంటె కారణం మరొకటి కావాలా? ఏ తప్పూ చేయని తనకులంవారిని చంపటంకంటె మహాపాపం మరేమైనా ఉన్నదా? నీవంటి పాపకర్ముడిని ఉపేక్షిస్తే ధర్మరక్షకులమైన మాకుకూడా ఆ పాపం అంటుతుంది. కాబట్టి అటువంటి పాపభయంతో నిన్ను దండించటానికి వచ్చాం. నన్ను మించినవాడు లే డని విర్రవీగి ఇతరులను అవమానించవద్దు. పూర్వం జయద్రథ, దంభోద్భవ, కార్తవీర్యులు మహాబలవంతు లైనప్పటికీ అవినీతులై, మహాత్ములకు అవమానంచేసినవారై ఇతరులచేత పరాజితులైనారు. అపారపరాక్రమంతో రణయజ్ఞాలు చేసి, శత్రువులను సంహరించిన వీరులు మహాతపస్వులు పోయే సద్గతి పొందుతారు. కాని, నీవలె అపకారదారుణకార్య మైన భైరవపూజ చేసేవాడికి ఉత్తమగతు లుంటాయా? కాబట్టి, నీవు చెడకుండా ఉండాలంటే నేను చెప్పేమాట చేయుము. నీవు బంధించిన రాజుల నందరినీ విడిపించుము; నేను కృష్ణుడను, ఇతడు భీముడు, అతడు అర్జునుడు, నీవలన పుట్టిన ఈ పాపమనే మహాగ్నిని చల్లార్చటానికి వచ్చిన పరాక్రమవంతులు. కురువంశశ్రేష్ఠులు వీరు. నీవు క్రూరుడవై ఇప్పటికీ ఆ రాజులను విడువకపోతే, ఈ పాండవేయులు నిన్ను యుద్ధంలో ఓడించి వారిని విడిపిస్తారు.

జరా: (కోపంతో కనుబొమలు ముడిచి) అపారపరాక్రమంతో రాజుల నోడించి గర్వించటం క్షత్రియులకు ధర్మమే అవుతుంది. కానీ, దోష మెట్లా అవుతుంది? నే నెప్పుడూ పరాక్రమమే జీవితవ్రతంగా కలవాడిని. భైరవపూజకొరకే తెచ్చిన ఈ రాజులను నే నెందుకు వదలుతాను? నేను పరాక్రమంచేత శత్రువులను జయించినవాడిని. కృష్ణా! నా సంగతి నీ కిదివరకే తెలుసు. నేను వేరే చెప్పనవసరం లేదు. మీతో యుద్ధమే చేయవలసివస్తే- మీ కిష్టమైన పద్ధతిలోనే చేస్తాను. సైన్యంతో నైనా సరే, మీ ముగ్గురితో కానీ, ఇద్దరితో కానీ, ఒక్కరితో కానీ నే నొక్కడినే అసహాయశూరుడనై పోరాడుతాను. మీరూ ప్రయత్నించండి. మీ యిష్టం చెప్పండి.

జరా: ఒక్కరితో పలువురు యుద్ధం చేయటం న్యాయం కాదు. మేము ముగ్గురమూ బలవంతులమే. మాలో ఒక మహాబలుడిని ఎన్నుకొమ్ము. అతడితో మల్లయుద్ధంలో తలపడుము.

జరా: భీముడే యుద్ధంలో నాకు దీటైనవాడు.

ఈ ఘట్టం రంగంమీద ప్రయోగింపబడుతున్న అంకంవలె ఉన్నది. స్నాతకులుగా, మార్గంగాని మార్గంలో ఉద్ధతులై ప్రవేశించి, మాల్యసుగంధాలను హరించి, అర్ఘ్యాన్ని తిరస్కరించిన శ్రీకృష్ణభీమార్జునులవృత్తం ఉపాయంతో (కపటంతో) చంపటానికి చేసిన ప్రయత్నాల ప్రదర్శనమే. దానిని క్షత్రియోచితవర్తనంగా సమర్థించుకొనటం శ్రీకృష్ణుడిచాతుర్యం. మూర్ధాభిషిక్తులను చెరపట్టటం దోషంకాదు కానీ, వారిని భైరవుడికి బలియివ్వటం అన్యాయ మన్నాడు కృష్ణుడు. వారిని విడిపించటమే ధర్మరాజు కర్తవ్యమనీ, అది ధర్మవ్రతమనీ చెప్పాడు. క్రూరుడిని చంపటానికి ధర్మచ్ఛన్నమైన కాపట్యం న్యాయమని శ్రీకృష్ణుడి మతం. అది నిఖిలరాజబలివధ అనే ఉపద్రవాన్ని తొలగించటానికి ఏర్పరచుకొన్న ఉపాయమని శ్రీకృష్ణుని వ్యాఖ్య. ఇటువంటి వస్తువు కపటచర్యలనూ, ఉపద్రవాలనూ చిత్రించే స్వభావంగల సమవకారానికి సరైన దని

నన్నయ భావించి, ఈ ఘట్టాన్ని రెండవఅంకంవలె సంభాషణచతురంగా. వాదోపవాదతుల్యంగా చిత్రించి నాటకీయతను రక్తికట్టించాడు.

సమవకారంలో విశేషవృత్తాలు వాడాలనే నియమం ఉన్నది. నన్నయ ఈ అంశంలోకూడా శ్రద్ధతీసికొన్నాడు. శ్రీకృష్ణుడు జరాసంధుడిని ధిక్కరిస్తూ భైరవపూజలో రాజులను బలిచేయటం దారుణ మని నిందించటం, ఆ రాజులను వదలిపెట్టు మని ధట్టించటం, వదలిపెట్టకపోతే అతడి పరాక్రమాగ్నిని ఆర్పటం తథ్యమని హెచ్చరించటం, భీమార్జునులనూ తననూ బహిర్గతం చేసికొనటం అనే అంశాలను తెలిపే సంభాషణలు ఈ ఘట్టంలో కీలకా లైనవి. కథావృత్తంలో కేంద్రబిందువులవంటివి. జరాసంధవధను సమర్థించుకొనే సారధర్మసూక్తులవంటివి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన శ్రీకృష్ణుడివాక్యాలను రెండు తరలవృత్తాలలో రచించటం నన్నయవిశేషచ్ఛందశ్శిల్పం. పఠితలమనస్సులు ఈ వృత్తాలవైపు ఆకర్షితాలై కథాప్రాణాన్ని గుర్తించేటట్లు చేశాడు నన్నయ.

విశేషవృత్తాలను సందర్భోచితంగా వాడటం, నాటకీయశిల్పానికి అనుగుణంగా అమర్చటం ఛందశ్శిల్పంలో ఒక నేర్పు. సామాన్యవృత్తాలనుకూడా విశేషంగా వాడటం మరొకనేర్పు. జరాసంధవధఘట్టంలో మత్తేభవృత్తాన్ని రెండుచోట్లమాత్రమే వాడాడు నన్నయ. ఒకటి భీమజరాసంధులు మల్లయుద్ధంలో పెనగిన సన్నివేశం చెప్పేది. (సభా. 1.203). మదించిన ఏనుగులు కుమ్ములాడినట్లుంటుంది ఆ మత్తేభం. అందుకే అది సార్థకం. జరాసంధవధానంతరం భీముడు ఇంద్రప్రస్థపురంలో ప్రవేశించినప్పుడు ప్రజ లాతనిని ప్రశంసిస్తూ, ధర్మజరాజ్య ప్రతిష్ఠాపనాచార్యుడివలె భావించిన పద్యంకూడా మత్తేభమే. (సభా. 1.219). మొదటిపద్యంలో భీమజరాసంధులు రెండు మత్తేభాలవలె పోరాడారనీ, చివరకు వీరమత్తేభంవంటి భీముడే విజయాన్ని సాధించి సాటిలేనిమత్తేభంగా మిగిలాడనీ వృత్తధ్వని సాధించాడు నన్నయ. ఇది భారతరచనాశిల్పంలో భాగమే కాకుండా సమవకారరచనాశిల్పమర్మంకూడా కావటం నన్నయనాటకీయతకు నిదర్శనం!

మూడవరంగం యుద్ధకార్యప్రదర్శన ప్రధానమైనది. ఆ ఘట్టంలోని నడిమిభాగంలో శ్రీకృష్ణుడిప్రబోధాన్ని సంభాషణగా ఒకపద్యంలో నిలపటం నన్నయ రచనాశిల్పం. ఈ యుద్ధచక్రానికి ఆ సంభాషణ ఇరుసు. దాని తాత్పర్యమంతా ఆ పిలుపులో ధ్వనిస్తుంది.

చ. "విరహితసత్త్వుఁ డయ్యెఁ బ్రతివీరుఁడు వీని నశేషధారుణీ
శ్వరనికరాపరాధు నతిసాహసికున్ వధియించి నీభుజ
స్థిరత యెలర్ప నయ్యనిలదేవుబలంబును నీబలంబు భా
సురముగ మాకుఁ జూపుము విశుద్ధయశోనిధి! మారుతాత్మజా!". **(సభా. 1.208)**

ఈ పద్యం రూపకప్రక్రియలో చూళిక వంటిది. తెరలోపలి పాత్రతో యుద్ధాదుల సూచనలు చేయటం దీనిస్వభావం. దీని విస్తరణమే మిగిలిన రంగవస్తువర్ణనం. జరాసంధవధ లోకధర్మన్యాయంగానే కాక, నాటకీయధర్మన్యాయంగాకూడా నిరూపించటం ఈ పద్యతాత్పర్యం. అంతేకాదు. శ్రవ్య దృశ్య కావ్య ప్రక్రియల విశిష్టయోజనం- ప్రసన్నకథాకలితార్థయుక్తిలో భాగంగా నన్నయ దీనిని ప్రదర్శించాడు.

ప్రజలు చేసే భీమప్రశంస భరతవాక్యంవలె ప్రకాశింపచేయటం మరొక రూపకశిల్పం!

మ. "జనసంత్రాసకరున్ మహోద్ధతు జరాసంధున్ హరిప్రేరణం
బున భంజించెఁ బ్రభంజనాత్మజుఁడు భూభుగ్వీరులం దన్నిరో
ధననిర్ముక్తులఁ జేసె నింకఁ జతురంతక్షోణికిన్ ధర్మనం
దనుసామ్రాజ్యము పూజ్యమయ్యె నని మోదం బంది రుర్వీజనుల్". **(సభా. 1. 219)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'సర్వేజనా స్సుఖినో భవంతు' అనే అర్థాన్ని ధ్వనింపచేశాడు 'మోదంబంది రుర్వీజనుల్' అనే చివరివాక్యంలో పరోక్షంగా నన్నయ.

కథారచనలో నాటకీయతను సూచించే కొన్ని పారిభాషికపదాలను తగిన సందర్భాలలో వాడటం నన్నయ పాటించే ఒక మర్యాద. కథారంభంలో 'ఆరంభము' (సభా.1.123) 'కార్యంబు నిర్వహింతుము' (1-126) అనే పదాలూ, అద్భుతంగా ముగిసే నిర్వహణంలో ప్రజల 'ఆశ్చర్యము' (1.221)ను సూచించటం ఇందుకు నిదర్శం. ఆ యా సందర్భాలలో భావానుభావవ్యంజక శబ్దాలను వాడటంకూడ గమనించవచ్చును. ఉదాహరణకు- 'నిర్వేదించి' (1.137), భక్తి-(1.139), భయానకము (1.205) ఆహవహర్షము (1.204) మొదలైనవి. నన్నయ చతుర్విధాభినయాలలో ఆంగికానికీ, వాచికానికీ మాత్రమే ఎక్కువ ప్రాధాన్య మిస్తాడు. ఆహార్యసాత్త్వికాభినయాలను క్వాచిత్కంగా వర్ణిస్తాడు. నన్నయగారు వదలిన ఆ రెండు అభినయాలను గూడా తిక్కన కళాపూర్ణంగా కవితలో పోషించాడు.

నన్నయఆంగికాభినయవర్ణనానికి ఒక మచ్చుతునక:

ఆ. "బలియుఁ డపుడు వెంద్రుకలు పాచి ముడిచి గం
టెసఁగఁ దాల్చి వీరరసికవృత్తి
నుద్ధతుండు మల్లయుద్ధప్రసాధనం
బమర నిలిచె వేడ్క నమితబలుఁడు". **(సభా. 1.201)**

వాచికాభినయప్రదర్శనకు-

క. "అమితపరాక్రమమున నా
క్రమించి పరనృపుల నోర్చి గర్వించుట దో
సమె యిది సత్క్షత్త్రియధ
ర్మమ; యే నెప్పుడుఁ బరాక్రమప్రతుఁడ నిలన్!". **(సభా. 1.196)**

అలంకారంచేత యుద్ధాదులలో వీరప్రతివీరుల తారతమ్యాన్ని ధ్వనింపచేయటానికి ఉదాహరణం:

చ. "అతులబలుల్ పరస్పరజయార్థులు పార్థివపుంగవుల్ మరు
త్సుతమగధేశ్వరుల్ సమరశూరులు దారుణలీలఁ బోరి రూ
ర్జితభుజదర్ప మేర్పడఁగ సింహగజేంద్రములట్లు వజ్రప
ర్వతములయట్లు ఘోరతరవాసవవృత్రులయట్లు నిద్దఱున్." **(సభా. 1.206)**

ఈ వర్ణనంలో మూడు ఉపమానా లున్నాయి. అతులబలుల్- అనే విశేషణానికి సాటిలేని బలం కలవారనీ, సమానం కాని బలం కలవారనీ రెండర్థాలు స్ఫురిస్తాయి. వారు పరస్పరజయార్థులై ఒకరిపై ఒకరు మించాలని వ్యూహాలు వేసికొంటూ మల్లయుద్ధం సాగించారు. కొంతసేపు మొదట్లో సింహగజేంద్రాలుగా అనిపించారు. ఇందులో క్రమాలంకారాన్ని అన్వయించుకోవాలి. భీముడు సింహంవలె, జరాసంధుడు గజేంద్రుడివలె కనిపించారు. అంటే మొదట భీముడిదే పైచేయి. ఆ తరువాత ఇద్దరూ వజ్రపర్వతాలవలె పోరారు కొంతకాలం. అందులో ఇరువురూ తుల్యబలాలను ప్రదర్శించారు. ఇక చివరకు- వా రిద్దరూ వాసవవృత్రాసురులవలె పోరారు. ఈ ఉపమానంవలన భీమవిజయం, జరాసంధమృతి ధ్వనించబడుతున్నది. యుద్ధవీరం పోషించబడే వస్తువును అలంకారంచేత ధ్వనింపజేయటం నన్నయ శిల్పం. ఈ అవస్థల వర్ణనం ఎంత శ్రవ్యకావ్యసుందరమో అంతటి దృశ్యకావ్యరమ్యం!

నానారసా(భావా)శ్రయంగా ఉండటం సమవకారంలో కానవచ్చే మరొక సార్థకలక్షణం. నన్నయ ఈ ఘట్టాన్ని నానారసభావబంధురంగా మలచాడు. ధర్మజ భీమార్జునులలో శ్రీకృష్ణుడిలో ఉత్సాహం, క్రోధం, బృహద్రథుడిలో నిర్వేదం,

హర్షం, భక్తి, పుత్రోత్సాహం, బృహద్రథుడి భార్యలలో భయం, లజ్జ, ఆశ్చర్యం, హర్షం, జరాసంధుడిలో ఉత్సాహ, క్రోధ, భక్తిభావాలు, భీమజరాసంధులలో రౌద్రోద్రేకం, ఉత్సాహశీలం, ప్రజలలో ఆశ్చర్యం- ఇవన్నీ స్పష్టంగా ప్రకటితమయ్యేటట్లు నన్నయ రచించాడు.

ఆదిసభారణ్యపర్వాలలో భీముడు చంపిన వీరులలో సర్వోత్తముడైన ధీరోద్ధతుడు జరాసంధుడు. భీమపరాక్రమ ప్రదర్శకాలైన వీరఘట్టాలు సమవకారాలుగా గోచరిస్తాయి. కాని, వాటన్నిటిలో జరాసంధవధ సమగ్రసుందరంగా సాక్షాత్కరించింది. దానికి కారణం నన్నయనాటకీయరచనారామణీయకత్వప్రసన్నతయే!

భీముడు రాక్షసులను వధించిన ఘట్టాలు ఆదిపర్వంలో రెండు, అరణ్యపర్వంలో రెండు ఉన్నాయి. అవి హిడింబాసురవధ (ఆది. 6.185-227), బకాసురవధ (ఆది. 6.237-309), కిమ్మీరవధ (ఆర.1.107-121), జటాసురవధ. (ఆర. 3.380-397) వీటిని నన్నయ తీర్చిదిద్దినపద్ధతి గమనిస్తే ఈ అంశాలు వ్యక్త మౌతున్నాయి.

1. ఆదిపర్వంలోని ఘట్టాలలో నాటకీయతను పాటించిన నన్నయ అరణ్యపర్వంలోని ఘట్టాలను కథాఘట్టాలుగానే చిత్రించాడు. అవి ఆఖ్యానంలోని భాగాలే కాబట్టి ఉపాఖ్యానా లనటానికి వీలులేదు.

2. హిడింబాసురవధఘట్టంలో భీమాశ్రిత మైన యుద్ధవీరానికి శృంగారం అంగంగా నిలిచింది.

3. బకాసురవధఘట్టంలో భీమాశ్రితయుద్ధవీరానికి, దయాధర్మవీరాలూ, కరుణరసం రౌద్రరసం పోషకాలుగా నిలిచాయి.

4. వస్తుస్వభావాలనుబట్టి హిడింబాసురవధఘట్టం లలితం ఉజ్జ్వలం. బకాసురుడిని లోకహితార్థం చంపాడు. ఆ ఘట్టాలను నాటకీయతతో చిత్రించటంలోకూడ మొదటిదానికంటె రెండవది ఉత్తమం.

5. హిడింబాసురుడిని స్వీయరక్షణంకొరకు చంపాడు భీముడు; బకాసురుడిని లోకహితార్థం చంపాడు. ఆ ఘట్టాలను నాటకీయతతో చిత్రించటంలోకూడ మొదటిదానికంటె రెండవది ఉత్తమం.

6. హిడింబ, బకాసురవధలు మూడురంగాలుగా విభజించబడటానికి అనువైన కథలు. అందుకే సమవకారస్వభావం వాటిలో కుదిరింది.

హిడింబాసురవధ - పాక్షికసమవకారం

లాక్షాగృహదహనానంతరం పాండవులు దుర్గమారణ్యంలో తలదాచుకొంటూ ఒక మర్రిచెట్టుక్రింద విశ్రాంతితీసికొంటున్న దృశ్యంతో ఈ కథ మొదలౌతుంది. ధర్మజార్జున నకులసహదేవులు, కుంతీదేవి శ్రమవలన ఒడలుతెలియకుండా చెట్టుక్రింద నిద్రపోతుంటారు. రాత్రివేళ రాక్షసాదుల బాధ కలుగకుండ భీముడు జాగరణచేస్తూ వారిని రక్షిస్తూ ఉంటాడు. వారి దైన్యాన్ని చూచి ఖిన్ను డౌతాడు, దుర్యోధనధృతరాష్ట్రులు చేసిన కాపట్యానికి చింతిస్తూ ఉంటాడు. ఆ సన్నివేశం ఒక రూపకంలోని రంగంలాగా శోభించింది.

ఆ ప్రక్కనే ఉన్నది లేతమద్దిచెట్లతోపు. అందులో ఉంటాడు హిడింబు డనే భయంకర రాక్షసుడు. మానవమాంసభక్షకుడు. అతడితో కలసి ఉంటున్నదిఅతడి చెల్లెలు హిడింబ. ఆమెకు వయసు వచ్చింది. మనసు పండింది. అన్న గడిపే భయంకరజీవయాత్ర ఆమెకు గిట్టదు. అయినా అగ్రజుడి ఆనతిని పాటించక తప్పదని కాలంగడుపుతున్నది. ఆమె సంస్కారవతి. ఆమెకు వివాహంచేసి ఒక ఇంటిదాన్ని చేయాలన్న స్పృహ హిడింబుడికి లేదు. తినటం, చెల్లెలిని వేధించుకొని తినటం తప్ప అతడికి మరొక ధ్యాస లేదు. అంతరాంతరాలలో ఆమె తన జీవితమాధుర్యాన్నిగురించి ఎన్నో ఆశలు పెట్టుకొని కలలు కంటున్నది. పాండవులు ఆ అడవిలో ప్రవేశించి వంటింట్లోకి చొరబడిన కుందేళ్ళవలె హిడింబుడికంటపడ్డారు. ఆ రాక్షసుడు హిడింబను పిలిచి 'వారిని తెచ్చి వారి మాంసాలు వండి వడ్డించు' మని ఆజ్ఞాపించాడు. అన్నఆజ్ఞ హిడింబకు యముడిఆజ్ఞయే. ఆమె భీము డున్నచోటకి వచ్చింది - అంటే భీముడున్న రంగంలోకి హిడింబ ప్రవేశించింది.

దూరంగా ఉండి భీముడిని చూచింది. అపూర్వం అతని ఆకారం. అతడి కన్నులు జాగృతాలై విప్పారి ఉన్నాయి వికసించిన పద్మాలవలె. విశాలమైన వక్షఃస్థలం, సింహంనడుమువంటి నడుము, వజ్రాయుధాలవలె ఉన్న స్థిరమైన బాహువులు, మహావీరుడు, అన్నింటికంటె మించి మన్మథాకారుడు. అతడిని చూడగానే మనస్సు చలించింది. ఒకవృక్షం చాటున అట్లాగే నిలువబడి కొంతసేపు కన్నార్పకుండా చూచింది. ఆమెకు తెలియకుండానే హృదయంలో మదనాగ్నివేదన మొదలైనది. ఆమెమనసులో తనను తాను భీముడికి సమర్పించుకొన్నది. ఆమె కామరూపధర కాబట్టి మనోజ్ఞమైన మానవస్త్రీరూపం తాల్చింది. పూచినతీగ నడచివచ్చినట్లు ఉన్నతమైనవక్షోజాలు ఉప్పొంగగా బహురత్నశోభితాలంకారాలతో భీముడిని సమీపించింది. అన్నగారిస్పృహయే లేదు. పవనతనయుడే తన సర్వస్వ మనుకొని మైమరచి నిలిచింది. ఆమెకు రాగోదయ మయింది.

ఆ రాత్రిసమయంలో ఒంటరిగా వచ్చిన ఆ వనితను అనుమానంతో గ్రుచ్చిగ్రుచ్చి అడిగాడు అనిలతనయుడు. ఆమె ఉన్నమాట, అన్నమాట అన్నీ చెప్పింది. మనసులో ఉన్నమాటకూడా మనవిచేసికొన్నది.

క. “నాకుఁ బతివయిన, నిన్నుం
జేకొని మా యన్న యెగ్గుసేయక కాచున్;
నాకు మఱి నీవ పతివి గు
ణాకర! యిజ్జన్మమున మహాస్నేహమునన్”. **(సభా. 6.194)**

అని జన్మజన్మల అనుబంధంగా తనలో కలిగిన అనురాగభావోదయాన్ని గుర్తించి వ్యాఖ్యానించి చెప్పింది. హిడింబు డున్న వనంలో ప్రవేశించటం యముడిగొంతులో దూరటంవంటిదని హెచ్చరించింది. తనను ప్రేమిస్తే భీముడిని హిడింబుడు చంపకుండ ఉంటాడని ఉపాయం సూచించింది. నిద్రపోతున్న ధర్మజాదులను రక్షించవలెనని భీముడి కోరికైతే తాను వారిని కాపాడుతానని మాటయిచ్చింది. అన్నబారిన పడకుండా భీముడిని దక్కించుకొందామని తాపత్రయపడుతూ భీముడికి రక్షణోపాయాలు చెప్పి తన అనురాగాన్ని వ్యక్తంచేసింది.

భీముడు మహాబలశాలి, మహాభిమాని. ఒక రాక్షసుడికి భయపడి తాను, తనవారిని నిద్రలేపి వారిని ‘మీకు మీరే రక్షించుకొనం’ డని ప్రబోధించాలనే సూచన భీముడికి కోపం తెప్పించింది. హుంకరించి ఇట్లా అన్నాడు హిడింబతో.

ఉ. “క్రచ్చఱ నొక్క రక్కసుఁడ కాఁడు సురాసురు లెల్ల నొక్కటై
వచ్చిన నీవ చూడఁగ నవార్యబలోన్నతిఁ జేసి వారలన్
వ్రచ్చి వధింతుఁగాక! యిటు వచ్చి శ్రమంపడి యున్న నిచ్చట
నెమ్మెచ్చగు వీరి దైన సుఖనిద్రకు భంగము సేయ నేర్తునే?” **(సభా. 6.200)**

హిడింబాసురుడిని రమ్మని చెప్పుమని విజృంభించాడు.

భీముడి భీషణసుందరమైన వీరమూర్తిని చూచింది హిడింబ. హిడింబుడికి ఎదురుగా నిలబడి గర్జించగల సింహం ఆమె కంతవరకు కనపడలేదు. అటువంటి మహావీరు డుంటా డని ఆమె కలకూడా కనలేదు. అటువంటి అనంతశక్తియుతుడు మన్మథాకారుడై తనమనసు దోచుకొని ముందు నిలువబడ్డాడు. ఆమె నిలువెల్లా పులకించింది.

ఇక ఆమె జీవితానికి కావలసింది హిడింబుడా? భీమసేనుడా?- సోదరుడా? మనోహరుడా? ఆమె అంతరంగం అరక్షణం సంక్షోభం చెందింది. వాయుతనయుడే తన ప్రాణనాథు డనుకొన్నది. చచ్చినా బ్రతికినా ఆతడే శరణ్యమని నిశ్చయించుకొన్నది.

ప్రళయకాలమేఘంవలె గర్జిస్తూ, మెరుపులవంటి కోరలు మెరుస్తూ ఉండగా అగ్నికుండాలవలె కన్నులు మండుతూ ఉండగా యముడివలె హిడింబుడు రంగంలో ప్రవేశించాడు. తనమాట కాదని మనుషులతో కూడి మసలుతున్నందుకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెల్లెలిని గద్దించాడు. ఆగ్రహించిన అన్న ప్రాణం తీస్తాడన్న భయంతో హిడింబ భీముడిచాటుకు పోయి నిలబడింది. భీముడు ఆమెను ప్రసన్నంగా చూచాడు. అన్నబలాన్ని అంతగా పొగడిన అబల తనఅండ చేరటం భీముడికి ఆత్మాభిమానం పెంచింది. "నన్నూ మీఅన్ననూ చూస్తూ ఇక్కడే ఉండుము" అని ధీమాగా పలికి ముందుకు సాగాడు భీముడు.

హిడింబాసురుడు భీముడిని సమీపించాడు. ఒకవైపు అన్నదమ్ములూ తల్లీ నిద్రపోతున్నారు. వారికి నిద్రాభంగం కలుగకూడదు. మరొకవైపు మహారాక్షసుడు యుద్ధానికి వస్తున్నాడు. భీముడు మేనుపెంచి హిడింబుడిభుజం పట్టుకొని సింహం నోటకరచుకొన్న మృగాన్ని లాగి తీసికొనిపోయినట్లు ఎనిమిదిధనువులదూరం లాగికొని పోయాడు.

రంగంప్రక్కనే మరోరంగం మొదలైనది. ఇప్పు డసలురంగ మిది. భీమహిడింబాసురులు ముష్టియుద్ధం ఘోరంగా చేస్తున్నారు. చప్పుడు లౌతున్నా ధర్మరాజాదుల నిద్ర భగ్నం కాలేదు. ఒకసారి హిడింబుడు భీముడిని బాహువులతో బిగియబట్టి పెద్దగా అరిచాడు విజయగర్వంతో. ఆ చప్పుడుకు ధర్మరాజాదులు నిద్రలేచారు. ఎదుట మానవాకారంలో ఉన్న హిడింబను చూచారు. అబ్బురపాటుతో ఆమెను 'నీ వెవ' రని అడిగారు. ఆమె తనసంగతంతా పూసగ్రుచ్చినట్లు చెప్పింది. కుంతిచెంత చేరి ఆత్మీయతను కలుపుకొన్నది. 'మీ కొడుకు ఆ రాక్షసుడిని అవలీలగా చంపి, నన్నూ మిమ్మల్నీ రక్షిస్తాడు చూడండి' అని భీముడు యుద్ధంచేస్తున్న స్థలాన్ని చూపించింది. అక్కడికి అర్జునుడు హుటాహుటిగా వెళ్ళాడు. తెల్లవారకపూర్వమే రాక్షసుడిని చంపు మని భీముడిని హెచ్చరించాడు. భీముడు హిడింబుడి కడకాలు పట్టుకొని గాలిలో నూరుసార్లు త్రిప్పాడు. అతడి ముక్కునా నోటా రక్తం కాలువలు కట్టింది. హిడింబుడిని నేలమీద వేసి కొట్టి వెన్నముక విరిచి విసిరివేశాడు. ఆ చిత్రవధతో హిడింబుడు చచ్చాడు.

హిడింబ కుంతికి ధర్మరాజుకు నమస్కరించింది. తననుగురించి దాపరికం లేకుండా చెప్పింది. భీముడిమీది వలపు ప్రాణంకంటె లోతైన దని తెలిపింది. తన కున్న శక్తులనుగురించి ఎరిగించింది. భవిష్యత్తులో జరుగబోయే సంగతులను ముందే తెలియచెప్పింది. ఆమె రాక్షసిగా పుట్టినా సాత్త్వికచైతన్యం గల సాధ్వి అని కుంతి గుర్తించింది. ధర్మరాజు ఆమె దివ్యవనిత అని పసికట్టాడు. (ఆ తరువాత వ్యాసుడు ఆమెను కమలపాలికగా గుర్తిస్తాడు). ఆమెను కపటిగా భావించి తిరస్కరించిన భీముడికి నచ్చచెప్పి హిడింబను వివాహమాడటానికి అంగీకరింపజేశారు కుంతీధర్మజులు. హిడింబకు బుద్ధులు చెప్పి భీముడిమనసుకు నచ్చేటట్లు మసలుకొమ్మని కోరింది కుంతీదేవి. పుత్రుడు పుట్టేంతవరకు హిడింబతో ఉండటానికి భీము డంగీకరించాడు. హిడింబాసురవధ హిడింబ వివాహంతో సుఖాంత మయింది.

కథలో సహజంగా మూడురంగా లున్నాయి. మానవమాంసం తినే రాక్షసులను హతమార్చాలన్నది పాండవవ్రతం. వారివలన కలిగే అవరోధాలనుండి ఋషులను, సాధుజనులను రక్షించాలని వారి దీక్ష. అందులో భాగంగా సాగింది హిడింబాసురవధ. ఆత్మరక్షణ సన్నిహితలక్ష్యమైనా, సాధురక్షణ పాండవుల జీవితలక్ష్యం. అందువలన సమవకారబీజం కొంతవరకు సార్థకమౌతున్నది.

హిడింబాసురవధ యుద్ధప్రధానం కావటంచేత క్రియాప్రధానమైనది. రంగంమీద యుద్ధం ప్రదర్శనయోగ్యం కాదు కాబట్టి ఆ సందర్భాలలో నాటకీయత తక్కువ. ఇకపోగా, మిగిలిన ఘట్టాలలో పాత్రల సంభాషణలు, చర్యలు రంగపరికల్పన సామగ్రులై సొంపు నింపుతాయి. ఇందులో హిడింబ కేంద్రబిందువు, హిడింబుడి వైపునుండి చూస్తే హిడింబ ఆడింది కపటనాటకం. అన్నయందున్న దోషాన్ని ఎంచి అన్నను మోసంచేసింది. కాని, ఆమె ఆత్మవంచన చేసుకొనలేదు, ప్రేమవంచన చేయలేదు. ధర్మశృంగారం ప్రధానమైన ఈ ఘట్టంలో హిడింబుడివలన కలిగే ఉపద్రవం చర్చించబడుతుంది. దానిని నివారించగలిగిన ధీరుడు వీరుడు భీముడై నిలవటంతో - కార్యదక్షుడైన నాయకుడు భీముడైనాడు. అతనివెంట నిలిచినవారు ధర్మజాదులు మరి నల్గురైనారు నాయకులు.

సమవకారస్వభావం కల ఈ ఘట్టంలో ఆ రూపకనిర్మాణస్వరూపస్వభావాలను పఠితలకు ప్రసన్నంచేస్తూనే కథాకథనానికి నాటకీయతను పోషకంగా నిలిపిన రచనాశిల్పం కనపడుతుంది. వాగ్యుద్ధం సగానికి పైగా సాగిన జరాసంధవధ సమగ్ర సమవకారంగా భాసిస్తే, హిడింబాసురవధ పాక్షికసమవకారంగా పరిఢవిల్లింది.

బకాసురవధ - సలక్షణసమవకారం

హిడింబాసురవధలోకంటె బకాసురవధఘట్టంలో నాటకీయత ఎక్కువగా కనపడుతుంది. లక్షణాన్ని ముందుపెట్టుకొని వ్రాసినట్లుకూడా అనిపిస్తుంది. బ్రాహ్మణుడిఇంటిలో సాగిన సన్నివేశం మొదటిరంగం. అది కరుణరసనిర్భరం. కుంతియింట జరిగిన సన్నివేశం దయాధర్మవీరపోషకం. భీముడు బకాసురుడిని చంపినరంగం యుద్ధవీరాద్భుతం. భీముడిది వంచనగా అనిపించటం సమవకారస్వభావం. అది ఆభాస నిజానికి. ఇది సంభాషణ బహుళం కావటంచేత నాటకీయతతో రక్తికట్టింది. ఇందులో రాక్షసకృత ఉపద్రవం చర్చనీయాంశం. భూదేవహితార్థం రాక్షససంహారం కార్యం. రచనలో తరువోజ, మధ్యాక్కర, తరలం అనే విశేషవృత్తాలు వాడబడిఉన్నాయి. కరుణ, వీర, రౌద్రాద్భుతహాస్యాదిరసబాహుళ్యం ఇందులో తరళసుందరంగా పోషించబడింది. ఈ ఘట్టంలోని నాటకీయతను, సమవకారస్వభావాన్నీ సహృదయులు సులభంగా గ్రహించగలిగేటట్లుగా నన్నయ రచించటంవలన బకాసురవధ సలక్షణసమవకారం అనవచ్చును.

నన్నయగారిరచనలో నాటకీయతను సూక్ష్మంగా పరిశీలిస్తే సమవకారరూపకాన్ని కథలో ఇమడ్చటంలో ఉత్తమప్రయోగం జరాసంధవధ, మధ్యమస్థానీయం బకాసురవధ. చివరకు పేర్కొనతగింది హిడింబాసురవధ. ఈ వరుసను నిజానికి తిరుగబెట్టి గమనించాలి. అప్పుడు నన్నయ నాటకీయతలో కలిగిన పరిణామక్రమంకూడ స్పష్టమౌతుంది. హిడింబాసురవధ పాక్షిక సమవకారం, బకాసురవధ సలక్షణ సమవకారం, జరాసంధవధ సమగ్రసమవకారం.

ద్యూతసభ - డిమప్రయోగం

సభాపర్వంలో అత్యంతసంఘర్షణాత్మక మైన సన్నివేశం మాయాద్యూతం. అది మహాభారత కథాచక్రానికే ఇరుసు. దానిలో సహజంగా డిమమనే రూపకంలో కానవచ్చే లక్షణాలు ప్రతిఫలిస్తున్నాయి. వాటిని నన్నయ గమనించి పోషించి నాటకీయతలో మరొక నాణ్యమైన శిల్పమర్యాదను ప్రపంచించాడు.

"డిమతే ఇతి డిమః"- అంటే ఉద్ధతనాయకులు, వారి ఆత్మవ్యాపారం ఎక్కడ ఉంటుందో దానిని డిమ మంటారు. 'డిమ్' అనే ధాతువుకు గాయపరచటం అనే అర్థాన్ని ధనికుడు చెప్పాడు. ఇతరులను బాధపెట్టటం, గాయపరచటం ఉద్ధతుల సహజస్వభావం. అది తేట తెల్లమయ్యేటట్లు ప్రయోగించబడేది డిమమని భావం. డిమానికి విద్రవ మనే పేరుకూడా ఉన్నది. విద్రవం (ఉపద్రవం)తో కూడుకొన్నదని దాని అర్థం. (నాట్యశాస్త్రము.పు. 525). భరతనాట్యశాస్త్రంలో డిమం లక్షణాలు స్థూలంగా ఇట్లా ఉన్నాయి- డిమంలో నాయకుడు ప్రఖ్యాతుడు, ఉదాత్తుడూ అయి ఉండాలి. నాలుగు అంకా లుండాలి. శృంగారహాస్యాలు తప్ప మిగిలిన ఆరురసాలూ పోషించబడాలి. కావ్యవస్తువు దీప్తరసమై, నానాభావోపసంపన్నమై ఉండాలి. నిర్ఘాత-ఉల్కాపాత- సూర్యేందు గ్రహణాలు, యుద్ధ-నియుద్ధ-ఆధర్షణ, సంఫేటాలు ఇందులో ప్రయుక్తం కావాలి. అంతేకాక, మాయ, ఇంద్రజాలం, నానావిధాలైన పుస్తాలు ఉండాలి. దేవ, భుజగేంద్ర, రాక్షస, యక్ష, పిశాచుల చరిత్రలుకూడా ఉండవచ్చును. సాత్త్వతి, ఆరభటి వృత్తులతో రచన సంపన్నంకావాలి. నాయకులు 16 మందివరకు ఉండవచ్చును. ఇవన్నీ దాదాపుగా సభాపర్వంలోని ద్యూతసభాఘట్టాలలో ద్యోతకమౌతూ ఉన్నాయి.

ఈ లక్షణాలను స్థూలంగా ఈ క్రిందివిధంగా కథకు అన్వయించుకొనవచ్చును.

1. ఉద్ధతు లైన దుర్యోధన ధృతరాష్ట్రాదుల కుటిలక్రూరస్వభావాలు, అధర్మశీలాలు ఈ సన్నివేశంలో సమగ్రంగా చిత్రించబడ్డాయి కాబట్టి ద్యూతసభ ముమ్మాటికీ డిమమే.

2. ద్యూతంవలన కలిగే ఉపద్రవాలను గురించి విదురాదులు వివరించి చెప్పటం, ద్రౌపదీవస్త్రాపహరణంవంటి ఉపద్రవకారకాలైన సన్నివేశాలు జరగటం గమనిస్తే డిమానికి ఉన్న విద్రవ మనే పేరుకూడా ఈ సభకు సార్థకంగా అన్వయిస్తుంది.

3. నాయకుడు ధర్మజుడు ధీరోదాత్తుడు, బలవంతాననైనా పిలువబడిన జూదానికి క్షత్రియుడు కాదనరాదన్న ధర్మానికి కట్టుబడినవాడు, అరణ్యాజ్ఞాతవాసాలను నిర్వహించటానికి సత్యసంధుడై అంగీకరించినవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

4. ఇందులోని నాలుగంకాలకు సరియైన కథాఘట్టాలను ఈ క్రిందివిధంగా గుర్తించవచ్చును.

   (1) దుర్యోధనుడితోనూ, విదురుడితోనూ ధృతరాష్ట్రుడు మంతనాలాడిన రంగం.

   (2) ధర్మరాజు శకునితో జూదమాడిన రంగం.

   (3) ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరాలిచ్చిన రంగం.

   (4) ధర్మరాజు శకునితో అనుద్యూత మాడిన రంగం.

5. శృంగారహాస్యాలు తప్ప అన్ని రసాలూ పోషించబడినాయి.

6. కావ్యవస్తువు దీప్తరసత్వం కలిగి, నానాభావోపసంపన్నం అయిఉన్నది.

7. ఉల్కాపాతాది అరిష్టాలు, అపశకునాలు ఎన్నో పొడసూపాయి.

8. శకునిమాయ ఇంద్రజాలంవంటిదే. శ్రీకృష్ణుడి మాహాత్మ్యం దివ్యమాయ. ఆ రెండూ ప్రదర్శితమయ్యాయి.

9. సాత్త్వతీ ఆరభటీవృత్తులు ప్రదర్శితమయ్యాయి. ఈ వృత్తుల సమగ్రచిత్రణం ఈ ఘట్టంలోని నాటకీయశిల్పం.

10. ఇది బహునాయక మైన రంగం. నాయకులంటే ప్రధానపాత్రలు నిర్వహించేవా రని గ్రహించాలి. పాండవులలో ధర్మజ భీమార్జునులు, కౌరవులలో దుర్యోధన కర్ణ శకుని దుశ్శాసనులు, వికర్ణవిదురులు, ధృతరాష్ట్రభీష్మాదులు ఇట్లా ఎందరో పాల్గొని వాగ్వివాదాలు చేసికొనిన ఘట్టాలు ఇందులో ఉన్నాయి.

ఈ లక్షణాలన్నీ మాయాద్యూతఘట్టం డిమప్రాయమై ప్రకాశిస్తుందని స్పష్టంచేస్తున్నాయి.

డిమరూపక నిర్వహణంలో రసపోషకాలై నిలిచే అభినయాంగాలు వృత్తులు. అవి నాలుగు- భారతి, సాత్త్వతి, ఆరభటి, కైశికి, బీభత్స కరుణరసాలలో భారతి, వీరాద్భుతశమాలలో సాత్త్వతి, రౌద్రభయానకాలలో ఆరభటి, శృంగారహాస్యాలలో కైశికి రాణిస్తాయని భరతుడి మతం. డిమం వీర రౌద్ర భయానకాద్భుతరసాలు ప్రధానంగా ఉండే రూపకం కాబట్టి దీప్తరసప్రయోగంగా ప్రకాశిస్తుంది. నన్నయ డిమాని కుండే ఈ స్వభావాన్ని లోనారసి దాన్ని నాటకీయమైన వృత్తులతో రమణీయంగా దిద్దితీర్చాడు.

సాత్త్వతీ, ఆరభటీవృత్తుల సమగ్ర నిర్వహణ

నన్నయ ఈ ఘట్టంలో సాత్త్వతీ ఆరభటీవృత్తులను సర్వాంగసమగ్రంగా నిర్వహించటం గమనిస్తే నన్నయ రూపకకళాశిల్పనైపుణ్యం ప్రకటిత మౌతుంది.

సాత్త్వతీవృత్తిలో పాత్రల మనఃప్రవృత్తులు ప్రకాశమానా లయ్యేటట్లు చిత్రించబడతాయి. మాయాద్యూతసభలో గోచరించే పాత్రల మనఃప్రవృత్తులను చిత్రిస్తూ నన్నయ నాటకీయతను పోషించటం గమనించదగిన ముఖ్యాంశం. సాత్త్వతీవృత్తిలో నాలుగురకా లుంటాయని భరతుడు పేర్కొన్నాడు. అవి:- ఉత్థాపకం, పరివర్తకం, సల్లాపకం, సంఘాత్యం. ఉత్థాపక మంటే- మానసికసంఘర్షణ సూచించే వ్యాపారం. పరివర్తక మంటే- మానసిక సంఘర్షణవలన చేయదలచిన కార్యాన్ని వదలి కారణాంతరంచేత మరొకకార్యాన్ని చేయటం. ఆధర్షణసహితంగా కానీ, రహితంగా కానీ ఇతరులను అధిక్షేపించటం సల్లాపకం. ఆధర్షణ మంటే నేరం మోపటం, తిరస్కరించటం, వాదాన్ని ఖండించటం, అన్యాయంగా పీడించటం. ధర్మార్థాంశాల చర్చలో రాగదోషసహితంగా సాధిక్షేపవచనాలు పలకటంకూడా సల్లాపక మని కొందరంటారు. ఇక సంఘాత్య మంటే- సామాద్యుపాయశక్తిచేతగాని, అర్థశక్తిచేత గాని, దైవవశంగా గాని, ఆత్మదోషంవలన గాని సంఘాతం (గట్టిదెబ్బ) భేదించబడటం. ఇది వ్యష్టిగా సమష్టిగా ప్రయోగించబడవచ్చును. కొందరు కూటమిగా చేరి అనేక కపటాలతో, ఇతరులను చంపవలెననీ వంచించాలనీ ఆశించి చేసే ప్రయోగం కూటసంఘాతం అంటారు. దానిని భేదించటం సంఘాత్యం. సాత్త్వతీవృత్తిలో కానవచ్చే భేదాలన్నీ సభాపర్వంలోని ఈ ఘట్టంలో సాంగంగా సాక్షాత్కరిస్తాయి.

ఆరభటు డంటే శూరుడు. అతడి చిత్తవృత్తినుండి జనించే క్రోధ ఆవేగాదులు, అనేకరకాల కపటచర్యలు, వంచనలు, దంభాలు, అనృతవాక్యాలూ కలిగి దీప్తరసాలైన రౌద్రాదులందు ప్రవర్తిల్లేది ఆరభటీవృత్తి. షాడ్గుణ్యంతో, వంచనా విద్రవాలతో, లాభా లాభాలతో కూడి ఉండేది ఆరభటీవృత్తి అని కొందరంటారు. ఇది నాలుగువిధాలు. 1.సంక్షిప్తకం. 2.అవపాతం. 3.వస్తూత్థాపనం. 4.సంఫేటం. అన్వర్థా లైన శిల్పాలు విపులమైన పుస్తములు (రంగదృశ్యాలు) విచిత్రమైన నేపథ్యం మొదలైనవాటిచేత సంజ్ఞామాత్రంగా వస్తువులను సూచించటం సంక్షిప్తకం. అధికమైన హర్షభయాదులతో పాత్రల ప్రవేశ నిర్గమాదులు జరగటం, విద్రవం (ఉపద్రవం)చేతకాని, వినిపాతం (పాటు, భంగపాటు, బాధ, దుఃఖం, అమర్యాద, అగౌరవం) వలనగాని ఆవేగప్రధానమైన చేష్టలను ప్రదర్శించటం అవపాతం. భావివస్తువును అనేకవిధాలుగా హృదయగోచర మయ్యేటట్లు (ధ్వనింప) చేయటం వస్తూత్థాపనం, సంరంభంచేత ప్రయుక్త మయ్యేదీ, యుద్ధ, నియుద్ధ, కపటాదులతో కూడుకొన్నదీ, శస్త్రప్రహారాలతో నిండిందీ సంఫేటం. ఆరభటీవృత్తిని సాంగంగా కపటద్యూతఘట్టంలో నన్నయ ఆవిష్కరించిన వైనం గమనిస్తే అతడి నాటకీయరచనాప్రతిభ మనలను ఆశ్చర్యపరుస్తుంది.

పరాక్రమార్జితమైన పాండవుల ఐశ్వర్యాన్ని మోసంతో అపహరించి, వారిని అపహసించి అవమానించే ప్రయత్నం కపటద్యూత ఘట్టంలోని కార్యం. ఇందులో ప్రతినాయకవిజృంభణం, నాయకపరాజయం వస్తువు. ప్రతినాయక కుటిలప్రయత్నమే మహాభారత రణానికి హేతువౌతున్నది. కర్మఫలభోగరూపమైన వస్తువు ఇతిహాసంలో ఉండటం సహజం కాబట్టి దుర్యోధన ధృతరాష్ట్ర స్వయంకృతా పరాధమే వారి స్వీయనాశానికి దారితీస్తుందనటం ప్రయోజనం. దానికి తగినట్లుగా ఈ కథ డిమప్రాయమై ఉండటం ఉచితం.

మహాభారతయుద్ధంలో (కురుక్షేత్రయుద్ధంలో) పాల్గొనే పాండవ కౌరవుల మనఃప్రవృత్తులను క్రమంగా ఆవిష్కరించే ఒక వికాసపద్ధతికి డిమరూపక నిర్మాణపద్ధతిని నన్నయ శక్తిమంత మైన వాహికగా వాడుకొన్నాడు. అందులో సాత్త్వతీ, ఆరభటీ వృత్తులు రెండు రెక్కలవలె పనికివచ్చాయి.

పాండవ రాజసూయవైభవాన్ని చూచి అందరూ ఆనందించారు. దుర్యోధను డొక్కడే అసూయతో అంతర్వేదనకు గురి అయ్యాడు. చిక్కి శల్యమైపోయాడు. తన దీనావస్థకు హేతువును తండ్రితో ఈవిధంగా మొరపెట్టుకొన్నాడు.

ఉ. “భావిపురాతనాద్యతన పార్థివలక్ష్ములు పాండవేయుల
క్ష్మీవిభవంబుతోడ నుపమింప సమంబులు గా; వశేష రా
జావళిలోన నత్యధికు లైన సపత్నులపేర్మిఁ జూచి యేఁ
జూవె సహింప నోపక కృశుండ వివర్ణుఁడ నైతి నెంతయున్”. **(సభా. 2.114)**

శత్రువుచేతకూడ ప్రశంసించబడి, అసూయపొందేటట్లు అతిశయించిన పాండవవైభవం ఇందులో ధ్వనించబడి ప్రశంసనీయ మైనది. కాని, దానిని అవలీలగా అపహరించాలన్న దుర్యోధనుడి సంకల్పం ధూర్తలక్షణం. ఉద్ధతస్వభావం. ఈ రూపంలో కార్యం ప్రారంభిస్తున్నది ప్రతినాయకుడు. తీవ్రమనోవేదనానంతరం ప్రతినాయకుడు బీజాన్ని తండ్రియెదుట నాటాడు. దానికి శకుని నీరుపోసి ప్రోత్సహించాడు.

క. “భానుప్రభు లగు పాండుమ
హీనాథాత్మజులలక్ష్మియెల్లను నీకున్
నే నపహరించి యిత్తు ధ
రానుత! మాయాదురోదరవ్యాజమునన్.” **(సభా. 2.122)**

అని ఉపాయాన్ని చూపాడు. శకుని పన్నాగాన్ని ధృతరాష్ట్రుడిచేత అంగీకరింపజేయాలని దుర్యోధనుడు ప్రయత్నించాడు. కాని, ధృతరాష్ట్రుడు విదురుడి నడిగి చేయటం ఉచిత మని భావించాడు. విదురుడిని పాండవపక్షపాతిగా పేర్కొని దుర్యోధనుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిందించాడు. దుర్యోధనుడు తలపెట్టిన మహావంచనకు ధృతరాష్ట్రుడు వెంటనే అనుకూలంగా స్పందించలేదు. విదురభీష్మద్రోణాదు లీ యత్నాన్ని గర్హిస్తారని భయపడ్డాడు. డోలాయమానస్థితిలో ఉన్న తండ్రిమనస్సును గమనించి దుర్యోధనుడు తనమాట మన్నించకపోతే అగ్నిలో దూకి ఆహుతి అయిపోతానని బెదిరించాడు. పుత్రవ్యామోహం అధర్మభీతిని మ్రింగివేసింది. ఉచితం కాదని అంతరాత్మ చెపుతున్నా కొడుకును కాదనలేక ఆ పాపకార్యానికి అంకురారోపణం చేశాడు ధృతరాష్ట్రుడు. సుయోధనుడి మనశ్శాంతికై మణిమయమహాసభను నిర్మింపచేశాడు.

దుర్యోధనుడు ధృతరాష్ట్రుడిని ఏవిధంగా మెడలు వంచి ఒప్పించాడో, అట్లాగే ధృతరాష్ట్రుడుకూడా విదురుడిచేత ఒప్పింపజేయటానికి ప్రయత్నించాడు. విదురుడితో ఏకాంతంగా ఒకనాడు దుర్యోధనశకునుల పన్నాగాన్ని గురించి ప్రస్తావించాడు. విదురుడు విరుచుకొని పడ్డాడు. పుత్రులనడుమ భేదబుద్ధి కలిగించటం అన్యాయమనీ, జూదంవలన కలహం తప్పదనీ హెచ్చరించి, శకుని దుర్యోధనుల ప్రయత్నాన్ని మాన్పు మని ప్రబోధించాడు. ధృతరాష్ట్రుడు దానికి మెత్తపడలేదు సరికదా మెత్తబడని విదురుడినే మెత్తపరచటానికి పూనుకొన్నాడు. తన మనసులోని మర్మం బైటపడకుండా ధర్మపన్నం చదివాడు.

ఉ. “పుత్త్రుల కేల భేదమగు? భూనుత! యేనును నీవు జాహ్నవీ
పుత్త్రుఁడు నుండఁగా నహితమున్ భయమున్ దొరకొన్నె? నాకు నా
పుత్త్రులకుం బ్రసాదకృతబుద్ధులు వేల్పులు గాన దీనికిన్
మిత్త్రనిధీ! యొడంబడుము మిన్నక సంశయమంద నేటికిన్?” (సభా. 2.133)

మనస్సులో పుత్రుడివైపు. మాటలలో విదురుడివైపు పలికిన ధృతరాష్ట్రుడు మేకతోలు కప్పుకొన్నపులివలె మాట్లాడాడు. జూదమాడటంవలన కలహంవస్తే మాన్పే శక్తులుగా ముగ్గురిని చూపించాడు- తాను, విదురుడు, భీష్ముడు. తనమీద విదురుడికి నమ్మకం లేకపోయినా విదురుడిమీద, భీష్ముడిమీద తనకు నమ్మక మున్నట్లు పలికాడు. విదురుడి విద్వత్తును బంగారుగొలుసుతో కట్టి కదలకుండ చేశాడు. ఇంద్రప్రస్థపురానికి పోయి ధర్మజుడిని పిలిచికొని రమ్మన్నాడు. విదురుడు భీష్ముడి కీ సంగతి చెప్పాడు. ఇద్దరూ మ్రింగలేక క్రక్కలేక ఉక్కిరిబిక్కి రయ్యారు.

విదురుడు చెప్పింది నిప్పువంటి నిజం. జూదంవలన తగాదా వస్తుంది. దానివలన యుద్ధ మౌతుంది. ప్రజానష్టం జరుగుతుంది. ఆ యుద్ధంలో వీరులే గెలుస్తారేమో! కపటులైన తన పుత్రులకు అపాయం వాటిల్లుతుందేమో! గ్రుడ్డిరాజుగుండెలో గుబులు మొదలైనది. విదురుడు చెప్పిన హితబోధలో దుర్యోధనుడి మనస్సును మార్చే ప్రయత్నంచేయాలన్న సూచన ఉన్నది. అది అతడికి సాధ్యం కాదేమో! అయినా ప్రయత్నంచేయటంలో తప్పులేదని ఒకనాడు తన కొడుకును పిలిచి, జూదం వలన కలిగే అహితాలన్నీ చెప్పి,

ఉ. “ఇమ్మహి నీవుఁ బాండవులు నెప్పటియట్ల పరస్పరానురా
గమ్మున నేలుచున్కి యిది కార్యము; పాండవలక్ష్మి నీ కస
హ్యమ్మన నేల? వంచనఁ బరార్థపరిగ్రహబుద్ధిఁ జేసి పా
పమ్మగుఁ; బాపకారులకుఁ బాయు నవశ్యము నర్థధర్మముల్.” (సభా. 2.136)

అని హితవు చెప్పాడు. జూదం విదురసమ్మతం కాదనీ, పాండవసంపదకంటె కౌరవులకు అయిదురెట్లు ధనమున్నదనీ, ధర్మజుడు చేసినన్ని యజ్ఞాలు దుర్యోధనుడుకూడా చేసి భూలోకంలోని రాజులందరి సంపదలను ఉపాయనాలుగా పొందవచ్చుననీ, బుజ్జగించి చెప్పాడు. దానికి దుర్యోధనుడు సుముఖుడు కాకపోగా, పైపెచ్చు తనకు జూదమే యజ్ఞమని ఘోషించాడు.

క. "ఇమ్ముల ధర్మజుతో జూ
దమ్మాడఁగఁ గాన్ప నాకు ధరణీశ్వర! య
జ్ఞ మ్మదియ సమస్తైశ్వ
ర్యమ్ములు వడయఁగ నుపాయ మభిమతసిద్ధిన్" (సభా. 2.138)

అని తన మనోభీష్టాన్ని స్పష్టంచేసి, తాను స్వయంగా చూచిన పాండవసంపదను, దర్శించిన మయసభా వైభవాన్నీ, పొందిన భంగపాటును, అవి తనను హృదయశల్యాల వలె బాధిస్తున్న వైఖరినీ వివరించి, సుఖోపాయంతో పరసంపదను గ్రహించటం ఉత్తమ పురుషార్థ మనీ, సుహృద్ద్యూతం ఉత్తమపుణ్యప్రద మనీ వాదించి, ఇంద్రుడు నముచిని చంపి అతడి సంపదను హరించిన ఐతిహ్యాన్ని దృష్టాంతంగా చెప్పి, తన వంచనయత్నం అధర్మం కాదని తేల్చి చెప్పి, తన ప్రయత్నాన్ని ధ్రువపరిచాడు.

తే. "అహితవృద్ధి యుపేక్షితం బగుడు నల్ప
మగు మహావ్యాధియును బోలె నది యసాధ్య
మయి యుపేక్షకు నిర్మూలితాత్ముఁ జేయుఁ
గానఁ బాండవశ్రీ యుపేక్ష్యంబు గాదు." (సభా. 2.145)

అని నీతిశాస్త్రాన్ని తనకు ఉపబలకంగా చూపించుకొన్నాడు. పాండవసంపదను ఏవిధంగానైనా సాధిస్తాననీ, లేకపోతే తన మనస్తాపం తీరదనీ గంద్రగొండిగా చెప్పాడు. శకుని దానికి వంతపాట పాడాడు. కాని, వారివ్యూహానికి ధృతరాష్ట్రుడు అంగీకరించలేదు. విదురుడి ధర్మబుద్ధిని సమర్థించి, జూదయత్నాన్ని మానుమని కొడుకుకు హితవు చెప్పాడు. ఇక్కడ ప్రతిముఖసంధి ప్రవర్తిల్లింది.

తన ప్రయత్నానికి పెద్ద అడ్డు తగలటంతో దుర్యోధనుడు తీవ్రయత్నం మొదలుపెట్టాడు. తండ్రికి వ్యక్తిత్వం లేదని, తనవా రెవరో పరాయి వారెవరో తెలియదనీ, తనపని ఇతరుల అభిప్రాయాల కనుగుణంగా చేయకూడదనీ, విదురుడు పాండవహితం కోరేవాడనీ, ఆ పక్షపాతబుద్ధి కలవాడిని ఆప్తుడిగా పరిగణించరాదనీ, జూదం పురాణాలలోకూడా పుణ్యకార్యంగా చెప్పబడిందనీ నీతిసమ్మతంగా తన వాదాన్ని వినిపించాడు. ధృతరాష్ట్రుడు చాలసేపు ఆలోచించాడు. తనకు కావలసింది పుత్రసంతోషమా? ధర్మప్రవర్తనమా? అన్న ప్రశ్న అతడి మనసులో సంఘర్షణగా నిలిచింది. మథనపడ్డాడు. చివరకు పుత్రవ్యామోహమే గెలిచింది. 'బుద్ధిః కర్మానుసారిణీ'. విదురుడిని పిలిచి ధృతరాష్ట్రుడు విస్పష్టంగా ఆదేశించాడు- ధర్మరాజును కొనితెమ్మని, దుర్యోధన ధర్మజులనడుమ సుహృద్ద్యూతం ప్రవర్తిల్లుతుందని. విదురుడు తలవంచాడు- జరుగబోయేది సుహృద్ద్యూతం కాదని మాయాదురోదరమనీ దానివలన దురర్థం పుడుతుందనీ భావిస్తూ విషణ్ణుడై కర్తవ్యోన్ముఖు డైనాడు.

విదురుడిని పంపటంవలన ధృతరాష్ట్రుడు భావికార్యం తప్పక జరిగే వ్యూహం సాధించగలిగాడు. దుర్యోధనుడి యత్నానికి విదురుడి సౌముఖ్యం బిందువు వంటిది. ముఖ ప్రతిముఖసంధులు ప్రవర్తిల్లిన ఈ సన్నివేశం ఒక అంకం వంటిది. ఇందులో కథాకథనంకంటె సంభాషణలు విస్తృతంగా సాగాయి. ఆణిముత్యాలవంటి పద్యాలు సార్థక సంభాషణలవలె ఆ యా పాత్రల మానసిక ప్రవృత్తులను, మనస్సంఘర్షణలను వ్యక్తంచేస్తూ సాత్త్వతీ వృత్తిలోని ఉత్థాపక మనే శాఖను సుసంపన్నం చేశాయి. దుర్యోధన, ధృతరాష్ట్ర, విదుర పాత్రల మనస్సంఘర్షణలతో ఈ అంకం రక్తికట్టింది. దానికి పోషకంగా సంక్షిప్తకం అనే ఆరభటీ వృత్తిభేదం - దుర్యోధనుడు పాండవవైభవాన్నీ, మయసభ విలాసాన్నీ, తన భంగపాటు పరితాపాన్నీ చెప్పేటప్పుడు రాణించింది. మయసభా శిల్పాలను గురించి, అందులోని దృశ్యాలను గురించి ప్రశంసించటం అందులో పొందిన అవమానమే మాయాద్యూత వ్యూహానికి నేపథ్యమనే సత్యాన్ని వెల్లడించటం సంక్షిప్తక మనే ఆరభటీవృత్తిని పోషించాయి. సుయోధనుడి ప్రయత్నం అర్థమూలం కాబట్టి అతడి క్రోధంవలన రౌద్రం పోషించబడుతున్నది. అది అధర్మమూలం కావటంచేత విదురాదులకు విషాదం కలిగించింది. కొడుకును సమర్థించిన ధృతరాష్ట్రుడు సైతం నిప్పు రగులుకొన్న కట్టెవలె లోలోన దహించుకొనిపోయాడు. రసోద్దీప్తి రంగాన్ని రక్తికట్టించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మరాజు శకునితో బలవద్ద్యూతం ఆడిన ఘట్టం డిమంవంటి రూపకంలోని శక్తిమంత మైన రెండవ అంకంవంటిది. అందులో గర్భసంధి భాసించింది. అంతేకాక పరివర్తనం, సల్లాపకం అనే సాత్త్వతీవృత్తులూ, అవపాతం, వస్తూత్థాపనం అనే ఆరభటీవృత్తులూ విస్తారంగా ప్రయోగించబడ్డాయి. నన్నయ ఉభయకావ్యకళాశిల్పానికి ఈ ఘట్టం (రంగం) ఉన్నతపతాకగా నిలిచింది.

హృదయసంఘర్షణవలన చేయదలచిన కార్యాన్ని విడిచి, కారణాంతరంచేత వేరొకకార్యాన్ని ఆచరించే పరివర్తక సాత్త్వతీవృత్తి ధర్మజుడిలో మొదట దర్శన మిస్తుంది. సుయోధనుడు చూపించగా ధృతరాష్ట్రనిర్మిత మణిమయసభను చూచి ధర్మజుడు మెచ్చుకొన్నాడు. దుర్యోధనుడు కపటమైన తన పావును కదిలించాడు.

క. “అనఘ! సుహృద్ద్యూతం బిం
దొనరింతము; ప్రొద్దువోకయును నగు; జూదం
బునకుం బ్రియుఁడవు దక్షుఁడ
వన విందుము నిన్నుఁ బ్రీతి నక్షజ్ఞులచేన్” **(సభా. 2.164)**

అని ద్యూతానికి ఆహ్వానించాడు. ధర్మరాజు ఆవులించిన ప్రేవులు లెక్కపెట్టగలడు. దుర్యోధనుడు ద్యూత మాడలేడు. శకుని అతడి భుజంవంటివాడు. అతడు మాయాదురోదరంలో మహానిపుణుడు. మోసగాడు. దుర్యోధనుడికి బదులు అతడు రంగంలోకి దిగవచ్చును. అసలు ఆ ఊహకు అతడే కారకుడు. ఇవన్నీ కడుపులో పెట్టుకొని ధర్మజుడు కపటద్యూతాన్ని అధిక్షేపిస్తూ మాట్లాడాడు. సాత్త్వికంగా అధిక్షేపించాడు. తనను బలవంత పెట్టకుండా ముందుకాళ్ళకు బందాలు వేశాడు. ఆమాట లివి-

తే. “క్షత్త్రనీతిక్రమంబులు గావు సూవె
నికృతియును జూదమును ధర్మనిత్యు లైన
వారి కీ రెండు వర్జింపవలయు నెందుఁ;
బాపవృత్తంబు జూదంబు పార్థివులకు.

ఆ. “కుటిలమార్గు లయిన కుత్సితకితవుల
తోడఁ గడఁగి జూదమాడఁ జనదు;
దానఁజేసి యర్థధర్మవివర్జితు
లగుదు రెట్టివారు జగములోన.” **(సభా. 2.166,167)**

కుటిలమార్గులు, కుత్సితులు అయిన కితవుల ప్రసక్తి పైకి సాధారణంగా వినపడినా ప్రక్కనున్న శకునికి అధిక్షేపమై తగిలి వచ్చింది. పిలిచిన దుర్యోధనుడు నిరుత్తరుడైనాడు కాని, మోసగాడైన శకునిమాత్రం మాటందుకొన్నాడు. ‘ధర్మజా! నీవంటి కళాకుశలుడే ఆ కళను దూషించటం నీతి కా’దన్నాడు. బలహీనులు బలవంతులను జయించేటప్పుడు మోసం తప్పదనే లోకనీతిని పేర్కొన్నాడు. జూదానికి నీవు భయపడితే, మానుకొనవచ్చు’ నన్నాడు.

ధర్మజుడు మొదట జూదంనుండి తప్పుకొందా మనుకొన్నాడు. కపటద్యూతాన్ని తిట్టి, తనకు పనికివచ్చే ధర్మసూత్రాన్ని ప్రతిపాదించాడు. శకుని నిపుణంగా పథకం మార్చాడు ‘ఆటకు భయపడితే మానుకోవచ్చు’ అన్నాడు. అభిమానధనుడైన యుధిష్ఠిరుడికి అది సవాలుగా తగిలింది. ‘బలవద్ద్యూతానికి పిలువబడి ఆడకుండా తిరిగిపోవటం న్యాయం కాదుకదా! ఇక పెక్కుమాట లెందుకు?’ అని అనుకొంటూ ముగ్గులోకి దిగాడు. ఊహించినట్లే దుర్యోధనుడు తనకు బదులు శకునితో పందెం వేయిస్తా నన్నాడు. అతడు కాచిన పందాలకు తాను పూచీపడతానన్నాడు. ధర్మజుడు కటకటపడ్డాడు. ‘ఒకరికొరకు మరొకరు జూదం ఆడటం అన్యాయం’ అని విసుక్కొన్నాడు. కాని, తెగించి జూదాన్ని మానలేకపోయాడు. పోగా, తెగించి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జూదానికి దిగాడు. దానితో- రెండవ అంకం రసకందాయంలో పడింది. ధర్మజుడు మొదట తలచిం దొక్కటి, శకుని తెచ్చిన ధర్మసంఘర్షణ వలన చివరకు చేసింది మరొక్కటి, ఇది కథాగతికి బలమైన హేతువు. ఇక్కడ పరివర్తన మనే సాత్త్వికవృత్తి పరిపూర్ణంగా ప్రకాశించింది.

ధర్మజుడు జూదంలో ఓడుతూ ఒక్కొక్క పందానికి కోల్పోయిన విలువైన కథనం సంక్షిప్తకం అనే ఆరభటీవృత్తికి నిదర్శనం. ధర్మరాజు సంపదనంతా కోల్పోయి ఓటుపడ్డాడు. పుత్రులమధ్య తగవు రాకుండా చూచే బాధ్యత తనమీదా ధృతరాష్ట్రుడిమీదా ఉన్నదనిచెప్పిన ధృతరాష్ట్రుడి మాటలను మనసులో తలంచి విదురుడు ధృతరాష్ట్రుడితో రహస్యంగా హితవు చెప్పాడు. ఇక ఇక్కడినుండి సల్లాపక మనే సాత్త్వతీవృత్తీ, అవపాతం అనే ఆరభటీవృత్తీ సర్వాంగసమగ్రంగా రంగప్రయోగంలో ప్రవర్తిల్లాయి. సల్లాపకంలో ఇతరులను అధిక్షేపించే సంభాషణలు విశేషంగా ఉంటాయి. అవి- ఒకరిమీద ఒకరు నేరం మోపుకొనే తీరులో కాని, పరస్పరం తిరస్కరించుకొన్నట్లుగా గాని, ఒకరి వాదాన్ని మరొకరు ఖండించుకొన్నట్లుగాగాని, అన్యాయంగా పరులను పీడించినట్లుగాగానీ, ధర్మాంశాలను చర్చించేటప్పుడు రాగదోషసహితంగా సాధిక్షేపంగా పలికినట్లుగా గాని సల్లాపకంలో అధిక్షేపాలు సాగుతాయి. సల్లాప సాత్త్వతీవృత్తితోపాటు అవపాతమనే ఆరభటీవృత్తి ప్రవర్తిల్లటంచేత- రంగంమీద భయహర్షాతిశయంతో పాత్రలు ప్రవేశనిర్గమాలు చేయటం, ఉపద్రవాలు కాని, భంగపాట్లు గాని జరిగినట్లు ప్రదర్శించటం జరుగుతుంది. ఈ దృష్టితో ఈ క్రింది అంశాలలో నాటకీయతను అన్వయించుకొనవచ్చును.

1. విదురుడు ధృతరాష్ట్రుడితో - దుర్యోధనుడు పుట్టినప్పుడు కలిగిన దుర్నిమిత్తాలను పేర్కొని, అతడివలన కులానికి కలుగుతున్న ఎగ్గును సూచించి, కులరక్షణార్థం అతడిని వధించటమో దేశబహిష్కృతుడిని చేయటమో తగునని ప్రతిపాదించాడు. పాండవులను దరికితీసి మన్నించు మని ప్రబోధించాడు. ఫలవృక్షాలను కట్టెలకొరకు తగులబెట్టే బొగ్గులవాడివలె, బలిసిన యెద్దు దర్పంతో కొండచరియను చీల్చటానికి పూనుకొన్నట్లు దుర్యోధనుడు పాండవులతో తగవుపెట్టుకొంటున్నాడనీ, ఆ దుష్టద్యూతాన్ని ఇకనైనా ఆపుమనీ చెప్పిన హితోక్తులలో దుర్యోధనుడి దుర్మార్గంవలన కలిగే ఉపద్రవాల ప్రసక్తి ఏర్పడి ఆరభటీవృత్తి పోషించబడింది.

2. ధృతరాష్ట్రుడు తన హితవు వినకపోవటంతో విదురుడు స్వయంగా దుర్యోధనుడిని అధిక్షేపిస్తూ మాట్లాడాడు. దానికి ప్రత్యాఖ్యానంగా దుర్యోధనుడు విదురుడిని అహితుడిగా నిందించి తమకు తొడమీద ఉంచుకున్న పామువంటివాడని నేరంమోపాడు. దానికి విదురుడు కోపించి అధిక్షేపోక్తులతో మందలించి ధర్మంచెప్పి ఊరుకొన్నాడు. ఆ ఇరువురి మధ్య ఒకరిమీద ఒకరు దోషం మోపుకొనే తీరులో అధిక్షేపసంభాషణలు సాగి సాత్త్వతీవృత్తి భాసించింది.

3. ధర్మరాజు తమ్ములను, తనను, ద్రౌపదిని క్రమంగా జూదంలో ఓడిపోయి, తలవంచుకొని మిన్నకుండగా, దుర్యోధనాదులు హర్షాతిశయంతో సభలో అనౌచిత్యంగా వ్యవహరించారు. దుర్యోధనుడు విదురుడిని పోయి ద్రౌపదిని తీసికొనిరమ్మన్నాడు. ఆ అనుచితపు పనికి, మాటలకు విదురుడు కోపించాడు.

క. "మదమలినమనస్కుఁ డరుం
తుదుఁడు నృశంసుఁ డనఁ బరఁగు దుర్జనునకు సం
పద లెడ లయ్యును నాతని
మొదలిటి సంపదలతో సమూలంబు సెడున్" **(సభా. 2.202)**

అని భావికథార్థసూచకంగా దుర్యోధనుడిని శపించినట్లు తిరస్కరించాడు.

దుర్యోధనుడు ప్రాతికామిని పంపాడు. అతడు పాంచాలివద్దకు పోయి సంగతులన్నీ చెప్పి దుర్యోధను డున్న సభకు రమ్మని పిలిచాడు. భార్యను జూదంలో ఓడినవారు రాజలోకంలో ఎవ్వరూ లేరని ఆశ్చర్యపోయింది ద్రౌపది. ఒక ధర్మసందేహాన్ని రేపి, దానిని ధర్మరాజు నడిగి సమాధానం తెమ్మన్నది. అతడు రమ్మంటే వస్తానని ప్రాతికామిని తిరిగిపంపింది. ఆమె ప్రశ్న ఇది:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తె. "మున్ను దన్నోటువడి మఱి నన్ను నోటు
వడియెనో? నన్ను మున్నోటువడి విభుండు
గ్రన్నఁ దన్నోటువడియెనో యన్న! నాకు
నెఱుఁగఁ జెప్పుము దీని నీ వెఱుఁగుదేని." (సభా. 2.209)

ప్రాతికామి తిరిగి సభకు వచ్చాడు. పైప్రశ్నను ధర్మజుడికి నివేదించాడు. అత డేమి పలుకక దుఃఖాతిశయంతో మిన్నకున్నాడు. దుర్యోధనుడు కల్పించుకొని, అధిక్షేపకాత్మకంగా 'ద్రౌపదిని తానే వచ్చి నిండుకొలువులో తెలిసికొ'మ్మని వెటకారంచేస్తూ మరల ప్రాతికామిని ద్రౌపదిదగ్గరకు పంపాడు. పరిస్థితుల వైపరీత్యాన్ని ద్రౌపది గుర్తించి ఏకవస్త్ర అయిఉన్నా, కన్నీటిధారలతో కదలి ప్రాతికామివెంట కౌరవసభకు వచ్చింది. భీతయై ధృతరాష్ట్రుడి చెంత నిలిచింది. దుర్యోధనుడు మదోద్ధతుడై దుశ్శాసనుడిని ఆజ్ఞాపించాడు- ఆమెను సభామధ్యప్రాంతానికి తీసికొనిరమ్మని, ఆమె భయకంపితురాలై గాంధారియొద్దకు పరుగెత్తిపోయి నిలిచింది. దుశ్శాసనుడు ఆమెను సమీపించాడు. ద్రౌపది తాను రజస్వల ననీ, ముట్టవద్దనీ, ఏకవస్త్రనై పెద్దలున్న సభకు రాజాల ననీ మొరపెట్టింది. ఆమెమాటలు తిరస్కరించి 'నీవు ఏకవస్త్రవైతే నేమి? విగతవస్త్రవైతే నేమి?' అని ధిక్కరించి, దుశ్శాసనుడు నిర్దయుడై రాజసూయావభృథ స్నానంతో పవిత్రమైన ఆమె దీర్ఘశిరోజాలను పట్టి నిండుసభకు లాగికొనివచ్చాడు. ఈవిధంగా హర్షంతో దుర్యోధనవర్గంవారూ, భయంతో ద్రౌపదీ, సభలో ప్రవేశనిర్గమాలు చేయటంవలనా, ఆ తరువాత ద్రౌపదీవస్త్రాపహరణ ఘట్టంలో ఆవేగప్రధానమైన చేష్టలు ప్రదర్శితం కావటంవలనా అవపాత మనే ఆరభటీవృత్తి రచనలో ఉద్దీప్తంగా పోషించబడింది.

నిండుసభలో పాంచాలి దుఃఖితఅయి నిలచిఉండగా భీముడు సహించలేక కోపోద్రిక్తుడై, భార్య నూరడించాలని భావించి, ధర్మరాజును తూలనాడి, శకునిమోసం తెలిసికూడ జూదమాడిన అతని చేతులు కాల్చాలని విజృంభించాడు. దుఃఖాతిశయంతో మనసు కలతచెంది ఒకటి చేయబోయి మరొకటి చేసిన ఉదంతం భీముడిది. అర్జునుడు అతడిని సమాధానపరచాడు. ఇందులో పరివర్తకమనే సాత్త్వతీవృత్తి ఉన్నది.

వికర్ణుడు సభలో నిలువబడి ఇట్లా హెచ్చరించాడు-

క. "సమచిత్తవృత్తు లగు బు
ద్ధిమంతులకు నిపుడు ద్రౌపదీప్రశ్న విచా
రము సేయవలయు నవిచా
రమునఁ బ్రవర్తిల్లు టది నరకహేతు వగున్". (సభా. 2.226)

ద్రౌపది అధర్మవిజిత అనీ, ఏకవస్త్రను సభకు తేవటం అధర్మమనీ ఎలుగెత్తి చాటాడు. అతడిని కర్ణుడు తిరస్కరించి మాట్లాడి, అతడి వాదాన్ని ఖండించి, ఆమె ధర్మవిజితయే అనీ, ఆమె బహుభర్తృక కాబట్టి వివస్త్రను చేసితెచ్చినా తప్పు లేదనీ వాదించాడు. ఆ సూచనకు రెచ్చిపోయి దుర్యోధనుడు ద్రౌపదివలువలు పాండవుల వలువలు వలువవలసిందని దుశ్శాసనుడిని ఆజ్ఞాపించాడు. ఇది పరులను అన్యాయంగా పీడించే ఆధర్షణం. ఇది సల్లాపక మనే సాత్త్వతీవృత్తి స్వభావం. ఇది దుర్యోధనుడిలో పరాకాష్ఠ నందుకొన్నది. దుశ్శాసనుడు ద్రౌపదీవస్త్రాపహరణం చేయ ప్రయత్నించాడు. శ్రీకృష్ణుడు ద్రౌపది మేనిమీది వస్త్రం తొలగకుండ తన మహిమతో ఆమె మానాన్ని, ధర్మాన్ని కాపాడాడు. దుశ్శాసనుడు ఎన్ని చీరలు లాగినా ఆమె మేనిమీది చీర తొలగక నిలిచిఉండేది. పర్వతమంత కుప్ప పడేంతవరకు చీరలు ఒలిచి ఒలిచి, అలసి సొలసి ఊరకుండిపోయాడు. భీము డప్పుడు భీషణప్రతిజ్ఞ చేశాడు.

మ. "కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనేకుల్ సూచుచుండన్ మదో
ద్ధురుఁడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోకభీ
కరలీలన్ వధియించి తద్విపులవక్షశ్శైలరక్తౌఘని
ర్ఝర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్". (సభా. 2.233)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇందులో సల్లాపం, అవపాతం, వస్త్రాత్థాపనం ముప్పేటగా మోహరించాయి. భీముడి ప్రతిజ్ఞలు దుర్యోధన కర్మఫలసూచికలు, భావికథార్థ పతాకలు, వీరరౌద్రరస పోషకాలుగా వర్తించే సాత్త్వతీ ఆరభటీవృత్తుల సమగ్ర విస్ఫూర్తులు! అభినయాకృతులు!

భీముడి అతిమానుష మైన ప్రతిజ్ఞకు సభ దద్దరిల్లింది. సభికులు ధృతరాష్ట్రుడినీ, అతడికొడుకులనూ మనసులో నిందించారు. సభ క్షోభించింది. విదురుడు సభాసదులను సద్దుమణగింపచేసి, ద్రౌపది అడిగిన ప్రశ్నకు సభలోని పెద్దలు సమాధానం చెప్పాలని కోరాడు. వికర్ణుడి తెగువను ప్రశంసించాడు. సభలో ధర్మం చెప్పకుండా మిన్నకుండేవారు ఆ పాపంలో పాలుపంచుకొంటారనీ, అసత్యదోషం అనుభవిస్తా రనీ హెచ్చరించాడు. విరోచనుడి కథను ఇతిహాసదృష్టాంతంగా చూపించాడు. అతడి దీర్ఘోపన్యాసం బూడిదలో పోసిన పన్నీరైపోయింది. దుర్యోధనుడికి భయపడి సభికు లెవ్వరూ నోరెత్తలేదు.

నన్నయ రచనలోని నాటకీయశిల్పంలో ఇక్కడ ఒక రంగనిర్వహణ నైపుణ్యాన్ని గమనించాలి. మాయాదురోదరంవలన పుడుతున్న ఉపద్రవాన్ని అడ్డుకొనటానికి యత్నించే ధార్మికశక్తి విదురుడు. అతడు నిండుసభలో ధర్మప్రసక్తి తెచ్చినప్పు డల్లా దుర్యోధనుడు తిరస్కారభావంతో రెచ్చిపోయేవాడు. హర్షగర్వాతిశయంతో అనౌచిత్యపు ఆఘాయిత్యాలు చేసేవాడు. అవి పాండవులకు, ప్రత్యేకంగా భీముడికి, అపారకోపాన్నీ, ద్రౌపదికి అపారదుఃఖాన్నీ కలిగించేవి. భీము డొక భీషణప్రతిజ్ఞ చేసేవాడు. దానితో ఒక రకమైన కార్యవర్తులం పూర్తి అయినట్లయ్యేది. విదురుడి బోధ- దుర్యోధనుడి దుశ్చర్య- భీముడి ప్రతిజ్ఞ- ఇట్లా రెండు ఆవృత్తులు తిరిగాయి ఈ రంగంలో. దానివలన కౌరవుల హర్షాతిరేకం, కర్ణాదుల దుష్టాలాపం, విదురాదుల ఆగ్రహాతిరేకం, ద్రౌపది దుఃఖావేశం, భీమాదుల రౌద్రోద్రేకం ప్రవర్తిల్లి సాత్త్వతీ ఆరభటీవృత్తులు రసోపస్కారకాలుగా వర్తిల్లటానికి తోడ్పడ్డాయి. ఈ రెండు రంగప్రయోగవర్తులాలలో ఒకదాని కంటె మరొకటి రసవత్తరమై రాణించటం విశేషం. ఈ చివరి వర్తులం శిల్పసుందరం.

విదురుడి దీర్ఘోపన్యాసంతరువాత సభలో దీర్ఘనిశ్శబ్దం. ద్రౌపదిని సమర్థించే సత్పురుషుడు ఒక్కడుకూడా ఆ సభలో లేడని తేలిపోయింది. అదీ ఆ సభలోని దారుణవాతావరణం. అప్పుడు ద్రౌపది ఎలుగెత్తి మరొక ప్రశ్న వేసింది.

సీ. "అవ్విధంబున నొప్పి యాస్వయంవరమునాఁ । డఖిలభూపతులచే నట్లు సూడఁ
బడి పాండవులధర్మపత్నినై, గోవిందు । చెలియలినై, వీనిచేత నిట్లు
పరిభూత నగుచు సభామధ్యమున మహీ । పతులచేఁ జూడంగఁ బడితి; నింత
వడుదునె? యిపుడు నా పలుకుల కెవ్వరుఁ । బ్రతివచనం బేల పలుకరైరి?

ఆ. ధన్యులార! యే నదాసినే? దాసినే? । యెఱుఁగఁ జెప్పి పనుపుఁ డెల్లదాని....." **(సభా. 2.244)**

నని అడిగింది. అలనాడు స్వయంవరసభలో అందరిచేత ఆమె ఒక్కతె అంత గౌరవంగా చూడబడింది; ఈనాడు కురుసభలో ఇందరిచేత ఈవిధంగా అగౌరవంగా చూడబడింది. ఆమె జీవితంలో ఆ రెండు సభలు నిర్వహించిన పాత్రలను తులనాత్మకంగా సభికులముందు చలనచిత్రంవలె ప్రదర్శించింది. ఇది కౌరవులపట్ల వ్యంగ్యమైన అధిక్షేపం. ఆ ద్రుపదుడిసభలో ఆమె పాండవపత్ని అయింది. ఈ సభలో గోవిందుడి చెల్లెలుగా నిరూపించుకొన్నది. అవమానంనుండి తనను తాను రక్షించుకొనగలిగింది. దుశ్శాసనుడు చేసిన దుశ్చర్యను తన సచ్ఛీలంతో త్రిప్పికొట్టగలిగింది. ఆమె తన పతివ్రతాశక్తిని, శ్రీకృష్ణశక్తిని, ధర్మానురక్తిని ప్రదర్శించి కర్ణుడు చేసిన (బంధకివంటి) అధిక్షేపాలకు వ్యంగ్యంగా సమాధానం చెప్పింది. ఆమె మొదట అడిగిన ప్రశ్నకు సమాధానం వివరించి చెప్పే నాథుడు లేని ఆ సభలో, ఆ ప్రశ్నయొక్క ఫలితాంశాలను రెండు ముక్కలలో అడిగింది- 'నేను అదాసినా? దాసినా?' అని. అందులో ఏ ఒక్కమాట చెప్పినా చాలు అని సభికులముందు ఆక్రోశించింది. ద్రౌపది మానసికసంఘర్షణ మంటలాగా రేగి సభను చురుక్కు మనిపించిన ప్రశ్న అది.

దానికీ ఎవ్వరూ మాట్లాడ లేదు. ఎంతో నిగ్రహంతో నిశ్శబ్దంగా ఉన్న భీష్ముడు ఎట్టకేలకు నిగ్రహించుకోలేక ఒక్కమాట అన్నాడు. "అమ్మా! నీ వడిగిన ప్రశ్నకు యుధిష్ఠిరుడు మాత్రమే బదులుచెప్పగలడు. దీనిలోని ధర్మసూక్ష్మం తెలియటం మరెవ్వరికీ సాధ్యంకాదు. దీనికి ఫలం ఈ కురుకుల కంటకులు త్వరలోనే అనుభవిస్తారులే' అని పలికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఊరుకొన్నాడు. భీష్ముడి సమాధానం సమస్యను తీర్చేది కాదు. పైపెచ్చు- ద్రౌపది ఆ ప్రశ్నను మొదట ధర్మరాజుకే వేసింది కదా! అత డేమీ మాట్లాడకపోయె; మరిం కెవ్వరు మాట్లాడగలరు? ఆమె మమ్ములను ముందు అడుగలేదు....అన్నట్లు మెత్తగా మందలించినట్లయింది. అంతటితో ఆగకుండ ధార్తరాష్ట్రులను నిందించాడు. భీష్ముడి మాటలు విదురుడి వాక్యాలవలెనే ఆధర్వణ రహితమైన అధిక్షేపాలకు ప్రతినిధులుగా నిలిచాయి.

భీష్ముడు దుర్యోధనుడి దుష్టవర్తనాన్ని దూషించినట్లు వ్యంగ్యంగా మాట్లాడేసరికి, మిత్రుడిమీద ఈగవాలనివ్వని ప్రాణమిత్రుడు కర్ణుడు, నిస్సహాయురాలుగా నిలువబడిన ద్రౌపదిని చూచి, అధిక్షేపాత్మక మైన అవహేళనం చేశాడు. దానివెనుక భీష్మవచన ప్రభావంకూడా లేకపోలేదు. ధర్మసందేహం తీర్చగల భర్త ధర్మరాజు, అతడే ఊరుకున్నాడు. దానికి కారణం జూదంలో ఓడిపోవటం. దాసుడు మాట్లాడకూడదు కాబట్టి, మౌన మర్ధాంగీకార మన్నట్లు ధర్మజుడు దాసుడని మౌనంతోనే ఒప్పుకొన్నాడు. అతడితోపాటు అతడి తమ్ములు, వారందరితోపాటు వారి భార్య పాంచాలి. ఇది చెప్పకుండానే స్పష్టమౌతున్న కథార్థం. ఈ దైన్యస్థితిని గమనించి కర్ణుడు ద్రౌపదిని నిష్కారణంగా పీడించాలని పూనుకొన్నాడు. 'ఓ తరుణీ! నీకు ఐదుగురికంటె ఒకే భర్త ఉండటం మంచిది. జూదంలో ఓడిపోనివాడిని ఒకడిని భర్తగా ఎన్నుకోవటం సబబు' అని వికటంగా నవ్వాడు. స్వయంవరసభతో కౌరవసభను పోల్చి తమను అధిక్షేపించిన ద్రౌపదికి తగిన జవాబిచ్చినట్లు మాట్లాడాడు. 'ఇప్పుడు ఈ సభనే మరొక స్వయంవరసభగా మార్చుకో' మ్మన్నట్లు 'దాసీత్వాన్ని తొలగించుకొమ్ము' అన్నట్లు ఎగతాళిచేశాడు. మాటకు మాట ఘాటుగా వడ్డించాడు. నిజానికి ద్రౌపదీస్వయంవరసభలో పెద్దదెబ్బ తిన్నది కర్ణుడే కదా!

కర్ణుడి మాటలలోని వెటకారం పాండవులనూ, ద్రౌపదినీ బాధించింది. దుర్యోధనుడికి మరొక దురాలోచన చేయటానికి దోహదం చేసింది. సుయోధనుడు ద్రౌపదిని తన తొడమీద కూర్చుండు మని సైగచేశాడు. ఆ సైగను చూచి భీముడు భగ్గున మండిపడ్డాడు. ఉగ్రరణాంతరంలో భీమగదాఘాతంతో దుర్యోధనుడి తొడలు విరుగగొట్టుతానని భీషణప్రతిజ్ఞ చేసి, ఆయుధాలవైపు చూచాడు. ధర్మజుడి ఆజ్ఞకొరకు తేపతేపకు అతడివైపు చూచాడు. భీముడు కార్యవీరుడైతే కథలో కార్యం దెబ్బతింటుందని భీష్మద్రోణాదులు భీముడిని అనునయించి కూర్చోబెట్టారు. ఈ ఘట్టంలో ప్రవర్తిల్లిన వీరరౌద్ర రసాలకు పోషకంగా సల్లాపక, అవపాతాలనే సాత్త్వికి ఆరభటీవృత్తులు నిలిచాయి. ఇంతటితో రెండవరంగం పూర్తయింది. ఈ డిమప్రాయమైన కథాఘట్టంలో.

మూడవరంగం ముచ్చటైన చిన్నఅంకం. ద్రౌపదీవస్త్రాపహరణసభానంతరం ధృతరాష్ట్రుడి మందిరంలో మహోత్పాతాలు పుట్టాయి. అగ్నిహోత్రగృహాలలో నక్కలు అరిచాయి. అగ్నులు ఆరిపోయాయి. కౌరవుల భార్యల హృదయాలు అధికశోకంతో ఉడికిపోయాయి. ధార్తరాష్ట్రుల శయ్యాగృహాలలో కాకులూ గ్రద్దలూ అరిచాయి. ఆ దుశ్శకునాలను గురించి విని విదురభీష్మద్రోణులు కౌరవులకు అరిష్టం దాపురించిం దని భావించి మనస్సులలో సంతోషించారు.

రాజమందిరంలో గుప్పున పొడచూపిన ఆ దుశ్శకునాలకు గాంధారిగుండె చెదిరిపోయింది. విదురుడిని పిలిపించుకొని అతడితోపాటు తాను ధృతరాష్ట్రుడివద్దకు గబగబా పోయింది. ఆవేగంతో కురుసభలో జరిగిన వృత్తాంతాన్నీ, దుర్నిమిత్తాలనూ చెప్పింది. ధృతరాష్ట్రుడు వెంటనే కొడుకును పిలిపించాడు.

చ. "పరమపతివ్రతన్ సభఁ దపస్వినిఁ బాండవధర్మపత్ని ధ
ర్మరత నయోనిజం బ్రకృతిమానవభామినిఁగాఁ దలంచి దె
ప్పరములు వల్కఁగాఁ దగునె? బాల్యము నాదిగ దుష్టభావనం
బెరిఁగితి; నీ నిమిత్తమునఁ బెద్దయు దుఃఖితు లైరి పాండవుల్". **(సభా. 2.255)**

అని మందలించి పాండవులపట్ల గల ఆగ్రహాన్ని మానుకొమ్మని హితవుచెప్పి పంపాడు. ఆ తరువాత దుర్యోధనుడికి తెలియకుండా ద్రౌపదిని పిలిపించి, ఆమెను నయవాక్యాలతో బుజ్జగించి, 'నా కోడండ్రలో నీవే పూజనీయ'వని ప్రశంసించి, వరాలిస్తాను కోరుకొమ్మన్నాడు. ఆమె క్షత్రియవనితకు తగినట్లుగా రెండువరాలు కోరుకొన్నది. ఒకటి- ధర్మరాజును దాస్యంనుండి విముక్తి చేయుమని కోరింది. దానివలన ద్రౌపదికి అతడివలన కలిగిన ప్రతివింధ్యుడు దాసపుత్త్రు డనే అపప్రథకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దూరమౌతాడని భావించింది. ధర్మరాజు తరువాత తన పుత్రుడు మూర్ధాభిషిక్తు డైతే మిగిలిన ఉపపాండవులకు, సుభద్రాతనయుడికి ఉండే దాస్యులనే మచ్చ తన కొడుకుకు లేకుండా ఉండాలని ఆమె మనసులోని మాట. ఆ తరువాత భీమార్జున నకులసహదేవులు ఆయుధాలతోసహా దాస్యవిముక్తులు కావాలని కోరింది. ధృతరాష్ట్రు డావరా లిచ్చాడు. కోడలి గుణాలకు ధర్మతత్పరతకు మెచ్చుకొన్నాడు. ధర్మజుడిని పిలిపించి అతని రాజ్యం అతని కిచ్చి వైభవోపేతంగా ఇంద్రప్రస్థానికి తిరిగిపంపాడు. పంపుతూ-

తే. “నీవు నిత్యంబు వృద్ధోపసేవఁ జేసి
యెఱుఁగు దెల్లధర్మంబుల; నెఱుక లేక
కడఁగి నీ కెగ్గు సేసె నా కొడుకు; దీని
మఱచునది; నీకు నే నొండ్లు గఱపనేల?” **(సభా. 2.265)**

అని ధర్మరాజును ప్రశంసించి పలకటమే కాకుండా తననూ తన కొడుకునూ కించపరచుకొని దయాభిక్ష కోరినట్లు మాట్లాడాడు. ఉత్తములైనవారు ఇతరుల అపరాధాలను మనసులో పెట్టుకోరనీ, ఓర్పును ప్రకటిస్తారనీ, గుణాలను గ్రహించి దోషాలను విడిచిపెడతారనీ పేర్కొన్నాడు. తాను బుద్ధిలేక జూదాన్ని ఉపేక్షించాననీ, ముసలితనంచేత తెలివిమాలినవాడైన తనను, తల్లి అయిన గాంధారిని చూచిఅయినా దుర్యోధనాదుల దుర్నయాలను సహించు మనీ ధర్మరాజును వేడుకొన్నాడు. ధర్మరాజుకు పాండురాజు రాజ్యాన్ని సమర్పించాడు. రంగం ముగియవచ్చింది. ఆ రంగంలో ద్రౌపది నిర్వహించిన పాత్రను పతితహృదయంలో ప్రతిష్ఠిత మయ్యేటట్లు తరల మనే విశేషవృత్తాన్ని వాడి నన్నయ సూత్రధారుడిగా గానంచేశాడు. నాటకప్రయోగంలో ఇది ఒక చూళికవంటిది.

తరలము.

“తరుణి ద్రౌపది యిట్లు పాండవధార్తరాష్ట్రుల దైన భీ
కరపరస్పరకోపవేగము గ్రన్నఁ బాచి విపత్తిసా
గరనిమగ్నుల నుద్ధరించెఁ బ్రకాశకీర్తుల ధీరులం
బురుషసింహములన్ నిజేశులఁ బూని తద్దయుఁ బ్రీతితోన్.” **(సభా. 2.268)**

ఈ సన్నివేశాన్ని నాటకీయశిల్పదృష్టితో, డిమలక్షణయుక్తితో గమనిస్తే కొన్ని విశేషాలు గోచరిస్తాయి.

1. గాంధారి విదురుడితో కలసివచ్చి ధృతరాష్ట్రుడిముందు నివేదించిన విశేషాలూ, ధృతరాష్ట్రుడు వెంటవెంటనే దుర్యోధనుడినీ ద్రౌపదినీ, ధర్మరాజునూ పిలిపించి, వారితో మాట్లాడి తీసికొన్న నిర్ణయాలూ కలిసి అవపాతమనే ఆరభటీ వృత్తిభేదాన్ని సమగ్రంగా చిత్రించాయి.

2. ధృతరాష్ట్రుడు ప్రదర్శించిన రాజనీతి సంఘాత్యం అనే సాత్త్వతీవృత్తికి సమగ్రోదాహరణం. దుర్యోధన కర్ణ శకుని దుశ్శాసనాదులు ఒక కూటమిగా కూడి కపటద్యూతాన్ని నడిపి, పాండవసంపదను హరించి, వారిని వారిభార్యను అవమానించారు. వారి దుష్టవ్యాపారంవలన కలిగే విపత్తునుండి తప్పించుకొనటానికి ధృతరాష్ట్రుడు సామదానోపాయాలను ప్రయోగించాడు, రాజ్యదానం చేసి అర్థశక్తిని ప్రదర్శించాడు. ఆత్మదోషాన్ని చెప్పుకొని క్రుద్ధులను అనునయించాడు. అనేక కపటాలతో ఇతరులను చంపటానికి గానీ, కీడు కలిగించటానికి గానీ ఒక కూటమి ప్రయత్నిస్తే, దానిని భేదించటానికి చేసే బలమైన యత్నంలోనే సంఘాత్యమనే సాత్త్వతీవృత్తి రూపుకట్టుతుంది. అది ఈ అంకంలో ప్రదర్శితమైనది.

నిజానికి ఇంతటితో ఈ రూపకం ముగిసే అవకాశం ఉన్నది. కౌరవులచేత ఆరంభించబడిన కార్యం ఫలించినట్లు ఫలించి విఫలమైపోయింది. బీజప్రగతి దృశ్యాదృశ్యమైపోయింది. ఈ సన్నివేశం గర్భసంధివంటిది. ఇందులో ప్రాప్త్యాశగా ప్రవర్తిల్లినవి రెండంశాలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

1. సతికారణంగా వచ్చిన సామ్రాజ్యం పురుషులకు పౌరుషచిహ్నం కాదని శత్రువులమీద విరుచుకొనిపడటానికి పూనుకొన్నాడు భీముడు. ధర్మజుడు చేయెత్తి అతడిని వారించాడు. దీనివలన ధృతరాష్ట్రు డిచ్చిన రాజ్యం పాండవుల పరిపూర్ణమైన అంగీకారాన్ని పొందలేకపోయింది. దానితో యుద్ధం అనివార్యమైనది.

2. దుర్యోధనుడు తండ్రిని కలిసి పాండవులతో ఇకపై స్నేహం కుదరదనీ, వారిని అవమానించి అనునయించటం పాములను రెచ్చగొట్టి గొంతులదగ్గర ఉంచుకొన్నట్లే అని వివరించి అనుద్యూతంలో వారి నోడించి పన్నెండేళ్ల అరణ్యవాసం, ఒకయేడు అజ్ఞాతవాసం చేయటానికి పంప నిశ్చయించటం.

3. దుర్యోధనుడి చర్యలలో మరొక సంఘాత్యస్ఫూర్తి భాసించి కథను ముందుకు నడిపించింది. దీనితో బీజఫలాని కనువైన ప్రాప్త్యాశ సిద్ధించింది. అవమర్శసంధి ఆకృతి తాల్చింది.

అనుద్యూతం చివరిదైన నాల్గవ అంకంవంటిది. అందులో ధర్మజుడు మరల ఓడి అరణ్యఅజ్ఞాతవాస వ్రతాన్ని నిర్వహించ పూనుకొంటాడు. అది ఆకృతిలో చిన్నదైనా అందులోని శకునిమాటలు నాటకీయతను పోషించాయి. అందులో కపటంతోకూడిన సంఫేట మనే ఆరభటీవృత్తి ద్యూతయుద్ధపరంగా ప్రయోగించబడింది.

ఈ డిమప్రాయమైన కథాఘట్టంలో జూదానికి కూర్చున్నది మొదలు ధర్మరాజు పాత్రనోట ఒకమాటకూడా పలికించకుండ కార్యాన్ని నడిపించిన ప్రజ్ఞ నన్నయది. లోనారసి చూస్తే- ఒక విశేషం భావించవచ్చును. భరతుడు నాట్యశాస్త్రంలో ఏ యే వృత్తులు ఏ యే రసాలలో ప్రయోగించబడతాయో వివరిస్తూ "సాత్త్వతీ చాపి విజ్ఞేయా వీరాద్భుత శమాశ్రయా" (భరతనాట్యశాస్త్రమ్. 18.73 శ్లో) అని అన్నాడు. దీనికి "వీరాద్భుతసమాశ్రయా" అని పాఠాంతరం ఉన్నదన్నారు కొందరు. శాంతరసవాదులు 'శమ' శబ్దాన్ని గ్రహిస్తారు. ఇతరులు 'సమ' శబ్దాన్ని సమర్థిస్తారు. శమ శబ్దమే సార్థకమని ధర్మజుడి పాత్రవైఖరి స్పష్టంచేస్తున్నది. కురుసభలో అంతటి సంక్షోభం తనవలన రేగినా, చుట్టూ ఉన్న పాత్రలన్నీ వీర రౌద్ర కరుణోద్వేగాలతో ఆవేశాన్ని ప్రదర్శిస్తూ ఉన్నా, ధర్మజుడు మాత్రం మూర్తికట్టిన శమం లాగా స్థిరుడై నిలిచాడు. సుడిగాలివలె యుద్ధానికి సిద్ధమైన భీమసేనుడిని చేయెత్తి సైగచేసి ఆపగలిగాడు. భీష్మాదులచేత, అర్జునుడిచేత సమున్నతుడుగా కీర్తించబడ్డాడు. శమంకూడా సాత్త్వతీవృత్తిచేత పోషించబడుతుందని నాటకీయంగా నిరూపించాడు. డిమంలో భాసించే మానసికసంక్షోభ వాతావరణంలోకూడా శాంతపర్వతంవలె నిలిచిన ధర్మజుడినిగురించి అర్జునుడు చాటిన ధర్మవీరగీతం మహాభారతనాయకుడైన ధీరోదాత్తుడి కీర్తి కెత్తిన విజయపతాకం.

సీ. "ధర్మతనూజుండు ధర్మువు తప్పిన । ధరణీతలంబెల్లఁ దల్లడిల్లుఁ
దగిలి సుహృద్ద్యూతధర్మయుద్ధములకుఁ । బరులచేఁ బిలువంగఁబడి విభుండు
గడఁగక విముఖుండు గాఁ జన దని శుభ । క్షాత్త్రధర్మంబు లోకంబునందు
నిలిపెఁ దా నిది పతినేరమియే? దైవ । వైపరీత్యంబైన వనరఁ దగునె?". **(సభా. 2.224)**

అన్నది సభాపర్వనాయకధర్మశీలసంకీర్తనం! నన్నయ నాటకీయరచనాశిల్పసుకేతనం!

ఈవిధంగా పరిశీలిస్తే నన్నయరచనలో నాటకీయత సంతరించుకొన్న సన్నివేశాలు మరికొన్ని గమనించవచ్చును. స్థాలీపులాక న్యాయాన్ని అనుసరించి యీ వివేచన చేయడ మైనది. నాటకలక్షణాలతో తీర్చిదిద్దిన కథలు యయాతి, దుష్యంత, నలమహారాజు చరిత్రలు. వాటినిగురించి ఆరణ్యపర్వపీఠికలో పరిశీలించటం సందర్భోచిత్యం.

నన్నయనాటకీయత ఆయన చెప్పుకొన్న 'ప్రసన్నకథాకలితార్థయుక్తి'లో భాగమే. నన్నయకథాకథనశిల్పం తల్లివంటిదైతే నాటకీయత ఎత్తుడుబిడ్డవంటిది. చంకబిడ్డ తల్లిని కేంద్రంగా చేసికొని చుట్టూ పారాడుతుంది, తిరుగుతుంది. ఒడిలోనుండి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లేచి ఆటలాడి మరల ఒడిలో చేరటమే ఎత్తుడుబిడ్డ లక్షణం. నన్నయ నాటకీయతకూడా అటువంటిదే. నాటకీయతకూ కథాకవితకూ పోష్యపోషకసంబంధం నన్నయ కల్పించిన అనుబంధం.

ప్రసన్నకథాకలితార్థయుక్తి

సంస్కృతమహాభారతంలోని సభాపర్వంతో పోల్చిచూస్తే నన్నయ సభాపర్వం సగానికి సగం తగ్గినట్లు కనపడుతుంది. కథలో వాపు తగ్గి బలుపు పెరిగింది. అంటే వ్యాసభారతాన్ని సర్వార్థప్రధానంగా కాక పరమార్థప్రధానంగా నన్నయ తెలుగులో పునర్నిర్మించాడన్నమాట! వ్యాసుడిది శాస్త్రేతిహాసం; నన్నయది కావ్యేతిహాసం! శాస్త్రం వాచ్యప్రతిపత్తిమీద నిలుస్తుంది; కావ్యం వ్యంగ్యగౌరవంతో జీవిస్తుంది. ఇతిహాసం చతుర్విధపురుషార్థప్రధానమైన జీవితాన్ని సత్యదృష్టితో ఆవిష్కరిస్తుంది. అందువలన వ్యాసభారతాన్ని చూచే చూపుకంటె భిన్నమైన దృక్పథం ఆంధ్రమహాభారతానుశీలనంలో అనుసరించాలి. వ్యాసరచన శాస్త్రేతిహాసప్రక్రియలో మేరునగశిఖరం. నన్నయరచన కావ్యేతిహాసప్రక్రియలో ఎవరెస్టుశిఖరం!

వ్యాసనన్నయుల రచనాదృక్పథాలలోని భేదం తెలియటానికి ఒకఅంశాన్ని గమనిద్దాం. మహాభారతంలో శ్రీకృష్ణమహత్త్వాన్ని విస్తృతంగా వర్ణించి దానిని కార్ష్ణవేదంగా రూపొందించటం వ్యాసహృదయం. ఆ అర్థాన్ని వీలైనప్పుడెల్లా వివరించి, వర్ణించి, వ్యాఖ్యానించి విస్తృతంగా చెప్పటం వ్యాసరచనాశిల్పం. నన్నయ ఆ అంశాలను సంగ్రహం చేస్తాడు. కాని, శ్రీకృష్ణమహత్త్వాన్ని తగ్గించడు. వ్యాసుడు వాచ్యం చేసినచోట వ్యంగ్యమర్యాదను పాటించి దానిని భావనామయం చేస్తాడు. అంటే- అల్పాక్షరాలలో అనల్పార్థరచన చేస్తాడన్నమాట. అది ఇతిహాసానికి కావ్యస్వభావాన్ని సంయోజనం చేయటం.

సభాపర్వంలో రెండుచోట్ల ప్రధానంగా శ్రీకృష్ణమహత్త్వం ప్రకటితమౌతుంది. మొదటిచోటు- రాజసూయంలో శ్రీకృష్ణుడిని గురించి భీష్ముడు చేసిన ప్రశంసలు. శిశుపాలుడు చేసిన దూషణలు. రెండవచోటు- కౌరవసభలో ద్రౌపది శ్రీకృష్ణుడిని ఆర్తితో ఎలుగెత్తి పిలవటం- విస్తృతంగా ఉన్నాయి. వాటిని తగ్గించి నన్నయ సంగ్రహమైన సారవద్రచన చేశాడు. కాని, దానివలన 'కృష్ణద్వైపాయన మునివృషభాభిహిత మహాభారతబద్ధనిరూపితార్థము' చెడలేదు. పైపెచ్చు ధ్వనిమయమై రమణీయమై నిలిచింది. మచ్చుకు ద్రౌపదీవస్త్రాపహరణ ఘట్టంలోని నన్నయరచనను గమనిస్తే ఈ సత్యం బైటపడుతుంది.

శ్లో. "ఆకృష్యమాణే వసనే ద్రౌపద్యా చింతితో హరిః
గోవింద ద్వారకావాసిన్ కృష్ణ గోపీజనప్రియ
కౌరవైః పరిభూతాం మాం కిం నజానాసి కేశవ! ॥
హేనాథ హే రమానాథ ప్రజానాథార్తినాశన
కౌరవార్ణవమగ్నాం మా ముద్ధరస్వ జనార్దన ॥
కృష్ణ కృష్ణ మహాయోగిన్ విశ్వాత్మన్ విశ్వభావన
ప్రపన్నాం పాహి గోవింద కురుమధ్యేఽవసీదతీం ॥
ఇత్యనుస్మృత్య కృష్ణం సా హరిం త్రిభువనేశ్వరం
ప్రారుద ద్దుఃఖితా రాజ న్ముఖ మాచ్ఛాద్య భామినీ ॥
యాజ్ఞసేన్యా వచ శ్శ్రుత్వా కృష్ణో గహ్వరితోఽభవత్
త్యక్త్వా శయ్యాసనం పద్మాం కృపాళుః కృపయాఽభ్యగాత్ ॥
కృష్ణంచ విష్ణుంచ హరిం నరంచ త్రాణాయ విక్రోశతి యాజ్ఞసేనీ
తతస్తు ధర్మోఽంతరితో మహాత్మా సమావృణో ద్వై వివిధై స్సువస్త్రైః ॥"

(సం. సభా. 61. 40; 542 అథస్స్వాచి)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ వర్ణనం గమనిస్తే భాగవతంలోని గజేంద్రమోక్షణఘట్టంలో గజేంద్రుడిఆర్తి గుర్తుకు వస్తుంది. గజేంద్రుడిని కాపాడటానికి శ్రీవిష్ణువు వలెనే ద్రౌపదిని రక్షించటానికి శ్రీకృష్ణుడు సిద్ధమయ్యాడు. 'ద్రౌపద్యా చింతితో హరిః' అనే వాక్యంతో మొదలై 'విక్రోశతి యాజ్ఞసేనీ' అనే వాక్యంతో ముగిసే పై ఘట్టంలో శ్రీకృష్ణుడిని ఆమె ఆర్తితో పిలిచినట్లూ, ఆత డామెను రక్షించినట్లూ స్పష్టమౌతున్నది. అప్పుడు ఆ సంగతి సభలో అందరికీ తెలిసిఉంటుంది. తెలిస్తే దానిప్రసక్తి కథలో వచ్చిఉండేది. నన్నయ దీనిని లోనారసి భావించి పునర్నిర్మించాడు. అసలీ కృష్ణస్తుతినంతా ఎత్తివేశాడు. "భామిని కృష్ణుఁ దలంచె భీతయై" అని మాత్రం చెప్పి ఊరుకొన్నాడు.

దీనివలన నన్నయ అనేకార్థాలను సాధించాడు. నన్నయరచనలో ద్రౌపది మూలంలోవలె ఆక్రోశించదు. ధీరోదాత్తురాలువలె దుఃఖిస్తుంది. బేలవలె శ్రీకృష్ణుడి నామావళి చదువదు. 'కృష్ణ' అనే నామాన్ని ఒక్కదానినే స్మరిస్తుంది. అది ఆమెకూ ఆ గోపాలుడికీ అద్వైతంగా కుదిరిన పేరు. దాన్ని స్మరిస్తే శ్రీకృష్ణుడు ఆ వస్త్రాపహరణం తనకే జరుగుతున్నట్లు భావించాలి. ద్రౌపదికీ శ్రీకృష్ణుడికీ అభేదభావం నన్నయ వ్యంగ్యంగా సాధించటంవలన శ్రీకృష్ణుడు శయ్యాసనం వదలి కదలిరావలసిన అవసరం తప్పింది. ద్రౌపది మనసులో స్మరించిన కృష్ణనామం సభలోనివారికి వినపడే అవకాశం లేదు. అందువలన ఆమె జఘనప్రదేశంపై వస్త్రం తొలగకుండా, ఆమెకు నగ్నత్వం ఏర్పడకుండా రక్షించినశక్తి ఎవరైఉంటారనే యోచన సభికులకు ఏర్పడుతుంది. కృష్ణుడు రక్షించా డని కృష్ణకు తెలుసు. సభికులుమాత్రం ఆమెపాతివ్రత్యమే ఆమెను రక్షించిందని భావించినట్లు ధ్వనిమయంగా తెలుస్తుంది. బంధకిని వివస్త్రను చేసినా తప్పులే దనీ, పలువురు భర్తలకు భార్యఅయిన ద్రౌపదిని ఎవరు ఉపభోగించినా దోషం లేదనీ, అటువంటి సామాన్యవనిత పట్టమహిషిగాకంటె దాసిగా ఉండటం సమంజసమనీ దుర్యోధనకర్ణాదుల తలంపులు. అందుకే వా రామెను సభలో వివస్త్రను చేయాలని తలపెట్టారు. వారి మొగాలు బొప్పులు కట్టేటట్లు ద్రౌపది తన శీలమాహాత్మ్యంతో సభలోనే సమాధానం చెప్పినట్లు రచించటం నన్నయ తాత్పర్యం. అది సన్నివేశౌచిత్యంకూడ. కావ్యదృష్టితో చూస్తే నన్నయరచన మిన్న. పురాణదృష్టితో పరిశీలిస్తే వ్యాసుడిరచన పైచేయి.

నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తినిగురించి మౌలికంగా ఎన్నో అంశాలను వివరించినవారు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు. వాటిలోనూ సభాపర్వంలోని నన్నయ కథాకథనశిల్ప విశేషాలనుగురించి వారు చేసిన వ్యాఖ్యలు అపూర్వంగా ఉన్నాయి. కాళిదాసుకు మల్లినాథుడివలె నన్నయకు విశ్వనాథ తెలుగులో పేరుతెచ్చారు. వారు చెప్పిన కొన్ని విలువైన అంశాలను స్మరించటం అవసరం.

1. సభాపర్వంలో ద్రౌపదికి గల ప్రాధాన్యం

"పాండవ కౌరవ ద్యూత కథాసౌధ మూలస్తంభము ద్రౌపది. ఇది నన్నయగారు చేసిన నిర్ణయము. అందుచేత నీ కథయొక్క యాద్యంతములందు నన్నయగారు ద్రౌపదిని నిక్షేపించిరి. గాంధారి కోడండ్రు

తే. అఖిలలావణ్యపుంజంబు నబ్జభవుఁడు
మెలఁతగా దీనియందు నిర్మించె నొక్కొ
కానినాఁ డిట్టి కాంతి యేకాంతలందు
నేల లే దని సామర్షహృదయ లైరి. ॥ (సభా. 2.160)

ఆమెయొక్క లావణ్యమును జూచి కౌరవుల భార్యలు చుప్పనాతితనమునుఁ బొందిరి. నన్నయ్యగారు వాడిన శబ్దము లావణ్యము. సౌందర్యము కాదు. లావణ్య శబ్దమునకు సౌందర్యమని సామాన్యముగా నర్థము చెప్పినను నిజమైన యర్థ మదికాదు. లవణము యొక్క భావము లావణ్యము. రాతిఉప్పు పగులగొట్టినచోఁ బలకలు పలకలుగా నుండును. ఒక ద్రవ్యము పలకలు పలకలుగా నున్నపుడు, నది స్నిగ్ధమైన వస్తువైనపుడు దానిమీఁద సూర్యకిరణ ప్రసారము జరిగి యది తళతళలాడును. ఆ మెఱుపు లావణ్యము. స్త్రీయొక్క శరీరచ్ఛాయయు, స్నిగ్ధత్వమును, బోషణచేత వచ్చిన సౌకుమార్యమును, నైగనిగ్యమును- నివి యన్నియు లావణ్య మనిపించుకొనును. అట్టి లావణ్యము ద్రౌపదీశరీరమందుఁ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గౌరవుల భార్యలు మాత్సర్యము వహించఁ దగినంతగా నుండెను. దీనిచేత ద్రౌపదీదేవియొక్క భోగలక్షణాధిక్యము వ్యజ్యమాన మగుచున్నది. అందుచేత వారు మత్సరము పడిరి. వా రంద ఱా రాత్రి తమభర్త లందఱితో నామెయొక్క యీ భోగవైశిష్ట్యమునుఁగూర్చి చెప్పియుందురు. వా రందఱకు ద్రౌపది యన్నచోఁ జుప్పనాతితనము బలిసినది. మఱునాఁడు జరుగఁబోవు నధర్మమునకు నందఱును హర్షించిరి. ఇంత ప్రయోజనకారిగా నన్నయ్యగా రీ పద్యము నిచ్చట నిక్షేపించిరి. ఒక్క ద్యూత కథా మూలస్తంభ మగుటయే కాదు. అట్టి మూలస్తంభ మగుటకుఁ బ్రధానకారణమయిన ద్రౌపదియందలి లక్షణములు, నా లక్షణములు వారిమాత్సర్యమునకు హేతువులు, నా మాత్సర్యము ద్రౌపదిపరాభవము హర్షించుటకు హేతువులు. ఈ రీతిగా నన్నయ్యగారు ద్యూతకథా మహాభవన మూలస్తంభ మయిన ద్రౌపదినిఁ దొట్టదొలుత స్థాపించి తరువాత ద్యూతకథలోనికి వెళ్ళిరి.

మఱియు నీ ద్యూతకథావసానము ద్రౌపది. ఆమెకు ధృతరాష్ట్రుఁ డిచ్చిన వరములచేతనే యా విచిత్ర ద్యూతఫల మహావైపరీత్యము మఱియొక త్రోవ పట్టినది. ఆ వరము లీయకున్నచో భారతకథ యేమి యయ్యెడిది? పాండవులు బ్రదికినన్నాళ్లు కౌరవదాసులుగా నుండిపోదురా? ఉండిపోయెడినాడు భారతకథయే లేదు. పాండవులు దాసులై యుండి కౌరవులతో యుద్ధము చేయుదురా? ఇది యొక చిత్రమైన సమస్య. ఆ సమస్య సమాధానములేని సమస్య. ద్రౌపదిచేతఁ బరిష్కరించఁబడినది. ఈ రీతిగా ద్రౌపది భారతకథలో నున్న యనేకములయిన కథాప్రవాహ భంజకము లయిన ఘట్టములలోఁ గథ సాగించిన యొక సహకారిణి. ఈ ఘట్టమునందు ద్రౌపదియొక్క ప్రాధాన్య మిట్టిది. దానినిఁ దెలిసికొని నన్నయగారు రచనచేసిరి. మహాకవి తాను వ్రాసెడి కథయొక్క స్వరూపము తెలిసికొని వ్రాయును. ఆ కథాగత సమస్యలనుఁ బరిష్కరించును. ఆ పరిష్కరించిన వైఖరి ఘట్టములుగాఁ గనిపించును. ఆ ఘట్టములు మనకు సువ్యక్తములుగా నుండును. వానియొక్క సువ్యక్తతచేతనే పాఠకులకు మహాకవి చేసిన కథానిర్ణయము తెలియును. అవి సువ్యక్తమగుటకుఁ గవి నిరూపించిన విషయములు శిల్పతీర్థములు.

ఈ కథావసానమునందు మఱల నన్నయగా రిట్లు వ్రాసెను.

తరలము.

తరుణి ద్రౌపది యిట్లు పాండవధార్తరాష్ట్రులదైన భీ
కరపరస్పరకోపవేగము గ్రన్నఁ బాచి విపత్తిసా
గర నిమగ్నుల నుద్ధరించెఁ బ్రకాశకీర్తుల ధీరులం
బురుషసింహములన్ నిజేశులఁ బూని దద్దయుఁ బ్రీతితోన్. ॥ **(సభా. 2.268)**

ఈ రెండు పద్యములచేత ద్యూతకథయంతయు నెట్లు ద్రౌపదిమీఁద నాధారపడియున్నదో, భారతకథా ప్రవాహములో నిది యెటువంటి ఘట్టమో నన్నయ్యగారు నిరూపించిరి. ఈ రెండును నన్నయ్యగారి మహాశిల్పమున కుదాహరణములు.'' (ఆంధ్రమహాభారతోపన్యాసములు: నన్నయగారి భారతాంధ్రీకరణము (వ్యా). పు. 12-14).

2. ద్రౌపదీవస్త్రాపహరణం - వివస్త్రత

''నన్నయగారు తా నొక విషయమును గాఢముగా నాలోచించికాని వ్రాయరు. ద్రౌపదీవస్త్రాపహరణవిషయమున భారతమునం దిట్లున్నది.

శ్లో. ఆకృష్యమాణే వసనే ద్రౌపద్యాస్తు విశాంపతే
తద్రూప మపరం వస్త్రం ప్రాదురాసీ దనేకశః ॥
నానారాగవిరాగాణి వసనాన్యథ వై ప్రభో
ప్రాదుర్భవంతి శతశః ధర్మస్య పరిపాలనాత్ ॥

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తతో హలహలా శబ్ద స్తత్రాసీద్ ఘోరనిస్స్వనః
త దద్భుతతమం లోకే వీక్ష్య సర్వే మహీభృతః ॥
శశంసు ర్ద్రౌపదీం తత్ర కుత్సంతో ధృతరాష్ట్రజం
శశాప తత్ర భీమస్తు రాజమధ్యే బృహత్స్వనః ॥ **(సం. సభా. 61. 41-43; అథస్సూచికలు 553,554)**

దీనిని నన్నయగా రిట్లు తెనుఁగు చేసిరి.

సీ. ఇది సేయఁగాదని మది విచారింపక సద్గర్వితుండు దుశ్శాసనుండు
నెట్టన ద్రౌపది గట్టిన పుట్టంబు సభలోన విడ్చె నాశంక లేక
యుడుగక యొలువంగఁబడియు ము న్నపనీత మైన తద్వస్త్రంబునట్టి వలువ
లలితాంగి జఘనమండలమునఁ బాయక యొప్పుచునున్న న య్యువిదఁ జూచి

ఆ. సభ్యులెల్ల నుదితసమ్మదు లయిరి దుశ్శాసనుండు వస్త్రచయము పర్వ
తోపమాన మైన నొలువంగనోపక యుడిగె లజ్జఁ బొంది యుక్కుదక్కి. ॥

వ. ఇట్లు భీమసేనుఁడు ద్రుపదరాజనందనకు దుశ్శాసనుండు సేసినయవమానంబు సూచి, కోపరక్తాంత నయనుం డగుచు నంతకాకారంబున దంతసందష్ట దారుణముఖుం డయి యెల్లవారును విన నిట్లనియె.

(సభా. 2.231, 232)

వివిధములైన యనేక వర్ణములు కలిగిన వసనములు పుట్టుచున్నవి. దీనికి హేతువు ధర్మము పరిపాలింపఁబడుట, సభలోఁ బెద్ద ధ్వని కలిగెను. ఈ యద్భుతమునుఁ జూచి రాజు లందఱు ద్రౌపదినిఁ బొగడిరి. దుర్యోధనునియందుఁ గుత్స వహించిరి. భీముఁడు శపథముఁ జేసెను. నన్నయగారు వస్త్రములయొక్క నానారాగవిరాగత్వము వర్ణించలేదు. అది యనవసరము, జనులలో హలాహలశబ్ద ముదయించినది. దానిని నన్నయగారు వదలిపెట్టిరి. ఇది యొక మహాఘోరము జరుగుచున్నపుడు జనులు నిస్తబ్ధులై నీరవులై యుండిపోదురు. అందుచేత నన్నయగారు దానిని వదలిపెట్టెను. ఆమెను జూచి సభ్యు లుదితసమ్మదు లయిరి. ప్రశంసించలేదు.

'తద్రూప మపరం వస్త్రం ప్రాదుర్భవతి' యన్న మాటను 'ఉడుగక యొలువంగఁ బడియు ము న్నపనీతమైన త ద్వస్త్రమ్మునట్టి వలువ లలితాంగి జఘనమండలమునఁ బాయక యొప్పుచునున్న'దని నన్నయగారు తెలుఁగుచేసిరి. ఈ తెలుఁగు సేతలోనున్న సొగసేమి? ద్రౌపదికి మానభంగము చేయవలయు నని దుర్యోధనాదుల యూహ, మానభంగ మనఁగా నేమి? ఆమె వివస్త్రయగుట. వివస్త్రత యనఁగా నగ్నత, నగ్నత యనఁగా నేమి? ఇచట విచారణ చేయవలెను. వస్త్రము ధరించినందువలన శరీరావయవములు కప్పఁబడు నని యనుకొందుము. కప్పఁబడుట యనఁగా నొక వస్తువుయొక్క స్వరూపజ్ఞాన మేర్పడకుండ నుండుట, శరీరముయొక్క నగ్నత్వ మనఁగా శరీరాంచలములు భాసించుట, మన కొక వస్తువు కనిపించుచున్న దనఁగా నా వస్తువుయొక్క యవధిభూతములయిన రేఖలు సువిస్పష్టముగాఁ గనిపించుటయే, ఒక పేటికను జూచితిమి. ఒక ఘటమును జూచితిమి. మఱి యింకొక వస్తువును జూచితిమి. త ద్వస్తువుయొక్క లోపలిభాగమును జూడలేదు. దాని పై యంచులనుఁ జూచితిమి. ఈ యంచులు రేఖలు. దృష్టికిఁ గనిపించునది రేఖ. అందుచేతనే చిత్రకారుఁడు రేఖలతో మనకు వస్తుదర్శన మీయగలఁడు. వస్త్రముచేత శరీరాంచలరేఖలు కప్పఁబడును. అపుడు శరీరము వస్త్రాచ్ఛాదిత మైనదని చెప్పుదుము. అంచల రేఖలు విస్పష్టముగా భాసించుచు దానిపయిన వస్త్రమున్నను వస్తువు వస్తువుగా భాసించును. కొందఱు పెట్టెలకు మాసిపోకుండఁ బైన గుడ్డలువేసి కుట్టింతురు. పెట్టె కనిపించుచునే యుండును. ఆ పెట్టె కనిపించుట లేదు. పెట్టె యని గుర్తుపట్టుటకు వీలులేదని చెప్పుటకు వీలులేదు. పురుషులు వస్త్రములు ధరించుట యీ ప్రయోజనముకొఱకు. శరీరాంచలరేఖలు భాసించకుండ ముడుతలతోఁ, గుచ్చెళ్ళతో, మడతలతో వస్త్రములను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధరించుట పేరు వస్త్రము ధరించుట. నగ్నత లేకుండఁ జేయుట. శరీరము నంటుకొనియున్న వస్త్రము నగ్నతను రక్షించదు. అందుచేతఁ బాశ్చాత్యులు వేయు దుస్తులు నగ్నతను సరిగా రక్షించవు. అది యనాగరకమైన వేషము. భారతీయులు కుచ్చెళ్లు పెట్టుకొని కట్టెడు ధోవతి పరమనాగరకమైన వేషము.

అట్టి కుచ్చెళ్లు, నట్టి మడతలు- నేది తొలఁగినను నగ్నత భాసించును. ద్రౌపది ధరించిన చీర యామెయొక్క నగ్నతను రక్షించునదిగా నున్నది. దుశ్శాసనుఁ డొక చీర తీసిన తరువాత మఱియొక చీర యచట భాసించినచో నది తొలఁగి యిది వచ్చులోన నగ్నత భాసించును. గాలిచేతఁ జీర తొలఁగినప్పుడే వేణీసంహారమున దుర్యోధనుఁడు భానుమతీవిషయమున నాటకరంగమైన గండము నిక్షేపించు స్థలములో నూరుప్రస్తావన చేసెను. అది నగ్నత. నగ్నత రేఖామాత్రమున భాసించినను ద్రౌపదికిఁ బరాభవము జరిగినట్లే. అందుకనియే 'మున్నపనీతమైన తద్వస్త్రమ్ము నట్టి వలువ'యని చెప్పుట. నానారాగవిరాగములైన వసనము లైనచో నొలిచిన వలువకు మఱల మొలిచిన వలువకు భేద మేర్పడి నగ్నతాభ్రాంతి కలుగవచ్చును. తద్వస్త్రము నట్టివలువ యనుటచేత నొకవలువ యొలువఁబడినది లేదు. మఱియొక వలువ, తత్స్థానీయమైనది, మొలిచినట్లు లేదు. నగ్నత లేదు సరికదా నగ్నతాభ్రాంతికూడ లేదు. ఇది యాశ్చర్యకరమైన రచన. నన్నయగా రీ విషయము నంత పరమసూక్ష్మముగా విచారించి, యా మాటల నచ్చటఁ బొదివెను. పరమేశ్వరానుగ్రహ మున్నచో నింత పరాభద్రమైన స్థితి యేర్పడుటయే. నగ్నత యనఁగా నేమి? యన్న విషయమును బహుముఖములుగా విచారించిన మహామేధాశాలి కాని యిట్లు వ్రాయలేఁడు.'' (ఆంధ్రమహాభారతోపన్యాసములు - నన్నయగారి భారతాంధ్రీకరణము (వ్యా)- పు. 6-9)

3. సంబుద్ధి - సంస్కృతి

''దుర్యోధనుడు ధర్మరాజుతో నెప్పుడు మాట్లాడడు. నన్నయ్యగారు వ్రాసిన భాగములో దుర్యోధనుడు ధర్మరాజుతో ద్యూతసమయమునందుతప్ప మరి యెప్పుడును మాటాడలేదు. ఈ ద్యూతసమయమున రెండుసారులే మాటాడెను. మొదటిసారి జూదమాడు మని, రెండవసారి తనబదులు తన మామయైన శకుని యాడు నని. ఈ రెండు పద్యములు చూడుడు.

''అనఘ! సుహృద్ద్యూతం బిం । దొనరింతము ప్రొద్దువోకయును నగు''

''అనఘ! మా మామ శకుని నాకై కడంగి । జూద మాడెడి నీతోడ''

మరియెచ్చటను దుర్యోధనుడు ధర్మరాజుతో మాటాడలేదు. ఈ మాటాడిన రెండుసార్లు ధర్మజుని 'అనఘా' అని సంబోధించెను. మొదటి పద్యములో సంబోధన మేదో పద్యరచన యట్లే యుండునని యనుకొన్నను రెండవపద్యములోని మొదటిసంబోధనము నన్నయ్యగారు బుద్ధిపూర్వకముగా నొక ప్రయోజన మర్థించియే యట్లు వ్రాసెనని తెలియగలదు. ఇది దుర్యోధనుడు ధర్మరాజుకు చేయుగౌరవము. వారికుటుంబములోని మర్యాద. దుర్యోధనునకు పాండవులయం దెంత మాత్సర్యమున్నను సముదాచారము నుల్లంఘించడు. పైన నతనికి ధర్మరాజునందు మిక్కిలి గౌరవము.

ఇట్లు రెండు సంబోధనలచేత నొక విచిత్రమైన నాగరకతయు, సముదాచారమును, కుటుంబమర్యాదయు, దుర్యోధనుని శీలములోని యొకయంశమును రహస్యముగా గుప్తపరచి లోనారసి తెలియఁదగిన శిల్పమును నన్నయ్యగారు ప్రదర్శించిరి.'' (నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి - పు. 135-136).

4. అన్నగారి అదుపు - అంతరార్థం

భీముడు దుశ్శాసనుడినీ, దుర్యోధనుడినీ భయంకరమైన యుద్ధంలో చంపుతానని రెండుప్రతిజ్ఞలు చేశాడు. 1.''కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనేకుల్ సూచుచుండన్...... ఉర్వీపతి చూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్'' (సభా.2.233); ''ధారుణిరాజ్యసంపదమదంబున.... మదీయ బాహుపరివర్తిత చండగదాభిఘాత భగ్నోరుతరోరుఁ జేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్.'' (సభా. 2. 249). ఈ రెండు ప్రతిజ్ఞలు చేసినప్పుడు ధర్మజుడు కిమ్మనలేదు. ద్రౌపది వరాలరూపంగా రాజ్యాన్ని ధృతరాష్ట్రుడినుండి తిరిగి పొందినప్పుడు భీముడు సతి కారణంగా వచ్చిన రాజ్యాన్ని అంగీకరించటానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అసమ్మతిని తెలిపి, శత్రువులను ఉగ్రరణంలో జయించి రాజ్యాన్ని పొందుతా నని ఆగ్రహించాడు. అప్పుడు ధర్మజుడు చేయెత్తి సైగజేసి భీముడిని అదుపులో పెట్టాడు. పైరెండు ప్రతిజ్ఞలకు స్పందించని ధర్మజుడు మూడవసారి ఎందుకు వారించాడు? అన్నప్రశ్నకు విలువైన వ్యాఖ్యానం చేశారు విశ్వనాథవారు-

1. "మొదటిసారి ప్రతిజ్ఞలు చేసినపుడు భీముడు యుద్ధమున కింత సిద్ధపడలేదు. దుర్యోధనుని తొడలు విరుగఁ గొట్టెదనని యాయుధమ్ము లున్న వలనికి దృష్టులు సలుపుచు నగ్రజుమొగంబు చూచెను. అప్పుడు భీష్మ విదుర ద్రోణాదు లాపిరి. మొదటిసారి ప్రతిజ్ఞచేసి యూరకుండెను. ధృతరాష్ట్రుడు రాజ్యమిచ్చినతర్వాత, కౌరవులను చంపుదు నని వాచ్యముగా చెప్పెను. ఈ మూఁడు భేదములు చమత్కారముగా నున్నవి. మనకు చూచినచో ద్రౌపది వస్త్రము లొలుచుట మిక్కిలి దుర్భరము. తన తొడమీఁదఁ గూర్చుండ రమ్మనుట దానికంటె తక్కువది. ద్రౌపదివలన రాజ్యము మరల వచ్చుట తత్పూర్వము గల రెంటికంటె తక్కువది. కాని భీము డొకదానికంటె నొకదానికి నుత్తరోత్తర మధికాధిక కోపము పొందుచున్నట్లు కాన్పించుచున్నాడు. అతని కోప ముత్తరోత్తర బలీయ మని చెప్పుటకు గారణము? మొదటిసారి ప్రతిజ్ఞచేసి యూరకుండెను. రెండవ ప్రతిజ్ఞచేసి యాయుధాగారమువంకఁ జూచెను. మూఁడవసారి వాచ్యముగా చెప్పి వెంటనే యుద్ధము చేయుటకు బయలుదేరఁ బోవుచుండెను. ఇవి కారణములు. మొదటిసారి తాను ప్రతిజ్ఞ చేసెనుగాని వెంటనే కౌరవులను చంపు నూహ వెలిపరుచనే లేదు. అప్పు డతని కా యూహ లేదు. ఆ యూహ రెండవసారి కలిగెను. దానిని భీష్మ ద్రోణ విదురులు వారించినమాత్రతో సరిపోయినది. మూడవది అన్నగారే వారించెను. చేయి వలదన్నట్లు పై కెత్తెను. ధర్మరాజు చేసిన దింతమాత్రమే. తొడలు విరుగ గొట్టెద నన్నప్పు డన్నగారి యంగీకార మున్నదో లేదో యని తెలిసికొనుట కతనివంక చూచుచుండెను. శత్రువు లంతటి యపకృతి చేసినప్పుడు, తన కంతటి కోపము వచ్చినపు డన్నగా రంగీకరించునా లేదా యన్న విచారణ విచిత్రముగా నున్నది. ఆ యన్న యదుపెట్టిదో? అతని నాయకత్వ మెట్టిదో? ఈ తమ్ముల యనుయాయిత్వ మెట్టిదో? మనసు పట్టని యొక శైష్యోపాధ్యాయిక వ్యంగ్యమగుచున్నది."

2. "ఇప్పు డీ మూఁడు పరిస్థితులలో నుత్తరోత్తర మధికాధిక మగుటకు కారణ మేమి?

మొదటిది జంతుత్వమాత్రసంబంధ మయినది; రెండవది నరత్వ సంబంధ మయినది. మూఁడవది స్త్రీసంబంధమయిన మరల రాజ్యము సమకూరుట వట్టి ధర్మవిషయము. పాండవులు ధర్మనిష్ఠులు. ధర్మముమీఁద నాధారపడి మోక్షమున్నది. తా నార్జించిన విత్త ముత్తమము, పిత్రార్జితము మధ్యమము, భ్రాతృవిత్త మధమము, స్త్రీవిత్త మధమాధమము. అందుచేత భీముడు మిక్కిలియు కోపించెను. ధర్మరాజు వారించెను.

ద్రౌపదీసంపాదిత మయిన రాజ్యానుభూతియందు ధర్మరాజునకుమాత్ర మీ యధమాధమబుద్ధి లేదా? ఎందుకు వారించెను? ధర్మజునియొక్క ధర్మస్వరూపము చాల నిగూఢ మయినది. ధృతరాష్ట్రుఁ డిచ్చుటచేత రాజ్య మిప్పుడు వచ్చినది. పాండవులకు మరల స్వాతంత్ర్యము వచ్చినది. తత్పూర్వమునందు తమమీఁద తమకు, తమ యాయుధములమీఁద తమకు తమ వర్మవరూధమ్ములమీఁద తమకు నధికారము లేదు. అందుకనియే ద్రౌపది యడిగిన రెండవవరము.

క. "నెమ్మిని ధర్మజు నలువురు
తమ్ములుఁ దమయాయుధములఁ దమవర్మవరూ
ధమ్ములయుఁదోడ సకలహి
తమ్ముగఁ బాయంగవలయు దాస్యమువలనన్." **(సభా. 2.261)**

అని యున్నది. అందుచేత నిప్పటి భీముని పౌరుషము, ఆయుధప్రయోగము చేయగల సామర్థ్యముకూడ స్త్రీవిత్తముక్రింద లెక్కగట్టబడవలయును. రాజ్యసంపద ననుభవించుటకు స్త్రీవిత్తదోష మెంత యున్నదో తమ పరాక్రమము ప్రకటించుటకు స్త్రీ ప్రసాదకృతసామర్థ్య మను దోస మంతియే యున్నది. ఇందుచేత ధర్మజుడు కరతలమ్మున వారించెను. తొడలు విరుగ గొట్టెద నన్నప్పుడు పరాక్రమము ప్రదర్శించుటకు వీలే లేదు. అందుచేత ధర్మరా జతనివంకనే చూడలేదు. ఇవి నన్నయ్యగారి రచనాంతర్నిగూఢమహార్థములు." (నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి- పుట. 155-159).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నన్నయకథాకథనశిల్పం

1. కార్యకారణపద్ధతి

కథ చెప్పటంలో రెండు పద్ధతులు ప్రసిద్ధం. 1. కాలక్రమపద్ధతి నాశ్రయించి చెప్పటం. 2. కార్యకారణపద్ధతి నాశ్రయించి చెప్పటం. ఈరెండు పద్ధతులు సందర్భాన్నిబట్టి శిల్పసుందరంగా శోభిల్లుతుంటాయి. అయితే మొదటిపద్ధతిలోకంటె రెండవ దానిలో ఉత్కంఠ, భావనం, పూర్వాపరసమన్వయం అనే గుణాలు ఆసక్తిదాయకంగా రాణిస్తాయి. సభాపర్వంలో సహజంగా కొంతకథ కార్యకారణసంబద్ధంగా చెప్పబడింది. ముఖ్యంగా- ధర్మజరాజసూయఘట్టం.

ఇందులో విశేషమేమంటే - ప్రథమాశ్వాసమంతా రాజసూయయాగం చేయటం ఫలంగా సాగే కార్యచైతన్యాన్ని ఉజ్జ్వలంగా వివరంగా వర్ణిస్తుంది. కాని, చివరకు రాజసూయయాగవర్ణనం అయిదారు పద్యాలలో ముగించివేస్తుంది. పఠిత ఈ సంగ్రహ రచనకు అసంతృప్తి చెందుతాడు. వివరాలు చెపితే బాగుండేది అనుకుంటాడు. ముందు వివరాలు తెలుస్తాయేమో అని ఒక ఆసక్తి కలిగిస్తూ ఆశ్వాసాన్ని ఆపటం నన్నయకథాకథనంలో ఒక శిల్పం. రెండోఆశ్వాసంలో పఠిత (శ్రోత) కోరే వివరాలన్నీ దుర్యోధనుడిచేత చెప్పించడం గమనిస్తే ఆశ్చర్యం వేస్తుంది. శత్రువులకు అసూయ పుట్టేటంత వైభవంగా రాజసూయం జరిగిందనే వస్తుధ్వని అందులో ఉన్నది. ధర్మరాజు రాజసూయ వైభవాన్ని కన్నులతో చూడలేని ధృతరాష్ట్రుడికి మనసుకు రూపుకట్టేటట్లు వర్ణించిచెప్పటం విశేషం. దానివలన కథలో పునరుక్తి తొలగి ఆసక్తి పెరిగింది.

ఇటువంటివే మరికొన్ని అంశాలు సభాపర్వకథాకథనశిల్పానికి వన్నె తెచ్చిపెట్టాయి. మచ్చుకు జరాసంధ శిశుపాలుర జన్మవృత్తాంతాలను వారివారి వధలకు ఉపబలకంగా చెప్పటం, వాటివలన శ్రీకృష్ణభీష్ముల వర్తనాలలోని లోతులను శ్రోతలు లోనారసి గ్రహించే గాఢత సాధించబడింది.

2. సమన్వయసూత్రం

ప్రతిపర్వంలోనూ ఆ యా కథార్థాలను సమన్వయించుకొనటానికి కొన్ని కీలకమైన సమన్వయ సూత్రాలను అందించటం కథాకథనంలో కనపడే ఒక ప్రౌఢశిల్పం.

క. "నయనములు నాకుఁ, బవనత
నయవిజయులు, మనము కమలనాభుఁడు, వీరిం
బ్రియహితులఁ బాసి నిమిషం
బయినను నెట్లుండ నేర్తు నవిచేష్టుఁడనై". **(సభా. 1.169)**

అని ధర్మరాజు అనుకొంటాడు. ధర్మరాజు మూర్తికట్టిన ధర్మం. ఆ ధర్మానికి రెండు కళ్ళు భీమార్జునులు, అంటే ప్రవృత్తి నివృత్తులు, పురుషార్థపరార్థాలు. మానుష దైవీశక్తులు. మనసు శ్రీకృష్ణుడు. అతడు ధర్మతత్త్వస్వరూపుడు. కన్నులు చూస్తాయి. మనసు భావిస్తుంది. అనుభవిస్తుంది. మనస్సునుకూడా నేత్రంగా చెప్పటం ప్రసిద్ధి. మనోనేత్రం భౌతికనేత్రాలకంటె బలమైనది. అది తత్త్వాన్ని దర్శించగలుగుతుంది. కన్నులది వాస్తవజ్ఞానం, మనస్సుది తత్త్వదర్శనం. సభాపర్వకథార్థాలను ఈ దృష్టితో అర్థం చేసికొంటే ధర్మానికి మూడోకన్ను దైవం. ఇహపరాలు ఉభయనేత్రాలు. రాజసూయం చేసే ధర్మమూర్తిని విజయమూర్తిగా చేసినవి భీమార్జునుల భుజశౌర్యబలం, శ్రీకృష్ణుడి బుద్ధిబలం. అయినా వీరు ధర్మజుడికి సహాయకులే. నాయకుడికి అనునాయక, ఉపనాయకప్రాయులే అనే తాత్పర్యం గ్రాహ్యం. ఈ తాత్పర్యాన్ని శ్రీకృష్ణుడే వ్యాఖ్యానించి చెప్పాడు.

క. "బలిమిమెయిఁ బార్థురక్షా
బలమును బవనసుతుబాహుబలమును నా ని
ర్మలనీతిబలము నీకుం
గలుగ నసాధ్యంబు గలదె కౌరవనాథా!" **(సభా. 1. 163)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రక్షాకవచమైన అర్జునుడు దైవీశక్తిని ధర్మరాజుకు కవచంగా అమర్చే బలం. నరు డెక్కడుంటే అక్కడ నారాయణుడు. వారిద్దరు కలిసి ఎక్కడుంటే అక్కడ శ్రీవిజయం. అర్జునుడు అస్త్రశస్త్రాలను, దేవతలవరాలను పొందుతూ దివ్యశక్తులను తనలో సమీకరించుకొంటూ సాగే నిరంతరసాధకుడు. భీముడు జన్మసిద్ధంగా వచ్చిన వజ్రకాయంతో స్థిరమైన దేహబలంతో సిద్ధుడు. కృష్ణుడు బుద్ధిబలానికి ప్రతినిధి. పై రెండింటికి పరిమితు లున్నాయి. నిర్మలనీతికి నియతి లేదు, హద్దులు లేవు. ఈ మూడింటిని సంగమించుకొనిన త్రేతాగ్ని ధర్మజుడు. శ్రీకృష్ణ డనే మూడోకన్ను తెరిస్తే, నీతిబలాన్ని సారిస్తే ధర్మమూర్తి అయిన ధర్మరాజు త్రినేత్రుడు కాగల డని ధ్వని. భీమార్జునకృష్ణులు ధర్మజుడి భౌతికసంపద కాదు. సహజమైన అక్షయసంపద. దిగ్విజయంవలన పొందిన సిరి అనిత్యం, కాని, ఆ సహజసంపదమాత్రం ఎవరూ అపహరించలేనిది.

3. ప్రశంసలు : ప్రయోజనాలు

సభాపర్వంలో నాయకుడైన ధర్మజుడు ప్రతినాయకుడైన దుర్యోధనుడి కపటోపాయంచేత వంచితుడై రాజ్యసంపదలను కోల్పోయి అవమానాలకు లోనై అడవుల పాలవుతాడు. అయినా ప్రతినాయక ప్రశంసలు మాత్రం అతడి నాయకత్వానికి గౌరవచిహ్నాలై రాజిల్లుతూ ఉంటాయి. దుర్యోధనుడు రాజసూయయాగ మహత్త్వాన్ని విస్తృతంగా - అసహనంతో నైనా - కీర్తించి ధర్మజుడి ఉత్తమ నాయకత్వాన్ని ఉన్మీలింపచేశాడు. ఆ వర్ణనమంతా ఒకయెత్తు; ధర్మజుడు రాజసూయాంతంలో అవభృథస్నాతుడై సమ్రాట్టుగా శోభిల్లిన సన్నివేశవర్ణనం మరొక యెత్తు.

సీ. అభిషిక్తుఁడయిన యయ్యమరాజసుతునకు । సాత్యకి మౌక్తికచ్ఛత్ర మొప్పఁ
బట్టె; భీముండును బార్థుండు మణిహేమ । దండచామరయుగధారు లయిరి;
కమలనాభుండును గవలును ద్రుపదేశ । పుత్త్రుండు వేర్వేఱ భూమిపతుల
మూర్ధాభిషిక్తుల మ్రొక్కించుచుండిరి । దర్పంబు వెలయంగ; దానిఁ జూచి

ఆ. యేను మొదలుగా మహీపతు లెల్లను । దీప్తి దఱిఁగి యుండఁ దివిరి మమ్ము
నగిరి కృష్ణపాండునందన ద్రౌపదీ । సాత్యకులుఁ గరంబు సంతసమున." **(సభా. 2. 119)**

భారతంలో కురుసామ్రాజ్యపట్టాభిషేకగౌరవం ధర్మజుడికి తప్ప దుర్యోధనుడి కుండ దని ఈపద్యంలోని వస్తుధ్వని.

ఉ. "భూవిదితప్రతాపపరిభూతవిపక్షుఁడు సవ్యసాచి గాం
డీవము గొన్న, భీముఁడు వడిన్ గద గొన్నఁ, గవల్ కృపాణచ
ర్మావరణాదిభాసితమహాభుజవిక్రములైన వారలన్
లావె రణంబులో మన కలంఘ్యబలాఢ్యుల నింక నోర్వఁగన్." **(సభా. 2. 273)**

ఈ పద్యం అనుద్యూతానికి అనువుగా దుర్యోధనుడు ధృతరాష్ట్రుడితో చెప్పిన ముందుమాట! ఏమైనా - ప్రతినాయకుడి అంతరంగంలోని అసలైన మాట! అంతేకాదు కురుక్షేత్రయుద్ధంలో కాబోయే నిజమైన మాట!

కథలో ప్రతినాయకుడిచేత నాయకవర్గాన్ని ప్రశంసింపచేసే వాక్యాలు స్థాయిభావపోషకాలై రాణించటం కథాశిల్పరహస్యం. ఇటువంటివి మరెన్నో!

సహానుభూతి : సానుభూతి

కావ్యంలోని పాత్రలు వారి వారి స్వభావాలనుబట్టి సహృదయులలో మూడు రకాలైన అనుభవాలను కలిగిస్తూ ఉంటారు. వాటిని ఈ విధంగా వివేచించవచ్చును. 1.ఆదర్శపాత్రలలో కాని, ధర్మబద్ధమైన ప్రవర్తన కలిగిన పాత్రలలో కాని, ధర్మబద్ధమైన ఏ కావ్యంలోనైనా ఉత్కటభావస్థితి ప్రదర్శించే పాత్రలలో కాని సహృదయులు తాదాత్మ్యాన్ని పొంది,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సాధారణీకరణంవలన వారి భావాలే తమ భావాలుగా చర్వణంచేసి రసానందాన్ని అనుభవిస్తారు. దీనిని సహానుభూతి అంటారు. 2.ఉదాత్తగుణసమన్వితులై కూడా ఏదో ఒక లోపంవలన కాని, బలమైన విధివలనగాని, అపజయానికి- ఒక్కొకసారి మరణానికి - గురిఅయ్యే పాత్రలు పఠితలనుండి తమపట్ల సానుభూతిని సాధించుకొంటారు. పాశ్చాత్య రూపకాలలో విషాదాంత పాత్రల స్వరూపం కూడా ఇటువంటిదే. 3.అధర్మబద్ధమైన ప్రవృత్తి కలిగిన దుష్టపాత్రల ప్రవృత్తులు పఠితలలో సహానుభూతిని గాని, సానుభూతిని గాని కలిగించకపోగా ప్రతికూలస్పందనను కలిగిస్తాయి. ఆ ప్రతికూలస్పందనలు ఉదాత్తపాత్రలపట్ల కలిగే సహానుభూతి, సానుభూతులకు బలాన్ని చేకూరుస్తాయి. ఈ రసానుభవసూత్రాన్ని దృష్టిలో ఉంచుకొని సభాపర్వ కథార్థాలు కలిగించే అనుభవాలను విశ్లేషించుకొంటే అవి అంత ఆసక్తిదాయకంగా ఎందుకు ఉన్నాయో తేటపడుతుంది.

ప్రథమాశ్వాసంలో సహానుభూతి : ద్వితీయాశ్వాసంలో సానుభూతి

ధర్మజుడు పాండురాజుహితం కోరి, రాజుల ప్రజల బాగునుకోరి రాజసూయం నిర్వహించటంలో ధర్మబద్ధమైన యుద్ధవీరాన్ని సహానుభూతిగా సహృదయుడు సభాపర్వ ప్రథమాశ్వాసంలో పొందుతాడు. జరాసంధవధలో జరాసంధుడు ప్రతినాయకప్రాయుడు. మూర్ధాభిషిక్తులను భైరవపూజలో బలిచేసే క్రూరకర్మ అతడిలో గల దోషం. దానివలన అతడు అపారబలపరాక్రమాలు కలిగి ఉన్నా పఠితకు సహానుభూతిని గాని, సానుభూతిని గాని కలిగించలేకపోయాడు. పైపెచ్చు పఠితల ప్రతికూలస్పందనకు గురిఅయ్యాడు. అట్లా కావటానికి శ్రీకృష్ణుడి అధిక్షేపణలు ఎంతగానో తోడ్పడతాయి. జరాసంధవధ చేసిన భీమాదుల కృత్యాలు ధర్మసమ్మతాలు కావటంచేత పఠితలు వారితో సహానుభూతి పొందుతారు.

వీరరసం ధర్మమూలం. ధర్మార్థకామాలను ధర్మబద్ధంగా సాధించే ఉత్కటోత్సాహమే వీరం. ''తతోఽర్థకామయో ర్ధర్మ మూలకత్వాత్ ధర్మప్రధానో వీరః'' అని అభినవగుప్తపాదులు. కాబట్టి ధర్మవిరుద్ధమైన ఉత్సాహం వీరానికి స్థాయి కాలేదు. అది వీరరసంగా సహృదయులచేత సహానుభూతితో అనుభవించబడలేదు.

సభాపర్వ ప్రథమాశ్వాసంలో ధర్మజుడి రాజసూయ ప్రయత్నమంతా ధర్మప్రధానం కావటంచేత వీరరసానుభవాన్ని సాంద్రంగా సహృదయుల కందిస్తుంది. ఇక ద్వితీయాశ్వాసంలో ధర్మజునిప్రవర్తనం మాయాద్యూతఘట్టంలో సహృదయుల సహానుభూతిని కోల్పోయి సానుభూతినిమాత్రం పొందే స్థితికి రావటం అనుభవసత్యం.

ధర్మరాజు తెలిసి తెలిసి కపటద్యూతంలో పాల్గొని వంచనకు గురిఅయి తన సంపదనంతా ఓడిపోవటం చదువుతూ ఉంటే ఆ పాత్రలో మనకు తాదాత్మ్యం కలుగదు. అట్లని ప్రతికూలస్పందనకూడా కలుగదు. అంతటి నిర్మలచరిత్రుడు ద్యూతవ్యసనం అనే బలహీనతకు లొంగి, 'బలవద్ద్యూతార్థముగాఁ బిలువంబడి మగుడ నగునె?' అనే ధర్మాన్ని చూపిస్తూ తనచర్యను బలపరచుకొంటూ అనుద్యూతంలోకూడా ఓడిపోవటాన్ని పఠిత ఆదర్శవర్తనగా గ్రహించడు. భీము డన్నట్లుగా అతడి చేతులు కాల్చదగిన వని ప్రతికూలస్పందన పొందడు. అర్జును డన్నట్లుగా ఉత్తమక్షత్రియ సంప్రదాయాన్ని నిలుపుతున్నాడని ధర్మరాజును మెచ్చుకొనలేడు. కాని, ''విధినియుక్తుఁడయి'' (2.157) ''విధినియోగంబు నతిక్రమించలేక'' ధర్మరాజు జూదానికి దిగవలసి వచ్చిందనీ, తత్ఫలాన్ని అనుభవించవలసి వచ్చిందనీ జాలి పొంది అతని పట్ల సానుభూతిని ప్రకటిస్తాడు. కాబట్టి అడవులకు పోతున్నా పాండవులు పాఠకుల సహానుభూతిని పొందరు. సానుభూతిని పొందుతారు. పాఠకులు విషాదపాత్రల స్వభావాన్ని వారిలో దర్శించగలుగుతారు. ఈ విధంగా- సహృదయులు కథార్థాలలో సహానుభూతిని, సానుభూతిని పొందే రెండుమార్గాలకు సభాపర్వపూర్వోత్తరార్థాలు రంగస్థలాలైన వన్నమాట!

సభాపర్వంలో ధీరోద్ధతులైన జరాసంధ, శిశుపాల, దుర్యోధనుల అధర్మబద్ధమైన అర్థప్రవృత్తులు ధర్మజాదుల ధర్మవీరప్రవృత్తులకు వ్యతిరేకవైఖరితో పోషకంగా నిలవటం గమనార్హం. జరాసంధ శిశుపాల దుర్యోధనులు అర్థపురుషార్థసాధకులు, అందువలన ఉద్ధతులు. వారి నాశ్రయించుకొని ఉన్న రసం రౌద్రం. క్రోధం దానికి స్థాయిభావం. 'శత్రుకృతాపచారేణ మనః ప్రజ్వలనం క్రోధః' అని ప్రతాపరుద్రయశోభూషణం. ఇది జరాసంధుడియందుకంటె శిశుపాలుడిలో, అంతకంటె దుర్యోధనుడిలో పరిపూర్ణతను సాధించింది. కారణం- మొదటిరెండూ ఉపకథలు, మూడవది ప్రధానకథ కావటమే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అర్థ కామాలను ధర్మంతో ముడిపెట్టినవాడు ధర్మజుడు. అర్థకామాలనుండి ధర్మాన్ని దూరం చేసినవాడు దుర్యోధనుడు. త్రివర్గాలను సేవించేవిధం భారతంలోనే ఇట్లా చెప్పబడి ఉన్నది.

సీ. "ధర్మకామంబులు దఱుగంగ నర్థార్థి । యగువాఁడు పతితుఁడౌ, నర్థసేవ
నర్థార్థముగఁ జేయునతఁ డుగ్రవనములో । గోరక్ష సేయు నక్కుమతిఁబోలు,
నర్థధర్మములకు హానిగాఁ గామార్థి । యగు నాతఁ డల్పజలాశయమున
జలచరం బెట్టు లజ్జలములతోఁ జెడు । నట్లు కామంబుతో హానిఁ బొందు

ఆ. నర్థధర్మములు మహాబ్ధిమేఘము లట్టు । లుభయమును పరస్పరోదయమ్ము
లిట్లుగాఁ ద్రివర్గ మెఱిఁగి సామ్యమున సే । వించువాఁడు సర్వవిత్తముండు". **(అరణ్య. 1. 245)**

దీనినిబట్టి గమనిస్తే దుర్యోధనుడు - ధర్మకామాలను కాదని అర్థాన్ని కోరేవాడు కాబట్టి-పతితుడు. అసూయాగ్రస్తుడై పాండవధనాన్ని మాయోపాయంతో అపహరించబూనిన అతడిపట్ల, అతడికి సహకారులుగా వర్తించినవారిపట్ల పఠితల సానుభూతి ఉండకపోగా ప్రతికూలస్పందన బలంగా ఉంటుంది. వారిని దుష్టపాత్రలుగా భావించి గర్హిస్తారు. సభాసదులు ధృతరాష్ట్రుడినీ, అతని పుత్రులనూ గర్హించినట్లు నన్నయ అనేకసార్లు వర్ణించడం కథార్థాలలో సహృదయ ప్రతికూలస్పందనలకు అనుస్పందనలను అనుసంధించటానికే. అందువలన కపటద్యూతంలో ఓడినా, ధర్మజుడు సానుభూతితో తన ఔదాత్యాన్నీ, ఔన్నత్యాన్నీ నిలువబెట్టుకొని, భావికథలో పఠితల సహానుభూతిని పొందటానికి వీలుకలిగించుకొన్నాడు.

అధర్మమూలమైన రౌద్రం దుర్యోధనాదులదైతే, ధర్మబద్ధమైన రౌద్రం భీముడిది, అతడి భీషణప్రతిజ్ఞలన్నీ సహృదయుల సహానుభూతిని పొందగలగటం విశేషం. పఠితలకు ధర్మజుడిపై సానుభూతి, భీముడిపట్ల సహానుభూతి. విదురవికర్ణుల ధర్మసంభాషణలవలె ఆదర్శాలుగా ఉండక పోవచ్చును. కాని, భీముడి ప్రతిజ్ఞలు అధర్మానికి ప్రతిగా తీవ్రంగా స్పందిస్తున్న ధర్మచైతన్యంగా పఠితలు భావిస్తారు. అక్కడక్కడ శ్రుతిమించి ధర్మజుడిని నిందించినా సహిస్తారు. అర్జునుడి హితబోధతో అతడు తన స్వల్పదోషాలను సరిదిద్దుకొనే సత్పురుష ప్రవృత్తిని ప్రకటించటంచేత భీముడు పాండవపాత్రలందరిలో ప్రశంసాపాత్రుడౌతాడు. అతడి ప్రతిజ్ఞలకు మారుగా దుర్యోధనాదులలో, చివరకు దుర్యోధనుడిని అంతగా బుజాన వేసికొని మోసే కర్ణుడుకూడ, మారుపల్కలేకపోవటం, ధర్మబద్ధమైన రౌద్రరసస్థితిని తెలుపుతున్నది. ధర్మజుడు భీముడిని ప్రతిజ్ఞలు చేయకుండా వారించకపోవటం గమనార్హం. ధర్మజుడి మనసే భీముడుగా పలుకుతున్నట్లు పఠితలు భావిస్తారు. అందువలననే ధర్మజధర్మ ప్రవృత్తికి పోషకంగా నిలిచింది భీముడి రౌద్రోద్రేకం!

మొత్తంమీద ధర్మజుడిది స్థిరమైన ధర్మవీరం. ప్రథమాశ్వాసంలో భీమాదుల దిగ్విజయ యుద్ధవీరంతో పరిపుష్టమై రాజసూయ నిర్వహణంలో అది ద్విగుణీకృతమైనది. రెండవ ఆశ్వాసంలో ప్రతినాయక రౌద్రంచేత ధిక్కరించబడి మందీకరించబడినదైనా ధర్మజు ధర్మవీరం భీముడి రౌద్రంచేత, అర్జునుడి వీరంచేత, ద్రౌపది ధర్మవీర ప్రవర్తనచేత, శ్రీకృష్ణుడి మహత్త్వంచేత మాన్యతను పొంది సహృదయుల రసానుభూతిని చూరగొన్నది. ధర్మబద్ధమైన రౌద్రం ప్రక్కనే ధర్మవిరహితమైన రౌద్రం ఆభాసగా అనుభూతి కందుతుంది. అట్టి విశిష్టరసచిత్రం కపటద్యూతసభలో ప్రత్యక్షమౌతుంది. అందుకే సభాపర్వం అంటే వీరకావ్యరసవైవిధ్య వర్ణచిత్రంగా పండితుల నాకర్షించేది.

క. "పర్వి సభాప్రభృతిగ నవ
పర్వములను విస్తరిల్లి పండితచేతో
నిర్వృతిఁ జేయుచు రెండవ
పర్వమునా రమ్య మగు సభాపర్వ మిలన్". **(ఆది. 1.38)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'ఎఱుఁగఁ జెప్పుము దీని నీ వెఱుఁగుదేని'

తెలుగువారి నోట ఈ తేటగీతి పాదం ఒక పొడుపు కథ తోక ప్రశ్నగా ఎప్పటికీ తురంగలిస్తూ ఉంటుంది. ఇది ద్రౌపది ప్రాతికామికి వేసిన ప్రశ్న. తిరిగి ప్రాతికామి ధర్మరాజుకు వేసిన ప్రశ్న. మరల కురుసభలో ఆసాధ్వి అందరినీ అడిగిన ప్రశ్న. ఆ ప్రశ్నకు సరైన సమాధానం ఇచ్చినవారు లేరు. ఒకరిద్దరు ఇచ్చినా వాటిని పట్టించుకొన్న నాథుడు లేడు. ధర్మజుడు కిమ్మన లేదు. ధర్మమర్మం జనంమధ్యలోనే నిద్రపోయింది. ద్రౌపదికి జరుగవలసిన అవమానం జరిగిపోయింది. అసలుసంగతి వ్యాసుడైనా చెప్పినట్లు స్పష్టంగా తెలియదు. నన్నయ వ్యాసుడివలె వాచ్యం చేసేవాడు కాడు. మూలాన్ని ఒరపిడి పెట్టి తన కథామూల్యాన్ని మెరుగుపెట్టుతాడు. ఒక్కమాటలో మూటెడు కథార్థాలను గుబాళింప చేస్తాడు. అందువలన అసలువిషయం అంత తేలికగా బైటపడదు.

ఈ కథాఘట్టాన్ని చదువుతుంటే పఠితల ముందు ఎన్నో ప్రశ్నలు తలలెత్తుతాయి. వాటికి నన్నయ వాచ్యంగా సమాధానం చెప్పడు. సారమతులై లోనారసి చూడండి అంటాడు. అటువంటివాటిని కొన్నింటిని గమనిద్దాం.

1. కపటద్యూతవ్యూహాన్ని భీష్ముడు ఎందుకు వారించలేదు?

సమాధానం : భీష్ముడు దాశరాజుఎదుట సత్యవతికి పుట్టిన సంతానమే తనకు రాజుగా ఉంటాడనీ, తాను అతడి నియుక్తుడుగా ఉంటాననీ శపథం చేశాడు. అందువలన ధృతరాష్ట్రుడికి అతడు యావజ్జీవ నియోజ్యుడు. అది కారణంగా ధృతరాష్ట్రుడు రాజుగా తీసికొన్న నిర్ణయాన్ని కాదని తిరస్కరించలేడు. సలహా అడిగితే చెప్పగలడు అంతే. భీష్ముడి శపథమే అతడి మాటను చేతను కదలకుండా బంధించింది. అందువలన రాజాజ్ఞకు విరుద్ధంగా ఒక్కమాట కూడా ఈ ఘట్టంలో భీష్ముడు పలుకడు.

2. విదురుడు పాండవులను హస్తినాపురానికి తెచ్చాడు. అడుగడుగునా ధర్మాన్ని ప్రబోధిస్తూ, అధర్మాన్ని వారిస్తూ ఉండి కూడా ఏమీ చేయలేని స్థితిలో ఎందుకు ఉండిపోయాడు?

సమాధానం : విదురుడు మహామంత్రి స్థానీయుడు. రాజుకు హితవు చెప్పగలడు కాని, అతడిని బలవంతం చేయలేడు. అతడు తనమాట విననప్పటికీ చెవులలో జోరీగవలె హోరుపెట్టి చెప్పగలడు. కాని, అతడి పక్షాన తాను మాట్లాడ లేడు. రాజు నిర్లిప్తుడై తన మాటను పట్టించుకొనకపోయినా రాజహితాన్ని కోరి రాజకుటుంబ సభ్యులకు, సభికులకు, ప్రజలకు తన మాటగా చెప్పగలడే కాని రాజుగా పలకలేడు. తనమాట కాదని రాజు తనను ఆజ్ఞాపిస్తే అతడు ఆ పని తప్పక చేయకతప్పదు. అట్లని దుర్యోధనుడు ఆజ్ఞాపిస్తే ఆచరించ నవసరం లేదు. దుర్యోధనుడు ఎన్ని నిందించినా తాను కటకట పడగలడు. తిరిగి నాలుగుమాట లనగలడు కాని, రాజు తనను నిందిస్తే, పాండవపక్షపాతి వని తూలనాడితే హస్తినాపురిని వదలిపోవలిసిందే. ఇతిహాసమైన మహాభారతంలో కురుసభలో మిత్రుడివలె (మిత్రసమ్మితంగా) హితం బోధించే ధార్మికమూర్తి విదురుడు. అతడి మాటను పాటించనివారు వారి పాపాన వారే పోతారు.

3. పాచికలాడి పాండవ సంపదలను అవలీలగా హరిస్తానని అంత ధీమాగా శకుని ప్రకటించటంలో గల రహస్య మేమై ఉంటుంది?

సమాధానం : పాండవులను పరాక్రమంతో దుర్యోధనుడు జయించలేడు కాబట్టి కపటోపాయంతో రాజ్యసంపదను అపహరించటం తప్ప మరొక మార్గం లేదు. ధర్మరాజులో జూదమాడే వ్యసనం చంద్రుడిలోని మచ్చ వలె నిలిచి ఉన్నది. అయితే అది అధర్మం కాదు. క్షత్రియులు వ్యసనపరులై వేటనూ, జూదాన్నీ అప్పుడప్పుడూ ఆడుతూ ఉంటారు. సుహృద్ద్యూతం దేవతలాడే ఆట అని ఒక ప్రతీతి ఉన్నది. ధర్మంగా జూదమాడితే యజ్ఞంచేసిన పుణ్య మనే భావం కూడా ప్రచారంలో ఉన్నది. పైపెచ్చు ఎవరైనా సుహృద్ద్యూతానికి పిలిస్తే జూదరి రాననటం ఆ ఆటగాళ్ళు పాటించే మర్యాద కాదు. ధర్మజుడు మర్యాదను పాటించే ధార్మికుడు. హాస్యానికికూడా అబద్ధమాడడు. అధిక్షేపంలోకూడా అన్యాయం చేయడు. అందువలన దుర్యోధనుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మరాజును సుహృద్ద్యూతానికి పిలిచి కపటద్యూతం మొదలుపెట్టినా - ముగ్గులోకి దిగిన తర్వాత మొగం తప్పుకోలేడు. లోకంలో జూదగాళ్ళ స్వభావం విచిత్రమైనది. పందెం ఓడిన కొద్దీ వారికి పంతం పెరుగుతూ ఉంటుంది. ఒడలు తెలియకుండా పందెములు కాస్తారు. చివరకు ఉన్నదంతా పణంగా పెట్టుతారు. చివరకు భార్యలనుకూడా ఒడ్డి ఓడిపోతారు. తనను తాను పణంగా పెట్టి ఓడిపోవటంతో ఆట ముగుస్తుంది. సాటి జూదగాళ్ళు ఓడిపోయినవాడినీ వాడి భార్యనూ వస్త్రహీనులను చేయటం, నిష్ఠురాలాడటం, పీడించటం, బాధించడం, దాసీ పనులు చేయించుకోవటం మొదలైన దుశ్చేష్టలతో అవమానాల పాలుచేస్తారు. అయినా ఓడినవారు కిమ్మనక చూస్తూ కూర్చుండవలసిందే. ఇవన్నీ ద్యూతలోకంలో సర్వసామాన్యాలే. ఇటువంటి వివరాలు ఋగ్వేదంలోని అక్షసూక్తంలో వివరించబడి ఉన్నాయి. (ఋగ్వేదం. మం10, అ 3, సూ. 32-33). శకుని కపటద్యూతపరుడు. అతని ద్యూతలోకంలో ఇదంతా ఆక్రీడకు సంబంధించిన సంస్కృతి. కపటం తెలియని ధర్మరాజుయొక్క జూదవ్యసనాన్ని, అతని ధార్మికవర్తనాన్నీ గుర్తించి కొల్లగొట్టాలని వ్యూహం పన్నాడు. ధర్మరాజును పిలిస్తే అతడు రాక తప్పదు. వస్తే ఆడక తప్పదు. ఆడితే ఓడక తప్పదు. ఓడితే పైనచెప్పిన జూదరుల మర్యాదలతో అతడిని అతని భార్యను తమ్ములను అవమానించటానికి అవకాశం దొరుకుతుంది. వస్త్రాపహరణం ఓడినవారికి గెలిచినవారు చేసే ద్యూతావమానక్రీడ. అందువలననే పాండవుల వస్త్రాలను, ద్రౌపది వస్త్రాలను అపహరించుమని దుర్యోధనుడు దుశ్శాసనుడిని ఆజ్ఞాపించాడు. ఆ ద్యూతావమాన క్రీడలలో వస్త్రాపహరణం ఉత్కృష్టదశగా నిలిచింది. దీన్ని గమనిస్తే శకునివ్యూహం సందు లేనిది. తిరుగు లేనిది.

4. 'మున్ను తన్నోడి ఆపై న న్నోడెనా? నన్ను మున్నోడి విభుడు ఆ మీద త న్నోడెనా? - ఈ ప్రశ్నలో ఉన్న కిటుకు ఏమిటి? మెలిక ఏమిటి?

సమాధానం : శకునితో జూదమాడుతూ ధర్మరాజు క్రమంగా తన తమ్ములనూ చివరకు తననూ పణాలుగా పెట్టి ఓడిపోయాడు. నన్నయరచనలో ధర్మరాజు తమ్ముల నోడినట్లే తానూ ఓడినట్లు చెప్పబడి ఉన్నది. వ్యాసు డీ ఘట్టంలో - జూదమాడుతున్నప్పుడు జూదరులు ఆటలో ఒక్కొక్క పందెం వేసేటప్పుడు ఏయే మాటలంటూ ఆడారో వాటిని ఆయా సందర్భాలలో వివరంగా చెప్పాడు. అందులో ధర్మజుడు తమ్ములలో ఒక్కొకడిని పణంగా పెట్టి ఓడినప్పుడు - 'ఇతడిని పణంగా పెట్టి ఆడుతున్నాను' అని అనేవాడు శకుని పందెం వేసి 'నీవు దీనిని ఓడావు' అని పలికేవాడు. అయితే ధర్మజుడు తనను తాను పణంగా పెట్టుకొన్నప్పుడు మాత్రం మాట మార్చి ఇట్లా అన్నాడు.

శ్లో. "అహం విశిష్టః సర్వేషాం భ్రాతౄణాం దయిత స్తథా
కుర్యామస్తే జితాః కర్మ స్వయ మాత్మన్యుపప్లవే." **(సం. సభా. 58. 27)**

నా సోదరులలో నేను విశిష్టుడను, సోదరులకు ప్రీతిపాత్రుడను. జయించబడితే జితదాసుడి వలె స్వయంగా పనిచేస్తా నన్నాడు. కాని, నన్ను నేను పణంగా ఒడ్డి ఆడుతున్నానని మామూలుగా చెప్పలేదు. శకుని మాత్రం ధర్మజుడు తనను తాను పణంగా పెట్టి ఓడినట్లే ప్రకటించాడు. కాని, ధర్మజుడు తాను పణంగా ఓడలేదని, ఓడితే దాసుడిగా ఉండటానికి అంగీకరించాడనీ తలంచి ఉండవచ్చును. శకుని ఈ భేదాన్ని గుర్తించకుండా వ్యవహరించాడు. ఏమైనా ధర్మజుడియందు దాసత్వం మాత్రం ఏర్పడింది. దానిచేత యజమాని ఏమి చెపితే అది చేయటం అతడి ధర్మమైపోయింది. శకుని మాట దుర్యోధనుడి మాటే కాబట్టి వారిద్దరిమాట కాదన లేని స్థితి ఏర్పడింది. భీమాదుల కట్టి స్థితి లేదు. అందువలన వారు శపథాలు చేశారు.

శకుని ధర్మరాజును ఆ సమయంలో "ఇ ట్లేల ని న్నొడ్డి తధిప! నీకు నొండుధనము గలదు, మఱచి తెట్లు? కమలాక్షి పాంచాలకన్య నీకు ధనము కాదె?' అని అన్నాడు. ఆమాట విని ఆటమీది ఆసక్తితో తన భార్యను పణంగా పెట్టి ఒడ్డి ఓటుపడ్డాడు. అంతటితో పణం పెట్టే ధనం ధర్మరాజుదగ్గర లేకపోవటంచేత ఆట ఆగవలసి వచ్చింది. తల వంచుకొని ఖిన్నుడై ధర్మరాజు కూర్చున్నాడు. ఇది నన్నయ చెప్పిన తీరు.

వ్యాసు డిచ్చిన వైనం ఇంతకంటె వివరంగా ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శకుని రువాచ - ఏత త్పాపిష్ఠ మకరోత్ యదాత్మానం పరాజితః
శిష్టే సతి ధనే రాజన్ పాప ఆత్మపరాజయః ॥

వైశంపాయన ఉవాచ - ఏవ ముక్త్వా మతాక్షస్తాన్ గ్లహే సర్వానవస్థితాన్
పరాజయ ల్లోకవీరా నాక్షేపేణ పృథక్ పృథక్ ॥

శకుని రువాచ - అస్తి వై తే ప్రియా దేవీ గ్లహ ఏకోఽపరాజితః
పణస్వ కృష్ణాం పాంచాలీం తయాత్మానం పునర్జయ ॥ (సం. సభా. 58. 29-31)

శకుని ధర్మరాజుతో 'నీ సొమ్ము మిగిలి ఉండగా నిన్ను నీ వోడటం పాపిష్ఠి కర్మ. అట్లా చేయటం పాపహేతువు, అని పలుకుతూ పాండవులందరూ పరాజితు లైనా రని సభలో ప్రకటించాడు. ఆ తరువాత ధర్మరాజు ఓడని ధనం మరొకటి ఉన్నదనీ, అది పాంచాలి అనీ పేర్కొన్నాడు. ప్రియురాలైన కృష్ణను పణంగా పెట్టుమని ధర్మరాజును ప్రేరేపించాడు. ద్రౌపదీ పణానికి ధర్మజుడి దాస్యవిముక్తి ప్రతిపణంగా ప్రతిపాదించాడు. ఆమాటలు కొసమెరుపు ఆశలు కలిగించగా ధర్మజుడు శకుని సూచన నంగీకరించి ద్రౌపదిని పణంగా పెట్టి జూదంలో ఓడిపోయాడు.

వ్యాసుడు చెప్పిన సంభాషణ వివరాలు కొన్ని విశేషాలను బయట పెట్టుతున్నాయి. (1) ధర్మజుడు తన్ను తా నోడి దాసుడైనాడు. (2) దాసుడి సొమ్ము రెండు రకాలు. దాసుడు కాకపూర్వం సంపాదించుకొన్న ధనం. దాసుడైన తరువాత సంపాదించే ధనం. ధర్మరాజుకు ద్రౌపది ఇందులో మొదటిరకం ధనమే అవుతుంది. దానిని తానోడకపూర్వం పణంగా పెట్టినట్లైతే ఆమె యజమాని సొత్తు అయి ఉండేది. అట్లా చేయటం ధర్మరాజు అభిమతం కాదని అతడి చర్య స్పష్టం చేస్తున్నది. తమ్ములను ఓడి భార్యను ఓడక తనను తానే ఓడిన ధర్మరాజు ఉచితజ్ఞుడు. ధర్మపత్ని గౌరవప్రతిష్ఠలను కాపాడటానికి యత్నించిన ధర్మజ్ఞుడు. అందుకే ద్రౌపది నిండుసభలో తన భర్త ధర్మస్వరూపుడని కీర్తిస్తుంది. (3) ధర్మరాజుచర్యలోని ఈ మెళకువను శకుని పసికట్టాడు. ధర్మజుడితో పాటు ద్రౌపదిని కూడా దాసిని చేయాలని అతడి పన్నాగం. అందువలన ద్రౌపదిని పణంగా పెట్టుమని ధర్మజుడిని ప్రేరేపించాడు. అయితే ఇక్కడ ఒక చిక్కు ఏర్పడింది. ధర్మజుడు సహదేవనకులార్జునభీములను ఒడ్డి ఓడిపోవటంతో వారికి ద్రౌపదిమీది అధికారం పోయింది. పెద్దవాడైన ధర్మజుడియందు అది నిలిచి ఉన్నది. అతడు ఆమెను ఓడకుండా తనను ఒడ్డి ఓడిపోవటంతో ద్రౌపది స్వతంత్రురాలుగా మిగిలిపోయింది. ఆమె ధర్మరాజు దాసుడు కాకపూర్వం సంపాదించుకొన్న ధనం వంటిది కాబట్టి దాసుడైన ధర్మరాజుయొక్క యజమానికి- అంటే- దుర్యోధనుడికి ఆమె అధీనురాలు, లేదా, దాసి కాజాలదు. ఈ ధర్మసూక్ష్మాన్ని కపటోపాయంతో భేదించాలని శకుని పూనుకొన్నాడు. (4) శకునిమాట దాసుడైన ధర్మజుడికి దాటరాని గీత. అందువలన అతడి ఆజ్ఞ ప్రకారం ద్రౌపదిని పణంగా పెట్టి ఓడిపోయాడు. అందులోనూ భీమాదులను ఓడినట్లు ఓడాడు. తాను ఓడినట్లు ఓడ లేదు. ఆమె దాసి కాదు. వాక్స్వాతంత్ర్యం ఉన్నది. సభలో ప్రశ్నించవచ్చును. పరుషంగా మాట్లాడవచ్చును. ఆమె నెవ్వరు కాదనటానికి వీలు లేదు. కాని ధర్మజుడికి ఆ వెసులుబాటు లేదు. (5) శకుని ఆడిన జూదమంతా ఒకయెత్తు; ధర్మరాజుకు చివరియెత్తును (పందెం వేసే అవకాశాన్ని) కలిగింపచేయటానికి వేసిన మలియెత్తు ఒక్కటీ ఒక్కయెత్తు, అందులో ఒక మడతపేచీ ఉన్నది. భార్యను పణంగా పెట్టుమని సూచిస్తే నలమహారాజువలె ధర్మజుడు కూడ తిరస్కరించవచ్చును. అప్పుడు శకుని చేయగలిగిం దేమి లేదు. అందుకే భార్యను పణంగా పెట్టి ధర్మజుడుఓడాడని విన్నప్పుడు ద్రౌపది ఆశ్చర్యపోయింది. "ఏ యుగంబునందు నెట్టి దుష్కితవుండు, భార్య నొడ్డి యోటువడిన భర్త గలడె? ఇది వినంగఁ గడు నపూర్వం బయ్యె! ఇట్లు చేయునొక్కొ ఇందుకులుడు?' అని తల్లడిల్లిపోయింది. ధర్మజు డంతపని అంత తేలికగా చేయ డని శకునికి తెలుసు. అందుకే - ద్రౌపదిపణానికి ధర్మజుని దాస్యవిముక్తి ప్రతిపణంగా పలికాడు. ఈ యెత్తులో ఉభయపక్షాలవారికీ ద్విగుణీకృత లాభం ఉన్నది. ఎట్లాగంటే - ధర్మజుడు గెలిస్తే ద్రౌపది అతడికి దక్కుతుంది, దాసత్వం పోతుంది. శకుని గెలిస్తే ధర్మజుడు మరల దాసుడుగా మిగులుతాడు. ద్రౌపది దాసురా లౌతుంది. ద్రౌపది పణంగా పెట్టబడాలంటే ధర్మజుడు దాసుడుగా మొదట విముక్తుడు కావాలి. ఆ వెసలుబాటుకోసం శకుని ఆ ప్రతిపణం పెట్టాడు. ఆ పందెం కాయటానికి అనువుగా అతడిని దాసత్వంనుండి విముక్తుడయ్యే అవకాశాన్ని ధర్మపరంగా కలిగించాడు. ఆ దాస్యవిముక్తి ద్రౌపదిని పణంపెట్టినప్పుడే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వర్తిస్తుంది. అందులో గెలిస్తేనే సిద్ధిస్తుంది. అది అసాధారణమైన అవకాశం. దానిని ధర్మజుడు వినియోగించుకొనటానికి ముందుకు వచ్చి ఉచ్చులో పడతా డని శకుని వ్యూహం. అనుకొన్నట్లే జరిగింది. (6) ధర్మజుడు ఒకసారి ఓడి దాసుడైన తరువాత, యజమాని ఆజ్ఞకు కట్టుబడి ఉండవలసిందే. శకుని సూచనను కాదనే హక్కు ఆయనకు లేదు. అందువలన భార్యను పణంగా పెట్టాడు. అదృష్టం కలిసి వస్తే తానూ తన భార్యా ఇద్దరూ బయటపడవచ్చు ననుకొన్నాడు. ఉన్నంతలో అంతకంటె గత్యంతరం లేదు. (7) ఇక్కడ మరొక ప్రశ్న ఉదయిస్తుంది. ధర్మజుడు ద్రౌపదిని పరిపూర్ణమైన అంగీకారంతోనే పణంగా పెట్టాడా? యజమాని బలవంతాన పెట్టాడా? మరేదైనా వ్యూహంలో భాగంగా పెట్టాడా? అన్నది. ఆయనకు ఇష్టం లేదని ముందే స్పష్టం. శకుని సూచనపై చేసినదనీ, బలవంతుడైన యజమాని ఆజ్ఞను పాటిస్తున్న ధర్మంగా చేసినదని సుస్పష్టం. దానివలన ధర్మరాజు నిర్ణయం ప్రకారం కూడా ద్రౌపది ధర్మవిజిత కాదు; బలవద్ధర్మ విజిత. (8) బలవద్ధర్మవిజిత భర్త సంకల్పపూర్వకంగా ఒడ్డినప్పుడు విజితురాలైన వనితతో తుల్యురాలౌతుందా? అన్నది ధర్మ మీమాంస. ఆప్రశ్న ఎవరు అడగాలి? ఆపద్ధర్మాన్ని అంగీకరించి పణంగా పెట్టి ఓడిపోయిన ధర్మరాజు అడగలేడు. అసలు ప్రశ్నించటమే దాసధర్మం కాకపోవచ్చును. భీమాదులకు అడిగే అవకాశం లేకుండా ధర్మరాజే చేశాడు. అందుకే అతడి చేతులు కాలుస్తానని భీము డొకసారి మండిపడ్డాడు. ఇక అడుగ గలిగింది - అడుగవచ్చునా అని అనుమతిని ముందుగా ధర్మజుడిని వ్యంగ్యంగా అడగగలిగింది ద్రౌపది మాత్రమే. బలవంతంమీద పణం పెట్టుతున్నానని ధర్మజుడు చెప్పకచేసిన దోషమని వాదించే అవకాశం ఉన్నది. అంతకంటె గత్యంతరం లేక అట్లా వర్తించాడు కాని, తత్త్వతః అది మనిషిని ఇరకాటంలో పెట్టి ఇబ్బందిగా పెట్టించిన పణమని సభికులు గ్రహించారు. దానిని సభలో చెప్పి, వాదించినా బలంగా నిలబడుతుందని నమ్మకం లేదు. శకుని అందుకే పొల్లు మాట మాట్లాడలేదు. ధర్మరాజు అందుకే కాబోలు, లేదా మరెందుకో, అసలు మాట్లాడలేదు.

5. ద్రౌపది నిండుకొలువులో అడిగిన ప్రశ్నకు సభాసదు లెవ్వరూ ఎందుకు మారుపలుక లేదు? భీష్ము డా ధర్మసూక్ష్మం ధర్మజుడికే తెలుసు నని ఎందుకు అన్నాడు?

సమాధానం : ప్రాతికామి నిండుకొలువులో ధర్మరాజును ద్రౌపది వేసిన ప్రశ్ననే అడిగినప్పుడు అతడు మాట్లాడలేదు. దానికి కారణం ధర్మరాజు 'దురోదర పరాజయ దుఃఖిత చేతస్కుఁడు' కావటంగా నన్నయ పేర్కొన్నాడు. అప్పుడు దుర్యోధనుడు ప్రాతికామితో ఇట్లా అన్నాడు.

క. 'సందిగ్ధ మయినయర్థము । నిందఱసన్నిధిన యడిగి; తింద ఱెఱుంగన్
సుందరిఁ బాంచాలేంద్రసు । తం దోడ్కొని రమ్ము పొమ్ము తడయక' ..... అని, **(సభా. 2.211)**

ఇందులో దుర్యోధనుడు ఆప్రశ్నకు సమాధానం ఇతమిత్థంగా చెప్పకుండా, సందిగ్ధమని చెప్పటం విశేషం. ప్రాతికామి ద్రౌపదివద్దకు వెళ్ళి 'దేవీ! నీ యడిగిన యర్థంబు నిర్ణయించువారయి సభ్యులు నిన్ను రాఁబనిచిరి' అని ఆమెను సభకు రమ్మని నిర్దేశించాడు. ఆమె దుర్యోధనుడి దుశ్చేష్టితానికీ, ధర్మరాజు సమ్మతానికీ భయపడి ప్రాతికామి వెంట వచ్చింది. సభలో పాండవులు ఆమె దీనస్థితిని చూడలేక తలలు వంచి కూర్చొని ఉన్నారు. ఆ సన్నివేశాన్ని చూచి అసూయాపరుడైన దుర్యోధనుడు సంతోషించాడు. కురువృద్ధుడి సమీపంలో ఉన్న ద్రౌపదిని సభామధ్యానికి తోడ్కొని రమ్మని దుశ్శాసనుణ్ణి పంపాడు. ద్రౌపది భయపడి గాంధారి చెంతకు పరుగెత్తింది. అప్పుడు దుశ్శాసనుడు ద్రౌపదితో ఇట్లా అన్నాడు- "సౌబలుండు నిన్నొడిచె దురోదరంబునఁ, గురూత్తము నర్థమ వైతి; నిన్నునుం బుడమిని దమ్ముఁ గోల్పడిరి పొల్తి! భవత్పతులైన పాండవుల్." ఆ తరువాత ఆమె శిరోజాలను పట్టి బలవంతాన సభామధ్యానికి లాగికొని వచ్చాడు. అందరూ సంభ్రమంతో ఆ దృశ్యాన్ని చూచారు. ఆమె కురువృద్ధులను సంబోధిస్తూ ఇట్లా అన్నది -

చ. "అనుపమదైవయోగహతుఁడయ్యు నవశ్యము ధర్మసంపదం
దనరున కాక ధర్మజుఁడు ధన్యుఁడు, ధర్మపథంబు తప్పఁ డ్రో
క్కునె కురువృద్ధులార! భృశకోపనుఁ డీతఁడు నన్ను నేల దు
ర్జనుఁ డిట యీడ్చి తెచ్చె? నవిచారపరుం డయి దుర్మదంబునన్". **(సభా. 2.218)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇది ద్రౌపది అడిగిన మొదటి ప్రశ్న. దానికి పెద్ద లెవ్వరూ మాట్లాడ లేదు. వికర్ణుడు లేచి 'కితవాహూతుండై వ్యసనవర్తి యయి పరాజితుం డయిన పాండవాగ్రజుండు పాండవుల కందఱకు సాధారణ ధనంబయిన పాంచాలిఁ బణంబుఁ జేసెం గావున ద్రౌపది యధర్మవిజిత; యక్కోమలి నేకవస్త్ర నిట దోడ్కొనితెచ్చుట యన్యాయంబు' అని వాదించాడు. అతని వాదనను కర్ణుడు ఖండించాడు. ధర్మరాజు సర్వస్వం ఒడ్డి ఓడినప్పుడు ద్రౌపది అతడికి వెలి కాదు కాబట్టి 'ధర్మవిజిత' అని పేర్కొన్నాడు. కాకపోతే పాండవులు మారుపలుకకుండా ఎందుకు ఉంటారు? అని దట్టించాడు. ఆమె బంధకి కాబట్టి వివస్త్రను చేసి తెచ్చినా ధర్మవిరోధం కాదన్నాడు. వికర్ణుడివాదంలో వివేకం ఉన్నది కాని ధర్మతత్త్వవిజ్ఞానం లేదు. కర్ణుడి వాదనలో దబాయింపు ఉన్నది కాని ధర్మం లేదు.

ద్రౌపదీ వస్త్రాపహరణ ప్రయత్నం సాగింది. భీముడి భీషణ ప్రతిజ్ఞ వెలువడింది. 'ద్రుపదరాజపుత్త్రి వాక్యంబులు విచారింపక వృద్ధరాజు లుపేక్షించి'రని సభాసదులు గగ్గోలు పెట్టారు. విదురుడు కల్పించుకొని సభలో అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండటం మహాపాప మని దృష్టాంతసహితంగా వివరించి "ద్రౌపదీ ప్రశ్నంబునందు ధర్మబుద్ధి సేయుం" డని సభాసదులను కోరాడు. దుర్యోధనుడివలని భయంతో సభలో ఎవ్వరూ నోరు పెకలించలేదు.

అప్పుడు ద్రౌపది ఎలుగెత్తి 'ఇపుడు నాపలుకుల కెవ్వరుఁ బ్రతివచనం బేల పలుకరైరి? ధన్యులార! యే నదాసినే, దాసినే యెఱుఁగఁజెప్పి పనుపుఁ డెల్లదాని' అని సభలోనివారి నడిగింది. అప్పుడు భీష్ముడు 'అవ్వా నీ ప్రశ్నంబునకు నుత్తరం బయ్యుధిష్ఠిరుఁడు సెప్పవలయుఁ; గానినాఁడు ధర్మసూక్ష్మత యెవ్వరికి నెఱుంగ గహనంబు; దీనిఫలంబు వేగంబ యిక్కురుకులపాంసను లనుభవింతురు' అని పలికి ఊరుకొన్నాడు. ధర్మజుడు ఆ ధర్మసూక్ష్మాన్ని చెప్పలేదు. అంతటితో ఆమె ప్రశ్న సమాధానం లేనిదిగా మిగిలిపోయింది. (ఆ ప్రశ్నార్థాలకూ ఆ యా సన్నివేశాలలో ఆ యా వ్యక్తుల అభిప్రాయాలకూ సంబంధం ఉన్నది కాబట్టి కొంత పునరుక్తిగా తోచినా సౌలభ్యంకొరకు ఇక్కడ వివరించటం జరిగింది.)

పై కథాంశాలలో స్పష్టమౌతున్న అంశాలు:

1. ప్రాతికామిద్వారా ద్రౌపది అడిగిన ప్రశ్నకు ధర్మరాజు మౌనంగా ఉండిపోగా దుర్యోధనుడు 'అది సందిగ్ధమైన అర్థం' అని ప్రకటించటం గమనార్హం. అంటే అది ఎటూ చెప్పలేని సందిగ్ధమైన ధర్మ మన్నమాట. అందుకే ఎటూ వాదించటానికి భయపడ్డారు సభాసదులు. రాజసభల చరిత్రలో తన్నోడి సతినోడిన సన్నివేశం అపూర్వంగా అప్పుడు ఆసన్న మైనది. దాని ధర్మస్థితి నిరూపించటం కష్టమని దుర్యోధనుడి భావం. దానిని భీష్ముడుకూడా అంగీకరిస్తూనే ధర్మజుడు ఒక్కడుమాత్రమే దానికి తీర్పుచెప్పగల డన్నాడు. అయితే దానికి ధర్మసూక్ష్మాన్ని ఆశ్రయించాలని భీష్ముడు భావించాడు.

మూలభారతంలో భీష్ముడు ద్రౌపది ప్రశ్నించిన రెండు సందర్భాలలోనూ సమాధానం చెప్పినట్లున్నది. నన్నయ రెండవప్రశ్నకు మాత్రమే ఆతడి అభిప్రాయానికి అనుగుణమైన సమాధానం చెప్పించి ఊరుకొన్నాడు. భీష్ముడి అభిప్రాయం తెలుగులో తేటపడుతున్నా అతడు ఆలోచించిన విధానం మనకు తెలియకుండా పోయింది. మూలంలో భీష్ముడు పలికిన మాటలనుగురించి పండితులు చేసిన వ్యాఖ్యలు గమనిస్తే ఆ సమస్య ఎంత జటిలమైనదోకూడా స్పష్టమౌతుంది. మచ్చుకు డాక్టర్ మూలంపల్లి చంద్రశేఖరశర్మగారి విలువైన సమీక్ష గమనించదగింది.

"భీష్ముడు సభలోని వా రందరికిని పెద్దవాడు గావున ద్రౌపది ప్రశ్నమున కిట్లు సమాధానము జెప్పెను. అందుగూడ ధర్మతత్త్వ మిమిడియున్నది. నన్నయ యీ భాగమును వదలివేసెను. వస్త్రాపహరణానన్తరమునగూడ భీష్ముడు ద్రౌపదీ ప్రశ్నమును విచారించుట సంస్కృత భారతమున గలదు. గావున నన్నయ యా రెండవ సమాధానమునే తెనిగించి యుండును. కాని సంస్కృత భారతమున వస్త్రాపహరణమునకు ముందు భీష్ముడు చేసిన ధర్మవిచారమున కొంత వైశిష్ట్యమున్నది. ద్రౌపదికూడ "ద్రోణస్య భీష్మస్య చ నాస్తి సత్త్వం క్షత్తు స్త థైవాస్య మహాత్మనోఽపి రాజ్ఞ స్తథా హీమమధర్మ ముగ్రం నలక్షయన్తే కురువృద్ధముఖ్యాః" అని కురువృద్ధులను పేరెత్తి సత్త్వహీనులైనా రని యున్నది. కావున కురువృద్ధుడైన భీష్ముడు మొదట సమాధానము జెప్పుట యుచితము. అతడు చెప్పిన సమాధాన మిది-

శ్లో. “న ధర్మసౌక్ష్మ్యా త్సుభగే వివక్తుం శక్నోమి తే ప్రశ్న మిమం యథావత్ ।
అస్వో హ్యశక్తః పణితుం పరస్వం స్త్రియశ్చ భర్తు ర్వశతాం సమీక్ష్య ॥
త్యజేత సర్వాం పృథివీం సమృద్ధాం యుధిష్ఠిరో ధర్మ మథో న జహ్యాత్ ।
ఉక్తం జితోఽస్మీతి చ పాండవేన తస్మా న్న శక్నోమి వివేక్తు మేతత్. ॥
. ద్యూతేఽద్వితీయః శకుని ర్నరేషు కున్తీసుత స్తేన నిసృష్టకామః ॥
న మన్యతే తాం నికృతిం యుధిష్ఠిరః తస్మా న్న తే ప్రశ్న మిమం బ్రవీమి”.

(సం. సభా.60. 40-42)

ధర్మసూక్ష్మతవలన నీ ప్రశ్నకు వివేచన మున్నది యున్నట్లుగా జేయలేకున్నాను- అని భీష్మ డనెను. ద్రౌపదికూడ “ధర్మశ్చ సూక్ష్మో నిపుణోపలక్ష్యః” అని తన నోడుటలో ధర్మసూక్ష్మ ముండు నని యొప్పుకున్నది. ద్రౌపదీ ప్రశ్న వివేచనము జేయమికి భీష్ముడు చూపిన కారణములు-

1. ధర్మజుడు తన్నోడుటచే, నస్వామియై దాసుడై, తన సోదరులకును సొమ్మై పరస్వమైన ద్రౌపది నోడుటకు స్వామ్యము లేకుండుటచే ద్రౌపది యధర్మజిత యనవలసి యుండుట.

2. స్త్రీ భర్త్రధీన యగుటచేతను భర్త లోడిపోవుటవలన వారితోడి భార్యయు నోటుపడిన దగుటచే ద్రౌపది ధర్మజితయే యనవలసి యుండుట.

3. సమస్తమును వదలియు ధర్మమును వదలనట్టి ధర్మజుడే “జితోఽస్మి” యని పుంలింగైక వచన శబ్దముచే తా నొక్కడే యోడినట్లు జెప్పి ద్రౌపదియు సోదరులు ఓడబడలే దని సూచించుటచే ద్రౌపది జితయే కాదనవలసి యుండుట.

4. ద్యూతమున నద్వితీయ పరమ ప్రామాణిక విద్వాంసు డగు శకుని ద్రౌపదీ విషయ సంబంధము వదలునట్లు ధర్మజుని ప్రేరేపించి, ద్రౌపదిని ప్రత్యేక పణముగా బెట్టించుటవలనను ద్యూత మాత్మపరాజయావసానమే యగుటచే ధర్మజుని మరల ద్యూత మాడింప జేసి, ద్రౌపదిని జయించుటవలన, ద్రౌపది శకునికాపట్యధర్మజితయే యైనను శకుని యొప్పుకొనక ధర్మజితయే యని యనుచుండుటచేత ద్రౌపది ధర్మజిత యనవలసి యుండుట.

ఈ సందర్భమున భీష్మవచనములకు నీలకంఠ వ్యాఖ్య యిట్లున్నది. “భర్తు రీశ్వరతాం దాసభార్యాపి దాస్యే వేతి భావః జితోఽస్మీతి వదతా ఆత్మైవ పరాజితో న తు స్త్రీ, నచ రాజజయేనైవ త్వజ్జయః సిద్ధ్యతి ద్యూతమర్యాదావిదా శకుని నైవ తవ పృథక్ పణీకరణా దిత్యాహ ద్యూతే ఇతి. రాజాతు పరాజ్ఞయా త్వాం పణీకృతవాన్ న స్వేచ్ఛయాఽతోఽస్వామీ కథం పణితవా నితి రాజ్ఞోఽపి దోషో నాస్తి. తథాచ శకుని బుద్ధ్యైవ త్వమజితా తచ్చ శకుని ర్న మన్యతే ఇత్యాహ నేతి. యతః పణీకృతా అతః ప్రాగజితా. యతశ్చా పరదాసేన పణీకృతా తతోఽప్యజితై వేతి భావః” (సం.భా. నీలకంఠ వ్యాఖ్య, సభా. 67, 47-49. పుటలు 108-109)

భర్తలు దాసులైనపుడు భార్యయు దాసి యగును. కాని ధర్మజుడు “జితోఽస్మి” యని మాత్ర మనుటచే తాను మాత్రమే జితుడయ్యెను గాని ద్రౌపది కాదనియు, ద్యూతమర్యాదను దెలిసిన శకుని ద్రౌపదిని వేరుగా పణముగా బెట్టించుటచే ధర్మజుని యోటమితో ద్రౌపది యోటుపడినట్లు కాదనియు, ధర్మజుడు తన స్వేచ్ఛతోగాక శకునియాజ్ఞచేతనే ద్రౌపదిని పణముగా బెట్టుటచే “దాసుడై ద్రౌపది నెట్లు పణముగా బెట్టె”నను దోషము ధర్మజునియందుగూడ లేదనియు కావున శకుని మతమునగూడ ద్రౌపది జయింపబడలేదు. కాని దానిని యొప్పకున్నా డనియు, ద్రౌపదిని పణముగా బెట్టించుటచే నంతకుపూర్వ మామె జిత కాదనియు ఇతరదాసుడైన ధర్మజునిచే పణముగా బెట్టబడినందున ఆమె జయింపబడనే లేదనియు భీష్ముడు చెప్పినట్లు నీలకంఠ వ్యాఖ్య వివరించినది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇట్లు భీష్ముడు ద్రౌపదీ ప్రశ్నకు ధర్మనిశ్చయమును కొంతవరకు జెప్పినను "తస్మాన్న తే ప్రశ్న మిమం బ్రవీమి" యని దానిని సందిగ్ధముగనే యుంచెను. భీష్ముడు ద్రౌపదీ మాహాత్మ్యమును బ్రకటింపజేయు తలంపుతోడనే ద్రౌపదీ ప్రశ్నమునకు సందిగ్ధముగనే సమాధానము జెప్పెనని నీలకంఠుడు తన వ్యాఖ్యలో జెప్పెను. ("తథేతి.... భీష్మేణ ద్రౌపదీ మాహాత్మ్యఖ్యాపనాయ ప్రశ్న స్యోత్తరం నోక్తం దుశ్శాసనస్తు పాండవ పక్షపాతినాపి భీష్మేణ సంశయోపన్యాసా దస్మాక మేవ జయ ఇతి మన్వానో యత్కించి త్ప్రలలాపే త్యర్థః". ఈ సందర్భమున క్షేమేంద్రుని భారతమంజరి:

శ్లో. "సూక్ష్మా ధర్మగతిః పుత్రి వాచా తాం వివృణోతి కః?
హారితాత్మా నృపో నేశః పతిః స్త్రీణాం చ దైవతః"

అని యనుచున్నది. ద్రౌపదియు భీష్ముని సందిగ్ధ సమాధానమునకు ప్రతిప్రశ్నముగా "కర్ణదుర్యోధన శకుని సైంధవాది దుష్టభూయిష్ఠంబైన సభకు న న్నేల పిలిపించి నన్నవమానించు నవకాశమును గల్పింపవలసి వచ్చెను? పై దుష్టు లందరిచే గలిసి మోసమున జయింపబడియు దెలిసికొనక (ద్యూత మాత్రపరాజయావసాన మనియు గూడ దెలిసికొనక) ధర్మజుడు మరల నెట్లు జూదమాడెను? శకునియు నాతని జూదమాడునట్లు ఏల చేసెను" అని యడిగి కురువృద్ధు డైన భీష్ముడు ధర్మమును జెప్ప వెనుకాడుచున్నా డని సర్వాధికారిగా నున్న ధృతరాష్ట్రుని లక్ష్యముగా జేసికొని సభలోని కౌరవుల నందరిని-

శ్లో. "తిష్ఠన్తి చేమే కురవ స్సభాయాం । ఈశా స్సుతానాం చ తథా స్నుషాణామ్,
సమీక్ష్య సర్వే మమ చాపి వాక్యం । విబ్రూత మే ప్రశ్న మిమం యథావత్" అని యడిగినది.

ఈ ప్రశ్నలో "తాను జితయా? అజితయా? ధర్మజునకు దనపై యధికార మున్నదా? లేదా? ఎవరి కధికార మున్నది?" అను విషయములను సుసూక్ష్మవిచారము చేసి సూచించి ఏ యొక్కరు ధర్మనిర్ణయము చేయలేనపుడు సభలోని వారినందరిని గలిసి ధర్మనిర్ణయము చేయుడని యడిగినది.

ఈ సభలో కొడుకులకు కోడండ్రకును సర్వాధికారు లైన ప్రభువు లున్నారు. దుర్యోధనాది కుమారులకు వారి భార్యలకును ధృతరాష్ట్రుడు, అతని తరువాత భీష్మాదులు అధికారులు. అటులనే పాండురాజు లేనికారణమున పాండవులకును వారిభార్యయగు ద్రౌపదికిని అధికారి ధృతరాష్ట్రుడు. కావున సుహృద్ద్యూత మాడరమ్మని యాత డాజ్ఞాపింపగనే పాండవులు వచ్చి యాడిరి. ఆజ్ఞానువర్తు లైన పాండవులను పాండవపత్నిని అవమానింపజేయుట న్యాయము గాదు. ఆ యవమానము దుర్యోధనాదులయు వారిభార్యలయు అవమానమువంటిది. ఇది కురురాజుగా రాజుగా సర్వాధికారియైన ధృతరాష్ట్రు డుపేక్షింపదగినది గాదు.

ఒక అధికారి పోయిన నాయధికారము పైయధికారికి సంక్రమించుట, పై యధికారి పోయిన వానియుత్తరాధికారి కాయధికారము సంక్రమించుట ధర్మరహస్యము. భీష్ముడు ప్రతిజ్ఞచే నధికారము వీడుటచే విచిత్రవీర్యు డధికారి యయ్యెను. తదనంతరము అతని సంతానములలో నంధత్వమున నధికారయోగ్యత లేమి పాండురా జధికారి యయ్యెను. పాండురాజు కిందమశాపవిరక్తుడై శతశృంగమునకు బోవుటచే ధృతరాష్ట్రు డధికారి యయ్యెను. శతశృంగమున పాండువు మరణించుటచే ధర్మజునకు పితృవ్యునితో సమభాగమైన రాజ్యము నీయవలసివచ్చినది. మనుస్మృతివ్యాఖ్యాకారుడగు కుల్లూకభట్టు వ్రాసిన "అస్మాదేవలింగాత్ పౌత్రస్యాపి మృతపితృకస్య పైతామహే ధనే పితృవ్య విభాగోస్తీతి గమ్యతే" (మనుస్మృతి. 9అ. 120 శ్లోకవ్యాఖ్య) అను వాక్యమునుబట్టి విచిత్రవీర్యుని రాజ్యమునందు అతని పౌత్రుడైన ధర్మజునకు తండ్రియైన పాండువు మరణించుటచే పితృవ్యుడైన ధృతరాష్ట్రునితో సమవిభక్తమగు రాజ్యము రావలసియున్నది. అది ఖాండవప్రస్థము రాజధానిగా ధృతరాష్ట్రునిచే నీయబడినది. దానికి దోడు స్వసద్గుణపరాక్రమమున రాజసూయము నెరవేర్చి ధర్మజుడు సార్వభౌము డైనాడు.

కావుననే ధృతరాష్ట్రుడు దుర్యోధనుని జననమందు గలిగిన యపశకునములకు పెద్దలందరిని సభచేయించి-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్లో. “యుధిష్ఠిరో రాజపుత్రో జ్యేష్ఠో నః కులవర్ధనః ।
ప్రాప్తః స్వగుణతో రాజ్యం న తస్మి న్వాచ్య మస్తి నః ॥
అయ న్త్వనంతర స్తస్మా దపి రాజా భవిష్యతి ।
ఏత ద్విబ్రూత మే తథ్యం యదత్ర భవితా ధ్రువమ్” ॥ **(సం.మ.భా. ఆది. అ.115. శ్లో. 31,32)**

‘జన్మజ్యేష్ఠుడైన ధర్మజుడు మనకు రాజు. అదియునుగాక నాతడు స్వగుణములతోడనే రాజయ్యెను. అం దేమాత్రము దోషము లేదు. కాని వాని యనంతరమైనను దుర్యోధనుడు రాజు గాగలడా? ఈ విషయమున నేమి జరుగనున్నదో నిశ్చితముగా వివరించి చెప్పుడు’- అని యడుగును.

ఇట ‘అయన్త్వనంతరః’ అను పదముచేత దుర్యోధనుడు, విచిత్రవీర్యునకు మొదటి భార్యయైన యంబిక యందు బుట్టిన ధృతరాష్ట్రుని కొడుకుగావున ధర్మజుని కన్నను దుర్యోధనుడే రాజు గావలయు నను నభిప్రాయము ధృతరాష్ట్రుడు వ్యక్తము చేయకపోలేదు. అందుకే ధర్మజుని రాజసూయప్రాప్త వైభవమునకు తండ్రికొడుకులలో నసూయాద్వేషములు గలిగినవి. కపటద్యూతమున ధర్మజుని సర్వస్వము నపహరించి (ద్రౌపదిని విడిచి) చివరి కాతనినిగూడ జయించిరి.

ఇట్లు ద్రౌపదిపై నధికారము ‘సోదరులలో నొక్కొక్క రోడుటచే పైపైవారికి సంక్రమించి చివరికి సర్వాధికారము ధర్మజునిపై బడినది. అతడుగూడ తన్నోడుటచే నామెపై నాతనికున్న సర్వాధికారము ధర్మజుని పైయధికారియైన ధృతరాష్ట్రునకు సంక్రమించినది. కావుననే “తిష్ఠన్తి చేమే కురవ స్సభాయా మీశా స్సుతానాం చ తథా స్నుషాణాం” ఇపుడు నాకు (మాకు) సర్వాధికారులైన పెద్దలు(ధృతరాష్ట్రాదులు) సభలో నందరియెదుట నిదిగో బ్రతికియే స్థాణువులవలె కూర్చొని యున్నారు. వా రుండగా వారి యుత్తరాధికారికి దుర్యోధనునకు నాపై నధికారము ఎట్లు వచ్చును? కావున నా వాదము సమీక్షజేసి యథార్థమైన ధర్మస్వరూపమును సభలోని వారందరు నిర్ణయింపు డని ధర్మతత్త్వమును స్పష్టముగా ప్రకాశింప జేసి యంగీకరింపు డనును.

ఇట ద్రౌపది జిత యైనచో దుర్యోధనుడు సాక్షాదధికారి యగును. అజితయైనచో ధృతరాష్ట్రుని యనంతరము అధికారి అగును. కావుననే చివరకు ధృతరాష్ట్రుడు వరముల వేడుకొమ్మనగా ద్రౌపది, ధర్మజునకు స్వాతంత్ర్యమును, భీమాదులకు స్వాతంత్ర్యమును వరములుగా గోరునే కాని అంతటి యవమానమును బొందినను తన దాస్య విముక్తిని వరముగా గోరలేదు. మూడవ వరమును (పరీక్షగాను) తన దాస్యవిముక్తి కవకాశముగా నిచ్చినను క్షత్రియస్త్రీ మూడవవరము గోరరా దనునే కాని స్వదాస్య విముక్తిని గోరదు. ఇట్లు తాను దాసిని గానను సుదృఢ ధర్మతత్త్వమును దెలిసి త్రికరణములతో వెలిబుచ్చినది. నన్నయగూడ “నే నదాసినే. దాసినే”! యని సంగ్రహముగా నీ తత్త్వమును ద్రౌపదితోనే యనిపించును. దీనివలన తాను దాసిని గానని నిరూపించు నవకాశ మున్నను కౌరవు లధర్మ మాచరించుట యందరు తెలిసికొనియున్నను, తన భర్తలతో బాటు ప్రశాన్తసహనము వహించి పాండవులకు దగిన భార్యయని నిరూపించుకొన్నది. లేనిచో ద్రౌపది యప్పటికప్పుడు శపింపగల పతివ్రతా తపోనిధి. ఆమె కోపించిన కౌరవులు నిలుతురా? తమలో ఒక్కొక్కరే కౌరవులనందరిని పరిమార్చగల పాండవులు తమ ప్రశాన్త సహనము వీడినచో కౌరవులు బ్రతికియుందురా? వికారహేతు వున్నపుడే వికారము జెందనివారు ధీరులు. ద్రౌపదియును పాండవులును కోప విజృంభణమునకు దగిన కారణము లున్నను ఏ వికారమునకు గురికాక ప్రశాన్తసహనముల నుండుటచే నిజమైన ధీరులు.

ఇంతటి సహన మున్నందుననే నిండుసభలో రజస్వలయై ఏకవస్త్రయైన ద్రౌపదిని వివస్త్రను జేయబూనిన దుశ్శాసనునకు ద్రౌపదికి మించిన యవమానమే జరిగినది. ద్రౌపదిని వివస్త్రను జేయునపుడు ఆమె కృష్ణుని రక్షింపు మని మొరలిడెను. వెంటనే యా మహాత్ముడగు కృష్ణుడు ధర్మస్వరూపమై యామెమానమును రక్షించు వస్త్రరూపమై అనేక వస్త్రములతో నామెను గప్పెను. ఆమె ధర్మపాలనము జేయుటచే దుశ్శాసనుడు లాగినకొలది, యెడతెగని వస్త్రము లామె యొడలిపైననే పుట్టుచుండెను. వస్త్రములు గుట్టలై పడుచుండెను. నిత్యధర్మవస్త్రబద్ధయైన యామెవస్త్రము హీనమగుట లేదు. దుశ్శాసను డలసి సిగ్గిలి కూర్చుండెను. ద్రౌపది యవమానమునకు ధర్మమడ్డుపడినది కాని దుశ్శాసనుని యవమానమునకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వానిద్వారా దుర్యోధనాదులకు గలిగిన యవమానమునకును ఎవ్వ రడ్డు పడరైరి. ఈ యకృత్య ఫలితమును భావిభారతరణమున ననుభవించినపుడు గూడ నెవ్వరడ్డురాకుండిరి.'' (మహాభారతము - విశ్వవిజ్ఞాన కోశము. (సిద్ధాంత వ్యాసము) (1989) -పు. 118-124)

2. మూలంలో వివరించబడిన అంశాలను మరికొన్నింటిని నన్నయ సూచ్యప్రాయంగా తెలుగులో చెప్పటంవలన కథార్థసమన్వయంలో ఆయనదైన ఒకవైఖరి స్పష్టమౌతున్నది. ఉదాహరణ (1) దుర్యోధనుడి దుశ్చేష్టితానికీ, ధర్మజుడి సమ్మతానికీ భయపడి ప్రాతికామివెంటపోవటం-(2.212) అనే వాక్యం అల్పాక్షరాలలో అనల్పార్థరచన. దుర్యోధనుడు పాండవసంపదను వంచనతో అపహరించి వారికి అవమానం చేయటమే కాకుండా తనను అపహసించిన ద్రౌపదిని అవమానించి వారి అభిమానధనాన్నికూడ వమ్ముచేయాలని పన్నిన కుట్రలో భాగమే- బలవంతంగా ధర్మజుడిచేత ద్రౌపదిని పణంగా పెట్టించటం. అది అతడి దుశ్చేష్టితం. పోగా, దానికి అవకాశ మివ్వటమే కాకుండా ధర్మరాజు తాను దాస్యంనుండి విముక్తుడు కాకుండానే ద్రౌపదినికూడ దాసిని చేసే దుష్టవ్యూహానికి తలఒగ్గటం ఆమెకు ఆశ్చర్యం వేసింది. ధర్మజుడి నిశ్శబ్దం 'ద్రౌపదికూడ దాసియే' అనే అంశాన్ని పరోక్షంగా అంగీకరించిన ట్లౌతుందని ఆమె భయం. దాన్ని సభలోనే తేల్చుకొనటం మంచిదని ఆమె కదలివచ్చింది. ఇక్కడ ఒక విషయం మాత్రం స్పష్టం. ద్రౌపది తాను దాసిని కాను- అనే నిశ్చితాభిప్రాయంతోనే ఆలోచించింది; దాని కనుగుణంగా మొదటినుండి తుదిదాకా వ్యవహరించింది. ఈ అంశాల నన్నింటినీ దుశ్చేష్టితం-సమ్మతం అనే రెండు పదాలలో ఊహించుకొమ్మంటాడు సారమతి నన్నయ.

3. మూలంలోని కొన్ని అంశాలను పూర్తిగా వదలిపెట్టటంలో కూడ నన్నయతీరు గోచరమౌతుంది. ప్రాతికామిని ద్రౌపది అడిగిన ప్రశ్నను, తానే వచ్చి ధర్మరాజునే నిండుసభలో అడిగి, సమాధానం తెలిసికొమ్మని ఆదేశించాడు దుర్యోధనుడు. ప్రాతికామిని తిరిగి ఆమెవద్దకు పంపాడు. ద్రౌపది సభలోని వారి నిశ్చయమేమిటో తెలిసికొనివస్తేదానిప్రకారం నడచుకొంటానని మరల ప్రాతికామిని త్రిప్పిపంపింది. ప్రాతికామి సభికుల నందరినీ ఉద్దేశించి ద్రౌపది అడిగినట్లుగా ఆమె ప్రశ్నను అడిగాడు. సభికులందరు తలలువంచి నిశ్శబ్దంగా ఉండిపోయారు. అప్పుడు మూలంలోని ధర్మరాజు ఆ పరిస్థితిని గమనించాడు. దుర్యోధనుడు ఏ విధంగానైనా ద్రౌపదిని సభకు రప్పించాలనే పట్టుదలతో ఉన్నాడని గ్రహించి, తానే ద్రౌపదివద్దకు విశ్వాసపాత్రుడైన ఒక దూతను పంపుతూ రహస్యంగా ఇట్లా నిర్దేశించాడు-

శ్లో. ''ఏకవస్త్రా త్వధో నీవీ రోదమానా రజస్వలా ।
సభా మాగమ్య పాంచాలి శ్వశురస్యాగ్రతో భవ ॥
అథ త్వా మాగతాం దృష్ట్వా రాజపుత్రీం సభాం తదా ।
సభ్యా స్సర్వే వినిందేరన్ మనోభి ర్ధృతరాష్ట్రజమ్'' ॥ **(సం. సభా. 60. 15)**

ఏకవస్త్రవూ, అధోనీవివీ, రజస్వలవూ అయిన ఓ పాంచాలీ! నీవు రోదిస్తూ సభకు వచ్చి మామగారైన ధృతరాష్ట్రుడి ఎదుట నిలువబడు. రాజపుత్రి వైకూడా అట్లా వచ్చిన నిన్ను చూచి సభ్యులందరూ దుర్యోధనుడిని మనస్సులలో నిందిస్తారు అని ధర్మరాజు నిర్దేశం. ధర్మజుడి సందేశాన్ని అనుసరించి ద్రౌపది సభకు వచ్చింది.

ఆమె సభకు వచ్చి ధృతరాష్ట్రుడి ఎదుట నిలువబడిందంటే సభకు చెప్పకుండానే తెలిసే విషయం ఒకటి ఉన్నది. తనను ముందుగా ఓడిన ధర్మజుడు ఆమెను పణంపెట్టి ఓడటం ధర్మం కాదు. అందువలన ఆమె ద్యూతంలో విజిత కాదు. ఆమె స్వతంత్ర, అయితే భర్తల బాధ్యత అధికారం ఆమెపట్ల లేనప్పుడు వారి తరువాత మామగారైన ధృతరాష్ట్రుడియందు ఆమెరక్షణ బాధ్యత లుంటాయి. ఆ అంశాన్ని స్థిరీకరించటానికే ధర్మజు డామె నట్లా నిర్దేశించాడు. నన్నయ ఈఅంశాన్ని తెలుగులో చెప్పలేదు. దానివలన ద్రౌపది స్వయంగా ఈఅంశాన్ని ఊహించి వర్తించిన వివేకవతిగా నన్నయ రచనలో రూపొందింది. 'తాను మున్నోడి ఆపైన నన్నోడెనా?' అని ధర్మజుడి సలహా లేకుండానే ప్రశ్నించిన ప్రజ్ఞావతికి సభలో వచ్చి ఏమి చేయాలో ధర్మజుడు చెప్పాలా? కాబట్టి నన్నయ ద్రౌపదివ్యక్తిత్వానికి విలువ పెంచటానికే మూలంలోని ఆ భాగాన్ని గ్రహించలే దని స్పష్టం!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

4. ఈ అంశాల పరిశీలనంవలన తేలిందేమంటే- జూదంలో శకుని అక్షవిద్యాకుటిల విశారదుడు. అతడు ధర్మరాజును ఏనుగును ఆకులుకప్పిన గుంటలో త్రోసినట్లు ద్యూత ధర్మకూపంలో దింపాడు. ధర్మరాజుపడుతూ కూడా తనధర్మాన్ని రక్షించుకొని శత్రువుల కాపట్యాన్ని సూక్ష్మబుద్ధులకు తెలిసేటట్లు వ్యవహరించాడు. ద్యూతంవలన ఎట్లాగూ యుద్ధం తప్పదు. ద్యూతంలో ఓడిన ధర్మరాజుకు ప్రజలసానుభూతి లభించటం కష్టం. ద్రౌపదిని అవమానించటంవలన ప్రజలు కౌరవులను నిందించి పాండవులపట్ల సానుభూతిని ప్రదర్శిస్తారు. ద్రౌపదిని ఓడకపోతే పాండవులకు సానుభూతికూడా మిగలదు. కౌరవులు పాండవసంపదలను ప్రారంభించడానికి ద్రౌపదిని పణంగా పెట్టుమన్న శకునిసలహాను దోహదంగా తీసికొన్నాడు ధర్మజుడు. పాండవసంపదను సమూలంగా నాశనం చేశా ననుకొన్నాడు - శకుని ద్రౌపదీపణానికి అవకాశాన్ని కల్పిస్తూ. కాని ధర్మజుడి లోతైన ఎత్తుగడను గమనించలేకపోయాడు. సభలో ధర్మరాజు నిశ్శబ్దం భవిష్యత్తులో కౌరవుల జీవితాలలో వ్యాపించే మృత్యునిశ్శబ్దానికి బీజరూపం.

ధర్మజుడి నిశ్శబ్దంలోని అంతరార్థాన్ని తెలిసినవారు ఆ సభలో ఇద్దరే. ఒకడు భీష్ముడు, మరొకడు విదురుడు. విదురుడు ద్రౌపది అధర్మవిజిత అన్నాడు. జూదాన్ని బలవంతులతో ఆడటం విరోధమని వ్యాఖ్యానించాడు వాచ్యంగా. భీష్ముడు ధర్మజునికి ధర్మతత్త్వం తెలుసునని పరమవ్యంగ్యంగా చెప్పాడు తనమాటలలో. 'ధర్మసూక్ష్మం ధర్మజుడికే తెలుసు. దాని ఫలితం కౌరవులు త్వరలోనే అనుభవిస్తా' రని. ఆ ఫలిత మేమిటో ధర్మజుడికి తెలుసు. భీష్మ విదురులకు తెలుసు. ద్రౌపదికీ తెలుసు. వ్యాసుడి రెండు ఉపన్యాసాల సారాంశాన్ని నన్నయ రెండువాక్యాలలో భీష్మునినోట నిబంధించి చెప్పాడు. నానారుచిరార్థ సూక్తులంటే ఇవే. ప్రసన్నకథాకలి(వి) తార్థ యోజనమంటే ఇదే!

పైకిచూస్తే మాయాద్యూత పర్వాన్ని నన్నయ సంగ్రహంగా వ్రాసినట్లు కనపడుతుంది. కాని సారమతితో ఆలోచిస్తే సారమతి చేసిన సారవద్రచనగా ప్రసన్నమౌతుంది.

అనుద్యూతంలో ధర్మరాజు పణాన్ని తప్పదు కాబట్టి ఒప్పుకొన్నట్లు ఉంటుంది కథలో. కాని దాని లోతులుకూడా తక్కువకావు. కపటద్యూతం తరువాత హస్తినాపుర సార్వభౌములుగా ఎవరో ఒకరే ఉండాలని తేలిపోయింది. ధర్మరాజు పాండురాజు భాగం పొంది రాజ్యం చేస్తూ ఉండగా ధృతరాష్ట్రుడి భాగాన్ని ఆక్రమించడానికి ధర్మబద్ధమైన ఉపాయం లేదు. అంతేకాక స్త్రీ సంపాదించి యిచ్చిన రాజ్యాన్ని అనుభవించటం అనుజులకు ఇష్టం లేదు. ఒకసారి కురురాజ్యం వదలిపోతే కాని మరలరాజ్యం మొత్తం వీరభోజ్యంగా హరించే అవకాశం దొరకదు. ఆ అవకాశం ఎప్పుడు కలగాలి? అనుద్యూతాహ్వానం దానికి సూచికగా తోచింది. వెంటనే అనుద్యూతానికి ధర్మజుడు అంగీకరించాడు. మూలంలో భీష్మాదులు, కుంతి మొదలైన ఆప్తులు, హితులు, మంత్రులు ధర్మరాజును అనుద్యూతాహ్వానాన్ని తిరస్కరించు మని ఎన్నోవిధాల చెప్పినట్లు ఉన్నది. నన్నయ దానిని వదలి ధర్మజుడి మౌనానికే, స్వయం నిర్ణయానికే కథనంలో ప్రాధాన్యమిచ్చి నడిపించాడు. అనుద్యూతంలోనిమౌనం హస్తినాపుర సామ్రాజ్య సార్వభౌమార్హతకైన మార్గాన్వేషణం. శకుని వాక్కులలో సర్వేశ్వరుడు ప్రవేశించి తమకు సర్వరాజ్య సర్వంసహాధికార యోగ్యతాసిద్ధికొరకు పుణ్యాహవచనం చేస్తున్నట్లు ధర్మజుడు భావించిఉండాలి. అడవికి పోయే పాండవుల వైఖరి ఆ సామ్రాజ్యసిద్ధికొరకైన మహారణయజ్ఞానికి చేస్తున్న విఘ్నేశ్వరపూజ. భస్మంలోనుండి కూడ బంగారాన్ని సృష్టించగల ధర్మజనీతిశక్తికి సభాపర్వం సంజీవనిమంత్రం!

పాండవదిగ్విజయం: ప్రాచీనభారతం

మహాభారతంలోని సభాపర్వంలో పాండవులు చేసిన దిగ్విజయ వివరాలూ, భీష్మపర్వంలో కౌరవ పాండవులకు సహాయకులుగా నిలిచిన రాజుల వివరాలూ గమనిస్తే ఆకాలంనాటి భారతదేశం (భరతఖండం) రూపురేకలు మనకు కొంతవరకు గోచరిస్తాయి. అప్పటి భౌగోళికాంశాలనుగురించి, రాజ్యాలస్థితి గతులను గురించి పండితు లెందరో చర్చించి ఉన్నారు. శ్రీచర్ల నారాయణ శాస్త్రిగారు మహాభారత మీమాంస (మూడవభాగంలో) (1984 ప్రథమ ముద్రణ) లోని పన్నెండవ ప్రకరణంలో ఈ విషయాలు విపులంగా వివరించి చెప్పారు. అంతకు 50 ఏళ్ళముందు 1933లోనే శ్రీపెండ్యాల వేంకటసుబ్రహ్మణ్య శాస్త్రిగారు రచించి ప్రచురించిన గ్రంథం 'మహాభారత చరిత్రము' లో 'మహాభారతకాలపు రాజ్యములు' అని ఒక అధ్యాయాన్ని ప్రత్యేకంగా రచించారు. వారు పాఠకుల సౌకర్యార్థం 'భారతకాల భరతఖండము' అనే దేశపటాన్ని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాజ్యాల రాజుల పట్టీని అనుబంధంగా ఇచ్చారు. వారికి కృతజ్ఞతలతో ఈనాటి పఠితలకొరకు ఆ పటాన్ని ఇక్కడ పొందుపరచటమైనది. (మిగిలిన వివరాలకు ఆ గ్రంథాన్ని చూడవచ్చును.) భీమాదులు నాలుగు దిక్కులలో దండయాత్ర చేసి జయించిన దేశాలపేర్లు, స్నేహంతో వర్తించిన దేశాలపేర్లు, కొంతమంది రాజులపేర్లూ నన్నయ మూలాన్ని అనుసరించి తెలుగులో చెప్పాడు. ఆ దేశాలపట్టీని ఇక్కడ ఇవ్వటం జరుగుతున్నది. వాటిలో కొన్నింటిని పఠితలు ఆ పటంలో గుర్తించి తెలిసికొనగలరని భావిస్తున్నాము. కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొనే రాజ్యాల రాజుల వివరాలు భీష్మపర్వపీఠికలో ఇవ్వటం జరుగుతుంది.

అర్జునుడి ఉత్తరదిగ్విజయయాత్రలో పేర్కొనబడిన దేశాలు, రాజులు : (సభా.1.229-241)

1. పుళిందదేశ ప్రభువు. 2. ప్రతివింధ్యుడు. 3. ద్వీప మండలేశ్వరులు. 4. ప్రాగ్జ్యోతిషం-భగదత్తుడు. 5. శబరులు, 6. సాగరతీర వాసులు. 7. అంతర్గిరి, బహిర్గిరి, ఉపగిరి భూపతులు. 8. ఉలూక దేశాధిపతి బృహంతుడు. 9. ఉత్తర ఉలూక, కామదేవ, మోదాపుర, సుదామ, సుసంకులము అనేదేశాలు, రాజులు. 10. దేవప్రస్థప్రభువు సేనాబిందుడు. 11. విష్వగశ్వుడు అనేరాజు. 12. పార్వతేయులు. 13. బర్బర, శబర, తురుష్క పతులు. 14. మాళవ, పౌండ్ర, కాశ్మీర, త్రిగర్త, లోహిత, సుధన్వ, గాంధార, కాంభోజ, కోసలపతులు. 15. సింహపురాధీశుడు చిత్రాయుధుడు. 16. వనచర దస్యుల రాజులు. 17. శ్వేతపర్వతం దాటిన తరువాత ఉన్న కాంభోజకటకుడు అనేరాజు, 17. హాటకదేశం, మానససరోవరం ఋషికుల్య ప్రాంతరాజులు, 18. హేమకూట నిషధాచలాలను దాటిన తరువాత గంధర్వనగరం. 19. జంబూవృక్షాన్ని జంబూనదిని చూచి మేరువును, గంధమాదనాన్ని దాటి సిద్ధ, విద్యాధర, చారణ, గంధర్వులచేత పూజితుడైనాడు. 20. మాల్యవంతం నీలపర్వతం దాటిన తర్వాత నున్న ఉత్తర కురుదేశాలు - హరివాసర నగరం.

భీముడి పూర్వ దిగ్విజయయాత్రలో పేర్కొనబడినదేశాలు, రాజులు: - (సభా.1.242-245)

1. పాంచాల దేశం. 2. విదేహరాజు జనకుడు. 3. దశార్ణపతి సుధన్వుడు. 4. అశ్వమేధేశ్వరుడైన రోచమానుడు. 5. చేది భూపాలుడు శిశుపాలుడు. 6. పుళిందవిషయంలో సుకుమార సుమిత్రులు. 7. కుమారవిషయంలో శ్రేణిమంతుడు. 8. కోసలదేశంలో బృహద్బలుడు. 9. అయోధ్యాపురంలోని దీర్ఘప్రజ్ఞుడు. 10. కాశీరాజు సుపార్శ్వుడు. 11. రాజపతిఅయిన సుధన్వుడు. 12. మత్స్య మలదపతులు. 13. కర్ణాట దక్షిణమల్లులు. 14. మగధపతి సహదేవుడు. 15. హిమవత్పర్వతపార్శ్వంలో ఉన్న జలోద్భవ మనేదేశం. 16. భల్లాటదేశం. 17. ఇంద్రపర్వత సమీపంలోని ఏడుగురు కిరాత పతులు, 18. శర్మక వర్మకులు. 19. ఇంద్రసేన సముద్రసేనులు. 20. కర్ణవత్సపతులు. 21. పుండ్రపతి. 22. పౌండ్రక వాసుదేవుడు.

సహదేవుడి దక్షిణదిగ్విజయయాత్రలో పేర్కొనబడిన దేశాలు, రాజులు: (సభా.1.246-264)

1. సుమిత్ర, శూరసేన, దంతవక్త్ర, యవనులు, 2. గోశృంగగిరి నివాసులు. 3. కుంతిభోజుడు. 4. భూరిబలుడి పుత్రుడైన జంభకుడు. 5. నర్మదానదీ సమీపంలో అవంతి దేశాధిపతులు విందానువిందులు. 6. మాహిష్మతీ పురాధీశుడు నీలుడు. 7. సౌరాష్ట్ర దేశంలో ఉండి దూతలద్వారా రుక్మి, భీష్మక, శూర్పారక, దండకపతులనుండి కప్పాలు కొన్నాడు. 8. సాగరద్వీపవాసులైన నిషాదులు, పురుషాదులు, ఏకపాదులు, కాలముఖులు, కర్ణప్రావరణులు, నరరాక్షస జాతులవారు. 9. రామశైల, కోలశైల, తామ్రద్వీప, సంజయంతీపుర నివాసులు. 10. తాళవన, పాండ్య, కేరళ, కాళింగ, ద్రవిడ, యవన, కరహాటక రాజులు. 11. లంకాధిపతి విభీషణుడు (దూతలద్వారా)

నకులుడి పశ్చిమదిగ్విజయయాత్రలో పేర్కొనబడిన దేశాలు, రాజులు: (సభా.1.265-270)

1. మహితక విషయం. దత్తక మయూరకాదులు. 2. మరు, మాళవ, బర్బర, కర్బర, శైరీషక, దశార్ణదేశాలు. 3. పుష్కరారణ్య నివాసులైన ఆభీరగణాలు. 4. సరస్వతీ, సింధు నదుల నాశ్రయించి ఉన్న స్రువణీయులు. 5. పంచనద-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భారతకాల భరతఖండం - (దేశపటం)



(కీ.శే. పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారి 'మహాభారతచరిత్రము' (1933) నుండి కృతజ్ఞతలతో)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అమర పర్వతనివాసులు. 6. ద్వారవతిలో వాసుదేవుడు. 7. మద్రపతి శల్యుడు (శాకలపురం). 8. పశ్చిమ సముద్ర గర్భనివాసులు బర్బర కిరాతవీరులు.

ఈ వివరాలు మహాభారతేతివృత్తంలోని చారిత్రక వాస్తవికతకు అద్దంపట్టుతాయి. ప్రాచీన భారతవర్ష పరిజ్ఞానానికి చుక్కానిపట్టుతాయి.

సభాపర్వం: సూక్తిసుధాకరం

ధర్మాధర్మ ప్రవృత్తుల సంఘర్షణలతో కూడుకొన్న సభాపర్వంలో నన్నయ కూర్చిన రుచిరార్థసూక్తులు కొన్ని తెలుగువారి నిత్యవ్యవహారంలో బాగా ప్రచారం పొంది ఉన్నాయి. సభాపర్వం అనగానే తెలుగువారినోట వినిపించే సుభాషితం వార్తను గురించినది.

ఆ. "వార్తయంద జగము వర్తిల్లుచున్నది, యదియు లేనినాఁడ యఖిలజనులు
నంధకారమగ్న లగుదురు గావున, వార్త నిర్వహింపవలయుఁ బతికి"- **(సభా.1.51)**

వార్తనుగురించి ఇంత చక్కని సూక్తి వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఇంతవరకు వెలువడలేదు.

ఆదిపర్వంలోని 'నిండుమనంబు నవ్యనవనీత సమానము.....' అనే పద్యం తరువాత ప్రజాదరం బాగాపొందిన రుచిరార్థసూక్తి నన్నయ వాక్పారుష్యాన్ని గురించి సభాపర్వంలో చెప్పినది.

క. 'భూరిగుణోన్నతు లనఁదగు, వారికి ధీరులకు ధరణివల్లభులకు వా
క్పారుష్యము చన్నె మహా, దారుణ మది విషముకంటె దహనముకంటెన్". **(సభా.2.17)**

కథార్థ సందర్భాలలో పొదగబడి ఉన్నప్పటికీ సూక్తులు స్వతంత్రప్రతిపత్తిగల పద్యాలుగా రాణించటం గమనార్హం. ఇటువంటి సూక్తులు జీవితంలోని అనేకరంగాలకు సంబంధించినవై ఉండటంచేత సమాజంలోని అన్నివర్గాలవారూ నన్నయసూక్తులను నోరారా పలుకుతూ ఉంటారు. వీటిని గురించి వ్యాఖ్యానంలో యథావకాశంగా వివరించటం జరిగింది కాబట్టి ఈ పీఠికలో వాటి ప్రస్తావన మాత్రం చేయబడుతున్నది. సూక్తులుగా సుప్రసిద్ధాలైన కొన్ని పద్యాలు-సభాపర్వం-1వ అశ్వా. పద్యాలు- **122, 123, 131, 2వ అశ్వా- పద్యాలు: 25, 49, 144, 149, 166, 167, 169, 170, 191, 192, 202, 237, 242, 263, 271.** సభాపర్వంలోని సూక్తులు ఎక్కువగా మానవుడి ఆర్థిక ధార్మిక జీవితానికి సంబంధించినవై ఉండటంచేత త్రివర్గసాధనలో అవి వెలుగు కిరణాలను ప్రసరిస్తూ ఉంటాయి.

సూక్తులు పూర్తి పద్యాలే కానక్కరలేదు. వాటిలోని వాక్యాలుకూడా కావచ్చు. లోకోక్తులుగా, ఛలోక్తులుగా, హాస్యోక్తులుగా, అధిక్షేపోక్తులుగా, వ్యంగ్యోక్తులుగా నన్నయ ఆయా సందర్భాలలో వాడినవాక్యాలు తెలుగువారి సంభాషణలలో వెలుగులు నింపుతూ ఉంటాయి- మచ్చుకు కొన్ని.

1. వృద్ధుల బుద్ధులు సంచలింపవే. — సభా.2.9.
2. దాశార్హుండు పూజార్హుఁడే. — సభా.2.8.
3. యుక్తమ కా కిది యేమి దోసమే? — సభా.2.18.
4. పెద్దలచరితం బల్పులకు నెఱుఁగ శక్యమె యెందున్. — సభా.2.19
5. పాలితదుర్ణయుండు శిశుపాలుఁడు బాలుఁడు. — సభా.2.22.
6. బాలుఁ డయ్యును బూజ్యుండు బ్రాహ్మణుండు. — సభా.2.25.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

7. బూతు వొగడినట్లు వొగడెదు. సభా.2.48.

8. నీ కిట్లు పలుక సిగ్గను లేదే? సభా.2.67.

9. భూపతి సహియింపనోపునె సపత్నులవృద్ధియు నాత్మహానియున్. సభా.2.98.

10. మిత్రనిధీ! యొడంబడుము మిన్నక సంశయమంద నేటికిన్? సభా.2.133.

11. పాపకారులకుఁ బాయు నవశ్యము నర్థధర్మముల్. సభా.2.136.

12. ఒక నక్క నిచ్చి సింహమ్ముల విల్చికో లుఱదె? సభా.2.181.

13. చిఱుతవాని కింత తఱుసంటి పలుకులు సన్నె వృద్ధజనము లున్నచోట. సభా.2.228.

14. ఇట్లు చేయనైతినేని పితృపితామహులగతికిం దప్పినవాఁడ నగుదు. సభా.2.234.

15. దీని మఱచునది. నే నొండ్లు గఱపనేల? సభా.2.265.

ఇంకెన్నో అలంకృతోక్తులనుకూడ వ్యాఖ్యలో గమనించవచ్చును. మొత్తానికి సభాపర్వం ఒక సూక్తిసుధాకరం!

సభాపర్వం: ఉద్యోగపర్వం

మహాభారతంలో సభాపర్వం, ఉద్యోగపర్వం చెల్లెలు, అక్కవలె ఉంటాయి. నిడివిలో సభాపర్వం రెండాశ్వాసాలు. ఉద్యోగపర్వం నాలుగాశ్వాసాలు. ఈ భౌతికమైన భేదం ఉన్నా అంతర్గత లక్షణాలలో పోలిక చాలవరకు భాసిస్తుంది.

ఈ రెండిట్లో ఉండే కొన్ని సాధారణలక్షణా లివి: 1. శృంగారాది లలితరసాలు లేవు. 2. వీరరౌద్రరసాభ్యుదయోల్లాసాలు ఉద్దీప్తంగా పోషించబడతాయి. 3. శోకభయాది భావాల తీవ్రత కనిపిస్తుంది. 4. పాండవ ధార్తరాష్ట్రుల చిత్తవృత్తులూ, స్వభావాలూ సంఘర్షణాత్మకమైన సన్నివేశాలలో వారివారి దీర్ఘసంభాషణలద్వారా వ్యక్త మౌతాయి. 5. అర్థసాధనలో సార్థకాలైన వ్యూహాలను ప్రదర్శించే క్రియాచైతన్యం కథలో వెల్లివిరుస్తుంది. 6. ధర్మనీతివర్తనానికీ, కపటనీతివర్తనానికీ గల తారతమ్యం కొట్టవచ్చేటట్లుగా సన్నివేశాలు తీర్చిదిద్దపడతాయి. 7. భారతంలోని ప్రసిద్ధపాత్రల వాగ్వృత్తులకు అనుగుణంగా పాత్రోచితసంభాషణశిల్పం అభినయదర్పణంగా ఆవిష్కృత మౌతుంది. 8. రసపోషకాలైన శబ్దార్థగుణప్రధాన రచనాప్రయోగాలు కవుల స్వీయ శైలీవిన్యాస వైభవాన్ని ప్రదర్శించుకొనటానికి రంగస్థలాలై రాణిస్తాయి. 9. దశరూపకప్రయోగవైచిత్రి యథావకాశంగా ప్రకాశిస్తుంది. 10. తెలుగువారి నాల్కలమీద నిలువగలిగిన ప్రసిద్ధమైన తెలుగుపద్యాలకు హృద్యమైన రంగాలుగా వెలుగొందాయి.

ఈ రెండుపర్వాలకూ వస్తుకవితాస్వభావాలనుబట్టి భేదంకూడా లేకపోలేదు. 1. సభాపర్వంలో ద్యూతం ప్రధానం. ఉద్యోగపర్వంలో దౌత్యం ప్రధానం. 2. సభాపర్వంలో పాండవుల ఆర్థికమైన ఉత్థాన పతనావస్థలు వర్ణించటం ప్రధానం. ఉద్యోగపర్వంలో కౌరవుల ధార్మికమైన ఉత్థానపతనాలు వర్ణించబడతాయి. 3. సభాపర్వంలో పాండవుల రాజసూయవైభవం విస్తృతంగా వర్ణించబడి, తత్ఫలమంతా కపటవ్యాపారపూరితమైన మాయాదురోదరంతో వైపరీత్యాన్ని పొందటం చిత్రింపబడింది. ఉద్యోగపర్వంలో ధృతరాష్ట్రకృత కపటరాజనీతికి కవాటాలు తెరిచిన దౌత్యకార్యం విస్తృతంగా వర్ణింపబడి చివర కది శ్రీకృష్ణుడిరాయబారంతో శిథిలం కావించబడుతుంది. 4. సభాపర్వంలో పాండవులు ప్రతిజ్ఞలు చేస్తూ అరణ్యవాసానికి వెళ్ళుతారు. వారు అడవులకు పోతున్నా యుద్ధానికి పోతున్నట్లుంటుంది. ఉద్యోగపర్వంలో కౌరవులు పదకొండు అక్షౌహిణీల సైన్యంతో యుద్ధానికి పోతున్నా పాండవులవలె భయంకర ప్రతిజ్ఞలు చేయటం లేకపోగా ధార్తరాష్ట్రులు ధూర్తులవలె మృత్యుముఖంలోకి ప్రవేశిస్తున్న ట్లుంటుంది. 5. సభాపర్వం ధర్మయుద్ధానికి నాందిగా ముగుస్తుంది. ఉద్యోగపర్వం అధర్మపరిపాలనకు భరతవాక్యంవలె ధ్వనిస్తుంది. 6. సభాపర్వంలో నన్నయగారి శబ్దగుణప్రధానరచన లాస్యంచేస్తుంది. ఉద్యోగపర్వంలో తిక్కనగారి అర్థగుణప్రధాన రచన అభినయిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈవిధంగా సామ్యభేదాలున్నా అంతర్గతస్వభావంలో అనురూప్యం గల ఈ రెండుపర్వాలనూ ఇటు నన్నయా, అటు తిక్కనా రచించటం ఆంధ్రసరస్వతి చేసికొన్న అదృష్టం. అందువలన ఈ ఉభయపర్వాలలో కథార్థవిశేషాల తులనాత్మకానుశీలనం ఎంతటి ప్రాధాన్యాన్ని వహిస్తుందో కవితార్థవిశేషాల పరిశీలనంకూడా అంతటి ప్రాముఖ్యాన్ని సంతరించుకొంటుంది.

శబ్దగుణశాలి నన్నయచతురశైలి - అర్థగుణశాలి తిక్కనయజ్వశైలి

రచనకు రూపాన్నిచ్చేది శబ్దం. ప్రాణచైతన్యాన్ని ప్రసాదించేది అర్థం. ప్రాణచైతన్యంతో కూడుకొన్న రూపమే శరీరం. అందువలననే భామహాదులు కవితకు శబ్దార్థాలు రెండూ కలిసి శరీర మన్నారు. కావ్యశరీరమైన శబ్దార్థాలలో శబ్దానికి ప్రాముఖ్యముండే రచనను చేసేవారు కొందరూ, అర్థానికి ప్రాధాన్యం ఉండే రచన చేసేవారు కొందరూ, ఉభయప్రాధాన్యం ఉండేరచన చేసేవారు కొందరూ కనపడతారు. కవిత్రయంలో శబ్దార్థోభయ ప్రాధాన్యమున్న రచనచేసేవాడు నన్నయ. అర్థప్రాధాన్యాన్ని మన్నించినవాడు తిక్కన. శబ్దవైచిత్రిచేత అర్థాన్ని దీపింపచేసేవాడు ఎఱ్ఱన. అందువలన ముగ్గురిశైలులూ మూడువిధాలుగా ఉంటాయి. ప్రాణచైతన్యంతోపాటు రూపవిలాసంకూడా ఉన్న ఆకృతిమాధుర్యాన్ని నన్నయ తెలుగుకవితకు ప్రసాదించాడు. ఆ మార్గాన్ని తరతరాల కవులు తన్మయత్వంతో అనుసరించారు. ఆకృతి వైభవంకంటె ఆత్మచైతన్యం అనంతంగా ప్రకాశించే తేజశ్శరీరాన్ని కవితకు తిక్కన ప్రసాదించాడు. నన్నయకవిత వివేకానందుడివలె రూపకాంతిమనోజ్ఞంగా ఉంటుంది. తిక్కనకవిత రామకృష్ణపరమహంసవలె భావతేజస్సుందరంగా ఉంటుంది. ఎఱ్ఱన ఆకృతిని అలంకరిస్తాడు; భావంచేత రూపారాధనం చేయిస్తాడు. ఆహార్యంచేత అలంకృతుడైన రాజకుమారుడివలె ఎఱ్ఱయకవిత రాణిస్తుంది.

కావ్యశరీరం శబ్దార్థోభయరూప మైతే- ఆ శరీరానికి శోభను కలిగించే గుణాలుకూడా శబ్దార్థగుణాలుగా ఉండాలని వామనుడు వింగడించాడు. ఉదాహరణకు- ఒక యువతి ఉన్నది. ఆ యువతి శరీరానికి శోభను కలిగించేది యౌవనం. ఇది కావ్యంలోని శబ్దగుణంవంటిది. శరీరశోభను కలిగించే యౌవనం యువతికి ఉన్నా, ఆమె ముగ్ధ కాకుండా గయ్యాళిగా ఉన్నదనుకోండి. ఆమె ఆస్వాదయోగ్యతను కోల్పోతుంది. లజ్జ మొదలైన ముగ్ధాలక్షణాలు ఆమె శరీరగుణాలు కావు. ఆమె సంస్కారంనుండి పుట్టిన ఆత్మగుణాలు. కావ్యానికి అర్థగుణాలవంటివి. యువతి సిగ్గులమొలక అయినప్పుడే ఉపభోగంలో శోభిస్తుంది. లేకపోతే రసభంగ మయ్యే అవకాశం ఉన్నది. ఈ తార్కాణంవలన కావ్యరచనలో శబ్దార్థగుణాల కున్న సార్థకమైన స్థానం స్పష్టమౌతుంది.

కావ్యానికి ఆత్మ రసం. అది ధ్వనిమయంగా శబ్దార్థాల నాశ్రయించి ఉంటుంది. ఆత్మలక్షణాలను గుణాలు వ్యంజింపచేస్తాయి. రసాన్ని ఆస్వాదించటానికి అనుగుణమైన సౌందర్యాభివ్యక్తిని గుణాలు కల్పిస్తాయి. నన్నయ కవితలోని ఆస్వాదనీయ మైన సౌందర్యం శబ్దగుణసంయోజనంవలన ప్రధానంగా ఏర్పడుతుంది. గుణవర్ధకమైన శబ్దం అతడి రచనకు ప్రాణం. దానివలన రచనకు నాదమాధుర్యం ఏర్పడుతుంది. సహజశోభాహేతువు లైన గుణాలను నన్నయ రచనలో పోషించినా వాటివలన రీతులు రూపుకట్టినట్లు సాధారణంగా కనపడవు. కాని, అక్కడక్కడ అటువంటి రచనను ఆవిష్కరించి రీతివైభవాన్ని ప్రదర్శించటం నన్నయకవితలో కనపడుతుంది. మచ్చునకు కుబేరసభలో పరమేశ్వరుడు సదా నివసించి ఉంటాడనే అంశాన్ని వర్ణించినపద్యం-

ఉ. వానికి నెయ్యుఁడై యమరవంద్యపదాంబుజుఁ డంబికా బృహ
త్పీనపయోధరాగ్రపరిపీడితవక్షుఁడు, భూషణీకృతా
హీనుఁ, డశేషలోకగురుఁ డీశ్వరుఁ డెప్పుడు నంద యుండు నా
నానిశితాయుధాయుతసనాథమహాద్భుతభూతకోటితోన్. (సభా. 1.78)

ఈ పద్యంలో ఓజఃప్రసాదగుణమిశ్రమం వైదర్భీరీతిని రూపుకట్టించింది. ఇందులో శివుడికి వేసిన విశేషణాలు నన్నయలో అపూర్వంగా కనపడతాయి. శ్రీనాథుడిరచనలో విశేషించి భీమఖండ, కాశీఖండాలలో శివుడి శృంగార రసికత్వం, శివగణ వీరవ్రతత్వం- సాధారణంగా గోచరిస్తాయి. 'అంబికా బృహత్పీనపయోధరాగ్ర పరిపీడితు' డనటంలోని శృంగారం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'భూషణీకృతాహీనుడు' అన్న సమాస సంఘటనలో ఉన్న సంస్కృత వ్యాకరణ ప్రయోగప్రౌఢి, 'నానా నిశితాయుధాయుత సనాథ మహాద్భుత భూతకోటి'ని వర్ణించే విశిష్టపదరచనా రీతి నన్నయ అప్పుడప్పుడు ప్రదర్శించే రీతి విన్యాసం. శ్రీనాథుడు తరువాత దీనిని సొమ్ముచేసికొన్నాడు. 'కుంభినీధర సుతాకుచకుంభ పరిరంభ మహాలోలుపాయోం నమశ్శివాయ' అని శ్రీనాథుడు ఈ రీతిమార్గాన్ని తన నీతిగా మార్చుకొన్నాడు. ఆ శిల్పంలో శ్రీనాథుడు ఆ తరువాత నన్నయకు వారసుడై రసానుగుణమైన రీతులను పోషించే రచనకు ఒక కళాపూర్ణత్వాన్ని కల్పించాడు. నన్నయ ఆ మార్గంలో శ్రీనాథుడికి గురువైనాడు.

క. "నెట్టుకొని కొలుతు నన్నయ
భట్టోపాధ్యాయసార్వభౌముని(గవితా
పట్టాభిషిక్తు భారత
ఘట్టోల్లంఘనపటిష్ఠగాఢప్రతిభున్" అని శ్రీనాథుడిచేత కీర్తించబడ్డాడు.

ఓజఃప్రసాదగుణమిశ్రమంవలన వైదర్భీరీతి, ఓజఃకాంతిగుణాలవలన గౌడీయరీతి, మాధుర్యసౌకుమార్యాలవలన పాంచాలిరీతి ఏర్పడతాయని లాక్షణికు లంటారు. ఈ రీతుల రీతులను శ్రీనాథుడి కవితలో గుర్తించినంత సులభంగా నన్నయలో కనుగొనలేము. అయినా గుణవద్రచనాసౌందర్యాన్ని మాత్రం గుర్తించి ఆస్వాదించగలం. నన్నయకవితలో ప్రసాదగుణం ప్రధానపాత్ర నిర్వహిస్తుంది. ఓజోమాధుర్యాది గుణాలలో ప్రసాదాన్ని ఆస్వాదయోగ్యంగా కలిపి ప్రయోగిస్తాడు నన్నయ. దానితో పద్యరచనకు హృద్యమైన సౌందర్యం ఏర్పడుతుంది. రసగుణాలైన దశవిధగుణాలను రసోచితంగా మేళవించి రచనలో రామణీయకత్వాన్ని సృష్టిస్తాడు నన్నయ. "నన్నయగారి రచన ప్రవాహము వంటిది. పద్యము విరుగదు. అమృతాధారగా(బోవుచుండును. అట్లుపోవుచున్న పద్యము తా నొక్కొక్కచోట విరుగును. ఎందుకు విరుగు ననగా, నచ్చటి భావము రచనచేత ధ్వనింప(జేయుటకు-" అని కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి వ్యాఖ్య (నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి- పు. 172) నన్నయరచనలో గుణప్రధానస్వభావాన్ని తెలుపుతున్నది. నన్నయ రచనలో అలంకారరీతివృత్తులు గుణపోషకాలుగా నిలవటం విశేషం. అది నన్నయకవితా శీలం.

తిక్కన అర్థగుణప్రధానవాది. అర్థగుణాలసంయోజనంవలన ప్రధానంగా రసాన్ని పోషిస్తా డాయన. అందువలననే పాత్రల ఆకృతులకంటె అభినయాన్ని విశేషంగా చిత్రిస్తాడు. శబ్దగుణం ఆకృతి వైభవాన్నీ, అర్థగుణం అవస్థావిలాసాన్నీ ధ్వనింపచేస్తాయి. అవస్థలను దీపింపచేసేవి అనుభావసాత్త్వికభావాలు. అనుభావాదులు రసభావవ్యంజకాలు. వాటి వ్యక్తీకరణంవలన శ్రవ్యకావ్యంలో దృశ్యకావ్యచిత్రణ వెల్లివిరుస్తుంది. దానికి సంభాషణాదులు రసవద్వృత్తులను అనుసంధింపజేస్తాయి. దానివలన కావ్యానికి రూపరామణీయకత్వంతోపాటు రసాభ్యుదయోల్లాసంకూడా ఏర్పడుతుంది. నన్నయ శబ్దగుణాలవలన కలిగించే రామణీయకత్వం వలన రసాభ్యుదయం కవితకు సిద్ధిస్తుంది. తిక్కన అర్థగుణపోషణంవలన రసాభ్యుదయంతోపాటు ఉత్+లాస్యస్థితి (నృత్యాయమానస్థితి)కూడా ఏర్పడుతుంది. నన్నయ శబ్దగుణప్రధానరచనకు మార్గదర్శకుడు. తిక్కన అర్థగుణప్రధానరచనకు ప్రస్థానాచార్యుడు.

శబ్దార్థగుణ స్వభావాలు ఈవిధంగా ఉంటాయి.

	గుణం	శబ్దగుణం	అర్థగుణం
1.	ఓజస్సు	గాఢబంధత్వం	అర్థప్రౌఢి
2.	ప్రసాదం	బంధశైథిల్యం	అర్థవైమల్యం
3.	శ్లేషము	మసృణత్వం	ఘటన
4.	సమత	మార్గాభేదం	అవైషమ్యం, ప్రక్రమాభేదం
5.	సమాధి	ఆరోహావరోహాక్రమం	అర్థదర్శనం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6.	మాధుర్యం	పృథక్పదత్వం	ఉక్తివైచిత్ర్యం
7.	సౌకుమార్యం	అజరఠత్వం	అపారుష్యం
8.	ఉదారత	బంధవికటత్వం	సభ్యప్రసంగంలో అగ్రామ్యత్వం
9.	అర్థవ్యక్తి	అర్థవ్యక్తిహేతుత్వం	వస్తుస్వభావస్ఫుటత్వం
10.	కాంతి	బంధౌజ్జ్వల్యం	దీప్తరసత్వం

మరే వివరాలకు పోకుండానే పై శబ్దార్థ గుణ వివేచనను ముందుంచుకొని సమీక్షించినా సహృదయలోకానికి నన్నయ తిక్కనల రచనలలోని తారతమ్యం గోచరమౌతుంది. శబ్దబంధానికి సంబంధించినవి శబ్దగుణాలు, అర్థప్రకటనకు సంబంధించినవి అర్థగుణాలు. నన్నయ కవితలో అర్థప్రకటన చేస్తున్న శబ్దసౌందర్యం అనుభవానికి అందుతుంది. చక్కగా చిక్కగా అల్లిన పూలదండ పరిమళం వెదజల్లు తున్నట్లుంటుంది. తిక్కన రచనలో శబ్దం అర్థసమర్పణం చేసి అంతర్హిత మౌతుంది. అందువలన తిక్కన రచనలో శబ్దం పానకంలో చక్కెరవంటిది. మరొకవిధంగా చెప్పాలంటే- నన్నయశబ్దగుణరచన పండు తింటూ రసాన్ని ఆస్వాదించినట్లుంటుంది. తిక్కనరచన పండ్లరసాన్నే త్రాగుతున్నట్లుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే- శబ్దగుణశాలి నన్నయ చతురశ్శైలి; అర్థగుణశాలి తిక్కనయజ్వశైలి.

వామనాదులు శబ్దార్థగుణ వివేచనం చేసి విశ్లేషించి చూపించినా ఆ తరువాతి లాక్షణికులు ఆ విభాగాన్ని అంతగా పాటించలేదు. దానికి కారణం కవిత్వంలో శబ్దగుణాలను గుర్తించినంత సులభంగా అర్థగుణాలను గుర్తించలేము. అసలు కవులుకూడా అర్థగుణప్రధానమైన రచనం చేయటం చాలకష్టం. తెలుగులో తిక్కన అటువంటి కవిత వ్రాసి 'తన కావించిన సృష్టి తక్కొరులచేతం గాదునాన్" అని ఎఱ్ఱయగారిచేత ప్రశంస లందుకొన్నాడు. ఆ భేదం నన్నయ తిక్కన కవితలలో కనపడుతుంది. నన్నయ శబ్దగుణవాది కాబట్టే అనుయాయులు అసంఖ్యాకంగా ఏర్పడ్డారు. తిక్కనరచన క్లిష్టం కాబట్టి ఆయన ఒక్కడే మిగిలిపోయాడు. అందువలన లక్షణగ్రంథకర్తలుకూడా అర్థగుణాలను ప్రత్యేకంగా పరిగణించటం మాని శబ్దగుణాలకు అనుబంధాలుగానే భావించారు. అంటే నన్నయశబ్దగుణాలను అనుశీలించేటప్పుడు శబ్దగుణలక్షణాలను ముఖ్యంగానూ, అర్థగుణలక్షణాలను గౌణంగానూ పరిగణించాలన్నమాట. తిక్కనకవితలో ఇది వ్యత్యస్తంగా మారుతుంది.

శబ్దార్థగుణవిభాగం ధ్వనిసిద్ధాంతం వచ్చినతరువాత వెనుకపడింది. ధ్వనివాదులు గుణాలు రసధర్మాలే కాని శబ్దార్థధర్మాలు కావని స్పష్టంగా చెప్పారు. అవి పది కాని, ఇరవై కాని కావని, రసానుభవదృష్టితో వాటిని మూడుగానే గుర్తించవచ్చుననీ పేర్కొన్నారు మమ్మటాదులు. రసానుభవంలో చిత్తద్రుతివలన కలిగే ఆహ్లాదకత్వం శృంగారాదులలో ఉంటుంది కాబట్టి ఆ రసగుణం మాధుర్య మని గుర్తించారు. మాధుర్యం కరుణ, విప్రలంభ, శాంతరసధర్మా లనికూడా పేర్కొన్నారు. రసానుభూతిలో చిత్తవిస్తారరూపమైన దీప్తత్వం వీరరసంలో కలుగుతుంది కాబట్టి ఓజస్సు ఆ రసగుణమని నిర్దేశించారు. వీరంకంటె రౌద్రబీభత్సాలలో ఓజస్సు రాణిస్తుందని కొందరు భావించారు. సర్వరసానుభవాలలో చిత్తవికాసం సర్వసామాన్యధర్మ మనీ అది సర్వరసాభ్యుదయ హేతు వనీ భావించి లాక్షణికులు ప్రసాదగుణం అటువంటి సర్వరస సామాన్యధర్మ మనీ గుర్తించారు. నన్నయరచనలో ప్రసాదగుణం ప్రధానమని గమనిస్తే అది సర్వరసరమ్యంగా ఉంటుందనీ, నానారుచిరార్థసూక్తికి నాణ్యంగా పనికివస్తుందనీ, అర్థయోజనాన్ని రసార్థయోజనంగా గ్రహిస్తే సర్వరసగుణాలను ప్రసాదంలో మిశ్రితంచేసి నన్నయ వాడతాడనీ స్పష్ట మౌతుంది.

పదిగుణాలూ వస్తుతః మూడుగుణాలలోనే అంతర్భవిస్తాయని మమ్మటాదుల అభిప్రాయం. కవిత్రయమార్గంలో ధ్వన్యనంతరయుగంలో రసధ్వనిమార్గదర్శకత్వాన్ని నిర్వహించిన లాక్షణికులలో మమ్మటుడు ముఖ్యుడుకూడ. అతనికాలం క్రీ.శ. 1020-1100. నన్నయసమకాలీనుడు. అంటే- నన్నయదృక్పథం ఆనాటికి ఆధునిక మన్నమాట!

ఆనాటి లాక్షణికులు ఓజస్సు, ప్రసాదం, మాధుర్యం అనేవి మూడే ప్రధానగుణాలనీ, పదిగుణాలలో శ్లేష, సమాధి, ఉదారగుణాలు ఓజస్సులోనూ, అర్థవ్యక్తి ప్రసాదంలోనూ, సుకుమారకాంతి సమతలు మాధుర్యప్రసాదాలలోనూ అంతర్భవిస్తాయనీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భావిస్తున్నట్లు తెలుస్తున్నది. రసధ్వనిమార్గంలో పయనించే నన్నయ దీనికి అనుకూలుడే. అందువలన నన్నయ తిక్కనాదులలో గుణవిచారం చేసేటప్పుడు రసధర్మాలుగా, తదనుకూల రచనాధర్మాలుగా పరిశీలించటం సమంజస మౌతుంది.

సభాపర్వంలో వివిధరసగుణాలను పోషించే ప్రసిద్ధపద్యాలు నూటికిపైగా ఉన్నాయి. అందులో సగానికి పైగా ప్రసాదం, అర్థవ్యక్తిగుణాలకు, మిగిలినవాటిలో చెరిసగం ఓజస్సుకు, మాధుర్యానికి చెందుతాయి. వాటిలో అంతర్భవించే గుణాలన్నీ ఆ యా సందర్భాలలో పోషించబడినాయి.

నన్నయకవితలో ఓజస్సు

సభాపర్వంలో వస్తువు వీర రౌద్రరస ప్రధానమైనది. పాండవ రాజసూయం ధర్మయుద్ధ దాన వీరాలతోనూ, వాటికి పోషకంగా నిలిచే రౌద్రవిస్ఫూర్తితోనూ, మాయాద్యూత ఘట్టం రౌద్ర కరుణరసాలతోనూ ఉద్దీప్తంగా సాగాయి. అందువలన ఇందులో లలితరసాల ప్రసక్తి తక్కువ. అందువలన ఓజస్సు అనేగుణం విస్తృతంగా ప్రయోగించే అవకాశం ఉన్నది.

ధర్మజుడు ధర్మవీరుడు కావటంచేతను, ఉదాత్తుడు, శమప్రవృత్తి కలవాడు కావటంచేతను అర్థపురుషార్థసాధకులలో వెలుగొందే రౌద్రం పరుషంగా వ్యక్తం కాదు. ఆయనకు సహాయకులైన శ్రీకృష్ణ భీష్మాదులయందుకూడ శిశుపాలాదులవలె శుద్ధరౌద్రం భాసించే అవకాశం లేదు. ఇక శత్రువులలో దుర్యోధన, శకుని, కర్ణాదులు కపటవర్తనులై వ్యవహరించటంచేత వారియందు శుద్ధరౌద్రం రాణించదు. ఇకపోగా సభాపర్వంలో భీమసేను డొక్కడే భీషణయుద్ధాలూ, ప్రతిజ్ఞలూ చేసేవాడు. అయినా అతడు ధర్మజుడికి అనునాయకుడు. అనివార్యమైన అతని ఆగ్రహాన్ని అందరూ అదుపుచేయటానికి ప్రయత్నించారు. అందువలన శుద్ధమైన ఓజస్సు ఆతనియందూ ఆవిష్కరించబడటానికి వీలులేదు. ఈ పరిస్థితులలో నన్నయకవితలో వీరరౌద్రరసానుగుణమైన ఓజస్సు ప్రసాదమిశ్రితమై ఉండటమే సహజం. అటువంటిరచన ఉండటమే గమనార్హం.

నన్నయకవితలో రౌద్రరసగుణమైన ఓజస్సును ప్రదర్శించిన ప్రసిద్ధమైన పద్యపంచరత్నాలు సభాపర్వంలోనే కొలువుతీర్చి ఉండటం, అవి రౌద్రరసవిస్తారమైన రెండో ఆశ్వాసంలోనే ఉండటం విశేషం.

1. 'రయవిచలత్తురంగమతరంగములన్....... క్షణంబునన్.' (2.33)
2. 'ప్రకటితకోపవేగమున.......... అంతకమూర్తి కచ్చటన్.' (2.51)
3. 'కురువృద్ధుల్........... ఉగ్రాకృతిన్' (2.233)
4. 'ధారుణిరాజ్యసంపదమదంబున..... ఉగ్రరణాంతరంబునన్' (2.249)
5. 'కనకోర్వీధరసానుసారరుచి..... సంగ్రామరంగంబునన్.' (2.297)

అంగ, నేపథ్య, వాక్యభేదాలచేత రౌద్రరసం మూడువిధా లని భరతుడు నిర్దేశించాడు. పై పద్యాలైదింటిలో మొదటిది నేపథ్యానికీ, రెండవది అంగానికీ, మిగిలినమూడూ వాక్యరౌద్రానికీ ఉదాహరణలు. వాక్యరౌద్రాన్ని స్వభావరౌద్ర మనికూడా అంటారు కాబట్టి భీమార్జున రౌద్రప్రతిజ్ఞలను వర్ణించే పద్యాలు వారి రౌద్రస్వభావాన్నికూడా వ్యక్తంచేస్తున్నాయి. మొదటిరెండురకాలూ కథాకథనంలోని వర్ణనలు, మిగిలినమూడూ వీరప్రతిజ్ఞలు, పాత్రోచితవాచ్యాభినయపతాకలు!

'రయవిచలత్తురంగమతరంగములన్'- అనే పద్యంలోనిది శిశుపాలవధ అనే రౌద్రకర్మకు నేపథ్యాన్ని కల్పించే యదు వృష్ణి భోజ కుకురాంధకవాహినుల సంకుల విజృంభణవర్ణనం. ఇది నిర్దయతర రోషమారుతనితాంత సమీరితమైన వాహినిని దర్శింపజేసే సావయవరూపకం. రోషశబ్దంచేత అది రౌద్రరసానికి సంబంధించిన క్రోధభావోద్వేగస్థితిని నన్నయ ధ్వనింపజేస్తూ ఓజస్సును నిబంధించాడు. అలంకారాన్ని అక్షరరమ్యతతో సంవదించి క్రోధభావదీప్తిని భావనామయం చేశాడు. సైనికసమూహం ప్రదర్శించే కోపం రసస్ఫూర్తిని పొందదు. కాని, ఉద్దీపనవిభావంగా రాణిస్తుంది. ఇది క్రోధభావదీప్తిని మాత్రం తెలిపే అలంకారధ్వనిమయమైన పద్యం. ఇది రౌద్రరసభావం ప్రకటిస్తున్న విభావవర్ణనం. ఇందులో అనుభావవర్ణనం అస్పష్టం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'ప్రకటితకోపవేగమున'-అనే పద్యం-భీష్ముడిని రూక్షాక్షరవచనాలతో ఆక్షేపిస్తూఉన్న శిశుపాలుడిని చూచి సహించలేక కోపించి భీమసేనుడు రౌద్రాకారంతో నిలిచిన అతడి అనుభావాలను వర్ణించేది. శత్రుకృతమైన నిందావమానాలవలన అభిమానధనుడైన ధీరుడికి కలిగే క్రోధోద్రేకం ఇందులో వర్ణ్యవస్తువు. క్రోధాన్ని ఎర్రబడిన కన్నులు, ముడివడిన కనుబొమ్మలు, నిప్పులు రాలే చూపులు, ఎర్రబారిన ముఖం, స్వేదం, పళ్ళు పటపటకొరకటం, పరుషవాక్యాలు పలకటం మొదలైన అనుభావాలతో వ్యక్తంచేస్తారు. భీముడియందు ఆ అనుభావాలను అలంకృతంచేసి నన్నయ రౌద్రవిభావాన్ని భావనామయం చేశాడు.

ఇందులో గమనించవలసిన అంశాలు ముఖ్యంగా మూ డున్నాయి.

1. శ్రవ్యకావ్యమర్యాద నాశ్రయించి అలంకారం విభావాన్ని ఆస్వాదమధురంగా మారుస్తుంది.

2. ఓజోగుణంవలన పఠితలకు చిత్తవిస్తారరూపమైన రౌద్రరసానుభవం కలుగుతుంది.

3. 'అతిరౌద్రాకారమున నలిగిన' 'భయానకతరలీలఁదాల్చె' 'అంతకమూర్తి' 'నిఖిలక్షత్రియత్రాసజనకంబుగా నలిగి' అనేమాటలు రౌద్రరస అభినయానికి సంబంధించిన సాంకేతికపదాలవంటివి. రౌద్రాకారంతో కోపించటం అనేది భరతనాట్యశాస్త్రంలోని అష్టమాధ్యాయంలో చెప్పిన ఉత్తమాంగాభినయంలో భాగమైన రౌద్రదృష్టికి సంబంధించింది. చలనంలేని కనురెప్పలతో, తారకలతో, బొమముడితో కూడిన క్రూరమూ, పరుషమూ, అరుణమూ, ఉద్ధృతమూ అయిన చూపు గల ముద్ర-రౌద్రాకారం- రౌద్రరసంలో ప్రయోగించేది. ఆ ముద్రలో సాక్షాత్ నాట్యరసమైన రౌద్రరసం ఆకృతిగొన్నట్లుగా భీముడు ఉన్నా డని నన్నయవర్ణన. 'భయానకతరలీల' అన్నదికూడా రసదృష్టికి సంబంధించిందే. చూచేవారికి భయం కలిగించేదిగా ఉండేది భయానకం. అంటే చూచేవారుకూడా భీముడి ఆకారాన్ని చూచి రెండురెప్పలూ బాగా విప్పారి నిశ్చలంగా ఉండగా, తారకలు మెరుస్తూ తిరుగుతూఉండగా, అత్యధికమైన భయాన్ని చూపించే దృష్టిగల భంగిమ భయానకదృష్టి, అటువంటి భంగిమలో చూపరులు భయంతో నిలబడేటట్లు భీముని రౌద్రాకారం ఉన్న దని భావం. ఇవి నాట్యపరిభాషకు సంబంధించినవి కాగా, 'అంతకమూర్తికి' అనేది కావ్యాలంకారానికి సంబంధించింది. ఈవిధంగా రౌద్రరసవర్ణనం చేసేటప్పుడు నాట్యపరిభాషను కావ్యపరిభాషతో కలిపి వాడే రచనాశిల్పంలో నన్నయగారే తిక్కనకు మార్గదర్శకు లయ్యారు. "కనుగొనికోపవేగమున....." (విరా.2.133) అనే తిక్కనపద్యం ఈపాదులో మొలిచిందే.

'కురువృద్ధుల్ గురువృద్ధబాంధవులు'- అనే పద్యంలో రౌద్రరసపోషక మైన వాచికాభినయానికీ, పాత్రోచితసందర్భోచిత సంభాషణానికీ ఓజస్సు సమర్థమైన సాధకంగా నిలిచింది. గాఢబంధత్వంతోపాటు అర్థప్రౌఢికూడా ఈ శపథంలో రాణించింది. ఇంతమంది పెద్దలు చూస్తూఉండగా ఖలుడైన దుశ్శాసనుడు ద్రౌపదిని "ఇట్లు" చేశాడు అన్నాడు భీముడు. "ఇట్లు" అనే పదం వాచికాభినయంలో అనంతమైన భావాభివ్యక్తికి పనికివచ్చే వాఙ్మయసాధనం. ఇట్లు-అన్నప్పుడు దుశ్శాసనుడు ద్రౌపదికి చేసిన అవమానం అవాచ్యం(నోటపలుకరానిది) అనీ, అంతటి అవమానంచేశాడనీ సందర్భోచితంగా గమ్యమానమైన అర్థం. దానితోపాటు మరొక అర్థంకూడా ప్రతీయమానం అవుతుంది. భీముడికి అంతటి కోపం వచ్చేటట్లు అవమానంచేయటానికి ఎంత వీలుందో ఆవిధంగా అని అర్థం. ఆ కోపం ఎంతటిది? ఇంతమంది చూచేటట్లు అవమానంచేయటానికి కారకుడైన దుర్యోధనుడిముందు దుశ్శాసనుడి రొమ్ముచీల్చి అందులోనుండి పారే నెత్తురుటేరులను త్రాగితేకాని తీరనంతటిది. రౌద్రం రాక్షసప్రవృత్తికి సంబంధించిందని భరతనాట్యశాస్త్రం. పచ్చినెత్తురు త్రాగటం ఎంత రాక్షసమో అంత రౌద్రం, అంత ఉగ్రత్వం. దుశ్శాసనుడు చేసింది అంతటి రాక్షసకృత్య మని భీముడి భావం. ఇంతటి అర్థప్రౌఢి భీముడి వాక్కులలో ఉన్నప్పుడు ఈ పద్యంలోది అర్థగుణమైన ఓజస్సు అనవచ్చును కదా? కాదు. ఆ అర్థప్రౌఢిని గాఢబంధానికి గౌణం చేశాడు నన్నయ. అందువలన ఇది శబ్దగుణమైన ఓజస్సు సార్థకంగా సాగిన సమర్థవంతమైన పద్యం. భావిరణరంగంలో దుర్యోధనుడికంటె దుశ్శాసనుడిచావు ముందుగా జరుగుతుందనీ, అతడి కర్మానుభవానికి ప్రేరకుడైన దుర్యోధనుడు అప్పుడు పరితపించక తప్ప దనీ వ్యంగ్యార్థం. రౌద్రరసంనుండి కరుణరసం పుడుతుంది. దుర్యోధనుని రౌద్రంనుండి ద్రౌపదియందు కరుణం జనించింది. శత్రుకృత అవమానంనుండి భీముడిలో రౌద్రం జనించింది. దానివలన దుర్యోధనాదులకు శోకం కలిగిస్తా నని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అతడు శపథం చేశాడు. రౌద్రానుప్రాణిత యుద్ధవీరం ఇందులో రసం. అందువలననే అతడిశపథం విని సభ్యులు అద్భుతరసావిష్టు లైనారు. వీరం జనకరసం. అద్భుతం జన్యరసం.

దుశ్శాసనుడిని చంపుతా నని భీముడు శపథం చేసినప్పుడు ఆలోచిస్తూ ఆగ్రహాన్ని అభివ్యక్తీకరించాడు. మరి-దుర్యోధనుడి తొడలు విరుగగొడతా నన్నప్పుడు భీముడు 'సర్వజనభయానకక్రోధావేశవివశు'డైనాడు. 'రౌద్రాకారం' తాల్చాడు. అప్పుడు పలికినపద్యం "ధారుణిరాజ్యసంపద మదంబున......". చెయ్యకూడని పనిని వివేకం లేకుండ చేశాడు కాబట్టి దుశ్శాసనుడు ఖలుడు, పశుతుల్యుడు. అతడి నెత్తురు త్రాగటం అతడి పశుత్వానికి అనువైనపని. కాని, దుర్యోధనుడు తెలిసి మదంచేత ఇల్లాలిని అవమానించ దలచిన "దురాత్ముడు" (చెడుబుద్ధి కలవాడు, దుష్టమైన స్వభావం కలవాడు) వీడు చావకూడదు, చచ్చినట్లు పడి తన కర్మఫలాన్ని భీము డనే రౌద్రాకారుడివలన ఇహంలోనే అనుభవించి అవమానం పొందాలి అన్నది అతడి భావం. అర్థప్రౌఢికంటె గాఢబంధత్వమే ఈ రచనలో శబ్దగుణమైన ఓజస్సుకు ప్రాణంపోస్తున్నది. ఈ నాలుగుపద్యాలు ఒకటికంటె మరొకటి విలక్షణమైనవి, విశిష్టమైనవి.

భీముడిశపథాలు ద్వంద్వయుద్ధాలకే పరిమితమైనవి. అయితే, అరణ్యానికి పోతూ 'దుర్యోధనాదులగు రిపుల'ను చంపుతా నని శపథం చేసినట్లు భీముడిచేత నన్నయగారు అనిపించారు (సభా.2.295) కాని అందులో ఓజస్సు లేదు. పైపద్యాలలోని తేజస్సుకూడా లేదు. కాగా, అరణ్యానికి పోతూ పాండవులు చేసిన ప్రతిజ్ఞలలో కవ్వడి చేసిన ప్రతిజ్ఞ కవోష్ణంగా ఉన్నది. "కనకోర్వీధర....." అన్న మత్తేభం ఓజోగుణభూయిష్ఠం. అర్జునుడి ప్రతిజ్ఞలో అంతర్నిగూఢ క్రోధం గర్జించినట్లయింది. వికటత్వ మనే ఉదారతతో కూడుకొన్న ఔజ్జ్వల్యంకూడా ఆ మాటలలో ఉన్నది. పక్షులముందు పిండాలు వేసినట్లుగా, రక్తతర్పణాలతో పక్షులు (ప్రేతాలకు ప్రతినిధులు) సంతోషపడేటట్లు కర్ణాదులను చంపుతా నన్నాడు పార్థుడు. అగ్రామ్యత్వంతోడి వికటత్వం. అర్థప్రౌఢితోకూడిన గాఢబంధత్వం అర్జునుడి ధీరోదాత్తప్రవృత్తిని వీరరసమూర్తిని ధ్వనింపజేస్తున్నాయి. (మరిన్ని వివరాలకు వ్యాఖ్యానంలోని విశేషాంశాలు చూడండి).

నన్నయగారి సభాపర్వంలో ఈ అయిదుపద్యాలూ ఓజో(శబ్ద)గుణప్రధానకవితకు పద్యపతాకలు!

రౌద్రరసపోషణంలో తిక్కన శబ్దగుణంకంటె అర్థగుణానికి ఏవిధంగా ప్రాధాన్యా న్నిస్తాడో గమనిస్తే నన్నయతిక్కనల గుణవద్రచనలలోని భేదాన్ని తెలిసికొనటం తేలికౌతుంది. ముందుగా తిక్కన నన్నయవలె ఓజోగుణాన్ని శబ్దగుణంగా వెలార్చే విధానానికి ప్రసిద్ధమైన పద్యం ఒకటి-

శా. "దుర్వారోద్యమబాహువిక్రమరసాస్తోకప్రతాపస్ఫుర
ద్గర్వాంధప్రతివీరనిర్మథనవిద్యాపారగుల్ మత్పుతుల్
గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెస న్గిట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా!". **(సభా. 2-55)**

పాండవుల రౌద్రవిభావవిస్ఫూర్తిని ప్రకటింపజేసే ద్రౌపదివాక్యాలలో ఆకృతినిరూపణసామర్థ్యం గల శబ్దగుణమైన ఓజస్సును కూర్చటం ఔచిత్యం. అయితే, తిక్కన రచనలో విభావాలను భావమూర్తులుగా చిత్రించే శిల్పమే అధికం; భౌతికరూపచిత్రణంకంటె భావక్రియారూపచిత్రణమే విస్తారం. పైపద్యంలో రౌద్రవిభావ ప్రదర్శనం చేసిన పద్ధతి శబ్దగుణాశ్రయంగా తిక్కన రచించి చూపించినా ఆయన ప్రధానంగా భావోచితవాక్యవిన్యాసంద్వారా పాత్రలప్రవృత్తులను వ్యంజింపజేసే అర్థగుణాశ్రితమైన రచనాశక్తిని ప్రకటించడంలో తన ప్రజ్ఞాప్రాభవాన్ని ప్రసిద్ధంగా ప్రదర్శించాడు. అందుచేత తిక్కన రచనలో అర్థగుణదీప్తి భాసిస్తుంది. ఉదాహరణకు భీముడి రౌద్రప్రవృత్తిని ప్రకటించే ఈ పద్యం చూడండి:

మ. "అవనీచక్రము సంచలింపఁగ దివం బల్లాడ నాశాచయం
బవధూతంబుగ గోత్రశైలనికరం బాకంపముం బొంద న

ర్ణవముల్ ఘూర్ణన మొందఁ గ్రోధము గృతార్థత్వంబు నొందించి చి
త్రవధప్రౌఢి వహించి సూతునకు రౌద్రం బేర్పడం జూపెదన్". (సభా. 2.284)

రౌద్రరసోన్నిద్ర మైన ఈ పద్యంలో నిజానికి తిక్కన శబ్దగుణప్రధాన మైన సమాససంఘటనను ప్రవేశపెట్టియుండవలసింది. కాని, గాఢబంధత్వంతో కాక అర్థప్రౌఢితో భీమరౌద్రాన్ని తిక్కన వ్యక్తీకరించాడు. తిక్కన కిట్టిరచన అత్యంతప్రీతిపాత్రం. ఓజస్సును రౌద్రంలో నిబంధించటం రసవద్రచనాధర్మం. అయితే, దానిని శబ్దగుణంగా వెలార్చాలా, అర్థగుణంగా వెలార్చాలా అన్నది కవి ఇచ్ఛాధీనం. తిక్కన పైపద్యంలో అర్థగుణ మైన ఓజస్సును ప్రదర్శించిన తీరు అపూర్వం. క్రోధం స్థాయిభావం. అది కృతార్థత్వం పొందటం అంటే రౌద్రంగా మారటమే. దానిని భావరూపంగా, క్రియారూపంగా కీచకుడి పట్ల ప్రదర్శించి చూపుతా నని భీమప్రతిజ్ఞ. రౌద్రరసమూర్తి అంటే ప్రళయకాలరుద్రునిమూర్తి అనే అర్థవిశేషం ధ్వని. ఆ రుద్రమూర్తిని చూచి ప్రకృతి సంక్షోభిస్తుంది. అటువంటి రౌద్రమూర్తిని ప్రదర్శిస్తానని భీముడి భావం. అప్పుడు కీచకుడుకూడ సంక్షోభాన్ని పొంది చిత్రవధకు గురిఔతాడట. భీముడిని ప్రళయరుద్రుడిగా భావింపజేసే అర్థప్రౌఢి ఇందులో ప్రధానం. రౌద్రరసంనుండి జనించే కరుణరసం భావనారమ్యం. ఇక్కడ శబ్దం అర్థంలో మునిగింది. శబ్దగుణంకంటె అర్థగుణం సాత్త్వికమైనదీ, సూక్ష్మమైనదీ, సుందరమైనదీ అయి, ఆస్వాదమాధుర్యాన్ని పఠితకు భావనామయంగా అందిస్తుంది. ఈ పద్యాలు రెండింటినీ గమనిస్తే నన్నయమార్గాన్ని అనుసరిస్తూనే తనప్రత్యేకతను తిక్కన ఎట్లా ప్రపంచించాడో స్పష్టమౌతుంది. ఉభయులమార్గాలలో ఉన్న సామ్యభేదాలు తేటపడతాయి.

శ్లేష, సమాధి, ఉదారత అనే గుణాలు ఓజస్సులో అంతర్భవిస్తాయి. వాటిని నన్నయ సభాపర్వంలో నిర్వహించినతీరు గమనించదగింది. బహుపదముల ఏకవద్భావం శబ్దాశ్రితమైన శ్లేషం. సన్నివేశఘటన అర్థాశ్రితమైన శ్లేషం. ఈ రెండింటియొక్క చక్కని సంయోజనంతో శ్లేషను శబ్దగుణప్రధానంగా ఆవిష్కరించిన నన్నయపద్యం-

ఉ. "ఆ వనజాననం గురుకులాపశదుండు గడంగి రాజసూ
యావభృథంబునందు వసుధామరమంత్రపవిత్రవారిధా
రావళిఁ జేసి పావనములైన శిరోజములం దెమల్చి పా
పావహుఁ డీడ్చి తెచ్చె సభ కందఱు సంభ్రమమంది చూడఁగన్". (సభా. 2.216)

సన్నివేశం రౌద్రరసగంభీర మైనది. నిర్దయుడైన దుశ్శాసనుడు ద్రౌపదిపవిత్రదీర్ఘకేశాలను పట్టి నిండుసభకు లాగుకొనివచ్చే క్రియాబహుళమైన సన్నివేశాన్ని నన్నయ శ్లేషలో నిబంధించాడు. అక్షరాలు వేరైనప్పటికీ ఒకేపదంవలె తోపింపజేసే సంహిత(సమీపోచ్చారణం)కు అనుకూలమైన వర్గాక్షరాల విన్యాసవిశేషంచేత గాఢంగా భాసించేది శబ్దగుణం. పవర్గ, కవర్గాక్షరాలతో మిళిత మైన అంతస్థశ్వాసాక్షరాల వర్ణవిన్యాసం రౌద్రభావోచిత మైన అక్షరరమ్యతను సాధించి శ్లేషను రూపుకట్టించింది. ద్రౌపది దీర్ఘశిరోజవర్ణనంలో గల దీర్ఘసమాసబంధం శ్లేషలోని ఓజస్సును పోషిస్తూ ఉండగా, దానిని పట్టి లాగుతున్న దుశ్శాసనుడిచర్యను వర్ణించే పదాలలోని శైథిల్యం పఠితకు స్ఫురించకుండా రచించటంలో శ్లేష భాసించింది. ఓజస్సుకు అంగంగా నిలిచి తన అస్తిత్వాన్ని ఆకృతికట్టించుకొన్నది. సన్నివేశం నిర్విరామంగా, ఏకధాటిగా ఒక్కుమ్మడిగా దానినిగురించి విశ్లేషించి తెలుసుకొనటానికి వీలులేకుండా సాగినట్లు చిత్రించిన ఈ శ్లేషగుణం సార్థకం. శబ్దప్రధానమైన మసృణత్వం ఘటనను తనలో ముంచివేసినట్లు రచించిన నన్నయరచన రౌద్రరసోన్నిద్ర మైన శబ్దశ్లేషగుణానికి ఉదాహరణం. అది ఓజస్సును తనలో నిలుపుకొన్నది కాబట్టి ఓజోగుణసుందరం.

నన్నయ తిక్కన రచనలలో శ్లేష శబ్దార్థఘటనల వ్యక్తిత్వాలను అపూర్వంగా ఆవిష్కరించే శిల్పాన్ని వెలార్చగలిగింది. అందువలన నన్నయశ్లేష అక్షరరమ్యతను సంతరించుకొన్నది తిక్కనశ్లేష అర్థసంఘటనకు ఆయువుపోసింది.

శ్లేష తిక్కన అర్థగుణ ప్రయోగ పాండిత్యాన్ని పట్టియిచ్చే గుణం. పదబంధంలోని మసృణత్వమే శబ్దగుణమైన శ్లేషలక్షణం. బహుపదా లున్నప్పటికీ ఏకపదంవలెనే భాసించటం దానిస్వభావం. అర్థగుణమైన శ్లేష అర్థఘటనకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంబంధించింది. అనేక భావా లున్నప్పటికీ అవన్నీ నీరక్షీరన్యాయంగా కలిసి వేరుపరచటానికి వీలుకాకుండా మెలగుతూ ఉండే ఐక్యఘటనాన్ని సంవదింపజేసేదిగా అది కనపడుతుంది. మచ్చుకు - తిక్కనప్రసిద్ధపద్యం:

చ. “పగ యడఁగించు టెంతయు శుభం; బది లెస్స; యడంగునే పగం
బగ; వగ గొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే; కడుం
దెగ మొద లెత్తిపోవఁ బగఁ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు; నే
మిగతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా!”. **(ఉద్యో. 3-21)**

శ్లేషలో క్రమమూ, కౌటిల్యమూ, అనుల్బణత్వమూ ఉపపన్నమై ఉండా లని వామనుడు పేర్కొన్నాడు. ఈ మూడు లక్షణాలూ ధర్మజుడి వాక్యఘటనలో అర్థగుణసిద్ధిని పొందాయి. తిక్కనపాత్రలు ఆలోచిస్తూ మాట్లాడుతున్నట్లుండటం ప్రసిద్ధి. వారి మాటల పొందికలో ఎంత మన్నిక ఉంటుందో వాక్యాల కూర్పులో అంత అర్థసంఘటన ఉంటుంది. మాటలను అతకటం శబ్దగుణం; ఊటగా ఊరే భావాలను బహు వాక్యాలలో ప్రవహింపజేసినా ఏకధారను అర్థస్ఫూర్తియందు సంఘటింపజేయడం అర్థగుణం. తిక్కన రచనలో శబ్దగుణమైన శ్లేష అర్థగుణమైన శ్లేషకు ఊడిగం చేస్తుంది. వాక్యవిన్యాసంలో ఏకసూత్రంగా ఉండే ఆలోచనాక్రమం ఒక్కొక్కప్పుడు వక్రతతో కూడివున్నా అనుల్బణత్వాన్ని ఆద్యంతమూ సమాదరిస్తుంది. ఇది తిక్కన సంభాషణశిల్పంలోని ఆయుస్సూత్రం. పైపద్యంలోని ధర్మజుడి వాక్యరచన అర్థగుణమైన శ్లేషకు శీర్షప్రాయమైన ఉదాహరణం.

ఆరోహావరోహక్రమం శబ్దగుణమైన సమాధిలక్షణం. పద్యంలోని రచనాబంధం క్రమంగా హెచ్చుతూ తగ్గుతూ, దిగుతూ ఎక్కుతూ శ్రోతలకు రచనమీదా, తద్ద్వారా రసభావప్రకటనం మీదా రక్తి కలిగించటమే శబ్దగుణప్రయోజనం. అర్థగుణమైన సమాధి పద్యంలోని తాత్పర్యంమీద పఠితబుద్ధిని సమాహితంచేసి అర్థదర్శనం చేయిస్తుంది. నన్నయరచనలో శబ్దసమాధికి అర్థసమాధి అంగం. ఉదాహరణకు-

మ. “అవనీనాథు లనేకు లుండఁగ విశిష్టారాధ్యు లార్యుల్ మహీ
దివిజుల్ పూజ్యులు పల్వు రుండఁగ ధరిత్రీనాథ! గాంగేయు దు
ర్వ్యవసాయంబునఁ గృష్ణుఁ గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి నీ
యవివేకం బెఱిఁగించి తిందఱకు; దాశార్హుండు పూజార్హుఁడే!”. **(సభా. 2.8)**

శిశుపాలుడి ఈ అధిక్షేపవాక్యాలలో మూడురకాల వాక్యవిన్యాసా లున్నాయి. సభలో నిండియున్న అవనీనాథులనూ, విశిష్టారాధ్యులనూ, ఆర్యులనూ, మహీదివిజులనూ, పూజ్యులైన అనేకులనూ చేయెత్తి నిర్దేశించిచూపిస్తూ, వా రందరి మహత్త్వాన్నీ ఎలుగెత్తి చెప్పుతూ ఉదాత్తఫణితిలో ఆరోహక్రమంలో మొదటివాక్యం అన్నాడు. ధరణీనాథ! అనే సంబుద్ధి అధిక్షేపాత్మకం; అవివేకిని పట్టుకొని మహారాజా! అని పిలిచినట్లు పిలిచే వైఖరితో పిలిచిన పిలుపది. అక్కడినుండి ‘నీ అవివేకం బెఱిఁగించి తిందఱకు’- అనేంతవరకూ అభిశంసనాత్మకంగా మాట్లాడుతూ వాక్యవిన్యాసంలో అవరోహక్రమం భాసించేటట్లు పలికాడు - శిశుపాలుడు. ‘దాశార్హుండు పూజార్హుఁడే?’ అనే వాక్యం అమర్షాధిక్షేపాత్మక మైన ఆవేశంతో వేసిన ప్రశ్న. శిశుపాలుడి కోపం తీవ్రస్థాయిని అందుకొన్న దీర్ఘాక్షర రూక్షవచనం, ఆరోహక్రమానికి అచ్చమైన అభివ్యక్తి.

శిశుపాలుడి రౌద్రప్రవృత్తికి ఈ పద్యం అద్దంపట్టుతుంది. ఆరోహావరోహక్రమంలో ఒక వర్తులం ప్రదర్శిత మైన అక్షరవిన్యాసం ఈ పద్యంలోని శబ్దసమాధి శిల్పం. పద్యంలోని ‘కృష్ణుఁ గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి’ అన్నప్పుడూ, ‘దాశార్హుండు పూజార్హుఁడే’ అని అధిక్షేపించినప్పుడూ అర్థం గూఢంగా ద్యోతక మౌతున్నది కాబట్టి అర్థదర్శనప్రధానమైన అర్థగుణసమాధికంటె ఆరోహావరోహక్రమ విన్యాసప్రధానమైన వాక్యవిన్యాసమే ప్రస్ఫుటంగా ఉండటంచేత ఇది శబ్దగుణప్రధానమైన సమాధిగా నిశ్చయించవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సమాధిలో లఘ్వక్షరవిన్యాసమున్న రచనలో అవరోహం, గుర్వక్షర విన్యాసమున్న రచనలో ఆరోహం అధికంగా భాసిస్తాయి. అందులో- అవరోహంనుండి ఆరోహాన్ని అందుకొనే శబ్దగుణసమాధిని నిబంధించే పద్ధతి ఒకరకం. వక్తవ్యాంశాన్ని క్రమపరిణామపద్ధతిలోగాని, ఆరంభవివరణపద్ధతిలోగాని చెప్పే ప్రతిపాదనవిధానంలో శబ్దగుణం రాణిస్తుంది. అటువంటి పద్యంలోని రచన రక్తిని కలిగించినా అది అంతటితో ఆగకుండా ప్రతిపాద్యాంశంలో పఠితమనస్సును అవహితం చేసే గుణాన్ని ప్రకటిస్తుంది. అర్థప్రతిపాదనకంటె అక్షరవిన్యాసం ఆకర్షణీయంగా ఉండేది శబ్దగుణం. అక్షరవిన్యాసంకంటె అర్థప్రతిపాదన ఆకట్టుకొనేది అర్థగుణం. ఒకటి నన్నయసొత్తు. మరొకటి తిక్కనసొత్తు.

ఆరోహక్రమాన్ని అందంగా ప్రదర్శించే శబ్దసమాధిగుణానికి ఉదాహరణం-

ఉ. “పాలితదుర్ణయుండు శిశుపాలుఁడు బాలుఁడు, వీని నేల భూ
పాలక నీకుఁ బట్టువఱుపన్, మఱి ధర్మ్మ వెఱుంగ వీనికిం
బోలునె రాగకోపపరిభూతమనస్కున కల్పరాజ్య ల
క్ష్మీలలనాంధబుద్ధి కనిమిత్తమహత్పరివాదశీలికిన్”. **(సభా. 2.22)**

శిశుపాలుడిని బాలుడిగా చెప్పి అధిక్షేపించే మాటలనుండి, తనకు ధర్మం తెలియ దని నిందించిన శిశుపాలుడిలో ధర్మం తెలియలేని అవగుణాలను ఏకరువుపెట్టే ఆవేశాత్మకమైన వాక్యవిన్యాసంవరకు సాగే ఈ పద్యంలోని అక్షరవిన్యాసంతోపాటు వాక్యవిన్యాసంకూడా అవరోహంనుండి ఆరోహంవరకు సాగే సమాధిని సాక్షాత్కరింపజేస్తూ క్రోధభావద్యోతకంగా నిలిచింది.

పద్యంలో అవరోహక్రమం భాసించే పద్ధతికి ఉదాహరణం-

చ. “అతులపరాక్రమార్జితములైన ధనంబుల పేర్మిఁ జేసి యు
న్నతమగుచున్నపాండునరనాథతనూజులలక్ష్మి నా కస
మ్మత మయి సూ వెలింగె విను మాతుల! మానధనాఢ్యుఁ డైన భూ
పతి సహియింపనోపునె సపత్నులవృద్ధియు నాత్మహానియున్.” **(సభా. 2.98)**

దుర్యోధనుడి అర్థప్రధానమైన రౌద్రరసానికి పాండవసంపదను చూచి సహించలేకపోవడమే మూలం. పాండవసంపద ప్రసక్తివచ్చినప్పుడు ఆరోహక్రమం, దానిని చూచి సహించలేక విచారిస్తున్నప్పుడు అవరోహక్రమం రచనలో ఉండటం సహజంకూడా. ఆ క్రమమే ఈ పద్యశిల్పంలో పాటించిన శబ్దసమాధిగుణం. రచనలో అర్థదర్శనంకంటె అక్షరప్రదర్శనకే ఆధిక్యం ఉండటం శబ్దగుణస్వభావం. దీనిలో నన్నయ అందెవేసిన చేయి.

తిక్కనరచనలో ఆరోహావరోహాలక్రమం అందంగా అమరి ఉన్నా దానికంటె అర్థదర్శనం అగ్రతాంబూలం అందుకొంటూ ఉంటుంది. పై రెండురకాలకూ తిక్కనగారి పద్యాలు-

చ. “అనయము పుట్టె జూదమున; యప్పుడ యెంతయుఁ జిచ్చువెట్టి కా
ల్చినయది నీ యుపేక్షయ; వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మె
త్తనిపులి; యెల్లవారలు నధర్మము నీపయిఁ బెట్టునంతకు
న్వినఁడును గానఁడుం; బిదప నీకును నాకు మరల్పవచ్చునే?”. **(ఉద్యో. 2.14)**

ఇది తిక్కనగారిప్రసిద్ధపద్యం. ధర్మరాజును ‘మెత్తనిపులి’గా తెలుగువారికి పరిచయం చేసిన పద్యం. ఇందులోని వాక్యవిన్యాసం గూఢమైన ధర్మజుడి క్రోధాన్ని సమాధిగుణమయంగా ఆవిష్కరించటానికి వినియోగించిన సంభాషణశిల్పం. ధృతరాష్ట్రుడికి ఆమోదం కాని తాత్పర్యాన్ని సత్యకథనదృక్పథంతో చెప్పిన సంజయుడివాక్యాలలో రచన అవరోహంనుండి ఆరోహానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎక్కటం రచనలోని శబ్దగుణసార్థక్యం. అయితే ఆ గుణంకంటె అర్థదర్శనమే ఈ పద్యంలో అధికంగా ప్రకాశిస్తున్నది. అది తిక్కనకవితాకళ!

శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడితో చెప్పిన మాటలలో దీర్ఘాక్షరబహుళమైన రచనతో ఎత్తుకొని లఘ్వక్షరబహుళమైన రచనతో పద్యాన్ని ముగించి, ఆరోహణనుండి అవరోహణంగా దిగివచ్చే పద్ధతిని తిక్కన ప్రదర్శించాడు.

ఉ. "కౌరవపాండవుల్ తెఱఁగు గైకొని శాంతతఁ బొందియున్కి మే
లారయ నాకు నీకుఁ గులమంతకు నీనృపకోటి కుర్వికిం;
బోరితమైన నింతకును బుట్టు మహాపద; గావునన్ ధరి
త్రీరమణాగ్రగణ్య! గణుతించి యవశ్యముఁ బొం దొనర్పవే!" (సభా. 3.262)

సచివుడైన సంజయుడు అవరోహంతో ఆరంభించి అర్థసమాధిని మాటలలో రంగరించటం, స్వతంత్రుడైన శ్రీకృష్ణుడు ఆరోహణంలో ఆరంభించటం అర్థవంతంగా బోధించటం గమనిస్తే తిక్కనకూడా సందర్భశుద్ధి నెరిగి శబ్దార్థగుణాలను సార్థకంగా ప్రయోగించటం నన్నయనుండి గ్రహించా డని తెలుస్తుంది.

వికటత్వం ఉదారత. ఏ రచనలో శబ్దాలు నృత్యంచేస్తున్నట్లు వికటత్వాన్ని ప్రదర్శిస్తాయో అది శబ్దగుణమైన ఉదారతాగుణంతో కూడిఉన్న దని చెప్పాలి. కాని, ఉదారతాగుణం అర్థగుణంలో అగ్రామ్యత్వంగా శోభిస్తుంది. ఉపాలంభనాదులలో ఔచిత్యపోషణకు ఉదారతాగుణం ఉదాత్తపాత్రలకు ఉపాలంబనంగా ఉంటుంది. జరాసంధుడు శ్రీకృష్ణభీమార్జునులతో అన్నమాటలు-

ఆ. "మీరు నాకు నేను మీకు నెన్నండు ము
న్నహిత మాచరించినదియు లేదు
మీకు నేల నే నమిత్రుండ నైతి? ని
రాగసుండ సద్గుణాన్వితుండ." (సభా. 1.186)

శ్రీకృష్ణుడి మాటలకు జరాసంధుడు మనసులో ఉడికిపోయి, ఉవ్వెత్తుగా రేగుతున్న రోషకోపాలను అదుముకుంటూ కసిగా అంటున్న మాట లివి. గలగలగలగల- నడకతో నడిచిన మాటలు నృత్యాయమానంగా ఉన్నాయి. నన్నయరచనకు తోడుగా ఆటవెలదిని ఛందంగా వాడటం విశేషం. క్రోధఘూర్ణితవచనంలోని వికటత్వం ఆత్మసమర్థనంలో, ఆత్మస్తుతిలో అర్థవంతంగా రాణిస్తున్నాయి. అగ్రామ్యత్వంకంటె పైపద్యంలో వికటత్వమే ప్రచురంగా వెలువడింది.

పాండవులు అడవులకు ఎట్లా పోయారో వివరంగా విని, వారివలన కౌరవులకు కీడు తప్పదని శంకించి దుఃఖిస్తూ ఉన్న ధృతరాష్ట్రుడిని చూచి, కుపితుడైన విదురుడు పలికిన మాటలు నిప్పులవలె చిటపటలాడిన వాక్యవిన్యాసాలు; వికటత్వానికి అక్షరరూపాలు. అవి తరలవృత్తంలో తురంగలించాయి.

తరలము.
"వగవ నేటికి నింక నైనను వారలం బిలిపించి యీ
జగతి నెప్పటియట్ల యేలుచు సంతసంబున నుండఁగా
జగదధీశ్వర! పంపు, వంచన చన్నె! యన్యులసంపదల్
మిగిలి చేకొన నిట్లు సేసిన మెత్తురే మది నుత్తముల్?" (సభా. 2.315)

తిట్టవలసినచోట గౌరవంగా మొట్టినట్లు మాట్లాడిన ఈ మాటలు అగ్రామ్యత్వాన్ని ప్రదర్శిస్తున్నా, ఆ మాట లనే తీరులో గోచరించే వికటత్వం పఠితలహృదయాలను ప్రధానంగా ఆకర్షిస్తుంది. ఇది నన్నయ శబ్దగుణమైన ఉదారతాగుణం.

తిక్కనకూడా రసౌచిత్యపాలనంలో ఈ గుణాన్ని నిపుణంగా వాడతాడు. అర్జునుడు దుర్యోధనుడిని ఉపాలంభిస్తూ అన్నమాటలు ఇందుకు ఉదాహరణాలు.

ఉ. "క్షత్రియుఁ డోడునే తగదు కౌరవరాజ! యొకండ నేఁ బృథా
పుత్త్రులలోనఁ బిన్న, నినుఁ బోరికిఁ బిల్వఁగ మాని నాఁగ ని
ద్ధాత్రిఁ బ్రసిద్ధి కెక్కి బలదర్పసమగ్రుఁడ వైన నీవు నీ
మిత్త్రులుఁగూడ నిట్లయిన మెత్తురె వత్తురె కొల్వ భూపతుల్?" **(విరా. 5.203)**

అర్జునుడిఅధిక్షేపం సభాపర్వంలోని కథార్థాలమీద ఆధారపడి ఉన్నది. సుహృద్ద్యూతానికి పిలిచినా, యుద్ధానికి పిలిచినా క్షత్రియుడు ఎదురొడ్డి యశస్సో మృత్యువో తేల్చుకోవాలికాని రణభూమి వదలిపారిపోకూడదు. ఈ ధర్మాన్ని ఆధారంగా చేసికొని ధర్మజుడిని జూదంలో ఓడించాడు శకుని సాయంతో దుర్యోధనుడు. ఇక్కడ అర్జునుడు యుద్ధానికి పిలిచాడు. కాని దుర్యోధనుడు నిలువలేక పారిపోతున్నాడు. నేతిబీరకాయ తీరుగా వీరుడైన దుర్యోధనుడిని నోరారా ఎగతాళిగా ఎత్తిపొడుపుగా వాక్యాలను ఉదాత్తానుదాత్తాలుగా పలుకుతూ అర్జును డంటున్న మాటలు ఉదారతకు ఊపిరిపోస్తున్నాయి. అవి అధిక్షేపాలే కాని గ్రామ్యాలు కావు. శబ్దగుణాలకు నన్నయ రమణీయతను నేర్పితే, తిక్కన రంజకత్వం అలవరచాడు.

ఈ విధంగా శ్లేష, సమాధి, ఉదారతలు వీర రౌద్ర రసపోషకాలై ఓజస్సుకు అంగాలుగా రాణిస్తాయి. అందులో లీనమౌతాయి.

నన్నయకవితలో ప్రసాదం

ఓజోగుణంతో కూడుకొన్న శిథిలబంధం ప్రసాదం. ప్రసాదం శబ్దగుణమైతే బంధశైథిల్యంవలె కనపడుతుంది. శిథిలబంధంలో కూడా అర్థవైమల్యం అర్థగుణప్రసాదం. ప్రసన్నంగా చెప్పే పద్ధతికి సంబంధించింది శబ్దగుణప్రసాదం. పద్ధతి నాశ్రయించి ప్రతిపాద్యాంశాన్ని ప్రసన్నంచేసేది అర్థగుణప్రసాదం. నన్నయలో శబ్దప్రసాదం ఎక్కువ; తిక్కన్నలో అర్థప్రసాదం అధికం.

చ. "ప్రియహితసత్యవాక్య! యరిభీషణ! కృష్ణ! భవన్నిదేశసం
శ్రయమున నున్న మా కధికశత్రుజయం బగు టేమి పెద్ద? ని
శ్చయముగ నింక మోక్షితుల సర్వమహీశులు; నిమ్మహాధ్వర
క్రమమును సిద్ధిఁ బొందె నయకిల్బిషకీర్తి వెలుంగుచుండఁగన్". **(సభా. 1. 166)**

ఈ పద్యంలో గాఢమైన రచనాబంధం శిథిలమైనట్లు కనపడుతున్నది. ఎందుకొరకు? అది వీరరౌద్రరసభావచర్వణంవలన కలిగే చిత్తవిస్తారంకంటె ఆహ్లాదంవలన కలిగే చిత్తవికాసం వంటి అనుభవాన్ని అందించాలి కాబట్టి. రాజసూయ యజ్ఞ నిర్వహణ ప్రయోగాని కంతా సూత్రధారుడుగా నిలిచిన శ్రీకృష్ణుడినిగురించి కృతజ్ఞతాబద్ధంగా ధర్మజుడు ప్రదర్శిస్తున్న ఆహ్లాదమానసికస్థితికి అభివ్యక్తి ఈ పద్యం. ఇటువంటి రచన నన్నయకు ప్రీతిపాత్రం. ఇది సర్వరససామాన్యమైన రచన.

భారతంలో నాయకుడైన ధర్మజుడి ప్రశంసలుగాని, ప్రసంగాలుగాని సాధారణంగా ప్రసాదగుణభూయిష్ఠాలుగా ఉండేటట్లు నన్నయ రచించాడు. ఆవిధంగా నాయకుడిని ఆశ్రయించుకొని సాగే స్థాయిభావంగాని, తత్పోషకాలైన భావాలుకాని ప్రసాదగుణప్రధానంగా ఉండటం ఔచిత్యమని నన్నయ భావించినట్లున్నాడు. ఉదాహరణకు- ఈ పర్వంలో కొన్నిపద్యాలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

1. పాండవులలో అగ్రజుడైన ధర్మజుడిని రాజసూయయాగం చేయగలిగిన సమర్థుడిగా పాండురాజు పలికినమాటలలో అతని యుధిష్ఠిరత్వం వ్యంగ్యం. ఆ వీరరసమూర్తిని వర్ణించినపద్యం. "అనుపమశక్తిమంతులు......" (సభా.1.90)

2. అర్జునుడు ధర్మరాజును రాజసూయం చేయుమని ప్రశంసిస్తూ చెప్పిన పద్యం వీరరసానుగుణం. "భూభుజులం జయింపుము....." (సభా.1.128)

3. దిగ్విజయానంతరం ధర్మజుడు శ్రీకృష్ణుడిని ప్రశంసించటం "ధారుణీధర! ధర్మతత్త్వనిధాన!......" (సభా. 1.270) భక్తిభావపోషకం.

4. శ్రీకృష్ణుడు ధర్మజుడిని భారతాన్వయభూషణుడిగా ప్రశంసించటం. "పూజ్యుఁడ వెల్లవంశముల భూపతులందును...... (సభా. 1.279)

5. ప్రజలు దర్శించిన రాజసూయయాగదీక్షితుడైన ధర్మజుడిస్వరూపవర్ణన. "సమ్మదమంది చూచిరి...... ధర్మనందనున్" (సభా. 1.290)

6. ధర్మరాజు భీష్ముడిని సభలో పుట్టిన కలకలాన్ని మాన్పు మని ప్రార్థించటం, భయభావం- "ధరణిలోఁ గల రాజు లెల్లను......... (సభా. 2.35)

7. రాజసూయయాగం ముగించిన ధీరుడు ధర్మజుడివర్ణన. (సభా. 2.73) రాజుల ప్రశంస. (సభా. 2.75)

8. ధర్మజుడినిగురించిన శ్రీకృష్ణప్రశంస. (సభా. 2.81)

9. ధర్మజవైభవాన్ని దుర్యోధనుడు ప్రశంసించిన పద్యాలు- (సభా. 2.110, 111)

10. ధర్మరాజువ్యక్తిత్వాన్ని అర్జునుడు ప్రశంసించినపద్యం (సభా. 2.224)

11. ఉదాత్తులవర్ణనలలోనూ, దిక్పాలకాదుల సభలను వర్ణించటంలోనూ నన్నయప్రసాదగుణాన్నే రచనలో పోషించి ఔదాత్యాన్నీ, ఓచిత్యాన్నీ పాటించాడు.

తిక్కనఅర్థగుణమైన ప్రసాదాన్నే ఎక్కువ రమిస్తాడు.

ఉ. "దక్కెను రాజ్యమంచు నకటా! యిటు దమ్మునిభాగ మీక నీ
వెక్కటి మ్రింగఁ జూచె దది యె ట్లగుగున్? విను- మీను లోలతన్
గ్రక్కున నామిషంబుచవి గాలము మ్రింగినచాడ్పునూవె యి
ట్లుక్కివుఁడైన నీకొడుకు నుల్లము నున్నటు లాడఁగూడునే?" **(ఉద్యో. 2.52)**

ఈ పద్యంలో బంధశైథిల్యం ఉన్నా దాన్ని మించిన భావనైర్మల్యం ఉన్నది. ప్రతిపాద్యాంశంకంటె పదరచనాన్ని చూపించి పరవశింపచేసేది శబ్దగుణమైన ప్రసాదం. రచనాన్ని ఆలంబనంగా చేసికొని రమణీయభావాభివ్యక్తిని రమింపచేసేది అర్థగుణ మైన ప్రసాదం. తిక్కన ఉభయగుణ నిర్వహణ ప్రౌఢిని ప్రకటించగల ప్రజ్ఞావంతుడైనా ఉత్తరోత్తరాలు బలీయాలని భావించే అర్థగుణవాది.

ప్రసాదగుణంలో పర్యవసించే గుణం అర్థవ్యక్తి. ఝటిత్యర్థప్రతిపత్తిహేతుత్వం శబ్దగుణమైన అర్థవ్యక్తిలక్షణం. వస్తుస్వభావ తత్వం అర్థగుణమైన అర్థవ్యక్తి. నన్నయ తిక్కనలకు అర్థవ్యక్తి అంటే అలవిమాలిన అభిమానం. ఇరువురికవిత్వాలలోనూ ఈ వ్యక్తిగుణబలంతో ఎన్నో అనర్ఘరత్నాలవంటి పద్యాలు వెలువడ్డాయి. మచ్చు కొక్కొక్కటి- శిశుపాలవధ ఘట్టంలో ధర్మజుడినోట కృష్ణుడి మహత్వాన్నిగురించి నన్నయ పలికించిన పద్యరత్నం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. "ఆదిజుఁడైన బ్రహ్మయుదయంబున కాస్పద మైనవాఁడు, వే
దాది సమస్తవాఙ్మయములందుఁ బ్రశంసితుఁ డైనవాఁడు, లో
కాది త్రిలోకపూజ్యుఁ డని యాత్మ నెఱింగి పితామహుండు దా
మోదరుఁ జెప్పెఁ బూజ్యుఁ డని; యుక్తమ కాకిది యేమి దోసమే?" **(సభా. 2.18)**

కౌరవసభలో శ్రీకృష్ణుడు చేసిన ఉపన్యాసంలో ధర్మరక్షకుడైన భగవంతుడితత్త్వాన్ని గురించి చెప్పిన పద్యరత్నం.

ఉ. "సారపుధర్మమున్ విమలసత్యముఁ బాపముచేతఁ బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁబాఱినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారలచేటగుఁగాని ధర్మని
స్తారకమయ్యు సత్యశుభదాయక మయ్యును దైవ ముండెడున్." **(ఉద్యో. 3.273)**

నన్నయపద్యంలో శ్రీకృష్ణుడే పరమాత్మ డని చెప్పే తాత్పర్యం పండుఒలిచి చేతిలో పెట్టినట్లు చెప్పబడింది. తత్సమపదబహుళంగా, నాతిదీర్ఘసమాససుందరంగా, అర్థగంభీరంగా చెప్పిన ధర్మజుడిమాటలలో ఓజస్సుయొక్క శిథిలబంధం అర్థవ్యక్తిహేతువుగా రాణిస్తున్నది. పితామహుడు, లోకాది, త్రిలోకపూజ్యుడు, ఆత్మ నెఱింగి- అనేమాటలలోని గాఢమైన అర్థాన్ని భావన చేస్తే పురుషోత్తమతత్త్వం తేటపడుతుంది. తిక్కనపద్యంతో పోలిస్తే నన్నయపద్యం శబ్దసుందర మనటంలో అనుమానం లేదు. నన్నయది సార్థకశబ్దప్రయోగం. తిక్కనది సాభిప్రాయశబ్దప్రయోగం. తిక్కనరచనలో శబ్దాలు నన్నయరచనలోకంటె దేశీయముద్రను కలిగిఉన్నాయి. నన్నయకంటె తిక్కన తేటతెలుగుమాటలలో చెప్పటానికి ప్రయత్నించాడు. అందువలన శబ్దంకంటె అర్థం ప్రధానమైన రచనగా అనిపిస్తుంది. ధర్మాన్ని తెలిసిన దక్షులు సారపుధర్మాన్నీ, సత్యాన్నీ రక్షించక ఉపేక్ష చేస్తే వారికి చేటు కలుగుతుందనీ, ధర్మాన్నీ సత్యాన్నీ దైవం తానై పూనుకొని రక్షిస్తుందనీ భారతకథాతత్త్వవ్యంజకంగా పలికాడు శ్రీకృష్ణుడు. ధర్మరక్షాదక్షు డైన దైవంయొక్క స్వభావాన్ని వ్యాఖ్యానించే వాక్యసముదాయం ఇందులో ప్రసన్నంగా ప్రకాశిస్తుంది కాబట్టి అర్థవ్యక్తి అర్థవంతంగా అవతరించింది. నన్నయ తిక్కనల పద్యాలు కలిపి చదువుకొనే తెలుగువారికి అర్థవ్యక్తియొక్క ఉభయశక్తులూ అనుభవంలోకి వస్తాయి. అర్థవ్యక్తి ప్రసాదగుణంలోనే అంతర్భవించగలదు. ఎందువల్లనంటే ప్రసాదానికి అర్థదీప్తిని కలిగించే శక్తి అర్థవ్యక్తి కాబట్టి.

నన్నయకవితలో మాధుర్యం

పరుషగుణాల పోషకశక్తి ఓజస్సయితే, లలితగుణాల రంజకశక్తి మాధుర్యం. సర్వగుణాల దీపకశక్తి ప్రసాదం. ప్రసాదమాధుర్యాలు కవలపిల్లలవంటివి. ఓజఃప్రసాదాలు ప్రాణస్నేహితులవంటివి. మాధుర్యంలో అంతర్భవించే గుణాలు- సౌకుమార్యం, కాంతి, సమత. ఇవి ప్రసాదానికికూడా పోషకంగా నిలుస్తాయి. మమ్మటుడు ప్రధానత్రిగుణాలనుగురించి చెప్తూ ఇట్లా అన్నాడు-

శ్లో. "మాధు ర్యౌజః ప్రసాదాఖ్యా స్త్రయ స్తే న పునర్దశ"
"కేచి దంతర్భవం త్యేషు దోషత్యాగా త్పరేశ్రితాః
అన్యే భజంతి దోషత్వం కుత్రచి న్న తతో దశ" **(కావ్యప్రకాశమ్. 8 ఉల్లాసం. కా. 68, 72)**

మాధుర్యం, ఓజస్సు, ప్రసాదం అనేవి మూడేగుణాలనీ, అందులోనే మిగిలిన కొన్నిగుణాలు అంతర్భవిస్తాయనీ చెప్తూనే, కొన్ని గుణాలు దోషాలను తొలగించటంవలన స్ఫురించేగుణాలేననీ, మరికొన్ని గుణాలుగా చెప్పబడినా వాటిని అట్లాగే గ్రుడ్డిగా వాడితే దోషాలుగాగూడా మారవచ్చు ననీ పేర్కొన్నాడు. దోషనివారణంవలన స్ఫురించేది సౌకుమార్యం. కష్టత్వ, గ్రామ్యత్వాదులు దోషాలు. వాటిని నివారించి నిరూపిస్తే సౌకుమార్యం అవుతుంది. మార్గాభేదత్వం సమత. అయితే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కొన్నిచోట్ల సమత పాటించబడకపోవటంకూడా గుణంగా పరిగణించబడుతుంది. కాబట్టి సౌకుమార్యం, సమత ప్రత్యేకగుణాలుగా కాకుండా ప్రసాదమాధుర్యాలలోని అంతర్భాగాలుగా మాత్రమే గ్రహించా లని మమ్మటాదుల మతం. ఔజ్జ్వల్యం లక్షణంగా కలిగిన కాంతికూడా ప్రసాదమాధుర్యాదులకంటె భిన్నంగా పరిగణించవలసిన అవసరం లేదని మరికొందరు భావిస్తారు. ఏమైనా రసానుభవానుకూల చిత్తవృత్తులను దృష్టిలో ఉంచుకొని గుణత్రయవిభాగం చేసే సంప్రదాయంలో చిత్తద్రుతిని కలిగించేది మాధుర్యం. "గుణానాం చైషాం ద్రుతిదీప్తి వికాసాఖ్యా స్త్రిస్ర శ్చిత్తవృత్తయః క్రమేణ ప్రయోజ్యాః । తత్తద్గుణవిశిష్టరసచర్వణా జన్యా ఇతి యావత్" అని జగన్నాథపండితరాయలు. చిత్తాన్ని కరగింపజేసే గుణం లలితం. అందుకే అది మధురం.

పృథక్పదత్వం శబ్దగుణమాధుర్యం. ఉక్తివైచిత్ర్యం అర్థగుణమాధుర్యం, ఉక్తివైచిత్ర్యం లేకుండా వట్టి పృథక్పదత్వం రసపోషకం కాదు. అందువలన నన్నయ ఈ రెండు లక్షణాలనూ కలిపి మాధుర్యాన్ని కలిగించి మనసును కరిగిస్తాడు. మచ్చుకు ఒక్కపద్యం.

ఉ. "ఇచ్చకు వచ్చుపూజనల నెంతయు సంతసమంది తొల్లి నా
కిచ్చె మునీశ్వరుండు దయ నిత్తనయున్; మఱి యిప్డు నెమ్మితో
నిచ్చితి; వీవు రాక్షసివె? యిక్కుల మెల్లను నుద్ధరింపఁగా
వచ్చిన పుణ్యదేవతవు వారిరుహాయతచారులోచనా!" **(సభా. 1.153)**

రెండుముక్కలుగా పుట్టిన పుత్రుడికి ఒక్కరూపు నిచ్చి వంశాన్ని నిలువబెట్టిన జరను 'నీవు రాక్షసివి కావు మా కులదేవతవు' అని కీర్తించే ఈ పద్యంలో బృహద్రథుడి మాటనేర్పరితనం మనసును కరిగించేదిగా ఉన్నది. ఉక్తివైచిత్రి అపహ్నవాలంకారంవలన కలుగుతున్నది. దానివలన కలిగే అర్థచమత్కారంకంటె పద్యంలోని నడకలో ఒడుపుగా సాగే పృథక్పదాల వినియోగసౌందర్యం పఠితలమనస్సులను ఆకర్షిస్తుంది. "వచ్చిన పుణ్యదేవతవు" అనే అభివ్యక్తి మనసును కరగించే బిందువు. ఆ అనుభూతిని అందుకొనటానికి అనువుగా ద్విత్వచకారప్రాస మూడుమెట్లుగా పనికివచ్చింది. 'వారిరుహాయతచారులోచనా' అనే సంబుద్ధిలో బృహద్రథుడితోపాటు పఠితకూడా ఆర్ద్రుడై రసానుభూతి పొందుతాడు.

ఇటువంటి మధురమైన పద్యాలు నన్నయ్యలో కొల్లలు. లలితరసాలలో నన్నయకవిత మధురమూర్తి.

పృథక్పదత్వంకంటె ఉక్తివైచిత్ర్యం శక్తిమంతంగా ఉంటే- అది అర్థగుణమైన మాధుర్యం అవుతుంది. తిక్కనకవితలో ఈ గుణం అధికం. మచ్చు కొకపద్యం.

క. "ఆ రాజు మాదెసం గల
కారుణ్యము కతమునను సుఖంబున ని ట్లు
న్నారము నినుఁ బుత్తెంచిన
గారవమున నాదుమది వికాసముఁ బొందెన్." **(ఉద్యో. 1.276)**

ఇందులో కాకువువలన ఏర్పడే అర్థవైచిత్రియే అర్థగుణం. శబ్దగుణం అర్థగుణంలో మునిగిపోయినట్లుంది ఈ పద్యంలో. ధర్మరాజు మాటల్లో అతడు చెప్పదలచుకొన్న భావం అంబరంవంటిది. దానికి సూచికలుగా నిలిచే నక్షత్రాలవలె పదాలు వెలుగుతూ ఉంటాయి. శబ్దం వాచ్యార్థా న్నిచ్చి, ప్రతీయమానమైన వ్యంగ్యాన్ని స్ఫురింపచేసి, తనను అప్రధానం చేసికొని ఒదిగిపోతుంది తిక్కనకవితలో. అందువలన పానకంత్రాగిన తరువాత గొంతులో నిలిచిపోయిన మాధుర్యంవలె అర్థగుణమే అనుభవంలో నిలుస్తుంది. ఈ అనుభూతి నందించే తిక్కనరచనకు వివరణ అనవసరం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పదబంధం చెవికి కటువుగా తోపకుండటం శబ్దగుణమైన సౌకుమార్యం. దాన్నే అజరఠత్వం అంటారు. కఠినమైన విషయాన్నిగాని, కరకుగా చెప్పదలచుకొన్న అంశాన్నిగాని చెప్పవలసివచ్చినప్పుడు ఆ కాఠిన్యం, ఆ కరకుదనం స్ఫురించకుండా చెప్పటమే అర్థగుణమైన సౌకుమార్యం. నన్నయతిక్కనలు పాత్రచిత్రణంలో సంభాషణలలో ఈ గుణాన్ని సంజీవనిగా వాడుకొంటారు. మచ్చుకు- దుర్యోధనుడు సభలో చేసిన దుష్కృత్యాలకు అంతఃపురాలలో అపశకునాలు పుట్టాయి. వాటిని చూచి భయపడి గాంధారి విదురుడితో కలసివచ్చి ధృతరాష్ట్రుడితో మొరపెట్టుకొన్నది. అప్పుడు ధృతరాష్ట్రుడు తెలివితో కొడుకును మందలించాడు. ద్రౌపదిని పిలిపించి ప్రశంసించాడు. ఈ ఘట్టంలో నన్నయ సౌకుమార్యాన్ని సలక్షణంగా పోషించాడు. ధృతరాష్ట్రుడు ద్రౌపదితో ఇట్లా అన్నాడు.

క. “సుందరి! నా కోడండ్రుర
యం దభ్యర్హితవు నీవ; యతిముదమున నీ
కొందఁగఁ బ్రియంబు సేసెద
నిందుముఖీ! వేఁడు మెద్ది యిష్టము నీకున్” **(సభా. 2.257)**

అని అన్నాడు. నిండుసభలో అంత జరుగుతున్నా కళ్ళుమూసికొని కూర్చున్న ధృతరాష్ట్రుడూ, దుశ్శాసనుడు లాగుకొనిపోవటానికి వచ్చినప్పుడు ద్రౌపది తనప్రక్కనే నిలిచిఉన్నా పట్టించుకొనక కళ్ళకు పట్టీకట్టుకొని కూర్చున్న గాంధారీ, తమకు కీడు వస్తుందేమో నన్న భయంతో నిష్ఠురా లాడకుండా నెమ్మదిగా నెమ్మిమీర మాట్లాడుతున్నారు. విదురుడు నిష్ఠురంగా చెప్పినా పట్టించుకోని ధృతరాష్ట్రుడు ఇప్పుడు నీతివాక్యాలు పలుకుతున్నాడు. ప్రాణభీతితో పలుకుతున్న మెత్తని మాటలేకాని ప్రేమమీర పలుకుతున్నవి కావు ధృతరాష్ట్రుడివి. ద్రౌపదికూడా ఆ మాటలతీరును గమనించి ఎత్తిపొడిచి పలుకలేదు. మెత్తగానే, చిత్తంలోని నిప్పును కొంగున దాచిపెట్టుకొనే మాట్లాడింది.

ఆ. “కరుణతోడ నాకు వరము ప్రసాదింప
బుద్ధియేని లోకపూజితుండు
మనునిభుండు ధర్మతనయుండు దాస్యంబు
వలనఁ బాయవలయు వసుమతీశ!” **(సభా. 2.259)**

‘దయతో నాకు వర మిచ్చే సంకల్పం నీకు నిజంగా ఉంటే’- అని మొదలుపెట్టిన వాక్యంలో ఎంతటి పారుష్యం ఎంత సుకుమారంగా మారింది! ‘వసుమతీశ!’ అని ధృతరాష్ట్రుడిని సంబోధించి, ఇప్పుడు రాజ్యానికంతా నీవే రాజువు అని అధిక్షేపంగా కాకుండా గౌరవప్రదంగా పలికింది. మాయాద్యూతంవలన లోకపూజితుడు, మనువువంటివాడు, యమధర్మరాజుకొడుకు అయిన ధర్మరాజు దాసుడైనాడు. అది అధర్మం. అతడిని దాస్యంనుండి విడిపించటం న్యాయం. నేను న్యాయబద్ధమైన కోరికను కోరుతున్నాను అని పారుష్యంలేకుండా పలకటమే కాకుండా ప్రతిపదసార్థక్యం గల వాక్యాలతో ఉక్తులను పరమసుకుమారంగా ప్రదర్శించింది. ఇటువంటివి సుకుమారగుణరచనలు.

తిక్కనకూడా నన్నయకు సరితూగేరచనలు చేశాడు సుకుమారగుణంతో. మచ్చు కొకటి. సంజయుడి వాక్యాలలో తిక్కన ఈ గుణం రెక్కలు విచ్చుకొన్నది.

క. “పాలీక కౌరవులు దు
శ్శీలతఁ జెడఁ దలఁచిరేనిఁ జెప్పెద రుధిరా
భీలాన్నంబునకంటెను
మేలగు భిక్షాన్న మైన మీ నడవడికిన్”. **(ఉద్యో. 1.329)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంజయుడి పలుకులకు ధర్మజు డిచ్చిన ధ్రువపత్రమే ఇందుకు సాక్ష్యం.

క. "ఎదు రున్నరూపు పలుకఁగఁ
దుదిఁ గటకటఁ బడవు నీవు; దుర్ణయమును బె
ట్టిదమును రెండును నగు పలు
కొదువదు నీ నాలుకకు నయోన్నత! యెపుడున్". (ఉద్యో. 1.363)

కౌరవులవంటి అర్థాలను కుసుమపేశలంగా నయనీతితో ఆవిష్కరించే నేర్పు నన్నయవలెనే తిక్కన సంజయుడికీ, ధర్మజుడికీ నేర్పాడు. దూషణలుకూడా సౌకుమార్య మనే అర్థగుణంవలన వాగ్భూషలుగా మారటం ఆ గుణంలో ఉన్న విశేషం. మహామంత్రి తిక్కన వాక్యానికి వాడితోపాటు వాల్లభ్యంకూడా నేర్పిన అర్థగుణం సౌకుమార్యం.

శబ్దబంధానికి ఔజ్జ్వల్యాన్ని కూర్చి రసాన్ని పోషించటమే శబ్దగుణమైన కాంతిలక్షణం. దీప్తరసత్వం అర్థగుణమైన కాంతిలక్షణం. నన్నయ ఈ రెండులక్షణాలనూ కాంతిలో కలిపి పోషించినా శబ్దగుణానికే తూకం ఎక్కువగా కల్పిస్తాడు. మచ్చుకొకటి- పాండవు లడవులకు పోయే సమయంలో కుంతీదేవిమాతృహృదయం దుఃఖావేశంతో తురంగలించింది.

మత్తకోకిల.

"వీర లిట్టు లనాథులై మునివృత్తి నుండెడివారె? హా
ద్వారకాపురనాథ! కేశవ! దైత్యభేది! భవత్పదాం
భోరుహాశ్రితు లైన వీరలఁ బూని కావకయుండఁగా
ధారుణీధర! నీకు ధర్మువె ధర్మనిర్మలమానసా!". (సభా. 2.286)

ఇందులో శ్రీకృష్ణుడికి వాడిన సంబుద్ధులన్నీ సార్థకాలై సందర్భోచితంగా ఆమె దుఃఖతీవ్రతకు తోడ్పడ్డాయి. వరుసగా బంధుత్వాన్నీ, పరమాత్మతత్త్వాన్నీ, దుష్టశిక్షణస్వభావాన్నీ స్మరించి 'ఆశ్రితుల యోగక్షేమాలు చూడకుండా ఉండటం న్యాయమా?' అని ఆక్రందించింది. భూతలాన్ని ధరించేవాడా! విష్ణురూపుడా! ధర్మాన్ని నిర్మలంగా భావించే మనసుకలవాడా! ధార్మికులను ధరణీపతులను ఈవిధంగా అనాథులనుగా చేయటం ధర్మమా? అని ఆక్రోశించింది. 'ధర్మో రక్షతి రక్షితః' అంటారే! ధర్మనిర్మలవర్తనులైన పాండవులను రక్షించకుండా ఎందుకు ఊరుకొన్నా? వని అడిగింది. ఈ పద్యంలోని శబ్దా లెంత ముఖ్యమో అర్థం అంత ముఖ్యం. ఔజ్జ్వల్యం రెండింటినీ ఆశ్రయించుకొని ఉన్నది. అయినా సార్థకశబ్దంవలన రచన రూపుకట్టుతున్నది. దీప్తకరుణరసత్వం ప్రసన్నమౌతున్నది. నన్నయ కవితాకాంతివైఖరి ఇది.

తిక్కనలో శబ్దాలు దీప్తరసత్వంలో జలకా లాడతాయి. రససిద్ధితో తిక్కనశబ్దం కరిగిపోతుంది. అందుకే తిక్కనది అర్థగుణప్రధానరచన. కాంతి కొక ఉదాహరణం.

చ. "అరయమిఁ జేసి కోడలన కప్పుడు దాసిగఁ జేసె నమ్మహా
పురుషునిపాలికిం బతులు వోవఁగ వీరలతోన యేను జె
చ్చెరఁ జని కోటరంబు దగఁ జేయుదునో, యటుగాక పాడి మై
వరవుడ మోపి చేయుదునొ వారికి మాధవ! నిశ్చయింపుమా!" (ఉద్యో. 3.112)

సంధికై హస్తినాపురి పోబోతున్న శ్రీకృష్ణుడితో ద్రౌపది అన్నమాట లివి. నిప్పులు మూటకట్టినట్లు వేడిగా ఉన్నమాటలు. ఆత్మాభిమానాన్ని ఉజ్జ్వలంగా వెలిగించే భావప్రకటనం ఈ పద్యప్రాణం. 'ఆ మహాపురుషునిపాలికిన్', 'కోటరంబు' 'పాడిమై' 'వరవుడము' అనే మాటలవేడిదనం ఆమెగూఢామర్షంలో మునిగిపోయింది ఈ రచనలో. తిక్కనతీరు ఇది.

ఒకపద్యంగాని, ఒకఘట్టంగాని ఏమార్గాన ఆరంభించబడుతుందో, ఆ మార్గాన్ని విడువకుండా చివరిదాకా నిర్వహించబడటం శబ్దగుణమైన సమతాగుణలక్షణం, ప్రారంభించిన అర్థంయొక్క పద్ధతి ప్రక్రమంలో భేదంలేకుండా ఉండే అవైషమ్యమే అర్థగుణమైన సమతాగుణం. శబ్దగుణంలో భాగంగా పద్యనిర్మాణశిల్పంలోకూడ సమతను పాటించిన పద్యం-

చ. "అనిలజవాశ్వయుక్త మయి హాటకరత్నవిచిత్రతార్క్ష్యకే
తన మయి మేఘనాద మయి దారుకసారథి యైన దివ్యకాం
చనరథ మెక్కి యాక్షణమ సాత్వతకుంజరుఁ డేఁగె, భక్తి నా
తని ననిచెన్ యుధిష్ఠిరుఁడు దమ్ములు దానును బాదచారి యై." **(సభా. 2.84)**

రథ మెక్కిన శ్రీకృష్ణుడు, అతడిరథంతో కొంతదూరం సమంగా నడిచిన భాతృయుతుడైన ధర్మరాజు ఈ పద్యంలో వర్ణించబడుతున్నారు. నన్నయ వస్తువులోని ఆ సమతను శబ్దగుణంలోకూడ పాటించాడు. యతిస్థానంవద్ద పాదం విరగటం, పాదాల కొసళ్ళు పైపాదాల మొదళ్ళలోకి చొప్పించుకొనిపోవటం, పద్యపూర్వార్ధం రథవర్ణనం, ఉత్తరార్ధంలో చెరిసగం శ్రీకృష్ణధర్మజుల ప్రశంసచేయటంవంటి వృత్తనిర్మాణసామ్యాలు సమతను సమర్థిస్తున్నాయి.

నన్నయ కథాకథనంలోనే కాక సంభాషణలలోకూడ ఎడనెడ సందర్భోచితంగా సమతను పాటించి రసభావాలను పోషించాడు. ఉదాహరణకు విదురుడిని కోపంతో మందలిస్తూ దుర్యోధనుడు అతనిస్వభావంలో పాండవులపట్ల గల అభిమానాన్నీ, తమపట్ల ఉన్న కాపట్యాన్నీ సమతాగుణస్ఫూర్తి గలిగిన సీసపద్యంలో ప్రవచించాడు.

సీ. "పరులగుణంబులు పలుమాఱుఁ గీర్తింతు । పక్షంబ పలుకుదు పాండవులకు
ధార్తరాష్ట్రుల సతతంబు నిందింతువు । కుడిచినచోటికిఁ గూర్ప వెపుడు
నుత్సంగతలమున నుగ్రవిషోరగం । బున్నట్లు నీవు మాయొద్ద నునికి
పరులసంపద సుఖోపాయబలంబునఁ । గొనుట భూపతులకు గుణమ కాదె?

ఆ. యడుగకయును గర్జ మది యిష్టుఁడై చెప్పు । నతని కాడఁ దగినయదియ నన్ను
నిట్టు నట్టు ననఁగ నేల? నీయిమ్ముల । నుండు బుద్ధి సెప్పకుండు మాకు" **(సభా. 2.188)**

దుర్యోధనుడికోపం క్రమక్రమాభివృద్ధి చెందినట్లు సీసపద్యగతిలోని సమతద్వారా తెలుపదలచుకొన్నాడు నన్నయ. పద్యాన్ని మూడుభాగాలు చేశాడు. మొదటి రెండుచరణాలలో సగానికే ఒక్కొక్కవాక్యం- ఆతరువాతిరెండుచరణాలలో చరణాని కొక్కొక్కవాక్యం. ఆ తరువాతి ఆటవెలదిలో నాలుగుపాదాలలో మూడువాక్యాలు అనే రచనాశిల్పాన్ని ప్రవేశపెట్టాడు. చిన్నవాక్యాలతో మొదలైన కోపం పెద్దవాక్యాలతో పెంపొందింది. విదురుడిని మందలించటంలో ఆ సమత మార్గం మారింది. ఈ విధంగా ఒక పాత్రలోని రెండు భావావస్థలకు రెండురకాల వాక్యప్రయోగంలో కానవచ్చే సమతలతో రచించటం శబ్దగుణమైన సమత స్వభావం. అయితే, ఒకే పద్యంలో మూడురకాలైన వాక్యవిన్యాసవైఖరులు ప్రదర్శిస్తున్నప్పుడు అది మార్గాభేదం కా దని కొందరి మతం. కాని, అది అవైషమ్యం ప్రక్రమాభేదం కావచ్చును. దీనిని గమనిస్తే ఈ పద్యం శబ్దగుణసమత కాక అర్థగుణసమతకు ఉదాహరణ మని చెప్పబడుతుంది. ఇటువంటి చిక్కు లున్నాయి కాబట్టి సమతను ప్రత్యేకగుణంగా పరిగణించక ప్రసాదమాధుర్యాలలో అంతర్భవింపజేస్తారు కొందరు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిక్కన రచనలో అర్థగుణ మైన సమత కీ శబ్దగుణ మైన సమత ఎప్పుడూ అంగంగానో, పోషకంగానో ఉండటం గమనిస్తాం. ఉదా॥

సీ. “లీల నా ముందట నా లేమ వొలసినఁ । జూడ్కికిఁ జుబ్బనచూఱ గాదె;
కను విచ్చి నన్ను నా తనుమధ్య సూచినఁ । దనువున కమృతసేచనము గాదె;
చిఱునవ్వు బెరయ నచ్చెలువ నాతోడఁ బ । ల్కినఁ జెవులకు రసాయనము గాదె;
యెలమి నమ్మెలఁత న న్నెలయింపఁ దివిరిన । నెడఁద కానందంబు నిక్కగాదె;

తే. “యా నితంబిని మక్కువ ననఁగి పెనఁగి । యింపుపొంపిరివోవ న న్నేలికొనఁగఁ
దలఁచి పొందిన నది జన్మఫలము గాదె । యనుచు వలరాజుబారికి నగ్గమయ్యె.” **(విరా. 2.86)**

ఈ పద్యనిర్మాణంలో శబ్దగుణ మైన సమత పాటించబడినా మూడవచరణంలో స్వల్పవిపర్యయం సూక్ష్మదృష్టికి గోచరిస్తుంది. అయినా, అది అంత పట్టింపుకు రాదు. కాని, ఇందులో అర్థగుణలక్షణా లైన అవైషమ్యమూ ప్రక్రమాభేదమూ సలక్షణంగా, నిర్వహించబడటం విశేషం. సైరంధ్రి క్రమంగా పొలయుట, చూచుట, పల్కుట, ఎలయింప దివురుట, ఏలికొనుట అనే అనుభవాలవలన కీచకుడు పొందే అనుభవవిశేషాన్ని ప్రక్రమభంగం లేకుండా సుగమం చేసే సమతను తిక్కన శిల్పసుందరంగా, అన్వయబంధురంగా ఇందులో సాధించాడు. తిక్కనదృష్టి అర్థగుణపుష్టిని కల్గించటంలో వ్యగ్రత వహించినంతగా శబ్దగుణసృష్టియందు వ్యామోహాన్ని ప్రకటించ దని దీనివలన స్పష్టమౌతుంది.

కవిత్రయంవారు తెలుగుకవితను గుణవతిగా తీర్చిదిద్దారు. శ్రీనాథుడు ఆమెకు రీతిమాధుర్యాన్ని నేర్పాడు. పోతన భక్తిపారవశ్యాన్ని అలవరచాడు. ప్రబంధకవులు అలంకారవైభవాన్ని అందించారు. నిజానికి మొదట గుణ మున్నప్పుడే మిగిలినవి జీవితంలో పూజాస్థానా లయ్యేవి. ‘గుణాః పూజాస్థానం గుణిషు నచలింగం న చ వయః’ అనికదా లోకోక్తి.

నన్నయ సభాపర్వంలో ప్రదర్శించిన ప్రసన్నకథాకలితార్థయుక్తిని, శబ్దగుణప్రయోగాన్నిగురించీ, అక్షరరమ్యత, నానారుచిరార్థసూక్తులనుగురించీ వ్యాఖ్యానంలో యథావకాశంగా వివరించటం జరిగింది. పాఠకులు వాటినికూడ పరిశీలించ ప్రార్థన.

సభాపర్వం - సందేశం

సభాపర్వంలో ప్రత్యక్షమయ్యే రెండుసభలలోనూ జరిగిన సంఘర్షణాత్మకమైన కథార్థాలను ఉపదేశదృష్టితో సమీక్షించుకొంటే దైవాసురసంపద్విభాగయోగాన్ని దర్శించినట్లు అనిపిస్తుంది. పాండవపక్షం దైవసంపదకూ, కౌరవపక్షం ఆసుర సంపదకూ ప్రాతినిధ్యాన్ని వహిస్తాయి. మానవహృదయమే సభ అయితే, అందులో దైవాసురస్వభావాల సంఘర్షణం సహజస్వభావమైతే, ఆరెండింటిలో దైవీశక్తుల విజయాన్ని సూచించేది మయసభ, ఆసురీశక్తుల విజృంభణాన్ని ప్రదర్శించేది కురుసభ.

భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు “మహాత్మానస్తు మాం పార్థ!, దైవీం ప్రకృతి మాశ్రితాః! భజం త్యనన్యమనసో, జ్ఞాత్వా భూతాది మవ్యయమ్” (9.13) (అర్జునా! మహాత్ములైనవారు దైవీప్రవృత్తి నాశ్రయించి, అన్నిటికీ ఆదినీ, అవ్యయుడనూ అయిన నన్ను తెలిసికొని అనన్య చిత్తంతో సేవిస్తున్నారు) అని దైవీప్రవృత్తుల స్వభావాన్ని పేర్కొన్నాడు. రాజసూయంలో శ్రీకృష్ణుడిని పూజిస్తూ, ‘ఆదిజుడైన బ్రహ్మ యుదయంబున కాస్పదమైనవాడు, లోకాది, త్రిలోకపూజ్యుడని - ఆత్మ నెఱింగి’ పితామహుడు చెప్పగా, దాని నెఱింగి పాండవులు పరమాత్మను సేవించారు. పరమేశ్వరానుగ్రహాన్ని పొందారు. ఆ సభలోనే శిశుపాలాదులు ఆసురీప్రవృత్తిని ప్రదర్శించి చెడిపోయారు.- ‘అవజానంతి మాం మూఢా, మానుషీం తను మాశ్రితం। పరం భావ మజానంతో, మమ భూతమహేశ్వరమ్’ (9.11) (సర్వభూత నియామకుడనై మానవశరీరధారినైన నన్ను మూఢులు తిరస్కరిస్తున్నారు. వారికి నా శ్రేష్ఠత్వం తెలియదు) అనే తాత్పర్యం శిశుపాలుడి ప్రవర్తనలో స్పష్టమైనది. దాని ఫలాన్నికూడా అత డనుభవించాడు. శిశుపాలుడి తరువాత రాజసూయంలో రాక్షసీప్రవృత్తిని ప్రదర్శించినవాడు దుర్యోధనుడు. దైవీవైభవాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చూచి దుఃఖితుడైన దుర్యోధనుడు "మోఘాశా, మోఘకర్మాణో, మోఘజ్ఞానా విచేతసః । రాక్షసీ మాసురీం చైన ప్రకృతిం మోహినీం శ్రితాః" (9.12) (వారి ఆశలు అడుగంటాయి. వారికోర్కెలు గొడ్డుపోయాయి. వారి తెలివి తెల్లవారింది. అట్టివారు మోహకరమైన రాక్షసీప్రవృత్తికిన్నీ, ఆసురీప్రవృత్తికిన్నీ వశులై చెడిపోతారు) అనే తాత్పర్యానికి అచ్చమైన ఉదాహరణంగా నిలిచాడు. శిశుపాలుడు అజ్ఞాని. దుర్యోధనుడు అహంకారి. మోహానికి వీరిద్దరూ బొమ్మా బొరుసులు. వారివిషాదాంతవృత్తాలు లోకానికి వివేకకరదీపికలు!.

భగవద్గీతపదారవఅధ్యాయంలో చెప్పబడిన దైవాసురసంపద్విభాగంలో ఆసురీగుణాలు కలిగినవారి లక్షణాలన్నీ దుర్యోధనుడిలో మూర్తీభవించి ఉండటం గమనిస్తే అతడు కలిఅంశతో జన్మించిన సార్థక్యం స్పష్టమౌతుంది. "ఆత్మ సంభావితాః స్తబ్ధా, ధనమానమదాన్వితాః, యజంతే నామ యజ్ఞై స్తే, దంభే నావిధిపూర్వకమ్." (16.17) "అహంకారం బలం దర్పం, కామం క్రోధంచ సంశ్రితాః । మామాత్మ పరదేహేషు, ప్రద్విషంతోఽభ్యసూయకాః" (16.18) (ఆసురీ ప్రవృత్తి కలవారు అహంకారంతో విర్రవీగుతూ, ధనాభిమానమదాంధులై విధివిధానాలను లెక్కచేయకుండా, డంబంకొరకు పేరుకొరకు యత్నాలు చేస్తారు. అహంకారాన్నీ, పశుబలాన్నీ, దర్పాన్నీ, కామాన్నీ, క్రోధాన్నీ కలిగి, అసూయాపరులై తమయందూ, ఇతరులందరియందూ ఉండే నన్ను తిరస్కరిస్తూ ఉంటారు). అతడి అసూయ వెనుక ఆసురీప్రవృత్తు లుంటాయని శ్రీకృష్ణభవానుడు చెప్పిన లక్షణాలన్నీ మోహరించి ఉన్నట్లు పాండవసంపదను హరించే అతడి దుష్టస్వభావంలో ధ్వనించబడుతూ ఉన్నది.

దైవీప్రవృత్తులు ఆసురీప్రవృత్తులచేత ధిక్కరించ బడినప్పుడు దైవం దైవీప్రవృత్తులను ప్రత్యక్షంగా రక్షించిన దివ్యవృత్తం శిశుపాలవధ ఘట్టం. వెంటనుండి విజయపథంలో నడిపించే ఆచార్యతత్త్వం ప్రకటించిన వృత్తం జరాసంధవధఘట్టం. ఆశ్రితులను పరోక్షంగాకూడా ఆదుకొనే ఆర్తత్రాణపరాయణరూపమైన పరమాత్మమాహాత్మ్యం ప్రదర్శించినవృత్తం ద్రౌపదీమానసంరక్షణ ఘట్టం. పరమాత్మవిభూతిని తెలిసికొనగోరే జిజ్ఞాసువులకు సభాపర్వం వివేకచూడామణి.

సభాపర్వంలోని ధార్తరాష్ట్రుల ప్రవర్తనాన్ని శ్రీకృష్ణభగవానుడి మాటలలో ఈవిధంగా అన్వయించుకొనవచ్చును. ఆ మాట లివి-

శ్లో. "త్రివిధం నరక స్యేదం । ద్వారం నాశన మాత్మనః,
కామః క్రోధ స్తథా లోభః । తస్మా దేతత్త్రయం త్యజేత్." **(భ.గీ.16.21)**

కామ, క్రోధ, లోభా లనేవి నరకానికి మూడుద్వారాలు. వాటివలన మనుష్యుడు సర్వనాశనం చెందుతాడు. కాబట్టి వాటిని పరిత్యజించటం కర్తవ్యం- అని ఆ మాటల తాత్పర్యం. పాండవసంపదను చూచి దాని నేవిధంగానైనా అపహరించాలని పూనుకొన్న దుర్యోధనుడిలో కామం పడగవిప్పింది. పాండవులూ, ద్రౌపదీ తనను జూచి నవ్వా రని అహంకరించి వారిపై ప్రతీకారం తీర్చుకొని అవమానాలపాలు చేయాలనే క్రోధం దుర్యోధనుడిలో విశ్వరూపం తాల్చింది. శత్రుసంపదను హరించటమే కాకుండా వారికి జీవితంలో ఎన్నడూ రాజ్యానుభవసౌఖ్యం లేకుండా చేయాలనే లోభం అతడిలో వికృతనాట్యం చేసింది. ఈమూడుగుణాల సంపుటి దుర్యోధనుడు. అందువలన నరకద్వారాలన్నీ తెరుచుకొన్న జీవనమార్గం దుర్యోధనుడిది.

కామంతో మొదలైన అతడి ప్రస్థానం ఏవిధంగా సాగుతుందో తెలిపేసూత్రం భగవద్గీత ద్వితీయాధ్యాయంలోని సాంఖ్యయోగ కథనంలో శ్రీకృష్ణుడు స్పష్టంచేశాడు.

శ్లో. "ధ్యాయతో విషయాన్ పుంసః । సంగ స్తే షూపజాయతే,
సంగా త్సంజాయతే కామః । కామా త్క్రోధోఽభిజాయతే.
క్రోధా ద్భవతి సమ్మోహః । సమ్మోహా త్స్మృతివిభ్రమః,
స్మృతిభ్రంశాత్ బుద్ధినాశః । బుద్ధినాశాత్ ప్రణశ్యతి". **(భ.గీ. 2.62-63)**

విషయవాంఛలవలన కామం పుట్టుతుంది. దానివలన కోపం సంభవిస్తుంది. కోపంవలన అవివేకం ఆవేశిస్తుంది. దానివలన మతిభ్రమ కలుగుతుంది. దానివలన బుద్ధి నశిస్తుంది. బుద్ధినాశంవలన సర్వస్వం నశిస్తుంది. ఇది దుర్యోధనుడి ప్రస్థానం.

దీనిని పరిత్యజించటమే ఉత్తముల కర్తవ్యం. దుష్టద్యూతంతో మతిభ్రంశం పొంది వ్యవహరించిన దుర్యోధనుడు కురుకులనాశన కారకుడౌతా డని విజ్ఞుడైన విదురుడు ధృతరాష్ట్రుడితో చెప్పటం గమనించదగిన అంశం. కౌరవులు తమ పాపకర్మకు తగినఫలం త్వరలో అనుభవిస్తా రని భీష్ము డనటం మరొక తార్కాణం. సపుత్రకుడైన ధృతరాష్ట్రుడిని ప్రజలు నిందించటం మరొక దృష్టాంతం. దుర్యోధనుడిని త్యజించటానికి ధృతరాష్ట్రుడు ఇష్టపడడు. అతడు మోహావిష్టుడైన జీవివంటివాడు. సత్యధర్మాలను చూడలేని గ్రుడ్డివాడు.

మనలోకూడా ధర్మరా జున్నాడు. దుర్యోధను డున్నాడు. అంతేకాదు విదురుడుకూడా ఉన్నాడు. ఆ సత్యాన్ని మనం గుర్తించాలి. ధర్మాధర్మాలకు సంఘర్షణ జరిగినప్పుడు మనలో వివేకమనే విదురుడు ధర్మబోధ చేస్తూనే ఉంటాడు. దానిని పెడచెవినిపెట్టి మనం ధృతరాష్ట్రులం కారాదు. కామం ఒక్కటే మనలను సర్వనాశనం చేయగలదు. దానికి తోడూ దుశ్శాసనుడనే మదం చేరకూడదు. మదం దుష్టచర్యలను చేయిస్తుంది. ఇక దానికితోడూ కాపట్యంకూడా కలిసి కార్యోన్ముఖమైతే ధర్మం నిలువునా దగ్ధమౌతుంది. లోకహాని ఏర్పడుతుంది. ఆరెండింటికీ కృపణత్వం తోడ్పడితే గాలితోకూడిన అగ్నికి ఆజ్యంతోడైనట్లవుతుంది. సభాపర్వంలో కామం దుర్యోధనుడు, కాపట్యం శకుని, కృపణత్వం (కుత్సితం) కర్ణుడు, మదం దుశ్శాసనుడు. ఈ దుష్టచతుష్టయం కలసినచోట ప్రళయం తథ్యం. అదే సభాపర్వసందేశం.

అయితే, ఈ ఆసురీప్రవృత్తి సమాజంలో విజృంభించినప్పుడు మానవుడి కర్తవ్య మేమిటి? సమర్థులైనవారు, దైవీప్రవృత్తి కలవారు కలిసి ఆసురీప్రవృత్తులను ఎదుర్కొని ధర్మాన్ని రక్షించాలి. విశ్వశ్రేయస్సును సాధించాలి. కురుసభలోవలె ఒక్కొక్కసారి సమర్థులు అసమర్థులై ఉపేక్షిస్తే దైవంమాత్రం చూస్తూ ఊరుకోదు. వారికి తగిన గుణపాఠాన్ని తానే పూనుకొని చెప్పుతుంది. ధర్మాన్ని విజయపథంలో నడిపిస్తుంది - ఉద్యోగపర్వంలో అదే కురుసభలో శ్రీకృష్ణుడు ఈ సత్యాన్ని ప్రకటించాడు.

ఉ. "సారపుధర్మమున్ విమలసత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁబాఱిన దైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారల చే టగుఁ గాని ధర్మని
స్తారక మయ్యు సత్యశుభదాయక మయ్యును దైవ ముండెడున్". **(ఉద్యో. 3.273)**

ఈ సందేశం సభాపర్వంలో ప్రదర్శితమైన సత్యం. కురుక్షేత్రయుద్ధంలో ప్రవర్తిల్లబోయే సత్యం. ధర్మసాధకుడైన మానవుడు ఎప్పుడూ జ్ఞాపకముంచుకోదగిన నిత్యసత్యం!

కవిత్రయమహాభారతం - వ్యాఖ్యానం

తెలుగులో ఆదికావ్యమైన మహాభారతానికి వ్యాఖ్యానం సమగ్రంగా రావటం ఆంధ్రావళికి ఆనందం కలిగించే అంశం. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో అవతరించటంవలన ఇది సారస్వత యజ్ఞగౌరవం పొందింది. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు దీనిని ఒక బృహత్తరధార్మికకార్యంగా భావించి, సర్వాంగసుందరంగా ప్రచురించి, సామాన్యులకుకూడ అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారి వెలుగులపుణ్యం. ఈ పవిత్రమహత్తరప్రయత్నానికి ఏడుకొండలస్వామిపక్షాన బాధ్యత వహించి విజయవంతంగా ముందుకు సాగిస్తున్న మాన్యులు, పుణ్యులు టి.టి.డి. బోర్డు ఛైర్‌మన్, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, సంపాదక సలహామండలి సభ్యులూ, సంపాదక మండలి సభ్యులూ, శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం సంపాదకులూ, వారిసహాయకులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, వివిధరకాలుగా దీనికి తోడ్పడుతున్న అధికార అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతా పూర్వక నమస్సులు. ఈ గ్రంథాన్ని ఆమూలాగ్రం చదివి ఆమోదించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం కంట్రోలర్ ఆఫ్ పబ్లికేషన్స్‌కు ప్రత్యేకకృతజ్ఞతలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటిగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటంగా రూపుదిద్దుకొన్నది. సభాపర్వం విద్వత్సభలలో విశేషంగా చర్చించుకొనే భారతభాగం. ఆకృతికి రెండాశ్వాసాలతో చిన్నదిగా పైకి కనపడుతున్నా లోనారసి చూస్తే జీవితంలోని మూడుపురుషార్థాలకు సంబంధించిన ఎన్నో విషయాలను మథించిన విలువైన పర్వం. నన్నయ తన కవితాకళాశక్తిని రూపకరమణీయంగా, గుణసుందరంగా, తత్త్వగంభీరంగా ప్రదర్శించిన మహత్తరపర్వం. మానవుడిలోని దైవాసురప్రవృత్తులు ఒకదానితో ఒకటి పోటీపడి సంఘర్షించిన సారవంతమైన పర్వం. అంతేకాక ఈ పర్వం భారతకథలో కీలకస్థానం నిర్వహించేది. అందువలన ఇది పరిమాణంలో చిన్నదైనా ప్రభావంలో పెద్దది. అందుకే కొంత విస్తృతమైన పీఠికకూడ అవసరమైనది. అది సరిక్రొత్త సమన్వయాలతో సమకూర్చబడినది. సహృదయులు సాదరంగా సమీక్షించ ప్రార్థన.

తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మప్రచారపరిషత్తు పూర్వాధ్యక్షులు, సద్విమర్శకులు, పండితులు అయిన డాక్టర్ అప్పజోడు వేంకట సుబ్బయ్యగారు సభాపర్వంలోని అనేకాంశాలను పండు ఒలిచి చేతిలో పెట్టినట్లు వ్యాఖ్యానంలో చెప్పారు. వారు ఆదిపర్వంలోని పంచమాశ్వాసం నుండి నాలుగాశ్వాసాలకూ, సభాపర్వంలోని రెండాశ్వాసాలకూ మొదట సరళ గ్రాంథికభాషలో వ్యాఖ్యానం వ్రాశారు. తిరుమల తిరుపతి దేవస్థానంవారి నిర్ణయానుసారం భారత వ్యాఖ్యానం ప్రజల కందుబాటులో ఉండటానికై శిష్టవ్యావహారికంలోకి వారే మార్చి వ్రాశారు. ఈ పర్వాల శుద్ధప్రతిని తయారుచేయటంలో సహకరించిన సంస్కృతాంధ్ర భాషాసాహిత్యకోవిదులు డాక్టర్ అట్లా వెంకటరామిరెడ్డి, డాక్టర్ శ్రీమతి కె. జయశ్రీ, శ్రీ ఎ.వి.బి.కె. శాస్త్రి, శ్రీమతి ఎస్.వి. విజయలక్ష్మి, డాక్టర్ వి. విశ్వనాథయ్య, డాక్టర్ బి. జయరాములుగారలకు నేను కృతజ్ఞుడను. ప్రూఫులు సరిచూడటంలో సహాయపడిన శ్రీమతి జి.లక్ష్మీ విద్యానాథ్, శ్రీమతి జి. సుశీల గార్లకు, డాక్టర్ వెలుదండ నిత్యానందరావు గారికి, భారతంమీద వచ్చిన లఘువ్యాఖ్యలను సేకరించటంలో సహకరించిన డాక్టర్ దంటు హేమలతగారికి, ముద్రణకు అనువైన అక్షరాకృతి నిచ్చిన శ్రీ దత్తసాయి గ్రాఫిక్స్ అధినేత్రి డాక్టర్ జి.యస్.లక్ష్మి గారికి ఆశీస్సులు.

వ్యాఖ్యాతలు చెప్పిన అంశాలకు మరికొన్ని విశేషాంశాలు చేర్చి ప్రతి సంపుటికీ ఒక పీఠికను కూర్చి, వీలైనంత సమగ్రతను, ఏకవాక్యతను, కథార్థ ప్రసన్నతను, కావ్య శిల్పతత్త్వ సమన్వయాన్నీ సంతరించి, ఎక్కువమంది సహృదయులకు సమ్మోదాన్ని కలిగించే దిశగా సంపాదకుడి కృషి సాగింది. ప్రతిపదార్థ తాత్పర్యాలు సరళసుందరంగా సాగాలనీ, విశేషాంశాలు వివేకచూడామణులుగా ప్రకాశించాలనీ భావించి రూపొందించటం జరిగింది. ఇది ప్రబంధవ్యాఖ్యలవంటిది కాదు; ప్రసన్నవ్యాఖ్యమాత్రమే!

భక్తజనకల్పద్రుమమైన భద్రమూర్తి పద్మావతీసహిత శ్రీ వేంకటేశ్వరస్వామివారు ధర్మద్రుమమైన ఈ భారతవ్యాఖ్యకు ప్రభువు. ఆస్వామి సత్య శివ సుందరమైన దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యా సంపుటిని వాఙ్మయారాధనలో పుణ్యపూజాకుసుమమంజరిగా సమర్పించుకొంటున్నాను!

హైదరాబాదు
బహుధాన్య సంక్రాంతి
15-1-1999

జి.వి.సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు
కవిత్రయమహాభారతంప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సభాపర్వకథాసారం

శ్రీకృష్ణుడి కోరికపై మయుడు ఒక అపూర్వమైన సభను నిర్మించి పాండవులకు సమర్పించాడు. ఒక శుభముహూర్తాన పాండవు లందులో ప్రవేశించారు. దిక్పాలకుల సభలకంటె, బ్రహ్మసభకంటె, మయనిర్మితమైన సభ మహిమాన్వితమైన దని నారద మహర్షి ప్రశంసించాడు. ఆ సందర్భంలో పాండురాజాదులు యమసభలో ఉన్నా రనీ, హరిశ్చంద్రుడు ఇంద్రసభలో ఉన్నా డనీ నారదుడు ప్రస్తావించాడు. పరమధర్మాత్ముడైన పాండురాజు యమసభలో ఉండటానికీ హరిశ్చంద్రుడు ఇంద్రసభలో ఉండటానికీ కారణమేమిటని ధర్మరాజు నారదుడి నడిగాడు. హరిశ్చంద్రుడు రాజసూయయాగం చేయటంవలన ఆ యోగాన్ని పొందాడనీ, పాండురాజు ధర్మరాజును రాజసూయంచేసి తనకూ పితృగణానికీ ఇంద్రసభా నివాససౌఖ్యాన్ని కల్పించుమని కోరుతున్నాడనీ తెల్పాడు. అంతటితో ఆగక ఆ మహర్షి ధర్మజుడిని రాజసూయయాగం చేయుమని ప్రోత్సహించాడు. రాజసూయంవలన ప్రజలు పుణ్యాత్ము లౌతారనీ, దానివిఘ్నంకొరకు బ్రహ్మరాక్షసులు ప్రయత్నిస్తారనీ, అది నిర్విఘ్నంగా పూర్తిఅయితే ప్రజాప్రళయం జరిగే మహాయుద్ధం జరుగుతుం దనికూడా పేర్కొన్నాడు. ధర్మరాజు తమ్ములతో మంత్రులతో యోచించి రాజసూయం చేయా లని సంకల్పించాడు. ధర్మరాజు శ్రీకృష్ణుడిని ఇంద్రప్రస్థానికి పిలిపించుకొని, రాజసూయం చేయటానికి ఆశీస్సుల నర్థించాడు. శ్రీకృష్ణుడు రాజసూయం నిర్వహించే యోగ్యత ధర్మరాజుకు అన్ని విధాలా ఉన్న దని నిర్దేశించి, జరాసంధుడినీ, అతడికి ఆసట బాసటగా నిలచి ఉన్న శిశుపాలుడినీ, హంసడిభకులనూ సంహరించనిదే రాజసూయయాగం నిరాటంకంగా సాగ దని సూచించాడు.

ధర్మజరాజసూయం

గిరివ్రజపురాన్ని రాజధానిగా చేసికొని, చండశాసనుడుగా పాలిస్తూ, భరతవర్షంలో మూర్ధాభిషిక్తులైన రాజులనందరినీ బంధించి, రోజు కొక్కడిని భైరవుడికి బలియిస్తూ సమకాలీన రాజలోకంలో సింహస్వప్నంగా దాపురించాడు జరాసంధుడు. అతడికి ఆయుధాల వలన చావు లేదు. అట్లాగే హంసడిభకులకుకూడా. శిశుపాలుడు నూరు తప్పులు చేసేంతవరకు ఎవరూ ఏమీ చేయలేరు. అపార సేనతో జరాసంధుడు శ్రీకృష్ణుడినికూడా బాధించాడు. అతడు మధురను వీడి మరోచోటికి ఎన్నోసార్లు పోవలసి వచ్చింది. అటువంటి జరాసంధుడిని భీము డొక్కడే చంపగలడు. అందువలన శ్రీకృష్ణుడు భీమార్జునులతో కలిసి బ్రాహ్మణవేషాలతో గిరివ్రజానికి వెళ్లి ద్వంద్వయుద్ధంలో జరాసంధుడిని భీముడిచేత చంపించే పథకాన్ని వేశాడు. శ్రీకృష్ణుడిమాట పాండవులకు శిరోధార్యం. శ్రీకృష్ణ దర్శకత్వంలో భీముడు జరాసంధుడిని ద్వంద్వయుద్ధంలో చంపాడు. బందీలుగా ఉన్న వేలాది భూపతులను విడుదల చేయించాడు. శ్రీకృష్ణుడు గిరివ్రజానికి జరాసంధుడి కుమారుడైన సహదేవుడిని రాజును చేశాడు. విముక్తులైన రాజులనందరినీ వెంటపెట్టుకొని భీమార్జునశ్రీకృష్ణులు ఇంద్రప్రస్థపురం చేరారు. ధర్మరాజు ఆ రాజులకు వారి వారి రాజ్యాలిచ్చి సగౌరవంగా పంపాడు. శ్రీకృష్ణుడికి కృతజ్ఞతాంజలి సమర్పించాడు.

రాజసూయానికి ముందు జరాసంధసంహారం ఒక విజయారంభం అయింది. ధర్మరాజు నలుగురుతమ్ములనూ నాలుగు దిక్కులూ జయించటానికి పంపాడు. భీమసేనుడు తూర్పుదిక్కున నున్న రాజులను నిరాఘాటంగా సాధించాడు. అర్జునుడు ఉత్తరదిశపై దండెత్తి విజయాన్ని కరతలామలకం చేసికొన్నాడు. నకులుడు పశ్చిమ దేశ ప్రభువులను పాదాక్రాంతులను చేసికొన్నాడు. సహదేవుడు దక్షిణదిగ్విజయాన్ని దక్షతతో నిర్వహించాడు. నాలుగు దిక్కులనుండీ అపారధనరాసులు తెచ్చి ధర్మరాజుకు సమర్పించారు భీమాదులు. రాజసూయానికి కావలసిన సంపద చేకూరింది. శ్రీకృష్ణుడిఅనుమతి తీసికొని ధర్మరాజు యాగానికి సన్నాహాలు ప్రారంభించాడు. సహదేవుడిని సకలసన్నాహాలకూ సారథిగా నియమించాడు. నకులుడిని హస్తినాపురానికి స్వయంగా పంపి భీష్మాదులనందరినీ సగౌరవంగా ఇంద్రప్రస్థానికి రప్పించాడు. ధృతరాష్ట్ర దుర్యోధనాదులను కలుపికోలుతనంతో గౌరవించాడు. దక్షిణలిచ్చే నిర్ణయం కృపాచార్యుడి కిచ్చాడు; కృతాకృతనిర్ణయాధికారాన్ని భీష్మద్రోణులకు వప్పచెప్పాడు. వస్తువ్యయభారాన్ని విదురుడి చేతుల్లో ఉంచాడు. నానా దేశాల నుండి వచ్చే రాజులు తెచ్చే విలువైన కానుకలను గ్రహించే పరువైన బాధ్యతను దుర్యోధనుడి కిచ్చాడు. భక్ష్యభోజ్యాదివినియోగపర్యాలోకనాన్ని దుశ్శాసనుడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కందించాడు. ఇట్లా అందరికీ అన్నిబాధ్యతలు ఇచ్చి, ధర్మరాజు తాను యజ్ఞదీక్షితుడై యజమాని చేయవలసిన కార్యక్రమాలను ఆరంభించాడు. యజ్ఞం మహేంద్రవైభవంగా సాగింది; అఖిల జనాలకు ఆనందాన్ని కలిగించింది.

శిశుపాలవధ

రాజసూయయాగం జరిగిన విధానాన్ని చూచి కురువృద్ధుడు భీష్ముడు ఉప్పొంగిపోయాడు. ధర్మరాజును ఆప్యాయంగా దగ్గరికి పిలిచి ఇట్లా బోధించాడు: 'మహాయజ్ఞం మహాత్ముని పూజతోకాని పరిపూర్ణం కాదు. స్నాతకుడైనా, ఋత్విజుడైనా, సద్గురుడైనా, సన్మిత్రుడైనా, భూతలేశుడైనా, సంయమీంద్రుడైనా - వీరిలో ఎవరినైనా ఒక్కరిని ఉత్తముడిని ఎన్నికచేసి పూజించుము; యజ్ఞఫలాన్ని పొందుము' - అని నిర్దేశించాడు. 'తాతా! అట్టివా డెవ్వడో నీవే నిర్ణయించి చెప్పాలి' అని ధర్మరాజు అర్థించాడు. పితామహుడు చిరునవ్వు నవ్వి. ఒకతన్మయభావంతో ఇట్లా అన్నాడు 'యుధిష్ఠిరా! సూర్యచంద్రులు ఎట్లా తమకాంతి కిరణాలతో లోకాలను వెలిగిస్తు ఉన్నారో, అట్లాగే తనదివ్యతేజంతో మనలనందరినీ ఆనందపరవశుల్ని చేస్తున్న ఆ పుండరీకాక్షుడు, ఆ అనాది నిధనుడు, ఆ అబ్జనాభుడు ఈ కృష్ణుడు మన మధ్య ఉన్నాడు. ఆ అచ్యుతుడిని పూజించి, యజ్ఞపురుషుడిని పూజించిన అమృతఫలాన్ని పొందుము'.

భీష్ముడిమాటలు ధర్మరాజు శిరసావహించాడు. సహదేవుడు పూజాపాత్రలను తేగా ధర్మతనయుడు విధివిధానంగా వాసుదేవుడిని అగ్రాసనంమీద కూర్చుండపెట్టి అర్ఘ్యాన్ని ఇచ్చాడు. దానికి శిశుపాలుడు ఆగ్రహించాడు. నిండుసభలో పెద్దగా అధిక్షేపించటం ఆరంభించాడు.

'ధర్మరాజా! పూజించదగిన రాజులు, ద్విజులు, పూజ్యులు ఇంతమంది ఈ సభలో కొలువుదీరి ఉంటే ఈ గాంగేయుడు ఏదో నెపంతో ఈ కృష్ణుడిని పూజించమంటే, వెంటనే పూజించి నీ అవివేకాన్ని ప్రకటించుకొన్నావు. నిజంగా దాశార్హుడు పూజార్హుడా? సభలలో ధర్మతత్త్వాన్ని నిరూపించి చెప్పటం సాధ్యంకాని పని. భీష్ముడు వెర్రితనంతో ధర్మబాహ్యుడైన కృష్ణుడిని పూజించుమని చెప్పాడు. వృద్ధుల బుద్ధులు సంచలించటంలో ఆశ్చర్యం లేదు. ఇష్టముంటే కానుక లిచ్చుకొనవచ్చును కాని, పలువురు పెద్దలున్న సభలో అయోగ్యుడిని యోగ్యుడిగా ప్రకటించి పూజించటం న్యాయం కాదు. కృష్ణుడు ఏ విధంగా అర్హుడైనాడు? వృద్ధు డందామా సభలో అతని తండ్రి వసుదేవు డున్నాడే? ఋత్విజు డని గౌరవిద్దామా ఎదురుగా వేదవ్యాసు డున్నాడే? ఆచార్యు డందామా అరుగో కృపాచార్యులూ, ద్రోణాచార్యులూ, భూనాథు డందామా ఈసభలో ఎందరో ప్రభువులూ ఉన్నారు. యుధిష్ఠిరుడు యోగ్యు డని భావించి మే మందరమూ ఈ యజ్ఞానికి వచ్చాం. ఇట్లా భీష్ముడు చెప్పిన మాటలు విని మమ్మల్ని అవమానిస్తా వని ఊహించలేకపోయాం. ఒకవేళ నీవు తెలియక అర్ఘ్య మిచ్చినా, తగుదునమ్మా అని ఈ గోవిందు డెట్లా గ్రహించాడు?' - అంటూ ధర్మజ భీష్మ శ్రీకృష్ణులను నిందిస్తూ పుత్రమిత్రులతో కలిసి సభను వీడి బయటకు నడిచాడు శిశుపాలుడు.

యజమానియైన ధర్మజుడు నయవినయవాక్యాలతో శిశుపాలుడిని సమాధాన పెట్టటానికి ప్రయత్నం చేశాడు. 'ఉత్తములకు వాక్పారుష్యం చెల్లుతుందా? విషంకంటె, దహనంకంటె అది ఎంతో దారుణం. పితామహుడు దామోదరుడు పూజ్యు డని చెప్పాడు. బ్రహ్మోత్పత్తికి మూలమైనవాడు, వేదాది సమస్త వాఙ్మయాలలో ప్రశంసితుడైనవాడూ, లోకాలకు ఆదియైనవాడూ త్రిలోక పూజ్యుడు అయిన అచ్యుతుడే ఈ కృష్ణు డని తాతగారు ఆత్మలో దర్శించి చెప్పారు. ఇది ఒప్పుగాక తప్పెలా అవుతుంది? అదీకాక మహాత్ముల చరిత్రలు అల్పులకు అర్థం కావటం కష్టంకూడా. నీకంటె పెద్దలందరు తమందరికంటె పెద్దగా శ్రీకృష్ణుడిని గౌరవిస్తుంటే, నీ వభ్యంతరం చెప్పటం ఉచితమా?' అని శిశుపాలుడిని ధర్మజుడు మందలించాడు.

శిశుపాలుడి మాటలకు భీష్ముడు మండిపడ్డాడు. 'అవినయపరుడైన శిశుపాలుడు బాలుడు. అజ్ఞాని, ధర్మరాజా! వాడి నెందుకు నీవు అనునయించటానికి యత్నిస్తావు? రాగకోపాలతో పరిభవించబడిన మనస్సుకలవాడూ, స్వల్పరాజ్యలక్ష్మివలననే కన్నులు తలకెక్కినవాడు, నిష్కారణంగా ఇతరులతో తగాదాలకు దిగేవాడైన శిశుపాలుడికి ధర్మ మిది అని తెలిసికొనే వివేకం ఉండటానికి వీలుందా?'-అని ధర్మరాజును వారించి శిశుపాలుడితో ఇట్లా నిష్ఠురంగా పలికాడు. 'శిశుపాలా! నీవు మూర్ఖుడవురా.

అవినయబుద్ధితో హరికి అర్పిస్తున్న అర్ఘ్యాన్ని అయోగ్య మని నిందించావు. నేను వేరే చెప్పవలెనా? ఈ సభలో ఉన్నవారందరూ ఆతడి దయచేత పరిముక్తులైనవారే. అతడి శరణార్థులే, బాలుడైనా, జ్ఞాని అయితే బ్రాహ్మణులలో పూజ్యుడు; విక్రమంలో అధికుడైతే క్షత్రియులలో పూజ్యుడు. గోవిందుడియందు ఈ రెండుగుణాలూ ఉన్నాయి. అతడు వయోవృద్ధు డని కాదు గుణవృద్ధు డని పూజించాలి' అని మందలించాడు.

సహదేవుడు శిశుపాలుడిఅవినయవర్తనానికి ఆగ్రహించాడు. 'మేము అచ్యుతునికి అర్ఘ్యమిచ్చాం. దీనికి అంగీకరించని దుర్మార్గుల శిరస్సులమీద ఇదుగో నా పాదాన్ని ఉంచి తగినశాస్తి చేస్తాను' అని సహదేవుడు పాదాన్ని ఎత్తి ఝళిపించాడు. సభాసదులు కిమ్మనకుండా సద్దుమణిగి కూర్చున్నారు. దేవతలు పూలవాన కురిపించారు.

ఆ తరువాత శిశుపాలుడు కొందరురాజులను కూడగట్టుకొని ససైన్యంగా ధర్మరాజుయజ్ఞంపై దాడిచేయ యత్నించాడు. యజ్ఞదీక్షితుడైన ధర్మజుడు భయసంభ్రమాలతో భీష్ముడివైపు చూచాడు. శ్రీకృష్ణు డున్నంతవరకు భయ మేమీ లే దని పితామహుడు ధైర్యం చెప్పాడు. ఆ మాటలు విని శిశుపాలుడు భీష్ముడిని పరుషవచనాలతో నిందించాడు; 'శ్రీకృష్ణుడు పరమేశ్వరుడా?' అని అవహేళనం చేశాడు. అతనివీరగాథలను పేర్కొని అధిక్షేపం చేశాడు. ఆ విధంగా ఇచ్చవచ్చినట్లు ప్రేలుతున్న శిశుపాలుడిని చూచి భీముడు రౌద్రోద్రేకుడైనాడు. పండ్లు పటపటా కొరుకుతూ అతడిని చంపటానికి ఉద్యుక్తుడైనాడు. అప్పుడు భీష్ముడు భీముడిని వారించి శిశుపాలుడిని చంపవలసినవాడు శ్రీకృష్ణుడే నని వానిజన్మగాథ చెప్పి, నూరునేరాలవరకు హరి అతడిని సహించి ఊరుకుంటా డనీ, ఆ తరువాత అతని చావు ఆయన చేతులలో తప్ప దనీ వివరించాడు. ఆ మాటలు విని శిశుపాలుడు శ్రీకృష్ణుడితో ముఖాముఖిగా నిలిచి ద్వంద్వయుద్ధానికి ఆహ్వానించాడు. శ్రీకృష్ణుడు - శిశుపాలుడు చేసిన నూరుతప్పులను ఏకరువు పెట్టి అందరికీ తెలియచెప్పి, ఇక శిశుపాలుడు క్షమార్హుడు కా డని నిరూపించి, సుదర్శనచక్రంతో అతడి శిరస్సును ఖండించాడు. శిశుపాలుడి శరీరంలో నుండి ఒక వెలుగు లేచి వెలుగుల కన్నింటికి వెలుగైన శ్రీకృష్ణుడిలో లీనమయిపోయింది. సభాసదు లందరు ఆశ్చర్యమగ్ను లయ్యారు; జయజయనినాదాలు చేశారు.

మయసభ: సుయోధనుడిఅసూయ

రాజసూయయాగం నిర్విఘ్నంగా నారాయణుడిదయవలన పరిసమాప్తమయింది. బంధుమిత్రులు ఒక్కరొక్కరే తరలి వెళ్లటం మొదలయింది. శ్రీకృష్ణుడు ద్వారకకు పయనమైపోయాడు. ధృతరాష్ట్రాదులు హస్తినకు తిరిగి వెళ్లారు. దుర్యోధనుడు, శకుని మాత్రం మయసభావైభవాన్ని చూడటానికై కొన్నాళ్ళు ఇంద్రప్రస్థంలో ఆగారు. సుయోధనుడు మయసభాశిల్పరమణీయ కల్పన లన్నింటిని చూస్తూ విహరిస్తున్న తరుణంలో మిట్టలు జలాశయాలుగా, జలాశయాలు మిట్టలుగా, ద్వారాలు కుడ్యాలుగా, కుడ్యాలు ద్వారాలుగా గోచరించే విచిత్రశాలలో తిరుగుతూ ద్వార మని భావించి కుడ్యాన్ని ఢీకొనటం, మిట్టలని భావించి నీటిలో పడటం జరిగింది. అప్పుడు పాంచాలి, పాండుకుమారులు నవ్వారు. ధర్మరాజు దివ్యాంబరాలను, భూషణాలను దుర్యోధనుడు ధరించటానికి భీముడి ద్వారా పంపాడు. నకులసహదేవులను త్రోవచూపటానికి పంపాడు. ఆ విధంగా జరిగిన సభాప్రలంభనం దుర్యోధనుడికి సహించరాని అవమానంగా హృదయాన్ని బాధించింది. అతడు లజ్జతో పాండవులను వీడ్కొని హస్తినాపురం చేరాడు.

ధర్మరాజు చేసిన రాజసూయం అందరికీ సంతోషాన్ని కలిగించింది. కాని, దుర్యోధనుడిలో అసూయ రగిలించింది. సకలజన నయనానందాన్ని కలిగించిన పాండవ సభాలక్ష్మి ఆ సుయోధనుడికి మాత్రం గుండెలలో మంటలు పెట్టినట్లు బాధించింది. రాజధానికి తిరిగి వచ్చాడే కాని రారాజు కంటినిండా నిద్రపోలేదు. పాండవులపై పాపచింతతో, అన్నిభోగాలూ వదలి, దిగులుతో రోజులు గడుపసాగాడు. శకుని దానిని గమనించి దుర్యోధనుడిని ఏకాంతంగా ఊరడించటానికి వచ్చాడు. దుర్యోధనుడు తనబాధ బయటపెట్టుకొన్నాడు.

'మామా! మయుడు నిర్మించి పాండవుల కిచ్చిన సభను నీవుకూడా చూచావు కదా! ఏ యుగంలోనూ, ఏ లోకంలోనూ దానివంటి వైభవం వినపడదు, కనపడదు. దానితో ధర్మరాజు సూర్యతేజంతో వెలిగిపోతున్నాడు. అదేమి ఆశ్చర్యమో భూతలంమీది ప్రభువులందరూ ధనరాసులను కానుకలుగా తెచ్చి ధర్మరాజుకు భృత్యుల్లా చెల్లించారు. పాండవుల పరాక్రమం, ధర్మరాజు ప్రభుత్వం భూమిమీద స్థిరపడ్డాయి. అపార పరాక్రమార్జితమైన పాండవమహాలక్ష్మిని చూచి నేను

సహించలేకపోతున్నాను. అభిమానధనులైనవారు జ్ఞాతుల అభివృద్ధిని చూచి సహించగలరా! కాబట్టి ఏ విధంగా ఆ పాండవలక్ష్మిని అపహరించటానికి వీలౌతుందో యోచించాలి' - అని ఆవేదన వ్యక్తంచేశాడు.

దుర్యోధనుడి దురాలోచనకు ధృతరాష్ట్రుడి అనుమతి సాధించా లని శకుని అతడిని ధృతరాష్ట్రుడివద్దకు తీసికొని పోయాడు. దుర్యోధనుడు తనమనోవేదనను తండ్రిముందు చెప్పుకొన్నాడు. రాజు లిచ్చిన కానుకల నన్నిటినీ తానే స్వయంగా లెక్కించాడు. ధర్మరాజు సంపదల నంచనా కట్టాడు. కాబట్టి వాటన్నింటి విలువలనూ చెప్పి వాపోయాడు. గతంలోనూ, భవిష్యత్తులోనూ, వర్తమానంలోనూ పాండవలక్ష్మీవైభవంతో సరితూగే సంపదను ఎన్నడూ చూడలే దనీ, దాని నిప్పుడు చూస్తూ తాను సహించి ఉండటంకూడా కష్ట మనీ, అందువలననే క్రుంగి కృశించిపోయినా ననీ తండ్రిముందు చెప్పుకొన్నాడు.

'అవభృథస్నానానంతరం ధర్మరాజు ఉన్నతసింహాసనంమీద కూర్చున్నాడు. సాత్యకి ముత్యాలగొడుగు పట్టాడు. భీమార్జునులు చామరాలు వీవసాగారు. నకులసహదేవులు ధృష్టద్యుమ్నుడు శ్రీకృష్ణుడు మూర్ధాభిషిక్తులైన రాజు లందరిచేత అతడి పాదాలకు మ్రొక్కించారు. ఆ మహారాజు వైభవం చూచి మే మందరం చిన్నబోయాం. మమ్మల్ని చూచి శ్రీకృష్ణ పాండునందన ద్రౌపదీ సాత్యకులు నవ్వారు. ధర్మజు డారాజ్య వైభవాన్ని అనుభవించడం నేను సహించలేను'- అని దుర్యోధనుడు పలికాడు. 'అనుమతిస్తే ఆ సంపదనంతా మాయాద్యూతనెపంతో అపహరించి దుర్యోధనుడికి ఇస్తా'నని శకుని సూచించాడు. శకుని ఉపాయానికి అంగీకరించు మని తండ్రిని బలవంతపెట్టాడు దుర్యోధనుడు. అంగీకరించకపోతే అగ్నిలో పడి ఆత్మాహుతి చేసికొంటా నని బెదిరించాడు. పుత్రవ్యామోహంతో ధృతరాష్ట్రుడు శకుని వ్యూహానికి తలఊపాడు.

మాయాద్యూతం

హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు వేయిమంది శిల్పులను పిలిపించి ఒక విచిత్ర మణిమయమహాసభను నిర్మించాడు. దానిలో మాయాద్యూతం జరిపించా లని నిర్ణయించి విదురుడికి చెప్పాడు. విదురుడు జూదంవలన కలిగే ఆపదలను పేర్కొని, దుర్యోధనాదులను ఆ ప్రయత్నంనుండి విముఖులయ్యేటట్లు ప్రయత్నించు మని ధృతరాష్ట్రుడిని హెచ్చరించాడు. గ్రుడ్డిరాజు ఏ విధంగానైనా జూదం జరగా లనీ, ఎటువంటి కీడులూ జరగకుండా పెద్దలు చూడా లనీ చెప్పి, పాండవులను తీసికొని రావటానికి విదురుడిని ఇంద్రప్రస్థపురానికి రథాలతో పంపాడు. విదురు డీసంగతి భీష్ముడికి నివేదించి బయలుదేరాడు.

మహేంద్ర వైభవంతో ఉన్న ధర్మరాజును విదురుడు దర్శించాడు. ధృతరాష్ట్ర సందేశాన్ని వినిపించాడు. నూత్న సభాసందర్శన సందర్భంలో సుహృద్ద్యూతం సమంజసం కా దనీ, అది కలతలకు దారి తీస్తుం దనీ ధర్మజుడు భావించాడు. కాని, పెదతండ్రి ఆనతిని శిరసావహించి భీమాదులను ద్రౌపదిని, ధౌమ్యాదులను వెంటబెట్టుకొని బయలుదేరి హస్తినాపురికి చేరాడు.

మణిమయమహాసభను దుర్యోధనుడు చూపగా ధర్మజుడు దర్శించి హర్షించాడు. ఆ తరువాత రారాజు ద్యూతానికి ఆహ్వానించాడు ధర్మరాజును. ద్యూతంవలన కలిగే కీడును పేర్కొని ధర్మరాజు ఆ ఆహ్వానాన్ని వారించాడు. శకుని కల్పించుకొని ఆట నేర్చినవారే దానిని నిందిస్తే ఆ కళ ఏమైపోతుం దని చమత్కరించి, ధర్మజుడు జూదమాడటానికి భయపడితే ఆడవలసిన అవసరం లే దని అధిక్షేపించాడు. ధర్మజుడు ఆ మాటకు నొచ్చుకొన్నాడు. 'బలవంతంగా జూద మాడించటానికి పిలిచిన తరువాత వెనుకాడటానికి వీలౌతుందా?' అని అంటూ విధిప్రేరితుడై మాయాద్యూతానికి ఉన్ముఖుడైనాడు.

జూదంలో తన పక్షాన శకుని ఆడతా డనీ, అత డొడ్డిన ధనరాసులు తాను చెల్లిస్తా ననీ రత్నరాసులు కుప్పలు పోసి దుర్యోధనుడు ముందుకు వచ్చాడు. 'ఇతరులకొరకు జూదం ఆడటం అసమంజసం' - అని అంటూనే ధర్మరాజు సాగరావర్త సంభవాలైన మణిరాసులను ఒడ్డాడు. సుహృద్ద్యూతం ఆరంభమయింది. భీష్మ ధృతరాష్ట్ర విదుర కృప ద్రోణాశ్వత్థామాదులు సముచితాసనాలలో కూర్చొని జూదాన్ని పరికిస్తున్నారు.

శకుని మాయావిదుడు. అందువలన పాచికలతో కావలసిన పందాన్ని జయప్రదంగా వేయగలడు. దానితో వరుసగా పందాలు శకుని గెలుచుకొంటున్నాడు. ధర్మరాజు ఓడిపోతున్నాడు. అట సాగే కొద్దీ ధర్మరాజుకు పంతంకూడా పెరిగింది. ఒక ఒడ్డుకు సువర్ణ భాండాగారాలు పెట్టి ఓడిపోయాడు. మరొక పందానికి రత్న భాండాగారాలను కోల్పోయాడు. ఇంకొకసారి చతుశ్శతనిధులను, మరొకసారి గుర్రాలను, ఏనుగులను, పరిచారికలను, పరిచారకులను ఇలా క్రమంగా ఉన్న సంపదనంతా, చివరకు రాజ్యాన్నికూడా మాయాద్యూతంలో చేజార్చుకొన్నాడు. విదురు 'డా కపటద్యూతాన్ని అంతటితో ఆపించు' మని ధృతరాష్ట్రుడిని కోరుకొన్నాడు. కాని, అతడు పుత్రవ్యామోహంతో కిమ్మనకుండా మిన్నకున్నాడు.

అప్పుడు విదురుడు దుర్యోధనుడిని ఇలా మందలించాడు: 'అన్యాయంగా, శకునిమాయతో, పాపమతివై జూదంలో పాండవుల సంపదలను ఇట్లా మోసంతో సంగ్రహించటం న్యాయమా? పాండవులు పరాక్రమాన్ని ప్రకటించి సంపాదించుకొన్నారు సంపదను; మీరు మోసంచేసి దోచుకొంటున్నారు'అన్నాడు. విదురుడి మాటలు దుర్యోధనునికి కోపం తెప్పించాయి. 'మావద్ద తిని పరాయివారిని పొగిడే కుత్సితబుద్ధి నీది! ఓ విదురా! నీవు మాయింట్లో విషసర్ప మున్న ట్లున్నావు. ఇతరులసంపద సులభోపాయంతో గ్రహించటం రాజనీతికాదా! అడగకుండానే నీవు మాకు నీతులు చెప్పవచ్చావు. ఇక చాలు. మాటలు కట్టిపెట్టటం మంచిది' - అని దుర్యోధనుడు విదురుడిని గద్దించాడు.

'దుర్యోధనా! నిన్ను పాడుచేసేవారిమాటలు విని సంబరపడుతున్నావు. నీకు హితుడైనవాడు - ముందుగా కొంత అప్రియంగా ఉన్నా తరువాత హితం చేకూర్చే మాటలు చెపుతాడు. హితులు మొగమోటం లేకుండా, బలవంతంగానైనా హితవును బోధిస్తారు. నీ విప్పుడు హితు లెవ్వరో, అహితు లెవ్వరో తెలిసికొనలేని స్థితిలో ఉన్నావు' - అని చెప్పి మాటలాడక మిన్నకున్నాడు విదురుడు.

ధనాల నన్నింటినీ ఓటువోయిన ధర్మరాజును మరొక పందెం కాయు మని శకుని బలవంతపెట్టాడు. ఆ తరువాత కూడా శకుని అవహేళనచేస్తూ పందాలు కాయుమనేవాడు. పౌరుషానికి ధర్మరాజు కాస్తుండేవాడు. వరుసగా సహదేవ నకుల పార్థభీములనూ, చివరకు తననుకూడా పణంగా పెట్టి జూదంలో ఓడిపోయాడు. ఆపైన శకుని 'ద్రౌపదికూడా నీ ధనమే కదా' అని ధర్మరాజుకు జ్ఞాపకం చేశాడు. గతిలేక కులభామనుకూడా జూదంలో ఒడ్డి చివరకు ఆమెనుకూడా ఓడిపోయాడు. ధర్మజుడు దీనవక్త్రుడై దిగాలుపడి కూర్చున్నాడు. భీష్మద్రోణులకు చెమటలు క్రమ్మాయి. విదురుడు మొగం ప్రక్కకుపెట్టి కంటతడి పెట్టుకొన్నాడు. మిగిలిన సదస్యు లందరూ ఏకధారగా దుఃఖించారు. దుర్యోధన దుశ్శాసన కర్ణ సైంధవులు విప్పారిన మొగాలతో ఒకరినొకరు చూచుకొంటూ నవ్వుకొన్నారు. సభలో కలకలం బయలుదేరింది. దుర్యోధనుడికి పట్టపగ్గాలు లేవు. పాండవులు తనకు దాసులైనా రని పొంగిపోతున్నాడు. ఆ గర్వాతిశయంతో పాంచాలిని దాసీలతో కలిసి తమయిళ్లు తుడవటానికి ఆజ్ఞాపించాడు. సభలో సంక్షోభం కలిగింది. గ్రుడ్డిరాజు ఆ గోల విని విషయ మేమి టని విదురుడిని అడిగి తెలిసికొన్నాడు.

ద్రౌపదీవస్త్రాపహరణం

దుర్యోధనుడు తన ఆజ్ఞను నెరవేర్పజేయటానికి విదురుడిని పోయి ద్రౌపదిని సభకు తీసికొని రమ్మని కోరాడు. విదురు డందుకు అతడిని మందలించాడు. దుర్యోధనుడు విదురుడిని తూలనాడి, ద్రౌపదిని తోడ్కొని రావటానికి ప్రాతికామిని పంపాడు. అతడు ద్రౌపది దగ్గరకు పోయి జరిగిందంతా చెప్పాడు. 'ఎన్నడైనా ఇలా తననూ తన భార్యనూ జూదంలో ఓడిపోయిన జూదరి ఉంటాడా?' అని విచారిస్తూ ప్రాతికామిని ఒక ప్రశ్న వేసింది పాంచాలి. 'అన్నా! ధర్మజుడు ముందుగా తన నోడి ఆ తరువాత న న్నోడాడా? నన్ను ముందుగా ఓడి ఆపై తనను తా నోడాడా? ఈ వివరం నీకు తెలిస్తే నాకు తెలియచెప్పుము. నీకు తెలియకపోతే ఆ ధర్మరాజునే అడిగి తెలిసికొని వచ్చి, ఉచిత మైతే నన్ను తీసికొని పో'' అని నిర్దేశించింది.

ప్రాతికామి సభకు వచ్చి ధర్మరాజును ఈ ప్రశ్న నడిగాడు. అత డేమీ సమాధానం ఇవ్వలేక మిన్నకున్నాడు. దుర్యోధనుడు 'నిండుసభలోనే ఆ సందిగ్ధమైన అర్థాన్ని నిర్ణయించుకొనవచ్చును; పాంచాలిని వేగంగా తీసికొని ర'మ్మని

ప్రాతికామిని మరలా పంపాడు. ద్రౌపది పరిస్థితుల ప్రాబల్యాన్ని గమనించింది. ఏకవస్త్రగా, అధోనీవిగా, అవిరళాశ్రుధారాపాతగా సభకు వచ్చి కురువృద్ధుడి సమీపంలో నించున్నది. ద్రౌపదిమోము చూడలేక లజ్జితులై, దుఃఖాయమానమానసులై, తలలు వంచియున్న పాండవులను చూచి దుర్యోధనుడు సంతోషించాడు. దుశ్శాసనుడిని పిల్చి 'నీవు పోయి పెద్దలవద్ద నున్న ద్రౌపదిని ఈవలకు లాక్కొని ర' మ్మని నియోగించాడు. అతడు ఆమెను సమీపించాడు. భయంతో ద్రౌపది గాంధారి దగ్గరకు పోయింది. దుశ్శాసనుడు ఆమెను వెన్నంటి వెళ్ళాడు. 'ఇం కెక్కడికి పోతావు? నీమగళ్ళు ని న్నోడారు. రారాజు నిన్ను గెలుచుకొన్నాడు. వెంటనే రా!' అని గద్దించాడు. 'నేను రజస్వలను. ఏకవస్త్రను. నన్ను ముట్టకుము; పెద్ద లున్న సభకు నే నీ స్థితిలో రాలేను' అని దీనంగా పలికింది పాంచాలి. 'నీవు ఏకవస్త్ర వైతే నేమి? వివస్త్ర వైతే నేమి? నిన్ను ఎట్లాగైనా తీసికొని పోతాను' - అని ఆ దుశ్శాసనుడు బలవంతంగా రాజసూయావభృథస్నానంతో పవిత్రమైన ఆమెశిరోజాలను ఒడిసిపట్టి సభకు ఈడ్చితెచ్చాడు. కర్ణ దుర్యోధన శకుని సైంధవాది దుష్టభూయిష్ఠమైన ఆ సభలో నిలబడి ద్రౌపది వివర్ణవదనంతో ఇట్లా సభికులను ఉద్దేశించి పలికింది -

'ఓ కురువృద్ధులారా! ధర్మరాజు ఎంత దురదృష్టకరమైన పరిస్థితులలో చిక్కుకొన్నా, ధర్మమార్గాన్ని మాత్రం వీడని ధన్యుడు. దుర్జనుడైన ఈ దుశ్శాసనుడు న న్నీసభ కెందుకు ఈడ్చుకొని తెచ్చాడు? సర్వధర్మసంవిదు లని పేరుగాంచిన కురుముఖ్యులు చూస్తూ ఉండగానే ఈ దుర్మదాంధుడు న న్నిట్లా అవమానిస్తున్నాడు. భరతవంశం నేడు అధర్మంతో అతినింద్యమై పోయింది' అని ఆక్రోశిస్తూ, 'అన్యథా శరణం నాస్తి' అనే భక్తిభావంతో ద్రౌపది శ్రీకృష్ణుడిని మనసులో తలచింది.

ద్రౌపదిదీనస్థితి చూచి భీముడు ధర్మరాజుపై మండిపడ్డాడు. జూదానికి కారణమైన అతడిచేతుల్ని కాలుస్తా నన్నాడు. అర్జునుడు అడ్డం వచ్చి ధర్మరాజువర్తనంలోని ధర్మనీతిని తెలియపరిచాడు. సభలో వికర్ణుడు లేచి ద్రౌపది అన్యాయవిజిత అని వాదించాడు. ఆమె అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వటం సభాధర్మ మని మనవి చేశాడు. కర్ణుడు అతడిని అధిక్షేపించాడు. అడగకుండానే నీతులు చెప్పే అధికప్రసంగానికి పోవ ద్దని మందలించాడు. ద్రౌపది ధర్మవిజితయే అని సమర్థించాడు. ఒక పతిని దైవంగా భావించి కాపురం చేసే వనితను ఏకవస్త్ర యని గౌరవించాలిగాని, అనేకభర్తృక అయిన బంధకిని వివస్త్రను చేసినా దోషం లే దని కర్ణుడు వాదించాడు. ఆ మాటలు విని రెచ్చిపోయి దుర్యోధనుడు 'పాండవుల వస్త్రాలను గ్రహించు'మని, 'పాంచాలిని వివస్త్రను చేయు'మని దుశ్శాసనుడిని ఆజ్ఞాపించాడు. అతడు అన్నమాటను అక్షరాలా పాటించాడు.

అయినా, అఖిలజగద్రక్షాదక్షుడైన నారాయణుడిమహిమవలన ద్రౌపదిశరీరంమీద చీర తొలగకుండా నిలిచి ఉండింది. దుశ్శాసనుడు లాగిన చీరలు కుప్పలు కుప్పలుగా పర్వతాకారంగా పడినాయి. అత డా మహిమకు సిగ్గుపడ్డాడు. అలసిపోయి ఊరుకొన్నాడు. దుశ్శాసనుడు ద్రౌపదికి చేసిన అవమానాన్ని భీమసేనుడు చూచి, ప్రతిక్రియ ఏమీ చేయలేని దయనీయ స్థితిలో ఉండికూడా రౌద్రాకారుడై ఇట్లా భయంకర శపథం చేశాడు: 'కురువృద్ధులు, గురువృద్ధులు, బంధువులు అనేకులు చూస్తూ ఉండగా మదోన్మత్తుడై ద్రౌపది నీవిధంగా చేసిన దుర్మార్గుడైన దుశ్శాసనుడిని యుద్ధంలో లోకాలు భయపడేటట్లు ఉగ్రాకారంతో చంపి అతడిగుండెలలోనుండి పెల్లుబికే రక్తప్రవాహాలను మనసారా రుచిచూస్తాను.' 'అట్లా చేయకపోతే పితృపితామహులగతికి తప్పినవాడి నవుతాను.' భీమశపథం విన్న సభాసదు లందరూ సపుత్రకుడైన ధృతరాష్ట్రుడిని నిందించారు. పాంచాలిప్రశ్నలను పట్టించుకొనని సభను విమర్శించారు. పాంచాలి ప్రశ్నలకు సమాధానం చెప్పకపోతే ధర్మవిదులకు పుట్టగతులుండ వని విదురుడు హెచ్చరించాడు. ఆమెప్రశ్నకు ధర్మరాజుమాత్రమే తగిన జవాబివ్వగల డని భీష్ముడు మారు పల్కాడు.

ఇంతలో కర్ణుడు పెచ్చు పెరిగి ద్రౌపదిని చూచి నవ్వుతూ 'తరుణీ! నీకు ఆరవ భర్త ఉండటం ఉచితం. జూదంలో ఓడనివాడినిగా చూచి అతడిని ఎన్నుకో'' అని ఎగతాళి చేశాడు. ఆ మాటలను ఆసరాగా తీసికొని దుర్యోధనుడు ఆ యిల్లాలిని తన యెడమ తొడమీద కూర్చొను మని సైగచేశాడు. ఆ దారుణమైన దృశ్యం చూచి వాయునందనుడు ఆగ్రహోదగ్రుడై లయకాలరుద్రుడివలె విజృంభించి భయంకరశపథం చేశాడు. 'రాజ్యసంపద మదంతో కన్ను మిన్ను కానకుండ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కోమలిని ద్రౌపదిని తన తొడమీద కూర్చో మని పిలిచిన దురాత్ముడైన దుర్యోధనుడిని భయంకరమైన రణరంగంలో నా బాహువులతో త్రిప్పే ప్రచండగదాఘాతాలతో తొడలు విరుగ గొట్టి చంపుతాను'- అని అరుణలోచనాలతో ఆయుధాలున్నవైపు చూపులు సారిస్తూ అన్నగారిఅనుమతికొరకు ఎదురు చూస్తున్న భీముడిని భీష్మవిదురద్రోణాదులు 'ఇది కోపానికి సమయం కా'దని వారించారు. ఆ సమయంలో ధృతరాష్ట్రుడి అంతఃపురంలో ఎన్నో అపశకునాలు గోచరించాయి. గాంధారి విదురుడిని తోడ్కొని ధృతరాష్ట్రుడి దగ్గరకు పోయి, జరిగినదంతా చెప్పింది. ధృతరాష్ట్రుడు దుర్యోధనుడిని పిలిచి కోపించి, సకలబాంధవహితం చేయసమకట్టి ద్రౌపదిని దగ్గరికి పిలిచి శాంతవచనాలు పలికాడు. ధృతరాష్ట్రుడు ద్రౌపదిని వరాన్ని కోరుకొ మ్మని అడిగాడు. ఆమె ధర్మరాజుదాస్యవిముక్తిని వరంగా కోరుకొన్నది. దానిని గ్రుడ్డిరాజు ప్రసాదించి రెండో వరాన్ని కోరుకో మన్నాడు. భీమాదులు నలుగురును వారిఆయుధాదులతోసహా దాస్యవిముక్తులు కావా లని అడిగింది. దానినీ ఇచ్చాడు. మూడోవరం వేడుకో మన్నాడు. 'క్షత్రియవనితకు రెండువరాలు కోరుకొనటం న్యాయం కాబట్టి మూడోవరం కోరుకొన'నన్నది. కోడలిధర్మనిష్ఠకు మెచ్చుకొని ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు అతనిరాజ్యాన్ని యిచ్చి యేలుకొ మ్మని ఇంద్రప్రస్థపురానికి పంపాడు. పాండవులు బంగారురథా లెక్కి తమరాజధానికి చేరి సుఖంగా ఉన్నారు.

అనుద్యూతం

ఈ విషయం తెలిసికొన్న దుర్యోధనుడు ఖిన్నుడై తండ్రి వద్దకు పోయి ఇట్లా అన్నాడు- 'ఇకపై ఎంతమేలుచేసినా పాండవులకు మనం హితులం కాగలమా? పాములను తోకలు త్రొక్కి వదిలిపెట్టాం. అవి పగపట్టి కాటేయక మానవు. గాండీవంతో ఉన్న సవ్యసాచిని, గదగొన్న భీముడిని ఎదుర్కొనటం సాధ్యమా? కాబట్టి వారలను మరల పిలిపించి అనుద్యూతంలో ఓడించి, అడవులకు పంపుదాం' అని ధృతరాష్ట్రుని ఒప్పించి, ప్రాతికామిని పాండవులను తీసికొనిరావటానికి పంపాడు.

ధర్మరాజాదులు మరల హస్తినాపురికి వచ్చారు. అనుద్యూతానికి పూనుకొన్నారు. అందులో ఓడినవారు వల్కలాలు కట్టి, కందమూలాలు తింటూ, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ పన్నెండేళ్లు వనవాసం చేసి, పదమూడవయేడు జనపదంలో అజ్ఞాతవాసం చేయాలి. అజ్ఞాతవాసంలో ఎవరైనా గుర్తిస్తే మరల పన్నెండేళ్ల అరణ్యవాసం, ఒకయేడు అజ్ఞాతవాసం చేయా లని కట్టడి చేసికొన్నారు. ధర్మరాజు అనుద్యూతంలో శకునిమాయవలన ఓడిపోయాడు. పాండవులు వనవాసాజ్ఞాతవాసాల దీక్షను గ్రహించారు. కుంతిని విదురునియింట ఉంచారు. సతీసమేతులై పాండవులు అడవులకు బయలుదేరారు.

తలవిరబోసుకొని పతుల వెంట నడచిపోయే ద్రౌపదిని చూచి కౌరవేంద్రుడి అంతఃపురవనిత లందరూ ఏదో చెప్పలేని భయంతో తలలు వంచారు. 'నా భయంకరగదాదండంతో ఆ దుర్యోధనునితొడలను ఉగ్రరణంలో విరగకొడతాను. శిరస్సు కాలితో తన్ని అవమానిస్తాను, దుశ్శాసనుడిని వధించి వేడిరక్తం త్రాగుతా' నంటూ బుసలు కొడుతూ సాగాడు వాయుపుత్రుడైన భీమసేనుడు. 'రాబోయే పదునాల్గవయేట జరగబోయే మహాయుద్ధంలో నా గాండీవం ఈ కర్ణుడు మొదలుగాగల దుర్జన సంఘాన్ని హతమారుస్తా' నని హుంకరిస్తూ అర్జునుడు వెళ్ళాడు. 'మాయాద్యూతంలో మోసం చేసి యింత విపత్తుకు మూలమైన శకునిని చంపుతా' మని భీమార్జుననకులసహదేవులు శపథం చేశారు.

ధృతరాష్ట్రుడిమందిరంలో పట్టపగలే నక్కలు కూశాయి. గ్రహణకాలం కాకుండానే సూర్యుడిని రాహువు పట్టాడు. భూమి కంపించింది. నారదుడు మింట నాట్యం చేస్తూ 'పదునాల్గవయేట భారతయుద్ధం జరుగుతుంది. భీమార్జునపరాక్రమాలవలన పాండవులు జయిస్తారు' అని ప్రకటించాడు.

ఇది సభాపర్వకథాసారం.

జి.వి. సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

సభాపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
మయుం డొక్క సభను నిర్మించి ధర్మజున కిచ్చుట	2-1-1	1
ధర్మరాజు సభాప్రవేశము కావించుట	2-4-1	10
నారదుఁడు పాండవులయొద్దకు వచ్చుట	2-5-2	13
నారదుఁడు ధర్మరాజును రాజనీతివిషయంబులం గొన్నింటి నడుగుట	2-5-7	15
ఇట్టిసభ నెచ్చటనైనఁ జూచితిరాయని ధర్మజుఁడు నారదునడుగుట	2-6-8	29
ఇంద్రసభావర్ణనము	2-7-1	31
యమసభావర్ణనము	2-8-1	33
వరుణసభావర్ణనము	2-9-1	35
కుబేరసభావర్ణనము	2-10-1	36
బ్రహ్మసభావర్ణనము	2-11-1	38
హరిశ్చంద్రుమాహాత్మ్యము	2-11-48	41
నారదుఁడు పాండురాజువచనంబులు ధర్మజుని కెఱింగించుట	2-11-65	43
ధర్మరాజు నారదవచనప్రబోధితుండై రాజసూయయజ్ఞంబు సేయుటకు నాలోచించుట	2-12-1	46
శ్రీకృష్ణుం డింద్రప్రస్థపురంబునకు వచ్చుట	2-12-30	49
శ్రీకృష్ణుఁడు ధర్మజునికి జరాసంధునిసామర్థ్యము నెఱిఁగించుట	2-13-1	107

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీమసేనార్జునులు ధర్మరాజున కుత్సాహంబు గలిగించుట	2-14-7	59
శ్రీకృష్ణుఁడు ధర్మజునకు జరాసంధుని జననక్రమ మెఱిఁగించుట	2-16-12	64
జరయను రాక్షసి బాలకునిఁ దెచ్చి బృహద్రథుని కొసంగుట	2-16-38	68
జరాసంధునియొద్దకుఁ జండకౌశికుండు వచ్చుట	2-17-8	71
శ్రీకృష్ణుఁడు భీమార్జునులను దనతోఁ బంపుమని ధర్మజు నడుగుట	2-17-25	74
శ్రీకృష్ణభీమార్జునులు జరాసంధునిఁ జంపఁ బోవుట	2-18-26	79
జరాసంధుఁడు శ్రీకృష్ణభీమార్జునుల కెదురు వచ్చుట	2-19-29	82
జరాసంధుండు యుద్ధమునకు భీమునిఁ గోరుకొనుట	2-20-28	90
భీమసేన జరాసంధుల మల్లయుద్ధము	2-21-10	92
భీముఁడు జరాసంధుని సంహరించుట	2-22-3	95
జరాసంధునికుమారుఁడైన సహదేవు నభిషిక్తుఁ గావించి, శ్రీకృష్ణుఁడు భీమార్జునులతో నింద్రప్రస్థమున కరుగుట	2-22-40	98
శ్రీకృష్ణుఁడు ద్వారకానగరమున కరుగుట	2-22-53	101
అర్జునుం డుత్తరదిగ్విజయంబు సేయుట	2-23-7	103
భీమసేనుండు పూర్వదిగ్విజయంబు సేయుట	2-26-1	110
సహదేవుండు దక్షిణదిగ్విజయంబు సేయుట	2-28-1	112
అగ్ని సహదేవుసేనపైఁ బ్రచండశిఖలు కప్పుటకుఁ గారణము	2-28-16	113
సహదేవుఁడు దక్షిణదిఙ్మహీపతులచేఁ గప్పములు గొనుట	2-28-37	117
నకులుఁడు పశ్చిమదిగ్విజయంబు సేయుట	2-29-2	119
రాజసూయము సేయుమని ధర్మజున కతనియాప్తులు సెప్పుట	2-30-8	122
శ్రీకృష్ణుఁడు ద్వారకనుండి వచ్చుట	2-30-9	124
ధర్మరాజు రాజసూయంబు సేయ నారంభించుట	2-30-17	128
రాజసూయమునకు భీష్మాదు లరుదెంచుట	2-31-4	131
ధర్మజుఁడు యజ్ఞాయతనము ప్రవేశించుట	2-33-1	132

ద్వితీయాశ్వాసము

ధర్మజుఁడు శ్రీకృష్ణున కర్ఘ్యంబిచ్చుట	2-33-10	138
శిశుపాలుఁడు ధర్మరాజు నాక్షేపించుట	2-34-1	141
భీష్ముఁడు శిశుపాలుని నిందించుట	2-35-6	148
శిశుపాలుఁడు భీష్మునిఁ దూలనాడుట	2-38-1	156
భీమునకు భీష్ముండు శిశుపాలునివృత్తాంతంబు సెప్పుట	2-40-1	163
చక్రాయుధముచేత శిశుపాలుండు చచ్చుట	2-42-21	169
పాండవసభామహిమకు దుర్యోధనుండు లజ్జితుండగుట	2-43-1	177
దుర్యోధనుని దురాలోచనము	2-43-19	180
విదురుఁడు ధృతరాష్ట్రునితో జూదమాడఁ దగ దని చెప్పుట	2-51-23	196
విదురుఁడు ధర్మరాజుం దోడ్కొని వచ్చుట	2-52-1	206
ధర్మరాజు శకునితో జూదంబాడుట	2-53-13	213
ధర్మరాజు తమ్ములను ద్రౌపదిని జూదమునందొడ్డి యోడుట		224
ప్రాతికామి ద్రౌపదిని సభకుఁ దోడ్కొని వచ్చుట	2-60-3	229
దుశ్శాసనుఁడు ద్రౌపదిని సభలోని కీడ్చి తెచ్చుట		234
దుశ్శాసనుండు ద్రౌపదికట్టినపుట్టం బొలుచుట	2-61-40	242
విరోచన సుధన్వుల వృత్తాంతము		246
ధృతరాష్ట్రుండు ద్రౌపది గోరినవరంబు లిచ్చుట	2-63-27	254
ధర్మరాజు శకునితో రెండవమాఱు జూదంబాడుట	2-67-21	262
విదురుఁడు ధృతరాష్ట్రునకుఁ బాండవు లడవికిఁ బోయిన రీతి సెప్పుట	2-71-3	271

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

సభాపర్వము

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

సభాపర్వము -ప్రథమాశ్వాసము

శ్రీదయితోరస్థ్సల! విమ । లాదిత్యాత్మజ! నిరంతరానందమతీ!
కోదండపార్థ! నిఖిల ధ । రాదేవ స్తుత్య! రాజరాజ నరేంద్రా! 1

ప్రతిపదార్థం: శ్రీ,దయితా+ఉరస్+స్థల=ప్రియురాలైన లక్ష్మీదేవిని వక్షస్థ్సలంలో కలవాడా (శ్రీమహావిష్ణువా!); విమల+ఆదిత్య+ఆత్మజ= విమలాదిత్యుని యొక్క కుమారుడా!; నిరంతర+ఆనంద, మతీ= ఎల్లప్పుడు ఆనందంతో కూడుకొన్న మనస్సు కలవాడా!; కోదండ, పార్థ= విలువిద్యలో అర్జునునివంటివాడా!; నిఖిల, ధరా, దేవ, స్తుత్య= అందరు బ్రాహ్మణులచేత కొనియాడబడేవాడా!; రాజరాజ నరేంద్రా!

తాత్పర్యం: ప్రియురాలైన లక్ష్మీదేవిని వక్షస్థ్సలంలో కల విష్ణువువంటివాడా! విమలాదిత్యునికుమారా! అన్నివేళలా ఆనందమయమైన మనస్సుకలవాడా! విలువిద్యలో పార్థుడితో సమానమైనవాడా! బ్రాహ్మణు లందరి ప్రశంసలందుకొనేవాడా! ఓ రాజరాజనరేంద్రా!- (అని నన్నయ ప్రశంసాపూర్వకంగా రాజరాజును సంబోధించి, సభాపర్వప్రథమాశ్వాసరచన ప్రారంభించాడు).

విశేషం: ఆశ్వాసారంభంలో, ఆశ్వాసాంతంలో కృతిపతి గుణవిశేషాలు కొనియాడుతూ అతణ్ణి సంబోధించి కథను ప్రారంభించటం, ముగించటం ప్రాచీనకావ్య సంప్రదాయం. ఆ సంప్రదాయానుసారంగా జరిగిందే ఈరాజరాజ నరేంద్రుడి ప్రశంస; సంబోధన. అయినా తన భారతకృతిపతి రాజరాజనరేంద్రు డని నన్నయ ఎక్కడ స్పష్టంగా చెప్పలేదు. 'నావిష్ణుః పృథివీపతి:'- విష్ణువు కానివాడు పృథ్వీపతి (రాజు) కాలే డనిగదా ఆర్యోక్తి. అందువలన రాజరాజనరేంద్రుని విష్ణుత్వాన్ని, శత్రుశిక్షణ సమర్థమైన ఆయన పరాక్రమాన్ని నన్నయ భారతంలో అనేకసందర్భాల్లో అనేకవిధాలుగా వర్ణించాడు. ప్రస్తుతపద్యంలో 'శ్రీదయితోరస్థ్సల' అనే సంబోధనలో ఆయన విష్ణుత్వం, 'కోదండపార్థ' అనే సంబోధనలో ఆయన పరాక్రమం ప్రకటం కావటం గమనార్హం. కుంతి మొదటి పేరు పృథ. పృథపుత్రుడు పార్థుడు. పృథాపుత్రు లందరు పార్థులే. కాని పార్థ డంటే స్మృతికి వచ్చేది ఒక్క అర్జునుడే. అర్జునుని పదిపేర్లలో పార్థు డనేది ఒకటి. అర్జునుని పదిపేర్లు - అర్జునుడు, ఫల్గునుడు, పార్థుడు, కిరీటి, శ్వేతవాహనుడు, బీభత్సుడు, విజయుడు, జిష్ణుడు, సవ్యసాచి, ధనంజయుడు.

మయుం డొక్కసభను నిర్మించి ధర్మజున కిచ్చుట (సం. 2-1-1)

వ. అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె: నట్లు ధర్మతనయునొద్ద వాసుదేవ సహితుం డయి యున్న యర్జునున కతిప్రీతిం గృతాంజలి యయి మయుం డిట్లనియె. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= ఆ కథను చెప్పేవ్యక్తి (భారతకథను చెప్పే ఉగ్రశ్రవసుడనే సౌతి); శౌనక+ఆది, మహా, మునులకున్= శౌనకుడు మొదలైన మహామునులకు; చెప్పెన్= (ఖాండవవనదహనంవరకు జరిగిన కథను) చెప్పాడు; అట్లు= ఆ విధంగా-

అంటే ఖాండవదహన కారణంగా అగ్నిదేవునివల్ల దివ్యధనుర్బాణతూణీరలాభాన్ని పొంది; ధర్మతనయు+ఒద్ద= ధర్మరాజుదగ్గర; వాసుదేవ, సహితుండు+అయి= శ్రీకృష్ణునితో కూడినవాడై; ఉన్న; అర్జునునకున్; అతి ప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; కృత+అంజలి, అయి= చేయబడిన నమస్కారం కలవాడై- అంటే నమస్కరించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నైమిశారణ్యంలో ఉగ్రశ్రవసుడనే మహర్షి, శౌనకాదులైన మహామునులకు ఖాండవదహనందాకా జరిగిన భారతకథను చెప్పాడు. ఖాండవ దహనం తరువాత శ్రీకృష్ణునితో కలిసి ధర్మరాజు దగ్గర ఉన్న అర్జునునికి మయుడు మహాసంతోషంతో నమస్కరించి ఇలా అన్నాడు. (అని ఉగ్రశ్రవసుడు మళ్ళీ కథ ప్రారంభించాడు.)

విశేషం: ఉగ్రశ్రవసుడు రోమహర్షణునిపుత్రుడు. అందువల్ల ఆయనకు రౌమహర్షణి అని కూడ పేరు. 'రౌమహర్షణి సుపౌరాణికుండు' (ఆది, ఆశ్వా. 1-28). వాసుదేవుడు-అన్నింటా, అంతటా వసించటంచేత భగవంతునికి వాసుదేవు డని పేరు. భగవంతుని అవతారం కావటంచేత, వసుదేవుని పుత్రుడు కావటంచేత శ్రీకృష్ణునికి కూడ వాసుదేవు డని పేరు. మయుడు రాక్షసశిల్పి. నముచి తమ్ముడు.

క. ఘనముగఁ బ్రాణము రక్షిం । చిన యుపకారికిఁ బ్రియంబు సేయుదు నన నే
ర్తునె; యైనను నీకుఁ బ్రియం । బనఘా! చేయంగ నిష్టమైనది నాకున్. 3

ప్రతిపదార్థం: అనఘా= పాపరహితుడవైన ఓ అర్జునా!; ఘనముగన్= గొప్పగా; ప్రాణము, రక్షించిన= (నా) ప్రాణాన్ని కాపాడిన; ఉపకారికిన్; ప్రియంబు, చేయుదున్, అనన్, నేర్తునె= ఇష్టమైనది చేయగలనని చెప్పగలనా; ఐనను; నీకున్; ప్రియంబు; చేయంగన్; నాకున్; ఇష్టము+ఐనది= కోరిక కలిగింది.

తాత్పర్యం: అర్జునా! నీవు నా ప్రాణాలనే కాపాడిన మహోపకారివి. అలాంటి నీకు ఏదో మేలు చేస్తా నని చెప్పటానికి సమర్థుడినా! అయినా నీకు ఇష్టమైన దేదో చేయా లని నాకు కోరికగా ఉంది.

విశేషం: మయునిమాటల్లో ఎంతో వినయం, అంతులేని ఆనందం, అపారకృతజ్ఞత వ్యక్తమౌతున్నాయి. ఉపకారం పొందిన ఏ వ్యక్తికైనా ఇవి ఉండదగిన గుణాలు.

వ. 'ఏను దానవ విశ్వకర్మ, ననేకవిధ శిల్ప కలా కుశలుండ; మీ కిష్టంబయిన దాని నిర్మించెదం బనుపుం' డనిన నర్జునుం డచ్యుతుమొగంబు చూచి 'యతని నెద్దియేనియు నొక్క యపూర్వం బయినదాని నిర్మింప నియోగింపు' మనినఁ గృష్ణుండు పెద్దయుంబ్రొద్దు విచారించి మయున కిట్లనియె. 4

ప్రతిపదార్థం: ఏను= నేను; దానవ, విశ్వకర్మన్= రాక్షసజాతికి చెందిన శిల్పిని; అనేక, విధ, శిల్ప, కలా, కుశలుండన్= పలువిధాలైన శిల్పకళలలో నేర్పరిని; మీకున్+ఇష్టంబు+అయిన, దానిన్; నిర్మించెదన్= సృజిస్తాను, చేస్తాను; పనుపుండు= ఆజ్ఞాపించండి; అనినన్= అని అనగా, అర్జునుండు; అచ్యుతు, మొగంబు= శ్రీకృష్ణుని ముఖాన్ని; చూచి; అతనిన్= ఆ మయుణ్ణి; ఎద్ది; ఏనియున్= ఏదైనా; ఒక్క, అపూర్వంబు+అయిన, దానిన్= ఇంతకుముం దెన్నడు లేనిదొక దానిని; నిర్మింపన్; నియోగింపుము= ఆజ్ఞాపించుము; అనినన్= అని అనగా; కృష్ణుండు; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; విచారించి= ఆలోచించి; మయునకున్+ఇట్లు+అనియెన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నేను దానవశిల్పిని, వివిధకళల్లోనేర్పరిని. మీ కిష్టమైనదాన్ని నిర్మించి ఇస్తా, ఆజ్ఞాపించండి' అని మయుడు అర్జునుణ్ణి అడిగాడు. అర్జునుడు శ్రీకృష్ణునిముఖం చూచి 'ఏదైనా ఒక అపూర్వమైనదాన్ని నిర్మించవలసిందిగా ఆజ్ఞాపించం'డని అన్నాడు. శ్రీకృష్ణుడు చాలాసేపు ఆలోచించి మయునితో ఇలా అన్నాడు.

విశేషం: అచ్యుతుడు - చ్యుతిలేనివాడు - అంటే పతనం లేనివాడు - శ్రీమహావిష్ణువు. ఆయన అవతారం కావటంచేత శ్రీకృష్ణునికి కూడ అచ్యుతు డనేపేరు.

చ. కురుపతికిన్ యుధిష్ఠిరునకున్ సకలక్షితిపాలసేవ్యసు
స్థిర విభవాభిరామున కతిప్రమదంబుగ రత్నరాజిసుం
దర మగు దాని నొక్క సభ ధాత్రి కపూర్వముగా నొనర్చి చె
చ్చెరఁ గొనిరమ్ము నీదయిన శిల్పకలాకుశలత్వ మేర్పడన్. 5

ప్రతిపదార్థం:కురుపతికిన్=కురువంశరాజుకు; యుధిష్ఠిరునకున్=ధర్మరాజుకు;సకల, క్షితి,పాల,సేవ్య,సుస్థిర,విభవ+అభిరామునకున్= అందరుభూపతులచేత - అంటే రాజులచేత కొలువదగిన శాశ్వత వైభవంతో వెలిగేవానికి; అతి, ప్రమదంబుగన్= ఎంతో సంతోషం కలిగేవిధంగా; రత్న, రాజి, సుందరము+అగు, దానిన్= రత్న సమూహంతో అందమైనదానిని; ఒక్క, సభన్= ఒక సభాభవనాన్ని; ధాత్రికిన్+అపూర్వముగాన్= భూమిమీద మున్నెన్నడు లేనివిధంగా; నీది+అయిన, శిల్ప, కలా, కుశలత్వము+ఏర్పడన్= నీయొక్కశిల్పకలానైపుణ్యం ప్రకాశించేవిధంగా; ఒనర్చి= నిర్మించి, చెచ్చెరన్= వేగమే; కొని, రమ్ము= తీసికొనిరా.

తాత్పర్యం: ధర్మరాజు కురువంశప్రభువు. అంతేకాదు, అందరు రాజులు సేవించదగిన శాశ్వతవైభవంతో విరాజిల్లే ప్రభుడు. అలాంటి ధర్మరాజుకు ఆనందదాయకంగా, నానావిధరత్నసమూహాలతో అందంగా, లోకానికే అపూర్వంగా నీ శిల్పకళానైపుణ్యానికి నిదర్శనంగా ఒక మహాసభను నిర్మించి వెంటనే తీసికొనిరా.

విశేషం: ధర్మరాజు అప్పటికి ఇంకా 'సకలక్షితిపాలసేవ్యసుస్థిరవిభవాభిరాముడు' కాలేదు. అయినా శ్రీకృష్ణుడు ఆ విశేషణాన్ని ప్రయోగించి అతని భావి సార్వభౌమయోగాన్ని అందరికీ ధ్వనింపజేయటం, ఏదో సామాన్యమైన సభనుగాక, సార్వభౌమయోగ్య మయిన మహాసభను నిర్మించి తెమ్మని మయునికి సూచించటం ఈ సందర్భంలో గమనించదగిన అంశాలు. మహాత్ముల మాటలు సార్థకాలు; భావ్యర్థసూచకాలు. శ్రీకృష్ణుడు అన్నట్లే తర్వాత ధర్మరాజు సార్వభౌము డయ్యాడు కదా! యుధిష్ఠిరుడు- 'ధృతిఁజేసి యుధిష్ఠిరుఁడు' (ఆది. ఆశ్వా.5-97)- యుద్ధంలో స్థిరంగా ధైర్యంతో నిలిచేవాడు ధర్మరాజు. పద్యంలో 'సకలక్షితి పాలసేవ్యసుస్థిరవిభవాభిరాముఁడు' - అనే సుదీర్ఘసంస్కృతసమాసం, అర్థం తెలియనివాళ్ళకుకూడ మున్ముందు ధర్మరాజుకు పట్టబోయే సార్వభౌమమహాయోగాన్ని ధ్వనింప చేసేదిగా ఉంటే- 'ఒనర్చి చెచ్చెరఁ గొనిరమ్ము'- అనే అలతి అలతి తెలుగు పదాలకూర్పు 'అపూర్వసభానిర్మాణం కదా అని ఆలస్యం చేసేవు- సత్వరం పని పూర్తిచేసి సభను తీసుకురా', అని మయుణ్ణి త్వరపెట్టి తరిమేదిగా ఉంది. అక్షరరమ్యమైన నన్నయశైలికి ఈ మాటలకూర్పులు మెరుగుటద్దాలు. ఈ పద్యంలో గుణం ప్రసాదం.

వ. అనిన వాసుదేవునకు మయుం డిట్లనియె. 6

తాత్పర్యం: ఆ విధంగా అనిన శ్రీకృష్ణునితో మయుడు ఇలా అన్నాడు.

ఉ. ఇమ్మనుజేంద్రుఁ డింద్రదనుజేంద్రులకంటె మహావిలాస సౌ
ఖ్యమ్ములఁ బెద్ద యిద్ధరణిఁ గావున, నీతని పేర్మికిం దగన్
నెమ్మి నొనర్చెదన్ సభ మణిప్రభ నొప్పఁగ, దేవతావిమా
నమ్ములు నిట్టివే యని జనమ్ములు దానిన మెచ్చి చూడఁగన్. 7

ప్రతిపదార్థం: ఈ+మనుజ+ఇంద్రుఁడు= మానవులకు రాజైన ఈ ధర్మరాజు; ఇంద్ర, దనుజ+ఇంద్రులకంటెన్= దేవతల రాజైన ఇంద్రునికంటె, రాక్షసులకు రాజైనవానికంటె; మహా, విలాస, సౌఖ్యమ్ములన్= గొప్పవైభవంలో, సుఖాల్లో; ఈ+ధరణిన్= ఈభూమిమీద; పెద్ద;కావునన్; ఈతని, పేర్మికిన్=ఇతని గొప్పతనానికి; తగన్= తగినట్లు; మణిప్రభన్, ఒప్పఁగన్= మణులకాంతితో ప్రకాశించేవిధంగా; జనమ్ములు= ప్రజలు; దేవతావిమానమ్ములున్= దేవతలయొక్కసౌధాలు(మేడలు)అయినా; ఇట్టివే=ఈ విధంగా ఉంటాయా!; అని; దానిన్+అ= ఆ సభనే; మెచ్చి; చూడఁగన్; నెమ్మిన్= ప్రేమతో; సభ=సభను; ఒనర్చెదన్= నిర్మిస్తాను.

తాత్పర్యం: వైభవంలో, భోగానుభవంలో, దేవేంద్ర రాక్షసేంద్రులకంటె మనుజేంద్రుడైన ధర్మరాజే ఈ ధరమీద మిన్న. ఆయన గొప్పతనానికి తగ్గట్లు, దేవతలమేడలైనా ఇంత బాగుంటాయా అని జనులంతా దానినే మెచ్చి చూచేటట్లు, మణుల కాంతితో మెరిసే ఒక మహాసభను మనసార నిర్మించి ఇస్తా.

విశేషం: అలం: సందేహం. 'మెచ్చిచూడఁగన్' అనటానికిబదులు 'వచ్చిచూడఁగన్' అని కొన్ని ప్రతుల్లో ఉన్నపాఠం కూడ ఉచితమైనదే. దేవతావిమానాలు అంటే- దేవతలు ఆకాశంలో పయనించే వాహనాలు, దేవతలు నివసించే సౌధాలు, దేవాలయ గర్భగుడి గోపురాలు- అని మూడర్థాలూ చెప్పవచ్చు. కాని, ఇక్కడ దేవతలు నివసించే సౌధాలు- అని చెప్పటమే ఎక్కువ ఉచితంగా ఉంటుంది. దనుజేంద్రు డంటే బలిచక్రవర్తి అని ప్రసిద్ధి. ఈ పద్యంలో 'ఇంద్ర' శబ్దం మూడుసార్లు వచ్చింది- మనుజేంద్రుడు, ఇంద్రుడు, దనుజేంద్రుడు. ఈ ముగ్గురూ వరుసగా మర్త్య, స్వర్గ, పాతాళాలకు అధిపతులు. సాంప్రదాయికంగా చెప్పుకొనే వరుసక్రమం- స్వర్గ, మర్త్య, పాతాళాలు. ఈ ముల్లోకాల ఇంద్రుల్లో మనుజేంద్రుడు రెండవవాడు. మధ్య ఉండేవాడు. కాని పద్యంలో అతడు మొదటివా డయ్యాడు. దీనివల్ల త్రిలోకాధిపతుల్లో ధర్మరాజు శ్రేష్ఠు డని ధ్వని. అందుచేత అతని యోగ్యతకు తగ్గట్లు మహాసభ ఉండా లని మయుని ఉద్దేశం. దనుజేంద్రునిసభకంటె దేవేంద్రునిసభ గొప్పది. అంతకంటె గొప్పదిగా ధర్మరాజు సభ ఉండా లనీ, ఆ సభను చూచి, దేవతల సౌధాలుకూడా ఇలా ఉండవే- అని జనులంతా ఆశ్చర్యపోవా లనీ మయుని అభిప్రాయం. శ్రీకృష్ణుడు ధర్మరాజును మనుజేంద్రుల్లో గొప్పవా డని భావిస్తే, మయుడు ఆ మహారాజును ముల్లోకాధిపతుల్లో అధికు డని అన్నాడు. అతని ఆధిక్యానికి తగ్గట్లే ఆ సభను తీర్చిదిద్దుతా నన్నాడు. దేవేంద్రాదులసభలకంటే ఈ సభ దివ్యమైం దని, మున్ముందు తెల్పిచెప్పే త్రిలోకసంచారి నారదమహర్షిమాటకు ఇది సూచ్యార్థసూచన. పద్యంలోని అర్థవ్యక్తిప్రసాదగుణపరిపోషకం- వస్తుధ్వనికి వ్యంజకం. నన్నయ రచనాశిల్పానికి చక్కనిదర్పణం.

వ. తొల్లి వృషపర్వుండను దానవేంద్రున కొక్కసభ నిర్మింప సమకట్టి వివిధ రత్నమయంబులయిన యుపకరణంబు లొడఁగూర్చి బిందుసరంబను కొలన సంగ్రహించినవాఁడ; నయ్యుపకరణంబుల దాని విచిత్రంబుగా రచియించి తెచ్చి ధర్మరాజున కిచ్చెద; మఱియును భౌమాదిత్యుండను రాజర్షిచేత నిహితంబయి సకలశత్రుఘాతినియైన దాని భీమసేనున కొక్కగదను. దారుణంబయిన దివ్యఘోషంబు గలుగు దేవదత్తంబను శంఖం బర్జునునకు నిచ్చెద'నని చెప్పి ధర్మరాజుచేత సత్కృతుండై మయుం డరిగె; నంత నిట నారాయణుండును బాండవుల వీడ్కొని పితృదర్శనలాలసుండై ద్వారవతీపురంబున కరిగె; నట

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మయుండును బూర్వోత్తరదిశాభిముఖుండై పోయి కైలాసంబునుత్తరంబున మైనాకశైలంబునందు హిరణ్యశృంగంబున. 8

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; వృషపర్వుండు+అను; దానవ+ఇంద్రునకున్= రాక్షసరాజుకు; ఒక్కసభ; నిర్మింపన్; సమకట్టి= పూనుకొని వివిధరత్నమయంబులు+అయిన= అనేకరకాలైన రత్నాలతో కూడుకొన్న; ఉపకరణంబులు= సాధనాలు; ఒడన్+కూర్చి= ప్రోగుచేసి; బిందుసరంబు+అను, కొలనన్= బిందుసరం అనేపేరుగలకోనేటిలో; సంగ్రహించినవాఁడన్= సేకరించిఉంచాను; ఆ+ఉపకరణంబులు+అ= ఆ సామగ్రితోనే; దానిన్= ఆ సభను; విచిత్రంబుగాన్= మిక్కిలిఆశ్చర్యకరమైనదానినిగా; రచియించి= నిర్మించి; తెచ్చి; ధర్మరాజునకున్; ఇచ్చెద; మఱియును; భౌమ+ఆదిత్యుండు+అను; రాజ+ఋషిచేతన్= ఋషివంటిరాజుచేత; నిహితంబు+అయి=ఉంచబడిందై; సకల, శత్రు, ఘాతిని, ఐన, దానిన్= అందరు శత్రువులను చంపునట్టిదైనదానిని; ఒక్కగదను; భీమసేనునకున్; దారుణంబు+అయిన= భయంకరమైన; దివ్య, ఘోషంబు, కలుగు= శ్రేష్ఠమైనశబ్దం వచ్చే; దేవ, దత్తంబు+అను= దేవదత్తం అనేపేరుగల; శంఖంబు; అర్జుననకున్+ఇచ్చెదన్+అని; చెప్పి; ధర్మరాజుచేతన్; సత్, కృతుండు+అయి= సమ్మానించ బడినవాడయి; మయుండు; అరిగెన్= వెళ్ళాడు; అంతన్= తరువాత; ఇటన్= ఇక్కడ; ఇంద్రప్రస్థమున; నారాయణుండును= శ్రీకృష్ణుడుకూడ; పాండవులన్, వీడ్కొని= పాండవుల దగ్గర సెలవుతీసికొని; పితృ, దర్శన, లాలసుండు+ఐ= తండ్రిని చూడటంలో మిక్కుటమైన కోరిక కలవాడై- అంటే తండ్రిని చూడాలన్న తహతహతో; ద్వారవతీ, పురంబునకున్= ద్వారకానగరానికి; అరిగెన్= వెళ్ళాడు; అటన్= అక్కడ; మయుండు; పూర్వ+ఉత్తర, దిశా+అభిముఖుండు+ఐ= ఈశాన్యదిశవైపు తిరిగినవాడై; పోయి; కైలాసంబు= కైలాసపర్వతానికి; ఉత్తరంబునన్ మైనాక, శైలంబు+అందున్= మైనాక పర్వతంలో; హిరణ్యశృంగంబునన్= హిరణ్యమనే పేరున్న శిఖరంలో.

తాత్పర్యం: 'పూర్వం వృషపర్వుడనే రాక్షసరాజుకు ఒక సభను నిర్మించి ఇవ్వా లని, నానావిధరత్నాలతో కూడిన నిర్మాణ సామగ్రిని సమకూర్చాను. ఆ సామగ్రినంతా బిందుసరం అనే సరోవరంలో భద్రపరచాను. ఇప్పుడా సామగ్రిని ఉపయోగించి చిత్ర, విచిత్రమైన సభను నిర్మిస్తాను. దాన్ని ధర్మతనయునికి బహూకరిస్తాను. అంతే కాదు, భౌమాదిత్యుడనే రాజర్షి ఉంచిన గదాశంఖాలు నా అధీనంలోనే ఉన్నాయి. సర్వశత్రువుల్ని హతమార్చే ఆ గదను భీమసేనుని కిస్తాను. మహాభయంకరమైన దివ్యధ్వని గల దేవదత్తశంఖాన్ని అర్జునునికిస్తాను' - అని మయుడు ధర్మరాజుచేత సమ్మానంపొంది అక్కడినుండి బయలుదేరాడు. శ్రీకృష్ణుడుకూడ తనతండ్రిని చూడాలన్న ప్రబలకుతూహలంతో- పాండవులదగ్గర సెలవు తీసికొని ద్వారవతికి వెళ్ళాడు. మయుడు ఈశాన్యదిశగా పయనించి కైలాసపర్వతానికి ఉత్తరాన మైనాకపర్వతంమీది హిరణ్యశిఖరాన్ని చేరుకొన్నాడు.

విశేషం: వృషపర్వుడు - రాక్షసరాజు, శర్మిష్ఠతండ్రి. భౌమాదిత్యుడు - తపస్సు చేసి ఋషిత్వాన్ని పొందిన ఒక మహారాజు. నారాయణుడు - నీరు స్థానంగా కలవాడు; నరులసమూహం నివాసంగా కలవాడు; ఒక మన్వంతరంలో నరుడనే ఋషికి మిత్రుడైనవాడు - విష్ణుమూర్తి. విష్ణుమూర్తి అవతార మవటంచేత శ్రీకృష్ణుడికికూడ నారాయణు డని పేరు. శ్రీకృష్ణుడు పాండవుల వీడ్కొని వెళ్ళే కార్యక్రమం సంస్కృతంలో చాలా విపులంగా ఉన్నది. సుభద్రార్జునుల వివాహం జరిపించి పాండవులతో బాంధవ్యాన్ని, ప్రత్యేకించి అర్జునుడితో ఆత్మీయతను పెంచుకొని, ఖాండవదహనాన్ని జరిపించటంలో, దేవేంద్రుడిని ఓడించటంలో అర్జునుడికి తోడయి, ఆ గాండీవివెంట ఇంద్రప్రస్థానికి వచ్చినవాడు శ్రీకృష్ణుడు. అంతేకాక తాను సంకల్పించిన దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంస్థాపనరూపమైన మహోద్యమసఫలతకు బలమైన ఉపకరణాలుగా పాండవులను ఉపయోగించదలచాడు శ్రీకృష్ణుడు. అందుచేత ఆ సందర్భంలో ఆ మహానుభావుడు పాండవులను వీడ్కొని వెళ్ళే కార్యక్రమం, విపులంగా, విలంబంగా సాగటం సహజమే. సంస్కృతభారతవర్ణన ఒకవిధంగా సందర్భోచితమే. కాని, పాఠకుడిదృష్టి ఆ సందర్భంలో అపూర్వసభానిర్మాణానికై

బయలుదేరిన మయునివెంట వెళ్తుందిగాని, పాండవులదగ్గర సెలవుతీసికొనే శ్రీకృష్ణుడికార్యక్రమంమీద నిలవదు. అందువలననే నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తికోసం ఒక్కవాక్యంలో ఆ వీడ్కోలుకార్యక్రమాన్నంతా ముగించి, మయుని అపూర్వసభానిర్మాణాన్ని మనోహరంగా విపులీకరించి వర్ణించాడు. ప్రసన్నకథాకలితార్థయుక్తి అంటే ప్రసన్నాలైన కథలలో కూర్చబడిన అర్థంయొక్క యుక్తి (కూడిక) అనికూడ చెప్పవచ్చును. కథాకథనంలో ప్రధానభాగాలు మూడు - చెప్పటం, వర్ణించటం, వివరించటం. చెప్పడంలో సరళత, స్పష్టత, పొందిక ఉండాలి. అప్పుడుగాని కథకు ప్రసన్నతాగుణం కలుగదు. కాని ఒక్క ప్రసన్నతాగుణంతోమాత్రమే కథ రక్తి కట్టదు. కథాకథనంలో అనేక చమత్కారవర్ణనలు, అవసరమైన వివరణలు సందర్భోచితాలుగా చోటుచేసికొనాలి. అప్పుడుగాని కథకు అర్థయుక్తి అమరదు; కథ గొప్పగా రక్తి కట్టదు. అప్పుడుగాని అది ఉపదేశం చక్కగా నిర్వహించదు. కాని పెక్కుమంది కథకులకు - ఈవర్ణనకు, వివరణకు సంబంధించిన అర్థయుక్తిమీదనే ప్రలోభం మెండు. అర్థయుక్తి ఏమాత్రం మితిమీరినా కథా ప్రసన్నత దెబ్బతినక మానదు. అందుచేత కథాకథనంలో - కథ చెప్పటానికి, చమత్కారంగా వర్ణించటానికి, వివిధ కథాంశాలను, ధర్మసూక్ష్మాలను వివరించటానికి చక్కని సమన్వయం, సరైన నిష్పత్తి ఉంటేగాని కథ ప్రసన్నంగా సాగజాలదు; రసమయమై రక్తి కట్టనేరదు; ఉపదేశయుతమై సార్థకం కాలేదు. నన్నయ ఉత్తమకథకుడు. ఆయన మహాభారతకావ్యం ప్రసన్నకథాకలితార్థయుక్తి విశిష్టం.

సీ. **ఎందేని సర్వభూతేశుండు సృజియించె । సచరాచరములైన జగము లెల్ల,**
గంగఁ బ్రత్యక్షంబు గావింప నెందేనిఁ । గృతవాసుఁ డయ్యె భగీరథుండు.
నలినసంభవ నరనారాయణస్థాణు । వాసవప్రభృతి గీర్వాణముఖ్యు
లెందేనిఁ గ్రతువు లనేకయుగంబులఁ । జేసిరి, రత్నవిచిత్ర వితత

ఆ. **చైత్యములు మహా విశాల హిరణ్మయ । యూపతతులు నోలి నొప్పు చుండ,**
నట్టి బిందుసరమునందున్న వివిధర । త్నోపకరణచయము లొనరఁ గొనియె. 9

ప్రతిపదార్థం: ఎందు+ఏనిన్= ఎక్కడైతే; సర్వ, భూత+ఈశుండు= అన్నిభూతాలకు (పృథివ్యాదిపంచభూతాలు, సమస్తప్రాణులు, ప్రమథగణాలు మొదలయినవాటికి) ప్రభువైన పరమేశ్వరుడు; స, చర+అచరములు+ఐన= కదలిక గలవి, కదలికలేనివి అయిన వస్తువులతో కూడిన; జగములు+ఎల్లన్= లోకాలనన్నింటిని; సృజియించెన్= పుట్టేటట్లు చేశాడో; ఎందు+ఏనిన్= ఎక్కడైతే; గంగన్= గంగను; ప్రత్యక్షము, కావింపన్=అగుపడేటట్లుచేయటానికి; భగీరథుండు= సగరుడి మున్మనుమడు; కృతవాసుఁడు+అయ్యెన్= ఏర్పరచుకొన్ననివాసం కలవాడయ్యాడో- అంటే నివాసం ఏర్పరచుకొన్నాడో!; ఎందు+ఏనిన్= ఎక్కడైతే; రత్న, విచిత్ర, వితత, చైత్యములు= రత్నాలచేత విచిత్రాలై- అంటే తమ రంగురంగుల కాంతులతో ఆశ్చర్యాన్నిగొలిపేవై, విశాలాలైనయజ్ఞశాలలు; మహా, విశాల, హిరణ్మయ, యూప, తతులున్= మిక్కిలి విశాలాలై, బంగారుతో చేయబడి, బలిపశువును, బంధించటానికి నాటబడిన స్తంభాల సమూహాలు; ఓలిన్= వరుసగా; ఒప్పుచున్+ఉండన్= ప్రకాశిస్తుండగా; నలిన సంభవ, నర, నారాయణ, స్థాణు, వాసవ, ప్రభృతి, గీర్వాణ, ముఖ్యులు= బ్రహ్మ, నరుడు, నారాయణుడు, శివుడు, ఇంద్రుడు మొదలైన ముఖ్యులైన దేవతలు; అనేక, యుగంబులన్= ఎన్నో యుగాల్లో; క్రతువులు= యజ్ఞాలు; చేసిరి; అట్టి= అలాంటి; బిందుసరము+అందు+ఉన్న= బిందుసరం అనే సరోవరంలో ఉన్న; వివిధ, రత్న+ఉపకరణ, చయములు= అనేకవిధాలైన రత్నాలతో కూడిన సాధనాల సమూహాలు; ఒనరన్= ఒప్పుగా- చక్కగా; కొనియెన్= తీసికొన్నాడు.

తాత్పర్యం: ఎక్కడ పరమేశ్వరుడు చరాచరాలైన సర్వలోకాలను సృజించాడో, ఎక్కడ భగీరథుడు గంగావతరణకు ప్రయత్నం చెయ్యా లని తనస్థానాన్ని ఏర్పరచుకొన్నాడో, ఎక్కడ రత్నకాంతులతో చిత్రవిచిత్రాలైన విశాల యజ్ఞశాలలు, బలిపశువుల్ని బంధించటానికి నాటిన సువిశాలసువర్ణస్తంభాలు ప్రకాశిస్తుండగా బ్రహ్మ, నర, నారాయణ, శివ,

దేవేంద్రాది దేవతాముఖ్యులంతా ఎన్నో యుగాలు యజ్ఞాలు చేశారో - అలాంటి బిందుసర సరోవరంలో ఉన్న వివిధరత్నసాధనసమూహా లన్నింటిని మయుడు గ్రహించాడు.

విశేషం: అలం: ఉదాత్తం. నన్నయ వడివడిగా కథ నడపటానికీ, దేనినైనా విపులంగా వర్ణించటానికీ సామాన్యంగా సీసాన్ని స్వీకరిస్తాడు. ఇది ఒక వర్ణనాత్మకసీసం. బిందుసరంయొక్క మనోహరవర్ణనం. నలినసంభవుడు - (నలినము అంటే కమలం) విష్ణుమూర్తి నాభికమలంనుండి పుట్టినవాడు - బ్రహ్మ, నరనారాయణులు - బదరీవనంలో చాలకాలం తపస్సుచేసిన ఋషులు, నరుడు అర్జునుడుగా, నారాయణుడు కృష్ణుడుగా అవతరించా రని పురాణగాథ, స్థాణువు - ప్రళయకాలంలో కూడ చలనంలేకుండ స్థిరంగా నిలచిఉండేవాడు - శివుడు. వాసవుడు - వసువులు (అంటే రత్నాలు) కలవాడు - ఇంద్రుడు.

క. దేవబ్రాహ్మణులకు నా । నావిధపూజనలఁ దర్పణము సేసి ధరి
త్రీవనిత కపూర్వశ్రీఁ । గావింపఁ దొడంగె మయుఁడు గడు రమ్యముగన్. 10

ప్రతిపదార్థం: మయుఁడు; దేవ, బ్రాహ్మణులకున్= దేవతలకు, బ్రాహ్మణులకు; నానావిధ, పూజనలన్= అనేక విధాలైన పూజలచేత; తర్పణము+చేసి= తృప్తి కావించి; ధరిత్రీ, వనితకున్= భూమిఅనేకాంతకు(భూదేవికి); అపూర్వ, శ్రీన్= మున్నెన్నడులేనిశోభను - సభారూపమైన అలంకారాన్ని; కడురమ్యముగన్= ఎంతో అందంగా; కావింపన్= రూపొందించటానికి; తొడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: మయుడు ముందుగా దేవతలను, బ్రాహ్మణులను పూజలతో తృప్తిపరచి, భూకాంతకు అందమైన అపూర్వాలంకారంగా సభా నిర్మాణానికి పూనుకొన్నాడు.

విశేషం: మహాకార్యారంభాలకు ముందు దేవబ్రాహ్మణపూజలు చెయ్యటం ఆర్షసంప్రదాయం.

క. విమల మణిమయము లగు దూ । లములం గంబముల గోడలను వేదులఁ గు
ట్టిమములఁ జుట్టిన ప్రాకా । రములను గర మొప్పచుండ రచియించె సభన్. 11

ప్రతిపదార్థం: విమల, మణిమయములు+అగు= స్వచ్ఛమైన మణులతో కూడినవయిన; దూలములన్= దూలాలతో; కంబములన్= స్తంభాలతో; గోడలను= గోడలతో; వేదులన్= అరుగులతో; కుట్టిమములన్= రాతికట్టడపుప్రదేశాలతో; చుట్టిన, ప్రాకారములను= చుట్టును వ్యాపించిన ప్రహరిగోడలతో; కరము+ఒప్పుచు+ఉండన్= మిక్కిలిప్రకాశిస్తుండగా; సభన్; రచియించెన్= నిర్మించాడు.

తాత్పర్యం: నిర్మలమణిమయాలైన దూలాలతో, స్తంభాలతో, గోడలతో, అరుగులతో, రాతికట్టడపుప్రదేశాలతో, ప్రహరిగోడలతో ఎంతో అందమైన సభను మయుడు నిర్మించాడు.

విశేషం: పై పద్యంలో ద్వితీయావిభక్తి ప్రత్యయమైన 'ను', తృతీయావిభక్త్యర్థంలో ఉంది - ఒక విభక్తికి మరో విభక్తి.

వ. మఱియును. 12

తాత్పర్యం: అంతేకాక.

సీ. **సురుచిరహరినీలకిరణజలంబులఁ । బద్మరాగారుణపద్మములను**
రాజితరాజీవరాజహంసావళి । నిర్మలసౌవర్ణకూర్మములను
గమనీయవైదూర్యకుముదంబులను వజ్ర । మీనమౌక్తికనవఫేనములను
మరకతశైవలోత్కరముల విలసిల్లఁ । గొల నని సన్మణిస్థలము చూచి

ఆ. **పలుఁగురాలకుడ్యముల రుచుల్ గప్పిన । జలము లున్నయెడల వెలయఁ జూచి**
యననుపస్థలంబు లని జను లెఱుఁగక । యుండునట్లుగా మయుండు సేసె. **13**

ప్రతిపదార్థం: సు, రుచిర, హరినీల, కిరణ, జలంబులన్= మంచికాంతులు గల ఇంద్రనీలమణులయొక్క కిరణాలు అనే నీళ్ళతో; పద్మ, రాగ+అరుణ, పద్మములను= పద్మరాగమణులతో చేసిన ఎర్రనిపద్మాలతో; రాజిత, రాజీవ, రాజహంస+ఆవళిన్= (ఇక్కడ రాజత అనేపాఠం యుక్తం - అప్పుడు రజతసంబంధమైన - అంటే వెండితో చేసిన అని చెప్పవచ్చు) ప్రకాశించే తెల్లతామరలయొక్క, రాజహంసలయొక్క సమూహంతో; నిర్మల, సౌవర్ణ, కూర్మములను= మాలిన్యం లేని మేలిమిబంగారుతో చేసిన తాబేళ్ళతో; కమనీయ, వైదూర్య, కుముదంబులను= మనోహరాలైన వైదూర్యాలతో చేసిన కలువలతో; వజ్ర, మీన, మౌక్తిక, నవఫేనములను= వజ్రాలతో చేసిన చేపలతో, ముత్యాలతో రూపొందించిన క్రొత్తనురుగులతో; మరకత, శైవల+ ఉత్కరములన్= మరకతమణులతో కూర్చిన నాచుసమూహాలతో; విలసిల్లన్= ఒప్పుచుండిన; సత్+మణి, స్థలము, చూచి= మంచిమణులు పొదిగినప్రదేశాన్ని చూచి; కొలను, అని=కొలను అనుకొని, పలుఁగు, రాల, కుడ్యముల, రుచుల్= స్ఫటికపురాళ్ళగోడలయొక్క కాంతులు; కప్పిన= మీదికి వ్యాపించిన; జలములు+ఉన్న+ఎడలన్= నీళ్ళుండే ప్రదేశాలను; వెలయన్+చూచి= ప్రకాశిస్తుండగా చూచి; (ఇక్కడ 'పులుగురాల కుడ్యముల రుచుల్' అనే పాఠాంతరంగూడ ఉంది - పులుగురాలు అంటే గరుడపచ్చరాళ్ళు, గరుడపచ్చలకాంతులు ముదురు ఆకు పచ్చగా ఉంటాయి. అది నీళ్ళరంగుకు దగ్గరరంగు. నీళ్ళు లేని ప్రదేశ మని అనిపించాలి కాబట్టి 'పలుగురాలు' అనే పాఠమే ఉచితం); అననుప, స్థలంబులు+అని= నీరు లేని ప్రదేశా లని; (అనుపము= జలప్రాంత ప్రదేశం, న+అనుపము= నీరులేని ప్రదేశం); (ఇచ్చట 'అనుపమస్థలము' లని ఒక పాఠాంతరం ఉంది. 'అనుపమస్థలా' లంటే చక్కని, చదునైన స్థలాలని అర్థం. అందువల్ల ఇదికూడ పరిగణించదగినపాఠమే); జనులు+ఎఱుఁగక+ఉండు+అట్లుగాన్= జనులు తెలిసికొనలేకుండ ఉండేటట్లుగా; మయుండు; చేసెన్= సభను నిర్మించాడు.

తాత్పర్యం: ఇంద్రనీలమణుల కిరణా లనే నీళ్ళతో, పద్మరాగమణులతో చెక్కిన ఎర్రనిపద్మాలతో, వెండితో చేసిన తెల్లతామరలతో, రాజహంసలతో, మేలిమి బంగారుతో పోతపోసిన తాబేళ్ళతో, మనోహరవైదూర్యాలతో మలచిన కలువలతో, వజ్రాలతో చేసిన చేపలతో, ముత్యాలతో కల్పించిన కొంగ్రొత్తనురుగులతో, మరకతాలతో రూపొందించిన నాచులతో ప్రకాశించే మణిమయప్రదేశాలు చూచి అవి నీటిమడుగు లని - స్ఫటికపురాళ్ళగోడల కాంతులు కప్పటంచేత నీళ్ళుండే చోట్లను చూచి నీళ్ళులేనిచో ట్లనీ - జనులు భ్రమపడేటట్లుగా మయుడు సభను నిర్మించాడు.

విశేషం: అలం: ఉదాత్తం, భ్రాంతిమంతం. మయునిశిల్పచాతురి అనుపమానం. ఈ శిల్పచాతురియే దుర్యోధనుని భంగపాటుకు, పాండవులమీద అతనిగుండెలో అప్పటికే గూడుకట్టుకున్న అసూయాద్వేషాలు అంతకంత పెరగటానికి పరోక్ష కారణమైంది. అక్షర రమ్యమైన ఈ పద్యం మయసభా రమణీయత ప్రతిఫలించే మెరుగుటద్దం. నవరత్నాలు - ఇంద్రనీలం, పద్మరాగం, వైదూర్యం, వజ్రం, మౌక్తికం, గోమేధికం, మరకతం, పుష్యరాగం, ప్రవాళం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియు సకలజన మనోహరంబు లైన నానావిధ యంత్రంబులును, ననవరత కుసుమఫలభరితంబు లైన తరువనంబులును, వికచ కమల కుముదాభిరామంబులైన జలాశయంబులును, వివిధ విచిత్ర పతాకావలంబిత తోరణ విటంకప్రదేశంబులునుం గలిగి దశ కిష్కు సహస్ర ప్రమాణవృత్తాయతంబును. సహస్రకర ప్రభా ప్రసర విస్తార విభూతియును వివిధరత్న విభవాభిశోభితంబునుంగా నపూర్వ సభా భవనంబు నందుఁ బదునాలుగు నెలలు నిర్మించి, దాని నెనిమిది వేల రాక్షస కింకరుల మహాకాయుల మహాజవసత్త్వ సంపన్నుల నంతరిక్ష చరులం బనిచి మోపించికొని వచ్చిధర్మరాజున కిచ్చి, గదయును శంఖంబును భీమార్జునుల కిచ్చి, ధర్మరాజుచేత సత్కృతుండయి మయుం డరిగిన. 14

ప్రతిపదార్థం: మఱియున్, సకలజన, మనః+హరంబులు+ఐన= అందరుప్రజలమనస్సుల్ని దోచుకొనేవి అయిన; నానావిధ, యంత్రంబులును= అనేకవిధాలైన యంత్రవిశేషాలున్నూ; అనవరత, కుసుమ, ఫల, భరితంబులు+ఐన= ఎల్లప్పుడు పువ్వులతో, పండ్లతో నిండినవైన; తరువనంబులును= చెట్లతోపులున్నూ; వికచ, కమల, కుముద+అభిరామంబులు+ఐన= వికసించిన కమలాలతో, కలువలతో, మనోహరాలైన; జల+ఆశయంబులును= నీటి మడుగులున్నూ; వివిధ, విచిత్ర, పతాకా+అవలంబిత, తోరణ, విటంక, ప్రదేశంబులును= రకరకాల చిత్రవిచిత్రాలైన జెండాలతో వ్రేలాడగట్టిన తోరణాలతో కూడిన గువ్వల గూళ్ళున్న ప్రదేశాలున్నూ, కలిగి; దశ, కిష్కు, సహస్ర, ప్రమాణ. వృత్త+ఆయతంబును=పదిమూరలకు వెయ్యిరెట్లు - అంటే పదివేలమూరల కొలత ఉండే కైవారంచేత (చుట్టుకొలతచేత) విశాలమైనదియు; సహస్రకర, ప్రభా, ప్రసర, విస్తార, విభూతియును= వెయ్యి కిరణాలు గల సూర్యుని కాంతిప్రసారంచేత ఎక్కువైన వైభవంకలదియున్నూ; వివిధ, రత్న, విభవ+అభిశోభితంబునున్+కాన్= రకరకాలైన రత్నకాంతులతో మిక్కిలిశోభిల్లేది అయ్యేటట్లుగా; అపూర్వసభాభవనంబున్= ఇంతకుముం దెన్నడు లేనట్టి సభాభవనాన్ని; అందున్= అక్కడ - బిందుసరోవరందగ్గర; పదునాలుగు నెలలు; నిర్మించి; దానిన్= ఆ సభాభవనాన్ని; ఎనిమిదివేలరాక్షస, కింకరులన్= ఎనిమిదివేలమంది రాక్షసభటులను; మహాకాయులన్= పెద్దశరీరాలు కలవాళ్ళను; మహా, జవ, సత్త్వ, సంపన్నులన్= గొప్పవేగం, బలం అధికంగా కలవాళ్ళను; అంతరిక్షచరులన్= ఆకాశంలో తిరిగేవాళ్ళను; పనిచి= నియమించి; మోపించికొని; వచ్చి; ధర్మరాజునకున్; ఇచ్చి; గదయును; శంఖంబును; భీమ+అర్జునులకున్+ ఇచ్చి; ధర్మరాజుచేతన్; సత్, కృతుండు+అయి= సమ్మానించబడినవాడై; మయుండు; అరిగినన్= వెళ్ళగా.

తాత్పర్యం: అపురూపమైన ఆ సభాభవనంలో మయుడు మనోహరాలైన అనేక యంత్రాలు అమర్చాడు. ఎప్పుడూ పూలతో, పండ్లతో కనులపండువుగా కనిపించే చెట్లతోపులను రూపొందించాడు. పూచిన తామరలతో, విచ్చిన కలువలతో కళకళలాడే కొలనులు కల్పించాడు. చూడ ముచ్చటగా వ్రేలాడే రకరకాల పతాకాల తోరణాలతో కూడి గువ్వల గూళ్ళున్న ప్రదేశాలు ఏర్పాటుచేశాడు. పదివేల మూరల చుట్టుకొలతతో సువిశాలమై, సూర్యకిరణప్రసారంతో వైభవోపేతమై, వివిధరత్నకాంతులతో విశేషంగా శోభిల్లే ఆ సభాభవనాన్ని బిందుసరం దగ్గర పదునాలుగునెలలు పరిశ్రమించి నిర్మించాడు. పెద్దశరీరాలతో, అమితవేగంతో అత్యధికబలంతో ఆకాశాన సంచరించే ఎనిమిదివేలమంది రాక్షసభటులచేత ఆ భవనాన్ని మోయించి తెచ్చి ధర్మరాజుకు ఇచ్చాడు. భీమునికి గదను, అర్జునునికి శంఖాన్ని అందించాడు. ధర్మరాజుచేత సన్మానంపొంది వెళ్ళాడు.

విశేషం: ఈ వచనరచన నన్నయ అక్షరరమ్యతకు చక్కని ఉదాహరణ. ఏ ఉద్దేశంతో ఆ జగన్నాటక సూత్రధారి శ్రీకృష్ణుడు ఈసభను నిర్మించుమన్నాడో, ఏ ముహూర్తంలో మయుడు దీనిని నిర్మించి తెచ్చాడో కురుపాండవ వైరవృద్ధికి ఇది పెద్దగా దోహదం చేసింది. విశేష్యం తరువాత విశేషణాలు వాడే సంప్రదాయం సంస్కృతంలో ఉన్నది. ఆ సంప్రదాయంప్రకారమే

నన్నయ రాక్షస కింకరులు అనే విశేష్యం తరువాత వరుసగా మూడువిశేషణాలు ప్రయోగించటం జరిగింది. (తెలుగులో మయసభావర్ణన సందర్భాలకు నన్నయవర్ణనం మార్గదర్శకం. అంతేకాదు ఆంధ్రులకు ఎంతో ప్రీతిపాత్రమైన దుర్యోధనుడి ఏకపాత్రాభినయ మనే ఆంధ్రుల రూపకప్రక్రియలో వాచికాభినయానికి నన్నయరచనయే ప్రేరకం. -సంపా.).

ధర్మరాజు సభాప్రవేశము కావించుట (సం. 2-4-1)

ఉ. వీరుఁడు ధర్మజుండు పదివేవురు విప్రుల కొప్పఁ బాయసా
హారము భక్తిఁ బెట్టి మఱి యందఱకుం జెఱు వేయునేసి వి
స్తారయశుండు ధేనువుల ధర్మవిధిన్ మణి ముద్రికాద్యలం
కార దుకూల పుష్పఫల గంధయుతంబుగ నిచ్చి లీలతోన్. 15

ప్రతిపదార్థం: వీరుఁడు; విస్తార, యశుండు= విరివిగా వ్యాపించిన కీర్తి కలవాడు; (అయిన); ధర్మజుండు; పదివేవురు= పదివేలమంది; విప్రులకున్= బ్రాహ్మణులకు, ఒప్పన్= తగినట్లుగా; పాయస+ఆహారము= పాయసంతోకూడినభోజనం; భక్తిన్= భక్తితో; పెట్టి; మఱి= ఇంకా; అందఱకున్; చెఱు= ఒక్కొక్కరికి, ('చెఱి' అని శబ్దరత్నాకరం); వేయున్+ఏసి= వెయ్యివంతున; ధేనువులన్= ఆవులను; మణి, ముద్రికా+ఆది+అలంకార, దుకూల, పుష్ప, ఫల, గంధ, యుతంబుగన్= మణులు పొదిగిన ఉంగరాలు మొదలైన ఆభరణాలతో, సన్నని వస్త్రాలతో, పువ్వులతో, పండ్లతో, గంధంతోకూడ; ధర్మవిధిన్= ధర్మపద్ధతితో; లీలతోన్= వేడుకతో; ఇచ్చి= దానం చేసి.

తాత్పర్యం: వీరుడు, విశేషకీర్తిమంతుడు అయిన ధర్మరాజు పదివేలమంది బ్రాహ్మణులకు భక్తితో పాయసాన్నం పెట్టాడు. అంతేకాదు ఒక్కొక్కరికి వెయ్యిగోవులతోపాటు, మణిముద్రికాదులైన ఆభరణాలు, సన్నివస్త్రాలు, పుష్పఫలగంధాలు వేడుకతో దానమిచ్చాడు.

విశేషం: ఈ పద్యం ధర్మజుని దానవీరం ప్రతిఫలించే దర్పణం.

వ. అనుజసహితుం డయి దైవజ్ఞదత్తశుభముహూర్తంబున ధౌమ్యాదిభూసురాశీర్వాదపుణ్యాహనాదంబు లెసంగ సభాప్రవేశంబు సేసి యంత. 16

ప్రతిపదార్థం: అనుజ, సహితుండు+అయి= తమ్ములతో కూడినవాడై; దైవజ్ఞ, దత్త, శుభ, ముహూర్తంబునన్= జ్యోతిశ్శాస్త్రనిపుణులచేత నిర్ణయించ (ఇవ్వ)బడిన శుభసమయాన; ధౌమ్య+ఆది, భూసుర+ఆశీర్వాద, పుణ్యాహనాదంబులు= ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణులయొక్క ఆశీర్వచన, పుణ్యాహవాచన ధ్వనులు; ఎసంగన్= అతిశయిల్లగా; సభా, ప్రవేశంబు= మయసభాప్రవేశాన్ని; చేసి; అంతన్.

తాత్పర్యం: ధర్మరాజు తమ్ములతో కూడి దైవజ్ఞులు నిర్ణయించిన శుభముహూర్తాన ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణుల ఆశీర్వచనపుణ్యాహవాచన మంత్రధ్వనులు మారుమ్రోగుతూ ఉండగా మయసభాప్రవేశం చేశాడు.

విశేషం: ధౌమ్యుడు - పాండవులపురోహితుడు. పుణ్యాహవాచనం - అశుద్ధిని నివారించటానికి, పవిత్రతను సిద్ధింపచేయటానికి, శుభాన్ని కలిగించటానికి పుణ్యాహశబ్దాన్ని మూడుమారులు చెప్పే శుభకర్మం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. మంచిగ భూరి భూసుర సమాజమునెల్లను భక్తితోడఁ బూ
జించి, యభీష్టదానములు సేసి, ధనార్థులఁ దన్పి దిక్కులన్
నించె యశంబు; బంధులకు నెయ్యురకున్ హృదయప్రియంబు గా
వించె విభూతి యేర్పడఁ బవిత్రుఁడు ధర్మసుతుండు నెమ్మితోన్. 17

ప్రతిపదార్థం: పవిత్రుడు, పుణ్యాత్ముడు (అయిన); ధర్మసుతుండు= ధర్మరాజు; మంచిగన్= బాగుగా; భూరి, భూసుర, సమాజమున్+ఎల్లన్= గొప్పబ్రాహ్మణ సమాజాన్నంతా; భక్తితోడన్; పూజించి; అభీష్ట, దానములు= వాళ్ళకు ఇష్టమైనదానాలు; చేసి; ధన+అర్థులన్= ధనం కోరి వచ్చినవాళ్ళను; తనిపి= తృప్తిపొందించి, దిక్కులన్= అన్నిదిశలలోను; యశంబు= కీర్తిని; నించెన్= నింపాడు; విభూతి= ఐశ్వర్యం; ఏర్పడన్= ప్రకాశించే విధంగా; నెమ్మితోన్= ప్రేమతో; బంధులకున్= బంధువులకు; నెయ్యురకున్= స్నేహితులకు; హృదయ, ప్రియంబు= మనస్సుకు సంతోషాన్ని; కావించెన్= చేశాడు.

తాత్పర్యం: పుణ్యాత్ముడైన ధర్మరాజు ఎందరెందరో బ్రాహ్మణుల్ని భక్తితో పూజించాడు. కోరినవాళ్ళకు కోరినదానాలిచ్చి తృప్తిపరచాడు. తనకీర్తి అన్నిదిక్కుల వ్యాపింపజేశాడు. తనఐశ్వర్యం ప్రకాశించేటట్లు ప్రేమతో బంధు మిత్రులకు ఆనందం కలిగించాడు.

విశేషం: క్త్వార్థక, భూతార్థక క్రియాపదాలతో పద్యంలోని మూడు పాదాల మొదట ఉన్న విరుపులు- ధర్మరాజు ఎంత ఉత్సాహంగా, ఎంత వేగంగా ధార్మిక క్రియలు నిర్వహించాడో స్ఫురింపచేసేవిగా ఉన్నాయి. నన్నయ పద్యరచనా శిల్పానికి, ప్రత్యేకించి ఆయన అక్షరరమ్యతకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

వ. తదవసరంబున. 18

తాత్పర్యం: ఆ సమయాన.

మ. మదమాతంగ తురంగ కాంచన లసన్మాణిక్య గాణిక్య సం
పద లోలిం గొని వచ్చి యిచ్చి, ముదమొప్పం గాంచి, సేవించి, ర
య్యుదయాస్తాచల సేతుశీతనగ మధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయున్ ధర్మజుఁ దత్సభాస్థితు జగత్పూర్ణ ప్రతాపోదయున్. 19

ప్రతిపదార్థం: ఆ+ఉదయ+అస్త+అచల, సేతు, శీతనగ, మధ్య+ఉర్వీపతుల్= సూర్యుడు ఉదయించే ఆ పర్వతానికి, అస్తమించే పర్వతానికి, సేతువుకు (దక్షిణపుచివర), హిమవత్పర్వతానికి (ఉత్తరపుచివర) నడుమ ఉండే రాజులందరు - అంటే నేల నాలుగుదిక్కుల్లో ఉన్న రాజులంతా; సంతత+అభ్యుదయున్= ఎడతెగక వృద్ధిపొందే సంపద కలవానిని, జగత్+పూర్ణ, ప్రతాప+ఉదయున్= ప్రపంచమంతా నిండిన పరాక్రమంయొక్క ఔన్నత్యం కలవానిని; తత్+సభా, స్థితున్= ఆ మయసభలో కొలువుదీరినవానిని; ధర్మజున్= ధర్మరాజును; మద, మాతంగ, తురంగ, కాంచన, లసత్+మాణిక్య, గాణిక్య, సంపదలు= మదపుటేనుగులు, గుర్రాలు, బంగారు, మెరిసే మాణిక్యాలు, వేశ్యాసమూహరూపమైనధనాలు; ఓలిన్= వరుసగా; కొనివచ్చి= తీసికొనివచ్చి; ఇచ్చి; ముదము+ఒప్పన్= సంతోషం శోభిల్లగా; కాంచి= చూచి; సేవించిరి= సేవించారు.

తాత్పర్యం: నేల నాలుగు దిక్కుల్లో ఉన్న రాజులంతా - ఎడతెగక వృద్ధిపొందే సంపద కలవాడు, లోకమంతటా నిండిన పరాక్రమంచేత ఔన్నత్యం వహించినవాడు అయిన ధర్మనందనుని సంతోషంతో దర్శించుకొన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మదపుటేనుగుల్ని, గుర్రాల్ని, బంగారాన్ని, మాణిక్యాలను, వేశ్యల్ని ప్రియమార కానుకలుగా సమర్పించుకొని మనసార ఆ మహారాజును సేవించుకొన్నారు.

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం. నన్నయ కవితాశైలికి ఈ పద్య మొక చక్కని ఉదాహరణ. కీర్తిప్రతాపాల వర్ణనకు మత్తేభాన్ని వాడటం వృత్తౌచిత్యానికి నిదర్శనం. నన్నయశైలి సంస్కృతపదబహుళం, సమాసఘటితం, సంధి బంధురం. అలా అని అది వినటానికి కటువైంది కాదు. విశేషించి విన సొంపైంది. మదపుటేనుగు నడకలా ఉదాత్త మనోహరమైంది. అందుచేతనే ఎర్రాప్రెగ్గడ 'నన్నయభట్టకుంజరం బెన్న నిరంకుశోక్తిగతి' అని అన్నాడు. నన్నయ పేర్కొన్న అక్షరరమ్యతకూడ ఇదే. అక్షరాల కూర్పువలన కవితకు కలిగే రమ్యతయే అక్షరరమ్యత. వాఙ్మయంలో అక్షరం విశ్వంలో పరమాణువు లాంటిది. పరమాణువుల కూర్పులోని మార్పు వల్లనే వస్తువైవిధ్యం, పదార్థస్వరూప స్వభావాల్లో తారతమ్యం, అలాగే అక్షరాల కూర్పులోని మార్పు వల్లనే వివిధ పదాలు, అర్థాలు, శైలీభేదాలు ఏర్పడతాయి. పదంలోని శబ్దభాగం ఆపాతమధురం; అర్థభాగం ఆలోచనామృతం. ఆపాతమధురమైన శబ్దసంయోజనమే అక్షరరమ్యత. సామాన్యులచేత ఏ రచననైనా చదివించే మొదటిగుణం ఇదే, శ్రోతను ఆకర్షించే ప్రధానగుణంకూడ ఇదే. అక్షరరమ్యమైన రచన పూర్తిగా అర్థం కాకపోయినా అందలిభావంమాత్రం స్థూలంగా మనస్సుకు స్ఫురిస్తుంది. దీనినే ఆంగ్ల సాహిత్య విమర్శకులు 'Sound echoing the sense' అంటారు. నన్నయ కవితలో ఈగుణం మెండు. సామాన్య పాఠకునికి పై పద్య ప్రతిపదార్థం తెలియకున్నా - ఎందరెందరో రాజులు, ఎన్నెన్నో గొప్ప వస్తువులు, ఎంతో ఎక్కువగా ధర్మరాజుకు ఇస్తున్నా రని మాత్రం సూటిగా స్ఫురించకమానదు. ఆయన వైభవం అత్యధిక మని ధ్వనించక తప్పదు. ఈ పద్యంలోని అక్షరాల కూర్పు, సమాసఘటన అలాంటివి. 'ముదమొప్పన్' అనే విశేషణంకూడ ఇక్కడ గమనింపదగింది. రాజులంతా ఆ కానుకలు తెచ్చి ఇవ్వటంలో ఏవిధమైన బలాత్కారం లేదు, భయం లేదు. అందరూ ఆ ధర్మరాజు ఆధిక్యాన్ని, ఆధిపత్యాన్ని మనఃపూర్వకంగా అంగీకరించి ఆనందంగా తెచ్చి యిస్తున్నారన్న విషయాన్ని ఆ విశేషణం తెలుపుతున్నది. మూలంలో ఎవరెవరు ఏ యే కానుకలు తెచ్చి యిచ్చారో ఎంతో విస్తృతంగా ఉంది. నన్నయ ఆ విస్తృతి నంతా 'అయ్యుదయాస్తాచల...' అన్న ఒక్క సమాసంతో చక్కగా సూచించాడు. (ఇది ఒక గొప్పసంఘటన. రాజులంతా కానుకలన్నీ కుప్పలు పోస్తున్నారు. కలిసి ధర్మరాజును సేవిస్తున్నారు. సేవించేరాజులు ఎవరైనా, ఎందరైనా అందరూ సేవాభావంలో మాత్రం అంతా ఒకటేకదా!. ఈ అర్థసంఘటనను శ్లేష అనే గుణంలో వ్యక్తం చేశాడు నన్నయ. బహుపదాల ఏకవద్భావం శబ్దశ్లేష, మనోహరమైన సన్నివేశసౌందర్యం అర్థశ్లేష, ఆ రెండుగుణాలు కల శ్లేషను వీరరసపోషకమైన ఓజోగుణరంజితంగా పద్యరచనలో ప్రపంచించటం నన్నయశిల్పం. ఓజస్సులో ఒదిగిన శ్లేష నన్నయకు ప్రీతిపాత్రమైన రచనాకళ!- సంపా.)

వ. మఱియును **20**

తాత్పర్యం: అంతేకాక.

సీ. **సుబల మార్కండేయ శునక మౌం జాయన । మాండవ్య శాండిల్య మందపాల**
బక దాల్భ్య రైభ్యక భాలుకి జతుకర్ణ । గౌతమ కౌశిక కణ్వ కుత్స
సావర్ణి పర్ణాద సత్య గోపతి గోప । వేష మైత్రేయ పవిత్రపాణి
ఘటజాను కాత్రేయ కఠకలాప సుమిత్ర । హారీత తిత్తిరి యాజ్ఞవల్క్య.

ఆ. **వాయుభక్ష భార్గవ వ్యాస జైమిని । శుక సుమంతు పైల సువ్రతాదు**
లయిన మునులు నేము నరిగితి మెంతయు । రమ్యమయిన ధర్మరాజుసభకు. **21**

ప్రతిపదార్థం: ఎంతయున్= మిక్కిలి; రమ్యము+అయిన= అందమైన; ధర్మరాజు, సభకున్; సుబల, మార్కండేయ, శునక, మౌంజాయన, మాండవ్య... సువ్రత+ఆదులు+ఐన= సుబలుడు, మార్కండేయుడు, శునకుడు, మౌంజాయనుడు, మాండవ్యుడు, సువ్రతుడు-మొదలయిన; మునులున్; ఏమున్= మేముకూడ; (అంటే ఉగ్రశ్రవసుడు ఆయన అనుచరులు); అరిగితిమి= వెళ్ళాము.

తాత్పర్యం: సుబల మార్కండేయ శునక మౌంజాయన మాండవ్య సువ్రతాది మహామునులు, మేము ఎంతో అందమైన ఆ ధర్మరాజుసభకు వెళ్ళా మని ఉగ్రశ్రవసుడు ఆ శౌనకాదిమహర్షులకు చెప్పాడు.

విశేషం: మునులపేర్ల విషయంలో భిన్నప్రతుల్లో భేదా లున్నాయి. మునులపేర్లను పట్టీగా చెప్పే ఈ సీసపద్యరచన ఉత్తమకవితగా చెప్పలేము కాని, ఉత్తమకథనశిల్ప మని చెప్పవచ్చును. ఈ పేర్లు వచనంలో చెప్పితే నీరసంగా ఉండేది. ఉగ్రశ్రవసుడు కథకుడు. ఆతడుకూడా అంతమంది మునులతో కలిసి వెళ్ళాడు. అందువలన అతని ఆత్మీయత ఇందులో ఉన్నది. తనతోపాటు ఎందరో మహర్షులను ఆకర్షించిన ఆ సభావైభవాన్ని చెప్పదలచుకొన్నాడు. మహర్షులవరుస వస్తుధ్వనిగా మారింది. ద్రష్టలైన ఋషులు దర్శించా లని కోరుకొన్న ధర్మరాజుసభ పరమపూజ్య మని ధ్వని. పేర్లనుకూడా కథార్థప్రయోజనంకొరకు ఒకవరుసగా చెపితే అది ఉక్తివైచిత్ర్య మౌతుంది. బహుపదాలు ఏకవద్భావం పొంది శ్లేషమనే శబ్దగుణం రాణించింది. పద్యం దీర్ఘసమాసభూయిష్ఠమైనా గాఢబంధత్వంకంటె మసృణత్వం రాణించింది. శ్లేషగుణం ఓజస్సులో ఒదిగిన రచన ఇది. ఇటువంటి రచనను తరువాతి కవు లాయాసందర్భాలలో సార్థకంగా వాడుకొన్నారు. (సంపా.)

వ. **అమ్మహామునుల నెల్ల నతిభక్తిం బూజించి లబ్ధాశీర్వచనుండై ధర్మతనయుండు వారలవలన ధర్మకథలు వినుచుఁ దమ్ములుం దానును సుఖంబుండునంత నొక్కనాఁడు.** **22**

ప్రతిపదార్థం: ఆ+మహామునులన్+ఎల్లన్= ఆ మహామునుల నందరిని; అతిభక్తిన్= మిక్కిలిభక్తితో; పూజించి; లబ్ధ+ ఆశీర్వచనుండు+ఐ= పొందబడిన ఆశీర్వచనం కలవాడై; ధర్మతనయుండు; వారలవలనన్= ఆ మహర్షులవలన; ధర్మకథలు= ధర్మసంబంధాలైన కథలు; వినుచున్; తమ్ములున్; తానును; సుఖంబు+ఉండు+అంతన్= సుఖంగా ఉండగా; ఒక్కనాఁడు= ఒక్క రోజు.

తాత్పర్యం: ధర్మరాజు ఆ మహామును లందరిని అతిభక్తితో పూజించాడు. వాళ్ళ ఆశీర్వచనాలు పొందాడు. ఆ మహర్షులు చెప్పే ధర్మకథలు వింటూ తమ్ముళ్లతో కలిసి తాను సుఖంగా ఉండగా- ఒకనాడు

విశేషం: సుఖము+ఉండు-ప్రథమావిభక్తికి తృతీయార్థ ప్రయోగం - సుఖంతో ఉండు. ధర్మజుడు మహర్షులను ఎప్పుడు కలిసినా వాళ్ళవల్ల ధర్మకథలు, పుణ్యకథలు వినటం ధర్మరాజుస్వభావం. ఆ మహారాజుజ్ఞానతృష్ణ అపారం.

నారదుఁడు పాండవులయొద్దకు వచ్చుట (సం. 2-5-2)

ఉ. **నీరజమిత్త్రుఁ డేల ధరణీగతుఁ డయ్యెడు నొక్కొ యంచు వి**
స్మేర మనస్కులై జనులు మెచ్చి నిజద్యుతి చూచుచుండఁగా
నారదుఁ డేఁగుదెంచె గగనంబుననుండి సురేంద్రమందిర
స్ఫారవిలాసహాసి యగు పార్థగృహంబునకుం బ్రియంబునన్. **23**

ప్రతిపదార్థం: నీరజమిత్త్రుఁడు= నీటిలోపుట్టిన పద్మాలకు స్నేహితుడైన సూర్యుడు; ఏల= ఎందుచేత; ధరణీగతుఁడు+అయ్యెడున్+ ఒక్కొ= నేలకు దిగివస్తున్నాడో; అంచున్= అంటూ; విస్మెర, మనస్కులు+ఐ= ఆశ్చర్యంతోకూడుకొన్నమనస్సుకలవారై; మెచ్చి; నిజద్యుతిన్= తనయొక్కకాంతిని; చూచుచున్+ఉండఁగాన్: నారదుఁడు; గగనంబుననుండి= ఆకాశంనుండి; సుర+ఇంద్ర, మందిర, స్ఫార, విలాస, హాసి= దేవతలరాజైన దేవేంద్రునిభవనంయొక్క విస్తారమైన శోభను ఎగతాళి చేసేది; అగు; పార్థ, గృహంబునకున్= పృథ(కుంతీదేవి) పుత్రుడైన ధర్మరాజు ఇంటికి (పార్థనామంతో ప్రసిద్ధుడు అర్జునుడే అయినా-ఇక్కడ- నారదుడు పృథ పుత్రుడైన ధర్మరాజు ఇంటికి వచ్చా డనటమే ఎక్కువ ఉచిత మనిపిస్తుంది. యజమాని ధర్మరాజుకదా); ప్రియంబుననన్= ప్రీతితో; ఏఁగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: సూర్యు డేల నేలకు దిగి వస్తున్నాడో! అని తన దేహకాంతిని చూచి జనులంతా ఆశ్చర్యపడుతుండగా- నారదమహర్షి, ఆకాశంనుండి - దేవేంద్రుని గృహశోభనే గేలిచేసే ధర్మరాజు గృహానికి ఎంతో ప్రీతితో వచ్చాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. బ్రహ్మమానసపుత్రుడైన ఆ నారదమహర్షి తేజస్సు ఎంత ఎక్కువో ఈ ఉత్ప్రేక్షతో నన్నయ భావుకులకు ప్రత్యక్షం చేశాడు. "నారదః సుమహాతేజాః..." అనే సంస్కృతాని కిది పెంపు. అక్షరరమ్యమైన ఈ పద్యగుణం మాధుర్యం.

క. తన పిఱుఁద ధర్మ సంబో । ధన వాంఛను వచ్చు దేవతా ఖచర మహా
మునివరులఁ దపనమార్గం । బునఁ గ్రమ్మఱఁ బంచె బ్రహ్మపుత్త్రుఁడు నెమ్మిన్. 24

ప్రతిపదార్థం: బ్రహ్మపుత్త్రుఁడు= బ్రహ్మదేవునికుమారుడైన నారదుడు; తన, పిఱుఁదన్= తన వెనుక; ధర్మ సంబోధనవాంఛను= ధర్మబోధను వినాలనే కోరికతో; వచ్చు; దేవతా, ఖచర, మహామునివరులన్= దేవతలను, ఆకాశసంచారులను, మహాముని శ్రేష్ఠులను; తపనమార్గంబునన్= ఆకాశమార్గంలోనే; నెమ్మిన్= ప్రేమతో; క్రమ్మఱన్+పంచెన్= త్రిప్పిపంపాడు.

తాత్పర్యం: బ్రహ్మపుత్రుడైన నారదుడు, తన ధర్మబోధ వినా లని వెంటవస్తున్న దేవతల్ని, ఆకాశసంచారుల్ని, మహామునిశ్రేష్ఠుల్ని - ఆకాశమార్గాననే త్రిప్పిపంపాడు.

వ. పర్వతపారిజాతరైవత సుముఖు లను మహామునులతో నిట్లు వచ్చిన నారదమహామునికిం బ్రత్యుద్గతుండయి ధర్మరాజు దమ్ములుం దానును నమస్కరించి తోడ్కొని తెచ్చి యున్నతాసనంబున నునిచి యడుగులు గడిగి, యర్ఘ్యపాద్యాదివిధులం బూజించిన, వారల కుశలం బడిగి నారదుఁడు రాజనీతి విషయంబుల నయ్యుధిష్ఠిరు ని ట్లని యడిగె. 25

ప్రతిపదార్థం: పర్వత, పారిజాత, రైవత, సుముఖులు+అను మహామునులతోన్= ఈ మహామునులు నలుగురితోమాత్రమే కలిసి; ఇట్లు= ఈవిధంగా; దివినుండి= ఆకాశంనుండి; భువికిన్= భూమికి; దిగివచ్చిన; నారదమహామునికిన్; ప్రతి+ ఉద్గతుండు+ఐ= లేచి ఎదురేగినవాడై; ధర్మరాజు; తమ్ములన్; తానును; నమస్కరించి; తోడ్కొని, తెచ్చి= ఆహ్వానించి వెంటతీసికొని వచ్చి; ఉన్నత+ఆసనంబునన్= ఎత్తయినపీఠంమీద; ఉనిచి= కూర్చుండబెట్టి; అడుగులు= పాదాలు; కడిగి; అర్ఘ్య, పాద్య+ఆది, విధులన్= పూజకు తగినపూలు, అక్షతలు మొదలైనవాటిని సమర్పించటం, పాదాలమీద నీటిని చల్లి ఆ నీటిని శిరస్సుపై చల్లుకోవటం మొదలైన పూజా పద్ధతులతో; పూజించినన్= పూజించగా; వారల= ఆ పాండవులయొక్క; కుశలంబు= క్షేమవిశేషాలు; అడిగి; రాజనీతి, విషయంబులన్= రాజనీతి విశేషాలగురించి; ఆ+యుధిష్ఠిరున్= ఆ ధర్మరాజును, ఇట్లు+అని; అడిగెన్.

తాత్పర్యం: పర్వత పారిజాత రైవత సుముఖ లనేమహర్షులతో కలిసి వచ్చిన నారదమహామునికి ధర్మరాజు తమ్ములతో కూడ ఎదురేగి నమస్కరించాడు. ఆహ్వానించి వెంటగొని వచ్చి ఉన్నతాసనంమీద కూర్చుండబెట్టాడు. అర్ఘ్యపాద్యాది పూజావిధానాలతో పూజించాడు. నారద మహర్షి పాండవు లందరిని కుశల మడిగాడు. ప్రత్యేకించి ధర్మరాజుతో రాజనీతి విషయాలు ప్రస్తావించాడు.

నారదుఁడు ధర్మరాజును రాజనీతివిషయంబులం గొన్నింటి నడుగుట (సం. 2-5-7)

సీ. **మీ వంశమున నరదేవోత్తములదైన । సద్ధర్మమార్గంబు సలుపుదయ్య?**
ధర్మవిదుండవై ధర్మార్థకామంబు । లొండొంటి బాధింపకుండ నుచిత
కాల విభక్తముల్ గా లీల సేవింతె? । ధర్మువునంద చిత్తంబు నిలిపి
యిమ్ముల నపరరాత్రమ్ములం దెప్పుడుఁ । జింతింతె నిజబుద్ధిఁ జేయఁదగిన

ఆ. **రాజకృత్యములఁ? దిరంబుగా నిఖిల ని । యోగ వృత్తులందు యోగ్యులయిన**
వారిఁ గరము గారవమ్మునఁ బంచితె । నీవు వారిదైన నే ర్పెఱింగి. **26**

ప్రతిపదార్థం: మీ, వంశమునన్; నరదేవ+ఉత్తముల+అది+ఐన= రాజశ్రేష్ఠులదైన; సత్+ధర్మ, మార్గంబు= మంచిధర్మపద్ధతిని; సలుపుదు+అయ్య= ఆచరిస్తున్నావుకదా!; ధర్మవిదుండవు+ఐ= ధర్మంతెలిసినవాడివై; ధర్మ+అర్థ+కామంబులు= ధర్మం, అర్థం, కామం అనే మూడుపురుషార్థాలు; ఒండు+ఒంటి= ఒకదాన్ని ఒకటి; బాధింపక+ఉండన్= బాధించకుండా; ఉచితకాలవిభక్తముల్= ఆయాకాలాలకు తగినట్లు విభజించబడినవి; కాన్=కాగా; లీల= సంతోషంగా; సేవింతె (సేవింతువు+ఎ)= సేవిస్తున్నావుకదా!; ధర్మువు+అందు+అ= ధర్మమందే; చిత్తంబు= మనస్సును; నిలిపి; ఇమ్ములన్= ప్రీతిగా; ఎప్పుడున్= ఎల్లప్పుడు; అపర, రాత్రమ్ముల+అందున్= రాత్రి ఉత్తరభాగంలో- అంటే అర్ధరాత్రి తరువాత; నిజ, బుద్ధిన్= స్వబుద్ధిచేత; చేయన్+తగిన; రాజకృత్యములన్= రాజకార్యాలను; చింతింతె (చింతింతువు+ఎ)= ఆలోచిస్తున్నావుకదా! తిరంబుగాన్= స్థిరంగా; నిఖిల, నియోగ, వృత్తుల+అందున్= అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో; యోగ్యులు+ఐన= తగిన; వారిన్= వాళ్ళను; వారిది+ఐన; నేర్పు+ఎఱింగి= సామర్థ్యాన్ని తెలిసికొని; కరము= మిక్కిలి; గారవమ్మునన్= గౌరవభావంతో; నీవు; పంచితే (పంచితివి+ఏ)= నియమించావుకదా!

తాత్పర్యం: మీవంశంలో జన్మించిన రాజశ్రేష్ఠులు ఏర్పరచిన ధర్మపద్ధతిని తప్పక ఆచరిస్తున్నావుకదా! ధర్మాన్ని తెలుసుకొని, ధర్మార్థకామాలు ఒకదాని నొకటి బాధించకుండ, కాలోచితాలుగా వాటిని విభజించుకొని సేవిస్తున్నావుకదా! ధర్మమందే మనస్సు నిలిపి, చేయదగిన రాజకార్యాల్ని స్వబుద్ధితో ఎల్లప్పుడూ అర్ధరాత్రి దాటిన తరువాతే ఆలోచిస్తున్నావుకదా! ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరంగా యోగ్యులైన వాళ్ళను, వాళ్ళ వాళ్ళ శక్తి సామర్థ్యాల్ని గుర్తించి గౌరవభావంగా, స్థిరంగా నియమించావుకదా!

విశేషం: పురుషార్థాలు ధర్మార్థకామమోక్షాలు. వీటిలో అర్థకామాలు ఐహిక సంబంధులు. మోక్షం పరలోక సంబంధి. అర్థకామాలు ఐహిక సంబంధులే అయినా, మానవుని ఐహిక జీవితమంతా ఈ అర్థకామాల చుట్టే తిరుగుతూ ఉన్నా అవి ధర్మబద్ధాలయితేనేకాని మోక్షసాధనకు తోడ్పడవు. ధర్మానికి దూరమయితే అవి పాపహేతువులౌతాయి. నరకానికి త్రోవతీస్తాయి. అందుకే పురుషార్థాల్లో అర్థకామాలకు ముందు ధర్మాన్ని చెప్పటం జరిగింది. మానవుడు తన ఐహిక జీవితంనుండి మోక్షాన్ని అధిరోహించటానికి మంచి నిచ్చెన ధర్మం. 'ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ' ('అర్జునా! ప్రాణుల్లో ధర్మవిరుద్ధం కాని కామాన్ని నేనే') అనే గీతావాక్యంకూడ ఇచ్చట గుర్తించదగింది. "చువర్ణంబుతోడి దుగ్దకారం తకారం" అవుతుంది కనుక, సేవించుదువు,

చింతించుదువు- సేవింతువు, చింతింతువు - అవుతాయి. భూతతద్ధర్మార్థ క్రియల్లో వకారం లోపించవచ్చు కనుక సేవింతువు+ఎ= సేవింతె, చింతింతువు+ఎ= చింతింతె, పంచితివి+ఎ= పంచితె - అయ్యాయి.

క. అనఘుల శాస్త్ర విధిజ్ఞుల । ననురక్తులఁ బితృపితామహక్రమమున వ
చ్చిన విప్రుల మంత్రులఁగా । నొనరించితె కార్య సంప్రయోగము పొంటెన్. 27

ప్రతిపదార్థం: అనఘులన్= పాపాత్ములు కానివాళ్ళను; శాస్త్రవిధిజ్ఞులన్= శాస్త్రనియమాలు తెలిసినవాళ్ళను; అనురక్తులన్= (నీమీద) ప్రేమకల వాళ్ళను; పితృపితామహక్రమమునన్= తండ్రితాతలనుండి వంశపారంపర్యంగా; వచ్చిన= కొలువుచేస్తున్న; విప్రులన్= బ్రాహ్మణులను; కార్య, సంప్రయోగముపొంటెన్= రాజకార్యనిర్వహణంకొరకు; మంత్రులన్+కాన్= మంత్రులనుగా; ఒనరించితె= చేశావుకదా!

తాత్పర్యం: పుణ్యాత్ములు, శాస్త్రనియమాలు బాగా తెలిసినవాళ్ళు, నీమీద ప్రేమగలవాళ్ళు, తాతతండ్రులనాటి నుండి వంశపారంపర్యంగా కొలువుచేస్తున్న వాళ్ళు అయిన బ్రాహ్మణోత్తముల్ని రాజకార్యనిర్వహణకు మంత్రులుగా ఏర్పరచుకొన్నావుకదా!

విశేషం: పొంటెన్ - అనేది 'కొఱకు' అనే అర్థంలో చతుర్థీవిభక్తి ప్రత్యయంగా నన్నయకాలంలో ఉంది. ఇప్పు డది వ్యవహారంలో లోపించింది. అరవంలో దీనికి సమానార్థకం 'పొరుట్టు'. విద్యావంతులైన బ్రాహ్మణులు విప్రులని చెప్పే అభియుక్తోక్తి ఒకటి ఉంది- "జన్మనా బ్రాహ్మణో జ్ఞేయః, సంస్కారా ద్ద్విజ ఉచ్యతే । విద్యయా యాతి విప్రత్వం, త్రిభిః శ్రోత్రియ ఉచ్యతే'. జన్మవల్ల బ్రాహ్మణుడు, సంస్కారంవల్ల ద్విజుడు, విద్యవల్ల విప్రుడు, ఈ మూడూ ఉంటే శ్రోత్రియుడు అంటారు.

క. రాజునకు విజయమూలము । రాజితమంత్రంబు; సుస్థిరంబుగ దానిన్
రాజాన్వయ! రక్షింతె ధ । రాజనులకుఁ గర్ణగోచరము గాకుండన్. 28

ప్రతిపదార్థం: రాజ+అన్వయ!= చంద్రవంశానికి చెందిన ఓ ధర్మరాజా!; రాజునకున్; విజయమూలము= విజయానికి కారణం; రాజిత, మంత్రంబు= చక్కనిరహస్యాలోచనమే; ధరా, జనులకున్= రాజ్యంలోని ప్రజలకు; కర్ణ, గోచరము, కాకుండన్= చెవిని పడకుండ; దానిన్= ఆ రహస్యాలోచనాన్ని; సుస్థిరంబుగన్= పదిలంగా; రక్షింతె= రక్షిస్తున్నావుకదా!

తాత్పర్యం: ఓధర్మరాజా! రాజుకు విజయకారణం అతడి రహస్యాలోచనం. ఆ రహస్యాలోచనం నీ ప్రజల చెవిని పడకుండ పదిలంగా రక్షించుకుంటున్నావుకదా!

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం.

క. ధీరుఁడు ధర్మాధర్మ వి । శారదుఁడు బహుశ్రుతుండు సమచిత్తుఁడు వా
ణీ రమణీ శ్రిత వదన స । రోరుహుఁ డనఁ జనునె నీ పురోహితుఁ డధిపా! 29

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; నీ, పురోహితుఁడు; ధీరుఁడు= ధైర్యశాలియు (విద్వాంసుడు); ధర్మ+అధర్మ, విశారదుఁడు= ధర్మాధర్మాల్ని గూర్చి బాగా ఎరిగినవాడు; బహుశ్రుతుండు= అనేక వేదశాస్త్రా లెరిగినవాడు; సమచిత్తుఁడు= రాగద్వేషాలులేకుండ సమత్వాన్ని సాధించిన మనస్సు కలవాడు; వాణీ, రమణీ, శ్రిత, వదన, సరోరుహుఁడు= సరస్వతీదేవిచేత ఆశ్రయించబడిన ముఖపద్మం కలవాడు; అనన్+చనునె= అని అనదగినవాడే కదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీ పురోహితుడు ధైర్యవంతుడు (పండితుడు), ధర్మాధర్మాలు తెలిసినవాడు, వివిధవేదశాస్త్రాలు బాగా అధ్యయనం చేసినవాడు, రాగద్వేషరహితమైన సమచిత్తం కలవాడు, సరస్వతీదేవి కొలువున్న ముఖపద్మం కలవాడు - అని అనదగినవాడే కదా!

విశేషం: పురోహితు డంటే శాంతికపౌష్టికాదివైదికకర్మల్లో ముందుండేవాడు. ధర్మాధర్మాలు తెలిపి శాస్త్రోక్తంగా వివిధ కర్మలు నడిపించేవాడు. మొగమోటమి లేకుండ ధర్మాధర్మాలు తెలియచెప్పటానికి, హితం ఉపదేశించటానికి, పురోహితునికి ధైర్యం కూడా ఉండాలి. ధైర్యం ఉన్నా-అందుకు తగిన వేదశాస్త్రపాండిత్యం, దాని సంస్కారరూపమైన రాగద్వేషరహిత సమచిత్తం లేకుంటే అతడు మంచిచెడ్డల్ని సరిగా నిర్ణయించలేడు, హితం ఉపదేశించ లేడు, నిస్స్వార్థంగా వ్యవహరించలేడు. ధైర్యం, పాండిత్యం, సమచిత్తం ఉన్నా- వాక్శుద్ధి, వాఙ్నైపుణ్యం లేకుంటే అవి అన్నీ వ్యర్థమే - అతనివాక్కు ఎదుటి హృదయాన్ని వశంచేసుకోలేదు. అందుచేత అతడు వాగ్దేవిని-సరస్వతిని-వశంచేసుకొన్న వ్యక్తిగా ఉండాలి. రజస్తమోగుణప్రధానమైనప్రభువ్యవస్థకు, ప్రాచీనకాలంలో పురోహితవ్యవస్థ సత్త్వశుద్ధిని కూర్చి ధర్మపాలనకు, ప్రభుక్షేమానికి, ప్రజాక్షేమానికి విశేషంగా దోహదం చేసింది. పై పద్యంలో పేర్కొన్నవన్నీ ఉత్తమపురోహిత లక్షణాలు.

క. **జనవర! నీ యజ్ఞములం । దనవరతనియుక్తుఁ డయిన యాజ్ఞికుఁడు ప్రయో**
గ నిపుణుఁడై యేమఱకుం । డునె నిజకృత్యముల నెప్పుడును సమబుద్ధిన్. **30**

ప్రతిపదార్థం: జనవర!= ఓరాజా!; నీ యజ్ఞముల+అందున్; అనవరత, నియుక్తుఁడు+అయిన= ఎల్లప్పుడు నియమించబడినవాడైన; యాజ్ఞికుఁడు= యజ్ఞం చేయించే బ్రాహ్మణుడు; ప్రయోగ, నిపుణుఁడు+ఐ= యజ్ఞంచేయించటంలో నేర్పుకలవాడై; ఎప్పుడును= ఎల్లప్పుడు; సమబుద్ధిన్= రాగద్వేషరహితమైన సమత్వ బుద్ధితో; నిజకృత్యములన్= తాను చెయ్యదగినపనుల్లో; ఏమఱక+ఉండునె= విస్మరించకుండా ఉన్నాడు కదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీవు యజ్ఞాలలో నియమించిన యాజ్ఞికుడు యజ్ఞం చేయించటంలో నిపుణుడై, రాగద్వేషరహితమైన సమబుద్ధితో తనకర్తవ్యాలను విస్మరించకుండా ఉన్నాడుకదా!

విశేషం: ఏయజ్ఞమైనా సక్రమంగా జరగకుంటే సత్ఫలితాలకు బదులు దుష్ఫలితాలు కలిగే ప్రమాదం ఉంది. అందువల్ల యాజ్ఞికుడు ప్రయోగనిపుణుడు, కర్తవ్యపరాయణుడు కావటం ఎంతో ముఖ్యం.

క. **నానావిధరణవిజయమ । హానిపుణు లవార్యవీర్యు లనఁదగువారిన్**
సేనాధ్యక్షులఁ జేసితె । నీ నమ్మినవారి మాననీయుల హితులన్. **31**

ప్రతిపదార్థం: నానావిధ, రణ, విజయ, మహానిపుణులు= వివిధ యుద్ధాల్లో గెలుపు సాధించడంలో గొప్ప నేర్పరులైనవాళ్ళు; అవార్య, వీర్యులు= ఎదిరించ సాధ్యం కాని పరాక్రమం కలవాళ్ళు; అనన్= అని అనటానికి; తగువారిన్= తగినటువంటివాళ్ళను; నీ, నమ్మిన, వారిన్= నీకు నమ్మకం కలవాళ్ళను; మాననీయులన్= గౌరవింపదగినవాళ్ళను; హితులన్= నీమేలు కోరేవాళ్ళను; సేనా+అధ్యక్షులన్= సైన్యానికి అధ్యక్షులుగా; చేసితె= చేశావుకదా!

తాత్పర్యం: పలు విధాలైన యుద్ధాల్లో విజయాన్ని సాధించటంలో నిపుణులైన వాళ్ళను, ఎదిరించ సాధ్యంకాని పరాక్రమం కలవాళ్ళను, విశ్వాసపాత్రులైనవాళ్ళను, గౌరవానికి అర్హులైన వాళ్ళను, నీమేలు కోరే వాళ్ళను, సైన్యాధ్యక్షులుగా నియమించావుకదా!

విశేషం: రాజ్యవ్యవస్థలో సైన్యాధ్యక్షపదవి చాలా ముఖ్యమైంది. సైన్యాధ్యక్షుడే ప్రధాన దేశరక్షకుడు. అందుచేత అతడు సమర్థుడుగా ఉండాలి. అంతేకాదు, అతడు ప్రభువుకు ఎంతో విశ్వాసపాత్రుడై ఉండాలి. ఇవి మాత్రమే అతనికి చాలవు. అతనికి గౌరవార్హమైన వ్యక్తిత్వం కూడ ఉండాలి. అన్నింటిని మించి అతడు ప్రభువు మేలు కోరేవాడుగా ఉండాలి. లేకుంటే అతనివల్ల ప్రభువుకే ప్రమాదం.

చ. కడుఁ జనువాఁడునై పురుషకారియు దక్షుఁడు నైన మంత్రి పెం
పడరఁగ రాజపుత్త్రుల మహాధనవంతులఁ జేసి వారితో
నొడఁబడి పక్ష మేర్పడఁగ నుండఁడుగా, ధన మెట్టి వారికిం
గడుకొని చేయకుండునె జగన్నుత! గర్వము దుర్విమోహమున్. 32

ప్రతిపదార్థం: జగత్+నుత!= లోకంచేత కీర్తింపబడే ఓధర్మరాజా!; కడున్= మిక్కిలి; చనువాఁడును+ఐ= పలుకుబడికలవాడై; పురుషకారియున్= కృషిచేసేవాడూ! దక్షుఁడును+ఐన= సమర్థుడును అయిన; మంత్రి; పెంపు+అడరఁగన్= అతిశయంమీర; రాజపుత్త్రులన్; మహాధనవంతులన్= గొప్ప సంపన్నులను; చేసి= కావించి; వారితోన్; ఒడఁబడి= చేతులు కలిపి; పక్షము+ఏర్పడఁగన్= వ్యతిరేకవర్గం ఏర్పడేటట్లుగా; ఉండఁడుగా= ఉండటంలేదుకదా!; ధనము; ఎట్టివారికిన్= ఎటువంటి వాళ్ళకైనా; కడుకొని= పూని; గర్వమున్= గర్వాన్ని; దుర్విమోహమున్= చెడ్డదైన మితిమీరినకాంక్షను; చేయక+ఉండునె= కలిగించకుండా ఉంటుందా!

తాత్పర్యం: ఎక్కువ పలుకుబడి కలిగి, క్రియాశీలి, సమర్థుడు అయిన మంత్రి-తన పరిధిమీరి, ఇతర రాజపుత్రుల్ని మహాధనవంతులుగా చేసి, వాళ్ళతో చేతులు కలిపి, నీకు వ్యతిరేకవర్గంగా ఏర్పడేటట్లుగా ఉండటం లేదుకదా! ధర్మరాజా! ధనం ఎటువంటివాళ్ళకైనా దురాశనూ, గర్వాన్నీ కలిగిస్తుంది.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. అధికారపక్షంలో ఉంటూ అన్ని ప్రయోజనాలూ పొంది, అధికంగా బలపడి, దురాశాదురహంకారాలు పెంచుకొని, అన్యులతో చేతులు కలిపి, అధికార పక్షాన్ని బలహీనపరిచే వ్యతిరేకవర్గాన్ని సృష్టించే వెన్నుపోటుదారులందరూ ఈ కోవకు చెందే మంత్రులే. కలియుగరాజకీయాల్లో వీళ్ళ సంఖ్య గణనీయంగా పెరగటం గమనార్హం. అలాంటివాళ్ళను ఓకంట కనిపెట్టటం మంచిదని ఆనాడే నారదుడు హెచ్చరించాడు.

క. క్షితినాథ! శాస్త్రదృష్టి । ప్రతిభను దివ్యాంతరిక్ష భౌమోత్పాత
ప్రతికారులగుచు సన్మా । నితులయి వర్తింతురయ్య నీదైవజ్ఞుల్. 33

ప్రతిపదార్థం: క్షితి, నాథ!= భూమికి అధిపతి అయినవాడా! - ఓధర్మరాజా!; నీ, దైవజ్ఞుల్= నీయొక్క జ్యోతిశ్శాస్త్ర పండితులు; శాస్త్రదృష్టి= శాస్త్రాలు చదవటంవల్ల కలిగిన పాండిత్యంచేత; ప్రతిభను= తమ బుద్ధిబలంచేత; దివ్య+అంతరిక్ష, భౌమ+ఉత్పాత, ప్రతీకారులు+అగుచున్= దేవతా సంబంధాలు, ఆకాశ సంబంధాలు, భూసంబంధాలు అయిన అనర్థాలకు విరుగుడుక్రియలు చేసేవాళ్ళయి; సన్మానితులు+అయి= నీచే తగిన సమ్మానాలను పొంది; వర్తింతురు+అయ్య= నడుచుకుంటున్నారుకదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీ ఆస్థానజ్యోతిష్కులు శాస్త్రపాండిత్యంచేత, స్వీయప్రతిభచేత దేవతా సంబంధాలు, అంతరిక్ష సంబంధాలు, భూ సంబంధాలు అయిన ఉత్పాతాలను కనిపెట్టి వాటికి విరుగుడుగా శాంతి క్రియాదులు నీచేత జరిపించి, సన్మానాలు పొందుతున్నారు కదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఉత్పాతాలు అంటే అపశకునాలు, హఠాత్తుగా వచ్చే అనర్థాలు. ఇవి దివ్యాలు, అంతరిక్షాలు, భౌమాలు అని మూడు విధాలు. దివ్యాలంటే - అపూర్వ గ్రహనక్షత్రాదులు పుట్టటం, అంతరిక్షాలంటే- పరివేషాలు ఏర్పడటం, పిడుగులు పడటం మొదలైనవి. భౌమాలంటే-అపూర్వ చరాచర వస్తువులు పుట్టటం, ఉప్పెనలు, భూకంపాలు మొదలైనవి రావటం. ఇవి ప్రజలకు దుఃఖాన్ని, రోగాన్ని కలిగిస్తాయి. అంతరిక్ష భూవాతావరణపరిశోధకులైన పండితుల సాయంతో సాధ్యమైనంత ముందుగా వీటిరాకను కనిపెట్టి ప్రతిక్రియలు జరిపించటం ప్రభుధర్మం.

క. అనిశము సేవింతురె ని । న్ననఘా! యష్టాంగమైన యాయుర్వేదం
బున దక్షులైన వైద్యులు । ఘనముగ ననురక్తులై జగద్ధితబుద్ధిన్. 34

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడవైన ఓధర్మరాజా!; నిన్నున్; అనిశము= ఎల్లప్పుడు; అష్ట+అంగము+ఐన= ఎనిమిదిభాగాలతో కూడుకొన్నదైన; ఆయుః+వేదంబునన్= ఆయుర్వేదంలో; దక్షులు+ఐన= సమర్థులైన; వైద్యులు; జగత్+హిత, బుద్ధిన్= లోకానికి మేలు చేయాలనే తలంపుతో; ఘనముగన్= ఎక్కువగా; అనురక్తులు+ఐ= ప్రేమగలవారై; సేవింతురె (సేవించుదురె)= సేవిస్తున్నారుకదా!

తాత్పర్యం: ఓ పుణ్యాత్మా! ఆయుర్వేదంలో సమర్థులైన వైద్యులు లోకానికి మేలుచేసేబుద్ధితో ప్రజలమీద ప్రేమతో ఎనిమిది శాఖలుగా వ్యాపించిన ఆ వైద్య విధానంలో సేవలు చేస్తున్నారా?

విశేషం: ఆయుర్వేదం-ఆయువును వృద్ధి చేసే మార్గాలను చెప్పేవేదం-భారతీయ వైద్యశాస్త్రం. నాలుగు ఉపవేదాలలో ఆయుర్వేదం ఒకటి. బ్రహ్మ, అశ్వినీదేవతలు, ధన్వంతరి మొదలయిన వాళ్ళు దీని కర్తలు. దీని అష్టాంగాలు - శల్యం, శాలాక్యం, కాయచికిత్స, భూతవిద్య, కౌమారభృత్యం, అగదతంత్రం, రసాయన తంత్రం, వాజీకరణ తంత్రం. 'జగద్ధితబుద్ధిన్' అని నారదమహర్షి వైద్యుల విషయంలో ప్రయోగించిన విశేషణం విశేషించి గుర్తించదగింది. బాధా పీడితుడై ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి చికిత్సచేసి అతని బాధ తొలగించి, ప్రాణం నిలిపే వైద్యుణ్ణి భారతదేశం విష్ణుస్వరూపునిగా భావించింది. 'వైద్యో నారాయణో హరిః' అని ప్రవచించింది. విష్ణు స్వరూపుడైన వైద్యునికి ఉండవలసిన బుద్ధి జగద్ధితబుద్ధి-స్వార్థబుద్ధి కాదు. స్వార్థబుద్ధి ప్రబలిన వైద్యుడు సమాజం పాలిటి దేవుడు కాడు- దానవుడు.

క. సారమతిఁజేసి మానస । శారీర రుజావళులకు సతతంబుఁ బ్రతీ
కారములు సేయుచుండుదె । యారఁగ వృద్ధోపసేవ నౌషధసేవన్. 35

ప్రతిపదార్థం: సారమతిన్+చేసి= నిపుణమైన బుద్ధితో - అంటే చక్కగా ఆలోచించి; మానస, శారీర, రుజా+ఆవళులకున్= మనస్సంబంధమైన, శరీరసంబంధమైన వ్యాధుల సమూహాలకు; సతతంబున్= ఎల్లప్పుడు; ఆరఁగన్= ఒప్పగా; వృద్ధ+ఉపసేవన్= వృద్ధులను సేవించటంచేత; ఔషధసేవన్= మందులను సేవించటంచేత, ప్రతీకారములు= విరుగుడుక్రియలు - అంటే చికిత్సలు; చేయుచున్+ఉండుదె= చేస్తున్నావు కదా!

తాత్పర్యం: చక్కగా ఆలోచించి పెద్దల సేవతో మనోవ్యాధులకు, ఔషధసేవతో శారీరకవ్యాధులకు చికిత్స చేసుకొంటున్నావు కదా!

విశేషం: అలం: క్రమాలంకారం. మనోవ్యాధికి మందు లేదంటారు. కాని వృద్ధసేవ మనోవ్యాధికి మంచిమందు. వృద్ధుల జీవితానుభవం, శాస్త్రవిజ్ఞానం మనోవ్యాధులకు మేలైన చికిత్స చేస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఉపధాశుద్ధులఁ బాప । వ్యపగతబుద్ధుల వినీతివర్తుల సములన్
సుపరీక్ష నియోగించితె । నిపుణుల నర్థార్జనాదినృపకార్యములన్. 36

ప్రతిపదార్థం: ఉపధా, శుద్ధులన్= ధర్మపరీక్షలచేత పరిశుద్ధులైనవాళ్ళను; సుపరీక్షన్= లెస్సగా పరీక్షించుటచేత; పాపవ్యపగతబుద్ధులన్= పాపరహితమైన చిత్తవృత్తి కలవాళ్ళను; వినీతి వర్తులన్= విశేషంగా నీతిమార్గంలో ప్రవర్తించేవారిని (వినయవంతులను); సములన్= రాగద్వేషరహితులై అందరిపట్ల సమబుద్ధితో వ్యవహరించేవాళ్ళను; నిపుణులన్= నేర్పరులైనవారిని; అర్థ+ఆర్జన+ఆది, నృపకార్యములన్= డబ్బును వసూలుచేయటం మొదలయిన రాచకార్యాలలో; నియోగించితె= నియమించావుకదా!

తాత్పర్యం: పన్నులు వసూలు చేయటం వంటి ధనార్జన రూపమైన రాచకార్యాలలో ధర్మపరీక్షలచే పరిశుద్ధులైన వాళ్ళని, పాపరహితమైన చిత్తవృత్తి కలవాళ్ళని, విశేషంగా నీతిమార్గంలో నడుచుకొనేవాళ్ళని, రాగద్వేషరహితమైన సమబుద్ధితో వ్యవహరించేవాళ్ళని, నైపుణ్యం కలవాళ్ళని చక్కగా పరీక్షించి నియమించావుకదా!

విశేషం: పన్నులు వసూలు చెయ్యటంలాంటి ధనార్జనరూపమైన రాచకార్యాల్లో, అవినీతిపరులు, పక్షపాతబుద్ధికలవాళ్ళు, నియుక్తులైతే- ప్రభుత్వకోశానికి నష్టం వాటిల్లటమే కాక, ప్రభుత్వంమీద ప్రజలకు ద్వేషభావం పెరుగుతుంది. అందువల్ల అలాంటి ఉద్యోగ నియామకాల్లో ప్రభువు ప్రత్యేకశ్రద్ధ వహించాలి.

ఉ. ఉత్తమ మధ్యమాధమ నియోగ్యత బుద్ధి నెఱింగి వారి న
య్యుత్తమ మధ్యమాధమ నియోగములన్ నియమించితే నరేం
ద్రోత్తమ! భృత్యకోటికి ననూనముగాఁ దగు జీవితంబు లా
యత్తము సేసి యిత్తె దయ నయ్యయికాలము దప్పకుండఁగన్. 37

ప్రతిపదార్థం: నరేంద్ర+ఉత్తమ!= ఓరాజశ్రేష్ఠ!; ఉత్తమ, మధ్యమ+అధమ, నియోగ్యత= ఉత్తమ మధ్యమ అధమ స్థానాలలో నియమించదగిన వ్యక్తుల యోగ్యతలను; బుద్ధిన్+ఎఱింగి= గ్రహించి; వారిన్; ఆ+ఉత్తమ, మధ్యమ+అధమ, నియోగములన్= ఆ ఉత్తమ మధ్యమ అధమములైన ఉద్యోగాల్లో; నియమించితి(వి)+ఏ= నియమించావుకదా!; భృత్యకోటికిన్= సేవకులసమూహానికి; అనూనముగాన్= కొరతలేకుండా; తగు, జీవితంబులు= తగిన జీతాలను; దయన్= దయతో; ఆ+అయి, కాలము, తప్పక+ ఉండఁగన్= ఆయా సమయం దాటకుండ; ఆయత్తము, చేసి= సిద్ధంచేసి; ఇత్తె (ఇచ్చుదువు+ఎ)= ఇస్తున్నావుకదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! వ్యక్తుల ఉత్తమ మధ్యమాధమ యోగ్యతలను తెలుసుకొని వాళ్ళను ఉత్తమ మధ్యమాధమ ఉద్యోగాల్లో నియమించావుకదా! సేవకు లందరికి, కొరతలేకుండా తగుజీతాలు దయతోసకాలంలో అందజేస్తున్నావుకదా!

విశేషం: ద్వ్యక్షరప్రాసతో వృత్తం అలంకృతమై ప్రతిపాద్యవస్తువును ఆస్వాదయోగ్యం చేస్తున్నది. సమత అనే గుణం పద్యనిర్మాణంలోనూ రచనలోనూ కనపడుతున్నది. మొదటి మూడు చరణాలు చివరిఅక్షరం ముందు విరిగి పైపాదంలో కొనసాగటం నిర్మాణంలోని సమత. మార్గాభేదం, అవైషమ్యం ఉండటంచేత సమతాగుణం స్ఫురించి, సేవకుల నందరినీ సమంగా చూస్తున్న రాజుయొక్క చిత్తవృత్తిని వ్యంజింపచేస్తున్నది. (సంపా.)

క. తమ తమ కనియెడు తఱి జీ । తము గానక నవయు భటుల దౌర్గత్య విషా
దము లేలినవాని కవ । శ్యము నెగ్గొనరించు నతఁడు శక్రుం డైనన్. 38

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తమ తమ, కనియెడు, తఱిన్= తాము తాము పొందవలసిన సమయాన; జీతము, కానక= జీతంపొందక; నవయు= శుష్కించే, (బక్కచిక్కే); భటుల, దౌర్గత్య, విషాదములు= సేవకులయొక్కదారిద్ర్య దుఃఖాలు; ఏలిన, వానికిన్= రాజుకు; అతఁడు; శక్రుండు+ఐనన్= దేవేంద్రుడైనా; అవశ్యమున్= తప్పక; ఎగ్గు+ఒనరించున్= కీడు కలిగిస్తాయి.

తాత్పర్యం: తాము పొందవలసిన సమయంలో జీతాన్ని పొందక శుష్కించే సేవకుల దారిద్ర్యదుఃఖాలు ప్రభువుకు-అతడు దేవేంద్రుడైనా సరే - తప్పక కీడు కలిగిస్తాయి.

విశేషం: సేవకులదుఃఖం ప్రభువుకు క్షేమకరం కాదు. తమ తమకు+అనియెడు. అని కొందరు విడదీస్తారు.

క. **కులపుత్త్రులైన సద్భృ । త్యులకును సత్కార మర్థితోఁ జేయుదె? వా**
రలు నీప్రస్తవమున ని । మ్ములఁ గృతము దలంచి ప్రాణములు విడుతు రనిన్. **39**

ప్రతిపదార్థం: కులపుత్త్రులు+ఐన= వంశపారంపర్యంగా వచ్చే (ఇచట 'కులభృత్యులైన' అనే పాఠం పెక్కు ప్రతులలో ఉంది); సత్+కారము= సమ్మానం; అర్థితోన్= ప్రీతితో; చేయుదె= చేస్తున్నావుకదా; వారలు; నీ ప్రస్తవమునన్= నీ విషయంలో, (అంటే నీ పనికోసం); ఇమ్ములన్= ఇంపుగ; కృతము= నీవు చేసిన ఉపకారం; తలంచి= తలచుకొని; అనిన్= యుద్ధంలో; ప్రాణములు; విడుతురు.

తాత్పర్యం: వంశపారంపర్యంగా వచ్చే మంచి సేవకులకు ప్రీతితో సమ్మానం చేస్తున్నావుకదా! వారు మనసార నీ ఉపకారాన్ని స్మరించి యుద్ధభూమిలో నీకై ప్రాణాలు వదలుతారు.

క. **అనఘా! నీ ప్రస్తవమున । నని నీల్గినవీరభటుల యనుపోష్యుల నె**
ల్లను బ్రోతె భోజనాచ్ఛా । దనముల వారలకు నెమ్మి దఱుఁగక యుండన్. **40**

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడవైన ఓధర్మరాజా!; నీ, ప్రస్తవమునన్= నీవిషయంలో; అనిన్= యుద్ధంలో; ఈల్గిన= మరణించిన; వీరభటుల, అనుపోష్యులన్+ఎల్లన్= వీరులైన భటులను అనుసరించి పోషించదగిన వాళ్ళందరిని, అంటే వారిపోషణపై ఆధారపడి జీవించే భార్యాపుత్త్రులు, తల్లిదండ్రులు మొదలయిన వాళ్ళందరిని; భోజన+ఆచ్ఛాదనములన్= కూడుగుడ్డలతో; వారలకున్; నెమ్మి= సంతోషం; తఱుఁగక+ఉండన్= తగ్గకుండా; ప్రోతె (ప్రోచుదువు+ఎ)= పోషిస్తున్నావుకదా!

తాత్పర్యం: పుణ్యాత్ముడవైన ఓ ధర్మరాజా! నీకొరకు యుద్ధంలో మరణించిన వీరసైనికుల కుటుంబాలకు కూడుగుడ్డలు లోటు లేకుండా ఇచ్చి, వాళ్ళ సంతోషం తగ్గకుండా పోషిస్తున్నావు కదా!

విశేషం: కుటుంబపు పింఛనుపథకం **(Family pension)** భారతకాలంలోనే ఉన్నదన్నమాట.

క. **ధనలుబ్ధుల మ్రుచ్చులఁ గూ । ర్పని వారలఁ బగఱవలని వారల ధృతి చా**
లని వారల దుర్జనులం । బనుపవుగా రాజకార్యభారము దాల్పన్. **41**

ప్రతిపదార్థం: ధన, లుబ్ధులన్= ధనంపట్ల లోభబుద్ధికలవాళ్ళను; మ్రుచ్చులన్= దొంగల్ని; కూర్పనివారలన్= స్నేహానికి యోగ్యులు కానివాళ్ళను; పగఱవలనివారలన్= శత్రువులపట్ల పక్షపాతం కలవాళ్ళను; ధృతి, చాలని, వారలన్= ధైర్యం చాలని

వాళ్ళను; దుర్జనులన్= దుర్మార్గులైన వాళ్ళను; రాజ, కార్యభారము, తాల్పన్= రాచకార్యం యొక్క భారాన్ని వహించటానికి; పనుపవుగా= పంపటంలేదుకదా!

తాత్పర్యం: ఓధర్మరాజా! ధనంపట్ల లోభబుద్ధి కలవాళ్ళని, దొంగల్ని, స్నేహానికి యోగ్యులు కానివాళ్ళని, శత్రువులపట్ల పక్షపాతం కలవాళ్ళని, ధైర్యం చాలనివాళ్ళని, దుర్మార్గులైనవాళ్ళని రాజకార్యాలు నిర్వహించటానికి పంపటం లేదు కదా!

క. చోరభయవర్జితముగా । ధారుణిఁ బాలింతె, యధికధనలోభమునం
జోరుల రక్షింపరుగా । వారలచే ధనముగొని భవద్భృత్యవరుల్. 42

ప్రతిపదార్థం: చోర, భయ, వర్జితముగాన్= దొంగలవల్ల భయం లేకుండా; ధారుణిన్= భూమిని; పాలింతె (పాలించుదువు+ఎ)= పాలిస్తున్నావుకదా!; భవత్+భృత్యవరుల్= నీయొక్క సేవకుల్లో ముఖ్యులు; అధిక, ధన, లోభమునన్= ధనంమీది మితిమీరిన కోరికతో; వారలచేన్= ఆదొంగలచేత; ధనము, కొని= డబ్బుతీసుకొని; చోరులన్= ఆ దొంగలను; రక్షింపరుగా= రక్షించటంలేదుకదా!

తాత్పర్యం: ధర్మరాజా! దొంగభయం లేకుండా నీవు రాజ్యాన్ని ఏలుతున్నావుకదా! నీ ప్రభుత్వోద్యోగుల్లో ముఖ్యులైనవాళ్ళు ధనాశాపరులై ఆ దొంగలదగ్గర డబ్బు పుచ్చుకొని వాళ్ళకు రక్షణ కల్పించటం లేదు కదా!

విశేషం: కాలం గడిచేకొలదీ, నాగరకత పెరిగేకొలదీ దొంగల సంఖ్య, దొంగల్లో రకాల సంఖ్య, విపరీతంగా పెరుగుతున్నది. ఈ కలికాలంలో-నవనాగరక యుగంలో - వ్యక్తుల జేబుల్ని, ఇండ్లను, బ్యాంకుల్ని, బస్సుల్ని, రైళ్ళని దోచుకొనే వాళ్ళు మాత్రమే కాదు, 'స్మగ్లింగ్' చేసేవాళ్ళు, 'బ్లాక్‌మార్కెట్' చేసేవాళ్ళు పెక్కు విధాల పన్నులు ఎగవేసేవాళ్ళు, అనేక కారణాలు చెప్పి చందాలు వసూలుచేసి దిగమ్రింగేవాళ్ళు-వీళ్ళంతా రకరకాల దొంగలే. ప్రభుత్వంలో ఉన్నతపదవుల్లో ఉన్న ఉద్యోగులు లంచగొండులైతే ఇలాంటి దొంగల్ని పట్టటం, పట్టి వాళ్ళని శిక్షించటం సక్రమంగా జరుగదు. ఫలితం-ప్రభుత్వ కోశానికి నష్టం, ప్రజలకు బాధ, ప్రభుత్వానికి చెడ్డపేరు. అందుచేత లంచగొండులైన ప్రభుత్వోద్యోగుల పట్ల ప్రభువు ఏవిధంగా అప్రమత్తుడై ఉండాలో నారదమహర్షి సూచించాడు. (సంపా.)

క. ధరణీనాథ! భవద్భుజ । పరిపాలితయైన వసుధఁ బరిపూర్ణములై
కర మొప్పుచున్నె చెఱువులు । ధరణి కవగ్రహభయంబు దనుకక యుండన్. 43

ప్రతిపదార్థం: ధరణీ, నాథ!= భూపతీ - ఓ ధర్మరాజా!; భవత్+భుజ, పరిపాలిత+ఐన= నీభుజబలంచేత పరిపాలించబడినదైన; వసుధన్= భూమిలో (రాజ్యంలో); చెఱువులు; పరిపూర్ణములు+ఐ= నిండినవై; ధరణికిన్= భూమికి; అనుగ్రహభయము= వానలేమివల్ల భీతి; తనుకక+ఉండన్= కలుగకుండ; కరము= మిక్కిలి; ఒప్పుచున్+ఉండున్+ఎ= ఒప్పుతున్నాయి కదా!(బాగున్నాయి కదా).

తాత్పర్యం: ఓ ధర్మరాజా! భుజబలంతో నీవు పరిపాలిస్తున్న ఈ భూమిలో అనావృష్టి భయంలేకుండా చెరువులు నిండి కనులపండువుగా ఉన్నాయి కదా!

క. హీనులగు కర్షకులకును । భూనుత! ధాన్యంబు బీజములు, వణిజులకున్
మానుగ శతైకవృద్ధి న । నూనముగా ఋణము లిత్తె యుత్తమబుద్ధిన్. 44

ప్రతిపదార్థం: భూనుత!= లోకంచేత కొనియాడబడే ఓ ధర్మరాజా!; ఉత్తమబుద్ధిన్= గొప్పబుద్ధితో-ఉదారబుద్ధితో; హీనులు+అగు= పేదలైన కర్షకులకును; ధాన్యంబు, బీజములు= ధాన్యపు విత్తనాలు; వణిజులకున్= వర్తకులకు; మానుగన్= ఒప్పుగా, తగురీతిగా; శత+ఏక, వృద్ధిన్= నూటికి ఒక వడ్డీవంతున(1%); అనూనముగాన్= కొరతలేకుండ; ఋణముల్= అప్పులు; ఇత్తె(ఇచ్చుదువు+ఎ)= ఇస్తున్నావు కదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఉదారబుద్ధితో పేద రైతులకు ధాన్యపు విత్తనాలూ, వర్తకులకు నూటికి ఒక రూపాయి వడ్డీ వంతున అప్పులు ఇస్తున్నావుకదా!

విశేషం: ఏ ప్రభువైనా వ్యవసాయాన్ని, వ్యాపారాన్ని ప్రోత్సహించాలి. సమాజశ్రేయస్సుకు అవి చాల అవసరం. నారదమహర్షి మాటల్నిబట్టి మహాభారతకాలంలోనే అధికాహారోత్పత్తికి విత్తనాలు, అధికాభివృద్ధికి తక్కువ వడ్డీతో ఋణాలు ప్రభువులు ఇస్తున్నట్లు తెలుస్తున్నది.

క. పంగుల మూకాంధుల విక । లాంగులను నబాంధవుల దయం బ్రోతే? భయా
ర్తుం గడఁది శత్రునైనను । సంగరరంగమునఁ గాతె శరణం బనినన్. 45

ప్రతిపదార్థం: పంగులన్= కుంటివాళ్ళను; మూక+అంధులన్= మూగవాళ్ళను, గ్రుడ్డివాళ్ళను; వికల+అంగులన్= అంగవిహీనులైనవాళ్ళను; అబాంధవులన్= బంధువులు లేనివాళ్ళను-అంటే దిక్కులేనివాళ్ళను; దయన్= దయతో; ప్రోతె(ప్రోచుదువు+ఎ)= పోషిస్తున్నావుకదా!; సంగరరంగమునన్+ యుద్ధభూమిలో; శరణంబు+అనినన్= శరణుఅనిఅంటే; కడఁది, శత్రున్+ఐనను= పెద్దశత్రువునైనా; భయ+ఆర్తున్= భయంతో దుఃఖించేవాణ్ణి; కాతె(కాచుదువు+ఎ)= కాపాడుతున్నావుకదా!

తాత్పర్యం: కుంటివాళ్ళను, మూగవాళ్ళను, గ్రుడ్డివాళ్ళను, అంగవిహీనులైన వాళ్ళను, బంధువులు లేనివాళ్ళను దయతో పోషిస్తున్నావుకదా! భయంతో దుఃఖిస్తూ శరణువేడిన పెద్దశత్రువునైనా యుద్ధభూమిలో కాపాడుతున్నావుకదా!

విశేషం: దయార్ద్రత ప్రభువుకు ఉండవలసిన ఒక ప్రధానగుణం. వికలాంగులకు, అనాథులకు ప్రభుత్వం చేయూత ఇవ్వటం మహాభారతకాలంలోనే ఉంది.

క. కృత మెఱిఁగి కర్త నుత్తమ । మతుల సభల సంస్తుతించి మఱవక తగు స
త్కృతి సేయుదె? కృత మెఱిఁగెడు । పతియె జగజ్జనుల నెల్లఁ బరిపాలించున్. 46

ప్రతిపదార్థం: కృతము+ఎఱిఁగి= చేసినమేలును గుర్తించి; కర్తన్= ఆ మేలు చేసిన వ్యక్తిని; ఉత్తమ, మతులన్, సభలన్= గొప్పబుద్ధిమంతు లున్న సభల్లో; సంస్తుతించి= ప్రశంసించి; మఱవక= మరచిపోకుండ; తగు, సత్+కృతి= తగిన సమ్మానం; చేయుదె(చేయుదువు+ఎ)= చేస్తావుకదా!; కృతము+ఎఱిఁగెడు= చేసిన మేలును గుర్తించగల; పతియె= ప్రభువే; జగత్+జనులన్+ ఎల్లన్= లోకప్రజలనందరిని; పరిపాలించున్= (చక్కగా) పరిపాలించగలడు.

తాత్పర్యం: చేసినమేలు గుర్తించి, ఆ మేలు చేసినవ్యక్తిని పదిమంది పెద్దలున్న సభల్లో ఉచితరీతిని సత్కరిస్తున్నావుకదా! చేసినమేలు గుర్తించగల ప్రభువే ప్రపంచప్రజల నందరిని చక్కగా పరిపాలించగలడు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. కృతజ్ఞత ఒక గొప్ప గుణం. అది మానవతాలక్షణం. మంచిని గుర్తించి పదిమందిముందు ప్రశంసించటంకంటె మంచిని పెంచటానికి మేలైన మార్గం మరొకటి లేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. ఆయయంబునందు నాలవ భాగమొండె. మూఁ। డవ భాగమొండె, నం దర్ధమొండె
గాని మిక్కిలి సేయఁగాదు వ్యయం బని । యవధరించితె బుద్ధి నవనినాథ!
యాయుధాగారధనాధ్యక్ష్యములయందు । వరవాజివారణావళులయందు
బండారములయందుఁ బరమవిశ్వాసుల । భక్తుల దక్షులఁ బంచితయ్య?

ఆ. గురుల వృద్ధశిల్పివరవణి గ్బాంధవ । జనుల నాశ్రితులను సాధుజనులఁ
గరుణఁ బేదఱికము వొరయకుండఁగఁ బ్రోతె । సకలజనులు నిన్ను సంస్తుతింప. 47

ప్రతిపదార్థం: అవనినాథ!= భూమికి ప్రభువైన-ఓధర్మరాజా!; ఆయయంబు+అందున్= ఆదాయంలో; నాలవభాగము+ఒండెన్= నాల్గవవంతుకాని; మూఁడవభాగము+ఒండెన్= మూడవవంతుకాని; అందు+అర్ధము+ఒండెన్= అందులో సగభాగంకాని; మిక్కిలి= మించి; వ్యయంబు= ఖర్చు; చేయన్, కాదు= చేయకూడదు; అని; బుద్ధిన్; అవధరించితె= గ్రహించావుకదా!; ఆయుధ+అగార, ధన+ఆధ్యక్ష్యముల+అందున్= ఆయుధశాలలయొక్క భాండాగారాలయొక్కపాలనలో; వర, వాజి, వారణ+ఆవళుల+అందున్= శ్రేష్ఠాలైన అశ్వగజ సమూహాల పాలనలో; బండారముల+అందున్= కోశాగారాల్లో; పరమ విశ్వాసులన్= మిక్కిలి నమ్మదగినవాళ్ళను; భక్తులన్= నీయందు భక్తి ఉన్న వాళ్ళను; దక్షులన్= సమర్థులైనవాళ్ళను; పంచితివి+అయ్య= నియమించావుకదా!; నిన్నున్; సకల, జనులు; సంస్తుతింపన్= ప్రశంసించగా; గురులన్= గురువులను; వృద్ధ, శిల్పి, వర, వణిక్+బాంధవ, జనులన్= ముసలివారైన శిల్పులను, శ్రేష్ఠులైన వ్యాపారులను, బంధువులను; ఆశ్రితులను= ఆశ్రయించినవాళ్ళను; సాధుజనులన్= సజ్జనులను; పేదఱికము+పొరయక+ఉండఁగన్= పేదరికం కలుగకుండ; కరుణన్= దయతో; ప్రోతె (ప్రోచుదువు+ఎ)= పోషిస్తున్నావుకదా!

తాత్పర్యం: ధర్మరాజా! ఆదాయంలో నాల్గవభాగాన్ని లేదా మూడవభాగాన్ని లేదా సగభాగాన్ని మాత్రమే ఖర్చు చెయ్యాలికాని, అంతకుమించి చేయకూడ దని గ్రహించావుకదా! ఆయుధశాలలు, ధనాగారాలు, అశ్వశాలలు, గజశాలలు, కోశాగారాలు-వీటి పాలనలో ఎంతో నమ్మదగిన వాళ్ళను, నీపట్ల భక్తిగల వాళ్ళను, సమర్థులైన వాళ్ళను నియమించావుకదా! ప్రజలంతా నిన్ను ప్రశంసించేటట్లుగా గురువుల్ని, వృద్ధశిల్పుల్ని, గొప్ప వ్యాపారుల్ని, బంధువుల్ని, ఆశ్రితుల్ని, సజ్జనుల్ని పేదరికం రాకుండ దయతో పోషిస్తున్నావు కదా!

క. వలయు నమాత్యులుఁ జుట్టం । బులు మూలబలంబు రాజపుత్త్రులు విద్వాం
సులు బలసియుండ నిచ్చలుఁ । గొలువుండుదె లోక మెల్లఁ గొనియాడంగన్. 48

ప్రతిపదార్థం: వలయు= ఇష్టులైన(కావలసిన); అమాత్యులున్= మంత్రులును; చుట్టంబులున్= బంధువులును; మూల, బలంబు= ప్రధాన సైనిక సమూహం; రాజ పుత్త్రులు; విద్వాంసులు; బలసి+ఉండన్= ఎక్కువగా చేరిఉండగా; లోకము+ఎల్లన్; కొనియాడంగన్= కీర్తించగా; నిచ్చలున్= ప్రతిదినం; కొలువు+ఉండుదె(ఉండుదువు+ఎ)= కొలువుతీరి ఉంటావుకదా!

తాత్పర్యం: ఇష్టులైన మంత్రులు, బంధువులు, సైన్యాధిపతులు, రాకుమారులు పండితులు- అధికసంఖ్యలో ఆసీనులై ఉండగా ప్రపంచమంతా ప్రశంసించే విధంగా ప్రతిదినం నీవు కొలువుతీరుతున్నావు కదా!

క. పరికించుచు బాహ్యాభ్యం । తరజనములవలన సంతతము నిజరక్షా
పరుఁడ వయి పరమహీశుల । చరితము వీక్షింతె నిపుణచరనేత్రములన్. 49

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పరికించుచున్= జాగ్రత్తగా గమనిస్తూ; బాహ్య+అభి+అంతర, జనములవలనన్= బయట, లోపల ఉండే జనులవల్ల, (ప్రమాదం కలుగకుండా); సంతతము= ఎల్లప్పుడూ; నిజ, రక్షా, పరుఁడవు+అయి= నిన్ను నీవు రక్షించుకోవటంలో శ్రద్ధకలవాడివై; పర, మహీశుల= శత్రురాజులయొక్క; చరితము= ప్రవర్తన; నిపుణ, చర, నేత్రములన్= నేర్పుగల చారు లనే కళ్ళతో - అంటే సమర్థులైన గూఢచారులవల్ల; వీక్షింతె (వీక్షించుదువు+ఎ)= చూస్తున్నావుకదా!

తాత్పర్యం: జాగ్రత్తగా గమనిస్తూ వెలుపల లోపల ఉండే శత్రువులనుండి నిన్ను నీవు రక్షించుకుంటూ, శత్రురాజుల ప్రవర్తనను గూఢచారులు అనే కళ్ళద్వారా కనుగొంటున్నావుకదా!

విశేషం: అలం: రూపకం. తా నుంటేనేకదా తక్కినవి చెయ్యటం. అందుచేత ఆత్మరక్షణ అందరికీ ముఖ్యమే. అందులోనూ అధికార పీఠాన్ని అధిష్ఠించిన మహారాజుకు ఆత్మరక్షణ అతిముఖ్యం. దేశం వెలుపల లోపల ఆయనకు ఎంతోమంది శత్రువు లుంటారు. ఎన్నో ప్రమాదాలు కల్పిస్తారు. అందువల్ల ఏ ప్రభువైనా ఎంతో సమర్థులైన గూఢచారుల్ని నియమించాలి. ఎప్పటికప్పుడు ఎదుటివాళ్ళ ఎత్తుగడలను తెలుసుకోవాలి. ఆత్మరక్షణకు, శత్రుశిక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ప్రభుశ్రేయానికి, విజయానికి పెద్దగా దోహదం చేసేది గూఢచారి వ్యవస్థ. ఒకవిధంగా ప్రభువుయొక్క చరించే చక్షువులే గూఢచారులు. అందుకే ప్రభువుకు చారచక్షువని పేరు.

క. వెలయఁగ విద్వజ్జన ము। ఖ్యులతోడ నశేషధర్మకుశలుఁడ వయి యి
మ్ముల లోకవ్యవహార। మ్ములు దయఁ బరికింతె నిత్యమును సమబుద్ధిన్. 50

ప్రతిపదార్థం: నిత్యమును= ప్రతిదినము; వెలయఁగన్= ఒప్పుగా-తగువిధంగా; విద్వత్+జన, ముఖ్యులతోడన్= పండితప్రముఖులతో; అశేష, ధర్మ, కుశలుఁడవు+అయి= అన్ని ధర్మాల్లో నేర్పరివై; సమబుద్ధిన్= రాగద్వేష రహితమైన బుద్ధితో, ఇమ్ములన్= శ్రద్ధగా; లోక, వ్యవహారమ్ములు; దయన్= దయతో; పరికింతె(పరికించుదువు+ఎ)= విచారిస్తున్నావుకదా!

తాత్పర్యం: గొప్ప పండితులతో కలిసి, సర్వధర్మాల్లో నేర్పరివై, రాగద్వేషరహితమైన సమబుద్ధితో శ్రద్ధగా దయతో లోకవ్యవహారాలు విచారిస్తున్నావు కదా!

ఆ. వార్తయంద జగము వర్తిల్లుచున్నది;। యదియు లేనినాఁడ యఖిలజనులు
నంధకారమగ్ను లగుదురు గావున। వార్త నిర్వహింపవలయుఁ బతికి. 51

ప్రతిపదార్థం: వార్త+అందు+అ= వార్త (న్యూస్) యందే; జగము= ప్రపంచం; వర్తిల్లుచున్+ఉన్నది= నడుస్తున్నది; అదియున్= ఆ వార్త; లేని, నాఁడు+అ= లేనిరోజే; అఖిలజనులున్; అంధకారమగ్నులు+అగుదురు= అజ్ఞానంఅనే చీకట్లో మునిగిపోయిన వాళ్ళుఅవుతారు; కావున; పతికిన్= రాజుకు; వార్త, నిర్వహింపవలయున్= వార్తను నడపవలసిన అవసరం ఉంది.

తాత్పర్యం: ప్రపంచమంతా వార్తమీదే నడుస్తున్నది. అది లేకుంటే ప్రజలంతా పెనుచీకట్లో మునిగినట్లే. అందువల్ల ప్రభువు వార్తను బాగా నడపాలి.

విశేషం: వార్త అంటే- వృత్తాంతం, వర్తనం, అర్థానర్థవివేచన విద్య- అనే అర్థాలు ఉన్నాయి. వార్తలను సేకరించటం, ప్రసరించటం, ప్రభుత్వబాధ్యత. అంతేకాదు. అది గొప్ప సామాజికావసరం కూడ. వార్తా నిర్వహణ సరిగా లేకుంటే ప్రభుత్వంలో ఒక విభాగానికి మరొక విభాగానికి, దేశంలో ఒక ప్రాంతానికి మరొక ప్రాంతానికి, సమాజంలో ఒక ప్రాంతానికి మరొక

ప్రాంతానికి, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అవగాహన కుంటుపడుతుంది. సమన్వయం లోపిస్తుంది. ఎక్కడ ఏం జరుగుతున్నదో, ఎవరి అభిప్రాయాలు ఎలా ఉన్నాయో, ఏయే సమస్యలకు ఏయే పరిష్కారాలో ఎవ్వరికి తెలియని స్థితి ఏర్పడుతుంది. అందరు అంధకారంలో ఉన్నట్లే అవుతుంది. అందుచేత ప్రభువు వార్తను సమర్థంగా నిర్వహించాలి. ప్రత్యేకించి ప్రజాస్వామ్య ప్రభుత్వంలో వార్తా నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం ఉంది. ఒక విధంగా ప్రభుత్వానికి కళ్ళు, చెవులు-ప్రజలకు కళ్ళు, చెవులు-వార్తాపత్రికలే. ఇవి మామూలు కళ్ళకు అందని దృశ్యాల్ని చూపిస్తాయి. మామూలు చెవులకు వినిపించని విషయాల్ని వినిపిస్తాయి. వార్త అనే శబ్దం చేత కృషి గోరక్షాదులు కూడా గ్రాహ్యాలే.

ఆ. దారసంగ్రహంబు ధరణీశ! రతి పుత్రఫలము, శీలవృత్తఫలము శ్రుతము,
దత్తభుక్తఫలము ధనము, వేదము లగ్ని। హోత్ర ఫలము లనియు నొగి నెఱుంగు. 52

ప్రతిపదార్థం: ధరణి+ఈశ= భూమికి ప్రభువు అయిన ఓధర్మరాజా!; దార, సంగ్రహంబు= భార్యను పొందటం; రతి=(ఆమెతో) సంభోగించటం; పుత్ర, ఫలము= పుత్రోత్పత్తి ఫలాలుగా కలిగినట్టిది; శ్రుతము= ధర్మాల్నిగూర్చి వినటం; శీల, వృత్త, ఫలము= శీలాన్ని, మంచి నడవడిని ఫలాలుగా కలిగినట్టిది; ధనము; దత్త, భుక్త, ఫలము= దానాన్ని అనుభవాన్ని ఫలంగా కలిగినట్టిది; వేదములు; అగ్ని, హోత్ర, ఫలములు= అగ్నిహోత్రాల్ని ఫలాలుగా గలిగినట్టివి, అనియున్; ఒగిన్= క్రమంగా; ఎఱుంగు= తెలుసుకొనుము.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! భార్యను పొందటానికి ఫలం- సంభోగసుఖం, పుత్రులు పుట్టటం, ధర్మాలు వినటానికి ఫలం-సచ్ఛీలం, సత్ప్రవర్తన సిద్ధించటం, సంపాదించినధనానికి ఫలం-దానం చెయ్యటం, అనుభవించటం, వేదాలకు ఫలం - అగ్నిహోత్రాలు. ఈ సంగతి క్రమంగా తెలుసుకో.

విశేషం: ఇట్టి పద్యాలు సంస్కృత మూలానికి యథాతథానువాదాలు. భారతీయ సంస్కృతిలో వైవాహిక జీవిత ఫలం-పాశవికమైన కామవాంఛ తీర్చుకోవటంమాత్రమే కాదు. సమాజకల్యాణానికి, ఐహికాముష్మిక సుఖసాధనకు, జీవితచరితార్థతకు దోహదం చెయ్యగల సత్‌సంతానాన్ని కనటం. అలాగే, ధనార్జనకు ఫలం, ధర్మాధర్మ విచక్షణ లేకుండ మనసుపడ్డ భోగా లన్నీ అనుభవించటం కాదు; నిరుపయోగంగా కూడబెట్టటం కాదు - సత్పాత్రదానంచెయ్యటం. ధర్మబద్ధాలైన భోగాలు అనుభవించటం. ఈ రెండింటి విషయంలో కాళిదాస మహాకవి- రఘువంశరాజుల్నిగూర్చి చెప్పిన 'త్యాగాయ సంభృతార్థానాం ..... ప్రజాయై గృహమేధినామ్' అనే మాటలు ఈ సందర్భంలో గుర్తుంచుకోతగ్గవి. కాగా, ధర్మశ్రవణానికి ఫలం- ఉబుసుపోక కాదు; ఒక చెవితో విని మరొక చెవితో వదలివెయ్యటం కాదు- జీవితంలో ఆచరించటం; జన్మచరితార్థతకు, సమాజశ్రేయస్సుకు దోహదంచేసే మంచి శీలాన్ని, నడవడిని అలవరచుకోవటం. అలాగే వేదాలకు ఫలం అగ్నిహోత్రాలు. వేదంలో- కర్మకాండలో ప్రాధాన్యం వహించేది అగ్నిహోత్రం. వేల్చిన హవిస్సులను దేవతల కందించి, ఆ దేవతలవల్ల లోకానికి ఫలా లందించేవాడు అగ్నిహోత్రుడు. పాండవులు ద్రౌపదిని వివాహమాడి అర్ధరాజ్యాన్ని పొంది, ఇంద్రప్రస్థం కేంద్రంగా రాజ్యపాలన సాగించే తరుణంలో ధర్మరాజుకు నారదు డీ ధర్మాలు, రాజనీతి విశేషాలు, బోధించటం ఎంతో ఉచితంగా ఉంది.

చ. బహుధనధాన్యసంగ్రహము బాణశరాసనయోధవీరసం
గ్రహము నిరంతరాంతరుదకంబులు ఘాసరసేంధనౌఘ సం
గ్రహము ననేకయంత్రములుఁ గల్గి యసాధ్యములై ద్విషద్భయా
వహు లగుచుండ నొప్పునె భవత్పరిరక్ష్యములైన దుర్గముల్. 53

ప్రతిపదార్థం: భవత్+పరిరక్ష్యములు+ఐన= నీచే రక్షింపబడుతున్నవైన; దుర్గముల్= కోటలు; బహు, ధన, ధాన్య, సంగ్రహము= ఎక్కువ, ధన, ధాన్యాల నిల్వ; బాణ, శర+ఆసన, యోధవీర, సంగ్రహము= బాణాలయొక్క, ధనుస్సులయొక్క, యుద్ధవీరుల యొక్క కూడిక; నిరంతర+అంతః+ఉదకంబులు= ఎల్లప్పుడు లోపల ఉండే నీళ్ళు; ఘాస, రస+ఇంధన+ఓఘ, సంగ్రహము= (పశువులకు) గడ్డి, (మానవులకు) ఉప్పు, పులుపు, కారం మొదలైన పదార్థాలు, వివిధ పానీయాలు, వంటకట్టెల సమూహం యొక్క కూడిక; అనేక యంత్రములున్; కలిగి; అసాధ్యములు+ఐ= భేదించశక్యంకానివై; ద్విషత్+భయ+ఆవహులు+అగుచు+ ఉండన్+ఒప్పునె= శత్రువులకు భయం కలిగించేవై ఒప్పి ఉన్నాయి కదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీ రక్షణలో నున్న కోటలన్నీ- ఎక్కువగా ధనధాన్యాల్ని, ధనుర్బాణాల్ని, యుద్ధవీరుల్ని, ఎప్పుడూ తరుగని నీళ్ళని, పశువుల గడ్డిని, ఉప్పు, పులుపు, కారంవంటి ఆహార పదార్థాల్ని, వివిధపానీయాల్ని వంటకట్టెల్ని, సమృద్ధిగా కలిగి అనేకయంత్రసాధనాలతో కూడి దుర్భేద్యాలై శత్రుభయంకరాలై ఒప్పుతున్నాయి కదా!

విశేషం: ముఖ్యంగా ముట్టడి సమయాల్లో పై పదార్థాలన్నీ కోటల్లో నిల్వ ఉండటం చాల అవసరం. రసశబ్దానికి అనేక అర్థాలు ఉన్నాయి. రుచిపరంగా రసాలు ఆరు-కషాయం(వగరు), మధురం(తీపి), లవణం(ఉప్పు), కటువు(కారం), తిక్తం(చేదు), ఆమ్లం (పులుపు). (అర్థవ్యక్తి అనే శబ్దగుణం ఇందులో చక్కగా పోషించబడింది - సంపా.)

చ. **వదలక బుద్ధి నంతరరివర్గము నోర్చి జితేంద్రియుండ వై**
మొదలన దేశకాలబలముల్ మఱి దైవబలంబుఁ గల్గి భూ
విదిత బలుండవై యహితవీరుల నోర్వఁగ నుత్సహింతె దు
ర్మద మలినాంధ చిత్తులఁ బ్రమత్తుల నింద్రియనిర్జితాత్ములన్. 54

ప్రతిపదార్థం: వదలక= విడువక; బుద్ధిన్= నీబుద్ధిబలంచేత; అంతః+అరి, వర్గమున్+ఓర్చి= లోపలి(నీలోని) శత్రుసమూహాన్ని జయించి; జిత+ఇంద్రియుండవు+ఐ= జయించిన ఇంద్రియాలు కలవాడివై; మొదలన= మొదటనే; దేశ, కాల, బలముల్; మఱి= అంతేకాక; దైవబలంబున్; కలిగి; భూ, విదిత, బలుండవు+ఐ= ప్రపంచంలో తెలియబడిన బలం కలవాడివై; దుర్మద+మలిన+అంధ, చిత్తులన్= మితిమీరిన గర్వమనే మాలిన్యంచేత గ్రుడ్డిదైన మనస్సుకలవాళ్ళను; ప్రమత్తులన్= మిక్కిలి మత్తెక్కినవాళ్ళను; ఇంద్రియ, నిర్జిత+ఆత్ములన్= ఇంద్రియాలచేత జయించబడిన బుద్ధికలవాళ్ళను; అహిత, వీరులన్= శత్రువీరులను; ఓర్వఁగన్= జయించటానికి, ఉత్సహింతె(ఉత్సహింతువు+ఎ)= ఉత్సాహపడుతున్నావుకదా!

తాత్పర్యం: దేశకాల దైవబలాల్ని ముందుగ పొంది, బుద్ధిబలంతో అంతశ్శత్రువులైన కామక్రోధాదుల్ని, ఇంద్రియాల్ని జయించి, ప్రపంచ ప్రసిద్ధిగల బలవంతుడివై, మితిమీరిన మదం అనే మాలిన్యంతో గ్రుడ్డిదైన మనస్సు కలవాళ్ళ, మిక్కిలి మత్తెక్కిన వాళ్ళ, ఇంద్రియాలకు వశమైన బుద్ధికలవాళ్ళు అయిన శత్రువుల్ని జయించాలన్న ఉత్సాహంతో ఉన్నావు కదా!

విశేషం: అంతరరివర్గం - కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. కర్మేంద్రియాలు - వాక్, పాణి, పాద, పాయు, గుహ్యాలు. జ్ఞానేంద్రియాలు-త్వక్కు, చక్షువు, శ్రోత్రం, జిహ్వ, ఘ్రాణం; మనస్సునుకూడ చేర్చితే మొత్తం ఇంద్రియాలు పదకొండు. మదములు - విద్యామదం, ధనమదం, కులమదం, ఉద్యోగమదం, యౌవనమదం మొదలైనవి.

తే. **కడిఁది రిపులపైఁ బోవంగఁ గడఁగి యున్న । నీకు ముందఱఁ జని రిపునృపులయందుఁ**
దగిలి సామాద్యుపాయంబు లొగిన సంప్ర । యోగమునఁ జేసి వర్తిల్లుచున్నె చెపుమ. 55

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కడిఁది= గొప్ప; రిపులపైన్+పోవంగన్= శత్రువులమీద దండెత్తిపోవటానికి; కడఁగి, ఉన్న= పూనుకొని ఉన్న; నీకున్; ముందఱన్+చని= ముందుగా వెళ్ళి; రిపు నృపుల, అందున్= శత్రురాజుల్లో; తగిలి= ప్రయత్నించి; సామ+ఆది+ ఉపాయంబులు= సామం, దానం మొదలయిన నాలుగు ఉపాయాలు; ఒగిన్+అ= వరుసగా, సంప్రయోగమునన్+చేసి= చక్కగా ప్రయోగించటంచేత, వర్తిల్లుచున్+ఉన్నె= ప్రవర్తిల్లుతున్నాయికదా!; చెపుమ= చెప్పుము.

తాత్పర్యం: నీవు దండెత్తటానికి ముందే-బలవంతులైన శత్రురాజులమీద సామదానాది చతుర్విధోపాయాల్ని చక్కగా ప్రయోగిస్తున్నావు కదా!

విశేషం: ఉపాయాలు - సామం, దానం, భేదం, దండం.

వ. **'మఱియు నాస్తిక్యం బనృతంబు ప్రమాదం బాలస్యం బనర్థజ్ఞులతోడి చింతనంబు క్రోధంబు దీర్ఘచింత దీర్ఘ సూత్రత యెఱుకగలవారి నెఱుంగమి యర్థంబుల యందనర్థక చింత నిశ్చితకార్యంబులు సేయమి మంత్రంబుల రక్షింపమి శుభంబులఁ బ్రయోగింపమి విషయంబులం దగులుట యనంబరఁగిన పదునాలుగు రాజదోషంబులఁ బరిహరింతె?' యని యడిగిన నారదునకు ధర్మరా జి ట్లనియె.** **56**

ప్రతిపదార్థం: మఱియున్; నాస్తిక్యంబు= నాస్తికత - అంటే భగవంతుణ్ణి వేదప్రామాణ్యాన్ని అంగీకరించకుండటం; అనృతంబు= అబద్ధంచెప్పటం; ప్రమాదంబు= ఏమరుపాటు; ఆలస్యంబు= సోమరితనం; అనర్థజ్ఞులతోడి చింతనంబు= అజ్ఞానులతో ఆలోచించటం; క్రోధంబు; దీర్ఘ, చింత= ఎక్కువకాలం దుఃఖించటం; దీర్ఘసూత్రత= చేయవలసిన పనులనుగురించి దీర్ఘంగా ఆలోచించటం, ఆలస్యంగా చేయటం; ఎఱుక, కల, వారిన్= జ్ఞానులను; ఎఱుంగమి= గుర్తించకుండటం; అర్థంబుల, అందున్+అనర్థక, చింత= ప్రయోజనకరమైన విషయాల్లో ప్రయోజనభంగకరమైన ఆలోచన; నిశ్చితకార్యంబులు= నిర్ణయించినపనులు; చేయమి= చేయకుండటం; మంత్రంబులన్= రహస్యాలోచనల్ని; రక్షింపమి= కాపాడకుండటం; శుభంబులన్= శుభకార్యాలను; ప్రయోగింపమి= జరిపించకుండటం; విషయంబులన్= ఇంద్రియసుఖాల్లో; తగులుట= తగుల్కొనటం; అనన్+పరఁగిన= అనేటటువంటి; పదునాలుగు; రాజదోషంబులన్; పరిహరింతె(పరిహరించుదువు+ఎ)= విడుస్తున్నావుకదా!; అని; అడిగిన; నారదునకు; ధర్మరాజు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నాస్తికత, అసత్యమాడటం, ఏమరుపాటు, సోమరితనం, తెలివితక్కువవాళ్ళతో కార్యాలోచనచెయ్యటం, అతికోపం, అధికకాలం దుఃఖించటం, చేయవలసిన పనిని గూర్చి అతిదీర్ఘంగా ఆలోచించటం, ఆలస్యంగా చెయ్యటం, జ్ఞానుల్ని గుర్తించకపోవటం, ప్రయోజనకరమైన విషయాల్లో ప్రయోజనభంగకరమైన ఆలోచనలు చెయ్యటం, నిర్ణయించిన పనులు చెయ్యకుండటం, రహస్యాలోచనలు బయటపడకుండ కాపాడకపోవటం, శుభకార్యాలు చెయ్యకుండటం, ఇంద్రియ సుఖాల్లో తగుల్కోవటం- అనే పదునాలుగు రాజదోషాలను విడనాడావుకదా!'' అని అడిగిన నారదమహర్షితో ధర్మరాజు ఇలా అన్నాడు.

తే. **నాయథాశక్తిఁ జేసి యన్యాయపథముఁ । బరిహరించి మహాత్ముల చరితలందు**
బుద్ధి నిలిపి మీ యుపదేశమున శుభంబు । లయిన వాని ననుష్ఠింతుఁ బ్రియముతోడ. **57**

ప్రతిపదార్థం: నా యథాశక్తిన్+చేసి= నాచేతనైనంతవరకు; అన్యాయ, పథమున్= అన్యాయమార్గాన్ని; పరిహరించి= వదలి; మహాత్ముల, చరితల+అందున్= మహాత్ములయొక్క చరిత్రల్లో; బుద్ధి, నిలిపి= మనస్సు ఉంచి; మీ, ఉపదేశమునన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మీధర్మబోధవల్ల; శుభంబులు+అయిన= శుభాన్ని కలిగించేవి అయిన; వానిన్; ప్రియముతోడన్= ప్రీతితో; అనుష్ఠింతున్= ఆచరిస్తాను.

తాత్పర్యం: నారదమునీంద్రా! చేతనైనంతవరకు అన్యాయమార్గాన్ని వదలి, మహాత్ముల చరిత్రల్ని ఆదర్శంగా ఉంచుకొని, మీధర్మబోధవల్ల శుభాలైనవాటిని మనఃపూర్వకంగా ఆచరిస్తాను.

విశేషం: 'నాయథాశక్తిఁ జేసి'- అనటంలో ధర్మజుడి వినయం. 'అనుష్ఠింతుఁ బ్రియముతోడ'-అనటంలో ఆయన ధర్మప్రియత్వం చక్కగా వ్యక్తమవుతున్నాయి. యథాశక్తి-అవ్యయీభావ సమాసం. నన్నయ ఇట్టి వాటిని విశేష్యాలుగా వాడుతుంటాడు. శౌనకాది మహామునులకు సౌతి చెప్పింది యథాతథ భారతకథనమే అయినా - నారదమహర్షి ప్రవేశంవల్ల, ఆయన కుశలప్రశ్నలవల్ల, ధర్మరాజు సమాధానాలవల్ల, సన్నివేశానికి ఒక నాటకీయత వచ్చింది. నారదమహర్షి ధర్మరాజును సాధారణ కుశలప్రశ్నలు అడుగకుండా-రాజనీతి విశేషాలకు, ఆదర్శరాజ్యపాలన ప్రమాణాలకు అద్దంపట్టే కుశలప్రశ్న లడగటం విశేషం. అభిషిక్తుడైన ధర్మరాజు తన రాజ్యప్రజలకు ఎలాంటి పరిపాలన అందివ్వాలో తెలియచేయటం విశేషం. నారదమహర్షి కుశలప్రశ్నలు- ఏ ప్రభువుకైనా ఉత్తమరాజనీతి పాఠాలు. ఆదర్శరాజ్యపాలనకు ఉత్తమప్రమాణాలు; ప్రభుజీవితచరితార్థతకు మహోపదేశాలు.

ఇట్టి సభ నెచ్చటనైనఁ జూచితిరా యని ధర్మజుఁడు నారదు నడుగుట (సం. 2-6-8)

వ. అని కృతాంజలి యయి 'మునీంద్రా! యీత్రిలోకంబులయందును మీ చూడనివి లేవు; వెందే నిట్టి యపూర్వంబైన సభ చూచి యెఱుంగుదురే?' యని మయ నిర్మితం బయిన సభ చూపినం జూచి విస్మితుండయి నారదుండు ధర్మరాజున కి ట్లనియె. 58

ప్రతిపదార్థం: అని; కృత+అంజలి+అయి= చేయబడిన నమస్కారం కలవాడై - అంటే నారదునికి నమస్కరించి; ముని+ఇంద్రా!= మునిశ్రేష్ఠా!; ఈ త్రిలోకంబుల, అందును= ఈమూడు లోకాలల్లోకూడ; మీ, చూడని+అవి= మీరు చూడనటువంటివి; లేవు; ఎందున్+ఏన్= ఎచ్చటనైనా; ఇట్టి; అపూర్వంబు+ఐన= అపురూపమైన; సభ, చూచి; ఎఱుంగుదురే; అని; మయ, నిర్మితంబు+ అయిన= మయునిచేత నిర్మించబడినదైన; సభ; చూపినన్= చూపించగా; విస్మితుండు+అయి= ఆశ్చర్యపడినవాడై; నారదుండు; ధర్మరాజునకున్+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ధర్మరాజు నారదమహర్షికి నమస్కరించి 'మునీంద్రా! ముల్లోకాలలోను మీరు చూడని విశేషాలు లేవు. అపూర్వమైన ఈ మయసభలాంటి సభను ఇం కెక్కడైన మీరు చూచారా?' అని ఆ సభను చూపించగా నారదమహర్షి ఆశ్చర్యపరవశుడై ఆయనతో ఇలా అన్నాడు.

క. భూనాథ! యిది యపూర్వ, మ । మానుషము, విచిత్ర రత్నమయ; మిట్టి సభన్
మానవలోకేశ్వరులం । దే నెన్నఁడుఁ జూచి వినియు నెఱుఁగ ధరిత్రిన్. 59

ప్రతిపదార్థం: భూనాథ!= ఓరాజా!; ఇది= ఈమయసభ; అపూర్వము= ఇంతకు ముం దెన్నడు లేనిది; అమానుషము= మానవాతీతమైనది; విచిత్ర, రత్న, మయము= విచిత్రాలైన రత్నాలతో కూడుకొన్నట్టిది; ఇట్టి; సభన్; ధరిత్రిన్= ఈభూమిమీద; మానవలోక+ఈశ్వరుల+అందున్= మానవలోక పరిపాలకులైన రాజుల దగ్గర; ఏన్=నేను; ఎన్నడున్= ఏనాడుకూడ; చూచి; వినియున్; ఎఱుఁగన్.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ సభ అపూర్వం. మానవాతీతం. చిత్రవిచిత్ర రత్నమయం. మానవలోకంలో ఏ మహారాజు దగ్గర కూడ నేను ఇలాంటి సభను ఎన్నడూ చూడలేదు, ఉన్నట్లు వినలేదు.

విశేషం: నారదుడు త్రికోకసంచారి, మహర్షి, దేవర్షి. అందుచేత 'ఇటువంటి సభను ముల్లోకాలలో మీ రెచ్చటైనా చూచారా?' అని ధర్మరాజు అడుగదగిన వ్యక్తి ఒక్క నారదుడే. ఆ మహర్షి మయసభనుగురించి చెప్పినమాట పరమప్రమాణం.

క. సురపతి యమ వరుణ ధనే। శ్వర కమలాసనుల దివ్యసభలెల్ల నరే
శ్వర! చూచితి; నవి దీనికి । సరిగా వత్యంతవిభవసౌందర్యములన్. 60

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= మానవులకు ప్రభువువైన ఓధర్మరాజా!; సురపతి, యమ, వరుణ, ధన+ఈశ్వర, కమల+ఆసనుల= దేవేంద్ర, యమ, వరుణ, కుబేర, బ్రహ్మదేవులయొక్క; దివ్యసభలు+ఎల్లన్= దేవతా సంబంధాలైన సభల నన్నింటిని; చూచితిన్; అవి; అత్యంత, విభవ, సౌందర్యములన్= అపారమైన ఐశ్వర్యంలో; అందమునందును; దీనికిన్; సరి, కావు= సమానం కావు.

తాత్పర్యం: ధర్మరాజా! దేవేంద్ర, యమ, వరుణ, కుబేర, బ్రహ్మదేవులయొక్క దివ్యసభలన్నీ నేను చూచాను. అవి ఏవీ ఐశ్వర్యసౌందర్యాల్లో దీనికి సరితూగలేవు.

విశేషం: దివ్యసభల్లో అందమైనవీ, ఐశ్వర్యంతో కూడినవీ అయినవాటిని అయిదింటిని నారదమహర్షి పేర్కొన్నాడు. అవన్నీ ధర్మజుని మయసభకు సాటిరా వని ప్రకటించాడు. ధర్మజుడు ఆ సంగతి విని ఊరుకుండేవాడు కాడు. ఏ విధంగా మయసభ దేవసభలకంటె గొప్పదో వివరంగా తెలుసుకోవా లని కుతూహలపడతాడు. అది అతని స్వభావం. వార్తలను సేకరించటంలో, వినటంలో, ప్రత్యక్ష పరిజ్ఞానాన్ని సంపాదించుకోవటంలో ధర్మజుడు సూక్ష్మబుద్ధి. ఆసక్తితో నిండిన అతనిభావిప్రశ్నకు నారదునివాక్యం చొరవ కలిపిస్తున్నది. (సంపా.)

వ. అనిన విని 'యవి యెట్టివి? వాని వినవలతు నానతిం'డని లోకపాల సభావిభవ శ్రవణ ప్రభూత కుతూహల చేతస్కుండై యడిగిన ధర్మరాజునకు నారదుం డి ట్లనియె. 61

ప్రతిపదార్థం: అనినన్; విని; అవి; ఎట్టివి; వానిన్= వాటినిగూర్చి; వినన్, వలతున్= వినాలని కోరుకుంటున్నాను; ఆనతి+ ఇండు+అని= ఆజ్ఞాపించం డని; లోకపాల, సభా, విభవ, శ్రవణ, ప్రభూత, కుతూహల, చేతస్కుండు+ఐ= దిక్పాలకులయొక్క సభావైభవాన్నిగూర్చి వినాలని ఎక్కువగా ఏర్పడిన కుతూహలంతో కూడుకొన్న మనస్సు కలవాడై; అడిగిన; ధర్మరాజునకు; నారదుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నారదమహర్షి మాటలు విని దిక్పాలుర సభావైభవాన్నిగూర్చి వినాలన్న విశేష కుతూహలంతో ధర్మరాజు అవి ఎలాంటివి? వాటినిగూర్చి వినా లని ఉంది. ఆజ్ఞాపించండి' అని అడిగేసరికి నారదమహర్షి ఇలా అన్నాడు.

విశేషం: ఆనతివ్వండి, సెలవివ్వండి- ఇలాంటి మాటలు పెద్దల్ని ఏదైనా విషయాన్ని చెప్పండి అని అడిగేటప్పుడు ఎంతో గౌరవసూచకంగా వాడే క్రియాపదాలు. ఇక్కడ ఆనతివ్వండి అంటే చెప్పండి అని అర్థం. అంతేకాదు-మీరు చెప్పిందే ప్రమాణంగా, శాసనంగా, తిరుగులేనిదిగా భావిస్తాను- అనే భావం కూడ ఆ పదంలో ధ్వనిస్తుంది. ధర్మరాజు అలా అనటం ఆయన వినయసంపన్నతకు, సంస్కారానికి చక్కని సూచిక.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇంద్రసభావర్ణనము (సం. 2-7-1)

క. శతమఖుసభ శుభరత్నాం । చితకాంచనరచిత, మతివిచిత్రము, లోక
త్రితయాఖిల లక్ష్మీ సం । శ్రిత; మలవియె దానిఁ బొగడ శేషున కయినన్. 62

ప్రతిపదార్థం: శతమఖు, సభ= నూరు యజ్ఞాలుచేసిన దేవేంద్రునియొక్క సభ; శుభ, రత్న+అంచిత, కాంచన, రచితము= మంచి రత్నాలతో ఒప్పుతున్న బంగారుతో చేయబడింది; అతివిచిత్రము= మిక్కిలి ఆశ్చర్యకరమైనది; లోక, త్రితయ+అఖిల, లక్ష్మీ, సంశ్రితము= ముల్లోకాల్లోని సమస్త ఐశ్వర్యంచేత ఆశ్రయించబడింది; దానిన్; పొగడన్; శేషునకున్+అయినన్= ఆదిశేషునికి కూడా; అలవియె= సాధ్యమా!

తాత్పర్యం: దేవేంద్రుని సభ రత్నమయం, స్వర్ణమయం, చిత్రవిచిత్రం. ముల్లోకాల్లోని సకలైశ్వర్యాలకు నిలయం. ఆ సభను పొగడటానికి ఆదిశేషునికికూడా సాధ్యంకాదు.

విశేషం: శేషుడు వెయ్యితలలు, రెండువేల నాల్కలు కలవా డని ప్రసిద్ధి. అలాంటి ఆదిశేషునికి కూడ దేవేంద్రుని సభా వైభవం పొగడటానికి సాధ్యం కాకుంటే ఒకతల, ఒక నాలుక ఉన్నవాళ్ళకు సాధ్యమౌతుందా?

వ. అదియును నూఱుయోజనంబుల వెడల్పును, నూటయేఁబది యోజనంబుల నిడుపును, నేను యోజనంబుల తనర్పునుం గలిగి, వైహాయసంబయి, కామగమనంబయి, వ్యపేతశీతాతపంబయి, సకల కాల కుసుమ ఫలభరిత పాదపవన సంకీర్ణ సరోవర విరాజితంబయి, తపఃప్రభావంబున నమరేంద్రుచేత నిర్మితంబయి కరం బొప్పుచుండు; నట్టి సభయందు. 63

ప్రతిపదార్థం: అదియును; నూఱు, యోజనంబులు, వెడల్పును= నూరామడలవెడల్పును; నూట, ఏఁబది, యోజనంబుల, నిడువునున్= నూటయాభై ఆమడల పొడవును; ఏను, యోజనంబుల, తనర్పునున్= ఐదామడ లెత్తును; కలిగి; వైహాయసంబు+అయి= ఆకాశానికి సంబంధించిందై-అంటే ఆకాశంలో ఉండేదై; కామగమనంబు+అయి= కోరుకొన్నట్లు వెళ్ళ గలిగిందై (కోరిక ననుసరించిన గతికలదై); వి+అపేత, శీత+ఆతపంబు+అయి= పూర్తిగా తొలగించబడిన చలి, ఎండ కలదై; సకల, కాల, కుసుమ, ఫల, భరిత, పాదప, వన, సంకీర్ణ, సరోవర, విరాజితంబు+అయి= అన్నికాలాలలోను పువ్వులతో, పండ్లతో నిండిన చెట్లతోపులతో క్రిక్కిరిసినదియున్నూ, సరోవరాలతో శోభిల్లేదియున్నూఅయి; తపః ప్రభావంబునన్= తపోబలంతో; అమర+ ఇంద్రుచేతన్= దేవేంద్రుడిచేత; నిర్మితంబు+అయి= నిర్మింపబడిందై; కరంబు= మిక్కిలి; ఒప్పుచున్+ఉండున్= ప్రకాశిస్తూ ఉంటుంది; అట్టి; సభయందు.

తాత్పర్యం: ఆ సభ వెడల్పు నూరామడలు. పొడవు నూటయాభై ఆమడలు. ఎత్తు ఐదామడలు. అది ఆకాశంలో ఉంటుంది. కోరుకొన్న చోటికి వెళ్ళుతుంది. చలిబాధ లేదు. ఎండబాధ లేదు. చెట్లతోపు లున్నాయి. అవి అన్ని కాలాల్లో పూలతో, పండ్లతో నిండి ఉంటాయి. సరస్సులూ ఉన్నాయి. అవి నిండుగా శోభిల్లుతుంటాయి. ఆ సభను దేవేంద్రుడే స్వయంగా తనతపోబలంతో నిర్మించుకున్నాడు.

విశేషం: 'తనర్పు' విషయంలో కొన్ని ప్రతుల్లో ఏనూరు, ఎనుబది అనే పాఠభేదా లున్నాయి. కాని, మూలంలో భండార్కరు ప్రతిలో 'పంచయోజన ముచ్ఛ్రితా' అని ఉంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **అతుల విభూతితో మణిమయాభరణద్యుతు లొప్పఁగా శత**
క్రతుఁడు శచీసమేతుఁడయి కాంచన చారు విమానమాలికా
గత దివిజోత్తముల్ గొలువఁగాఁ గొలువుండు వరాప్సరోంగనా
యత విలసత్కటాక్ష కుసుమార్చిత సుందర వక్త్ర చంద్రుఁడై. **64**

ప్రతిపదార్థం: అతుల, విభూతితోన్= సాటిలేని ఐశ్వర్యంతో; మణి, మయ+ఆభరణ, ద్యుతులు= మణులతోకూడినసొమ్ముల కాంతులు; ఒప్పఁగాన్= మెరయగా; శతక్రతుఁడు= నూరుయజ్ఞాలు చేసినవాడైన ఇంద్రుడు; శచీ, సమేతుఁడు+అయి= భార్య అయిన శచీదేవితో కూడుకొన్నవాడై; కాంచన, చారు, విమాన, మాలికా+ఆగత, దివిజ+ఉత్తముల్= బంగారుతో చేయబడిన అందమైన విమాన సమూహాల్లో వచ్చిన దేవతాశ్రేష్ఠులు; కొలువఁగాన్= సేవించగా; వర, అప్సరః+అంగనా+ఆయత, విలసత్+ కటాక్ష, కుసుమ+అర్చిత, సుందర, వక్త్ర, చంద్రుఁడు+ఐ= మేటి అప్సరఃకాంతలయొక్క విశాలాలు, ప్రకాశవంతాలు అయిన కడగంటిచూపు లనే పూవులతో పూజించబడే అందమైన ముఖమనే చంద్రుడు కలవాడై; కొలువు+ఉండున్= కొలువుతీరి ఉన్నాడు.

తాత్పర్యం: అందమైన బంగారు విమానాల్లో వచ్చిన దేవతాశ్రేష్ఠులు, కాంతిమంతాలైన విశాలనేత్రాల కడగంటి చూపులు అనే పూలతో పూజించే అప్సరసలు తనను సేవిస్తుండగా, సాటిలేని ఐశ్వర్యంతో, మణిమయాలైన ఆభరణాల కాంతులతో, శచీసమేతుడై, అందమైన చంద్రబింబంలాంటి ముఖంతో దేవేంద్రుడు ఆ సభలో కొలువు తీరి ఉంటాడు.

విశేషం: అలం: రూపకం. గాఢబంధమైన ఓజస్సు శిథిలబంధమైతే ఎంత మనోహరంగా ఉంటుందో, అది ప్రసాదగుణమనే పేరుతో ఎంత ప్రసన్నమౌతుందో ఈ పద్యరచన ప్రదర్శించి చూపుతున్నది. ఇందులో గల మసృణత్వం ఇంద్రుని ధీరలలితస్వభావానికి వ్యంజకంగా అమరింది. ఓజస్సు, శ్లేష అనే శబ్దగుణాలచేత రూపుకట్టిన ప్రసాదగుణం ఇంద్రసభావైభవాన్ని రచనామర్యాదతో రక్తికట్టింపచేస్తున్నది. ఇది నన్నయ ప్రసాదగుణప్రధానమైన రచనకు మంచి ఉదాహరణం. (సంపా.)

వ. **మఱియును.** **65**

తాత్పర్యం: ఇంకను.

సీ. **వదలక యేలినవాని ప్రస్తవమునఁ । బోరిలో నీల్గిన వీరభటులుఁ,**
దమకుల ధర్మముల్ దప్పక సలిపిన । గృహమేధులును, జగన్మహితకీర్తిఁ
బరఁగిన ధన్యులుఁ, బరహితవ్రతులైన । పురుషులు, రుగ్జరా మరణ శోక
భయ బుభుక్షార్తి పిపాసా వ్యపేతులై । కొలుతురు సురరాజు నొలసి యర్థ

ఆ. **ధర్మకామములు సదక్షిణ క్రతువులు । శ్రీ విలాసములు విశేషయజ్ఞ**
వాహమంత్ర తతులు వచ్చి సేవింతురు । మూర్తిమంతు లగుచు ముదముతోడ. **66**

ప్రతిపదార్థం: వదలక= విడువక; ఏలినవాని= తన ప్రభువుయొక్క; ప్రస్తవమునన్= విషయంలో; పోరిలోన్= యుద్ధంలో; ఈల్గిన= మరణించిన; వీరభటులున్= వీరులైనసైనికులూ; తమ, కులధర్మముల్; తప్పక; సలిపిన= ఆచరించిన; గృహమేధులు= గృహస్థులు; జగత్+మహిత, కీర్తిన్= ప్రపంచ ప్రసిద్ధిపొందిన కీర్తితో; పరగిన= ఒప్పిన; ధన్యులున్= పుణ్యాత్ములూ; పర, హిత,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్రతులు+ఐన= ఇతరులకు మేలు చెయ్యటమే వ్రతంగా కలవాళ్ళయిన; పురుషులు; రుక్+జరా, మరణ, శోక, భయ, బుభుక్షా+ఆర్తి, పిపాసా, వి+అపేతులు+ఐ= రోగం, ముసలితనం, మరణం, శోకం, భయం, ఆకలి, బాధ, దప్పిక పూర్తిగా తొలగినవాళ్ళయి; కొలుతురు= సేవిస్తారు; అర్థ, ధర్మ, కామములు; స దక్షిణ, క్రతువులు= దక్షిణలతో కూడిన యజ్ఞయాగాదులు; శ్రీవిలాసములు= లక్ష్మీదేవి కాంతులు(సంపదలు); విశేష, యజ్ఞవాహ, మంత్ర, తతులు= విశేషాలైన యజ్ఞాలను నిర్వహించే మంత్రాల సమూహాలు; మూర్తిమంతులు+అగుచున్= ఆకారాలు కలవారై; వచ్చి; సురరాజున్= దేవతలకు రాజయిన దేవేంద్రుడిని; ఒలసి= చుట్టుచేరి; ముదముతోడన్= సంతోషంతో; సేవింతురు.

తాత్పర్యం: ప్రభువును వదలకుండా ఆయనకోసం యుద్ధంలో మరణించిన వీరసైనికులు, తమకులధర్మాలను తప్పక పాటించిన గృహస్థులు, ప్రపంచ ప్రసిద్ధ కీర్తితో ఒప్పిన పుణ్యాత్ములు, ఇతరులకు మేలు చేయటమే వ్రతంగా గల మహాపురుషులు-రోగం, ముసలితనం, మరణం, శోకం, భయం, ఆకలి, బాధ, దప్పిలేనివాళ్ళయి దేవేంద్రుణ్ణి సేవిస్తుంటారు. అంతేకాదు ధర్మార్థకామాలు, దక్షిణలతో కూడిన యజ్ఞయాగాలు, లక్ష్మీవిలాసాలు, విశేషయజ్ఞాల్ని నిర్వహించే మంత్రసమూహాలు - ఆకారాలు తాల్చివచ్చి ఆ దేవతారాజును సంతోషంతో సేవిస్తుంటారు.

విశేషం: ధర్మకామాదులు అమహద్వాచకాలైనా, మూర్తిదాల్చి వస్తాయి. కాబట్టి 'మూర్తిమంతు'లనే మహద్విశేషణం వాడబడింది. 'మూర్తిమంతములయి ముదముతోడ' అనే పాఠాంతరం కూడ ఉంది.

వ. **మఱియు శుక్రబృహస్పతులు నగ్నీషోములు నాశ్వినులు విశ్వదేవతలును ధాతయు విధాతయు హరిశ్చంద్రుం డను రాజర్షియు సురేంద్రసభ నుండుదురు.** **67**

ప్రతిపదార్థం: మఱియున్; శుక్ర బృహస్పతులున్, అగ్నీషోములును= అగ్నిదేవుడు, చంద్రుడు; ఆశ్వినులున్= అశ్వినీదేవతలు; విశ్వదేవతలును= విశ్వాపుత్రు లని భావింపబడే 10 మంది దేవతలు; ధాతయు= పంన్రెండు మంది సూర్యులలో ఒకడైన ధాత; విధాతయు= మన్మథుడు; హరిశ్చంద్రుండు+అను, రాజ+ఋషియు; సుర+ఇంద్ర, సభన్= దేవతలరాజైన ఇంద్రునిసభలో; ఉండుదురు= ఉంటారు.

తాత్పర్యం: అంతేకాక, శుక్రుడు, బృహస్పతి, అగ్నిదేవుడు, చంద్రుడు, అశ్వినీదేవతలు, విశ్వదేవతలు, ధాత, మన్మథుడు, హరిశ్చంద్రు డనే రాజర్షి దేవేంద్రునిసభలో ఉంటారు.

విశేషం: అశ్వినీదేవతలు- నాసత్యుడు, దస్రుడు, వీరు దేవవైద్యులు. సూర్యుడు అశ్వరూపం పొంది రమించటంచేత సంజ్ఞాదేవికి కలిగిన సుతు లవటంచేత వీళ్ళకు ఆశ్విను లనిపేరు. విశ్వదేవతలు- వసుబంధులు, క్రతుదక్షులు, కాలకాములు, ధురివిరోచనులు, పురూరవార్ద్రవులు (10మంది). ద్వాదశాదిత్యులు- ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూష, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు. ఇచట మూలంలో పెక్కుమంది ఋషుల పేర్లుకూడ ఉన్నాయి (భండార్కరు ప్రతి 2-7-8) ధాత, విధాత అనే సితాసితపటాన్ని వయించే (నేసే) ఇరువురు స్త్రీల ప్రసక్తి ఉదంకోపాఖ్యానంలో ఉంది.

యమసభావర్ణనము (సం. 2-8-1)

క. **ధర్మసభ లోక ధర్మా । ధర్మ వివేకాస్పదంబు, తైజసము; లస**
ద్ధర్మమణితతుల దానిన్ । నిర్మించెను విశ్వకర్మ నిపుణత యొప్పన్. **68**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధర్మ, సభ= యమధర్మరాజుయొక్క సభ; లోకధర్మ+అధర్మ, వివేక+ఆస్పదంబు= లోకంలోని ధర్మాధర్మాల్ని గూర్చి చేసే వివేచనానికి ఉనికిపట్టు; తైజసము= కాంతిమంతం; లసత్+భర్మ, మణి, తతులన్= ప్రకాశించే బంగారంతో, మణి సమూహాలతో; విశ్వకర్మ= దేవశిల్పి; నిపుణతన్= నేర్పుతో; ఒప్పన్; దానిన్, నిర్మించెను.

తాత్పర్యం: యమధర్మరాజుసభ లోకంలోని ధర్మాధర్మాలనుగూర్చి చేసే వివేచనానికి ఉనికిపట్టు. అంతేకాదు అది కాంతిమంతం. మెరిసే బంగారంతో, మణులసమూహాలతో విశ్వకర్మ ఎంతో నేర్పుతో దాన్ని నిర్మించాడు.

విశేషం: విశ్వకర్మ దేవశిల్పి. ప్రభావసుడనే వసువు కుమారుడు.

వ. **అది శతయోజనవిస్తారాయామరమణీయంబును గామగామియును సూర్యతేజోనిభశుభతేజంబును సర్వసుఖసంపాదనంబు నయి చూడనొప్పుచుండు; నట్టి సభయం దగస్త్యమతంగాదిసిద్ధమునులును బితృదేవతలును గాలకింకరులును మూర్తిమంతులైన కాలచక్రక్రతుదక్షిణదిగ్దేవతలను నుగ్రతపంబులును గృతవీర్యజనమేజయజనకబ్రహ్మదత్తపృషదశ్వశంతనువైన్యభూరిద్యుమ్నేంద్రద్యుమ్నమన్మథ మధుకంఠోపరిచరులును మీ జనకుండయిన పాండుమహారాజును నాదిగాఁ గల యనేకరాజఋషులు నుందురు; వీరిచేత ననవరతంబు సేవితుండయి యమరాజు సమస్తజీవుల శుభాశుభకర్మంబు లారయుచుండు.** **69**

ప్రతిపదార్థం: అది= ఆ యమసభ; శతయోజనవిస్తార+ఆయామ, రమణీయంబును= నూరు ఆమడల విస్తృతిచేత, నిడుపుచేత అందమైనది; కామగామియును= కోరిన చోటికి వెళ్ళగలిగేది; సూర్య, తేజో, నిభ, శుభ, తేజంబును= సూర్యకాంతితో సమానమైన మంచికాంతి కలిగినది; సర్వ, సుఖ, సంపాదనంబున్+అయి= అన్ని సుఖాలను కూర్చునదయి; చూడన్+ఒప్పుచున్+ ఉండున్; అట్టి; సభయందు; అగస్తి, మతంగ+ఆది, సిద్ధమునులును= అగస్త్యుడు, మతంగుడు మొదలైన సిద్ధ మహామునులును; పితృదేవతలును; కాల, కింకరులును= యమభటులును; మూర్తిమంతులు+ఐన= రూపుదాల్చిన; కాల, చక్ర, క్రతు, దక్షిణ, దిక్+దేవతలును= కాలచక్రం, యాగాలు, దక్షిణదిక్కులోనిదేవతలు; ఉగ్ర, తపంబులును= ఘోరాలైనతపస్సులును; కృతవీర్య, జనమేజయ, జనక, బ్రహ్మదత్త, పృషదశ్వ, శంతను, వైన్య, భూరిద్యుమ్న+ఇంద్రద్యుమ్న, మన్మథ, మధుకంఠ+ఉపరిచరులును; మీ, జనకుండు+అయిన= మీతండ్రి అయిన; పాండుమహారాజును; ఆదిగాన్+కల= మొదలుగా గల; అనేక, రాజ+ఋషులున్; ఉందురు; వీరిచేతన్; అనవరతంబు= ఎల్లప్పుడు; సేవితుండు+అయి= సేవించబడినవాడయి; యమరాజు= యమధర్మరాజు; సమస్త, జీవుల= అన్నిప్రాణుల; శుభ+అశుభ, కర్మంబులు= మంచిపనులు, చెడుపనులు; ఆరయుచున్+ఉండున్= విచారిస్తూఉంటాడు.

తాత్పర్యం: యమసభ నూరామడల విస్తృతి, నిడుపు కలిగి రమణీయమైంది. కోరుకున్నచోటికి వెళ్ళగలది. సూర్యకాంతితో సమానమైన మంచితేజస్సు కలది. సర్వసుఖాల్ని సమకూర్చేది. చూడ చక్కనిది. ఆ సభలో అగస్త్యమతంగాది సిద్ధమునులు, పితృదేవతలు, యమకింకరులు, రూపుదాల్చిన కాలచక్రం, యాగాలు, దక్షిణదిక్కులోని దేవతలు, ఉగ్రతపస్సులు, కృతవీర్య, జనమేజయ, జనకాదిమహారాజులు, మీతండ్రి అయిన పాండుమహారాజు మొదలుగా గల పెక్కుమంది రాజఋషులును ఉంటారు. వీళ్ళంతా తనను ఎప్పుడూ సేవిస్తుండగా యమధర్మరాజు ప్రాణుల పుణ్యపాపాల్ని గూర్చి విచారిస్తుంటాడు.

విశేషం: పాండురాజుకూడ యమసభలో ఉన్నా డని చెప్పటం భావికథకు ప్రేరకం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వరుణసభావర్ణనము (సం. 2-9-1)

క. వరుణసభ సర్వలోకో। త్తర ముజ్జ్వలమణిమయము సితప్రభ మతిసుం
దర మందుండు వరుణుఁడును। వరుణానీసహితుఁడై ధ్రువంబగు మహిమన్. 70

ప్రతిపదార్థం: వరుణ, సభ= వరుణుడియొక్కసభ; సర్వలోక+ఉత్తరము= అన్నిలోకాలలో శ్రేష్ఠం; ఉత్+జ్వల, మణిమయము= మిక్కిలిప్రకాశించే మణులతో కూడుకొన్నది; సిత, ప్రభము= తెల్లని కాంతికలది; అతిసుందరము= మిక్కిలి అందమైనది; వరుణుఁడును; వరుణానీ, సహితుఁడు+ఐ= భార్యతో కూడుకొన్నవాడై; ధ్రువంబు+అగు= స్థిరమైన; మహిమన్= మహిమతో; అందున్+ఉండున్.

తాత్పర్యం: వరుణసభ సర్వలోకోత్తరమైంది. మెరిసే మణులతో కూడుకొన్నది. తెల్లనికాంతి కలది. ఎంతో అందమైంది. వరుణుడు భార్యాసహితుడై స్థిరమహిమతో ఆ సభలో ఉన్నాడు.

వ. అది యమరాజు సభయంతియ విస్తారాయామ రామణీయకంబులును గామగామిత్వంబునుం గలిగి విలసిల్లు; జలస్తంభంబు సేసి జలంబులలో నుండి విశ్వకర్మ దాని రమణీయంబుగా రచియించె. 71

ప్రతిపదార్థం: అది= ఆ వరుణుని సభ; యమరాజు, సభ, అంతియ= యమధర్మరాజు సభ అంతే; విస్తార+ఆయామ, రామణీయకంబులును= వెడల్పు, పొడవు, సొగసులూ; కామగామిత్వంబునన్= కోరుకొన్నచోటికి వెళ్ళగలిగినస్థితి; కలిగి; విలసిల్లున్= ప్రకాశిస్తూ ఉంటుంది; విశ్వకర్మ= దేవశిల్పి; జలస్తంభంబు, చేసి= జలస్తంభనవిద్యతో; జలంబులలోన్+ఉండి= నీళ్ళలో ఉండి; దానిన్= ఆ సభను; రమణీయంబుగాన్= సుందరంగా; రచియించెన్= రూపొందించాడు.

తాత్పర్యం: ఆ వరుణసభ యమసభతో సమానమైన వెడల్పు, పొడవు, అందం కలిగి, కోరినచోటికి వెళ్ళగలిగిందై కళకళలాడుతూ ఉంటుంది. విశ్వకర్మ జలస్తంభనవిద్యతో నీళ్ళలో ఉండి ఎంతో మనోహరంగా దాన్ని నిర్మించాడు.

విశేషం: జలస్తంభనం- ఊపిరి బిగబట్టి నీళ్ళ అడుగున జీవించగలగటం- ఇది అరవైనాలుగు కళల్లో ఒకటి. దుర్యోధనుడు కూడ ఈ విద్య నేర్చినవాడే.

సీ. అందు సుఖాసీనుఁడైన యవ్వరుణేంద్రు। నంబుధుల్ నాల్గును నధికభక్తిఁ
గాళింది నర్మద గంగ గోదావరి। విదిశ విపాశ కావేరి కృష్ణ
వేణి సరస్వతి పెన్న యైరావతి। యనఁగఁ బ్రసిద్ధంబులయిన నదులు
సరసీతటాక నిర్ఝర దీర్ఘికాదులు। దిక్కులు నఖిల ధాత్రీధరములు

ఆ. వసుమతియును దేహవంతంబులై వచ్చి। మకర కూర్మ శింశుమార సింహ
శరభ సామజాది జలచర స్థలచర। తతులతోడ సంతతంబుఁ గొలుచు. 72

ప్రతిపదార్థం: అందున్= ఆ సభలో; సుఖ+ఆసీనుఁడు+ఐ= సుఖంగా కొలువుదీరిఉన్న; ఆ+వరుణ+ఇంద్రున్= ఆ వరుణదేవుని; అంబుధుల్= సముద్రాలు; నాల్గును; కాళింది, నర్మద, గంగ, గోదావరి, విదిశ, విపాశ, కావేరి, కృష్ణవేణి, సరస్వతి, పెన్న, ఐరావతి; అనఁగన్= అనేపేర్లతో; ప్రసిద్ధంబులు+అయిన; నదులు; సరసీ, తటాక, నిర్ఝర, దీర్ఘికా+ఆదులు= సరస్సులు, చెరువులు, సెలయేళ్ళు, దిగుడుబావులు మొదలైనవి; దిక్కులున్= దిక్కులూ; అఖిల, ధాత్రీ, ధరములు= అన్ని పర్వతాలు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వసుమతియును= భూమియు; దేహవంతంబులు+ఐ= దేహాలను ధరించినవై; వచ్చి; మకర, కూర్మ, శింశుమార, సింహ, శరభ, సామజ+ఆది, జలచర, స్థలచర, తతులతోడన్= మొసళ్ళు, తాబేళ్ళు, నీటికోతులు, సింహాలు, శరభాలు, ఏనుగులు మొదలైన జలచర, భూచర ప్రాణుల సమూహాలతో; సతతంబున్= ఎల్లప్పుడు; అధికభక్తిన్= మిక్కిలిభక్తితో; కొలుచున్= సేవిస్తారు.

తాత్పర్యం: ఆ సభలో సుఖంగా కొలువుదీరిఉన్న వరుణదేవుణ్ణి - నాలుగు సముద్రాలు, కాళిందీ నర్మదా గంగా గోదావరీ, కావేరీ మొదలైన నదులు, సరస్సులు, చెరువులు, సెలయేళ్ళు, దిగుడుబావులు, దిక్కులు, పర్వతాలు, భూమి - దేహాలు ధరించివచ్చి, మొసళ్ళు, తాబేళ్ళు, సింహాలు శరభాలు మొదలైన జలచర భూచర సమూహాలతో అన్నివేళలా అధికభక్తితో ఆయనను సేవిస్తుంటారు.

విశేషం: 'అంబుధు లేడు' అని కొన్ని ప్రతుల్లో ఉన్నా 'సముద్రా శ్చత్వారో' (భండార్కరు ప్రతి 2-9-18) అని మూలంలో ఉంది. శింశుమార మంటే మొసలి అనే అర్థంకూడ ఉంది.

వ. మఱియు వాసుక్యైరావతాది నాగరాజులును బ్రహ్లాద విరోచన బలి నరక నముచి విప్రచిత్తి కాలకంఠ కైటభ ఘటోదర దశగ్రీవ విశ్వరూప విరూపాక్షాదులయిన దైత్యదానవ వరులును వరుణు సేవించుచుండుదురు. 73

ప్రతిపదార్థం: మఱియున్; వాసుకి+ఐరావత+ఆది= వాసుకి, ఐరావతుడు మొదలయిన; నాగరాజులును= సర్పరాజులు; ప్రహ్లాద, విరోచన, బలి, నరక, నముచి, విప్రచిత్త, కాలకంఠ, కైటభ, ఘటోదర, దశగ్రీవ, విశ్వరూప, విరూపాక్ష+ఆదులు+అయిన= ప్రహ్లాదుడు, విరోచనుడు, బలి మొదలయిన; దైత్య, దానవ, వరులును= దైత్యదానవశ్రేష్ఠులూ; వరుణున్; సేవించుచున్+ఉండుదురు.

తాత్పర్యం: అంతేకాక వాసుకి, ఐరావతుడు మొదలైన నాగరాజులు, ప్రహ్లాదుడు, విరోచనుడు, బలి, నరకుడు, నముచి, విప్రచిత్తి, కాలకంఠుడు, కైటభుడు, ఘటోదరుడు, దశగ్రీవుడు, విశ్వరూపుడు, విరూపాక్షుడు మొదలైన దైత్యదానవశ్రేష్ఠులు వరుణుణ్ణి సేవిస్తూ ఉంటారు.

విశేషం: ఇంతకంటె అధికంగా సర్పరాజుల పేర్లు మూలంలో ఉన్నాయి. వాసుకి, ఐరావతుడు - కద్రువ కుమారులు. దైత్యులు - కశ్యపునికి దితియందు పుట్టినవాళ్ళు. దానవులు - కశ్యపునికి దనువుకు పుట్టినవాళ్ళు. అందరూ రాక్షసులే.

కుబేర సభావర్ణనము (సం. 2-10-1)

క. ధనదుసభ యింద్రసభతో । నెనయగుచు మహావిభూతి నెంతయు నొప్పుం
దన దివ్యశక్తి నాతం । డొనరంగ నిర్మించె దాని నుత్తమమణులన్. 74

ప్రతిపదార్థం: ధనదు, సభ= ధనాన్ని ఇచ్చేవాడైన కుబేరుని సభ; ఇంద్రసభతోన్= దేవేంద్రుని సభతో; ఎన, అగుచున్= సాటిగా ఉంటూ; మహా, విభూతిన్= గొప్ప ఐశ్వర్యంతో; ఎంతయున్= మిక్కిలి; ఒప్పున్= ప్రకాశిస్తుంది. అతండు= ఆ కుబేరుడు; తన= తనయొక్క; దివ్య, శక్తిన్= దివ్యమైన శక్తిచేత; దానిన్= ఆ సభను; ఉత్తమ మణులన్= శ్రేష్ఠాలైన మణులతో; ఒనరంగన్= ఒప్పుగా; నిర్మించెన్= నిర్మించాడు.

తాత్పర్యం: కుబేరునిసభ ఇంద్రసభతో సమానంగా ఉంటుంది. అపారమైన ఐశ్వర్యంతో ఎంతో ప్రకాశిస్తూ ఉంటుంది. కుబేరుడు తనదివ్యశక్తిచేత ఉత్తమమణులతో అతిరమణీయంగా దాన్ని నిర్మించాడు.

వ. అదియును నూఱుయోజనంబుల నిడుపును దెబ్బదియోజనంబుల వెడల్పునుం గలిగి సితప్రభంబయి గగనచరంబయి కనకమయతరులతాలంకృతం బయి తటిల్లతావిచిత్రశరదంబుదంబు ననుకరించు చుండు. 75

ప్రతిపదార్థం: అదియును; నూఱు, యోజనంబుల, నిడుపును= నూరామడల పొడవును; డెబ్బది, యోజనంబుల, వెడల్పును; కలిగి; సిత, ప్రభంబు+అయి= తెల్లటికాంతి కలదై; గగనచరంబు+అయి= ఆకాశంలో తిరుగాడేదై; కనకమయ, తరు, లతా+ అలంకృతంబు+అయి= బంగారుచెట్లతో, తీవలతో అలంకరించబడిందై; తటిత్+లతా, విచిత్ర, శరత్+అంబుదంబున్= మెరుపుతీవలచేత ఆశ్చర్యకరమైన శరత్కాలమేఘాన్ని; అనుకరించుచున్+ఉండున్= పోలి ఉంటుంది.

తాత్పర్యం: ఆ సభ పొడవు నూరామడలు, వెడల్పు డెబ్బది ఆమడలు. తెల్లటి కాంతితో అది ఆకాశంలో చలిస్తూ, బంగారు చెట్లతో, తీవలతో అలంకరించబడి, మెరుపుతీగలతో ఆశ్చర్యకరమైన శరత్కాలమేఘంలా ఉంటుంది.

విశేషం: సభకాంతి తెలుపు, శరత్కాల మేఘకాంతి తెలుపు. సభకు అలంకారాలు-బంగారుచెట్లు, తీవలు. మేఘానికి అలంకారాలు- మెరుపుతీగలు. పోలిక మనోహరం. ఆకాశ సంచారం రెండింటికి సమానం.

క. అందుఁ గుబేరుఁడు పరమా । నందంబున నుండు ధర్మనందన! విలస
న్మందార పారిజాతక । నందన మందానిలాభినందితుఁ డగుచున్. 76

ప్రతిపదార్థం: ధర్మనందనా!= ఓధర్మరాజా!; అందున్= ఆ సభలో; కుబేరుఁడు; పరమ+ఆనందంబునన్= మిక్కిలి ఆనందంతో; విలసత్+మందార, పారిజాతక, నందన, మంద+అనిల+అభినందితుఁడు+అగుచున్= శోభిల్లుతున్న మందార పారిజాత వృక్షాలతో కూడిన నందనవనంలోనుండి మెల్లగా వీస్తున్న చల్లనిగాలిచేత సంతోషింప చేయబడినవాడౌతూ; ఉండున్= కొలువుదీరి ఉంటాడు.

తాత్పర్యం: ఓధర్మరాజా! ఆ సభలో కుబేరుడు మందార పారిజాతాది వృక్షశోభతో శోభిల్లే నందనవనంనుండి మందమారుతంవీస్తుండగా పరమానందంతో కొలువుదీరి ఉంటాడు.

వ. అతని ననవరతంబును నరకిన్నర నాములైన గంధర్వులును, వరాహకర్ణ గజకర్ణ మాణిభద్ర హేమనేత్ర విభీషణ పింగళక ప్రవాళకాదులయిన యక్షులును, నలకూబరుండును, నూర్వశీతిలోత్తమా ఘృతాచీ మేనకా విభావరీ రంభా ప్రభృతులయిన యప్సరసలును సేవింతు; రే నెప్పుడు ననేక దేవర్షి గణంబులతో నరిగి చూచుచుండుదు. 77

ప్రతిపదార్థం: అతనిన్= ఆ కుబేరుని; అనవరతంబును= ఎల్లప్పుడును; నర, కిన్నర, నాములు+ఐన= నరులు, కిన్నరులు అనే పేర్లు కల; గంధర్వులును; వరాహకర్ణ, గజకర్ణ, మాణిభద్ర, హేమనేత్ర, విభీషణ, పింగళక, ప్రవాళక+ఆదులు+అయిన= వరాహకర్ణుడు, గజకర్ణుడు-మొదలైన; యక్షులును; నలకూబరుండును; ఊర్వశీ, తిలోత్తమా, ఘృతాచీ, మేనకా, విభావరీ, రంభా, ప్రభృతులు+అయిన= ఊర్వశి, తిలోత్తమ మొదలైన; అప్సరసలును; సేవింతురు; ఏను= నేను; ఎప్పుడున్= ఎల్లప్పుడు; అనేక, దేవ+ఋషి, గణంబులతోన్= పెక్కుమంది దేవర్షి సమూహాలతో; అరిగి= వెళ్ళి; చూచుచున్+ఉండుదున్.

తాత్పర్యం: అన్ని వేళల ఆ కుబేరుడిని నరులు, కిన్నరులు అనే పేర్లు గల గంధర్వులును, వరాహకర్ణుడు, గజకర్ణుడు మొదలయిన యక్షులు, నలకూబరుడు, ఊర్వశి, తిలోత్తమ మొదలయిన అప్సరసలు సేవిస్తూ ఉంటారు. నేను కూడ ఎప్పుడూ ఎంతోమంది దేవర్షులతో వెళ్ళి అతణ్ణి చూస్తూ ఉంటాను.

ఉ. **వానికి నెయ్యుఁడై యమరవంద్యపదాంబుజుఁ డంబికా బృహ**
త్పీనపయోధరాగ్ర పరిపీడితవక్షుఁడు భూషణీకృతా
హీనుఁ డశేషలోకగురుఁ డీశ్వరుఁ డెప్పుడు నంద యుండు నా
నా నిశితాయుధాయుతసనాథమహాద్భుతభూతకోటితోన్. **78**

ప్రతిపదార్థం: వానికిన్= ఆకుబేరునికి; నెయ్యుఁడు+ఐ= స్నేహితుడై; అమర, వంద్య, పద+అంబుజుఁడు= దేవతలచేత నమస్కరించబడే పద్మాలవంటి పాదాలు కలవాడు; అంబికా, బృహత్+పీన, పయోధర+అగ్రపరిపీడిత, వక్షుఁడు= పార్వతీదేవియొక్క పెద్దవైన, బలిసిన పాలిండ్ల చివరలచే నొక్కబడిన వక్షఃస్థలం కలవాడు; భూషణీకృత+అహి+ఇనుఁడు= ఆభరణాలుగా చేయబడిన పాములరాజైన వాసుకి కలవాడు-అంటే పాములను అభరణాలుగా కలవాడు; అశేష, లోక, గురుఁడు= అన్నిలోకాలకు గురువైనవాడు; ఈశ్వరుఁడు= శివుడు; నానానిశిత+ఆయుధ+అయుత, సనాథ, మహా+అద్భుత, భూత, కోటితోన్= నానావిధాలై వాడి అయిన ఆయుధాలు పదివేలతో కూడుకొన్న మిక్కిలి ఆశ్చర్యకరమైన భూతాల సమూహంతో; ఎప్పుడున్= ఎల్లప్పుడు; అందు+అ, ఉండున్= అందే ఉంటాడు.

తాత్పర్యం: దేవతలు నమస్కరించే పాదపద్మాలు కలవాడు, పార్వతీదేవి పాలిండ్ల చివరలు నొక్కిన వక్షఃస్థలం కలవాడు, పాములరాజైన వాసుకిని ఆభరణంగా కలవాడు, అన్నిలోకాలకు గురుడు అయిన శివుడు కుబేరుడికి స్నేహితుడై పదునైన నానావిధ ఆయుధాలు ధరించి ఆశ్చర్యకరంగా ఉన్న భూతసమూహంతో ఎప్పుడూ అక్కడనే ఉంటాడు.

విశేషం: పిశాచగణాలకు, ప్రమథగణాలకు అధిపతి కనుక శివునికి భూతపతి అనికూడ పేరు. (ఈ పద్యంలో ఓజఃప్రసాదగుణమిశ్రమం వైదర్భీరీతిని రూపుకట్టించింది. ఇటువంటి రచన నన్నయలో విరళంగా కనపడుతుంది. (చూడు. పీఠిక). సంపా.)

బ్రహ్మసభావర్ణనము (సం. 2-11-1)

వ. **ఏను దొల్లి మనుష్యలోకంబునం గొండొక కాలంబున్న నా కడకు సూర్యుండు వచ్చి పితామహు సభ వర్ణించినఁ దద్దర్శన కుతూహలుండ నయి యాదిత్యుతోడన యరిగి యక్కమలగర్భుసభం జూచితి.** **79**

ప్రతిపదార్థం: ఏను= నేను; తొల్లి= పూర్వం; మనుష్య, లోకంబునన్= భూలోకంలో; కొండొక, కాలంబు+ఉన్న= కొంతకాలం ఉండగా; నాకడకున్= నాదగ్గరకు; సూర్యుండు; వచ్చి; పితామహు, సభ= బ్రహ్మదేవునిసభను; వర్ణించినన్= వర్ణించగా; తత్+దర్శన, కుతూహలుండను+అయి= దాన్ని చూడటంలో ఆసక్తి కలవాడినై; ఆదిత్యుతోడన్+అ= సూర్యుని వెంటనే; అరిగి= వెళ్ళి; ఆ, కమల, గర్భు, సభన్= ఆ బ్రహ్మదేవునిసభను; చూచితిన్= చూచాను.

తాత్పర్యం: పూర్వం కొంతకాలం నేను భూలోకంలో ఉన్నప్పుడు నా దగ్గరకు సూర్యుడు వచ్చాడు. బ్రహ్మసభనుగూర్చి వర్ణించాడు. నేనుకూడ దాన్ని చూడాలన్న కుతూహలంతో సూర్యునివెంబడి వెళ్ళి ఆ బ్రహ్మసభను చూచాను.

విశేషం: పితామహుడు - తండ్రులకు తండ్రి - బ్రహ్మ, కమలగర్భుడు - పద్మాన్ని (శ్రీ మహావిష్ణువు యొక్క నాభి కమలాన్ని) పుట్టుకస్థానంగా కలవాడు (శ్రీమహావిష్ణువుయొక్క నాభికమలంనుండి పుట్టినవాడు) - బ్రహ్మ.

చ. దళితవిరోధి! యిట్టి దని దాని తెఱం గెఱుఁగంగ బ్రహ్మకుం
గొలఁదియె తా నవాఙ్మనసగోచర మద్భుతరూప మీ వియ
త్తల మను కంబ మొక్కటియ తాల్పఁగ సుస్థిరమై నిజప్రభా
వలి వెలుఁగించుచుండు శశివారిజమిత్త్రుల మండలంబులన్. 80

ప్రతిపదార్థం: దళితవిరోధి!= అణచివేయబడిన శత్రువులు కలవాడా! ఓధర్మరాజా!; ఇట్టి+అది+అని; దాని, తెఱంగు+ ఎఱుఁగంగన్= ఆ సభయొక్క విధం తెలుసుకోటానికి; బ్రహ్మకున్+కొలఁదియె= బ్రహ్మదేవునికైనా సాధ్యమా!; తాన్=తాను (సభ); అవాక్+మనస, గోచరము= మాటకు, మనస్సుకు అందనిది-అంటే చెప్పసాధ్యంకానిది, ఊహించశక్యంకానిది; అద్భుత, రూపము= ఆశ్చర్యకరమైన రూపం కలది; ఈ, వియత్+తలము+అను= ఈ ఆకాశమనే; కంబము+ఒక్కటి+అ= స్తంభమొక్కటే; తాల్పఁగన్= ధరించగా; సుస్థిరము+ఐ= మంచి నిలకడకలదై; శశి, వారిజ, మిత్త్రుల, మండలంబులన్= చంద్రసూర్యమండలాలను; నిజప్రభా+ఆవలిన్= తనయొక్కకాంతి సమూహాలచేత; వెలుఁగించుచున్+ఉండున్= ప్రకాశించేటట్లు చేస్తూ ఉంటుంది.

తాత్పర్యం: శత్రువుల్ని అణచివేసిన ఓ ధర్మరాజా! బ్రహ్మసభావైభవం ఇలాంటి దని తెలుసుకోటానికి ఆ బ్రహ్మకైనా సాధ్యం కాదు. అది చెప్ప సాధ్యం కానిది. ఊహకు కూడా అందనిది. దానిరూపం అద్భుతం. ఆకాశమనే స్తంభ మొక్కటే దాన్ని ధరిస్తూ ఉండగా, సుస్థిరంగా నిలిచి, తన కాంతులతో చంద్రసూర్యమండలాల్ని ప్రకాశింపచేస్తూ ఉంటుంది.

విశేషం: వారిజము - నీటినుండి పుట్టింది - పద్మం. దానికి మిత్త్రుడు - సూర్యుడు. 'వాఙ్మనసము' - ఇది నిపాతం. స్త్రీపుంసము, వాఙ్మనసము, రాత్రిందివము మొదలయినవి. (అచతు రేత్యాది పాణినీయ సూత్రం చూచేది). (పద్యరచనలో ప్రసాదగుణం ప్రసన్న మౌతున్నది. సంపా.)

వ. 'అం దనేకవిధ జీవరాసుల సృజియించుచు నధికతపస్వుల తపఃఫలంబులు విధించుచు విశ్వకర్తలైన మన్వత్రి మరీచి భృగు భరద్వాజ దక్ష వసిష్ఠ వాలఖిల్య పులస్త్య పులహ క్రతు కశ్యప గౌతమాంగిరః ప్రచేతసులును, జంద్రాదిత్యగ్రహనక్షత్రగణంబులును, దేవగణంబులును, వసురుద్రసిద్ధసాధ్యులును, బ్రజావంతులైన పంచాశత్సహస్రమునులును, నూర్ధ్వరేతసులయిన యష్టాశీతిసహస్రమునులును. నాశ్వినులును, విశ్వదేవతలును, విశ్వకర్మయుం, బితృదేవతలునుం దన్నుం బరివేష్టించి యుండ ధర్మార్థకామమోక్షంబులును, శబ్దస్పర్శరూపరసగంధంబులును, దపశ్శమదమంబులును, ధృతి స్మృతి మేధాబుద్ధి క్షమా కీర్తులును, సంకల్ప వికల్పప్రణవంబులును, క్షణలవత్రుటి కాష్ఠా ముహూర్తాహోరాత్ర పక్షమాస ఋతు సంవత్సర యుగాత్మకంబైన కాలచక్రంబును. ఋగ్యజుస్సామాథర్వణవేదవేదాంగంబులును,

బురాణేతిహాసంబులును, బహుప్రకారభాషలును, సమస్తవిద్యలును మూర్తిమంతంబులైకొలువ సరస్వతీ సమేతుండై పరమానందంబునం బరమేష్ఠి పద్మాసనంబున నుండు' నని లోకపాలురసభలను బ్రహ్మసభను వర్ణించిన నారదునకు ధర్మరా జి ట్లనియె. 81

ప్రతిపదార్థం: అందున్+అనేకవిధ, జీవరాసులన్= ఆ సభలో పెక్కువిధాలైన ప్రాణుల సమూహాల్ని; సృజియించుచున్= సృష్టిచేస్తూ, అధిక, తపస్వుల= ఎక్కువ తపస్సు చేసినవాళ్ళయొక్క; తపః, ఫలంబులు= తపస్సుల ఫలాలను; విధించుచున్= నిర్ణయిస్తూ; విశ్వకర్తలు+ఐన= విశ్వాన్ని రూపొందించిన; మను+అత్రి, మరీచి, భృగు, భరద్వాజ, దక్ష, వసిష్ఠ, వాలఖిల్య, పులస్త్య, పులహ, క్రతు, కశ్యప, గౌతమ+అంగిరః; ప్రచేతసులును; చంద్ర+ఆదిత్య, గ్రహ, నక్షత్ర, గణంబులును= చంద్రసూర్యగ్రహ నక్షత్ర సమూహాలూ; దేవగణంబులును= దేవతల సమూహాలూ; వసు, రుద్ర, సిద్ధ, సాధ్యులును; ప్రజావంతులు+ఐన= సంతానంగల; పంచాశత్+సహస్ర మునులును= యాభైవేలమంది మునులూ; ఊర్ధ్వరేతసులు+అయిన= ఇంద్రియాన్ని ఊర్ధ్వముఖం కావించిన - అంటే బ్రహ్మచారులైన; అష్ట+అశీతి, సహస్రమునులును= ఎనభైఎనిమిదివేలమంది మునులూ; ఆశ్వినులును= అశ్వినీదేవతలూ; విశ్వదేవతలును; విశ్వకర్మయున్, పితృదేవతలున్, తన్నున్= తనను (ఆబ్రహ్మదేవుణ్ణి); పరివేష్టించి, ఉండన్= చుట్టును చేరి కొలుస్తుండగా; ధర్మ+అర్థ, కామ, మోక్షంబులును; శబ్ద, స్పర్శ, రూప, రస, గంధంబులును; తపస్+శమ, దమంబులును= తపస్సును అంతర్బహిరింద్రియ నిగ్రహాలూ; ధృతి, స్మృతి, మేధా, బుద్ధి, క్షమా, కీర్తులును; సంకల్ప, వికల్ప, ప్రణవంబులును; క్షణ, లవ, త్రుటి, కాష్ఠా, ముహూర్త+అహః+రాత్ర, పక్ష, మాస, ఋతు, సంవత్సర, యుగ+ఆత్మకంబు+ఐన, కాలచక్రంబును= క్షణం, లవం వంటి కాలవిభాగాలతో కూడిన కాలచక్రమూ; ఋక్, యజుస్, సామ+అథర్వణవేద, వేద+అంగంబులును= నాలుగువేదాలు, వేదాంగాలు; పురాణ+ఇతిహాసంబులును; బహు, ప్రకార, భాషలును= అనేకవిధాలైన భాషలూ; సమస్తవిద్యలును; మూర్తి మంతంబులు+ఐ= ఆకారాన్ని ధరించినవై; కొలువన్; సరస్వతీ, సమేతుండు+ఐ= సరస్వతీదేవితో కూడినవాడై; పరమ+ఆనందంబునన్; పరమేష్ఠి= బ్రహ్మదేవుడు; పద్మ+ఆసనంబునన్, ఉండున్+అని; లోకపాలుర, సభలను= లోకపాలురు - దిక్పాలకులైన ఇంద్ర, యమ, వరుణ, కుబేర, సభలను; బ్రహ్మసభను; వర్ణించిన; నారదునకున్; ధర్మరాజు+ ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'విశ్వకర్తలైన మనువు, అత్రి, మరీచి మొదలయినవాళ్ళు, సూర్య చంద్ర గ్రహనక్షత్ర సమూహాలు, దేవగణాలు, వసువులు, రుద్రులు, సిద్ధులు, సాధ్యులు సంతానవంతులైన యాభైవేలమంది మహామునులు, ఊర్ధ్వరేతసు లయిన ఎనభై ఎనిమిదివేలమంది మహర్షులు, అశ్వినీదేవతలు, విశ్వదేవతలు, విశ్వకర్మ, పితృదేవతలు, రూపుదాల్చిన ధర్మార్థకామమోక్షాలు, శబ్దస్పర్శరూపరసగంధాలు, తపస్సు, శమం, దమం, ధృతి, స్మృతి, మేధ, బుద్ధి, క్షమ, కీర్తి, సంకల్పం, వికల్పం, ప్రణవం (ఓంకారం), క్షణం, లవం, త్రుటి, కాష్ఠ, ముహూర్తం, పగలు, రాత్రి, పక్షం, మాసం మొదలయిన విభాగాలతో కూడిన కాలచక్రం, చతుర్వేదాలు, వేదాంగాలు, పురాణేతిహాసాలు, బహువిధ భాషలు, సమస్త విద్యలు, ఆకారం తాల్చి తనను సేవిస్తూ ఉండగా, సరస్వతీ సమేతుడై, వివిధ జీవరాసుల్ని సృజిస్తూ, మహాతపస్వుల తపఃఫలాలు నిర్ణయిస్తూ, బ్రహ్మదేవుడు పద్మాసనంమీద ఆ సభలో కొలువు తీరి ఉంటాడు'- అని దిక్పాలురసభలను, బ్రహ్మదేవునిసభను వర్ణించిన నారదమహర్షితో ధర్మరాజు ఇలా అన్నాడు.

విశేషం: బ్రహ్మదేవునిసభ ఎవ రెవరితో ఎంత క్రిక్కిరిసి ఉంటుందో, ఆయన ఎన్నెన్ని విషయాలలో ఎంత నిర్విరామంగా కృషి చేస్తుంటాడో ఈవచనం వ్యక్తం చేస్తుంది. వసువులు-ఆపుడు, ధ్రువుడు, సోముడు, అధ్వరుడు, అనిలుడు, ప్రత్యూషుడు, అనలుడు, ప్రభాసుడు. రుద్రులు- అజుడు, ఏకపాదుడు, అహిర్బుధ్న్యుడు, త్వష్ట, రుద్రుడు, హరుడు, శంభుడు, త్ర్యంబకుడు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అపరాజితుడు, ఈశానుడు, త్రిభువనుడు. సిద్ధులు, సాధ్యులు దేవతల్లో రెండు తెగలు. ధర్మార్థకామమోక్షాలు-చతుర్విధపురుషార్థాలు. శబ్ద స్పర్శ రూప రస గంధాలు పంచభూతాలైన ఆకాశ వాయు కాంతి జల పృథివీ ధర్మాలు. వీటినే పంచతన్మాత్ర లని వ్యవహరించటం ఉంది. శమము-శాంతి,- అంతరింద్రియ నిగ్రహం. దమము-ఓర్పు-బాహ్యేంద్రియ నిగ్రహం. ప్రణవం - ఓంకారం. వేదాంగాలు - శిక్ష. వ్యాకరణం, ఛందం, నిరుక్తం జ్యోతిషం, కల్పం, పురాణం - సృష్టి. ప్రతిసృష్టి. వంశం, మన్వంతరం, వంశానుచరితం అనే ఐదు లక్షణాలు గల పురాతన చరిత్ర. పురాణాలు పద్దెనిమిది - మత్స్య, మార్కండేయ, భాగవత, భవిష్యత్, బ్రహ్మాండ, బ్రాహ్మ, బ్రహ్మవైవర్త, వామన, వాయవ్య, వైష్ణవ, వరాహ, అగ్ని, నారద, పద్మ, లింగ, గరుడ, కూర్మ, స్కాందాలు. ఇతిహాసం- ఇతి+హ+ఆస - పూర్వరాజుల చరిత్ర - భారతం లాంటిది.

హరిశ్చంద్రుమాహాత్మ్యము (సం. 2-11-48)

మధ్యాక్కర.

పరమధర్మాత్మకుఁ డయిన పాండుభూపతిఁదొట్టి సకల
ధరణీశులెల్ల యముసభ నుండంగఁ, దా నేమి పుణ్య
చరితఁ బ్రవర్తిల్లెనయ్య దేవేంద్రసభ హరిశ్చంద్రుఁ
డురుతరమహిమతో దేవపూజ్యుఁడై యుండంగఁ గనియె? 82

ప్రతిపదార్థం: పరమ, ధర్మ+ఆత్మకుఁడు+అయిన= మిక్కిలిధర్మాత్ముఁడైన; పాండుభూపతిన్, తొట్టి= పాండురాజు మొదలుగాగల; సకల, ధరణీ+ఈశులు+ఎల్లన్= సమస్త భూమండలానికి రాజులైన వా రందరు; యము, సభన్= యమధర్మరాజుయొక్క సభలో; ఉండంగన్= ఉండగా; హరిశ్చంద్రుఁడు; తాను+ఏమి; పుణ్యచరితన్= పవిత్రవర్తనంతో; ప్రవర్తిల్లెన్+అయ్య= నడవడి సాగించాడో; ఉరుతర, మహిమతోన్= గొప్ప మహిమతో; దేవ, పూజ్యుఁడు+ఐ= దేవతలకు పూజించదగినవాడై; దేవ+ఇంద్ర, సభన్= దేవేంద్రునియొక్కసభలో; ఉండంగన్, కనియెన్= ఉండగలిగాడు.

తాత్పర్యం: పరమధర్మాత్ముడైన పాండురాజు మొదలుగాగల రాజులంతా యమసభలో ఉండగా, ఏ పవిత్ర చరిత్రవల్ల హరిశ్చంద్రమహారాజు మహామహిముడై, దేవతలకే పూజ్యుడై దేవేంద్రుని సభలో ఉండగలిగినాడో కదా!

విశేషం: రాజ్యపాలకులంతా ఏదో ఒక్క కారణంగా యమలోకం చేరక తప్ప దని కాబోలు 'రాజ్యాంతే నరకం ధ్రువమ్' అన్నారు.

వ. అని యడిగిన ధర్మరాజునకు హరిశ్చంద్రు మహిమాతిశయంబు నారదుం డి ట్లని చెప్పె. 83

ప్రతిపదార్థం: అని; అడిగిన; ధర్మరాజునకు; నారదుండు; హరిశ్చంద్రు, మహిమ+అతిశయంబు= హరిశ్చంద్రుని ప్రభావం యొక్క గొప్పతనాన్ని; ఇట్లు+అని; చెప్పెన్;

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా అడిగేసరికి, నారదమహర్షి హరిశ్చంద్రుని గొప్పతనాన్ని ఈ విధంగా చెప్పాడు.

ఉ. దీపితసత్యసంధుఁడు ధృతిస్మృతిధర్మపరాయణుం డయో
ధ్యాపురనాయకుండు జలజాప్తకులైకవిభూషణుండు వి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్యాపరమార్థవేది శరదబ్జసముజ్జ్వలకీర్తిచంద్రికా
స్నాపితసర్వలోకుఁడు త్రిశంకునరేంద్రసుపుత్త్రుఁ డున్నతిన్. 84

ప్రతిపదార్థం: త్రిశంకు, నర+ఇంద్ర, సుపుత్త్రుఁడు= త్రిశంకుమహారాజుయొక్క ఉత్తముడైన కుమారుడు - హరిశ్చంద్రుడు; ఉన్నతిన్= గొప్పతనంలో; దీపిత, సత్యసంధుఁడు= ప్రకాశింపజేయబడిన సత్యవాక్యప్రతిజ్ఞకలవాడు; ధృతి, స్మృతి, ధర్మ పరాయణుండు= యజ్ఞ (ధైర్య) శాస్త్రధర్మాలలో ఎంతో ఆసక్తి కలవాడు; అయోధ్యాపుర, నాయకుండు= అయోధ్యానగరానికి రాజు; జలజ+ఆప్త, కుల+ఏక, విభూషణుండు= పద్మాలకు ఆప్తుడైన సూర్యునివంశానికి ప్రధానమైన అలంకారమైనవాడు - అంటే సూర్యవంశంలో ప్రసిద్ధుడైన రాజు; విద్యా, పరమ+అర్థ, వేది= విద్యయొక్క పరమార్థాన్ని తెలిసికొన్నవాడు; శరత్+అబ్జ, సముజ్జ్వల, కీర్తి, చంద్రికా, స్నాపిత, సర్వలోకుఁడు= శరత్కాలంలోని పద్మంవలె మిక్కిలి కాంతిమంతమైన కీర్తి అనే వెన్నెలచేత స్నానం చేయించబడిన అన్నిలోకాలుకలవాడు - అంటే అన్నిలోకాలకు వ్యాపించిన కీర్తి కలవాడు.

తాత్పర్యం: త్రిశంకుమహారాజు కుమారుడైన హరిశ్చంద్రుడు పేరుకెక్కిన సత్యసంధుడు. యజ్ఞంలో, ధైర్యంలో, శాస్త్రంలో, ధర్మంలో ఎంతో ఆసక్తి కలవాడు. అయోధ్యానగరానికి ప్రభువు. సూర్యవంశం మొత్తానికి అలంకారమైనవాడు. విద్యాపరమార్థాన్ని తెలుసుకున్నవాడు. అన్నిలోకాలకు వ్యాపించిన కీర్తికలవాడు.

విశేషం: అలం: ఉపమ, రూపకం. అనేకప్రతుల్లో ఈ పద్యం లేదు. రచన ప్రసాదగుణబంధురం. (సంపా.)

సీ. **జయశీలుఁడయి హరిశ్చంద్రుండు దొల్లి స । ప్తద్వీపములఁ దన బాహుశక్తిఁ**
జేసి జయించి నిశ్శేషితశత్రుఁడై । ధారుణిలోఁ గల ధరణిపతుల
నిజశాసనంబున నిలిపి నిత్యంబైన । మహిమతో సకలసామ్రాజ్య మొప్ప
రాజసూయంబు తిరంబుగా నొనరించి । తనరి యథోచితదక్షిణలకు

ఆ. **నేనుమడుఁగు లర్థ మిచ్చి యాజకులఁ బూ । జించి భక్తితో విశిష్ట విప్ర**
జనుల కభిమతార్థసంప్రదానంబులఁ । దృప్తిసేసె వంశదీపకుండు. 85

ప్రతిపదార్థం: వంశ, దీపకుండు= వంశం వెలిగించేవాడైన హరిశ్చంద్రుడు; జయశీలుఁడు+ఐ= జయించే స్వభావం కలవాడై; తొల్లి= పూర్వం; సప్త, ద్వీపములన్= ఏడుదీవులను; తన= తనయొక్క; బాహుశక్తిన్, చేసి= భుజబలంతో; జయించి; నిః+శేషిత, శత్రుఁడు+ఐ= మిగలని శత్రువులు కలవాడై, అంటే శత్రువు లందరిని జయించి; ధారుణిలోన్, కల= భూమిలో ఉన్న; ధరణిపతులన్= రాజుల్ని; నిజశాసనంబునన్= తన ఆజ్ఞలో; నిలిపి; నిత్యంబు+ఐన, మహిమతోన్= శాశ్వతమైన గొప్పతనంతో; సకల సామ్రాజ్యము+ఒప్పన్= సమస్త సామ్రాజ్యం ప్రకాశించగా; రాజసూయంబు= రాజసూయమహాయాగం; తిరంబుగాన్= స్థిరంగా; ఒనరించి= చేసి; తనరి= అతిశయించి; యథా+ఉచిత, దక్షిణలన్= ఎవరెవరికి ఎంతెంతగా ఇవ్వదగిన దక్షిణలకు; ఏనుమడుఁగులు= ఐదురెట్లు; అర్థము+ఇచ్చి= ధనాన్ని ఇచ్చి; యాజకులన్= యజ్ఞం చేయించేవారిని; పూజించి; భక్తితోన్; విశిష్ట, విప్ర, జనులకున్= గొప్పవారైన బ్రాహ్మణులకు; అభిమత+అర్థ, సంప్రదానంబులన్= కోరుకొన్నవస్తువులను ఇవ్వటంచేత; తృప్తి, చేసెన్= తృప్తి నొందించాడు;

తాత్పర్యం: సూర్యవంశాన్ని ప్రకాశింపజేసే హరిశ్చంద్ర మహారాజు, జయించాలన్న స్వభావంతో, సప్తద్వీపాల్ని తన బాహుబలంతో జయించాడు. శత్రువు లెవ్వరూ మిగులకుండ, నేలమీది రాజులంతా తన ఆజ్ఞ మీరకుండ చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శాశ్వతవైభవంతో తన సామ్రాజ్యమంతా ప్రకాశించేటట్లు - రాజసూయమహాయాగం చేశాడు. యాజ్ఞికు లందరికి ఇవ్వదగిన దక్షిణలకంటె ఐదింత లిచ్చి పూజించాడు. బ్రాహ్మణోత్తముల కోర్కెలన్నీ భక్తితో తీర్చాడు.

విశేషం: ద్వీపం - నాల్గువైపుల నీరున్న భూభాగం-దీవి. సప్తద్వీపాలు - జంబూ, ప్లక్ష, శాల్మల, కుశ, క్రౌంచ, శాక, పుష్కరాలు, యాజకుడు-యాజ్ఞికుడు-యాగం నడిపేవాడు - ఋత్విక్కు.

క. ఉరుతరధనసంతర్పిత । ధరణీసురు లతని నతిముదంబున దీవిం
చిరి 'రాజులందు లోకో । త్తరతేజోధర్మయుక్తిఁ దనరుమ' యనుచున్. 86

ప్రతిపదార్థం: ఉరుతర, ధన, సంతర్పిత, ధరణీసురులు= గొప్పధనదానాలచేత లెస్సగా తృప్తి పొందించబడిన బ్రాహ్మణులు; అతనిన్= ఆ హరిశ్చంద్రుణ్ణి; అతిముదంబునన్= మిక్కిలి సంతోషంతో; రాజుల+అందున్= రాజుల్లో; లోక+ఉత్తర, తేజః, ధర్మయుక్తిన్= లోకాతీతమైన తేజస్సుతో, ధర్మంతో కూడినవాడివై; తనరుము+అ= ఒప్పుమా!; అనుచున్; దీవించిరి.

తాత్పర్యం: హరిశ్చంద్రుడు కావించిన గొప్ప ధనదానాలతో లెస్సగా తృప్తిపొందిన బ్రాహ్మణులు మిక్కిలి సంతోషంతో 'రాజు లందరిలో నీవు లోకాతీతతేజస్సుతో, ధర్మంతో ప్రకాశించు' అని ఆశీర్వదించారు.

వ. వాఁడును బ్రాహ్మణ వచనంబునం జేసి యెల్ల రాజులకు నధికుండయి రాజసూయమహాయజ్ఞకరణంబునం జేసి దేవేంద్రుసాలోక్యంబు వడసె; నట్టి హరిశ్చంద్రు మహిమాతిశయంబు రాజసూయ నిమిత్తంబున నయినదిగా నెఱింగి రాజలోకంబుతో వైవస్వతసభ నుండు భవజ్జనకుండు పాండురాజు నాతో ని ట్లనియె. 87

ప్రతిపదార్థం: వాఁడును= ఆ హరిశ్చంద్రుడుకూడ; బ్రాహ్మణ, వచనంబునన్+చేసి= బ్రాహ్మణులయొక్క ఆశీర్వచనంచేత; ఎల్లరాజులకున్= అందరు రాజులకంటె; అధికుండు+అయి= గొప్పవాడై; రాజసూయ, మహాయజ్ఞ, కరణంబునన్+చేసి= రాజసూయ మహాయజ్ఞాన్ని చేయటంచేత; దేవేంద్రు, సాలోక్యంబు= దేవేంద్రుని చేరే స్థితిని; పడసెన్= పొందాడు; అట్టి, హరిశ్చంద్రు, మహిమ+అతిశయంబు= హరిశ్చంద్రుని గొప్పతనంయొక్క ఆధిక్యాన్ని; రాజసూయ, నిమిత్తంబునన్= రాజసూయ యాగ కారణాన; అయినది, కాన్= ఏర్పడినట్టిదిగా; ఎఱింగి= తెలిసికొని; రాజలోకంబుతోన్= రాజుల సమూహంతో; వైవస్వత, సభన్, ఉండు= యమధర్మారాజు సభలో ఉండే; భవత్, జనకుండు= నీయొక్క తండ్రి; పాండురాజు; నాతోన్+ఇట్లు+అనియెన్= నాతో ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: హరిశ్చంద్రుడు బ్రాహ్మణాశీర్వచనంవల్ల అందరు రాజులకంటె అధికుడై, రాజసూయమహాయజ్ఞం చెయ్యటంవల్ల దేవేంద్రలోకాన్ని పొందాడు. హరిశ్చంద్రునికి ఆ మహిమాతిశయం అంతా రాజసూయ మహాయాగ కారణంగానే వచ్చిం దని గ్రహించి, యమసభలో రాజు లందరితో ఉన్న మీ తండ్రి నాతో ఇలా అన్నాడు.

నారదుఁడు పాండురాజువచనంబులు ధర్మజుని కెఱింగించుట (సం. 2-11-65)

క. జనపతులు రాజసూయం । బొనరించిన వారు శక్రునొద్దను సురపూ
జన లొందుచుండుదురు కో । రిన కోర్కులు వడయుచును హరిశ్చంద్రుక్రియన్. 88

ప్రతిపదార్థం: జనపతులు= రాజులు; రాజ, సూయంబు+ఒనరించినవారు= రాజసూయ మహాయాగం చేసినవారు; హరిశ్చంద్రు, క్రియన్= హరిశ్చంద్రుడివలె; శక్రు, ఒద్దను= దేవేంద్రుడి దగ్గర; కోరిన, కోర్కులు; పడయుచును= పొందుతూ; సుర, పూజనలు+ఒందుచున్= దేవతలయొక్క పూజలు అందుకొంటూ; ఉండుదురు.

తాత్పర్యం: రాజసూయయాగం చేసిన రాజులంతా హరిశ్చంద్రునిలా తమ కోర్కెలు తీర్చుకొంటూ దేవతల పూజలు అందుకుంటూ దేవేంద్రుని దగ్గర ఉంటారు.

చ. **గొనకొని మర్త్యలోకమునకుం జని సన్మునినాథ! యిందు నా**
యునికిని రాజసూయమఖ మున్నతిఁ జేసిన ధన్యు లింద్రునం
దునికియు నా తనూజున కనూనయశోనిధి యైన ధర్మనం
దనునకుఁ జెప్పి వాని నుచితస్థితిఁ బన్పుఁడు దానిఁ జేయఁగన్. **89**

ప్రతిపదార్థం: సత్+మునినాథ!= ఓమహామునీంద్రా!; గొనకొని= పూనుకొని; మర్త్య, లోకమునకున్+చని= మానవలోకానికి వెళ్ళి; ఇందున్= ఈ యమసభలో; నా, ఉనికిని= నేను ఉండటాన్ని; రాజసూయ, మఖము+ఉన్నతిన్+చేసిన, ధన్యులు= రాజసూయ యజ్ఞాన్ని గొప్పగా చేసిన పుణ్యాత్ములు; ఇంద్రునందున్+ఉనికియు= ఇంద్రసభలో ఉండటాన్ని; నా, తనూజునకున్= నా కుమారునికి; అనూన, యశోనిధి+ఐన= సాటిలేని కీర్తికి స్థానమైన; ధర్మనందనునకున్, చెప్పి; వానిన్= అతడిని; దానిన్, చేయఁగన్= ఆ యజ్ఞాన్ని చెయ్యటానికి; ఉచిత, స్థితిన్, పన్పుఁడు= తగువిధంగా ఆజ్ఞాపించండి.

తాత్పర్యం: ఓ నారద మునీంద్రా! మీరు మానవలోకానికి వెళ్ళి నేను యమసభలో ఉన్న విషయాన్ని, రాజసూయ మహాయాగం చేసిన పుణ్యాత్ములంతా ఇంద్రసభలో ఉన్న విషయాన్ని, కీర్తి సంపన్నుడైన నా కుమారుడు ధర్మరాజుకు చెప్పండి. ఆ యాగం చెయ్యటానికి ఉచితరీతిని అతణ్ణి ఆజ్ఞాపించండి.

విశేషం: అర్థనైర్మల్యంతోకూడిన శిథిలబంధం ప్రసాదగుణాన్ని రూపొందించి పాండురాజు చిత్తవృత్తిని వ్యక్తంచేస్తున్నది. (సంపా.)

చ. **అనుపమశక్తిమంతులు మదాత్మజు లేవురు దేవతావరం**
బున నుదయించి యున్న కృతపుణ్యులు; వారలలోన నగ్రజుం
డనఘుఁడు రాజసూయము మహామతిఁ జేయఁగ నోపు శత్రుసూ
దనుఁ డయి సార్వభౌముఁ డయి తమ్ముల బాహుబలంబు పెంపునన్. **90**

ప్రతిపదార్థం: అనుపమ, శక్తిమంతులు= సాటిలేని బలం కలవాళ్ళు; మత్+ఆత్మజులు= నాయొక్కకుమారులు; ఏవురు= ఐదుగురు; దేవతావరంబునన్= దేవతలయొక్కవరంచేత; ఉదయించి= పుట్టిఉన్న; కృత, పుణ్యులు= చేయబడిన పుణ్యం కలవారు - అంటే పుణ్యపురుషులు; వారలలోనన్= వారిలో; అగ్రజుడు= పెద్దవాడు; అనఘుఁడు= పాపరహితుడు-అంటే పుణ్యాత్ముడు; రాజసూయము; మహా, మతిన్= గొప్పబుద్ధితో; తమ్ముల= తమ్ములయొక్క; బాహు, బలంబు, పెంపునన్= భుజబలంయొక్క ఆధిక్యంతో; శత్రుసూదనుఁడు+అయి= శత్రువుల్ని జయించినవాడై; సార్వభౌముఁడు+అయి= భూమినంతా పరిపాలించేవాడయి; చేయఁగన్+ఓపున్= చెయ్యగలడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నాకుమారులు ఐదుగురు సాటిలేని శక్తి సంపన్నులు. దేవతల వరాలవల్ల పుట్టిన పుణ్యాత్ములు. పెద్దవాడు ధర్మజుడు తమ్ముల భుజబలంతో శత్రువుల్ని జయించి, చక్రవర్తి అయి రాజసూయమహాయాగం చెయ్యగలడు.

విశేషం: పైపద్యంలోవలె ఇందులోనూ ప్రసాదగుణం ప్రసన్నమౌతున్నది; ధర్మరాజు ధీరోదాత్తవ్యక్తిత్వాన్ని వ్యంజింపచేస్తున్నది.(సంపా.)

వ. అట్లేని నాకు నస్మత్పితృ పితామహ నివహంబుతోడ నాకాధిపలోక సుఖావాప్తి యగు ననిన నప్పాండురాజు వచనంబు నీ కెఱింగించు వేడుక నిట వచ్చితి. 91

ప్రతిపదార్థం: అట్లు+ఏనిన్= ఆ విధంగా అయితే-అంటే-ధర్మరాజు రాజసూయమహాయాగం చేస్తే; నాకున్= నాకు; అస్మత్+పితృ, పితామహ, నివహంబుతోడన్= నాతండ్రి తాతల సమూహంతోకూడ; నాక+అధిప, లోక, సుఖ+అవాప్తి, అగున్= స్వర్గానికి అధిపతి అయిన ఇంద్రునియొక్క లోకంలోని సుఖాన్ని పొందటం కలుగుతుంది; అనినన్= అని అనగా; ఆ+పాండురాజు, వచనంబు= ఆ పాండురాజు యొక్కమాట; నీకున్; ఎఱింగించు, వేడుకన్= నీకు తెలియచెయ్యాలన్న కుతూహలంతో; ఇటన్= ఇచ్చటికి; వచ్చితిన్= వచ్చాను.

తాత్పర్యం: 'ఆ విధంగా ధర్మరాజు రాజసూయం చేస్తే, నాకు పితృ పితామహ సమూహంతో ఇంద్రలోక సుఖప్రాప్తి కలుగుతుంది' అని ఆ పాండురాజు చెప్పినమాట నీకు తెలియచెయ్యాలన్న కుతూహలంతో ఇక్కడికి వచ్చాను.

క. న్యాయమున రాజసూయము । సేయుము; నీ పితృగణంబుఁ జెచ్చెర నధిక
శ్రీయుత సురగణపూజ్యులఁ । జేయుము; శక్రుసభ నుండఁ జేయుము వారిన్. 92

ప్రతిపదార్థం: అధిక, శ్రీ, యుత= గొప్ప సంపదతో కూడిన ధర్మరాజా!; న్యాయమునన్= న్యాయమార్గంలో; రాజసూయము, చేయుము; చెచ్చెరన్= వేగమే; సురగణపూజ్యులన్= దేవతల సమూహంచేత పూజించదగిన వాళ్ళనుగా; చేయుము; వారిన్= వాళ్ళను; శక్రుసభన్= దేవేంద్రుని సభలో; ఉండన్+చేయుము= ఉండేటట్లు చేయుము.

తాత్పర్యం: మహాసంపన్నుడవైన ఓ ధర్మరాజా! న్యాయమార్గంలో రాజసూయం చేసి నీ పితృదేవతాసమూహం దేవతాసమూహంచే శీఘ్రమే పూజలందుకొనేటట్లు, దేవేంద్రసభలో ఉండేటట్లు చెయ్యి.

విశేషం: పాండురాజు కోరికను మిత్రసమ్మితంగా ప్రబోధించిన నారదమహర్షియొక్క ఈ వాక్యాలు సభాపర్వకథార్థాలకు బీజతుల్యాలు. భవిష్యద్ద్రష్ట అయిన శ్రీకృష్ణుడు రాజసూయయాగా ధ్వరయోగ్యమైన సభను మయునిచేత నిర్మింపచేసి, నాంది నాలపించి నిష్క్రమించిన సూత్రధారునివలె ద్వారవతీ నగరానికి వెళ్ళాడు. నాంద్యంతాన ప్రవేశించే మరొక సూత్రధారునివలె నారదుడు వచ్చి, సభాసార్థక్యాన్ని సాధించే సవనప్రయోగాన్ని పితృవాక్యపరిపాలనధర్మంలోని అంగంగా నిర్దేశించాడు. నారదుని హితవాక్యాలతో కూడిన ఈ పద్యంలో 'సమత' అనే శబ్దగుణం సందర్భోచితంగా రాణించి, ఋషియొక్క సమతాబుద్ధిని ప్రసన్నతను ధ్వనింపజేస్తున్నది. పద్యనిర్మాణంలోని సమతకూడా గమనించతగింది. (సంపా.)

వ. 'దిగ్విజయోపార్జితంబులయిన ధనంబుల బ్రాహ్మణసంతర్పణంబును ధర్మమార్గంబునం జాతుర్వర్ణాశ్రమ రక్షణంబునుం జేసి సామ్రాజ్యంబు పూజ్యంబై యొప్పం బ్రకాశింపుము; మఱి రాజసూయంబు బహు

విఘ్నంబు, బ్రహ్మరాక్షసులు దానిరంధ్రంబ రోయుచుండుదు; రదియును నిర్విఘ్నంబున సమాప్తం బయ్యేనేని నిఖిల ప్రజాప్రళయ కారణంబయిన రణంబగు'నని చెప్పి నారదుం డరిగినఁ దమ్ములంజూచి ధర్మతనయుండు ధౌమ్య ద్వైపాయన సుహృద్బాంధవ మంత్రి సమక్షంబున ని ట్లనియె. 93

ప్రతిపదార్థం: దిక్+విజయ+ఉపార్జితంబులు+అయిన= దిగ్విజయంచేత సంపాదించబడిన; ధనంబులన్= సంపదలతో; బ్రాహ్మణ, సంతర్పణంబును= బ్రాహ్మణుల్ని తృప్తి పెట్టటం; ధర్మ, మార్గంబునన్, చాతుర్వర్ణ్య+ఆశ్రమ, రక్షణంబునున్+చేసి= ధర్మమార్గంలో బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య శూద్రవర్ణాలవారిని, బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలను రక్షించటంచేత; సామ్రాజ్యంబు; పూజ్యంబు+ఐ= గౌరవించదగిందై; ఒప్పన్= శోభిల్లగా; ప్రకాశింపుము; మఱి; రాజసూయంబు; బహు, విఘ్నంబు= పెక్కు విధాలైన ఆటంకాలతో కూడుకొన్నది; బ్రహ్మరాక్షసులు; దాని; రంధ్రంబు+అ= దోషాన్నే; రోయుచుండుదురు= వెదుకుతూ ఉంటారు; అదియును= ఆ రాజసూయంకూడ; నిర్విఘ్నంబున= నిరాటంకంగా; సమాప్తంబు+అయ్యెన్+ఏనిన్= ముగిసినట్లయితే; నిఖిల, ప్రజా, ప్రళయ, కారణంబు, అయిన= సకలప్రజల నాశనానికి కారణమైన; రణంబు+అగున్+అని= యుద్ధం జరుగుతుం దని; చెప్పి; నారదుండు+అరిగినన్= నారదుడు వెళ్ళగా; ధర్మతనయుండు= ధర్మరాజు; తమ్ములన్+చూచి; ధౌమ్య, ద్వైపాయన, సుహృత్, బాంధవ, మంత్రి, సమక్షంబునన్= ధౌమ్యుడు, వ్యాసుడు, మిత్రులు, బంధువులు, మంత్రులు- వీళ్ళందరియెదుట; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'దిగ్విజయంచేత సంపాదించిన ధనంతో బ్రాహ్మణులను తృప్తిపెట్టు. ధర్మమార్గాన నాలుగు వర్ణాలవాళ్ళని, బ్రహ్మచర్యగార్హస్థ్యవానప్రస్థసన్న్యాసాశ్రమాల్ని (మునుల నివాసాలైన ఆశ్రమాల్ని) రక్షించు. నీ సామ్రాజ్యం గౌరవార్హమై శోభించేవిధంగా ప్రకాశించు. కాగా రాజసూయానికి అనేకవిఘ్నాలు కలుగుతాయి. బ్రహ్మరాక్షసులు దాన్ని భంగంచేసే మార్గాన్ని వెదుకుతుంటారు. నిర్విఘ్నంగా యాగం పూర్తిఅయితే సకల ప్రజా నాశకమైన మహాయుద్ధం సంభవిస్తుంది'- అని నారదమహర్షి చెప్పి అక్కడినుండి వెళ్ళాడు. ధర్మరాజు తన తమ్ముళ్ళవైపు చూచి ధౌమ్య, వ్యాస, మిత్ర, బంధు, మంత్రుల ఎదుట ఇలా అన్నాడు.

విశేషం: నారదుడి పలుకులు ప్రస్తావనలో సూత్రధారుడు కథోద్ఘాతం అనే అంగం ప్రయోగిస్తున్న స్ఫూర్తిని కలిగిస్తూ నన్నయ రచనలో నాటకీయతను ధ్వనింపచేస్తున్నాయి. ధర్మజుడు రాజసూయం చేసేటప్పుడు అనేక విఘ్నాలను ఎదుర్కోవలసి వస్తుందనీ, యజ్ఞం నిర్విఘ్నంగా ముగిస్తే కాలాంతరంలో ప్రజాక్షయం కలిగే ప్రళయంవంటి ఒక మహాయుద్ధం సంభవిస్తుం దనీ నారదుడు సూచించాడు. కలహభోజనుడిచేత ఈ అంశాన్ని కబురంపించటం, ఆయన ధర్మరాజుకు నిర్దేశించటం భావికథార్థధ్వనిలో ప్రవర్తిల్లిన ఔచిత్యం. రాజసూయానికి రంగంగా నిలిచింది మయసభ; ధర్మజుడి అంతరంగానికి ప్రేరకంగా సాగింది నారద వాక్యసుధ. (సంపా.)

ధర్మరాజు నారదవచనప్రబోధితుండై రాజసూయయజ్ఞంబు సేయుటకు నాలోచించుట (సం. 2-12-1)

క. పితృసంకల్పము సేయుఁగ । సుతుల కవశ్యమును వలయు; సుతజన్మఫలం
బతిముదమునఁ బితృవరులకు । హిత మొనరించుటయ కాదె యెంతయు భక్తిన్. 94

ప్రతిపదార్థం: పితృ, సంకల్పము= తండ్రియొక్క కోరిక; సుతులకున్= కుమారులకు; అవశ్యమును, చేయుఁగన్, వలయున్= తప్పక చేయాలి; సుతజన్మ, ఫలంబు= పుత్రుని పుట్టుకకు ఫలం; పితృ వరులకున్= పూజ్యులైన తండ్రులకు; ఎంతయున్, భక్తిన్= ఎంతోభక్తితో, అతిముదమునన్= మిక్కిలి సంతోషంతో; హితము+ఒనరించుట+అ, కాదు+ఎ= మేలు చేయటమే కదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తండ్రి కోర్కెను తీర్చటం తనయుల విధి, పుత్రుడుగా పుట్టినందుకు ఫలం పితృదేవులకు ఎంతో భక్తితో, సంతోషంతో మేలు చెయ్యటమే కదా!

విశేషం: ఈపద్యం పుత్రధర్మప్రబోధకం. చేయఁగ. వలయు= వ్యస్తంగా ఉన్నాయి.

క. **'పరలోకనిలయు లగు మీ । గురులకు దీనన హితం బగున్ లోకభయం**
కరసంగరమును గాలాం । తరమున నగు' నని విరించితనయుఁడు సెప్పెన్. **95**

ప్రతిపదార్థం: పరలోక, నిలయులు+అగు= పరలోకం నివాసస్థానంగా కలిగి ఉన్నవారయిన; మీగురులకున్= మీ పెద్దలకు అంటే- మీ పితరులకు; దీనన్+అ= దీనిచేతనే-ఈ రాజసూయము చెయ్యటంవల్లనే; హితంబు+అగున్= మేలు కలుగుతుంది; లోక, భయంకర, సంగరమును= ప్రపంచానికి భయంకరమైన యుద్ధంకూడ; కాల+అంతరమునన్+అగున్= తరువాతికాలంలో జరుగుతుంది; అని; విరించి, తనయుఁడు= బ్రహ్మదేవునియొక్క కుమారుడైన నారదుడు; చెప్పెన్.

తాత్పర్యం: 'ఈరాజసూయంవల్ల పరలోకవాసు లయిన మీ పెద్దలకు మేలు కలుగుతుంది. లోకంలో మున్ముందు మహాభయంకరమైన సంగ్రామం సంభవిస్తుంది' - అని నారదమహర్షి చెప్పాడు.

క. **పితృగణహితార్థముగ స । త్క్రతు వొనరింపంగ బుద్ధిగలదు, ప్రజా సం**
హృతి తత్క్రతువున నగు నని । మతి నాశంకయును గలదు మానుగ నాకున్. **96**

ప్రతిపదార్థం: మానుగన్= తగువిధంగా; నాకు; పితృ, గణ, హిత+అర్థముగన్= పితృదేవతల సమూహంయొక్క మేలుకొరకు; సత్+క్రతువు+ఒనరింపంగన్= శ్రేష్ఠమైన ఆ రాజసూయయాగం చెయ్యటానికి; బుద్ధి= కోరిక; కలదు; తత్, క్రతువునన్= ఆ యాగంవల్ల; ప్రజా, సంహృతి= ప్రజానాశం; అగున్+అని= కలుగుతుం దని; ఆశంకయును= అనుమానం (భయం) కూడ; కలదు.

తాత్పర్యం: పితృదేవతల మేలుకోరి ఆ మహాయాగం చెయ్యాలన్న కోరిక ఉంది. కాని, ఆ యాగం చెయ్యటంవల్ల ప్రజానాశం కలుగుతుందన్న భయం కూడా ఉంది.

వ. **ఏమి సేయుదు నని దోలాయమాన మానసుం డయి యున్న ధర్మరాజునకు ధౌమ్యప్రభృతు లి ట్లనిరి.** **97**

ప్రతిపదార్థం: ఏమి, చేయుదున్+అని; డోలాయమాన, మానసుండు+అయి= ఊయలవలె ముందు వెనుకలకు ఊగుతున్న మనస్సు కలవాడై; ఉన్న; ధర్మరాజునకు; ధౌమ్య, ప్రభృతులు= ధౌమ్యుడు మొదలయినవారు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ఏమి చెయ్యటానికి తోచక ఉయ్యాలమాదిరిగా ముందువెనుకలకు ఊగుతున్న మనస్సు కల ధర్మరాజుతో ధౌమ్యాదులు ఇలా అన్నారు.

ఉ. **చేయుము రాజసూయ మెడసేయక; దానన చేసి దోషముల్**
వాయు నిలేశ! భూప్రజకుఁ; బార్థివులెల్ల భవత్ప్రతాపని

ర్జేయులు; సర్వసంపదలు చేకొనఁగాఁ దఱియయ్యెఁ గౌరవా

మ్నాయలలామ! నీ కెనయె మానవనాథులు మానుషంబునన్. **98**

ప్రతిపదార్థం: ఇలా+ఈశ!= ఓ భూపతీ-ధర్మరాజా!; ఎడ, చేయక= ఆలస్యం చెయ్యకుండ; రాజసూయము, చేయుము; దానిన్+అ, చేసి= దానిచేతనే; భూప్రజకున్= లోకంలోని జనులకు; దోషముల్= పాపాలు; పాయున్= తొలగుతాయి; పార్థివులు+ఎల్లన్= రాజులంతా; భవత్, ప్రతాప, నిర్జేయులు= నీయొక్క పరాక్రమంచేత జయించతగినవారు; సర్వసంపదలు; చేకొనన్+కాన్= తీసుకోటానికి; తఱి+అయ్యెన్= సమయం అయింది; కౌరవ+ఆమ్నాయ, లలామ!= కౌరవ వంశశ్రేష్ఠా!; మానుషంబునన్= మానవయత్నంలో (పురుషకారంలో); మానవనాథులు= రాజులు; నీకున్; ఎనయె= సాటియా, సమానమా!

తాత్పర్యం: ధర్మరాజా! ఆలస్యం కాకుండా రాజసూయం జరిపించు. దానివల్ల ప్రజల పాపాలు తొలగిపోతాయి. రాజులంతా నీ ప్రతాపానికి లొంగిపోయేవాళ్ళే. సర్వసంపదలు సేకరించటానికి ఇది తగిన సమయం. ఓ కౌరవాన్వయశ్రేష్ఠా! మానవయత్నంలో రాజు లెవ్వరూ నీకు సరిగారు.

విశేషం: ఈ పద్యంలో అర్థవ్యక్తి అనే గుణం సార్థకంగా పోషించబడింది. రాజసూయయాగం చేయాలా వద్దా అని డోలాయమానమైన మనస్సుతో ఉన్న ధర్మరాజుకు నిశ్చయబుద్ధి కలిగేటట్లు ధౌమ్యాదులు ఇందులో వక్తవ్యార్థం స్ఫుటంగా ఝటితిత్యర్థస్ఫోరకంగా వ్యక్తమయ్యేటట్లు చెప్పటంవలన అర్థవ్యక్తి రూపుకట్టింది. ఈ పద్యరచనలో వాక్యనిర్మాణపద్ధతికూడ దానికి తోడ్పడుతున్నది. 'చేయుము రాజసూయ మెడసేయక'- అనే వాక్యం విధ్యర్థక క్రియాపదంతో ప్రారంభమై ధర్మజుని అనుమానాన్ని నివారిస్తున్నది. ఆ తరువాత రాజసూయ మనే కర్మను వాడటం, వెంటనే 'ఎడసేయక' అని వాడి, వెంటనే నిర్వహించవలసింది అని నిర్దేశించటం జరిగింది. ఈ పద్యంలోని తరువాతివాక్యాలన్నీ ఆలస్యంచేయకుండా రాజసూయం ఎందుకు చేయాలో నిరూపించేవే. అందుకు మూడు కారణాలు-చెప్పారు. 1. ప్రజలకు దోషాలు తొలుగుతాయి. అందువలన దేశంలో ఈతిబాధలు లేకుండ జనులు సుఖంగా జీవించగలుగుతారు-అంటే అది విశ్వశ్రేయోదాయక మని భావం. 2. రాజు లందరు ధర్మజునిచేత జయింపబడి ఉన్నారు. 3. అందువలన వా రందరు తమసంపదలను కప్పాలుగా, కానుకలుగా ధర్మజుడికి అర్పించగలరు. ఈ మూడుకారణాలవలన ధర్మరాజుకు ఆ కాలంలో దీటైనవాడు మరొక రాజు లేడు. కాబట్టి రాజసూయానికి అదే సమయ మని నొక్కిచెప్పారు. 'ఆలస్యా దమృతం విషమ్' అనే న్యాయంచొప్పున అనుకూలమైన కాలాన్ని అనువుగా ఉపయోగించుకొని అభ్యుదయాలను సాధించు మని ధౌమ్యాదులు బోధించారు. సమర్థనీయస్యార్థస్య కావ్యలింగం సమర్థనం' అనే లక్షణంచేత ఇందులో కావ్యలింగాలంకారం ఉన్నది. 'నీ కెనయె' అనేది అర్థాంతరసంక్రమిత వాచ్యం. పైన చెప్పిన కారణాలవలన ఏర్పడిన సమున్నతస్థితివలననే కాక, సర్వసద్గుణాలలోనూ, మహాపరాక్రమవంతులైన తమ్ములను కలిగి ఉండటంలోను, పరమాత్ముడైన శ్రీకృష్ణుని అండదండలు ఉండటంలోనూ ధర్మరాజుకు సాటిగా నిలిచే రాజులు మరెవ్వరూ భూతలంలో లే రని తాత్పర్యం. (సంపా.)

వ. **అనిన వారల వచనంబుల కనుగుణంబుగా ననుజానుమతుండయి ధర్మరాజు రాజసూయంబు సేయ సమకట్టి, 'దీని నిర్విఘ్నంబున నిర్వహించుట కనాదినిధనుం డాదిపురుషుండు పురుషోత్తముండు పుండరీకాక్షుం డజుం డయ్యును జగద్ధితార్థంబుగా మర్త్యంబున జనియించిన యమ్మహాత్ముండు వాసుదేవుండ యోపుంగాని యన్యుల కశక్యం' బని యప్పుడ యాప్తచరులం బిలువంబనిచి.** **99**

ప్రతిపదార్థం: అనిన, వారల; వచనంబులకున్; అనుగుణంబుగాన్= తగినట్లుగా; అనుజ+అనుమతుండు+అయి= తమ్ములచేత సమ్మతించబడినవాడై, అంటే - తమ్ముల సమ్మతి పొంది; ధర్మరాజు; రాజసూయంబు; చేయన్; సమకట్టి= పూనుకొని; దీనిన్= ఈ రాజసూయాన్ని; నిర్విఘ్నంబునన్= ఆటంకంలేకుండా; నిర్వహించుటకున్= జరపటానికి; అనాది, నిధనుండు=

పుట్టుక, చావు లేనివాడు; ఆదిపురుషుండు= మొట్టమొదటిపురుషుడు; పురుష+ఉత్తముండు= పురుషుల్లో శ్రేష్ఠుడు; పుండరీక+అక్షుండు= తెల్ల తామరలవంటి కన్నులు కలవాడు; అజుండు= పుట్టుకలేనివాడు-విష్ణువు; అయ్యును; జగత్+హిత+అర్థంబుగాన్= లోకానికి మేలు చేయటంకోసం; మర్త్యంబునన్= భూలోకంలో; జనియించిన= పుట్టిన; ఆ+మహాత్ముండు; వాసుదేవుండు+అ= వసుదేవుని పుత్రుడైన శ్రీకృష్ణుడే; ఓపున్+కాని= సమర్థుడవుతాడు గాని; అన్యులకున్+ఇతరులకు; అశక్యంబు+అని= అసాధ్యమని; అప్పుడు+అ= అప్పటికప్పుడే; ఆప్తచరులన్= ఆప్తులైన సేవకులను; పిలువన్+పనిచి= పిలిపించి.

తాత్పర్యం: ధౌమ్యుడు మొదలయినవాళ్ళు చెప్పిన దానికి తగినట్లే ధర్మరాజు తమ్ముల సమ్మతి పొందాడు. రాజసూయం చేయటానికి పూనుకొన్నాడు. 'ఈ యాగాన్ని నిర్విఘ్నంగా నిర్వహించటానికి శ్రీకృష్ణుడే సమర్థుడనుకున్నాడు. ఇతరు లెవ్వరు కా దనుకున్నాడు. ఎందుకంటే - శ్రీమహావిష్ణువే శ్రీకృష్ణుడు. ఆద్యంతరహితుడు, ఆదిపురుషుడు, పురుషోత్తముడు అయిన శ్రీమహావిష్ణువు పుట్టుకలేనివాడే అయినా-లోకానికి మేలు చెయ్యా లని వసుదేవసుతుడుగా మానవలోకంలో అవతరించాడు. అందుచేత ఆ మహాత్ముడే ఈ యాగాన్ని నిర్విఘ్నంగా జరిపించటానికి సమర్థు డని, ఆప్తులైన సేవకుల్ని పిలిపించి.

క. అనిలజవాశ్వంబులఁ బూ । నిన యరదం బెక్కి ధారుణీధరు మధుసూ
దను దోడ్తెం డని ముదమునఁ । బనిచి తదాగమనకాంక్షఁ బార్థివుఁ డుండెన్. 100

ప్రతిపదార్థం: అనిల, జవ+అశ్వంబులన్= వాయువేగం గల గుర్రాల్ని; పూనిన= కట్టిన; అరదంబు+ఎక్కి= రథాన్నిఎక్కి; ధారుణీ, ధరున్= భూభారాన్ని, నిర్వహించేవాడు; మధుసూదనున్= మధు డనే రాక్షసుడిని సంహరించిన వాడు అయిన శ్రీకృష్ణుని; తోడ్తెండు+అని= వెంట పిలుచుకొనిరం డని; ముదమునన్= సంతోషంతో; పనిచి= పంపి; తత్+ఆగమన కాంక్షన్= ఆయన రాకను కోరుతూ; పార్థివుఁడు+ఉండెన్= ధర్మరాజు ఉన్నాడు.

తాత్పర్యం: 'వాయువేగం గల గుర్రాల్ని కట్టిన రథంఎక్కి వెళ్ళండి. ధరాభారాన్ని వహించేవాడు, మధుసూదనుడు అయిన శ్రీకృష్ణుణ్ణి వెంటతీసుకురండి' అని సంతోషంతో ధర్మరాజు సేవకుల్ని పంపాడు. ఆయన రాకకై ఎదురు చూస్తూ ఉన్నాడు.

విశేషం: ఈ సందర్భంలో శ్రీకృష్ణుడికి ధారుణీధరుడు, మధుసూదనుడనే విశేషణాలు ప్రయోగించటం ఎంతో ఉచితంగా ఉంది. రాజసూయమహాయాగనిర్వహణభారం సామాన్యమైంది కాదు. రాజసూయానికి ముందు దిగ్విజయయాత్ర జరగాలి. తరువాత దుర్మార్గులవల్ల ప్రమాదంలేకుండ యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగాలి. అందువల్ల, భూభారాన్ని వహించేవాడు, మధువనే రాక్షసుణ్ణి సంహరించినవాడు అయిన శ్రీకృష్ణుణ్ణి తీసుకొని రమ్మనటం ఎంతో అర్థవంతంగా ఉంది. నిరాటంకంగా దిగ్విజయయాత్ర పూర్తికావటానికి, నిర్విఘ్నంగా యజ్ఞం పరిసమాప్తి నొందటానికి, మున్ముందు జరిగే జరాసంధ శిశుపాలవధల్లో శ్రీకృష్ణుడు నిర్వహించనున్న గణనీయపాత్రను సూచించేదిగా ఉంది.

శ్రీకృష్ణుం డింద్రప్రస్థపురంబునకు వచ్చుట (సం. 2-12-30)

వ. అయ్యుధిష్ఠిరు సందేశంబున దాశార్హుండును దద్దర్శనోత్సుకుం డయి ద్వారవతి గదలి యతిత్వరితగతిం జని నిరంతర ప్రయాణంబుల నింద్రప్రస్థపురంబునకు వచ్చి. 101

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ+యుధిష్ఠిరు, సందేశంబునన్= ఆ ధర్మరాజు పంపిన సందేశంతో; దాశార్హుండును= దశార్హుని సంతతివాడు-యాదవుడు అయిన - శ్రీకృష్ణుడు; తత్+దర్శన+ఉత్సుకుండు+అయి= ఆ ధర్మరాజును చూడాలన్న కుతూహలం కలవాడై; ద్వారవతి, కదలి= ద్వారకానగరంనుండి బయలుదేరి; అతి, త్వరితగతిన్= మిక్కిలి వేగంతో కూడిన గమనంతో; చని= వెళ్ళి; నిరంతర ప్రయాణంబులన్= మధ్య ఎక్కడా ఆగకుండ చేసిన ప్రయాణాలతో; ఇంద్రప్రస్థపురంబునకున్; వచ్చి.

తాత్పర్యం: ధర్మరాజు పంపిన సందేశాన్ని అందుకొని శ్రీకృష్ణుడుకూడ, ఆయనను చూడాలన్న కుతూహలంతో ద్వారవతి నుండి బయల్దేరి, ఎక్కడా మధ్యలో ఆగకుండ ప్రయాణాలు చేసి ఇంద్రప్రస్థపురానికి వచ్చాడు.

ఉ. **కుంతికి ధర్మనందనునకున్ వినయంబున మ్రొక్కి, భీము ధీ**
మంతునిఁ గౌఁగిలించుకొని, మధ్యమపాండవు మాద్రిపుత్త్రులన్
సంతతభక్తినమ్రులఁ బ్రసాదనయోత్కటదృష్టిఁ జూచి, తా
నెంతయుఁ బ్రీతి నెత్తికొనియెన్ మహినెత్తిన పుణ్యుఁ డున్నతిన్. **102**

ప్రతిపదార్థం: మహిన్+ఎత్తిన, పుణ్యుఁడు= భూమిపై అవతారమెత్తిన పుణ్యాత్ముడు లేదా, (వరాహావతారంలో) భూమిని ఎత్తిన పుణ్యాత్ముడు-శ్రీకృష్ణుడు; ఉన్నతిన్= గొప్పగా; కుంతికిన్; ధర్మనందనునకున్; వినయంబునన్; మ్రొక్కి= నమస్కరించి; ధీమంతునిన్= బుద్ధిమంతుని; భీమున్= భీముని; కౌఁగిలించుకొని; సంతత, భక్తి, నమ్రులన్= ఎల్లప్పుడు భక్తితో శిరం వంచిన వాళ్ళయిన; మధ్యమ, పాండవున్= పాండవుల్లో నడిమివాడైన అర్జునుణ్ణి; మాద్రిపుత్త్రులన్= మాద్రియొక్క కుమారులైన నకుల సహదేవుల్ని; ప్రసాద, నయ+ఉత్కట, దృష్టిన్= అనుగ్రహభావం, మృదుభావం అధికమైన దృష్టితో; చూచి; తాన్= తాను; ఎంతయున్= మిక్కిలి; ప్రీతిన్= ప్రేమతో; ఎత్తికొనియెన్= (కొద్దిగా) పైకెత్తుకొన్నాడు.

తాత్పర్యం: భూమిమీద అవతరించిన పుణ్యపురుషుడు, ఇదివరలో వరాహంగా అవతరించి భూమిని ఎత్తిన పుణ్యాత్ముడు అయిన శ్రీకృష్ణుడు కుంతీ ధర్మజులకు సవినయంగా నమస్కరించాడు. బుద్ధిమంతుడైన భీమసేనుణ్ణి కౌగిలించుకొన్నాడు. భక్తిభావంతో శిరస్సువంచి నిలిచిన అర్జున నకుల సహదేవుల్ని అనుగ్రహించినట్లు అల్లన చూచి అలా పైకెత్తుకొన్నాడు.

విశేషం: శ్రీకృష్ణుడు పెద్దలకు నమస్కరించి భక్తిని, పిన్నలను కౌగిలించుకొని ప్రేమను ప్రదర్శించాడు. 'మహినెత్తినపుణ్యుడు' అంటే వరాహావతారంలో భూమిని రక్షించినవాడనే అర్థాన్నికూడ భావించవచ్చు. ఈ సందర్భంలో అర్జున నకుల సహదేవులను ప్రేమతో ఎత్తుకొన్న శ్రీకృష్ణుని 'మహినెత్తిన పుణ్యుఁ' డనటం ఎంతో రమ్యంగా ఉంది. ఈవిధంగానే పాండవులను కష్టసమయాల్లో రక్షిస్తా డని వస్తుధ్వని. శ్రీకృష్ణుడు 'ప్రసాదనయోత్కటదృష్టిఁ జూచె'ననటంలో నన్నయ తనరచనలోని ప్రసాదగుణాన్ని ధ్వనిమయం చేశాడు.

వ. **తదనంతరంబ ధర్మతనయుండు.** **103**

తాత్పర్యం: అటు పిమ్మట ధర్మరాజు.

క. **పరమాసనమున నునిచి య । పరిమిత హర్షంబుతో సపర్యావిధులన్**
గురుఁ బూజించిన విధమునఁ । గురువృషభుఁ డశేషలోకగురుఁ బూజించెన్. **104**

ప్రతిపదార్థం: కురు, వృషభుఁడు= కురువంశశ్రేష్ఠుడైన ధర్మరాజు; పరమ+ఆసనమునన్= ఉన్నతమైన పీఠంపై; ఉనిచి= కూర్చుండబెట్టి; అపరిమిత, హర్షంబుతోన్= మిక్కిలి ఆనందంతో; గురున్= గురువును; పూజించిన, విధమునన్= పూజించినట్లు; అశేష లోకగురున్= అన్ని లోకాలకు గురువైన వానిని- శ్రీకృష్ణుణ్ణి; పూజించెన్= పూజించాడు.

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడైన ధర్మరాజు - సర్వలోకగురుడైన శ్రీకృష్ణుణ్ణి, ఉన్నతాసనంమీద కూర్చోపెట్టాడు. అంతులేని ఆనందంతో, అన్ని ఉపచారపద్ధతులతో, గురువును పూజించినట్లు పూజించాడు.

విశేషం: అలం: ఉపమ. 'గురు' శబ్దానికి తండ్రి, పెద్ద, అనే రెండర్థాలను భావింపవచ్చును. గురు కురు శబ్దాలవలన అక్షరరమ్యత రచనకు కలిగింది.

క. **ఏమఱక జనుల యోగ । క్షేమంబుల నడపుచున్న కృష్ణుని యోగ**
క్షేమంబు లడిగి యపుడు మ । హాముదమున ధర్మసుతుఁడు హరి కి ట్లనియెన్. **105**

ప్రతిపదార్థం: అపుడు; ఏమఱక= మరవక; జనుల, యోగక్షేమంబుల; నడపుచున్న; కృష్ణుని; యోగక్షేమంబులు; అడిగి; ధర్మసుతుఁడు; మహా, ముదమునన్= మిక్కిలి ఆనందంతో; హరికిన్+ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

తాత్పర్యం: ఏమరుపాటు లేక, ఎల్లప్పుడు జనుల యోగక్షేమాల్ని నడిపే శ్రీకృష్ణపరమాత్మనే ధర్మజుడు యోగక్షేమాలు అడిగాడు. మహానందంతో ఇలా అన్నాడు.

విశేషం: 'యోగక్షేమం వహా మ్యహం' అని ప్రకటించిన పరమాత్ముడు శ్రీకృష్ణుడు. అతనిని లౌకికాచారాన్ని అనుసరించి యోగక్షేమా లడిగాడట ధర్మరాజు. అంటే తమ యోగక్షేమాలనుగురించి (దిగ్విజయ యాత్ర, రాజసూయం రెండూ ముందున్నాయి కనుక) శ్రీకృష్ణునికి జ్ఞాపకం చేయటమే అందులోని చమత్కారం. ఉక్తివైచిత్ర్యంతో కూడికొనిన ధర్మజుని హర్షపూర్ణాలైన మాటలు మధురగుణపూర్ణాలు. (సంపా.)

క. **ధ్యేయుఁడవు సకల లోక । స్థేయుండవు నమ్రులకు విధేయుఁడవు నయో**
పాయజ్ఞుఁడ విజ్జగముల । నీ యెఱుఁగని యవియుఁ గలవె నీరజనాభా! **106**

ప్రతిపదార్థం: నీరజనాభా!= నీటినుండి పుట్టిన పద్మాన్ని బొడ్డుగా కలవాడా..పద్మనాభా! శ్రీకృష్ణా!; ధ్యేయుఁడవు= ధ్యానించదగినవాడివి; సకల, లోక, స్థేయుండవు= అన్నిలోకాల్లో స్థిరంగా ఉండేవాడివి; నమ్రులకున్= భక్తులకు; విధేయుఁడవు= లొంగి ఉండేవాడివి; నయ+ఉపాయజ్ఞుఁడవు= నీతిని, ఉపాయాలను తెలిసిన వాడివి; ఈ+జగములన్= ఈ లోకాల్లో; నీ+ ఎఱుఁగని; అవియున్= నీకు తెలియని విశేషాలుకూడా; కలవు+ఎ= కలవా? (లేవు.)

తాత్పర్యం: ఓ పద్మనాభా! శ్రీకృష్ణా! నీవు అందరిచేత ధ్యానించదగినవాడివి. అన్నిలోకాల్లో స్థిరంగా ఉండేవాడివి. భక్తులకు వశమైనవాడివి. నీతి, ఉపాయాలు తెలిసినవాడివి. ఈ లోకాల్లో నీకు తెలియని విశేషాలు ఏమున్నాయి?

విశేషం: అంత్యప్రాసలతో కూడికొన్న విశేషణాలను వాడి, మనసులోని శ్రీకృష్ణభక్తిని మధురంగా వ్యక్తంచేశాడు ధర్మరాజు. రాజసూయయాగ రక్షణదక్షతకు యోగ్యమైన విశేషణాలనే ఎన్నుకొని ఒకవరుసలో వాడటంలో ఉక్తివైచిత్ర్యం ఉన్నది. వినయగుణం వ్యక్తమయ్యేటట్లు రచనలో పృథక్పదత్వం రాణించింది. కాబట్టి ఈ పద్యంలోని గుణం మాధుర్యం. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అయినను నాయర్థిత్వంబునంజేసి నీ కెఱింగించెద. 107

ప్రతిపదార్థం: అయినను; నా, అర్థిత్వంబునన్+చేసి= నేను కోరికకలవాడినవటంచేత; నీకున్+ఎఱింగించెదన్= నీకు తెలియచేస్తాను.

తాత్పర్యం: అయినా నా కోరికను నీకు తెలియచేసుకుంటాను.

సీ. 'పాండుమహీపతి పనిఁజేసి నారద । ముని వచ్చి వీ రెల్ల వినుచు నుండ
రాజసూయంబు తిరంబుగాఁ జేసి నీ । పితృపితామహులకు హితము సేయు
మని పంచె నన్నుఁ నెయ్యముననో, నాకట్టి । బలము సామర్థ్యంబుఁ గలుగు టెఱిఁగి
పంచెనో, తత్క్రతు ప్రారంభమున కొడం । బడితి వీ రిందఱుఁ గడఁగి దీని

ఆ. నిత్యసత్యవచన! నిపుణనిర్మలబుద్ధి । నిర్ణయించి పనుప నీ నియోగ
కాంక్ష నున్నవాఁడఁ గమలాక్ష!' యనిన ధ । ర్మాత్మజునకు నిట్టు లనియెఁ జక్రి. 108

ప్రతిపదార్థం: కమల+అక్ష!= పద్మాలవంటి కన్నులు కల ఓ శ్రీకృష్ణా!; పాండు మహీపతి= పాండురాజుయొక్క; పనిన్+చేసి= పనికారణంగా; నారదముని; వచ్చి; వీరు+ఎల్లన్= వీరంతా; వినుచున్+ఉండన్= వింటూ ఉండగా; రాజసూయంబు= రాజసూయయాగాన్ని; తిరంబుగాన్+చేసి= స్థిరంగా చేసి; నీ, పితృ, పితామహులకున్= నీతండ్రి తాతలకు; హితము, చేయుము+ అని= మేలు చెయ్యవలసిందని; నన్నున్; పంచెన్= ఆజ్ఞాపించాడు; నెయ్యముననో= ప్రేమచేతనో; నాకున్+అట్టి, బలము, సామర్థ్యంబున్= నాకు అలాంటి బలం, సామర్థ్యం; కలుగుట+ఎఱిఁగి= ఉండటం తెలుసుకొని; పంచెనో= ఆజ్ఞాపించాడో; నిత్య, సత్య, వచన!= ఎల్లప్పుడు సత్యాన్నే చెప్పేవాడా!; వీరు+అందఱున్= ఈసభలో ఉన్నవాళ్ళంతా; కడఁగి= పూనుకొని; దీనిన్= ఈ యాగాన్ని; నిపుణ, నిర్మల, బుద్ధిన్= నేర్పుతో కూడిన నిర్మలమైన బుద్ధితో; నిర్ణయించి; పనుపన్= ఆజ్ఞాపించగా; తత్+క్రతు, ప్రారంభమునకున్= ఆయాగాన్ని ప్రారంభించటానికి; ఒడంబడితిన్= అంగీకరించాను; నీ, నియోగకాంక్షన్= నీ ఆజ్ఞయందలి కోరికతో, అంటే నీ ఆజ్ఞకోసం; ఉన్నవాఁడన్= వేచి ఉన్నాను; అనినన్; చక్రి= చక్రాయుధం కలవాడు - శ్రీకృష్ణుడు; ధర్మ+ఆత్మజునకున్= యముని కుమారుడైన ధర్మరాజుకు; ఇట్టులన్+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణా! పాండురాజు పంపిస్తే నారద మహాముని వచ్చి, వీళ్ళంతా వింటూ ఉండగా, 'రాజసూయం చేసి పితృపితామహులకు మేలుచెయ్యి' అని చెప్పాడు. అది నా తండ్రి మీదిప్రేమతో చెప్పాడో!- లేక అందుకు తగిన శక్తిసామర్థ్యాలు నా కున్నా యని చెప్పాడో! వీళ్ళంతా నిర్మలబుద్ధితో ఎంతో నిపుణంగా ఆలోచించి, నిర్ణయించి నన్ను ప్రేరేపిస్తే ఆయాగాన్ని ప్రారంభించటానికి అంగీకరించాను. నీ ఆజ్ఞకోసం వేచిఉన్నాను.

విశేషం: ధర్మజుని మాటనేర్పుకు ఈ పద్యం చక్కని ఉదాహరణం. ఇక్కడ శ్రీకృష్ణునికి ప్రయోగించిన 'చక్రి' అనే విశేషణం మున్ముందు రాజసూయంలో ఆయన చక్రాయుధం నిర్వహించే పాత్రను సూచించేదిగా ఉంది. చక్రాయుధం - ఇది విశ్వకర్మనిర్మితం. దేవశిల్పి విశ్వకర్మ - తన కూతురు సంజ్ఞ, ఆమె భర్త అయిన సూర్యుడి తేజస్సుకు తాళలేక పోవటంచేత సూర్యుణ్ణి సానపట్టాడట; అప్పుడు రాలిన చూర్ణంతో చక్రాయుధాన్ని రూపొందించాడట!

కృష్ణుఁడు ధర్మజునికి జరాసంధుని సామర్థ్యము నెఱిఁగించుట (సం. 2-13-1)

క. కురువృషభ! సర్వగుణముల । సురుచిర తేజమున రాజసూయాఖ్య మహా
ధ్వరమునకు నీవ యర్హుఁడ । వరిసూదనశౌర్యు లయిన యనుజులబలిమిన్. 109

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కురు, వృషభ!= కురు వంశ శ్రేష్ఠా!; సర్వ, గుణములన్= అన్ని సుగుణాలచేత; సురుచిర, తేజమునన్= గొప్పగా ప్రకాశించే పరాక్రమంచేత; అరి, సూదన, శౌర్యులు+అయి= శత్రువులను సంహరించగల శౌర్యం కలవాళ్ళయిన; అనుజుల బలిమిన్= తమ్ముల యొక్క బలంచేత; రాజసూయ+ఆఖ్య, మహా+అధ్వరమునకున్= రాజసూయం అనే పేరున్న మహాయాగం చేయటానికి; నీవు+అ= నీవే; అర్హుఁడవు= తగినవాడివి.

తాత్పర్యం: ఓ కురువంశశ్రేష్ఠా! యుధిష్ఠిరా! అన్ని సుగుణాలచేత, గొప్పగా ప్రకాశించే పరాక్రమంతో, శత్రుసంహారం చెయ్యగల శౌర్యవంతులైన తమ్ముళ్ళతో రాజసూయమహాయాగం చెయ్యటానికి నీవే సమర్థుడివి.

వ. **తొల్లి జమదగ్నిసుతుం డయిన రామునిచేత ధాత్రి యపగతక్షత్త్రం బయిన నంతనుండి యైలవంశంబును నిక్ష్వాకువంశంబును దక్కఁ దక్కిన క్షత్త్రియవంశంబు లెల్లం గృత్రిమంబులు గాని విమల మకుటార్హంబులుగా; వీ రెండు వంశంబులవలన నేకోత్తరశతవంశంబు లయ్యెఁ; మఱి యయాతి భోజ వంశంబులవలనం జతుర్దశ వంశంబు లయ్యెఁ; నిట్టి సకలక్షత్త్రంబునెల్ల జయించి జరాసంధుం డున్నవాఁడు; వాని సామర్థ్యంబు చెప్ప నశక్యంబు.** **110**

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; జమదగ్ని; సుతుండు+అయిన= జమదగ్ని యొక్క కుమారుడయిన; రామునిచేతన్= పరశురామునిచేత; ధాత్రి= భూమి; అపగతక్షత్త్రంబు+అయినన్= తొలగింపబడిన క్షత్రియులుకలదికాగా; అంతన్+ఉండి= అప్పటినుండి; ఐల, వంశంబును; ఇక్ష్వాకు వంశంబును; తక్కన్= తప్ప; తక్కిన; క్షత్త్రియ, వంశంబులు+ఎల్లన్= రాజవంశాలన్నీ; కృత్రిమంబులు, కాని= కేవలం కల్పించబడినవే కాని; విమల, మకుట+అర్హంబులు= స్వచ్ఛమైన రాజకిరీటాన్ని ధరించటానికి తగినవి; కావు; ఈ, రెండు, వంశంబుల వలనన్= ఈ ఐల, ఇక్ష్వాకు వంశాలు రెండింటివల్ల; ఏక+ఉత్తర, శత, వంశంబులు+ అయ్యెన్= నూటొక్క రాజవంశాలు ఏర్పడ్డాయి; మఱి= ఇంకను; యయాతి, భోజ, వంశంబులవలనన్= యయాతియొక్క, భోజుడియొక్క వంశాలవలన; చతుః+దశ, వంశంబులు+అయ్యెన్= పధ్నాలుగువంశాలు ఏర్పడ్డాయి; ఇట్టి= ఇటువంటి; సకల క్షత్త్రంబున్+ఎల్లన్= సకలరాజసమూహాన్ని; జయించి; జరాసంధుండు+ఉన్నవాఁడు; వాని; సామర్థ్యంబు; చెప్పన్; అశక్యంబు= సాధ్యం కాదు.

తాత్పర్యం: పూర్వం జమదగ్నికొడుకు పరశురాముడు నేలమీద క్షత్రియులు లేకుండ చేశాడు. ఐల ఇక్ష్వాకు రాజ వంశాలు మాత్రమే ఈ భూమిమీద మిగిలాయి. అప్పటినుండి ఆ రెండే సహజ రాజవంశాలు. తక్కిన రాజవంశాలన్నీ కల్పితాలే. రాజకిరీటాన్ని ధరించటానికి యోగ్యాలు కావు. క్రమంగా ఈ రెండువంశాలు నూటొక్క వంశాలుగా విస్తరిల్లాయి. అంతేకాక, యయాతి, భోజవంశాలవల్ల పదునాల్గువంశాలు ఏర్పడ్డాయి. జరాసంధుడు ఈ రాజుల నందరిని జయించాడు. అతనిసామర్థ్యం చెప్పశక్యం కాదు.

విశేషం: ఇల - వైవస్వతమనువు కూతురు. ఈశ్వరానుగ్రహంచేత ఈమెకు పుంస్త్వం ప్రాప్తించింది. సుద్యుమ్ను డయ్యాడు. ఉత్కళుడు, గయుడు, విమలుడు-ఇతని కుమారులు. ఇతడు వేటకై వెళ్ళి, కుమారవనంలో శివపార్వతుల సంగమం చూచాడు. పార్వతి శాపంతో మళ్ళీ స్త్రీత్వాన్ని పొంది ఇలగా మారాడు. ఈ దశలో ఇలకు బుధునితో సమాగమం ఏర్పడింది. పురూరవుడు జన్మించాడు. మళ్ళీ ఈశ్వరానుగ్రహంచేత ఇల పురుషుడుగా మారింది. ఇలకు సంబంధించిన క్షత్రియవంశం ఐలం. ఇక్ష్వాకువు - వైవస్వత మనువు కుమారుడు. శ్రీరాముని వంశానికి మూలపురుషుడు. యయాతి - నహుషుని కుమారుడు. చంద్రవంశప్రభువు. దేవయానికి, శర్మిష్ఠకు భర్త.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **అతిదర్పోద్ధతుఁడు మహా । ద్భుతభూరిబలుండు చేదిభూపతి సేనా**
పతి యయి శిశుపాలుఁడు సం । తతమును నాతనిన కొలుచుఁ దద్దయు భక్తిన్. **111**

ప్రతిపదార్థం: చేది భూపతి= చేది దేశంయొక్కరాజు; శిశుపాలుడు; అతి, దర్ప+ఉద్ధతుఁడు= మిక్కిలి గర్వంచేత విజృంభించేవాడు; మహత్+అద్భుత, భూరి, బలుండు= మిక్కిలి ఆశ్చర్యకరమైన గొప్ప బలం కలవాడు; సేనాపతి, అయి; సంతతమును= ఎల్లప్పుడు; తద్దయున్, భక్తిన్= ఎంతో భక్తితో; అతనిన్+అ= ఆ జరాసంధుణ్ణే; కొలుచున్= సేవిస్తాడు.

తాత్పర్యం: చేదిభూపతి అయిన శిశుపాలుడు, అమితగర్వంతో విర్రవీగేవాడు. ఆశ్చర్యకరమైన అపారబలం కలవాడు. అతడు సేనాధిపతిగా ఆ జరాసంధుణ్ణి భక్తితో ఎప్పుడూ సేవిస్తూ ఉంటాడు.

క. **ఆయతభుజవీర్యులు మా । యాయోధులు హంసడిభకు లనువార లని**
ర్జేయులు పరస్పర స్నే । హాయత్త సుచిత్తు లతని యాప్తు లధీశా! **112**

ప్రతిపదార్థం: అధీశా!= రాజా!; హంస, డిభకులు+అనువారలు= హంసడిభకు లనే పేరు కలవారు; ఆయత భుజవీర్యులు= అధికమైన భుజబలంకలవాళ్ళు; మాయాయోధులు= మాయోపాయాలతో కూడిన యుద్ధవీరులు; అనిర్జేయులు= జయింపసాధ్యం కాని వారు; పరస్పర, స్నేహ+ఆయత్త, సుచిత్తులు= ఒకరి పట్ల ఒకరు స్నేహానికి అధీనమైన చక్కని మనస్సు కలవాళ్ళు; అతని= ఆ జరాసంధుని యొక్క; ఆప్తులు= స్నేహితులు, హితులు.

తాత్పర్యం: హంస డిభకులు మహాబలవంతులు, మాయోపాయాల్లో అరితేరిన యుద్ధవీరులు, అజేయులు. పైగా ఒకరి కొకరు మంచిమిత్రులు. ఇద్దరూ ఆ జరాసంధునికి ఆప్తులు.

వ. **అయ్యిద్దఱును గౌశిక చిత్రసేను లను నామంబులతో మహాసేనాన్వితులై వానికి వామదక్షిణ భుజంబులుంబోలె సర్వసాధనసమర్థు లయి వర్తిల్లుదురు; మఱియు వరుణు నంతియ బలవంతుండు పశ్చిమ దిఙ్మహీపతి భగదత్తుం డనువాఁడు పాండురాజుసఖుం డగుటంజేసి నీకు మనంబున భక్తుం డయ్యును భయంబున జరాసంధునకు వాక్కర్మంబులం బనిసేయుచుండుఁ; జేదిపతులలోనఁ బురుషోత్తముండును నంగ వంగ పుండ్ర కిరాతపతులలోనఁ బౌండ్రకవాసుదేవుండు మదీయ నామంబులు దాల్చి జరాసంధుం గొలుతురు; ప్రాగ్దక్షిణ దిగ్భాగముల రాజులు పురుజితుండును గరూశ కలభ నకుల సంకర్షణ సూపహిత మనోదత్త చక్ర సాల్వేయ యవనులును వానిన సేవింతు; రుదీచ్యులయిన యష్టాదశక్షత్త్రకులంబుల వారును నుత్తరపాంచాల శూరసేన పుష్కర పుళింద కళింగ కుంతి మత్స్యదేశంబుల రాజు ల్లెలను దద్భయంబునఁ దమ తమ దేశంబుల విడిచి యున్నవారలు మఱియును.** **113**

ప్రతిపదార్థం: ఆ+ఇద్దఱును= ఆ హంసడిభకు లిద్దరూ; కౌశిక, చిత్ర సేనులు+అను; నామంబులతో; మహాసేనా+అన్వితులు+ఐ= గొప్పసైన్యంతో కూడుకున్నవాళ్ళయి; వానికిన్= జరాసంధుడికి; వామ, దక్షిణ, భుజంబులున్+పోలెన్= ఎడమ, కుడి భుజాల్లాగా; సర్వ, సాధన, సమర్థులు+అయి= అన్నింటిని సాధించగల సామర్థ్యం కలవాళ్ళయి, వర్తిల్లుదురు= ప్రవర్తిస్తూ ఉంటారు; మఱియు; వరుణు, అంతియ= వరుణదేవునంతటి; బలవంతుండు= బలం కలవాడు; పశ్చిమ, దిక్+మహీపతి= పడమటి దిశకు రాజు; భగదత్తుండు+అనువాఁడు= భగదత్తుడనే పేరు కలవాడు; పాండురాజు, సఖుండు+అగుటన్+చేసి= పాండురాజుకు స్నేహితుడు కావటంవల్ల; నీకున్; మనంబునన్= మనస్సులో; భక్తుండు+అయ్యును=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భక్తుడైనా; భయంబునన్= భయంచేత; జరాసంధునకున్; వాక్, కర్మంబులన్= మాటలతో, చేతలతో; పనిచేయుచున్+ఉండున్= పనిచేస్తూ ఉంటాడు; చేదిపతులలోనన్= చేది రాజుల్లో; పురుష+ఉత్తముండును; అంగ, వంగ, పుండ్ర, కిరాత, పతులలోనన్= అంగ, వంగ, పుండ్ర, కిరాత రాజుల్లో; పౌండ్రకవాసుదేవుండున్; మదీయ, నామంబులు; దాల్చి= నాయొక్క పేర్లు పెట్టుకొని; జరాసంధున్; కొలుతురు(కొలుచుదురు)= సేవిస్తున్నారు; ప్రాక్+ దక్షిణ, దిక్+భూముల, రాజులు= తూర్పు, దక్షిణ దిక్కుల్లో ఉన్న రాజులు; పురుజితుండును; కరూశ, కలభ, నకుల, సంకర్షణ, సూపహిత, మనోదత్త, చక్ర, సాల్వేయ, యవనులును; వానిన్+అ= ఆ జరాసంధుణ్ణే; సేవింతురు= కొలుస్తారు; ఉదీచ్యులు+అయిన= ఉత్తర దిక్కులో ఉన్న; అష్టాదశ, క్షత్ర కులంబులవారును= పద్దెనిమిది క్షత్రియ వంశాలవాళ్ళు; ఉత్తరపాంచాల, శూరసేన, పుష్కర, పుళింద, కళింగ, కుంతి, మత్స్యదేశంబుల; రాజులు+ఎల్లను= రాజులంతా; తత్+ భయంబునన్= ఆ జరాసంధునివల్ల కలిగిన భయంచేత; తమతమదేశంబులన్ విడిచి; ఉన్నవారలు; మఱియును.

తాత్పర్యం: కౌశిక చిత్రసేను లనే పేర్లుగల ఆ హంసడిభకు లిద్దరు పెద్దసైన్యంతో జరాసంధుడికి కుడి ఎడమభుజాల్లా ప్రవర్తిల్లుతున్నారు. అంతేకాదు, వరుణునిఅంతటి బలవంతుడైన పడమటిదేశ ప్రభువు భగదత్తుడు- మీ తండ్రి పాండురాజుకు స్నేహితుడే. నీపట్ల మనస్సులో భక్తి కలవాడే. అయినా జరాసంధునికి భయపడి మాటల్లో, చేతల్లో అతనినే అనుసరిస్తున్నాడు. చేదిరాజుల్లో పురుషోత్తముడు, అంగ, వంగ, పుండ్ర, కిరాత రాజుల్లో పౌండ్రక వాసుదేవుడు నాపేర్లు పెట్టుకొని జరాసంధుణ్ణి సేవిస్తున్నారు. తూర్పు దక్షిణ దేశాల రాజులు- పురుజితుడు, కరూశ, కలభ, నకుల, సంకర్షణ, సూపహిత, మనోదత్త, చక్ర, సాల్వేయ, యవనులు అతనినే కొలుస్తున్నారు. ఉత్తర దిక్కున ఉండే పదునెనిమిది రాజవంశాలవారు, ఉత్తరపాంచాల, శూరసేన, పుష్కర, పుళింద, కళింగ, కుంతి, మత్స్యదేశంబుల రాజులందరు జరాసంధుని భయంతో తమతమదేశాలు విడిచి వెళ్ళారు.

ఉ. **ఘోరరణంబులోన నధికుం గృతబంధు జనాపకారు నే**
దారుణ లీలఁ గంసు నతిదర్పితుఁ జంపుటఁ జేసి, యమ్మహా
క్రూరుఁడు కంసుభార్య దన కూఁతురు గావున, దానిసంతత
ప్రేరణ నా కుపద్రవముఁ బెక్కు విధంబులఁ జేసె నీసునన్. **114**

ప్రతిపదార్థం: నేన్= నేను; ఘోర, రణంబులోనన్= భయంకరమైన యుద్ధంలో; అధికున్= బలవంతుడైనవానిని; కృత, బంధుజన+అపకారున్= బంధుజనులకు అపకారాలు చేసినవానిని; అతి, దర్పితున్= మిక్కిలి గర్వించినవానిని; కంసున్= కంసుణ్ణి; దారుణలీలన్= ఘోరమైన పద్ధతిలో; చంపుటన్, చేసి= చంపటంచేత; కంసు, భార్య= కంసునియొక్క భార్య; తన, కూఁతురు, కావునన్; దాని= ఆ కంసుని భార్యయొక్క; సంతత= ఎడతెగని; ప్రేరణన్= ప్రేరేపణచేత; ఆ+మహాక్రూరుఁడు= పరమ దుర్మార్గుడైన ఆ జరాసంధుడు; ఈసునన్= రోషంతో; నాకున్; ఉపద్రవమున్= కీడును; పెక్కు, విధంబులన్= అనేక విధాలుగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: బలవంతుడు, బంధుజనులకు అపకారం చేసినవాడు, గర్వంతో విర్రవీగేవాడు అయిన కంసుణ్ణి నేను ఘోరంగా వధించాను. కంసునిభార్య తనకూతురు కావటంచేత ఆమెప్రేరణతో పరమదుర్మార్గు డైన ఆ జరాసంధుడు నామీద వైరంపూని అనేకవిధాల నాకు అపకారం చేశాడు.

విశేషం: జరాసంధుడు శ్రీకృష్ణాదులకు ఉపద్రవం కలిగించటానికి గల అర్థహేతువును చెప్తూతూ వస్తుస్వభావస్ఫుటత్వాన్ని కలిగించినట్లు రచించిన ఈ పద్యంలో అర్థవ్యక్తి అనే శబ్దగుణం ఉన్నది. ఇది ప్రసాదగుణంలో అంతర్భవించేది. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. భూమీశ! హంసడిభకులు । నా మగధాధీశ్వరుండు నమ్మువ్వురు ను
ద్దామ భుజవీర్య సంపద । తో మూఁడుజగములు నోపుదురు సాధింపన్. 115

ప్రతిపదార్థం: భూమి+ఈశ!= భూపతీ! ఓధర్మరాజా!; హంసడిభకులున్; ఆ+మగధ+అధీశ్వరుండున్= ఆమగధరాజైన జరాసంధుడు; ఆ+ముఫ్వురున్= ఆ ముగ్గురూ; ఉద్దామ, భుజ, వీర్య, సంపదతోన్= అధికమైన భుజబలంయొక్క సంపదతో (పెంపుతో); మూడు, జగములన్= ముల్లోకాలను; సాధింపన్= జయించటానికి; ఓపుదురు= చాలుదురు.

తాత్పర్యం: ధర్మరాజా! హంసడిభకులు, ఆ మగధరాజైన జరాసంధుడు - ముగ్గురూ తమ భుజ బల పరాక్రమంతో ముల్లోకాలనైనా జయించగలరు.

వ. ఆ జరాసంధుండును నాయుధనిహతులు గాని హంసడిభకులతో వచ్చి మధురపై విడిసిన నతి వీరులయిన యదు వృష్ణిభో జాంధక వరు లష్టాదశ సహస్ర రథవ్రాతంబులతో నేమును సమకట్టి మహాయుద్ధంబు సేయుచు వాని నెట్లును జయింపరాకున్న నుపాయంబున హంసుండు సమరనిహతుం డయ్యె నని డిభకునకుం జెప్పంబంచిన నప్పలుకులు నిక్కువంబ కా వగచి. 116

ప్రతిపదార్థం: ఆ, జరాసంధుండును; ఆయుధ, నిహతులు, కాని= ఆయుధంచేత చావులేని; హంస, డిభకులతోన్; వచ్చి; మధురపైన్= మధురానగరంపై; విడిసినన్= దండెత్తగా; అతి, వీరులు+అయిన= గొప్ప వీరులైన; యదు, వృష్ణి, భోజ+అంధక, వరులు= యదువృష్ణిభోజాంధక శ్రేష్ఠులు; అష్టాదశసహస్ర, రథ, సమూహములతోన్= పదునెనిమిది వేల రథ సమూహాలతో; ఏమును= మేమును; సమకట్టి= పూనుకొని; మహాయుద్ధంబు; చేయుచున్; వానిన్= ఆ జరాసంధుని; ఎట్లును= ఏవిధంగాకూడా; జయింపరాక+ఉన్నన్= గెలవలేకుండా ఉండగా; ఉపాయంబునన్= యుక్తిచేత; హంసుండు; సమరనిహతుండు+అయ్యెన్+అని= యుద్ధంలో చంపబడినవాడయ్యాడని-అంటే యుద్ధంలో మరణించాడని; డిభకునకున్+చెప్పన్+పంచినన్= డిభకునికి చెప్పి పంపగా; ఆ+పలుకులు= ఆమాటలు; నిక్కువంబు+అ, కాన్= నిజమే అని; వగచి= దుఃఖించి(తలచి).

తాత్పర్యం: ఆయుధాలవల్ల చావు లేని ఆ హంసడిభకులతో కలసి ఆ జరాసంధుడు మధురమీద దండెత్తాడు. ఆసమయంలో మేముకూడ మహావీరులైన యదువృష్ణి భోజాంధక శ్రేష్ఠులు పద్దెనిమిదివేలమంది రథికులతో అతణ్ణి ఎదిరించి ఎంత యుద్ధం చేసినా విజయం లభించటం లేదు. అప్పు డొక ఉపాయం పన్నాము. హంసుడు యుద్ధంలో మరణించా డని డిభకునికి చెప్పి పంపాము. ఆ మాటలు నమ్మి ఎంతో దుఃఖించి.

చ. 'అనవరతంబు నిష్టుఁడగు హంసుఁడు లేని జగంబులోని జీ
వన మది యేల నా' కనుచు వారినిమగ్న శరీరుఁ డై క్షణం
బున డిభకుండు మృత్యుగతిఁ బొందె; ఘనంబుగ; దాని నక్కడన్
విని మృతుఁడయ్యె హంసుఁ డతివీరుఁడు తద్గత సౌహృదంబునన్. 117

ప్రతిపదార్థం: అనవరతంబున్= ఎల్లప్పుడు; ఇష్టుఁడు+అగు= ప్రియమైనవా డయిన; హంసుఁడు; లేని; జగంబులోని= ప్రపంచంలోని; జీవనము= బ్రదుకు; అది, నాకు, ఏల, అనుచు; వారి, నిమగ్న, శరీరుఁడు+ఐ= నీళ్ళలో పూర్తిగా మునిగిన శరీరం కలవాడై; క్షణంబునన్; డిభకుండు; మృత్యు, గతిన్+పొందెన్= మరణవిధాన్ని పొందాడు అంటే- మరణించాడు;

ఘనంబుగ= గట్టిగా; దానిన్= ఆ మరణవార్తను; అక్కడన్= యుద్ధభూమిలో; విని; తత్, గత, సౌహృదంబునన్= అతని పట్ల ఉన్న స్నేహభావంచేత; అతివీరుఁడు, హంసుఁడు= మహావీరుడైన హంసుడు; మృతుఁడు+అయ్యెన్= మరణించాడు.

తాత్పర్యం: తనకు అత్యంతం ఇష్టుడైన హంసుడు లేని లోకం ఎందుకని డిభకుడు నీళ్ళలో మునిగి ప్రాణాలు వదిలాడు. అది విని హంసు డిక్కడ డిభకునిమీది స్నేహభావంతో ఊపిరి విడిచాడు.

వ. అట్లు కౌశిక చిత్రసేనులు పరలోకగతులైన నసహాయుండై జరాసంధుండు మగిడి మగధపురంబునకుం జనియె; నేమును వానితోడి వైరంబు బలవంతంబైన, నమ్మధుర నుండ నొల్లక కుశస్థలంబునకు వచ్చి రైవతక పర్వతంబున ఘనంబుగా దుర్గంబు నిర్మించికొని భవదాశ్రయంబున సుఖంబున్నవారము. 118

ప్రతిపదార్థం: అట్లు= ఆవిధంగా; కౌశిక చిత్రసేనులు= హంసడిభకులు; పరలోక గతులు+ఐనన్= పరలోకానికి వెళ్ళినవాళ్ళు కాగా - అంటే మరణించగా; అసహాయుండు+ఐ= సాయంలేనివాడై; జరాసంధుండు; మగిడి= వెనుదిరిగి; మగధ పురంబునకున్; చనియెన్= వెళ్లాడు; ఏమును= మేము కూడా; వానితోడన్, వైరంబు; బలవంతంబు+ఐనన్= (బలం కలది) ఎక్కువకాగా; ఆ, మధురన్= ఆ మధురా నగరంలో; ఉండన్+ఒల్లక= ఉండటానికి ఇష్టపడక; కుశస్థలంబునకున్; వచ్చి; రైవతక పర్వతంబున; ఘనంబుగాన్= గట్టిగా; దుర్గంబు= కోటను; నిర్మించికొని= కట్టుకొని; భవత్+ఆశ్రయంబునన్= నీ అండలో; సుఖంబు+ఉన్నవారము= సుఖంతో ఉన్నాము.

తాత్పర్యం: ఆ విధంగా హంస డిభకులు హతులుకాగా జరాసంధుడు నిస్సహాయుడై-తన రాజధాని మగధకు మరలి వెళ్ళాడు. మేముకూడ అతనితో వైరం అధికం కాగా, ఆమధురానగరాన్ని వదలి కుశస్థలంలో రైవతకాద్రిమీద గట్టికోట కట్టుకొని, నీ అండలో సుఖంగా ఉన్నాము.

విశేషం: శక్తిమంతులైన బంధువు లుంటే శత్రుబాధ ఉండదు. భీమార్జునుల బలపరాక్రమాలు ప్రసిద్ధాలు; శత్రుభయంకరాలు. శ్రీకృష్ణునికి పాండవులతో బాంధవ్యమే కాక ప్రగాఢమైత్రికూడ ఉంది. బలవంతులైన పాండవుల ప్రాపు ఉన్న శ్రీకృష్ణునిమీదికి దండెత్తటానికి జరాసంధుడు సాహసించలేడు. అందుకే నీ అండతో మేము సుఖంగా ఉన్నా మని ధర్మరాజుతో శ్రీకృష్ణు డన్నాడు. పైగా ఈమాట జరాసంధునిమీద పాండవుల్ని ఉసిగొల్పటానికై కూడ ఉపయోగపడుతుంది. మూలంలో - 'సామర్థ్యవంతః సంబంధా ద్భవన్తం సముపాశ్రితాః' - అని కూడా ఉంది. వానితోడన్, వైరంబు-సమాసంలో చేత, తోడ, వలనలకు ఇత్వం అవుతుంది కనుక - వానితోడి వైరంబు. సుఖంబు+ఉన్నవారము - ప్రథమావిభక్తి తృతీయార్థంలో వాడబడింది - సుఖంతో ఉన్నవారము.

చ. ఖలుఁడు బృహద్రథాత్మజుఁడు గర్వితుఁడై మహిలోని రాజులం
బెలుకుఁ బట్టి తెచ్చి చెఱఁబెట్టి గిరివ్రజమ న్పురంబులోఁ
జొలయక నిత్య మొక్కొకని సూనరివోలె వధించి నేమమున్
బలిమియు నేర్పడం గడఁగి బైరవపూజ యొనర్చు నుగ్రుఁడై. 119

ప్రతిపదార్థం: బృహద్రథ+ఆత్మజుఁడు= బృహద్రథుని కుమారుడైన జరాసంధుడు; ఖలుఁడు= దుర్మార్గుడు; గర్వితుఁడు+ఐ= గర్వించిన వాడై; మహిలోని రాజులన్= భూమిలోని రాజులందరిని; పెలుకుఱన్+పట్టి= భయపడేటట్లుగా బంధించి; తెచ్చి; గిరివ్రజము+అన్+పురంబులోన్= గిరివ్రజమనే పేరుగల నగరంలో; చెఱన్+పెట్టి= చెరసాలలో బంధించి; చొలయక= వెనుకాడక;

నిత్యము+ఒక్కొకనిన్= ప్రతిదినం ఒక్కొకరిని; సూనరి, పోలెన్= కసాయివానిలా; వధించి= చంపి; నేమమున్= నియమాన్ని; బలిమియున్= బలాన్ని; ఏర్పడన్= స్పష్టమయ్యేటట్లు; కడఁగి= పూని; ఉగ్రుఁడు+ఐ= భయంకరుడై; భైరవపూజ= భైరవరూపుడైన రుద్రుని పూజ; ఒనర్చున్= చేస్తున్నాడు.

తాత్పర్యం: దుర్మార్గుడు, గర్వితుడు అయిన జరాసంధుడు లోకంలోని రాజులనందరినిపట్టి బంధించి, రోజుకు ఒక్కడి వంతున తన నియమం, బలం ప్రకటమయ్యేటట్లు కసాయివానిలా వాళ్ళను వధించి, భయంకరంగా భైరవపూజ చేస్తున్నాడు.

క. ధరణీశ! వానిఁ జంపుదు। నురుతర సామ్రాజ్య విభవ మున్నతితో సు
స్థిరమగు నీకును; మఱి భా। సురముగ సమకూరు రాజసూయము సేయన్. 120

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ= భూపతి అయిన ఓధర్మరాజా!; వానిన్= ఆ జరాసంధుడిని; చంపుడున్= చంపిన అనంతరం; నీకును; ఉరుతర, సామ్రాజ్య, విభవము= అధికమైన సామ్రాజ్యవైభవం; ఉన్నతితోన్= గొప్పగా; సుస్థిరము+అగున్= గట్టిగా స్థిరపడుతుంది; మఱి= అంతేకాక; భాసురముగన్= ప్రకాశమానంగా; రాజసూయము, చేయన్= రాజసూయయాగం చేయటానికి; సమకూరున్= సాధ్యమవుతుంది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆ జరాసంధుణ్ణి సంహరిస్తే నీ సామ్రాజ్య వైభవం గొప్పగా స్థిరపడుతుంది. అంతేకాక జగత్ ప్రసిద్ధంగా రాజసూయం చేయటం కూడ సాధ్యమౌతుంది.

సీ. రక్షణంబున భగీరథుఁడు, జయంబున। నయ్యౌవనాశ్వుండు, నత్యుదగ్ర
బాహుబలంబున భరతుండు, తపమునఁ। గార్తవీర్యుండును, గరముబుద్ధి
నమ్మరుత్తుండును, నఖిల సామ్రాజ్యంబుఁ। బడసిరి తొల్లి భూపాల! యిప్పు
డిన్ని గుణంబులు నెన్నంగఁ గలవు నీ;। కిది యేమి దుర్లభ, మిద్దురాత్ముఁ

ఆ. డెంత బలియుఁడయ్యు, నెంత గర్వితుఁడయ్యుఁ। దన కఠోర దుష్ప్రతాపమునను
విగతవిభవుఁ డగు; వివేకవిహీనుల। కైన లక్ష్మి సుచిర మగునె యెందు? 121

ప్రతిపదార్థం: భూపాల!= భూమిని ఏలే ఓ ధర్మరాజా!; తొల్లి= పూర్వం; రక్షణంబునన్= ప్రజల్ని రక్షించటంచేత; భగీరథుండు; జయంబునన్= విజయంచేత; యౌవనాశ్వుండున్; అతి+ఉదగ్ర; బాహు, బలంబునన్= మిక్కిలి భయంకరమైన భుజబలంచేత; భరతుండు; తపమునన్= తపోబలంచేత; కార్తవీర్యుండును; కరము= మిక్కిలి; బుద్ధిన్= బుద్ధిబలంచేత; ఆ+మరుత్తుండును; అఖిల సామ్రాజ్యంబున్= సమస్త సామ్రాజ్యాన్ని; పడసిరి= పొందారు; ఇప్పుడు; ఇన్ని, గుణంబులున్= వాళ్ళందరిలోఉన్న ఈ సుగుణాలన్నీ; ఎన్నంగన్= లెక్కిస్తే; నీకున్; కలవు; ఇది= ఈరాజసూయయాగం చెయ్యటం; ఏమి, దుర్లభము= ఏమి కష్టం?; ఈ దురాత్ముఁడు= ఈదుర్మార్గుడైన జరాసంధుడు; ఎంత, బలియుఁడు+అయ్యున్= ఎంత బలం కలవాడైనప్పటికి; ఎంత, గర్వితుఁడు+అయ్యున్= ఎంతగర్వం కలవాడైనప్పటికి; తన= తనయొక్క; కఠోర= తీవ్రమైన; దుష్ప్రతాపమునను= చెడుపరాక్రమంచేత; విగత, విభవుఁడు+అగున్= కోల్పోయిన వైభవం కలవా డౌతాడు; ఎందున్= ఎక్కడైనా; వివేక, విహీనులకున్+ఐన, లక్ష్మి= వివేకం లేని వాళ్ళకు లభించిన సంపద; సుచిరము+అగును+ఎ= ఎంతో ఎక్కువకాలం ఉంటుందా? - ఉండదు.

తాత్పర్యం: ధర్మరాజా! పూర్వం భగీరథుడు ప్రజారక్షణచేత, యౌవనాశ్వుడు విజయసాధనచేత, భరతుడు భయంకర భుజబలంచేత, కార్తవీర్యుడు తపోబలంచేత, మరుత్తుడు బుద్ధిబలంచేత సమస్త సామ్రాజ్యాన్ని పొందారు. ఇప్పుడీ సుగుణాలన్నీ నీలో ఉన్నాయి. అందువలన రాజసూయం చేయటం ఏం కష్టం? జరాసంధుడు ఎంత బలవంతుడైనా, గర్వితుడైనా అతని పరాక్రమం చెడుమార్గంలో ప్రవర్తిల్లటంచేత అతని వైభవం పతనం కాక తప్పదు. వివేకశూన్యులసంపద స్థిరంగా ఉండదు కదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

భీమసేనార్జునులు ధర్మరాజున కుత్సాహంబు గలిగించుట (సం. 2-14-7)

వ. అనిన విని భీమసేనుండు ధర్మరాజున కిట్లనియె. 122

తాత్పర్యం: అని కృష్ణుడు అనగా విని భీముడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

క. ఆరంభరహితుఁ బొందునె । యారయ సంపదలు? హీనుఁ డయ్యును బురుషుం
డారంభశీలుఁ డయి యకృ । తారంభుల నోర్చు నెంత యధికుల నయినన్. 123

ప్రతిపదార్థం: ఆరయ= విచారిస్తే; ఆరంభరహితున్= ప్రయత్నమే చేయనివానిని; సంపదలు; పొందును+ఎ; పురుషుండు; హీనుఁడు+అయ్యును= బలహీనుడైనా; ఆరంభ, శీలుఁడు+అయి= ప్రయత్నం చేసే స్వభావం కలవాడై; అకృత+ఆరంభులన్= చేయబడని ప్రారంభం కలవారిని, అంటే- ప్రయత్నమే చెయ్యనివాళ్ళను; ఎంత, అధికులన్+అయినన్= ఎంత బలవంతులనైనా; ఓర్చున్= జయిస్తాడు.

తాత్పర్యం: లోకంలో ప్రయత్నమే చేయనివాడికి సంపదలు సమకూరవు. బలహీనుడైనా సరే పురుషుడు తాను ప్రయత్నం చేసే స్వభావం కలవాడైతే, ప్రయత్నమే చెయ్యని ఎంత బలవంతులనైనా జయించగలడు.

క. కడు నధికుతోడఁ దొడరినఁ । బొడిచిన నొడిచినను బురుష పురుషగుణం బే
ర్పడుఁగాక, హీను నొడుచుట । కడిఁదియె? పౌరుషము దానఁ గలుగునె చెపుమా! 124

ప్రతిపదార్థం: కడున్+అధికుతోడన్= మిక్కిలి బలవంతునితో; తొడరినన్= ఎదుర్కొంటే; పొడిచినన్= పోట్లాడితే; ఒడిచినన్= ఓడిస్తే; పురుషు= పురుషుడియొక్క; పురుషగుణంబు= పౌరుషం; ఏర్పడున్, కాక= ప్రకాశిస్తుంది కాని; హీనున్= బలహీనుని; ఒడుచుట= ఓడించటం; కడిఁది+ఎ= గొప్పయా? కాదు; దానన్= దానివలన; పౌరుషము; కలుగునె; చెపుమా?

తాత్పర్యం: లోకంలో బలవంతునితో వైరం పూనినా, యుద్ధం చేసినా, అతణ్ణి ఓడించినా పురుషుని పౌరుషం ప్రకాశిస్తుంది. అంతేకాని బలహీనుణ్ణి ఓడించటం ఒక విశేషమా? అది పరాక్రమమా?

విశేషం: శ్రీకృష్ణుడు జరాసంధుని బలపరాక్రమాల్ని ప్రశంసించింది ధర్మరాజుకొరకే అయినా, ఆ ప్రశంస ప్రక్కనే ఉన్న భీమసేనునిలో కయ్యపువేడిని గొప్పగా పుట్టించింది. ఆ జగన్నాటక సూత్రధారిమాటలు, చేతలు బహుళార్థసాధకాలు కదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఈహరి కరుణయు నర్జును। సాహాయ్యముఁ గలుగ నీ ప్రసాదమున జగ
ద్ద్రోహు జరాసంధు మహా। సాహసు వధియింతు నుగ్ర సంగ్రామమునన్. 125

ప్రతిపదార్థం: ఈ, హరి, కరుణయున్= ఈకృష్ణునియొక్కదయ; అర్జును, సాహాయ్యమున్= అర్జునునియొక్క తోడ్పాటు; కలుగన్= కలిగితే; నీ ప్రసాదమునన్= నీ అనుగ్రహంచేత; జగత్+ద్రోహు, జరాసంధు= లోక ద్రోహి అయిన జరాసంధుణ్ణి; మహాసాహసున్= మిక్కిలి సాహసం కలవాణ్ణి; ఉగ్ర, సంగ్రామమునన్= భయంకరమైన యుద్ధంలో; వధియింతున్= చంపుతాను.

తాత్పర్యం: శ్రీకృష్ణుని దయ, అర్జునుని సాహాయ్యం నాకు ఉంటే, నీ అనుగ్రహంతో లోకద్రోహి, మహాసాహసుడు అయిన జరాసంధుణ్ణి భీకరసంగ్రామంలో సంహరిస్తాను.

తే. అనఘ! యేము ముప్వురము మూఁడగ్నులట్లు। నీ మహాయజ్ఞ కార్యంబు నిర్వహింతు
మా జరాసంధ పశువున నఖిల శాత్ర। వాహుతులఁ జేసి తృప్తుల మగుచు బలిమి. 126

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ధర్మరాజా!; ఏము, ముప్వురము= మేము ముగ్గురం; మూఁడు+అగ్నుల+అట్లు= ఆహవనీయ; దక్షిణ, గార్హపత్యా లనే మూడు అగ్నుల్లా; జరాసంధ, పశువునన్= జరాసంధు డనే బలిపశువుతో; అఖిల, శాత్రవ+ఆహుతులన్+చేసి= సమస్త శత్రువు లనే హోమద్రవ్యాలతో - ఆహుతులతో; తృప్తులము+అగుచున్= తృప్తిచెందిన వాళ్ళమై; బలిమిన్= బలంతో; నీ, మహా, యజ్ఞ, కార్యంబు, నిర్వహింతుము= నీ రాజసూయ మహాయజ్ఞ కార్యాన్ని నిర్వహిస్తాము.

తాత్పర్యం: మేము ముప్వురం ఆహవనీయ, దక్షిణ, గార్హపత్యాలనే మూడు అగ్నుల్లా జరాసంధు డనే బలిపశువుతో, సర్వశత్రువులనే ఆహుతులతో నీరాజసూయమహాయజ్ఞకార్యాన్ని నిర్వహిస్తాము.

విశేషం: అలం: ఉపమ, రూపకం. ఆహవనీయ, దక్షిణ, గార్హపత్యాలు త్రేతాగ్నులు. ఇవి క్రమంగా వేదికి పూర్వ, దక్షిణ, పశ్చిమదిశలలో ఉంటాయి. ఇవిగాక సభ్యం, అపసభ్యం అనేవి ఈశాన్యదిశలో ఉంటాయి. పై పద్యానికి 3,4 పాదాలకు సంబంధించి 'శస్త్రాస్త్రతీవ్రహతిని జేసియుఁదృప్తుల మగుచు బలిమి - దివ్యాస్త్రశస్త్రహతునిఁగాఁ జేసి' వంటి పాఠాంతరా లున్నాయి. జరాసంధుడు శస్త్రాస్త్రాలచేత వధించ సాధ్యంకానివాడు. అందుచేత ఈ పాఠాంతరాలు ఉచితాలు కావనిపిస్తుంది.

వ. అనిన భీమసేను విక్రమవచనంబుల కనుగుణంబుగా నర్జునుం డిట్లనియె. 127

ప్రతిపదార్థం: అనినన్; భీమసేను= భీమసేనుడియొక్క; విక్రమ, వచనంబులకున్= పరాక్రమంతో కూడిన మాటలకు; అనుగుణంబుగాన్= తగినట్లుగా; అర్జునుండు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని భీమసేనుడు అనగా, అతని పరాక్రమవాక్యాలకు తగ్గట్లు అర్జునుడు కూడ ఈ విధంగా అన్నాడు.

ఉ. భూభుజులన్ జయింపుము, విభూతి నొనర్పుము రాజసూయమున్,
నాభుజ వీర్య విక్రమ గుణంబులకుం దగుచున్న యీ ధను
ర్లాభము, దివ్య బాణరథలాభము, శోభితమైన యీ సభా
లాభము నొండుపాట సఫలత్వముఁ బొందునె కౌరవేశ్వరా! 128

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= కురువంశ ప్రభుడవైన ఓ ధర్మరాజా!; భూ, భుజులన్= రాజులను; జయింపుము; రాజసూయమున్; విభూతిన్+ఒనర్పుము= ఐశ్వర్యంతోచేయుము; నా, భుజ, వీర్య, విక్రమ, గుణంబులకున్= నాయొక్క భుజ బల పరాక్రమగుణాలకు; తగుచున్+ఉన్న= తగినట్లుగా ఉన్న; ఈ, ధనుః+లాభము= ఈగాండీవ మనే మహాధనుస్సు లభించటం; దివ్య, బాణ, రథ, లాభము= దేవతాసంబంధాలైన బాణాలు, రథం లభించటం; శోభితము+ఐన= ప్రకాశించేదైన; ఈ, సభా, లాభమున్= ఈ మయ సభ లభించటం; ఒండుపాట= వేరొకవిధంగా; సఫలత్వమున్+పొందునె= సార్థకతను పొందుతాయా!

తాత్పర్యం: ఓ కౌరవేశ్వరా! ధర్మరాజా! రాజులందరిని జయించు. అపారమైన ఐశ్వర్యంతో రాజసూయం నిర్వహించు. అలా కాకుంటే నా భుజబలపరాక్రమ గుణాలకు తగినట్లు ఈ గాండీవం, ఈ దివ్యబాణాలు, ఈ దివ్యరథం, శోభాయమానమైన ఈ మయసభ పొందినందుకు ఫల మేముంది?

విశేషం: గాండీవ దివ్యబాణరథాలు పార్థుని భుజబల పరాక్రమాలకు ఫలాలుగా లభించిన దివ్యఫలాలైతే, శోభాయమానమైన మయసభ ఆయన శరణాగత రక్షణ గుణానికి ఫలంగా లభించిన మహాద్భుతఫలం. (ఇందులోని వీరరసదీప్తి ఉజ్జ్వలమై కాంతి అనే గుణాన్నీ, తద్వారా ప్రసాదాన్నీ రూపుకట్టిస్తున్నది. - సంపా.)

క. కలరూప గుణ ద్రవ్యం । బులు విక్రమవంతునందు భూవిదితములై
నిలుచు నవిక్రమునకు నవి । గలిగియు లేని క్రియ నప్రకాశంబు లగున్. 129

ప్రతిపదార్థం: విక్రమవంతునందున్= పరాక్రమం కలవానివిషయంలో; కల, రూప, గుణ ద్రవ్యంబులు= ఉన్నరూపం, గుణం, సంపద; భూవిదితములు+ఐ= ప్రపంచప్రసిద్ధాలై; నిలుచున్= రాణిస్తాయి; అవిక్రమునకున్= పరాక్రమం లేనివాడికి; అవి= ఆ రూపగుణసంపదలు; కలిగియున్= ఉండికూడ; లేని, క్రియన్= లేనివిధంగా; అప్రకాశంబులు+అగున్= వెలుగు లేనివై పోతాయి.

తాత్పర్యం: పరాక్రమవంతుని రూపగుణ సంపదలు ప్రపంచ ప్రసిద్ధాలై రాణిస్తాయి. పరాక్రమహీనునికి అవి ఉన్నా లేనట్లే కాంతివిహీనా లౌతాయి.

విశేషం: భండార్కర్ ప్రతిలో (మూలంలో) 'ద్రవ్యభూతాః గుణాః సర్వే తిష్ఠంతి హి పరాక్రమే' అని మాత్రమే ఉన్నా 'కుల రూపగుణ...' అని పెక్కు ప్రతులలో ఉన్న పాఠమే మేల్తర మనిపిస్తుంది. ఎందుకంటే గుణద్రవ్యాలే కాక కులరూపాలు కూడ పరాక్రమవంతుడిపట్ల గొప్పగా రాణిస్తాయి కదా.

వ. 'మఱియు రాజసూయ మహాధ్వరంబు కారణంబుగాఁ బరాక్రమంబున జరాసంధు వధియించి నిఖిల క్షత్త్రియ నిగ్రహ మోక్షణంబు సేయునంతకంటె మిక్కిలి యశోధర్మంబు లొండెవ్వి?' యనిన భీమార్జునుల పలుకులకు సంతసిల్లి నారాయణుం డి ట్లనియె. 130

ప్రతిపదార్థం: మఱియు, రాజసూయ, మహా+అధ్వరంబు= రాజసూయమహాయాగం; కారణంబుగాన్; పరాక్రమంబునన్= శౌర్యంతో; జరాసంధున్, వధియించి; నిఖిల, క్షత్త్రియ, నిగ్రహ, మోక్షణంబు= అందరు రాజులకు చెరనుండి విముక్తి; చేయు, అంతకంటె= కలుగచెయ్యటంకంటె; మిక్కిలి= ఎక్కువైన; యశః, ధర్మంబులు= కీర్తి, ధర్మము; ఒండు+ఎవ్వి= వేరే ఏమున్నాయి; అనిన; భీమ+అర్జునుల; పలుకులకున్= మాటలకు; సంతసిల్లి= సంతోషించి; నారాయణుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'రాజసూయ మహాయాగ కారణంగా జరాసంధుణ్ణి వధించి, అతనిచేత బంధితులైన రాజులనందరిని చెరనుండి విడిపించటంకంటె ఎక్కువ కీర్తి, ధర్మం, ఇంకేమున్నాయి?' అని పలికిన భీమార్జునుల పలుకులకు శ్రీకృష్ణుడు సంతోషించి ఇలా అన్నాడు.

క. **వెలయ విధిదృష్ట నయమున । వలయుఁ బరాక్రమము సేయ వసుధేశ్వర య**
గ్గల మగు బుద్ధియుఁ గడఁకయుఁ । గల పురుషుల కిదియె చూవె కర్తవ్య మిలన్. 131

ప్రతిపదార్థం: వసుధా+ఈశ్వర!= ఓభూనాథ! ధర్మరాజా!; వెలయన్= ప్రకాశించేటట్లుగా; విధి, దృష్ట, నయమునన్= శాస్త్రదృష్టితో కూడిన నీతితో; పరాక్రమము, చేయ, వలయున్= పరాక్రమం చూపాలి; అగ్గలము+అగు= అధికమైన; బుద్ధియున్; కడఁకయున్= ప్రయత్నంకూడా; కల; పురుషులకు; ఇలన్= భూమిమీద; కర్తవ్యము= చేయతగినది; ఇది+ఎ, చూవె= ఇదే సుమా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! శాస్త్రోక్తమైన ధర్మపద్ధతిలో పరాక్రమాన్ని ప్రదర్శించాలి. బుద్ధిబలం, ప్రయత్నం గల పురుషులకు భువిలో ఇదే సుమా కర్తవ్యం.

వ. **'కావున మేము ముప్వురముఁ గ్రమంబునం బరాక్రమించి జరాసంధుడాసి నదీప్రవాహంబులు వృక్షోన్మూలనంబు సేయునట్లు క్రమంబున వాని నిర్మూలితుం జేసెద; మద్దురాత్ముండు భూతంబులయం దంతరాత్మయుం బోలెఁ దన యంతరం బెఱుంగక యేకాంతశీలుఁడై సుఖం బనుభవించుటం జేసి వాని యంతికంబున కరుగుట యశ్రమం' బనిన నారాయణునకు ధర్మరా జిట్లనియె.** 132

ప్రతిపదార్థం: కావున; మేము; ముప్వురమున్; క్రమంబునన్= వరుసగా; పరాక్రమించి; జరాసంధు, డాసి= జరాసంధుణ్ణి సమీపించి; నదీ ప్రవాహంబులు; వృక్ష, ఉత్+మూలనంబు, చేయు, అట్లు= చెట్లను వేళ్ళతో కూడ పెకలించి వేసేటట్లు; క్రమంబునన్; వాని= ఆ జరాసంధుణ్ణి; నిర్మూలితున్+చేసెదము= చంపివేయబడినవాడినిగా చేస్తాము - అంటే చంపివేస్తాము; ఆ+దురాత్ముండు= ఆ దుర్మార్గుడు; భూతంబుల, అందున్= ప్రాణుల్లో; అంతర్+ఆత్మయున్+పోలెన్= అంతరాత్మవలె; తన, అంతరంబు= తనమేర (తనకాలపరిమితి); ఎఱుంగక= తెలియక; ఏకాంత, శీలుఁడు+ఐ= ఒంటరిగా ఉండే స్వభావం కలవాడై; సుఖంబు+అనుభవించుటన్+చేసి= సుఖాన్ని అనుభవిస్తూ ఉండటంవల్ల; వాని= ఆ జరాసంధుని; అంతికంబునకున్= సమీపానికి; అరుగుట= వెళ్ళటం; అశ్రమంబు= కష్టం కాదు; అనిన; నారాయణునకున్= శ్రీకృష్ణునికి; ధర్మరాజు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'భీమార్జునులు, నేను- ముప్వురం విజృంభించి జరాసంధుణ్ణి ఎదుర్కొని నదీప్రవాహాలు చెట్లను వ్రేళ్ళతో కూడ పెకలించివేసేటట్లు పట్టుబట్టి అతణ్ణి నిర్మూలిస్తాం. ప్రాణుల్లోని అంతరాత్మలా తన ఉనికి, తన కాలపరిమితి తెలియకుండా ఏకాంతంగా ఉండే స్వభావం కలవాడై, సుఖాలు అనుభవిస్తూ ఉండటంచేత అతని సమీపానికి వెళ్ళటం కష్టం కా' దని శ్రీకృష్ణు డనగా ధర్మరాజు ఇలా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ. ఇచట అర్థం సందిగ్ధంగా ఉంది.

"తే వయం యత్న మాసాద్య శత్రుదేశసమీపగాః, కథ మంతం న గచ్ఛేమ వృక్షస్యేవ నదీరయాః.
పరరంధ్రే పరాక్రాంతః స్వరంధ్రావరణే స్థితః, వ్యూఢానీకస్తు బలవాన్ నోపేయా ద్బలవత్తరమ్.

అనవద్యా హ్యసంబాధాః దృష్ట్వా శత్రుం సమీపతః, శత్రుదేశ ముపాక్రమ్య తం కామం ప్రాప్నుయామహే. ఏకోహ్యేవ శ్రియం నిత్యం బిభర్తి భరతర్షభ, అంతరాత్మేవ భూతానాం తత్క్షయే వై బలక్షయః" -అని మూలం. 'ఎఱుంగకుండ' అని ఉంటే 'తా నుండే చోటు ఎవ్వరూ ఎఱుగకుండ' - అని అర్థం చెప్పవచ్చు. 'అద్దురాత్ముండు తన యంతరం బెఱుంగక భూతంబులం దంతరాత్మయుంబోలె' - అని ఉంటే అన్వయం సులభంగా ఉండేది.

ప్రాణుల్లో ఉండే అంతరాత్మ ఎవ్వరికీ అగుపించకుండ ఏకాంతంగానే ఉంటుంది. అంతేకాదు- తన కొక కాలపరిమితి ఉంటుం దన్న సంగతికూడ అది తెలుసుకోదు. అలా ఉంటాననే అనుకుంటూ ఉంటుంది. కాలం తీరగానే వెళ్ళిపోతుంది. అలాగే అసాధారణజన్మతో అపారబలసంపన్నుడు, అతిగర్వితుడు అయిన జరాసంధుడు తనకాలపరిమితినిగూర్చి తాను ఆలోచించుకోకుండా ఉండటంలో ఆశ్చర్యం లేదు. పైగా ఎంతో రహస్యస్థానంలో, ఉంటూ ఏకాంతజీవితం గడపటానికి అలవాటు పడ్డాడు కనుక, తన ఉనికిని ఎవ్వరూ కనిపెట్టలేరన్న ధీమాకూడా అతనికి ఉండవచ్చు. రహస్యస్థానానికి మార్గం తెలియాలే కాని- తెలిస్తే ఆ స్థానాన్ని చేరుకోవటం పెద్ద కష్టంకాదు. అక్కడ ఏకాంతంగా ఉన్న వ్యక్తిని అంతమొందించటం కూడ అంతకష్టంకాదు. అంతరాత్మ ఎక్కడ ఉన్నా పరమాత్మ ప్రవేశించటానికి శ్రమ ఏముంటుంది? అందుకే శ్రీకృష్ణుడు లౌకికంగానేకాక తాత్త్వికంగాకూడా జరాసంధుణ్ణి చేరటం కష్టం కా దని అంటున్నాడేమో.

క. దనుజాహిత! నీ కాహవ । మున నెదిరి మహోగ్ర దహనమునఁ బడియును గా
లని మిడుత వోలె నతికో । పనుఁడు జరాసంధుఁ డెట్లు బ్రదుకఁగ నేర్చున్? 133

ప్రతిపదార్థం: దనుజ+అహిత= రాక్షసులకు శత్రువైనవాడా, శ్రీకృష్ణా!; నీకున్; ఆహవమునన్= యుద్ధంలో; ఎదిరి= ఎదిరించి; అతికోపనుఁడు= అధికకోపం కలవాడైన; జరాసంధుడు; మహా+ఉగ్ర, దహనమునన్= మిక్కిలి భయంకరమైన నిప్పులో; పడియును; కాలని; మిడుత, పోలెన్= మిడుత పురుగువలె; ఎట్లు= ఏవిధంగా; బ్రదుకఁగన్= జీవించటానికి; నేర్చున్= జీవించగలడు ?

తాత్పర్యం: శ్రీకృష్ణా! యుద్ధంలో ని న్నెదిరించి ఆ జరాసంధుడు అతిభయంకరమైన అగ్నిలో పడ్డ మిడతలా మాడిపోకుండా బ్రతుకగలడా!

విశేషం: అలం: ఉపమ.

క. అట్టి యతి దారుణత్వము । నట్టి యజేయ భుజ విక్రమాధిక్యము వాఁ
డెట్టి క్రియఁ బడసె; నాతని । పుట్టిన విధ మెట్లు చెప్పు పొలుపుగ నాకున్. 134

ప్రతిపదార్థం: వాఁడు= ఆ జరాసంధుడు; అట్టి= ఆవిధమైన; అతి, దారుణత్వమున్= మహాక్రూర స్వభావాన్ని; అట్టి= అంతటి; అజేయ, భుజ, విక్రమ+ఆధిక్యమున్= జయింప సాధ్యంకాని భుజ పరాక్రమాతిశయం; ఎట్టి, క్రియన్, పడసెన్= ఏ విధంగా పొందాడు; ఆతని= అతడియొక్క; పుట్టిన విధము; ఎట్లు= ఎలాంటిదో; నాకున్; పొలుపుగ = ఒప్పుగా; చెప్పు= చెప్పుము.

తాత్పర్యం: ఆ జరాసంధుడికి అంత క్రూర స్వభావం, జయించటానికి సాధ్యంకాని అంత భుజ పరాక్రమం ఎలా వచ్చాయో, అతని పుట్టుక ఎలాంటిదో నాకు చెప్పు.

విశేషం: చెప్పుము+పొలుపుగ - హల్లు పరమైంది కనుక 'ము' లోపం- చెప్పు.

శ్రీకృష్ణుఁడు ధర్మజునకు జరాసంధుని జననక్రమ మెఱిఁగించుట (సం. 2-16-12)

వ. అని యడిగిన ధర్మరాజునకుఁ గృష్ణుం డిట్లనియె. 135

తాత్పర్యం: అని అడిగిన ధర్మరాజుతో శ్రీకృష్ణుడు ఈవిధంగా అన్నాడు.

సీ. అతిసమర్థుండు బృహద్రథుం డనువాఁడు । మగధాధినాథుఁ డున్మార్గదూరుఁ,
దక్షౌహిణీ త్రితయంబు బలంబునఁ । బరుల నోడించిన బలిమికాఁడు,
కాశిరా జనువానిగాదిలికూఁతులఁ । గవల వారల నతికాంతిమతుల
నమరంగఁ బెండ్లి యై యనుపమప్రీతి న । య్యిరువురయందు భోగేచ్ఛ సలిపి

తే. యం దపత్యంబు వడయుదు నని తలంచి । విప్ర ముని దేవ పూజల వివిధవిధులఁ
బుత్త్రకామేష్టులను నొండు పుణ్యకర్మ । యుక్తులను జేసి పడయంగ నోప కలసి. 136

ప్రతిపదార్థం: అతి సమర్థుండు= మిక్కిలి సమర్థుడైన; మగధ+అధినాథుఁడు= మగధదేశపురాజు; బృహత్+రథుండు; అనువాఁడు= అనే పేరున్నవాడు; ఉన్మార్గదూరుఁడు= చెడునడవడికి దూరమైనవాడు; అక్షౌహిణీ, త్రితయంబు, బలంబునన్= మూడు అక్షౌహిణుల సైన్యంతో; పరులన్= శత్రువులను; ఓడించిన; బలిమికాఁడు= బలవంతుడు; కాశిరాజు+అనువాని; గాదిలికూఁతులన్= ప్రియమైన పుత్త్రికలను; కవల వారలన్= ఒకేసారి జన్మించిన జంట పిల్లలను; అతికాంతిమతులన్= మిక్కిలి తేజస్సుతో వెలిగేవాళ్ళను; అమరంగన్= ఒప్పుగా; పెండ్లి+ఐ= పెండ్లిచేసికొని; అనుపమప్రీతిన్= సాటిలేని ప్రేమతో; ఆ+ఇరువుర+అందున్= ఆ ఇద్దరు భార్యల ద్వారా; భోగ+ఇచ్ఛ= సంభోగ సంబంధమైన కోరిక; సలిపి; అందున్= ఆ భార్యల ఇద్దరి ద్వారా; అపత్యంబున్= సంతానాన్ని; పడయుదున్+అని= పొందుతానని; తలంచి; విప్ర, ముని, దేవపూజలన్= బ్రాహ్మణులను, మునులను, దేవతలను, పూజించటంచేత; వివిధ, విధులన్= అనేక శాస్త్రోక్త పద్ధతులచేత; పుత్త్రకామ+ఇష్టులన్= పుత్త్రులను కోరి చేసే యాగాలచేత; ఒండు= ఇతరాలైన; పుణ్య, కర్మ, యుక్తులను= పుణ్యకార్యాలతో కూడ; పడయంగన్+ఓపక= పుత్రులను పొందనేరక; అలసి= విసిగి.

తాత్పర్యం: మహాసమర్థుడైన మగధరాజు బృహద్రథుడు అక్రమ మార్గాలను అనుసరించకుండ, మూడుఅక్షౌహిణుల సైన్యంతో శత్రురాజుల్ని ఓడించాడు. కాశీరాజుకూర్మిపుత్రికల్ని, అందమైన కవలపిల్లల్ని వివాహమాడాడు. అమితప్రీతితో, ఆ యిద్దరితో అనేక సంభోగ సుఖాలు అనుభవించాడు. సంతానకాంక్షతో దేవ బ్రాహ్మణ ముని పూజలు చేశాడు. శాస్త్రనియమానుసారం పుత్త్రకామేష్టి యాగాలు, పెక్కుపుణ్యకార్యాలు చేశాడు. అయినా పుత్రుల్ని పొందలేక జీవితంలో విసిగిపోయాడు.

విశేషం: అక్షౌహిణి - 21870 రథాలు, అదేసంఖ్యలో ఏనుగులు, 65610 గుఱ్ఱాలు, 109350 పదాతులు గల సేనాసమూహం.

వ. 'పుత్త్రుండు లేని విభవంబు లన్నియు నేల?'యని నిర్వేదించి పత్నీద్వయ సమేతుండయి వనంబున కరిగి. 137

ప్రతిపదార్థం: పుత్త్రుండు; లేని; విభవంబులు+అన్నియున్= సంపదలన్నీ; ఏల; అని; నిర్వేదించి= నిరాశచెంది; పత్నీద్వయ సమేతుండు+అయి= భార్యలిద్దరితో కూడినవాడై; వనంబునకున్+అరిగి= అడవికి వెళ్ళి.

తాత్పర్యం: పుత్రులు లేని సంపదలు ఎందుకని నిరాశచెంది, భార్యలిద్దరితో కలిసి బృహద్రథుడు అడవికి వెళ్ళి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ఆ విపినాంతరంబున నిరంతర నిష్ఠ ననంత మోక్షకాం
క్షావిధి నొక్క బాల సహకార మహీజము క్రింద నుజ్జ్వల
త్పావకతేజుఁడై తపము పాయక చేయుచు నున్న ధన్యుఁ గా
క్షీవతుఁ గాంచె గౌతము నకిల్బిషమానసుఁ జండకౌశికున్. 138

ప్రతిపదార్థం: ఆ+విపిన+అంతరంబునన్= ఆ, అడవి మధ్యలో; నిరంతర, నిష్ఠన్= ఎడతెగని నియమంతో; అనంత, మోక్ష, కాంక్షా, విధిన్= అంతులేని మోక్షం పట్ల కోరికతో కూడిన విధానంతో; ఒక్క, బాల, సహకార, మహీజము, క్రిందన్= లేతమామిడి చెట్టు క్రింద; ఉత్+జ్వలత్+పావక, తేజుఁడు+ఐ= బాగా మండుతున్న అగ్నిహోత్రుని వంటి కాంతి కలవాడై; తపము= తపస్సు; పాయక= వదలక; చేయుచున్+ఉన్న; ధన్యున్; కాక్షీవతున్; అకిల్బిష, మానసున్= పాపరహితమైన మనస్సు కలవానిని; గౌతమున్= గౌతముని కుమారుడిని; చండకౌశికున్= చండకౌశికు డనే పేరు కలవానిని; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: ఆ అడవి మధ్య నిరంతర నిష్ఠతో, అంతులేని ముక్తికాంక్షతో, మండుతున్న అగ్నిలా మహాతేజస్సుతో, ఒక లేత మామిడి చెట్టుక్రింద ఎడతెగని తపస్సు చేస్తున్న ధన్యుడు, కాక్షీవతుడు, పుణ్యాత్ముడు, గౌతముడు అయిన చండకౌశిక మహర్షిని చూచాడు.

విశేషం: కాక్షీవతః పుత్రం గౌతమస్య మహాత్మనః - అని మూలం. కాక్షీవతః అనేది గౌతమస్య అనే దానికి విశేషణం. (ఈ పద్యరచనలో అర్థనైర్మల్యంతో కూడిన బంధశైథిల్యం నన్నయరచనలో మిక్కుటంగా గోచరించే ప్రసాదగుణాన్ని ప్రత్యక్షం చేస్తున్నది. సంపా.)

క. ధరణీశ్వరుఁ డమ్మునివరుఁ। బురాతనమునినిఁ నిరాశుఁ బుణ్యాత్ము నిరం
తర కృత నియమ సపర్యా। వరివస్యుం డగుచు భక్తి వదలక కొలిచెన్. 139

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వరుఁడు= బృహద్రథ మహారాజు; ఆ+మునివరున్= ఆమునిశ్రేష్ఠుని; పురాతన, మునిన్= ప్రాచీనుడైనమునిని; నిర్+ఆశున్= కోరికలేనివానిని; పుణ్య+ఆత్మున్= పవిత్రమైన మనస్సు కలవానిని; నిరంతర, కృత, నియమ, సపర్యా, వరివస్యుండు+అగుచున్= ఎడతెగకుండ చేయబడిన నియమబద్ధమైన, పరిచర్యలతోను కూడిన సేవ కలవాడై; భక్తిన్, వదలక= విడువక; కొలిచెన్= సేవించాడు.

తాత్పర్యం: పుణ్యాత్ముడు, పురాతనుడు, నిష్కాముడు, మునిశ్రేష్ఠుడు అయిన చండకౌశికుణ్ణి ఎడతెగని నియమనిష్ఠలతో, ఎనలేని భక్తితో బృహద్రథమహారాజు సేవించాడు.

వ. ఇట్లుపాస్యమానుం డయి చండకౌశికుండు బృహద్రథునకు మెచ్చి 'నీ కిష్టంబు చెప్పు మిచ్చెద' ననిన వినయ
వినమితోత్తమాంగుం డయి వాఁ డి ట్లనియె. 140

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; ఉపాస్యుండు+అయి= సేవించబడినవాడై; చండకౌశికుండు; బృహత్+రథునకున్; మెచ్చి; నీకున్+ఇష్టంబు= నీఇష్టమైనది; చెప్పుము+ఇచ్చెదన్; అనినన్; వినయ, వినమిత+ఉత్తమ+అంగుండు+అయి= వినయంచేత వంచిన శిరస్సు కలవాడై; వాఁడు= ఆ బృహద్రథ మహారాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: బృహద్రథుడి సేవలకు మెచ్చి చండకౌశికుడు 'నీ కేమి కావాలో కోరుకో'మ్మనగా అతడు వినయంతో శిరస్సు వంచి ఇలా అన్నాడు.

ఉ. **సంతతమైన సర్వ సుఖ సంపద గల్గియు దానికిం దగన్**
సంతతి లేమిఁ జేసి యది సర్వము హేయము కాఁ దలంచి ని
శ్చింతుఁడనై ధృతిం దపము సేయఁగవచ్చితిఁ బుత్త్రజన్మమై
నంతన యేను మీ దయఁ గృతార్థతఁ బొందుదు సన్మునీశ్వరా! **141**

ప్రతిపదార్థం: సత్+మునీశ్వరా!= ఓమునిశ్రేష్ఠా!; సంతతము+ఐన= ఎడతెగని; సర్వ, సుఖ, సంపద= అన్ని సుఖాల వైభవం; కల్గియున్= పొందియు; దానికిన్, తగన్= అందుకు తగినట్లు; సంతతి, లేమిన్+చేసి= సంతానం లేనందువల్ల; అది, సర్వము= ఆ సంపద అంతా; హేయము+అ, కాన్+తలంచి= విడువదగినదే అని అనుకొని; నిశ్చింతుఁడన్+ఐ= దిగులు లేనివాడినై; ధృతిన్= స్థిరమైన బుద్ధితో; తపము= తపస్సు; చేయఁగన్; వచ్చితిన్; పుత్త్ర, జన్మము+ఐన+అంతన= పుత్రుడు పుట్టటం జరిగినంతనే; ఏను= నేను; మీదయన్= మీదయతో; కృత+అర్థతన్+పొందుదున్= ఈడేరిన కోరిక కలవాడి నౌతాను.

తాత్పర్యం: ఓ మునిశ్రేష్ఠా! నాకు అంతులేని సుఖసంపద లున్నాయి. కాని, అందుకు తగ్గట్లు సంతానం లేదు. అందుచేత ఆ భోగభాగ్యా లన్నింటిని వదలి నిశ్చింతగా, స్థిరబుద్ధితో తపస్సు చెయ్యాలని వచ్చాను. మీ అనుగ్రహంచేత నాకు పుత్రోదయ మైతే నాకోరిక తీరుతుంది.

విశేషం: నన్నయప్రసాదగుణవిశిష్టమైన రచన కీ పద్యం చక్కని ఉదాహరణం.

వ. **అనినం గరుణించి మునివరుండు పరమధ్యానముకుళిత నయనుండై యున్నంత.** **142**

ప్రతిపదార్థం: అనినన్= అని బృహద్రథు డనగా; కరుణించి= దయతలచి; మునివరుండు= మునిశ్రేష్ఠుడైన చండకౌశికుడు; పరమ, ధ్యాన, ముకుళిత, నయనుండు+ఐ= గొప్పధ్యానంచేత ముడుచుకొన్న కన్నులు కలవాడై; ఉన్న+అంతన్.

తాత్పర్యం: అని బృహద్రథమహారాజు అనగానే, దయతో ఆ మునిశ్రేష్ఠుడైన చండకౌశికుడు ధ్యానంలో కళ్ళుమూసుకొని ఉండగా.

క. **పవనవిధూతము శుకచం । చు విలూనముఁ గాక యొక్క చూతఫలం బ**
య్యవనిజమువలన నమ్ముని । ప్రవరుపృథూత్సంగతలముపై వడిఁ బడియెన్. **143**

ప్రతిపదార్థం: పవన, విధూతము= గాలిచే విసిరివేయబడింది; శుక, చంచు, విలూనమున్= చిలుక ముక్కుచేత త్రుంచి వేయబడింది; కాక= కాకుండ; ఒక్క, చూత, ఫలంబు= ఒక మామిడిపండు; ఆ, అవనిజము వలనన్= ఆ చెట్టునుండి; ఆ, ముని, ప్రవరు, పృథు+ఉత్సంగ, తలముపైన్= ఆ మునిశ్రేష్ఠుడియొక్క విశాలమైన తొడమీద; వడిన్= వేగమే; పడియెన్.

తాత్పర్యం: ఒక మామిడిపండు ఆ చెట్టుమీదినుండి చండకౌశికమహర్షియొక్క విశాలమైన తొడమీద పడింది. కాని, అది గాలికి రాలిపడలేదు. చిలుక ముక్కుతో దాన్ని త్రుంచి వెయ్యలేదు. దానంతట అదే పడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. దానిం బుచ్చికొని యభిమంత్రించి చండకౌశికుండు బృహద్రథున కిచ్చి 'యీ ఫలంబువలన నీకొక్క పుత్త్రుం డుద్భవిల్లు' నని చెప్పిన నాతండును గృతార్థుండై క్రమ్మఱి నిజపురంబునకు వచ్చి, తన యిద్దఱు భార్యలకు నప్పండు సమంబుగా విభాగించి పెట్టినం దత్ఫలోపభోగంబున నయ్యిద్దఱు గర్భిణులయినఁ బదియగు మాసంబున నొక్కనాఁటి రాత్రియందు వారలకు. 144

ప్రతిపదార్థం: చండకౌశికుండు; దానిన్= ఆ మామిడిపండును; పుచ్చికొని= తీసికొని; అభిమంత్రించి= మంత్రంచేత సంస్కరించి; బృహత్+రథునకున్; ఇచ్చి; ఈ, ఫలంబువలనన్; నీకున్+ఒక్క, పుత్త్రుండు; ఉద్భవిల్లున్= జన్మిస్తాడు; అని; చెప్పినన్= చెప్పగా; అతండును= ఆ బృహద్రథుడు; కృత+అర్థుండు+ఐ= తీరిన కోరిక కలవాడై; క్రమ్మఱి= మరలి; నిజ, పురంబునకున్= తనయొక్క రాజధానీ నగరానికి; వచ్చి; తన; ఇద్దఱు; భార్యలకున్, ఆ+పండు; సమంబుగా= సమానంగా; విభాగించి= పంచి; పెట్టినన్; తత్, ఫల+ఉపభోగంబునన్= ఆ పండును తినటంచేత; ఆ+ఇద్దఱు; గర్భిణులు+అయినన్; పది, అగు, మాసంబునన్= పదవ నెలలో; ఒక్కనాటి; రాత్రి, అందున్; వారలకున్.

తాత్పర్యం: చండకౌశికుడు ఆ పండు తీసుకొన్నాడు. మంత్రించి బృహద్రథమహారాజుకు ఇచ్చాడు. దీనివల్ల నీ కొకకొడుకు జన్మిస్తా డని చెప్పాడు. బృహద్రథునికోరిక తీరింది. ఆయన తనరాజధానికి తిరిగివచ్చాడు. ఆ పండును భార్య లిద్దరికి సమానంగా పంచి ఇచ్చాడు. ఆ పండును తిన్న భార్య లిద్దరు గర్భవతు లయ్యారు. పదినెలల తర్వాత ఒకనాటి రాత్రి ఆ యిద్దరికి.

విశేషం: 'అవ' అనటానికి బదులు నన్నయగారు 'అగు' అని వాడుతుంటారు.

క. ఒక్కొక కన్నును జెవియును । జెక్కును జను బొడ్డు మూఁపుఁ జెలువగు చేయున్
బ్రక్కయుఁ గుఱువును గాలును । నక్కజముగ మనుజ శకలమై యుదయించెన్. 145

ప్రతిపదార్థం: ఒక్కొక; కన్నును; చెవియును; చెక్కును= చెంప; చను, బొడ్డు= చన్ను, బొడ్డుయొక్క భాగము; మూఁపున్= భుజమును; చెలువు+అగు= అందమైన; చేయున్= చెయ్యి; ప్రక్కయున్= ప్రక్క భాగమూ; కుఱువును= తొడా; కాలునున్, అక్కజముగ= ఆశ్చర్యకరంగా, మనుజ, శకలము+ఐ= మానవశరీరపు ముక్క అయి; ఉదయించెన్= పుట్టింది.

తాత్పర్యం: ఒక కన్ను, ఒక చెవి, ఒక చెంప, ఒక చన్ను, సగంబొడ్డు, ఒక భుజం, ఒక చెయ్యి, ఒక ప్రక్క భాగం, ఒక తొడ, ఒక కాలు ఉన్న మానవశరీరపు సగభాగం ముక్కలు ఆశ్చర్యకరంగా ఆ యిద్దరికి జన్మించాయి.

విశేషం: చండకౌశికుడు చెప్పింది ఈ ఫలంవల్ల ఒక పుత్రుడు కలుగుతాడు అని. బృహద్రథుడు ఆ పండును రెండు సమభాగాలుగా కోసి భార్యలకు ఇచ్చాడు. అందువల్లనే ఇలా అయింది. 'ఏకాక్షి బాహుచరణే అర్ధోదరముఖస్ఫిచే' - అని మూలం. చను బొడ్డు - అనే వాటి సంగతి అందులో లేదు.

క. అమ్మానిసి వ్రయ్యలు గని । యమ్ముదితలు వెఱచి 'వీని నాత్మజుఁ డని నె
య్యమ్మున నెట్టులు చూపుదు । మిమ్మనుజేశ్వరున?' కనుచు నెంతయు లజ్జన్. 146

ప్రతిపదార్థం: ఆ+మానిసి, వ్రయ్యలు= ఆ మానవుని ముక్కలు; కని= చూచి; ఆ+ముదితలు= ఆ కాంతలు, - బృహద్రథుని భార్యలు; వెఱచి= భయపడి; వీనిన్= ఈముక్కలుగా పుట్టిన వాడిని; ఆత్మజుఁ(డు+అని= పుత్రుడని; నెయ్యమునన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రేమతో; ఈ+మనుజ+ఈశ్వరునకున్= ఈ మహారాజుకు (భర్త అయిన బృహద్రథుడికి); ఎట్టులు= ఏవిధంగా; చూపుదుము; అనుచున్; ఎంతయున్, లజ్జన్= మిక్కిలి సిగ్గుతో.

తాత్పర్యం: ఆ మానవాకారపు ముక్కల్ని చూచి, బృహద్రథుని భార్యలిద్దరు భయపడ్డారు. ఈ ముక్కలుగా పుట్టినవాణ్ణి ప్రియమార పుత్రుడని మహారాజుకు ఎలా చూపించాలా? అని సిగ్గుపడ్డారు.

వ. **'వీని నెవ్వరును నెఱుంగకుండ వెలుపల వైచిరం' డని తమదాదులం బంచిన, వార లా రెండు వ్రయ్యలుం గొనిపోయి రాజగృహ ద్వారతోరణ సమీపంబునఁ జదుకంబునొద్ద నొక్కచోట వైచిన, నచ్చదుకంబున నుండెడు రాక్షసి జర యనునది దాని బలియకా వగచి పఱతెంచి.** **147**

ప్రతిపదార్థం: వీనిన్= ఈముక్కల్ని; ఎవ్వరును; ఎఱుంగకుండన్; వెలుపలన్; వైచి= వేసి; రండు+అని; తమ; దాదులన్= పనికత్తెల్ని; పంచినన్= పంపించగా; వారలు; ఆ, రెండు; వ్రయ్యలున్= ముక్కలును; కొనిపోయి= తీసుకొని పోయి; రాజ, గృహ, ద్వార, తోరణ, సమీపంబునన్= రాజభవనంయొక్క వెలుపలి వాకిలి దగ్గర; చదుకంబు+ఒద్దన్= నాలుగు త్రోవల కూడలి దగ్గర; ఒక్కచోటన్; వైచినన్= వెయ్యగా; ఆ+చదుకంబునన్= ఆ నాలుగుత్రోవలు కలిసేచోట; ఉండెడు; రాక్షసి; జర, అనునది; దానిన్= ఆ ముక్కల జంటను; బలి+అ, కా, వగచి= బలి ఇచ్చిన ప్రాణిశరీరంయొక్క ముక్కలని తలచి; పఱతెంచి= పరుగెత్తుకొని వచ్చి,

తాత్పర్యం: 'ఎవరికి తెలియకుండ ఈ ముక్కల్నిబయట పారేసిరం' డని బృహద్రథుని భార్యలు పనికత్తెల్ని పంపారు. పనికత్తెలు ఆ రెండు ముక్కల్ని తీసుకుపోయి రాజభవనం వెలుపలి వాకిలి సమీపంలో నాలుగు త్రోవలు కలిసేచోట ఒకవైపు వేసి వచ్చారు. అక్కడ ఉండే జర అనే రాక్షసి ఆ ముక్కలను చూచి, బలి యిచ్చిన ప్రాణి శరీరపుముక్కలని అనుకొని పరుగెత్తి వచ్చింది.

జరయను రాక్షసి బాలకునిఁ దెచ్చి బృహద్రథుని కొసంగుట (సం. 2-16-38)

ఆ. **ఎత్తికొని చనంగ నిమ్మగు నట్లుగా । మెదలుచున్న వ్రయ్య లదిమి రెంటిఁ**
గూడఁబట్టె; నవియుఁగూడి యొండొంటితోఁ । జక్క నంటి రెండు నొక్కఁడయ్యె. **148**

ప్రతిపదార్థం: ఎత్తికొని, చనంగన్= ఎత్తుకొని వెళ్ళటానికి; ఇమ్ము+అగునట్లుగాన్= అనుకూలం అయ్యేటట్లుగా; మెదలుచున్+ఉన్న= అటు ఇటు కదలుతున్న; వ్రయ్యలు+అదిమి= ముక్కలను ఒత్తి; రెంటిన్; కూడన్, పట్టెన్= రెండింటిని కలిపి పట్టుకొన్నది; అవియున్= ఆ ముక్కలు; కూడి= కలిసి; ఒండు+ఒంటితోన్= ఒకదానితో ఒకటి; చక్కన్+అంటి= సరిగా అతుక్కొని; రెండును+ఒక్కఁడు+అయ్యెన్.

తాత్పర్యం: జర అనే ఆ రాక్షసి తా నెత్తుకొని వెళ్ళటానికి అనుకూలంగా-కదులుతున్న ఆ రెండు ముక్కల్ని కలిపి గట్టిగా పట్టుకున్నది. అవి ఒకదానితో ఒకటి చక్కగా అతుక్కొని రెండూ కలిసి ఒకవ్యక్తిగా రూపొందాయి.

క. **ఆ రాక్షసి కెత్తికొనన్ । భారముగా వజ్రకలిన బంధురతనుఁ డై**
ధీరుఁడు బాలకుఁ డేడ్చె మ । హారవమున దాని చేతు లాడకయుండన్. **149**

ప్రతిపదార్థం: ఆ, రాక్షసికిన్; ఎత్తికొనన్; భారముగాన్= బరువుగా; వజ్ర, కఠిన, బంధుర, తనుఁడు+ఐ= వజ్రంలా కఠినంగా ఉన్న శరీరం కలవాడై; ధీరుఁడు; బాలకుఁడు; మహా, రవమునన్= పెద్దశబ్దంతో; దాని= ఆ రాక్షసియొక్క; చేతులు+ఆడక, ఉండన్= చేతులాడకుండగా; ఏడ్చెన్.

తాత్పర్యం: ఆ రాక్షసి ఎత్తుకొనటానికే బరువై, వజ్రంలాంటి కఠినమైన శరీరంతో ఒప్పుతున్న ఆ బాలుడు పెద్దశబ్దంతో ఏడ్చాడు. ఆ ఏడ్పు విన్న జరకు అతణ్ణి ఎత్తుకొని పోవటానికే చేతు లాడలేదు.

విశేషం: 'తతః సా రాక్షసీ రాజన్ విస్మయోత్ఫుల్లలోచనా, న శశాక సముద్వోఢుం వజ్రసారమయం శిశుం' (భండార్కరు ప్రతి. 2-16-41) మూలంలోని 'విస్మయోత్ఫుల్లలోచనా' అనే జర ఆశ్చర్యం అనువాదంలో రాలేదు. ఇచట ఆ రాక్షసి ఆశ్చర్యపడటం సహజమే కదా!

వ. అబ్బాలకు రోదన ధ్వని విని యంతిపురంబున నున్న ముదుసలి యవ్వలెల్లం బఱతెంచి మహాహర్షంబుతో వాని నెత్తికొని; రట్టి సంభ్రమం బెఱింగి బృహద్రథుండు వచ్చి తేజోధికుండయి తామ్రతలముష్టిం దనముఖపద్మంబునం బెట్టికొని దిక్కులు సెలంగ నేడ్చుచున్న కొడుకుం జూచి కృతార్థీకృత లోచనుం డయ్యెఁ; నట్టి యవసరంబున నా రాక్షసి కామరూపిణి గావున మనుష్య స్త్రీరూపధారిణి యయి యమ్మగధరాజున కి ట్లనియె. 150

ప్రతిపదార్థం: ఆ+బాలకు; రోదన, ధ్వని= ఏడుపు శబ్దం; విని; అంతిపురంబునన్+ఉన్న= అంతఃపురంలో ఉండే; ముదుసలి; అవ్వలు+ఎల్లన్= ముసలి స్త్రీలందరు; పఱతెంచి= పరుగెత్తుకొని వచ్చి; మహాహర్షంబుతోన్= మిక్కిలి సంతోషంతో; వానిన్= ఆ బాలుణ్ణి; ఎత్తికొనిరి; అట్టి; సంభ్రమంబు+ఎఱింగి= ఆ వేగిరపాటు చూచి; బృహద్రథుండు; వచ్చి; తేజః+అధికుండు+అయి= కాంతిచే మిక్కిలిగా వెలుగుతున్నవాడై; తామ్రతల ముష్టిన్= రాగివలె ఎర్రగా ఉన్న పిడికిలిని; తన= తనయొక్క; ముఖపద్మంబునన్= పద్మంవంటి ముఖంలో; పెట్టికొని; దిక్కులు, చెలంగన్= దిక్కులు మ్రోగేటట్లు; ఏడ్చుచున్+ఉన్న; కొడుకున్; చూచి; కృత+అర్థీకృత, లోచనుండు+అయ్యెన్= ఈడేరిన కోరిక కలవాడివలె చేయబడిన కన్నులు కలవాడయ్యాడు - అంటే పుత్రుడు కావాలనే కోరిక తీరటంచేత కలిగిన ఆనందం అతని కన్నులలో కన్పించింది; అట్టి, అవసరంబునన్= ఆ సమయంలో; ఆ రాక్షసి; కామరూపిణి; కావునన్= కోరుకొన్నరూపాన్ని ధరించేశక్తి కలది కావటంచేత; మనుష్య, స్త్రీ, రూప, ధారిణి, అయి= మానవకాంత రూపాన్ని ధరించిందై; ఆ+మగధరాజునకున్= ఆ బృహద్రథునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ బాలకుడి ఏడుపుశబ్దం విని అంతఃపురంలో ఉండే వృద్ధస్త్రీలందరు పరుగెత్తుకొని వచ్చారు. మహానందంతో ఆ బాలుణ్ణి ఎత్తుకొన్నారు. వాళ్ళ వేగిరపాటును చూచి బృహద్రథుడు కూడా వచ్చాడు. ఎంతో కాంతితో ప్రకాశిస్తూ, రాగివలె ఎర్రగా ఉండే లేత పిడికిలిని తనపద్మంవంటి ముఖంపై పెట్టుకొని దిక్కులు పిక్కటిల్లేటట్లు ఏడుస్తున్న తన పుత్రుణ్ణి చూచి మహానందభరితు డయ్యాడు. ఆ రాక్షసి కోరుకొన్న రూపాన్ని ధరించే శక్తి ఉంది కనుక అప్పుడు మానవకాంతరూపం ధరించి ఆ మగధరాజైన బృహద్రథునితో ఇలా అన్నది.

తే. ఏను జరయను రాక్షసి, నిప్పురంబు । చదుకమునఁ బాయకుండుదు, సంతతంబు
నీకు నిష్టంబు సేయంగ నెమ్మితోడఁ । గోరుచుండుదు, నది సమకూరె నేఁడు. 151

ప్రతిపదార్థం: ఏను= నేను; జర, అను; రాక్షసిన్; ఈ+పురంబు= ఈనగరంయొక్క; చదుకంబునన్= నాలుగుమార్గాల కూడలిస్థలంలో; పాయక+ఉండుదున్= వదలకుండా ఉంటాను; సంతతంబు= ఎల్లప్పుడు; నీకున్= నీకు; ఇష్టంబు= ప్రియమైనది; చేయంగన్; నెమ్మితోడన్= ప్రేమతో; కోరుచున్+ఉండుదున్; అది= అలాంటి అవకాశం; నేడు; సమకూరెన్= లభించింది.

తాత్పర్యం: నాపేరు జర. నే నొక రాక్షసిని. ఈ నగరంయొక్క నాలుగు మార్గాల కూడలి నా నివాసస్థలం. సర్వదా నీ కిష్టమైనది చేయాలని నా కోరిక. ఆ అవకాశం ఈరోజు లభించింది.

వ. **'నీ యిద్దఱు దేవులకు నుద్భవిల్లిన యిమ్మనుష్య శకలంబులు రెండును నీదాదులు దెచ్చి యిచ్చదుకంబు నొద్ద నొక్కచో వైచి పోయిన నేను వానిం గూడఁబట్టుడు నప్పుడు వజ్రఘన ఘటిత కఠిన శరీరుండై యిక్కుమారుండు మేరుగిరి శృంగంబునుంబోలె నా కెత్తికొన నశక్యుం డయ్యె; వీని నొప్పుగొను' మనిన విని బృహద్రథుండు ముదితహృదయుం డయి దాని కి ట్లనియె.** **152**

ప్రతిపదార్థం: నీ; ఇద్దఱు; దేవులకున్= భార్యలకు; ఉద్భవిల్లిన= పుట్టిన; ఈ+మనుష్యశకలంబులు= ఈమానవుడి ముక్కలు (మానవ దేహభాగాలు); రెండును; నీ, దాదులు= నీ పనికత్తెలు; తెచ్చి; ఈ+చదుకంబు+ఒద్దన్= ఈనాలుగు మార్గాల కూడలి దగ్గర; ఒక్కచోన్= ఒక్కచోట; వైచి= పడవేసి; పోయినన్= వెళ్ళగా; ఏను; వానిన్= ఆముక్కలను; కూడన్= కలిసేటట్లు; పట్టుడున్= పట్టుకోగా; అప్పుడు; వజ్ర, ఘన, ఘటిత, కఠిన, శరీరుండు+ఐ= వజ్రంయొక్క కాఠిన్యంతో కూర్చబడిన గట్టి శరీరం కలవాడై; ఈ+కుమారుండు; మేరుగిరి, శృంగంబునున్+పోలె= మేరుపర్వత శిఖరంవలె; నాకు+ఎత్తికొనన్; అశక్యుండు+అయ్యె= సాధ్యం కానివా డయ్యాడు; వీనిన్= ఈ బాలుణ్ణి; ఒప్పు, కొనుము= అంగీకరించు; అనిన; విని; బృహద్రథుండు; ముదిత, హృదయుండు+అయి= సంతోషించిన మనస్సు కలవాడై; దానికి= ఆ రాక్షసికి; ఇట్లు+అనియె.

తాత్పర్యం: 'నీ భార్య లిద్దరికి పుట్టిన ఈమానవదేహపు ముక్కలు రెండింటిని నీపనికత్తెలు తెచ్చి ఈనాలుగుత్రోవల కూడలిలో పారేసి వెళ్ళారు. నేను ఆ ముక్కలను కలిపి పట్టుకోగా వజ్రంలా కఠినమైన దేహంతో, ఈబాలకుడు రూపొందాడు. మేరుపర్వతశిఖరంవలె ఎత్తుకొనటానికి సాధ్యంకానివాడయ్యాడు. ఈ బాలుణ్ణి ప్రేమతో నీవు అంగీకరించు.' అని రాక్షసి అనగానే బృహద్రథుడు సంతోషంతో ఇలా అన్నాడు.

ఉ. **ఇచ్చకు వచ్చు పూజనల నెంతయు సంతసమంది తొల్లి నా**
కిచ్చె మునీశ్వరుండు దయ నిత్తనయున్; మఱి యిప్డు నెమ్మితో
నిచ్చితి వీవు రాక్షసివె! యిక్కులమెల్లను నుద్ధరింపఁగా
వచ్చిన పుణ్యదేవతవు వారిరుహాయతచారులోచనా! **153**

ప్రతిపదార్థం: వారిరుహ+ఆయత, చారు, లోచనా!= పద్మాలవంటి విశాలమైన అందమైన కళ్ళు కలదానా!; ఇచ్చకున్, వచ్చు, పూజనలన్= ఇష్టమైన పూజలచేత; ఎంతయున్= మిక్కిలి; సంతసము+అంది= సంతోషాన్ని పొంది; తొల్లి= పూర్వం; ముని+ఈశ్వరుండు= ముని శ్రేష్ఠుడైన చండకౌశికుడు; దయన్= దయతో; ఈ+తనయున్= ఈ కుమారుణ్ణి; నాకున్+ఇచ్చె; మఱి; ఇపుడు; నెమ్మితోన్= ప్రేమతో; ఇచ్చితివి= నీవు నాకు ఇచ్చావు; ఈవు= నీవు; రాక్షసివె!= రాక్షసివా?; ఈ కులము+ఎల్లనున్= ఈ మావంశాన్నంతా; ఉద్ధరింపన్+కాన్= ఉన్నతస్థితికి చేర్చటానికి (తరింపచేయుటానికి); వచ్చిన; పుణ్యదేవతవు= పవిత్రదేవతామూర్తివి.

తాత్పర్యం: పద్మాలవంటి విశాలమైన అందమైన కళ్ళు కలదానా! పూర్వం చండకౌశిక మహర్షిని పూజిస్తే ఈ పుత్రుణ్ణి ఇచ్చాడు. ఇప్పుడు ప్రేమతో నీ విచ్చావు. నీవు రాక్షసివా? నావంశాన్ని ఉద్ధరించటానికి వచ్చిన పుణ్యదేవతవు.

విశేషం: అలం: అపహ్నుతి. ఇందులోని శబ్దగుణం మాధుర్యం. (వివరాలకు పీఠిక చూడండి). (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని దాని నతిప్రీతిం బూజించి కొడుకు నెత్తికొని దేవీద్వయంబునకు నిచ్చి, జర యను రాక్షసిచేత సంధింపఁబడినవాఁడు గావున జరాసంధుం డను పేరిడి. పురం బష్టశోభనంబు సేయించి, యా రాక్షసి కేఁటేఁట మహోత్సవంబు సేయించుచుం గొడుకు నతి గౌరవంబునం బెంచిన. 154

ప్రతిపదార్థం: అని; దానిన్= ఆ జరను; అతిప్రీతిన్= మిక్కిలి ఇష్టంతో; పూజించి; కొడుకున్+ఎత్తికొని; దేవీ, ద్వయంబునకున్= భార్యలిద్దరికి ఇచ్చి; జర, అను; రాక్షసిచేత; సంధింపన్+పడినవాఁడు, కావునన్= ఒకటిగా కూర్చబడినవాడు కావటంచేత; జరాసంధుండు+అను; పేరు+ఇడి= పేరుపెట్టి; పురంబు+అష్ట, శోభనంబు, చేయించి= నగరాన్ని ఎనిమిది విధాల మంగళాలు కలదానినిగా చేయించి; ఆ, రాక్షసికిన్; ఏఁట+ఏఁట; మహా+ఉత్సవంబు= గొప్పపండుగ; చేయించుచున్; కొడుకున్; అతి, గౌరవంబునన్= మిక్కిలి ప్రేమతో (గారాబంతో); పెంచినన్.

తాత్పర్యం: అని బృహద్రథుడు ఆ జరను ఎంతో ప్రీతితో పూజించాడు. ప్రియమార పుత్రుణ్ణి ఎత్తుకొన్నాడు. భార్యలిద్దరిచేతికి ఇచ్చాడు. జరచేత ఒకటిగా కలుపబడినాడు కనుక జరాసంధు డని పేరుపెట్టాడు. నగరాన్ని అష్టశోభనంగా అలంకరించాడు. ఆ రాక్షసికి ప్రతిసంవత్సరం పండుగ జరిపిస్తూ పుత్రుణ్ణి ఎంతో ప్రేమతో పెంచుతుండగా.

విశేషం: 'జరయా సంధితో యస్మాత్ జరాసంధ స్తతో ఽభవత్-' (భండార్కరు ప్రతి 2-17-6) అని మూలం. పురం బష్టశోభనంబు, చేయించుట - కొన్ని ప్రతులలో లేదు. మూలంలోకూడా లేదు. "మృగరాజో బుధో నాగః కలశో వ్యజనం తథా, వైజయంతీ తథా భేరీ దీప ఇత్యష్ట మంగలమ్". మరికొందరి ప్రకారం "లో కేఽస్మిన్మంగలాన్యష్ట బ్రాహ్మణో గౌర్హుతాశనః హిరణ్యం సర్పి రాదిత్య ఆపో రాజా తథాష్టమః".

క. ఈహిత విధానముల లో । కాహిత దుస్సహనతేజుఁ డయి వాఁడు మహో
త్సాహముతో వర్ధిల్లె ఘృ । తాహుతులఁ బ్రవృద్ధి నొందు నగ్నియపోలెన్. 155

ప్రతిపదార్థం: వాఁడు= ఆ జరాసంధుడు; ఈహిత, విధానములన్= కోరుకున్న పద్ధతుల్లో; లోక+అహిత, దుస్సహన, తేజుఁడు+అయి= ప్రపంచానికి హితంకానిది, సహించటానికి శక్యంకానిది అయిన పరాక్రమాన్ని కలవాడై; మహా+ఉత్సాహంతో= మిక్కిలి సంతోషంతో; ఘృత+ఆహుతులన్= నేతి ఆహుతులచేత; ప్రవృద్ధిన్+ఒందు= అంతకంతకు అధికమయ్యే; అగ్ని+అ. పోలెన్= నిప్పువలె; వర్ధిల్లెన్= పెరిగాడు.

తాత్పర్యం: ఆ జరాసంధుడు తన కిష్టమైనపద్ధతుల్లో లోకానికి హితంకాని, సహించ శక్యంకాని పరాక్రమం కలవాడయ్యాడు. నేతిఆహుతులతో అంతకంతకు అధికమయ్యే అగ్నిహోత్రునిలా అధికోత్సాహంతో అభివృద్ధి చెందాడు.

విశేషం: అలం: ఉపమ.

జరాసంధునియొద్దకుఁ జండకౌశికుండు వచ్చుట (సం. 2-17-8)

వ. ఇట్లు జరాసంధుండు పెరుగుచున్నఁ గొండొక కాలంబునకు నొక్కనాఁడు చండకౌశికుం డందులకు వచ్చిన నతిముదంబుతోఁ బుత్త్ర కళత్ర మిత్రభృత్యామాత్య సహితుండయి బృహద్రథుం డెదురువోయి యమ్మునీంద్రునకు నమస్కరించి తోడ్కొనివచ్చి యుచితాసనంబున నునిచి యడుగులు గడిగి

యర్ఘ్యపాద్యాది విధులం బూజించి తనరాజ్యంబుతోడ సర్వస్వంబును నివేదించి కొడుకుం జూపినం జూచి సంతసిల్లి మునివరుం డిట్లనియె. **156**

ప్రతిపదార్థం: ఇట్లు; జరాసంధుండు; పెరుగుచున్+ఉన్నన్; కొండొక, కాలంబునకున్= కొంతకాలం తరువాత; ఒకనాఁడు; చండకౌశికుండు; అందులకున్= అక్కడికి; వచ్చినన్= రాగా; అతి, ముదంబుతోన్= మిక్కిలి సంతోషంతో; పుత్త్ర, కళత్ర, మిత్త్ర, భృత్య+అమాత్య, సహితుండు+అయి= పుత్రునితో, భార్యలతో, మిత్రులతో, సేవకులతో, మంత్రులతో కూడుకొన్నవాడై; బృహద్రథుండు; ఎదురు, పోయి; ఆ+మునీంద్రునకున్= ఆ చండకౌశికునికి; నమస్కరించి; తోడ్కొని, వచ్చి= వెంట పిలుచుకొని వచ్చి; ఉచిత+ఆసనంబునన్= తగిన పీఠంమీద; ఉనిచి= కూర్చుండబెట్టి; అడుగులు= పాదాలు; కడిగి; అర్ఘ్య, పాద్య+ఆది, విధులన్= అర్ఘ్యమివ్వటం, పాద్యమివ్వటం మొదలైన పూజా పద్ధతులతో; పూజించి; తన రాజ్యంబుతోడన్; సర్వస్వంబును= సమస్త సంపదలను; నివేదించి= అర్పించి; కొడుకున్= తన కుమారుఁడైన జరాసంధుని; చూపినన్; మునివరుండు= మునిశ్రేష్ఠుడు- చండకౌశికుడు; చూచి; సంతసిల్లి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: జరాసంధుడు ఈ విధంగా వృద్ధి పొందుతుండగా కొంతకాలం తరువాత ఒకరోజు చండకౌశికుడు వచ్చాడు. బృహద్రథుడు మహానందభరితుడై పుత్రునితో, భార్యలతో, మిత్రులతో, సేవకులతో, మంత్రులతో ఎదురేగి నమస్కరించాడు. ఆమహామునిని తోడ్తెచ్చాడు. ఉచితపీఠంపై కూర్చుండబెట్టాడు. కాళ్ళు కడిగి, అర్ఘ్యపాద్యాదు లిచ్చి పూజించాడు. తన రాజ్యంతో కూడ సర్వస్వాన్ని అర్పించి, ఆయన అనుగ్రహంచేత జన్మించిన తన కుమారుడిని చూపించాడు. ఆ మహామునికూడా జరాసంధుణ్ణి చూచి ఎంతో సంతోషించి ఇలా అన్నాడు.

క. **జరయను రాక్షసి నీకుం । గర ముపకారంబు సేసె ఘనముగ దీనిన్**
ధరణీశ! యే నెఱింగితి । నిరుపమ నిరతిశయ యోగ నిష్ఠిత బుద్ధిన్. **157**

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= ఓ బృహద్రథ మహారాజా!; జర; అను; రాక్షసి; నీకున్; కరము+ఉపకారము= మిక్కిలిమేలు; చేసెన్= చేసింది; ఘనముగన్= గొప్పగా; దీనిన్= ఈసంగతిని; నిరుపమ, నిరతిశయ. యోగ, నిష్ఠిత, బుద్ధిన్= సాటిలేని మేటి యోగంలో నిలుపబడిన బుద్ధిచేత; ఏన్= నేను; ఎఱింగితిన్= తెలుసుకొంటిని.

తాత్పర్యం: ఓ బృహద్రథ మహారాజా! జర అనే రాక్షసి నీకు మిక్కిలి మేలు చేసింది. ఈ సంగతి యోగదృష్టితో తెలుసుకొన్నాను.

వ. **'ఇక్కుమారుండు కుమారునంతియ శక్తి సంపన్నుండయి త్రిపురాంతకు నంతకహరుం బరమేశ్వరుం దనకు సన్నిహితుంజేయు; నెంత బలవంతు లయ్యును వైరివీరులు వీనిం దాఁకి యగ్నిఁ దాఁకిన శలభంబులుంబోలె నడంగుదురు; గరుడనిగతి నన్యవిహంగంబు లనుగమింప నోపనియట్లు మానవులు వీనివీర్యంబు ననుగమింపనోపరు; తేజస్వులలోన నాదిత్యుండు వెలుంగునట్లు వీఁడు మూర్ధాభిషిక్తులలోన మిగిలి వెలుంగు; నదీరయంబులు మహాపర్వతంబుల ఛేదింప నోపనియట్లు దివ్యాస్త్రంబులు వీని దేహంబు భేదింప నోపవు; సముద్రంబు మహానదులం జేకొనునట్లు వీఁడు పరమహీపతుల సంపదలు చేకొను'నని జరాసంధు సామర్థ్యంబు చెప్పి చండకౌశికుం డరిగిన.** **158**

ప్రతిపదార్థం: ఈ+కుమారుండు; కుమారు+అంతియ= కుమారస్వామి అంతటి; శక్తి, సంపన్నుండు+అయి= శక్తి సంపద కలవాడై; త్రిపుర+అంతకున్= మూడు నగరాలను నాశనం చేసినవాణ్ణి; అంతక, హరున్= మృత్యువును జయించినవాణ్ణి; పరమ+ఈశ్వరున్= సర్వానికి ప్రభువైన శివుణ్ణి; తనకున్; సన్నిహితున్, చేయున్= ప్రత్యక్షం కావించుకొంటాడు; ఎంత, బలవంతులు+అయ్యును= ఎంత బలం కలవాళ్ళయినా; వైరి, వీరులు= శత్రువీరులు, వీనిన్= ఈ జరాసంధుణ్ణి; తాఁకి= ఎదుర్కొని; అగ్నిన్= నిప్పును; తాఁకిన; శలభంబులున్+పోలెన్= మిడుతలవలె; అడంగుదురు= నశిస్తారు; గరుడని= గరుత్మంతునియొక్క; గతిన్= గమనాన్ని; అన్యవిహంగంబులు= ఇతర పక్షులు; అనుగమింపన్+ఓపని అట్లు= వెంబడించి వెళ్ళలేని విధంగా; మానవులు; వీని= ఈ జరాసంధునియొక్క; వీర్యంబున్= పరాక్రమాన్ని; అనుగమింపన్+ఓపరు= పోలజాలరు; తేజస్వులలోనన్= కాంతిమంతుల్లో; ఆదిత్యుండు= సూర్యుడు; వెలుంగునట్లు; వీఁడు= ఈ జరాసంధుడు; మూర్ధ+ అభిషిక్తులలోనన్= పట్టాభిషిక్తులైన రాజులలో; మిగిలి= అధికుడై; వెలుంగున్; నదీ, రయంబులు= ఏటి ప్రవాహవేగాలు; మహా, పర్వతంబులన్= పెద్దకొండలను; ఛేదింపన్+ఓపని, అట్లు= పడగొట్టలేనట్లు; దివ్య+అస్త్రంబులు= దేవతాసంబంధాలైన అస్త్రాలు; వీని, దేహంబున్= ఈ జరాసంధునియొక్క శరీరాన్ని; భేదింపన్+ఓపవు= చీల్చలేవు; సముద్రంబు; మహానదులన్= పెద్ద నదులను; చేకొను+అట్లు= తనలో చేర్చుకొనే విధంగా; వీఁడు= ఈ జరాసంధుడు; పరమహీపతుల, సంపదలు= ఇతర రాజుల సంపదలు; చేకొనున్= గ్రహిస్తాడు; అని; జరాసంధు; సామర్థ్యంబు; చెప్పి; చండకౌశికుండు; అరిగినన్= వెళ్ళగా.

తాత్పర్యం: 'ఈ కుమారుడు కుమారస్వామి అంతటి శక్తి సంపన్ను డౌతాడు. త్రిపురాంతకుడు మృత్యుంజయుడు అయిన పరమేశ్వరుణ్ణి ప్రత్యక్షం చేసుకొంటాడు. ఎంత బలవంతులైనా శత్రువీరులు ఈతణ్ణి ఎదుర్కొంటే నిప్పుమీద పడ్డ మిడుతల్లా మాడిపోతారు. గరుత్మంతుని పరుగును తక్కిన పక్షులు అనుసరించలేనట్లే ఈతని పరాక్రమానికి ఇతరులెవ్వరూ సరితూగలేరు. కాంతిమంతులలో సూర్యుడిలా, మహారాజుల్లో ఇతడు మిక్కిలి ప్రకాశిస్తాడు. నదీ ప్రవాహవేగాలు మహాపర్వతాల నెలా పెకలించి వేయలేవో, దివ్యాస్త్రాలు అలా ఇతని దేహాన్ని చీల్చలేవు. సముద్రం మహానదులను ఎలా తనలో చేర్చుకొంటుందో పరరాజులసంపదల్ని ఇతడు అలా చేజిక్కించుకుంటాడు' - అని చండకౌశికుడు జరాసంధుని సామర్థ్యాన్నిగురించి చెప్పి వెళ్ళాడు.

విశేషం: అలం: ఉపమ. త్రిపురాసురులు తారకాసురుని కుమారులు - విద్యున్మాలుడు, తారకాక్షుడు, కమలాక్షుడు. వాళ్ళ పురాలు మూడింటిని అంతం చేయటంచేత శివునికి త్రిపురాంతకు డనే పేరు వచ్చింది. మృత్యువును జయించిన వాడు కనుక ఆయనకు మృత్యుంజయు డనే పేరుకూడ ఉంది.

క. తనయుని నభినవయౌవను । ననుపము నభిషిక్తుఁ జేసి యవనీభర మా
తనిఁ బూన్చి సభార్యుండయి । యనఘ! తపోవనమునకు బృహద్రథుఁ డరిగెన్. 159

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; బృహద్రథుడు; అభినవయౌవనున్= క్రొత్తగా పొందిన యౌవనం కలవాణ్ణి; అనుపమున్= సాటిలేనివాణ్ణి; తనయునిన్= కుమారుడైన జరాసంధుణ్ణి; అభిషిక్తున్+చేసి= పట్టాభిషిక్తుణ్ణి కావించి-అంటే మగధ రాజ్యానికి రాజుగా చేసి; అవనీభరము= రాజ్యభారం; ఆతనిన్+పూన్చి= అతనిచేత వహింపజేసి; సభార్యుండు+ అయి= భార్యలతో కూడినవాడై; తపః+వనమునకున్= తపస్సు చేసుకోటానికి అనుకూలమైన అడవికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ధర్మరాజా! నూత్నయౌవనుడు, సాటిలేని మేటివీరుడు అయిన తన కుమారుడు జరాసంధుణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేసి, రాజ్యభారం అతనికి అప్పగించి, భార్యలతో కలిసి బృహద్రథుడు తపోవనానికి వెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: విశేష్యం తరువాత విశేషణాలు వాడే సంస్కృత సంప్రదాయానుసారంగా నన్నయ - 'తనయునిన్, అభినవయౌవనున్, అనుపమున్' అని అనటం జరిగింది.

శ్రీకృష్ణుఁడు భీమార్జునులను దనతోఁ బంపు మని ధర్మజు నడుగుట (సం. 2-17-25)

వ. ఆ జరాసంధుండును నాయుధ నిహతులుగాని హంస డిభకులు దనకు సహాయులుగా నపరాజితంబయిన పరాక్రమంబునం బరచక్రపతుల భంజించుచు. 160

ప్రతిపదార్థం: ఆ, జరాసంధుండును; ఆయుధ, నిహతులు, కాని= ఆయుధాలచేత చావులేని; హంసడిభకులు; తనకున్; సహాయులుకాన్= తోడ్పడేవాళ్ళు కాగా; అపరాజితంబు+అయిన= ఓటమి లేనిదైన; పరాక్రమంబునన్= పరాక్రమంతో; పరచక్రపతులన్= ఇతర రాజ్యాల రాజులను; భంజించుచున్= ఓడిస్తూ.

తాత్పర్యం: ఆ జరాసంధుడుకూడా ఆయుధాలచేత చావులేనివారైన హంసడిభకులను తనకు తోడు చేసుకొని ఓటమిలేని పరాక్రమంతో ఇతరరాజ్యాల రాజులను ఓడిస్తూ.

చ. అయన విహీనుఁడౌ సవితృనట్లు, విఖండిత పక్షతిద్వయుం
డయిన ఖగేంద్రునట్లు, మఱి హంసుఁడు నా డిభకుండు నంతక
క్షయ గతులైన నిప్డు గతగర్వమునన్ మగధేశ్వరుండు ని
శ్చయమతి నున్నవాఁడు నిజసంక్షయకాలవిశంకితాత్ముఁడై. 161

ప్రతిపదార్థం: మగధ+ఈశ్వరుఁడు= మగధరాజైన జరాసంధుడు; మఱి; హంసుఁడున్, ఆ, డిభకుండున్; అంతక, క్షయ, గతులు+ఐనన్= యముని గృహానికి (నరకానికి) వెళ్ళినవారు కాగా - అంటే మరణించగా; ఇప్డు= ఇప్పుడు; అయన, విహీనుఁడు+ఔ= ఉత్తర దక్షిణాయనాలు లేని; సవితృ+అట్లు= సూర్యుడివలె; విఖండిత, పక్షతి, ద్వయుండు+అయిన= పూర్తిగా నరికివేయబడిన రెక్కల జంటగల; ఖగ+ఇంద్రు, అట్లు= పక్షులరాజైన గరుత్మంతుడివలె; గత, గర్వమునన్= కోల్పోయిన గర్వంతో; నిజ, సంక్షయ, కాల, విశంకిత+ఆత్ముఁడు+ఐ= తనయొక్క వినాశకాలాన్ని గురించిన అనుమానంతో కూడుకొన్న మనస్సు కలవాడై; నిశ్చయ, మతిన్= నిశ్చయమైన బుద్ధితో; ఉన్నవాఁడు= ఉన్నాడు.

తాత్పర్యం: మగధరాజైన జరాసంధు డిప్పుడు హంసడిభకులు మరణించటంచేత అయనాలు లేని సూర్యునిలా, రెక్కలు రెండూ తెగిన గరుడునిలా గర్వాన్ని కోల్పోయి, తన వినాశకాలాన్ని గూర్చిన అనుమానంతో మనస్సు రాయి చేసుకొని ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ. అయనాలు లేని సూర్యునితో, రెక్కలు లేని గరుడునితో జరాసంధుని పోల్చటం వలన అతడు ఎక్కడికీ దండయాత్రకు వెళ్ళక, వెళ్ళలేక తన అంత్యకాలాన్ని గురించిన ఆలోచనలో పడి, ఉన్నచోటనే ఉన్నాడని స్ఫురిస్తున్నది. 'అయనయ హీనుడైన పతి యట్లు' - అని పాఠాంతరం. (అర్థవ్యక్తి అనే శబ్దగుణం సార్థకంగా పోషించబడి ప్రసాదగుణానికి బలాన్ని చేకూర్చింది ఈ పద్యరచనలో. - సంపా.)

ఉ. అమ్మగధేశు నుగ్రబలు నాయుధయుద్ధమునన్ జయింపఁగా
నిమ్మహి నోప రెవ్వరు, నుమేశ్వరుఁ డట్టి వరమ్ము వానికిన్

నెమ్మిన యిచ్చెఁ, గావున వినీతుఁడు వాయుసుతుండు మల్లయు
ద్ధమ్మున నోర్చు నాతని నుదగ్రమహాభుజశక్తి యేర్పడన్. 162

ప్రతిపదార్థం: ఆ+మగధ+ఈశున్= ఆమగధరాజైన జరాసంధుణ్ణి; ఉగ్ర, బలున్= భయంకరమైన బలం కలవాణ్ణి; ఆయుధ, యుద్ధమునన్= ఆయుధాలతో చేసే యుద్ధంలో; జయింపఁగాన్= జయించటానికి; ఈ+మహిన్= ఈ భూమిమీద; ఎవ్వరున్= ఎవరు కూడ; ఓపరు= సమర్థులు కారు; ఉమా+ఈశ్వరుఁడు= పార్వతీదేవి భర్త అయిన శివుడు; వానికిన్= ఆ జరాసంధుడికి; అట్టి; వరమ్ము; నెమ్మిన్+అ= ప్రేమతో; ఇచ్చెన్; కావునన్; వినీతుఁడు= వినయవంతుడు; వాయు, సుతుండు= వాయుదేవుడియొక్క కుమారుడు-భీముడు; ఉదగ్ర, మహా, భుజ, శక్తి= మిక్కిలి భయంకరమైన గొప్ప బాహుబలం; ఏర్పడన్= ప్రకటమయ్యేటట్లు; ఆతనిన్= ఆ జరాసంధుణ్ణి; మల్లయుద్ధమ్మునన్; ఓర్చున్= ఓడిస్తాడు.

తాత్పర్యం: భయంకర బాహుబల సంపన్నుడైన ఆ జరాసంధుణ్ణి ఆయుధయుద్ధంలో జయించటానికి భూమిమీద ఎవరితరం కూడా కాదు. పరమేశ్వరుడు ప్రేమతో అతనికి ఆ వరం ఇచ్చాడు. అందుచేత అతిభయంకరమైన మల్లయుద్ధంలో తన బాహుబలం ప్రకటమయ్యేటట్లు వినయపరుడైన మనవాయుసుతుడు భీముడే అతణ్ణి ఓడిస్తాడు.

విశేషం: జరాసంధవధకు భీముణ్ణి పూర్తిగా సుముఖుణ్ణి చెయ్యాలనుకున్న శ్రీకృష్ణుడు మొదట మిక్కిలి చతురంగా జరాసంధుని బలపరాక్రమాల్ని సుదూరం వర్ణించాడు. తరువాత భీముణ్ణి ఉదగ్ర మహాభుజశక్తి యుక్తుడనీ, మహాబలుడైన వాయుదేవుని పుత్రుడనీ వినయపరు డనీ ఎంతో నేర్పుగా ప్రశంసించి జరాసంధుని జయించగల బలసంపద అతనికి ఉందని, తండ్రిపేరు నిలుపగల తనయుడని, నీవంటి పెద్దలు ఆజ్ఞాపించాలేకాని శిరస్సు వంచి చెప్పినపని సాధించే వినయపరుడని పరోక్షంగా సూచించాడు. ఆపినా ఆగకుండ ఆజరాసంధునిమీదికి ఆతడు కాలెత్తి కయ్యానికి వెళ్ళే మానసికస్థితిని మాత్రమే కల్పించాడు. ఇక శ్రీకృష్ణుడు సాధించవలసింది ధర్మజుని అనుమతి. మల్లయుద్ధం భుజబలంతో చేసేది. అందులో ఆయుధాల ఉపయోగం ఉండదు. అందువల్ల ఆయుధంచేత మరణం ఉండదని జరాసంధుడు పొందిన వరం మల్లయుద్ధంలో అతణ్ణి రక్షించలేదు. జరాసంధవధ జరిగితే మల్లయుద్ధంలోనే జరగాలి. అదీ భీమునిచేతిమీదిగానే జరగాలి. అందుకే శ్రీకృష్ణుడు అంతనేర్పుగా భీమునిమనస్సులో జరాసంధవధకు బీజం నాటాడు. పైపద్యం కొన్ని ప్రతులలో లేదు. కొన్నింటిలో 120వ పద్యంగా ఉంది. ఇందులోని శబ్దగుణం అర్థవ్యక్తి.

క. బలిమిమెయిఁ బార్థురక్షా । బలమును బవనసుతు బాహుబలమును నా ని
ర్మలనీతిబలము నీకుం । గలుగ నసాధ్యంబు గలదె కౌరవనాథా! 163

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ఓధర్మరాజా!; బలిమిమెయిన్= దేహబలంతో; పార్థు, రక్షా, బలమును= రక్షణ కల్పించగల అర్జునునియొక్క శక్తి; పవన, సుతు, బాహు, బలమును= వాయుపుత్రుడైన భీముడియొక్క భుజశక్తి; నా, నిర్మల, నీతి, బలము= నాయొక్క మలినం కాని నీతి బలము; నీకున్+కలుగన్= నీకుండటంవలన; అసాధ్యంబు= సాధ్యం కానిది; కలదె= కలదా! (లేదు).

తాత్పర్యం: ఓ ధర్మరాజా! పార్థుడి రక్షాబలం, భీముడి భుజబలం, నా నీతిబలం నీకుండగా అసాధ్యమేముంది?

విశేషం: పార్థునిది సాంకేతికమైన ధనుర్విద్యాబలం, శస్త్రాస్త్రప్రయోగబలం. భీమునిది దైహికమైన బాహుబలం. శ్రీకృష్ణునిది నైతికమైన బుద్ధిబలం. ఈ మూడూ కూడితే అసాధ్య మేముంది?

చ. తడయక యేఁగి నీతి బలదర్పము లొప్పఁగ వాని డాసి, క
వ్వడియును నేను భీముఁడు నవశ్యముఁ బోర బృహద్రథాత్మజుం
గడిఁది రిపున్ జయింతుము జగన్నుత! న న్నెద నమ్ముదేని యి
ల్లడయిడు భీము నర్జును నలంఘ్యబలాఢ్యుల నావశంబునన్. 164

ప్రతిపదార్థం: జగత్+నుత!= ప్రపంచంచేత కొనియాడబడేవాడా! ఓ ధర్మరాజా!; తడయక= ఆలస్యం చేయక; ఏఁగి= వెళ్ళి; నీతిబలదర్పములు+ఒప్పఁగన్= నీతి, బలం, దర్పం మెరసేటట్లుగా; కవ+వడియును= అర్జునుడూ; నేను; భీముఁడున్; వానిన్= ఆ జరాసంధుడిని; డాసి= సమీపించి (ఎదుర్కొని); పోరన్= యుద్ధంలో; కడిఁది, రిపున్= బలమైన శత్రువును; బృహద్రథ+ ఆత్మజున్= బృహద్రథుడియొక్క కుమారుడైన జరాసంధుని; అవశ్యమున్= తప్పక; జయింతుము; నన్ను+ఎదన్; నమ్ముదు+ఏనిన్= నన్ను నీవు మనస్సులో నమ్మినట్లయితే; అలంఘ్య, బల+ఆఢ్యులన్= జయించ సాధ్యం కాని బలంతో కూడుకొన్న వాళ్ళైన; భీమున్; అర్జునన్; నావశంబునన్= నా అధీనంలో; ఇల్లడ, ఇడు= ఇల్లడపెట్టుము - అంటే నీ తమ్ముళ్ళను నీకు మళ్ళీ చెక్కుచెదరకుండ అప్పగించే పద్ధతిలో నాకు అప్పగించు.

తాత్పర్యం: ధర్మరాజా! ఆలస్యం చేయకుండ నేను, భీముడు, అర్జునుడు ముగ్గురం వెళ్ళి, నీతి, బలం, గర్వం ప్రకాశించేవిధంగా బలమైన శత్రువయిన ఆ జరాసంధుణ్ణి ఎదుర్కొని యుద్ధంలో తప్పక జయిస్తాము. నామీద నీకు నమ్మకముంటే అజేయులైన నీ తమ్ముళ్ళు భీమార్జునుల్ని నాకు ఇల్లడపెట్టు.

విశేషం: కవ్వడి - బాణ ప్రయోగంలో రెండు చేతుల వడి కలవాడు - అర్జునుడు. శ్రీకృష్ణుని మాటనేర్పు అనుపమానం. అటు జరాసంధుణ్ణిగురించి, ఇటు భీమార్జునుల శక్తి సామర్థ్యాలనుగురించి చెప్పవలసినవన్నీ ఎంతో చతురంగా చెప్పాడు. చిట్టచివరకు నామీద నమ్మకముంటే, నీ తమ్ముళ్ళను నాకు అప్పగించు అన్నాడు. ఇక ధర్మరాజు తప్పించుకోగలడా?

వ. అని నిశ్చయించి పలికిన నారాయణుని, విజయశ్రీ విభాసిత ముఖులైన భీమార్జునులం జూచి సంతుష్టాంత రంగుండయి ధర్మతనయుం డిట్లనియె. 165

ప్రతిపదార్థం: అని; నిశ్చయించి; పలికిన; నారాయణునిన్= శ్రీకృష్ణుని; విజయశ్రీ, విభాసిత, ముఖులు+ఐన= విజయశోభతో ప్రకాశించే ముఖాలు కలవాళ్ళయిన; భీమ+అర్జునులన్, చూచి; సంతుష్ట+అంతరంగుండు+అయి= సంతోషించిన మనస్సు కలవాడై; ధర్మతనయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని నిర్ణయించి చెప్పిన శ్రీకృష్ణుని, విజయశోభతో ప్రకాశిస్తున్న భీమార్జునుల ముఖాలను చూచి ధర్మరాజు అంతరంగంలో ఎంతో సంతోషించి ఇలా అన్నాడు.

చ. ప్రియహితసత్యవాక్య! యరిభీషణ! కృష్ణ! భవన్నిదేశ సం
శ్రయమున నున్న మా కధికశత్రుజయం బగు టేమి పెద్ద, ని
శ్చయముగ నింక మోక్షితుల సర్వమహీశులు, నిమ్మహాధ్వర
క్రియయును సిద్ధిఁబొందెన యకిల్బిషకీర్తి వెలుంగుచుండఁగన్. 166

ప్రతిపదార్థం: ప్రియ, హిత, సత్య, వాక్య!= వినటానికి ఇంపైన, మేలు కలిగించే, సత్యమైన మాటలు కలవాడా!; అరి, భీషణ!= శత్రువులకు భయంకరమైనవాడా, కృష్ణ!; భవత్+నిదేశ, సంశ్రయమునన్= నీ ఆజ్ఞ అనే ఆశ్రయంలో; ఉన్న; మాకున్; అధిక, శత్రు జయంబు+అగుట= బలవంతులైన శత్రువులను జయించటం; ఏమి, పెద్ద= ఏమి గొప్ప?; నిశ్చయముగన్= అనుమానం లేకుండ; ఇంకన్=ఇక; సర్వ, మహీ+ఈశులున్= అందరు రాజులు - అంటే జరాసంధుడిచేత బాధించబడుతున్న, బంధించబడిన రాజులంతా, మోక్షితులు+అ= (ఆ బాధలనుండి, బంధాలనుండి) విముక్తి పొందినవాళ్ళే; అకిల్బిష, కీర్తి= నిర్మలమైన కీర్తి; వెలుంగుచున్+ఉండఁగన్; ఈ+మహా+అధ్వర, క్రియయును= ఈ రాజసూయ మహాయజ్ఞ కార్యం కూడ; సిద్ధిన్= సఫలతను; పొందెన్+అ= పొందినట్లే.

తాత్పర్యం: శ్రీకృష్ణా! నీవు ప్రియంగా, హితంగా సత్యం పలికేవాడివి. శత్రుభయంకరుడివి. నీ ఆజ్ఞను ఆశ్రయించి ఉండే మాకు బలవంతులైన శత్రువులను జయించటం ఒక విశేషమా! ఇక జరాసంధుడిచేత బాధితులు, బంధితులు అయిన రాజులందరికి ఆ బాధలనుండి బంధాలనుండి విముక్తి కలిగినట్లే. నీ నిర్మలకీర్తి ప్రకాశించేటట్లు రాజసూయ యజ్ఞంకూడ జరిగినట్లే.

విశేషం: 'పొందెఁ గృతకృత్యత' - అని పాఠాంతరం ఉంది. మాటనేర్పులో ధర్మజుడు శ్రీకృష్ణుడికి తీసిపోయేవాడు కాడు. 'భవన్నిదేశ సంశ్రయమున నున్న మాకు' - అని జరాసంధుడిని జయించి రాజసూయాన్ని సఫలం కావించే భారాన్నంతా శ్రీకృష్ణుని భుజస్కంధాలపై మోపాడు. (గాఢమైన బంధం శిథిలమైనట్లు చిత్రించే ప్రసాదగుణభూయిష్ఠ మైన రచన నన్నయ శైలి. దాని కిది చక్కని ఉదాహరణం. (చూడు: పీఠిక). - సంపా.)

క. **ధరణీధర! సర్వగుణా । కర! కరుణానిరత! సర్వకార్యైకధురం**
ధర! నినుఁ బడసిన మాకును । హరివిక్రమ! పడయరానియవియుం గలవే! **167**

ప్రతిపదార్థం: ధరణీధర!= భూమిని ధరించినవాడా! శ్రీకృష్ణా!; సర్వగుణ+ఆకర!= అన్ని సుగుణాలకు ఉనికిపట్టు అయినవాడా!; కరుణా, నిరత!= దయయందు ఆసక్తి కలవాడా!; సర్వ, కార్య+ఏక, ధురంధుర= అన్ని పనుల (సఫలం చేసే) భారంమొత్తాన్నీ వహించేవాడా!; హరి, విక్రమ!= సింహంవంటి పరాక్రమం కలవాడా!; నినున్+పడసిన= నిన్ను పొందిన; మాకును; పడయరాని, అవియున్= పొందలేనివికూడా; కలవే= ఉన్నాయా! (లేవు).

తాత్పర్యం: ఓకృష్ణా! నీవు భూమిని ధరించినవాడివి. సర్వసుగుణాలకు స్థానమైనవాడివి. దయామయుడివి. సర్వకార్యభారాన్ని నిర్వహించేవాడివి. సింహపరాక్రముడివి. అటువంటి నీవు మావాడివై ఉండగా, మాకు పొందలేనివి ఏవైనా ఉంటాయా!

విశేషం: ఇవన్నీ భగవంతుని గుణాలు. భగవంతుడే మా ప్రక్కన ఉంటే అసాధ్యం ఏమున్నది? అంటున్నాడు ధర్మరాజు.

వ. **అని సంతసిల్లి మఱియు నాత్మగతంబున.** **168**

తాత్పర్యం: అని సంతోషించి, ఇంకా మనస్సులో (ఇలా అనుకొన్నాడు).

క. **నయనములు నాకుఁ బవనత । నయ విజయులు, మనము కమలనాభుఁడు; వీరిం**
బ్రియహితులఁ బాసి నిమిషం । బయినను నెట్లుండ నేర్తు నవిచేష్టుఁడనై. **169**

ప్రతిపదార్థం: పవన తనయ, విజయులు= భీమార్జునులు; నాకున్; నయనములు= కన్నులు; కమలనాభుఁడు= పద్మాన్ని బొడ్డుగా కలవాడు-శ్రీమహావిష్ణువు-శ్రీకృష్ణుడు; మనము= మనస్సు; వీరిన్= ఈముగ్గురిని; ప్రియహితులన్= ఇష్టులై నా మేలుకోరే వాళ్ళను; పాసి= వదలి, అవిచేష్టుఁడను+ఐ= చేష్టలు ఉడిగినవాడినై; నిమిషంబు+అయినను= ఒక్క నిమిషమైనా; ఎట్లు= ఏవిధంగా; ఉండనేర్తున్= ఉండగలను.

తాత్పర్యం: భీమార్జునులు నాకు కళ్ళు. కృష్ణుడు మనస్సు. ప్రియులు, హితులు అయిన ఈ ముగ్గురిని వదలి ఒక్కనిమిషమైనా నిర్వికారంగా ఎలా ఉండగలను?

విశేషం: కళ్ళు, మనస్సు లేకుండా మనిషి ఉండటం ఎంత కష్టమో ఈముగ్గురూ లేకుండా తాను ఉండటం అంత కష్టమని ధర్మజుని భావన.

వ. 'అయినను నా హృదయంబు గరంబు హృద్యంబగుచున్నయది; కృష్ణార్జునులం దలంచినవారికి శ్రీ విజయంబు లగు ననిన నమ్మహాత్ములఁ దనకు సహాయులఁగాఁ బడసిన భీమసేనునకు శ్రీ విజయంబు లగుట యేమి సందేహం?'బని నిశ్చయించి 'మీకుఁ గార్యసిద్ధి యయ్యెడు మరుగుం' డని పంచిన. 170

ప్రతిపదార్థం: అయినను; నా, హృదయంబు; కరంబు= మిక్కిలి; హృద్యంబు+అగుచున్+ఉన్న, అది= సంతోషాన్ని పొందుతున్నది; కృష్ణ+అర్జునులన్= కృష్ణుణ్ణి, అర్జునుణ్ణి; తలంచినవారికిన్= కేవలం తలచుకొన్నవారికే; శ్రీవిజయంబులు= కలిమి, గెలుపు; అగున్, అనినన్= కలుగుతుందనగా; ఆ+మహాత్ములన్= ఆ మహాత్ములిద్దరిని; తనకున్; సహాయులన్, కాన్= సహాయపడేవాళ్ళుగా; పడసిన= పొందిన; భీమసేనునకున్; శ్రీ, విజయంబులు= ఐశ్వర్యం, విజయం; అగుట= కలగటం; ఏమి, సందేహంబు= ఏమి అనుమానం? అని; నిశ్చయించి; మీకున్; కార్యసిద్ధి= కార్య సఫలత; అయ్యెడుము= అగునుగాక!; అరుగుండు+అని= వెళ్ళండని; పంచినన్= పంపగా.

తాత్పర్యం: అయినా నా మనస్సు చాలా సంతోషంగా ఉంది. కృష్ణార్జునులను కేవలం స్మరించే వాళ్ళకే కలిమి, గెలుపు కలుగుతా యంటారు కదా! ఆ మహాత్ము లిద్దరినీ సహాయులుగా పొందిన భీమసేనునికి ఐశ్వర్యం, విజయం కలుగుతా యనటంలో అనుమాన మేముంది? 'మీకు కార్యసిద్ధి ఔతుంది, వెళ్ళిరం' డని ధర్మరాజు వారిని సాగనంపించాడు.

క. ఘోరరిపుఁ జంప నరిగెడు । వీరుల వార్ష్ణేయపాండవేయుల సింహా
కారులఁ జూచి మనంబున । ధీరుఁడు ముదమందె నయ్యుధిష్ఠిరుఁ డంతన్. 171

ప్రతిపదార్థం: ఘోర, రిపున్= భయంకరుడైన శత్రువును; చంపన్= చంపటానికి; అరిగెడు= వెళ్ళే; వీరులన్; వార్ష్ణేయ, పాండవేయులన్= వృష్ణి కులంలో పుట్టిన శ్రీకృష్ణుణ్ణి, పాండురాజు కుమారులైన భీమార్జునులను; సింహ+ఆకారులన్= సింహం వంటి ఆకారం కలవాళ్ళను; చూచి; మనంబునన్= మనస్సులో; ధీరుఁడు= ధైర్యవంతుడు అయిన; ఆ, యుధిష్ఠిరుఁడు= ఆ ధర్మరాజు; అంతన్= అప్పుడు; ముదము+అందెన్= సంతోషాన్ని పొందాడు.

తాత్పర్యం: భయంకర శత్రువైన ఆ జరాసంధుణ్ణి చంపటానికి బయలుదేరిన సింహాలవంటి శ్రీకృష్ణ భీమార్జునులను చూచి ధర్మరాజు సంతోషించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీకృష్ణభీమార్జునులు జరాసంధునిఁ జంపఁబోవుట (సం. 2-18-26)

వ. కృష్ణభీమపార్థులు కృతక స్నాతకులయి చని, యేక పర్వత ప్రభవంబులైన కాల కూట శోణ గండకీ సదానీరలను నేఱుల లంఘించి, సరయూనదియునుం బూర్వకోసల మిథిలా దేశంబులును గంగయుం గడచి, పూర్వాభిముఖులయి నిత్య ప్రయాణంబుల నమ్మగధదేశంబు సొచ్చి గోరథం బనుపర్వతం బెక్కి. 172

ప్రతిపదార్థం: కృష్ణ, భీమ, పార్థులు; కృతక, స్నాతకులు+అయి= కపటమైన స్నాతకవ్రతాన్ని పూనినవాళ్ళయి; చని= వెళ్ళి; ఏక, పర్వత, ప్రభవంబులు+ఐన= ఒకే పర్వతంనుండి పుట్టినవైన; కాలకూట, శోణ, గండకీ, సదానీరలు; అను; ఏఱులన్= నదులను; లంఘించి= దాటి; సరయూ, నదియును= సరయూనదిని; పూర్వకోసల, మిథిలా, దేశంబులును; గంగయున్; కడచి= దాటి; పూర్వ+అభిముఖులు+అయి= తూర్పువైపునకు తిరిగినవాళ్ళయి; నిత్య, ప్రయాణంబులన్= ఎడతెగని ప్రయాణాలతో; ఆ+మగధ, దేశంబు; చొచ్చి= ప్రవేశించి; గోరథంబు+అను; పర్వతంబు+ఎక్కి.

తాత్పర్యం: శ్రీకృష్ణ భీమార్జునులు కపటస్నాతకవ్రతాన్ని స్వీకరించారు. ఒకే పర్వతంనుండి పుట్టిన కాలకూట, శోణ, గండకీ, సదానీర లనే నదులను దాటారు. సరయూనదిని, పూర్వకోసల మిథిలాదేశాలను, గంగానదిని అతిక్రమించారు. తూర్పువైపు తిరిగి, నిరంతర ప్రయాణాలు చేసి ఆ మగధదేశాన్ని ప్రవేశించారు. గోరథం అనే పర్వతం ఎక్కారు.

విశేషం: స్నాతకుడు-స్నానశీలవ్రతం కలవాడు; విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత మతకార్యార్థం భిక్షుకత్వం వహించి తీర్థస్నానాలు చేసే బ్రహ్మచారి. 'కృతస్నానులై'- అనే పాఠాంతరం పెక్కుప్రతులలో ఉంది. కాని, మూలంలో 'వర్చస్వినాం బ్రాహ్మణానాం స్నాతకానాం పరిచ్ఛదాన్ ఆచ్ఛాద్య' (భండార్కరు ప్రతి 2-18-22) అని ఉంది. అందుచేత వారిని 'కృతకస్నాతకు' లనటమే సమంజసం.

చ. ఉరుతర హర్మ్యమాలికల నొప్పు గిరివ్రజ మన్పురంబుఁ గాం
చిరి నవసౌరభప్రసవచిత్రవనావళి గల్గుదాని నె
వ్వరికి దురాసదంబు లగు వజ్రమయోన్నతవప్రచారు గో
పురముల దాని నయ్యలకఁ బోలెడు దాని మహార్థసంపదన్. 173

ప్రతిపదార్థం: ఉరుతర, హర్మ్య, మాలికలన్= చాల గొప్పవైన మేడల వరుసలచేత; ఒప్పు= ప్రకాశిస్తున్న; నవ, సౌరభ, ప్రసవ, చిత్ర, వన+ఆవళి, కల్గు, దానిన్= క్రొత్త సువాసనలు గల పువ్వులతో కూడుకొన్న చిత్రాలైన తోటల సమూహం కలదానిని; ఎవ్వరికిన్= ఎంతశక్తి ఉన్నవాళ్ళకు కూడ; దురాసదంబులు+అగు= ప్రవేశం సాధ్యంకాని; వజ్రమయ+ఉన్నత, వప్ర, చారు, గోపురముల దానిన్= వజ్రాలతో నిండి, ఎత్తైన ప్రాకారాలు (చుట్టుగోడలు), అందమైన గోపురాలు కలదానిని; మహా+అర్థ సంపదన్= మిక్కుటమైన ఐశ్వర్యంలో; ఆ+అలకన్= ఆకుబేరుడి రాజధాని అయిన అలకాపట్టణాన్ని; పోలెడుదానిన్= పోలినటువంటి దానిని; గిరివ్రజము+అన్+పురంబున్= గిరివ్రజమనే పేరుగల పట్టణాన్ని; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: గొప్ప గొప్ప మేడల వరుసలతో క్రొత్త వాసనలు వెదజల్లే పూలతోటలతో, ఎవ్వరికీ ప్రవేశించ సాధ్యం కాని ఎత్తైన వజ్రమయ ప్రాకారాలతో, అందమైన గోపురాలతో అపార ధనసంపదతో అలకాపురిని పోలిన గిరివ్రజమనే పురాన్ని ఆ శ్రీకృష్ణభీమార్జునులు చూచారు.

విశేషం: అలం: ఉదాత్తం, ఉపమ, వృత్త్యనుప్రాసం. (శ్లేష మనే శబ్దగుణం ఆ నగరవైభవాన్ని రచనలో రూపుకట్టించింది. - సంపా.)

వ. కని దాని యపూర్వ రామణీయక సమృద్ధి కచ్చెరువడి యచ్యుతుండు భీమార్జునుల కిట్లనియె. 174

ప్రతిపదార్థం: కని= చూచి; దాని= ఆ గిరివ్రజపురం యొక్క; అపూర్వ, రామణీయక, సమృద్ధికిన్= అపూర్వమైన సౌందర్యాతిశయానికి; అచ్చెరువడి= ఆశ్చర్య పడి; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; భీమ+అర్జునులకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ గిరివ్రజపురాన్ని చూచి, దాని అపూర్వ సౌందర్యాతిశయానికి ఆశ్చర్యపడి, శ్రీకృష్ణుడు భీమార్జునులతో ఇలా అన్నాడు.

క. గోరథమును ఋషభము వై । హారము ఋషిగిరియుఁ జైత్యకాద్రియు ననఁగా
భూరిగిరు లేను దీనికి । శూరభటులువోలెఁ గాచి చుట్టును నుండున్. 175

ప్రతిపదార్థం: గోరథమును; ఋషభము, వైహారము; ఋషిగిరియున్; చైత్యక+అద్రియున్; అనఁగా= అనే పేర్లుగల; భూరి, గిరులు= పెద్ద కొండలు; ఏను= అయిదు; దీనికిన్= ఈ గిరివ్రజమనే పురానికి; శూరభటులు, పోలెన్= వీరులైన భటులవలె; కాచి= కాపాడుతూ; చుట్టునున్+ఉండున్.

తాత్పర్యం: గోరథం, ఋషభం, వైహారం, ఋషిగిరి, చైత్యకాద్రి అనే పేర్లున్న అయిదు పెద్దపర్వతాలు గిరివ్రజ మనే ఈ పట్టణానికి చుట్టూ ఉండి వీరభటుల్లా రక్షణ కల్పిస్తున్నాయి.

విశేషం: అలం: ఉపమ.

వ. 'దానన చేసి యిప్పురంబు గిరివ్రజంబు నాఁబరఁగె; నిందుఁ దొల్లి గౌతముం డౌశీనరి యను శూద్రయందుఁ గాక్షీవాదుల సృజియించె; నట్టి గౌతమానుగ్రహంబునను నీ దుర్గ బలంబుననుం జేసి యిమ్మాగధుల నెవ్వరును జయింప నోప' రనుచుఁ దద్ద్వారంబునం బురంబు సొరనొల్లక చైత్యకగిరి శృంగంబున కరిగి యందున్న మూఁడు భేరులం జూపి, 'తొల్లింటి మాగధులు మానుషాదంబను ఋషభంబు వధియించి దాని చర్మంబున వీని నిర్మించి; రివి యిప్పురంబు వింతవారు చొచ్చునప్పు డమ్మునిశక్తిం జేసి మ్రోయు' ననిన. 176

ప్రతిపదార్థం: దానన్+అ, చేసి= అందుచేతనే - అంటే కొండలసమూహం దాని చుట్టూ ఉండటంచేత; ఈ+పురంబు; గిరివ్రజంబు, నాన్+పరఁగెన్= గిరివ్రజము అనేపేరుతో ఒప్పింది; ఇందున్= ఈపురంలో; తొల్లి= పూర్వం; గౌతముండు= గౌతముడు అనే పేరున్న మహర్షి; ఔశీనరి, అను= ఔశీనరి అనే పేరున్న (ఉశీనర దేశంలో పుట్టింది); శూద్రఅందున్= శూద్రజాతి స్త్రీయందు; కాక్షీవ+ఆదుల= కాక్షీవుడు మొదలయిన వాళ్ళను; సృజియించెన్= పుట్టించాడు; అట్టి; గౌతమ+అనుగ్రహంబునను= గౌతమ మహర్షి యొక్క దయచేత; ఈ, దుర్గ, బలంబుననున్+చేసి= ఈ దుర్గంయొక్క బలంచేత; ఈ+మాగధులన్= ఈమగధరాజులను; ఎవ్వరును= ఎవ్వరుగూడ; జయింపన్+ఓపరు= గెలువలేరు; అనుచున్= అని అంటూ; తత్+ద్వారంబునన్= దానియొక్క వాకిటినుండి; పురంబు= గిరివ్రజపురాన్ని; చొరన్= ప్రవేశించటానికి; ఒల్లక= ఇష్టపడక; చైత్యకగిరి, శృంగంబునకు+అరిగి= చైత్యక పర్వతంయొక్క శిఖరంమీదికి వెళ్ళి; అందున్+ఉన్న= ఆశిఖరంమీద ఉండే; మూఁడు భేరులన్= మూడు పెద్ద ఢక్కలను; చూపి; తొల్లింటి, మాగధులు= పూర్వకాలపు మగధరాజులు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మానుషాదంబు+అను= మానుషాదం అనే పేరున్న (మనుషులను తినేది); ఋషభంబు= ఎద్దును; వధియించి= చంపి; దాని; చర్మంబునన్; వీనిన్= ఈభేరులను; నిర్మించిరి; ఇవి; ఈ+పురంబు= ఈ పట్టణాన్ని; వింతవారు= కొత్తవాళ్ళు; చొచ్చునప్పుడు; ఆ+మునిశక్తిన్, చేసి= ఆ గౌతమ మహర్షియొక్క మహిమచేత; మ్రోయున్= మ్రోగుతాయి; అనిన.

తాత్పర్యం: 'ఆ అయిదు కొండలూ చుట్టి ఉండటంచేత దీనికి గిరివ్రజ మనే పేరు వచ్చింది. పూర్వం గౌతమ మహాముని ఔశీనరి అనే శూద్రజాతిస్త్రీయందు కాక్షీవుడు మొదలయిన వాళ్ళను సృజించాడు. ఆ గౌతమ మహాముని దయచేత, ఈ దుర్గబలంచేత మగధరాజులను ఎవ్వరూ జయించలేరు' అని చెపుతూ శ్రీకృష్ణుడు ఆ నగరద్వారంనుండి గిరివ్రజపురాన్ని ప్రవేశించటానికి ఇష్టపడక, చైత్యకమనే కొండమీదికి వెళ్ళాడు. అక్కడ ఉండే మూడు పెద్ద ఢక్కలను భీమార్జునులకు చూపించాడు. ప్రాచీన మగధరాజులు మానుషాదమనే ఎద్దును చంపి దాని చర్మంతో వీటిని నిర్మించా రని, కొత్త వాళ్ళెవరైనా ఈ పురాన్ని ప్రవేశిస్తుంటే, ఆ గౌతమమహర్షిమహిమచేత ఇవి మ్రోగుతా యని చెప్పాడు.

విశేషం: శ్రీకృష్ణుని దూరదృష్టి, జాగరూకత అమోఘాలు. 'మానుషాద' మనే ఎద్దుకు 'మాషాద' మనే పేరుకూడా ఉన్నది.

ఉ. **దారుణ వజ్రచారు భుజదండములన్ బలవద్విచార గం**
భీరులు ధీరు లాక్షణమ భేరులు మూఁటిని వ్రచ్చి చైత్యక
స్ఫార నితంబదేశమును భగ్నము సేసి గిరివ్రజంబు న
ద్వారమునందుఁ జొచ్చి రతిదర్పితు లా యదుకౌరవోత్తముల్. **177**

ప్రతిపదార్థం: బలవత్+విచార, గంభీరులు= బలవంతుల్లా విచారించటం (అంటే బలమైన ఆలోచన) చేత గంభీరంగా ఉండేవారు; ధీరులు= ధైర్యశాలులు; అతిదర్పితులు= మిక్కిలి గర్వంతో ఉన్నవాళ్ళు; ఆ, యదు, కౌరవ+ఉత్తముల్= ఆ యదువంశ, కురువంశ శ్రేష్ఠులు - శ్రీకృష్ణ భీమార్జునులు; దారుణ, వజ్ర, చారు, భుజ, దండములన్= కఠినమై, వజ్రంవలె అందమైన బాహుదండాలతో; ఆ, క్షణము+అ= అప్పటికప్పుడే; భేరులు; మూఁటిని, వ్రచ్చి= పగులగొట్టి; చైత్యక, స్ఫార నితంబ, దేశమును= చైత్యకపర్వతంయొక్క విశాలమైన నడిమిభాగాన్ని; భగ్నము, చేసి= భేదించి; గిరివ్రజంబున్= ఆ గిరివ్రజ పురాన్ని; అద్వారమునందున్= ద్వారం కాని త్రోవలో; చొచ్చిరి= ప్రవేశించారు.

తాత్పర్యం: బలవంతుల్లా ఆలోచించటంవల్ల గంభీరంగా ఉన్నవాళ్లు, ధైర్యవంతులు, ఎంతో గర్వంతో ఉన్నవాళ్ళు అయిన ఆ యదువంశ కురువంశ శ్రేష్ఠులైన శ్రీకృష్ణభీమార్జునులు, వజ్రంలా కఠినాలు సుందరాలు అయిన భుజదండాలతో తత్క్షణమే ఆభేరులు మూడింటిని పగులగొట్టారు. చైత్యకపర్వతంయొక్క నడిమిభాగాన్ని భేదించి, గిరివ్రజపురాన్ని ద్వారం కాని మార్గంలో ప్రవేశించారు.

విశేషం: గాఢబంధం శిథిలమైనట్లు భాసించే ఈ పద్యరచన ప్రసాదగుణ విశిష్టం. ఇటువంటి రచన నన్నయకు అభిమానపాత్రం. భేరులు పగులగొట్టిన ఈ వీరక్రియను వర్ణించే ఈ పద్యం తద్భావవ్యంజకంగా అక్షరరమ్యమై ఉంది. (సంపా.)

క. **ఘోరాకారులు మాలా। కార గృహంబులకు గంధిక గృహంబునకున్**
దా రరిగి ముప్పురు బలా। త్కారంబునఁ గొనిరి పుష్పగంధము లొప్పన్. **178**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఘోర+ఆకారులు= భయంకరమైన ఆకారాలు కలవాళ్ళు - శ్రీకృష్ణ భీమార్జునులు; మాలాకార, గృహంబులకున్= పూలమాలలు కట్టే వాళ్ళ ఇళ్ళకు; గంధిక, గృహంబునకున్= సుగంధ ద్రవ్యాలు అమ్మేవాళ్ళ ఇంటికి; తారు= తాము; అరిగి= వెళ్ళి; ముప్పురు; బలాత్కారంబునన్= బలవంతంగా; పుష్ప, గంధములు= పువ్వులు, గంధం; కొనిరి= తీసికొన్నారు.

తాత్పర్యం: భయంకరాకారులైన శ్రీకృష్ణభీమార్జునులు ముప్పురు పూలమాలలు కట్టేవాళ్ళ ఇళ్ళకు, సుగంధాలు అమ్మేవాళ్ళ ఇంటికి వెళ్ళి బలవంతంగా పూలు, గంధం తీసుకొన్నారు.

విశేషం: అలం: క్రమం.

వ. **అందు మాల్యాలంకృతమౌళులుఁ జందనాగరు రూషితహస్తులు విస్మయమాన మాగధ నిరీక్ష్యమాణులు నయి రాజమార్గంబు గదియం జని, యనవరతంబును బ్రాహ్మణులకు సుప్రవేశంబగుచున్న జరాసంధు మందిరంబు గోవాసంబు హిమవత్సింహంబులు సొచ్చునట్లు యాదవ పాండవ సింహంబులు సొచ్చిన.** **179**

ప్రతిపదార్థం: అందున్; మాల్య+అలంకృత, మౌళులున్= పూలమాలలచేత అలంకరించబడిన సిగలు కలవాళ్ళు; చందన+అగరు+ రూషిత, హస్తులు= గంధం అగరు పూతలచేత కప్పబడిన చేతులు కలవాళ్ళు; విస్మయమాన, మాగధ, నిరీక్ష్యమాణులున్+ అయి= ఆశ్చర్యపడే మగధ పౌరులచే చూడబడేవాళ్ళు అయి; రాజ మార్గంబు; కదియన్+చని= చేరువగా వెళ్ళి; అనవరతంబును= ఎల్లప్పుడు; బ్రాహ్మణులకున్; సుప్రవేశంబు+అగుచున్+ఉన్న= చక్కగా ప్రవేశించటానికి అవకాశ మున్న; జరాసంధు మందిరంబున్= జరాసంధుని యొక్క ఇంటిని; గోవాసంబు= ఆవు నివసించేచోటును; హిమవత్+సింహంబులు= హిమాలయ పర్వతాలలో ఉండే సింహాలు; చొచ్చు+అట్లు= ప్రవేశించేవిధంగా; యాదవ, పాండవ, సింహంబులు= యాదవశ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు, పాండవశ్రేష్ఠులైన భీమార్జునులు; చొచ్చినన్= ప్రవేశించగా.

తాత్పర్యం: యాదవ పాండవ సింహాలైన శ్రీకృష్ణ భీమార్జునులు సిగల్లో పువ్వులు అలంకరించుకొన్నారు. చేతులకు గంధం అగరు పూసుకొన్నారు. మగధపౌరులు ఆశ్చర్యపరవశులై చూస్తుండగా ఆ ముగ్గురూ రాజమార్గానికి చేరువగా వెళ్ళారు. అన్ని వేళలా బ్రాహ్మణులకు చక్కగా ప్రవేశమున్న ఆ జరాసంధుని మందిరంలో గోశాలలో హిమాలయ సింహాలు ప్రవేశించినట్లు ప్రవేశించారు.

విశేషం: అలం. ఉపమ. మున్ముందు జరుగనున్న జరాసంధవధను పద్యంలోని అలంకారం ప్రస్ఫుటంగా ధ్వనింపజేస్తుంది. గోవాసంలోకి సింహాలు ప్రవేశిస్తే ఇక ఆ గోవు బ్రతుకగలదా! గో వంటే ఎద్దు అనే అర్థంకూడ ఉంది.

జరాసంధుఁడు శ్రీకృష్ణ భీమార్జునుల కెదురు వచ్చుట (సం. 2-19-29)

ఆ. **అర్ధరాత్ర మయిన నభ్యాగత ద్విజ । స్నాతకులకు నెదురుచని కరంబు**
భక్తిఁ బూజలిచ్చు పరమవ్రతుం డప్పు । డెదురు వచ్చి వారి కిష్టమెసఁగ. **180**

ప్రతిపదార్థం: అర్ధ రాత్రము+అయినన్= నడిరేయి అయినా; అభ్యాగత, ద్విజ, స్నాతకులకున్= అప్పటి కప్పుడు వచ్చే బ్రాహ్మణ స్నాతకవ్రతులకు; ఎదురు, చని= (ఆహ్వానించటానికి) లేచి ఎదురుగా వెళ్ళి; కరంబు= మిక్కిలి; భక్తిన్= భక్తితో;

పూజలు+ఇచ్చు= పూజలు చేసే; పరమవ్రతుండు= శ్రేష్ఠమైన వ్రతం పూనిన ఆ జరాసంధుడు; అప్పుడు= ఆ సమయంలో; ఎదురు, వచ్చి= శ్రీకృష్ణభీమార్జునులకు ఎదురుగా వెళ్ళి; వారికిన్; ఇష్టము+ఎసఁగన్= ప్రీతి కలిగేలా.

తాత్పర్యం: అర్ధరాత్రి అయినా అభ్యాగత బ్రాహ్మణ స్నాతకవ్రతులను ఆహ్వానించి, అమితభక్తితో అర్చనలు చేసే ఆ జరాసంధుడు స్నాతకవ్రతుల్లా అప్పుడు వచ్చిన ఆ శ్రీకృష్ణ భీమార్జునులకు ఎదురు వెళ్ళాడు. వాళ్ళకు ప్రీతిగా.

విశేషం: వ్రతభేదాన్నిబట్టి వ్రతులు తొమ్మిది విధాలు - ఋషి, స్నాతకుడు, యతి, స్థండిలుడు; ద్వయాతిగుడు, మూలికుడు, లోచకుడు, ఔర్వుడు, ఖపుటుడు. వీరిలో స్నానశీలవ్రతుడు స్నాతకుడు. (స్నాతకులుకూడ తొమ్మిదివిధాలుగా ఉంటారు. వారు: 1. సంతానంకొరకు పెండ్లిచేసికొనదలచి ధనాన్ని యాచించేవాడు, 2. తన ధనాన్ని యాగాదులందు బ్రాహ్మణుల కిచ్చి దరిద్రుడై ధనాన్ని కోరేవాడు, 3. యజ్ఞార్థం ధనాన్ని యాచించేవాడు, 4. గురుదక్షిణకోసం ధనాన్ని కోరేవాడు, 5. బాటసారుల పోషణకై ధనాన్ని యాచించేవాడు, 6. రోగులపోషణకై ధనాన్ని యాచించేవాడు, 7. ఆలుబిడ్డల పోషణకై ధనాన్ని యాచించేవాడు, 8. బీదలకు అన్నదానం నిమిత్తం యాచించేవాడు, 9. వేదపఠనానికై కావలసిన సౌకర్యాలను కోరేవాడు.-సంపా.)

క. ధీయుతుఁ డయి మధుపర్కము । సేయఁగ సమకట్టి దానిఁ జేకొనని మహో
పాయుల గర్వంబు నభి । ప్రాయంబు నెఱింగి మగధపతి యి ట్లనియెన్. 181

ప్రతిపదార్థం: మగధపతి= మగధరాజైన జరాసంధుడు; ధీయుతుఁడు+అయి= బుద్ధిబలం కలవాడయి; మధుపర్కము= పెరుగు, తేనె కలిపిన తీయని పదార్థం; చేయఁగన్= (వారికి) ఇవ్వగా; సమకట్టి= పూనుకొని; దానిన్= ఆ మధుపర్కాన్ని; చేకొనని= తీసికొనని; మహా+ఉపాయుల= మిక్కిలి ఉపాయంగల వాళ్ళయొక్క - అంటే శ్రీకృష్ణభీమార్జునులయొక్క; గర్వంబున్= గర్వాన్ని; అభిప్రాయంబున్= ఉద్దేశాన్ని; ఎఱింగి= తెలిసికొని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: తా నిచ్చే మధుపర్కాన్ని తీసికోవటానికి ఇష్టపడని ఆ శ్రీకృష్ణభీమార్జునుల గర్వాన్ని, ఉద్దేశాన్ని బుద్ధిబలం గల ఆ మగధరాజు జరాసంధుడు గ్రహించాడు. వాళ్ళతో ఇలా అన్నాడు.

విశేషం: జరాసంధుని మందిరంలో ప్రవేశించటానికి తప్పనిసరై ఆ శ్రీకృష్ణ భీమార్జునులు బ్రాహ్మణస్నాతక వేషధారులయ్యారేకాని, నిజానికి వాళ్ళు క్షత్రియులు, శత్రువులు కదా! అందుచేత జరాసంధు డిచ్చే మధుపర్కాన్ని స్వీకరిస్తారా?

తే. స్నాతకులరేని పూవులుఁ జందనంబుఁ । జనునె బలిమిమైఁగొని తాల్పఁ? జైత్యకాద్రి
తటము మీ రిట్లు వ్రచ్చి దోర్దర్ప మెసఁగఁ । జులుక నద్వారమునఁ బ్రోలు సొరఁగనగునె? 182

ప్రతిపదార్థం: స్నాతకులరు+ఏని= (మీరు) స్నాతకవ్రతం పూనినే వాళ్ళే అయితే; పూవులున్; చందనంబున్= గంధాన్ని; బలిమిమైన్= బలవంతంగా; కొని= గ్రహించి; తాల్పన్= ధరించటానికి; చనునె= తగునా?; చైత్యక+అద్రి, తటమున్= చైత్యక పర్వత ప్రదేశాన్ని; మీరు; ఇట్లు= ఈవిధంగా; వ్రచ్చి= భేదించి; దోః+దర్పము= భుజగర్వం; ఎసఁగన్= మెరసేటట్లు; చులుకన్= సులువుగా; అద్వారమునన్= ద్వారం కాని మార్గంలో; ప్రోలున్= గిరివ్రజపురాన్ని; చొరఁగన్= ప్రవేశించటం; అగునె= తగునా!

తాత్పర్యం: మీరు నిజంగా స్నాతకవ్రతులే అయితే మాలాకార గంధిక గృహాలనుండి పూలను, గంధాన్ని బలవంతంగా గ్రహించి ధరించటం తగునా? అంతే కాదు, మీరు ఈ విధంగా చైత్యకప్రదేశాన్ని భేదించి భుజగర్వంతో ద్వారం కాని మార్గంనుండి గిరివ్రజపురాన్ని ప్రవేశించటం తగునా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. **'మఱియు నా కావించిన మధుపర్కంబు ప్రతిగ్రహింపనొల్లమి యిది యేమి? మీరలు వేషధారుల కావలయు; మీ వేషంబున బ్రాహ్మణత్వంబును మహాసత్త్వ దీర్ఘబాహు పృథులవక్షోలక్షణంబుల క్షత్త్రియత్వంబును బ్రకాశించుచున్న యవి' యనిన వానికి నారాయణుం డి ట్లనియె.** **183**

ప్రతిపదార్థం: మఱియున్; నా కావించిన= నేను ఇచ్చిన; మధుపర్కంబు; ప్రతిగ్రహింపన్= అందుకోటానికి; ఒల్లమి= ఇష్టపడకపోవటం; ఇది; ఏమి; మీరలు= మీరు; వేషధారులు+అ= స్నాతకులవలె వేషం వేసుకొన్నవాళ్ళే; కావలయున్= అయి ఉంటారు; మీ, వేషంబునన్; బ్రాహ్మణత్వంబును; మహా, సత్త్వ, దీర్ఘ, బాహు, పృథుల, వక్షః, లక్షణంబులన్= మిక్కిలి బలంగలవై, పొడవైన బాహువులయొక్క విశాలమైన వక్షస్థలంయొక్క లక్షణాలచేత; క్షత్రియత్వంబును; ప్రకాశించుచున్+ఉన్నయవి; అనిన; వానికిన్; నారాయణుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అంతే కాదు, నే నిచ్చిన మధుపర్కాన్ని మీ రెందుకు స్వీకరించటం లేదు? మీరు కేవల స్నాతకవేషధారుల్లా ఉన్నారు. మీ వేషంలో బ్రాహ్మణత్వం అగుపిస్తూఉంది. బలమైన మీ బాహువుల్లో, విశాలమైన వక్షస్థ్సలాల్లో క్షత్రియత్వం ప్రకాశిస్తూ ఉంది' - అని పలికిన జరాసంధునితో శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

విశేషం: నా కావించిన - ఇచట కర్తృపద ప్రథమకు షష్ఠి వచ్చింది. ఈ ప్రయోగాలు నన్నయ భారతంలో మెండు.

క. **స్నాతకులు పుణ్యకర్మస । నాతను లగుచున్న బ్రాహ్మణ క్షత్త్రియ వి**
డ్జాతులయందును క్షత్త్రియ । జాతి స్నాతకుల మేము జనవినుత! మతిన్. **184**

ప్రతిపదార్థం: జనవినుత!= జనులచేత కొనియాడబడే ఓ జరాసంధా!; స్నాతకులు; పుణ్యకర్మ, సనాతనులు= పుణ్యకర్మలచేత ప్రాచీనులు; అగుచున్+ఉన్న; బ్రాహ్మణ, క్షత్త్రియ, విట్+జాతుల, అందును= బ్రాహ్మణక్షత్త్రియ వైశ్యజాతులలో; మతిన్= బుద్ధిచేత; ఏము= మేము; క్షత్త్రియజాతి స్నాతకులము.

తాత్పర్యం: పుణ్యకర్మలు చేయటంచేత పురాతనులు అయిన బ్రాహ్మణక్షత్రియ వైశ్యజాతి స్నాతకుల్లో మేము క్షత్రియజాతిస్నాతకులము.

విశేషం: 'జనవినుతమతిన్' - జనులచేత కొనియాడబడే అభిప్రాయంచేత - అని ఇచ్చట అర్థం చెప్పి అన్వయించవచ్చు. కాని పెక్కుప్రతుల్లో 'జనవినుతనిధీ, జనవినుతమతీ, సౌజన్యనిధీ' అనే పాఠాంతరాలు ఉండటంచేత జనవినుత' అనేదాన్ని జరాసంధునికి సంబోధనగా భావించటమే ఉచిత మనిపిస్తుంది.

వ. **ద్వారంబున మిత్త్రనివాసంబును నద్వారంబున నమిత్త్రనివాసంబును జొచ్చుట యిది బాహువీర్య సంపన్నులయిన క్షత్త్రియులకుం గర్తవ్యంబు; మఱి గంధమాల్యంబులయందు లక్ష్మి యుండుం గావున బలాత్కారంబున గంధ మాల్యంబులు గొంటిమి; నీయందుల మాకు నొండు కార్యంబు గలుగుటం జేసి నీయిచ్చు నర్ఘ్యంబు గొన నొల్ల' మనిన జరాసంధుం డి ట్లనియె.** **185**

ప్రతిపదార్థం: ద్వారంబునన్; మిత్త్ర నివాసంబును= మిత్రునియొక్క ఇంటిని; అద్వారంబునన్= ద్వారం కాని మార్గంలో - అంటే ప్రవేశించకూడని మార్గంలో; అమిత్త్ర, నివాసంబును= శత్రువుయొక్క ఇంటిని; చొచ్చుట= ప్రవేశించటం; ఇది; బాహు,

వీర్య, సంపన్నులు+అయిన= భుజబలసంపద కలవాళ్ళయిన; క్షత్రియులకున్; కర్తవ్యంబు= చేయదగినపని; మఱి; గంధ, మాల్యంబుల, అందున్= గంధంలో, పువ్వుల్లో; లక్ష్మి; ఉండున్; కావున; బలాత్కారంబునన్= బలవంతంగా; గంధ, మాల్యంబులు= గంధం, పూలమాలలు; కొంటిమి= తీసుకున్నాము; నీ, అందుల= నీపట్ల; మాకున్; ఒండు, కార్యంబు= మరొక విధమైనపని; కలుగుటన్, చేసి= ఉండటంచేత; నీ, ఇచ్చు+అర్ఘ్యంబు= నీవు ఇచ్చే అర్ఘ్యాన్ని; కొనన్= తీసికోటానికి; ఒల్లము= ఇష్టపడం; అనినన్; జరాసంధుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ద్వారంనుండి మిత్రునిగృహాన్ని, ద్వారం తప్పించి శత్రుగృహాన్ని ప్రవేశించటం భుజబలసంపన్నులైన క్షత్రియులకు ఉచితమైన పనే. గంధంలో పువ్వుల్లో లక్ష్మి ఉండటంచేత మేము వాటిని బలాత్కారంగా గ్రహించాం. నీతో మాకు వేరే పని ఉంది. అందువల్ల నీ విచ్చే అర్ఘ్యాన్ని అంగీకరించం' అని శ్రీకృష్ణు డనగానే జరాసంధుడు ఇలా అన్నాడు.

విశేషం: గంధం, పువ్వులు లక్ష్మీస్థానాలు కనుక - దానం తీసుకోవటం క్షత్రియులకు ఉచితం కాదు కనుక, శ్రీకృష్ణ భీమార్జునులు బలవంతంగా వాటిని గ్రహించారు. అర్ఘ్యం స్వీకరిస్తే ఆర్షసంప్రదాయానుసారం అది ఇచ్చినవారిని ఆశీర్వదించాలి; వాళ్ళ హితాన్ని కోరాలి. శ్రీకృష్ణభీమార్జునులు జరాసంధుడిని చంపటానికి వచ్చారు. అందుచేతనే ఆత డిచ్చే అర్ఘ్యాన్ని గ్రహించలేదు. నన్నయకాలంలో 'అందుల' సప్తమీవిభక్తిప్రత్యయంగా ఉన్నట్లుంది.

ఆ. మీరు నాకు నేను మీకు నెన్నండు ము । న్నహిత మాచరించినదియు లేదు;
మీకు నేల నే నమిత్త్రుండ నైతి? ని । రాగసుండ సద్గుణాన్వితుండ. 186

ప్రతిపదార్థం: మీరు; నాకు; నేను; మీకున్; ఎన్నండున్= ఎప్పుడుకూడ; మున్ను= ఇదివరకు; అహితము= అపకారం; ఆచరించినదియు, లేదు= చేయలేదు; నిరాగసుండన్= తప్పు(పాపం) లేనివాణ్ణి; సద్గుణ+అన్వితుండన్= మంచి గుణాలతో కూడుకొన్న వాణ్ణి; మీకున్; ఏల= ఎందుచేత; అమిత్త్రుండను= శత్రువును; ఐతిన్= అయ్యాను.

తాత్పర్యం: ఇదివరకెప్పుడూ మీరు నాకుగాని, నేను మీకుగాని అపకారం చేయలేదు. పైగా నేను ఏ తప్పూ చెయ్యనివాణ్ణి. మంచిగుణాలు కలవాణ్ణి. ఎందుచేత మీకు నేను శత్రువు నయ్యాను?

విశేషం: మాటలలోని వికటత్వం ఉదారతాగుణ లక్షణం (చూడు వివరాలకు పీఠిక). (సంపా.)

క. 'సురమునివరులకు వసుధా । మరులకు భక్తుండ నుత్తమక్షత్త్రకులా
చరితుండ' ననిన ధరణీ । ధరుఁ డమ్మగధేశ్వరునకుఁ దా ని ట్లనియెన్. 187

ప్రతిపదార్థం: సుర, ముని, వరులకున్= దేవతలకు, మునిశ్రేష్ఠులకు; వసుధా+అమరులకున్= భూసురులకు - అంటే బ్రాహ్మణులకు; భక్తుండన్= భక్తుణ్ణి; ఉత్తమ, క్షత్త్ర, కుల+ఆచరితుండన్= ఉత్తమమైన క్షత్రియ కుల ధర్మాలను ఆచరించేవాణ్ణి; అనినన్= అని అనగా; ధరణీధరుఁడు= శ్రీకృష్ణుడు; ఆ+మగధ+ఈశ్వరునకున్= ఆ మగధ రాజైన జరాసంధునికి; తాన్= తాను; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: 'దేవతలకు, మునిశ్రేష్ఠులకు, బ్రాహ్మణులకు నేను భక్తుణ్ణి. ఉత్తమ క్షత్రియ ధర్మాల్ని ఆచరించేవాణ్ణి' - అని జరాసంధు డనగానే శ్రీకృష్ణుడు అతనితో ఇలా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కులరక్షార్థ మఖిల నృప । కులోద్వహునియోగమున నకుంఠితశత్రు
ప్రళయవిధాయుల మయి యిం । దులకున్ వచ్చితిమి దుష్టదూషణబుద్ధిన్. 188

ప్రతిపదార్థం: కులరక్షా+అర్థము= క్షత్రియ కులాన్ని రక్షించటంకొరకు; అఖిల, నృప, కుల+ఉద్వహు, నియోగమునన్= అన్ని క్షత్రియ వంశాలను ఉద్ధరించేవాడైన ధర్మరాజు ఆజ్ఞచేత; అకుంఠిత, శత్రు, ప్రళయ, విధాయులము+అయి= అపజయ మెరుగని శత్రునాశం కలిగించే వాళ్ళమై; దుష్ట, దూషణ. బుద్ధిన్= దుర్మార్గులను నిందించే ఉద్దేశంతో; ఇందులకున్= ఇక్కడికి; వచ్చితిమి.

తాత్పర్యం: క్షత్రియ వంశాలనన్నింటిని ఉద్ధరించేవా డైన ధర్మరాజు ఆజ్ఞతో క్షత్రియకులాన్ని రక్షించటానికి, అపజయ మెరుగని శత్రువుల్ని అంతం చేయటానికి, దుర్మార్గుల్ని దూషించటానికి ఇక్కడికి వచ్చాము.

సీ. కడఁగి యత్యుత్తమ క్షత్త్రియ చరితంబు । నందు వర్తిల్లుదు నంటి, జనుల
కెవ్వరి కెన్నండు నెగ్గొనరింప నే । నంటి, సత్క్షత్త్రియు లవని నొరులు
నీయట్లు క్రూరులై నృపతులఁ జెఱఁబెట్టి । పశువరించుచుఁ బశుపతి నుమేశు
వరదుఁ బూజించిన వారును గలరె? ము । న్నింతకు నగ్గలం బెద్ది యెగ్గు?

ఆ. కారణంబు లేక దారుణుఁ డయి సాధు । హింస సేయు కుజనుఁ డెల్లవారి
కప్రియుండ కాక యప్రియలక్షణం । బొండు గలదె తలఁప నుత్తములకు? 189

ప్రతిపదార్థం: కడఁగి= ప్రయత్నించి; అతి+ఉత్తమ, క్షత్త్రియ, చరితంబు+అందున్= మిక్కిలి శ్రేష్ఠమైన క్షత్రియ జీవనంలో; వర్తిల్లుదును+అంటి(వి)= నడుచుకొంటానని అన్నావు; జనులకున్+ఎవ్వరికిన్= ఏమానవులకు కూడ; ఎన్నండున్= ఎప్పుడుకూడ; ఎగ్గు= కీడు; ఏను= నేను; ఒనరింపన్= చేయను; అంటి(వి)= అన్నావు; అవనిన్= భూమిలో; సత్+క్షత్త్రియులు= ఉత్తములైన రాజులు; ఒరులు= ఇతరులు; నీ, అట్లు= నీవలె; క్రూరులు+ఐ= దుర్మార్గులై; నృపతులన్= రాజులను; చెఱన్+పెట్టి= చెరసాలలో బంధించి; పశువరించుచున్= బలియిస్తూ; పశుపతిన్= శివుని; ఉమా+ఈశున్= పార్వతీపతిని; వరదున్= వరాలిచ్చేవాణ్ణి (శంకరుని); పూజించినవారును; మున్ను= ఇదివరకు; కలరె= ఉన్నారా?; ఇంతకున్= ఇంతకంటె; అగ్గలంబు= ఎక్కువైన; ఎగ్గు= కీడు; ఎద్ది= ఏది; కారణంబు, లేక; దారుణుఁడు+అయి= దుర్మార్గుడై; సాధు, హింస, చేయు= మంచివాళ్ళను బాధించే; కుజనుఁడు= దుష్టుడు; ఎల్లవారికిన్= అందరికీ; అప్రియుండు+అ, కాక= శత్రువే కాక; ఉత్తములకున్= సజ్జనులైన వాళ్ళకు; తలఁపన్= ఆలోచిస్తే; అప్రియ, లక్షణంబు= శత్రులక్షణం; ఒండు, కలదె= ఇంకొకటి ఉన్నదా?

తాత్పర్యం: ఓ జరాసంధా! నీవు అత్యుత్తమ క్షత్రియ జీవితం గడుపుతున్నట్లు చెప్పావు. ఎవ్వరికీ ఎప్పుడూ ఏ కీడూ చేయలే దన్నావు. భూమిమీద ఉత్తమ క్షత్రియులు నీవలె క్రూరులై రాజులను చెరబట్టి బలియిస్తూ ఇంతకుముం దెన్నడైనా శివుణ్ణి పూజించారా? ఇంతకు మించిన కీడు ఇంకేమైనా ఉందా? అకారణంగా సాధుజనులను హింసించే దుష్టుడు అందరికీ శత్రువే కదా! ఆలోచిస్తే ఉత్తములకు ఇంతకంటె వైరకారణం ఇంకొకటి ఏముంది!

విశేషం: పశుపతి - ప్రమథగణాలకు, పశువులకు అనగా జీవులకు - వారిని సంసారబంధము నుండి రక్షించువాడు ప్రభువు - శివుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. నిర్దయుండై సవర్ణుండు నిర్దోషు లైన సవర్ణుల వధియించుననంతకంటె మిక్కిలి పాతకం బొం డెద్ది? నీయట్టి పాపకర్ముల నుపేక్షించిన నఖిల ధర్మ రక్షణ క్షములమైన మమ్ముఁ దత్పాపంబు వొందు నని పాపభయంబున నిన్ను నిగ్రహింప వచ్చితిమి; నాకంటె నధికుండైన క్షత్రియుండు లేఁడని గర్వించి యొరుల నవమానించి పలుక వలదు. 190

ప్రతిపదార్థం: నిర్దయుండు+ఐ= దయలేనివాడై; స, వర్ణుండు= తమకులంవాడు; నిర్దోషులు+ఐన= తప్పు చేయని వాళ్ళయిన; స, వర్ణులన్= తనకులం వారిని; వధియించు+అంతకంటెన్= చంపటంకంటె; మిక్కిలి= ఎక్కువైన; పాతకంబు= పాపం; ఒండు+ఎద్ది= ఇంకొకటి ఏముంది?; నీ, అట్టి= నీవంటి; పాప, కర్ములన్= పాపపు పనులు చేసేవాళ్ళను; ఉపేక్షించినన్= వదలివేస్తే; అఖిల, ధర్మ, రక్షణ క్షములము+ఐన= అన్ని ధర్మాలను రక్షించటానికి సమర్థులమైన; మమ్మున్; తత్+పాపంబు= ఆపాపం; పొందున్; అని; పాపభయంబునన్= పాపంవల్ల కలిగే భయంచేత; నిన్నున్; నిగ్రహింపన్= దండించటానికి; వచ్చితిమి; నాకంటెన్; అధికుండు+ఐన= గొప్పవాడైన; క్షత్రియుండు; లేడు+అని; గర్వించి; ఒరులన్= ఇతరులను; అవమానించి; పలుక; వలదు.

తాత్పర్యం: కఠినాత్ముడై ఒక కులంవాడు, ఏతప్పూ చేయని తనకులంవాళ్ళను చంపటం కంటె ఎక్కువైన పాపం ఇంకేముంది? నీవంటి పాపపు పనులు చేసేవాళ్ళ సంగతి పట్టించుకోకుండ వదలివేస్తే, సర్వధర్మాలను రక్షించటానికి సమర్థులమైన మాకు, ఆ పాపం సంక్రమిస్తుంది. ఆ పాపభయంచేతనే నిన్ను దండించటానికి వచ్చాము. నన్ను మించిన క్షత్రియుడు లేడన్న గర్వంతో ఇతరులను అవమానించి మాట్లాడవద్దు.

**క. అవినీతులయి మహాత్ముల । కవమానము సేసి మును జయద్రథ దంభో
ద్భవ కార్తవీర్యులనువా । రవజితులయి రొరులచే మహాబలులయ్యున్. 191**

ప్రతిపదార్థం: మును= పూర్వం; జయద్రథ, దంభోద్భవ, కార్తవీర్యులు+అనువారు; మహాబలులు+అయ్యున్= మిక్కిలి బలంకలవారు అయినప్పటికిని; అవినీతులు+అయి= నీతిలేని వాళ్ళయి; మహాత్ములకున్; అవమానము; చేసి; ఒరులచేన్= ఇతరులచేత; వారు; అవజితులు+అయిరి= ఓడించబడినవా రయ్యారు.

తాత్పర్యం: పూర్వం జయద్రథుడు, దంభోద్భవుడు, కార్తవీర్యుడు మహాబలవంతులే అయినా అవినీతిపరులై మహాత్ములను అవమానించటంచేత ఇతరులచేతుల్లో ఓడిపోయారు.

విశేషం: జయద్రథుడు - సింధుదేశాధిపతి అయిన వృద్ధక్షత్రుని కుమారుడు. ఇతనికి సైంధవుడనే పేరుకూడ ఉంది. ఇతడు ధృతరాష్ట్రుడి కూతురు దుస్సలకు భర్త. అయితే ఈ సైంధవుడు పార్థునిచేత కురుక్షేత్రంలో చచ్చాడు. అందుచేత ఇక్కడ అతడని చెప్పటం కుదరదు. యశోదా వృహన్మనసుల కొడుకైన జయద్రథు డున్నాడు. అతడే ఇతడు. దంభోద్భవుడు - గంధమాదనంమీద తపస్సు చేసుకొంటున్న నరనారాయణుల దగ్గరకు క్రొవ్వెక్కి వెళ్ళి, యుద్ధానికి రమ్మని పిలిచి వాళ్ళచేతిలో ఓడిపోయిన రాజు. కార్తవీర్యుడు - కృతవీర్యుడి పుత్రుడు. హైహయవంశపు రాజు. దత్తాత్రేయుని వరంతో వెయ్యిచేతులు పొందినవాడు. జమదగ్ని మహామునిని అవమానించి పరశురామునిచేత నాశనమైనవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తరలము.

> **అతుల విక్రమ సంపదన్ రణయజ్ఞ దీక్షితులై రిపు**
> **ప్రతతి నోర్చిన వీరు, లుగ్రతపంబు సేసినవారు స**
> **ద్గతికిఁ బోదురు గాక; యి ట్లపకారదారుణవృత్తి ను**
> **ద్ధతిని భైరవపూజ సేసిన దాన సద్గతి గల్గునే?** **192**

ప్రతిపదార్థం: అతుల, విక్రమ, సంపదన్= సాటిలేని పరాక్రమమనే సంపదతో; రణ, యజ్ఞ దీక్షితులు+ఐ= యుద్ధమనే యజ్ఞంలో దీక్షగలవాళ్ళయి; రిపు ప్రతతిన్= శత్రు సమూహాన్ని; ఓర్చిన= ఓడించిన; వీరులు; ఉగ్ర, తపంబు= భయంకరమైన తపస్సు; చేసిన, వారు; సత్+గతికిన్= స్వర్గానికి; పోదురుగాక; ఇట్లు= ఈవిధంగా; అపకార, దారుణ, వృత్తిన్= అపకారంతో కూడుకొన్న క్రూరమైన నడవడితో; ఉద్ధతిని= గర్వంతో; భైరవ, పూజ= శివపూజ; చేసిన; దానన్= దానిచే; సత్+గతి= మోక్షం; కల్గునే= కలుగునా?

తాత్పర్యం: సాటిలేని పరాక్రమమనే సంపదతో, యుద్ధమనే యజ్ఞంలో దీక్షవహించి, శత్రుసమూహాన్ని ఓడించినవీరులు, గొప్పతపస్సు చేసినవాళ్ళు స్వర్గాన్ని పొందుతారు. కాని, నీవలె సాటిరాజులను క్రూరంగా హింసిస్తూ గర్వంతో శివపూజ చేస్తే మోక్షం లభిస్తుందా!

విశేషం: అలం: రూపకం. 'తరలం'లో న-భ-ర-స-జ-జ-గ- అనే గణాలు ఉంటాయి. 12వ అక్షరం యతి స్థానం. ఇందులో మొదటి రెండు లఘువులను ఒక గురువుగా మారిస్తే మత్తకోకిల అవుతుంది. (శ్రీకృష్ణుడు అధిక్షేపాత్మకంగా మాట్లాడిన ఈపద్యంలోని వాక్యవిన్యాసంలో వికటత్వం గోచరిస్తుంది. దానివలన ఉదారత పోషించబడి ఓజోగుణం రాణించింది. అధిక్షేపంలో కూడా అగ్రామ్యత గోచరించటం ఉదాత్తుని స్వభావానికి వ్యంజకం. - సంపా.)

తరలము.

> **చెడక నా వచనంబు సేయుము; చెచ్చెరన్ ధరణీశులన్**
> **విడిచి పుచ్చుమ; యేను గృష్ణుఁడ, వీఁడు భీముఁడు, వాఁడు గ**
> **వ్వడి; భవత్కృత దారుణం బను వహ్ని యార్పఁగ నున్న య**
> **క్కడిఁది వీరులు వీర లిద్దఱు గర్వితుల్ కురుసింహముల్.** **193**

ప్రతిపదార్థం: చెడక= చెడిపోక; నా, వచనంబు, చేయుము= నేను చెప్పినట్లు చేయుము; చెర+చెరన్= వెంటనే, ధరణీ+ఈశులన్= రాజులను (చెరలో ఉన్న వాళ్ళను) విడిచి, పుచ్చుము+అ= విడిచిపెట్టుమా!; ఏను= నేను; కృష్ణుఁడ; వీఁడు; భీముఁడు; వాఁడు; కవ్వడి= అర్జునుడు; భవత్+కృత, దారుణంబు+అను= నీచే చేయబడిన దుర్మార్గమనే; వహ్ని= అగ్నిని; ఆర్పఁగన్= చల్లార్చటానికి; ఉన్న= సిద్ధంగా ఉన్న; ఆ+కడిఁది, వీరులు= ఆగొప్పవీరులు; వీరలు+ఇద్దఱు; గర్వితుల్= గర్వించి ఉన్నవారు-అంటే పెచ్చు పెరిగి ఉన్నవాళ్ళు; కురు సింహముల్= కురువంశశ్రేష్ఠులు.

తాత్పర్యం: నీవు చెడిపోకుండా ఉండాలంటే నేను చెప్పినట్లు చెయ్యి; వెంటనే చెరలో ఉండే రాజు లందరిని విడిచిపెట్టు. నేను కృష్ణుణ్ణి. ఇతడు భీముడు. అతడు అర్జునుడు. నీదుర్మార్గం అనే నిప్పును చల్లార్చటానికి సిద్ధంగా ఉన్న ఆ మహావీరు లిద్దరూ గర్వోన్నతులు, కురువంశ శ్రేష్ఠులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: రూపకం. కవిత్రయంలో తరలవృత్తాన్ని నన్నయయే ఎక్కువగా వాడాడు. (నన్నయ రచించినవి 25; ఎఱ్ఱన రచించినవి-8, తిక్కన రచించినవి-5.). విశేషించి ఈ ఘట్టంలోనే శ్రీకృష్ణుడి మాటలుగా వరుసగా రెండు తరలవృత్తాలను వాడటం గమనార్హం. శ్రీకృష్ణుడు జరాసంధుణ్ణి మందలించి, అతనిని శిక్షించడానికి వచ్చామని బెదిరించిన ఈ వాక్యాలు ఈ విశేషవృత్తంలో ఉండటం ఛందౌచిత్యం. పై వృత్తంలోవలె ఇందులోకూడ ఉదారతను ఓజస్సుకు అంగంగా పోషించటం పాత్రౌచిత్య, సందర్భౌచిత్య కారకం. (సంపా.)

క. కడుఁ గ్రూరుఁడవయి నృపతుల । విడువవినాఁ డాజిఁ బాండవేయులు నీయు
క్కడఁచి భుజశక్తి యేర్పడ । విడిపింతురు గడిమి నిఖిల విషయాధిపులన్. 194

ప్రతిపదార్థం: కడున్= మిక్కిలి; క్రూరుఁడవు+అయి= దుర్మార్గుడివై; నృపతులన్= రాజులను; విడువని, నాఁడు= విడిచిపెట్టనిరోజు; ఆజిన్= యుద్ధంలో; పాండవేయులు= పాండురాజుకుమారులైన ఈ భీమార్జునులు; భుజశక్తి= భుజబలం; ఏర్పడన్= ప్రకాశించగా; నీ, ఉక్కు+అడఁచి= నీయొక్క పొగరును అణచి; కడిమిన్= ఆధిక్యంతో; నిఖిల, విషయ+అధిపులన్= అందరు భూపతులను - అంటే నీకు బందీలుగా ఉన్న రాజు లందరిని; విడిపింతురు.

తాత్పర్యం: పరమ దుర్మార్గుడివై నీవు రాజులను చెరనుండి విడిపించకుంటే, పాండుపుత్రులైన ఈ భీమార్జునులు తమ భుజబలంతో నీ పొగరు అణచివేస్తారు. నీకు బందీలైన రాజులందరినీ విడిపిస్తారు.

విశేషం: శ్రీకృష్ణుడు భీమార్జునుల పరాక్రమాన్ని ప్రశంసించి వారిని ఉత్సాహపరిచాడు. జరాసంధుణ్ణి నిందించి అతణ్ణి రెచ్చగొట్టాడు. యుద్ధానికి రంగాన్ని సిద్ధం చేశాడు.

వ. అనిన విని జరాసంధుండు సటాసముత్పాటన కుపితకుంజర వైరియుంబోలెఁ గడునలిగి పటు కుటిల భ్రుకుటి ఘటిత నిటలుం డగుచుఁ బురుషోత్తమున కి ట్లనియె. 195

ప్రతిపదార్థం: అనినన్; విని; జరాసంధుండు; సటా, సమ్+ఉత్+పాటన, కుపిత, కుంజర, వైరియున్+పోలెన్= జూలు గట్టిగా పట్టి ఊడబెరకటంచేత కోపపడిన, ఏనుగుల శత్రువైన సింహంవలె; కడున్= మిక్కిలి; అలిగి= కోపించి; పటు, కుటిల, భ్రుకుటి, ఘటిత, నిటలుండు+అగుచున్= ఎక్కువగా వంకర తిరిగిన బొమముడిపాటుతో కూడిన నొసలు కలవాడై; పురుష+ఉత్తమునకున్= శ్రీకృష్ణునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుని మాటలకు జరాసంధుడు జూలు గట్టిగా పట్టి పెరకటంచేత కోపించిన సింహంలా ఎంతో కోపంతో మిక్కిలి వక్రమైన బొమముడిపాటుగల నొసలు కలవాడై ఇలా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ. అక్షరరమ్యమైన నన్నయశైలికి ఇదొక చక్కని ఉదాహరణ. శ్రీకృష్ణ భీమార్జునుల అక్రమ ప్రవేశంతో, వాళ్ళ అహంకార ప్రదర్శనతో, అన్నింటిని మించి ఆ శ్రీకృష్ణుడి కవ్వింపు మాటలతో, జరాసంధుడు ఎంత కోపోద్రిక్తుడయ్యాడో ఈ వచనంలోని ఉపమానమే కాక ఇందులోని పద ఘటన కూడ పాఠకునికి ప్రత్యక్షం చేస్తున్నది. కటువైన ఉచ్చారణ, వక్రమైన ఆకారం ఉండే 'ట' కారం సటాసముత్పాటనతో ప్రారంభమై, వడివడిగా ఆ జరాసంధుని కోపం ఎట్లా పెరిగిందో ఒక్కపెట్టున అతని ముఖమెంత కటువుగా మారిందో, నొస లెంత వక్రత వహించిందో చక్కగా వ్యక్తం చేస్తూ ఉంది. ఇక్కడ 'ట' కారావృత్తితో వృత్త్యనుప్రాసమనే శబ్దాలంకారం ఉంది.

క. అమితపరాక్రమమున నా । క్రమించి పరనృపుల నోర్చి గర్వించుట దో
సమె? యిది సత్క్షత్రియ ధ । ర్మమ; యే నెప్పుడుఁ బరాక్రమవ్రతుఁడ నిలన్. 196

ప్రతిపదార్థం: అమిత, పరాక్రమమునన్= మిక్కిలి పరాక్రమంతో; ఆక్రమించి= దండెత్తి; పరనృపులన్= శత్రురాజులను; ఓర్చి= జయించి; గర్వించుట; దోసమె= తప్పా?; ఇది; సత్+క్షత్రియ, ధర్మము+అ= ఉత్తమక్షత్రియ ధర్మమే; ఇలన్= భూమిమీద; ఏన్= నేను; ఎప్పుడున్= ఎల్లప్పుడు; పరాక్రమవ్రతుఁడన్= పరాక్రమంతో జీవించటమే వ్రతంగా కలవాణ్ణి.

తాత్పర్యం: అమితపరాక్రమంతో పరరాజులమీద దండెత్తి వాళ్ళను జయించి గర్వించటం తప్పా? ఇది ఉత్తమ క్షత్రియధర్మమే కదా! ఈనేలమీద ఎప్పుడూ పరాక్రమంతో జీవించటమే నా వ్రతం.

క. దేవార్థముగాఁ దెచ్చిన । యీ వసుధాధిపుల నేల యే విడుతుఁ బ్రతా
పావజితరిపుఁడఁ గావున । నీ వెఱుఁగవె తొల్లి ధారుణీధర! నన్నున్? 197

ప్రతిపదార్థం: దేవ+అర్థముగాన్= దేవుడికొరకు - అంటే పరమేశ్వరుడికి బలిఇవ్వటానికని; తెచ్చిన; ఈ, వసుధా+అధిపులన్= ఈ భూపతులను - రాజులను; ఏల= ఎందుకు; ఏన్= నేను; విడుతున్= విడిచిపెడతాను; ప్రతాప+అవజిత, రిపుఁడన్= పరాక్రమంచేత జయింపబడిన శత్రువులు కలవాడిని; కావున= అవటంచేత; ధారుణీ, ధర!= శ్రీకృష్ణా!; తొల్లి= ఇదివరకు; నీవు; ఎఱుఁగవె; నన్నున్.

తాత్పర్యం: పరమేశ్వరునికి బలియివ్వటానికై పట్టి తెచ్చిన రాజు లందరిని ఎందుకు వదలిపెడతాను? పరాక్రమంచేత శత్రువుల్ని జయించినవాణ్ణి. శ్రీకృష్ణా! నా సంగతి నీ కిదివరకు తెలియదా?

విశేషం: జరాసంధుని దెబ్బకు తాళలేక మధురనుండి ద్వారవతికి తననివాసాన్నే మార్చుకొన్న శ్రీకృష్ణునికి 'నీ వెఱుఁగవె తొల్లి ధారుణీధర నన్నున్' అనే జరాసంధుని మాటపోటు ఆయువుపట్టు తాకేదిగా ఉంది.

జరాసంధుండు యుద్ధమునకు భీమునిఁ గోరుకొనుట (సం. 2-20-28)

సీ. 'సమకట్టి సైన్యంబు సైన్యంబుతో నొండెఁ, । దొడరి మీ ముువ్వురతోడ నొండె.
నిద్దఱతో నొండె, నెక్కటి యొక్కని । తో నొండెఁ, బొడిచెద దోర్బలమున
నే యాయుధంబున నెమ్మెయిఁ బోరంగ । నిష్ట మయ్యది యుత్సహింపుఁ' డనిన,
'నొక్కనితోఁ బల్వు రుద్ధతులయి పూని । యుద్ధంబు సేయుట యుచితమగునె?

ఆ. యధిక బాహుబలులమయిన మా ముువ్వుర । యందు నొక్కరుని మహాబలాఢ్యుఁ
గోరికొనుము; వాఁడు ఘోరాజిలో నిన్ను । మొనసి మల్లయుద్ధమున జయించు.' 198

ప్రతిపదార్థం: సమకట్టి= పూనుకొని; సైన్యంబు, సైన్యంబుతోన్+ఒండెన్= సైన్యం సైన్యంతోకాని; తొడరి= ప్రయత్నించి; మీ, ముువ్వురతోడన్+ఒండెన్= మీ ముగ్గురితోకాని; ఇద్దఱతోన్+ఒండెన్= ఇద్దరితోకాని; ఎక్కటి, ఒక్కనితోన్+ఒండెన్= ఒంటరిగా ఒక్కనితోకాని; పొడిచెదన్= యుద్ధం చేస్తాను; దోః+బలమునన్= బాహుబలంచేతగాని; ఏ, ఆయుధంబునన్= ఏరకమైన ఆయుధంచేతగాని; ఏ, మెయిన్= ఏవిధంగా; పోరంగన్= యుద్ధం చెయ్యటానికి; ఇష్టము= మీకు ఇష్టమో; అ+అది= ఆవిధం;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉత్సహింపు(డు= పూనుడు; అనినన్; ఒక్కనితోన్; పలువురు; ఉద్ధతులు+అయి= విజృంభించినవాళ్ళయి; పూని= పూనుకొని; యుద్ధంబు; చేయుట; ఉచితము+అగునె= తగునా?; అధిక, బాహు, బలులము+ఐన= మిక్కిలి భుజబలం కలవాళ్ళమైన; మా, మువ్వుర, అందున్; మహా, బల+ఆఢ్యున్= గొప్ప బలంతో కూడుకొన్నవాణ్ణి; ఒక్కరుని; కోరికొనుము; వా(డు; ఘోర+ ఆజిలోన్= భయంకరమైన యుద్ధంలో; నిన్నున్; మొనసి= ఎదుర్కొని; మల్ల, యుద్ధమునన్; జయించున్.

తాత్పర్యం: 'సైన్యం సైన్యంతోగాని, మీ ముగ్గురితో కాని, మీలో ఇద్దరితోకాని, ఒంటరిగా మీలో ఒక్కరితో కాని యుద్ధం చేయటానికి నేను సిద్ధం. బాహుబలంతోకాని, ఆయుధంతో కాని, ఏవిధంగా పోరాడటం మీకిష్టమో ఆ విధంగా నాతో యుద్ధానికి రండి' అని జరాసంధు డనగానే 'పెక్కుమంది బలవంతులు విజృంభించి ఒక్కడితో యుద్ధం చేయటం ఉచితం కాదు. అధిక బలశాలురమైన మా ముగ్గురిలో మహాబలవంతుడైన ఒక్కణ్ణి కోరుకో. అతడే నిన్ను ఎదుర్కొంటాడు. భయంకరమైన మల్లయుద్ధంలో నిన్ను జయిస్తాడు' అని శ్రీకృష్ణు డన్నాడు.

విశేషం: శ్రీకృష్ణుని మాటనేర్పు అమోఘం. మా ముగ్గురిలో ఎవరినైనా ఒక్కడిని కోరుకొమ్మని పైకి అన్నట్లే అని, మహాబలాఢ్యుణ్ణి కోరుకొమ్ము, అతడు మల్లయుద్ధంలో నిన్ను జయిస్తా డని పలికి పరోక్షంగా జరాసంధునిదృష్టిని మహాబలుడైన వాయుపుత్రుడు, మల్లయుద్ధనిపుణుడు అయిన భీముడివైపు మళ్ళించాడు.

క. **అనిన మురవైరి పలుకులు । విని బార్హద్రథు(డు భూరివీర్యు మరున్నం**
దను(గోరికొనియె 'నీతం । డని నెన యగు నాకు' ననుచు నతిదర్పితు(డై. 199

ప్రతిపదార్థం: అనినన్; ముర, వైరి, పలుకులు= మురుడనే రాక్షసునికి శత్రువైన శ్రీకృష్ణుని మాటలు; విని; బార్హద్రథు(డు= బృహద్రథుడి పుత్రుడైన జరాసంధుడు; భూరి, వీర్యున్= గొప్ప పరాక్రమం కలవాడైన, మరుత్+నందనున్= వాయుతనయుడైన భీమసేనుని; ఈతండు; అనిన్= యుద్ధంలో; నాకున్; ఎన= సరి; అగున్; అనుచున్; అతిదర్పితు(డు+ఐ= మిక్కిలి గర్వంతో కూడుకొన్నవాడై; కోరికొనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుని మాటలు విని జరాసంధుడు గర్వంతో 'యుద్ధంలో నాకు సరిజోడు పవన తనయుడైన భీముడే' అని ఆతణ్ణి కోరుకొన్నాడు.

విశేషం: భీముడే నాకు యుద్ధంలో సరి ఉద్దీ అని అతణ్ణి కోరుకొన్న జరాసంధుని అభిమానంగూడ అభినందించతగ్గదే.

వ. **ఇట్లు జరాసంధుండు భీమసేనుతో మల్లయుద్ధంబు సేయ నిశ్చయించి తన తనయు సహదేవుని రాజ్యంబున కభిషిక్తుంజేసి పురోహిత కృత స్వస్త్యయనుండై. 200**

ప్రతిపదార్థం: ఇట్లు; జరాసంధుండు; భీమసేనుతోన్; మల్ల, యుద్ధంబు; చేయ, నిశ్చయించి, తన, తనయున్= తన కుమారుణ్ణి; సహదేవునిన్; రాజ్యంబునకున్= మగధరాజ్యానికి; అభిషిక్తున్+చేసి= రాజుగా చేసి; పురోహిత, కృత, స్వస్తి+అయనుండు+ ఐ= పురోహితులచేత చేయబడిన మంగళాశీర్వచనాలుకలవాడై.

తాత్పర్యం: ఆ విధంగా జరాసంధుడు భీమసేనునితో మల్లయుద్ధం చేయటానికి నిశ్చయించి, ముందుగా తన కుమారుడైన సహదేవుణ్ణి మగధరాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి చేసి, తాను పురోహితుల మంగళాశీర్వచనాలు పొంది.

విశేషం: జరాసంధునికి ఆయుధాలవలన మరణం లేదనే వరం ఉంది. కాని ఇప్పుడు భీమునితో జరుగబోయేది మల్లయుద్ధం. జయం తథ్యం కాదు. అందుకే జరాసంధుడు మరణానికికూడా సిద్ధమై యుద్ధానికి పూనుకొంటున్నాడని సహదేవుని పట్టాభిషేకం సూచిస్తున్నది. జరాసంధుని మరణ సూచన ఉంది కనుక ఇది వస్తుధ్వని. (సంపా.)

ఆ. బలియుఁ డపుడు వెండ్రుకలు పాచి ముడిచి గం। టెసఁగఁ దాల్చి వీరరసికవృత్తి
నుద్ధతుండు మల్లయుద్ధ ప్రసాధనం। బమర నిలిచె వేడ్క నమితబలుఁడు. 201

ప్రతిపదార్థం: బలియుఁడు= బలవంతుడైన జరాసంధుడు; అపుడు; వెండ్రుకలు; పాచి= వెనుకకు త్రోసి; ముడిచి; గంటు+ ఎసఁగన్= ముడి ఒప్పేటట్లుగా; తాల్చి= వేసికొని; వీర, రసిక, వృత్తిన్= వీరరసావేశం పొందిన వాడి విధంగా; ఉద్ధతుండు= విజృంభించినవాడు; అమిత, బలుఁడు= మిక్కిలి బలవంతుడయిన జరాసంధుడు; మల్ల, యుద్ధ, ప్రసాధనంబు= మల్లయుద్ధానికి తగిన అలంకరణ; అమరన్= ఒప్పగా; వేడ్కన్= సంతోషంతో; నిలిచెన్= నిలిచాడు.

తాత్పర్యం: అప్పుడు మహాబలవంతుడైన ఆ జరాసంధుడు తనజుట్టు వెనుకకు నెట్టి, ముడివేసుకొన్నాడు. వీరరసావేశంతో విజృంభించాడు. మల్లయుద్ధానికి తగిన అలంకరణతో ఆ భీమునిముందు నిలిచాడు.

వ. భీమసేనుండును వానికి నక్కజంబుగా మల్లయుద్ధ సన్నద్ధుం డయి ప్రతిభటించి నిలిచె నంత. 202

ప్రతిపదార్థం: భీమసేనుండును; వానికిన్= ఆ జరాసంధునికి, అక్కజంబుగాన్= ఆశ్చర్యం కలిగేటట్లుగా; మల్ల, యుద్ధ, సన్నద్ధుండు+అయి= మల్లయుద్ధానికి సిద్ధమైనవాడై; ప్రతిభటించి= ఎదిరించి; నిలిచెన్; అంత= అప్పుడు.

తాత్పర్యం: భీమసేనుడు కూడ జరాసంధునికి ఆశ్చర్యం కలిగేటట్లుగా మల్లయుద్ధానికి సిద్ధమై అతనికి దీటుగా ఎదుట నిలిచాడు.

భీమసేన జరాసంధుల మల్లయుద్ధము (సం. 2-21-10)

మ. సమసత్త్వాతిశయుల్ వృకోదర జరాసంధుల్ మహోద్యత్పరా
క్రమ మొప్పం గడు నల్గి యొండొరులఁ జుల్కం దాఁకి రన్యోన్యదు
ర్దమ దోర్దండ పటుప్రహార జనితధ్వానంబు బ్రహ్మాండ భాం
డము నిండన్ లయకాల దండధర చండక్షోభమో నా జనుల్. 203

ప్రతిపదార్థం: సమ, సత్త్వ+అతిశయుల్= సమానమైన బలం యొక్క అధిక్యం కలవాళ్ళు; వృకోదర, జరాసంధుల్= భీమసేన జరాసంధులు; మహా+ఉద్యత్+పరాక్రమము+ఒప్పన్= పెల్లుబికిన శౌర్యం ప్రకాశించగా; అన్యోన్య, దుర్దమ, దోః+దండ, పటు ప్రహార, జనిత, ధ్వానంబు= పరస్పరం అణచటానికి సాధ్యం కాని భుజదండాల తీవ్రమైన దెబ్బలచే పుట్టిన శబ్దం; బ్రహ్మాండ, భాండము= కుండవంటి ఆకారంలో ఉన్న భువనగోళం; నిండన్= నిండగా; జనుల్; లయ, కాల, దండధర, చండ, క్షోభమో, నాన్= ప్రళయకాలంలోని యమునివల్ల ఏర్పడే భయంకరకల్లోలమా అని అనుకొనేటట్లుగా; కడున్+అల్గి= మిక్కిలి కోపించి; ఒండు+ఒరులన్= ఒకరి నొకరు; చుల్కన్= సులువుగా; తాఁకిరి= ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: సమబలులై, విజృంభించిన భీమజరాసంధు లిద్దరు, పెల్లుబికిన పరాక్రమంతో, పరస్పరం అణచసాధ్యంకాని తమ బాహుదండాల తీవ్రమైన దెబ్బల ధ్వని బ్రహ్మాండ భాండమంతా నిండగా, ప్రజలంతా అది ప్రళయకాల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యముని వల్ల ఏర్పడిన అల్లకల్లోలమా అని అనుకొనేటట్లుగా మితిమీరిన కోపంతో మహోద్రిక్తులై ఒకరినొకరు అవలీలగా ఎదుర్కొన్నారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. రెండు మదపుటేనుగులు ఢీకొన్నట్లు భీమజరాసంధుల మల్లయుద్ధపు తొలితాకిడిని మత్తేభవృత్తంలో వర్ణించటం, వారి భుజదండ ప్రహారాలను బిందుపూర్వక డకార పౌనఃపున్యంచేత ధ్వనింప చేయటం శబ్దశాసనుడైన నన్నయ మనోహర కవితాశిల్పం. (వీరరౌద్ర రసస్ఫోరకమైన ఈ పద్యరచనలో కాంతి అనే శబ్దగుణంతో ఉజ్జ్వలంగా భాసించే ప్రసాదం ప్రదర్శితం. - సంపా.)

క. కర్షితరిపు లన్యోన్యా । కర్షణ సంకర్షణాపకర్షణముల సా
మర్షు లయి పెనఁగి రాహవ । హర్షంబునఁ బవనసుత బృహద్రథపుత్త్రుల్. 204

ప్రతిపదార్థం: కర్షితరిపులు= పరస్పరం ఆకర్షితులైన శత్రువులు; పవన, సుత, బృహద్రథ, పుత్త్రుల్= వాయుదేవుని కొడుకైన భీముడు, బృహద్రథుని కొడుకైన జరాసంధుడు; అన్యోన్య+ఆకర్షణ, సంకర్షణ+అపకర్షణములన్= ఒకరి నొకరు లాగటంచేత, నలపటంచేత, త్రోయటంచేత; స+అమర్షులు+అయి= కోపంతో కూడుకొన్నవాళ్ళయి; ఆహవహర్షంబునన్= యుద్ధమందలి ఉత్సాహంతో; పెనఁగిరి= పోరాడారు.

తాత్పర్యం: పరస్పరం కలియబడిన శత్రువులు ఆ భీమ జరాసంధులు ఒకరినొకరు లాగటంచేత, నలపటంచేత, త్రోయటంచేత అతిశయించిన కోపంతో యుద్ధోత్సాహంతో పోరాటం సాగించారు.

విశేషం: ఒకదాని వెంట ఒకటిగా వచ్చే రకారషకారసంయోగం ఆ మల్లయుద్ధమహావీరుల పెనుగులాటను మనోహరంగా ధ్వనింపజేస్తున్నది. మహాకవుల రచనల్లో అక్షరాల కూర్పు అంతరభావాన్ని ధ్వనింపచేస్తుందనటానికి (Sound echoing the sense) ఇదొక ఉదాహరణ.

క. వ్యాయామకర్కశ స్థిర । కాయుల యుద్ధము భయానకం బయ్యె మహో
గ్రాయస పరిఘాయిత కఠి । నాయత భుజదండ దారుణాఘాతములన్. 205

ప్రతిపదార్థం: వ్యాయామ, కర్కశ, స్థిర, కాయుల= వ్యాయామంచేత - అంటే కసరత్తుచేత - కఠినమై గట్టిపడిన శరీరాలు కలవాళ్ళయొక్క; మహా+ఉగ్ర+ఆయస, పరిఘాయిత, కఠిన+ఆయత, భుజ, దండ, దారుణ+ఆఘాతములన్= మిక్కిలి భయంకరాలైన ఇనుప గుదియల వలె కఠినాలై పొడవైన బాహుదండాలయొక్క; తీవ్రమైన దెబ్బలచేత; భయానకంబు+అయ్యెన్= భయాన్ని కలిగించే దయింది.

తాత్పర్యం: వ్యాయామంచేత గట్టిపడిన శరీరాలు కల ఆ భీమజరాసంధుల మల్లయుద్ధం భయంకరమైన ఇనుపగుదియలా కఠినంగా పొడవుగా ఉన్న వాళ్ళ బాహుదండాల దెబ్బలతో భయంకరంగా మారింది.

విశేషం: నన్నయగారు పద్యంలో విరివిగా ఇచట ప్రయోగించిన సవర్ణ దీర్ఘసంధులు, భీమ జరాసంధుల బాహుదండాల దీర్ఘతకు, సమానతకు, తీవ్రతకు చక్కని సూచికలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **అతులబలుల్ పరస్పర జయార్థులు పార్థివపుంగవుల్ మరు**
త్సుత మగధేశ్వరుల్ సమరశూరులు దారుణలీలఁ బోరి రూ
ర్జిత భుజదర్ప మేర్పడఁగ సింహగజేంద్రములట్లు, వజ్ర ప
ర్వతముల యట్లు, ఘోరతర వాసవ వృత్రులయట్లు నిద్దఱున్. **206**

ప్రతిపదార్థం: అతుల బలుల్= సాటిలేని బలం కలవాళ్ళు; పరస్పర, జయ+అర్థులు= ఒకరినొకరు జయించగోరే వాళ్ళు; పార్థివ పుంగవుల్= రాజశ్రేష్ఠులు; సమర, శూరులు= యుద్ధవీరులు; మరుత్+సుత, మగధ+ఈశ్వరుల్= వాయుపుత్ర, మగధరాజులైన - భీమ జరాసంధులు; ఊర్జిత, భుజ, దర్పము= దృఢమైన బాహు గర్వం; ఏర్పడఁగన్= మెరయగా; సింహ, గజ+ఇంద్రముల, అట్లు= సింహం మదపుటేనుగులవలె; వజ్ర, పర్వతముల, అట్లు= వజ్రాయుధ పర్వతాల వలె; ఘోరతర, వాసవ, వృత్రుల, అట్లు= మిక్కిలి భయంకరులైన దేవేంద్ర వృత్రాసురులవలె; ఇద్దఱున్; దారుణ, లీలన్= భీకర పద్ధతిలో; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: సాటిలేని బలం కలవాళ్ళు, ఒకరినొకరు జయించాలన్న కాంక్ష కలవాళ్ళు, రాజశ్రేష్ఠులు, యుద్ధవీరులు అయిన భీమ జరాసంధు లిద్దరు - సింహ గజేంద్రుల్లా, వజ్రపర్వతాల్లా, ఇంద్ర వృత్రాసురుల్లా భయంకరంగా యుద్ధం చేశారు.

విశేషం: అలం: ఉపమ. వాళ్ళిద్దరూ సమస్థాయిలో ఎంత పట్టుగా పోరుతున్నా, భీముణ్ణి సింహంతో, వజ్రాయుధంతో, దేవేంద్రునితో పోల్చటం, భీమవిజయాన్నీ జరాసంధపరాజయాన్నీ అద్భుతంగా ధ్వనింపజేస్తున్నది. ఇది అలంకార మూలంగా జరిగే వస్తుధ్వని. భీముని విజయాన్ని సూచించటానికై నన్నయ ఇచట మూలంలోని ఉపమానాల క్రమం మార్చటం విశేషం. (వస్తుస్వభావస్ఫూర్తితో కూడిన అర్థవ్యక్తిహేతుత్వం గల అర్థవ్యక్తి అనే శబ్దగుణం ఇందులో ప్రసాదగుణాన్ని సార్థకంగా పోషిస్తున్నది. సర్వరససామాన్యమైన ప్రసాదగుణం రౌద్రరసపోషకంగా ఈ రచనలో రాణిస్తున్నది. - సంపా.)

వ. **ఇట్లు కార్తిక మాసంబునం బ్రథమ దివసంబునం దొడంగి భీమజరాసంధు లెడ యుడుగక యొండొరులం బట్టియుఁ గిట్టియు నడిచియుం బొడిచియుఁ దాఁచియుం ద్రోచియు మహాయుద్ధంబు సేయుచుం ద్రయోదశినాఁ డిద్దఱుం గిట్టి మల్లయుద్ధ కౌశలం బేర్పడం బెనంగు నెడఁ జతుర్దశినాఁటి రాత్రియందు జరాసంధు నతిశ్రాంతభావం బుపలక్షించి యధోక్షజుండు భీమున కి ట్లనియె.** **207**

ప్రతిపదార్థం: ఇట్లు; కార్తికమాసంబునన్; ప్రథమ, దివసంబునన్= పాడ్యమినాడు; తొడంగి= ప్రారంభించి; భీమ, జరాసంధులు; ఎడ, ఉడుగక= (స్థానం విడువక) విడివడక; ఒండొరులన్= ఒకరినొకరు; పట్టియున్= గట్టిగా పట్టుకొని; కిట్టియున్= ఎదుర్కొని; అడిచియున్= కొట్టి; పొడిచియున్; తాఁచియున్= తన్ని; త్రోచియు= త్రోసి; మహాయుద్ధంబు; చేయుచున్; త్రయోదశినాఁడు= పదమూడవరోజు; ఇద్దఱున్; కిట్టి= సమీపించి (తలపడి); మల్లయుద్ధకౌశలంబు= మల్లయుద్ధంలోని నేర్పు; ఏర్పడన్= ప్రకటమయ్యేటట్లు; పెనంగు+ఎడన్= యుద్ధం చేస్తున్న సమయంలో; చతుర్దశినాఁటి రాత్రియందున్= పదునాల్గవ నాటి రాత్రి; జరాసంధు= జరాసంధునియొక్క; అతి, శ్రాంత, భావంబు= మిక్కిలి అలసిన స్థితిని; ఉపలక్షించి= గుర్తించి; అధోక్షజుండు= శ్రీకృష్ణుడు; భీమునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా కార్తిక శుద్ధ పాడ్యమినాడు ప్రారంభించి భీమ జరాసంధులు ఒకరినొకరు పట్టి, కొట్టి, పొడిచి, తన్ని, త్రోసి ఎడతెగని మహాయుద్ధం చేశారు. త్రయోదశినాడు ఇద్దరు తమ మల్లయుద్ధసామర్థ్యం

ప్రకటమయ్యేటట్లు పెనుగులాడగా చతుర్దశినాటి రాత్రి జరాసంధుడి అలసటను గుర్తించి శ్రీకృష్ణుడు భీమసేనునితో ఇలా అన్నాడు.

విశేషం: 'ఎడయుడుగక' కు మూలం - 'అనారతం దివారాత్ర మవిశ్రాంత మవర్తత' (భండార్కరు ప్రతి. 2-21-17). నన్నయ గారు మూలంలో వర్ణింపబడిన భీమజరాసంధుల యుద్ధంయొక్క అవిశ్రాంతత నంతా 'ఎడయుడుగక' అనే ఒక్క చక్కని తెలుగుమాటలో చెప్పి విడిచారు.

భీముఁడు జరాసంధుని సంహరించుట (సం. 2-22-3)

చ. విరహితసత్త్వుఁ డయ్యెఁ బ్రతివీరుఁడు; వీని నశేష ధారుణీ
శ్వరనికరాపరాధు నతిసాహసికున్ వధియించి, నీ భుజ
స్థిరత యెలర్ప నయ్యనిలదేవుబలంబును నీ బలంబు భా
సురముగ మాకుఁ జూపుము విశుద్ధయశోనిధి! మారుతాత్మజా! 208

ప్రతిపదార్థం: విశుద్ధ, యశః, నిధి= నిర్మలమైన కీర్తికి నిలయమైన వాడా!; మారుత+ఆత్మజా!= వాయుదేవుని కుమారుడా!- భీమసేనా!; ప్రతివీరుఁడు= శత్రువీరుడైన జరాసంధుడు; విరహిత, సత్త్వుఁడు+అయ్యెన్= కోల్పోయిన బలం కలవాడయ్యాడు అంటే బలాన్ని కోల్పోయాడు; అశేష, ధారుణీ+ఈశ్వర, నికర+అపరాధున్= సకల రాజులసమూహానికి అపకారం చేసినవాణ్ణి; అతి సాహసికున్= మిక్కిలి తెగింపు కలవాణ్ణి; వీనిన్= ఈ జరాసంధుణ్ణి, వధియించి= చంపి; నీ, భుజ, స్థిరత= నీ భుజ బలంయొక్క చెక్కుచెదరని స్థితి; ఎలర్పన్= ప్రకటమయ్యేటట్లు; నీ బలంబు; ఆ+ అనిలదేవు, బలంబును= ఆ వాయుదేవునియొక్క బలంకూడ; భాసురముగన్= ప్రకాశించేటట్లు; మాకున్; చూపుము.

తాత్పర్యం: నిర్మలమైన కీర్తికి నిలయుడవైన ఓ వాయుపుత్రా! శత్రువీరు డైన జరాసంధుడు బలహీను డయ్యాడు. సకల రాజ సమూహానికి అపకారం చేసి, మితిమీరిన సాహసుడైన ఇతణ్ణి వధించి, నీ భుజబలంయొక్క చెక్కుచెదరని స్థితి ప్రకటమయ్యేటట్లు, నీ బలం, నీ తండ్రి వాయుదేవుడి బలం ప్రకాశించేటట్లు మాకు చూపు.

విశేషం: శ్రీకృష్ణుడు మారుతాత్మజా! అని సమయోచితంగా భీమసేనుణ్ణి సంబోధించటం, 'నీ బలమేకాక నీతండ్రి బలాన్ని కూడ మాకు చూపించు' అని చతురంగా సంభాషించి- ప్రోత్సహించటం, మహాబలుడైన వాయుదేవుని పుత్రుడివై ఉండి ఈ శత్రువీరుణ్ణి ఇంకా సహిస్తావా? - అని హెచ్చరించటం, నీ పితృదేవుణ్ణి స్మరించుమని సూచించటం- రసజ్ఞుల దృష్టిని ఆకర్షించే విశేషాలు. (యుద్ధవీరస్ఫోరకంగా ఈ పద్యంలో కాంతి అనే గుణం గొప్పగా పోషించబడింది. సంపా.)

వ. అని ప్రబోధించిన ననిలతనయుం డనిలదేవుం దలంచి తత్ప్రసాదంబున నధికసత్త్వసమేతుండై. 209

ప్రతిపదార్థం: అని; ప్రబోధించినన్= కర్తవ్యాన్ని ఉపదేశించగా; అనిల, తనయుండు= వాయుదేవుడి కుమారుడైన భీముడు; అనిల, దేవున్= వాయుదేవుణ్ణి; తలంచి= స్మరించి; తత్+ప్రసాదంబునన్= ఆయన అనుగ్రహంచేత; అధిక, సత్త్వ, సమేతుండు+ఐ= మిక్కిలి బలంతో కూడుకొన్నవాడై.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు కర్తవ్యబోధ చేయగానే, భీమసేనుడు తన తండ్రి అయిన వాయుదేవుణ్ణి మనస్సులో ధ్యానించి, ఆయన అనుగ్రహంతో అధికబలసంపన్నుడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ఆతనిఁ బట్టి యెత్తి నిహతాహితవీరుఁడు వానిముక్కునన్
వాతను గర్ణరంధ్రముల వారక శోణితధార లొల్కఁగా
వాతసుతుండు వీచె శతవారము లుద్ధత చండ వాత సం
ఘాత వివర్తమాన తృణఖండసముం డగుచుండ మాగధున్. 210

ప్రతిపదార్థం: నిహత+అహిత, వీరుఁడు= చంపబడిన శత్రువీరులు కలవాడు - అంటే శత్రువులను సంహరించినవాడు; వాతసుతుండు= వాయుదేవుని కుమారుడైన భీముడు; ఆతనిన్= ఆ జరాసంధుణ్ణి; పట్టి, ఎత్తి= పట్టుకొని పైకెత్తి; వాని, ముక్కునన్; వాతను= నోటిలో; కర్ణ రంధ్రములన్= చెవి బెజ్జాలలో; వారక= ఎడతెగక; శోణిత, ధారలు= రక్తధారలు; ఒల్కఁగాన్= కారేటట్లుగా; ఉద్ధత, చండ, వాత, సంఘాత, వివర్తమాన, తృణఖండ, సముండు+అగుచుండన్= భయంకరమైన పెనుగాలి తాకిడిచేత తిరుగుడు పడుతున్న గడ్డిపరకతో సమానమైనవా డవుతుండగా; మాగధున్= మగధరాజైన జరాసంధుణ్ణి; శత, వారములు= నూరుసార్లు; వీచెన్= విసిరికొట్టాడు.

తాత్పర్యం: శత్రువీరసంహారకుడైన వాయుపుత్రుడు జరాసంధుణ్ణి పట్టి పైకెత్తి, అతడిముక్కు, నోట, కర్ణరంధ్రాలలో ఎడతెగనిరక్తధారలు ప్రవిస్తుండగా, భయంకరమైన పెనుగాలితాకిడికి తిరుగుడుపడుతున్న గడ్డిపరకతో సమానంగా మగధరాజైన ఆ జరాసంధుణ్ణి నూరుసార్లు విసరివేశాడు.

విశేషం: అలం: పరికరం. మహాబలుడైన వాయుదేవుణ్ణి స్మరించి ఆ పితృదేవుని అనుగ్రహంతో అధిక బల సంపన్నుడై విజృంభించిన భీమసేనుణ్ణి ఈ సందర్భంలో వాతసుతు డని సంబోధించటం, బలహీనుడై ఆ భీమసేనునిచేత చిక్కిన జరాసంధుణ్ణి గడ్డిపరకతో పోల్చటం ఎంతో ఉచితంగా, మనోహరంగా ఉండటమేగాక, భీమసేను డా జరాసంధుణ్ణి పట్టి, ఎత్తి, త్రిప్పికొట్టిన తీరుకూడ పాఠకుని కంటికి కట్టినట్లుంది. (భీముడు మల్లయుద్ధాల్లో శత్రువుల్ని ఈవిధంగా చంపటం సాధారణంగా కనపడుతుంది. హిడింబాసురుణ్ణీ, బకాసురుణ్ణీకూడా ఈ విధంగానే తుదముట్టించాడు. - సంపా.)

వ. మఱియును. 211

తాత్పర్యం: అంతేకాక.

క. వెఱచఱవఁ బట్టికొని వడిఁ । జఱచి జరాసంధుసంధిసంధుల యెమ్ముల్
విఱిచి వధియించి యార్చెను । వఱలఁగ భీముండు భువనవలయం బద్రువన్. 212

ప్రతిపదార్థం: భీముండు; వెఱచఱవన్= భయపడేటట్లుగా; పట్టికొని; వడిన్= తీవ్రంగా; చఱచి= అరచేత కొట్టి; జరాసంధు= జరాసంధునియొక్క; సంధి, సంధుల, ఎమ్ముల్= కీళ్ళకలయికల్లోని ఎముకలు; విఱిచి; వధియించి= చంపి; భువన, వలయంబు= భూమండలమంతా; అద్రువన్= అదరేటట్లు; వఱలఁగన్= వ్యాపించేటట్లు; ఆర్చెను= అరచాడు.

తాత్పర్యం: భీమసేనుడు భయంకరంగా జరాసంధుణ్ణి పట్టుకొని, తీవ్రంగా అరచేత కొట్టి, అతని కీళ్ళ కలయికల్లో ఉండే ఎముకలను విరిచి, అతణ్ణి వధించి భూమండలమంతా దద్దరిల్లేటట్లు పెద్దగా అరచాడు.

విశేషం: భీముడు మల్లయుద్ధంలో శత్రువును చివరకు క్రిందపడవేస్తాడు. వెన్నెముక విరుస్తాడు. కీళ్ళ ఎముకలూ విరుస్తాడు. కుప్పగూలిన అతణ్ణి చంపేస్తాడు. హిడింబాసురాదులను కూడ అలాగే తుదముట్టించాడు. ఇది భీముని పద్ధతి (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **అవనితలంబు వ్రస్సెనొ, హిమాచలశృంగము వ్రయ్యలయ్యెనో,**
శ్రవణ విదారణం బయిన శబ్దము దా నిది యేమి యొక్కొ భై
రవమయి విన్చె నంచును బురంబునవారు భయంబు వొందిః రం
దువిదలగర్భముల్ గలఁగెః నుక్కడఁగెన్ మగధేశు సైన్యముల్. **213**

ప్రతిపదార్థం: అవని, తలంబు= భూమండలం; వ్రస్సెనొ= బ్రద్దలయ్యెనో; హిమ+అచల, శృంగము= హిమాలయ పర్వతశిఖరం; వ్రయ్యలు+అయ్యెనో= ముక్కలయిందో; శ్రవణ, విదారణంబు+అయిన= చెవులను బ్రద్దలు చేసేటటువంటిదైన; శబ్దము= ధ్వని; తాన్+ఇది; ఏమి+ఒక్కొ= ఏదోకదా!; భైరవము+అయి= భయంకరమై; వినిచెన్(విన్చెన్)= వినవచ్చింది; అంచును; పురంబునవారు= పురజనులందరు; భయంబు, పొందిరి; అందున్; ఉవిదల, గర్భముల్= స్త్రీలయొక్క కడుపులోని పిండాలు; కలఁగెన్= కలతచెందాయి; మగధ+ఈశు, సైన్యముల్= మగధరాజైన జరాసంధుని సేనలు; ఉక్కు+అడఁగెన్= బలహీనా లయ్యాయి.

తాత్పర్యం: 'భూమండలం బ్రద్దలయిందా! లేక హిమాచలశృంగం ముక్కలైందా! చెవులను బ్రద్దలు చేసే ఈ శబ్దం ఏమిటిది? భయంకరంగా వినవస్తున్నదే!' అని పురప్రజలందరు భీతి చెందారు. స్త్రీల గర్భాలు కలత పొందాయి. జరాసంధునిసేనలు బలహీనా లయ్యాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. విజయోత్సాహంతో భీముడు అరచిన అరుపు ఎంత భయంకరమో, అతడిక్రోధవిజృంభణం ఎంత తీవ్రమో ఈపద్యం తెలియచేస్తుంది. (జరాసంధునికథ ఒక భయంకరమైన ఏడ్పుతో మొదలై భీముని దారుణమైన అరుపుతో ముగుస్తుంది. రోదిస్తూ పుట్టి రాజలోకాన్ని రోదింపచేసి, చివరకు దీనుడై ప్రాణాలు వదిలాడు - జరాసంధుడు. - సంపా.)

వ. **ఇట్లు భీమసేనుండు జరాసంధుఁ జంపి వాని వధియించుట జగద్విదితంబుగాఁ దదీయ గృహద్వార తోరణ సమీపంబునం దత్కళేబరంబు వైచిన నది సర్వజన భయంకరంబయి యుండెః నంత నాదిత్యోదయంబున.** **214**

ప్రతిపదార్థం: ఇట్లు; భీమసేనుండు; జరాసంధున్; చంపి; వాని, వధించుటయించుట= వానిని చంపటం; జగత్+విదితంబు, కాన్= ప్రపంచమంతటికి తెలిసేటట్లుగా; తదీయ, గృహ, ద్వార, తోరణ, సమీపంబునన్= ఆతనియొక్క ఇంటివాకిటితోరణం దగ్గర; తత్+కళేబరంబు= ఆతని శవాన్ని; వైచినన్= పడవేయగా; అది; సర్వ, జన, భయంకరంబు+అయి= అందరు ప్రజలకు భయాన్ని కలిగించేదై; ఉండెన్; అంతన్= తరువాత; ఆదిత్య+ఉదయంబునన్= సూర్యుడు ఉదయించిన సమయాన.

తాత్పర్యం: ఈ విధంగా భీమసేనుడు జరాసంధుణ్ణి సంహరించి, అతని చావు లోకానికంతా తెలిసేటట్లు అతని మృతదేహాన్ని అతని భవనద్వారతోరణం దగ్గర పడవేశాడు. అది ప్రజలందరికి భయంకరమై అగుపించింది. తర్వాత సూర్యోదయం కాగానే.

విశేషం: భీముడు పూర్వం బకాసురుని కళేబరాన్నికూడ ఏకచక్రపురం ద్వారంవద్ద పడవేశాడు. ప్రజలందరిముందు తన బలప్రదర్శన చేసే ఉద్ధతుని లక్షణం. రాక్షసబాధ తీరిపోయిం దని ప్రజలు తెలిసికొనవలెననే ప్రభుత్వలక్షణం - ఇందులో ధ్వని. (సంపా.)

జరాసంధుని కుమారుడైన సహదేవు నభిషిక్తుఁ గావించి శ్రీకృష్ణుఁడు భీమార్జునులతో నింద్రప్రస్థమున కరుగుట (సం. 2-22-40)

సీ. గరుడధ్వజుం డప్డు కరుణాసమేతుఁడై । యమ్మాగధుల కెల్ల నభయ మిచ్చి,
మొగి జరాసంధుచే నిగృహీతులయి యున్న । పృథివీపతుల విడిపించి చెఱలు,
మోక్షితు లైన సర్వక్షత్రియులచేత । సంశుద్ధరత్న పుంజములఁజేసి
పూజితుండయి, తన తేజంబు వెలుఁగంగ । సహదేవు నజ్జరాసంధతనయు

ఆ. నోడ కుండు మని తదున్నత రాజ్యంబు । నందు నిలిపి, హృదయహారి వివిధ
రత్నరాజి సుందరంబైన మగధేశు । రథముఁ దేరఁ బనిచె రమణతోడ. 215

ప్రతిపదార్థం: గరుడ ధ్వజుండు= గరుత్మంతుడు జెండాగా కలవాడు - శ్రీకృష్ణుడు; అప్డు; కరుణా, సమేతుఁడు+ఐ= దయతో కూడుకొన్నవాడై; ఆ+మాగధులకున్+ఎల్లన్= ఆ మగధ దేశవాసులందరికి; అభయము+ఇచ్చి= భయంవద్దని మాట ఇచ్చి; మొగి= పూర్వం; జరాసంధునిచే నిగ్రహీతులు+అయి= బాధింపబడినవాళ్ళయి; ఉన్న; పృథివీ, పతుల= రాజులయొక్క; చెఱలు; విడిపించి; మోక్షితులు+ఐన= విడిపించబడిన వారైన; సర్వక్షత్రియులచేతన్= అందరు రాజులచేత; సంశుద్ధరత్న, పుంజములన్, చేసి= స్వచ్ఛములైన రత్న సమూహాలతో; పూజితుండు+అయి= పూజించబడినవాడై; తన, తేజంబు= తనప్రభావం (కాంతి); వెలుగంగన్; ఆ+జరాసంధ, తనయున్= ఆ జరాసంధుని కుమారుణ్ణి; సహదేవున్; ఓడక+ఉండుము+అని= భయపడకుండ ఉండుమని; తత్+ఉన్నత, రాజ్యంబు+అందున్= ఆగొప్ప మగధరాజ్యంలో; నిలిపి= ఉంచి; అంటే మగధరాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి చేసి; హృదయహారి= మనోహరమైనది; వివిధ, రత్న, రాజి, సుందరంబు+అయిన= అనేకవిధాలైన రత్న సమూహంచేత అందమైన; మగధ+ఈశు, రథమున్= మగధరాజుయొక్క రథాన్ని; రమణతోడన్= ప్రీతితో; తేరన్= తెచ్చుటకు; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: గరుడధ్వజుడైన శ్రీకృష్ణుడు దయామయుడై మగధప్రజలందరికి అభయమిచ్చాడు. ఇదివరకు జరాసంధునిచేత బంధితులైన రాజులందరిని విడిపించాడు. ఆ రాజులంతా అర్పించిన స్వచ్ఛ రత్నసమూహాలతో పూజలందుకొన్నాడు. తన ప్రభావం ప్రకాశించగా జరాసంధసుతుడైన సహదేవునికి ధైర్యం చెప్పాడు. అతణ్ణి మగధరాజ్యానికి రాజుగా చేశాడు. మనోహరంగా వివిధరత్నకాంతులతో అందంగా ఉన్న జరాసంధుని రథాన్ని ప్రీతితో తెప్పించాడు.

వ. 'తొల్లి తారకాసుర సంగ్రామంబున నింద్రారూఢంబయిన దాని నింద్రువలన వసువను రాజు వడసె, వానివలన బృహద్రథుండు వడసె' నని తద్దివ్యరథప్రభావంబు సెప్పుచు భీమార్జున సమేతుండయి యా రథం బెక్కి చక్రధరుం డఖిలరాజచక్రంబుతో నింద్రప్రస్థగమనోన్ముఖుండై గరుడనిం దలంచుడుఁ దత్క్షణంబ. 216

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; తారక+అసుర, సంగ్రామంబునన్= తారకుడనే రాక్షసునితో జరిపిన యుద్ధంలో; ఇంద్ర+ ఆరూఢంబు+అయిన, దానిన్= ఇంద్రునిచే ఎక్కబడినదానిని-అంటే ఇంద్రుడు ఎక్కిన దానిని; ఇంద్రువలన; వసువు+అను, రాజు; వడసెన్= పొందాడు; వాని వలనన్= ఆ వసుమహారాజువల్ల; బృహద్రథుండు= జరాసంధుని తండ్రి అయిన బృహద్రథుడు; వడసెన్= పొందాడు; అని; తత్+దివ్య, రథ, ప్రభావంబు= ఆ దేవతా సంబంధమైన రథంయొక్క గొప్పతనాన్ని; చెప్పుచున్; భీమ+అర్జున, సమేతుండు+అయి= భీమార్జునులతో కూడుకొన్నవాడై; చక్రధరుండు= చక్రాయుధాన్ని ధరించినవాడు -

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీకృష్ణుడు; ఆ, రథంబు+ఎక్కి; అఖిల, రాజ, చక్రంబులతోన్= సకల రాజ సమూహంతో; ఇంద్రప్రస్థ, గమన+ఉన్ముఖుండు+ఐ= ఇంద్రప్రస్థపురం వెళ్ళటానికి పూనుకొన్నవాడై; గరుడనిన్= గరుత్మంతుణ్ణి; తలంచుడున్= తలచుకోగానే; తత్+క్షణంబు+అ= ఆ క్షణమందే.

తాత్పర్యం: 'పూర్వం తారకాసురునితో యుద్ధం చేసేటప్పుడు ఇంద్రుడు ఈ రథం ఎక్కాడు. తరువాత ఇంద్రునినుండి ఈ రథాన్ని వసుమహారాజు పొందాడు. అతడినుండి జరాసంధుని తండ్రి బృహద్రథుడు దీనిని గ్రహించాడు' - అని చక్రధరుడైన శ్రీకృష్ణుడు ఆ దివ్యరథవృత్తాంతాన్ని చెపుతూ, భీమార్జునులతో కలిసి ఆ రథ మెక్కి, సకల రాజ సమూహంతో ఇంద్రప్రస్థపురానికి వెళ్ళాలని గరుత్మంతుని మనసులో తలచుకోగానే తత్క్షణం.

విశేషం: తారకాసురుడు - రాక్షసుడు, వజ్రాంగుని కుమారుడు - బ్రహ్మనుగూర్చి మహోగ్రతపం చేసి తనతో సమానమైన బలవంతుడు లోకాల్లో లేకుండ వరంపొంది, లోకాల్ని బాధించాడు. చివరకు కుమారస్వామిచేత మరణించాడు.

క. **అనలప్రభాభిశోభిత । ఘనతర తనుదీప్తు లొప్పఁగా వచ్చి వడిన్**
వినతాతనయుఁడు వినయా । వనతోరుశిరస్కుఁ డయ్యె వనజాక్షునకున్. **217**

ప్రతిపదార్థం: వినతా, తనయుఁడు= వినతయొక్క కుమారుడైన గరుత్మంతుడు; అనల, ప్రభా+అభిశోభిత, ఘనతర, తను, దీప్తులు= అగ్నిదేవుడియొక్క కాంతివంటి కాంతితో ప్రకాశించే గొప్ప శరీరకాంతులు; ఒప్పన్= ఒప్పుతుండగా; వడిన్= వేగమే; వచ్చి; వనజ+అక్షునకున్= పద్మాలవంటి కన్నులు గల శ్రీకృష్ణునికి; వినయ+అవనత+ఉరు, శిరస్కుఁడు+అయ్యెన్= వినయంచేత వంగిన గొప్ప శిరస్సు కలవా డయ్యాడు - అంటే వినయంతో శిరస్సు వంచి నిలబడ్డాడు.

తాత్పర్యం: వినతాసుతు డైన గరుత్మంతుడు అగ్నిలా ప్రకాశించే దేహకాంతులతో వేగంగా వచ్చి శ్రీకృష్ణుని ఎదుట వినయంతో శిరస్సు వంచి నిలబడ్డాడు.

వ. **ఇట్లు వచ్చిన వైనతేయు నతిప్రీతిం దద్దివ్యరథసారథ్యంబునందు నియోగించి, మనోవాయు వేగంబునం గృష్ణ భీమ విజయు లింద్రప్రస్థపురంబు ప్రవేశించి రంత.** **218**

ప్రతిపదార్థం: ఇట్లు; వచ్చిన; వైనతేయున్= వినతాసుతుడైన గరుత్మంతుణ్ణి; అతి, ప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; తత్+దివ్య, రథ, సారథ్యంబునందున్= ఆ దివ్యరథాన్ని నడపటంలో; నియోగించి= నియమించి; మనః, వాయు, వేగంబునన్= మనస్సు, గాలి వెళ్ళేటంత వేగంతో; కృష్ణ, భీమ, విజయులు= కృష్ణుడు, భీముడు, అర్జునుడు; ఇంద్రప్రస్థ పురంబు; ప్రవేశించిరి; అంత.

తాత్పర్యం: ఈ విధంగా వచ్చిన గరుత్మంతుణ్ణి అతి ప్రీతితో ఆ దివ్యరథానికి సారథిగా నియమించి, మనోవేగ, వాయువేగాలతో శ్రీకృష్ణభీమార్జునులు ఇంద్రప్రస్థపురంలో ప్రవేశించారు. అంత.

మ. **'జనసంత్రాసకరున్ మహోద్ధతు జరాసంధున్ హరిప్రేరణం**
బున భంజించెఁ బ్రభంజనాత్మజుఁడు; భూభుగ్వీరులం దన్నిరో
ధన నిర్ముక్తులఁ జేసె; నింకఁ జతురంతక్షోణికిన్ ధర్మనం
దను సామ్రాజ్యము పూజ్యమయ్యె' నని మోదం బంది రుర్వీజనుల్. **219**

ప్రతిపదార్థం: ప్రభంజన+ఆత్మజుఁడు= వాయుపుత్రుడైన భీముడు; హరి, ప్రేరణంబునన్= శ్రీకృష్ణునియొక్క ప్రేరణచేత; జన, సంత్రాసకరున్= ప్రజలకు మిక్కిలి భయం కలిగించేవాణ్ణి; మహా+ఉద్ధతున్= ఎంతో గర్వించినవాడిని; జరాసంధున్, భంజించెన్= చంపాడు; భూ, భుక్+వీరులన్= భూమిని అనుభవించే వీరులను - అంటే రాజులను; తత్+నిరోధన, నిర్ముక్తులన్= అతని చెరనుండి విముక్తిపొందిన వారినిగా; చేసెన్; ఇంకన్; చతుః, అంత, క్షోణికిన్= నాలుగు సముద్రాలు మేరలుగా గల భూమికి; ధర్మనందను, సామ్రాజ్యము= ధర్మరాజుయొక్క సామ్రాజ్యాధికారం; పూజ్యము+అయ్యెన్+అని= పూజించతగింది అయిందని; ఉర్వీ, జనుల్= భూమిమీద ప్రజలంతా; మోదంబు+అందిరి= సంతోషాన్ని పొందారు.

తాత్పర్యం: 'శ్రీకృష్ణుని ప్రేరణతో భీమసేనుడు లోకభయంకరుడు, మహాగర్వితుడు అయిన జరాసంధుణ్ణి వధించాడు. అతడు బంధించిన రాజుల నందరిని విడిపించాడు. ఇక నాలుగు సముద్రాలు హద్దులుగా గల ఈ భూమి కంతటికి ధర్మరాజు సామ్రాజ్యాధికారం పూజించదగింది అయింది' అని ప్రజలంతా మహానందభరితులయ్యారు.

విశేషం: ధర్మరాజు సామ్రాజ్యం పూజ్యం కావటానికి హేతువులు ఇందులో సమాలోచించబడ్డాయి. దానివలన వస్తుస్వభావం స్పష్టంగా వ్యక్తమౌతున్నది. ప్రజల సంతోషం ప్రతిఫలించే ఈ రచనలో అర్థవ్యక్తి అనే శబ్దగుణం రాణించింది. కథాప్రసన్నతకు ఈ గుణం ఎంతో తోడ్పడుతున్నది. (సంపా.)

క. 'ఆయుధనిహతుఁడు గాని య । జేయు జరాసంధు భీమసేనుఁడు విజయ
శ్రీ యెసఁగ నోర్చెఁగా క । త్యాయత భుజశక్తి నొరుల కలవియె?' యంచున్. 220

ప్రతిపదార్థం: భీమసేనుడు; ఆయుధ, నిహతుఁడు, కాని= ఆయుధాలతో చావనటువంటి; అజేయున్= జయించసాధ్యం కానివాణ్ణి; జరాసంధున్; అతి+ఆయత, భుజ, శక్తిన్= మిక్కిలి ఎక్కువైన భుజబలంతో; విజయశ్రీ= విజయలక్ష్మి; ఎసఁగన్= ప్రకాశించేటట్లు; ఓర్చెన్, కాక= ఓడించాడుగాని; (ఇది); ఒరులకున్= ఇతరులకు; అలవి+ఎ= చేతనవుతుందా?; అంచున్= అని అంటూ.

తాత్పర్యం: 'ఆయుధాలచేత చావులేనివాడు, జయించ సాధ్యంకానివాడు అయిన జరాసంధుణ్ణి భీమసేనుడు గొప్ప భుజబలంతో విజయలక్ష్మి వెలిగేలా వధించాడు. ఇది ఇతరులకు సాధ్యమా!' అని.

విశేషం: జరాసంధవధానంతరం ఆ కార్యసాధనలోని కీలకమైన అంశం ప్రజలచేత పరామర్శించబడుతున్నది (చర్వణం చేయబడుతున్నది). ఆయుధాలతో చావని అద్భుతవీరుడు జరాసంధుడు. అతడిని బాహువులతో చంపాడు భీముడు. గాండీవ చక్రధారులుకూడ చేయలేని పనిని తన భుజబలంతో సాధించిన భీముడి యుద్ధవీరం ఇతరులకు అసాధ్యం. అందుచేత అద్భుతం. కథలోని కీలకాంశాన్ని కీర్తించి తాను నిర్వహించిన కథారసార్థసంయోజన శిల్పాన్ని పఠితకు మననం చేయిస్తున్నా డిక్కడ నన్నయ. ఇది కథానిర్వహణ శిల్పంలో కమనీయమైన అంశం. (సంపా.)

క. పురజను లాశ్చర్యంబునఁ । గర మనురాగమునఁ బరమ కౌతుకమునఁ జూ
చిరి బోరన వచ్చి వృకో । దర దామోదర సురేంద్రతనయులఁ బ్రీతిన్. 221

ప్రతిపదార్థం: పురజనులు= ఇంద్రప్రస్థపుర ప్రజలు; ఆశ్చర్యంబునన్= ఆశ్చర్యంతో; కరము= మిక్కిలి; అనురాగమునన్= ప్రేమతో, పరమ, కౌతుకమునన్= ఎంతో ఎక్కువైన ఆసక్తితో; బోరన, వచ్చి= వేగంగా వచ్చి; వృకోదర, దామోదర, సుర+ఇంద్ర, తనయులన్= భీమసేనుణ్ణి, శ్రీకృష్ణుణ్ణి, దేవేంద్రపుత్రుడైన అర్జునుణ్ణి; ప్రీతిన్; చూచిరి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఇంద్రప్రస్థపురప్రజలంతా ఆశ్చర్యంతో, ఎంతో ప్రేమతో, ఎక్కువ ఆసక్తితో ఒక్కుమ్మడిగా వచ్చి భీమసేన శ్రీకృష్ణార్జునులను ప్రియమార చూచారు.

విశేషం: వృకోదరుడు - వృకంతో అంటే తోడేలుతో సమానమైన మిక్కిలి ఆకలి గల ఉదరం కలవాడు - భీముడు. దామోదరుడు - తులసి మాల ఉదరంపై కలవాడు - శ్రీ మహావిష్ణువు - శ్రీకృష్ణుడు. (వీరంనుండి అద్భుతం పుడుతుందని లాక్షణికు లంటారు. భీముని యుద్ధవీర స్మరణంవలన పురజనులలో ఆశ్చర్యం కలిగినట్లు వర్ణించటం కథాకథనంలోని రసశిల్పం. - సంపా.)

వ. కృష్ణభీమ విజయు లిట్లు విజయ విభాసితులయి వచ్చి ధర్మరాజునకు మ్రొక్కి జరాసంధు బంధనంబువలనం దమచేత మోక్షితులైన మహీపతుల నెల్లం జూపిన. 222

ప్రతిపదార్థం: కృష్ణ, భీమ, విజయులు+ఇట్లు; విజయ, విభాసితులు+అయి= విజయంచేత ప్రకాశించే వాళ్ళయి; వచ్చి; ధర్మరాజునకున్; మ్రొక్కి; జరాసంధు, బంధనంబు వలనన్= జరాసంధునియొక్క చెరనుండి; తమచేతన్; మోక్షితులు+ఐన= విడిపించబడిన; మహీపతులన్+ఎల్లన్= రాజులందరిని; చూపిన.

తాత్పర్యం: శ్రీకృష్ణ భీమార్జునులు ఈ విధంగా విజయకాంతితో వెలుగుతూ వచ్చి ధర్మరాజుకు మ్రొక్కి, జరాసంధుని చెరనుండి తాము విడిపించిన రాజులందరిని చూపించగా.

క. సవినయ నతోత్తమాంగుల । నవనీశుల నందఱను యథార్హప్రియగౌ
రవమునఁ బూజించి కురు । ప్రవరుఁడు తద్దేశములకుఁ బరువడిఁ బంచెన్. 223

ప్రతిపదార్థం: కురు, ప్రవరుఁడు= కురువంశశ్రేష్ఠుడైన ధర్మరాజు; సవినయనత+ఉత్తమ+అంగులన్= వినయంతో వంచిన శిరస్సులు కలవాళ్ళను; అవనీ+ఈశులన్= రాజులను; అందఱను; యథా+అర్హ, ప్రియ, గౌరవమునన్= ఎవరెవరికి తగిన రీతిగా వాళ్ళను ప్రేమతో, గౌరవంతో; పూజించి; తత్+దేశములకున్= ఆ దేశాలకు అంటే వారి వారి దేశాలకు; పరువడిన్= క్రమంగా; పంచెన్= పంపాడు.

తాత్పర్యం: కురువంశ శ్రేష్ఠుడైన ధర్మరాజు, తనకు వినయంతో శిరస్సు వంచి నమస్కరించిన ఆ రాజులందరిని, ఎవరికి తగినట్లు వాళ్ళను ప్రేమతో, గౌరవంతో పూజించి, వారి వారి దేశాలకు క్రమంగా సాగనంపాడు.

విశేషం: శ్రీకృష్ణుడు జరిపించిన జరాసంధవధచేత ధర్మజుని భావి సార్వభౌమాధికారానికి పెద్ద అడ్డు తొలగింది. జరాసంధ బంధవిముక్తులైన రాజులంతా ధర్మజుని ఆధిపత్యాన్ని కృతజ్ఞతాపూర్వకంగా అంగీకరించటం జరిగింది. 'ఏక క్రియా ద్వ్యర్థకరీ'- ఒక పనితో రెండు ప్రయోజనాలు సాధించటం అంటే ఇటువంటిదే. ఆ జగన్నాటకసూత్రధారి శ్రీకృష్ణుని రాజనీతి అమోఘం; బహుళార్థసాధకం.

కృష్ణుఁడు ద్వారకానగరమున కరుగుట (సం. 1-22-53)

వ. నారాయణుండును ధర్మరాజు వీడ్కొని తద్దివ్యరథారూఢుండయి ద్వారవతీపురంబున కరిగె, నంత నిక్కడ. 224

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నారాయణుండును= శ్రీకృష్ణుడుకూడ; ధర్మరాజున్, వీడ్కొని= ధర్మరాజు దగ్గర సెలవు తీసికొని; తత్+దివ్య, రథ+ఆరూఢుండు+అయి= ఆ దివ్యరథాన్ని ఎక్కినవాడై; ద్వారవతీ, పురంబునకున్= ద్వారకానగరానికి; అరిగెన్= వెళ్ళాడు; అంతన్= తర్వాత; ఇక్కడ= ఇంద్రప్రస్థంలో.

తాత్పర్యం: శ్రీకృష్ణుడుకూడ ధర్మజుని దగ్గర సెలవు తీసికొని ఆ దివ్యరథాన్ని ఎక్కి ద్వారకానగరానికి వెళ్ళాడు. తరువాత ఇంద్రప్రస్థంలో.

చ. భరతకులైక భూషణుఁడు భాసురతేజుఁడు ధర్మనందనుం
డురు భుజ విక్రమంబున జయోన్నతిఁ బోల్పఁగ వీరు లోకపా
లురయని భీముఁ బార్థు నకులున్ సహదేవునిఁ బంచెఁ దూర్పు ను
త్తరమును బశ్చిమంబు మఱి దక్షిణమున్ వరుసన్ జయింపఁగన్. 225

ప్రతిపదార్థం: భరత, కుల+ఏక, భూషణుఁడు= భరత వంశానికంతటికి ముఖ్యమైన అలంకారమైన వాడు; భాసురతేజుఁడు= ప్రకాశిస్తున్న పరాక్రమం కలవాడు; (అయిన) ధర్మనందనుఁడు; ఉరు, భుజ, విక్రమంబునన్= గొప్పదైనభుజబలంలో; జయ+ ఉన్నతిన్= విజయాన్ని సాధించే గొప్పతనంలో; పోల్పఁగన్= పోల్చి చూస్తే; వీరు; లోకపాలురు+అ, అని= దిక్పాలకుల వంటి వారే అని; భీమున్; పార్థున్; నకులున్; సహదేవునిన్; వరుసన్= వరుసగా; తూర్పున్, ఉత్తరమును; పశ్చిమంబున్; మఱి; దక్షిణమున్; జయింపఁగన్; పంచెన్= పంపాడు.

తాత్పర్యం: భరత వంశానికి అంతటికి అలంకారమైన వాడు, ప్రకాశించే పరాక్రమం కలవాడు అయిన ధర్మరాజు - గొప్ప భుజబలంలో, విజయాన్ని సాధించే గొప్పతనంలో తన తమ్ముళ్ళు దిక్పాలకులతో పోల్చదగిన వారని తలచి, భీమార్జున నకుల సహదేవుల్ని వరుసగా తూర్పు, ఉత్తరం, పశ్చిమం, దక్షిణం అనే దిక్కుల్ని జయించటానికి పంపించాడు.

విశేషం: అలం: క్రమం. ఓజోగుణవిశిష్టమైన ప్రసాదం వీరరసోన్నిద్రంగా ఈ రచనలో పోషించబడింది. ధర్మరాజును వర్ణించేటప్పుడు నన్నయ ఇటువంటిరచననే సాధారణంగా వాడతాడు. (సంపా.)

వ. ఇట్లు పంచిన నలువురు నపార చతురంగ బలసమేతులై నాలుగు సముద్రంబులపై నడచు నపూర్వ సముద్రంబులుం బోలె నాలుగు దిక్కులపై నడచి రనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 226

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పంచినన్= పంపగా; నలువురున్, అపార, చతురంగ, బల, సమేతులు+ఐ= మితిమీరిన రథ గజ తురగ పదాతి బలాలతో కూడుకొన్న వాళ్ళయి; నాలుగు, సముద్రంబులపై; నడచు; అపూర్వ, సముద్రంబులున్+ పోలెన్= ఆశ్చర్యకరాలైన సముద్రాలవలె; నాలుగు దిక్కులపై; నడచిరి; అనినన్; విని; జనమేజయుండు; వైశంపాయనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఈ విధంగా ధర్మరాజు పంపగా, భీమార్జున నకుల సహదేవులు నలువురు మితిమీరిన చతురంగ బలాలతో, నాలుగు సముద్రాలమీద నడచే అపూర్వాలైన మరి నాలుగు సముద్రాల్లా నాలుగు దిక్కులకు నడచా' రని వైశంపాయనుడు చెప్పగా జనమేజయుడు అతనితో ఇలా అన్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. సముద్రమే సువిశాలం, భయంకరం. ఒక సముద్రంమీద మరొక సముద్రం నడిస్తే ఎట్లా ఉంటుందో ఊహకు అందవలసిందే కాని మాటకు అందదు.

క. **నరసుతు లయ్యై దిక్కుల । కరిగి మహీపతులచేత నరిగొని ధనముల్**
దెరలఁగఁ దెచ్చిన మార్గముఁ । బరువడి నెఱిఁగింపు నాకుఁ బరమమునీంద్రా! **227**

ప్రతిపదార్థం: పరమ ముని+ఇంద్రా!= మహామునిశ్రేష్ఠా! వైశంపాయనమహర్షీ!; నరసుతులు= రాజకుమారులైన భీమార్జున నకుల సహదేవులు; అయ్యై దిక్కులకున్= ఆయా దిశలకు; అరిగి= వెళ్ళి; మహీపతుల చేతన్= రాజులచేత; అరి= కప్పాన్ని; కొని= తీసుకొని; ధనముల్; తెరలఁగన్= పొంగునట్లుగా; తెచ్చిన; మార్గమున్= విధమును; నాకున్; పరువడిన్= క్రమంగా; ఎఱిగింపు= తెలియచెప్పుము.

తాత్పర్యం: వైశంపాయన మహామునీంద్రా! ఆ విధంగా భీమార్జున నకుల సహదేవులు నాలుగుదిక్కులకు వెళ్ళి రాజులచేత కప్పాలు తీసికొని అపార ధనాన్ని తెచ్చిన విధం నాకు చెప్పండి.

వ. **అని యడిగిన జనమేజయునకు వైశంపాయనుం డి ట్లనియె.** **228**

తాత్పర్యం: అని అడుగగా వైశంపాయనుడు జనమేజయునితో ఈవిధంగా అన్నాడు.

అర్జునుం డుత్తరదిగ్విజయంబు సేయుట (సం. 2-23-7)

సీ. **అగ్నిదత్తంబైన యద్దివ్యరథ మెక్కి । గాండీవధరుఁ డతిఘర్మసమయ**
ఘర్మాంశుఁడును బోలెఁ గౌబేర దిగ్విజ । యార్థ ముగ్ర ప్రతాపాగ్ని వెలుఁగఁ
జని పుళిందావనీశ్వరు నోర్చి, ప్రతివింధ్యుఁ । డనువాని నోడించి, యశ్రమమున
మఱి యఖిల ద్వీప మండలేశుల నెల్ల । వశవిధేయులఁ జేసి, వారు దన్ను

ఆ. **భక్తిఁ గొలిచి రాఁగఁ బ్రాగ్జ్యోతిషంబుపై । విడిసెఁ; దత్పురమున విభుఁ డనంత**
బలముతోడఁ బన్ని భగదత్తుఁ డేతెంచి । విజయుఁ దాఁకె సమరవిజయకాంక్ష. **229**

ప్రతిపదార్థం: గాండీవ, ధరుఁడు= గాండీవాన్ని ధరించినవాడు - అర్జునుడు; అగ్ని, దత్తంబు+ఐన= (ఖాండవదహనఘట్టంలో) అగ్నిదేవునిచేత ఇవ్వబడిన; ఆ+దివ్య, రథము+ఎక్కి= ఆ దేవతాసంబంధమైన రథాన్ని ఎక్కి; అతి, ఘర్మ, సమయ, ఘర్మ+అంశుఁడును+పోలెన్= మండువేసవిలోవేడి కిరణాలు గల సూర్యునివలె; కౌబేర, దిక్+విజయ+అర్థము= కుబేరసంబంధమైన దిక్కును జయించటంకొరకు - అంటే ఉత్తర దిగ్విజయ యాత్రకొరకు; ఉగ్ర, ప్రతాప+అగ్ని= భయంకరమైన పరాక్రమ మనే అగ్ని; వెలుఁగన్= ప్రకాశిస్తుండగా; చని= వెళ్ళి; పుళింద+అవనీ+ఈశ్వరున్= పుళిందదేశపురాజును; ఓర్చి= ఓడించి; ప్రతివింధ్యుఁడు; అనువానిన్; ఓడించి; అశ్రమమునన్= సులువుగా; మఱి= ఇంకా; అఖిల, ద్వీప, మండల+ఈశులన్= సమస్తద్వీపమండలాల రాజులను; ఎల్లన్= అందరిని; వశ, విధేయులన్+చేసి= లొంగి తనకు తలవంచిన వాళ్ళుగా చేసి; వారు; తన్నున్= తనను; భక్తిన్= భక్తితో; కొలిచి= సేవించి; రాగన్= వెంట రాగా; ప్రాక్, జ్యోతిషంబుపై= ప్రాగ్జ్యోతిషం అనే పట్టణంమీద; విడిసెన్= దండెత్తాడు; తత్+పురమునన్= ఆ పట్టణంలో; విభుఁడు= రాజు; భగదత్తుఁడు; అనంత, బలముతోడన్= అంతులేని సైన్యంతో; పన్ని= యుద్ధానికి సిద్ధపడి; ఏతెంచి= వచ్చి; విజయున్= అర్జునుణ్ణి; సమర, విజయ, కాంక్షన్= యుద్ధంలో గెలవాలనే కోరికతో; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: గాండీవాన్ని ధరించిన అర్జునుడు అగ్నిదేవు డిచ్చిన దివ్యరథమెక్కి మండు వేసవిలో వెలిగే చండకిరణుడైన సూర్యునివలె భయంకరమైన పరాక్రమాగ్ని ప్రజ్వరిల్లేటట్లు ఉత్తర దిగ్విజయ యాత్రకు బయలుదేరి పుళిందరాజును ఓడించాడు. ప్రతివింధ్యుణ్ణి జయించాడు. అంతేకాక, అఖిల ద్వీపాల మండలేశ్వరులను అతిసులభంగా వశవర్తులను చేసుకొన్నాడు. వాళ్ళందరు తనను భక్తితో కొలిచి వెంటరాగా ప్రాగ్జ్యోతిషంపై దండెత్తాడు. ఆ దేశపురాజు భగదత్తుడు అపారసైన్యంతో దండెత్తివచ్చి అర్జునుణ్ణి గెలవాలన్న కాంక్షతో అతణ్ణి ఎదుర్కొన్నాడు.

విశేషం: అలం: ఉపమ. గాండీవధరుడు - విజయుడు అనే సంబోధనలు రెండూ ఈ సందర్భంలో సార్థకాలే.

వ. **ఇట్లు శబర సాగరానూపవాసులైన యోధవీరులతోఁ బన్ని భగదత్తుండు పార్థుతో నెనిమిది దివసంబులు మహాయుద్ధంబు సేసి తదీయ బాణభగ్న బలుండై పార్థున కి ట్లనియె.** **230**

ప్రతిపదార్థం: ఇట్లు; భగదత్తుండు; శబర, సాగర+అనూపవాసులు+ఐన= శబరులు, సముద్రతీరవాసులు అయిన; యోధవీరులతోన్= వీరులైన యోధులతో; పన్ని= దండెత్తి; పార్థుతోన్= అర్జునునితో; ఎనిమిది, దివసంబులు= ఎనిమిదిరోజులు; మహాయుద్ధంబు; చేసి; తదీయ, బాణ, భగ్న, బలుండు+ఐ= అతనియొక్క బాణాలచేత కోల్పోయిన (భంజింపబడిన) బలం కలవాడై; పార్థునకున్+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భగదత్తుడు, శబరులు, సాగర తీరవాసులు అయిన యుద్ధవీరులతో కలిసి దండెత్తి, అర్జునునితో ఎనిమిది రోజులు పెద్ద యుద్ధం చేశాడు. అతని బాణాలచేత బలం కోల్పోయి ఇలా అన్నాడు.

విశేషం: 'అనూప' మంటే జలసమృద్ధి గల నేల. సాగరానూపం అంటే సముద్ర జలవ్యాప్తి గల ప్రదేశం. సాగరానూపవాసులు- సముద్ర తీరవాసులు. శబరులు - ఆటవికులు - అడవులలో నివసించేజాతి వారు. ఇక్కడ 'ఇట్లు సాగరోపవన వాసులైన యాభీర శబర వీర గణంబుతో' అని కూడ ఒక పాఠాంతరం ఉంది.

క. **ఏ నింద్ర సఖుఁడ; నీవును । భూనాథ! సురాధినాథ పుత్త్రుండవు; నీ**
తో నని సేయుట యుచితమె? । యే నోడితిఁ జెప్పు మెద్ది యిష్టము నీకున్. **231**

ప్రతిపదార్థం: భూనాథ!= ఓరాజా!; ఏన్= నేను; ఇంద్ర, సఖుఁడన్= దేవేంద్రుడియొక్క స్నేహితుణ్ణి; ఈవును; సుర+అధినాథ, పుత్త్రుండవు= దేవతలకు రాజైన దేవేంద్రునియొక్క కుమారుడివి; నీతోన్; అని= యుద్ధం; చేయుట; ఉచితము+ఎ= తగునా?; ఏన్= నేను; ఓడితిన్= ఓడిపోయాను; నీకున్; ఎద్ది= ఏది; ఇష్టము; చెప్పుము.

తాత్పర్యం: అర్జునా! నేను ఇంద్రునికి స్నేహితుణ్ణి. నీవు ఇంద్రునికి పుత్రుడివి. నీతో యుద్ధం చేయటం ఉచితమా? నేను ఓడిపోయాను. నీ కేది ఇష్టమో చెప్పు.

వ. **'దానిన చేయుదు' ననిన విని భగదత్తునకుఁ బార్థుం డి ట్లనియె.** **232**

తాత్పర్యం: 'దానినే చేస్తా' - అని భగదత్తు డనగా అర్జునుడు ఇలా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కురువిభుఁడు రాజసూయా । ధ్వర మొనరింపం గడంగె; ధర్మజుఁడు నిరం
తరధర్మశీలుఁ; డాతని । కరి వెట్టుము; రమ్ము ప్రీతి నమ్మఖమునకున్. 233

ప్రతిపదార్థం: కురు విభుఁడు= కురువంశపురాజు; నిరంతర, ధర్మ, శీలుఁడు= ఎల్లప్పుడు ధర్మంతో కూడిన స్వభావం కలవాడు; ధర్మజుఁడు; రాజసూయ+అధ్వరము= రాజసూయం అనే యాగం; ఒనరింపన్= చేయటానికి; కడంగెన్= పూనుకొన్నాడు; అతనికిన్; అరి, పెట్టుము= కప్పాన్ని చెల్లించు; ప్రీతిన్= ప్రేమతో; ఆ+మఖమునకున్= ఆ యాగానికి; రమ్ము.

తాత్పర్యం: కురువంశప్రభువు, నిత్య ధర్మ శీలుడు అయిన ధర్మరాజు రాజసూయ మహాయాగం చెయ్యటానికి పూనుకొన్నాడు. ఆయనకు నీవు కప్పం చెల్లించు. ప్రీతితో ఆ యాగానికి రా.

వ. అని యా భగదత్తుచేత నపరిమిత ధనరాసులు గొని ధనదదిశాభిముఖుండయి ధనంజయుం డరిగి. 234

ప్రతిపదార్థం: అని; ఆ; భగదత్తు చేతన్, అపరిమిత= లెక్కకు మిక్కిలి అయిన; ధనరాసులు; కొని= తీసికొని; ధనద, దిశ+అభిముఖుండు+అయి= కుబేరుడి దిక్కైన ఉత్తరంవైపు తిరిగినవాడై; ధనంజయుండు= అర్జునుడు; అరిగి= వెళ్ళి.

తాత్పర్యం: అని ఆ భగదత్తునినుండి లెక్కకు మిక్కిలిగా ధనరాసులను తీసుకొని అర్జునుడు ఉత్తరదిశవైపు వెళ్ళి.

విశేషం: ధనదుడు - అంటే ధనం ఇచ్చేవాడు - కుబేరుడు. ఈయన ఉత్తర దిక్పాలుడు. అందుచేతనే ఉత్తర దిక్కుకు ధనదుదిశ అని పేరు. ఈసందర్భంలో అర్జునుణ్ణి ధనంజయుడని అనటం, ఆయన ఉత్తరదిశవైపు వెళ్ళా డని అనకుండ, ధనదు దిశవైపు వెళ్ల డనటం ఎంతో ఉచితంగా ఉంది. ధనదుదిశలోని రాజులను జయించి రాజసూయానికి అవసరమైన అపార ధనరాసులను తీసుకొని రావటంచేతనే అర్జునుడు ధనంజయు డయ్యాడు. తరువాత ఉత్తర గోగ్రహణంలో గో ధనాన్ని కూడ గెలిచి తేవటంలో ఆయన ధనంజయనామం అంతకంత సార్థకమైంది.

క. అతుల చతురంగ సేనా । యుతుఁ డంతర్గిరి బహిర్గి రోపగిరుల భూ
పతుల నని నోర్చి శౌర్యో । న్నతిఁ గొనియెను వారిచేత నానాధనముల్. 235

ప్రతిపదార్థం: అతుల, చతురంగ, సేనా, యుతుఁడు= సాటిలేని రథ గజ తురగ పదాతి బలంతో కూడుకొన్న వాడైన అర్జునుడు; అంతర్గిరి, బహిర్గిరి+ఉపగిరుల, భూపతులన్= అంతర్గిరి, బహిర్గిరి, ఉపగిరుల రాజుల నందరిని; అనిన్= యుద్ధంలో; ఓర్చి= జయించి; శౌర్య+ఉన్నతిన్= పరాక్రమం యొక్క ఆధిక్యంతో; వారిచేతన్, నానా, ధనముల్, కొనియెను= తీసుకొన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు సాటిలేని చతురంగబలంతో అంతర్గిరి, బహిర్గిరి, ఉపగిరుల భూపతులనందరిని యుద్ధంలో జయించి అత్యధికపరాక్రమంతో వాళ్ళనుండి నానావిధధనాలు గ్రహించాడు.

విశేషం: "బహిర్గిరోపగిరుల - విడదీస్తే బహిర్గిర+ఉపగిరుల అని అవుతుంది, 'బహిర్గిరి' అనాలి గాని 'బహిర్గిర' అనటం ఒప్పా! అనిపిస్తుంది. అంతర్గిరించ కౌంతేయ స్తథైవచ బహిర్గిరిమ్ తథోపరిగిరిం చైవ విజిగ్యే పురుషర్షభః - అని మూలం (-భండార్కరు ప్రతి, 2-24-2) కాని 'బహిర్గిరమ్' అనే పాఠాంతరం కూడా ఉంది. ఈ పాఠాంతరాన్ని అనుసరించి

'బహిర్గిరోపగిరుల' అనే రూపం సాధువు. కాగా సిద్ధాంతకౌముదిలోని 'గిరేశ్చ సేనకస్య' అనే అవ్యయీభావ సమాస ప్రకరణంలోని తుది సూత్రంవలన గిర్యంతమైన అవ్యయీభావ సమాసానికి 'అచ్' ప్రత్యయం వైకల్పికంగా వస్తుంది. దీన్ని బట్టి అంతర్గిరి- అంతర్గిరమ్; బహిర్గిరి - బహిర్గిరమ్; ఉపగిరి - ఉపగిరమ్ అనే రూపాలు కలగటానికి అవకాశం ఉన్నది. నన్నయ 'బహిర్గిర+ ఉపగిరుల' అనే చోట 'అచ్' ప్రత్యయం వచ్చిన రూపం వాడి ఉన్నాడు. అందువలన బహిర్గిరోపగిరుల అనే రూపం సాధువే."- (మహాభారత సంశోధిత ప్రతి).

వ. **మఱియు నులూక దేశాధిపతియగు బృహంతునిఁ బరాజితుం జేసి, యుత్తరోలూక వామదేవ మోదాపుర సుదామ సుసంకులంబు లను దేశంబుల రాజుల జయించి, దేవప్రస్థంబున సేనాబిందు నోడించి, విష్వగశ్వుండనురాజువిక్రమం బడంచి, పార్వతేయుల గర్వం బుడిపి, బర్బర శబర తురుష్కపతుల వశగతులంజేసి, మాళవ పౌంద్ర కాశ్మీర త్రిగర్త లోహిత సుధన్వగాంధార కాంభోజ కోసల పతులచేత విచిత్ర రత్న కాంచన వస్తు వాహన నివహంబులు గొని, చిత్రాయుధ రక్షితంబైన సింహపురంబు మథించి, సింహాసనాసీనులయిన వనచర దస్యుల వశ్యులంజేసి, శ్వేతపర్వతం బతిక్రమించి యట చని కాంభోజ కటకుండను రాజుచేతం బూజితుండై, హాటకదేశంబున మానసం బనుకొలను ఋషికుల్యంబును జూచి, యందుల రాజులచేత నపరిమిత పదార్థంబులం దిత్తిరి కల్మాష మండూకాఖ్య మయూరహంస శుక సవర్ణంబులైన హయంబులం బర్వత నిభంబులైన యిభంబులం గొని, (హేమకూట నిషధాచలంబులు గడచి గంధర్వనగరంబులు గెలిచి, శత సహస్ర యోజనాయతం బయి శుద్ధ సువర్ణమయం బయి తేజోరాశి యయిన మేరు మహీధరంబు నాలోకించి, జంబూ మహావృక్షంబును జంబూ మహానదియునుం జూచి, తత్తీరంబున మేరువునకుం బ్రదక్షిణంబుగాఁజని, గంధమాదన పర్వతం బతిక్రమించి, తద్దిశాధిపతులైన సిద్ధ విద్యాధర చారణ గంధర్వులచేత నానా విచిత్రవస్తు వాహనంబులు గొని మాల్యవన్నీల పర్వతంబులు గడచి) యుత్తర కురుదేశములకుం జని హరివాసం బను పురంబుపై విడిసిన.** **236**

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక; ఉలూక, దేశ+అధిపతి+అగు; బృహంతునిన్; పరాజితున్+చేసి= ఓడించి; ఉత్తర+ఉలూక, వామదేవ, మోదాపుర, సుదామ, సుసంకులంబులు; అను; దేశంబుల; రాజుల; జయించి; దేవప్రస్థంబున; సేనాబిందున్= సేనా బిందువు అనే పేరుగల రాజును; ఓడించి; విష్వక్+అశ్వుండు+అను; రాజు= రాజుయొక్క; విక్రమంబున్= పరాక్రమాన్ని; అడంచి= అణచి; పార్వతేయుల= పర్వతదేశరాజుల; గర్వంబు= పొగరును; ఉడిపి= తొలగించి; బర్బర, శబర, తురుష్క, పతుల; వశగతులన్+చేసి= లోబరుచుకొని; మాళవ, పౌంద్ర, కాశ్మీర, త్రిగర్త, లోహిత, సుధన్వ, గాంధార, కాంభోజ, కోసల, పతులచేత; విచిత్ర, రత్న, కాంచన, వస్తు, వాహన, నివహంబులు= విచిత్రాలైన రత్నాలను, బంగారు వస్తువులను, వాహనాల సమూహాలను; కొని= గ్రహించి; చిత్ర+ఆయుధ, రక్షితంబు+ఐన= చిత్రాయుధునిచేత రక్షించబడిందైన; సింహపురంబు; మథించి= జయించి (త్రచ్చి); సింహాసన+ఆసీనులు+అయిన= సింహాసనంపై కూర్చొని ఉన్న; వనచర దస్యులన్= ఆటవికులైన దస్యుజాతులవాళ్ళను; వశ్యులన్+చేసి= లోబడినవాళ్ళనుగా చేసుకొని; శ్వేత, పర్వతంబు; అతిక్రమించి= దాటి; అట, చని; కాంభోజకటకుండు+అను; రాజుచేతన్; పూజితుండు+ఐ= పూజించబడినవాడై; హాటక, దేశంబునన్; మానసంబు+అను= మానసం అనే పేరున్న; కొలను; ఋషికుల్యంబును; చూచి; అందుల, రాజులచేతన్; అపరిమిత పదార్థంబులన్= లెక్కకు మిక్కిలి అయిన వస్తువులను; తిత్తిరి, కల్మాష, మండూక+ఆఖ్య= తిత్తిరి, కల్మాషం, మండూకం అనే పేర్లు కలిగినట్టియు; మయూర, హంస, శుక, సవర్ణంబులు+ఐన= నెమలి, హంస, చిలుక రంగువంటి రంగు కలిగినవైన; హయంబులన్= గుఱ్ఱాలను; పర్వత, నిభంబులు+ఐన= కొండలతో సమానాలైన; ఇభంబులన్= ఏనుగులను; కొని= గ్రహించి; (హేమకూట,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిషధ+అచలంబులు= హేమకూట నిషధ పర్వతాలు; కడచి= దాటి; గంధర్వ, నగరంబులు; గెలిచి, శత, సహస్ర, యోజన+ఆయతంబు+అయి= నూరువేల యోజనాల వైశాల్యం కలిగి; శుద్ధ, సువర్ణమయంబు+అయి= స్వచ్ఛమైన బంగారుతో కూడినదై; తేజః+రాశి= వెలుగుకుప్ప; అయిన, మేరు మహీధరంబును; జంబూ, మహావృక్షంబును; జంబూ మహానదియునున్, చూచి; తత్+తీరంబున= దాని ఒడ్డున; మేరువునకున్= మేరు పర్వతానికి; ప్రదక్షిణంబుగాన్= కుడినుండి ఎడమవైపుగా; చుట్టుచు; చని= వెళ్ళి; గంధమాదనపర్వతంబు; అతిక్రమించి= దాటి; తత్+దిశా+అధిపతులు+ఐన= ఆదిక్కుకు ప్రభువులయిన; సిద్ధ, విద్యాధర, చారణ, గంధర్వులచేతన్; నానా, విచిత్ర వస్తు వాహనంబులు; కొని= తీసుకొని; మాల్యవత్+నీల, పర్వతంబులు; కడచి= దాటి) ఉత్తరకురుదేశములకున్; చని= వెళ్ళి; హరివాసంబు+అను; పురంబుపై; విడిసినన్= దండెత్తగా.

తాత్పర్యం: అంతేకాక, ఉలూకదేశాధిపతి అయిన బృహంతుణ్ణి, ఉత్తర ఉలూక వామదేవాది దేశాల అధిపతుల్ని, దేవప్రస్థరాజయిన సేనాబిందుణ్ణి, విష్వగశ్వుణ్ణి, పార్వతేయుల్ని, బర్బర, శబర, తురుష్కరాజుల్ని, మాళవ, పౌండ్ర, కాశ్మీరాది దేశాధిపతుల్ని ఓడించాడు. వాళ్ళచేత చిత్రవిచిత్రాలైన రత్నాల్ని, కాంచన వస్తు వాహనాల సమూహాల్ని గ్రహించాడు. చిత్రాయుధుని రక్షణలో ఉన్న సింహపురాన్ని జయించాడు. సింహాసనాసీనులైన ఆటవిక దస్యుల్ని వశం చేసుకొన్నాడు. శ్వేతపర్వాతాన్ని దాటి, కాంభోజకటకుడనే రాజుచేత పూజలందుకొన్నాడు. హాటకదేశంలో మానసమనే పేరున్న కొలను, ఋషికుల్యాన్ని దర్శించాడు. అక్కడి రాజులచేత అపరిమిత పదార్థాల్ని, తిత్తిరి, కల్మాష, మండూకాలనే పేర్లు గల నెమలి, హంస, చిలుక రంగులతో సమానమైన రంగులు కల గుర్రాల్ని, కొండలవంటి ఏనుగుల్ని గ్రహించి (హేమకూట నిషధ పర్వతాలు దాటి, గంధర్వ నగరాన్ని జయించి, నూరువేల యోజనాల వైశాల్యంతో, స్వచ్ఛమైన బంగారుతో, కుప్పవోసిన కాంతిలా ఉన్న మేరుపర్వతాన్ని దర్శించి, జంబూమహావృక్షాన్ని, జంబూమహానదిని చూచి, ఆ నదీతీరాన మేరువుకు ప్రదక్షిణంగా వెళ్ళి, గంధమాదన పర్వతాన్ని దాటి, ఆ దిక్కుకు అధిపతులైన సిద్ధ, విద్యాధర, చారణ గంధర్వులచేత వివిధవస్తు వాహనాల్ని గ్రహించి, మాల్యవంతం, నీలం అనే పర్వతాలను దాటి) ఉత్తర కురు దేశాలకు వెళ్ళి, హరివాస మనే పురంపై దండెత్తాడు.

విశేషం: ఇది ప్రాచీన ఉత్తర భారత భౌగోళికస్థితిని వర్ణించే వచనం. 'హేమకూటనిషధాచలాలు' మొదలు 'మాల్యవన్నీల పర్వతంబులు గడచి' అనేవరకు ఉన్న వచన భాగానికి మూలం శ్రీ పి.పి.యస్. శాస్త్రిగారి సంపాదకత్వంలో వెలువడ్డ సంస్కృత భారత ప్రతిలో ఉంది కాని, భండార్కర్ ప్రతిలో అది లేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు భారత ప్రతిలో ఈ భాగం కుండలీకృతమై ఉంది. రాజుల పేర్ల విషయంలో, దేశాల పేర్ల విషయంలో కొన్ని ప్రతులలో కొన్ని భేదాలు ఉన్నాయి.

సీ. **తద్ద్వారపాలకుల్ దారుణాకారు ల । పార బలాఢ్యులు పార్థుకడకుఁ**
జనుదెంచి సురరాజసన్నిభు నాతనిఁ । జూచి యచ్చెరు వడి 'శూరు లెందు
నీయట్టిరే కురునృపవీర! పర్యాప్త । మయ్యె నీ విజయ వీర్యాతిశయము;
వసుమతీనాథు లెవ్వరు నిట్లు బలిమిమై । నిట వచ్చిరే తొల్లి యే యుగముల?

ఆ. **నున్నతప్రతాప! యుత్తర కురు భూము । లంద్రు జనులు వీని; నవనిచరుల**
కివి యగోచరంబు; లిందు సాధించి యె । ద్దియును గొనఁగలేదు తివిరి నీకు. 237

ప్రతిపదార్థం: తత్+ద్వారపాలకుల్= ఆ హరివాసపురం యొక్క ద్వారాన్ని కాపాడే భటులు; దారుణ+ఆకారులు= భయంకరమైన ఆకారం కలవాళ్ళు; అపార+బల+ఆఢ్యులు= అమితమైన బలంతో కూడుకొన్నవాళ్ళు; పార్థుకడకున్= అర్జునుని దగ్గరకు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చనుదెంచి= వచ్చి; సుర, రాజ, సన్నిభున్= దేవతలకు రాజైన ఇంద్రునితో సమానమైన వాణ్ణి; అతనిన్= ఆ అర్జునుణ్ణి; చూచి; అచ్చెరు+పడి= ఆశ్చర్యపడి; కురు, నృప, వీర= వీరుడవైన కురు వంశ రాజా!; శూరులు+ఎందున్, నీ, అట్టిరే= వీరులు ఎచ్చటైనా నీవంటివాళ్ళు ఉన్నారా?; నీ, విజయ, వీర్య+అతిశయము= నీ విజయంలోని పరాక్రమం యొక్క గొప్పతనం; పర్యాప్తము+అయ్యె= తృప్తిని కలిగించింది (సంపూర్ణమయింది); తొల్లి= పూర్వం, ఏ, యుగములన్= ఏ యుగాల్లో అయినా; వసుమతీ, నాథులు= భూపతులు-రాజులు; ఎవ్వరున్= ఎవరుకూడ; ఇట్లు= ఈ విధంగా; బలిమిమైన్= బలంతో; ఇట, వచ్చిరే= ఇక్కడికి వచ్చారా; ఉన్నత, ప్రతాప= గొప్ప ప్రతాపం కలవాడా!; వీనిన్= ఈ ప్రదేశాలను; జనులు; ఉత్తర కురు భూములు; అండ్రు= అంటారు; అవని చరులకున్= భూమి మీద సంహరించేవాళ్ళకు; ఇవి= ఈ ప్రదేశాలు; అగోచరంబులు= అగుపించవు; నీకున్; ఇందు; తివిరి= ప్రయత్నించి; ఎద్దియును= దేనినికూడ; సాధించి; కొనఁగన్= తీసుకోటానికి; లేదు.

తాత్పర్యం: భయంకరమైన ఆకారం, అపారమైన బలం కల ఆ హరివాస పుర ద్వారపాలకులు అర్జునుని దగ్గరకు వచ్చి, దేవేంద్రునిలా ఉన్న అతణ్ణి దర్శించి ఆశ్చర్యచకితులై 'కురువంశవీరా! నీవంటి శూరులు ఎక్కడైనా ఉన్నారా! నీ విజయ పరాక్రమంయొక్క గొప్పతనం మాకు తృప్తి కలిగించింది. పూర్వం ఏ యుగాలలో అయినా, ఏరాజులైనా నీవలె బలసంపన్నులై ఇక్కడికి వచ్చారా? ఓ మహావీరా! ఈ ప్రదేశాలను ప్రజలు ఉత్తర కురుభూము లంటారు. నేలమీద సంచరించే సామాన్యులకు ఇవి అగుపించవు. నీవు ప్రయత్నించి సాధించి తీసుకోటానికి ఇక్కడ ఏదీ లేదు.'

విశేషం: విశేష్యానికి ముందు విశేషణాలను వాడటం తెలుగు పద్ధతి. విశేష్యం తరువాత విశేషణాలను ప్రయోగించటం సంస్కృత పద్ధతి. నన్నయ పెక్కుచోట్ల సంస్కృత పద్ధతిని అనుసరించారు. ప్రస్తుత పద్యంలో 'ద్వారపాలకులు' అనే విశేష్యం తరువాత 'దారుణాకారులు, అపారబలాఢ్యులు' అనే విశేషణాలు ప్రయోగించటం ఇటువంటిదే. 'ఏ/య్యువియుఁగొనఁగలేరు తివిరి జనులు (ఒరులు)' అని పెక్కు ప్రతులలోను, 'ఎయ్యవి గొనంగ లేవు నీవు' అని కొన్ని ప్రతులలోను పాఠాంతరా లున్నాయి. మూలంలో - నచాపికించిజ్జేతవ్య మర్జునాత్ర ప్రదృశ్యతే (భండార్కరు ప్రతి 2-25-11), (ఇంక నీకు జయించ వలసిన దేదియు లేదు) అనీ; 'పార్థనేదం త్వయా శక్యం పురం జేతుం కథంచన, ఉపావర్తస్వ కల్యాణ పర్యాప్త మిద మచ్యుత' (భండార్కరు ప్రతి, 2-25-9) (పార్థా! ఇది నీకు జయించ శక్యం కాదు. నీ విజయం సంపూర్ణమైనది. తిరిగి వెళ్ళుము) అనీ ఉన్నాయి.

వ. అయినను నీవచనంబు సేయంగలవారము మమ్ముఁ బనుపు మనిన వారికి నర్జునుం డి ట్లనియె. 238

ప్రతిపదార్థం: అయినను; నీ, వచనంబు= నీవు చెప్పినట్లు; చేయంగలవారము; మమ్మున్; పనుపుము= ఆజ్ఞాపించుము; అనినన్; వారికిన్; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అయినా నీవు చెప్పినట్లు చేస్తాం. మమ్మల్ని ఆజ్ఞాపించు' - అనగానే వారితో అర్జునుడు ఇలా అన్నాడు.

తే. రాజసూయాధ్వరము ధర్మరాజు సేయ । నుత్సహించినవాఁడు తదుత్సవమున
కిందు మీయందుఁ గల వస్తు వెద్దియైన; । నమ్మహీనాథు సామ్రాజ్య మతిశయిల్లు. 239

ప్రతిపదార్థం: ధర్మరాజు; రాజసూయ+అధ్వరము= రాజసూయయాగం; చేయన్= చేయటానికి; ఉత్సహించినవాఁడు= ఉత్సాహంతో ఉన్నాడు; తత్+ఉత్సవమునకున్= ఆయాగానికి; మీయందున్; కల; వస్తువు; ఎద్ది; ఐనన్; ఇందు; ఆ+మహీనాథు, సామ్రాజ్యము; అతిశయిల్లున్= అధికం కాగలదు.

తాత్పర్యం: ధర్మరాజు రాజసూయ మహాయాగం చేయాలన్న ఉత్సాహంతో ఉన్నాడు. ఆ యాగానికి మీవద్ద ఉన్న వస్తు వే దైనా ఇవ్వండి. ఆ మహారాజు సామ్రాజ్యం గొప్పగా ప్రకాశిస్తుంది.

విశేషం: ఇచ్చు ధాతువునకు సంప్రార్థన విధులందు ఇమ్ము-ఇండు అనునవి ఏకవచన బహువచన రూపాలు.

వ. **అనిన నయ్యుత్తర కురు భూముల రాజు లెల్ల నర్జునున కతిప్రీత చిత్తులయి యమూల్యంబులైన యపరిమిత దివ్యరత్నాభరణంబులు దెచ్చియిచ్చిన.** **240**

ప్రతిపదార్థం: అనినన్; ఆ+ఉత్తర కురు భూముల, రాజులు+ఎల్లన్; అర్జుననకున్; అతి, ప్రీతి, చిత్తులు+అయి= మిక్కిలి సంతోషించిన మనస్సులు కలవాళ్ళయి; అమూల్యంబులు+ఐన= చెప్పశక్యం కాని విలువలుఉన్న; అపరిమిత, దివ్య, రత్న+ ఆభరణంబులు= లెక్కకు మిక్కిలి యైన మంచిరత్నాలతో కూడిన నగలను; తెచ్చి; ఇచ్చినన్.

తాత్పర్యం: అని అర్జునుడు అనగా, ఆ ఉత్తర కురు భూములను పాలించే రాజులంతా అపరిమిత సంతోషంతో అర్జునుడికి అమూల్యాలు అసంఖ్యాకాలు అయిన రత్నాభరణాలను తెచ్చి ఇవ్వగా.

తరలము.

తరణిసన్నిభు ధర్మపుత్త్రు నుదారతేజము పర్వ భా
స్వర సుసంపదఁ బాకశాసని శాసనంబున నిట్టు లు
త్తర కురూత్తముఁ దొట్టి యుత్తర ధారుణీశులు వశ్యు లై
కర ధనంబులు దెచ్చియిచ్చిరి గౌరవంబున ధన్యు లై. **241**

ప్రతిపదార్థం: తరణి, సన్నిభు= సూర్యునితో సమానుడైన; ధర్మపుత్త్రు= ధర్మరాజుయొక్క; ఉదార, తేజము= గొప్ప పరాక్రమం; భాస్వర, సుసంపదన్= ప్రకాశించే మంచి సంపదచేత; పర్వన్= వ్యాపించేటట్లు; పాకశాసని, శాసనంబునన్= దేవేంద్రుని కుమారుడైన అర్జునునియొక్క ఆజ్ఞచేత; ఇట్టులు= ఈ విధంగా; ఉత్తర కురు+ఉత్తమున్+తొట్టి= ఉత్తర కురు రాజశ్రేష్ఠుడు మొదలుగా; ఉత్తర ధారుణీ+ఈశులు= ఉత్తర దేశరాజులు; వశ్యులు+ఐ= లొంగిపోయిన వారై; గౌరవంబునన్; ధన్యులు+ఐ= పుణ్యవంతులై; కర, ధనంబులు= కప్పంసొమ్ములు; తెచ్చి; ఇచ్చిరి.

తాత్పర్యం: సూర్యసమానుడైన ధర్మరాజుయొక్క గొప్ప తేజస్సు, వెలిగే సంపదతో విశేషంగా వ్యాపించేటట్లుగా, అర్జునుని ఆజ్ఞకు లొంగి ఉత్తరకురుభూముల రాజులంతా గౌరవంతో కప్పాలు తెచ్చి యిచ్చి ధన్యులయ్యారు.

విశేషం: 'కరధనంబులు'కు - 'కలధనంబులు' అనే పాఠాంతరం ఉంది. ఇది కూడ ఉచితమైందే. కాని ఈ పాఠాన్ని అంగీకరిస్తే ర, ల లకు ప్రాస చెల్లుతుందని గ్రహించవలసి ఉంటుంది. ఈ వృత్తం తరలం. తరలమంటే హారమధ్యరత్నం, ప్రకాశించేది- అని అర్థం. పాండవమధ్యముడైన పార్థుడు ఉత్తర దిగ్విజయ యాత్రను దేదీప్యమానంగా పూర్తి చేసి, అపార ధనరాసులతో తిరిగి రావటాన్ని తరలవృత్తంలో వర్ణించటం ఎంతో ఉచితంగా ఉంది. పాకశాసని - తారకాసురుడి తమ్ముడైన పాకాసురుణ్ణి చంపటంచేత దేవేంద్రునికి పాకశాసను డని పేరు. పాకశాసనుడి కుమారుడు (అపత్యార్థంలో) పాకశాసని - అర్జునుడు వృత్తలక్షణానికి చూడు: సభా 1.192.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీమసేనుండు పూర్వ దిగ్విజయంబు సేయుట (సం. 2-26-1)

వ. అట భీమసేనుండునుం బరచక్రమర్దనంబయిన బలచక్రంబుతోఁ బూర్వ దిక్కునకుం జని పాంచాలపతిచేత సత్కృతుండయి, విదేహరాజు జనకుండను వాని జయించి, దశార్ణపతి యయిన సుధన్వుతో మహాయుద్ధంబు సేసి తత్పరాక్రమంబునకు మెచ్చి వానిం దనకు సేనాపతిం జేసికొని, యశ్వమేధేశ్వరుం డయిన రోచమాను ననుజ సహితుం బరాజితుం జేసి, చేదివిషయంబునకుం జనిన. 242

ప్రతిపదార్థం: అట, భీమసేనుండును; పర, చక్ర, మర్దనంబు+అయిన= శత్రుసమూహాన్ని అణచగలిగిన; బల, చక్రంబుతోన్= బలమైన దండుతో; పూర్వదిక్కునకున్= పూర్వదిశకు; చని= వెళ్ళి; పాంచాలపతిచేతన్= పాంచాలదేశప్రభువుచేత; సత్కృతుండు+అయి= గౌరవించబడినవాడై; విదేహరాజు; జనకుండు; అనువానిన్; జయించి; దశార్ణపతి, అయిన; సుధన్వుతో; మహాయుద్ధంబు; చేసి; తత్, పరాక్రమంబునకున్= అతనియొక్క శౌర్యానికి; మెచ్చి; వానిన్; తనకున్; సేనాపతిన్; చేసికొని; అశ్వమేధ+ఈశ్వరుండు+అయిన= అశ్వమేధానికి రాజైన; రోచమానున్; అనుజ, సహితున్= తమ్ములతో కూడిన వాణ్ణి; పరాజితున్+చేసి= ఓడించి; చేది విషయంబునకున్= చేదిదేశానికి; చనిన= వెళ్ళిన.

తాత్పర్యం: భీమసేనుడు కూడ శత్రు సమూహాన్ని అణచగలిగిన బలమైన సైన్యంతో తూర్పుదిక్కుకు వెళ్ళి, పాంచాల రాజుచేత పూజ లందుకొని, విదేహరాజైన జనకుణ్ణి జయించాడు. తరువాత దశార్ణపతి అయిన సుధన్వునితో మహాయుద్ధం చేసి అతని పరాక్రమానికి మెచ్చి తనకు సేనాపతిగా చేసుకొన్నాడు. అశ్వమేధం చేసిన రాజైన రోచమానుణ్ణి తమ్ములతో సహా ఓడించి చేదిదేశంలో ప్రవేశించాడు.

చ. అతని నతిప్రతాపు ననిలాత్మజుఁ గానఁగవచ్చి చేది భూ
పతి శిశుపాలుఁ డెంతయును భక్తిపరుం డయి రాజసూయ ము
న్నతి నొనరింపనున్న యమనందనుయత్న మెఱింగి రత్నశో
భిత ధనరాసు లిచ్చెఁ గడుఁబ్రీతిసమన్వితుఁ డై ముదంబునన్. 243

ప్రతిపదార్థం: అతనిన్; అతి, ప్రతాపున్= మిక్కిలి పరాక్రమం కలవాణ్ణి; అనిల+ఆత్మజున్= వాయుదేవునియొక్క పుత్రుణ్ణి (భీముణ్ణి); చేది, భూపతి= చేది దేశం యొక్క రాజు; శిశుపాలుఁడు; కానఁగన్, వచ్చి= చూడవచ్చి; ఎంతయును= మిక్కిలి; భక్తిపరుండు+అయి= భక్తితో కూడినవాడై; రాజసూయము; ఉన్నతిన్= గొప్పగా; ఒనరింపన్+ఉన్న= చేయటానికి సిద్ధంగా ఉన్న; యమనందను= యముని పుత్రుడైన ధర్మరాజుయొక్క; యత్నము+ఎఱింగి= ప్రయత్నం తెలుసుకొని; కడున్= మిక్కిలి; ప్రీతి, సమన్వితుఁడు+ఐ= ప్రేమతో కూడుకొన్నవాడై; ముదంబునన్= సంతోషంతో; రత్న, శోభిత, ధనరాసులు= రత్నాలతో వెలుగొందే ధనరాసులను; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: మహాపరాక్రమ శాలి అయిన భీముణ్ణి చేది రాజైన శిశుపాలుడు దర్శించాడు. ఎంతో భక్తితో ధర్మరాజు చేస్తున్న రాజసూయ ప్రయత్నాన్ని గూర్చి తెలుసుకొన్నాడు. ఎంతో ప్రీతితో రత్నశోభితాలైన ధనరాసుల్ని ఆయనకు ఇచ్చాడు.

విశేషం: శిశుపాలుడు ధర్మరాజుపట్ల భక్తి గౌరవాలు కలవాడే. రాజసూయయాగ ప్రయత్నం తెలిసికొని సంతోషించినవాడే. అయితే ధర్మరాజు శ్రీకృష్ణునికి అర్ఘ్య మివ్వటంచేతనే అతడి వైఖరి పూర్తిగా వ్యతిరేకంగా మారింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. భీమసేనుండును శిశుపాలుపురంబునం గొన్నిదినంబు లుండి పూర్వదిక్కున కరిగి, పుళిందపురంబున సుకుమారసుమిత్రులం, గుమారవిషయంబున శ్రేణిమంతునిం, గోసలదేశంబున బృహద్బలు, నయోధ్యాపురంబున దీర్ఘప్రజ్ఞునిఁ, గాశీరాజును సుపార్శ్వుని, రాజపతియైన సుధన్వుని, మత్స్యమలదపతులను గర్ణాట దక్షిణమల్లులను మర్దించి, వారిచేత నపరిమిత ధనంబులుగొని, మగధపతియయిన జరాసంధతనయు సహదేవు నాశ్వాసించి, హిమవత్పర్వత పార్శ్వంబునం జలోద్భవంబనుదేశంబును భల్లాటదేశంబును జయించి, యింద్రపర్వత సమీపంబునం గిరాతపతుల నేడ్వురను శర్మక వర్మకులను జంద్రసేన సముద్రసేనులను గర్ణవత్సపతులను బుండ్రపతినిం బౌండ్రక వాసుదేవుని వశగతులం జేసి. 244

ప్రతిపదార్థం: భీమసేనుండును; శిశుపాల పురంబునన్; కొన్ని; దినంబులు+ఉండి; పూర్వ దిక్కునకున్= తూర్పుదిశకు; అరిగి= వెళ్ళి; పుళింద, పురంబునన్; సుకుమార, సుమిత్రులన్; కుమార, విషయంబునన్= కుమార దేశంలో; శ్రేణిమంతునిన్; కోసల, దేశంబునన్; బృహత్+బలున్; అయోధ్యా, పురంబునన్; దీర్ఘ ప్రజ్ఞునిన్; కాశీరాజును; సుపార్శ్వుని; రాజపతి+ఐన; సుధన్వుని ('రాజపతింక్రథ' మ్మని మూలం); మత్స్య, మలద, పతులను; కర్ణాట, దక్షిణ, మల్లులను; మర్దించి= ఓడగొట్టి; వారిచేతన్; అపరిమిత, ధనంబులు; కొని= తీసుకొని; మగధపతి, అయిన; జరాసంధ, తనయున్; సహదేవున్; ఆశ్వాసించి= అనునయించి; హిమవత్+పర్వత, పార్శ్వంబునన్= హిమవత్పర్వతం ప్రక్కలో; జల+ఉద్భవంబు+అను; దేశంబును; భల్లాట, దేశంబును; జయించి; ఇంద్ర, పర్వత, సమీపంబునన్, కిరాత, పతులన్= బోయరాజులను; ఏడ్వురను= ఏడుమందిని; శర్మక, వర్మకులను; చంద్రసేన, సముద్రసేనులను; కర్ణ, వత్సపతులను; పుండ్రపతినిన్; పౌండ్రకవాసుదేవునిన్; వశగతులన్, చేసి= లోబరచుకొని.

తాత్పర్యం: భీమసేనుడు శిశుపాలుడి పురంలో కొన్నిదినా లుండి, తూర్పుదిక్కునకు వెళ్ళి, ఆయాదేశాల రాజుల నందరిని జయించాడు.

విశేషం: రాజుల పేర్ల విషయంలో వివిధ ప్రతుల్లో భేదాలు ఉన్నాయి. కర్ణాటపదం మూలంలో లేదు. బహుశః నన్నయగారే దీన్ని చేర్చారేమో!

ఉత్సాహము.

అతులశౌర్యుఁ డనిలతనయుఁ డమిత వాహినీ పదా
హతి ధరిత్రి దలర నిట్టు లరిగి పూర్వ దిఙ్మహీ
పతులచేత రత్నరజత భర్మతతులఁ గొనియె భూ
నుతయశుండు వేఱు వేఱ నూఱు కోట్ల సంఖ్యలన్. 245

ప్రతిపదార్థం: అతులశౌర్యుఁడు= సాటిలేని పరాక్రమం కలవాడు; భూనుత, యశుండు= ప్రపంచంచేత కొనియాడబడిన కీర్తి కలవాడు; అనిల, తనయుఁడు= గాలిదేవుని కొడుకు - భీముడు; అమిత, వాహినీ, పదాహతిన్= మితిమీరిన సైన్యంయొక్క పాదాల తాకిడిచేత; ధరిత్రి= భూమి; తలరన్= అదరగా; ఇట్టులు+అ= ఈ విధంగా; అరిగినన్= వెళ్ళగా; పూర్వదిక్+ మహీపతులచేతన్= తూర్పు దిక్కులోని రాజులచేత; రత్న, రజత, భర్మ, తతులన్= రత్నాలయొక్క వెండియొక్క బంగారంయొక్క సమూహాలను; వేఱువేఱు; నూఱుకోట్ల సంఖ్యలన్; కొనియెన్= గ్రహించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సాటిలేని పరాక్రమశాలి, లోకం కొనియాడిన కీర్తిమంతుడు అయిన వాయుపుత్రుడు భీముడు, అపారసైన్యపాదఘట్టనతో భూమి అదిరేటట్లు దండయాత్ర చేసి, తూర్పు దిక్కులోని రాజులచేత వేర్వేరుగా వందకోట్ల రత్నరజతకాంచన రాసులను కప్పంగా తీసుకొన్నాడు.

విశేషం: 'రత్న రజత ధర్మతతు' లకు మూలం - 'కాంచనం రజతం వజ్రం విద్రుమంచ మహాధనమ్' (భండార్కరు ప్రతి. 2-27-26). దిగ్విజయయాత్రనుండి సాటిలేని శౌర్యంతో భీమసేనుడు తిరిగి రావటాన్ని ఉత్సాహవృత్తంలో వర్ణించటం ఎంతో ఉచితంగా ఉంది. ఉత్సాహం జాతివృత్తం. అందులో ప్రతిచరణంలోనూ వరుసగా ఏడుసూర్యగణాలమీద ఒక గురువు నిలుస్తుంది. అయిదవగణంలోని మొదటి అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉంది.

సహదేవుండు దక్షిణ దిగ్విజయంబు సేయుట (సం. 2-28-1)

వ. అట సహదేవుండు దక్షిణ దిక్కున కరిగి సుమిత్ర శూరసేన దంతవక్త్ర యవనులను, గోశృంగగిరి నివాసులను జయించి కుంతిభోజుచేతం బ్రియపూర్వకంబున సత్కృతుం డయి. 246

ప్రతిపదార్థం: అట; సహదేవుండు; దక్షిణ, దిక్కునకున్; అరిగి= వెళ్ళి; సుమిత్ర, శూరసేన, దంతవక్త్ర, యవనులను; గోశృంగగిరి, నివాసులను; జయించి; కుంతిభోజుచేతన్; ప్రియపూర్వకంబునన్= మనసార; సత్కృతుండు+అయి= పూజించబడినవాడై.

తాత్పర్యం: ఇక అక్కడ సహదేవుడు దక్షిణదిశకు వెళ్ళి సుమిత్రుడు, శూరసేనుడు, దంతవక్త్రుడు, యవనులు, గోశృంగగిరి నివాసులు మొదలైన రాజులందరిని జయించి, కుంతిభోజునిచేత మనసార పూజ లందుకొని.

ఆ. జలజనాభుపగతు జంభకుండనువాని । భూరిబలునిపుత్త్రుఁ బోరిలోన
నొడిచి వానిచేత నుత్తమ గజహయ । రత్నతతులు గొని పరాక్రమమున. 247

ప్రతిపదార్థం: జలజనాభు, పగతున్= పద్మనాభునియొక్క - అంటే శ్రీకృష్ణునియొక్క - శత్రువైన; జంభకుండు+అనువానిన్; భూరి, బలుని, పుత్త్రున్= భూరిబలుడు అనేవానియొక్క కుమారుణ్ణి (భూరి బలుడంటే గొప్ప బలం కలవాడు); పోరిలోనన్= యుద్ధంలో; ఒడిచి= ఓడించి; వానిచేతన్; ఉత్తమ, గజ, హయ, రత్న, తతులు= శ్రేష్ఠాలైన ఏనుగుల, గుర్రాల, రత్నాల సమూహాలను; కొని= గ్రహించి; పరాక్రమమునన్= పరాక్రమంతో.

తాత్పర్యం: శ్రీకృష్ణుని విరోధి, భూరిబలుని పుత్రుడు అయిన జంభకుడనే వానిని యుద్ధంలో ఓడించి అతనిచేత శ్రేష్ఠాలైన గజాశ్వరత్నసమూహాల్ని గ్రహించి పరాక్రమంతో.

వ. నర్మదాసమీపంబున నవంతి పతుల విందానువిందుల మందదర్పులం జేసి చని, మాహిష్మతీపురంబు పయి విడిసిన. 248

ప్రతిపదార్థం: నర్మదా, సమీపంబునన్= నర్మదానదానికి దగ్గర; అవంతి, పతులన్= అవంతిదేశరాజులను; వింద+అనువిందులన్; మంద, దర్పులన్+చేసి= అణగిన పొగరు కలవాళ్ళనుగా చేసి (ఓడించి); చని= వెళ్ళి; మాహిష్మతీ, పురంబు; పయి, విడిసినన్= దండెత్తగా.

తాత్పర్యం: నర్మదానదానికి సమీపంలోని అవంతిదేశరాజులైన విందానువిందుల్ని ఓడించి, ముందుకు సాగి మాహిష్మతీపురంమీద దండెత్తగా.

క. వీరుఁడు తత్పురవిభుఁ డు । గ్రారివిమర్దనుఁడు నీలుఁ డనువాఁడు మహా
దారుణబలుఁ డై సమర । ప్రారంభాత్యుగ్రుఁ డయ్యెఁ బాండవుతోడన్. 249

ప్రతిపదార్థం: వీరుఁడు; తత్+పుర, విభుఁడు= ఆమాహిష్మతీపురరాజు; ఉగ్ర+అరి, విమర్దనుఁడు= భయంకరులైన శత్రువుల్ని లెస్సగా అణచేవాడు; నీలుఁడు+అనువాడు; మహా, దారుణ, బలుండు+ఐ= మిక్కిలి భయంకరమైన బలం కలవాడై; పాండవుతోడన్= పాండురాజుపుత్రు డైన సహదేవునితో; సమర, ప్రారంభ+అతి+ఉగ్రుఁడు+అయ్యెన్= యుద్ధాన్ని ప్రారంభించటంలో మిక్కిలి విజృంభించినవా డయ్యాడు.

తాత్పర్యం: వీరుడు, మాహిష్మతీపుర ప్రభుడు, భయంకరశత్రు విమర్దనుడు అయిన నీలుడు, మహాదారుణబలుడై సహదేవునితో యుద్ధానికి విజృంభించాడు.

వ. అంత. 250

తాత్పర్యం: అప్పుడు.

క. దరికొని దహనుం డెగసెను । వరుసను సహదేవుసకలవాహినిమాద్య
త్కరులపయిఁ దురగములపయి । వరరథములపయిఁ బదాతివర్గములపయిన్. 251

ప్రతిపదార్థం: సహదేవు, సకల, వాహినిన్= సహదేవునియొక్క సమస్త సైన్యంలో; మాద్యత్, కరులపయిన్= మదపుటేనుగులమీద, తురగములపయిన్= గుర్రాలమీద; వర, రథములపయిన్= శ్రేష్ఠాలైన రథాలమీద; పదాతివర్గములపయిన్= కాల్బలాల సమూహాలమీద; దహనుండు= అగ్నిదేవుడు; దరికొని= రగుల్కొని; ఎగసెను= విజృంభించాడు.

తాత్పర్యం: క్రమంగా సహదేవుని సైన్యంలోని మదపుటేనుగులమీద, గుర్రాలమీద, రథాలమీద, కాల్బలాల సమూహంమీద అగ్నిదేవుడు రగుల్కొని వ్యాపించాడు.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 252

తాత్పర్యం: అనగా విని జనమేజయుడు వైశంపాయనునితో ఇలా అన్నాడు.

అగ్ని సహదేవుసేనపైఁ బ్రచండశిఖలు కప్పుటకుఁ గారణము (సం. 2-28-16)

ఆ. కడఁగి యనలుఁ డేమి కారణంబున సహ । దేవు సేనపయి నతిప్రచండ
శిఖలు గప్పె? దీనిఁ జెప్పు మేర్పడ నాకు । ననఘ! వినఁగ వేడ్కయైన యదియు. 253

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ వైశంపాయన మహర్షీ!; కడఁగి= పూనుకొని; అనలుఁడు= అగ్ని; ఏమి, కారణంబునన్; సహదేవుసేనపయిన్= సహదేవునియొక్క సైన్యంమీద; అతి, ప్రచండ, శిఖలు= మిక్కిలి తీవ్రాలైన మంటలు; కప్పెన్= పరపాడో; వినఁగన్; వేడ్కఐన, అదియు= వినా లని కుతూహలం కలిగింది; దీనిన్; ఏర్పడన్= స్పష్టంగా; నాకున్; చెప్పుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పుణ్యాత్మా! ఓ వైశంపాయనమహర్షీ! ఏకారణంచేత అగ్నిదేవుడు సహదేవుని సైన్యంమీద మహాతీవ్రమైన మంటలను కప్పాడో వినా లని కుతూహలంగా ఉంది. దీన్ని నాకు స్పష్టంగా చెప్పండి.

వ. **అనిన వైశంపాయనుం డి ట్లని చెప్పెఁ:దొల్లి నీలువంశంబున నిషధుం డనురాజు రాజ్యంబున జాతవేదుండు విప్రుండయి వేదాధ్యయనంబుసేయుచు మాహిష్మతీపురంబున నుండి ప్రమాదవశంబునం బారదారికుండయిన నెఱింగి రాజనియోగులు వానిం బట్టికొని పోయి రాజసమక్షంబున శాస్త్రవిహితదండనంబున దండింపం బోయిన.** **254**

ప్రతిపదార్థం: అనినన్; వైశంపాయనుండు; ఇట్లు+అని; చెప్పెన్; తొల్లి= పూర్వం; నీలు, వంశంబునన్= నీలునియొక్క వంశంలో; నిషధుండు+అను రాజు, రాజ్యంబునన్= రాజుయొక్క రాజ్యంలో; జాతవేదుండు= అగ్నిదేవుడు; విప్రుండు+అయి= బ్రాహ్మణుడై; వేద+అధ్యయనంబు, చేయుచున్= వేదపాఠాలు నేర్చుకొంటూ; మాహిష్మతీపురంబునన్; ఉండి; ప్రమాద, వశంబునన్= ఏమరుపాటున; పారదారికుండు+అయినన్= పరపురుషుని భార్యతో రమించినవాడు కాగా; రాజనియోగులు= రాజభటులు; ఎఱింగి= తెలుసుకొని; వానిన్= ఆ అగ్నిహోత్రుణ్ణి; పట్టికొనిపోయి; రాజసమక్షంబునన్= రాజు ఎదుట; శాస్త్ర విహిత, దండనంబునన్= శాస్త్రంలో చెప్పబడిన శిక్షప్రకారం; దండింపన్+పోయినన్= శిక్షించపోగా.

తాత్పర్యం: అనిన విని వైశంపాయనుడు ఈవిధంగా చెప్పాడు. పూర్వం నీలునివంశంవాడైన నిషధు డనే రాజు రాజ్యం చేస్తుండగా, అగ్నిహోత్రుడు బ్రాహ్మణరూపం ధరించి మాహిష్మతీపురంలో వేదాధ్యయనం చేస్తూ ఉన్నకాలంలో పొరపాటున పరపురుషుని భార్యతో రమించాడు. రాజభటులు దానిని తెలుసుకొని అతణ్ణి బంధించి తీసుకొనిపోయి రాజసమక్షంలో శాస్త్ర ప్రకారం శిక్షించబోగా.

విశేషం: జాతవేదుడు - పుట్టిన వేదాలు కలవాడు - అగ్నిదేవుడు. అంటే ఇతడివల్ల వేదాలు పుట్టాయట. త్రేతాయుగంలో పురూరవుని మనస్సుకు వేదాలు కర్మబోధకాలై మూడు మార్గాలుగా తోచాయి. తాను ఇదివరకు అరణ్యంలో అగ్నిస్థాలిని వదలిన చోటికి వెళ్ళి శమీ(జమ్మి) గర్భంనుండి పుట్టిన అశ్వత్థా(రావిచెట్టు) న్ని చూచి, ఆ అశ్వత్థాన్ని రెండు అరణులుగా చేసి మొదటి అరణి తాననీ, రెండవ అరణి తాను మోహించిన ఊర్వశి అనీ, మధ్యనున్న కాష్ఠం పుత్రుడనీ మంత్రాలు జపించటంచేత జాతవేదు డనే అగ్ని సంభవించిం దట!

క. **అవమానదుఃఖితుండయి । పొవయుచు రోషానలంబు పోఁడిమి వెలుఁగం**
బవనసఖుఁ డుగ్ర కణములు । నెవయఁగఁ దన పొడవు చూపె నిషధుని మ్రోలన్. **255**

ప్రతిపదార్థం: పవనసఖుఁడు= గాలిదేవుని మిత్రుడైన అగ్నిదేవుడు; అవమాన, దుఃఖితుండు+అయి= అవమానంచేత దుఃఖం పొందినవాడై; పొవయుచున్= పొగలుగ్రక్కుతూ; రోష+అనలంబు, పోఁడిమి= రోషమనే అగ్నియొక్క తీవ్రత; వెలుఁగన్= ప్రకాశించగా; ఉగ్ర, కణములు= భయంకరాలైన నిప్పురవ్వలు; నెవయఁగన్= ఎగురగా; నిషధుని మ్రోలన్= నిషధరాజు ఎదుట; తన, పొడవున్= తన యొక్క నిజరూపాన్ని; చూపెన్= చూపించాడు.

తాత్పర్యం: వాయుదేవుని మిత్రుడైన అగ్నిదేవుడు అవమానంతో దుఃఖపడి పొగలు క్రక్కుతూ, రోషంతో భయంకరాలైన నిప్పురవ్వలు ఎగిరేటట్లు నిజరూపాన్ని నిషధుని ముందు చూపించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. వాఁడును గడు భీతుండయి యగ్నిదేవునకు నమస్కరించి 'మహాపురుషా! నాయజ్ఞానంబు సహింపవలయు' నని ముకుళిత కరకమలుం డయిన వానికి వైశ్వానరుండు ప్రసన్నుండయి 'నీ కోరిన వరం బిచ్చెద వేఁడు'మనిన వాఁ డి ట్లనియె. 256

ప్రతిపదార్థం: వాఁడును= ఆ నిషధుడనే రాజుకూడ; కడున్= మిక్కిలి; భీతుండు+అయి= భయపడినవాడయి; అగ్నిదేవునకున్; నమస్కరించి; మహాపురుషా!; నా, అజ్ఞానంబు; సహింపవలయున్+అని; ముకుళిత, కర, కమలుండు+అయినన్= జోడించిన పద్మాల వంటి చేతులు కలవాడు కాగా; వానికిన్; వైశ్వానరుండు= అగ్నిహోత్రుడు; ప్రసన్నుండు+అయి= దయతో కూడినవాడై; నీ, కోరిన, వరంబు= నీవు కోరుకొన్నట్టి వరాన్ని; ఇచ్చెదన్; వేడుము+అనినన్= కోరుకొమ్మని అనగా; వాఁడు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అగ్నిహోత్రుని నిజ రూపం చూచి ఆ నిషధరాజు భయపడ్డాడు. 'మహాపురుషా! నా అజ్ఞానాన్ని సహించు' అని చేతులెత్తి నమస్కరించాడు. అప్పుడు అగ్నిహోత్రుడు దయదలచి 'నీవు కోరినవరం ఇస్తా వేడుకో' అని అనగా, అందుకు నిషధుడు ఇలా అన్నాడు.

విశేషం: వైశ్వానరుడు-విశ్వానరుని పుత్రుడు-అగ్ని. వైశ్వానరుడు శివుణ్ణి గురించి తపస్సు చేసి ఆయన అనుగ్రహంచేత ఆగ్నేయ మూలకు అధిపతి అయ్యాడు.

తే. ఇప్పురంబు జయింపంగ నెవ్వరేని । వత్తు రుద్ధతులయి శత్రువరులు వారు
దర్పమేది నీచేత నిర్దగ్ధులై వి । హీను లవునట్లుగా వర మిమ్ము నాకు. 257

ప్రతిపదార్థం: ఈ+పురంబు= ఈ మాహిష్మతీనగరాన్ని; జయింపంగన్= జయించటానికి; ఎవ్వరు+ఏనిన్= ఎవరైనా; శత్రు, వరులు= బలవంతులైన శత్రువులు; ఉద్ధతులు+అయి= విజృంభించిన వారై; వత్తురు (వచ్చుదురు)= వస్తారో; వారు= ఆ శత్రువులు; దర్పము= గర్వం; ఏది= నశించి; నీచేతన్; నిర్దగ్ధులు+ఐ= పూర్తిగా కాల్చబడినవాళ్ళయి; విహీనులు+అవునట్లుగాన్= మిగలకుండ నశించే వారయ్యేటట్లుగా; వరము+ఇమ్ము.

తాత్పర్యం: 'ఈ మాహిష్మతీ నగరాన్ని జయించటానికి బలమైన శత్రువులు ఎవరైనా విజృంభించి వస్తే, వాళ్ళు గర్వాన్ని కోల్పోయి నీచేత దగ్ధులై పూర్తిగా నశించేటట్లు నాకు వర మివ్వండి' అని ప్రార్థించాడు.

వ. అనిన నా రాజునకు నగ్నిదేవుం డభిమతం బయిన వరం బిచ్చి, 'మఱి నీవు నాకుం బ్రతిప్రియంబు సేయు; మిప్పురంబు నింతు లెంతయు మనోజరాగిణులు గావున వీరల స్వైరిణీవృత్తియెల్ల కాలంబు సహింపవలయు' నని యడిగిన, నాఁటంగోలె మాహిష్మతీ పురంబు స్త్రీలకు స్వైరిణీత్వంబు నిర్దోషంబయ్యె; నగ్నిదేవుండును నప్పురంబుపై వచ్చిన వారలనెల్ల దగ్ధ సైన్యులం జేయుచు దాని రక్షించుచుంటంజేసి పరరాష్ట్రపతు లగ్ని భయంబున నప్పురంబు పరిహరింతు; రది కారణంబుగా సహదేవు సైన్యంబెల్ల నగ్నిపరీతంబయినం జూచి సంచలింపక సహదేవుండు శుచియై వార్చి దర్భశయనంబున శయనించి యగ్నిసూక్తంబుల నగ్నిభట్టారకు ని ట్లని స్తుతియించె. 258

ప్రతిపదార్థం: అనినన్= అని నిషధరాజు వర మడుగగా; ఆరాజునకున్, అగ్నిదేవుండు; అభిమతంబు+అయిన= ఇష్టమైన; వరంబు+ఇచ్చి; మఱి; నీవు, నాకున్; ప్రతి ప్రియంబు= బదులుగా ఇష్టమైన దానిని; చేయుము; ఈ+పురంబు; ఇంతులు=

స్త్రీలు; ఎంతయున్= మిక్కిలి; మనోజరాగిణులు= మన్మథరాగాన్ని కలవాళ్ళు; కావునన్; వీరల; స్వైరిణీ, వృత్తి= స్వేచ్ఛా విహారం; వ్యభిచారం; ఎల్ల, కాలంబు; సహింపవలయున్; అని; అడిగినన్; నాటన్+కోలె= ఆనాటి నుండి; మాహిష్మతీ, పురంబు, స్త్రీలకున్; స్వైరిణీత్వంబు= వ్యభిచారం; నిర్దోషంబు+అయ్యె= తప్పులేని దయింది; అగ్నిదేవుండును; ఆ, పురంబుపై; వచ్చిన, వారలన్+ఎల్లన్= దండెత్తి వచ్చిన వారినందరిని; దగ్ధ, సైన్యులన్= దహించబడినసైన్యాలు కలవాళ్ళనుగా; చేయుచున్; దానిన్= ఆమాహిష్మతీపురాన్ని; రక్షించుచున్+ఉంటన్, చేసి= రక్షిస్తూ ఉండటంవల్ల; పరరాష్ట్రపతులు= ఇతరదేశాల రాజులు; అగ్ని, భయంబునన్= అగ్నివల్ల కలిగే భయంచేత; ఆ+పురంబు; పరిహరించుదురు= వదలివేస్తారు; అది; కారణంబుగా; సహదేవు, సైన్యంబు+ఎల్లన్= సహదేవుని సైన్యమంతా; అగ్ని, పరీతంబు+అయినన్= అగ్నిచే చుట్టబడింది కాగా; చూచి; సహదేవుండు; సంచలింపక= కలత చెందక; శుచి+ఐ= స్నానం చేసి పరిశుద్ధుడై; వార్చి= ఆచమనం చేసి; దర్భ శయనంబునన్= దర్భలతో కూర్చిన పడకమీద; శయనించి= పరుండి; అగ్ని సూక్తంబులన్= అగ్నికి సంబంధించిన వేదమంత్రస్తోత్రాలతో; అగ్ని భట్టారకున్= అగ్నిదేవుణ్ణి; ఇట్లు+అని= ఈ విధంగా; స్తుతియించెన్= స్తోత్రం చేశాడు.

తాత్పర్యం: అగ్నిదేవుడు నిషధరాజు కోరినట్లు వరమిచ్చి, అందుకు బదులుగా తన కిష్టమయిం దొకటి చేయవలసిందని అడిగాడు. 'మాహిష్మతీ పురస్త్రీలు శృంగారవతులు, మన్మథరాగం(కామం) అధికంగా కలవాళ్ళు, అందువల్ల వాళ్ళ వ్యభిచారాన్ని నీ వెప్పుడూ సహించాలి' అన్నాడు. ఆనాటినుండి ఆ పురస్త్రీల వ్యభిచారం తప్పు కాకుండా పోయింది. అగ్నిదేవుడుకూడ ఆ పురంమీద దండెత్తి వచ్చే వారి సైన్యాల్ని దగ్ధం చేస్తూ ఆ పురాన్ని రక్షిస్తూ ఉండటంచేత పరదేశభూపతులు అగ్నిభయంతో ఆదేశం మీదకి దండెత్తటం వదలివేశారు. అగ్నిదేవుడు ఆ కారణంచేతనే సహదేవుని సైన్యాన్ని చుట్టుకొన్నాడు. అయినా సహదేవుడు కలత చెందలేదు. స్నానం చేశాడు. శుచి అయ్యాడు. ఆచమనం చేసి దర్భలతో కూర్చిన పడకమీద పడుకొన్నాడు. వేదోక్తాలైన అగ్నిసూక్తాలతో అగ్నిదేవుణ్ణి ఈ విధంగా స్తుతించాడు.

సీ. 'నీ తదర్థంబులై నిఖిల వేదంబులు । వర్తిల్లు లోకపావనము లగుచుఁ;
బావనంబులలోనఁ బావనుండవు నీవ; । యజ్ఞంబులును నీవ హవ్యవాహ!
ధర్మనిత్యుండైన ధర్మజు కావించు । క్రతువు భవత్ప్రీతికరము గాదె!
దానికి విఘ్నంబు దలఁచుట ధర్మువె? । వరద! వైశ్వానర! వాయుమిత్ర!'

ఆ. యనిన నగ్నిదేవుఁ డతనికి సంప్రీతుఁ । డయి తదీయసేన కగ్నిభయముఁ
బాచె; దాని నెఱిఁగి భక్తుఁడై నీలుండు । కౌరవేంద్రుననుజుఁ గానవచ్చె. 259

ప్రతిపదార్థం: వరద!= వరాలిచ్చేవాడా!; వైశ్వానరా!= అగ్నిహోత్రా!; వాయుమిత్ర!= వాయుదేవునికి మిత్రుడా!; నీతదర్థంబులు+ఐ= నీకొరకైనవి; నిఖిల, వేదములు= అన్ని వేదాలు; లోక పావనములు+అగుచున్= లోకాన్ని పవిత్రం చేసేవై; వర్తిల్లున్= ఉంటున్నాయి; హవ్యవాహ!= అగ్నిహోత్రా!; పావనంబులలోనన్= పవిత్రాలైన వాటిల్లో; పావనుండవు= పవిత్రమైనవాడవు; నీవు+అ= నీవే; హవ్యవాహ!= అగ్నిదేవుడా!; యజ్ఞంబులును= యాగాలు కూడా; నీవు+అ= నీవే; ధర్మ, నిత్యుండు+ఐన= ఎడతెగని ధర్మాచరణం కలవాడైన; ధర్మజు, కావించు, క్రతువు= ధర్మరాజు చేసే యజ్ఞం; భవత్, ప్రీతికరము= నీకు ఇష్టమైంది; కాదు+ఎ= కాదా?; దానికిన్= ఆయజ్ఞానికి; విఘ్నంబు; తలఁచుట= ఆటంకాన్ని కలుగజేయాలనుకోవటం; ధర్మువు+ఎ= ధర్మమా?; అనినన్; అగ్నిదేవుఁడు; అతనికిన్= సహదేవుడికి; సంప్రీతుండు+అయి= మిక్కిలి ప్రీతి చెందినవాడయి; తదీయ, సేనకున్= అతనియొక్క సైన్యానికి; అగ్నిభయమున్; పాచెన్= తొలగించాడు; దానిన్+ఎఱిఁగి= దాన్ని తెలుసుకొని; నీలుండు= నీలుని వంశంవాడైన నిషధుడనే రాజు; భక్తుఁడై; కౌరవ+ఇంద్రు, అనుజున్= కౌరవపతి అయిన ధర్మరాజు తమ్ముణ్ణి-సహదేవుణ్ణి; కానవచ్చెన్= దర్శనం చేసుకొనటానికి వచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఓ వరదా! అగ్నిహోత్రా! వాయుమిత్రా! వేదాలన్నీ నీ కారణంగానే కదా లోకాన్ని పవిత్రం చేస్తున్నాయి. హవ్యవాహనా! పవిత్రాలైన వాటిలో పవిత్రుడివి నీవే. యజ్ఞాలుకూడా నీవే. ధర్మపరుడైన ధర్మరాజు చేసే రాజసూయయాగం నీకు ప్రీతికరం కాదా? దానికి విఘ్నం చెయ్యాలనుకోవటం నీకు ధర్మమా!' అని సహదేవు డనగా, అగ్నిదేవుడు సంతృప్తుడై అతని సేనకు అగ్నిభయాన్ని తొలగించాడు. దాన్ని తెలుసుకొని నీలుని వంశంవాడైన నిషధుడు భక్తితో సహదేవుని దర్శనం చేసుకొన్నాడు.

విశేషం: హవ్యవాహుడు - హవ్యాలను (హోమంలో వేసిన ఆహుతులను) దేవతలకు మోసుకొని పోయేవాడు - అగ్నిహోత్రుడు.

సహదేవుఁడు దక్షిణ దిఙ్మహీపతులచేఁ గప్పములు గొనుట (సం. 2-28-37)

క. **దేవప్రభావుఁ డగు సహ । దేవునకు హయద్విపేంద్ర దివ్యాంబర నా**
నా విధ రత్నమయాభర । ణావలి లలిఁ దెచ్చి యిచ్చె నధిక ప్రీతిన్. **260**

ప్రతిపదార్థం: దేవప్రభావుఁడు+అగు= దేవతా సమానమైన తేజస్సు కలవాడైన; సహదేవునకున్; అధికప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; హయ, ద్విప+ఇంద్ర, దివ్య+అంబర, నానావిధ, రత్నమయ+ఆభరణ+ఆవలిన్= గుర్రాలయొక్క, మదపుటేనుగుల యొక్క, మంచి వస్త్రాలయొక్క, అనేక విధాలైన రత్నాభరణాలయొక్క సమూహాన్ని; లలిన్= క్రమంగా; తెచ్చి, ఇచ్చెన్.

తాత్పర్యం: దేవసమానుడయిన సహదేవునికి ఎంతో ప్రీతితో గుర్రాల్ని, మదపుటేనుగుల్ని, మంచి వస్త్రాల్ని నానావిధరత్నాభరణాల్ని క్రమంగా తెచ్చి ఇచ్చాడు.

వ. **ఇట్లు మాహిష్మతీపురంబు సాధించి నీలుచేత నరిగొని సహదేవుండు దక్షిణదిక్కున కరిగి సౌరాష్ట్రదేశంబున నుండి రుక్మి భీష్మక శూర్పారక దండక పతులచేత దూతముఖంబున నసంఖ్యాత ధనంబులు గొని సాగరద్వీపవాసు లైన నిషాదులం బురుషాదుల నేకపాదులం గాలముఖులం గర్ణప్రావరణుల నర రాక్షస యోనుల రామశైల కోలశైల తామ్రద్వీప సంజయంతీపుర నివాసులను వశగతులంజేసి.** **261**

ప్రతిపదార్థం: ఇట్లు; సహదేవుండు; మాహిష్మతీపురంబు, సాధించి; నీలుచేతన్; అరి, కొని= కప్పాన్ని గ్రహించి; దక్షిణ దిక్కునకున్+అరిగి= దక్షిణ దిశకు వెళ్ళి; సౌరాష్ట్రదేశంబునన్+ఉండి; దూతముఖంబునన్= దూతద్వారా; రుక్మి, భీష్మక, శూర్పారక, దండకపతులచేతన్; అసంఖ్యాత, ధనంబులు= అపరిమితాలైన సంపదలు; కొని= గ్రహించి; సాగరద్వీప, వాసులు+ఐన= సముద్ర ద్వీపాలలో నివసిస్తున్న; నిషాదులన్; పురుషాదులన్, ఏకపాదులన్; కాలముఖులన్; కర్ణ ప్రావరణులన్; నర, రాక్షస, యోనులన్= నర రాక్షస జాతులవాళ్ళను; రామశైల, కోలశైల, తామ్రద్వీప, సంజయంతీపుర, నివాసులను; వశగతులన్; చేసి= లోబరచుకొని.

తాత్పర్యం: ఈవిధంగా సహదేవుడు మాహిష్మతీపురాన్ని జయించి నిషధునిచేత కప్పం గ్రహించి, దక్షిణ దిశగా వెళ్ళి, సౌరాష్ట్రదేశంలో నిలిచి, దూతద్వారా - రుక్మి, భీష్మక, శూర్పారక, దండకరాజులచేత అపారధనాలు గ్రహించి, సముద్రద్వీపవాసులైన - నిషాద, పురుషాద, ఏకపాద, కాలముఖ కర్ణ ప్రావరణులనే నరరాక్షస జాతులవారిని, రామశైల, కోలశైల తామ్రద్వీప సంజయంతీపుర నివాసుల్ని వశపరచుకొని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తాళవన పాండ్య కేరళ । కాళింగ ద్రవిడ యవన కరహాటక భూ
పాలకుల నొడిచి దక్షిణ । వేలావన భూములందు విడిసి కడంకన్. 262

ప్రతిపదార్థం: తాళవన, పాండ్య, కేరళ, కాళింగ, ద్రవిడ, యవన, కరహాటక; భూపాలకులన్= రాజులను; ఒడిచి= ఓడించి; దక్షిణ, వేలా, వన, భూముల+అందున్= దక్షిణ సముద్రపు చెలియలికట్ట చెంత ఉండే అడవి ప్రదేశాల్లో; విడిసి= దండు విడిసి; కడంకన్= పూనికతో.

తాత్పర్యం: తరువాత సహదేవుడు తాళవన, పాండ్య, కేరళ, కాళింగ, ద్రవిడ, యవన, కరహాటక రాజులను ఓడించి దక్షిణ సముద్రతీర వనభూముల్లో దండు విడిసి పూనికతో.

విశేషం: మూలంలో - ఆంధ్రాం స్తాళవనాంశ్చైవ (భండార్కరు ప్రతి. 2-28-48) అని ఉంది. నన్నయ పద్యంలో ఆంధ్రపదం లోపించింది. ఇది బుద్ధిపూర్వకమో (గౌరవప్రదమైన సందర్భం కాదు గనుక), లేక ఆయన చూచిన ప్రతులలో ఆ పదం లేదో!

చ. కురువిభు రాజసూయమునకున్ ధన మిచ్చిరి రాజులెల్ల నా
దరమునఁ బ్రీతి సేయునది దానును దప్పక యంచు లంక క
చ్చెరువుగఁ బుచ్చె దూతలఁ బ్రసిద్ధిగ నంత విభీషణుండు చె
చ్చెర సహదేవు శాసనము చేకొని సేసెఁ గరంబు నెమ్మితోన్. 263

ప్రతిపదార్థం: కురువిభు, రాజసూయమునకున్= కురువంశ ప్రభువైన ధర్మరాజుయొక్క రాజసూయ యాగానికి; ఆదరమునన్= మన్ననతో; రాజులు+ఎల్లన్= రాజులందరు; ధనము+ఇచ్చిరి; తానును= తానుకూడ; తప్పక; ప్రీతి, చేయునది= ప్రేమతో ధనం ఇవ్వవలసింది; అంచున్= అని, అంటూ; లంకకున్= లంకానగరానికి; అచ్చెరువుగన్= ఆశ్చర్యం కలిగేటట్లుగా; దూతలన్; పుచ్చెన్= పంపాడు; అంతన్= అప్పుడు; విభీషణుండు= విభీషణుడు; ప్రసిద్ధిగన్= గొప్పగా; చెచ్చెరన్= వేగమే; సహదేవు, శాసనము= సహదేవుని యొక్క ఆజ్ఞ; చేకొని= గ్రహించి; నెమ్మితోన్= ప్రేమతో, కరము, చేసెన్= కప్పాన్ని ఇచ్చాడు. (కరంబు నెమ్మితోన్= మిక్కిలి ప్రీతితో; అతని ఆజ్ఞ చేశాడు; ధనమిచ్చాడు).

తాత్పర్యం: సహదేవుడు దక్షిణసముద్రతీరవనభూముల్లో విడిది చేసి లంకాధిపతి అయిన విభీషణునికి దూతలద్వారా-'ధర్మరాజురాజసూయానికి రాజులంతా ధనమిచ్చా'రని, 'నీవుకూడ ప్రీతితో ఈయవలసిం'దని చెప్పి పంపాడు. విభీషణుడు సహదేవుని ఆజ్ఞను శిరసావహించి వెంటనే ఆవిధంగా చేశాడు. (కప్పం తెచ్చి ఇచ్చాడు)

విశేషం: ఈ పద్యానికి ముందు కొన్ని ప్రతుల్లో 'ఇట్లు సేతు బంధన సమీపంబున విడిసిన సహదేవుండు ఘటోత్కచుం దలంచిన తత్క్షణంబ వచ్చి దండప్రణామంబు సేసి ముకుళితహస్తుం డయి పని యేమి యనుటయు, నీవు విభీషణుకడకుం జని యుపాయనంబు గొని రమ్మని పంచిన, వాఁడును గగనమార్గంబున లంకకుం జని రాక్షసేంద్రుండగు విభీషణునిఁ గాంచి, కృష్ణ సహాయుండగు ధర్మరాజు రాజసూయారంభంబును తత్కారణంబున భీమార్జున నకుల సహదేవుల దిగ్విజయార్థం బరుగుటయు, వారలలోన దక్షిణ దిశకుం జనుదెంచిన సహదేవు శాసనంబున తాను దూతయై వచ్చుటయుఁ దనపేరు భీమసేన పుత్త్రుం డయిన ఘటోత్కచుం డని విన్నవించి' అనే వచనం ఉంది. దీనికి మూలం శ్రీ పి.పి.యస్.శాస్త్రిగారి దాక్షిణాత్య సంస్కృత భారత ప్రతిలో 2-27-125 నుండి 203 వరకు ఉందిగాని భండార్కర్‌వారి సంస్కృత భారత ప్రతిలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లేదు. - (మహాభారత సంశోధిత ప్రతి). (సౌకుమార్యమనే శబ్దగుణం సార్థకంగా ఈ పద్యరచనలో దర్శన మిస్తుంది. - సంపా.) త్రేతాయుగంనాటి విభీషణుడు చిరంజీవి గనుక ద్వాపరయుగంలో కూడా ఉన్నాడు.

మ. **పరఁగన్ దక్షిణ దిజ్మహీపతులచేఁ బౌలస్త్యుచే నిట్లు దు**
ర్ధర శక్తిన్ సహదేవుఁ డర్థములు రత్నవ్రాతముల్ చందనా
గురు కాష్ఠాదులు గప్పముల్ గొనియెఁ బెక్కుల్ పేర్మితో నుర్వరా
మరలక్ష్మీకరుఁ డైన ధర్మసుతుసామ్రాజ్యంబు పూజ్యంబుగన్. **264**

ప్రతిపదార్థం: సహదేవుఁడు; ఇట్లు= ఈ విధంగా; దుర్ధర, శక్తిన్= సహించ సాధ్యంగాని బలంతో; పరఁగన్= ఒప్పగా; దక్షిణ, దిక్+మహీపతులచేన్= దక్షిణదిశలో ఉండే రాజులచేత; పౌలస్త్యుచేన్= పులస్త్య బ్రహ్మపుత్రుడైన విభీషణునిచేత; అర్థముల్= ధనాలు; రత్న, వ్రాతముల్= రత్నసమూహాలు; చందన+అగురు, కాష్ఠ+ఆదులు= మంచిగంధంయొక్క, అగురుయొక్క కొయ్యలు మొదలైన; కప్పముల్; పెక్కుల్= అనేకాలు; ఉర్వరా+అమర, లక్ష్మీకరుఁడు+ఐన= భూసురులకు (బ్రాహ్మణులకు) సంపదను కలిగించేవాడైన; ధర్మసుతు, సామ్రాజ్యంబు; పూజ్యంబుగన్= పూజించదగినది అయ్యేటట్లు; పేర్మితోన్= గౌరవంతో; కొనియెన్= గ్రహించాడు.

తాత్పర్యం: బ్రాహ్మణులకు సగౌరవంగా దక్షిణ లిచ్చే ధర్మరాజుసామ్రాజ్యం పూజ్యార్హ మయ్యేటట్లు సహదేవుడు సహించశక్యంగాని బలంతో, దక్షిణ దిశలో ఉండే రాజులచేత పులస్త్యుని పుత్రుడైన విభీషణునిచేత ధనాలు, రత్న సమూహాలు, మంచి గంధం చెక్కలు, అగరు కొయ్యలు మొదలైన కప్పాలు ఎన్నింటినో గ్రహించాడు.

విశేషం: ధర్మజుని చక్రవర్తివైభవం ధ్వనింపజేసే ఈ పద్యం ప్రసాదగుణరంజితంగా నన్నయ తీర్చిదిద్దాడు. (సంపా.)

నకులుఁడు పశ్చిమ దిగ్విజయంబు సేయుట (సం. 2-29-2)

క. **నకులుఁడు పశ్చిమ దిక్కున । కకుటిల శౌర్యంబు మెఱయ నరిగి యరాతి**
ప్రకర భయానక సేనా । ధికుఁడయి నిజతేజ మెల్లదిక్కుల వెలుఁగన్. **265**

ప్రతిపదార్థం: నకులుఁడు; పశ్చిమదిక్కునకున్= పడమటి దిశకు; అకుటిల, శౌర్యంబు, మెఱయన్= మొక్కవోని శూరత్వం ప్రకాశించగా, అరిగి= వెళ్ళి; అరాతి, ప్రకర, భయానక, సేనా+అధికుఁడు+అయి= శత్రు సమూహానికి భయాన్ని కలిగించే సేన చేత మించినవాడై; నిజ, తేజము= తనయొక్క కాంతి; ఎల్ల, దిక్కులన్, వెలుఁగన్= అన్ని దిశల ప్రకాశించగా.

తాత్పర్యం: మొక్కవోని శౌర్యంతో నకులుడు పశ్చిమ దిశకు వెళ్ళి, శత్రు సమూహానికి భయం కలిగించే సేనతో అధికుడై తనకాంతి అన్నిదిక్కుల వెలుగగా.

ఉ. **యోధుల సింహనాదము మదోత్కటవారణబృంహితంబు వే**
గాధికవాజిహేషిత మహారవమున్ రథనేమిఘోషమున్
బాధితకర్ణరంధ్రమయి పర్వె దిగంతము లెల్ల మ్రోయ నం
భోధిరవంబపోలెఁ గురుపుంగవు నచ్చతురంగవాహినిన్. **266**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కురుపుంగవు= కురుశ్రేష్ఠుడైన నకులునియొక్క; ఆ+చతురంగ, వాహినిన్= ఆ రథ, గజ, తురంగ పదాతులతో కూడిన సైన్యంలో; యోధుల సింహనాదము= వీరులయొక్క గర్జన ధ్వని; మద+ఉత్కట, వారణ, బృంహితంబు= లెస్సగా మదించిన ఏనుగులయొక్క ఘీంకారం; వేగ+అధిక, వాజి, హేషిత, మహారవమున్= మిక్కిలి వేగంగల గుర్రాల సకిలింతలయొక్క పెద్దశబ్దం; రథనేమి ఘోషమున్= రథచక్రాల కమ్ముల ధ్వని; అంభోధి, రవంబు+అ, పోలెన్= నీటికి నిలయమైన సముద్రంయొక్క ఘోషవలె; బాధిత, కర్ణ, రంధ్రము+అయి= బాధించబడిన కర్ణ రంధ్రాలు కలదై; దిక్+అంతములు+ఎల్లన్= దిక్కులచివరి భాగాలన్నీ; మ్రోయన్= మారుమోగేటట్లు; పర్వెన్= వ్యాపించింది.

తాత్పర్యం: కురువంశ శ్రేష్ఠుడైన నకులుడి చతురంగ సైన్యంలో - వీరుల సింహనాదం, మదపుటేనుగుల ఘీంకారం, మిక్కిలి వేగంగల గుర్రాల సకిలింతల శబ్దం, రథ చక్రాల ధ్వని, సముద్రఘోషలా చెవుల్ని బ్రద్దలు చేస్తూ దిక్కులెల్ల మారు మ్రోగేటట్లు వ్యాపించింది.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు మాద్రేయుండు రౌద్రాకారంబునఁ గసిమసంగి మహాసేనాన్వితుండయి యరిగి మహాసేనరక్షితంబైన మహితక విషయంబున దత్తక మయూరకాది శూద్రులతోఁ గయ్యంబు చేసి, మరు మాళవ బర్బర కర్బర శైరీషక దాశార్ణ దేశంబుల రాజుల జయించి, పుష్కరారణ్యనివాసులైన యాభీరగణంబులను సరస్వతీసింధు కూలాశ్రితు లైన గ్రామణీయులను బంచనదామరపర్వతనివాసులను వశగతులం జేసికొని వాసుదేవునకు నిజాగమనం బెఱింగించి పుచ్చి. 267

ప్రతిపదార్థం: ఇట్లు; మాద్రేయుండు= మాద్రీ తనయుుడైన నకులుడు; రౌద్ర+ఆకారంబునన్= భయంకరమైన రూపంతో; కసిమసంగి= విజృంభించి; మహాసేనా+అన్వితుండు+అయి= గొప్పసేనతో కూడుకొన్నవాడై; అరిగి= వెళ్ళి; మహాసేన, రక్షితంబు+ఐన= మహాసేనునిచేత రక్షింపబడిందైన; మహితక, విషయంబునన్= మహితకదేశంలో; దత్తక, మయూర+ఆది= దత్తకుడు, మయూరకుడు, మొదలయిన; శూద్రులతోన్; కయ్యంబుచేసి= యుద్ధం చేసి; మరు, మాళవ, బర్బర, కర్బర, శైరీషక, దాశార్ణ దేశంబుల, రాజులన్; జయించి; పుష్కర+అరణ్య, నివాసులు+ఐన; ఆభీరగణంబులను= యాదవ సమూహాలను; సరస్వతీ, సింధుకూల+ఆశ్రితులు+ఐన= సరస్వతీ సింధునదీ తీరాలను ఆశ్రయించి ఉండే; గ్రామణీయులను; పంచనద+అమర, పర్వత, నివాసులను; వశగతులన్+చేసికొని= లోబరచుకొని; వాసుదేవునకున్= శ్రీకృష్ణునికి; నిజ+ఆగమనంబు= తన రాకను; ఎఱింగించి పుచ్చి= తెలియబంపి.

తాత్పర్యం: ఈవిధంగా మాద్రీసుతు డైన నకులుడు భయంకరంగా విజృంభించి, పెద్దసైన్యాన్ని వెంటతీసికొని వెళ్లి, మహాసేనుని రక్షణలో ఉన్న మహితక దేశంలో దత్తక మయూరకాది శూద్రులతో యుద్ధం చేసి, మరు, మాళవ, బర్బర, కర్బర శైరీషక దాశార్ణదేశ రాజులను జయించాడు. పుష్కరారణ్యంలో నివసించే యాదవ సమూహాలను సరస్వతీ సింధు తీరాలలో ఉండే గ్రామణీయులను, పంచనద, అమర పర్వతాలలో ఉన్న వాళ్ళను వశపరచుకొని శ్రీకృష్ణునికి తనరాకను తెలియ చేశాడు.

విశేషం: ఆయా దేశాల పేర్ల విషయంలో భిన్నప్రతుల్లో భేదాలు ఉన్నాయి. 'గ్రామణేయా మహాబలాః' అని మూలం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **శాకలపురమందు శల్యు మద్రేశ్వరుఁ । దమ మేనమామ నుత్తమగుణాఢ్యుఁ**
గానంగ నరిగి సత్కారపూర్వకముగా । వస్తువాహనములు వానిచేతఁ
గొని, పశ్చిమాంబుధి కుక్షినివాసులఁ । బరమదారుణుల బర్బర కిరాత
వీరుల నోడించి, విభుఁ డిట్లు వరుణేంద్ర । పాలిత దిఙ్మహీపతులచేత

ఆ. **బలిమిఁ గొనిన ధనము పదివేలు లొట్టియల్ । పెఱిఁగి రాఁగ వైరిభీకరుండు**
వచ్చె నకులుఁ డమిత వాహినీ పదహతిఁ । దల్లడిల్లుచుండ ధరణితలము. 268

ప్రతిపదార్థం: వైరి భీకరుండు= శత్రువులకు భయాన్ని కలిగించేవాడైన; నకులుఁడు; శాకల పురమందున్; శల్యు; మద్ర+ఈశ్వరున్= మద్రరాజును; తమ మేనమామన్; ఉత్తమగుణ+ఆఢ్యున్= ఉత్తమ గుణాలతో కూడుకొన్నవానిని; కానంగన్= చూడటానికి; అరిగి= వెళ్ళి; సత్కార పూర్వకముగన్= మర్యాద మున్నుగా; వస్తు, వాహనములు; వానిచేతన్; కొని= గ్రహించి; పశ్చిమ+అంబుధి, కుక్షి, నివాసులన్= పశ్చిమ సముద్ర గర్భంలో నివసించే వాళ్ళను; పరమ, దారుణులు= మిక్కిలి భయంకరులు అయిన; బర్బర, కిరాత వీరులన్; ఓడించి; విభుఁడు= ప్రభువు (నకులుడు); ఇట్లు= ఈవిధంగా; వరుణ+ఇంద్ర, పాలిత, దిక్+మహీపతులచేతన్= వరుణరాజుచేత పాలించబడే దిక్కులోని రాజులచేత; బలిమిన్, కొనిన= బలవంతంగా గ్రహించిన, ధనము= ధనాన్ని; పదివేల లొట్టియల్= పదివేల ఒంటెలు; పెఱిఁగి= మోసికొని; రాఁగన్; ధరణితలము= భూమిపైభాగం; అమిత, వాహినీ, పదహతిన్= అపారమైన సైన్యంయొక్క పాదాల తాకిడిచేత; తల్లడిల్లుచున్+ఉండన్= చలిస్తూ ఉండగా; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: శత్రుజన భయంకరుడైన నకులుడు, శాకలపురంలో సద్గుణసమేతుడైన తన మేనమామ, మద్రపతి, శల్యుడిని చూడటానికి వెళ్ళాడు. మర్యాదపూర్వకంగా అతనిచేత అనేక వస్తు వాహనాలు గ్రహించాడు. పశ్చిమ సముద్ర గర్భంలో నివసించే పరమదారుణులు అయిన బర్బర కిరాత వీరుల్ని ఓడించాడు. పశ్చిమదిశలోని రాజులందరిచేత బలవంతంగా గ్రహించిన ధనాన్నంతా పదివేల ఒంటెలచేత మోయించుకొని అంతులేని సైన్య పాదఘట్టనతో భూతలం గ్రక్కదలేటట్లు వచ్చాడు.

విశేషం: అనేక ప్రతుల్లో శాకల్యపురమని ఉంది. 'శాకల మభ్యేత్య' అని మూలం (భండార్కరు ప్రతి 12-29-13). 'పదివేల లొట్టియల్ పెఱిఁగి రాఁగ' - కు 'పదివేల యొంటెలం బెఱికి రాఁగ' అని ఒక పాఠాంతరం ఉంది.

వ. **ఇట్లు భీమార్జున నకుల సహదేవులు పరాక్రమంబున దిగ్విజయంబుసేసి చతురుదధి పరీత మహీతలంబునంగల రాజులచేత నసంఖ్యాత ధన వస్తు వాహన నివహంబులు గొని వచ్చి వేఱు వేఱ ధర్మరాజునకుం జూపి యిచ్చిన.** 269

ప్రతిపదార్థం: ఇట్లు; భీమ+అర్జున, నకుల, సహదేవులు; పరాక్రమంబునన్= పరాక్రమంతో; దిక్+విజయంబు, చేసి= నాలుగు దిక్కులను జయించి; చతుః+ఉదధి, పరీత, మహీతలంబునన్= నాలుగు సముద్రాలచే వ్యాప్తి చెందిన భూప్రదేశంలో; కల= ఉన్న; రాజులచేతన్; అసంఖ్యాత ధన, వస్తు, వాహన, నివహంబులు= లెక్కకు మిక్కిలిగా ధన వస్తు వాహన సమూహాలు; కొనివచ్చి= తీసుకొనివచ్చి; వేఱువేఱన్, ధర్మరాజునకున్; చూపి; ఇచ్చినన్.

తాత్పర్యం: ఈ విధంగా భీమార్జున నకుల సహదేవులు నలుగురు పరాక్రమంతో దిక్కులను జయించి, నాలుగు సముద్రాలచే వ్యాప్తినొందిన భూమిమీద గల రాజులందరిచేత లెక్కకు మిక్కిలిగా ధన వస్తు వాహన సమూహాలు తీసుకొనివచ్చి, వేరు వేరుగా ధర్మరాజుకు చూపి ఇచ్చారు.

క. ఉరుగుణవిశుద్ధ రత్నో। త్కర నానాధన సమృద్ధిఁ గడు నధికుండై
కురువృషభుఁడు గీడ్పఱిచెను। వరుణ ధనేశ్వరుల విభవ వైభవయుక్తిన్. 270

ప్రతిపదార్థం: కురువృషభుఁడు= కురువంశ శ్రేష్ఠుడైన ధర్మరాజు; ఉరు, గుణ, విశుద్ధ, రత్న+ఉత్కర, నానా, ధన సమృద్ధిన్= గొప్ప శ్రేష్ఠత గల స్వచ్ఛమైన రత్నసమూహాలతో కూడుకొన్న వివిధసంపదలయొక్క నిండుదనంచేత; కడున్= మిక్కిలి; అధికుండు+ఐ= ఎక్కువ వాడై; విభవ వైభవ యుక్తిన్= ఐశ్వర్యంయొక్క ఆధిక్యంతో కూడి ఉండటంలో; వరుణ, ధన+ఈశ్వరుల= వరుణదేవుని, కుబేరుని; కీడు, పఱిచెను= క్రిందు చేశాడు.

తాత్పర్యం: కురువంశ శ్రేష్ఠుడైన ధర్మరాజు ఎంతో శ్రేష్ఠత గల స్వచ్ఛమైన రత్న సమూహాలతో కూడుకొన్న నానావిధ ధనసమృద్ధితో అత్యధికుడై, ఆ వరుణకుబేరులనే తక్కువ చేశాడు.

విశేషం: రత్నాలకు స్థానం సముద్రం. అందుచేతనే దానికి రత్నాకరం అని కూడ పేరు. రత్నాకరా లన్నింటికి అధిపతి వరుణుడు. రత్నసంపదలో ఆయన అందరికంటే అధికుడు. ధనపతి కుబేరుడు. ఆయనకు ధనదు డని కూడ పేరు. ధనసమృద్ధిలో కుబేరుని మించినవాళ్ళు లేరు. రత్నసంపదలో, ధనసంపదలో ధర్మరాజు- అలాంటి వరుణకుబేరులనే తక్కువ చేశాడు.

రాజసూయము సేయుమని ధర్మజున కతనియాప్తులు సెప్పుట (సం. 2-30-8)

వ. మఱియు ధర్మోపార్జిత రక్షిత ప్రవర్ధితంబయిన మహాధనవర్గంబుఁ జూచి పాత్రప్రతిపాదనంబు నియోగింప సమకట్టి రాజసూయాధ్వరారంభసుస్థిరనివేశితబుద్ధియై యున్న యయ్యుధిష్ఠిరు నభిప్రాయంబున కనుగుణంబుగా నాప్తమంత్రు లి ట్లనిరి. 271

ప్రతిపదార్థం: మఱియున్= అంతే కాక; ధర్మ+ఉపార్జిత, రక్షిత, ప్రవర్ధితంబు+అయిన= ధర్మ పద్ధతిన సంపాదించబడి, రక్షింపబడి లెస్సగా వృద్ధి పొందించబడిన; మహా, ధన, వర్గంబున్= గొప్ప ధన సమూహాన్ని; చూచి; పాత్ర, ప్రతిపాదనంబు= తగిన రీతిని వినియోగాన్ని-అంటే తగిన రీతిలో ఖర్చు చేయటాన్ని, తగిన వారికి దానరూపంలో ఇచ్చి వేయటాన్ని; నియోగింపన్= ఆజ్ఞాపించ; సమకట్టి= పూనుకొని; రాజసూయ+అధ్వర+ఆరంభ, సుస్థిర, నివేశిత, బుద్ధి+ఐ= రాజసూయయాగాన్ని ప్రారంభించటంలో చొప్పించిన మనస్సు కలవాడై; ఉన్న; ఆ+యుధిష్ఠిరు+అభిప్రాయంబునకున్= ఆ ధర్మరాజుయొక్క ఉద్దేశానికి; అనుగుణంబుగాన్= తగినట్లుగా; ఆప్తమంత్రులు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: క్షత్రియధర్మాన్ని అనుసరించి ఆర్జించి, రక్షించి, లెస్సగా వృద్ధిచెందించిన మహాధనసమూహాన్నంతా చూచి, తగిన రీతిగా దానివినియోగాన్ని ఆజ్ఞాపించటానికి పూనుకొని, రాజసూయయాగ ప్రారంభాన్నిగూర్చి గట్టిగా ఆలోచిస్తున్న ధర్మరాజు అభిప్రాయానికి తగినట్లు అతని ఆప్తమంత్రులు ఈ విధంగా అన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. కురువీర! నీ ధర్మపరిపాలనంబున । నీ గుణసంపద నీ విశుద్ధ
చారిత్రమునఁ జేసి ధారుణి ప్రజ కెల్ల । నభివృద్ధియయ్యె నెయ్యంబుతోడ;
రాజవంచకులయు రాజవల్లభులయుఁ । దస్కరులయు బాధ దఱిఁగె; రుజయుఁ
బగయును భయమును వగయును వెఱపును । నాదిగాఁ గల యెగ్గు లడఁగెఁ బుడమి;

ఆ. నర్ఘ్య లోలిఁ బెరిఁగె; నవనీశులెల్ల నీ । యనుజవీర్యవిజితు లయి త్వదీయ
శాసనస్థు లయిరి జగతీశ! యిదియ నీ । యజ్ఞ కార్యమునకు నవసరంబు. 272

ప్రతిపదార్థం: కురువీర= కురువంశ వీరుడివైన ఓ ధర్మరాజా!; నీ, ధర్మ పరిపాలనంబునన్= నీయొక్క ధర్మమైన పరిపాలనచేత; నీ, గుణ, సంపదన్= నీయొక్క సుగుణ సంపదచేత; నీ, విశుద్ధ, చారిత్రమునన్+చేసి= నీ నిర్మలమైన నడవడిచేత; ధారుణి, ప్రజకున్+ఎల్లన్= భూమిమీది జనులందరికి; నెయ్యంబుతోడన్= ఇంపుతో; అభివృద్ధి; అయ్యెన్= కలిగింది; రాజ వంచకులయు= రాజును మోసగించే వాళ్ళ వల్ల; రాజవల్లభులయు= రాజుకు ఇష్టులైనవాళ్ళవల్ల; తస్కరులయు= దొంగలవలన; బాధ; తఱిఁగెన్= తగ్గిపోయింది; పుడమిన్= భూమిలో; రుజయున్= రోగము; పగయును; భయమును; వగయును= దుఃఖమును; వెఱపును; ఆదిగాన్, కల= మొదలయిన; ఎగ్గులు= కీడులు; అడఁగెన్= తొలిగాయి; అర్ఘ్యలు+ఓలిన్= వెలలు క్రమంగా; పెరిఁగెన్; అవనీ+ఈశులు+ఎల్లన్= రాజులందరు; నీ, అనుజ, వీర్య, విజితులు+అయి= నీ తమ్ముల పరాక్రమంచేత జయించబడినవాళ్ళయి; త్వదీయ, శాసనస్థులు+అయిరి= నీయొక్క ఆజ్ఞకు లోబడిన వాళ్ళయ్యారు. జగతీ+ఈశ= మహారాజా! ఇది+అ= ఇదే; నీ, యజ్ఞకార్యమునకున్= నీ రాజసూయ యజ్ఞానికి; అవసరంబు= తగిన సమయం.

తాత్పర్యం: కురువంశవీరుడివైన ఓధర్మరాజా! నీ ధర్మపరిపాలనచేత, నీ సుగుణసంపదచేత, నీ నిష్కళంక ప్రవర్తనచేత ఈభూమిమీది ప్రజలందరికి ప్రియమార అభివృద్ధి కలిగింది. రాజును మోసం చేసేవారివల్ల, రాజుకు ఇష్టులైన వాళ్ళవల్ల, దొంగలవల్ల బాధ తగ్గిపోయింది. రోగం, పగ, భయం, దుఃఖం మొదలయిన కష్టాలు తొలగిపోయాయి. వెలలు క్రమంగా పెరిగాయి. పరాక్రమంలో నీ తమ్ములు రాజులందరినీ జయించారు. అందరు రాజులు నీ ఆజ్ఞకు లోబడి ఉన్నారు. మహారాజా! నీవు రాజసూయం చేయటానికి ఇదే తగిన సమయం.

విశేషం: 'రాజవల్లభులయు' అనే దానికి 'రాష్ట్రవంచకులయు' అని కొన్ని ప్రతులలో పాఠాంతరం ఉంది. కాని మూలంలో 'రాజవల్లభ' శబ్దమే ప్రయుక్తమై ఉంది. (భండార్కరు ప్రతి 2-30-4,5). రాజవల్లభు లంటే రాజుకు ప్రియులు. -రాజుగారి బావమరిదిలాంటి వాళ్ళు. అలాంటివాళ్ళు రాజుగారికి తామంటే ఉండే ప్రియత్వాన్ని దుర్వినియోగంచేసి ప్రజలను బాధించే అవకాశం ఉంది.

వ. 'మఱియు నపరిమిత పరార్ఘ్యరత్న రజత సువర్ణ పరిపూర్ణంబయి మహామేరుశైలంబు సన్నిహితంబైన యట్లు యక్షేశ్వరు నక్షయనిధులు ప్రత్యక్షంబైన యట్లు భాండాగారంబు సమృద్ధంబైన యది; ఘృతలవణతైల తండుల ధాన్యాది సమస్త వస్తు విస్తృతంబయి కోష్ఠాగారంబు సకల సంకల్ప సిద్ధి కరంబై కల్పద్రుమంబు ననుకరించుచున్న యది; వేదంబు లన్నియు మూర్తిమంతంబులయిన యట్లు మహాయాజ్ఞికు లయిన మహీసురవరులు నీ యభ్యుదయంబు గోరుచున్నవారు గావున రాజసూయాధ్వరం బెడసేయక చేయు'మని పలుకుచున్న యవసరంబున. 273

ప్రతిపదార్థం: మఱియున్; అపరిమిత, పర+అర్ఘ్య, రత్న, రజత, సువర్ణ, పరిపూర్ణంబు+అయి= అపారమైన శ్రేష్ఠత, విలువ గల రత్నాలతో, వెండితో, బంగారుతో నిండి; మహా, మేరు, శైలంబు= గొప్పదైన మేరుపర్వతం; సన్నిహితంబు+ఐన+అట్లు= సమీపానికి వచ్చినట్లు; యక్ష+ఈశ్వరు+అక్షయ, నిధులు= యక్షులరాజైన కుబేరునియొక్క తిరుగులేని నిధులు(తొమ్మిది); ప్రత్యక్షంబు+ఐన+అట్లు= కంటి ఎదుట కన్పించినట్లు; భాండ+అగారంబు= బొక్కసం (ధనం నిలువ ఉంచేచోట; ఖజానా); సమృద్ధంబు+ఐన, అది= పూర్తిగా నిండి ఉన్నది; ఘృత, లవణ, తైల, తండుల, ధాన్య+ఆది, సమస్త, వస్తు, విస్తృతంబు+ అయి= నెయ్యి, ఉప్పు, నూనె, బియ్యం, పప్పులు మొదలయిన అన్ని వస్తువులతో నిండి; కోష్ఠ+అగారంబు= వస్తువులను నిలవ చేసే గది; సకల, సంకల్ప, సిద్ధికరంబు+ఐ= అన్నికోర్కెలను తీర్చేటటువంటిదైన; కల్పద్రుమంబును= కల్పవృక్షాన్ని; అనుకరించుచున్+ఉన్న, అది= పోలి ఉన్నది; వేదంబులు+అన్నియున్; మూర్తిమంతంబులు+అయిన, అట్లు= రూపాలు తాల్చినట్లు; మహాయాజ్ఞికులు+అయిన= గొప్పగా యజ్ఞం చేయించేవాళ్ళయిన; మహీసురవరులు= బ్రాహ్మణశ్రేష్ఠులు; నీ, అభ్యుదయంబు= నీయొక్క అభివృద్ధిని; కోరుచున్+ఉన్నవారు; కావునన్; రాజసూయ+అధ్వరంబు= రాజసూయయాగం; ఎడ, చేయక= ఆలస్యం చేయకుండ; చేయుము+అని; పలుకుచున్+ఉన్న; అవసరంబునన్= సమయంలో.

తాత్పర్యం: 'అంతేకాదు, అపరిమితమైన శ్రేష్ఠత, విలువ ఉన్న రత్నాలతో, వెండితో, బంగారంతో, మహామేరుపర్వతం సమీపించినట్లు, కుబేరుని అక్షయనిధులు ప్రత్యక్షమైనట్లు ధనాగారం పూర్తిగా నిండుగా ఉంది. వస్తువుల్ని నిలువ ఉంచే గృహం నెయ్యి, ఉప్పు, నూనె, బియ్యం, పప్పులు మొదలైన సమస్తవస్తువులతో నిండి అన్ని కోర్కెలను తీర్చే కల్పవృక్షంలా ఉంది. వేదాలన్నీ రూపుతాల్చి వచ్చినట్లున్న మహాయాజ్ఞికులైన బ్రాహ్మణోత్తములంతా నీ అభివృద్ధిని కోరుతున్నారు. అందుచేత రాజసూయయాగం ప్రారంభించు; ఆలస్యం చేయవద్దు' అని పలుకుతున్న సమయంలో.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, ఉపమ. అలంకారాలు రమణీయాలై ధర్మరాజు సంపత్సమృద్ధిని చక్కగా సూచిస్తున్నాయి. ఇచటి విశేషణాలు ఉపమానోపమేయాలు రెండింటితో అన్వయిస్తాయి.

శ్రీకృష్ణుఁడు ద్వారకనుండి వచ్చుట (సం. 2-30-9)

క. **ద్వారవతినుండి జగదా । ధారుఁడు గృష్ణుండు వచ్చి ధర్మజు ధర్మ**
ప్రారంభనిత్యు నుత్తము । భూరిధనంబులను రత్నములఁ బూజించెన్. **274**

ప్రతిపదార్థం: ద్వారవతినుండి= ద్వారకానగరంనుండి; జగత్+ఆధారుఁడు= లోకానికి ఆధారమైనవాడు; కృష్ణుండు; వచ్చి; ధర్మ, ప్రారంభ, నిత్యున్= యజ్ఞాన్ని ప్రారంభించటంలో స్థిరమైన మనస్సు కలవాణ్ణి; ఉత్తమున్= శ్రేష్ఠుడైనవాణ్ణి; ధర్మజున్= ధర్మజుని; భూరి ధనంబులను= అధిక ధనాలచేత; రత్నములన్= రత్నాలచేత; పూజించెన్.

తాత్పర్యం: ద్వారకానగరంనుండి జగదాధారుడైన శ్రీకృష్ణుడు వచ్చి రాజసూయయాగాన్ని ప్రారంభించాలన్న స్థిరసంకల్పంతో ఉన్నవాడూ, ఉత్తముడూ అయిన ధర్మరాజుకు అధికధనాలు రత్నాలు ఇచ్చి గౌరవించాడు.

విశేషం: సరిగా ఈ సమయానికే జగన్నాటకసూత్రధారి శ్రీకృష్ణుడు తనంత తానే రావటం ఒక విశేషం.

వ. **ధర్మరాజును జగదర్చితుం డయిన యచ్యుతు నర్ఘ్యాదివిధులం బూజించి తమ్ములయు ధౌమ్య ద్వైపాయనాదులయు ఋత్విజులయు నాప్తమంత్రులయు సమక్షంబున నధోక్షజున కి ట్లనియె.** **275**

ప్రతిపదార్థం: ధర్మరాజును= ధర్మరాజు కూడ; జగత్+అర్చితుండు+అయిన= లోకంచే పూజించబడినవాడైన; అచ్యుతున్= శ్రీకృష్ణుణ్ణి; అర్ఘ్య+ఆది= అర్ఘ్య మివ్వటం మొదలైన; విధులన్= పూజా పద్ధతులతో; పూజించి; తమ్ములయు= తమ్ముళ్ళయొక్క ధౌమ్య+ద్వైపాయన+ఆదులయు= ధౌమ్యుడు, వ్యాసుడు మొదలయిన వాళ్ళయొక్క; ఋత్విజులయున్= యజ్ఞం చేయించే బ్రాహ్మణులయొక్క; ఆప్త, మంత్రులయు= ఆప్తులైన మంత్రులయొక్క; సమక్షంబునన్= ఎదుట; అధోక్షజునకున్= శ్రీకృష్ణునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: లోకంచేత పూజలందుకొనే శ్రీకృష్ణుణ్ణి, ధర్మరాజు అర్ఘ్యపాద్యాదులిచ్చి పూజించాడు. తమ్ముళ్ళు, ధౌమ్య ద్వైపాయనాదులు, ఋత్విజులు, ఆప్తమంత్రులు ఉండగా అందరి సమక్షంలో శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

విశేషం: అధోక్షజుడు - ఇంద్రియాలను అధఃకరించి జన్మించినవాడు, జితేంద్రియులకు- అంటే ఇంద్రియాలను జయించినవాళ్ళకు- ప్రత్యక్షమయ్యేవాడు - శ్రీకృష్ణుడు. ధౌమ్యుడు పాండవపురోహితుడు.

మత్తకోకిలము.

ధారుణీధర! ధర్మతత్త్వనిధాన! దానవదర్ప సం
హార! వారిజనాభ! బంధుజనానురంజనకారి! నీ
కారణంబునఁ జేసి మాకు జగంబునం గల భూపతుల్
భూరివిక్రమవశ్యు లైరి విభుత్వ మేర్పడుచుండఁగన్. **276**

ప్రతిపదార్థం: ధారుణీధర= భూమిని ధరించినవాడా! శ్రీకృష్ణా! ధర్మ, తత్త్వ, నిధాన= ధర్మతత్త్వానికి ఉనికిపట్టు అయినవాడా!; దానవ, దర్ప, సంహార= రాక్షసులయొక్క గర్వాన్ని అణచినవాడా!; వారిజనాభ= నీటినుండి పుట్టిన పద్మం బొడ్డులో కలవాడా!; బంధు, జన+అనురంజనకారి= బంధుజనులకు సంతోషాన్ని కలిగించేవాడా! నీ, కారణంబునన్+చేసి= నీకారణంచేత; జగంబునన్+కల= లోకంలో ఉండే; భూపతుల్= రాజులు; మాకున్; విభుత్వము+ఏర్పడుచున్+ఉండఁగన్= మాకు సార్వభౌమాధికారం కలిగేటట్లు; భూరి, విక్రమ, వశ్యులు+ఐరి= మా గొప్ప పరాక్రమానికి లొంగిపోయినవా ళ్ళయ్యారు.

తాత్పర్యం: భూమిని ధరించినవాడా! ధర్మతత్త్వానికి ఉనికిపట్టయినవాడా! రాక్షసులగర్వం అణచినవాడా! పద్మనాభా! బంధుజనులకు ఆనందాన్ని కలిగించేవాడా! నీ కారణాన్నే కదా మాకు సార్వభౌమాధికారం కలిగేటట్లు లోకంలోని రాజులంతా మా పరాక్రమానికి లొంగిపోయారు.

విశేషం: మత్తకోకిలవృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా ర,స,జ,జ,భ,ర అనే గణాలు ఉంటాయి. 18 అక్షరాల చరణంలో 11వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉంది. భక్తికవితకు బీజప్రాయమైన లక్షణాలు ఈ పద్యరచనలో మాధుర్యగుణంతో కలిసి శోభిస్తున్నాయి. (సంపా.)

క. **క్షితిపతులవలన సముపా । ర్జితమైన ధనంబు కొలఁదిఁ జెప్పఁగ వాచ**
స్పతికి నశక్యము; దీనిం । బ్రతిపాదింపంగవలయుఁ బాత్రవశమునన్. **277**

ప్రతిపదార్థం: క్షితి, పతులవలన= భూపతులనుండి - రాజులనుండి; సమ్+ఉపార్జితము+ఐన= లెస్సగా సంపాదించబడిన; ధనంబు, కొలఁదిన్= డబ్బు యొక్క పరిమాణాన్ని; చెప్పగాన్= చెప్పటానికి; వాచస్పతికిన్= బృహస్పతికైనా; అశక్యము= సాధ్యం కాదు; దీనిన్= ఈధనాన్ని; పాత్రవశమునన్= అర్హులైన వాళ్ళకు చెందేటట్లు; ప్రతిపాదింపంగన్ వలయున్= దానంగా ఇవ్వాలి.

తాత్పర్యం: రాజులనుండి సంపాదించిన ధనరాసుల పరిమాణమెంతో తేల్చి చెప్పటం ఆ బృహస్పతికికూడ సాధ్యం కాదు. ఇక ఈ ధనాన్ని అర్హులైనవారికి దానం చేయాలి.

వ. **'దేవముఖం బైన యగ్నిదేవుముఖంబున విధ్యుక్తంబుగా వేల్చి, దేవతర్పణంబును, యథోచితదక్షిణల నభీష్టదానంబుల మహీదేవ తర్పణంబునుం జేయవలయుం గావున నీ కిష్టంబయిన యజ్ఞంబు చేయించి, నాకును, లోకంబులకుం బ్రియంబు సేయు; మొండె నన్ను రాజసూయాధ్వర విధానంబునందు నియోగించి యనుగ్రహింపు' మనిన యుధిష్ఠిరునకు నారాయణుం డి ట్లనియె.** **278**

ప్రతిపదార్థం: దేవముఖంబు+ఐన= దేవతలకు నోరైన; అగ్నిదేవుముఖంబునన్= అగ్నిదేవునియొక్క నోటితో; విధి+ఉక్తంబుగాన్= శాస్త్రంలో చెప్పబడినవిధంగా; వేల్చి= ఆహుతులను వేసి; దేవ, తర్పణంబును= దేవతలకు తృప్తిని; యథా+ఉచిత దక్షిణలన్= తగిన దక్షిణలను ఇవ్వటంచేత; అభీష్ట, దానంబులన్= కోరినదానాలు ఇవ్వటంచేత; మహీదేవ, తర్పణంబునున్= భూదేవతలైన బ్రాహ్మణులకు తృప్తిని; చేయవలయున్; కావునన్; నీకున్; ఇష్టంబు+అయిన; యజ్ఞంబు; చేయించి; నాకును; లోకంబులకున్; ప్రియంబు; చేయుము; ఒండెన్= అట్లాకాకుంటే; నన్నున్; రాజసూయ+అధ్వర, విధానంబునందున్= రాజసూయయాగ కార్యక్రమంలో, నియోగించి= నియమించి; అనుగ్రహింపుము= దయ చూపుము; అనినన్; యుధిష్ఠిరునకున్= ధర్మరాజుకు; నారాయణుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'దేవతలకు ముఖమైన అగ్నిదేవుని ముఖంలో శాస్త్రోక్తంగా వేసిన ఆహుతులతో దేవతల్ని, తగిన దక్షిణలతో, కోరిన దానాలతో బ్రాహ్మణుల్ని తృప్తి పరచాలి. అందుచేత నీ కిష్టమైన యజ్ఞం చేయించి నాకు, లోకాలకు ప్రియంచేయండి. అలా కాకుంటే, నన్ను రాజసూయ యాగకార్యక్రమంలో నియమించి అనుగ్రహించండి'- అని పలికిన ధర్మరాజుకు శ్రీకృష్ణు డిలా అన్నాడు.

విశేషం: పరాక్రమార్జిత మైన సంపదను యజ్ఞంచేసి ప్రభువు యోగ్యులకు పంచిపెట్టటం భారతీయ సంప్రదాయం. దానంతోనే ధనం రాణిస్తుం దని భారతీయభావన. అర్థం ధర్మబద్ధం కాకపోతే, పురుషయత్నం దైవానుకూల్యాన్ని పొందకపోతే వ్యర్థా లౌతాయి. అందువల్ల ధర్మరాజు పరమాత్ముడైన శ్రీకృష్ణుని యెదుట 'సంపదను యోగ్యుల కందజేసే యే యజ్ఞాన్నైనా చేయించు' అన్నాడు - మొదట. 'నీకు అంగీకార మైతే నన్ను రాజసూయయాగ కార్యక్రమంలో నియమించి అనుగ్రహించు' అన్నాడు - తరువాత, మానవుడు కోరుకొంటాడు కాని ఏ కోరిక యోగ్యమైనదో నిర్ణయించేది దైవం. అందువలన శ్రీకృష్ణునిమీదనే భారం ఉంచి, దైవానుకూల్యం ఉన్నకార్యాన్ని నిర్దేశించండి - అని ధర్మరాజు అర్థించాడు. (సంపా.)

ఉ. **పూజ్యుఁడ వెల్ల వంశముల భూపతులందును, ధర్మ నిర్మల**
ప్రాజ్యవిభూతి నద్విజపాలకు నట్టిఁడ నీక యొప్పె సా
మ్రాజ్యము దైవసంపదయు మానుషసంపదపేర్మి కావునన్
యాజ్యుఁడ విప్పు డీవ భరతాన్వయభూషణ! ధర్మనందనా! **279**

ప్రతిపదార్థం: భరత+అన్వయ, భూషణ!= భరతునియొక్క వంశానికి అలంకారమైనవాడా, ధర్మనందనా!; ఎల్ల వంశముల, భూపతుల+అందును= అన్ని వంశాల రాజుల్లోను; పూజ్యుఁడవు= పూజింప దగినవాడివి; ధర్మ, నిర్మల, ప్రాజ్య, విభూతిన్= ధర్మంచేత స్వచ్ఛమై అధికమైన ఐశ్వర్యంలో; ఆ+దివిజ, పాలకు+అట్టిఁడు+అ= ఆ స్వర్గలోక పాలకుడైన ఇంద్రుని వంటివాడా; సామ్రాజ్యము; దైవ, సంపదయు= దైవబలం; మానుష సంపద పేర్మి= మానవ బలంయొక్క ఆధిక్యం; నీకు+అ= నీకే; ఒప్పెన్= అమరిఉంది; కావునన్; యాజ్యుఁడవు= యజ్ఞం చేయదగినవాడివి; ఇప్డు= ఇప్పుడు; నీవు+అ= నీవే.

తాత్పర్యం: భరత వంశానికి అలంకారమైనవాడా! ధర్మనందనా! అన్ని రాజ వంశాల్లో నీవు పూజించదగినవాడివి. ధర్మంచేత స్వచ్ఛమైన, అధికమైన ఐశ్వర్యంలో దేవేంద్రుని వంటి వాడివి. సామ్రాజ్యం దైవబలం, మానవబలం గొప్పగా నీకే అమరి ఉన్నాయి. అందుచేత ఇప్పుడు యజ్ఞం చేయదగినవాడివి నీవే.

విశేషం: మానుషసంపదతోపాటు దైవీసంపదకూడ కలిసి ధర్మజునికి సామ్రాజ్యయోగాన్ని కలిగించాయని శ్రీకృష్ణు డంగీకరించాడు. యజ్ఞం దైవస్వరూపం. దానిని నిర్వహించే అధికారం ధర్మరాజుకు ఉన్నదని ఈ విధంగా శ్రీమన్నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణుడు ధ్రువీకరించాడు. అర్థవ్యక్తి గుణరంజకమైన రచన ఈ పద్యం. (సంపా.)

క. **పంపం దగుఁ దగ దని శం । కింపక నీ కిష్టమయిన కృత్యముల నియో**
గింపుము నన్ను భవద్గుణ । సంపత్ప్రవణుల సమస్తజనుల జనేశా! **280**

ప్రతిపదార్థం: జన+ఈశా!= జనులకు ప్రభువైన ఓ ధర్మరాజా!; పంపన్+తగున్, తగదు+అని= ఈపని చెప్పదగును, చెప్పతగదు అని; శంకింపక= సంకోచించక; నీకున్+ఇష్టము+అయిన; కృత్యములన్= పనుల్లో, నన్నున్= నన్ను; భవత్+గుణసంపత్+ ప్రవణులన్= నీయొక్క గుణ సంపదలపై ఆసక్తి గలవాళ్ళయిన; సమస్త జనులన్= అందరు వ్యక్తులను; నియోగింపుము= నియమించుము.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ పని చెప్పతగినది, చెప్పతగనిది - అని ఏమాత్రం సంకోచించకుండ నీ కిష్టమైన పనుల్లో నన్ను, నీ గుణసంపదపట్ల ఆసక్తి ఉన్న అందరు వ్యక్తులను నియమించు.

విశేషం: యజ్ఞస్వరూపుడు, యజ్ఞపతి, యజ్ఞభోక్త, యజ్ఞకర్త అన్నీ తానే అయిన శ్రీకృష్ణపరమాత్ముడు తన్ను తాను ఆ విధంగా అర్పించుకోవటం రాజసూయమహాయజ్ఞనిర్వహణకు పూనుకొన్న ఆ ధర్మరాజుకు ఎంత ఆనందహేతువైందో! ఎంత గౌరవకారణమైందో! ఎంత ప్రోత్సాహజనక మైందో!

చ. **అనిన నుపేంద్రువాక్య మను నయ్యమృతంబునఁజేసి ధర్మనం**
దనుఁడు ముదంబు నొంది 'విదితంబుగ నాకు మనోరథంబు లె
ల్లను సమకూరె నిప్డు, సఫలత్వము నొందె ధనాగమంబు' లం
చును నెడ నిశ్చయించె మధుసూదనదేవు ననుగ్రహంబునన్. **281**

ప్రతిపదార్థం: అనినన్; ఉపేంద్రు, వాక్యము+అను= శ్రీకృష్ణుడి మాట అనే; అ+అమృతంబునన్+చేసి= ఆ అమృతంచేత; ధర్మనందనుఁడు; ముదంబున్= సంతోషాన్ని; ఒంది= పొంది; విదితంబుగన్= స్పష్టంగా; నాకున్; మధుసూదన దేవు= మధువనే రాక్షసుణ్ణి సంహరించిన శ్రీకృష్ణదేవునియొక్క; అనుగ్రహంబునన్= దయచేత; ఇప్డు+అ= ఇప్పుడే; మనోరథంబులు+

ఎల్లన్= కోరికలన్నీ; సమకూరెన్= తీరాయి; ధన+ఆగమంబులు= సంపదలు కలుగుటలు; సఫలత్వమున్, ఒందెన్= సార్థక్యం పొందాయి; అంచునున్; ఎడన్= హృదయంలో; నిశ్చయించెన్.

తాత్పర్యం: అని పలికిన శ్రీకృష్ణుడి వాక్యమనే అమృతంచేత ధర్మరాజు సంతోషించి, 'నాకు శ్రీకృష్ణుని అనుగ్రహంచేత ఇప్పుడే కోరికలన్నీ తీరాయి. సమకూరిన సంపదలన్నీ ఫలవంతా లయ్యాయి' అని మనస్సులో నిశ్చయించాడు.

విశేషం: ఈ సందర్భంలో శ్రీకృష్ణునికి ప్రయోగించిన మధుసూదన శబ్దం మిక్కిలి అర్థవంతం. మధుడనే రాక్షసుడిని సంహరించిన శ్రీకృష్ణుడు యాగానికి ఆటంకం కలిగించే ఏ దుష్టులనైనా తొలగించగలడనే భావాన్ని అది ధ్వనింపజేస్తుంది. అందుకు తగినట్లే రాజసూయమహాయాగసభలో ఆయన శిశుపాలుణ్ణి హతమార్చటం జరిగింది.

ధర్మరాజు రాజసూయంబు సేయ నారంభించుట (సం. 2-30-17)

వ. **ఇట్లు నారాయణదేవుచేత ననుజ్ఞాతుండయి తమ్ములయు ధౌమ్య ద్వైపాయనాదులయు ననుమతంబున ధర్మరాజురాజసూయంబు సేయ నుపక్రమించి, సహదేవుంజూచి 'నీవు ధౌమ్యోపదిష్టంబులయిన యజ్ఞోపకరణ ద్రవ్యంబులు దేర నింద్రసేన ప్రముఖులను నర్జును సారథియయిన రుక్మను సమర్పించి, యజ్ఞాయతనంబున నానాదేశాగతులైన రాజులకు సన్నివేశంబులు సేయించి, నిఖిల మహీతలంబునం బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రుల నెల్ల రాఁబనుపు' మని పంచిన నతండును దద్వాక్యానంతరంబున నింద్రసేనాదుల ననేక శిల్పివరుల నియోగించి.** **282**

ప్రతిపదార్థం: ఇట్లు; నారాయణదేవుచేతన్= శ్రీకృష్ణునిచేత; అనుజ్ఞాతుండు+అయి= అనుమతించబడినవాడై; తమ్ములయు; ధౌమ్య, ద్వైపాయన+ఆదులయు= ధౌమ్యుడు, వ్యాసుడు మొదలయిన వారియొక్క; అనుమతంబునన్= సమ్మతితో; ధర్మరాజు; రాజసూయంబు; చేయన్; ఉపక్రమించి= ప్రారంభించి; సహదేవున్; చూచి; నీవు; ధౌమ్య+ఉపదిష్టంబులు+అయిన= ధౌమ్యునిచేత ఉపదేశించబడినవైన - అంటే ధౌమ్యులవారు అవసరమని చెప్పిన; యజ్ఞ+ఉపకరణ, ద్రవ్యంబులు= యజ్ఞానికి అవసరమైన వస్తువులు (సాధన సామగ్రి); తేరన్= తేవటానికి; ఇంద్రసేన, ప్రముఖులను= ఇంద్రసేనుని వంటి ముఖ్యులను; అర్జును, సారథి+ఐన; రుక్మను; సమర్పించి= నియమించి; యజ్ఞ+ఆయతనంబునన్= యజ్ఞశాలలో; నానాదేశ+ఆగతులు+ఐన= వివిధదేశాలనుండి వచ్చిన; రాజులకున్; సత్+నివేశంబులు= మంచి మందిరాలు; చేయించి= రూపొందించి; నిఖిల మహీ, తలంబునన్= సమస్త భూమండలంలో; బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్రులన్+ఎల్లన్; రాన్, పనుపుము= రమ్మని చెప్పుము; అని; పంచినన్= ఆజ్ఞాపించగా; అతండును= ఆ సహదేవుడును; తత్+వాక్య+అనంతరంబునన్= ఆమాట తరువాత, - అంటే అన్నగారు చెప్పినదాన్ని అనుసరించి; ఇంద్రసేన+ఆదులన్= ఇంద్రసేనుడు మొదలైన; అనేక, శిల్పవరులన్= పెక్కుమంది శిల్పాచార్యులను; నియోగించి= నియమించి.

తాత్పర్యం: ఈవిధంగా శ్రీకృష్ణుని అనుమతిని, తమ్ముళ్ళతోపాటు, ధౌమ్య ద్వైపాయనాదుల సమ్మతిని పొంది ధర్మరాజు రాజసూయం చేయటానికి పూనుకొని, సహదేవునితో 'నీవు ధౌమ్యులవారు చెప్పిన విధంగా యాగానికి అవసరమైన సాధన సామగ్రిని సమకూర్చే పనిని ఇంద్రసేనుడు మొదలైన ప్రముఖులకు, అర్జున సారథి రుక్మకు అప్పగించు' అన్నాడు. 'యాగశాలలో వివిధ దేశాలనుండి వచ్చిన రాజులకు మంచి విడుదులు ఏర్పాటు చేయవలసిం'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దని ఆజ్ఞాపించాడు. 'భూమండలంలో ఉండే బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రుల నందరిని రప్పించవలసిం'దని ఆదేశించాడు. సహదేవుడు అన్నగారి ఆజ్ఞప్రకారం ఇంద్రసేనాదులవంటి పెక్కుమంది శిల్పాచార్యులను నియమించి.

విశేషం: 'రుక్మశ్చార్జున సారథిః' - అని మూలం. కనుక 'రుక్ముని' - అని ఉండటం లెస్స.

సీ. **శాస్త్రోపదిష్ట ప్రశస్త ప్రమాణల। క్షణముల యజ్ఞోపకరణ తతుల**
యజ్ఞాయతనమున నతిరమణీయంబు। లయి యుండ నొనరించి, యందు సర్వ
సంభారములు నించి, సకలదిక్కుల హరి। ప్రస్థంబుచుట్టు నపార భూరి
బహువిధాగారముల్ ప్రమదవనంబుల। వాపుల దీర్ఘికావలుల వెలసి

ఆ. **యాజ్య తైల తండులాది నానా వస్తు। పూరితంబులయి విభూతిఁ దనర**
జననుతుండు సేసె సహదేవుఁ డపర భూ। తలముఁ బోలి యొప్పెఁ దత్పురంబు. **283**

ప్రతిపదార్థం: శాస్త్ర+ఉపదిష్ట, ప్రశస్త, ప్రమాణ, లక్షణములన్= శాస్త్రంచేత చెప్పబడిన ఉత్తమ ప్రమాణ లక్షణాలతో; యజ్ఞ+ఉపకరణ, తతులన్= యజ్ఞానికి అవసరమైన సాధనసామగ్రియొక్క సమూహాలను; యజ్ఞ+ఆయతనమునన్= యజ్ఞశాలలో; అతిరమణీయంబులు+అయి, ఉండన్= మిక్కిలి అందమైనవిగా అమరేటట్లు; ఒనరించి= చేసి; అందున్= యజ్ఞశాలలో; సర్వసంభారములు= అన్ని వస్తువులు; నించి= నింపి; హరిప్రస్థము చుట్టున్= ఇంద్రప్రస్థం చుట్టు; సకల దిక్కులన్= అన్ని దిశల్లో; అపార, భూరి, బహువిధ+అగారముల్= లెక్కలేనన్ని గొప్పవైన వివిధ గృహాలతో; ప్రమదవనంబులన్= ఉద్యానవనాలతో; వాపులను= కోనేరులతో; దీర్ఘికా+ఆవలులన్= దిగుడుబావి సమూహాలతో; వెలసి= ఏర్పడి; ఆజ్య, తైల, తండుల+ఆది, నానావస్తు, పూరితంబులు+అయి= నెయ్యి, నూనె, బియ్యం మొదలయిన పదార్థాలతో నిండి ఉండేటట్లు, విభూతిన్=ఐశ్వర్యంతో; తనరన్= ఒప్పేటట్లుగా; జననుతుండు= జనులచే కీర్తించబడేవాడు; సహదేవుఁడు; చేసెన్; తత్, పురంబు= ఆపట్టణం; అపర, భూతలమున్+పోలి= రెండవ భూమండలంవలె; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: శాస్త్రోక్తాలైన ఉన్నత ప్రమాణ లక్షణాలున్న యజ్ఞ సాధన సామగ్రి నంతా యజ్ఞశాలలో అతిరమణీయంగా అమర్చాడు. అవసరమైన పదార్థాల నన్నింటినీ నింపాడు. ఇంద్రప్రస్థానికి అన్ని వైపులా ఉద్యానవనాలతో, కోనేరులతో, దిగుడు బావులతో, అవసరమైన నెయ్యి, నూనె, బియ్యంవంటి ఆహార పదార్థాలు సమృద్ధిగా ఉండేటట్లు అతిథిగృహ సముదాయాన్ని తన ఐశ్వర్యం శోభిల్లేటట్లు ఏర్పరచాడు. అప్పుడు ఇంద్రప్రస్థపురం అపరభూమండలంలా ప్రకాశించింది.

విశేషం: వైదికాలైన యజ్ఞవిషయాలు నన్నయగారికి ఎంతో ఆత్మీయాలు. అంతేకాక, ధర్మజుని రాజసూయం రాజకీయ ప్రాధాన్యమున్న యజ్ఞం. ఆ యజ్ఞమూలంగా ఆయన ఐశ్వర్యం, అధిక్యం అందరికీ ప్రకటం కావాలి. భావికురుసార్వభౌముడు ధర్మరాజే అనే అభిప్రాయం ఏర్పడాలి. అందుచేతనే నన్నయగారు ఇక్కడ ఆ యజ్ఞవిషయాల్ని మూలాన్ని మించి మనోహరంగా ఉదాత్తంగా వర్ణించారు. కాగా 'అపరభూతలం' అనే దానికి కొన్ని ప్రతులలో 'అమర భూధరం' అనే పాఠాంతరం ఉంది. ఐశ్వర్యంతో నిండిన ఇంద్రప్రస్థాన్ని అపర భూతలంతో పోల్చటం కంటె, అమర భూధరమైన మేరు పర్వతంతో పోల్చటమే మేల్తరంగా ఉంటుందేమో! అని అనిపించవచ్చు. అయినా, భూతలాన్ని పాలించే ప్రభువులు, కీర్తి కెక్కిన ప్రముఖులు అందరూ కలిసి ఒకచోట ఉండటానికి అనువుగా సర్వవిధసౌకర్యాలతో కూడికొనిఉన్న ఆ మహానగరం అపరభూతలం (Mini World)గా ఉన్న దని నన్నయగారు భావించిఉంటారు. అప్పుడే ధర్మరాజు సమ్రాట్టుగా వైభవాన్ని ప్రదర్శించగలడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియు సహదేవానుశాసనంబునఁ బుత్త్ర మిత్త్ర భ్రాతృసమేతులై విరాట ద్రుపద శిశుపాల గాంధార రాజులును బ్రాగ్జ్యోతిషంబున భగదత్తుండును, శక సాల్వ బృహద్బల చంద్రసేన సముద్రసేన కుంతిభోజ పౌండ్రకవాసుదేవులును, వసుదేవ బలదేవ ప్రద్యుమ్న శూరసేనాది యదు వృష్ణి భోజాంధకవరులును, నంగ వంగ కళింగ కాశ్మీర కాంభోజ గౌడాంధ్ర సింహళ కేరళ కుంతల ద్రవిడ మరు యవనపతులును, బార్వతేయులును సాగరానూపవాసులును నాదిగాఁ జతుస్సముద్ర ముద్రిత వసుంధరా చక్రంబునం గల రాజచక్రంబును, సమగ్ర వేద వేదాంగవిదు లైన యగ్రజన్ములును, స్వకర్మ నిరతులైన వైశ్యశూద్రులును వచ్చి యథాపరికల్పిత సన్నివేశంబుల నుండి; రంత ధర్మపుత్త్రుండు భీష్మాదులం దోడ్కొని తేర గజపురంబునకు నకులుం బంచిన. 284

ప్రతిపదార్థం: మఱియు; సహదేవ+అనుశాసనంబునన్= సహదేవునియొక్క ఆజ్ఞ ప్రకారం; పుత్త్ర, మిత్త్ర, భ్రాతృ, సమేతులు+ఐ= పుత్రులతో, మిత్రులతో, సోదరులతో కూడుకొన్నవాళ్ళయి; విరాట, ద్రుపద, శిశుపాల, గాంధార రాజులును; ప్రాగ్జ్యోతిషంబున భగదత్తుండును; శక, సాల్వ, బృహద్బల, చంద్రసేన, సముద్రసేన, కుంతిభోజ, పౌండ్రక, వాసుదేవ+ఆదులును= శకుడు, సాల్వుడు మొదలయినవాళ్ళూ; వసుదేవ, బలదేవ, ప్రద్యుమ్న, శూరసేన+ఆది, యదు, వృష్ణి, భోజ+అంధక, వరులును= వసుదేవుడు, బలరాముడు, ప్రద్యుమ్నుడు, శూరసేనుడు మొదలైన యదు, వృష్ణి, భోజ, అంధక వంశాలకు సంబంధించిన శ్రేష్ఠులూ; అంగ, వంగ, కళింగ, కాశ్మీర, కాంభోజ, గౌడ, ఆంధ్ర, సింహళ, కేరళ, కుంతల, ద్రవిడ, మరు, యవన పతులును= అంగవంగాది దేశాల రాజులూ; పార్వతేయులును= పర్వతప్రాంతాల రాజులూ; సాగర, అనూప, వాసులును= సముద్రతీరప్రాంతంలో నివసించేవాళ్ళూ; ఆదిగాన్= మొదలుగా; చతుః+సముద్ర, ముద్రిత, వసుంధరా, చక్రంబునన్= నాలుగు సముద్రాలచేత చుట్టబడిన భూమండలంలో; కల= ఉన్న; రాజచక్రంబును= రాజుల సమూహమూ, సమగ్ర, వేద, వేద+అంగ, విదులు+ఐన= పరిపూర్ణంగా వేదాలను, వేదాలయొక్క అంగాలైన శిక్ష, వ్యాకరణం మొదలైనవాటిని తెలిసినవాళ్ళయిన; అగ్రజన్ములును= బ్రాహ్మణులూ; స్వధర్మ, నిరతులు+ఐన= తమ కర్తవ్యాన్ని నిర్వహించటంలో ఆసక్తి కలవాళ్ళయిన; వైశ్య, శూద్రులును; వచ్చి; యథాపరికల్పిత సత్+నివేశంబులన్= వాళ్ళ వాళ్ళ అర్హతలకు తగినట్లు ఏర్పాటు చేయబడిన మంచి విడిది ఇండ్లలో; ఉండిరి; అంత= తరువాత; ధర్మపుత్రుండు= ధర్మరాజు; భీష్మ+ఆదులన్= భీష్ముడు మొదలయిన వాళ్ళను; తోడ్కొని తేరన్= వెంటతీసుకొని రావటానికి; గజపురంబునకున్= హస్తినాపురానికి; నకులున్= నకులుణ్ణి; పంచినన్= పంపగా.

తాత్పర్యం: సహదేవుని పిలుపుమేరకు, పుత్రులతో, మిత్రులతో, సోదరులతో కలిసి భూమండలంలో ఉండే అందరు రాజులు, వేదవేదాంగ పారంగతులైన బ్రాహ్మణులు, తమ తమ ధర్మాలను నిర్వర్తించే వైశ్యులు, శూద్రులు వచ్చి, వాళ్ళ వాళ్ళ అర్హతలకు తగినట్లు ఏర్పాటు అయిఉన్న ఇళ్ళలో విడిడి చేశారు. తరువాత భీష్ముడు మొదలయిన పెద్దలను తోడ్కొని రావటానికి ధర్మరాజు నకులుణ్ణి హస్తినాపురానికి పంపగా.

విశేషం: వచ్చిన రాజుల విషయంలో వివిధ ప్రతులలో కొన్ని భేదా లున్నాయి. వేదాంగాలు - శిక్ష (కర్త పాణిని), వ్యాకరణం (కర్త పాణిని), ఛందం (కర్త పింగలముని), నిరుక్తం (కర్త యాస్కుడు), జ్యోతిషం (కర్తలు ఆదిత్యాదులు), కల్పం (కర్తలు ఆశ్వలాయన, కాత్యాయన, ఆపస్తంబ, బోధాయన, వైఖానసాదులు). పాండవులచేతిలో ఓడినవాళ్ళలో ఆంధ్రులను చేర్చని నన్నయ రాజసూయ యజ్ఞానికి వచ్చిన రాజుల్లో ఆంధ్రులను చేర్చి తనజాతిగౌరవాన్ని నిలిపాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాజసూయమునకు భీష్మాదు లరుదెంచుట (సం. 2-31-4)

క. అనుపమధనరాసులు గొను । చును ననురాగమున రాజసూయమఖాలో
కన కౌతూహలపరు లయి । చనుదెంచిరి భీష్ముఁదొట్టి సద్బంధుజనుల్. 285

ప్రతిపదార్థం: భీష్మున్, తొట్టి= భీష్ముని మొదలు చేసికొని; సత్+బంధు, జనుల్= మంచి (దగ్గరి) బంధువులందరు; అనుపమ, ధనరాసులు= సాటిలేని ధన సమూహాలు; కొనుచున్= వెంటతీసుకొని; అనురాగమునన్= ప్రేమతో; రాజసూయ, మఖ+ఆలోకన, కౌతూహల, పరులు+అయి= రాజసూయ యాగాన్ని చూడటంలో మిక్కిలి కోరిక కలవాళ్ళయి; చనుదెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: భీష్ముడు మొదలైన ఆప్త బంధువులందరు సాటిలేని ధనరాసులు వెంటతీసికొని ప్రేమతో రాజసూయం చూడాలన్న కుతూహలంతో ఇంద్రప్రస్థానికి వచ్చారు.

విశేషం: వచ్చిన వాళ్ళలో - భీష్మవిదురాదులే కాక, దుర్యోధనాదులుకూడ అనురాగంతో అపార ధనరాసులు తీసికొని రాజసూయం చూడాలన్న కుతూహలంతో వచ్చారు. కౌరవులకు కన్ను కుట్టిందీ, మనస్సులో కుళ్ళు పెరిగిందీ, రాజసూయం చూచిన తరువాతే.

వ. ఇట్లు వచ్చిన భీష్మ ధృతరాష్ట్ర విదుర ద్రోణ కృపాశ్వత్థామ సోమదత్త కర్ణ భూరిశ్రవశ్శల్య శకుని సైంధవ దుర్యోధన దుశ్శాసన వికర్ణాదుల నెల్లం బ్రియసత్కారంబులం బూజించి వారలతో ధర్మరా జి ట్లనియె. 286

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; వచ్చిన; భీష్మ, ధృతరాష్ట్ర, విదుర, ద్రోణ, కృప+అశ్వత్థామ, సోమదత్త, కర్ణ, భూరి శ్రవః+శల్య, శకుని, సైంధవ, దుర్యోధన, దుశ్శాసన, వికర్ణ; ఆదులన్+ఎల్లన్= భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు, ద్రోణుడు మొదలయిన వారి నందరిని; ప్రియ, సత్కారంబులన్= ఇష్టమైన సమ్మానాలతో; పూజించి; వారలతోన్; ధర్మరాజు; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా వచ్చిన భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు, ద్రోణుడు మొదలయిన వాళ్ళనందరిని ధర్మరాజు సమ్మానించి వారితో ఇలా అన్నాడు.

విశేషం: వచ్చిన వారి పేర్ల విషయంలో వివిధ ప్రతులలో పాఠభేదా లున్నాయి.

ఆ. మీ యనుగ్రహమునఁ జేయంగఁ గడఁగితి । నిమ్మహాధ్వరంబు నెమ్మితోడ
దీని నిందఱును ననూనంబుగాఁ బూని । పెంపు మెఱసి నిర్వహింపవలయు. 287

ప్రతిపదార్థం: మీ, అనుగ్రహమునన్= మీ అందరిదయతో; ఈ+మహా+అధ్వరంబున్= ఈ మహాయజ్ఞాన్ని; చేయంగన్= చేయటానికి; కడఁగతిన్= పూనుకొన్నాను; నెమ్మితోడన్= ప్రేమతో; దీనిన్; ఇందఱును= మీరంతా; అనూనంబుగాన్= వెలితి లేకుండ; పూని= పూనుకొని; పెంపు, మెఱసి= ఘనత వహించి; నిర్వహింపవలయున్= జరిపించాలి.

తాత్పర్యం: మీ అందరి అనుగ్రహంతో నే నీ మహాయాగాన్ని చేయటానికి పూనుకొన్నాను. ప్రేమతో మీరందరు వెలితి లేకుండ దీన్ని ఘనంగా నిర్వహించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: బంధువులకు పెద్దరికం ఇవ్వటం- విశేషించి ఇలాంటి సందర్భాల్లో భారతీయ కుటుంబసంస్కృతి. 'మీ అనుగ్రహంతోనే నే నీయజ్ఞాన్ని చేస్తున్నా నని చెప్పటం బంధుప్రీతికి సూచకం. 'మీరు పూనుకొని యజ్ఞాన్ని వెలితిలేకుండా నిర్వహించా'లని అనటం జ్ఞాతులవలన ఎలాంటి ఇబ్బందులు రాకుండ నిపుణంగా నివారించుకొనే ఉపాయం. (సంపా.)

వ. అని వారల యనుగ్రహంబు వడసి హిరణ్య రజత రత్న దక్షిణా దాన విషయంబులందుఁ గృపాచార్యునిఁ, గృతాకృత పరిజ్ఞానంబునందు భీష్మద్రోణులను, సకల వస్తు వ్యయంబునందు విదురుని, నానాదేశాగతులైన రాజులు దెచ్చి యిచ్చిన యుపాయనంబులు గైకొన దుర్యోధనుని, భక్ష్యభోజ్యాది వినియోగంబునందు దుశ్శాసనుని నియోగించి. 288

ప్రతిపదార్థం: అని; వారల, అనుగ్రహంబు; పడసి= పొంది; హిరణ్య, రజత, రత్న, దక్షిణా, దాన, విషయంబులందున్= బంగారు, వెండి, రత్నాలు, దక్షిణలు, దానాలు ఇచ్చే విషయాల్లో; కృపాచార్యునిన్; కృత+అకృత, పరిజ్ఞానంబు నందున్= చేయబడిన, చేయని వాటిని ఆలోచించి నిర్ణయించటంలో అంటే కార్యాకార్యాలను గురించి ఆలోచించటంలో; భీష్మద్రోణులను; సకల వస్తువ్యయంబునందున్= అన్ని పదార్థాలను వినియోగపరచటంలో; విదురునిన్; నానాదేశ+ఆగతులు+ఐన= వివిధ దేశాలనుండి వచ్చిన; రాజులు; తెచ్చి; ఇచ్చిన; ఉపాయనంబులు= కానుకలు; కైకొనన్= తీసికోవటానికి; దుర్యోధనునిన్; భక్ష్య, భోజ్య+ఆది, వినియోగంబునందున్= భక్ష్యాలు, భోజ్యాలు మొదలయిన ఆహార పదార్థాలను అందరికి అందచేయటంలో; దుశ్శాసనుని; నియోగించి= నియమించి.

తాత్పర్యం: అని, వచ్చిన బంధుజనులందరి అనుగ్రహం పొంది, బంగారు, వెండి, రత్నాలను దక్షిణలుగా, దానాలుగా ఇచ్చే విషయంలో కృపాచార్యుణ్ణి, కార్యాకార్యాలనుగురించి ఆలోచించటంలో భీష్మద్రోణుల్ని, సకల పదార్థాలను వినియోగ పరచటంలో విదురుణ్ణి, వివిధ దేశాల రాజులు తెచ్చి ఇచ్చే కానుకలను గ్రహించటంలో దుర్యోధనుణ్ణి, భక్ష్యభోజ్యాది ఆహార పదార్థాలను అందరికీ అందచేయటంలో దుశ్శాసనుణ్ణి నియమించి.

విశేషం: ఈ విధంగా ఆయా వ్యక్తుల్ని ఆయా పనుల్లో నియమించటంలో ధర్మజుని ఉచితజ్ఞత, దూరదృష్టి గొప్పగా వ్యక్తమవుతున్నాయి. ధర్మజుడు అప్పగించినా, పాండవులతో ప్రతి విషయంలో పోటీపడే స్వభావం, వాళ్ళపట్ల అసూయ పడే మనస్తత్వం ఉన్న దుర్యోధనుడు, అందరు రాజులు తెచ్చియిచ్చే కానుకలు అందుకొనే పనికి అప్పుడు అంగీకరించకుండా ఉంటే అతనికి ఎంతో బాగుండేది! కాని ఆ అవివేకి ఏ ముహూర్తంలో అంగీకరించాడో ఆ కానుకల విలువ, ధర్మరాజు వైభవం చూచి తన అసూయను అంతకంత పెంచుకొన్నాడు; కృశించాడు. శకుని మాటలు విని పాండవుల పతనానికి ప్రయత్నించాడు. అపకీర్తి పాలయ్యాడు. కడకు అతి దయనీయ మరణాన్ని పొందాడు. రాజసూయం చూడవచ్చి దుర్యోధనుడు అంగీకరించిన ఈ కానుకలందుకొనే పని, జీవితంలో అతణ్ణి ఎంతగానో దెబ్బతీసింది. ఒక విధంగా ఇది- ధర్మరాజు మర్యాదపూర్వకంగా దుర్యోధనునికి నిబంధించిన మానసికశిక్ష. ఎంతో వివేకి అయిన ధర్మరాజు కృతాకృతపరిజ్ఞానంలో కురుపితామహుడైన భీష్ముని, గురువుగారైన ద్రోణుని నియమించి, రాజసూయార్ఘ్య ప్రదాన విషయంలో తాతగారి మాట తల దాల్చినట్లే తాల్చి, తనకు ఇష్టుడైన శ్రీకృష్ణునికే అర్ఘ్యం ఇచ్చే అవకాశం కల్పించుకొన్నాడు.

ధర్మజుఁడు యజ్ఞాయతనము ప్రవేశించుట (సం. 2-33-1)

**క. ప్రాజ్ఞుఁడు విశేష ధర్మవి। ధిజ్ఞుఁడు ధర్మజుఁడు యజ్ఞదీక్షితుఁ డయి వి
ప్రజ్ఞాతిపరివృతుం డయి। యజ్ఞాయతనమున కరిగె నధికవిభూతిన్. 289**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ప్రాజ్ఞుఁడు= వివేకవంతుడు; విశేష, ధర్మ, విధిజ్ఞుఁడు= విశేషాలైన ధర్మ విధులు తెలిసినవాడు; (అయిన) ధర్మజుఁడు; యజ్ఞ, దీక్షితుఁడు+అయి= యజ్ఞదీక్షను వహించిన వాడయి; విప్ర, జ్ఞాతి, పరివృతుండు+అయి= బ్రాహ్మణులతో, దాయాదులతో చుట్టబడినవాడై అనగా బ్రాహ్మణులు, దాయాదులు తన చుట్టు ఉండగా; అధిక, విభూతిన్= మిక్కిలి వైభవంతో; యజ్ఞ+ఆయతనమునకున్= యజ్ఞశాలకు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: వివేకవంతుడు, విశేషధర్మజ్ఞుడు అయిన ధర్మరాజు, యజ్ఞదీక్ష వహించి బ్రాహ్మణులు, దాయాదులు తన చుట్టూ ఉండగా మహావైభవంగా యజ్ఞశాలలో ప్రవేశించాడు.

విశేషం: ధర్మరాజుకు ప్రాజ్ఞ డనే విశేషణం ఎంతో తగిఉంది. ఆయన ఆలోచనలు, మాటలు, చేష్టలు ఎంత ధార్మికాలో అంత లౌకికాలు. వాటిని అక్షరరమ్యంగా ఆవిష్కరించబడటం ఈ పద్యరచనాశిల్పం.

ఉ. **సమ్మదమంది చూచిరి భృశంబుగ భూజను లెల్ల బ్రహ్మతే**
జమ్మును రాజతేజమును సద్బహుభూషణ రత్నరాజి తే
జమ్మును విస్తరించుచు నిజద్యుతి యొప్పఁగ మూర్తమైన ధ
ర్మమ్మును బోలె నున్న గుణమండితు దీక్షితు ధర్మనందనున్. **290**

ప్రతిపదార్థం: భూజనులు+ఎల్లన్= భూమిమీది ప్రజలంతా; భృశంబుగన్= గొప్పగా; బ్రహ్మతేజమ్మును= బ్రాహ్మణుల తేజస్సును; రాజతేజమును= రాజుల తేజస్సును; సత్+బహు, భూషణ, రత్న, రాజి, తేజమ్మును= శ్రేష్ఠాలైన అనేకాభరణాల, రత్నసమూహంయొక్క తేజస్సును; విస్తరించుచున్= అధికం చేస్తూ; నిజద్యుతి= తనయొక్క కాంతి; ఒప్పఁగన్= ప్రకాశించగా; మూర్తము+ఐన= ఆకారం తాల్చిన; ధర్మమ్మును+పోలెన్= ధర్మంవలె; ఉన్న; గుణమండితున్= సుగుణాలచేత అలంకరించ బడినవాణ్ణి; దీక్షితున్= యజ్ఞదీక్ష వహించినవాణ్ణి; ధర్మనందనున్= ధర్మరాజును; సమ్మదము+అంది= సంతోషాన్ని పొంది; చూచిరి.

తాత్పర్యం: బ్రహ్మతేజస్సుకు, క్షత్రతేజస్సుకు, ఉత్తమ ఆభరణాల రత్నతేజస్సుకు మెరుగులు దిద్దుతూ తన తేజస్సు ప్రకాశించగా గుణశోభితుడు, యజ్ఞదీక్షితుడు అయి, రూపుతాల్చిన ధర్మంలా ఉన్న ధర్మరాజును రాజ్యప్రజలంతా మహదానందభరితులై చూచారు.

విశేషం: అలం: ఉపమ. గుణం ప్రసాదం. అది అక్షరరమ్యంగా ఆవిష్కృతం. 'మూర్తమైన ధర్మమ్మును బోలె నున్న' అనేదానికి 'మూర్తియైన ధర్మమ్మునుబోలె' అనే పాఠాంతరం పెక్కు ప్రతుల్లో ఉంది. 'ధర్మో విగ్రహవా నివ' అని మూలం (భండార్కరు ప్రతి 2-30-45). ('రామో విగ్రహవాన్ ధర్మః' అని శ్రీరామునిగూర్చి మారీచునిచేత వాల్మీకి చెప్పించిన సూక్తి జగద్విదితం. అలాగే భారతంలో ధర్మరాజు ధర్మవీరం ప్రధానరసంగా పోషించబడిన ఆంధ్రమహాభారతంలో మూర్తమైన ధర్మంవలె నున్నట్లు ధర్మరాజును వర్ణించటం సార్థకం. రాజసూయయాగంవల్ల సమకాలీన చక్రవర్తులలో సార్వభౌముడుగా, రాబోయే కురుక్షేత్ర మహాసంగ్రామంలో విజయుడుగా ధర్మరాజు వెలుగబోతున్నాడు. మహాభారత యుద్ధానంతరం అశ్వమేధయాగంతో మరొకసారి తన సార్వభౌమత్వాన్ని నిరూపించుకోబోతున్నాడు. ధర్మవిజయాన్ని తెలిపే మహేతిహాసం మహాభారతం. -సంపా.)

క. **బ్రహ్మవిదు లయిన నిఖిల । బ్రాహ్మణ సత్తములచేతఁ బరివేష్టితుఁడై**
బ్రహ్మణ్యుఁ డొప్పెఁ గురుపతి । బ్రహ్మర్షి పరీతుఁ డయిన బ్రహ్మయపోలెన్. **291**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: బ్రహ్మ, విదులు+అయిన= బ్రహ్మజ్ఞాన సంపన్నులైన; నిఖిల, బ్రాహ్మణ, సత్తములచేతన్= అందరు బ్రాహ్మణశ్రేష్ఠుల చేత; పరివేష్టితుఁడు+ఐ= చుట్టబడినవాడై; బ్రహ్మణ్యుఁడు= బ్రాహ్మణులకు హితుఁడైన; కురుపతి= కురువంశరాజు - ధర్మరాజు; బ్రహ్మ+ఋషి, పరీతుఁడు+అయిన= బ్రహ్మర్షులచేత చుట్టబడినవాడైన; బ్రహ్మ+అ, పోలెన్= బ్రహ్మదేవునివలె; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: బ్రహ్మజ్ఞానసంపన్ను లైన బ్రాహ్మణోత్తములంతా తనచుట్టూ ఉండగా, బ్రాహ్మణుల మేలుకోరే ధర్మరాజు బ్రహ్మర్షులచేత కొలువబడే బ్రహ్మదేవునిలా ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **వేదనినాదము నాశీ । ర్వాదనినాదము ననేకవాదిత్రమహా**
నాదంబుఁ జెలఁగె నన్యని । నాదంబు జనంబులకు వినంబడకుండన్. **292**

ప్రతిపదార్థం: వేద, నినాదము= వేదమంత్రాల ధ్వని; ఆశీర్వాద, నినాదము= ఆశీర్వచనాల ధ్వని; అనేక, వాదిత్ర, మహానాదంబున్= పెక్కువాద్యాల యొక్క మహాధ్వని; అన్యనినాదంబు= ఇతర ధ్వని, జనంబులకున్; వినంబడక+ఉండన్= వినబడకుండా ఉండేటట్లుగా; చెలఁగెన్= వ్యాపించింది.

తాత్పర్యం: ఇతర శబ్దాలేవీ జనులకు వినపడకుండేటట్లుగా వేదమంత్రాలధ్వనీ, ఆశీర్వచనాలధ్వని, అనేక వాద్యాల మహాధ్వని వ్యాపించింది.

వ. **అంత ననంత వేదమూర్తులైన పైల ధౌమ్యులు హోతలుగా, యాజ్ఞవల్క్యుం డధ్వర్యుండుగా, ద్వైపాయనుండు బ్రహ్మగా, సుసాముం డుద్గాతగా, వీరల పుత్త్రశిష్యగణంబులు క్రమంబున మైత్త్రావరుణుండును నచ్ఛావాకుండును గ్రావస్తుతుండును బ్రతిప్రస్థాతయు నేష్టయు నున్నేతయు బ్రాహ్మణాచ్ఛంసియు నాగ్నీధ్రుండును బోతయుఁ బ్రస్తోతయుఁ బ్రతిహస్తయు సుబ్రహ్మణ్యుండునుంగా, నారదాది బ్రహ్మర్షులు సదస్యులుగా, భీష్మాది రాజర్షులు సహాయులుగా, సర్వక్రియా సమగ్రంబయి షడంగ సమృద్ధంబయి సంపూర్ణ దక్షిణా సనాథంబయి సకల ధన ధాన్యసమన్వితంబయి జగన్నాథరక్షితంబయి సకలజనానందకరంబయి రాజసూయం బతిరమణీయం బయిన.** **293**

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; అనంత వేదమూర్తులు+ఐన= రూపుతాల్చిన అంతం లేని వేదాలవంటి వాళ్ళయిన; పైల, ధౌమ్యులు; హోతలుగా= ఋగ్వేద ఋత్విక్కులుగా; యాజ్ఞ+వల్క్యుండు; అధ్వర్యుండుగా= యజుర్వేదతంత్రం నడిపే వాడుగా; ద్వైపాయనుండు= వేదవ్యాసుడు; బ్రహ్మగా= ప్రధాన ఋత్విక్కైన బ్రహ్మగా; సుసాముండు; ఉద్గాతగా= సామవేద తంత్రం నడిపేవాడుగా; వీరల= వీరియొక్క; పుత్త్ర, శిష్య, గణంబులు= పుత్త్రుల శిష్యుల సమూహాలు; క్రమంబునన్= వరుసగా; మైత్త్రావరుణుండును, అచ్ఛావాకుండును, గ్రావస్తుతుండును, ప్రతిప్రస్థాతయు, నేష్టయున్, ఉన్నేతయు, బ్రాహ్మణాచ్ఛంసియు, ఆగ్నీధ్రుండును, పోతయున్, ప్రస్తోతయు, ప్రతిహస్తయు, సుబ్రహ్మణ్యుండునుంగాన్= యజ్ఞం చేయించే ఆయా సహాయ ఋత్విక్కులుగా; నారద+ఆది, బ్రహ్మ+ఋషులు= నారదుడు మొదలైన బ్రహ్మర్షులు; సదస్యులుగాన్= యజ్ఞవిధులను పరీక్షించే అధికారులుగా; భీష్మ+ఆది, రాజ+ఋషులు; సహాయులుగా= తోడ్పడేవాళ్ళుగా; సర్వక్రియా, సమగ్రంబు+అయి= అన్ని విధాల సంపూర్ణమై; షట్+అంగ, సమృద్ధంబు+అయి= ఆరు వేదాంగాలతో నిండిందై; సంపూర్ణ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దక్షిణా సనాథంబు+అయి= సంపూర్ణ దక్షిణలతో కూడుకొన్నదై; ధన, ధాన్య సమన్వితంబు+అయి= ధనంతో, ధాన్యంతో కూడుకొన్నదై; జగత్+నాథ, రక్షితంబు+అయి= లోకానికి ప్రభువైన శ్రీకృష్ణునిచేత రక్షించబడిందై; సకల జన+ఆనంద కరంబు+అయి= అందరు జనులకు ఆనందాన్ని కలిగించేదై; రాజసూయంబు; అతి రమణీయంబు+అయినన్= మిక్కిలి మనోహరం కాగా.

తాత్పర్యం: మూర్తీభవించిన అనంత వేదాల వంటి వారైన పైలధౌమ్యులు ఋగ్వేదతంత్రాన్ని నిర్వహించే ఋత్విక్కులుగా, యాజ్ఞవల్క్యుడు యజుర్వేదతంత్రాన్ని నడిపే అధ్వర్యుడగా, వేదవ్యాసుడు ప్రధాన ఋత్విక్కైన బ్రహ్మగా, సుసాముడు సామవేద తంత్రాన్ని నడిపే ఋత్విక్కుగా, ఈ నలువురియొక్క పుత్ర శిష్య సమూహాలు, మైత్రావరుణుడు, అచ్ఛావాకుడు మొదలయినవారు సహాయ ఋత్విక్కులుగా, నారదాది బ్రహ్మర్షులు సదస్యులుగా, భీష్మాది రాజర్షులు సహాయులుగా అన్ని విధాల సమగ్రమై, ఆరు వేదాంగాలైన శిక్షావ్యాకరణాదులతో నిండినదై, సంపూర్ణదక్షిణలతో కూడినదై, ధనధాన్యసమేతమై, జగన్నాథుడైన శ్రీకృష్ణునిచే రక్షితమై, సర్వప్రజలకు ఆనందజనకమై రాజసూయం మహామనోహరం కాగా.

విశేషం: ఋత్విక్కు - యజమానిచేత యజ్ఞాన్ని చేయించే వేదపండితుడు. ఋత్విక్కులు నలుగురు. వాళ్ళకు సహాయులుగా ఉండే ఋత్విక్కులు పంద్రెండుమంది. నలుగురు ప్రధాన ఋత్విక్కులు - హోత, అధ్వర్యుడు, బ్రహ్మ, ఉద్గాత, పంద్రెండు మంది సహాయ ఋత్విక్కులు - మైత్రావరుణుడు, అచ్ఛావాకుడు, గ్రావస్తుతుడు, ప్రతిప్రస్తోత, నేష్ట, ఉన్నేత, బ్రాహ్మణాచ్ఛంసి, ఆగ్నీధ్రుడు, పోత, ప్రస్తోత, ప్రతిహస్త, సుబ్రహ్మణ్యుడు. ఈ ఋత్విక్కుల క్రమం భిన్నప్రతులలో భిన్నవిధాలుగా ఉంది. నన్నయ వైదిక క్రియాప్రియత ఈ యాజ్ఞికభాగాన్ని మూలాన్ని మించి విపులంగా వర్ణించేటట్లు చేసింది.

సీ. **'అమ్మహామఖమునం దగ్నిముఖంబున । విపులమంత్రాహుతివితతిఁజేసి**
సకలదేవతలును, సంపూర్ణదక్షిణా । దానోత్సవంబున ధరణిసురులు,
సముచితసత్కారశతసహస్రంబుల । నఖిలరాజన్యులు, నభిమతాన్న
దానంబుపెంపున ధరణీజనంబులుఁ । దద్దయుఁ దృప్తులై ధర్మచరితు

ఆ. **ననఘు ధర్మతనయు ననుజసమన్వితు । సంస్తుతించి రధికసమ్మదమున'**
నని కురుప్రభునకు నట్లు వైశంపాయ । నోక్తమైన కథ రసోత్కటముగ. **294**

ప్రతిపదార్థం: ఆ+మహా, మఖమునందున్= ఆగొప్పయజ్ఞంలో; అగ్నిముఖంబునన్= అగ్నిహోత్రునియొక్క ముఖంలో; విపుల, మంత్ర+ఆహుతి, వితతిన్, చేసి= అధికంగా హోమం చేసిన మంత్రపూతాలైన ఆహుతుల సమూహంతో; సకల దేవతలును= అందరు దేవతలును; సంపూర్ణ, దక్షిణా, దాన+ఉత్సవంబునన్= నిండుగా దక్షిణలను, దానాలను ఇచ్చే వేడుకతో; ధరణి, సురులు= భూదేవులు - బ్రాహ్మణులు; సముచిత, సత్కార శత, సహస్రంబులన్= తగిన సమ్మానాలు నూరువేలతో; అఖిల రాజన్యులున్= సకలరాజశ్రేష్ఠులును; అభిమత+అన్నదానంబు, పెంపునన్= ఇష్టమైన అన్నదానంయొక్క ఆధిక్యంచేత; ధరణీ జనంబులున్= ప్రజలు; తద్దయున్= మిక్కిలి; తృప్తులు+ఐ= తృప్తిపొందిన వారై; ధర్మచరితున్= ధర్మబద్ధమైన నడవడి కలవాణ్ణి; అనఘున్= పాపరహితుణ్ణి - అంటే పుణ్యాత్ముణ్ణి; ధర్మతనయున్; అనుజ, సమన్వితున్= తమ్ముళ్ళతో కూడుకొన్నవాణ్ణి; అధిక, సమ్మదమునన్= మిక్కిలి సంతోషంతో; సంస్తుతించిరి= లెస్సగా ప్రశంసించారు; అని; కురు ప్రభునకున్= కురువంశ రాజైన జనమేజయునికి; అట్లు= ఆవిధంగా; రస+ఉత్కటముగన్= మిక్కిలి రసవంతంగా-అంటే ఆనందాతిశయం కలిగే తీరున; వైశంపాయన+ఉక్తము+ఐన, కథ= వైశంపాయనమునిచేత చెప్పబడిన కథ.

తాత్పర్యం: 'ఆ రాజసూయయాగంలో అగ్నిహోత్రుడిముఖంలో మంత్రపూతాలైన ఆహుతుల్ని అధికంగా వేల్చటంచేత దేవతలు, నిండుగా దక్షిణలు దానాలు ఇవ్వటంచేత బ్రాహ్మణులు, సముచిత సమ్మాన పరంపరలచే వివిధ దేశాధీశులు, అభీష్టమైన అన్నదానం అధికంగా చేయటంచేత సామాన్యప్రజలు పూర్తిగా తృప్తి పొందారు. ధర్మబద్ధమైన నడవడి కలిగి, పుణ్యాత్ముడై, తమ్ముళ్ళతో కూడి ఉన్న ఆ ధర్మరాజును మహానందంతో అందరు అమితంగా ప్రశంసించారు' అని జనమేజయునికి వైశంపాయనుడు ఎంతో రసవంతంగా మహాభారతకథ చెప్పాడు.

ఆశ్వాసాంతము

క. **భూరి గుణ రత్న భూషణ! । నారాయణమూర్తి! రాజనారాయణ! కం**
ఠీరవ విక్రమ! శారద । నీరద నీహార హీర నిభశుభకీర్తీ! **295**

ప్రతిపదార్థం: భూరి, గుణ, రత్న, భూషణ!= గొప్పగుణా లనే రత్నాలు అలంకారాలుగా కలిగినవాడా!; నారాయణమూర్తి= విష్ణు స్వరూపా!; రాజనారాయణ= రాజచంద్రా!; కంఠీరవ, విక్రమ!= సింహంవంటి పరాక్రమం కలవాడా!; శారద నీరద, నీహార, హీర, నిభ, శుభకీర్తి!= శరత్కాలమేఘంతో, మంచుతో, వజ్రమణితో సమానమైన మంచికీర్తి కలవాడా!

తాత్పర్యం: గొప్ప గుణాలనే రత్నాలు అలంకారాలుగా కలిగిన వాడా! విష్ణు స్వరూపా! రాజచంద్రా! సింహంవంటి పరాక్రమం కలవాడా! శరత్కాల మేఘంతో, మంచుతో, వజ్రమణితో సమానమైన స్వచ్ఛమైన సత్కీర్తి కలవాడా!

విశేషం: ఇది ఆశ్వాసాంతంలో ప్రశంసాపూర్వకంగా చేసిన రాజరాజనరేంద్ర సంబోధన. నన్నయగారు ఆ మహారాజు సుస్వభావాన్ని, విష్ణుత్వాన్ని, రాజశ్రేష్ఠత్వాన్ని, శూరత్వాన్ని, కీర్తినిర్మలత్వాన్ని గొప్పగా ప్రశంసించారు.

అంబురుహ వృత్తము.

రాజకులోత్తమ! రాజమనోహర! రాజసూరి సభాంతర
భ్రాజిత సద్గుణ పార్థివశేఖర! పార్థ సన్నిభ! బాంధవాం
భోజవనద్యుమణీ! మణికాంచన పుంజ భూషిత! భూమరు
ద్రాజసమాజ! పరాక్రమరాఘవ! రాజరాజనరేశ్వరా! **296**

ప్రతిపదార్థం: రాజకుల+ఉత్తమ!= రాజవంశంలో శ్రేష్ఠుడవైనవాడా! (రాజ శబ్దానికి చంద్రుడనే అర్థం కూడ ఉంది కాబట్టి రాజరాజనరేంద్రుడు చంద్రవంశపు రాజు కనుక 'చంద్రవంశంలో శ్రేష్ఠుడవైనవాడా!' అని కూడ చెప్పవచ్చు); రాజ, మనోహర!= చంద్రునివలె మనస్సును హరించేవాడా!- అంటే అందరికీ ఆహ్లాదాన్ని కలిగించేవాడా!; రాజ, సూరి, సభా+అంతర, భ్రాజిత, సద్గుణ!= రాజులయొక్క, పండితులయొక్క సభామధ్యంలో ప్రకాశించే మంచి గుణాలు కలవాడా!; పార్థివ, శేఖర!= రాజులకు సిగదండవంటివాడా! - రాజశ్రేష్ఠా!; పార్థ, సన్నిభ!= అర్జునునితో సమానమైనవాడా!; బాంధవ+అంభోజ, వన, ద్యుమణీ!= బంధువు లనే పద్మవనానికి సూర్యుని వంటివాడా!; మణి, కాంచన, పుంజ, భూషిత!= మణులయొక్క, బంగారుయొక్క సమూహంతో అలంకరించబడినవాడా!; భూ, మరుత్+రాజసమాజ!= భూసురుల (బ్రాహ్మణుల)తో కూడుకొన్న రాజసమూహం కలవాడా!; పరాక్రమ, రాఘవ!= పరాక్రమంలో శ్రీరామునితో సమానమైనవాడా!; రాజరాజ, నర+ఈశ్వర!= రాజరాజనరేంద్రా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజవంశంలో ఉత్తముడవైనవాడా! లేదా చంద్రవంశంలో శ్రేష్ఠుడవైనవాడా! చంద్రునిలా ఆహ్లాదం కలిగించేవాడా! రాజులు, పండితులు ఉన్న సభలో శోభిల్లే సద్గుణాలు కలవాడా! రాజులకు శిరోభూషణం వంటివాడా! అర్జునునితో సమానమైనవాడా! బంధువు లనే పద్మవనానికి సూర్యునివంటివాడా, మణిసువర్ణాభరణాలను అలంకరించుకొన్నవాడా! బ్రాహ్మణులతో కూడిన రాజ సమూహం కలవాడా! పరాక్రమంలో శ్రీరామునివంటివాడా! శ్రీ రాజరాజనరేంద్రా!

విశేషం: అలం: రూపకం. రాజరాజుయొక్క గుణసంపద, పండితపోషణ, పరాక్రమాధికత, ఇందులో వ్యక్తమవుతున్నాయి. అంబురుహవృత్తంలోని ప్రతిచరణంలోను వరుసగా భ, భ, భ, భ, ర, స, లగ అనే గణాలు ఉంటాయి. 13వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం పాటించబడింది.

గద్యము.

ఇది సకలసుకవిజనవినుతనన్నయభట్ట ప్రణీతంబయిన శ్రీ మహాభారతంబునందు సభాపర్వంబున ధర్మరాజునకు సభాప్రాప్తియుఁ, గింకరదర్శనంబును, నారదువలన లోకపాలుర సభాశ్రవణంబును, రాజసూయ మహాధ్వరారంభంబును, జరాసంధవధయు, గిరివ్రజ నిరుద్ధులయిన రాజులం గృష్ణుండు విడిపించుటయు, దిగ్విజయంబును, రాజసూయంబు నన్నది ప్రథమాశ్వాసము. 297

తాత్పర్యం: ఇది ఉత్తమకవిజనులందరి ప్రశంసలందుకొన్న నన్నయభట్టు రచించిన శ్రీమహాభారతంలోని సభాపర్వంలో ధర్మరాజుకు సభ సమకూరటం, కింకరదర్శనం, నారదునివల్ల లోకపాలకుల సభలనుగూర్చి వినటం, రాజసూయ మహాయజ్ఞాన్ని ఆరంభించటం, జరాసంధుని చంపటం, గిరివ్రజపురంలో బందీలై ఉన్న రాజులనందరిని శ్రీకృష్ణుఁడు విడిపించటం, దిగ్విజయం, రాజసూయమున్ను కలది మొదటి ఆశ్వాసం.

సభాపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

సభాపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీరమణీప్రియ! ధర్మవి । శారద! వీరావతార! సౌజన్యగుణా

ధార! భువనైక సుందర! వీరశ్రీరమ్య! బుధ వివేక నిధానా! 1

ప్రతిపదార్థం: శ్రీ, రమణీ, ప్రియ= లక్ష్మీదేవికి ప్రియమైనవాడా!; ధర్మ, విశారద= ధర్మంలో విద్వాంసుడవైనవాడా!-అంటే ధర్మాన్ని పూర్తిగా తెలిసినవాడా! వీర+అవతార= పరాక్రమం రూపుదాల్చినవాడా! సౌజన్య, గుణ+ఆధార= మంచిగుణాలకు ఆధారమైనవాడా!; భువన+ఏక, సుందర= లోకమంతటికి అందమైనవాడా!; వీరశ్రీ, రమ్య= వీరలక్ష్మిచేత శోభిల్లేవాడా!; బుధ, వివేక, నిధానా= పండిత వివేకానికి నిధివంటివాడా - అంటే పండితులకు ఉండే వివేకాన్ని మెండుగా కలిగినవాడా!

తాత్పర్యం: లక్ష్మీదేవికి ప్రియమైనవాడా! ధర్మాన్ని పూర్తిగా తెలిసినవాడా! వీరత్వం రూపుదాల్చినవాడా! మంచిగుణాలకు ఆధారమైనవాడా! లోకాని కంతటికీ అందమైనవాడా! వీరలక్ష్మిచేత శోభిల్లేవాడా! పండితుల కుండే వివేకం మెండుగా కలవాడా! (అని నన్నయగారు ప్రశంసాపూర్వకంగా రాజరాజును సంబోధించి ద్వితీయాశ్వాసాన్ని ప్రారంభించారు.)

ధర్మజుఁడు శ్రీకృష్ణున కర్ఘ్యం బిచ్చుట (సం. 2-33-10)

వ. అ క్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె; నట్లు రాజసూయ మహోత్సవంబు నొప్పును ధర్మరాజు ధర్మనిత్యతయును స్తుతియించి నారదుం డా సదంబున సకలరాజసమూహంబును రాజలోకంబులో మనుష్యసామాన్యుండయి యున్న జగన్మాన్యు జనార్దనుం జూచి తొల్లి బ్రహ్మాదిసురగణప్రార్థితుండయి యఖిల మహీభారావతరణార్థంబు నారాయణుండు యదువంశంబున నుదయించుటయు, నయ్యయి క్షత్రియ కులంబుల సురదైత్య దానవ యక్ష రాక్షస గంధర్వాదుల యంశావతారంబులుం దలంచి భవిష్యద్భారత రణంబునకు సంహృష్ట హృదయుండయి యుండు నంత. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= ఆ కథను చెప్పేవాడు - ఉగ్రశ్రవసుడనే మహర్షి; శౌనక+ఆది, మహామునులకున్= శౌనకుడు మొదలయిన మహర్షులకు; చెప్పెన్; అట్లు= ఆ విధంగా; రాజ, సూయ, మహా+ఉత్సవంబు= రాజసూయ యాగమనే గొప్ప ఉత్సవంయొక్క; ఒప్పును= వైభవాన్ని; ధర్మరాజు, ధర్మ, నిత్యతయును= ధర్మరాజు ధర్మంయొక్క ఎడతెగనితనాన్ని; స్తుతియించి= పొగడి; నారదుండు; ఆ, సదంబునన్= ఆ సభలో; సకల, రాజ, సమూహంబును= సమస్తరాజుల సమూహాన్ని; రాజ, లోకంబులోన్= ఆ రాజసమూహంలో; మనుష్య, సామాన్యుండు+అయి= సామాన్యమానవుడై; ఉన్న; జగత్+మాన్యున్= లోకానికి పూజ్యుడైన; జనార్దనున్= శ్రీకృష్ణుని; చూచి; తొల్లి= పూర్వం; బ్రహ్మ+ఆది, సుర, గణ, ప్రార్థితుండు+అయి= బ్రహ్మ మొదలయిన దేవతల సమూహంచేత ప్రార్థించబడినవాడయి; అఖిల, మహీ, భార+అవతరణ+అర్థంబు= సమస్త భూభారాన్ని తగ్గించటం కొరకు; నారాయణుండు= శ్రీమహావిష్ణువు; యదువంశంబునన్= యాదవకులంలో; ఉదయించుటయున్= పుట్టటమూ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అయ్యుయి, క్షత్త్రియ, కులంబులన్= ఆయా రాజవంశాల్లో; సుర, దైత్య, దానవ, యక్ష, రాక్షస, గంధర్వ+ఆదుల= దేవతలు, దైత్యులు, దానవులు, యక్షులు, రాక్షసులు, గంధర్వులు మొదలయినవాళ్ళయొక్క; అంశ+అవతారంబులున్= అంశాల పుట్టుకలూ; తలంచి= ఆలోచించి; భవిష్యత్+భారత, రణంబునకున్= మున్ముందు జరుగబోయే మహాభారతయుద్ధానికి; సంహృష్ట, హృదయుండు+అయి= సంతోషించిన హృదయం కలవాడయి; ఉండునంతన్= ఉన్నప్పుడు.

తాత్పర్యం: ఆ కథను చెప్పే ఉగ్రశ్రవస మహర్షి శౌనకాది మహామునులకు రాజసూయాన్ని గూర్చి ఆ విధంగా చెప్పాడు. నారదమహర్షి రాజసూయ మహోత్సవవైభవాన్ని, ధర్మరాజు శాశ్వత ధర్మపరాయణత్వాన్ని ప్రశంసించాడు. ఆ సభలో సకలరాజ సమూహాన్నీ, ఆ రాజసమూహంలో సామాన్య మానవునివలె ఉన్న లోకపూజ్యుడైన శ్రీకృష్ణుణ్ణీ చూచాడు. పూర్వం బ్రహ్మాది దేవతలు ప్రార్థించగా భూభారాన్ని తగ్గించటానికై శ్రీమహావిష్ణువు యదుకులంలో ఉదయించటాన్ని, సురదైత్య దానవ యక్ష రాక్షస గంధర్వాదుల అంశాలు ఆ యా క్షత్త్రియకులాల్లో జన్మించటాన్ని ఆలోచించాడు. రాబోయే మహాభారత యుద్ధానికి అంతరంగంలో సంతోషించాడు. అప్పుడు

విశేషం: దైత్యులు - కశ్యపునికి దితికి కలిగిన సంతానం. దానవులు - కశ్యపునికి దనువుకు కలిగిన సంతానం.

క. **శాంతనవుఁడు భీష్ముండు ప్ర । శాంతుఁడు దత్క్రతువు సూచి సంతుష్టుండై**
యంతక తనూజునకు ధృతి । మంతున కత్యంత ధర్మమతి కి ట్లనియెన్. 3

ప్రతిపదార్థం: శాంతనవుఁడు= శంతనుని కుమారుడు; ప్రశాంతుఁడు= మిక్కిలి శాంతం కలవాడు; (అయిన) భీష్మండు; తత్+క్రతువు= ఆ రాజసూయయాగాన్ని; చూచి; సంతుష్టుండు+ఐ= పూర్తిగా తృప్తిపొందినవాడై; ధృతిమంతునకున్= ధైర్యంతో కూడుకొన్నవానికి; అత్యంత, ధర్మ, మతికిన్= ఎంతో ఎక్కువగా ధర్మంలో నిలిపిన బుద్ధి కలవానికి; అంతక, తనూజునకున్= యమధర్మరాజు కుమారుడయిన ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఎంతో శాంతస్వభావం కలవాడు, శంతనుని కుమారుడు, అయిన భీష్ముడు రాజసూయ యాగాన్ని చూచి సంతృప్తి పొంది - ధైర్యవంతుడు, ధర్మపరాయణుడు అయిన ధర్మరాజుతో ఇలా అన్నాడు.

విశేషం: సంస్కృత సంప్రదాయాన్ని అనుసరించి నన్నయగారు 'అంతక తనూజునకు' అనే విశేష్యం తరువాత అదే విభక్తిలో 'ధృతిమంతునకు', 'అత్యంతధర్మమతికి' అనే విశేషణాలు వాడటం గమనించ దగింది.

మత్తకోకిలము.

స్నాతకుండును ఋత్విజుండును సద్గురుండును నిష్టుఁడున్
భూతలేశుఁడు సంయుజుండును బూజనీయులు; వీరిలోఁ
బ్రీతి నెవ్వఁడు సద్గుణంబులఁ బెద్ద యట్టి మహాత్ము వి
ఖ్యాతుఁ బూజితుఁ జేయు మొక్కనిఁ గౌరవాన్వయవర్ధనా! 4

ప్రతిపదార్థం: కౌరవ+అన్వయ, వర్ధనా= కౌరవవంశాన్ని వృద్ధిపొందించేవాడా! - ధర్మరాజా!; స్నాతకుండును= స్నాతకవ్రతశీలుడూ; ఋత్విజుండును= యజ్ఞం చేయించేవాడూ; సత్+గురుండును= ఉత్తముడైన గురువూ; ఇష్టుఁడున్= మిక్కిలి ఇష్టమైనవాడూ;

భూతల+ఈశుఁడు= భూపతీ - అంటే రాజూ; సంయుజుండును= జ్ఞానీ; పూజనీయులు= పూజించదగినవాళ్ళు; వీరిలోన్= ఈ ఆర్గురిలో; ఎవ్వఁడు; సత్+గుణంబులన్= మంచిగుణాలచేత; పెద్ద= ఎక్కువవాడో; అట్టి; మహాత్మున్= మహాత్ముణ్ణి; విఖ్యాతున్= ప్రసిద్ధుడైనవాణ్ణి; ఒక్కనిన్; ప్రీతిన్= ప్రేమతో; పూజితున్+చేయుము= పూజించబడినవాణ్ణిగా చేయుము - అంటే పూజించుము.

తాత్పర్యం: కురువంశవర్ధనా! ఓధర్మరాజా! స్నాతకుడు, ఋత్విజుడు, సద్గురుడు, ఇష్టుడు, భూపాలుడు, జ్ఞానసంపన్నుడు - పూజించదగినవాళ్ళు. ఈ ఆర్గురిలో సద్గుణాలచేత ఎవడు అధికుడో అలాంటి వాణ్ణి ఒక్కణ్ణి ప్రేమతోపూజించు.

విశేషం: తొమ్మిదివిధాలైన వ్రతుల్లో స్నానశీలవ్రతుడు స్నాతకుడు. 'సంయుజుండును' అనేదానికి ఉన్న పాఠాంతరం 'సంయమీంద్రుడు' కూడ స్వీకరింపదగిందే. ధర్మరాజు రాజసూయంలో కృతాకృత పరిజ్ఞానంలో భీష్మద్రోణులను నియమించాడు. కనుక తదనుగుణంగా భీష్ముడు పూజించదగిన వ్యక్తి విషయాన్ని ప్రస్తావించటం ఉచితంగా ఉన్నది. పూజ్యులైన వారిని వివేచించి చెప్పి, 'వాళ్ళందరిలో ఎవడు గొప్పవాడో, ఎవడు మహాత్ముడో, ఎవడు లోకవిఖ్యాతుడో అతణ్ణి పూజించు' అని శ్రీకృష్ణుణ్ణి స్ఫురించేటట్లు చెప్పిన భీష్ముని మాటనేర్పు అద్భుతం. ఈ పద్యంలో నన్నయ పృథక్పదత్వంతో మాధుర్యగుణాన్ని మనోజ్ఞంగా పోషించాడు.

వ. అనిన 'నట్టివాఁ డెవ్వండు నా కెఱిఁగింపు' మనిన ధర్మరాజునకు భీష్ముం డి ట్లనియె. 5

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు 'అటువంటివాడు ఎవడో నాకు తెలియచెప్పు' అన్నాడు. అందుకు భీష్ముడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

సీ. రోదసీకుహరంబు రుచిరాంశుతతిఁ జేసి । యర్కుండు వెలిఁగించు నట్టు; లమృత
సందోహ నిష్యంద చంద్రికఁ జేసి శీ । తాంశుఁ డానందించు నట్టు; సకల
జనులకుఁ దనదైన సదమలద్యుతిఁ జేసి । తనరంగఁ దేజంబుఁ దనుపుఁ దాన
చేయుచునున్న సత్సేవ్యుండు పుండరీ । కాక్షుండు గృష్ణుఁ డనాదినిధనుఁ

ఆ. డబ్జనాభుఁ డుండ; నర్ఘ్యంబునకు నిందు । నర్హు లొరులు గలరె? యజ్ఞపురుషు
నఖిలలోకపూజ్యు నచ్యుతుఁ బూజింపు । మధిప! యదియ చూవె యజ్ఞఫలము. 6

ప్రతిపదార్థం: అర్కుండు= సూర్యుడు; రుచిర+అంశు, తతిన్+చేసి= కాంతిమంతమైన కిరణాలయొక్క సమూహంచేత; రోదసీ, కుహరంబు= అంతరిక్షమనే గుహను; వెలిఁగించునట్టులు; శీత+అంశుఁడు= చల్లని కిరణాలు కలవాడు-చంద్రుడు; అమృత, సందోహ, నిష్యంద, చంద్రికన్+చేసి= అమృత సమూహాన్ని స్రవింపచేసే వెన్నెలచేత; ఆనందించునట్టు= ఆనందింపజేసేటట్లు; సకల, జనులకున్, తనది+ఐన; సత్+అమల, ద్యుతిన్+చేసి= మంచి స్వచ్ఛమైన కాంతిచేత; తనరంగన్= అతిశయించగా; తేజంబున్= వెలుగును; తనుపున్= తృప్తిని; తాను+అ= తానే; చేయుచున్+ఉన్న; సత్+సేవ్యుండు= సత్పురుషులు సేవించదగినవాడు; పుండరీక+అక్షుండు= తెల్లదామరలవంటి కన్నులు కలవాడు; అనాది, నిధనుఁడు= ఆది, అంతం లేనివాడు-అంటే జనన మరణాలు లేనివాడు; అబ్జనాభుఁడు= నీటినుండి పుట్టిన పద్మాన్ని నాభి(బొడ్డు)లో కలవాడు-కృష్ణుడు; ఉండన్= ఉండగా; అర్ఘ్యంబునకున్; ఇందున్= ఇచట; అర్హులు= తగినవాళ్ళు; ఒరులు= ఇతరులు; కలరె= కలరా?; అధిప= ధర్మరాజా!; యజ్ఞ, పురుషున్= యజ్ఞంలో పూజించదగిన ప్రధానపురుషుణ్ణి; అఖిలలోక, పూజ్యున్= అన్నిలోకాలు పూజించదగినవాణ్ణి; అచ్యుతున్= పతనం లేనివాణ్ణి - శ్రీకృష్ణుణ్ణి; పూజింపుము; యజ్ఞఫలము; అదియ, చూవె= అదే సుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సూర్యుడు కాంతిమంతమైన తన కిరణసమూహంతో అంతరిక్షగుహను వెలిగించేటట్లు, చల్లనికిరణాలుగల చంద్రుడు అమృతసమూహాన్ని స్రవించే వెన్నెలచేత ఆనందింపజేసేటట్లు - అందరు మానవులను తనదైన నిర్మలకాంతితో వెలిగిస్తూ, తృప్తిపరుస్తూ, సత్పురుషులచేత సేవించదగినవాడు, తెల్లదామరలవంటి కన్నులు కలవాడు, ఆద్యంతాలు లేనివాడు, పద్మాన్ని నాభిలో కలవాడు అయిన విష్ణుస్వరూపుడు శ్రీకృష్ణు డుండగా - అర్ఘ్యప్రదానానికి అర్హులైనవాళ్ళు ఇక్కడ ఇంకెవ రున్నారు? ధర్మరాజా! యజ్ఞపురుషుడు, సర్వలోకపూజ్యుడు, అచ్యుతుడు అయిన శ్రీకృష్ణుణ్ణి పూజించు. అదే సుమా యజ్ఞఫలం!

విశేషం: అలం: ఉపమ. ఇందు శ్రీకృష్ణునికి వాడిన విశేషణాలన్నీ విష్ణుమూర్తికి సంబంధించినవే! శ్రీకృష్ణుడు విష్ణుమూర్తి అవతారం కనుక అవి అన్నీ ఆయనకు అన్వయించేవే.

వ. అనిన భీష్మువచనంబున నప్పుడు సహదేవోపనీతంబయిన యర్ఘ్యం బర్హణీయుండయిన వాసుదేవునకు శాస్త్రదృష్ట విధానంబున ధర్మతనయుం డిచ్చిన, దానింజూచి సహింపక శిశుపాలుం డుపాలంభనపరుం డయి యధోక్షజు నాక్షేపించుచు ధర్మరాజున కిట్లనియె. 7

ప్రతిపదార్థం: అనిన; భీష్ము, వచనంబునన్= భీష్మునిమాటప్రకారం, సహదేవ+ఉపనీతంబు+అయిన= సహదేవునిచేత తీసుకొనిరాబడిన; అర్ఘ్యంబు; అర్హణీయుండు+అయిన= పూజించదగినవాడయిన; వాసుదేవునకున్= శ్రీకృష్ణునికి; శాస్త్ర, దృష్ట, విధానంబునన్= శాస్త్రంలో చూడబడిన పద్ధతితో - అంటే శాస్త్రంలో చెప్పబడిన పద్ధతి ప్రకారం; ధర్మతనయుండు, ఇచ్చినన్; దానిన్; చూచి; సహింపక= ఓర్వక; శిశుపాలుండు; ఉపాలంభన పరుండు+అయి= నిందించే స్వభావం కలవాడయి; అధోక్షజున్= శ్రీకృష్ణుని; ఆక్షేపించుచున్= తప్పులు పడుతూ - దూషిస్తూ; ధర్మరాజునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీష్ముని మాటను అనుసరించి ధర్మరాజు - సహదేవుడు తెచ్చిన అర్ఘ్యాన్ని పూజార్హుడైన శ్రీకృష్ణునికి శాస్త్రోక్త పద్ధతి ప్రకారం సమర్పించాడు. దాన్ని చూచి సహించలేక శిశుపాలుడు శ్రీకృష్ణుణ్ణి నిందిస్తూ ధర్మరాజుతో ఇలా అన్నాడు.

విశేషం: సంస్కృతభారతంలో పై వచనానికి ముందు శ్రీకృష్ణుని విష్ణుతత్త్వాన్ని చెప్పటానికి, తక్కిన అవతారాల్లో ఆయన సాధించిన ఘనకార్యాలు సుదీర్ఘంగా వర్ణించబడ్డాయి. నన్నయ ఆ వర్ణనను వదలివేశాడు. ఇంతవరకు ప్రశాంతసుందరంగా, సరళరేఖలా సాగిపోయే రాజసూయం, ఉన్నట్టుండి ఈ అర్ఘ్యప్రదానఘట్టంతో పెద్దమలుపు తిరుగుతుంది. పాఠకుని ఆసక్తి ఆ మలుపు మీదికి తిరుగుతుందిగాని, ఎంత చెప్పినా విష్ణుమూర్తి అవతారవర్ణనమీద నిలవదు. అంతటి శ్రీకృష్ణుణ్ణి ఆ శిశుపాలుడు అప్పుడు ఏమని అధిక్షేపించాడో, దానిపరిణామం ఎలా ఉంటుందో తెలుసుకోవాలని పాఠకుడు ఉవ్విళ్ళూరుతాడు. అందుచేతనే నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తిమీద దృష్టి నిలిపి, ఆ వర్ణనను పరిహరించి, పాఠకుని ఆసక్తిని అనుసరించి, శిశుపాలుని అధిక్షేపాన్నీ, దానిపరిణామాన్నీ వర్ణించటం జరిగింది.

శిశుపాలుఁడు ధర్మరాజు నాక్షేపించుట (సం. 2-34-1)

మ. అవనీనాథు లనేకు లుండఁగ విశిష్టారాధ్యు లార్యుల్ మహీ
దివిజుల్ పూజ్యులు పల్వు రుండఁగ ధరిత్రీనాథ! గాంగేయు దు
ర్వ్యవసాయంబునఁ గృష్ణుఁ గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి నీ
యవివేకం బెఱిఁగించి తిందఱకు; దాశార్హుండు పూజార్హుఁడే? 8

ప్రతిపదార్థం: ధరిత్రీనాథ= ఓ ధర్మరాజా! అవనీనాథులు+అనేకులు+ఉండఁగన్= రాజులు పెక్కుమంది ఉండగా; విశిష్ట+ఆరాధ్యులు+ఆర్యుల్= విశేషంగా పూజించదగిన పెద్దలు; మహీదివిజుల్= భూసురులు - బ్రాహ్మణులు; పూజ్యులు= పూజించదగినవాళ్ళు; పలువురు+ఉండఁగన్= పెక్కుమంది ఉండగా; గాంగేయు, దుర్+వ్యవసాయంబునన్= గంగాపుత్రుడైన భీష్మునియొక్క చెడు నిర్ణయాన్ని అనుసరించి; కష్ట, చరితున్= చెడు నడవడి కలవాణ్ణి; వార్ష్ణేయున్= వృష్ణి అనే వాని వంశంలో జన్మించిన వాణ్ణి, కృష్ణున్; పూజించి; నీ, అవివేకంబున్= నీయొక్క తెలివితక్కువతనాన్ని; ఇందఱకున్= ఇంతమందికి; ఎఱిఁగించితి= తెలియజేశావు; దాశార్హుండు= దశార్హసంతతివాడు, యాదవుడు అయిన శ్రీకృష్ణుడు; పూజా+అర్హుఁడే= పూజించటానికి తగినవాడా?

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఈ సభలో ఎందరో మహారాజు లుండగా, విశేషంగా పూజించదగిన పెద్దలు, బ్రాహ్మణులు పెక్కుమంది ఉండగా, భీష్మని చెడు నిర్ణయాన్ని అనుసరించి, వృష్ణివంశంవాడు, చెడు ప్రవర్తన కలవాడు అయిన శ్రీకృష్ణణ్ణి పూజించి, నీ తెలివితక్కువతనాన్ని ఇంతమందికి తెలియజేశావుగాని - ఆ దాశార్హుడు పూజార్హుడా?

విశేషం: యాదవులు యయాతిశాపంచేత రాజ్యానర్హులు. ఆ యాదవవంశాల్లో వృష్ణివంశం ఒకటి. దశార్హవంశం మరొకటి. రాజ్యానర్హుడై, తక్కువజాతికి చెందిన వృష్ణివంశంవాడు, చెడుప్రవర్తన కలవాడు అయిన శ్రీకృష్ణుడినా నీవు పూజించటం అని అధిక్షేపం. (దాశార్హుడు) పూజార్హుడు కాడని నిందించటం - శిశుపాలుని అధిక్షేపవాక్యాల్ని నన్నయ అర్థవ్యక్తి అనే శబ్దగుణంచేత విశిష్టంగా రచించాడు. శ్రీకృష్ణుడు పూజార్హుడు కాడనే విషయాన్ని సహేతుకంగా నిరూపించాలనే వాదన ఇందులో ముఖ్యం. తనవాదంలోని తాత్పర్యం ఝటితిస్ఫూర్తితో శ్రోతలు గ్రహించగలిగే అర్థవ్యక్తిహేతుత్వాన్ని శిశుపాలుని మాటల్లో నన్నయ నిబంధించాడు - సంపా.)

చ. **కడుకొని ధర్మతత్త్వ మెఱుఁగంగ నశక్యము; ధర్మబాహ్యు ని**
న్నొడఁబడ నిష్టుఁడై కఱపి యుత్తము లుండఁగ వాసుదేవుఁ డ
న్జడునకుఁ బూజ యిమ్మని విచారవిదూరుఁడు భీష్ముఁ డెంతయున్
వెడఁగుఁదనంబునం బనిచె; వృద్ధులబుద్ధులు సంచలింపవే. 9

ప్రతిపదార్థం: కడుకొని= పూనుకొని; ధర్మతత్త్వము= ధర్మంయొక్క పరమార్థం; ఎఱుఁగంగన్= తెలుసుకోటానికి; అశక్యము= అసాధ్యము; విచారవిదూరుఁడు= ఆలోచనకు దూరమైనవాడు-అంటే తగిన ఆలోచన లేనివాడు; భీష్ముఁడు; ఎంతయున్= మిక్కిలి; వెడఁగు, తనంబునన్= అవివేకంతో; ఉత్తములు+ఉండఁగన్= శ్రేష్ఠులైనవాళ్ళు సభలో ఉండగా; వాసుదేవుఁడు+అన్+జడునకున్= వసుదేవుని కుమారుడైన శ్రీకృష్ణుడు అనే బుద్ధిహీనుడికి; పూజ= అర్ఘ్యం; ఇమ్ము; అని; ధర్మబాహ్యున్= ధర్మానికి దూరమైనవాడివైన; నిన్నున్; ఒడఁబడన్= సమ్మతించేటట్లు; ఇష్టుఁడై= (నీకు)ఇష్టమైనవాడై; కఱపి= బోధించి; పనిచెన్= ఆదేశించాడు; వృద్ధుల, బుద్ధులు; సంచలింపవే= చలిస్తాయికదా! - అంటే చక్కగా పనిచేయవుగదా!

తాత్పర్యం: ధర్మతత్త్వాన్ని తెలుసుకోవటం అసాధ్యం. భీష్ముడు ఆలోచన సరిగా లేనివాడు. అందుకే ఎందరో మహానుభావులు ఈ సభలో ఉంటే, అవివేకంగా ఆ శ్రీకృష్ణ డనే బుద్ధిహీనుడికి అర్ఘ్యం ఇమ్మని, ధర్మబాహ్యుడివైన నిన్ను సమ్మతింపచేశాడు. వృద్ధుల బుద్ధులు నిలకడగా ఉండవుకదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. శిశుపాలుని అహంకారం, ఆక్షేపణం అంతకంతకు శ్రుతిమించుతున్నాయి. మొదట శ్రీకృష్ణణ్ణి నిందించాడు. తరువాత ధర్మరాజునే ధర్మబాహ్యుడి వన్నాడు. పిమ్మట కురుపితామహుడైన భీష్మణ్ణే విచారవిదూరు

డని, అవివేకి అని, వృద్ధుల బుద్ధులు సంచలింపవే - అని తూలనాడాడు. ఫలితం అనుభవించటానికి పాపం పండాలికదా! ఈ పద్యంలోకూడా అర్థవ్యక్తిగుణం సార్థకంగా పోషించబడింది.

చ. ఇతనికిఁ గూర్తురేని ధనమిత్తు రభీష్టములైన కార్యముల్
మతి నొనరింతు రిష్టుఁడని మంతురుగాక, మహాత్ములైన భూ
పతులయు విప్రముఖ్యులసభన్ విధిదృష్ట విశిష్ట పూజనా
యతికి ననర్హు నర్హుఁ డని యచ్యుతు నర్చితుఁ జేయఁ బాడియే? 10

ప్రతిపదార్థం: ఇతనికిన్= ఈ శ్రీకృష్ణునికి, కూర్చుదురు+ఏనిన్= (మీరు అంతగా) కావలసినవాళ్ళయితే; ధనము+ఇత్తురు= ధనాన్ని ఇస్తారుకాని; అభి+ఇష్టములు+ఐన= మిక్కిలి ప్రీతికరాలైన; కార్యముల్= పనులు; మతిన్= మనసార; ఒనరించుదురు= చేస్తే చేస్తారుకాని; ఇష్టుఁడు+అని= ఇష్టమైనవాడని; మంతురు (మనుచుదురు) కాక= పోషిస్తే పోషిస్తారు కాక; మహాత్ములు+ఐన= మిక్కిలి గొప్పవాళ్ళయిన; భూపతులయు= మహారాజులయొక్క; విప్రముఖ్యుల= బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క; సభన్= సభలో; విధి, దృష్ట, విశిష్ట, పూజన+ఆయతికిన్= శాస్త్రంలో చెప్పబడిన గొప్ప పూజను పొందటానికి; అనర్హున్= యోగ్యత లేనివాణ్ణి; అర్హుఁడు+అని= యోగ్యుడని; అచ్యుతున్= శ్రీకృష్ణుణ్ణి; అర్చితున్+చేయన్= పూజించటం; పాడియే= న్యాయమా?

తాత్పర్యం: శ్రీకృష్ణునికి మీరు స్నేహితులైతే ఒంటరిగా మీ ఇంటికి పిలిచి ధనమిస్తే ఇవ్వండి. ఆయనకు ప్రీతికరాలైన పనులు మనసార చేస్తే చెయ్యండి. ఇష్టుడుకదా అని పోషిస్తే పోషించండి. అంతేకాని, మహాత్ములైన మహారాజులు, బ్రాహ్మణశ్రేష్ఠులు ఉండే ఈ మహాసభలో - శాస్త్రంలో చెప్పబడిన ఈ గొప్పపూజ పొందటానికి ఏమాత్రం యోగ్యత లేని అతణ్ణి యోగ్యు డని పూజించటం ఏంన్యాయం? (కాదని భావం).

విశేషం: అలంకారాదులచేత అయిన ఉక్తిప్రౌఢత లేకుండా అర్థశక్తివలన ప్రతీయమాన మయ్యే ధ్వని వాక్యాశ్రితంగా ఇందులో పోషింపబడింది. దీనిని స్వతస్సంభవ్యర్థశక్తికృతానురణనధ్వని అంటారు. శిశుపాలుడు ప్రదర్శించే ఈర్ష్యా క్రోధాది భావాలకు ఈ వాక్యార్థాలు పోషకంగా ఉన్నాయి. వీటిలో అర్థవ్యక్తి అనేగుణం పోషింపబడింది. ఇది నన్నయగారి రసభావధ్వనిపోషణకు చక్కని ఉదాహరణ. ఈ పద్యంలోని కొన్నివాక్యాలు బహుళప్రచారం పొందాయి. తెలుగువారి దైనందిన వ్యవహారంలోకూడా చోటుచేసికొన్నాయి. (సంపా.)

సీ. ఈతని వృద్ధని యెఱిఁగి పూజించితే। వసుదేవుఁ డుండంగ వసుమతీశ!
ఋత్విజుం డని విచారించి పూజించితే। ద్వైపాయనుం డుండ ధర్మయుక్తి;
యాచార్యుఁ డని వినయమునఁ బూజించితే। కృతమతుల్ ద్రోణుండుఁ గృపుఁడు నుండ;
భూనాథుఁ డనియెడు బుద్ధిఁ బూజించితే। యాదవుల్ రాజులే యవనిమీఁదఁ;

ఆ. బూజనీయులైన పురుషులలోపల। నెవ్వఁడయ్యెఁ గృష్ణుఁ? డిట్టు లేల
పూజ్యులయినవారిఁ బూజింపనొల్లక। భీష్ము పనుపుఁ జేసి బేల వయితి. 11

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ= భూనాథా! ఓ ధర్మరాజా!; ఈతనిన్= ఈ శ్రీకృష్ణుణ్ణి; వృద్ధు+అని= పెద్దవాడని; ఎఱిఁగి= గుర్తించి; పూజించితి+ఏ= పూజించావా!; వసుదేవుఁడు= శ్రీకృష్ణుని తండ్రిఅయిన వసుదేవుడు; ఉండంగన్= ఈ సభలో ఉండగా; ఋత్విజుండు+అని= యజ్ఞం చేయించేవాడని; విచారించి= ఆలోచించి; ధర్మయుక్తిన్= ధర్మపద్ధతిని; పూజించితి+ఏ=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పూజించావా! కృష్ణద్వైపాయనుండు+ఉండన్= వేదవ్యాస మునీంద్రుడే ఈసభలో ఉండగా; అచార్యుఁడు+అని= గురువని; వినయమునన్= వినయభావంతో; పూజించితి+ఏ= పూజించావా? కృతమతుల్= గొప్పబుద్ధిశాలురైన; ద్రోణుండు; కృపుఁడున్; ఉండన్= ఉండగా; భూనాథుఁడు+అనియెడు= రాజు అనే; బుద్ధిన్= ఉద్దేశంతో; పూజించితే; అవనిమీఁదన్= భూమిమీద; యాదవుల్= యదువంశీయులు; రాజులే= రాజులా? పూజనీయులు+ఐన= పూజించదగినవాళ్ళయిన; పురుషులలోపలన్; కృష్ణుఁడు; ఎవ్వఁడు+అయ్యెన్= ఎవడై ఉన్నాడు? ఇట్టులన్= ఈ విధంగా; ఏల= ఎందుచేత; పూజ్యులు+అయిన, వారిన్= పూజించదగినవాళ్ళను; పూజింపన్+ఒల్లక= పూజించటానికి ఇష్టపడక; భీష్మ, పనుపున్+చేసి= భీష్ముని ఆజ్ఞచేత; బేలవు+అయితి= మూర్ఖుడి వయ్యావు.

తాత్పర్యం: ధర్మరాజా! శ్రీకృష్ణుణ్ణి వృద్ధుడని గుర్తించి పూజించావా? సభలో ఆయన తండ్రి వసుదేవుడే ఉన్నాడుకదా! ఋత్విజు డని ఆలోచించి పూజించావా? సభలో వేదవ్యాస మునీంద్రులే ఉన్నారుకదా! గురువుగా రని వినయంతో పూజించావా? సభలో మహామేధావులైన ద్రోణాచార్య కృపాచార్యులే ఉన్నారుకదా! మహారాజు అని పూజించావా? భూమిమీద యాదవులు రాజులా? ఈ విధంగా పూజించదగిన పురుషుల్లో శ్రీకృష్ణుడు ఎవ డని పూజించావు? పూజించవలసినవాళ్ళను పూజించక, భీష్ముడు చెప్పినమాటలు విని శ్రీకృష్ణుణ్ణి పూజించి మూఢుడి వనిపించుకొన్నావు.

విశేషం: మూఢునికి కాళిదాసు చెప్పిన నిర్వచనం: 'మూఢః పరప్రత్యయనేయబుద్ధిః' - ఇతరులు చెప్పింది నమ్మే బుద్ధి గలవాడు. (ఈ పద్యంలోని వాక్యాంత కాకువు, తద్ధిత ప్రయోగాలూ వ్యంజకాలై శిశుపాలుని అసూయను ధ్వనింపచేస్తున్నాయి. అసూయకున్న ప్రధానలక్షణం-గుణాల్లో సైతం దోషారోపణచెయ్యటం. 'అక్షాంతిరీర్ష్యాఽసూయాతు దోషారోపో గుణేష్వపి' - అని అమరకోశం. శిశుపాలు డీలక్షణాన్ని పుష్కలంగా ప్రదర్శిస్తున్నాడు. ఈ సీసపద్యరచనలో ప్రతిపాదంలో పూర్వార్ధం ఆరోహగతిలో, ఉత్తరార్ధం అవరోహగతిలో సాగటంతో సమాధిగుణం సంపన్నమైంది. - సంపా.)

చ. **పురుష విశేష విత్తముఁడు పూజ్యుఁడు రాజులలోన నీయుధి**
ష్ఠిరుఁ డని నీ గుణాళి ప్రకటించి మనంబులలోన ధారుణీ
శ్వరులు భవన్మఖంబునకు వచ్చిన నిందఱ కివ్విధంబునం
బరఁగ నవజ్ఞ సేయు టిది పాడియె ధర్మువె ధర్మనందనా! **12**

ప్రతిపదార్థం: ధర్మనందనా= ఓ ధర్మరాజా!; ఈ, యుధిష్ఠిరుఁడు; పురుష, విశేష విత్తముఁడు= పురుషు లందరిలో గొప్పపేరు పొందినవాడు; రాజులలోనన్; పూజ్యుఁడు= పూజించతగినవాడు; అని; నీ= నీయొక్క; గుణ+ఆళిన్= సుగుణాల సమూహాన్ని; ధారుణీ+ఈశ్వరులు= భూపతులు-రాజులు; మనంబులలోనన్= మనస్సులలో; ప్రకటించి= స్పష్టపరుచుకొని; భవత్+మఖంబునకున్= నీయొక్క యాగానికి; వచ్చినన్= రాగా; ఇందఱకున్= ఇంతమందికి; ఈ+విధంబునన్; పరఁగన్= పెద్దగా; అవజ్ఞ, చేయుట= అవమానం చేయటం; ఇది; పాడియె= న్యాయమా? ధర్మువె= ధర్మమా? (కాదని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! యుధిష్ఠిరుడు పురుషులందరిలో విశేషంగా పేరుపొందినవా డని, రాజుల్లో ఎంతో పూజ్యు డని, నీ సుగుణాలను స్పష్టంగా తెలుసుకొని, రాజులందరు నీ యజ్ఞానికి రాగా - ఇందరిని ఈ విధంగా ఇంత అవమానంపాలు చెయ్యటం నీకు న్యాయమా? ధర్మమా?

విశేషం: 'పురుషవిశేషవిత్తముఁడు' అనేదానికి 'పురుషవరేణ్యుఁ డుత్తముఁడు', 'పురుషవిశేషయుత్తముఁడు', 'పురుషవివేక సత్తముఁడు' అనే పాఠాంతరా లున్నాయి. (ధర్మువె, ధర్మనందనా- అని అనటంలో దెప్పిపొడుపు ధ్వనిస్తున్నది. శ్లేష అనే శబ్దగుణం శిశుపాలుడి వాక్యరచనకు మస్సృణత్వాన్ని కలిగిస్తూ మృదువుగా మందలిస్తున్న వైఖరిని ప్రదర్శిస్తున్నది. - సంపా.)

క. నీ వెఱుఁగక యిచ్చిన నిది । నా విషయమె యని మనంబునం దలఁపక ల
జ్జా విరహితుఁ డయి యర్ఘ్యము । గోవిందుఁడు గొనియెఁ; దనకుఁ గొను టుచితంబే? 13

ప్రతిపదార్థం: నీవు; ఎఱుఁగక= తెలియక; ఇచ్చినన్; ఇది; నా, విషయమె, అని= నేను పొందదగినదా అని; మనంబునన్= మనసులో; తలఁపక= ఆలోచించక; లజ్జా, విరహితుఁడు+అయి= సిగ్గులేనివాడై; గోవిందుఁడు= శ్రీకృష్ణుడు; అర్ఘ్యము; కొనియెన్= తీసుకొన్నాడు; తనకున్; కొనుట= తీసుకోవటం; ఉచితంబే= తగిఉన్నదా? (లేదని భావం)

తాత్పర్యం: నీవు అజ్ఞానంతో ఇచ్చినా, ఇందుకు నేను తగుదునా అని ఆలోచించకుండా శ్రీకృష్ణుడు సిగ్గులేక అర్ఘ్యాన్ని స్వీకరించాడు. అలా తీసుకోవటం అతనికి ఉచితమా?

క. చనఁ బేడికి దారక్రియ । యును, జెవిటికి మధురగీతియును, జీకునక
త్యనుపమ సురూపదర్శన । మును జేయుటఁ బోలుఁ గృష్ణుఁ బూజించు టిలన్. 14

ప్రతిపదార్థం: ఇలన్= భూమిలో; కృష్ణున్; పూజించుట; చనన్= తగునని; పేడికిన్= నపుంసకునికి; దార, క్రియయును= పెండ్లి; చెవిటికిన్, మధురగీతియును= కమ్మని పాటా; చీకునకున్= గ్రుడ్డివాడికి; అతి+అనుపమ, సురూప, దర్శనమును= సాటిలేని సుందరరూపాన్ని చూపటం; చేయుటన్; పోలున్.

తాత్పర్యం: ఈ భూమిమీద శ్రీకృష్ణుణ్ణి పూజించటం - నపుంసకుడికి పెండ్లిచేయటంలాంటిది. చెవిటివాడికి కమ్మనిపాట వినిపించటంలాంటిది. గ్రుడ్డివాడికి అందమైనరూపాన్ని చూపించటంలాంటిది.

విశేషం: అలం: ఉపమ.

ఉ. 'ఈ యవనీశ్వర ప్రవరు లిందఱు నిన్ను నగంగ నిట్లుగాఁ
జేయుదె ధర్మరా జను విశేషసమాఖ్య నిరర్థకంబుగా
ధీయుత!' యంచు ధర్మజ నదీసుత కృష్ణుల నెగ్గులాడుచుం
బోయె సదంబు వెల్వడి సపుత్త్రబలుండయి చైద్యుఁ డల్కతోన్. 15

ప్రతిపదార్థం: చైద్యుఁడు= చేదిరాజైన శిశుపాలుడు; ధీయుత= బుద్ధిమంతుడవైన ఓ ధర్మరాజా! ఈ, అవనీ+ఈశ్వర, ప్రవరులు= ఈ రాజశ్రేష్ఠులు; ఇందరు= ఇంతమంది; నిన్ను, నగంగన్= నిన్ను చూచి నవ్వగా; ధర్మరాజు+అను; విశేష, సమాఖ్య= ప్రత్యేకమైన పేరు; నిరర్థకంబుగాన్= వ్యర్థమయ్యేటట్లుగా; ఇట్లు, కాన్= ఈవిధంగా; చేయుదు+ఎ= చేస్తావా? అంచున్, ధర్మజ, నదీసుత, కృష్ణులన్= ధర్మరాజును, గంగానదీసుతు డైన భీష్మణ్ణి, శ్రీకృష్ణుని; ఎగ్గులు+ఆడుచున్= నిందిస్తూ; సపుత్త్రబలుండు+అయి= పుత్త్రులతో, పరివారంతో కూడుకొన్నవాడయి; అల్కతోన్= కోపంతో; సదంబు; వెల్వడి= సభనుండి బయటికి వచ్చి; పోయెన్= వెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: చేదిరాజైన శిశుపాలుడు - 'బుద్ధిమంతుడా!' అని ధర్మరాజును ఎత్తిపొడుపుగా సంబోధించి, 'ఈ రాజశ్రేష్ఠులు ఇంతమంది నిన్ను చూచి నవ్వేటట్లు, ధర్మరా జనే నీ ప్రత్యేకనామం వ్యర్థం అయ్యేటట్లు ఈ విధంగా చేశావా?' అంటూ ధర్మజ భీష్మ కృష్ణులను నిందిస్తూ కోపోద్రిక్తుడై పుత్రులతో, బలగంతోగూడి సభనుండి వెళ్ళిపోయాడు.

విశేషం: ఈ పద్యంలో అగ్రామ్యత్వంవలన ఉదారత అనే అర్థగుణం రాణిస్తున్నది. (సంపా.)

వ. **ఆ శిశుపాలు పిఱుందన చని ధర్మనందనుండు వానిం బ్రియవచనంబుల ననునయించుచు ని ట్లనియె.** **16**

ప్రతిపదార్థం: ధర్మనందనుండు; ఆ, శిశుపాలు= ఆ శిశుపాలునియొక్క; పిఱుందన= వెనుకనే; చని= వెళ్ళి; వానిన్; ప్రియ, వచనంబులన్= ఇంపైన మాటలతో; అనునయించుచున్= బుజ్జగిస్తూ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధర్మరాజు ఆ శిశుపాలుని వెనువెంటనే వెళ్ళి అతణ్ణి ఇంపైన మాటలతో బుజ్జగిస్తూ ఇలా అన్నాడు.

క. **భూరిగుణోన్నతు లనఁదగు । వారికి ధీరులకు ధరణివల్లభులకు వా**
క్పారుష్యము చన్నె? మహా । దారుణ మది విషముకంటె దహనముకంటెన్. **17**

ప్రతిపదార్థం: భూరి, గుణ+ఉన్నతులు= గొప్పగుణాలచేత శ్రేష్ఠులు; అనన్+తగు, వారికిన్= అని అనదగినవాళ్ళకు; ధీరులకున్= విద్వాంసులకు; ధరణి వల్లభులకున్= భూపతులకు - అంటే రాజులకు; వాక్+పారుష్యము= మాటలో కాఠిన్యం - అంటే కటువుగా మాట్లాడటం; చనున్+ఎ= తగునా?; అది= ఆ వాక్పారుష్యం; విషముకంటెన్; దహనముకంటెన్= నిప్పుకంటె; మహాదారుణము= మిక్కిలి భయంకరమైంది.

తాత్పర్యం: గొప్పగుణాలచేత శ్రేష్ఠులని చెప్పదగినవాళ్ళకు, పండితులకు, ప్రభువులకు కఠినంగా మాట్లాడటం తగునా? మాటకాఠిన్యం-విషంకంటె, అగ్నికంటె అతిభయంకరం కదా!

విశేషం: నన్నయసూక్తుల్లో ఇదొక సుప్రసిద్ధసూక్తి. నన్నయ నానారుచిరార్థ సూక్తినిధి. అంటే అనేకరుచిరాలైన అర్థాలతో కూడుకొన్న సూక్తులకు ఆయన నిధివంటివాడు. సూక్తి అంటే మంచిమాట. లోకాన్ని పరిశీలించి, అనుభవాన్ని ఆధారంగా గొని, ధర్మమార్గానికి దీపికగా, మానవుని మనస్సుకు ఎక్కేట్లు చెప్పే మంచిమాట సూక్తి, సూక్తి సుదీర్ఘంగా ఉండకూడదు. సూత్రప్రాయంగా ఉంటేనే సూక్తికి శోభ. అంటే అది అల్పాక్షరాల అనల్పార్థ రచన. అంతేకాదు, సూక్తిలోని అర్థం సూటిగా ఉండాలి. కొంత ఘాటుగా కూడ ఉండాలి. అది చదివేకొలది చవులూరించాలి. వ్యక్తి జీవితానికి వెలుగునివ్వాలి. కవి లోకహితుడు. ఆతని కవిత రసమయంగానే కాక, ఉపదేశయుతంగా ఉండాలి. 'జగద్ధితంబుగన్ మహాభారత సంహితా రచన బంధురు'డైన మహాకవి నన్నయ నానారుచిరార్థ సూక్తినిధి. రసమయమైన ఆయనకవిత సూక్తిరత్నాకరం. మానవజీవితంలో మాట ఎంతో విలువైంది. అది మానవుణ్ణి "మహాత్మా" అని అనిపించగలదు. 'పశువా' అని పిలిపించగలదు. మాటకాఠిన్యాన్నిగూర్చి మహాకవి నన్నయసూక్తి మరపురానిది; మరువగూడనిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. **ఆదిజుఁడైన బ్రహ్మయుదయంబున కాస్పదమైనవాఁడు, వే**
దాది సమస్త వాఙ్మయములందుఁ బ్రశంసితుఁడైన వాఁడు,లో
కాది, త్రిలోకపూజ్యుఁ డని యాత్మ నెఱింగి పితామహుండు దా
మోదరుఁ జెప్పెఁ బూజ్యుఁ డని; యుక్తము కా కిది యేమి దోసమే? **18**

ప్రతిపదార్థం: ఆదిజుఁడు+ఐన= (సృష్టికి) మొదట పుట్టినవాడైన; బ్రహ్మ, ఉదయంబునకున్= బ్రహ్మదేవుని పుట్టుకకు; ఆస్పదము+ఐన, వాఁడు= స్థానమైనవాడు; వేద+ఆది= వేదాలు మొదలైన; సమస్త, వాఙ్మయముల+అందున్= అన్ని విజ్ఞానగ్రంథాల్లో; ప్రశంసితుఁడు+ఐనవాఁడు= కీర్తింపబడినవాడు; లోక+ఆది= లోకాలకు మొదలైనవాడు; త్రిలోక, పూజ్యుఁడు= మూడు లోకాలచేత పూజించదగినవాడు; అని; ఆత్మన్+ఎఱింగి= బుద్ధిచే గ్రహించి; పితామహుండు= తాత అయిన భీష్ముడు; దామోదరున్= శ్రీకృష్ణుని; పూజ్యుఁడు+అని= పూజించదగినవాడని; చెప్పెన్= చెప్పాడు; ఇది; యుక్తము+అ కాక= ఉచితంకాక; ఏమి, దోసమే= తప్పా ఏమి?

తాత్పర్యం: సృష్టికి మొదటపుట్టిన బ్రహ్మపుట్టుకకే స్థానమైనవాడు, వేదాలు మొదలైన మహాగ్రంథా లన్నింట కీర్తించబడేవాడు, లోకాలకే ఆద్యుడైనవాడు, ముల్లోకాలచే పూజించదగినవాడు - అని తెలుసుకొని పితామహుడైన భీష్ముడు, శ్రీకృష్ణుణ్ణి పూజార్హు డని చెప్పాడు. ఇది ఉచితం కాక దోష మౌతుందా ఏమిటి?

విశేషం: (అలం: కావ్యలింగం. సమర్థించవలసిన అర్థాన్ని సమర్థించటం కావ్యలింగం. శ్రీకృష్ణుడు పూజ్యు డని సమర్థించటం ఇందలి ప్రకృతాంశం. అందువల్ల ఇందులో అర్థవ్యక్తి అనే గుణం ఆకృతి తాల్చింది. -సంపా.) సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు విష్ణుమూర్తి నాభికమలంనుండి జన్మించాడు. కనుక బ్రహ్మపుట్టుకకు విష్ణుమూర్తి స్థానమయ్యాడు. దామోదరుడు - తులసిమాల ఉదరంపై కలవాడు.

క. **పరమార్థ ప్రతిభఁ దమో । హరు నచ్యుతు భీష్ముఁ డెఱిఁగిన ట్లెఱుఁగఁగ నీ**
కరిది శిశుపాల! పెద్దల । చరితం బల్పులకు నెఱుఁగ శక్యమె యెందున్? **19**

ప్రతిపదార్థం: శిశుపాల; పరమ+అర్థ, ప్రతిభన్= పరమార్థ తత్త్వాన్ని దర్శించగల ప్రజ్ఞచేత; తమోహరున్= చీకటిని తొలగించేవాణ్ణి; అంటే అజ్ఞానాన్ని పారద్రోలేవాణ్ణి; అచ్యుతున్= చ్యుతి-లేదా-పతనంలేనివాణ్ణి, శ్రీకృష్ణుణ్ణి, భీష్ముఁడు; ఎఱిఁగినట్లు= తెలుసుకొన్నట్లు; ఎఱుఁగఁగన్= తెలుసుకొనటానికి; నీకున్, అరిది= అసాధ్యం; ఎందున్= ఎచ్చటైనా; పెద్దల చరితంబు= గొప్పవాళ్ళయొక్క చరిత్ర; అల్పులకున్= తక్కువవాళ్ళకు; ఎఱుఁగన్= తెలుసుకొనటం; శక్యమె= సాధ్యమా! (కాదని భావం.)

తాత్పర్యం: ఓ శిశుపాలా! పరమార్థతత్త్వాన్ని దర్శించే ప్రతిభచేత అజ్ఞానం అనే చీకటిని పారద్రోలేవాడు, పతనం లేనివాడు అయిన శ్రీకృష్ణుణ్ణి భీష్ముడు అర్థంచేసుకొన్నట్లు అర్థంచేసుకోవడం నీకు అసాధ్యం. ఎక్కడైనా మహాత్ముల చరిత్రను అల్పులు అర్థంచేసుకోగలరా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. (ఈ రచనలోనూ అర్థవ్యక్తి అనే గుణం సార్థకంగా పోషించబడింది. -సంపా.)

క. **గురుఁ డని సమస్తలోకో । త్తరుఁ డని నీకంటె వృద్ధతములైన నరే**
శ్వరు లచ్యుతు నర్చన నెడఁ । గర మభినందింప నీకుఁ గాదనఁ దగునే. **20**

ప్రతిపదార్థం: గురుఁడు+అని= అందరికంటె గొప్పవా డని, లేదా జ్ఞానదాత అని; సమస్త, లోక+ఉత్తరుఁడు+అని= అన్నిలోకాలకంటె శ్రేష్ఠు డని; నీకంటెన్; వృద్ధతములు+ఐన= మిక్కిలి పెద్దవాళ్ళయిన; నర+ఈశ్వరులు= నరపతులు - అంటే రాజులు; అచ్యుతు, అర్చనన్= శ్రీకృష్ణుని యొక్క పూజను; ఎడన్= హృదయమందు; కరము= మిక్కిలి; అభినందింపన్= పొగడగా; నీకున్; కాదు; అనన్; తగునే.

తాత్పర్యం: అందరికంటె గొప్పవా డని, జ్ఞానదాత, అని లోకాలన్నింటికంటె శ్రేష్ఠు డని, నీకంటె ఎంతో పెద్దలైన రాజులే శ్రీకృష్ణుని కిచ్చిన అర్ఘ్యానికి ఎంతో పొగడుతూ ఉంటే నీ విలా వ్యతిరేకించటం తగునా?

విశేషం: ధర్మజుని వాక్యవిన్యాసంలో రుచిరార్థసూక్తులను కూర్చాడు నన్నయ. గురుడనే శబ్దం సార్థకం. ఇది శ్రీకృష్ణుడి జగద్గురుత్వాన్నీ, అజ్ఞానాన్ని తొలగించి వెలుగును ప్రసాదించే మహత్త్వాన్నీ ధ్వనింపచేస్తున్నది. సమస్తలోకోత్తరు డనే విశేషణం శ్రీకృష్ణుని పరమాత్మతత్త్వాన్ని వ్యక్తంచేస్తున్నది. 'అచ్యుతుని అర్చన చేయటం' అనే పదాలు శ్రీకృష్ణుని నిత్యత్వాన్ని తెలుపుతూ శిశుపాలుణ్ణి వివేకచ్యుతు డని వ్యంగ్యంగా చెపుతున్నవి. 'వృద్ధతములు' అనేమాట సార్థకం. శిశుపాలునికంటె వయసులోనే కాక అనుభవంలోకూడా పెద్దలైనవాళ్ళు శ్రీకృష్ణుణ్ణి అభినందిస్తే శిశుపాలుడు అభిశంసించి అవివేకి అనిపించుకొన్నా డని భావం. ధర్మజుని వాక్యం ప్రౌఢం. ధ్వనిమయం. ఈ పద్యంలోని వాక్యవిన్యాసవికటత్వంలో నన్నయ ఉదారతను పోషించాడు. అగ్రామ్యత్వలక్షణం ధర్మజుడి సంస్కారవ్యంజకం. (సంపా.)

వ. అని యా శిశుపాలుం బట్టువఱుచుచున్నంత ధర్మరాజునకు భీష్ముం డి ట్లనియె. 21

ప్రతిపదార్థం: అని; ఆ, శిశుపాలున్; పట్టువఱుచుచున్+ఉన్న+అంతన్= తెలియజెప్పి ఒప్పించటానికి ప్రయత్నిస్తుండగా; ధర్మరాజునకున్; భీష్ముండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ఆ శిశుపాలుడికి నచ్చచెప్పి ఒప్పించటానికి ప్రయత్నిస్తూ ఉండగా, ధర్మరాజుతో, భీష్ముడు ఈ విధంగా అన్నాడు.

భీష్ముఁడు శిశుపాలుని నిందించుట (సం. 2-35-6)

ఉ. పాలితదుర్ణయుండు శిశుపాలుఁడు బాలుఁడు; వీని నేల భూ
పాలక! నీకుఁ బట్టువఱుపన్? మఱి ధర్ము వెఱుంగ వీనికిం
బోలునె రాగకోప పరిభూత మనస్కున కల్పరాజ్య ల
క్ష్మీ లలనాంధబుద్ధి కనిమిత్త మహత్పరివాదశీలికిన్? 22

ప్రతిపదార్థం: భూపాలక= ధర్మరాజా; శిశుపాలుఁడు; పాలిత, దుర్ణయుండు= పెంచుకొనబడిన చెడునడత కలవాడు; బాలుఁడు= పరిపక్వం కాని బుద్ధికలవాడు; వీనిన్= ఇటువంటి శిశుపాలుడిని; పట్టు, పఱుపన్= తెలియజెప్పి ఒప్పించటం; నీకున్; ఏల= ఎందుకు; మఱి= అంతేకాక; రాగ, కోప, పరిభూత, మనస్కునకున్= మాత్సర్య కోపాలచేత అవమానించబడిన మనస్సు కలవాడూ - అంటే అసూయా క్రోధాలకు వశమైన మనస్సు కలవాడూ; అల్ప, రాజ్య, లక్ష్మీ, లలనా+అంధ, బుద్ధికిన్= కొద్దిపాటి రాజ్యసంపద అనే కాంత చేతనే గ్రుడ్డిదైన బుద్ధికలవాడూ - అంటే అల్పరాజ్య సంపద అనేకాంతను చూచుకొని మదించి వివక్షను కోల్పోయిన బుద్ధి కలవాడూ; అనిమిత్త, మహత్+పరివాద, శీలికిన్= కారణం లేకుండానే మహాత్ములను నిందించే స్వభావం కలవాడూ అయిన; వీనికిన్= ఈ శిశుపాలుడికి; ధర్మువు+ఎఱుంగన్= ధర్మతత్త్వాన్ని తెలుసుకోవటం; పోలునె= సాధ్యమగునా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మరాజా! శిశుపాలుడు పెచ్చుపెరిగిన చెడునడత కలవాడు; పరిపక్వం కాని బుద్ధికలవాడు. ఇలాంటి వీడికి చెప్పి ఒప్పించే ప్రయత్నం నీవు ఎందుకు చేస్తావు? అంతేకాదు, ఇతడు అసూయా క్రోధాలకు వశమైన మనస్సు కలవాడు. కొద్దిపాటి రాజ్యలక్ష్మిచేతనే మదించి వివక్షను కోల్పోయిన బుద్ధి కలవాడు. కారణం లేకుండానే మహాత్ములను నిందించే స్వభావం కలవాడు. ఇలాంటి వీడికి ధర్మతత్త్వం తెలుసుకోవటం సాధ్యమవుతుందా?

విశేషం: అలం: రూపకం. ఈ పద్యం శిశుపాలుడి చెడు స్వభావం ప్రతిఫలించే అద్దం. ధర్మతత్త్వాన్ని గ్రహించటానికి రాగద్వేషరహితమైన సమచిత్తం ఉండాలి. అహంకారం, అవివేకం ఉండకూడదు. శిశుపాలుని స్వభావంలో ఉండవలసిన సమచిత్తత లేదు. ఉండగూడని అహంకారం, అవివేకం మెండుగా ఉన్నాయి. అందుచేత 'ధర్మరాజా! ఇతనికి ధర్మతత్త్వాన్ని తెలియజెప్పి ఒప్పించే ప్రయత్నం వ్యర్థ'మని భీష్ము డంటున్నాడు. అంతేకాదు, 'భూపాలక! నేల నాలుగు దిక్కులు జయించి సార్వభౌమ యోగ్యమయిన రాజసూయయాగం చేసే మహారాజా! వీనిన్ - ఈ తక్కువవాణ్ణి, అల్పరాజ్య లక్ష్మీలలనాంధబుద్ధిని, అనిమిత్త మహత్పరివాదశీలిని - ఒప్పించే ప్రయత్నం నీకు అనవసర'మనికూడ అంటున్నాడు. కాగా, ఇక్కడ శ్రీకృష్ణుని మాహాత్మ్యాన్ని, ఆయన పూర్వావతార వృత్తాంతాలను విరివిగా భీష్ముడు వర్ణించినట్లు పి.పి.యస్. శాస్త్రిగారి సంపాదకత్వంలో వెలువడిన దాక్షిణాత్య సంస్కృత భారత ప్రతిలో ఉంది. నన్నయ కథాప్రసన్నతను పోషించటానికే ఆ విపులవర్ణనను పరిహరించి, శ్రీకృష్ణునికి అర్ఘ్యమివ్వటం ఎలా ఉచితమో యుక్తియుక్తంగా, సంక్షిప్తంగా చెప్పించాడు. (పై పద్యంలోని భీష్ముడి క్రోధోక్తులు ఆరోహక్రమంలో సాగి అర్థదృష్టితో ప్రవర్తిల్లటంచేత సమాధి అనే గుణం రసోదంచితంగా రచనలో రాణించింది. ఈ ఘట్టంలోని నన్నయనాటకీయతను గురించిన వివరాలకు పీఠిక చూడండి. - సంపా.)

వ. అని ధర్మరాజును వారించి శిశుపాలుం జూచి భీష్ముం డిట్లనియె. 23

తాత్పర్యం: అని ధర్మరాజును ఆపి. శిశుపాలుణ్ణి చూచి భీష్ముడు ఇలా అన్నాడు.

చ. అవినయబుద్ధివై హరికి నర్ఘ్య మయోగ్యమ యంటి; నీవు మూ
ర్ఖవు శిశుపాల! యింకఁ బలుకన్ వలసెన్ సభలోన నున్న యీ
యవనిపులెల్ల నాతని దయం బరిముక్తులు, వానిచేత నా
హవ జితులుం, దదీయశరణార్థులుఁగా కొరులయ్య చెప్పుమా! 24

ప్రతిపదార్థం: శిశుపాల; అవినయ, బుద్ధివి+ఐ= వినయంలేని బుద్ధికలవాడివై - అంటే అహంకరించి; హరికిన్= శ్రీమహావిష్ణువుకు - అంటే ఆయన అవతారమైన శ్రీకృష్ణునికి; అర్ఘ్యము; అయోగ్యము+అ= తగదు; అంటి= అంటివి; నీవు= నీవు; మూర్ఖవు= తెలివిలేనివాడివి; ఇంకన్= ఇక; పలుకన్, వలసెన్= చెప్పక తప్పటంలేదు; సభలోనన్= ఈసభలో; ఉన్న; ఈ; అవనిపులు+ఎల్లన్= ఈ రాజులందరు; ఆతని, దయన్= ఆశ్రీకృష్ణునిదయచేత; పరిముక్తులు= పూర్తిగా విడిచిపెట్టబడినవాళ్ళు (జరాసంధుని చెరనుండి), వానిచేతన్= శ్రీకృష్ణునిచేత; ఆహవజితులున్= యుద్ధంలో ఓడించబడినవాళ్ళు; కాక; ఒరులు+అయ్య= ఇతరులటయ్యా! చెప్పుమా.

తాత్పర్యం: శిశుపాలా! అహంకరించి సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణునికే అర్ఘ్యమివ్వటం తగదంటున్నావు. ఇక చెప్పక తప్పిందికాదు. ఈ సభలో ఉండే రాజులంతా, ఆయనదయచేత జరాసంధుని చెరనుండి విడిపించబడినవాళ్ళే. లేదా ఆయనచేత యుద్ధంలో ఓడించబడినవాళ్ళే. లేదా ఆయనను శరణువేడినవాళ్ళే, అలా కాకుండా ఇతరు లెవరున్నారో చెప్పు?

విశేషం: ఇక్కడ 'హరి' శబ్దప్రయోగం ఉచితంగా ఉంది. శ్రీకృష్ణుని విష్ణుత్వంమీద, శిశుపాలుని మూర్ఖత్వంమీద ఆ మాట వెలుగులను ప్రసరిస్తున్నది. (భీష్ముని వాక్యవిన్యాసంలో, రచనలో వికటత్వం భాసించి ఉదారత అనే గుణం క్రోధభావోద్దీప్తికి తోడ్పడింది-సంపా.)

తే. **ఉత్తమ జ్ఞానవృద్ధు నా నుండె నేని । బాలుఁ డయ్యును బూజ్యుండు బ్రాహ్మణుండు;**
క్షత్త్రియుఁడు పూజ్యుఁ డమితవిక్రమసమృద్ధి । నుర్విపతులలో నధికుఁడై యుండె నేని. **25**

ప్రతిపదార్థం: బ్రాహ్మణుండు; ఉత్తమ, జ్ఞాన, వృద్ధునాన్= ఉత్తమమైన జ్ఞానంచేత పెద్దవాడయితే; బాలుఁడు+అయ్యును= వయస్సులో చిన్నవాడయినా; పూజ్యుండు= పూజించదగినవాడు; క్షత్త్రియుఁడు; అమిత, విక్రమ, సమృద్ధిన్= అపరిమితమైన పరాక్రమంయొక్క నిండుదనంచేత; ఉర్వి, పతులలోన్= భూపతులలో; అధికుఁడు+ఐ= ఎక్కువైనవాడై; ఉండెన్+ఏనిన్= ఉన్నట్లయితే; పూజ్యుఁడు= పూజించదగినవాడు.

తాత్పర్యం: ఉత్తమజ్ఞానంచేత గొప్పవాడయితే, వయస్సుచేత బాలుడయినా బ్రాహ్మణుడు పూజించదగినవాడే, అపరిమితమైన పరాక్రమంతో రాజుల్లో అధికుడైతే క్షత్రియుడు పూజార్హు డౌతాడు.

విశేషం: నన్నయరుచిరార్థసూక్తి.

క. **ఈ రెండు కారణముల ము । రారాతియ యర్ఘ్యమునకు నర్హుఁడు; జగదా**
ధారుండు మాక కాదు, స । దారాధ్యుఁడు విష్టపత్రయావాసులకున్. **26**

ప్రతిపదార్థం: ఈ, రెండు, కారణములన్= ఉత్తమజ్ఞానం, పరాక్రమసమృద్ధి అనే రెండు కారణాలచేత; ముర+అరాతి+అ= మురుడనే రాక్షసునికి శత్రువైన శ్రీకృష్ణుడే; అర్ఘ్యమునకున్= అర్ఘ్యమివ్వటానికి; అర్హుఁడు= తగినటువంటివాడు; జగత్+ ఆధారుండు= లోకానికి ఆధారమైనవాడు; మాకు+అ, కాదు= మాకు మాత్రమే కాదు; విష్టపత్రయ+ఆవాసులకున్= మూడులోకాలలో నివసించేవారికి; సదా+ఆరాధ్యుఁడు= ఎల్లప్పుడు పూజించదగినవాడే.

తాత్పర్యం: ఉత్తమజ్ఞానం, అమితపరాక్రమం అనే ఈ రెండు కారణాలవల్ల - మురుడనే రాక్షసునికి శత్రువైన శ్రీకృష్ణుడే అర్ఘ్యానికి అర్హుడు. జగత్తుకు ఆధారమైన శ్రీకృష్ణుడు, మాకే కాదు ముల్లోకాల్లో నివసించే వాళ్ళందరికీ ఆయన ఎల్లప్పుడూ పూజార్హుడే.

విశేషం: ఇక్కడ శ్రీకృష్ణునికి ప్రయోగించిన 'మురారాతి' శబ్దం శిశుపాలునికి పరోక్షంగా హెచ్చరికవంటిది. శ్రీకృష్ణునితో వైరంపూనిన మురుడికి ఏగతి పట్టిందో తెలుసుకొ మ్మని ఆ పదం శిశుపాలునికి ధ్వనింపచేస్తున్నది.

క. **వృద్ధు లొకలక్ష యున్నను । బుద్ధియె యెవ్వరికి వారిఁ బూజింపంగా;**
నిద్ధరణీశులలో గుణ । వృద్ధని పూజించితిమి త్రివిక్రము భక్తిన్. **27**

ప్రతిపదార్థం: వృద్ధులు= వయస్సుచేత పెద్దలైనవాళ్ళు; ఒక; లక్ష; ఉన్నను; ఎవ్వరికిన్= ఎవరికైనా; వారిన్= వాళ్ళను; పూజింపంగాన్= పూజించటానికి; బుద్ధియె= జ్ఞానమే(ప్రమాణం); ఈ+ధరణీ+ఈశులలోన్= ఈ రాజులందరిలో; గుణ, వృద్ధు+అని= గుణంచేత పెద్దవాడని; త్రివిక్రమున్= శ్రీకృష్ణుణ్ణి; భక్తిన్= భక్తితో; పూజించితిమి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వయస్సుచేత వృద్ధులైనవాళ్ళు ఒక లక్షమంది ఉన్నా - ఎవరినైనా వాళ్ళ జ్ఞానాన్ని బట్టే పూజిస్తాం. రాజులందరిలో గుణంచేత గొప్పవా డనే శ్రీకృష్ణుణ్ణి భక్తితో పూజించాం.

విశేషం: భీష్ముని మాటలు శ్రీకృష్ణునికి అర్ఘ్య మివ్వటాన్ని సమర్థించే ఉక్తులుమాత్రమే కావు, లోకానికి ఉపయోగించే చక్కని సూక్తులుకూడ. కాగా, త్రివిక్రమ పదప్రయోగంకూడా శిశుపాలుణ్ణి హెచ్చరించేదే. శ్రీకృష్ణుణ్ణి తక్కువగా లెక్కగట్టవద్దని, అవసరమైతే ఆయన త్రివిక్రమావతారం తాల్చగల డని, బలిఅంతటివాడు ఏమయ్యాడో భావించుకొమ్మని, నీకొలది తెలుసుకొని ప్రవర్తించు మని ఆ పదం శిశుపాలునికి ధ్వనింపజేస్తున్నది.

క. **పూజితుల తృప్తులగుదురు । భూజను లొరు; లచ్యుతుండు పూజితుఁ డగుడుం**
దేజమున జగత్త్రితయముఁ । బూజితమయి తృప్తిఁబొందుఁ బుణ్యసమృద్ధిన్. **28**

ప్రతిపదార్థం: భూ, జనులు= భూమిమీది ప్రజలు; ఒరులు= ఇతరులు - అంటే శ్రీకృష్ణుడు కాక ఇతరులు; పూజితులు+అ= పూజించబడినవాళ్ళుమాత్రమే; తృప్తులు+అగుదురు= తృప్తి పొందినవా ళ్ళవుతారు; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; పూజితుఁడు= పూజించబడినవాడు; అగుడున్= అయితే; తేజమునన్= ప్రకాశంగా - గొప్పగా; జగత్+త్రితయమున్= మూడులోకాల సమూహం, పూజితము+అయి= పూజించబడిందై; పుణ్య, సమృద్ధిన్= పుణ్యంయొక్క నిండుదనంచేత; తృప్తిన్; పొందున్.

తాత్పర్యం: లోకంలో శ్రీకృష్ణుడు కాక ఇతరు లెవ్వరు పూజించబడినా వాళ్ళుమాత్రమే తృప్తిపొందుతారు. శ్రీకృష్ణుడు పూజితుడైతే ముల్లోకాలు పూజితాలై పుణ్యసమృద్ధితో తృప్తిపొందుతాయి.

సీ. **'బుద్ధియు మనమును బురుషుండు నవ్యక్త । మగుచున్న ప్రకృతియు నంబరంబు**
ధరణియుఁ దరణియు దహనుండుఁ జంద్రుండు । గాడ్పును దిక్కులుఁ గాలములును
దానయై జంగమస్థావరాత్మకమైన । సకల భూత ప్రపంచంబు నెల్లఁ
దన దివ్యశక్తిమైఁ దాల్చిన సర్వాత్ము । సర్వభూతేశ్వరు సర్వవంద్యు

ఆ. **నధికయోగ నిష్ఠితాత్మకులగు మహా । యోగివరులు తత్త్వయుక్తిఁజేసి**
యెఱిఁగినట్టు నీకు నెఱుఁగంగఁబోలునే?' । యనుచు భీష్ముఁ డన్న యవసరమున. **29**

ప్రతిపదార్థం: బుద్ధియున్; మనమును= మనస్సును; పురుషుండున్= జీవుడు; అవ్యక్తము+అగుచున్న, ప్రకృతియున్= ఇంద్రియాలకు గోచరించని పరమాత్మ; అంబరంబు= ఆకాశం; ధరణియున్= భూమియు; తరణియున్= సూర్యుడును; దహనుండున్= అగ్ని; చంద్రుండు; గాడ్పును= గాలియు; దిక్కులున్; కాలములును= భూతభవిష్యద్వర్తమానాలు; తాన, ఐ= తానే అయి; జంగమ, స్థావర+ఆత్మకము+ఐన= కదలునట్టి, కదలనట్టి వాటితోకూడిన; సకల, భూత, ప్రపంచంబున్+ఎల్లన్= అన్ని ప్రాణులతో కూడిన ప్రపంచాన్నంతటిని; తన, దివ్య, శక్తిమైన్= తనయొక్కదివ్యశక్తిచేత; తాల్చిన= ధరించిన; సర్వ+ఆత్మున్= సర్వాన్నిఆత్మగా కలిగినవాణ్ణి - అంటే సర్వం తానే అయినవాణ్ణి; సర్వ, భూత+ఈశ్వరున్= అన్ని ప్రాణులకు ప్రభువైనవాణ్ణి; సర్వవంద్యున్= అందరికి పూజ్యుడైనవాణ్ణి; అధిక, యోగ, నిష్ఠిత+ఆత్మకులు+అగు= గొప్ప యోగంలో గట్టిగా నిలుపబడిన మనస్సు కలవాళ్ళయిన, మహా, యోగి, వరులు= శ్రేష్ఠులైన గొప్పయోగులు, తత్త్వయుక్తిన్+చేసి= యథార్థజ్ఞానంతో; ఎఱిఁగిన+ అట్టు= తెలుసుకొన్నట్లు; నీకున్; ఎఱుఁగంగన్= తెలుసుకొనటానికి; పోలునే= సాధ్యమవుతుందా? అనుచున్; భీష్ముఁడు; అన్న= అనిన; అవసరమునన్= సమయంలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'బుద్ధి, మనస్సు, జీవుడు, ఇంద్రియాలకు గోచరించని పరమాత్మ, ఆకాశం, భూమి, సూర్యుడు, అగ్ని, చంద్రుడు, వాయువు, దిక్కులు, కాలములు, అన్నీ తానై, చరాచరాలైన సమస్త భూతాలతో కూడిన ప్రపంచాన్నంతటిని తన దివ్యశక్తిచేత ధరించి, సర్వమూ తానై, సర్వభూతాలకు ప్రభువై, సర్వులకు పూజ్యుడైనవాణ్ణి, యోగనిష్ఠలో ఉన్న మహాయోగులు యథార్థ జ్ఞానంతో తెలుసుకొన్నట్లు, తెలుసుకోవటం నీకు సాధ్యమవుతుందా?' అని భీష్ము డన్న సమయంలో.

విశేషం: 'యోగ శ్చిత్తవృత్తి నిరోధః' - మనస్సుయొక్క చలనాన్ని అరికట్టి దాన్ని ఏకాగ్రం చెయ్యటం - అంటే పరమాత్మమీద లగ్నం చెయ్యటం యోగం. దీన్నే ధ్యానం అని గూడ వ్యవహరించటం ఉంది. (పై పద్యంలోని శ్లేష పరతత్త్వవివరణ ఘట్టానికి అనువుగా అమరింది. - సంపా.)

చ. **ఎడపక యర్ఘ్య మచ్యుతున కిచ్చితి; మిచ్చిన దీని కిం దొడం**
బడ మని దుర్జనత్వమునఁ బల్కెడువీరుల మస్తకంబుపై
నిడియెద నంచుఁ దాఁ జరణమెత్తె సభన్ సహదేవుఁ డట్టిచో
నుడిగి సభాసదుల్ వలుకకుండిరి తద్దయు భీతచిత్తులై. **30**

ప్రతిపదార్థం: ఎడపక= వెనుకాడక; అర్ఘ్యము; అచ్యుతునకున్= శ్రీకృష్ణునికి; ఇచ్చితిమి; ఇచ్చినన్; దీనికిన్; ఇందున్= ఈ సభలో; ఒడంబడము+అని= ఒప్పుకొనమని; దుర్జనత్వమునన్= చెడు బుద్ధితో; పలికెడు; వీరుల, మస్తకంబు, పైన్= వీరుల నెత్తిమీద; ఇడియెదను= పెట్టెదను; అంచున్= అంటూ; సహదేవుడు; తాన్= తాను; సభన్= సభలో; చరణము+ఎత్తెన్= పాదాన్ని పైకెత్తాడు; అట్టిచోన్= అప్పుడు; సభాసదుల్= సభలోనివాళ్ళు; తద్దయున్= మిక్కిలి; భీతచిత్తులై= భయంతో కూడిన మనస్సుకలవాళ్ళయి; ఉడిగి= అణగి; పలుకక+ఉండిరి= మాటాడకున్నారు.

తాత్పర్యం: 'మేము శ్రీకృష్ణునికి అర్ఘ్యం ఇచ్చాం. దీనికి తిరుగులేదు. దుర్బుద్ధితో దీన్ని కాదనే వీరుల తలమీద ఇదిగో నాపాదం పెట్టి అణగద్రొక్కుతా' అని సహదేవుడు పాదాన్ని పైకెత్తగానే సభాసదులంతా భయభ్రాంతులై మారుమాటాడకుండా ఉన్నారు.

విశేషం: తాత్కాలికంగానైనా శిశుపాలుని నోటికి తాళంవేసిన సహదేవుని ధార్మికతేజం, సాహసం శ్లాఘించదగినవి. (ఇందులో ప్రదర్శితమైన సహదేవుని రౌద్రానికి సభికుల్లో ఏర్పడిన భావశాంతి అంగంగా నిబంధించబడింది. ఈవిధంగా రసానికి భావశాంతిని అంగంగా పోషిస్తే సమాహితాలంకార మౌతుంది. ఈ అద్భుతసంఘటనలో శ్లేష అనే శబ్దగుణం ప్రసాదగుణపోషకంగా రాణించింది. -సంపా.)

చ. **చెలువుగఁ బుష్పవృష్టి గురిసెన్ సహదేవుపయిన్; దివంబునన్**
వెలయఁగ సాధువాదములు వించె; సభాసదులెల్ల విస్మయా
కులిత మనస్కులైరి; తన కుంచెయుఁ గృష్ణమృగాజినంబునుం
బలుమఱు వీచుచుం గలహబంధుఁడు నారదుఁ డాడె వేడుకన్. **31**

ప్రతిపదార్థం: సహదేవు, పయిన్= సహదేవునిమీద; చెలువుగన్= అందంగా; పుష్పవృష్టి= పూలవాన; కురిసెన్; దివంబునన్= ఆకాశంలో; సాధువాదములు= బాగుబాగనే శబ్దాలు; వెలయఁగన్= ఒప్పుగా; వించెన్(వినిచె)= వినిపించాయి; సభాసదులు+ఎల్లన్=

సభలోఉన్న వాళ్ళంతా; విస్మయ+ఆకులిత, మనస్కులు+ఐరి= ఆశ్చర్యంచేత కలతచెందిన మనస్సులు కలవాళ్ళయ్యారు; కలహబంధుఁడు= పోట్లాటకు బంధువైనవాడు-నారదుడు; తన కుంచెయున్= తనయొక్క చామరాన్ని; కృష్ణమృగ+అజినంబునున్= నల్ల ఇఱ్ఱి చర్మాన్ని; పలుమఱు= పెక్కుమారులు; వీచుచున్; వేడుకన్= ఆనందంతో; ఆడెన్= నృత్యంచేశారు.

తాత్పర్యం: అప్పుడు సహదేవునిమీద అందంగా పూలవాన కురిసింది. ఆకాశంలో 'బాగుబాగు' అనే ధ్వనులు పెద్దగా వినిపించాయి. సభాసదులంతా ఆశ్చర్యంతో కలతచెందారు. కలహబంధుడైన నారదుడు తనచామరాన్ని, కృష్ణాజినాన్ని పెక్కుమారులు వీస్తూ ఆనందనృత్యం చేశాడు.

విశేషం: దుష్టశిక్షణకు దారితీసే కలహం పెరుగుతూ ఉంది కనుక ఆ కలహబంధుడికి అంత ఆనందం. (అందుకే రచనలో మాధుర్యగుణం. -సంపా.)

వ. అంత శిశుపాలుసేనాపతి సునీథుండను వాఁ డతిరోషపరుషవచనుం డగుచు, స్వపక్షక్షత్త్రియులనెల్ల నొక్కంతం జేర్చికొని, శిశుపాలు ననుమతంబున యుద్ధసన్నద్ధుం డయియున్న సమయంబున. 32

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; శిశుపాలు, సేనాపతి= శిశుపాలునియొక్క సేనాధిపతి; సునీథుండు+అనువాఁడు; అతి, రోష, పరుష వచనుండు+అగుచున్= మిక్కిలి కోపంతో కూడిన కఠినమైన మాటలు కలవాడై; స్వపక్ష, క్షత్త్రియులన్+ఎల్లన్= తమవైపున ఉండే రాజులందరిని; ఒక్కంతన్+చేర్చుకొని= ఒక్కటిగా కూర్చుకొని; శిశుపాలు+అనుమతంబునన్= శిశుపాలునియొక్క అనుమతితో; యుద్ధ సన్నద్ధుండు+అయి= యుద్ధానికి సిద్ధమైనవాడయి; ఉన్న; సమయంబునన్.

తాత్పర్యం: అప్పుడు శిశుపాలుని సేనాధిపతి సునీథు డనేవాడు మిక్కిలి కోపంతో కఠినంగా మాట్లాడుతూ, తమవైపు ఉండే రాజులందరిని ఒకటిగా కూర్చుకొని, శిశుపాలుని అనుమతితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. అప్పుడు

చ. రయవిచల త్తురంగమ తరంగములన్ మదనాగనక్ర సం
చయముల సంచలచ్చటుల సైనిక మత్స్యములన్ భయంకరం
బయి యదువృష్ణిభోజ కుకురాంధక వాహినియుం గలంగె ని
ర్దయతరరోషమారుత నితాంత సమీరితమై క్షణంబునన్. 33

ప్రతిపదార్థం: యదు, వృష్ణి, భోజ, కుకుర+అంధక, వాహినియున్= యదు, వృష్ణి, భోజ, కుకుర, అంధక వంశాల వీరులయొక్క సైన్యం - వాహిని శబ్దానికి నది అనే అర్థం ఉంది కాబట్టి సైన్యమనే నది; రయ, విచలత్+తురంగమ, తరంగములన్= వేగంగా, ఎక్కువగా కదలుతున్న గుఱ్ఱాలనే అలలతో; మద, నాగ, నక్ర, సంచయములన్= మదపుటేనుగులనే మొసళ్ళ సమూహాలతో; సంచలత్+చటుల, సైనిక మత్స్యములన్= మిక్కిలిగాతిరుగుతూ మెరుస్తున్న సైనికులనే చేపలతో; భయంకరంబు+అయి= భయాన్ని కలిగించేదై; నిర్దయతర, రోష, మారుత, నితాంత, సమీరితము+ఐ= ఏమాత్రం దయలేని కోప మనే గాలి ఎడతెగకుండా వీచబడిందై; క్షణంబునన్= ఒక్క నిమిషంలో; కలంగెన్= కలత పొందింది.

తాత్పర్యం: యదువృష్ణిభోజ కుకురాంధకవంశ వీరుల సైన్య మనే నది - వేగంగా ఎక్కువగా కదలుతున్న గుఱ్ఱాలనే అలలతో, మదపుటేనుగులనే మొసళ్ళ సమూహాలతో, అమితంగా అటుఇటు తిరుగాడుతూ మెరుస్తున్న సైనికులనే చేపలతో, భయంకరమై, ఏమాత్రం దయలేని కోపమనే ఎడతెగని గాలి వీచగా ఒక్క క్షణంలో కలతచెందింది.

విశేషం: అలం. సావయవరూపకం - శ్లేష, వృత్త్యనుప్రాసం. అక్షరరమ్యమై, ఓజోగుణ విశిష్టమై, అర్థచమత్కృతితో పాఠకుణ్ణి ఆకర్షించే నన్నయ ప్రసిద్ధ పద్యాల్లో ఇదొకటి. 'వాహినీ' శబ్దాని కున్న రెండర్థాలను ఆధారంగా గ్రహించి, సైన్యంలోని గుర్రాలను నదిలో ఎంతో చలనంతో పైకిలేచే అలలతో, మదపుటేనుగులను లోపల పారాడే భీకర నక్రాలతో, సైనికులను- తళుకు తళుక్కుమంటూ మిక్కిలిగా సంచరించే మీనాలతో రూపించటం మనోహరంగా ఉంది. 'రయ విచలత్ - తురంగమ- తరంగములన్' అనే కూర్పులోని శబ్దాలంకారానికి సంబంధించిన తకార, రకార, బిందుపూర్వక గకారాల సమూహం చెవికి సోకగానే ఏదో మీదికెగసి దూకుతున్న స్ఫూర్తి కలగటమేకాక, అశ్వికులు యుద్ధసన్నద్ధులై ఒక్కసారిగా కళ్ళేలు లాగటంచేత మెడలు మలిపి మూతులుపైకెత్తి కదనుత్రొక్కే ఎత్తైన గుర్రాల తలల కదలికలు, గాలితాకిడిచేత అంతకంతకు పై కెగిరే అలల చివరల ఊపులు భావుకుని కంటికి కనిపించగలవు. అలాగే నాగ - నక్ర పదాల్లో గబగబ ముందుకు దూసుకొనిపోయే ఏనుగులను, తలలు వంచి పారాడే నల్లని మొసళ్ళను, 'సంచలత్ - చటుల - సైనిక' శబ్దోచ్చారణలో - యుద్ధ సన్నద్ధులై, తళతళ మెరిసే ఖడ్గాలు చేపట్టి - అటు ఇటు చురుకుగా సంచరించే సైనికులను, నీళ్ళలో తళుకు, తళుక్కున తిరుగాడే మత్స్యాలను భావుకుడు చూడవచ్చు. శబ్దఘటనచేత అర్థస్ఫూర్తిని కలిగించే నన్నయగారి అక్షరశిల్పానికి ఈ పద్యం ఒక చక్కని ఉదాహరణం. 'వాహినియుం' అనేదానికి 'వారిధియుం' అనే పాఠాంతరం ఉంది. 'తత స్సాగర సంకాశం దృష్ట్వా నృపతి సాగరమ్' (భండార్కరుప్రతి 2-37-1) అనే మూలానికి సరైన పదం 'వారిధి'యే కాని వాహినీ శబ్దంచేత సావయవరూపకానికి సమకూరే మనోహర శ్లేష వారిధిశబ్దంవల్ల సంక్రమించదు. కాగా, 'రోషమారుత' మనే పదానికి 'దోషమారుత'మనే పాఠాంతరం ఉంది. ప్రకరణాన్నిబట్టి 'దోషమనేగాలి' అనటం కంటే 'రోషమనేగాలి' అనటమే మేల్తర మనిపిస్తున్నది. ఈ పద్యానికి ప్రతిబింబంవంటి పద్యాన్ని ఎర్రాప్రెగ్గడ ఆరణ్యపర్వ షష్ఠాశ్వాసంలో వ్రాయటం దీని ఆకర్షణ కొక తార్కాణం.

వ. అట్టి సకల క్షత్త్రియ క్షోభంబు సూచి భయసంభ్రమాక్రాంత హృదయుండయి ధర్మరాజు భీష్మున కి ట్లనియె 34

ప్రతిపదార్థం: అట్టి= ఆవిధమైన; సకల, క్షత్త్రియ, క్షోభంబు= అందరు రాజులయొక్క అలజడి; చూచి; భయ, సంభ్రమ+ ఆక్రాంత, హృదయుండు+అయి= భయంచేత, వేగిరపాటుచేత, ఆక్రమించబడిన హృదయం కలవాడై; ధర్మరాజు; భీష్మునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ విధంగా అందరు రాజుల్లో ఏర్పడిన అలజడిని చూచి భయం, వేగిరపాటు అలముకొన్న మనస్సుతో ధర్మరాజు భీష్మునితో ఇలా అన్నాడు.

తరలము.

ధరణిలోఁ గల రాజు లెల్లను దారుణక్షయకాలసా
గరములట్లు గలంగి; రిప్డు మఖప్రయోగము విఘ్నముం
బొరయ కుండఁ బ్రజాపకారము వుట్టకుండఁగ నీవు చె
చ్చెరఁ బితామహ! వీరి కిచ్చటఁ జిత్తశాంతి యొనర్పవే. 35

ప్రతిపదార్థం: పితామహ= తాతా!; ధరణిలోన్+కల= భూమిలో ఉండే; రాజులు+ఎల్లను= రాజులందరు; దారుణ, క్షయ, కాల, సాగరముల+అట్లు= భయంకరమైన ప్రళయకాల సముద్రాలవలె, కలంగిరి= కలతచెందారు; ఇపుడు(ఇప్డు)= ఇప్పుడు; మఖ, ప్రయోగము= రాజసూయయాగ కార్యక్రమం; విఘ్నమున్= ఆటంకాన్ని; పొరయకుండన్= పొందకుండా; ప్రజా+అపకారము= ప్రజలకు కీడు; పుట్టక+ఉండఁగన్; నీవు; చెచ్చెరన్= వెంటనే, వీరికిన్= ఈ రాజులకు; ఇచ్చటన్; చిత్తశాంతి= మనశ్శాంతిని; ఒనర్పవే= కలిగించవా?

తాత్పర్యం: పితామహా! భూమిమీది రాజులంతా ప్రళయకాల సముద్రాల్లా కలతచెందారు. రాజసూయ కార్యక్రమానికి విఘ్నం కలుగకుండ, ప్రజలకు కీడు పుట్టకుండ, నీవు వెంటనే ఈ రాజులందరికి మనశ్శాంతి కలిగించు.

విశేషం: ఈ పద్యరచనలో సౌకుమార్యగుణం అక్షరరమ్యంగా సందర్భోచితంగా ప్రసాదగుణరంజకంగా పోషించబడింది.(సంపా.)

వ. అనిన ధర్మరాజునకు భీష్ముం డి ట్లనియె. 36

తాత్పర్యం: అనగా భీష్ముడు ధర్మరాజుతో ఈవిధంగా అన్నాడు.

క. నీ యజ్ఞమునకు విఘ్నము । సేయఁగ నోపుదురె యొరులు? జితదైత్యుఁడు నా
రాయణుఁడు యజ్ఞపురుషుఁ డ । జేయ పరాక్రముఁడు దీనిఁ జేకొని కావన్. 37

ప్రతిపదార్థం: జితదైత్యుఁడు= జయించబడిన రాక్షసులు కలవాడు - అంటే రాక్షసులను జయించినవాడు; యజ్ఞ, పురుషుఁడు= శ్రీమహావిష్ణువు; నారాయణుఁడు= శ్రీకృష్ణుడు; అజేయ, పరాక్రముఁడు= జయించసాధ్యంగాని పరాక్రమం కలవాడు; దీనిన్= ఈ యజ్ఞాన్ని; చేకొని= తనదిగా చేసుకొని; కావన్ - రక్షించగా; ఒరులు= ఇతరులు, నీయజ్ఞమునకున్; విఘ్నము= చెరుపు; చేయఁగన్= చేయటానికి; ఓపుదురె= చేతనైనవా ళ్ళవుతారా?

తాత్పర్యం: రాక్షసులను జయించినవాడు, జయించ సాధ్యంకాని పరాక్రమం కలవాడు, శ్రీమహావిష్ణు స్వరూపుడు అయిన శ్రీకృష్ణుడు- ఈ రాజసూయాన్ని చేపట్టి రక్షిస్తుండగా, ఇతరులు నీ యజ్ఞానికి చెరుపు చెయ్యగలరా?

సీ. 'చైద్యునకై పూని సన్నద్ధులై యున్న । యీ రాజు లిందఱు నీక్షణంబ
హరి యల్గి చూచుడు నంతకక్షయమున । కరిగెడు వార; ఘోరాహవమున
దమఘోషనందనుదర్పంబు నిప్పడ । యడఁగెడుఁ; గడుఁబెక్కులయ్యుఁ గుక్క
లిభకుంభదళనమహిష్ఠనిష్ఠురనఖ । ముఖుఁడగు హరిమీఁద మొఱఁగి యేమి

ఆ. సేయనోపుఁ? గృష్ణు సింహపరాక్రము । నెఱుఁగకున్నవారె యెల్లవారు?'
ననిన భీష్మపలుకు లవి కర్ణశూలంబు । లయినఁ జేదినాథుఁ డాగ్రహించి. 38

ప్రతిపదార్థం: చైద్యునకై= చేదిదేశానికి రాజైన శిశుపాలునికై; పూని= పూనుకొని; సన్నద్ధులై= యుద్ధానికి సిద్ధమైనవాళ్ళయి; ఉన్న; ఈ, రాజులు; ఇందఱున్; ఈ క్షణంబు+అ; హరి= శ్రీకృష్ణుడు; అలిగి= కోపించి; చూచుడున్= చూస్తే; అంతకక్షయమునకున్= యమధర్మరాజుయొక్క ఇంటికి; అరిగెడు, వారు+అ= వెళ్ళేటటువంటివారే-అంటే మరణించేవారే; దమఘోషనందను, దర్పంబు= దమఘోషునియొక్క కుమారుడైన శిశుపాలుని పొగరు; ఘోర+ఆహవమునన్= భయంకరమైన యుద్ధంలో; ఇప్పుడు+అ= ఇప్పటికిప్పుడే; అడఁగెడున్= అణగిపోతుంది; కడున్= మిక్కిలి; పెక్కులు+అయ్యున్= ఎక్కువసంఖ్యలో ఉన్నప్పటికిని; కుక్కలు; ఇభ, కుంభ, దళన, మహిష్ఠ, నిష్ఠుర, నఖ, ముఖుఁడు+అగు= ఏనుగు కుంభస్థలాన్ని చీల్చటంలో మహాకఠినాలైన గోళ్ళ చివరలు కలవాడయిన; హరిమీదన్= సింహంమీద; మొఱఁగి= అరిచి; ఏమి చేయన్+ఓపున్= ఏమిచేయగలవు; సింహపరాక్రమున్ - సింహంవంటి పరాక్రమం కలవాణ్ణి; కృష్ణున్= శ్రీకృష్ణుణ్ణి; ఎల్లవారున్= అందరును; ఎఱుఁగకన్, ఉన్న, వారె= తెలియకున్నారా - అంటే శ్రీకృష్ణునియొక్క పరాక్రమంగురించి తెలియని వాళ్ళెవరు?; అనిన; భీష్మపలుకులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీష్మునియొక్కమాటలు; అవి; కర్ణశూలంబులు= చెవులకు బల్లెములవంటివి; కాగా; (అంటే వినటానికి మిక్కిలి బాధాకరాలైనవికాగా); చేదినాథుఁడు= చేదిదేశానికి రాజైన శిశుపాలుడు; ఆగ్రహించి= కోపం పొంది.

తాత్పర్యం: 'శ్రీకృష్ణుడు కోపగించుకొని చూస్తే చాలు, శిశుపాలునికై యుద్ధం చెయ్యటానికి సిద్ధంగా ఉండే ఈ రాజులంతా ఒక్క క్షణంలో యమలోకానికి వెళ్ళుతారు. భీకరపోరాటంలో శిశుపాలునిపొగరు ఇప్పటికిప్పుడే అణగిపోతుంది. కుక్కలు మిక్కిలి ఎక్కువ సంఖ్యలో ఉన్నా, ఏనుగు కుంభస్థలాన్ని చీల్చగల మహాకఠినాలైన గోళ్ళ చివరలు గల సింహంమీద మొరిగి ఏంచేస్తాయి? సింహంవంటి మహాపరాక్రమశాలి అయిన శ్రీకృష్ణుని సంగతి తెలియనివా ళ్ళెవరు?' అని పలికిన భీష్మునిమాటలు శిశుపాలునికి కోపాన్ని కలిగించాయి.

విశేషం: అలం: నిదర్శన, పరికరం, శత్రుపక్షరాజుల అల్పత్వం, శ్రీకృష్ణుని ఆధిక్యం, పద్యంలోని అర్థాలంకారంచేతనే కాక, అక్షరయోజన చేతగూడ సువ్యక్తమవుతున్నది. 'కడు-పెక్కులు-అయ్యు-కుక్కలు' అనే అలతి అలతి పదాలకూడిక, వాటిలో ఒక్క మహాప్రాణాక్షరంకూడ లేని స్థితి. 'ఇభకుంభ దళన మహిష్ఠ నిష్ఠుర నఖ ముఖుఁడు' అనే సుదీర్ఘ సమాసం, అందలి ఓష్ఠ్య మూర్ధన్య కంఠ్యమహాప్రాణాక్షరాలైన భకార, షకార, ఠకార, ఖకారాల పునరుక్తి-ఇరుపక్షాల శక్తులందుండే వ్యత్యాసాన్ని చక్కగా ధ్వనింపచేస్తున్నాయి. కాగా, సింహం, శ్రీమహావిష్ణువు అనే రెండర్థాలు ఉండే 'హరి' శబ్దప్రయోగంకూడ పద్యాని కొక ప్రత్యేకశోభను పొదుగుతున్నది. ఇభకుంభదళన మహిష్ఠ నిష్ఠుర నఖముఖుడైన హరి అనటంతోనే - ఆనాడు మదించి హరిని దూషించిన హిరణ్యకశ్యపు వక్షస్థ్సలాన్ని, తన మహిష్ఠ నిష్ఠుర నఖముఖాలచే చీల్చి, రుధిరపానంచేసే రౌద్రరసోద్విగ్న భీకరనృసింహమూర్తి భావుకుడైన పాఠకుని మనోనయనానికి పొడగట్టుతున్నాడు.

శిశుపాలుఁడు భీష్ముని(దూలనాడుట (సం. 2-38-1)

ఉ. **'ఇమ్ముదివెఱ్ఱి వీని(బరమేశ్వరుఁగా(గొనియాడె; ధర్మత**
త్త్వమ్ములు పాండవేయులును దానునుగాని యెఱుంగరట్టె; సా
మమ్మున నెల్లవారి నవమాన్యులఁ జేసె నమాన్యుఁడంచు రూ
క్షమ్మున భీష్ముఁ జూచి బలగర్వితుఁ డి ట్లని పల్కె నల్కతోన్. **39**

ప్రతిపదార్థం: ఈ+ముదివెఱ్ఱి= ఈ ముసలి వెఱ్ఱివాఁడు-భీష్ముడు; వీనిన్= ఈ కృష్ణుణ్ణి; పరమ+ఈశ్వరున్, కాన్= భగవంతునిగా; కొనియాడెన్= పొగిడాడు; ధర్మతత్త్వమ్ములు= ధర్మంయొక్క పరమార్థాలు; పాండవేయులును= పాండవులు; తానును; కాని; ఎఱుంగరు+అట్టె= ఎరుగరట! - అంటే పాండవులు, తాను మాత్రమే తెలుసుకుంటారట!; అమాన్యుఁడు= గౌరవించతగినవాడు - ఈ భీష్ముడు; సామమ్మునన్= మంచిగా మెత్తగా మాట్లాడుతూనే; ఎల్లవారిన్= అందరిని; అవమాన్యులన్+చేసెన్= అవమానించబడినవాళ్ళను చేశాడు - అంటే అవమానించాడు, అంచున్= అంటూ; రూక్షమ్మునన్= కఱకుగా, - చురచుర; భీష్మున్; చూచి; బలగర్వితుఁడు= బలంచేత పొగరెక్కినవాడు; అల్కతోన్= కోపంతో; ఇట్లు+అని, పల్కెన్= పలికాడు.

తాత్పర్యం: 'ఈ ముసలి వెఱ్ఱి భీష్ముడు, ఈ గుణహీనుడైన శ్రీకృష్ణుణ్ణి, పరమేశ్వరు డని పొగిడాడు. ధర్మతత్త్వాలు ఈ పాండవులకు, తనకే తెలుసు నట! గౌరవార్హుడుగాని ఈ భీష్ముడు మెత్తగా మాట్లాడుతూనే అందరినీ అవమానించాడు!' అని ఆ కురుపితామహుణ్ణి చురచుర చూచి, బలగర్వితుడైన శిశుపాలుడు కోపంతో ఇంకా ఇలా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: నన్నయగారు రూపొందించిన 'ఇమ్ముదివెట్టి' పదంలో శిశుపాలుని ఈసడింపు లెస్సగా వ్యక్తమైంది. ('నీనిన్' అని శ్రీకృష్ణుణ్ణి నిర్దేశించటంలో అతనిపట్ల శిశుపాలునికి గల క్రోధాసహ్యాభావం కూడ ధ్వనిస్తూఉంది. దానికి పోషకంగా రచనలో అర్థవ్యక్తిగుణం అమరింది. - సంపా.)

ఉ. నెట్టన ధర్మనందనుఁడు ని న్నవలంబము సేసి యోడతోఁ
గట్టినయోడవోలె గతగౌరవుఁడై కడుఁదూలెఁ గృష్ణుఁ జే
పట్టి బిభీషికల్ ధరణిపాలుర కిప్పుడు సూపి; తెందు నీ
యట్టి దురాత్ములుం గలరె; యంత యధీరులె ధారుణీపతుల్? 40

ప్రతిపదార్థం: నెట్టన= తప్పనిసరై; ధర్మనందనుఁడు= ధర్మరాజు; నిన్నున్+అవలంబము, చేసి= నిన్ను ఆధారంగా చేసుకొని; కృష్ణున్+చేపట్టి= అర్ఘ్యమివ్వటానికి శ్రీకృష్ణుణ్ణి చేకొని; ఓడతోన్+కట్టిన, ఓడ, పోలెన్= ఒక ఓడతో కట్టిన మరొక ఓడవలె; గతగౌరవుఁడు+ఐ= కోల్పోయిన గౌరవం కలవాడై; కడున్= మిక్కిలి; తూలెన్= చలించాడు; ధరణి, పాలురకున్= భూపతులకు; - రాజులకు; ఇప్పుడు, బిభీషికల్= పెద్ద బెదిరింపులు; చూపితివి; ఎందున్= ఎక్కడైనా; నీ, అట్టి= నీవంటి; దురాత్ములున్= దుర్మార్గులు; కలరె; ధారుణీపతుల్= ఈ రాజులందరు; అంత, అధీరులె= అంత ధైర్యంలేనివాళ్ళా?

తాత్పర్యం: తప్పనిసరై ధర్మనందనుడు నిన్ను ఆధారంచేసుకొని అర్ఘ్యమివ్వటానికి శ్రీకృష్ణుణ్ణి స్వీకరించాడు. ఓడతో కట్టిన ఓడలా గౌరవాన్ని కోల్పోయి తూలాడు. ఈ సభలోఉన్న రాజులందరిని నీ విప్పుడు బెదిరించావు. ఎక్కడైనా నీవంటి దుర్మార్గులున్నారా? ఈ రాజులంతా అంత ధైర్యం లేనివాళ్ళా?

విశేషం: అలం: ఉపమ. భీష్ముణ్ణి ఆధారంచేసుకోవటం ధర్మరాజుకు తప్పనిసరి అవటానికి కారణం - ఆయన తాత అవటం, కృతాకృత పరిజ్ఞానంలో ధర్మజుడే ఆయనను నియమించటం. కాగా భీష్ముడు కావించిన శ్రీకృష్ణుని బలపరాక్రమ మాహాత్మ్య ప్రశంసలన్నీ పరోక్షంగా ప్రతిపక్షులకు బెదిరింపులే. (పద్యరచనలో అర్థవ్యక్తి పౌరుషోక్తులతోకూడిన ప్రసాదానికి పోషకంగా నిలిచింది. సంపా.)

సీ. పూతనాఘాతంబుఁ, జేతనేతరమైన । శకటంబు త్రోపును జరణనిహతి,
వీఁకతోఁ గడుఁబూచుప్రాకుల విఱుపును, । వల్మీకమాత్రపర్వతము నెత్తి
కొని, లావుగలఁడు వీఁ డన నేఁడు దివసంబు । లునికియు, వృషవధయును ననంగఁ
బమ్మిన కృష్ణుబీరమ్ములు వొగడుచు । నున్న నీ నాలుక యొక్కఁడయ్యు

ఆ. వ్రయ్యవలయు నూఱు వ్రయ్యలుగాఁగ; న । ట్లయినఁ గాని చాల వతనిఁ బొగడ;
నెల్లదాని నేన యెఱుఁగుదు; నెందు వాఁ । డర్ఘ్యదానయోగ్యుఁ డయ్యెఁ జెపుమ. 41

ప్రతిపదార్థం: పూతనా, ఘాతంబు= పూతన అనే రాక్షసిని చంపటం; చరణనిహతిన్= కాలిదెబ్బచేత; చేతన+ఇతరము+ఐన= ప్రాణంకలది కానిదైన; శకటంబు, త్రోపును= బండిని పడగొట్టటం; వీఁకతోన్= గర్వంతో; కడున్= మిక్కిలి - అంటే ఏమాత్రంకూడ; పూచుప్రాకులన్= చేవలేని చెట్లను; విఱుపును= విరగదీయటాన్ని; వల్మీకమాత్ర, పర్వతమును= పుట్టఅంతటి చిన్నకొండను; ఎత్తికొని= పైకెత్తుకొని; లావు గలఁడు, వీఁడు+అనన్= బలంకలవా డితడు అనేటట్లు; ఏడు, దివసంబులు= ఏడురోజులు; ఉనికియున్= ఉండటమును; వృషవధయునున్= ఎద్దును చంపటమును; అనంగన్= అనేటటువంటి; పమ్మిన=

అతిశయించిన, కృష్ణుభీరమ్ములు= శ్రీకృష్ణుని పరాక్రమాలు; పొగడుచున్+ఉన్న; నీ, నాలుక; ఒక్కడు+అయ్యున్= ఒక్కటే అయినా; నూఱు వ్రయ్యలు, కాఁగన్= వందముక్కలయ్యేటట్లుగా, వ్రయ్యవలయున్= చీలిపోవాలి; అట్లు; అయినన్; కాని; అతనిన్= ఆ శ్రీకృష్ణుణ్ణి; పొగడన్= పొగడటానికి; చాలవు= సరిపోవు; ఎల్లదానిన్= ప్రతివిషయాన్ని, - ఆ కృష్ణునికి సంబంధించిన అన్ని విషయాలను; నేను+అ= నేనే; ఎఱుఁగుదున్; ఎందున్= ఏవిషయంలో; వాఁడు= ఆ కృష్ణుడు; అర్ఘ్య, దాన, యోగ్యుఁడు+అయ్యెన్= అర్ఘ్యాన్ని ఇవ్వటానికి తగినవాడయ్యాడో; చెపుమ= చెప్పుమా!

తాత్పర్యం: పూతన అనే ఆడుదాన్ని చంపటం, కాలిదెబ్బతో ప్రాణంలేని బండిని పడద్రోయటం, ఏమాత్రం సారంలేని చెట్లను గర్వంతో విరవటం, పుట్టఅంత చిన్నకొండను ఎత్తుకొని వీడు బలవంతు డనిపించేటట్లు ఏడురోజు లుండటం, ఎద్దును చంపటం- అనే శ్రీకృష్ణుని పరాక్రమాలు పొగడుతున్న నీ నాలుక ఒక్కటే అయినా, అది నూరు చీలికలుగా చీలాలి. అట్లయితేగాని అతణ్ణి బాగా పొగడటానికి సరిపోవు. ఆ కృష్ణుని విషయాలన్నీ నాకు తెలుసు. ఏ విషయంలో వాడు అర్ఘ్యమివ్వటానికి తగినవా డయ్యాడో తెలుపు.

విశేషం: అంతటి మాయాపూతనా జీవితాపహరణాన్ని ఒక ఆడుదాన్ని చంపటంగాను, శకటాసురుడంతటివాణ్ణి భంజించటాన్ని ప్రాణంలేని బండిని పడద్రోయటంగాను, మహావృక్షరూపులైన మాయావులు యమళార్జునుల్ని పడవేయటం చేవలేనిచెట్లను విరవటంగాను, గోవర్ధనగిరిని ఎత్తి ఏడునాళ్ళు గొడుగుగా పట్టుకొనటాన్ని పుట్ట అంతటి చిన్నకొండను ఎత్తి బలవంతు డని విఱ్ఱవీగటంగాను, ధేనుకాసురుణ్ణి తుదముట్టించటాన్ని ఎద్దు నొకదానిని చంపటంగాను- తక్కువచేసి మాట్లాడే శిశుపాలుని తక్కువదనాన్ని, శ్రీకృష్ణద్వేషాన్ని ఈ పద్యం చక్కగా సూచిస్తున్నది. 'ఎల్లదాని నేన యెఱుఁగుదు నెందు వాఁ డర్ఘ్యదానయోగ్యుఁ డయ్యెఁ జెపుమ'- అనే దానికున్న, 'ఎల్లదాని నేన యెఱుఁగుదు నందు వీఁ డర్ఘ్య దానయోగ్యుఁ డగునె చెపుమ'- అనే పాఠాంతరం కూడ స్వీకరించదగిందే. 'పూచు మ్రాకుల'కు మూలంలో భండార్కర్ ప్రతిలో 'అర్కప్రమాణౌ తౌ వృక్షౌ'- (జిల్లేడుచెట్ల ప్రమాణం గలరెండుచెట్లు) అని ఉంది. (2-38-367).

వ. స్త్రీలను గోబ్రాహ్మణులం గూడువెట్టువారిని విశ్వసించినవారిని వధియించుట మహాపాతకం బని పెద్దలు సెప్పుదు; రట్టివానియందు గోవిందుఁడు స్త్రీవధయును గోవధయునుం జేసె; నీవునుం గడు ధర్మువెఱింగినవాఁడ వయి వీని కర్ఘ్యం బిప్పించి; తదియునుంగాక యన్యకామ యయిన యంబ యను కన్యక నపహరించి నీవు దెచ్చిన నెఱింగి నీ తమ్ముండు విచిత్రవీర్యుండు ధర్మ్మ వెఱిఁగినవాఁడై దాని విడిచి పుచ్చె. 42

ప్రతిపదార్థం: స్త్రీలను; గోబ్రాహ్మణులన్; కూడు; పెట్టువారిని; విశ్వసించినవారిని= నమ్మినవారిని; వధియించుట= చంపటం; మహా, పాతకంబు+అని= మిక్కిలి పాప మని; పెద్దలు; చెప్పుదురు; అట్టి, వాని, అందున్= ఆ విధా లైన మహాపాపాల్లో; గోవిందుఁడు; స్త్రీవధయును; గోవధయునున్; చేసె; నీవునున్= నీవుకూడ; కడున్= గొప్పగా; ధర్మువు+ఎఱింగినవాఁడవు+అయి= ధర్మం తెలిసినవాడవయి; వీనికిన్= ఇటువంటి పాపాలు చేసిన ఈ కృష్ణునికి; అర్ఘ్యంబు+ఇప్పించితి; అదియునుంగాక; అన్య, కామ, అయిన= ఇతరుణ్ణి వరించినదైన; అంబ; అను; కన్యకన్; అపహరించి= దొంగిలించి; నీవు; తెచ్చినన్; ఎఱింగి= తెలుసుకొని; నీ, తమ్ముండు; విచిత్రవీర్యుండు; ధర్మువు+ఎఱిగినవాఁడు+ఐ= ధర్మాన్ని తెలిసికొన్నవాడై; దానిన్= ఆ కన్యకను; విడిచి; పుచ్చెన్= వదలివేశాడు.

తాత్పర్యం: స్త్రీలను, గోవులను, బ్రాహ్మణులను, అన్నంపెట్టినవారిని, నమ్మినవాళ్ళను చంపటం మహాపాప మని పెద్దలు చెప్పుతారు. అటువంటి పాపాల్లో గోవిందుడు స్త్రీవధను, గోవధను చేశాడు. నీకేదో గొప్పగా ధర్మం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తెలిసినట్లు అలాంటి పాపాలు చేసిన కృష్ణునికి అర్ఘ్యం ఇప్పించావు. అంతే కాదు, మరొకరిని ప్రేమించిన అంబ అనే కన్యకను నీవు అపహరించి తెచ్చావు. ఆ సంగతి తెలిసి, ధర్మం తెలిసిన నీ తమ్ముడు విచిత్రవీర్యుడు, ఆమెను విడిచిపెట్టాడు.

విశేషం: అంబ కాశీరాజు పెద్దకూతురు. ఆమె సాళ్వుణ్ణి ప్రేమించింది. స్వయంవర సమయంలో భీష్ముడు-తక్కిన రాజుల్ని జయించి తమ్ముడు విచిత్రవీర్యునికొరకు ఆమెను, ఆమె చెల్లెళ్లు - అంబికను, అంబాలికను బలవంతంగా తెచ్చాడు.

క. జననిందిత మయి నీయం । దనపత్యత యను నధర్మ మది యుండఁగ ధ
ర్మనివృత్తచరిత్రక! నీ । యనుశాసన మెట్లు నమ్మ నగు జనములకున్? 43

ప్రతిపదార్థం: జననిందితము+అయి= జనులచేత నిందించబడిందై; నీయందున్; అనపత్యత= సంతానం లేకుండటం; అను; అధర్మము; అది; ఉండఁగన్; ధర్మ; నివృత్త, చరిత్రక!= ధర్మంనుండి మరల్చబడిన చరిత్ర కలవాడా-అంటే ధర్మాన్ని వదలిన చరిత్ర కలవాడా!; నీ, అనుశాసనము= నీ ఆనతి; జనములకున్; ఎట్లు, నమ్మన్, అగున్= ఏవిధంగా సమ్మతమవుతుంది?

తాత్పర్యం: ధర్మానికి దూరమైనచరిత్రకలవాడా! సంతానం లేకపోవటం అనే అధర్మం - అందరిచేత నిందింపబడుతూ నీలో ఉంది కదా! అలాంటప్పుడు నీ ఆజ్ఞను జను లెట్లా శిరసావహిస్తారు?

వ. తొల్లి సముద్రతీరంబున నుండి యొక్క వృద్ధహంస ధర్మాధర్మంబులు సెప్పుచు ధర్మమార్గంబున వర్తిల్లుచుండుఁ డని పక్షుల నెల్ల శిక్షించుచుఁ బ్రాణిహింస సేయక తపోవృత్తి నున్న దానికి సముద్రజలచరంబు లయిన పక్షులు రుచ్యంబు లగు భక్ష్యంబులు దెచ్చి పెట్టుచుం దత్సమీపంబునం దమ తమ యండంబుల నెల్ల నిక్షేపించి భక్షణార్థం బొక్కనాఁ డతిదూరం బరిగిన, నిట యాహంసయు నయ్యండంబుల భక్షించిన దాని నొక్క పక్షి గని యా పక్షులకెల్లం జెప్పిన, నవి దద్దయు దుఃఖించి యా యంచను వధియించెం గావున నట్ల నీవు నధర్మప్రవృత్తుండవై ధర్మశిక్ష సేయుచుఁ గౌరవుల కాపద యాపాదించుచున్నవాఁడవు. 44

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; సముద్రతీరంబునన్; ఉండి; ఒక్క; వృద్ధ, హంస= ముసలిహంస; ధర్మ+అధర్మంబులు= ఇది ధర్మం. ఇది అధర్మం అని; చెప్పుచున్; ధర్మమార్గంబునన్; వర్తిల్లుచున్+ఉండుఁడు= ప్రవర్తిస్తూ ఉండండి; అని; పక్షులన్+ఎల్లన్= అన్ని పక్షులను; శిక్షించుచున్= బోధిస్తూ; ప్రాణి, హింస, చేయక= ప్రాణులను చంపక; తపో, వృత్తిన్= తపస్సు చేసుకొంటూ; ఉన్నన్; దానికిన్= ఆ ముసలిహంసకు; సముద్ర, జల, చరంబులు= సముద్రపునీట తిరుగుతున్న; పక్షులు; రుచ్యంబులు+అగు= మంచి రుచికలిగినటువంటి; భక్ష్యంబులు= ఆహారపదార్థాలు; తెచ్చి; పెట్టుచున్; తత్, సమీపంబునన్= ఆ ముసలిహంస దగ్గర; తమ; తమ; అండంబులన్+ఎల్లన్= గ్రుడ్లనన్నింటిని; నిక్షేపించి= దాచిఉంచి; భక్షణ+అర్థంబు= ఆహారంకోసం; ఒక్కనాఁడు; అతి, దూరంబు; అరిగినన్; ఆ, ముసలి, హంస; ఆ+అండంబులన్= ఆ గ్రుడ్లను; భక్షించినన్= తినగా; దానిన్= ఆ తినటాన్ని; ఒక్క; పక్షి; కని= చూచి; ఆ, పక్షులకున్+ఎల్లన్= ఆ పక్షుల కన్నింటికి; చెప్పినన్; అవి; తద్దయున్= మిక్కిలి; దుఃఖించి; ఆ, అంచను= ఆ ముసలిహంసను; వధియించెన్= చంపాయి; కావునన్; అట్లు= ఆ విధంగా; నీవును; అధర్మ, ప్రవృత్తుండవు+ఐ= అధర్మంలో నడుస్తున్నవాడివై; ధర్మశిక్ష, చేయుచున్= ధర్మబోధచేస్తూ; కౌరవులకున్; ఆపద= కీడు; ఆపాదించుచున్+ఉన్నవాఁడవు= కలిగిస్తున్నావు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పూర్వం ఒక ముసలిహంస సముద్రతీరంలో నివసిస్తూ, ధర్మాధర్మాల్ని గూర్చి చెప్తూ, ధర్మమార్గంలో నడచుకొండని పక్షులన్నింటికి ఉపదేశిస్తూ, జీవహింస మాని తపస్సు చేసుకొంటూ ఉండింది. సముద్రపునీట తిరుగాడే పక్షులన్నీ ఆ ముసలిహంసకు రుచికరా లైన ఆహారపదార్థాలు తెచ్చిపెడుతూ, తమ గ్రుడ్లను దానిదగ్గర దాచిపెట్టి, ఒకరోజు దూరప్రాంతానికి ఆహారానికై వెళ్ళాయి. ముసలిహంస ఆ గ్రుడ్లను తినటం ఒకపక్షి చూచి తక్కినవాటికి చెప్పింది. ఆ పక్షులన్నీ మిక్కిలి దుఃఖించి ఆ ముసలిహంసను చంపివేశాయి. అలాగే నీవుకూడ అధర్మమార్గాన నడుస్తూ, ధర్మబోధ చేసి కౌరవులకు కీడు కలిగిస్తున్నావు.

క. విదితముగ నధికబలసం । పద నోర్చె నుపేంద్రుఁ డవనిపాలుర నంచున్
మదిఁ బొగడితి; నా యెఱుఁగని । యదియె జనార్దనుబలంబు నత్యున్నతియున్? 45

ప్రతిపదార్థం: ఉపేంద్రుఁడు= కృష్ణుడు; విదితముగన్= లోకప్రసిద్ధంగా; అధికబలసంపదన్= మిక్కుట మైన బలసమృద్ధితో; అవనిపాలురను= రాజులను; ఓర్చెన్= ఓడించాడు; అంచున్= అంటూ; మదిన్= మనసార; పొగడితి= కొనియాడావు; జనార్దను, బలంబున్= శ్రీకృష్ణునియొక్క బలం; అతి+ఉన్నతియున్= అధికమైన గొప్పతనము; నా, ఎఱుఁగని, అదియే= నాకు తెలియనిదా?

తాత్పర్యం: శ్రీకృష్ణుడు లోకప్రసిద్ధంగా అత్యధిక బలసంపదతో రాజులందరిని ఓడించా డని మనసార పొగిడావు. ఆ శ్రీకృష్ణుని బలం, గొప్పతనం నాకు తెలియనివా?

క. సకలక్షత్త్రభయంకరు । నకు బార్హద్రథికి ననిమొనన్ మార్కొన నో
పక వలియం బాఱఁడె యీ । ముకుందుఁడు భయాతిరేకమునఁ బదిమాఱుల్. 46

ప్రతిపదార్థం: ఈ ముకుందుఁడు= ఈ శ్రీకృష్ణుడు; సకల, క్షత్ర, భయంకరునకున్= అందరు క్షత్రియులకు భయాన్ని కలిగించేవాడికి; బార్హద్రథికిన్= బృహద్రథుని కుమారుడైన జరాసంధుడికి; అనిమొనన్= యుద్ధంలో ఎట్టయెదుట; మార్కొనన్+ ఓపక= ఎదుర్కొనలేక; భయ+అతిరేకమునన్= విపరీతమైన భయంతో; పదిమాఱుల్; వలియన్= బలహీనతను పొంది; పాఱడె= పరుగెత్తిపోలేదా?

తాత్పర్యం: అందరు రాజులకు భయాన్ని కలిగించేవాడు, బృహద్రథుని పుత్రుడు అయిన జరాసంధుణ్ణి యుద్ధంలో ఎదుర్కోలేక, విపరీత భయంతో ఈ శ్రీకృష్ణుడు బ్రతుకుజీవుడా అని పదిమార్లు పరుగెత్తిపోలేదా?

వ. అమ్మహాసత్త్వు జరాసంధుం బరమబ్రహ్మణ్యు బ్రాహ్మణవేషంబున భీమార్జునులం దోడుసేసికొని వధియించె; నవి యెల్లం ద్రివిక్రము పరాక్రమంబులుగా నశ్రాంతవచనుండ వయి. 47

ప్రతిపదార్థం: ఆ+మహాసత్త్వున్, జరాసంధున్= మహాబలసంపన్ను డైన ఆ జరాసంధుణ్ణి; పరమబ్రహ్మణ్యున్= మిక్కిలిగా బ్రాహ్మణుల హితం కోరేవాణ్ణి; బ్రాహ్మణవేషంబునన్; భీమ+అర్జునులన్; తోడు, చేసికొని= వెంటబెట్టుకొని; వధియించెన్= చంపాడు; అవి; ఎల్లన్; త్రివిక్రము= శ్రీకృష్ణునియొక్క; పరాక్రమంబులుగాన్; అశ్రాంతవచనుండవు+అయి= అలసటలేని మాటలు కలవాడివై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మహాబలసంపన్నుడు, ఎంతగానో బ్రాహ్మణుల మేలు కోరేవాడు అయిన ఆ జరాసంధుణ్ణి బ్రాహ్మణవేషంలో భీమార్జునుల్ని సహాయులుగా చేసుకొని చంపాడు. వీటి నన్నింటిని శ్రీకృష్ణుని వీరకృత్యాలుగా అలసటలేని మాటలు కలవాడివై.

ఆ. బూతు వొగడినట్లు వొగడెదు; పొగడంగ । వలయునేని సుగుణవంతు లయిన
కర్ణ శల్యు లాదిగాఁ గల వీరులఁ । బొగడుచుండరాదె ప్రొద్దువోక. 48

ప్రతిపదార్థం: బూతు= బట్టువాడు(వంది); పొగడినట్లు; పొగడెదు= పొగడుతున్నావు; పొగడంగన్, వలయున్+ఏనిన్= పొగడదలచుకొంటే; సుగుణవంతులు+అయిన= మంచిగుణాలు కలవాళ్ళయిన; కర్ణ, శల్యులు+ఆదిగాన్= కర్ణుడు, శల్యుడు మొదలుగా గల; వీరులన్; ప్రొద్దు, పోక= కాలం గడపటానికి; పొగడుచున్+ఉండరాదె= పొగడుతూ ఉండకూడదా?

తాత్పర్యం: బట్టువానివలె పొగడుతున్నావు. పొగడదలచుకుంటే మంచిగుణాలు కల కర్ణ శల్యుల వంటి వీరు లున్నారు. ప్రొద్దుపోవటానికి వాళ్ళను పొగడుతూ ఉండరాదా?

విశేషం: 'ప్రొద్దుపోక'కు 'ప్రొద్దువోవ' అనే పాఠాంతరం ఉన్నది. (రౌద్రానుప్రాణితంగా శిశుపాలుడి వాక్యాలలో వికటత్వం లాస్యంచేస్తూ అగ్రామ్యత్వంవలన ఉదారత అనే గుణం రాణిస్తున్నది. -సంపా.)

ఆ. అన్యకీర్తనంబు నన్యనిందయుఁ దన్నుఁ । బరఁగఁ బొగడికోలుఁ బ్రబ్బికోలు
నాపగాతనూజ! యార్యవృత్తములు గా । వనిరి వీని నాద్యులయిన మునులు. 49

ప్రతిపదార్థం: ఆపగా, తనూజ= నదీతనయా! గాంగేయా!; ఆద్యులు+అయిన, మునులు= ప్రాచీను లైన మహర్షులు; అన్యకీర్తనంబున్= ఇతరులను పొగడటం; అన్య, నిందయున్= ఇతరులను దూషించటం; తన్నున్= తనను; పరఁగన్= ఒప్పుగా; పొగడికోలున్= పొగడుకొనటం; ప్రబ్బికోలున్= నిందించుకోవటం; వీనిన్= ఈ నాల్గింటిని; ఆర్య, వృత్తములు= పెద్దలు చేయదగిన పనులు; కావు+అనిరి.

తాత్పర్యం: గాంగేయా! ఇతరులను పొగడటం, నిందించటం, తనను తాను పొగడుకోవటం, నిందించుకోవటం పెద్దలు చెయ్యదగిన పనులు కా వని ప్రాచీను లైన మహర్షులు చెప్పారు కదా!

వ. అని రూక్షాక్షరవచనంబుల నాక్షేపించుచున్న శిశుపాలుం జూచి సహింపనోపక భీమసేనుం డతిరౌద్రాకారంబున నలిగిన. 50

ప్రతిపదార్థం: అని; రూక్ష+అక్షర, వచనంబులన్= కఠినాలైన అక్షరాలతో కూడుకొన్న మాటలతో; ఆక్షేపించుచున్+ఉన్న= దూషిస్తున్న; శిశుపాలున్; చూచి; సహింపన్+ఓపక= ఓర్చుకొనలేక; భీమసేనుండు; అతి, రౌద్ర+ఆకారంబునన్= మిక్కిలి భయంకరమైన రూపాన; అలిగినన్= కోపించగా.

తాత్పర్యం: అని కఠినాక్షరాలతో కూడుకొన్న మాటలతో దూషిస్తున్న ఆ శిశుపాలుణ్ణి చూచి ఓర్చుకోలేక భీముడు మిక్కిలి భయంకరమైన రూపంతో కోపించగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'రూక్షాక్షరవచనంబుల' అనేదానికి 'రూక్షేక్షణవచనంబుల' అనే పాఠాంతరం అనేక ప్రతుల్లోఉంది. అర్థాన్నిబట్టి శిశుపాలుని మాటలు కఠినాలే గాని, అందలి అక్షరాల్లో కాఠిన్యమేముంది? కాగా సందర్భాన్నిబట్టి శిశుపాలుడు మాట్లాడిన మాటల్లోనే కాక అతడు కురుపితామహుణ్ణి చూచిన చూపుల్లోకూడ ఎంతో కఱకుదనం ఉండే అవకాశంఉంది. అందువల్ల కఱకుచూపులు, మాటలు - అనే అర్థాన్నిచ్చే 'రూక్షేక్షణవచనంబుల' అనే పాఠాంతరమే మేల్తర మనిపిస్తున్నది. అంతమందిలో, అంతటి కురుపితామహుణ్ణి నోటికి వచ్చినట్లు మాట్లాడే శిశుపాలుడి మాటల్లోని కఱకుదనాన్నే గాక, చూపుల్లోని కఱకుదనాన్నికూడ చూడబట్టే భీముడు అంత ఆగ్రహోదగ్రమూర్తి అయ్యా డనిపిస్తుంది.

చ. **ప్రకటితకోపవేగమునఁ బద్మదళాయతనేత్రముల్ భయా**
నకతర లీలఁ దాల్చె నరుణద్యుతి నుద్యతమై త్రిశాఖ మై
భ్రుకుటి లలాటదేశమునఁ బొల్చెఁ ద్రికూటతటిత్రిమార్గగా
నుకృతిఁ బ్రభంజనప్రియతనూజున కంతకమూర్తి కచ్చటన్. **51**

ప్రతిపదార్థం: అచ్చటన్= ఆ సభలో; అంతకమూర్తికిన్= అందరిప్రాణాలను అంతమొందించేవాడైన యమధర్మరాజువంటి ఆకారాన్ని తాల్చినవానికి; ప్రభంజన, ప్రియ, తనూజునకున్= వృక్షాలు మొదలైనవాటిని విరిచే మహాబలు డైన వాయుదేవుని కూర్మి తనయునికి- భీమసేనునికి; ప్రకటిత, కోప, వేగమునన్= పెల్లుబికిన కోపంయొక్క వేగంచేత; పద్మదళ+ఆయత, నేత్రముల్= పద్మంయొక్క రేకులవంటి విశాలాలైన కన్నులు; అరుణద్యుతిన్= ఎఱ్ఱనికాంతితో; భయానకతర, లీలన్+తాల్చెన్= ఎక్కువభయంకరమైన రూపాన్ని ధరించాయి; భ్రుకుటి= బొమముడి; ఉద్యతము+ఐ= పైకి ఎత్తబడినదై; త్రిశాఖము+ఐ= మూడుభాగాలు కలదై - అంటే మూడు మెలికలు కలదై; త్రికూట, తటి= త్రికూట పర్వతప్రదేశంలో; త్రిమార్గగా+అనుకృతిన్= మూడుమార్గాల్లో వెళ్ళేటటువంటి దైన- అంటే స్వర్గ మర్త్య పాతాళలోకాల్లో ప్రవహించే దైన గంగానదిని పోలినదై; లలాటదేశమునన్= (భీముడియొక్క) నొసటిప్రదేశంలో; పొల్చెన్= ఒప్పింది.

తాత్పర్యం: ఆ సభలో యమునివంటి ఆకారం ధరించినవాడు, ప్రభంజను డైన వాయుదేవుడి ప్రియపుత్రుడు అయిన భీమునికి, పెల్లుబికిన కోపవేగంతో పద్మపత్రాలవంటి విశాలనేత్రాలు ఎఱ్ఱబడ్డాయి. భయంకర మైన రూపుదాల్చాయి. అతనినొసట బొమముడి ఎత్తుగా పైకుబికి మూడుభాగాలుగా మెలికలు తిరిగి, త్రికూట పర్వతప్రదేశంలో మూడుపాయలుగా చీలి స్వర్గ మర్త్య పాతాళాల్లో ప్రవహించే గంగానదిలా కన్పించింది.

విశేషం: అలం: ఉపమ. ఇది భీమసేనుని కోపవిజృంభణవర్ణనం. శిశుపాలుని దౌష్ట్యాన్ని చూచి ఆగ్రహోదగ్రుడైన భీమసేనుణ్ణి అంతకమూర్తి అనటం ఎంతో బాగుంది. అన్నగారి అనుమతి లభించాలే కాని ఆ కోపోద్రిక్తస్థితిలో శిశుపాలుని పాలిటికి, అతని సైన్యం పాలిటికి అప్పు డా భీమసేనుడు యముడే. 'ప్రభంజన ప్రియతనూజుడు' అనే సంబోధనకూడ ఈ సందర్భంలో భావస్ఫోరకంగా ఉంది. ప్రభంజనుడు ఏ విధంగా విజృంభించి, వీచి ఎంతటి వృక్ష సముదాయా న్నైనా ఏ విధంగా నేలమట్టం చేస్తాడో ఆయన ప్రియతనూజు డైన భీమసేనుడుకూడ- అన్నగారు ఊఁ అంటే చాలు- ఆ శిశుపాలుణ్ణి, అతని సైన్యాన్ని తాకి ఒక్కక్షణంలో మట్టుపెట్టగలడు. పద్మపత్రాల్లా సహజంగా విశాలాలే అయినా కోపోద్రిక్తు డైన ఆ భీమసేనుని కళ్ళు, అప్పు డెంతగా విప్పారి ఎఱ్ఱబడ్డాయో 'పద్మదళాయత' అనే సమాసంలోని సవర్ణదీర్ఘత చక్కగా సూచిస్తున్నది. ఎత్తైన అతని ఫాలభాగంమీది ఆ బొమముడి, ఎంత ఎత్తై ఏ విధంగా మూడు మెలికలు తిరిగిందో- త్రిశాఖమై, త్రికూటతటి, త్రిమార్గగ- అనే పదాల్లో మొత్తం వక్రమై మూడుసార్లు కనిపించే 'త్రి'లో భావుకుడు దర్శించవచ్చు. కాగా భీముని ధార్మికరోషాన్ని- ఎంత పవిత్రమో అంత ప్రమాదకరమైన గంగానదితో పోల్చటం ప్రత్యేకించి బాగున్నది. అక్షరసంయోజనచేతనే కాక, ఓజోగుణరచనచేతనే కాక, అర్థగాంభీర్యంచేతకూడ ఈ పద్యం మనోహరం; ప్రసిద్ధం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీమునకు భీష్ముండు శిశుపాలుని వృత్తాంతంబు సెప్పుట (సం. 2-40-1)

వ. ఇట్లు నిఖిల క్షత్త్రియత్రాసజననంబుగా నలిగి దంతసందష్ట దారుణ ముఖుండై శిశుపాల నిర్మూలనాభీల సంరంభంబున నున్న భీమసేను వారించి భీష్ముం డిట్లని చెప్పె : 'నిద్దురాత్ముండు తొల్లి చేదివంశంబున దమఘోషుం డనువానికి సాత్వతికిం జతుర్భుజ లలాట నేత్రంబులతో నుదయించి. రాసభరవంబున నేడ్చుచున్నం జూచి తల్లిదండ్రులు భయవిస్మయాధీనమనస్కులయి యున్న వారికి నొక్క యశరీరభూతం బిట్లనియె.' 52

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నిఖిల, క్షత్త్రియ, త్రాస, జననంబుగాన్= అందరు రాజులకు భయంపుట్టేటట్లు; అలిగి= కోపించి; దంత, సందష్ట, దారుణ, ముఖుండు+ఐ= పళ్ళుకొరకటంచేత భయంకర మైన ముఖం కలవాడై; శిశుపాల, నిర్మూలన+ఆభీల, సంరంభంబునన్= శిశుపాలుణ్ణి చంపటంలో భీకరమైన ఆటోపంతో; ఉన్న; భీమసేను; వారించి= ఆపి; భీష్ముండు; ఇట్లు+అని; చెప్పెన్; తొల్లి= పూర్వం; ఈ+దురాత్ముండు= ఈ దుర్మార్గు డైన శిశుపాలుడు; చేది, వంశంబునన్; దమఘోషుండు+అనువానికిన్; సాత్వతికిన్= సాత్వతి అనే పేరుగల ఆమెకు; చతుః+భుజ, లలాట, నేత్రంబులతోన్= నాలుగుభుజాలతో; నొసటి మీది కంటితో; ఉదయించి= పుట్టి; రాసభరవంబునన్= గాడిదకంఠధ్వనితో; ఏడ్చుచున్+ఉన్నన్= ఏడుస్తూ ఉండగా; తల్లిదండ్రులు= సాత్వతీదమఘోషులు; చూచి; భయ, విస్మయ+అధీన, మనస్కులు+అయి= భయానికి, ఆశ్చర్యానికి లొంగిపోయిన- అంటే భయాశ్చర్యాలతో నిండిన- మనస్సులు కలవాళ్ళయి; ఉన్నన్; వారికిన్; ఒక్క; అశరీర, భూతంబు= శరీరం లేకయే పలికే ప్రాణి- ఆకాశవాణి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఈ విధంగా కోపించి రాజు లందరికి భీతి కలిగేలా, పళ్ళుకొరుకుతూ భయంకర మైన ముఖంతో శిశుపాలుణ్ణి తుదముట్టించటానికి సమకట్టి, దారుణమైన ఆటోపంతో ఉన్న భీమసేనుణ్ణి ఆపి- భీష్ముడు, శిశుపాలుని చరిత్రను ఇలా చెప్పాడు: 'ఈ దుర్మార్గుడైన శిశుపాలుడు చేదివంశంలో సాత్వతీదమఘోషులకు పుట్టాడు. పుట్టుతూనే ఇతనికి- నాలుగుభుజాలు, నొసట కన్ను, గాడిదకంఠధ్వనితో ఏడ్పు వచ్చాయి. తల్లిదండ్రులు అది చూచి భయపడ్డారు, ఆశ్చర్యపోయారు. అప్పు డొక అశరీరవాణి ఇలా అన్నది.

విశేషం: సాత్వతి శ్రీకృష్ణుని మేనత్త.

ఆ. వీని నొరులు చంపఁగా నోప రెవ్వరు; । నెవ్వరేని వీని నెత్తికొనుడు
మిగిలియున్న బాహుయుగళంబుఁ గన్నును । నడఁగు వీని కతఁడ యంతకుండు. 53

ప్రతిపదార్థం: వీనిన్= ఈ బాలుణ్ణి; ఒరులు= ఇతరులు; ఎవ్వరున్= ఎవరుకూడ; చంపఁగాన్+ఓపరు= చంపలేరు; ఎవ్వరు+ఏనిన్= ఎవరైతే; వీనిన్= ఈ బాలుణ్ణి; ఎత్తికొనుడున్= ఎత్తుకొంటూనే; మిగిలి, ఉన్న= ఎక్కువగా ఉన్న; బాహు, యుగళంబున్= చేతులజంట; కన్నునున్= కన్ను; అడఁగున్= అణగిపోతాయో; అతఁడు+అ= అతడే; వీనికిన్; అంతకుండు= అంతమొందించేవాడు- యముడు.

తాత్పర్యం: ఈ బాలుణ్ణి ఇతరు లెవ్వరూ చంపలేరు. ఎవరైతే ఇతణ్ణి ఎత్తుకోగానే, ఎక్కువగా ఉన్న రెండుచేతులు, కన్ను అణగిపోతాయో అతడే ఇతడి పాలిటి యముడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన నయ్యశరీరివచనంబులు విని వార లాశ్చర్యమానసులయి, యా కుమారుం జూడవచ్చిన వారికెల్ల నెత్తికొన నిచ్చుచున్నంత. 54

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+అశరీరి= ఆ శరీరంలేనిదానియొక్క; వచనంబులు= మాటలు; విని; వారలు= ఆ శిశుపాలుని తల్లిదండ్రులు; ఆశ్చర్య, మానసులు+అయి= ఆశ్చర్యంతో కూడుకొన్న మనస్సులు కలవాళ్ళయి; ఆ, కుమారున్; చూడ, వచ్చిన, వారికిన్+ఎల్లన్; ఎత్తికొనన్= ఎత్తుకొనటానికి; ఇచ్చుచున్+ఉన్న+అంతన్= ఇస్తూ ఉండగా.

తాత్పర్యం: అశరీరవాణి ఆవిధంగా చెప్పేసరికి, శిశుపాలుని తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. చూడవచ్చినవాళ్ళందరి చేతికి ఎత్తుకోటానికి ఆ బాలుణ్ణి ఇవ్వసాగారు.

చ. అతివికృతస్వరూపధరుఁ డైన కుమారకుఁ బ్రీతితోడ సా
త్వతిఁ దమ మేనయత్తను ముదంబునఁ జూడఁగఁగోరి యద్భుత
ప్రతిభులు రామకేశవులు పన్నుగ నేఁగిరి చేదిధారుణీ
పతిపురి కొక్కనాఁ డఖిల బాంధవ మంత్రిసుహృత్సమేతులై. 55

ప్రతిపదార్థం: అద్భుత, ప్రతిభులు= ఆశ్చర్యకరమైన బుద్ధిబలం కలవాళ్ళయి; రామకేశవులు= బలరామకృష్ణులు; అతి, వికృత, స్వరూప, ధరుఁడు+ఐన= మిక్కిలి వికారమైన ఆకారాన్ని ధరించిఉన్నవాడైన; కుమారకున్= ఆ బాలుణ్ణి- శిశుపాలుణ్ణి; ప్రీతితోడన్= ప్రేమతో; తమ, మేన+అత్తను; సాత్వతిన్; ముదంబునన్= సంతోషంతో; చూడఁగన్+కోరి; ఒక్క-నాఁడు; అఖిల, బాంధవ, మంత్రి, సుహృత్+సమేతులు+ఐ= అందరు బంధువులతో, మంత్రులతో, స్నేహితులతో కూడుకొన్నవాళ్ళయి; చేదిధారుణీపతి, పురికిన్= చేదిభూపతియొక్క పట్టణానికి; పన్నుగన్= ఒప్పుగా; ఏగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: అద్భుతప్రతిభావంతులైన బలరామకృష్ణు లిద్దరూ వికారరూపంలో ఉన్న బాలుడు శిశుపాలుణ్ణి, మేనత్త అయిన సాత్వతిని ప్రియమార చూడా లని బంధువులతో, మంత్రులతో, మిత్రులతో కలిసి ఒకనాడు చేదిభూపతి పట్టణానికి వెళ్ళారు.

వ. ఇట్లు వచ్చిన రామకేశవులం బ్రియసత్కారంబులఁ బూజించి సాత్వతియు నబ్బాలు బలదేవుచేతికి నెత్తికొననిచ్చి తదనంతరంబ నారాయణుచేతికి నిచ్చిన. 56

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వచ్చిన, రామకేశవులన్; ప్రియసత్కారంబులన్= ఇష్టము లైన సమ్మానాలచేత; పూజించి; సాత్వతియున్; ఆ+బాలున్= ఆ బాలుడైన శిశుపాలుణ్ణి; బలదేవు చేతికిన్; ఎత్తికొనన్; ఇచ్చి; తత్+అనంతరంబ= ఆ తరువాత; నారాయణు, చేతికిన్= శ్రీకృష్ణునిచేతికి; ఇచ్చినన్.

తాత్పర్యం: సాత్వతి ఈ విధంగా వచ్చిన బలరామకృష్ణులను ప్రీతితో గౌరవించి, బాలుడైన శిశుపాలుణ్ణి, ఎత్తుకోటానికి మొదట బలరాముని చేతి కిచ్చింది. ఆ తరువాత శ్రీకృష్ణునిచేతికి ఇచ్చింది.

క. అక్కొడుకు నబ్జనాభుం। డక్కజముగ నెత్తికొనుడు నందఱుఁ జూడన్
గ్రక్కున నొక్కట నడఁగెను। మిక్కిలి చేతులును వానిమిక్కిలి కన్నున్. 57

ప్రతిపదార్థం: ఆ+కొడుకున్= ఆ సాత్వతికుమారు డైన శిశుపాలుణ్ణి; అబ్జనాభుండు= పద్మనాభుడు - శ్రీకృష్ణుడు; ఎత్తికొనుడున్= ఎత్తుకొన్నవెంటనే; అందఱున్; చూడన్; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; గ్రక్కునన్= వెంటనే; మిక్కిలి చేతులును= ఎక్కువగా ఉండే చేతులూ; మిక్కిలి కన్నున్= ఎక్కువగా ఉండే కన్నూ; ఒక్కటన్= ఒక్కసారిగా; అడఁగెను= అణగిపోయాయి.

తాత్పర్యం: శిశుపాలుణ్ణి శ్రీకృష్ణుడు ఎత్తుకోగానే, అందరూ చూస్తుండగా, ఆశ్చర్యకరంగా - అధికంగా ఉండే అతని చేతులు, కన్ను ఒక్కసారిగా అణగిపోయాయి.

వ. **దానిం జూచి సాత్వతి యద్భుతచిత్తయై యశరీరిపలుకు లప్పుడు దలంచి తన పుత్త్రునకు మురవైరివలన మరణం బగుట యెఱింగి యతని కి ట్లనియె.** **58**

ప్రతిపదార్థం: దానిన్; చూచి; సాత్వతి; అద్భుత, చిత్త+ఐ= ఆశ్చర్యంతో కూడుకొన్న మనస్సు కలదై; అశరీరి, పలుకులు; అప్పుడు; తలంచి; తన, పుత్త్రునకున్; మురవైరివలనన్= శ్రీకృష్ణునివల్ల; మరణంబు+అగుట= చావు కలగటం; ఎఱింగి= తెలుసుకొని; అతనికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దానిని చూచి సాత్వతి ఆశ్చర్యపోయింది, అశరీరవాణి చెప్పిన మాటలను మనసులో తలచుకొన్నది. శ్రీకృష్ణునివల్లనే తనకొడుకుకు మరణం తప్ప దని తెలుసుకొన్నది. శ్రీకృష్ణునితో ఈ విధంగా అన్నది.

క. **కుపథప్రవృత్తుఁ డయి వీఁ । డపనయమున నీ కనిష్టుఁ డయినను గరుణా**
నిపుణుఁడవై నీ మఱఁదికి । నపరాధశతంబు సైఁపుమయ్య యుపేంద్రా! **59**

ప్రతిపదార్థం: ఉపేంద్రా= ఓ శ్రీకృష్ణా!; వీఁడు= ఈ బాలుడు; కుపథ, ప్రవృత్తుఁడు+అయి= చెడుమార్గంలో నడిచేవాడై; అపనయమునన్= కీడుచేయటంచేత; నీకున్; అనిష్టుఁడు+అయినను= ఇష్టంలేనివాడు అయినప్పటికీ; కరుణా, నిపుణుఁడవు+ఐ= దయచూపటంలో నేర్పరివై; నీ, మఱఁదికిన్= నీమరది అయిన ఈ శిశుపాలునికి; అపరాధశతంబు= తప్పులు నూరింటిని; సైపుము+అయ్య= క్షమించవయ్యా!

తాత్పర్యం: శ్రీకృష్ణా! ఈ బాలుడు చెడుమార్గంలో నడిచేవాడై అపకారం చేసి నీకు అప్రియుడైనా- నీ మరది చేసే తప్పులు నూరింటిని దయతో క్షమించు.

విశేషం: ఈపద్యంలో సాత్వతి 'నాకొడుకుకు' అనకుండా 'నీమఱఁదికి' అని అనటం, 'కరుణానిపుణుఁడవై' అని వేడుకొనటం విశేషం. ఆ బాలుడు దుర్మార్గుడైనా నీ బావమరది. బావలు మరదులు పరస్పరం క్షేమం కోరుకుంటా రని తెలుగులో నానుడి. ఆ బంధుత్వాన్ని జ్ఞాపకంచేసి దయచూపటానికికూడా తానే ఉపాయాలూ, దారులూ చూచుకొని రక్షించా లని సూచించి, శిశుపాలునితోపాటు అతని బ్రతుకునుకూడ శ్రీకృష్ణునిచేతుల్లో పెట్టినట్లు పలకటం మెచ్చుకోదగిన మాటనేర్పు. (సంపా.)

వ. **అని వీనితల్లి తొల్లి జగద్వల్లభుండైన జనార్దనుం బ్రార్థించి తత్ప్రసాదంబున వరంబు వడయుటం జేసి శతాపరాధంబులు నిండునంతకు వీఁ డన్యులచేత నప్రతిహతుండు; కృష్ణునిచేత నిహతుండగు; నది కారణంబుగా.** **60**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని; వీని; తల్లి; తొల్లి= మునుపు; జగత్+వల్లభుండు+ఐన= లోకానికి ప్రభువైన; జనార్దనున్= శ్రీకృష్ణుణ్ణి; ప్రార్థించి; తత్+ప్రసాదంబునన్= ఆయన దయచేత; వరంబు; పడయుటన్+చేసి= పొందటంచేత; శత+అపరాధంబులు= నూరుతప్పులు; నిండునంతకున్= పూర్తిఅయ్యేవరకు; వీఁడు; అన్యులచేతన్= ఇతరులచేత; అప్రతిహతుండు= చంపబడడు; కృష్ణునిచేతన్; నిహతుండు+అగున్= చంపబడినవాడవుతాడు; అది, కారణంబుగా.

తాత్పర్యం: ఇదివరకు ఇతనితల్లి జగన్నాయకుడైన ఆ కృష్ణుణ్ణి ప్రార్థించి, ఆయనదయతో వరం పొందింది కనుక, నూరుతప్పులు నిండేదాకా ఇతడు ఇతరులచేత హతుడు కాడు. ఆ తరువాత శ్రీకృష్ణునిచేతనే హతు డౌతాడు. అందుచేతనే.

చ. **ఇతనికి నిట్లు న న్నుఱక యెగ్గులు వల్కఁగఁ బోలెఁగాక, యు**
ద్ధతమతి నన్యు లీతని విధంబునఁ బల్కి మదీయచాప ని
ర్గత చటులోగ్రమార్గణ నికాయ పయోధి మునుంగ కిట్లు ద
ర్పితులయి పోవనేర్తురె గభీరపరాక్రమ! మారుతాత్మజా! **61**

ప్రతిపదార్థం: గభీర, పరాక్రమ= గంభీరమైన పరాక్రమం కలవాడా! మారుత+ఆత్మజ= వాయుపుత్రా! భీమసేనా!; ఇతనికిన్; ఇట్లు= ఈవిధంగా; నన్నున్+ఉఱక= నన్ను లక్ష్యపెట్టక; ఎగ్గులు= నిందలు; పల్కఁగన్= పలకటానికి; పోలెన్+కాక= సాధ్యమైనదికాని; అన్యులు= ఇతరులు; ఈతని విధంబునన్; ఉద్ధతమతిన్= దుడుకుతనంతో; పల్కి= మాటాడి; మదీయ, చాప, నిర్గత, చటుల+ఉగ్ర, మార్గణ, నికాయ, పయోధి, మునుంగక= నాయొక్క ధనుస్సునుండి వెలువడి మెరుస్తున్న భయంకర బాణ సమూహ మనే సముద్రంలో మునగకుండ; ఇట్లు= ఈ విధంగా; దర్పితులు+ఐ= పొగరుబట్టి ప్రవర్తించినవాళ్ళయి; పోవనేర్తురె= బ్రతికిపోగలరా!

తాత్పర్యం: గంభీరమైన పరాక్రమం కలవాడా! వాయుపుత్రా! భీమసేనా! ఇతని కీవిధంగా న న్నారకే నిందలు పలకటం సాధ్యమైందిగాని-ఇతరు లీవిధంగా దుడుకుతనంతో మాట్లాడితే, నా ధనుస్సునుండి వెలువడి మెరుస్తున్న బాణసమూహ మనే సముద్రంలో మునగకుండ ఇలా పొగరుబట్టి ప్రవర్తించి బ్రతకగలరా!

విశేషం: అలం: రూపకం. భీష్ముడు భీమసేనునికి ప్రయోగించిన విశేషణాలు రెండూ ప్రశంసాపూర్వకంగా అతని పెనుకోపాన్ని ఉపశమింపజేసేవే. (భీష్ముడు సంయమనంతో కూడుకొన్న క్రోధభావదీప్తిని ప్రకటిస్తున్న ఈ పద్యరచన ఔజ్జ్వల్యంతోకూడిన కాంతిగుణంతో శోభిల్లుతున్నది. - సంపా.)

వ. **అని పలుకుచున్న భీష్మభీముల నతిక్రమించి శిశుపాలుండు జనార్దనున కభిముఖుండయి యి ట్లనియె.** **62**

ప్రతిపదార్థం: అని; పలుకుచున్+ఉన్న; భీష్మ, భీములన్; అతిక్రమించి= దాటివెళ్ళి; శిశుపాలుండు; జనార్దనునకున్= శ్రీకృష్ణునికి; అభిముఖుండు+అయి= ఎదురుగా నిలిచినవాడై; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలుకుతున్న భీష్ముణ్ణీ, భీముణ్ణీ త్రోసిపుచ్చి శిశుపాలుడు శ్రీకృష్ణునితో ముఖాముఖి ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. అవమాన్యున్ సభలోన మాన్యుఁ డని సౌహార్దంబునం గౌరవ
స్థవిర ప్రేరణ నిన్నుఁ బాండుతనయుల్ తప్పంగఁ బూజించి ర
య్యవివేకాస్పదు లైన పాండవులు మోహాంధుండు భీష్ముండుఁ గే
శవ! నీవుం గడఁగుండు నాకు నెదురై సంగ్రామరంగంబునన్. 63

ప్రతిపదార్థం: అవమాన్యున్= అవమానించతగినవాణ్ణి; సభలోనన్= నిండుసభలో; మాన్యుఁడు+అని= గౌరవించదగినవాడని; సౌహార్దంబునన్= స్నేహంచేత; కౌరవ, స్థవిర, ప్రేరణన్= కురువంశపు ముదుసలి అయిన భీష్ముని ప్రేరణచేత; పాండు, తనయుల్= పాండురాజు కుమారులు; నిన్నున్; తప్పంగన్= తప్పువడి; పూజించిరి; ఆ+అవివేక+ఆస్పదులు+ఐన= ఆ తెలివితక్కువతనానికి స్థానమైనవాళ్ళయిన; పాండవులు; మోహ+అంధుండు= నీమీది విపరీత ప్రేమచేత గ్రుడ్డివాడైన; భీష్ముండు; కేశవ= కృష్ణా; నీవున్= నీవును; సంగ్రామరంగంబునన్= యుద్ధభూమిలో; నాకున్; ఎదురై= ఎదురుగా నిలిచి; కడఁగుండు= పూనుకొనండి; అంటే యుద్ధంచేయటానికి ప్రయత్నించండి.

తాత్పర్యం: అవమానించదగిన నిన్ను- స్నేహంచేత, కురువంశపు ముదుసలి అయిన భీష్ముని ప్రేరణచేత - నిండుసభలో గౌరవించదగినవాడి వని ఎంచి తప్పుగా పూజించారు. కేశవా! అవివేకులైన ఆ పాండవులు, నీ మీది మోహంతో మతికోల్పోయిన ఈ భీష్ముడు, నీవు- నాతో యుద్ధం చెయ్యటానికి సిద్ధం కండి.

విశేషం: ఇది మితిమీరిన శిశుపాలుడి మదాన్ని, మూర్ఖతను, మాటల కాఠిన్యాన్ని ప్రదర్శించే పద్యం, సభలో శిశుపాలుడు గర్వంతో ఎంతగా విర్రవీగి, ఎంత నిరసనభావంతో శ్రీకృష్ణుణ్ణి చూచి, ఎంత చులుకనగా ఆయనవైపు వేలెత్తిచూపి 'కేశవ నీవున్' అని పలికాడో ఆదిగురువు ఆవల లఘువులుకల ఆ మూడక్షరాలపదం (కేశవ) మూడవపాదం చివర, నాలుగవపాదంమొదట విరగటంలో ధ్వనిస్తున్నది. శిశుపాలుని అప్పటి మదాతిరేకతకు మత్తేభవృత్తంకూడ చక్కని సూచికగా ఉంది. (ఇందులోని అర్థవ్యక్తిగుణం రౌద్రరసానుగుణమైన ప్రసాదాన్ని పోషిస్తున్నది. -సంపా.)

వ. అని శిశుపాలుండు గర్వించి పలికిన విని చక్రధరుం డఖిల రాజచక్రంబు విన నిట్లనియె. 64

ప్రతిపదార్థం: అని; శిశుపాలుండు; గర్వించి; పలికినన్; విని; చక్రధరుండు= చక్రాయుధాన్ని ధరించినవాడు - శ్రీకృష్ణుడు; అఖిల, రాజ, చక్రంబు= అందరు రాజుల సమూహం; వినన్= వినేటట్లుగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని శిశుపాలుడు గర్వంతో మాట్లాడగా చక్రధారి అయిన శ్రీకృష్ణుడు సమస్త రాజ సమూహం వినేటట్లు ఈ విధంగా అన్నాడు.

విశేషం: శిశుపాలుని ఉదంతంలో మొదటిసారిగా ఇక్కడ శ్రీకృష్ణుణ్ణి చక్రధరు డని ప్రయోగించటం ఎంతో భావస్ఫోరకంగా ఉంది. కథలో ఇక ప్రాధాన్యం వహించేది, సభలో రాజచక్రం దృష్టి నంతా ఆకర్షించేది ఈ చక్రప్రయోగమే. శిశుపాలుని మాటలు ఎంచి, చూచి, అతనిమాట పడిపోవటానికి కాల మాసన్న మైన దనీ, అతని కయ్యం ఊపును ఆపి యజ్ఞాన్ని నిర్విఘ్నం చేయవలసిన అవసరం ఏర్పడిం దనీ భావించి - బహుశః అప్పుడు శ్రీకృష్ణుడు చక్రాయుధాన్ని స్మరించి కేల గ్రహించి నిలిచాడేమో!

సీ. ప్రాగ్జ్యోతిషంబున భగదత్తుపయి నేము । వోయిన నీతఁ డన్యాయవృత్తి
నిట బాలవృద్ధుల కెల్ల భయంబుగా । ద్వారకాపురిఁ గాల్చె, వీరులైన
భోజరాజన్యులు పొలఁతులతోడ రై । వతకాద్రిఁ గ్రీడాభిరతిఁ బ్రమత్తు
లయియున్న వారల నదయుఁడై వధియించె; । దేవాభుఁ డగు వసుదేవు చేయు

ఆ. నశ్వమేధమునకు నభ్యర్చితం బైన । హయము నపహరించి యజ్ఞమునకు
విఘ్న మాచరించె; వీఁ డతిపాపుఁ డై । బభ్రుభార్యఁ దనకు భార్యఁ జేసె. 65

ప్రతిపదార్థం: ఏము= మేము; ప్రాక్+జ్యోతిషంబునన్= ప్రాగ్జ్యోతిష మనే పట్టణంలో; భగదత్తుపయిన్= భగదత్తు డనే రాజుమీద; పోయినన్= దండెత్తిపోగా; ఈతఁడు= ఈ శిశుపాలుడు; ఇటన్= ఇక్కడ; ద్వారకాపురిన్= ద్వారకానగరాన్ని; బాలవృద్ధులకున్+ఎల్లన్= అందరుపిల్లలకు, ముసలివాళ్ళకు; భయంబుగాన్= భయంకలిగేటట్లుగా; కాల్చెన్= తగులబెట్టాడు; వీరులు+ఐన; భోజరాజన్యులు= భోజవంశపురాజులు; పొలఁతులతోడన్= భార్యలతోకూడి; రైవతక+అద్రిన్= రైవతక మనే పేరున్న పర్వతంలో; క్రీడా+అభిరతిన్= విహరించాలనే కోరికతో; ప్రమత్తులు+అయి= మైమరచి; ఉన్నన్; వారలన్; అదయుఁడు+ఐ= దయలేనివాడై; వధియించెన్= చంపాడు; దేవ+ఆభుఁడు+అగు= దేవతాసమాన మైన దీప్తి కలవాడయిన; వసుదేవు, చేయు= వసుదేవుడు చేసే; అశ్వమేధమునకున్= అశ్వమేధయాగానికి; అభి+అర్చితంబు+ఐన= బాగా పూజించబడిందైన; హయమున్= గుర్రాన్ని; అపహరించి= దొంగిలించి; యజ్ఞమునకున్= ఆ అశ్వమేధయాగానికి; విఘ్నము= ఆటంకం; ఆచరించెన్= చేశాడు(కలిగించాడు); వీఁడు= ఈ(నీచుడైన) శిశుపాలుడు; అతి, పాపుఁడు+ఐ= మిక్కిలి పాపాత్ముడై; బభ్రుభార్యన్= బభ్రువనే వాని భార్యను; తనకున్; భార్యన్+చేసె= భార్యగా చేసుకొన్నాడు.

తాత్పర్యం: ప్రాగ్జ్యోతిషాధిపతి భగదత్తునిమీద మేము దండెత్తిన సమయంలో - ఈ శిశుపాలుడు దుర్మార్గుడై బాలురకు, వృద్ధులకు భయం కలిగేటట్లు ద్వారకానగరాన్ని తగులబెట్టాడు. వీరులైన భోజరాజులు భార్యలతో కలిసి రైవతకాద్రిమీద క్రీడిస్తూ మైమరచి ఉన్న సమయంలో, క్రూరుడై వాళ్ళను వధించాడు. దేవతాసమానుడయిన వసుదేవుడు అశ్వమేధయాగానికై పూజించిన గుర్రాన్ని అపహరించి, ఆ యాగానికి చెరుపుచేశాడు. పాపాత్ముడై బభ్రుని భార్యను తన భార్యగా చేసుకొన్నాడు.

వ. 'మఱియు వాగ్విషయంబు లయిన యపకారంబు లనేకంబులు సేసె; మా యత్త సాత్వతి నన్నుం బ్రార్థించుటంజేసి యిద్దురాత్ముండు సేసిన యపరాధశతంబు సహించితి; నిప్పుడు మీ రిందఱు నెఱుంగ నాయం దకారణ వ్యతిక్రమం బుపక్రమించి యత్యంతశత్రుం డయ్యె' ననిన విని శిశుపాలుం డతిపరుష వచనుం డగుచుఁ బురుషోత్తమున కి ట్లనియె. 66

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; వాక్+విషయంబులు+అయిన= మాటలకు సంబంధించిన; అపకారంబులు; అనేకంబులు; చేసెన్; మా, అత్త; సాత్వతి; నన్నున్; ప్రార్థించుటన్+చేసి= వేడుకొనటంచేత; ఈ+దురాత్ముండు= ఈ దుర్మార్గుడు; చేసిన; అపరాధశతంబు= నూరుతప్పులు; సహించితిన్= ఓర్చుకొన్నాను; ఇప్పుడు; మీరు+ఇందఱున్; ఎఱుంగన్; నా, అందున్; అకారణ, వ్యతిక్రమంబు+ఉపక్రమించి= కారణంలేని దుర్మార్గాన్ని ప్రారంభించి; అత్యంత శత్రుండు+అయ్యెన్= మిక్కిలి శత్రువయ్యాడు; అనినన్= అని అనగా; విని; శిశుపాలుండు; అతి, పరుష, వచనుండు+అగుచున్= మిక్కిలి కఠినమైన మాటలు కలవాడై; పురుషోత్తమునకున్= శ్రీకృష్ణునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అంతేకాక, మాటలకు సంబంధించి అనేక అపకారాలుకూడ చేశాడు. మా అత్త సాత్వతి ప్రార్థించటంచేత ఈ దుర్మార్గుడు చేసిన నూరుతప్పులు సహించాను. ఇప్పుడు మీరంతా చూస్తుండగా నాపట్ల దుర్మార్గప్రవర్తన ప్రారంభించి పరమశత్రు వయ్యాడు' - అని శ్రీకృష్ణు డనగానే శిశుపాలుడు మహాకఠినా లైన మాటలతో ఆ పురుషోత్తముణ్ణి ఇలా అన్నాడు.

క. నీ కూర్మియు నీ యలుకయు । నా కవి యేమిటికి దుర్గుణప్రియ! మొదలన్
నా కిచ్చిన యక్కన్యకఁ । జేకొని నీ కిట్లు పలుక సిగ్గును లేదే! 67

ప్రతిపదార్థం: దుర్గుణప్రియ= చెడుగుణాలు కలవాళ్ళకు ప్రియమైనవాడా!; నీ, కూర్మియున్= నీ స్నేహం; నీ, అలుకయున్= నీ కోపం; నాకున్+అవి, ఏమిటికిన్= వాటితో నాకేమి పని?; మొదలన్= మొదట; నాకున్+ఇచ్చిన; ఆ+కన్యకన్; చేకొని= చేపట్టి; నీకున్+ఇట్లు; పలుకన్; సిగ్గును; లేదే= లేదా!

తాత్పర్యం: దుర్జనులకు ప్రియమైనవాడా! నీ స్నేహంతో, నీ కోపంతో నా కేమి పని? మొదట నా కిచ్చిన కన్యను నీదానినిగా చేసుకొని ఈ విధంగా మాట్లాడటానికి సిగ్గులేదా?

విశేషం: సభలో శిశుపాలుని వాక్పారుష్యం చివరకు రుక్మిణి విషయంవరకు ప్రాకింది. అతనిపాపం పండింది. ('బభ్రు భార్యను శిశుపాలుడు తనభార్యగా చేసుకొన్నా'డని శ్రీకృష్ణుడు చేసిన నిందకు ప్రతిగా, రుక్మిచేత తనకు దత్త అయిన రుక్మిణిని శ్రీకృష్ణుడు రాక్షసవివాహపద్ధతిలో గ్రహించిన ఉదంతాన్ని పేర్కొన్నాడు శిశుపాలుడు. అంబను తెచ్చినందుకే భీష్ముణ్ణి అధిక్షేపించిన శిశుపాలుడు అన్యుడి భార్యనే తెచ్చి ఏలుకొంటున్న అధర్మవర్తను డని చేసిన శ్రీకృష్ణుని ఎత్తిపొడుపును సహించలేక, రెచ్చిపోయి మాటకుమాట వడ్డించాడు. వాదం ఒక తీవ్రస్థాయికి చేరింది. - సంపా.)

చక్రాయుధముచేత శిశుపాలుండు చచ్చుట (సం. 2-42-21)

చ. అని శిశుపాలుఁ డొండొకట నప్రియముల్ హరిఁ బల్కుచున్నచో
ననలశిఖాలి దూల దనుజాంతకచక్రము రాజచక్ర మె
ల్లను భయమంద మూర్ధవికలంబుగ నప్పుడు సేసెఁ జేదినం
దను తనువున్ బృహద్రుధిరధారలు బోరన మీఁది కొల్కఁగన్. 68

ప్రతిపదార్థం: అని; శిశుపాలుఁడు; ఒండు+ఒకటన్= ఒకదానివెంట ఒకటిగా; హరిన్= శ్రీకృష్ణుణ్ణి; అప్రియముల్= నిందలు; పలుకుచున్+ఉన్నచోన్= పలుకుతుండగా; దనుజ+అంతక+చక్రము= రాక్షసులను అంతమొందించేవాడైన శ్రీకృష్ణునియొక్క చక్రాయుధం; అనల, శిఖా+ఆలి= అగ్నిజ్వాలల సమూహం; తూలన్= చలిస్తుండగా; రాజ, చక్రము+ఎల్లను= రాజుల సమూహమంతా; భయము+అందన్; చేదినందను, తనువున్= చేదిరాకుమారుడైన శిశుపాలుని శరీరాన్ని; బృహత్+రుధిర, ధారలు= పెద్దరక్తధారలు; బోరనన్= ఒక్కుమ్మడిగా; మీఁదికిన్; ఒల్కఁగన్= చిందేటట్లుగా; అప్పుడు; మూర్ధ, వికలంబుగన్= తల తెగిన దాన్నిగా; చేసెన్= చేసింది.

తాత్పర్యం: ఈ విధంగా శిశుపాలుడు ఒకదానివెంట ఒకటిగా శ్రీకృష్ణుణ్ణి నిందావాక్యాలతో దూషిస్తుండగా, రాక్షసాంతకు డైన శ్రీకృష్ణుని సుదర్శనచక్రం-అగ్నిజ్వాలలు చలిస్తుండగా, అందరు రాజులు భయపడుతుండగా, శిశుపాలుని శరీరంనుండి రక్తధారలు ఒక్కుమ్మడి మీదికి చిందుతుండగా అతని తలను నరికివేసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: రౌద్రరసరమ్యమైన ఈ సంఘటనలో శ్లేష మనే గుణాన్ని నన్నయ అక్షరరమణీయంగా వాడాడు. (సంపా.)

ఉ. ప్రల్లదమేది యిట్లు శిశుపాలుఁడు వజ్రహతాద్రి తుల్యుఁడై
త్రెళ్ళెడు వానిదైన పృథుదేహము వెల్వడి తేజ మంబరం
బెల్ల వెలుంగ వచ్చి పరమేశ్వరు దేహము సొచ్చె విస్మయో
త్ఫుల్ల విశాలనేత్రు లయి భూపతులెల్లను జూచుచుండఁగన్. 69

ప్రతిపదార్థం: ప్రల్లదము+ఏది= నిందిస్తూ మాట్లాడటం (పెరిగి పెరిగి) నశించి; శిశుపాలుఁడు; ఇట్లు= ఈవిధంగా; వజ్ర, హత+అద్రి, తుల్యుఁడు+ఐ= వజ్రాయుధంచేత నరకబడ్డ కొండతో సమానమైనవాడై; త్రెళ్ళెడు= క్రిందపడుతున్న; వానిది+ఐన= ఆ శిశుపాలునియొక్క; పృథు, దేహము, వెలువడి= పెద్దశరీరంనుండి బయటికి వచ్చి; భూపతులు+ఎల్లను= రాజులందరు; విస్మయ+ఉత్ఫుల్ల, విశాల, నేత్రులు+అయి= ఆశ్చర్యంచేత వికసించిన పెద్ద కన్నులు కలవాళ్ళయి; చూచుచున్+ఉండఁగన్; తేజము= కాంతి; అంబరంబు+ఎల్లన్= ఆకాశమంతా; వెలుంగన్; వచ్చి; పరమ+ఈశ్వరు, దేహమున్= పరమాత్మ అయిన శ్రీకృష్ణుని దేహాన్ని; చొచ్చెన్= ప్రవేశించింది.

తాత్పర్యం: నిందిస్తూ మాట్లాడుతున్న శిశుపాలునినోరు మూత పడింది. రాజులంతా ఆశ్చర్యంతో కళ్ళంతా పెద్దవిచేసుకొని చూస్తుండగా-శిశుపాలుని శరీరం, వజ్రాయుధంతో హతమైన కొండలా క్రిందపడింది. ఆ కళేబరం నుండి ఒకకాంతి ఆకాశమంతా వెలుగులు చిమ్ముతూ వెలుపలికి వచ్చింది. శ్రీకృష్ణపరమాత్మ శరీరంలో చేరిపోయింది.

విశేషం: అద్భుతరసవ్యంజక మైన ఈ పద్యరచన నన్నయ ప్రసాదగుణప్రధానరచనకు ఒక ఉదాహరణం. (సంపా.)

క. ఘనజాలము లేకయుఁ బెలు । చన పిడుగులతోడి వృష్టి చైద్యుని పాతం
బునఁ గురిసె; సముద్ర మహా । ద్రి నికాయముతో ధరిత్రి దిర్దిరఁ దిరిగెన్. 70

ప్రతిపదార్థం: చైద్యుని పాతంబునన్= చేదిరాజైన శిశుపాలునియొక్క పతనంతోడనే- అంటే శిశుపాలుడు తలతెగి పడటంతోనే; ఘనజాలము= మేఘాలయొక్క సమూహం; లేకయున్= లేకుండానే; పెలుచన= పెద్దగా; పిడుగులతోడి; వృష్టి= వాన; కురిసెన్; సముద్ర, మహా+అద్రి, నికాయముతోన్= సముద్రాలయొక్క, మహాపర్వతాలయొక్క సమూహంతో; ధరిత్రి= భూమి; దిర్దిరన్= గిర్రున; తిరిగెన్.

తాత్పర్యం: శిశుపాలుడు తల తెగి పడటంతోనే మేఘాలు లేకుండా పిడుగులతో కూడిన పెద్దవాన కురిసింది. సముద్రసమూహంతో, మహాపర్వత సమూహంతో భూమి దిర్దిర తిరిగింది.

క. జయ జయ నినాదమున న । వ్యయు నంబుజనాభు భువనవంద్యు నుపేంద్రుం
బ్రియమునఁ బొగడెడు జనముల । దయిన మహాధ్వనియుఁ జెలఁగె నతితుములంబై. 71

ప్రతిపదార్థం: అవ్యయున్= నాశం లేనివాణ్ణి; అంబుజనాభున్= పద్మాన్ని నాభిలో కలవాణ్ణి; భువనవంద్యున్= లోకాలచేత పూజించదగినవాణ్ణి; ఉపేంద్రున్= శ్రీకృష్ణుణ్ణి; జయ జయ నినాదమునన్= జయ జయ శబ్దాల ధ్వనితో; ప్రియమునన్= మనసార; పొగడెడు; జనములది+అయిన= ప్రజలయొక్క; మహాధ్వనియున్= పెద్దశబ్దంకూడ; అతి, తుములంబు+ఐ= మిక్కిలి తీవ్రమైనదయి; చెలఁగెన్= వ్యాపించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నాశం లేనివాడు, పద్మనాభుడు, లోకాలచేత పూజించదగినవాడు అయిన శ్రీకృష్ణుణ్ణి జయజయ ధ్వానాలతో మనసార పొగడే జనుల మహాధ్వని తీవ్రమై వ్యాపించింది.

వ. అంత ననంతశయనుండు శిశుపాలు సంస్కరింపం బంచి వాని కొడుకుం జేదిరాజ్యంబున కభిషిక్తుం జేసె; నట్లు ప్రశాంతవిఘ్నంబయి, సుఖారంభంబయి, ప్రభూతభక్ష్యాన్నధనదానసనాథంబయి, జగన్నాథ రక్షితంబయి రాజసూయమహాధ్వరంబు సమాప్తప్రయోగం బయిన. 72

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; అనంతశయనుండు= శ్రీకృష్ణుడు; శిశుపాలు సంస్కరింపన్= శిశుపాలునికి అంత్యక్రియలు జరపటానికి; పంచి= ఆజ్ఞాపించి; వానికొడుకున్= ఆ శిశుపాలునియొక్క కుమారుణ్ణి; చేదిరాజ్యంబునకున్; అభిషిక్తున్= రాజునుగా; చేసెన్; అట్లు= ఆ విధంగా; రాజసూయ+మహా+అధ్వరంబు= రాజసూయమహాయాగం; ప్రశాంతవిఘ్నంబు+అయి= శాంతింపజేయబడిన విఘ్నం కలదై - అంటే అడ్డులేనిదై, సుఖ+ఆరంభంబు+అయి= సుఖమైన ఆరంభం కలదై; ప్రభూత, భక్ష్య+అన్న, ధన, దాన, సనాథంబు+అయి= అధికమైన పిండివంటలను, అన్నాన్ని, డబ్బును, దానం చేయటంతో కూడుకొన్నదై; జగన్నాథ, రక్షితంబు+అయి= జగత్తుకు ప్రభువైన శ్రీకృష్ణునిచేత రక్షించబడిందై; సమాప్తప్రయోగంబు+అయినన్= పూర్తిచేయబడిన కార్యక్రమం కలది కాగా.

తాత్పర్యం: తరువాత శ్రీకృష్ణుడు శిశుపాలుని మృతదేహానికి అంత్యక్రియలు చెయ్యం డని ఆజ్ఞాపించాడు. ఆతని కుమారుణ్ణి చేది రాజ్యానికి రాజుగా చేశాడు. ఆ విధంగా రాజసూయం నిరాటంకంగా సుఖంగా ప్రారంభమై అధికమైన భక్ష్యాన్న ధనదానాలతో, జగన్నాథుడైన శ్రీకృష్ణుని సంరక్షణలో సమాప్తం కాగా-

విశేషం: అనంతశయనుడు - అనంతుని (ఆదిశేషుడి)పై శయనించేవాడు - శ్రీమహావిష్ణువు, శిశుపాలుడు పూర్వజన్మలో ఆయన ద్వారపాలకుల్లో ఒకడు. శిశుపాలుని పుత్రుడు ధృష్టకేతుడు.

ఉ. దేవగురుద్విజప్రకరతృప్తికరున్ వరరాజసూయ య
జ్ఞావభృథాభిషేకవిమలాంగు విశుద్ధయశోనిధిన్ జగ
త్పావను ధర్మనందను సభాస్థితుఁ జూచి ముదంబు చెంది రిం
ద్రావరజాది మిత్రు, లసహత్వముఁ బొందిరి ధార్తరాష్ట్రులున్. 73

ప్రతిపదార్థం: దేవ, గురు, ద్విజ, ప్రకర, తృప్తికరున్= దేవతల, గురువుల, బ్రాహ్మణులయొక్క సమూహానికి తృప్తి కలిగించినవాణ్ణి; వర, రాజసూయ, యజ్ఞ+అవభృథ+అభిషేక, విమల+అంగున్= శ్రేష్ఠమైన రాజసూయయాగంలో అవభృథస్నానం చేయటంవలన పరిశుద్ధమైన శరీరం కలవాణ్ణి; విశుద్ధయశః+నిధిన్= నిర్మల కీర్తికి నిధి అయిన వాణ్ణి; జగత్+పావనున్= లోకాన్ని పవిత్రం చేసేవాణ్ణి; సభా, స్థితున్= సభలో కొలువు తీరినవాణ్ణి; ధర్మనందనున్= ధర్మరాజును; చూచి; ఇంద్ర+అవరజ+ఆది, మిత్రులు= ఇంద్రుని తమ్ముడైన శ్రీకృష్ణుడు మొదలయిన మిత్రులు; ముదంబు, చెందిరి= సంతోషించారు; ధార్తరాష్ట్రులున్= ధృతరాష్ట్రుని కుమారులు- కౌరవులు; అసహత్వమున్= ఓర్వలేమిని; పొందిరి.

తాత్పర్యం: దేవతలను, గురువులను, బ్రాహ్మణ సమూహాలను తృప్తినొందించినవాడు, రాజసూయమహాయాగం ముగిసిన సందర్భంలో అవభృథస్నానంతో పవిత్రమైన శరీరం కలవాడు, నిర్మలమైన కీర్తికి నిధివంటివాడు, లోకాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పవిత్రం చేసేవాడు అయిన ధర్మరాజు సభలో కొలువుతీరి ఉండగా, శ్రీకృష్ణాదు లైన మిత్రులంతా చూచి ఎంతో సంతోషించారు. కౌరవులు అసూయ చెందారు.

విశేషం: గుణం: ప్రసాదం. అవభృథము - యజ్ఞాంతంలో చేసేస్నానం. వ్యక్తివైభవాన్ని చూచి మిత్రులు ఆనందించటం, దాయాదులు అసూయ చెందటం లోకసహజం. కొన్ని ప్రతుల్లో ఈ పద్యానికి ముందు అధర్వణాచార్యునివి అని చెప్పబడే రెండు పద్యాలు ఉన్నాయి.

వ. **ఇట్లు మహావిభూతితో నున్న ధర్మరాజు నొద్దకు వచ్చి నానాదేశాగతులయిన రాజు లి ట్లనిరి.** **74**

ప్రతిపదార్థం: ఇట్లు; మహా, విభూతితోన్= గొప్ప ఐశ్వర్యంతో; ఉన్న; ధర్మరాజు+ఒద్దకున్= ధర్మరాజు దగ్గరకు; వచ్చి; నానా, దేశ+ఆగతులు+ఐన= వివిధ దేశాలనుండి వచ్చిన; రాజులు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ఈ విధంగా గొప్ప ఐశ్వర్యంతో ఉండే ధర్మరాజు దగ్గరకు చేరి, వివిధదేశాలనుండి వచ్చిన రాజులు ఇలా అన్నారు.

మాలిని.

జగదభినుతసామ్రాజ్యంబుతో నొప్పు నీ య
త్యగణిత గుణయుక్తం బైన ధర్మప్రవృత్తిన్
మిగిలి వెలిఁగె నాజామీఢవంశంబు విద్వ
ద్గగనతపన! సర్వక్షత్త్రవంశంబులందున్. **75**

ప్రతిపదార్థం: విద్వత్+గగన, తపన= పండితులనే ఆకాశానికి సూర్యుని వంటివాడా!-ధర్మరాజా!; జగత్+అభినుత, సామ్రాజ్యంబుతోన్= లోకంచేత కొనియాడబడే సామ్రాజ్యంతో; ఒప్పు= ప్రకాశించే; నీ, అతి+అగణిత, గుణ, యుక్తంబు+ఐన, ధర్మప్రవృత్తిన్= ఏమాత్రం లెక్కించసాధ్యంగాని సుగుణాలతో కూడుకొన్న నీ ధర్మబద్ధమైన నడవడికచేత; సర్వ, క్షత్త్ర, వంశంబుల+అందున్= అన్నిరాజ వంశాలలో; ఆజామీఢవంశంబు= (మీదైన) ఆజామీఢవంశం; మిగిలి వెలిఁగెన్= ఎక్కువగా ప్రకాశించింది.

తాత్పర్యం: విద్వజ్జనులు అనే ఆకాశానికి సూర్యునివంటివాడా! ఓ ధర్మరాజా! లోకం అంతా కీర్తించే సామ్రాజ్యంతో వెలుగుతూ, లెక్కకు మిక్కిలి అయిన సుగుణాలతో కూడిన ధర్మప్రవర్తనతో రాణిస్తూ- అన్ని రాజవంశాల్లో నీ ఆజామీఢవంశమే అధికంగా ప్రకాశించింది.

విశేషం: గుణం : ప్రసాదం. అజామీఢుడు కురువంశమూలపురుషుడు. హస్తి అతనికి కుమారుడు. హస్తికుమారుడైన వికంఠనుడి కుమారుడు కూడ అజామీఢ నామధేయుడే.

వ. **'ఏము భవదీయ రాజసూయ మహోత్సవ దర్శనంబునను భవత్కృత సత్కార గౌరవంబుననుం జేసి కృతార్థుల మయితిమి. మా మా దేశంబులకుం బోయెద' మని చెప్పి వీడ్కొని చని; రప్పుడు ధర్మరాజువచనంబున భీష్మధృతరాష్ట్రుల భీమసేనుండును, యజ్ఞసేను నర్జునుండును, సపుత్త్రకులయిన (కర్ణ) శల్య సుబలుల**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నకులుండును, గృపద్రోణాశ్వత్థామల సహదేవుండును, విరాట భగదత్తుల ధృష్టద్యుమ్నుండునుం, బార్వతేయులైన రాజుల సౌభద్రద్రౌపదేయులును ననిచి రంత. **76**

ప్రతిపదార్థం: ఏము= మేము; భవదీయ, రాజసూయ, మహా+ఉత్సవ, దర్శనంబుననను= మీయొక్క రాజసూయయాగ మహోత్సవాన్ని చూడటంచేత; భవత్+కృత, సత్కార, గౌరవంబుననున్+చేసి= మీచే చేయబడిన సమ్మానంవలన కలిగిన గొప్పతనంచేత-అంటే మీరు చేసిన మర్యాదచేతను; కృతార్థులము+అయితిమి= ధన్యులమయ్యాము; మా, మా, దేశంబులకున్; పోయెదము; అని; చెప్పి; వీడ్కొని= వదలి; చనిరి= వెళ్ళారు; అప్పుడు; ధర్మరాజు, వచనంబునన్= ధర్మరాజుయొక్క మాటను అనుసరించి; భీష్మ, ధృతరాష్ట్రులన్; భీమసేనుండును; యజ్ఞసేనున్= ద్రుపదుణ్ణి; అర్జునుండును; సపుత్త్రకులు+అయిన= కుమారులతో కూడుకొనినవాళ్ళయిన; (కర్ణ), శల్య, సుబలులన్; నకులుండును; కృప, ద్రోణ+అశ్వత్థామల; సహదేవుండును; విరాట, భగదత్తులన్; ధృష్టద్యుమ్నుండునున్; పార్వతేయులు+ఐన, రాజులన్= పర్వత దేశానికి సంబంధించిన రాజులను; సౌభద్ర, ద్రౌపదేయులునున్= సుభద్రాతనయుడైన అభిమన్యుడు, ద్రౌపదీ పుత్రులైన ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడు; అనిచిరి= సాగనంపారు; అంతన్= తరువాత.

తాత్పర్యం: 'మేము నీ రాజసూయ యాగ మహోత్సవాన్ని చూచి, నీవు చేసిన సమ్మానగౌరవంతో ధన్యుల మయ్యాం. ఇక మా మా దేశాలకు వెళ్ళివస్తాం' అని సెలవు తీసుకొని వెళ్ళారు. అప్పుడు ధర్మరాజు ఆజ్ఞాపించగా భీమసేనుడు భీష్మధృతరాష్ట్రులను, అర్జునుడు ద్రుపదుణ్ణి, నకులుడు (కర్ణ) శల్య సుబలులను, వాళ్ళ కుమారులను, సహదేవుడు కృపద్రోణాశ్వత్థామలను, ధృష్టద్యుమ్నుడు విరాటభగదత్తులను, అభిమన్యుడు ఉపపాండవులు పర్వతదేశాల రాజులను సాగనంపారు. ఆ తరువాత.

విశేషం: కర్ణ శల్యుల విషయం మూలంలో లేదు. అనేక ప్రతుల్లో 'సుబలుల' అనటానికి బదులు 'సౌబలుల' అని ఉంది. కాని మూలంలో సుబలుడినే నకులుడు సాగనంపినట్లుంది. 'నకులః సుబలం రాజన్ సహపుత్త్రం సమన్వయాత్' (భండార్కరు ప్రతి 2-42-43) సుబలుడు= గాంధారరాజు, గాంధారియొక్క తండ్రి. ఆయన పెద్దవాడు, గౌరవించదగినవాడు కనుక నకులుడు ఆయనవెంట వెళ్ళి పంపటమే సమంజసం. సౌబలు డంటే సుబలుని కొడుకు - శకుని.

క. **సతత ధన దానములఁ బూ । జితులయి తృప్తులయి గుణవిశిష్టమహీదే**
వతవరులు ధర్మసుతు మా । నితగుణు దీవించి చనిరి నిజ గృహములకున్. **77**

ప్రతిపదార్థం: గుణ, విశిష్ట, మహీదేవత, వరులు= గుణంచేత గొప్పవాళ్ళయిన బ్రాహ్మణశ్రేష్ఠులు; సతత, ధన, దానములన్= ఎడతెగని ధనదానాలచేత; పూజితులు+అయి= పూజించబడినవాళ్ళయి; మానిత, గుణున్= గౌరవించదగినగుణాలు కలవాడయిన; ధర్మసుతున్= ధర్మరాజును; దీవించి; నిజగృహములకున్= తమ ఇండ్లకు; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: గుణాలచేత గొప్పవాళ్ళయిన బ్రాహ్మణోత్తములంతా-ఎడతెగని ధనదానాలతో తృప్తిపొంది, గౌరవించదగిన గుణాలు కలవాడైన ధర్మరాజును దీవించి, తమ తమ ఇండ్లకు వెళ్ళారు.

వ. **నారాయణుండును బాండునందనుల నందఱం గ్రమంబున వీడ్కొని ద్వారవతికిం బోవుచుండి ధర్మరాజున కి ట్లనియె.** **78**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శ్రీకృష్ణుడుకూడ పాండవులందరికి ఒకరి తరువాత ఒకరికి వీడ్కోలు చెప్పి ద్వారవతీనగరానికి పోబోతూ ధర్మరాజుతో ఇలా అన్నాడు.

తే. **సకలభూతసంఘంబు పర్జన్యుఁ, బక్షి। సమితి బహుఫలవృక్షంబు, నమరు లింద్రు**
ననిశమును నుపజీవించునట్లు బంధు। జనులు ని న్నుపజీవింప మనుము పేర్మి. **79**

ప్రతిపదార్థం: సకల, భూత, సంఘంబు= అన్ని ప్రాణుల సమూహం; పర్జన్యున్= మేఘుణ్ణి; పక్షి, సమితి= పక్షుల సమూహం; బహు, ఫల, వృక్షంబున్= పెక్కు పండ్లున్న చెట్టును; అమరులు= దేవతలు; ఇంద్రున్= దేవేంద్రుణ్ణి; అనిశమును= ఎల్లప్పుడూ; ఉపజీవించునట్లు= ఆశ్రయించి బ్రతికేటట్లు; బంధుజనులు; నిన్నున్+ఉపజీవింపన్= నిన్ను ఆశ్రయించి బ్రతికేటట్లుగా; పేర్మిన్= గొప్పగా; మనుము= జీవించుము.

తాత్పర్యం: ధర్మరాజా! అన్ని ప్రాణులు మేఘుణ్ణి, పక్షిసమూహం పెక్కుఫలాలున్న వృక్షాన్ని, దేవతలు దేవేంద్రుణ్ణి, ఎల్లప్పుడు ఆశ్రయించి జీవిస్తున్నట్లు- బంధువులందరు ని న్నాశ్రయించి బ్రతికేలా గొప్పగా మనుగడ సాగించు.

విశేషం: అలం: ఉపమ. బంధుజనులు రాజును ఆశ్రయించే విధాలను, రాజు వాళ్ళను రక్షించే పద్ధతులను ఈ పద్యంలో వాడిన మూడు ఉపమానాలు సూచిస్తున్నాయి. ప్రాణులకు జలం ప్రాణాధారం, అలాగే బంధుజనుల ప్రాణరక్షణభారం రాజు వహించాలి. పండ్లవృక్షాన్ని పక్షులు ఆహార నివాసాలకొరకు ఆశ్రయిస్తాయి. అలాగే రాజు తనను ఆశ్రయించిన బంధువులకు ఆహారనివాసాలకు అవసరమైన ద్రవ్యాలను అందించాలి. అంటే ఆశ్రయ మిచ్చి పోషించా లని భావం. అమరులు ఇంద్రుణ్ణి ఆశ్రయించి సురక్షితులుగా ఉండా లని ఆశిస్తారు. అలాగే రాజు బంధువులకు రక్షాకవచంగా నిలవాలి. ఈ మాటలు ఒక బంధువుగా శ్రీకృష్ణుడు చెప్పటంలో విశేషం ఉన్నది. (సంపా.)

వ. **'మఱియు నప్రమత్తుండవయి నిఖిలప్రజారక్షణంబు సేయు'మనినఁ గృష్ణునకు ధర్మరా జి ట్లనియె.** **80**

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక; అప్రమత్తుండవు+అయి= ఏమరుపాటు లేనివాడివై; నిఖిల, ప్రజా, రక్షణంబు, చేయుము= అందరు ప్రజలను రక్షించుము; అనినన్, కృష్ణునకున్; ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అంతేకాక, ఎటువంటి ఏమరుపాటు లేకుండా ప్రజలందరిని రక్షించు' అని శ్రీకృష్ణుడు అనగా ధర్మరాజు ఇలా అన్నాడు.

ఉ. **నీకరుణం గరంబు రమణీయతరంబయి సర్వవిఘ్నదూ**
రీకృతమై సమాప్తి నొనరెన్ ధరణీధర! యిమ్మఖంబు; భూ
లోకములోన నేను నృపలోక నమస్కృతిఁ గీర్తిఁ బర్వితిన్;
నా కులమున్ వెలింగె సుగుణంబుల కాస్పదమై పవిత్రమై. **81**

ప్రతిపదార్థం: ధరణీధర= భూమిని ధరించినవాడా! శ్రీకృష్ణా!; నీ, కరుణన్= నీ దయచేత; ఈ, మఖంబు= ఈయజ్ఞం; కరంబు= మిక్కిలి; రమణీయ తరంబు+అయి= ఎక్కువ మనోహరమైనదయి; సర్వ, విఘ్న దూరీకృతము+ఐ= అన్ని ఆటంకాలకు దూరం చేయబడినదై; సమాప్తిన్+ఒనరెన్= ముగింపుతో ఒప్పింది; లోకములోనన్; నేను; నృప, లోక, నమస్కృతిన్, కీర్తిన్= రాజసమూహం యొక్క నమస్కారంచేత కీర్తితో; పర్వితిన్= ప్రసిద్ధుడనయ్యాను; సుగుణంబులకున్= మంచిగుణాలకు; ఆస్పదమై= ఉనికిపట్టయి; పవిత్రము+ఐ= పరిశుద్ధమై; నా, కులమున్= నాయొక్క వంశంకూడ; వెలింగెన్= ప్రకాశించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: భూభారాన్ని వహించిన ఓ శ్రీకృష్ణా! నీ దయతో ఈయజ్ఞం ఎంతో మనోజ్ఞమై, నిర్విఘ్నమై, శోభాయమానంగా ముగిసింది. లోకంలో రాజులంతా నమస్కరించటంవల్ల వచ్చిన కీర్తితో నేను ప్రసిద్ధుడి నయ్యాను. నా వంశం కూడ మంచిగుణాలకు నిలయమై, నిర్మలమై ప్రకాశించింది.

విశేషం: ధరణీధర! అనే సంబోధనలో 'భూభారాన్నే వహించిన నీకు నా యజ్ఞభారాన్ని వహించటం ఒక లెక్కా' అనే ధ్వని కూడ లేకపోలేదు. (ఆనందపూర్ణమయిన ధర్మరాజు హృదయం అక్షరరమ్యంగా మాధుర్యగుణ బంధురంగా ఈ పద్యంలో ప్రతిఫలించింది. - సంపా.)

క. ద్వారవతి నుండియును నిట । యారసియుండునది దానవాంతక! లోకా
ధార! సమీపస్థుండవ । దూరంబున నుండియుం జతుర్భుజ! మాకున్. 82

ప్రతిపదార్థం: దానవ+అంతక!= రాక్షసులను నాశ మొనర్చేవాడా! లోక+ఆధార= లోకానికి ఆధారమైనవాడా! చతుర్భుజ!= నాలుగుభుజాలు కలవాడా!-శ్రీకృష్ణా!; ద్వారవతిన్+ఉండియును= ద్వారకానగరంలో ఉన్నప్పటికిని; ఇటన్= ఇక్కడ; ఆరసి+ ఉండునది= (మా యోగక్షేమాలను) విచారిస్తూ ఉండవలసింది; దూరంబునన్, ఉండియున్= దూరంలో ఉండికూడ; మాకున్; సమీపస్థుండవు+అ= దగ్గరివాడివే.

తాత్పర్యం: రాక్షసుల్ని నాశం చేసేవాడా! లోకానికి ఆధారమైనవాడా! నాలుగు భుజాలు కలవాడా! శ్రీకృష్ణా! నీవు ద్వారకానగరంలో ఉన్నప్పటికీ, ఇక్కడి మా యోగక్షేమాలు విచారించు, దూరంగా ఉన్న నీవు మా కెప్పుడూ దగ్గరివాడివే.

విశేషం: ధర్మరాజు శ్రీకృష్ణుని శక్తిసామర్థ్యాల్ని, మాహాత్మ్యాన్ని ప్రశంసించి, 'నీ వెక్కడున్నా ఇక్కడ మా యోగక్షేమాల్ని విచారించవలసిన బాధ్యత నీదే' అని అనన్యభక్తితో అంటున్నాడు. (ఈ మాటల్లో సర్వేశ్వరుని అనంతశక్తిమత్త్వాన్నీ, అనంత వ్యాపకత్వాన్నీ ధర్మరాజు ధ్వనిమయంగా స్తుతించాడు. ద్రౌపదీమానసంరక్షణ ఘట్టంలో ఈ వాక్యం నిజం కానున్నది. ఇది వస్తుధ్వని. - సంపా.)

వ. 'నిన్నుం బాసి నిమిషంబయిన నిర్వహింప నేర'మని ధర్మరా జెట్టకేనియు గరుడగమనుగమనంబున కొడంబడియె; నంత. 83

ప్రతిపదార్థం: నిన్నున్+పాసి= నిన్నువిడిచి; నిమిషంబు+అయినన్; నిర్వహింపనేరము= జీవితాన్ని నడుపుకోలేము; అని; ధర్మరాజు; ఎట్టకేనియున్= అతి కష్టంమీద; గరుడ, గమను, గమనంబునకున్= (గరుత్మంతుని మీద ప్రయాణంచేసేవాని ప్రయాణానికి) శ్రీకృష్ణుని ప్రయాణానికి; ఒడంబడియెన్= అంగీకరించాడు; అంతన్= తరువాత.

తాత్పర్యం: 'నిన్ను విడిచి నిమిషంకూడా ఉండలేము' అంటూ ధర్మరాజు ఎంతోకష్టంమీద శ్రీకృష్ణుని ప్రయాణానికి అంగీకరించాడు. ఆ తరువాత.

విశేషం: గరుడ గమనుఁడు-గరుడునిపై ప్రయాణం చేసేవాడు - విష్ణుమూర్తి - శ్రీకృష్ణుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. అనిలజవాశ్వయుక్తమయి హాటకరత్న విచిత్ర తార్క్ష్య కే
తనమయి మేఘనాదమయి దారుక సారథియైన దివ్య కాం
చన రథ మెక్కి యాక్షణమ సాత్వతకుంజరుఁ డేఁగె భక్తి నా
తని ననిచెన్ యుధిష్ఠిరుఁడు దమ్ములు దానును బాదచారియై. 84

ప్రతిపదార్థం: సాత్వత, కుంజరుఁడు= సాత్వతవంశశ్రేష్ఠుడు - శ్రీకృష్ణుడు; అనిల, జవ+అశ్వ, యుక్తము+అయి= వాయువేగం గల గుర్రాలతో కూడినదై; హాటక, రత్న, విచిత్ర, తార్క్ష్య, కేతనము+అయి= బంగారుతో, రత్నాలతో, చాలా చిత్రమైన రంగు గల గరుడధ్వజం కలదై; మేఘ, నాదము+అయి= మేఘ గర్జనం వంటి శబ్దం కలదై; దారుక, సారథి, ఐన= దారుకుని సారథిగా గలదైన; దివ్య, కాంచన, రథము= దేవతాసంబంధమైన బంగారు రథాన్ని; ఎక్కి; ఆ, క్షణము+ఆ= ఆ నిమిషాన్నే; ఏఁగెన్= వెళ్ళాడు; యుధిష్ఠిరుఁడు= ధర్మజుడు; తమ్ములు; తానును; పాదచారియై= నడిచివెళ్ళి; భక్తిన్= భక్తితో; అతనిన్= ఆ కృష్ణుని; అనిచెన్= సాగనంపాడు.

తాత్పర్యం: సాత్వత వంశశ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు- వాయువేగం గల గుర్రాలు, బంగారుతో, రత్నాలతో చిత్రమైన గరుడధ్వజం, మేఘగర్జన లాంటిశబ్దం కలిగి- దారుకుడు సారథిగా ఉన్న దివ్యమైన కాంచన రథాన్ని అధిరోహించి ఆ క్షణమే ద్వారకకు బయలుదేరివెళ్ళాడు. ధర్మరాజు తమ్ములతో కూడ నడిచి వెళ్ళి, భక్తి భావంతో శ్రీకృష్ణుణ్ణి సాగనంపాడు.

విశేషం: సాత్వతుడు వృష్ణి తండ్రి. ధర్మరాజు స్వయంగా నడిచి వెళ్ళి సాగనంపింది ఒక శ్రీకృష్ణుణ్ణే. (శ్రీకృష్ణుడి రథయాత్రలో కానవచ్చే ఔదాత్త్యాన్ని, గతిగాంభీర్యాన్ని, శబ్దాలంకారభ్రాంతిని కలిగించే వివిధ మధురాక్షరసంయోజనంవలన కలిగిన అక్షరరమ్యత అనుభూతికి అందిస్తున్నది. రథగమనమధురనాదమే ఈ వృత్తరచనమా అనిపిస్తున్నది. వృత్తం ప్రతిపాదం చివరిఅక్షరం దగ్గర విరిగి ముందుపాదంలోకి గతి చొచ్చుకొనిపోయే నిర్మాణసమత మార్గాభేదత్వాన్ని ధ్వనింపచేస్తున్నది. సమత అనే గుణం సంపన్నమై సహృదయహృదయాలను సమ్మోదపరుస్తున్నది. - సంపా.)

క. తగిలి విలోచన గోచర । మగు నంతకు దృష్టి నిలిపి యట హృదయం బి
మ్ముగఁ జొనిపి యెట్టకేనియు । మగిడిరి హరి ననిచి దీనమతిఁ బాండుసుతుల్. 85

ప్రతిపదార్థం: పాండుసుతుల్= పాండురాజుకుమారులు-పాండవులు; తగిలి= వెంటవెళ్ళి; విలోచన, గోచరము+అగునంతకున్= కంటికి కనిపించినంతదూరం; దృష్టి= చూపు; నిలిపి; అటన్= ఆవల; హృదయంబు= మనస్సును; ఇమ్ముగన్= ప్రీతితో; చొనిపి= చొప్పించి - అంటే చూపులకు బదులు మనస్సును ప్రవేశపెట్టి; ఎట్టకేనియున్= అతికష్టంతో; హరిని= శ్రీకృష్ణుణ్ణి; అనిచి= సాగనంపి; దీనమతిన్= దీనతను పొందిన బుద్ధితో - అంటే శూన్యం, నీరసం అయిన మానసిక స్థితితో; మగిడిరి= వెనుదిరిగారు.

తాత్పర్యం: పాండవులు శ్రీకృష్ణుని రథం వెంట వెళ్ళి, కంటికి కనిపించినంతదూరం చూచి, ఆవల చూపులకు బదులు మనస్సును పంపి, అతికష్టంమీద ఆయనను సాగనంపి దీనుల్లా తిరిగి వచ్చారు.

విశేషం: కొంతవరకే వెళ్ళేది కంటిచూపు. ఎంతవరకైన వెళ్ళేది వ్యక్తిమనస్సు. జీవితంలో తమ కెంతో సాయంచేసి, అండగా నిలిచిన ఆత్మీయుణ్ణి సాగనంపి, ఆయన వెంట మనస్సును పంపి, ఇంటికి తిరిగి వచ్చే వ్యక్తుల దీనమతి, శూన్యస్థితి అనుభవైకవేద్యమే కాని, వివరణ సాధ్యం కాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాండవ సభామహిమకు దుర్యోధనుండు లజ్జితుం డగుట (సం. 2-43-1)

వ. అట దుర్యోధనుండు శకునియుం దానును సభావిభవంబుఁ జూచు వేడుక నందుఁ గొన్ని దినంబు లుండి, యొక్కనాఁడు దాని యపూర్వరమణీయతకు విస్మితుం డగుచు నయ్యయి ప్రదేశంబులం గ్రుమ్మరువాఁడు వివృతంబైన ద్వారదేశంబు సంవృతంబుగా వగచి చొరనొల్లక, సంవృతంబైనదాని వివృతంబుగా వగచి చొరంబోయిలలాట ఘట్టితగృహద్వారుండయి, సమప్రదేశం బున్నతంబుగా వగచి యెక్కసమకట్టి, నీలాశ్మరశ్మి స్థగితంబైన విమలమణిస్థలంబు జలాశయంబుగా వగచి పరిధానం బెగఁద్రోచికొని, స్ఫటికదీప్తిజాల పరివృతంబైన జలాశయంబు స్థలంబుగా వగచి కట్టిన పుట్టంబు దడియంజొచ్చి, క్రమ్మఱిన వానిం జూచి పాంచాలియుఁ బాండుకుమారులును నగి రంత. 86

ప్రతిపదార్థం: అటన్= అక్కడ; దుర్యోధనుండు; శకునియున్; తానును; సభా, విభవంబున్= మయసభయొక్క గొప్పతనం; చూచు, వేడుకన్= చూడాలనే కుతూహలంతో; అందున్= ఇంద్రప్రస్థంలో; కొన్ని, దినంబులు; ఉండి; ఒక్కనాఁడు; దాని= ఆ మయసభయొక్క; అపూర్వ రమణీయతకున్= అరుదైన సౌందర్యానికి; విస్మితుండు+అగుచున్= ఆశ్చర్యంపొందుతూ; ఆ+అయి, ప్రదేశములన్= సభలోపలి ఆయా ప్రదేశాలలో; క్రుమ్మరువాఁడు= తిరుగుతున్నట్టి ఆ దుర్యోధనుడు; వివృతంబు+అయిన= తెరువబడి ఉండే; ద్వార, దేశంబు= వాకిలిని; సంవృతంబుగా= మూసి ఉన్న దానినిగా; వగచి= తలంచి; చొరన్+ఒల్లక= ప్రవేశించటానికి ఇష్టపడక; సంవృతంబు+ఐన, దానిన్= మూసివేయబడి ఉండే వాకిలిని; వివృతంబుగా= తెరువబడి ఉండే దానినిగా; వగచి= తలంచి; చొరన్, పోయి= ప్రవేశించబోయి; లలాట, ఘట్టిత, గృహ, ద్వారుండు+అయి= నొసట కొట్టుకొన్న గృహద్వారం కలవాడై-అంటే నొసలు గృహద్వారానికి కొట్టుకొని; సమ, ప్రదేశంబు= సమతలంగా ఉండే చోటును; ఉన్నతంబుగా= ఎత్తైన ప్రదేశంగా; వగచి= తలంచి; ఎక్కన్= ఎక్కటానికి; సమకట్టి= పూనుకొని; నీల+అశ్మ, రశ్మి, స్థగితంబు+ఐన= నీలపు రాళ్ళ కాంతులచేత కప్పబడిన; విమల, మణి, స్థలంబు= నిర్మలమైన మణులు పొదగబడిన ప్రదేశాన్ని; జల+ఆశయంబుగా= నీటి మడుగుగా; వగచి= తలచి; పరిధానంబు= కట్టుకొన్నధోవతి; ఎగ, ద్రోచికొని= పైకెత్తి పట్టుకొని; స్ఫటిక, దీప్తి, జాల, పరివృతంబు+ఐన= పటికపు రాళ్ళ కాంతి సమూహంచేత చుట్టబడిన దయిన; జల+ఆశయంబు= నీటి మడుగును; స్థలంబుగా= నేలగా; వగచి= తలచి; కట్టిన, పుట్టంబు= కట్టుకున్న వస్త్రం; తడియన్= తడిసిపోయేటట్లు చొచ్చి= అందులో ప్రవేశించి; క్రమ్మఱిన= వెనుదిరిగిన; వానిన్= ఆ దుర్యోధనుణ్ణి; చూచి; పాంచాలియున్= ద్రౌపదియు; పాండుకుమారులును= పాండవులును; నగిరి= నవ్వారు; అంతన్= తరువాత.

తాత్పర్యం: దుర్యోధనుడు, శకుని - మయసభా విశేషాలు చూడాలన్న కుతూహలంతో ఇంద్రప్రస్థంలోనే కొన్ని రోజులు ఉన్నారు. ఒకరోజు దుర్యోధను డొక్కడే ఆ మయ సభయొక్క అపూర్వసౌందర్యానికి ఆశ్చర్యపడి, అందుండే ఆ యా ప్రదేశాలు తిరిగి చూడటం ప్రారంభించాడు. ఒకచోట తెరచిన ద్వారాన్ని మూసిన దానినిగా తలచి ముందుకు వెళ్ళక వెనుదిరిగాడు. మరొకచోట మూసినద్వారాన్ని తెరచినదానినిగా తలచి ముందుకు పోబోయి నొసలు కొట్టుకొన్నాడు. సమతలప్రదేశాన్ని ఎత్తైన స్థలంగా తలచి ఎక్కబోయాడు. ఒకచోట నీలపురాళ్ళ కాంతులు కప్పిన మణిమయ ప్రదేశాన్ని నీటిమడుగుగా భ్రమించి కట్టుకొన్న బట్టలు ఎగబట్టుకొని నడిచాడు. మరొకచోట స్ఫటికపు రాళ్ళ కాంతులు కప్పిన నీటి మడుగును నేలగా తలచి ముందుకు నడిచి కట్టుబట్టలు తడుపుకొని వెనుదిరిగాడు. అతణ్ణి చూచి ద్రౌపదితోపాటు పాండవులు కూడ నవ్వారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇది అభిమానధనుడైన దుర్యోధనుని భంగపాటు. పాండవులపై అతని అసూయా ద్వేషాలను అంతకంత అధికం చేసిన భంగపాటు. ద్రౌపదీమానభంగయత్నానికి త్రోవతీసిన భంగపాటు. రాజసూయయాగంవల్ల కలుగబోయే మహాసంగ్రామానికి ఇది తొలినాటు.

ఆ. దాని నెఱిఁగి ధర్మతనయుండు ధృతరాష్ట్ర । తనయునకు సమీరతనయుచేత
దివ్యవస్త్రములును దివ్యభూషణములు । నిచ్చి పుచ్చెఁ బ్రీతి యేర్పడంగ. 87

ప్రతిపదార్థం: దానిన్= ఆ దుర్యోధనుని తడిసిన బట్టలతో కూడినస్థితిని; ఎఱిఁగి= తెలుసుకొని; ధర్మతనయుండు= ధర్మరాజు; ధృతరాష్ట్రతనయునకున్= ధృతరాష్ట్రుని కుమారుడైన దుర్యోధనునికి; సమీర, తనయుచేతన్= వాయుపుత్రుడైన భీమసేనునిచేత; దివ్య, వస్త్రములును= మంచి బట్టలను; దివ్యభూషణములును= మంచి ఆభరణాలను; ప్రీతి= ప్రేమ; ఏర్పడంగన్= ప్రకటమయ్యేటట్లుగా; ఇచ్చి పుచ్చెన్= ఇచ్చి పంపించాడు.

తాత్పర్యం: దుర్యోధనుని కట్టుబట్టలు తడిసిన స్థితిని చూచి, ధర్మరాజు అతనికి మంచి వస్త్రాలు, ఆభరణాలు తన ప్రేమ ప్రకటమయ్యేలా భీమసేనునిచేత ఇచ్చి పంపించాడు.

విశేషం: ధర్మరాజుకు దుర్యోధనునిమీద అంతప్రేమ ఉంటే మంచివస్త్రాలు, ఆభరణాలు ఇచ్చి పంపటం మంచిదే. కాని, అవి భీమసేనునిచేతనే ఇచ్చి పంపాలా? మరొక తమ్ముడిచేత పంపకూడదా? తిక్కనగారు ధర్మజుణ్ణి 'మెత్తనిపులి' అనటం ఇలాంటివాటిని దృష్టిలో పెట్టుకొని కాబోలు. ఆగర్భశత్రువైన భీమసేనుని చేత అలా ఇచ్చి పంపితే అవమానం పాలైన అభిమానధనుడు దుర్యోధనునికి పుండుమీద కారం చల్లినట్లుండదా?

వ. దుర్యోధనుం డట్లు సభాప్రలంభంబునకు లజ్జితుండయి పాండవుల వీడ్కొని గజపురంబున కరిగి ధర్మరాజు రాజసూయంబు దన కసూయాజననం బగుటయు సకలజనమనో నయనోత్సవంబయిన తత్సభాలక్ష్మి దన మనోనయనంబుల కగ్నిజ్వాలలయి మహాదాహంబు సేయుటయు సంతప్తుండై నిదాఘదాహంబున నింకి తఱుఁగు నల్పజలాశయంబునుం బోలెఁ దద్దయుం దఱిఁగి. 88

ప్రతిపదార్థం: దుర్యోధనుండు; అట్లు= ఆ విధంగా; సభా ప్రలంభంబునకున్= సభవల్ల మోసపోవటానికి; లజ్జితుండు+ఐ= సిగ్గుపడినవాడై; పాండవులన్; వీడ్కొని= వదలి; గజపురంబునకున్= హస్తిపురానికి; అరిగి= వెళ్ళి; ధర్మరాజు, రాజసూయంబు= ధర్మరాజుయొక్క రాజసూయయాగం; అసూయా, జననంబు+అగుటయున్= అసూయను పుట్టించేది కాగా; సకల, జన, మనః+నయన+ఉత్సవంబు+అయిన= అందరు ప్రజల మనస్సులకు, కన్నులకు పండువు అయిన - అంటే అందరికీ సంతోషాన్ని కూర్చిన; తత్+సభా, లక్ష్మి= ఆ మయసభా వైభవం; తన, మనః+నయనంబులకున్= తనయొక్క మనస్సుకు, నేత్రాలకు; అగ్ని, జ్వాల+ఐ= నిప్పుమంట అయి; మహా, దాహంబు, చేయుటయున్= మిక్కిలిగా కాల్చటంచేత; సంతప్తుండు+ఐ= ఎక్కువ దుఃఖం పొందినవాడై; నిదాఘ, దాహంబునన్= వేసవి వేడిమిచేత; ఇంకి= నీళ్ళు ఇంకిపోయి; తఱుఁగు= తగ్గిపోయే; అల్ప, జల+ఆశయంబునున్+పోలెన్= చిన్ననీటిమడుగువలె; తద్దయున్= మిక్కిలి; తఱిఁగి= కృశించి.

తాత్పర్యం: ఆ విధంగా దుర్యోధనుడు మయసభవల్ల మోసపోయి, అవమానం పాలైనందుకు సిగ్గుపడ్డాడు. పాండవుల్ని వదలి హస్తినకు వెళ్ళాడు. ధర్మరాజు రాజసూయం అతనికి అసూయ కలిగించింది. అందువల్ల - అందరి మనస్సులకు, కళ్ళకు ఆనందాన్ని కూర్చిన ఆ మయసభా వైభవం - అతని మనస్సుకు, కళ్ళకు నిప్పుమంట

అయింది. అమితంగా అతణ్ణి దహించింది. దుఃఖంతో కుమిలిపోయాడు. వేసవి వేడికి నీళ్ళింకి తరిగిపోయిన నీటి మడుగులా కృశించి-

విశేషం: అలం. ఉపమ.

క. కందు గల పసిఁడి గాఁచినఁ । గంది వివర్ణమయినట్లు కౌరవుకాయం
బొందఁగ వివర్ణమయి కడు । వందె మనస్తాపహవ్యవహదాహమునన్. 89

ప్రతిపదార్థం: కందు= మాలిన్యం; కల; పసిఁడి= బంగారాన్ని; కాఁచినన్= కాల్చగా; కంది= నలుపెక్కి; వివర్ణము+అయిన, అట్లు= రంగును కోల్పోయినట్లు; మనస్తాప, హవ్యవహ, దాహమునన్= మనోవేదన అనే అగ్నియొక్కవేడిచేత; కౌరవుకాయంబు= దుర్యోధనుని శరీరం; ఒందఁగన్= స్పష్టంగా తెలిసేటట్లుగా; వివర్ణము+అయి= కళావిహీనమై - అంటే వెలవెలపోయి; కడున్= మిక్కిలి; వందెన్= దుఃఖంచేత కృశించింది.

తాత్పర్యం: మాలిన్యం గల బంగారాన్ని బాగా కాలిస్తే (వేడిచేస్తే) అది నలుపెక్కి ఎంతగా తన రంగును కోల్పోతుందో మనోవేదన అనే నిప్పువేడిచేత దుర్యోధనుని శరీరం అంత కళావిహీనమైంది. కృశించింది.

విశేషం: అలం: రూపకానుప్రాణితఉపమ. ఎదుటివారి అభివృద్ధిని చూచి సంతోషించటం సజ్జనలక్షణం. ఈర్ష్యపడటం దుర్జనస్వభావం. ఈర్ష్య చాలాచిత్రమైన దుర్గుణం. అది ఒకరితో చెప్పుకోటానికి వీలులేనిది. అట్లని ఓర్చుకొనటానికి సాధ్యంకానిది. ఒక విధంగా అది కర్రకు అంటుకొన్న నిప్పులాంటిది. ఎదుటివాళ్ళను కాల్చేమాట ఎలా ఉన్నా మొదట కర్రను మాత్రం అది కాల్చకమానదు. ఇప్పుడు దుర్యోధనుని స్థితి ఇదే.

క. అవనీ రాజ్యవ్యాపా । రవిహీనుం డయి సుహృద్విరంజనుఁ డై కౌ
రవపాంసనుండు పాప । వ్యవసాయమునందు బుద్ధి వదలక నిలిపెన్. 90

ప్రతిపదార్థం: కౌరవ, పాంసనుండు= కౌరవ కులానికి అపకీర్తి తెచ్చేవాడు-దుర్యోధనుడు; అవనీ, రాజ్య, వ్యాపార, విహీనుండు+అయి= రాజ్యపరిపాలన వ్యవహారాలు మానినవాడై; సుహృత్+విరంజనుఁడు+ఐ= స్నేహితులపట్ల ఇష్టంలేనివాడయి; పాప, వ్యవసాయంబునందున్= పాపపుపని చేయటంలో; బుద్ధి= మనస్సు; వదలక= విడువక-అంటే గట్టిగా; నిలిపెన్= నిలిపాడు.

తాత్పర్యం: కౌరవకులానికి అపకీర్తి కలిగించే దుర్యోధనుడు, రాజ్యవ్యవహారాలు చూడటం మాని, స్నేహితులను కలయటానికి కూడ ఇష్టపడక, పాపపుపని చెయ్యటంలో పట్టుగా బుద్ధి నిలిపాడు.

వ. ఇట్లు సకల సుఖోపభోగ విముఖుండయి యెవ్వరితోడం బలుక కున్న దుర్యోధనుం జూచి శకుని యి
ట్లనియె. 91

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సకల, సుఖ+ఉపభోగ, విముఖుండు+ఐ= అన్ని సుఖాలను అనుభవించటానికి ఇష్టంలేనివాడై; ఎవ్వరితోడన్= ఎవరితోకూడ; పలుకక+ఉన్న= మాట్లాడకుండ ఉన్నటువంటి; దుర్యోధనున్; చూచి; శకుని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ఏ సుఖం అనుభవించటానికి ఇష్టంలేని వాడై, ఎవరితో కూడా మాట్లాడకుండా ఉండే ఆ దుర్యోధనుణ్ణి చూచి శకుని ఇలా అన్నాడు.

ఆ. ఇన్ని దినములయ్యె నేటికి నాతోడ । నిభపురేశ! పలుక విట్టు లేల?
నీ ముఖంబు దీర్ఘ నిశ్వాస ధూమ సం । హతులఁ జేసి కలుషమయిన యదియు. 92

ప్రతిపదార్థం: ఇభ, పుర+ఈశ= ఓ హస్తినాపురరాజా! దుర్యోధనా!; ఇన్ని, దినంబులు+అయ్యెన్= ఇన్ని రోజులయింది-అంటే చాలా రోజులనుండి; ఏటికిన్= ఎందుచేత; నాతోడన్; పలుకవు= మాట్లాడవు; ఇట్టుల= ఈ విధంగా; ఏల= ఎందుచేత; నీ, ముఖంబు; దీర్ఘ, నిశ్వాస, ధూమ, సంహతులన్+చేసి= నిట్టూర్పుపొగల సమూహాలచేత; కలుషము+అయిన, అదియు= మలినమైనది.

తాత్పర్యం: ఓ హస్తినాపురరాజా! దుర్యోధనా! ఇన్ని రోజులుగా నీవు నాతో ఎందుకు మాట్లాడటం లేదు? ఎందుచేత నీ ముఖం ఈ విధంగా వేడి నిట్టూర్పులతో మలినమైపోయింది?

విశేషం: వేడినిట్టూర్పులు వెలితికి చిహ్నాలు. వేదనకు సూచికలు. 'ఇభపురేశ' - అనే సంబోధన - నీవు హస్తినాపురాధీశ్వరుడివి కదా! నీ కేమి కొరత? ఎందుల కీ నిట్టూర్పులు? ఏమి నీ వేదన? తప్పక చెప్పు' అని తరచి అడిగేదిగా ఉంది.

క. నా కెఱిఁగింపుము దీని, న । నేకాగ్రతఁ బొందనేల యే నుండఁగ? న
వ్యాకులభవత్ప్రతాప ని । రాకృతులు ధరిత్రిలోని రాజులు నీకున్. 93

ప్రతిపదార్థం: దీనిన్= నీ దుఃఖకారణాన్ని; నాకున్+ఎఱిఁగింపుము= నాకు తెలియజెప్పుము; ఏన్+ఉండఁగన్= నేనుండగా; అనేకాగ్రతన్= చింతను; పొందన్+ఏల= పొందటమెందుకు? ధరిత్రిలోని= భూమిలోని; రాజులు; నీకున్? అవ్యాకుల, భవత్+ప్రతాప, నిరాకృతులు= కలతచెందని నీ పరాక్రమంచేత అణగించబడినవారు.

తాత్పర్యం: నీ దుఃఖకారణాన్ని నాకు చెప్పు. నే నుండగా నీవు చింతించట మెందుకు? భూమిమీద రాజులంతా నీ స్థిరపరాక్రమంచేత అణచివేయబడిన వాళ్ళే కదా!

వ. 'ఇంత సంతాపింప నేల?' యనిన నాశకునికి దుర్యోధనుం డిట్లనియె. 94

తాత్పర్యం: 'ఇంతగా నీవు దుఃఖించట మెందుకు?' అని అనగానే ఆ శకునితో దుర్యోధనుడు ఇలా అన్నాడు.

దుర్యోధనుని దురాలోచనము (సం. 2-43-19)

ఉ. నీవును జూచి, తట్టిసభనేని వినంబడ దేయుగంబులన్;
భూవలయంబులో నది యపూర్వము సర్వమనోజ్ఞ మిష్ట భో
గావహ మేక్రియం బడసెనయ్యు? మహాత్ముఁడు దాన నేమి సం
భావితభాగ్యుఁ డయ్యెను బ్రభాకరతేజుఁడు ధర్మజుం డిలన్. 95

ప్రతిపదార్థం: నీవును= నీవుకూడ; చూచితి= చూచావు; అట్టి, సభన్+ఏని= అటువంటి సభనుగురించి ఏ మాత్రం; ఏ యుగంబులన్= ఏ యుగాల్లోకూడ; వినంబడదు= వినబడలేదు; భూవలయంబులోన్= భూమండలంలో; అది= ఆ మయసభ; అపూర్వము= ముందెన్నడూ లేనట్టిది; సర్వ, మనోజ్ఞము= అన్నివిధాల (అందరికీ) అందమైనట్టిది; ఇష్టభోగ+ఆవహము= కోరిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సుఖాలను కలగజేసేటటువంటిది; మహాత్ముఁడు= గొప్పవాడైన ధర్మరాజు; ఏ క్రియన్= ఏ విధంగా; పడసెన్+అయ్యా= పొందాడయ్యా! దానన్= ఆ సభచేత; ఏమి= ఎంతగొప్పగా; ప్రభాకర తేజుఁడు= సూర్యునితో సమానమైన కాంతికలవాడు; ధర్మజుండు= ధర్మరాజు; ఇలన్= భూమిమీద; సంభావిత భాగ్యుఁడు+అయ్యెను= గౌరవించబడిన వైభవం కలవాడయ్యాడు.

తాత్పర్యం: నీవుకూడ చూచావుకదా! ఏ యుగంలో కూడ అలాంటి సభ ఉన్నట్లే వినలేదు. భూమండలంలో అది అపూర్వం. అన్నివిధాల రమణీయం. కోరిన సుఖాలన్నీ ఇచ్చే ఆ సభను, ఆ మహాత్ముడు ధర్మరాజు ఏ విధంగా పొందాడోకదా! సూర్యతేజుడైన ధర్మరాజు దాన్ని పొంది ఈ లోకంలో ఎంత గౌరవం పొందిన భాగ్యం కలవాడయ్యాడు!

విశేషం: గుణం : అర్థవ్యక్తి. రాజసూయంలో ఆ మయసభావైభవం అన్నింటికంటె మిన్నగా దుర్యోధనుని కన్ను కుట్టింది. (ఈ సందర్భంలో అతని మనోవేదనను వ్యక్తంచేసిన పద్యాలను అర్థవ్యక్తి గుణరంజకంగా రచించటం గమనార్హం. -సంపా.)

చ. **కడు భయమంది వానికిఁ దగన్ మఱి వైశ్యులపోలె వశ్యులై**
పుడమి నతిప్రసిద్ధులగు భూపతులెల్ల మహాధనావళుల్
దడయక తెచ్చియిచ్చి కరదానము సేయుటఁ బార్థివత్వ మే
ర్పడియెఁ బృథాగ్రపుత్త్రునకుఁ; బాండవతేజము పర్వె నెల్లచోన్. **96**

ప్రతిపదార్థం: పుడమిన్= భూమిలో; అతిప్రసిద్ధులు+అగు= మిక్కిలిపేరు పొందిన; భూపతులు+ఎల్లన్= రాజులందరు; కడున్ భయము+అంది= మిక్కిలి భయాన్ని పొంది; వానికిన్= ఆ ధర్మరాజుకు; మఱి; వైశ్యులపోలెన్= వైశ్యులవలె; వశ్యులై= లొంగిపోయినవాళ్ళయి; మహాధన+ఆవళుల్= గొప్ప ధన సమూహాలను; తడయక= ఆలస్యంచెయ్యకుండా; తెచ్చియిచ్చి; కరదానము, చేయుటన్= కప్పం చెల్లించటంచేత; పృథ+అగ్ర, పుత్త్రునకున్= కుంతీదేవియొక్క పెద్దకుమారునికి; పార్థివత్వము= చక్రవర్తిత్వం; ఏర్పడియెన్= ఏర్పడింది; పాండవ, తేజము= పాండవులయొక్క పరాక్రమం; ఎల్లచోన్= అన్నిచోట్ల; పర్వెన్= వ్యాపించింది.

తాత్పర్యం: భూమిమీద ఎంతో పేరుపొందిన రాజులంతా చాలా భయపడి ధర్మరాజుకు వైశ్యుల్లా లొంగిపోయారు. విపరీత ధనసమూహాలు కప్పాలుగా తెచ్చి ఇచ్చారు. అందువల్ల ఆ కుంతీదేవి పెద్దకొడుకుకు చక్రవర్తిత్వం ఏర్పడింది. పాండవుల పరాక్రమం అన్నివైపులా వ్యాపించింది.

విశేషం: గుణం: అర్థవ్యక్తి. ఆ మయ సభావైభవం తరువాత, దుర్యోధనుని కన్నుకుట్టించినవి- వివిధ దేశాధీశ్వరులు ధర్మజునికి తెచ్చిఇచ్చిన ధనరాసులు; ఆయనచక్రవర్తిత్వం; పాండవుల పరాక్రమం. వైశ్యులు వాణిజ్య వ్యాపారాలు వృత్తిగా కలవారు. వాళ్ళు తమ ప్రయోజనాలు పూర్తిగా సాధించుకోటానికి అందరితో మంచిగా మెలగి, విశేషించి ప్రభువులకు వశవర్తులై ఉండక తప్పదు. అందుచేతనే 'వైశ్యులపోలె వశ్యులై' అనటం జరిగిందేమో?

ఉ. **యాదవుచేతిచక్రము భయంకరమై శిశుపాలమస్తక**
చ్ఛేదము సేసినం గడుఁ బ్రసిద్ధులు శూరులునైన రాజు ల
య్యాదవుముందటన్ జయ జయ ధ్వను లిచ్చిరి గాని, వాని శౌ
ర్యోదయవృత్తికట్టెదుర నోపర యెవ్వరు విక్రమింపఁగన్. **97**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: యాదవుచేతి, చక్రము= యదువంశంవాడైన శ్రీకృష్ణుని చేతిలోని చక్రాయుధం; భయంకరము+ఐ; శిశుపాల, మస్తకచ్ఛేదము, చేసినన్= శిశుపాలునియొక్క తలను నరుకగా; కడున్= మిక్కిలి; ప్రసిద్ధులు= పేరుపొందినవాళ్ళు; శూరులున్+ ఐన; రాజులు; ఆ+యాదవు, ముందటన్= ఆ శ్రీకృష్ణుని ఎదుట; జయ, జయ, ధ్వనులు, ఇచ్చిరి, కాని= 'జయ!జయ!' అని విజయ ప్రశంసలతో కూడిన కేకలు పెట్టారు కాని; వాని= ఆ శ్రీకృష్ణునియొక్క; శౌర్య+ఉదయ, వృత్తి, కట్టెదురన్= పరాక్రమ ప్రవర్తనముందు; ఎవ్వరున్= ఏ ఒక్కరుకూడ; విక్రమింపఁగన్= ఎదిరించటానికి; ఓపరు= చాలని వాళ్ళయ్యారు.

తాత్పర్యం: యాదవుడైన శ్రీకృష్ణుని చేతిచక్రం భయంకరమై శిశుపాలుని శిరస్సును ఛేదిస్తే- ఎంతో ప్రసిద్ధులు, వీరులు అయిన రాజులు- ఆ శ్రీకృష్ణుని ముందు జయ జయ శబ్దాలు చేశారు కాని, ఆతని ఆ వీరకృత్యాన్ని ఎదిరించటానికి ఏ ఒక్కరు సమర్థులు కాలేకపోయారు.

విశేషం: గుణం: అర్థవ్యక్తి. దుర్యోధనుడు ఒకటికి రెండుమార్లు యాదవపదాన్ని ప్రయోగించింది శ్రీకృష్ణుని కులాన్ని ఎత్తిచూపటానికే.

చ. **అతుల పరాక్రమార్జితములైన ధనంబులపేర్మిఁ జేసి యు**
న్నతమగు చున్న పాండునరనాథ తనూజుల లక్ష్మి నా కస
మ్మతమయి సూ వెలింగె విను మాతుల! మానధనాఢ్యుఁ డైన భూ
పతి సహియింపనోపునె సపత్నులవృద్ధియు నాత్మహానియున్. **98**

ప్రతిపదార్థం: అతుల, పరాక్రమ+ఆర్జితములు+ఐన= సాటిలేని పరాక్రమంచేత సంపాదించబడినవైన; ధనంబుల, పేర్మిన్+చేసి= సంపదల అతిశయంతో; ఉన్నతము+అగుచున్+ఉన్న= ఎక్కువ అవుతున్న; పాండు, నరనాథ, తనూజుల, లక్ష్మి= పాండురాజుకుమారులయొక్క ఐశ్వర్యం; నాకున్; అసమ్మతము+ఐ= సహించరానిదై; వెలింగెన్, సూ= ప్రకాశించిందిసుమా; మాతుల= ఓ మేనమామా!; విను; మాన, ధన+ఆఢ్యుఁడు+ఐన= అభిమాన మనే ధనంతో కూడుకొనినవాడైన; భూపతి= రాజు; సపత్నుల, వృద్ధియున్= దాయాదులయొక్క అభివృద్ధిని; ఆత్మ, హానియున్= తనయొక్క తగ్గుదలను; సహింపన్+ ఓపునే= ఓర్చుకొనగలడా!

తాత్పర్యం: సాటిలేని పరాక్రమంతో సంపాదించిన గొప్ప సంపదలతో అంతకంతకు అధికమౌతున్న పాండవుల ఐశ్వర్యం. నాకు సహించరానిదై ప్రకాశించింది సుమా! ఓ మేనమామా! శకునీ! విను. అభిమానధనుడైన రాజు దాయాదుల అభివృద్ధిని, తన తగ్గుదలను సహించగలడా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ఇది దుర్యోధనుని ఈర్ష్యకు అద్దం పట్టే పద్యం. గుణం: అర్థవ్యక్తి.

వ. **'ఏమి సేయుదము? పాండవుల లక్ష్మి యెవ్విధంబున మన కపహరించి కొననగు?' ననిన దుర్యోధనునకు**
శకుని యి ట్లనియె. **99**

ప్రతిపదార్థం: ఏమి, చేయుదము; పాండవుల లక్ష్మి= పాండవులయొక్క సంపద; ఏ, విధమునన్; మనకున్; అపహరించికొనన్= దోచుకోవటానికి; అగున్= సాధ్యమవుతుంది; అనిన; దుర్యోధనునకున్; శకుని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఏం చేద్దాం? పాండవుల సంపదను ఏ విధంగా దోచుకోటానికి సాధ్య మౌతుందో చెప్పు' అని దుర్యోధను డనగా- శకుని ఈ విధంగా అన్నాడు.

క. దీనికి ధృతరాష్ట్రునను । జ్ఞానము వడయుడును మనకు సమకూరు ధరి
త్రీనాథ! భవదభిప్రా । యానుగుణైశ్వర్య మతిశయంబుగఁ బ్రీతిన్. 100

ప్రతిపదార్థం: ధరిత్రీనాథ= భూపతీ! ఓదుర్యోధనా మహారాజా!; దీనికిన్= పాండవుల సంపదను దోచుకొనే ఈ పనికి; ధృతరాష్ట్ర+అనుజ్ఞానము= ధృతరాష్ట్రునియొక్క అనుమతిని; పడయుడును= పొందితే; భవత్+అభిప్రాయ+అనుగుణ+ఐశ్వర్యము= నీ ఉద్దేశానికి తగిన సంపద; అతిశయంబుగన్= గొప్పగా; ప్రీతిన్= ఇష్టంతో; మనకున్; సమకూరున్.

తాత్పర్యం: ఓ దుర్యోధన మహారాజా! పాండవుల సంపదను అపహరించేపనికి ధృతరాష్ట్రుని అనుమతి పొందితే, నీ ఉద్దేశానికి తగిన ఐశ్వర్యం ప్రియమార మనకు సమకూరుతుంది.

వ. అని యప్పుడ శకుని దుర్యోధనుం దోడ్కొని ధృతరాష్ట్రునొద్దకుం జని యాతని శరీరకార్శ్య వైవర్ణ్యంబులు సెప్పిన విని యదరిపడి ధృతరాష్ట్రుండు కొడుకు నొడలంటి చూచి కడు దుఃఖితుండయి యి ట్లనియె. 101

ప్రతిపదార్థం: అని; అప్పుడు; శకుని; దుర్యోధనున్; తోడ్కొని= వెంటపెట్టుకొని; ధృతరాష్ట్ర+ఒద్దకున్= ధృతరాష్ట్రుని దగ్గరకు; చని= వెళ్ళి; ఆతని= ఆ దుర్యోధనునియొక్క; శరీ, కార్శ్య, వైవర్ణ్యంబులు= శరీరం కృశించటాన్ని, కళావిహీనమవటాన్ని; చెప్పిన; విని; అదిరిపడి; ధృతరాష్ట్రుండు; కొడుకు; ఒడలు= దేహాన్ని అంటి, చూచి= తడవిచూచి; కడున్, దుఃఖితుండు+అయి= మిక్కిలి దుఃఖించినవాడయి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని శకుని, అప్పుడు దుర్యోధనుణ్ణి వెంట బెట్టుకొని ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళాడు. అతని శరీరం కృశించటాన్ని, కళావిహీన మవటాన్ని చెప్పాడు. అది విని ధృతరాష్ట్రుడు అదిరిపడ్డాడు. కుమారుని శరీరాన్ని తడవి చూచి అమితంగా దుఃఖిస్తూ ఇలా అన్నాడు.

సీ. కౌరవైశ్వర్యంబు గౌరవంబున సమ । ర్పితమయ్యె నీయంద పేర్మితోడ;
ననుజులు మిత్రులు ననుచరులును నీకుఁ । బ్రీతుల కాని యప్రియులు లేరు;
వివిధోపభోగముల్ దివిజేశునకుఁ గల । యట్టుల కలవు నీ కనుభవింప;
సకలభూపతులుఁ బాయక భక్తియుక్తులై । యొలసి నీ పనుపు సేయుదురు; పేర్మి

ఆ. నేమి గొఱఁతయయ్యె? నిట్లు డయ్యును దను । చ్ఛాయ దఱిఁగి యుండ సకలధరణి
రాజ్యభోగ సుఖ పరాఙ్ముఖత్వముఁ బొంద । నేల నీకుఁ గురుకులేశ్వరుండ! 102

ప్రతిపదార్థం: కురుకుల+ఈశ్వరుండ= కురువంశరాజా! ఓ దుర్యోధనా!; కౌరవ+ఐశ్వర్యంబు= కౌరవులసంపద; గౌరవంబునన్= గొప్పగా; నీయందు+అ= నీకే; పేర్మితోడన్= ఎక్కువగా; సమర్పితము+అయ్యెన్= ఈయబడింది; అనుజులు= తమ్ములు; మిత్రులున్= స్నేహితులును; అనుచరులును= సేవకులును; నీకున్; ప్రీతులకాని= ఇష్టమైనవాళ్ళేకాని; అప్రియులు= ఇష్టంకానివాళ్ళు; లేరు; వివిధ+ఉపభోగముల్= అనేకవిధాలైన సుఖభోగాలు; దివిజ+ఈశునకున్= దేవేంద్రునికి; కల, అట్టుల= ఉన్నట్లు; నీకున్; అనుభవింపన్; కలవు; సకల, భూపతులున్= అందరు రాజులు; పాయక= ఎడతెగక; భక్తియుక్తులు+ఐ= భక్తితో కూడినవాళ్ళయి; ఒలసి= చుట్టుకొని; నీ, పనుపు= నీ ఆజ్ఞను; చేయుదురు; పేర్మిన్= గొప్పతనంలో; ఏమి; కొఱత+అయ్యెన్= లోటు కలిగింది; ఇట్లు= ఈ విధంగా; డయ్యును= కృశించటం; తనుచ్ఛాయ= దేహకాంతి; తఱిఁగి= తక్కువై; ఉండన్= ఉండటం; సకల,

ధరణి, రాజ్య, భోగ, సుఖ, పరాఙ్ముఖత్వమున్= సమస్తరాజ్య భోగసుఖాలలో విరక్తిని; పొందన్= పొందటం; నీకున్; ఏల= ఎందులకు?

తాత్పర్యం: దుర్యోధనా! కౌరవసంపద నీకే ఎక్కువగా ఇవ్వబడింది. తమ్ములు, స్నేహితులు, సేవకులు, నీకు ఇష్టమైన వాళ్ళే కాని, ఇష్టం కానివాళ్ళు లేరు. అనేక విధాలైన సుఖభోగాలు దేవేంద్రునికి ఉన్నట్లు అనుభవించటానికి నీకూ ఉన్నాయి. అందరు రాజులు ఎడతెగని భక్తితో నీచుట్టూ చేరి గౌరవంతో నీ ఆజ్ఞ పాలిస్తారు. గొప్పతనంలో నీ కేమి కొరత? ఈ విధంగా నీవు కృశించటం, వెలవెలబోవటం. రాజ్యభోగాల్లో, సుఖాల్లో విరక్తిచెందటం ఎందుకు?

వ. అనిన విని ధృతరాష్ట్రునకు దుర్యోధనుం డి ట్లనియె. 103

తాత్పర్యం: అనగా విని దుర్యోధనుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

క. పాండవుల విభవ మది యా । ఖండలు విభవంబుకంటెఁ గడుమిక్కిలియై
యొండొండ పెరిఁగి దిక్కులు । నిండెఁ దదీయ ప్రతాప నిర్మల రుచితోన్. 104

ప్రతిపదార్థం: పాండవుల, విభవము= పాండవులయొక్కఐశ్వర్యం; అది; ఆఖండలు, విభవంబుకంటెన్= దేవేంద్రుడియొక్క ఐశ్వర్యంకంటె; కడున్, మిక్కిలి+ఐ= ఎంతో ఎక్కువై; ఒండు+ఒండ, పెరిఁగి= అంతకంతకు పెరిగి; తదీయ, ప్రతాప, నిర్మల, రుచితోన్= వారి పరాక్రమంయొక్క స్వచ్ఛకాంతులతో; దిక్కులు; నిండెన్.

తాత్పర్యం: పాండవుల ఐశ్వర్యం- దేవేంద్రుని ఐశ్వర్యంకంటె ఎంతో ఎక్కువై- అంతకంతకు పెరిగి, స్వచ్ఛమైన వాళ్ళ పరాక్రమకాంతులతో అన్ని దిక్కులా నిండింది.

విశేషం: అలం: సహోక్తి.

క. సామాన్యమె యుత్తర కురు । భూములు మొదలుగ సమస్తభూములు విజయ
శ్రీమహిమను సాధించెఁ ద్రి । ధామపరాక్రముఁడు శక్రతనయుఁడు బలిమిన్. 105

ప్రతిపదార్థం: త్రిధామ పరాక్రముఁడు= విష్ణుమూర్తితో సమానమైన పరాక్రమం కలవాడు; శక్రతనయుఁడు= దేవేంద్రుని కుమారుడు - అర్జునుడు; బలిమిన్= బలంతో; ఉత్తర కురు భూములు మొదలుగ; సమస్త, భూములు= అన్నిదేశాలు; విజయశ్రీ, మహిమను= విజయలక్ష్మి ప్రభావంచేత; సాధించెన్= జయించాడు; సామాన్యమె= ఇది సామాన్యమైన విషయమా? (కాదని భావం).

తాత్పర్యం: విష్ణుమూర్తితో సమానమైన పరాక్రమం గల అర్జునుడు తన బలంతో ఉత్తర కురుభూములు మొదలుగా సమస్తదేశాలను జయించాడు. ఇది సామాన్యమైన విషయమా?

తే. సఖ్యసంబంధములఁ జేసి చక్రధరుఁడు । ద్రుపదుఁడును దక్కఁ దక్కిన నృపతులెల్ల
నరియుఁ బెట్టనివారు లే రఖిల జలధి । వలయిత క్షోణిలోఁ బాండవులకుఁ బ్రీతి. 106

ప్రతిపదార్థం: సఖ్య, సంబంధములన్+చేసి= స్నేహంతో, బంధుత్వంతో; చక్రధరుఁడు= చక్రాన్ని ధరించినవాడు - శ్రీకృష్ణుడు; ద్రుపదుడును; తక్కన్= తప్ప; అఖిల, జలధి, వలయిత, క్షోణిలోన్= అన్ని సముద్రాలచేత చుట్టబడి ఉండే భూమిలో; తక్కిన; నృపతులు+ఎల్లన్= రాజులందరు; ప్రీతిన్= ప్రీతితో; పాండవులకున్; అరియున్= కప్పమును; పెట్టనివారు= చెల్లించనివాళ్ళు; లేరు.

తాత్పర్యం: స్నేహంతో, బంధుత్వంతో శ్రీకృష్ణుడు, ద్రుపదుడు తప్ప, ఈ సమస్త భూమండలంలో పాండవులకు ప్రీతిగా కప్పంకట్టని రాజులే లేరు.

తే. **శైల కానన ద్వీప విశాల మయిన। వసుమతీ చక్రమంతయు వారి వశము;**
యేను నొకరాజసుతుఁడనై యెట్లు దీనిఁ। జూడ నోపుదుఁ బ్రాభవశూన్యునట్లు. 107

ప్రతిపదార్థం: శైల, కానన, ద్వీప, విశాలము+అయిన= కొండలతో, అడవులతో, ద్వీపాలతో విశాలమైన; వసుమతీచక్రము+అంతయున్= భూమండలమంతా; వారి, వశము+అ= పాండవుల అధీనమే; ఏనున్= నేను; ఒక; రాజసుతుఁడను+ఐ= రాజకుమారుడినై ఉండి; ప్రాభవ, శూన్య+అట్లు= ప్రభుత్వంలేనివాడివలె; ఎట్లు= ఏ విధంగా; దీనిన్= ఈ స్థితిని; చూడన్+ఓపుదున్= చూడగలను?

తాత్పర్యం: కొండలతో, అడవులతో, ద్వీపాలతో విశాలమైన భూమండలమంతా పాండవుల అధీనమై ఉండగా, నేనొక రాజకుమారుడినై అధికారం లేని దీనుడిలా దీన్ని ఎలా చూడగలను.

తే. **నన్ను రత్నపరిగ్రహణంబునందుఁ। బాండవుండు నియోగించెఁ బార్థివేంద్ర!**
సర్వరత్నాకరైక ప్రశస్త రత్న। పుంజముల కాస్పదము ధర్మపుత్త్రుగృహము. 108

ప్రతిపదార్థం: పార్థివ+ఇంద్ర= ధృతరాష్ట్రమహారాజా!; పాండవుండు= ధర్మరాజు; నన్నున్; రత్న, పరిగ్రహణంబు+అందున్= రత్నాలు అందుకొనటంలో; నియోగించెన్= నియమించాడు; ధర్మపుత్త్రు, గృహము= ధర్మరాజుయొక్కఇల్లు; సర్వ, రత్న+ఆకర+ఏక, ప్రశస్త, రత్న, పుంజములకున్= అన్ని సముద్రాల్లోని మిక్కిలి శ్రేష్ఠమైన రత్న సమూహాలకు; ఆస్పదము= ఉనికిపట్టు.

తాత్పర్యం: ధృతరాష్ట్రమహారాజా! ధర్మరాజు నన్ను అందరూ కానుకలుగా తెచ్చి ఇచ్చిన రత్నాలు అందుకోటానికి నియమించాడు. ఆ ధర్మజుని ఇల్లు అన్ని సముద్రాల్లోని శ్రేష్ఠరత్నాలకు నిలయం.

విశేషం: రత్నాకరము-రత్నాలకు నిలయమైనది సముద్రం.

తే. **యజ్ఞదీక్షితుఁ డయిన ధర్మాత్మజునకు। గౌడకాంభోజపతు లనేక ప్రకార**
వర్ణకంబళములు శుకవర్ణవాహ। నివహములుఁ దెచ్చియిచ్చిరి నెమ్మితోడ. 109

ప్రతిపదార్థం: యజ్ఞ దీక్షితుఁడు+అయిన= యజ్ఞదీక్ష వహించిన వాడైన; ధర్మ+ఆత్మజునకున్= ధర్మునియొక్క కుమారుడైన ధర్మరాజుకు; నెమ్మితోడన్= ప్రేమతో; గౌడ, కాంభోజపతులు= గౌడ కాంభోజ దేశ రాజులు; అనేక, ప్రకార, వర్ణ, కంబళములు= అనేక విధాలైన రంగులు గల కంబళ్ళును; 'శుక', వర్ణ, వాహ, నివహములున్= చిలుకవన్నె గల గుర్రాల సమూహాలును; తెచ్చి; ఇచ్చిరి.

తాత్పర్యం: యజ్ఞదీక్ష వహించిన ధర్మరాజుకు-గౌడ, కాంభోజ దేశాధీశులు రకరకాల రంగుల కంబళ్ళను, చిలుకవన్నె గుర్రాల సమూహాలను తెచ్చి ఇచ్చారు.

ఉ. **సాగరసారవారిరుహ శౌక్తిక మౌక్తిక విద్రుమద్రుమై**
లాగురు చందనంబులు ప్రియంబున నిచ్చిరి తెచ్చి యున్నత
శ్రీగుణయుక్తిమైఁ బరఁగు సింహళకేరళచోళపాండ్యదే
శాగతరాజపుత్త్రులు మహాగుణశాలి కజాతవైరికిన్. **110**

ప్రతిపదార్థం: ఉన్నత, శ్రీ, గుణ, యుక్తిమైన్= గొప్ప ఐశ్వర్యంతో, సుగుణాల కూడికతో; పరఁగు= ఒప్పే; సింహళ, కేరళ, చోళ, పాండ్య, దేశ+ఆగత, రాజ, పుత్త్రులు= సింహళ, కేరళ, చోళ, పాండ్య దేశాలనుండి వచ్చిన రాజకుమారులు; మహాగుణశాలికిన్= గొప్పగుణాలు కలవానికి; అజాతవైరికిన్= పుట్టని శత్రువులు గలవానికి- అంటే ధర్మరాజుకు; సాగర, సార, వారిరుహ, శౌక్తిక, మౌక్తిక, విద్రుమ, ద్రుమ+ఏలా+అగురు, చందనంబులు= సముద్రపునీటినుండి పుట్టిన ముత్యపుచిప్పల్లోని మంచిముత్యాలను, పగడపు చెట్లను, ఏలకులను, అగురు చెక్కలను, గంధపు చెక్కలను; ప్రియంబునన్= ప్రీతితో; తెచ్చి; ఇచ్చిరి.

తాత్పర్యం: గొప్ప ఐశ్వర్యం, గుణాలు ఉన్న సింహళ కేరళ చోళ పాండ్య దేశరాజులు- మహాగుణవంతుడు, అజాతశత్రుడు అయిన ధర్మరాజుకు- మంచి ముత్యాలను, పగడపు చెట్లను, ఏలకులను, అగరుచెక్కలను, గంధపుచెక్కలను ప్రీతితో తెచ్చి ఇచ్చారు.

విశేషం: అలం: ఉదాత్తం. నన్నయ అక్షర రమ్యమైన శైలికి ప్రసాదగుణరచనకు ఈ పద్యమొక చక్కని ఉదాహరణ. 'సాగరసార .... ప్రియంబున నిచ్చిరి తెచ్చి' అనే సుదీర్ఘ సమాసాన్ని చదివినంతనే, అర్థం వివరంగా తెలియకున్నా, ఏవో గొప్ప గొప్ప వస్తువులను విస్తారంగా తెచ్చియిచ్చారనే భావం మాత్రం పాఠకునికి స్ఫురిస్తుంది. పాశ్చాత్య సాహిత్య విమర్శకులు దీనినే **Sound Echoing the Sense** అంటారు.

ఉ. **మందిత సూర్యరశ్మి రుచిమన్మణిహారచయంబుతోఁ గట**
స్యంది సుగంధిదాన జల సంపద నొప్పెడు వాని దేవకీ
నందనుఁ డిచ్చెఁ బ్రీతిఁ బదునాలుగువేలుగజంబులన్ జనా
నందనకీర్తియైన యమనాథతనూజున కిష్టమిత్త్రుఁడై. **111**

ప్రతిపదార్థం: దేవకీనందనుఁడు= దేవకీదేవి కుమారు డైన శ్రీకృష్ణుడు; జన+ఆనందన, కీర్తి+ఐన= జనులకు ఆనందాన్ని కలిగించే కీర్తి కలవాడైన; యమనాథ, తనూజునకున్= యమధర్మరాజు కుమారుడైన ధర్మరాజుకు; ఇష్ట, మిత్త్రుఁడు+ఐ= ప్రియమైన స్నేహితుడై; మందిత, సూర్యరశ్మి, రుచిమత్+మణిహార, చయంబుతోన్= సూర్యకాంతినే వెలవెలపోయేటట్లు చేసే కాంతి ఉన్న మణిహార సమూహాలతో; కట, స్యంది, సుగంధి, దానజల, సంపదన్= చెక్కిళ్ళనుండి జాలువారుతున్న పరిమళ మదజలంయొక్క అతిశయంతో, ఒప్పెడు, వానిన్; పదునాలుగువేలు; గజంబులన్= ఏనుగులను; ప్రీతిన్= ప్రేమతో; ఇచ్చెన్.

తాత్పర్యం: దేవకీదేవి కుమారుడైన శ్రీకృష్ణుడు, యమధర్మరాజు కుమారుడైన ధర్మరాజుకు ప్రియమిత్రుడై - సూర్యరశ్మినే వెలవెల పోయేటట్లు చేసేకాంతిఉన్న మణిహార సమూహాలతో, చెక్కిళ్ళనుండి మిక్కిలిగా జాలువారుతున్న పరిమళ మదజలంతో ఒప్పే పదునాలుగు వేల ఏనుగులను ప్రియమార ఇచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ పద్యంకూడ అక్షరరమ్యమైన నన్నయ ఉదాత్త మనోహర శైలికి ప్రసాద గుణ రచనకు ఒక చక్కని ఉదాహరణ. అలం. ఉదాత్తం.

క. **హరియును గిరీటియును నొం । డొరుల కభీష్టములు సలుపుచుండుదు రంద**
యిరువురు నేకాత్ములు జన । శరణ్యు లుత్తములు నిత్యసాంగత్యమునన్. 112

ప్రతిపదార్థం: అందున్= అక్కడ - ఇంద్రప్రస్థంలో; హరియును= శ్రీకృష్ణుడును; కిరీటియును= అర్జునుడును; ఒండొరులకున్= ఒకరికొకరు; అభీష్టములు= ప్రియములు; సలుపుచున్+ఉండుదురు= చేస్తూ ఉన్నారు; ఆ+ఇరువురు= ఆ కృష్ణార్జును లిద్దరు; నిత్య, సాంగత్యమునన్= ఎడతెగని కలయికచేత; ఏక+ఆత్ములు= ఒకే మనస్సు కలిగిన వాళ్ళు; జన, శరణ్యులు= జనులకు శరణు పొందదగినవాళ్ళు; ఉత్తములు= శ్రేష్ఠులు.

తాత్పర్యం: ఒకే మనస్సు కలవాళ్ళు, జనులంతా శరణు వేడదగిన వాళ్ళు, ఉత్తములు - అయిన కృష్ణార్జునులు రాజసూయంలో ఒకరికొకరు ఇష్టమైన పనులు చేస్తూ అగుపించారు.

వ. **మఱియు నయ్యుధిష్ఠిరున కనురక్తుండయి విరాటుండు రెండువేలు గజంబుల నిచ్చె; ద్రుపదుండు వేయి గజంబులను బదివేలు హయంబులను బదునాలుగువేలు విలాసినీజనంబులం బదివేలు దాసీ గృహస్థుల నిచ్చెఁ; గురు కుకురోలూక కేకయ కాశ్మీర కాంభోజ గాంధార మద్ర ద్రవిడ మగధ మాళవ కళింగాంగ వంగ బంగాళగౌడాంధ్రకేరళకోసలాది మహీపతులునుం బ్రాగ్జ్యోతిషంబున భగదత్తుండును మరుకచ్ఛనివాసులును జేదిపతులును నాజానేయ బాహ్లిక హూణ పారసీయ దేశంబులం గల హయంబులం బర్వతనిభంబులైన యిభంబులను దివ్యాంబరాభరణ భూషితంబులయిన యోషిత్సహస్రంబులను నపరిమితంబులయిన యజావి గో మహిషంబులను హిరణ్య రత్నరజత కంబళాంబరాదుల నిచ్చిరి; మఱియు మేరుమందరమధ్య కీచక వనవాసులయిన గుళింద పారద బర్బర తురుష్క టెంకణ కోంకణాధిపతులును వశగతులై హిమశైల రామశైల కురుదేశంబులైన కౌసుమ క్షౌద్ర పాత్రంబులను దివ్యౌషధంబులను నింద్ర నీలేంద్ర గోప పిక చంద్ర మయూర కీర వర్ణ తురంగంబులను సౌవర్ణ కీటజ పట్టజాండజ శయ్యలను నిశిత దీర్ఘ నిస్త్రింశంబులను మణి కాంచన ఖచిత గజ దంతమయ శిబికాసనంబులను నిచ్చిరి; వాసవ సఖుండయిన గంధర్వపతి చిత్రరథుం డనువాఁడు నన్నూఱు గంధర్వ హయంబుల నిచ్చెఁ; దుంబురుండను గంధర్వుండు నూఱు హయంబుల నిచ్చె. 113**

ప్రతిపదార్థం: మఱియున్; ఆ+యుధిష్ఠిరునకున్= ఆ ధర్మరాజుకు; అనురక్తుండు+అయి= ప్రేమకలవాడై; విరాటుండు; రెండువేలు; గజంబులన్= ఏనుగులను; ఇచ్చెన్; ద్రుపదుండు; వేయి; గజంబులన్= ఏనుగులను; ఇచ్చెన్; పదివేలు; హయంబులను= గుర్రాలను; పదునాలుగువేలు; విలాసినీజనంబులన్= వేశ్యలను; పదివేలు; దాసీ, గృహస్థులన్= దాసీకుటుంబాలవాళ్ళను; ఇచ్చెన్; కురు, కుకుర+ఉలూక, కేకయ, కాశ్మీర, కాంభోజ, గాంధార, మద్ర, ద్రవిడ, మగధ, మాళవ, కళింగ+అంగ, వంగ, బంగాళ, గౌడ+ఆంధ్ర, కేరళ, కోసల+ఆది, మహీపతులునున్= కురు, కుకుర, ఉలూక, ఆది, రాజులును; ప్రాక్+జ్యోతిషంబునన్= ప్రాగ్జ్యోతిషమనే దేశంలో; భగదత్తుండును; మరుకచ్ఛనివాసులును= మరుకచ్ఛ ప్రదేశంలో నివసించేవాళ్ళూ; చేది పతులునున్= చేదిదేశరాజులూ; ఆజానేయ, బాహ్లిక, హూణ, పారసీయ, దేశంబులన్= ఆయాదేశాలలో; కల= ఉన్న; హయంబులన్= గుర్రాలను; పర్వత నిభంబులు+ఐన= పర్వతంతో సమానాలైన; ఇభంబులను=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏనుగులను; దివ్య+అంబర+ఆభరణ, భూషితంబులు+అయిన= మంచి వస్త్రాలతో, సొమ్ములతో అలంకరించబడిన; యోషిత్‌సహస్రంబులనున్= వేలకొలది స్త్రీలను; అపరిమితంబులు+ఐన= లెక్కకు మిక్కిలి అయిన; అజ+అవి, గో, మహిషంబులను= మేకలను, గొఱ్ఱెలను, ఆవులను, బఱ్ఱెలను; హిరణ్య, రత్న, రజత, కంబళ+అంబర+ ఆదులన్= బంగారు, రత్నాలు, వెండి, కంబళ్ళు, వస్త్రాలు మొదలయిన వాటిని; ఇచ్చిరి; మఱియు; మేరు, మందర, మధ్య, కీచక, వన, వాసులు+అయిన= మేరు పర్వతానికి, మందరపర్వతానికి మధ్యనఉండే సన్నవెదుళ్ళ అడవులలో నివసించే వాళ్ళైన గుళింద, పారద, బర్బర, తురుష్క, టెంకణ, కోంకణ+అధిపతులును= ఆయాదేశాలరాజులును; వశగతులై= లొంగిపోయినవాళ్ళయి; హిమశైల, రామశైల, కురుదేశంబులు+ఐన= ఆయా దేశాలలోని; కౌసుమ, క్షౌద్ర, పాత్రంబులను= పూలసంబంధమైన తేనెతో కూడిన పాత్రలను; దివ్య+ఔషధంబులను= మంచి మందులను; ఇంద్రనీల+ఇంద్రగోప, పిక, చంద్ర, మయూర, కీర, వర్ణ, తురంగంబులను= ఇంద్రనీలమణి, ఆరుద్రపురుగు, కోకిల, చంద్రుడు, నెమలి, చిలుక రంగులు కల గుఱ్ఱాలను; సౌవర్ణ, కీటజ, పట్టజ+అండజ, శయ్యలను= బంగారు మయములై, పురుగునుండి పుట్టిన - అంటే పట్టు పురుగుల వంటి పురుగులనుండి పుట్టిన మెత్తని పదార్థంతో; చెట్ల బెరడులనుండి పుట్టిన మెత్తని పదార్థంతో, గుడ్డునుండి పుట్టిన పక్షుల ఈకలవంటి మెత్తని పదార్థంతో రూపొందించిన పరుపులను; నిశిత, దీర్ఘ, నిస్త్రింశంబులను= వాడియై, పొడవైన ఖడ్గాలను; మణి, కాంచన, ఖచిత, గజ, దంతమయ, శిబికా+ఆసనంబులను= మణులు బంగారు పొదుగబడిన ఏనుగు దంతాలతో రూపొందించబడిన పల్లకీలను, పీఠాలను; ఇచ్చిరి; వాసవసఖుండు+అయిన, గంధర్వపతి= దేవేంద్రుని స్నేహితుడైన గంధర్వరాజు; చిత్రరథుండు+అనువాఁడు; నన్నూఱు(నాలుగు+నూఱు), గంధర్వ, హయంబులన్= నాలుగు వందల గంధర్వజాతి గుఱ్ఱాలను; ఇచ్చెన్; తుంబురుండు+అను; గంధర్వుండు; నూఱు, హయంబులన్; ఇచ్చెన్.

తాత్పర్యం: అంతేకాక ఆ ధర్మరాజుపట్ల ప్రేమ కలవాడై విరాటుడు రెండువేల ఏనుగులను ఇచ్చాడు. ద్రుపదుడు వెయ్యి ఏనుగులను, పదివేల గుఱ్ఱాలను, పద్నాలుగువేలమంది వేశ్యలను, పదివేల దాసీకుటుంబాలవాళ్ళను ఇచ్చాడు. కురు, కుకుర ఉలూకాది దేశ ప్రభువులు, ప్రాగ్జ్యోతిష దేశాధిపతి భగదత్తుడు, మరుకచ్ఛ నివాసులు, చేది దేశరాజులు పేరుపొందిన ఆజానేయ బాహ్లిక హూణ పారసీక దేశాల గుఱ్ఱాలను, కొండలతో సమానాలైన మదపుటేనుగులను, మంచి వస్త్రాలతో, సొమ్ములతో అలంకరించబడిన వేలకొలది స్త్రీలను, లెక్కకు మిక్కిలిగా మేకలను, గొఱ్ఱెలను, ఆవులను, బఱ్ఱెలను, బంగారు, రత్నాలు, వెండి, కంబళ్ళు, వస్త్రాలు మొదలయిన వాటిని ఇచ్చారు. అంతేగాక మేరు మందర పర్వతాల మధ్య ఉండే సన్నవెదుళ్ళ అడవుల్లో నివసించే గుళింద, పారద, బర్బర, తురుష్క, టెంకణ, కోంకణ దేశప్రభువులు లొంగిపోయినవాళ్ళయి హిమశైల, రామశైల, కురుదేశాల్లోని పూలతేనెతో కూడిన పాత్రలను, మంచి మందులను, ఇంద్రనీలమణి, ఆరుద్రపురుగు, కోకిల, చంద్రుడు, నెమలి, చిలుక రంగులు గల గుఱ్ఱాలను, బంగారు మయాలై పట్టుపురుగువంటి పురుగులనుండి పుట్టిన పట్టు వంటి మెత్తని పదార్థంతో, చెట్లబెరడులనుండి పుట్టిన మెత్తని పదార్థంతో, గ్రుడ్డునుండి పుట్టిన పక్షుల ఈకలవంటి మెత్తని పదార్థంతో రూపొందించిన పాన్పులను, వాడిగల, పొడవైన ఖడ్గాలను, మణులు బంగారు పొదుగబడిన ఏనుగుదంతాలతో రూపొందించిన పల్లకీలను, పీఠాలను ఇచ్చారు. దేవేంద్రుడి స్నేహితుడైన గంధర్వరాజు చిత్రరథుడు నాలుగు వందల గంధర్వజాతి గుఱ్ఱాలను ఇచ్చాడు. తుంబురుడనే గంధర్వుడు వంద గుఱ్ఱాలను ఇచ్చాడు.

విశేషం: బహుశః లోకంలో దుర్యోధనుని వంటి ఈర్ష్యాగ్రస్తులే దాయాదుల ఐశ్వర్యాన్ని ఇంతగా లెక్కించి గుర్తుంచుకోగలరేమో! దేశాల పేర్ల విషయంలో కొన్ని ప్రతుల్లో భేదాలున్నాయి. ఆంధ్ర కేరళ తురుష్కరాజులు ఆకాలంలో ఉన్నారా? ఇవి నన్నయ చేర్చినవే. మూలంలో లేవు. (ధర్మరాజుకు కానుకలుగా వచ్చిన ఈ వివరాలను రాజసూయం జరిగిన ఘట్టంలో వివరించకుండా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుర్యోధనుడు ధృతరాష్ట్రునికి నివేదించటంలో కథాకథన శిల్పం ఉంది. అప్పుడు చెప్పినట్లైతే ఈ వివరాలు కథలో మునిగిపోయేవి. ఇప్పుడు చెప్పటంవల్ల దుర్యోధనుని అసూయకు గల బలమైన హేతువును చెప్పినట్లయింది. ధర్మరాజు కావాలని దుర్యోధనునికి బహుమతులను స్వీకరించే బాధ్యత ఎందుకు ఇచ్చాడో తేటతెల్లమయింది. ఆత్మీయుడైతే దుర్యోధనుడు ఆ సంపదను చూచి హర్షించేవాడు. దాయాది, అసూయాగ్రస్తుడు కావటంచేత భరించలేకపోతున్నాడు. ఈ వివరాలవల్ల పాండవుల ఔన్నత్యం, దుర్యోధనుని దుష్టత్వం ధ్వనిస్తున్నాయి. మరొక విశేషం - ధర్మరాజు మాయాద్యూతంలో సంపదలను కోల్పోయినప్పుడు ఈ వివరాలు ఇవ్వవలసిన అవసరంకూడా తప్పింది. ఇదంతా నన్నయ కథను చెప్పటంలో సాధించిన అర్థసంయోజనం. -సంపా.)

ఉ. భావిపురాతనాద్యతనపార్థివలక్ష్ములు పాండవేయు ల
క్ష్మీ విభవంబుతోడ నుపమింప సమంబులు గా వశేష రా
జావళిలోన నత్యధికులైన సపత్నులపేర్మిఁ జూచి యేఁ
జూవె సహింపనోపక కృశుండ వివర్ణుఁడ నైతి నెంతయున్. 114

ప్రతిపదార్థం: భావి, పురాతన+అద్యతన, పార్థివ, లక్ష్ములు= రాబోయే కాలంలోని, గతించిన కాలంలోని, వర్తమాన కాలంలోని రాజులయొక్క ఐశ్వర్యాలు; పాండవేయు, లక్ష్మీ, విభవంబుతోడన్= ధర్మరాజు ఐశ్వర్యంయొక్క గొప్పతనంతో; ఉపమింపన్= పోల్చటానికి; సమంబులు= సమానాలు; కావు, అశేష, రాజ+ఆవళిలోనన్= అందరు రాజులయొక్క సమూహంలో; అతి+అధికులు+ ఐన= మిక్కిలి గొప్పవాళ్ళయిన; సపత్నుల పేర్మిన్= దాయాదులయొక్క ఆధిక్యాన్ని; చూచి; ఏన్= నేను; చూవె= చూడుమా (సుమా) సహింపన్+ఓపక= ఓర్వలేక; ఎంతయున్= మిక్కిలి; కృశుండన్= చిక్కిపోయినవాణ్ణి; వివర్ణుఁడన్= కళావిహీనమైనవాణ్ణి; అయితిన్= అయ్యాను.

తాత్పర్యం: భూత భవిష్య ద్వర్తమానాల్లోని రాజుల ఐశ్వర్యా లేవీ ధర్మరాజు ఐశ్వర్యాతిశయంతో పోల్చటానికి సమానాలు కావు. సకలరాజసమూహంలో మిక్కిలి గొప్పవాళ్ళయిన దాయాదుల అతిశయం చూచి ఓర్వలేక నే నెంత కృశించానో, ఎంత కళావిహీనుణ్ణి అయ్యానో చూడు.

విశేషం: ఇది దుర్యోధనుడు తన అసూయను స్పష్టం చేసిన పద్యం: అసూయ క్రరకు అంటుకొన్న నిప్పులాంటిది. అది ఎదుటివాళ్ళను కాల్చే మాట ఎలా ఉన్నా మొదట ఆ క్రరను మాత్రం కాల్చక మానదు. దుర్యోధనుడు కృశించటం వెలవెలపోవటం ఇలాంటిదే. (ఈ పద్యరచనలోని దీప్తరసత్వం, ఔజ్జ్వల్యం కాంతిగుణాన్ని కమనీయంగా రూపొందించాయి. - సంపా.)

ఆ. ఒక్క లక్ష భూసురోత్తముల్ గుడిచిన । మొనసి తనకుఁ దాన మ్రోయు శంఖ;
మొక్క నిమిషమేని యుడుగక మ్రోసె న । య్యధ్వరోత్సవంబు నన్నినాళ్ళు. 115

ప్రతిపదార్థం: ఒక్క, లక్ష, భూసుర+ఉత్తముల్= ఒక లక్షమంది బ్రాహ్మణశ్రేష్ఠులు; కుడిచినన్= భోజనంచేస్తే; మొనసి= పూనుకొని; తనకు తాను+అ= తనంతట తానే; మ్రోయు, శంఖము; ఆ+అధ్వర+ఉత్సవంబు, అన్నినాళ్ళు= ఆ రాజసూయయాగం జరిగినన్ని రోజులు; నిమిషము+ఏనిన్= క్షణంకూడా; ఉడుగక= మానక; మ్రోసెన్= మ్రోగింది.

తాత్పర్యం: ఒక లక్షమంది బ్రాహ్మణ శ్రేష్ఠులు భోజనంచేస్తే తనకు తానై మ్రోగే శంఖం, ఆ రాజసూయ మహోత్సవం జరిగినన్ని రోజులు ఒక్క నిమిషమైనా ఆగకుండా మ్రోగింది.

సీ. జన్నంబు చూడంగ సకలభూములనుండి । వచ్చిన రాజన్యవరుల నవని
సురులను వైశ్యుల శూద్రుల నాత్మీయ । బంధుసుహృద్వీరభటనియోగ
జనులను బేదల సాధుల నిత్యంబుఁ । దాన పరీక్షించి, తగ వెఱింగి,
యన్నంబు దయఁ బెట్టి, యందఱుఁ గుడిచినఁ । దనుమధ్య యర్ధరాత్రంబు నపుడు

ఆ. గాని కుడువదట్టె కమలాక్షి ద్రౌపది; । యదియుఁగాక యమ్మహాధ్వరమున
నధముఁ డయ్యుఁ గడుఁబ్రియంబున నభ్యర్చి । తుండ కాని వంచితుండు లేఁడు. 116

ప్రతిపదార్థం: తనుమధ్య= సన్నని నడుంగలది; కమల+అక్షి= కమలంవంటి కన్నులు కలది అయిన ద్రౌపది; జన్నంబు= ఆ రాజసూయ యజ్ఞం; చూడంగన్= చూడటానికి; సకల భూముల నుండి= అన్ని దేశాలనుండి; వచ్చిన; రాజన్య, వరులన్= రాజశ్రేష్ఠులను; అవనిసురులను= బ్రాహ్మణులను; వైశ్యులన్; శూద్రులన్; ఆత్మీయ, బంధు, సుహృత్+వీరభట, నియోగజనులను= దగ్గరిబంధువులను, స్నేహితులను, వీరభటులను ఆయాపనుల్లో నియమించిన పరిచారకులను; పేదలన్; సాధులన్; నిత్యంబున్= ప్రతిదినము; తాన= తానే; పరీక్షించి; తగవు+ఎఱింగి= తగినవిధం తెలుసుకొని; దయన్= దయతో; అన్నంబు; పెట్టి; అందఱున్; కుడిచినన్= భోజనంచేసిన తర్వాత; అర్ధరాత్రంబు, అపుడుగాని= అర్ధరాత్రి సమయంలో గాని; కుడువదు+అట్టె= తాను తృప్తిగా భుజింపదు; అదియున్, కాక= అంతేగాక; ఆ+మహా+అధ్వరమునన్= ఆ మహాయజ్ఞంలో; అధముఁడు+అయ్యున్= తక్కువవాడైనా; కడున్= మిక్కిలి; ప్రియంబునన్= ప్రీతితో; అభ్యర్చితుండు+అ కాని= పూజింపబడినవాడే కాని; వంచితుండు= కోరుకున్నది లభించనివాడు; లేఁడు.

తాత్పర్యం: ద్రౌపదీదేవి అన్నిదేశాలనుండి రాజసూయయాగం చూడటానికి వచ్చిన రాజశ్రేష్ఠులను, బ్రాహ్మణులను, వైశ్యులను, శూద్రులను, దగ్గరిబంధువులను, స్నేహితులను, వీరభటులను, పనివాళ్ళను, పేదలను, బైరాగులను ప్రతిదినం తానే స్వయంగా విచారించి తగిన రీతిగా, దయతో అన్నంపెట్టి, అందరూ భుజించిన తర్వాత అర్ధరాత్రి కాని తాను తృప్తిగా భుజించదు. అంతేకాదు, ఆ మహాయాగంలో అధముడు కూడ ప్రేమతో పూజలందుకొన్నాడుగాని-కోరుకొన్నది లభించనివాడు ఒక్కడైనా లేడు.

విశేషం: రాజసూయంలో జరిగిన అన్నదానం, ఆ అన్నదాన కార్య నిర్వాహకురాలుగా ఆ ద్రౌపదీదేవి వెలిగిన వెలుగు, దుర్యోధనునికి కన్ను కుట్టించాయి. మిత్రుడు అభిమానంతో చేసే ప్రశంసకంటె శత్రువు అసూయతోనైనా చేసే ప్రశంస సత్యమైనది. ప్రశస్తమైనది.

క. ధరణి హరిశ్చంద్రుఁడు భా । సురయశుఁ డయి చేసె రాజసూయం; బదియున్
సరిగా దని యే వగతును । సురుచిరవిభవమునఁ బాండుసుతుయజ్ఞముతోన్. 117

ప్రతిపదార్థం: ధరణిన్= భూమిమీద; హరిశ్చంద్రుఁడు; భాసుర, యశుఁడు+ఐ= ప్రకాశించే కీర్తి కలవాడై; రాజసూయంబు; చేసెన్; అదియున్= ఆ రాజసూయంకూడ; సురుచిరవిభవమునన్= మిక్కిలి ఒప్పయిన వైభవంలో; పాండుసుతుయజ్ఞముతోన్= పాండురాజుకుమారుడైన ధర్మరాజుయాగంతో; సరిగాదు+అని= సమానం కాదని; ఏన్= నేను; వగతును= చింతిస్తాను.

తాత్పర్యం: ఈ భూమిమీద హరిశ్చంద్రుడు గొప్ప కీర్తిమంతుడై రాజసూయం చేశాడు. కాని వైభవంలో అది కూడ ధర్మరాజు చేసిన రాజసూయయాగంతో సరిగా దని నేను చింతిస్తున్నాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. **అట్టి రాజసూయాధ్వరంబున నవభృథసమయంబునందు బ్రహ్మర్షి రాజర్షి లోకపాలపరివృతుం డయిన మహేంద్రుండునుం బోలె నున్న ధర్మతనయు నారదపారాశర్యాదిమహాముని సమేతుండయి ధౌమ్యుం డశేషతీర్థజలంబుల నభిషిక్తుం జేసిన.** **118**

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి, రాజసూయ+అధ్వరంబునన్= రాజసూయ యాగంలో; అవభృథ, సమయంబునందున్; బ్రహ్మర్షి, రాజర్షి, లోకపాల, పరివృతుండు+అయిన= బ్రహ్మర్షులచేత, రాజర్షులచేత, దిక్పాలురచేత కొలువబడి ఉన్న; మహా+ఇంద్రుండునున్, పోలెన్= దేవేంద్రునివలె; ఉన్న; ధర్మతనయున్= ధర్మరాజును; నారద, పారాశర్య+ఆది, మహాముని, సమేతుండు+అయి= నారదుడు, పరాశరుని కుమారుడు వేదవ్యాసుడు మొదలైన మహామునులతో కూడినవాడై; ధౌమ్యుండు; అశేష, తీర్థ, జలంబులన్= అన్ని పుణ్యనదుల జలాలచేత; అభిషిక్తున్+చేసినన్= అభిషేకించబడినవాణ్ణిగా చేయగా.

తాత్పర్యం: అలాంటి రాజసూయయాగం చివర చేసే అవభృథస్నానసమయంలో - పాండవ పురోహితుడు ధౌమ్యుడు, నారద వ్యాసాది మహర్షులతో కలిసి - బ్రహ్మర్షులు, రాజర్షులు, దిక్పాలకులు కొలుస్తున్న ఇంద్రునిలా వెలుగుతున్న ధర్మరాజును, అన్ని పుణ్యనదుల జలాలతో అభిషేకించాడు.

సీ. **అభిషిక్తుడయిన యయ్యమరాజసుతునకు । సాత్యకి మౌక్తికచ్ఛత్ర మొప్పఁ**
బట్టె; భీముండును బార్థుండు మణిహేమ । దండ చామరయుగధారు లయిరి;
కమలనాభుండును గవలును ద్రుపదేశ । పుత్త్రుండు వేర్వేఱ భూమిపతుల
మూర్ధాభిషిక్తుల మ్రొక్కించుచుండిరి । దర్పంబు వెలయంగ; దానిఁ జూచి

ఆ. **యేను మొదలుగా మహీపతు లెల్లను । దీప్తిఁ దఱిఁగి యుండఁ దివిరి మమ్ము**
నగిరి కృష్ణ పాండునందన ద్రౌపదీ । సాత్యకులుఁ గరంబు సంతసమున. **119**

ప్రతిపదార్థం: అభిషిక్తుఁడు+అయిన= అభిషేకించబడిన; ఆ+యమరాజ, సుతునకున్; సాత్యకి; మౌక్తికచ్ఛత్రము= ముత్యాలగొడుగు; ఒప్పన్= అందంగా; పట్టెన్= పట్టాడు; భీముండును; పార్థుండు= అర్జునుడు; మణిహేమదండ, చామర, యుగ, ధారులు+అయిరి= మణులు పొదగబడిన బంగారుకాడలు గల చామరాల జంటను ధరించిన వాళ్ళయ్యారు; కమలనాభుండును= శ్రీకృష్ణుడును; కవలును= నకుల సహదేవులును; ద్రుపద+ఈశ, పుత్త్రుండును= ద్రుపదరాజుయొక్క కుమారుడైన ధృష్టద్యుమ్నుడును; వేఱు+వేఱ; మూర్ధ+అభిషిక్తులన్= పట్టాభిషిక్తులైన; భూమిపతులన్= రాజులను; దర్పంబు= గర్వం; వెలయంగన్= ప్రకాశిస్తుండగ; మ్రొక్కించుచున్+ఉండిరి; దానిన్; చూచి; ఏను= నేను; మొదలుగ; మహీపతులు+ఎల్లన్= రాజులందరు; దీప్తి= కాంతి; తఱిఁగి= తగ్గి; ఉండన్= ఉండగా; తివిరి= ప్రయత్నించి - అంటే పనికట్టుకొని; కృష్ణ, పాండునందన, ద్రౌపదీ, సాత్యకులు= శ్రీకృష్ణుడు, పాండవులు, ద్రౌపది, సాత్యకి; కరంబు= మిక్కిలి; సంతసమునన్= సంతోషంతో; మమ్మున్, నగిరి= మమ్మల్ని చూచి నవ్వారు.

తాత్పర్యం: రాజసూయంలో అభిషిక్తుడైన ఆ ధర్మరాజుకు సాత్యకి ముచ్చటగా ముత్యాలగొడుగు పట్టాడు. భీమార్జునులు మణులు పొదిగిన బంగారుకాడలున్న చామరాల జంటను ధరించి చెరొకవైపు నిలిచారు. శ్రీకృష్ణుడు, నకులసహదేవులు, ద్రుపదరాజ పుత్రుడైన ధృష్టద్యుమ్నుడు పట్టాభిషిక్తులయిన రాజు లందరిని వేరువేరుగా కొనిపోయి ధర్మరాజుకు మ్రొక్కించారు. ఆ వైభవాన్ని చూచి నేను, తక్కిన రాజులు వెలవెలబోతూ ఉంటే, శ్రీకృష్ణుడు, పాండవులు, ద్రౌపది, సాత్యకి అదే పనిగా ఆనందాతిశయంతో మమ్మల్ని చూచి నవ్వారు.

విశేషం: దాయాది అయిన ధర్మరాజు వైభవంతోపాటు, శ్రీకృష్ణపాండునందన ద్రౌపదీసాత్యకుల నవ్వుకూడ ఈ దుర్యోధనుని హృదయంలో గాఢంగా గ్రుచ్చుకొన్నది.

వ. మఱియు నయ్యుధిష్ఠిరుండు. 120

తాత్పర్యం: అంతేకాక ఆ ధర్మరాజు.

సీ. 'అనఘుఁడై యెనుబది యెనిమిది వేవురు । బ్రాహ్మణ ప్రవరుల బ్రహ్మవిదుల
వెలయంగ నల్లిండ్ల నిలిపి, ప్రత్యేకంబ । ముప్పంద్రు దాసుల నొప్ప నిచ్చి
ముదముతో రక్షించుఁ, బదివేవురుత్తమ । భూసురు లతని యగ్రాసనమునఁ
గలధౌతమయ పాత్రములఁ బ్రతిదినమును । గుడువను గట్టను దొడువఁ బూయ

ఆ. ననుభవింపఁ గలుగు టది యేమి పురుషార్థ । మయ్యు; కష్టపురుషు నట్టు లొరుల
పేర్మిఁ జూచుచుండఁ బెద్దయు నే నోప' । ననినఁ బతికి నిట్టు లనియె శకుని. 121

ప్రతిపదార్థం: అనఘుఁడు+ఐ= పాపరహితుడై; ఎనుబది, ఎనిమిదివేవురు, బ్రాహ్మణ, ప్రవరులన్= ఎనభై యెనిమిది వేలమంది బ్రాహ్మణశ్రేష్ఠులను; బ్రహ్మవిదులన్= బ్రహ్మజ్ఞాన సంపన్నులను; వెలయంగన్= ఒప్పునట్లుగా; నల్లిండ్లన్= అగ్రహారాల్లో; నిలిపి; ప్రత్యేకంబ; ముప్పంద్రు, దాసులన్= ముప్పదేసిమంది సేవకులను; ఒప్పన్= తగురీతిగా; ఇచ్చి; ముదముతోన్= సంతోషంతో; రక్షించున్= రక్షిస్తున్నాడు; పదివేవురు, ఉత్తమ, భూసురులు= పదివేలమంది ఉత్తమ బ్రాహ్మణులు; అతని= ఆ ధర్మరాజుయొక్క; అగ్ర+ఆసనమునన్= ఉన్నతమైన పీఠంలో; కలధౌతమయ, పాత్రములన్= వెండి లేదా బంగారుతో చేయబడిన పాత్రలలో; ప్రతిదినమును; కుడువను= భుజించటాన్ని; కట్టను= వస్త్రాలు కట్టటాన్ని; తొడువను= సొమ్ములుఅలంకరించుకొనటాన్ని; పూయన్= మైపూతలు పూసుకొనటాన్ని; అనుభవింపన్+కలుగుట; అది; ఏమి; పురుష+అర్థము+అయ్యు= మానవ జీవిత సార్థకత అయ్యా? కష్టపురుషున్+అట్టుల= హీనస్థితిలో ఉన్న మానవుడివలె; ఒరుల= ఇతరులయొక్క; పేర్మిన్= గొప్పతనాన్ని; చూచుచున్; ఉండన్; పెద్దయున్= ఎక్కువగా; ఏన్= నేను; ఓపన్= సహించను; అనినన్= అనిఅనగా; శకుని; పతికిన్= దుర్యోధనుడికి; ఇట్టుల+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'పుణ్యాత్ముడైన ఆ ధర్మరాజు ఎనభైఎనిమిదివేలమంది బ్రహ్మజ్ఞాన సంపన్నులైన బ్రాహ్మణ శ్రేష్ఠులను అగ్రహారాల్లో నిలిపి, వాళ్ళకు ముప్పదేసిమంది సేవకుల నిచ్చి, సంతోషంతో రక్షిస్తూ, పదివేలమంది బ్రాహ్మణులను ప్రతిదినం తన ప్రక్కన కూర్చుండ బెట్టుకొని భోజనం పెడుతూ, వాళ్ళకు బట్టలు, సొమ్ములు, మైపూతలు ఇచ్చి అనుభవింప జేయ గలగటం జీవితంలో ఎంతధన్యత! నేను హీనస్థితిలో ఉన్న మానవునిలా ఇతరుల గొప్పతనాన్ని చూచి అట్టే సహించి ఉండలేను' అని దుర్యోధనుడు అనగా అతనితో శకుని ఇలా అన్నాడు.

విశేషం: దానధర్మాలు కూడ వ్యక్తివైభవానికి అలంకారాలే. ప్రత్యర్థులకు అసహనహేతువులే. ఈర్ష్యాగుణం దుర్యోధనునికి తల్లిగర్భంనుండే సంక్రమించినట్లుంది. అది పాండవుల రాజసూయవైభవం చూచిన తరువాత పరాకాష్ఠ చెందింది. కురుపాండవ సఖ్యానికి తావులేకుండా చేసింది. సాక్షాత్తు చక్రధరుని సంధిప్రయత్నాన్నే చెడగొట్టింది. మహాభారత సంగ్రామానికి దారితీసింది; సర్వనాశనానికి కారణమయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **భానుప్రభుఁ డగు పాండుమ । హీనాథాత్మజులలక్ష్మి యెల్లను నీకున్**
నే నపహరించి యిత్తు ధ । రానుత! మాయాదురోదరవ్యాజమునన్. 122

ప్రతిపదార్థం: ధరానుత= భూమిలోని ప్రజలచే కొనియాడబడేవాడా - ఓ దుర్యోధనా!; భానుప్రభుఁడు+అగు= సూర్యునితో సమానమైన తేజస్సు కలవాడయిన; పాండు మహీనాథ+ఆత్మజుల, లక్ష్మి= పాండు భూపతి కుమారులైన పాండవులయొక్కఐశ్వర్యం; ఎల్లను= అంతా; నీకున్; ఏను= నేను; మాయా, దురోదర, వ్యాజమునన్= మోసపు జూదం నెపంతో; అపహరించి= దోచి; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: లోకం కొనియాడే ఓదుర్యోధనా! సూర్యునితో సమానమైన తేజస్సుకల ఆ ధర్మరాజుఐశ్వర్యాన్నంతా మాయాద్యూతం నెపంతో నీకు అపహరించి ఇస్తాను.

వ. **'ధర్మతనయుండు జూదంబునకుఁ బ్రియుండు గాని యందుల యుక్కివం బెఱుంగం; డే నక్షవిద్యయం దతి దక్షుండ; నాతని నశ్రమంబున నోడించి తదీయ రాజ్యవిభూతి నీ కిచ్చెద; వగవకుండు' మని పలికిన శకుని పలుకులకు సంతసిల్లి దుర్యోధనుండు దండ్రిపాదంబులపయిం బడి మ్రొక్కి 'యీ శకునిమతంబున కొడంబడవలయు' ననినఁ గొడుకునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. 123**

ప్రతిపదార్థం: ధర్మతనయుండు= ధర్మరాజు; జూదంబునకున్; ప్రియుండు; కాని; అందుల= ఆ జూదంలోని; ఉక్కివంబు= కపటం; ఎఱుంగండు= తెలియడు; ఏన్= నేను; అక్షవిద్యయందున్= పాచికలాడటంలో; అతిదక్షుండన్= మిక్కిలి నేర్పరిని; ఆతనిన్= ఆ ధర్మరాజును; అశ్రమంబునన్= సులభంగా; ఓడించి; తదీయ, రాజ్య, విభూతి= అతని రాజ్య సంపద అంతా, నీకున్+ఇచ్చెదన్; వగవక+ఉండుము= దుఃఖించకుండుము; అని; పలికిన; శకుని; పలుకులకున్; సంతసిల్లి; దుర్యోధనుండు; తండ్రి, పాదంబుల; పయిన్; పడి; మ్రొక్కి; ఈ, శకుని, మతంబునకున్= ఈశకునియొక్క అభిప్రాయానికి; ఒడంబడవలయున్= అంగీకరించాలి; అనినన్; కొడుకునకు; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ధర్మరాజుకు జూదం అంటే ఎంతో ఇష్టం. కాని అందులో ఎంతమోసం ఉంటుందో అతనికి తెలియదు. నేను ద్యూతవిద్యలో చాలా నేర్పరిని. ఆ ధర్మరాజును సులభంగా ఓడించి, అతని రాజ్యసంపదనంతా నీకిస్తా. ఎందుకు అలా దుఃఖిస్తావు' - అని శకుని అనగానే సుయోధనుడు సంతోషించాడు. తండ్రి పాదాలమీద వ్రాలాడు. 'ఈ శకుని అభిప్రాయాన్ని అంగీకరించు' అన్నాడు. అందుకు ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు.

క. **ధీరమతి విదురుతోడ వి । చారింతము; వాఁడు నయవిశారదుఁడు కళా**
పారగుఁడు దీర్ఘదర్శి య । పార హితారంభుఁ డుభయపక్షంబులకున్. 124

ప్రతిపదార్థం: ధీరమతి= బుద్ధిబలం కలవాడైన - అంటే మేధావి అయిన; విదురుతోడన్; విచారింతము= ఆలోచిద్దాం; వాఁడు= ఆ విదురుడు; నయ, విశారదుఁడు= నీతి, న్యాయం బాగా తెలిసినవాడు; కళాపారగుఁడు= విద్యయొక్క ఆవలిదరి చేరినవాడు - అంటే గొప్ప విద్యావంతుడు; దీర్ఘదర్శి= ముందుచూపు కలవాడు; ఉభయ పక్షంబులకున్= కురుపాండవ పక్షాలు రెండింటికి; అపార, హిత+ఆరంభుఁడు= గొప్పమేలు చేసే పూనిక కలవాడు.

తాత్పర్యం: విదురుడు మేధావి. అతనితో ఈ విషయం ఆలోచిద్దాం. అంతేకాదు. అతడు నీతికోవిదుడు. అంతేకాదు దూరదృష్టి కలవాడు. కురుపాండవ పక్షాలు రెండింటి క్షేమం కోరేవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: శకునిపన్నాగం దుర్యోధనునికి మేలు చేసేదే. అయితే, దానికి ధృతరాష్ట్రుని ఆమోదముద్ర కావాలి. ఇది కురుపాండవ రాజ్యతంత్రంతో ముడివడి ఉంది. ధృతరాష్ట్రుడు రాజుగా, తండ్రిగా రెండు పాత్రలు నిర్వహించాలి. తండ్రిగా అతడు అనుకూలుడే, అంతకంటె అతడు రాజ్యానికి ప్రభువు. రాజనిర్ణయం మంత్రితో చర్చించి తీసుకోవాలి. విదురుని అంగీకారం. ధృతరాష్ట్రుని ప్రభుత్వముద్రకు ముఖ్యం. దుర్యోధనుడు ధృతరాష్ట్రుని స్వతంత్రనిర్ణయాన్నే కోరుతున్నాడు. కాని, తన నిర్ణయాన్నే తండ్రి ప్రభు నిర్ణయంగా ప్రకటించా లని అతని ఉద్దేశం. అయితే మంత్రిని కా దని తంత్రం సాగించటానికి ధృతరాష్ట్రునికి ధైర్యం చాలలేదు. ఆ చిత్తవృత్తికి ఈ వాక్యాలు అద్దంపట్టుతున్నాయి. (సంపా.)

వ. 'సురపతి గురుండైన బృహస్పతి సేసిన నీతిశాస్త్ర రహస్యంబులం దెవ్వరికంటె విదురుం డెంతయు విశారదుం; డాతని బుద్ధిబలంబునను నాపగేయు బాహుబలంబుననుంజేసి యీ రాజ్యతంత్రంబు వర్తిల్లుచున్నయది; గావున నవ్విదురానుమతంబున నెగడుట లగ్గగు' ననిన దుర్యోధనుం డి ట్లనియె. 125

ప్రతిపదార్థం: సుర, పతి, గురుండు+ఐన= దేవతలరాజు దేవేంద్రుని గురువైన; బృహస్పతి; చేసిన= చెప్పిన; నీతి, శాస్త్ర, రహస్యంబులందున్, ఎవ్వరికంటెన్= అందరికంటె; విదురుండు; ఎంతయున్= ఎంతో; విశారదుండు= నేర్పరి; ఆతని బుద్ధి, బలంబునను= ఆతని బుద్ధిబలంచేతను; ఆపగేయు, బాహుబలంబుననున్+చేసి= గంగాతనయుడైన భీష్ముని భుజబలంచేతను; ఈ, రాజ్యతంత్రంబు; వర్తిల్లుచున్న+అది= నడుస్తున్నది; కావునన్; ఆ+విదుర+అనుమతంబున= ఆ విదురుని సమ్మతితో; నెగడుట= నడుచుకొనటం; లగ్గు+అగున్= మేలవుతుంది; అనినన్; దుర్యోధనుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'దేవేంద్రుని గురువైన బృహస్పతి చెప్పిన నీతిశాస్త్రరహస్యాల్లో విదురుడు అందరికంటె విద్వాంసుడు. అతని బుద్ధిబలంతో, గంగాతనయుడైన భీష్మునిబాహుబలంతో ఈ హస్తినాపురరాజ్యతంత్రం నడుస్తున్నది. అందుచేత ఏదిచేసినా విదురుడి సమ్మతితో చెయ్యటం మంచిది' అని ధృతరాష్ట్రు డనగా- అందుకు దుర్యోధనుడు ఇలా అన్నాడు.

విశేషం: ధృతరాష్ట్రుని పుత్రమమకారం 'ఈపాడుబుద్ధి నీ కేల' అని గట్టిగా కొడుకును మందలించలేక, విదురుని సమ్మతితో చేయటం మంచి దని చెప్పింది. లోకంలో పుత్రమమకార పీడితుల స్వభావం ఇలాగే ఉంటుంది. వాళ్ళు తగిన తరుణంలో తనయులను దండించరు. పరిస్థితులు విషమించినప్పుడు బాధపడతారు.

తే. పాండుపుత్త్రుల కెప్పుడుఁ బక్షపాతి । విదురుఁ డని చెప్పఁ దొల్లియు విందు; దీని
నెఱిఁగి వారించుఁ గా, కతఁ డేల శకుని । కైతవంబున కొడఁబడుఁ గౌరవేంద్ర! 126

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= ధృతరాష్ట్రమహారాజా!; విదురుఁడు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; పాండుపుత్త్రులకున్; పక్షపాతి= మొగ్గుచూపేవాడు; అని; చెప్పన్; తొల్లియున్= ఇదివరకే; విందున్= విని ఉన్నాను; దీనిన్= ఈ జూదమాడే ప్రయత్నాన్ని; ఎఱిఁగి= తెలుసుకొని; వారించున్+కాక= ఆపివేస్తాడుగాని; అతఁడు= ఆ విదురుడు; ఏల= ఎందుచేత; శకుని= శకునియొక్క; కైతవంబునకున్= జూదానికి; ఒడఁబడున్= అంగీకరిస్తాడు?

తాత్పర్యం: విదురుడు ఎప్పుడూ పాండవపక్షం వైపే మొగ్గుచూపుతా డని ఇదివరకే విన్నాను. ఆత డీప్రయత్నాన్ని ఆపివేస్తాడేకాని, శకునిజూదానికి అంగీకరిస్తాడా?

తే. **దీని కొడఁబడు; మొడఁబడవేని నేఁడ । యీ క్షణమ సర్వభక్షుచే భక్షితుండ**
నగుదుఁ; దెల్ల మే నట్లైన వగపుఁ దక్కి । విదురుఁడును నీవు నుండుఁడు ముదముతోడ. **127**

ప్రతిపదార్థం: దీనికిన్= ఈ జూదప్రయత్నానికి; ఒడఁబడుము= అంగీకరించుము; ఒడఁబడవు+ఏనిన్= అంగీకరించకుంటే; నేడు+అ= ఈ రోజే; ఈక్షణము+అ= ఈ నిమిషాన్నే; సర్వ, భక్షుచే= అన్నింటినీ భక్షించే వాడైన అగ్నిచే; భక్షితుండన్= భక్షించబడినవాణ్ణి; అగుదున్; తెల్లము= ఇది నిజం; ఏన్= నేను; అట్లు+ఐనన్= ఆ విధంగా నశిస్తే; వగపున్= చింతను; తక్కి= వదలి; విదురుఁడును; నీవున్; ముదముతోడన్= సంతోషంతో; ఉండుఁడు.

తాత్పర్యం: ఈ ప్రయత్నానికి అంగీకరించు. అంగీకరించకుంటే ఈ రోజే, ఈ క్షణమే అగ్నికి ఆహుతి అవుతా. ఇది నిజం. తరువాత నిశ్చింతగా నీవూ, విదురుడూ సుఖంగా ఉండండి.

విశేషం: పుత్రమమకారపీడితులైన తల్లిదండ్రులను లోకంలో దుర్మార్గులైన తనయులు బెదిరించే తీరు ఇదే.

క. **అని కడు నడలుగఁ బలికిన । విని ధృతరాష్ట్రుండు దుఃఖవివశాత్మకుఁ డ**
య్యును నెద నది యుచితము గా । దని వగచుచు నాత్మజునకు నాహ్లాదముగన్. **128**

ప్రతిపదార్థం: అని; కడున్= మిక్కిలి; అడలుగన్= దుఃఖంతో; పలికినన్; విని; ధృతరాష్ట్రుండు; దుఃఖ, వివశ+ఆత్మకుఁడు+ అయ్యునున్= దుఃఖానికి పూర్తిగా లొంగిపోయిన మనస్సు కలవాడైకూడా; ఎదన్= మనస్సులో; అది; ఉచితముకాదు= తగిందికాదు; అని; వగచుచున్= చింతిస్తూ; ఆత్మజునకున్= కుమారునికి; ఆహ్లాదముగన్= సంతోషం కలిగేటట్లుగా.

తాత్పర్యం: అని అమితంగా దుఃఖిస్తూ దుర్యోధనుడు అనగానే విని, ధృతరాష్ట్రుడు, తాను కూడా తీవ్రంగా దుఃఖించాడు. అయినా జూదం తగ దని మనస్సులో అనుకొని కొడుకుకు ఆహ్లాదం కలిగేవిధంగా-

వ. **అప్పుడు వేవురు శిల్పాచార్యుల రావించి, కనకరత్న ఖచిత స్తంభ సహస్రంబులను విచిత్రద్వార శతంబులను వివిధ రత్నరుచిర ప్రదేశంబులనుం జేసి రమ్యంబుగా నొక్క సభ నిర్మింపంబనిచి, యొక్కనాఁ డే కాంతంబ విదురునకు శకునిదుర్యోధనుల యభిప్రాయంబు చెప్పిన విని, యతండు విస్మితుండై, కలి ద్వారసమీపం బగుటయు జూదం బఖిలప్రజాక్షయకరం బగుటయు నెఱింగి ధృతరాష్ట్రున కి ట్లనియె.** **129**

ప్రతిపదార్థం: అప్పుడు; వేవురు= వెయ్యిమంది; శిల్ప+ఆచార్యులన్= శ్రేష్ఠులైన శిల్పులను; రావించి; కనక, రత్న, ఖచిత, స్తంభ, సహస్రంబులను= బంగారు, రత్నాలు పొదుగబడిన వేయిస్తంభాలతో; విచిత్ర ద్వార శతంబులను= ఆశ్చర్యకరాలైన వందలకొలది వాకిళ్ళతో; వివిధ, రత్న, రుచిర, ప్రదేశంబులనున్+చేసి= అనేక విధాలైన రత్నకాంతులతో ఒప్పిన ప్రదేశాలతో; రమ్యంబుగాన్= అందంగా; ఒక్క; సభ; నిర్మింపన్; పనిచి= ఆజ్ఞాపించి; ఒక్కనాడు; ఏకాంతంబు+అ= ఒంటరిగా; విదురునకున్; శకుని, దుర్యోధనుల; అభిప్రాయంబు; చెప్పినన్; విని; అతండు= ఆ విదురుడు; విస్మితుండు+ఐ= ఆశ్చర్యపడినవాడై; కలి, ద్వార, సమీపంబు+అగుటయున్= కలి వాకిటి దగ్గరకు రావటం - అంటే కలియుగం దగ్గర పడటం; జూదంబు; అఖిల, ప్రజా, క్షయ, కరంబు+అగుటయున్= అందరు ప్రజలకు నాశనం కూర్చేది అవటాన్ని; ఎఱింగి= తెలుసుకొని; ధృతరాష్ట్రునకున్+ ఇట్లు+అనియెన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అప్పుడు శ్రేష్ఠులైన శిల్పులను వెయ్యిమందిని రప్పించి, బంగారు రత్నాలు పొదిగిన వెయ్యిస్తంభాలతో, విచిత్రాలైన వందలకొలది ద్వారాలతో, రకరకాలైన రత్నకాంతులతో ప్రకాశించే ప్రదేశాలతో, అందంగా ఒక సభను నిర్మించటానికి ఆజ్ఞాపించాడు. ఒకనాడు ఒంటరిగా విదురునితో శకునిదుర్యోధనుల అభిప్రాయాన్ని చెప్పాడు. అది విన్న విదురుడు ఆశ్చర్యపడి- కలియుగప్రవేశం దగ్గరపడటం, జూదం సర్వజననాశకం కావటం తెలుసుకొని ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

విశేషం: 'కలి ద్వార సమీపం బగుటయు' అనే దానికి అనేక ప్రతుల్లో 'కలిద్వాపర సమీపంబగుటయు' అనే పాఠాంతరం ఉంది. కాని మూలంలో 'తచ్ఛ్రుత్వా విదురో ధీమాన్ కలిద్వార ముపస్థితమ్ । వినాశముఖ ముత్పన్నం ధృతరాష్ట్ర ముపాద్రవత్' - అని ఉంది. (భండార్కరు ప్రతి - 2-45-50).

విదురుఁడు ధృతరాష్ట్రునితో జూదమాడఁదగ దని చెప్పుట (సం. 2-51-23)

ఆ. **ఇట్టి కార్యమునకు నే నవశ్యంబును । నొడఁబడంగ నోప నుక్కివమున**
సుతులతోడ నేల సుతులకు భేదంబు । సేయఁ గడఁగి తిదియుఁ జెట్ట యనక. 130

ప్రతిపదార్థం: ఇట్టి; కార్యమునకున్; నేను; అవశ్యంబును= తప్పని సరిగా; ఒడఁబడంగన్+ఓపన్= ఒప్పుకొనలేను; ఇదియున్= దీన్ని; చెట్ట, అనక= చెడ్డ అని అనకుండ; ఉక్కివమునన్= కపటంతో; ఏల= ఎందుచేత; సుతులతోడన్; సుతులకున్= కొడుకులతో కొడుకులకు; భేదంబు= విరోధం; చేయన్= కలిగించటానికి; కడఁగితి= పూనుకొన్నావు.

తాత్పర్యం: ఇలాంటి పనికి ఏ మాత్రం నేను అంగీకరించను. ఇది చెడ్డ అని అనకుండ, కపటంతో నీ కొడుకుల్లో- పాండవులకు కౌరవులకు - విరోధం కల్పించటానికి ఎందుకు పూనుకున్నావు?

తే. **ఒలసి నీ పుత్త్రులెల్ల నొండొరులతోడ । నె ట్లొడంబడి యుండుదు రట్ల చేయ**
వలయుఁ; దమలోన జూదంబు వాదు నగుటఁ । గలహ మూలంబ యెట్టి శాంతులకు నైన. 131

ప్రతిపదార్థం: ఒలసి= కలిసి; నీ, పుత్త్రులు+ఎల్లన్= నీ కుమారు లందరు; ఒండు+ఒరులతోడన్= ఒకరితో నొకరు; ఎట్లు= ఏ విధంగా; ఒడంబడి, ఉండుదురు= కూడిఉంటారో; అట్లు+అ= ఆ విధంగా; చేయవలయున్; ఎట్టి, శాంతులకున్+ఐనన్= ఎంతటి శాంత స్వభావం కలవాళ్ళకైనా; తమలోనన్; జూదంబు; వాదున్= వివాదం; అగుటన్; కలహ, మూలంబు+అ= వైరమేర్పడటానికి కారణమే.

తాత్పర్యం: నీ పుత్రులంతా ఒకరితో ఒకరు ఎలా కలిసి మెలిసి ఉంటారో అలా చెయ్యి. ఎంత శాంత స్వభావులకైనా జూదం వాళ్ళలో వాళ్ళకు వాదు ఏర్పడటానికి, వైరం కలగటానికి కారణం అవుతుంది.

విశేషం: భారతంలో విదురుడు గొప్ప హితవరి, నన్నయ నానారుచిరార్థసూక్తినిధిత్వం విదురుని నోట విశేషంగా శోభిల్లింది.

వ. **'నీ నేర్చు విధంబున శకుని దుర్యోధనుల దుర్వ్యవసాయం బుడిగించి యిక్కురువంశంబు రక్షింపు' మనిన విదురునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె.** 132

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నీ, నేర్పు, విధంబునన్= నీకు చేతనైన పద్ధతిలో; శకుని, దుర్యోధనుల; దుర్+వ్యవసాయంబు= చెడ్డపనిని; ఉడిగించి= మాన్పి; ఈ+కురువంశంబు; రక్షింపుము; అనిన; విదురునకు; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీకు చేతనైన పద్ధతిలో శకుని దుర్యోధనుల చెడ్డపనిని మాన్పించి, కురుకులాన్ని రక్షించు'అని విదురుడు అనగానే విదురుడితో ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు.

ఉ. **పుత్త్రుల కేల భేదమగు భూనుత! యేనును నీవు జాహ్నవీ**
పుత్త్రుఁడు నుండఁగా నహితమున్ భయమున్ దొరకొన్నె? నాకు నా
పుత్త్రులకుం బ్రసాదకృత బుద్ధులు వేల్పులు గాన దీనికిన్
మిత్రనిధీ! యొడంబడుము మిన్నక సంశయ మంద నేటికిన్? **133**

ప్రతిపదార్థం: భూనుత!= లోకంచేత కొనియాడబడేవాడా!; ఏనునున్= నేనూ; నీవు; జాహ్నవీ, పుత్త్రుఁడున్= గంగాతనయుఁడు- భీష్ముడు; ఉండఁగాన్; పుత్త్రులకున్; ఏల= ఎందుచేత; భేదము+అగున్= వైరమేర్పడుతుంది?; వేల్పులు= దేవతలు; ప్రసాద, కృత, బుద్ధులు, కానన్= దయచూపే బుద్ధి కల వా రవటంచేత; నాకున్, పుత్త్రులకున్; అహితమున్= కీడును; భయమున్= భయమూ; దొరకొన్నె= కలుగునా?; మిత్రనిధీ= మిత్రులకు నిధియైనవాడా!; దీనికిన్= ఈ జూదానికి; ఒడంబడుము= అంగీకరించుము; మిన్నక= ఊరక - అంటే అనవసరంగా; సంశయము+అందన్= అనుమానపడటం; ఏటికిన్= ఎందుకు?

తాత్పర్యం: లోకం కొనియాడే ఓ విదురా! నేను, నీవు, గంగాతనయుడు భీష్ముడు ఉండగా, కొడుకుల కెందుకు వైరం ఏర్పడుతుంది? దేవతలు దయచూపే బుద్ధికలవాళ్ళు కావటంచేత నాకు, నా పుత్త్రులకు కీడు, భయం కలుగుతాయా? మిత్రనిధీ! నీ వీ జూదానికి అంగీకరించు. అనవసరంగా అనుమానపడటం ఎందుకు?

విశేషం: ధృతరాష్ట్రుని పుత్ర మమకారంతో పాటు, మాటనేర్పుకూడ ఈపద్యంలో వ్యక్తమవుతున్నది. విదురుణ్ణి ఆజ్ఞాపించగలవాడైనా అతణ్ణి 'మిత్రనిధీ!' అని సంబోధించి 'ఇందుకు అంగీకరించు' అని అడుగుతున్నాడు. (ఈ మాటల్లో ప్రభువు పాత్రకంటె తండ్రి పాత్రకే ధృతరాష్ట్రుడు ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్ట మౌతున్నది. ఇక విదురునిమాటలు అరణ్యరోదనలే, బూడిదలో పోసిన పన్నీరే. గుణం: ఉదారత. - సంపా.)

వ. **'వడిగల తురంగంబులం బూనిన రథం బెక్కి యింద్రప్రస్థపురంబునకుం జని యిందులకు ధర్మనందనుం దోడ్కొని ర' మ్మని విదురుం బంచిన, నాతండును నాపగేయున కంతయు నెఱింగించి 'యిది యపకర్మం' బనుచుండె; నిట ధృతరాష్ట్రుండు దన నిర్మింపంబంచిన సభ దుర్యోధనునకుం జూపి యాతని కేకాంతంబున నిట్లనియె.** **134**

పతిపదార్థం: వడిగల= వేగంగల; తురంగంబులన్= గుర్రాలను; పూనిన= కట్టిన; రథంబు+ఎక్కి; ఇంద్రప్రస్థపురంబునకున్; చని= వెళ్ళి; ధర్మనందనున్= ధర్మరాజును; తోడ్కొని= పిలిచికొని; రమ్ము+అని; విదురున్; పంచినన్; ఆతండునున్= విదురుడుకూడ; ఆపగేయునకున్= గంగానదీ పుత్రుడైన భీష్మునికి; అంతయున్= జరిగినదంతా; ఎఱింగించి= తెలిపి; ఇది= ఈ జూదం; అపకర్మంబు= చేయకూడని పని; అనుచుండెన్; ఇట; ధృతరాష్ట్రుండు; తన= తాను; నిర్మింపన్; పంచిన = ఆజ్ఞాపించిన; సభ; దుర్యోధనునకున్; చూపి; ఆతనికిన్; ఏకాంతంబునన్= ఒంటరిగా; ఇట్లు+అనియెన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'వేగంగల గుర్రాలను కట్టిన రథం ఎక్కి ఇంద్రప్రస్థపురానికి వెళ్ళి, ధర్మరాజును ఇక్కడికి పిలుచుకొనిరా' అని విదురుణ్ణి పంపగా, ఆతడు భీష్మునికి జరిగిందంతా చెప్పి, 'ఈ జూదం కూడని పని' అన్నాడు. ధృతరాష్ట్రుడు తాను నిర్మించటానికి ఆజ్ఞాపించిన సభను దుర్యోధనునికి చూపి, ఏకాంతంగా అతనితో ఇలా అన్నాడు.

క. జూద మిది యేల? దీనను । భేదము మీలోనఁ బుట్టుఁ బెలుచన; యుష్మ
ద్భేదమునఁజేసి యె గ్గు । త్పాదిల్లు ధరిత్రిఁ బ్రజకు భయజననంబై. 135

ప్రతిపదార్థం: జూదము+ఇది; ఏల; దీనను= దీనివలన; పెలుచన= పెద్దగా; మీలోనన్; భేదము= వైరం; పుట్టున్; యుష్మత్+ భేదమునన్+చేసి= మీయొక్కవైరంవలన; ధరిత్రిన్= భూమిలోని; ప్రజకున్= ప్రజలకు; భయ, జననంబు+ఐ= భయాన్ని కలిగించేదై; ఎగ్గు= కీడు; ఉత్పాదిల్లున్= పుడుతుంది.

తాత్పర్యం: ఈ జూదం ఎందుకు? దీనివల్ల మీలో మీకు తీవ్ర వైరం పుడుతుంది. మీ వైరంవల్ల భూమిమీది ప్రజలందరికి భయంకరమైన కీడు కలుగుతుంది.

ఉ. ఇమ్మహి నీవుఁ బాండవులు నెప్పటియట్ల పరస్పరానురా
గమ్మున నేలుచున్కి యిది కార్యము; పాండవలక్ష్మి నీ కస
హ్యా మ్మన నేల? వంచనఁ బరార్థ పరిగ్రహబుద్ధిఁ జేసి పా
పమ్మగుఁ; బాపకారులకుఁ బాయు నవశ్యము నర్థధర్మముల్. 136

ప్రతిపదార్థం: ఈ+మహిన్= ఈభూమిని; నీవున్; పాండవులున్; ఎప్పటి, అట్ల= ఎప్పటివలె; పరస్పర+అనురాగమ్మునన్= పరస్పరప్రేమతో; ఏలుచున్+ఉనికి= పాలిస్తూ ఉండటం; ఇది; కార్యము= చేయదగింది; పాండవ, లక్ష్మి= పాండవులఐశ్వర్యం; నీకున్; అసహ్యము+అనన్+ఏల= ఓర్చుకోరానిది అని అనటం ఎందుకు?; వంచనన్= మోసంతో; పర+అర్థ= ఇతరులయొక్క సంపదను; పరిగ్రహ, బుద్ధిన్+చేసి= తీసుకోవాలనే ఆలోచనచేత; పాపమ్ము+అగున్= పాపం కలుగుతుంది; పాపకారులకున్= పాపంచేసేవాళ్ళకు; అవశ్యమున్= తప్పక; అర్థ, ధర్మముల్= సంపద, ధర్మం; పాయున్= తొలగిపోతాయి.

తాత్పర్యం: ఈ భూమిని నీవు, పాండవులు ఎప్పటిలాగే పరస్పర ప్రేమతో పాలిస్తూ ఉండటం మంచిది. పాండవుల సంపద నీకు ఎందుచేత సహింపరానిదైంది? మోసంతో ఇతరుల సంపద పరిగ్రహించా లనే ఆలోచనవల్ల పాపం కలుగుతుంది. పాపాత్ములకు సంపద, ధర్మం తప్పక నశిస్తాయి.

విశేషం: ఈ పద్యరచనలో ఉదారతాగుణం పోషించబడింది. (సంపా.)

వ. 'ధర్మాధర్మవిదుండైన విదురున కిది సమ్మతంబు గాదు; ధర్మజు ధనసంపదకంటె నేనుమడుంగులు నీకు ధన సంపద గలదు; వాని చేసిన యజ్ఞంబుకంటె విశేషంబుగా దక్షిణ లిచ్చి నీ కిష్టంబయిన యజ్ఞంబు సేయుము; నీకును భూలోకంబునంగల రాజులెల్లం దమసర్వస్వమ్ములుఁ దెచ్చియిత్తు' రనిన విని దుర్యోధనుండు దండ్రి కి ట్లనియె. 137

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధర్మ+అధర్మ, విదుండు+ఐన= ధర్మం, అధర్మం తెలిసిన వాడైన; విదురునకున్; ఇది= జూదమాడి మోసంతో పాండవుల సంపదను అపహరించే పని; సమ్మతంబు కాదు; ధర్మజు, ధనసంపదకంటెన్; ఏనుమడుంగులు= ఐదు రెట్లు; నీకున్; ధనసంపద; కలదు; వాని, చేసిన= ఆ ధర్మరాజుచేసిన; యజ్ఞంబుకంటెన్; విశేషంబుగాన్= ఎక్కువగా; దక్షిణలు; ఇచ్చి; నీకున్+ఇష్టంబు+అయిన; యజ్ఞంబు; చేయుము; నీకును; భూలోకంబునన్+కల= భూలోకంలో ఉండే; రాజులు+ఎల్లన్= రాజులందరూ; తమ సర్వస్వమ్ములున్= తమ సకలసంపదలను; తెచ్చి; ఇత్తురు; అనినన్; విని; దుర్యోధనుండు; తండ్రికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ధర్మాధర్మాలు బాగా తెలిసిన విదురునికి ఈ మాయాద్యూతం సమ్మతంకాదు. ధర్మరాజు ధనసంపదకంటె ఐదురెట్లు ధనసంపద నీ కుంది. అతడు చేసిన యజ్ఞంకంటె అధికంగా దక్షిణ లిచ్చి నీకిష్ట మైన యజ్ఞం చెయ్యి. లోకంలోని రాజులంతా నీకుగూడ తమ సంపద లన్నింటిని తెచ్చి ఇస్తారు' అని అనగా విని దుర్యోధనుడు తండ్రితో ఇలా అన్నాడు.

విశేషం: ఈర్ష్యాగ్రస్తునికి తనకు లేదన్న బాధకంటె ఎదుటివాళ్ళకు ఉన్నదన్న బాధే ఎక్కువ. తనకు లే దన్న బాధను ఎవరైనా తీర్చగల రేమో కాని, ఎదుటివాళ్ళ కున్నదన్న బాధను కడకు కన్నతండ్రి మాత్రం ఏ విధంగా తీర్చగలడు?

క. ఇమ్ముల ధర్మజుతో జూ । దమ్మాడఁగఁ గాన్ప నాకు ధరణీశ్వర! య
జ్ఞ; మ్మదియ సమస్తైశ్వ । ర్యమ్ములు వడయఁగ నుపాయ మభిమతబుద్ధిన్. 138

ప్రతిపదార్థం: ధరణి+ఈశ్వర= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఇమ్ములన్= ఇంపుగా; ధర్మజుతోన్; జూదమ్ము; ఆడఁగన్; కాన్పన్= చూచుటయే; నాకున్; యజ్ఞము; అది+అ= అదే; అభిమతబుద్ధిన్= కోరుకొన్నట్లు; సమస్త+ఐశ్వర్యమ్ములు= సకల సంపదలు; పడయఁగన్= పొందటానికి; ఉపాయము.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రమహారాజా! ధర్మరాజుతో జూదమాడగా చూడటమే నాకు యజ్ఞం. కోరుకొన్న సకల సంపదలు పొందటానికి అదే తగిన ఉపాయం.

క. మీ రిందుల కందఱుఁ జను । దేరఁగ నే నంద యుండితిని సభ చూడన్;
ధారుణి నట్టి యపూర్వ స । భారచనలు వినఁగఁ జూడఁబడ వెవ్వరిచేన్. 139

ప్రతిపదార్థం: మీరు; అందఱున్; ఇందులకున్= ఈ హస్తినాపురానికి; చనుదేరఁగన్= రాగా; నేను; సభ= మయసభను; చూడన్= చూడటానికి; అందు+అ= అక్కడే - అంటే ఇంద్రప్రస్థంలోనే; ఉండితిని; ధారుణిన్= భూమిలో; అట్టి; అపూర్వ, సభా, రచనలు= ఆశ్చర్యకరమైన సభా నిర్మాణ శిల్పాలు; ఎవ్వరిచేన్= ఎవరిచేతగూడ; వినఁగన్, చూడన్, పడవు= వినబడలేదు. చూడబడలేదు.

తాత్పర్యం: మీరంతా రాజసూయం తర్వాత హస్తినాపురానికి తిరిగివచ్చారు. నేను ఆ మయసభను చూడా లని అక్కడే ఉన్నాను. లోకంలో ఆశ్చర్యకరమైన అలాంటి సభానిర్మాణాన్ని ఇంతవరకు ఎవ్వరూ వినలేదు. కనలేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. నిర్మల స్పటిక శిలానిర్మితం బై శశిప్రకాశంబై వివిధరత్న ప్రభా భాసురంబైన యా సభావిభవంబు చూచువేడుక నందుఁ గ్రుమ్మరు వాఁడ హరినీల బద్ధస్నిగ్ధ మణిస్థలంబునందు జలబుద్ధింజేసి పరిధానోత్కర్షణంబుసేసి, విమల శిలాతలబుద్ధి నుదకపరిపూర్ణం బయిన వాపి సొచ్చి, కట్టిన పుట్టంబు దడియం ద్రెళ్ళిన నన్నుం జూచి వృకోదరుండు నగియె; దాని నంతయు నెఱింగి ధర్మరాజ చోదితులయిన కింకరులు నాకుం బరిధానంబులు దెచ్చి యిచ్చిరి; మఱియు వివృతద్వారంబుఁ గవాట ఘటితం బని చొరనొల్లక, కవాటఘటితంబు వివృతంబుగా వగచి, చొరంబోయి తత్కవాట స్ఫటిక శిలా ఘట్టిత లలాటుండ నైన నన్నుం జూచి యనేక సహస్ర విలాసినీ పరివృతయయియున్న ద్రౌపది నగియె; నంత నకుల సహదేవులు పఱతెంచి 'యిదె వాకిలి యిట వచ్చునది' యని నన్నుం దోడ్కొని పోయి; రట్టి సభాప్రలంభంబు నాకు హృదయశల్యం బయి యున్నది. 140

ప్రతిపదార్థం: నిర్మల, స్ఫటిక, శిలా, నిర్మితంబు+ఐ= స్వచ్ఛమైన స్ఫటికపురాళ్ళతో కట్టబడినదై; శశి, ప్రకాశంబు+ఐ= చంద్రునివలె వెలిగేటటువంటిదై; వివిధ, రత్న, ప్రభా భాసురంబు+ఐన= పలువిధాలైన రత్న కాంతులచేత ప్రకాశించేదైన; ఆ సభా, విభవంబు= ఆ మయ సభయొక్క గొప్పదనం; చూచువేడుకన్= చూడాలనే కుతూహలంతో; అందున్= ఆ మయసభలో; క్రుమ్మరువాఁడన్= తిరుగుతున్న నేను; హరినీల, బద్ధ, స్నిగ్ధ, మణిస్థలంబునందున్= ఇంద్రనీలాలు కూర్చబడటంచేత నునుపైన మణి ప్రదేశంలో; జలబుద్ధిన్+చేసి= నీళ్ళున్నాయని అనుకోవటంచేత; పరిధాన+ఉత్కర్షణంబు, చేసి= కట్టుకున్న వస్త్రాన్ని పైకెత్తుకొని; విమల, శిలా, తల, బుద్ధిన్= స్వచ్ఛమైన రాతినేల అనే తలంపుతో; ఉదక, పరిపూర్ణంబు+అయిన= నీళ్ళతో పూర్తిగా నిండిన; వాపి= నడబావి - అంటే నడిచిపోవటానికి మెట్లు ఏర్పాటుచేసిన బావి; చొచ్చి= ప్రవేశించి, కట్టిన పుట్టంబు= కట్టుకొన్న బట్ట; తడియన్= తడిసిపోయేటట్లు; త్రెళ్ళినన్= పడిపోగా; నన్నున్; చూచి; వృకోదరుండు= భీముడు; నగియెన్= నవ్వాడు; దానిన్; అంతయున్; ఎఱింగి= తెలుసుకొని; ధర్మరాజ, చోదితులు+అయిన= ధర్మరాజుచేత పంపబడిన; కింకరులు= సేవకులు; నాకున్; పరిధానంబులు= కట్టుబట్టలు; తెచ్చియిచ్చిరి; మఱియున్; వివృతద్వారంబున్= తెరవబడిన వాకిలిని; కవాటఘటితంబు+అని= తలుపు మూయబడిన వాకిలి అని; చొరన్= ప్రవేశించటానికి; ఒల్లక= ఇష్టపడక; కవాటఘటితంబు= తలుపు మూయబడిన దానిని; వివృతంబుగాన్= తెరవబడినదానినిగా; వగచి= తలంచి; చొరన్+పోయి= ప్రవేశించబోయి; తత్+కవాట, స్ఫటిక, శిలా, ఘట్టిత, లలాటుండన్+ఐన= దానితలుపుయొక్క స్ఫటికపురాతిచే కొట్టబడిన నొసలు కలవాడినైన; నన్నున్; చూచి; అనేక, సహస్ర, విలాసినీ, పరివృత, అయిన, ఉన్న= పెక్కువేలమంది చెలికత్తెలతో కూడి ఉన్న; ద్రౌపది; నగియెన్= నవ్వింది; అంతన్= అప్పుడు; నకుల, సహదేవులు; పఱతెంచి= పరుగెత్తుకొనివచ్చి; ఇదె; వాకిలి; ఇట; వచ్చునది; అని; నన్నున్; తోడ్కొని= వెంటపిలుచుకొని; పోయిరి; అట్టి; సభా, ప్రలంభంబు= సభవలన కలిగిన వంచన; నాకున్; హృదయ, శల్యంబు+అయి= గుండెలో గుచ్చుకొన్న బాణమై; అంటే మిక్కిలి బాధాకరమై; ఉన్నది.

తాత్పర్యం: స్వచ్ఛమైన స్ఫటికపు రాళ్ళతో నిర్మించబడి, చంద్రునిలా ప్రకాశిస్తూ, పలువిధాలైన రత్నకాంతులతో వెలుగుతున్న ఆ మయసభా వైభవాన్ని చూడాలన్న కుతూహలంతో అందులో తిరుగుతూ ఉండగా-ఇంద్రనీలమణుల కూర్పుచేత నునుపైన మణిప్రదేశంలో నీళ్ళున్నా యని, కట్టుకొన్న వస్త్రాన్ని పైకెత్తుకొన్నాను. స్వచ్ఛమైన రాతినేల అనే తలంపుతో నీళ్ళు నిండిన నడబావిలో అడుగుపెట్టి కట్టుకున్న బట్టలన్నీ తడసేటట్లు క్రిందపడ్డాను. నాపాటు చూచి భీముడు నవ్వాడు. ధర్మరాజు పంపితే కొందరు సేవకులు కట్టుబట్టలు తెచ్చిఇచ్చారు. అంతే కాదు, తెరచిన ద్వారాన్ని మూసినదాన్నిగా తలచి అందు ప్రవేశించకుండా ఆవలికి తొలగిపోయాను. మూసినతలుపును తెరచినదాన్నిగా తలచి ప్రవేశించబోగా దానిస్ఫటికపురాతికి నొసలు కొట్టుకున్నాను. అలాగే నా స్థితిని చూచి పెక్కువేలమంది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెలికత్తెలతో ఉన్నపాంచాలి ఫక్కున నవ్వింది. నకులసహదేవులు పరుగెత్తుకొని వచ్చి-ఇది వాకిలి; ఇటు ర మ్మని పిలుచుకొని పోయారు. ఆ సభలో, నేను పడినభంగపాటు గుండెలో గ్రుచ్చుకొన్న బాణంలా నన్ను అమితంగా బాధిస్తూ ఉంది.

విశేషం: అసలే దుర్యోధనుడు పాండవుల పట్ల అసూయాగ్రస్తుడు. అందుకుతోడు వారిముందే అంత ఘోరావమానం. పుండుమీద కారం చల్లినట్లయింది. అంతేకాదు, విశేషించి సూదులు గ్రుచ్చినట్లు ద్రౌపదీ భీమసేనుల నవ్వులు. అప్పటి దుర్యోధనుని మానసిక స్థితి ఊహించుకోవలసిందే కాని వివరించ సాధ్యంకాదు.

క. పెద్దలు హీనతఁ బొందిరి । తద్దయు హీనులు సమృద్ధిఁ దనరిరి నియమం
బెద్ది విధియోగమున కసు । హృద్దర్పోన్నతులు సూచి యెట్లు సహింతున్. 141

ప్రతిపదార్థం: పెద్దలు= గొప్పవారు; హీనతన్= తక్కువతనాన్ని; పొందిరి; తద్దయున్= మిక్కిలి; హీనులు= తక్కువవాళ్ళు; సమృద్ధిన్= ఐశ్వర్యంతో; తనరిరి= ఒప్పారు; విధి, యోగమునకున్= బ్రహ్మదేవునిచేష్టకు; నియమంబు= క్రమం; ఎద్ది= ఏది?అ, సుహృత్+దర్ప+ఉన్నతులు= మిత్రులుకాని వాళ్ళయొక్క గర్వం; ఔన్నత్యము; చూచి; ఎట్లు; సహింతున్= ఓర్చుకుంటాను?

తాత్పర్యం: గొప్పవాళ్ళు తగ్గిపోయారు. అల్పులు అన్ని సంపదలతో అధికు లయ్యారు. బ్రహ్మదేవుని చేష్టకు క్రమం ఏముంది? మిత్రులు కానివాళ్ళ గర్వాన్ని, ఔన్నత్యాన్ని చూచి నే నెలా సహిస్తాను?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. పరమసుఖోపాయంబునఁ । బరసంపద చేకొనంగఁ బడునేని నరే
శ్వర! యంతకంటె మిక్కిలి । పురుషార్థం బెద్ది యొండు భూనాథులకున్. 142

ప్రతిపదార్థం: నర+ఈశ్వర= ధృతరాష్ట్రమహారాజా!; భూనాథులకున్= రాజులకు; పరమ, సుఖ+ఉపాయంబునన్= మిక్కిలి సులభమైన ఉపాయంచేత; పర, సంపద= పగవారి సంపద; చేకొనంగన్, పడున్, ఏనిన్= తీసుకోటానికి వీలైతే; అంతకంటెన్; మిక్కిలి= ఎక్కువైన; పురుష+అర్థంబు= పురుష ప్రయోజనం; అంటే జీవితంలో పురుషుడు పొందదగిన లాభం; ఒండు= మరొకటి; ఎద్ది= ఏది?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! రాజులు చాలా సులభమైన ఉపాయంతో శత్రువుల సంపదను గ్రహించటానికి వీలు కలిగితే, అంతకంటె అధికంగా వాళ్ళు కోరుకోతగిన ప్రయోజనం ఇంకేముంది?

క. నముచి యను దనుజుఁ డుగ్రత । పము సేయుచు నున్నవాని బలమథనుఁ డధ
ర్మమున వధియించె; రిపుప । క్షము నెమ్మెయి నైనఁ జెఱుపఁగా వలయు నిలన్. 143

ప్రతిపదార్థం: నముచి; అను; దనుజుఁడు= రాక్షసుడు; ఉగ్ర, తపము= భయంకరమైన తపస్సు; చేయుచున్+ఉన్న; వానిన్= అతడిని బలమథనుఁడు= ఇంద్రుడు; అధర్మమునన్= అన్యాయంగా; వధియించెన్= చంపాడు; ఇలన్= భూమిలో; రిపు, పక్షమున్= శత్రుపక్షాన్ని; ఏ+మెయిన్+ఐనన్= ఏవిధంగానైనా; చెఱుపఁగావలయున్= నాశనం చేయాలి.

తాత్పర్యం: నముచి అనే రాక్షసుడు భయంకరమైన తపస్సు చేస్తుండగా, దేవేంద్రుడు అన్యాయంగా అతణ్ణి వధించాడు గదా! భూమిమీద శత్రుపక్షాన్ని ఏ విధంగా నైనా నాశనం చెయ్యాలి.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. నముచి కశ్యపునికి, దనువుకు జన్మించిన కుమారుడు. నముచి భార్య ప్రభ. దేవదానవయుద్ధంలో ఇంద్రుడు వజ్రాయుధంతో కొట్టినా ఇతడు కసుగందలేదు. ఇతనికి ఉండే వరాలు అలాంటివి. ఆర్ద్రమైన (తడిసిన) దానితోగాని శుష్కమైన (ఎండిన) దానితోగాని ఇతనికి చావు లేదు. అయినా నముచి దేవేంద్రునికి భయపడి, దాగి, భయంకరమైన తపస్సు చేస్తుండగా- ఇంద్రుడు 'నిన్ను ఆర్ద్రమైన దానితోగాని, శుష్కమైన దానితోగాని కొట్ట' నని నమ్మించి, ఫేనం (నురుగు)తో కొట్టి ఈ రాక్షసుణ్ణి హతమార్చా డని పురాణగాథ.

ఆ. అల్పుఁడయ్యు మనుజుఁ డతి పరాక్రమమునఁ । బేర్మిఁ దరతరంబ పెరుగుచున్న
వాఁడు ప్రాని మొదలి వల్మీక మా ప్రానిఁ । జెఱుచు నట్లు గడఁగి చెఱుచుఁ బగఱ. 144

ప్రతిపదార్థం: మనుజుఁడు; అల్పుడు+అయ్యున్= తక్కువవాడు అయి నప్పటికీ; అతిపరాక్రమమునన్= మిక్కిలి పరాక్రమంచేత; పేర్మిన్= గొప్పగా; తరతరంబ= అంతకంతకు; పెరుగుచున్నవాడు; ప్రాని, మొదలి, వల్మీకము= చెట్టుమొదట ఉండే పుట్ట; ఆ, ప్రానిన్= ఆ చెట్టును; కడఁగి= ప్రయత్నించి; పగఱన్= శత్రువులను; చెఱచున్= నాశనం చేస్తాడు.

తాత్పర్యం: మానవుడు తక్కువవాడే అయిన ఎక్కువ పరాక్రమంతో అంతకంతకు గొప్పగా అభివృద్ధి చెందుతుంటే చెట్టుమొదలిపుట్ట క్రమంగా ఆ చెట్టునే చెరిచి వేసినట్లు, ఆతడు ప్రయత్నంచేసి తనశత్రువులను నాశనం చెయ్యగలడు.

విశేషం: అలం: ఉపమ.

తే. అహితవృద్ధి యుపేక్షితం బగుడు నల్ప । మగు మహావ్యాధియును బోలె నది యసాధ్య
మయి యుపేక్షకు నిర్మూలితాత్ముఁ జేయుఁ । గాన పాండవశ్రీ యుపేక్ష్యంబు గాదు. 145

ప్రతిపదార్థం: అహిత, వృద్ధి= మేలుకోరేవారుకాని వాళ్ళయొక్కఅభివృద్ధి-అంటే శత్రువులయొక్క అభివృద్ధిని; ఉపేక్షితంబు+అగుడున్= పరిగణించక అశ్రద్ధ చేస్తే; అల్పము+అగు= తక్కువగా ఉండే; మహావ్యాధియున్+పోలెన్= పెద్దరోగంవలె; అది; అసాధ్యము+అయి= అదుపుచేయటానికి; వీలుకానిదై; ఉపేక్షకున్= అశ్రద్ధచేసినవాణ్ణి; నిర్మూలిత+ఆత్మున్= నాశనమైనవానిగా, చేయున్; కాన= అందుచేత; పాండవశ్రీ= పాండవులఐశ్వర్యం; ఉపేక్ష్యంబు, కాదు= లెక్కలోకి తీసికొనకుండ విడిచివేయతగింది కాదు.

తాత్పర్యం: శత్రువుల అభివృద్ధిని లెక్కలోకి తీసుకోకుండా వదలివేస్తే- మొదట తక్కువగా ఉన్నా పెరిగి పెరిగి పెద్దదై అదుపుచెయ్యటానికి సాధ్యంకాని మహావ్యాధిలా, అశ్రద్ధ చేసినవాణ్ణే అది నాశనం చేస్తుంది. అందువల్ల పాండవుల ఐశ్వర్యం ఏమాత్రం వదిలివేయతగింది కాదు.

విశేషం: అలం: ఉపమ. గుణం: అర్థవ్యక్తి.

వ. 'దాని నెవ్విధంబున నయిన నపహరింపవలయు; నట్లుగాని నాఁడు నా హృదయ తాపంబున
కుపశమనంబుగా; దనిన దుర్యోధనునకు శకుని యి ట్లనియె. 146

ప్రతిపదార్థం: దానిన్= ఆ పాండవ ఐశ్వర్యాన్ని; ఏ+విధంబునన్+అయినన్= ఏ పద్ధతిని అనుసరించి అయినా; అపహరింపవలయున్= దొంగిలించాలి; అట్లు; కాని, నాఁడు= ఆ విధంగా జరగని రోజు; నా, హృదయ, తాపంబునకున్= నా గుండెలోని బాధకు; ఉపశమనంబు= తగ్గుదల; కాదు; అనిన; దుర్యోధనునకు; శకుని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పాండవుల ఐశ్వర్యాన్ని ఏ పద్ధతిని అనుసరించి అయినా అపహరించాలి. ఆ విధంగా జరుగని నాడు నా హృదయంలోని బాధ తీరదు' అని దుర్యోధనుడు అనగా అతనితో శకుని ఇలా అన్నాడు.

సీ. నాగరథాశ్వసన్నాహ మొనర్పక, । యొడ్డనంబులు దీర్ప, కుభయ సైన్య
వీరుల కరముల వివిధాయుధంబుల । నన్యోన్యసంఘట్టనారవంబు
లెసఁగంగ సంగ్రామ మేర్పడఁ జేయక, । యక్షముల్ దొలిచి యే నశ్రమమునఁ
బ్రతిపక్షతతుల సంపదలు జయించి నీ । కిచ్చెద; వగవంగ నేల? ధర్మ

ఆ. రాజుఁ బ్రీతితోడ రావించి యతనితోఁ । గడఁగు జూద మాడఁ గౌరవేంద్ర!
యొండు పాటఁ బాండవోన్నతి వేల్పుల । కయిన నపహరింప నలవి గాదు. 147

ప్రతిపదార్థం: నాగ, రథ+అశ్వ, సన్నాహము= గజ, రథ, తురగ బలాల ప్రయత్నం; ఒనర్పక= చేయక; ఒడ్డనంబులు= యుద్ధవ్యూహాలు; తీర్పక= ఏర్పరచక; ఉభయ, సైన్యవీరుల= రెండు సైన్యాలలోని వీరుల యొక్క; కరములన్= చేతులలో; వివిధ+ఆయుధంబులన్= పలురకాలైన ఆయుధాలచేత; అన్యోన్య, సంఘట్టనా, రవంబులు= ఒకరినొకరు తాకిన శబ్దాలు; ఎసఁగంగన్= అతిశయించగా; సంగ్రామము= యుద్ధం; ఏర్పడన్= కలిగేటట్లు; చేయక; అక్షముల్= పాచికలు; తొలిచి= రంధ్రాలు చేసి, రూపొందించి; లేదా, దొలిచి= దొర్లించి; ఏన్= నేను; అశ్రమమునన్= శ్రమలేకుండ; ప్రతిపక్ష, తతుల, సంపదలు= ఎదుటి పక్ష సమూహాల సంపదలు; జయించి= గెలిచి; నీకున్; ఇచ్చెదన్; వగవంగన్= దుఃఖించటం; ఏల= ఎందుకు? కౌరవ+ఇంద్ర= కౌరవరాజా! ఓ దుర్యోధనా!; ధర్మరాజున్; ప్రీతితోడన్= ప్రియమార; రావించి; అతనితోన్; జూదము+ఆడన్; కడఁగు= పూనుకొనుము; ఒండుపాటన్= వేరొక విధంగా; పాండవ+ఉన్నతి= పాండవులయొక్క గొప్పదనం; వేల్పులకున్+అయినన్= దేవతలకైనా; అపహరింపన్= మోసగించి తీసుకోవటం; అలవిగాదు= సాధ్యం కాదు.

తాత్పర్యం: గజ రథ తురగ బలాల ప్రయత్నాలు లేకుండ, యుద్ధవ్యూహాల ఏర్పాట్లు చెయ్యకుండ, ఉభయసైన్యాల వీరుల చేతి ఆయుధాల తాకిడి శబ్దాలు పెల్లుబికేటట్లు పోరు సలుపకుండ, పాచికలు దొర్లించి, ఎదుటిపక్షంవాళ్ళ సంపదలు శ్రమలేకుండ గెలిచి నీ కిస్తాను. దుఃఖపడటం ఎందుకు? దుర్యోధనా! ధర్మరాజును ప్రియమార పిలిచి ఆతనితో జూదమాడు. ఇంకో విధంగా పాండవుల గొప్పతనం అపహరించటం ఆ దేవతలకైనా సాధ్యంకాదు.

విశేషం: అవినీతి పరులకు అక్రమ సంపాదనమీద అభిలాష మెండు. అక్రమ మార్గానుసరణం ఒక విధంగా వ్యక్తి అశక్తతకు చిహ్నమే. 'అక్షముల్ దొలిచి'- అంటే పాచికలను (యుక్తిగా) దొర్లించటం; దొలుచు అనే ధాతువు సంస్కృత 'దోలనం' నుండి ఏర్పడినరూపం. ఇచట కొన్ని ప్రతుల్లో 'అక్షములొడ్డి', 'అక్షముల్ దాల్చి' అనే పాఠాంతరా లున్నాయి. వీటి అర్థం స్పష్టం.

వ. అనిన ధృతరాష్ట్రుండు దాని కొడంబడనొల్లక 'యేను విదురు శాసనంబున వర్తిల్లుచున్నవాఁడ; నాతం డర్థానర్థ విదుండు, సకలకార్యసమర్థుండు; జూదంబున విగ్రహం బగు ననియె; బలవంతులతోడి విగ్రహంబు పరిహరించుట లగ్గు; నా వచనంబు ధర్మోపేతంబు; దీని నతిక్రమించి యనుతాపంబు సేయక యిప్పుడు జూదం బుడిగి యెప్పటియట్ల యుండుట కార్యం' బనిన విని దుర్యోధనుం డతని కి ట్లనియె. 148

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్; ధృతరాష్ట్రుండు; దానికిన్= జూదానికి; ఒడంబడన్, ఒల్లక= ఒప్పుకొనటానికి ఇష్టపడక; ఏను= నేను; విదురుశాసనంబునన్= విదురుడు చెప్పినప్రకారం; వర్తిల్లుచున్+ఉన్నవాఁడన్= నడుచుకొంటూ ఉన్నవాణ్ణి; ఆతండు; అర్థ+అనర్థ, విదుండు= న్యాయాన్యాయాలు లేదా మేలుకీళ్ళు బాగా తెలిసినవాడు; సకల, కార్య, సమర్థుండు= చేయదగిన అన్ని పనులలోను నేర్పుకలవాడు; జూదంబునన్= జూదమాడటంచేత; విగ్రహంబు+అగున్+అనియెన్= యుద్ధంకలుగుతుందని చెప్పాడు; బలవంతులతోడి; విగ్రహంబు= యుద్ధం; పరిహరించుట= విడవటం; లగ్గు= మేలు; నా వచనంబు= నామాట; ధర్మ+ఉపేతంబు= ధర్మంతో కూడుకొన్నది; దీనిన్; అతిక్రమించి= దాటి; అనుతాపంబు= పశ్చాత్తాపం; చేయక= పొందక; ఇప్పుడు; జూదంబు; ఉడిగి= మానుకొని; ఎప్పటి, అట్ల; ఉండుట; కార్యంబు= చేయదగినపని; అనినన్; విని; దుర్యోధనుండు; అతనికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని దుర్యోధను డనగా- ధృతరాష్ట్రుడు జూదానికి ఇష్టపడక, 'నేను విదురుడు చెప్పినట్లు నడుచుకొంటాను. అతడు న్యాయాన్యాయాలు లేదా మేలుకీళ్ళు బాగా తెలిసినవాడు. చేయదగినపను లన్నింటిలో నేర్పుకలవాడు. జూదమాడటంవల్ల యుద్ధం కలుగుతుందని చెప్పాడు. బలవంతులతో యుద్ధం నివారించటం మేలు. నామాట ధర్మంతో కూడుకొన్నది. దీన్ని దాటి, తరువాత దుఃఖించక, ఇప్పుడు జూదం మాని ఎప్పటిలా ఉండు. అది మంచిది' అని అనగా తండ్రితో దుర్యోధనుడు ఇలా అన్నాడు.

క. తనకార్య మొరుమతంబున । నొనరింపఁగ నేర నగునె యొరునిమతంబుం
దనమతము నొకఁడు గా నో । పునె? చెచ్చెర నిశ్చయింపఁబోలునె దానిన్? 149

ప్రతిపదార్థం: తన, కార్యము= తాను చేయదగినపని; ఒరు, మతంబునన్= ఇతరుల ఇష్టంప్రకారం; ఒనరింపఁగ నేరన్+అగునె= చేయదగునా?; ఒరుని, మతంబున్= ఇతరుని అభిప్రాయం; తన, మతమున్= తన అభిప్రాయం; ఒకఁడు, కాన్+ఓపునె= ఒకటి అవుతుందా?; దానిన్= ఇతరుల అభిప్రాయం తన అభిప్రాయం ఒకటి అవుతుందనే విషయాన్ని; చెచ్చెరన్= వెంటనే; నిశ్చయింపన్+పోలునె= నిర్ణయించటం సాధ్యమా?

తాత్పర్యం: తాను చెయ్యవలసిన పనిని ఇంకొకడి ఇష్టప్రకారం చెయ్యవచ్చా? ఇతరుల అభిప్రాయం, తన అభిప్రాయం ఒకటిగా ఉంటుందా? ఒకే విధంగా ఉంటుం దని వెంటనే నిర్ణయించటం సాధ్యమా?

ఆ. విదురుమతము పాండవేయహితార్థంబు; । వానిబుద్ధి నెగడవలవ; దన్య
పక్షపాతబుద్ధిఁ బరఁగుచు నుండెడు । నట్టి వాని నాప్తుఁ డనఁగ నగునె? 150

ప్రతిపదార్థం: విదురు, మతము= విదురుని అభిప్రాయం; పాండవేయ, హిత+అర్థంబు= పాండవుల మేలునే ప్రయోజనంగా కలిగినట్టిది - అంటే పాండవుల మేలు కోరేటటువంటిది; వాని= ఆ విదురునియొక్క; బుద్ధి= ఆలోచన; నెగడన్, వలవదు= వర్ధిల్లకూడదు, - అంటే అతడు చెప్పినట్లు చేయకూడదు; అన్య, పక్షపాత, బుద్ధిన్= ఇతరులపట్ల పక్షపాతం గల మనస్సుతో; పరఁగుచున్= ఒప్పుతూ; ఉండెడున్+అట్టివానిన్= ఉన్నట్టివాడిని; ఆప్తుఁడు= స్నేహితుఁడు; అనఁగన్+అగునె= అని అనవచ్చునా?

తాత్పర్యం: విదురుని అభిప్రాయం ఎప్పుడూ పాండవుల మేలు కోరేదే. అందువల్ల అతడు చెప్పినట్లు చెయ్యకూడదు. ఇతరుల పట్ల పక్షపాతం గలవాణ్ణి మనం ఆప్తు డని అనుకోవచ్చా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: నన్నయ వాక్యాలు కొన్ని సూత్రాల్లా సాగుతాయి. నానారుచిరార్థసూక్తులై శోభిల్లుతాయి. 'విదురుమతము పాండవేయహితార్థంబు'- ఇది సంస్కృత పద్ధతిలో సూత్రంలా సాగిన వాక్యం. 'అన్యపక్షపాత బుద్ధిఁ బరఁగుచు నుండెడు నట్టివాని నాప్తుఁ డనఁగ నగునె' అనేది ఒక చక్కని సూక్తి.

వ. 'జూదం బన్నది పురాణంబులయందును వినంబడు; దీన దోషంబు లేదు; సుహృద్ద్యూతంబున దేవతలు దేవసాయుజ్యంబు వడయుదురు; గాన, దీనిం బ్రవర్తింప శకుని కానతిచ్చి యిందులకు ధర్మనందను రావింప వలయు' ననిన ధృతరాష్ట్రుండు పెద్దయుం బ్రొద్దు చింతించి, యెట్టకేనియు దాని కొడంబడి, విదురుం బిలిపించి వాని కి ట్లనియె. 151

ప్రతిపదార్థం: జూదంబు; అన్నది; పురాణంబుల, అందును; వినంబడున్; దీనన్= ఈ జూదంలో; దోషంబు; లేదు; సుహృత్+ ద్యూతంబునన్= స్నేహంగా ఆడుకొనే జూదంవల్ల; దేవతలు; దేవ, సాయుజ్యంబు= దేవత్వయోగాన్ని; పడయుదురు= పొందుతారు; కాన= అందువలన; దీనిన్= ఈ జూదాన్ని; ప్రవర్తింపన్= నడిపించటానికి; శకునికిన్; ఆనతి; ఇచ్చి; ఇందులకున్; ధర్మనందనున్; రావింపవలయున్= రప్పించాలి; అనినన్; ధృతరాష్ట్రుండు; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; చింతించి= ఆలోచించి; ఎట్టకేనియున్= చిట్టచివరికి; దానికిన్= ఆ జూదానికి; ఒడంబడి= అంగీకరించి; విదురున్, పిలిపించి; వానికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'జూదం అనేది పురాణాల్లోకూడా వినిపిస్తుంది. దీనిలో దోషం లేదు. స్నేహంగా ఆడుకొనే జూదంవల్ల దేవతలు దేవత్వాన్ని పొందుతున్నారు. అందువల్ల ఈ జూదాన్ని నడిపించటానికి శకునికి అనుమతి ఇచ్చి, ధర్మరాజును ఇక్కడికి రప్పించాలి' అని దుర్యోధను డనగా, ధృతరాష్ట్రుడు చాలా సేపు ఆలోచించి, చివరకు అంగీకరించాడు. విదురుణ్ణి పిలిపించాడు. అతనితో ఇలా అన్నాడు.

విశేషం: 'దివు' ధాతువుకు అనేకార్థా లున్నాయి. దివు-క్రీడా, విజిగీషా, వ్యవహార, ద్యుతి, స్తుతి, మోద, మద, స్వప్న, కాంతి, గతిషు. దీవ్యన్తి ఇతిదేవాః- కాబట్టి దేవనం చేతనే - అంటే ద్యూతక్రీడ చేతనే వాళ్ళు దేవత లయ్యారు. జూదమాడటంచేత దేవతలు దేవత్వాన్ని పొందుతుంటే, మనం జూదమాడటంలో తప్పేమి ఉంది అని దుర్యోధను డంటున్నాడు.

చ. అనుపమరత్నకాంచనచయాంచిత మీ సభ దీని ధర్మనం
దనుఁ డనఘుండు దానుఁ దన తమ్ములు నిందుల కేఁగుదెంచి చూ
చినఁ గడు సంతసం బగు విశిష్టజనస్తుత! నీవు వానిఁ దో
డ్కొని చనుదెమ్ము భూసురసఖున్ బుధబంధుజనానురంజనున్. 152

ప్రతిపదార్థం: విశిష్ట, జన, స్తుత= గొప్పవారిచేత ప్రశంసించబడేవాడా! ఓ విదురా!; ఈ, సభ; అనుపమ, రత్న, కాంచన, చయ+అంచితము= సాటిలేనట్టి రత్నాలయొక్క, బంగారుయొక్కసమూహంతో కూడుకొన్నది; అనఘుండు= పాపరహితుడైనవాడు; ధర్మనందనుఁడు= ధర్మరాజు; తానున్, తన తమ్ములున్; ఇందులకున్= ఇక్కడికి; ఏఁగుదెంచి= వచ్చి; దీనిన్= ఈ సభను; చూచినన్= చూస్తే; కడున్= మిక్కిలి; సంతసంబు= సంతోషం; అగున్= కలుగుతుంది; నీవు; భూసురసఖున్= బ్రాహ్మణులకు ప్రియమైనవాణ్ణి; బుధ, బంధు, జన+అనురంజనున్= పండితులను, బంధుజనులను సంతోషపరచేవాణ్ణి; వానిన్= ఆ ధర్మరాజును; తోడ్కొని= వెంటబెట్టుకొని; చనుదెమ్ము= రమ్ము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: గొప్పవారిచేత పొగడబడేవాడా! ఓవిదురా! ఈసభ సాటిలేని మేటి రత్నాలతో, బంగారుతో కూడుకొన్నది. పుణ్యాత్ముడైన ధర్మరాజు, అతని తమ్ములు ఇక్కడికి వచ్చి దీనిని చూస్తే చాలా సంతోషం కలుగుతుంది. నీవు వెళ్ళి- బ్రాహ్మణులకు ప్రియమైనవాడు, పండితులను, బంధువులను సంతోషపరచేవాడు అయిన ఆ ధర్మరాజును వెంటపెట్టుకొనిరా.

విశేషం: ధర్మరాజును పిలిపించటం జూదమాడటానికా? సభను చూడటానికా? ఈ మాత్రం సభను ధర్మరాజు ఎన్నడూ చూడలేదా? అయినా ఆ మయసభముందు ఇదెంత? పైగా ధృతరాష్ట్రుడు 'విశిష్టజనస్తుత!' అని విదురుణ్ణి సంబోధిస్తున్నాడు. ధర్మజునికి అనఘుడు. భూసురసఖుడు, బుధ బంధు జనానురంజకుడు - అనే విశేషణాలు ప్రయోగిస్తున్నాడు. లోకం ధృతరాష్ట్రుణ్ణి గురించి నోట తీపి, అంగిట విషం' అనటం ఇందుకే కాబోలు. గుణం: అర్థవ్యక్తి.

వ. 'ఇట్టి విచిత్ర రత్న సభావేదికాతలంబున నతండును దుర్యోధనుతోడం బ్రొద్దువోక సుహృద్ద్యూతంబుఁ బ్రవర్తించు' ననిన విని విదురుండు విషణ్ణహృదయుండయి 'మాయా దురోదరంబు దురర్థంబుగాఁ జింతించి దీని నుడిగిన నుభయపక్షంబులకు ల గ్గగు' నని పెక్కుమాఱులు వారించి. 153

ప్రతిపదార్థం: ఇట్టి= ఈ విధమైన; విచిత్ర, రత్న, సభా, వేదికా, తలంబునన్= ఆశ్చర్యకరాలైన రత్నాలతో కూడిన సభలోని అరుగుమీద; అతండును= ఆ ధర్మరాజు; దుర్యోధనుతోడన్; ప్రొద్దు, పోక= కాలక్షేపానికి; సుహృత్+ద్యూతంబున్= మైత్రితో కూడుకొన్న జూదాన్ని; ప్రవర్తించున్= ఆడుకొంటాడు; అనిన; విని; విదురుండు; విషణ్ణ, హృదయుండు+అయి= దుఃఖాన్ని పొందిన మనస్సు కలవాడయి; మాయా, దురోదరంబు= కపటపుజూదం; దుర్+అర్థంబుకాన్= చెడు ఫలా న్నిచ్చే దానినిగా; చింతించి= ఆలోచించి; దీనిన్= ఈ జూదాన్ని; ఉడిగినన్= మానితే; ఉభయపక్షంబులకున్= రెండు వైపులవాళ్ళకి; లగ్గు= మేలు; అగున్+అని; పెక్కుమాఱులు; వారించి= వద్దని చెప్పి.

తాత్పర్యం: 'ఈ విధంగా ఆశ్చర్యకరాలైన రత్నాలతో కూడుకొన్నసభావేదిక మీద, ధర్మరాజు కాలక్షేపానికి దుర్యోధనునితో మిత్రద్యూతం ఆడతా'డని ధృతరాష్ట్రు డనగా, విదురుడు దుఃఖపడి 'కపటపు జూదంవల్ల అనర్థం కలుగుతుం దని ఆలోచించి, దీనిని మానితే రెండుపక్షాలవాళ్ళకి మేలవుతుం'దని, జూదం వద్దని పెక్కుమార్లు చెప్పి.

విశేషం: ధర్మరాజును పిలిపించేది అతని ప్రొద్దుపోకకా! దుర్యోధనునితో జూదమాడే అవకాశం కల్పించటానికా? అన్యాయంగా అతని సంపదను అపహరించటానికా? ఎంత తీయగా మాట్లాడినా, తడిగుడ్డతో గొంతుకోసే ధృతరాష్ట్రుని తత్త్వం తలుపు సందునుండి తొంగిచూచినట్లు కొంత కొంత తెలుస్తూనే ఉంది.

విదురుఁడు ధర్మరాజుం దోడ్కొని వచ్చుట (సం. 2-52-1)

క. అవిలంఘనీయ మీదు । ర్వ్యవసాయం బనుచు సత్యవచనుఁడు ధర్మా
ర్థవిదుం డప్పుడు ధృతరా । ష్ట్రవిధాతృనియోగమున కొడంబడి యంతన్. 154

ప్రతిపదార్థం: ఈ, దుర్+వ్యవసాయంబు= ఈ చెడ్డపని; అవిలంఘనీయము= దాట సాధ్యం కానిది; అనుచున్; సత్య, వచనుఁడు= సత్యమైన మాటలు కలవాడు; ధర్మ+అర్థ, విదుండు= ధర్మంయొక్క అర్థం తెలిసినవాడు అయిన విదురుడు; అప్పుడు; ధృతరాష్ట్ర, విధాతృ, నియోగమునకున్= ధృతరాష్ట్రు డనే బ్రహ్మయొక్క ఆజ్ఞకు, ఒడంబడి= ఒప్పుకొని, అంతన్= తర్వాత.

తాత్పర్యం: ఈ చెడ్డపని తప్పించుకోటానికి సాధ్యం కాదని- సత్యం మాట్లాడేవాడు, ధర్మం తెలిసినవాడు అయిన విదురుడు ధృతరాష్ట్రు డనే విధాత ఆజ్ఞకు తలవంచి- అప్పుడు,

క. **ఇంద్రప్రస్థపురంబున । కింద్రగురుప్రతిభుఁ డరిగి యింద్రసమానుం**
జంద్రయశు ననుజసహితు నృ । పేంద్రుని ధర్మసుతుఁ గాంచె నెంతయుఁ బ్రీతిన్. 155

ప్రతిపదార్థం: ఇంద్ర, గురు, ప్రతిభుఁడు= దేవేంద్రుని గురువైన బృహస్పతితో సమానమైన బుద్ధిబలం కలవా డయిన విదురుడు; ఇంద్రప్రస్థపురంబునకున్; అరిగి= వెళ్ళి; ఇంద్ర, సమానున్= దేవేంద్రునితో సమానమైనవాణ్ణి; చంద్ర, యశున్= చంద్రునివలె ప్రకాశించే కీర్తికలవాణ్ణి; అనుజ, సహితున్= తమ్ములతో కూడుకొన్నవాణ్ణి; నృప+ఇంద్రునిన్= రాజశ్రేష్ఠుని; ధర్మసుతున్= ధర్మరాజును; ఎంతయున్= మిక్కిలి; ప్రీతిన్= ప్రేమతో; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: దేవేంద్రుని గురువైన బృహస్పతితో సమానమైన బుద్ధిబలం గల విదురుడు, ఇంద్రప్రస్థపురానికి వెళ్ళి- దేవేంద్రునితో సమానమైనవాడు, చంద్రుని వలె ప్రకాశించే కీర్తికలవాడు, తమ్ములతో కూడి ఉన్నవాడు, రాజశ్రేష్ఠుడు అయిన ధర్మరాజును ఎంతో ప్రేమతో దర్శించాడు.

విశేషం: అలం: ఉపమ, వృత్త్యనుప్రాసం.

వ. **అతనిచేత నభ్యర్చితుం డయి కుశలం బడిగి నిజాగమనప్రయోజనం బెఱింగించిన విని, విదురునకు ధర్మతనయుం డి ట్లనియె. 156**

ప్రతిపదార్థం: అతనిచేతన్= ఆ ధర్మరాజుచేత; అభ్యర్చితుండు+అయి= పూజించబడినవాడయి; కుశలంబు= క్షేమం; అడిగి; నిజ+ఆగమన, ప్రయోజనంబు= తనరాకయొక్కకారణం; ఎఱింగించినన్= చెప్పగా; విని; ధర్మతనయుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: విదురుడు ధర్మరాజు పూజలందుకొని, అతని క్షేమ మడిగి, తనరాకకు గల కారణం చెప్పగా, ధర్మరాజు ఇలా అన్నాడు.

సీ. **'పుత్త్రవత్సలుఁడు విచిత్రవీర్యాత్మజుఁ । డార్యుండు ధృతరాష్ట్రుఁ డాదరించి**
నిన్ను నియోగించె నన్నుఁ దోడ్కొని తేర; । నీవును వచ్చితి నెమ్మితోడ;
లాలితాపూర్వసభాలోకనంబున । యందు జూదంబు కార్యంబె? చెపుము;
జూదంబు కతమున భేదంబు గాకుండ । నేరదు మాలోన; నీనియోగ

ఆ. **మనఘ! మా కలంఘ్య మయినట్లు ధృతరాష్ట్రు । పనుపుసేయ నీకుఁ బాడి యదియ'**
యనుచు విధినియుక్తుఁ డయి యప్డు విదురుతో । నేఁగ నిశ్చయించె నిందుకులుఁడు. 157

ప్రతిపదార్థం: అనఘ= పాపరహితుడా!; విదురా!; పుత్త్రవత్సలుఁడు= పుత్రులపట్ల స్నేహభావం కలవాడు; విచిత్ర, వీర్య+ ఆత్మజుఁడు= విచిత్రవీర్యునికుమారుడు; ఆర్యుండు= పూజ్యుడుఅయిన; ధృతరాష్ట్రుఁడు; ఆదరించి= మన్నన చూపి; నన్నున్; తోడ్కొనితేరన్= పిలుచుకొని రావటానికి; నిన్నున్; నియోగించెన్= నియమించాడు; నీవును= నీవుకూడ; నెమ్మితోడన్=

ప్రేమతో; వచ్చితి= వచ్చావు; లాలిత+అపూర్వ, సభా, లోకనంబునన్= అందమై మిక్కిలి అరుదైన సభను చూస్తున్నపుడు; అందున్; జూదంబు; కార్యంబె= చేయదగిందేనా?; చెపుమ= చెప్పుము; మాలోనన్; జూదంబు; కతమునన్= జూదమాడటం కారణంగా; భేదంబు= వైరం; కాకుండ నేరదు= కలగకుండా ఉండదు; నీ నియోగము= నీ ఆజ్ఞ; మాకున్; అలంఘ్యము= దాటరానిది; అయినట్లు= అయిన విధంగానే; ధృతరాష్ట్ర, పనుపు= ధృతరాష్ట్రుని ఆజ్ఞను; చేయన్= చేయటం; నీకున్; పాడి, అది+అ= న్యాయమే; అనుచున్; ఇందుకులుఁడు= చంద్రవంశపు రాజైన ధర్మజుడు; విధి, నియుక్తుఁడు+అయి= దైవంచేత నియమింపబడినవాడై- అంటే దైవ నిర్ణయానుసారం; విదురునితోన్; ఏఁగన్= వెళ్ళటానికి; నిశ్చయించెన్.

తాత్పర్యం: 'పుణ్యాత్మా! విదురా! పుత్రులపట్ల స్నేహభావం కలవాడు, విచిత్రవీర్యునితనయుడు, పూజ్యుడు, అయిన ధృతరాష్ట్ర మహారాజు- ఆదరంతో నన్ను పిలుచుకొని ర మ్మని నిన్ను పంపాడు. ప్రేమతో నీవు నా దగ్గరకు వచ్చావు. అందమై, అపూర్వమైన ఆ సభను చూడటానికి వచ్చి అందులో జూదమాడటం తగునా? చెప్పు. ఈ జూదం కారణంగా మాలో మాకు వైరం ఏర్పడక మానదు. నీ ఆజ్ఞ మా కెట్లా మీరరానిదో, ధృతరాష్ట్రుని ఆజ్ఞ నీకూ అట్లే' అని- చంద్రవంశప్రభువైన ధర్మరాజు విధివశాన విదురుని వెంట వెళ్ళటానికి నిశ్చయించాడు.

విశేషం: అంతా దైవనిర్ణయం అనటం వేరు. కాని వ్యసనం మానవస్వభావంలో ఒక బలమైన భాగం. అందువల్ల ధర్మరాజు అన్నీ తెలిసి విదురుని వెంట హస్తినకు వెళ్ళాడు. జూద మాడాడు. ధర్మరాజులో ఈ వ్యసనమే లేకుంటే మహాభారతకథ మరోవిధంగా ఉండేది. (ధర్మరాజువాక్యవిన్యాసంలో వికటత్వం అర్థప్రకటనలో అగ్రామ్యత్వం సందర్భోచితంగా సంవదించటంవలన ఉదారతాగుణం రాణించింది. సంపా.)

క. అనుజులు ద్రుపదాత్మజయును । ననుచరముఖ్యులును ధౌమ్యుఁ డాదిగ విద్వ
జ్జనులును దోఁ జనుదేరఁగ । నినసన్నిభతేజుఁ డరిగె నిభపురమునకున్. 158

ప్రతిపదార్థం: అనుజులు= తమ్ములు; ద్రుపద+ఆత్మజయును= ద్రుపదునికూతురైన పాంచాలియు; అనుచర, ముఖ్యులును= ముఖ్యులైన సేవకులును; ధౌమ్యుఁడు+ఆదిగన్= ధౌమ్యుడుమొదలయిన; విద్వత్+జనులును= పండితులును; తోన్+ చనుదేరఁగన్= వెంటరాగా; ఇన, సన్నిభ, తేజుఁడు= సూర్యునితో సమానమైన తేజస్సుకలవాడు - ధర్మరాజు; ఇభ, పురమునకున్= హస్తినాపురానికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: తమ్ముళ్ళు, ద్రౌపది, ముఖ్యసేవకులు, ధౌమ్యుడు మొదలైన పండితులు వెంటరాగా, సూర్యతేజుడైన ధర్మరాజు హస్తినాపురానికి వెళ్ళాడు.

వ. అందు దుర్యోధన దుశ్శాసనాది పుత్త్రశతంబుతో భీష్మశల్య శకుని సైంధవ కర్ణ గౌతమ ద్రోణాశ్వత్థామ సోమదత్త సమేతుండయి యున్న ధృతరాష్ట్రునకు భానుమతీ ప్రభృతిస్నుషా పరివృతయయి తారకాపరివృత యయి యున్న రోహిణియుంబోలె నున్న గాంధారీదేవికిఁ గురువృద్ధజనులకు నతివినయంబున ననుజ సహితుండయి ధర్మతనయుండు మ్రొక్కె; నంత ద్రుపదరాజనందనయు గాంధారికి మ్రొక్కిన, నక్కోమలిం జూచి గాంధారికోడం డ్రెల్లను విస్మితలయి. 159

ప్రతిపదార్థం: అందున్= ఆ హస్తినాపురంలో; దుర్యోధన, దుశ్శాసన+ఆది, పుత్త్ర,శతంబుతోన్= దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలయిన నూరుగురు కొడుకులతో; భీష్మ, శల్య, శకుని, సైంధవ, కర్ణ, గౌతమ, ద్రోణ+అశ్వత్థామ, సోమదత్త, సమేతుండు+

అయి, ఉన్న= భీష్ముడు, శల్యుడు, శకుని మొదలయిన వారితో కూడి ఉండే; ధృతరాష్ట్రునకు; భానుమతీ, ప్రభృతి, స్నుషా, పరివృత, అయి= భానుమతి మొదలైన కోడండ్రచేత చుట్టబడినదై- అంటే భానుమతి మొదలయిన కోడళ్ళందరూ చుట్టూ చేరి ఉన్నారనటం; తారకా, పరివృత, అయి= నక్షత్రాలచేత చుట్టబడినదై; ఉన్న; రోహిణియున్+పోలెన్= రోహిణివలె; ఉన్న; గాంధారీదేవికిన్, కురువృద్ధజనులకున్= కురువంశంలోని పెద్దలకు; అతి, వినయంబునన్= మిక్కిలి వినయంతో; అనుజ, సహితుండు+అయి= తమ్ములతో కూడినవాడై; ధర్మతనయుండు= ధర్మరాజు; మ్రొక్కెన్= నమస్కరించాడు; అంతన్; ద్రుపదనందనయున్= ద్రౌపదికూడ; గాంధారికిన్; మ్రొక్కినన్, ఆ+కోమలిన్= ఆ అందగత్తెను; చూచి; గాంధారి కోడండ్రు+ఎల్లను= గాంధారీదేవికోడ ళ్ళందరూ; విస్మితలు+అయి= ఆశ్చర్యపడినవాళ్ళయి.

తాత్పర్యం: హస్తినాపురంలో - దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైన నూర్గురు కొడుకులతో, భీష్మ, శల్య, శకుని, సైంధవ, కర్ణ, కృప, ద్రోణ, అశ్వత్థామ, సోమదత్తులతో కూడి ఉన్న ధృతరాష్ట్రునికి, భానుమతిమొదలయిన కోడళ్ళతోకూడి, నక్షత్రాల మధ్య రోహిణిలా ఉన్న గాంధారీదేవికి, కురుకులంలోని పెద్దలకు ధర్మరాజు తమ్ముళ్ళతో గూడి ఎంతోవినయంగా నమస్కరించాడు. అప్పుడు ద్రౌపది కూడ గాంధారిదేవికి మ్రొక్కగా, ఆమె అందాన్ని చూచి గాంధారి కోడ ళ్ళందరూ ఆశ్చర్యపడ్డారు.

విశేషం: అలం: ఉపమ.

తే. **'అఖిలలావణ్యపుంజంబు నబ్జభవుఁడు । మెలఁతగా దీనియందు నిర్మించె నొక్కొ!**
కానినాఁ డిట్టి కాంతి యే కాంతలందు । నేల లే?'దని సామర్షహృదయ లయిరి. 160

ప్రతిపదార్థం: అబ్జభవుఁడు= పద్మంనుండి పుట్టినవాడు - బ్రహ్మదేవుడు; అఖిల, లావణ్య, పుంజంబున్= సమస్త సౌందర్య కాంతి సమూహాన్ని; మెలఁతగా= స్త్రీగా; దీని+అందున్= ఈ ద్రౌపదిపట్ల; నిర్మించెన్+ఒక్కొ= నిర్మించాడోగదా! కాని, నాఁడు= అలాకానప్పుడు; ఇట్టి, కాంతి; ఏకాంతల+అందున్= ఏ స్త్రీలలోకూడ; ఏలన్= ఎందుచేత; లేదు+అని; స+అమర్ష, హృదయలు= అసూయతో కూడిన మనస్సు కలవాళ్ళు; అయిరి.

తాత్పర్యం: 'బ్రహ్మదేవుడు సమస్తసౌందర్యకాంతిసమూహాన్ని ఈ ద్రౌపదీకాంతగా నిర్మించిన ట్లున్నాడు. అందువల్లనే కాబోలు! ఇంతటికాంతి ఏ యితరకాంతల్లోనూ కానరాదు' అని వాళ్ళంతా అసూయ చెందారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. సాటి స్త్రీలే అసూయపడేటంత లావణ్యవతి ద్రౌపది. (ఈ పద్యంలోని వ్యంగ్యవైభవాన్నిగురించి విశ్వనాథ సత్యనారాయణగారు చేసినవ్యాఖ్యను పీఠికలో గమనించవచ్చు.)

వ. **ఇట్లు పాండవ కౌరవు లతిప్రణయగౌరవంబున నద్దివసంబు సలిపి రంతఁ బ్రభాతంబ.** 161

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవ, కౌరవులు; అతి, ప్రణయ, గౌరవంబునన్= మిక్కిలి ప్రేమాతిశయంతో; ఆ+దివసంబు= ఆ రోజు; సలిపిరి= గడిపారు; అంతన్; ప్రభాతంబు+అ= ఉదయాన్నే.

తాత్పర్యం: ఈ విధంగా పాండవకౌరవులు ఎంతో ప్రేమాదరాలతో ఆరోజంతా గడిపారు. మరునాటి ఉదయం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ఆ ధృతరాష్ట్రుచేసిన యనర్ఘమణిప్రకరానుబద్ధ శో
భాధృతి నొప్పుచున్న సభ పార్థివముఖ్యుఁడు ధర్మజుండు దు
ర్యోధనుఁ డర్థిఁ జూపఁగ సహోదరవీరులుఁ దానుఁ జూచి ల
క్ష్మీధరమూర్తి యెంతయును మెచ్చె మనంబునఁ దద్విభూతికిన్. 162

ప్రతిపదార్థం: ఆ, ధృతరాష్ట్రు, చేసిన= ఆ ధృతరాష్ట్రమహారాజు నిర్మించిన; అనర్ఘ, మణి, ప్రకర+అనుబద్ధ, శోభా, ధృతిన్= వెలలేనిమణులసమూహంతో కూర్చబడిన శోభను ధరించటంచేత; ఒప్పుచున్+ఉన్న= అందంగా ఉండే; సభన్= సభను; దుర్యోధనుఁడు; అర్థిన్= వేడ్కతో; చూపఁగన్; పార్థివ, ముఖ్యుఁడు= రాజులలో ప్రముఖు డైనవాడు; ధర్మజుండు; తానున్; సహోదర, వీరులు= వీరులైనతమ్ములు; చూచి; లక్ష్మీధరమూర్తి= లక్ష్మిని ధరించిన విష్ణుమూర్తివంటి ధర్మరాజు (నావిష్ణుః పృథివీపతిః - అని గదా ఆర్యోక్తి. అందుచేత పృథ్వీపతి అయిన ధర్మరాజు లక్ష్మీధరమూర్తియే), తత్+విభూతికిన్= ఆ సభాభవనవైభవానికి; మనంబునన్= మనస్సులో; ఎంతయును= మిక్కిలి; మెచ్చెన్.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రమహారాజు నిర్మించింది, అమూల్య మణిసమూహశోభతో ప్రకాశించేది - అయిన సభను దుర్యోధనుడు ప్రీతితో చూపించగా, రాజుల్లో ప్రముఖుడైన ధర్మరాజు, వీరులైన తమ్ముళ్ళతో కలిసి ఆ సభావైభవాన్ని చూచాడు. మనస్సులో ఎంతో మెచ్చుకొన్నాడు.

వ. అయ్యపూర్వసభామణి కుట్టిమంబున నందఱు సుఖాసీనులయి యిష్టసంభాషణాది క్రీడావసరంబున నున్నంత దుర్యోధనుండు యుధిష్ఠిరున కి ట్లనియె. 163

ప్రతిపదార్థం: ఆ+అపూర్వ, సభా, మణి, కుట్టిమంబునన్= ఆ అపురూపమైన సభలో మణులతో నిర్మించబడిన తిన్నెమీద; అందరు; సుఖ+ఆసీనులు+అయి= సుఖంగా కూర్చుండి; ఇష్ట, సంభాషణ+ఆది, క్రీడా+అవసరంబునన్+ఉన్నంతన్= ఇష్టమైన సంభాషణలు మొదలయిన వినోదాలతో ఉన్న సమయాన; దుర్యోధనుండు; యుధిష్ఠిరునకున్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ అపురూపమైన సభలో, మణులతో నిర్మించిన వేదికమీద, అందరు సుఖంగా కూర్చుండి, సరస సల్లాపాది వినోదాలతో ఉన్న సమయాన దుర్యోధనుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

క. అనఘ! సుహృద్ద్యూతం బిం । దొనరింతము ప్రొద్దువోకయును నగు, జూదం
బునకుం బ్రియుఁడవు దక్షుఁడ । వన విందుము నిన్నుఁ బ్రీతి నక్షజ్ఞులచేన్. 164

ప్రతిపదార్థం: అనఘ= పాపరహితుడా! ధర్మరాజా!; సుహృత్+ద్యూతంబు= స్నేహంగా ఆడుకొనే జూదం; ఇందున్= ఇక్కడ; ఒనరింతము= ఆడుదాము; ప్రొద్దు, పోకయును+అగున్= కాలక్షేపం జరుగుతుంది; నిన్నున్; ప్రీతిన్= ప్రియమార; అక్షజ్ఞులచేన్= పాచికలాడటం బాగా తెలిసినవాళ్ళచేత; జూదంబునకున్; ప్రియుఁడవు; దక్షుఁడవు= నేర్పరివి; అనన్= అని అనగా; విందుము= విన్నాము.

తాత్పర్యం: పుణ్యాత్మా! ధర్మరాజా! ఇక్కడ స్నేహంగా జూదం ఆడుకొందాం. కాలక్షేపం అవుతుంది. పాచికలాడటం బాగా తెలిసినవాళ్ళు- నీవు జూదంలో ఆసక్తి గలవాడి వని, సమర్థుడి వని చెప్పితే విన్నాం.

వ. అనిన వానికి ధర్మతనయుం డి ట్లనియె. 165

తాత్పర్యం: అనగా దుర్యోధనునితో ధర్మరాజు ఇలా అన్నాడు.

తే. క్షత్రనీతిక్రమంబులు గావు సూవె । నికృతియును జూదమును; ధర్మనిత్యులైన
వారి కీ రెండు వర్జింపవలయు నెందుఁ; । బాపవృత్తంబు జూదంబు పార్థివులకు. 166

ప్రతిపదార్థం: నికృతియును= మోసం; జూదమును; క్షత్ర, నీతి, క్రమంబులు, కావు= క్షత్రియధర్మానికి తగినవికావు; సూవె= సుమా!; ధర్మనిత్యులు+ఐనవారికిన్= ధర్మాన్ని ఎల్లప్పుడూ ఆచరించేవారికి; ఈ, రెండున్; ఎందున్= ఎచ్చటైనా; వర్జింపవలయున్= విడవాలి; పార్థివులకున్= రాజులకు; జూదంబు; పాప, వృత్తంబు= పాపపుపని.

తాత్పర్యం: మోసం, జూదం- క్షత్రియధర్మానికి తగినవి కావు సుమా! ఎప్పుడూ ధర్మాన్ని ఆచరించేవాళ్ళు ఈ రెంటిని వదలివెయ్యాలి. రాజులు జూదమాడటం పాపపు పని.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ధర్మరాజు ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టగలవాడు. ధర్మరాజు జూదంలో ఆసక్తి కలవాడనీ, అందులో సమర్థుడనీ, 'అక్షజ్ఞుల' వలన విన్నాడట దుర్యోధనుడు. ఆ మాట వినగానే ధర్మజునికి తెలిసిందేమో- ఆ బుద్ధి దుర్యోధనుడి బుర్రలో పుట్టింది కా దని, అక్షవిద్య తెలిసిన శకుని దుష్ట చింతన అని. పైగా దుర్యోధనుడు అక్షవిద్యలో నిపుణుడు కాడు. శకుని మోసగాడు. అతని వ్యూహం సుహృద్ద్యూతం. అందుకే ధర్మరాజు ధర్మనిరతులైన క్షత్రియులు జూదం ఆడకూడ దన్నాడు. ఇది వ్యంగ్యంగా దుర్యోధనునికి ఎత్తిపొడుపు. అంతేకాక, జూదంవల్ల పార్థివులు పాపవృత్తులై చెడిపోతా రనటంలో శకునిమాటలు విని చెడిపోకు మన్న హెచ్చరిక కూడా ఉంది. (సంపా.)

ఆ. కుటిలమార్గు లయిన కుత్సితకితవుల । తోడఁ గడఁగి జూదమాడఁ జనదు;
దానఁజేసి యర్థధర్మవివర్జితు । లగుదు రెట్టివారు జగములోన. 167

ప్రతిపదార్థం: కుటిల, మార్గులు+అయిన= మోసపుమార్గాలు అవలంబించేవాళ్ళయిన; కుత్సిత, కితవులతోడన్= నీచపు జూదగాండ్రతో; కడఁగి పూనుకొని; జూదము; ఆడన్+చనదు= ఆడకూడదు; దానన్+చేసి= దానివల్ల; జగములోనన్= ప్రపంచంలో; ఎట్టివారు= ఎటువంటివాళ్ళయినా; అర్థధర్మవివర్జితులు= ధనాన్ని, ధర్మాన్ని కోల్పోయినవాళ్ళు; అగుదురు.

తాత్పర్యం: మోసపు మార్గాలు అనుసరించే నీచపు జూదగాళ్ళతో జూదమాడకూడదు. దానివల్ల లోకంలో ఎటువంటి వాళ్ళయినా ధనాన్ని, ధర్మాన్ని కోల్పోతారు.

విశేషం: నన్నయభట్టారకుని నానారుచిరార్థ సూక్తినిధిత్వానికి పై పద్యాలు రెండూ చక్కని ఉదాహరణలే. లోకంలో ద్యూతవ్యసన పరులకు కనువిప్పు కలిగించే గొప్ప హెచ్చరికలే. కుటిలమతులు, కుత్సితబుద్ధులు అయిన జూదగాళ్ళతో జూదమాడటంవల్ల అర్థం, ధర్మం రెండూ దూరమౌతాయి అన్నమాటల్లో ఆ లక్షణాలు గల జూదగాడు శకుని అని, దుర్యోధనునిది దుష్టవ్యూహ మని, మోసగాళ్ళతో జూదమాడితే ధనం, ధర్మం రెండూ కోల్పోయే ప్రమాదం ఉం దని ధర్మరాజు గ్రహించకపోలే దని ధ్వనిస్తూ ఉంది. చిత్ర మేమంటే - ఇంత తెలిసి, ఇన్ని ధర్మాలు చెప్పి ధర్మరాజు చివరకు జూదమాడాడు. ఎన్నో కష్టాలు అనుభవించాడు. అతని ద్యూతవ్యసనం అంతబలీయం.

వ. 'మఱియు మాయాద్యూతంబున జయించుట మహాపాతకం బనియును, ధర్మద్యూతంబున జయించుట ధర్మయుద్ధంబున జయించు నంతియ పుణ్యం బనియును నసితుండయిన దేవలుండు చెప్పె' ననిన నయ్యుధిష్ఠిరునకు శకుని యి ట్లనియె. 168

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక, మాయాద్యూతంబునన్= కపటపుజూదంలో; జయించుట= గెలవటం; మహాపాతకంబు= మిక్కిలి పాపం; అనియును; ధర్మ, ద్యూతంబునన్= ధర్మంగా ఆడిన జూదంవల్ల; జయించుట; ధర్మ, యుద్ధంబునన్= ధర్మంగా చేసిన యుద్ధంలో; జయించు, అంతియ= గెలిచేటంతటి; పుణ్యంబు; అనియును; అసితుండు; అయిన; దేవలుండు; చెప్పెన్; అనినన్; ఆ+యుధిష్ఠిరునకున్; శకుని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అంతేకాక, కపటపు జూదంలో గెలవటం మహాపాప మని, ధర్మంగా ఆడిన జూదంలో గెలవటం ధర్మంగా చేసినయుద్ధంలో గెలిచినంత పుణ్య మని అసితుడయిన దేవలుడు చెప్పాడు' అని ధర్మరాజు అనగా అతనితో శకుని ఇలా అన్నాడు.

విశేషం: అసితదేవలుడు పితృలోకంలో వ్యాసుని ఆదేశానుసారం భారతాన్ని ప్రచారం చేసిన ఋషీశ్వరుడు. (ధర్మరాజు మాయాద్యూతం మహాపాప మనీ, ధర్మద్యూతం పుణ్యప్రద మనీ ఒక నీతివిశేషం చెప్పాడు. దుర్యోధనుడు పైకి అంటున్నది సుహృద్ద్యూతమైనా, అసలు జరుగబోయేది మాయాద్యూత మని ధర్మజునివాక్యాల్లో ధ్వని, భావికథార్థం భావించి వ్యంగ్యంగా మందలిస్తున్న ధర్మరాజుతో దుర్యోధనుడు మారు మాటాడలేక పోయాడు. పైమాట లన్నీ శకునికి తగిలాయి. ధర్మరాజు తగలాలనే మాట్లాడాడు. అందువల్ల భుజాలు తడువుకుంటూ శకుని బదులుచెప్పాడు. ధర్మరాజు మాట లనే గాలం వేసి, శకుని కుతంత్రాన్ని బైటకు లాగాడు. - సంపా.)

క. ద్యూతకళాకుశలుండగు । నాతఁడు లోకజ్ఞుఁడును మహామతియును వి
ఖ్యాతుఁడు నగు సత్క్షత్రియ । నీతి విదుఁడు దగునె దాని నిందింపంగన్. 169

ప్రతిపదార్థం: ద్యూత, కళా, కుశలుండు+అగు, ఆతఁడు= ద్యూతకళలో నేర్పరి అయినవాడు; లోకజ్ఞుఁడును= లోకజ్ఞానం కలవాడు; మహామతియును= గొప్పమేధావి; విఖ్యాతుఁడున్= ఎంతో పేరు గలవాడు; అగున్; సత్+క్షత్రియ, నీతి, విదుఁడు= ఉత్తమరాజనీతి చక్కగా తెలిసినవాడు; దానిన్= జూదాన్ని; నిందింపంగన్; తగునె= ఒప్పునా? (తగదని భావం).

తాత్పర్యం: జూదమాడే కళలో నేర్పరి, లోకజ్ఞానం కలవాడు, గొప్పమేధావి, కీర్తిమంతుడు, ఉత్తమరాజనీతి చక్కగా తెలిసినవాడు ఆ జూదాన్ని నిందించటం తగునా?

విశేషం: శకుని ధర్మరాజును పొగడ్తలతో ఉబ్బించటం జూదం ఊబిలో దించటానికే. శకుని సామాన్యుడా! ధర్మరాజు ద్యూతవ్యసనం ఎంత బలియమో అతనికి తెలుసు. ఇంతదూరం ధర్మరాజు వచ్చింది జూదం ఆడటానికే కదా. అయితే ధర్మపన్నాలు వల్లిస్తున్నాడు. అంతే. అతనికి పూనకం తెప్పిస్తే చాలు. జూదంలో పడిపోతాడు. అందుకే ఈ ప్రశంస.

క. బలహీను లయిన వారలు । బలవంతుల నొడుచునపుడు బహుమాయల న
చ్ఛలమునఁ జేయుట యెందును । గలయదియ; జయంబ కాదె కర్తవ్య మిలన్. 170

ప్రతిపదార్థం: బలహీనులు+అయిన, వారలు; బలవంతులన్; ఒడుచునపుడు= ఓడించేటప్పుడు; బహుమాయలన్= పెక్కుమోసాలను; అచ్ఛలమునన్= పూనికతో; చేయుట; ఎందును= ఎచ్చటైనా; కల, అది+అ= ఉన్నదేకదా!; జయంబు+అ, కాదె= జయమేకదా!; ఇలన్= భూమిమీద; కర్తవ్యము= చేయదగింది.

తాత్పర్యం: బలహీనులైనవాళ్ళు బలవంతులను ఓడించేటప్పుడు పెక్కుమోసాలకు పూనుకోవటం ఎక్కడైనా ఉన్నదేకదా! లోకంలో ఏ విధంగానైనా జయాన్ని సాధించటమే కదా చెయ్యదగిన పని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ధర్మజుడు ద్యూతంలో మోసాన్ని నిందించాడు. అది శకునికి గట్టిగా తగిలే ఎత్తిపొడుపే. పైగా శకుని జూదంలో ధర్మరాజును మోసం చెయ్యాలన్న సంకల్పంతోనే ఉన్నాడు. అందుకే ధర్మరాజు ఎత్తిపొడుపును త్రిప్పికొట్టటానికి, మున్ముందు తాను చెయ్యబోయే మోసాన్ని సమర్థించుకోటానికి ఇలా అన్నాడు. మోసానికి నీతి ముసుగు తొడిగాడు. శుక్రనీతిని పేరు చెప్పకుండ పేర్కొన్నాడు. జరాసంధవధలో మీరు చేసింది ఇదే కాదా - అని ధ్వనింపచేశాడు.

వ. 'జూదంబున కీ వోడుదేని యుడుగు' మనిన నాతనికి ధర్మరా జి ట్లనియె. 171

ప్రతిపదార్థం: జూదంబునకున్; ఈవు; ఓడుదు+ఏనిన్= భయపడేటట్లయితే; ఉడుగుము= మానుకొమ్ము; అనినన్; ఆతనికిన్; ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'జూద మాడటానికి నీవు భయపడితే మానుకో' - అని అనగా - శకునితో ధర్మరాజు ఈ విధంగా అన్నాడు.

విశేషం: చివరకు శకుని ధర్మరాజు అభిమానాన్ని రెచ్చగొట్టి అతణ్ణి జూదానికి దించాడు.

ధర్మరాజు శకునితో జూదం బాడుట (సం. 2-53-13)

క. 'బలవద్ద్యూతార్థముగాఁ । బిలువంబడి మగుడ నగునె? పెక్కులు పలుకుల్
పలుకంగ నేల?' యని య । త్యలఘుఁడు ధర్మజుఁడు జూద మాడఁ గడంగెన్. 172

ప్రతిపదార్థం: బలవత్+ద్యూత+అర్థంబుగాన్= బలవంతంగా జూదానికి; పిలువంబడి; మగుడన్+అగునె= వెనుదిరిగి వెళ్ళదగునా?; పెక్కులు, పలుకుల్= అనేకములైన మాటలు; పలుకంగన్+ఏల= మాట్లాడటం ఎందుకు? అని; అతి+ అలఘుఁడు= మిక్కిలి గొప్పవాడు; ధర్మజుఁడు; జూదము; ఆడన్= ఆడటానికి; కడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: బలవంతంగా జూదానికి పిలువబడి వెనుదిరిగి వెళ్ళటమా? ఎక్కువ మాట్లాడటం ఎందుకు? అని ఆ ధర్మరాజు జూదానికి పూనుకొన్నాడు.

వ. ఇట్లు జూదంబున నయ్యెడు దోసం బెఱింగియు దైవానుశాసనంబున ధర్మజుండు దాని కభిముఖుండయి చందన కర్పూర కస్తూరీ పరిషిక్తంబయిన ద్యూతరంగంబునందు ముందఱ గంధపుష్పార్చితంబు లయిన యభిమతాక్షంబు లమర్చికొనియున్న సౌబల వివింశతి చిత్రసేన వికర్ణులం జూచి 'వీరిలో నెవ్వఁడు నాతో జూదం బాడెడు వాఁ?'డనిన నాతనికి దుర్యోధనుం డి ట్లనియె. 173

ప్రతిపదార్థం: ఇట్లు; జూదంబున్= జూదమాడటంచేత; అయ్యెడు= కలిగే; దోసంబు; ఎఱింగియున్= తెలిసికూడా; దైవ+ అనుశాసనంబునన్= దైవాజ్ఞచేత; ధర్మజుండు; దానికిన్= ఆ జూదానికి; అభిముఖుండు+అయి= ఇష్టపడినవాడై; చందన, కర్పూర, కస్తూరీ, పరిషిక్తంబు+అయిన= మంచిగంధం, కర్పూరం, కస్తూరి కలిసిన నీటిచేత చుట్టును తడుపబడిన; ద్యూత, రంగంబు+అందున్= జూదమాడేస్థలంలో; ముందఱ; గంధ, పుష్ప+అర్చితంబులు+అయిన= గంధంచేత, పూలచేత పూజింపబడినవైన; అభిమత+అక్షంబులు= ఇష్టమైన పాచికలు; అమర్చికొని= ఏర్పాటు చేసుకొని; ఉన్న; సౌబల, వివింశతి, చిత్రసేన వికర్ణులన్= శకుని, వివింశతి, చిత్రసేనుడు, వికర్ణుడు అనేవాళ్ళను; చూచి; వీరిలోన్; ఎవ్వడు; నాతోన్; జూదంబు; ఆడెడువాడు; అనినన్; ఆతనికిన్= ధర్మరాజుకు; దుర్యోధనుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: జూదమాడటం తప్పని తెలిసికూడా, దైవనిర్ణయానుసారం ధర్మరాజు అందుకు అంగీకరించాడు. చుట్టూ మంచిగంధం, కర్పూరం, కస్తూరి, కలిపిన నీళ్ళు చల్లిన జూదమాడే స్థలంలో, గంధంచేత, పూలచేత పూజించబడిన పాచికలు అమర్చుకొని కూర్చున్న శకునిని, వివింశతిని, చిత్రసేనుణ్ణి, వికర్ణుణ్ణి చూచి 'వీరిలో ఎవడు నాతో జూదమాడే వా' డనగా అతనితో దుర్యోధనుడు ఇలా అన్నాడు.

తే. **అనఘ! మా మామ శకుని నాకై కడంగి । జూదమాడెడి నీతోడఁ; గాదు నాక**
యీతఁ డొడ్డిన ధనరాసు లెవ్వియైనఁ । బోఁడిగా నీకు నీఁగలవాఁడ నేను. **174**

ప్రతిపదార్థం: అనఘ= పాపరహితుడా! ధర్మరాజా!; శకుని; నాకై= నాకొరకు; కడంగి= పూని, నీతోడన్; జూదము+ఆడెడిన్; కాదు, నాక= కాదని అనకుండ; ఈతఁడు; ఒడ్డిన; ధన, రాసులు; ఎవ్వి+ఐనన్; పోఁడిగాన్= ఒప్పుగా; నేను; నీకున్; ఈన్+కలవాఁడన్= ఈయగలవాడిని.

తాత్పర్యం: పుణ్యాత్మా! ఓ ధర్మరాజా! నా పక్షాన శకుని నీతో జూదమాడతాడు. కాదని అనకుండా- ఇతడు ఒడ్డిన ధనరాసులు ఏవైనా సరే- నీకిస్తా.

వ. **అని తనచేతి యనర్ఘ రత్న కటకంబు లొడ్డిన, 'నన్యులకయి యన్యులు జూదం బాడుట యెంతయు విషమం' బనుచు ధర్మతనయుండు సాగరావర్త సంభవంబులయిన పరార్థ్యమణిహారంబు లొడ్డె; నిట్లు సుహృద్ద్యూతంబు ప్రవర్తిల్లు నదియైన నచ్చోటికి వచ్చి భీష్మ ధృతరాష్ట్ర విదురకృపద్రోణాశ్వత్థామలు విచిత్రోచ్చాసనస్థు లయి దానిం జూచుచు నప్రహృష్టహృదయు లయి యుండి రంత.** **175**

ప్రతిపదార్థం: అని; తన, చేతి; అనర్ఘ; రత్న, కటకంబులు= వెలకట్ట సాధ్యంగాని రత్నాలతో చేయబడిన కంకణాలు; ఒడ్డినన్; అన్యులకున్+అయి= ఇతరులకై; అన్యులు= ఇతరులు; జూదంబు+ఆడుట; ఎంతయున్= మిక్కిలి; విషమంబు= అక్రమం; అనుచున్; ధర్మతనయుండు; సాగర+ఆవర్త, సంభవంబులు+అయిన= సముద్రపు సుడులలో పుట్టిన; పరార్థ్య, మణి, హారంబులు= శ్రేష్ఠాలైన మణులతో చేయబడిన హారాలు; ఒడ్డెన్; ఇట్లు; సుహృత్+ద్యూతంబు= స్నేహంగా ఆడుకొనే జూదం; ప్రవర్తిల్లునది+ఐనన్= నడిచేది కాగా; ఆ+చోటికిన్; వచ్చి; భీష్మ, ధృతరాష్ట్ర, విదుర, కృప, ద్రోణ+అశ్వత్థామలు; విచిత్ర+ఉచ్చ+ఆసనస్థులు+అయి= విచిత్రాలై ఎత్తైన పీఠాలమీద కూర్చుండి; దానిన్= ఆ జూదాన్ని; చూచుచున్; అప్రహృష్ట, హృదయులు+అయి= సంతోషం లేని మనస్సు కలవాళ్ళయి; ఉండిరి; అంతన్.

తాత్పర్యం: అని దుర్యోధనుడు అమూల్యరత్నాలతో చేసిన తనకంకణాలను ఒడ్డగా, ఒకరికై మరొకరు జూదమాడటం అక్రమ మని అంటూ ధర్మరాజు సముద్రపు సుళ్ళలో ఉద్భవించిన ఉత్తమ మణులతో చేసిన హారాలను ఒడ్డాడు. ఈవిధంగా స్నేహభావంతో జూదం నడుస్తుండగా, అక్కడికి భీష్మ ధృతరాష్ట్ర విదుర కృప ద్రోణాశ్వత్థామలు వచ్చి, ఎత్తైన పీఠాలమీద కూర్చుండి, సంతోషం లేనిమనస్సుతో ఆ జూదాన్ని చూస్తూ ఉన్నారు.

విశేషం: ఒకరికై మరొకరు జూదమాడటం అక్రమం అనే ధర్మరాజు ఆ జూదంలో ఎందుకు పాల్గొనాలి? వ్యక్తి స్వభావంలో వ్యసనం ఎంతో బలీయం. అందుచేతనే అంతటి ధర్మరాజుకూడ-అందరికీ తెలియటానికి అది అక్రమం అని అన్నారు కాని- ఆటమాత్రం తాను మానలేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. అభిమతాక్షముల్ దొల్చి మాయావిదుండు । సుబలరాజాత్మజుఁడు ధర్మసుతు జయించె;
నొడుతు నే నింక నని వెండియును గడంగె । శకునితో జూదమాడ నా శశికులుండు. 176

ప్రతిపదార్థం: అభిమత+అక్షముల్= తన కిష్టమైన పాచికలు; దొల్చి= యుక్తిగా దొర్లించి; మాయావిదుండు= మోసంచేయటం ఎరిగినవాడు; సుబలరాజ+ఆత్మజుఁడు= సుబలుడనే రాజుయొక్క కుమారుడు-శకుని; ధర్మసుతున్= ధర్మరాజును; జయించెన్; ఆ, శశి, కులుండు= ఆ చంద్ర వంశం వాడైన ధర్మరాజు; ఏను= నేను; ఇంకన్; ఒడుతున్= ఓడిస్తాను; అని; శకునితో; వెండియును= మరల; జూదము; ఆడన్; కడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: తన కిష్టమైన పాచికలు రూపొందించుకొని మోసగా డైన శకుని ధర్మరాజును జయించాడు. ఆ చంద్ర వంశంవాడైన ధర్మరాజు 'నే నింక నిన్ను ఓడిస్తాను' అని శకునితో మళ్ళీ జూదం ఆడటానికి పూనుకొన్నాడు.

వ. ఇట్లు యుధిష్ఠిరుండు బద్ధమత్సరుండయి పెటిఁగి యొండొండ యొడ్డుచు నిష్కసహస్రభరితానేకాయుత కుండమండితంబు లయిన సువర్ణభాండాగారంబులును, వజ్రవైదూర్యమరకతమౌక్తికనీలప్రవాళ పద్మరాగాది వివిధ శుద్ధ విపుల రత్న పరిపూర్ణంబు లైన రత్నభాండాగారంబులుం, బ్రత్యేకంబ పంచద్రోణ కాంచన సంచితంబు లయిన చతుశ్శతనిధులును, మణికింకిణీ జాలాలంకృతంబు లయిన యసంఖ్యాత హయ యూధంబులును, జాతరూప వరూధంబులుం గనక కక్ష్యాకుథ సనాథంబు లయిన మదాంధ గంధ సింధుర సందోహంబులుం, బరార్ధ్య రత్న భూషణ భూషితంబు లయిన యోషిత్సహస్రంబులును, ననుదినాతిథి జన భోజనపాత్రహస్తులయిన శతసహస్రపరిచారకులును, నర్జునునకుఁ జిత్రరథుం డిచ్చిన గంధర్వ హయంబులుం దొట్టి దుగ్ధపానశాలి తండుల ఖాదనంబులం బెరుఁగుచున్న జాత్యశ్వానేకాయుతంబులు, నజావి గో మహిష ఖర రాసభ నివహంబులు నొక్కొక్క యొడ్డునన యొడ్డి యోటుపడినం జూచి విదురుండు ధృతరాష్ట్రునకు రహస్యంబున ని ట్లనియె. 177

ప్రతిపదార్థం: ఇట్లు; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; బద్ధ, మత్సరుండు+అయి= క్రోధంతో(అసూయతో) కూడుకొనిన వాడై; పెటిఁగి= రెచ్చి; ఒండు+ఒండ= ఒకదానివెంట ఒకటి; ఒడ్డుచు; నిష్క, సహస్ర భరిత+అనేక+అయుత, కుండ, మండితంబులు+ అయిన= వేలకొలది వరహాలతో నిండి, పెక్కుపదివేల సంఖ్యలు గల కుండలతో అలంకరించబడినవైన; సువర్ణ భాండాగారంబులును= బంగారు బొక్కసాలును; వజ్రవైదూర్య, మరకత, మౌక్తిక, నీల, ప్రవాళ, పద్మరాగ+ఆది, వివిధ, శుద్ధ, విపుల, రత్న, పరిపూర్ణంబులు+ఐన= వజ్రాలు, వైదూర్యాలు, మరకతాలు, ముత్యాలు, ఇంద్రనీలాలు, పవడాలు, పద్మరాగాలు మొదలైన అనేకవిధాల- స్వచ్ఛాలు. విస్తారాలు అయిన రత్నాలతో నిండిన; రత్నభాండాగారంబులున్= రత్నాల కోశాలును; ప్రత్యేకంబు+అ= వేర్వేరుగా; పంచ, ద్రోణ, కాంచన, సంచితంబులు+అయిన= ఐదుతూముల బంగారు కూడబెట్టబడినవైన; చతుః+శత, నిధులును= నాలుగువందల నిధులను; మణి, కింకిణీ, జాల+అలంకృతంబులు+అయిన= మణుల చిరుగజ్జెల సమూహాలచేత అలంకరించబడిన వైన; అసంఖ్యాత, హయ, యూధంబులును= లెక్కలేనన్ని గుఱ్ఱాల సమూహాలును; జాతరూప, వరూధంబులున్= బంగారు కవచాలు కలవియు; కనక, కక్ష్యా, కుథ, సనాథంబులు+అయిన= బంగారుతో చేయబడిన (నడుముకు కట్టే) మోకులతో, (మీదపరిచే) చిత్రకంబళాలతో కూడుకొన్నవియు అయిన; మద+అంధ, గంధ, సింధుర, సందోహంబులున్= మదంచేత కన్నుగానని మదపుటేనుగుల సమూహాలును; పరార్ధ్య, రత్న, భూషణ, భూషితంబులు+ అయిన= శ్రేష్ఠములైన రత్నాల సొమ్ములచే అలంకరించబడిన; యోషిత్+సహస్రంబులును= వేలకొలది స్త్రీలును; అనుదిన+ అతిథిజన, భోజన, పాత్ర, హస్తులు+అయిన, శత, సహస్ర, పరిచారకులును= ప్రతిదినం అతిథులైన జనులయొక్క భోజన

పాత్రలను హస్తాలలో కలవాళ్ళయిన నూరువేలమంది సేవకులును; అర్జుననకున్; చిత్రరథుండు= గంధర్వరాజైన చిత్రరథుడు; ఇచ్చిన; గంధర్వ, హయంబులన్+తొట్టి= గంధర్వజాతి గుర్రాలు మొదలుకొని; దుగ్ధపాన, శాలితండుల, ఖాదనంబులన్= పాలు త్రాగటంచేత, వరిబియ్యం తినటంచేత, పెరుగుతున్న; జాతి+అశ్వ+అనేక+అయుతంబులున్= మేలుజాతిగుర్రాలు పెక్కుపదివేల సంఖ్యలును; అజ+అవి, గో, మహిష, ఖర, రాసభ, నివహంబులున్= మేకల, గొఱ్ఱెల, గోవుల, గేదెల, గాడిదల, కంచర గాడిదల సమూహాలును; ఒక్కొక్క; ఒడ్డనన= ఒడ్డనంలో; ఒడ్డి; ఓటుపడినన్= ఓడిపోగా; చూచి; విదురుండు; ధృతరాష్ట్రునకున్; రహస్యంబునన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు క్రోధంతో పెచ్చుపెరిగి ఒకదాని వెంట ఒకటి ఒడ్డుతూ - వేలకొలది వరహాలతో నిండి పదివేల సంఖ్యలు గల పెక్కు కుండలతో ఒప్పుతున్న బంగారు భాండాగారాలను, వజ్ర వైదూర్యమరకతాది పలువిధ స్వచ్ఛ విస్తార రత్నాలతో నిండిన రత్నభాండాగారాలను, ప్రత్యేకంగా ఐదుతూముల బంగారంతో కూడుకొన్న నాలుగువందలనిధులను, మణులసమూహాలతో, చిరుగజ్జెలసమూహాలతో అలంకరించబడిన లెక్కలేనన్ని గుర్రాల సమూహాలను, బంగారుకవచాలతో, నడుముకు కట్టే బంగారుమోకులతో, మీద పరిచే బంగారుచిత్రకంబళాలతో కూడుకొన్న మదపుటేనుగుల సమూహాలను, శ్రేష్ఠాలైన రత్నాల సొమ్ములతో అలంకరించబడిన వేలకొలది స్త్రీలను, ప్రతిదినం అతిథిజనుల భోజన పాత్రలను హస్తాల్లో ధరించిన నూరువేలమంది సేవకులను, అర్జునుడికి గంధర్వరాజు బహూకరించిన గంధర్వాశ్వాలు మొదలుకొని పాలు త్రాగటంచేత, వరిబియ్యం తినటంచేత పెరుగుతున్న పెక్కు పదివేల సంఖ్యల మేలుజాతిగుర్రాలను, మేకల, గుఱ్ఱాల, గోవుల, గేదెల, గాడిదల, కంచరగాడిదల సమూహాలను ఒక్కొక్క ఒడ్డన ఒడ్డి ఓడిపోవటం చూచి, విదురుడు ధృతరాష్ట్రునితో రహస్యంగా ఇలా అన్నాడు.

క. ఖలుఁ డీ దుర్యోధనుఁ డె । గ్గులతోడన యుద్భవిల్లె; గోమాయురుతం
బులు వించె, దుర్నిమిత్తం । బులు పెక్కులు వుట్టె వీని పుట్టిన వేళన్. 178

ప్రతిపదార్థం: ఖలుఁడు= దుర్మార్గుడు; ఈ; దుర్యోధనుఁడు; ఎగ్గులతోడన= దోషాలతోనే; ఉద్భవిల్లెన్= పుట్టినాడు; వీని, పుట్టిన, వేళన్= వీడు పుట్టిన సమయంలో; గోమాయు, రుతంబులు= నక్కల అరుపులు; వించెన్= వినిపించాయి; దుర్నిమిత్తంబులు= చెడ్డశకునాలు; పెక్కులు; పుట్టెన్.

తాత్పర్యం: దుర్మార్గుడైన దుర్యోధనుడు దోషాలతోనే జన్మించాడు. వీడు పుట్టినప్పుడు నక్కల అరుపులు వినబడ్డాయి. ఎన్నో చెడుశకునాలు పుట్టాయి.

వ. తొల్లి యెన్నండును బాపంబుం బొరయని మహాభిష భీమసేన ప్రతీప శంతనుల కులంబు దుర్యోధనుకారణంబునం బాపభూయిష్ఠంబు గానున్నయది; యొక్కని కారణంబునఁ గులంబున కెగ్గగు నేని వాని దూషించి కులంబు రక్షించుట ధర్మం బని శుక్రుండు చెప్పెఁ; గులరక్షణార్థం బంధక యాదవ వృష్ణి వీరులు కృష్ణు నియోగించి కులదూషకుండైన కంసుని వధియించిరి గావున. 179

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; ఎన్నండును; పాపంబున్; పొరయని= పొందని; మహాభిష, భీమసేన, ప్రతీప, శంతనుల, కులంబు; దుర్యోధను కారణంబునన్= దుర్యోధనుని కారణంగా; పాప, భూయిష్ఠంబు= పాపంతో నిండింది; కాన్+ఉన్న, అది= కాబోతున్నది; ఒక్కని, కారణంబునన్= ఒక్కని కారణంగా; కులంబునకున్= వంశానికి; ఎగ్గు+అగున్+ఏనిన్= కీడు

కలిగితే, వానిన్, దూషించి= వాణ్ణి నిందించి; కులంబు= వంశాన్ని అంతటినీ; రక్షించుట; ధర్మంబు+అని; శుక్రుండు; చెప్పెన్, కుల, రక్షణ+అర్థంబు= వంశాన్ని రక్షించటంకొరకు, అంధక, యాదవ, వృష్ణి, వీరులు= అంధక, యాదవ, వృష్ణి వంశాలకు చెందిన వీరులు; కృష్ణున్; నియోగించి= పంపి(ప్రయోగించి); కుల, దూషకుండు+ఐన= కులానికి చెడ్డపేరు తెచ్చేవాడైన; కంసునిన్; వధియించిరి= చంపారు; కావునన్.

తాత్పర్యం: ఇదివరకు ఎప్పుడూ పాపం అంటని మహాభిష, భీమసేన, ప్రతీప, శంతనులదైన ఈ వంశం దుర్యోధనుని కారణంగా పాపంతో నిండబోతున్నది. ఒకడి కారణంగా వంశాని కంతటికి కీడు కలిగితే అతణ్ణి నిందించి వంశాన్ని రక్షించటం ధర్మమని శుక్రాచార్యుడు చెప్పాడు. వంశాన్ని రక్షించుకోవటానికై అంధక యాదవ వృష్ణి వీరులు, శ్రీకృష్ణుణ్ణి పంపి, కులానికి చెడ్డపేరు తెచ్చే కంసుణ్ణి వధించారు. అందుచేత

విశేషం: మహాభిషుడే బ్రహ్మశాపంచేత ప్రతీపమహారాజుకుమారుడైన శంతనుడుగా జన్మించాడు. భీమసేనుడు ప్రతీపుని తండ్రి, ఋక్షుని కుమారుడు.

మత్తకోకిలము.

వాసవాత్మజుఁ బంపు మిప్పుడ వాఁడు ధర్మవిదుండు నీ
శాసనంబున నిగ్రహించు విచారదూరు సుయోధనున్;
భూసతీశ్వర! దీన నీకులమున్ మహీప్రజయున్ గత
త్రాసవృత్తిసుఖంబు వొందుఁ; బ్రధానవిగ్రహ మేటికిన్? 180

ప్రతిపదార్థం: భూసతీ+ఈశ్వర!= భూమి అనే స్త్రీకి భర్త అయినవాడా! ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఇప్పుడు+అ= ఈ క్షణమే; వాసవ+ఆత్మజున్= దేవేంద్రుని కుమారుడైన అర్జునుణ్ణి; పంపుము; వాఁడు; ధర్మ, విదుండు= ధర్మం తెలిసినవాడు; నీ శాసనంబునన్= నీ ఆజ్ఞచేత; విచార దూరున్, సుయోధనున్= ఆలోచనకు దూరమైన వాడైన దుర్యోధనుణ్ణి; నిగ్రహించున్= ఆపివేస్తాడు; దీనన్= దీనివలన; నీకులమున్; మహీప్రజయున్= భూమిలోని ప్రజయు; గత, త్రాస, వృత్తిన్= తొలగిపోయిన భయంతో కూడిన నడవడికతో; సుఖంబు; పొందున్; ప్రధానవిగ్రహము= గొప్పయుద్ధం; ఏటికిన్= ఎందుకు?

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రమహారాజా! ఇప్పుడే దేవేంద్రుని తనయుడైన అర్జునుణ్ణి పంపించు. వాడు ధర్మం తెలిసినవాడు. నీ ఆజ్ఞతో వివేకంలేని ఆ దుర్యోధనుణ్ణి ఆపగలడు. దీనివల్ల నీ కులం, భూమిమీద ప్రజ- భయం తొలగి సుఖంగా జీవిస్తారు. పెద్దయుద్ధం ఎందుకు?

విశేషం: విదురుడి వాక్యవిన్యాసాన్ని చిత్రించిన ఈ పద్యంలో దీప్తరసత్వం, ఔజ్జ్వల్యం శోభించి కాంతిగుణాన్ని రూపొందించాయి. (సంపా.)

ఉ. **ఇమ్మనుజాధమున్ గుణవిహీను బహిష్కృతుఁ జేసి ధర్మమా**
ర్గమ్మునఁ గౌరవాన్వయముఁ గావుము; పాండుతనూజులం బ్రతా
ప మ్మెసఁగంగ నేలు; మిది పథ్యము సు; మ్మొక నక్క నిచ్చి సిం
హమ్ముల విల్చికో లుఱదె? యన్నులె వారలు కౌరవేశ్వరా! 181

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= ఓ ధృతరాష్ట్రమహారాజా! ఈ+మనుజ+అధమున్= ఈ నీచుడైన మానవుణ్ణి; గుణ, విహీనున్= మంచి గుణాలు లేనివాణ్ణి; బహిష్కృతున్+చేసి= వెలివేయబడినవాణ్ణిగా చేసి - అంటే త్రోసిపుచ్చి; ధర్మ, మార్గమ్మునన్; కౌరవ+అన్వయమున్= కౌరవవంశాన్ని; కావుము= రక్షించుము; పాండు, తనూజులన్= పాండురాజకుమారులను; ప్రతాపమ్ము; ఎసగంగన్= అతిశయించేటట్లు; ఏలుము= పాలించుము; ఇది; పథ్యము= అనుసరించదగినమార్గం; సుమ్ము= సుమా!; ఒక; నక్కను; ఇచ్చి; సింహమ్ములన్; విల్చికోలు= కొనటం; ఉఅదు+ఎ= మేలుకాదా!; వారలు= పాండవులు; అన్యులు+ఎ= పరాయివాళ్ళా?

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రమహారాజా! ఈ నీచమానవుడు, గుణవిహీనుడు అయిన దుర్యోధనుణ్ణి వెలివేసి, ధర్మమార్గాన కౌరవవంశాన్ని కాపాడు. పాండవుల ప్రతాపం పెంపొందేటట్లు పాలించు. ఇది నీకు అనుసరించదగిన మార్గం సుమా! ఒక నక్కను ఇచ్చి సింహాలను కొనటం మేలు గాదా? పాండవులుమాత్రం పరాయివాళ్ళా?

విశేషం: అలం: దృష్టాంతం. గుణం: కాంతి. విదురుడి వాక్యాలు లోతైనవి. దుర్యోధనుడి చర్యలవలన వంశాని కంతటికీ, ప్రజల కందరికీ కీడు కలుగుతుం దని అతడు పుట్టినప్పుడు కలిగిన దుశ్శకునాలే సూచించా యనీ, అవన్నీ ఈ మాయాద్యూతం కారణంగా నిజం కాబోతున్నా యనీ పూర్వాపర సమన్వయంతో రాబోయే విపత్తును సూచించాడు. ఒకడివలన వంశానికి ముప్పు వచ్చేటట్లుంటే అతడిని నిందించటం ధర్మ మని కర్తవ్యాన్ని నిర్దేశించాడు. అర్జునుడు అతడిని నిర్జించగల డని, కులాన్ని రక్షించగల డని సూచించాడు. స్వీయపుత్రుడిని దూషించి పాండుపుత్రులను రక్షించటం ధర్మం కా దని అనుకోవ ద్దన్నాడు. పాండవులను తనపుత్రులవలెనే భావించు మని హితవు చెప్పాడు. పాండవులను కాపాడటం వంశాన్ని కాపాడటంగా చెప్పాడు. లేకపోతే ఘోరయుద్ధం జరుగుతుం దని హెచ్చరించాడు. సరళమైన దృష్టాంతాన్ని చూపించాడు. కుటిలమైన నక్కను ఇచ్చి సింహాలను కొనటంవంటి దా కార్యమన్నాడు. (సంపా.)

మధ్యాక్కర.

> **అంగారములు గొనువేడ్కఁ బుష్పఫలావళీ లలిత**
> **తుంగద్రుమప్రకరంబుఁ గరుణావిదూరుఁడై కాల్చు**
> **నంగారకారుఁ బోలంగ సమకట్టె నర్థలోభంబు**
> **నం గురుకులహానికరుఁడు ధారుణీనాథ! నీ సుతుఁడు.** **182**

ప్రతిపదార్థం: ధారుణీ నాథ= ఓ ధృతరాష్ట్రమహారాజా!; కురుకులహానికరుఁడు= కురువంశానికి కీడు కలిగించేవాడు; నీ, సుతుఁడు= నీ కుమారుడు; అర్థ, లోభంబునన్= ధనంమీది అత్యాశతో; అంగారములు= బొగ్గులు; కొను= తీసుకొను; వేడ్కన్= కోర్కెతో; పుష్ప, ఫల+ఆవళీ, లలిత, తుంగ, ద్రుమ, ప్రకరంబున్= పూలు, పండ్ల సమూహంతో అందమైన ఎత్తయిన చెట్ల సమూహాన్ని; కరుణా, విదూరుడు+ఐ= దయలేనివాడై; కాల్చు; అంగారకారున్= బొగ్గులు చేసేవాణ్ణి; పోలంగన్= పోలేటట్లు; సమకట్టెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రమహారాజా! కురువంశానికి కీడు కలిగించే నీకుమారుడు, ధనంమీది అత్యాశతో-పూలతో, పండ్లతో నిండి కనుల పండువుగా ఉన్న ఎత్తైన చెట్ల సమూహాన్ని బొగ్గులకోసం కఠినాత్ముడై కాల్చటానికి పూనుకొన్న బొగ్గులవాడిలా ఉన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ. గుణం: కాంతి, నానారుచిరార్థసూక్తిరత్నాకరమైన నన్నయ కవితలో ఈ పద్య మొక మేలిమి రత్నం. అలంకారం వలన వస్తువు ధ్వనిస్తున్నది. మాయాద్యూతంలో పాండవసంపదను మోసంతో హరించటం ఎటువంటి చర్యయో ఇందులో చెప్పబడింది. పుష్పఫలాలతో కూడుకొన్న మహావృక్షాలను బొగ్గులకొరకు తగులబెట్టటంవలె ఉన్నదనటం విశేషం. దానికి కారణం ధనాశ. ఈ గుణం వంశనాశనకరుడికే కలుగుతుం దని సూచన. బొగ్గులవ్యాపారం చేసేవాడు బొగ్గులనే కోరుకొంటాడు. వంశనాశనం కోరుకొనేవాడు ఇక్కడ బొగ్గులుకోరేవాడు. పాండవులను సర్వనాశనం చేయటానికి తలపెట్టిన కపటద్యూతం అప్పుడు పాండవవృక్షదహనంగా భాసించటం సహజం. కాని, కురుక్షేత్రయుద్ధంలో ఏచెట్లు కాలిపోతాయో ఊహించుకొను మని ధ్వని. కౌరవులు తమ వంశాంకురాలుకూడా మిగలకుండ నశించిపోతారు. పాండవవృక్షాలను తగులబెట్టా లనుకొన్న దుర్యోధను డనేఅంగారకారుడు తన కుటుంబాన్నే కాల్చుకొంటాడని ధ్వని. (సంపా.)

ఆ. అధికదర్పయుక్తమై బలీవర్దంబు । నగముదరి విదారణంబు సేయఁ
గాలుద్రవ్వునట్లు గడు బలాఢ్యులతోడ । నేచి వీఁడు విగ్రహింపఁ దొడఁగె. 183

ప్రతిపదార్థం: అధిక, దర్ప, యుక్తము+ఐ= మిక్కిలి పొగరెక్కినదై; బలీవర్దంబు= ఎద్దు; నగము, దరిన్= కొండచరియను; విదారణంబు, చేయన్= చీల్చివేయటానికి; కాలుద్రవ్వునట్లు; వీఁడు= ఈ దుర్యోధనుడు; ఏచి= విజృంభించి; కడున్, బల+ఆఢ్యుల తోడన్= మిక్కిలి బలవంతులతో; విగ్రహింపన్= పోరుసలుపటానికి; తొడఁగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: ఎంతో పొగరెక్కిన ఎద్దు కొండచరియను చీల్చటానికి కాలుద్రవ్వినట్లు, ఈ దుర్యోధనుడు విజృంభించి మహాబలవంతులతో పోరు సలుపటానికి పూనుకొన్నాడు.

విశేషం: అలం: ఉపమ. (జనజీవనంలోనుండి ఎన్నుకొన్న ఉపమానాలను సార్థకంగా వాడటం నన్నయ ఉపజ్ఞ. ఎద్దు మదించబట్టే ఎవరితో ఢీకొంటున్నదీ తెలియక కొండతో ఢీకొనటం. ఫలితం తల పగలటం. ఈ అర్థం అలంకారకృతవస్తుధ్వని. - సంపా.)

వ. 'ఇంక నయిన నుపేక్షింపక యీ దుష్టద్యూతంబు వారింపు 'మనినఁ బుత్త్రస్నేహంబున నెద్దియుం జేయునది నేరక ధృతరాష్ట్రుండు మిన్నకుండె; నంత విదురుండు దుర్యోధనున కభిముఖుండై యి ట్లనియె. 184

ప్రతిపదార్థం: ఇంకన్; అయినన్; ఉపేక్షింపక= అశ్రద్ధ చేయక; ఈ, దుష్ట, ద్యూతంబు= ఈ దుర్మార్గపు జూదం; వారింపుము= ఆపుము; అనినన్; పుత్త్రస్నేహంబునన్= పుత్రులమీది ప్రేమచేత; ఎద్దియున్= ఏదీ; చేయునది, నేరక= చేయటానికి తోచక; ధృతరాష్ట్రుండు; మిన్నక, ఉండెన్= ఊరకున్నాడు; అంతన్; విదురుండు; దుర్యోధనునకున్; అభిముఖుండు+ఐ= ఎదురు తిరిగిన ముఖం కలవాడై - అంటే దుర్యోధనునివైపు తిరిగి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఇంకా అశ్రద్ధ చెయ్యక ఈ దుర్మార్గపు జూదాన్ని ఆపు' అని అనగా పుత్రులమీది మమకారంతో ఏమీ చెయ్యటానికి తోచక ధృతరాష్ట్రుడు ఊరకున్నాడు. అప్పుడు విదురుడు దుర్యోధనుని వైపు తిరిగి ఇలా అన్నాడు.

విశేషం: విదురోపదేశాన్ని వినకుండ ధృతరాష్ట్రుడు ఉపేక్ష వహించాడు. ఇది మాయాద్యూతంకంటె మహాపకారం చేసింది కౌరవులకు. (సంపా.)

క. న్యాయంబు విడిచి సౌబలు । మాయా ద్యూతమునఁ బాపమతివై భరతా
మ్నాయు లగు పాండవేయుల । శ్రీ యిమ్మెయిఁ గొనిన నిన్నుఁ జీ యనరె యొరుల్. 185

ప్రతిపదార్థం: న్యాయంబు; విడిచి; సౌబలు= శకునియొక్క; మాయాద్యూతమునన్= కపటజూదంచేత; పాపమతివి+ఐ= చెడుబుద్ధి కలవాడవై; భరత+ఆమ్నాయులు+అగు= భరతుని సంప్రదాయానికి చెందిన వాళ్ళయిన - అంటే భరతవంశీయులయిన పాండవేయుల= పాండవులయొక్క; శ్రీ= సంపద; ఈ+మెయిన్= ఈ విధంగా; కొనిన= గ్రహించిన; నిన్నున్; ఒరుల్= ఇతరులు; చీ, అనరె= ఛీ అని అనరా?

తాత్పర్యం: న్యాయం వదలి, శకుని మాయాద్యూతంతో పాపబుద్ధి కలవాడివై, భరతవంశం వాళ్ళయిన పాండవుల సంపద ఈ విధంగా అపహరిస్తే ఇతరులు నిన్ను ఛీకొట్టరా?

విశేషం: ప్రజలు ఛీకొట్టే కారణాలు ఇందులో ఆరు చెప్పబడుతున్నాయి. 1. అన్యాయంగా మాయతో పాపబుద్ధితో పాండవసంపదను హరించటం. 2. పాండవులు భరతవంశంవారు కావటంచేత ధర్మాత్ములే కాక దాయాదులు, స్వీయవంశంవారే కావటం, దానివలన తమవారినే తాను నిలువుదోపిడీ చేసినట్లు కావటం. 3. అన్నదమ్ములను శత్రువులుగా భావించటం. 4. పాండవవినాశనం స్వీయవంశనాశనం కా దని అవివేకంగా భావించటం. 5. ఉత్తమవంశజులు ఆచరించవలసిన ఉదాత్తచర్య మాయాద్యూతం కాకపోవటం. 6. అపహరణభావం అధర్మమూలం కావటం. విదురుడి వివేకానికి ఈ హితవు విశిష్టతార్కాణం. (సంపా.)

క. **ధృతిమంతుల భుజవిక్రమ । జితశత్రులఁ బాండవేయసింహులను మదో**
ద్ధతిమైఁ బరాజితులఁ జే । సితి; వారల కిట్లు నికృతి సేయుట లగ్గే? 186

ప్రతిపదార్థం: ధృతిమంతులన్= ధైర్యవంతులను; భుజ, విక్రమ, జిత, శత్రులన్= భుజ పరాక్రమంచేత జయించిన శత్రువులు కలవారిని; పాండవేయ సింహులను= పాండవశ్రేష్ఠులను; మద+ఉద్ధతిమైన్= పెచ్చుపెరిగిన పొగరుతో; పరాజితులన్= ఓడిపోయినవారినిగా; చేసితి= చేసినావు; వారలకున్; ఇట్లు; నికృతి= మోసం; చేయుట; లగ్గు+ఏ= మంచిదా? (కాదని భావం).

తాత్పర్యం: ధైర్యవంతులు, భుజపరాక్రమంచేత శత్రువులను జయించినవాళ్ళు అయిన పాండవశ్రేష్ఠులను పెచ్చుపెరిగిన పొగరుతో జూదంలో ఓడిపోయేటట్లు చేశావు. వాళ్ళను ఇలా మోసం చెయ్యటం మంచిదా?

విశేషం: విదురుడు ఉపయోగించిన 'ధృతిమంతులు, భుజవిక్రమజితశత్రులు, పాండవేయసింహులు' అనే పదాలు మూడూ పాండవుల శక్తిసామర్థ్యాలను, రానున్న ప్రమాదాలను ధ్వనింపజేస్తున్నాయి. ఉత్తరపదంగా ఉండే సింహపదం సామాన్యంగా శ్రేష్ఠవాచకమే. కాని ఇక్కడ ఆ పదం ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నది. ప్రమాద తీవ్రతను తెలియజేస్తున్నది. ఒకవేళ వంచించి కొట్టినా, సింహాన్ని దెబ్బకొట్టటం మంచిదా? ఆలోచించుకొమ్మనే భావాన్ని స్ఫురింపజేస్తున్నది.

వ. **అనిన విని విదురున కలిగి దుర్యోధనుం డి ట్లనియె.** 187

తాత్పర్యం: అనగా విని దుర్యోధనుడు కోపించి విదురుడితో ఇలా అన్నాడు.

సీ. **పరుల గుణంబులు పలుమాఱుఁ గీర్తింతు; । పక్షంబ పలుకుదు పాండవులకు;**
ధార్తరాష్ట్రుల సంతతంబు నిందింతువు; । కుడిచిన చోటికిఁ గూర్వ వెపుదు;
నుత్సంగతలమున నుగ్రవిషోరగం । బున్నట్లు నీవు మా యొద్ద నునికి;
పరులసంపద సుఖోపాయబలంబునఁ । గొనుట భూపతులకు గుణము కాదె?

ఆ. యడుగకయును గర్జ మది యిష్టుఁడై చెప్పు। నతని కాడఁ దగిన యదియ; నన్ను
నిట్టు నట్టు ననఁగ నేల? నీ యిమ్ముల। నుండు; బుద్ధి సెప్పకుండు మాకు. 188

ప్రతిపదార్థం: పరుల, గుణంబులు= శత్రువుల గుణాలనే; పలుమాఱున్= పెక్కుమారులు; కీర్తింతు= పొగుడుతావు; పాండవులకున్; పక్షంబు+అ= పక్షపాతంగానే; పలుకుదు= మాటాడతావు; ధార్తరాష్ట్రులన్= ధృతరాష్ట్రుని పుత్రులను; సంతతంబు= ఎల్లప్పుడు; నిందింతువు; కుడిచిన చోటికిన్= అన్నం తిన్న ఇంటికి; ఎపుడున్= ఎన్నడును; కూర్పవు= అనుకూలంగా ఉండవు; నీవు; మా, ఒద్దన్= మా దగ్గర; ఉనికి= ఉండటం; ఉత్సంగ, తలమునన్= ఒడిలో; ఉగ్ర విష+ఉరగంబు= భయంకరమైన విషసర్పం; ఉన్నట్లు; పరుల, సంపద= శత్రువుల ఐశ్వర్యం; సుఖ+ఉపాయ, బలంబునన్= సుఖమైన ఉపాయబలంచేత; కొనుట= తీసుకోవటం; భూపతులకున్= రాజులకు; గుణము, కాదె= స్వభావంకదా! ఇష్టుఁడు+ఐ= ఇష్టమైనవాడై - అంటే స్నేహితుడై; అడుగకయును= అడగకుండానే; కర్జము+అది= చేయదగినదాన్ని; చెప్పు, అతనికి= బోధించేవాడికి; ఆడన్, తగిన, అదియ= మాటాడదగిందే; నన్నున్; ఇట్టున్, అట్టున్, అనఁగన్= ఈవిధంగా చేసినావు, ఆవిధంగా చేసినావు అని తప్పులెన్నటం; ఏల= ఎందుకు? నీ, ఇమ్ములన్= నీ స్థానంలో; ఉండు=(నీవు) ఉండుము - అంటే నీ హద్దుల్లో నీవు ఉండుము; మాకున్; బుద్ధి; చెప్పక; ఉండు.

తాత్పర్యం: శత్రువుల గుణాలనే నీవు పలుమారు పొగడుతావు. పాండవ పక్షాననే పలుకుతావు. ధృతరాష్ట్రుని పుత్రులను ఎల్లప్పుడూ నిందిస్తావు. తిన్నయింటికి ఎన్నడూ అనుకూలంగా ఉండవు. నీవు మావద్ద ఉండటం ఒడిలో భయంకరమైన విషసర్పం ఉన్నట్లే. శత్రుసంపదను సులభోపాయంతో గ్రహించటం రాజుల సహజస్వభావమే కదా! స్నేహితుడు అడగకుండానే ఇది చెయ్యదగు నని చెప్పవచ్చు. కాని నీవు నన్ను 'ఈవిధంగా చేశావు, ఆ విధంగా చేశావు' అని తప్పు లెన్నటం ఎందుకు? నీ హద్దుల్లో నీవు ఉండు. మాకు బుద్ధులు చెప్పవద్దు.

విశేషం: అలం: ఉపమ. విదురుని హితం దుర్యోధనునికి ఎంత వెగటుగా ఉందో ఈ పద్యం వ్యక్తం చేస్తున్నది. (దుర్యోధనుడు ఈ విధంగా విదురుణ్ణి నిందించి వివేకవిహీను డని నిరూపించుకొన్నాడు. హితం చెపితే స్నేహితుడు చెప్పా లని ఎత్తిపొడిచాడు. విదురుడు తనకు విరోధి అని బహిరంగంగా నిందించాడు. హితుణ్ణి హితుడిగా గుర్తించే వివేకాన్ని కోల్పోయి, శకునిని హితుడిగా భావిస్తున్న దుర్యోధనుణ్ణి చూచి విదురుడు విసుక్కున్నాడు. హితుడుగా అతణ్ణి మందలించకుండ ఉండలేకపోయాడు. అందుకే మళ్ళీ మాట్లాడుతున్నాడు- నిజానికి తాను కౌరవహితాన్ని కోరేవాడు కాబట్టి. - సంపా.)

వ. అనిన విదురుం డి ట్లనియె. 189

తాత్పర్యం: అనగా విదురుడు ఇలా అన్నాడు.

క. చెడఁ గఱపువార చెలులుం। గడుకొని నీయట్టివారి కర్జంబులు చె
ప్పెడు వారుఁగాక, నీకున్। మడవక మా యట్టివారి మాటలు గొఱయే? 190

ప్రతిపదార్థం: చెడన్= చెడిపోయేటట్లు; కఱపువారు+అ= బోధలు చేసేవారే; చెలులున్= స్నేహితులు; కడుకొని= యత్నించి; నీ, అట్టి, వారి= నీవంటి వారియొక్క; కర్జంబులు= చేయదగినపనులు; చెప్పెడువారున్= చెప్పేటటువంటివాళ్ళు; కాక= అట్లాకాక; మా, అట్టి, వారి, మాటలు; నీకున్, మడవక= నిష్ఫలాలుకాక, కొఱయే= ప్రయోజనకరా లౌతాయా?

తాత్పర్యం: చెడిపొయ్యేటట్లు చెడ్డబుద్ధులు చెప్పేవాళ్ళే నీకు స్నేహితులు; నీవంటి వాడికి కర్తవ్యాలు చెప్పేవాళ్ళు. మావంటివాళ్ళమాటలు నీపట్ల వ్యర్థా లవుతాయి కాని, ప్రయోజనకరా లౌతాయా?

విశేషం: హితాన్ని చెప్పేవాడే హితుడు. స్నేహితుడు. చెడు చెప్పేవాడు హితుడిలా తోచే అహితుడు. దుర్యోధనుడు అహితులను స్నేహితులుగా చేసుకొన్నాడు. వారి పన్నాగాలు మన్నించాడు. హితులను విరోధులుగా భావిస్తున్నాడు. ఇది అతనిలోని విపరీతబుద్ధి. దానిని విదురుడు అధిక్షేపించాడు. కాని, దుర్యోధనుడు వినడు. (సంపా.)

తే. ప్రియము పలికెడువారిన పెద్ద మెత్తు, । రప్రియంబును బథ్యంబునైన పలుకు
వినఁగ నొల్లరు, గావున వేడ్కదానిఁ । బలుక రెవ్వరు నుత్తమప్రతిభు లయ్యు. 191

ప్రతిపదార్థం: ప్రియము= వినటానికి ఇంపైనమాట; పలికెడు; వారిని+అ= వారినే; పెద్ద, మెత్తురు= ఎక్కువగా మెచ్చుకొంటారు; అప్రియంబును= వినటానికి ఇంపు కాకుండ; పథ్యంబును+ఐన= మేలు చేసేదైన, పలుకు= మాట; వినఁగన్= వినటానికి; ఒల్లరు= ఇష్టపడరు; కావునన్= అందుచేత; ఉత్తమ, ప్రతిభులు+అయ్యున్= గొప్పతెలివిగలవాళ్ళయి కూడ; ఎవ్వరున్= ఎవరును; దానిన్= అట్టి మాటను-అంటే వినటానికి కటువుగా ఉన్నను మేలు చేసేమాటను; పలుకరు= చెప్పరు.

తాత్పర్యం: వినటానికి ఇంపుగా ఉండే మాటను పలికేవాళ్ళనే ఎక్కువగా మెచ్చుకొంటారు. మేలు చేసేదైనా వినటానికి ఇంపుగా ఉండని మాటను వినటానికి ఎవరూ ఇష్టపడరు. అందుచేత గొప్ప ప్రతిభావంతులుకూడ అలాంటి కటువైన మాట చెప్పరు.

విశేషం: 'హితం మనోహారి చ దుర్లభం వచః' వంటి హితోక్తుల ప్రక్క నిలువదగిన రుచిరార్థసూక్తి ఇది. (సంపా.)

తే. మొదల నప్రియ మయ్యును దుదిఁ గరంబు । పథ్య మగు పల్కు ప్రియులందు బలిమి నైనఁ
బలుక వలయు మోమోడక యొలసి యట్టి । వాఁడు దగు సహాయుండు భూవల్లభునకు. 192

ప్రతిపదార్థం: మొదలన్= మొదట; అప్రియము+అయ్యును= వినటానికి ఇంపు కాకున్నను; తుదిన్= చివరకు; కరంబు= మిక్కిలి; పథ్యము+అగు= మేలు చేసేదైన; పల్కు= మాట; ప్రియుల+అందున్= ఇష్టులైనవాళ్ళకు; బలిమిన్+ఐనన్= బలవంతంగానైనా; మోమోడక= మొగమోటమి లేకుండా; ఒలసి= చెంతచేరి; పలుకవలయున్; అట్టివాఁడు; భూవల్లభునకున్= భూపతికి-రాజుకు; తగు, సహాయుండు= తగిన సహాయం చేసేవాడు - అంటే హితుడు.

తాత్పర్యం: మొదట వినటానికి ఇంపు కాని దైనా, చివరికి మేలు చేసే మాటను, ఇష్టులైనవాళ్ళ చెంత చేరి, మొగమోటమి లేకుండ, బలవంతంగానైనా చెప్పాలి. అలాంటివాడే రాజుకు తగినసహాయం చేసేవాడు.

విశేషం: విదురుని హితవాక్యాలు దుర్యోధనునికి ఎలా ఉన్నా, లోకానికి మాత్రం శిరోధార్యాలు.

వ. 'ఏను సపుత్త్రకుండైన వైచిత్రవీర్యు కార్యంబునకు హితుండనై నెగడుదు; నట్టి న న్నన్యథాబుద్ధి నొల్లక పలికితి; పాండవులతోడి విగ్రహంబు లగ్గుగా'దని చెప్పి విదురుండు విగతవచనుండై యుండె; నంత శకుని ధర్మనందనున కి ట్లనియె. 193

ప్రతిపదార్థం: ఏను= నేను; సపుత్త్రకుండు+ఐన= పుత్త్రులు కలవాడైన; వైచిత్రవీర్యు, కార్యంబునకున్= ధృతరాష్ట్రుడు చేయదగినపనికి; హితుండను+ఐ= మేలు కోరేవాడినై; నెగడుదున్= ఉంటాను; నన్నున్; అన్యథా, బుద్ధిన్= వేరొక విధమైన తలంపుతో; ఒల్లక= ఇష్టపడక; పలికితి= పలికావు; పాండవులతోడి; విగ్రహంబు= వైరం; లగ్గు, కాదు= మేలు కాదు; అని; చెప్పి; విదురుండు; విగత వచనుండు+ఐ= మాట మానినవాడై; ఉండెన్; అంతన్; శకుని; ధర్మనందనునకున్; ఇట్లు+అనియెన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నేను పుత్రులు గల ధృతరాష్ట్రునికి మేలు కోరేవాణ్ణి. నన్ను వేరొక విధంగా అర్థం చేసుకొన్నావు. త్రోసిపుచ్చి మాట్లాడావు. పాండవులతో వైరం మంచిది కాదు' అని విదురుడు మౌనం వహించాడు. అప్పుడు శకుని ధర్మరాజుతో ఇలా అన్నాడు.

విశేషం: 'ఏ నపుత్రకుండయ్యు' అనే పాఠాంతరం కొన్నిప్రతుల్లో ఉంది. ఇది కూడ గ్రహించదగిన పాఠమే. 'నాకు ఏవిధమైన స్వార్థం లేదు'. అనే అర్థంలో విదురుడు ఇలా అనటం ఉచితమే. (ప్రస్తుతపాఠంకూడ సార్థకమే. విదురుడు మహామంత్రిస్థానంలో ఉన్నాడు. అతడు రాజును, రాజ్యాన్నీ రక్షించాలి. రాజు పుత్రవంతుడైతే వాళ్ళను కూడా రక్షించే ఉపాయం ఆలోచించటం అతని కర్తవ్యం. అందువల్ల విదురుడు దుర్యోధనాదుల యోగక్షేమాలనుగూర్చి మాట్లాడాడు. అది రాజ్యవ్యవస్థ తెలిసిన ఉచితజ్ఞునికి తెలియదగిన అంశం. దుర్యోధనుడు విదురుణ్ణి అపార్థం చేసుకున్నాడు. నిందించాడు. కాని, అతనికికూడ హితవుచెప్పటం తన ధర్మ మని విదురుడు భావించాడు. నిండుకొలువులోనే వివరించి చెప్పాడు. మారుమాటాడని ధృతరాష్ట్రునిలా తానుకూడ నిర్లిప్తు డైనాడు. హితవు చెప్పని దోషం అతనికి కలుగదు. హితవు పాటించని దోషం ధృతరాష్ట్ర దుర్యోధనులదే. కపటవర్తనుల నడుమ కటకటపడుతున్న ధర్మస్వరూపుడు విదురుడు. - సంపా.) సంస్కృత భారతంలో విదురునికి సంతానం ఉన్నట్లుగా చెప్పబడింది - (ఆ.పర్వం. 113 ఆధ్యాయం 12,13,14 శ్లోకాలు).

ఉ. 'ఎల్లధనంబు నోటువడి తిందుకులేశ్వర! యింక నొడ్డఁగా
మొల్లము నాకుఁ జూపు'మని ముందట సారెలు ద్రోచి యాడఁగా
నొల్లకయున్న సౌబలున కున్నతచిత్తుఁడు ధారుణీతలం
బెల్లను నొడ్డి యోటువడియెన్ బలవద్వ్యసనాభిభూతుఁడై. 194

ప్రతిపదార్థం: ఇందు కుల+ఈశ్వర= ఓ చంద్రవంశపురాజా! ధర్మరాజా! ఎల్ల; ధనంబున్= ధనాన్ని అంతను; ఓటు, పడితి= ఓడిపోయావు; ఇంకన్, ఒడ్డగాన్= పందెంఒడ్డటానికి; మొల్లము= ధనం; నాకున్; చూపుము; అని; ముందట; సారెలు= పాచికలు; త్రోచి= పడవేసి; ఆడఁగాన్= ఆడటానికి; ఒల్లక+ఉన్న= ఇష్టపడకున్న; సౌబలునకున్= శకునికి; ఉన్నత, చిత్తుఁడు= గొప్పమనస్సు కలవాడు - ధర్మరాజు; బలవత్+వ్యసన+అభిభూతుఁడు+ఐ= బలమైన ద్యూతవ్యసనంచేత తిరస్కరించబడినవాడై; ధారుణీతలంబు+ఎల్లను= రాజ్యాన్నంతా; ఒడ్డి; ఓటు, పడియెన్= ఓడిపోయాడు.

తాత్పర్యం: 'ఓ చంద్రవంశపురాజా! ధర్మరాజా! ఉన్న సంపదనంతా ఓడిపోయావు. ఇంకా పందెం ఒడ్డటానికి నాకు ధనం చూపు' అని సారెలు ముందర పడవేసి ఆట మానిన శకునికి, గొప్ప మనస్సు కల ధర్మరాజు బలమైన ద్యూతవ్యసనానికి లొంగిపోయి రాజ్యాన్నంతా ఒడ్డి ఓడిపోయాడు.

వ. ఇట్లు దేవభోగ బ్రాహ్మణ వృత్తులు దక్కఁ దక్కిన మహీతలంబును, బ్రాహ్మణులు దక్క సర్వప్రకృతిజనులను, రాజ పుత్త్రుల నొక్కొక్క యొడ్డున నొడ్డి యోటువడి వెండియు. 195

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దేవభోగ, బ్రాహ్మణవృత్తులు= గుడులలో దేవుళ్ళ ధూపదీపాలంకార నైవేద్యాలకొరకు, బ్రాహ్మణుల జీవనోపాధికొరకు ఇచ్చిన భూములు - అంటే దేవాలయాలకు, బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన మళ్ళు, మాన్యాలు; తక్కన్= తప్ప; తక్కిన, మహీతలంబును= తక్కిన భూమిని; బ్రాహ్మణులు; తక్కన్= తప్ప; సర్వ, ప్రకృతి జనులను= అందరు సామాన్య మానవులను; రాజపుత్రులన్; ఒక్కొక్క; ఒడ్డునన్, ఒడ్డి; ఓటు, పడి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ఈవిధంగా - దేవాలయాల్లోని దేవుళ్ళ ధూపదీపాలంకార నైవేద్యాలకు, బ్రాహ్మణుల జీవనోపాధికి దానాలుగా ఇచ్చిన భూములు తప్ప, తక్కిన భూమిని, బ్రాహ్మణులు తప్ప సామాన్యజనులందరిని, రాజపుత్రులను, ఒక్కొక్క పందెంలో ఒడ్డి ఓడిపోయాడు. మళ్ళీ

ధర్మరాజు తమ్ములను ద్రౌపదిని జూదమునం దొడ్డి యోడుట

సీ. **తమ్ముల నత్యంత ధర్మసమేతుల । నాయతబాహుల నాజిజయుల**
నాదిత్యతేజుల నాదిభూపాలక । చరితుల నభిమానసత్యరతుల
సహదేవనకులవాసవసుతభీములఁ । గ్రమమున నలువురఁ గౌరవేంద్రుఁ
డొక్కొక్క యొడ్డున నొడ్డి తన్నును నొడ్డి । యుక్కివంబున నప్పు డోటు వడిన

ఆ. **నతనిఁ జూచి శకుని యనియె 'నిట్లేల ని । న్నొడ్డి తధిప! నీకు నొండుధనము**
గలదు; మఱచి తెట్లు? కమలాక్షి పాంచాల । కన్య నీకు ధనము గాదె?' యనిన. 196

ప్రతిపదార్థం: తమ్ములన్; అత్యంత, ధర్మ, సమేతులన్= మిక్కిలి ధర్మంతో కూడుకొన్నవాళ్ళను - అంటే పరిపూర్ణంగా ధర్మాన్ని అనుసరించేవాళ్ళను; ఆయతబాహులన్= పొడవైన చేతులుగలవాళ్ళను; ఆజిజయులన్= యుద్ధంలో గెలుపొందే స్వభావం కలవాళ్ళను; ఆదిత్య, తేజులన్= సూర్యునితో సమానమైన తేజస్సు కలవాళ్ళను; ఆది, భూపాలక, చరితులన్= తొలిరాజుల నడవడి కలవాళ్ళను; అభిమాన, సత్య, రతులన్= ఆత్మగౌరవంలోను, సత్యంపట్లను ప్రీతి కలవాళ్ళను; సహదేవ, నకుల, వాసవసుత (అర్జున) భీములన్; క్రమమునన్= వరుసగా; నలువురన్; కౌరవ+ఇంద్రుఁడు= కౌరవప్రభువైన ధర్మరాజు; ఒక్కొక్క; ఒడ్డునన్= పందెంలో; ఒడ్డి= (పణంగా) పందెంలో ఒడ్డి; తన్నునన్= తనను కూడ; ఒడ్డి; ఉక్కివంబునన్= మోసంచేత; ఓటు, పడినన్= ఓడిపోగా; అతనిన్= ఆ ధర్మరాజును; చూచి; శకుని; అనియెన్; అధిప= ఓ ధర్మరాజా! ఇట్లు= ఈ విధంగా; ఏల; నిన్ను; ఒడ్డితివి; నీకున్; ఒండు= మరొక; ధనము; కలదు; మఱచితి+ఎట్లు= ఎలా మరిచిపోయావు?; కమలాక్షి= కమలాలవంటి కన్నులు కలదైన; పాంచాల, కన్య= పాంచాలరాజుకూతురు - ద్రౌపది; నీకున్; ధనము; కాదె; అనినన్.

తాత్పర్యం: పూర్తిగా ధర్మాన్ని అనుసరించేవాళ్ళు, విశాలమైనభుజాలుగలవాళ్ళు, యుద్ధంలో జయశీలురు, సూర్యునితో సమానమైన తేజస్సు కలవాళ్ళు, తొలిరాజులవలె మంచి నడవడి కలవాళ్ళు, ఆత్మగౌరవంలో, సత్యంలో ప్రీతిగలవాళ్ళు అయిన తమ్ములు - సహదేవనకులార్జునభీమసేనులు నలుగురిని వరుసగా ధర్మరాజు ఒడ్డి ఓడిపోయాడు. కడకు తననుకూడ ఒడ్డుకొని వంచనకు గురిఅయి ఓడిపోగా, శకుని చూచి, 'ఓ ధర్మరాజా! ఈ విధంగా ని న్నేల ఒడ్డుకొన్నావు? నీకు ఇంకొక ధనం ఉందిగదా! ఎలా మరచావు? కమలాక్షి ద్రౌపది నీధనం కాదా?' అన్నాడు.

విశేషం: ఇక్కడ శకుని వేసిన ప్రశ్న జటిలమైంది. ఆ చిక్కు ధర్మరాజుకే అర్థమౌతుంది. ధర్మరాజు తనను తాను పణంగా పెట్టుకొన్నప్పుడు శకుని మాట్లాడలేదు. అతను ఓడిన తరువాత మరొక ధనం ఉం దని జ్ఞాపకం చేశాడు. త న్నోడిన ధర్మజుడు దాసుడు కావచ్చు కాని, అతనిభార్యమీది అధికారం అతని కున్న దని సూచనచేయటం ఒక అర్థం. ధర్మజుడు ఓడాడు కాబట్టి శకుని చెప్పినట్లు చేయటం కర్తవ్యం కావటం మరొక అర్థం. ఈ రెండింటిచేత బంధించబడిన ధర్మజుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భార్యను పణంగా పెట్టటానికి పూనుకొన్నాడు. దీనిలోని ధర్మసూక్ష్మాన్ని గురించి ద్రౌపది నిండుసభలో ప్రశ్నించబోతున్నది. (వివరాలకు పీఠిక చదవండి - సంపా.)

చ. అలయక వెండియుం గడఁగి యక్షరతుండయి ద్రౌపదిన్ మహో
త్పలదళచారునేత్రఁ గులభామఁ బణంబుగఁ జేసి యొడ్డి సౌ
బలఖలుచేత నోటువడి పాండుసుతుం డుడిగెన్ ధనంబు ల
గ్గలముగ నొడ్డలేమి గతగర్వమునం గడు దీనవక్త్రుఁడై. 197

ప్రతిపదార్థం: అలయక= ఆలస్యంచేయక; వెండియున్= మళ్ళీ; కడఁగి= పూనుకొని; అక్షరతుండు+అయి= పాచికలందు ప్రీతికలవాడయి; మహా+ఉత్పల, దళ, చారునేత్రన్= పెద్దకలువరేకులవంటి అందమైన కన్నులు కలదానిని; కులభామన్= కులకాంతను; ద్రౌపదిన్; పణంబుగన్+చేసి= పందెంగా జేసి; ఒడ్డి; సౌబలఖలుచేతన్= సుబలునికుమారుడు శకుని అనే దుర్మార్గుని చేత; ఓటు, పడి= ఓడిపోయి; పాండు, సుతుండు= పాండురాజుకుమారుడైన ధర్మరాజు; ధనంబులు; అగ్గలముగన్= అధికంగా; ఒడ్డలేమి= ఒడ్డలేక; గత, గర్వమునన్= కోల్పోయిన గర్వంతో; కడున్, దీన, వక్త్రుఁడు+ఐ= మిక్కిలి దీనమైన ముఖంకలవాడై; ఉడిగెన్= పాచికల ఆట చాలించాడు.

తాత్పర్యం: ఆలస్యం చెయ్యకుండా, పాచికలమీది ప్రీతితో, ధర్మరాజు మళ్ళీ ఆటకు పూనుకున్నాడు. కలువరేకులవంటి కన్నులు కలది, కులకాంత అయిన ద్రౌపదిని పణంగా ఒడ్డాడు. దుష్టశకుని చేతుల్లో ఆమెను కూడ ఓడిపోయాడు. ఇంకా ఒడ్డటానికి ధనం లేదు. అందుచేత గర్వాన్ని కోల్పోయాడు. ఎంతో దీనమైన ముఖంతో అప్పుడు ఆట చాలించాడు.

విశేషం: ధర్మజుని ద్యూతవ్యసనం కడకు ధర్మపత్ని ద్రౌపదిని ఓడిపోయేదాకా సాగితేకాని ఆగలేదు. మానవస్వభావంలో వ్యసనపరత ఎంత బలీయమో, అన్నిధర్మాలు తెలిసిన ఆ ధర్మరాజునమతనే అది ఎంతగా తారుమారు చేసిందో - మహాభారతం ఈ ఘట్టంలో మరపురానంత బలంగా ప్రదర్శించింది.

సీ. ఆతనిఁ జూచి ద్రోణాచార్య కృప భీష్ము । లవిరళ స్వేదాంగు లగుచు వృద్ధ
జనులును దారు నిశ్శబ్ద నిరంతర । ముఖులైరి; విదురుండు మొగము వాయ
నిడి తలవాంచి త న్నెఱుఁగక దుఃఖితుం । డై యుండెఁ; దక్కిన యా సదస్సు
లందఱుఁ బ్రబలబాష్పాంబుధారాకులి । తాక్షులై; రత్యుచ్ఛమై పయోధి

ఆ. పటురవాభమై సభాక్షోభ మయ్యె; దు । శ్శాసనుండుఁ గర్ణసైంధవులును
నధికహర్షవికసితాస్యంబు లొప్ప నొం । డొరులఁ జూచి నగుచు నుండి రపుడు. 198

ప్రతిపదార్థం: ఆతనిన్= ఆవిధంగా సర్వం కోల్పోయిన ధర్మరాజును; చూచి; ద్రోణాచార్య, కృప, భీష్ములు; అవిరళ, స్వేద+అంగులు= దట్టమైన చెమటతో కూడిన అవయవాలు కలవాళ్ళు; అగుచున్; వృద్ధజనులును; తారున్= తాము; నిశ్శబ్ద, నిరంతర, ముఖులు+ఐరి= నిశ్శబ్దం ఎడతెగకుండా ఉన్న ముఖాలు కలవాళ్ళయ్యారు-అంటే నోటిమాట, శ్వాస శబ్దంరాని స్థితిలో ఉండిపోయారు; విదురుండు; మొగము; పాయన్+ఇడి= మొగాన్ని ప్రక్కకు త్రిప్పి; తలవాంచి; తన్నున్+ఎఱుంగక=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తనలోతానులేక; దుఃఖితుండు+ఐ; ఉండెన్; తక్కిన; ఆ, సదస్యులు+అందఱున్= ఆ సభలోని సభ్యులందరును; ప్రబల, బాష్ప+అంబు, ధారా+ఆకులిత+అక్షులు+ఐరి= తీవ్రమైన కన్నీటి ధారలచే కలతచెందిన కన్నులుకలవా ళ్ళయ్యారు; అతి+ఉచ్చము+ఐ= మిక్కిలి ఎక్కువైనది అయి (మిక్కిలి పెద్దదై); పయోధి, పటు, రవ+ఆభము+ఐ= సముద్రంయొక్క పెద్ద ధ్వని వలె చాలా తీవ్రమై; సభా, క్షోభము+అయ్యెన్= సభలో కలకలం చెలరేగింది; దుశ్శాసనుండున్; కర్ణ, సైంధవులును; అధిక, హర్ష, వికసిత+ఆస్యంబులు= మిక్కిలి సంతోషంచేత విప్పారిన ముఖాలు; ఒప్పన్= ప్రకాశించగా; ఒండొరులన్= ఒకరినొకరు; చూచి; నగుచున్= నవ్వుతూ; ఉండిరి; అప్పుడు.

తాత్పర్యం: ఆ విధంగా సర్వాన్ని కోల్పోయిన ధర్మరాజును చూచేసరికి- ద్రోణ కృప భీష్ములకు శరీరమంతా చెమటపట్టింది. తాము, తక్కిన వృద్ధులు నోటమాట, శ్వాసశబ్దం కూడ రాని స్థితిలో ఉండిపోయారు. విదురుడు మొగం ప్రక్కకు త్రిప్పి, తలవంచుకొని, మనస్సు మనస్సులో లేక ఎంతో దుఃఖంతో ఉన్నాడు. తక్కిన సదస్యులంతా తీవ్రంగా కంటతడి పెట్టారు. మితిమీరిన సముద్రఘోషలా సభలో కలకలం చెలరేగింది. దుశ్శాసనుడు, కర్ణుడు, సైంధవుడు సంతోషాతిరేకంతో విప్పారినముఖాలతో ఒకరి నొకరు చూచుకుంటూ నవ్వుతూ ఉండిపోయారు.

విశేషం: దిగ్విజేతగా, రాజసూయం చేసిన మహారాజుగా, కానున్న కురుసార్వభౌముడుగా కొండంత దీప్తితో కౌరవసభలో అడుగుపెట్టిన ధర్మరాజుముఖాన్ని, పిదప కపటద్యూతంలో ఉన్నదంతా కోల్పోయి, కడకు తనను కూడ ఓడిపోయి, ఎవరి వైపు చూడలేక, ఏమి చెయ్యాలో తోచక, దీనాతిదీనస్థితిలో అందరిముందు తలవంచుకొని ఉన్న ధర్మరాజుముఖాన్ని- అక్రమవిజయంతో, వికృతానందంతో విజృంభించి ఒకరివైపు మరొకరు చూచుకొంటూ, పకపక నవ్వుతున్న దుర్యోధన శకుని కర్ణ దుశ్శాసనాదుల ముఖాలను, అన్యాయాన్ని నివారించలేక ఆవేదనపడుతూ, నిస్సహాయులై కళ్ళనీళ్ళు నించుకొన్న భీష్మ ద్రోణ విదురాదుల ముఖాలను, సభలో చెలరేగిన కలకలాన్ని- సహృదయుడు ఒక్కసారి ఊహించుకుంటే అప్పు డెంత తీవ్రమైన స్థితి ఏర్పడిందో తెలుస్తుంది.

వ. ధృతరాష్ట్రుండును 'నిది యేమి సభాక్షోభం? బెవ్వ రెవ్వ రే వస్తువు లొడ్డి?' రని విదురు నడుగుచుండె; నట్టి యవసరంబున దుర్యోధనుండు పాండవులం దనకు దాసులంగా నొడిచినవాఁడై పెటిఁగి. 199

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండునున్; ఇది; ఏమి; సభా, క్షోభంబు= సభాకలకలం; ఎవ్వరు+ఎవ్వరు; ఏ వస్తువులు; ఒడ్డిరి+అని; విదురున్; అడుగుచున్; ఉండెన్; అట్టి; అవసరంబునన్= సమయంలో; దుర్యోధనుండు; పాండవులన్; తనకున్; దాసులంగాన్= సేవకులనుగా; ఒడిచినవాఁడు+ఐ= ఓడించినవాడై; పెటిఁగి= గర్వంతో పెల్లురేగి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు సభలో 'ఇది ఏమి కలకలం? ఎవ్వరెవ్వరు ఏ యే వస్తువులు ఒడ్డినారు?' అని విదురుణ్ణి అడుగుతున్న సమయంలో- దుర్యోధనుడు, పాండవులను తనదాసులుగా గెలుచుకొన్న గర్వాతిరేకంతో.

క. వరవుళ్ళఁ గలసి తనయిలు । పరువడిఁ దుడువంగఁ గృష్ణఁ బనుచువగన్ భా
సుర రాజ్యదర్ప మొప్ప వి । దురుఁ జెచ్చెరఁ బంచె దానిఁ దోడ్కొని తేరన్. 200

ప్రతిపదార్థం: వరవుళ్ళన్, కలిసి= దాసీజనంతో కలిసి; తన, ఇలు= తన ఇల్లు; పరువడిన్= క్రమంగా; తుడువంగన్= శుభ్రంగా తుడవటానికి; కృష్ణన్= ద్రౌపదిని; పనుచు= ఆజ్ఞాపించు; వగన్= ఆలోచనతో; భాసుర, రాజ్య, దర్పము= వెలుగుతున్న రాజ్యగర్వం; ఒప్పన్; దానిన్= ద్రౌపదిని; తోడ్కొని తేరన్= పిలుచుకొని రావటానికి; విదురున్; చెచ్చెరన్= వెంటనే; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: దాసీజనంతో కలిసి తన ఇల్లు వరుసగా తుడవటానికి ద్రౌపదిని ఆజ్ఞాపించాలనే ఆలోచనతో, రాజ్య గర్వంతో విర్రవీగుతూ- ద్రౌపదిని తోడ్కొని రమ్మని విదురుణ్ణి వెంటనే ఆజ్ఞాపించాడు.

విశేషం: కపటద్యూతంలో ధర్మరాజురాజ్యాన్ని గెలుచుకోవటంతో దుర్యోధనునికి అహంకారం అంతులేకుండా పెరిగింది. అది మొదలు తానే రాజైనట్లు, తండ్రితో నిమిత్తమే లేనట్లు విదురునంతటివాణ్ణే ఆజ్ఞాపించే స్థితికి వచ్చాడు. దాసీజనంతో కలిసి ద్రౌపది తనఇల్లు తుడవాలట! విదురుడు వెళ్ళి ఆమెను ఆ పనికి పిలుచుకు రావాలట! ఎంత అహంకారం! ఎంత దుర్విదగ్ధత!

క. దాని సహింపక విదురుం । డా నరపతి కిట్టు లనియె 'నజ్ఞానులు నీ
తో నెన లే రొరు; లిట్లు మ । హానిష్ఠురవృత్తిఁ బనుప నగునే నన్నున్?' 201

ప్రతిపదార్థం: దానిన్, సహింపక; విదురుండు; ఆ, నరపతికిన్= ఆదుర్యోధనునికి; ఇట్టులు+అనియెన్; అజ్ఞానులు= మూర్ఖులు; నీతోన్; ఒరులు= ఇతరులు; ఎనలేరు= సాటిలేరు; ఇట్లు= ఈ విధంగా; మహానిష్ఠురవృత్తిన్= చాలా క్రూరమైన పనిమీద; నన్నున్; పనుపన్+అగునే= పంపదగునా?

తాత్పర్యం: దాన్ని సహించక విదురుడు దుర్యోధనునితో 'నీతో సమానమైన మూర్ఖులు లోకంలో మరెవ్వరూ లేరు. ఇంత క్రూరమైన పనికి నన్ను పంపదగునా?' అని అన్నాడు.

విశేషం: మాయాద్యూతంలో గెలిచినంతమాత్రాన-పాంచాలరాజపుత్రి, పాండవ ధర్మపత్ని అయిన ద్రౌపదిని తనదాసిగా చేసి ఇల్లు తుడిపించటమా? ఎంత క్రూరమైనపని? పైగా అందుకు అంత గొప్ప విదురుణ్ణి పొమ్మని ఆజ్ఞాపించటమా? ఎంత మూర్ఖత! ఎంత అహంకారం!

క. మదమలినమనస్కుఁ డరుం । తుదుఁడు నృశంసుఁ డనఁ బరఁగు దుర్జనునకు సం
పద లెడలయ్యును నాతని । మొదలిటి సంపదలతో సమూలంబు చెడున్. 202

ప్రతిపదార్థం: మద, మలిన మనస్కుఁడు= పొగరుచేత మాసిన మనస్సుకలవాడు; అరుంతుదుఁడు= ఆయువుపట్టును నొప్పించేవాడు; నృశంసుఁడు= క్రూరుడు; అనన్, పరఁగు= అని అనదగిన; దుర్జనునకున్= దుర్మార్గునికి; సంపదలు; ఎడలు+ అయ్యునున్= చెదిరిపోయినప్పటికి; ఆతని; మొదలిటి= తొలుతటి; సంపదలతో; సమూలంబు= వేరుతో గూడ, -అంటే పూర్తిగా; చెడున్= నశిస్తాయి.

తాత్పర్యం: పొగరుచేత మలినమైన మనస్సు కలవాడు. ఆయువుపట్టును (మర్మస్థానాన్ని) నొప్పించేవాడు, క్రూరుడన దగినవాడు అయిన దుర్మార్గుని సంపదలు చెదరిపోవటమే కాక, అతని తొలిసంపదలుకూడ సమూలంగా నాశనమవుతాయి.

విశేషం: విదురునిమాటలు పైకిచూస్తే సూక్తులు: లోనారసి చూస్తే భవిష్యద్వాణులు. శాపోక్తులవంటివి. విదురుడు అంతరాత్మబోధితమైన ధర్మసంస్కారప్రజ్ఞవంటివాడు. అతణ్ణి తనకు హితవు చెప్పవ ద్దని దుర్యోధనుడు తిరస్కరించాడు. అంతటితో ఆగకుండ అధర్మంచేయు మని ఆజ్ఞాపిస్తున్నాడు. ఇది ధర్మప్రవృత్తియొక్క ఆయువుపట్టును నొప్పించే పని. దుర్యోధనుడు ఈ చర్యను ద్రౌపదిని ఆజ్ఞాపించా లని అనుకోవటంతో మొదలుపెట్టాడు. విదురుణ్ణి ఆజ్ఞాపించి దానికి ఒక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రూపా న్నివ్వదలచుకొన్నాడు. దీనివల్ల ధర్మజాదుల ఆయువుపట్టులు బాధపడతాయి. ఆ అధర్మఫలంగా వచ్చిన సంపదతోపాటు ఉన్నసంపదకూడ ఊడ్చుకొనిపోతుం దని భవిష్యద్దర్శనంతో విదురుడు మాట్లాడాడు. (సంపా.)

క. అవనీతలసామ్రాజ్యో । త్సవమునకును యోగ్యమైనసతి ద్రౌపది పాం
డవధర్మపత్ని నీ కం । తవమానము సేయ నేమి యనపాశ్రయయే. 203

ప్రతిపదార్థం: ద్రౌపది; అవనీతల, సామ్రాజ్య+ఉత్సవమునకును= భూమండల సామ్రాజ్యాని కంతటికి రాణిగా పట్టాభిషేకం పొందే వేడుకకు; యోగ్యము+ఐన, సతి= తగిన స్త్రీ; పాండవ ధర్మపత్ని= పాండవుల భార్య; నీకున్; అంత; అవమానము; చేయన్, అనపాశ్రయయే= అండ లేనిదా ఏమి?

తాత్పర్యం: ద్రౌపది సమస్తభూమండలానికి రాణిగా పట్టాభిషేకం పొందదగిన స్త్రీమూర్తి. పాండవుల ధర్మపత్ని, నీ వంత అవమానం చెయ్యటానికి ఆమె అండ లేనిదా ఏమి?

తే. ఏల యాశీవిషంబుల నెఱిఁగి యెఱిఁగి । మూర్ఖవై యలిగించెదు? మొనసి యొరుల
ధనము నికృతిమై గొను టిది ధర్మువగునె? । శకునిమతమునఁ బాపంబుఁ జనునె చేయ? 204

ప్రతిపదార్థం: ఏల= ఎందులకు; ఆశీవిషంబులన్= ముఖమందు విషం గల పాములను; ఎఱిఁగి, ఎఱిఁగి= తెలిసి తెలిసి; మూర్ఖవు+ఐ= మూర్ఖుడివై; అలిగించెదు= కోపం వచ్చేటట్లు చేస్తావు; మొనసి= పూనుకొని; ఒరుల= ఇతరుల; ధనము; నికృతిమైన్= మోసంతో; కొనుట= గ్రహించటం; ఇది; ధర్ముపు; అగునె; శకుని, మతమునన్= శకుని అభిప్రాయాన్ని అనుసరించి; పాపంబున్; చేయన్, చనును+ఎ= చేయవచ్చునా?

తాత్పర్యం: ఎందుచేత తెలిసితెలిసి మూర్ఖుడివై పాములకు కోపం తెప్పిస్తావు? ఇతరుల ధనాన్ని మోసంతో గ్రహించటం ధర్మమా? శకునిఅభిప్రాయాన్ని అనుసరించి పాపం చెయ్యదగునా?

విశేషం: అలం: రూపకాతిశయోక్తి. చేసిన పనిలోని చెడుగుతోపాటు, రానున్న ప్రమాదాన్నికూడా విదురుడు సూచిస్తున్నాడు.

వ. జూదంబున నెగ్గు పుట్టు; దీన నయ్యెడు ఫలంబు వేణుఫలంబునుంబోలె సహమూలవినాశంబునకు నిమిత్తం బగు'ననిన దుర్యోధనుండు విదురుం దూలనొదరి, ప్రాతికామి యనువానిం బిలిచి' యీ విదురుం డెప్పుడు నరిష్టంబ కాని పలుకండు; పాండవులకు వెఱచు; నీవు వోయి ద్రౌపదిం దోడ్కొని ర'మ్మని పంచిన. 205

ప్రతిపదార్థం: జూదంబునన్= జూదంవల్ల; ఎగ్గు= కీడు; పుట్టున్; దీనన్= దీనివల్ల; అయ్యెడు= కలిగే; ఫలంబు; వేణు, ఫలంబునున్+పోలెన్= వెదురు ఫలంవలె; సహమూల, వినాశంబునకున్= వేళ్ళతోగూడ నాశనం కావటానికి; నిమిత్తంబు= కారణం; అగున్; అనినన్; దుర్యోధనుండు; విదురున్; తూలన్+ఒదరి= తిరస్కారంగా నిందించి; ప్రాతికామి; అనువానిన్; పిలిచి; ఈ, విదురుండు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; అరిష్టంబు+అ, కాని= కీడే కాని; పలుకండు; పాండవులకున్; వెఱచు= భయపడతాడు; నీవు; పోయి; ద్రౌపదిన్, తోడ్కొని; రమ్ము; అని; పంచినన్= పంపగా.

తాత్పర్యం: 'జూదం వల్ల కీడు పుట్టుతుంది. జూదంవల్ల కలిగే ఫలం వెదురు ఫలంలా వేళ్ళతోగూడ నాశనం కావటానికి కారణమవుతుంది' అని అనగా దుర్యోధనుడు విదురుణ్ణి తిరస్కరించి నిందించాడు. ప్రాతికామి అనే

వాణ్ణి పిలిచి 'ఈవిదురు డెప్పుడూ మనకు కీడే పలుకుతాడు. పాండవుల కితడు భయపడతాడు. నీవు పోయి ద్రౌపదిని తోడ్కొని రా' అని పంపాడు.

విశేషం: అలం: ఉపమ. వెదురుపంట పండగానే పొద ఆమూలాగ్రం ఎండిపోతుంది.

ప్రాతికామి ద్రౌపదిని సభకుఁ దోడ్కొని వచ్చుట (సం. 2-60-3)

ఆ. **అవనినాథుచేత నాజ్ఞాపితుం డయి । సూతనందనుండు ప్రాతికామి**
పాండవాగ్రమహిషిపాలికిఁ జని భక్తి । వినతుఁ డగుచు నిట్టు లనియె సతికి. **206**

ప్రతిపదార్థం: అవనినాథుచేతన్= భూపతి దుర్యోధనునిచేత; ఆజ్ఞాపితుండు+అయి= ఆజ్ఞాపించబడినవాడై; సూతనందనుండు= సూతుని కుమారుడు; ప్రాతికామి; పాండవ+అగ్రమహిషి, పాలికిన్= పాండవపట్టమహిషి అయిన ద్రౌపది దగ్గరకు; చని, భక్తిన్, వినతుఁడు+అగుచున్= భక్తితో నమస్కరించినవాడై; సతికిన్= ఆ పతివ్రతకు; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: దుర్యోధనుడు ఆజ్ఞాపించగా, సూతనందనుడైన ప్రాతికామి, పాండవ పట్టమహిషి అయిన ద్రౌపది దగ్గరకు వెళ్ళి, భక్తితో నమస్కరించి, ఆ పతివ్రతతో ఈ విధంగా అన్నాడు.

తరువోజ.

'ధనసంపదలు నిజధరణిరాజ్యంబుఁ దనయులం దమ్ములఁ దన్నును నిన్నుఁ
దనరఁ జూదంబాడి ధార్తరాష్ట్రులకు ధర్మతనూజుండు దా నోటువడియె;
వనజాక్షి! కౌరవవరుపని నిన్ను వడిఁ దోడుకొని పోవ వచ్చితి నిపుడ;
చనుదెమ్ము కౌరవేశ్వరుకడ' కనిన జలజాయతాక్షి పాంచాలి యి ట్లనియె. **207**

ప్రతిపదార్థం: ధర్మతనూజుండు= ధర్మరాజు; తనరన్= ఒప్పగా; జూదంబు+ఆడి; ధార్తరాష్ట్రులకున్= ధృతరాష్ట్రుని కుమారులకు; ధనసంపదలు; నిజ, ధరణి, రాజ్యంబున్= తనభూమిమీది దొరతనాన్ని; తనయులన్= కుమారులను; తమ్ములన్; తన్నును; నిన్నున్; తాన్; ఓటుపడియెన్= ఓడిపోయాడు; వనజ+అక్షి= నీట పుట్టిన పద్మాలవంటి కన్నులు కలదానా!; కౌరవ, వరు, పని= కౌరవశ్రేష్ఠుడైన దుర్యోధనుని పనిమీద; నిన్నున్; వడిన్= వేగమె; తోడుకొనిపోవన్; వచ్చితిన్; ఇపుడు+అ; చనుదెమ్ము= రమ్ము; కౌరవ+ఈశ్వరు, కడకున్= కౌరవరాజు దగ్గరకు; అనినన్; జలజ+ఆయత+అక్షి= నీటినుండి పుట్టిన పద్మాలవలె విశాలమైన కన్నులు గలదైన; పాంచాలి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ధర్మరాజు జూదమాడి-కౌరవులకు తన ధనసంపదలను, రాజ్యాన్ని, కొడుకులను, తమ్ములను, తనను, నిన్ను ఓడిపోయాడు. పద్మాక్షీ! కౌరవశ్రేష్ఠుడైన దుర్యోధనుని పనిమీద నిన్ను వేగమే తోడ్కొని పోవటానికి వచ్చాను. కౌరవేశ్వరుని దగ్గరికి రా' అని అనగా ద్రౌపది అతనితో ఇలా అన్నది.

విశేషం: ప్రాతికామికథనంలో నన్నయవాడిన శబ్దాలు గమనించదగ్గవి. ధర్మరాజు ధార్తరాష్ట్రులకు ఓడిపోయాడట! కౌరవశ్రేష్ఠుడు పంపితే ద్రౌపదిని తోడ్కొనిపోవటానికి వచ్చాడట. కౌరవేశ్వరుని దగ్గరకు ఆమె రావాలట. జూదం మొదలైనప్పుడు దుర్యోధనుడు ధృతరాష్ట్రుని పుత్రుల్లో పెద్దవాడు. గెలిచినతరువాత ఆజ్ఞాపించేటప్పుడు అతడే కౌరవశ్రేష్ఠుడు. రమ్మంటున్నది కౌరవేశ్వరుని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దగ్గరికి. దుర్యోధనుడు పాండవులను గెలిచేంతవరకే ధృతరాష్ట్రుని పుత్రు డని- ఆ తరువాత తానే కౌరవేశ్వరుడుగా వెలిగిపోతున్నా డని ధ్వని. ద్రౌపది కౌరవేశ్వరు డంటే ధృతరాష్ట్రు డని వ్యాఖ్యానించుకొని సభలో మొదట ఆయనవద్దకు వెళ్ళి నిలువబడిం దని చెప్పుకొనటానికి అనువుగా ఆ శబ్దాన్ని వాడాడు. ధృతరాష్ట్రునివద్దనున్న ద్రౌపదిని దుర్యోధనుడు తానే కౌరవేంద్రుడ నన్నట్లు ఆజ్ఞాపిస్తాడు. ధృతరాష్ట్రుడు మారుమాటాడలేదు. (వివరాలకు పీఠిక చూడండి). (సంపా.)

ఆ. 'ఏయుగంబునందు నెట్టి దుష్కితవుండు । భార్య నొడ్డి యోటువడినభర్త
గలఁడె? యిది వినంగఁ గడు నపూర్వం బయ్యె; । నిట్లు సేయునొక్కొ యిందుకులుఁడు? 208

ప్రతిపదార్థం: ఏయుగంబునందున్= ఏయుగంలో నయినా; ఎట్టి దుష్కితవుండు= ఎటువంటి చెడుజూదగాడైనా; భార్యను+ఒడ్డి; ఓటుపడిన= ఓడిపోయిన; భర్త; కలఁడె; ఇది; వినంగన్; కడున్= మిక్కిలి అపూర్వంబు+అయ్యెన్= ఆశ్చర్యకరమయింది; ఇందుకులుఁడు= చంద్రవంశ ప్రభువైన ధర్మరాజు; ఇట్లు; చేయున్+ఒక్కొ= చేశాడా?

తాత్పర్యం: ఏ యుగంలో నయినా, ఎటువంటి చెడ్డ జూదగాడయినా, భార్యను పణంగా ఒడ్డి ఓడిపోయిన భర్త ఉన్నాడా? వినటాని కిది ఆశ్చర్యకరంగా ఉంది. చంద్రవంశ ప్రభువైన ధర్మరాజు ఇలా చేశాడా?

విశేషం: ధర్మజుని 'ఇందుకులు' డనటంలో చంద్రునికాంతితో పాటు అతనిమచ్చకూడ స్ఫురించినట్లే. ధర్మజుని గుణసంపదతోపాటు అతని ద్యూతవ్యసనం కూడా ధ్వనిస్తున్నది.

తే. మున్ను త న్నోటువడి మఱి నన్ను నోటు । వడియెనో, నన్ను ము న్నోటువడి విభుండు
గ్రన్నఁ ద న్నోటువడియెనో యన్న! నాకు । నెఱుఁగఁ జెప్పుము దీని నీ వెఱుఁగుదేని.' 209

ప్రతిపదార్థం: మున్ను= మొదట; తన్నున్= తనను; ఒటుపడి= ఓడిపోయి; మఱి= తర్వాత; నన్నున్+ఓటు పడియెనో= ఓడిపోయాడో; నన్నున్; మున్ను+ఓటుపడి= ముందుగా ఓడిపోయి; విభుండు= ప్రభువు; క్రన్నన్= పిమ్మట; తన్నున్+ఓటు, పడియెనో= తనను ఓడిపోయాడో; అన్న! దీనిన్; ఈవు; ఎఱుఁగుదు+ఏనిన్; నాకున్; ఎఱుఁగన్; చెప్పుము.

తాత్పర్యం: నా భర్త మొదట తన్నోడి తరువాత న న్నోడెనా? లేక ముందే న న్నోడి తరువాత తా నోడెనా? అన్నా! నీకు తెలిస్తే ఈ సంగతి నాకు చెప్పు.

విశేషం: పదునైన ద్రౌపదిబుద్ధికి ఈ ప్రశ్న ఒక ప్రబలనిదర్శనం.

వ. 'ఎఱుంగవేని యక్కితవు నడిగి వచ్చి మఱి నన్నుం దోడ్కొని పోవనగునేని తోడ్కొని పొ'మ్మనినం బ్రాతికామి క్రమ్మఱి వచ్చి పాంచాలిపలుకులు ధర్మరాజునకుం జెప్పిన, దురోదర పరాజయ దుఃఖిత చేతస్కుం డగుటం జేసి యతఁడు వానికి నదత్తప్రతివచనుం డైనఁ, బ్రాతికామికి దుర్యోధనుం డి ట్లనియె. 210

ప్రతిపదార్థం: ఎఱుంగవు+ఏనిన్= నీకు తెలియకుంటే; ఆ+కితవున్= ఆ జూదగాణ్ణి; అడిగి; వచ్చి; మఱి= తర్వాత; నన్నున్; తోడ్కొని, పోవన్, అగున్+ఏనిన్= పిలుచుకొని వెళ్ళదగినట్లయితే, తొడ్కొనిపొమ్ము; అనినన్; ప్రాతికామి; క్రమ్మఱి, వచ్చి= తిరిగివచ్చి; పాంచాలి, పలుకులు= ద్రౌపది మాటలు; ధర్మరాజునకున్; చెప్పినన్; దురోదర, పరాజయ, దుఃఖిత, చేతస్కుండు+ అగుటన్+చేసి= జూదంలో ఓడిపోవటంచేత దుఃఖాన్ని పొందిన మనస్సుకలవాడుకావటంచేత; అతఁడు= ఆ ధర్మరాజు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వానికిన్= ప్రాతికామికి; అదత్త, ప్రతివచనుండు+ఐనన్= ఇవ్వబడని బదులుమాటలు కలవాడు కాగా, అంటే సమాధానం చెప్పలేకపోగా; ప్రాతికామికిన్; దుర్యోధనుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీకు తెలియకుంటే, ఆ జూదగాణ్ణి అడిగి వచ్చి- నన్ను పిలిచికొని వెళ్ళటం తగినట్లయితే పిలుచుకొని వెళ్ళు'- అని ద్రౌపది పలుకగా, ప్రాతికామి తిరిగి వచ్చి ఆమెమాటలు ధర్మరాజుకు చెప్పాడు. కాని, అతడు జూదంలో ఓడిపోయి దుఃఖంతో ఉండటంవల్ల ప్రాతికామికి బదులు చెప్పలేదు. అప్పుడు దుర్యోధనుడే ఇలా అన్నాడు.

విశేషం: 'నీకు తెలియకుంటే ఆ జూదగాడి నడిగి తెలుసుకొనిరా' అనే ఒక్క వాక్యంతో ఆ ప్రాతికామిని త్రిప్పిపంపిన ద్రౌపది వ్యక్తిత్వంలోని నిండుదనం, దిటవుతనం- విశేషించి ధర్మజుని ద్యూతవ్యసనం పట్ల ఆమె కుండే నిరసన, ఆవేదన పాఠకునికి పొడగట్టక మానవు. సామాన్యస్త్రీ ఎవరైనాసరే ఈ పరిస్థితిలో దుఃఖాతిరేకంతో చతికిలబడిపోయేదే. ద్రౌపదిది ఒక మహోన్నత వ్యక్తిత్వం.

క. 'సందిగ్ధ మయిన యర్థము । నిందఱ సన్నిధిన యడిగి; తింద ఱెఱుంగన్
సుందరిఁ బాంచాలేంద్ర సు । తం దోడ్కొని రమ్ము, పొమ్ము! తడయక' యనినన్. 211

ప్రతిపదార్థం: సందిగ్ధము+అయిన= సందేహమైన - అంటే ఖచ్చితంగా సమాధానం చెప్పటానికి వీలులేని దయిన; అర్థమున్= న్యాయాన్ని; ఇందఱ, సన్నిధిన= ఇంతమంది యెదుట; అడిగితి= అడిగావు; ఇందఱు+ఎఱుంగన్= ఈ సభలోని ఇందరూ తెలిసికొనటానికి వీలుగా; తడయక= ఆలస్యంచేయక; సుందరిన్= అందగత్తె అయిన; పాంచాల+ఇంద్రసుతన్= పాంచాలరాజుకూతురు ద్రౌపదిని; తోడ్కొని, రమ్ము.

తాత్పర్యం: 'ఖచ్చితంగా సమాధానం చెప్పటానికి వీలులేని న్యాయాన్ని ఇంతమంది ఎదుట అడిగావు. ఈ సభలోని వా రందరూ తెలుసుకొనేట్లు, అందగత్తె అయిన ఆ ద్రౌపదిని ఆలస్యం చేయకుండా తోడ్కొనిరా- వెళ్ళు' అని దుర్యోధను డనగా.

విశేషం: 'సందిగ్ధమయిన యర్థము నిందఱి సన్నిధికి వచ్చి యందఱ నడుగన్', 'యేర్పడ నడుగన్' అనే పాఠాంతరాలే ఇక్కడ స్పష్టార్థాలుగా ఉన్నాయి. (మూలంలోకంటె నన్నయచేసిన మార్పులను గురించి పీఠిక చదవండి. - సంపా.)

వ. వాఁడును ద్రౌపది పాలికింబోయి 'దేవీ! నీ యడిగిన యర్థంబ నిర్ణయించువా రయి సభ్యులు నిన్ను రాఁబంచిరి; ర'మ్మనిన దుర్యోధను దుశ్చేష్టితంబునకు ధర్మరాజుసమ్మతంబునకు వెఱచి, యక్కోమలి ప్రాతికామిపిఱుంద నేకవస్త్రయు నధోనీవియు నవిరళగళితనయనోదకబిందుసందోహపరిపీడ్యమానపీనస్తన పరిధానాంతరయు నగుచు సభకుం జనుదెంచి కురువృద్ధసమీపంబున నున్నంత; ద్రౌపదిం జూడ నోపక లజ్జితులయి దుఃఖాయమాన మానసులయి తలలు వాంచియున్న పాండవుల వైలక్ష్యం బుపలక్షించి సంతసిల్లి దుర్యోధనుండు దుశ్శాసనుం బిల్చి 'ప్రాతికామి వృకోదరునకు వెఱచు; నీవు వోయి ద్రౌపదిం దోడ్కొని ర'మ్మని పంచిన. 212

ప్రతిపదార్థం: వాఁడును= ఆ ప్రాతికామియు; ద్రౌపది, పాలికిన్= ద్రౌపది దగ్గరకు; పోయి; దేవీ; నీ, అడిగిన= నీవు అడిగిన; అర్థంబు+అ= న్యాయాన్ని; నిర్ణయించువారు+అయి; సభ్యులు; నిన్ను; రాన్, పంచిరి= రమ్మని ఆజ్ఞాపించారు; రమ్ము+అనిన; దుర్యోధను= దుర్యోధనునియొక్క; దుశ్చేష్టితంబునకున్= చెడ్డపనికి; ధర్మరాజు= ధర్మరాజుయొక్క; సమ్మతంబునకున్= అంగీకారానికి; వెఱచి= భయపడి; ఆ+కోమలి= ఆ సుకుమారి అయిన ద్రౌపది; ప్రాతికామి, పిఱుందన్= ప్రాతికామి వెనుక; ఏకవస్త్రయున్= ఒకే బట్టను ధరించినదీ; అధోనీవియున్= కిందికి ఉన్న కోకముడి కలదీ; అవిరళ, గళిత, నయన+ఉదక, బిందు, సందోహ, పరిపీడ్యమాన, పీన, స్తన, పరిధాన+అంతరయున్= మెండుగా పడుతున్నకన్నీటి బిందువుల సమూహంచేత గట్టిగా బాధించబడుతున్న బలిసిన పాలిండ్ల కట్టువస్త్రంయొక్క చాటు కలదీ; అగుచున్; సభకున్; చనుదెంచి= వచ్చి; కురువృద్ధు, సమీపంబునన్= కురువంశంలో పెద్దవాడైన; ప్రభువైన ధృతరాష్ట్రుని ప్రక్కన; ఉన్న+అంతన్= నిలిచిఉండగా; ద్రౌపదిన్, చూడన్+ఓపక= చూడలేక; లజ్జితులు+అయి= సిగ్గుచెందినవాళ్ళయి; దుఃఖాయమానమానసులు+అయి= దుఃఖంతో నిండిన మనస్సులు కలవాళ్ళయి; తలలు, వాంచి= తలలు వంచుకొని; ఉన్న; పాండవులు; వైలక్ష్యంబు= సిగ్గు; ఉపలక్షించి= చూచి; సంతసిల్లి= సంతోషించి; దుర్యోధనుండు; దుశ్శాసనున్; పిల్చి; ప్రాతికామి; వృకోదరునకున్= భీమునికి; వెఱచున్= భయపడతాడు; నీవు; పోయి; ద్రౌపదిన్; తోడ్కొని= వెంటతీసుకొని; రమ్ము, అని; పంచినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఆ ప్రాతికామి ద్రౌపది దగ్గరకు వెళ్ళాడు. 'నీ వడిగిన న్యాయాన్ని నిర్ణయించటానికి సభ్యులు నిన్ను ర మ్మని ఆజ్ఞాపించారు. రా' - అన్నాడు. ద్రౌపది దుర్యోధనుని దుష్కృత్యానికి, ధర్మరాజు అంగీకారానికి భయపడింది. ధరించిన ఏకవస్త్రంతో, క్రిందికి ఉన్న కోకముడితో, ఎడతెరపిలేని కన్నీటి బిందువులతో, తడిసిన చనుకట్టుతో ప్రాతికామివెంట సభకు వెళ్ళింది. కురువృద్ధుడైన ధృతరాష్ట్రునిదగ్గర నిలిచింది. ద్రౌపదిదీనస్థితిని చూడలేక సిగ్గుతో దుఃఖిస్తూ, పాండవులు తలలు వంచుకొన్నారు. సిగ్గుతో తలలువంచుకొన్న పాండవుల్ని చూచి సుయోధనుడు సంతోషించాడు. దుశ్శాసనుణ్ణి పిలిచాడు. 'ప్రాతికామి భీముడికి భయపడతాడు. నీవు వెళ్ళి ద్రౌపదిని తీసుకురా' అని ఆజ్ఞాపించాడు. అప్పుడు

విశేషం: ప్రాతికామి మళ్లీ రావటంలోనే పాంచాలికి పరిస్థితుల తీవ్రత అర్థమైంది. దుర్యోధనుని దుర్మార్గ విజృంభణాన్ని, ధర్మజుని నిస్సహాయతను ఆమె గుర్తించింది. ఒక్క మాటలో అప్పుడు ప్రాతికామిని తిప్పిపంపిన ధీరోదాత్త గంభీర స్త్రీమూర్తి ఇప్పుడు 'కోమలి' అయి అతనివెంట కౌరవసభకు నడిచింది. ఈ కురువంశపుకోడలిమానమర్యాదలు కాపాడవలసిన బాధ్యత నీదే అన్నట్లు కురువృద్ధుడు, స్వార్థరహితుడు, ధర్మనిరతుడు అయిన ధృతరాష్ట్రుని ప్రక్క నిలిచింది. భర్తల బలహీనతను పరోక్షంగా ఎత్తిపొడిచింది. ఆనాడు ఓడలు బండ్లయ్యాయి. బండ్లు ఓడలయ్యాయి. అంతటి పాండవులు అడుగంటి క్రుంగిపోయారు. క్రుంగిన కౌరవులు పట్టపగ్గాలు లేని పొంగులో ఉన్నారు. అ దొక భయంకర వాతావరణం. (ఇందులో- కురువృద్ధు డంటే భీష్ము డనే అర్థం రూఢం. కాని, మూలంలో ద్రౌపది సభలోకి వచ్చి మామగారైన ధృతరాష్ట్రుడివద్ద నిలువబడిం దని చెప్పబడి ఉన్నది. ద్యూతంలో అధర్మవిజిత కావటంచేత ఆమె దాసి కాదు. పాండవులు తమ్ము తా మోడిపోవటంచేత వారికి ద్రౌపదిని పణంగా పెట్టే అధికారం లేదు. ఆమె అప్పుడు ధృతరాష్ట్రుడి అధికారంలోకి వస్తుంది. అతడు కాపాడకపోతే గాంధారిపొంతకు పోతుంది. ఇక్కడ అత్తమామల రక్షలోఉన్న కోడలు. మూలంలో ధర్మరాజు తన ప్రత్యేకదూతతో ఆవిధంగానే వ్యవహరించు మని చెప్పిపంపాడు. కాబట్టి ఆమె వచ్చి మామవద్ద నిలిచింది. ఆయన కాపాడకపోతే లోకులు ధృతరాష్ట్రుడిని నిందించా లని ఆ చర్యలోని అంతరార్థం. ఈ సందర్భంలో కురువృద్ధు డంటే ప్రకరణాన్నీ, ప్రయోజనాన్నీ అనుసరించి ధృతరాష్ట్రు డని అర్థం చెప్పాలి. భీష్ముడు ధృతరాష్ట్రుడి ప్రభుత్వాన్ని కా దని ఏ పనీ చేయలేడు. అతడు స్వయంగా చేసికొనిన నియమం అటువంటిది. అందువలననే అతడికి ద్రౌపదిమీద ఆ సందర్భంలో రక్షణాధికారం లేదు. అంతేకాదు అతడు రాజుకు విరుద్ధంగా ధర్మంకూడా చెప్పలేడు. భీష్ముడు నిర్లిప్తుడైతే గాంధారివద్దకు ద్రౌపది పోవటంలో అప్పుడు ఔచిత్యమే ఉండదు.

అందువలన ఇక్కడ కురువృద్ధు డంటే ధృతరాష్ట్రు డని గ్రహించటంవలన మూలంలోని కొన్ని అంశాలను తెలుగులోకి తేకుండా సంగ్రహించిన నన్నయకథనంలోకూడా సమన్వయం సాధించబడుతుంది. (పీఠికలోని వివరాలు చూడండి). (సంపా.)

ఆ. నిర్దయాత్ముఁ బాపనిరతు దుశ్శాసనుఁ । బనుచు టెఱిఁగి కృష్ణ పంకజాక్షి
గడుభయంబు నొంది గాంధారియొద్దకు । నరిగెఁ గడు నడంగి యతిరయమున. 213

ప్రతిపదార్థం: పంకజ+అక్షి= పద్మాలవంటి కన్నులు కలది; కృష్ణ= ద్రౌపది; నిర్దయ+ఆత్మున్= దయలేని హృదయం కలవాడిని; పాప, నిరతున్= పాపం చేయటంలో ఆసక్తి కలవాడిని; దుశ్శాసనున్; పనుచుట= పంపటం; ఎఱిఁగి= చూచి (తెలిసికొని); కడున్, భయంబున్= మిక్కిలి భీతిన్; ఒంది= పొంది; కడున్= చాలా; అడంగి= తగ్గి; అతి, రయమునన్= ఎంతో వేగంగా; గాంధారి, ఒద్దకున్= గాంధారి దగ్గరకు; అరిగెన్= వెళ్ళింది.

తాత్పర్యం: దయ లేని హృదయం కలవాడు, పాపం చేయటంలో ఆసక్తి కలవాడు అయిన దుశ్శాసనుణ్ణి పంపటం చూచి, పద్మాలవంటి కన్నులు కల ద్రౌపది మిక్కిలి భీతితో, ఎంతో కుంచించుకుపోయింది. ఒక్కపరుగున గాంధారీదేవి దగ్గరకు వెళ్ళింది.

విశేషం: దుర్యోధనదుశ్శాసనుల దౌష్ట్యాన్ని ధృతరాష్ట్రుడు ఆపకుండటం చూచి ఆ అబల - సాటిస్త్రీగా, కౌరవుల ఇంటి పెద్ద కోడలుగా 'నీవైనా నా గౌరవం కాపాడు' అన్నట్లు గాంధారిదగ్గరకు పరుగెత్తింది.

చ. తడయక కౌరవానుజుఁడు దాని పిఱుందన పాఱి 'యింక నె
క్కడ కరుగంగఁబోలుఁ? జులుకం జను దెమ్మిట; సౌబలుండు ని
న్నొడిచె దురోదరంబునఁ; గురూత్తము నర్థమ వైతి; నిన్నునుం
బుడమిని దమ్ముఁ గోల్పడిరి పొల్తి! భవత్పతులైన పాండవుల్.' 214

ప్రతిపదార్థం: తడయక= ఆలస్యం చేయక; కౌరవ+అనుజుఁడు= కౌరవుడైన దుర్యోధనుని తమ్ముడు; దాని, పిఱుందన= ఆ ద్రౌపది వెనుక; పాఱి= పరుగెత్తి; పొల్తి= ఓ కాంతా! ఇంకన్; ఎక్కడకున్; అరుగంగన్+పోలున్= వెళ్ళటానికి సాధ్యమవుతుంది?; చులుకన్= సులభంగా; ఇటన్= ఇక్కడికి; చనుదెమ్ము= రమ్ము; సౌబలుండు= శకుని; దురోదరంబునన్= జూదంలో; నిన్నున్+ఒడిచెన్= నిన్ను గెలిచాడు; కురు+ఉత్తము= కురుశ్రేష్ఠుడైన దుర్యోధనునియొక్క; అర్థమవు+ఐతి= సొత్తువైనావు; భవత్+పతులు+ ఐన= నీ భర్తలైన; పాండవుల్; నిన్నునున్; పుడమినిన్= భూమిని; తమ్మున్= తమను; కోలుపడిరి= కోల్పోయారు.

తాత్పర్యం: వెంటనే దుశ్శాసనుడు ఆ ద్రౌపదివెంట పరుగెత్తి 'ఓ కాంతా! ఇంక నీ వెక్కడికి వెళ్ళగలవు? చెప్పినట్లు విని ఇక్కడికి రా. జూదంలో శకుని నిన్ను గెలిచాడు. కురుశ్రేష్ఠుడైన దుర్యోధనుడి సొత్తువైనావు. నీ భర్తలు నిన్ను, రాజ్యాన్ని, తమను జూదంలో కోల్పోయారు.

వ. అనుచు డాయ వచ్చిన నక్కోమలి 'రజస్వల నన్ను ముట్టకు; మేకవస్త్ర నయి యున్నదాన; గురుబంధు జనాధిష్ఠితంబైన సభకు నెట్లు రా నేర్తు?' ననిన 'నీ వేకవస్త్ర వైతేమి విగతవస్త్ర వైతేమి? ని న్నెట్లుం దోడ్కొని పోదు'నని బలాత్కారంబున. 215

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనుచున్; డాయన్, వచ్చినన్= దగ్గరకు రాగా; ఆ+కోమలి= ఆ ద్రౌపది; రజస్వలన్= ముట్టైన దానను (ఋతుమతిని); నన్నున్; ముట్టకుము= తాకకుము; ఏకవస్త్రను= ఒకే బట్టను కట్టుకొన్నదానిని; అయిఉన్నదానన్; గురు, బంధుజన+అధిష్ఠితంబు+ఐన= పెద్దలతో, బంధువులతో ఆక్రమించబడిందైన; సభకున్; ఎట్లు; రా నేర్తున్. అనినన్= అని అనగా; నీవు; ఏక, వస్త్రవు= ఒకే బట్ట కట్టుకొన్న దానివి; ఐతేమి= అయితే ఏమి? విగతవస్త్రవు= పూర్తిగా తొలగిన వస్త్రం కలదానివి; ఐతేమి= అయితే ఏమి? నిన్నున్; ఎట్లున్= ఏ విధంగా నైనా; తోడ్కొనిపోదును+అని= తీసుకొనిపోతా నని; బలాత్కారంబునన్= బలవంతంగా.

తాత్పర్యం: అంటూ దగ్గరకు రాగా, ఆ ద్రౌపది - 'నేను రజస్వలను, నన్ను తాకవద్దు. ఒకే బట్ట కట్టుకొని ఉన్నాను. పెద్దలు, బంధువులు కొలువుదీరిన ఈ సభకు ఎలా వస్తాను?' అని అనగా, దుశ్శాసనుడు 'నీవు ఒకే బట్ట కట్టుకొంటే ఏమి? లేదా అసలు బట్ట లేకుండా ఉంటే ఏమి? ఎలాగైనా నిన్ను తీసుకొని పోతాను' అని బలవంతంగా-

విశేషం: 'నేను రజస్వల నన్ను ముట్టకుండు మేకవస్త్ర' - అనే పాఠాంతరం పెక్కుప్రతుల్లో ఉంది.

దుశ్శాసనుఁడు ద్రౌపదిని సభలోని కీడ్చి తెచ్చుట

ఉ. **ఆ వనజాననం గురుకులాపశదుండు గడంగి రాజసూ**
యావభృథంబునందు వసుధామరమంత్రపవిత్రవారిధా
రావళిఁ జేసి పావనము లైన శిరోజములం దెమల్చి పా
పావహుఁ డీడ్చి తెచ్చె సభ కందఱు సంభ్రమమంది చూడఁగన్. **216**

ప్రతిపదార్థం: కురుకుల+అపశదుండు= కురువంశంలోని నీచుడు; పాప+ఆవహుఁడు= చెడుచేసేవాడు - అయిన దుశ్శాసనుడు; కడంగి= పూనుకొని, ఆ, వనజ+ఆననన్= పద్మంవంటిముఖంగల ఆ ద్రౌపదిని; రాజసూయ+అవభృథంబు+అందున్= రాజసూయయాగం చివర చేసిన అవభృథస్నానంలో; వసుధ+అమర, మంత్ర, పవిత్ర, వారి, ధారా+ఆవళిన్+చేసి= భూదేవతల- అంటే బ్రాహ్మణులయొక్క మంత్రాలచేత పవిత్రాలైన నీటిధారలచేత; పావనములు+ఐన= పవిత్రాలైన; శిరోజములన్= తలవెంట్రుకలను; తెమల్చి= పట్టుకొని; అందఱు= సభలోనివాళ్ళంతా; సంభ్రమము+అంది= భయపడి; చూడఁగన్; సభకున్; ఈడ్చి; తెచ్చెన్.

తాత్పర్యం: కురుకులనీచుడు, పాపాత్ముడు అయిన దుశ్శాసనుడు పూని, పద్మంవంటి ముఖం గల ఆ ద్రౌపదిని - రాజసూయ యాగం చివర చేసిన అవభృథస్నానంలో, బ్రాహ్మణుల మంత్రాలచేత పవిత్రాలైన నీటి ధారలతో పావనాలైన తలవెంట్రుకలను పట్టి అందరు భయపడి చూస్తుండగా సభకు ఈడ్చి తెచ్చాడు.

విశేషం: ద్రౌపది శిరోజాలకు నన్నయ ప్రయోగించిన సుదీర్ఘ విశేషణాలు-వాటి పవిత్రతనేకాక, పొడవును, సౌందర్యాన్ని, పట్టిలాగబడిన ఆ శిరోజాలు భావిభారత కథలో వహించనున్న ప్రాధాన్యాన్ని పరోక్షంగా సూచించేవిగా ఉన్నాయి. కులకాంతను పదిమందిలో జుట్టుబట్టి లాగటం పెద్దదోషం. అందులోను సార్వభౌమయోగ్యమైన రాజసూయయాగం చేసిన శక్తిసంపన్నుల ధర్మపత్ని ద్రౌపదిని, నిండుసభలో అవభృథస్నానంచేత పవిత్రాలైన ఆమె సుదీర్ఘ శిరోజాలు పట్టి లాగటం మహాపాపమే కాదు, మిక్కిలి ప్రమాదకరంకూడ. పుట్టలోని నల్లత్రాచును పట్టి లాగినట్లే. ఈ శిరోజాలు-సంధికి వెళ్ళే శ్రీకృష్ణునికి ద్రౌపదిచేత 'ఇవి దుస్ససేను వ్రేళ్ళం దవిలి సగము ద్రెవ్విపోయి తక్కిన యవి కౌరవులకడఁ దీఱుమాటల యవసరమునఁ దలపవలయు నచ్యుత వీనిన్' అని చెప్పించాయి. 'ఈ వెంట్రుకలు వట్టి యీడ్చిన యా చేయి దొలుతగాఁ బోరిలో దుస్ససేను, తను వింతలింతలు

తునియలై చెదరి రూపటియున్నఁ గని యుడుకాఱుఁగాక' అని పలికించాయి. సంధి ప్రయత్నాన్ని చేతనైనంతవరకు బలహీన పరిచాయి. ఈ పద్యరచనలో శ్లేష మనేగుణం రసోదంచితంగా పోషించబడింది (వివరాలకు చూడు: పీఠిక). (సంపా.)

వ. ఇట్లు వాతావధూతంబైన పతాకయుంబోలె దుశ్శాసనాకృష్టయై ద్రౌపది వికీర్ణకేశయు వివర్ణవదనయునై కర్ణ దుర్యోధన శకుని సైంధవాది దుష్ట భూయిష్ఠంబైన సభకు వచ్చి కోపలజ్జాపరవశ యయి. 217

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వాత+అవధూతంబు+ఐన= గాలిచేత కదలించబడిందైన; పతాకయున్, పోలెన్= జెండావలె; దుశ్శాసన+ఆకృష్ట+ఐ= దుశ్శాసనునిచేత లాగబడినదై; ద్రౌపది; వికీర్ణ, కేశయున్= చెదరిన వెంట్రుకలు గలదియు; వివర్ణవదనయున్+ఐ= వెలవెలబోయిన ముఖం కలదియు అయి; కర్ణ, దుర్యోధన, శకుని, సైంధవ+ఆది= కర్ణుడు, దుర్యోధనుడు, శకుని, సైంధవుడు మొదలయిన; దుష్ట, భూయిష్ఠంబు+ఐన= దుర్మార్గులతో నిండినదైన; సభకున్; వచ్చి; కోప; లజ్జా, పరవశ+ అయి= కోపంచేత, సిగ్గుచేత మై మరచినదై;

తాత్పర్యం: ఈ విధంగా గాలిచే కదలించబడిన జెండావలె దుశ్శాసనునిచేత ఈడ్వబడిన ద్రౌపది, చెదిరిన జుట్టుతో, వెలవెలబోయిన ముఖంతో-కర్ణుడు, దుర్యోధనుడు, శకుని, సైంధవుడు మొదలయిన దుర్మార్గులతో నిండిన సభకు వచ్చి, కోపంతో సిగ్గుతో మైమరచినదై.

విశేషం: అలం: ఉపమ.

చ. అనుపమ దైవయోగహతుఁ డయ్యు నవశ్యము ధర్మసంపదం
దనరున కాక ధర్మజుఁడు ధన్యుఁడు ధర్మపథంబు తప్పఁద్రొ
క్కునె కురువృద్ధులార! భృశకోపనుఁ డీతఁడు నన్ను నేల దు
ర్జనుఁ డిట యీడ్చి తెచ్చె నవిచారపరుం డయి దుర్మదంబునన్. 218

ప్రతిపదార్థం: కురువృద్ధులార= కురువంశంలోని పెద్దలారా!; అనుపమ, దైవ, యోగ, హతుఁడు+అయ్యున్= సాటిలేని దైవయోగంచేత కొట్టబడినవాడైనను; ధన్యుఁడు= పుణ్యాత్ముడు; ధర్మజుఁడు; అవశ్యము= తప్పక; ధర్మసంపదన్= ధర్మమనే ఐశ్వర్యంతో; తనరును+అ+కాక= ఒప్పునేకాని; ధర్మపథంబు= ధర్మమార్గం; తప్పన్+త్రొక్కునె= తప్పి నడుస్తాడా?; భృశకోపనుఁడు= అధికకోపంకలవాడు; దుర్జనుఁడు= చెడ్డవాడు; ఈతఁడు= ఈ దుశ్శాసనుడు; దుర్మదంబునన్= కండకావరంతో; అవిచారపరుండు+అయి= ఆలోచన లేనివాడై; నన్నున్; ఏల; ఇటన్= ఈ సభకు; ఈడ్చి; తెచ్చెన్.

తాత్పర్యం: కురువంశంలోని పెద్దలారా! సాటిలేని దురదృష్టాలచేత దెబ్బతిన్నప్పటికీ, పుణ్యాత్ముడైన ధర్మరాజు ఎల్లప్పుడు ధర్మమనే సంపదతో ప్రకాశిస్తాడేకాని, ధర్మమార్గం తప్పి నడుస్తాడా? అధికకోపం కలవాడు, చెడ్డవాడు అయిన ఈ దుశ్శాసనుడు కండకావరంతో అవివేకంగా న న్నెందుకు ఈ సభకు ఈడ్చి తెచ్చాడు?

విశేషం: లౌకిక సంపదలు కోల్పోయినా ధర్మరాజు నిత్యధర్మసంపన్నుడు. అతని చర్యల్లోని ధర్మసూక్ష్మాన్ని గుర్తించలేని అవివేకి దుశ్శాసనుడు. 'అతడు ఏ ధర్మాన్ని ఆశ్రయించి నన్ను సభకు తెచ్చాడు?' అని ద్రౌపది ప్రశ్నించింది. ఆమెను సభకు రప్పించటంలో ధర్మం లేదనీ, మదమొక్కటే కారణ మనీ ఆమె సభకు నివేదించుకొన్నది. (ఈ మాటల కీ ఘట్టంలో లోతైన అర్థాలు ఉన్నాయి. వివరాలకు పీఠిక చూడండి). (సంపా.)

చ. **'ఇది యుచితంబు గా దనక యిక్కురుముఖ్యులు సూచుచుండ దు**
ర్మదుఁ డయి వీఁడు నన్ను నవమానితఁ జేసెడి; సర్వధర్మ సం
విదు లన నున్న యీ భరతవీరులవంశము నేఁ డధర్మ సం
పద నతినింద్య మయ్యె' నని భామిని గృష్ణుఁ దలంచె భీతయై. 219

ప్రతిపదార్థం: ఇది= ఈ విధంగా జుట్టుపట్టి ఈడ్చితేవటం; ఉచితంబు= తగినది; కాదు+అనక= కాదని అనకుండా; ఈ+కురు, ముఖ్యులు= ఈ కురువంశంలోని ముఖ్యమైనవాళ్ళు - అంటే భీష్మ ధృతరాష్ట్రాది ప్రముఖులు; చూచుచున్+ఉండన్; దుర్మదుఁడు+అయి= క్రొవ్విినవాడై; వీఁడు= ఈ దుశ్శాసనుడు; నన్నున్; అవమానితన్= అవమానించ బడిన దానినిగా; చేసెడిన్= చేస్తున్నాడు; సర్వ, ధర్మ, సంవిదులు+అనన్= అన్నిధర్మాలు బాగుగా తెలిసినవారు అనునట్లుగా; ఉన్న; ఈ భరతవీరుల, వంశము; నేఁడు; అధర్మ, సంపదన్= అధర్మం పెరగటంచేత; అతి నింద్యము= మిక్కిలి నిందించదగినది; అయ్యెన్+ అని; భామిని= కోపం గల స్త్రీ - ద్రౌపది; భీత+ఐ= భయపడిందై; కృష్ణున్= శ్రీకృష్ణుణ్ణి; తలంచెన్= తలచుకొన్నది.

తాత్పర్యం: 'ఈ విధంగా నన్ను జుట్టుపట్టి ఈడ్చితేవటం ఉచితం కాదని భావించక, ఈ కురువంశప్రముఖులంతా చూస్తుండగా, క్రొవ్విన ఈ దుశ్శాసనుడు న న్నవమానిస్తున్నాడు. అన్ని ధర్మాలు పూర్తిగా తెలిసినవా ళ్ళని పేరు పొందిన ఈ భరతవీరుల వంశం ఈనాడు అధర్మం పెరగటంచేత ఎంతో నిందించదగినది అయిం' దని కోపించిన ద్రౌపది భయపడి శ్రీకృష్ణుణ్ణి స్మరించింది.

విశేషం: కురువంశపు పెద్దలను ఉద్దేశించి ద్రౌపది అన్నమాటల్లో మంటలు కనబడకపోవచ్చు గాని వేడిమాత్రం విపరీతంగా ఉంది. (భయభావదీప్తిని సూచిస్తూ ఔజ్జ్వల్యంతో కూడుకొన్న మాటలరచన గల ఈ పద్యంలో కాంతిగుణం ప్రకాశిస్తున్నది. -సంపా.)

వ. **ఇట్లు జగత్త్రయ విజయ భుజవీర్య సనాథులైన నాథులు గలిగియు ననాథయుంబోలెఁ బాంచాలరాజపుత్త్రి భయార్తయై యార్తజన శరణ్యుండైన జగన్నాథు జనార్దనుం దలంచుచుఁగపట ద్యూతమధుమదోన్మత్తుండయిన ధర్మపుత్త్రు నిమిత్తంబున నుద్గతంబయిన పాండవపరాజయ దహనంబుఁ దన రూక్ష కటాక్ష వీక్షణ వచనంబులఁ బ్రవర్తించుచున్నదానిఁ జూచి దుఃఖితుండై భీమసేనుండు ధర్మరాజున కి ట్లనియె. 220**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; జగత్త్రయ, విజయ, భుజవీర్య, సనాథులు+ఐన= ముల్లోకాలను జయించగల భుజబలంతో కూడుకొన్న వాళ్ళయిన; నాథులు= భర్తలు; కలిగియున్; అనాథయున్+పోలెన్= భర్తలేని దాని వలె-అంటే దిక్కులేని దాని వలె; పాంచాల రాజపుత్త్రి= ద్రౌపది; భయ+ఆర్త+ఐ= భయంచేత దుఃఖంపొందిందై; ఆర్తజనశరణ్యుండు+ఐన= దుఃఖంలో ఉండే జనులు రక్షణ వేడదగినవాడైన; జగన్నాథున్= జగత్తు కంతటికి ప్రభు వైనవాణ్ణి; జనార్దనున్= శ్రీమహావిష్ణువును - ఆయన అవతారమైన శ్రీకృష్ణుణ్ణి; తలంచుచున్= తలచుకొంటూ; కపట, ద్యూత, మధు, మద+ఉన్మత్తుండు+అయిన= కపటపుజూదమనే మద్యపానమదంచేత మిక్కిలి మత్తెక్కి ఉన్న వాడైన; ధర్మపుత్త్రు, నిమిత్తంబునన్= ధర్మరాజు కారణంగా; ఉద్గతంబు+అయిన= పుట్టిన; పాండవ పరాజయ, దహనంబున్= పాండవుల ఓటమి అనే అగ్నిని; తన, రూక్ష, కటాక్ష, వీక్షణ, వచనంబులన్= తనయొక్క కఠినాలైన చూపులలో, మాటలలో; ప్రవర్తించుచున్నదానిన్= ప్రకటిస్తున్న ద్రౌపదిని; చూచి; దుఃఖితుండు+ఐ= దుఃఖంపొందినవాడై; భీమసేనుండు; ధర్మరాజునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ముల్లోకాలను జయించగల భుజబలం ఉన్న భర్తలు గల ద్రౌపది, దిక్కులేనిదానిలా భయంతో దుఃఖిస్తూ - దుఃఖంలో ఉన్నవా ళ్ళందరు శరణు వేడదగినవాడు, జగత్తు కంతటికి ప్రభువు అయిన శ్రీకృష్ణుణ్ణి మనస్సులో తలచుకొంటూ, కపటపు జూద మనేమద్యపానమదంచేత మత్తెక్కిన ధర్మరాజువల్ల పుట్టిన పాండవుల ఓటమి అనే అగ్నిని కఠినాలైన తన చూపుల్లో, మాటల్లో వ్యక్తం చేయటం చూచి, భీమసేనుడు దుఃఖపడుతూ ధర్మరాజుతో ఇలా అన్నాడు.

విశేషం: అలం. రూపకం. అందరు ఉన్నా ద్రౌపదికి ఎవ్వరూ లేనట్లే అయింది. ఇక దిక్కులేనివాళ్ళకు దేవుడే దిక్కుగదా! అందుకే ఆమె శ్రీకృష్ణుణ్ణి స్మరించింది.

క. ధన కనక రత్న వరవా । హన ధరణీ రాజ్యములును నాయుధములు మ
మ్మును నోటువడుట యుచితమ । యినసన్నిభ! వీని కెల్ల నీశుఁడ వగుటన్. 221

ప్రతిపదార్థం: ఇన, సన్నిభ= సూర్యునితో సమానమైనవాడా! ఓ ధర్మరాజా!; ధన, కనక, రత్న, వరవాహన, ధరణీ, రాజ్యములునున్= డబ్బును, బంగారాన్ని, రత్నాలను, శ్రేష్ఠములైన వాహనాలను, రాజ్యాన్ని, ఆయుధాలను; మమ్మునున్= తమ్ముళ్ళమైన నలువురను; వీనికిన్+ఎల్లన్= వీటి కన్నింటికి; నీవు; ఈశుఁడవు= ప్రభుడవు; అగుటన్= అవటంచేత; ఓటు, పడుట= జూదంలో ఒడ్డి ఓడిపోవటం; ఉచితము+అ= తగినదే.

తాత్పర్యం: సూర్యునితో సమానమైన ఓ ధర్మరాజా! ధన, కనక, రత్న, వాహనాలకు, రాజ్యానికి, ఆయుధాలకు, తమ్ములమైన మా నల్వురకు - నీవు ప్రభుడవు. కాబట్టి, జూదంలో ఒడ్డి ఓడిపోవటం ఉచితమే.

క. ద్రుపదతనూజం బణముగఁ । గపటద్యూతమునఁ జేయఁగాఁ దగునె జనా
ధిప! యిది దుష్టద్యూతము । నెపమునఁ బరిభూత యయ్యె నిష్కరుణులచేన్. 222

ప్రతిపదార్థం: జన+అధిప= రాజా!; ద్రుపద, తనూజన్= ద్రౌపదిని; కపట, ద్యూతమునన్= మోసపు జూదంలో; పణముగాన్= పందెంగా; చేయఁగాన్+తగునె= చేయటం తగునా?; ఇది= ద్రౌపది; దుష్ట, ద్యూతము, నెపమునన్= ఈ చెడుజూదం కారణంగా; నిష్కరుణులచేన్= దయలేని వారి చేత; పరిభూత+అయ్యెన్= అవమానించబడినది అయింది.

తాత్పర్యం: ఓరాజా! ద్రౌపదిని కపటపు జూదంలో పందెంగా ఒడ్డదగునా! ఈ చెడుజూదం కారణంగా ఆమె ఈ దయలేనివాళ్ళచేత అవమానింపబడింది.

వ. 'శకునికైతవం బెఱింగియుం బాపద్యూతంబునఁ బ్రవర్తించి యధర్మ ప్రవృత్తుండ వయితి కావున భవద్బాహు దాహంబు సేయవలయు' నని కోపించి పలికినం బవనతనయునకు నర్జునుం డి ట్లనియె. 223

ప్రతిపదార్థం: శకుని, కైతవంబు= శకునియొక్కకపటాన్ని; ఎఱింగియున్= తెలిసియు; పాప, ద్యూతంబునన్= చెడ్డజూదంలో; ప్రవర్తించి= పాల్గొని; అధర్మ ప్రవృత్తుండవు+అయితి= అధర్మంలో నడిచినవాడి వయ్యావు; కావున; భవత్+బాహు, దాహంబు= నీయొక్క చేతులను కాల్చటం; చేయవలయున్, అని కోపించి; పలికినన్, పవనతనయునకున్= వాయుదేవుని కుమారుడైన భీమునికి; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'శకునిమోసం తెలిసికూడ నీవు చెడుజూదంలో పాల్గొని, అధర్మమార్గాన నడిచినవాడి వయ్యావు. అందుచేత నీ చేతులు కాల్చాలి' అని కోపంతో పలికిన భీమునికి అర్జునుడు ఇలా అన్నాడు.

విశేషం: ఇక్కడ మూలంలో "బాహూ తే సంప్రధక్ష్యామి సహదేవాగ్ని మానయ" (భండార్కరు ప్రతి 2-61-6) అని ఉంది. సహదేవుణ్ణి అగ్ని తెమ్మనటం తెలుగులో లేదు. కాగా 'బాహూ తే సంప్రధక్ష్యామి' అనటాన్ని రెండు విధాలుగా పండితులు అన్వయించటం జరిగింది. తే బాహూ= నీ బాహువులను; సంప్రధక్ష్యామి= తగులబెడతాను - అనటం ఒకటి, తే=తే(పురతః), బాహూ=(మమ) బాహూ, సంప్రధక్ష్యామి= తగులబెడతాను (నీ ఎదుట నా బాహువులను తగులబెడతాను) అని అనటం మరొకటి. భీముడు అన్నగారి బాహువులను తగులబెడతానని అంటాడా? అందుచేత ఏమీ చేయలేక తన బాహువులను తానే తగులబెట్టుకొంటా నన్నా డని మరొక వర్గంవారి అభిప్రాయం. కాని, ఆ సందర్భంలో ఆవేశపరుడైన భీముడు అన్నగారిని అలా అనటమే సమంజస మనిపిస్తున్నది. అందుచేతనే అర్జునుడు ధర్మరాజును సమర్థించవలసివచ్చింది. పైగా భీముడు ధర్మరాజును ఎదిరించి మాట్లాడిన సందర్భాలు భారతంలో లేకపోలేదు. నన్నయ అనువాదమే ఈ సందర్భంలో చక్కగా అతుకుతున్నది.

సీ. **ధర్మతనూజుండు ధర్మువు దప్పిన । ధరణీతలం బెల్లఁ దల్లడిల్లుఁ;**
దగిలి సుహృద్ద్యూత ధర్మయుద్ధములకుఁ । బరులచేఁ బిలువంగఁబడి విభుండు
గడగక విముఖుండు గాఁ జన దని శుభ । క్షాత్త్రధర్మంబు లోకంబునందు
నిలిపెఁ దా; నిది పతినేరమియే? దైవ । వైపరీత్యం బైన వనరఁ దగునె?

ఆ. **గురుల ధర్మపరులఁ గోపించి ధీరు ల । తిక్రమింతురే? తదీయనిత్య**
ధర్మగౌరవం బధార్మికు లగుచున్న । పరులచేతఁ జెఱుపఁబడియె నిట్లు. **224**

ప్రతిపదార్థం: ధర్మతనూజుండు= ధర్మరాజు; ధర్మువు= ధర్మం; తప్పినన్; ధరణీతలంబు+ఎల్లన్= భూమండలం అంతా; తల్లడిల్లున్; తగిలి= వెంటబడి; సుహృత్+ద్యూత, ధర్మయుద్ధములకున్= స్నేహంగా ఆడుకొనే జూదానికి, ధర్మంకోసం చేసే యుద్ధానికి; పరులచేన్= ఇతరులచేత; పిలువంగఁబడి; విభుండు= రాజు; కడగక= పూనుకొనక; విముఖుండు= పెడమొగం పెట్టినవాడు; కాన్+చనదు+అని= కాకూడ దని; శుభ, క్షాత్ర, ధర్మంబు= శుభమైన క్షత్రియధర్మాన్ని; లోకంబునందున్; తాన్= తాను; నిలిపెన్; ఇది; పతి, నేరమియే= ధర్మరాజుయొక్క అజ్ఞానమా?; దైవవైపరీత్యంబు+ఐనన్= దేవునిదయ తారుమారైతే; వనరన్= దుఃఖించ; తగునె= తగునా?; గురులన్= పెద్దవాళ్ళను; ధర్మపరులన్= ధర్మాన్ని పాటించేవాళ్ళను; కోపించి; ధీరులు= నీవంటి ధైర్యవంతులు; అతిక్రమింతురే= మర్యాదను మీరుతారా!; తదీయ, నిత్య, ధర్మ, గౌరవంబు= ఆయనయొక్క (ధర్మరాజుయొక్క) శాశ్వతమైన ధర్మంయొక్క గొప్పతనం; అధార్మికులు= ధర్మహీనులు; అగుచున్+ఉన్న; పరులచేతన్= ఇతరులచేత; ఇట్లు; చెఱుపన్+పడియెన్= చెడగొట్టబడింది.

తాత్పర్యం: ధర్మరాజే ధర్మం తప్పితే భూమండలమంతా తల్లడిల్లదా? స్నేహంగా ఆడుకొనే జూదానికి, ధర్మంకొరకు చేసే యుద్ధానికి ఇతరులు పలుమార్లు పిలిస్తే, ప్రభువైనవాడు అందుకు పూనుకోకుండా, పెడమొగంపెట్టి పోకూడదన్న శుభక్షత్రియధర్మాన్ని, ఆయన లోకంలో నిలిపాడు. అంతేకాని ధర్మరాజు ఈ జూదమాడటం అజ్ఞానంవల్లనా? దైవానుగ్రహం తారుమారైతే అందుకు దుఃఖించటం తగునా? ధర్మజుని శాశ్వతమైన ధర్మగౌరవం- ధర్మహీనులైన ఇతరులచేత ఈ విధంగా చెడగొట్టబడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అర్జుననిసమర్థన భీముని ఆగ్రహావేశానికి సకాలంలో చక్కని అడ్డుకట్ట వేసింది.

వ. అనుచు దుఃఖితులగు చున్న పాండవులను దుశ్శాసనాపకృష్టయై సభాంతరంబున నున్న ద్రౌపదిం జూచి వికర్ణుం డన్యాయశ్రవణవికర్ణులై మిన్నకున్న సభ్యుల కి ట్లనియె. 225

ప్రతిపదార్థం: అనుచున్; దుఃఖితులు+అగుచున్+ఉన్న; పాండవులను; దుశ్శాసన+అపకృష్ట+ఐ= దుశ్శాసనునిచేత ఈడ్వబడిందై; సభా+అంతరమునన్= సభమధ్య; ఉన్న; ద్రౌపదిన్, చూచి; వికర్ణుండు; అన్యాయ, శ్రవణ, వికర్ణులు+ఐ= అన్యాయాన్ని వినటానికి చెవులు లేనివాళ్ళయి - అంటే అన్యాయాన్నిగూర్చి వినటానికి ఒల్లనివాళ్ళయి; మిన్నక+ఉన్న= ఊరకున్న; సభ్యులకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని దుఃఖిస్తున్న పాండవులను, దుశ్శాసనునిచేత ఈడ్వబడి సభామధ్యంలో ఉన్న ద్రౌపదిని చూచి, అన్యాయాన్ని గూర్చి వినటానికి ఇష్టపడని సభాసదులతో వికర్ణుడు ఇలా అన్నాడు.

విశేషం: దుర్యోధనుని తొంబయితొమ్మిదిమంది తమ్ముళ్ళలో వికర్ణుడు ఒకడు. కొంత న్యాయాన్యాయ పరిగణన, ధార్మికావేశం కలవాడు.

క. సమచిత్తవృత్తు లగు బు । ద్ధిమంతులకు నిపుడు ద్రౌపదీప్రశ్న విచా
రము సేయ వలయు; నవిచా । రమునఁ బ్రవర్తిల్లు టది నరకహేతు వగున్. 226

ప్రతిపదార్థం: సమచిత్తవృత్తులు+అగు= పక్షపాతం లేని మనసు కలవాళ్ళయిన; బుద్ధిమంతులకున్= మేధావులకు-ఆలోచనాపరులకు; ఇప్పుడు; ద్రౌపదీ, ప్రశ్న= ద్రౌపది వేసిన ప్రశ్న; విచారము, చేయవలయున్= ఆలోచించవలసి ఉన్నది; అవిచారమునన్= ఆలోచించకుండ; ప్రవర్తిల్లుట= ఉండటం; అది; నరకహేతువు+అగున్= నరకం పొందటానికి కారణ మవుతుంది.

తాత్పర్యం: పక్షపాతంలేని బుద్ధిమంతు లంతా ఇప్పుడు ద్రౌపది అడిగిన ప్రశ్నను విచారించవలసిన అవసరముంది. అలా విచారించకుండ మన కెందుకు లెమ్మని ఊరకుంటే అది నరక హేతు వౌతుంది.

వ. 'ఇక్కురువృద్ధు లైన భీష్మ ధృతరాష్ట్ర విదురాదులును నాచార్యులయిన ద్రోణకృపాదులుం బలుకరైరి; యున్న సభాసదులెల్లం గామక్రోధాదులు దక్కి విచారించి చెప్పుం'డనిన నెవ్వరుం బలుకకున్న 'నే నిందు ధర్మ నిర్ణయంబు సేసెద; నెల్లవారును వినుండు; జూదంబును వేఁటయుఁ బానంబును బహుభక్షణాసక్తియు నను నాలుగు దుర్వ్యసనంబులం దగిలిన పురుషుండు ధర్మువుం దప్పివర్తిల్లు; నట్టి వాని కృత్యంబులు సేకొనం దగవు; కిత వాహూతుండై వ్యసనవర్తి యయి పరాజితుం డయిన పాండవాగ్రజుండు పాండవుల కందఱకు సాధారణ ధనంబయిన పాంచాలిఁ బణంబుఁ జేసెం గావున ద్రౌపది యధర్మవిజిత; యక్కోమలి నేకవస్త్ర నిట దోడ్కొని తెచ్చుట యన్యాయం' బనిన వికర్ణుపలుకుల కొడంబడక కర్ణుండు వాని కి ట్లనియె. 227

ప్రతిపదార్థం: ఈ+కురువృద్ధులు+ఐన= ఈ కురువంశపు పెద్దలైన; భీష్మ, ధృతరాష్ట్ర, విదుర+ఆదులునున్= భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు మొదలయినవాళ్ళూ; ఆచార్యులు+అయిన= గురువులైన; ద్రోణ, కృప+ఆదులున్= ద్రోణుడు, కృపుడు మొదలయినవాళ్ళూ; పలుకరు+ఐరి= మాటాడకున్నారు; ఉన్న= మిగిలిఉన్న- తక్కిన; సభాసదులు+ఎల్లన్= సభలో

కూర్చున్న ధర్మం తెలిసిన వాళ్ళంతా; కామ, క్రోధ+ఆదులు= రాగం, ద్వేషం మొదలైనవి; తక్కి= మాని; విచారించి= ఆలోచించి; చెప్పుండు; అనినన్; ఎవ్వరున్= ఎవరుకూడ; పలుకక; ఉన్నన్; ఏన్= నేను; ఇందున్= ఇక్కడ; ధర్మనిర్ణయంబు= ధర్మాన్ని గురించిన నిర్ణయం; చేసెదన్; ఎల్లవారును= అందరు; వినుండు; జూదంబును; వేఁటయున్; పానంబును= మద్యపానం; బహు, భక్షణ+ఆసక్తియున్= అతిగా తినటంలోని మితిమీరిన కోరిక; అను నాలుగు, దుర్వ్యసనంబులన్= చెడు వ్యసనాలలో; తగిలిన= తగుల్కొన్న; పురుషుండు= మానవుడు, ధర్మువున్= ధర్మాన్ని; తప్పి, వర్తిల్లున్= ప్రవర్తిస్తాడు; అట్టి వాని; కృత్యంబులు= పనులు; చేకొనన్, తగవు= లెక్కలోకి తీసుకోదగినవికావు; కితవ+ఆహూతుండు+ఐ= జూదరిచేత పిలువబడినవాడై; వ్యసన, వర్తి+అయి= జూదవ్యసనంలో తగుల్కొన్నవాడై; పరాజితుండు+అయిన= ఓడిపోయిన; పాండవ+అగ్రజుండు= పాండవులందు ముందు పుట్టినవాడు - ధర్మరాజు; పాండవులకున్+అందఱకు; సాధారణ ధనంబు+అయిన= ఉమ్మడిసొమ్ము అయిన; పాంచాలిన్= ద్రౌపదిని; పణంబున్+చేసెన్= పందెంగా చేశాడు; కావున; ద్రౌపది; అధర్మ, విజిత= అధర్మంచేత జయింపబడింది; ఆ+కోమలిన్= ఆ సుకుమారిని; ఏక, వస్త్రన్= ఒకే బట్టను ధరించినదానిని; ఇటన్= ఇక్కడికి; తోడ్కొని; తెచ్చుట; అన్యాయంబు; అనిన; వికర్ణు, పలుకులకున్= వికర్ణుని మాటలకు; ఒడంబడక= ఒప్పుకొనక; కర్ణుండు; వానికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఈ కురువంశపు పెద్దలైన భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు మొదలయినవాళ్ళూ, గురువులైన ద్రోణుడు, కృపుడు మొదలయినవాళ్ళూ మౌనంగా ఉన్నారు. సభలో కూర్చున్నవాళ్ళలో మిగిలిన ధర్మజ్ఞులైనా రాగద్వేషాలు మాని ఆలోచించి చెప్పండి' - అని వికర్ణు డనగా, ఎవ్వరూ పలుకలేదు. అప్పుడు వికర్ణుడు 'నేనే ఇక్కడ ధర్మనిర్ణయం చేస్తాను. అందరు వినండి. జూదం, వేట, మద్యపానం, అతిగా తినటం అనే నాలుగూ చెడు వ్యసనాలు. వీటిలో తగుల్కొన్న మానవుడు ధర్మంతప్పి ప్రవర్తిస్తాడు. అలాంటివాడి పనులు లెక్కలోకి తీసుకోకూడదు. జూదగానిచేత ఆహ్వానించబడి, జూదవ్యసనంలో తగుల్కొని ఓడిపోయిన ధర్మరాజు, పాండవు లందరికి ఉమ్మడిసొమ్ము అయిన పాంచాలిని పందెంగా చేశాడు. అందుచేత ఆమె అధర్మంచేత జయించబడింది. ఆ సుకుమారిని-ఒకేవస్త్రం ధరించి ఉన్నదాన్ని, ఇక్కడికి తీసుకొని రావటం అన్యాయం' అని వికర్ణు డనగా ఆ మాటలను అంగీకరించక కర్ణు డతనితో ఇలా అన్నాడు.

విశేషం: వ్యసన మంటే కామక్రోధాదులవల్ల పుట్టే దోషం. ఇవి ఏడు. జూదం, మద్యపానం, వేట, స్త్రీవ్యామోహం (ఈ నాలుగు కామం వల్ల పుట్టేవి), వాక్పారుష్యం, దండపారుష్యం, అర్థదూషణం (ఈమూడూ క్రోధంవల్ల పుట్టేవి). పై వచనంలో 'బహుభక్షణాసక్తి' అనే దానికి 'పరనారీ బహుళాసక్తి' అనే పాఠాంతరం ఉంది. ఇదే మేల్తరం, మూలానుగుణం అనిపిస్తుంది.

ఆ. 'ఎల్లవారు నెఱుఁగ నొల్లని ధర్మువు । బేల! నీకుఁ జెప్ప నేల వలసెఁ?
జిఱుతవాని కింత తఱుసంటి పలుకులు । సన్నె వృద్ధజనము లున్నచోట? 228

ప్రతిపదార్థం: ఎల్లవారున్= అందరు; ఎఱుఁగన్+ఒల్లని= తెలియటానికి ఇష్టపడని; ధర్మువు= ధర్మం; బేల= మూఢుడా! నీకున్, ఏల; చెప్పన్, వలసెన్= చెప్పవలసివచ్చింది, వృద్ధ, జనములు= పెద్దవాళ్ళు; ఉన్నచోటన్; చిఱుతవానికిన్= చిన్నవాడికి; ఇంత; తఱుసంటి, పలుకులు= అధికప్రసంగాలు; చన్నె= తగునా? (తగదని భావం).

తాత్పర్యం: ఎవ్వరూ తెలియటానికి ఇష్టపడని ధర్మాన్ని మూఢుడా! నీ వెందుకు చెప్పవలసివచ్చింది? పెద్దవాళ్ళుండే చోట చిన్నవాడికి ఈ అధికప్రసంగా లెందుకు?

విశేషం: నిండుసభల్లో పెద్ద లెవరైనా పిన్నవారిని ఈసడింపుతో అధిక్షేపించే సందర్భాలలో ఈ పద్యాన్ని వాడుతూ ఉండటం ప్రసిద్ధి. అది నన్నయగారి రుచిరార్థసూక్తిమత్త్వానికి మచ్చుతునక. ఈ పద్యరచనలో 'బేల!' అన్నసంబోధన అవహేళనాత్మకం. 'చిఱుతవాని కింత తఱుసంటిపలుకులు' అనేమాట అధిక్షేపాత్మకం. తెలుగుమాటలతో కూడిన వాక్యాల నృత్యవద్భావం. అగ్రామ్యత్వస్ఫూర్తి కల ఈ పద్యంలో ఉదారత ఉజ్జ్వలంగా పోషించబడింది. (సంపా.)

వ. నీవు ద్రౌపది నధర్మవిజిత యని పలికితి; సభాసదులెల్ల నెఱుంగ ధర్మజుండు దన సర్వస్వమ్ము నొడ్డి యోటువడి నప్పు డిది వానికి వెలిగాదు గావున ధర్మవిజితయ; యిట్లు గానినాఁడు పాండవు లిందఱును దీని విజితఁగా నేల యొడంబడుదురు? మఱి యేకవస్త్రయై యున్న దీని సభకుం దోడ్కొని వచ్చుట ధర్మువు గాదంటి; భార్యకు దైవవిహితుం డయిన భర్త యొక్కరుండ; యిది యనేకభర్తృక గావున బంధకి యనంబడు; నిట్టిదాని విగతవస్త్రం జేసి తెచ్చినను ధర్మవిరోధంబు లే దని కర్ణుండు వికర్ణువచనంబులకుం బ్రత్యాఖ్యానంబు సేసిన విని, దుర్యోధనుండు దుశ్శాసనుం బిలిచి 'యిప్పాండవులయు ద్రౌపదియు వస్త్రంబు లపహరింపు' మని పంచిన దాని నెఱింగి. 229

ప్రతిపదార్థం: నీవు; ద్రౌపదిన్; అధర్మ విజిత= అధర్మంచేత జయించబడినది; అని; పలికితి= పలికావు; సభాసదులు+ఎల్లన్= సభలో కూర్చున్న ధర్మం తెలిసిన వాళ్ళంతా; ఎఱుంగన్; ధర్మజుండు; తన, సర్వస్వమ్మున్= తనకున్న సంపద నంతా; ఒడ్డి; ఓటుపడి నప్పుడు= ఓడిపోయి నప్పుడు; ఇది= ఈ ద్రౌపది; వానికిన్= ఆ ధర్మరాజుకు; వెలి, కాదు, కావునన్= పరాయిది కాదు కనుక; ధర్మవిజిత+అ= ధర్మంచేత జయించబడినదే; ఇట్లు; కాని, నాఁడు= కానిరోజు; పాండవులు+ఇందఱును= పాండవులంతా; దీనిన్= ఈ ద్రౌపదిని; ఏల, విజితఁగాన్= జయించబడిన దానినిగా; ఒడంబడుదురు= అంగీకరిస్తారు; మఱి= మరియు; ఏక, వస్త్ర, ఐ= ఒకే వస్త్రాన్ని ధరించినదై; ఉన్న; దీనిన్; సభకున్, తోడ్కొని= వెంటబెట్టుకొని; వచ్చుట; ధర్మువు= ధర్మం; కాదు+అంటి; భార్యకున్; దైవవిహితుండు+అయిన= దైవంచేత ఏర్పాటు చేయబడిన; భర్త; ఒక్కరుండు+అ= ఒక్కడే; ఇది= ఈ ద్రౌపది; అనేక, భర్తృక= పెక్కుమంది భర్తలు కలది; కావునన్; బంధకి= రంకుటాలు; అనంబడున్; ఇట్టిదానిన్; విగతవస్త్రన్+చేసి= తొలగించబడిన వస్త్రాలు కలదానినిగా చేసి - అంటే నగ్నంగా; తెచ్చినను; ధర్మ, విరోధంబు= ధర్మానికి వ్యతిరేకం; లేదు+అని; కర్ణుండు; వికర్ణు, వచనంబులకున్= వికర్ణుని మాటలకు; ప్రతి+ఆఖ్యానంబు; చేసినన్= నిరాకరణ చేసిన - అంటే త్రోసిపుచ్చి మాట్లాడగా; విని; దుర్యోధనుండు; దుశ్శాసనున్; పిలిచి; ఈ+పాండవులయు= ఈపాండవులయొక్క; ద్రౌపదియు= ద్రౌపదియొక్క; వస్త్రంబులు; అపహరింపుము= లాగికొనుము; అని; పంచినన్= ఆజ్ఞాపించగా; దానిన్; ఎఱింగి= తెలుసుకొని.

తాత్పర్యం: 'నీవు, ద్రౌపది అధర్మంగా జయించబడిం దని పలికావు. సభలో కూర్చున్న ధర్మజ్ఞులంతా చూస్తుండగా ధర్మరాజు తన సర్వస్వాన్నీ ఒడ్డి ఓడిపోయాడు. ఈ ద్రౌపది అతనికి పరాయిమనిషి కాదు. అందుచేత అదికూడ ధర్మంగా జయించబడినట్లే. అలా కాకుంటే పాండవులంతా దానిని ఎందుకు జయించబడిన దానినిగా అంగీకరిస్తారు? కాగా, ఒకే వస్త్రాన్ని ధరించి ఉన్నదాన్ని సభకు తోడ్కొని రావటం ధర్మం కా దన్నావు. భార్యకు భగవంతుడు విధించిన భర్త ఒక్కడే. ఇది పెక్కుమంది భర్తలు కలది. అందుచేత బంధకి. ఇలాంటిదాన్ని బట్టలు లేకుండ నగ్నంగా తెచ్చినా తప్పు లేదు' అని కర్ణుడు వికర్ణుని మాటలను త్రోసిపుచ్చి పలుకగా - దుర్యోధనుడు విని, దుశ్శాసనుణ్ణి పిలిచి 'ఈపాండవులవి, ద్రౌపదివి వస్త్రాలు లాగితీసుకో' అని ఆజ్ఞాపించగా దానిని తెలుసుకొని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: వస్త్రాపహరణాన్ని సూచించినవాడు, ద్రౌపదీ నగ్నసౌందర్యాన్ని చూడ ఉసిగొల్పినవాడు - కర్ణుడు.

క. కితవవ్యవసాయపరా । జితు లగుటం జేసి బలిమి చెడి పాండుసుతుల్
ధృతిఁ దమ పయిపుట్టము లా । యతకీర్తులు మున్నపెట్టి యా సభ నున్నన్. 230

ప్రతిపదార్థం: కితవ, వ్యవసాయ, పరాజితులు+అగుటన్+చేసి= జూదమాడే ప్రయత్నంలో ఓడిపోయిన వాళ్ళుకావటంచేత; పాండుసుతుల్= పాండురాజుపుత్రులు - పాండవులు; ఆయతకీర్తులు= గొప్ప కీర్తికలవాళ్ళు; బలిమి, చెడి= బలహీనులై; ధృతిన్= ధైర్యంతో; తమ; పయి పుట్టములు= పై బట్టలు; మున్న= ముందుగానే; పెట్టి= తీసిపెట్టి; ఆ, సభన్= ఆ సభలో; ఉన్నన్= ఉండగా.

తాత్పర్యం: జూద మాడే ప్రయత్నంలో ఓడిపోయినవాళ్ళు కావటంచేత, ఎంతో కీర్తిమంతులైన పాండవులు బలహీనులై తమ పై బట్టలు ముందే తీసిపెట్టి ఆ సభలో నిలిచారు.

దుశ్శాసనుండు ద్రౌపది కట్టిన పుట్టం బొలుచుట (సం. 2-61-40)

సీ. ఇది సేయఁ గా దని మది విచారింపక । సద్గర్హితుండు దుశ్శాసనుండు
నెట్టన ద్రౌపది గట్టిన పుట్టంబు । సభలోన విడ్చె నాశంక లేక
యుడుగక యొలువవంగఁ బడియు ము న్నపనీత । మైన తద్వస్త్రంబు నట్టి వలువ
లలితాంగిజఘనమండలమునఁ బాయక । యొప్పుచు నున్న నయ్యువిదఁ జూచి

ఆ. సభ్యులెల్ల నుదితసమ్మదు లయిరి దు । శ్శాసనుండు వస్త్రచయము పర్వ
తోపమాన మయిన నొలువంగ నోపక । యుడిగె లజ్జఁ బొంది యుక్కు దక్కి. 231

ప్రతిపదార్థం: సత్+గర్హితుండు= సజ్జనులచేత నిందించబడినవాడు; దుశ్శాసనుండు; ఇది; చేయన్+కాదు+అని= చేయ కూడని దని; మదిన్= మనస్సులో; విచారింపక= ఆలోచించక; నెట్టన= అడ్డులేకుండా; ద్రౌపది; కట్టిన= కట్టుకొనిన; పుట్టంబు= వస్త్రం; ఆశంక, లేక= సంకోచం లేకుండ; సభలోనన్; విడ్చెన్= విప్పాడు; ఉడుగక= ఆపకుండ; ఒలువవంగఁబడియున్= విప్పబడి; మున్ను+అపనీతము+ఐన= ముందు తొలగింపబడిందైన; తత్‌వస్త్రంబు, అట్టి, వలువ= ఆ వస్త్రంవంటి వస్త్రమే; లలిత+అంగి, జఘన, మండలమునన్= మనోహరాలైన అవయవాలు కల ద్రౌపదియొక్క మొలభాగాన; పాయక= ఎడతెగక; ఒప్పుచున్; ఉన్నన్; ఆ+ఉవిదన్= ఆకాంతను; చూచి; సభ్యులు+ఎల్లన్= సభలోని సభ్యులంతా; ఉదిత, సమ్మదులు+అయిరి= పుట్టిన సంతోషం కలవా ళ్ళయ్యారు- అంటే సంతోషించారు; వస్త్రచయము= బట్టల సమూహం; పర్వత+ఉపమానము= పర్వతంతో సమానం; అయినన్; దుశ్శాసనుండు; ఒలువంగన్+ఓపక= విప్పలేక; ఉక్కు, తక్కి= పట్టువిడిచి; లజ్జన్+పొంది= సిగ్గుచెంది; ఉడిగెన్= ఊరకున్నాడు.

తాత్పర్యం: సజ్జనులచేత నిందించబడిన దుశ్శాసనుడు, ఇది చేయకూడ దని మనస్సులో విచారించక, అడ్డులేనివాడై, ఆ ద్రౌపది కట్టుకొన్న వస్త్రాన్ని నిస్సంకోచంగా నిండు సభలో విప్పాడు. ఆపకుండా అతడు విప్పుతున్నా ముందు తొలగించబడ్డ వస్త్రంవంటి వస్త్రమే- ఆ లలితాంగి మొలభాగంమీద ఎడతెగకుండా ఉండటం చూచి సభలోని సభ్యులంతా సంతోషించారు. విప్పిన వస్త్రసమూహం కొండలా గుట్టపడగా దుశ్శాసనుడు ఇక విప్పలేక, పట్టు విడిచి, సిగ్గుచెంది ఊరకుండిపోయాడు.

విశేషం: కులకాంతకు ఇంతకంటె ఘోరావమానం ఏముంది? అయినా అంతమంది సభలో ఉండి దాన్ని ఆపలేకపోయారు. ఊహించుకొంటే చాలు ఎవరికైనా రక్తం ఉడికిపోతుంది. అది చూచి ఎవరు ఊరుకొన్నా- భీముడు ఊరుకొంటాడా?

వ. **ఇట్లు భీమసేనుండు ద్రుపదరాజనందనకు దుశ్శాసనుండు సేసిన యవమానంబు సూచి కోపరక్తాంత నయనుం డగుచు నంతకాకారంబున దంతసందష్టదారుణముఖుండయి యెల్లవారును విన ని ట్లనియె.** **232**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; భీమసేనుండు; ద్రుపదరాజ నందనకున్= ద్రుపదరాజు కూతురైన ద్రౌపదికి; దుశ్శాసనుండు; చేసిన; అవమానంబు; చూచి; కోప, రక్త+అంత+నయనుండు= కోపంచేత ఎరుపెక్కిన చివరలు గల కన్నులు కలవాడు; అగుచున్; అంతక+ఆకారంబునన్= యముని రూపాన; దంత, సందష్ట, దారుణ, ముఖుండు+అయి= పళ్ళుకొరకటంచేత భయంకరమైన ముఖం కలవాడై; ఎల్లవారును; వినన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ద్రుపదరాజపుత్రికి దుశ్శాసనుడు చేసిన అవమానాన్ని చూచి, భీమసేనుడు కళ్ళెర్ర చేశాడు. పళ్ళు కొరుకుతూ, భయంకరముఖంతో యమునిలా అందరూ వినేటట్లు ఇలా అన్నాడు.

మ. **కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనేకుల్ సూచుచుండన్ మదో**
ద్ధురుఁడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోకభీ
కరలీలన్ వధియించి తద్విపులవక్షశ్శైలరక్తౌఘ ని
ర్ఝర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్. **233**

ప్రతిపదార్థం: కురు, వృద్ధుల్= కురువంశపు పెద్దలు; గురు, వృద్ధ, బాంధవులు= గురువులు, వృద్ధులు, బంధువులు; అనేకుల్= పెక్కుమంది; చూచుచుండన్; మద+ఉద్ధురుఁడు+ఐ= పొగరుచేత బరువైనవాడై- అంటే పొగరు పెరిగి చెలరేగినవాడై; ద్రౌపదిన్; ఇట్లు= ఈ విధంగా; చేసిన; ఖలున్= క్రూరుడైనవాణ్ణి; దుశ్శాసనున్; ఉర్వీపతి= రాజైన దుర్యోధనుడు; చూచుచుండన్; అనిన్= యుద్ధంలో; లోకభీకరలీలన్= లోకానికి భయం కలిగించే రీతిగా; వధియించి= చంపి; తత్+విపుల, వక్షస్+శైల, రక్త+ఓఘ, నిర్ఝరము= ఆ దుశ్శాసనుడియొక్క విశాలమైన రొమ్ము అనే పర్వతంలోని రక్తప్రవాహ మనే సెలయేటిని; ఉగ్ర+ఆకృతిన్= భయంకరమైన రూపంతో; ఆస్వాదింతున్= పానం చేస్తాను.

తాత్పర్యం: కురు వంశపు పెద్దలు, గురువులు, వృద్ధులు, బంధువులు పెక్కుమంది చూస్తుండగా- పొగరెక్కి చెలరేగి, ద్రౌపదిని ఈవిధంగా చేసిన దుశ్శాసనుణ్ణి రాజు (దుర్యోధనుడు) చూస్తుండగానే యుద్ధంలో లోకభయంకరమైన రీతిలో వధించి, అతని విశాలవక్షస్థలమనే పర్వతంలోని రక్తప్రవాహమనే సెలయేటిని భయంకరాకారం ధరించి త్రాగుతాను.

విశేషం: అలం: రూపకం. అక్షరరమ్యమై, అర్థగంభీరమై, పద్యశిల్పంలో అతిప్రసిద్ధమైన నన్నయ పద్యాల్లో ఇది ఒకటి, భయంకరాలై, భావిభారత మహాసంగ్రామానికి ప్రాతిపదికలై, రౌద్రరసానికి ఉనికి పట్టులైన భీముని ప్రతిజ్ఞల్లో ఇది మొదటిది. వినాలేగాని ఇందులోని ధకారాల్లో మహోగ్రుడైన భీముని గదాఘాతాలు, పిడిగ్రుద్దులు వినిపించగలవు. చూడాలేగాని తరువాతి పదాల్లో, సమాసాల్లో-ఖలున్, దుశ్శాసనున్ - అని ఖంగున తెగబలికి, కళ్ళురిమి, పళ్ళు బిగబట్టి, ఒక్క గ్రుక్కలో 'లోక భీకరలీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తౌఘ నిర్ఝర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్' అని బుసలు కొట్టుతూ, ఊగుతూ నిలిచిన భీముని భయంకరముఖాకృతిని చూడవచ్చు. 'ద్రౌపది నిట్లు సేసిన ఖలున్' అనటంలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుశ్శాసనుడు చేసిన పని ఎంత అవాచ్యమైనదో వ్యక్తమౌతున్నది. 'ఉర్వీపతి చూచుచుండన్' అనటంలో అవాచ్యం, అతిక్రూరం అయిన ఈ పనికి అతణ్ణి పురికొల్పిన వ్యక్తి కట్టెదుటే దుష్టదుశ్శాసనుణ్ణి ఈ విధంగా కడతేరిస్తే గాని నాకసి తీర దనే భావం స్ఫురిస్తున్నది. 'ఆస్వాదింతు' ననటంలో తన కసితాపం తీరటానికి దుశ్శాసనుడి నెత్తురు భీముడి కెంత తియ్యని పానీయమో తెలుస్తున్నది. ఇక ఆనాటి భీముడి 'ఉగ్రాకృతి' ఊహించదగిందే కాని- వివరించ సాధ్యం కానిది. దుశ్శాసనుడి గుండె పగిలి నెత్తుటిధారలు పైకి చిమ్మినట్లే, పద్యంలోని ప్రతిపదంలోనూ రౌద్రరసం పైకి ఎగుస్తున్నది. అందులోనూ మహాప్రాణాక్షర వర్ణవిన్యాస వైఖరి, అక్షరరమ్యతను రౌద్రరసోన్నిద్రంగా ఆవిష్కరింప చేసింది.

వ. 'ఇట్లు సేయనైతినేని పితృపితామహుల గతికిం దప్పినవాఁడ నగుదు' ననిన నతని యతిమానుషంబయిన మహావ్యవసాయంబున కద్భుతం బంది దిక్కులు చూడక ధిక్శబ్దముఖరిత ముఖు లగుచు సభాజనులు తమలో సపుత్త్రకుండయిన ధృతరాష్ట్రు నిందించుచు 'ద్రుపదరాజపుత్త్రి వాక్యంబులు విచారింపక వృద్ధరాజు లుపేక్షించి' రనుచుండి; రంత నుద్యతబాహుం డయి విదురుం డెల్లవారిని వారించి యి ట్లనియె. 234

ప్రతిపదార్థం: ఇట్లు= చెప్పినట్లు; చేయన్+ఐతిన్+ఏనిన్= చూయజాలకుంటే; పితృ, పితామహుల, గతికిన్= తండ్రితాతల మార్గానికి; తప్పినవాడన్; అగుదున్; అనినన్; అతని; అతిమానుషంబు+అయిన= మానవశక్తికి మించినదైన; మహావ్యవసాయంబునకున్= గొప్పపనికి; అద్భుతంబు+అంది= ఆశ్చర్యపడి; దిక్కులు, చూడక= ఊరకుండక; ధిక్+శబ్ద, ముఖరిత, ముఖులు= ఛీ అనే శబ్దం మ్రోగుతున్న ముఖాలు కలవారు; అగుచున్; సభా, జనులు; తమలోన్; సపుత్త్రకుండు+అయిన= పుత్త్రులతో కూడి ఉండే; ధృతరాష్ట్రునిన్; నిందించుచున్; ద్రుపదరాజ, పుత్త్రి, వాక్యంబులు= ద్రౌపదిమాటలు; విచారింపక= ఆలోచించక; వృద్ధ, రాజులు= పెద్దలైనరాజులు; ఉపేక్షించిరి= అశ్రద్ధచేశారు; అనుచుండిరి; అంతన్= అప్పుడు; విదురుండు; ఉద్యత, బాహుండు+అయి= పైకెత్తిన చేతులు కలవాడై; ఎల్లవారినిన్= అందరిని; వారించి= ఆపి - అంటే మాట్లాడకుండ ఆపి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఈ విధంగా చెప్పినట్లు చెయ్యకుంటే నేను తండ్రితాతల మార్గానికి తప్పినవాడి నవుతాను' అని భీముడనగా - అతని మానవాతీతమైన మహాప్రయత్నానికి సభాసదులంతా ఆశ్చర్యపడి, ఊరకుండక, కొడుకులతో కూడి ఉన్న ధృతరాష్ట్రుణ్ణి 'ఛీ' అని నిందిస్తూ- 'ద్రౌపది అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పక పెద్దలైన రాజులు అశ్రద్ధ చేశా'రని అంటుండగా- విదురుడు చేతులు పైకెత్తి అందరిని మాట్లాడకుండ ఆపి- ఇలా అన్నాడు.

క. సుమతులు పాంచాలీ ప్ర। శ్నము నర్థము నేర్పడన్ విచారింపుఁడు పా
పము వొందు ధర్మసందే। హము దీర్పనినాఁడు సభ్యులగు సజ్జనులన్. 235

ప్రతిపదార్థం: సుమతులు= మంచి బుద్ధికలవాళ్ళు; పాంచాలీ ప్రశ్నము, అర్థమున్= ద్రౌపదిప్రశ్నకు సమాధానం; ఏర్పడన్= స్పష్టంగా తెలిసేటట్లు; విచారింపుఁడు= ఆలోచించండి; ధర్మసందేహము= ధర్మాన్నిగూర్చిన అనుమానం; తీర్పనినాఁడు= తీర్చని రోజున; సభ్యులు+అగు= సభలో ఉన్న వాళ్ళయిన; సజ్జనులన్; పాపము, పొందున్= పాపం అంటుతుంది.

తాత్పర్యం: బుద్ధిమంతులంతా ద్రౌపది అడిగిన ప్రశ్నకు సమాధానం స్పష్టమయ్యేటట్లు ఆలోచించండి. ధర్మసందేహం తీర్చని రోజు సభలోని సజ్జను లందరికి పాపం అంటుకొంటుంది.

విశేషం: 'తీర్పనినాఁడు', 'తీర్పనిరోజు' - అనే వాటికి ఈ సందర్భంలో 'అప్పటికప్పుడు తీర్పుచెప్పకపోతే' అని అర్థం.

మత్తకోకిలము.

ఈ వికర్ణుఁడు బాలుఁ డయ్యును నేర్పరించి యథావిధిన్
దేవమంత్రియపోలె ధర్మువుఁ దెల్పెఁ; నీతనిబుద్ధి మీ
రేవగింపక చేకొనుం డిది; యెల్లయందును ధర్మ స
ద్భావ మొక్కని కేర్పరింపఁగ బ్రహ్మకైనను బోలునే? 236

ప్రతిపదార్థం: ఈ, వికర్ణుఁడు; బాలుఁడు+అయ్యును= చిన్నవాడయినప్పటికి; దేవమంత్రియ, పోలెన్= బృహస్పతివలె; యథావిధిన్= శాస్త్రం ప్రకారం; ఏర్పరించి= స్పష్టమవునట్లు; ధర్మువున్= ధర్మాన్ని; తెల్పెన్= చెప్పాడు; మీరు; ఏవగింపక= తక్కువగా చూచి త్రోసిపుచ్చక; ఈతని, బుద్ధి= ఈతని ఆలోచన; చేకొనుండు= అంగీకరించండి; ఎల్లన్, అందును= అన్నిచోట్లా; ధర్మ, సత్+భావము= ధర్మంయొక్క సరైన అర్థాన్ని; ఒక్కనికిన్; ఏర్పరింపఁగన్= తెలియజేయటానికి; బ్రహ్మకున్+ఐనను; పోలునే= సాధ్యమవుతుందా?

తాత్పర్యం: ఈ వికర్ణుడు చిన్నవాడైనా బృహస్పతిలా శాస్త్రప్రకారం స్పష్టంగా ధర్మాన్ని తెలియచెప్పాడు. ఇతని ఆలోచనను మీరు తక్కువ చేసి త్రోసిపుచ్చక అంగీకరించండి. అన్నిచోట్లా ధర్మంయొక్క సరైన అర్థాన్ని నిర్ణయించటం ఏ ఒక్కడికీ- బ్రహ్మకుకూడ సాధ్యం కాదు.

ఆ. సభకు వచ్చి ధర్మసందేహ మడిగిన । నెఱిఁగి చెప్పకుండిరేని సభ్యు
లనృతదోషఫలమునం దర్ధ మొందుదు । రనిరి ధర్మవేదులైన మునులు. 237

ప్రతిపదార్థం: సభకున్, వచ్చి; ధర్మసందేహము= ధర్మాన్ని గూర్చిన అనుమానం; అడిగినన్, ఎఱిఁగి= తెలిసి; చెప్పక; ఉండిరి+ఏనిన్; సభ్యులు; అనృతదోషఫలమునందున్= అసత్యమాడే తప్పువలన కలిగే ఫలంలో; అర్ధము= సగం; ఒందుదురు= పొందుతారు; అని; ధర్మవేదులు+ఐన= ధర్మాన్ని తెలిసిన; మునులు; అనిరి.

తాత్పర్యం: సభకు వచ్చి ఎవరైనాసరే ధర్మసందేహం అడిగితే, తెలిసి చెప్పకుంటే- సభ్యులు, అసత్యమాడే తప్పువల్ల కలిగే ఫలంలో సగం పొందుతా రని ధర్మ మెరిగిన మునులు చెప్పారు.

ఆ. ధర్ము వెఱిఁగి దానిఁ దా నొండుగా లాభ । లోభ పక్షపాతలోలబుద్ధి
సభల నెవ్వఁడేని సభ్యుఁడై పలుకు వాఁ । డనృతదోషఫలము ననుభవించు. 238

ప్రతిపదార్థం: ధర్మువు+ఎఱిఁగి= ధర్మం తెలిసికూడ; దానిన్; ఒండుగాన్= మరొకవిధంగా; లాభ, లోభ, పక్షపాత, లోల, బుద్ధిన్= లాభంచేత, కోరికచేత, పక్షపాతంచేత ఊగిసలాడే మనస్సుతో; సభలన్= సభల్లో; ఎవ్వఁడు+ఏనిన్= ఎవ్వడైనా; సభ్యుఁడై; పలుకువాఁడు; అనృత, దోష, ఫలమున్= అసత్య మాడే తప్పువల్ల కలిగే ఫలాన్ని; అనుభవించున్.

తాత్పర్యం: ధర్మాన్ని తెలిసికూడా, లాభంచేతనో, లోభంచేతనో, పక్షపాతంచేతనో, ఊగిసలాడే బుద్ధితోనో సభల్లో ఎవడైనా - దానిని మరొక విధంగా పలికితే, అతడు అసత్యమాడే దోషంవల్ల కలిగే ఫలాన్ని అనుభవిస్తాడు.

విశేషం: నానారుచిరార్థసూక్తినిధి అయిన నన్నయ కవితలో పై పద్యాలు రెండూ గొప్ప సూక్తిరత్నాలు. న్యాయాన్యాయ నిర్ణయం చేసే సభల్లో కూర్చున్న పెద్దలందరికి ఇవి శిరోధార్యాలు.

విరోచన సుధన్వుల వృత్తాంతము

వ. ఈయర్థం బితిహాసంబులయందు వినంబడుఁ; దొల్లి ప్రహ్లాదునికొడుకు విరోచనుండును నంగిరసుండను విప్రునికొడుకు సుధన్వుండును నొక్క కన్యా ప్రతిగ్రహ నిమిత్తంబున నెల్లసుగుణంబుల 'నేన పెద్ద, నేన పెద్ద' నని తమలో నిద్దఱును ప్రాణంబు లొడ్డుగా నొడ్డి వివాదంబు సేసి ప్రహ్లాదు పాలికిం జని; రందు సుధన్వుండు ప్రహ్లాదున కి ట్లనియె. 239

ప్రతిపదార్థం: ఈ, అర్థంబు= ఈ న్యాయం; ఇతిహాసంబుల, అందున్; వినంబడున్= వినిపించును; తొల్లి= పూర్వం; ప్రహ్లాదునికొడుకు; విరోచనుండును; అంగిరసుండు+అను; విప్రుని, కొడుకు= బ్రాహ్మణుని కుమారుడు; సుధన్వుండును; ఒక్క; కన్యా, ప్రతిగ్రహ నిమిత్తంబునన్= కన్యను దానం పుచ్చుకొనే కారణాన; ఎల్ల, సుగుణంబులన్= అన్ని మంచి గుణాలలో; ఏను+అ, పెద్దన్= నేను ఎక్కువ; ఏను+అ, పెద్దన్= నేను ఎక్కువ; అని; తమలోన్; ఇద్దరును; ప్రాణంబులు; ఒడ్డుగాన్, ఒడ్డి= పందెంగా ఒడ్డి; వివాదంబు, చేసి= తగవులాడుకొని; ప్రహ్లాదు, పాలికిన్= ప్రహ్లాదుని దగ్గరకు; చనిరి= వెళ్ళారు; అందున్; సుధన్వుండు; ప్రహ్లాదునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ న్యాయం ఇతిహాసాల్లోకూడ వినిపిస్తుంది. పూర్వం ప్రహ్లాదునికొడుకు విరోచనుడూ, అంగిరసుడనే బ్రాహ్మణునికొడుకు సుధన్వుడూ ఒక కన్యను దానం పుచ్చుకొనే విషయంలో - అన్ని సుగుణాల్లో నే నెక్కువ, నే నెక్కువ అని, ప్రాణాలు పందెంగా ఒడ్డి, తగవులాడుకొని, ప్రహ్లాదునిదగ్గరకు వెళ్ళారు. సుధన్వుడు ప్రహ్లాదునితో ఇలా అన్నాడు.

తే. నీవు ధర్మవిదుండవు మా వివాద। మెఱిఁగి తీర్పు గుణశ్రేష్ఠుఁ డితఁడొ నేనొ
చెప్పు; మన్యథాబుద్ధివై చెప్పితేని। మఘువు కులిశంబు వ్రచ్చు నీ మస్తకంబు. 240

ప్రతిపదార్థం: నీవు; ధర్మ, విదుండవు= ధర్మం తెలిసినవాడివి; మా, వివాదము= మా తగవు; ఎఱిఁగి= తెలుసుకొని; గుణశ్రేష్ఠుఁడు= మంచిగుణాలచేత గొప్పవాడు; ఇతఁడొ; నేనో; తీర్పు చెప్పుము; అన్యథా, బుద్ధివి+ఐ= ఇతరమైన మనస్సు కలవాడివై - అంటే నీ పుత్రుడన్న పక్షపాతబుద్ధి కలిగినవాడివై; చెప్పితేనిన్= తీర్పు చెప్పితే; మఘువు, కులిశంబు= దేవేంద్రునియొక్క వజ్రాయుధం; నీ, మస్తకంబున్= నీ తలను; వ్రచ్చున్= పగులగొట్టుతుంది.

తాత్పర్యం: నీవు ధర్మం తెలిసినవాడివి. మా తగవు తెలుసుకొని గుణాలచేత గొప్పవాడు ఇతడో, నేనో తీర్పు చెప్పు. నీ పుత్రు డని పక్షపాతబుద్ధితో తీర్పు చెప్పితే దేవేంద్రుని వజ్రాయుధం నీ తలను పగులగొట్టుతుంది.

వ. అనినం బ్రహ్లాదుండు భయంపడి కశ్యపుకడకుం జని విరోచన సుధన్వులు తన్ను వివాదనిర్ణయం బడిగిన విధంబును జెప్పిన విని వానికిం గశ్యపుం డి ట్లనియె. 241

ప్రతిపదార్థం: అనినన్; ప్రహ్లాదుండు; భయము+పడి; కశ్యపు, కడకున్= కశ్యపుని దగ్గరకు; చని= వెళ్ళి; విరోచన, సుధన్వులు; తన్నున్; వివాదనిర్ణయంబు= తగవుయొక్కతీర్పు; అడిగిన, విధంబును; చెప్పినన్; విని; వానికిన్; కశ్యపుండు; ఇట్లు+అనియెన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అనగా ప్రహ్లాదుడు భయపడి కశ్యపునిదగ్గరకు వెళ్ళి- తగవు తీర్పునుగూర్చి విరోచనుడు, సుధన్వుడు త న్నడిగిన విధము చెప్పగా, కశ్యపుడు అతనితో ఇలా అన్నాడు.

తే. **సాక్షియును ధర్మదర్శియు సాక్షిధర్మ । విధులు దప్పంగఁ జెప్పిన నధమవృత్తి**
వరుణపాశసహస్రంబు వానిఁ గట్టి । పాయు నేఁటేఁట నొక్కొకఁ డాయతముగ. 242

ప్రతిపదార్థం: సాక్షియును; ధర్మ, దర్శియున్= ధర్మాన్ని దర్శించే న్యాయాధిపతీ; సాక్షి, ధర్మవిధులు= సాక్షియొక్క, ధర్మంయొక్క నియమాలు; తప్పంగన్= తప్పునట్లు; అధమ, వృత్తి= నీచంగా ప్రవర్తించి; చెప్పినన్= చెప్పితే; వరుణ, పాశ, సహస్రంబు= వెయ్యి వరుణపాశాలు; వానిన్; కట్టి; ఏఁట+ఏఁటన్= ప్రతి సంవత్సరం; ఒక్కొకఁడు= ఒక్కొక్కటి; ఆయతముగన్= నిడుపుగ; పాయున్= వదలుతాయి.

తాత్పర్యం: సాక్షీ, ధర్మాన్ని దర్శించే న్యాయమూర్తీఐనవాడు- సాక్షినియమాలను, ధర్మనియమాలను తప్పి నీచంగా ప్రవర్తించి సాక్ష్యం, ధర్మం చెప్పితే అలాంటివాణ్ణి వెయ్యివరుణపాశాలు బంధిస్తాయి. ఏటేట ఒక్క పాశం వంతున వదలుతాయి.

విశేషం: సాక్షులు పదకొండుమంది. అందులో కృతసాక్షులు - అంటే నిర్ణయించుకొనబడిన సాక్షులు ఐదుగురు. వారు లిఖితుడు, స్మారితుడు, యదృచ్ఛాభిజ్ఞుడు, గూఢుడు, ఉత్తరుడు. అకృతసాక్షులు - అంటే నిర్ణయించుకొనబడని సాక్షులు ఆరుగురు. వారు - గ్రామస్థులు, ప్రాడ్వివాక లేఖకసభ్యులు, రాజు, కార్యాధికారి, వాదిచే పంపబడిన వాడు (కులవివాదాల్లో కులంవాడు).

వ. **'ధర్మం బధర్మవిద్ధంబయి సభకు వచ్చిన దానిం దీర్పనిసభ్యు లధర్మవిద్ధు లగుదురు; మఱి సభ్యులు కామక్రోధంబులు విడిచి యధర్మంబు నాపనినాఁ డయ్యధర్మంబునం దొక్కపాదంబు సభ్యుల, నొక్కపాదంబు భూపతిఁ, దక్కినయది గర్తనుం బొందు; సమంజసులైన సభ్యులచేత విధ్యుక్తం బయ్యేనేని నధర్మంబు కర్తనుం బొందుఁ; గావున ధర్మంబు దప్పక చెప్పవలయు'ననినం బ్రహ్లాదుండు ధర్మమతియై విచారించి తనకొడుకుకంటె గుణశ్రేష్ఠుఁడుగా సుధన్వుం జెప్పినఁ, 'బుత్త్రస్నేహంబు విడిచి ధర్మువు దప్పక చెప్పి' తని ప్రహ్లాదుం బ్రశంసించి సుధన్వుం డరిగెఁ; గావున 'మీరును ద్రౌపదీ ప్రశ్నంబునందు ధర్మబుద్ధిసేయుం' డని విదురుండు పలికిన, దుర్యోధను భయంబున సభ్యు లెవ్వరుం బలుకరయిరి; ద్రౌపదియు నట్లు సకలక్షత్త్రియసమక్షంబున దుశ్శాసనుచేతం బరిభవింపంబడి దుఃఖిత యయి. 243**

ప్రతిపదార్థం: ధర్మంబు+అధర్మ, విద్ధంబు+అయి= ధర్మం అధర్మంచేత బాధించబడినదై; సభకున్; వచ్చినన్; దానిన్; తీర్పని; సభ్యులు; అధర్మ, విద్ధులు= అధర్మంచేత బాధించబడినవాళ్ళు; అగుదురు; మఱి; సభ్యులు; కామ, క్రోధంబులు; విడిచి; అధర్మంబును; ఆపని, నాఁడు; ఆ, అధర్మంబునందున్; ఒక్క, పాదంబు= నాల్గవవంతు; సభ్యులన్; ఒక్క, పాదంబు= నాల్గవవంతు; భూపతిన్= రాజును; తక్కినది; కర్తనున్= చేసినవాణ్ణి; పొందున్; సమంజసులు+ఐన= న్యాయంతో కూడిన వాళ్ళయిన; సభ్యులచేతన్; విధి+ఉక్తంబు+అయ్యెన్+ఏనిన్= ఉన్నస్థితి చెప్పబడిందైతే; అధర్మంబు; కర్తనున్= చేసినవాణ్ణి; పొందున్; కావున; ధర్మంబు; తప్పక; చెప్పవలయున్; అనినన్; ప్రహ్లాదుండు; ధర్మమతి+ఐ= ధర్మంతో కూడిన బుద్ధిగలవాడై; విచారించి= ఆలోచించి; తనకొడుకు కంటెన్; గుణశ్రేష్ఠుఁడుగాన్= గుణాల్లో గొప్పవాడుగా; సుధన్వున్= సుధన్వుణ్ణి; చెప్పినన్; పుత్త్ర, స్నేహంబు= పుత్రునిమీది ప్రేమ; విడిచి= వదలి; ధర్మువు= ధర్మం; తప్పక; చెప్పితి= చెప్పావు; అని; ప్రహ్లాదున్;

ప్రశంసించి= పొగిడి; సుధన్వుండు; అరిగెన్= వెళ్ళాడు; కావున; మీరును; ద్రౌపదీ, ప్రశ్నంబు, అందున్= ద్రౌపది అడిగిన ప్రశ్న విషయంలో; ధర్మ, బుద్ధి= ధర్మంతో కూడిన బుద్ధి; చేయుండు= కావించండి - అంటే ధర్మమైన బుద్ధితో ఆలోచించండి; అని; విదురుండు; పలికినన్; దుర్యోధను, భయంబునన్= దుర్యోధనునివల్ల కలిగిన భయంచేత; సభ్యులు; ఎవ్వరున్= ఎవరుగూడ; పలుకరు+అయిరి= మాటాడకున్నారు; ద్రౌపదియున్, అట్లు= ఆ విధంగా; సకల, క్షత్రియ, సమక్షంబునన్= అందరు రాజుల ఎదుట; దుశ్శాసనుచేతన్; పరిభవింపంబడి= అవమానించబడి; దుఃఖిత; అయి= దుఃఖించినదై.

తాత్పర్యం: 'ధర్మం అధర్మంచేత బాధింపబడి సభకు వస్తే, దాన్ని తీర్చని సభ్యులు, అధర్మంచేత బాధించబడతారు. అంతేకాదు. సభ్యులు కామక్రోధాలు విడిచి అధర్మాన్ని ఆపనినాడు, ఆ అధర్మంలో ఒక నాల్గవ భాగం సభ్యులకు, మరొక నాల్గవ భాగం రాజుకు, మిగిలింది కర్తకు సంక్రమిస్తుంది. అందుచేత ధర్మం తప్పక చెప్పాలి' అనగా, ప్రహ్లాదుడు ధర్మబుద్ధికలవాడై ఆలోచించి తనకొడుకుకంటె సుధన్వుడు సుగుణాల్లో గొప్పవా డని చెప్పాడు. సుధన్వుడు 'పుత్రప్రేమ వదలి ధర్మం తప్పక చెప్పావు' అని ప్రహ్లాదుణ్ణి పొగడి వెళ్ళాడు. 'అందుచేత మీరుకూడ ద్రౌపది అడిగిన ప్రశ్నను ధర్మబుద్ధితో ఆలోచించండి' అని విదురుడు పలుకగా దుర్యోధనునికి భయపడి సభ్యుల్లో ఎవ్వరూ పెదవి విప్పలేదు. ద్రౌపది ఆ విధంగా దుశ్శాసనునిచేత అవమానించబడి దుఃఖంతో ఉండగా.

సీ. 'అవ్విధంబున నొప్పి యా స్వయంవరము నాఁ । డఖిల భూపతులచే నట్లు సూడఁ
బడి, పాండవుల ధర్మపత్నినై, గోవిందు । చెలియలినై, వీనిచేత నిట్లు
పరిభూత నగుచు సభామధ్యమున మహీ । పతులచేఁ జూడంగఁ బడితి; నింత
వడుదునె? యిపుడు నా పలుకుల కెవ్వరుఁ । బ్రతివచనం బేల పలుక రైరి?

ఆ. ధన్యులార! యే నదాసినే? దాసినే? । యెఱుఁగఁ జెప్పి పనుపుఁ' డెల్ల దాని
ననుచు వనరుచున్న నాపగాసుతుఁడు శాం । తనవుఁ డిట్టు లనియె దానిఁ జూచి. 244

ప్రతిపదార్థం: ఆ, స్వయంవరమునాఁడు; ఆ+విధంబునన్; ఒప్పి= ప్రకాశించి; అఖిల భూపతులచేన్= అందరు రాజులచేత; అట్లు= అంత గొప్పగా; చూడబడి; పాండవుల, ధర్మపత్నినిన్+ఐ= పాండవుల భార్యనై; గోవిందు, చెలియలినిన్+ఐ= శ్రీకృష్ణునియొక్క చెల్లెలినై; వీనిచేతన్= ఈ దుశ్శాసనునిచేత; ఇట్లు= ఈ విధంగా; పరిభూతన్= అవమానించబడిన దానినిగా; అగుచున్; సభామధ్యమునన్; మహీపతులచేన్= రాజులచేత; చూడంగన్+పడితిన్; ఇపుడు; ఇంత, పడుదునె= ఇంత దుస్థితిని అనుభవిస్తున్నానే; నా, పలుకులకు; ప్రతివచనంబు= బదులుమాట అంటే సమాధానం; ఎవ్వరున్= ఎవరుగూడ; ఏల; పలుకరు+ఐరి= చెప్పకున్నారు; ధన్యులార= ఓ పుణ్యాత్ములారా!; ఏన్= నేను; అదాసినే= దాసిని కానిదానినే; దాసినే= దాసినా?; ఎల్లదానిన్= సర్వాన్నీ; ఎఱుఁగన్, చెప్పి= తెలియజెప్పి; పనుపుఁడు= ఆజ్ఞాపించండి; అనుచున్; వనరుచున్+ఉన్నన్= దుఃఖిస్తూ ఉండగా; దానిన్= ద్రౌపదిని; చూచి; ఆపగాసుతుఁడు= గంగాతనయుడు; శాంతనవుఁడు శంతనుని పుత్రుడు అయిన భీష్ముడు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఆ స్వయంవరంరోజు ఆ విధంగా వెలిగి, అందరు రాజులచే అంత గొప్పగా చూడబడి, పాండవుల ఇల్లాలినై, శ్రీకృష్ణునిచెల్లెలినై- ఇప్పుడు ఈ దుశ్శాసనుడిచేత ఇలా అవమానించబడుతూ, ఈ సభామధ్యంలో రాజులందరిచేత చూడబడుతూ ఇంత దుఃస్థితిని అనుభవిస్తున్నానే- నే నడిగిన దానికి ఎవరు గూడ ఎందుకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బదులు చెప్పరు? నేను దాసినా? కానా? పూర్తిగా తెలియ జెప్పి నన్ను ఆజ్ఞాపించండి' అని దుఃఖిస్తున్న ద్రౌపదిని చూచి భీష్ముడు ఈ విధంగా అన్నాడు.

విశేషం: ద్రౌపదివాక్యవిన్యాసంలో కానవచ్చే అగ్రామ్యత్వం, వికటత్వం ఉదారతాగుణాన్ని రూపుకట్టిస్తున్నాయి. (సంపా.)

వ. 'అవ్వా! నీ ప్రశ్నంబునకు నుత్తరం బయ్యుధిష్ఠిరుఁడు సెప్పవలయుఁ; గానినాఁడు ధర్మసూక్ష్మత యెవ్వరికి నెఱుంగ గహనంబు; దీని ఫలంబు వేగంబ యిక్కురుకులపాంసను లనుభవింతు' రని పలుకుచున్న యవసరంబున నక్కోమలిం జూచి నగుచు. 245

ప్రతిపదార్థం: అవ్వా= అమ్మా! నీ ప్రశ్నంబునకున్; ఉత్తరంబు= సమాధానం; ఆ+యుధిష్ఠిరుఁడు= ఆధర్మరాజు; చెప్పవలయున్; కానినాఁడు= అట్లా కాని రోజు; ధర్మ, సూక్ష్మత= ధర్మంయొక్క సూక్ష్మతత్త్వం; ఎవ్వరికిన్= ఇతరు లెవరి కైనా; ఎఱుంగన్= తెలుసుకోవటం; గహనంబు= కష్టం; దీని, ఫలంబున్= ఈ చెడుపనియొక్క ఫలితాన్ని; వేగంబు+అ= త్వరగానే; ఈ, కురుకుల, పాంసనులు= కురువంశాన్ని మలినం చేసే ఈ కౌరవులు; అనుభవింతురు; అని; పలుకుచున్+ఉన్న; అవసరంబునన్= సమయంలో; ఆ+కోమలిన్= అందగత్తె అయిన ఆ ద్రౌపదిని; చూచి; నగుచున్= నవ్వుతూ.

తాత్పర్యం: 'అమ్మా! నీ ప్రశ్నకు సమాధానం ఆ యుధిష్ఠిరుడే చెప్పాలి. అలా కానినాడు ధర్మంయొక్క సూక్ష్మతత్త్వాన్ని తెలుసుకోవటం ఇతరు లెవరికైనా అసాధ్యమే. ఈ చెడుపని ఫలితాన్ని వెంటనే ఈ కురువంశ దూషకులైన కౌరవులు అనుభవిస్తారు' అని భీష్ముడు పలుకుతున్న సమయంలో, కోమలి అయిన ఆ ద్రౌపదిని చూచి నవ్వుతూ.

విశేషం: భీష్ముడు 'అమ్మా! ఈ ప్రశ్నకు సమాధానం చెప్పవలసింది ఆ యుధిష్ఠిరుడే' అనటంలో ఎన్నో అర్థాలు స్ఫురిస్తున్నాయి. మహావ్యసనపరుడై, ఒళ్ళు తెలియక పందెములొడ్డి ఓడిపోయిన ఆ ధర్మరాజునే సమాధానం అడగ'మన్నట్లు, ఇందులో కొంత నిరసన వ్యక్తమవుతున్నది. 'న్ని న్నొడ్డి ఓడిపోయిన నీ భర్త జూదంలోని మోసాన్నిగూర్చిగాని, ని న్నొడ్డటంలోని ముందు వెనుకలనుగూర్చి గాని విమర్శించక, జరిగిన దానిని అంతా అంగీకరించినట్లు ఊరకుండగా ఎవ్వ రేమని చెప్పగలరు?' అనే భావంగూడ ధ్వనిస్తున్నది. అంతేగాక - 'ఈ దుర్మార్గులమీద దండోపాయం ప్రయోగించటమే నీ ప్రశ్నకు సమాధానం. దీన్ని నిర్ణయించవలసిన వాడు నీ భర్త' అనే భావంకూడ కొంత స్ఫురిస్తున్నది. ధర్మజు డని అనక యుధిష్ఠిరుడనే పదప్రయోగం, 'దీనిఫలంబు వేగంబ యిక్కురుకులపాంసను లనుభవింతురు' అనే వాక్యం ఈ భావానికి బలం చేకూరుస్తున్నాయి. ధర్మరాజును మించి ధర్మసూక్ష్మాలు ఎరిగినవాళ్ళు ఇం కెవ్వ రున్నారు? ఆయనే నీ ధర్మసందేహం తీర్చగల డన్నది వాచ్యార్థం.

తే. 'తరుణి! యేవురకంటె నొక్కరుఁడ భర్త । యగుట లగ్గు; జూదంబున నాలి నోటు
వడని వానిఁగాఁ దగు భర్తఁ బడయు మింక' । ననుచు రాధేయుఁ డుల్లసమాడె నంత. 246

ప్రతిపదార్థం: తరుణి= ఓకాంతా! ద్రౌపదీ!; ఏవురకంటెన్= ఐదుమంది కంటె; ఒక్కరుఁడు+అ= ఒక్కడే; భర్త; అగుట; లగ్గు= మేలు; జూదంబునన్; ఆలిన్= భార్యను; ఓటుపడని= ఓడిపోని; వానిన్, కాన్, తగు, భర్తన్= తగిన భర్తను; ఇంకన్= ఇక; పడయుము= పొందుము; అనుచున్; రాధేయుఁడు= కర్ణుడు; అంతన్= అప్పుడు; ఉల్లసము+ఆడెన్= ఎగతాళి చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ద్రౌపదీ! ఐదుగురికంటె ఒక్కడే భర్త కావటం మంచిది. జూదంలో భార్యను ఓడిపోని తగుభర్తను ఇక పొందు' అని కర్ణుడు ఎగతాళి చేశాడు.

విశేషం: కర్ణుని పెంపుడు తల్లి రాధ (అధిరథుని భార్య). అందుచేత కర్ణుడు రాధేయుడైనాడు. జూదంలో భార్యను ఓడిపోని వాణ్ణి తగుభర్తగా పొందుమంటే దుర్యోధనుణ్ణి చేపట్టు మని కర్ణునిసూచన. ఏ కులకాంత కైనా కర్ణునిమాటలు కర్ణశూలాలే. కాగా, కర్ణునిసూచన మాయాద్యూతంలో లభించిన అక్రమవిజయంతో మదోద్ధతుడై ఉన్న దుర్యోధనుని దుర్మార్గాన్ని మరొకరీతిగా రగుల్కొల్పింది.

ఉ. **అమ్ముదితన్ విభీతహరిణాక్షిఁ గలాపవిభాసికేశభా**
రమ్మున నొప్పు దానిఁ దన రమ్యపృథూరుతలంబు నెక్కఁగా
రమ్మని సన్న సేసె ధృతరాష్ట్రసుతాగ్రజుఁ డప్డు; దాని దూ
రమ్మునఁ జూచి కౌరవకురంగమృగేంద్రుఁడు భీముఁ డల్కతోన్. **247**

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర, సుత+అగ్రజుఁడు= ధృతరాష్ట్రుని కొడుకుల్లో ముందు పుట్టినవాడు - దుర్యోధనుడు; ఆ+ముదితన్= ఆ కాంతను; విభీత, హరిణ+అక్షిన్= భయపడిన లేడి కన్నులవంటి కన్నులుకలదానిని; కలాప, విభాసి, కేశ, భారమ్మునన్= నెమలి పురివలె ప్రకాశించే తల వెంట్రుకల బరువుచేత; ఒప్పుదానిన్= ప్రకాశించే దానిని; తన, రమ్య, పృథు+ఊరు, తలంబున్= తనయొక్క అందమైన, విశాలమైన తొడమీద; ఎక్కఁగాన్= ఎక్కటానికి - అంటే కూర్చోనటానికి; రమ్ము+అని; సన్న= సైగ; చేసెన్; అపుడు; దానిన్= ఆ సైగను; దూరమ్మునన్+చూచి= దూరాననుండి చూచి; కౌరవ, కురంగ, మృగ+ ఇంద్రుఁడు= కౌరవులనే జింకలపాలిటికి సింహంవంటివాడైన; భీముడు; అల్కతోన్= కోపంతో.

తాత్పర్యం: ధృతరాష్ట్రుని జ్యేష్ఠపుత్రుడైన దుర్యోధనుడు, భయపడిన లేడి కన్నులాంటి కన్నులుకలది, నెమలి పురిలా ప్రకాశించే తల వెంట్రుకలభారం కలది అయిన ద్రౌపదిని- అందమై, విశాలమైన తన తొడమీద కూర్చుండ రమ్మని సైగ చేశాడు. ఆ సైగను దూరంనుండి చూచి, కౌరవులు అనే జింకల పాలిటి సింహంలాంటి భీముడు కోపంతో.

విశేషం: అలం: ఉపమ, రూపకం. భయపడిన లేడివంటి కన్నులు, నెమలి పురివలె ప్రకాశించే బరువైనజుట్టు స్త్రీకి సౌందర్యహేతువులు. 'విభీతహరిణాక్షి, కలాపవిభాసికేశభారమ్మున నొప్పుదాని' అని నన్నయ ద్రౌపదికి ప్రయోగించిన విశేషణాలు రెండును ఆమె పొందుతున్న భీతిని, దుశ్శాసనుని దుష్టచేష్టవల్ల ఆ జుట్టు చెదరినరీతిని తెలియజెయ్యటంతో పాటు, దుర్యోధనుని కంటికి ఆ స్థితిలోగూడ ఆమె అందంగా కనిపించటాన్ని సూచిస్తున్నది. భీముణ్ణి 'కౌరవ కురంగ మృగేంద్రు' డనటంలో మున్ముందు అతనిచేత కౌరవులకు పట్టనున్న గతికూడ సూచన చేయబడింది. (ఈ పద్యరచనలో పదాలు మసృణత్వంతోనూ అర్థఘటనతోనూ కూడిఉండటంచేత శ్లేష మనే గుణం రౌద్రరసవిభావవర్ణనంలో విశిష్టంగా రూపొందింది. - సంపా.)

క. **లయసమయదండధర ని । ర్దయుఁడై ధరణీశు లెల్లఁ దనపలుకులు వి**
స్మయసంభ్రమభయసంభృతు । లయి వినుచుండంగ నిట్టు లనియెన్ సభలోన్. **248**

ప్రతిపదార్థం: లయ, సమయ, దండధర, నిర్దయుఁడు+ఐ= ప్రళయకాలంలోని యమధర్మరాజువలె దయలేనివాడై; ధరణి+ఈశులు+ఎల్లన్= రాజులందరు; విస్మయ, సంభ్రమ, భయ, సంభృతులు+అయి= ఆశ్చర్యంచేత, తొట్రుపాటుచేత, భయంచేత నిండినవారై; తన, పలుకులు= తనమాటలు; వినుచుండంగన్; సభలోన్; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: భీముడు ప్రళయకాల యమధర్మరాజులా దయలేనివాడై, రాజులంతా ఆశ్చర్యంతో, తొట్రుపాటుతో, భయంతో తనమాటలు వింటూండగా సభలో ఇలా అన్నాడు.

ఉ. ధారుణి రాజ్య సంపద మదంబునఁ గోమలిఁ గృష్ణఁ జూచి రం
భోరు నిజోరుదేశమున నుండఁగఁ బిల్చిన యిద్దురాత్ము దు
ర్వార మదీయ బాహుపరివర్తిత చండ గదాభిఘాత భ
గ్నోరుతరోరుఁ జేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్. 249

ప్రతిపదార్థం: ధారుణి, రాజ్య, సంపద, మదంబునన్= భూమిమీద దొరతనమనే ఐశ్వర్యంవల్ల కలిగిన పొగరుచేత; కోమలిన్= అందమైన దానిని; కృష్ణన్= ద్రౌపదిని; చూచి; రంభ+ఊరున్= అరటి (బోదెల) వంటి తొడలు గల ఆమెను; నిజ+ఊరు, దేశమునన్= తనతొడమీది స్థలంపై; ఉండఁగన్; పిల్చిన; ఈ+దురాత్మున్= ఈ దుర్మార్గుణ్ణి; సుయోధనున్= దుర్యోధనుణ్ణి; ఉగ్ర, రణ+అంతరంబునన్= భయంకరమైన యుద్ధంలో; దుర్వార, మదీయ, బాహు, పరివర్తిత, చండ, గదా+అభిఘాత, భగ్న+ఉరుతర+ఊరున్= అడ్డగించసాధ్యం కాని నా చేతులచేత త్రిప్పబడిన భయంకరమైన గదయొక్క దెబ్బలచేత విరిగిన పెద్దతొడలు గలవాణ్ణిగా; చేయుదున్.

తాత్పర్యం: రాజ్యసంపదవల్ల కలిగిన పొగరుతో అందమైన ద్రౌపదిని చూచి, అరటి(బోదెల) వంటి తొడలు గల ఆమెను, తన తొడమీద కూర్చుండ రమ్మని పిలిచిన ఈ దుష్టదుర్యోధనుణ్ణి భయంకర యుద్ధరంగంలో ఎదుర్కొని, అడ్డగించ సాధ్యంకాని నా చేతులు త్రిప్పే భీకరగదాదండం దెబ్బలతో ఇతనితొడలు విరుగ కొట్టుతాను.

విశేషం: ఉదాత్తరమణీయమైన నన్నయ పద్యశైలికి ఉదాహరణాలైన ప్రసిద్ధ పద్యాల్లో ఇదొకటి. భయంకరాలు, భావి భారత మహా సంగ్రామానికి ప్రాతిపదికలు, రౌద్రరసానికి ఉనికి పట్టులు అయిన భీముని ప్రతిజ్ఞల్లో ఇది రెండవది. అనేకంగా ప్రయుక్తమైన 'ఊరు' శబ్దం పద్యశైలికి రమ్యతను కూర్చటమే కాక, ద్రౌపదిని కూర్చుండు మని దుర్యోధనుడు చూపిన ఊరువు భీముని కంటికి ఎంత కటువుగ మాటిమాటికి కనిపించిందో తెలుపుతున్నది. కాగా 'దుర్వారమదీయబాహుపరివర్తితచండగదాభిఘాత భగ్నోరుతరోరు' అని సుదీర్ఘంగా సుళ్ళు తిరుగుతూ సాగిన సమాసంలో- సహృదయుడు, భీముని చేతిలో ఆ చండగద తిరిగే విధాన్ని భావించుకోవచ్చు. (ఇందులో శబ్దశక్తిమూలకానురణనధ్వని, ఓజోగుణం పోషించబడ్డాయి. సంపా.)

వ. అని సర్వజన భయానక క్రోధావేశ వివశుండయి యాయుధంబు లున్న వలనికి దృష్టులు సలుపుచు నగ్రజు మొగంబు సూచుచున్న భీమసేను నతిరౌద్రాకారంబు సూచి భీష్మ విదుర ద్రోణాదు'లిది కోపంబున కవసరంబు గా'దని యాతనిం బ్రశాంతచిత్తుం జేసి రంత. 250

ప్రతిపదార్థం: అని, సర్వజన, భయానక, క్రోధ+ఆవేశ, వివశుండు+అయి= అందరికీ భయం కలిగించే కోపావేశంచేత మైమరచిన వాడై; ఆయుధంబులు+ఉన్న; వలనికిన్= దిక్కుకు; దృష్టులు= చూపులు; సలుపుచున్= సాగేటట్లు చేస్తూ; అగ్రజు, మొగంబు= అన్న అయిన ధర్మరాజు ముఖాన్ని; చూచుచున్న; భీమసేను, అతిరౌద్ర+ఆకారంబు= భీమసేనునియొక్క మిక్కిలి భయంకరమైన రూపు; చూచి; భీష్మ, విదుర, ద్రోణ+ఆదులు= భీష్ముడు, విదురుడు, ద్రోణుడు మొదలయినవాళ్ళు; ఇది; కోపంబునకున్; అవసరంబు= సమయం; కాదు+అని; ఆతనిన్= ఆ భీమసేనుణ్ణి; ప్రశాంత, చిత్తున్= మిక్కిలి శాంతిని పొందిన మనస్సు కలవాణ్ణిగా చేసిరి; అంతన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని అందరికి భయాన్ని కలిగించే కోపావేశంతో మైమరచి ఆయుధా లుండే దిక్కుకు చూపులు ప్రసరింపజేస్తూ, అన్నమొగం చూస్తున్న ఆ భీమసేనుడి భయంకరాకారం చూచి, భీష్మవిదుర ద్రోణాదులు 'ఇది కోపానికి సమయంకా'దని ఆ భీమసేనుణ్ణి పూర్తిగా శాంతింపజేశారు. అప్పుడు.

క. ధృతరాష్ట్రు నగ్నిహోత్రా। యతనంబున నఱచె వఱలు, లగ్నులు శాంత
ద్యుతులయ్యెఁ, గౌరవ స్త్రీ। తతిహృదయము లధికశోకతప్తము లయ్యెన్. 251

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర, అగ్నిహోత్ర+ఆయతనంబునన్= ధృతరాష్ట్రుని యొక్క అగ్నిహోత్ర గృహంలో; వఱలులు= పెద్దనక్కలు; అఱచెన్; అగ్నులు; శాంత, ద్యుతులు+అయ్యెన్= చల్లారిన వెలుగులు కలవి అయ్యాయి; కౌరవ, స్త్రీ, తతి, హృదయములు= కౌరవ స్త్రీ సమూహాల హృదయాలు; అధిక, శోక, తప్తములు+అయ్యెన్= పెద్దదుఃఖంచేత తపింప జేయబడినవి అయ్యాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుని అగ్నిహోత్రగృహంలో పెద్దనక్కలు అరిచాయి. అగ్నిహోత్రాల్లో వెలుగులు చల్లారినాయి. కౌరవస్త్రీసమూహాల హృదయాలు దుఃఖంతో కలతచెందాయి.

విశేషం: అపశకునాలు అశుభసూచకాలు.

క. క్రూరాత్మకులై దుష్పద। వీ రతులగు ధార్తరాష్ట్రవీరుల శయ్యా
గారముల నెగసె నెంతయు। ఘోరంబుగఁ గాక ఘూక ఘూత్కారంబుల్. 252

ప్రతిపదార్థం: క్రూర+ఆత్మకులు+ఐ= క్రూరమైన మనస్సుతో కూడిన వాళ్ళయి; దుష్పదవీ, రతులు+అగు= చెడుమార్గం ఇష్టం గలవాళ్ళయిన; ధార్తరాష్ట్ర, వీరుల= కౌరవ వీరులయొక్క; శయ్యా+అగారములన్= పడకటిండ్లలో; ఎంతయున్; ఘోరంబుగన్= భయంకరంగా; కాక, ఘూక, ఘూత్కారంబుల్= కాకుల, గుడ్లగూబల అరుపులు; ఎగసెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: క్రూరమైన మనస్సు కలవాళ్ళు, చెడుమార్గం ఇష్టమైనవాళ్ళు, అయిన కౌరవ వీరుల పడకటిండ్లలో ఎంతో భయంకరంగా కాకుల కూతలు, గుడ్లగూబల అరపులు వ్యాపించాయి.

క. అట్టి మహోత్పాతంబులు। పుట్టినఁ గృప విదుర కలశభూ శాంతనవుల్
'నెట్టన ధృతరాష్ట్రజులకుఁ। బుట్టె నరిష్ట' మని రిష్టమునఁ దమలోనన్. 253

ప్రతిపదార్థం: అట్టి; మహా+ఉత్పాతంబులు= పెద్ద అపశకునాలు; పుట్టినన్; కృప, విదుర, కలశభూ, శాంతనవుల్= కృపుడు, విదురుడు, కలశంలో నుండి పుట్టిన ద్రోణుడు; శంతనుని పుత్రుడైన భీష్ముడు; ఇష్టమునన్= ఇష్టంగా; తమలోనన్= తమలో తాము; ధృతరాష్ట్రజులకున్= ధృతరాష్ట్రుని కుమారులకు; నెట్టన= తప్పక; అరిష్టము= కీడు; పుట్టెన్; అనిరి.

తాత్పర్యం: అలాంటి పెద్ద అపశకునాలు పుట్టగా- కృప, విదుర, ద్రోణ, భీష్ములు తమలో తాము- ధృతరాష్ట్రుని కుమారులకు కీడు పుట్టిందని ఇష్టంగా అనుకొన్నారు.

వ. అంత నంతయు నెఱింగి గాంధారి విదురుం దోడ్కొని ధృతరాష్ట్రు కడకుంబోయి పాండవపరాజయంబును ద్రౌపదిపరిభవంబును దుర్నిమిత్తోత్పత్తియుం జెప్పిన విని, ధృతరాష్ట్రుండు దుర్యోధనుం బిలిచి యి ట్లనియె. 254

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అంతన్; అంతయున్; ఎఱింగి= తెలుసుకొని; గాంధారి; విదురున్, తోడ్కొని; ధృతరాష్ట్రు, కడకున్= ధృతరాష్ట్రుని దగ్గరకు; పోయి; పాండవపరాజయంబును= పాండవుల ఓటమిని; ద్రౌపది, పరిభవంబును= ద్రౌపదియొక్క అవమానాన్ని; దుర్నిమిత్త+ఉత్పత్తియున్= అపశకునాల పుట్టుకను; చెప్పినన్; విని; ధృతరాష్ట్రుండు; దుర్యోధనున్; పిలిచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అప్పుడు జరిగిందంతా తెలుసుకొని గాంధారి- విదురుణ్ణి వెంట బెట్టుకొని ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళింది. పాండవులు ఓడిపోవటాన్ని, ద్రౌపదికి జరిగిన అవమానాన్ని, అపశకునాలు పుట్టటాన్ని ఆయనకు చెప్పింది. అది విని ధృతరాష్ట్రుడు దుర్యోధనుణ్ణి పిలిచి.

విశేషం: ఇంత జరిగిన తరువాత గాంధారి ఇప్పుడు కదిలింది. కోడలిమీద సానుభూతి పెరిగి కదిలిందో? లేక కొడుకుల క్షేమాన్ని కాంక్షించి కదిలిందో?

చ. **పరమపతివ్రతన్ సభఁ దపస్విని౯ బాండవధర్మపత్ని ధ**
ర్మరత నయోనిజం బ్రకృతిమానవభామిని౯గాఁ దలంచి దె
ప్పరములు వల్కఁగాఁ దగునె? బాల్యము నాదిగ దుష్టభావనం
బెఱిఁగితి నీ నిమిత్తమునఁ బెద్దయు దుఃఖితు లైరి పాండవుల్. **255**

ప్రతిపదార్థం: పరమ, పతివ్రతన్; తపస్వినిన్= తాపసురాలిని; పాండవ, ధర్మపత్నిన్= పాండవుల ఇల్లాలిని; ధర్మరతన్= ధర్మంపట్ల అభిలాష కల దానిని; అయోనిజన్= గర్భంనుండి పుట్టని దానిని; ద్రౌపదినిన్; ప్రకృతి, మానవ, భామినిగాన్= సామాన్య మానవకాంతగా; తలంచి; దెప్పరములు= ఓర్చుకొన సాధ్యంగాని మాటలు; సభన్= సభలో; పల్కఁగాన్= మాట్లాడగా; తగునె= తగునా? బాల్యము+ఆదిగన్= చిన్నతనం మొదలుకొని; దుష్టభావనన్= చెడు తలంపుతో; పెఱిఁగితి= పెరిగావు; నీ నిమిత్తమునన్= నీ కారణంగా; పాండవుల్; పెద్దయున్= మిక్కిలి; దుఃఖితులు+ఐరి= దుఃఖాన్ని పొందినవా ళ్ళయ్యారు.

తాత్పర్యం: పరమపతివ్రత, తాపసురాలు, పాండవుల ఇల్లాలు, ధర్మంపట్ల ప్రీతి కలది, మానవగర్భంనుండి పుట్టనిది అయిన ద్రౌపదిని- సామాన్య మానవకాంతగా తలచి, ఓర్చుకోటానికిసాధ్యం గాని మాటలు సభలో మాట్లాడటం తగునా? బాల్యంనుండి నీవు చెడు తలంపుతోనే పెరిగావు. నీ కారణంగా పాండవులు ఎంతో దుఃఖం అనుభవించారు.

విశేషం: గతజన్మంలో ద్రౌపది ఇంద్రసేన. గొప్పతపస్సు చేసిన పతివ్రత. (ధృతరాష్ట్రుడి మాటలలో అగ్రామ్యత్వం, వికటత్వం ఉదారతాగుణాన్ని రూపొందిస్తున్నాయి. - సంపా.)

వ. **'వారలవలన నీ దురాగ్రహం బుడుగు'మని కొడుకును భంగించి సకలబాంధవహితంబు సేయందలంచి ద్రౌపదిని రావించి శాంతవచనంబుల నిట్లనియె.** **256**

ప్రతిపదార్థం: వారలవలనన్= వారలపట్ల; నీ, దురాగ్రహంబు= నీ చెడుకోపం; ఉడుగుము= మానుము; అని; కొడుకును; భంగించి= త్రోసిపుచ్చి; సకల, బాంధవ, హితంబు= అందరు బంధువులకు మేలు; చేయన్, తలంచి; ద్రౌపదిని; రావించి; శాంత, వచనంబులన్= మెత్తనిమాటలచే; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'వాళ్ళమీద నీవు కోపం మాను' అని కొడుకును త్రోసిపుచ్చి, అందరు బంధువులకు మేలు చెయ్యాలనే తలంపుతో ద్రౌపదిని పిలిచి మెత్తనిమాటలతో ఇలా అన్నాడు.

ధృతరాష్ట్రుండు ద్రౌపదిగోరినవరంబు లిచ్చుట (సం. 2-63-27)

క. సుందరి! నా కోడంద్రుర । యం దభ్యర్చితవు నీవ; యతిముదమున నీ
కుం దగఁ బ్రియంబు సేసెద । నిందుముఖీ! వేఁడు మెద్ది యిష్టము నీకున్. 257

ప్రతిపదార్థం: సుందరి; నా, కోడండ్రుర, అందున్= నాకోడండ్రందరిలో; నీవు+అ= నీవే; అభ్యర్చితవు= గౌరవించదగినదానవు; ఇందుముఖీ= చంద్రునివంటి అందమైన ముఖం కలదానా!; అతి, ముదమునన్= మిక్కిలి సంతోషంతో; నీకున్; తగన్= తగిన విధంగా; ప్రియంబు, చేసెదన్= ఇష్టమైనది ఇస్తాను; నీకున్; ఎద్ది= ఏది; ఇష్టము; వేఁడుము= కోరుకొనుము.

తాత్పర్యం: సుందరీ! ద్రౌపదీ! నా కోడళ్ళందరిలో నీవే గౌరవించదగిన దానివి. చంద్రముఖీ! నీ కేది ఇష్టమో కోరుకో. ఎంతో సంతోషంతో ఇస్తా.

విశేషం: ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు. ద్రౌపది అందాన్ని గురించి ఆయన విని ఉంటాడే కాని చూడలేదు. అయినా ఈ సందర్భంలో ఆమెను సుందరీ, ఇందుముఖీ- అని సంబోధిస్తున్నాడు. సౌందర్య సూచకాలైన సంబోధనలు స్త్రీలకు సంతోషహేతువులు. ద్రౌపది మనస్సును సుముఖం చేసుకోటానికి ధృతరాష్ట్రుడు ఆమెను అలా సంబోధించి ప్రశంసించా డని అనిపిస్తుంది.

వ. అనినం బాంచాలి యి ట్లనియె. 258

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడనగా, ద్రౌపది ఇలా అన్నది.

ఆ. కరుణతోడ నాకు వరము ప్రసాదింప । బుద్ధియేని లోకపూజితుండు
మనునిభుండు ధర్మతనయుండు దాస్యంబు । వలనఁ బాయవలయు వసుమతీశ! 259

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ= ఓ భూనాథ! ధృతరాష్ట్రమహారాజా!; కరుణతోడన్= దయతో; నాకున్; వరము; ప్రసాదింపన్= ఇవ్వటానికి, బుద్ధి, ఏనిన్= మనస్సు కలదేని; లోకపూజితుండు= ప్రపంచంచేత పూజించబడేవాడు; మను, నిభుండు= మనువుతో సమానమైనవాడు; ధర్మతనయుండు= ధర్మరాజు; దాస్యంబువలనన్= సేవకత్వంనుండి; పాయవలయున్= తొలగిపోవాలి, విముక్తుడు కావాలి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! దయతో నాకు వరం ఇవ్వా లని మీకు అనిపిస్తే, లోకంచేత పూజించబడేవాడు, మనువుతో సమానమైనవాడు అయిన ధర్మరాజుకు దాస్యంనుండి విముక్తి కలగాలి.

విశేషం: అపౌరుష్యం, అజరరత్వం గల ఈ పద్యరచన సౌకుమార్యానికి చక్కని ఉదాహరణం. (సంపా.)

వ. 'అ ట్లయినం గురుకుమారులు గురువృద్ధజనలాలితుండై పెరిఁగిన ప్రతివింధ్యు దాసపుత్త్రుం డనకుండుదు;
రిదియ నా యిష్టం' బనిన 'నిచ్చితి; నింక రెండవవరంబు వేఁడు' మనిన ద్రౌపది యి ట్లనియె. 260

ప్రతిపదార్థం: అట్లు+అయినన్; కురు, కుమారులు= కౌరవులు; గురు, వృద్ధ జన, లాలితుండు+ఐ= గురువులచేత, పెద్దవారిచేత బుజ్జగించబడిన వాడై; పెరిగిన; ప్రతివింధ్యు= ప్రతివింధ్యుని; దాస పుత్త్రుండు= సేవకుని కొడుకు; అనక+ ఉండుదురు= అని అనకుండా ఉంటారు; ఇదియే; నాకున్; ఇష్టంబు; అనినన్; ఇచ్చితిన్; ఇంక; రెండవ, వరంబు; వేఁడుము= కోరుకొనుము; అనినన్; ద్రౌపది; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అలా అయితే గురువులచేత, పెద్దవారిచేత బుజ్జగించబడి పెరిగిన మా ప్రతివింధ్యుణ్ణి కౌరవులు సేవకుని కొడు కని అనకుండా ఉంటారు. ఇదే నా కోరిక' - అని ద్రౌపది అనగా- 'ఇచ్చాను- రెండవవరం కోరుకో' అని ధృతరాష్ట్రు డన్నాడు. అందుకు ద్రౌపది ఇలా అన్నది.

విశేషం: ప్రతివింధ్యుడు ద్రౌపదికి ధర్మరాజువల్ల జన్మించిన కుమారుడు. ఈ కోరికలో రాచకూతురుగా ద్రౌపది మాతృహృదయం వ్యక్తమవుతుంది.

క. **నెమ్మిని ధర్మజు నలువురు । దమ్ములుఁ దమ యాయుధములఁ దమవర్మవరూ**
థమ్ములయుఁ దోడ సకల హి । తమ్ముగఁ బాయంగవలయు దాస్యము వలనన్. **261**

ప్రతిపదార్థం: నెమ్మినిన్= సంతోషంతో; ధర్మజు, నలుగురు, తమ్ములున్= ధర్మరాజుయొక్క నలుగురు తమ్ములును; తమ, ఆయుధములన్, తమ, వర్మ, వరూథమ్ములయున్+తోడన్= తమయొక్క ఆయుధాలతో కవచాలతో, గృహాలతో గూడ; సకల హితమ్ముగన్= అందరికి మేలు కలిగేటట్లు; దాస్యమువలనన్= దాస్యంనుండి; పాయంగవలయున్= తొలగాలి.

తాత్పర్యం: సంతోషంతో ధర్మరాజు నలుగురు తమ్ములు, తమ ఆయుధాలతో, కవచాలతో, గృహాలతో అందరికి మేలు కలిగేటట్లు దాస్యంనుండి విముక్తి పొందాలి.

వ. **అనిన ధృతరాష్ట్రుండు 'నీకోరిన వరం బిచ్చితి; నింక మూఁడవవరంబు వేఁడు' మనిన ద్రౌపది యి ట్లనియె.** **262**

తాత్పర్యం: అని ద్రౌపది అనగా ధృతరాష్ట్రుడు 'నీవు కోరినవరం ఇచ్చాను. ఇంకా, మూడవవరం కోరుకో' అనగా ద్రౌపది ఇలా అన్నది.

ఆ. **'వైశ్యసతికి నొక్క వరము, సత్క్షత్త్రియ । సతికి రెండు, శూద్రసతికి మూఁడు,**
విప్రసతికి నూఱు వేఁడఁజ న్వరములు । గాన యింక వేఁడఁగాదు నాకు.' **263**

ప్రతిపదార్థం: వైశ్యసతికిన్= వైశ్య స్త్రీకి; ఒక్క వరము; సత్+క్షత్త్రియ సతికిన్= ఉత్తమక్షత్త్రియస్త్రీకి; రెండు; శూద్రసతికిన్= శూద్ర స్త్రీకి; మూఁడు; విప్రసతికిన్= బ్రాహ్మణ స్త్రీకి; నూఱు, వరములు; వేఁడన్+చన్= కోరదగును; కాన; ఇంకన్; నాకున్; వేఁడన్+కాదు= కోరదగదు.

తాత్పర్యం: వైశ్యస్త్రీ ఒకవరం, ఉత్తమక్షత్త్రియస్త్రీ రెండువరాలు, శూద్రస్త్రీ మూడువరాలు, బ్రాహ్మణస్త్రీ వంద వరాలు కోరవచ్చు. అందువల్ల ఇక నేను కోరకూడదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన ధృతరాష్ట్రుండు కోడలి గుణంబులకు ధర్మం బెఱుంగుటకు సంతసిల్లి, యనుజ సహితుం డయిన యుధిష్ఠిరు రావించి 'నీవు సర్వసంపదలు స్వరాజ్యంబు నొప్పుగొని యెప్పటియట్ల యింద్రప్రస్థపురంబున కరిగి సుఖం బుండుము; నీకు లగ్గయ్యెడు' మని వెండియు. 264

ప్రతిపదార్థం: అనిన; ధృతరాష్ట్రుండు; కోడలి; గుణంబులకున్= మంచిగుణాలకు; ధర్మంబు+ఎఱుంగుటకున్= ధర్మం తెలిసి ఉండటానికి; సంతసిల్లి= సంతోషించి; అనుజ, సహితుండు+అయిన= తమ్ములతో కూడిన; యుధిష్ఠిరున్= ధర్మరాజును; రావించి; నీవు; సర్వ, సంపదలు; స్వ, రాజ్యంబున్= నీ యొక్క రాజ్యాన్ని; ఒప్పుగొని= తీసుకొని; ఎప్పటి, అట్ల= ఎప్పటివలె; ఇంద్రప్రస్థ, పురంబునకున్; అరిగి= వెళ్ళి; సుఖంబుండుము; నీకున్; లగ్గు= మేలు; అయ్యెడుము+అని= అవునని; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ద్రౌపది మాటలు విన్న ధృతరాష్ట్రుడు ఆ కోడలి గుణాలకు, ధర్మపరిజ్ఞానానికి, సంతోషించి, యుధిష్ఠిరుణ్ణి, అతనితమ్ములతో కూడ రప్పించి, 'నీవు సర్వసంపదలు, నీ రాజ్యం తీసుకొని ఎప్పటిలా ఇంద్రప్రస్థానికి వెళ్ళి సుఖంగా జీవించు. నీకు మేలు కలుగుతుంది' అని, మళ్ళీ.

**తే. నీవు నిత్యంబు వృద్ధోపసేవఁ జేసి । యెఱుఁగు దెల్ల ధర్మంబులు; నెఱుక లేక
కడఁగి నీ కెగ్గు సేసె నా కొడుకు; దీని । మఱచునది; నీకు నే నొండ్లు గఱపనేల? 265**

ప్రతిపదార్థం: నీవు; నిత్యంబు= ఎల్లప్పుడు; వృద్ధ+ఉపసేవన్+చేసి= పెద్దలసేవ చేసి; ఎల్లధర్మంబులన్= అన్నిధర్మాలను; ఎఱుఁగుదు= తెలిసినవాడివి; నా, కొడుకు; ఎఱుక లేక= జ్ఞానం లేక; కడఁగి= పూనుకొని; నీకున్; ఎగ్గు= కీడు; చేసెన్; దీనిన్= ఈ అపకారాన్ని; మఱచునది; నీకున్; నేను; ఒండ్లు= ఇతరాలు; కఱపన్+ఏల= బోధించట మెందుకు?

తాత్పర్యం: నీవు పెద్దలసేవ చేసి అన్ని ధర్మాలు తెలుసుకొన్నావు. నాకొడుకు జ్ఞానం లేక నీకు కీడు చేశాడు. ఈ అపకారాన్ని మరచిపో. నీకు నేను ఇంకేమీ బోధించ నక్కరలేదు.

**క. మనమున వేరమిఁ దలఁపమి । యును, సక్షమచిత్తుఁ డగుటయును, గుణములు కై
కొని దోషమ్ములు విడుచుట । యును నుత్తముఁ డయిన పురుషు నుత్తమగుణముల్. 266**

ప్రతిపదార్థం: మనమునన్= మనస్సులో; వేరమిన్= వైరాన్ని; తలఁపమియును= తలంచకుండటం; సక్షమ, చిత్తుఁడు+ అగుటయును= ఓర్పుతో కూడిన మనస్సు కలవాడు కావటం; గుణములు; కైకొని= గ్రహించి; దోషమ్ములు; విడుచుటయును; ఉత్తముఁడు+అయిన= గొప్పవాడైన; పురుషు, ఉత్తమ, గుణముల్= మానవునియొక్క గొప్పగుణాలు.

తాత్పర్యం: మనసులో వైరం తలచకుండటం, ఓర్పుతో కూడిన మనస్సు కలిగి ఉండటం, గుణాలు గ్రహించి, దోషాలు విడిచి వేయటం, గొప్పవ్యక్తియొక్క గొప్పగుణాలు.

విశేషం: మానవతకు వెలుగు నిచ్చే చక్కని సూక్తుల్లో ఇ దొకటి. (పై పద్యం, ఈ పద్యం మాధుర్యగుణానికి మచ్చుతునకలు. సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఏను బుద్ధిలేక జూదం బుపేక్షించితి; నల్పబుద్ధిసత్త్వుండయిన వృద్ధు నన్నును, మీతల్లి యయిన గాంధారినిం దలంచి, దుర్యోధనాదులు సేసిన దుర్నయంబులు సేకొన కుండునది; సర్వశాస్త్రవిదుం డయిన విదురుండు మంత్రిగా సర్వధర్మవిదుండవైన నీవు రక్షకుండవుగా నిక్కురుకులంబునకు లగ్గగు'నని ధర్మరాజుఁ బాండురాజు రాజ్యంబునందు సమర్పించిన. 267

ప్రతిపదార్థం: ఏను= నేను; బుద్ధిలేక; జూదంబు+ఉపేక్షించితిన్= జూదాన్ని అశ్రద్ధచేశాను; అల్ప, బుద్ధి, సత్త్వుండు+అయిన= కొద్దిదైన బుద్ధిబలం గల; వృద్ధున్= ముసలివాణ్ణి; నన్నును; మీ, తల్లి, అయిన; గాంధారినిన్, తలంచి; దుర్యోధన+ఆదులు= దుర్యోధనుడు మొదలయినవాళ్ళు; చేసిన; దుర్నయంబులు= చెడ్డపనులు; చేకొనక+ఉండునది= లెక్కపెట్టకుండ ఉండేది; సర్వ, శాస్త్ర విదుండు+అయిన= అన్ని శాస్త్రాలు తెలిసిన వాడైన; విదురుండు; మంత్రిగా; సర్వ, ధర్మ, విదుండవు+ఐన= అన్ని ధర్మాలు తెలిసిన వాడి వైన; నీవు; రక్షకుండవుగాన్; ఈ+కురుకులంబునకున్= ఈ కురువంశానికి; లగ్గు+అగున్= మే లవుతుంది; అని; ధర్మరాజున్; పాండురాజు, రాజ్యంబునందున్; సమర్పించినన్= గౌరవంగా అప్పగించగా.

తాత్పర్యం: 'నేను బుద్ధిలేక జూదాన్ని ఉపేక్షించాను. స్వల్పబుద్ధి గల ముసలివాణ్ణి నన్నూ, మీ తల్లి గాంధారినీ తలచి దుర్యోధనాదులు చేసిన చెడ్డపనులు మనస్సులో పెట్టుకోవద్దు. అన్నిశాస్త్రాలు తెలిసిన విదురుడు మంత్రిగా, అన్ని ధర్మాలు తెలిసిన నీవు రక్షకుడవుగా ఈ కురువంశానికి శుభం కలుగుతుంది' అని ధృతరాష్ట్రుడు పాండురాజు రాజ్యాన్ని ధర్మరాజుకు సమర్పించాడు.

విశేషం: ఇది ధృతరాష్ట్రుని మనోవేదనను వ్యక్తం చేసే వచనం. పుత్రమమకారం, అధర్మఫలభీతి అనే అడకత్తెరలో ఆ తండ్రి నలుగుతున్నాడు. 'సమర్పించిన' అనే దానికి అనేకప్రతుల్లో ఉండే 'నియోగించిన' అనే పాఠాంతరం అర్థస్పష్టతకు ఎక్కువ అనుకూలమైనదిగా ఉంది.

తరలము.

తరుణి ద్రౌపది యిట్లు పాండవధార్తరాష్ట్రులదైన భీ
కర పరస్పర కోపవేగము గ్రన్నఁ బాచి విపత్తి సా
గర నిమగ్నుల నుద్ధరించెఁ బ్రకాశకీర్తుల ధీరులం
బురుషసింహములన్ నిజేశులఁ బూని తద్దయుఁ బ్రీతితోన్. 268

ప్రతిపదార్థం: తరుణి= యౌవనవతి; ద్రౌపది; ఇట్లు= ఈ విధంగా; పాండవ ధార్తరాష్ట్రులది+ఐన= పాండవులయొక్క; ధృతరాష్ట్రుని కుమారులైన కౌరవులయొక్క; భీకర, పరస్పర, కోప, వేగము= భయంకరమైన పరస్పరకోపంయొక్క తీవ్రతను; క్రన్నన్= త్వరగా; పాచి= తొలగించి; విపత్తి, సాగర, నిమగ్నులన్= ఆపద అనే సముద్రంలో పూర్తిగా మునిగినవాళ్ళను; ప్రకాశ, కీర్తులన్= వెలుగుతున్న కీర్తి కలవాళ్ళను; ధీరులన్= ధైర్యవంతులను; పురుష, సింహములన్= పురుష శ్రేష్ఠులను; నిజ+ఈశులన్= తన భర్తలను; పూని= ప్రయత్నించి; తద్దయున్= మిక్కిలి; ప్రీతితోన్= ప్రేమతో; ఉద్ధరించెన్= లేవనెత్తింది.

తాత్పర్యం: ద్రౌపది ఈ విధంగా పాండవులకు, కౌరవులకు ఒకరిమీద మరొకరికున్న భయంకరకోపతీవ్రతను త్వరగా తొలగించింది. ఆపద అనే సముద్రంలో పూర్తిగా మునిగిన కీర్తిమంతులు, ధైర్యవంతులు, పురుషశ్రేష్ఠులు అయిన తనభర్తలను ప్రయత్నించి ఎంతో ప్రేమతో పైకి తీసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: రూపకం. గుణం : శ్లేష, (సంపా.)

సీ. **దాని నంతయు భీమసేనుండు విని 'రాజ్య । సంప్రాప్తి పాండవసత్తములకు**
సతికారణంబున ధృతమయ్యె నను నింత । కంటెను గష్టంబు గలదె యొండు;
పేర్మి నపత్యంబుఁ గర్మంబు విద్యయు । నను నివి తేజంబు లట్టె తగిన
పురుషున కెందును; నిరతంబు మిక్కిలి । తేజంబు కర్మంబు; దీని విడిచి

ఆ. **యలుక గాఁడె పురుషుఁ' డని కోపఘూర్ణిత । రక్తనేత్రుఁడై 'పరాక్రమమున**
శత్రువరుల నుగ్రసంగరంబునఁ జంపి । కుతలరాజ్యమెల్లఁ గొందు' ననుచు. **269**

ప్రతిపదార్థం: దానిన్; అంతయున్; భీమసేనుండు; విని; పాండవ, సత్తములకున్= పాండవశ్రేష్ఠులకు; రాజ్య, సంప్రాప్తి= రాజ్యలాభం; సతి, కారణంబునన్= భార్యమూలంగా; ధృతము+అయ్యెన్= ధరించబడినది అయినది; అను నింతకంటెను= అనిపించుకొనటంకంటె; కష్టంబు; ఒండు= మరొకటి; కలదె= కలదా? పేర్మిన్= గొప్పగా; అపత్యంబున్= సంతానం; కర్మంబు= చేయవలసిన పని; విద్యయున్; అను, ఇవి; తగిన; పురుషునకున్; ఎందును= ఎచ్చటనైనను; తేజంబులు+అట్టె= వెలుగులను (కీర్తిని) కలిగిస్తాయా?; నిరతంబు= ఎల్లప్పుడు; మిక్కిలి, తేజంబు, కర్మంబు= వీరకృత్యమే; మిక్కిలి శ్రేష్ఠం, దీని; విడిచి; పురుషుఁడు; అలుకగాఁడె= తేలికపడడా! అని; కోప, ఘూర్ణిత, రక్త, నేత్రుఁడు+ఐ= కోపంచేత తిరుగుడు పడిన ఎఱ్ఱని కన్నులు కలవాడై; పరాక్రమమునన్= శౌర్యంతో; శత్రు, వరులన్= శత్రురాజులన్; ఉగ్ర, సంగరంబునన్= భయంకరమైన యుద్ధంలో; చంపి; కుతల, రాజ్యము+ఎల్లన్= భూమిమీది రాజ్యాధికారాన్నంతను; కొందును= గ్రహిస్తాను; అనుచున్.

తాత్పర్యం: భీమసేనుడు అంతా విని 'పాండవ శ్రేష్ఠులకు రాజ్యలాభం భార్యమూలంగా వచ్చిం దని అనిపించుకోవటంకంటె కష్టం మరొకటి లేదు. పురుషునికి వెలుగునిచ్చేవి- గొప్ప సంతానం, చేసేపని, విద్య, ఎల్లప్పుడు వీరకృత్యమే శ్రేష్ఠం. దీన్ని విడిచిన పురుషుడు తేలికపడడా!' అని కోపంతో తిరుగుడుబడిన ఎఱ్ఱనికళ్ళు కలవాడై, 'పరాక్రమంతో శత్రురాజులను భయంకరయుద్ధంలో సంహరించి రాజ్యమంతా గ్రహిస్తా' నంటూ.

విశేషం: 'అలుకగాఁడె' అనే పాఠానికి 'అలుసుగాఁదె', 'అలతిగాదె' అనే పాఠాంతరా లున్నాయి.

వ. **మృగమధ్యంబున నున్న సింహంబునుంబోలె ననుజమధ్యంబున నున్న యాతనిం గరంబున వారించి, ధర్మరాజు ధృతరాష్ట్ర శాసనంబునం దమ్ములుం దానును ద్రౌపదీ సహితంబుగాఁ గాంచనరథారూఢుఁ డై యింద్రప్రస్థపురంబున కరిగిన; నిట దుశ్శాసనుచేత నంత వృత్తాంతంబును విని దుర్యోధనుండు కర్ణశకుని సైంధవులతో విచారించి ధృతరాష్ట్రుపాలికిం జని యి ట్లనియె.** **270**

ప్రతిపదార్థం: మృగ, మధ్యంబునన్+ఉన్న= జింకలమధ్య ఉన్న; సింహంబునున్+పోలెన్= సింహంవలె; అనుజమధ్యంబునన్+ ఉన్న= తమ్ముల మధ్య ఉండే; ఆతనిన్= ఆ భీమసేనుణ్ణి; ధర్మరాజు; కరంబునన్= చేతితో; వారించి= అడ్డగించి; ధృతరాష్ట్ర, శాసనంబునన్= ధృతరాష్ట్రుని ఆజ్ఞ ప్రకారం; తమ్ములున్; తానును; ద్రౌపదీ, సహితంబుగాన్= ద్రౌపదితోకూడ; ఇంద్రప్రస్థ, పురంబునకున్; అరిగినన్= వెళ్ళగా; ఇట; దుశ్శాసనుచేతన్; అంత, వృత్తాంతంబును= జరిగిన విషయాన్నంతటిని; విని; దుర్యోధనుండు; కర్ణ, శకుని, సైంధవులతో, విచారించి; ధృతరాష్ట్ర పాలికిన్= ధృతరాష్ట్రుని దగ్గరికి; చని= వెళ్ళి; ఇట్లు+అనియెన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: జింకలమధ్య ఉన్న సింహంలా తమ్ముల మధ్య ఉన్న ఆ భీమసేనుణ్ణి, ధర్మరాజు చేతితో అడ్డగించాడు. ధృతరాష్ట్రునిఆజ్ఞప్రకారం తమ్ములు, తాను, ద్రౌపదితో కలిసి ఇంద్రప్రస్థపురానికి వెళ్ళాడు. జరిగిందంతా దుశ్శాసనునిద్వారా విని దుర్యోధనుడు, కర్ణ శకుని సైంధవులతో ఆలోచించి, ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ. తాను చేసినదంతా తండ్రి తలక్రిందులు చేస్తే దుర్యోధనుని స్థితిలో ఉన్న ఏ తనయుడైనా ఊరకుంటాడా?

క. **అహితుల నెల్ల విధంబుల । విహతులఁగాఁ జేయునది వివేక మని మరు**
న్మహితుండు చెప్పె నిది మును । బృహస్పతి సురేశ్వరునకుఁ బ్రియహితబుద్ధిన్. **271**

ప్రతిపదార్థం: అహితులను= శత్రువులను; ఎల్ల, విధంబులన్= అన్ని విధాల; విహతులన్+కాన్= తెగటార్చ బడిన వాళ్ళనుగా; చేయునది; వివేకము= తెలివి; అని; మరుత్+మహితుండు= దేవతలలో గొప్పవాఁడు; బృహస్పతి; మును= పూర్వం; ప్రియ, హిత, బుద్ధిన్= ప్రేమతో మేలు చేసే తలంపుతో; సుర+ఈశ్వరునకున్= దేవతలరాజుకు-దేవేంద్రునికి; ఇది; చెప్పెన్.

తాత్పర్యం: 'శత్రువుల్ని అన్నివిధాల తెగటార్చటమే వివేకం' అని దేవతల్లో గొప్పవాడైన బృహస్పతి- దేవరాజైన దేవేంద్రునికి మేలు చెయ్యా లని ప్రేమతో చెప్పాడు.

వ. **అప్పాండవుల కెంత లగ్గు సేసియు నింక హితుల మయ్యెదమె? యాశీవిషంబుల నలిగించి కంఠ సమీపంబున విడుచునట్లు వారల విడిచిపుచ్చి కర్జంబు దప్పితిమి.** **272**

ప్రతిపదార్థం: ఆ+పాండవులకున్; ఎంత; లగ్గు= మేలు; చేసియున్; ఇంక; హితులము= మేలు చేసేవాళ్ళము; అయ్యెదము+ ఎ= అవుతామా?; ఆశీ, విషంబులన్= ముఖంలో విషం కలవాటిని- పాములను; అలిగించి= కోపపడేటట్లు చేసి; కంఠసమీపంబునన్= గొంతు దగ్గర; విడుచునట్లు; వారలన్; విడిచి; పుచ్చి= పంపి; కర్జంబు= చేయదగినపని; తప్పితిమి.

తాత్పర్యం: ఆ పాండవులకు ఎంతమేలు చేసినా ఇంక మనం మంచివాళ్ళం అవుతామా! పాములను కోపపడేటట్లు చేసి కంఠంపై విడిచినట్లు వాళ్ళను వదలి, పంపి, తప్పు చేశాము.

విశేషం: అలం: ఉపమ.

ఉ. **భూ విదిత ప్రతాప పరిభూత విపక్షుఁడు సవ్యసాచి గాం**
డీవము గొన్న భీముఁడు వడిన్ గదగొన్నఁ, గవల్ కృపాణచ
ర్మావరణాది భాసిత మహాభుజ విక్రములైన, వారలన్
లావె రణంబులో మన కలంఘ్యబలాఢ్యుల నింక నోర్వఁగన్. **273**

ప్రతిపదార్థం: భూ, విదిత, ప్రతాప, పరిభూత, విపక్షుఁడు= ప్రపంచప్రసిద్ధమైన పరాక్రమంచేత ఓడించబడిన శత్రువులుకలవాడు; సవ్యసాచి= అర్జునుడు; గాండీవము; కొన్నన్= చేత పట్టితే; భీముఁడు; వడిన్= వేగంగా; గద, కొన్నన్= గదను చేపట్టితే; కవల్= నకుల సహదేవులు; కృపాణ, చర్మ+ఆవరణ+ఆది, భాసిత, మహా, భుజ, విక్రములు+ఐనన్= కత్తి, డాలు, కవచం మొదలైన

వాటిచేత ప్రకాశించిన గొప్ప బాహుపరాక్రమం కలవాళ్ళయితే; వారలన్; అలంఘ్య, బల+ఆఢ్యులన్= దాటసాధ్యంకాని బలంతో కూడుకొన్నవాళ్ళను- అంటే జయింప సాధ్యంగాని బలంతో కూడుకొన్నవాళ్ళను; రణంబులోన్= యుద్ధంలో; ఇంకన్; మనకున్; ఓర్వఁగన్= సహించటం; లావె= శక్యమా?

తాత్పర్యం: ప్రపంచ ప్రసిద్ధమైన పరాక్రమంచేత శత్రువుల్ని ఓడించిన సవ్యసాచి, గాండీవం చేతపట్టితే- భీముడు వడిగా గదను చేబూనితే, నకుల సహదేవులు కత్తి, డాలు, కవచం మొదలైనవాటిచేత ప్రకాశించే గొప్ప భుజ పరాక్రమం కలవాళ్ళయితే, జయింప సాధ్యంగాని ఆ బలవంతుల్ని మనం యుద్ధంలో ఎదిరించి నిలవటం సాధ్యమా?

విశేషం: సవ్యసాచి అనే పదప్రయోగం, ఆ పదానికి విశేషణంగా కూర్చిన సుదీర్ఘ సమాసం గాండీవం చేపట్టిన అర్జునుని భీకరవీర విహారాన్ని చక్కగా వ్యక్తం చేస్తున్నవి. పాపపు పని చేసినవానికి దానిఫలితాన్ని గూర్చిన భయం ఎక్కువ. అందుచేత దుర్యోధనుని ఈ భయం అసహజమైంది కాదు. (ఈ పద్యరచనలో పాండవ పరాక్రమంవల్ల ప్రదర్శితమైన వీరరసదీప్తి ఔజ్జ్వల్యప్రధానమై కాంతి గుణపోషకంగా ఉంది. - సంపా.)

వ. **'కావున వారల ననుద్యూతంబునఁ బరాజితులం గావించి విరళ దేశ నిర్వాసితులం జేయుట కార్యం' బనిన విని ధృతరాష్ట్రుం డొడంబడి, యప్పుడ యనుద్యూతార్థంబు ధర్మనందనుం దోడితేరం బ్రాతికామిం బంచినం 'బితృనియోగంబును విధినియోగంబు నతిక్రమింప నగునే' యని.** **274**

ప్రతిపదార్థం: కావున; వారలన్= పాండవులను; అనుద్యూతంబునన్= రెండవ జూదంలో; పరాజితులన్= ఓడిపోయినవాళ్ళనుగా; కావించి= చేసి; విరళదేశ, నిర్వాసితులన్= దూరప్రదేశాలకు వెళ్ళగొట్టబడినవాళ్ళనుగా; చేయుట; కార్యంబు; అనినన్; విని; ధృతరాష్ట్రుండు; ఒడంబడి= ఒప్పుకొని; అప్పుడు+అ= అప్పుడే; అనుద్యూత+అర్థంబు= రెండవమారు జూదమాడటంకొరకు ధర్మనందనున్ - ధర్మరాజును; తోడితేరన్= తోడ్కొని రావటానికి; ప్రాతికామిన్; పంచినన్= పంపగా; పితృ, నియోగంబును= తండ్రియొక్క ఆజ్ఞను; విధి, నియోగంబున్= దైవనిర్ణయాన్ని; అతిక్రమింపన్+అగునే= దాటనవునా; అని.

తాత్పర్యం: 'కావున పాండవుల్ని పునర్ద్యూతంలో ఓడించి దేశంనుండి వెళ్ళగొట్టటమే మనం చెయ్యదగినపని' అని అనగా ధృతరాష్ట్రుడు ఒప్పుకొని, అప్పుడు మళ్ళీ జూదమాడటానికి ధర్మరాజును పిలుచుకొని రమ్మని ప్రాతికామిని పంపాడు. 'తండ్రి ఆజ్ఞ, దైవనిర్ణయం దాటనవునా?' అని.

విశేషం: పునర్ద్యూత విషయంలో భీష్ముడు తన అసమ్మతిని వెలిబుచ్చటం, గాంధారి దుర్యోధనుణ్ణి వదలివేసి అయినా కులాన్ని రక్షించు మని ధృతరాష్ట్రునికి హితబోధ చేయటం- మొదలయినవి మూలంలో ఉన్నాయి కాని, తెలుగు భారతంలో లేవు.

క. **నృపవరుఁ డనుజులుఁ దానును। ద్రుపదతనూజయుఁ బ్రియంబుతో నరిగెను హ**
స్తిపురంబునకు నశేష। స్వపక్షజన హృదయములకు సంతాపముగన్. **275**

ప్రతిపదార్థం: నృప, వరుఁడు= రాజశ్రేష్ఠుడు- ధర్మరాజు; అనుజులున్= తమ్ములును; తానును; ద్రుపద తనూజయున్= ద్రుపదుని యొక్క పుత్రిక అయిన ద్రౌపదియు; అశేష, స్వ, పక్ష, జన, హృదయములకున్= తన పక్షంలోని జనులందరి హృదయాలకు; సంతాపముగన్= విచారం కలిగేటట్లు; హస్తిపురంబునకున్; ప్రియంబుతోన్= ప్రీతితో; అరిగెను= వెళ్ళాడు.

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు తన పక్షంలోని జను లందరి హృదయాలకు విచారం కలిగేటట్లుగా తమ్ములతో, ద్రౌపదితో కలిసి ఎంతో ఇష్టంగా హస్తినకు వెళ్ళాడు.

విశేషం: 'సంతాపముగన్' అనే దానికి పెక్కు ప్రతుల్లో ఉన్న 'సంతోషముగన్' అనే పాఠాంతరం మూల విరుద్ధం. "వ్యథయం తిస్మ చేతాంసి సుహృదాం" (మూలం భండార్కరు ప్రతి 2-67-6).

వ. అం దెప్పటియట్ల ధృతరాష్ట్ర నిర్మిత సభాసీనులై యున్నంత నభిమతాక్షుండైన శకుని కితవుండు ధర్మరాజున కి ట్లనియె. 276

ప్రతిపదార్థం: అందున్; ఎప్పటి, అట్ల= ఎప్పటివలె; ధృతరాష్ట్ర, నిర్మిత, సభా+ఆసీనులు+ఐ= ధృతరాష్ట్రునిచే నిర్మించబడిన సభలో కూర్చున్నవాళ్ళయి; ఉన్నంతన్= ఉండగా; అభిమత+అక్షుండు+ఐన= కోరిన పాచికలు కలవాడైన; శకుని, కితవుండు= మోసగాడు, జూదగాడుఅయిన శకుని; ధర్మరాజునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు నిర్మించిన ద్యూతసభలో ఎప్పటిలాగే అందరు కూర్చున్నారు. కోరిన పాచికలు గల జూదగాడు మోసగాడు అయిన శకుని- ధర్మరాజుతో ఇలా అన్నాడు.

క. ధనసంపద రాజ్యంబున । దినకరతేజుండు మిమ్ము ధృతరాష్ట్రుఁడు పెం
పునఁ బూజించెం గావునఁ । జన దింకను వాని నొడ్డి సరి క్రీడింపన్. 277

ప్రతిపదార్థం: దినకర, తేజుండు= సూర్యుని వంటి కాంతి కలవాడైన; ధృతరాష్ట్రుఁడు; ధన సంపదన్, రాజ్యంబునన్= ధనసంపదచేత, రాజ్యంచేత; మిమ్ము; పెంపునన్= గొప్పగా; పూజించెన్= సత్కరించాడు; కావునన్; వానినిన్= ఆ ధన సంపదను, రాజ్యమును; ఒడ్డి= పణంగా పెట్టి; సరి క్రీడింపన్= తగురీతిగా జూదమాడటం; ఇంకను; చనదు= కూడదు.

తాత్పర్యం: సూర్యునివంటి తేజస్సు గల ధృతరాష్ట్ర మహారాజు- ధనసంపదను, రాజ్యసంపదను ఇచ్చి మిమ్మల్ని సమ్మానించాడు. కాబట్టి ఇక వాటిని ఒడ్డి జూదమాడటం తగదు.

వ. 'ఇది యపూర్వంబైన పణంబు; దీని నొడ్డి యోటువడిన వార లజినవల్కలంబులు గట్టి వన్యమూలఫలాశనులై బ్రహ్మచర్యంబునం బండ్రెండేండ్లు వనవాసంబు సేసి, పదుమూఁడగు నేఁడు జనపదంబున నజ్ఞాతవాసంబు సేసి, యం దెఱుంగఁ బడిరేని వెండియుఁ బండ్రెండేండ్లు వనవాసంబు నొక్కయేఁ డజ్ఞాతవాసంబుఁ జేయుచుండు వా; రిట్లోపుదేని జూదం బాడుద' మనిన 'ననుద్యూతార్థం బాహూతుండనై మగుడ నగునే' యని. 278

ప్రతిపదార్థం: ఇది= నేను చెప్పబోయేది; అపూర్వంబు+ఐన= మున్నెన్నడు లేని, పణంబు= పందెం; దీనిన్; ఒడ్డి; ఓటు, పడిన, వారలు= ఓడిపోయినవాళ్ళు; అజినవల్కలంబులు= జింకచర్మం, నారచీరలు; కట్టి; వన్య, మూల ఫల+అశనులు+ఐ= అడవులలోని వేళ్ళు (దుంపలు), పండ్లు ఆహారంగా కలవాళ్ళయి; బ్రహ్మచర్యంబునన్= బ్రహ్మచర్యవ్రతాన్ని పూని; పండ్రెండు+ ఏండ్లు; వనవాసంబు, చేసి= అడవులలో నివసించి; పదుమూఁడగు, ఏఁడు= పదమూడవ సంవత్సరం; జనపదంబునన్= ఏదో ఒక దేశంలో; అజ్ఞాతవాసంబు= తెలియబడని నివాసం - అంటే వా ళ్ళెవరో తెలియకుండా నివసించటం; చేసి; అందున్= ఆ అజ్ఞాతవాసంలో; ఎఱుంగన్+పడిరి+ఏనిన్= కనపడినట్లయితే; వెండియున్= మళ్ళీ; పండ్రెండేండ్లు; వనవాసంబున్=

అరణ్యవాసాన్ని; ఒక్కఏఁడు; అజ్ఞాతవాసంబున్; చేయుచున్+ఉండువారు; ఇట్లు= ఈ విధంగానైన పందెమునకు; ఓపుదు+ ఏనిన్= చాలినవాడివయితే - అంటే ఈ విధమైన పందెం వేయటానికి చేతనైనవాడి వైతే; జూదంబు; ఆడుదము; అనినన్; అనుద్యూత+అర్థంబు= రెండవమారు జూదమాడటంకొరకు; ఆహూతుండను+ఐ= పిలువబడినవాడనై; మగుడన్= మరలి వెళ్ళటం; అగునే= తగునా? అని.

తాత్పర్యం: 'నేను చెప్పబోయేది ఇంతకుముం దెన్నడు లేని పందెం. దీన్ని ఒడ్డి ఓడినవాళ్ళు జింకచర్మం, నారచీరలు ధరించి, అడవుల్లో వేళ్ళు(దుంపలు) ఫలాలు ఆహారంగా, బ్రహ్మచర్యవ్రతం అవలంబించి, పండ్రెండేండ్లు అరణ్యవాసం, పదమూడవయేడు ఏదో ఒక దేశంలో అజ్ఞాతవాసం చెయ్యాలి. ఆ అజ్ఞాతవాసంలో వాళ్ళు కనబడితే మళ్ళీ పండ్రెండేండ్లు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేస్తారు. ఈ విధమైన పందెం వెయ్యటానికి నీకు శక్తి సరిపోతే జూదమాడదాం' - అని శకుని అనగా 'రెండవసారి జూదానికి ర మ్మని పిలిస్తే వెనుతిరిగి వెళ్ళదగునా' అని.

విశేషం: ప్రథమ ద్యూతంలోని పందెములు పాండవులను నిండుసభలో నిట్టనిలువునా దోచుకోవటం వంటివి. పాండవులకే కాదు ప్రజలకు కూడా కోపావేశాన్ని కలిగించేటువంటివి. అందుచేతనే పునర్ద్యూతంలోని పందెములు తడిగుడ్డతో పాండవుల గొంతులు కోసేవిగా రూపొందించటం జరిగింది. పాండవులు పదుమూడేండ్లు పదవి లేక ప్రజకు దూరమైతే వారి విషయం అందరు విస్మరించరా? అంతేకాదు, పండ్రెండేండ్లు అరణ్యవాసం తరువాత వాళ్ళు బ్రతికి ఉంటారనే నమ్మకం ఏముంది? అవసరమైతే అరణ్యవాసంలో అసహాయులైన వాళ్ళను అంతమొందించే ప్రయత్నాలు చెయ్యవచ్చు. ఘోషయాత్ర అటువంటిదే. ఒకవేళ వాళ్ళు బ్రతికి బయటపడినా అజ్ఞాతవాసంలో- ఒక్క సంవత్సరకాలంలో- వాళ్ళ ఉనికి కనిపెట్టటానికి సాధ్యంకాదా? మొత్తం ప్రభుత్వయంత్రాంగం, గూఢచారులదళం సర్వం తమ చేతుల్లోనే ఉంటుంది గదా! అజ్ఞాతవాసంలో వాళ్ళను కనిపెట్టితే మళ్ళీ వాళ్ళ జీవితం పండ్రెండేండ్లు అడవులపాలు. ఇది ఈ రెండవ జూదపు పందెం వెనుక ఉండే క్రూరప్రణాళిక. మొత్తంమీద ధర్మరాజు మళ్ళీ జూదమాడటానికి అంగీకరించాడు. పూర్వానుభవంతో అతడు గుణపాఠం నేర్చుకోలేదు. ఇక ఎవ్వరేం చెయ్యగలరు? భండార్కర్ సంస్కృత భారత సంశోధిత ప్రతిలో భీష్మద్రోణ బాహ్లిక సోమదత్త వికర్ణ యుయుత్సాదులును, గాంధారీ ద్రౌపదీకుంతీదేవులును రెండవసారి జూదం ఆడవద్దని ధర్మరాజుకు బోధించిన ట్లుంది గాని తెలుగు భారతంలో ఇది లేదు. కాగా భండార్కర్ ప్రతిలో - వనవాస అజ్ఞాతవాసాలు సక్రమంగా నెరవేర్చితే ఓడినవాళ్ళు మళ్ళీ తమ రాజ్యాన్ని తాము పొందగల రని ఉంది. ఈ విషయం గూడ తెలుగు భారతంలో లేదు. ధర్మరాజుకు అప్పటికీ ఇప్పటికీ ఒకే ధర్మం- సుహృద్ద్యూతానికి కాని, అనుద్యూతానికి గాని పిలువబడిన తరువాత క్షత్రియుడు దానిని వల దని తిరిగిపోరాదట! ఇది ప్రచ్ఛన్నరణరంగం. గెలుపో ఓటమో ఏదో ఒకటే గమ్యం. ఈ సున్నితమైన ధర్మబలహీనతను ధర్మరాజులో సహజంగా ఉన్న ద్యూతవ్యసన బలహీనతను శకుని కొల్లగొట్టాడు.

ధర్మరాజు శకునితో రెండవమాఱు జూదంబాడుట (సం. 2-67-21)

క. ధర్మసుతుఁ డొడ్డి శకుని క। ధర్మ స్థితి నోటు వడియె; దైవము చెయిదిన్
నిర్మితమయిన శుభాశుభ। కర్మ ఫలం బెట్లు దేహి గడవఁగ నేర్చున్. 279

ప్రతిపదార్థం: ధర్మసుతుఁడు= ధర్మరాజు; ఒడ్డి= పందెంవేసి; శకునికిన్; అధర్మస్థితిన్= అధర్మపద్ధతిలో; ఓటు, పడియెన్= ఓడిపోయాడు; దైవము, చెయిదిన్= దేవునిచేత; నిర్మితము+అయిన= ఏర్పరచబడిన; శుభ+అశుభ, కర్మ, ఫలంబు= మంచి చెడు పనుల ఫలితాన్ని; దేహి= దేహంగలవాడు; ఎట్లు; కడవఁగన్= దాటటానికి; నేర్చున్. (దాటటానికి వీలు లేదని భావం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మరాజు పందెం వేసి శకునిచేతిలో అధర్మంగా ఓడిపోయాడు. దేవుడు నిర్ణయించిన మంచిచెడ్డల కర్మఫలాన్ని మానవుడు ఎలా దాటగలడు?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. **అంత ననుద్యూతపరాజితులయిన పాండవులు దమరాజ్యోపభోగంబులు విడిచి విప్రసుహృద్బాంధవ జనానుగమ్యమానులయి వనంబునకుం బోవ సమకట్టి భీష్మ ధృతరాష్ట్ర విదురకృప ద్రోణాచార్యుల నా మంత్రించిన విదురుం డి ట్లనియె.** **280**

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; అనుద్యూత, పరాజితులు+అయిన= రెండవసారి ఆడి జూదంలో ఓడిపోయిన; పాండవులు; తమ; రాజ్య+ఉపభోగంబులు= రాజ్యసుఖానుభవాలను; విడిచి; విప్ర, సుహృత్+బాంధవ, జన+అనుగమ్యమానులు+అయి= బ్రాహ్మణులు, మిత్రులు, బంధువులు, ప్రజలు వెంట వస్తున్నవాళ్ళయి; వనంబునకున్= అరణ్యానికి; పోవన్; సమకట్టి= పూనుకొని; ధృతరాష్ట్ర, విదుర, కృప, ద్రోణాచార్యులను; ఆమంత్రించినన్= వెళ్ళివస్తామని సెలవుతీసుకొనగా; విదురుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అప్పుడు పునర్ద్యూతంలో ఓడిపోయిన పాండవులు తమ, రాజ్యసుఖానుభవాలను వదలి బ్రాహ్మణులు, మిత్రులు, బంధువులు, ప్రజలు వెంటరాగా అరణ్యానికి వెళ్ళ బోతూ ధృతరాష్ట్ర విదుర కృప ద్రోణాచార్యుల దగ్గర సెలవు తీసుకున్నప్పుడు, విదురుడు ఇలా అన్నాడు.

క. **వనవాసపరిక్లేశం । బున కోపదు కుంతిదేవి భోజాత్మజ గా**
వున నా గృహమున నుండెడు । ననవరతము భక్తితో మదభ్యర్చితయై. **281**

ప్రతిపదార్థం: భోజ+ఆత్మజ= భోజుని కూతురు; కుంతిదేవి; వనవాస, పరిక్లేశంబునకున్= అరణ్యంలో నివసించటంవల్ల కలిగే కష్టానికి; ఓపదు= ఓర్వలేదు; కావున; నా, గృహమునన్= నా ఇంటిలోనే; అనవరతము= ఎల్లప్పుడు; భక్తితో; మత్+అభ్యర్చిత యై= నాచేత పూజించబడేదై; ఉండెడున్.

తాత్పర్యం: భోజుని కూతురు కుంతీదేవి అరణ్యావాసంవల్ల కలిగే కష్టాన్ని ఓర్చుకోలేదు. అందువల్ల ఎప్పుడు నాచేత పూజించబడుతూ నాఇంట్లోనే ఉంటుంది.

సీ. **ధర్మజ్ఞుఁడవు నీవు పేర్మిఁ, బరాక్రమ । ధనుఁడు భీముం, డింద్రతనయుఁ డఖిల**
యుద్ధ విశారదుం డిద్ధయశోనిధి, । నకులుఁ డర్థాఢ్యుండు, ప్రకట బుద్ధి
నెంతయు సంయమవంతుఁడు సహదేవుఁ, । డధ్యాత్మవిద్య నారాధ్యుఁ డెందు
ననఘుండు ధౌమ్యుండు, వినుతార్థ ధర్మంబు । లందు విచక్షణ సుందరాంగి

ఆ. **ద్రుపదతనయ; యిట్లు విపులగుణాళి న । న్యోన్య హితుల రగుట నన్యు లుర్వి**
నాదరింపఁగాక భేదింపనోపెడు । వారు గలరె మిమ్ము ధీరమతుల. **282**

ప్రతిపదార్థం: నీవు; పేర్మిన్= గొప్పగా; ధర్మజ్ఞుఁడవు= ధర్మం తెలిసినవాడివి; భీముఁడు; పరాక్రమధనుఁడు= శౌర్యమే ధనంగా కలగినవాడు - అంటే గొప్ప శౌర్యవంతుడు; ఇంద్రతనయుఁడు= ఇంద్రుని కుమారుడైన అర్జునుడు; అఖిల, యుద్ధ, విశారదుండు= అన్నియుద్ధాల్లో నేర్పరి; ఇద్ధ, యశోనిధి= ప్రకాశించే కీర్తికి నిధివంటివాడు; నకులుఁడు; అర్థ+ఆఢ్యుండు= న్యాయ సంపన్నుడు; సహదేవుఁడు; ప్రకటబుద్ధిన్= ప్రసిద్ధమైన తెలివితో; ఎంతయున్= మిక్కిలి; సంయమవంతుఁడు= నియమశీలం కలవాడు; అధ్యాత్మవిద్యన్= ఆత్మసంబంధమైన జ్ఞానంలో; ఎందున్= ఎచ్చటనైనా; అనఘుండు= పాపరహితుడు; ధౌమ్యుండు; ఆరాధ్యుఁడు= పూజింపదగినవాడు; వినుత+అర్థ, ధర్మంబుల+అందున్= పేరుకెక్కిన ధర్మార్థాలలో; సుందర+అంగి= అందమైన రూపు గలది; ద్రుపద, తనయ= ద్రుపదుని కూతురు; ద్రౌపది; విచక్షణ= బాగోగులు తెలిసినట్టిది; ఇట్లు= ఈ విధంగా; విపుల+గుణ+ఆళిన్= పెక్కు గొప్ప గుణాల సమూహంచేత; అన్యోన్యహితులరు+అగుటన్= ఒకరిమేలు మరొకరు కోరేవారవటంచేత; ధీరమతులు= ధైర్యవంతులు; మిమ్ము; ఉర్విన్= భూమిమీద; అన్యులు= ఇతరులు; ఆదరింపన్+కాక= గౌరవింపక; భేదింపన్+ఓపెడువారు= వైరం పూనే శక్తి కలవాళ్ళు; కలరె= కలరా?

తాత్పర్యం: నీవు గొప్ప ధర్మజ్ఞుడివి. భీముడు పరాక్రమవంతుడు, అర్జునుడు యుద్ధవిశారదుడు, కీర్తిమంతుడు. నకులుడు న్యాయసంపన్నుడు. సహదేవుడు మేధావి, నియమశీలి. పుణ్యాత్ముడైన ధౌమ్యుడు అధ్యాత్మవిద్యచేత పూజ్యుడు. అందమైన ద్రౌపది ధర్మార్థాల్లో చక్కని వివేకం గలది. ఈ విధంగా ఎన్నో గొప్ప గుణాలు కలిగి, ఒకరికొకరు హితులై, ధైర్యవంతులైన మిమ్మల్ని లోకంలో ఇతరులు ఆదరించక మీతో వైరం పెట్టుకోగలరా?

వ. మఱియుఁ గృష్ణద్వైపాయనుచేత శిక్షితులరు, నారదుచేత రక్షితులరు, మీకుం బురోహితుండు ధౌమ్యుండు, దైవమానుషసంపన్నులరు, బలపరాక్రమంబులంజేసి రాజులను, ధర్మచరితంబునం జేసి ఋషులను, మహత్త్వంబునంజేసి కుబేరవాసవాదులను జయించిన వారలరు, మిమ్ము భూమియు గాడ్పును జంద్రాదిత్యులు నెల్లకాలము రక్షించుచు నుండెడు; మెల్ల కార్యంబులయందును నప్రమత్తుల రయి వర్తిల్లునది; భవత్పునర్దర్శన మయ్యెడు మరుగుం'డని కఱపిన గురువృద్ధానుమతంబునం దమ తల్లి చరణంబులకు మ్రొక్కినం గొడుకుల. 283

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక; కృష్ణద్వైపాయనుచేతన్; శిక్షితులరు= బోధించ బడిన వాళ్ళు; నారదుచేతన్; రక్షితులరు= రక్షించ బడిన వాళ్ళు; మీకున్; పురోహితుండు; ధౌమ్యుండు; దైవమానుషసంపన్నులరు= దివ్యత్వం, మానవత్వం నిండుగా కలవాళ్ళు; బలపరాక్రమంబులన్+చేసి= ధర్మ ప్రవర్తనతోన్; ఋషులను; మహత్త్వంబునన్+చేసి= గొప్పతనంచేత; కుబేర, వాసవ+ఆదులను= కుబేరుడు; ఇంద్రుడు మొదలయినవాళ్ళని; జయించిన వారలరు= జయించినట్టివాళ్ళు; మిమ్మున్; భూమియున్; గాడ్పును= గాలియు; చంద్ర+ఆదిత్యులున్= చంద్రుడు, సూర్యుడును; ఎల్ల, కాలము; రక్షించుచున్; ఉండెడున్+ఎడమ= అన్ని కాలాల్లోను రక్షిస్తూ ఉండుగాక!; ఎల్ల, కార్యంబుల, అందునున్= అన్ని పనులలోను; అప్రమత్తులరు+అయి= జాగరూకులై; వర్తిల్లునది= నడచుకొనండి; భవత్+పునర్దర్శనము= మిమ్మల్ని మరలా చూడటం; అయ్యెడున్= అగునుగాక! అరుగుండు= వెళ్ళండి; అని; కఱపిన= బోధించిన; గురు, వృద్ధ+మతంబునన్= గురువులయొక్క, పెద్దలయొక్క అనుమతితో; తమ, తల్లి; చరణంబులకున్= పాదాలకు; మ్రొక్కినన్; కొడుకులన్.

తాత్పర్యం: 'మీరు కృష్ణద్వైపాయనుని బోధ పొందినవాళ్ళు. నారదునిరక్షణ ఉన్నవాళ్ళు. మీకు పురోహితుడు ధౌమ్యుడు. దివ్యత్వం, మానవత్వం నిండుగా కలవాళ్ళు. బలపరాక్రమాలతో రాజులను, ధర్మప్రవర్తనతో ఋషులను, మహత్తుచేత

కుబేర దేవేంద్రాదులను జయించినవాళ్ళు. మిమ్మల్ని నేల, గాలి, చంద్రుడు, సూర్యుడు ఎల్లవేళల రక్షించుగాక! అన్ని పనుల్లో జాగరూకులై నడుచుకొందురుగాక! మిమ్మల్ని మరలా చూడటం జరుగుగాక! వెళ్ళిరండు' అని విదురుడు బోధించగా, గురువులఅనుమతి, పెద్దల అనుమతి పొంది పాండవులు కుంతీదేవి పాదాలకు మ్రొక్కగా, ఆమె కొడుకులను.

విశేషం: 'నారదుచేత రక్షితులరు' అనేదానికి పెక్కు ప్రతుల్లో ఉన్న 'నారాయణుచేత రక్షితులరు' అనే పాఠమే ఎంతో ఉచిత మనిపిస్తుంది.

సీ. **అధికలజ్జావనతాస్యుల, నపగతా । భరణాంబరుల, ధర్మపరుల, నజిన**
వల్కలధారుల, వరమునివేషులఁ బాండుకుమారుల భానునిభులఁ
జూచి దుఃఖిత యయి సుతులార! యిట్టి దు । ర్వ్యసనోపహతులైనవారి మిమ్ముఁ
జూడక ముందఱ సురలోకమున కేఁగి । పాండుభూపతి పుణ్యభాగి యయ్యెః

తే. **భక్తిఁ బతితోన పోవఁ దపంబు సేసె । మాద్రి; యే నేల పోవక మందభాగ్య**
నయితి నని విలాపించుచు నపుడు గుంతి । యేడ్చె దుఃఖితు లగుచుండ నెల్లవారు. **284**

ప్రతిపదార్థం: అధిక, లజ్జా+అవనత+ఆస్యులన్= మిక్కిలి సిగ్గుచేత వంచుకొన్న మొగాలు కలవాళ్ళను; అపగత+ఆభరణ+ అంబరులన్= కోల్పోయిన ఆభరణాలు, వస్త్రాలు కలవాళ్ళను; ధర్మపరులన్= ధర్మంలో ఆసక్తి కలవాళ్ళను; అజిన, వల్కల, ధారులన్= జింకచర్మం, నారచీరలు ధరించినవాళ్ళను; వర, మునివేషులన్= శ్రేష్ఠమైన మునివేషం కలవాళ్ళను; భానునిభులన్= సూర్యుడితో సమానమైన వాళ్ళను; పాండుకుమారులన్; చూచి; దుఃఖిత; అయి= దుఃఖించినట్టిదై; సుతులార= కుమారులార; ఇట్టి; దుర్వ్యసన+ఉపహతులు+ఐనవారిన్= చెడువ్యసనం(జూదం)చేత దెబ్బతినినవాళ్ళను; మిమ్మున్; చూడక; ముందఱన్; పాండుభూపతి= పాండురాజు; సురలోకమునకున్= స్వర్గలోకానికి; ఏఁగి= వెళ్ళి; పుణ్య, భాగి, అయ్యెన్= పుణ్యవంతు డయ్యాడు; మాద్రి; భక్తిన్= భక్తితో; పతితోనన్= భర్తతోకూడ; పోవన్= పోవటానికి; తపంబు; చేసెన్; ఏన్= నేను; ఏల= ఎందుచేత; పోవక= వారివెంట గతించక; మందభాగ్యను= దురదృష్టవంతురాలిని; అయితిని; అని; కుంతి, ఎల్లవారు= అందరు; దుఃఖితులు+అగుచున్+ఉండన్= దుఃఖం పొందినవా రవుతుండగా; అపుడు; విలాపించుచున్= దుఃఖంతో మాటాడుతూ; ఏడ్చెన్.

తాత్పర్యం: ఆభరణాలు, వస్త్రాలు పోగొట్టుకొని, సిగ్గుతో ముఖాలు దించుకొని, నారచీరలు కట్టుకొని, జింకచర్మాలు చేతపట్టుకొని- మునివేషధారులు, సూర్యతేజులు, ధర్మపరులు అయిన పాండవులను చూచి దుఃఖించి- 'పుత్రులారా! ఈ విధంగా ద్యూతవ్యసనంతో దెబ్బతిన్న మిమ్మల్ని చూడకముందే పాండురాజు స్వర్గస్థుడై పుణ్యవంతు డయ్యాడు. పతితో సహగమనం చెయ్యటానికి మాద్రి తపస్సు చేసింది. నేను వాళ్ళ వెంట వెళ్ళని దురదృష్టవంతురాల్ని' - అని కుంతి అందరితోపాటుగా తానూ దుఃఖిస్తూ పలికింది.

వ. **మఱియును** **285**

తాత్పర్యం: అంతేకాక.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మత్తకోకిలము.

వీర లిట్టు లనాథులై మునివృత్తి నుండెడు వారె హా
ద్వారకాపురనాథ! కేశవ! దైత్యభేది! భవత్పదాం
భోరుహాశ్రితులైన వీరలఁ బూని కావక యుండఁగా
ధారుణీధర! నీకు ధర్మువె ధర్మనిర్మలమానసా! 286

ప్రతిపదార్థం: వీరలు= నాకుమారులైన ఈ పాండవులు; ఇట్టులు= ఈ విధంగా; అనాథులు+ఐ= దిక్కులేనివాళ్ళయి; మునివృత్తిన్; ఉండెడువారె; హా! ద్వారకాపురనాథ= ద్వారకాపురప్రభూ!; కేశవ! దైత్య, భేది= రాక్షసులను సంహరించినవాడా!; ధారుణీ, ధర= భూమిని ధరించినవాడా!; ధర్మ, నిర్మల, మానసా= ధర్మంచేత పరిశుద్ధమైన మనస్సుగలవాడా! శ్రీకృష్ణా!; భవత్+పద+అంభోరుహ+ఆశ్రితులు+ఐన= నీయొక్క పాదపద్మాలను ఆశ్రయించిన వాళ్ళయిన; వీరలన్= ఈ పాండవులను; పూని= ప్రయత్నించి; కావక, ఉండఁగాన్= రక్షించకుండా ఉండటం; నీకున్; ధర్మువె= ధర్మమా?

తాత్పర్యం: నా కుమారులైన పాండవులు ఈ విధంగా దిక్కులేని వాళ్ళయి మునివృత్తిని అవలంబించి ఉండటమా! హా! ద్వారకానాథా! కేశవా! రాక్షససంహారా! భూమిని ధరించినవాడా! ధర్మంచేత నిర్మలమైన మనస్సు కలవాడా! శ్రీకృష్ణా! నీ పాదపద్మాలను ఆశ్రయించిన ఈ పాండవులను ప్రయత్నించి రక్షించకుండటం నీకు ధర్మమా?

విశేషం: ఈ పద్యరచనలో కాంతిగుణం పోషించబడింది. (వివరాలకు చూడు - పీఠిక - సంపా.)

తరలము.

అమితసత్త్వులు ధర్మమూర్తు లహర్పతిప్రతిముల్ రిపు
ద్రుమహుతాశను లాపగేయుఁడు ద్రోణుఁడున్ విదురుండు గౌ
తముఁడు నుండఁగ ధర్మమార్గము దప్పఁ బాడియె? పాండవో
త్తములు రాష్ట్రనిరాసయోగ్యులె ధార్తరాష్ట్రుల వంచనన్? 287

ప్రతిపదార్థం: అమిత, సత్త్వులు= మిక్కిలి బలవంతులు; ధర్మమూర్తులు= ధర్మస్వరూపులు; అహర్పతి ప్రతిముల్= పగటికి నాథుడైన సూర్యునితో సమానమైన వాళ్ళు; రిపు, ద్రుమ, హుతాశనులు= శత్రువు లనే వృక్షాలకు అగ్నిహోత్రులవంటివాళ్ళు; ఆపగేయుఁడు= గంగా తనయుడు - భీష్ముడు; ద్రోణుఁడున్; విదురుండు; గౌతముఁడున్= కృపాచార్యుడును; ఉండఁగన్; ధర్మ, మార్గము; తప్పన్= తప్పటం; పాడియె= న్యాయమా?; ధార్తరాష్ట్రుల, వంచనన్= ధృతరాష్ట్రుని కుమారులయొక్క మోసంచేత; పాండవ+ఉత్తములు= పాండవశ్రేష్ఠులు; రాష్ట్ర, నిరాస, యోగ్యులు+ఎ= దేశం వదలి వెళ్ళదగినవాళ్ళా?

తాత్పర్యం: మహాబలవంతులు, ధర్మమూర్తులు, సూర్యతేజులు, శత్రువు లనే వృక్షాలకు అగ్నిహోత్రులవంటివాళ్ళు అయిన భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, కృపాచార్యుడు ఉండగా ధర్మమార్గం తప్పటం న్యాయమా? కౌరవుల మోసంచేత పాండవశ్రేష్ఠులు దేశాన్ని వదలి వెళ్ళ దగినవాళ్ళా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: కాంతి గుణానికి కుంతీదేవి ఈ వాక్యాలు కూడా ఉదాహరణలు. (సంపా.)

క. అన్న! సహదేవ! నీవును । నన్నలతో నరిగె దయ్య యట నడవుల కీ
వున్నను సుతు లందఱు నిం । దున్నట్టుల నాకుఁ జిత్త మూఱడి యుండున్. 288

ప్రతిపదార్థం: అన్న, సహదేవ= నాయనా! సహదేవా!; అటన్= అక్కడ; అడవులకున్; అన్నలతోన్; నీవును= నీవుకూడ; అరిగెదు+అయ్య= వెళ్లుతావా?; ఈవు= నీవు; ఉన్నను= ఉన్నచో; సుతులు+అందఱున్= కొడుకులందరు; ఇందున్= ఇక్కడ; ఉన్న+అట్టుల; నాకున్; చిత్తము= మనస్సు; ఊఱడి= ఊరటచెంది; ఉండున్.

తాత్పర్యం: నాయనా! సహదేవా! నీవుకూడ అన్నలతోపాటు అడవులకు వెళ్ళుతావా? నీవు ఒక్కడివి ఉంటే చాలు. కొడుకు లందరు ఇక్కడ ఉన్నట్లే. నా మనస్సు ఊరట చెంది ఉంటుంది.

విశేషం: సవతికొడుకైనా, కడగొట్టువాడైన సహదేవునిమీద కుంతీదేవికి ఎంతో ప్రేమ.

వ. అనుచు శోకాక్రాంత యయి కుంతీదేవి దనకు వినయవినమితోత్తమాంగ యయిన పాంచాలిం జూచి బాష్పజలంబు లురుల ని ట్లనియె. 289

ప్రతిపదార్థం: అనుచున్; శోక+ఆక్రాంత, అయి= దుఃఖంచేత నిండిందై; కుంతీదేవి; తనకున్; వినయ, వినమిత+ఉత్తమ+అంగ, అయిన= వినయంచేత వంగిన శిరస్సు కలదైన; పాంచాలిన్; చూచి; బాష్పజలంబులు= కన్నీళ్ళు; ఉరులన్= దొరలగా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అంటూ దుఃఖంతో నిండిన కుంతీదేవి, వినయంతో తలవంచి తనకు నమస్కరించిన ద్రౌపదిని జూచి, కన్నీళ్ళు కారుస్తూ ఇలా అన్నది.

క. ధవళాక్షి । నీ కతంబునఁ । బవిత్రమై ద్రుపదకులముఁ బాండుకులంబున్
భువనముల వెలిఁగె నీ వు । ద్భవ మొంటను జొచ్చుటను శుభస్థితితోడన్. 290

ప్రతిపదార్థం: ధవళ+అక్షి= తెల్లని కన్నులు కలదానా! అంటే అందమైన కన్నులు కలదానా!; నీ కతంబునన్= నీకారణంగా; పవిత్రము+ఐ= నిర్మలమై; నీవు; ఉద్భవము+ఔటను= పుట్టటంచేత, ద్రుపద కులమును= ద్రుపదుడి వంశమును; చొచ్చుటను= ప్రవేశించటంచేత; పాండు, కులంబున్= పాండురాజువంశమును; శుభస్థితితోడన్= మంగళకరమైన ఉనికితో; భువనములన్= లోకాలలో; వెలిఁగెన్= ప్రకాశించాయి.

తాత్పర్యం: అందమైన కన్నులు గల ఓ ద్రౌపదీ! నీకారణంగా పవిత్రమై- నీవు పుట్టటంచేత ద్రుపదవంశం, నీవు మెట్టటంచేత పాండువంశం, శుభస్థితితో లోకాల్లో ప్రకాశించాయి.

విశేషం: అలం: క్రమం. అరణ్యవాసకాలంలో సహదేవుణ్ణి ఆదరంతో చూచుకొమ్మని కుంతి ద్రౌపదితో చెప్పినట్లు భండార్కర్‌వారి సంస్కృత భారతప్రతిలో ఉంది. తెలుగులో లేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'పురుషవృషభు లయిన పురుషులతోడన । యరిగి పరమభక్తిఁ బరిచరింపఁ
బోవఁ గనుట నీవు పుణ్యంబు సేసితి' । వంచుఁ బ్రీతిఁ గౌఁగిలించుకొనియె. 291

ప్రతిపదార్థం: పురుష, వృషభులు+అయిన= పురుషశ్రేష్ఠులయిన; పురుషులతోడన= మగవారి వెంట; అరిగి= వెళ్ళి; పరమభక్తిన్= మిక్కిలి భక్తితో; పరిచరింపన్+పోవన్+కనుట= సేవ చేయబోవగలగటంచేత; నీవు; పుణ్యంబు; చేసితివి; అంచున్= అంటూ; ప్రీతిన్= ప్రేమతో; కౌఁగిలించుకొనియెన్.

తాత్పర్యం: 'పురుషశ్రేష్ఠు లయిన భర్తలవెంట వెళ్ళి పరమభక్తితో సేవ చేయగలగటం నీపుణ్యం' అని ప్రేమతో కౌగిలించుకొన్నది.

వ. అని యిట్లు కోడలిం గొడుకులను దీవించి కుంతీదేవి విదురుగృహంబున నుండె; నంత. 292

తాత్పర్యం: అని ఈవిధంగా కోడలిని, కొడుకులను దీవించి కుంతీదేవి విదురుని ఇంట్లో ఉన్నది. తరువాత-

ఆ. పతులపిఱుఁద మందగతి ముక్తకేశియై । పోవుదాని ద్రుపదపుత్త్రిఁ జూచి
వంతఁ గౌరవేంద్రు నంతిపురంబున । వారలెల్లఁ దలలు వాంచి రడలి. 293

ప్రతిపదార్థం: పతుల, పిఱుఁద= భర్తల వెనుక; మందగతిన్= నిదానంగా నడుస్తూ; ముక్తకేశీ+ఐ= విడువబడిన తలవెంట్రుకలు కలదై - అంటే విరబోసికొన్న జుట్టుతో; పోవుదానిన్; ద్రుపద, పుత్త్రిన్= ద్రుపదునికూతురైన ద్రౌపదిని; చూచి; కౌరవ+ఇంద్రు; అంతిపురంబున; వారలు+ఎల్లన్= కౌరవరాజుయొక్క అంతఃపురంలోని వాళ్ళంతా; వంతన్= దుఃఖంతో; అడలి= భయపడి; తలలు; వాంచిరి.

తాత్పర్యం: భర్తల వెనుక మెల్లగా అడుగులు వేస్తూ, తల విరబోసుకొని వెళ్ళుతున్న ద్రౌపదిని చూచి- కౌరవరాజు అంతఃపురంలో ఉన్న వాళ్ళంతా దుఃఖంతో భయపడి తలలు వంచుకొన్నారు.

విశేషం: కౌరవరాజు అంతఃపురకాంతలకు- సాటిస్త్రీ ద్రౌపదికి, ఆమె భర్తలకు కలిగిన దుస్థితి చూడటం వల్ల దుఃఖం- కుములుతూ కానలకు వెళ్ళే పాండవులవల్ల మున్ముందు ఎలాంటి దారుణ పరిణామాలు సంభవిస్తాయో అన్న ఊహవల్ల భయం- కలిగాయి.

ఆ. ధర్మతనయుపిఱుఁదఁ దమ్ములు నలువురు । నరుగుచుండి తత్సభాంతరమున
జనులు వినుచునుండ సంభృతక్రోధులై । పలికి రధికపరుషభాషణముల. 294

ప్రతిపదార్థం: ధర్మతనయు, పిఱుఁదన్= ధర్మరాజు వెనుక; తమ్ములు; నలువురున్, అరుగుచున్+ఉండి= వెళ్ళుతూ; తత్+ సభా+అంతరమునన్= ఆ సభలో; జనులు; వినుచున్+ఉండన్; సంభృత క్రోధులు+ఐ= నిండిన కోపం కలవాళ్ళయి; అధిక, పరుష, భాషణములు= మిక్కిలి కఠినాలైన మాటలను; పలికిరి.

తాత్పర్యం: ధర్మరాజువెనుక నలుగురుతమ్ములు వెళ్ళుతూ, సభలోని జనులంతా వింటుండగా అమితకోపంతో కఠినాతికఠినాలైన మాటలను మాట్లాడారు.

క. **సాహసమున మద్బాహు గ । దాహతి దుర్యోధనాదులగు రిపుల జగ**
ద్ద్రోహులఁ జంపుదు నత్యు । గ్రాహవమున హరిహరాదు లడ్డం బైనన్. **295**

ప్రతిపదార్థం: సాహసమునన్= తెగించి; మత్+బాహు, గదా, హతిన్= నా చేతి గద దెబ్బతో; దుర్యోధన+ఆదులు+అగు= దుర్యోధనుడు మొదలయినవాళ్ళయిన; రిపులన్= శత్రువులను; జగత్+ద్రోహులన్= లోకానికి అపకారం చేసేవాళ్ళను; అతి+ఉగ్ర+ఆహవమునన్= మిక్కిలి భయంకరమైన యుద్ధంలో; హరి, హర+ఆదులు= విష్ణువు, శివుడు మొదలయినవాళ్ళు; అడ్డంబు+ఐనన్= అడ్డు తగిలినా, చంపుదున్.

తాత్పర్యం: సాహసించి నా చేతిగదదెబ్బతో లోకద్రోహు లైన దుర్యోధనాదిశత్రువులను మహాభయంకరమైన యుద్ధంలో హరిహరాదులు అడ్డమైనా హతమారుస్తాను.

ఆ. **దుష్టచిత్తుఁ డయిన కష్టు దుర్యోధను । శిరము దన్నువాఁడ ధరణిఁ గూల్చి;**
హీనుఁడైన దుస్ససేనుని వధియించి । వేఁడిరక్త మానువాఁడఁ గడఁగి. **296**

ప్రతిపదార్థం: కడఁగి= పూనుకొని; దుష్ట, చిత్తుఁడు+అయిన= దుర్మార్గమైన మనస్సు కలవాడైన; కష్టున్= పాపిని; దుర్యోధనున్; ధరణిన్= భూమిమీద; కూల్చి= పడగొట్టి; శిరము= తలను; తన్నువాఁడన్; హీనుఁడు+ఐన= నీచుడైన; దుస్ససేనునిన్= దుశ్శాసనుని; వధియించి= చంపి; వేఁడి, రక్తము; ఆనువాఁడన్= త్రాగుతాను.

తాత్పర్యం: ప్రయత్నించి దుష్టాత్ముడు, పాపి అయిన దుర్యోధనుణ్ణి నేల గూల్చి అతని తలను తన్నుతాను, నీచుడైన దుశ్శాసనుణ్ణి చంపి వాడి వేడినెత్తురు త్రాగుతాను.

మ. **కనకోర్వీధర సానుసార రుచిమద్గాండీవ నిర్ముక్త ప**
త్త్రినిపీతారుణ వారిశేషముఁ బతత్త్రివ్రాతముల్ ద్రావున
య్యని నాతోడఁ జతుర్దశాబ్దమున మాఱైపోరు కర్ణాది దు
ర్జన సంఘంబుల మార్తురం దునుముదున్ సంగ్రామరంగంబునన్. **297**

ప్రతిపదార్థం: కనక+ఉర్వీధర, సాను, సార, రుచిమత్+గాండీవ, నిర్ముక్త, పత్త్రి, నిపీత+అరుణ, వారి, శేషమున్= మేరు పర్వతపు చరియలాగ నిగ్గుదేలిన కాంతితో కూడిన గాండీవంనుండి విడువబడిన బాణాలచేత లెస్సగా త్రావబడిన నెత్తుటి మిగులును; పతత్త్రి, వ్రాతముల్= పక్షుల సమూహాలు - అంటే కాకులు, గ్రద్దలు మొదలయినవి; త్రావు= తాగునట్టి; ఆ+అనిన్= ఆ యుద్ధంలో; నాతోడన్; చతుర్దశ+అబ్దమునన్= పదునాల్గవ సంవత్సరంలో; మాఱు+ఐ= ఎదుర్కొని; పోరు= యుద్ధంచేసే; కర్ణ+ఆది, దుర్జన, సంఘంబులన్= కర్ణుడు మొదలయిన దుర్మార్గుల సమూహాలను; మార్తురన్= శత్రులను; సంగ్రామ రంగంబునన్= యుద్ధభూమిలో; తునుముదున్= చంపుతాను.

తాత్పర్యం: పదునాల్గవ సంవత్సరంలో (అంటే అరణ్యాజ్ఞాతవాసాల తరువాత) యుద్ధభూమిలో మేరుపర్వతపు చరియలాంటి నిగ్గుదేలిన కాంతిగల గాండీవం నుండి ప్రయోగించిన బాణాలు-లెస్సగా త్రావగా, మిగిలిన రక్తాన్ని కాకులు, గద్దలు మొదలైన పక్షులు త్రాగే యుద్ధంలో - న న్నెదిరించి పోరాడే కర్ణాది దుర్మార్గుల్ని, శత్రు సమూహాల్ని సంహరిస్తా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మేరుపర్వతసానువువంటి నిగ్గుదేలిన కాంతితో కూడిన గాండీవంఅని అనటమే కాక, మిక్కిలిపొడవైన సమాసాన్ని ప్రయోగించటంవల్ల కూడ నన్నయ, పార్థుని గాండీవం పొడవును, లావును, కాంతిని, అతని కోపాతిశయాన్ని పాఠకుని ఊహకు అందేటట్లు చేశాడు. పత్త్రి, పతత్త్రి శబ్దాలు రెండూ రెక్కలు గల బాణాలకు, పక్షులకు గల సామ్యాన్ని చక్కగా చెప్పటమేకాక పద్యశోభను కూడ పెంచాయి. ఉర్వీధరమంటే - భూమిని ధరించింది - కొండ. కనకోర్వీధరం - బంగారుకొండ - మేరువు. ఇది భూమిచుట్టూ ఒడ్డాణంలా ఉంటుం దని, దీనిచుట్టూ సూర్యచంద్రులు తిరుగుతుంటా రని, ఈ పర్వత శిఖరాల్లో దేవతలు విహరిస్తూ ఉంటా రని పురాణాలు చెప్తుతున్నవి.

క. **మాయాద్యూతంబున ని । ర్జేయులఁ గా మమ్ము నిట్లు సేసిన ఖలు న**
న్యాయపరు శకుని నస్మ । త్సాయకజితహస్తుఁ జేసి చంపుదు మాజిన్. **298**

ప్రతిపదార్థం: మాయా, ద్యూతంబునన్= కపటపు జూదంలో; నిర్జేయులన్, కా= ఓడిపోయిన వార మవునట్లు; మమ్మున్, ఇట్లు; చేసిన; ఖలున్= దుర్మార్గుణ్ణి; అన్యాయపరున్= అన్యాయాన్ని అవలంబించినవాణ్ణి; శకునిన్; ఆజిన్= యుద్ధంలో; అస్మత్, సాయక, జిత+హస్తున్= మా బాణాలచేత ఓడించబడిన హస్తం కలవాణ్ణిగా; చేసి; చంపుదుము.

తాత్పర్యం: కపటపుజూదంలో మమ్మల్ని ఓడించి ఇలా చేసిన దుష్టుడు, అన్యాయపరుడు, అయిన శకునిని యుద్ధంలో మా బాణాలచేత ఓడించి చంపుతాము.

విశేషం: ఏ చేతుల్తో పాచికలు వేసి, మోసంతో మమ్ము జయించాడో, ఆ చేతులు శకునికి లేకుండా చేసి, చంపుతాము- అని ధ్వని.

వ. **అని భీమార్జున నకుల సహదేవులును విజృంభించి కృతప్రతిజ్ఞులై; రట్లు పాండవులు పరిత్యక్తవిభవు లయి నిజాయుధంబులు ధరించి గజపురంబు వెలువడి; రంత.** **299**

ప్రతిపదార్థం: అని; భీమ+అర్జున, నకుల, సహదేవులును; విజృంభించి= రెచ్చిపోయి; కృతప్రతిజ్ఞులు+ఐరి= చేయబడిన ప్రతిజ్ఞలు కలవాళ్ళు అయ్యారు; అట్లు; పాండవులు; పరిత్యక్త, విభవులు+అయి= పూర్తిగా విడువబడిన ఐశ్వర్యం కలవాళ్ళయి; అంటే ఐశ్వర్యాన్ని పూర్తిగా కోల్పోయినవాళ్ళయి; నిజ+ఆయుధంబులు= తమయొక్క ఆయుధాలు; ధరించి; గజపురంబు= హస్తినాపురంనుండి; వెలువడిరి; అంతన్.

తాత్పర్యం: అని భీమార్జున నకుల సహదేవులు కోపావేశంతో చెలరేగి ప్రతిజ్ఞలు చేసి, ఐశ్వర్యాన్ని పూర్తిగా కోల్పోయిన వాళ్ళయి తమ తమ ఆయుధాలు ధరించి హస్తినాపురంనుండి బయలుదేరారు.

సీ. **ధృతరాష్ట్రవిభుని మందిరమున నఱచుచుఁ । బఱచె గోమాయువుల్ పట్టపగల;**
యప్రదక్షిణముగా నయ్యె నుల్కాపాత; । మపమేఘమై యున్న యంబరమున
విద్యుత్సహస్రముల్ విలసిల్లె; మఱి రాహు । పర్వంబు గాకయ భానుఁ బట్టె;
భూకంప మయ్యె నప్పుడు; సభాంతరమున । నరులెల్ల వినుచుండ నారదుండు

ఆ. **పలికె నద్భుతముగఁ 'బదునాలుగవ యేఁడు । భారతాజి యగు; నపారవీరు**
లయిన పాండవులు జయం బందుదురు భీమ । మఘవసుతుల విక్రమమున' ననుచు. **300**

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర, విభుని, మందిరమునన్= ధృతరాష్ట్ర మహారాజుయొక్క అంతఃపురంలో; పట్టపగలు+అ; గోమాయువుల్= నక్కలు; అఱచుచున్; పఱచెన్= పరుగెత్తాయి; అప్రదక్షిణముగాన్= అపసవ్యంగా; ఉల్కాపాతము= తోకచుక్కలు పడటం; అయ్యెన్= జరిగింది; అపమేఘము+ఐ= తొలగింపబడిన మేఘాలు కలదై, అంటే మేఘాలు లేనిదై; ఉన్న; అంబరమునన్= ఆకాశంలో; విద్యుత్ సహస్రముల్= వేలకొలదిమెఱుపులు; విలసిల్లెన్= మెరిశాయి; మఱి= అంతేకాక; పర్వంబు, కాకయ= గ్రహణ పర్వదినం కాకుండానే; రాహు= రాహువు; భానున్= సూర్యుణ్ణి; పట్టెన్; భూకంపము+అయ్యెన్; అప్పుడు; సభా+ అంతరమునన్= సభలోపల; నరులు+ఎల్లన్= జనులంతా; వినుచుండన్; నారదుండు; పదునాలుగవ, ఏఁడు= పదునాల్గవసంవత్సరం; అంటే అరణ్య, అజ్ఞాతవాసాల తర్వాత; భారత+ఆజి= భారతయుద్ధం; అగున్; అపార, వీరులు+అయిన= మహాపరాక్రమశాలురైన; పాండవులు; భీమ, మఘవ సుతుల, విక్రమమునన్= భీమునియొక్క, దేవేంద్రపుత్రుడైన అర్జునునియొక్క శౌర్యంచేత; జయంబు+అందుదురు= విజయాన్ని పొందుతారు; అనుచున్; అద్భుతముగన్= ఆశ్చర్యం కలిగేటట్లు; పలికెన్.

తాత్పర్యం: ధృతరాష్ట్రమహారాజు అంతఃపురంలో పట్టపగలే నక్కలు అరుస్తూ పరుగెత్తాయి. అపసవ్యంగా తోకచుక్కలు పడ్డాయి. మేఘాలు లేకుండానే ఆకాశంలో వేలకొలది మెరుపులు మెరిశాయి. గ్రహణానికి తగిన పర్వదినం కాకుండానే రాహువు సూర్యుణ్ణి పట్టుకొన్నాడు. భూమి కంపించింది. అప్పుడు సభలోని వాళ్ళంతా వింటూండగానే నారదుడు- పదునాల్గవ ఏట భారతయుద్ధం జరుగుతుం దనీ, మహాపరాక్రమశాలురైన పాండవులు భీమార్జునుల బలాధిక్యంచేత విజయం పొందుతా రనీ ఆశ్చర్యకరంగా పలికాడు.

విశేషం: అపశకునాలు అశుభసూచకాలు. పూర్ణిమ అమావాస్యవంటి పర్వదినాల్లోనే గ్రహణాలు కలుగుతాయి.

వ. ధృతరాష్ట్రుండును దాని నంతయు విని 'కొడుకుల దుర్ణయంబుల నింక నెట్టి యరిష్టంబులు పుట్టెడునో' యని వగచుచు విదురుం బిలిచి, 'ధౌమ్య ద్రౌపదీ సహితు లయిన పాండవు లెట్లు వోయి' రని యడిగిన నతనికి విదురుం డి ట్లనియె. **301**

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండును; దానిన్; అంతయున్; విని; కొడుకుల, దుర్ణయంబులన్= కొడుకుల చెడుపనులవలన; ఇంకన్; ఎట్టి; అరిష్టంబులు= అశుభాలు; పుట్టెడునో= ఏర్పడతాయో; అని; వగచుచున్= చింతిస్తూ; విదురున్; పిలిచి; ధౌమ్య, ద్రౌపదీ, సహితులు+అయిన= ధౌమ్యునితో, ద్రౌపదితో కూడుకొన్న; పాండవులు; ఎట్లు; పోయిరి, అని; అడిగినన్; అతనికి; విదురుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు జరిగిందంతా విని, కొడుకుల దుశ్చేష్టలవల్ల ఇంకా ఎటువంటి అశుభాలు కలుగుతాయో అని చింతిస్తూ, విదురుణ్ణి పిలిచి, పాండవులు ధౌమ్యునితో, ద్రౌపదితో కలిసి ఏ విధంగా వెళ్ళా రని అడుగగా అతనికి విదురుడు ఇలా అన్నాడు.

విదురుఁడు ధృతరాష్ట్రునకుఁ బాండవు లడవికిఁ బోయిన రీతి సెప్పుట (సం. 2-71-3)

సీ. వదనసరోజంబు వస్త్రాంతమునఁ గప్పి । కొని యేఁగె ధర్మనందనుఁడు; మఱియు
భీమబాహులు రెండుఁ బెద్దలుగాఁ జాచి । ఘనసత్త్వుఁ డమ్మరుత్తనయుఁ డరిగె;
నిసుము చల్లుచు నమరేంద్రపుత్త్రుఁడు వోయె; । భూరేణులిప్తశరీరుఁ డగుచు
నకులుండు సనియె; మానక లజ్జఁ జేసి య । ధోవక్త్రుఁ డై సహదేవుఁ డరిగె;

ఆ. వివృతకేశభరము వ్రేలంగ ద్రౌపది । సనియె; రౌద్రయామ్య సామగాన
ముఖరితాస్యుఁ డగుచు మ్రోల ధౌమ్యుం డేఁగె । సకలజనులు శోకజలధిఁ దేల. 302

ప్రతిపదార్థం: సకల జనులు= అందరు ప్రజలు; శోక, జలధిన్= దుఃఖమనే సముద్రంలో; తేలన్= తేలునట్లుగా; ధర్మనందనుఁడు= ధర్మరాజు; వదన, సరోజంబు= పద్మంవంటి ముఖాన్ని; వస్త్ర+అంతమునన్= బట్టకొంగుతో; కప్పికొని; ఏఁగెన్= వెళ్ళాడు; మఱియున్; ఘన, సత్త్వుఁడు= మిక్కిలి బలం కలవాడు; ఆ+మరుత్+తనయుఁడు= ఆ వాయుదేవుని కుమారుడైన భీముడు; భీమ, బాహులు= భయంకరమైన చేతులు; రెండున్; పెద్దలుగాన్= పొడవు (వెడల్పు) అగునట్లుగా; చాచి; అరిగెన్= వెళ్ళాడు; అమర+ఇంద్ర పుత్త్రుఁడు= దేవేంద్రుని కుమారుడైన అర్జునుడు; ఇసుము= ఇసుక; చల్లుచున్; పోయెన్; నకులుండు; ధూరేణులిప్త, శరీరుఁడు+అగుచున్= మట్టికణాలు పూయబడిన శరీరంకలవాడై - అంటే దుమ్ము శరీరంపై పూసికొన్నవాడై; చనియెన్= వెళ్ళాడు; సహదేవుఁడు; మానక= ఆగక, లజ్జన్+చేసి= సిగ్గుచేత; అధోవక్త్రుఁడు+ఐ= వంచినముఖం కలవాడై; అరిగెన్= వెళ్ళాడు; ద్రౌపది; వివృత, కేశ, భరము= విరబోసుకొన్న వెంట్రుకల భారం; వ్రేలంగన్= వ్రేలాడుతుండగా; చనియెన్= వెళ్ళింది; ధౌమ్యుఁడు; రౌద్ర, యామ్య, సామగాన, ముఖరిత+ఆస్యుఁడు+అగుచున్= రుద్ర యమ సంబంధాలైన మంత్రాల సామగానం ధ్వనించే ముఖం కలవాడై; మ్రోలన్= ముందుభాగంలో; ఏఁగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: జనులంతా దుఃఖసముద్రంలో తేలుతుండగా, ధర్మరాజు పద్మంవంటి తన ముఖాన్ని గుడ్డకొంగుతో కప్పుకొని వెళ్ళాడు. మహాబలవంతుడైన భీముడు భయంకరమైన తనచేతులు రెండూ పెద్దగా చాచి నడిచాడు. ఇంద్రతనయుడైన అర్జునుడు ఇసుక చల్లుతూ వెళ్ళాడు. నకులుడు దుమ్ము నిండిన శరీరంతో నడిచాడు. సహదేవుడు కుంతి కోరినట్లు అరణ్యవాసం మానక, సిగ్గుతో ముఖం వంచుకొని అన్నల వెంట వెళ్ళాడు. ద్రౌపది విరబోసుకొన్న వెంట్రుకల భారం వ్రేలాడుతుండగా ప్రయాణం సాగించింది. ధౌమ్యుడు రుద్ర యమ సంబంధి మంత్రాలతో సామగానం చేస్తూ ముందు నడిచాడు.

విశేషం: రుద్ర యములు ఇద్దరు అంత్యకాలానికి సంబంధించిన దేవతలు, భయంకరులు.

వ. అనిన 'నట్లేల వార లరిగి?' రని యడిగిన విదురుం డి ట్లనియె. 303

తాత్పర్యం: అనగా 'వాళ్ళు ఆవిధంగా ఎందుకు వెళ్ళా?' రని ధృతరాష్ట్రు డడుగగా విదురుడు ఇలా అన్నాడు.

క. నీకొడుకునికృతిఁ జేసి య । పాకృత రాజ్యుఁ డయి ధర్మపతి నిజరూక్షా
లోకనజనదాహభయ । వ్యాకులుఁ డై చనియె దృష్టి వారించి వడిన్. 304

ప్రతిపదార్థం: ధర్మపతి= ధర్మరాజు; నీ, కొడుకు; నికృతిన్+చేసి= మోసంచేత; అపాకృత, రాజ్యుఁడు+అయి= తొలగించబడిన రాజ్యం కలవాడయి; నిజ+రూక్ష+ఆలోకన, జన, దాహ, భయ, వ్యాకులుఁడు+ఐ= తనయొక్క కఠినమైన చూపులచేత జనులు మండిపోతా రనే భయంవల్ల కలతనొందిన మనస్సుకలవాడై; దృష్టిన్; వారించి= తప్పించి; వడిన్= వేగంగా; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: నీకొడుకు చేసిన మోసంచేత రాజ్యాన్ని కోల్పోయినవాడై ధర్మరాజు తనకోపపుచూపులవల్ల జనం దహించబడతారేమో అన్న భయంతో కలత చెంది తన దృష్టిని తప్పించి (ముఖానికి గుడ్డ కప్పుకొని) వడిగా వెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. సమరమున బాహుబల ద । ర్పము మెఱయం గంటి ననుచు బాహు లతివిశా
లములుగఁ జేయుచు నరిగెను । సమీరజుఁ డరాతిభీతిసంజననుం డై. 305

ప్రతిపదార్థం: సమీరజుఁడు= వాయుదేవునికి జన్మించినవాడు - భీముడు; సమరమునన్= యుద్ధంలో; బాహు, బల, దర్పము= భుజబలగర్వం; మెఱయన్+కంటిని= ప్రకాశింప జేసే అవకాశాన్ని పొందాను; అనుచున్; బాహులు= చేతులు; అతి విశాలములుగన్= మిక్కిలి పొడవు (వెడల్పు) లయ్యేటట్లుగా; చేయుచున్, అరాతి, భీతి, సంజననుండు+ఐ= శత్రువులకు భయాన్ని కలిగించేవాడై; అరిగెను= వెళ్ళాడు.

తాత్పర్యం: భీమసేనుడు యుద్ధంలో తన బాహు బలగర్వాన్ని ప్రకాశింపచేసే అవకాశాన్ని పొందాను - అన్నట్లుగా చేతులు విశాలంగా చాచి, శత్రువులకు భయం కలిగించేవాడై వెళ్ళాడు.

క. వెఱచఱవ నింతకంటెం । దఱుచుగ బాణంబు లేసి తడయక పగఱం
జెఱుతు నని యిసుము చల్లుచు । నుఱక ధనంజయుఁడు రణజయోన్నతుఁ డరిగెన్. 306

ప్రతిపదార్థం: రణ, జయ+ఉన్నతుఁడు= యుద్ధంలోని విజయంచేత గొప్పవాడు; ధనంజయుఁడు= అర్జునుడు; వెఱచఱవన్= భయపడేటట్లుగా; ఇంతకంటెన్, తఱుచుగన్= అధికంగా; బాణంబులు; ఏసి= వేసి; తడయక= ఆలస్యం చేయకుండ; పగఱన్= శత్రువులను; చెఱుతును= చంపుతాను; అని; ఇసుము= ఇసుక; చల్లుచున్; ఉఱక= ఊరక, (నిర్లక్ష్యంగా); అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: యుద్ధ విజయాలతో గొప్పవాడైన అర్జునుడు- ఇసుకచల్లుతూ, భయంకరంగా ఇంతకంటె ఎక్కువగా బాణాలువేసి, సత్వరమే శత్రువుల్ని సంహరిస్తా నని నిర్లక్ష్యంగా నడిచాడు.

వ. మఱి దుఃఖాను భావంబున కనుచితంబైన తన సుందర రూపంబు సూచి జనులు దుఃఖింప కుండ వలయు నని ధూళి ధూసరిత శరీరుండై నకులుం డరిగె; దీనంబైన తన యాననంబు సూచినవారికి నెల్ల నెగ్గగు నని యవనతవదనుం డయి సహదేవుం డరిగె. 307

ప్రతిపదార్థం: మఱి, దుఃఖ+అనుభావంబునకున్= దుఃఖప్రభావానికి; అనుచితంబు+ఐన= తగనిదైన; తన, సుందరరూపంబు; చూచి; జనులు; దుఃఖింపకుండ వలయును; అని; ధూళి, ధూసరిత, శరీరుండు+ఐ= దుమ్ముచేత కప్పబడిన శరీరం కలవాడై; నకులుండు; అరిగెన్= వెళ్ళాడు; దీనంబు+అయిన; తన; ఆననంబు= ముఖం; చూచిన, వారికిన్+ఎల్లన్= చూచినవారి కందరికి; ఎగ్గు= కీడు; అగున్+అని; అవనత, వదనుండు+అయి= వంచుకొన్న ముఖం కలవాడయి; సహదేవుండు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: దుఃఖాన్ని అనుభవించటానికి తగని తన అందమైన రూపాన్ని చూచి ప్రజలు దుఃఖపడకుండా ఉండా లని, దుమ్ముచేత కప్పబడిన శరీరం కలవాడై నకులుడు వెళ్ళాడు. తన దీనముఖాన్ని చూచినవాళ్ళకు కీడు కలుగుతుం దని సహదేవుడు ముఖం వంచుకొని వెళ్ళాడు.

చ. తడిసిన యేకవస్త్రపరిధానముతోడ విముక్తకేశియై
తొడరుచు దుఃఖభావమున ద్రోవది వోయె మహాహవంబునం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బడిన నిజేశ మిత్ర సుత బంధు జనంబులు శోకవేదనం

గడుకొని యట్ల యేఁగుదురు కౌరవభామిను లన్విధంబునన్. **308**

ప్రతిపదార్థం: తడిసిన; ఏక, వస్త్ర, పరిధానముతోడన్= ఒంటి బట్ట కట్టుకొని; విముక్త కేశి+ఐ= విరబోసికొనిన వెంద్రుకలు గలదై; తొడరుచున్= తొట్రుపడుతు; దుఃఖభావమునన్= దుఃఖంతో కూడిన మనస్సుతో; ద్రోవది; మహా+ఆహావంబునన్= మహాయుద్ధంలో; పడిన= మరణించిన; నిజ+ఈశ, మిత్ర, సుత, బంధు, జనంబుల, శోకవేదనన్= తమయొక్క భర్తలను, స్నేహితులను, కొడుకులను, చుట్టాలను గురించిన దుఃఖబాధతో; కడుకొని= పూనుకొని; కౌరవ, భామినులు= కౌరవుల భార్యలు; అట్లు+అ= ఆ విధంగా; ఏఁగుదురు= వెళ్తారు; అనువిధంబునన్= అనే పద్ధతిగా; పోయెన్= వెళ్ళింది.

తాత్పర్యం: తడిసిన ఒంటి బట్ట కట్టుకొని, వెంద్రుకలు విరబోసుకొని, తొట్రుపడుతూ, దుఃఖిస్తూ ద్రౌపది-భర్తలు, మిత్రులు, పుత్రులు, బంధువులు మహాయుద్ధంలో మరణించగా కౌరవుల భార్యలు ఆ విధంగానే వెళ్ళుతా రన్నట్లు వెళ్ళింది.

క. **భారతరణహతు లగు కురు। శూరుల పరలోకవిధులు సూచించి క్రియా**

పారగుఁడు ధౌమ్యుఁ డరిగె వి। చారజ్ఞుఁడు రౌద్రయామ్యసామోద్గీతిన్. **309**

ప్రతిపదార్థం: భారత, రణ, హతులు+అగు= భారత యుద్ధంలో మరణించే; కురు, శూరుల= కౌరవవీరులయొక్క; పరలోక విధులు= ఉత్తరక్రియలు; సూచించి; క్రియాపారగుఁడు= క్రియలు పూర్తిగా తెలిసినవాడు; విచారజ్ఞుఁడు= ఆలోచనను తెలిసినవాడు అయిన; ధౌమ్యుఁడు; రౌద్ర, యామ్య సామ+ఉత్+గీతిన్= రుద్ర, యమ సంబంధి సామవేదమంత్రాలను పెద్దగా గానం చేస్తూ; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: మహాభారతయుద్ధంలో మరణించే కౌరవవీరుల పరలోకక్రియలు సూచించి, ఆ క్రియలు పూర్తిగా తెలిసినవాడు, ఆలోచనాపరుడు అయిన ధౌమ్యుడు రుద్ర యమ సంబంధి సామాన్ని పెద్దగా గానం చేస్తూ వెళ్ళాడు.

వ. **అనిన విని ధృతరాష్ట్రుండు దుఃఖితుం డయి.** **310**

తాత్పర్యం: అనగా విని ధృతరాష్ట్రుడు శోకించి.

తరలము.

సమరశూరులు పాండవుల్ జితశత్రు లున్నతచిత్తు లు

త్తములు వారలతోడి వైరము ధర్మయుక్తిఁ గరం బయు

క్తము ప్రజాక్షయకారణం బని తద్దయున్ భయమందుచున్

విమనుఁడై పడియుండె హా యని వెచ్చనూర్చుచు విన్న నై. **311**

ప్రతిపదార్థం: పాండవుల్; సమర, శూరులు= యుద్ధవీరులు; జిత, శత్రులు= జయింపబడినశత్రువులు కలవాళ్ళు; ఉన్నత, చిత్తులు= గొప్ప మనస్సు కలవాళ్ళు; ఉత్తములు= శ్రేష్ఠులు; వారలతోడి; వైరము= శత్రుత్వం; ధర్మయుక్తిన్= ధర్మంప్రకారం; కరంబు= మిక్కిలి; అయుక్తము= తగనిది; ప్రజా, క్షయ, కారణంబు= జనులు నశించటానికి హేతువు; అని; తద్దయున్=

మిక్కలి; భయము+అందుచున్= భయపడుతూ; హా! అని; వెచ్చన్+ఊర్పుచున్= వేడి నిట్టూర్పులు వదలుతూ; విన్నను+ఐ= వెలెవెలబోయి; విమనుఁడు+ఐ= దుఃఖంపొందిన మనస్సు కలవాడై; పడి, ఉండెన్.

తాత్పర్యం: 'పాండవులు యుద్ధవీరులు. శత్రువులను జయించినవాళ్ళు. గొప్పమనస్సు కలవాళ్ళు. ఉత్తములు. వారితో వైరం ధర్మంప్రకారం ఏమాత్రం తగనిది. అది ప్రజానాశానికి కారణం' అని మిక్కిలి భయపడుతూ ధృతరాష్ట్రుడు హా! అని వేడి నిట్టూర్పులు విడుస్తూ వెలవెలబోయి దుఃఖిస్తూ పడి ఉన్నాడు.

విశేషం: భయదుఃఖభావతీవ్రతను ప్రదర్శించే ఈ రచనలో కాంతిగుణం రసపోషకం. (సంపా.)

వ. అట్లు వగుచుచున్న ధృతరాష్ట్రునకు సంజయుం డిట్లనియె. 312

తాత్పర్యం: ఆవిధంగా దుఃఖిస్తున్న ధృతరాష్ట్రునితో సంజయుడు ఇలా అన్నాడు.

సీ. పాండుకుమారులఁ బరమధార్మికు లని । వగవక రాష్ట్రంబువలనఁ బాపి
వసుపూర్ణమైన యివ్వసుమతి సేకొంటి । వసుధేశ! నీ కింక వగవ నేల?
కలశజ విదుర గంగాసుత ప్రభృతులు । వారింప వారింప వశము గాక
కర్ణ గాంధారుల కఱపులు విని, వారి । కపకారి యయ్యె నీ యాత్మజుండు;

ఆ. వగవ కధికు లయిన వారితో వైరంబు । సేసికొంటి కరము చెట్ట యనక;
నీవు నీ సుతుండు నేర్తురు గా, కొరు । లేమి సేయనేర్తు రిందుకులుఁడ! 313

ప్రతిపదార్థం: ఇందుకులుఁడ= చంద్రవంశంవాడి వైన ఓ ధృతరాష్ట్రమహారాజా!; పాండుకుమారులన్= పాండురాజు పుత్రులైన పాండవులను; పరమ ధార్మికులు+అని= మిక్కిలి ధర్మాత్ములని; వగవక= ఆలోచించక; రాష్ట్రంబువలనన్+పాపి= దేశంనుండి వెళ్ళగొట్టి; వసుపూర్ణము+ఐన= బంగారుతో నిండిన; ఈ+వసుమతిన్= ఈ భూమిని; చేకొంటి= గ్రహించావు; వసుధ+ఈశ= భూ నాథా! రాజా!; నీకున్; ఇంకన్; వగవన్= దుఃఖించటం; ఏల= ఎందుకు? కలశజ, విదుర, గంగాసుత, ప్రభృతులు= కుండనుండి పుట్టిన ద్రోణుడు; విదురుడు, గంగా తనయుడైన భీష్ముడు మొదలయినవాళ్ళు; వారింపన్= అడ్డగించగా; వారింప వశము, కాక= అడ్డగించటం సాధ్యంగాక; కర్ణ గాంధారుల= కర్ణునియొక్క, శకుని యొక్క; కఱపులు= బోధలు; విని; నీ, ఆత్మజుండు= నీ కుమారుడు; వారికిన్= పాండవులకు; అపకారి, అయ్యెన్= అపకారం చేసినవా డయ్యాడు; వగవక= విచారించక; కరంబు= మిక్కిలి; చెట్ట, అనక= చెడ్డ అని భావించక; అధికులు+అయిన, వారితో= గొప్పవాళ్ళతో; వైరంబు= శత్రుత్వం; చేసికొంటి; నీవు; నీ, సుతుండు= నీ కుమారుడు; నేర్తురుగాక= ఏమి చేయటానికైన తగుదురు; ఒరులు= ఇతరులు; ఏమి, చేయన్, నేర్తురు= ఏమి చేయగలరు?

తాత్పర్యం: చంద్రవంశంవాడి వైన ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాండవులు మిక్కిలి ధర్మాత్ము లని ఆలోచించక దేశంనుండి వెళ్ళగొట్టి, బంగారుతో నిండిన ఈ భూమినంతా గ్రహించావు. మహారాజా! నీ వింక దుఃఖించటం ఎందుకు? భీష్మద్రోణవిదురాదులు వద్దన్నా వినకుండ, కర్ణశకునుల మాటలు విని, నీ కుమారుడు పాండవులకు అపకారం చేశాడు. ఆలోచించకుండా, ఎంతో చెడ్డ అని అనుకోకుండా గొప్పవాళ్ళతో వైరం తెచ్చుకొన్నావు. నీవు, నీ కుమారుడు ఏమి చెయ్యటానికైనా తగినవాళ్ళు. ఇతరు లేమి చేస్తారు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ సందర్భంలో 'ఇందుకులుఁడ' అనే సంజయుని సంబోధనలో ఆహ్లాదకరుడైన చంద్రునివంశంలో జన్మించి, కొడుకుల క్రూరకృత్యాలను ప్రోత్సహిస్తున్నావా? అనే ఎత్తిపొడుపు ధ్వనిస్తున్నది.

వ. అని సంజయుండు పలికిన విని విదురుండు ధృతరాష్ట్రున కి ట్లనియె. 314

తాత్పర్యం: అని సంజయుడు పలుకగా విదురుడు విని ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

తరలము.

వగవ నేటికి నింకనైనను వారలం బిలిపించి యీ
జగతి నెప్పటియట్ల యేలుచు సంతసంబున నుండఁగా
జగదధీశ్వర! పంపు; వంచన చన్నె? యన్యుల సంపదల్
మిగిలి చేకొన నిట్లు సేసిన మెత్తురే మది నుత్తముల్? 315

ప్రతిపదార్థం: జగత్+అధీశ్వర= ప్రపంచానికి ప్రభువైనవాడా! ధృతరాష్ట్ర మహారాజా!; వగవన్, ఏటికిన్= దుఃఖించటం ఎందుకు? ఇంకన్+ఐనను; వారలన్= పాండవులను; పిలిపించి; ఈ, జగతిన్= ఈ భూమిని; ఎప్పటి+అట్ల= ఎప్పటివలె; ఏలుచున్= పాలిస్తూ; సంతసంబునన్; ఉండఁగాన్; పంపు= ఆజ్ఞాపించు; వంచన= మోసం; చన్నె= తగునా?; అన్యుల, సంపదల్= ఇతరుల సంపదలను; మిగిలి= హద్దుమీరి - అంటే ధర్మాన్ని అతిక్రమించి; చేకొనన్= గ్రహించటానికి; ఇట్లు+చేసినన్; ఉత్తముల్= గొప్పవాళ్ళు; మదిన్= మనస్సులో; మెత్తురే= మెచ్చుకొంటారా?

తాత్పర్యం: ధృతరాష్ట్రమహారాజా! దుఃఖించటం ఎందుకు? ఇప్పు డైనా పాండవుల్ని పిలిపించి ఈ భూమిని ఎప్పటిలా పాలిస్తూ సుఖంగా ఉండండని ఆజ్ఞాపించు. మోసం చెయ్యటం తగునా? ఇతరుల సంపదలు హద్దు మీరి గ్రహించటానికి ఇలా చేస్తే ఉత్తములు మెచ్చుకొంటారా?

విశేషం: విదురుడు చేసిన కర్తవ్యబోధ కురుపాండవ సమస్యకు సమయోచిత సులభపరిష్కారం. ధృతరాష్ట్రుని చిత్తశుద్ధికి చక్కని గీటురాయి. 'జగదధీశ్వర!' అనే సంబోధనలో సర్వసర్వంసహాధికారివి నీవై ఉండి, పాండవులను పిలిచి, రాజ్య మిచ్చి ఎప్పటిలా పాలించుకొమ్మని చెప్పితే నీ మాట కాదనే వాళ్ళెవరు? - అనే భావం కూడ ధ్వనిస్తున్నది. (విదురుడి వాక్యవిన్యాసంలో గోచరించే అగ్రామ్యత్వం, వికటత్వం ఉదారతాగుణస్ఫోరకాలై రాణిస్తున్నాయి. సంపా.)

ఆ. అనిన విదురుపలుకు లా ధృతరాష్ట్రుండు । వినియు విననియట్లు విపినవాస
గతులఁ బాండుసుతులఁ గ్రమ్మఱింపక యుపే । క్షించెఁ బూర్వవిహిత కిల్బిషమున. 316

ప్రతిపదార్థం: అనిన; విదురు, పలుకులు; ఆ, ధృతరాష్ట్రుండు; వినియున్; వినని, అట్లు; విపిన, వాస, గతులన్= అరణ్యానికి వెళ్ళే వాళ్ళను; పాండు సుతులన్= పాండురాజు కుమారులను; క్రమ్మఱింపక= మరలించక; పూర్వ విహితకిల్బిషమునన్= గడచిన జన్మలో విధించబడిన పాపంచేత; ఉపేక్షించెన్= ఊరకున్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు విదురుని మాటలు వినికూడ, వినని విధంగా ఉండి, అరణ్యానికి వెళ్ళే పాండవులను మరలించకుండా, గతజన్మంలో విధించబడిన పాపంచేత ఊరక ఉండిపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ధృతరాష్ట్రునికి చిత్తశుద్ధిలేదనటానికి ఇది చక్కని ఉదాహరణం.

వ. **మఱియు ద్రోణుండు పాండవులకు నెయ్యుం డయ్యును దొల్లి యాజోపయాజుల వరంబున నగ్ని కుండంబున నుద్భవిల్లిన ద్రుపదాత్మజుండు ధృష్టద్యుమ్నుండు పాండవసంబంధి యయి ప్రతివీరుం డగుట నాతనితోఁ దనకు సమరం బగు నని యెఱింగి పాండవానుగమనంబు సేయ నొల్లక గజపురంబున ధృతరాష్ట్రు నొద్దన యుండె; ని ట్లింద్రప్రస్థపురంబున నిరువది మూఁడేఁడులు రాజ్యంబు సేసి పాండవులు పాపద్యూత పరాజితు లయి.** **317**

ప్రతిపదార్థం: మఱియు, ద్రోణుండు; పాండవులకున్; నెయ్యుండు+అయ్యును= స్నేహితుడయినప్పటికీ; తొల్లి= పూర్వం; యాజ+ఉపయాజుల= యాజునియొక్క ఉపయాజునియొక్క; వరంబునన్= వరంచేత; అగ్ని, కుండంబునన్, ఉద్భవిల్లిన= పుట్టిన; ద్రుపద+ఆత్మజుండు= ద్రుపదుని కుమారుడు; ధృష్టద్యుమ్నుండు; పాండవ, సంబంధి, అయి= పాండవుల బంధువై; ప్రతివీరుండు= శత్రువీరుడు; అగుటన్= అవటంచేత; ఆతనితోన్= ఆ ధృష్టద్యుమ్నునితో; తనకున్; సమరంబు= యుద్ధం; అగును+అని; ఎఱింగి= తెలిసికొని; పాండవ+అనుగమనంబు= పాండవుల వెంట వెళ్ళటం; చేయన్= చేయటానికి; ఒల్లక= ఇష్టపడక; గజపురంబునన్= హస్తినాపురాన; ధృతరాష్ట్ర+ఒద్ద= ధృతరాష్ట్రుని దగ్గర; ఉండెన్; ఇట్లు; ఇంద్రప్రస్థపురంబునన్; ఇరువది మూఁడు+ఏఁడులు= ఇరవై మూడు సంవత్సరాలు; రాజ్యంబు, చేసి; పాండవులు; పాప, ద్యూత, పరాజితులు+అయి= చెడుజూదంలో ఓడిపోయినవాళ్ళయి.

తాత్పర్యం: ద్రోణుడు పాండవులమీద ప్రేమకలవాడే అయినా-పూర్వం యాజోపయాజుల వరంచేత అగ్నిగుండంనుండి పుట్టిన ద్రుపదపుత్రుడు ధృష్టద్యుమ్నుడు పాండవుల బంధువై తనకు శత్రువీరుడు కావటంచేత, అతనితో తనకు యుద్ధం అవుతుం దని తెలుసుకొని, పాండవులవెంట వెళ్ళటానికి ఇష్టపడక హస్తినాపురంలో ధృతరాష్ట్రుని దగ్గరే ఉండిపోయాడు. ఈ విధంగా పాండవులు ఇంద్రప్రస్థపురంలో ఇరవై మూడేళ్ళు రాజ్యంచేసి పాపపు జూదంలో ఓడిపోయి.

విశేషం: యాజోపయాజులు గంగ ఒడ్డున వానప్రస్థవృత్తిలో ఉండే బ్రాహ్మణోత్తములు.

క. **వీరులగు పాండు సుతులు మ । హారణ్యనివాస నిరతులయి ధరణీబృం**
దారక సహస్రములతో । సారమతుల్ సనిరి నిత్యసత్యవ్రతులై. **318**

ప్రతిపదార్థం: వీరులు+అగు; పాండు సుతులు= పాండవులు; మహా+అరణ్య, నివాస, నిరతులు+అయి= మహారణ్యంలో నివసించటంలో మిక్కిలి ఆసక్తి కలవాళ్ళయి; ధరణీ బృందారక, సహస్రములతోన్= వేలకొలది భూసురులతో; సారమతుల్= బుద్ధిమంతులు; నిత్యసత్యవ్రతులు+ఐ= ఎల్లప్పుడు సత్యాన్నే వ్రతంగా కలవాళ్ళయి; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: వీరులు, బుద్ధిమంతులు, నిత్యసత్యవ్రతులు అయిన పాండవులు- వేలకొలది బ్రాహ్మణులు వెంటరాగా అరణ్యవాసానికి వెళ్ళారు.

క. **అని యిట్లు సభాపర్వం । బున కథ జనమేజయునకు మొగి వైశంపా**
యను చెప్పిన విధమంతయు । మనునిభ! శుభచరిత! నిత్యమహిమాతిశయా! **319**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మను, నిభ= మనువుతో సమానమైన వాడా! శుభచరిత= మంగళకరమైన చరిత్ర కలవాడా! నిత్య, మహిమ+అతిశయా= శాశ్వతమైన గొప్పతనంచేత మిన్న అయినవాడా! ఓ రాజరాజ నరేంద్రా! అని; ఇట్లు; సభా, పర్వమున, కథ= సభా పర్వంలోని కథ; మొగి= మునుపు; జనమేజయునకున్; వైశంపాయను, చెప్పిన, విధము+అంతయున్= వైశంపాయనుడు చెప్పిన విధం పూర్తిగా ఇది.

తాత్పర్యం: మనువుతో సమానమైన వాడా! శుభ చరిత్ర కలవాడా! శాశ్వతమైన మహిమచే మిన్న అయినవాడా! ఓ రాజరాజ మహేంద్రా! ఈ విధంగా సభాపర్వంలోని కథ పూర్తిగా మునుపు జనమేజయునికి వైశంపాయనుడు చెప్పిన విధమంతా ఇది.

విశేషం: 'మనునిభ శుభ చరిత!' అనే విశేషణానికి 'మనువుకు సాటియైన శుభచరిత్ర గలవాడా!' అనే అర్థంకూడా చెప్పవచ్చు.

ఆశ్వాసాంతము

రథోద్ధతము.

హార హీర ధవళాంశు నిర్మలో
దార కీర్తి! రణదర్ప! సద్గుణా!
వైరి వీర రస వైద్య! మన్మథా
కార! ధీర! పరగండభైరవా! **320**

ప్రతిపదార్థం: హార, హీర, ధవళ+అంశు, నిర్మల, ఉదార, కీర్తి= హారంలోని వజ్రంయొక్క తెల్లని కాంతిలా నిర్మలమైన గొప్పకీర్తి కలవాడా!; రణ, దర్ప= యుద్ధంలో గర్వం కలవాడా!; సద్గుణా= మంచిగుణాలు కలవాడా!; వైరి, వీర, రస, వైద్య= శత్రువులయొక్క వీరరసానికి చికిత్స చేసేవాడా!; మన్మథ+ఆకార= మన్మథుని వంటి ఆకారం కలవాడా!; ధీర= ధైర్యం కలవాడా!; పరగండ భైరవా= శత్రువీరులకు భయంకరమైనవాడా!

తాత్పర్యం: హారంలోని వజ్రకాంతివంటి తెల్లని నిర్మలమైన గొప్పకీర్తి కలవాడా! యుద్ధంలో గర్వంకలవాడా! ఉత్తమగుణాలు గలవాడా! శత్రువుల వీరరసానికి చికిత్స చేసేవాడా! మన్మథుని ఆకారం కలవాడా! ధైర్యం కలవాడా! శత్రువీరులకు భయంకరమైనవాడా!

విశేషం: అలం. ఉపమ, వృత్త్యనుప్రాసం. ఇవి ఆశ్వాసాంత రాజరాజ సంబోధనలు. ఆయన గుణ విశేషాల ప్రశంసలు. (రథోద్ధత వృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా ర,న,ర,లగ గణా లుంటాయి. ఏడవ అక్షరం యతి. ప్రాసనియమం పాటించబడింది. నన్నయ లఘు రకారావృత్తిచేత వృత్తరచనలో అక్షరరమ్యతను పోషించాడు. నన్నయ ఈ వృత్తాన్ని ఈ ఒక్కచోటనే వాడాడు. - సంపా.)

క. **కరుణావతార! ధరణీ । సురవర సురభూజ! రాజసుందర! నయబం**
ధుర! ధర్మధురంధర! మం । దరధైర్య! సుహృన్నిధాన! దానవినోదీ! **321**

ప్రతిపదార్థం: కరుణా+అవతార= దయా స్వరూపా!; ధరణీ, సుర, వర, సురభూజ= భూదేవతలైన బ్రాహ్మణ శ్రేష్ఠులకు కల్పవృక్షం వంటి వాడా!; రాజ, సుందర= చంద్రునివలె అందమైనవాడా!; నయ, బంధుర= నీతిచేత ఒప్పిదమైనవాడా!; ధర్మధురంధర= ధర్మభారాన్ని వహించేవాడా!; మందర ధైర్య= మందరపర్వతంతో సమానమైన ధైర్యం కలవాడా!; సుహృత్+ నిధాన= మిత్రులకు పెన్నిధివంటివాడా!; దాన, వినోదీ= దానం చేయటంలో సంతోషం కలవాడా!

తాత్పర్యం: దయాస్వరూపా! భూదేవతలైన బ్రాహ్మణ శ్రేష్ఠులకు కల్పవృక్షం వంటివాడా! చంద్రుడిలా అందమైనవాడా! నీతితో ప్రకాశించేవాడా! ధర్మభారం వహించేవాడా! మందరపర్వతంతో సమానమైన ధైర్యం కలవాడా! మిత్రులకు పెన్నిధివంటివాడా! దానం చెయ్యటంలో సంతోషం కలవాడా!

విశేషం: అలం: ఉపమ. వృత్త్యనుప్రాసం. (సంపా.)

ఉత్సాహము.

> **రాజవంశవార్ధిచంద్ర! రాజదేవ! నిత్యల**
> **క్ష్మీ జయాభిరామ! ధర్మమిత్ర! మిత్ర విద్వదం**
> **భోజ వన పయోజమిత్ర! భూరి కీర్తి కౌముదీ**
> **రాజిత త్రిలోక! నిఖిల రాజ నిత్య పూజితా!** **322**

ప్రతిపదార్థం: రాజ, వంశ, వార్ధి, చంద్ర= రాజవంశం అనే సముద్రానికి చంద్రునివంటివాడా!; రాజదేవ!; నిత్యలక్ష్మీ, జయ+ అభిరామ= శాశ్వతమైన ఐశ్వర్యంతో, జయంతో మనోహరమైనవాడా!; ధర్మమిత్ర= ధర్మానికి స్నేహితుడివైనవాడా!; మిత్ర, విద్వత్+ అంభోజ, వన, పయోజమిత్ర= స్నేహితులు, పండితులు అనే పద్మవనానికి సూర్యుని వంటివాడా!; భూరి, కీర్తి కౌముదీ, రాజిత త్రిలోక= గొప్పకీర్తి అనే వెన్నెలచేత ముల్లోకాలను ప్రకాశింప చేసేవాడా!; నిఖిల, రాజ, నిత్య, పూజితా= అందరు రాజులచేత ఎల్లప్పుడు పూజించబడేవాడా!

తాత్పర్యం: రాజవంశమనే సముద్రానికి చంద్రునివంటివాడా! రాజదేవా! శాశ్వతమైన ఐశ్వర్యంతో, జయంతో మనోహరమైనవాడా! ధర్మానికి మిత్రుడవైనవాడా! స్నేహితులు, పండితులు అనే పద్మవనానికి సూర్యునివంటివాడా! ముల్లోకాలను కీర్తి అనే వెన్నెలచేత ప్రకాశింపచేసేవాడా! సమస్తరాజులచే ఎల్లప్పుడు పూజింపబడేవాడా!

విశేషం: అలం: ఉపమ. రూపకం. ఉత్సాహ వృత్తపాదంలో ఏడు సూర్య గణాలమీద ఒక గురువు ఉంటుంది. అయిదవ గణంలోని మొదటి అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉంది. (సంపా.)

గద్యము.

> **ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్ట ప్రణీతం బయిన శ్రీమహాభారతంబునందు సభాపర్వంబున నర్ఘ్యాభిహరణంబును, శిశుపాల వధయును, రాజసూయ విభూతికి దుఃఖితుండై సభాస్ఖలితుండై యున్న దుర్యోధనుం జూచి ద్రౌపదీభీమసేనులు నగుటయు, రాజసూయవిభూతి సూచి సహింపక దుర్యోధనుండు జూదం బొనర్చుటయు, నందు శకుని కైతవంబున ధర్మరాజ పరాజయంబును, ద్యూతదుఃఖార్ణవ**

మగ్నులయిన పాండవులం బాంచాలి యుద్ధరించుటయుఁ, బునర్ద్యూత పరాజితులయి పాండవులు వనవాసగతు లగుటయు నన్నది సర్వంబును ద్వితీయాశ్వాసము.

సభాపర్వము సమాప్తము.

తాత్పర్యం: ఇది ఉత్తమకవు లందరి ప్రశంస లందుకొన్న నన్నయభట్టారకుడు రచించిన శ్రీమహాభారత సభాపర్వంలో, అర్ఘ్యప్రదానం, శిశుపాలుణ్ణి చంపటం, రాజసూయవైభవాన్ని చూచి దుఃఖితుడై సభలో జారిపడిన దుర్యోధనుణ్ణి చూచి ద్రౌపదీ భీమసేనులు నవ్వటం, రాజసూయ వైభవాన్ని చూచి సహించలేక దుర్యోధనుడు జూదమాడటం, అందులో శకుని మోసంవల్ల ధర్మరాజు ఓడిపోవటం, జూదంవల్ల కలిగిన దుఃఖ మనే మహాసముద్రంలో మునిగిన పాండవులను ద్రౌపది ఉద్ధరించటం, మళ్ళీ ఆడిన జూదంలో పాండవులు ఓడి అడవులకు వెళ్ళటం - అన్నది రెండవ ఆశ్వాసం.

సభాపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతంలో సభాపర్వం ముగిసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

సభాపర్వము

పద్య - గద్య ప్రథమపాద సూచి

పద్యము	పుట
అ	
అంగారములు గొనువేడ్కఁ	218
అంత	113
అంత నంతయు నెఱింగి	252
అంత ననంతవేదమూర్తు లైన	134
అంత ననంతశయనుండు	171
అంత ననుద్యూతపరా	263
అంత శిశుపాలు సేనాపతి	153
అం దనేకవిధ జీవరాసుల	39
అందుఁ గుబేరుఁడు	37
అందు దుర్యోధనదుశ్శాసనాది	208
అందు మాల్యాలంకృతమౌళులుఁ	82
అందు సుఖాసీనుఁడైన	35
అం దెప్పటి యట్ల ధృత	261
అక్కథకుండు శౌనకాది	1
అక్కథకుండు శౌనకాది	138
అక్కొడుకు నబ్జనాభుం	164
అఖిల లావణ్యపుంజంబు	209
అగ్నిదత్తంబైన యద్దివ్య	103
అట దుర్యోధనుండు శకునియుం	177
అట భీమసేనుండునుం	110
అట సహదేవుండు దక్షిణ	112
అట్టి మహోత్పాతంబులు	252
అట్టి యతిదారుణత్వము	63
అట్టి రాజసూయాధ్వరంబున	191
అట్టి సకలక్షత్త్రియ క్షోభంబు	154
అ ట్లయినం గురుకుమారులు	254
అట్లు కౌశిక చిత్రసేనులు	57
అట్లు వగచుచున్నధృతరాష్ట్రునకు	275
అట్లేని నాకు నస్మత్పిత్రు	45
అతనిచేత నభ్యర్చితుండయి	207
అతని నతిప్రతాపు	110
అతని ననవరతంబును	37
అతిదర్పోద్ధతుఁడు	54
అతివికృతస్వరూపధరుఁ	164
అతిసమర్థుండు బృహద్రథుం	64
అతులచతురంగ సేనాయుతుఁ	105
అతుల పరాక్రమార్జిత	182
అతుల బలుల్ పరస్పర	94
అతుల విక్రమసంపదన్	88
అతుల విభూతితో మణి	32
అతుల శౌర్యుఁ డనిల	111
అది యమరాజుసభయంతియ	35
అదియును నూఱుయోజనంబుల	31
అదియును నూఱుయోజనంబుల	37
అది శతయోజనవిస్తారాయామ	34
అధిక దర్పయుక్తమై	219
అధిక లజ్జావనతాస్యుల	265
అనఘ మామామ శకుని	214
అనఘ యేము ముప్వురము	60
అనఘ సుహృద్ద్యూతం బిం దొన	210
అనఘా నీ ప్రస్తవమున	21
అనఘుఁడై యెనుబది	192
అనఘుల శాస్త్రవిధిజ్ఞుల	16
అనలప్రభాభిశోభిత	99
అనవరతంబు నిష్టుఁడగు	56
అని కడునడలుగఁ	195
అని కృతాంజలియయి	29
అని తనచేతియనర్థ	214
అని దాని నతిప్రీతిం	71
అని ధర్మరాజును వారించి	149
అనినం గరుణించి ముని	66

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనినం బాంచాలి యి ట్లనియె	254
అనినం బ్రహ్లాదుండు భయం	246
అనిన ధర్మరాజునకు	155
అనిన ధృతరాష్ట్రుండు కోడలి	256
అనిన ధృతరాష్ట్రుండు దాని	203
అనిన ధృతరాష్ట్రుండు నీ	255
అనిన నట్టివాఁ డెవ్వండు	140
అనిన న ట్లేల వారలరిగి	272
అనిన నయ్యశరీరి	164
అనిన నయ్యుత్తరకురు	109
అనిన నారాజునకు నగ్ని	115
అనిన నుపేంద్రువాక్య మను	127
అనిన భీమసేనువిక్రమ	60
అనిన భీష్మువచనంబున	141
అనిన మురవైరిపలుకులు	91
అనిన వానికి ధర్మతనయుం	210
అనిన వారల వచనంబుల	48
అనిన వాసుదేవునకు	3
అనిన విదురుం డి ట్లనియె	221
అనిన విదురుపలుకులు	276
అనిన విని జనమేజయుం	113
అనిన విని జరాసంధుండు	89
అనిన విని ధృతరాష్ట్రుండు	274
అనిన విని ధృతరాష్ట్రునకు	184
అనిన విని భీమసేనుండు	59
అనిన విని యవి యెట్టివి	30
అనిన విని విదురున	220
అనిన వైశంపాయనుం	114
అని నిశ్చయించి పలికిన	76
అని పలుకుచున్న భీష్మ	166
అని ప్రబోధించిన ననిల	95
అని భీమార్జుననకుల	270
అని యడిగిన జనమేజయు	103
అని యడిగిన ధర్మరాజు	41
అని యడిగిన ధర్మరాజు	64
అని యప్పుడ శకుని	183
అని యాభగదత్తుచేత	105
అని యాశిశుపాలుం బట్టు	148
అని యిట్లు కోడలిం గొడుకుల	268
అని యిట్లు సభాపర్వంబున	277
అని రూక్షాక్షరవచనంబుల	161
అనిలజవాశ్వంబులఁ	49
అనిలజవాశ్వయుక్తమయి	176
అని వారల యనుగ్రహంబు	132
అని వీనితల్లి తొల్లి	165
అనిశము సేవింతురె	19
అని శిశుపాలుండు గర్వించి	167
అని శిశుపాలుఁ డొండొకట	169
అని సంజయుండు పలికిన	276
అని సంతసిల్లి మఱియు	77
అని సర్వజనభయానక	251
అనుచు డాయవచ్చిన	233
అనుచు దుఃఖితు లగుచున్న	239
అనుచు శోకాక్రాంత యయి	267
అనుజసహితుండయి	10
అనుజులు ద్రుపదాత్మజ	208
అనుపమదైవయోగ	235
అనుపమధనరాసులు	131
అనుపమరత్నకాంచన	205
అనుపమశక్తిమంతులు	44
అన్న సహదేవ నీవును	267
అన్యకీర్తనంబు నన్య	161
అప్పాండవుల కెంత లగ్గు	259
అప్పుడు వేవురు శిల్పి	195
అబ్బాలకు రోదనధ్వని	69
అభిమతాక్షముల్ దొల్చి	215
అభిషిక్తుఁడయిన యయ్యమ	191
అమితపరాక్రమమున	90
అమితసత్త్వులు ధర్మమూర్తు	266
అమ్మగధేశు నుగ్రబలు	74
అమ్మహామఖమునం దగ్ని	135
అమ్మహామునుల నెల్ల	13
అమ్మహాసత్త్వు జరాసంధుం	160
అమ్మానిసి వ్రయ్యలు గని	67
అమ్మురదితన్ విభీతహరి	250
అయనవిహీనుఁడౌ సవిత్రు	74
అయినను నాయర్థిత్వంబునం	52
అయినను నాహృదయంబు	78
అయినను నీ వచనంబు	108
అయ్యపూర్వసభామణి	210
అయ్యిద్దఱును గౌశికచిత్ర	54
అయ్యుధిష్ఠిరు సందేశంబున	49
అర్ధరాత్రమయిన నభ్యాగత	82
అలయక వెండియుం గడఁగి	225
అల్పుఁ డయ్యు మనుజుఁ డతి	202
అవనితలంబు వ్రస్సెనొ	97
అవనినాథుచేత నాజ్ఞ	229
అవనీతలసామ్రాజ్యో	228
అవనీనాథు లనేకు లుండఁగ	141
అవనీరాజ్యవ్యాపార	167

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అవమానదుఃఖితుండయి	114
అవమాన్యున్ సభలోన	167
అవినయబుద్ధివై హరికి	149
అవినీతులయి మహాత్ముల	87
అవిలంఘనీయ మీదుర్వ్యవ	154
అవ్వా నీప్రశ్నంబునకు	249
అవ్విధంబున నొప్పియా	248
అహితవృద్ధి యుపేక్షితం	202
అహితుల నెల్లవిధంబుల	259
ఆ	
ఆ జరాసంధుండును నాయుధ	56
ఆ జరాసంధుండును నాయుధ	74
ఆతనిఁ జూచి ద్రోణాచార్య	225
ఆతనిఁబట్టి యెత్తి నిహతా	96
ఆదిజుఁడైన బ్రహ్మయుదయం	147
ఆ ధృతరాష్ట్రుచేసిన	210
ఆయంబునందు నాలవభాగ	24
ఆయతభుజవీర్యులు	54
ఆయుధనిహతుఁడుగాని	100
ఆరంభరహితుఁ బొందునె	59
ఆరాక్షసి కెత్తికొనన్	68
ఆవనజాననం గురుకులా	234
ఆవిపినాంతరంబున	65
ఆ శిశుపాలుపిఱుందన	146
ఇ	
ఇంకనయిన నుపేక్షింపక	219
ఇంత సంతాపింపనేల	180
ఇంద్రప్రస్థపురంబున	207
ఇక్ష్వాకుమారుండు కుమారు	72
ఇక్ష్వాకురువృద్ధులైన భీష్మ	239
ఇచ్చకువచ్చు పూజనల	70
ఇట్టి కార్యమునకు నే	196
ఇట్టి విచిత్రరత్నసభా	206
ఇట్లు కార్తికమాసంబునం	94
ఇట్లు జగత్త్రయవిజయ	236
ఇట్లు జరాసంధుండు	71
ఇట్లు జరాసంధుండు	91
ఇట్లు జూదంబున నయ్యేడు	213
ఇట్లు దేవభోగబ్రాహ్మణ	223
ఇట్లు నారాయణదేవుచేత	128
ఇట్లు నిఖిలక్షత్రియత్రాస	163
ఇట్లు పంచిన నలువురు	102
ఇట్లు పాండవకౌరవు	209
ఇ ట్లుపాస్యమానుండయి	65
ఇట్లు భీమసేనుండు జరాసంధుఁ	97
ఇట్లు భీమసేనుండు ద్రుపద	243
ఇట్లు భీమార్జుననకుల	121
ఇట్లు మహావిభూతితో	172
ఇట్లు మాద్రేయుండు రౌద్రా	120
ఇట్లు మాహిష్మతీపురంబు	117
ఇట్లు యుధిష్ఠిరుండు బద్ధ	215
ఇట్లు వచ్చిన భీష్మధృత	131
ఇట్లు వచ్చిన రామకేశవులం	164
ఇట్లు వచ్చిన వైనతేయు	99
ఇట్లు వాతావధూతంబైన	235
ఇట్లు శబరసాగరానూప	104
ఇట్లు సకలసుఖోపభోగ	179
ఇట్లు సేయనైతినేని	244
ఇతనికిఁ గూర్తురేని	143
ఇతనికి నిట్లు న న్నుఱక	166
ఇది యపూర్వంబైన పణంబు	261
ఇది యుచితంబు గాదనక	236
ఇది సకలసుకవిజన	137
ఇది సకలసుకవిజన	279
ఇది సేయఁగా దని మది	242
ఇన్నిదినము లయ్యె నేటికి	180
ఇప్పురంబు జయింపంగ	115
ఇమ్మనుజాధమున్ గుణ	217
ఇమ్మనుజేంద్రుఁ డింద్ర	4
ఇమ్మహి నీవుఁ బాండవులు	198
ఇమ్మదివెట్టి వీనిఁ	156
ఇమ్ముల ధర్మజుతో	199
ఈ	
ఈతని వృద్ధని యెఱిఁగి	143
ఈ యర్థం బితిహాసంబుల	246
ఈయవనీశ్వరప్రవరు	145
ఈరెండుకారణముల	150
ఈవికర్ణుఁడు బాలుఁ డయ్యును	245
ఈహరికరుణ	60
ఈహితవిధానములలో	71
ఉ	
ఉత్తమజ్ఞానవృద్ధునా	150
ఉత్తమమధ్యమాధమ	20
ఉపధాశుద్ధులఁ బాప	20
ఉరుగుణవిశుద్ధరత్నో	122

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఉరుతరధనసంతర్పిత	43
ఉరుతరహర్మ్యమాలికల	79
ఎ	
ఎందేని సర్వభూతేశుండు	6
ఎడపక యర్ఘ్య మచ్యుతున	152
ఎత్తికొని చనంగ నిమ్మగు	68
ఎఱుంగవేని యక్కితవు	230
ఎల్లధనంబు నోటువడి	223
ఎల్లవారు నెఱుఁగనొల్లని	240
ఏ	
ఏ నింద్రసఖుఁడ నీవును	104
ఏను జరయనురాక్షసి	69
ఏను దానవవిశ్వకర్మ	2
ఏను దొల్లి మనుష్య	38
ఏను బుద్ధిలేక జూదంబు	257
ఏను సపుత్త్రకుండైన	222
ఏమఱక జనులయోగ	51
ఏమి సేయుదము పాండవుల	182
ఏమి సేయుదు నని డోలాయ	47
ఏము భవదీయ రాజసూయ	172
ఏయుగంబునందు నెట్టి	230
ఏల యాశీవిషంబుల	228
ఒ	
ఒక్కలక్ష భూసురోత్తముల్	189
ఒక్కొక్క కన్నును జెవి	67
ఒలసి నీ పుత్త్రులెల్ల	196

పద్యము	పుట
క	
కందుగల పసిఁడి గాఁచినఁ	179
కడఁగి యత్యుత్తమక్షత్త్రియ	86
కడఁగి యనలుఁ డేమి	113
కడిఁది రిపులపైఁ బోవంగఁ	27
కడుఁ గ్రూరుఁడవయి	89
కడుఁ జనువాఁడు నై పురుష	18
కడుకొని ధర్మతత్త్వ	142
కడు నధికుతోడఁ దొడ	59
కడుభయ మంది వానికిఁ	181
కనకోర్వీధరసానుసార	269
కని దాని యపూర్వ	80
కరుణతోడ నాకు వరము	254
కరుణావతారధరణీసుర	278
కర్శితరిపు లన్యోన్యా	93
కలరూపగుణద్రవ్యం	61
కావున మేము మువ్వురముఁ	62
కావున వారల నను	260
కితవవ్యవసాయపరా	242
కుంతికి ధర్మనందనునకున్	50
కుటిలమార్గులయిన	211
కుపథప్రవృత్తుఁడయి	165
కురుపతికిన్ యుధిష్ఠిరు	3
కురువిభురాజసూయమునకున్	118
కురువిభుఁడు రాజసూయా	105
కురువీర నీ ధర్మపరి	123
కురువృద్ధుల్ గురు వృద్ధ	243
కురువృషభ సర్వ గుణ	52
కులపుత్త్రులైన సద్భృత్యుల	21
కులరక్షార్థ మఖిల	86

పద్యము	పుట
కృత మెఱిఁగి కర్త నుత్తమ	23
కృష్ణభీమపార్థులు	79
కృష్ణభీమవిజయ లిట్లు	101
కౌరవైశ్వర్యంబు గౌరవం	183
క్రూరాత్మకులై దుష్పద	252
క్ష	
క్షత్త్రనీతిక్రమంబులు గావు	211
క్షితినాథ శాస్త్రదృష్టి	18
క్షితిపతులవలన సము	125
ఖ	
ఖలుఁ డీదుర్యోధనుఁ డెగ్గు	216
ఖలుఁడు బృహద్రథాత్మజుఁడు	57
గ	
గరుడధ్వజుం డప్డు కరుణా	86
గురుఁ డని సమస్తలోకోత్తరు	147
గొనకొని మర్త్యలోకమున	44
గోరథమును ఋషభము	80
ఘ	
ఘనజాలము లేకయుఁ	170
ఘనముగఁ బ్రాణము రక్షించి	2
ఘోరరణంబులోన నధికుం	55
ఘోరరిపుఁ జంప నరిగెడు	78
ఘోరాకారులు మాలాకార	81
చ	
చనఁ బేడికి దారక్రియ	145
చెడఁగఱపువార చెలులుం	221

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
చెడక నావచనంబు	88
చెలువుగఁ బుష్పవృష్టి	152
చేయుము రాజసూయ మెడ	47
చైద్యునకై పూని సన్నద్ధు	155
చోరభయవర్జితముగా	22
జ	
జగదభినుతసామ్రాజ్యంబు	172
జననిందితమయి నీ	159
జనపతులు రాజసూయం	43
జనవర నీ యజ్ఞములం	17
జనసంత్రాసకరున్ మహో	99
జన్నంబు చూడంగ సకల	190
జయజయనినాదమున	170
జయశీలుఁడయి హరిశ్చంద్రుండు	42
జర యనురాక్షసి నీకుం	72
జలజనాభు పగతు	112
జూదం బన్నది పురాణంబుల	205
జూదంబున కీ వోడు దేని	213
జూదంబున నెగ్గపుట్టు	228
జూద మిది యేల దీనను	198
త	
తగిలి విలోచనగోచర	176
తడయక కౌరవానుజుఁడు	233
తడయక యేఁగినీతి	76
తడిసిన యేకవస్త్రపరి	274
తదనంతరంబ ధర్మ	50
తదవసరంబున	11
తద్ద్వారపాలకుల్ దారుణా	107
తనకార్య మొరుమతంబున	204
తనపిఱుఁద ధర్మసంబో	14
తనయుని నభినవ	73
తమతమ కనియెడు	20
తమ్ముల నత్యంత ధర్మ	224
తరణిసన్నిభు ధర్మ	109
తరుణి ద్రౌపది యిట్లు పాండవ	257
తరుణి యేపురకంటె	249
తాళవన పాండ్య కేరళ	118
తొల్లి జమదగ్నిసుతుం	53
తొల్లి తారకాసురసంగ్రామం	98
తొల్లి యెన్నండునుం బాపంబుం	216
తొల్లి వృషపర్వుండను	4
తొల్లి సముద్రతీరంబున	159
ద	
దనుజాహిత నీకాహవ	63
దరికొని దహనుం డెగసె	113
దళితవిరోధి యిట్టి దని	39
దాననచేసి యిప్పురంబు	80
దానిం జూచి సాత్వతియద్భుత	165
దానిం బుచ్చికొని యభి	67
దాని నంతయు భీమసేనుండు	258
దానిన చేయుదు నని	104
దాని నెఱిఁగి ధర్మ	178
దాని నెవ్విధంబున నయిన	202
దాని సహింపక విదురుం	227
దారసంగ్రహంబు ధరణీశ	26
దారుణవజ్రచారుభుజ	81
దిగ్విజయోపార్జితంబు	45
దీనికి ధృతరాష్ట్రునను	183
దీని కొడఁబడు మెడఁ	195
దీపితసత్యసంధుఁడు	41
దుర్యోధనుం డట్లు సభా	178
దుష్టచిత్తుఁడైన కష్టు	269
దేవగురుద్విజప్రకర	171
దేవప్రభావుఁడగు సహ	117
దేవబ్రాహ్మణులకు నానా	7
దేవముఖంబయిన యగ్ని	126
దేవార్థముగాఁ దెచ్చిన	90
ద్యూతకలాకుశలుండగు	212
ద్రుపదతనూజం బణముగ	237
ద్వారంబున మిత్రనివాసం	84
ద్వారవతినుండి జగదా	124
ద్వారవతి నుండియును	175
ధ	
ధనకనకరత్నవర	237
ధనదుసభ యింద్రసభ	36
ధనలుబ్ధుల మ్రుచ్చులఁ	21
ధనసంపద రాజ్యంబున	261
ధనసంపదలు నిజధరణి	229
ధరణిలోఁగల రాజు లెల్లను	154
ధరణి హరిశ్చంద్రుఁడు	190
ధరణీధర సర్వగుణా	77
ధరణీనాథ భవద్భుజ	22
ధరణీశ వానిఁ జంపుడు	58
ధరణీశ్వరు నమ్మునివరు	65
ధర్మం బధర్మవిద్ధంబయి	247
ధర్మజ్ఞుఁడవు నీవు పేర్మిఁ	263
ధర్మతనయుండు జూదంబు	193
ధర్మతనయుపిఱుఁదఁ	268

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ధర్మతనూజుండు ధర్ముపు	238
ధర్మరాజును జగదర్చితుం	124
ధర్మసుతుఁ డొడ్డి శకుని	262
ధర్మాధర్మవిదుండైన	198
ధర్మ వెఱఁగి దానిఁ దా	245
ధర్మసభ లోకధర్మా	33
ధవళాక్షి నీకతంబున	267
ధారుణి రాజ్యసంపద	251
ధారుణీ ధర ధర్మతత్త్వ	125
ధీయుతుఁడయి మధుపర్కము	83
ధీరమతి విదురుతోడ	193
ధీరుఁడు ధర్మాధర్మ	16
ధృతరాష్ట్రవిభునిమందిర	270
ధృతరాష్ట్రుండును దాని	271
ధృతరాష్ట్రుండును నిది	226
ధృతరాష్ట్ర నగ్నిహోత్రా	252
ధృతిమంతుల భుజవిక్రమ	220
ధ్యేయుఁడవు సకలలోక	51
న	
నకులుఁడు పశ్చిమదిక్కున	119
నన్ను రత్నపరిగ్రహణంబు	185
నముచి యనుదనుజుఁ	201
నయనములు నాకుఁబవన	77
నరసుతు లయ్యైదిక్కుల	103
నర్మదాసమీపంబున	112
నా కెఱిఁగింపుము దీనిన	180
నాగరథాశ్వసన్నాహ	203
నానావిధరణవిజయ	17
నాయథాశక్తిఁ జేసి	28
నారాయణుండును ధర్మ	101
నారాయణుండును బాండు	173
నిన్నుం బాసి నిమిషంబయిన	175
నిర్దయాత్ముఁ బాపనిరతు	233
నిర్దయుండై సవర్ణుండు	87
నిర్మలస్ఫటికశిలా	200
నీకరుణం గరంబు రమ	174
నీకూర్మియు నీయలుకయు	169
నీకొడుకు నికృతిఁజేసి	272
నీతదర్థంబులై నిఖిల	116
నీనేర్పువిధంబున శకుని	196
నీయజ్ఞమునకు విఘ్నము	155
నీయిద్దఱుదేవులకు	70
నీరజమిత్రుఁ డేల ధరణీ	13
నీవు ద్రౌపది నధర్మ	241
నీవు ధర్మవిదుండవు	246
నీవు నిత్యంబు వృద్ధోప	256
నీవును జూచి తట్టి సభ	180
నీ వెఱుఁగక యిచ్చిన	145
నృపవరుఁ డనుజులుఁ	260
నెట్టన ధర్మ నందనుఁడు	157
నెమ్మిని ధర్మజు నలువురు	255
న్యాయంబు విడిచి సౌబలు	219
న్యాయమున రాజసూయము	45
ప	
పంగుల మూకాంధుల వికల	23
పంపందగుఁ దగ దని	127
పతులపిఱుఁద మందగతి	268
పరఁగన్ దక్షిణదిఙ్మహీ	119
పరమ ధర్మాత్మకుఁ డయిన	41
పరమపతివ్రతన్ సభఁ	253
పరమసుఖోపాయంబునఁ	201
పరమార్థప్రతిభఁ దమో	147
పరమాసనమున నునిచి	50
పరలోకనిలయులగు	47
పరికించుచు బాహ్యాభ్యం	24
పరుల గుణంబులు పలు	221
పర్వత పారిజాత రైవత	14
పవనవిధూతము శుక	66
పాండవుల విభవ మది	184
పాండుకుమారులఁ బరమ	275
పాండుపుత్త్రుల కెప్పుడుఁ	194
పాండుమహీపతి పనిఁ	52
పాలితదుర్లయుండు శిశు	148
పితృగణహితార్థముగ	47
పితృసంకల్పము సేయఁగ	46
పుత్త్రవత్సలుఁడు విచిత్ర	207
పుత్త్రుండు లేనివిభవంబు	64
పుత్త్రుల కేల భేద మగు	197
పురజను లాశ్చర్యంబునఁ	100
పురుషవిశేషవిత్తముఁడు	144
పురుషవృషభులయిన	268
పూజితుల తృప్తు లగుదురు	151
పూజ్యుఁడ వెల్లవంశముల	126
పూతనాఘాతంబుఁ జేత	157
పెద్దలు హీనతఁ బొందిరి	201
ప్రకటితకోపవేగమునఁ	162
ప్రల్లద మేది యిట్లు శిశు	170
ప్రాగ్జ్యోతిషంబున భగదత్తు	168

పద్యము	పుట
ప్రాజ్ఞుఁడు విశేషధర్మ	132
ప్రియము పలికెడు వారి	222
ప్రియహితసత్యవాక్య	76
బ	
బలవద్ద్యూతార్థముగాఁ	213
బలహీను లయిన వారలు	212
బలిమిమెయిఁ బార్థరక్షా	75
బలియుఁ డపుడు వెండ్రు	92
బహుధనధాన్యసంగ్రహ	26
బుద్ధియు మనమును బురు	151
బూతు వొగడినట్లు వొగ	161
బ్రహ్మవిదులయిన నిఖిల	133
భ	
భరతకులైకభూషణుఁడు	102
భానుప్రభుఁడగు పాండు	193
భారతరణహేతు లగు	274
భావిపురాతనాద్యతన	189
భీమసేనుండును వానికి	92
భీమసేనుండును శిశు	111
భూనాథ యిది యపూర్వ	29
భూభుజులన్ జయింపుము	60
భూమీశ హంసడిభకులు	56
భూరిగుణరత్నభూషణ	136
భూరిగుణోన్నతులనఁ	146
భూవిదితప్రతాపపరి	259
మ	
మంచిగ భూరిభూసుర	11
మందితసూర్యరశ్మిరుచి	186
మదమలినమనస్కుఁ	227
మదమాతంగ తురంగ	11
మనమున వేరమిఁ దలఁప	256
మఱి దుఃఖానుభావంబున	273
మఱియుఁ గృష్ణద్వైపాయను	264
మఱియుఁ ద్రోణుండు పాండవు	277
మఱియు ధర్మోపార్జిత	122
మఱియు నపరిమిత	123
మఱియు నప్రమత్తుండ	174
మఱియు నయ్యుధిష్ఠిరుండు	192
మఱియు నయ్యుధిష్ఠిరున	187
మఱియు నాకావించిన	84
మఱియు నాస్తిక్యం బనృతం	28
మఱియును	7
మఱియును	12
మఱియును	32
మఱియును	96
మఱియును	265
మఱియు నులూకదేశాధి	106
మఱియు మాయాద్యూతంబున	211
మఱియు రాజసూయమహా	61
మఱియు వాగ్విషయంబు	168
మఱియు వాసుక్యైరావతాది	36
మఱియు శుక్రబృహస్పతులు	33
మఱియు సకలజన	9
మఱియు సహదేవాను	130
మాయాద్యూతంబున నిర్జేయులఁ	270
మీ యనుగ్రహమునఁ	131
మీ రిందుల కందఱుఁ జను	199
మీరు నాకు నేను మీకు	85
మీవంశమున నరదేవో	15
మున్ను ద న్నోటుపడి మఱి	230
మృగమధ్యంబున నున్న	258
మొదల నప్రియ మయ్యును	222
య	
యజ్ఞదీక్షితుఁ డయిన	185
యాదవుచేతిచక్రము	181
యోధుల సింహనాదము	119
ర	
రక్షణంబున భగీరథుఁడు	58
రయవిచలత్తురంగ	153
రాజకులోత్తమరాజ	136
రాజవంశవార్ధిచంద్ర	279
రాజసూయాధ్వరము ధర్మ	108
రాజునకు విజయమూలము	16
రోదసీకుహరంబు రుచి	140
ల	
లయసమయదండధర	250
వ	
వగవనేటికి నింక	276
వడిగల తురంగంబులం	197
వదనసరోజంబు వస్త్రాంత	271
వదలక బుద్ధి నంతరరి	27
వదలక యేలినవాని	32
వనవాసపరిక్లేశంబున	263
వరవుళ్ళఁగలసి తన	226
వరుణసభ సర్వలోకో	35

పద్యము	పుట
వలయు నమాత్యులఁ జుట్టం	24
వాఁడును గడుభీతుండయి	115
వాఁడును ద్రౌపదిపాలికిం	231
వాఁడును బ్రాహ్మణవచనం	43
వానికి నెయ్యుఁడై యమర	38
వారలవలన నీ దురాగ్రహం	253
వార్తయందు జగము	25
వాసవాత్మజుఁ బంపుమిప్పుడు	217
విదితముగ నధికబల	160
విదురుమతము పాండ	204
విమలమణిమయము	7
విరహితసత్త్వుఁ డయ్యెఁ	95
వీని నెవ్వరును నెఱుంగ	68
వీని నొరులు చంపఁగా	163
వీర లిట్టు లనాథులై ముని	266
వీరుఁడు తత్పురవిభుఁడు	113
వీరుఁడు ధర్మజుండు పది	10
వీరులగు పాండు సుతులు	277
వృద్ధు లొకలక్ష యున్నను	150
వెఱచఱవఁ బట్టికొని	96
వెఱచఱవ నింతకంటెను	273
వెలయఁగ విద్వజ్జన	25
వెలయ విధిదృష్టనయ	62
వేదనినాదము నాశీ	134
వైశ్యసతికి నొక్కవరము	255
వ్యాయామకర్కశస్థిర	93
శ	
శకునికైతవం బెఱింగియు	237
శతముఖుసభ శుభ	31
శాంతనవుఁడు భీష్ముండు	139
శాకలపురమందు శల్యు	121
శాస్త్రోపదిష్టప్రశస్త	129
శైల కానన ద్వీపవిశాల	185
శ్రీదయితోరస్థల విమ	1
శ్రీరమణీప్రియధర్మ	138
స	
సంతతమైన సర్వసుఖ	66
సందిగ్ధమయిన యర్థము	231
సకలక్షత్త్రభయంకరు	160
సకలభూతసంఘంబు	174
సఖ్యసంబంధములఁజేసి	184
సతతధనదానములఁ	173
సభకు వచ్చి ధర్మసందేహ	245
సమకట్టి సైన్యంబు	90
సమచిత్తవృత్తులగు	239
సమరమున బాహుబల	273
సమరశూరులు పాండవుల్	274
సమసత్త్వాతిశయుల్	92
సమ్మదమంది చూచిరి	133
సవినయనతోత్తమాంగుల	101
సాక్షియును ధర్మదర్శియు	247
సాగరసారవారిరుహ	186
సామాన్యమె యుత్తరకురు	184
సారమతిఁ జేసి మానస	19
సాహసమున మద్బాహు	269
సుందరి నాకోడండ్రుర	254
సుబలమార్కండేయశునక	12
సుమతులు పాంచాలీప్రశ్న	244
సురపతిగురుండైన	194
సురపతియమవరుణ	30
సురమునివరులకు	85
సురుచిరహరినీల	8
స్త్రీలను గోబ్రాహ్మణులం	158
స్నాతకుండును ఋత్విజుం	139
స్నాతకుల రేని పూవులు	83
స్నాతకులు పుణ్యకర్మ	84
హ	
హరియును గిరీటియును	187
హారహీరధవళాంశు	278
హీనులగు కర్షకులకును	22

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 4

ఆరణ్యపర్వము - భాగం -1

మొదటి భాగము 1,2,3,4 (141వ పద్యంవరకు) ఆశ్వాసములు

కృతికర్త

నన్నయభట్టారకుడు

వ్యాఖ్యాత

డా॥ నందూరి రామకృష్ణమాచార్య

ప్రధానసంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITHRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATHAM

With Commentary
Aranyaparvamu of Nannaya Bhattarakudu-part-I
(Cantos 1,2,3 and 4 upto the poem 141)

Vol. IV.

Commentary by
Dr. Nanduri Ramakrishnamacharya

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Publications Series No.603
First Edition : 2003

Second Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by

Sri. M.G. Gopal, I.A.S.

Executive Officer,

T.T.Devasthanams,

Tirupati - 517 507

D.T.P. Type Setting

Editor-In-Chief Office

T.T.D. Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్

భారతీయుల విజ్ఞాన సర్వస్వం భారతం. ఈ గ్రంథం తొలుతటిపేరు 'జయం'. వేదవాఙ్మయం యొక్క సారం ఇందులో ఇమిడి ఉన్నందున ఇది పంచమ వేదంగా ప్రశస్తిగాంచింది. పూర్వం దేవతలు, ఋషులు – దీని మహిమను పరీక్షించదలచి – నాలుగు వేదాలను ఒక వైపు, ఈ గ్రంథాన్ని మరోవైపు తులలోపెట్టితూచినారట! ఈ గ్రంథం ఉన్నవైపే అధికంగా ముల్లు చూపినందువలన, ఈ జయేతిహాసం మిగుల మహత్త్వం కలదిగా, చతుర్వేదాలకన్న బరువైనదిగా వెల్లడయింది. ఆనాటి నుండి ఈ గ్రంథానికి 'మహాభారత' మనే నామధేయం సార్థకంగా స్థిరపడింది. "మహత్త్వాత్ భారవత్త్వాత్ చ మహాభారత ముచ్యతే" – అనే నిర్వచనం అలా ఏర్పడింది. 'భరత వంశీయుల చరిత్ర భారతం' – అనే వ్యుత్పత్తి కూడ ఇందుకు తోడయింది.

భారతంలోని భాగాలకు పర్వాలని పేరు. 'పర్వ' మంటే చెఱకు గణుపు. మహాభారతం పదునెనిమిది గణుపులు గల చక్కని చిక్కని చెఱకు గడవంటిదని వ్యాసభగవానుని అభిప్రాయం. చెఱకుగడలో ప్రతి గణుపులోనూ మధురరసం సమృద్ధిగా ఉన్నట్లే, భారతంలో గల ప్రతి పర్వంలోనూ కావ్యరసం పుష్కలంగా నెలకొని ఉంటుందనే భావం ఇందులో వెల్లడౌతున్నది. "భారతం చేక్షుఖండం చ ప్రతిపర్వరసోదయమ్"– అనే ఆర్యోక్తి ఈ సత్యాన్ని చాటుతూవుంది.

మహాభారతం దివినుండి భువికి దిగివచ్చిన దివ్యగంగావాహిని; పారిజాత కల్పవృక్షం; సమస్త కళలతో విరాజిల్లే పూర్ణచంద్రుడు; అమృతకలశం – ఇలా ఈ జాతీయ కావ్యం యొక్క మాహాత్మ్య వైభవ ఆ యా సందర్భాల్లో అనేక రీతుల అభివర్ణింపబడింది.

దేవభాషలో అవతరించిన భారతం కాలక్రమేణ తమిళ, కర్ణాటాది దేశభాషలలోనికి అనువదింపబడుతూవచ్చింది. ప్రాంతీయ భాషలలో వెలువడిన ఆ యా భారతానువాదాలన్నిట్లోనూ తెలుగులో 'కవిత్రయం' వారు రచించిన ఆంధ్రమహాభారతం విశిష్టమై విలసిల్లుతూవుంది. కృష్ణద్వైపాయనుడు ఏ పరమార్థాన్ని మూలంలో నిరూపించాడో, ఆ నిరూపితార్థం చెక్కుచెదరకుడా పుణికి పుచ్చుకొని ఆవిర్భవించిన స్వతంత్ర రచన ఆంధ్రమహాభారతం. కవిత్రయం కావించిన పునఃసృష్టి !

ఆంధ్రావళికి ఆదికావ్యాన్ని ప్రసాదించిన మహాకవులు ముప్వరూ త్రిమూర్తుల వంటివారు. వారిలో ఆదికవియే విష్ణువు, కవిబ్రహ్మయే బ్రహ్మదేవుడు, ప్రబంధ పరమేశ్వరుడే పరమేశ్వరుడు. ఈ ముగ్గురు సారస్వత మూర్తులు వేరు వేరు కాలాల్లో, తెలుగుదేశంలోని వేరు వేరు ప్రాంతాల్లో తమ తమ రచనల్ని కొనసాగించినప్పటికీ, కవిత్రయ భారతం స్వరూపంలోనూ, సందేశంలోనూ ఏకవాక్యతతో విలసిల్లుతూవుంది. ఇది ఆంధ్రావనికి దైవికంగా సిద్ధించిన అదృష్ట విశేషం ! తరతరాల తెలుగు జాతికి ఆదర్శంగా తెనుగు సాహితీ మందిరంపై నిర్మించిన సమున్నత స్వర్ణగోపురం ఆంధ్రమహాభారతం ! ఆ సుందర గోపురాన్ని నెలకొల్పిన అక్షరశిల్పులు "కవిత్రయం" అందరకూ ఆరాధ్యులు !!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భారతంలోని పర్వాల్లో మూడవది ఆరణ్యపర్వం, ధర్మాత్ములైన పాండునందనులకు విజయం తథ్యమనే విషయానికి స్పష్టమైన నిదర్శనాలు మొదటిసారిగా ఈ పర్వంలో గోచరిస్తాయి. 'ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ భగవానుడు ఉంటాడు; ఎక్కడ భగవానుడు ఉంటాడో అక్కడ విజయం నిశ్చయం'.

"యతో ధర్మః తతో విష్ణుః, యతో విష్ణుః తతో జయః'

– అనేదే ఆరణ్యపర్వం యొక్క ప్రధాన సందేశం !

'ధర్మో విగ్రహవానివ' – అని కొనియాడబడిన ధీరోదాత్తుడు యుధిష్ఠిరుడు. ధర్మమూర్తియైన ఆ మహారాజు రోమశుడనే మహర్షిని అడిగిన ప్రశ్న – తీర్థయాత్రల ప్రయోజనాన్ని గూర్చి తెలిపేది – ఈ సందర్భంలో ముఖ్యంగా ప్రస్తావింపదగి ఉంది :

అచేతనాలైన కొండలు, నదులు, సరస్సులు మొదలైనవి జనుల పాపాలను పోగొట్టేవై ఉండటానికి గల కారణమేమి? – అని ధర్మజుడి ప్రశ్న.

ధర్మపరాయణులైన దేవతలు, ఋషులు వాటిని ఆసక్తితో ఆశ్రయించి ఉండటం చేత పర్వతాలు, నదులు, సరోవరాలు మొదలైనవి పవిత్రాలై, పుణ్యతీర్థాలై, జనుల పాపాలను నివారిస్తూ, వారి వారి కోరికలను ఈడేరుస్తూ, జగత్తును పావనం చేస్తూ ఉంటాయి – అని రోమశుడి సమాధానం.

(ఆరణ్యపర్వం, రెండవ ఆశ్వా., 309వ వచనం, 317వ వచనం.)

ఈ సమాధానం తీర్థయాత్రల యొక్క ప్రాముఖ్యాన్ని, పరమార్థాన్ని చక్కగా విశదీకరిస్తూ వుంది.

తిరుమల తిరుపతి దేవస్థానములు చేపట్టి నిర్వహిస్తూ వున్న అనేక ధార్మిక ప్రచురణల కార్యక్రమాల్లో "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారత ప్రచురణ ప్రణాళిక" విస్తృతమైనది, విశిష్టమైనది. ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా నన్నయభట్టారకుని ఆదిపర్వం (రెండు భాగాలు), సభాపర్వం – ఇటీవలే (కడచిన మే నెలలో) దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు గౌ॥ శ్రీ దండు శివరామరాజు మహోదయుల కరకమలాల మీదుగా ఆవిష్కరింపబడినాయి.

ఇప్పుడు ప్రచురితమైన ఆరణ్యపర్వం మూడవ సంపుటం. ఈ సంపుటం కూడ గ్రంథ పరిమితి ననుసరించి, పాఠకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని రెండు భాగాలుగా వింగడింపబడింది. ఆరణ్యపర్వం రెండు భాగాల్లో ఇది మొదటి భాగం. ఈ భాగం నన్నయభట్టు రచించినది. దీని తరువాతిదైన రెండవ భాగం నన్నయ పేర ఎఱ్ఱన రచించినది. ఈ విధంగా ఆరణ్యపర్వాన్ని తెలుగులో రెండు వేర్వేరు భాగాలుగా ప్రచురించటం ఇదే ప్రథమం.

ఈ పర్వానికి వ్యాఖ్యను సమకూర్చినవారు డా॥ నందూరి రామకృష్ణమాచార్యులుగారు. దీనిని పరిష్కరించినవారు 'వ్యాఖ్యాసహిత కవిత్రయాంధ్రమహాభారతం ప్రాజెక్టు' ప్రధాన సంపాదకులు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు. మరియు, ఈ వాఙ్మయ యజ్ఞంలో పలు తెఱగుల పాలు పంచుకొంటున్న విద్వాంసులు, విద్యావేత్తలు అనేకులు ! సుగృహీత నామధేయులయిన ఈ సహృదయులందరికీ పేరుపేరున కృతజ్ఞతాభివాదాలు తెలుపుతున్నాము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిత్యకల్యాణ మూర్తి అయిన వేంకటేశ్వరుని అనుగ్రహ విశేషం వలన, వ్యాఖ్యాన సమేతమైన ఈ జయేతిహాసం సర్వజనులకు జయప్రదము, ఆనంద సంధాయకము కాగలదని మా ఆశయము, ఆకాంక్ష.

"అమల ధర్మార్థ కామమోక్షముల గుఱిచి
యొలయు తెరువెద్దియును నిందుఁ గలుగునదియ
యొండెడలఁ గల్గు ; దీన లేకుండు చొప్పు
దక్కొకంటను లేదు వేదజ్ఞులార !"

తిరుపతి,

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీవేంకటేశ్వరస్వామి వారి దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమ స్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన ''పోతన'' పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 -' 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్లవేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జులై11 తేదీన హైదరాబాదు బాలాజి భవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అర సున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్లవేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్పురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్లవేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిక్రమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగాపర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీమధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జులై3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డి గారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను''.

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥కె. సర్వోత్తమరావు	**శ్రీడి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

“రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిని అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్లు రచనలో మార్పులు, చేర్పులు చేయడానికి, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జులై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీడి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీస్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలో ని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్లకొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పండ్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నపుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులుబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి, విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి''.

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్. గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాష్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదక మండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంపాదకమండలి సభ్యులు

ఆచార్య నండూరి రామకృష్ణమాచార్యులు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య
ఆచార్య కె.జె. కృష్ణమూర్తి
శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్యులు
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
ఆచార్య కె.జె. కృష్ణమూర్తి
డా॥ మేడసాని మోహన్
ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానంద
ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య
శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు
ఆచార్య ఎం. కులశేఖరరావు
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు
ఆచార్య ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలులలోని సభ్యులయొక్క సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటా లన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్తపాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ఇప్పుడు ప్రథమ సంపుటం - ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం - సభాపర్వం వెలువడినాయి. ఇప్పటి కార్యనిర్వహణాధికారి అయిన డా॥ పి. కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారు వచ్చిన తత్‌క్షణమే ఆంధ్రమహాభారత ప్రచురణను గూర్చి ఆసక్తితో గమనిస్తూ అన్నివిధాల సహకరించి ఆది సభా పర్వాల విడుదలకు ఏర్పాటు చేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాల నిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ ప్రణాళిక వ్యాఖ్యాసహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. తరువాతి సంపుటాలు సైతం త్వరలోనే వెలుగుచూడనున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారతం' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయసాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

కృతజ్ఞతలు :

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన సహృదయులు డా॥ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారికి అనేక ధన్యవాదాలు. తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి డా॥ పి.కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. సాహిత్య ప్రీతి కలవారైన తి.తి.దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ కె.నారాయణ, ఐ.ఏ.ఎస్. గారికి వందనములు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంబంధిత విభాగాధిపతిగా నూతనముగా వచ్చి సలహామండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన డా॥ పి. రంగారావు, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయసహకారాలందించిన తదితర అధికార గణానికి నమస్సులు. ఈ ప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధాన పాత్ర వహించిన - వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదక మండలి, సలహా మండలి) యందలి విద్యావేత్తలు ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు - ఈ విద్వాంసులందరికి నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి. దేవస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడం వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్ కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానిక పండితవర్యుల ఒక ఉపసంఘం (ఎడిటోరియల్ సెల్) నిర్మాణానికి సిఫారసు చేయగా, దేవస్థానం ఆమేరకు ఎడిటోరియల్ కమిటీలో ఉన్న **డా॥ కె.సర్వోత్తమరావు, డా॥ కె.జె.కృష్ణమూర్తి గారలతో స్థానికులైన విద్వాంసులు, పండితవరేణ్యులు శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీ ముదివర్తి కొండమాచార్యులు** గారలతో ఎడిటోరియల్ సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈ సెల్ ఉపకారం మరువరానిది. వీరు వర్క్‌షాపువలె శ్రీ వేంకటేశ్వర లైబ్రరీ మరియు పరిశోధన కేంద్రంలో నిర్వహించబడ్డ కవిత్రయ మహాభారత యజ్ఞంలో పాలుపంచుకొన్నారు. అందువలననే అతి త్వరితకాలంలో ఆరణ్యపర్వ శేషభాగం ముద్రణ పొతూ ఉండగా విరాటపర్వం కూడ ప్రెస్సుకు పంపగల్గుతున్నాము. తక్కిన పర్వసంపుటాలను ఇలాగే అందించగలమని ఆశిస్తున్నాము.

"సప్తగిరి" సంపాదకులుగా ఉండి, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి ప్రముఖ పాత్ర వహించిన కీ.శే. కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. "సప్తగిరి" సంపాదక కార్యాలయ ప్రచురణల విభాగంలో 'సబ్-ఎడిటరు'గా ఉద్యోగిస్తూ 1995లో పదవినుండి విరమించేదాకా ఈ ప్రణాళిక విషయమై మిగుల సహకరించిన విద్వత్కవివర్యులు శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు గారికి, ఆచార్య కె.జె.కృష్ణమూర్తి (కంట్రోలర్ ఆఫ్ పబ్లికేషన్సు) గారికి అనేక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్నివిధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు శ్రీ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె.రాధారమణ, డాక్టర్ ఎ.సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి.ఎన్. శ్రీనివాసన్ గారికి, తదితర సిబ్బందికి, టి.టి.డి. ముద్రణాలయ అధికారి శ్రీ ఐ.పార్వతీశ్వర రావు గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహవిశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ఎస్.ఎస్. రామమూర్తి
కన్వీనర్
సంపాదకుడు - సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదకమండలి

అధ్యక్షులు

శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకుడు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం

సంపాదకమండలి సభ్యులు

ఆచార్య నందూరి రామకృష్ణమాచార్యులు
శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు
ఆచార్య ఎస్.బి. రఘునాథాచార్య
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
ఆచార్య కె.జె. కృష్ణమూర్తి
ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

ఆచార్య బిరుదురాజు రామరాజు
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు
ఆచార్య ఎం. బుద్ధన్న
ఆచార్య ఎం. కులశేఖరరావు

ఎక్స్ అఫిషియో సభ్యులు

డా॥ పి. రంగారావు
పౌరసంబంధాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

డా॥ మేడసాని మోహన్, డైరెక్టర్
అన్నమాచార్య ప్రాజెక్ట్, తి.తి.దే.

ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానంద, కార్యదర్శి
ధర్మప్రచార పరిషత్తు, తి.తి.దే.

కన్వీనర్

డా॥ ఎన్.ఎస్. రామమూర్తి.
"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా 1,2
4. డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్న శాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	ఆను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	ఆను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఆను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది.	–	ఆదిపర్వం
సభా.	–	సభాపర్వం
ఆర.	–	ఆరణ్యపర్వం
విరా.	–	విరాటపర్వం
ఉద్యో.	–	ఉద్యోగపర్వం
భీష్మ.	–	భీష్మపర్వం
ద్రోణ.	–	ద్రోణపర్వం
కర్ణ.	–	కర్ణపర్వం
శల్య.	–	శల్యపర్వం
సౌప్తి.	–	సౌప్తికపర్వం
స్త్రీ.	–	స్త్రీ పర్వం
శాంతి.	–	శాంతిపర్వం
ఆను.	–	ఆనుశాసనికపర్వం
అశ్వ.	–	అశ్వమేధపర్వం
ఆశ్ర.	–	ఆశ్రమవాసపర్వం
మౌస.	–	మౌసలపర్వం
మహా.	–	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	–	స్వర్గారోహణపర్వం
సం.	–	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	–	సంస్కృత మహాభారతము
అను.	–	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	–	ప్రధాన సంపాదకుడు

క.	–	కందపద్యం
వ.	–	వచనం
ఆ.	–	ఆటవెలది
తే.	–	తేటగీతి
సీ.	–	సీసం
ఉ.	–	ఉత్పలమాల
చ.	–	చంపకమాల
మ.	–	మత్తేభ విక్రీడితం
శా.	–	శార్దూల విక్రీడితం
ఆశ్వా.	–	ఆశ్వాసం
క్రీ.శ.	–	క్రీస్తుశకం
య.	–	యగణం
మ.	–	మగణం
త.	–	తగణం
ర.	–	రగణం
జ.	–	జగణం
భ.	–	భగణం
న.	–	నగణం
స.	–	సగణం
ల.	–	లఘువు
గ.	–	గురువు
అలం.	–	అలంకారం
సం.	–	సంవత్సరం
మొ.	–	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పీఠిక

ఉ. "ఆదరణీయ సార వివిధార్థగతి స్ఫురణంబు గల్గి య
ష్టాదశ పర్వ నిర్వహణ సంభృతమై పెనుపొంది యుండ నం
దాదిఁ దొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్". **(విరా. 1.6.)**

ఆంధ్ర మహాభారతం పదునెనిమిది పర్వాల నిర్వహణం కలిగిందై పెంపొంది ఉండగా అందులో నన్నయభట్టు మొదటి మూడు పర్వాలను దక్షతతో రచించాడని తిక్కన సోమయాజి పేర్కొన్నారు. భారతం ఆదరించదగిన, సారవంతమైన, నానారుచిరార్థస్ఫూర్తి కలిగిందట! నన్నయ వాడిన 'సారమతి', 'ప్రసన్న కథాకలి(వి)తార్థ యుక్తి', 'నానా రుచిరార్థ సూక్తి నిధిత్వం', అందరూ ఆదరించే 'అక్షరరమ్యత' అనే లక్షణాలన్నీ కలసివచ్చేటట్లు భారతానికి విశేషణం వాడటం తిక్కన్న తీర్పరితనం. పై పద్యంలో మూడుకృతులంటే మూడు పర్వాలు - ఆది, సభా, ఆరణ్య పర్వాలు. ఆ మూడు పర్వాలను దక్షతతో నిర్వహించిన నన్నయ వరుసగా కవిత్వవిశారదుడు, విద్యాదయితుడు, మహితాత్ముడు. ఆదిపర్వంలో నన్నయ కవితాకళ విశ్వరూపం ప్రదర్శించింది. సభాపర్వంలో నన్నయ తెలుగు కావ్య విద్యకు బ్రహ్మకల్పుడుగా రాణించాడు. ఆరణ్యపర్వంలో ఒక మహితాత్ముడుగా ప్రకాశించాడని తిక్కన ప్రౌఢంగా నిర్దేశించాడు. ఆ మాట నిజం. ఆరణ్యపర్వరచనం మహాకవి మాత్రమే కాక మహితాత్ముడైనవాడు మాత్రమే వ్రాయగలడని తిక్కన అభిప్రాయం.

మూడు పర్వాల ముచ్చట :

నన్నయ మొదటి మూడు పర్వాలు రచించాడన్న మాట తిక్కన ఔపచారికంగా చెప్పినమాట! నన్నయభట్టు రచన ఆరణ్యపర్వ చతుర్థాశ్వాసంలోని 142వ పద్యంతో ఆగిపోయిందని వ్రాత ప్రతులన్నీ సాక్ష్యం పలుకుతున్నాయి. నన్నయ ఆంధ్ర మహాభారత రచనను సుమారు క్రీ.శ.1054-55 నుండి నాలుగైదేళ్ళు సాగించి సహజంగా తనువును చాలించి ఉంటాడు. ఆ తరువాత రెండు వందలేండ్లకు తిక్కన విరాటపర్వం మొదలుకొని పదునేను పర్వాలు చేపట్టి, భారతం తుదముట్టించాడు. ఆ తరువాత ఎఱ్ఱాప్రెగ్గడ 14వ శతాబ్ది పూర్వార్ధంలో ఆరణ్యపర్వశేషాన్ని పూరించాడు. ఈ విధంగా మహాభారతం తెలుగులో పూర్తికావటానికి మూడు శతాబ్దాలకాలం పట్టింది. ముగ్గురు కవులు చేపట్టి నిర్వహించవలసి వచ్చింది.

అయితే, నన్నయ మొదటి మూడు పర్వాలు రచించాడని భావించేవారు చెప్పే ఉపపత్తులు కొన్ని ఉన్నాయి. నన్నయ తరువాత భారత రచనను చేపట్టిన తిక్కనే కాక, ఆయన శిష్యుడు మారనకూడ నన్నయ మూడుపర్వాలు రచించాడనే పేర్కొన్నాడు- తన మార్కండేయ పురాణావతారికలో

ఉ. "సారకథా సుధారస మజస్రము నాగళపూరితంబుగా
నారఁగఁ గ్రోలుచు న్జనులు హర్షరసాంబుధిఁ దేలునట్లుగా
భారతసంహిత న్మును ద్రిపర్వము లెవ్వఁ డొనర్చె నట్టి వి
ద్యారమణీయు నాంధ్రకవితాగురు నన్నయభట్టుఁ గొల్చెదన్." **(మార్కండేయపురాణము : పీఠిక.9.)**

అప్పకవికూడ నన్నయ మూడు పర్వాలు చెప్పాడని పేర్కొన్నాడు. ఆరణ్యపర్వంలో ఆశ్వాసాంత గద్యలన్నింటిలో నన్నయ రచించినట్లే ఉన్నది. ఆశ్వాసారంభాంత పద్యాలలో రాజరాజనరేంద్రుడికే వినిపిస్తున్నట్లున్నది. దీనినిబట్టి నన్నయ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆరణ్యపర్వమంతా రచించి ఉండవచ్చుననీ, ఎఱ్ఱన కాలంనాటికి ఆ పర్వంలో కొంతభాగం చెదలు తిని ఉండవచ్చుననీ, ఆ క్రిమిదష్టమైన భాగాలను ఎఱ్ఱాప్రెగ్గడ పూరించి ఉండవచ్చుననీ కొందరు పండితులు భావించారు. ఎఱ్ఱన నృసింహపురాణంలో తన తాత ప్రశంసించినట్లు ఈవిధంగా చెప్పుకొన్నాడు:

"ఉన్నత సంస్కృతాది చతురోక్తి పదంబులఁ గావ్యకర్తవై
యెన్నిక మైఁ బ్రబంధపరమేశుఁ డనంగ నరణ్యపర్వ శే
షోన్నయ మాంధ్రభాష, సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి తౌ
నన్నయభట్ట తిక్కకవినాథుల కెక్కిన భక్తి పెంపునన్" **(నృసింహపురాణము - 1.17)**

ఈ పద్యంలో 'అరణ్య పర్వశేషోన్నయం ఎఱ్ఱాప్రెగ్గడ చేశా'డని చెప్పబడింది. అంటే ఆరణ్యపర్వంలో (శిథిలమై పోగా) శేషించిన దాన్ని ఉద్ధరించటం చేశాడని అర్థం చెప్పారు పర్వత్రయవాదం వారు. నన్నయ మూడు పర్వాలు వ్రాశాడు. కాని, కొంత శిథిలమై పోయింది. ఆ శిథిలమైన చోట్ల ఎఱ్ఱాప్రెగ్గడ పూరించి ఉంటాడని వారి వాద తాత్పర్యం. ఈ వాదాన్ని నన్నయ పక్షాన పర్వత్రయవాదమనీ, ఎఱ్ఱన పక్షాన శిథిలపూరణవాదమనీ పిలువవచ్చును.

ఈ వాదాన్ని చాలమంది అంగీకరించటం లేదు. ఎఱ్ఱన నృసింహపురాణంలోని 'అరణ్యపర్వశేషోన్నయ' మనే సమాసానికి నన్నయ వ్రాయగా మిగిలిన భాగాన్ని ప్రతిభతో భావించి కల్పించటమని వీరు వ్యాఖ్యానించారు. వీరు మొదట శిథిల పూరణ వాదాన్ని సమూలంగా ఖండించారు. ఎఱ్ఱన ఆరణ్యపర్వం చివరలో తాను ఆరణ్యపర్వశేషాన్ని పూరించినట్లే స్పష్టంగా చెప్పుకొన్నాడు. ఆ తరువాతి కవులందరూ ఆ సత్యాన్ని ఏకకంఠంతో సమర్థించారు. నన్నయప్రతి క్రిమిదష్టమై పోవటానికి కారణం ఆతడు వ్రాసికొన్న ప్రతి ఒకటి మాత్రమే ఉండటం కావాలి. నన్నయ రచనకు ప్రతులు కరువయ్యాయన్న వాదం అర్థరహితం, సత్యదూరం. కాబట్టి క్రిమిదష్టవాదం సక్రమం కాదు. అనేక ప్రతులు ఉన్నవని అంగీకరిస్తే అన్నిట్లో ఒకేచోట ఒకేవిధంగా చెదలు పట్టటం అసందర్భం. అది అట్లా ఉండగా, నన్నయ వ్రాసిన మధ్యాక్కరలలో ఎఱ్ఱన వ్రాసిన వాటిలో యతిని పాటించడంలో భేదం కనపడుతుంది. కాబట్టి మధ్యాక్కరలున్నచోటే చెదలు కొరికాయా అన్న అనుమానం రాకమానదు. అందువలన చెదలు పట్టిన భాగాలను ఎఱ్ఱన ఉద్ధరించాడనే వాదం పరాస్తమై పోయింది. ఎఱ్ఱన ఆరణ్యపర్వశేషాన్ని పూరించాడన్న వాదం నిలిచింది.

విశిష్ట సాహిత్య నీతి :

ఆంధ్ర సాహిత్య చరిత్రలో ఆరణ్యపర్వం ఒక విశిష్ట సాహిత్య నీతికి పతాకగా నిలుస్తుంది. నన్నయ రచన అకస్మాత్తుగా ఆగిపోతే, ఆ పర్వాన్ని పూరించటానికి తిక్కనాదులు ముందుకు రాలేదు. నన్నయ రచన నరాంకితమైనది. తిక్కన రచన దైవాంకితమైనది. అందువలన నరాంకితమైన ఆరణ్యపర్వంలోని శేషాన్ని ఎత్తుకొనకపోయి ఉండవచ్చును. ఆ పర్వం నన్నయ పేరు మీదనే ఉండటం ఔచిత్యమని భావించి మూడుపర్వాలనూ నన్నయపేరుమీదనే లెక్కించే ఒక సంప్రదాయాన్ని పాటించి ఉండవచ్చును. తిక్కననాటినుండి వస్తున్న ఆ మర్యాదను ఎఱ్ఱన గౌరవించి ఉంటాడు.

ఆరణ్యపర్వం అనర్థదాయక మని ఒక వదంతి లోకంలో ఉన్నది. అందువలననే నన్నయ ఆ పర్వరచన చేస్తూ మరణించాడని కొందరూ, మతిచాంచల్యానికి గురి అయినాడని కొందరూ, భీమకవి శాపానికి బలి అయినాడని, అథర్వణుడి ఉసురుకొట్టి పోయాడని కొందరూ, కట్టుకథ లనేకం లోకంలో సృష్టించారు. అవన్నీ ఆధార రహితాలనిన్నీ, నన్నయ ఉత్తమశీలుడనీ

చారిత్రికాధారాలే నేడు నిరూపిస్తున్నాయి. ఇక పోతే, అనర్థభీతివలననే తిక్కన ఆరణ్యపర్వశేషాన్ని పూరించకుండా ఆ పర్వమంతా నన్నయే వ్రాశాడని చెప్పాడనీ, అతడి శిష్యుడైన మారన కూడా అదే పాట వల్లించాడనీ కొందరు భావించారు. ఎఱ్ఱన ఎట్లాగో సాహసించి ఆరణ్య పర్వశేష పూరణకు పూనుకొన్నా, తనపేరు పెట్టుకొంటే ఏ ముప్పు వాటిల్లుతుందో అని భయపడి నన్నయ పేరు మీదనే, రాజరాజనరేంద్రుడికి వినిపిస్తున్నట్లుగానే వ్రాశాడని ఆ వాదం వారు భావించారు. ఈ భీరుత్వవాదాన్ని కూడా ధీరు లంగీకరించటం లేదు. అంతేకాక, మహాభారతాన్నంతా ఒకే కలంతో రచించిన మహాకవు లెందరో ఉన్నారు. వారందరికీ పట్టని ఈ అనర్థవాదం కవిత్రయానికి అన్వయించబూనటం అనౌచిత్యం.

అందుకే ఆరణ్యపర్వ రచనం ఒక అపూర్వ సాహిత్యనీతికి నిదర్శనంగా మనం చెప్పుకొని గర్వించటం! ఒక మహాకవి యొక్క సారస్వతాంశ తనయందు ప్రకాశిస్తున్న మరొక మహాకవి ఆయన ప్రారంభించి ముగించలేని ఒక కావ్యభాగాన్ని, ఆయన కవిత్వ లక్షణాలు ముద్రించుకొన్న తన కవితతో ఆయన పేరుమీద, ఆయన రచనగా రచించటం అపూర్వం! దానికి ఉదాహరణం ఆరణ్యపర్వ శేషాన్ని పూరించి, వినయంగా తన పాత్రను పేర్కొని ఊరుకొన్న వినమ్ర విద్వన్మూర్తి ఎఱ్ఱన. ఆయన వంటి కవులను సాహిత్యక్షేత్రంలో అరుదుగా చూస్తాం. ఎఱ్ఱన అట్లా చేయటానికి కారణం నన్నయమీద పూర్వ మహాకవులందరికి వలెనే ఆయనకూ ఉన్న పరమగురుభావమే. అది ఒక ఉదాత్త సాహిత్యనీతిగా ఎఱ్ఱన పాటించి చూపించాడు. అందువలననే నన్నయ మూడుకృతులు వ్రాశాడన్నా ఆ నీతిలో వైరుధ్యం రాదు. ఎఱ్ఱన రానీయ లేదు. నన్నయను నాటికీ నేటికీ కవిలోకం ఆ గురుస్థానంలోనే నిలిపి గౌరవిస్తున్నది.

ఆరణ్యపర్వం - రెండు భాగాలు :

ఇంతవరకు ఆరణ్యపర్వాన్ని ఒక సంపుటిగా ప్రచురించే పరిపాటి సాగుతూ వస్తున్నది. కాని, తిరుమల తిరుపతి దేవస్థానంవారు వ్యాఖ్యాసహితంగా ప్రచురించ బూనటంతో పరిమాణాన్ని దృష్టిలో ఉంచుకొని, పఠితల సౌకర్యం కొరకు ఈ మూడో సంపుటాన్ని రెండు భాగాలుగా వెలువరించవలసి వచ్చింది. అందువలన నన్నయ రచనగా ప్రసిద్ధిచెందిన భాగాన్ని (ఆరణ్యపర్వం మొదటినుండి నాలుగో ఆశ్వాసం 142వ పద్యం వరకు) మొదటి భాగంగానూ, ఎఱ్ఱన రచన అయిన ఆరణ్యపర్వ శేషాన్ని రెండవ భాగంగానూ ప్రచురించటం జరుగుతున్నది. ఈరెండు భాగాలను పూర్వోత్తర భాగాలుగా పేర్కొనటం లేదు. ఎందువల్లనంటే హరివంశంలో వలె, భాగవత దశమస్కంధంలో వలె కథ నాధారంగా చేసికొని కవి ఏర్పరచిన సహజ విభాగం కాదిది. మొదటి భాగం ఆశ్వాసం మధ్యలోనే ఆగుతుంది. రెండోభాగం ఆశ్వాసారంభంతో మొదలు కాదు. కాబట్టి శ్రీకారంతోకూడ మొదలు కాదు. ఈ విధమైన విభాగంతో ఆరణ్యపర్వాన్ని తెలుగులో మొదటిసారి ప్రచురించటం జరుగుతున్నది. మొదటి భాగం నన్నయ భాగమనీ, రెండవభాగం నన్నయరచనగా చెప్పబడుతున్న ఎఱ్ఱాప్రగ్గడ రచనమనీ స్పష్టమైన వింగడింపుతో ఈ విభాగం చేయబడింది. ఇది ఈ ప్రచురణకు సంబంధించిన విశేషాంశం మాత్రమే సహృదయులు గమనించ ప్రార్థన.

ఆరణ్య శాంతి పర్వాలు జ్ఞాన నేత్రాలు :

మహాభారత సాహిత్యమూర్తికి ఆరణ్య శాంతి పర్వాలు జ్ఞాన చక్షువులు. ఇతిహాసంలోని శాస్త్రాంశలను పుష్కలంగా నింపుకొన్న విజ్ఞాన నిధులు. పరిమాణంలో అన్ని పర్వాల కంటె పెద్దది ఆరణ్యపర్వం. దీనికంటె మరికొంత పెద్దది శాంతిపర్వం. 13664 శ్లోకాల సంస్కృత ఆరణ్యపర్వాన్ని నన్నయ ఎఱ్ఱనలు 2894 గద్య పద్యాలలో రచించారు. 14525 శ్లోకాల శాంతి పర్వాన్ని 3093 గద్యపద్యాలతో తిక్కన నిర్మించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మిగిలిన పర్వాలకూ ఈ రెండింటికీ కొట్టవచ్చినట్లు ఒక తేడా కనపడుతుంది. ఇవి ప్రధానంగా పాండవుల ఇతివృత్తాన్ని రసవత్తరంగా చెప్పటానికి ఉద్దేశించబడినవి కావు. పాండవుల మనఃప్రవృత్తిని, వ్యుత్పత్తిని, జ్ఞానాన్ని ప్రబోధాత్మక ప్రక్రియల ద్వారా వికసింప చేయటానికై ఏర్పడిన జ్ఞాన కాండలు. ఇందులో కేంద్రపాత్ర ధర్మరాజు. అతడు ఇతిహాస నాయకుడు. చతుర్విధ పురుషార్థ సాధకుడు. ధర్మవీరమూర్తి. అతడు జీవితంలో రెండుసార్లు అపార సంతాప సముద్రంలో మునిగి ఉక్కిరిబిక్కిరైనా, ధీరుడై మహాత్ముల విజ్ఞాన ప్రబోధాలతో ఆ విషాదస్థితి నుండి తేరుకొని, కార్యశూరుడై ధర్మసాధనకు పూనుకొన వలసిన విశిష్ట ఘట్టాలను ఎదుర్కొన్నాడు. ఆ రెండు ఘట్టాలను చిత్రించేవే ఆరణ్య శాంతి పర్వాలు.

మాయాద్యూతంలో రాజ్యసంపదలను కోల్పోయి, కురుసభలో దుర్భరమైన అవమానాలకు లోనై, అరణ్య, అజ్ఞాతవాసాలకై అడవులపాలై పడరాని కష్టాలను పొందుతున్న పాండవులు అవమానాగ్నితో దహింపబడుతూ అంతశ్శాంతిని కోల్పోయారు. పెద్దవాడైన ధర్మజుడు క్షమావంతుడై, నిగ్రహంతో ఆ అవమాన ఘూర్ణితమానసిక స్థితినుండి తేరుకొని, క్రమంగా శత్రువులను సంహరించటానికీ, వారిపై పగ సాధించి సర్వసర్వంసహాచక్రవర్తిత్వాన్ని సాధించటానికీ సాగించే నిరంతర నిశ్శబ్ద తపోవీరవికాస చరిత్రమే ఆరణ్యపర్వగాథ. శాంతిపర్వంలో ధర్మజుడు బంధుజన వియోగదుఃఖంతో, బంధు మిత్రజన సంహారం వలన కలిగే పాపభయంతో క్రుంగి కుమిలిపోతాడు. ఆ నిర్వేదంనుండి ధర్మజుడిని తేర్చి, భూమిని పాలించే ఉత్సాహమూర్తిగా మార్చే పరిణామప్రవృత్తిని చిత్రించేది శాంతిపర్వం.

ఈ రెండు పర్వాలూ ధర్మరాజుకు ప్రబోధ గీతాలుగా సాగటం విశేషం. ఆరణ్యపర్వంలో పాండవుల నడుమ సంవాదాలు నడుస్తాయి. పరస్పరం వారు ఎన్నో విషయాలను చర్చించుకొంటారు. అవన్నీ వారు సభాపర్వంలో తమకు కలిగిన అవమానశోకాన్ని ఉపశమింప చేసికొనటానికి ఉపయోగపడే శైత్యోపచారాలే. పాండవుల వద్దకు శ్రీకృష్ణాది బంధువులు వచ్చి పలికే ఓదార్పు మాటలన్నీ వారి దైన్యాన్ని తొలగించటానికి చేసే దోహదాలే. అవమానాగ్ని జ్ఞానవర్షంచేత కాని ఉపశమించదు, అరణ్యవాసాన్ని యోగసాధనగా మార్చుకొంటే కాని విజయోత్సాహానికి మార్గాలు ఏర్పడవు. ఆ వెలుగుబాటను చూపించే మహితాత్ములు మహర్షులు. ఆరణ్యపర్వంలో ధర్మరాజువద్దకు పిలిచినట్లుగా మహర్షులు వచ్చారు, యోగక్షేమాలు విచారించారు, ఉపశమన వాక్యాలు పలికారు. అనుమానాలు తీర్చండని అడిగితే తగిన పురాణేతిహాస కథలను చెప్పి, ధర్మోపదేశాలు చేసి వారికి వెలుగుబాటలు చూపారు. మంత్రాల నిచ్చారు. వరాలు కురిపించారు. ఉపాయాలు చెప్పారు. తీర్థయాత్రలు చేయించారు. దివ్యలోకాలను దర్శింప చేశారు. అరణ్యవాసాన్ని ఒక దివ్యయోగంగా మార్చుకొనేటట్లు చేశారు. ఆరణ్యపర్వం అవమానాగ్ని తాపం చల్లారటానికి పాండవులు చేసిన జ్ఞాన తీర్థస్నాన పరంపరగా భాసిస్తుంది. పాండవాగ్రజుడు భారత నాయకుడు. అతడు సమగ్ర విజయోపాయాలను స్వాయత్తం చేసికొని, చిత్తశాంతితో విజయలక్ష్యంవైపు ఉన్ముఖుడయ్యే ప్రస్థానమే ఆరణ్యపర్వంలోని కథా తాత్పర్యం.

శాంతిపర్వం కూడా ధర్మజుడి చిత్తవృత్తి వికాసం కొరకు ఏర్పడిందే. బాంధవవధవలన కలిగిన శోకాన్నీ, పాపాన్నీ పోగొట్టుకొని రాజ్యపరిపాలనం చేయటానికి కావలసిన చిత్తస్థైర్యాన్నీ, పుణ్యపాకాన్నీ సమకూర్చే భీష్మప్రబోధం శాంతి పర్వ తాత్పర్యం. పెక్కురు చెప్పిన బోధలసారం ఆరణ్యపర్వం. పితామహుడు చెప్పిన నీతిసారం శాంతిపర్వం. చెప్పిన దెవరైనా, ఎంతమందైనా బాగుపడింది ధర్మజుడు, అతడి చలువ వలన పాండవులు, వారి పుణ్యాన భారతం చదివే పాఠకజనులు.

కథ - బోధ - కాలం :

మహాభారతేతిహాసానికి నాయకుడు ధర్మరాజనీ, అతడి నాశ్రయించి ధర్మవీరం పోషించబడుతుందనీ కథాపరంగా, తత్త్వపరంగా నిరూపించే ఉదాత్త పర్వాలు ఆరణ్య శాంతిపర్వాలు. శాంతి పర్వ ప్రశస్తిని ఆ పర్వ పీఠికలో చేయటం సముచితం. ప్రస్తుతం ఆరణ్యపర్వ వస్తు విచారం, రసానుకూల తత్త్వవిచారం సమంజసం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆరణ్యపర్వకథ ధర్మరాజు ఎదుర్కొనే రెండు పరీక్షలతో సహజంగా సమవిభక్తమై ప్రత్యక్షమౌతుంది. మొదటిది నహుషప్రశ్నల పరీక్ష. రెండవది యక్షప్రశ్నల పరీక్ష. ఇదొక చిత్రమైన కథానిర్మాణం. ధర్మజుడు వనవాస సమయంలో ఈ రెండు పరీక్షలలో ఉత్తీర్ణుడయ్యే మానసికమైన అధికారాన్ని సంపాదించేందుకు తోడ్పడేదే ఈ పర్వంలోని వస్తువు.

ఆ వస్తువును ఆఖ్యానంగా, ఉపాఖ్యానాలుగా విభజించవచ్చును. ఆఖ్యానంలో కథ సాగుతుంది. ఉపాఖ్యానాలలో బోధ సాగుతుంది. ఈ రెండూ పరస్పర పోషకాలుగా ఉండటం ఈ పర్వంలోని కథామర్మంకూడా! ఉపాఖ్యానాలన్నీ ధర్మజు డడిగిన ప్రశ్నలకు మహర్షు లిచ్చిన సమాధానాలే. ఆ సమాధానాలవలన ఏర్పడిన సంస్కారంతో ధర్మజుడు నహుష, యక్షప్రశ్నలకు సక్రమమైన, సమర్థవంతమైన సమాధానా లివ్వ గలుగుతాడు. పృచ్ఛకుడి ప్రశ్నలకు ఇతిహాస పురాణ గాథలతో సమాధానాలు చెప్పి, మిత్రసమ్మితంగా ధార్మిక ప్రబోధం చేయటమే ఇతిహాస స్వభావం. అది సర్వాంగసుందరంగా ఆరణ్యపర్వంలో పురివిప్పింది.

ఆరణ్యపర్వంలో కథ తక్కువనీ ఉపకథ లెక్కువనీ, గడిచిన కాలం ఎక్కువనీ చెప్పినకథ తక్కువనీ కొందరు విమర్శకులు భావించారు. ఉదాహరణకు డాక్టర్ పాటిబండ మాధవశర్మగారి మాటలు గమనించదగినవి -- "ఆరణ్యపర్వమున కాలము పండ్రెండేళ్ళు జరిగినకథ. కథ మాత్రము పన్నెండు అంగుళములు కూడ జరుగలేదు. మఱి జరిగిన దేమిటి? ధర్మజుని ధర్మబలము పెరిగినది. భీముని భుజబలము పెరిగినది. అర్జునుని అస్త్రబలము పెరిగినది. అజ్ఞాతవాస సమ్యగనుష్ఠానమునకు, రాజ్య పునఃప్రాప్తికి, ప్రతిజ్ఞాపరిపూర్తికి సదుపాయములు అమరినవి." (ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ - ఆంధ్రమహా భారతము-ఆరణ్యపర్వము- పీఠిక. పుట9)". కాలం సాగినంతగా కథ సాగలేదన్నమాట ఆఖ్యానానికి సంబంధించింది. కాలం ఉపాఖ్యాన శ్రవణంతో, తీర్థయాత్రా గమనంతో సాగినట్లు అనిపించినా, అసలు కథలో రమణీయమైన ఘట్టాలు కొన్ని చిత్రించబడినా, ఆ రెండూ కాలగతిని సూచించేవిగానే ఉన్నాయి. అందువలన శర్మగారి మాటలతో మనం పూర్తిగా ఏకీభవించలేం. ఎందువలన అంటే కథకూ బోధకూ గల సంబంధాన్ని ఈ పర్వంలో కాలంతో కవి నిబంధించి చెప్పాడు కాబట్టి. కథ, బోధ, కాలం అనేవి ఈ పర్వంలోని వస్తువుకు మూడు ముఖాలు.

ఆరణ్య పర్వం ఒక ప్రశ్నోపనిషత్తు

ధర్మరా జడిగిన ప్రశ్నలే ఆరణ్యపర్వ కథా ప్రగతికి సోపానాలు. వాటి తాత్పర్యాన్నీ, తత్త్వాన్నీ గ్రహించి పురోగమించటమే ఈ పర్వంలోని పరమతాత్పర్యం. ఈ దృష్టితో చూస్తే ఆరణ్యపర్వం ఒక ప్రశ్నోపనిషత్తు. ఆ ప్రశ్నల క్రమాన్ని స్థూలంగా గమనిస్తే ఆ సత్యం గోచరిస్తుంది-

1. ప్రశ్న: ఇష్ట మృష్టాన్నాలతో పూర్వం అన్నివేళలా సంతృప్తులైన బ్రాహ్మణులు అడవులలో కందమూలాలు తింటూ ఉంటే ఎట్లా సహించగలను ? (1.18)

శౌనకుడు : జనకగీతా తాత్పర్యబోధ. తృష్ణాక్షయప్రబోధం.

2. ప్రశ్న : నాతో కలిసి వచ్చిన బ్రాహ్మణులకు ఉగ్రవనాలలో ఆహారాన్ని ఏ ఉపాయంతో సంపాదించి పెట్టగలను? (1.36)

ధౌమ్యుడు : సూర్యోపాసనవలన చతుర్విధాహార ప్రాప్తి సాధించుమని ప్రబోధం.

3. ప్రశ్న : భూమినీ, రాజ్యాన్నీ, బంధువులనూ విడిచి మా వలె అడవులలో మృగాలనడుమ నివసిస్తూ పడరాని కష్టాలుపడిన రాజు లెవరైనా ఉన్నారా? ఉంటే ఆ కథ చెప్పండి. (2.3)

బృహదశ్వుడు : నలోపాఖ్యానం చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

4. ప్రశ్న : భూమికి ప్రదక్షిణంగా వెళ్ళి లోకంలో అనేకులు తీర్థాలను, సేవిస్తూ ఉంటారు. వారికి ఎటువంటి శుభఫలాలు కలుగుతాయి? బహుపుణ్య తీర్థాలనూ, వాటి ఫలాలనూ నాకు పరిచయం చేయండి. (2.235)

నారదుడు : తీర్థాలూ, వాటిని సేవించటంవలన కలిగే ఫలాలు చెప్పాడు.

5. ప్రశ్న : లోకంలో అధార్మికులైన కపటులకు అభ్యుదయం కలగటం, పుణ్యచరిత్రులైన ధార్మికులకు నిరంతరం అవమాన భారం కలగటం న్యాయమేనా? (2.310)

రోమశుడు : అధార్మికులకు కలిగే అభ్యుదయాలు స్వల్పకాలికాలనీ, ధార్మికులు పొందే అభ్యుదయాలు దీర్ఘకాలికా లనీ వివరించాడు.

6. ప్రశ్న : అచేతనాలైన పర్వతాలూ, నదులూ, సరోవరాలూ, పుణ్యతీర్థాలై, జగత్పావనాలై జనుల పాపాలను పోగొట్టుతూ ఉండటానికి గల కారణ మేమిటి? (2.309)

రోమశుడు : ధర్మపరులైన దేవతలు, ఋషులు వాటిని ఆశ్రయించటం చేత పర్వత, నదీ, సరోవరాదులు పవిత్రాలై, సర్వ కామితార్థ ఫలాలను ఇవ్వగలుగుతాయి.

7. ప్రశ్న : (అగస్త్యాశ్రమం దర్శించిన ధర్మజుడు): అగస్త్యుడు వాతాపిని చంపినకథ చెప్పండి. (2.318)

రోమశుడు : వాతాపిని అగస్త్యుడు జీర్ణం చేసికొన్న కథ చెప్పాడు.

8. ప్రశ్న : అగస్త్యుడి కథ మరింత వివరించండి. (3.2)

రోమశుడు : అగస్త్యుడు వింధ్యగర్వాన్ని అణచటం, సముద్రజలాలను త్రాగటం, తరువాత భగీరథుడు గంగను భూతలానికి తెచ్చి, సముద్రాలను మరల నీటితో నింపటం అనే కథలు చెప్పాడు.

9. ప్రశ్న : ఋశ్యశృంగ హ్రదంలో స్నానంచేసి, ఋశ్యశృంగ మహర్షి కథ చెప్పమని ధర్మరాజు అడిగాడు. (3.87)

రోమశుడు : ఋశ్యశృంగుడి చరిత్ర చెప్పాడు.

10. ప్రశ్న : మహేంద్రనగాన్ని దర్శించి అక్కడ ఋషులను పరశురాముడి వృత్తాంతం చెప్పండని అడిగాడు. (3.130)

అకృతవ్రణుడు:పరశురాముడి వృత్తాంతం చెప్పాడు.

11. ప్రశ్న : శర్యాతి యజ్ఞప్రదేశాన్ని దర్శించి అక్కడి చ్యవనుడి కథను చెప్పమని అడిగాడు.

రోమశుడు : సుకన్యోపాఖ్యానం చెప్పాడు.

12. ప్రశ్న : యమునా నదీ తీరంలో మాంధాతృడు యజ్ఞం చేసిన తీర్థాన్ని దర్శించి ఆ రాజుచరిత్ర నడిగాడు. (3.199)

రోమశుడు : మాంధాతృ చరిత్రం చెప్పాడు.

13. ప్రశ్న : సోమకుడు యజ్ఞంచేసి నూరుగురు కొడుకులను ఎట్లా పొందాడు? (3.207)

రోమశుడు : సోమకుడి చరిత్రం చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

14. ప్రశ్న : భృగుతుంగ పర్వత మాహాత్మ్యం చెప్పమని అడిగాడు. (3.227)

రోమశుడు : శిబి చక్రవర్తి చరిత్రం చెప్పాడు.

15. ప్రశ్న : శ్వేతకేతు తపోవనం గురించి అడిగాడు. (3.237)

రోమశుడు : శ్వేతకేతు, అష్టావక్రుల చరిత్ర చెప్పాడు.

16. ప్రశ్న : భరద్వాజాశ్రమంలో విద్యాగర్వంతో యవక్రీతుడు మృతుడైన విధం చెప్పమన్నాడు. (3.251)

రోమశుడు : యవక్రీతుడి చరిత్ర చెప్పాడు.

17. ప్రశ్నలు : ధర్మపరులమైన మే మీ విధంగా వివిధ దుఃఖాలను పొందటం, నిరంతర పాపకర్ములైన కౌరవులు సుఖోన్నతులు పొందడం - అనే ఈ విపర్యయానికి కారణం ఏమిటి? నరుడు తాను చేసే కర్మలకు ఫలాన్ని ఈ లోకంలోనే పొందుతాడా? పరలోకంలో పొందుతాడా? రెండింటా పొందుతాడా? విశ్వకర్త అయిన ఈశ్వరుడిని సరకు గొనని పురుషుడికి కర్మఫలం కలుగదా? ఈ దేహంతోనే నరుడికి కర్మతోటి సంబంధం తీరిపోతుందా? (4.168)

మార్కండేయుడు: ఉపవాసాది వ్రతాలతో తీర్థయాత్రాది పుణ్యకార్యాలు చేసినవారు ఇహంలోనూ, పరంలోనూ సుఖిస్తారని చెప్పుతూ మనుష్యుల కర్మగతి ప్రకారాన్ని వివరించాడు.

18. ప్రశ్న : బ్రాహ్మణ ప్రభావాన్ని తెలపండి అని అడిగాడు. (4.181)

మార్కం : హైహయుల వృత్తాంతం చెప్పాడు.

19. ప్రశ్న : బ్రహ్మ క్షత్ర స్వరూప నిరూపణం చేయుమని ప్రశ్న. (4.191)

మార్కం : అత్రి, గౌతముల వృత్తాంతం - దానికి సమాధానంగా చెప్పాడు.

20. ప్రశ్న : వైవస్వతమనువు ఏవిధంగా ప్రభావ సంపన్నుడైనాడు? (4.216)

మార్కం : వైవస్వతమనువు చరిత్ర చెప్పాడు.

21. ప్రశ్న : లోకాలన్నీ ప్రళయం పొందే ప్రకారాన్ని వివరించండి. (4. 239)

మార్కం : జలప్రళయం, వటపత్రశాయి అయిన విష్ణువు గర్భంలోకి మార్కండేయుడు ప్రవేశించి, సంగుప్తమైన సర్వసృష్టిని దర్శించి, వెలువడటం మొదలైన కథలు వివరించాడు.

22. ప్రశ్న : కలియుగంలో ధర్మలోపం ఎట్లా జరుగుతుందో తెలపండి. (4.284)

మార్కం : కలియుగ ధర్మకథనం; కల్కి అవతార కథను చెప్పాడు.

23. ప్రశ్న : బ్రాహ్మణ ప్రభావం గురించి చెప్పండి. (4.317)

మార్కం : పరీక్షితుడికథను, శలుడికథను చెప్పాడు.

24. ప్రశ్న : మార్కండేయ మహర్షి కంటె వృద్ధతముడైన పురుషు డున్నాడా? (4.359)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మార్కం : ఇంద్రద్యుమ్నుడి చరిత్ర చెప్పాడు.

25. ప్రశ్న : ఇక్ష్వాకువంశంలో పుట్టిన కువలాశ్వుడికి ధుంధుమారుడనే పేరు ఎట్లా వచ్చింది ? (4.372)

మార్కం : కువలాశ్వుడి చరిత్ర చెప్పాడు.

26. ప్రశ్న : ధుంధుడు మధుకైటభుల పుత్రుడని చెప్పారు. వారు ఏ కాలం వారు ? వారు ఏవిధంగా, ఎవరిచేతిలో ఏమైనారు? (4.390)

మార్కం : మధుకైటభుల చరిత్ర చెప్పాడు.

27. ప్రశ్న : పతివ్రతలైన వారి చరిత్రలు అత్యంత ధర్మసూక్ష్మాలై ఉంటాయి. కాబట్టి ఆ పుణ్యవ్రతల ప్రభావాన్ని తెలిపే కథలు చెప్పండి. (5.3)

మార్కం : పతివ్రతామాహాత్మ్యం, కౌశికుడికథ, ధర్మవ్యాధుడికథ, అతడి పూర్వజన్మ వృత్తాంతం; అతడి బోధ, అహింసా స్వరూపం, జీవ లక్షణ కథనం, పితృశుశ్రూష చేత ధర్మాన్ని ఆచరించే ఉపాయం మొదలైనవి చెప్పాడు.

28. ప్రశ్న : అగ్నిదేవుడు మహాతపస్సు చేశాడని వింటాం. ఎందుకు చేశాడు? అంగిరసుడు ఎందువలన అగ్ని అయ్యాడు? అగ్నులు ఎన్ని విధాలుగా అతిశయిల్లుతాయి? (5.146)

మార్కం : ఈ ప్రశ్నలకన్నింటికి అనువైన కథలు చెప్పాడు.

29. ప్రశ్న : కుమారస్వామి అగ్నికి, కృత్తికలకు, శివుడికి కొడుకని చెప్పుతారు. దానికి కారణమైన కథను వివరించండి. (5.175)

మార్కం : ఇంద్రుడు కేశి అనే రాక్షసుడిని పారద్రోలి దేవసేనను రక్షించటం; దేవసేనకు అనువైన వరుడిని కూరుస్తానని వరమివ్వటం; పితామహుడు కుమారస్వామి ఉత్పత్తిని సూచించటం, అగ్నికి సప్తర్షుల భార్యలపై వలపువలన విరహం కలగటం, స్వాహాదేవి ఋషిపత్నుల రూపంతో అగ్నిని కూడి అగ్ని వీర్యంతో కుమారస్వామిని ఒక కలశంలో ఉత్పన్నం చేయటం. అందువలన అతడు ఆరుగురు తల్లుల బిడ్డడైనాడు. ఇంద్రుడు కుమారస్వామిపై దాడిచేయటం, ఈశ్వరుడు కుమారస్వామిని పుత్రుడిగా అంగీకరించటం, సప్తమాతృకలను బాలగ్రహాలుగా మార్చటం, భద్రవటంలో కుమారస్వామిని దేవసేనాపతిగా అభిషేకించడం, మహిషాసుర సంహారం, మొదలైన కథలు చెప్పాడు.

30. ప్రశ్న : దానం, తపస్సు - ఈ రెండింటిలో ఏది కష్టమైనది? దేనివలన అధిక ఫలాన్ని పొందవచ్చును? (6.110)

వ్యాసుడు : దానం కంటె తపస్సు గొప్పదని చెప్పే వ్రీహిద్రోణాఖ్యానాన్ని, ముద్గలదేవదూతల సంవాదాన్ని వినిపించాడు.

31. ప్రశ్న : సైంధవుడు ద్రౌపది పట్ల చేసిన దుర్వ్యవసాయానికి పాండవులు నొచ్చుకొని ఉన్నారు. అప్పుడు మార్కండేయ మహర్షి వచ్చాడు. అప్పు డాయనను ధర్మరాజు ఈ విధంగా అడిగాడు: 'ఏ కాలంలోనైన ద్రౌపదివలె అత్యంతదుఃఖాన్ని పొందిన వనిత గాని, నావలె అనంత శోక సముద్రంలో మునిగిన రాజు కాని ఎవరైనా ఉన్నారా?' (6.263)

మార్కం : అందుకు దృష్టాంతంగా సీతారాముల కథ అయిన రామాయణాన్ని వినిపించాడు.

32. ప్రశ్న : మునీంద్రా! పతిభక్తి తాత్పర్యంతో సమస్త దుఃఖాలను సహించి, చివరికి శుభాన్ని పొందిన పుణ్యవతి చరిత్రం వినిపించండి! (7. 169)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మార్కం : సావిత్రి చరిత్ర చెప్పాడు. సావిత్రివలెనే ద్రౌపదికూడ పుణ్యవతి అనీ, మహాభాగ్యవతి అనీ చెప్పి, ఆమె కురువంశాన్ని అంతటినీ ఉద్ధరిస్తుందని ప్రకటించాడు. ఈ ప్రశ్నల పట్టీ ఆరణ్యపర్వంలోని బోధకు సంబంధించిన అంశాలను అనుశీలించటానికి ప్రాథమిక ప్రణాళికగా పనికి వస్తుంది. ఆలోచిస్తే అనేక విషయాలు ఇందులోనుండి బయట పడతాయి.

ఆరణ్య పర్వంలో పాండవకౌరవుల వృత్తాంతాలు సుమారు 45 శాతం, ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు మహర్షులు చెప్పిన ఉపాఖ్యానాల, ధర్మోపన్యాసాల భాగం సుమారు 55 శాతం. ఈ ప్రశ్నోత్తర భాగమంతా ధర్మజుడి జిజ్ఞాసకు సంబంధించినదే. కాబట్టి ధర్మజుడి తత్త్వజిజ్ఞాసకు ఆరణ్యపర్వంలో అగ్రతాంబూల మన్నది నిశ్చితార్థం.

ధర్మరాజు ధర్మవీరుడు, కర్మవీరుడు :

ధర్మరాజు వేసే ప్రశ్నల స్వభావాన్ని గమనిస్తే ఆతడు భక్తుడిగా కంటె, జ్ఞానిగా కంటె కర్మఠుడుగా కర్మసిద్ధాంతాన్ని నమ్మినవాడుగా కనపడుతున్నాడు. కొన్ని అంశాలను గమనిద్దాం.

1. ధర్మరాజు వెంట వేదవిదులైన విప్రులు కూడ అడవులకు కదలివచ్చారు. అప్పుడు అతడు తన గార్హస్థ్య ధర్మాన్ని స్మరించి, తన కర్తవ్యాన్ని పాలించటానికి సంకల్పించాడు. ధర్మజుడి దృష్టిలో ఆశ్రమ ధర్మాలన్నింటిలో గృహస్థాశ్రమ ధర్మం ఉత్తమమైనది. ఆ ఆశ్రమ ధర్మం నిర్వహించే రాజు పాటించవలసిన కర్తవ్యాలను పేర్కొన్నాడు. 'బాధ పడేవారికి ప్రక్క లమర్చాలి. భయపడేవారికి అభయమివ్వాలి. దప్పిగొన్నవారికి నీరందించాలి. ఆకలి గొన్నవారికి అన్నం పెట్టాలి. అలసిన వారికి ఆసన మమర్చాలి. ఇది సనాతన ఉత్తమ గృహస్థధర్మం' అని ధర్మరాజు పేర్కొన్నాడు. (1.31). కారడవులలో కూడా తన గృహస్థాశ్రమధర్మాన్ని మొక్కపోకుండ రక్షించుకొనటానికై సూర్యోపాసన చేసి, అక్షయతామ్రపాత్రను పొంది, అతిథి సత్కారాన్ని అవిచ్ఛిన్నంగా సాగించిన ఆదర్శకర్మఠుడు, గృహస్థుడు ధర్మరాజు. గృహస్థాశ్రమ ధర్మప్రాముఖ్యాన్ని చెప్పే భారతంలో ధర్మజుడు ఆ ఆశ్రమ ధర్మపాలనకు ఆదర్శప్రాయుడిగా చిత్రించబడటం ఆరణ్యపర్వ తాత్పర్యం.

2. తీర్థయాత్రలపట్ల ఆసక్తితో మొదట నారదుడివలన తీర్థాల పేర్లు, మహిమలు తెలిసికొన్నాడు- ధర్మరాజు. ఆ తరువాత ధౌమ్యుడి వలన ప్రేరితుడై తీర్థయాత్రలు చేయాలని సంకల్పించాడు. ఆపై ఇంద్రుడి ఆజ్ఞచొప్పున వచ్చి, ధర్మజుడిని వివిధ తీర్థయాత్రలకు వెంటపెట్టుకొని తీసికొనివెళ్ళి, తీర్థక్షేత్ర దైవ ఋషి స్థల మాహాత్మ్యాదులను వివరించి చెప్పగలిగిన రోమశమహర్షి వలన వివిధ తీర్థమహత్త్వగాథలను అడిగి చెప్పించుకొని చెవులార విన్నాడు. మనసార సంతోషించాడు. మునుగుమన్న తీర్థంలో విసుగులేక మునిగాడు. దీక్షలను, తపస్సులను, వ్రతాలను, దానాలను చేయుమన్నచోట్ల చెప్పినట్లుగా చేశాడు. తీర్థాలలో మునిగి దివ్యదృష్టిని దూర శ్రవణశక్తిని పొంది, దూరదూరాల నున్న దివ్యలోకాలను దర్శించిన ఆనాటి భూతల సార్వభౌముడు- ధర్మరాజు. అర్జునుడు ఇంద్రుడి దయవలన స్వర్గంలో ప్రవేశించి, ఆతడి అర్ధసింహాసనంమీద ఆసీనుడైనాడు. ధర్మజుడు తీర్థసేవలో ఆ దివ్యలోక దృశ్యాన్ని చూడగలిగాడు. తపస్సువలన అర్జునుడు సాధించిన దివ్యలోక గమనశక్తిని, ధర్మజుడు కర్మమార్గంలో తీర్థసేవాపుణ్యఫలంగా సంపాదించ గలిగాడు. భారతీయ గార్హస్థ్యధర్మంలో, కర్మపద్ధతిలో, తీర్థయాత్రావ్రతాన్ని తెలిసి ఆచరించి తత్ఫలితాన్ని సంపూర్ణంగా సాధించిన మహితాత్ముడు- ధర్మరాజు.

3. ధర్మరాజు హృదయంలో ఒక ధర్మ సందేహం బడబాగ్నివలె అతడిని బాధిస్తూ ఉండేది. దానికి తగిన సమాధానంకొరకు ఎదురుపడిన ప్రతి మహర్షిని గ్రుచ్చిగ్రుచ్చి అడిగాడు. ధర్మజుడి ప్రశ్నకు సమాధానం ప్రత్యక్షంగా చెప్పిన ఋషులు ఇద్దరు 1. రోమశుడు. 2. మార్కండేయుడు. పరోక్షంగా చెప్పినవారు మరొక ఇద్దరు. 1. వేదవ్యాసుడు, 2. ధౌమ్యుడు. ఆరణ్యపర్వంలో బోధకొరకే వచ్చిన మహర్షుల ముచ్చట చెప్పుకొంటే సరిపోతుంది.

రోమశమహర్షిని ధర్మజుడు ప్రశ్నించిన విధం ఇది --

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

"ధరణి నధార్మికులగు కా
పురుషుల కభివర్ధనంబుఁ బుణ్య చరిత్రం
బరఁగెడు ధార్మికులకు దు
ర్ధరమగు నవివర్ధనంబుఁ దగునె మునీంద్రా!' **(ఆర. 2.308)**

ఈ ప్రశ్న ధర్మరాజుకే కాదు, పఠితలకు కూడా గుండెలో కుంపటి వలె కాలుతూనే ఉంటుంది. అధార్మికులైన కౌరవులు అభివృద్ధి చెందారు. పుణ్యచరిత్రులైన పాండవులు అడవుల పాలైనారు. ఇదేమి న్యాయం? ధర్మమంటూ ఒకటి ఉంటే, దైవమంటూ ఒకడు ఉంటే ఇట్లా జరుగుతుందా? అనే అనుమానం అందరికీ కలుగుతుంది. దీని సమాధానం మీదనే ఆరణ్యపర్వ అస్తిత్వం ఆధారపడి ఉన్నది. ధర్మజుడి కర్మఠ స్వభావం బైటపడవలసి ఉన్నది. దీనికి సమాధానాన్ని రోమశుడు ఉత్తమ పౌరాణికుడివలె చెప్పాడు. అధర్మ పరులు అభ్యుదయాన్ని సాధించినా అది ఎక్కువ కాలం నిలువదు. త్వరలో నశించి పోతుంది. వేలసంఖ్యలో దైత్యదానవులు దేవతలను బాధించి సంపదలను దోచుకొని భాగ్యాలను అనుభవించారు. కాని, వారి కాసంపదలు ఎక్కువకాలం నిలువలేదు. దేవతలు ధర్మవర్తనులు కాబట్టి తాత్కాలికంగా సౌఖ్యాలకు దూరమైనా, స్వీయధర్మశక్తితో వారు త్వరలోనే తమ అభ్యుదయాలను తిరిగి పొందగలిగా రని తార్కాణం చూపిస్తూ కపటులైన కౌరవుల సంపదలు కలకాలం నిలువవనీ అమరతుల్యులైన పాండవులు ధర్మారంభ విశిష్టమతులు కాబట్టి రాజ్యాన్ని తిరిగి పొందగలరనీ ధర్మజుడికి ధైర్యం చెప్పాడు. దేవదానవుల దృష్టాంతం పాండవ కౌరవుల పట్ల చక్కగా అమరి, రోమశుడి పురాణ ప్రవచన గౌరవాన్ని కాపాడింది. 'ధర్మో రక్షతి రక్షితః' అనే న్యాయం రోమశుడి ప్రవచనసారం.

మార్కండేయమహర్షిని ప్రశ్నించేనాటికి ధర్మజుడు మరికొంత వివేకాన్ని ప్రదర్శించాడు. రోమశుడు ధర్మప్రాతిపదికమీద సమాధానం చెప్పాడు. ధర్మజుడు కర్మప్రాతిపదికమీద సమాధానాన్ని కోరుతున్నాడు. రోమశుడి వలన దానిని పొందలేక పోయాడు. మార్కండేయుడి వద్ద కర్మఫల రూపమైన ప్రశ్నలతో కలిపి అదే అనుమానాన్ని విశదంగా వెలువరించాడు.

సీ. 'కడఁగి ధర్మముతోడ నడచుచు నే మిట్లు । దందడి దుఃఖంబుఁ బొందుటయును
నేపున నెప్పుడు పాపంబు సేయుచు । ధృతరాష్ట్రజులు సుఖోన్నతు లగుటయుఁ
గని యీ విపర్యయమునకు నే నూహింతుఁ । బాయక నరుఁ డిప్డు సేయు కర్మ
మున ఫల మిందుఁ బొందునొ? పరలోకంబు । నందుఁ బొందునొ? యిందు నందుఁ గనునొ?

ఆ. విశ్వకర్త యైన యీశ్వరుఁగా నని । పురుషుఁ గర్మఫలము పొరయకున్నె ?
యొడలితోనఁ గృతము వెడలిపోవునొ! యిది । దెలియవలయు నాకు నలఘుపుణ్య!

(ఆర.4.168)

రోమశుడు చెప్పిన దాని ప్రకారం పాండవులకు అభ్యుదయం కలుగుతుంది. కౌరవులకు సంపదలు నశిస్తాయి. మరి అది ఎప్పుడు కలుగుతుంది? 'అత్యుత్కటైః పుణ్యపాపైః ఇహైవ ఫలమశ్నుతే' అన్న న్యాయం ప్రకారం కౌరవుల పాపం పండి త్వరలో రాజ్యభ్రష్టులు కావాలి; పాండవుల పుణ్యం పండి త్వరలో రాజ్యపదవి తిరిగి పొందాలి. అది జరుగుతుందా? చెప్పుమని ధర్మరాజు మార్కండేయుడిని పరోక్షంగా అడిగాడు. మార్కండేయుడు కర్మగతి ప్రకారాన్ని వివరించి ఫలితాంశాన్ని తేల్చి చెప్పాడు. ఈ లోకంలో సంపదలు గడించి పుణ్యమార్గాన పోక, లోభమోహహతబుద్ధులై, ఇంద్రియ భోగాలకు లోనై జీవించేవారికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇహంలో సుఖమున్నా, పరంలో మిగిలేది దుఃఖమే. ఉపవాసాదివ్రతాలూ, తీర్థయాత్రలూ, పుణ్యకర్మలూ చేసినవారు ఇహలోకంలో దుఃఖం పొందినా, పరలోకంలో సుఖిస్తారు. ధర్మాన్ని ఆచరిస్తూ గార్హస్థ్యాశ్రమంలో జీవితాన్ని సాగిస్తూ సత్కర్మలూ, సత్క్రతువులూ చేసేవారు ఇహపరసుఖాల ననుభవిస్తారు. సత్యశమ శౌచాలు లేకుండా నాస్తికులై, నిషద్ధకర్మ లాచరించేవారు రెంటికి చెడ్డ రేవడులు అవుతారు. ఇది కర్మ ప్రవర్తన పద్ధతి. పాండవులు ధర్మశీలురు, పుణ్యవ్రతులు కావటంచేత శత్రువులను జయించి, రాజ్యాన్ని పాలించి, ఇహపరసుఖాల నందుతా రని తీర్పుచెప్పాడు- మార్కండేయుడు. ధర్మజుడిలోని కర్మఠుడు కోరే ఫలంకూడా అదే!

ప్రశ్నలు ధర్మజుని మానసిక వికాససూచికలు :

ధర్మరాజు వేసిన ప్రశ్నలను ఆతడి మానసిక వికాసదశలకు దర్పణాలుగా తీర్చిదిద్దటం ఆరణ్యపర్వ వస్తు సంవిధాన శిల్పం. ఈ పర్వారంభంలో ధర్మజుడు శోకమూర్ఛితుడు (1.19). పర్వాంతంలో క్రోధమోహాదులు లేకుండా ధర్మంలోనే స్థిరపడిన ధీరచిత్తం కలవాడు (7.466). ఈ పరిణామాన్ని చిత్రించేదే ఈ పర్వకథాంశం.

తనవెంట వస్తున్న విప్రవరులకు మృష్టాన్న భోజనాలు పెట్టలేక కందమూలాలు అందించవలసి వచ్చిందే అని ధర్మరాజు తీవ్రమైన శోకానికి గురై మూర్ఛపోయాడు. అతడిని శీతలోపచారాలతో తేర్చి శౌనకుడనే బ్రహ్మర్షి ధర్మరాజుహృదయం కుదుటపడటానికి జనక గీతా తాత్పర్యాన్ని వినిపించాడు. బంధు మిత్ర ధనాదులమీద స్నేహం విడిచి, లోకంలో తామరాకుమీద నీటి బిందువు వలె ఉండాలి. స్నేహం వలన రాగం, రాగం వలన కామం, కామం వలన క్రోధం, క్రోధం వలన తృష్ణ కలుగుతాయి. తృష్ణ సర్వదోషాలకూ మూలం. అది అన్ని పాపాలకూ మొదలు. నిరంతర దుఃఖానికి నెలవు. కాబట్టి తృష్ణాక్షయం విజ్ఞుల కర్తవ్యం. తృష్ణ కలవాడు తొర్రలో అగ్ని ఉన్న చెట్టువలె నిలువునా నాశన మౌతాడు. అర్థం అనర్థమూలం. అర్థం వలన దర్పకార్పణ్యమాన భయోద్వేగాదులు పుట్టుతాయి కాబట్టి అర్థోపార్జనచింత వదలిపెట్టటం బుద్ధిమంతుల లక్షణ మని శౌనకుడు బోధించాడు.

శోక విమోహితుడైన ధర్మరాజుకు తృష్ణాక్షయరూపమైన శమాన్ని బోధించాడు- శౌనకుడు. ధర్మజుడు దానిని సున్నితంగా కాదన్నాడు. తనకు అర్థలాభేచ్ఛ ఉన్నా, అది ఆత్మోపభోగార్థం కాదన్నాడు, గృహస్థాశ్రమ ధర్మనిర్వహణం కొరకే అర్థార్జనమని హెచ్చరించాడు. ఇది అసలైన ధర్మజుడి శీలం. అతడికి రాజ్యం కావాలి. కాని, అది భోగం కొరకు కాదు, ధర్మరక్షణం కొరకు. అయితే, అటువంటి అర్థసంపదను కోల్పోయాడు. దానిని తిరిగి సంపాదించుకొనాలి. లేమివలన అతడు శోకమూర్ఛితుడైనాడు. సూర్యోపాసనతో తన లేమిని పోగొట్టుకొన్నాడు. అక్షయతామ్రపాత్రతో నిరతాన్నదానం చేస్తూ ధర్మమయజీవితాన్ని కారడవిలోసైతం సురక్షితంగా సాగించాడు. శోకమూర్ఛితుడు సూర్యానుగ్రహంవలన ధర్మోత్సాహిగా మారాడు.

ప్రసన్న కథాకలితార్థయుక్తి :

ధర్మజుడి ప్రశ్నలు ఆరణ్యపర్వకథా వాహినిలో చిన్న చిన్న ద్వీపాలవంటివి. వాటి మధ్య ఆఖ్యానం ప్రవాహంగా సాగుతూ ఉంటుంది. అందులోకూడా క్రమం పాటించబడి ఉంటుంది. ఆరణ్యపర్వం ముగిసేసరికి పాండవులు అజ్ఞాత వాసాన్ని నిర్విఘ్నంగా ముగించుకొనే యుక్తినే కాక, ఆపైన రాజ్యాన్ని సాధించుకొనే శక్తిని కూడా సాధించుకొంటారు. అట్టిక్రమ వికాస దశలతో ఆరణ్యపర్వకథా శతపత్రం క్రమంగా విచ్చుకొంటున్నట్లు చిత్రించటంలో ఆరణ్యపర్వంలోని ప్రసన్న కథాకలితార్థ యుక్తి ప్రత్యక్షమౌతుంది. రేఖామాత్రంగా ఆ కథాశిల్ప వికాసవిన్యాసాన్ని గమనిద్దాం.

1. ధర్మరాజు సూర్యదత్తమైన అక్షయతామ్రపాత్రతో ఇష్టభోజన సుఖాన్ని, అతిథి సత్కార ధర్మాన్ని నిర్వహిస్తూ నిశ్చింతుడైనాడు.

2. ఆ తరువాత విదురుడు ధృతరాష్ట్రుడిని వదలి పాండవుల వద్దకు వచ్చాడు. దీనివలన కథలో రెండు ప్రయోజనాలు సాధించబడ్డాయి. మొదటిది విదురుడి వంటి ధర్మవేత్తకు తగిన ధర్మప్రభువు ధర్మరాజే అని ధ్వనించబడటం. పాండవులు హస్తినాపురం వీడి వచ్చినా ఆ రాజ్యంలో వారిని సమర్థించేవారు ఇంకా బలంగా కొంతమంది ఉన్నారన్న వాస్తవం వెల్లడి కావటం. రెండో ప్రయోజనం ఆశ్చర్యం కలిగించేది. విదురుడు వస్తుంటే పాండవులు భయపడ్డారు. దానికి ఒక రహస్యం కారణం ఉన్నది. కౌరవులు మరల మాయాద్యూతానికి పిలిచి పాండవుల ఆయుధాలను వశం చేసికొంటారేమో అన్న భయం ధర్మరాజు మనసులో ములికివలె బాధిస్తూనే ఉన్నది. పాండవులు అరణ్యవాసానికి వచ్చేటప్పుడు అదృష్టవశాత్తు కౌరవులు పాండవుల ఆయుధాలను వశంచేసికొనటం మరచారు. ఆ తరువాత శకుని వలన దానిని తెలిసికొని పునర్ద్యూతానికి పిలుస్తారేమోనని ధర్మరాజుకు గుండెలో గుబులుండేది. దాన్ని బయట పెట్టింది విదురుడిఘట్టం. విదురుడిని తిరిగి హస్తినాపురానికి పంపటంలో ధర్మజుడు మెలకువను ప్రకటించాడు. విదురుడు హస్తినలో ఉంటే- పాండవ యోగక్షేమం విచారించే ఒక ధర్మదేవత శత్రుశిబిరంలో ఉన్నట్లే. అందువలన విదురుడి రాకడ, పోకడ ధర్మజుడికి లాభమే కావటం కథాప్రయోజనం.

3. ధృతరాష్ట్ర విదుర పునస్సమాగమం దుష్టచతుష్టయంలో కలకలం రేపింది. పాండవులకు రాజ్యభాగం గ్రుడ్డిరాజుచేత విదురు డిప్పిస్తాడేమో అని దుర్యోధనుడి అనుమానం. ఒకవేళ వారివ్వదలచుకొన్నా ధర్మజుడు తాను చేసిన ప్రతిజ్ఞను వమ్ముచేసి, రాజ్యాన్ని స్వీకరించడని శకుని తీర్మానం. శకుని అంచనా సక్రమమైనదే. అది ధర్మరాజు శీలానికి కలికితురాయి. కౌరవుల కది పాండవుల అసమర్థతకు చిహ్నం. ఉభయవర్గాలకు అనుకూలమైన శకుని తీర్పు కథా సంవిధానశిల్ప రహస్యం.

4. అడవులలో కందమూలాలు తింటూ కాలం గడుపుతున్న పాండవులమీద మహాసైన్యంతో దాడిచేసి, వారిని చంపి, శత్రుశేషం లేకుండా చేసి, రాజ్యాన్ని పాలించుమని కర్ణుడు దుర్యోధనుడికి సలహా చెప్పాడు. కర్ణదుర్నీతికి ఇది పతాక. దానిని విని, దుర్యోధనుడు పాండవులపై రణభేరి మ్రోగించాడు. వ్యాసుడు వచ్చి వారించాడు. కౌరవ, పాండవులను బిడ్డలుగా సమానమైన అనురాగంతో చూచుకొమ్మని ధృతరాష్ట్రుడికి వ్యాసుడు బోధించి ఇంద్రసురభి సంవాదాన్ని వినిపించాడు. అతడు వినలేదు. కాని యుద్ధాన్ని కొడుకుచేత మాన్పించాడు. మైత్రేయుడు దుర్యోధనుడికి నీతులు చెప్పాడు. అతడు వినకపోగా అవినయంగా ప్రవర్తించాడు. దానికి ఫలంగా భీముడి గదచేత దుర్యోధనుడు తొడలు విరిగి రణంలో నిహతుడయ్యేటట్లు మైత్రేయుడు శపించాడు. ఈ సన్నివేశం వలన పాండవులను ధార్మిక శక్తులు, దివ్యశక్తులు రక్షాకవచంవలె నిలిచి సదా కాపాడుతున్నాయని స్పష్టం ఔతున్నది. భీముడు ఆవేశంతో కురుసభలో సుయోధనుడి తొడలు విరుగగొట్టుతానని శపథం చేశాడు. దాని ఉచితానుచితాలను గురించి చర్చ జరిగింది. దానిని మైత్రేయుడు శాపంగా మార్చాడు. మైత్రేయుడిశాపం పరోక్షంగా భీముడికి వరం. దీనితో దుర్యోధనవధ నిశ్చితమైపోయింది. కౌరవపతనం ప్రారంభమైంది. ఆరణ్యపర్వంలో ధర్మరాజు ధార్మిక విజయప్రస్థానం మొదలయింది.

5. కిమ్మీరవధ భావి దుర్యోధనవధను ధ్వనింపచేసే మరొక మరణమృదంగం. ఆరణ్యపర్వంలో భీమ బలవీరం, అర్జున తపోవీరం, ధర్మజ ధర్మవీరం అనన్యసామాన్యంగా ప్రకాశించేటట్లు ప్రదర్శించటమే వస్తుసంవిధాన శిల్పం. భీమబలవీరం శత్రు హృదయ భయంకరమై రాణించింది- ధృతరాష్ట్రుడు విని భయవిహ్వలుడు కావటం వలన.

6. యాదవ పాంచాలాదులు పాండవులను కామ్యకవనంలో కలిసిన ఘట్టం ఆ తరువాత రావటం సార్థకం. కథాశిల్ప పోషకం. కామ్యకవనం యాదవ పాంచాల రాజ్యాలకు దగ్గరగా ఉండటం వలన వారందరూ కలిసి వచ్చారు. వారిరాక వలన పాండవులు అడవులలో ఉన్నా ఒంటరివారు కారని తేలింది. వారికొరకు యుద్ధంచేసి విజయాన్ని సాధించి వారికి హస్తినాపురాన్ని అప్పగించగల బలపరాక్రమవంతులు, శ్రేయోభిలాషులు వారి కున్నారని స్పష్టమయింది. వారు బలప్రయోగానికై ముందుకు వచ్చినా ధర్మజుడు ఆశకు లోనై నియమోల్లంఘనానికి లొంగే బలహీనుడు కాడని కూడా స్పష్టమయింది. పాండవులు బలహీనులు కారు, బలగం లేనివారు కారు. కాని, ధర్మబలాన్ని గౌరవించేవారని ఈఘట్టం తేల్చిచెప్పింది. ధర్మజ ధర్మవీర ప్రవృత్తికి ఈ సన్నివేశం బలవర్ధకం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

7. ద్రౌపదీ శ్రీకృష్ణుల సంభాషణం మహాభారత కథార్థాలలో ఒక కీలకాంశాన్ని ప్రకటించింది. అలనాడు మయసభలోని ద్రౌపది నవ్వు కురుసభలో చిచ్చురేపింది, అవమానాగ్నిని ప్రజ్వలింపచేసింది. ఆ కురుసభలో ద్రౌపది తన కందరున్నా ఎవ్వరూ లేని దానివలె ఒంటరిది అయి నిలిచిన ఆ దారుణక్షణంలో కర్ణుడు ఆమెను చూచి నవ్విన నవ్వు దుశ్శాసనుడి దుశ్చర్యకంటె దుర్భరంగా అగ్నిశిఖవలె ద్రౌపది హృదయాన్ని దహించి వేస్తున్నది. కౌరవుల సంహార మంతా ఒక యెత్తు. ఆ కర్ణుడి చావొక్కటి ఒక్కఎత్తుగా ఎత్తిచూపింది- ద్రౌపది. ఇది మహాభారత యుద్ధంలో కడుజటిలమైన సమస్య. అది కాలం తీర్చవలసిందే. లేదా కాలపురుషుడైన శ్రీకృష్ణుడు నిర్వహించవలసిందే. అందుకే ద్రౌపది గోవిందుడితో నివేదించుకొన్నది. అతడు అర్జునుడిచేత కర్ణుడికి చావు మూడుతుందని అభయమిచ్చాడు. త్రోవలు తెరువబడని భవిష్యత్తులోని ఒక పరమార్థాన్ని పరమాత్ముడు అవ్యక్తంగా ఆవిష్కరించాడు. ఆరణ్యపర్వంలోని తరువాతి కథ శ్రీకృష్ణుడి అభయానికి అనుకూలమైన ద్వారాలు తెరిచేదే. ఆ సత్యాన్ని భక్తాగ్రగణ్యుడైన అర్జునుడు ద్రౌపదికి చెప్పి ఆమె నోదార్చాడు.

ఉ. ‘ఈ పురుషోత్తముండు మన కిందఱకుం గుశలంబు సేయుచుం
బాపకలంక పంకములఁ బాయఁగఁ జేయుటఁ జేసి దుర్మదో
ద్దీపిత శత్రుసంహతి హతిం బరమార్థమ పొందు; నేల సం
తాపము నీకుఁ జేయఁగఁ ద్రిధామజయోన్నతి గల్గి యుండఁగన్’ **(ఆర. 1.143).**

శ్రీకృష్ణుడి వాక్యాలవలన అరణ్యాజ్ఞాతవాసాల తరువాత జరిగే మహాయుద్ధంలో అర్జునుడు ఏకైకవీరుడై కౌరవ వీరులనూ, బలాన్నీ నాశనం చేయటం తథ్యం అని తెలుస్తున్నది. అర్జును డటువంటి లోకోత్తర వీరుడుగా ఆరణ్యపర్వంలోనే పరిణతి చెందుతాడని కథాధ్వని.

8. సౌంభకాఖ్యానం పాండవేతివృత్తంలోని ఒక సూక్ష్మమైన అంశానికి సమాధానం చెపుతున్నది. సభాపర్వంలో పాండవుల చెంత శ్రీకృష్ణ డెందుకు ఉండలేకపోయాడు? వారిని భద్రమైన పంథాలో ఎందుకు నడపలేక పోయాడు? అనే ప్రశ్న పఠితల మనస్సులలో కలతపెడుతూనే ఉంటుంది. దానికి కారణం చెప్పేది సౌంభకాఖ్యానం. ధర్మజ రాజసూయం పాండవచరిత్రలో ఒక మహత్తర ఘట్టం. ఆ యజ్ఞం చేయటం వలన బహుళ ప్రజానష్టం జరిగే ప్రళయంవంటి యుద్ధాలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఆ సంగతి తెలిసి తెలిసి పాండురాజుకు సద్గతి కల్పించాలని శ్రీకృష్ణుడి సలహాతో ధర్మరాజు రాజసూయం చేశాడు. అందులో శ్రీకృష్ణుడిని పెద్దగా చేసి పూజించాడు. అప్పుడే శిశుపాలుడితో వైరం ఏర్పడింది. రాజసూయం ముగిసిందో లేదో యజమాని అయిన ధర్మరాజు మాయాద్యూతంలో రాజ్యసంపదను కోల్పోవలసి వచ్చింది. మరి ఆ యాగంలో పూజలందుకొన్న శ్రీకృష్ణుడికి తన రాజ్యాన్ని శత్రువుల నుండి రక్షించుకొనవలసిన వచ్చింది. సౌంభక నగరాధిపతి మాయాయుద్ధ నిపుణుడైన సాల్వుడు. అతడు శిశుపాలుడి తమ్ముడు. అన్నను చంపిన శ్రీకృష్ణుడిపై పగ తీర్చుకొనటానికి ఆరునెలలు మాయాయుద్ధం చేశాడు. రాజసూయ యాగంవలన కలిగే విపత్తును భగవంతుడైన శ్రీకృష్ణుడు ఆరునెలలకైనా తప్పించుకొనగలిగాడు. మరి ధర్మజుడు పదమూడేళ్ళు అరణ్య అజ్ఞాతవాసాల పాలు కావలసివచ్చింది. పాండవులకు శ్రీకృష్ణ సహాయంయొక్క మహత్త్వాన్ని ధ్వనింపచేసే ఈ ఉపాఖ్యానం పరమరమణీయం.

9. మార్కండేయాది మహర్షులు పాండవులను దర్శించటం, వా రా మహర్షులను పూజించటం, వారివలన ధర్మరాజు బహుధర్మవిశేషాలను గ్రహించటం అనేది ఆరణ్యపర్వంలో దాదాపు నిత్యకృత్యంగా సాగే జ్ఞానయజ్ఞం. దీనివలన ధర్మజుడికి కలిగే భావిశుభోదయాలను గురించి బకదాల్భ్యుడనే ముని ఈ విధంగా వ్యాఖ్యానించాడు - ‘బ్రాహ్మణానుగ్రహంబునంజేసి తొల్లి వైరోచనాదు లనేక కాలంబు లక్షయలక్ష్మీ విభవులయి సముద్రనేమి భూచక్రంబు రక్షించిరి; యనిలసహాయుం డయిన యగ్నిదేవుం డరణ్యంబులు దహించునట్లు బ్రాహ్మణసహాయుండయిన మహీశుండు శత్రువర్గంబు నిశ్శేషంబు సేయు... మీరు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బ్రాహ్మణప్రియులరు ధర్మనిత్యుల; రెప్పుడును మీ కభ్యుదయం బగు'. (1.207) ఇది పాండవ భావివిజయ రహస్యం. ఇది ఆరణ్య పర్వమంతా ప్రపంచించబడింది.

10. ద్రౌపదికి ధర్మరాజుకు, భీమధర్మజులకు నడుమ జరిగిన సంవాదాలు భావికథకు పరమ రమణీయమైన పూర్వరంగ ప్రక్రియలు. ద్రౌపదీభీముల వాదాల తాత్పర్య మిది : -

(1) వన్యమూల ఫలాలు తిని కోపం చల్లారి క్షత్రియులు జీవించరాదు. (2) క్షమ, పరాక్రమం అనే గుణాలను రాజు అదనెరిగి ప్రయోగించకపోతే అతడు ప్రజానురాగాన్ని, ప్రతాపాన్ని కోల్పోతాడు. (3) అల్పాపరాధం చేసినా శత్రువులను క్షమించరాదు, కౌరవులా అనేకాపరాధాలు చేశారు. వారిని అసలే క్షమించరాదు. (4) ధర్మజుడు శత్రువులపై కొద్దిగా కోపాన్ని ప్రదర్శిస్తే చాలు భీమాదులు శత్రుసంహారం చేసి రాజ్యాన్నీ, సంపదనూ సాధిస్తారు. (5) కర్మఫలసిద్ధి దైవమానుష సిద్ధం అయినప్పటికి పురుషకారం చేతనే కార్యాలు సమర్థులు సాధిస్తారు. కాబట్టి పాండవులు ఉత్సాహవంతులై శత్రువులను జయించటమే కార్యం. (6) జగత్తు ధర్మమయం. ధర్మాన్ని మించింది మరేదీ లేదు. అయినా అర్థాన్ని సాధించని ధర్మం క్షత్రియులకు యుక్తం కాదు. కరుణాపరత్వం బ్రాహ్మణధర్మం కాని క్షత్రియ ధర్మం కాదు. (7) మిత్రబలం కల రాజుకు అసాధ్యమనేది ఉండదు. అందువలన విజయప్రయాణమే తగిన ఉపాయం. (8) రాజ్యం సంపాదించిన తరువాత యజ్ఞాది పుణ్య కార్యాలు చేసి, పాపాలు పోగొట్టుకొని మచ్చ లేని చంద్రుడివలె రాజు ప్రకాశిస్తాడు. (9) అరణ్యవాసం ఎట్లాగో చేసినా, పాండవులు అజ్ఞాతవాసంలో ఎవరికీ తెలియకుండా ఉండటం అసాధ్యం. కాబట్టి యుద్ధమే శరణ్యం.

ధర్మజుడు ఈ వాదాలను నిపుణంగా సున్నితంగా ఖండించాడు. (1) కోపం పాపం, దానివలన ధర్మకామార్థ హాని కలుగుతుంది. (2) క్షమ కలవాడికి విజయం నిత్యం. క్షమావంతుడైన ధర్మజుడిని వ్యాసాది మహర్షులు ప్రశంసించారు. (3) ఇతరులు అధర్మం, అన్యాయం చేశారని ఉత్తముడు తాను ఆ బాటన పోరాదు. ధర్మం సర్వజనులకు స్వర్గారోహణ సోపానం. (4) మహాకార్యాలన్నీ బాగా విచారించి చేయవలసినవి కాని, క్షణికోద్రేకంతో కోపంతో చేయదగినవికావు. (5) వృద్ధులున్న నిండు సభలో ఒక నియమం చేసి, దానిని తప్పటం ధర్మం కాదు. (6) చంచలమైన లక్ష్యంకొరకు స్థిరమైన సత్యధర్మాలను త్యాగం చేయరాదు. (7) కౌరవుల మిత్రబలాన్ని కూడ ముందుగా మనం గణించి, దానిని జయించే ఉపాయాన్ని కనుగొనాలి. అనాలోచిత ప్రయత్నం ప్రమాదకారి. (8) శత్రువులను జయించటం ప్రస్తుతం భీమాదు లనుకొంటున్నంత సులభం కాదు. కర్ణుడు అభేద్యకవచుడు. అతడిని తలచినప్పుడెల్లా ధర్మజుడికి రాత్రిళ్ళు నిద్రపట్టదు. భీష్మ, ద్రోణులు అపార దివ్యాస్త్రకోవిదులు, వారిని ముందుగా జయిస్తే కదా ఆ తరువాత దుర్యోధనుడిని సంహరించగలిగేది. వారందరిచేత అతడు సురక్షితుడు. కాబట్టి విజయం అంత సులభం కాదు. (9) కాబట్టి కర్ణాదివీరులను చంపగలిగే శక్తి యుక్తులను సంపాదించాలి. అరణ్య, అజ్ఞాత వాసాలు నిర్వహించాలి. ధర్మయుద్ధం చేయాలి. పురుషకారంతో దైవయత్నాన్ని కూర్చుకొని విజయం సాధించాలి.

10. ద్రౌపదీభీముల వాదాలన్నీ కర్ణ భీష్మ ద్రోణ సంహార శక్తియుక్తుల సంపాదన లేకపోతే నిష్ఫలాలే అని ధర్మరాజు తేల్చి చెప్పాడు. ఇంతవరకు పూర్వకథకు సంబంధించిన విచారం సాగింది. ఇక్కడినుండి భవిష్యత్ కార్యక్రమం మొదలౌతుంది.

11. భీష్మ ద్రోణ కృపాచార్య కర్ణులను వధించగల ఉపాయాన్ని అన్వేషిస్తున్న ధర్మజుడికి శాంతిలేదు. కృష్ణద్వైపాయనుడు ధర్మజుడి మనోభారాన్ని దివ్యజ్ఞానంవలన తెలిసికొని, అతడి మనోవేదనను తగ్గించటానికై వచ్చాడు. అధిక యోగంవలన సిద్ధించేదీ, అతిరహస్యమైనదీ అయిన విశేషవిద్య 'ప్రతిస్మృతి'ని ధర్మజుడికి ఉపదేశించి, దానిని అర్జునుడికి అందించుమని ఆదేశించాడు. 'ఆ మహా విద్యాశక్తి వలన అర్జునుడు తపోవీర్యవిభవు డౌతాడు. అష్టదిక్పాలకులు, పరమేశ్వరుడు ప్రత్యక్షమై దివ్యాస్త్రాల నిస్తారు. వాటి ప్రభావంతో భీష్మాది వీరుల నందరినీ అతడు చంపగలుగుతాడు' అని పేర్కొన్నాడు. దీనినుండి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పుట్టినవే పాశుపతాస్త్ర సంపాదన కథ. ఇంద్రాదిదేవతలు వివిధ దివ్యాస్త్రాలను ప్రసాదించిన కథ, ఆ తరువాత అర్జునుడు దేవలోకానికి దివ్యరథం మీద వెళ్ళి, ఇంద్రుడి అర్ధసింహాసనగౌరవం పొంది, పాశుపతాస్త్రాది ప్రయోగంతో నివాత కవచాది రాక్షసులను పౌలోమకాలకేయాది దానవులను సంహరించి, దేవలోకానికి పరమ హితాన్ని చేకూర్చిన కథ, ఊర్వశి శాపంవలన అర్జునుడు అజ్ఞాత వాసకాలంలో ఇతరులచేత గుర్తించబడకుండా నపుంసకుడిగా ఆడువారి నడుమ ఉండే అవకాశాన్ని పొందిన కథ. నృత్య వాద్య నాట్య విశేషాదులను వజ్రధరుడి వద్ద నేర్చుకొనటానికై అర్జునుడు అయిదేళ్ళు అమరలోకంలో ఉన్న ఉదంతం, అర్జునుడు తిరిగి వచ్చిన తరువాత ఇంద్రుడు ధర్మజుడి యెదుట ప్రత్యక్షమై అర్జునుడు దివ్యవీరుడైనాడని ప్రకటించిన ఉదంతం. ఇవన్నీ వ్యాసమహర్షి మంత్రప్రభావంతో మొదలైన విజయపరంపరలే.

'పాశుపతాస్త్రంచేత అఖిల లోకాలను జయించగల' వన్న పరమేశ్వరుడి వరం -

క. 'ద్రోణ ద్రోణజ కృప గీ
ర్వాణనదీజాంగపతు లవశ్యమును భవ
ద్బాణహతిఁ జేసి సమర
క్షోణిఁ బరిక్షీణబలు లగుదు రవజితులై' **(ఆర. 4.88)**

అన్న ఇంద్రుడివరం పొంది, అర్జునుడు

క. 'ఇమ్ముల ధర్మజునకు జన
సమ్మతునకు రిపుజయంబు సకల మహీ రా
జ్యమ్ము సమకూరె నేఁడు ఘ
నమ్ముగ సర్వప్రయోజనమ్ములతోడన్' **(ఆర. 1.335)**

అని భావించటంలోనూ, అర్జునుడు సాధించిన దివ్యాస్త్రాలనూ దేవలోక విజయాలనూ విని ధర్మజుడు. 'చతురంభోధి పర్యంత మహీరాజ్యాన్ని అప్పుడే పొందినట్లు సంతసించటంలోనూ' (4.90) ఆరణ్య పర్వ కథార్థ ప్రయోజనాలన్నీ ఫలవంతమైనట్లు నన్నయ సూచించాడు. ఆరణ్యపర్వంలోని అర్జునతపోబలవీరాలు పాండవ విజయానికి నాందీగీతాలు. ధర్మజుడి అర్థనిర్ణయశక్తికి, మంత్ర ప్రయోగయుక్తికి దివ్యోదాహరణాలు. దేవత లందరిలో లయకారుడు పరమేశ్వరుడు. అమృతంతో కలిసి పుట్టిన పాశుపతాస్త్రం పొందగలిగింది ఆ మహాదేవుడి తరువాత పార్థమహావీరుడే! అర్జునుడు అనన్య సామాన్య వీరుడుగా అభివృద్ధిని సాధించి, ధర్మజుడి చింతను బాపిన ఘట్టం ఆరణ్యపర్వం.

12. అరణ్యపర్వంలో అర్జునుడి విజయగాథ ఆయువుపట్టు వంటిది. దానినంతా ఒక్కచోట వరుసగా చెప్పకుండా సందర్భోచితంగా పరచి చెప్పటంలో నన్నయ ప్రసన్న కథాకవితార్థయుక్తిని ప్రదర్శించాడు. కాలక్రమ పద్ధతిలో కొంత, కార్యకారణ క్రమ పద్ధతిలో కొంత, ఆ కథ చెప్పటంలో శిల్పంతో పాటు ప్రయోజనంకూడా నన్నయ సాధించాడు. ఎట్లాగంటే-

(1) పాశుపతాస్త్ర సంపాదనం నుండి ఊర్వశి శాపం వరకు జరిగిన కథను అరణ్యపర్వ ప్రథమాశ్వాసంలో చెప్పి 'ప్రతిస్మృతి మంత్రసిద్ధి పరిపూర్ణమైనట్లు, అది అర్జునుడి తపశ్శక్తికి సద్యఃఫలమైనట్లు చిత్రించటం కాలక్రమ కథాకవితా శిల్పం. (2) ఆ కథ ధర్మజాదులకు తెలియకుండా ఉండేటట్లు రోమశ మహాముని దర్శనమయ్యేంత వరకు (ద్వితీయాశ్వాసం చివరి దాకా) రక్షించటం కథలో ఉత్కంఠను పెంచటానికి ఉపయోగపడింది. (3) దేవసభలో నరుడికి అర్ధసింహాసన గౌరవమిచ్చి ఇంద్రుడు రోమశుడితో పల్కిన మాటలు ధర్మరాజుకు పంపే సందేశంలో ఉపశమన మంత్రాలుగా నిబంధించబడటం విశేషం.

క. 'బలవంతులైన భీష్మా
దుల నర్జునుఁ డోర్చు నూర్జితుండై మఱి పో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రులఁ గర్ణుండు పదాఱవ
కళకు సమానుండు గాఁడు గవ్వడితోడన్' **(ఆర. 2-294)**

అనే పద్యంలో కర్ణుడిని గురించి ప్రత్యేకంగా చెప్పినమాట ధర్మరాజు చిత్తశోకం శాంతించటానికే. 'అర్జునుండు మనుష్యుండు కాఁడు దివ్యపురుషుండు' అని ఇంద్రుడు ప్రకటించటం పాండవులలో ఆతడి ఆధిక్యాన్ని ప్రకటించటానికే. (4) దేవకార్యాన్ని ముగించుకొని అర్జునుడు తిరిగివచ్చే వరకు ధర్మరాజు తీర్థయాత్రలు చేయాలని దేవేంద్రుడి హితవు. తీర్థయాత్రల వలన ధర్మజుడు కూడ దివ్యపురుషు డౌతాడు. అర్జునుడి అన్నగా యోగ్యతను రక్షించుకొనాలంటే తీర్థయాత్రలలో ధర్మజుడు తపస్విగా జీవనవ్రతాన్ని సాగించవలసిందే. అందుకే 'నిరతముగఁ దీర్థసేవాపరులగు శాంతాత్ములకుఁ దపస్వులకును దుష్కర మెద్దియు లేదు' (2.296) అని ఇంద్రుడు హెచ్చరించాడు. (5) తీర్థయాత్రలు చేస్తున్నంత సేపూ అర్జునుడిని చూడాలన్న తపన పాండవులందరిలో కనపడుతుంది. అది వియోగబాధగా పరిణతి చెందింది కూడా. కాని, ధర్మజుడు వైతరణీ స్నానం చేసి అఖిలలోకాలనూ దివ్యదృష్టితో దర్శించి, ముప్పైవేల యోజనాల దూరంలో ఉన్న వైఖానసుల వేదధ్వనిని వినగల్గిన 'నీవు దివ్యుండవు' (3.120) అని రోమశుడిచేత ప్రశంస లందుకొన్న తరువాతే అర్జునుడి పునర్దర్శనమైనట్లు రచించటం కథాకథన శిల్పం. (6) అర్జునుడు తన విజయగాథను స్వయంగా చెప్పి, పాండవులతోపాటు పఠితల ఆసక్తిని కూడ పోషించే ఈ కథాకథనం కార్యకారణ సంబద్ధ శిల్పానికి సంబంధించి ఉండటం విశేషం. (7) అర్జునుడి దివ్యాస్త్ర ప్రయోగ ప్రౌఢిని విన్న ధర్మజుడు కళ్ళారా చూడాలని కోరటం ఆతడి కార్యదృష్టికి నిదర్శనం. 'లక్ష్యాలు లేకుండా దివ్యాస్త్ర ప్రయోగాలు చేయటం వలన లోకాలు సంక్షోభిస్తా'యని నారదుడు చెప్పగా, సంతృప్తి చెందిన ధర్మరాజు వాటిని కురుక్షేత్ర యుద్ధంలో శత్రులక్ష్యాలపై ప్రయోగించే పార్థుడి పరాక్రమాన్ని చూడాలనే ఆశతో ఆరణ్యపర్వ జీవితాన్ని నిర్భయంగా గడపగలిగాడు. పర్వారంభంలో ధర్మజుడి హృదయంలో బడబాగ్నిగా రగులుతున్న భీతి పర్వమధ్యంలోనే తొలగింది. విజయం తథ్యమని తేలింది.

13. బృహదశ్వుడు చెప్పిన నలోపాఖ్యానం కథలో రెండు ప్రయోజనాలను సాధించింది. ఒకటి: ధర్మరాజు అధర్మపరులైన శత్రువులచేత మోసగించబడి రాజ్యాన్ని, బంధువులను వదలి అడవులలో ఉన్నాడు. తన వలె పూర్వం ఎవరైనా కష్టాలుపడ్డారేమో తెలిసికొందామని ధర్మజుడు భావించాడు. తమవలె ఇతరులు కూడ కొందరు బాధపడ్డారని తెలిస్తే, ధర్మజుడికి కొంత దుః ఖోపశాంతి కలుగుతుంది; పుణ్యకథాశ్రవణం ఫలం లభిస్తుంది. వారి జీవితాలలోనుండి ఏదైనా ఉపదేశం గ్రహించటానికి వీలౌతుంది. ధర్మరాజు చిత్తశాంతికి నలుడి కథ తోడ్పడింది. రెండు : నలుడు పుష్కరుడితో ఓడిపోవటానికి కారణం అతడికి అక్షహృదయ విద్య తెలియకపోవడమే. అట్లాగే శకుని వలన ధర్మరాజు జూదంలో ఓడటానికి కూడ అదే కారణం. నలుడు ఋతుపర్ణుడి వలన అక్షహృదయం పొందినట్లుగానే ధర్మజుడు కూడ బృహదశ్వుడి వద్ద అక్షహృదయాన్ని ఉపదేశం పొందాడు. ఆనాటితో ధర్మజుడు ఇకముందు కపటద్యూతంలో సైతం ఓడిపోయే అవకాశం జీవితంలో ఏర్పడదని ధ్రువపడింది. మరొకమాటలో చెప్పాలంటే ధర్మరాజు కౌరవుల దుర్నీతికి మూలమైన శకుని అక్షవిద్యను గెలిచాడు. ఇక కౌరవులకు మిగిలింది భీష్మాదివీరుల పౌరుషమే. దానిని అర్జునుడు జయించాడు. ధర్మజుడి విజయం మరొకసారి ధ్రువపడింది.

14. ఆరణ్యపర్వంలోని తీర్థయాత్రల వర్ణన ఘట్టాలను మూడు దశలుగా విభజించవచ్చును. మొదటిది నారద ప్రోక్తమైన తీర్థమాహాత్మ్య కథనం. దానివలన ధర్మజుడికి తీర్థయాత్రలమీద ఇచ్ఛ జనించింది.

క. 'సకల దురితములఁ బాయుదు
రకలంకమనస్కు లగుదు రార్యోత్తమవ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రతకు లగుదురు సజ్జనగుణ
నికరంబుల వెలయుదురు సునిశ్చితమతులై ' (ఆర. 2.283(ఆ))

అనే ప్రబోధం మనసులో బాగా కుదురు కొన్నది. సునిశ్చితమతితో సకల తీర్థాలను సేవించాలని నిశ్చయించుకొన్నాడు ధర్మజుడు. అర్జునుడు దివ్యాస్త్రాలతో తిరిగి వచ్చేంతవరకు తీర్థయాత్రలలో భూవలయాన్నంతా తిరిగి వచ్చేందుకు ధౌమ్యుడి ప్రబోధాన్ని పొందాడు. అంటే - ఇచ్ఛాశక్తి క్రియాశక్తిగా రూపొందిందన్నమాట. దానికి దైవశక్తి (లేదా జ్ఞానశక్తి) చేకూరినట్లుగా రోమశుడు దేవేంద్రుడి ఆదేశంతో వచ్చాడు. ధర్మజుడి వెంట నుండి తీర్థాలను సేవింపజేశాడు. నారదుడు చెప్పగా తీర్థాలనుగురించి ధర్మజుడికి శ్రుతపాండిత్య మబ్బింది. విన్నస్థలాలను కంటితో చూపించి రోమశుడు వాటి మాహాత్మ్యాలను సంగ్రహించి చెప్పటంవలన ధర్మరాజుకు జ్ఞానశక్తి బలపడింది. గమనిస్తే - రోమశుడు చెప్పిన ఉపాఖ్యానాలన్నీ క్షేత్రమాహాత్మ్య ప్రతిపాదకాలైన ఉపాఖ్యానాలు. అవి జ్ఞానబోధకాలు. ధర్మజుడి ఇచ్ఛాక్రియాజ్ఞానవృత్తుల పరిపోషకం రోమశమహర్షి చెప్పిన కథాప్రవాహం. ఆరణ్యపర్వంలో ఆ ఉపాఖ్యానాల సార్థక్యం అటువంటిది.

15. ఆరణ్యపర్వకథ స్థూలంగా రెండు భాగాలుగా సహజంగా విభక్తమై ఉంటుందని భావించాం. ఆ రెండు భాగాలలో మొదటిది నన్నయ, రెండవది ఎఱ్ఱయ రచించటం ఒక విశేషం. మొదటి భాగం నహుష ప్రశ్నలతో స్థూలంగా ముగుస్తుంది. రెండోభాగం- యక్షప్రశ్నలతో ముగుస్తుంది. ఈ సమవిభక్త భాగాలలో కొన్ని సమాన కథాంశాలను తులనాత్మకంగా దర్శించగలం. ఆ అంశాలు ఆరణ్యపర్వ కథాకథన శిల్పసంపదలు. మచ్చుకు కొన్ని -

1. మూడు జంటల ముక్తాయింపు : ఆరణ్యపర్వంలో - పాండవ పక్షంలో, కౌరవపక్షంలో, ఋషుల పక్షంలో పాత్రలు మొత్తం తొమ్మిది జంటలు కనపడుతుంటారు. పాండవులలో - ధర్మరాజు, అర్జునుడు; భీముడు, ద్రౌపది; నకుల సహదేవులు. కౌరవులలో - దుర్యోధనుడు, కర్ణుడు; శకుని, ధృతరాష్ట్రుడు; విదురుడు, సంజయుడు; ఋషులలో- నారదుడు, వ్యాసుడు; రోమశుడు, మార్కండేయుడు; మైత్రేయుడు, బృహదశ్వుడు. వీరందరి వ్యక్తిత్వాలు స్పష్టమయ్యేటట్లు ఆరణ్యపర్వంలోని కథలు రాణించటం విశేషం.

పై జంటలలో కానవచ్చే సమానగుణాలను ఈవిధంగా వివేచించవచ్చును.

1. ధర్మజుడు, అర్జునుడు - పురుషకారానికి తీర్థయాత్రలతో తపస్సుతో దైవానుకూల్యం కల్పించటం.
2. భీముడు, ద్రౌపది - పురుషకారానికి ప్రాధాన్యమిచ్చి సాహసాలు చేయటం.
3. నకుల సహదేవులు - తమ భావా లేవైనా ధర్మజుడిని సమర్థించటం.
4. దుర్యోధన కర్ణులు - పాండవులను ఏ విధంగానైనా మట్టుపెట్టాలని ఆగ్రహంతో వ్యూహాలు పన్నటం.
5. ధృతరాష్ట్ర శకునులు - పాండవ పక్షపాతులను ద్వేషించటం.
6. విదుర సంజయులు - న్యాయమైన సలహాలను ప్రభువుకు అందించటం. అతడు అంగీకరించకపోతే ఊరుకొనటం, పొమ్మంటే వెళ్ళిపోవటం - కాని, తమ మనస్సులు మార్చుకొనకపోవటం.
7. నారద వ్యాసులు - త్రికాలజ్ఞులు, సార్వకాలిక శ్రేయస్సులను సూచించేవారు, ఆచరించేవారు.
8. రోమశ మార్కండేయులు - సృష్టి స్థితి లయాలను గురించి గాని, సర్వలోకవిశేషాలను గురించిగాని బహుపురాణ విజ్ఞాననిరతులుగా దార్శనికులుగా మాట్లాడేవారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

9. మైత్రేయుడు, బృహదశ్వుడు - పూర్వకథా ప్రవచన కుశలురు. శాపానుగ్రహశక్తి యుక్తులు.

ఈ పాత్రలను ఈ ప్రవృత్తులతో చిత్రించటంలో నన్నయఎఱ్ఱయలు కూడా - ఒక కాలంలో నివసించి ఉండకపోయినా ఒక భావంతో మహాభారత రచనను నిర్వహించిన కవులజంటవలె కనిపిస్తారు.

2. పాండవులలో ధర్మజుడి ఆధిక్యం నిరూపించి అతడియందు నాయకత్వం స్థాపించడం కథా కథన శిల్పంలోని అంతస్సూత్రం. నన్నయ ఎఱ్ఱన్నలు నిపుణంగా ఆ శిల్పాన్ని పోషించారు. మొదటి భాగంలో అస్త్రశస్త్రబలానికి దైవబలానికి ప్రతీకగా అర్జునుడు అనన్యసామాన్య వీరుడుగా నిలిచాడు. భీముడు కిమ్మీర జటాసుర సంహారం చేసి, సౌగంధికాపహరణ సందర్భంలో యక్షరాక్షససైన్యాన్ని సంహరించి, బాహుపరాక్రమంలో ప్రశంస లందుకొన్నాడు. వీరిద్దరికంటె జ్ఞానంలో గొప్పవాడని నిరూపించబడాలి- ధర్మరాజు, అప్పుడే అతడి నాయకత్వం స్థిరపడుతుంది. నహుష ప్రశ్నలు ధర్మజుడి జ్ఞానశక్తికి పతాకలుగా నిలిచాయి. బాహు తపోబలాలకంటె, జ్ఞానబలం మిన్న అని మొదటి భాగంలో నిరూపిత మైనది. అది నన్నయ రచనలో ఆవిష్కరించబడింది.

ఇక రెండవ భాగంలో మార్కండేయుడు చెప్పిన కథలు ధర్మజుడి జిజ్ఞాసకు పోషకాలు. మొదటి భాగంలో భీమార్జున పరాక్రమాలు విడివిడిగా ప్రదర్శించబడగా, రెండో భాగంలో వారిరువురి పరాక్రమాలు సంయుక్తంగా వర్ణించబడ్డాయి. - అటు ఘోషయాత్రలో, ఇటు సైంధవ పరాభవ ఘట్టంలో. చివరకు మహావీరులైన వారిద్దరు యక్షుడి ముందు విగతజీవులై పోయారు. యక్ష ప్రశ్నలకు సమాధానం చెప్పి ధర్మజుడు వారిని బ్రతికించాడు. ధర్మదేవతను మెప్పించి అజ్ఞాతవాసంలో పరులచేత గుర్తించబడకుండా భద్రంగా ఉండే వరాన్ని పొందాడు. ఆరణ్యపర్వం ముగిసే సరికి ధర్మజుడి హృదయంలో ఉండే కర్ణాది వీరులవలని భయం, భీమాదుల హృదయంలో ఉండే అజ్ఞాతవాస వ్రతాన్ని గురించిన భయం తొలగిపోయాయి. అది పురుషకారం వలన, దైవానుకుల్యంవలన సిద్ధించింది. అట్లా చిత్రించటమే ఇతిహాసకథా స్వభావం.

ఆరణ్య పర్వం - నన్నయ భాగం :

ఆరణ్యపర్వంలో నన్నయ దాదాపు 1300 పద్యగద్యాలు రచించాడు. వాటిలో సగం భాగం ప్రధానకథకూ, మిగిలిన సగం ఉపాఖ్యానాలకూ, తీర్థయాత్రా విశేషాలకూ వెచ్చించి, ఒక సమతౌల్యాన్ని పాటించాడు. నన్నయ భాగంలోని వస్తువిన్యాసం కూడా అందుకు తోడ్పడింది. ఎఱ్ఱయ భాగంలో వస్తువులోనే ఆ సమతౌల్యం లేకపోవడం చేత ఆయన పాటించలేదు. అందులో దోష మేమీ లేదు.

నన్నయ సారమతులైన కవీంద్రులు లోనారసి మేలనేటట్లు కథ చెప్పగలడు. కథ చెప్పటంలోకూడా వస్తువును కవితామయం చేయగలడు. వాచ్యలక్ష్యవ్యంగ్యార్థాల సంయోజనంతో కథను ప్రసన్నం చేయగలడు. అక్షర రమ్యతతో రచనకు తరుగని అందాన్నీ, ఆస్వాదయోగ్యతనూ కల్పించగలడు. నానారుచిరార్థ సూక్తి నిధులతో రచనను రమణీయంగా రసోదంచితంగా రాణింపచేయగలడు. నన్నయకు తాను ప్రదర్శిస్తున్న కథా కథన శిల్పరీతిలోని ప్రతిభను ఆశ్వాసాంతంలో అప్పుడప్పుడు సూచించటం అలవాటు. వైశంపాయనుడు ఆదిపర్వకథను 'ఇమ్ముగా' చెప్పాడని ఆదిపర్వం చివర పేర్కొన్నాడు. రమ్యతకు తెలుగుపదం ఇమ్ముగా నన్నయ వాడాడు. సభాపర్వ ప్రథమాశ్వాసం చివర వైశంపాయనుడు రసోత్కటంగా కథ చెప్పాడన్నాడు. ఆది సభాపర్వాలలో ఒకటి రెండు చోట్ల మాత్రమే తన రచనా రమణీయతను గురించి పేర్కొన్న నన్నయ ఆరణ్యపర్వంలో ప్రతి ఆశ్వాసాంతంలోనూ ఒక ప్రత్యేకతను పేర్కొని, పఠితల దృష్టిని తన కవితాకళపై కేంద్రీకరింపజేశాడు. ప్రథమాశ్వాసాంతంలో 'పుణ్యకథ యతిరమణీయంబుగా' చెప్పినట్లు, ద్వితీయాశ్వాసాంతంలో 'కథాక్రమం బతి రమ్యంబుగా' చెప్పినట్లూ, తృతీయాశ్వాసాంతంలో 'కథ రమ్యంబుగ' చెప్పినట్లు ప్రత్యేకించి చెప్పుకొన్నాడు. మొత్తానికి అన్నీ కలిసి ఆరణ్య పర్వకథకు వర్తిస్తాయన్నది రమణీయ సత్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పుణ్యకథ - రమణీయత - రమ్యత :

"పురుషులందు పుణ్యపురుషులు వేరయా" అన్నట్లు, కథలయందు పుణ్యకథలే వేరని స్పష్టం. పుణ్యుల కథలు, పుణ్యం కలిగించే కథలు పుణ్యకథలు. చదివినవారికి పాపం కరిగిపోయి, పుణ్యభావం పెరిగిన అనుభూతి నిచ్చేవి, ఉపదేశాత్మకాలైనవి కూడా పుణ్యకథలే. ఆరణ్యపర్వం వాటికి కాణాచి. వాటిని ఏకవాక్యతతో కూర్చి అందంగా చెప్పటం రమణీయత్వం. కథ చెప్పేక్రమంలో, కథలు అమర్చే క్రమంలో ఉన్న సంవిధానశిల్పం రమ్యత. కథ రమ్యంగా ఉందంటే నిర్మాణంలోనే కాక కవితాపరంగా కూడా ఆస్వాద యోగ్యంగా ఉన్నదని తాత్పర్యం. నన్నయ కథను, కవితను రమణీయంగా, రమ్యంగా తీర్చిదిద్దినట్లు తాత్పర్యం ఏర్పడింది.

ఆరణ్యపర్వంలోని ప్రధాన కథలో పుణ్యకథగా మొదట పేర్కొని తగింది పాశుపతాస్త్ర ప్రదానం, అర్జునుడు నివాత కవచాదులను సంహరించటం. ఆ కథను రెండాశ్వాసాల మీద పరచి చెప్పటం రమణీయం. దాని సార్థక్యాన్ని ముందే గమనించాం. ప్రతిస్మృతి మంత్ర ప్రభావంతో అర్జునుడి తపస్సు ఫలించటం, పరమేశ్వరుడు ప్రసన్నుడు కావటం ఒక విశేషం. నరుడు పరమేశ్వర శరీరాన్ని స్పృశించ గలగటం అపూర్వం. అది అమోఘ పుణ్యఫలం. అర్జును డా పుణ్యఫలాన్ని పరవశించి కీర్తించాడు.

క. 'మంటి హరుదేహ మంటం
గంటి నుమాధీశు నసురకంటకహను ము
క్కంటిఁ గఱకంఠుఁ జూడం
గంటిఁ గృతార్థుండ నైతిఁ గడుఁబుణ్యమునన్'. **(ఆర. 1.334)**

ఈమాటలను నరుడితోపాటు సహృదయుడు కూడా తాదాత్మ్యంతో భావించి పుణ్యకథా శ్రవణ రామణీయకాన్ని ఆస్వాదించగలుగుతాడు.

కథ పుణ్యప్రదం. కవిత అతిరమణీయం. నన్నయ రచనలో భక్తివీరరసాన్ని పోషించే కవితా పాకం ఈ ఘట్టంలో పరిమళించినట్లు మరొకచోట కానం. నన్నయ వ్రాసిన ఏకైక దండకం. ఈ ఘట్టంలోనే ఉన్నది. తెలుగువారి నాల్కల మీద అది నేటికీ లాస్యం చేస్తున్నది.

క. 'హరు శరమును నరు శరమును
సరి నిరుపక్కియలు దాఁకి జవ మఱి శరసం
భరమునఁ దిరిగె వరాహము
శరనిధి మథనమునఁ దిరుగు శైలము పోలెన్' **(ఆర. 1.306)**

ఇది వృత్త్యనుప్రాసంగా కవితకు రామణీయకాన్ని ప్రసాదిస్తున్న నన్నయ అక్షర రమ్యత. పోతన్న కవితకు ఈ కందం మూలకందంవలె అందంగా ఉండటం సహృదయ హృదయైకవేద్యం.

పాశుపతాస్త్ర ఘట్టంలో పార్థుడు ప్రదర్శించింది తపోవీరం, యుద్ధవీరం. కాని, నన్నయ ఆ రెండింటిని అతడి భక్తి వీరానికి అంగంగా చేశాడు. ఈ రస ప్రవృత్తిని బట్టి నన్నయ కవితలో గుణనిష్పత్తి రూపుకట్టి కవితకు రామణీయకాన్ని కలిగిస్తుంది. శుద్ధ యుద్ధ వీరమైతే ఓజస్సు రాజ్యం చేస్తుంది. తపోవీరమైతే ఓజోమిశ్రితమైన ప్రసాదం సమంజసంగా ఉంటుంది. అదే భక్తి వీరమైతే ప్రసాదం, మాధుర్యం రమ్యంగా రాణిస్తాయి. నన్నయ గుణ ప్రధాన రచన చేసే మహాకవి కాబట్టి ఈ రహస్యాన్ని తన కవితాశైలిలో ప్రాణచైతన్యంగా ప్రవహింప జేశాడు. ఈ ఘట్టంలో ప్రసిద్ధమైన పద్యాలు అయిదున్నాయి. అయిదూ రమణీయతకు రమ్యాకృతులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అర్జునుడు తపస్సుకై బయలుదేరి వెళ్ళుతున్నాడు. ద్రౌపది సాభిమానంగానూ, సాదరంగానూ, సద్భక్తియుక్తంగానూ పలికిన ఈ పద్యం ప్రసాదమాధుర్య గుణమిశ్రమానికి ఉదాహరణం. శైలిలో పరమరమణీయం.

చ. ‘అరికృత దుష్పరాభవ మహార్ణవమగ్నుల మమ్ము నందఱం
గరుణ సముద్ధరింపుము జగన్నుత! యన్యులు పూనఁగాని యీ
భరము వహింపఁ బూనిన యపారగుణోన్నతు నిన్ను దిక్కులున్
దరణియు సోముఁడున్ నభము ధాత్రియు గాడ్పును గాచుచుండెడున్.’ **(ఆర. 1.285)**

ఓజోమిశ్రితమైన ప్రసాదగుణ రచనను పాశుపతాస్త్రాన్ని వర్ణించేటప్పుడు మాత్రం వాడి ప్రకరణౌచిత్యాన్ని పాటించాడు-నన్నయ. ఈఘట్టంలో ఈపద్యం సుప్రసిద్ధం.

చ. ‘అవిరళ సూర్యమండల సహస్ర సమ ప్రభమై ధనంజయ
ప్రవరుకరమ్మునన్ వెలుఁగు పాశుపతాస్త్రముఁ జూచి దైత్యదా
నవసురయక్షరాక్షస గణమ్ము గరమ్ము భయమ్ముఁ బొందె, నం
దవనియుఁ దిర్దిరం దిరిగె నబ్ధిశిలోచ్చయ సంచయంబుతోన్.’ **(ఆర. 1.332)**

లోకభయంకరమైన పాశుపతాస్త్రాన్ని ఓజోగుణమిశ్రితమైన ప్రసాదగుణంలో వర్ణించి నన్నయ రసానుగుణమైన కవితా గుణౌచిత్యాన్ని పోషించాడు.

పాశుపతాస్త్రవర్ణనంకంటె భిన్నమైన రసవద్గుణరచన పరమేశ్వర సాక్షాత్కార వర్ణన.

చ. ‘వరదుఁడు పార్థు శౌర్యవిభవంబున కాతని ధైర్యవృత్తికి
న్నరుదుగ మెచ్చి సన్నిహితుఁ డయ్యె జటామకుటేందురేఖయుం
గరమున శూలమున్ గరళకాలగళంబు బృహద్గజాజినాం
బరముఁ దృతీయలోచనముఁ బన్నగహారము నొప్పుచుండఁగన్.’ **(ఆర. 1.321)**

భక్తుడి ముందు ప్రత్యక్షమయ్యే పరమేశ్వరుడి రూపవైభవాన్ని వర్ణించేటప్పుడు ఝటితిత్యర్థ ప్రతిపత్తి హేతువును వస్తుస్వభావ స్ఫుటత్వంతో ప్రదర్శించే అర్థవ్యక్తిని భక్తవరప్రసాదుడిని తలపింపజేసే ప్రసాదగుణంతో మేళవించటం కవితారామణీయకం. ఈ పద్యం ప్రసాదంలో పర్యవసించే అర్థవ్యక్తి గుణానికి రమ్యోదాహరణం.

నన్నయ దీప్తరసత్వాన్ని ఉజ్జ్వలశబ్దాలతో కలిసిన కాంతిగుణంతో పోషిస్తూ దాన్ని ప్రసాదానికో, మాధుర్యానికో అంగంగా చేయటం సర్వత్రా కనబడుతుంది. కిరాతరూపంలో ఉన్న పరమేశ్వరుడి పరాక్రమాతిశయాన్ని గమనించి ఆశ్చర్యాన్ని ప్రకటించే అర్జునుడిలో అద్భుతరసదీప్తి కాంతిమంతంగా వెలుగొందుతూ రక్తికట్టిస్తుంది. ఈక్రింది పద్యం దాని కుదాహరణం.

చ. ‘ఇతఁడు సురేంద్రుఁ డొండెఁ బరమేశ్వరుఁ డొండె దినేశుఁ డొండెఁ గా
కతుల బలప్రభావయుతుఁ డన్యుఁడు గాఁ డొరుఁ డైన మద్భుజా
వితత ధనుర్విముక్త శరవేగము పోర సహించి యిట్టు ల
క్షతుఁడు నమూర్ఛితుండు నయి కంపముఁ బొందక యుండ నేర్చునే?’ **(ఆర. 1.312)**

ఇటువంటిదే 'ప్రతిబలదర్పభంజనుఁడు' (1.311) అనే పద్యంకూడా. ఈ రెండు పద్యాలూ జంటగా ఒకేచోట ఉండటం శిల్పపుపంట.

నన్నయ కవిత్వంలో రసోచిత గుణవద్రచనమే రమ్యత. దానిని శిల్పమయం చేయటం వలన రమణీయత ఏర్పడుతుంది. ఇక్కడ ఒక్క అంశం గమనిస్తే చాలు- నన్నయ శిల్పంలోని గొప్పతనం తెలుస్తుంది. ప్రసాదగుణం అర్జునుడి తపోవీరంలోని భక్తి భావతీవ్రతకు పోషకమని నన్నయ తీర్పు. ప్రసాదంలోనే సమయోచితంగా వివిధ గుణాలను మిశ్రమం చేసి వైవిధ్యాన్ని చిత్రించి రక్తికట్టించాడు. దానిని ఛందశ్శిల్పం ద్వారా నన్నయ వ్యాఖ్యానించాడు. పై అయిదు పద్యాలూ చంపకమాలలే. ఒకే వృత్తంలో భిన్నగుణ మిశ్రమ ప్రయోగం! సారమతులైన కవీంద్రులు లో నారసి మేలనవలసిన మేటి గుణ మది !

మహాభారతం పారిజాత కల్పవృక్షం

ఆఖ్యానక ఉపాఖ్యానాలతో ప్రఖ్యాతి చెందిన పర్వం ఆరణ్యపర్వం. అందువలన నన్నయ ఎఱ్ఱయల ఉపాఖ్యాన రచనా వైదగ్ధ్యం ఈ పర్వంలోనే పురులు విప్పుకొన్నది. మార్గదర్శి అయిన మహర్షి నన్నయ. నిగ్గులు దిద్దిన నిపుణుడు ఎఱ్ఱయ. నన్నయ ఉపాఖ్యాన శిల్ప విచారమే ఈ పీఠికలో ప్రధానం. వలసినచోట ఎఱ్ఱయ ప్రస్తుతి తప్పదు.

ఆరణ్యపర్వంలోని ద్వితీయ తృతీయాశ్వాసాలలో ఉన్నవి చాలా వరకు ఉపాఖ్యానాలే. వాటిలో కొన్ని తెలుగు సాహిత్యంలో కావ్యగౌరవం అందుకొన్న అనర్ఘరత్నాలు. అవి మొత్తం పన్నెండు.

1. నలోపాఖ్యానం. 2. అగస్త్యవృత్తాంతం. 3. భగీరథ చరిత్రం. 4. ఋశ్యశృంగుడి కథ. 5. పరశురాముడి చరిత్ర. 6. సౌకన్యోపాఖ్యానం. 7. మాంధాతృ చరిత్రం. 8. సోమకుడి కథ. 9. శిబి చక్రవర్తి చరిత్ర. 10. అష్టావక్రుడి కథ. 11. యవక్రీతు చరిత్రం. 12. అర్వావసు వృత్తాంతం.

ఆఖ్యానంలో ఆఖ్యానక ఉపాఖ్యాన పాత్రలు విశిష్టమైనవి. ప్రధాన కథ ఆఖ్యానం. దానిలో భాగంగా దానికి ఉదాహరణంగా కానీ ఉపబలకంగా కానీ, ఉద్దీపకంగా కానీ అఖ్యానకం వర్ధిల్లుతుంది. ఉపాఖ్యానం ఆఖ్యానానికి పరిపోషకంగానూ, పరిపుష్టికరంగానూ, పరివ్యాప్తికరంగానూ అండగా నిలుస్తుంది. ఆరణ్యపర్వంలో ఆఖ్యానకాలు తక్కువ; ఉపాఖ్యానా లెక్కువ. అవి ఆఖ్యానంలో సాధించే ప్రయోజనాన్ని బట్టి చూస్తే వాటిని మూడు రకాలుగా వర్గీకరించ వచ్చును. ఒకటి - ఉదాహరణంకొరకు గానీ, ఉపరంజనంకొరకు గానీ, ఉపశమనంకొరకు గానీ, ఉత్కంఠా పరిపోషణం కొరకు గానీ, చెప్పేవి ఒకరకం. రెండు - ఉపదేశంకొరకు గాని, సందేశంకొరకు గాని, సందేహనివారణకొరకు గాని, సంస్కారంకొరకు గాని చెప్పేవి మరొకరకం. మూడు లోజ్ఞతకు గాని, తత్త్వదర్శనంకొరకు గాని, దృష్టాంతంకొరకు గాని, పుణ్యంకొరకు గాని చెప్పేవి మరింకో రకం. విశేష మేమంటే - ఉపాఖ్యానా లెన్నివిధాలుగా సాహిత్యలోకంలో ప్రవర్తిల్లటానికి వీలుందో వాటినన్నింటిని ఆవిష్కరించటానికే ఆరణ్యపర్వం ఆవిర్భవించిందా అన్నట్లు కనబడుతుంది. నన్నయ ఎఱ్ఱయలు కలిసి ఉపాఖ్యాన శిల్ప సర్వస్వాన్ని నిర్మించి తరువాతి కవులకు సమర్పించిన ఉజ్జ్వలఘట్టం ఆరణ్యపర్వం. నన్నయ ఎఱ్ఱయల తులనాత్మక అధ్యయనంలో మరెన్నో అంశాలు వెలికి వస్తాయి. వచ్చే భాగంలో వాటిని గురించి చూద్దాం. ప్రస్తుతం నన్నయ ఉన్మీలింపచేసిన ఉపాఖ్యాన శిల్పాన్ని గమనిద్దాం. నన్నయ చెప్పుకొన్నట్లుగా ఈ కథాక్రమం అతి రమ్యం.

నలోపాఖ్యానం-శిల్పసౌందర్యం :

ఉపాఖ్యానాలలో ఉత్తమమైనది నలచరిత్రం. దానిని నన్నయ సర్వాంగ సుందరంగా శిల్పించి, మూలంకంటె అందంగా నిర్మించాడు. 976 శ్లోకాల మూలకథ నన్నయ రచనలో 226 గద్యపద్యాలలో అవతరించింది. ఇది అనువాద మనటానికి వీలులేదు. పునస్సృష్టివలె పునర్భవించింది. రసవత్ప్రబంధమూర్తికి రమణీయ ఉత్సవమూర్తిగా రూపొందింది. కావ్యేతిహాస రచనాకుశలుడైన నన్నయ ప్రదర్శించే మిశ్ర ప్రక్రియా ప్రవృత్తికి ఇది కావ్యత్వస్పృహ నందించే కథాకవితగా రాణించింది. నన్నయ నాటకీయతలో రూపకశిల్పాన్ని రూపొందించుకొన్న రమ్యకృతి ఈ నలోపాఖ్యానం!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నలోపాఖ్యానం ధర్మజుడి దుఃఖోపశాంతి కొరకు చెప్పబడిన కథ. అంటే ఉపశమన ప్రయోజనం కొరకు చెప్పిన కథ. ధర్మజుడు కపటద్యూతంలో వంచించబడ్డాడు. రాజ్యానికి, బంధువులకు దూరమై కానలలో కష్టాల పాలయ్యాడు. అటువంటి కష్టాలు మరొకడు కూడా అనుభవించాడని తెలిస్తే మనస్సు ఊరడిల్లుతుంది. అంతవరకు తా నొక్కడే అటువంటి దురదృష్టానికి గురిఅయినట్లు భావిస్తున్న ధర్మరాజు తనకు ముందు కూడా మరొక దుఃఖితుడున్నాడని తెలిసికొంటే, అతనితో తనను పోల్చుకొని, ఎక్కువ తక్కువలు అంచనా వేసికొని సరిపుచ్చుకొనటానికి వీలుంటుంది.

ఈ సత్యాన్ని గుర్తించిన బృహదశ్వుడు నలుడి చరిత్ర చెప్పాడు. అంటే - ధర్మరాజు పొందిన కష్టాలకంటె దుర్భరమైన వాటిని ఎంతో ఘోరంగా అనుభవించిన మహారాజు కథ చెప్పాడన్నమాట! నల ధర్మరాజుల కథలను పోల్చిచూస్తే నలుడికంటె ధర్మజుడే అదృష్టవంతు డనేటంత ఊరడింపు కలగాలి. నలుడికథ విన్న తరువాత ధర్మరాజు మనసు తేలికపడాలి. ఈ ప్రయోజనం కొరకు ఈ ఉపాఖ్యానం చెప్పబడింది.

నలుడికథ ధర్మజుడికథతో ఎంత సంవదిస్తుందో, అంత వివదిస్తుంది. సంవదించే అంశాలుకూడా నలుడి దురదృష్టాన్ని దుర్భరంగా చిత్రిస్తాయి. నలధర్మజులు నిత్యసత్యధర్మవ్రతులు. ఇద్దరూ ద్యూతవ్యసనం కలవారే. అయినా ఇద్దరికీ అక్షహృదయవిద్య తెలియదు. ఇద్దరూ బలవంతంగా ద్యూతానికి పిలువబడి రాజధర్మాన్ని అనుసరించి కాదనలేక అందులో పాల్గొన్నవారే. ఇద్దరూ దాయాదులతో ద్యూతానికి దిగినవారే! పుష్కరుడు కలిచేత ప్రేరేపించబడి నలుడిని ద్యూతంలో ఓడించాడు. దుర్యోధనుడు శకునిచేత ప్రేరేపించబడి ధర్మరాజును ద్యూతంలో ఓడించాడు. కలిద్వేషమే రెండింటికి కారణం. (దుర్యోధనుడు కలి అవతారం). రెండింట ఈర్ష్యకు కారణం స్త్రీ కావటం విశేషం. దమయంతి తనను వరించలేదని కలికి కోపం. ద్రౌపది తనను మయసభలో పరిహసించిందని సుయోధనుడికి రోషం. నలధర్మజులు ఇద్దరూ ఆడి ఓడించి కపటద్యూతంలోనే. రెండు సందర్భాలలోనూ పునర్ద్యూతం ప్రవర్తిల్లింది. అయితే నలుడు ఓడటానికి కారణం అతడిలో కలి ప్రవేశించి బుద్ధిని వక్రీకరించటం. దమయంతి మంత్రులు హితులు బంధువులు ఎందరు వారించినా నలుడు ద్యూతవ్యసనపరుడైన ఆ ఉన్మాదావస్థకు కారణం- కలి. మరి ధర్మజుడికి? నలుడికి కలిగిన కలిపీడ ధర్మజుడి దేహానికి లేదు, మనసుకు లేదు. ధర్మప్రవృత్తికి లేదు. ధర్మజుడు అందుకు ముందుగా కొంత ఊరట చెందుతాడు.

కథలో మిగిలిన అంశాలను కూడా ఈ తారతమ్య పరిశీలనతో చూడాలి. రెండు కథలలోనూ స్వయంవరాలున్నాయి. ఆ రెండూ వ్యాజస్వయంవరాలే. అర్జునుడిని ఉద్దేశించి ద్రుపదుడూ, నలుడిని ఉద్దేశించి భీముడూ స్వయంవరాలను చాటించారు. దాంపత్యం కూడా ఇరువురికీ పూర్వజన్మలోనే నియతమై ఈ జన్మలో అనుభవానికి వచ్చింది. ఇందులో దమయంతి సౌందర్యం దేవతలను, కలిని ఆకర్షించింది. అందులో ద్రౌపది లావణ్యం కౌరవులకు కన్నెర్ర కావించింది. కలిపగవలెనే దుర్యోధనుడి ఈర్ష్య పాండవులను పట్టి పీడించింది. అయితే, ఒక విషయంలో ధర్మజుడు నయం. రాజ్యం వెలువడి రాగానే నలదమయంతులను పల్కరించటానికే భయపడ్డారు- ప్రజలు. పుష్కరుడి దుష్టశాసనాన్ని ప్రజలు కాదనలేకపోయారు. మూడురోజులు అన్నోదకాలు లేకుండా నగరసీమలో దీనంగా నలదమయంతులు గడపవలసి వచ్చింది. ధర్మరాజుకు ఆ గతి పట్టలేదు. ప్రజలు అతడి వెంట తరలి వచ్చారు. అతడి వినతిమేరకు తిరిగి వెళ్ళారు. ధర్మబాహ్యమైన కౌరవశాసనాన్ని ధిక్కరించి వేలాది విప్రులు ధర్మజుడి వెంట అడవులకు వచ్చారు. అన్నపానీయాలకు అడవులలో కూడా లోపం రాలేదు. నలుడితో పోల్చుకుంటే ధర్మజుడు ప్రజాభిమానాన్ని చూరగొన్న ప్రభువు. అది ఒక ఊరడింపు.

చేసిన సమయాన్ని పాలించటానికి ధర్మజుడు అరణ్య అజ్ఞాతవాసాలు చేశాడు. నలదమయంతులు అభిమానంతో తమకుతాము అరణ్యవాసాన్ని గత్యంతరం లేక ఎన్నుకొన్నారు. ఇల్లాలిని ఒంటరిగా వదలిపెట్టటం, ఆమె చీరలో సగం చించుకొని పోవటం, ఆర్తరక్షావ్రతం పాటించి కర్కోటక విషానికి గురై రూపుమారటం నలుడిచరిత్రలో కలివర్తనకు ప్రతిగా కలిసివచ్చిన అదృష్టాలు. బాహుకుడి రూపం అజ్ఞాతవాసంలోని మారురూపం వంటిదే - అర్జునుడి షండరూపం వలె. వంటలవాడి వేషం భీముడి వలలరూపం వంటిదే. అశ్వరక్షణం నకులుడి అజ్ఞాతవాస సేవావృత్తి వంటిదే. బృహన్నల సారథ్యం వంటిదే బాహుకుడి సారథ్యం. ఇన్ని సామ్యాలున్నా నలుడివలె ధర్మజుడు దయనీయమైన బ్రతుకు సాగించలేదు. వనవాసక్లేశాలు అనుభవించినా పరదాస్యవృత్తి పొందలేదు సరికదా, తపోవృత్తిని తనివితీర సాగించాడు. అజ్ఞాతవాసం వారి నియమంలోని భాగమేకాని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దయనీయమైన కలి శాపం కాదు. నలుడివలె ధర్మజుడు భార్యను వదలిపోలేదు. మాట నిచ్చి తప్పలేదు. ఆ మాట తప్పటం కలిప్రభావంవలన అని తరువాత చెప్పకొని ఇతరులను నమ్మించవలసిన దురవస్థకు పాలుకాలేదు. నలుడిగాథ ధర్మజుడికి కడు దయనీయంగా తోచింది. అతడికంటె తానే వేయిరెట్లు మెరుగని మనసును సముదాయించుకొని ఉంటాడు.

ద్రౌపది పడిన పాట్లు ఒక విధం. దమయంతి అగచాట్లు మరియొక విధం. పాండవులు మీదివస్త్రాలను తీసి కుప్పపెట్టి తమ ఓటమిని ఒప్పుకొన్నారు. అక్షముల ప్రతిరూపమైన పక్షులు నలుడి కట్టుబట్టను ఎత్తుకొని పోయి అతడిని అవమానించాయి. ద్రౌపదికి నిండు సభలో వస్త్రాపహరణం, నలుడికి ఊరిబైట వస్త్రాపహరణం. ద్రౌపది చీరలు దుశ్శాసనుడు ఒలిచి, భంగపడ్డాడు. దమయంతి చీర కొంగును చింపికొనిపోయి నలుడు భంగపడ్డాడు. దమయంతి తన పిల్లలను పుట్టింటికి పంపింది. ద్రౌపది కూడా ఉపపాండవులను పుట్టింటికి పంపింది. ద్రౌపదివలె దమయంతి కూడా సైరంధ్రి వృత్తిలో ఉండింది. దమయంతి కిరాతుడిచేత పీడించబడ్డట్టే ద్రౌపది కీచకుడిచేత పీడించబడింది. ఏకవస్త్రధారణం, కురులు ముడివేసికొనకపోవడం దమయంతీ ద్రౌపదులపట్ల సమానమే. దమయంతి చరిత్ర వింటే ద్రౌపది అదృష్టవంతురాలేమో అనిపిస్తుంది. భర్తచేత విడువబడి బహుయాతనలు పడి, భర్తను అన్వేషించే యత్నాలు తానే స్వయంగా నిర్వహించి చివరకు భర్తను తానే చారచక్షువై గుర్తించి, అతడిని తనవద్దకు రప్పించుకొని, అతడిని ప్రసన్నుడిని చేసికొన్న వీరపత్ని దమయంతి. పాండవపత్నికి అటువంటి దుస్థితి రానివ్వకుండా చూడవలసిన అవసరం పాండవుల కున్నదని నలచరిత్ర హెచ్చరించింది. పతిరక్షలేని దమయంతి కంటె పతిరక్షగల ద్రౌపది భద్రం. శాపానుగ్రహశక్తియుక్తురాలైన మహాపతివ్రత దమయంతే అన్ని కష్టాలు పడినప్పుడు ఇక పాండవపత్ని పడుతున్న కష్టాలు సహించదగినవే అన్న ఊరడింపు ఈ కథాప్రయోజనం.

నలధర్మరాజు లిరువురు అక్షహృదయ విద్యను పొందారు. నలుడు ఆ విద్య వలన జూదంలో కోల్పోయిన రాజ్యాన్ని పొందగలిగాడు. ధర్మజుడికి మరల జూదమాడే అవసరమే జీవితంలో లభించలేదు. నలుడివలె ధర్మజుడు అరణ్యాజ్ఞాతవాసవ్రతాల తరువాత రణమో ద్యూతమో అని పందెం వేయలేదు. దానికి కారణం లేకపోలేదు. నలుడికి బైటిశత్రువు ఒక్కడే. అతడు పుష్కరుడు. కలి దాసుడైనాడు. కలి సాయంలేని పుష్కరుడిని నలుడు సులభంగా జయించాడు. మరి ధర్మరాజుకు కురువీరులందరూ శత్రువులే. దుర్యోధన పక్షవర్తులే. వారి నందరిని జూదంలోనే జయించవచ్చును. నలుడివలె ధర్మజు డా పని చేయలేని ధీరోదాత్తుడు. తుల్యపరిశీలనలో నలుడు గొప్పవాడా? యుధిష్ఠిరుడు గొప్పవాడా? ఆ ఆలోచన రేకెత్తించటమే నలోపాఖ్యాన ముఖ్యోద్దేశం. నన్నయ ఉపాఖ్యానశిల్పంలో పొందించిన వస్తుధ్వని.

మరొకవిశేషం- నలధర్మరాజు లిద్దరు ధీరోదాత్తులే. కానీ, కలి ఆవేశించిన తరువాత నలుడు నలుడు కాడు. అతడి చేష్టలు కలిశాసితాలు. అతడి మనోవేదన మాత్ర మతడిది. ధర్మజుడికి ధర్మం ఆవేశించింది. అతడిలో ఎన్నటికీ మార్పు లేదు. అందువలన నలుడి కథ వింటే జాలి కలుగుతుంది. దమయంతి బాధ వింటే దయ పొటమరిస్తుంది. సహానుభూతికి దూరమైన సానుభూతి నలోపాఖ్యాన రసప్రవృత్తి. ధర్మజుడు సహృదయుల సహానుభూతినే పొందాడు కాని సానుభూతిని కోరలేదు.

బృహదశ్వుడు నలకథ నంతా వినిపించి 'అక్షజితుండ నైతినని వగవ వలదు : నీవును దైవమానుష సంపన్నుండ వయి శత్రువుల జయించి సకల మహీసామ్రాజ్యంబు వడయుదువు' అని ఆశీర్వదించాడు. ఆ కథ వింటే కలిదోషం పోతుందని ఫలశ్రుతి చెప్పాడు. ధర్మజుడికి అక్షహృదయవిద్య నిచ్చాడు. ఈ కథ చెప్పిన నన్నయ ధర్మరాజు ద్యూతపరాభవ దుఃఖంనుండి తేరుకొన్నాడనీ, అక్షహృదయ లాభంతో పరాజయభయ రహితుడైన విజయుడైనాడనీ ధ్వనింపచేశాడు.

ప్రతిపద్యం హృద్యం :

చ. 'నలదమయంతు లిద్దఱు మనఃప్రభవానల బాధ్యమానులై
సలిపిరి దీర్ఘవాసరనిశల్ విలసన్నవనందనంబులన్
నలినదళంబులన్ మృదుమృణాళములన్ ఘనసారపాంసులం
దలిరులశయ్యలన్ సలిలధారలఁ జందనచారుచర్చలన్.' **(ఆర. 2.24.)**

నలోపాఖ్యానానికి ఈ పద్యంతో నన్నయ ప్రాణం పోశాడు. ఇది అమూలకం. నల దమయంతుల పూర్వరాగ విప్రలంభాన్ని ప్రసాదమాధుర్యాల గుణ సమ్మేళనంతో నన్నయ్య ఇందులో ఆవిష్కరించాడు. నలోపాఖ్యానంలో ఒక్క పద్యం చెప్పండంటే తెలుగు రసికులు ఈ పద్యం చెపుతారు. అంతటితో ఆగక - ఈ ఒక్క పద్యమే నలోపాఖ్యాన మంటారు. అంతటిది ఈ పద్య మహత్త్వం.

నలదమయంతులది ప్రణయ జీవితం. వారు అన్యోన్యరూపగుణశ్రవణంవలన అనురక్తులై వివాహమాడారు. దేవతల ఆశీస్సులతో దమయంతి నలుడిని స్వయంవర సభలో వరించింది. వివాహమయ్యేంతవరకు విరహం. అయిన తరువాత పట్టుమని పదునాలుగేళ్ళు కాపురం చేశారో లేదో మరల వియోగం. నలదమయంతుల కథలో సంయోగం కంటె వియోగమే అధికం. అందులోనూ పూర్వరాగవిప్రలంభం కోమలం. వివాహానంతర విప్రలంభం దారుణం. కథలో విప్రలంభాని కున్న ప్రాధాన్యాన్ని గుర్తించి నన్నయ ఈ పద్యాన్ని కల్పించి శిల్పించాడు. కథంతా ఒక యెత్తు; ఈ పద్య మొక్కటి మరొకయెత్తు అన్నంత కీర్తిని నన్నయ దీనితో గడించాడు.

కథను వివిధ ఛందస్సులతో అలంకరించి ఆ యా కథార్థాలను ప్రసన్నం చేయటం నలోపాఖ్యానంలో నన్నయ అనుసరించిన మరొక శిల్పం. అందులో సీసపద్యరచనా శిల్పం అనల్పం. ఫలశ్రుతి సీసంలో చెప్పి, కథలో ఆ పద్యాన్ని ప్రత్యేకంగా పరిశీలించండని నన్నయ సూచించాడు. ఫలశ్రుతి కాక 18 సీసపద్యాలు ఈ ఉపాఖ్యానంలో సహృదయులను ఆకర్షిస్తాయి. సీసం పెద్ద వృత్తం కాబట్టి కథ చెప్పటానికి వాడటం ప్రాథమిక లక్షణం. దమయంతి పుట్టు పూర్వోత్తరాలను గుణగణాలను చెప్పటానికి (2.8), నలుడు రథం మీద వచ్చాడనే ఆశతో చూచి, వచ్చినవాడు ఋతుపర్ణుడని తెలిసి దమయంతి దుఃఖించిందని చెప్పటానికి (2.183) సీసాలను కథాకథనంలో వాడాడు. కథలోనే రమణీయ సన్నివేశాన్ని చిత్రించటానికి సీసాన్ని వాడిన ఘట్టాలు రమ్యతరాలు. దమయంతి అంతఃపురంలో నలదమయంతులు పరస్పరం చూచుకొన్న సన్నివేశం (2-39), దమయంతి స్వయంవర సన్నివేశం (2.54), నలుడు జూదంలో ఓడుతున్నాడని తెలిసి దమయంతి తన సంతానం పట్ల తీసికొన్న జాగ్రత్తలు (2.64), అర్ధరాత్రి గజయూథం సార్థవాహులను చంపిన దృశ్యం (2.111), రాజమాత దమయంతిని గుర్తించి అనురాగంతో కౌగలించుకొని మన్నించిన సన్నివేశం (2.151) మరువలేనివి. సంభాషణకు కూడా సీసాన్ని సమర్థంగా నన్నయ వాడాడు. దిక్పాలకులు నలుడితో చేసిన అభ్యర్థనను (2.34), సభాంతరాలలో విప్రులు ప్రకటించవలసిన వాక్యసముదాయాన్ని (2.158), కేశిని బాహుకుడికి చెప్పిన దమయంతి నియమనిష్ఠలను (2.194) నన్నయ సరళసుందరంగా సీసాలలో చిత్రించాడు.

ఇవన్నీ ఒక యెత్తు; నన్నయ సీసాన్ని రసభావవర్ణనలకై వాడటం మరొక యెత్తు. పూర్వరాగ విప్రలంభాన్ని అనుభవిస్తున్న దమయంతి విరహంలోని గ్లాని, చింత, ఔత్సుక్యం అనే సంచారిభావాలను వ్యక్తీకరించటం (2.23), అడవిలో అలసి నిద్రపోతున్న దమయంతి యొక్క జాలిగొలిపే దైన్యావస్థ (2.77), సార్థంలోని ప్రజలు చూచిన దమయంతి యొక్క దీనమైన రూపం, వారి సమీక్షలు (2.103), సార్థంలో చచ్చినవారితో తా నెందుకు చావలేదని దమయంతి వ్యక్తంచేసే విచారం (2.114), నలుడి వంట నేర్పరితనం (2.197) వస్తువైవిధ్యంతోపాటు వర్ణన వైశిష్ట్యాన్ని ప్రదర్శిస్తున్నాయి.

రసభావతీవ్రతను వ్యక్తంచేసిన నాలుగు సీసపద్యాలను ప్రత్యేకంగా పేర్కొనాలి - 'హా! మహారాజ! మహామహీ రక్షణదక్ష దక్షిణబాహుదండ!' (2.82) అనే సీసం నలుడి అన్వేషణలో దమయంతి పొందిన శోకతీవ్రతను వ్యక్తం చేస్తుంది. నాయికా విరహశోకాన్ని సీసంలో నిర్మించి ఉపాఖ్యానంలోని వర్ణనాంశాలలో ఒక సమతౌల్యాన్ని పాటించాడు నన్నయ. 'ఇభరాజగమన నీ వెందుల కరిగితి' (2.133) అన్నది ఆ సీసం. నలోపాఖ్యానంలోని సీసా లన్నింటిలో తిలకాయమానమైనది ఈ క్రిందిది.

సీ. 'సహకార మత్ప్రియసహకారుఁ బున్నాగ। పున్నాగుఁ దిలక భూభువనతిలకుఁ
జందన బుధహరిచందనుఁ బుష్పితా। శోక సుహృజ్జన శోకదమను

వకుళ కులైకదీపకు విభీతక భయో। పేతార్తిహరు నలుఁ బ్రీతితోడఁ
గానరే కానలలోన లోకోత్తరు'। నని ద్రుమని ద్రుమనికి నరిగి యరిగి

ఆ. యడుగు నడుగు లెండ బొడవొడఁ బొక్కిన। నిర్ఝరాంతరముల నిలుచుఁ బిలుచు
గిరుల దరుల యెడల నురుగుహాగృహములఁ। దొంగి తొంగి చూచుఁ దోయజాక్షి.'**(అర. 2.95)**

పోతన భాగవతంలో గోపికలు శ్రీకృష్ణుడిని అన్వేషించే ఘట్టంలోని "పున్నాగ కానవే పున్నాగవందితు" వంటి సీసాపద్యాలకు ఇది ఆచార్యకం. నన్నయ సామాన్యంగా యమకం ఎచ్చటో కాని వాడడు. నలోపాఖ్యానంలో దానిని విరివిగానే వాడాడు. అలంకారరమ్యత నన్నయగారి అక్షరరమ్యతలో ఒక భాగం.

ఉపాఖ్యానానికి విశేషవృత్తాలతో రమ్యతను కల్పించే శిల్పంలో భాగంగా నన్నయ 5 మధ్యాక్కరలను, 3 మత్తకోకిలలను, 1 తరువోజను, 1 కవిరాజవిరాజితాన్ని వాడాడు. కథలో ప్రత్యేకంగా గమనించదగిన సంభాషణలను, సన్నివేశాలను, వర్ణనలను మధ్యాక్కరలలో నిబంధించి ఛందశ్శిల్పం ద్వారా ప్రధానాంశ ప్రతిపాదనను చేయటం ఒకకళ. నలమహారాజునుండి తనవద్దకు దూతగా వచ్చి అతడి గుణగణాదులను కీర్తించి హంస తనకు హృదయ సమ్మోదం కలిగించిన తరుణంలో దమయంతి పలికిన మాటలను నన్నయ మధ్యాక్కరలో ఎత్తుకొన్నాడు. పూర్వార్ధంలో దమయంతి చేత మాటలు చెప్పించి, ఆ మాటలు విని నలుడికి ఆమె సందేశాన్ని అందించిన హంస హృదయ సమ్మోదాన్ని సూచించేటట్లు వృత్త ఉత్తరార్ధాన్ని నడిపి సమాన మానసిక స్థితిని ఛందఃప్రయోగంతో ధ్వనింపచేశాడు- నన్నయ (చూడు 2.22). సమ్మోదాన్ని ఒక మధ్యాక్కరలో చెప్పిన నన్నయ దుఃఖావేశాన్ని మరొక దానిలో నింబంధించి వృత్త ప్రయోగరమ్యతను చూపాడు. రాజమాత హృదయంలో సానుభూతి కలిగేటట్లు నలుడు దమయంతిని ఒంటిగా అడవిలో విడిచి వెళ్ళిన ఉదంతాన్ని (2.118) రసభావతీవ్రతతో అభివ్యక్తం చేయించాడు. నలమహారాజుకథలో అక్షహృదయ, అశ్వహృదయ విద్యల ప్రస్తావన ఒక ప్రత్యేకత సంతరించుకొన్నది. నలు డొకదానిని పొందుతాడు. మరొకదానిని దానం చేస్తాడు. కథ సుఖాంతం కావటానికి ఈ రెండు కీలకాంశాలు కీలకపాత్ర నిర్వహిస్తాయి. నలమహారాజు అరణ్య అజ్ఞాతవాస జీవితాలలో భద్రమైన జీవితాన్ని గడపటానికీ, కలినివారణం కలగటానికీ పరోక్షంగా తోడ్పడిన కర్కోటకుడు స్నేహభావావేశంతో చెప్పిన మాటలను (2.129) మధ్యాక్కరలో నన్నయ నిబంధించి ప్రకరణౌచిత్యాన్ని పాటించాడు. రాజమాత యెదుట దమయంతిని గుర్తించిన నేర్పుతోనే నలుడిని కూడా గుర్తించి కథలో ఒక కీలకమైన పాత్ర నిర్వహిస్తాడు. సుదేవుడి బుద్ధిశక్తిని ప్రజ్వలింప చేసే ఈ వాక్యాలు విశేషచ్ఛందంలో ఉండటం వృత్తౌచిత్యమే కాక సందర్భౌచిత్యం కూడా (2.149). బాహుకుడి రథవేగాన్ని వర్ణించటం మూలాతిశయంగా నన్నయ కల్పించిన కథార్థం.

"ఎదురను దవ్వులఁ జూచిన పొడవు లెల్లఁ దత్క్షణమ
కదియఁగా నవ్వి యెంతయును దవ్వయి కనఁబడఁ బిఱుఁద
నిది దినేశ్వరు రథమో యనూరుఁడో యితఁ డంచు నపుడు
హృదయమునను గడు విస్మయం బందె నిక్ష్వాకుకులుఁడు". **(అర. 2.170)**

రథవేగ మనగానే అభిజ్ఞాన శాకుంతలంలో కాళిదాసు చేసిన దుష్యంతుడి రథవేగవర్ణనం సహృదయులకు తలపున నిలుస్తుంది. నన్నయ ఆ శ్లోకానికి ఛాయగా ఈ విశేషవృత్తాన్ని తీర్చిదిద్దాడు. పతితయొక్క హృదయాన్ని కథలోని ఒక కీలకాంశంమీద కేంద్రీకరింపజేసి పూర్వాపర కథార్థ సమన్వయంలో అది నిర్వహించే పాత్రను భావింపజేసి కథను ప్రసన్నం చేయటం నన్నయ కథనశిల్పం. దమయంతి పునస్స్వయంవరం ఒక కల్పన. నలుడి అశ్వహృదయ విద్య నిజంగా బాహుకుడి యందు ప్రదర్శితమైతే అతడే నలుడని, కారణాంతరాలవలన కురూపుడైనాడనీ దమయంతి నిర్ణయించుకొన గలుగుతుంది. పైపెచ్చు ఆ కారణంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నలుడు భీముడి పట్టణానికి రాగలుగుతాడు. నలదమయంతీ పునస్సమాగమం జరుగుతుంది. ఇంతటి కీలకమైన అంశం రథవేగం. కీలకమైన అంశాలన్నింటినీ నన్నయ మూలాతిశయంగా చిత్రించటమే ఒక విశేషం. విశేషవృత్తాలలో వాటిని వ్యక్తీకరించటం మరీ విశేషం.

ఈ ఉపాఖ్యానంలో నన్నయ వాడిన మత్తకోకిలలు ముచ్చటగా మూడు - వాటిని మూడు రకాలుగా వాడి పాత్ర మనోగత రసభావ వ్యక్తీకరణను మనోజ్ఞంగా చిత్రించాడు. నలుడు వరుడు కాకపోతే ప్రాణత్యాగం చేసికొంటానని ప్రకటించిన దమయంతిని ఊరడిస్తున్నట్లు, దేవతలవైపు మనసు మళ్ళిస్తున్నట్లు మెత్తగా, హేతుబద్ధంగా, బుజ్జగిస్తున్నట్లుగా చెప్పిన నలుడిమాటలు లయబద్ధంగా శ్రుతిబద్ధంగా అక్షరరమ్యంగా పలికాయి- నన్నయ కవితలో. 'భూరిసత్త్వులు సర్వలోకవిభుల్' (2.49) అనే మత్తకోకిల నన్నయ మంచి పద్యాలలో ఒకటిగా నిలిచిపోయింది.

నలుడిని వెదకుకొంటూ అడవులలో పడరాని పాట్లు పడుతూ, కొండచిలువ బారినుండి కోయవాడు రక్షించగా బయటపడి, అతడిచేత భంగపడబోయి తన పతివ్రతా మాహాత్మ్యంతో తనను తాను రక్షించుకొని, అడుగులు బొబ్బలెక్కగా, కొండలను గుట్టలను వేయికళ్ళతో వెదకుతూ వేసారి పోయిన దమయంతికి ఆ భీకరారణ్యంలో పతిని గురించి శుభవార్త తెలిపే ఒక మున్యాశ్రమం కనబడుతుంది. దానిని చూచినప్పుడు దమయంతి చిత్తవృత్తిలో భాసించే సంతోషతరంగాలనూ, ఆశాకిరణాలనూ తలపించే మత్తకోకిలాన్ని నన్నయ చిత్రించాడు.

'వారిభక్షులు పర్ణభక్షులు వాయుభక్షులు శాకనీ
వారభక్షులు వృక్షమూల నివాసయుక్తులు నై తపం
బారఁజేయు మహామునీంద్రుల యాశ్రమం బెడఁ గాంచె నం
భోరుహాక్షి పురాసమార్జిత పుణ్యకర్మ ఫలంబునన్'. **(అర. 2.97)**

ఎడారిలో ఒయాసిస్సువలె భీకరారణ్యమధ్యంలో సుందరమున్యాశ్రమ సాక్షాత్కారం శిశిర ఋతువులో వసంతదర్శనం వంటిదే. శబ్దలంకార రూప అక్షరరమ్యత దమయంతి హృదయస్పందనసంకేతం.

మహర్షుల దర్శనం పూర్వజన్మ పుణ్యఫలమని నిర్దేశించటం ద్వారా నన్నయ దమయంతిజీవితంలో శుభకరమైన ఒక మలుపు అక్కడినుండి కనబడుతుందని వస్తుధ్వని చేశాడు. ఈ కీలకాంశాన్ని విశేషవృత్త ప్రయోగం ద్వారా సూచించటం రచనా శిల్పం.

కథాంతంలో నలుడు పుష్కరుడిని యుద్ధానికి ఆహ్వానించే ఉత్సాహభావాభివ్యక్తిని మత్తకోకిలలో రచించటం పరమరమణీయం. అక్షహృదయం తెలిసిన నలుడు అటు జూదానికిగానీ, ఇటు యుద్ధానికిగానీ సిద్ధమే. విజయం తథ్యమని అతడికి తెలుసు. ఆ విజయోత్సాహం మత్తకోకిలలో మనోజ్ఞంగా వినిపించింది. (2.223)

ఈ ఉపాఖ్యానంలో నల దమయంతుల పాత్రప్రవృత్తులు విచిత్రంగా ప్రసరిస్తాయి. కథాగతికి నలుడెప్పుడూ అడ్డంగా తిరుగుతాడు. దమయంతి నలుడిచేత భంగపడిన కథను అప్రయత్నంగా ఫలంవైపు లాగుకొని పోతూ ఉంటుంది. కథలోని ఈ రహస్యాన్ని గుర్తించిన నన్నయ ఉభయ ప్రవృత్తులను విశేషవృత్తాల ద్వారా పఠితల మనోరంగాలపై ప్రత్యక్షం చేయటం శిల్పమర్మజ్ఞులు గమనించదగిన అంశం. ఈ కథలో వజ్రప్రాయమైన సంకల్పం దమయంతిదే. దేవతలను వరించుమని నలుడు పలకటం, వారిని వరించకపోతే తనకు కీడు కల్పిస్తారని భయాన్ని తెలపటం నలుడికే చెల్లింది. దేవతలకొరకై స్వీయప్రయోజనాన్ని సైతం త్యాగం చేసికొన బూనిన ఉదాత్తుడు కావచ్చును- నలుడు. కాని, అతడి ప్రయత్నంవలన కథ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కుప్పకూలి పోతుంది. హంసదౌత్యం కథాగతికి పోషకం, నలదౌత్యం కథాప్రయోజనానికే విఘాతం. నాయికా జీవితానికి అశనిపాతం. ఆ విపత్తునుండి, అంతేకాదు దానివలన భవిష్యత్తులో కలిగే విపత్తులన్నింటినుండి, తనను తాను రక్షించుకొని భర్తను ఉద్ధరించగలిగిన ఉదాత్తచరిత్ర దమయంతి. నలుడియెదుట ఆమె వ్యక్తంచేసిన దృఢనిశ్చయాన్ని నన్నయ తరువోజలో పలికించాడు. దేవ తిరస్కారం, భూదేవ పురస్కారం అతిరమ్యంగా ఆవిష్కరించబడిన పద్యం.

'ఏ నేడ? నింద్రాదు లేడ? వారలకు నెప్పుడు మ్రొక్కుదు; నేను నీ ధనమ
భూనాథ! నీగుణంబులు హంసచేతఁ బొలుపుగా విని మనంబున నిల్పియున్న
దాన ; భవన్నిమిత్తమున ని ట్లఖిల ధారుణీనాథ సార్థంబు రావింపఁ
గా నిప్డు వలసె; లోకఖ్యాతకీర్తి! కరుణించి పతిబుద్ధిఁ గావింపు మిందు'. **(ఆర. 2.47)**

ఈ కథారథ చక్రాలకు ఈ పద్యం ఇరుసు. ఆమె సంకల్పమే నలదమయంతుల జీవితంలో సుఖదుఃఖాలను వర్షించింది. దానిని విశేషవృత్తంలో పతిత్రహృదయంలో నాటటం నన్నయ కథాకథన శిల్పంలోని రమ్యత.

కవితా పరంగానూ, స్థిరచర చిత్రాలను రమ్యంగా రూపొందించటంలోనూ, సన్నివేశచారుత్వంలోనూ పేరుగాంచిన నన్నయ నిర్మించిన 'కవిరాజవిరాజితం' ఒకటి- ఈ ఉపాఖ్యానంలో రత్నం వలె రాణిస్తూ నన్నయను కవిరాజుగా విరాజిల్లచేస్తున్నది.

'రజనికరాననఁ బీనపయోధర రాజితరాజసుతన్ విలస
ద్గజపతిగామినిఁ జందనగంధిఁ బ్రకాశితకాంతిసమన్వితఁ బం
కజదళలోచనఁ జూచి కిరాతుఁడు కామనిశాతశరాహతుఁడై
నిజహృదయం బెఱిఁగించె లతాంగి కనింద్యచరిత్రకు వేడుకతోన్'. **(ఆర. 2.90)**

ఇది నన్నయ రచించిన రమణీయమైన పద్యాలలో ఒకటి. కిరాతుడు దమయంతిని చూచాడు. చూచిన క్రమం ఈ వర్ణనలో వ్యంగ్యం. మొదట చంద్రబింబం వంటి వదనాన్ని చూచాడు. ఆహ్లాదాన్ని అనుభవించాడు. ఆ తరువాత అతడి చూపులు క్రమంగా క్రిందికి దిగుతూ వచ్చాయి. దానితోనే అతడి భవిష్యత్తు కూడా పతనం కావటం మొదలైంది. ఆమె పీన పయోధరాలను చూచాడు. కోర్కె తలయెత్తింది. ఆమె శరీరాంగవిన్యాస వైభవాన్ని పరిశీలించాడు. రాచకొలంలో పుట్టిన రత్నంవలె మెరిసిపోతున్నది. 'రాజిత' అనే విశేషణం ఆమె శరీర లావణ్య నైగనిగ్యాన్ని ప్రకాశింపచేస్తున్నది. ఆమె లావణ్యం అతడికి రమణభావం కలిగించింది. తలనుండి క్రమంగా దిగి వస్తున్న చూపులు ఆమె అడుగుల జాడల సింగారాన్ని దర్శించాయి. ఆమె నడకలో గజరాజగమనం గోచరించింది. నెమ్మదిగా నడచివస్తూ సమీపిస్తున్న ఆమెను కన్నార్పకుండా కొంతసేపు చూచాడు. అతడిలో మొలకెత్తిన కోర్కె రతిభావోద్దీప్తిగా మారింది. ఆమె సమీపించింది. ఆమె ఉత్తమజాతి స్త్రీ కావటం వలన శరీరంనుండి మంచిగంధపు వాసన సహజంగా గుబాళిస్తున్నది. అది అతడి మనస్సును మత్తెక్కించింది. ఆమెను నిలువెల్ల కలయచూచాడు. తనువెల్లా ప్రకాశిస్తున్న కాంతిగుణంతో ఆమె వెలిగిపోతున్నది. అది ఆమె పాతివ్రత్య తేజస్సుకు సంబంధించిన లోవెలుగు-వెలికి కాంతిగా ప్రసరిస్తున్నది. దానిని చూచి అతడు దిమ్మరపోయాడు. ఆ తరువాత వెర్రివాడై ఆమె కన్నులలోకి నరాసరి చూడటం మొదలుపెట్టాడు. ఆమె కన్నులు పద్మాలవలె పరమ రమణీయంగా ఉన్నాయి. ఆమె పద్మినీజాతివంటి పరమోత్తమురాలని కాంతితో కూడిన కళ్ళుకూడ చెపుతున్నాయి. వాటిని చూచాడు. కాని వాటి మహిమను తెలిసికొనలేక పోయాడు. అందుకే నన్నయ వాడిని కిరాతుడని, కావాలని అక్కడే పలికాడు. ఆమె సౌందర్యం ఆరాధించదగింది; కాని, అతడు అనుభవించాలని కోరుతున్నాడు. ఆమె పతివ్రత. ఆమెవ్రతాన్ని భగ్నం చేసి ఆమెధర్మాన్ని చెరచి ఆమెతనువును హింసించ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తలపెట్టాడు. అందుకే అతడు కిరాతుడు. అతడు తన కోర్కెను ఆమెపై బాణంగా సంధించబోతున్నాడు. కాని, ఆ కిరాతుడికి తెలియదు. అత డప్పటికే కామనిశాతశరాహతుడని. ఆ కిరాతు డప్పటికే మరొక కిరాతుడిచే కొట్టబడ్డాడు. అతడి మృతి తథ్యం. ఇది నన్నయ రుచిరార్థ సూక్తిరమ్యత. వేడుకతో కిరాతుడు తన హృదయాన్ని లతాంగికి చెప్పాడు - అని కథ చెప్పిన నన్నయ అంతటితో ఆగలేదు. ఆమె అనింద్యచరిత్ర అని విశేషించి చెప్పాడు. ఆ మాట కిరాతు డనుకొన్నది కాదు. అనుకొనేదీ కాదు. అది లోనారసి చూచే సారమతుల కొరకు వాడింది. అందులోని రుచిరార్థ రమ్యతకొరకు వాడింది. పఠిత ఆ సన్నివేశంలో ఉత్కంఠతో ఊగిపోతుంటాడు. దమయంతిశీలం రక్షించబడుతుందా లేదా అని తహతహ లాడుతూ ఉంటాడు. ఆమె అనిందితచరితగానే ఉండాలని ఆశిస్తూ ఉంటాడు. అట్లా సారమతితో కథనుగురించి భావించే భావుకుడికి అందించిన కీలకం ఇది. ఆమె అనిందితచరితగానే ఉంటుందని సూచించి కొంత ఊరట కలిగించాడు- నన్నయ. కాని, అది ఎట్లా సాధ్యమౌతుంది అనే రహస్యం మాత్రం దాచిపెట్టి ఉత్కంఠను పోషించాడు. తరువాత క్రమంగా కథను రమ్యంగా నడిపించాడు.

ఇందులో నన్నయ పద్యాన్ని నడిపిస్తున్నాడా? దమయంతిని నడిపిస్తున్నాడా? కిరాతుడి చూపులను నడిపిస్తున్నాడా? మన మనస్సులను నడిపిస్తున్నాడా? అనే ఆశ్చర్యం కలిగిస్తాడు. అన్నింటినీ నడిపించిన వృత్తం కవిరాజవిరాజితం అని ధ్వనింపజేశాడు. అందుకే నన్నయ అన్నాడు - కథాక్రమం అతిరమ్యం అని.

శివుడే హంసగా అవతరించాడు :

మూలకథను నన్నయ పునస్సృష్టి చేస్తాడన్న సత్యాన్ని నిరూపించేది నలోపాఖ్యానంలోని హంసదౌత్యం. నలదమయంతు లిద్దరూ అన్యోన్యరూపగుణ శ్రవణసంజాత ప్రీతులు. జనులు పొగడే గుణగణాలను విని ఇరువురూ అనురక్తులైనారు. అందులో నలుడు మదనానల వేదన భరించలేక ఉద్యానవనంలో విహరిస్తూ ఉన్నాడు. అంతరిక్షకాంతాహారావళి వలె అంచల వరుస అవనీతలం మీద అవతరించింది. నలుడు ఆ హంసల నడకలు చూచి నవ్వుతూ వాటిని ఎగుర కొట్టాడు. అందులో ఒక హంస ఎగురకుండా ఉండగా దానిని పట్టుకొన్నాడు. మిగిలిన హంసలు దానిని విడిచి పోలేక ఆకాశంలో గాలికి కదిలే శరత్కాల మేఘశకలాల వలె తిరుగుతున్నాయి. ఆ హంస నలుడితో మనుష్యవాక్యాలతో ఇట్లా అన్నది: 'అయ్యా! నీకు ప్రియం చేస్తాను. నీ హృదయేశ్వరి అయిన దమయంతి వద్దకు పోయి, నీగుణాలు ఆమెకు వర్ణించి చెప్పి, ఆ కన్యక అన్యులను వరించకుండా నీయందే బద్ధానురాగ అయ్యేటట్లుగా చేస్తా'నని పలికింది. ఆ పలుకులు నలుడికి అమృతధారాపాతాలవలె అనిపించాయి. హంసను అనురక్తుడై వెంటనే వదిలాడు.

ఆ హంస విదర్భకు చేరింది. చెలికత్తెలతో దమయంతి విహరిస్తున్న అంతఃపుర వనంలో అంచలగుంపుతో దిగింది. చెలికత్తెలందరూ ఆ హంసలను పట్టుకొనటానికి పరుగెత్తారు. నలుడిచేత వదలబడిన ఆ హంసమాత్రం నిపుణంగా తనంతటతాను దమయంతిచేత పట్టుబడింది.

క. 'దమయంతికి నలునకు సం
గమకారణదూత యైన కలహంస మనో
జ్ఞ మనుష్య వాక్యముల న
ద్దమయంతికి హర్ష మెసఁగఁ దా నిట్లనియెన్'. **(ఆర.2.18)**

'నీహృదయేశ్వరుడైన నలునొద్ద నుండి వచ్చాను. ప్రభువు లెవ్వరూ అందంలో అతడితో సరికారు. నీవు నలుడి దేవివైతే నీ రూపకాంతి వైభవాదులు సఫలా లౌతాయి. నీవు నారీరత్నానివి. అతడు పురుషరత్నం. మీ ఇద్దరి కలయిక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అన్యోన్యశోభాకరం' అని చెప్పింది. దమయంతి అమితమైన ఆనందం పొందింది. తనకు నలుడిని గూర్చి ఎట్లా చెప్పిందో అట్లాగే తనను గూర్చి కూడా నలుడికి వర్ణించి చెప్పి, మమ్ములను కూర్చుమని కోరింది. హంస అట్లాగే చేసింది. ఆ తరువాత 'నలదమయంతులిద్దఱు మనఃప్రభవానల బాధ్యమానులై'నారు. ఇది హంసకథ. (క్రీగీట్లున్నవి నన్నయ అమూలకంగా వాడిన పదాలు).

నన్నయ చిత్రించిన హంస వ్యాసుడి హంస కంటె విశిష్టమైనదిగా ఉండటం గమనించతగింది. ఆ అర్థాన్ని తేటపడేటట్లు నన్నయ తెలుగులో రచించాడు. ఆ తాత్పర్యాన్ని మూలంకంటె మిన్నగా తాను వాడిన కొన్ని పదాలచేత నన్నయ ధ్వనింపచేసి కథను ప్రసన్నం చేశాడు. హంసదౌత్యంలో నన్నయ ప్రదర్శించిన అమూలకప్రతిభను మొదటిసారి కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు వివేచించి చెప్పారు -

''ఇది హంసదౌత్యము. ఈ హంస ఎవరు? దీని కీ మాటాడు శక్తి యెచ్చటినుండి వచ్చినది? తన ప్రేమ రహస్యము దీనికిఁ దెలియుటను నలు డెట్లు నిశ్శంకముగా స్వీకరించెను? ఈ హంస 'యవతరించెను'. ఇది దమయంతికి నలునకు సంగమ కారణదూత. సంగమమునకు గారణమయిన దూత యని యర్థము. ఈ హంస లేనిచో వారి సంగమము జరుగదా? అదివరకే వా రన్యోన్యలగ్నమనస్కులు. ఈ దౌత్యము వలన దమయంతి యధిక విరహతప్త యగుటయు, భీముడు స్వయంవరమును జాటించుటయు జరిగినమాట నిజమే! అంతమాత్రమున సంగమకారణ దూత యనవలయునా? ఏవిధముగాఁ జెప్పిన చెప్పకూడదు? ఇచ్చటి కారణశబ్దమే చమత్కారముగా నున్నది. కారణజన్ముడు మొదలైన శబ్దములు కలవు. వారి సంగమమే కారణముగా గల దూత. ఈ హంస మరి యెచ్చటను లేదు. ఈ యొక్క కారణము కొరకే యీ హంస భూమి కవతరించెను. ఇతర కావ్యములలోని హంసలు, పక్షులు మాటాడినచోఁ బంచతంత్రములో పక్షులు మాటాడినట్లు. ఇచ్చట నట్లు కాదు. ఈ హంస నలదమయంతులయొక్క సంగమార్థమయిన కారణజన్మ కలది.''

''ఈ హంస శివుడు. ఇది శివపురాణాంతర్గతమైన గాథ. ఆహుకులను భిల్లదంపతులు యుగాంతరములందుఁ దపస్సు చేయఁగా శివుఁ డనుగ్రహించి 'మీ రిద్దఱు నలదమయంతు లయి జన్మింతురు. మీకు నేను దౌత్యము చేయుదు'నని ప్రసాదించెను. ఆ గాథ యిచ్చట ననుసంధిత మయినచో నీ నన్నయగారి రత్నగర్భమైన రచన తెలియును. నన్నయ్యగారు తాను 'నానాపురాణవిజ్ఞాననిరతుఁడ' నని చెప్పికొనెను.'' (నన్నయగారి ప్రసన్న కథా కలితార్థయుక్తి' (1954) పు. 95-96)

మార్పులు - చేర్పులు :

కథార్థాలలో ఆయువు పట్టులైన కొన్ని అంశాలను పట్టుకొని ఉపాఖ్యానంలోని తాత్పర్యం ప్రసన్నమయ్యేటట్లు నన్నయ కడురమ్యంగా బలపరుస్తాడు. దానితో ఉపాఖ్యానం ఉజ్జ్వలంగా ఉన్మీలిస్తుంది. మచ్చుకు కొన్ని ఉదాహరణలు:

(1) దమయంతీ స్వయంవరానికి ఇంద్రాదు లొకవైపు నుండి, నలుడు మరొక వైపు నుండి వస్తున్నారు. వారి సమావేశం కథలో కీలకమైనది. కథలో నలుడు నాయకుడు. అతడు నరుడు. దమయంతిని ఆశిస్తున్న ఇంద్రాదులు దేవతలు. తారతమ్య పరిశీలన కథనంలో ఏర్పడుతుంది. అప్పుడు నన్నయ నలుడిని అలంకారబలంతో ఉజ్జ్వలుడిగా తీర్చిదిద్దుతాడు. (చూడు.2.33). ఇందులో నన్నయ నలుడికి రెండు విశేషణాలు వాడాడు. 1. ఆదిత్యులలో విష్ణువువలె తేజోధికుడైన వాడట. 2. సౌందర్యంలో రెండవమన్మథుడి వంటివాడట. మూలంలో మొదటి విశేషణంగా ''భ్రాజమానం యథా రవిః'' అని చెప్పబడింది. సూర్యుడివలె ప్రకాశించే వాడిని తెలుగులో సూర్యులలో విష్ణువును చేశాడు. దేవతలకంటె నలుడు మహానుభావుడనీ, తేజస్వి అనీ నన్నయ రచనలో ధ్వని కనిపిస్తుంది. మూలం కంటె ఇది రమణీయం. రెండో విశేషణం మూలంలో లేదు. ''తస్థు ర్విగత సంకల్పాః'' అని మాత్రమే ఉన్నది. అంటే నలుడిని చూడగానే ఇంద్రాదులు తమ ఆశలు వదులుకొన్నారట! ఇది వాచ్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నన్నయ ఈ భావాన్ని అలంకృతం చేసి ధ్వనిమయం చేశాడు. అందంలో దేవతలలో మన్మథుడు మిన్న. నలుడు రెండవమన్మథుడివలె ఉన్నాడనటం ఇక్కడ రమణీయం. నలుడి సర్వాతిశాయిత్వం నన్నయ తాత్పర్యం.

(2) మూలాన్ని కథాప్రవృత్తికి అనుకూలంగా సంస్కరించటం నన్నయ వివేకం. నలుడు దేవదూతగా వచ్చి దమయంతితో 'నీవు వారిని వరించకుండా నన్ను వరిస్తేవారు నన్ను స్వార్థపరుడని నిందిస్తారు. నేను వారి పనిమీద వచ్చాను. నేను స్వప్రయోజనంతో మెలగకూడదు. అది ధర్మం కూడా కాదు. కాబట్టి నాకు ధర్మసంకట మేర్పడకుండా నాకు స్వార్థం నెరవేరేటట్లు ఉపాయం ఆలోచించు' మని అడుగుతాడు- మూలంలో. నన్నయ దీనిని మార్చాడు. 'దేవతల కిష్టం లేని పనులు చేస్తే నరులు అధమగతు లౌతారు. కాబట్టి వారి కిష్టం చేసి నన్ను కాపాడు' మని నలు డన్నట్లు నన్నయ చెప్పాడు. భావికథలో కష్టాలనుభవించేటప్పుడు అవి దేవతలను కాదని నలుడిని పెండ్లాడినందుకు వారు కల్పిస్తున్న బాధలేమో అని శంకించింది దమయంతి. ఆ భావనకు అనుకూలంగా నన్నయ మార్పు రాణించింది.

(3) మార్పులు చేసేటప్పుడు పూర్వాపరవైరుధ్యం లేకుండా కథలో ఏకవాక్యతను సాధించటంలో నన్నయ జాగరూకుడై ఉంటాడు. జూదంలో పుష్కరుడి చేతిలో నలుడు ఓడిపోవటం తప్పదని తెలిసికొనిన దమయంతి చాకచక్యంతో భర్త అనుమతి పొంది కొడుకును, కూతురును విదర్భకు పంపింది. వార్ష్ణేయుడనే సారథి రథంలో వారిని విదర్భకు తీసికొని పోయి పిల్లలతో పాటు రథాన్నీ, గుఱ్ఱాలనూ అక్కడే వదలిపెట్టి రమ్మని వ్యాసదమయంతి ఆజ్ఞాపించింది. నన్నయ దమయంతి రథాన్ని తిరిగి తీసికొని రమ్మని ఆనతిచ్చింది. భావికథలో నలుడు వార్ష్ణేయుడితో కూడి తనరథంమీద ఋతుపర్ణుడి నెక్కించుకొని విదర్భకు పోవలసి ఉన్నది. ఆ రథశబ్దం నలుడిదిగా దమయంతి గుర్తించవలసి వస్తుంది. మూలకథ దాని కనుకూలంగా లేదు. అందువలన నన్నయ దానికి తగినట్లు దమయంతి మాటలు మార్చాడు. వైరుధ్యాన్ని తొలగించాడు. ఔచిత్యాన్ని పోషించాడు.

(4) నలుడి పాత్రలోని అంతస్సంఘర్షణను సృష్టించిన ఈ క్రింది పద్యం యథామూలమైనా తెలుగులో బహుళ ప్రచారం పొందింది.

చ. 'కలి దమయంతిఁ బాప సమకట్టుఁ బొరిం బొరి వాయనోపఁడా
లలన సుదీర్ఘ సౌహృదబలంబున; నిట్టులు రెంటఁ జేసి య
న్నలుఁడు విమోహరజ్జులఁ బెసంగి గతాగతకారి యైన యు
య్యెలయును బోలె నూఱడక యెంతయుఁ బ్రొద్దు వినిశ్చితాత్ముఁడై'. **(ఆర.2.79)**

నలచరిత్రం ప్రాచీన భారతీయ సాహిత్యంలో లభిస్తున్న ప్రసిద్ధ విషాద గంభీర గాథ. విషాదాంత నాటకంలో ఉండే సంఘర్షణ సాంద్రత, విషాద వాతావరణం విషాద గంభీర కావ్యనాటకాలలో కూడా ఉంటాయి. 'టు బి ఆర్ నాట్ టు బి' అన్న అంతస్సంఘర్షణ షేక్స్పియర్ హేమ్లెట్ నాటకంలో ఎంతటి విషాద సంఘర్షణ వాతావరణ సాంద్రతను సృష్టించిందో నలుడి ఈ డోలాయమానస్థితి ఈ కథలో అంతటి విషాదగాఢతను కల్పించి, ఆ పాత్రపై అపార సానుభూతిని కల్గించింది.

(5) నలోపాఖ్యానంలోని ఇతివృత్తం ఒకనాటక వస్తువులో ఉండే సహజ నిర్మాణంతో అమరి ఉన్నది. ఉదాహరణకు హంస దౌత్యంలో ముఖసంధి, నలదౌత్యంలో ప్రతిముఖ సంధి, నలదమయంతులు అరణ్యంలో విడివడి ఒకరు ఋతుపర్ణుడిని ఆశ్రయించి, మరొకరు రాజమాత నాశ్రయించి ఉన్న ఘట్టంలో గర్భసంధి, దమయంతి నలుడిని గురించి బ్రాహ్మణులతో అన్వేషణ సాగించిన ఘట్టంలో అవమర్శ సంధి, పునస్స్వయంవర ఘట్టంలో నిర్వహణ సంధి భాసించాయి. నన్నయ ఈ రూపకమర్యాదను కథాకథనరూపమైన చట్రంలో ఇమిడ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(6) "కర్కోటకస్య నాగస్య దమయంత్యా నలస్య చ,
ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనమ్ కలినాశనమ్".

ఈ ఫలశ్రుతి ప్రసిద్ధం. నన్నయ దీనికి సీసపద్యం వ్రాశాడు. ఫలశ్రుతి ఉన్నది పుణ్యకథ.

పుణ్యతీర్థకథలు :

పదునాలుగు లోకాలు తిరిగే నారదుడు ఒకచోట కూర్చుండి భూవలయంలో ఉన్న తీర్థాలను, వాటి దర్శనం వలన, సేవనంవలన కలిగే ఫలితాలను చెప్పగా, రోమశుడు దేవలోకం నుండి దిగివచ్చి, ధర్మరాజును తనతో పాటు పుణ్యతీర్థాలన్నీ త్రిప్పి సేవింప చేయటమే కాకుండా వాటి మాహాత్మ్యాలనూ, తీర్థక్షేత్ర పురాణాలనూ ధర్మజుడి అభిలాష కనుగుణంగా వివరించాడు. అది ఆరణ్య పర్వ పుణ్యకథా ప్రపంచానికి పుట్టుక నిచ్చింది. తీర్థాలు పవిత్రాలు - ధర్మపరులైన దేవతలు, ఋషులు వాటి నాశ్రయించారు కాబట్టి. తీర్థసేవ సర్వాభీష్టప్రదం. తీర్థాలను సేవిస్తూ క్రతువులను, దానాలను చేస్తూ విప్రాశీస్సులను పొందేవారికి సర్వదుఃఖాలు తొలగిపోతాయి. వారిని సర్వశ్రేయస్సులూ పొందుతాయి. ఈ విశ్వాసంతో పాండవులు తీర్థయాత్రలు చేశారు, యజ్ఞాలు చేశారు, దానాలు చేశారు, బ్రాహ్మణాశీస్సులను పొందారు. అయితే యజ్ఞాలలో జ్ఞానయజ్ఞం ఒకటి. ధర్మరాజు కర్మవలన జ్ఞానం సాధించే అనుష్ఠాన వేదాంతి. అతడు తీర్థాలలో మునిగి పుణ్యం గడించాడు. ఆ పుణ్యతీర్థాలు ఏ మహితాత్ముల చరిత్రలతో ప్రసిద్ధి చెందాయో తెలిసికొని ఆ పుణ్యకథాతీర్థాలలో కూడా మునకలువేసి జిజ్ఞాసువైనాడు. కర్మకాండకు సంబంధించిన దానిని నన్నయ ఊరక చెప్పి ఊరుకొన్నాడు. జ్ఞానకాండకు సంబంధించిన అంశాలను ఉపాఖ్యానాలుగా (స్థలపురాణాలుగా) వివరించి చెప్పాడు. ఆ తీర్థాలను ఆశ్రయించిన మహనీయుల గుణతీర్థావగాహనమే ఈ సాహిత్యతీర్థ సేవాఫలం.

ఈ కథలలో ఎందరో మహానుభావులు కీర్తించబడ్డారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క విశిష్టవ్యక్తిత్వం, ఒక్కొక్కపురుషార్థ సాధన మార్గం. అన్ని కథలూ వింటే చతుర్విధ పురుషార్థ తీర్థ సేవనమైనట్లే. ఇతిహాసఫలాలలో అది ఒకటి.

1. అగస్త్య మహర్షి : ఈ ఋషిపేరుమీద వెలసిఉన్న పుణ్యక్షేత్రం అగస్త్యాశ్రమం. వాతాపిని జీర్ణం చేసికొని జగద్విఖ్యాతి పొందినవాడు. అందుకే ధర్మజుడు ఆ కథ నడిగాడు. ఆ కథలో తెలిసే అంశాలు నాలుగు. పురుషుడు పుట్టిన తరువాత గృహస్థుడై పుత్ర పౌత్ర లాభాన్ని పొందకపోతే వారి పితరులకు ఉత్తమగతు లుండవు. భార్యకోరికను ఎట్టిప్రయత్నం చేసైనా తీర్చటం భర్త ధర్మం. భర్తవలన ఉత్తమ సంతానాన్ని పొందాలన్న ఉత్తమ సంకల్పం భార్యకూడా కలిగి ఉండాలి. ఉత్తమ గృహస్థుడు తపస్వి అయితే ఎంతటి ఆసురీశక్తినైనా నిగ్రహించగలడు - అనే గుణపాఠాలు నేర్చుకొన్నాడు- ధర్మజుడు.

అగస్త్యుడు అనంత మహిమ కలవాడు. భార్య అయిన లోపాముద్రతో గృహస్థజీవితం గడుపుతున్నా సామాజిక శ్రేయస్సు కొరకు ఎంతటి త్యాగాన్ని చేయటానికైనా, ఎంతటి సాహసం చేయటానికైనా వెనుకాడని తపోవీరుడు. వాతాపిని జీర్ణించుకొన్న దిట్ట. వింధ్యపర్వత గర్వాన్ని భంజించిన గురుమూర్తి. ఉత్తరాపథం నుండి దక్షిణాపథానికి మకాం మార్చిన లోకహిత కారకుడు. లోకకంటకనివారణార్థం సముద్రోదకాలను ఆపోశనం పట్టిన మహితాత్ముడు. అంతటి మహితాత్ముడి మూడంచెల జీవితం వలన మూడు నీతులు తెలుస్తాయి. అవి -గృహనీతిని పాటించు, లోక శ్రేయస్సును సాధించు, అసురశక్తిని దమించు! ధర్మజుడు అగస్త్యాశ్రమంలో ఈ జ్ఞానతీర్థంలో మునిగాడు.

2. భగీరథుడు : గంగను నేలకు తెచ్చిన తపోవీరుడు భగీరథుడు. ఎంతో కష్టపడి అసాధ్యమైనదాన్ని సాధిస్తే 'భగీరథ ప్రయత్నం' అంటాం దాన్ని. అతడి చరిత్ర జీవితలక్ష్యం సాధించదలచుకొన్న ఏ ధర్మవీరుడికైనా ఆదర్శప్రాయం. భగీరథుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పుట్టినవంశం సాహసవంతులైన వీరులు జన్మించిన ఇక్ష్వాకువంశం. అందులో సగరుడు సంతానంకొరకు శివుడిని గూర్చి తపస్సు చేశాడు. అతడికి ఇద్దరు భార్యలు. పరమేశ్వరుడి వరంవలన పెద్దభార్య వైదర్భికి అరవై వేల మంది కొడుకులు పుట్టారు. శైబ్యకు ఒక్క కొడుకు కలిగాడు. పెద్దభార్య కొడుకులు మదాంధులై కపిలమహర్షి కంటిమంటకు బూడిదై పోయారు. రెండవభార్య కొడుకు క్రూరుడై శిశుహంతగా మారి దేశంనుండి వెళ్ళగొట్టబడ్డాడు. సగరుడు అశ్వమేధయాగం చేశాడు. కాని అది సగంలో ఆగిపోయింది. అతడి మనుమడు తాత గౌరవం నిలువబెట్టాడు. కపిలమునినుండి సవనాశ్వాన్ని తెచ్చి సవనం పూర్తి చేయించాడు. అతడి మనుమడు భగీరథుడు ఘోరతపస్సుచేసి గంగను నేలకు దింపాడు. అగస్త్యుడు నీరు త్రాగగా ఎండిపోయిన సముద్రాలను మరల నీటితో నింపాడు. సాగరుల భస్మరాశులను గంగతో తడిపి వారికి ఉత్తమ గతులు కల్పించాడు. ఈ కథ పుణ్యకథ. ఈ జ్ఞాన తీర్థంలో స్నానం చేసి, ధర్మజుడు నేర్చుకొన్నది అపారం. అందులో ఒక క్రమవిన్యాసం కూడా ఉన్నది. సంతానాన్ని కని పితరులను ఉద్ధరించ వచ్చునని అగస్త్యుడి కథ చెప్పితే, సంతానం ఉత్తమసంతానమైతేనే ఉత్తమగతులు లభిస్తాయని సగరపుత్రుల కథ చెపుతున్నది. ఒక వంశంలో ఒక తరం చెడిపోయినా సంకల్పబలం ఉంటే తరువాతి తరంవారు సత్కర్మలు చేసి, వెనుకటి తరాలవారి నందరినీ ఉద్ధరించగలరనే ఒక ఉపదేశాన్ని ఆశాకిరణంగా అందించింది భగీరథచరిత్ర.

3. ఋశ్యశృంగముని : ఈ మహామునిపేర ఒక పుణ్యతీర్థం ఉన్నది. అత డొక అద్భుతవ్యక్తి. విభాండక పుత్రుడు. విభాండకుడు అఖండ బ్రహ్మచారి. ఒకనాడు సరస్సులో స్నానం చేస్తూ ఊర్వశిని చూచాడు. రేతఃపతన మైనది. దానితో కలిసిన నీటిని ఒక దుప్పి త్రాగి గర్భవతి అయి ఋశ్యశృంగుడికి జన్మనిచ్చింది. అతడు తండ్రివద్ద ఆడువారంటే ఎవరో కూడా తెలియని ఏకాంతవాసంలో తపోనిష్ఠలతో పెరుగుతున్నాడు. విభాండకు డొక చిత్రమైన మనిషి. బ్రహ్మచర్యం అతడు పాటించాడు. కొడుకు కూడ బ్రహ్మచారిగానే ఉండాలనుకొన్నాడు. తా నొకసారి ఊర్వశిని చూడటం వలన స్ఖలితుడైనాడు. ఆ తప్పుకూడా కొడుకు పట్ల జరుగకూడదని ఆతడిపై ఆడువారి నీడకూడ పడకుండా నట్టడవిలో పెంచాడు. ఋశ్యశృంగుడు ఎక్కడ ఉంటే అక్కడ వానలు పడే మహిమ కలవాడు. కాని, వానలు కురిసే లోకాన్ని చూడని వానప్రస్థుడు!

అంగదేశాన్ని రోమపాదుడు పాలిస్తూ విప్రులపట్ల అపరాధం చేశాడు. రాజ్యంలో వానలు పడక దుర్భిక్షం ఏర్పడింది. తప్పు తెలిసికొని రాజు విప్రులను సంతోషపెట్టాడు. వారు ఋశ్యశృంగుడిని అంగదేశానికి పిలిపించుమన్నారు. అతడు ఆ ఋషివిషయం తెలిసికొని నిపుణలైన వేశ్యలను తపోవనానికి పంపాడు. విభాండకుడు లేని సమయంలో వేశ్యాపుత్రిక ఋశ్యశృంగుడిని సమీపించి, తన విలాసాలను ప్రదర్శించింది. ఆమెను వింతమునిగా ఊహించి ఋశ్యశృంగు డామెపట్ల పురుషభావంతోనే వ్యవహరిస్తూ ఒక వింతస్పందనను పొందాడు. ఆ వేశ్య అతడిని కౌగిలించుకొని, ముద్దాడి, మణితాది శబ్దాలు చేసి అతడిని ప్రబోధించింది. నిగ్రహించబడి సుప్తమై ఉన్న ఋశ్యశృంగుడి దేహేంద్రియ చైతన్యం ప్రవృత్తి పట్ల జాగృతమైనది. తండ్రి వారించాడు. కానీ, మరునాడు ఋశ్యశృంగుడు ప్రబోధితుడైనాడేకాని వేశ్యతో సంపర్కం పొందలేదు. రోమపాదుడు తనకూతురైన శాంత నిచ్చి పెళ్ళి చేశాడు. గోశాలలు అతడిపేర రాజ్యమంతా ఏర్పాటుచేశాడు. విభాండకుడు ఆసంగతి తెలిసికొని, కొడుకును కోడలిని ఆశ్రమానికి తెచ్చుకొన్నాడు. శాంతాఋశ్యశృంగులు అరుంధతీ వసిష్ఠులవలె, లోపాముద్రాగస్త్యులవలె ఉత్తమ దంపతులై జీవించారు. ఋశ్యశృంగుడికథ అందరినీ ఆశ్చర్యకరంగా ఆకర్షిస్తుంది. నిశ్శబ్దంగా ఒక నీతిని బోధిస్తుంది. నిర్బంధ బ్రహ్మచర్యం వానలు లేని దేశం వంటిది. గృహస్థాశ్రమధర్మంలో చేసే తపస్సు సుభిక్షమైన దేశవైభవం వంటిది. అస్ఖలిత బ్రహ్మచర్యం లోకశ్రేయస్సును అందించదు. గృహస్థాశ్రమమే సర్వత్రా సమాదరణీయం!

4. పరశురాముడు : పరశురామనివాసం మహేంద్రపర్వతం. ఆతడి చరిత్ర సారమే ఆ తీర్థసేవన ఫలం. పరశురాముడు ఒక విశిష్ట వ్యక్తి. పుట్టింది బ్రాహ్మణవంశంలో, కలిగింది క్షత్రియ తేజం. అది భృగుడి వరంవలన కలిగిన ఒక మిశ్రప్రకృతి. బ్రాహ్మణక్షత్రియ స్వభావాల మేలికలయిక పరశురాముడు. 'ఇదం బ్రాహ్మ్యం ఇదం క్షాత్రం' అన్న సూక్తికి అచ్చమైన ఉదాహరణం!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'పితృదేవోభవ', 'మాతృదేవోభవ' - అనే ఆర్షసూత్రాలను త్రికరణశుద్ధిగా పాటించే విప్రవీరుడు పరశురాముడు. రేణుకా జమదగ్నులు అతడి తల్లిదండ్రులు. తండ్రి తల్లిని చంపుమంటే మారుపలుకకుండా ఆమె తలనరికి పితృవాక్యపరిపాలనం చేసే క్షాత్రశక్తి అతడికి ఉన్నది. మానవుడు ప్రమాదశాత్తు-మానసికంగానైనా-పాపంకాని, నేరంకాని చేయవచ్చును. దానికి మరణం శిక్ష కాదు. పశ్చాత్తాపమే తరణోపాయమని ఉదారంగా భావించగలిగిన ఉదాత్తప్రవృత్తి అతడికి ఉన్నది. మానసికంగా పరపురుషుడి పొందుకోరిన తల్లినీ, తండ్రిమాటను తిరస్కరించి, శప్తులైన సోదరులనూ బ్రతికించు కొన్నాడు. తల్లిని చంపిన పాపాన్ని పోగొట్టుకొన్నాడు. తండ్రికే తన ప్రవర్తనవలన ఒక కనువిప్పు కలిగించాడు. కోపం కంటె శాంతం, సహనం, క్షమ, క్షమించటం ఎంతటి ఉత్తమ గుణాలో ప్రదర్శించి చూపించాడు. తండ్రి తన తల్లిని అనురాగంతో ఏలుకొనేటట్లు చేశాడు. తల్లి మానసికమైన తన తప్పుకు పశ్చాత్తాపపడి, తనగృహస్థ జీవితాన్ని మరల భగ్నం చేసికొనకుండ భద్రపడటానికి అనువైన శాంతియుత ప్రేమమయ కుటుంబాన్ని పరశురాముడు సృష్టించాడు. ఈ ఘట్టంలో పరశురాముడు పరమ బ్రహ్మణ్యమూర్తి! క్షమాశక్తి!

పరశురాముడి జీవితాన్ని కార్తవీర్యుడి ధూర్తవర్తనం తీవ్రంగా మార్చింది. ఒకనాడు పరశురాము డాశ్రమంలో లేనప్పుడు కార్తవీర్యార్జునుడు ససైన్యుడై వెళ్ళి జదదగ్నివలన ఆతిథ్యాన్ని పొంది, కృతఘ్నుడై ఆశ్రమహోమధేనువును బలవంతంగా హరించాడు. ఆ సంగతి తెలిసి పరశురాముడు ఉగ్రుడైనాడు; కార్తవీర్యుడిని వెన్నంటి వెళ్ళి పోరులో ఘోరంగా చంపాడు. హోమధేనువును తిరిగి తెచ్చాడు. అంతటితో శాంతు డయ్యాడు.

కాని, మరొకసారి మరొక ఘోరం జరిగింది. కార్తవీర్యుడి పుత్రులు పగబట్టి పరశురాముడు ఆశ్రమంలో లేని సమయంలో జమదగ్నిని పట్టి నానాహింసలు పెట్టి దారుణంగా వధించారు. ఆ బాధలు పడుతూ ఆ మహర్షి కొడుకైన రాముడిని ఎలుగెత్తి పిలుస్తూ ఆశ్రమమంతా ప్రతిధ్వనించేటట్లు, ఆశ్రమవాసులంతా రోదించేటట్లు, దారుణ వేదనను అనుభవిస్తూ చనిపోయాడు. రేణుక ఘోరమైన ఆ హత్యను చూచి దిక్కులదిరేటట్లుగా రోదించింది. ఆ కరుణభయంకర దృశ్యాన్ని పరశురాముడు చూచాడు. అపరరుద్రుడైనాడు. పరశువుకు పదునుపెట్టాడు. హైహయులను నిర్దాక్షిణ్యంగా చంపి, అయిదు మడుగులలో రక్తం నింపాడు. ఆ రక్తంతో తండ్రికి తర్పణాలిచ్చాడు. శాంతించాడు. తపోమయ జీవితాన్ని మహేంద్రపర్వతంమీద గడుపుతున్నాడు.

మహేంద్ర పర్వతాన్నీ, పరశురాముడినీ స్వయంగా దర్శించిన ధర్మరాజు గొప్ప నీతిని నేర్చుకొన్నాడు. పితృభక్తి, క్షమ, శాంతం, తపస్సు- అనే విప్రధర్మాలు మనిషిని మహనీయుడిగా చేస్తాయి. పరులవలన అపకారం పొందినప్పుడు దానికి ప్రతీకారం చేసే పరాక్రమాన్ని ప్రదర్శిస్తే అతడు మహావీరుడుగా మారుతాడు. ఒకేవ్యక్తిలో ఈ బ్రాహ్మణ క్షత్రియగుణాలు ఉండటం విశేషం! ఈ జ్ఞానతీర్థంలో మునిగిన ధర్మరాజు అరణ్య, అజ్ఞాత వాసాలలో బ్రాహ్మణ స్వభావాన్నీ, యుద్ధఘట్కంలో క్షత్రియపరాక్రమాన్నీ ప్రకటించి పరశురామ దర్శన తీర్థసేవన ఫలాన్ని జీవితంలో పండించుకొన్నాడు.

ద్రౌపదీ భీములు ధర్మజు డనుసరిస్తున్న క్షమాగుణం బ్రాహ్మణధర్మమని వాదించారు. ధర్మజుడు అదనెరిగి మహాప్రయత్నం చేసి మహాయుద్ధంలో మహాఫలాన్ని పొందటం వీరధర్మ మనీ, ఆ సమయం వచ్చేంతవరకు క్షమతో తపస్సే శరణ్యమనీ ప్రబోధించాడు. క్షత్రియలోకసంహారం చేసిన రౌద్రమూర్తి పరశురాముడు. ధర్మజుడు దర్శించినప్పుడు పరశురాముడు తపశ్శాలి, శాంతమూర్తి. ఆరణ్యపర్వంలో ఆయనను అట్లా దర్శించటమే ఉచితం. అతడి కథ భావికథా జీవితానికి ఒక దివ్యస్ఫూర్తి! ధర్మజుడు ప్రసన్న పరశురాముడు!

5. చ్యవనుడు-సుకన్య : చ్యవనుడు ఒక అపూర్వవ్యక్తి; సుకన్య ఒక విచిత్రవ్యక్తి. ఈకథను చెప్పటంలో నన్నయ అపూర్వవ్యంగ్యవైఖరిని అనుసరించి కథార్థాలను భావనామయం చేశాడు. విశ్వనాథ సత్యనారాయణగారు ఈ కథనుగురించి విశేషంగా వ్యాఖ్యానించారు. (చూడండి: 'నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి') రోమశుడు ఒక సరోవరతీరంలో శర్యాతి యజ్ఞ ప్రదేశాన్ని ధర్మరాజుకు చూపిస్తూ- 'ఇక్కడ భృగుపుత్రుడైన చ్యవనుడు శర్యాతి అనే రాజుకూతురు సుకన్యను పెండ్లాడి,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అతడి యజ్ఞంలో ఇంద్రుడిని లెక్కచేయకుండా అశ్వినులను సోమపీథులను చేశాడు' - అని చెప్పాడు. ధర్మజుడు అది ఎట్లా జరిగిందో వివరించుమన్నాడు.

ఈకథలో కేంద్రబిందువు చ్యవనుడు సుకన్యను పెండ్లిచేసికొనటం. దానికి పూర్వ కథ - దాని తరువాతి కథ అని ఉపాఖ్యానం రెండుగా విభక్తమౌతుంది. చ్యవనుడు ఒక సరోవర తీరంలో వీరాసనంలో ఉండి పెక్కువేలేండ్లు తపస్సు చేశాడు. అతడు కన్నులు ఇంచుక తెరిచి తపస్సు చేస్తున్నాడు. చుట్టూ పుట్టలూ చెట్లూ తీగలూ క్రమ్ముకున్నాయి. కాని, అతడి కన్నుల కాంతికి మాత్రం అడ్డం ఏదీ రాలేదు. అతడి కన్నులు ఆ పుట్టలో చెట్లలో మెరుస్తూ ఉన్నాయి. ఆ దృశ్యం చూస్తే అద్భుతంగా, ఆసక్తికరంగా ఉంటుంది. ఎవరైనా సాహసం కలవారు వస్తే ఆ మెరిసే పదార్థా లేమిటో తెలిసికొనాలని ప్రయత్నించే ప్రేరణ కలిగించేవిగా అతడి కన్నులు మెరిసిపోతున్నాయి.

ఒకసారి శర్యాతి ఆ సరోవరతీరానికి వనవిహారానికై వచ్చాడు. అతడి వెంట నాలుగువేల మంది రాణులు కూడా వచ్చారు. వారిరక్షణకై విపుల సైన్యం కూడా వచ్చింది. వారందరిలో 'అతిశయరూప యౌవన గర్విత' ఆతడికూతురు సుకన్య. ఆమె చెలికత్తెలతో కలిసి అడవిలో తిరగటం మొదలు పెట్టింది. చ్యవనుడున్న పుట్టలోనుండి మిడుగురు పురుగుల వలె మెరుస్తున్న ఆ కాంతులను చూచింది. ఉత్కంఠ పెరిగింది. ఆదేమిటో తెలిసికొందామని ఆ పుట్టను త్రవ్వించింది. చ్యవనుడు కళ్ళను నిమీలితం చేశాడు. కొంతసేపు అదృశ్యుడైనాడు. ఆమె కక్కడ ఏమీ కనబడలేదు. తిరిగి తండ్రి వద్దకు వెళ్ళింది.

శర్యాతి సైనికులందరికీ మలమూత్రనిరోధ మేర్పడింది. కారణం తెలియక శర్యాతి బాధపడుతున్నాడు. సుకన్య తాను చేసిన పని చెప్పి ఆ వికారానికి తనపని కారణమై ఉండవచ్చునన్న ఊహ నందించింది. శర్యాతి చ్యవనుడు తపస్సు చేసికొంటున్న చోటికి వచ్చాడు. అస్థిపంజరంవలె చిక్కిశల్యమై ఉన్న పరమవృద్ధుడైన చ్యవనుడిని చూచాడు. కూతురు చేసిన తప్పునకు క్షమాపణ కోరాడు. సైన్యాన్ని బాధనుండి విముక్తి చేయుమని ప్రార్థించాడు. చ్యవనుడు వింతకోరిక కోరాడు. సుకన్య నిచ్చి పెళ్లి చేస్తే సైన్యానికి కలిగిన బాధ తొలగుతుందని పేర్కొన్నాడు. గత్యంతరం లేక కన్య నా ఋషి కిచ్చి శర్యాతి రాజధానికి తిరిగిపోయాడు.

ఇంతవరకు కథలోని పూర్వభాగం. ఇకపై ఉత్తరభాగం. సుకన్య పుట్ట త్రవ్వించటం ఇందులో కీలక సమస్య. సుకన్య యౌవనగర్వంతో ఆ పని చేసింది కానీ, అవినయంతో కాదు, అయోగ్యప్రవర్తనవలన కాదు, ఆమె సార్థక నామధేయురాలు, పుట్టను త్రవ్వించి చ్యవనుడి తపస్సును భగ్నంచేసింది. ఆతడు సుకన్యను వరించాడు. వేలేండ్ల తపస్సు తరువాత అతడు ఒకయింటి వాడవ్వాలని అనుకొన్నాడు. కథ ఎట్లా ఉన్నదంటే - సుకన్య(తగిన ఉత్తమురాలైన కన్య) కొరకే చ్యవనుడు తపస్సు చేస్తున్నాడా? ఆమె దొరికింది కాబట్టి ఇక కళ్ళు నిమీలితం చేసి, ఆలోచించి, ఆమెను దక్కించుకొనే యత్నంలో భాగంగా శర్యాతి సైన్యానికి ఇబ్బంది కల్పించాడా? సైన్యాన్ని దక్కించుకోవాలంటే శర్యాతి సుకన్యను తప్పక ఇవ్వాలి. లేకపోతే' అంతవృద్ధుడికి నాకన్య నివ్వటం ఎట్లా'? అని ఎన్నో అడ్డు ప్రశ్నలు వేయవచ్చును. చ్యవను డెంతటి తపస్వియో అంతటి వ్యూహనిపుణుడి వలె కనబడతాడు. చివరకు తాను కోరుకొంటున్న భార్యను శర్యాతి సుముఖత్వంవలన సులభంగా పొందగలిగాడు. విచిత్రమేమంటే ఈ వ్యూహంలో సుకన్య మనస్సును తెలిసికొనే సమస్యే రాలేదు. ఆమె తండ్రి ఆనతికి బద్ధురాలు. సైన్యం కొరకు సుకన్యను దానంచేసి తండ్రి వెళ్ళిపోయాడు. ఇష్టమున్నా లేకపోయినా వృద్ధమునితో సుకన్య కాపురం చేయవలసి వచ్చింది. ఆమె యౌవనంలో ఉన్నది. అతడు ఆమెతో కామకేళి జరిపే వయస్సులో లేడు. అయినా ఆమెను వివాహమాడాడు. చ్యవనుడు తపస్సులో వయసునంతా వ్యయం చేశాడు. గృహస్థాశ్రమధర్మం నిర్వహించటం జీవితపరమార్థమనుకొన్నాడు, మరి ఆ వృద్ధుడికి ఆ తపస్సు తోడ్పడుతుందా?

ఇది ఒక పెద్దప్రశ్న. భార్య తోడ్పాటుంటే భర్తతపస్సు గృహస్థాశ్రమ ధర్మ ఫలాన్ని పొందటానికి సమర్థమౌతుంది. ఆ రహస్యాన్ని చ్యవనుడు తన జీవితంలో ఆవిష్కరించ దలచాడు. చ్యవనుడు నవయౌవనవతి అయిన తన భార్యను అభిమత కేళీసౌఖ్యాలతో తృప్తురాలిగా చేయవలసిన ధర్మం తనకు ఉన్నదని మనసారా భావించిన మహనీయుడు. దానికి తన తపస్సుతో ఒక కార్యరూపాన్ని ఇవ్వాలి. అయితే. అందుకు సుకన్య సంకల్పశుద్ధి కూడా కావాలి. మరొకమాటలో చెప్పాలంటే ఆమె పాతివ్రత్య దీక్షావ్రత శక్తికూడా కావాలి. ఆ రెండూ కలిస్తే గృహస్థ ధర్మఫలసిద్ధి ఏర్పడుతుంది.

ఉత్తరభాగం ఇక్కడ మొదలౌతుంది. చ్యవనుడు చాల లోతైన మనిషి. ఎక్కడా బయట పడడు. పుట్ట త్రవ్వించినప్పుడు కొంత కొంటెపిల్లవలె కనిపించినా సుకన్య పెండ్లి అయిన తరువాత భర్తకు పరమభక్తితో పరిచర్యలు చేస్తున్నది. ఆమెకు పరిచర్యాభాగ్యమే కలుగుతున్నది కాని భర్తృ సమాగమసుఖం అందటంలేదు. ఆమెకూడా అసంతృప్తిని ప్రకటించలేదు. భర్త ఎంత నిండుగా బైటపడకుండా ఉంటాడో భార్యకూడా అంత నిండుగా బైటపడకుండా ఉంటున్నది. ఆమె చ్యవనుడి కంటె రెండాకులెక్కువ చదివిందా అనిపిస్తుంది.

పుట్టనుండి బైటపడిన తరువాత చ్యవనుడికి పట్టుమని తపస్సు కుదరటం లేదు. తన యిల్లు, ఇల్లాలు కుదుటపడితే తప్ప అతడికి శాంతి లేదు. అతడిలో అతడే అన్వేషణ మొదలు పెట్టాడు. ఆతడు యువకుడు కావాలి, సుకన్యకు సుఖాన్ని పంచిపెట్టాలి. దేవతలలో యౌవనాధిదేవతలు అశ్వినులు. వారిని ఉపాసించాడు. వారు ప్రసన్నులైనారు. మార్గం వేశారు.

ఒకనాడు ఒంటిగా అశ్వినులు సుకన్యను కలిశారు. ఆమె యోగక్షేమాలు తెలిసికొన్నారు. వారు నవ్వి 'అయ్యో! ఇట్టి అందం, యౌవనం కలిగి ఉండి కూడా కామోపభోగాలకు పనికిరాని ముదుసలిని పెళ్ళాడి, నీ వయసును వృథా చేసికొంటున్నావు. ఇప్పుడైనా సరే, నీ వయోరూపాలకు తగిన వరుడిని వరించుము. మేం వాడిని తెచ్చి నీ కిస్తాం' అన్నారు. సుకన్య వారి మాటలకు అడ్డువచ్చింది. 'నాకు చ్యవనుడిమీద ఎప్పుడూ ప్రీతి ఉంటుండగా మీ రిట్లా మాట్లాడటం ఉచితమా?' అని చెప్పి, వారి నక్కడే ఉంచి, వెంటనే భర్తవద్దకు వెళ్ళి వా రన్నమాటలు చెప్పింది. సుకన్య ఎంత శీలవతియో అంత లోకజ్ఞురాలు. ఆ మాట లన్నవారు అశ్వినీదేవతలు. వారు ఆశ్రమ ప్రాంతానికి ఊరక రారు. ఊరక ఏ ప్రసక్తీ తేరు. వారన్న మాటలలో ఏ భావి భాగధేయాలు దాగి ఉన్నాయో? అయినా, వా రన్న మాటలు తన మనసులో లోలోన దాగి ఉన్న కోరికనే తెలుపుతున్నాయి. భర్తయందు భక్తి ఉన్నది. అది అచంచలం. కాని ఆతడివలన ఆమె రక్తిని కూడా కోరుకొంటున్నది. అశ్వినులా తగిన వరుడిని వరించుము, మేము తెచ్చి ఇస్తా' మంటున్నారు. ఆమె మనసులో భర్త తప్ప మరొకరు లేరు. కాబట్టి ఆమె మరొకరిని సూచించలేదు, కాని, భర్త యువకుడు కాడు. ఇదీ సత్యమే. అదీ సత్యమే. ఇది ఆమె జీవిత వాస్తవం కూడా. ఆమె అశ్వినుల మాటలు వెంటనే భర్తకు చెప్పటం వలన చ్యవనుడు ఆమె పతివ్రత అని నిశ్చయించాడు. ఎట్లా? మరొకరిని ఆమె కోరుతున్నట్లయితే దేవతలకు రహస్యంగా నివేదించుకొని వారి దయవలన మరొక యువకుడితో ఇష్టసుఖా లనుభవించి ఉండేదే. కాని, తగిన వరుడిని తెచ్చి యిస్తామని అశ్విను లన్నప్పుడు కూడా ఆమె హృదయంలో చ్యవనుడే స్మరణయందు నిలవటం ఆమె పాతివ్రత్యాన్ని ప్రకటించింది.

ఇది ఒక విధంగా ఆమె శీలపరీక్ష. ఆమె నెగ్గింది. అశ్వినులు సంతోషించారు. చ్యవనుడు తన వ్యూహం ఫలించినందుకు సంతోషించాడు. అశ్వినులు చెప్పినట్లు చేయుమని భార్యను ఆజ్ఞాపించాడు. ఆమె వివేకవతి. 'నాకు నవయౌవన వరుడి' ని ప్రసాదించండని అశ్వినులను వేడింది. అత డెవరో ఆమె చెప్పలేదు.

అశ్వినులు కొలనులో దిగి మునిగారు. వారివెంట చ్యవనుడు కూడా కొలనులో మునిగాడు. అందరూ నవయౌవనాకారులై బయటికి వచ్చారు. 'మాలో ఒకరిని ఎన్నుకొను' మని అశ్విను లన్నారు. సుకన్య యువకుడైన తన భర్తనే ఎన్నుకొన్నది. అశ్వినులు సంతోషించారు.

చ్యవనుడి మహావ్యూహంలో ఆశ్వినులు భాగస్వాము లని సుకన్యకు తెలియునా? తెలిస్తే కథ ఇట్లా నడవదు. ఆమె కొంత ఊహించి ఉండవచ్చునని కొందరు భావించారు. సారమతులు లోనారసినంత లోతు ఈ ఉపాఖ్యానంలో కనబడుతుంది.

చ్యవనుడు తనకు తాను నవయౌవనుడిగా సృష్టించుకొనటానికి తోడ్పడిన అశ్వినీదేవతలకు యజ్ఞాలలో సోమపానంలో భాగం కల్పించాడు. ఎదిరించిన ఇంద్రుడిని తన తపోబలంతో తలవంచేటట్లు అంగీకరించేటట్లు చేశాడు. యజ్ఞం శర్యాతి చేత చేయించాడు. ఆశ్వినులకు తాను ఆ ఫలాన్ని అందించాడు.

ఆరణ్యపర్వంలో కర్మప్రధానమైన యజ్ఞయాగాదులకంటె తపస్సు ముఖ్యమనే మహాతాత్పర్యం నిరూపించబడింది. తపస్సువలన కర్మభక్తిజ్ఞాన ఫలాలను పొందవచ్చునన్న పరమతాత్పర్యాన్ని చ్యవనుడి కథ వెల్లడిస్తున్నది. పురుషుడిలోని తపశ్శక్తిని గృహస్థాశ్రమ ధర్మరక్షణశక్తిగా మలచి పోషించే మహాశక్తి గృహిణి. ఆమె సుకన్య. అందుకే దీనికి సౌకన్యోపాఖ్యానం అనే పేరుంది; చ్యవనుడి తపశ్శక్తి వలన వైడూర్యపర్వతం ఆర్చీకపర్వతంగా ప్రసిద్ధి చెందింది. కాబట్టి ఇది చ్యవన చరిత్రం.

6. మాంధాతృడు : ఇంద్రుడి అర్ధసింహాసనాన్ని అధిరోహించిన ఇక్ష్వాకువంశ చక్రవర్తులలో ఇతడు ప్రసిద్ధుడు. అతడు అజగవమనే ధనువుతో, దివ్యాస్త్రాలతో, అభేద్యకవచంతో ఎన్నో యుద్ధాలు చేశాడు. పరిపూర్ణ దక్షిణలతో ఎన్నో యాగాలు చేశాడు. పుట్టగానే ఇంద్రుడి చూపుడు వ్రేలినుండి అమృతం త్రాగిన ఈ వీరుడు తనదేశంలో అనావృష్టి ఏర్పడ్డప్పుడు ఇంద్రుడితోనే యుద్ధంచేసి మేఘాలచేత వర్షం కురిపించాడు. ఇతడి గాథ వింటూంటే అర్జునుడి చరిత్రకు ఆచార్యకం వంటిదిగా మన కనిపిస్తుంది.

7. సోమకుడు : యజ్ఞకర్మకంటె తపస్సు గొప్పదని చెప్పేకథ- సోమకుడనే రాజర్షిది. సోమకుడు యజ్ఞం చేసి, అందులోనుండి జంతుడనే పేరుకల కొడుకును పొందాడు. అతడి నూర్వురు భార్యలూ ఆ బాలుడిని అల్లారు ముద్దుగా పెంచారు. కాని ఒక కొడుకు ఏకారణంవలన నైనా చనిపోతే తనవంశం ఏం కావాలి? అనే ప్రశ్న అతడికి కలిగింది. జంతుణ్ణి బలిపశువుగా ఉపయోగించి అతడి మెదడునూ, రక్తాన్నీ హోమంచేసి యజ్ఞం చేస్తే నూరుగురు కొడుకులు పుడతారనీ, వారిలో జంతుడు పెద్దవాడౌతాడనీ, ఒక ఋత్విజుడు చెప్పాడు. సోమకుడు యజ్ఞం చేశాడు. పుత్రశతాన్ని పొందాడు. అయితే ఆ యజ్ఞం చేయించిన ఋత్విజుడు చనిపోయి నరకంలో యమయాతనలు పడుతున్నాడు. సోమకుడు ఉత్తమలోకాలకు పోతూ ఋత్విజుడికి తన యజ్ఞం చేయటంవలన ఆ నరకబాధ ఏర్పడిందని తెలిసి, తన తపోయజ్ఞఫలాన్ని పంచి అతడిని కూడా ఉత్తమలోకాలకు తీసికొనిపోయాడు. పుత్రుడిని యజ్ఞం చేసి పొందు కాని, పుత్రుడిని యజ్ఞపశువుగా చేసి యజ్ఞం చేయకు - అన్నది ఈ తీర్థగాథా సందేశం!

8. భరతుడు : చంద్రవంశ చక్రవర్తులలో వంశకర్తగా ప్రసిద్ధి చెందిన భరతుడు ప్లక్షావతరణ మనే యమునా తీర్థంలో అనేక యాగాలు చేసి సర్వలోకాలనూ చూచాడు. రోమశుడు ధర్మరాజును కూడా ఆ తీర్థంలో స్నానంచేసి సర్వలోకాలను దర్శించుమని హితువు చెప్పాడు. ధర్మజుడు తమ్ములతో సహా స్నానం చేశాడు. స్నానంచేసి, ధర్మరాజు మాత్రం తాను సర్వలోకాలనూ దర్శించినట్లు ప్రకటించుకొన్నాడు -

శా. ‘దేవర్షి ద్యుచరాహిలోకములు నాదిత్యాశ్వినీ లోకముల్
దేవాధీశ్వరుఁ జూచితిన్ మఱియు నద్దేవేంద్రునొద్దన్ సగాం
డీవోద్దామమహాభుజార్గళుఁ గిరీటిన్ సవ్యసాచిన్ జయ
శ్రీవిభాజితుఁ బార్థుఁ జూచితి జగత్సేవ్యా! మునీంద్రోత్తమా!’ **(ఆర. 3.222)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ ఒక్క నిదర్శనం చాలు - ధర్మజుడు ఏ తీర్థంలో స్నానం చేసినా ఆ తీర్థ మాహాత్మ్యానికి కారకుడైన మహాత్ముడు పొందిన మహితానుభూతిని తాను కూడా పొందాడనటానికి. ధర్మజుడి తీర్థయాత్రల పరమార్థమే అది. ఒక్క ధర్మరాజులో యుగయుగాల పుణ్యపురుషుల తేజం సంపుటీకరించబడిందనటానికి ఆరణ్యపర్వంలోని పుణ్యతీర్థ సేవాఘట్టం పరమోదాహరణం.

9. శిబిచక్రవర్తి : ఇంద్రాగ్నులు శ్యేనకపోతరూపాలతో శిబి చక్రవర్తి దానశీలాన్ని పరీక్షించినప్పుడు తన శరీరాన్ని దానంగా ఇచ్చి శబ్దబ్రహ్మం ఉన్నంతకాలం నిత్యకీర్తి పొందిన దానవీరుడు శిబి చక్రవర్తి. అతడి క్షేత్రం భృగుతుంగపర్వతంమీద ఉన్నది. ఆశ్రితుల కొరకు శరీరాన్ని గాని, చివరకు స్వర్గ సౌఖ్యాలను గాని త్యాగం చేయగలిగే మహిమోన్నతుడు ధర్మరాజు. ఆతడిలోని త్యాగవీరం ఆ తీర్థసేవనం వలన దృఢపడిఉంటుంది.

10. అష్టావక్రుడు :

క. ‘అలయక యేండ్లు గడుం బె
క్కులు జీవించుట నర గలుగుటయుం దగు వృ
ద్ధుల లక్షణమే? జ్ఞానము
గలఁడేనిన్ బాలుఁడయినఁ గడు వృద్ధు మహిన్’. **(ఆర. 3.248)**

అన్న సూక్తికి అష్టావక్రుడి చరిత్రం చక్కని ఉదాహరణం. కురుసభలో ద్రౌపది అడిగిన ధర్మసందేహాన్ని ధర్మరాజొక్కడే తీర్చగలడని భీష్ము డన్నాడు. జ్ఞానానికీ, వయసుకూ, సొగసుకూ సంబంధం లేదన్న సత్యం భారతమంతా వినబడుతుంది. ధర్మజుడు విశ్వసించిన ధర్మాలలో ఇది ఒకటి. రాజసూయంలో శ్రీకృష్ణుడిని వృద్ధుడని పూజించలేదు. జ్ఞానవృద్ధుడనే గౌరవించాడు.

11. యవక్రీతుడు :

క. ‘గురుశుశ్రూష యొనర్చుచుఁ
బరమక్లేశమునఁ జేసి పడసిన విద్యల్
స్ఫురియించుఁ గాక గురుముఖ
విరహితముగఁ బడసినవియు వెలయునె యెందున్?’ **(ఆర. 3,282)**

అనే నీతికి చక్కని ఉదాహరణం యవక్రీతుడిచరితం. రోమశుడు రైభ్యాశ్రమాన్నీ, భారద్వాజాశ్రమాన్నీ చూపించి, ఆ తపోవిద్యా కేంద్రాలలో జరిగిన రెండు ఉదంతాలను పేర్కొని, గురుముఖతః చదువని విద్యావంతులు, యజ్ఞంవలన విద్యను పొందిన పండితులు ఏవిధంగా మదమాత్సర్యాలకు గురి అయి నశిస్తారో వివరించి చెప్పాడు. సంతత జ్ఞాన విద్యార్థిగా ధర్మజుడు పెద్దల వలన పొందిన జ్ఞానాన్ని ఉపాసిస్తున్నవాడు. దుర్యోధనుడు ఈతడి వలె కాక విపరీత ప్రవృత్తి కలవాడు. వారిరువురి విద్యావిభవ తారతమ్య పరిశీలనకు ఈ కథ ఎంతో తోడ్పడుతుంది. మంత్రతంత్రాలతో విద్యను గడించి, మిత్రుడి భార్యను కామించి చివరకు రైభ్యుడి మంత్రశక్తికి బలియైన భరద్వాజ పుత్రుడు యవక్రీతుడు దుర్యోధనతుల్యుడు. తమ్ముడు చేసిన పితృహత్యకు ఉపశమనక్రియలు చేసి, తమ్ముడికి మేలు చేయబోయిన అర్వావసుడికి తమ్ముడు కపటియై కీడు చేయబోయాడు. దేవతలు అర్వావసు సత్యశీలాన్ని మెచ్చి అతడికి వరాలిచ్చారు. చని పోయిన బంధుమిత్రులందరు అతడివలన బ్రతికారు. రైభ్య భరద్వాజాశ్రమాలలో జరిగిన కథలవలన దేవతలు చెప్పిన సారాంశమిది- గురుశుశ్రూషా సంతోషకరుడైన వాడు బ్రహ్మజ్ఞానాన్ని ఉపార్జించగలుగుతాడు అని (3.283), యవక్రీతుడి క్షేత్రంలో నివసిస్తే దురితవిముక్తుడౌతాడని, ఇక్కడితో ధర్మరాజు తీర్థయాత్ర ముగుస్తుంది. ధర్మజుడు బ్రహ్మజ్ఞాని అయినాడని, దురితవిముక్తుడైనాడని వస్తుధ్వని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నన్నయ సూచించినట్లుగా ఈ పుణ్యతీర్థ కథలకు కూడా ఒక క్రమం తెలిసి చదివితే' కథాక్రమం బతి రమ్యంబు' (2.354). క్రమం తెలియకుండా చదివినా 'కథ రమ్యంబు' (3-397). ఇది నన్నయ శిల్పం.

ఉపాఖ్యానాలలో కూడ అనుసృజనాత్మకత :

అఖ్యానంలో వలెనే, ఉపాఖ్యానాలలో కూడా నన్నయ రచనలో అనుసృజనాత్మకత అడుగడుగునా కనబడుతుంది. తీర్థ మాహాత్మ్యాలలో కూడా నన్నయ గంటం ఆ ప్రతిభను ప్రదర్శించింది. మచ్చు కొకటి రెండు గమనిస్తే చాలు.

1. అగస్త్యుడు లోపాముద్రను వివాహం చేసికొని, ఆమెను వెంటపెట్టుకొని గంగాద్వారక్షేత్రంలో తపస్సు చేస్తూ ఉంటాడు. లోపాముద్రా రూపయౌవన వైభవం అతడిలో మన్మథప్రేరణను కలిగించింది. ఆ ఘట్టంలో వ్యాసుడు చెప్పే పద్ధతి కంటె నన్నయది శిల్పసుందరం. మూలం :

"తతో బహుతిథే కాలే లోపాముద్రాం విశాంపతే,
తపసా ద్యోతితాం స్నాతాం దదర్శ భగవానృషిః.
స తస్యాః పరిచారేణ శౌచేన చ దమేన చ,
శ్రియా రూపేణ చ ప్రీతో మైథునాయాజుహావ తామ్." **(3.95.13-14)**

నన్నయ తీర్పరితనం :

'నీచతరనాభిఁ జపల వి
లోచనఁ బృథుజఘనచక్ర లోపాముద్రం
జూచి మునీంద్రుఁడు మన్మథ
గోచరుఁడై దానిఁ బ్రీతిఁ గూడఁగఁ దివిరెన్'. (ఆర. 2.332)

నన్నయ తీర్చిన లోపాముద్ర శృంగార విభావం. 'మన్మథ గోచరుడై' అనే మధురమైన అభివ్యక్తి నన్నయకే దక్కింది. "ప్రీతో మైథునాయాజుహావ తాం" అన్న గ్రామ్యధోరణి కంటె "ప్రీతిఁ గూడఁగఁ దివిరెన్" అన్న నాగరక ధోరణి నాణ్యంగా ఉన్నది.

2. అగస్త్యుడు వాతాపి జీర్ణం అని కడుపు నిమురుకొన్నాడు తెలుగులో మరొకవిశేషం కూడా ఉన్నది. మూలంలో పిడుగువంటి అపానవాయువును వదలినట్లున్నది. తెలుగులో గఱన త్రేన్చినట్లున్నది. ఎంత ఔచిత్యదృష్టి? గమనించండి:

మూలం : "తతో వాయుః ప్రాదు రభూ దధస్తస్య మహాత్మనః,
శబ్దేన మహతా తాత! గర్జన్నివ యథా ఘనః".

నన్నయ : 'కడుపుఁ దడవిగొనుచుఁ గఙ్ఞనఁ ద్రేఁచిన
నసుర జీర్ణమయ్యె నాక్షణంబ'. **(ఆర. 2.343)**

(3) తీర్థయాత్రలను గురించి ఆరణ్యపర్వంలో ఋషిత్రయం చెప్పిన వర్ణనలు మూలంలో విపులంగా ఉన్నాయి. అందులో మొదట నారదుడు, చివర రోమశుడు, మధ్య ధౌమ్యుడు చెప్పిన అంశాలున్నాయి. ఆ ముగ్గురిలో ధౌమ్యుడిది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంత ముఖ్యం కాదు. అట్లని అతడిని కాదనటానికి వీలులేదు. దివ్యర్షుల కెన్నివిషయాలు తెలియునో పాండవ పురోహితుడికి కూడా అన్ని తెలియునని చెప్పటమే అందులోని వస్తుధ్వని. అయితే, మూలంలో ధౌమ్యుడు నాలుగు దిక్కులా ఉన్న తీర్థాలను నాలుగు అధ్యాయాలలో చెప్పినట్లున్నది. నన్నయ దాని నొక పద్యభాగంలోకి కుదించి ఔచిత్యాన్ని పాటించాడు.

ఉ. 'నాలుగు దిక్కులందును వినన్ విదితంబగుచున్న పుణ్యతీ
ర్థాలి తెఱం గెఱుంగఁగ మహాత్ముఁడు ధౌమ్యుఁ డజాతవైరి కం
దోలినఁ జెప్పుచున్నతఱి నొప్పుగ రోమశుఁ డేఁగుదెంచె....!' **(ఆర. 2.290)**

శాస్త్రేతిహాసాన్ని కావ్యేతిహాసంగా మలచే కిటుకుల్లో ఇటువంటి సంగ్రహీకరణలు ముఖ్యమైనవి. ఆ వివరాలు లేకపోతే కావ్యత్వానికీ, కథాశక్తికీ ఏమీ లోపం లేదని నన్నయ తీర్పు.

అరణ్య రమణీయత - నన్నయ ఆత్మీయత :

గోదావరీనదిని, వేంగీసీమను ఆత్మీయంగా ప్రేమించిన ఆంధ్రకవి, ఆదికవి నన్నయ. అందువలననే నదులన్నా, వనాలన్నా, తోటలన్నా, ప్రకృతి సౌందర్య విలసితాలైన పర్వతారణ్యాలన్నా నన్నయకు మనసు మత్తెక్కుతుంది. ఆరణ్యపర్వంలో ప్రకృతి పొత్తిళ్ళలో పెరిగినట్లున్న ప్రాంతాలను నన్నయ ఆత్మీయతతో వర్ణించాడు. అటువంటి వాటిల్లో గంధమాదన పర్వతం నన్నయకు నచ్చిన క్షేత్రం. గోదావరీ ప్రకృతి సౌందర్యాన్ని గంధమాదనంలో బింబప్రతిబింబ భావంగా దర్శించాడు. నన్నయ ఆత్మసంగీతం అక్కడ ప్రకృతివర్ణనపద్యాలలో అక్షరరమ్యంగా అవతరించింది.

గంధమాదన పర్వత సానువులలో సహజ రమణీయంగా ఉన్న ప్రకతి ఒడిలో ద్రౌపదీ భీములు ప్రసన్నంగా విహరిస్తున్నారు. వారి ఆనందానికి ప్రతీకయా అన్నట్లు సహస్రదళకమలం వారిముందు పడింది. అదొక మధురమైన తన్మయ సన్నివేశం. పఠితను ఒక పద్యంతో నన్నయ్య ఆ రసానుభూతిలో అక్షరమ్యత అనే సాహితీ కళామంత్రంతో ముంచుతాడు. ఆ పద్యం ఇది.

చ. 'అలఘులు గంధమాదన మహా ధరణీధర సానురత్న వే
దులఁ బవమాననందనుఁడు ద్రోవదియున్ విహరించుచున్నచో
లలిత సహస్ర పత్రకమలంబు సమీరవిధూతమై మహీ
తలముపయిన్ వడిం బడియెఁ దద్దయుఁ బొల్పుఁగ వారిముందటన్'. **(ఆర. 3.310)**

ఓజస్సులో ప్రసాదం కలిపి భద్రగజంవలె పద్యాన్ని నడిపే రచన నన్నయకు ఆత్మీయం. అందువలననే ప్రసిద్ధికెక్కిన నన్నయ పద్యాలు చాలావరకు ఈ పాకంలోనే పడి రుచిగా ఉంటాయి. ఉదాత్తవస్తు వర్ణనంలో నన్నయ శైలి ఈ రమ్యతను వెలారుస్తుంది. దీన్ని అక్షరరమ్యత అనీ, అక్షరమైన ఆస్వాదనీయత్వం అనీ పిలుస్తాం.

ప్రకృతిని వర్ణించేటప్పుడు నన్నయ పద్యంవలె వచనాన్ని కూడ అక్షరరమ్యం చేస్తాడు. భీముడు గంధమాదనం మీదకు పోయి కుబేరుడి వనంలో ఒక సరోవరం చూచాడు. ప్రకృతి రమణీయంగా ఉన్నది. సరోవరస్నానం సరసంగా సాగింది. నన్నయ వచనం అక్షరరమ్యంగా స్పందించింది.

''చని చని పవనవశ సంచలిత తటమహావన తమాల తాల హింతాల విశాల కదళీదళ వీజ్యమాన శీతలజల పరిపూర్ణంబైన యొక్క సరోవరంబుఁ గని యందుఁ గృతావగాహుండై నవనలినదళమృణాల వలయాలంకృతుం డగుచు దాని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వెలువడి యనేక యోజన విస్తారాయామ రమణీయం బైన కదళీషండంబుఁ జొచ్చి యందు శంఖధ్వానంబుఁ జేసిన'' -**(ఆర. 3.313)**

భీముడే కాదు నన్నయకూడా ఈ వచనంలో నాదమాధుర్యాన్ని శంఖధ్వానంగా వినిపించాడు. ఇది నన్నయ ఆత్మీయత అక్షరరమ్యతగా అవతరించే తీరు.

కొండ కొమ్ములలో మేఘాలు క్రమ్ముకొంటున్నాయి, చరియలలో ఏనుగులు తిరుగుతున్నాయి. ఆ రెంటికీ తేడా గుర్తించలేని ఒక మబ్బులు క్రమ్మిన కొండ ప్రకృతి సౌందర్యం నిండారిన సుందర సన్నివేశం - భయద గంభీర సుందరంగా ఉన్నది. నన్నయ అటువంటి సన్నివేశంలో ఒడలు మరచి పరవశిస్తాడు. ఆ అనుభూతిని అతడి కవిత మోసుకొని వస్తుంది. ఈ సీసం ఆ రమ్యతకు ఒక రమణీయ అక్షరశిల్పం!

సీ. 'వారిధారల ననివారిత నిర్గళ । ద్దానధారలఁ దటిద్ధామములను
దశన ధామంబుల నశనిఘోషంబుల । ఘోరబృంహిత బృహద్ఘోషణముల
నివి ఘనబృందంబు లివి గజయూథంబు । లని విచారింపంగ నక్కజంబు
లై లలితోత్తుంగ శైలశృంగంబుల (। ద్రిమ్మరు జలధర ద్విరదతతుల

ఆ. విస్మయంబుతోడ వీక్షించుచుం జని । రజతగిరి సమీప రమ్యభూమి
నక్కుబేరు వనమునందు సౌగంధిక । కమలవనముఁ గనియె ఘనభుజుండు'. **(ఆర. 3.355)**

ఈ పద్యం చదువుతూ ఉంటే "ఆషాఢస్య ప్రథమ దివసే మేఘమాశ్లిష్ట సానుం, వప్రక్రీడా పరిణత గజ ప్రేక్షణీయం దదర్శ'' అన్న కాళిదాసమహాకవి మేఘసందేశ కావ్యశ్లోకం గుర్తుకు వస్తుంది. ఆరణ్యపర్వంలో కూడా రానున్న వర్షకాలానికి ఈ మబ్బులు ముందు సూచన లేమో! మేఘాలకూ ఏనుగులకూ సామ్యం కవిసమయం. దాన్ని రూపకంగా ప్రదర్శించటం నన్నయ రచనలో రామణీయకం.

మదగజ మనే భావ చిత్రాన్ని సన్నివేశసుందరంగా నిర్వహించటం నన్నయ రుచిరార్థ శిల్ప నిధిత్వం. అసలు గంధమాదన పర్వతాన్ని భీముడు మదగజం వలెనే ఎక్కినట్లు నన్నయ పరిచయం చేశాడు. అక్కడినుండి అతడు చేసిన చేష్టలు, చూచిన స్థలాలు మదగజ భావచిత్రాలతో అలంకారరమ్యంగా భాసింపజేయటం ప్రసన్నకథా కవితార్థయుక్తి!

నానారుచిరార్థ సూక్తులు :

ఆరణ్యపర్వం నన్నయ నానారుచిరార్థ సూక్తినిధిగా ప్రసిద్ధిపొందింది. ఈ పర్వంలోని ఈక్రింది పద్యాలు తెలుగువారి సంభాషణలలో రమ్యధర్మోక్తులుగా, సూక్తులుగా, లోకోక్తులుగా నేటికీ జాలువారుతున్నాయి.

ధర్మం -

క. 'ధీరమతియుక్తిఁ జేసి వి । చారింపఁగ నిక్కువంబు సర్వజన స్వ
ర్గారోహణ సోపానం । బారఁగ ధర్మంబ సూవె యతిరమ్యం బై'. **(ఆర. 1.229)**

క. 'ధర్మజ్ఞులైన పురుషులు । ధర్మువునకు బాధ సేయు ధర్మువు నైనన్
ధర్మముగా మదిఁ దలఁపరు । ధర్మువు సర్వంబునకు హితంబుగ వలయున్'. **(ఆర. 3.230)**

భార్య :

తే. 'అధిక దుఃఖ రోగార్తున కౌషధంబు । సురుచిరంబుగ భార్యయ చూవె యెందు;
నొనర భార్యాసమేతుఁడై యున్నవాని । కెంతలయ్యును నాపద లెఱుకపడవు'. **(ఆర. 2.74)**

క. 'అలసినెడ డస్సినెడ నాఁ । కలి దప్పియు నైన యెడలఁ గడుకొని ధరణీ
తలనాథ! పురుషునకు ని । మ్ముల భార్యయ పాచుఁ జిత్తమున దుఃఖంబుల్'. **(ఆర. 2.75)**

సంఘబలం :

తే. 'బలము గలవానిఁ బలువురు బలవిహీను
లొక్కటై కూడి నిర్జింతు రుత్సహించి
మధువు గొన నుత్సహించిన మనుజుఁ బట్టి
కుట్టి నిర్జించు మధుకర కులమునట్లు'. **(ఆర. 1.251)**

వృత్తరక్ష :

తే. 'వృత్తవంతుండు వెండియు వివిధ గతుల । వృత్తవంతుండు గానేర్చు; వృత్తహీనుఁ
(పాఠాం: విత్తహీనుండు వెండియు వివిధ విధుల । విత్తవంతుండు గానేర్చు, వృత్తహీనుఁ)
డైనవాఁడు విహీనుండ యండ్రు గాన । విత్తరక్షకుఁ గడుమేలు వృత్తరక్ష'. **(ఆర.4.129)**

ఆరణ్యపర్వంలో ధర్మజుడి శీలచిత్రణాన్నంతా ఒక్కమాటలో చెప్పాలంటే 'విత్త రక్షకుఁ గడుమేలు వృత్తరక్ష' అని పేర్కొంటే చాలు, నహుష ప్రశ్నలలో ధర్మజు డిచ్చిన ఈ సమాధానం ధర్మవీరుల ఉత్తమశీలచిత్రం!

మహాభారతం కాలంనాటి పుణ్యతీర్థాలు :

సంస్కృత మహాభారతంలోని వనపర్వంలో వర్ణించబడిన పాండవ తీర్థయాత్రలను ఆధారంగా చేసికొని ఆకాలంనాటి భరతఖండం, అందులో పాండవులు చేసిన తీర్థయాత్రలను గురించి శ్రీ చర్ల నారాయణశాస్త్రిగారు చెప్పిన ఈ క్రింది విశేషాలు గమనించదగినవి. 'మహాభారత మీమాంస' అనే గ్రంథం (1984) - మూడవభాగంనుండి ఈక్రింది అంశాలు కృతజ్ఞతలతో గ్రహించి పాఠకుల సౌకర్యార్థం ఇక్కడ పొందుపరచబడినవి.

వనపర్వంలో నారద ధౌమ్యులు పుణ్యక్షేత్రాలను వర్ణించి చెప్పారు. పాండవులు విన్నారు. రోమశుడు తన వెంట పాండవులను తీసికొని వెళ్ళి వారిని తీర్థస్నానాలు చేయించాడు. చెప్పిన తీర్థాల పేర్లలో నారద ధౌమ్యుల పట్టీలలోనే కొన్ని తేడాలున్నాయి. ఇక చూపించిన రోమశుడి క్షేత్రాలకూ వాటికీ కూడా కొద్దిపాటి భేదాలున్నాయి. చూపిన వాటికంటె చెప్పినవే ఎక్కువున్నాయి. ఆ మూడూ మూడుకాలాల్లో వెలిశాయని కొందరు పండితులు భావిస్తున్నారు. నారద ప్రోక్తమైనది ఆ మూడింటిలో అధునాతన మని విమర్శకుల అభిప్రాయం. ఏమైనా మొత్తం మీద పాండవ తీర్థయాత్రలు భారతకాలంనాటి తీర్థాల స్థితులను మనకు రేఖామాత్రంగా నైనా అందిస్తున్నాయి. వాటి అవగాహనకు ఈక్రింది పంక్తులు కొంత తోడ్పడగలవు.

''పాండవులు ప్రత్యక్షముగా, నేయే తీర్థములకు వెళ్ళిరో యాయా తీర్థముల వర్ణనము వనపర్వములో విస్తరించి యీయఁబడి యుండెను. ఎక్కడెక్కడకుఁ బాండవులు వెళ్ళిరో, యా స్థానములకు నేఁటి తీర్థయాత్రా స్థానములతో మైత్రిఁ గలుపుట యనెడు మనోరంజకకార్యము చేయఁదగియుండెను. మన మందులకై యథాశక్తిని ప్రయత్నింతుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుగాఁ బాండవులు కామ్యకవనములో నుండిరని వ్రాసియున్నాఁడు, ప్రాచీనకాలమందుఁ బ్రతిదేశముయొక్క భిన్న భిన్న భాగములలోను వనములుండెను. ఆ వనముల యందుఁ బ్రతివాఁడును నివసించుటకును నెలవుండెను. వనముపై నేదేశపు రాజునకును సత్త లేకుండెను. వనవాసులైన క్షత్రియులు ఇట్టి వనములలో వేఁట మీఁద బొట్టపోసికొనుచుండిరి; మఱియుఁ దపస్సు చేసెడి బ్రాహ్మణులు కందమూలఫలములను దిని తమ్ము నిర్వహించుకొనుచుండిరి. ఈ సంగతి యెంత మాత్రమును గాల్పనికము కాదు. ఇటువంటి పరిస్థితి మహాభారతకాలము వఱకు నుండెను. గ్రీకులు వనములో నిర్భయముగా నివసించెడి తత్త్వవేత్తలైన మునులను వర్ణించి యున్నారు. బౌద్ధ గ్రంథములలోఁగూడ నిట్టి వనేక వర్ణనము లుండెను. బుద్ధుడు రాజ్యమును ద్యజించిన పిమ్మట, ఇట్టి యనేకారణ్యములలో నుండెనని వ్రాసియుండెను. వానిలోఁ బ్రతి వనమునకును భిన్నభిన్న నామములు గలవు. లుంబినీవనము యొక్క పేరు బౌద్ధగ్రంథములలోఁ బలుమాఱు వచ్చుచున్నది. అగుఁగాక; పాండవులు వనవాస కాలమున నెన్నియో వనములందుండిరని మహాభారతమందు వ్రాసియున్నాఁడు. ఆవనముల యొక్క స్థలములను ముందుగా మన మిచ్చట నిశ్చయింతుము. పాండవులు మొట్టమొదటఁ గామ్యకవనమున నుండిరని వ్రాసియున్నాఁడు. వారు భాగీరథీ తీరముపై నుండి ముందుగా గురుక్షేత్రము వైపు వెళ్ళిరి. సరస్వతి, దృషద్వతి, యమునలను దర్శించి వారు పడమటి వైపుగా వెడలిరి. అపుడు గుప్తరూపమున నున్న సరస్వతి యొడ్డున నున్న నిర్జనమగు మైదానములో ఋషిప్రియ మగు కామ్యకవనము వారి కగపడెను. (వన. అధ్యా.5) దీనిఁబట్టి కామ్యకవనము మరుదేశమున నుండెనని ధ్యానములోనికి రాఁగలదు.

ఆ వనమును విడిచి మరల వారు ద్వైతవనమునకు నేగిరి. ద్వైతవనము ఉత్తరము వైపున హిమాలయపు చఱియలందునై యుండును. అందు పశువులు, పక్షులు, మృగములు, ఏనుఁగులును తండోపతండములుగా నుండెను. మఱియు నందు సరస్వతీ నది ప్రవహించుచుండెను. ఈద్వైతవనమునుండియే వారు తీర్థయాత్రకు వెడలిరని వ్రాసి యున్నాఁడు; మరియుఁ దిరుగఁ గామ్యక వనమునకు వచ్చిరి. ఇక్కడకు ముందుగా తూర్పువైపున నైమిశారణ్య మున్నది. ఈ పుణ్య దేశము అయోధ్యకు పడమట గలదు. దీనికిఁ దూర్పున గోమతీతీర్థ మున్నదని వ్రాసియున్నాఁడు. దీని పిమ్మట నైమిశారణ్యమునకు ముందుగా వచ్చిన మీఁదట గోమతిలో స్నానముచేసి వారు బాహుదానది మీఁదుగా వెళ్ళిరని వర్ణించి యున్నాఁడు. ఈ బాహుదానది యిచట రెండవమాఱు వచ్చియున్నది. దీనికిఁ బిదపఁ బాండవులు ప్రయాగమునకు వచ్చిరి. ఈ ప్రయాగము గంగా, యమునా సంగమమేయై యున్నది. గంగా సంగమము నందు వారు బ్రాహ్మణులకు దానములు చేసిరని వ్రాసి యున్నాఁడు. ఇచట ప్రయాగ భూమి దేవతల యజ్ఞభూమియని చెప్పఁబడి యుండెను. మరల ప్రయాగము నుండి పాండవులు గయకు వెళ్ళిరని వ్రాసి యున్నాఁడు. గయలో గయాశిరమను పేరుగల పర్వతమున్నది. మరియు ఇసుకచేత శోభిల్లునట్టి మహానది అనఁగా ఫల్గు నది యున్నది. ఇదిగాక యిచట బ్రహ్మవేదియు దగ్గఱగా నున్నది. మరియు నక్షయవటము కూడఁ గలదని వ్రాసియున్నాఁడు. ఈ యక్షయవటమే శ్రాద్ధము చేయుటకై సర్వశ్రేష్ఠమగు స్థానమని చెప్పబడి యున్నది. ఇచట నక్షయపదము ప్రాప్తమగు చున్నది. ఇచట గయ రాజుయొక్క వర్ణనము కూడ నిచ్చి యున్నాఁడు. దీని తరువాత పాండవులు గయనుండి బయలుదేరి మణిమతి యను పేరి దుర్జయనగరియం దుండిరని వ్రాసియున్నాఁడు; మరియు దిరుగ వారు అగస్త్యాశ్రమమును దర్శించిరి. ఈ తీర్థమెచ్చట నున్నదో నిశ్చయ పూర్వకముగాఁ జెప్పఁబడఁ జాలదు; అయినను ఆ వర్ణనముఁ బట్టి భాగీరథీమీఁద నయ్యాశ్రమ ముండెనని స్పష్టముగాఁ దెలియుచున్నది.అగస్త్యుడు వాతాపిని జంపిన వర్ణనము కూడ నీయఁబడి యున్నది. ఇటు పిమ్మట కౌశికీ నదియొక్క వర్ణన మీయబడి యున్నది. ఈ నది భాగీరథిలో నుత్తరము వైపునుండి కలియుచున్నది. కౌశికీ నదిపై విశ్వామిత్రుడు తపముచేసి బ్రాహ్మణ్యమును సంపాదించెనని వ్రాసియున్నాఁడు. ఇదిగాక భాగీరథియందు భగీరథుఁడు చేసిన యజ్ఞము యొక్కయు వర్ణన మీయఁబడి యున్నది. ఇచటను మరల పాండవులు నంద అలకనంద యనెడు రెండు నదుల మీఁదుగా వెళ్ళిరని వ్రాసి యున్నాఁడు; మరియుఁ దిరుగ హేమకూట పర్వతము మీఁదికి వెళ్ళిరి. ఈ పర్వతముపై నదృశ్యమగు వేదఘోషము వినవచ్చుచున్నది. కౌశికీనది యొద్ద నుత్తములైన నదులుండి యుండును. ఇచటనే విభాండకపుత్రుఁడైన ఋశ్యశృంగుని యాశ్రమమున్నది. ఋశ్యశృంగుని కథ యిచ్చట నీయఁబడియున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కౌశికినుండి వెడలి పాండవులు సముద్రముమీదికి పోయిరి. మఱియు నే చోటను గంగ సముద్రముతోఁ గలియుచున్నదో, ఆ స్థలమందు నైదువందల నదుల నడుమ భాగమందు వారు సముద్రములో స్నానముచేసిరి. గంగానది సముద్రమందు సహస్ర ముఖములఁ గలియుచుండినదను వర్ణనము ప్రసిద్ధమై యుండెనే, దాని యుల్లేఖము ఈ 500 నదుల నామముతో జేయబడినట్లు తెలియుచుండెను. ఇచటఁ దూర్పు వైపు తీర్థములు సమాప్తములయ్యెను. ఈ వర్ణనములోఁ గాశీక్షేత్రమునకు వెళ్ళిన వర్ణనము లేకుండుట మిగుల నాశ్చర్య విషయమై యుండెను. అయినను ధౌమ్యుఁడు చేసిన తీర్థవర్ణనములో రెండు మూడు తీర్థము లింకను వ్రాయబడియుండెను. వాని సమావేశ మిచ్చటఁ జేయఁబడఁగలదు. కాలింజర పర్వతము మీఁద హిరణ్యబిందు వనెడు పేర నొక పెద్ద స్థాన ముండెను. దీని తరువాత భారవణముని మహేంద్ర పర్వతము చెప్పఁబడియుండెను. ఆ పర్వతముపైని భాగీరథీనది మణికర్ణికా సరోవరములోనుండి వచ్చినదని వ్రాసియుండెను. మహేంద్రపర్వతము యొక్క యీ మణికర్ణికాతీర్థము వాస్తవమునఁ గాశియందే యుండియుండునని యనుమానించుటయందుఁ గొంచెమైనను బాధ యగపడదు. అయినను, కాశి లేక వారణాశి యొక్క విస్తృతమైన వర్ణనము ఈ తీర్థ వర్ణనములో లేదన్న విషయము ఆశ్చర్యకరమై యుండెను. ఏదియేని యగుఁగాక; ఇపుడు మనము దక్షిణతీర్థములవైపు వచ్చుచుంటిమి.

పాండవులు గంగాముఖమునందు స్నానము చేసి సముద్రతీరమువెంటఁ గళింగ దేశమునకుఁ బోయిరి. అచట వారికి ముందుగా వైతరణీనది తగిలెను. ఈ నదిలో స్నానము చేసి వారు పవిత్రులైరి. ఈనదియందు స్నానము చేయగా వారు మహాతపోబలయోగమున మృత్యులోకమునుండి మిగుల దూరముగా వెళ్ళిరని తెలియుచుండెను. ఇక్కడకు దగ్గఱనే మహేంద్ర పర్వతముండెను. ఆ పర్వతముపైఁ బరశురాముఁడు ఉండెను. పృథ్విని గశ్యపుని కిచ్చినపుడు అది సముద్రములో మునుగ నారంభించెను. ఆ సమయమందుఁ గశ్యపుని తపఃప్రభావమువలన నయ్యది సాగరము నుండి వెలుపలికి వేది రూపమున నిచట నుండిపోయియుండెను. ఈ వేది సముద్రములో నొకానొక చిన్న ద్వీపమై యున్నది. పాండవులు సముద్రములో స్నానము చేసి యా వేదిపై నెక్కిరి; మరియు నిట మీఁదట మహేంద్ర పర్వతము మీఁద నాఁగిపోయిరి. ప్రతి చతుర్దశికిని నచటఁ బరశురాముని దర్శనమగుచున్నది. తదనుసారముగా నా దినమందు దర్శనము చేసిన పాండవులు సముద్రపు టొడ్డులమీఁదుగా దక్షిణ దిశవైపు వెళ్ళిరి.

సముద్ర తీరమందలి తీర్థములు ఇచట నామ నిర్దేశము లేకుండ చెప్పఁబడి యున్నవి. ప్రశస్తా నదిని జూచి వారు సముద్ర గామినియగు గోదావరి మీఁదికి వచ్చిరి. అటు పిమ్మట ద్రావిడ దేశములో సముద్రపు టొడ్డున నున్న యగస్త్యతీర్థము నొద్దకు వచ్చిరి. అటు పిమ్మటఁ బవిత్రములైన యితర తీర్థములకుఁ గ్రమముగాఁ బోయిన మీఁదట వారు శూర్పారక క్షేత్రమునకు వచ్చిరి. దక్షిణపూర్వ దేశాల యందలి యీ తీర్థముల వర్ణనమందు రెండు మూఁడు పేరులు మన కగపడకున్నవి. ముఖ్యముగా తూర్పువైపున జగన్నాథస్థానము యొక్క లేక పూరీ యొక్క వర్ణనము లేదు. ఇట్టి స్థితిలో మన యెదుర, ఈక్షేత్రము యొక్క మాహాత్మ్యము పిదప నుత్పన్న మైనదా? యను ప్రశ్న వచ్చుచున్నది. ధౌమ్యుఁడు చెప్పిన తీర్థ వర్ణనములోఁ గూడఁ బూరీ పేరు లేదు; మరియు నారదుని వర్ణనమందుఁ గూడఁ బూరీ పేరు రాలేదు. ఇట్లే రామేశ్వరము పేరు కూడ పాండవుల తీర్థయాత్రలో రాలేదు. దీనిఁబట్టి ఈ తీర్థము లిటీవల నుత్పన్నములై యుండునని సంశయము కలుగుచున్నది. కాని మనము ఉల్లేఖాభావరూపమైన ప్రమాణము అసమర్థమైనదను సంగతి ననేక స్థలములయందు జెప్పియే యున్నాము. ఇదిగాకుండ, పాండవులు సముద్రపు టొడ్డుల మీదఁగా మెట్ట మార్గమున వెళ్ళిరి. నావపైఁ గూర్చుండి వెళ్ళలేదనిన సంగతియుఁ గలదు. ఈ కారణముచేత వారు బహుశః అగస్త్య తీర్థము నుండి ద్రవిడదేశములో నుండుచు నొక్క మాఱుగాఁ బశ్చిమపుటొడ్డుమీఁదికి వచ్చి యుందురనుట యసంభవమై యున్నది.

పశ్చిమపుటొడ్డున ఉన్న గోకర్ణమహాబలేశ్వర తీర్థముయొక్కయు వర్ణనము చేయఁబడలేదు. దీనిఁబట్టి ఆ తీర్థము ఆ సమయమున లేకుండెనని విశ్వసింపఁబడఁజాలదు. మంచిది, ధౌమ్యుఁడు దక్షిణము వైపున చేర్చిన తీర్థముల నిపుడు చూడుఁడు. మొదట గోదావరి, వేగానది, భీమరథీనది, పయోష్ణి ఈ నదులు చెప్పఁ బడియున్నవి. పయోష్ణి యొడ్డున రాజైన నృగుడు వందలకొలది యజ్ఞములను జేసి యుండెనని వ్రాసియున్నాడు. పాండ్యదేశములోని యగస్త్య తీర్థము మఱియు వరుణ తీర్థము యొక్క వర్ణనము కలదు; మఱి జీవద తామ్రపర్ణి గోకర్ణతీర్థముల వర్ణనమున్నది. నారద తీర్థ యాత్రయందు నింకను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నెక్కువగాఁ జెప్పఁబడియున్న తీర్థములు కావేరి నదియుఁ గామారి తీర్థములై యున్నవి. అనఁగా దక్షిణతీరము నందుఁ గన్యాకుమారి యొద్ద నుల్లేఖ మున్నది. కృష్ణ, మరియు దండకారణ్యము యొక్కయు నుల్లేఖము కలదు. సప్తగోదావరము యొక్కయు నుల్లేఖము కలదు; అదిగో గోదావరి యొక్క యేడు ముఖములు నిచ్చట నిర్దేశింపఁబడియున్నవి.

అన్నిటికంటె విశేషసంగతి, ఉజ్జయినిలోని మహాకాళము యొక్క వర్ణన చేయఁబడుటయై యున్నది. మరియు నిచ్చట రెండు స్థానములు, ఇపుడు కూడ ప్రసిద్ధములై యున్న కోటి తీర్థము భద్రవటము ఉల్లేఖితములై యున్నవి. పైని చెప్పఁబడిన వర్ణనముఁబట్టి దక్షిణమువైపు యొక్క యధికజ్ఞాన మెట్లగుచు వచ్చెనో యిది యనుమానింపఁబడఁగలదు. దీనిఁ బట్టి పాండవుల తీర్థయాత్ర కంటె ధౌమ్యతీర్థ యాత్రల వర్ణనమందు నెక్కువ తీర్థముల పేరులున్నవని స్పష్టమగును; మరియు నంతకంటె నధికముగా నారదుని తీర్థయాత్రావర్ణనమందుఁ దీర్థముల పేరులు వచ్చియున్నవి.

ఇపుడు మనము పడమటివైపు తీర్థములను పేర్కొను చున్నాము. పాండవులు శూర్పారక తీర్థమునకు వచ్చిరి; అచట వారు వనములోఁ బ్రాచీన రాజులు చేసిన యజ్ఞములను జూచిరి; మరియు నొడ్డు నుండి లోపలికిఁ బోయినమీఁదటఁ దపస్వులైన బ్రాహ్మణులతో నిండియున్న పరశురాము వేదిని జూచిరి. వసువులు, అశ్వినీకుమారులు, యముఁడు, కుబేరుఁడు, ఇంద్రుడు, విష్ణువు, విభువు, శంకరుఁడు మొదలైనవారి సుందరములైన మందిరము లవలోకించిరి. ఇటు మీదట వారు మరల శూర్పారక తీర్థమునకు వచ్చిరి; మరియు నచట నుండి ప్రభాసతీర్థమునకు వెళ్ళిరి. ప్రభాసతీర్థము కాఠియావాడు నందు దక్షిణ సముద్రముపై ద్వారకకు దూరముగా నున్నది. అచ్చట వారు శ్రీకృష్ణుని, యాదవులను గలిసికొనిరి. ఇచటి నుండి పాండవులు విదర్భదేశాధిపతి చేత వృద్ధినొందిన యున్న పవిత్రమైన పయోష్ణీ నదికి వచ్చిరి. దీనిఁబట్టి విదర్భ దేశములోని యీ నది గుజరాతులో నుండి యుండునను ననుమానము బయలుదేఱుచున్నది. కాని, పాండవులు తరువాతఁ దిరుగా పయోష్ణినది అనఁగా తాప్తీ మీఁదికి వచ్చియుందు రనుటయు సంభవమై యున్నది. ఎందుచేత? ఇచటి నుండి వారు వైడూర్య పర్వతము నర్మదా నదులపైకి వెడలిరి. పక్షాంతరమున ప్రభాస తీర్థము కాఠియావాడులోనికిఁ గాక యుండును. ఏవియో యగుఁగాక; నర్మదా నదిలో స్నానము చేసి వారు రాజగు శర్యాతియొక్క యజ్ఞప్రదేశమునకును చ్యవనాశ్రమమునకును వచ్చిరి, ఈ రెండు స్థానములును నర్మదా తీరమందే యుండెను. ఇచట చ్యవన మునియు శర్యాతి యొక్క కన్యయగు సుకన్యక యొక్క గాథ కలదు. ఇచటి నుండి మరల వారు సింధునది తీర్థము మీఁదికి వెళ్ళిరి; మరియు అచట నరణ్యములో నున్న సరోవరమును జూచిరి. అటు పిమ్మట వారు పుష్కర తీర్థము మీఁదికి వచ్చిరి; మరియు నార్చీక పర్వతముపై నుండిరి. తదనంతరము గంగా, యమునా, సరస్వతుల యొడ్డులపై తీర్థములను జూచిరి. పాండవుల యొక్క యీ పశ్చిమతీర్థ యాత్రయొక్క వర్ణనము మిక్కిలి పవిత్రమును మిగుల స్పష్టముగా చేయఁబడినదియునై యున్నది.

విశేషించి పుష్కరము యొక్క వర్ణనము ఇతరస్థలములందు విశేషముగా చేయఁబడినట్లుగా నిచటఁ గనఁబడదు. నారద తీర్థయాత్ర యందును, ధౌమ్యతీర్థ యాత్రయందును పుష్కరము యొక్క యెక్కువ వర్ణనమున్నది. పుష్కర క్షేత్రము బ్రహ్మదియై యున్నది. ఇది పుష్కర మొక్క పెద్దచెఱువై యున్నది. నది కాదు. అయ్యది రాజపుతానా యొక్క మధ్యభాగమునఁ గలదు. దీని యందలి యర్బుదము అనఁగా ఆబూపర్వతము అచట చెప్పఁబడి యున్నది. నారదుని తీర్థయాత్ర వర్ణనమందు ద్వారక వర్ణనమున్నది. వాస్తవమున పాండవుల కాలమందు ద్వారకకుఁ దీర్థత్వము ప్రాప్తము కాలేదు; మరియు నీ కారణము చేతనే పాండవులు ద్వారకకు వెళ్ళలేదు. నారదుని యొక్క వర్ణింపఁబడిన తీర్థయాత్ర మహాభారతము నాఁటిది కాదు. ఆ సమయమున ద్వారక స్వభావము చేత నొక గొప్ప తీర్థస్థానము అయియుండెను. ఈ స్థానము యొక్క బహు విస్తర వర్ణనము చేయఁబడి యున్నది. (ద్వారకలో పిండారక తీర్థమునందు స్నానము చేసిన యెడల సువర్ణలాభము కలుగుచున్నది. ఆ తీర్థమునందు నేఁటికి పద్మరూప చిహ్నములతోఁ గూడిన ముద్రలు (బంగారు నాణెములు) కనఁబడుచుండుట వింత సంగతియై యున్నది. అచటఁ ద్రిశూల చిహ్నములు గల కమలములు కనఁబడు చున్నవి. ఇచట నెల్లపుడును శంకరుని నివాసమున్నది. ఈ వర్ణనముఁబట్టి మహాభారత కాలమున ద్వారక యొక ప్రసిద్ధ క్షేత్రమై యుండెనని తెలియుచున్నది. కాని ద్వారకను క్రొత్తగా శ్రీకృష్ణుడు స్థాపించి, రైవత పర్వతము మీఁద నతఁడు క్రొత్త దుర్గము నిర్మించి, అతఁడు నిజధామమునకుఁ బోఁగా ద్వారక నీటిలో మునిఁగెనన్న సంగతిపై మనము ధ్యానముంచినపుడు శ్రీకృష్ణుని లేక పాండవుల కాలమున ఈ తీర్థము లేకుండెనని స్పష్టముగాఁ బ్రకటమగు చున్నది. దీనిఁబట్టి స్వభావతః ఈ వర్ణనము మఱియు ఈ సంపూర్ణమైన నారదోక్త తీర్థయాత్ర మహాభారత కాలికము అనగా క్రీ.పూ. 250 వత్సరము దాదాపుదింకను ననుమానము కలుగుచున్నది.

ఇటీవల నుత్తరము వైపు తీర్థముల వర్ణనములో యువంధరము, అచ్యుతస్థలము, భూతలవ్యము ననెడి యమునా నదిపై నున్న తీర్థముల వర్ణనము కలదు. ప్లక్షావతరణ తీర్థము యొక్క యుల్లేఖముండి తరువాత కురుక్షేత్రమునకుఁ బాండవులు వెళ్ళిన వర్ణన మున్నది. కురుక్షేత్రమునుండి సరస్వతి యొక్క వినశన తీర్థ వర్ణనము కలదు. దీని తరువాత విపాశ అనగా వ్యాసానది వచ్చియున్నది. విపాశనుండి మరల వారు కాశ్మీరమునకు వెళ్ళిరి. దీని పిమ్మట మరల వారు మానస సరోవరము మీఁదికి వెడలిరి. అచట వారికి వితస్తానది యగపడెను. వితస్తానది యొద్ద జల, ఉపజల యను పేరుగల రెండు నదులు వారికిఁ దగిలెను. తరువాత నాకము శ్వేతగిరి పర్వతములపై నుండి వారు కైలాస పర్వతము మీఁదికి వెళ్ళిరి. అచటనే వారికి భాగీరథియొక్క దర్శన మయ్యెను. దీని తరువాత వారు గంధమాదన పర్వతము మీఁదికి వచ్చి చేరిరి; మఱియు విశాలా సంజ్ఞకమైన బదరి (బైరి)యు నరనారాయణ ఆశ్రమమును నెచట నున్నవో, ఎచటి నుండి యలకనందానది బయలుదేఱు చున్నదో, అచటికి వారు వెళ్ళి చేరిరి. నర నారాయణాశ్రమ మందుఁజేరిన మీఁదట ఘటోత్కచుని సాహాయ్యము చేత ముందునకుఁబోయి మరల వారు భాగీరథీనదిలో స్నానము చేసి తమ తీర్థయాత్రను సాగించిరి."

పుష్కర కురుక్షేత్రముల మహత్త్వం :

"మహాభారత కాలమందు రెండు తీర్థముల లేక తీర్థముల స్థానములు మిక్కిలిఁ బ్రసిద్ధములై యుండెను. ఒకటి యర్బుదము నొద్ద పుష్కర తీర్థము, రెండవది కురుక్షేత్రము. పుష్కర తీర్థ మన్ని తీర్థములకును రాజై యున్నది. పుష్కరమును నుదయాస్తమయము లందు స్మరించినవానికిఁ గూడ నన్ని తీర్థముల యందును స్నానము చేసిన ఫలము దొరకఁగలదు. పుష్కర తీర్థము విషయమై మఱియొక సంగతి, బ్రహ్మకు ఏక మాత్రమైన తీర్థ మిదియే యను నదియై యున్నది. మిగిలిన తీర్థములన్నియు శివ విష్ణువులవి యన్య దేవతలవియునై యున్నవి. నారదుఁడు చేసిన తీర్థప్రశంసయందు ఈ తీర్థము అన్నితీర్థములకు నాదిభూతమని చెప్పఁబడి యున్నది. రెండవ తీర్థము కురుక్షేత్రమైయున్నది. నారద తీర్థ వర్ణనమందు ఈ తీర్థమునకై యొక గొప్ప స్వతంత్రమైన యధ్యాయము (వన ప.3వ యధ్యాయము) ఈయఁబడి యున్నది. నేను కురుక్షేత్రమునకు నేగెదను, కురుక్షేత్రములో నుందును, పాప విముక్తుఁడ నగుదునని చెప్పెడు మనుష్యులు కూడ నున్నారు. దృషద్వతికి నుత్తరముననను, సరస్వతికి దక్షిణముననను నున్న క్షేత్రము లన్నియు పుణ్యభూములై యున్నవి. ఇన్ని క్షేత్రములలోను ననేకములు వేవేల నూఱుల కొలది క్షేత్రముల వర్ణనము ఈ యధ్యాయమందుఁ జేయఁబడియున్నది. వానిలో మూఁడు ముఖ్యమై యున్నవి. మొదట పృథూదకము, అన్ని క్షేత్రముల వర్ణనము ఈ యధ్యాయమందుఁ జేయఁబడియున్నది. వానిలో మూఁడు ముఖ్యమై యున్నవి. మొదట పృథూదకము, అన్ని క్షేత్రములలోను కురుక్షేత్రము పవిత్రమైనదని వ్రాసి యున్నాఁడు. కురుక్షేత్రమందు సరస్వతియు, సరస్వతియందుఁ బృథూదకమును నన్నిటికంటె నెక్కువ యుత్కృష్టమై యున్నవి. శ్యమంత పంచక తీర్థము రెండవ తీర్థము. ఈ యైదు తటాకములను పరశురాముఁడు క్షత్రియులను సంహరించి వారి రక్తముతో నిండించెను. మూడవ తీర్థము సన్నిహతీ నామకమై యున్నది. సూర్యగ్రహణ కాలమందు ఈ తీర్థములో స్నానము చేసి మనుష్యుఁడు శతాశ్వమేధములు చేసినవాని పుణ్యమును పొందునని వ్రాసియున్నాడు. ఈ తీర్థములో అన్ని తీర్థములును గలవు. ఇందుచేత దీనిపేరు సన్నిహతియై యున్నది. సూర్యగ్రహణ కాలమందు కురుక్షేత్రమునఁ గౌరవులు, పాండవులు, యాదవులు, గోపాలురు అందఱు నొక చోటఁబ్రోగైరని భాగవతమున వ్రాసి యున్నాఁడు. మఱియు నేఁడును సూర్యగ్రహణ కాలమునఁ గురుక్షేత్రగమనమునకు విశేష మహిమ విశ్వసింపఁబడుచున్నది. అచట లక్షలకొలఁది మనుష్యులు ప్రోగుపడు చున్నారు.

ఆ కాలమున కురుక్షేత్రమునందు మరణించినవాఁడు ముక్తుఁడగునని దృఢ విశ్వాసముండెను. ఇందుచేతఁ గౌరవ పాండవులు ఈ క్షేత్రములో యుద్ధమునకై చేరియుండిరి. కాని ఇంత పెద్దసేన కురుక్షేత్రమున నుండ గలుగుట యనెడు సంగతి సంభవము కాదు. స్వయముగా మహాభారతమందే కురుక్షేత్రమునకు నడుమను నివసించి రెండువైపుల సేనలును మిగుల విస్తీర్ణమగు ప్రదేశమున వ్యాపించి యుండెనని వ్రాయఁబడియున్నది. పంజాబులోని కొన్ని పూర్తిగాఁ గురుజాంగలము, రోహితకారణ్యము, మరియు మరుభూమి వరకును సైన్యము వ్యాపించి యుండెను. అహిచ్ఛత్రము, కాలకూటము, గంగాపూల్, సేతువు, వారణము, వటధానము అట్లు యమునకు దక్షిణము వైపున నున్న వరగతములవరకు సైన్యములు

వ్యాపించియుండెను. భారత యుద్ధము ఒక ప్రదేశమున జరిగెనని చాలమంది యొక్క కల్పన కలదు. కాని మహాభారతములో మఱియొకచోట కురుక్షేత్రము, అహిచ్ఛత్రము, (నేఁటి రామపురము) వరకు వటధానములనెడి గ్రామములను దక్షిణమున హస్తినాపురమునకుఁ చాలవఱకుగాఁ గలవని వర్ణనము చేయఁబడియున్నది. ఇంతవరకు సేన లుండెను. దీనిఁబట్టి నూఱుకోసుల పొడవును నూటయేబఁది కోసుల వెడల్పుగల ప్రదేశమందు జరిగియుండునని తెలియుచున్నది.

సరస్వతి విషయమై మహాభారతములో నొక స్వతంత్రమైన యాఖ్యానము శల్యపర్వములో నియ్యఁబడియున్నది. దానిఁబట్టి మనకు సరస్వతియొక్క వృత్తాంతము చాలఁ దెలియుచున్నది. బలరాముఁడు యుద్ధమునకు వెళ్ళక సరస్వతీ తీర్థమునకు వెళ్ళెను. ఆ సమయమున నీరు సరస్వతియొక్క పైదిక్కునుండి అనఁగా ముఖమువైపునుండి ప్రవహించెడువైపునకు వెళ్ళెనని వ్రాసియున్నాఁడు. వాస్తవమున సరస్వతి సముద్రములోఁ గలియలేదు. ఇపుడు కూడ నయ్యది ఘాఘూరానదికిఁ బోయి కలియుచున్నది. కాని ప్రాచీన కాలమందు నెప్పుడును నీ నది యరబ్బుసముద్రములోఁ గచ్చరణము నొద్దఁ గలియుచుండి యుండును. బలరాముఁడు తన యాత్రను ప్రభాస తీర్థము నుండి మొదలుపెట్టెను. ఈ తీర్థ మిప్పుడు ద్వారకకు దక్షిణమునఁ బడయటి యొడ్డుపై నున్నది. దీనికిఁ బిమ్మట నతఁడు చమసోద్భేద తీర్థముమీదికిఁ బోయెను. అచ్చటి నుండి మరల నుదపాన తీర్థముమీఁద కేగెను. ఈ తీర్థము కేవల మొక నూయియై యుండెనని వ్రాసియున్నాడు. కాని యిచ్చట లతావృక్షముల పచ్ఛఁదనముచేతను భూమియొక్క నున్నఁదనము చేతను సిద్ధులు సులభముగానే గుర్తింపఁగలరని గూడఁ జెప్పియున్నాఁడు. అవశ్యముగా నా నూయి మార్వాడులోని రేగిస్థానములో నుండి యుండును. దీనికిఁ బిమ్మట బలరాముఁడు వినశన తీర్థమునకుఁ బోయెను. ఇచ్చట శూద్రాభీరుల ద్వేషకారణమున సరస్వతి నష్టమయ్యెను. అనఁగ నిసుకలో గుప్తమైపోయెను. ఇందుచేత దీనిపేరు వినశనయై యున్నది.

అతఁడు సరస్వతీ నదిలో స్నానము చేసెను. ఇచ్చటనుండి యుత్తరమునకుఁబోవుచు నతఁడు సరస్వతి యొడ్డు పై నున్న యనేక తీర్థములను జూచెను. ముందునకుఁ బోవుచుఁ బోవుచుఁ నతఁడు ద్వైతవనమునకుఁ జేరెను. ఈ వనమును మునుపు వర్ణించియే యున్నాము. ఈ వనము హిమాలయపర్వతము క్రింది భూమికి సమీపమున నుండెను. దీనికి ముందు సరస్వతి దక్షిణమువైపున ప్రవహించుచున్నది. ముందునకుఁబోయి యిచ్చట హిమాలయమునుండి యేడునదులు బయలుదేరియున్నవని వ్రాసియున్నాఁడు; మరియు నయ్యవియన్నియుఁ గలిసి సరస్వతిగా నేర్పడెను. ఇందుచేత దీనికి సప్త సారస్వత మను పేరు ప్రాప్తించెను అక్కడ నుండి పిమ్మట ననేక తీర్థములను జూచుచు నతఁడు హిమాలయము లోపలఁ బ్రవేశించెను; మరియు అతడు సరస్వతి పుట్టిన చోటు వఱకు యాత్రచేసెను. సరస్వతియొడ్డున ననేక బ్రాహ్మణులు ప్రాచీన కాలము నుండియు నుండుచుండిరి. ఒకప్పుడు పండ్రెండు వత్సరములు అనావృష్టియయ్యెను, కాబట్టి బ్రాహ్మణులకుఁ గొంచెమైనను దినుటకు దొరకకుండెను. అపుడు సారస్వతముని సరస్వతియొక్క యాజ్ఞవలన మత్స్యములచేతఁ దనపొట్ట పోషించుకొని వేదములను రక్షించెను. భ్రాంతిపడి యితర స్థానములకుఁ బోయిన బ్రాహ్మణులకు సారస్వతముని వేదాధ్యయనమును జెప్పెను, ఇందుచేత వారందఱును సారస్వతమునికి శిష్యులైరి; అప్పటినుండియు మత్స్యములను దినెడు నాచారము ఈ బ్రాహ్మణులకు తటస్థించెను. అగుఁగాక, దీనికిఁ బిమ్మట యమున యొక్క ప్రతియొడ్డునకును వెళ్ళి బలదేవుఁడు కురుక్షేత్రమున శ్యమంత పంచకములో దిగి గదాయుద్ధ సమయమున నుపస్థితుఁడయ్యెను. ఈ విధముగా సరస్వత్యాఖ్యాన మందు సరస్వతీ ముఖమున నుద్గమము వఱకు వర్ణనము వచ్చియున్నది. ఈ యాఖ్యానముఁబట్టి ప్రాచీన కాలమున సరస్వతీనది ప్రత్యక్షముగా మార్వాడనుండి ప్రవహించుచుఁ బశ్చిమ సముద్రమునకుఁ బోయి కలియుచుండెనని యనుమానించుటకు నే మాత్రము బాధయుఁ గన్పడదు.'' (పు.219-230)

ఇతిహాసంలో పురాణచ్ఛాయులు, పుణ్యతీర్థ వర్ణనలు :

ఇతిహాసమైన మహాభారతంలో పురాణలక్షణాలను ప్రతిఫలింపజేసే శాస్త్రాంశ సంపత్తిని కలిగించే విశేషాలు నారద రోమశ మార్కండేయ మహర్షులు చెప్పే అంశాలు. 'పురాణం పంచలక్షణమ్' అని ప్రసిద్ధి. సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశానుచరితం అనేవి పురాణ పంచలక్షణాలుగా ప్రసిద్ధికెక్కాయి. వీటిలో వంశానుచరితం స్వతంత్రప్రతిపత్తి కలిగిన ప్రక్రియగా రూపొంది, ఇతిహాసంగా పరిణతి చెందింది. అందుకే ఇతిహాసం పురాణానికి పుత్రికగా భావిస్తారు- పండితులు. పురాణ పంచలక్షణ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్లోకంలో 'వంశానుచరితం చేతి' అనే పాదభాగానికి 'భూమ్యాదేః సంస్థానం' అనే పాఠాంతరం ఉన్నది. అంటే ప్రపంచ భౌగోళిక స్థితిగతులను గురించిన వర్ణనమని భావం. ఈ లక్షణానికి కొంతవరకు ప్రాతినిధ్యం వహించే కథాంశం పుణ్యతీర్థవర్ణనం విశిష్టమైనది. పాండవులు విన్న, కన్న పుణ్యతీర్థాలు నాటి భరతఖండ భౌగోళిక స్థితిగతులను గురించి, వాటి స్థలపురాణాలను గురించి, మాహాత్మ్యాలను గురించి, ప్రజల విశ్వాసాలను గురించి తెలియచెపుతున్నాయి. ఈ అంశాన్ని 'వార్త' గా కొన్ని పురాణాలు పేర్కొనటం గమనించదగిన విశేషం. మాత్స్యపురాణం చెప్పిన పురాణ పంచలక్షణాలు గమనించతగినవి -

చ. "ఉత్పత్తిం ప్రలయం చైవ వంశాన్ మన్వన్తరాణి చ,
వంశానుచరితం చైవ భువనస్య చ విస్తరమ్". **(మాత్స్య పురా. 2.22)**

తీర్థవర్ణనం భువనవిస్తర వర్ణనలో భాగమే. ఈ అంశాన్ని నారద ధౌమ్య రోమశ మహర్షులు విస్తరించారు. ఉత్పత్తి ప్రళయాదులను మార్కండేయ మహర్షి వివరించాడు. ఆ విధంగా మహాభారతంలో పురాణలక్షణాలు పరిమిళిస్తున్నాయి.

ఇక్కడ మరొక విశేషాన్ని కూడా గమనించాలి. ఇతిహాసంలో చెప్పబడే పురాణాంశాలు ఇతిహాస స్వభావ ముద్రితాలై ఉండటం ఆ ప్రక్రియా స్వభావం. ఎట్లాగంటే - ధర్మజుడు నారద మహర్షిని తీర్థయాత్రలను, వాటి మాహాత్మ్యాలను గురించి అడిగాడు. త్రిలోకసంచారి అయిన నారదుడు స్వయంగా ఆ వివరాలు చెప్పవచ్చును. కాని, పులస్త్యమహర్షి భీష్ముడికి పూర్వ మెప్పుడో చెప్పిన వివరాలనే అందించాడు. అంటే - ఇదివరకే చెప్పబడిన ఒక ఇతిహాసాన్ని పరంపరా కథనంగా ధర్మజుడికి చెప్పాడు. ఇటువంటివే ధౌమ్యుడు చెప్పినా, రోమశుడు చెప్పినా. రోమశుడు ఇదివరకే లోకంలో, రూఢికెక్కి పరంపరగా చెప్పబడుతున్న క్షేత్రగాథలనే వివరించి చెప్పాడు. అంటే- ఇతిహాసంలో పురాణాంశాలు అంగాలుగా ఉంటాయి. ఇతిహాసముద్రను కలిగి ఉంటాయి. ఆరణ్యపర్వంలో వీటివలన ధర్మజుడు దివ్యుడనే పరమార్థం కూడా కథలో స్థాపించబడుతుంది. పుణ్యతీర్థవర్ణనంవలన ధర్మరాజుకు పుణ్యం, పురుషార్థం లభిస్తే, పఠితకు ప్రపంచవిజ్ఞానం కలుగుతుంది.

గోదావరీ స్నానం - నన్నయ దేశాభిమానం :

నారద కథనంలో ఆంధ్రప్రాంతానికి చెందిన పుణ్యతీర్థాలను నన్నయ నోరారా అభిమానంతో వర్ణించాడు. కాని, ఔచిత్యాన్ని కాపాడి ముచ్చటగా ముక్తసరిగా చెప్పాడు. శ్రీశైల మహాక్షేత్రంలోని దేవహ్రదాన్ని ప్రత్యేకంగా ఒక తేటగీతిలో రచించాడు. పుణ్యఫలం మూలంలోదే అయినా శ్రీశైలాన్ని తీర్థరాజంగా పేర్కొన్నాడు.

తే. 'పరమమైన తీర్థంబు శ్రీపర్వతంబు । నందు దేవహ్రదం బాడి యాదిదేవు
నీశు నర్చించి పడయుదు రిష్టఫలము । నశ్వమేధ ఫలంబును నవని జనులు.

శ్రీశైలం శ్రేష్ఠమైన తీర్థమట! పుణ్యఫలం అశ్వమేధయాగ ఫలమట! అంతేకాక తెలుగువారి ప్రియమైన నదులను విశేషించి చెప్పాడు- నన్నయ. ఇంద్రుడు నూరుయజ్ఞాలు కృష్ణానది ఒడ్డున చేశాడట! ఆచోటు దేవహ్రదంగా పేరొందింది. అందులో స్నానమాడితే సర్వపాపాలూ ప్రక్షాళనమైనపోతాయట! కృష్ణానదిలో స్నానం చేస్తే పూర్వజన్మస్మృతి కలుగుతుందని మూలమహాభారతం, నన్నయ దానిని చెప్పకుండా సర్వపాపనివారణం జరుగుతుందని మార్చాడు. ఔచిత్యదృష్టి, లోకజ్ఞత ప్రదర్శించాడు. అట్లాగే తుంగభద్ర, పెన్నా, గోదావరి మొదలైన తీర్థాలలో దండకారణ్యం, శరభంగాశ్రమం, శూర్పారకం, సప్తగోదావరి మొదలైన తీర్థాలలో స్నానం చేస్తే పుణ్యలోకాలు సంప్రాప్తిస్తాయట! నారదుడి కంటె నన్నయ ఆంధ్ర ప్రాంత పుణ్యతీర్థ ఫలాలను పెంచి చెప్పాడు. అందులోనూ గోదావరీస్నానఫలం గొప్పగా చెప్పారు.

వారణాసిలోని గంగలో మునిగి రుద్రుడిని సేవిస్తే రాజసూయయాగ ఫలమట! దక్షిణకాశి అయిన శ్రీశైలంలోని దేవహ్రదంలో స్నానమాడితే అశ్వమేధ యాగఫల మట! గోదావరిలో స్నానంచేస్తే గోమేధ యజ్ఞం చేసిన ఫలంతోపాటు వాసుకిలోకం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దక్కుతుందట! ఇది వ్యాసుడివాక్కు. నన్నయ దానిని మార్చాడు. ఉదాత్తీకరించాడు. గోదావరీస్నానం వలన దశాశ్వమేధ యాగఫలం కలుగుతుందని చెప్పాడు. గోదావరికి ఆ గొప్పదనం లేదని ఆంధ్రులం చెప్పలేం. కాని, నన్నయకు గోదావరి అంటే ఎంత అభిమానమో తెలిసికొని ఆ ఆదికవిని అభినందించకుండా ఉండలేం. నన్నయ మూర్తీభవించిన ఆంధ్రాభిమానం!

నన్నయ వాగనుశాసనత్వం :

ఆంధ్రకవిలోకానికి నన్నయప్రయోగాలు పరమప్రమాణాలు, నన్నయ వాడిన పదాలు, సమాసాలు, ఛందస్సులు మొదలైన అంశాలమీద ఆంధ్రపండితులు ఎన్నో చర్చలు జరిపారు. నన్నయ వ్రాసిన కొన్ని ప్రయోగాలు తప్పన్నవారున్నారు. అవి సరి అయినవేనని సమర్థించినవారున్నారు. ఆ వివరాలన్నీ ఇవ్వటం ఇక్కడ సాధ్యపడదు కాని, ఆరణ్యపర్వంలోని ప్రస్తుతభాగంనుండి కొన్నిటిని మచ్చుకు గమనించవచ్చును. ఈ విశేషాలను శ్రీమాన్ పళ్ళె పూర్ణప్రజ్ఞాచార్యులవారు ఆరణ్యపర్వానికి వ్రాసిన 'టిప్పణి' నుండి కృతజ్ఞతలతో గ్రహించి ఉదాహరించటం జరుగుతున్నది.

సమాస ప్రయోగాలు :

అహోరాత్రులు : (ఆర. 3.238): ''అహస్సర్వైకదేశ సంఖ్యాతపుణ్యాచ్చ రాత్రేః - అను పాణినీయ సూత్రము చేతను అహర్గ్రహణం ద్వంద్వార్థమ్మనుభాష్యము చేతను ద్వంద్వసమాసమునందు అహన్ - శబ్దముకంటెఁ బరమగు రాత్రి శబ్దమునకు ఆ (చ్) ప్రత్యయము వచ్చి - జాతి రప్రాణినామ్ - అనుసూత్రముచే ఏకవద్భావము వచ్చినచో అహోరాత్రము అని కావలయును. కాని వాగనుశాసనులు అహోరాత్రులు - అని ప్రయోగించుకతన దీని కేదేని మార్గ మారయవలసి యున్నది. మహాభాష్యమునందు అహర్గ్రహణం ద్వంద్వార్థ మ్మని చెప్పియుండుటచే ద్వంద్వసమాసమునందే అహన్‌శబ్దమునకంటెఁ బరమగు రాత్రిశబ్దమునకు అచ్ ప్రత్యయము వచ్చునని తేలుచున్నది కనుక నిట అహ్నా సహితా రాత్రిః అని మధ్యమ పదలోపి సమాసము గావించు కొన్నచో నిది ద్వంద్వ సమాసము కాదు కనుక అచ్ప్రత్యయప్రసక్తి లేమింజేసి అహోరాత్రి అనురూప మేర్పడును. దాని కాంధ్రమునందుఁ బ్రథమాబహువచన మహోరాత్రులని నిర్బాధముగా నగును.''

ముష్టాముష్టి : (ఆర. 3.395): ''ఇయ్యది యసాధువని పలువురు తలంతురు. నిర్దుష్టమనియే నా యాశయము. 'ముష్టిభి ర్ముష్టిభిః ప్రహృత్యేదం యుద్ధం ప్రవృత్తమ్' అను విగ్రహవాక్యమునందు తత్ర తేనేద మితి సరూపే - అనుసూత్రముచే సమాసాంతమగు ఇ(చ్) ప్రత్యయము వచ్చి అన్యేషామపి దృశ్యతే - అనుదానిచేఁ బూర్వపదమగు ముష్టి - పదమునకు దీర్ఘము రాగా ముష్టీముష్టి అనియే కావలయును, ముష్టాముష్టి యను ఆకార విశిష్టరూప మసాధువని పూర్వపక్షుల శంక. దానికి సమాధాన మేమన - పాణిన్యాచార్యులవారిచే సైతము 'వ్యోర్లఘు ప్రయత్నతర శ్శాకటాయనస్య' - అని యష్టాధ్యాయిలోఁ బేర్కొనఁబడిన శాకటాయనాచార్యుఁడు తన శాకటాయన వ్యాకరణమున 'ఆ దిజంతే' అనుమాత్రముచే ఇజంత ముత్తరపదముగా నున్నపుడు పూర్వపదమునకు ఆత్వము వచ్చునని విధించి ముష్టాముష్టిపదము నుదాహరించియుండుటచే నియ్యది వ్యాకరణాంతరసిద్ధమని యెఱుంగునది.

''మఱియు హేమచంద్రాచార్యులు తన సిద్ధహేమచంద్రమను వ్యాకరణంబునఁ బూర్వపదమునకు దీర్ఘంబును ఆకారమంతా దేశంబుగను విధించి ఉదాహరణముగాఁ దన ద్వ్యాశ్రయకావ్యంబున యష్టీయష్టి-యష్టాయష్టి అని యిచ్చి యుండుటచే ముష్టాముష్టి పదంబు పై రీతిగా సుసాధంబు.''

''ముగ్ధబోధవ్యాకరణంబునఁ గూడఁబైవిధంబుగనే సూత్రించి ముష్టీముష్టి అనునవియే యుదాహరింపఁబడినవి. కనుక బహువ్యాకరణనిర్దుష్టం బగు నీ పదంబును వాగనుశాసనులు వాడుటలో వింతలేదని నా యభిప్రాయము. వ్యాకణాంతర ప్రసిద్ధమైనను ముష్టాముష్టి పదము పాణినీయ విరుద్ధంబుగదా యని తలంపరాదు. పాణినీయవ్యాకరణమునందును దీని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సాధుత్వమున కొక్కింతమార్గము గలదు. శ్రీ నాగేశభట్టుగారు స్వరచితభాష్యప్రదీపమున "తత్ర తేనేద మితి సరూపే" అను సూత్రమున తేన+ఆ+ఇదమ్ అని ఆ కారము ప్రశ్లేషించి కొన్ని చోటులఁ బూర్వపదంబునకు ఆత్వము వచ్చునని ముష్టాముష్టి పదము నుదాహరించియున్నారుగాన ముష్టాముష్టిపద మపాణినీయ మను శంక నిరస్తమని తెలియునది."

1. త్రిణయన - త్రినయన (ఆర. 1.334): "త్రిణయన పదము వస్తుతః దుష్టము కాదుగాని యిచ్చట 'త్రినయన' పదము వాడుటయే సమంజసము. కవిత్రయమునకు నణప్రాస మనభిప్రేతము. త్రినయనపద మెట్లు సాధువనఁగా -- 'కేచిత్తు త్రిణయన: త్రినయనః ఇత్యత్ర వికల్పేన ణత్వ మిచ్ఛంతి' - సారస్వత వ్యాకరణము."

2. ఋతుపర్ణుడు (ఆర. 2.129): "ఋతువనఁగాఁ గాలము. పర్ణ మన వాహనము. కాలము వలె వడిగాఁ బోవు గుఱ్ఱములు గలవాడు. కొన్ని సంస్కృత భారతములలో ఋతపర్ణుఁడని పేరైనట్లు గాన్పించును. అప్పుడు ఋత మన సత్యము గనుక సత్యముగా లెక్కపెట్టఁబడిన ఆకులు కలవాఁడు - అని వ్యుత్పత్తి. అక్షవిద్య నెఱిగినవాఁ డనుట. అక్షహృదయము- అక్షములన ఇంద్రియములు కనుక నిది యింద్రియాభిమాని దేవతల హృదయమును వశపఱచుకొను నొక మంత్రము. దీని శక్తిచేఁ బత్త్రపుష్ప ధాన్యాది రాసులలోని తత్తత్సంఖ్య సరిగాఁ జెప్పవీలగును. కొందఱు అక్షము లన బాచికలు కాన నీ మంత్రముచే జూదమునందుఁ బాచికలు వశ్యములుగా నుండుననియు నిర్వచింతురు."

3. నావాశ్రమమునకున్ (ఆర. 3.95): "నౌ+ఆశ్రమమునకున్, 'ఏచోఽయవాయావః' (అచ్చు పరమగునపుడు ఏ,ఓ, ఐ,ఔ, లకుఁగ్రమముగా అయ్, అవ్, ఆయ్, ఆవ్, అనునవి ఆదేశములుగా వచ్చును) అనునియమముచే "నౌ" అనుచోట 'ఔ' కారమునకు 'ఆవ్' అను నాదేశము వచ్చి నావాశ్రమమునకున్ అనియయ్యెను, ఓడయందలి యాశ్రమమునకు నని యర్థము. రోమపాదునిచే ఋశ్యశృంగుఁ దోడ్కొనిరాఁబంపఁబడిన వేశ్యాంగనలు ఋశ్యశృంగ ప్రలోభనార్థ మొక యోడయందు నాశ్రమముఁ గల్పించుకొని యట కేగిరని గ్రహించనగు. కొంద ఱోడచే దాఁటఁదగిన యాశ్రమంబున కని వచింతురు. అప్పుడు వీరు కల్పించుకొనిన యాశ్రమంబునకు మధ్య నద్యాదికము కలదనియు దాని నోడచేదాఁటవలసియుండుననియు నెఱుంగునది. ఈ పక్షమున "నౌ" శబ్దమునకుఁ దార్వార్థమును. 'నౌవయోధర్మే'తి పాణినిసూత్రముచే య(త్) ప్రత్యయము వచ్చినచో నావ్యాశ్రమమున కనురూపము సిద్ధించును. సంస్కృతభారతమున నీ రూపమే కలదు. "సాతు నావ్యాశ్రమం చక్రే" - ఈ పక్షమున భగ్నప్రాసదోషము. వాటిల్లును గానఁ బ్రథమపక్షమే స్వీకార్యము."

నన్నయ శబ్దశాసను డనటానికి ఈ ఉదాహరణలు నామమాత్రాలే! నన్నయ శబ్దసాధుత్వాన్ని గురించి ఆంధ్రపండితు లెంతటి చర్చలు చేశారో తెలియటానికే ఈ ప్రయోగాల ప్రసక్తులు.

లోకతంత్ర పంచకం - కథాక్రమ రమ్యత :

విజయుడు ఇంద్రలోకంనుండి తిరిగి రావటంతో ఆరణ్యపర్వంలో సగం కార్యం ముగిసింది. పాశుపతాస్త్ర సంపాదనంతో నివాతకవచాదుల సంహారంతో అర్జునుడు దైవీశక్తుల అనుగ్రహంతో ఆసురీశక్తులను అణచే వీరవ్రతాన్ని సాధించాడు. ఇది ఒక పక్షం. మరొకవైపు భీముడు రాక్షసులను, యక్షులను ఏకవీరుడై సంహరించి కుబేర, హనుమదాదుల, సహాయాన్ని పాండవులకు కల్పించాడు. ఇంద్రకీలాద్రి, స్వర్గలోకం ఇంద్రసుతుడి విజయ భూములు. గంధమాదన హిమవత్పర్వతాదులు భీమపరాక్రమ క్షేత్రాలు.

భీముడు ధర్మరాజుతో దైవమానుష యత్నాలలో మానుషయత్నానికే ప్రాధాన్యమిచ్చి వాదించాడు. ధర్మరాజు ఎంత చెప్పినా ఆతడి బుద్ధి కెక్కలేదు. హనుమదాదులు సూచించినా ఆతడి తల కెక్కలేదు. చివరకు కుబేరుడు కూడా మనసులో దాచుకొనలేక బహిర్గతంగా ధర్మరాజుతో ఇట్లా అన్నాడు -

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. 'అయ్యా! ధృతియును, దాక్ష్యంబు, నుపదేశంబును, గాలంబును, బరాక్రమంబును నను పంచవిధంబులైన లోకతంత్ర విధానంబు లెఱింగిన క్షత్త్రియుండు ధర్మవిదుండై ధరణీచక్రంబు నిర్వక్రంబుగా రక్షించి పుణ్యలోకంబు వడయుఁ; దత్కర్మవిశేషంబు లెఱుంగక వృథారంభుండై సాహసంబున వర్తిల్లు వానికిం బాతకం బగుట నిశ్చయంబు. **(ఆర. 4.31)**

క. కావున నీ తమ్ము మరు । ద్దేవాత్మజు సాహసైకధృతి గాకుండన్,
భూవల్లభ! శిక్షింపుము । నీ విమలజ్ఞాన ధర్మనిష్ఠిత బుద్ధిన్'. **(ఆర. 4.32)**

ఈ లోకతంత్ర పద్ధతులలో ఆరణ్యవాసంలో ధృతి, దాక్ష్యం, ఉపదేశం అనే తంత్రాలనూ, అజ్ఞాతవాసంలో కాలాన్నీ, ఉద్యోగాదులలో పరాక్రమాన్నీ, పాండవులు ప్రదర్శించారని ధ్వని. అదే ధర్మరాజు వ్యూహంకూడా. తద్భిన్నంగా ఆ క్రమాన్ని మార్చి ప్రయోగించే సాహసం చేస్తే దోషం కలుగుతుందని కుబేరుడి హెచ్చరిక.

ఆరణ్యపర్వ ప్రథమాశ్వాసంలో ద్రౌపదీ భీమసేనుల వాదాలను కాదని ధర్మజుడు తన సమయాన్ని పాటించటానికి కృతనిశ్చయుడు కావటంలో ధృతి ఉన్నది. వ్యాస ప్రేరితుడై ధర్మజుడు అర్జునుడి ద్వారా పాశుపతాస్త్రాది దివ్యాయుధాల నన్నింటిని సాధించి విజయం తథ్యమన్న భావాన్ని పొందటంలో, పాండవులలో కలిగించటంలో దాక్ష్యం (అంటే దక్షత్వం, సామర్థ్యం) ఉన్నది. బృహదశ్వ, నారద, ధౌమ్య, రోమశాది మహర్షులు చెప్పిన ఉపాఖ్యానాలలోని ఉపదేశాలను గ్రహించటంలో ఉపదేశం ఉన్నది. దీనితో ఒక వర్తులం పూర్తి అవుతుంది. దీనికి పరీక్ష నహుష ప్రశ్నలకు ధర్మజుడిచ్చే సమాధానాలు.

రెండవ వర్తులం వెనుకనుండి మొదలౌతుంది. మార్కండేయ మహర్షి చెప్పిన కథాంశాలు ఉపదేశం, ఘోషయాత్రలో సైంధవ దుర్నయ ఘట్టంలో పాండవులు ప్రదర్శించిన పరాక్రమం దక్షత; యక్షఘట్టంలో ధర్మజుడు ప్రదర్శించింది ధృతి. వాటికి యక్షప్రశ్నలు ఒక పరీక్ష, ఈ క్రమంలో కథార్థాలు చదువుకొని అన్వయించుకొనటమే ఆరణ్యపర్వంలోని రమ్యత!

నన్నయ రచించిన భాగంలో లోకతంత్ర వర్తనాల వర్తులం ఎడమనుండి కుడికి ప్రదక్షిణంగా కొనసాగింది; ఎఱ్ఱయ రచించిన భాగంలో ఆ వర్తులం కుడినుండి ఎడమకు మరలి, సవ్యంగా ముగిసింది. అప్పుడే అది పరిపూర్ణం. అందుకే ఎఱ్ఱయ నన్నయ పేరుమీదనే తన భాగాన్ని పూరించి, ఆరణ్యపర్వాన్ని పరిపూర్ణం చేసి ఉంటాడు!.

కవిత్రయ మహాభారతం - వ్యాఖ్యానం :

తెలుగులో ఆదికావ్యమైన మహాభారతానికి వ్యాఖ్యానం సమగ్రంగా రావటం ఆంధ్రావళికి ఆనందం కలిగించే అంశం. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో అవతరించటంవలన ఇది సారస్వతయజ్ఞ గౌరవం పొందింది. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారు దీనిని ఒక బృహత్తర ధార్మిక కార్యంగా భావించి, సర్వాంగసుందరంగా ప్రచురించి, సామాన్యులకు కూడ అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారి వెలుగుల పుణ్యం. ఈ పవిత్రమహత్తర ప్రయత్నానికి ఏడుకొండలస్వామి పక్షాన బాధ్యత వహించి, విజయవంతంగా ముందుకు సాగిస్తున్న మాన్యులు, మహనీయులు టి.టి.డి. బోర్డ్ ఛైర్మన్, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, సంపాదకులూ, వారిసహాయకులూ, సంపాదక సలహామండలి సభ్యులు, సంపాదకమండలి సభ్యులు, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, పలురకాలుగా దీనికి తోడ్పడుతున్న అధికార అనధికారులు ధన్యులు. వారికి నా కృతజ్ఞతాపూర్వక నమోవాకాలు!.

ఈ గ్రంథాన్ని ఆమూలాగ్రం చదివి ఆమోదించటమే కాక, కొన్ని మంచి సూచనలిచ్చి ప్రోత్సహించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం కంట్రోలర్ ఆఫ్ పబ్లికేషన్సు శ్రీ కరణం జువ్వలకంటి కృష్ణమూర్తి గారికి నా కృతజ్ఞతాభివందనాలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటిగా - రెండు భాగాలలో - వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపుదిద్దుకొన్నది. విస్తృతమైన ఆరణ్యపర్వం రెండు భాగాలుగా వెలువడుతున్నది. అందులో మొదటి భాగ మిది.

విద్వత్కవులు, పండితులు, రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షులు అయిన డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులవారు దక్షతతో రచించిన వ్యాఖ్యాన మిది. కథార్థ తత్త్వాన్ని విశ్లేషణాత్మకంగా వివేచించిన విద్వన్మణులు వారు. దీనిని తిరుమల తిరుపతి దేవస్థానంవారు ప్రచురించటం ముదావహం. వారికి నా కృతజ్ఞతలు.

డాక్టర్ కృష్ణమాచార్యులవారు మొదట వ్యాఖ్యానాన్ని సరళ గ్రాంథిక భాషలో రచించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి నిర్ణయానుసారం భారతవ్యాఖ్యానం ప్రజల కందుబాటులో ఉండటానికై శిష్టవ్యావహారికంలోకి మార్చబడింది. ఆ పరివర్తనంలో తోడ్పడిన సంస్కృతాంధ్రభాషా పండితులు డాక్టర్ అట్లా వెంకటరామిరెడ్డి, డాక్టర్ శ్రీమతి వి. జయశ్రీ గారలు. వారు చేసిన పరివర్తనను డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు గారు పరిశీలించి ఆమెదించారు. శుద్ధప్రతుల తయారీలోను ప్రూపులు సరిచూడటంలోను డాక్టర్ వెలుదండ నిత్యానందరావు. శ్రీమతి జి. సుశీల, శ్రీమతి లక్ష్మీవిద్యానాథ్ గారలు తోడ్పడ్డారు. భారతంమీద వచ్చిన లఘువ్యాఖ్యలను సేకరించటంలో సహకరించారు డాక్టర్ దంటు హేమలతగారు. ముద్రణకు అనువైన అక్షరాకృతి నిచ్చారు శ్రీ దత్తసాయి గ్రాఫిక్స్ అధినేత్రి డాక్టర్ జి.యస్. లక్ష్మిగారు. వీరందరికి హార్దికమైన కృతజ్ఞతలు.

భక్తజనకల్పద్రుమమైన భద్రమూర్తి పద్మావతీ సహిత శ్రీవేంకటేశ్వరస్వామివారు ధర్మకల్పద్రుమమైన ఈ భారతవ్యాఖ్యకు ప్రభువు. సత్యశివసుందరమైన ఆ స్వామి దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యా సంపుటిని వాఙ్మయారాధనలోని పుణ్యపూజాకుసుమ మంజరిగా సమర్పించుకొంటున్నాను.

జి.వి సుబ్రహ్మణ్యం
ప్రధానసంపాదకుడు
కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానం.

హైదరాబాదు
విక్రమ ఉగాది
5-4-2000

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆరణ్యపర్వ కథాసారం

(మొదటి భాగం)

ద్రౌపది వెంటరాగా పాండవులు ఉత్తరదిశగా పయనించారు. కొంత దూరం పోయినతరువాత ఇంద్రసేనుడు మొదలైన ముఖ్యసేవకులూ, పధ్నాలుగువేల రథాలతో సుభద్రాభిమన్యులూ, ప్రతివింధ్యాది ఉపపాండవులూ వారిని కలిసికొన్నారు. ప్రజలు ధృతరాష్ట్రుడి దుర్నీతిని నిందించి, పాండవులవెంట వనవావసానికి బయలుదేరారు. ధర్మజుడు వారికి నచ్చచెప్పి, వారి వారి ఇండ్లకు వారిని తిరిగి పంపాడు. కాని, కొందరు వేదాచారపరాయణులైన పండితులూ, పాండవపురోహితుడైన ధౌమ్యుడూ వారివెంట సాగివచ్చారు. తమతో వస్తున్నవారు వనవాసంలో ఏమాత్రం ఆకలి బాధకు శ్రమపడినా ధర్మజుడు ఎంతో బాధపడుతూ ఉండేవాడు. ఒక్కొకసారి తీవ్రమైన శోకంతో మూర్ఛపోయేవాడు. శౌనకుడు అనే బ్రహ్మర్షి ధర్మజుడు ఆత్మస్థైర్యం పొందటానికి 'జనకగీతా' సారాన్ని ప్రబోధించాడు. ధర్మజుడు శాంతచిత్తుడైనాడు.

ఆశ్రితులకు అన్నలోపం లేకుండా ఉండాలంటే ఆదిత్యమంత్రాన్ని జపించి సూర్యానుగ్రహాన్ని పొందుమని ధౌమ్యుడు ధర్మరాజుకు సూచించాడు. ధర్మజుడు నిష్ఠతో సూర్యోపాసనం చేశాడు. సూర్యుడు అతడికి ప్రత్యక్షమై ఒకరాగిపాత్రను ప్రసాదించాడు. ఆ పన్నెండేళ్ళ వనవాసకాలంలో వంటశాలలో ద్రౌపది ఆ పాత్రలో వండిన వన్య ఫలమూలశాకాలు అక్షయమైన చతుర్విధాహారాలుగా పరిణమిస్తాయని వరమిచ్చాడు. ఆ వర ప్రభావంతో వేలాది బ్రాహ్మణులకూ, అతిథులకూ నిత్యాన్నసంతర్పణలు చేస్తూ ధర్మజుడు గార్హస్థ్యధర్మాన్ని గౌరవంగా నిర్వహిస్తూ ఉన్నాడు.

ధృతరాష్ట్రుడిని వదలిన విదురుడు తిరిగి రావటం:

కొంతకాలం తరువాత పాండవులు కామ్యకవనం చేరారు. అప్పుడు ఒకనాడు హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు 'ఇక పాండవులు ఏమిచేయగలరో' చెప్పమని విదురుడిని అడిగాడు. విదురుడు పాండవుల బలపరాక్రమాలను ప్రశంసించాడు. కపటద్యూతంవలన పాండవకౌరవుల నడుమ పగ రేగుతుందని ముందుగా చెప్పినా పట్టించుకొనకుండా ధృతరాష్ట్రుడు కొడుకులమాట వినినందుకు మందలించారు. కులదూషకుడైన దుర్యోధనుడిని దూషించి, ధర్మరాజుకు పట్టంగట్టి కులాన్నీ, బంధుమిత్రులనూ కాపాడుకొమ్మని హితవు చెప్పాడు.

విదురుడి మాటలకు గ్రుడ్డిరాజు కోపగించాడు. 'నీవు నా కొడుకుల అభ్యుదయాన్ని ఎన్నడూ సహించ లేవు. కాబట్టి నీ సహాయం నాకు అవసరం లేదు. నీవు పాండవులవద్దకు గాని, నీ కిష్టమున్నచోటికి ఎక్కడికైనగాని వెళ్ళిపొమ్ము' అని నిష్ఠురమాడాడు. విదురుడు వెంటనే రథమెక్కి పాండవుల వద్దకు వెళ్ళాడు.

విదురుడి రాకను తెలిసికొని పాండవులు మొదట అనుమానించారు. కౌరవులపక్షాన మరల జూదానికి రమ్మని పిలవటానికి వస్తున్నాడేమోననీ, వారు ఆయుధాలను పణంగా పెట్టించి గెలవాలని వ్యూహం పన్నారేమోననీ ఊహించారు. కాని, విదురుడివలన అసలు సంగతి తెలిసికొని కుదుటపడ్డారు. విదురుడు పాండవులకు సచివుడుగా నిలిచాడు. ధర్మహీనులైన కౌరవుల రాజ్యం నిలువదనీ, ధర్మవ్రతులైన పాండవులను రాజ్యసంపద వరిస్తుందనీ విదురుడు ప్రకటించాడు.

ప్రభువైన ధృతరాష్ట్రుడికి విదురుడు హృదయం, చూపువంటివాడు. అటువంటి విదురుడు దూరమయ్యేసరికి గ్రుడ్డిరాజు విలవిలలాడి పోయాడు. వెంటనే సంజయుడిని పిలిచి 'కామ్యకవనానికి వెళ్లి, విదురుడిని వెనుకకు తె'మ్మని నియోగించాడు. సంజయుడి సందేశం విని, ధర్మజుడి అనుమతితో విదురుడు హస్తినాపురికి తిరిగి వెళ్ళాడు. ధృతరాష్ట్రుడు ఆతడిని సాదరంగా ఆహ్వానించి తన తెలివితక్కువతనానికి క్షమించుమని వేడుకొన్నాడు.

వ్యాసుడి హితవు :

ధృతరాష్ట్ర విదురుల పునస్సమాగమం దుర్యోధనుడికి కన్నెర్ర చేసింది. అతడు కర్ణ శకుని దుశ్శాసనులతో మంతనం చేశాడు. పాండవులను అడవులనుండి పిలిపించి, ధృతరాష్ట్రుడు తిరిగి వారి రాజ్యం వారికిస్తాడేమో నని శంకించాడు. కాని, శకుని ఆ మాటను కాదని, పాండవులు తాము చేసిన ప్రతిజ్ఞలను మధ్యలో భగ్నం చేయరని చెప్పాడు. పాండవులపై దాడి చేసి, యుద్ధంలో వారిని చంపి, రాజ్యాన్ని నిష్కంటకం చేద్దామని కర్ణుడు సలహా ఇచ్చాడు. ఆ మాట విని దుర్యోధనుడు సమస్తసైన్యాలను మోహరించి యుద్ధభేరి మ్రోగించటానికి సిద్ధమైనాడు. ఆ సంగతిని వ్యాసమహర్షి దివ్యదృష్టితో తెలిసికొని, హస్తినాపురికి వచ్చి దుర్యోధనుడిని వారించి, ధృతరాష్ట్రుడిని మందలించాడు. ఇంద్రసురభి సంవాదాన్ని వినిపించి, కౌరవ పాండవులను సమంగా ఆదరించుమని గ్రుడ్డిరాజుకు హితవు చెప్పాడు. కొన్నాళ్ళు దుర్యోధనుడిని ధర్మరాజువద్ద ఉంచితే సత్సాంగత్యంవలన సద్గుణవంతుడు కావచ్చునని సూచించాడు. కాని, ధృతరాష్ట్రుడు దానిని మన్నించక తన కొడుకు తనమాట వినడని విచారించి, వ్యాసమహర్షినే తన కొడుకుకు ఆ హితవును బోధించుమని కోరాడు. ఆ పనిని మైత్రేయుడనే ముని చేస్తాడని చెప్పి వ్యాసుడు నిష్క్రమించాడు.

సుయోధనుడి తొడలు విరిగే శాపం :

ఆ తరువాత మైత్రేయుడు పుణ్యక్షేత్రాలను దర్శించుకొంటూ కామ్యకవనంలో ఉన్న పాండవులనుకూడా చూచి, హస్తినాపురికి వచ్చాడు. ధృతరాష్ట్ర డతనిని పూజించి పాండవుల కుశల మడిగాడు. ఆ ఋషి కుశల వార్తలు చెప్పి, దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు: 'అయ్యా! నీవు పాండవులతో విరోధం మాని బుద్ధి కలిగి ఉంటే, నీకూ, కురుకులానికీ మేలు కలుగుతుంది. నా మాటలు మన్నించుము' - అని, పాండవుల, వారి సహాయకుల బలపరాక్రమ విశేషాలను వివరించాడు. దుర్యోధనుడు ఆ ముని మాటలు లెక్క చేయకుండా, గర్వించి కాలి బొటనవ్రేలితో నేలను రాస్తూ, చేతులెత్తి తొడలు చరుస్తూ, బిగ్గరగా నవ్వ నారంభించాడు. అతడి అవినయానికి మైత్రేయుడు మండిపడి దుర్యోధనుడిని శపించాడు - 'నీతొడలు రెండూ భీముడి గద దెబ్బలకు విరిగిపోవుగాక!' అన్నాడు- ఆగ్రహంగా. ధృతరాష్ట్రుడు శాపాన్ని ఉపసంహరించుమని ప్రార్థించాడు. 'దుర్యోధనుడు సమబుద్ధితో వ్యవహరిస్తే ఆ శాపం వర్తించ'దని చెప్పి, మైత్రేయ మహర్షి వెడలిపోయాడు.

భీముడు కిమ్మీరుడిని వధించటం :

ఈ కథను విదురుడు ధృతరాష్ట్రుడికి చెప్పాడు.

పాండవులు హస్తినాపురం వదలి మూడురోజులు ఆగకుండా ప్రయాణం చేసి కామ్యకవనం చేరారు. ఆ అడవిలో ఒకనాటి నడిరేయి భయంకరాకారుడై, రాక్షసమాయలు చేస్తూ గర్జిస్తూ కిమ్మీరుడనే రాక్షసుడు పాండవుల బాటకు అడ్డంగా నిలిచాడు. అతడి భీకరరూపం చూచి ద్రౌపది మూర్ఛ పోయింది. పాండవు లామెను తేర్చారు. రాక్షసుడికి తమను గురించి తెలియ చెప్పుకొన్నారు. కిమ్మీరుడు బకాసురుడి తమ్ముడు. బకాసురుడిని వధించిన భీముడిపై పగ తీర్చుకొనాలని అతడు ఎదురుచూస్తున్నాడు. వెదుకబోయిన తీగ కాలికి తగిలినట్లు అతడికి భీముడు దొరికాడు. అతడిపై ఆగ్రహోదగ్రుడై విజృంభించాడు. భీముడిని పట్టాడు. ఆ రాక్షసుడు తనకంటె బలహీనుడని భీముడు గుర్తించాడు. వెంటనే కిమ్మీరుడి నడుమును, కుత్తుకను రెండుచేతులతో పట్టి పైకెత్తి నేలపై పడవేసి, వెన్నెముకను విరిచి చంపివేశాడు. ఆనాటినుండి కామ్యకవనం రాక్షసపీడ లేక సుఖంగా ఉండే వనస్థలిగా మారింది. పాండవులందులో కొంతకాలం సుఖంగా ఉన్నారు.

నరనారాయణుల నరజన్మం :

పాండవులు కామ్యకవనంలో నివసించే సమయంలో శ్రీకృష్ణాదియాదవవీరులూ, ధృష్టద్యుమ్నాది పాంచాలవీరులూ వారిని పరామర్శించటానికి వచ్చారు. ధార్తరాష్ట్రులు పాండవులకు చేసిన మోసాన్ని పేర్కొంటూ శ్రీకృష్ణుడు కౌరవులపై మండిపడ్డాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాంచాల యాదవ వృష్ణి భోజాంధక వీరులందరూ కలిసి హస్తినాపురిపై దండెత్తి కర్ణ శకుని దుర్యోధన దుశ్శాసనులను చంపి, వారినెత్తురుతో భూదేవిని తృప్తిపరచి, ధర్మరాజుకు రాజ్యపట్టాభిషేకం చేస్తామని ప్రళయకాలంలోని యముడివలె ఉగ్రుడై పలికాడు- శ్రీకృష్ణుడు. అర్జునుడు శ్రీకృష్ణుడిని శాంతపరిచాడు. ఆతడి లోకప్రభుత్వాన్నీ, త్రివిక్రమత్వాన్నీ, విశ్వరూపత్వాన్నీ కీర్తించి ధరణీతలం మీద శిశుపాలాదులను సంహరించి ధర్మసంరక్షణం చేసేందుకు పుట్టిన అవతారపురుషుడుగా కీర్తించి, అసత్యం, మాత్సర్యం, క్రోధం అనే వికారాలను జయించి సుర మునీంద్రులచేత పొగడబడే ఆ దేవదేవుడి మహత్వాన్ని ప్రశంసిస్తూ నమస్కరించాడు. శ్రీకృష్ణుడు శాంతించి అర్జునుడితో ఇట్లా అన్నాడు: 'ఓ పుణ్యాత్ముడా! నీవూ నేనూ నరనారాయణులనే పేర్లతో పూర్వం ఉన్న ఆదిమునులం. ఇద్దరం సమానశక్తితో మానవజన్మలెత్తాం. మనిద్దరినడుమ నీవూ నేనూ అనే భేదం లేదు. ఇద్దర మొక్కటే. నీకు ఇష్టుడు నాకు కూడా ఇష్టుడే. నీకు శత్రువు నాకుకూడా శత్రువే. మనిద్దరం ఈ లోకానికి మేలు కలిగే పనులనే చేద్దాం' అంటూ ఆతడితో కలిసి స్నేహపూరిత సంభాషణలలో మునిగిపోయాడు- శ్రీకృష్ణుడు.

ఒకనాడు శ్రీకృష్ణుడు బంధుమిత్రులైన రాజులందరితో కలిసి కొలువుండగా ద్రౌపది ఆతడితో తన పరాభవ దుఃఖాన్ని ఇట్లా నివేదించుకొన్నది. 'దేవా! నీవు ప్రజాపతి వని అసితుడైన దేవలు డన్నాడు. యజ్ఞపురుషుడవని కశ్యపుడు కీర్తించాడు. సర్వమయుడవని నారదుడు సంస్తుతించాడు. అక్షయజ్ఞాననిధివని మునిశ్రేష్ఠులందరూ ప్రశంసించారు. రాజర్షులకు, యోగులకు, సాధులకు, భక్తులకు నీవే గతివి, పతివి. నీకు తెలియని దంటూ ఏమీ లేదు. అయినా నేను పొందిన అవమానాలను గురించి నీకు నివేదించుకొంటున్నాను'.

'నేను మహా ప్రభువైన పాండురాజు కోడలిని, మహా పరాక్రమవంతులైన పాండవుల భార్యను. పూజ్యుడవైన నీ చెల్లెలిని. శక్తిమంతుడైన ధృష్టద్యుమ్నుడి సోదరిని. ఇట్టి నన్ను ఆ దుర్యోధనుడు పగతో నిండుసభ కీడ్పించి తెప్పించాడు. ఆ పాపాత్ముడు దుశ్శాసనుడు నా వలువలను ఒలిచాడు. ఆ దారుణమైన అవమానాన్ని నేను అనుభవించాను. అప్పుడు పాండవులు అభిమానం చచ్చి, చూస్తూ అందరివలెనే ఊరకుండిపోయారు. భీష్మాది కురువృద్ధులు నిశ్శబ్దంగా ఉన్నారు. శరణన్న వారిని కరుణతో రక్షించే పౌరుషమూర్తులు భీమార్జునులు. శరణని నేను అరచినా భార్య పిలుపును వినకుండా రక్షించకుండా మిన్నకున్నారు. ఇక వారి బాహుబల మెందుకు? అన్నలు, కొడుకులు, బంధువులు ఇంతమంది బలగం నాకున్నా, అనాథవలె అలమటిస్తూ ఉంటే, ఆ కర్ణుడు నన్ను చూచి నవ్వాడు. అన్నా! ఆ దుశ్శాసనుడు చేసిన అవమానంకంటె ఆ కర్ణుడు అప్పుడు నవ్విన ఆ నవ్వు ఇప్పటికీ నా మనస్సును అగ్నిశిఖవలె దహించి వేస్తున్నది. అలనాడు దుర్యోధనుడు భీముడిని గంగలో త్రోసి, విషంపెట్టి, పాములతో కరిపించాడు. ఆ తరువాత వారణావతంలో తల్లితో కలిసి నివసిస్తున్న పాండవులను క్రూరుడై అగ్నిపాలు చేసేందుకు కుట్ర పన్నాడు. అతడు చేసిన అపకారాలు అన్నీ ఇన్నీ అని చెప్పలేను. ఇప్పుడు అధర్మద్యూతంలో రాజ్యాన్ని అపహరించి నిండుకొలువులో వారినీ, నన్నూ అవమానించినా పరాక్రమాన్ని ప్రదర్శించటానికి ముందుకు రాని ఈ పాండవులు నా పరాభవ దుఃఖాన్ని ఏ విధంగా మాన్పగలరు?' అంటూ కన్నీరుమున్నీరుగా శ్రీకృష్ణుడి యెదుట దుఃఖించింది. ఆమె నోదారుస్తూ శ్రీకృష్ణార్జునులు ఇట్లా అన్నారు.

శ్రీకృష్ణుడు : సోదరీ! నీ గుండెలో మండుతున్న అవమానాగ్ని చల్లారేటట్లుగా అర్జునుడు ధృతరాష్ట్ర పక్షవీరులను తన బాణపరంపరతో హతంచేసి యమసదనానికి పంపుతాడు. ఇది నిజం. నామాట తప్పక జరిగి తీరుతుంది. సప్తసముద్రా లింకినా రాత్రింబవళ్ళు తలక్రిందులైనా ఇది తథ్యం.

అర్జునుడు : ద్రౌపదీ! ఈ పురుషోత్తముడే మన యోగక్షేమాలను చూస్తూ, మన పాపపంకిలాన్ని తొలగించి, దుర్మదాంధులైన మన శత్రువులను సంహరింప చేస్తాడు. మనకు ముల్లోకవిజయం కలుగుతుంది. నీ వింక దుఃఖించటం ఎందుకు?

వారి మాటలు విని ధృష్టద్యుమ్నుడు కూడా ఇట్లా పలికాడు.

ధృష్టద్యుమ్నుడు : చెల్లీ! అవినయపరులైన ఆ దుర్యోధన దుశ్శాసనులను భీముడు హతమారుస్తాడు. అర్జునుడు ఆ కర్ణుడినీ, ద్రోణుడిని నేనూ చంపుతాం. ఇక నీకు మనశ్శాంతి కలుగుతుంది. - అని అందరూ కలిసి ఆమెను ఓదార్చారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అప్పుడు శ్రీకృష్ణుడు తాను పాండవులు మాయాద్యూత మాడే సమయంలో ద్వారకలో లేకపోవటంచేత, వారివెంట ఉండి ఆ విపత్తును తప్పించలేకపోయానని ధర్మరాజుకు సౌంభకవృత్తాంతం చెప్పాడు.

సౌంభక వృత్తాంతం :

ధర్మజుడు చేసిన రాజసూయంలో అవినయంగా వర్తించిన శిశుపాలుడిని శ్రీకృష్ణుడు వధించి, పాండవు లర్పించిన పూజనందుకొన్నాడు. శిశుపాలుడి తమ్ముడు సాల్వుడు. శ్రీకృష్ణుడు తన అన్నను చంపినందుకు కోపించి ప్రతీకారం తీసికొనటానికై ద్వారవతిమీద దండెత్తాడు. సాల్వుడికి సౌంభక మనే పేర కామగమనం గల పట్టణం ఉన్నది. దానితో కలిసి వచ్చి ద్వారవతిని చుట్టుముట్టి పరిసరాలను ధ్వంసం చేశాడు. నగరంమీద దాడి మొదలుపెట్టాడు. యదువీరకుమారులు చారుదేష్ణుడు, ప్రద్యుమ్నుడు, సాంబుడు అనేవారు యుద్ధోత్సాహంతో కోట వెలువడి సాల్వుడిని ఎదుర్కొన్నారు. ముగ్గురూ పౌరుషంతో పోరాడి అనేక మంది వీరులను చంపారు. ఒకసారి ప్రద్యుమ్నుడు యుద్ధంలో మూర్ఛపోయాడు. సారథి ఆతడి రథాన్ని దూరంగా తీసికొనిపోయి అతడిని సేద తీర్చాడు. ప్రద్యుమ్నుడు తేరుకొని తేరెక్కి సాల్వుడిపై దాడిచేసి, అతడిని మేటియుద్ధంలో చంపబోయాడు. కాని, నారద మారుతులు ప్రత్యక్షమై సాల్వుడు శ్రీకృష్ణుడిచేత చంపబడతాడని చెప్పారు. దానితో ప్రద్యుమ్నుడు సాల్వుడిని యుద్ధంలో ఓడించి ప్రాణాలతో వదిలాడు. సాల్వుడు సౌంభక నగరంతో పాటు పలాయనం చిత్తగించాడు.

ఆసమయంలో శ్రీకృష్ణుడు ధర్మజ రాజసూయం ముగించుకొని ద్వారకకు తిరిగివచ్చాడు. చిన్నవోయి, రూపుమాసిన తన రాజధానిని చూచి చిన్నబోయాడు. జరిగిన వృత్తాంతం ఆహుకాత్మజుని (ఉగ్రసేనుని) వలన విని, కోపించి 'సాల్వుడిని చంపి కాని నగరంలో ప్రవేశించనని ప్రతిజ్ఞ చేసి అనంతబలంతో సాల్వుడిమీద దండెత్తాడు. సాల్వుడు సౌంభకనగరంతో సహా సముద్ర గర్భంలో దాగి ఉన్నాడు. ఆతడిని పసికట్టి శ్రీకృష్ణుడు శస్త్రాస్త్రాలతో అతడి సైన్యాన్ని నుగ్గుచేశాడు. సాల్వుడు భయపడి శ్రీకృష్ణుడిపై మాయాయుద్ధం ప్రారంభించి విజృంభించాడు. శ్రీకృష్ణుడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించి అతడి మాయను తొలగించాడు. సాల్వుడు వసుదేవుడిని బంధించినట్లు కనుకట్టు సన్నివేశాన్ని ప్రదర్శించాడు. శ్రీకృష్ణుడు వాడి మాయను గ్రహించి శబ్దభేదిని ప్రయోగించాడు. సాల్వుడు తన సౌంభకనగరాన్ని ప్రాగ్జ్యోతిషనగరంగా మార్చి పర్వతాలతో యుద్ధం చేశాడు. శ్రీకృష్ణుడు పర్వతాలను వజ్రాస్త్రంతో నుగ్గుచేశాడు. ఆ తరువాత సారథి ప్రేరణతో సాల్వుడిని చక్రప్రయోగంతో సంహరించాడు. ఈ యుద్ధం ముగియటానికి ఆరునెలలు పట్టింది. ఆ కాలంలోనే పాండవులు కౌరవులచేత మాయాద్యూతంలో ఓడించబడి అడవులపాలైనారు. శ్రీకృష్ణసాన్నిధ్యం వారికి లభించకపోయింది.

శ్రీకృష్ణాదులు కొంతకాలం పాండవులతో కలిసి ఉన్నారు. ఆ తరువాత శ్రీకృష్ణుడు తనతో సుభద్రాభిమన్యులను ద్వారవతికి తీసికొని పోయాడు. ఉపపాండవులైన ప్రతివింధ్యాదులను ధృష్టద్యుమ్నుడు ద్రుపద పురానికి కొంపోయాడు. ఆపైన పాండవులు మూలభృత్యులతో కలిసి ద్వైతవనంలో ప్రవేశించారు. అప్పుడు వారిని మార్కండేయ మహర్షి, బకదాల్భ్య మహర్షి దర్శించారు. వారిరువురూ పాండవుల ధర్మ సత్యనిరతిని ప్రశంసించారు. విశేషించి బకదాల్భ్యుడు ధర్మజుడి బ్రాహ్మణ భక్తిని కొనియాడాడు. బ్రాహ్మణానుగ్రహంవలన సంపదలను పొందిన వైరోచనాదుల వృత్తాంతాలను ప్రస్తావించి, బ్రాహ్మణప్రియులైన పాండవులకు అభ్యుదయాలు కలుగుతాయని ఆశీర్వదించాడు. ఆ మునులిద్దరూ వెళ్ళారు. పాండవులు ఆ వనంలో నివసిస్తూ తమ దుఃఖోపశమనం కొరకు అనేక కథలు చెప్పుకొంటున్నారు. ఆ సందర్భంలో ద్రౌపదికీ ధర్మరాజుకూ ఈ క్రింది విధంగా సంవాదం సాగింది.

ద్రౌపదీ ధర్మరాజుల సంవాదం :

ద్రౌపది : ఆ ముసలిరాజు కొడుకుమాటలు విని క్రూరుడై పాపచింతతో మిమ్మల్ని రాజ్యం నుండి వెడలగొట్టి, రాజ్యవైభవాన్నంతా అపహరించాడు. ఇప్పటికైనా అతడు కోపం మాని మంచి మనసుతో ఉన్నాడా? ఆ దురాత్ముడి హృదయం ఇనుమువలె, రాయివలె కఠినమైనది. లేకపోతే ధర్మవిదులైన మిమ్మల్ని తనకొడుకులు అన్ని ఎగ్గుమాట లంటుంటే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వారించకుండా పైపెచ్చు కలహాన్ని పోషిస్తాడా? మహారాజభోగా లనుభవించే మీరు ఈ కారడవులలో పడరాని కష్టాలు పడుతూ ఉంటే నే నెట్లా మిమ్మల్ని చూచి ఓర్చుకొనేది? మిమ్మల్ని ఎట్లా ఓదార్చేది? ఆ ధృతరాష్ట్రుడివలె విధి కూడా మీకు శత్రువైనట్లే కనిపిస్తున్నాడు.

ఓ ధర్మరాజా! నీ తమ్ములు నీ ఆజ్ఞ అనే సంకెళ్ళలో చిక్కి పరాక్రమం ప్రదర్శించలేక బోనులోపడ్డ సింగపుపిల్లలవలె కష్టాల ననుభవిస్తున్నారు. పరరాజుల కిరీటాల రత్నాల కాంతులతో వెలిగిపోయే నీ పాదాలు ఈ పర్వతధాతుశిలల ధూళితో ఎఱ్ఱబడ్డాయి. రోజూ పదివేలమంది బ్రహ్మవేత్తలైన బ్రాహ్మణులు బంగారు పళ్ళేరాలలో భుజించి తృప్తులైన తరువాత నీవు భుజించేవాడివి. ఇప్పుడు వనమూలికలను తింటూ పేదవోయావు. పదివేల యేనుగుల బలంగల భీమసేనుడు కాయగూరలు తిని చిక్కిపోతున్నాడు. కార్తవీర్యార్జునుడివలె బాహుపరాక్రమం ప్రదర్శించగల పార్థుడు వన్యమృగాలతో కలిసి తిరుగుతున్నాడు. సుఖభోగలాలసులైన నకులసహదేవులు దీనులై ఉన్నారు. ఈ స్థితినంతా గమనించికూడా నీవు శాంతుడవై ఉండటం సమంజసం కాదు.

ఓర్పు పరాక్రమం అనే రెండు గుణాలను ఆయాకాలాలలో అద నెరిగి ప్రయోగించకపోతే ఆ రాజుకు ప్రజల గౌరవం లభించదు; వారి ప్రతాపం వారికి ప్రయోజనకారి కాకుండా పోతుంది. ఈ సత్యం ప్రసిద్ధమైన 'బలీంద్రప్రహ్లాద సంవాదం' వలన నిరూపితమయింది. అంతేకాక, శత్రువులు చేసిన అపకారం చిన్నదైతే క్షమించి వారిని వదలివేయవచ్చును. కాని, కౌరవులు అనేక అపరాధాలను నిరంతరం చేస్తున్నారు. వారి పట్ల సహనం ఎందుకు? ఇది పరాక్రమానికి తగిన సమయం. శత్రువులమీద నీవు కొద్దిగా క్రోధాన్ని ప్రకటించుము. చాలు. నీ తమ్ములు ఉగ్రస్వరూపులై దుర్మార్గులైన దుర్యోధనాదులను తునుమాడుతారు.

ధర్మరాజు : కోపమే పాపం. కోపంవలన ధర్మకామార్థాలు చెడిపోతాయి. కోపించే వాడికి కార్యం చెడుతుంది. అతడు పెద్దలను నిందిస్తాడు; చంపకూడనివారిని చంపుతాడు; ఆత్మహత్యకు పాల్పడతాడు. మనవంటి ధర్మాచరణపరులకు కోపం మంచిది కాదు. తెలివికలవాడు కోపమనే మంటను జ్ఞానమనే నీళ్ళతో ఆర్పుతాడు. దేశకాలతత్త్వాలను తెలిసికొని కోపంలేని వాడు ప్రకాశిస్తాడు. భూమివలె ఓర్పు కలవాడికి ఎల్లప్పుడు విజయం కలుగుతుంది. ఓర్పు కలవాడి పరాక్రమం అన్నిపనులు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. అమర్షం, దాక్షిణ్యం, శౌర్యం, శీఘ్రత్వం అనే నాలుగు గుణాలు ఓర్పుకలవాడిలోనే శక్తిమంతంగా వర్ధిల్లుతాయి. ప్రాచీనమైన కశ్యపగీతలోని కథలవలన ఈ అంశాన్ని తెలిసికొనవచ్చును. వేదాలు, యజ్ఞాలు, శుచిత్వం, సత్యం, విద్య, ధర్మం, ఈజగత్తూ అన్నీ ఓర్పులోనే నిలిచి ఉన్నాయి. యజ్ఞకర్తలు, బ్రహ్మవేత్తలు పొందే పుణ్యగతులను క్షమావంతుడు పొందుతాడు. అంతేకాదు, వ్యాస భీష్మ విదుర కృప ద్రోణ సంజయాదులు నా ఓర్పును కీర్తిస్తారు. సహనంలేని దుర్యోధనుడు కారణంగా ధార్తరాష్ట్రులందరూ నాశనమౌతారు.

ద్రౌపది : ఓ అజాత శత్రుడా! ఓర్పుగల బుద్ధితో నిర్మలమైన వర్తనంతో ధర్మాన్ని ఆచరిస్తూ ఉన్న నిన్ను ధర్మం రక్షిస్తుంది. కానీ, నీవు శత్రువుల పట్లకూడా సమబుద్ధితో ఉండటం మంచిది కాదు. అధర్మపరులు, కపట వర్తనులు అయిన ధార్తరాష్ట్రులను నీవు కూడా కపట మార్గంతోనే వధించాలి. లేకపోతే నీవే వధ్యుడవౌతావని ఆర్యులంటారు. ఓ విధీ! మంచివారికి దీనస్థితిని, అయోగ్యులకు ఉన్నతస్థితిని కలిగించి నీవు చేయరానిపని చేశావు. నీకు దుష్టులే చుట్టాలా? ఆర్యులే శత్రువులా?

ధర్మరాజు : నాస్తికులవలె ధర్మాన్ని శంకించి దైవాన్ని దూషిస్తా వెందుకు? ధర్మాన్ని తిట్టేవారికి ప్రాయశ్చిత్తం లేదు. ధర్మాన్ని తప్పక పాటిస్తూ జీవించే మహానుభావు లెందరో ఉన్నారు. మైత్రేయ, మార్కండేయ, వ్యాస, వసిష్ఠ, నారదాదులు మనకు ప్రత్యక్షసాక్షులు; వీరందరూ నన్ను ధర్మపరుడనని మన్నిస్తారు. ఇతరులు అన్యాయం చేశారని నేనెందుకు ధర్మాన్ని తప్పాలి? ధర్మం మానవులకు స్వర్గారోహణ సోపానం వంటిది. తపస్సు, స్వాధ్యాయం, బ్రహ్మచర్యం, దానం, ధర్మం, యజ్ఞం అనేవి పుణ్యకర్మలు. అవి ఫలం లేనివైతే ఇంతమంది ఋషులు ఎందుకు ఆచరిస్తున్నారు? నీ జన్మం, ధృష్టద్యుమ్నుడి పుట్టుక పుణ్య కర్మఫలం వలన కలిగినవే కదా! పూర్వం బ్రహ్మ తన కొడుకులకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కర్మఫల సద్భావం గురించి చెప్పాడు. వారిలో కశ్యపుడు ఆ ఫలాన్ని పొందాడు. బ్రహ్మ నియోగం చేతనే పుణ్యకర్మపరులు దేవత్వాన్ని పొందుతుంటారు.

ద్రౌపది : భూనాథా! కర్మఫలానికి విధి కారణమనీ తెలుసు. వేదశాస్త్రాలు పరమప్రమాణాలనీ తెలుసు. నే నంత తెలియనిదాన నేమీ కాను. మా తండ్రిగారింట్లో బ్రాహ్మణులు చెప్పగా ఎన్నో ధార్మికాంశాలు తెలిసికొన్నాను. పురుషుడు మనస్సులో అర్థసిద్ధిని నిశ్చయించికొని కర్మ చేయాలి. అతడికి దైవం సహాయపడి కర్మసిద్ధి కావిస్తాడు. నువ్వులనుండి నూనె, కట్టెనుండి నిప్పు- పుట్టుతాయని తెలిసి ఉపాయంతో వాటిని పొందినట్లుగా, ఉత్సాహవంతుడు కర్మసిద్ధి పొందగలుగుతాడు. ఉత్సాహి కీడు పొందలేడు. రైతు దుక్కిదున్ని విత్తులు చల్లి ఉండగా వర్షం కురిసి తత్ఫలసిద్ధిని పొందుతాడు. నడుమ పర్జన్యుడు అనుగ్రహించకపోతే రైతు ఏమి చేయగలడు? రైతు తాను చేయగలిగినంత చేసి మిగిలిదానికి దైవానుకూల్యం సిద్ధించాలని కృషి చేస్తాడు. అట్లాగే నీవుకూడ కర్మఫలం దైవమానుషసిద్ధమని తెలిసికొని, పురుషకారంతో సాధించేవే సుస్థిరాలని తెలిసికో. పురుషయత్నం చేయక దైవంమీద భారం వేసేవాడు నీటిలో పడవ వంటివాడు. కాబట్టి నీవు కర్మఫలసిద్ధిని నిశ్చయించుము. ఉత్సాహవంతుడ వయి నీతమ్ముల పరాక్రమంతో శత్రువులను జయించుము. మన పేదరికాన్ని మాన్పుము.

ద్రౌపది మాటలను సమర్థిస్తూ భీమసేనుడు ఇట్లా అన్నాడు.

భీముడు : ధర్మరాజా! తాతతండ్రుల నుండి మనకు వచ్చిన రాజ్యం శత్రుదుర్భేద్యం. గాండీవిచేత సంరక్షితం. ఇంద్రుడికైనా జయించటానికి అసాధ్యం. అట్టి రాజ్యాన్ని దుర్బుద్ధితో అన్యాక్రాంతం చేయటం న్యాయమా? ఈ కారడవిలో వ్రతాలు చేస్తూ ధర్మలేశచరణ వ్యాసక్తితో ఇట్లా ఉండటం తగునా? సింహాలు కూర్చిన మాంసాన్ని నక్కలు తిన్నట్లు మనం సంపాదించిన సామ్రాజ్యలక్ష్మిని కౌరవులు హరించి మనసులో ఏమని భావిస్తారో? దుర్బుద్ధులను, దుర్జనులను ధర్మంతో జయించటం సాధ్యమా? కాబట్టి, దుష్కర్ములయిన దుర్యోధనాదులను భుజబలశక్తితో అణచివేయుము. ధర్మకామాలనుండి పుట్టి సర్వార్థాలను సాధించే అర్థపురుషార్థాన్ని వదలిపెట్టి, మిత్రులకు దుఃఖాన్నీ, శత్రువులకు సంతోషాన్నీ కలిగేటట్లు మునివృత్తితో ధర్మం ధర్మం అంటూ ధర్మంలోనే మనసు నిలిపి బలహీనుడివలె ఇట్లా నిర్వేదపడుతూ ఉండటం సమంజమా? బలంలేనివాడు పరుల సంపదలు గ్రహించలేక దుఃఖిస్తూ ఉంటాడు కాని, నీకీపని తగునా? ఆ నిండుసభలో ఆనాడే నీవు అనుమతించి ఉండి ఉంటే- విరోధుల నందరినీ యుద్ధంలో వేగంగా అక్కడే మనం చంపి ఉండేవారం. అప్పుడు ఈ కారడవిలో అడవిమృగాల నడుమ పడిఉండే దైన్యం మనకు లేకుండా ఉండేది. చేసిన ప్రతిజ్ఞలను మీరలేక ఓర్పుతో ఉన్న మనలను గురించి కౌరవులు యుద్ధోత్సాహం లేని జడమతులనీ, పరాక్రమంలేని పిరికిపందలనీ భావిస్తారు. ఏకాంతంగా ఉండి ధర్మాచరణం చేసే వాడిని అర్థకామాలు వదలిపెట్టి పోతాయి.

లోకంలో ధర్మకామాలను తక్కువ చేసి అర్థాన్ని కోరేవాడు పతనమౌతాడు. అర్థం కొరకే అర్థాన్ని సాధించేవాడు భయంకరమైన అడవిలో గోవులను రక్షించే మూర్ఖుడివంటివాడు. అర్థ ధర్మాలకు హానికలిగేటట్లు కామాన్ని సాధించేవాడు ఎండుతున్న నీటి మడుగులోని చేపవంటివాడు. అర్థ ధర్మాలు సముద్ర మేఘాలవలె పరస్పరం ఆధారపడి ఉంటాయి. కాబట్టి త్రివర్గాన్ని సమయోచితంగా సాధించేవాడే సర్వసంపన్నుడు. నీ వాచరిస్తున్న ధర్మం అర్థకామాలకే కాక, నీకూ, నీ బంధువులకూ బాధాకరంగా పరిణమించింది. నిజానికి, క్షత్రియులకు అర్థసాధకం కాని ధర్మం నిరర్థకం. శత్రువులను యుద్ధంలో జయించటం, రాజ్యాన్ని నిర్భయంగా గ్రహించి సముచితంగా రక్షించటం, యోగ్యులైన వారికి అర్థాన్ని దానం చేయటం, బ్రాహ్మణులను పూజించటం అనేవి ఉత్తమ క్షత్రియ ధర్మాలు. అవే వారికి మంచి గతుల నిస్తాయి, విపుల సంపదలు కలిగిస్తాయి. కేవలం ధర్మాన్ని ఆచరించటంవలన శత్రువిజయం సాధ్యం కాదు. మోసం చేసేవారిని మోసంతోనే జయించాలి. పూర్వం అసురులను దేవత లట్లాగేకదా జయించింది. కాబట్టి, నీవుకూడా నియమాన్ని పాటించే ధర్మాన్ని మాని శత్రువులను జయించే ప్రయత్నం సాగించుము.

జయశీలివైన నీకు ఆసటగా బాసటగా యదుపాంచాలాది మిత్రరాజు లున్నారు. మిత్రులబలంతో అమిత్రులను జయించటం నీతి. దేహబలం, దేశబలం కలవారికి అసాధ్యమనేది లేనేలేదు. తేనెతుట్టెలోని తేనెను తీసేవాడిని తేనెటీగలన్నీ ఒక్కటై పట్టి కుట్టినట్లుగా ఒంటరిగా ఉన్న బలవంతుడిని పలుపురు బలహీనులు ఒక్కటై జయించటానికి యత్నిస్తారు. దుర్యోధనుడి రాజ్యంలో జానపదులు, బ్రాహ్మణులు నీపట్ల అనురక్తులు. వారు నీ ప్రభుత్వాన్ని సమర్ధిస్తారు. కాబట్టి నీవు ఆలస్యం చేయక, ఆయుధాలున్న రథమెక్కి హస్తినాపురంమీద విజయయాత్ర సాగించుము. ఇప్పుడే క్షత్రియోచితమైన విక్రమాన్ని ప్రకటించుము. యుద్ధంలో గాండీవి తన బాణాలతో ధార్తరాష్ట్రులను అరటిచెట్లను నరికినట్లు నరికి కుప్పలు పోస్తాడు. శత్రువులకు అపారమైన సేన ఉన్నదని భయపడబోకుము. నా గదాఘాతాలకు ఆ సైన్యం ప్రాణాలతో బైటపడగలుతుందా? శత్రువుల నోడించి భూవలయాన్ని పాలించుము. ప్రజా పరిపాలనం కంటె ధర్మం వేరే ఉంటుందా? రాజ్యం పొందిన రాజు భూరిదక్షిణ లిచ్చి యజ్ఞాలు చేయగలడు. దానివలన బ్రాహ్మణులకు బహుదానాలిచ్చి పాపాలనుండి విముక్తుడై చీకటినుండి విముక్తుడైన చంద్రుడివలె ప్రకాశించగలడు.

ధర్మరాజు : భీమసేనా! నీమాటలు నీతియుతంగా ఉన్నాయి. ఇష్టసిద్ధి కనుకూలంగా ఉదారంగా ఉన్నాయి. అయినా ఏకార్యమైనా బాగా ఆలోచించి చేయటంవలననే సత్ఫలితాల నిస్తుందని బుద్ధిమంతు లంటారు. నేను పెద్దల యెదుట నిండుసభలో అరణ్యాజ్ఞాతవాసాలు చేస్తానని ప్రతిజ్ఞ చేశాను. ఉత్తముడు రాగకోపాలకు వశుడై ఓర్పును కోల్పోయి చంచలమైన సంపదకు ఆశపడి సత్యం, ధర్మం తప్పి మరల పెద్దలున్నసభలో తలెత్తి నిలువగలడా? నేను చేసిన ప్రతిజ్ఞను దాటలేను. మంచికాలం వచ్చేవరకు వేచి ఉండటం మంచిది. రాజ్యాలు, పుత్రులు, సంపదలు, కీర్తి అనేవి సత్యంతో సమంకావు.

భీముడు : శరీరాలు అశాశ్వతాలు. శరీరానికి మరణం తథ్యం. ఎప్పు డది వస్తుందో తెలియదు. అందువలన పనులు ఎడంచేసి కొనటం కూడదు. మరణించే లోపల ఎవరైనా తనవైరం తీర్చుకొనకపోతే వాడిజన్మ వృథా. కాబట్టి, మనం పరులచేత పడిన పరాభవాలకు ప్రతీకారం తీర్చుకొనేంతవరకు రాత్రింబవళ్ళు నాగుండె మండుతూ ఉన్నది. నాకంటె అధికంగా అర్జున నకుల సహదేవులు, కుంతీదేవి మనస్తాపంతో వేగిపోతున్నారు. వీరల దుఃఖం తీర్చకుండా కారడవిలో ధర్మం. దయ అంటూ ఉండటం తగినపని కాదు. ఈవిధంగా శాంతంగా ఉండటం బ్రాహ్మణధర్మం గాని, క్షత్రియధర్మం కాదు. మనువు ధర్మశాస్త్రంలో శత్రుసంహారం క్షత్రియధర్మంగా చెప్పాడు. శత్రువులను సంహరించనివాడికి హాని తప్పక కలుగుతుంది.

అది అట్లా ఉండనిమ్ము. మనం పన్నెండేళ్ళు అరణ్యవాసాన్ని ఎట్లాగో గడపవచ్చును. కాని, అజ్ఞాతవాసాన్ని ఒకరోజు కూడా గడపలేం. ఎందువల్లనంటే- నిన్నూ నీ తమ్ములను ఎరుగనివారు లేరు. మనం రహస్యంగా ఉండటం అంటే మేరుపర్వతాన్ని దాచటం వంటిది. అది అసాధ్యం. అందువలన మనకు ఈ వనవాసం ఎప్పుడూ తప్పదు. కాబట్టి ఇప్పు డొక ధర్మాంతరాన్ని పాటిద్దాం. లోకంలో సంవత్సరానికి ప్రతినిధిగా మాసాన్ని గ్రహించే పరిపాటి ఉన్నది. కాబట్టి మనం ఇప్పటికి పదమూడు నెలల అరణ్యవాసం చేశాం. దీనిని పదమూడేళ్ళుగా గణించటం ధర్మవిరోధం కాదు. కాబట్టి విజయారంభానికి ఇది తగిన సమయం.

ధర్మరాజు : భీమసేనా! నీవు పాండిత్యంలోనూ, పరాక్రమంలోనూ, గర్వంలోనూ మంచి దిట్టవు. నీవు చెప్పింది చేయతగిందే. అయినా నామాట కూడా వినుము. స్వల్పమైన ఉపాయంతో సాధించే పనిని సాహసంతో చేసినా తప్పు లేదు. కాని, మహాకార్యం సాహసంతో సాధ్యం కాదు. దానిని బాగా ఆలోచించి చేయాలి. అట్లా చేస్తే దైవంకూడా తోడ్పడతాడు. ఆ పక్షంలో ఉన్న దుర్యోధనాదులు శూరులు. కర్ణుడు, భూరిశ్రవసుడు, మద్రభూపతి మొదలైనవారు జయించటం సులభంకాని పరాక్రమం కలవారు. మనచేత ఇదివరలో ఓడించబడిన రాజులందరూ ఇప్పుడు దుర్యోధనుడిచేత సత్కరించబడి అతడివైపే చేరి యుద్ధం చేయనున్నారు. వారుకూడా అస్త్ర శస్త్ర విద్యాకోవిదులు. వారందరూ ఒక ఎత్తు. కర్ణుడు ఒక్కడూ ఒక యెత్తు. అతడు అభేద్యకవచుడు. అతడి విలువిద్యను, బాహుపరాక్రమాన్నీ

తలచుకొన్ననాడు నాకు నిద్ర పట్టదు. ఇంక భీష్మ ద్రోణ కృపాచార్యులు ఉభయులపట్ల సమదృష్టి కలవారైనా వారిపక్షాన్నే ఉన్నారు. వారు అపార దివ్యాస్త్ర విశారదులు. వారలను జయించిన తరువాత కదా దుర్యోధనుడిని ఓడించటం. ఇదే అసలు సమస్య - అని ధర్మరాజు కార్యసాధనం కొరకు గాఢంగా విచారిస్తున్నాడు.

పాశుపతాస్త్ర సంపాదనం :

ధర్మరాజుచింతను తెలిసికొని వేదవ్యాసుడు ప్రసన్నుడైనాడు. ధర్మరాజుకు 'ప్రతిస్మృతి' అనే విద్యను బోధించి దానిని అర్జునుడికి ఇస్తే తపోవీర్య విభవంతో దేవతలనుండి మహాస్త్రాలను సంపాదించగలడని సూచించాడు. ఆ తరువాత పాండవులు అక్కడినుండి కామ్యకవనం చేరి సరస్వతీ నదీతీరంలో నివసించసాగారు.

ధర్మరాజు అర్జునుడికి ప్రతిస్మృతివిద్యను బోధించాడు. దానితో అతడు తేజోవంతుడైనాడు. దివ్యాస్త్రసంపాదన కొరకు పార్థుడు తపస్సుకు పూనుకొన్నాడు. ఇంద్రకీల పర్వతంమీదకు చేరి ఇంద్రుడి ఆనతితో పాశపతాస్త్రాన్ని పొందటానికి పరమేశ్వరుడిని గురించి తపస్సు చేశాడు. పార్థుడి ఘోరతపస్సుకు పరమేశ్వరుడు మెచ్చి, పరీక్షించి వర మిద్దామని కిరాతవేషంతో దిగివచ్చాడు. ఆ దేవదేవుడి వెంట పార్వతి. ప్రమథగణం, వారిభార్యలు కిరాతవేషాలతో వచ్చి పరమేశ్వరసేవలో నిలిచారు. పరమేశ్వరుడు పార్థుడి పరాక్రమాన్ని పరీక్షించటానికి ఒక దివ్యవ్యూహం పన్నాడు. దాని కనుకూలంగా మూకుడనే రాక్షసుడు అర్జునుడిని చంపాలని అడవిపంది ఆకారంలో పరుగెత్తుతూ వచ్చాడు. ఒకవైపునుండి పార్థుడూ, మరొకవైపునుండి పరమేశ్వరుడూ ఒకేసారి బాణాలు వేశారు. అవి రెండూ ఒకేసారి పందికి గ్రుచ్చుకొన్నాయి. పంది పడిపోయింది. మూకుడు నిజాకారాన్ని పొంది అంతర్ధానం చెందాడు. కిరీటి ఎదుట కిరాతవేషధారి అయిన పరమేశ్వరుడు కనపడ్డాడు. ఇరువురూ వీరాలాపాలు ఆడుకొన్నారు. అడవిపందిని చంపటంపై వివాదం పెంచుకొన్నారు. బాణాలు గుప్పకొన్నారు. ఎరుకువాడి బాణాల ధాటికి అర్జునుడు ఆశ్చర్యపోయి, మారురూపంలో వచ్చిన ఏ దేవుడో అని భావించాడు. తనవద్ద నున్న అస్త్రశస్త్రాలన్నిటినీ ప్రయోగించాడు. పరమశివుడు తనదివ్యమాయతో వాటి నన్నింటినీ వమ్ముచేశాడు. అంతేకాక, అర్జునుడికి అగ్నిదేవు డిచ్చిన అక్షయతూణీర ద్వయాన్ని ఓటుపడేటట్లు చేసి వాటిని అదృశ్యం చేశాడు. అర్జునుడికి ఆశ్చర్యం వేసింది. గత్యంతరం లేక గాండీవంతో కిరాతుడి మీదికి లంఘించాడు. ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి. ముష్టియుద్ధానికి తలపడ్డాడు- పార్థుడు. పరమేశ్వరుడు గట్టిగా చరిచాడు. నరుడు మూర్ఛపోయాడు. శివుడు ప్రత్యక్షమై కరుణతో పార్థుడికి పాశుపతాస్త్రాన్ని ప్రసాదించాడు. దానికి అసాధ్యమనేది లేదనీ, అల్పులమీద ప్రయోగిస్తే జగత్ప్రళయం కలిగిస్తుందనీ హెచ్చరిక చేశాడు. అక్షయ తూణీరాలను అనుగ్రహించాడు. పాశుపతాస్త్రంతో సమస్త లోకాలను జయించగలవని చెప్పి పరమేశ్వరుడు అంతర్ధానమైనాడు.

ఇంద్రుడి వరాలు - ఊర్వశి శాపం :

పాశుపతాస్త్రం పొందిన అర్జునుడి ఎదుట ఇంద్రుడు దేవగణాలతో కలిసి వచ్చి ప్రత్యక్షమైనాడు. దేవతలందరూ పార్థుడిని అభినందించి, తమతమ దివ్యాస్త్రాలను ప్రసాదించి అదృశ్యు లయ్యారు. దేవేంద్రుడు తన రథాన్ని పంపి అర్జునుడిని అమరావతికి రప్పించుకొన్నాడు. అక్కడి భోగభాగ్యాలను చూపించాడు. తనతోపాటు సగంగద్దెమీద సవ్యసాచిని కూర్చుండబెట్టుకొని గౌరవించాడు. ఒక నరుడికి భౌతిక శరీరంతో స్వర్గంలో అటువంటి గౌరవం జరగటం అపూర్వం.

ఒకనాటి రాత్రి వెన్నెలవేళ ఊర్వశి అర్జునుడిపై మరులుగొని అతడిని సమీపించి తన మనసు బైట పెట్టింది. కాని, అర్జునుడు ఆమెయందు మాతృభావాన్ని ప్రకటించి నమస్కరించాడు. దేవవనితలకు వావివరుస లుండవని ఆమె ఎన్నోవిధాల మదనోద్దీపకంగా మాట్లాడింది. అతడు చలించలేదు. ఆమె విసిగి తనకోర్కె ఫలించలేదని కోపించి, అర్జునుడు నపుంసకుడై ఆడువారి మధ్య మసలేటట్లు దారుణంగా శపించింది. మరునాడు ఆసంగతి తెలిసికొని దేవేంద్రుడు అర్జునుడి ధర్మశీలాన్ని మెచ్చుకొని, అభినందించాడు. ఊర్వశిశాపంవలన కలిగే షండరూపం అజ్ఞాతవాస సంవత్సర కాలం మాత్రమే ఉంటుందని వరమిచ్చి, వివిధ దివ్యాస్త్రాలను అతడికి ప్రసాదించాడు. అయిదేళ్ళ కాలం అర్జునుడికి గీతవాద్యనృత్యాలను దేవేంద్రుడు సురలోకంలో నేర్పించాడు. ఆవిధంగా ఊర్వశిశాపం అజ్ఞాతవాస వ్రతంలో అర్జునుడికి వరంగా పరిణమించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒకనాడు రోమశుడు దేవేంద్రలోకానికి వెళ్ళాడు. దేవేంద్రుడితోపాటు అర్ధసింహాసనారూఢుడైన అర్జునుడిని చూచి ఆశ్చర్యపోయాడు. దేవేంద్రుడు చెప్పగా - నరుడనే మహర్షి పార్థుడుగా పుట్టాడనీ, పాశుపతాస్త్రం పొందిన నరుడు అర్జునుడే అని తెలిసికొన్నాడు. ఆ అస్త్రంతో దేవతల విరోధులైన రాక్షసులను సంహరించి సురలోకానికి మేలు చేయనున్నాడని దేవేంద్రుడు చెప్పగా విన్నాడు. ఆ తరువాత ఇంద్రుడు రోమశుడిని ధర్మరాజు వద్దకు పంపి అర్జునుడు దేవహితార్థమై సురలోకంలో ఉన్నాడనీ, పాశుపతాస్త్ర ప్రభావంతో రాబోయే యుద్ధంలో భీష్మద్రోణకర్ణాది వీరులను సంహరించగలడనీ, పార్థుడు తిరిగి వచ్చేంతవరకు ధర్మరాజును తమ్ములతో కలిసి తీర్థయాత్రలు చేయుమనీ సందేశం పంపాడు. రోమశుడిని ఆ తీర్థయాత్రలలో సహాయపడుమని దేవేంద్రుడు నిర్దేశించాడు.

పాండవులు వనంలో పార్థుడి రాకకొరకు పరితపించి పోతున్నారు. అప్పుడు భీముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: 'అర్జునుడు సంపాదించిన దివ్యాస్త్రాలతో ధరణీరాజ్యాన్ని తిరిగి పొందుదామని అనుకొంటున్నాం. అతడి రాక ఎందుకో ఆలస్యమయింది. జనార్దనుడిని పంపి అతడిని త్వరగా రప్పించటం మంచిది. అతడు తిరిగివస్తే మేమంతా కలిసి హస్తినాపురం మీద దండెత్తి, శత్రువులను పరిమార్చి రాజ్యాన్ని ఆక్రమిస్తాం. నీకు సత్యవ్రతభంగ మౌతుందనే భయం ఉంటే పదమూడేళ్ళు అరణ్య, అజ్ఞాతవాసాలు ముగించుకొని వచ్చి రాజ్యపట్టాభిషేకం చేయించుకొమ్ము. మాయాద్యూతంతో మనలను మోసగించిన దుర్యోధనుడు రాజ్యంలో కుదురుకొనక పూర్వమే అతడిని దూషిస్తాం. వంచనపరులను వంచనతో సాధించటమే సముచితం. అదే రాజధర్మం' అని ఆవేశంతో భీమసేనుడు పలికాడు.

ధర్మరాజు భీముడిని ప్రేమతో కౌగలించుకొని శిరస్సు ముద్దు పెట్టుకొన్నాడు. అగ్నికి వాయువు తోడైనట్లు అర్జునుడికి భీముడు తోడైతే యుద్ధంలో ఎవరు నిలువగలరు? అయితే, ఆ యుద్ధం పదమూడేళ్ళ తరువాత జరగాలనీ, అందులో భీమార్జునులే విజయ కారకులు కావాలనీ ఆకాంక్షిస్తూ భీముడి కోపాన్ని ఉపశమింప చేశాడు- ధర్మరాజు.

ఇక హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు పరమేశ్వరుడివలన పార్థుడు పాశుపతాస్త్రాన్ని పొందిన వృత్తాంతాన్ని పారాశర్యుడు చెప్పగా విని పరమవ్యాకుల చిత్తుడై పరితపించాడు. భీముడు కిమ్మీరుడిని చంపిన వార్త విని మనసులో కటకట పడ్డాడు. రాబోయే యుద్ధంలో శ్రీకృష్ణార్జునులు నిర్వహించే మహనీయపాత్రను విదురుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు నిరుత్తరుడైనాడు.

నలోపాఖ్యానం :

ధర్మరాజు వద్దకు బృహదశ్వుడనే ముని వచ్చాడు. అతడికి పాండవులు అతిథి సత్కారాలు చేసి, విశ్రాంతి కల్పించారు. అ ఋషితో ధర్మరాజు- కౌరవులు తమకు చేసిన అన్యాయాలనన్నింటిని చెప్పాడు. 'మునీంద్రా! దేశాన్నీ, రాజ్యాన్నీ, బంధువులనూ విడిచి అడవులలో మృగాలతో కలిసి మావలె కష్ట పడిన రాజు లెవరైనా ఉన్నారా?' అని ఆ మునీంద్రుడిని అడిగాడు. బృహదశ్వుడు నలమహారాజుకథ చెప్పాడు. అతడు కూడా జూదమాడి పుష్కరుడిచేతిలో ఓడిపోయి, ఒక్కడే కానలలో ఎన్నోకష్టాలు పడ్డాడు. ఆ సామ్యంతో నలుడిచరిత్రను చెప్పాడు.

వీరసేనుడి కొడుకైన నలుడు నిషధరాజు. అనేక అక్షౌహిణుల సైన్యంతో రాజుల నందరినీ జయించిన చక్రవర్తి. అతడికి జూదమంటే ప్రీతి. అయినా, బ్రహ్మణ్యుడయి బ్రహ్మోత్తరంగా ప్రజాపాలనం చేస్తున్నాడు. విదర్భాధీశుడైన భీముడికి దమయంతి అనే అపూర్వ సౌందర్యవతి కూతురు. ఆమె నలుడి గుణగణాలను విని అతడిపై వలపుపెంచుకొన్నది. నలుడు ఆమె గుణగణాలను విని అనురక్తుడైనాడు.

ఒకనాడు నలుడు దమయంతిని స్మరిస్తూ ఉద్యావనంలో విహరిస్తుండగా ఆకాశంలో నుండి అంచలగుంపు సమీపంలో వాలింది. నలుడు వాటిని పట్టుకొనబోయి ఒకహంసను చిక్కించుకొన్నాడు. పట్టుబడిన హంసను వదలలేక మిగిలినవి ఆకసంలో తెల్లమబ్బులవలె తిరుగుతూనే ఉన్నాయి. అప్పుడా హంస మనుష్య వాక్కులతో ఇట్లా అన్నది. 'అయ్యా! నీకు నేను మేలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేస్తాను. నీ ప్రియురాలైన దమయంతి వద్దకు పోయి, నీ గుణాలు ఆమెకు వర్ణించిచెప్పి, ఆమె మరెవ్వరినీ మనసులో కోరకుండా నీయందే అనురాగబద్ధురాలయ్యేటట్లు చేస్తాను' అని అన్నది. ఆ మాటలు విని నలుడు ఆ హంసను వదలిపెట్టాడు.

ఆ హంస తనగుంపుతో కలిసి విదర్భకు పోయింది. అంతఃపురోద్యానవనంలో దిగింది. దమయంతికి కావాలని తనంతట తానే పట్టుబడింది. నలుడినిగురించి వర్ణించి దమయంతికి చెప్పింది. తాను చూచిన రాజులందరిలో ఆతడే సర్వగుణ సుందరుడని కీర్తించింది. దమయంతి కున్న రూపకాంతి వైభవాలు నలుడిని పొందినప్పుడే సార్థకమౌతాయని చెప్పింది. దమయంతి నారీరత్నమనీ, నలుడు పురుషరత్నమనీ పేర్కొని వారిద్దరి సమాగమం పరస్పరశోభాకరమని ప్రశంసించింది. హంసమాటలకు దమయంతి సంతోషించింది. తననుగురించి కూడా నలుడికి అదే విధంగా తెలియజెప్పమని కోరింది. ఆ హంస నిషధకు తిరిగి వెళ్ళి, నలుడికి దమయంతి రూపలావణ్యవైభవాలనుగురించి వర్ణించి చెప్పింది. ఆ విధంగా నలదమయంతు లిద్దరూ అనురక్తులై మదనవిరహాన్ని అనుభవిస్తూ పొద్దుపోని పగళ్ళూ రాత్రుళ్ళూ గడిపేవారు. విరహతాపోపశమనానికి నందనోద్యానాలలో తిరిగేవారు. తామరాకులలో, తామర తూండ్లో కప్పుకొనేవారు. చిగురాకుపాన్పులపై పవళించేవారు. నీటి ధారలతో, గంధపుపూతలతో శైత్యోపచారాలు చేసికొనేవారు.

దమయంతి విరహతాపాన్ని గురించి చెలికత్తెలు చెప్పగా విని, ఆమె తండ్రి భీమరాజు నలమహారాజుకు తనకూతురు నిచ్చే ఉపాయాన్ని ఆలోచించి స్వయంవరం చాటబంచాడు. భూతలం మీది రాజులందరూ ఆ స్వయంవరానికి తరలి వచ్చారు. ఆ సంగతి ఇంద్రుడు నారదుడివలన తెలిసికొని దిక్పాలకసహితంగా తానూ విదర్భకు బయలుదేరి వస్తున్నాడు. మార్గమధ్యంలో నలమహారాజును కనుగొన్నాడు. దమయంతి తమలో ఒకరిని వివాహం చేసికొనేటట్లు ఆమెవద్దకు తమదూతగా వెళ్ళమని అడిగాడు. దానివలన దేవహితం సాధించబడుతుందని చెప్పాడు. దేవేంద్రుడిమాట కాదనలేక నలు డందుకు అంగీకరించాడు. సురక్షితమైన అంతఃపురంలో ప్రవేశించటానికి వీలుగా దేవేంద్రుడు నలుడికి తిరస్కరిణీ విద్యను ప్రసాదించాడు. నలుడు దమయంతిని ఆమె అంతఃపురంలోకి పోయి చూచాడు. ఆమె సౌందర్యాన్ని చూచి మన్మథ వశుడైనాడు. నలుడు దమయంతికి దర్శనమిచ్చాడు. ఆతడి రూపం దమయంతికి మన్మథావేశాన్ని కలిగించింది. కాని, ఆత డెవరో తెలియదు. దమయంతి ఆతడి గురించిన వివరాలను తెలిసికొనాలని అడిగింది.

నలుడు : నేను దేవదూతను. నాపేరు నలుడు. దిక్పాలకులు నిన్ను ప్రీతితో చూడటానికి వచ్చారు. స్వయంవరంలో వారిలో ఒకరిని వలచి వరించటానికై నాతో ముందుగానే రాయబారం పంపారు. వారి కోర్కెను నీవు తీర్చాలి.

దమయంతి: మీ మాటలు వింటూంటే నాకు దుఃఖం కలుగుతున్నది. నే నెక్కడ? ఇంద్రాదు లెక్కడ? నీ గుణగణాలను హంసవలన విని నిన్నే నామనసులో నిలిపాను. నీ కొరకే ఈ స్వయంవర సన్నాహం. కాబట్టి నీవు నాయందు కరుణించి నా భర్తవుగా అనుగ్రహించుము. నీవు అంగీకరించకపోతే ఏదోవిధంగా చనిపోతాను.

నలుడు : నిన్ను దేవతలే కోరుతున్నారు. నేను వారి కాలిదుమ్ముకు కూడా సరిపోను. దేవత లుండగా మనిషిని నన్ను కోరటం దేనికి? దేవతలకు ప్రియం చేయకపోతే వారు నాకు బాధలు కలిగిస్తారు. కాబట్టి నన్ను ఆ ఆపదనుండి రక్షించుము.

దమయంతి: నే నొక ఉపాయం కనుగొన్నాను. ఇంద్రాదులు రేపు స్వయంవరానికి వస్తే వారి యెదుటనే నిన్ను వరిస్తాను. అప్పుడు నీకు దోషం ఉండదు.

నలుడు తిరిగి వెళ్ళి దిక్పాలకులకు జరిగినదంతా చెప్పాడు. స్వయంవరసభలో ఇంద్రాదులు నలుగురూ నలరూపధారులై ఉన్నారు. దమయంతికి నిజ నలు డెవరో తెలియటం కష్టమైపోయింది. అప్పు డామె దేవతలను ప్రార్థించింది. వారు ఆమెప్రార్థనకు కరుణించి కనురెప్పపాటు లేని, చెమటపట్టని, అడుగులు నేల కానని తమ దేవతా రూపాలను తెలిసేటట్లు చేశారు. దమయంతి కల్యాణకుసుమమాలను నలుడి మెడలో వేసింది. దేవతలు మెచ్చారు. విప్రులు ఆశీర్వదించారు. నలదమయంతుల వివాహం వైభవంగా జరిగింది. ఇంద్రాది దిక్పాలకులు నలుడికి వరాలనిచ్చి నిజలోకానికి బయలుదేరి వెళ్ళసాగారు.

దారిలో వారికి కలి ఎదురుపడ్డాడు. అతడు కూడా దమయంతీ స్వయంవరానికే వస్తున్నాడు. కాని, ఆమె నలుడిని వరించిందనిన వర్తమానాన్ని ఇంద్రాదులవలన విని కోపించాడు. 'ఆ నలదమయంతులకు రాజ్యవైభవం దూరం చేస్తాను. వారిద్దరికీ వియోగం కలిగిస్తాను'- అని నిశ్చయించుకొని, నలుడు ద్యూతప్రియుడని తెలిసి పాచికలలో ప్రవేశించి నిలిచాడు.

నలుడు నిష్ఠాగరిష్ఠుడు. ఏసందర్భంలోనైనా అశౌచం కలిగితే అందులో ప్రవేశించడానికి కలి ప్రయత్నించాడు. ఒకనాడు నలుడు మూత్రవిసర్జనం తరువాత ఆచమించి కాళ్ళుకడుక్కోలేదు. ఆ అశౌచాన్ని ఆలంబనంగా చేసికొని నలుడి శరీరంలో కలి ప్రవేశించాడు.

కలి పుష్కరుడిని ప్రేరేపించాడు. నలుడితో జూద మాడించాడు. ఆ జూదంలో మైమరచి నలుడు సర్వస్వాన్నీ క్రమక్రమంగా ఓడిపోయాడు. అంతకుముందే దమయంతి తన కుమారుడైన ఇంద్రసేనుడిని, ఇంద్రసేన అనే కూతురిని వార్ష్ణేయుడనే సారథితో రథంమీద విదర్భలోని తన తండ్రివద్దకు పంపింది. నలుడు సర్వస్వం కోల్పోయి భార్యాసహితుడై నగరం వెడలి బయట నివసించాడు. పుష్కరుడి శాసనం వలన ప్రజలెవ్వరూ నలదమయంతుల కెటువంటి సహాయం చేయలేదు. నలదమయంతులు మూడునాళ్ళునీళ్ళు త్రాగి గడిపారు. మరునాడు ఆకలిబాధకు ఓర్వలేక నలుడు తమ ప్రక్కన తిరుగుతున్న బంగారు రెక్కల పక్షులను పట్టుకొని తినాలనే కోరికతో తన కట్టుపుట్టాన్ని వాటిపై విసిరాడు. ఆ పక్షులు ఆ గుడ్డతో సహా గగనానికి ఎగిరిపోయాయి. పోతూ, తాము పాచికలమనీ, రాజ్యాన్నే కాక, వస్త్రాన్ని కూడా అపహరించటానికి పక్షుల రూపంలో వచ్చామనీ చెప్పి ఎగిరిపోయాయి. నలుడు ఆశ్చర్యపడ్డాడు; దమయంతి చీరచెరగును చుట్టుకొన్నాడు. ఆ విధంగా దంపతులిద్దరూ ఒకే చీరతో సాగిపోవలసి వచ్చింది.

నలదమయంతులు నాలుగు బాటల కూడలికి చేరారు. ఒకబాట దక్షిణాపథం పోతుంది. మరొకటి విదర్భకు చేరుతుంది. ఇంకొకటి కోసలకు వెళ్ళుతుంది. చివరిది ఉజ్జయినికి తీసికొనిపోతుంది. ఏ బాటలో పోవాలి? అన్నప్రశ్న వచ్చింది. దమయంతి తన పుట్టినిల్లు విదర్భకు పోదామన్నది. నలుడు అడవులకు పోదామన్నాడు. ఎందుకంటే అత్తవారింట - పూలమ్మిన చోట కట్టెలమ్మినట్లుంటుందని నలుడు విదర్భకు చేరటం అవమానంగా భావించాడు. భార్యను విదర్భకు పొమ్మన్నాడు. కాని, దమయంతి నలుడివెంట నడవటానికే కోరుకొన్నది. 'అధికరోగదుఃఖార్తుడికి ఔషధం ఎటువంటిదో ఆపదలలో ఉన్న భర్తకు భార్య అటువంటిది. పురుషుడికి అన్ని దుఃఖాలను పోగొట్టేది భార్య' - అని చెప్పి నలుడిని అనుసరించటానికి అనుమతి కోరింది. ఆమె నెట్టి పరిస్థితులలోనూ వదలిపెట్టనని నలుడు మాటిచ్చాడు.

దంపతు లిద్దలూ ఏకవస్త్రంతో బయలు దేరారు. అడవిమార్గంలో వనమధ్యంలో ఒక వసతిని చూచారు. ధూళితో నిండి ఉన్న ఆ సభలో అలసిసొలసి విశ్రమించారు. మార్గాయాసంవలన దమయంతి ఒడలు మరచి నిదురపోయింది. ఆ మహారాణి పొందిన ఆ దీనావస్థను చూచి నలుడు దుఃఖించాడు. ఆమె నా దీనస్థితిలో చూడలేక ఆమె చీరలో సగం చించుకొని ఆమెనుండి విడివడి, వీడలేక వీడలేక, కలిప్రభావంతో దయారహితుడై, దూరంగా వెళ్ళిపోయాడు.

దమయంతి నిద్ర మేల్కొన్నది. చినిగిన చీరను, భర్త తనప్రక్కనే లేకపోవటాన్నీ గమనించి, నాలుగు దిక్కులా భర్తకొరకు వెదకి పలురకాలుగా ఆక్రందించి, నలుడిని వెదకుతూ ఒంటిగా బయలుదేరింది. తనను ఎట్టి పరిస్థితులలో విడువనని మాట ఇచ్చిన నలుడు తనమాట నిలబెట్టుకొనాలని ఎలుగెత్తి భర్తకొరకు పిలిచింది. గహనమైన వనమార్గంలో భయంతో నడిచింది. ఒకచోట ఒకకొండచిలువ దమయంతిని పట్టి మ్రింగబోయింది. ఆమె తనను రక్షించుమని నలుడిని పెద్దగా పిలిచింది. ఆ సమీపంలో తిరుగుతున్న ఒక ఎరుకులరేడు ఆమె ఆర్తనాదం విని కొండచిలువనోరు చీల్చి దాని మేనును ముక్కలు చేసి రాహువు నుండి చంద్రుడిని విముక్తుడిని చేసినట్లు దమయంతిని ఆ పాము నుండి రక్షించాడు. ఆమె వృత్తాంతాన్నంతా అడిగి తెలిసికొన్నాడు. ఆమెను సమీప సరోవరంలో స్నానం చేయుమన్నాడు. తడిసిన మేనితో ఉన్న దమయంతి సౌందర్యాన్ని చూచి కామించి తనకోర్కెను బైట పెట్టాడు. పతివ్రత అయిన దమయంతి కోపంతో చూచింది. ఆమె వేడిచూపుకు- అగ్నిజ్వాలకు గురి అయిన చెట్టువలె- ఆ బోయవాడు నిలువున కాలిపోయాడు. ఆమె పాతివ్రత్య మహత్త్వ మటువంటిది.

దమయంతి భయంకరారణ్యంలో కొంతదూరం పోయి మహాత్ములైన మునులు నివసించే ఒక ఆశ్రమాన్ని చూచింది. తనను గురించి చెప్పుకొని నలుడిని గురించి వారి నడిగింది. నలుడు కనిపించకపోతే కొద్ది దినాలలో చనిపోతానని వాపోయింది. అప్పుడు మునులు దివ్యదృష్టితో గమనించి కొద్దిరోజులలో నలుడిని పూర్వ వైభవంతో చూడగలవని ఓదార్చి వారందరూ ఆశ్రమంతో సహా అదృశ్యమైపోయారు. దమయంతి ఆశ్చర్యపడింది.

అప్పు డడవిలో దమయంతికి ఒక వర్తకుల బిడారు కనపడింది. ఆమె ఆ సార్థవాహుడైన శుచి అనే వాడిని కలిసి నలుడి గురించి ప్రశ్నించింది. అతడు నలుడిని చూడలేదన్నాడు. ఆమెను సుబాహుడి పురానికి తమతోపాటు తీసికొని పోవటానికి అంగీకరించాడు. దారి మధ్యలో సార్థవాహం ఒకరాత్రి ఒక పెద్ద చెరువువద్ద విశ్రాంతి తీసికొన్నది. నడిరేయి ఆ అడవిలోనుండి ఏనుగులు నీటికొరకు చెరువు వద్దకు వచ్చి శయనించి ఉన్న జనాన్ని త్రొక్కాయి. చాలమంది చనిపోయారు. ఆ ఆపదను చూచి దమయంతి తనకు చావు రాలేదని వాపోయింది. అలనాడు దేవతలను కాదని నలుడిని స్వయంవరంలో గ్రహించినందుకు వారే కోపించి అటువంటి ఇక్కట్టులను కలిగిస్తున్నారని భావించింది. చావగా మిగిలినవారితో కలసి దమయంతి సుబాహునగరం చేరింది. రాజమార్గంలో నడుస్తున్న దమయంతిని రాజమాత చూచింది. ఆమెరూపవైభవాన్ని గమనించి మెచ్చి ఆమెను పిలిపించుకొని తనవద్ద సైరంధ్రిగా ఉంచుకొన్నది. దమయంతి సైరంధ్రిగా ఉన్నప్పటికీ దాసివలె ఉచ్ఛిష్టం తినలేదు. రాణిపాదాలను పిసుకలేదు. పరపురుషులతో మాట్లాడలేదు. నలుడిని అన్వేషించబోయే బ్రాహ్మణులతో మాత్రం పలికేది. ఆ నియమాలకు రాజమాత అంగీకరించింది. రాణి తన కూతురైన సునందను దమయంతి రక్షలో ఉంచింది. సైరంధ్రిగా ఉన్నా, దమయంతి భర్తృవియోగ దుఃఖం అనుభవిస్తూ కూడా పుణ్యవ్రతాలు చేస్తూ ఉండేది.

ఇక నలుడి సంగతి తెలిసి కొందాం. అలనాడు దమయంతిని ఏకాంతంగా అడవిలో వదలి బయలుదేరిన నలుడు కొంతదూరం పోయేసరికి తీవ్ర దావానలాన్ని ఎదుర్కొన్నాడు. ఆ మంటల మధ్యలో కర్కోటకుడనే నాగకుమారుడు చిక్కుకొని నలుడిని రక్షించుమని ఎలుగెత్తి పిలిచాడు. తనను రక్షిస్తే అతడికి ఒక హితం చేస్తానని పేర్కొన్నాడు. ఎత్తుకొని పోవటానికి వీలుగా బొటనవ్రేలంత పొట్టివాడై నిలిచాడు. నలుడు సాహసంతో ఆ మంటల మధ్య నున్న కర్కోటకుడిని తప్పించి భుజంమీద పెట్టుకొని మోసికొనిపోయి సమీప సరోవరం వద్దకు చేరి దింపబోయాడు. ఆ పాము మరొక పదిఅడుగులు వేసి దింపుమని కోరాడు. అట్లాగే వెళ్ళుతూ ఉండగా పదవ అడుగు వేస్తుండగా కర్కోటకుడు నలుడిని కాటు వేశాడు. నలుడు వికృతరూపాన్ని పొందాడు. అప్పుడు కర్కోటకుడు ఇట్లా అన్నాడు:

'అయ్యా! నీవు నాచేత విషపీడితుడవైనావని విచారించకుము. ఈ వికార రూపంలో ఉన్న నిన్ను ఎవ్వరూ తెలిసికొనలేరు. అందువలన నీకు శత్రుభయం ఉండదు. విషోరగ రాక్షసపిశాచాదుల భయంకూడా ఉండదు. నీకు సర్వరాజ్యం తిరిగి లభిస్తుంది. మరల భార్యతో కలిసి సుఖంగా ఉంటావు. నీ కెప్పుడు నీ నిజరూపం కావాలని ఇష్టం కలిగితే అప్పుడు నన్ను స్మరించుము. నే నొక వస్త్రాన్ని నీవద్దకు పంపుతాను. దానిని ధరించుము. నీరూపం నీకు వస్తుంది. ఇది నా వరం. నీవు ఇక్ష్వాకువంశజుడు, అయోధ్యాధిపతి అయిన ఋతుపర్ణ మహారాజును సేవించుము. అతడికి నీవు నీవద్దనున్న 'అశ్వహృదయ', విద్యను ఇమ్ము. అతడివలన 'అక్షహృదయ' మనే విద్యను స్వీకరించుము. ఆ రాజువద్ద నీవు బాహుకుడనే పేరుతో రథాన్ని నడిపే సూతుడిగా, వంటలవాడిగా కొలువుండుము' అని హితోపదేశం చేసి అదృశ్యుడయ్యాడు.

కర్కోటకుడి హితవు ప్రకారం నలుడు బాహుకుడనే పేరుతో ఋతుపర్ణుడిని సేవిస్తూ అయోధ్యలో అశ్వాధ్యక్షుడుగా ఉంటున్నాడు. అతడికి సహాయకులుగా వార్ష్ణేయుడు, జీవలుడు నియోగించబడ్డారు. ఒకనాడు బాహుకుడు తన భార్యను స్మరిస్తూ విరహవేదనతో నిట్టూర్పులు నిగుడిస్తూ ఉండటం జీవలుడు గమనించాడు. అంతటి వికారశరీరుడిని కూడా ప్రేమించే ప్రియురాలు ఉంటుందా? ఉంటే ఆమెంత కురూపియో? అంటూ అనుమానిస్తూనే బాహుకుడిని అతడి భార్యనుగురించి, వారి వియోగ కారణాన్ని గురించి అడిగాడు. బాహుకుడు 'నా వంటివాడికి ఇల్లా లేమిటి? నన్ను చూచి అందరూ నవ్వుతారు. మందప్రజ్ఞుడనే భటుడొకడు తన ప్రియురాలికి దూరమై విరహాన్ని అనుభవించేవాడు. అతడిమాటలు జ్ఞాపకం వచ్చి నేను అనుకరిస్తున్నా; నంతే' అని అసలు సంగతి బైట పెట్టకుండా దాటవేశాడు.

ఇక, విదర్భలో భీమమహారాజు నలుడు రాజ్యభ్రష్టుడైనాడనీ, భార్యతో కలిసి ఎక్కడికో వెళ్ళాడనీ తెలిసి, నలదమయంతులను వెదకి తీసికొని రావటానికై నిపుణులైన బ్రాహ్మణులను నియోగించాడు. వారు భూవలయంలో ఉన్న రాజ్యాలన్నీ దర్శించి అన్వేషిస్తున్నారు. వారిలో సుదేవుడనే విప్రుడు సుబాహునగరానికి వెళ్ళాడు. పురోహిత బ్రాహ్మణులతో కలసి అంతఃపురంలో ప్రవేశించి, పుణ్యాహవాచన పుణ్య సమయంలో సునందతో కూడి ఉన్న దమయంతిని చూచాడు. ఆమె పొగబారిన అగ్నిజ్వాలవలె, నల్లమబ్బులు క్రమ్ముకొన్న చంద్రరేఖవలె ఉండటం గమనించాడు. ఆమె నుదుట సూక్ష్మమైన లక్షణాన్ని గుర్తించాడు. దమయంతిగా నిశ్చయించుకొని ఆమెతో ఇట్లా అన్నాడు: 'అమ్మా! నీ తల్లిదండ్రులు, కొడుకు, కూతురు, బంధువులు, అందరూ క్షేమంగా ఉన్నారు. వారందరు నీ క్షేమం తెలియనందుకు దిగులుపడుతున్నారు. ఇకమీద వారి చింత తొలగిపోతుంది. నేను నీ అన్నగారి స్నేహితుడిని. సుదేవుడిని. మీతండ్రిగారు మీదంపతుల ఉనికి తెలిసికొనటానికి ఎందరో విప్రులను నలుదిక్కులకు పంపారు. నా అదృష్టంవలన నిన్ను నేను చూడగలిగాను'. సుదేవుడి మాటలు విని తనవారినందరిని పేరుపేరున కుశలమడిగి దుఃఖం ఆపుకొన లేక, కన్నీరు ధారలు కట్టేటట్లుగా ఏడ్చింది. ఆ సంగతి గమనించి సునంద రాజమాతకు చెప్పింది. ఆమె దమయంతి వద్దకు వచ్చి జరిగింది తెలిసికొని దమయంతిని ఎట్లా గుర్తించగలిగావో చెప్పుమని సుదేవుడిని అడిగింది. అతడు తనరాకకు కారణం చెప్పి, దమయంతి కనుబొమల నడుమ పద్మకాంతితో మహిమాన్వితమైన ఒక పుణ్యసంకేతం (పద్మప్రభమైన పుట్టుమచ్చ) దుమ్ముచేత కప్పబడి ఉన్నా నేను దానిని గుర్తించి ఈమెను దమయంతిగా తెలిసికొన్నానని పేర్కొన్నాడు. రాజమాత మంచినీరు తెప్పించి దమయంతి ముఖాన్ని కడిగించి ఆ గుర్తును చూచి ఆశ్చర్యానందాలతో ఇట్లా అన్నది:

'తల్లీ! నీవూ నా కూతురివేనే. నీ తల్లీ, నేనూ దశార్ణరాజపుత్రికలం. మీ అమ్మ విదర్భరాజుకు రాణి అయింది. నేను ఈ చేదిపురాధిపతి పత్ని నయ్యాను' అనగానే దమయంతి రాజమాతకు వినయంతో నమస్కరించింది. రాజమాత దమయంతిని కౌగిలించుకొని గౌరవించింది. కొన్నాళ్ళ తరువాత దమయంతి విదర్భకు వెళ్ళి తల్లిదండ్రులతో, బంధువులతో కలిసి ఉన్నది. అయినా ఆమె ఆనాడు నలుడు తనను వీడినప్పుడు కట్టిన మాసిన చీరనే కట్టింది. దేహసౌఖ్యాలను కోరకుండా నేలపై శయనిస్తూ, ధూళిధూసరితగానే నియమనిష్ఠలతో జీవితం సాగిస్తున్నది. ఈ విధంగా భర్తృవియోగదుఃఖాన్ని అనుభవిస్తూ, ఒకనాడు తల్లితో నలుడిని అన్వేషించటానికై బ్రాహ్మణులను పంపుమని కోరింది. ఆమె భీమానుమతితో బ్రాహ్మణులను నియోగించింది. నలాన్వేషకులైన విప్రులతో దమయంతి ఇట్లా పలికింది.

'నిషధాధిపతి అయిన నలుడు ప్రస్తుతం అసమర్థుడు కావటంచేత తాను ఇతరులచేత గుర్తించబడకుండా గూఢంగా ఉంటుంటాడు. కాబట్టి మీరు పెద్ద పెద్ద రాజసభలకు వెళ్ళి, అందరూ వినేటట్లు ఈ విధంగా ఎలుగెత్తి చెప్పండి. 'నీవు నిత్యం నిజం మాట్లాడేవాడివి. నీ భార్యను వంచించి ఆమె సగంచీరె చించి నీవు కట్టుకొని, ఆమెను ఒంటిగా వదలి వెళ్ళటం న్యాయమేనా? భార్య భర్తచేత భరించతగింది అనే మాట అబద్ధమైపోయింది. నీవంటివాడు ఈ విధంగా నిర్దయుడు కావటం సమంజసమా? కాబట్టి, ఆ సతికి నీవు ప్రసన్నుడవు కమ్ము' అని అన్నిచోట్ల ప్రకటించండి. అప్పుడు ఎవడైనా ఆ మాటలు సహించలేక మారుమాట మాట్లాడితే, అతడిని నలుడిగా గుర్తించండి. ప్రీతితో అతడికి నన్ను గురించి చెప్పి, వెంట పెట్టుకొని తీసికొనిరండి. రాకపోతే అతడున్నచోటు తెలిసికొని మీరు రండి' అని తెలిపింది.

విప్రులందరూ వివిధ దేశాలకు వెళ్ళి తిరిగి వచ్చారు. వారిలో పర్ణాదుడు అనే బ్రాహ్మణు డిట్లా అన్నాడు: 'నేను అయోధ్యకు వెళ్ళాను. ఋతుపర్ణుడి సభలో నీవు చెప్పినట్లే ప్రకటించాను. అప్పుడు ఒక కురుచచేతులవాడు బాహుకుడనేవాడు నన్ను ఏకాంతంలో చూచి వెలవెలపోతూ నిట్టూర్పులు నిగుడిస్తూ నాతో ఇట్లా అన్నాడు. అతడు నూరుగద్యాణాల ఉద్యోగి, వేగంగా రథం నడిపే నేర్పుకలవాడు. వంటలలో నిపుణుడు. కాని, అతడు కురూపి. 'భర్తలో లోపాలున్నాయని తెలిసికూడా మనసులో ఓర్చుకొని ఉంటే ఆ భార్య మరోజన్మలో ఆ భర్తతో ధర్మభోగాలను పొందుతుంది.' అని మరేమీ మాట్లాడక తనఇంటికి వెళ్ళిపోయాడు.

పర్ణాదుడి మాటలు విని దమయంతి చాలాసేపు ఆలోచించింది. నలుడు కానివాడు మారుమాటలు ఎందుకు మాట్లాడతాడు? అతడి వద్దకు మరికొంతమంది నిపుణులను పంపి ఆతడి వివరాలను మరిన్ని సేకరించాలని భావించి తల్లి అనుమతితో సుదేవుడిని పిలిపించి బాహుకుడి వద్దకు పంపుతూ ఇట్లా చెప్పింది:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'ఓ విద్వన్నుతా! నీవు నన్ను గుర్తించి ఎట్లా తెచ్చావో, అట్లాగే నలుడిని కూడా నిపుణంగా గుర్తించి తీసికొని రావాలి. అటువంటి బుద్ధిబలం నీకే ఉన్నది. విదేశవిప్రుడివలె అయోధ్యకు శీఘ్రంగా వెళ్ళుము. ఋతుపర్ణుడిని దర్శించి 'రాజా! భీమమహారాజు నలుడిని గురించి వెదకి వెదకి వేసారి ఎక్కడా చూడలేక దమయంతికి పునస్స్వయంవరం చాటించాడు. దానికి భూవలయంలో ఉన్న రాజు లందరూ పోతున్నారు'- అని చెప్పు మని పంపింది. సుదేవుడు ఋతుపర్ణుడిని దర్శించి రేపే దమయంతి పునస్స్వయంవరమని చెప్పాడు. ఆ మాటలు విని ఆ రాజు బాహుకుడిని పిలిచి 'నేను దమయంతి స్వయంవరం చూడటానికి ఒకరోజులో విదర్భకు పోవాలి. నీ అశ్వశిక్షానైపుణ్యం చూపించాలి' అని అతడితో అన్నాడు.

నలుడు తన మనస్సులో దుఃఖించాడు. 'అడవిలో తనను ఒంటరిగా వదలి వెళ్ళానని అలిగి ఇట్లా దమయంతి చేయటానికి పూనుకొన్నది. మగవారు తమ భార్యలు తమ నెప్పుడూ అంటిపెట్టుకొని ఉంటారని నమ్మి వెర్రివారైపోతుంటారు కదా! నాపని అంతే అయింది. అయినా, దమయంతి పతివ్రత, సంతానవతి. ఆమె ఇట్లా ఎందుకు చేస్తుంది? అని మనసులో అనిపిస్తుంది. ఏమైనా అసలు సంగతి తెలిసికొనాలి. కాబట్టి ఋతుపర్ణుడితో నేనుకూడా పోతాను' అని మనసులో నిశ్చయించుకొన్నాడు. పూర్వం వార్ష్ణేయుడు తెచ్చిన తనరథాన్ని మనోవాయువేగంతో పోగలిగిన తన గుర్రాలతో సిద్ధంచేసి రాజువద్దకు తెచ్చాడు. ఋతుపర్ణుడు రథమెక్కేటప్పుడు గుర్రాలు మొగ్గాయి. అవి బలహీనమైనవని రాజు నవ్వి వాటిని మార్చుమని బాహుకుడిని అడిగాడు. అప్పుడు- 'రాజా! ఇవి వాయువేగంతో పరుగెత్త గలవు. నేడే ప్రొద్దుక్రుంకకుండానే ఇవి రథాన్ని విదర్భకు చేరుస్తా' యన్నాడు. రాజు మెచ్చి రథమెక్కి కూర్చున్నాడు. వార్ష్ణేయుడు కూడా వెంటవచ్చాడు.

రథం మహావేగంతో సాగిపోతున్నది. నలుడొక్కడే రథాన్ని అట్లా నడపగలడని వార్ష్ణేయుడు భావించాడు. కాని, ఆ వికృతాకారుడిని నలుడిగా గుర్తించలేక పోయాడు. ఋతుపర్ణుడి ఉత్తరీయం గాలికి ఎగిరి నేలపై పడింది. దాన్ని గమనించే సరికే రథం కొన్ని ఆమడలు దాటి పోయింది. ఒకచోట లెక్కించలేనన్ని ఆకులు పండ్లు కల ఒక పెద్ద తాండ్రచెట్టును చూచారు. ఋతుపర్ణుడు ఆ చెట్టుకున్న ఆకులను, పండ్లను లెక్కించకుండానే చూచి చెప్పాడు. బాహుకుడు ఆశ్చర్యపడి రథ మాపి ఆ చెట్టుకున్న ఆకులను, పండ్లను లెక్కించాడు. ఋతుపర్ణుడి లెక్క సరిపోయింది. బాహుకుడు ఆశ్చర్యపడి తనకా విద్యను ఉపదేశించుమని కోరాడు. ఋతుపర్ణ డిట్లా అన్నాడు: 'ఇది అక్షహృదయం అనే విద్య. దీనిని దీక్షతో పొందినవాడు సంఖ్యావిదు డౌతాడు. పాపాలనుండి, అపవాదులనుండి, విషం నుండి విముక్తుడౌతాడు. సమస్తసుగుణాలను పొందుతాడు. అందరికీ మిత్రుడౌతాడు' అని చెప్పి విధియుక్తంగా బాహుకుడికి ఋతుపర్ణుడు 'అక్షవిద్యను' ఉపదేశించాడు. నలుడు సంతోషించి ఋతుపర్ణుడికి 'అశ్వ హృదయం' అనే విద్యను ఇస్తానని చెప్పాడు. కాని, ఆ రాజు దానిని తరువాత స్వీకరిస్తానని ఉపదేశాన్ని వాయిదా వేశాడు.

అక్షహృదయ విద్యా ప్రభావం వలన నలుడి శరీరంలో దాగి ఉన్న కలి కర్కోటక విషాన్ని క్రక్కుతూ బైటకు వచ్చి భయంతో వణకుతూ నలుడికి నమస్కారం చేశాడు. అతడిని చూచి నలుడు కోపించి శపించబోయాడు. తా నన్నాళ్ళూ కర్కోటక విషబాధవలన పొందిన దుఃఖాన్ని చెప్పికొని కలి క్షమించుమని వేడాడు. నలదమయంతులను కీర్తించిన జనులకు కలివలన భయం ఉండదని వరమిచ్చాడు. నలు డతడిని దయతో వదిలాడు. కలి ఆ తాండ్రచెట్టును ఆశ్రయించాడు. అది మొదలు తాండ్రచెట్టు పూజార్హతను కోల్పోయింది.

ఆ విధంగా నలుడు వికారరూపం మాత్రంతప్ప మిగిలిన దోషాలనన్నింటినుండి విముక్తుడయ్యాడు. ఆ పై రథమెక్కి ముగ్గురూ వేగంగా సాయంకాలానికి విదర్భకు చేరారు. దమయంతి మేఘనాదం వంటి ఆ రథధ్వని విని అది నలుడి రథఘోషగా గుర్తించింది. నలుడిని చూడగలననే ఆశతో చూచింది. కాని, రథంలో ఋతుపర్ణుడిని చూచి నిరాశ చెంది దుఃఖించింది.

భీమరాజు ఋతుపర్ణుడిని ఒక అందమైన భవనంలో విడిది చేయించాడు. ఆ రాజుకు ఆ నగరంలో స్వయంవర సంరంభ మేమీ కనపడలేదు. ద్వితీయ స్వయంవరానికి ఎవ్వరూ రావటానికి ఇష్టపడలేదేమో అని లోలోన అనుకొన్నాడు. బాహుకుడు రథశాలలో రథాశ్వాలను కట్టివేసి రథం దగ్గర విశ్రాంతి తీసికొంటున్నాడు. దమయంతి కేశిని అనే దాసిని పిలిచి బాహుకుడి వృత్తాంతం తెలిసికొని రమ్మని పంపింది. కేశిని బాహుకుడి వద్దకు పోయింది.

కేశిని : దమయంతి నీ క్షేమం తెలిసికొని రమ్మన్నది. నీ విక్కడికి ఎందుకు వచ్చావు?

బాహు : దమయంతి పునస్స్వయంవర మని తెలిసి ప్రీతితో అనేకమంది రాజులు ఇక్కడికి వస్తూంటే ఋతుపర్ణుడు కూడా రావటానికి ముచ్చటపడ్డాడు. అయోధ్యనుండి ఇక్కడికి నూరామడల దూరం. ఒక్కరోజులో ఆతడు ఇక్కడికి వచ్చాడు. ఆతడి రథసారథిగా నేనూ వచ్చాను.

కేశి : ఆ మూడవ వా డెవడు?

బాహు : అతడా? నలరథసారిథి అయిన వార్ష్ణేయుడు.

కేశి : అతడికి నలభూపాలుడు పోయిన తెరగు తెలియదా?

బాహు : అతడు నలుడి కొడుకును, కూతురిని విదర్భదేశప్రభువు వద్ద ఉంచి తిరిగిపోతూ ఉండగా నలుడు రాజ్యాన్ని కోల్పోయాడని త్రోవలోనే విని ఋతుపర్ణుడి సేవలో చేరాడు. అతడికి నలుడినిగురించి తెలియదు. నలుడితో ఒంటరిగా వెళ్ళిన దమయంతికి తెలియాలి కాని, మరెవ్వరికీ తెలిసే అవకాశమే లేదు.

కేశి : అడవిలో తన సగం చీరను చింపుకొని తన పతి దయారహితుడై తనను ఒంటరిగా వదలి వెళ్ళగా నాటినుండి ఆ సగం చీరనే దమయంతి కట్టుకొని ఉన్నది. దుమ్ముతో మేను క్రమ్ముకొని పోయినా, తలవెంట్రుకలు జడలు కట్టినా నేలమీదనే పడుకొంటూ ఆమె పవిత్ర పాతివ్రత్య వ్రతాన్ని పాటిస్తున్నది.

ఆ మాటలు వింటున్న నలుడి కన్నులు కన్నీరుతో నిండిపోయాయి. అవి కనపడకుండా అతడు మొగం త్రిప్పుకొని మరొకవైపు చూస్తూ ఊరుకొన్నాడు. ఆ సంగతి కేశిని దమయంతికి చెప్పింది. ఆతడే నలుడై ఉండవచ్చునని దమయంతి శంకించింది. బాహుకుడు ఋతుపర్ణుడి వంటలవాడుకూడా. అతడు వంటచేసే పద్ధతిని కూడా గమనించుమని కేశినిని మరల పంపింది.

నలుడు వంటలు వండే వేళలో ప్రదర్శించిన మహిమలు అపూర్వాలు. గుప్పెడు గడ్డి చేతిలో పట్టి అటూ ఇటూ ఊపితే అగ్గి అంటుకొంటుంది. ఆ గడ్డిమంటతో ఎంతవంటైనా ఉడుకుతుంది. నంజుళ్ళు కడగటానికి సంకల్పించినంత మాత్రంలోనే దివ్యగంగాధార పుట్టుకొస్తుంది. కుండలు నిండుతాయి, అక్షయంగా జలధార పారుతుంది. అతడి రెండుచేతులతో మర్దితాలయికూడా సుగంధసుమాలు వాడకుండా ఉంటాయి. (ఇవన్నీ అగ్ని వరుణాది దిక్పాలకులు నలుడికిచ్చిన వరాల ప్రభావాలు). ఈ వివరాలన్నీ చూచి కేశిని దమయంతికి చెప్పింది. ఆమె బాహుకుడి నంజుళ్ళు తెప్పించుకొని రుచిచూచింది. అది నలపాకమని నిశ్చయించుకొన్నది.

అంతటితో ఆగక దమయంతి తనకొడుకునూ, కూతురినీ బాహుకుడి వద్దకు కేశినితో పంపింది. వారిని బాహుకుడు ప్రేమతో దగ్గరికి తీసికొని తొడలపై కూర్చుండబెట్టుకొని పులకిస్తూ ఆర్ద్రుడైనాడు. కేశినికి అనుమానం కలుగకుండా తనకొడుకు, కూతురు ఆ యీడువారే కావటం చేత, వారివలె వీళ్ళూ ఉండటం చేత దుఃఖించానని దాచి చెప్పాడు. తాను విదేశీయుడు కావటం చేత పెక్కుసార్లు కేశిని తనను కలిసి మాట్లాడటం ఉచితం కాదనీ, ఎవరైనా అనుమాన పడవచ్చుననీ చెప్పి ఆమెరాకను వారించాడు. జరిగినదంతా కేశిని దమయంతికి నివేదించింది. ఆమె తన తల్లిదండ్రుల అనుమతితో బాహుకుడిని తన వద్దకు వచ్చేటట్లు ఏర్పాటు చేసింది.

బాహుకుడు వచ్చి తపస్వినిగా కృశించి, మలిన గాత్రంతో, బాష్పనేత్రాలతో మూర్తీభవించిన శోకం వలె ఉన్న దమయంతిని చూచాడు. దమయంతి వికృతాకారుడైన బాహుకుడిని చూచినా నలుడిని చూచినట్లుగానే భావించి వినయంతో తన్మయత్వంతో ఇట్లా అన్నది :

దమ : జనంలేని అడవిలో అలసి నిద్రపోయిన అబలను, సాధ్విని, అనువ్రతను, అగ్నిసాక్షిగా పెండ్లాడిన వనితను వదలి నలుడివలె నిర్దయులై వెళ్ళినవారు లోకంలో మరింకెవ్వరూ లేరు. దేవతలను కాదని అతడిని వరించాను. అతడివలన సంతానాన్ని కన్నాను. అటువంటి నన్ను దయలేకుండా నిష్కారణంగా ఉన్నట్లుండి వదలి వెళ్ళాడు. నే నేమి కీడు చేశాను? 'నిన్ను నే నెప్పుడూ విడువను, భయపడకుము' అని మాట ఇచ్చి కూడా ఎందుకు మరచాడో తెలియదు. (అని అంటూ కన్నీరు మున్నీరుగా దుఃఖించింది.)

నలుడు : (శోకంతో కలవరపాటు చెందుతూ) కలి ఆవేశించిన బుద్ధితో అటువంటి కఠిన పద్ధతిని అనుసరించి పడరాని పాట్లు పడ్డాను. అవన్నీ నా తపస్సువలన నీ వియోగదుఃఖతాపంవలన, నశించిపోయాయి. కలి ఇప్పుడు నన్ను వదలి వెళ్ళిపోయాడు. నే నిక్కడికి నీకొరకే వచ్చాను. అది అట్లా ఉండనిమ్ము. నేను నీకు అనురక్తుడను, అనువ్రతుడను. అయినా, నీవు అన్యాపేక్షతో పునస్స్వయంవరం చాటించావు. ఇది పతివ్రతకు ధర్మం కాదు. నీ స్వయంవరానికి రాజుల నందరిని పిలవటం కారణంగా ఋతుపర్ణుడు వచ్చాడు కదా!

దమ : (దోసిలిపట్టి వినయంతో ఇట్లా అన్నది) నిన్ను అన్వేషించటానికై నేను అనేకమంది విప్రులను పంపాను. వారిలో పర్ణాదుడితో అయోధ్యలో నీవు పలికిన మారుపలుకులను తెలిసికొని, వాటి వలన నిన్ను గుర్తించాను. ని న్నిక్కడికి రప్పించటానికి ఒక ఉపాయం పన్నాను. రేపే స్వయంవరమని సుదేవుడిచేత ఋతుపర్ణుడికి చెప్పించాను. నూరామడల దూరాన్ని ఒక్కరోజులో రథం మీద రాగలిగిన నేర్పు నీ కొక్కడికే ఉన్నది. కాబట్టి నిన్ను ఆ నెపంతో విదర్భకు రప్పించుకొనవలెనని భావించాను. ఇంతకంటె నేను మరే కీడును మనసులో తలంచ లేదు. నీ పాదాల సాక్షి. నా మనస్సులో మరొక భావముంటే దేవతలు, బ్రాహ్మణులు నన్ను చంపి ఉండేవారు.

దమయంతి అట్లా అంటూఉండగానే ఆకాశంనుండి వాయుదేవుడు ఇట్లా ప్రకటించాడు :-

'దమయంతి పరమపవిత్రచరిత్ర, పతివ్రత. సూర్యచంద్రులూ నేనూ కలిసి ఆమె శీలాన్ని ఈ మూడేళ్ళు రక్షించాం. ఈమె నీయందే అనురాగం కలది. కాబట్టి ఈమెను స్వీకరించుము'. ఆ మాట లంటున్నప్పుడు దేవతలు దుందుభులు మ్రోగించారు, పూలవాన కురిపించారు. వాయుదేవుడి ప్రకటన విని నలుడు ఆశ్చర్యపోయాడు. ఆనందించాడు. వెంటనే కర్కోటకుడిని స్మరించాడు. అత డిచ్చిన వస్త్రాన్ని తనపై పెట్టుకొన్నాడు. వెంటనే నలుడు నిజరూపంతో నిలిచాడు.

నలదమయంతులు పరమానందంతో పునస్సమాగమాన్ని పొందారు. బంధుమిత్ర ప్రజలందరూ సంతసించారు. భీముడు నలుడిని సత్కరించాడు. ఋతుపర్ణుడు నలుడిని అభినందించాడు. బాహుకుడిగా ఉన్నప్పుడు చేసిన అవజ్ఞలను మన్నించుమని వేడుకొన్నాడు. నలుడు ఋతుపర్ణుడికి అశ్వహృదయ విద్యను బోధించి పంపాడు. ఆ తరువాత నలుడు ఒక నెల రోజులు విదర్భలో సుఖంగా ఉన్నాడు.

ఆ తరువాత చతురంగ బలంతో నిషధపురానికిపోయి పుష్కరుడిని పిలిచి 'యుద్ధంగానీ, జూదంగానీ పందెంగా వేస్తున్నాను. దేనిలోనైనా నిన్ను ఓడించి నా రాజ్యాన్ని నేను గ్రహిస్తాను. సిద్ధం క' మ్మని పిలిచాడు. పుష్కరుడు యుద్ధం చేయలేక, జూదంలో నలుడిని ఓడించి దమయంతిని గెలుచుకొందామని భావించాడు. పుష్కరు డోడితే రాజ్యం నలుడి కిచ్చేటట్లు, నలు డోడితే దమయంతిని పుష్కరుడికి దత్తంచేసేటట్లు పందెం వేసికొని ఇరువురూ జూదమాడారు. అందులో పుష్కరు డోడాడు. పూర్వం పుష్కరుడు గెలవటం కలిప్రభావంవలన జరిగిందని ప్రకటించి, నలుడు అతడిని క్షమించి వదలివేశాడు. ఆ తరువాత నలుడు దమయంతితో కూడి ఇంద్రవైభవంతో రాజ్యాన్ని పాలించాడు.

'కాబట్టి ధర్మరాజా! జూదంలో ఓడిపోయానని దిగులు పడబోకుము. నీవుకూడా దైవమానుష సంపదలతో శత్రువులను జయించి సకల మహీసామ్రాజ్యాన్ని పొందగలవు' అని బృహదశ్వుడు ధర్మరాజుకు అక్షహృదయాన్ని ఉపదేశించాడు. 'ఈ నలోపాఖ్యానం శ్రద్ధతో విన్నవారూ, సభలలో చదివినవారూ కలిదోషంనుండి విముక్తి చెందుతారు. నిఖిల పుణ్యఫలాలను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అందుకొంటారు. పుత్ర పౌత్ర ఆయురారోగ్య ఐశ్వర్యాలు పొందుతారు. విషాలవలన, దుష్టవిషయాలవలన భయం లేకుండా ఉంటారు. ధర్మాత్ము లౌతారు. అంతే కాదు. కర్కోటకుడు, దమయంతి, నలుడు, ఋతుపర్ణుడు - వీరిపేర్లు ఉచ్చరిస్తే చాలు కలిభయాలు తొలగిపోతాయి'- అని ఫలశ్రుతిని ప్రకటించాడు. ఆ తరువాత పాండవులవద్ద సెలవు తీసికొని బృహదశ్వుడు వెళ్ళిపోయాడు.

పుణ్యతీర్థ విశేషాలు :

పాండవులు అర్జునుడి రాక కొరకు ఎదురు చూస్తున్నారు. అప్పుడు నారదమహర్షి వచ్చాడు. ధర్మరాజు ధర్మమతికి ఉదాత్తచరిత్రకు మెచ్చుకొని అతడికి ఇష్టమైన దేదైనా అడుగుము- అని అడిగాడు. 'ఈ భూమిలో ప్రదక్షిణంగా కొందరు ధన్యులు తీర్థయాత్రలు చేస్తూ ఉంటారు. వారికి ఎటువంటి ఫలం కలుగుతుందో చెప్పండి. అనేక తీర్థాల గొప్పతనం కూడా తెలియపరచండి' అని ధర్మరాజు కోరాడు. పూర్వం అటువంటి ప్రశ్నే గంగాద్వారంలో పితృదేవతలకు శుభకర్మలు చేస్తున్న భీష్ముడు అడుగగా, పులస్త్య మహర్షి చెప్పిన విశేషాలు వినిపిస్తానని నారదుడు ధర్మరాజుకు ఈక్రింది వివరాలు తెలిపాడు.

'జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలపై నిగ్రహం ఉన్నవారు, అహంకారం లేనివారు, ప్రతిగ్రహాపేక్ష లేనివారు, తక్కువగా భోజనం చేసేవారు, అనారంభకులైనా ఆనందంగా ఉండేవారు, సత్యవ్రతులు, శుభాచారులు, కోపం లేనివారు, ధర్మపరులు అయినవారు వందలాది పుణ్యతీర్థాలను సేవించిన ఫలాన్నీ, సర్వయజ్ఞాలు చేసిన పుణ్యాన్నీ పొందుతారు. దుర్మార్గులు తీర్థసేవల ఫలాన్ని పొందలేరు. నువ్వులను, గోవులను, బంగారాన్ని దానంచేయటం, ఉపవాస వ్రతాలు చేయటం, తీర్థయాత్రలు చేయటంవలన జనులు దారిద్ర్యాన్ని, రోగాలను, ఆత్మదోషాలను పోగొట్టుకొంటారు. దుర్గతులైనవారు యజ్ఞఫలాలు పొందజాలరు. కాని, తీర్థాలు సేవించటంవలన ఆ ఫలితాలు వారికి లభిస్తాయి. తీర్థసేవనం విశేష పుణ్యప్రదం' అని చెప్పి బహువిధ పుణ్యతీర్థసేవలయొక్క ఫలాలను వివరించాడు.

నారదుడు పేర్కొన్న పుణ్య తీర్థాలు :

1. పుష్కరం (ఇందులో పదివేల కోట్ల తీర్థాలున్నాయి) 2. జంబూమార్గం, 3. తుండులికాశ్రమం, 4. అగస్త్యవటం, 5. కణ్వాశ్రమం, 6. ధర్మారణ్యం, 7. యయాతి పతనం, 8. మహాకాళం, 9. కోటితీర్థం, 10. భద్రవటం, 11. నర్మదాతీర్థం, 12. దక్షిణసింధుతీర్థం, 13. చర్మణ్వతీతీర్థం, 14. వసిష్ఠాశ్రమం, 15. పింగం, 16. ప్రభాస తీర్థం, 17. వరదానం, 18. సరస్వతీసాగరసంగమం, 19. పిండారకం, 20. సాగర సింధు సంగమం, 21. శంకు కర్ణేశ్వరం, 22. వసుధార, 23. వసుసరం, 24. సింధూత్తమతీర్థం, 25. బ్రహ్మతుంగ, 26. శక్రకుమారి, 27. శ్రీకుండం, 28. విమలం, 29. బడబ, 30. దేవిక, 31. కామతీర్థం, 32. రుద్రతీర్థం, 33. యజనం, 34. యాజనం, 35. బ్రహ్మవాలుకం, 36. దీర్ఘసత్రం, 37. వినశనం, 38. నాగోద్భేదం, 39. శివోద్భేదం, 40. చమసోద్భేదం, 41, సరస్వతి, 42. శశయానం, 43. రుద్రకోటి, 44. నైమిశం, 45. కురుక్షేత్రం, 46. శమంతకపంచకం, 47. రామహ్రదం, 48. విష్ణుస్థానం, 49. పారిప్లవం, 50, పృథివీతీర్థం, 51. శాలూకిని, 52. సర్పతీర్థం, 53. వరాహతీర్థం, 54. అశ్వినీతీర్థం, 55. జయంతిలో సోమతీర్థం, 56. కృతశౌచతీర్థం, 57. అగ్నివటం, 58. ముంజవటం, 59. యక్షిణీతీర్థం, 60. కురుక్షేత్రద్వారం, 61. కాయశోధనం, 62. లోకోద్ధారం, 63. శ్రీతీర్థం, 64. కపిలతీర్థం, 65. సూర్యతీర్థం, 66. గోభవనం, 67. శంఖినీతీర్థం, 68. యక్షేంద్రతీర్థం, 69. మాతృతీర్థం 70. బ్రహ్మావర్తం, 71. శరవణం, 72. శ్వావిల్లోమాపహం, 73. మానుషతీర్థం, 74. ఆపగానది, 75. బ్రహ్మోదుంబరం, 76. సప్తర్షికుండం, 77. కేదారం, 78. కపిలకేదారం, 79. సరకం, 80, ఇలాస్పదం 81. కిందానం, 82. కింజప్యం, 83. నారదతీర్థమైన అంబాజన్మం, 84. పుండరీకం, 85. వైతరణి, 86. ఫలకీవనం, 87. మిశ్రకం, 88. వ్యాసవనం, 89. మనోజవం, 90. మధువటి, 91. కౌశికీ దృషద్వతీ సంగమం, 92. కిందత్తం, 93. అహస్సుదినతీర్థాలు, 94. మృగధూమం 95. వామనం, 96. పావనం, 97. శ్రీకుంజం, 98. నైమిశకుంజం, 99. బ్రహ్మతీర్థం, 100. సప్తసారస్వతతీర్థం, 101. ఔశసన తీర్థం, 102. కపాలమోచనం, 103. విశ్వామిత్రం, 104. కార్తికేయం, 105. పృథూదకతీర్థం, 106. సురకన్యాసరస్వతీ సంగమం, 107. అర్ధకీల తీర్థం. 108. శతం, 109. సహస్రం, 110. తైజసం, 111. కురుతీర్థం,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

112. స్వర్గద్వారం, 113. రుద్రపత్ని, 114. స్వస్తిపురం, 115. గంగమడుపులో మూడు కోట్ల తీర్థాల కూపం, 116. బదరీవనంలోని వసిష్ఠాశ్రమం, 117. ఏకరాత్రం, 118. ఆదిత్యాశ్రమం, 119. దధీచితీర్థం, 120. కన్యాశ్రమం, 121. సన్నిహిత (సన్నిహతి), 122. ధర్మతీర్థం, 123. జ్ఞానపావనం, 124. సౌగంధికం, 125. దేవశ్రవ, 126. సుగంధ, 127. శతకుంభ, 128. పంచయక్ష, 129. త్రిశూలఖాత, 130. శాకంభరీతీర్థం, 131. సువర్ణాఖ్యతీర్థం, 132. ధూమావతి 133. రథావర్తం, 134. ధార, 135. గంగాద్వారం, 136. సప్తగంగాసంగమం, 137. త్రిగంగాసంగమం, 138. శక్రావర్తం, 139. కనస్వలం, 140. గంగాసరస్వతీ సంగమం, 141. భద్రకర్ణేశ్వరం, 142. అరుంధతీవటం. 143. సింధుప్రభవం, 144. యమునా ప్రభవం, 145. వేదిక, 146. ఋషికుల్య, 147. కృత్తికాతీర్థం, 148. మఘతీర్థం, 149. విద్యాతీర్థం. 150. వేతసిక, 151. బ్రహ్మతీర్థం, 152. నైమిశం, 153. గంగోద్భేదతీర్థం, 154. ఇందీవరతీర్థం, 155. దిశాపతితీర్థం, 156. బాహుద, 157. సరయూప్రదేశంలోని గోప్రదానతీర్థం, 158. గోమతి, 159. కోటితీర్థం, 160. వారణాసి, 161. కపిలాహ్రదం, 162. మార్కండేయ తీర్థం అయిన గంగాగోమతీసంగమం, 163. గయ, 164. ఫల్గుతీర్థం, 165. యక్షిణీతీర్థం, 166. మణినాగం, 167. గౌతమవనంలోని అహల్యాహ్రదం, 168. ఉదపానం, 169. రాజర్షిజనకకూపం, 170. కంపన, 171. మహానది, 172. దేవపుష్కరిణి, 173. మహేశ్వరధార, 174. మహేశ్వరపదం, 175. మహేశ్వరపథం, 176. సాలగ్రామతీర్థం, 177. సన్నిహిత చతుస్సముద్రకూపం, 178. చంపకారణ్యంలోని భరతాశ్రమం, 179. కన్యాసంవేద్యం, 180. దేవకూటం, 181. కౌశికహ్రదం. 182. కుమార వీరాశ్రమం, 183. అగ్నిధార, 184. కుమారధార, 185. గౌరీశిఖరకుండం, 186. నందినీకూపం, 187. కాళికాకౌశికా సంగమతీర్థం, 188. ఊర్వశితీర్థం, 189. గోకర్ణం, 190. సరస్వతీతీర్థం, 191. వృషభద్వీపం, 192. నంద, 193. ఔలకం, 194. కరతోయం, 195. గంగాసాగరసంగమం, 196. శోణానర్మదా ప్రభవం, 197. బదరీతీర్థం, 198. మహేంద్రం, 199. రామతీర్థం, 200. మతంగకేదారం, 201. వంశగుల్మం, 202. శ్రీపర్వతంలోని కృష్ణవేణియందలి దేవహ్రదం, 203. పాండ్యపర్వతంలోని కావేరీతీర్థం, 204. తుంగభద్ర, 205. సముద్రతీర్థం, 206. కన్యాతీర్థం, 207. గాయత్రీ స్థానం, 208. పెన్నానది, 209. గోదావరీనది, 210. పయోష్ణి, 211. దండకారణ్యం, 212. శరభంగాశ్రమం, 213. శుక్రాశ్రమం, 214. శూర్పారకం, 215. సప్తగోదావరీ తీర్థం, 216. తుంగకారణ్యం, 217. కాలంజర పర్వతంలోని దేవహ్రదం, 218. మేధికం, 219. చిత్రకూటంలోని మందాకిని, 220. పితృస్థానం, 222. శృంగిబేరపురం, 223. ప్రయాగ, 224. గంగాయమునా సంగమం (దాని నాశ్రయించుకొన్న అరవైకోట్ల పదివేల తీర్థాలు). 225. భోగవతి. 226. వాసుకి, 227. హంసవ్రతం మొదలైనవి.

ఈ తీర్థాలను ఏయేవిధంగా సేవిస్తే ఎంతెంతటి ఎన్నెన్ని ఫలాలు లభిస్తాయో నారదుడు చెప్పాడు. ఈ తీర్థవర్ణనం వింటే శ్రోతలు ధన్యులౌతారని పేర్కొన్నాడు. పులస్త్యుడి కథనం విని భీష్ముడు సర్వతీర్థాలూ సేవించినట్లే, ధర్మరాజు కూడా పుణ్యతీర్థ కథనం విన్న తరువాత తీర్థసేవచేసి పూరు, పురూరవ, భగీరథ, రఘుపతుల వలె కృతకృత్యుడు కావాలని ప్రబోధించాడు. రోమశుడనే ముని దేవలోకంనుండి వస్తాడనీ, అతడి ఉపదేశాన్ని అనుసరించి ధౌమ్యుడి అనుమతితో తీర్థసేవ చేయుమని ధర్మజుడికి చెప్పి నారదుడు వెళ్ళాడు. ఆపైన అర్జునుడు దివ్యాస్త్రాలను పొంది, తిరిగి వచ్చేంతవరకు ధర్మజుడు తీర్థయాత్రలు చేయటానికి నిశ్చయించాడు.

రోమశుడు చెప్పిన పుణ్యతీర్థ కథలు :

ఇంద్రలోకం నుండి రోమశుడు ధర్మజుడివద్దకు వచ్చాడు. ఈశ్వరుడు మొదలుకొని ఇంద్రాది దేవతలందరూ అభీష్టవరాలివ్వగా కృతార్థుడైన అర్జునుడు మహేంద్రలోకంలో ఆతడి అర్ధసింహాసనం మీద కూర్చుండే గౌరవం పొందాడు. ఆ దృశ్యాన్ని చూచి, రోమశు డాశ్చర్యపోయాడు. అప్పుడు అతడితో ఇంద్రు డిట్లా అన్నాడు- 'ఇక అర్జునుడు భీష్మాదులను జయించగలడు. కర్ణుడు అతడి పదహారోకళకు కూడా సరికాడు. అమృతసంభవమైన పాశుపతాన్ని పరమేశ్వరుడు పార్థుడికి ప్రసాదించాడు. దిక్పాలకులు దివ్యాస్త్రాలు అందించారు. అర్జును డిప్పుడు మనుష్యుడు కాడు. దివ్యపురుషుడు. ఇతరు లెవ్వరూ సాధించలేని ఒక దేవకార్యాన్ని తీర్చి, అర్జునుడు మర్త్యలోకం చేరతా డని తమ్ములతో కూడి ఉన్న ధర్మరాజుతో చెప్పుము. తీర్థసేవ చేసే శాంతాత్ములకు, తపస్వులకు, దుష్కరమనేది ఉండదు. కాబట్టి ధర్మరాజుచేత నీవు తీర్థాలను సేవింపచేయుము- అని ఇంద్రు డాదేశిస్తే నేను నీవద్దకు వచ్చా' నని రోమశుడు పలికాడు.

విజయుడి క్షేమవార్త విన్నందుకూ, ఇంద్రుడే స్వయంగా తనను తీర్థయాత్రలు చేయించటానికి సంకల్పించినందుకూ ధర్మజుడు సంతోషించాడు. తా నిదివరకే నారద ధౌమ్యులచేత ప్రేరేపించబడి తీర్థయాత్రలు చేయటానికి సిద్ధంగా ఉండటంచేత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భార్యతో, తమ్ములతో, ధౌమ్యాది బ్రాహ్మణవర్గంతో కామ్యకవనంలో మూడురోజులున్న తరువాత మార్గశీర్షమాసం చివరి రోజుల్లో తీర్థయాత్రలకు బయలుదేరాడు- ధర్మరాజు.

ధర్మరాజు : మహర్షీ! లోకంలో ధర్మం పాటించని దుర్మార్గులకు అభివృద్ధి కలగటం, పుణ్యచరిత్రులకు, ధార్మికులకు అభివృద్ధి కలగకపోవటం అనేది న్యాయమా? ఇదొక ప్రశ్న. మరొకటి - అచేతనాలైన కొండలు, నదులు, సరోవరాలు పుణ్యతీర్థాలై జగత్తును పావనం చేసేవై, జనులకు పాపాన్ని పోగొట్టేవై ఉండటానికి వెనుక ఉన్న కారణ మేమిటి?

రోమశుడు : ధర్మజా! అధర్మపరులకు అభివృద్ధి కలిగినా అది ఎక్కువకాలం నిలవదు. త్వరలోనే నశించిపోతుంది. రాక్షసులు వేలసంఖ్యలో తమ అభివృద్ధిని కోల్పోవటం గమనించవచ్చును. దేవతలు ధర్మవర్తులు కాబట్టి అభివృద్ధి పొందుతారు. కౌరవులు కూడా రాక్షసులవలె విధిచేత నిర్మూలించబడతారు. అధర్మవర్తనులు మొదట గర్విస్తారు. ఆ పైన అభిమానిస్తారు. తరువాత కోపాన్ని ప్రదర్శిస్తారు. దానివలన వారి శీలం చెడిపోతుంది. లజ్జావిహీనులై అపకీర్తిపాలై సంపదను పోగొట్టుకొంటారు. కౌరవులు అట్లాగే నశిస్తారు. మీరు దేవతలవంటివారు. వారివలె మీరు కూడా ఋషులను ఆశ్రయించండి. తీర్థసేవలు, యజ్ఞాలు, దానాలు, చేసి విప్రాశీస్సులు పొందండి. సర్వదుఃఖాలనుండి విముక్తులై శ్రేయస్సును పొందండి. - అని ప్రబోధించాడు.

రోమశుడివలన ధర్మరాజాదులు ధర్మవిశేషాలు వింటూ అనేక తీర్థాలు సేవించారు. మార్గంలో శమఠమహర్షి గయామాహాత్మ్యాన్ని చెప్పగా విన్నారు. అగస్త్యాశ్రమం దర్శించినప్పుడు అగస్త్యమహర్షి వాతాపి నెట్లా చంపాడో ఆ కథ తెలియచెప్పమని ధర్మజుడు రోమశుడిని అడిగాడు. ఈ ఋషి ఆ కథ చెప్పాడు.

వాతాపి జీర్ణం :

మణిమతీ పురంలో ఇల్వలుడు, వాతాపి అనే దైత్యసోదరులు ఉన్నారు. వారిద్దరూ బలగర్వితులు. ఇల్వలుడు ఒకనాడు ఒక బ్రాహ్మణుడిని సమీపించి అన్నికోరికలు తీరే ఒక మంత్రాన్ని అడిగాడు. ఆ విప్రుడు అతడి ప్రార్థనను తిరస్కరించాడు. అతడికి కోపం వచ్చింది. కామరూపుడైన వాతాపిని మేకగా మార్చాడు. అతడి మాంసాన్ని వండి ఆ బ్రాహ్మణుడికి వడ్డించాడు. అతడు తినిన తరువాత వాతాపిని పిలిచాడు. వాతాపి ఆ బ్రాహ్మణుడి పొట్టను చీల్చుకొని వచ్చాడు. విప్రుడు విగతజీవు డయ్యాడు. అతడి మాంసాన్ని అన్నదమ్ము లిద్దరూ కలిసి ఆరగించారు. ఆనాటినుండి ఇల్వలుడు అతిథులైన విప్రులను అదే విధంగా చంపి హింసిస్తూ ఉన్నాడు.

అగస్త్యుడు బ్రహ్మచర్యాశ్రమంలో చాలకాలం ఘోరతపస్సు చేస్తూ ఒకనాడు వనంలో తిరుగుతూ తనపితృదేవతలు ఒక సల్లకీ పల్లవానికి తలక్రిందుగా వ్రేలాడుతూ ఉండటం చూచాడు. వారావిధంగా ఉండటానికి గల కారణాన్ని గురించి అడిగాడు. వారి స్థితికి అగస్త్యుడు అవివాహితుడై సంతానవంతుడు కాకపోవటమే కారణమని పితరులు చెప్పారు. అతడికి సంతానం కలిగితే వారికి పుణ్యగతులు వస్తాయని తెలిపారు.

అగస్త్యుడు తన తపోమహిమవలన విదర్భరాజుకు ఒక కూతురు పుట్టేటట్లు చేశాడు. ఆమె పేరు లోపాముద్ర. ఆమె యుక్తవయస్కురాలు అయింది. అగస్త్యుడు వచ్చి ఆమెను తన కిచ్చి వివాహం చేయుమని విదర్భరాజును ఆడిగాడు. కాని, ఆ రాజు తన కూతురును తపస్వికి ఇవ్వటానికి ఇష్టపడలేదు. కాని, లోపాముద్ర తనంతట తాను అగస్త్యుడిని వివాహమాడటానికి ముందుకు వచ్చింది. వారిరువురికీ వివాహం జరిగింది. లోపాముద్ర వల్కలాలు కట్టి భర్తతో గంగాద్వారానికి చేరింది. అక్కడ అగస్త్యుడు తపస్సు చేసికొంటూ ఒకనాడు ఆమె అందాన్ని చూచి మన్మథ ప్రేరితుడై ఆమెను కూడబోయాడు. అప్పుడు లోపాముద్ర తనను అలంకారాలతో అలంకరించి భోగించుమని భర్తను కోరింది.

అగస్త్యుడి వద్ద తపోధనం తప్ప బంగారం లేదు. అందువలన అతడు బంగారాన్ని అర్థించడానికై శ్రుతర్వుడనే రాజువద్దకు వెళ్ళాడు. ఆ రాజు వద్ద పోష్యజన పోషణానికి ఇబ్బంది లేకుండ మిగిలే ధనాన్ని దానంగా కోరాడు. అతడి వద్ద మిగులుధనం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లేదు. అగస్త్యుడు అతడితో కలిసి బ్రధ్నాశ్వుడనే రాజువద్దకు వెళ్ళి అట్లాగే అడిగాడు. ఈతడి వద్దకూడ మిగులు ధనం లేకపోయింది. ఆ తరువాత త్రసదస్యుడనే రాజువద్దకు పోయి అట్లాగే అడిగాడు. అతడి వద్దకూడ మిగులు ధనం లేకపోయింది. కాని, త్రసదస్యుడు ఇల్వలుడి వద్దకు వెళ్ళుమని అగస్త్యుడికి హితవు చెప్పాడు. అతడి వెంట ఆ ముగ్గురు రాజులు వెళ్ళారు.

ఇల్వలుడు అగస్త్యుడికి ధనసహాయం చేయటానికి అంగీకరించాడు. కాని, అంతకు ముందే మామూలుగా భోజనం పెట్టి వాతాపితో చంపిద్దామని ఊహించాడు. కాని, అగస్త్యుడు తృప్తిగా భుజించి 'వాతాపి జీర్ణం' అని త్రేన్చి, అతడిని తనకడుపులో జీర్ణంచేసికొన్నాడు. దానితో ఇల్వలుడి మాట వ్యర్థమైపోయింది. ఆ రాక్షసుడు అగస్త్య డడిగిన ధనాన్ని ఇచ్చాడు. బంగారు రథంలో ఎక్కించి ఇంటికి పంపాడు. అతడి మిత్రులకు కానుక లిచ్చాడు.

అగస్త్యుడు లోపాముద్రను సువర్ణాభరణాలతో అలంకరించాడు. ఆమె నొక ప్రశ్న అడిగాడు. 'నీకు సామాన్యులైన కొడుకులు నూర్గురు కావాలా? ఆ నూరుమంది కొడుకులకు సమానమైన పదిమందిని కోరుకొంటావా? లేదా వేయిమందిని కోరుకుంటావా? వేయిమందికి తుల్యుడైన ఒక్క కొడుకును కోరుకొంటావా?' అని అనగా ఆమె మహాత్ముడైన ఒక్కకొడుకునే కోరింది. ఆమె కోర్కెను మన్నించి ఆమెకు గర్భాధానం చేసి అగస్త్యుడు తపోవనానికి వెళ్ళాడు. ఏడేళ్ళు గర్భంతాల్చి లోపాముద్ర వేదవేదాంగవిదుడైన ఒక కొడుకును కన్నది. అతడి పేరు దృఢస్యుడు. అతడు పుత్రపౌత్రులను పొందాడు. దానివలన అగస్త్యుడి పితరులు పుణ్యలోకాలను పొందారు.

అగస్త్య చరిత్రం :

ఈ కథ విని ధర్మరాజు అగస్త్యుడి చరిత్ర ఇంకా వివరించి చెప్పమని కోరాడు. రోమశుడు ఈ విధంగా చెప్పాడు.

కృతయుగంలో వృత్రుడు కాలకేయాదులతో కలిసి ఇంద్రుడిని ఓడించి దేవతలను బాధించాడు. దేవతలు బ్రహ్మదేవుడితో తమ కష్టాలను గురించి మొరపెట్టుకొన్నారు. సరస్వతీ నదీ తీరంలో తపస్సు చేసికొంటున్న దధీచి వద్దకు పోయి, అతడి ఎముకలను దానంగా పొందేటట్లు బ్రహ్మ సూచించాడు. ఆ ఎముకలనుండి వజ్రాయుధాన్ని ఇంద్రుడు పొంది వృత్రాసురుడిని సంహరిస్తాడని పేర్కొన్నాడు. బ్రహ్మ పేర్కొన్నట్లే ఇంద్రుడు దధీచి ఎముక నుండి పొందిన వజ్రాయుధంతో వృత్రాసురుడిని సంహరించాడు.

దధీచి ఎముకలనుండి దేవతలు కూడా అనేకాయుధాలు పొంది కాలకేయులపై దండెత్తారు. ఆ రాక్షసులు సముద్రంలో దాగి రాత్రిళ్ళు పైకి వచ్చి తపస్వులను వధించేవారు. ధర్మచరితుల వలననే లోకాలు అపాయం పొందకుండా ఉన్నాయని భావించి, అటువంటి తపస్వులను చంపటమే ఒక పనిగా పెట్టుకొన్నారు. వసిష్ఠాశ్రమంలో 197 మందిని, చ్యవనాశ్రమంలో 100 మందిని, భరద్వాజాశ్రమంలో 20 మందిని - ఇట్లా ఋష్యాశ్రమాలలో వరుసగా పుణ్యాత్ములను సంహరిస్తూ హింస సాగించారు. ఆ దారుణకృత్యాలను సహించలేక ఇంద్రాది దేవతలు వైకుంఠానికి పోయి విష్ణుదేవుడితో మొర పెట్టు కొన్నారు. వేదాలను ధరించే విప్రులకు బాధకలిగితే హవ్యకవ్యకర్మలు నశిస్తాయి. అందువలన దేవతలకు, పితరులకు బాధ ఏర్పడుతుంది. కాబట్టి బ్రాహ్మణోపద్రవాన్ని మాన్పి లోకహితాన్ని కలిగించుమని ప్రార్థించారు. 'కాలకేయులు నివసిస్తున్న సముద్ర జలాలను అగస్త్యుడు త్రాగగలడు. అతడిని ప్రార్థించి ఆ నీటిని త్రాగించి, బయలువడిన కాలకేయులను సంహరించం' డని విష్ణువు దేవతలకు ఉపాయం చెప్పాడు.

దేవతలు అగస్త్యుడి వద్దకు వెళ్ళారు. పూర్వం దేవతల హితాన్ని కోరి వింధ్యపర్వత గర్వాన్ని అణచిన అగస్త్యుడి గొప్పతనాన్ని దేవతలు కీర్తించారు. ఆ కథను వివరించుమని ధర్మరాజు రోమశుడిని అడిగాడు. ఆ ముని ఇట్లా చెప్పాడు.

మేరుపర్వతాన్ని సూర్యచంద్రులు ప్రదక్షిణం చేస్తూ ఉండటాన్ని గమనించి వింధ్యపర్వతం గర్వించి తనకు కూడా సూర్యచంద్రులు ప్రదక్షిణం చేయాలని పోటీపడి పెరిగి ఆకాశాన్నంతా అవతరించింది. దాని వలన సూర్యచంద్రుల గతులు ఆగిపోయాయి. రేయింబవళ్ళ స్థితిగతులు స్తంభించాయి. నిత్యకర్మలు వికలమైపోయాయి. దేవతలందరూ వింధ్యం వద్దకు

వెళ్ళి వేడుకొన్నారు. కాని, వింధ్యగిరి వారి మాటలు వినలేదు. వారు అగస్త్యుడి వద్దకు పోయి మొరపెట్టుకొన్నారు. అగస్త్యుడి శిష్యుడు వింధ్యపర్వతం. ఆ ఋషి లోపాముద్రతో కలిసి దక్షిణభారతానికి బయలుదేరి వింధ్యవద్దకు వచ్చాడు. వింధ్య పర్వతం నేలమట్టంగా ఒదిగి మునిదంపతులకు నమస్కరించింది. అగస్త్యుడు తాను దక్షిణాపథంనుండి తిరిగి వచ్చేంతవరకు ఆవిధంగానే వింధ్యను అణగి ఉండుమని ఆజ్ఞాపించాడు; దేవహితాన్ని కోరి భార్యాసహితుడై దక్షిణాపథంలోనే ఉండిపోయాడు. అటువంటి ఉదారుడైన అగస్త్యుడు దేవతల ప్రార్థనను మన్నించి సముద్రజలాలనన్నీ త్రాగాడు. జలనిధి ఓటువడింది. జలజంతువులతోపాటు కాలకేయులు కూడా బయటపడ్డారు. దేవతలు వారిపై దాడిచేసి ఘోరయుద్ధంలో వారినందరినీ సంహరించారు. వారందరూ అగస్త్యుడిని కీర్తించి, మరల, సముద్రాన్ని జలంతో నింపుమని వేడుకొన్నారు. కాని, ఆ నీరు అగస్త్యుడి గర్భంలో జీర్ణమైపోయి ఉండటంచేత మరల ఉత్పత్తిచేయలేక పోయాడు. ఆ సంగతి తెలిసికొని దేవతలు బ్రహ్మను ప్రార్థించారు. ఆ దేవదేవుడు దివ్యదృష్టితో చూచి భవిష్యత్తులో చాలకాలానికి భగీరథుడనే రాజు సముద్రాన్ని జలంతో నింపుతాడనీ, అంతవరకూ ఓర్చుకొనండని దేవతలను సమాధానపరిచాడు. ఈ కథ విని ధర్మరాజు భగీరథుడు జలాలతో సముద్రాన్ని నింపిన కథ చెప్పుమని రోమశుడిని అడిగాడు. ఆతడు ఇట్లా చెప్పాడు.

భగీరథ యత్నం - గంగావతరణం :

పూర్వం ఇక్ష్వాకు వంశంలో సగరుడనే రాజు హైహయులను జయించి విశాల సామ్రాజ్యాన్ని పాలించాడు. అతడికి వైదర్భి, శైబ్య అనే ఇద్దరు భార్యలున్నారు. వారికి సంతానం లేదు. సంతానం కొరకు సగరుడు భార్యాసమేతుడై కైలాసానికి పోయి పరమేశ్వరుడిని గురించి తపస్సు చేశాడు. ఆ దేవదేవుడు ప్రసన్నుడై సగరుడికి వైదర్భి వలన అరవైవేలమంది, శైబ్యవలన ఒక్కడు, కొడుకులు పుట్టేటట్లు వరమిచ్చాడు. అయితే, ఆ అరవైవేలమంది గర్వితులై ఒకేసారి చనిపోతారనీ, ఆ ఒక్కకొడుకూ వంశకర్త అవుతాడని పేర్కొన్నాడు. సగరుడికి పుత్రులను పొందికూడా అసంతృప్తి మిగిలిపోయింది. పరమేశ్వరుడి వరం ప్రకారం సగరుడికి అరవై వేలమంది కొడుకులు పుట్టి పెద్దవారై స్వర్గంమీద దాడికి వెడలి, దేవతలను బాధించారు. దేవతలు వారి ఆగడాలను గురించి బ్రహ్మకు నివేదించారు. వారు కొద్ది కాలంలోనే దగ్ధులౌతారని బ్రహ్మ పేర్కొన్నాడు.

సగరుడి రెండవభార్య శైబ్యకు అసమంజసుడనే కొడుకు పుట్టాడు. అతడు పెద్దవాడై రాజ్యంలోని బాలకులను చంపి మహానదిలో పారవేస్తూ ఉండేవాడు. అతడిని సగరుడు రాజ్యంనుండి వెళ్ళగొట్టాడు. అసమంజసుడికి అంశుమంతుడనే కొడుకు ఉన్నాడు.

సగరుడు అశ్వమేధయాగం తలపెట్టాడు. అతడి యజ్ఞాశ్వాన్ని సగరపుత్రులు రక్షిస్తూ దాని వెంట వెళ్ళారు. ఆ గుర్రం నీరులేని సముద్రంలో ప్రవేశించి మాయమైపోయింది. సాగరులు సముద్రాన్ని త్రవ్వి పాతాళంలో ఈశాన్యభాగాన గాఢతపస్సు చేసికొంటున్న కపిలుడనే ముని వద్ద యజ్ఞాశ్వాన్ని కనుగొన్నారు. వారు కపిలుడిపై కోపగించి అతడిని అవమానించారు. ఆ ఋషి ఉగ్రుడై తనకంటిమంటతో అరవై వేల సాగరులను ఒక్కసారిగా బూడిద చేశాడు. ఆ సంగతిని నారదుడు సగరుడికి తెల్పాడు. అతడు దుఃఖించి తన మనుమడైన అంశుమంతుడి కా సంగతి చెప్పాడు. ఆతడు కపిలమునివద్దకు వెళ్ళి, అతడిని ప్రార్థించి ప్రసన్నుడిని చేసికొన్నాడు. ఆ ఋషి యజ్ఞాశ్వాన్ని అంశుమంతుడికి అప్పగించాడు. సగరుడి యజ్ఞం సఫలమయ్యేటట్లు, అతడి వలన తండ్రి తాతలు సుగతిని పొందేటట్లు, అతడి పౌత్రుడైన భగీరథుడివలన గంగాజలం భూమికి వచ్చేటట్లు, సాగరులు స్వర్గస్థులయ్యేటట్లు, సముద్రాలు నిండేటట్లు అనుగ్రహించాడు. అంశుమంతుడు సంతోషించి అశ్వాన్ని సగరుడి కిచ్చాడు. సగరుడు అశ్వమేధాన్ని పూర్తిచేసి కృతార్థుడయ్యాడు.

సగరుడి తరువాత అంశుమంతుడు, అతడి తరువాత దిలీపుడు రాజ్యం చేశారు. దిలీపుడు తన తాతలను గంగావతరణంతో ఉద్ధరిద్దామని ప్రయత్నం చేశాడు కాని విఫలుడయ్యాడు. అతడి కొడుకు భగీరథుడు కృతకృత్యుడయ్యాడు. భగీరథుడు హిమవత్పర్వతం మీద ఘోరతపస్సు చేశాడు. గంగ ప్రత్యక్షమై అవతరణానికి అంగీకరించింది. కాని, ఆకసంనుండి భూమిమీదకు దిగే గంగాప్రవాహాన్ని భరించగలిగినవాడు పరమేశ్వరుడు మాత్రమే. కాబట్టి అతడి అనుగ్రహాన్ని పొందుమని హితవు చెప్పింది. భగీరథుడు కైలాసానికి పోయి పరమేశ్వరుడిని గూర్చి చాలకాలం తపస్సుచేసి గంగను భరించటానికి శంకరుడి

అనుమతిని పొందాడు. సర్వలోకాలు ఆనందించగా గంగ భూతలం మీద అవతరించింది. శివుడు గంగను జటాజూటంతో భరించి నేలపై ధారగా వదిలాడు. భగీరథుడి వెంట మందగమనంతో గంగ నడచి వచ్చి, సాగరులకు ఉత్తమగతుల నిచ్చింది. సాగరాన్ని జలపూర్ణం చేసింది. సగరుడి సంతానంగా భావించబడి సముద్రం సాగరమై ప్రసిద్ధి చెందింది. ఈ విధంగా భగీరథుడి మాహాత్మ్యాన్ని రోమశుడు ధర్మరాజుకు చెప్పాడు.

ఆ తరువాతక్రమంగా అనేక తీర్థయాత్రలు చేస్తూ ఋశ్యశృంగహ్రదం వద్దకువచ్చారు. ధర్మరాజు ఋశ్యశృంగుడి చరిత్రను చెప్పుమని కోరాడు. రోమశుడు ఈ విధంగా చెప్పాడు.

ఋశ్యశృంగ వృత్తాంతం :

పూర్వం కశ్యపుడి పుత్రుడు విభాండకుడు అస్ఖలిత బ్రహ్మచారిగా తపస్సు చేస్తున్నాడు. ఒకనాడు సరస్సులో స్నానం చేస్తూ ఉండగా ఊర్వశిని చూచాడు. ఆమె సౌందర్యాన్ని చూడగానే రేతస్స్ఖలనం జరిగింది. ఆ రేతస్సుతో కలిసిన నీటిని ఒక దుప్పి త్రాగి గర్భం దాల్చింది. దానికి ఋశ్యశృంగుడు పుట్టి తండ్రి వద్ద అమాయకంగా పెరిగాడు. అతడికి ఆశ్రమం తప్ప మరొక లోకజ్ఞానం లేదు. స్త్రీలంటే కూడా తెలియదు. అతడు పుట్టినప్పటినుండి తపస్సులోనే నిమగ్నుడైనాడు.

ఆ కాలంలో అంగదేశానికి అధిపతి రోమపాదుడు. అతడు పురోహితుడికి చేసిన అపరాధంవలన బ్రాహ్మణులు ఆ రాజును పరిత్యజించారు. అందువలన దేశంలో వానలు కురవటం మాని కరువు వ్యాపించింది. రోమపాదుడు తన తప్పు తెలిసికొని బ్రాహ్మణులను పూజించాడు. వారు ఋశ్యశృంగుడిని రోమపాదుడి దేశానికి పిలిపిస్తే వర్షాలు కురుస్తాయని సూచించారు. రోమశుడు ఋశ్యశృంగుడిని రప్పించటానికి ఒక ఉపాయాన్ని పన్ని వేశ్యలను అతడి తపోవనానికి పంపాడు.

రోమపాదుడి ఆదేశం ప్రకారం వేశ్యలు తపోవనంలో ప్రవేశించారు. వివిధ రసాలతో కూడుకొన్న భక్ష్యాలనూ, అనులేపనాలనూ తీసికొని ఆశ్రమానికి వెళ్ళారు. విభాండకుడు ఆశ్రమంలో లేని సమయంలో అభినవ యౌవనవిలాసవతి అయిన వేశ్యకూతు రొకతె ఋశ్యశృంగుడిని సమీపించింది. ఆడువారిని చూచి ఎరుగని ఋశ్యశృంగుడు ఆమెను ఒక వింత ఋషికుమారుడిగా భావించి, ఆమె రూపలావణ్యాలకు ఆశ్చర్యపడ్డాడు. ఆమెను ఆదరంతో గౌరవించాడు. ఆమె శరీరావయవాల పొంకానికి ముగ్ధుడయ్యాడు. ఆమె ఇచ్చిన దివ్యగంధమాల్యాలను, సరసభక్ష్యపానాలను, విచిత్ర వస్త్రాలను స్వీకరించాడు. ఆమె అతడి యెదుట నాట్యం చేసింది. అతడిని కౌగిలించుకొని సంతోషపెట్టింది. అతడిని ఆ విధంగా ప్రబోధించి వేశ్యాపుత్రి వెళ్ళింది. ఋశ్యశృంగుడు ఆ తన్మయత్వంలో యజ్ఞకార్యం మరచాడు. తండ్రి వనంలోనుండి తిరిగి వచ్చి కొడుకు వైఖరికి అబ్బురపడ్డాడు. ఋశ్యశృంగుడు జరిగిన దంతా చెప్పాడు. ఆ మునికుమారుడితో కలిసి తపస్సు చేయాలని ఉన్నదని తన కోర్కెను బయటపెట్టాడు. తండ్రి కటకట పడ్డాడు. అది రాక్షసమాయగా విభాండకుడు భావించి కొడుకును హెచ్చరించాడు.

తండ్రి హెచ్చరికలు వినక, తమకంతో ఋశ్యశృంగుడు మరునాడు ఆ వేశ్యాపుత్రి వెంటతగిలి పోయి అంగదేశం చేరుకొన్నాడు. రోమపాదు డాతడిని రాజాశ్రయమనే భవనంలో ఉంచాడు. ఋశ్యశృంగ ప్రవేశ ప్రభావంతో ఆ దేశాన వానలు మెండుగా కురిశాయి. దేశం సుభిక్షమైంది. ప్రజలు సంతోషించారు. అవగ్రహదోషాలు పోయాయి. రోమపాదుడు ఆనందించి తనకుమార్తె అయిన శాంతాదేవి నిచ్చి, ఋశ్యశృంగుడికి వివాహం చేశాడు. ఋశ్యశృంగుడికి ధనరాసులు, భూషణాలు బహుమానంగా ఇచ్చి, అతడి పేరుమీద దేశంలో అనేక గోశాలలను ఏర్పాటు చేశాడు. వాటిలో నిత్యాతిథిసత్కారాలను ఏర్పాటు చేశాడు.

విభాండకుడు ఆశ్రమంలో కొడుకు కనపడకపోవటంతో వెదకుతూ అంగదేశంలో ప్రవేశించి, ఒకగోశాలలో విశ్రమించి, తనకొడుకు కథనంతా తెలిసికొన్నాడు. రాజధానికి చేరి కొడుకును కోడలిని చూచి ఆనందించి వారిని ఆశ్రమానికి తీసికొనిపోయాడు. శాంతా ఋశ్యశృంగులు వసిష్ఠారుంధతులవలె అన్యోన్య ఆదర్శ దాంపత్యసుఖాలను పొందుతూ ఉన్నారు.

ధర్మజాదులు క్రమంగా ఋశ్యశృంగహ్రదంలో, కౌశికహ్రదంలో, గంగాసాగర సంగమ తీర్థంలో స్నానాలు చేసి కళింగ దేశంలో ఉన్న వైతరణీనదిని దర్శించారు. అప్పుడు రోమశుడు ఇట్లా అన్నాడు: 'మునులు దేవతలు ఇక్కడ అనేక యజ్ఞాలు చేశారు. ఈ నది ఉత్తరతీరాన వేలకొలది అవభృథస్నానాలు చేశారు. అన్ని యజ్ఞాలలోనూ గొప్పదైన పశుభాగాన్ని పశుపతికి దేవతలు, ఋషులు ఇక్కడ కల్పించారు. ఈ తీర్థంలో స్నానం చేస్తే లోకాలన్నింటిని దర్శిస్తారు. దేవతల విమానాలలో పయనిస్తారు'. ఆ మాటలు విని ధర్మరాజు సకుటుంబంగా వైతరణీ స్నానం చేశాడు. చేసి, రోమశుడితో - 'మునీంద్రా! మీ దయవలన నాకన్ని లోకాలు కనపడ్డాయి. వైఖానసుల వేదాధ్యయన శబ్దం వినవచ్చింది' - అని అన్నాడు. ఆ మాటలకు రోమశుడు ఆశ్చర్యపోయాడు. వైఖానసులు నివసించేచోటు అక్కడికి ముప్పదివేల ఆమడల దూరం. అంతదూరంలో వారు చదువుతున్న వేదాల నాదాలు వినపడుతున్నవంటే ధర్మరాజు దివ్యుడని నిర్ధారించాడు.

ఆ తరువాత ధర్మజాదులు ఒక మహావనానికి వెళ్ళారు. స్వాయంభువుడైన విశ్వకర్మ పూర్వం ఇక్కడ యజ్ఞం చేసి భూవలయాన్ని యజ్ఞదక్షిణగా కశ్యపుడికి దానం చేశాడు. భూదేవి కశ్యపుడికి వశంకావటం ఇష్టంలేక నీటిలో మునిగింది. కశ్యపుడు ఘోరతపస్సు చేసి భూదేవిని ప్రసన్నురాలిని చేసికొన్నాడు. ఆమె నీటిపై తేలి ఒక వేదికగా నిలిచింది. 'ఆ వేదిక ఇదే. దీనిమీదకు ఎక్కగలిగినవారు వీర్యవంతు లౌతారు. ఎక్కడానికి అర్హత లేనివారు. ఎక్కబూనితే ఆ వేది మునిగిపోతుంది'. అని చెప్పి' 'అగ్నిర్మిత్రో యోని' మొదలైన మంత్రాలను ఉపదేశించి, ఆ వేది నెక్కించాడు. సతీ భ్రాతృ సహితుడైన ధర్మరాజు ఆ వేదికపై కెక్కి తేజోవంతుడై ప్రకాశించి, బ్రాహ్మణుల ఆశీస్సుల నందుకొన్నాడు.

ధర్మరాజు మహేంద్రగిరి చేరాడు. అక్కడి మహర్షులు పరశురాముడిని చూడగలరు. వారితో కలిసి ధర్మరాజు పరశురాముడిని చూడాలని కోరుకొన్నాడు. మరునాడు చతుర్దశి. ఆనాడు పరశురామ దర్శనమౌతుందని మునులు చెప్పారు. ధర్మజుడు వస్తున్నసంగతి పరశురాముడికి ముందే తెలియునని అకృతవ్రణుడనే ముని పలికాడు. ఆ మునిని ధర్మరాజు పరశురాముడి వృత్తాంతాన్ని చెప్పమని కోరాడు. అత డీవిధంగా చెప్పాడు.

పరశురామ వృత్తాంతం :

పూర్వం కన్యాకుబ్జాన్ని గాధి పాలించేవాడు. అతడి కూతురు సత్యవతి గుణవతి, అందగత్తె. ఆమెను వివాహం చేసికొనాలని భృగుపుత్రుడైన ఋచీకుడు కోరికపడి గాధిని అడిగాడు. గాధి కన్యాశుల్కంగా ఒక నల్లని చెవితో, తెల్లని దేహంతోగల గుర్రాలు ఒక వెయ్యింటిని ఇస్తే కన్య నిస్తానన్నాడు. ఋచీకుడు వరుణేంద్రుడి వద్దకు వెళ్ళి ఆ గుర్రాలను పొంది, గాధికి కన్యాశుల్కంగా ఇచ్చి, సత్యవతిని వివాహమాడి, కన్యాకుబ్జంలో సుఖంగా ఉన్నాడు. ఒకసారి భృగుడు కొడుకుదగ్గరకు వచ్చాడు. కోడలు చేసే పరిచర్యలకు మెచ్చాడు. ఆమెను వరాన్ని కోరుకొనుమన్నాడు. 'నీ దయవలన నా కొక పుత్రుడు కలిగేటట్లు వరం ఇమ్ము' అని సత్యవతి ప్రార్థించింది. భృగుడు కరుణించి ఒక ఉపదేశం చేశాడు. కోడలు శుచిస్నాత అయిన తరువాత మేడిచెట్టును, ఆమె తల్లి, రావిచెట్టును కౌగిలించుకొనవలసిందని ఆదేశించాడు. ఆ తరువాత పొరపాటున వారిద్దరు వ్యత్యస్తంగా ఆ చెట్లను కౌగిలించుకొన్నారు. ఆ సంగతి భృగుడు తెలిసికొని ఇట్లా పలికాడు :

'సత్యవతీ! నీకు బ్రాహ్మణకుల పూజ్యుడైన పుత్రుడు పుట్టినా, వాడు పరాక్రమంతో దారుణ క్షత్రియ ప్రవృత్తితో వర్తిస్తాడు. నీతల్లికి పుట్టేవాడు క్షత్రియుడైనా తపస్వి అయి బ్రాహ్మణప్రవృత్తితో వ్యవహరిస్తాడు.' ఆమాట విని సత్యవతి తన కొడుకుకు కాక మనుమడికి ఆ దారుణ క్షత్రియ స్వభావం వచ్చేటట్లు అనుగ్రహించుమని ప్రార్థించి వరం పొందింది.

కొంతకాలానికి సత్యవతికి జమదగ్ని పుట్టాడు. అతడు ప్రసేనజితుడి కూతురైన రేణుకను పెండ్లాడాడు. వారిరువురికి ఐదుగురు కొడుకులు పుట్టారు. వారు - రుమణ్వంతుడు, సుషేణుడు, వసువు, విశ్వావసుడు, రాముడు అనేవారు. జమదగ్ని ఉగ్రతపస్సులో మునిగి ఉన్నాడు. ఒకనాడు కొడుకులందరూ అడవికి పండ్లు తెచ్చేందుకు పోయారు. రేణుక ఒక సరోవరంలో చిత్రరథుడనే రాజు భార్యలతో జలక్రీడలాడటం గమనించింది. ఆ దృశ్యాన్ని తిలకించిన ఆమె హృదయం చలించింది. ఆ మానసిక వ్యభిచారాన్ని తెలిసికొన్న జమదగ్ని మహర్షి కోపోద్రిక్తుడైనాడు. తల్లిని చంపండని కొడుకుల నాజ్ఞాపించాడు. మొదటి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నలుగురూ తండ్రి ఆనతిని తిరస్కరించారు. వారిని అడవులలో పక్షులుగా తిరగండని ఆయన శపించాడు. పరశురాముడు తండ్రిమాటను శిరసావహించి రేణుకశిరస్సును ఖండించాడు. జమదగ్ని మెచ్చి పరశురాముడిని వరాలు కోరుకొనుమన్నాడు. అతడు తల్లిని బ్రతికించుమన్నాడు. ఆమెను చంపిన పాపం తనకు రాకుండ అనుగ్రహించుమన్నాడు. సోదరుల శాపాన్ని తొలగించుమన్నాడు. యుద్ధాలలో తనకు ఓటమి లేని శక్తిని, దీర్ఘాయువును ప్రసాదించుమన్నాడు. తండ్రివలన ఆ వరాలన్నీ పొంది ఆనందంతో ఉన్నాడు.

కొంతకాలం తరువాత హైహయుడైన కార్తవీర్యుడు అపారసైన్యంతో ఆశ్రమానికి వచ్చాడు. జమదగ్నిచేత అతిథి సత్కారాలు పొందాడు. కాని, రాజ్యమదం గల అతడికి మెప్పు కలుగలేదు. అందుకని ఆశ్రమవాసులను అవమానించాడు. ఆశ్రమ వృక్షాలను ధ్వంసంచేశాడు. జమదగ్ని హోమ ధేనువును తరుణవత్సంతో (పసిదూడతో) సహా కట్టి లాగికొని పోయాడు. అప్పుడు అడవిలోనుండి సమిత్కుశఫలాలతో పరశురాముడు తిరిగివచ్చాడు. తండ్రివలన విశేషాలు తెలిసికొని, తండ్రి ప్రేరణతో కార్తవీర్యుడిని వెన్నంటి, ఎదురించి, యుద్ధంచేసి, అతడిని రణంలో చంపి కసితీర్చుకొన్నాడు. కపిల ధేనువును ఆశ్రమానికి తెచ్చాడు. తండ్రి మనస్సును సంతోషపెట్టాడు.

కార్తవీర్యుడి పుత్రులు పగపట్టారు. పరశురాముడు ఆశ్రమంలో లేని సమయం చూచికొని జమదగ్న్యాదులపై దాడిచేశారు. ఆశ్రమవాసులను అవమానాల పాలుచేశారు, జమదగ్నిని పట్టి కొట్టి హింసించి 'హా రామా!, హా రామా!' అని అతడు ఆక్రందనం చేస్తూ ఉండగా అతడిని దారుణంగా వధించారు. ఆ దారుణ సంఘటన చూచి రేణుక ఆశ్రమం దద్దరిల్లేటట్లు రోదించింది. పరశురాముడు వచ్చి జరిగినదంతా తెలిసికొని మదాంధులైన క్షత్రియులను సంహరిస్తానని ఘోరప్రతిజ్ఞ చేశాడు. రాజలోకాన్ని నిర్దాక్షిణ్యంగా తన పరశువుతో ఖండించి భూవలయాన్నంతా సాధించి, దానిని యజ్ఞదక్షిణగా కశ్యపుడికి దానం చేశాడు. చివరకు మహేంద్రపర్వతంమీద తపస్సు చేసికొంటూ నిత్యుడై ఉన్నాడు - అని చెప్పగా విని ధర్మరాజాదులు చతుర్దశినాడు పరశురాముడిని దర్శించి, పూజించి సంతుష్టులైనారు.

ధర్మరాజు అక్కడినుండి దక్షిణగంగ అయిన గోదావరీనదిని దర్శించి అందులో స్నానం చేసి, గోదానాలు, హేమరత్నదానాలు చేసి బ్రాహ్మణులను పూజించాడు. అక్కడినుండి ద్రవిడదేశంలోని అగస్త్యతీర్థాన్ని సేవించాడు. అక్కడ పూర్వం అర్జునుడు చేసిన దానాలను గురించి తెలిసికొని సంతోషించాడు. ఆపై క్రమంగా శూర్పారక తీర్థాన్నీ, సముద్ర తీరంలోని ప్రభాస తీర్థాన్నీ దర్శించాడు. అక్కడ పన్నెండు రోజులు పంచాగ్ని మధ్యంలో గాలిని నీరును సేవిస్తూ తపస్సు చేశాడు.

ఆ సంగతి తెలిసికొని బలరామకృష్ణులు వచ్చి తీర్థయాత్రాసేవలలో కృశించిన పాండవులను, ద్రౌపదిని చూచి, ఓదార్చారు. అర్జునుడి దివ్యాస్త్ర లాభవృత్తాంతాన్ని విని సంతోషించారు. బలరాముడు కౌరవుల దుర్గుణాలను నిందించాడు. కౌరవులను రాజ్యభ్రష్టులను చేసి, ధర్మాత్ములైన పాండవులకు రాజ్యం చెందేటట్లు చూడాలని తమవారిని ప్రోత్సహించాడు. అతడి మాటలను సాత్యకి సమర్థించాడు. వారిద్దరి మాటలను శ్రీకృష్ణుడు సమర్థించి, శత్రువులను జయించి ధర్మజుడికి రాజ్యం కట్టబెడతామని అన్నాడు. ధర్మరాజు తాను భీష్మాదుల యెదుట చేసిన ప్రతిజ్ఞను వమ్ముచేయటం ధర్మం కాదని శ్రీకృష్ణాదులకు నచ్చచెప్పి, వారిని ద్వారకకు తిరిగి పంపాడు.

ధర్మరాజు క్రమంగా పుణ్యతీర్థాలను సేవిస్తూ నర్మదలో స్నానం చేసి వైడూర్యపర్వతాన్ని దర్శించాడు. అక్కడి శర్యాతి యజ్ఞ స్థలాన్నీ, చ్యవనుడు ఇంద్రుడిని మన్నించక అశ్వినులను సోమపీథులను చేసిన సోమమిశ్రిత తీర్థాన్నీ చూచి, ఆ కథను చెప్పుమని రోమశుడిని అడిగాడు. అప్పుడు రోమశుడు సౌకన్యాఖ్యానం చెప్పాడు.

సుకన్య కథ :

భృగుపుత్రుడైన చ్యవనుడు వీరాసనంలో పెక్కేండ్లు తపస్సు చేశాడు. అతడి మీద పుట్టలు గుట్టలు పెరిగాయి. అతడి కన్నులు మాత్రం మిలమిల లాడుతూ ఆ పుట్టలో మెరుస్తూ ఉంటాయి.

ఒకసారి శర్యాతి అనేరాజు తన నాలుగువేల మంది రాణులతో అక్కడికి వనవిహారానికై వచ్చాడు. అతడి కూతురు సుకన్య చెలికత్తెలతో తిరుగుతూ చ్యవనుడి కనుల కాంతులను చూచి మిణుగురు పురుగులుగా భ్రమించి ఆపుట్టను త్రవ్వించింది. అందుకు చ్యవనుడు కోపించి శర్యాతి సైన్యానికి మలమూత్రాలు కట్టుకొనేటట్లు చేశాడు. ఆ విపత్తుకు కారణం తెలియక రాజు తహతహలాడాడు. సుకన్య పోయి తాను చేసిన పొరపాటును తండ్రికి చెప్పింది. శర్యాతి చ్యవనుడి వద్దకు వచ్చి తనకూతురి తప్పును మన్నించి సైన్యాన్ని కాపాడుమని ప్రార్థించాడు. చ్యవనుడు సుకన్య నిచ్చి వివాహం చేస్తే మేలుచేస్తానన్నాడు. శర్యాతి దాని కంగీకరించి సుకన్యా చ్యవనుల వివాహం జరిపించి సుఖంగా నగరానికి వెళ్ళాడు.

వృద్ధుడైన చ్యవనుడితో నవయౌవన విలాసవతి అయిన సుకన్య కలిసి కాపురం చేస్తున్నది. ఒకనాడు అశ్వినీ దేవతలు ఆమెకు ఎదురుపడి ఆమె యౌవనం వృద్ధుడైన పతివలన అడవికాచిన వెన్నెలై పోతున్నదని జాలిపడి, ఆమె కోరితే ఆమె వయోరూపాలకు తగిన వరుడిని సృజిస్తామని అడిగారు. ఆమె తనభర్తయందలి అనురాగంతో వారి మాటలను తృణీకరించింది. అంతేకాదు, వారి మాటలు తన మగడికి తెలియజెప్పింది. చ్యవనుడు ఆమె ఉత్తమ శీలానికి హర్షించి అశ్వినీదేవతలు చెప్పినట్లు అంగీకరించుమన్నాడు. మరునాడు అశ్వినీదేవతలను 'తనకు తగిన యువవరుడిని' వరంగా కోరింది. వారు సమీప సరోవరంలో ప్రవేశించారు. వారితోపాటు చ్యవనుడు కూడా ఆ నీటిలో మునిగాడు. అందరూ ఒకే విధమైన నవయౌవన విలాసాకారులై వెలుపలికి వచ్చారు. వారిలో ఒక్కరిని వరుడిగా కోరుకొమ్మన్నారు ఆశ్వినులు. సుకన్య తన భర్తనే ఎన్నుకొన్నది. అందుకు ఆశ్వినులు హర్షించి ఆమెను ఆశీర్వదించారు. తనకు నవయౌవనం రావటంలో తోడ్పడిన ఆశ్వినులను శర్యాతిచేత చేయించే యజ్ఞంలో సోమపీథులను చేస్తానని చ్యవనుడు వాగ్దానం చేశాడు. ఆశ్వినులు సంతోషించారు.

ఇచ్చిన మాట ప్రకారం ఆ తరువాత చ్యవనుడు శర్యాతిచేత యజ్ఞం తానే చేయించి, అందులో ఇంద్రుడు వలదని వారించినా అతడితో వాదించి ఆశ్వినులకు సోమపానం అందించబోయాడు. ఇంద్రుడు వజ్రాయుధంతో చ్యవనుడిని చంపబోయాడు. ఆ మహర్షి అగ్నిలోనుండి మదుడనే రాక్షసుడిని సృష్టించి ఇంద్రుడిపై ప్రయోగించాడు. అతడి రౌద్రానికి భయపడి ఇంద్రుడు చ్యవనుడిని శరణువేడాడు. ఆశ్వినులను సోమార్హులుగా ఇంద్రు డంగీకరించాడు. చ్యవనుడు ఆ రాక్షసుడిని మద్య స్త్రీ మృగయాక్షాలను ఆశ్రయించుమని నిర్దేశించాడు. ఆశ్వినులు సోమపీథులై సంతృప్తి చెందారు.

మాంధాతృ చరిత్రం :

ధర్మజుడు యమునానదిని దర్శించాడు. దాని తీరంలో మాంధాతృడు బహు సంవత్సరాలు యజ్ఞాలు చేశాడని రోమశుడు చెప్పాడు. మాంధాతృ వృత్తాంతం చెప్పుమని ధర్మరాజు రోమశుడిని అడిగాడు. ఆ ముని ఈ విధంగా చెప్పాడు.

పూర్వం యువనాశ్వుడనే ఇక్ష్వాకు వంశ ప్రభువు వేయి అశ్వమేధయాగాలు చేసి కీర్తికెక్కాడు. కానీ, అతడికి సంతానం లేదు. సంతానార్థి అయి భృగుడి ఆశ్రమానికి వెళ్ళి చాలాకాలం అతడిని సేవించాడు. భృగుడు కరుణించి అతడిచేత పుత్రకామేష్టి చేయించాడు. అందులో మంత్రజలంతో నిండి పుత్రుడు కలగటానికి కారణమైన ఒక కలశం ఉద్భవించింది. దానిని ఒకరాత్రి మునుల రక్షలో ఉంచాడు. మును లా రాత్రి అలసి నిద్రపోయారు. యువనాశ్వుడు అర్ధరాత్రివేళ దప్పికకు తాళలేక ఆ కలశంలోని నీటిని తెలియక త్రాగాడు. మరునాడు భృగువు ఆ సంగతి తెలిసికొని రాణి త్రాగవలసిన మంత్రజలాన్నే యువనాశ్వుడు త్రాగటం వలన అతడికే ఒక కొడుకు పుట్టుతాడని చెప్పాడు. రాజు రాజధానికి చేరాడు. నూరేండ్లకు యువనాశ్వుడి ఎడమ ప్రక్కను చీల్చుకొని ఒక కొడుకు పుట్టాడు. బాలసూర్యుడివలె వెలిగిపోయే అతడిని దర్శించటానికి ఇంద్రుడు వచ్చాడు. ఆతడి నోటిలో తన జుట్టనవ్రేలును పెట్టి అమృతమయమైన దానిని త్రావుమన్నాడు. (మాం= నన్ను; ధయ= త్రాగుము (ధేట్= పానంచేయటం); నన్ను (ఇంద్రుడిని, అమృతాన్ని) పానంచేసే వాడు= మాంధాతృడు-అనే అర్థం కలిగించే మాటలన్నాడు ఇంద్రుడు ఆ సమయంలో.) ఆ ఇంద్రుడి మాటలు ఆధారంగా దేవతలందరు అతడిని మాంధాతృడని పేరుపెట్టి పిలిచారు. అతడికి ధ్యానమాత్రంతో వేదశాస్త్రాలన్నీ వచ్చాయి. ధనుర్వేదం, శస్త్రాస్త్రప్రయోగ నైపుణ్యం అలవడ్డాయి. ఇంద్రు డాతడిని భూతలానికి ప్రభువుగా అభిషిక్తుడిని చేశాడు. తన అర్ధ సింహాసన గౌరవాన్నిచ్చి మన్నించాడు. ధనువునూ, అభేద్యకవచాన్నీ

ప్రసాదించాడు. వాటితో మాంధాతృడు సకలలోకాలను జయించి, సంపూర్ణ దక్షిణలతో అనేక యజ్ఞాలు చేసి, పద్మసంఖ్యల గోవులను బ్రాహ్మణులకు దానంగా ఇచ్చాడు. ఒకసారి దేశంలో అనావృష్టి ఏర్పడగా ఇంద్రుడితో యుద్ధం చేశాడు. బాణాలతో ఏనుగులను కొట్టినట్లు మేఘాలను కొట్టి వానలు కురిపించాడు. అటువంటి మాంధాతృడు యజ్ఞంచేసిన పుణ్యస్థలాన్ని ధర్మరాజు దర్శించాడు.

సోమకుడి చరిత్రం :

పూర్వం కురుక్షేత్రంలోని సరస్వతీ నదీ తీరంలో సోమకుడు యజ్ఞం చేసి నూరుమంది కొడుకులను కన్న వృత్తాంతాన్ని రోమశుడు చెప్పగా, ఆ కథను వివరించుమని ధర్మజు డడిగాడు.

సోమకుడు మహాయజ్ఞం ఒకటి చేసి జంతుడు అనే కొడుకును పొందాడు. సోమకుడికి నూర్గురు భార్యలు. వారందరూ ఆ బాలుడిని సమమైన ప్రేమతో పెంచారు. ఒకనాడు ఆ బాలుడి తొడకు చీమ కుట్టింది. అతడు ఆ ఆవేదన భరించలేక పెద్దగా ఏడ్వటం మొదలు పెట్టాడు. తల్లులందరు గుమికూడి అతడిని లాలించారు. సోమకుడు ఆ ఆక్రందన విని నిండు కొలువునుండి వచ్చి కొడుకును ఓదార్చాడు. ఆ పరిస్థితిని గమనించి తనకు ఒకడికంటె ఎక్కువమంది కొడుకు లుండటం అవసరమని గుర్తించి మంత్రులను, ఋత్విక్కులను పిలిపించి వారిని బహుపుత్రలాభానికి తగిన ఉపాయాన్ని చెప్పండని కోరాడు. వారందరూ ఆలోచించి సోమకుడి ఏకైక పుత్రుడైన జంతుడిని బలిపశువుగా చేసి, అతడి మెదడును హవ్యంగా హోమంచేసి, అగ్నిని తృప్తుడిని చేస్తే దానివలన నూరుగురు కొడుకులు పుడతారని సూచించారు. అంతేకాక జంతుడు బంగారుమయమైన ఎడమభాగంతో మరల పుట్టి అగ్రజుడుగా ఉంటాడని చెప్పారు. రాజు యజ్ఞానికి అంగీకరించాడు. ఋత్విజుడు జంతుడిని హుతం చేస్తుంటే రాణులు రోదించారు. ఆ యజ్ఞంనుండి వెలువడిన ధూమాన్ని వాసనచూచి రాణులు గర్భవతులైనారు. ఆ తరువాత రాణులు నవమాసాలు మోసి జంతుడు మొదలుగా నూరుగురు కొడుకులను కన్నారు. కొంతకాలానికి ఆ యజ్ఞం చేయించిన ఋత్విజుడు చనిపోయి నరకంలో పడి పడరాని యాతనలు అనుభవిస్తూ ఉన్నాడు. సోమకుడు మృతిచెంది పుణ్యలోకాలకు పోతూ ఋత్విజుడి నరకయాతనలు చూచి జాలి చెందాడు. తనవలన ఋత్విజుడికి నరకం వచ్చిందని తెలిసి, తన తపోయజ్ఞపుణ్యంలో కొంత ధారపోసి యముడి ఆజ్ఞ పొంది అతడికి కూడా ఉత్తమలోకాలు కలిగేటట్లు చేశాడు.

ఇట్లా అనేక తీర్థాలను దర్శింపచేస్తూ వాటి మహిమలు తెలిపే కథలు చెపుతూ రోమశుడు ధర్మరాజును కృతార్థుడిని చేస్తూ ఉన్నాడు. నాభాగుడు, అంబరీషుడు, నహుషుడు, యయాతి, భరతుడు యజ్ఞాలు చేసిన క్షేత్రాలను, నరనారాయణాశ్రమాన్ని దర్శించి ధర్మరాజు ప్లక్షావతరణం అనే యమునాతీర్థంలో స్నానం చేశాడు. ఆ తీర్థంలో పూర్వం భరతుడు స్నానం చేస్తూ సర్వలోకాలను దర్శించగలిగాడు. అట్లాగే ధర్మరాజు కూడా చూడగలిగాడు. అపుడే ఇంద్రుడి అర్ధ సింహాసనం మీద కూర్చొని శోభిల్లుతున్న అర్జునుడిని కూడా కన్నులారా చూచి ఆనందించాడు. అట్లా అనేక తీర్థాలను సేవిస్తూ భృగుతుంగ పర్వతాన్ని చేరాడు. అక్కడ శిబి చక్రవర్తి యజ్ఞం చేసిన క్షేత్రం చూచాడు. ఇంద్రాగ్నులు శ్యేన కపోతాల రూపాలలో వచ్చి, అతడి దానగుణాన్ని పరీక్షించిన కథను రోమశుడు ధర్మరాజుకు వివరించి చెప్పాడు.

అష్టావక్ర చరితం :

ఆ తరువాత ధర్మరాజు శ్వేతకేతుడి తపోవనం దర్శించాడు. అక్కడి సరస్వతీదేవి మనుష్య స్త్రీ రూపంతో శ్వేతకేతుడిని సేవించింది. మేనల్లుడు, మేనమామ అయిన అష్టావక్ర శ్వేతకేతులు అక్కడ ఉగ్రతపస్సు చేశారని రోమశుడు చెప్పాడు. అప్పుడు ధర్మరాజు అష్టావక్రచరిత్ర వినకోరాడు.

పూర్వం ఏకపాదుడు అనే మునివరుడు విద్యావంతుడై సుజాతను వివాహమాడి, అరణ్యంలో ఘోరతపస్సు చేస్తూ ఉన్నాడు. అత డెప్పుడూ శిష్యులచేత వేదాలను చదివిస్తూ ఉండేవాడు. చాలకాలానికి సుజాత గర్భవతి అయింది. ఆమె

గర్భంలో ఉన్న శిశువు తండ్రితో ఇట్లా అన్నాడు: 'విశ్రాంతి లేకుండా నిరంతరం వేదాన్ని చదవటంవలన విద్యార్థులు నిద్రచాలక జడమతులైపోతారు' అని ఉపాలంభించాడు. అందుకు ఏకపాదుడికి కోపం వచ్చింది. వేదాధ్యయనానికి వక్రంగా పలికాడు కాబట్టి ఆ గర్భస్థ శిశువు ఎనిమిది వంకలు గల శరీరంతో పుట్టేటట్లు ఏకపాదుడు శపించాడు. అందువలన ఆ శిశువు అష్టావక్రుడుగా పుట్టి ఆ పేరుతో ప్రసిద్ధికెక్కాడు.

సుజాతకు నెలలు నిండుతున్నాయి. ఇంట్లో నెయ్యి, నూనె, ఆహారపదార్థాలు నిండుకొన్నాయి. ప్రసూతి కానున్న సుజాత తన భర్తను వాటిని సంపాదించి ఇంట్లో ఉంచుమని కోరింది. ఏకపాదుడు ధనసంపాదనకై జనకమహారాజు చేస్తున్న యజ్ఞం దగ్గరికి పోయాడు. అక్కడ వందితో జరిగిన వాదంలో ఓడిపోయి నియమం ప్రకారం జలావాసం చేస్తూ అక్కడే బందీగా ఉండిపోయాడు.

ఇక్కడ ఆశ్రమంలో సుజాతకు అష్టావక్రుడు పుట్టాడు. అప్పుడే ఉద్దాలకుడి భార్య శ్వేతకేతువును కన్నది. అష్టావక్ర శ్వేతకేతు లిద్దరూ అన్యోన్యంగా ఏకోదరులవలె అన్నదమ్ములుగా పిలుచుకొంటూ పన్నెండేళ్ళు కలిసి విద్యాభ్యాసం చేశారు. ఉద్దాలకుడే ఇద్దరికి గురువు. ఒకనాడు అష్టావక్రుడు ఉద్దాలకుడిని తండ్రిగా పిలుస్తూ అతడి తొడమీద కూర్చున్నాడు. శ్వేతకేతువు దానిని సహించలేక అష్టావక్రుడిని 'నీతండ్రితొడమీద నీవు కూర్చో' అని పంపివేశాడు. అంతవరకు తనకు తండ్రి ఉద్దాలకుడే అని భావిస్తున్న అష్టావక్రుడు తల్లివలన తన తండ్రి సంగతి తెలిసికొని, మామగారైన శ్వేతకేతుని వెంటబెట్టుకొని జనకుడి యజ్ఞానికి పోయి, వందిని వాదంలో ఓడించి, తండ్రిని బందీ నుండి విడిపించి, ఆనందంగా ఆశ్రమానికి తీసికొనివచ్చాడు. ఇది అష్టావక్రుడి కథ.

ధర్మరా జనేక పుణ్యస్థలాలను దర్శిస్తూ భరద్వాజాశ్రమాన్ని చేరాడు. అక్కడ భరద్వాజ పుత్రుడైన యవక్రీతుడు విద్యాగర్వంతో విగతజీవుడైన కథను రోమశుడు ధర్మరాజుకు చెప్పాడు.

యవక్రీతుడి కథ :

రైభ్యుడు, భరద్వాజుడు, ప్రాణమిత్రులైన తపస్వులు. రైభ్యుడికి అర్వావసుడు, పరావసుడు అనే వా రిద్దరు కొడుకులు. ఇద్దరూ వేదవిద్యలో పండితులు. భరద్వాజుడి కొడుకు యవక్రీతుడు. అతడు తపస్సుతో వేదశాస్త్రాలన్నింటిని సాధించదలచి అగ్నిలో సంధార్యంబు సంధిస్తూ ఉగ్రతపస్సు చేశాడు. ఇంద్రు డాతడి తపస్సును సహించలేక వచ్చి తపస్సుకు కారణ మేమిటని అడిగాడు. చదువకుండానే చదువు లెల్ల రావాలని తపస్సు చేస్తున్నా నని యవక్రీతుడు చెప్పాడు. 'చదువు లెప్పుడూ గురువుల వద్ద నేర్చుకొన తగినవి. అట్లా నేర్చుకొనకపోతే ఎంతటి మంచివారికైనా మదమాత్సర్యాలు ఏర్పడతాయి. కాబట్టి గురుశుశ్రూషయే సద్విద్యోపాయం. తపస్సు కాదు' అని ఇంద్రుడు చెప్పి ఆ ప్రయత్నం మానుమని హితవు పలికాడు. కాని, యవక్రీతుడు ఇంద్రుడిమాట పట్టించుకొనక తపస్సు కొనసాగించాడు. ఇంద్రుడు అతడికి ఒక గుణపాఠం చెప్పాలని తలచుకొని ఒక ముసలివాడి రూపంతో వణుకుతూ గుప్పెళ్ళతో ఇసుకను తీసికొని గంగాప్రవాహానికి ఆనకట్ట కట్టటానికి ప్రయత్నిస్తూ కనపడ్డాడు. యవక్రీతుడు అతడిని చూచి నవ్వాడు. ఇంద్రుడు తన ప్రయత్నం యవక్రీతుడి ప్రయత్నం వంటిదే అని ఎగతాళి చేశాడు. అఘటమానమైన అర్థాన్ని గురించి ప్రయత్నం చేయటం తెలివితక్కువతనమని ఇంద్రుడు పలికాడు. అయినా, యవక్రీతుడు పట్టుదలతో తపస్సు చేసి ఇంద్రుడి వలన వేద వేదాంగ విద్యలను పొందాడు.

దేవేంద్రుడి అభిప్రాయాన్ని యవక్రీతుడు భరద్వాజుడికి తెలిపాడు. భరద్వాజుడు కూడ దేవగీతలలోని అర్థాలను వివరించి చెప్పి ఇంద్రుడి అభిప్రాయాన్నే బలపరిచాడు. తపస్సువలన విద్యను గడించినా గర్వాతిశయాన్ని పొందక రైభ్యుడి కొడుకులతో మాత్సర్యం పెట్టుకొనకుండా స్నేహంతో మెలగాలని హితవు పలికాడు. అందుకు యవక్రీతుడు అంగీకరించాడు. కాని, యథాప్రకారం అతడు మునిసభలలో తన విద్యావిభవాన్ని ప్రదర్శిస్తూ రైభ్యాశ్రమం చేరాడు. ఆ ఆశ్రమ వనంలో పరావసుభార్య రైభ్యుడి కోడలు అయిన కృష్ణను చూచి మోహితుడై ఆమె యెదుట తన కోర్కెను బయటపెట్టాడు. అంగీకరించకపోతే శపిస్తాడేమోననే భయంతో కృష్ణ సిగ్గును అభినయించి మరునాడు సంకేత స్థలానికి వస్తానని చెప్పి వెళ్లింది. జరిగిన దాన్ని రైభ్యుడికి నివేదించింది.

అతడు ఉగ్రుడై ఒక జటను అగ్నిలో వేసి కృష్ణవంటి మరొక వనితను, మరొకజటను కాల్చి భయంకర రాక్షసుడిని సృజించి యవక్రీతుడిని సంహరించటానికై వారిద్దరినీ నియోగించాడు. ఆ మాయాకృష్ణ సంకేతస్థలానికి పోయి యవక్రీతుడి కమండలాన్ని గ్రహించింది. దానితో అతడి తపోమహిమ నశించింది. ఆ పైన కృత్యాకారంతో ఉన్న రాక్షసుడు అతడిని భక్షించటానికి పూనుకొన్నాడు. యవక్రీతుడు పలాయనం చిత్తగిస్తూ అనేక జలాశయాల్లో దాగుకొనటానికి ప్రయత్నంచగా అవన్నీ ఎండిపోవటంతో అతడికి భద్రత లేకపోయింది. చివరకు యవక్రీతుడు తన ఇంట్లో ఉన్న యజ్ఞాగ్నిలో దూకబోయాడు. కాని, అంతలోనే రాక్షసుడు అతడిని పట్టి వధించాడు.

భరద్వాజుడు ఆశ్రమానికి తిరిగివచ్చి తనకొడుకు చనిపోవటం గమనించి అపారశోకానికి గురి అయి, ఆ కొడుకు చితి పై పడి తానూ మరణించాడు.

బృహద్ద్యుమ్నుడనే రాజు సత్రయాగం చేయ తల పెట్టి రైభ్యుడి కొడుకులను ఋత్విక్కులనుగా వరించాడు. యజ్ఞం నిర్విఘ్నంగా సాగుతున్నది. ఒకనాడు పరావసుడు ఒంటరిగా ఆశ్రమానికి వస్తున్నాడు. తెల్లవారు జామున చీకట్లో చిట్టడవిలో దూరంగా ఎదురుగా వస్తున్న తండ్రిని మృగంగా భ్రమించి ఆత్మసంరక్షణార్థం సంహరించాడు. ఆ తరువాత నిజం తెలిసి విచారించాడు. తండ్రికి అపరకర్మలు చేసి సత్రయాగశాలకు వెళ్ళి జరిగిన పొరపాటు అన్నకు నివేదించాడు. అన్నను బ్రహ్మహత్యాదోషానికి ప్రాయశ్చిత్తం చేయుమని వేడుకొన్నాడు. యజ్ఞాన్ని తా నొక్కడే నిర్వహించటానికి పూనుకొన్నాడు. అర్వావసుడు తమ్ముడి మాటను మన్నించి బ్రహ్మహత్యా ప్రాయశ్చిత్త కాండను జరిపి తిరిగి వచ్చాడు. అప్పుడు పరావసుడు తన అన్న బ్రహ్మహత్య చేశాడని రాజుకు చెప్పి అతడిని యజ్ఞం నుండి వెలివేయించటానికి కపటోపాయం పన్నాడు. కాని, అర్వావసుడి సత్యవర్తనాన్ని అగ్నిపురోగాములైన దేవతలు ప్రకటించారు. అతడికి వరాల నివ్వటానికి ప్రసన్నులయ్యారు. అప్పుడు అర్వావసుడు తన తండ్రి అయిన రైభ్యుడేకాక మృతులైన భరద్వాజుడు, యవక్రీతుడుకూడా జీవించాలనీ, తనతమ్ముడు పరావసుడిచేత చంపబడినట్లు తన తండ్రికి జ్ఞాపకం ఉండకుండా చేయాలనీ వరాలు వేడుకొన్నాడు. దేవతలు, వాటిని ప్రసాదించారు. యవక్రీతుడు బ్రతికి, దేవతలను ఇట్లా అడిగాడు: 'నేనూ రైభ్యుడి వలెనే బహు వేదశాస్త్ర విజ్ఞానాన్ని ఆర్జించాను. కాని, రైభ్యుడిచేత నే నెందుకు చంపబడ్డాను? అతడి కా ఆధిక్యత ఎట్లా వచ్చింది? అని, ఆ ప్రశ్నకు దేవత లిట్లా సమాధానం చెప్పారు: 'గురుశుశ్రూష చేస్తూ అనేక కష్టాలకు లోనై సాధించిన విద్యలే మహిమాన్వితాలు. గురుముఖతః నేర్వని విద్యలు ఎప్పుడూ ప్రకాశించలేవు'. ఇదియే యవక్రీతుడి కథా సందేశం.

ఆపైన ధర్మరాజాదులు కాలశైలాన్ని, సప్తవిధగంగను దర్శించారు. మనుష్యులు చర్మచక్షువులతో చూడలేని మందర పర్వతాన్ని, కైలాస పర్వతాన్ని ఆ క్షేత్రంలో ధ్యానసమాధిలో ఉండి చూడగలిగారు. అప్పుడు ధర్మరాజు భీముడితో ఇట్లా అన్నాడు: 'నడవటానికి సాధ్యంకాని ఈ మార్గంలో రథాలతో పోవటం సాధ్యం కాదు. కాబట్టి నేనూ నకులుడూ కలిసి ముందున్న తీర్థయాత్రలు చేసివస్తాం. మిగిలిన మీరందరూ ఇక్కడే ఉండండి' అని. ఆ మాటలకు భీముడు అంగీకరించలేదు. ధర్మరాజును వీడి మేము క్షణముండ లేమని తెలిపారు. ధౌమ్యుడి సలహామేరకు పాండవులు తపోమహిమతో గంధమాదన పర్వతం చేరాలని నిశ్చయించారు. మార్గమధ్యంలో పుళిందపతి అయిన సుబాహుడి నగరంలో రథాలను, సేనలను, భృత్యులను ఉంచి పాదచారులై గంధమాదనంవైపు నడిచి, అర్జునుడిని అక్కడ చూడగలమనే ఉత్సాహంతో ముందుకు సాగారు.

మార్గమధ్యంలో పాండవులు పెను తుఫానుకు గురి అయ్యారు. ద్రౌపది ఆ గాలివానకు తట్టుకొనలేక మూర్ఛితురాలైంది. రాత్రింబవళ్ళు స్వీయరక్షణకొరకు పాండవులు కష్టపడ వలసి వచ్చింది. గంధమాదన పర్వతశిఖరాలు నిటారుగా ఉన్నాయి. ఎక్కటం సాధ్యంకాని పనిగా తోచింది. భీముడు ఘటోత్కచుడిని స్మరించాడు. అతడు రాక్షస సేనతో వచ్చి, పాండవులను, వారి పరివారాలను మూపులమీద ఎక్కించుకొని ఆకాశమార్గంలో పయనించి, గంగాతీరంలోని నరనారాయణాశ్రమంలోని బదరీవనంలో దింపాడు. ధర్మరాజాదులు భాగీరథిలో స్నానాలు చేశారు. సమాధియోగంలో నిలిచి మైనాకపర్వతాన్నీ, హిరణ్య శిఖరాన్నీ, బిందుసరస్సునూ దర్శించారు. బదరీవనంలో ఆరు రోజులున్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సౌగంధికాపహరణం :

ఒకనాడు ద్రౌపదీ భీములు గంధమాదన పర్వత సానువులలో విహరిస్తున్నారు. అప్పుడు వారి యెదుట సహస్రపత్రాలు గల కోమలమైన కమలపుష్ప మొకటి గాలికి ఎగిరి వచ్చి పడింది. దాని అపూర్వమైన అందానికీ, సుగంధానికీ ద్రౌపది మోజు పడింది. అటువంటిపూలు తనకు కావాలని భీముడిని కోరింది. ఆ అపూర్వ పుష్పాలను చూపటానికి ధర్మరాజు వద్దకు పోయింది. ద్రౌపది మనసుపడి కోరిన ఆ కోరికను తీర్చాలని భీముడు ఉత్సాహపడ్డాడు. గదాధనుర్ధరుడై ఆ పూవు గాలికి వచ్చిన దిక్కువైపు బయలుదేరాడు. ఘోరాటవులను, పర్వత శిఖరాలను దాటాడు. వన్యమృగాలను హేలగా చంపాడు. ఒక రమణీయ సరోవరాన్ని చూచి అందులో స్నానం చేశాడు. ఆ పైన విశాలమైన అరటి తోటలను చూచి, అందులో ప్రవేశించి శంఖాన్ని పూరించాడు. ఆ శంఖనాదం పిడుగుపాటువలె దిక్కులు పిక్కటిల్లేటట్లు చేసింది. ఒక కొండగుహలో ఉన్న హనుమంతుడు ఆ శంఖధ్వని విన్నాడు. అది భీమనాదమని పొంగిపోయాడు. భీముడి బాటలో చెట్లను విరిచి పడవేసి తాను అడ్డంగా పడుకొని, తోకతో నేలను తాడించాడు. ఆ మ్రోతకు భీము డాశ్చర్యపోయాడు. కదళీవనంలో తన దారి కడ్డంగా ఒక వృద్ధుడైన కోతి పడిఉండడం గమనించాడు. సింహనాదం చేశాడు. ముసలికోతిరాజు కన్నులు తెరిచాడు. 'జంతువులను హింసించటం మానవ ధర్మం కాదు కదా! మావంటి పేద జంతువులు భయపడేటట్లు సింహనాదం చేయటం న్యాయమా?' అని అడిగాడు వృద్ధకపీంద్రుడు. మనుష్య గోచరంకాని ఈ వనానికి వచ్చిన కారణమేమిటని భీమసేనుడిని ప్రశ్నించాడు.

భీముడు తనను గురించి వృద్ధవానరుడికి తెలియ చెప్పుకొని, తన బాటకు అడ్డం తొలగుమని కోరాడు. తొలగకపోతే శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని హనుమంతుడు దాటినట్లుగా నిన్నూ, ఈ పర్వతాన్నీ దాటిపోతానని ప్రతాపోక్తులు పలికాడు. హనుమంతుడి గురించి ముసలికోతిరేడు అడుగగా ఆ రామభక్తుడి పరాక్రమాన్ని భక్తితో కీర్తించాడు భీముడు. హనుమ సంతోషించి, భీముడి బలాన్ని పరీక్షించదలచాడు. అతడిని తన తోకను ప్రక్కకు నెట్టి పొమ్మన్నాడు. భీము డెంత ప్రయత్నించినా ఆ వృద్ధకపీంద్రుడి, వాలాన్ని కదిలించలేక పోయాడు. చివరకు వృద్ధకపీంద్రుడికి నమస్కరించాడు. హనుమ కరుణించి భీముడి కోరికపై తాను పూర్వం మహార్ణవాన్ని దాటిన రూపాన్ని ప్రదర్శించి చూపించాడు. చతుర్యుగ ధర్మాలను బోధించాడు. భీముడు ధన్యుడై హనుమ యొక్క బృహద్రూపాన్ని దర్శించాడు, కీర్తించాడు. హనుమ నిజరూపం తాల్చి, సౌగంధిక సరోవరం యక్షరాక్షస సంరక్షితమనీ సాహసం కంటె ఉపాయం శ్రేయస్కరమనీ, సర్వకార్యాలు మంత్రమూలాలనీ భీముడికి ప్రబోధం చేశాడు. కౌరవులందరినీ మట్టుపెట్టి మహారాజ్యాన్ని పాండవులకు అప్పగిస్తానని పలికాడు. ఆ మాటలు విని భీముడు - 'కపినాథా! మీకు ఆ పని ఎంత? మేము మా శత్రువులను జయించగలం. మీ దయవలన మమ్మల్ని ఓడించగల వీరులు మా శత్రువులలో లేరు' అని అన్నాడు. ఆ మాటలు విని హనుమంతుడు సంతసించి, 'నన్ను రణరంగంలో స్మరించండి. అర్జునుడి రథకేతనం మీద నిలిచి మీ పరాక్రమాల నన్నింటిని చూస్తాను' అని అనుగ్రహించి భీముడిని కౌగిలించుకొని సౌగంధిక సరోవరమార్గం చూపి అంతర్ధానం చెందాడు.

మదించిన ఏనుగుల గుంపులవలె క్రమ్ముకొంటున్న మేఘమాలికలను చూస్తూ భీముడు బంగారుకమలాలపై నుండి వీస్తున్న గాలికి సంతోషిస్తూ సౌగంధిక సరోవరం వద్దకు చేరాడు. రక్షకభటులైన యక్షరాక్షసులు అతడిని వారించారు. అది కుబేరవనమనీ, అందులోకి ఎవరూ పోలేరనీ, పోతే ప్రమాదమనీ, ఆ సరోవరం కుబేర క్రీడావినోదకేంద్రమనీ, దాని తీరంలో దేవర్షిగణాలు దేవతార్చనలు చేసికొంటూ ఉంటారనీ, ఆ సరోవరజలం అమృతతుల్యమనీ, అందులోని కమలాలు అపూర్వ వాసనలుగల బంగారు పూలనీ, వాటివి వైడూర్యనాళాలనీ వివరాలు చెప్పి, సాహసించ వద్దని హెచ్చరించారు. భీముడు సౌగంధిక పుష్పాల కొరకు వచ్చాడని తెలిసికొని, దానికి కుబేరుడి అనుమతి కావాలని పేర్కొన్నారు. ఆ మాటలు విని భీముడు మండిపడ్డాడు. ప్రకృతి పదార్థాలపై అందరికీ అధికార ముంటుందనీ, సత్క్షత్రియుడు ఎవరినీ యాచించడనీ తన పరాక్రమంతో అన్యధనాన్ని ఉపార్జించి అర్థులకు పంచిపెట్టటం అతడి ధర్మమనీ - తన చర్యను సమర్థించుకొంటూ సౌగంధిక సరోవరంలో దిగి జలాలు త్రాగి పుష్పాలు కోసికొని నిర్భయంగా బయటికి వచ్చాడు. అధిక బలసంపన్ను డయ్యాడు. కుబేరుడి భటులు భీముడితో యుద్ధానికి తలపడి ఓడి, పారిపోయి కుబేరుడికి నివేదించుకొన్నారు. భీముడు పాంచాలిని సంతోషపెట్టటానికి మాత్రమే చేసిన ఆ వీరకృత్యాన్ని తెలిసికొని కుబేరుడు మెచ్చుకొని మిన్నకున్నాడు. భీముడు విజయోత్సాహంతో సమీపవనంలో విహరిస్తున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మరాజాదు లున్నచోట మహోత్పాతాలు గోచరించాయి. అవి భీముడి యుద్ధం వలన కలిగిన ఫలితాలుగా ఊహించాడు- ధర్మరాజు. భీముడు సౌగంధికపుష్పాల కొరకై వెళ్ళినట్లు ద్రౌపదివలన తెలిసికొని వెంటనే ఘటోత్కచుడు మొదలైన వారి మూపులపై అందురూ ఎక్కి సౌగంధిక సరోవరతీరానికి వెళ్ళి భీముడిని కలిసికొన్నారు. భీముడిని ఏకాంతంగా సాహసాలు చేయవద్దని ధర్మరాజు హెచ్చరించాడు. ఆ తరువాత ఆ ప్రాంతంలో నివాసాలు ఏర్పరచుకొని నివసించారు. ఘటోత్కచాదులను వారి నిజప్రదేశాలకు పంపివేశారు.

జటాసురవధ :

జటాసురుడనే రాక్షసుడు బ్రాహ్మణ వేషంతో పాండవుల అండజేరి నివసించసాగాడు. తాను వేదవిదుడననీ, ధనుర్వేదవిదుడైన పరశురామ శిష్యుడననీ చెప్పి, వారిని నమ్మించాడు. ఒకనాడు భీముడు వేటకు పోయాడు. జటాసురుడు నిజాకారం ప్రకటించి ద్రౌపదినీ, ధర్మజనకులులనూ వారి ఆయుధాలనూ ఎత్తుకొని ఆకాశానికి ఎగసి వేగంగా వెళ్ళటమారంభించాడు. ధౌమ్యాదులు భయవిహ్వాలు లయ్యారు. సహదేవుడు భీముడిని పిలుస్తూ అడవులలో తిరిగాడు. భూమిపై నుండే జటాసురుడిపై దాడి సాగించాడు.

ధర్మరాజు ధర్మబుద్ధితో ఆ రాక్షసుడికి హితవు పలికాడు. 'దేవతలూ, రాక్షసులూ మానవులకు సుఖాల నందిస్తూ ఈ మనుజలోకాన్ని ఉపజీవించి ఉంటారు. ఆ మానవులను కాపాడేవాళ్లం మేము. అటువంటి మాకు అపకారం చేయటం నీకు ధర్మం కాదు. అన్నంపెట్టినవారికి అన్యాయం చేయకూడదనే కనీసధర్మంకూడ నీకు తెలిసినట్లులేదు. మా ఆయుధాలు మా కిచ్చి మాతో యుద్ధం చేయు' మన్నాడు. ఆ అసురుడు మాట వినలేదు. ధర్మజుడు అతడికి భారమయ్యేటట్లు నొక్కి పట్టాడు. జటాసురుడు ఉక్కిరిబిక్కిరై వేగం తగ్గించాడు.

అంతలో భీముడు రంగంలోకి దూకాడు. పరిస్థితిని గమనించాడు. రాక్షసుడిపై మండిపడ్డాడు. 'దుర్మార్గా! నీవు మాయింటికి అతిథివై వచ్చి, మాయింట కుడిచి రాక్షసుడివై మాకే అపకారం తలపెడతావా? అన్నం తిన్న చోటుకు అపకారం ఎటువంటి దుర్మార్గులు కూడా చేయరు. నీకు నిజంగా బుద్ధి ఉంటే వీరిని విడిచి పెట్టి, నీప్రాణాలు రక్షించుకో. లేదా హిడింబుడు, కిమ్మీరుడు చచ్చినట్లే నాచేతులలో నీ చావు మూడింది' అని మందలించాడు. జటాసురుడు మాట వినకపోగా భీముడినే చంపి హిడింబ కిమ్మీరులకు రక్తతర్పణా లిస్తానని ప్రగల్భా లాడాడు. భీముడు ఆగ్రహోదగ్రుడై జటాసురుడిపై లంఘించాడు. జటాసురుడు ధర్మరాజాదులను నేలపై దింపి, భీముడిపై తలపడ్డాడు. ఇరువురి నడుమ ద్వంద్వయుద్ధం ఘోరంగా జరిగింది. చివరకు భీముడు జటాసురుడిని పిడికిలితో పొడిచి క్రింద పడవేసి, మరల పైకెత్తి రాతిపై కొట్టి ముక్కలు చేసి చంపాడు. వాయుపుత్రుడి పరాక్రమాన్ని అందరూ ప్రశంసించారు.

యక్ష యుద్ధం :

పాండవులు నరనారాయణాశ్రమంలో కొన్ని రోజు లున్నారు. అర్జునుడు దివ్యాస్త్రాలను సంపాదించటానికై వెళ్ళి అప్పటికి ఐదేళ్లయింది. అన్నేళ్ళు అర్జునుడిని విడిచి ఉన్నందుకు, అతడిని చూడనందుకు ధర్మరాజు దిగులుపడ్డాడు. ఆ ప్రాంతంలో అర్జునుడి పునస్సమాగమం కలుగుతుందన్న ఆశతో పాండవులు ఉన్నారు. రోజులు లెక్కపెట్టుకొంటున్నారు.

గంధమాదన పర్వతంలోని పుణ్యతీర్థాల నన్నింటినీ సేవించారు. పదునేడవ రోజున వృషపర్వుడనే రాజర్షి ఆశ్రమం చేరుకొన్నారు. ఆతడిచేత అతిథి పూజలు పొంది అక్కడ ఏడురోజులున్నారు. బ్రాహ్మణులనందరినీ అక్కడ ఉంచి ధౌమ్యరోమశాదులతో కలిసి ధర్మజాదులు మాల్యవంత పర్వత ప్రాంతంలోని మనోహరమైన వనాలలో శ్వేతకీనదీతీరంలో విహరిస్తూ ఉన్నారు. అప్పుడు అయిదురంగుల వింత వాసనపూలు కొన్ని గాలికి ఎగిరి వచ్చి పాండవుల ముందు పడ్డాయి. అవి సౌగంధిక కనకపుష్పాలకంటె దివ్యసుగంధాలను వెదజల్లుతున్నాయి. వాటిపై ద్రౌపదికి మోజు కలిగింది. ఒకనాడు ఏకాంతంగా తన కాపువ్వులను తెచ్చిపెట్టుమని భీముడిని కోరింది. ద్రౌపదికి హృదయానందం కలిగించాలనే యత్నంతో భీముడు పూవులను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తేవటానికి ప్రయాణమయ్యాడు. చక్రవాళపర్వతం వలె ఎత్తుగా ఉండే ఆ పర్వతం ఎక్కాడు. అక్కడ వివిధ రత్నకాంతులతో వెలిగిపోతున్న కుబేరుడి నివాసాన్ని చూచాడు. భీముడు శంఖధ్వానం చేశాడు. అక్కడి యక్షసైన్యం ఒక్కుమ్మడిగా భీముడిపై దాడిచేసింది. వారి దాడిని ఎదుర్కొని భీముడు వారిని పోరులో ఓడించాడు. వారు పారిపోయారు. అయితే కుబేరుడి స్నేహితుడైన మణిమంతుడు లక్షలాది రాక్షసభటులను వెంటపెట్టుకొని భీముడిపై యుద్ధానికి సిద్ధమైనాడు. మణిమంతుడు బాణాలవర్షాన్ని భీముడిపై కురిపించాడు. ఒక గొప్ప గదను అతడిపై విసిరాడు. భీముడు వాటిని వమ్ముచేశాడు. మణిమంతుడు తన బంగారు దండంలోనుండి ఒక శక్తిని పుట్టించి భీముడిపై ప్రయోగించాడు. అది భీముడి భుజానికి తగిలి క్రిందపడిపోయింది. మణిమంతుడు శక్తిమంతమైన త్రిశూలాన్ని భీముడిపై విసిరాడు. అది నిప్పులు క్రక్కుకుంటూ వచ్చింది. భీముడు దానిని గదతో భగ్నంచేశాడు. రాక్షసులను చాలా మందిని చంపాడు. మణిమంతుడు భయభ్రాంతుడై ఆకసానికి ఎగసి యుద్ధం చేశాడు. భీముడు లంఘించి గదతో నేలమీద పడవేసి చంపాడు. మిగిలిన రాక్షససైన్యం తూర్పుదిక్కుకు పారిపోయింది.

భీముడు ఏకాకిగా పూలకొరకు పోయిన సంగతి ద్రౌపది చెప్పగా ధర్మరాజు తెలిసికొని, ద్రౌపదిని ధౌమ్యాదులను ఆర్ష్టిషేణుడనే ముని ఆశ్రమంలో ఉంచి, రోమశ నకుల సహదేవులతో కలిసి ఆ పర్వతశిఖరం ఎక్కి కుబేరుడి భవనం దగ్గర చనిపోయిన రాక్షసవీరుల మధ్య ఏకవీరుడై నిలిచి ఉన్న భీముడిని చూచి సంతోషించాడు.

రాక్షసవీరుల వలన జరిగిన సంగతి తెలిసికొని, కుబేరుడు భీముడి పరాక్రమానికి ఆశ్చర్యం చెంది గరుడ గంధర్వ యక్ష రాక్షస సైన్యంతో రణరంగానికి వచ్చి పాండవులను చూచాడు. పాండవులు కుబేరుడికి నమస్కరించారు. కుబేరుడు ఇట్లా అన్నాడు : 'ధర్మరాజా! నీ తమ్ముడైన భీముడు నామిత్రుడైన మణిమంతుడిని చంపి నాకు ఉపకారమే చేశాడు కాని అపకారం చేయలేదు. ఎందుకంటే మణిమంతుడికి అగస్త్యుడి శాపం ఉన్నది. ఒకసారి నేను, దేవతలు చేస్తున్న యజ్ఞానికి నా మిత్రులతో, పరివారంతో, శతమహాపద్మ సంఖ్యగల రాక్షససైన్యంతో ఆకాశమార్గాన పోతున్నాను. భూతలం మీద యమునా నదీతీరంలో అగస్త్యమహర్షి ఉగ్రమైన తపస్సు చేసికొంటున్నాడు. నా మిత్రుడు మణిమంతుడు పొరపాటున గగనంలో ఉమ్మివేయగా అది నేలపై తపస్సు చేస్తున్న అగస్త్యుడి పై పడింది. దాని కతడు కోపించి మణిమంతుడు ససైన్యుడై ఒక మనుజుడిచేత చంపబడుతాడనీ, ఆ మనుజుని దర్శించటంచేత నాకు పాపం తొలగుతుందనీ పలికాడు. ఆ శాపం వలన మణిమంతుడు ససైన్యుడై మరణించాడు. నేను మీ దర్శనంవలన పాపవిముక్తుడ నైనాను' అని చెప్పాడు.

అంతటితో ఆగక ధర్మరాజుకు ఒక హితవు కూడా తెలిపాడు. 'ధర్మవిదుడైన క్షత్రియుడు ఐదు విధాలైన లోకతంత్రాన్ని తెలిసికొని వర్తించాలి. ధృతి, దాక్ష్యం, ఉపదేశం, కాలం, పరాక్రమం అనేవి పంచవిధ లోకతంత్రాలు. వాటి విధి విధానాలు తెలియకుండా సాహసంతో వృథారంభం చేసేవారికి పాతకం కలుగుతుంది. కాబట్టి నీ విమలజ్ఞాన నిష్ఠమైన బుద్ధితో నీతమ్ముడైన భీముడిని సుశిక్షితుడిగా చేయాలి. నీవూ నీ తమ్ములూ ధర్మ, అనిల, శక్ర, అశ్వినుల చేత సదా రక్షించబడుతూ ఉన్నారు. నేను కూడా మిమ్మల్ని రక్షిస్తూ ఉంటాను. మీరు ఒక పక్షం రోజులు, ఆ ఆర్ష్టిషేణాశ్రమంలో ఉండండి. అర్జునుడు ఇంద్రుడి వద్దనుండి తిరిగి వచ్చి మిమ్మల్ని కలిసికొంటాడు. మీ కోరికలు సఫలమౌతాయి' అని చెప్పి కుబేరుడు అంతర్ధానమయ్యాడు.

ఆ పక్షం రోజులలో ధర్మజుడు ధౌమ్యుడి తపోబలంవలన ఆతడు చూపిస్తూ ఉండగా మందరనగాన్నీ, మేరుపర్వతాన్నీ చూచి, ఎనిమిది దిక్కుల వసించే దేవతలను దర్శించాడు. పాండవులక్కడ మొత్తం ఒకనెల రోజులున్నారు. ఒకనాడు ఆకాశమార్గం నుండి మాతలి నడిపే దివ్య రథాన్ని అధిరోహించి, అన్ని దిక్కులా కాంతులు వెదజల్లుతూ అర్జునుడు వచ్చి ధర్మజాదులను సగౌరవంగా, ఆప్యాయంగా కలిసికొన్నాడు. ఆరాత్రి సోదరులకు తన అనుభవాల నన్నింటిని అర్జునుడు కథలు కథలుగా వివరించి చెప్పి, వారిని సంతోషపరిచాడు.

ఇంద్రదర్శనం :

మరునాడు ఉదయం దేవేంద్రుడు సకల దిక్పాలక దేవసేనా సహితుడై పాండవు లున్నచోటికి వచ్చాడు. ధర్మజుడు ఇచ్చే భక్తిపూజలను గ్రహించి అర్జునుడిని గురించి ధర్మజాదులతో ఈవిధంగా చెప్పాడు : 'ఘనుడైన ఈ పార్థుడు నావలన

దివ్యాస్త్రాలను ప్రయోగ విజ్ఞానంతో సహా పొందాడు. దుర్మార్గులైన నివాతకవచు లనే రాక్షసులను సంహరించి దేవతలకు ఎంతో హితం చేశాడు. ఇతడు తన పరాక్రమంతో శత్రువులను జయించి మహాసామ్రాజ్యాన్ని నీకు ప్రఖ్యాతంగా సమకూరుస్తాడు. అర్జునుడు మహాతేజుడు. అతడిని ఎవ్వరూ జయించలేరు'. ఈ మాటలు పలికి ఇంద్రుడు సపరివారంగా అమరావతికి వెళ్ళాడు.

కుబేర, ఇంద్ర, పాండవ సమాగమాన్ని వర్ణించే ఈ ఘట్టాన్ని ఎవరైనా సరే బ్రహ్మచర్య దీక్షతో ఒక సంవత్సరకాలం రోజూ వింటే, చదివితే వారు నూరేళ్ళు తేజోవంతులుగా జీవిస్తారు.

నివాతకవచ నిర్మూలనం :

ఇంద్రుడు సంగ్రహంగా చెప్పిన అర్జునవిజయగాథను వివరించుమని ధర్మజుడు కోరగా అన్నకు పార్థుడు వివరించి చెప్పాడు. ఆ కథాసార మిది -

ధర్మరాజు నియోగించినట్లు పార్థుడు హిమవత్పర్వతానికి వెళ్ళాడు. అక్కడ వృద్ధ బ్రాహ్మణుడి వేషంలో ఇంద్రుడు ప్రసన్నుడైనాడు. అతడి ఆజ్ఞ చొప్పున పరమేశ్వరుడిని గురించి పార్థుడు ఉగ్రతపం చేశాడు. పరమేశ్వరుడు మొదట కిరాత రూపంలో వచ్చి పార్థుడితో ఘోరయుద్ధం చేశాడు. చివరకు నిజ స్వరూపంతో ప్రత్యక్షమై పాశుపతాస్త్రాన్ని ప్రసాదించాడు. ఆ తరువాత ఇంద్రాది దేవతలు ఐంద్రం, ఆగ్నేయం, యామ్యం, రాక్షసం, వారుణం, వాయవ్యం, కౌబేరం, గాంధర్వం, పైశాచం, బ్రాహ్మ్యం అనే దివ్యాస్త్రాలు ప్రసాదించారు. ఆ తరువాత ఇంద్రుడు పంపిన దివ్యరథ మెక్కి అర్జునుడు అమరావతికి వెళ్ళాడు. అక్కడ ఇంద్రుడిని ఆచార్యుడిగా ఆరాధించి, అతడివలన అనేక దివ్యాస్త్రాలను ప్రయోగ, ఉపసంహరణ, నివర్తన, ప్రాయశ్చిత్త, ప్రతిఘాత ప్రక్రియలతో నేర్చుకొన్నాడు. ఈ తరువాత ఇంద్రుడు పార్థుడిని మించిన అస్త్రశస్త్ర కోవిదుడు మరొకరు లేడనీ, అతడిని యుద్ధంలో మరొకరు జయించలేరనీ ప్రకటించాడు. ఆ అమోఘాస్త్ర శస్త్ర పాండిత్యంతో దేవతలకూ, బ్రాహ్మణులకూ హితం చేకూర్చుమని ఇంద్రుడు పార్థుడికి హితవు చెప్పాడు.

నివాతకవచులను సంహరించి, గురుదక్షిణగా సమర్పించుమని ఇంద్రుడు పార్థుడిని కోరాడు. తాను ధరించిన దివ్యకిరీటాన్నీ, భూషణాలనూ స్పర్శరూపమైన అభేద్యకవచాన్నీ అర్జునుడికి అలంకరించి, ఒక గొప్ప అల్లెత్రాటిని తానే స్వయంగా గాండీవానికి తొడిగి, పదివేల మేలిమి గుర్రాలతో కూర్చిన దివ్యరథాన్ని సిద్ధంచేయించి, మాతలిని సారథిగా నిలిపి, పార్థుడిని రథికుడిగా ఎక్కించి, యుద్ధయాత్రకు ఇంద్రుడు స్వయంగా పంపాడు. 'ఇదివరలో దేవేంద్రుడు ఆ రథం మీదనే మహాయుద్ధాలు చేసి వృత్ర, శంబర, బలాదులైన మహారాక్షసులను సంహరించాడు. అట్లాగే నీవూ విజయుడవు కమ్ము' అని ఆశీర్వదిస్తూ పార్థుడికి 'దేవదత్తం' అనే సార్థకనామధేయంగల ఒక దివ్యశంఖాన్ని దేవత లిచ్చారు. అర్జును డారథం మీద నివాతకవచులపై దాడికి వెడలాడు.

నివాతకవచులు సముద్రగర్భంలో నివసిస్తారు. మాతలి దివ్యరథాన్ని సముద్ర తీరం చేర్చాడు. ఆనీటిలో ఒక విశాల పట్టణం కనిపించింది. దాని ముఖద్వారం వద్దకు చేరి అర్జునుడు దేవదత్తం పూరించాడు. ఆ శంఖనాదం విని, నివాతకవచులు బాణాలతో ఆకాశాన్నంతా కప్పారు. చీకటి క్రమ్ముకొన్నది. మాతలి ఆ చీకట్లో రథం నడపలేకపోయాడు. అప్పుడు పార్థుడే రథాన్ని నడుపుతూ రాక్షసులపై నిశిత బాణాలు గుప్పించి నెత్తురుటేరులు పారించాడు. అసురులు మాయాయుద్ధానికి దిగి అర్జునుడిపై వారుణాస్త్రాన్ని ప్రయోగించారు. పార్థుడు శోషణాస్త్రాన్ని వేసి నీటిధారలను ఎండించాడు. దానవులు కొండరాళ్ళు కురిసే అస్త్రం వేశారు. అర్జునుడు వజ్రాయుధాస్త్రాన్ని ప్రయోగించి రాళ్ళను పిండి చేశాడు. వారు అనలాస్త్రం వేశారు. అతడు సలిలాస్త్రంతో దానిని వారించాడు. వారు తిమిరాస్త్రం ప్రయోగించారు. ఆచీకట్లో దారితెలియక మాతలి రథంమీద నుండి క్రిందపడ్డాడు. అర్జునుడిని పిలుస్తూ అరచాడు. అటువంటి యుద్ధం తాను అంతవరకు చూడలేదని పలికాడు. అర్జునుడు వెంటనే సూర్యాస్త్రం వేసి లోకాన్ని వెలుగుతో నింపాడు. గాండీవి ప్రయోగించిన బాణాలకు రాక్షసుల శరీరాలు తునకలై విరిగిన కొండశిఖరాలవలె క్రిందపడసాగాయి. అసుర వనితల ఆక్రందనలు మిన్నుముట్టాయి. రాక్షససంహారం పూర్తి అయింది. మాయ తొలగింది. ఆ నగర శోభ బయటపడింది. ఆ నగరం మొదట దేవతల కొరకే కట్టబడింది. కాని, దానవులు బ్రహ్మదేవుడి అనుగ్రహంతో దానిని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆక్రమించారు. ఆ దేవుడి వరంవలన వారు బలగర్వితులైనారు. వారు నరుడిచేతనే జయించబడగలరని బ్రహ్మవచనం. అందువలన నరుడినే ఇంద్రుడు ప్రయోగించి, జయాన్ని సాధించాడు.

అర్జునుడు నివాతకవచులను నిర్మూలనం చేసి తిరిగివస్తూ మార్గమధ్యంలో హిరణ్యపురాన్నీ, అందులో బ్రహ్మవరం వలన అజేయులై ఉన్న పౌలోమ కాలకేయులనూ చూచాడు. వారు అమరులచేత అవధ్యులని తెలిసికొని పార్థుడు వారిపై దాడిచేశాడు. పౌలోమకాలకేయులు అరవైవేల రథాలతో అర్జునుడిని ఎదుర్కొన్నారు. పార్థుడు వారి రథాల గతికి దివ్యబాణాలతో అడ్డాలు కల్పించాడు. వారు మాయాయుద్ధమార్గంలో పట్టణంతో సహా గగనానికి ఎగిసారు. పార్థుడు వారిని దివ్యబాణాలతో గగనంలో బంధించి, వారి శరీరాలను ఖండఖండాలుగా నరకటం మొదలుపెట్టాడు. అయినా, వారిని పూర్తిగా చంపటం సాధ్యంకాదని తెలిసికొని పరమేశ్వరుడిని హృదయంలో స్మరించి పాశుపతాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ దివ్యాస్త్ర ప్రభావం వలన సింహాలు, శరభాలు, పులులు, ఏనుగులు, దున్నలు, ఎలుగుబంట్లు, యక్షులు, రాక్షసులు, పిశాచులు, పన్నగులు, గంధర్వులు అనేకులు ఆ అస్త్రంలోనుండి పుట్టిన అసురులందరిని అంతం చేశారు. ఈవిధంగా హిరణ్యపురవాసులను యమపురానికి పంపించి అర్జునుడు వచ్చి ఇంద్రుడికి నమస్కరించాడు.

ఇంద్రుడు సంతోషించి, సోదరుడి రాకకై ఎదురుచూస్తున్న ధర్మజాదుల వద్దకు వెళ్ళుమని అర్జునుడిని అనుమతించాడు. అతడితో క్లిష్టమైన యుద్ధాలలో కూడ ఎవ్వరూ ఎదుర్కొనలేరని ప్రకటించాడు. భీష్మ, ద్రోణాది మహావీరులు పార్థుడి బాణాలకు రణరంగంలో హతులు కాక తప్పదని చెప్పాడు. అప్పుడు అర్జునుడు ఇంద్రుడిని వీడ్కొని ధర్మరాజాదులవద్దకు వచ్చాడు. అర్జునుడు చెప్పిన ఈ కథనంతా విని ధర్మరాజు విశాల సామ్రాజ్యమంతా అప్పుడే తనకు దక్కినంతగా ఉప్పొంగిపోయాడు. అర్జునుడు పొందిన దివ్యాస్త్రాలను ప్రయోగించి చూపించుమని కోరాడు. అర్జునుడు దివ్యాస్త్ర ప్రయోగాన్ని ప్రదర్శించటం ప్రారంభించాడు. ప్రకృతి దద్దరిల్ల నారంభించింది. దివి నుండి నారదుడు దిగివచ్చి అర్జునుడిని సమీపించి, లక్ష్యం లేకుండా దివ్యాస్త్రాలను ప్రయోగిస్తే అవి లోకాలను దహించి వేస్తాయని హెచ్చరించి, ఆ ప్రయత్నాన్ని మాన్పించాడు. ఆపైన దేవకన్యలు దిగివచ్చి 'అర్జునుడు అజ్ఞాతవాసంలో కన్యకలమధ్య గడిపి ఆ గడువు పూర్తికాగానే విస్తారభూమిని జయిస్తాడనీ, ధర్మరాజు ఆ భూమిని పాలిస్తాడనీ, అలనాటి శ్రీరాముడి కీర్తి వంటి కీర్తి అర్జునుడికి లభిస్తుం' దనీ దీవించి దివానికి వెళ్ళారు. అప్పుడు రోమశుడు కూడ ధర్మజుడి అనుమతితో అమరావతికి వెళ్ళాడు. ఆ తరువాత పాండవులు క్రమంగా వృషపర్వనివాసానికీ, బదరీవనానికీ, హిమవత్పర్వతంలోని వివిధ యజ్ఞపుణ్య ప్రాంతాలకూ వచ్చి అక్కడ కొంతకాలం నివసించారు.

నహుష ప్రశ్నలు :

పాండవులు హిమవన్నగ ప్రాంతంలో నివసిస్తున్నపుడు ఒకనాడు భీముడు ఒంటరిగా వేటకు వెళ్ళాడు. అతడు అలసిపోయి ఉన్న సమయంలో ఒక పెద్ద కొండచిలువ భీముడిని బిగియపట్టింది. అదేమి చోద్యమో ఆపాము పట్టుకోగానే భీముడు బలహీనుడై పోయాడు. ఆ పాముపట్టునుండి ఎంత ప్రయత్నించినా బైటపడలేకపోయాడు. తనను గురించిన వివరాలను ఆ పాముకు తెలియపరచుకొన్నాడు. చంద్రవంశజుడని తెలిసినా ఆ పాము భీముడిని వదలలేదు. భీముడు వేటకు వెళ్ళి తిరిగి రావటం ఆలస్యం కావటంతో ధర్మజుడు ఏదో కీడును శంకించి ధౌమ్యుడితో కలిసి అడవిలో వెదకుకొంటూ బయలుదేరాడు. సర్పాధీనంలో చిక్కుకొని ఉన్న భీముడిని చూచాడు. కడు విచారించాడు. ఆ సర్పం సామాన్యమైనది కాదని ఊహించి వివరాలను అడిగాడు. ఆ కొండచిలువ రూపంలో ఉన్నది భరతవంశీయుడైన నహుషచక్రవర్తి అని తెలిసికొన్నాడు. వేదాలన్నీ చదివినా, నూరు యజ్ఞాలు చేసినా, దేవేంద్ర పదవి పొందినా, మదోన్మత్తుడై మునిపుంగవులను అవమానిస్తే ఎటువంటి వాడైనా తప్పులాన్ని అనుభవించక తీరదన్న సత్యాన్ని శాపగ్రస్తుడైన నహుషచక్రవర్తి కథ చెప్పకచెపుతుంది. నహుషుడే స్వీయగాథను, శాపవృత్తాంతాన్ని స్వయంగా ధర్మరాజుకు పశ్చాత్తాపంతో వివరించి చెప్పుకొన్నాడు. తాను వేసే ప్రశ్నలకు సమాధానాలు చెపితే భీముడిని వదలుతా నన్నాడు. సవినయంగా ధర్మజుడు నహుష ప్రశ్నలకు సమాధానా లిచ్చాడు. ఆ వివరా లివి :

నహుషుడు: ఏగుణాలు కలవాడు బ్రాహ్మణుడు? అతడిని గుర్తించటానికి తగిన వస్తు వేది?

ధర్మరాజు : సత్యం, క్షమ, దమం, శౌచం, దయ, తపస్సు, దానశీలం అనేగుణాలు కలవాడు బ్రాహ్మణుడు. సుఖదుఃఖాలు పొందినపుడు మోహాన్ని పొందకుండా ఉండే స్వభావమే బ్రాహ్మణుడని గుర్తించటానికి తోడ్పడే సాధనం.

నహుషుడు: నీవు చెప్పిన గుణాలూ ఆచరణా శూద్రుడియందుకూడా ఉంటే అతడు ఉత్తమ బ్రాహ్మణుడు కాగలుగుతాడా? సత్యాన్ని విడిచిపెడితే బ్రాహ్మణాది వర్ణవిభాగం ఎట్లా కలుగుతుంది? ఉత్తమాధమ వివేకం అపార్థాన్ని కలిగిస్తుంది కదా?

ధర్మరాజు : పొరపాటున వర్ణసాంకర్యం ఏర్పడితే వర్ణపరీక్షను నిర్వహించటంలో బ్రాహ్మణాదుల ప్రవర్తనను స్వాయంభువ మనువు ప్రత్యేకించి చెప్పాడు. సత్యం మొదలైన గుణాలు శూద్రుడియందు కలిగినప్పటికీ అతడు సత్‌శూద్రుడు ఔతాడు కాని, బ్రాహ్మణుడు కాలేడు. ఆ గుణాలు బ్రాహ్మణుడిలో లేకపోతే అతడు శూద్రుడు అనబడతాడు. కావున వృత్తం (శీలం, ప్రవర్తన, స్వభావం) ముఖ్యం. ధనం లేకపోతే వివిధ రీతులలో దానిని సంపాదించుకొని ధనవంతుడు కావచ్చును. శీలం లేనివాడు అస లేమీ లేనివాడే. కాబట్టి విత్తరక్షణం కంటె వృత్తరక్షణమే ఉత్తమం.

నహుషుడు :అప్రియమైన పనులు చేసినా, అబద్ధాలాడినా సరే హింసచేయకుండా ఉంటే చాలు అతడు ఉత్తమగతిని పొందుతాడని కొంద రంటారు. ఆ అహింస అంత గొప్పది ఎందుకైనదో చెప్పగలవా?

ధర్మరాజు : దానం, మేలు చేయటం, సత్యం, అహింస - అనే నాలుగూ సమానాలే అయినప్పటికీ అహింసయే శ్రేష్ఠం. ఎట్లాగంటే - దేవతలలో, మనుష్యులలో, పశుపక్ష్యాదులలో పుట్టిన వారిలో మనుష్యుడు దానాదిగుణాలు కలిగి అహింసాపరుడైతే దేవగతిని పొందుతాడు. ఆ గుణాలు పాటించకపోతే పశుపక్ష్యాదులలో పుట్టి పతితు డౌతాడు.

ఈ విధంగా నహుషుడు వేసిన ప్రశ్నలకు ధర్మరాజు సమాధానా లిచ్చాడు. అందుకు కొండచిలువ రూపంలో ఉన్న నహుషుడు సంతోషించి, భీమసేనుడిని తన పట్టునుండి విముక్తుడిని చేశాడు. తానూ శాపవిముక్తు డైనాడు. ధర్మజు డామహాత్ముడిని అడిగి అనేక ఆధ్యాత్మిక విషయాలను తెలిసికొన్నాడు. నహుషుడికి నమస్కరించి తమ్ముడితో కలిసి ఆశ్రమానికి చేరుకొన్నాడు.

అప్పుడు వర్షర్తువు వచ్చింది. వానలు మెండుగా కురిశాయి. క్రమంగా భూమిపై శరదృతువు విస్తరిల్లింది. పగళ్ళు పరమప్రమోదకరంగా సాగాయి. శారదరాత్రులు పండువెన్నెలలతో ప్రకాశించాయి.

ఇంతవరకు ఆరణ్యపర్వంలో నన్నయ రచించిన భాగం.

ఇది ఆరణ్యపర్వ కథాసారంలో మొదటి భాగం.

జి.వి. సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతం

సంపుటము - 4

ఆరణ్యపర్వము

(మొదటిభాగము)

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
పాండవుల వనగమనము	3-1-8	1
శౌనకుఁడు ధర్మరాజునకు ధర్మంబులు సెప్పుట	3-2-14	9
ధర్మరాజు సూర్యు నారాధించి వరంబు గొనుట	3-3-13	21
విదురుఁడు ధృతరాష్ట్రుని విడిచి పాండవులయొద్దకుఁ బోవుట	3-5-19	26
ధృతరాష్ట్రునకు వ్యాసుఁ డింద్రసురభిసంవాదంబు సెప్పుట	3-10-6	36
మైత్రేయుఁడు దుర్యోధనుని శపించుట	3-11-27	43
కిమ్మీరుఁడను రాక్షసుఁడు భీమునిచేఁ జచ్చుట	3-12-42	50
యాదవపాంచాలాదులు పాండవులకడ కేతెంచుట	3-13-1	52
ద్రౌపది శ్రీకృష్ణునితోఁ దన పరిభవంబు సెప్పి దుఃఖించుట	3-13-42	57
శ్రీకృష్ణుండు ధర్మరాజునకు సౌంభకాఖ్యానంబు సెప్పుట	3-15-1	64
సాల్వుఁడు ప్రద్యుమ్నునిచే బాధితుండై మరలిపోవుట	3-20-26	76
పాండవులు ద్వైతవనంబునకు వచ్చియుండుట	3-23-42	85
ద్రౌపదీ ధర్మరాజుల సంవాదము	3-28-2	91
భీమసేన ధర్మరాజుల సంవాదము	3-34-1	105
కృష్ణద్వైపాయనుఁడు ధర్మరాజునొద్దకు వచ్చుట	3-37-20	119
ఈశ్వరుఁడు కిరాతవేషంబున నర్జుననొద్దకు వచ్చుట	3-40-2	132
అర్జునుఁడు పరమేశ్వరుని స్తోత్రము సేయుట	3-40-56	142

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇంద్రుఁడు దేవగణంబులతో నర్జుననకుఁ బ్రత్యక్షంబగుట	3-42-5	149
అర్జునుఁ డమరావతికిఁ బోవుట	3-43-26	155
ఊర్వశి యర్జును నపుంసకునిఁగా శపించుట	.....	164

ద్వితీయాశ్వాసము

ధర్మరాజునకు బృహదశ్వుండు నలోపాఖ్యానంబు సెప్పుట	3-50-1	186
నలుఁడు దమయంతియొద్దకు దేవదూతయై పోవుట	3-52-10	199
నలుండు స్వయంవరలబ్ధయయిన దమయంతిం బెండ్లియగుట	3-54-25	207
నలుండు దమయంతీసహితుండై యడవికిఁ బోవుట	3-58-25	213
దమయంతిశాపంబునం గిరాతుండు చచ్చుట	3-61-34	223
దమయంతి సుబాహుపురంబు ప్రవేశించుట	3-62-28	233
నలుఁడు కర్కోటకునిచేత దష్టుండగుట	3-63-7	239
చేదిపురంబున సుదేవుఁడను బ్రాహ్మణుఁడు దమయంతి నెఱుంగుట	3-65-5	246
దమయంతి నలు నెడఁబాసి విదర్భాపురంబు సేరుట	3-66-22	252
నలుండు గలిచేత విముక్తుండయి విదర్భకుఁ బోవుట	3-72-7	264
కేశినియను దూతి దమయంతితో నలునిగుణంబులు సెప్పుట	3-73-8	270
నలుండు నిజరూపంబుతో దమయంతిం గూడుట	3-75-27	281
ధర్మరాజునొద్దకు నారదమహాముని వచ్చుట	3-80-1	287
రోమశమహాముని ధర్మరాజునొద్దకు వచ్చుట	3-89-1	322
రోమశుండు ధర్మరాజునకు ధర్మవిశేషంబులు సెప్పుట	3-92-1	330
అగస్త్యుఁడు లోపాముద్రను వివాహంబగుట	3-95-9	340

తృతీయాశ్వాసము

అగస్త్య చరిత్రము	3-98-1	351
దేవతలు వైకుంఠమునకుఁ బోయి విష్ణుని స్తుతియించుట	3-99-11	355

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అగస్త్యుఁడు వింధ్యంబు పెరుఁగకుండ వారించుట	3-101-2	359
అగస్త్యుండు సముద్రోదకంబు పానంబు సేయుట	3-103-1	364
భగీరథుండు జలముచే సముద్రము నించుట	3-104-6	368
సగరసుతులు గపిలమహామునికోపాగ్నిచే భస్మమగుట	3-106-3	374
రోమశుఁడు ధర్మజునకు ఋశ్యశృంగుచరిత్రము సెప్పుట	3-110-6	385
ఋశ్యశృంగుఁడు వేశ్యను మునికుమారునిఁగా భావించుట	3-111-9	389
విభాండకుఁడు ఋశ్యశృంగుని వెదకుచు వచ్చుట	3-113-11	398
అకృతవ్రణుఁడు ధర్మరాజునకుఁ బరశురాముని మహిమ సెప్పుట	3-115-9	404
పరశురాముఁడు కార్తవీర్యునిఁ జంపుట	3-116-24	412
రోమశుఁడు ధర్మరాజునకు సౌకన్యాఖ్యానంబు సెప్పుట	3-122-1	424
చ్యవనుఁ డాశ్వినుల సోమపీథులఁ జేయుట	3-124-21	429
మాంధాతృ చరిత్రము	3-125-22	434
సోమకుండను రాజర్షి చరిత్రము	3-127-2	439
శిబియను రాజర్షిచరిత్రంబు రోమశుఁడు ధర్మరాజునకుఁ జెప్పుట	3-130-15	447
రోమశుఁడు ధర్మరాజునకు నష్టావక్రుచరితంబు సెప్పుట	3-132-8	453
రోమశుఁడు ధర్మరాజునకు యవక్రీతుచరిత్రంబు సెప్పుట	3-135-12	459
దేవత లర్థావసునకు మెచ్చి కోరిన వరంబు లెల్ల నిచ్చుట	3-139-18	470
పాండవులు గంధమాదనపర్వతంబునకుం బోవుట	3-143-1	477
భీముఁడు సౌగంధికహరణార్థంబు పోవుట	3-146-292	487
భీమునకు హనుమంతుఁడు చతుర్యుగాచారవర్తనంబులను దెలుపుట	3-148-10	498
హనుమంతుఁడు భీమునకుఁ దన పూర్వరూపంబుఁ జూపుట	3-149-1	501
భీముఁడు యక్షరాక్షసులతో యుద్ధంబు సేయుట	3-152-12	512
భీముఁడు జటాసురునితో యుద్ధము సేయుట	3-154-28	520

చతుర్థాశ్వాసము

ఇంద్రుఁడు పాండవులయొద్దకు వచ్చుట	3-162-5	543
అర్జునుఁడు నివాతకవచు లను రాక్షసుల జయించిన కథ	3-166-1	550
అజగరోపాఖ్యానము	3-176-5	565
ధర్మరాజు భీమసేనుని వెదకఁబోవుట	3-176-40	569
ధర్మరాజు నహుష ప్రశ్నంబులకుఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట	3-177-13	575
గద్య పద్య ప్రథమ పాద సూచి		583

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆరణ్య పర్వం

మొదటి భాగం

(1,2,3,4 (141వ పద్యము వరకు) ఆశ్వాసాలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీకీర్తిశ్రీవల్లభ! లోకజనస్తుత్య! సర్వలోకాశ్రయ! ర
త్నాకర పరివృత సకల ధ । రా కాంత! జితారి! రాజరాజ నరేంద్రా! 1

ప్రతిపదార్థం: శ్రీ, కీర్తిశ్రీ, వల్లభ!= సంపదకున్నూ, యశస్సంపదకున్నూ అధిపతి అయినవాడా! (రాజ్యలక్ష్మికిన్నీ, కీర్తి అనే లక్ష్మికిన్నీ ప్రియమైనవాడా); లోక, జన, స్తుత్య!= లోకంలోని ప్రజలచేత పొగడదగినవాడా! సర్వ, లోక+ఆశ్రయ!= సమస్తలోకానికి ఆధారమైనవాడా! (ఇది బిరుదుకూడ కావచ్చు); రత్న+ఆకర, పరివృత, సకల, ధరా, కాంత!= సముద్రంచేత చుట్టబడిన సమస్తభూమికిని అధినేత అయినవాడా!; జిత+అరి!= జయించబడిన శత్రువులు కలవాడా!; రాజరాజనరేంద్రా!= రాజరాజనరేంద్రుడు అనే పేరు కలవాడా!;

తాత్పర్యం: సంపదకున్నూ, కీర్తిసంపదకున్నూ, భర్తఅయినవాడా! లోకంలోని అందరు ప్రజలచేత పొగడ దగినవాడా! 'సర్వలోకాశ్రయ' అనే సార్థక బిరుదనామం ధరించినవాడా! సముద్రంచేత చుట్టబడిన సువిశాల భూప్రదేశాన్ని పరిపాలించే ప్రభువా! శత్రువులను జయించినవాడా! ఓ రాజరాజనరేంద్రా!

విశేషం: ఇది నన్నయ మహాకవి ఆరణ్యపర్వం మొదటి ఆశ్వాసంలో వ్రాసిన మొదటి పద్యం. ఈ పద్యంలోని పదాలన్నీ కృతిపతి అయిన రాజరాజనరేంద్రుడికి సంబోధనలే. చాళుక్యప్రభువులు 'లోకాశ్రయ' - 'సత్యాశ్రయ' అనే బిరుదులు వహించటం చరిత్రలో సుప్రసిద్ధం. చాళుక్యసామ్రాజ్యం ఉత్తరంలో చిలకసముద్రంనుంచి దక్షిణాన పులికాట్ సరస్సువరకు సముద్రతీరరేఖను అంటి విస్తరించి ఉండటంచేత 'రత్నాకర పరివృత సకలధరాకాంత' అనే సంబోధన మిక్కిలి సముచితం, సార్థకం. నన్నయ మహాకవి ఆశ్వాస ఆరంభ పద్యాలను అన్నింటిని శ్రీకారంతో ప్రారంభించటం గమనించదగిన విశేషం. శ్రీకార ప్రారంభం భారతదేశంలో మంగళప్రదమైన సాహితీ సంప్రదాయం. నన్నయ మహాకవి ఆంధ్రమహాభారతాన్ని చాళుక్య చక్రవర్తి అయిన రాజరాజనరేంద్రుడి కోరికపై రచించాడు. అందుచేత అతడే కృతిపతి అని భావించవచ్చును. ఆశ్వాస ఆరంభాలలోను, ఆశ్వాసాంతాలలోను కృతిపతిని సంబోధించే సాహిత్య సంప్రదాయాన్ని తెలుగులో ప్రారంభించినవాడు ఆదికవి నన్నయ.

రాజరాజనరేంద్రుడి మాతామహు డైన తమిళ చోళప్రభువు పేరు రాజరాజు. ఆ చోళప్రభువు రాజరాజనరేంద్రుడి తండ్రి అయిన విమలాదిత్యుడిని చేరదీసి, తన పుత్రిక నిచ్చి వివాహంచేసి, ఎన్నోవిధాల అతడికి తోడుపడ్డాడు. విమలాదిత్యుడు మామగారిపట్ల కృతజ్ఞతాపూర్వకంగా తన పుత్రుడికి ఆయన పేరుపెట్టినట్లు చరిత్రవేత్తల అభిప్రాయం.

పాండవుల వనగమనము (సం. 3-1-8)

వ. **అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె; నట్లు పాండవులు నిజాయుధంబులు ధరియించి కృష్ణాసహితులై యుత్తరము మించి యరిగిన నింద్రసేనాదులైన మూలభృత్యులు పదునాలుగువేల**

రథంబులతోడ సుభద్రాభిమన్యు ప్రతివింధ్యాదులం దోడ్కొని వారి పిఱుందన యరిగి; రంత నప్పాండవులం జూచి పౌరులెల్లఁ బరమ దుఃఖితులై. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= మహాభారతకథను చెప్పే సౌతి; శౌనక+ఆది, మహత్, మునులకున్= శౌనకుడు మొదలయిన గొప్ప ఋషులకు; చెప్పెన్= చెప్పాడు; అట్లు= ఆ విధంగా; పాండవులు= పాండురాజుకొడుకులు; నిజ+ఆయుధంబులు= తమ ఆయుధాలు; (ధనుస్సు, బాణాలు మొదలైనవి); ధరియించి; కృష్ణా, సహితులు+ఐ= ద్రౌపదితో కూడినవారై; ఉత్తరము, మించి, అరిగినన్= ఉత్తరదిక్కును అతిక్రమించి వెళ్ళగా; ఇంద్రసేన+ఆదులు+ఐన= ఇంద్రసేనుడు మొదలైన; మూలభృత్యులు= ప్రధానులైన సేవకులు; పదునాలుగు, వేల, రథంబులతోడ; సుభద్రా+అభిమన్యు, ప్రతివింధ్య+ఆదులన్= సుభద్ర, అభిమన్యుడు, ప్రతివింధ్యుడు మొదలైనవారిని; తోడ్కొని= వెంటబెట్టుకొని; వారి, పిఱుందన్+అ= వారి వెనుకనే; అరిగిరి= వెళ్ళారు; అంతన్= అంతట; ఆ+పాండవులన్; చూచి; పౌరులు+ఎల్లన్= పురజనులందరు; పరమ దుఃఖితులు+ఐ= మిక్కిలి శోకం పొందినవారై.

తాత్పర్యం: మహాభారతకథను సౌతి, శౌనకుడు మొదలయిన మహర్షులకు చెప్పాడు. జూదంలో ఓడిపోయిన తర్వాత పాండవులు అరణ్యవాసానికి ఉపక్రమించి ఉత్తరదిక్కుగా పయనించారు. వారి వెనువెంట వారి ముఖ్యసేవకులైన ఇంద్రసేనుడు మున్నగువారు పద్నాలుగువేల రథాలతో సుభద్ర, అభిమన్యుడు, ప్రతివింధ్యుడు మున్నగు ఉపపాండవులను వెంట పెట్టుకొని వెళ్ళారు. ఆ దృశ్యాన్ని చూచిన పురజనులు మిక్కిలి శోకం పొంది (ఇట్లా అన్నారు).

విశేషం: ఇచట అక్కథకుడు అంటే ఉగ్రశ్రవసుడు అనే పేరు గల సౌతి. సమకాలీనులలో సుగృహీతనామధేయు డైన పౌరాణికుడు. నైమిశారణ్యంలో కులపతి శౌనకమహర్షి తన ఆశ్రమంలో పండ్రెండేండ్లు సత్రయాగాన్ని నిర్వహించాడు. కులపతి అంటే నిత్యం పదివేలమంది శిష్యులకు అన్నదానం చేసి, విద్యాదానం చేసే మహామహోపాధ్యాయుడు. ఆ దీర్ఘసత్రయాగానికి అచట చేరిన మహర్షులకు మహాభారతకథ చెప్పిన ఉగ్రశ్రవసుడు రోమహర్షణుడనే సూతుడి కుమారుడు. వ్యాసశిష్యులు ఐదుగురు. జైమిని-సుమంత-శుక-పైల-వైశంపాయన మహర్షులు. వీరిలో వైశంపాయన మహర్షి భారతాన్ని జనమేజయ మహారాజు చేసిన సర్పయాగంలో చెప్పాడు. (జనమేజయుడు పరీక్షిత్తు కొడుకు. పరీక్షిత్తు అభిమన్యుడి పుత్రుడు. అభిమన్యుడు అర్జునుడి సుతుడు). వ్యాసశిష్యులలోని జైమిని రచించిన అశ్వమేధపర్వం మాత్రమే లభిస్తున్నది. వైశంపాయనుడు చెప్పినప్పుడు విన్న భారతాన్నే ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంగా శౌనకాది మునీశ్వరులకు వినిపించాడు.

ప్రతివింధ్యాదులు:- ద్రౌపదికి ధర్మరాజుకు జన్మించిన పుత్రుడు ప్రతివింధ్యుడు. ద్రౌపదికి భీముడికి జనించినవాడు శ్రుతసోముడు. ద్రౌపదికి అర్జునుడికి జన్మించినవాడు శ్రుతకీర్తి. అట్లే ద్రౌపదికి నకులుడికి పుట్టినవాడు శతానీకుడు. ద్రౌపదికి సహదేవుడికి ఉద్భవించినవాడు శ్రుతసేనుడు. వీరినే ఉపపాండవులంటారు.

క. 'చనునె యధర్మద్యూతం । బున నిట్టుల పాండురాజపుత్త్రులఁ బ్రభులన్
వనగతులఁ జేయ దుర్యో । ధన ధృతరాష్ట్రులకు విగతదయహృదయులకున్. 3

ప్రతిపదార్థం: అధర్మ, ద్యూతంబునన్= ధర్మం తప్పిన మాయజూదంలో; ఇట్టులు+అ= ఈ విధంగా; పాండు, రాజ, పుత్త్రులన్= పాండురాజు కొడుకులను; ప్రభులన్= రాచరికం చేస్తున్నవారిని; వన, గతులన్+చేయన్= అరణ్యానికి వెళ్ళినవారినిగా చేయటం; విగతదయహృదయులకున్= పోయిన దయగల హృదయాలు కలవారైన, అంటే దయలేనట్టివారికి; దుర్యోధన, ధృతరాష్ట్రులకు; చనున్+ఎ= తగునా? న్యాయమా?

తాత్పర్యం: 'రాచబిడ్డ లై ప్రజానురంజకంగా తమ రాజ్యభాగాన్ని ఏలుకొంటున్న పాండవులను జూదానికి పిలిచి, అన్యాయంగా ఓడించి, అరణ్యాలకు పంపటం నిర్దయచిత్తు లైన దుర్యోధనధృతరాష్ట్రులకు తగునా?

విశేషం: జూదం ఆడినవారు ధర్మరాజు, శకుని. దుర్యోధనుడు జూదంలో నేర్పరి అయిన తన మేనమామ శకునిని తన పక్షాన నియోగించాడు. ముందుగా వేసికొనిన పథకం ప్రకారం కౌరవులు ధర్మరాజును వంచించటాన్ని పౌరులు ఈ పద్యంలో పునరుద్ఘాటించారు.

క. క్రూరతర ధార్తరాష్ట్ర ని । కారము వారింపరైరి గాంగేయుఁడు న
బ్భారద్వాజుఁడుఁ గృపుఁడు ను । దారుఁడు విదురుండు నేమి దలఁచిరొ బుద్ధిన్. 4

ప్రతిపదార్థం: గాంగేయుఁడున్= గంగకొడుకైన భీష్ముడు; ఆ+భరద్వాజుఁడున్= ద్రోణుడు; కృపుఁడున్; ఉదారుఁడు= మహాత్ముడు (మంచివాడైన); విదురుండున్; క్రూర, తర, ధార్తరాష్ట్ర, నికారము= మిక్కిలిక్రూరులైన ధృతరాష్ట్రపుత్రుల అపకారాన్ని (వంచనను); బుద్ధిన్= మనస్సులో; ఏమి, తలఁచిరి+ఒ= ఏమని ఆలోచించారోకాని; వారింపరు+ఐరి= అడ్డుకొనలేదుకదా!

తాత్పర్యం: కురువంశానికి గౌరవపాత్రుడైన భీష్ముడు కాని, గురుదేవుడైన ద్రోణాచార్యుడు కాని, కృపాచార్యుడు గాని, మహానుభావుడైన విదురుడు కాని, క్రూరులైన ఆ ధార్తరాష్ట్రులు చేసిన అపకారాన్ని ఎందుచేతనో వారించలేదు?

విశేషం: ధృతరాష్ట్రుడి సంతానం ధార్తరాష్ట్రులు. ఇది సంస్కృతంలో అపత్యార్థక తద్ధిత ప్రక్రియ. ఇటువంటిదే గంగ కొడుకు గాంగేయుడు మరియు భారద్వాజుడు. 'క్రూరతర' అనేటప్పుడు 'మిక్కిలి క్రూరులు' అని అర్థం. క్రూర- క్రూరతర-క్రూరతమ అనే ప్రయోగాలు ఉత్తరోత్తర ఆధిక్యాన్ని వ్యక్తీకరిస్తాయి. ధర్మ నిర్ణయానికి కురువృద్ధుడుగా భీష్ముడికి, గురువర్యులుగా ద్రోణుడికి, కృపుడికి గల అర్హత సుస్పష్టం. విదురుడు ధర్మమూర్తిగా, యమధర్మరాజు అవతారంగా పేరుకెక్కినవాడు. అందుచేత అతడి వ్యక్తిత్వంపై ఆ పౌరులకు గల విశేషప్రత్యయం ఇక్కడ అభివ్యక్తమైనది.

సీ. కర్ణ జయద్రథ గాంధారు లాప్తులై । యుండంగ లోభి దుర్యోధనుండు
రాజుగా నీతని రాజ్యంబు నందెట్టు । లుండంగ నేర్తు? మీ యుర్వి నింక
నేది ధర్మువు? ప్రజ నెవ్వరు గాతురు? పరమధార్మికులైన పాండుసుతుల
యరిగిన చోటికి యరుగుద' మని వారి । పిఱుఁదన చని పాపభీతమతులు

ఆ. 'వీరులార! మమ్ము విడిచి మీ కరుగంగఁ । జనునె, మాకు నొండు శరణ మెద్ది?
సాధులకు నసాధుసహవాసమునఁ బాప । సంప్రయోగ మగుట సందియంబె? 5

ప్రతిపదార్థం: కర్ణ= కర్ణుడు; జయద్రథ= సైంధవుడు; గాంధారుఁడు= శకుని - కర్ణ సైంధవ శకునులు; ఆప్తులు+ఐ= కావలసిన వారై (హితం ఉపదేశించేవారై); ఉండంగ; లోభి= పిసినివాడు; దుర్యోధనుండు; రాజుగాన్= ఏలిక అయి ఉంటే; ఈతని రాజ్యంబునందు; ఎట్టులు; ఉండంగ, నేర్తుము= ఉండగల వాళ్ళం; ఈ, ఉర్విన్= ఈ పుడమిలో; ఇంకన్, ఏది; ధర్మువు= ధర్మం; ప్రజన్+ఎవ్వరు, కాతురు?= ప్రజలను ఎవరు రక్షించగలరు?; పరమ ధార్మికులు+ఐన= మిక్కిలి గొప్పధర్మంతో కూడిన ప్రవర్తనకల; పాండు సుతుల= పాండవులు (ఇక్కడ 'సుతుల' అనటం కర్మపద ప్రథమకు షష్ఠి); అరిగిన, చోటికి+అ= వెళ్ళిన స్థలానికే; అరుగుదము+అని= వెళ్ళుదామని; వారి, పిఱుఁదన్+అ, చని= ఆ పాండవుల వెనువెంటనే వెళ్ళి; పాప, భీత, మతులు= పాపంవలన భయపడిన బుద్ధి గల ఆ పౌరులు; వీరులార!= వీరులైన ఓ పాండవులారా!; మమ్ము, విడిచి=

మమ్మల్ని వదలిపెట్టి; మీకు+అరుగంగన్, చనున్+ఎ= మీరు వెళ్ళిపోవటం భావ్యమా?; మాకున్, ఒండు, శరణము+ఎద్ది= మాకు వేరే ఆశ్రయం ఏది?; సాధులకున్= మంచివారికి; అసాధు, సహవాసమునన్= దుర్జనసాంగత్యంవలన; పాప, సంప్రయోగము+అగుట= పాపం సంప్రాప్తించటం (తోడి కూడిక); సందియంబు+ఎ?= సందేహమా? కాదు.

తాత్పర్యం: పిసినిగొట్టువాడైన దుర్యోధనుడు, తనకు అనుగు చెలికాండ్రయిన కర్ణుడు, సైంధవుడు, శకుని తోడు కాగా, రాజ్యం ఏలుతుంటే- ఆతడి రాజ్యంలో మే మెట్లా బ్రతుకగలం? ఈ భువిపై ఇక ఏది ధర్మం? పాండవులు వెళ్ళే చోటికే మేము కూడ వెళ్ళటం మంచిది- అని నిశ్చయించుకొన్న పౌరులు పాండవులతో (ఇట్లా అన్నారు); - 'ఓ వీరులారా! మమ్మల్ని విడిచి వెళ్ళటం మీకు న్యాయం కాదు. మాకు వేరే దిక్కులేదు. దుర్జన సహవాసంవలన మంచివారికి కూడా పాపం సంప్రాప్తిస్తుందనటంలో సందేహం లేదు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ప్రజానురంజకులైన పాండవులపై పౌరులకు ఏర్పడిన ప్రేమానురాగాలను ఈ పద్యం వ్యక్తం చేస్తున్నది. గాంధారుడు - గాంధారరాజపుత్రుడు, గాంధారి - గాంధార రాజపుత్రిక.

క. తిలలును నీళ్ళును వస్త్రం । బులుఁ బుష్ప సుగంధ వాసమున సౌరభముం
బొలు పెసఁగఁ దాల్చుఁ గావున । నలయక సత్సంగమమున నగు సద్గుణముల్. 6

ప్రతిపదార్థం: తిలలును= నువ్వులున్నూ; నీళ్ళును; వస్త్రంబులున్= గుడ్డలున్నూ; పుష్ప. సుగంధ, వాసమున= పువ్వుల పరిమళ సంపర్కంచేత; సౌరభమున్= పరిమళాన్ని; పొలుపు+ఎసఁగన్= ఇంపారేటట్లుగా; తాల్చున్+కావునన్= ధరిస్తాయి కాబట్టి; అలయక= శ్రమపడకుండానే; సత్సంగమమునన్= మంచివారితోడి కలయికవలన; సద్గుణముల్= మంచిగుణాలు; అగున్= ఏర్పడతాయి.

తాత్పర్యం: నువ్వులు, నీళ్ళు, గుడ్డలు, పువ్వుల పరిమళ సంపర్కంవలన సుగంధాన్ని సంపాదించుకొన్నట్లు సజ్జన సహవాసంచేత అశ్రమంగా జనులకు సద్గుణాలు అలవడతాయి.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. మహాభారతం విశ్వజనీనమైన విజ్ఞాన సర్వస్వమని నన్నయ మహాకవి ప్రవచనం. 'ధర్మతత్త్వజ్ఞుల' దృష్టిలో అది ధర్మశాస్త్రం. 'నీతివిచక్షణుల' దృష్టిలో అది నీతిశాస్త్రం. అంతేకాక మహాభారతానికి లోకంలో 'పంచమవేదం' అనే ప్రఖ్యాతి ఏర్పడింది. మహాభారతంలో పలుతావులలో నీతిబోధ వినిపిస్తుంది. నీతి ప్రబోధంలో, కర్తవ్య నిర్ణయంలో వేదాలు ప్రభుసమ్మితాలు. మహాభారతంలోని నీతి పద్యాలలో ఈ కందం మిక్కిలి హృదయంగమమైనది.

వ. సాధుసమ్మతంబులైన గుణంబుల నొప్పి, జన్మవిద్యా కర్మంబులం బ్రశస్తులరై, యార్యవృత్తులరైన మీ సహవాసంబున నుండి, ధర్మపరులమై కృతార్థుల మగుదుము; దుష్కృతంబులయం దనారంభులయ్యును జనులు దుర్జన దర్శన స్పర్శన సంభాషణ సహాసనంబులంజేసి ధర్మవిహీను లగుదురు; గావున నేము దుర్యోధను రాజ్యంబున నుండనోపము; మా యనుగమనంబున కొడంబడవలయు' నని కృతాంజలులైన న ప్పౌరులం జూచి ధర్మతనయుం డిట్లనియె. 7

ప్రతిపదార్థం: సాధు సమ్మతంబులు+ఐన= మంచి వారికి ఇష్టాలైన; గుణంబులన్+ఒప్పి= గుణాలచేత వెలుగొంది; జన్మ, విద్యా, కర్మంబులన్= పుట్టుక చేతను, చదువుచేతను, చేసే పనుల చేతను; ప్రశస్తులరు+ఐ= పేరుకెక్కినవారై;

ఆర్యవృత్తులరు+ఐన= పూజించదగిన నడవడికలు కల; మీ, సహవాసంబునన్+ఉండి= మీతోపాటు నివసించి; ధర్మపరులము+ఐ= ధర్మాన్ని అనుసరించే వాళ్ళమై; కృతార్థులము+అగుదుము= ధన్యులం కాగలం; దుష్కృతంబులయందు= చెడ్డపనులలో; అనారంభులు+అయ్యును= ప్రయత్నంలేనివారైనను, అంటే చెడ్డపనులు చేయటానికి ఉపక్రమించనివాళ్ళు సైతం; జనులు = ప్రజలు; దుర్జన, దర్శన, స్పర్శన, సంభాషణ, సహ+ఆసనంబులన్+చేసి= చెడ్డవారిని చూడటంచేత, తాకటంచేత, మాటాడటంచేత, ఒకచోట కూర్చుండటంచేత; ధర్మ, విహీనులు+అగుదురు= ధర్మంలోపించిన వారు అవుతారు; కావునన్= కాబట్టి; ఏము= మేము; దుర్యోధను రాజ్యంబునన్= దుర్యోధనుడు ఏలుతున్న రాజ్యంలో; ఉండన్+ఓపము= ఉండజాలం; మా, అనుగమనంబునకు+ఒడంబడవలయున్= మేము మీతో రావటానికి దయచేసి మీరు అంగీకరించాలి; అని; కృతాంజలులు+ ఐనన్= చేయబడిన నమస్కారం కలవారైన, అంటే నమస్కరించిన; ఆ+పౌరులన్+చూచి= ఆ పురజనులను చూచి; ధర్మ తనయుండు+ఇట్లు+అనియెన్= ధర్మరాజు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'మీరు సాధువులు మెచ్చుకొనే సద్గుణాలు కలవారుగా పేరుకెక్కినవారు. మీ సాహచర్యంవలన మేము ధర్మాత్ములమై ధన్యులం కాగలం. చెడ్డపనులకు ఉపక్రమించనివారుకూడ దుర్జన సాంగత్యంచేత ధర్మ భ్రష్టులవుతారు. కావున మాకు దుర్యోధనుడి రాజ్యంలో నివసించటానికి ఇష్టం లేదు. అందుచేత మీతోపాటు రావటానికి మాకు అనుమతిని ఇవ్వా'లని పౌరులు నమస్కరించి పలుకగా, వారితో ధర్మరాజు ఈవిధంగా ప్రత్యుత్తర మిచ్చాడు.

క. 'మాయందు లేని గుణములు । మీ యనురాగమునఁ జేసి మిగిలి వెలింగెన్;
మీ యనుగతి మా కనభి । ప్రాయము; వనవాసదుఃఖభర మోపుదురే? 8

ప్రతిపదార్థం: మాయందు, లేని, గుణములు= మాలో లేని మంచిగుణాలు; మీ, అనురాగమునన్+చేసి= మీకు మాపై ఉన్న ప్రేమచేత; మిగిలి, వెలింగెన్= హెచ్చుగా ఉన్నట్లు వెలుగొందాయి; మీ, అనుగతి= మీరు మాతో రావటం; మాకు+అనభిప్రాయము= మా తలంపు కాదు; వన వాస, దుఃఖ, భరము+ఓపుదురే= అరణ్యంలో నివసించటంవలన కలిగే శోకాన్ని మీరు భరించగలరా?

తాత్పర్యం: 'మాలో లేని సద్గుణాలు మీరు ఆరోపిస్తున్నారు. అది మా అదృష్టం. కాని, అరణ్యావాసం చేయటంవలన కలిగే దుఃఖభారాన్ని మీరు సహించలేరు. అందుచేత మీరు మాతోపాటు రావటం మాకు ఇష్టం లేదు.

విశేషం: ఈ పద్యంలో 'మాకు నభిప్రాయము' - అనే పాఠాంతరం కొన్ని ప్రతుల్లో ఉన్నది.

తే. వలవ దుడుగుండు మీ' రని వారినెల్లఁ । గరుణఁ బాండవజ్యేష్ఠుండు గ్రమ్మఱించెఁ;
బౌరు లట్లు నివర్తింపఁబడి నిరంత । రార్తనాదులై యరిగిరి హస్తిపురికి. 9

ప్రతిపదార్థం: వలవదు= రావద్దు; ఉడుగుండు= (మీ పయనం) విడవండి; మీరు+అని; వారిన్+ఎల్లన్= ఆ పౌరులనందరిని; కరుణన్= దయతో; పాండవజ్యేష్ఠుండు= పాండుసుతులలో పెద్దవాడయిన ధర్మరాజు; క్రమ్మఱించెన్= మరల్చాడు; పౌరులు= పురజనులు; అట్లు= ఆ విధంగా; నివర్తింపఁబడి= వెనుకకు మరల్చబడి; నిరంతర+ఆర్తనాదులు+ఐ= ఎడతెగని శోకధ్వనులు కలవారై, అంటే దుఃఖితులై; హస్తిపురికి= హస్తినానగరానికి; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: 'మాతో రావద్దు. మీరు దయచేసి వెనుకకు మరలిపొండి' అని చెప్పి, కరుణతో ధర్మరాజు పౌరులను వెనుకకు మరలించాడు. పౌరులు శోకిస్తూ హస్తినాపురానికి తిరిగి వెళ్ళిపోయారు.

వ. ఇట్లు పాండవులు గృతప్రస్థానులై గంగాతీరంబునం బ్రమాణాఖ్యవటంబున విడిసి, గంగాస్నానంబు సేసి, నాఁటి పగలును రాత్రియు నంద యుండి; రంతఁ బ్రభాతసమయంబున. 10

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవులు; కృతప్రస్థానులు+ఐ= చేయబడిన ప్రయాణం కలవారై, అంటే ప్రయాణంచేసి; గంగా, తీరంబునన్= గంగానది ఒడ్డున; ప్రమాణ+ఆఖ్య, వటంబున= 'ప్రమాణ' మనే పేరు కల మఱ్ఱిచెట్టుదగ్గర; విడిసి= విడిది చేసి; గంగా స్నానంబు+చేసి= గంగానదిలో స్నానంచేసి; నాఁటి= ఆ రోజు; పగలును; రాత్రియున్; అందు+అ, ఉండిరి= అచటనే ఉన్నారు; అంతన్; ప్రభాత సమయంబున= తెల్లవారు జామున.

తాత్పర్యం: ఈ విధంగా పాండవులు అరణ్యంలో ప్రయాణం కొనసాగించి, గంగానదీతీరంలో 'ప్రమాణం' అనే పేరుతో విలసిల్లిన మఱ్ఱిచెట్టు క్రింద విడిది చేసి, గంగాస్నానం చేసి, అచ్చటనే ఒక పగలు, రాత్రి గడిపారు. అంత తెల్లవారే సమయంలో.

చ. పరువడి నగ్నిహోత్రములు బంధులు శిష్యులుఁ దోడ రా మహీ
సురవరులెల్లఁ బాండునృపసూనులయొద్దకుఁ బ్రీతి నేఁగుదెం
చిరి బహువేదఘోషములఁ జేసి నిరస్త సమస్త కిల్బిషో
త్కరు లగుచున్న ధన్యులు జగత్పరిపూజ్యులు బ్రహ్మసమ్మితుల్. 11

ప్రతిపదార్థం: పరువడిన్= వేగం(శ్రద్ధ)తో; అగ్నిహోత్రములు= (నిత్యవ్రతంగా నిర్వహిస్తున్న) అగ్నులు; బంధులు= చుట్టాలు; శిష్యులున్= తమవద్ద చదువుకొంటున్న వటువులు; తోడ, రాన్= వెంటరాగా; బహు, వేద, ఘోషములన్+చేసి= ఎన్నో వేదమంత్రాలను వల్లెవేస్తూ ఉన్నందున; నిరస్త, సమస్త, కిల్బిష+ఉత్కరులు+అగుచు+ఉన్న= పోయిన సర్వపాపాల అతిశయం కలవారవుతూ ఉన్న, అంటే సమస్త పాపరహితు లయిన; ధన్యులు= చరితార్థులు; జగత్, పరిపూజ్యులు= జగత్తుకంతటికి మిక్కిలి పూజించతగినవారు; బ్రహ్మ సమ్మితుల్= బ్రహ్మదేవుడితో సమానులు; అగు; మహీ సురవరులు+ఎల్లన్= భూమిలోని దేవతలలో శ్రేష్ఠులు అందరు, అంటే బ్రాహ్మణోత్తములందరు; పాండు, నృప, సూనుల+ఒద్దకున్= పాండురాజుకొడుకులవద్దకు; ప్రీతిన్= అనురాగంతో; ఏఁగుదెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: (ఆ వేగుబోకలో) వేదమంత్రాలను పఠించడంవల్ల సమస్త పాపరహితులయి ధన్యులైనవారు, లోకమంతటికి పూజనీయులు, బ్రహ్మదేవునితో సమానులు అయిన బ్రాహ్మణోత్తములందరు, బంధువులు, శిష్యులు వెంటరాగా, తమ తమ అగ్నిహోత్రాలు తీసుకొని పాండవుల వద్దకు ప్రేమతో వచ్చి చేరారు.

విశేషం: వేదమంత్రపఠనం సమస్త పాపహరం అని ఆర్షవిశ్వాసం. నన్నయభట్టుకాలంలో తూర్పు చాళుక్య యుగంలో వైదికమత పునర్వికాసం వెల్లివిరిసింది. నన్నయమహాకవి వ్రాసిన ఈ పద్యం సమకాలిక బ్రాహ్మణసమాజాన్ని ప్రతిఫలింపచేసే మణిదర్పణం.

వ. ఇట్లు దమతోడన వనవాసంబు సేయ నిశ్చయించి వచ్చిన విప్రుల నతిప్రీతి గౌరవంబున నర్చించి తదా శీర్వాదంబుల నభినందితుండై ధర్మతనయుండు వారల కిట్లనియె. 12

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తమతోడన్+అ; వనవాసంబు+చేయ= అరణ్యంలో నివసించటానికి; నిశ్చయించి= నిర్ణయించి; వచ్చిన; విప్రులన్= బ్రాహ్మణులను; అతిప్రీతి, గౌరవంబునన్= మిక్కిలి అనురాగంతో, మన్ననతో; అర్చించి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పూజించి; తద్+ఆశీర్వాదంబులన్= వారి దీవెనలచేత; అభినందితుండు+ఐ= మెచ్చుకొనబడినవాడై; ధర్మతనయుండు= (యమధర్మరాజు కొడుకు) ధర్మరాజు; వారలకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా తమతో అరణ్యావాసం చేయటానికి సంసిద్ధులై వచ్చిన బ్రాహ్మణులను అనురాగంతో, మన్ననతో పూజించి, వారి ఆశీర్వాదాలను పొంది ధర్మరాజు వారితో ఇట్లా అన్నాడు.

క. 'అపహృత సర్వస్వులమై । సపత్నుల నికారమునఁ బ్రచండాటవిలో
విపుల ఫల శాక మూలము । లుపయోగించుచును నిష్ఠ నుండెడు మాతోన్. 13

ప్రతిపదార్థం: అపహృత సర్వస్వులము+ఐ= అపహరించబడిన సమస్తం కలవాళ్ళమై, అంటే సమస్తం కోలుపోయిన వాళ్ళమై; సపత్నుల, నికారమునన్= శత్రువుల వంచనవలన; ప్రచండ+అటవిలో= ఘోరమైన అడవిలో; విపుల, ఫల, శాక, మూలములు= ఎన్నో పండ్లు కూరలు దుంపలు; ఉపయోగించుచును= వాడుతూ; నిష్ఠన్+ఉండెడు= నియమంతో బ్రతికే; మాతోన్.

తాత్పర్యం: 'శత్రువుల వంచనచేత అంతయు పోగొట్టుకొని అరణ్యంలో దొరికే పండ్లు, కూరలు, వేళ్ళు (దుంపలు)తిని బ్రతికే మాతో.

క. రా నేల? వచ్చి నవయం । గా నేల? నివాసములకుఁ గ్రమ్మతి చనుఁ; డు
గ్రానేకప శార్దూల భ । యానక వనవాస మర్హ మగునే మీకున్!' 14

ప్రతిపదార్థం: రాన్+ఏల= మీరు రావటం ఎందుకు?; వచ్చి; నవయంగాన్+ఏల= కష్టపడుట ఎందుకు?; నివాసములకున్+క్రమ్మతి, చనుఁడు= (మీ)ఇండ్లకు తిరిగి వెళ్ళండి; ఉగ్ర+అనేకప, శార్దూల, భయానక, వనవాసము= క్రూరమైన ఏనుగులతో, పెద్దపులులతో భయంకరమైన అరణ్యనివాసం; మీకున్+అర్హము+అగున్+ఏ= మీకు తగునా?

తాత్పర్యం: మీరు రావటం ఎందుకు ? వచ్చి ఎందుకు కష్టపడాలి? మీరు మీ ఇండ్లకు తిరిగిపొండి. భీకరమైన ఏనుగులతో, పెద్దపులులతో కూడిన అరణ్యవాసం మీకు తగునా?'

వ. అనిన విని బ్రాహ్మణులు పరమ దుఃఖితులై 'మీర కాని మాకు నొండు గతి లేదు; మమ్ము నసన్యశరణ్యుల విడుచుట ధర్మంబు గాదు. 15

ప్రతిపదార్థం: అనిన, విని, బ్రాహ్మణులు; పరమ దుఃఖితులు+ఐ= మిక్కిలి శోకం పొందినవారై; మీరు+అ, కాని= మీరే తప్ప; మాకున్+ఒండు, గతి= మాకు వేరొకమార్గం; లేదు; మమ్మున్; అనన్య శరణ్యుల= వేరేదిక్కు (ఆశ్రయం) లేని వాళ్ళను; విడుచుట= వదలుట; ధర్మంబు, కాదు= న్యాయం కాదు.

తాత్పర్యం: ఆ మాటలు విన్న బ్రాహ్మణులు మిక్కిలి దుఃఖించి పాండవులతో - 'అయ్యలారా! మాకు మీరు తప్ప వేరే ఎవరూ దిక్కు లేరు. మీరు మమ్మల్ని వదలటం ధర్మం కాదు.

ఆ. ఆశ్రితులను భక్తులగువారి నెప్పుడు । నన్యులైన విడువ; రట్టి విప్ర
వరుల భక్తిపరుల వసుధేశ! మీ యట్టి । ధార్మికులకు విడువఁదగునె చెపుమ. 16

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆశ్రితులను= తమ అండకు చేరిన వాళ్ళను; భక్తులు+అగువారిని= తమపట్ల భక్తికలవాళ్ళను; ఎప్పుడున్; అన్యులైన= ఇతరులైన; విడువరు= వదలిపెట్టరు; అట్టి; విప్రవరుల= బ్రాహ్మణోత్తములను; భక్తిపరుల= భక్తితో కూడిన వాళ్ళను; వసుధా+ఈశ= ఓరాజా!; మీ, అట్టి, ధార్మికులకు= మీవంటి ధర్మాత్ములకు; విడువన్+తగునె= విడుచుట తగునా?; చెపుము+అ= చెప్పండి.

తాత్పర్యం: తమప్రాపు గోరి చేరినవాళ్ళను, తమపట్ల భక్తి కలవాళ్ళను ఇతరులు కూడ ఎన్నడూ విడనాడరు కదా! అటువంటప్పుడు బ్రాహ్మణోత్తములను, మీపట్ల భక్తికలవాళ్ళను ఓ ధర్మరాజా! మీబోటి ధర్మాత్ములు విడిచిపెట్టటం భావ్యమా?

వ. అస్మ త్పోషణోపాయచింత సేయ వలదు; వన్యమూల ఫలంబుల నేమ తెచ్చికొని యుపయోగించుచు జపహోమాది పుణ్యక్రియల మీకుం బ్రియంబు సేయుచు నుండెద; మధర్మవర్తులయి మీ కపకారంబు సేసిన ధార్తరాష్ట్రుల రాష్ట్రంబున నుండ నోప' మనిన వారల రాక కొడంబడి. 17

ప్రతిపదార్థం: అస్మద్+పోషణ+ఉపాయ, చింత= మమ్మల్ని ఎట్లా పోషించాలి అనే ఉపాయాన్నిగూర్చిన ఆలోచన; చేయవలదు; వన్య, మూల, ఫలంబులన్= అడవిలో పుట్టి పెరిగే వేళ్ళు, పండ్లు; ఏము+అ= మేమే; తెచ్చికొని; ఉపయోగించుచు; జప, హోమ+ఆది, పుణ్య, క్రియల= జపం, అగ్నివేల్చటం మొదలైన పుణ్యకార్యాలచేత; మీకున్+ప్రియంబు+చేయుచున్= మీకు ఇష్టం ఒన గూర్చుతూ; ఉండెదము; అధర్మ వర్తులు+అయి= అధర్మాన్ని ఆచరించేవారయి; మీకు+అపకారంబు= మీకు కీడు; చేసిన; ధార్తరాష్ట్రుల= ధృతరాష్ట్రుడి కొడుకుల; రాష్ట్రంబునన్= రాజ్యంలో; ఉండన్+ఓపము= ఉండజాలము; అనిన= అని చెప్పగా; వారల రాకకు= ఆ బ్రాహ్మణులు తమతో రావటానికి; ఒడంబడి= అంగీకరించి.

తాత్పర్యం: మా పోషణగురించి మీరు ఆలోచించవలసిన అవసరం లేదు. మేమే అడవిలో దొరికేపండ్లు, వేర్లు తెచ్చుకొని తినగలం. జపతపాలు, యజ్ఞయాగాలు మొదలైన పుణ్యకార్యాలు నిర్వహించి మీకు ప్రియం చేస్తూ ఉంటాము. మీకు కీడు చేసిన దుర్యోధనాదులు పరిపాలించే దేశంలో మేము ఉండలేం' అని చెప్పిన బ్రాహ్మణుల మాటలకు సమ్మతించి.

తే. ఇష్టమృష్టాన్నములఁ దొల్లి యెల్ల ప్రొద్దుఁ । దృప్తులగుచున్న వసుమతీదేవవరులఁ
గానలందు శాకాశనుల్ గాఁగ నెట్లు । సూడ నోపుదు నని ధర్మసూనుఁ డపుడు. 18

ప్రతిపదార్థం: ఇష్ట. మృష్ట+అన్నములన్= తమకు నచ్చినట్టియు శుచి అయినట్టియు అన్నములచేత; తొల్లి= మున్ను; ఎల్లప్రొద్దున్= సర్వవేళల; తృప్తులు+అగుచున్న= తనివి చెందుతున్నవారయిన; వసుమతీ, దేవ, వరులన్= భూదేవ శ్రేష్ఠులను అంటే బ్రాహ్మణోత్తములను; కానలందు= అరణ్యాలలో; శాక+అశనుల్+కాఁగన్= కూరలు తినే వారినిగా; ఎట్లు= ఏవిధంగా; చూడన్+ఓపుదును+అని= చూడగల నని; అప్పుడు; ధర్మసూనుఁడు= ధర్మరాజు.

తాత్పర్యం: రుచిగా, శుచిగా ఉన్న వంటకాలతో ఎల్లప్పుడూ తృప్తిగా భుజించే బ్రాహ్మణోత్తములు కేవలం కూరగాయలు తింటూ అరణ్యంలో ఉండటం ఎట్లా చూడగలనని ధర్మరాజు వాపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శౌనకుఁడు ధర్మరాజునకు ధర్మంబులు సెప్పుట (సం. 3-2-14)

వ. శోకమూర్ఛితుండై మహీతలంబుపయిం బడిన యాతని నాశ్వాసించి శౌనకుం డను బ్రహ్మర్షి దొల్లి యాత్మ వ్యవస్థానార్థంబు జనకగీతంబు లైన శ్లోకంబుల యర్థంబులు యుధిష్ఠిరున కి ట్లనియె. 19

ప్రతిపదార్థం: శోక, మూర్ఛితుండు+ఐ= దుఃఖంవలన మూర్ఛపొందిన వాడై; మహీతలంబుపయిన్+పడిన, ఆతనిన్= నేలపైబడిన ఆతడిని; ఆశ్వాసించి= ఓదార్చి; శౌనకుండు+అను, బ్రహ్మర్షి= శౌనకుడు అనే బ్రాహ్మణ ఋషి; తొల్లి= పూర్వం; ఆత్మ, వ్యవస్థాన+అర్థంబు= ఆధ్యాత్మిక జ్ఞానం నిల్పటంకోసం; జనక, గీతంబులు+ఐన= జనక మహారాజుచేత పాడబడిన; శ్లోకంబుల= పద్యాల; అర్థంబులు= అభిప్రాయాలు; యుధిష్ఠిరునకు= ధర్మరాజుకు(చెపుతూ); ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుఃఖంవలన మూర్ఛిల్లి నేలపై కొరిగిన ధర్మరాజును సేదదీర్చి, శౌనకుడనే బ్రాహ్మణఋషి ధర్మరాజుకు జనకగీతాలలోని వేదాంతపరమార్థాన్ని ఈవిధంగా వివరించాడు.

విశేషం: శౌనకుడు జనకగీతాలైన శ్లోకాల అర్థమే చెప్పాడు గాని వాటినన్నింటిని చెప్పి ఉండలేదు. నన్నయ మూలాన్ని సంక్షేపించే విధానాలలో ఇదొకటి.

క. 'శోకభయస్థానంబు ల । నేకంబులు గలిగినను విహీన వివేకుం
డాకులతఁ బొందునట్లు వి । వేకము గలవాఁడు బుద్ధి వికలుం డగునే? 20

ప్రతిపదార్థం: శోక, భయ, స్థానంబులు= దుఃఖానికి, భయానికి నెలవులు; అనేకంబులు= పెక్కులు; కలిగినను= కలిగినప్పటికిని; విహీన వివేకుండు= వివేకం లేనివాడు; ఆకులతన్+పొందునట్లు= ఆరాటం చెందినట్లు; వివేకము, కలవాఁడు= ఉచితానుచిత జ్ఞానం కలవాడు; బుద్ధి, వికలుండు+అగునే= మతిపోగొట్టుకొన్నవాడు అవుతాడా?

తాత్పర్యం: 'దుఃఖం, భయం పొందదగిన పట్టులు పెక్కులు దాపురించినప్పటికినీ అవివేకివలె వివేకి వికలుడు కాడు.

విశేషం: అలం: ఉపమ.

క. శారీర మానస మహా । దారుణ దుఃఖములఁ జేసి తఱఁగి శరీరుల్
క్రూరతరబాధఁ బొందుదు । రా రెంటిని జెఱుతు రార్యు లమలినబుద్ధిన్. 21

ప్రతిపదార్థం: శారీర= దేహానికి సంబంధించినట్టి; మానస= మనస్సుకు సంబంధించినట్టి; మహా, దారుణ= మిక్కిలి భయావహమైన; దుఃఖములన్+చేసి= శోకాల (అనుభవించటం) చేత; తఱఁగి= క్షీణించి; శరీరుల్= దేహధారులైన మనుజులు; క్రూరతర, బాధన్+పొందుదురు= ఎక్కువ నొప్పి కలిగించే కష్టాలను అనుభవిస్తారు; ఆరెంటిని= ఆ రెండింటిని అంటే దేహసంబంధమైన, మనస్సంబంధమైన వెతలను; ఆర్యులు= పూజించతగినవారు; అమలిన, బుద్ధిన్= నిర్మలమైనమతితో; చెఱుతురు= చెడేటట్లు చేస్తారు.

తాత్పర్యం: కేవలం దేహధారులని చెప్పతగిన సామాన్యమానవులు శారీరక, మానసిక బాధలచేత క్రుంగి కృశిస్తారు. ఆర్యులు ఆ రెంటిని నిర్మలబుద్ధితో నిగ్రహించగలుగుతారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఆంధ్ర మహాభారతంలోని ఎన్నో పద్యాలలో, వచనాలలో పెక్కు పాఠాంతరాలు కనిపిస్తున్నాయి. ప్రాచీన తాళపత్ర గ్రంథాలలో లేఖకులు కారణాంతరాలవలన మార్పులు, చేర్పులు, కూర్పులు ఎడనెడ చేసి ఉన్నారు. అసలు కవిహృదయం నిష్కర్షగా నిర్ణయించటంకూడ కష్టమే. ఆంధ్రమహాభారతం - సంశోధిత ముద్రణం తయారు చేసిన విద్వాంసులు పాఠభేదాలు అన్నింటిని సమగ్రంగా చర్చించి, తమకు నచ్చిన పాఠాన్ని స్వీకరించినప్పటికీ పాఠాంతరాలను కూడ అచ్చుప్రతిలో ఆయా పుటల క్రింద ఉదాహరించి ఉన్నారు. ఇచట 'చెఱుతురు' అనే దానికి 'పాతురు' అనే పాఠాంతరం ఉన్నది. కాని 'చెఱుతురు' అనే పాఠమే కవి హృదయమని తోస్తున్నది.

వ. వ్యాధి శ్ర మానిష్ట సంస్పర్శ నేష్ట వివర్జనంబు లను నాల్గింటం బుట్టి శారీరదుఃఖంబు లాశుక్రియాది ప్రతి యోగంబుల నుపశమిల్లు; మఱి స్నేహజంబు లైన మానసదుఃఖంబులు జలంబుల నగ్ని యుపశమిల్లునట్లు విమల జ్ఞానంబునం జేసి యుపశమంబునం బొందు. 22

ప్రతిపదార్థం: వ్యాధి, శ్రమ+అనిష్ట, సంస్పర్శన+ఇష్ట, వివర్జనంబులు+అను, నాల్గింటన్= రోగం, అలసట, ఇష్టంలేని వాటిని ముట్టుకోవటం, ఇష్టమైన వాటిని వదలిపెట్టటం అనే నాల్గింటి నుండి; పుట్టి= జనించి; శారీర దుఃఖంబులు= దేహ సంబంధమైన శోకాలు; ఆశు, క్రియా+ఆది, ప్రతియోగంబులన్= అప్పటికప్పుడు చేసే చేష్టలు మొదలైన విరుగుళ్ళ వల్ల; ఉపశమిల్లు= తగ్గుతాయి; మఱి; స్నేహజంబులు+ఐన= మైత్రి వల్ల జనించే; మానస, దుఃఖంబులు= మనస్సుకు సంబంధించిన శోకాలు; జలంబులన్= నీటిచేత; అగ్ని= నిప్పు; ఉపశమిల్లునట్లు= అణగేటట్లు; విమల, జ్ఞానంబునన్+చేసి= నిర్మలమైన జ్ఞానంచేత; ఉపశమంబునన్+పొందున్= తగ్గుతాయి.

తాత్పర్యం: రోగం, అలసట, ఇష్టంలేని వాటిని ముట్టుకోవటం, ఇష్టమున్న వాటిని వదలిపెట్టటం అనే నాల్గింటి వలన శరీరదుఃఖాలు పుట్టుతాయి. ఆ శరీరదుఃఖాలు (వేగంగా) అప్పటికప్పుడు చేసే విరుగుడులవలన తాత్కాలికంగా ఉపశమింపవచ్చును. ఇక, స్నేహంవలన ఏర్పడిన మానసిక తాపాలు, నీటివలన నిప్పు అణగినట్లుగా విమలజ్ఞానం వలన ఉపశమనం పొందుతాయి.

క. స్నేహార్ణవ మగ్నుం డయి । దేహి మహాదుఃఖముల నధృతిఁ బొందును; దుః
ఖాహతుఁడు శోకతాపవి । మోహి యగున్; స్నేహమూలములు రాగాదుల్. 23

ప్రతిపదార్థం: స్నేహ+అర్ణవ, మగ్నుండు+అయి= చెలిమి అనే కడలిలో మునిగినవాడై; దేహి= శరీరధారి అయిన మానవుడు; మహాదుఃఖములన్= గొప్ప వెతలను; అధృతిన్= స్థైర్యం లేమిచేత; పొందును; దుఃఖ+ఆహతుఁడు= బాధలచేత కొట్టబడినవాడు; శోక, తాప, విమోహి, అగున్= వగపు అనే వేడిమి సోకి స్పృహతప్పినవాడు అవుతాడు; రాగ+ఆదుల్= ప్రేమ మున్నయినవి; స్నేహమూలములు= స్నేహం కారణంగా కలిగినట్టివి.

తాత్పర్యం: స్నేహమనే సముద్రంలో మునిగి మనుజుడు స్థైర్యం కోలుపోయి దుఃఖాన్ని పొందుతాడు. దుఃఖితుడు వగపువేడిమిలో ఉడికిపోయి స్పృహ తప్పుతాడు. అనురాగం మొదలయినవి స్నేహాన్ని ఆధారంగా చేసికొని పుట్టేవే.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'స్నేహం' - సంస్కృతభాషలో మైత్రి - చెలిమి అనే పదాలకంటె విస్తృతమైన పరిధిలో వాడబడింది. ఒక జీవికి అనేక కారణాలవలన ఏర్పడే అనిర్వచనీయమైన అనుబంధాన్ని, అనురాగాన్ని స్నేహభావంగా అర్థం చెప్పవచ్చును. 'స్నేహమూలములు రాగాదుల్' అనే మనోహర భావన నన్నయను నానారుచిరార్థ సూక్తి నిధిని చేసిన కవితాశిల్పానికి ఉదాహరణగా ఎన్నవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. కావున బంధుమిత్త్రధనసంచయంబులవలని స్నేహంబు విడుచునది; పద్మపత్త్రంబు నీరం బొందనియ ట్లెఱుక గలవారి నెట్టియెడలను స్నేహంబు వొందదు; స్నేహంబున రాగంబును, రాగంబునం గామంబును, గామంబునం గ్రోధంబును, గ్రోధంబునం దృష్ణయు వర్తిల్లు. 24

ప్రతిపదార్థం: కావున= కాబట్టి; బంధు, మిత్త్ర, ధన, సంచయంబుల వలని, స్నేహంబు= చుట్టాలవలనను, నెచ్చెలులవలనను, డబ్బును ప్రోగుచేయటంవలనను ఏర్పడే మైత్రి; విడుచునది= వదలునది; ఎఱుక, కలవారిన్= తెలిసినట్టివారిని, అంటే ఆ జ్ఞానులను; ఎట్టి, ఎడలను= ఎటువంటి సమయాల్లోనైనను; పద్మపత్త్రంబు= తామరాకు; (నీరన్+పొందని) నీరంబు+ఒందని, అట్లు= నీటిని పొందని విధంగా; స్నేహంబు= మైత్రి; పొందదు= చేరుకోదు; స్నేహంబున= మైత్రివలన; రాగంబును= ప్రేమయున్నూ; రాగంబునన్+కామంబును= ప్రేమవలన కోరికయున్నూ; కామంబునన్+క్రోధంబును= కోరికవలన కోపమున్నూ; క్రోధంబునన్+తృష్ణయు= కోపంవలన దాహమున్నూ (అంటే తీరని ప్రలోభం); వర్తిల్లున్= ఏర్పడతాయి.

తాత్పర్యం: కాబట్టి, చుట్టాలవలన, మిత్రులవలన, ధనం సమకూర్చటంవలన ఏర్పడే కూరిమి విడనాడాలి. తామరాకు నీటిని పొందనట్లు జ్ఞాని ఎప్పుడును స్నేహం పొందడు. కూరిమి వలన అభిమానం, అభిమానం వలన కోరిక, కోరికవలన కోపం, కోపంవలన దాహం ఉద్భవిస్తాయి. (ఇచట దాహమంటే అత్యాశ).

విశేషం: అలం: ఉపమ. సంచయంబులవలని స్నేహంబు; సమాసములలో చేత, తోడ, వలనలకు ఇత్వమౌతుంది. సంచయంబుల వలన స్నేహము.

క. అది సర్వదోషముల కా । స్పద, మది దురితక్రియానుబంధంబులకున్
మొదలు, నిరంతర దుఃఖ । ప్రద మని మదిఁ దలఁచి తృష్ణఁ బాతురు సుమతుల్. 25

ప్రతిపదార్థం: అది= తృష్ణ; సర్వ, దోషములకు= అన్ని తప్పిదాలకు; ఆస్పదము= నెలవు; అది; దురిత, క్రియా+ అనుబంధంబులకున్= పాపకృత్యాల కలయికకు; మొదలు= ప్రారంభం; నిరంతర, దుఃఖ, ప్రదము= ఎల్లప్పుడు దుఃఖాన్ని కలిగించేది; అని; మదిన్= మనస్సులో; తలఁచి= ఆలోచించి; తృష్ణన్= అత్యాశను; సుమతుల్= బుద్ధిమంతులు; పాతురు (పాచుదురు)= వదలి వెళ్ళుతారు.

తాత్పర్యం: అది సమస్త దోషాలకు నెలవైనదనిన్నీ, అది పాపకార్యాల అనుసంధానానికి ఆరంభమనిన్నీ, నిరంతరం అది దుఃఖాన్ని కలిగించేదనిన్నీ ఆలోచించి మంచిబుద్ధికలవారు తృష్ణను వదలిపెట్టుతారు.

విశేషం: పౌరాణికవాఙ్మయంలో, బౌద్ధసాహిత్యంలో తృష్ణయే సర్వదురితాలకు మూలమని నొక్కి వక్కాణించబడింది.

వ. మఱియుఁ దృష్ణాతురుం డర్థలోభంబునఁ గోటరస్థంబయిన యనలంబునం జేసి దగ్ధంబగు వృక్షంబునుంబోలె వినాశంబునం బొందు; నర్థాసక్తుండైనవాఁడు శుభంబులు వడయ నోపండు; మృత్యువువలనం బ్రాణులకు భయంబు గలుగు నట్లర్థవంతులకు రాజ చోర స్వజన జలానలంబులవలన భయంబు నియతంబు. 26

ప్రతిపదార్థం: మఱియున్; తృష్ణా+ఆతురుండు= తృష్ణచేత కలతచెందినవాడు; అర్థలోభంబునన్= ధనమందలి ఆసక్తివలన; కోటరస్థంబు+అయిన= (చెట్టు) తొఱ్ఱలో ఉన్నట్టి; అనలంబునన్+చేసి= అగ్నిచేత; దగ్ధంబు+అగు= తగులబడే; వృక్షంబునున్+పోలె= చెట్టువలె; వినాశంబునన్+పొందున్= నశించిపోతాడు; అర్థ+ఆసక్తుండు+ఐనవాఁడు= ధనకాంక్ష కలిగినవాడు;

శుభంబులు= మేళ్ళు, అభ్యుదయాలు; పడయన్+ఓపండు= పొందజాలడు; ప్రాణులకు= జీవకోటికి; మృత్యువువలనన్= మరణంవలన; భయంబు, కలుగునట్లు= భయం ఏర్పడేటట్లు; అర్థవంతులకు= ధనం కలవారికి; రాజ, చోర, స్వజన, జల+అనలంబులవలన= రాజులవలన, దొంగలవలన, చుట్టపక్కాలవలన, నీటివలన, నిప్పువలన; భయంబు= భీతి; నియతంబు= నిత్యం. (ఎల్లప్పుడు ఉంటుంది).

తాత్పర్యం: మఱియు, తృష్ణచేత కలతచెందినవాడు ధనంమీది ఆసక్తివలన, చెట్టుతొర్రలోని అగ్నిచేత దగ్ధం అయ్యే చెట్టువలె నాశనం పొందుతాడు. ధనకాంక్ష కలిగినవాడు శుభాలు పొందలేడు. ప్రాణులకు మరణంవలన భయం కలుగునట్లుగా ధనం కలవారికి రాజులవలన, దొంగలవలన, చుట్టాలవలన, నీటివలన, నిప్పువలన భయం ఎల్లప్పుడూ ఉంటుంది.

విశేషం: అలం: ఉపమ.

తే. జలములందు మత్స్యంబులు, చదలఁ బక్షు । లామిషం బెట్లు భక్షించు నట్లు దివిరి
యెల్లవారును జేరి యనేకవిధుల । ననుదినంబును భక్షింతు రర్థవంతు. 27

ప్రతిపదార్థం: జలములందు= నీళ్ళలో; మత్స్యంబులు= చేపలు; చదలన్= ఆకాశంలో; పక్షులు; ఆమిషంబు= మాంసాన్ని; ఎట్లు= ఏవిధంగా; భక్షించున్= తింటాయో; అట్లు= ఆ విధంగా; తివిరి= పూని; ఎల్లవారును= అందరున్నూ; చేరి= దగ్గరకు చేరి; అనేక విధులన్= పెక్కు రకాలుగా; అనుదినంబును= ప్రతిదినం; అర్థవంతున్= ధనంకలవాడిని; భక్షింతురు= తింటారు (పీడిస్తారు).

తాత్పర్యం: నీటిలోని చేపలు, ఆకాశంలోని పక్షులు ఏవిధంగా మాంసాన్ని భక్షిస్తాయో, అదేవిధంగా అందరు ధనవంతుడి చుట్టూ చేరి అనేకవిధాల ప్రతిదినం అతడిని పీడిస్తారు.

విశేషం: అలం: ఉపమ. ధనాపహరణం చేసేవాళ్ళు దొంగలు అనేమాట అందరికీ అనుభవసిద్ధం. అది ప్రత్యక్ష ప్రమాణం. ఇక చుట్టపక్కాలు పరోక్షంగా ధనవంతుడిని పీడించటం పరోక్షప్రమాణం.

క. అర్థమ యనర్థ మూలం; । బర్థమ మాయా విమోహనావహము; నరుం
డర్థార్జన దుఃఖమున న । పార్థీకృతజన్ముఁ డగుట పరమార్థ మిలన్. 28

ప్రతిపదార్థం: అర్థము+అ= ధనమే; అనర్థ, మూలంబు= కష్టాలకుకారణం; అర్థము+అ= ధనమే; మాయా, విమోహన+ఆవహము= మాయవలన ఏర్పడే మైకం కలిగించేది; నరుండు= మనుజుడు; అర్థ+ఆర్జన, దుఃఖమునన్= ధనం సంపాదించాలనే బాధతో; అపార్థీకృత, జన్ముఁడు+అగుట= వ్యర్థమైన పుట్టుక కలవాడవటం; ఇలన్= భూలోకంలో; పరమ+అర్థము= మేటి సత్యం.

తాత్పర్యం: అన్ని చెడుగులకు ధనమే మూలకారణం. ధనం మాయచేత ఏర్పడే భ్రాంతికి ఆకరం. మనుజుడు ధనసంపాదనవలన ఏర్పడే దుఃఖంవలన వ్యర్థజన్ముఁ డవుతా డనే మాట భూలోకంలోని మేటి సత్యం.

విశేషం: ఈ పద్యంలోని ధన నిరసనం సుస్పష్టం. "ధనమూల మిదం జగత్", నానా గుణ గణము కాంచనంబున నిలుచున్", "సర్వే గుణాః కాంచన మాశ్రయంతి" అనే సుభాషితాల అంతరార్థం కూడ వ్యంగ్యగర్భితమైన ధన నిరసనమే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

"అర్థానామార్జనే దుఃఖం ఆర్జితానాం చ రక్షణే । ఆయే దుఃఖం వ్యయే దుఃఖం ధిగర్థం దుఃఖభాజనమ్."

ధన సంగ్రహణం దుఃఖంతో కూడిన పని, ఆర్జించిన ధనాన్ని రక్షించటం కూడ దుఃఖంతో కూడిన పనే. ఆదాయం దుఃఖం. వ్యయం దుఃఖం ఛీ! ఛీ! ధనం దుఃఖభాజనం. పై శ్లోకం ఇక్కడ అనుశీలించతగింది.

వ. అట్టి యర్థంబువలన దర్పకార్పణ్య మాన భయోద్వేగంబులు పుట్టుఁ; గావున నర్థోపార్జనచింత సేయ వలదు. రూప యౌవన ధన విభవ ప్రియ సంవాసంబు లనిత్యంబు లగుట నందు బుద్ధిమంతులు విమోహింప' రనిన నమ్మునివరునకు ధర్మతనయుం డిట్లనియె. 29

ప్రతిపదార్థం: అట్టి= ఆ విధమైన; అర్థంబువలన= ధనం వలన; దర్ప, కార్పణ్య, మాన, భయ+ఉద్వేగంబులు+పుట్టున్= గర్వం, పిసినిగొట్టుతనం, అహంకారం, భీతి, ఉబ్బు ఏర్పడతాయి. కావునన్= కాబట్టి; అర్థ+ఉపార్జన, చింత= ధనాన్ని సంపాదించి కూడ పెట్టాలనే ఆలోచన; చేయవలదు; రూప, యౌవన, ధన, విభవ, ప్రియ సంవాసంబులు= దేహ సౌందర్యం, ప్రాయపుపొంగు, ధనం, ఐశ్వర్యం, ఇష్టమైన మేలైన ఇంటిలో ఉండటం; అనిత్యంబులు= తాత్కాలికాలు; అగుటన్= కావటంచేత; అందు; బుద్ధిమంతులు= ప్రాజ్ఞులు; విమోహింపరు= భ్రాంతి చెందరు; అనినన్= అని చెప్పగా; ఆ+మునివరునకు= మునులలో శ్రేష్ఠుడైన ఆ శౌనకుడితో; ధర్మతనయుండు= ధర్మరాజు (యమధర్మరాజుకొడుకు); ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అట్టి ధనంవలన గర్వం, పిసినిగొట్టుతనం, అహంభావం, భయం, ఉబ్బు కలుగుతాయి. అందుచేత, అట్టి ధనసంపాదన చేయాలనే కోరికను పెంచుకొనవద్దు. అందం, యౌవనం, సంపద, ఇష్టమైన ఇంటిలో నివసించటం అనేవి తాత్కాలికమైనవి. ప్రాజ్ఞులు అట్టివాటినిగురించి భ్రాంతిని పొందరు' అని చెప్పగా ఆ మునిశ్రేష్ఠుడైన శౌనకుడితో ధర్మరాజు ఈ విధంగా బదులు పలికాడు.

సీ. 'ఆత్మోపభోగార్థ మర్థలాభేచ్ఛ నా । కెన్నండు లేదు; మహీసురాగ్ర
గణ్యుల నత్యుగ్ర కాననాంతరమున । నెవ్విధంబున భరియింతు నొక్కొ
యని యిప్డు వగచెద; ననవద్యగుణయుక్తి । ననఘ! మాయట్టి గృహస్థతతికిఁ
బోష్యుల నెయ్యెడఁ బ్రోవక యుండను । విప్రుల నతిథుల వృథయ పుచ్చఁ

ఆ. జనునె? నిజధనంబు సంవిభాగించి యీ । వలయు, సాధురక్ష వలయుఁ జేయ,
నభిమతాశ్రమంబులందు గృహస్థాశ్ర । మంబకాదె యుత్తమంబు వినఁగ. 30

ప్రతిపదార్థం: ఆత్మ+ఉపభోగ+అర్థము= సొంతంగా నేను భోగాలను అనుభవించటం కొరకు; అర్థ, లాభ+ఇచ్ఛ= ధనం పొందాలనే కోరిక; నాకు+ఎన్నండు, లేదు= నాకెప్పుడూ లేదు; మహీ, సుర+అగ్రగణ్యులన్= బ్రాహ్మణోత్తములను; అతి+ఉగ్ర, కానన+అంతరమునన్= మిక్కిలి భయంకరమైన అడవిలో; ఏ+విధంబున= ఏ రీతిగ; భరియింతున్+ఒక్కొ= పోషించగలనో; అని; ఇప్డు= ఇపుడు; వగచెదన్= చింతిస్తున్నాను; అనఘ!= పాపరహితుడా!; అనవద్య, గుణ, యుక్తిన్= మంచిగుణాలుకలిగి ఉండటంచేత; మా, అట్టి, గృహస్థ, తతికిన్= మా వంటి గృహస్థుల సమూహానికి; పోష్యులన్= పోషించదగినవారిని; ఏ+ఎడన్= ఏ చోటనైనా; ప్రోవక, ఉండను= రక్షించకుండ ఉండటానికి; విప్రులన్= బ్రాహ్మణులను; అతిథుల= తాత్కాలిక వసతికి, భోజనానికి, ఇంటికి వచ్చిన వారిని; (అతిథులైన బ్రాహ్మణులను); వృథ+అ, పుచ్చన్+చనునె= వ్యర్థులుగా పంపటం పాడియా?; నిజ, ధనంబు= తన ధనం; సంవిభాగించి= పంచి; ఈ, వలయు= ఇవ్వాలి; సాధు, రక్ష= మంచివారి సంరక్షణం;

వలయున్+చేయన్= చేయాలి; అభిమత+ ఆశ్రమంబులందు= కోరుకొనదగిన ఆశ్రమాలలో; గృహస్థ+ఆశ్రమంబు+అ= గృహమేధియొక్క ఆశ్రమమే; వినఁగ= పెద్దలు చెపుతుంటే విన్న ప్రకారం; కాదె, ఉత్తమంబు= మంచిదికాదా? (అవునని భావం)

తాత్పర్యం: 'నేను నా స్వార్థంకొరకు, భోగాలకొరకు ధనాన్ని కోరుకొనటంలేదు. బ్రాహ్మణోత్తములను ఈ మహారణ్యంలో నేను ఏ విధంగా పోషించగలను- అని మాత్రమే నా దిగులు. నాబోటి గృహస్థుడికి అవశ్య కర్తవ్యం అతిథిపూజ. అందులో నా దగ్గరికి అతిథులుగా విచ్చేసినవారు బ్రాహ్మణోత్తములు, సాధుపురుషులు. అట్టివారిని ఊరక పంపవచ్చునా? గృహస్థులైనవారు తమ సంపదలో కొంతభాగం అతిథులకొరకు వెచ్చించాలి. సజ్జనులను సంరక్షించాలి. ఈ రీతిగా అన్ని ఆశ్రమాలలో గృహస్థాశ్రమమే మేల్తరమని పెద్దలు చెప్పితే వింటున్నాంకదా! ఇచట సాధు సంరక్షణం, అతిథి సేవ కలిసి వచ్చాయి. కనుక గృహస్థాశ్రమధర్మం నెరవేర్చాలి కదా!

విశేషం: సనాతన ఆర్ష సంస్కృతి ప్రకారం, మానవజీవితం- బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం- అనే ఆశ్రమ చతుష్టయంగా విభాగించబడింది. భారతానికి 'పంచమవేదం' అనే ప్రశస్తి ఏర్పడింది. వ్యాసమహర్షి వేదాలను విభజించిన మహానుభావుడు. అతడే మహాభారతకర్త. అందుచేత మహాభారతం వేదసారమనిన్నీ, వేదాలకు విపుల వ్యాఖ్యానమనిన్నీ పేరు కెక్కింది. ఇంకొక విశేషం - మహాభారతం ప్రారంభ పీఠికలో బ్రహ్మదేవుడు వ్యాసమహర్షికి ప్రత్యక్షమై, మహాభారత రచనా ప్రణాళికను ప్రశంసించాడు. అందులో బ్రహ్మదేవుడి అభినందన -'' ఆశ్రమాలలో గృహస్థాశ్రమం ఎట్లో అట్లే కావ్యాలలో మహాభారతం మేల్తరం'' - అన్నది మిక్కిలి అర్థవంతమైనది. వ్యాసమహర్షి మహాభారతాన్ని గృహస్థులకొరకు ప్రత్యేకించి వ్రాసినట్లు ఈ ఉదంతంవలన తెలుతున్నది. కవిహృదయం మహాభారత పీఠికలో సుకుమార సుందరంగా పొందుపరచబడింది. ప్రాచీన భారతదేశంలో వైదిక మతంపై తిరుగుబాటు నెలకొల్పిన జైన బౌద్ధాలు మున్నగు మతాల నిష్ఠ గృహస్థాశ్రమంపై కాక సన్న్యాసాశ్రమంపైనే ఉండటం ఇచట అనుసంధేయం. మహాభారతంలో వ్యాసమహర్షి గృహస్థాశ్రమాన్ని ఉగ్గడించి గృహస్థులు అనుష్ఠానవేదాంతులు కావాలని ఉద్బోధించాడు.

వ. మఱి యార్తునకు శయనంబును, భీతున కభయంబును, దృషితునకు జలంబును, బుభుక్షితునకు నన్నంబును, శ్రాంతునకు నాసనంబును నిచ్చుట సనాతనంబైన యుత్తమ గృహస్థ ధర్మంబు; తృణ భూమ్యుదక ప్రియ వచనాదరంబు లెల్లవారికి నవశ్యంబ; యాత్మార్థంబుగా నన్నపాకంబును నసాక్షిక భోజనంబును, వృథాపశు ఘాతంబును బాపహేతువు, లగ్నిహోత్రంబులు ననడ్వాహంబులు నతిథి బాంధవ విద్వజ్జన గురుమిత్ర భామినీ నివహంబు లపూజితంబులై యెగ్గు సేయును; గావున గృహస్థుండు సర్వసంతర్పకుండ గావలయుం, గావునం బ్రతిదినంబును బక్షి శునక శ్వాపదార్థంబు సాయం ప్రాతస్సులయందు వైశ్వదేవంబు సేసి యమృతాశియు విఘసాశియుఁ గావలయు; యజ్ఞశేషం బమృతంబు నాఁ బరఁగు; నతిథిభుక్త శేషంబు విఘసంబు నాఁబడు; నట్టి వృత్తి వర్తిల్లువాఁ డుత్తమగృహస్థుం' డనిన ధర్మరాజునకు శౌనకుం డిట్లనియె. 31

ప్రతిపదార్థం: మఱి; ఆర్తునకు= బాధపడుతున్నవాడికి; శయనంబును= పడకను; భీతునకు= భయపడినవాడికి; అభయంబును= శరణును; తృషితునకు= దప్పిగొన్నవాడికి; జలంబును= నీరును; బుభుక్షితునకున్= ఆకలిగొన్నవాడికి; అన్నంబును= భోజనమును; శ్రాంతునకున్= డస్సినవాడికి; ఆసనంబునున్= కూర్చొనటానికి పీటను; ఇచ్చుట= ఇవ్వటం; సనాతనంబు+ఐన= పూర్వకాలంనుండి వస్తున్న; ఉత్తమ, గృహస్థ, ధర్మంబు= మంచి గృహస్థులు ఆచరించవలసిన ధర్మం; తృణ= తృణమయమైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆసనం; భూమి+ఉదక, ప్రియవచన+ఆదరంబులు= కూర్చుండుటకు లేదా, పరుండుటకు ప్రదేశం, దప్పిక తీర్చటానికి నీళ్లు, ఇంపైన పలుకులతో ఆదరించటం; ఎల్లవారికిన్= అందరకు, అవశ్యంబు+అ= తప్పనిసరి అయినటువంటివి; ఆత్మ+అర్థంబుగాన్= తనకొరకు మాత్రమే ఉద్దేశించబడిన; అన్న, పాకంబునున్= అన్నం వండటమున్నూ; అసాక్షిక, భోజనంబును= తోడులేకుండ తిండి తినటమున్నూ; వృథా, పశు, ఘాతంబును= అనవసరంగా జంతువులను చంపటమున్నూ; పాప, హేతువులు= పాపం కలగజేసే కారణాలు; అగ్నిహోత్రంబులున్= వ్రేల్చిన అగ్నులు; అనడ్వాహంబులున్= ఎద్దులు; అతిథి, బాంధవ, విద్వత్+జన, గురు, మిత్ర, భామినీ, నివహంబులు= అతిథులు, చుట్టాలు, విద్వాంసులైన జనులు, గురువులు, మిత్రులు, స్త్రీలు వీరి సముదాయాలు; అపూజితంబులు+ఐ= పూజించబడనివై (పోషించబడనివై); ఎగ్గు, చేయును= కీడు చేస్తాయి; కావున= కాబట్టి; గృహస్థుండు= గృహమేధి (గృహస్థాశ్రమంలో ఉన్నవాడు); సర్వ సంతర్పకుండు= అందరిని సంతృప్తి పరిచేవాడు; కావలయున్= కావాలి; కావునన్= కాబట్టి; ప్రతిదినంబును= అనుదినం; పక్షి, శునక, శ్వాపద+అర్థంబు= పక్షులు, కుక్కలు, జంతువులకొరకు; సాయం, ప్రాతస్సుల+అందు= సాయంకాలం ఉదయంవేళలలో; వైశ్వదైవంబు, చేసి= వైశ్వదేవం అనే పేరుకెక్కిన యజ్ఞాన్ని నిర్వహించి; అమృత+ఆశియు= అమృతాన్ని తినేవాడున్నూ; విఘస+ఆశియున్= విఘసం తినేవాడున్నూ; కావలయు= కావాలి; యజ్ఞ, శేషంబు= యజ్ఞంలో మిగిలింది; అమృతంబు= అమృతం; నాన్+పరగున్= అనబడుతుంది; అతిథి, భుక్త, శేషంబు= అతిథులు తినగా మిగిలింది; విఘసంబు=విఘసం; నాన్+పడున్= అనబడుతుంది; అట్టి, వృత్తి, వర్తిల్లువాఁడు= అటువంటి మర్యాద పాటించేవాడు; ఉత్తమ, గృహస్థుండు+అనిన= మంచి గృహస్థుడు అని చెప్పగా; ధర్మరాజునకు= ధర్మపుత్రుడికి; శౌనకుండు+ఇట్లు+అనియెన్= శౌనకుడు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆర్తుడికి శయ్యాసౌఖ్యం, భయపడినవాడికి శరణం, దప్పిగొన్నవాడికి నీరు, ఆకలిగొన్నవాడికి తిండి, డస్సినవాడికి ఆసనం సమకూర్చటం గృహస్థుడు నిర్వహించవలసిన సనాతనధర్మాలు. అతిథుల పట్ల ఆదరాభిమానాలు చూపవలసిన బాధ్యత గృహస్థుడిది, పక్కన విస్తరి లేకుండ భుజించటం, తనకోసం మాత్రమే వంట చేయించటం, నిష్కారణంగా పశువులను హింసించటం పాతకాలు. అంతేకాక అగ్నిహోత్రాలు, అతిథులు, చుట్టాలు, విద్వాంసులు, గురువులు, మిత్రులు, స్త్రీలు-వీరలకు యథోచిత మర్యాద చూపనప్పుడు ఎగ్గు చేస్తారు (కీడు కలుగుతుంది), అందుచేత గృహస్థుడు ఎల్లవారిని సంతృప్తి పరచక తప్పదు. యజ్ఞశేషానికి అమృతమని పేరు. అతిథి భుక్త శేషానికి విఘసమని పేరు. గృహమేధి అమృతాశియు, విఘసాశియు కావాలి. ఉదయాస్తమయ వేళలలో పక్షి, శునకాదులకు బలి ఆహారం వేయాలి. దానికి వైశ్వదేవ యజ్ఞమని పేరు. ఉత్తమ గృహస్థుడు నిర్వహించవలసిన ఇటువంటి కర్తవ్యాలు ఉన్నాయి గదా!' అని ధర్మరాజు చెప్పిన పై మాటలు విని, శౌనకమహర్షి సమాధానం చెప్పటానికి ఉద్యమించాడు.

విశేషం: పాండవులలో జ్యేష్ఠుడైన యుధిష్ఠిరుడికి ధర్మరాజు అనే సార్థకనామం ఎట్లా ఏర్పడిందో పై వాక్యాలవలన తెలుస్తుంది. ధర్మరాజుశీలాన్ని పై వాక్యాలు హృదయంగమంగా చిత్రిస్తున్నాయి. మహాభారతం గృహస్థాశ్రమానికి కల్పించిన గౌరవప్రపత్తులు ధర్మరాజు వెల్లడించిన అభిప్రాయాలవలన తేటతెల్లమవుతున్నాయి. ['విఘసం' అంటే విశేషంగా భక్షింపబడేది అని వ్యుత్పత్తి].

క. 'హారివిషయాభిలాషము । గారణముగ నెంత యెఱుక గలవారును దు
ర్వారవికారముఁ బొందెడు । వారు నిజేంద్రియము లవి యవశ్యము లగుటన్. 32

ప్రతిపదార్థం: హారి, విషయ+అభిలాషము= మనోహరాలైన ఇంద్రియ సౌఖ్యాలపై కోరిక; కారణముగన్= హేతువుగా; ఎంత, ఎఱుక, కలవారును= ఎంతటి జ్ఞానం కలవారైనను; నిజ+ఇంద్రియములు= తమ ఇంద్రియాలు; అవి; అవశ్యములు+అగుటన్= వశంకానట్టివి అవటంచేత; దుర్వార, వికారమున్= వారించరాని వికృతిని; పొందెడువారు= పొందుతారు.

తాత్పర్యం: ఆకర్షించే ఇంద్రియసౌఖ్యాలపై కోరిక కారణంగా ఎంతటిజ్ఞానం కలవారైనా, తమ ఇంద్రియాలు తమకు వశం కావు కాబట్టి, వారించటానికి వీలులేని వికారాన్ని పొందుతారు.

విశేషం: ప్రాచీన భారతీయసాహిత్యం పలుమారులు-ఇంద్రియాలను జయించటమే విశ్వవిజయమని ఉద్ఘాటించింది.

వ. సంకల్పజంబైనకామంబునఁదగిలిన మనస్సుచేతంబ్రేరితంబై శ్రోత్రాదీంద్రియంబులు శబ్దాది విషయంబులం బరిభ్రమించుటంజేసి విషయాభిలాష విశిఖవిద్ధులై దేహులు తేజోలుబ్ధంబులైన శలభంబులుంబోలె శోకానలంబునంబడి తమ్మెఱుంగక యవిద్యాకర్మతృష్ణలం జేసి సంసారచక్రంబునందుఁ బ్రవర్తిల్లుదు; రట్టి బ్రాహ్మాదితృణపర్యంతభూతప్రవృత్తియందు రాగద్వేష విముక్తులై యభిమాన మత్సరంబులు విడిచి, వేద చోదితంబైన సమ్యక్సంకల్ప సంబంధం బింద్రియనిగ్రహంబు వ్రతవిశేషంబు గురుసేవనం బాహారయోగం బధ్యయ నాగమంబు కర్మసన్న్యాసంబు చిత్తనిరోధంబను నెనిమిదింటను గర్మానుష్ఠానంబు సేసిన మహాత్ములు దమ తమ తపోమహత్త్వంబునం జేసి సంసారంబు జయింతురు; నీవును శుశ్రూషా శ్రవణ గ్రహణ ధారణోహాపోహార్థవిజ్ఞాన తత్త్వజ్ఞాన సమన్వితుండవు; నీచేతం బ్రారబ్ధంబులైన యవి సర్వంబులును సంపన్నంబులగు. 33

ప్రతిపదార్థం: సంకల్పజంబు+ఐన= చిత్తవృత్తినుండి పుట్టిన; కామంబునన్+తగిలిన= కోరికయందు చేరుకొన్న; మనస్సుచేతన్= చిత్తంచేత; ప్రేరితంబు+ఐ= ప్రేరేపించబడినవై (రెచ్చగొట్టబడినవై); శ్రోత్ర+ఆది+ఇంద్రియంబులు= చెవి మున్నగు ఇంద్రియాలు; శబ్ద+ఆది, విషయంబులన్= శబ్దం మున్నగు ఇంద్రియార్థాలలో; పరిభ్రమించుటన్+చేసి= తిరుగాడుతుండటంవలన; దేహులు= శరీరధారులు; విషయ+అభిలాష, విశిఖ, విద్ధులు+ఐ= ఇంద్రియాలకు సంబంధించిన కోరికలు అనే బాణాలచేత కొట్టబడినవారై; తేజస్+లుబ్ధంబులు+ఐన= వెలుగుపై ఆపుకొనలేని తమకం కలిగినవైన; శలభంబులున్+పోలెన్= మిడత పురుగులవలె; శోక+అనలంబునన్+పడి= దుఃఖమనే అగ్నిలో పడి; తమ్ము+ఎఱుంగక= తమను తాము తెలిసికొనలేక; (అంటే వశం తప్పి); అవిద్యా, కర్మ, తృష్ణలన్+చేసి= అజ్ఞానంచేతను, కార్యాలు చేయటంలోని అభిలాషచేతను; సంసార, చక్రంబునందున్= ఐహిక జీవిత వలయంలో; ప్రవర్తిల్లుదురు= సంచరిస్తారు; అట్టి; బ్రహ్మ+ఆది= బ్రహ్మమొదలుగా; తృణపర్యంత= గడ్డివరకుకల; భూతప్రవృత్తి+అందు= ప్రాణుల స్వభావంపట్ల; రాగ, ద్వేష, విముక్తులు+ఐ= ఇష్టంచేత, అనిష్టంచేత విడువబడినవారై; అభిమాన, మత్సరంబులు, విడిచి= ప్రేమ, అసూయలు వదలిపెట్టి; వేద, చోదితంబు+ఐన= వేదాలచేత నిర్ణయించబడిన; సమ్యక్+సంకల్ప, సంబంధంబు= సరైన చిత్తవృత్తిని ఏర్పరచుకొనటం; ఇంద్రియ, నిగ్రహంబు= ఇంద్రియాలను వశం చేసికొనటం; వ్రత, విశేషంబు= యథోచితమైన దీక్షను స్వీకరించటం; గురు, సేవనంబు= గురువులను ఆరాధించి సేవలు చేయటం; ఆహారయోగంబు= తిండి ఎన్నుకొని తినటంలో నియమం; అధ్యయన+ఆగమంబు= చదువులను వల్లెవేయటం; కర్మ, సన్న్యాసంబు= కర్తవ్యాలను ఫలాల పట్ల అనాసక్తితో నిర్వహించటం; చిత్త, నిరోధంబు= మనఃప్రవృత్తులను అదుపులో పెట్టుకొనటం; అను= అనే; ఎనిమిదింటను= పై ఎనిమిది అంశాలను; కర్మ+అనుష్ఠానంబు+చేసిన= క్రియారూపాన నిర్వహించిన; మహా+ఆత్ములు= గొప్ప ఆత్మ(మనసు)కల మహానుభావులు; తమ, తమ= వారివారి; తపస్+మహత్త్వంబునన్+చేసి= తపస్సు యొక్క ప్రభావంవలన; సంసారంబున్= ఐహిక జీవితబంధాన్ని; జయింతురు= గెలుస్తారు; నీవును(ఓధర్మరాజా!); శుశ్రూషా, శ్రవణ, గ్రహణ, ధారణా+ఊహ+అపోహ+అర్థ, విజ్ఞాన, తత్త్వజ్ఞాన, సమన్వితుండవు= (గురు)సేవ, వినటం, విన్నదాన్ని ఆకళింపు చేసికొనటం, (అవసరమైనదాన్ని) ఊహించటం, అనవసరమైనదాన్ని భావననుండి తొలగించుకొనటం, వస్తువులను గురించిన విజ్ఞానం (తెలివితేటలు), వివిధ వేదాంత దర్శనాల పరిజ్ఞానం అనే వాటితో కూడిన వాడివి; నీ చేతన్+ ప్రారబ్ధంబులు+ఐన+అవి= నీచేత ఆరంభించబడినట్టివి; సర్వంబులును= అన్ని కార్యములును; సంపన్నంబులు+అగున్= అభ్యున్నతిని పొందుతాయి.

తాత్పర్యం: చిత్తవృత్తినుండి పుట్టిన కామంలో తగుల్కొన్న మనస్సుచేత ప్రేరేపించబడినవైన చెవి మొదలైన ఇంద్రియాలు, ఇంద్రియార్థాలలో తిరుగాడుతుండటం వలన, దేహధారులు శబ్దం మొదలైన ఇంద్రియాలకు సంబంధించిన కోరికలు అనే బాణాలచేత కొట్టబడినవారై, వెలుగు పైని లోభంచేత అగ్నిలోపడే మిడతలవలె దుఃఖాగ్నిలో పడి తమను తాము తెలిసికొనలేక అజ్ఞానంచేత, కార్యాలుచేయటంలోని అభిలాషచేత సంసారచక్రంలో తిరుగుతుంటారు. బ్రహ్మ మొదలు గడ్డివరకు ఉండే ప్రాణుల స్వభావాల పట్ల రాగద్వేషాలు విడిచినవారై, ప్రేమాసూయలను వదలి, వేదాలలో చెప్పబడిన సరైన చిత్తవత్తిని ఏర్పరచుకోవటం, ఇంద్రియాలను వశం చేసికొనటం, యథోచితమైన దీక్షను స్వీకరించటం, గురుసేవ, ఆహారం తినటంలో నియమం, చదువులను వల్లెవేయటం, ఫలితంపట్ల ఆసక్తిలేకుండ కర్తవ్యాలను నిర్వహించటం, మనఃప్రవృత్తిని అదుపులో పెట్టుకోవటం- అనే ఈ ఎనిమిది అంశాలను క్రియారూపాన నిర్వహించిన మహాత్ములు తమతమ తపఃప్రభావంవలన సంసారాన్ని గెలుస్తారు. ఓ ధర్మరాజా! నీవుకూడ గురుసేవ, వినటం, విన్నదాన్ని అర్థం చేసికొనటం, అర్థం చేసికొన్న విషయాన్ని స్థిరంగా మనస్సులో నిల్పుకొనటం, అవసరమైన దాన్ని ఊహించటం, అనవసరమైనదాన్ని భావనమండి తొలగించుకొనటం, వస్తువిజ్ఞానం, వేదాంతాది శాస్త్రపరిజ్ఞానం అనేవాటితో కూడినవాడవు. కావున నీచేత ప్రారంభించబడిన అన్ని పనులూ అభ్యున్నతిని పొందుతాయి.

విశేషం: అలం: రూపకం, ఉపమ. మహాభారతం ప్రకారం మహాత్ములు చేయవలసిన కర్మానుష్ఠానాలు వేదచోదితాలైనవి ఎనిమిది: 1. సమ్యక్సంకల్ప సంబంధం 2. ఇంద్రియ నిగ్రహం 3. వ్రతవిశేషం 4. గురుసేవనం 5. ఆహార యోగం 6. ఆగమాధ్యయనం 7. కర్మసన్న్యాసం 8. చిత్తనిరోధం- ఇది ఒక అష్టాంగయోగం. బౌద్ధదర్శనం ప్రతిపాదించిన అష్టాంగయోగం కూడ ఇచట అనుశీలించతగింది. 1. సమ్యగ్దృష్టి 2. సమ్యక్సంకల్పం 3. సమ్యగ్వచనం 4. సమ్యక్కర్మ 5. సమ్యగ్జీవిక 6. సమ్యక్కృషి 7. సమ్యక్స్మృతి 8. సమ్యక్సమాధి. పతంజలి మహర్షి యోగదర్శనంలో ఒక అష్టాంగయోగాన్ని ప్రతిపాదించాడు. అది ఈవిధంగా ఉంది: 1. యమం 2. నియమం 3. ఆసనం 4. ప్రాణాయామం 5. ప్రత్యాహారం 6. ధారణ 7. ధ్యానం 8. సమాధి. మహాభారతంలోని ప్రవచనంలో విద్యావిషయకమైన మరొక అష్టాంగ యోగం కూడ ప్రతిపాదించబడింది. 1.శుశ్రూష 2. శ్రవణం 3. గ్రహణం. 4. ధారణ. 5. ఊహ. 6. అపోహ 7. అర్థవిజ్ఞానం 8. తత్త్వజ్ఞానం. జిజ్ఞాసువు లందరు విద్యాభ్యాసంలో పై అష్టాంగయోగాన్ని ఆకళింపు చేసికొనాలి.

క. వసురుద్రాదిత్యాదులు । వసుధేశ! తపంబు గౌరవంబున నైశ్వ
ర్యసమృద్ధులైరి; తపమునఁ । బ్రసిద్ధముగ నిష్టసిద్ధి వడయుము నీవున్. 34

ప్రతిపదార్థం: వసు, రుద్ర+ఆదిత్య+ఆదులు= వసువులు, రుద్రులు, ఆదిత్యులు (అదితిపుత్రులు - సూర్యులు) మొదలైనవారు; వసుధా+ఈశ!= ఓరాజా! (భూమికి ఈశుడవైనవాడా!); తపంబు, గౌరవంబునన్= తపస్సుయొక్క మాహాత్మ్యంవలన; ఐశ్వర్య సమృద్ధులు= సంపన్నులు; ఐరి; తపమునన్= తపస్సుచేత; ప్రసిద్ధముగన్= అందరికి తేటతెల్లం అయ్యేటట్లుగా; నీవున్= నీవుకూడ; ఇష్టసిద్ధి= అభీష్టాన్ని; పడయుము= పొందుము.

తాత్పర్యం: వసువులు, రుద్రులు, ఆదిత్యులు మున్నగువారు తపస్సు చేసి ఐశ్వర్యాన్ని సంపాదించగలిగారు. నీవు కూడ తపస్సు చేసి నీ ఈప్సితాలను ఈడేర్చుకో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. తపస్సిద్ధులైనవారు దమ తలంచిన దానిన క్రమంబునం బడయుదురు; గావున నీవు నుపశమవంతుండవై తపంబు సేసి యోగార్థసిద్ధి వడసి, బ్రాహ్మణుల ననుచరించుచు నీ మనోరథంబు సఫలంబు సేయు' మనిన శౌనకవచనంబు సేకొని భ్రాతృమధ్యగతుండైన ధర్మతనయుండు ధౌమ్యునకు నమస్కరించి యిట్లనియె. 35

ప్రతిపదార్థం: తపస్+సిద్ధులు+ఐనవారు= తపస్సులో ఫలితం పొందినవారు; తమ, తలంచిన, దానిన్+అ= తాము సంకల్పించినదాన్నే; క్రమంబునన్= వరుసగా; పడయుదురు= పొందుతారు; కావునన్= కాబట్టి; ఈవు= ఓ ధర్మరాజా!; ఉపశమవంతుండవు+ఐ= ఓర్పుకలవాడివై; తపంబు+చేసి= తపస్సు చేసి; యోగ+అర్థ, సిద్ధి= యోగంలో సాఫల్యం; పడసి= పొంది; బ్రాహ్మణులన్= విప్రులను; అనుచరించుచు= అనుసరిస్తూ; నీ మనోరథంబు= నీకోరిక; సఫలంబు+చేయుము= ఈడేర్చుకొనుము; అనిన; శౌనక, వచనంబు+చేకొని= శౌనక మహర్షి చెప్పిన మాటలు అంగీకరించి; భ్రాతృ, మధ్య, గతుండు+ఐన= సోదరుల మధ్య ఉన్నట్టి; ధర్మతనయుండు= ధర్మరాజు; ధౌమ్యునకు= తమ పురోహితుడైన ధౌమ్యుడికి; నమస్కరించి= అభివాదం చేసి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దీక్షతో తపస్సు చేసినవారు వారి కోర్కెలను నెరవేర్చుకొనగలరు. ఓ ధర్మరాజా! నీవు కూడ తపస్సు చేసి, బ్రాహ్మణులను అనుసరిస్తూ నీ కోరికలను ఈడేర్చుకో'- అని శౌనకమహర్షి చెప్పగా సోదరులమధ్య ఉన్న ధర్మరాజు ధౌమ్యుడికి నమస్కరించి ఆయనతో ఇట్లా అన్నాడు.

తే. 'వనమునకు వచ్చి నవయంగ వలవ దుడుగుఁ; డనిన నుడుగక; 'మీతోన యరుగుదెంతు'
మనిరి బ్రాహ్మణుల్; వీరి కాహార మే యు। పాయమున నుగ్రవనమునఁ బడయ నేర్తు? 36

ప్రతిపదార్థం: వనమునకు= అరణ్యానికి; వచ్చి= ఏతెంచి; నవయంగ, వలవదు= బాధ పడవద్దు; ఉడుగుండు+అనినన్= మానండని చెప్పినప్పటికీ; ఉడుగక= మానక; మీతోన్+అ= మీతోనే; అరుగుదెంతుము+అనిరి= వస్తామన్నారు; బ్రాహ్మణుల్= విప్రులు; వీరికి; ఆహారము= భోజనం; ఏ, ఉపాయమునన్= ఏ వెరవున; ఉగ్రవనమునన్= భయంకరమైన అడవిలో; పడయన్, నేర్తున్= సంపాదించగలను?

తాత్పర్యం: 'అయ్యలారా! మేము చేసేది వనవాసం. మీరు మాతో అడవికి రావ'ద్దని చెప్పి బ్రతిమాలుకొన్నప్పటికీ వినక, వస్తామన్నారు బ్రాహ్మణులు. భయంకరమైన అడవిలో వీరికి నేను ఏవిధంగా ఆహారం సమకూర్చి పెట్టగలను?

వ. వీరల విడువ నోప; నేమి సేయుదు'? ననిన విని ధౌమ్యుండు పెద్దయుం బ్రొద్దు చింతించి, ధర్మరాజున కిట్లనియె. 37

ప్రతిపదార్థం: వీరల= ఈ బ్రాహ్మణులను; విడువన్+ఓపన్= విడిచి పెట్టజాలను; ఏమి+చేయుదున్?= ఏమి చేయగలను?; అనిన; విని; ధౌమ్యుండు; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; చింతించి= యోచించి; ధర్మరాజునకు+ఇట్లు+అనియెన్= ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: నాపైని మిక్కిలి ప్రేమతో నా కష్టాలను పంచుకొనటానికి ఇచ్చగించి నాతోపాటు వనవాసం చేయటానికి వచ్చిన ఈ బ్రాహ్మణోత్తములను నేను విడవజాలను, వీరలకొరకు నేను ఏమి చెయ్యాలి?' - అని ధర్మరా జనగా, అతడితో పురోహితుడైన ధౌమ్యుడు ఇట్లా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'భూతరాశి దొల్లి పుట్టి బుభుక్షాభి । తప్తమయినఁ జూచి తద్భయంబు
నపనయింపఁ గడఁగి యదితిసుతాగ్రణి । గమలబాంధవుండు గరుణతోడ. 38

ప్రతిపదార్థం: భూతరాశి= ప్రాణికోటి; తొల్లి= పూర్వకాలంలో; పుట్టి; బుభుక్షా+అభితప్తము+అయినన్= ఆకలిచేత మాడగా; చూచి; తద్+భయంబున్= ఆ భీతిని; అపనయింపన్+కడఁగి= పోగొట్టటానికి పూని; అదితి, సుత+అగ్రణి= అదితిసుతులలో మేటిఅయినవాడు; కమల, బాంధవుఁడు= (పద్మాలకు చుట్టం) సూర్యుడు; కరుణతోడ= దయతో.

తాత్పర్యం: 'పూర్వకాలంలో జీవకోటి ఉద్భవించి ఆకలిచేత మలమలమాడుతుంటే చూచి ఆ భయాన్ని తొలగించటానికి పూనుకొని సూర్యుడు దయతో -

వ. ఉత్తరాయణగతుండై యుర్వీరసంబు పరిగ్రహించి, దక్షిణాయనగతిం బర్జన్యభూతుండై యోషధులం బడసి, రాత్రులయందుఁ జంద్రకిరణామృతంబునం జేసి వానిందడుపుచు వర్ధించి, యం దన్నంబు పుట్టించి, ప్రజారక్షణంబు సేయుటం జేసి యన్నం బాదిత్యమయంబని యెఱింగి, తొల్లి భీమవైన్య కార్తవీర్య నహుషాదులు యోగసమాధి నిష్ఠితులై సూర్యభజనంబున నన్నంబుఁబడసి యాపదలవలనం బ్రజల సముద్ధరించిరి గావున. 39

ప్రతిపదార్థం: ఉత్తర+అయన+గతుండై= ఉత్తర దిక్కుగా పయనించినవాడై; ఉర్వీరసంబు= భూమిలోనిసారం; పరిగ్రహించి= స్వీకరించి; దక్షిణ+అయన, గతిన్= దక్షిణ దిశగా పయనించినవాడై; పర్జన్యభూతుండై= మేఘుడై; ఓషధులన్+పడసి= వరి, గోధుమ మున్నగు సస్యములను (పైరులను) (బీజరూపంలో) పొంది; రాత్రుల+అందున్= రాత్రివేళలలో; చంద్ర, కిరణ+అమృతంబునన్+చేసి= చంద్రుడియొక్క కిరణాలనుండి స్రవించే అమృతంవలన; వానిన్= ఆ ఓషధులను; తడుపుచు; వర్ధించి= పెంపొందింపజేసి; అందు+అన్నంబు+పుట్టించి= వాటినుండి అన్నాన్ని ఉద్భవింపజేసి; ప్రజా, రక్షణంబు+చేయుటన్+చేసి= ప్రజలను రక్షించటంచేత; అన్నంబు= అన్నం; ఆదిత్యమయంబు+అని= సూర్యుడితో నిండిందని; ఎఱింగి= తెలిసికొని; తొల్లి= పూర్వకాలంలో; భీమ, వైన్య, కార్తవీర్య, నహుష+ఆదులు= భీముడు, వైన్యుడు (పృథువు), కార్తవీర్యుడు, నహుషుడు మున్నగువారు; యోగసమాధి నిష్ఠితులు+ఐ= యోగంవలన ఏర్పడే సమాధిలో ఉన్నవారై; సూర్య భజనంబునన్= సూర్యుడిని ఆరాధించటంవలన; అన్నంబున్= ఆహారమును; పడసి= పొంది; ఆపదలవలనన్= ఆపదలనుండి; ప్రజల= జనులను; సముద్ధరించిరి= మిక్కిలి కాపాడారు; కావున= కాబట్టి.

తాత్పర్యం: సూర్యుడు ఉత్తర దిక్కుగా పయనించి భూసారాన్ని క్రోలి, దక్షిణ దిక్కుగా పయనించి మేఘ రూపుడై ఓషధులను సమీకరించి, చంద్ర కిరణాల ద్వారా ఆ ఓషధులను పెంపొందించి, వాటి నుండి అన్నాన్ని పుట్టించాడు. తద్వారా ప్రజారక్షణం చేశాడు. అందువలన అన్నం సూర్యమయమని తెలిసికొని పూర్వకాలంలో భీమ, వైన్య, కార్తవీర్య, నహుషాదులు సూర్యుడిని ఆరాధించి ఆహారాన్ని సాధించి ప్రజలను కాపాడారు. కాబట్టి.

విశేషం: ఓషధి: ఒకసారి ఫలించి నశించేది (వరి గోధుమ మొ॥ పైరులు) ఔషధము: మందుకు ఉపయోగపడు మొక్క మొ॥నది)

లయగ్రాహి.

వారిరుహమిత్త్రు నమరోరగమునిద్యుచర । చారణగత ప్రణుతచారుగుణు లోకా
ధారు నఖిలశ్రుతిశరీరు హరిశంకర స । రోరుహభవప్రతిము దారుణతమిస్రా

వారణ మరీచి పరిపూరిత దిగంతరుని । భూరికరుణానిరతు సూరుఁద్రిజగద్ర

క్షారతు సహస్రకరుఁ గోరి భజియింపుము; మ । నోరథఫలంబు లగు భూరమణ! నీకున్'. 40

ప్రతిపదార్థం: వారి రుహ మిత్రున్= నీటిలో పుట్టిన పద్మాలకు నెచ్చెలిని అంటే సూర్యుడిని; అమర+ఉరగ, ముని, ద్యుచర, చారణ గణ, ప్రణుత, చారు, గుణున్= దేవతలచేత, పాములచేత, మునులచేత, ఆకసంలో చరించే వారిచేత, దేవగాయకులచేత స్తుతించబడిన మనోహరమైన గుణాలు కలవాడిని; లోక+ఆధారున్= లోకాలకు ఆధారమైనవాడిని; అఖిల, శ్రుతి, శరీరున్= సమస్త వేదాలు శరీరంగా కలవాడిని; హరి, శంకర, సరోరుహభవ, ప్రతిమున్= విష్ణువుతో, శివుడితో, బ్రహ్మదేవుడితో సమానుడైనవాడిని; దారుణ, తమిస్రా, వారణ, మరీచి, పరిపూరిత, దిక్+అంతరుని= ఘోరమైన చిమ్మచీకట్లను నివారించే కిరణాలతో నింపబడిన దిగంతరాలు గలవాడిని; భూరి, కరుణా, నిరతున్= గొప్ప దయకలవాడిని; సూరున్= సూర్యుని, త్రిజగత్, రక్షా, రతున్= మూడులోకాలను రక్షించటంలో ఇష్టం కలవాడిని; సహస్రకరున్= వేయి కిరణాలు కలవాడిని; కోరి= పూని; భజియింపుము= పూజించుము; భూరమణ!= ఓరాజా!; నీకున్= నీకు; మనోరథ, ఫలంబులు+అగున్= కోరికలు ఈడేరుతాయి.

తాత్పర్యం: ఓరాజా! నీవు సూర్యుడిని పూజించుము. నీ కోరికలు ఈడేరుతాయి. అతడు గొప్ప మాహాత్మ్యం కలవాడు. పద్మాలకు మిత్రుడు. అతడిని దేవతలు, పాములు, మునులు, చారణులు నమస్కరించి పూజిస్తూ ఉంటారు. అతడు సమస్తవేదరూపుడు. విష్ణువుతో, శివుడితో, బ్రహ్మదేవుడితో సమానుడు. తన వేవెలుగులతో చిమ్మచీకట్లను పోగొట్టి, దిగంతరాలను ప్రకాశింపజేసేవాడు. గొప్పదయ కలవాడు. మూడులోకాలను రక్షించటానికి పూనిక వహించి ఉన్నవాడు'.

విశేషం: ఈ వృత్తంలో ప్రతిపాదంలోనూ భ,జ,స,న,భ,జ,స,న,భ,య అనే గణాలు వరుసగా ఉంటాయి. ఇందులో ప్రాసయతులు మూడు చోట్ల కూర్పబడతాయి. అంటే 10, 18, 26 అక్షరాలు ప్రాసయతిమైత్రితో ఉంటాయి. ప్రాసనియమం ఉన్నది.

వ. అని ధౌమ్యుండు విశుద్ధాత్ముండైన ధర్మరాజునకు సూర్యుం డర్యముండు భగుండను నివి మొదలుగాఁ గల నామంబుల యష్టోత్తరశతంబు నభీష్ట సిద్ధిప్రదం బయినదాని విస్పష్టార్థ వర్ణోచ్చారణంబును విధియుక్తంబునుగా నుపదేశించి, 'దీనిం దొల్లి యింద్రువలన నారదుండు వడసె; నారదువలన వసువనురాజు వడసె; నాతనివలన నేను వడసితి; నేను నీ కిచ్చితి; నిది దేవనిర్మితంబు; దీన నాదిత్యు నతిభక్తి నారాధింపు' మనిన. 41

ప్రతిపదార్థం: అని; ధౌమ్యుండు; విశుద్ధ+ఆత్ముండు+ఐన= మిక్కిలి పవిత్రమైన మనస్సుకల వాడైన; ధర్మరాజునకు= ధర్మపుత్రుడికి; సూర్యుండు, అర్యముండు, భగుండు, అను+ఇవి; మొదలుగాన్+ కల; నామంబుల= పేర్లుకల; అష్టోత్తరశతంబున్= నూట ఎనిమిదింటిని; అభీష్ట, సిద్ధి, ప్రదంబు+అయినదాని= కోరినట్టి కోరికలు నెరవేర్చే దానిని (స్తోత్రాన్ని); విస్పష్ట+ అర్థ+ వర్ణ+ఉచ్చారణంబును= మిక్కిలి స్పష్టమయిన భావాన్ని, అక్షరాన్ని, ఉచ్చారణను కలుగునట్లుగా; విధి, యుక్తంబును+కాన్= శాస్త్రం నిర్దేశించిన ప్రకారం కలదగునట్లుగా; ఉపదేశించి= ఉపదేశం చేసి; దీనిన్= దీనిని; తొల్లి= పూర్వం; ఇంద్రువలన= ఇంద్రుడివలన; నారదుండు; పడసెన్= పొందాడు; నారదువలన; వసువు, అనురాజు; పడసెన్; ఆతనివలన; నేను; పడసితి= పొందాను; నేను; నీకు+ఇచ్చితిన్; ఇది; దేవనిర్మితంబు= దేవతలచేత కూర్చబడింది; దీనన్= దీనివలన(ఈమంత్రంవలన); ఆదిత్యున్= సూర్యుడిని; అతిభక్తిన్= మిక్కిలి భక్తిభావంతో; ఆరాధింపుము= పూజించుము; అనినన్= అని అనగా.

తాత్పర్యం: పాండవపురోహితుడైన ధౌమ్యుడు ధర్మరాజుకు ఆదిత్యనామాలు (పేర్లు) నూటెనిమిదింటిని, సుస్పష్టమైన అర్థాలు వివరించి చెప్పి, సరైన ఉచ్చారణను నేర్పి ఉపదేశించాడు. ఆ మంత్రాలు నారదుడికి ఇంద్రుడు, ఇంద్రుడు వసురాజుకు, వసురాజు ధౌమ్యుడికి ప్రసాదించినవి. ధౌమ్యుడు ధర్మరాజుకు ఉపదేశించాడు. ఆ మంత్రోపాసనవలన అభీష్టప్రాప్తి అవుతుందని ధౌమ్యుడు ధర్మరాజుకు తెలిపాడు.

విశేషం: మంత్రోపాసనలో ముఖ్యంగా గమనించవలసిన అంశాలు: (1) సుస్పష్టమైన అర్థాన్ని తెలుసుకోవాలి (2) ప్రతి అక్షరానికి ఉచ్చారణ తెలియాలి. మూలంలో ఉండే సూర్య అష్టోత్తరశతాన్ని నన్నయ సంగ్రహం చేశాడు.

ధర్మరాజు సూర్యు నారాధించి వరంబు గొనుట (సం. 3-3-13)

సీ. **హితుఁడైన తన పురోహితు నుపదేశంబు । పేర్మితోఁ జేకొని ధర్మసుతుఁడు**
నెమ్మిఁ బుష్పోపహారమ్ముల నాదిత్యుఁ । బూజించి, భాగీరథీజలంబు
లం దుండి విషయంబులం దింద్రియంబుల । నమలవ్రతానుభావమున నుడిచి,
వాయుభోజనుఁడుఁ బ్రాణాయామపరుఁడు నై । సూర్యాదినామముల్ సూర్యుగుఱిచి

ఆ. **జపము సేయుచున్నఁ దపనుఁ డాతనికిఁ బ్ర । త్యక్షమయి త్రిలోకచక్షుఁ డమర**
వరుఁడు దురితహరుఁడు తరణి త్రయీమూర్తి । వనజమిత్త్రుఁ డిట్టు లనియెఁ గరుణ. **42**

ప్రతిపదార్థం: హితుఁడు+ఐన= తనకు ఇష్టుడైన; తన, పురోహితు+ఉపదేశంబు= తన మేలు కోరే విప్రుడి బోధనం; పేర్మితోన్= గౌరవంతో; చేకొని= గ్రహించి; ధర్మసుతుఁడు= ధర్మరాజు; నెమ్మిన్= పూనికతో; పుష్ప+ఉపహారమ్ములన్= పూలకానుకలతో; ఆదిత్యున్= సూర్యుడిని; పూజించి= అర్చించి; భాగీరథీ, జలంబుల+అందు+ఉండి= గంగానదినీటిలో నిలిచి; విషయంబులందు= ఇంద్రియార్థాలలో; ఇంద్రియంబులన్= ఇంద్రియాలను (త్వక్కు మొదలయిన వాటిని); అమల, వ్రత+అనుభావమునన్= స్వచ్ఛమైన వ్రతదీక్షతో; ఉడిచి= అదుపులో పెట్టి (ఉడిగించి); వాయు భోజనుఁడున్= గాలిని మాత్రమే ఆహారంగా స్వీకరించినవాడున్నూ; ప్రాణాయామపరుఁడున్+ఐ= ప్రాణాయామాన్ని చేసినవాడున్నూఅయి; సూర్య+ఆది, నామముల్= సూర్యుడు మున్నగు పేర్లను; సూర్యుగుఱిచి= సూర్యుడిని గురించి; జపము, చేయుచు+ఉన్నన్= దీక్షతో వల్లెవేస్తుండగా; ఆతనికిన్= ఆధర్మరాజుకు; త్రిలోక, చక్షుఁడు= మూడులోకాలకు నేత్రమైనవాడు; అమరవరుఁడు= దేవతలలో శ్రేష్ఠుడు; దురిత, హరుఁడు= పాపాలను పోగొట్టేవాడు; తరణి= చీకటి నుండి తరింపజేయువాడు; త్రయీమూర్తి= మూడు వేదాలు రూపం తాల్చినవాడు; వనజ మిత్త్రుఁడు= కమలములకు నెచ్చెలి అయిన; తపనుఁడు= సూర్యుడు; ప్రత్యక్షము+అయి= సాక్షాత్కరించి; కరుణన్= దయతో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: తన పురోహితుడైన ధౌమ్యుడు చేసిన ఉపదేశం ప్రకారం ధర్మరాజు గంగాజలాలలో నిలిచి, నిష్ఠతో సూర్యుడినిగురించి అష్టోత్తరశతనామాలు ఉచ్చరిస్తూ జపం చేశాడు. అంత వేదస్వరూపుడు, పాపహరుడు, పద్మాలకు మిత్రుడు, ముల్లోకాలకు నేత్రమైన వాడు అయిన సూర్యుడు అతడికి ప్రత్యక్షమై దయతో ఇట్లా అన్నాడు.

వ. **'నీ తపమునకు మెచ్చితి; నీ వరణ్యంబున నుండఁ గల పండ్రెండేండ్లును వన్యఫలమూలశాకంబులు నీ మహానసంబున ద్రుపదరాజపుత్త్రిచేత సాధితంబులై యక్షయంబులైన చతుర్విధాహారంబులగు' నని యొక్క తామ్రస్థాలి యిచ్చి, వరం బిచ్చి వనజహితుం డంతర్హితుం డైన.** **43**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నీ, తపమునకు= నీ తపస్సుకు; మెచ్చితి; నీవు+అరణ్యంబునన్+ఉండన్+కల= నీవు అడవిలో ఉండే; పండ్రెండు+ఏండ్లును= పన్నెండు సంవత్సరాలున్నూ; వన్య, ఫల, మూల, శాకంబులు= అడవిలో ఉండే పండ్లు, వేళ్ళు, కాయగూరలు; నీ మహానసంబున= నీ వంట ఇంట్లో; ద్రుపదరాజ పుత్త్రిచేత= ద్రౌపదిచేత; సాధితంబులు+ఐ= సంస్కరింపబడినవై (వండబడినవై); అక్షయంబులు+ఐన= తరుగనివైన; చతుర్+విధ+ఆహారంబులు+అగున్+అని= నాలుగు విధాల వంటకాలు తయారవుతాయని; ఒక్క; తామ్రస్థాలి= రాగి పాత్ర; ఇచ్చి; వరంబు+ఇచ్చి= వరాన్ని అనుగ్రహించి; వనజ, హితుండు= సూర్యుడు; అంతర్హితుండు+ఐనన్= మాయం కాగా.

తాత్పర్యం: 'నీ తపస్సు నాకు నచ్చింది. నీవు అడవిలో ఉండే పండ్రెండు సంవత్సరాలు, అడవిలో లభించే పండ్లు, వేళ్ళు, కాయగూరలు నీ పాకశాలలో ద్రౌపదిచే వండబడి తరుగని నాలుగు విధాలైన వంటకాలుగా ఏర్పడగల' వని చెప్పి, ఒక రాగిపాత్ర నిచ్చి సూర్యుడు మాయ మయ్యాడు.

విశేషం: భక్ష్యం, భోజ్యం, చోష్యం, లేహ్యం - అనేవి నాలుగు విధాలైన ఆహారాలు.

చ. అదరఁగ ధర్మనందనుఁ డహర్పతిచేత వరంబు పేర్మితోఁ
బడసి మహీసురోత్తముల భవ్యులఁ బల్వుర నిర్వహించె న
ప్పుడు ద్రుపదాధిరాజసుత పొల్పుగ వండిన శాకమూలముల్
గడు రుచి నిష్టభోజనసుఖంబులఁ దృప్తులఁ జేయుచుండఁగన్. **44**

ప్రతిపదార్థం: అదరఁగన్= అతిశయించేటట్లుగా; ధర్మనందనుఁడు= ధర్మసుతుడు; అహః+పతిచేత= పగటికి పతి అయిన సూర్యుడిచేత; పేర్మితోన్= గొప్పతనంతో; వరంబు= వరం; పడసి= పొంది; మహీసుర+ఉత్తములన్= బ్రాహ్మణోత్తములను; భవ్యులన్= పూజించతగిన వాళ్ళను; పల్వురన్= పెక్కుమందిని; నిర్వహించెన్= భరించాడు; అప్పుడు; ద్రుపద+అధిరాజ, సుత= ద్రౌపది (ద్రుపదమహారాజు కూతురు); పొల్పుగన్= చక్కగా; వండిన; శాక, మూలముల్= కాయగూరలు, వేళ్ళు; కడు= మిక్కిలి; రుచిన్= రుచితో; ఇష్ట, భోజన, సుఖంబులన్= కోరిన తిండివలన కలిగిన సుఖాలచేత; తృప్తులన్= తృప్తిచెందిన వాళ్ళనుగా; చేయుచుండఁగన్= చేస్తుండగా.

తాత్పర్యం: ధర్మరాజు సూర్యుడివలన అతిశయమైన వరాన్ని పొంది, ఆ అక్షయపాత్రలో ద్రౌపది చక్కగా వండిన శాకమూలాలు మిగుల రుచికరాలైన వివిధ భోజనపదార్థాలుగా మారి, వాళ్లందరినీ సంతృప్తిపరుస్తూ ఉండగా - ఎందరో బ్రాహ్మణోత్తములను చక్కగా పోషించగలిగాడు.

వ. ఇట్లనేకసహస్ర మహీసురవరుల ననుదినంబును నభిమత భోజనంబులం దనిపి, విఘసామృత భోజనంబులం దృప్తులైన తనపతుల భుక్తశేషంబు ద్రుపదపుత్త్రిక యుపయోగించుచుండం గొన్నిదినంబు లంద యుండి, పాండవులు బ్రాహ్మణులచేతం గృతస్వస్త్యయనులై బ్రహ్మర్షిసంఘంబులతోఁ గామ్యకవనంబున కరిగి; రంత నిట ధృతరాష్ట్రుండు విదురుం బిలిపించి 'నీవు భార్గవుకంటె బుద్ధిమంతుఁ డవు; పాండవ కౌరవులకు సముండవు; సమ్మతుండవు, చెప్పు మింక నప్పాండవు లేమి సేయువా?' రనిన విదురుం డిట్లనియె. **45**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; అనేక సహస్ర, మహీ సుర, వరులన్= పెక్కువేల బ్రాహ్మణశ్రేష్ఠులను; అనుదినంబునున్= నిత్యమున్నూ; అభిమత, భోజనంబులన్+తనిపి= ఇష్టమైన ఆహారాలతో సంతృప్తి కలిగించి; విఘస+అమృత, భోజనంబులన్= అతిథులు తిన్న పిమ్మట మిగిలిన, 'యజ్ఞం'లో దేవతలకు సమర్పించగా శేషించిన ఆహారాలతో; తృప్తులు+ఐన= సంతుష్టి చెందిన వారైన; తన పతుల= తన భర్తల; భుక్తశేషంబు= తినగా మిగిలిన ఆహారం; ద్రుపదపుత్త్రిక= ద్రౌపది; ఉపయోగించుచుండన్= స్వీకరిస్తుండగా; కొన్ని దినంబులు= కొన్ని రోజులు; అందు+అ, ఉండి= అచటనే నివసించి; పాండవులు, బ్రాహ్మణులచేతన్; కృత, స్వస్తి+అయనులై= ప్రయాణంలో శుభం కలుగుగాక అనే దీవనలు పొందినవారై; బ్రహ్మ+ఋషి, సంఘంబులతోన్= బ్రాహ్మణులైన ఋషుల సముదాయంతో; కామ్యకవనంబునకు= కామ్యకం అనే పేరున్న అడవికి; అరిగిరి= వెళ్ళారు; అంతన్; ఇట; ధృతరాష్ట్రుండు; విదురున్+పిలిపించి; నీవు; భార్గవుకంటెన్= శుక్రుడికంటె; బుద్ధిమంతుఁడవు= తెలివితేటలు కలవాడివి; పాండవ, కౌరవులకు; సముండవు= సమానుడివి; సమ్మతుండవు= అంగీకరించబడేవాడివి; చెప్పుము; ఇంకన్; ఆ+పాండవులు; ఏమి, చేయువారు?= ఏమి చేయగలరు?; అనినన్= అని అడుగగా; విదురుండు= విదురుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా ప్రతిదినం వేలమంది బ్రాహ్మణులకు సంతర్పణ జరుగుతూ ఉండింది. యజ్ఞావశిష్టాన్ని, అతిథిభుక్తశేషాన్ని పాండవులు భుజించేవారు. ద్రౌపది తన భర్తల భుక్తశేషాన్ని తింటూ ఉండేది. ఆ విధంగా పాండవులు కొన్ని రోజులు అక్కడనే నివసించి, పిమ్మట బ్రాహ్మణుల దీవనలు పొంది, బ్రహ్మర్షి సంఘాలతో కలిసి కామ్యకవనానికి వెళ్ళారు. అంత, ఇక్కడ ధృతరాష్ట్రుడు విదురుడిని పిలిపించి 'నీవు శుక్రుడికంటె బుద్ధిమంతుడివి; కురుపాండవులకు సమానుడివి, సమ్మతుడివి' అని పొగడి 'ఇక మీద ఆ పాండవులు ఏమి చేయగల?'రని ప్రశ్నించాడు. విదురుడు అతడికి ఇట్లా బదులు పలికాడు.

మత్తకోకిల.

'దేవమూర్తులు పాండుపుత్త్రులు ధీరచిత్తులు వారి పెం
పీ వెఱుంగనివాఁడవే ధరణీశ! వాయుసుతుండు గాం
డీవియున్ భుజవిక్రమప్రకటీకృతుల్ వివిధాస్త్ర వి
ద్యావిశేషులు వైరివీరులఁ దక్కనిత్తురె పోరులన్. 46

ప్రతిపదార్థం: దేవమూర్తులు= దేవతల ఆకారాల వంటి ఆకారాలు కలవారు; ధీరచిత్తులు= ధైర్యంతో కూడిన మనస్సు కలవారు; పాండు పుత్త్రులు= పాండవులు; వారి, పెంపు= వారి గొప్పతనం; ధరణీశ!= ఓ మహారాజా! (ధృతరాష్ట్రుడా!); ఈవు+ఎఱుంగని వాఁడవు+ఏ= నీవు తెలియనివాడివా; వాయు, సుతుండు=(గాలిదేవరకొడుకు) భీముడు; గాండీవియున్= (గాండీవం అనే విల్లు కలవాడు) అర్జునుడు; భుజ, విక్రమ, ప్రకటీకృతుల్= భుజ పరాక్రమంచేత ప్రకటించబడిన వాళ్ళు; వివిధ+అస్త్ర, విద్యా, విశేషులు= పెక్కు అస్త్రాలకు సంబంధించిన పరిజ్ఞానంలో గొప్పవాళ్ళు; వైరి వీరులన్= శత్రు వీరులను; పోరులన్= యుద్ధాలలో; తక్కన్+ఇత్తురె= మిగుల నిస్తారా?

తాత్పర్యం: 'పాండవులు దేవతాంశసంభూతులు, ధైర్యశాలురు. ధృతరాష్ట్రమహారాజా! వారి గొప్పతనం నీకు తెలియనిది కాదు. భీముడు, అర్జునుడు తమ పరాక్రమంచేత లోకానికి ప్రసిద్ధులు; వివిధాస్త్రసంపన్నులు. వారు యుద్ధాల్లో శత్రువులను బ్రతుకనిస్తారా?

విశేషం: అస్త్రం = మంత్రయుక్తంగా ప్రయోగించే బాణం. శస్త్రం= ఆయుధ విశేషం. ఈ వృత్తంలో పాదానికి 18 అక్షరాలు. ప్రతిపాదంలోనూ ర, స, జ, జ, భ, ర అనే గణాలు వరుసగా ఉంటాయి. 11వ అక్షరం యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

క. మొనసి యధర్మద్యూతం । బున భేదము వుట్టుఁ బాండుపుత్త్రులకును నీ
తనయుల కని మును చెప్పిన । విన నొల్లక కొడుకుపలుకు వింటివి కడఁకన్. 47

ప్రతిపదార్థం: మొనసి= పూని; అధర్మ, ద్యూతంబునన్= మోసపు జూదంవలన; పాండుపుత్త్రులకును= పాండవులకున్నూ; నీ, తనయులకు= నీ కొడుకులకున్నూ; భేదము= కలత; పుట్టున్= ఏర్పడుతుంది; అని= అంటూ; మును= ముందుగా; చెప్పిన= చెప్పినప్పటికీ; వినన్+ఒల్లక= వినటానికి ఇష్టపడక; కడఁకన్= పూనికతో; కొడుకు, పలుకు= (నీ) కుమారుడి మాట; వింటివి=విని ఉన్నావు.

తాత్పర్యం: మోసపుజూదంవలన పాండవులకూ కౌరవులకూ వైరం ఏర్పడుతుందని నేను నీకు మొదటేచెప్పి ఉన్నాను కదా! నీవు నామాటలు లెక్కపెట్టక నీ కొడుకు దుర్యోధనుడిమాటనే పాటించావు.

వ. ఇఁక నయినను వారి రావించి, తొల్లి నీచేతం బడయంబడిన రాజ్యంబునందుఁ బ్రతిష్ఠించి, కీర్తియు ధర్మంబును నిలుపుము; రాజ్యంబును ద్రివర్గంబును ధర్మమూలంబులు గావున నంద వర్తిల్లు; ధర్మువు విడిచి యధర్మవర్తి యయి కర్ణ శకుని దుశ్శాసన శిక్షితుండైన దుర్యోధను దుశ్చేష్టితంబుల కొడంబడ వలవదు. 48

ప్రతిపదార్థం: ఇఁకన్+అయినను= ఇకమీదట నైనను; వారి= ఆ పాండవులను; రావించి= వచ్చేటట్లు చేసి; తొల్లి= మునుపు; నీచేతన్+పడయన్+పడిన= నీ చేత పొందబడిన; రాజ్యంబునందున్; ప్రతిష్ఠించి= నిలిపి; కీర్తియు= మంచిపేరును; ధర్మంబును; నిలుపుము; రాజ్యంబును; త్రివర్గంబును= మూడు తెరగులైన అర్థ కామ మోక్షాలు; ధర్మమూలంబులు= ధర్మమే ఆధారంగా కలిగినట్టివి; కావునన్; అందు+అ= అందే, అంటే ధర్మమందే; వర్తిల్లు= ఉంటాయి; ధర్మువు= ధర్మాన్ని; విడిచి= వదలిపెట్టి; అధర్మ, వర్తి+అయి= అధర్మంలో వర్తించేవాడయి; కర్ణ, శకుని, దుశ్శాసన, శిక్షితుండు+ఐన= కర్ణుడిచేత, శకునిచేత, దుశ్శాసనుడిచేత బోధించబడినవాడైన; దుర్యోధను= దుర్యోధనుడియొక్క; దుస్+చేష్టితంబులకు= చెడ్డపనులకు; ఒడంబడవలవదు= సమ్మతించవద్దు.

తాత్పర్యం: జరిగింది జరిగిపోయింది. ఇకనైనను నీవు పాండవులను తిరిగి రప్పించి వాళ్ళ రాజ్యాన్ని వాళ్ళకు ఇవ్వాలి. దానివలన నీకు మంచిపేరు వస్తుంది. నీవు ధర్మాన్ని నిలిపినవాడి వవుతావు. రాజ్యానికిన్నీ, అర్థకామమోక్షాలనే త్రివర్గానికిన్నీ ధర్మమే ఆధారం. కర్ణ శకుని దుశ్శాసనుల చెడుమాటలు విని దుర్యోధనుడు చేసే చెడ్డపనులను నీవు సమ్మతించరాదు.

తే. వీని పుట్టిన పాపంపువేళఁ బెక్కు । దుర్నిమిత్తముల్ పుట్టిన నిర్ణయించి
యేను జెప్పితిఁ దొల్లియు వీనిచేత । నెట్టుఁ గౌరవులకు నెగ్గు పుట్టు ననియు. 49

ప్రతిపదార్థం: వీని, పుట్టిన, పాపంపు+వేళన్= వీడు జన్మించిన దుర్ముహూర్తంలో; పెక్కు, దుర్నిమిత్తముల్= చాల చెడ్డశకునాలు; పుట్టినన్; నిర్ణయించి= ఏర్పరచి; ఏను= నేను; వీనిచేతన్; ఎట్టున్= ఏ విధంగానైనా; కౌరవులకున్; ఎగ్గు= కీడు; పుట్టున్+అనియు= కలుగుతుందని; తొల్లియు= మునుపుకూడ; చెప్పితిన్= చెప్పిఉన్నాను.

తాత్పర్యం: ఈ దుర్యోధనుడు పుట్టినపుడు ఎన్నో చెడ్డశకునాలు ఏర్పడితే ఆనాడే నేను వీడివలన కౌరవులకు కీడు కలుగుతుందని చెప్పి ఉన్నాను.

వ. కులదూషకు దూషించి కులంబు రక్షించుట ధర్మువు; ధర్మరాజు నఖిలమహీరాజ్యరక్షకుం జేసి పుత్త్ర పౌత్త్ర మిత్త్రా మాత్య బంధు వర్గంబుల నెల్ల రక్షింపుము; సభామధ్యంబునందు ద్రౌపదీ భీమసేనులం బ్రార్థింప దుశ్శాసనుం బంపుము. 50

ప్రతిపదార్థం: కులదూషకున్= వంశాన్ని చెరిచేవాడిని; దూషించి= నిందించి; (విడిచి); కులంబు= వంశాన్ని; రక్షించుట= కాపాడటం; ధర్మువు= ధర్మం; ధర్మరాజున్= ధర్మరాజును; అఖిల, మహీ, రాజ్య, రక్షకున్+చేసి= సమస్తమైన భూరాజ్యానికి రాజును చేసి; పుత్త్ర, పౌత్త్ర, మిత్త్ర+అమాత్య, బంధు, వర్గంబులన్= కొడుకులు, మనుమలు, హితులు, మంత్రులు, చుట్టాలు, మున్నగువారిని; ఎల్లన్= అందరిని; రక్షింపుము= కాపాడుము; ద్రౌపదీ, భీమసేనులన్= ద్రౌపదిని, భీముడిని; సభా, మధ్యంబునందు= నిండుసభలో; ప్రార్థింపన్= వేడుకొనటానికి; దుశ్శాసనున్= దుశ్శాసనుడిని; పంపుము= నియోగించుము.

తాత్పర్యం: కులానికి చేటు తెచ్చేవాడిని నిందించి కులాన్ని రక్షించటం ధర్మం. సమస్త భూరాజ్యానికి ధర్మరాజును రాజుగా చేయుము. అట్లా చేయటంవలన నీ కొడుకులు, మనుమలు, మిత్రులు, చుట్టాలు అందరున్నూ కాపాడబడతారు. ద్రౌపదికీ, భీమునికీ నిండుసభలో దుశ్శాసనుడిచేత క్షమాపణలు చెప్పించుము.

విశేషం: ఈ వచనంలో 'కులము' అనే శబ్దం ఎట్లా ప్రయోగించబడిందో అరయదగింది. అది కుటుంబం కావచ్చును; పలుకుటుంబాల కలయిక కావచ్చును. యుగ యుగాంతరాలలో అర్థపరిణామం సంతరించుకొన్న 'కుల' శబ్దం వంశం అనే అర్థంలో ఇక్కడ గ్రహించాలి.

చ. అతిశయితామరోత్తముఁ డహర్పతితేజుఁ డజాతశత్రుఁ డూ
ర్జితుఁ డజితుండు నీ సుతులు సేసిన యెగ్గు దలంపఁ; డాతనిన్
ధృతి నభిషిక్తుఁ జేయుము ప్రతీపకులోద్వహ! యిట్లు యైన నీ
కృతమునఁ గౌరవాన్వయ మకిల్బిషకీర్తిఁ బ్రకాశితం బగున్.' 51

ప్రతిపదార్థం: అతిశయిత+అమర+ఉత్తముఁడు= అతిశయింపబడిన ఇంద్రుడు కలవాడు, అంటే దేవేంద్రుడికంటె గొప్పవాడు (అమర+ఉత్తముడు= దేవతలలో శ్రేష్ఠుడు, ఇంద్రుడు); అహస్+పతి, తేజుఁడు= సూర్యుడి వంటి తేజస్సు కలవాడు; అజాత శత్రుఁడు= శత్రువులు లేనట్టివాడు, అంటే ధర్మరాజు; ఊర్జితుఁడు= గొప్పవాడు (మహానుభావుడు); అజితుండు= జయింపబడనివాడు-అపజయం లేనివాడు; నీ సుతులు= నీకొడుకులు; చేసిన; ఎగ్గు= కీడు; తలంపఁడు= మనసులో పెట్టుకోడు; ఆతనిన్= ఆ ధర్మరాజును; ధృతిన్= స్థిరనిశ్చయంతో; అభిషిక్తున్+చేయుము= రాజ్యానికి పట్టం కట్టుము; ప్రతీప, కుల+ఉద్వహ!= ప్రతీప మహారాజు వంశాన్ని ఉద్ధరించేవాడా!; ఇట్లు+అ+ఐన= ఈ విధంగా చేస్తే; నీ, కృతమునన్= నీవు చేసిన పనివలన; కౌరవ+అన్వయము= కౌరవవంశం; అకిల్బిష, కీర్తిన్= పాపంలేని యశస్సుతో; ప్రకాశితంబు+అగున్= వెలుగొందుతుంది.

తాత్పర్యం: ఇంద్రుడిని మించినవాడు, సూర్యుడివంటి తేజస్సు కలవాడు. అజాతశత్రుడు, గొప్పవాడు, జయించసాధ్యం కానివాడు అయిన ధర్మరాజు నీ కొడుకులు చేసిన కీడు మనసులో పెట్టుకోడు. ప్రతీపమహారాజుకులంలో పుట్టిన ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధర్మరాజును పట్టాభిషిక్తుడిగా చేయుము. అట్లా చేస్తే కౌరవవంశం పాపం లేని కీర్తితో వెలుగొందుతుంది.'

విశేషం: ధృతరాష్ట్రుడి తండ్రి విచిత్రవీర్యుడు. అతడి తండ్రి శంతనుడు. అతడి తండ్రి ప్రతీపుడు. 'అజాత శత్రువు' అనే బిరుదు సంపాదించుకొన్నవాడు- ధర్మరాజు. 'అజాతశత్రువు' అనే ధ్యేయాన్ని లోకానికి ప్రసాదించి, ధర్మరాజుపాత్రను తీర్చి దిద్దిన విశిష్టత ప్రపంచవాఙ్మయంలో మహాభారతానికి దక్కింది. ఎవరియెడ కూడా శత్రుత్వంలేని శీలం పుట్టుకతోడనే లభించిన మహామహితాత్ముడు 'అజాతశత్రువు'. ఇది హృదయంగమమైన పరికల్పన. పరమ పవిత్రమైన ధ్యేయం.

వ. అని పలికిన విదురు పలుకులు విని కడు నలిగి ధృతరాష్ట్రుం డిట్లనియె. 52

ప్రతిపదార్థం: అని, పలికిన= అని చెప్పిన; విదురు, పలుకులు= విదురుడి మాటలు; విని= ఆలకించి; కడున్+అలిగి= మిక్కిలి కోపం పొంది; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అని చెప్పిన విదురుడి మాటలు విని ధృతరాష్ట్రుడు మిక్కిలి ఆగ్రహం చెంది ఈవిధంగా అన్నాడు.

క. 'నా దేహంబునఁ బుట్టిన । యాదిసుతున్ విడువ నెట్టులగు? నాత్మజులం
గాదనక విఘాతించు ద । యాదూరులు గలరె? యిట్టు లన నీ కగునే? 53

ప్రతిపదార్థం: నా, దేహంబునన్= నా శరీరం నుండి; పుట్టిన= జన్మించిన; ఆది, సుతున్= మొదటికొడుకును; విడువన్+ఎట్టులు+అగున్= ఏ విధంగా విడిచిపెట్టటానికి వీలవుతుంది?; కాదు+అనక= కూడదు అనుకోకుండ; ఆత్మజులన్= కన్నకొడుకులను; విఘాతించు= చంపు లేదా కీడుకలిగించు; దయాదూరులు= దయకు దూరమైన కఠినాత్ములు; కలరు+ఎ= కలరా?; ఇట్టులు+అనన్= ఈ విధంగా పలకటం; నీకు+అగునే= నీకు తగునా?

తాత్పర్యం: 'నా శరీరంనుండి పుట్టిన మొదటికొడుకును నేను ఎట్లా విడువగలను? కూడదు అని అనుకోకుండ కొడుకులకు చేటు కలిగించే దయాహీనులు ఉంటారా? ఈ విధంగా చెప్పటం నీకు తగునా?

విదురుఁడు ధృతరాష్ట్రుని విడిచి పాండవులయొద్దకుఁ బోవుట (సం. 3-5-19)

వ. నీవు నా కొడుకుల యున్నతి కెన్నండును సహింపవు; నీ సహాయత్వంబే నొల్లఁ; బాండవులకడ కేనియు నొండు గడకేనియు నీకిష్టం బైన చోటికి నరుగు' మనిన నా క్షణంబ విదురుండు మనోజవైకరథారూఢుండై పాండవుల కడకుం గామ్యకవనంబున కరిగె; నంత నతనిరాక దవ్వులం గని ధర్మరాజు భీమసేనుని కిట్లనియె.54

ప్రతిపదార్థం: నీవు; నా, కొడుకుల+ఉన్నతికి= నాపుత్రుల అభివృద్ధికి; ఎన్నండును= ఏనాడుకూడా; సహింపవు= ఓర్వలేవు; నీ సహాయత్వంబు= నీ సాయం; ఏన్+ఒల్లన్= నేను సమ్మతించను; పాండవుల, కడకు+ఏనియున్= పాండవుల దగ్గరకైనా; ఒండు, కడకు+ఏనియు= ఇంకొకచోటికైనా; నీకు+ఇష్టంబు+ఐన, చోటికి= నీకు నచ్చినప్రదేశానికి; అరుగుము+అనినన్= వెళ్ళుము- అని అనగా; ఆ క్షణంబు+అ= ఆక్షణంలోనే; విదురుండు; మనస్+జవ+ఏక, రథ+ఆరూఢుండై= మనస్సుయొక్క వేగంవంటి వేగం కల రథాన్ని ఎక్కి; పాండవుల, కడకున్= పాండవు లుండే స్థలానికి; కామ్యక వనంబునకు= కామ్యక మనే పేరుకల అడవికి; అరిగెన్= వెళ్ళాడు; అంతన్; అతని, రాక= ఆ విదురుడు రావటం; దవ్వులన్+కని= దూరాన్నుండి చూసి; ధర్మరాజు; భీమసేనునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: నా కొడుకులు పైకి రావటం నీవు ఏనాడూ సహించలేవు. నీ సాయం నాకు అక్కరలేదు. నీవు పాండవుల దగ్గరకుగాని, లేక నీకిష్టమైన మరొక చోటికి గాని పొమ్ము' అని ధృతరాష్ట్రుడు అనగానే, వెంటనే విదురుడు మనోవేగం గల రథా న్నెక్కి పాండవు లుండే కామ్యకవనానికి వెళ్ళాడు. అతడు రావడం చూచి ధర్మజుడు భీమునితో ఇలా అన్నాడు-

సీ. 'గాండీవ మాదిగాఁ గల యాయుధావలు । లుక్కివంబున నప్పు డొడిచి కొనఁగ
మఱచినవాఁడయ్యు మందాత్ముఁ డా ధార్త । రాష్ట్రుండు గాంధారరాజతనయు
వచనముల్ విని యక్షవతి నెపంబున వానిఁ । గష్టుఁడై కొన సమకట్టి మనల
మగుడింపఁగా దుష్టమతిఁజేసి విదురుఁ బు । త్తెంచెఁ; గాకున్న నేతేరఁ డితఁడు

ఆ నింక జూదమాడ నే నోప; నిది పని । గాఁగ వచ్చు నొక్కొ కడఁగి విదురుఁ;
డేమి సేయు వార? మితని నియోగంబు । మనకుఁ జేయ కునికి మానుషంబె?' 55

ప్రతిపదార్థం: గాండీవము+ఆదిగాన్+కల= గాండీవం (అర్జునుడివిల్లు) మొదలుగా కల; ఆయుధ+ఆవలులు= ఆయుధ సమూహాలు; ఉక్కివంబునన్= మోసంతో; అప్పుడు+ఒడిచి, కొనఁగన్= ఆ సమయంలో ఓడించి తీసుకోవటం; మఱచిన, వాఁడు+ అయ్యు; మంద+ఆత్ముఁడు= మందమైన బుద్ధి కలవాడు; ఆ ధార్తరాష్ట్రుండు= ఆ ధృతరాష్ట్రుడి కొడుకు దుర్యోధనుడు; గాంధార, రాజ, తనయు, వచనముల్= గాంధారదేశపు రాజు కొడుకైన శకుని మాటలు; విని; అక్షవతి, నెపంబున= జూదం మిషతో; వానిన్= ఆ ఆయుధాలను; కష్టుఁడు+ఐ= నీచుడై; కొన, సమకట్టి= తీసుకొనాలని పూని; మనల, మగుడింపఁగాన్= మనల్ని వెనుకకు తీసికొనిపోవటానికై; దుష్ట, మతిన్+చేసి= దుర్బుద్ధిచేత; విదురున్+పుత్తెంచెన్= విదురుడిని పంపించాడు; కాక+ఉన్న= కాకపోతే; ఇతఁడున్= ఈ విదురుడు; ఏతేరఁడు= రాడు; ఏను= నేను; ఇంక= ఇకమీదట; జూదము+ఆడన్+ఓపను= జూదమాడటానికి ఇష్టపడను; విదురుఁడు; ఇది= ఈ (జూదం); పనిగాఁగ= పనిమీద; కడఁగి= పూని; వచ్చును+ఒక్కొ= వస్తాడా?; ఏమి+చేయువారము= మనము ఏమి చేద్దాం?; ఇతని, నియోగంబు= ఈ విదురుడి ఆదేశం; మనకున్; చేయక+ఉనికి= చేయకుండటం; మానుషంబె= మానవధర్మ మవుతుందా?

తాత్పర్యం: 'ఆనాడు దుర్యోధనుడు గాండీవం మున్నగు ఆయుధాలు సంగ్రహించటం మరచిపోయి, శకునిదుష్టబోధతో నేడు మళ్ళీజూదమాడి వాటిని కూడ కైవసం చేసికొనటానికై, మనలను తీసుకొనిరమ్మని పంపి ఉంటాడు. కాకుంటే ఇప్పుడు విదురుడు ఇక్కడికి ఎందుకు వస్తున్నట్లు? నేను ఇంకొకసారి జూదం ఆడదలచుకోలేదు. అయితే విదురుడి మాట జవదాటటం ఎట్లా?'

విశేషం: మహాభారతాన్ని కేవలం కథగా చూచినా, లేక ఇతిహాసంగా గ్రహించినా అందులోనుండి మానవులు నేర్చుకొనదగిన గుణపాఠాలు ఎన్నో ఉన్నాయి. ఇక్కడ విదురుడి రాకకు కారణం తెలియక అజాతశత్రువైన ధర్మరాజే కారణాంతరాలను యోచించాడు. విదురుడు పరమధర్మమూర్తి. ధర్మరాజు ఆ విదురుడిపై అకుంఠితవిశ్వాసం కలవాడు. అయినా సత్యం తెలియనప్పుడు అనేకఅనుమానాలు ఎంతటి మంచివారికైనా, ఎంతటి మంచివారి పట్లనైనా ఏర్పడటం సహజం. నిజం నిదానంగా కాని తెలియదు.

వ. అని తమలోఁ బలుకుచున్న సమయంబున విదురుం డేతెంచిన నతనికిఁ బ్రత్యుద్గతులై వినయప్రియ సత్కారంబుల సంతుష్టుం జేసి, తదాగమననిమిత్తం బడిగిన, వారికి విదురుం డిట్లనియె. 56

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; తమలోన్= పాండవులు ఒకరితో నొకరు; పలుకుచు+ఉన్న, సమయంబునన్= మాటాడుకొనేటప్పుడు; విదురుండు; ఏతెంచినన్= రాగా; అతనికిన్; ప్రతి+ఉద్గతులు+ఐ= ఎదురువెళ్ళినవారై; వినయ, ప్రియ, సత్కారంబులన్= అణకువతో, ప్రేమతో, అతిథి సపర్యలతో; సంతుష్టున్+చేసి= సంతృప్తుడిని చేసి; తద్+ఆగమన, నిమిత్తంబు= అతడి రాకకు కారణం అడుగగా; వారికి= పాండవులకు; విదురుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అని పాండవులు తమలో తాము చర్చించుకొంటూ ఉన్నసమయంలో విదురుడు వచ్చాడు. వారు అతడికి ఎదురేగి, వినయ పూర్వకంగా ప్రియమార స్వాగతసత్కారాలు చేసి, ఆయన వచ్చిన హేతువును గురించి అడిగారు. వారికి విదురుడు ఇట్లా చెప్పాడు.

క. **'మతి వారికి మాకును గడు । హితుఁడవు; చెపుమయ్య; యింక నెయ్యది కార్య**
స్థితి?' యని ధృతరాష్ట్రుం డే । కత మిష్టంబైన కార్యగతి నన్నడుగన్. **57**

ప్రతిపదార్థం: మతిన్= మనస్సులో; వారికి, మాకును= పాండవులకున్నూ, కౌరవులకున్నూ; కడు= మిక్కిలి; హితుఁడవు= మేలుకోరేవాడివి; ఇంకన్, ఎయ్యది; కార్యస్థితి= కర్తవ్యం; చెపుము+అయ్య= చెప్పవయ్యా; అని; ధృతరాష్ట్రుండు; ఏకతము= రహస్యంగా; ఇష్టంబు+ఐన= సమ్మతమైన; కార్యగతి= కార్యవిధానం; నన్ను+అడుగన్= నన్ను అడుగగా.

తాత్పర్యం: 'వారికిన్నీ, మాకున్నూ హితుడవు. ఇక చేయవలసిన పని ఏమిటో చెప్పవయ్యా!' - అని ధృతరాష్ట్రుడు నన్ను ఏకాంతంగా అడిగినప్పుడు.

వ. **ఏ నుభయపక్షంబులవారికి జగంబునకు లగ్గుగ హితంబైన విధంబు సెప్పిన, నది సర్వజన రుచికరంబైన యాహారంబు రోగాతురునకు నరుచికరంబైన యట్ల యతనికి రుచియింపదయ్యె.** **58**

ప్రతిపదార్థం: ఏను= నేను; ఉభయ, పక్షంబుల, వారికి= ఇరువైపుల వారికి; జగంబునకు= లోకానికి; లగ్గుగ= మేలవునట్లుగా; హితంబు+ఐన, విధంబు= మేలైనమార్గం; చెప్పినన్; అది; సర్వ, జన, రుచికరంబు+ఐన= అందరు జనులకు ఇష్టమైన; ఆహారంబు= భోజనం; రోగ+ఆతురునకున్= జబ్బుచేసినవాడికి; అరుచికరంబు+ఐన+అట్లు= రుచించనట్లు; అతనికి; రుచియింపదు+అయ్యెన్= ఇష్టం కాలేదు.

తాత్పర్యం: నేను ఉభయపక్షాలవారికి, జగత్తుకు మేలయ్యే మార్గం ఉపదేశించాను. కాని అందరికి రుచిగా ఉన్న ఆహారం జబ్బు చేసినవాడికి రుచించనట్లు అతడికి నాహితవు రుచించలేదు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. **కార్యగతులతెఱఁగు కలరూపు సెప్పిన । నధికమతులు దాని నాదరింతు;**
రల్పకార్యబుద్ధు లగువారలకు నది । విరసకారణంబు విషమ పోలె. **59**

ప్రతిపదార్థం: కార్య, గతుల తెఱఁగు= కర్తవ్యమార్గం; కలరూపు+చెప్పినన్= ఉన్నది ఉన్నట్లు చెప్పితే; అధికమతులు= గొప్పబుద్ధి కలవారు; దానిన్+ఆదరింతురు; అల్ప, కార్య, బుద్ధులు+అగువారలకున్= నీచకృత్యాలతో కూడిన బుద్ధి కలవాళ్ళకు; అది; విషము+అ, పోలె= విషంవలెనే; విరస, కారణంబు= బుద్ధిని విరిచివేసే హేతువు, అప్రీతికి కారణం.

తాత్పర్యం: ఉన్నదున్నట్లు చెపితే గొప్పబుద్ధి కలవాళ్ళు దాన్ని ఆదరిస్తారు. కాని, నీచకృత్యాలకు పాల్పడేవాళ్ళకు అది రక్తాన్ని విరిచే విషంవలె, బుద్ధికి విరసంగా ఉంటుంది.

విశేషం: అలం: ఉపమ. ఈ పద్యం ఆదికవి సూక్తిరత్నాల్లో ఒకటి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. దానన చేసి ధృతరాష్ట్రుండు నన్నొల్లక యెగ్గులు పలికి 'నీవు విపరీతచేతస్కుండ; విందుండ వలవదు; పాండవుల పాలికిం బొ' మ్మనిన వచ్చితి; రూపలావణ్యవతియై వృద్ధశ్రోత్రియునిచేతం బరిణీతయైన తరుణియుం బోలె రాజ్యలక్ష్మి యద్దురాత్మునందు విరక్తయగాని ప్రీతిఁ బుట్టదండ్రు. 60

ప్రతిపదార్థం: దానన్+అ, చేసి= అందుచేత; ధృతరాష్ట్రుండు; నన్ను+ఒల్లక= నన్ను అంగీకరించక; ఎగ్గులు+పలికి= నిష్ఠురాలాడి; నీవు; విపరీత, చేతస్కుండవు= వ్యతిరేకమైన మనస్సు కలవాడివి; ఇందు+ఉండ, వలవదు= ఇక్కడ ఉండవద్దు; పాండవుల, పాలికిన్+పొమ్ము+అనినన్= పాండవులవద్దకు వెళ్ళుమంటే; వచ్చితిన్; రూప, లావణ్యవతి+ఐ= సౌందర్యం, తళుకు కలిగినదై; వృద్ధశ్రోత్రియుని చేతన్= ముసలివాడై పూర్వ సంప్రదాయ బద్ధుడైన వైదికవిప్రుడిచేత; పరిణీత+ఐన= పెండ్లి యాడబడిన; తరుణియున్+పోలెన్= లేతజవరాలి వలె; రాజ్యలక్ష్మి= రాజ్యమనే లక్ష్మి; ఆ+దురాత్మునందు= ఆ దుర్మార్గుడి పట్ల, విరక్త+అ= వలపులేనిదే; కాని; ప్రీతిన్= ప్రేమను; పుట్టదు+అండ్రు= కలుగదు అని అంటారు.

తాత్పర్యం: అందుచేత ధృతరాష్ట్రుడు నన్ను నిందించి, 'నీవు మాకు వ్యతిరేకమైన మనస్సుగలవాడివి. ఇక్కడ ఉండవద్దు. పాండవుల దగ్గరికి పో' అన్నాడు. అందువలన నే నిక్కడికి వచ్చాను. ముసలివాడైన ఛాందసుడు పెండ్లాడిన లేజవరాలివలె, రాజ్యలక్ష్మి ఆ దురాత్ముడి పట్ల వలపు లేనిదే అవుతుందిగాని, ప్రీతికలిగింది కాదని అంటారు కదా.

విశేషం: అలం: ఉపమ.

ఆ. ధర్మరహితులైన ధార్తరాష్ట్రులకు భూ। రాజ్యలక్ష్మి సుస్థిరంబు గాదు;
ధర్మతనయ! నిన్నుఁ దద్రాజ్యసంపదల్। వలచి తమకుఁ దామ వచ్చి పొందు. 61

ప్రతిపదార్థం: ధర్మ, రహితులు+ఐన= ధర్మంలేని; ధార్తరాష్ట్రులకు= ధృతరాష్ట్రుడి కొడుకులకు; భూ, రాజ్యలక్ష్మి= భూరాజ్యమనే లక్ష్మి; సుస్థిరంబు= ఎంతో ఎక్కువకాలం నిలిచేది; కాదు; ధర్మతనయ!= ఓ ధర్మరాజా!; నిన్నున్; తద్+రాజ్య, సంపదల్= ఆ రాజ్యంయొక్క ఐశ్వర్యాలు; వలచి= ప్రేమించి; తమకున్, తాము+అ= తమంతట తామై; వచ్చి= చేరి; పొందున్= పొందుతాయి.

తాత్పర్యం: ధర్మాన్ని కోలుపోయిన దుర్యోధనాదులకు రాజ్యలక్ష్మిస్థిరంగా ఉండదు. ఓ ధర్మరాజా! ఆ రాజ్యసంపదలు తమంత తామై నిన్ను వలచి వచ్చి పొందుతాయి.

విశేషం: భూరాజ్యలక్ష్మి - రూపకాలంకారం. భూరాజ్యానికి లక్ష్మికి ఇక్కడ అభేదాధ్యవసాయం.

వ. నా వచనంబున నెగడునది' యనిన ధర్మరాజు 'నట్ల చేయుదు' నని యున్నంత; నిట ధృతరాష్ట్రుండు పాండవులయొద్ద విదురు నునికి యెఱింగి ధృతివిహీనుండై, తన హృదయంబును దృష్టియుం బోని విదురుం బాసి నిమిషం బేనియు నిర్వహింప నోపక సంజయున కిట్లనియె. 62

ప్రతిపదార్థం: నా, వచనంబున= నామాట చొప్పున, నెగడునది= నడిచేది; అనినన్; ధర్మరాజును; అట్లు+అ= ఆవిధంగానే; చేయుదును+అని= చేస్తానని; ఉన్నంత= అక్కడ నివసించినంత; ఇట; ధృతరాష్ట్రుండు; పాండవుల+ఒద్ద= పాండవులకడ; విదురు+ఉనికి= విదురుడు ఉండటం; ఎఱింగి= తెలిసికొని; ధృతివిహీనుండు+ఐ= తాలిమిలేనివాడై; తన హృదయంబును= తన గుండెను; దృష్టియున్+పోని= చూపును పోలిన; విదురున్+పాసి= విదురుడిని విడనాడి; నిమిషంబు+ఏనియు= నిమిషమైనను; నిర్వహింపన్+ఓపక= ఏపనియు చేయలేక; సంజయునకు+ఇట్లు+అనియెన్= సంజయుడితో ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నేను చెప్పినట్లు నడచుకోండి' అని విదురుడు అనగా, 'అట్లే చేస్తా'నని ధర్మరాజు బదులు పలికాడు. ఇక్కడ ధృతరాష్ట్రుడికి విదురుడు పాండవులకడ ఉన్నట్లు తెలిసింది. తనకు గుండెవంటివాడున్నూ, చూపు వంటివాడున్నూ అయిన విదురుడిని విడిచి ఉండలేక ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా పలికాడు.

విశేషం: విదురుడు ధృతరాష్ట్రుడి హృదయంతో (గుండెతో), చూపుతో పోల్చబడ్డాడు. ఇది ఉపమాలంకారం.

క. **'నెమ్మిగలవాని, నా చి । త్తమ్మెఱిఁగెడు వాని విదురు ధర్మప్రియు నా**
తమ్ము నిట వేగఁ దోడ్కొని । ర; మ్మరుగుము కామ్యకాఖ్య రమ్యాటవికిన్. **63**

ప్రతిపదార్థం: నెమ్మి కలవానిన్= ప్రేమ కలవాడిని; నా, చిత్తమ్ము+ఎఱిఁగెడు వాని= నామనస్సు తెలిసికొనగలిగిన వాడిని; ధర్మప్రియు= ధర్మంపట్ల ప్రీతి కలవాడిని; నా, తమ్మున్= నా సోదరుడిని; విదురున్, ఇట= ఇక్కడకు; వేగన్= శీఘ్రంగా; తోడ్కొని, రమ్ము= తీసికొని రావాలి; కామ్యక+ఆఖ్య, రమ్య+అటవికిన్= కామ్యకం అనే పేరున్న అందమైన అడవికి; అరుగుము= వెళ్ళుము.

తాత్పర్యం: 'ప్రీతిపాత్రుడు, నామనస్సు తెలిసినవాడు, నా సోదరుడు, ధర్మప్రియుడు అయిన విదురుడిని తీసికొనిరమ్ము. కామ్యకవనానికి వెళ్ళుము' - అని ధృతరాష్ట్రుడు సంజయుడితో పలికాడు.

వ. **అని పంచిన నప్పుడ సంజయుం డతిత్వరితగతిం గామ్యకవనంబున కరిగి.** **64**

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; పంచినన్= ఆజ్ఞాపించగా; అప్పుడు+అ= వెంటనే; సంజయుండు; అతి త్వరితగతిన్= మిక్కిలి వేగంతో; కామ్యక వనంబునకు= కామ్యక మనే పేరున్న అడవికి; అరిగి= వెళ్ళి.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు ఆజ్ఞాపించగానే సంజయుడు మిక్కిలి వేగంగా కామ్యకవనానికి వెళ్ళాడు.

మ. **ధరణీదేవసహస్రసంఘములతో ధౌమ్యుండు ధర్మక్షమా**
భరణుల్ నల్వురు దమ్ములున్ విదురుఁడుం బాంచాలియుం బ్రీతి బం
ధురులై కొల్వఁగ నొప్పుచున్న బుధబంధున్ ధర్మరాజుం బ్రభా
స్వరతేజుం బ్రభుఁ గాంచి సంజయుఁడు సంజాతప్రమోదాత్ముఁడై. **65**

ప్రతిపదార్థం: ధరణీదేవ, సహస్ర, సంఘములతోన్= వేలకొలది విప్రుల సమూహములతో (ధరణీదేవులు= భూదేవులు, బ్రాహ్మణులు); ధౌమ్యుండు= పురోహితుడైన ధౌమ్యుడు; ధర్మ, క్షమా+ఆభరణుల్= ధర్మం, క్షమ అనే ఆభరణాలు కలవారు; నల్వురు= నలుగురు; తమ్ములున్= సోదరులున్నూ; విదురుఁడున్= విదురుడున్నూ; పాంచాలియున్= పాంచాలదేశరాజపుత్రి అయిన ద్రౌపదియున్నూ; ప్రీతి బంధురులు+ఐ= ప్రీతితో కూడిన వారై; కొల్వఁగన్= సేవిస్తుండగా; ఒప్పుచున్న= ప్రకాశిస్తున్న; బుధ బంధున్= సుజనులకు చుట్టం వంటివాడైన; ధర్మరాజున్= ధర్మరాజును; ప్రభాస్వరతేజున్= మిక్కిలి ప్రకాశంతో కూడిన తేజం కలవాడిని; ప్రభున్= రాజును; సంజయుఁడు; కాంచి= చూచి; సంజాత, ప్రమోద+ఆత్ముఁడు+ఐ= పుట్టిన సంతోషం కల ఆత్మకలవాడై, అంటే వికసించిన సంతోషంతో నిండినవాడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వేలకొలది విప్రుల సమూహములతో, పురోహితుడైన ధౌమ్యుడితో, ధర్మం, క్షమ అనే ఆభరణాలు తాల్చిన నలుగురు తమ్ములతో, విదురుడితో, ద్రౌపదితో సేవించబడుతున్నవాడై, సజ్జనబంధువై దేదీప్యమానంగా వెలుగుతున్న ధర్మరాజును చూచి సంజయుడు సంతోషతన్మయత్వంతో-

క. వనవాసము సేయుచుఁ ద్రిభు । వన రాజ్యము సేయునట్టి వడువున సంతో
ష నిబద్ధ బుద్ధి యగు యమ । తనూజునకు భక్తి నెఱఁగి తా నిట్లనియెన్. 66

ప్రతిపదార్థం: వనవాసము+చేయుచున్= అడవిలో నివసిస్తూకూడా; త్రి, భువన, రాజ్యము+చేయు+అట్టి, వడువునన్= మూడు లోకాలు ఏలుతున్న రీతిని; సంతోష నిబద్ధ బుద్ధి+అగు= సంతోషంతో కూడిన బుద్ధి కలవాడయిన, అంటే నిండు సంతోషంతో కూడినవాడైన; యమ తనూజునకు= ధర్మపుత్రుడికి; భక్తిన్= భక్తితో; ఎఱఁగి= నమస్కరించి; తాన్= తాను (సంజయుడు); ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: తాను అడవిలో నివసిస్తున్నప్పటికిన్నీ ముల్లోకాలు పరిపాలిస్తున్నరీతిని సంతోషంతో నిండినవాడైన ధర్మరాజుకు నమస్కరించి ఈవిధంగా పలికాడు.

వ. 'మిమ్మును ధర్మార్థవిదుండైన విదురునిం గౌరవేంద్రుం డెప్పుడుం దలంచుచుండు; మీ యనుమతంబునఁ దన యనుజుం దోడ్కొని తేర నన్నుఁ బుత్తెంచె' ననిన విని ధర్మరాజు విదురున కిట్లనియె. 67

ప్రతిపదార్థం: మిమ్మును; (పాండవులను); ధర్మ+అర్థ, విదుండు+ఐన= ధర్మంయొక్క ఆంతర్యాన్ని (ధర్మాన్ని, అర్థాన్ని) ఎరిగిన; విదురునిన్= విదురుడిని; కౌరవ+ఇంద్రుండు= కౌరవప్రభువు, ధృతరాష్ట్రుడు; ఎప్పుడున్+తలంచుచు+ఉండు; మీ, అనుమతంబునన్= మీ అనుజ్ఞ చొప్పున; తన, అనుజున్= తన తమ్ముడిని (విదురుడిని); తోడ్కొని తేరన్= వెంటబెట్టుకొని తీసికొని వచ్చుటకు; నన్నున్= నన్ను; పుత్తెంచెను= పంపించాడు; అనిన; విని; ధర్మరాజు; విదురునకు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'మిమ్ములను, ధర్మవేత్త అయిన విదురుడిని, ధృతరాష్ట్రప్రభువు ఎల్లప్పుడు స్మరిస్తూ ఉంటాడు. మీ అనుజ్ఞ గైకొని, తన తమ్ముడైన విదురుడిని తీసికొని రమ్మని నన్ను ధృతరాష్ట్రుడు మీకడకు పంపాడు' - అని సంజయుడు చెప్పగా విని ధర్మరాజు విదురుడితో ఇట్లా అన్నాడు.

తే. 'సర్వజనులును ధృతరాష్ట్ర శాసనంబు । సేయుచున్నచో మనకు విశేషభక్తిఁ
జేయవలయుఁ; గావున నెడ సేయ కరుగు' । మనిన విదురుండు గజపురి కరిగె నంత. 68

ప్రతిపదార్థం: సర్వజనులును= సమస్త ప్రజలును; ధృతరాష్ట్ర, శాసనంబు= ధృతరాష్ట్రుడి ఆజ్ఞ; చేయుచున్నచో= పాటిస్తుండగా; మనకు; విశేషభక్తిన్= మిక్కిలి భక్తితో; చేయవలయున్= పాటించాలి; కావునన్; ఎడ+చేయక= ఆలస్యంచెయ్యకుండ; అరుగుము= వెళ్ళుము; అనిన= అని అనగా; విదురుండు= విదురుడు; అంత; గజపురికి= హస్తినాపురానికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'ప్రజలందరు ధృతరాష్ట్రుడి శాసనాన్ని శిరసావహిస్తున్నప్పుడు, ఆతడి ఆజ్ఞను విశేషించి పాటించవలసిన ధర్మం మనపై ఉన్నది. కాబట్టి నీవు ఆలస్యం చేయకుండ వెళ్ళు' మని విదురుడితో ధర్మరాజు అన్నాడు. వెంటనే, విదురుడు హస్తినాపురానికి వెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ధృతరాష్ట్రుండును దనకు వినయవినమితోత్తమాంగుఁ డైన విదురు నతిస్నేహంబునం గౌఁగిలించుకొని మూర్ధాఘ్రాణంబు సేసి 'నీవు నిత్యక్షమానిరతుండవు నాబుద్ధిలేమికి క్షమియింపు' మనిన విదురుం డిట్లనియె.69

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండును; తనకు; వినయ, వినమిత+ఉత్తమ+అంగుఁడు+ఐన= నమ్రతతో వంగిన శిరం కలవాడైన; విదురున్= విదురుడిని; అతి స్నేహంబునన్= మిక్కిలి అనురాగంతో; కౌఁగిలించుకొని= ఆలింగనంచేసికొని; మూర్ధ+ ఆఘ్రాణంబు+చేసి= తలను మూర్కొని (అది వాత్సల్య చిహ్నం); నీవు; నిత్య, క్షమా, నిరతుండవు= ఎల్లప్పుడు క్షమించటంలో ఇష్టం కలవాడివి; నా, బుద్ధి, లేమికి= నాకు బుద్ధిలేక పోవటానికి; క్షమియింపుము; అనిన; విదురుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: తనకు భక్తితో శిరస్సు వంచి మ్రొక్కిన విదురుడిని, ధృతరాష్ట్రుడు అనురాగపురస్సరంగా ఆలింగనం చేసికొని 'నిత్యం క్షమాగుణంనందు ఆసక్తుడవైన నీకు క్షమించే సౌశీల్యం ఉన్నది. నాకు బుద్ధిలేకపోయింది. నన్ను క్షమించు' - అని వేడుకొన్నాడు. అప్పుడు ధృతరాష్ట్రుడితో విదురుడు ఇట్లా పలికాడు.

ఆ. 'నీవు నీ సుతుండు నెఱిఁ దప్పి పలికినఁ । బథ్యమయిన పలుక పలుకవలయు;
వీరు లయిన పాండవేయులతో నిగ్ర । హంబు సేయు టిది నయంబు గాదు.' 70

ప్రతిపదార్థం: నీవు; నీ, సుతుండు= నీ కొడుకు; నెఱిన్+తప్పి= న్యాయాన్ని విడిచి; పలికినన్= మాట్లాడగా; పథ్యము+అయిన= మేలు చేకూర్చేటి; పలుకు+అ= మాటనే; పలుకవలయు= చెప్పాలి; వీరులు+అయిన= పరాక్రమవంతులయిన; పాండవేయులతోన్= పాండవులతో; నిగ్రహంబు= వైరం; చేయుట; ఇది; నయంబు, కాదు= నీతి (మంచిది) కాదు.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీవున్నూ, నీకొడుకైన దుర్యోధనుడున్నూ న్యాయం తప్పి మాట్లాడుతున్నపుడు, మీ మేలుకోరి నేను హితవు పలకటం నా కర్తవ్యం. పరాక్రమవంతులైన పాండవులతో వైరం మంచిది కాదు.'

వ. అనుచు నెప్పటి యట్ల కార్యసహాయుండై విదురుండు ధృతరాష్ట్రునొద్ద నున్న, నయ్యిద్దఱ సంగమంబునకు శంకించి దుర్యోధనుండు కర్ణ శకుని దుశ్శాసనులతో నిట్లనియె. 71

ప్రతిపదార్థం: అనుచున్= అని చెపుతూ; ఎప్పటి+అట్లు+అ= యథాప్రకారం; కార్య, సహాయుండు+ఐ= పనులను చేయటంలో (తగిన సలహాలనిస్తూ) సాయం చేస్తున్నవాడై; విదురుండు= విదురుడు; ధృతరాష్ట్ర+ఒద్దన్= ధృతరాష్ట్రుడి కడ; ఉన్నన్= ఉండగా; ఆ+ఇద్దఱు+అ= ఆ ఇరువురి; సంగమంబునకున్= కూడికకు; శంకించి= సందేహించి; దుర్యోధనుండు; కర్ణ; శకుని; దుశ్శాసనులతోన్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అని చెప్పి విదురుడు మునుపటివలెనే ధృతరాష్ట్రుడికి ఆయా పనులు చేయటంలో తగిన సలహాలు ఇస్తూ సాయం చేస్తున్నాడు. ఆ ఇరువురి కలయికకు సందేహించి దుర్యోధనుడు కర్ణ శకుని దుశ్శాసనులతో ఇట్లా అన్నాడు.

క. 'పాండవహితుఁ డగు విదురుఁడు । వెండియుఁ జనుదెంచి కార్యవిధులందు సహా
యుండయ్యెఁ; నతనితోడ హి । తుండయి మంతనము సేయఁ దొడఁగెన్ విభుఁడున్. 72

ప్రతిపదార్థం: పాండవ, హితుఁడు+అగు= పాండవుల పట్ల ప్రీతి ఉన్న; విదురుఁడు; వెండియున్= మళ్ళీ; చనుదెంచి= వచ్చి; కార్య, విధులందు= పనులు చేసే తీరులలో; సహాయుండు+అయ్యెన్= తోడ్పడేవాడయ్యాడు; అతనితోడన్ - ఆ విదురుడితో; హితుండు+అయి= అనురాగం కలవాడయి; విభుఁడున్= రాజుకూడ (ధృతరాష్ట్రుడును); మంతనము+చేయన్, తొఁడగెన్= ఆలోచనలు చేయటానికి పూనుకొన్నాడు.

తాత్పర్యం: 'పాండవులపట్ల ప్రీతికల విదురుడు మళ్ళీ వచ్చి ధృతరాష్ట్రుడికి మంత్రి అయ్యాడు. రాజైన ధృతరాష్ట్రుడు కూడ ఆతడితో అన్ని విషయాలు సంప్రతించి మన్నిస్తున్నాడు.

వ. వీరలింకఁబాండవుల నిందులకు రావించు వారలయిన నగ్ని విష జలంబులు ప్రయోగించి వారల కపాయంబు సేయుద' మనిన విని శకుని దుర్యోధనుం జూచి 'యిట్లేల బాలిశంబైన మతిఁ దలంచితివి? విదుర ధృతరాష్ట్రులు విపరీతమతులై రావించినను, నిత్యసత్యనిరతులైన యప్పాండవులు దమ సేసిన సమయంబు సలుపక యేల వచ్చువార గుదు?' రనిన శకునిదుర్యోధనులకుఁ గర్ణుం డిట్లనియె. 73

ప్రతిపదార్థం: వీరలు= (విదురుడు, ధృతరాష్ట్రుడు); ఇంకన్; పాండవులన్; ఇందులకు= ఇక్కడికి; రావించువారలు+అయినన్= రప్పించే వాళ్ళయితే; అగ్ని, విష, జలంబులు= నిప్పు, విషంతో కలిసిన నీరు (విషం, నీరు); ప్రయోగించి= వాడి; వారలకు; (ఆ పాండవులకు); అపాయంబు+చేయుదము= ప్రమాదం కల్పిద్దాము; అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; శకుని; దుర్యోధనున్+చూచి; ఇట్లు+ఏల, బాలిశంబు+ఐన= ఈ విధంగా ఎందుకు మూర్ఖమైన; మతిన్+తలంచితివి= బుద్ధితో ఊహ చేశావు; విదుర, ధృతరాష్ట్రులు= విదురుడును, ధృతరాష్ట్రుడును; విపరీతమతులు+ఐ= వ్యతిరేకమైన బుద్ధికలవారై; రావించినను= (పాండవులను) రప్పించినప్పటికి; నిత్య, సత్య, నిరతులు+ఐన= ఎల్లప్పుడు సత్యం పట్ల ప్రీతి కలిగినవారైన; ఆ+పాండవులు; తమ, చేసిన, సమయంబు= తాము గైకొన్న ప్రతిజ్ఞను; సలుపక= పాటించక; ఏల, వచ్చువారు+అగుదురు= ఏ విధంగా వస్తారు?; అనినన్= అని అనగా; శకుని దుర్యోధనులకున్; కర్ణుండు= కర్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఒకవేళ విదురుడు ధృతరాష్ట్రుడు కలిసి పాండవులను వనవాసంనుండి ఇక్కడికి రప్పిస్తే, వారికి అగ్ని విష జల ప్రయోగాలతో అపాయం కలిగిద్దాము' అని దుర్యోధనుడనగా, అందుకు శకుని ఎందుకు ఇట్లా తెలివితక్కువగా ఆలోచిస్తున్నావు'? విదురుడు, ధృతరాష్ట్రుడు విభిన్నంగా ఆలోచించి వాళ్ళను రప్పించినా, సత్యసంధులైన పాండవులు తమ ప్రతిజ్ఞను పాటించకుండ ఎందుకువస్తారు? అని అనగానే - కర్ణుడు, శకుని దుర్యోధనులకు తన అభిప్రాయాన్ని ఇలా వెల్లడించాడు.

ఉ. 'ఇత్తతిఁ బన్నిపోయి పయినెత్తి రణం బొనరించి వారలన్
మిత్తికి నంపి ధాత్రి నిరమిత్రముఁ జేయుద; మిట్టు లైనఁ ద
ద్వృత్తులు నీక దక్కుఁ గురువీర; కడంగుము' నావుడున్ మదో
న్మత్తుఁడు గౌరవుం డతనిమాటకు సంతసమంది చెచ్చెరన్. 74

ప్రతిపదార్థం: ఇత్తఱిన్ (ఈ+తఱిన్)= ఈ అదనులో; పన్నిపోయి= యుద్ధమునకుసిద్ధమైవెళ్ళి; పయిన్+ఎత్తి= దండెత్తి; రణంబు+ఒనరించి= యుద్ధంచేసి; వారలన్(పాండవులను); మిత్తికిన్= మృత్యువుకు; అంపి= పంపి; ధాత్రిన్= భూమిని; నిర్+అమిత్రమున్+చేయుదము= శత్రువులు లేనట్లు చేద్దాం; ఇట్టులు+ఐనన్= ఈ విధంగా చేస్తే; తద్+వృత్తులు= వారి జీవనోపాయాలు; నీకు+అ= నీకే; దక్కున్= స్థిరపడతాయి; కురువీర!= కురువంశంలోని వీరుడా! ఓ దుర్యోధనుడా!;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కడంగుము= పూనుము; నావుడున్= అని చెప్పగా; మద+ఉన్మత్తుఁడు= మదంచేత గర్వించినవాడు; కౌరవుండు= దుర్యోధనుడు (కురువంశస్థుడు); అతని మాటకు= కర్ణుడి మాటకు; సంతసము+అంది= సంతోషించి; చెరన్+చెరన్= వేగంగా.

తాత్పర్యం: 'ఈ అదనులో మనం పాండవులపై దండెత్తి వారిని సంహరించి, భూమిపై ఇక మనకు శత్రుశేషం లేకుండా చేద్దాం. వారి జీవనోపాయాలు నీకు స్థిరంగా ఉంటాయి'- అని కర్ణుడు చెప్పగా మదోన్మత్తుడైన దుర్యోధనుడు మిక్కిలి సంతోషించాడు.

విశేషం: ధాత్రిని 'నిరమిత్రము' చేయటం పేర్కొదగిన ప్రయోగం. నిర్+అమిత్రము= నిరమిత్రము. సంస్కృతవ్యాకరణాన్ని అనుసరించి 'నిర్' అనేది వ్యతిరేకార్థకం.

వ. సమర సన్నద్ధుఁడై సమస్తబలంబును సమకట్టి వెలువడినం దన దివ్యదృష్టి నంతయు నెఱింగి కృష్ణద్వైపాయనుండు వచ్చి 'యిది ధర్మువు గా దుడుగు' మని దుర్యోధనుని వారించి ధృతరాష్ట్రున కిట్లనియె.75

ప్రతిపదార్థం: సమర, సన్నద్ధుఁడు+ఐ= యుద్ధమునకు సిద్ధమైనవాడై; సమస్త బలంబును= సర్వసేనలను; సమకట్టి= సమీకరించి; వెలువడినన్= దండయాత్రకు బయలుదేరగా; తన దివ్యదృష్టిన్= తనయొక్క దివ్యదృష్టిచేత; అంతయున్+ఎఱింగి; కృష్ణద్వైపాయనుండు= వేదవ్యాసుడు; వచ్చి; ఇది; ధర్మువు+కాదు= ధర్మం కాదు; ఉడుగుము+అని= విరమించుమని; దుర్యోధనుడిని; వారించి= ఆపి; ధృతరాష్ట్రునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు సేనలను సమీకరించి యుద్ధానికి బయలుదేరుతుండగా ఆ వృత్తాంతాన్నంతా తన దివ్యదృష్టితో తెలిసికొన్న వ్యాసమహర్షి అక్కడికి వచ్చి, 'ఇది ధర్మం కా'దని అతడిని వారించి, ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ద్వైపాయనుడు - అనగా వ్యాసుడు. వ్యాసుడు సత్యవతికి పరాశరమహర్షికి జన్మించాడు. యమునపై పడవ నడుపుతున్న సత్యవతిపై మరులుగొన్న పరాశరుడు నీహారయవనికను సృష్టించి, పడవను నదిమధ్యన ఉన్న ఒక ద్వీపం చేర్పించాడు. ఆ ద్వీపంలో సద్యోగర్భం నుండి వ్యాసుడు ఉద్భవించాడు. అందువలన ఆయనకు ద్వైపాయనుడు= ద్వీపంలో పుట్టినవాడు - అని పేరు కలిగింది. కృష్ణద్వైపాయనుడు - అనగా నల్లని వర్ణంకల ద్వైపాయనుడని అర్థం.

క. 'పుడమియు రాజ్యముఁ గోల్పడి । యడవుల నేకతమ యున్న యప్పాండవులం
గడఁగి వధియింతు నని నీ । కొడు కరిగెడు; నిట్లు తలఁపఁ గూడునె బుద్ధిన్? 76

ప్రతిపదార్థం: పుడమియు, రాజ్యమున్= భూమిని, రాజ్యాన్ని; కోల్పడి= పోగొట్టుకొని; అడవులన్= అడవులలో; ఏకతము+అ+ఉన్న= ఒంటరిగా ఉండే; ఆ+పాండవులన్; కడఁగి= పూని; వధియింతును+అని= చంపుతానని; నీ, కొడుకు; అరిగెడున్= వెళ్ళుతున్నాడు; బుద్ధిన్= బుద్ధితో; ఇట్లు, తలఁపన్+కూడునె?= ఈ విధంగా ఆలోచించవచ్చునా?

తాత్పర్యం: 'భూ రాజ్యాలను జూదంలో పోగొట్టుకొని అడవుల్లో ఒంటరిగా నివసిస్తున్న పాండవులను సంహరించాలని నీ కొడుకు దుర్యోధనుడు దండెత్తుతున్నాడు. ఇట్లాంటి ఆలోచన చేయవచ్చునా?

క. ధృతియుతులై సత్యవ్రత । రతులై పదుమూఁడు వత్సరంబులు ధర్మ
స్థితి సలిపి వార కడఁగెద । రతులపరాక్రములు మీఁద నాహవమునకున్. 77

ప్రతిపదార్థం: ధృతియుతులు+ఐ= ఓర్పుకలవారై; సత్య, వ్రత, రతులు+ఐ= సత్యాన్ని నిష్ఠగా పాటించటంలో ఇష్టం కలవారై; పదుమూఁడు వత్సరంబులు= పదమూడేండ్లు; ధర్మస్థితి, సలిపి= ధర్మమైన స్థితితో నిర్వహించి; ఆహవమునకున్= యుద్ధానికి; అతుల, పరాక్రములు= సాటిలేని శౌర్యంకలవారు; మీఁదన్= తదుపరి; వారు+అ= వారే(పాండవులే); కడఁగెదరు= పూనుకొంటారు.

తాత్పర్యం: సత్యసంధులు, పరాక్రమవంతులు, ఓర్పుకలవారు అయిన పాండవులే పదమూడేండ్లు తమ ప్రతిజ్ఞను పాటించిన తర్వాత యుద్ధానికి పూనుకొంటారు.

క. వనగతులని వారలపైఁ । జని భంగముఁ బొంది రాఁగ సమకట్టెడు నీ
తనయుఁడు గావున నీ వా । తని వారింపు మది యనుచితం బని నెమ్మిన్. 78

ప్రతిపదార్థం: వనగతులు+అని= అడవులకు వెళ్ళారని; వారలపైన్= ఆ పాండవులమీదికి; చని= దండెత్తి వెళ్ళి; భంగమున్+పొంది= పరాజయం పొంది; రాఁగ= మరలి రావటానికి; నీ, తనయుఁడు= నీ కొడుకు; సమకట్టెడు= పూనుతున్నాడు; కావున; నీవు; ఆతని= దుర్యోధనుడిని; నెమ్మిన్= మంచితనంతో; అది, అనుచితంబు+అని= అది సరి అయినది కాదని; వారింపుము= ఆపుము.

తాత్పర్యం: అడవుల పాలయ్యారని ఆ పాండవులమీదికి దండెత్తటానికి ఉద్యమించిన నీ కొడుకు పరాజయాన్నే పొంది తిరిగి రావలసి వస్తుంది. నీవు పూనుకొని ఆ అనుచితచర్యను వద్దని చెప్పి ఆతడిని వారించుము.

క. విను మేనును నీవును శాం । తనవుఁడు విదురుండు నుండి తగునె యధర్మం
బు నుపేక్షింపఁగ? ననయం । బును బాండవవిగ్రహంబు పుట్టుట లగ్గే?' 79

ప్రతిపదార్థం: వినుము; ఏనును, నీవును= నేనున్నూ, నీవున్నూ; శాంతనవుఁడు= భీష్ముడు; విదురుండును; ఉండి; అధర్మంబున్= అధర్మాన్ని; ఉపేక్షింపఁగన్+తగున్+ఎ= సహించటం తగునా?; అనయంబును= ఎల్లప్పుడు (దుర్నీతియు); పాండవ విగ్రహంబు= పాండవులతోడి విరోధం; పుట్టుట; లగ్గు+ఏ= మేలా?

తాత్పర్యం: వినుము. నీవు, నేను విదురుడు, భీష్ముడు బ్రదికి ఉండగా అధర్మాన్ని సహించటం న్యాయమా? సదా పాండవులపై పగ పూనటం మేలా?'

విశేషం: శాంతనవుడు= శంతనుపుత్రుడు- అపత్యార్థక తద్ధితం. ధార్తరాష్ట్రుడు= ధృతరాష్ట్రుడి కొడుకు - ఇట్టిదే.

వ. అనిన విని ధృతరాష్ట్రుండు దుఃఖితుండై 'నాకును గాంధారికిని భీష్మ విదుర కృప ద్రోణులకు ననిష్టంబైన దుష్ట ద్యూతంబు ప్రవర్తిల్లె; దుర్బుద్ధియైన దుర్యోధనుం బుత్త్రస్నేహంబున విడువనోప; నేమి సేయుదు?' ననిన ధృతరాష్ట్రునకుఁ గృష్ణద్వైపాయనుం డిట్లనియె. 80

ప్రతిపదార్థం: అనిన, విని; ధృతరాష్ట్రుండు; దుఃఖితుండు+ఐ= శోకించినవాడై; నాకును; గాంధారికిని; భీష్మ, విదుర, కృప, ద్రోణులకున్; అనిష్టంబు+ఐన= ఇష్టంకాని; దుష్టద్యూతంబు= చెడు జూదం; ప్రవర్తిల్లెన్= జరిగింది; దుర్బుద్ధి+ఐన= చెడ్డ బుద్ధి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కలవాడైన; దుర్యోధనున్= దుర్యోధనుడిని; పుత్త్ర స్నేహంబునన్= పుత్రుడిపైగల అనురాగంచేత; విడువన్+ఓపన్= విడువజాలను; ఏమి+చేయుదున్= ఏమి చేయగలను?; అనిన= అని చెప్పగా; ధృతరాష్ట్రునకున్; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ మాటలు విని ధృతరాష్ట్రుడు దుఃఖించి, 'నాకు, గాంధారికి, భీష్మ విదుర కృప ద్రోణులకు ఇష్టం కాని చెడుజూదం జరిగింది. ఏమి చేయగలను? పుత్రవాత్సల్యంవలన నేను దుర్బుద్ధి అయిన దుర్యోధనుడిని, వదలలేకున్నాను'- అని వ్యాసుడితో విన్నవించుకోగా, వ్యాసుడు ఇట్లా అన్నాడు.

ధృతరాష్ట్రునకు వ్యాసుఁ డింద్రసురభి సంవాదంబు సెప్పుట (సం. 3-10-6)

ఆ. 'ఎల్ల నెయ్యములకుఁ దల్లిదండ్రులయందు । సుతులవలని నెయ్య మతిశయంబు;
ధనము లెంత గలిగినను సుతరహితుల । కెమ్మెయిని మనఃప్రియమ్ము లేదు. 81

ప్రతిపదార్థం: ఎల్ల, నెయ్యములకున్= సమస్త స్నేహాలకు; తల్లి దండ్రుల యందు= తల్లి దండ్రులలో; సుతుల వలని, నెయ్యము= పుత్రులపై ఉండే ప్రేమ; అతిశయంబు= గొప్పది; ధనములు+ఎంత, కలిగినను= సంపదలు ఎన్ని ఉన్నను; సుత రహితులకు= కొడుకులు లేనివారికి; ఏ+మెయిని= ఏవిధంగానైనను; మనస్+ప్రియమ్ము= మనస్సుకు ప్రీతి; లేదు.

తాత్పర్యం: 'తల్లిదండ్రులకు మమకారబంధాలన్నింటిలో పుత్రస్నేహం మిక్కిలి గాఢమైనది. కొడుకులు లేని వారికి ఎంత సంపద ఉన్నా మనశ్శాంతి లభించదు.

వ. తొల్లి సకలగోమాత యయిన సురభి సురరాజుకడకుం బోయి కరుణంబుగా నేడ్చిన దానింజూచి సురపతి విస్మితుండై' యిట్లేల రోదనాకులితలోచనవయి యున్న దాన; వెల్ల వారికి లగ్గ కదా' యనిన నింద్రునకు సురభి యిట్లనియె. 82

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వకాలంలో; సకల గోమాత, అయిన= అన్ని గోవులకు తల్లి అయిన; సురభి= వేలుపుటావు; సురరాజు, కడకున్+పోయి= ఇంద్రుడి వద్దకు వెళ్ళి; కరుణంబుగాన్= జాలి పుట్టేటట్లుగా; ఏడ్చిన; దానిన్+చూచి; సురపతి= దేవేంద్రుడు; విస్మితుండు+ఐ= ఆశ్చర్యపడి; ఇట్లు+ఏల= ఈవిధంగా ఎందుకు?; రోదన+ఆకులిత లోచనవు+అయి= ఏడుపుచేత కలవరపాటు చెందిన కన్నులు కలదానివయి; ఉన్నదానవు; ఎల్లవారికి= అందరికి; లగ్గు+అ కదా= క్షేమమేకదా?; అనినన్= అని పలుకగా; ఇంద్రునకు; సురభి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: అన్ని ఆవులకు తల్లి అయిన వేలుపుటావు సురభి ఇంద్రుడి వద్దకువెళ్ళి కన్నీరు కారుస్తూ విలపించింది. ఇంద్రునికి ఆశ్చర్యం, జాలి కలిగింది. ఇంద్రుడు సురభితో 'ఇట్లా ఎందుకు ఏడుస్తున్నావు? అందరికిని క్షేమమే కదా!' - అని ప్రశ్నించాడు. ఇంద్రుడితో సురభి ఇట్లా బదులు పలికింది.

క. 'నీ వజ్రము రక్షింపఁగ । నా వారికిఁ దక్కఁ ద్రిభువనంబులఁ గల జీ
వావలి కెల్లను గుశలమ । దేవేంద్ర! జగత్త్రయప్రదీప! మహాత్మా! 83

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దేవ+ఇంద్ర!= ఓ దేవేంద్రా!; జగత్+త్రయ, ప్రదీప!= మూడు లోకాలను వెలిగించేవాడా!; మహా+ఆత్మా= గొప్ప ఆత్మకలవాడా!; నీ, వజ్రము= నీ వజ్రాయుధం; రక్షింపఁగన్= రక్షిస్తుంటే; నా వారికిన్+తక్కన్= నా సంతతికి తప్ప; త్రి, భువనంబులన్+కల, జీవ+ఆవలికి+ఎల్లను= మూడులోకాలలో ఉండే ప్రాణికోటికెల్ల; కుశలము+అ= క్షేమమే.

తాత్పర్యం: 'మూడులోకాలను ప్రకాశింపచేసే మహానుభావా! దేవేంద్రా! నీ వజ్రాయుధం రక్షిస్తుండగా మూడులోకాలలో ఉన్న జీవకోటికి క్షేమమే - నా సంతతికి తప్ప.

వ. దీనిం జిత్తగింపుము; బలంబు గల బలీవర్దంబులతో బలహీనంబులయిన వానిం బూన్చిన నవి దుర్వహ భారవహన మహాలాంగలాకర్షణంబులయం దసమర్థంబు లైన నడిచియుం బొడిచియు ములుకోలలం గుట్టియు దుర్బలబలీవర్దంబుల జనులు బాధింపం జూచి యేను దానికి దుఃఖించెద' ననిన సురభికి సురపతి యిట్లనియె. 84

ప్రతిపదార్థం: దీనిన్= ఈ విషయాన్ని; చిత్తగింపుము= దయతో విని గ్రహించుము; బలంబు, కల= బలంఉన్న; బలీవర్దంబులతోన్= ఎద్దులతో; బలహీనంబులయిన వానిన్= బలంలేనివాటిని; పూన్చినన్= జతపరిస్తే; అవి, దుర్వహ, భార, వహన, మహా, లాంగల+ఆకర్షణంబులయందు= మోయలేని బరువు మోయుటంలో, పెద్దనాగళ్ళు లాగటంలో; అసమర్థంబులు+ఐనన్= సామర్థ్యం లేకపోయినవి కాగా; అడిచియున్= కొట్టిన్నీ; పొడిచియు= గ్రుచ్చిన్నీ; ములుకోలలన్+కుట్టియు= ముల్లుగలకర్రలతో నొప్పించిన్నీ; దుర్బల బలీవర్దంబులన్= బలంలేని ఎద్దులను; జనులు; బాధింపన్+చూచి= కష్టపెట్టటం చూచి; ఏను= నేను; దానికి= ఆ దుఃఖస్థితికి; దుఃఖించెదన్= దుఃఖిస్తున్నాను; అనిన; సురభికి= వేలుపుటావుకు; సురపతి= దేవేంద్రుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దేవా! నామాటలు దయచేసి సావధానంగా వినండి: బలం గల ఎద్దులతో బలంలేని ఎద్దులను పూన్చి (కాడి కట్టి) బరువులను మోయిస్తున్నప్పుడు, పొలాలు దున్నుతున్నప్పుడు బలంలేని ఎద్దులు బరువులు మోయలేక, నాగళ్ళు లాగ లేక మిక్కిలి బాధపడుతున్నాయి. కాని, జనులు బడుగుటెద్దులను కొట్టి, ములుగర్రలతో పొడిచి బాధిస్తూ ఉండటంచేత నేను మిక్కిలి పరితపిస్తున్నాను'- అని అనగా దేవేంద్రు డిట్లా బదులు పలికాడు.

క. 'నీకు నపత్యశతంబు ల । నేకంబులు గలవు వాని కేకాకృతి దుః
ఖాకులత సంభవింపదు । శోకింపకు' మనిన సురభి సురపతి కనియెన్. 85

ప్రతిపదార్థం: నీకున్+అపత్య, శతంబులు= నీకు నూర్ల కొలదీ బిడ్డలు; అనేకంబులు= పెక్కు; కలవు; వానికి; ఏక+ఆకృతి= ఒకే విధమైన; దుఃఖ+ఆకులత= శోక పరితప్తత (దుఃఖంతో వెత చెందటం); సంభవింపదు= ఏర్పడదు; శోకింపకుము= విచారించకు; అనినన్= అని అనగా; సురభి= వేలుపుటావు; సురపతికి= దేవేంద్రుడికి; అనియెన్= చెప్పింది.

తాత్పర్యం: 'నీకు ఎన్నోవందల సంతానం ఉంది. అన్నింటికిని ఒకే రీతి దుఃఖం దాపురించదుకదా! శోకించవద్దు' అని దేవేంద్రుడు పలుకగా, సురభి సురపతితో బదులు పలికింది.

వ. 'దేవా! దీనాననంబులయి దుర్బలంబు లయిన యపత్యంబుల దుఃఖం బే నెట్లు సూడనోపుదు?' ననిన నగి యింద్రుండు దానికిం గరుణించి వర్షంబునఁ దృణవర్ధనంబు సేసి దుర్బల బలీవర్దంబులకు బలంబు గావించె

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నని యింద్ర సురభి సంవాదంబు వేదంబులయందు వినంబడుఁ గావున నీకుం బుత్త్రస్నేహంబు సామాన్యంబు గా; దైనను దీనులై వనంబున నవయుచున్న యప్పాండవులకు దయాళుండ వగుము. 86

ప్రతిపదార్థం: దేవా! (= ఓ ఇంద్రా!); దీన+ఆననంబులు+అయి= వెత చెందిన ముఖాలు కలవయి; దుర్బలంబులు+అయిన= బలంలేనివయిన; అపత్యంబుల= సంతానంయొక్క; దుఃఖంబు= శోకం; ఏను= నేను; ఎట్లు= ఏ విధంగా; చూడన్+ఓపుదున్= చూడగలను?; అనినన్= అని చెప్పగా; నగి= నవ్వి; ఇంద్రుండు; దానికిన్+కరుణించి= దానిపై దయకలిగి; వర్షంబునన్= వానచేత; తృణవర్ధనంబు+చేసి= గడ్డి బాగా పెరిగేటట్లు చేసి; దుర్బల బలీవర్దంబులకు= బలం లేని ఎద్దులకు; బలంబు, కావించెన్= బలం కలిగేట్లు చేశాడు; అని; ఇంద్ర, సురభి, సంవాదంబు= ఇంద్రుడికి, వేలుపుటావుకు జరిగిన సంభాషణ; వేదంబుల యందు; వినంబడున్; కావున; నీకున్= (ధృతరాష్ట్రా!) నీకును; పుత్త్రస్నేహంబు= కొడుకులపై కల ప్రేమ; సామాన్యంబు, కాదు= సాధారణమైనది కాదు; ఐనను; దీనులు+ఐ= వెతచెందినవారై; వనంబునన్= అడవిలో; నవయుచున్న= కష్టపడుతున్న; ఆ+పాండవులకు= ఆ పాండవులపట్ల; దయాళుండవు+అగుము= దయకలవాడివి కమ్ము.

తాత్పర్యం: 'దేవా! బలంలేని నా సంతానం పడుతున్న బాధను నేను ఎట్లా చూడగలను?' అని సురభి చెప్పింది. ఇంద్రుడు నవ్వి, కరుణించి, వాన కురిపించి గడ్డి ఎక్కువగా పెరిగేటట్లు చేసి బలంలేని ఎద్దులకు బలం కలిగేటట్లు చేశాడు. ఈ ఇంద్రసురభి సంవాదం వేదాలలో ఉన్నది. ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీకు కల పుత్రప్రేమ సాధారణమైనది కాదు. ఐనను అడవులలో వెతలతో క్రుగ్గుతున్న పాండవులపట్ల దయ చూపించుము.

విశేషం: మహాభారతంలో ప్రధాన కథతో పాటు పెక్కు ఉపాఖ్యానాలు, సంవాదాలు ఉన్నాయి. సంవాదమంటే ఇరువురి మధ్య జరిగే సంభాషణ. ఈ సంభాషణకు అంతరార్థం ఉంటుంది. ప్రస్తుత కథతో అవినాభావ సంబంధం ఉంటుంది. ఇందువలన అప్పుడప్పుడు కథాగమనం కుంటుపడుతుందని కొందరు విమర్శించటం కద్దు. కాని, మహాభారత గ్రంథకర్త వేసికొన్న ప్రణాళిక ప్రకారం విజ్ఞాన సర్వస్వం అయిన ఇతిహాసంలో ఉపాఖ్యానాలు, సంవాదాలు ప్రధానకథకు పరిపుష్టి చేకూర్చేవే. ఈ సురభి సురపతి సంవాదంలోని ప్రధానాంశాలు: (1) నోరు లేని మూగ జంతువుల పట్ల జనులు జాలి చూపాలనే మానవతా ధర్మం (2) సృష్టిలో పుత్రేషణ ప్రాణికోటిపై నెరపే ప్రభావం హృదయంగమంగా చిత్రించబడ్డాయి. ఈషణత్రయం - దారేషణ, ధనేషణ, పుత్రేషణ - ఇవి భూతకోటిపై మిక్కిలి ప్రభావం చూపిస్తున్నాయి. పక్షులలో దారేషణ, పశువులలో పుత్రేషణ, మనుజులలో ధనేషణ ఎక్కువ అని పెద్దల ప్రవచనం. కాని, మానవుల్లో ఈ ఈషణత్రయం ప్రభావాన్ని చూపుతుంది. ధృతరాష్ట్రుడికి ఉండే పుత్రేషణ అతడి శీలాన్ని చాల ప్రభావితంచేసింది. ఆ విషయాన్ని వ్యాసమహర్షి ఈ ఉపాఖ్యానంలో ప్రస్ఫుటం చేశాడు. అంతేకాదు. సుఖాల్లో ఉన్న బిడ్డలమీద కంటె, కష్టాల్లో ఉన్న బిడ్డలమీద ఎక్కువ ప్రేమ చూపాలని ప్రబోధించాడు.

తే. నీవుఁ బాండుండు విదురుండు నెమ్మి నాకు । నొక్క రూపైన యట్లు నీ కుదితయశులు
నీ సుతులు నూర్వురును బాండునృపతనూజు । లేవురును నొక్కరూప కా నెఱుఁగవలయు. 87

ప్రతిపదార్థం: నీవున్= (ధృతరాష్ట్రుడు) నీవున్నూ; పాండుండు= పాండురాజున్నూ; విదురుండు; నెమ్మిన్= ప్రేమలో; నాకున్ (వ్యాసుడికి); ఒక్క, రూపు+ఐన, అట్లు= ఒకే విధమైనవారు (సమానులు) అయినట్లే; నీకు+ఉదితయశులు= నీకు, అధిక కీర్తి కలవారు; నీ, సుతులు= నీ కొడుకులు; నూర్వురును= వందమందిన్నీ; పాండు, నృప, తనూజులు+ఏవురును= పాండురాజు కొడుకులు ఐదుగురున్నూ; ఒక్క, రూపు+అ, కాన్= ఒకే రూపం వారని, అంటే సమానులని; ఎఱుఁగవలయున్= (నీవు) తెలిసికోవాలి.

తాత్పర్యం: నీవు, పాండురాజు, విదురుడు ప్రేమలో నాకు సమానులు. అలాగే గొప్ప కీర్తి కల వందమంది నీ కొడుకులూ, పాండురాజు ఐదుగురు పుత్రులూ నీకు సమానులని తెలిసికోవాలి.

క. సుజనుల సహవాసంబునఁ। గుజనులు సద్ధర్మమతు లగుట నిక్కము; ధ
ర్మజునొద్ద నుండి నీ యా। త్మజుఁడు ప్రశాంతుండు ధర్మమార్గుండు నగున్. 88

ప్రతిపదార్థం: సుజనుల, సహవాసంబునన్= మంచివారి స్నేహంవలన (మంచివారితో కలిసి మెలిసి ఉండటంవలన); కుజనులు= చెడ్డవారు; సత్+ధర్మమతులు+అగుట= మంచి ధర్మబుద్ధి కలవారవటం; నిక్కము= నిజం; ధర్మజు+ఒద్దన్+ఉండి= ధర్మరాజు దగ్గర ఉండి; నీ, ఆత్మజుఁడు= నీ కొడుకు; ప్రశాంతుండు= మిక్కిలి శాంతం కలవాడు; ధర్మమార్గుఁడున్= ధర్మమార్గంలో సంచరించేవాడు; అగున్= కాగలడు.

తాత్పర్యం: మంచివారిమైత్రివలన చెడ్డవారు కూడ మంచివారవుతారు. ధర్మరాజుసహవాసంవలన నీ కొడుకు ధర్మమార్గుడు, ప్రశాంతుడు కాగలడు.

వ. రాజర్షి యైన ధర్మరాజుతోడి సహవాసంబు సర్వజనహితంబు గావున నాతని నుపాసించి దుర్యోధనుండు గొండొకకాలం బుండు నట్లుగాఁ బనుపు; మట్లయిన నుభయపక్షంబులకు లగ్గగు' ననిన ధృతరాష్ట్రుండు గృతాంజలి యయి 'మునీంద్రా! దుర్యోధనుండు నా పలుకులు వినండు; కురుకులంబు రక్షించు నట్టి బుద్ధి గలదేని వాని మీర శిక్షింపుం' డని మ్రొక్కిన 89

ప్రతిపదార్థం: రాజ+ఋషి+ఐన= రాజులలో ఋషివంటివాడైన; ధర్మరాజుతోడి, సహవాసంబు= ధర్మరాజుతోమైత్రి; సర్వ, జన, హితంబు= సమస్త జనులకు ఇష్టమైనది; కావునన్, ఆతనిన్= ఆ ధర్మరాజును; ఉపాసించి= ఆరాధించి; దుర్యోధనుండు; కొండొక, కాలంబు= కొంతకాలం; ఉండునట్లుగాన్; పనుపుము= నియమించుము; అట్లు+అయినన్= ఆ విధంగా చేస్తే; ఉభయ, పక్షంబులకున్= ఇరువర్గాలవారికి; లగ్గు+అగున్= మేలు కలుగుతుంది; అనినన్= అని చెప్పగా; ధృతరాష్ట్రుండు; కృత+అంజలి+అయి= చేయబడిన నమస్కారం కలవాడయి- అంటే నమస్కరించి; ముని+ఇంద్రా!= మునులలో శ్రేష్ఠుడా!; దుర్యోధనుండు; నా పలుకులు= నా మాటలు; వినండు= వినడు; కురు, కులంబు= కురువంశాన్ని; రక్షించు+అట్టి, బుద్ధి, కలదు+ఏని= కాపాడే ఉద్దేశం ఉంటే; వాని= ఆ దుర్యోధనుడిని; మీరు+అ= మీరే; శిక్షింపుండు= ప్రబోధించండి; అని= అని పలికి; మ్రొక్కిన= నమస్కరించగా.

తాత్పర్యం: రాజర్షి అయిన ధర్మరాజుతో దుర్యోధనుడు మైత్రి చేయటం సర్వజన హితమైనది. దానివలన ఇరుపక్షాలకు మేలు కలుగుతుంది' అని ధృతరాష్ట్రుడితో వ్యాసుడు పలికాడు. 'మునీంద్రా! కురుకులాన్ని కాపాడాలనే కోరిక మీకు ఉంటే మీరే దుర్యోధనుడికి ప్రబోధం చేయండి. అతడు నా పలుకులను వినడు'- అని ధృతరాష్ట్రుడు వ్యాసుడికి నమస్కరించి బదులు పలికాడు.

క. 'అనఘుఁడు మైత్రేయుం డను। మునినాథుఁడు వచ్చి ధర్మమున నాతనిఁ దా
ననుశాసించుఁ దిరంబుగ'। నని చెప్పుచు నప్పరాశరాత్మజుఁ డరిగెన్. 90

ప్రతిపదార్థం: అనఘుఁడు= పాపంలేనివాడు; మైత్రేయుండు+అను, మునినాథుఁడు= మైత్రేయుడు అనే పేరున్న ఋషి శ్రేష్ఠుడు; వచ్చి; ఆతనిన్= ఆ దుర్యోధనుడిని; ధర్మమునన్= ధర్మంలో; తిరంబుగన్= స్థిరంగా; అనుశాసించున్= ఆజ్ఞాపిస్తాడు (అంటే ప్రబోధిస్తాడు); అని; చెప్పుచున్; ఆ+పరాశర+ఆత్మజుఁడు= పరాశరుడి కొడుకైన వ్యాసుడు; అరిగెన్= వెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'మహానుభావుడైన మైత్రేయమహర్షి వచ్చి దుర్యోధనుడికి ధర్మప్రబోధం చేయగల' డని చెప్పి వ్యాసమహర్షి నిష్క్రమించాడు.

వ. అంత. 91

తాత్పర్యం: ఆ తరువాత

ఉ. న్యాయవిదుండు గామ్యకవనంబున ధర్మజునొద్దనుండి మై
త్రేయుఁడు ధీయుతుం డరుగుదెంచిన నప్పుడ యమ్మునీంద్రు నిం
ద్రాయితుఁ డాంబికేయుఁ డుచితస్థితిఁ బూజితుఁజేసె నాత్మ ని
శ్శ్రేయసలాలసుండయి విశేషసపర్యలఁ జేసె భక్తితోన్. 92

ప్రతిపదార్థం: న్యాయవిదుండు= పాడి తెలిసినవాడు; కామ్యకవనంబునన్= కామ్యకమనేపేరున్న అడవిలో; ధర్మజు+ఒద్దనుండి= ధర్మరాజు దగ్గరనుండి; ధీయుతుండు= బుద్ధిమంతుడైన; మైత్రేయుఁడు; అరుగుదెంచినన్= రాగా; అప్పుడు+అ= ఆ సమయాన్నే; ఆ+ముని+ఇంద్రున్= ఆ మునీశ్వరుడిని; ఇంద్ర+ఆయితుఁడు= ఇంద్రుడితో సమానమైనవాడు; ఆంబికేయుఁడు= అంబికాపుత్రుడైన ధృతరాష్ట్రుడు; ఉచిత స్థితిన్= అర్హమైన విధంగా; పూజితున్+చేసెన్= పూజించాడు; ఆత్మ, నిశ్శ్రేయస, లాలసుండు+అయి= తనకు మేలు లభించాలనే కోరిక కలవాడై; భక్తితోన్= గౌరవభావంతో; విశేష, సపర్యలన్= ప్రత్యేకమైన శుశ్రూషలు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: న్యాయవేత్త అయిన మైత్రేయమహర్షి కామ్యకవనంలో ఉన్న ధర్మరాజు దగ్గరనుండి తన కడకు వచ్చినపుడు ధృతరాష్ట్రుడు తనకు మేలు కలగాలనే కోరిక కలవాడై ఎంతో భక్తితో ఆ మునీంద్రునికి విశేషసపర్యలు చేసి పూజించాడు.

వ. ఇట్లుదనచేతంబూజితుండై సుఖవిశ్రాంతుండైన మునివరునకు ధృతరాష్ట్రుండు ముకుళితహస్తుండై
'భట్టారకా! యెందుండి వచ్చితి?' రని యడిగిన మైత్రేయుం డిట్లనియె. 93

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తన చేతన్; పూజితుండై= పూజించబడినవాడై; సుఖవిశ్రాంతుండు+ఐన= సుఖంగా విశ్రమించిన; మునివరునకు= ఋషిశ్రేష్ఠుడికి; ముకుళిత, హస్తుండు+ఐ= మొగిడ్చిన హస్తాలు కలవాడై అంటే, నమస్కరించినవాడై; భట్టారకా!= పూజనీయుడా!; ఎందు+ఉండి, వచ్చితిరి+అని+అడిగినన్= ఎక్కడ నుండి విచ్చేశా రని అడుగగా; అతనికి= ఆ ధృతరాష్ట్రుడికి; మైత్రేయుండు= మైత్రేయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: తనచే పూజించబడి విశ్రాంతి గైకొంటున్న మైత్రేయ మహర్షికి నమస్కరించి 'భట్టారకా! తా మెక్కడనుండి ఇక్కడకు దయచేశా?' రని ధృతరాష్ట్రుడు అడిగాడు. ధృతరాష్ట్రుడికి మైత్రేయుడు ఈ విధంగా బదులు పలికాడు.

చ. 'అలఘుతపోభరంబున జటాజినముల్ ధరియించి రూక్ష వ
ల్కలములు గట్టి కూరలును గాయలుఁ బండులు భోజనంబుగా
నలయక కామ్యకం బను మహావిపినంబున నున్న పాండవే
యులకడనుండి వచ్చితిఁ గురూత్తమ! నీసుతు నిన్నుఁ జూడఁగన్. 94

ప్రతిపదార్థం: అలఘు= గొప్పదైన; తపస్+భరంబున= తపస్సుయొక్క బరువుతో; జటా+అజినముల్= జడలు; తోళ్ళు; ధరియించి; రూక్ష వల్కలములు= కరకు మోటు నారబట్టలు; కట్టి; కూరలును; కాయలున్; పండులు; భోజనంబుగాన్= ఆహారంగా; అలయక= ఆయాసం పొందక; కామ్యకంబు+అను= కామ్యకం అనే పేరున్న; మహా విపినంబునన్= పెద్ద అడవిలో; ఉన్న; పాండవేయుల కడ నుండి= పాండవుల దగ్గరనుండి; కురు+ఉత్తమ!= కురువంశంలో ఉత్తముడైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; నిన్నున్= నిన్ను; నీ సుతున్= నీ కొడుకును; చూడఁగన్= చూడటానికి; వచ్చితిన్= వచ్చాను.

తాత్పర్యం: 'కురువంశంలో జనించిన ఉత్తముడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా! నిన్నును, నీ కుమారుడిని చూడటానికై నేను పాండవులకడనుండి వచ్చాను. వారు కామ్యకవనంలో తపోభారంచేత పెరిగిన జడలతో, మోటునారబట్టలు కట్టుకొని కాయలు, కూరలు, పండ్లు ఆహారంగా స్వీకరిస్తూ సమయపరిపాలన చేస్తున్నారు.

వ. ఏ నఖిలతీర్థదర్శనార్థంబు పరిభ్రమించుచుఁ గురుజాంగలంబున కరిగి యందుఁ గురుకులోత్తము లైన పాండుపుత్త్రులం జూచితి.' 95

ప్రతిపదార్థం: ఏను= నేను; అఖిల, తీర్థ, దర్శన+అర్థంబు= అన్ని దివ్యస్థలాలను చూడటానికై; పరిభ్రమించుచున్= తిరుగుతూ; కురుజాంగలంబునకు= కురుదేశానికి సమీపంలోని అరణ్యప్రదేశానికి; అరిగి= వెళ్ళి; అందున్= అక్కడ; కురు, కుల+ఉత్తములు+ఐన= కురువంశంలో శ్రేష్ఠులైన; పాండుపుత్త్రులన్; చూచితిన్= చూచాను.

తాత్పర్యం: నేను తీర్థయాత్రలు చేస్తూ కురుక్షేత్రానికి సమీపంలోని అరణ్యప్రదేశాలకు వెళ్ళి అక్కడ పాండవులను చూచాను.'

విశేషం: తీర్థశబ్దానికి వాచ్యార్థం నీరు. తీర్థయాత్రలు అనేచోట దివ్యదేశయాత్రలు అని లాక్షణికార్థం. బహు దివ్యస్థలాలు ప్రాయికంగా నదీతీరాలలో ఉండటంచేత తీర్థానికి అట్టి లాక్షణికార్థం ఏర్పడింది.

ఆ. అనిన నవనతాస్యుఁ డయి ధృతరాష్ట్రుఁ డి । ట్లనియె 'నెట్లు సెప్పుఁ డయ్య! యందుఁ
బాండవులకు సత్యభాషణులకుఁ గుశ । లంబె? వార లిట దలంతు రొక్కొ!' 96

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అవనత+ఆస్యుఁడు+అయి= వంచబడిన మొగం కలవాడయి; ధృతరాష్ట్రుఁడు; ఇట్లు+అనియెన్; ఎట్లు; చెప్పుఁడు+అయ్య; అందున్; సత్యభాషణులకున్= నిజం మాట్లాడే పాండవులకు; కుశలంబు+ఎ= క్షేమమా; వారలు; ఇట= ఇక్కడను గురించి (హస్తినాపురాన్ని గురించి); తలంతురు+ఒక్కొ= స్మరిస్తున్నారా!

తాత్పర్యం: అని మైత్రేయమహర్షి అనగా, ధృతరాష్ట్రుడు తలవంచుకొని 'అయ్యా! సత్యభాషణులగు పాండవులకు క్షేమమా? వారు ఇచటివారిని స్మరిస్తుంటారా?' - అని పలికినాడు.

క. 'అమితభుజశక్తి నంతక । సము లప్పాండుసుతు లిందు సౌభ్రాత్ర స్నే
హమునకు విచ్ఛేదముగా । సమయాతిక్రమము సేయ సమకట్టరుగా.' 97

ప్రతిపదార్థం: అమిత, భుజ, శక్తిన్= అంతులేని బాహుపరాక్రమంలో; ఆ+పాండు= సుతులు= ఆ పాండవులు; అంతక, సములు= యముడితో సమానులు; ఇందు, సౌభ్రాత్ర స్నేహమునకు= అన్నదమ్ముల ప్రేమకు - అంటే కౌరవ పాండవుల

మధ్యగల సోదరభావానికి; విచ్ఛేదముగా= భంగకరంగా; సమయ+అతిక్రమము= ప్రతిజ్ఞను మీరటం (అంటే పండ్రెండేండ్ల వనవాసం ఒక ఏడు అజ్ఞాతవాసం చేయకుండానే కౌరవులపై దండెత్తటం); చేయన్= చేయటానికి; సమకట్టరుగా= పూనరుకదా!

తాత్పర్యం: 'పరాక్రమంలో యముడితో సమానులైన పాండవులు కురు పాండవసోదరభావానికి విఘాతం కలిగేట్లుగా తాము లోగడ అంగీకరించిన సమయాన్ని మీరటానికి యత్నించరు కదా!'

వ. అనిన మైత్రేయుం డిట్లనియె. 98

తాత్పర్యం: అనగా మైత్రేయుడు ఈ విధంగా అన్నాడు.

చ. 'చనుదెంచి మహామునివరు । లనవరతము వారలకుఁ బ్రియం బొనరఁగ దీ
వన లీగిఁ జేసి కుశలమ । మనుజేశ్వర! వారు ధర్మమతియుతు లగుటన్. 99

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= ఓ రాజా!; మహాముని వరులు= మహర్షులు; చనుదెంచి= వచ్చి; అనవరతము= ఎల్లప్పుడు; ప్రియంబు+ఒనరఁగ= ప్రీతికలిగేటట్లు; వారలకున్= ఆ పాండవులకు; దీవనలు= ఆశీస్సులు; ఈగిన్, చేసి= ఇవ్వటం చేత; వారు= ఆ పాండవులు; ధర్మ, మతి, యుతులు+అగుటన్= ధర్మబుద్ధితో కూడినవారు కావటంచేత; కుశలము+అ= క్షేమమే.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి ప్రశ్నకు సమాధానంగా మైత్రేయుడు ఇట్లా అన్నాడు: 'ఓ రాజా! మహర్షులు నిరంతరం వచ్చి, ప్రియం కలిగేటట్లుగా పాండవులకు దీవనలు ఇవ్వటంచేత, వారు ధర్మబుద్ధితో కూడినవారు కావటం చేత, క్షేమంగా ఉన్నారు.

క. వారలు సమయము దప్పిన । వారిజరిపుహితుల గతు లవశ్యముఁ దప్పున్;
వారికి నకారణంబ ని । కారము నీ కొడుకు సేసెఁ గడు నహితుండై.' 100

ప్రతిపదార్థం: వారలు= ఆ పాండవులు; సమయము= ఒడంబడిక; తప్పిన= మీరితే; వారిజ, రిపు, హితుల, గతులు= చంద్ర సూర్యుల నడకలు (వారిజరిపుడు=చంద్రుడు, వారిజ హితుడు= సూర్యుడు ఇక్కడ 'వారిజ' శబ్దం రిపు-హిత శబ్దాలకు రెండింటికి అన్వయిస్తుంది); అవశ్యమున్= విధిగా; తప్పున్= తప్పుతాయి; వారికిన్= ఆ పాండవులకు; అకారణంబు+అ= ఎట్టికారణం లేకుండానే; నీకొడుకు= నీ పుత్రుడు (దుర్యోధనుడు); కడున్+అహితుండు+ఐ= మిక్కిలి శత్రుత్వం వహించినవాడై; నికారము= వంచన; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: పాండవులు చేసిన ప్రతిజ్ఞను మీరితే సూర్యచంద్రులే గతులు తప్పుతారు. అలాంటి వారిని నీ కొడుకు నిష్కారణంగా వైరం వహించి వంచించాడు.'

వ. అని దుర్యోధనుం జూచి 'యయ్యా! నీవు బుద్ధిగలవేనిఁ బాండవులతో విరోధం బుడుగు; మట్లయిన నీకును వారికిం గురుకులంబునకు లగ్గగు; నా పలుకుఁ జేకొనుము. 101

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; దుర్యోధనున్+చూచి= దుర్యోధనుడిని చూచి; అయ్యా; నీవు; బుద్ధి, కలవు+ఏనిన్= బుద్ధికలవాడివైతే; పాండవులతో; విరోధంబు= శత్రుత్వం; ఉడుగుము= మానుకొమ్ము; అట్లు+అయిన; నీకును; వారికిన్; కురు, కులంబునకున్= కౌరవవంశానికి; లగ్గు+అగు= మేలు చేకూరుతుంది; నా, పలుకున్= నా మాటను; చేకొనుము= స్వీకరించుము(అంగీకరించుము).

తాత్పర్యం: అని చెప్పి, మైత్రేయమహర్షి దుర్యోధనుడితో 'అయ్యా! బుద్ధిగలవాడవైతే నీవు పాండవులతో విరోధం విడనాడుము. అట్లయితే నీకూ, పాండవులకూ కురువంశానికీ మేలు కలుగుతుంది. నామాట వినుము.

సీ. వజ్రసంహనను లవార్యపరాక్రముల్ । పాండుకుమారు లాఖండలాభు
లందఱు నాగశతాయుతత్రాణు లు । గ్రాహవకాంక్షు లుత్సాహపరులు;
వారలలో బలవంతుండు బక హిడిం । బాసురు లనువారి నాసురమునఁ
జంపె, నాగాయుతసత్త్వు జరాసంధు । నెక్కటి యోర్చిన యక్కజుండు

తే. ఘోరవనమున వీరుఁ గిమ్మీరుఁ డను సు । రారి నిశ్చల ఘన భీకరాంగుఁ బట్టి
పోర వధియించినట్టి సమీరజునకు । భూరిభుజునకు మార్కొనువారుఁ గలరె? 102

ప్రతిపదార్థం: పాండుకుమారులు= పాండవులు; వజ్ర సంహననులు= వజ్రం వంటి శరీరం కలవారు; అవార్య, పరాక్రముల్= వారించశక్యంగాని పరాక్రమం కలవారు; ఆఖండల+ఆభులు= ఇంద్రుడితో సమానులు; అందఱు; నాగ, శత+అయుత, త్రాణులు= వంద పదివేల ఏనుగులతో సమానమైన శక్తి కలిగినవారు; ఉగ్ర+ఆహవ, కాంక్షులు= భయంకరమైన యుద్ధం చేసే కోరిక కలవారు; ఉత్సాహపరులు= (లోకోత్తర కృత్యాలు నిర్వహించటంలో) ఉత్సాహం కలవారు; వారలలో; బలవంతుండు= బలం కలవాడు; బక, హిడింబ+అసురులు+అనువారిన్= బకుడు, హిడింబుడు అనే రాక్షసులను; ఆసురమునన్= క్రూరత్వంతో (రాక్షస విధానంతో); చంపెన్= సంహరించాడు; నాగ+అయుత, సత్త్వు= పదివేల ఏనుగులయొక్క బలం కల వాడిని; జరాసంధున్; ఎక్కటి= ఒంటరిగా; ఓర్చిన= జయించిన; అక్కజుండు= అధికుడు; ఘోరవనమునన్= భయంకరమైన అడవిలో; వీరున్= వీరుడైనవాడిని; కిమ్మీరుఁడు+అను= కిమ్మీరుడు అనే; సుర+అరిన్= రాక్షసుడిని; నిశ్చల, ఘన భీకర+అంగున్= చలించని, మిక్కిలి భయంకరమైన శరీరం కలవాడిని; పట్టి= పట్టుకొని; పోరన్= యుద్ధంలో; వధియించినట్టి= చంపినట్టి; సమీరజునకు= వాయుపుత్రుడికి, భీముడికి; భూరి భుజునకు= గొప్ప భుజాలు కలవాడికి (మేటి పరాక్రమం కలవాడికి); మార్కొనువారున్= యుద్ధంలో ఎదిరించేవారు; కలరు+ఎ= ఉన్నారా? (లేరని భావం)

తాత్పర్యం: పాండవులు వజ్రశరీరులు, దేవేంద్రసములు, మహాపరాక్రమోపేతులు, ఉత్సాహవంతులు. అందరు పది లక్షల ఏనుగుల బలం కలవారు, భీకర యుద్ధమంటే కుతూహలపడే వారు. వారిలో మిగుల బలవంతుడైన భీముడు పదివేల ఏనుగులబలం కలిగిన జరాసంధుడిని ఒంటరిగా ఓడించి చంపిన అద్భుతవీరుడు. బక హిడింబ కిమ్మీరులను రాక్షసంగా చంపిన ఆ భీముడిని ఎదిరించగల యోధులు ఎక్కడ ఉన్నారు?

విశేషం: అలం: ఉపమ. ఎత్తుగీతిలో నన్నయ ప్రాసనియమాన్ని పాటించాడు.

మైత్రేయుఁడు దుర్యోధనుని శపించుట (సం. 3-11-27)

వ. వారికి వాసుదేవ ధృష్టద్యుమ్నులు సంబంధ సహాయులు; జరామరణవంతులైన మనుజులు వారింజెనకి యెట్లు జీవింతురు? నీవు వారితో నొడంబడియుండు; మిది కార్యం' బనిన మైత్రేయుపలుకు లాదరింపక పాదాంగుష్ఠంబున నేల వ్రాయుచు బాహు వెత్తి తొడలు సఱచి నగుచున్న యా దుర్యోధనుం జూచి, మైత్రేయుం డలిగి 'యీ యపరాధంబున నాహవంబగు నందు భీముగదాఘాతంబున నీ

యూరుయుగళంబు భగ్నం బయ్యెడు' మని శాపం బిచ్చిన వెఱచి ధృతరాష్ట్రుండు 'మునీంద్రా! యట్లు గాకుండం బ్రసాదింపు' మనిన నమ్మునివరుం డిట్లనియె. 103

ప్రతిపదార్థం: వారికి; వాసుదేవ, ధృష్టద్యుమ్నులు= శ్రీకృష్ణుడు, ధృష్టద్యుమ్నుడు; సంబంధ సహాయులు= చుట్టరికం చొప్పున సాయం చేసేవారు; జరా, మరణవంతులు+ఐన= ముసలితనం, చావు కలిగిన వారైన; మనుజులు= మనుష్యులు; వారిన్, చెనకి= వారిని ఎదిరించి; ఎట్లు= ఏ విధంగా; జీవింతురు= బ్రదుకగలరు?; నీవు; వారితో= ఆ పాండవులతో; ఒడంబడి, ఉండుము= అంగీకారం కుదుర్చుకొని ఉండుము; ఇది కార్యంబు= ఇది చేయదగిన పని; అనిన; మైత్రేయు పలుకులు= మైత్రేయుడి మాటలు; ఆదరింపక= లెక్కచేయక; పాద+అంగుష్ఠంబునన్= కాలి బొటనవ్రేలితో; నేలన్= భూమిపై; వ్రాయుచు; బాహువు= చేయి; ఎత్తి; తొడలు; చఱచి; నగుచున్న= నవ్వుతున్న; ఆ దుర్యోధనున్+చూచి= ఆ దుర్యోధనుడిని చూచి; మైత్రేయుండు; అలిగి= కోపించి; ఈ అపరాధంబున్= ఈ తప్పువలన; ఆహవంబు+అగున్= యుద్ధం దాపురిస్తుంది; అందు= ఆ యుద్ధంలో; భీము, గదా+ఆఘాతంబున= భీముడి గద యొక్క దెబ్బవలన; నీ+ఊరు, యుగళంబు= నీతొడలజంట; (ఊరు= తొడ, యుగళము= జంట); భగ్నంబు+అయ్యెడు= విరుగగలదు; అని; శాపంబు; ఇచ్చిన; వెఱచి= భయపడి; ధృతరాష్ట్రుండు; ముని+ఇంద్రా!= మునిశ్రేష్ఠా!; అట్లు; కాకుండన్; ప్రసాదింపుము+అనిన= ప్రసన్నుడ వగుము అనగా; ఆ, మునివరుండు= ఆ ఋషిశ్రేష్ఠుడు, ఆ మైత్రేయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: పాండవులకు చుట్టరికంవలన ఏర్పడిన అనుబంధంచేత శ్రీకృష్ణుడు, ధృష్టద్యుమ్నుడు తోడుపడగలరు. ముసలితనానికి చావుకు లోనయ్యే మానవమాత్రులు వారిని ఎదిరించి బ్రతుకలేరు. నీవు వారితో పొత్తు కుదుర్చుకొనటం మంచిది' - అని దుర్యోధనుడితో మైత్రేయుడు పలికాడు. దుర్యోధనుడు మైత్రేయుని మాటలను తిరస్కరిస్తూ, తన కాలి బొటనవ్రేలితో నేలపై వ్రాస్తూ, చేయెత్తి తన తొడలపై చరచి చప్పుడు చేస్తూ, మైత్రేయుడిని పరిహసించాడు. మైత్రేయుడు కోపగించుకొని 'ఈ అపరాధంవలన ఘోరయుద్ధం జరుగుతుంది అందులో భీమ గదాఘాతంవలన నీ తొడలు విరుగగల' వని శపించాడు. ఆ శాపానికి ధృతరాష్ట్రుడు భయపడి 'శాపాన్ని ఉపసంహరించు కొ'మ్మని ఆ మునీంద్రుడిని వేడుకొన్నాడు. అప్పుడు మైత్రేయుడు ఇట్లా పలికాడు.

తే. 'కడఁగి సమబుద్ధి వీనికిఁ గలిగె నేనిఁ । గాదు శాప ఫలం; బట్లు గాక బుద్ధి
హీనుఁడై గర్వితుం డగు నేని శాప । హవ్యవాహఫలంబు వీఁ డనుభవించు.' 104

ప్రతిపదార్థం: కడఁగి= పూని; సమబుద్ధి= సవ్యమైన బుద్ధి; వీనికిన్= ఈ దుర్యోధనునికి; కలిగెన్+ఏనిన్= ఏర్పడినట్లయితే; శాప, ఫలంబు, కాదు= శాపం ఫలించదు; అట్లు, కాక= సమబుద్ధి దుర్యోధనునికి ఏర్పడక; బుద్ధి హీనుఁడు+ఐ= బుద్ధిలేనివాడై, అంటే మూర్ఖుడై; గర్వితుండు+అగున్+ఏని= గర్వంకలవాడయితే; శాప, హవ్యవాహ, ఫలంబు= శాపమనే అగ్ని యొక్క ఫలితం (హవ్యమును వహించేవాడు హవ్యవాహుడు అంటే అగ్నిహోత్రుడు. హవ్యమంటే యజ్ఞంలో వ్రేల్చబడే ఆజ్యాది హోమద్రవ్యం); వీఁడు= ఈ దుర్యోధనుడు; అనుభవించున్= అనుభవిస్తాడు.

తాత్పర్యం: 'దుర్యోధనుడు పశ్చాత్తాపం పొంది, చేసిన దానికి వగచి, మంచి బుద్ధి ఏర్పరచుకొంటే ఈ శాపం వర్తించదు. అట్లా కాక, బుద్ధిలేనివాడై గర్వంతో ప్రవర్తిస్తే శాపాగ్నిఫలితం ఆతడు అనుభవిస్తాడు'.

విశేషం: అలం: రూపకం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని ప్రసన్నుండైన మైత్రేయునకు నాంబికేయుం డిట్లనియె. 105

ప్రతిపదార్థం: అని; ప్రసన్నుండు+ఐన= శాంతించిన; మైత్రేయునకున్; ఆంబికేయుండు= అంబిక పుత్రుడైన ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: శాంతించిన మైత్రేయమహర్షితో ధృతరాష్ట్రుడు ఇట్లా పలికాడు.

క. 'కిమ్మీరుం డను రక్కసు । డ మ్మారుతతనయుచేత నత్యుగ్ర వనాం
తమ్మున నిహతుండయిన వి । ధ మ్మెట్టులు సెప్పు మద్భుతం బిది' యనినన్. 106

ప్రతిపదార్థం: కిమ్మీరుండు+అను, రక్కసుఁడు= కిమ్మీరు డనే పేరుగల రాక్షసుడు; ఆ+మారుత, తనయుచేత= ఆ వాయు పుత్రుడైన భీముడిచేత; అతి+ఉగ్ర, వన+అంతమ్మునన్= మిక్కిలి భయంకరమైన వనంలోపల; నిహతుండు+అయిన, విధమ్ము+ఎట్టులు చెప్పుము= చంపబడినవిధానం ఎటువంటిదో చెప్పుము; ఇది; అద్భుతంబు= ఆశ్చర్యకరం; అనినన్= అని అనగా.

తాత్పర్యం: 'కిమ్మీరుడనే రాక్షసుడు భయంకరమైన అడవిలో భీముడిచేత సంహరించబడిన అద్భుతవృత్తాంతాన్ని వివరించు' మని ధృతరాష్ట్రుడు మైత్రేయమహర్షిని అడిగాడు.

వ. 'నా పలుకులు నీకొడుకు వినండయ్యె; నే నేల చెప్పెద? దీనిం బాండవసహాయులైన విప్రులచేత విదురుం డిమ్ముగా నెఱింగినవాఁ; డతనివలన విను' మని చెప్పి మైత్రేయుం డరిగినం, గిమ్మీరవధ కథాశ్రవణపరుండై తన్నడిగిన ధృతరాష్ట్రునకు విదురుం డిట్లనియె; నిందుండి చని పాండవులు మూఁడహోరాత్రంబులు నిరంతర ప్రయాణంబు సేసి, కామ్యకవనంబుఁ జొచ్చు వా రొక్కనాఁటి యర్ధరాత్రంబున రాక్షసప్రచారవేళయందుఁ బరిభ్రమించుచు రాక్షసమాయఁ గావించుచున్నవాని, నతినిశితదంష్ట్రాకరాళంబైన తన వదన గహ్వరంబుఁ దెఱచి గ్రుడ్లు మెఱవ(య) బభ్రుకేశంబులు దూల బాలార్క రశ్మియుతంబయిన బలాహకంబునుంబోలె సకల ప్రాణిభయజననంబుగా గర్జిల్లుచున్నవాని, నిజపాద ఘట్టిత మహీతల ప్రచలన వేగ వేల్లిత వల్లీ పల్లవ బాహు పరిరంభణసుఖంబుఁ బాదపంబుల కాపాదించుచున్నవాని నెదుర నొక్కరక్కసుం గని; రంత వాఁడును బ్రాహ్మణ సంఘంబు ముందటఁ గృష్ణాజినావృతులై వచ్చు పాండవుల దవ్వులం గని మార్గ నిరోధియై మహాపర్వతంబునుంబోలె నున్న, నదృష్ట పూర్వ ప్రమాణంబైన వాని దేహంబుఁజూచి నిమీలితనయన యయి దుశ్శాసన కరాకృష్ట వికీర్ణవేణీభరంబు వెనువెంట నొలయం బాంచాలి పంచపర్వతంబుల నడిమి నదియుంబోలెఁబతుల నడుమ భయవ్యాకుల చిత్తయైన నింద్రియంబులు విషయరతిం బరిగ్రహించు నట్టు లేవురు నక్కోమలిం బట్టుకొని భయపడకుండ నాశ్వాసించుచున్నంత. 107

ప్రతిపదార్థం: నా పలుకులు= నా మాటలు; నీకొడుకు; వినండు+అయ్యె; నేను+ఏల, చెప్పెద; దీనిన్= కిమ్మీర వధ వృత్తాంతాన్ని; పాండవ సహాయులు+ఐన= పాండవులకు సాయంగా నిలిచిన; విప్రులచేత= బ్రాహ్మణులచేత; ఇమ్ముగాన్= బాగుగా; విదురుండు= విదురుడు; ఎఱింగినవాఁడు= తెలిసికొన్నవాడు; అతనివలన= ఆ విదురుడివలన; వినుము+అని, చెప్పి; మైత్రేయుండు; అరిగినన్= వెళ్ళగా; కిమ్మీర, వధ, కథా, శ్రవణ, పరుండు+ఐ= కిమ్మీరుడిని చంపటం గురించిన వృత్తాంతం

వినటంలో ఆసక్తి కలవాడై; తన్ను (విదురుడిని); అడిగిన; ధృతరాష్ట్రునకు; విదురుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు; ఇందు+ఉండి= ఇక్కడినుండి; చని= వెళ్ళి; పాండవులు; మూఁడు+అహస్+రాత్రంబులు= మూడు పగళ్ళు, రాత్రులు; నిరంతర, ప్రయాణంబు, చేసి= ఎడతెగని ప్రయాణంచేసి; కామ్యక వనంబున్= కామ్యక మనే పేరుకల అడవిని; చొచ్చువారు= ప్రవేశించేవారు; ఒక్కనాఁటి= ఒక దినం; అర్ధరాత్రంబున= నడికిరేయి; రాక్షస, ప్రచార, వేళయందున్= రక్కసులు తిరుగాడే సమయంలో; పరిభ్రమించుచున్= ఇటునటు తిరుగుతూ; రాక్షస, మాయన్, కావించుచున్నవానిన్= రాక్షసులు కల్పించే మాయను చేస్తున్నవాడిని; అతి, నిశిత, దంష్ట్రా, కరాళంబు+ఐన= మిక్కిలి వాడి అయిన వెలికోరలతో భయాన్ని కలిగించేదయిన; తన, వదన, గహ్వరంబున్+తెఱచి= తన గుహవంటినోరును తెరిచి; గ్రుడ్లు, మెఱవ(య)= కంటిగుడ్లు ప్రకాశించగా; బభ్రుకేశంబులు= (పసుపు) పచ్చని వెంట్రుకలు (బట్టతలపక్క వెంట్రుకలు); తూలన్= కదలగా; బాల+అర్క, రశ్మి, యుతంబు+అయిన= ఉదయభానుడి కిరణాలతో కూడిన; బలాహకంబునున్+పోలెన్= మేఘంవలె; సకల, ప్రాణి, భయ, జననంబుగా= సర్వ ప్రాణులకు భయం కలిగేటట్లుగా; గర్జిల్లుచున్నవాని= పెద్దధ్వని చేస్తున్నవాడిని; (అలంకారం: ఉపమ); నిజ, పాద, ఘట్టిత, మహీతల, ప్రచలన, వేగ, వేల్లిత, వల్లీ, పల్లవ, బాహు, పరిరంభణ సుఖంబున్= తనయొక్క పాదాలచేత కొట్టబడిన భూప్రదేశం యొక్క కదలిక వేగంచేత చుట్టుకొనబడిన తీగల చిగురుటాకులనే చేతుల కౌగిలింతల సౌఖ్యాన్ని; పాదపంబులకు= చెట్లకు; ఆపాదించుచున్నవానిన్= కలిగిస్తున్నవాడిని (అలంకారం: రూపకం); ఎదురన్= ఎదురుగా; ఒక్క; రక్కసున్+కనిరి= రాక్షసుడిని చూచారు; అంత; వాఁడును= ఆ కిమ్మీర రాక్షసుడును; బ్రాహ్మణ, సంఘంబు, ముందటన్= బ్రాహ్మణ సమూహాల ముందు; కృష్ణ+అజిన+ఆవృతులు+ఐ= లేడిచర్మాలతో కప్పబడినవారై; వచ్చు= వస్తున్నట్టి; పాండవుల, దవ్వులన్+కని= దూరంనుండి చూచి; మార్గ, నిరోధి+ఐ= దారిని అడ్డగించినవాడై; మహా, పర్వతంబును+పోలెన్= గొప్ప కొండవలె; ఉన్న; అదృష్ట, పూర్వ, ప్రమాణంబు+ఐన, వాని, దేహంబున్+చూచి= లోగడ ఎన్నడూ చూడబడనంతటి కొలతలు కల వాడి దేహాన్ని చూచి; నిమీలిత, నయన+అయి= మూసికొన్న కనులుకలదై; దుశ్శాసన, కర+ఆకృష్ట, వికీర్ణ, వేణీ, భరంబు= దుశ్శాసనుడి చేతులచేత లాగబడి చెదరిన కొప్పుముడి; వెనువెంటన్+ఒలయన్= వెనువెంట వ్యాపించగా (కదలగా); పాంచాలి= ద్రౌపది; పంచపర్వతంబుల నడిమి, నదియున్+పోలెన్= ఐదు కొండల మధ్య ఉన్న ఏరువలె; పతులనడుమ= భర్తల మధ్య; భయ, వ్యాకుల, చిత్త+ఐనన్= భీతితో కలత చెందిన మనస్సు కలది కాగా; ఇంద్రియంబులు= (ఐదు) ఇంద్రియాలు; విషయ, రతిన్, పరిగ్రహించునట్టులు= ఇంద్రియార్థాల అనుభూతిని చేకొనేటట్లు; ఏవురున్= ఐదుగురును; ఆ+కోమలిన్= ఆ సౌకుమార్యం కలిగిన వనిత అయిన ద్రౌపదిని; పట్టుకొని; భయపడకుండన్; ఆశ్వాసించుచున్నంత= అనునయిస్తుండగా- (అలంకారం: ఉపమ).

తాత్పర్యం: 'నీ కొడుకు నా మాటలు వినలేదుకదా- నేనెందుకు చెపుతాను? కిమ్మీర సంహారగాథను విదురుడు పాండవులకు సాయంగా అరణ్యవాసం చేస్తున్న విప్రులచేత విన్నాడు. నీవు ఆ వృత్తాంతం విదురు నడిగి తెలుసుకొమ్ము' అని చెప్పి మైత్రేయమహర్షివెళ్ళాడు. విదురుడు ఆ వృత్తాంతాన్ని ధృతరాష్ట్రుడికి వివరించి చెప్పాడు. వనవాసగతులైన పాండవులు మూడు రాత్రులు, పగళ్ళు పయనించి కామ్యకవనం చేరుతున్నపుడు ఒకనాటి అర్ధరాత్రి లోగడ తా మెప్పుడూ చూడని కొలతలు కల దేహం కలవాడిని, వెలికోరలతో వెరపు పుట్టించే నోరు తెరిచి, కనుగుడ్లు ప్రకాశించగా, బట్టతల పక్క నున్న (పచ్చనైన) వెంట్రుకలు కదలి, ఉదయభానుడి కిరణాలతో వెలుగొందే మేఘంవలె గర్జిస్తున్నవాడిని, తన పాదాల తాకిడిచే భూమికంపించిన వేగానికి తీగల చిగురాకుచేతులతో చెట్లకు కౌగిలింతల సౌఖ్యం కలిగిస్తున్నవాడిని, ఒక రాక్షసుడిని చూశారు. ఆ కిమ్మీర రాక్షసుడు కూడ దూరంనుండి బ్రాహ్మణుల ముందు జింకతోలు ఉడుపులు ధరించి వస్తున్న పాండవులను చూచి వారిదారికి అడ్డుగా నిలిచాడు. ఆ రాక్షసుడిని చూచి ద్రౌపది భయకంపిత అయి కన్నులు మూసికొన్నది. దుశ్శాసనుడి చేతులచేత లాగబడి చెదరిన ఆమె కేశసమూహం వెనువెంట వ్యాపించింది. ఆ సమయంలో ఆమె ఐదుకొండల మధ్య ఉండే నదివలె భర్తలనడుమ మిగుల వ్యాకుల చిత్త అయింది. అపుడు పాండవులైదుగురును పంచేంద్రియాలు విషయరతిని పరిగ్రహించే రీతిగా ద్రౌపదిని పట్టుకొని సేదతీర్చారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పై రెండు ఉపమాలంకారాలు మిక్కిలి హృద్యాలయ్యాయి. పంచ పాండవుల మధ్య ద్రౌపది ఉపమేయం. ఐదుకొండల మధ్య ఉండే నది ఉపమానం. ఇది సారస్వత వేత్తలు మెచ్చుకొనే ఉపమ. ఇక పంచపాండవులు ద్రౌపదిని ఆశ్వాసించటం పంచేంద్రియాలు విషయరతిని పరిగ్రహిస్తున్నట్లు ఉన్నదనే ఉపమ వేదాంతులు మెచ్చుకొనేది. జ్ఞానేంద్రియాలు ఐదు: 1. శ్రోత్రం 2. త్వక్కు 3. చక్షువు 4. జిహ్వ 5. ఘ్రాణం. కర్మేంద్రియాలు ఐదు: 1. వాక్కు 2. పాణి 3. పాదం 4. పాయువు 5. ఉపస్థ. ఇంద్రియార్థాలు అంటే విషయాలు ఐదు: 1. శబ్దం 2. స్పర్శం 3. రూపం 4. రసం 5. గంధం. ఇందు శ్రోత్రంవలన శబ్దం, త్వక్కువలన స్పర్శం, చక్షువు వలన రూపం, జిహ్వవలన రసం, ఘ్రాణంవలన గంధం అనుభవించబడతాయి. పంచేంద్రియాలు-జ్ఞానేంద్రియాలుగాని, కర్మేంద్రియాలు గాని - విషయరతి నిబద్ధాలు కాబట్టి పంచపాండవులు ద్రౌపదిని ఆశ్వాసించటం వేదాంతవేద్యమైన ఉపమ అయింది.

క. రక్షోఘ్నమంత్రముల నా । రాక్షస మాయాపరిస్ఫురణఁ జెఱిచెఁ గ్రియా
దక్షుఁడు ధౌమ్యుఁడు పాండవు । లీక్షించుచు నుండఁగా నహీనప్రతిభన్. 108

ప్రతిపదార్థం: పాండవులు+ఈక్షించుచున్+ఉండఁగాన్= పాండవులు చూస్తుండగా; క్రియాదక్షుఁడు= కార్యశూరుడైన; ధౌమ్యుఁడు; రక్షస్+ఘ్న, మంత్రములన్= రక్కసులను సంహరించే మంత్రాలచేత; అహీన, ప్రతిభన్= గొప్ప ప్రతిభతో; ఆ రాక్షస, మాయా, పరిస్ఫురణన్; చెఱిచెన్= ఆ రాక్షసుడికి సంబంధించిన మాయల విజృంభణాన్ని భంగం చేశాడు.

తాత్పర్యం: ప్రతిక్రియలో దక్షుడైన ధౌమ్యుడు పాండవులు చూస్తుండగా గొప్ప ప్రతిభతో రాక్షసులను ఛేదించే మంత్రాలచేత ఆ రాక్షసుడి మాయావిజృంభణాన్ని భగ్నం చేశాడు.

వ. అంత. 109

తాత్పర్యం: అప్పుడు.

క. ప్రతివిహితమాయు నత్యా । యతభుజయుతుఁ గోపఘూర్ణితారుణ విస్ఫా
రితనేత్రు నసురఁ జూచి భ । రతకులవర్ధనుఁడు ధర్మరా జిట్లనియెన్. 110

ప్రతిపదార్థం: ప్రతివిహితమాయున్= నిరోధించబడిన మాయకలవాడిని - అంటే తన మాయ వ్యర్థమైనవాడిని; అతి+ఆయత, భుజ, యుతున్= మిక్కిలి పొడుగైన భుజాలు కలవాడిని - అంటే ఆజానుబాహుడిని; కోప, ఘూర్ణిత+అరుణ, విస్ఫారిత, నేత్రున్= ఆగ్రహంచేత తిరుగుడువడి ఎర్రనై పెద్దవైన కన్నులు కలవాడిని; అసురన్= రాక్షసుడిని; చూచి; భరత కుల వర్ధనుఁడు= భరతవంశాన్ని వృద్ధిలోనికి తెచ్చేవాడు; ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: తనమాయ నిరోధించబడటం వలన కలిగిన, కోపంచేత తిరుగుడు పడుతున్న ఎర్రని కన్నులు గల ఆ రాక్షసుడిని చూచి ధర్మరాజు ఈ విధంగా పలికాడు.

వ. 'నీ వెవ్వరి వాఁడ? వెవ్వండ? వివ్వనంబున నేల యున్న వాఁడ? వనిన వాఁ డి ట్లనియె. 111

ప్రతిపదార్థం: నీవు+ఎవ్వరివాఁడవు= నీవు ఎవరికి సంబంధించినవాడివి; ఎవ్వండవు= ఎవడివి; ఈ+వనంబునన్= ఈ అడవిలో; ఏల= ఎందుకు; ఉన్నవాఁడవు; అనిన; వాఁడు+ఇట్లు+అనియె.

తాత్పర్యం: 'నీవు ఎవడివి? నీవా ళ్ళెవరు? ఈ అడవిలో ఎందుకు ఉన్నావు?' అని ధర్మరాజు అడుగగా ఆ రాక్షసుడు ఇట్లా అన్నాడు.

క. 'ఏను బకాసురు ననుజుఁడ, । గీనాశుఁడ మానవులకుఁ, గిమ్మీరుఁ డనం
గా నెగడుదు నీ కామ్యక । కాననమున సర్వసత్త్వఖాదనబుద్ధిన్. 112

ప్రతిపదార్థం: ఏను= నేను; బక+అసురు+అనుజుఁడన్= బకుడనే రాక్షసుడి తమ్ముడిని; మానవులకున్= నరులకు; కీనాశుఁడ= యముడిని; కిమ్మీరుఁడు+అనంగా= కిమ్మీరుడనే నామధేయంతో; నెగడుదు= వర్ధిల్లుతుంటాను; ఈ కామ్యక కాననమున= కామ్యకమనే ఈవనంలో; సర్వసత్త్వ ఖాదనబుద్ధిన్= సమస్త జంతువులను తినే సంకల్పంతో (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: 'నేను బకుడనే రాక్షసుడి తమ్ముడిని. నరులపాలిటి యముడిని. కిమ్మీరుడనే పేరుతో వర్ధిల్లుతుంటాను. సర్వప్రాణులను సంహరించి తినే కోరికతో ఈ అడవిలో (విడువక ఉంటాను).

క. పాయక యుండుదు, రాక్షస । మాయల సమరంబు సేసి మనుజుల విగతో
పాయులఁ జంపుచు భక్షణ । సేయుదు, నమరాదులకు నజేయుఁడఁ బోరన్. 113

ప్రతిపదార్థం: పాయక+ఉండుదు= విడువక ఉంటాను; రాక్షస మాయలన్= రాక్షసుల యొక్క మాయలతో; సమరంబు+చేసి= యుద్ధం చేసి; విగత+ఉపాయులన్+చేసి= పోయిన ఉపాయాలు కల; మనుజులన్= మానవులను; అంటే యుక్తి విహీనులైన అని అర్థం; చంపుచు= సంహరిస్తూ; భక్షణ+చేయుదున్= తింటుంటాను; పోరన్= యుద్ధంలో; అమర+ఆదులకున్= దేవతలు మొదలైన వారికి; అజేయుఁడన్= గెలువరాని వాడిని.

తాత్పర్యం: (సకల జంతువులను చంపి తినే బుద్ధితో ఈ కామ్యకవనంలో) విడువక నివసిస్తూ ఉంటాను. మాయా యుద్ధంలో మనుష్యులను యుక్తిహీనులను చేసి సంహరించి భక్షిస్తూ ఉంటాను. దేవతలు మొదలైన వారు కూడా యుద్ధంలో నన్ను గెలువలేరు.

విశేషం: పై 112వ పద్యంలోని చివరి భాగం (సర్వసత్త్వఖాదనబుద్ధిన్) 113వ పద్యంలోని మొదటి భాగం (పాయకయుండుదు)తో అన్వయిస్తూ ఉంది. ఇట్లా రెండు పద్యాల నడుమ ఏర్పడే వాక్యాన్వయాన్ని 'కులక'మని అంటారు. ఆంధ్రవాఙ్మయంలో ఇటువంటి అన్వయక్రమానికి నన్నయ రచనయే మార్గదర్శకమైంది.

వ. నాకు వెఱచి యెల్లవారును దూరంబున దీనిం బరిహరింతురు; మీ రెవ్వ? రిందుల కేల వచ్చితిరి? మిమ్ము వధియించి యిపుడు భక్షించెద' ననిన వానికి యుధిష్ఠిరుం డిట్లనియె. 114

ప్రతిపదార్థం: నాకు, వెఱచి= నాకు భయపడి; ఎల్లవారును= అందరును; దూరంబున= దూరంనుండి; దీనిన్= ఈ కామ్యక వనాన్ని; పరిహరింతురు= విడిచిపెట్టుతారు; మీరు+ఎవ్వరు; ఇందులకు+ఏల; వచ్చితిరి; మిమ్ము; వధియించి= చంపి; ఇప్పుడు; భక్షించెదన్= తింటాను; అనిన; వానికి= ఆ రాక్షసుడికి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: నాకు భయపడి అందరు కామ్యకవనానికి రాకుండా దూరంగా ఉంటారు. మీరు ఎవ్వరు? ఎందుకు ఇక్కడికి వచ్చారు? మిమ్ములను చంపి భక్షిస్తాను' అని కిమ్మీరుడు పలుకగా ధర్మరాజు ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'యిపుడు భక్షించెద' - అనే పాఠాంతరం వావిళ్లప్రతిలో ఉన్నది.

ఆ. 'ఏను ధర్మసుతుఁడ, నీతఁడు భీముండు, । వాఁడు విజయుఁ, డల్లవారు గవలు;
పాండవులము సమయపడి వనవాసంబు । సేయ వచ్చితిమి విశేషయుక్తి.' 115

ప్రతిపదార్థం: ఏను= నేను; ధర్మసుతుఁడన్= ధర్మరాజును; ఈతఁడు, భీముండు; వాఁడు; విజయుఁడు= అర్జునుడు; అల్లవారు= అదిగో అక్కడ ఉన్నవారు; కవలు= జంటబిడ్డలు (నకుల సహదేవులు); పాండవులము; సమయపడి= ఒప్పందం చేసికొని; వనవాసంబు+చేయన్= అడవిలో ఉండటానికై; విశేషయుక్తి= ప్రత్యేకమైన కారణంచేత; వచ్చితిమి= అరుదెంచాం.

తాత్పర్యం: 'నేను ధర్మరాజును. ఇతడు భీముడు. అతడు అర్జునుడు. వారు కవలు నకుల సహదేవులు. మేం పాండవులం. విశేషకారణంచేత ఒడంబడిక ప్రకారం వనవాసం చేయటానికి వచ్చాం'

సీ. అనవుడు రాక్షసుం డట్టహాసంబుతో । 'నెట్టెట్టు! భీముండె యీతఁ? డేమి
పుణ్యమో వీని నెప్పుడు సంపఁగాంతునో । యని యున్నచోఁ దాన యరుగు దెంచె;
నధికు మా యన్న బకాసురు, నా యిష్ట । సఖు హిడింబాసురుఁ జంపి యున్న
ఖలు మ్రింగి జీర్ణంబు గావింతు వాతాపిఁ । దడయక మ్రింగిన తపసి యట్ల'

ఆ. యనిన రక్కసునకు నలిగిన యగ్రజు । నలుక యెఱిఁగి వీరుఁ డర్జునుండు
మొనసి గాండివంబు మోపెట్టె; సునిశిత । ఖడ్గపాణులైరి కవలు నంత. 116

ప్రతిపదార్థం: అనవుడు= అని చెప్పగా; రాక్షసుండు= ఆ కిమ్మీరుడు; అట్టహాసంబుతోన్= పెద్దవెడనవ్వుతో; ఎట్టెట్టు (ఎట్టు+ఎట్టు)= ఎట్ల, ఎట్ల?; భీముండె= భీముడా!; ఈతఁడు; ఏమి పుణ్యమో= ఏ పుణ్యంవలననో; వీనిన్+ఎప్పుడు, చంపన్, కాంతునో= వీడిని ఎప్పుడు చంపగలనా?; అని; ఉన్నచోన్= ఎదురుచూస్తుంటే; తాను+అ= తానే; అరుగుదెంచెన్= వచ్చాడు; అధికు, మా అన్న బకాసురున్= గొప్పవాడైన మా అన్న బకాసురుడిని; నా+ఇష్ట, సఖున్= నా ప్రియమిత్రుడు; హిడింబ+అసురున్= హిడింబుడనే రాక్షసుడిని; చంపి+ఉన్న= లోగడ సంహరించిన; ఖలున్= నీచుడిని; మ్రింగి= తిని; జీర్ణంబు, కావింతున్= అరిగించుకొంటాను; వాతాపిన్= వాతాపి అనేవాడిని; తడయక= ఆలస్యం చేయక; మ్రింగిన= తినిన; తపసియట్లు+అ= ఋషివలె (అగస్త్యుడి వలె); అనిన; రక్కసునకున్+అలిగిన= రాక్షసుడిపై కినుక వహించిన; అగ్రజు+అలుక= అన్నగారికోపం; ఎఱిఁగి= గ్రహించి; వీరుఁడు; అర్జునుండు; మొనసి= పూని; గాండివంబు= గాండీవం అనే పేరుకల విల్లు; మోపెట్టెన్= ప్రయోగించటానికి సంసిద్ధమయ్యాడు; కవలున్= (నకుల సహదేవులు); అంత; సునిశిత= ఎక్కువవాడి కల; ఖడ్గపాణులు+ఐరి= కత్తులు ధరించారు.

తాత్పర్యం: అని ధర్మజుడు చెప్పగా, కిమ్మీరుడు ఉద్రేకాన్ని పొంది వెడనవ్వునవ్వుతూ 'ఏమీ నా అన్నఅయిన బకుడిని, నా ప్రియమిత్రుడైన హిడింబుడిని చంపిన భీముడు వీడేనా? ఎంతటి పుణ్యం? వీడిని ఎప్పుడు చంపగలనా? అని నేను ఇంతకాలం నుండి ఎదురు చూస్తుండగా వీడే నేడు నాకు తారసిల్లాడు. ఇక వీడిని చంపి, అలనాడు అగస్త్యమహర్షి వాతాపిని జీర్ణం చేసికొన్నట్లు నేడు నేను వీడిని అరిగించుకొంటాను' అని అట్టహాసం చేశాడు. ఆ మాటలకు అన్న అయిన ధర్మరాజుకు వచ్చిన ఆగ్రహాన్ని గుర్తించి వీరుడైన అర్జునుడు గాండీవాన్ని ఎక్కుపెట్టాడు. కవలు వాడికత్తులు దూశారు.

విశేషం: అలం: ఉపమ. వాతాపిగాథ ఇక్కడ ప్రస్తావించబడింది. రామాయణ మహాభారతాదుల్లో ఈ గాథ సుప్రసిద్ధమైనది. ఇల్వలుడు వాతాపి అన్నదమ్ములు. ఇల్వలుడు మేకరూపం దాల్చిన వాతాపిని చంపి ఆ మాంసంతో ఆర్యఋషులకు అతిథి భోజనం కల్పిస్తూ ఉండేవాడు. భోజనానంతరం ఇల్వలుడు వాతాపిని గొంతెత్తి పిలవటంతో వాతాపి పునర్జీవితుడై అతిథుల పొట్టలు చీల్చుకొని బయట పడేవాడు. అన్నదమ్ము లిరువురు తిరిగి అతిథిమాంసాన్ని భుజిస్తూ ఉండేవారు. ఒకనాడు అగస్త్యమహర్షి ఇల్వలుడికి అతిథిగా విచ్చేశాడు. భోజనానంతరం ఇల్వలుడు గొంతెత్తి వాతాపిని పిలిచాడు కాని అగస్త్యుడు తన పొట్ట నిమిరి వాతాపి జీర్ణమయ్యాడని వచించాడు. అంతటితో వాతాపిజీవితం పరిసమాప్తం అయింది. (చూ. ఆరణ్యపర్వం-ద్వితీయాశ్వాసం).

కిమ్మీరుఁడను రాక్షసుఁడు భీముచేఁ జచ్చుట. (సం. 3-12-42)

ఉ. **ఘోరపరాక్రముల్ ప్రబలకోపపరుల్ పృథుసారభూరిభూ**
మీరుహపాణు లుద్ధతు లమిత్రవిఘాతులు వీరబృందబృం
దారకు లార్చు చొండొరులఁ దాఁకిరి దారుణభంగిఁ బొంగి కి
మ్మీర సమీరసూనులు సమీరవిధూతపయోధులట్ల యై. 117

ప్రతిపదార్థం: ఘోర, పరాక్రముల్= భయంకరమైన శౌర్యం కలవారు; ప్రబల, కోప, పరుల్= ఎక్కువ కోపం పొందినవారు; పృథు, సార, భూరి, భూమీ, రుహ, పాణులు= ఎక్కువ చేవ గలిగిన పెద్దవైన చెట్లు చేతులలో కలవారు; ఉద్ధతులు= గర్వించినవారు; అమిత్ర, విఘాతులు= శత్రువులను సంహరించేవారు; వీర, బృంద, బృందారకులు= వీరుల సమూహాలలో దేవతలవంటివారు (శ్రేష్ఠులు); కిమ్మీర, సమీర సూనులు= కిమ్మీరుడున్నూ, భీముడున్నూ; ఆర్చుచు= పెడబొబ్బలు పెట్టుతూ; సమీర, విధూత, పయోధులు+అట్ల+ఐ= పెనుగాలిచేత కలచబడిన సముద్రాల వలె; పొంగి= ఉబ్బి; దారుణభంగిన్= భయంకర రీతిగా; ఒండొరులన్= పరస్పరం; తాఁకిరి= ఢీకొన్నారు;

తాత్పర్యం: భయంకరమైన పరాక్రమంగల కిమ్మీరుడున్నూ, భీముడున్నూ మిక్కిలి ఉగ్రులై, చేవకలిగిన పెద్ద చెట్లు చేత పట్టుకొని పెడబొబ్బలు పెట్టుతూ పెనుగాలిచేత కలచబడిన సముద్రాలవలె గర్వంతో ఉప్పొంగి, భయంకరంగా ఒకరి నొకరు ఢీకొన్నారు.

విశేషం: అలం: ఉపమ. వృత్తరచనలో నన్నయ అర్వాచీనకవులకు ప్రసాదించిన ఒజ్జబంతులలో ఈ పద్యాన్ని ఎన్నుకోవచ్చును. రేఫ ప్రాసాన్ని పూర్వోత్తరపాదాలలోనిప్రాసస్థానాలలో - భూమీరుహ, బృందారక, కిమ్మీర పదాలతో గొలుసుకట్టుగ అను సంధించటం గమనించదగింది. శబ్దాలంకారం- ఛేకానుప్రాసం.

తరలము.
పొరిని వారల చేతి యున్నతభూరుహాయుధముల్ పర
స్పర కఠోరశిరస్స్థలంబులపై వడిం బడి మత్తకుం
జర శిరఃపతితంబులైన లసన్మృణాలములట్ల జ
ర్జరిత మయ్యెఁ దదారవప్రతిశబ్ద మొప్ప నభంబునన్. 118

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పొరిని= వరుసగా; వారల, చేతి, ఉన్నత, భూరుహ+ఆయుధముల్= వారి చేతులలో ఉన్న పెద్ద చెట్లు అనే పోటు ముట్టులు, (అంటే ఆయుధాలవలె ప్రయోగిస్తున్న చెట్లు); పరస్పర, కఠోర, శిరస్, స్థలంబులపై= ఒండొరుల గట్టి తలలపై; వడిన్+పడి= వేగంగాపడి; మత్త, కుంజర, శిరః, పతితంబులు+ఐన= మదపుటేనుగుల తలలపైపడిన; లసత్+మృణాలములు+అట్ల+అ= సుకుమారమైన తామరతూండ్లవలె; జర్జరితము+అయ్యెన్= ముక్కలు ముక్కలు అయ్యాయి (శిథిలమయ్యాయి); నభంబునన్= ఆకసంలో; తద్+ఆరవ, ప్రతిశబ్దము+ఒప్ప= ఆ శబ్దాల ప్రతిధ్వని ఒప్పగా.

తాత్పర్యం: భీముడూ, కిమ్మీరుడూ తలపడగా వారు ఆయుధాలుగా ప్రయోగించిన పెద్ద పెద్ద చెట్లు మదపుటేనుగుల కుంభస్థలాలపై పడిన తామరతూండ్లవలె వారి శిరస్సులపై వేగంగా పడి ముక్కలు ముక్కలుగా అయ్యాయి. ఆ ధ్వనులు ఆకసంలో ప్రతిధ్వనించాయి.

విశేషం: అలం: ఉపమ. నన్నయ కవితాశిల్పానికి విశిష్టమైన లక్షణమైన అక్షరరమ్యత ఈ పద్యంలో కానవస్తున్నది. ఈ వృత్తంలోని ప్రతిపాదంలోనూ న,భ,ర,స,జ,జ,గ అనే గణాలు వరుసగా ఉంటాయి. 12వ అక్షరంతో యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

వ. ఇ ట్లొక్క ముహూర్తంబు వృక్షయుద్ధంబు సేసి యాసన్నమహీరుహంబులు సమసిన నయ్యిద్దఱు శిలాయుద్ధంబునకుఁదొడంగి చేయునెడం బవనజనిక్షిప్త నిష్ఠుర శిలాహత హృదయుండై భానుంబట్టుకొను స్వర్భానుండునుం బోలెఁ గిమ్మీరుండు భీముం బట్టుకొనిన భీముండును వాని హీనబలుంగా నెఱింగి కృతాంతదండానుకారంబులైన తన బాహుదండంబుల నమ్మనుజకంటకు కటి కంఠ ప్రదేశంబులు పట్టుకొని నేలంబెట్టి దేహయష్టి విఱిచి బకుం జంపిన విధంబునఁ గిమ్మీరు విగతప్రాణుం జేసి. 119

ప్రతిపదార్థం: ఇట్లు+ఒక్క, ముహూర్తంబు= ఈ విధంగా రెండు గడియల సేపు; వృక్షయుద్ధంబు+చేసి= చెట్లు ఆయుధాలుగా ఉపయోగించి పోరాటం చేసి; ఆసన్న మహీరుహంబులు= సమీపంలోని చెట్లు; (మహీ, రుహములు= భూమినుంచి పుట్టినవి - చెట్లు అని రూఢ్యర్థం ఏర్పడింది); సమసినన్= నశించగా; ఆ+ఇద్దఱు= ఆ ఇరువురు; శిలా, యుద్ధంబునకున్+తొడంగి= శిలలు ఆయుధాలుగా పోరాటం చేయటానికి పూనుకొని; చేయు+ఎడన్= పోరు సల్పేటప్పుడు; పవనజ, నిక్షిప్త, నిష్ఠుర, శిలా+ఆహత, హృదయుండు+ఐ= వాయుసుతుడగు భీముడిచేత విసరబడిన కరకురాళ్ళ దెబ్బలచేత కొట్టబడిన గుండె కలవాడై; భానున్+పట్టుకొను= సూర్యుడిని పట్టుకొనే; స్వర్+భానుండునున్+పోలెన్= రాహువువలె; కిమ్మీరుండు; భీమున్; పట్టుకొనిన; భీముండును; వానిన్= ఆ కిమ్మీరుడిని; హీన బలున్+కాన్= తరిగిన బలం కలవాడినిగా; ఎఱింగి= తెలిసికొని; కృతాంత, దండ+అనుకారంబులు+ఐన= యముడి దండాన్ని అనుకరించేవైన (అంటే ఇతరుల ప్రాణాలు తీయటానికి సమర్థాలైన); తన బాహు దండంబులన్= దండాల వంటి తన భుజాలచేత; ఆ+మనుజకంటకు= మనుష్యులను ముల్లువలెబాధించేవాడి యొక్క, ఆ రాక్షసుడి యొక్క; కటి, కంఠ, ప్రదేశంబులు= మొల, కుత్తుక భాగాలు, పట్టుకొని; నేలన్+పెట్టి= భూమిపై పడద్రోసి; దేహయష్టి= కర్రవంటి శరీరాన్ని; విఱిచి; బకున్+చంపిన, విధంబునన్= బకుడిని చంపిన రీతిగా; కిమ్మీరున్; విగతప్రాణున్+చేసి= పోయిన ప్రాణాలు కలవాడినిగా చేసి, అంటే చంపి.

తాత్పర్యం: ఈ విధంగా వారు రెండుగడియలు పోరాడారు. చెట్లతో కొట్టుకొన్నారు. దగ్గరలోని చెట్లు నశించిన తర్వాత రాళ్ళతో కొట్టుకొన్నారు. అంత కిమ్మీరుడు రాహువు సూర్యుడిని పట్టుకొన్నట్లు భీముడిని పట్టుకొన్నాడు. భీముడు వాడిని హీనబలుడిగా గుర్తించి ఆ రక్కసుడి మొలను, కంఠాన్ని పట్టుకొని నేలపై పడవేసి, బకుడిని చంపిన విధంగానే (మోకాలితో) వాడిదేహాన్ని విరుగబొడిచి వధించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ.

తే. **'బక హిడింబులు హతులైనఁ బనవి పనవి । యఱచి శోకింపఁ గానక యమపురమున**
కరిగి తక్కట రాక్షస!' యనుచుఁ దెరువు । వాయఁ బావని దత్కళేబరము వైచె. **120**

ప్రతిపదార్థం: బక హిడింబులు, హతులు+ఐనన్= బకుడు, హిడింబుడు మరణించగా; పనవి, పనవి= ప్రలాపించి; అఱచి, శోకింపన్+కానక= బిగ్గరగా దుఃఖించలేక (కానక= ఊరట చెందక); యమపురమునకు+అరిగితి+అక్కట= నరకానికి పోయావుకదా!; రాక్షస= ఓ రాక్షసుడా!; అనుచున్= అని పలుకుతూ; తెరువు+పాయన్= దారి నుంచి తొలగేటట్లు; పావని= వాయుసుతుడైన భీముడు; తద్‌కళేబరము= ఆతని దేహాన్ని; వైచెన్= విసిరివేశాడు.

తాత్పర్యం: 'బకుడు, హిడింబుడు చనిపోయారని మిక్కిలి దుఃఖించి, ఓ రాక్షసుడా! నీవు కూడ వారిని కలిసికొనటానికి నరకానికి పోయావు కదా!' అని భీముడు కిమ్మీరుడి కళేబరాన్ని దారి కడ్డం లేకుండా దూరంగా విసిరి వేశాడు.

విశేషం: 'శోకించి కానక'- అనే పాఠాంతరం ఒకానొక ప్రతిలో ఉన్నది.

వ. **ఇట్లు ధర్మరాజువచనంబునఁ గిమ్మీరు నశ్రమంబున వధియించి తద్వనవాసులకు రాక్షసభయం బుడిపిన మహావీరు నమ్మారుతాత్మజు ధర్మార్జుననకులసహదేవులును ధౌమ్యాది మహీసురవరులును బ్రశంసించి' రని విదురుండు గిమ్మీరువధ సెప్పిన విని ధార్తరాష్ట్రులకు హృదయదలనం బయ్యె; నిట పాండవులు గామ్యక వనంబున నుండు నంత.** **121**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ధర్మరాజు వచనంబునన్= ధర్మరాజు మాటవలన; కిమ్మీరున్; అశ్రమంబునన్= శ్రమలేకుండ; వధియించి= చంపి; తద్+వనవాసులకున్= ఆ అడవిలో నివసించే వాళ్ళకు; రాక్షసభయంబు+ఉడిపిన= రాక్షసుడివలన కలిగిన భీతిని పోగొట్టగా; మహావీరున్= గొప్పవీరుడిని; ఆ+మారుత+ఆత్మజు= ఆ వాయునందనుడిని అంటే భీముడిని; ధర్మ+అర్జున, నకుల, సహదేవులును; ధౌమ్య+ఆది, మహీసురవరులును= ధౌమ్యుడు మున్నగు బ్రాహ్మణ శ్రేష్ఠులును; ప్రశంసించిరి= పొగిడారు; అని; విదురుండు; కిమ్మీరువధ= కిమ్మీరుడి సంహారాన్ని; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; ధార్తరాష్ట్రులకు= ధృతరాష్ట్రుడి కొడుకులకు; హృదయదలనంబు+అయ్యెన్= గుండె వ్రయ్యలయింది; ఇట= ఇక్కడ; పాండవులు= పాండురాజు కొడుకులు; కామ్యక, వనంబునన్= కామ్యకం అనే పేరుకల అడవిలో; ఉండు+అంత= ఉండగా.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజుమాటచొప్పున కిమ్మీరుడు అనే రాక్షసుడిని సులువుగా సంహరించి, ఆ కామ్యకవనంలో నివసించే వాళ్ళకు రాక్షసభయాన్ని పోగొట్టిన వాయుసుతుడైన భీముడిని ధర్మరాజు, అర్జునుడు, నకులసహదేవులు, ధౌమ్యుడు మున్నగు విప్రులు పొగిడారు'- అని విదురుడు కిమ్మీరవధగాథ చెప్పగా వినిన ధృతరాష్ట్రుడి కొడుకులకు గుండెలు పగిలాయి. ఇక్కడ పాండవులు కామ్యకవనంలో నివసిస్తున్నారు. అంతట.

యాదవ పాంచాలాదులు పాండవులకడ కేతెంచుట (సం. 3-13-1)

సీ. **వసుమతీరాజ్యంబువలన నిరస్తులై । మునివృత్తి నత్యుగ్రవనములోన**
నవయుచుఁ బాండుభూనాథనందను లున్న । వారని విని యతిక్రూరమతుల

ధృతరాష్ట్రసుతుల నిందించుచుఁ బాంచాల । యాదవ వృష్ణి భోజాంధు లెల్ల
నచ్యుత ప్రముఖులై యప్పాండవుల కడ । కేతెంచి శోకపరీతు లగుచు

ఆ. నున్న నధికధర్మయుక్తుఁ డుపేంద్రుండు । నికృతిఁ జేసి పాపనియతబుద్ధిఁ
బాండవులకు న ట్లపాయంబు సేసిన । ధార్తరాష్ట్రులకును దద్ద యలిగి. 122

ప్రతిపదార్థం: వసుమతీ, రాజ్యంబువలన, నిరస్తులు+ఐ= భూరాజ్యంనుండి వెళ్ళగొట్టబడినవారై; మునివృత్తిన్= ఋషుల నడవడితో; అతి+ఉగ్ర, వనములోన= మిక్కిలి ఘోరమైన అడవిలో; నవయుచున్= బాధపడుతూ; పాండు, భూనాథ, నందనులు+ఉన్నవారు+అని, విని= పాండురాజు కొడుకులు నివసిస్తున్నారని విని; అతి క్రూరమతుల= ఎక్కువగా ఇతరులను పీడించే బుద్ధి కలవారయిన; ధృతరాష్ట్ర సుతుల= ధృతరాష్ట్రుడి కొడుకులను; నిందించుచున్= తెగడుతూ; పాంచాల, యాదవ, వృష్ణి, భోజ+అంధులు+ఎల్లన్= పాంచాలులు, యాదవులు, వృష్ణులు, భోజులు, అంధులు(అంధకులు) అనే తెగలవారు అందరు; అచ్యుత ప్రముఖులు+ఐ= శ్రీకృష్ణుడిని ముందు పెట్టుకొన్నవారై; ఆ+పాండవుల, కడకు+ఏతెంచి= ఆ పాండవుల దగ్గరకు వచ్చి; శోక, పరీతులు+అగుచున్= దుఃఖంచేత చుట్టుకోబడినవారై; ఉన్నన్= ఉండగా; అధిక, ధర్మ, యుక్తుఁడు= ఎక్కువైన ధర్మంతో కూడిన; ఉపేంద్రుఁడు= శ్రీకృష్ణుడు; నికృతిన్+చేసి= మోసంచేసి; పాప, నియత, బుద్ధిన్= పాపంతో కూడిన బుద్ధితో; పాండవులకున్+అట్లు; అపాయంబు+చేసిన= కీడుచేసిన; ధార్తరాష్ట్రులకును= ధృతరాష్ట్రుడి కొడుకులపట్ల; తద్ద= మిక్కిలి; అలిగి= కోపగించి.

తాత్పర్యం: రాజ్యాన్ని కోల్పోయి భయంకరమైన అడవిలో మునివృత్తితో బాధలు పడుతున్న పాండవులకడకు శ్రీకృష్ణుడి నాయకత్వంలో పాంచాల యాదవ వృష్ణి భోజాంధకులైన బంధువులు వచ్చి ధార్తరాష్ట్రులను నిందించారు. (యాదవులందలి తెగలు వృష్ణిభోజాంధకులు).

క. 'అనిఁ గర్ణ శకుని దుర్యో । ధన దుశ్శాసన నవాస్రధారాపాతం
బునఁ దృప్తిఁబొందు వసుధాం । గన రాక్షస కాక గృధ్ర గణములతోడన్. 123

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధంలో; కర్ణ, శకుని, దుర్యోధన, దుశ్శాసన= కర్ణుడియొక్క, శకునియొక్క, దుర్యోధనుడియొక్క, దుశ్శాసనుడియొక్క; నవ+అస్ర, ధారా, పాతంబునన్= క్రొత్త నెత్తుటి ధారలు పడటంచేత; వసుధా+అంగన= భూదేవి, (భూమి అనే స్త్రీ); రాక్షస, కాక, గృధ్ర, గణములతోడన్= రాక్షసుల, కాకుల, గ్రద్దల సమూహాలతో సహా; తృప్తి+పొందున్= తనివి చెందుతుంది.

తాత్పర్యం: 'యుద్ధంలో కర్ణ, శకుని, దుర్యోధన, దుశ్శాసనుల శరీరాలనుండి కారిన క్రొత్త నెత్తురుతో రాక్షసులు, కాకులు గ్రద్దలతోపాటు భూదేవి తనివి చెందుతుంది.

విశేషం: అలం: సహోక్తి.

క. అవినీతుల వధ్యులఁ గౌ । రవపాంసులఁ జంపి ధర్మరాజునకుఁ గురు
ప్రవరున కొనరింతమ, యీ । యవనీరాజ్యాభిషేక మవిజితశక్తిన్. 124

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అవినీతులు= నీతి మాలిన వారైన; వధ్యులన్= చంపదగిన వారైన; కౌరవ పాంసులన్= దుష్టులైన కౌరవులను; చంపి= సంహరించి; కురు ప్రవరునకున్= కురు వంశంలో శ్రేష్ఠుడైనవానికి; ధర్మరాజునకు= ధర్మపుత్రుడికి; అవనీ, రాజ్య+ అభిషేకము= భూరాజ్యానికి పట్టం కట్టటం; అవిజిత శక్తిన్= ఓడించబడిన సామర్థ్యంతో; ఒనరింతము+అ= చేద్దామా.

తాత్పర్యం: అవినీతిపరులున్నూ, చంపదగినవారున్నూ, కౌరవవంశాన్ని మలినం చేసే దుష్టులున్నూ అయిన దుర్యోధనాదులను సంహరించి, కౌరవవంశశ్రేష్ఠుడైన ధర్మరాజుకు మనం పూనుకొని పట్టాభిషేకం చేద్దాం.'

విశేషం: ఒనరించుదమ - ఒనరింతమ; "చువర్ణంబుతోడి దుగ్ధకారంబునకు తకారంబగును"

వ. **అని యుగాంత్యకాల కుపిత కృతాంతాకృతి నున్న జగన్నాథు జనార్దనుం బ్రశాంతచిత్తుం జేసి యర్జునుం డతని నిట్లని కీర్తించె.** **125**

ప్రతిపదార్థం: అని= అని పలికి; యుగ+అంత్య, కాల, కుపిత, కృతాంత+ఆకృతిన్+ఉన్న= యుగాల కడపటి కాలమైన ప్రళయ సమయంలో కోపించిన యముడి ఆకారాన్ని పోలి ఉన్న; జగత్+నాథున్= విశ్వానికి పరిపాలకుడైన; జనార్దనున్= శ్రీకృష్ణుడిని; ప్రశాంత చిత్తున్+చేసి= శాంతమైన మనస్సు కలవాడినిగా చేసి; అతనిన్= ఆ శ్రీకృష్ణుడిని; అర్జునుండు; ఇట్లు+అని= ఈ విధంగా పలికి; కీర్తించెన్= పొగిడాడు.

తాత్పర్యం: అని, ప్రళయకాలంలోని యముడి ఆకృతిని పోలి ఉండే జగన్నాథుడైన శ్రీకృష్ణుడిని శాంతింపజేసి అర్జునుడు ఈ విధంగా ప్రస్తుతించాడు.

విశేషం: ప్రళయకాలం యుగాంతంలో వస్తుందని, అప్పుడు యముడు సర్వప్రాణిసంహారం చేస్తాడన్నది-పురాణప్రోక్తం. అప్పుడు యముడు మూర్తీభవించిన కోపం. ఇచట ఉపమేయం శ్రీకృష్ణుడు. ఉపమానం ప్రళయకాల యముడు. అలంకారం: ఉపమ.

ఆ. **'పూజ్యుఁడవు పురాణపురుషుండ వీశుండ । వప్రమేయుఁడవు చరాచరంబు**
లయిన భూతరాసు లచ్యుత! నీయంద । పుట్టు, నిలుచు, లయముఁ బొందుచుండు. **126**

ప్రతిపదార్థం: పూజ్యుఁడవు= ఆరాధించదగినటువంటివాడివి; పురాణ పురుషుండవు= ప్రాచీనకాలంనుండి ఉండేవాడివి; ఈశుండవు= (విశ్వానికి) పరిపాలకుడివి; అప్రమేయుఁడవు= మితిలేనివాడివి; అచ్యుత!= ఓకృష్ణా! (అ+చ్యుత= జారుపాటు [నాశనము] లేనివాడా!); చర+అచరంబులు+అయిన= కదిలేటి, కదలనట్టి; భూత, రాసులు= ప్రాణి సముదాయాలు; నీయందు+అ= నీలోనే; పుట్టున్= ఉద్భవిస్తాయి; నిలుచున్= బ్రదుకుతాయి; లయంబున్+పొందుచుండున్= వినాశం పొందుతుంటాయి.

తాత్పర్యం: 'ఓ అచ్యుతా! నీవు పూజ్యుడవు. అనాదిపురుషుడివి. ఈశ్వరుడివి. అప్రమేయుడివి. స్థావరజంగమాల సృష్టిస్థితిలయాలకు నీవే కారకుడివి.

వ. **నీవు దొల్లి గంధమాదనంబునం గందమూలఫలాశనుండవై పదివేలేండ్లు తపంబు సేసి, పుష్కరంబున నేకాదశసహస్ర వర్షంబులు జలంబు లాహారంబుగా నుండి, ప్రభాసంబను తీర్థంబున దివ్యసహస్ర వర్షంబు లేకపాదస్థితుండ వయి యుండి, బదరీవనంబునం బవనంబు భక్షించుచు నూర్ధ్వబాహుండ వయి**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యేకపాదంబున ననేకసహస్ర వర్షంబులు నిలిచి, సరస్వతీ సత్త్రంబున నవకృష్టోత్తరాసంగుండవై నియమకృశీకృత శరీరంబుతోఁ బండ్రెండు వర్షంబు లశేష వ్రతంబులు సలిపిన తపోనిధానంబవు. నిఖిలలోకజైత్రుండ వయి చైత్రరథంబున నుత్తమక్రతువు లనేకంబులు సేసి యొక్కొక్కక్రతువునకు నూఱేసి లక్షలు సువర్ణంబులు దక్షిణ లిచ్చిన యజ్ఞపురుషుండవు. తపోయజ్ఞంబులు రెంటను సమృద్ధతేజుండ వయి, దైత్యదానవేంద్రుల వధియించి, యింద్రున కింద్రత్వం బేకాధిష్ఠతంబు సేసిన లోకప్రభుండ, వదితికిం గశ్యపునకు నుదయించి, యింద్రానుజుండవై త్రివిక్రమంబునం ద్రిజగంబుల నభివ్యాపించిన విశ్వరూపధరుండవు.127

ప్రతిపదార్థం: ఓ శ్రీకృష్ణా!; నీవు; తొల్లి= పూర్వం; గంధమాదనంబునన్= గంధమాదనం అనే కొండపై; కంద, మూల, ఫల+అశనుండవు+ఐ= దుంపలు, వేళ్ళు, పండ్లు ఆహారంగా కలవాడివై; పదివేల+ఏండ్లు= పదివేల సంవత్సరాలు; తపంబు+చేసి; పుష్కరంబునన్= పుష్కరమనే పుణ్య ప్రదేశంలో; ఏకాదశ, సహస్ర, వర్షంబులు= పదకొండు వేల ఏండ్లు; జలంబులు= నీళ్ళు; ఆహారంబుగాన్= భోజనంగా; ఉండి; ప్రభాసంబు+అను, తీర్థంబునన్= ప్రభాసం అనే పేరుకల పుణ్యప్రదేశంలో; దివ్య, సహస్ర, వర్షంబులు= దేవమానంప్రకారం వెయ్యి సంవత్సరాలు; ఏక, పాద, స్థితుండవు+అయి= ఒంటి పాదంపై నిలిచి ఉండి; బదరీవనంబునన్= బదరిఅనే పేరుకల అడవిలో; పవనంబు= గాలిని; భక్షించుచున్= తింటూ; ఊర్ధ్వ బాహుండవు+అయి= పైకెత్తిన చేతులు కలవాడివయి; ఏక, పాదంబునన్= ఒంటికాలిపై; అనేక సహస్ర, వర్షంబులు= పెక్కువేల ఏండ్లు; నిలిచి; సరస్వతీ, సత్త్రంబునన్= సరస్వతీ నదీ తీరంలోని యజ్ఞవాటికలో (సరస్వతీ తీరంలో, సరస్వతీ సరస్సులో); అవకృష్ట+ఉత్తరా సంగుండవు+ఐ= తొలగించబడిన ఉత్తరీయం కలవాడివై (అంటే పై వస్త్రం లేనివాడవై); నియమ, కృశీకృత, శరీరంబుతోన్= నియమాలచేత చిక్కిపోయిన దేహంతో; పండ్రెండు వర్షంబులు= పండ్రెండేండ్లు; అశేషవ్రతంబులు= పెక్కునోములు (పుణ్యకర్మలు); సలిపిన= చేసిన; తపస్+నిధానంబవు= తపస్సుకు నెలవైన వాడివి; నిఖిల, లోక+ఏక, జైత్రుండవు+అయి= సమస్తలోకాలను అసహాయశూరుడివిగా జయించినవాడి వయి; చైత్రరథంబునన్= చైత్రరథం అనే కుబేరుడితోటలో; ఉత్తమ, క్రతువులు= గొప్పయజ్ఞాలు; అనేకంబులు= పెక్కు; చేసి; ఒక్కొక్క, క్రతువునకు= ఒక్కొక్క యజ్ఞానికి; నూఱేసిలక్షలు= కోటి; సువర్ణంబులు= బంగారు నాణేలు; దక్షిణలు+ఇచ్చిన= బహుమతులు ఇచ్చిన; యజ్ఞపురుషుండవు= యజ్ఞాలు చేసిన వాడివి; తపస్+యజ్ఞంబులురెంటను= తపస్సులోను, యజ్ఞంలోను రెండింటను; సమృద్ధతేజుండవు+అయి= పూర్ణమైన కాంతికలవాడి వయి; దైత్య, దానవ+ఇంద్రుల= దితిపుత్త్రులలో, దనువు పుత్త్రులలో శ్రేష్ఠులను (రాక్షస నాయకులను); వధియించి= చంపి; ఇంద్రునకు; ఇంద్రత్వంబు= ఇంద్రపదవి; ఏక+అధిష్ఠితంబు+చేసిన= ఒక్కడు మాత్రమే అధిష్ఠించేదానినిగా చేసిన; లోక, ప్రభుండవు= జగన్నాథుడివి (లోకానికి ఏలికవు); అదితికిన్+కశ్యపునకున్+ఉదయించి= అదితికి, కశ్యపుడికి పుట్టి; ఇంద్ర+అనుజుండవు+ఐ= ఇంద్రుడికి తమ్ముడివై; త్రివిక్రమంబునన్= మూడు అడుగుల విజృంభణతో; త్రిజగంబులన్= మూడులోకాలను; అభివ్యాపించిన= పరిపూర్ణంగా విస్తరించిన; విశ్వరూపధరుండవు= విశ్వరూపాన్ని ధరించినవాడివి.

తాత్పర్యం: ఓకృష్ణా! నీవు పూర్వకాలంలో గంధమాదనం అనే కొండపై దుంపలు, వేళ్లు, పండ్లు మాత్రమే ఆహారంగా కలవాడివై, పదివేల సంవత్సరాలు తపస్సు చేశావు. పుష్కరంలో పదకొండు వేల సంవత్సరాలు నీళ్ళు మాత్రమే ఆహారంగా స్వీకరించి తపం చేశావు. ప్రభాసతీర్థంలో దేవమానంలో వెయ్యి సంవత్సరాలు ఒంటికాలిపై నిలిచి తపం చేశావు. బదరీవనంలో గాలి మాత్రమే పీల్చి, చేతులు పైకెత్తుకొని ఒంటికాలిపై నిలిచి పెక్కువేల ఏండ్లు గొప్ప తపస్సు చేసినవాడివి. సరస్వతీ నదీ తీరంలో గల సత్రం(వనం) లో శరీరం పై భాగంలో వస్త్రం లేకుండా ఉపవాసవ్రతాలచేత శుష్కించిన దేహం కలవాడివై పండ్రెండు సంవత్సరాలు అనేక వ్రతాలు చేసినవాడివి. సమస్తలోకాలను జయించి కుబేరుడితోట అయిన చైత్రరథంలో పెక్కు గొప్పయజ్ఞాలు చేసి, ఒక్కొక్క యజ్ఞంలో కోటి పసిడి నాణేలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దక్షిణగా ఇచ్చినవాడివి. తపస్సులోనూ, యజ్ఞంలోనూ గొప్ప తేజస్వివి. దితికుమారులు, దనువు కుమారులు అయిన రాక్షసులను సంహరించి, ఇంద్రుడికి ఇంద్రపదవి సుస్థిరం చేసినవాడివి. నీవు సకలలోకప్రభుడవు. అదితికి కశ్యపుడికి కుమారుడివిగా, ఇంద్రుడికి తమ్ముడివిగా (ఉపేంద్రుడివిగా) జన్మించిన నీవు తొలుత వామనుడివై, తదుపరి త్రివిక్రముడివై ముల్లోకాలు విస్తరించిన విశ్వరూపధారివయ్యావు.

విశేషం: బదరీవనం-రేగుచెట్లు విస్తారంగా ఉండే అరణ్యం, హిమాలయ పర్వతాలపై మిక్కిలి ఎత్తున 'అలకనంద' తీరంలో ఉండే క్షేత్రం. అలకనంద, క్రిందికి పారి దేవప్రయాగ వద్ద మందాకినితో కలుస్తుంది. అక్కడినుండి సంయుక్త నదికి 'గంగ' అని పేరు. త్రివిక్రమావతారం - విష్ణువు వామనుడుగా అవతరించి బలిచక్రవర్తిని మూడుఅడుగులమేర భూమిని దానంగా అర్థించి 'త్రివిక్రముడై' ముల్లోకాలు ఆక్రమించిన గాథ సుప్రసిద్ధం.

పై వచనం నాలుగవ పంక్తిలో "నవకృష్ణోత్తరాసంగుండవై" - అనుటకు మారుగా కొన్ని ప్రతుల్లో "కృష్ణాజినోత్తరీయాంగుండవై" నవకృష్ణాజినోత్తరాసంగుండవై" - అనే పాఠాంతరాలు గోచరిస్తున్నాయి.

క. నరక శిశుపాలు రాదిగ । ధరణీకంటకుల నధికతరదర్పులఁ బ
ల్వుర వధియింపఁగ మహి నవ । తరించిన మహాత్ముఁడవు నుతస్థిరశక్తిన్. 128

ప్రతిపదార్థం: నరక, శిశుపాలురు+ఆదిగ= నరకుడు, శిశుపాలుడు మొదలుగా కల; ధరణీ కంటకులన్= ముండ్లవలె భూమికి బాధలు కలిగించేవారైన; అధికతరదర్పులన్= మిక్కిలి ఎక్కువ గర్వం కలవారిని; పల్వురన్= పెక్కుమందిని; వధియింపఁగన్= చంపటానికి; మహిన్= భూలోకంలో; నుతస్థిరశక్తిన్= పొగడతగిన దృఢమైన శక్తితో; అవతరించిన= భూలోకంలో మానవరూపాన్ని ధరించిన; మహా+ఆత్ముఁడవు= గొప్పఆత్మ కలవాడివి అంటే మహానుభావుడివి.

తాత్పర్యం: లోకకంటకులై మితిమీరిన గర్వంతో ప్రవర్తించే నరకుడు, శిశుపాలుడు మున్నగు అనేకులను వధించటానికి దృఢశక్తితో అవతరించిన మహానుభావుడివి- నీవు. నీ మహత్త్వం పొగడదగింది. నీవు అవతారమూర్తివి.

క. అనృతము, మదమును, మత్సర । మును, గ్రోధము నను వికారములు వొరయునె ని?
న్ననుపమ గుణముల నీ కొరు । లెన పోల్పఁగఁ గలరె సురమునీంద్రప్రణుతా!' 129

ప్రతిపదార్థం: సుర, ముని+ఇంద్ర, ప్రణుతా!= దేవతలచేత, మునివరేణ్యులచేత స్తుతించబడే ఓ కృష్ణా!; నిన్ను; అనృతము= అసత్యం; మదమును= గర్వం; మత్సరమును= అసూయ; క్రోధమున్= కోపము; అను= అనే; వికారములు= మానసికములైన వికృతులు; పొరయునె= పొందునా? (పొందవు); అనుపమ గుణములన్= సాటిలేని గుణాలలో; నీకు+ఒరులు= నీకు ఇతరులు; ఎనపోల్పఁగన్+కలరె= సాటి చెప్పటానికి ఉన్నారా?

తాత్పర్యం: దేవతలచేత, మునీంద్రులచేత స్తుతించబడే శ్రీ కృష్ణా! నీకు మరి ఎవరు సాటి? అసత్యం, అసూయ, గర్వం, కోపం అనే మనోవైకల్యాలు నీదరికి చేరకలవా?'

వ. అని కృతాంజలి యయిన ధనంజయుం జూచి దనుజభంజనుం డిట్లనియె. 130

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా పలికి; కృత+అంజలి+అయిన= చేయబడిన నమస్కారం కలవాడైన; అంటే నమస్కరించిన; ధనంజయున్+చూచి= అర్జునుడిని చూచి; దనుజభంజనుండు= రాక్షసులను సంహరించేవాడు (శ్రీకృష్ణుడు); ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని తనకు నమస్కరించిన అర్జునుడితో శ్రీకృష్ణుడు ఇట్లా పలికాడు.

తే. 'నరుఁడు నారాయణుండు నాఁబరఁగు నాది । మునుల మిద్దఱ; మందు నీ వనఘ! నరుఁడ,
వేను నారాయణుండ; ననూనశక్తి । యుతులమై మర్త్యయోనిఁ బుట్టితిమి పేర్మి? 131

ప్రతిపదార్థం: నరుఁడు= నరుడు; నారాయణుండు= నారాయణుడు; నాన్+పరఁగు= అనబడే; ఆదిమునులము= మొదటి ఋషులం; ఇద్దఱము= ఇరువురం; అనఘ!= పాపరహితుడా!; అందున్= ఆ నరనారాయణులలో; నీవు; నరుఁడవు; ఏను= నేను; నారాయణుండను= నారాయణుడిని; అనూన, శక్తి, యుతులము+ఐ= గొప్ప మహిమతో కూడినవారమై; పేర్మిన్= అతిశయంతో; మర్త్యయోనిన్= మనుజగర్భంలో; పుట్టితిమి= జన్మించాం.

తాత్పర్యం: 'మనం ఇరువురం నరుడు నారాయణుడు అనే ఆది ఋషులం. వారిలో నీవు నరుడివి, నేను నారాయణుడిని. మనం గొప్పశక్తి కలిగి మనుజలోకంలో అవతరించాం.'

తరువోజ.

నిరతంబుగా నేను నీవను భేద । నియమంబు లే, దైక్యనిష్ఠయ మనకు
నిరువురకును, నీకు నిష్టుండ నాకు । నిష్టుండు, మఱి నీ కనిష్టుండ నాకుఁ
గర మనిష్టుం, డట్లుగా నమ్ము' మనుచు । ఘనభుజుల్ భువనోపకారైకమతులు
హరియు నర్జునుఁడుఁ బ్రియంబుతోఁ దగిలి । యన్యోన్యహితభాషు లగుచుండు నంత. 132

ప్రతిపదార్థం: నిరతంబుగాన్= ఎల్లప్పుడున్నూ; ఏను= నేను; నీవు; అను= అనే; భేద నియమంబు= వేర్పాటు అనే ఏర్పాటు; లేదు; మనకు; ఇరువురకును; ఐక్య నిష్ఠ+అ= ఒకటి అనేదే ఉనికి; నీకున్+ఇష్టుండు+అ= నీకు ఇష్టుడైనవాడే; నాకున్+ఇష్టుండు= నాకు కావలసినవాడు; మఱి; నీకు+అనిష్టుండు+అ= నీకు హితుడు కానివాడే; నాకున్; కరము= మిక్కిలి; అనిష్టుండు= శత్రువు; అట్లుగా= ఆ విధంగా; నమ్ముము; అనుచున్; ఘనభుజుల్= గొప్పభుజాలు కలవారు అంటే పరాక్రమశాలులు; భువన+ఉపకార+ఏకమతులు= విశ్వానికి మేలు చేకూర్చటంలోనే గురి కల మనస్సు కలవారు; హరియున్= శ్రీకృష్ణుడున్నూ; అర్జునుఁడున్= అర్జునుడున్నూ; ప్రియంబుతోన్+తగిలి= ప్రేమతో కూడి; అన్యోన్య, హిత, భాషులు+అగుచున్+ఉండున్+అంత= ఒకరితో ఒకరు మాట్లాడుకొంటున్నప్పుడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు, అర్జునుడు తమకు భేదభావమే లేదనిన్నీ, తమలో ఒకరికి మిత్రులు ఇంకొకరికి మిత్రులేననీ. అట్లాగే ఒకరి శత్రువులు ఇంకొకరికి శత్రువులేననీ పరస్పరహితకరమైన మిత్రసల్లాపాలు ఆడుకొంటూ ఉన్నారు. అంతట.

విశేషం: ఆదికవిగా ఆంధ్రవాఙ్మయ ప్రపంచంలో సుప్రసిద్ధుడైన నన్నయ మహాకవి అటు సంస్కృతచ్ఛందాలను, ఇటు తెలుగు బాసలోని ఛందాలను రచించాడు. ద్విపదకు ప్రతిపాదంలో 3 ఇంద్రగణాలు 1 సూర్యగణం ఉంటాయి. మంజరీద్విపదకు ప్రాస నియతి లేదు. రెండు ద్విపద పాదాలు కలిసి ఒక తరువోజ పాదం అవుతుంది. తరువోజలో ప్రాస నియతి ఉన్నది. ప్రతిపాదంలోను 1-3-5-7 గణాల మొదటి అక్షరాలకు యతిమైత్రి చెల్లుతుంది.

ద్రౌపది శ్రీకృష్ణునితోఁ దన పరిభవంబు సెప్పి దుఃఖించుట (సం. 3-13-42)

వ. అఖిల రాజలోక పరివృతుండయి యున్న నారాయణునొద్దకు వచ్చి ద్రుపదరాజపుత్త్రి ముకుళిత కరాంబుజ యయి యిట్లనియె; 'దేవా! నిన్ను నాదిప్రజాసర్గంబునఁ బ్రజాపతివని యసితుం డయిన దేవలుండును,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సత్యంబువలన యజ్ఞం బుద్ధరించుటంజేసి నిత్యసత్యమయుండవయిన యజ్ఞపురుషుండ వని కశ్యపుండును, శిరంబున దివంబును, బాదంబుల మేదినియును, లోచనంబుల సూర్యుండును, నవయవంబుల లోకంబులు నభివ్యాపించుటం జేసి సర్వమయుండ వని నారదుండును. నక్షయజ్ఞాననిధి వని సర్వమునిముఖ్యులును జెప్పిరి. 133

ప్రతిపదార్థం: అఖిల, రాజ, లోక, పరివృతుండు+అయి+ఉన్న= అందరు రాజులచేత చుట్టుకొనబడి ఉన్న; నారాయణు+ఒద్దకు= శ్రీకృష్ణుడి కడకు; వచ్చి; ద్రుపద, రాజ, పుత్రి= ద్రౌపది; ముకుళిత, కర+అంబుజ, అయి= ముడుచుకొన్న తామరలవంటి చేతులు కలదయి, అంటే నమస్కరించి; ఇట్లు+అనియె; దేవా!= ఓ శ్రీకృష్ణా!; నిన్నున్; ఆది, ప్రజా, సర్గంబునన్= మొదటి సృష్టి సమయాన; ప్రజాపతివి+అని= బ్రహ్మదేవుడివని; అసితుండు+అయిన= నల్లని వాడయిన; దేవలుండును= దేవలుడనే ఋషియున్నూ; సత్యంబు వలన= సత్యనిష్ఠతో; యజ్ఞంబు+ఉద్దరించుటన్+చేసి= క్రతుధర్మాన్ని తిరిగి నెలకొల్పటంచేత; నిత్య, సత్య, మయుండవు+అయిన= ఎల్లప్పుడు సత్యంతోనే కూడినవాడివయిన; యజ్ఞపురుషుండవు+అని= యజ్ఞాన్ని నిర్వహించే పురుషుడవని (యజ్ఞస్వరూపుడవని); కశ్యపుండును= కశ్యపుడున్నూ; శిరంబునన్= తలచేత; దివంబును= ఆకాశమును; పాదంబులన్= కాళ్ళ చేత; మేదినియును= భూమియు; లోచనంబులన్= కన్నులచే; సూర్యుండును= సూర్యుడును; అవయవంబులన్= శరీరభాగాల చేత; లోకంబులు= భువనాలు; అభివ్యాపించుటన్+చేసి= సంపూర్ణంగా నిండి ఉండటంచేత; సర్వమయుండవు+అని= సమస్తంలోనూ వ్యాపించి ఉన్నవాడి వని; నారదుండునున్= నారద మహర్షియు; అక్షయ, జ్ఞాన, నిధివి+అని= నశించని జ్ఞానానికి గనివని; సర్వ, ముని, ముఖ్యులును= అందరు మునివరేణ్యులును; చెప్పిరి= వచించారు.

తాత్పర్యం: చుట్టూ చేరిన రాజన్యులందరిచేత ఆరాధించబడుతున్న శ్రీకృష్ణుడికడకు ద్రౌపది వచ్చింది. ఆమె శ్రీకృష్ణుడితో 'దేవా! నీవే తొలిసృష్టిసమయంలో బ్రహ్మదేవుడివి. ఇది అసితుడైన దేవలుడి ప్రవచనం. నీవే నిత్యసత్యమయుడ వయిన యజ్ఞపురుషుడివి. ఇది కశ్యపమహర్షి చెప్పిన మాట. నీవు సర్వవ్యాపివి. నీ అవయవాల్లో విశ్వసృష్టి అమరి ఉన్నది. ఇది నారదుడి వాక్కు. నీవు అక్షయజ్ఞాననిధివి. ఇది సర్వముని ముఖ్యుల ప్రశంస.

విశేషం: పౌరాణిక వాఙ్మయంలో దేవలమహర్షికి విశేషణంగా 'అసిత' శబ్దం వాడబడింది. దేవలుడు ప్రాచీనస్మృతికర్త. అతడు 'అసితుడు'. బహుశః మరొక ప్రసిద్ధఋషి దేవలనామధేయుడు ఉండి ఉండవచ్చు ననిన్నీ, ప్రాధాన్యవివక్షకయి 'అసిత' విశేషణం వాడబడిందని కొందరి అభిప్రాయం. అసితచ్ఛవికి= నల్లని దేహకాంతికి ఆనాటి ఆర్యులు కల్పించిన ప్రాముఖ్యం అందరికి తెలిసిందే. కృష్ణుడు అసితుడు. ద్రౌపది కూడ కృష్ణయే. ఈ వచనంలోని 'లోచనంబుల సూర్యుండును నవయవంబుల లోకంబులు' అనే భాగం పెక్కు వ్రాత ప్రతులలో లేదు. దీనికి సంస్కృతమూలం కూడా కనిపించటం లేదు.

మధ్యాక్కర.

అని ననివృత్తులై పుణ్యచరితులై యాత్మప్రబోధ
వినిహితచిత్తులై సర్వధర్మార్థవిదులయి తృప్తిఁ
దనరెడు రాజర్షివరులకును యోగధరులకు సాధు
జనులకు గతి నీవ నిత్యకారుణ్య! సర్వశరణ్య! 134

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధంలో; అనివృత్తులు+ఐ= వెనుకకు తిరుగనివారై; పుణ్యచరితులు+ఐ= పుణ్యప్రదమైన ప్రవర్తన కలవారై; ఆత్మ, ప్రబోధ, వినిహిత, చిత్తులు+ఐ= ఆధ్యాత్మిక జ్ఞానంలో ఉంచబడిన మనస్సు కలవారై; సర్వ, ధర్మ+అర్థ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విదులు+అయి= అన్ని ధర్మాల ఆంతర్యాన్ని ఎరిగినవారై; తృప్తిన్+తనరెడు= తనివితో ఒప్పెడి; రాజ+ఋషి, వరులకును= రాజులలో ముని శ్రేష్ఠులుగా ఉన్నవారికి; యోగధరులకున్= యోగులకు; సాధుజనులకున్= మంచివారికి; నిత్యకారుణ్య!= దయకలవాడా!; సర్వ శరణ్య!= అందరికి శరణు పొందతగినవాడా!; గతి= దిక్కు; నీవు+అ= నీవే.

తాత్పర్యం: శ్రీకృష్ణా! దయామయా! యుద్ధంలో వెనుదిరుగనివారై, సౌశీల్యవంతులై, ఆధ్యాత్మికజ్ఞానులై, సర్వ, ధర్మ సూక్ష్మకోవిదులై, రాజర్షిశ్రేష్ఠులై తృప్తి వహించే వారికి, యోగీశ్వరులకు, సజ్జనులకు సర్వ శరణ్యుడవైన నీవే దిక్కు.

విశేషం: మధ్యాక్కరలో ఒక్కొక్క పాదానికి 2 ఇంద్రగణాలు 1 సూర్యగణం మళ్ళీ 2 ఇంద్రగణాలు 1 సూర్యగణం మొత్తం 6 గణాలుంటాయి. ప్రాసనియమం ఉన్నది. నన్నయ పంచమ గణాద్యక్షరంతో యతి వేస్తే తర్వాతివారు చతుర్థ గణాద్యక్షరంతో యతి వేశారు.

వ. నీ యంతఃకరణ ప్రవృత్తి కగోచరం బెద్దియు లేే; దయినను నా పడిన పరాభవం బెఱింగించెద. 135

ప్రతిపదార్థం: నీ, అంతఃకరణ ప్రవృత్తికి= నీ లోబుద్ధికి; అగోచరము= కానరానిది; ఎద్దియు= ఏది కూడా; లేదు; అయినను; నా పడిన= నేను అనుభవించిన; పరాభవంబు+ఎఱింగించెద= అవమానాన్ని తెలుపుతాను.

తాత్పర్యం: నీకు తెలియంది ఏదీ లేదు. అయినా నేను అనుభవించిన పరాభవాన్ని నీకు తెలుపుతాను.

విశేషం: అంతఃకరణం= లోపలి ఇంద్రియం 1. మనస్సు 2. బుద్ధి 3. చిత్తం 4. అహంకారం. ఈ నాలుగింటికి అంతఃకరణ చతుష్టయం అని పేరు.

సీ. పార్థివప్రభుఁడైన పాండుమహీపతి । కోడల నయి, యుద్ధకుశలు లయిన
పాండుతనూజుల భార్యనై, పూజ్యుఁడ । వైన నీ యనుజనై, యధికశక్తిఁ
బరఁగు ధృష్టద్యుమ్ను భగినినై, ధృతరాష్ట్రు । పట్టిచే సభఁ దలపట్టి యీడ్వఁ
బడి, పాపకర్ముచేఁ బరిధాన మొలువంగఁ । బడి, దారుణం బైన పరిభవంబు

ఆ. పడితి; నట్టి నన్నుఁ బాండవుల్ సూచుచు । నుండి రొరులు వోలె నుక్కు దక్కి;
యాపగాతనూజుఁ డాదిగాఁ గల వృద్ధ । బంధుజనులు సూచి పలుక రయిరి. 136

ప్రతిపదార్థం: పార్థివ, ప్రభుఁడు+ఐన= రాజులకు రాజు అయిన; పాండు, మహీపతి= పాండురాజు; కోడలను+అయి; యుద్ధకుశలులు+అయిన= యుద్ధంలో నేర్పరులైన; పాండుతనూజుల= పాండవుల; భార్యను+ఐ; పూజ్యుఁడవు+ఐన= పూజించదగినవాడివైన; నీ, అనుజను+ఐ= నీకు చెల్లెలినై; అధిక, శక్తిన్+పరఁగు= గొప్ప బలంచేత ఒప్పునట్టి; ధృష్ట, ద్యుమ్ను, భగినిన్+ఐ= ధృష్టద్యుమ్నుడి సోదరినై; ధృతరాష్ట్రుపట్టిచే= ధృతరాష్ట్రుడి కొడుకుచేత; (దుశ్శాసనుడిచేత); సభన్= సభలో; తలపట్టి= శిరస్సుపట్టుకొని; ఈడ్వఁబడి= లాగబడి; పాపకర్ముచేన్= పాపపు పనులు కలవాడిచేత; పరిధానము= బట్ట; ఒలువంగన్+పడి= అపహరించబడి; దారుణంబు+ఐన= ఘోరమైన; పరిభవంబు పడితిన్= అవమానం పొందాను; అట్టి; నన్నున్, పాండవుల్; ఒరులు+పోలె= ఇతరులవలె; ఉక్కు, తక్కి= చేవ లేక; చూచుచున్+ఉండిరి= చూస్తూ ఉండినారు; ఆపగా తనూజుఁడు= నదీపుత్రుడైన భీష్ముడు; ఆదిగాన్+కల= మొదలుగా ఉన్న; బంధుజనులు= చుట్టాలు; పలుకరు+అయిరి= మౌనంగా ఉన్నారు.

తాత్పర్యం: నేను చక్రవర్తి అయిన పాండురాజు కోడలిని. వీరాధివీరులైన పాండవుల భార్యను. మహాబలశాలి అయిన ధృష్టద్యుమ్నుడి సహోదరిని. నీకు చెల్లెలిని. అట్టి నన్ను దుశ్శాసనుడు నిండుసభలో తలవెంద్రుకలు పట్టి ఈడ్చాడు; వలువలొలిచి దారుణంగా అవమానించాడు. అప్పుడు పాండవులు మిన్నకున్నారు. భీష్మాదివృద్ధులు, బంధువులు చూచి ఊరకున్నారు.

క. శరణనినవారిఁ గరుణా । కరులయి రక్షించు పురుషకారాన్వితులే
శరణని యఱచిన నాలిం । పర భీమార్జునుల బాహుబల మేమిటికిన్? 137

ప్రతిపదార్థం: శరణు+అనినవారిన్= రక్షించుమని కోరినవారిని; కరుణా+ఆకరులు+అయి= దయకు నెలవైన వారయి; రక్షించు= కాపాడే; పురుషకార+అన్వితులే= పురుష ప్రయత్నం (పౌరుషం) కలవారే; శరణు+అని, అఱచినన్= కాపాడండని (నేను) మొరపెట్టినప్పటికి; ఆలింపరు+అ= వినలేదుకదా!; భీమ+అర్జునుల= భీముడియొక్క అర్జునుడియొక్క; బాహుబలము= భుజశౌర్యం; ఏమిటికిన్= ఇక దేనికి?

తాత్పర్యం: శరణు వేడినవారిని కాపాడేవారే (పాండవులు) 'నన్ను రక్షించండి'అని మొరపెట్టుకొన్న నా ఆక్రందన ఆలకించలేదుకదా! ఇంక భీమార్జునుల భుజబల మెందుకు?

వ. భ్రాతృ పుత్త్ర బంధుజనంబులు నాకుం గలిగియు లేని వారయి; రట్టియెడం గర్ణుండు నన్నుం జూచి నగియె. 138

ప్రతిపదార్థం: భ్రాతృ, పుత్త్ర, బంధు జనంబులు= సహోదరులు, కొడుకులు, చుట్టాలు; నాకున్+కలిగియు= నాకు ఉన్నప్పటికిని; లేనివారు+అయిరి; అట్టి+ఎడన్= అప్పుడు; నన్నున్+చూచి; కర్ణుండు; నగియెన్= నవ్వాడు.

తాత్పర్యం: సోదరులు, కొడుకులు, బంధువులు దండిగా నాకున్నప్పటికి, నా కెవ్వరూ లేనివారు అయినారు. ఆ సమయంలో కర్ణుడు నన్నుచూచి నవ్వాడు.

ఆ. కర్ణునగవు లోకగర్హితుండగు దుస్స । సేను చెయిదికంటె శిఖియ పోలె
నడరి నా మనంబు నతిదారుణక్రియ । నేర్చుచున్నయది మహీధరుండ! 139

ప్రతిపదార్థం: కర్ణ, నగవు= కర్ణుడియొక్క నవ్వు; లోక, గర్హితుండు+అగు= లోకంలోని జనులందరిచేత తెగడబడిన; దుస్ససేను= దుశ్శాసనుడి; చెయిదికంటె= చేష్టకంటె; శిఖి+అ, పోలెన్= అగ్నివలె; అడరి= అతిశయించి; నా, మనంబున్= నా మనస్సును; అతిదారుణ క్రియన్= మిక్కిలి ఘోరమైన రీతిగా; మహీధరుండ= (భూమిని తాల్చిన) శ్రీకృష్ణా!; ఏర్చుచున్న+అది= కాలుస్తున్నది.

తాత్పర్యం: ఓకృష్ణా! లోకులచేత నిందించబడే దుశ్శాసనుడి దుష్టచేష్ట కంటె, కర్ణుడు నన్ను చూచి నవ్వినవవ్వు నా మనస్సును మహాఘోరంగా కాలుస్తూ ఉన్నది.

వ. తొల్లివేదాధ్యయనంబుసేయుచు బాలకేళీవినోదంబున నున్న కాలంబునఁబ్రమాణకోటియందు సుప్తుండయిన భీమసేను నంటఁగట్టి గంగమడువునం ద్రోపించియు, విషంబుఁబెట్టియు, విషసర్పంబులంబట్టి గఱపించియు, జననీసహితులైన యేవురను వారణావతంబున లక్కయిల్లు సొనిపి యందు దహనంబుఁ

బ్రయోగింపం బంచియు ననేకంబులైన యపకారంబులు సేసి, యిప్పుడు దుర్యోధనుం డధర్మద్యూతంబున రాజ్యంబు నపహరించి, రాజలోక సమక్షంబునం దమ్ము నిరాకృతులం జేసినను బరాక్రమపరాఙ్ముఖులైన పాండవులు నా పడిన పరిభవంబు నెట్లు దలఁగెద?' రని బాష్పధారా స్నపితపయోధర యయి పాణిపల్లవంబున నయన సమ్మార్జనంబు సేయుచున్న పాంచాలిం జూచి వాసుదేవుం డిట్లనియె. 140

ప్రతిపదార్థం: తొల్లి= కడచిన కాలంలో; వేద+అధ్యయనంబు+చేయుచు= వేదాలను చదువుతూ; బాల, కేళీ, వినోదంబునన్+ఉన్న, కాలంబునన్= చిన్నతనపు ఆటల వేడుకతో ఉన్నప్పుడు; ప్రమాణకోటి+అందు= (గంగా తీరంలో) ప్రమాణకోటి అనే లోతైన గంగమడుగు ప్రదేశంలో; సుప్తుండు+అయిన= నిదురపోయిన; భీమసేనున్+అంటన్+కట్టి= భీముడిని కదలకుండ కట్టివేసి; గంగమడువునన్+త్రోపించియు= గంగనీరు లోతుగా ఉండేచోట త్రోయించియున్నూ; విషంబున్+పెట్టియు= తిండిలో విషం కలిపి తినిపించియున్నూ; విషసర్పంబులన్+పట్టి= విషంకల పాములను పట్టుకొనివచ్చి; కఱపించియు= కరచేటట్లుచేసియున్నూ; జననీ సహితులు+ఐన= తల్లితో కూడి ఉన్న; ఏవురను= అయిదుగురిని (పాండవులను); వారణావతంబునన్= వారణావతం అనే పేరున్న పట్టణంలో; లక్క+ఇల్లు+చొనిపి= లక్కతో నిర్మించిన గృహంలో ఉండేటట్లు చేసి; అందు; దహనంబున్= అగ్నిని; ప్రయోగింపన్+పంచియున్= ముట్టించే ఏర్పాటు చేసియున్నూ; అనేకంబులు+ఐన+అపకారంబులు= పెక్కు కీడులు;, చేసి; ఇప్పుడు; దుర్యోధనుండు; అధర్మద్యూతంబునన్= ధర్మ రహితమైన (మోసంతో కూడిన) జూదంలో; రాజ్యంబున్+అపహరించి= రాజ్యాన్ని లాగుకొని; రాజ, లోక, సమక్షంబునన్= రాజులందరి ముందు; తమ్ము నిరాకృతులన్+చేసినను= అవమానించినప్పటికి; పరాక్రమ+పరాఙ్ముఖులు+ఐన= శౌర్యం చూపనట్టి (పరాక్+ముఖులు= పెడమొగం పెట్టినవారు, విముఖులు); పాండవులు; నా పడిన= నేను పొందిన; పరిభవంబున్, ఎట్లు+తలఁగెదరు= అవమానాన్ని ఏ విధంగా పోగొట్టగలరు?; అని; బాష్ప, ధారా, స్నపిత, పయోధర+అయి= కన్నీటిధారలచేత తడపబడిన స్తనాలు కలదై; పాణి పల్లవంబున= చిగురుటాకువంటి చేతితో; నయన సమ్మార్జనంబు= కన్నులను తుడుచుకొనటం చేస్తున్న; పాంచాలిన్+చూచి= పాంచాలదేశరాజుపుత్రికను ద్రౌపదిని చూచి; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: చాలాకాలం క్రిందట వేదాలు చదువుకొంటూ, పిల్లలతో ఆడుకొంటున్న కాలంలో భీముడు ఒకనాడు ప్రమాణకోటిప్రదేశంలో గాఢనిద్రలో మునిగి ఉంటే, అతడిని ప్రమాణకోటి అనే పేరుగల అగాధమైన గంగమడుగులో త్రోయించారు, విషం తినిపించారు, విషసర్పాలచేత కరిపించారు; పంచపాండవులను తల్లితోపాటు వారణావతంలో లక్కఇంట్లో పెట్టి కాల్పించటానికి ప్రయత్నించారు. ఇప్పుడు మోసపుజూదంలో రాజ్యం లాగుకొన్నారు. అయినా, అన్ని అవమానాలను భరించి పాండవులు నేడు శౌర్యం కోల్పోయి పడి ఉన్నారు. ఇక, నేను పడిన పరాభవాన్ని ఎలా తొలగించగలరు?'- అని ద్రౌపది విలపించింది. అపుడామె కన్నీళ్లు పాలిండ్లను తడుపుతూ ఉండగా, చేతితో కన్నులు తుడుచుకోసాగింది. అట్టి పాంచాలిని చూచి శ్రీకృష్ణుడు ఇట్లా పలికాడు.

చ. 'తనుకుచు నున్న నీ హృదయతాప నిమిత్తమునన్ సురేంద్రనం
దను పటుబాణపాతహతిఁ దద్ధృతరాష్ట్రబలంబు మృత్యుసా
దనమున కేఁగుఁ జు; మ్మిదియ తథ్యము; నా వచనంబు దప్ప ది
వ్వననిధు లేడు నింకిన, దివంబును రాత్రియు సంచలించినన్. 141

ప్రతిపదార్థం: తనుకుచున్+ఉన్న= తపిస్తున్న; నీ హృదయ, తాప, నిమిత్తమునన్= నీ గుండెలోని బాధ కారణంగా; సుర+ఇంద్ర, నందను= దేవేంద్రుడి కొడుకు అంటే అర్జునుడియొక్క; పటు, బాణ, పాత, హతిన్= తీవ్రమైన అమ్ములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పడటం వలన కలిగిన దెబ్బలచేత; తద్, ధృతరాష్ట్ర, బలంబు= ఆ ధృతరాష్ట్రుడి బలం (సేన); మృత్యుసాదనమునకున్+ఏఁగున్= మరణగృహ వాటికకు (యమ సదనానికి= నరకానికి) వెళ్తుంది; చుమ్ము= సుమా!; ఇది+అ, తథ్యము= ఇదే నిజం; నా వచనంబు= నామాట; ఈ+వనవిధులు+ఏడున్= ఈ సప్తసాగరాలు; ఇంకిన; దివంబును= పగలును; రాత్రియు= రేయి; సంచలించినన్= కదలి తారుమారైనను; తప్పదు= జరిగి తీరుతుంది.

తాత్పర్యం: 'నీ హృదయతాపం కారణంగా, అర్జునుడి యొక్క కఠోర బాణపాతంచేత ధార్తరాష్ట్రులు మృత్యుసదనానికి చేరక తప్పదు. సప్తసాగరాలు ఇంకిపోయినప్పటికిన్నీ, పగలు, రాత్రి తారుమారైనప్పటికిన్నీ నామాట నిజంగా జరిగి తీరుతుంది.

వ. అనిన నర్జునుండు ద్రౌపదిం జూచి యిట్లనియె. 142

ప్రతిపదార్థం: అనినన్= ఆ విధంగా శ్రీకృష్ణుడు చెప్పగా; అర్జునుండు; ద్రౌపదిన్+చూచి= ద్రౌపదిని చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా శ్రీకృష్ణుడు చెప్పగా అర్జునుడు ద్రౌపదిని చూచి ఇట్లా పలికాడు.

వ. 'ఈ పురుషోత్తముండు మన కిందఱకుం గుశలంబు సేయుచుం
బాపకలంకపంకములఁ బాయఁగఁ జేయుటఁ జేసి దుర్మదో
ద్దీపితశత్రుసంహతి హతిం బరమార్థమ పొందు; నేల సం
తాపము నీకుఁ జేయఁగఁ ద్రిధామజయోన్నతి గల్గియుండఁగన్.' 143

ప్రతిపదార్థం: ఈ, పురుష+ఉత్తముండు= ఈ శ్రీకృష్ణుడు (పురుషులలో ఉత్తముడు); మనకు+ఇందఱకున్= ఇంతమందికి మనకు; కుశలంబు+చేయుచున్= క్షేమం చేకూర్చుతూ; పాప, కలంక, పంకములన్+పాయఁగన్+చేయుటన్+చేసి= పాపం, నింద అనే బురదలను తొలగించటంచేత; దుర్మద+ఉద్దీపిత, శత్రు, సంహతి= చెడుగర్వంచేత ప్రజ్వలించే శత్రువుల సముదాయం; హతిన్= నాశాన్ని; పరమార్థము+అ, పొందున్= యథార్థంగా పొందుతుంది; త్రిధామ+జయ+ఉన్నతి= మూడులోకాలను జయించ గలిగే గొప్పతనం (విష్ణువువలని జయంయొక్క గొప్పతనం); కల్గి యుండఁగన్= కలిగి ఉండగా; ఏల, సంతాపము, నీకున్+చేయఁగన్= ఎందుకు నీవు దుఃఖిస్తూ ఉండటం?

తాత్పర్యం: 'పురుషోత్తముడైన శ్రీకృష్ణుడు మన యోగక్షేమాలను చూస్తూ ఉన్నాడు. పాప కళంక పంకాలను తొలగింపచేస్తున్నాడు. దుర్మదులైన మన శత్రువులు నశించగలరు. మూడులోకాలను జయించగల గొప్పతనం (విష్ణువు బాసటగా ఉండటం చేత) మనకు చేకూరి ఉన్నది. ఇంక నీకు సంతాపం ఎందుకు?'

వ. అనిన సక్రోధుం డయి ధృష్టద్యుమ్నుం డిట్లనియె. 144

ప్రతిపదార్థం: అనిన= అట్లా చెప్పగా; సక్రోధుండు+అయి= కోపంతో కూడిన వాడయి; ధృష్టద్యుమ్నుండు- ద్రౌపది సోదరుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అట్లా అర్జునుడు చెప్పగా, కోపంతో కూడినవాడయి ధృష్టద్యుమ్నుడు ఇట్లా పలికాడు.

క. 'వినయవిహీనుల దుర్యో । ధన దుశ్శాసనులఁ బవనతనయుఁడు, రాధా
తనయుని నరుఁ, డేఁ గుంభజు । ననిఁ జంపుదు; మేల వగవ నంబుజనేత్రా!' 145

ప్రతిపదార్థం: వినయ, విహీనులన్= అడకువలేని వారైన; దుర్యోధన, దుశ్శాసనులన్= దుర్యోధనుడిని, దుశ్శాసనుడిని; పవనతనయుఁడు= వాయుపుత్రుడైన భీముడు; రాధాతనయుని= (రాధ కొడుకు) కర్ణుడిని; నరుఁడు= అర్జునుడు; ఏన్= నేను; కుంభజున్= (కుండలో పుట్టిన) ద్రోణుడిని; అనిన్= యుద్ధంలో; చంపుదుము= సంహరిస్తాం; అంబుజనేత్రా!= పద్మాలవంటి కన్నులు కలదానా! ఓ ద్రౌపదీ!; వగవన్+ఏల= విచారించట మెందుకు?

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కల ఓ ద్రౌపదీ! భీముడు దుర్యోదన దుశ్శాసనులను, అర్జునుడు కర్ణుడిని, నేను ద్రోణుడిని యుద్ధంలో చంపుతాం. నీవు విచారించ నవసరం లేదు' - అని ద్రౌపదితో ధృష్టద్యుమ్నుడు పలికాడు.

వ. అని యందఱు ద్రుపదరాజపుత్త్రి నాశ్వాసించి; రంత నచ్యుతుండు ధర్మరాజున కిట్లనియె. 146

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; అందఱు; ద్రుపద, రాజ, పుత్త్రిన్= ద్రౌపదిని; ఆశ్వాసించిరి= ఊరడించారు; అంతన్; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అందరు ద్రౌపదిని ఊరడించారు. అప్పుడు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఇట్లా పలికాడు.

తే. 'ద్వారవతినుండి యే యుయుధానువలన । ధారుణీశ! యింతయు విని తత్క్షణంబ
యరుగుదెంచి యాపన్నుఁడ వైన నిన్నుఁ । జూచి దుఃఖోపహతమనస్కుండ నైతి. 147

ప్రతిపదార్థం: ద్వారవతిన్+ఉండి= ద్వారకలో ఉండి; ఏన్= నేను; యుయుధానువలనన్= సాత్యకి వలన; ఇంతయు= ఈ (ద్యూత) వృత్తాంతమంతయు; విని; తత్, క్షణంబు+అ= వెంటనే; అరుగుదెంచి= వచ్చి; ఆపన్నుఁడవు+ఐన, నిన్నున్= కష్టాలలో ఉన్న నిన్ను; చూచి; దుఃఖ+ఉపహత, మనస్కుండన్+ఐతి= శోకంచేత కొట్టబడిన మనస్సు కలవాడిని అయ్యాను.

తాత్పర్యం: 'ఇక్కడి మీ వృత్తాంతాన్ని అంతటిని నేను యుయుధానుడు చెప్పగా ద్వారకలోనే విని మిక్కిలి దుఃఖించి నిన్ను చూడటానికి వెంటనే బయలుదేరి వచ్చాను.

విశేషం: సాత్యకికి యుయుధానుడనే పేరు కూడా ఉన్నది.

వ. అయ్యవసరంబున నేను మీయొద్ద నుండమిం జేసి యిట్టి దుర్వ్యసనంబు సంభవిల్లెం; గామజంబులైన స్త్రీ ద్యూత మృగయా పానంబు లను నాలుగు దుర్వ్యసనంబులం బ్రవర్తిల్లకుండఁ బ్రతిషేధింపవలయు; నందును విశేషంబుగా ననర్థమూలంబయిన పావద్యూతంబుఁబరిహరింపనినాఁడు పాపం బగు నని హేతుదృష్టాంతంబులు సూపి, కృప ద్రోణ విదుర గాంగేయులం దోడుసేసికొని యాంబికేయు నొడంబఱిచి దుష్టద్యూతంబు సర్వ ప్రకారంబుల వారింతు. 148

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; ఏను, మీ, ఒద్దన్; ఉండమిన్+చేసి= లేకపోవటంచేత; ఇట్టి; దుర్, వ్యసనంబు= చెడ్డ ద్యూతాసక్తి (వ్యసనం= కామక్రోధాదులవలన కలిగిన దోషం); సంభవిల్లెన్= కలిగింది; కామజంబులు+ఐన=

కోరికలవలన పుట్టిన; స్త్రీ, ద్యూత, మృగయా, పానంబులు+అను= ఆడుది, జూదం, వేట, త్రాగుడు అనే; నాలుగు; దుర్, వ్యసనంబులన్= చెడ్డ ఆసక్తులలో; ప్రవర్తిల్లకుండన్= నడచుకొనకుండ; ప్రతిషేధింపవలయున్= త్రోసిపుచ్చవలెను; అందును; విశేషంబుగాన్= ఎక్కువగా; అనర్థమూలంబు+అయిన= కీడుకు కారణమైన; పాపద్యూతంబున్= పాపంతో కూడిన జూదం; పరిహరింపనినాఁడు= విడువనిరోజు; పాపంబు+అగున్= పాపం దాపురిస్తుంది; అని= అని చెప్పి; హేతు, దృష్టాంతంబులు= కారణాలు, నిదర్శనాలు; చూపి; కృప, విదుర, గాంగేయులన్, తోడుచేసికొని= కృపుడిని, విదురుడిని, భీష్ముడిని వెంట పెట్టుకొని (గాంగేయుడు= గంగకొడుకు భీష్ముడు); ఆంబికేయున్= అంబికకొడుకైన ధృతరాష్ట్రుడిని; ఒడంబఱిచి= అంగీకరింపచేసి; దుష్టద్యూతంబు= చెడ్డజూదాన్ని; సర్వప్రకారంబులన్= అన్ని విధాల; వారింతున్= ఆపి ఉందును.

తాత్పర్యం: ఆ సమయంలో నేను నీ దగ్గర లేను. అందువలన ఈ దుర్వ్యసనం సంభవించింది. మహిళ, మద్యం మృగయ(వేట), జూదం అనే నాలుగున్నూ పెద్దవ్యసనాలు. అందులోనూ అనర్థాలకు మూలమైన పాపపు జూదం వదలిపెట్టకపోతే పాపం చుట్టుకొంటుంది; ఆ జూదం జరిగినప్పుడు అక్కడ నేనే ఉండి ఉంటే, అనేక హేతువులను, నిదర్శనాలను చూపి, పెద్దలయిన కృప ద్రోణ విదుర భీష్ముల తోడ్పాటుతో ధృతరాష్ట్రుడిని ఒప్పించి ఆ పాపపు జూదాన్ని ఆపుచేసి ఉండేవాడిని.

క. వలచి హితంబునఁ బథ్యముఁ । బలికినఁ జేకొనని ధర్మబాహ్యుల నవివే
కుల నిగ్రహింతు; మీ కె । గ్గులు మత్సాన్నిధ్యమున నగునె యెయ్యెడలన్? 149

ప్రతిపదార్థం: వలచి= ప్రేమ చూపి; హితంబునన్= మేలు కలగటానికై; పథ్యమున్= మంచిదైన దాన్ని; పలికినన్= చెప్పినప్పటికీ; చేకొనని= స్వీకరించని; ధర్మబాహ్యులన్= ధర్మానికి దూరమైన వారిని; అవివేకులన్= వివేకం లేని వారిని (మూర్ఖులను); నిగ్రహింతున్= కూలద్రోస్తాను; ఏ+ఎడలన్= ఏ పట్టుననైనా; మత్, సాన్నిధ్యమునన్= నేను దగ్గరగా ఉన్నప్పుడు; మీకు; ఎగ్గులు= కీడులు; అగునె?= సంభవిస్తాయా?

తాత్పర్యం: ప్రేమతో హితవు చెప్పినా వినని మూర్ఖులను, అధర్మపరులను నేను కూలద్రోసి ఉండేవాడిని. నేను దగ్గర ఉంటే మీకు ఎన్నడూ కీడు కలుగదు.

శ్రీకృష్ణుఁడు ధర్మరాజునకు సౌంభకాఖ్యానంబు సెప్పుట (సం. 3-15-1)

వ. ఏను సముద్ర తీరంబున సాల్వుతోడం బదినెలలు యుద్ధంబు సేసి వాని వధియించుపొంటె నక్కడ మసలితి; నది గారణంబుగా మీకు దుర్వ్యసనావసరంబున నలబ్ధసన్నిధానుండ నయితి' ననిన 'నది యె' ట్లని యుధిష్ఠిరుం డడిగిన, నాతనికి సౌంభకాఖ్యానంబు సవిస్తరంబుగాఁగృష్ణుండిట్లనిచెప్పె; నీ యజ్ఞంబున నర్ఘ్యనిమిత్తంబున నసహిష్ణుండయిన శిశుపాలుండు నాచేత నిహతుం డగుట విని, వాని తమ్ముండు సాల్వుండను వాఁడు తద్వధ ప్రవర్తిత క్రోధుండయి కామగమనంబైన తన సౌంభకం బను నగరంబుతో సన్నద్ధుండయి వచ్చి ద్వారవతీపురంబు నవరోధించి. 150

ప్రతిపదార్థం: ఏను= నేను; సముద్ర, తీరంబున= కడలి ఒడ్డున; సాల్వుతోడన్= సాల్వుడితో; పదినెలలు యుద్ధంబు, చేసి= రణంచేసి; వాని, వధియించు, పొంటెన్= వాడిని సంహరించటం కొరకై; అక్కడ= అచట; మసలితిన్= ఉన్నాను; అది;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కారణంబుగా; మీకు; దుర్, వ్యసన+అవసరంబునన్= చెడు కృత్యం (జూదం) జరిగేకాలంలో; అలబ్ధ, సన్నిధానుండున్+అయితిన్= లభించని సమీపత కలవాడిని అయ్యాను (అంటే మీకు దూరంగా ఉండిపోయాను); అనినన్= అని చెప్పగా; అది; ఎట్లు+అని= ఏ విధంగా జరిగిందని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అడిగినన్= అడుగగా; ఆతనికి= ధర్మరాజుకు; సౌంభక+ఆఖ్యానంబు= సౌంభకానికి సంబంధించిన కథను; సవిస్తరంబుగాన్= విశదంగా (సంపూర్ణంగా) కృష్ణుండు; ఇట్లు+అని, చెప్పె= ఈ విధంగా తెలిపాడు; నీ యజ్ఞంబునన్= నీ రాజసూయ యాగంలో; అర్ఘ్యనిమిత్తంబునన్= అర్ఘ్యం కారణంగా (పూజకొరకైన ద్రవ్యం ఇవ్వటం కారణంగా); అసహిష్ణుండు+అయిన= ఓర్వలేని వాడయిన; శిశుపాలుండు; నాచేత; నిహతుండు+అగుట= చావటం; విని; వాని, తమ్ముండు= శిశుపాలుడి సోదరుడు; సాల్వుండు+అనువాఁడు; తద్, వధ, ప్రవర్తిత, క్రోధుండు+అయి= అతడి మరణం వలన ఏర్పడిన కోపం కలవాడై; కామ, గమనంబు+ఐన= యథేచ్ఛగా తిరిగే శక్తి కలదైన; తన; సౌంభకంబు+అను; నగరంబుతో; సన్నద్ధుండు+అయి= ప్రయత్నాలు చేసిన వాడయి; వచ్చి; ద్వారవతీ, పురంబున్= ద్వారకానగరాన్ని; అవరోధించి= ముట్టడించి.

తాత్పర్యం: నేను పదినెలలు సముద్రతీరంలో సాల్వుడితో యుద్ధంచేయవలసి వచ్చింది. అందువలన దుష్టద్యూత సమయంలో మీకు దూరంగా ఉండిపోయాను' - అని అనగా ధర్మరాజు ఆ వృత్తాంతం తెల్పగోరాడు. అప్పుడు శ్రీకృష్ణుడు సౌంభకాఖ్యానాన్ని ఇట్లా వివరించదొడగాడు: నీవు చేసిన రాజసూయయాగంలో నాకు పూజార్ఘ్య ప్రదానం చేయటాన్నిచూచి ఓర్వలేక మత్సరించిన శిశుపాలుడు నాచేత చచ్చాడు కదా! అతడి తమ్ముడే ఆ సాల్వుడు. అతడు కామగమనం గల సౌంభకనగరంతో కదలి వచ్చి ద్వారకాపురిని ముట్టడించాడు.

చ. 'ప్రతినరపాలకాలు శిశుపాలు బలాధికుఁ జంపి దర్పసం
హితుఁ డగుచున్న వృష్ణిఖలుఁ డెక్కడ? నెక్కడ? నాతనిం జయో
న్నతి వెలయంగఁ జంపెద రణంబున' నంచు నలంఘ్యవిక్రమో
ర్జితుఁ డయి దానిచుట్టు విడిసెం జతురంగమహాబలంబుతోన్. 151

ప్రతిపదార్థం: ప్రతి నరపాల, కాలు= శత్రురాజులకు యముడైన; శిశుపాలు; బల+అధికున్= బలంచేతగొప్పవాడిని; చంపి; దర్పసంహితుఁడు+అగుచున్న= గర్వంతో అతిశయిస్తున్న; వృష్ణిఖలుఁడు= వృష్ణివంశానికి చెందిన దుష్టుడు, కృష్ణుడు; ఎక్కడన్+ఎక్కడన్= ఎక్కడున్నాడు? ఎక్కడున్నాడు? (ద్రుతాంతమైన పదం ఉద్వేగాన్ని తెలుపుతుంది); ఆతనిన్; రణంబునన్= యుద్ధంలో; జయ+ఉన్నతి, వెలయంగన్= గెలుపుయొక్క గొప్పతనం వెలిగేటట్లు; చంపెదన్; అంచున్= అంటూ; అలంఘ్య, విక్రమ+ఊర్జితుఁడు+అయి= దాట శక్యంకాని పరాక్రమంతో గొప్పవాడయి; దాని చుట్టు (ఆ ద్వారకా) నగరం చుట్టూ; చతురంగ, మహా, బలంబుతోన్= నాలుగు అంగాలు గల పెద్ద సేనతో; విడిసెన్= ముట్టడించాడు.

తాత్పర్యం: 'శత్రురాజులకు యముడివంటివాడైన శిశుపాలుడిని సంహరించి గర్వంతో విహరిస్తున్న శ్రీకృష్ణుడు వృష్ణివంశంవాడు ఎక్కడ ఉన్నాడు? వాడిని చంపి జయోన్నతితో వెలుగుతాను' అని సాల్వుడు మహాపరాక్రమోపేతుడై చతురంగబలాలతో దండెత్తి ద్వారకాపురిని ముట్టడించాడు.

విశేషం: యాదవుల్లో పెక్కు తెగలు ఉన్నాయి. అందులో వృష్ణివంశం ఒకటి. చతురంగబలాలు 1. రథాలు 2. ఏనుగులు 3. అశ్వాలు 4. పదాతి దళం (కాల్బలం)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మేలగు తత్పురబాహ్యవి । శాలోద్యానముల తాల సాల సరళ హిం
తాల తమాలావలి ని । ర్మూలితముగఁ జేసెఁ దచ్చమూసామజముల్. 152

ప్రతిపదార్థం: మేలు+అగు= మంచివైన; తద్; పుర, బాహ్య, విశాల+ఉద్యానముల= ఆ పట్టణం బయట మిగుల నిడివి వెడల్పు కల తోటలలోని; తాల, సాల, సరళ, హింతాల, తమాల+ఆవలి= తాటిచెట్లు, మద్దిచెట్లు, దేవదారు వృక్షాలు, గిరకతాడి చెట్లు, చీకటిచెట్లు- వీటి సముదాయాలను; తద్+చమూ, సామజముల్= ఆతడియొక్క అంటే సాల్వుడియొక్క సేనలోని ఏనుగులు; నిర్మూలితముగన్+చేసెన్= వ్రేళ్ళతో పెకలించి వేశాయి.

తాత్పర్యం: ఆ సాల్వుడి సేనలోని ఏనుగులు ద్వారకాపట్టణానికి వెలుపలి ఉండే ఉద్యానవనాలలోని తాల, సాల, తమాలాది వృక్ష సమూహాలను సమూలంగా నాశనం చేశాయి.

వ. మఱి తృణజలధాన్య సమిత్సమృద్ధంబయి శతఘ్నీప్రముఖానేక యంత్రంబుల నలంఘ్య పరిఖా ప్రాకారంబులను, నపార బల రక్షిత ఘనకవాట చతుర్గోపురంబులను, లబ్ధ ప్రభూత వేతన ప్రహృష్ట పుష్ట ధృష్ట వీర సుభట సంకులంబులను, నపరిమిత గజతురంగ శతాంగంబులను, బ్రదీప్తాలాత శాత శర చక్ర తోమర పరశుపాశాంకుశ కూటంబులను, వీరయోధారూఢ విశాలాట్టాలకంబులను నొప్పి పరుల కసాధ్యంబయిన ద్వారవతి భేదింప నేరక దాని వెలిం బ్రపా చైత్య దేవాయతన వల్మీకంబులు వర్జించి సమతలప్రదేశంబున నిబిడంబుగా శిబిరసన్నివేశంబు సేసి నిత్యంబు నుపద్రవంబు సేయుచున్న సౌంభక విజృంభణంబునకు సహింపక, సమరసంరంభంబున సర్వాయుధ సన్నద్ధులయి. 153

ప్రతిపదార్థం: మఱి; తృణ, జల, ధాన్య, సమిద్+సమృద్ధంబు+అయి= గడ్డితో, నీటితో, ఆహారధాన్యాలతో, సమిధలతో (వంటచెరకుతో) నిండినదై; శతఘ్నీ ప్రముఖ+అనేక, యంత్రంబులన్= శతఘ్నులు మొదలుగాగల పెక్కు యంత్రాలతో (శతఘ్ని= నూరు మందిని ఒకేసారి చంపగల మర ఆయుధం); అలంఘ్య, పరిఖా, ప్రాకారంబులనున్= దాటటానికి వీలుకాని కందకంతో, చుట్టుగోడలతో; అపార, బల, రక్షిత, ఘన, కవాట, చతుర్, గోపురంబులను= మితిలేని సేనచేత రక్షించబడుతున్న పెద్దగుమ్మాలు గల నాలుగు గోపురాలతో; లబ్ధ, ప్రభూత, వేతన, ప్రహృష్ట, పుష్ట, ధృష్ట, వీర, సుభట, సంకులంబులను= ఎక్కువ జీతాన్ని పొందటంచేత సంతోషం పొంది బలిసి ధైర్యంతో ఉండే వీరులైన మంచి భటుల సమూహాలతో; అపరిమిత, గజ, తురంగ, శతాంగంబులను= మితిలేని సంఖ్యల ఏనుగులతో, గుర్రాలతో, రథాలతో; ప్రదీప్త+అలాత, శాత, శర, చక్ర, తోమర, పరశు, పాశ+అంకుశ కూటంబులను= వెలుగొందుతున్న కొఱవులు, వాడి అయిన బాణాలు, చక్రాలు, చిల్లకోలలు, గండ్రగొడ్డళ్ళు, త్రాళ్ళు, అంకుశాలు- వీటి సమూహాలతో; వీర, యోధ+ఆరూఢ, విశాల+అట్టాలకంబులనున్= వీరులైన భటులతో కూడి విరివి అయిన బురుజులతోను; ఒప్పి= వెలుగొంది; పరులకు= ఇతరులకు; అసాధ్యంబు+అయిన= జయించటానికి వీలులేని; ద్వారవతి= ద్వారకను; భేదించనేరక= నిగ్రహించలేక; దాని వెలిన్= ఆ పురంబయట ఉండే; ప్రపా, చైత్య, దేవాయతన, వల్మీకంబులు= చలిపందిళ్ళు, రావిచెట్టు వంటి నీడనిచ్చే దివ్యవృక్షాల చుట్టూ రాతితో నిర్మించిన రచ్చ కట్టలు; దేవళాలు, పుట్టలు; వర్జించి= విడిచిపెట్టి; సమతల ప్రదేశంబునన్= మైదానపు నేలమీద; నిబిడంబుగా= దట్టంగా; శిబిర సన్నివేశంబు= భటులు నివసించే డేరాలు; చేసి= వేసి; నిత్యంబును= ప్రతిదినం; ఉపద్రవంబు, చేయుచున్న= హాని కలిగిస్తున్న; సౌంభక విజృంభణంబునకున్= సౌంభకంయొక్క చెలరేగటం; సహింపక= ఓర్వలేక; సమర సంరంభంబునన్= పోరు సల్పే ఆవేశంతో; సర్వ+ఆయుధ, సన్నద్ధులు+అయి= సమస్తమైన ఆయుధాలు సమకూర్చు కొన్నవారయి.

తాత్పర్యం: ఇది ద్వారక కోట వర్ణనం. 1. ఆ కోట-గడ్డితో, జలంతో, ఆహార ధాన్యాలతో, సమిధలతో పుష్కలం. 2. అందులో శతఘ్నులు మున్నగు ఆయుధయంత్రాలు అమర్చబడి ఉన్నాయి. 3. దాటలేని కందకం, ఎత్తైన ప్రాకారాలు, బురుజులు, నాలుగుదిక్కుల నాలుగు గోపురాలు, పెద్ద కవాటాలు అందులో ఉన్నాయి. 4. అచ్చటి సైనికులు ఎక్కువ జీతబత్తేలు పొందటంచేత సంతృప్తులు. సంతోషం మీరి ఉన్నవారు. 5. అక్కడ రథ-గజ-తురగ-పదాతి దళాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. 6. పదునైన సరికొత్త ఆయుధవిశేషాలు అలాత శర చక్ర తోమర పరశు పాశ అంకుశ కూటాలు అక్కడ ఉన్నాయి. 7. వీర యోధులు కావలి కాస్తున్న విశాలమైన అట్టాలకాలు ఉన్నాయి. అందువలన సాల్వుడు ద్వారకను భేదించలేక కోటవెలుపల మైదానాలలో సైనికశిబిరాలు నిర్మించాడు. అంతేగాక, అతడు తన సౌంభక పట్టణంతో నిత్యం అలజడి సృష్టిస్తున్నాడు. అందువలన యాదవులు ఆ సౌంభకంయొక్క విజృంభణం సహించలేక యుద్ధానికి సర్వాయుధాలతో సిద్ధులయి.

విశేషం: మహాభారతంలోని ద్వారకాపురి వర్ణన ప్రాచీనయుద్ధకళను అవగాహనం చేసికొనటానికి తోడ్పడుతుంది. ఈ వర్ణన నేటి ఇరవయ్యవ శతాబ్దిలోని వాళ్ళకు సైతం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇక సౌంభక కల్పన, ఇరవయ్యవ శతాబ్దివారి ఊహలకు కూడ అందనట్టిది. సౌంభకం కామగమనం కల నగర మట! రామాయణంలో సారథి లేనిది, అసంఖ్యాక ప్రజలు పయనించటానికి వీలైనట్టిది అయిన పుష్పక విమాన వర్ణన ఉన్నది. ఇక మహాభారతంలోని సౌంభకం తీరు వేరు. ఆ అభివర్ణన నేటి వైజ్ఞానిక కల్పనాకథలతో సంవదిస్తూ ఉన్నది.

క. ఉద్యద్బలులు గుమారులు । విద్యాధరసములు పురము వెలువడిరి రణై
కోద్యములు చారుదేష్ణుఁడుఁ । బ్రద్యుమ్నుఁడు సాంబుఁడును విపక్షజిఘాంసన్. 154

ప్రతిపదార్థం: ఉద్యత్+బలులు= విజృంభించే బలం కలిగిన వాళ్ళు; కుమారులు= (యాదవ) రాజపుత్రులు; విద్యాధరసములు= విద్యాధరులతో సరితూగేవాళ్ళు (దేవతలలో ఒక తెగవారు విద్యాధరులు); రణ+ఏక+ఉద్యములు= యుద్ధం చేయటంలోనే మిక్కిలి ఆసక్తి కలిగిన వాళ్ళు; చారుదేష్ణుఁడున్; ప్రద్యుమ్నుఁడు; సాంబుఁడును (అనే రాకుమారులు); విపక్ష, జిఘాంసన్= శత్రువులను చంపాలనే కోరికతో; పురము, వెలువడిరి= ద్వారకాపురి కోటలోపలినుండి బయటకు వచ్చారు.

తాత్పర్యం: చారుదేష్ణుడు, ప్రద్యుమ్నుడు, సాంబుడు శత్రునిర్మూలన చెయ్యాలన్న కోరికతో మహోత్సాహంతో ద్వారకాపురికోటలోపలినుండి బయటకు వచ్చారు. ఆ యువవీరులు బలవంతులు, విద్యాధరులవంటివారు, యుద్ధనిపుణులు.

మణిభూషణము.

రామవిక్రముఁ డజేయుఁ డరాతి గజావలీ
సామజాహితుఁడు సాంబుఁడు సాల్వచమూపతిన్
క్షేమవృద్ధి యనువాని నకృత్రిమ సాహసో
ద్ధాముఁ దాఁకె శరధారల ధారుణిఁ గప్పుచున్. 155

ప్రతిపదార్థం: రామవిక్రముఁడు= శ్రీరాముడి వంటి పరాక్రమం కలవాడు; అజేయుఁడు= జయించనలవికానివాడు; అరాతి, గజ+ఆవలీ, సామజ+అహితుఁడు= శత్రువులయొక్క ఏనుగుల సముదాయాలకు సింహం వంటి వాడు లేదా శత్రువులనే

ఏనుగుల సమూహాలకు సింహంవంటివాడు; సాంబుఁడు; సాల్వచమూపతిన్= సాల్వసేనాధిపతిని; క్షేమవృద్ధి+అనువానిన్; అకృత్రిమ, సాహస+ఉద్దామున్= సహజమైన ధైర్యంతో (తెగువతో) కూడినట్టివాడిని; శరధారలన్= బాణపరంపరలచేత; ధారుణిన్= భూమిని; కప్పుచున్; తాఁకెన్= ఢీకొన్నాడు.

తాత్పర్యం: శ్రీరాముడి పరాక్రమం వంటి పరాక్రమం కలవాడు, జయింపసాధ్యంకానివాడు, శత్రుగజాలను చీల్చిచెండాడటంలో సింహంలాంటివాడు అయిన సాంబుడు, శరపరంపరలతో భూమిని కప్పుతూ, సహజసాహసంతో భయంకరుడైన సాల్వసేనాధిపతిక్షేమవృద్ధిని ఎదుర్కొన్నాడు.

విశేషం: ఈ పద్యంలో 'గజావలీ సామజాహితుఁడు' అనే పదగుంఫనాన్ని 'గజ+ఆవళీ, సామజ+అహితుడు' అని విడదీయాలి. అయితే గజములు అంటే ఏనుగులు; సామజములు అంటే ఏనుగులు. ఇచట పునరుక్తి దోషం ఉన్నట్లు స్థూల దృష్టికి భ్రమ కలుగుతుంది. కాని శత్రువులనే ఏనుగులదండకు సామజ+అహితుఁడు= సింహం వంటివాడు అనే అర్థం చెప్పాలి. రూపకాలంకారం. 'మణి భూషణం' పద్యానికి ర-న-భ-భ-ర- అనే గణాలు ప్రతి పాదంలోను ఉంటాయి. 10వ అక్షరం యతిస్థానం.

క. జాంబవతేయు బృహద్విశి । ఖంబులకున్ బెదర కెదిరి ఘనుఁ డేసె రణా
గ్రంబున నాతనిపై నవి । లంబితుఁడై క్షేమవృద్ధి లక్షశరంబుల్. 156

ప్రతిపదార్థం: జాంబవతేయు= (జాంబవతికొడుకు) సాంబుడియొక్క; బృహత్ విశిఖంబులకున్= పెద్దబాణాలకు; బెదరక; ఎదిరి= ఎదిరించి; ఘనుఁడు= గొప్పవాడు; క్షేమవృద్ధి; అవిలంబితుఁడు+ఐ= ఎడతెగకుండ (ఆలస్యంలేకుండ); రణ+అగ్రంబునన్= అని మొనముందట; ఆతనిపై= సాంబుడిపై; లక్షశరంబుల్= లక్షబాణాలు; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: సాంబుడు వేసిన పెద్ద బాణాలకు బెదరక క్షేమవృద్ధి తిరిగి ఆ యుద్ధంలో సాంబుడిపై లక్షబాణాలను ప్రయోగించాడు.

వ. వాని యేయు శరంబుల నేర్పునకు సహింపక సాంబుండు జాంబూనదపుంఖంబులయిన విశిఖంబులం దదీయ రథాశ్వమర్మంబుల నేసిన నవి మర్మభేదవేదనలం దలరి యతివేగంబున రణంబు వెలువడ రథం బీడ్చుకొని సారథికి వశంబుగాక పఱచె; నట్లు సాల్వ చమూపతి సమరవిముఖుం డయిన. 157

ప్రతిపదార్థం: వాని, ఏయు, శరంబుల, నేర్పునకున్= వాడు (క్షేమవృద్ధి) వేసే బాణాలనేర్పుకు; సహింపక, సాంబుండు; జాంబూనదపుంఖంబులు+అయిన= బంగారు చివరలు కల; విశిఖంబులన్= బాణాలతో; తదీయ, రథ+అశ్వ, మర్మంబులన్= ఆతడియొక్క రథాలకు పూన్చిన గుఱ్ఱాలయొక్క జీవస్థానాలలో; ఏసినన్= కొట్టగా; అవి, మర్మ, భేద, వేదనలన్+తలరి= జీవస్థానాలు చీలటంచేత కలిగిన బాధతో నొచ్చి; అతివేగంబునన్= మిక్కిలి వేగంతో; రణంబు వెలువడన్= యుద్ధంనుండి తొలగేటట్లు; రథంబు+ఈడ్చుకొని= రథాన్ని ఈడ్చుకొని; సారథివశంబు, కాక= చోదకుడికి లోబడక; పఱచెన్= పారిపోయాయి; అట్లు= ఆ విధంగా; సాల్వచమూపతి= సాల్వసేనాని; సమర, విముఖుండు= యుద్ధంనుండి వెనుదిరిగినవాడు; అయినన్= కాగా.

తాత్పర్యం: క్షేమవృద్ధి వేసిన బాణాలకు తాళలేక సాంబుడు, బంగరుచివరలు కలిగిన బాణాలతో ఆతని రథానికి పూన్చిన గుఱ్ఱాల మర్మస్థానాలలో కొట్టాడు. ఆబాధకు గుఱ్ఱాలు తాళలేక, సారథికి లొంగక, రథాన్ని యుద్ధభూమినుండి తొలగించుకొని పారిపోయాయి. ఆ విధంగా సాల్వసేనాపతి యుద్ధవిముఖుడు కాగా-

స్వాగతము.

వేగవంతుఁ డను వీరుఁడు సాంబున్
వేగవంతుఁ డయి వీఁకను దాఁకెన్
వేగ బాణపదవీ తతులన్ ది
గ్భాగముల్ విశిఖపంజరముల్ గాన్. 158

ప్రతిపదార్థం: వేగవంతుఁడు+అను, వీరుఁడు= వేగవంతుడనే శూరభటుడు; వేగవంతుఁడు+అయి= వేగంకలవాడయి; సాంబున్= సాంబుడిని; వీఁకన్= ఉత్సాహంతో; వేగ, బాణ, పదవీ, తతులన్= శీఘ్రంగా వెళ్ళే అమ్ముల మార్గాల సమూహాలతో; దిశ్+భాగముల్= దిగంతరాలు; విశిఖ, పంజరముల్+కాన్= బాణాలతో ఏసిన గూళ్ళు కాగా; తాఁకెన్= తలపడ్డాడు.

తాత్పర్యం: వేగవంతు డనే వీరుడు సాంబుడిని వేగంగా ఎదుర్కొన్నాడు. ఆతడు వేసిన వేగబాణపరంపరలతో దిగంతరాలు బాణపంజరాలయ్యాయి.

విశేషం: స్వాగతపద్యానికి ప్రతిపాదంలో ర-న-భ-గగ అనే గణా లుంటాయి. 7వ అక్షరం యతిస్థానం.

ఆ. సాంబుఁ బాయు మనుచుఁ జారుదేష్ణుం డల్గి । వేగవంతుఁ దాఁకి వీఁకతోడ
వాని మస్తకంబు వ్రయ్యంగ వడి గదం । బొడిచె రుధిరవారిపూర మొలుక. 159

ప్రతిపదార్థం: సాంబున్+పాయుము+అనుచున్= సాంబుడిని తప్పుకొమ్మని పలికి; చారుదేష్ణుండు; అల్గి=కోపించి; వేగవంతున్+తాఁకి= వేగవంతుడిని ఎదిరించి; వీఁకతోడ= ఉత్సాహంతో; వాని, మస్తకంబు= వాడితల; వ్రయ్యంగ= పగిలేటట్లు; వడిన్= వేగంగా; గదన్= గదతో; రుధిర, వారి, పూరము+ఒలుకన్= నెత్తురునీటి సమూహం (వెల్లువ) జారి కారగా; పొడిచెన్= కొట్టాడు.

తాత్పర్యం: సాంబుడిని ప్రక్కకు తప్పుకొమ్మని పలికి, చారుదేష్ణుడు వేగవంతుడితో పోరాడి, అతడి తల పగిలేటట్లు తనగదతో కొట్టాడు. ఆ దెబ్బకు వేగవంతుడి తలనుండి నెత్తురు నీటివెల్లువగా ప్రవహించింది.

వ. ఇట్లు చారుదేష్ణు నిష్ఠురగదాఘాతంబున వేగవంతుండు విగతజీవుండయి నిర్ఘాతపాత భిన్నోన్నతగిరి శిఖరంబునుంబోలె నేలఁ ద్రెళ్ళినం జూచి విచింత్యుం డను వాఁ డవిచింత్యవిక్రముం డయి. 160

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; చారుదేష్ణు= చారుదేష్ణుడియొక్క; నిష్ఠుర, గదా+ఆఘాతంబునన్= కఠోరమైన గద దెబ్బకు; వేగవంతుండు; విగత, జీవుండు+అయి= పోయిన ప్రాణాలు కలవాడై; నిర్ఘాత, పాత, భిన్న+ఉన్నత, గిరి, శిఖరంబునున్+పోలె= పిడుగుపాటుచేత పగిలిన ఎత్తైన కొండకొనవలె; నేలన్+త్రెళ్ళినన్= నేలపై దొర్లి పడగా; చూచి; విచింత్యుండు+అనువాఁడు; అవిచింత్య+విక్రముండు+అయి= ఊహించ నలవికాని పరాక్రమం కలవాడయి (అనాలోచితంగా విజృంభించినట్టివాడయి).

తాత్పర్యం: ఈ విధంగా చారుదేష్ణుని గదాఘాతానికి వేగవంతుడు, పిడుగుపాటుకు ఎత్తైన కొండకొన పగిలి నేలపై దొరలి కూలినట్లు క్రిందపడి మరణించాడు. అప్పుడు విచింత్యు డనేవాడు అవిచింత్యపరాక్రముడై చారుదేష్ణుడితో పోరాడటానికి తలపడ్డాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. **చారుదేష్ణుపైఁ గడువాఁడిశరము లేసె; । నతఁడు కార్ముకహస్తుఁడై యాక్షణంబ**
వానిపై నభిమంత్రించి వహ్నిబాణ । మేసె నుగ్రస్ఫులింగంబు లెసఁగఁ జదల. **161**

ప్రతిపదార్థం: చారుదేష్ణుపైన్= చారుదేష్ణుడిమీద; (విచింత్యుడు); కడు, వాఁడి శరములు+ఏసెన్= మిక్కిలి వాడి అయిన బాణాలు ప్రయోగించాడు; అతఁడు= ఆ చారుదేష్ణుడు; కార్ముక, హస్తుఁడు+ఐ= విల్లు చేతిలో కలవాడై; ఆ, క్షణంబు+అ= ఆక్షణంలోనే; వానిపైన్= ఆ విచింత్యుడిపై; అభిమంత్రించి= లెస్సగా మంత్రాలు ఉచ్చరించి; వహ్ని, బాణము= ఆగ్నేయాస్త్రాన్ని; చదలన్= ఆకాశంలో; ఉగ్రస్ఫులింగంబులు= భయంకరమైన నిప్పురవ్వలు; ఎసఁగన్= విస్తరించగా; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: విచింత్యుడు చారుదేష్ణుడిపై కడువాడిబాణాలు వేశాడు. చారుదేష్ణుడు ఆ క్షణంలోనే చేతిలో విల్లు ధరించి, అభిమంత్రించి వానిపై ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. అంతట ఆకాశంలో భయంకరంగా నిప్పురవ్వలు క్రమ్ముకొన్నాయి.

క. **అనలాస్త్ర మట్లు వక్షముఁ । గొనిన విచింత్యుండు గూలెఁ గుతలం బద్రువన్;**
ఘను వానిఁ జూచి హా హా । స్వనము లెసఁగ సాల్వసేన సంక్షోభించెన్. **162**

ప్రతిపదార్థం: అనల+అస్త్రము= ఆగ్నేయాస్త్రం; అట్లు= ఆవిధంగా; వక్షమున్= రొమ్మును; కొనిన= కొట్టగా (ఖండించగా); విచింత్యుండు; కుతలంబు= భూతలం; అద్రువన్= అదిరేటట్లు; కూలెన్= క్రిందపడ్డాడు; ఘను, వానిన్+చూచి= గొప్పవాడైనవాడిని చూచి; హాహాస్వనములు+ఎసఁగన్= హాహాకారాలు వ్యాపింపగ; సాల్వ సేన= సాల్వుడియొక్క సేన; సంక్షోభించెన్= మిక్కిలి కలతచెందింది.

తాత్పర్యం: ఆగ్నేయాస్త్రం (అనలాస్త్రం) తన రొమ్మును తాకటంచేత విచింత్యుడు పుడమి అదిరేట్లు క్రిందపడి మరణించాడు. ఘనుడైన ఆతడి మరణం చూచి సాల్వుడి సైనికులు హాహాకారాలు చేసి సంక్షోభం పొందారు.

విశేషం: 'అద్రువన్' ఛందస్సులో శిథిలద్విత్వం. ఇది సగణం.

వ. **సాల్వుండు నిజసేనా సంక్షోభం బుడిచి సర్వాయుధసనాథం బయిన రథం బెక్కి యాదవకుమారవాహిని పయి నెత్తియేయుచు వ్రేయుచుంబొడుచుచుఁ బ్రతిబలంబు నెల్ల నాయుధమయంబుగాఁజేయుచున్న వాని కలిగి.** **163**

ప్రతిపదార్థం: సాల్వుండు= సాల్వుడు; నిజ, సేనా, సంక్షోభంబు+ఉడిచి= తన సేనలో వ్యాపించిన కలవరపాటును ఆపి; సర్వ+ఆయుధ, సనాథంబు+అయిన= అన్ని ఆయుధాలతో సమకూడి ఉన్న; రథంబు= తేరు; ఎక్కి; యాదవ, కుమార, వాహినిపైన్= యాదవకుమారుల సైన్యంమీద; ఎత్తి= దండెత్తి; ఏయుచు, వ్రేయుచున్+పొడుచుచున్= (ఆయుధాలు) విసురుతూ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఖండిస్తూ, గుచ్చుతూ; ప్రతిబలంబున్+ఎల్లన్= శత్రుసైన్యాన్నంతటినీ; ఆయుధమయంబుగాన్= ఆయుధాలతో నిండేటట్లుగా; చేయుచున్న; వానికి+అలిగి= వాడిపై కోపించి.

తాత్పర్యం: సాల్వుడు సమస్తాయుధాలతో కూడి ఉన్న రథాన్ని ఎక్కివచ్చి, తనసేనలో ఏర్పడిన కలవరపాటును తొలగించి, యాదవసైన్యంపై అనేకాలైన అస్త్రశస్త్రాలతో విజృంభించి పోరాడ సాగాడు. అంతట వాడిపై ఆగ్రహం చెంది.

సీ. హంసవర్ణోత్తమహయములఁ బూనిన । రథ మెక్కి కాంచనరమ్యయష్టి
సంభృత మకరధ్వజం బొప్ప బద్ధ గో । ధాంగుళిత్రాణుఁడై యతులశాత
సాయకావళిఁజేసి సాల్వుఁ బిల్చుచు వాని । మీఁదఁ బ్రద్యుమ్నుఁ డమేయబాణ
వర్షంబు గురిసిన, వాఁడును వానిపైఁ । గడువాఁడిశరములఁ గడఁగి యేసె;

ఆ. నధికవీరు లైన యయ్యిద్దఱకు నస్త్ర । కోవిదులకుఁ బోరు ఘోరమయ్యెఁ
దద్ద భయము వొంది తద్ద్వారకాపురి(ర) । సౌంభకముల జనులు సంభ్రమింప. 164

ప్రతిపదార్థం: హంస, వర్ణ+ఉత్తమ, హయములన్+పూనిన, రథము+ఎక్కి= తెల్లని హంసరంగు కల మేలిగుర్రాలు కట్టిన తేరును ఎక్కి; కాంచన, రమ్య, యష్టి, సంభృత, మకర, ధ్వజంబు+ఒప్పన్= బంగారుతో చేయబడిన అందమైన కర్రకు పూన్చబడిన మొసలి జెండా వెలుగొందుతుండగా; బద్ధగోధా+అంగుళి, త్రాణుఁడు+ఐ= చేతి వ్రేళ్లకు అల్లెత్రాటి ఒరిపిడి తగలకుండటానికై ఉడుముతోలుతో కుట్టబడిన కవచం ధరించిన వాడై; అతుల, శాత, సాయక+ఆవళిన్+చేసి= సాటిలేని వాడి అయిన బాణాల సముదాయంచేత; సాల్వున్+పిల్చుచు= సాల్వుడిని (యుద్ధంచేయుమని) ఆహ్వానిస్తూ; వాని మీఁదన్= ఆ సాల్వుడిపై; ప్రద్యుమ్నుఁడు; అమేయ, బాణ, వర్షంబు, కురిసిన= దట్టమైన అమ్ములవాన కురిపించగా; వాఁడును= ఆ సాల్వుడును; వానిపైన్= ప్రద్యుమ్నుడిపై; కడు, వాఁడి, శరములన్+కడఁగి+ఏసెన్= మిక్కిలి పదునైన బాణాలను పూని ప్రయోగించాడు; అధిక, వీరులు+ఐన= గొప్ప శూరులైన (దండిమగలైన); ఆ+ఇద్దఱకున్= ఆ ఇరువురికి; అస్త్ర కోవిదులకున్= అస్త్రాలు తెలిసినట్టి వారికి- అంటే అస్త్రాలలో ప్రావీణ్యం గల ఆ సాల్వప్రద్యుమ్నులు ఇరువురికిన్నీ; పోరు= యుద్ధం; ఘోరము+అయ్యెన్= భయంకరంగా జరిగింది; తద్, ద్వారకా, పురి(ర), సౌంభకముల జనులు= ఆ ద్వారకానగరంలోని, సౌంభకపురంలోని జనులు; తద్ద= మిక్కిలి; భయము+పొంది= భయపడి; సంభ్రమింప= కలవరం చెందగా.

తాత్పర్యం: తెల్లగుర్రాల్ని పూన్చిన రథాన్ని ఎక్కి, ఆ రథంమీది బంగారుకొయ్యపై మొసలిగుర్తుజెండా లెస్సగా ప్రకాశిస్తూ ఉండగా, చేతివ్రేళ్ళకు అల్లెత్రాటిఒరిపిడి తగులకుండ ఉడుముతోలుపైకప్పులు తొడుగుకొని ప్రద్యుమ్నుడు పదునైన బాణాలు ప్రయోగిస్తూ సాల్వుడిని యుద్ధానికి ఆహ్వానిస్తూ శరవర్షం కురిపించాడు. సాల్వుడు కూడ పూనికతో వాడి బాణాలు ప్రయోగించాడు. అస్త్రవిద్యలో ఆరితేరిన ఇద్దరిమధ్య పోరు భీకరమయ్యేసరికి ద్వారకాపట్టణంలోని, సౌంభకపురిలోని ప్రజలు మిక్కిలి భీతిల్లి కలవరపడినారు.

విశేషం: ఈ పద్యంలో 'బద్ధగోధాంగుళిత్రాణుఁడై' ప్రద్యుమ్నుడు పోరు సలిపినట్లు ఉన్నది. ప్రాచీనకాలంలో యుద్ధంలో వింటికి కల ప్రాముఖ్యం ఎల్లరకు తెలిసిందే. వింటి బద్దకు అల్లె త్రాడు బిగించి బాగుగా ఎక్కుపెట్టి లాగి వీరుడు బాణాలను విడవాలికదా! అప్పుడు అల్లెత్రాటి ఒరిపిడివల్ల వీరుడి వ్రేళ్లు గాసి చెందకతప్పదు. అందుచేత 'అంగుళిత్రాణం' అవసరం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రాచీనకాలంలో విలుకాండ్రు అంగుళిత్రాణంగా 'గోధ'ను ఉపయోగించేవారు. గోధ అంటే అల్లెత్రాటి దెబ్బతగులకుండ ఉండటానికై చేతికి తొడుగుకొనే ఉడుముతోలుతో కుట్టబడిన కవచం. ఉడుము (గోధ) చర్మంతో తయారుచేయబడేది కనుక. అంగుళిత్రాణానికి 'గోధ' - అనే పేరు ఏర్పడింది.

క. అనిమొన సాల్వుఁడు ప్రద్యు । మ్ననిశాతశరాలివిద్ధ మర్మండయి పె
ల్చన మూర్ఛవోయి పడియెం । దన రథముపయిన్ ధరిత్రి దల్లడపడఁగన్. 165

ప్రతిపదార్థం: అని, మొన= యుద్ధానికిముందుభాగంలో; ప్రద్యుమ్న, నిశాత, శర+ఆవలి, విద్ధ, మర్మండు+అయి= ప్రద్యుమ్నుడియొక్క వాడి అమ్ముల గుంపుచేత కొట్టబడిన జీవస్థానాలు కలవాడయి; సాల్వుఁడు; ధరిత్రి= భూమి; తల్లడపడఁగన్= కంపించేటట్లు; పెల్చన= వేగంగా; మూర్ఛ+పోయి= స్పృహ తప్పి; తన, రథము పయిన్= తన తేరుమీద; పడియెన్= పడిపోయాడు.

తాత్పర్యం: యుద్ధానికి ముందుభాగంలో ప్రద్యుమ్నుడు సాల్వుడి మర్మస్థానాలను వాడిబాణాలతో భేదించాడు. అప్పుడు సాల్వుడు భూమి కంపించేటట్లు వేగంగా రథంపై మూర్ఛిల్లిపడ్డాడు.

ఉ. అంతన మూర్ఛదేఱి కలుషానలదీప్తముఖుండు సౌంభకుం
డంతకదండదారుణము లైన శరంబుల రౌక్మిణేయు ది
గ్దంతిబలాఢ్యు నేయుడు, నతండును మూర్ఛితుఁడయ్యె; వాని సం
భ్రాంతిఁ దదీయసారథి యపాస్తరణాంతరుఁ జేసెఁ జెచ్చెరన్. 166

ప్రతిపదార్థం: అంతన= అంతట; కలుష+అనల, దీప్త, ముఖుండు= కోపమనే అగ్నిచేత వెలుగొందే మొగం కలవాడు; సౌంభకుండు= సాల్వుడు (సౌంభకం కలవాడు); మూర్ఛ, తేఱి= మూర్ఛనుండి తేరుకొని; అంతక, దండ, దారుణములు+ఐన= యముడి దండం వలె భయంకరాలైన; శరంబులన్= బాణాలతో; దిశ్+దంతి, బల+ఆఢ్యున్= దిగ్గజం వంటి బలం కలవాడిని; రౌక్మిణేయున్= రుక్మిణికొడుకైన ప్రద్యుమ్నుడిని; ఏయుడున్= కొట్టగా; అతండును= ఆ ప్రద్యుమ్నుడుకూడ; మూర్ఛితుఁడు+అయ్యెన్= మూర్ఛచెందిన వాడయ్యాడు; తదీయసారథి= అతని రథచోదకుడు; సంభ్రాంతిన్= కలతనొంది; చెరన్+చెరన్= వెంటనే; వానిన్= ఆ ప్రద్యుమ్నుని; అపాస్త, రణ+అంతరున్+చేసెన్= యుద్ధమధ్యంనుండి తొలగించబడినవాడినిగా చేశాడు.

తాత్పర్యం: అంతట సాల్వుడు తెలివొంది, కోపోద్దీపితుడై, బలాఢ్యుడైన ప్రద్యుమ్నుడిపై యమదండంవంటి బాణాలు ప్రయోగించాడు. అందువలన ప్రద్యుమ్నుడు మూర్ఛపోయాడు. అంత అతడిసారథి కళవళపడి, రథాన్ని రణరంగంనుండి ప్రక్కకు తొలగించి తోలుకొనిపోయాడు.

వ. ఇట్లు మూర్ఛితుండయిన ప్రద్యుమ్నుం దోడ్కొని చని రణంబునకు దూరంబుగా నరదంబు నిలిపికొని దారుక సుతుం డున్నంత, నొక్కింత ప్రొద్దునకు మూర్ఛదేఱి ప్రద్యుమ్నుండు సూతున కిట్లనియె. 167

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మూర్ఛితుండు+అయిన= స్పృహ కోల్పోయిన; ప్రద్యుమ్నున్+తోడ్కొని, చని= ప్రద్యుమ్నుడిని తీసికొని వెళ్ళి; రణంబునకు, దూరంబుగాన్= యుద్ధానికి దూరంగా; అరదంబు= రథం; నిలిపికొని= ఆపి; దారుక సుతుండు= దారుకుని కొడుకు; ఉన్నంతన్= ఉండగా; ఒక్కింత ప్రొద్దునకు= కొంతసేపటికి; ప్రద్యుమ్నుండు; మూర్ఛ, తేఱి= తెలివొంది; సూతునకు= సారథికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆవిధంగా మూర్ఛిల్లిన ప్రద్యుమ్నుడిని తోడ్కొని వెళ్లి, అతనిసారథి రథాన్ని రణరంగంనుండి తొలగించి దూరంగా ఆపి ఉంచగా, కొంతసేపటికి ఆ వీరుడు తేరుకొని సూతుడితో ఇట్లా అన్నాడు.

క. 'ఘోరాహవరంగమునకు । దూరముగా నన్ను నిట్లు దోడ్కొని తేరన్
దారుకసుత! నీ కుచితమె? । వీరారంభంబు సూచి వెఱచితె? చెపుమా!' 168

ప్రతిపదార్థం: ఘోర+ఆహవరంగమునకున్= భయంకరమైన యుద్ధభూమికి; దూరముగా= దవ్వుగా; నన్నున్+ఇట్లు; తోడ్కొని, తేరన్= తీసికొనిరావటం; దారుకసుత!= ఓ దారుకుడి పుత్రుడా!; నీకు; ఉచితమె= తగునా?; వీర+ఆరంభంబు= (ఎదిరి) వీరుని ప్రారంభం; చూచి= అరసి; వెఱచితివి+ఎ= భయపడ్డావా?; చెపుము+ఆ= చెప్పుము.

తాత్పర్యం: 'ఓ దారుకుడి పుత్రుడా! భయంకరంగా పోరు జరుగుతున్నపుడు నన్ను యుద్ధభూమినుండి దూరంగా తోడ్కొని తేవటం నీకు తగునా? ఎదుటివీరుల పరాక్రమవిజృంభణం చూచి నీవు భయపడ్డావా? చెప్పుము.'

విశేషం: ఇక్కడ ప్రద్యుమ్నుడు తన సారథిని 'దారుకసుత'! అని సంబోధించటం గమనించదగింది. దారుకుడు శ్రీకృష్ణుడి రథసారథి. ప్రాణభీతిచే వీరుడు యుద్ధభూమిని వీడటం అవమానం. ప్రద్యుమ్నుడు రణరంగంలో ప్రాణాలు కోల్పోవటానికైనా సంసిద్ధుడే కాని పరోక్షంగానైనను పిరికితనాన్ని సహించలేడు. కాబట్టి అట్లా పలికాడు. వేరొక సారథిమాట వేరు. దారుకుడి పుత్రుడికి అటువంటి పిరికితనం కూడదని ప్రద్యుమ్నుడి భావం.

వ. మఱియు సారథిం జూచి విహ్వలమానసుండయి యిట్లనియె. 169

ప్రతిపదార్థం: మఱియు= ఇంకను; సారథిన్+చూచి= రథచోదకుడిని చూచి; (ప్రద్యుమ్నుడు); విహ్వల మానసుండు+అయి= కలత చెందిన మనస్సు కలవాడయి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అంతటితో ఆగక, ప్రద్యుమ్నుడు చెదరిన మనస్సు కలవాడయి సారథితో ఇట్లా పలికాడు.

విశేషం: ఇచట 'మఱియు' అనే ప్రయోగం మిక్కిలి అర్థవంతమైంది. ప్రద్యుమ్నుడు అప్పుడు 'విహ్వల మానసుడు'. అంతకు పూర్వమే అతడు సారథిని చీవాట్లు పెట్టి ఉన్నాడు. అది చాల లేదు. అందుచేత 'మఱియు' మాటాడవలసి వచ్చింది. ప్రద్యుమ్నుడి వంటి వీరుల మనస్తత్త్వం, రథికులకూ, సారథులకూ ఉండవలసిన ఆదర్శ అనుబంధాన్ని ఈ సంవాదం వెల్లడిస్తున్నది.

క. 'సమర విముఖత్వమును రణ । విముఖులఁ జంపుటయు శరణు వేఁడిన రక్షిం
పమియును యాదవవంశో । త్తములకుఁ గల నయినఁ గలవె దారుకతనయా! 170

ప్రతిపదార్థం: దారుకతనయా!= ఓ దారుకుడి సుతుడా!; సమర, విముఖత్వమును= యుద్ధంలో పెడమొగం పెట్టటం; రణవిముఖులన్+చంపుటయున్= యుద్ధం నుండి వెనుదిరిగిపోయే వారిని చంపటం; శరణు, వేఁడిన, రక్షింపమియును= కాపాడుమని వేడుకొన్న వారిని రక్షించకపోవటం; యాదవ, వంశ+ఉత్తములకున్= యాదవ వంశంలో పుట్టిన సజ్జనులకు; కలన్+అయినన్= కలలో అయినప్పటికి; కలవె= ఉన్నాయా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'పేరుప్రతిష్ఠలను ఆర్జించిన దారుకుడి పుత్రుడవైన సారథీ! యుద్ధంనుండి వెనుదిరిగి పోవటం, రణరంగంలో వెన్నుజూపి పారిపోయేవారిని సంహరించటం, శరణువేడిన వారిని రక్షించకుండా ఉండటం యాదవవంశంలో పుట్టిన వీరశ్రేష్ఠులకు కలలో అయినను ఉన్నాయా!

క. **విక్రమము విడిచి సమరా । పక్రాంతుఁడ నయిన నన్ను బలదేవుఁడునుం**
జక్రధరుండు కుమారులు । నక్రూరాదులును నేమి యని నగరె సభన్. **171**

ప్రతిపదార్థం: విక్రమము, విడిచి= పౌరుషం వీడి; సమర+అపక్రాంతుఁడన్+అయినన్= యుద్ధరంగం నుండి తొలగితే; నన్ను; బలదేవుఁడునున్+చక్రధరుండు= బలరాముడు, శ్రీకృష్ణుడును; కుమారులున్= యాదవ పుత్రులు; అక్రూర+ఆదులునున్= అక్రూరుడు మున్నగువారున్నూ; సభన్= కొలువుకూటంలో; ఏమి+అని= ఇది ఏమిటని; నగరె= నవ్వరా?

తాత్పర్యం: పరాక్రమం విడిచి, యుద్ధభూమి నుండి నేను తేజస్సు కోల్పోయి తొలగిపోతే, బలరాముడు, శ్రీకృష్ణుడు, రాకుమారులు, అక్రూరుడు మొదలైన పెద్దలు నన్ను చూచి నవ్వరా?

విశేషం: 'ఏమి యని నగరె' అనేది జాతీయం. ఇటువంటి హీనకృత్యం చేశా వేమియని నవ్వరా!

వ. **చెట్టసేసి తింకనయినఁ జెచ్చెర సాంబ చారుదేష్ణు లున్న చోటికి సాల్వాభిముఖంబుగా రథంబు వఱపు 'మనిన, సారథి యిట్లనియె.** **172**

ప్రతిపదార్థం: చెట్ట= చెడు; చేసితి= చేశావు; ఇంకన్+అయినన్= ఇకనయిన; చెరన్+చెరన్= వెంటనే; సాంబ, చారుదేష్ణులు; ఉన్న చోటికి; సాల్వ+అభిముఖంబుగా= సాల్వుడికి ఎదురుగా; రథంబు, వఱపుము= తేరు సాగనిమ్ము; అనిన, సారథి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నీవు చేసింది తప్పు. ఇకనయిన సాంబుడు చారుదేష్ణుడు యుద్ధం చేస్తున్న చోటికి సాల్వుడికి ఎదురుగా మనతేరు నడుపుము'- అని అనగా ప్రద్యుమ్నుడికి సారథి ఇట్లా బదులు పలికాడు.

క. **'రథి కిమ్ముగాని యెడ సా । రథి ధృతిమెయిఁ; గావ వలయు, రథియును దత్సా**
రథిఁ గావవలయు, రథి సా । రథులు పరస్పర శరీర రక్షకు లగుటన్. **173**

ప్రతిపదార్థం: రథికి= రథాన్నెక్కి యుద్ధం చేసేవీరుడికి; ఇమ్ముకాని, ఎడ=అనుకూలత లేని సమయంలో; సారథి= రథం నడిపేవాడు; ధృతిమెయిన్= ధైర్యంతో; కావవలయు= కాపాడాలి; రథియును= రథికుడు కూడ; తద్, సారథిన్= ఆ సారథిని; కావ వలయు= రక్షించాలి; రథి, సారథులు= రథికుడు, సారథియును; పరస్పర, శరీర, రక్షకులు+అగుటన్= ఒండొరుల దేహాలకు రక్షణ చేకూర్చేవాళ్ళు కాబట్టి.

తాత్పర్యం: 'వీలు, చాలు కానివేళ రథికుడిని సంరక్షించే బాధ్యత సారథిపై ఉంటుంది. అట్లే సారథిని కాపాడే బాధ్యతకు రథికుడు పూనుకోవాలి. రథికుడు, సారథి ఒండొరుల శరీరరక్షణకు బాధ్యులు.

ఆ. **సాల్వబాణవిగతసత్త్వుఁడ వైన ని । న్నిట్లు దెచ్చితిని; సహింప వలయు;**
నా రథాశ్వముల ఘనస్యందనము నిదె । చూడు' మనుచు సూతసూనుఁ డపుడు. **174**

ప్రతిపదార్థం: సాల్వ, బాణ, విగత, సత్త్వుఁడవు+ఐన= సాల్వుడియొక్క బాణాలచేత పోయిన బలం కలవాడివి అయిన; నిన్ను+ఇట్లు, తెచ్చితిని= నిన్ను ఈ విధంగా తీసుకొని తెచ్చాను; సహింపవలయు= ఓర్చుకొనాలి. నా, రథ+అశ్వముల= నా తేరుకు కట్టిన గుఱ్ఱాలను; ఘన, స్యందనమును= గొప్పరథాన్ని; ఇదె, చూడుము+అనుచున్; సూతసూనుఁడు= (సూతుడి కొడుకైన) సారథి; అపుడు.

తాత్పర్యం: సాల్వుడిబాణాలచేత నీ బలం తరిగింది. అందుచేత ఇట్లా నిన్ను తీసుకొని వచ్చాను. ఓర్చుకొనుము. నా రథాన్ని, రథానికి కట్టిన గుఱ్ఱాల పటుత్వాన్ని ఇంక నీవు చూడగలవు!

వ. సవ్యాపసవ్య విచిత్రమండల గతుల నాక్షణంబ సాల్వునకు నప్రదక్షిణంబుగా రథంబు వఱపిన, దాని సహింపక సాల్వుండు మూఁడమ్ముల సారథినేసి మఱియు రాక్షసమాయ ననేక శరంబులు ప్రద్యుమ్నుపై నేసిన. 175

ప్రతిపదార్థం: ఆ క్షణంబు+అ= వెనువెంటనే; సవ్య+అపసవ్య, విచిత్ర, మండల, గతులన్= కుడి, ఎడమ వైపులుగా ఆశ్చర్యకరంగా, గుండ్రంగా త్రిప్పుతూ; సాల్వునకున్+అప్రదక్షిణంబుగా= ఎడమవైపునుంచి కుడివైపుగా సాల్వుడిని చుట్టుతూ, రథంబు, వఱపిన= తేరునడపగా; దాని, సహింపక= దాన్ని ఓర్వక; సాల్వుండు; మూఁడు+అమ్ములన్= మూడు బాణాలతో; సారథిన్+ఏసి= సూతుడిని కొట్టి; మఱియు; రాక్షస, మాయన్= రక్కసులు చూపే మాయతో; అనేక, శరంబులు= పెక్కుబాణాలు; ప్రద్యుమ్నుపైన్; ఏసినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: వెంటనే సూతుడు రథాన్ని కుడి యెడమల విచిత్రగతులతో ఆశ్చర్యకరంగా నడిపి, సాల్వుడికి అప్రదక్షిణంగా చుట్టి వచ్చాడు. సాల్వుడు దాన్ని తనకు అవమానంగా ఎంచి సారథిని మూడుబాణాలతో కొట్టి, రాక్షసమాయతో కూడిన పెక్కుబాణాలు ప్రద్యుమ్నుడిపై ప్రయోగించాడు.

క. అమ్మాయాశరములు భ । గ్నమ్ములుగాఁ జేసి తన్ముఖమ్మునఁ దద్వ
క్షమ్మున నొక్కట బ్రహ్మా । స్త్రమ్మును బ్రద్యుమ్నుఁ డేసె దారుణభంగిన్. 176

ప్రతిపదార్థం: ఆ+మాయాశరములు= ఆ మాయతో కూడిన బాణాలు; భగ్నమ్ములుగాన్+చేసి= ముక్కలుగా వ్యర్థంచేసి; తద్+ముఖమ్మునన్= అతడి మొగాన; తద్+వక్షమ్మునన్= ఆతడి రొమ్ముమీద; ఒక్కట= ఏకకాలంలో; బ్రహ్మ+అస్త్రమ్మును= బ్రహ్మపేరిటి మంత్రబాణాన్ని; ప్రద్యుమ్నుఁడు; దారుణభంగిన్= భయంకరరీతిగా; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: సాల్వుడు వేసిన మాయాబాణాలను వమ్ముచేసి ప్రద్యుమ్నుడు, అతడి ముఖాన్ని, రొమ్మును ఒకేసారి తాకేటట్లు బ్రహ్మాస్త్రాన్ని భయంకరంగా ప్రయోగించాడు.

వ. ఇట్లు బ్రహ్మాస్త్రపీడితుండయి సాల్వుండు మూర్ఛవోయి రథంబుపయింబడిన వాని వెండియు నొక్కదివ్యబాణంబున నేయ సమకట్టిన నంతరిక్షంబున హాహారవంబు లెసఁగె,; నంత దేవగణ ప్రేరితులైన నారద మారుతులు ప్రద్యుమ్నుపాలికి వచ్చి యిట్లనిరి. 177

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; బ్రహ్మ+అస్త్ర, పీడితుండు+అయి= బ్రహ్మాస్త్రంచేత బాధించబడినవాడయి; సాల్వుండు; మూర్ఛ, పోయి= మూర్ఛిల్లి; రథంబుపయిన్= తేరిపై; పడిన; వాని= వాడిని; వెండియున్= మళ్ళీ; ఒక్క దివ్యబాణంబునన్= దేవతాసంబంధమైన ఒక బాణంతో; ఏయ, సమకట్టినన్= వేయటానికి పూనుకోగా; అంతరిక్షంబునన్= ఆకాశంలో; హాహారవంబులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

హాహాఅనేధ్వనులు; (భయోత్పాతాన్ని సూచించే అరుపులు); ఎసఁగెన్= విస్తరిల్లాయి; అంతన్; దేవ, గణ, ప్రేరితులు+ఐ= దేవతల సమూహంచేత ప్రేరేపించబడినవారై; నారద మారుతులు= నారదుడు; వాయుదేవుడు; ప్రద్యుమ్ను పాలికి, వచ్చి= ప్రద్యుమ్నుడి దగ్గరకు వచ్చి; ఇట్లు+అనిరి= ఈ విధంగా పలికారు.

తాత్పర్యం: సాల్వుడు బ్రహ్మాస్త్రపీడితుడై మూర్ఛిల్లాడు. ప్రద్యుమ్నుడు మరొక దివ్యబాణాన్ని సంధిస్తుండగా, ఆకాశంలో హాహాకారాలు ఉప్పతిల్లాయి. దేవతలప్రేరణచొప్పున నారదుడు, వాయుదేవుడు ప్రద్యుమ్నుడి కడకు వచ్చి ఇట్లా పలికారు.

విశేషం: కొన్ని ప్రతులలో నారదపర్వతులు వచ్చారని ఉన్నది. సంస్కృతమూలంలో "నారదం ప్రేషయామాసుః శ్వసనం చ మహాజవమ్" - అని ఉన్నది. అందుచేత నారద మారుతుల అనే పాఠమే ఇచట గ్రహించదగింది.

తే. **'వీఁడు నీచేత వధ్యుండు గాఁడు, మిన్న । కేయ కుండుము.; వీని నారాయణుండు**
మొనసి వధియించు' నని పల్కె వనజగర్భుఁ । డనినఁ బ్రద్యుమ్నుఁ డేయక యనఘుఁ డుండె. **178**

ప్రతిపదార్థం: వీఁడు= ఇతడు అంటే సాల్వుడు; నీచేత; వధ్యుండు, కాఁడు= చంపదగిన వాడు కాడు; మిన్నక+ ఏయక+ ఉండుము= (బాణం) వేయకుండ ఊరకుండుము; వీనిన్= ఇతడిని; (ఈసాల్వుడిని); నారాయణుండు= విష్ణువు; మొనసి= పూని; వధియించున్= చంపుతాడు; అని; వనజ గర్భుఁడు= బ్రహ్మదేవుడు (పద్మగర్భంనుండి పుట్టినవాడు); పల్కెన్= పల్కినాడు; అనినన్; అనఘుఁడు= పాపరహితుడు; ప్రద్యుమ్నుఁడు; ఏయక, ఉండెన్= (బాణాన్ని) ప్రయోగించకుండ మిన్నక ఉండిపోయాడు.

తాత్పర్యం: 'వీడు నీచేత చంపదగినవాడు కాడు. వీడిని నారాయణుడే వధిస్తాడు' అని బ్రహ్మదేవుడు చెప్పినట్లు నారద మారుతులు పలుకగా ప్రద్యుమ్నుడు ఇంక తాను బాణం వేయక మిన్నకున్నాడు.

సాల్వుఁడు ప్రద్యుమ్నునిచే బాధితుండై మరలిపోవుట (సం. 3-20-26)

వ. **అంత సాల్వుండును నివృత్తుండయి ద్వారకాపురి యవరోధం బుడిగి తన సౌంభక బెక్కి క్రమ్మఱి చనియె; నంత నీ యజ్ఞంబు నిర్వృత్తం బయిన నేనరిగి బల భగ్నీకృత పాదపవనంబుల దాని, ననభిజ్ఞాత ద్వారదేశంబుల దాని, నస్వాధ్యాయ స్వాహాకార మహీసురాగారం బయిన దాని, నపేత భూషణ యోషిజ్జనంబుల దాని ద్వారవతిం జూచి, యాహుకాత్మజువలన నంత వృత్తాంతంబును నెఱింగి, సాల్వుం జంపి కాని యిప్పురంబు సొర నొల్ల నని నిశ్చయించి, దీని నప్రమాదులరై రక్షించుకొని యుండుండని బలదేవాదులం బంచి, యప్పుడ ప్రయాణభేరి సఱవం బంచి, కృత స్వస్తి వచన పురోహిత ప్రముఖ బ్రాహ్మణ వరులకు నమస్కరించి శైబ్యసుగ్రీవంబులను వాహనంబులం బూనిన దివ్యరథం బెక్కి.** **179**

ప్రతిపదార్థం: అంత; సాల్వుండును; నివృత్తుండు+అయి= మరలిన వాడై; ద్వారకాపురి, అవరోధంబు+ఉడిగి= ద్వారకా నగరాన్ని ముట్టడించటం మాని; తన సౌంభకంబు+ఎక్కి= (కామగమనశక్తి ఉన్న) తన సౌంభకాన్ని ఎక్కి; క్రమ్మఱి= వెనుతిరిగి; చనియెన్= వెళ్ళిపోయాడు; అంత, నీ, యజ్ఞంబు= నీ (రాజసూయ) యాగం; నిర్వృత్తంబు+అయిన= పూర్తికాగా; నేను+అరిగి= నేను వెళ్ళి (అంటే ద్వారకకు వెళ్ళి); బల, భగ్నీకృత, పాదప, వనంబుల దానిన్= సేనలచేత భగ్నం చేయబడిన

చెట్ల తోటలు కలదానిని; అనభిజ్ఞాత, ద్వార దేశంబులదానిన్= గుర్తింపరాని ద్వారసీమలు కల దానిని; అ+స్వాధ్యాయ, స్వాహాకార, మహీసుర+అగారంబు+అయినదానిన్= వేదపారాయణలు, స్వాహాకారాలు (యజ్ఞాలలో హవిస్సులు వేల్చేటప్పుడు మంత్రాల చివర ఉచ్చరింపబడేవి) లేని బ్రాహ్మణ గృహాలు గలదానిని (అంటే ఆనాడు ద్వారకలో వేదపఠనం లేదు, యజ్ఞయాగాదులు జరగటం లేదన్న మాట); అపేత, భూషణ, యోషిత్+జనంబుల దానిన్= తొలగించబడిన ఆభరణాలు కల స్త్రీ జనం కల దానిని; ద్వారవతిన్+చూచి= ద్వారకను చూచి; ఆహుక+ఆత్మజు వలనన్= ఉగ్రసేనుడి వలన (కంసుడి తండ్రి - శ్రీకృష్ణుడి తాత ఉగ్రసేనుడు); అంత, వృత్తాంతంబునున్+ఎఱింగి= జరిగినదంతయు తెలిసికొని; సాల్వున్+చంపి, కాని= సాల్వుడిని సంహరించిన పిమ్మట కాని; ఈ+పురంబు= ఈ పట్టణం; చొరన్+ఒల్లన్+అని= ప్రవేశించనని; నిశ్చయించి= నిర్ణయించి, దీనిన్= దీనిని (ఈ ద్వారకాపురిని); అప్రమాదులరు+ఐ= జాగరూకులై; రక్షించుకొని+ఉండుండు+అని= కాపాడుకొంటూ ఉండండని; బలదేవ+ఆదులన్, పంచి= బలరాముడు మున్నగువారిని ఏర్పరచి; అప్పుడు+అ= అప్పుడే; ప్రయాణ భేరి; చఱవన్, పంచి= ప్రయోగించటానికి ఆజ్ఞాపించి; కృత, స్వస్తివచన, పురోహిత, ప్రముఖ, బ్రాహ్మణవరులకు= చేయబడిన "స్వస్తి" వాక్యాలు కల పురోహితులు మొదలైన బ్రాహ్మణ శ్రేష్ఠులకు; నమస్కరించి= మొక్కి; శైబ్య, సుగ్రీవంబులు+అను= శైబ్యం, సుగ్రీవం అనే పేర్లు కల; వాహనంబులన్= గుర్రాలను; పూనిన= కట్టబడిన; దివ్యరథంబు+ఎక్కి= దేవతామహత్తు కల తేరును ఎక్కి.

తాత్పర్యం: అటుపిమ్మట ద్వారకానగరంపై ముట్టడిమాని, సౌంభకం ఎక్కి సాల్వుడు వెళ్ళిపోయాడు. రాజసూయయాగం పూర్తి అయిన పిమ్మట నేను ద్వారకకు వెళ్ళి చూడగా - అచ్చటి ఉద్యానవనాలు శత్రుసైనికులచేత నాశనమయి పోయాయి. ప్రవేశ ద్వారసీమలు గుర్తు పట్టలేనట్లు మారిపోయాయి. విప్రగృహాలలో వేదపారాయణ వినిపించటం లేదు. యజ్ఞ యాగాదులు జరగటం లేదు. స్వాహాకారాలు వినరాలేదు. స్త్రీ జనాల శరీరాలపై ఆభరణాలే లేవు. 'ఇక, సాల్వుడిని చంపి కాని తిరిగి ద్వారకానగరం ప్రవేశించజాల' నని శపథం చేసి, పురరక్షణకై బలరామాదులను నియోగించి వెంటనే ప్రయాణభేరి మ్రోగింపజేసి, పురోహిత బ్రాహ్మణాశీస్సులు అందుకొని, శైబ్య సుగ్రీవా లనే గుర్రాలను పూన్చిన దివ్యరథం అధిరోహించి.

ఆ. పాంచజన్యరవముఁ బంచమహాశబ్ద । రవముఁ జెలఁగె దిశలు సెవుడు వడఁగ
నొలసి జనుల దీవనలు మించె రమ్యమై । గరుడకేతనంబు గ్రాలెఁ జదల. 180

ప్రతిపదార్థం: పాంచజన్య రవమున్= పాంచజన్యమనే పేరున్న శంఖధ్వని (పాంచజన్యం శ్రీ మహావిష్ణువు యొక్క శంఖం); పంచమహాశబ్దరవమున్= ఐదు గొప్ప జంత్రాలనుండి వచ్చే ధ్వనియు; దిశలు= దిక్కులు; చెవుడు+పడఁగన్= వినిపించనంతటి పెద్ద ధ్వని ఏర్పడగా (చెవులకువలె దిక్కులకు చెవుడు వచ్చిందని భావం); ఒలసి= వ్యాపించి; జనుల, దీవనలు= ప్రజల ఆశీస్సులు; రమ్యము+ఐ= అందమై; మించె= అతిశయించాయి; చదలన్= ఆకాశంలో; గరుడకేతనంబు= గరుత్మంతుడు గుర్తుగా ఉండే జెండా; క్రాలెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: పాంచజన్య శంఖారావం, పంచ మహావాద్యాలధ్వనులు దిక్కులు చెవుడు పడేటట్లు అతిశయిల్లాయి. ప్రజల ఆశీస్సులు వెల్లివిరిశాయి. మనోహరంగా గరుడధ్వజం ఆకాశంలో ప్రకాశించింది. (ఢక్కా మృదంగ పటహాది పంచమహావాద్యాల శబ్దాలు పంచమహాశబ్దాలు.)

విశేషం: పంచజనుడనే రాక్షసుని శరీరం నుండి లభించినందువలన శ్రీకృష్ణుని శంఖానికి 'పాంచజన్యం' అనే పేరు ఏర్పడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అ ట్లసంఖ్యాత చతురంగ సైన్యంబులతో నరిగి గిరి వన సరోవర సరిద్దేశంబులు గడచి మార్తికావత దేశంబున కరుగునంతకు ముందర సాల్వుండు సౌంభకారూఢుండయి సముద్రకుక్షిదేశంబునకుం బోయిన.181

ప్రతిపదార్థం: అట్లు= ఆ రీతిగా; అసంఖ్యాత, చతురంగ సైన్యంబులతోన్+అరిగి= లెక్కకు మిక్కిలి అయిన (రథ గజ తురగ పదాతి) చతురంగ సైన్యంతో వెళ్ళి; గిరి, వన, సరోవర, సరిత్, దేశంబులు= కొండలు, అడవులు, సరస్సులు, నదులు ఉండే స్థలాలు; కడచి= అతిక్రమించి (దాటి); మార్తికావత దేశంబునకు= మార్తికావత మనే దేశానికి; అరుగునంతకున్= వెళ్ళేటప్పటికి; ముందరన్= ముందుగా; సాల్వుండు; సౌంభక+ఆరూఢుండు+అయి= సౌంభకాన్ని అధిరోహించి; సముద్ర కుక్షి, దేశంబునకున్+పోయినన్= సముద్ర గర్భదేశానికి వెళ్ళగా.

తాత్పర్యం: ఆ రీతిగా లెక్కకు మిక్కిలి అయిన చతురంగ బలాలతో కొండలు, అడవులు, సరస్సులు, నదులు దాటి మార్తికావతదేశానికి వెళ్ళగా, అక్కడ సాల్వుడు ముందే సౌంభకాన్ని ఎక్కి సముద్రగర్భంలోకి వెళ్ళాడు.

విశేషం: కొన్ని ప్రతులలో మార్తికావత దేశానికి బదులు- పారశీక, వార్తికావతి, వార్తిక, ఆనర్తక- అనే పాఠాంతరాలు కనపడుతున్నాయి. అయితే, మూలంలో ఇట్లా ఉన్నది. "సరాంసి సరితశ్చైవ మార్తికావత మాసదమ్''. (వావిళ్ల ప్రతిలో మూర్తికావత దేశంబున'- అనే పాఠాంతరం ఉన్నది.)

క. ఏనును వాని పిఱుందన । మానక చని తచ్చమూసమాజముతోడన్
భూనాథ! రణము సేసితి । నానానిశితాస్త్రవర్షణవ్యాప్తముగన్. 182

ప్రతిపదార్థం: భూనాథ!= ఓరాజా!; ఏనును= నేనున్నూ; వాని పిఱుందన్+అ= వాడివెనుకనే; మానక,చని= వదలకవెళ్ళి; తత్+చమూ, సమాజము తోడన్= ఆతడి సేనా సమూహంతో; నానా, నిశిత+అస్త్ర, వర్షణ, వ్యాప్తముగన్= వాడి అయిన పెక్కు అస్త్రాలను వర్షంవలె అంతట వ్యాపించేటట్లు కురిపిస్తూ; రణము+చేసితిన్= యుద్ధం చేశాను.

తాత్పర్యం: ఓ రాజా (ఓ ధర్మరాజా)! నేను కూడ వాడివెనుకనే వెళ్ళి పెక్కువాడిఅయిన అస్త్రాలు వర్షంవలె విరివిగా కురిపిస్తూ వాడి సేనాసమూహంతో యుద్ధం చేశాను.

క. వీరు లగు సాల్వయోధుల । నారాచావళులు గప్పె నా రథముపయిన్
సారథిఁ దురంగముల పయిఁ । జారుధ్వజయష్టిపయి నసంఖ్యాతముగన్. 183

ప్రతిపదార్థం: వీరులు+అగు= పరాక్రవంతు లయిన; సాల్వయోధుల= సాల్వుని శూరులయొక్క; నారాచ+ఆవళులు= బాణ సమూహాలు; నా రథముపయిన్= నా తేరుపైన; సారథిన్, తురంగములపయిన్= రథచోదకుడిపైన, గుర్రాలపైన; చారు, ధ్వజ, యష్టిపయిన్= అందమైన జెండా కొయ్యపైన; అసంఖ్యాతముగన్= లెక్కకు మిక్కిలిగా; కప్పెన్= కప్పివేశాయి. (కనబడకుండాచేశాయి)

తాత్పర్యం: వీరాధివీరులైన సాల్వయోధులు ప్రయోగించిన బాణసముదాయం లెక్కకు మిక్కిలిగా నా రథాన్ని, సారథిని, గుర్రాలను జెండాను కన్పించకుండ దట్టంగా కప్పి వేశాయి.

వ. వాని నెల్ల నస్మదీయ గోచరంబులు గాకుండ ననేకాయుతశరంబు లేసి సాల్వసైన్యంబుతో మహాయుద్ధంబు సేసిన. 184

ప్రతిపదార్థం: వానిన్+ఎల్లన్= ఆ బాణాలన్నీ; అస్మదీయ, గోచరంబులు, కాకుండన్= నాకు విషయాలు కాకుండా (తగులకుండ); అనేక+అయుత, శరంబులు+ఏసి= పెక్కు పదివేల బాణాలు ప్రయోగించి; సాల్వు సైన్యంబుతో= సాల్వుడి సేనతో; మహాయుద్ధంబు, చేసినన్= గొప్ప యుద్ధం చేయగా.

తాత్పర్యం: ఆ బాణాలన్నీ నన్ను చేరకుండానే నేను పెక్కువేలబాణాలు వేసి సాల్వుడిసేనతో గొప్పయుద్ధం చేశాను.

మ. **అవనీనాథ! తదాహవాంతరమునం దస్మత్కరాకృష్ట శా**
ర్ఙ్గ వినిర్ముక్త నిశాతసాయకశతాగ్రచ్ఛిన్నమై దైత్య దా
నవదేహప్రకరంబు వాతవిధుతార్ణఃపూర్ణ సంఘూర్ణితా
ర్ణవకుక్షిం బడియెం గపిప్రవరసైన్యక్షిప్త శైలాకృతిన్. **185**

ప్రతిపదార్థం: అవనీ, నాథ!= ఓరాజా! (ధర్మరాజా!); తద్+ఆహవ+అంతరమునన్= ఆ యుద్ధమధ్యంలో; అస్మద్, కర+ఆకృష్ట, శార్ఙ్గ, వినిర్ముక్త, నిశాత, సాయక, శత+అగ్ర+ఛిన్నము+ఐ= నాచేతులచేత అనుసంధించబడిన శార్ఙ్గం అనే విల్లునుండి వదలబడిన వాడి అయిన వందల కొలది బాణాల కొనలచేత (ములుకుల చేత) ముక్కలు ముక్కలుగా చేయబడి; దైత్య, దానవ, దేహ, ప్రకరంబు= రాక్షసుల కళేబరాల సముదాయం; వాత, విధుత+అర్ణస్+పూర్ణ, సంఘూర్ణిత+అర్ణవ, కుక్షిన్= గాలిచేత చెదరగొట్టబడిన నీటితో నిండి తిరుగుడు పడిన సముద్రంయొక్క కడుపులో; కపిప్రవర, సైన్య, క్షిప్త, శైల+ఆకృతిన్= వానర శ్రేష్ఠుడి (సుగ్రీవుడి) సైన్యంచే విసరివేయబడిన కొండల రూపాలను సరిపోలుతూ; పడియెన్= పడింది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నాచేత ఎక్కు పెట్టబడిన శార్ఙ్గమనే నా వింటి నుండి వెలువడిన వాడి బాణసమూహాలచేత ముక్కలు ముక్కలై రాక్షసులదేహాలు, సుగ్రీవుడి సేనలచేత విసరబడిన కొండలవలె, గాలిచేత చెదరగొట్టబడిన నీటిచే తిరుగుడు పడిన సముద్రమధ్యంలో పడిపోయాయి.

విశేషం: ఈ పద్యం నన్నయ కవితా శిల్పానికి అంతర్వాహిని అయిన అక్షరరమ్యతకు ఉదాహరణమైనది. సుదీర్ఘ సమాసాలు ప్రయోగించినా నన్నయశైలి ప్రసన్నకథాకలితార్థయుక్తికి ఆకరం. దైత్యులు= దితికి జన్మించినవారు, దానవులు= దనువుకు జన్మించినవారు= రాక్షసులు.

చ. **ఘనతర దైత్య దానవ నికాయ కళేబర పాత ఘట్టనం**
దనరి యుగాంత్యకాలచలితంబునుబోలెఁ బయోధి మ్రోసె న
వ్వనధి రవంబుకంటె ననివారితమై చెలఁగెన్ మదీయ వా
హిని భట సింహనాదహయహేషిత సింధురబృంహితధ్వనుల్. **186**

ప్రతిపదార్థం: ఘనతర, దైత్య, దానవ, నికాయ, కళేబర, పాత ఘట్టనన్+తనరి= మిక్కిలి పెద్దవైన దైత్యుల యొక్కయు, దానవుల యొక్కయు (రాక్షసుల) సమూహాల శరీరాలు పడిన రాపిడిచేత అతిశయించి; యుగ+అంత్యకాల, చలితంబును+పోలెన్= ప్రళయకాలంలో కదలాడేటట్లు; పయోధి= సముద్రం; మ్రోసె= ధ్వని చేసింది; అవ్వనధి (ఆ+వనధి)= ఆ సముద్రంయొక్క; రవంబు కంటెన్= మ్రోతకంటె; మదీయ వాహినిన్= నా సేనలోని; భట, సింహనాద, హయ, హేషిత, సింధుర, బృంహిత, ధ్వనుల్= భటుల సింహనాదాలు, గుర్రాల సకిలింపులు, ఏనుగుల ఘీంకారాలు (వాటిధ్వనులు); అనివారితము+ఐ= నివారించటానికి వీలులేనివై; చెలఁగెన్= శబ్దించాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మిక్కిలి పెద్దవైన రాక్షసుల శరీరాలు సముద్రంలో కుప్పలుతెప్పలుగా కూలుతున్నప్పుడు, సముద్రం ప్రళయకాలంలో ఘూర్ణిల్లుతున్నట్లు పెనురొద చేసింది. నా సైన్యాలలో చెలరేగిన వీరభటుల సింహనాదాలు, గుర్రాల సకిలింపులు, ఏనుగుల ఘీంకారాలు- ఆ సముద్రఘోషనుకూడ మించిపోయాయి.

విశేషం: వీరభటులు ఉత్సాహంతో చేసేనాదం సింహనాదం. అది గర్జనవంటిది. సంస్కృత భాషలో గుర్రాల సకిలింపునకు హేష అనిన్నీ, ఏనుగుల ఘీంకారానికి బృంహితం అనిన్నీ ప్రత్యేక పరిభాష. పద్యం మొదటి సగంలో ఉపమాలంకారం. రెండో సగంలో అతిశయోక్తి.

వ. అట్టి మదీయ సేనోత్సాహంబును నిజసేనాక్షీణతయుం జూచి సహింపక సాల్వుండు వెండియు సౌంభకారూఢుం డయి నాతో మాయాయుద్ధంబు సేయ సమకట్టి. 187

ప్రతిపదార్థం: అట్టి; మదీయ, సేనా+ఉత్సాహంబును= నా భటుల యొక్క ఉత్సాహాన్ని; (ఉత్సాహ మంటే గొప్ప పనులు చేయటంలో స్థిర సంకల్పంతో కూడిన అవిరళ ప్రయత్నం); నిజ, సేనా, క్షీణతయున్+చూచి= తన సేన తగ్గిపోవటాన్ని చూచి; సహింపక= తట్టుకోలేక; సాల్వుండు; వెండియు= మరల; సౌంభక+ఆరూఢుండు+అయి= సౌంభకాన్ని ఎక్కినవాడయి; నాతోన్; మాయాయుద్ధంబు= మాయతో కూడిన యుద్ధం; చేయ, సమకట్టి= చేయటానికి పూనుకొని.

తాత్పర్యం: నా సైనికులలో పెల్లుబికిన ఉత్సాహాన్ని తన సేన బలహీనపడటాన్ని గ్రహించిన సాల్వుడు సహింపలేక తిరిగి సౌంభకం ఎక్కి నాతో మాయాయుద్ధం చేయటానికి పూనుకొన్నాడు.

సీ. పరశు పాశాంకుశ కరవాల శూల ము । ద్గరములు నా మీఁదఁ దెరలఁ గురిసె;
నేనును గడఁగి యద్దానవు శస్త్రముల్ । వాయంగఁ జేసితి; మాయఁ జేసి
వెఱవక సాల్వుండు వెండియు నామీఁదఁ । బరుషశిలావృష్టిఁ గురిసె; వరుస
నమరఁ దమః ప్రకాశములతో దుర్దిన । సుదిన శీతోష్ణముల్ గదియఁ జేసి

ఆ. దితిసుతాధముండు శతసూర్య శతచంద్ర । శతసహస్ర వహ్నితతులు వెలుఁగ
గగనతలము సేసెఁ బగలిది రేయిది । యని యెఱుంగ నయితి మనములోన. 188

ప్రతిపదార్థం: నామీఁదన్+తెరలన్= నాపై పడేటట్లు; పరశు, పాశ+అంకుశ, కరవాల, శూల, ముద్గరములు= గండ్ర గొడ్డళ్లు, ఉరిత్రాళ్లు, ఏనుగుకోలలు, కత్తులు, బల్లెము, (మూడు మొనలవి), ఇనుపగుదియలు; కురిసెన్= వర్షించాడు; నేనును; కడఁగి= పూని, ఆ+దానవు, శస్త్రముల్= ఆ రాక్షసుడి ఆయుధాలు; పాయంగన్+చేసితిన్= వ్యర్థం చేశాను; మాయన్+చేసి= మాయచేత; సాల్వుండు= సాల్వుడు; వెఱవక= భయపడక; వెండియు= మరల; నామీఁదన్; పరుష, శిలా, వృష్టిన్+కురిసెన్= కఠినమైన రాలవాన కురియించాడు; వరుసన్= క్రమంగా; అమరన్= ఏర్పడ; తమస్+ప్రకాశములతోన్= చీకటి వెలుతురులతో; దుర్దిన, సుదిన, శీత+ఉష్ణముల్= సూర్యరశ్మి కనిపించనట్టి, కనిపించే దినం నాటి చలి, వేడి; కదియన్+చేసి= ఏర్పడేటట్లు చేసి; దితి, సుత+అధముండు= అల్పుడైన దితికొడుకు (రాక్షసుడు); శతసూర్య, శతచంద్ర, శతసహస్ర, వహ్నితతులు వెలుఁగన్= వంద సూర్యులు, వంద చంద్రులు, లక్ష అగ్నిహోత్రుల సమూహాలు వెలుగొందగా; గగనతలము= ఆకాశాన్ని; చేసెన్= చేశాడు; మనములోనన్= మనస్సులో; పగలు+ఇది= ఇది పగలు; రేయి+ఇది= ఇది రాత్రి; అని; ఎఱుంగన్+అయితిన్= తెలిసికొనలేకపోయాను.

తాత్పర్యం: నీచ రాక్షసుడైన సాల్వుడు నామీద గండ్రగొడ్డళ్ళు, ఉరితాళ్ళు, అంకుశాలు, కత్తులు, బల్లెములు, ఇనుపగుదియలు వర్షించాడు. నేను వాటిని అన్నింటిని వ్యర్థం చేశాను. అతడు మరల మాయకు ఉపక్రమించి నామీద రాళ్ళవర్షం కురిపించాడు. చీకట్లతో, చలితో మేఘాలు క్రమ్మిన రోజులను, వెలుగుతో, వేడితో ప్రకాశించే రోజులను కల్పించాడు. ఆకాశంలో నూర్గురు సూర్యులు, నూర్గురు చంద్రులు, లక్ష అగ్నిహోత్రులు వెలిగేటట్లు చేసి, ఇది పగలు, ఇది రాత్రి అని నేను తెలిసికొనటానికి వీలులేకుండ చేశాడు.

విశేషం: 'మాయన్, చేసి'= నశింప చేసి అని కూడ అర్థం చెప్పవచ్చును. అప్పు డది 'పాయఁజేసి'తో అన్వయిస్తుంది. మేఘాచ్ఛన్నమైన దినం దుర్దినం. పై పద్యం యొక్క ఐదవ పంక్తిలో 'శతసహస్ర విష్ణుతతులు వెలుఁగ' అనే ఈ పాఠం ఆనందాశ్రమ గ్రంథమాల ప్రతిలో ఉన్నది.

క. **మనుజేంద్ర! సర్వ మాయా । పనోదనం బయిన యగ్నిబాణంబున న**
ద్దనుజ వినిర్మిత మాయా । వినివర్తనఁ జేసితిని సవిస్మయమతినై. 189

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్ర!= ఓరాజా! (ధర్మరాజా!); సర్వ మాయా+అపనోదనంబు+అయిన= సమస్తమైన మాయలు తొలగించే; అగ్ని, బాణంబునన్= ఆగ్నేయాస్త్రంచేత; స, విస్మయ మతిని+ఐ= ఆశ్చర్యంతో కూడిన మతి కలవాడినై; ఆ+దనుజ, వినిర్మిత, మాయా, వినివర్తనన్+చేసితిని= ఆ రాక్షసుడిచేత నిర్మించబడిన మాయను పూర్తిగా మరల్పజేశాను.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! సమస్తమైన మాయలను పరిహరించే ఆగ్నేయాస్త్రంచేత ఆ రాక్షసుడు కల్పించిన మాయను తొలగించాను. ఇది నాకే ఆశ్చర్యకరమైంది.

వ. **అట్టి యవసరంబున ద్వారవతినుండి యాహుకప్రేషితుండయి యొక్కరుం డతిత్వరితగతిం బఱతెంచి 'సాల్వుచేత నక్కడ వసుదేవుండు పట్టువడియె నీ వెవ్వనితోడం గయ్యంబు సేసెదు? క్రమ్మఱి చని పురంబు రక్షించుకొను' మనిన విని యదరిపడి 'మహాబలపరాక్రములైన బలదేవాదులు రక్షించుకొని యుండ వసుదేవుఁ డేల పట్టువడు? నిది పోల' దని సంశయించుచు విమనస్కుండ నయి యుండునంత. 190**

ప్రతిపదార్థం: అట్టి+అవసరంబున= ఆ సమయంలో; ద్వారవతి నుండి= ద్వారకనుంచి; ఆహుక, ప్రేషితుండు+అయి= ఆహుకుడిచేత పంపబడినవాడై; ఒక్కరుండు; అతి త్వరితగతిన్+పఱతెంచి= మిక్కిలి వేగంగా వచ్చి; సాల్వుచేతన్= సాల్వుడిచేత; అక్కడ= ఆ ద్వారకలో; వసుదేవుండు; పట్టువడియెన్; నీవు+ఎవ్వనితోడన్= నీవు ఎవరితో; కయ్యంబు= యుద్ధం; చేసెదు; క్రమ్మఱి చని= తిరిగిపోయి; పురంబు, రక్షించుకొనుము+అనిన= ద్వారకను కాపాడుకో అని అంటే; విని; అదరిపడి; మహా, బల, పరాక్రములు+ఐన= గొప్ప బలశౌర్యాలు కల; బలదేవ+ఆదులు= బలరాముడు మున్నగు వారు; రక్షించుకొనిఉండన్; వసుదేవుఁడు+ఏల, పట్టువడున్; ఇది; పోలదు+అని= సరిపడదని; సంశయించుచు= సందేహం పొందుతూ; విమనస్కుండను+అయి= చెదరిన మనస్సు కలవాడినయి; ఉండునంత.

తాత్పర్యం: ఆ సమయంలో ఒక వార్తాహరుడు ఆహుకుడిచేత పంపబడినవాడై ద్వారకనుండి వచ్చాడు. ద్వారకలో వసుదేవుడు సాల్వుడిచేతికి చిక్కినాడనిన్నీ, నీవు వెళ్ళి ద్వారకాపురిని రక్షించుకొనాలనిన్నీ అతడు చెప్పాడు. మహాబలవంతులైన బలరామాదులు ఉండగా వసుదేవుడు ఎట్లా సాల్వుడిచేతికి చిక్కాడు? ఇది సరిపోని విషయం' అని నేను నా మనస్సులో చింతిస్తూ ఉండగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **పుణ్యకర్మంబులు వొలిసిన నుర్వికిఁ । బ్రీతి నేతెంచు యయాతి వోలె**
భూషణదీప్తులు వొలియంగ వివృత కే । శాంబరుం డయి సౌంభకంబువలనఁ
బఱతెంచు వసుదేవుఁ బాప నిశాచర । బల పీడ్యమాను దవ్వులను కాంచి
యత్యంత మోహాశోకాంధుండ నయిన నా । హస్తంబు వలన విస్రస్త మయ్యె

ఆ. **శార్‌ఙ్గ మప్రియావసన్నదేహుండనై । యుడిగి రథముమీఁదఁ బడితి నేను;**
దానిఁ జూచి భయము దగిలి మత్సైన్యంబు । దల్లడిల్లి యులిసెఁ బెల్లు రేఁగి. **191**

ప్రతిపదార్థం: పుణ్య, కర్మంబులు, పొలిసినన్= చేసిన పుణ్యఫలాలు క్షీణించగా; ఉర్వికిన్= భూలోకానికి (స్వర్గం వదలి); ప్రీతిన్= మక్కువతో; ఏతెంచు= వచ్చు; యయాతి, పోలె= యయాతివలె; భూషణదీప్తులు= ఆభరణ కాంతులు; పొలియంగన్= తగ్గిపోవగా; వివృత, కేశ+అంబరుండు+అయి= విడివడిన తలజుట్టు, బట్టలు కలవాడయి; సౌంభకంబువలనన్= సౌంభకంనుండి; పఱతెంచు= వచ్చే; వసుదేవున్; పాప, నిశాచర, బలపీడ్యమానున్= పాపులైన రాక్షసులచేత పీడించబడుతున్నవాడిని; దవ్వులన్+అ, కాంచి= దూరం నుండే చూచి; అత్యంత, మోహ, శోక+అంధుండను+అయిన= మిక్కుటమైన భ్రాంతిచేత, దుఃఖంచేత గుడ్డివాడనుకాగా; నా, హస్తంబువలనన్= నా చేతినుండి; శార్‌ఙ్గము= శార్‌ఙ్గమనే పేరుకల విల్లు; విస్రస్తము+అయ్యెన్= జారిపడిపోయింది. అప్రియ+అవసన్న దేహుండను+ఐ= దుఃఖంచేత వశం తప్పిన దేహం కలవాడినై; ఉడిగి= విరమించి; ఏను; రథము మీఁదన్= తేరిపై; పడితిన్= కూలబడ్డాను; దానిన్+చూచి= దాన్ని (ఆ సంఘటనను) చూచి; భయము, తగిలి= భయపడి; మత్, సైన్యంబు= నాసేన; తల్లడిల్లి= ఎంతో బాధనొంది; పెల్లురేఁగి= మిక్కిలి ఉద్రేకపడి; ఉలిసెన్= ఆక్రోశించింది (దుఃఖంతో అరిచింది).

తాత్పర్యం: చేసినట్టి పుణ్యం క్షీణించిన పిదప స్వర్గలోకంనుండి భూమికి దిగివచ్చే యయాతివలె, ఆభరణకాంతులు తగ్గిపోవగా, చెదరిన తల జుట్టు, బట్టలతో సౌంభకంనుండి వసుదేవుడు రాక్షసులచేత పీడించబడుతూ అవతరించటం నాకు కనిపించింది. దాన్ని చూచి దుఃఖంతో మోహాంధుడి నయిన నాచేతినుండి శార్‌ఙ్గమనే ధనుస్సు జారి క్రిందపడింది. నేను రథంపై కూలబడిపోయాను. ఆ అవస్థను చూచి నాసేన ఎంతో బాధపడి అతిశయించిన ఉద్రేకంతో ఆక్రోశించింది.

వ. **అంత నెంతయుం బ్రొద్దునకుఁ దెలిసి సాల్వు సౌంభకంబున వసుదేవుం గానక దాని మాయగా నెఱింగి, పదంపడి మాయావి యయిన సాల్వుం జూచి వానిపయి నలిగి యే నేసిన నయ్యసురయు సౌంభకంబు నదృశ్యం బగుటయు.** **192**

ప్రతిపదార్థం: అంతన్; ఎంతయున్+ప్రొద్దునకున్= చాలాసేపటికి; తెలిసి= తెలివొంది; సాల్వు, సౌంభకంబున= సాల్వుడి సౌంభకంలో; వసుదేవున్, కానక= వసుదేవుడిని చూడక; దానిన్= ఆ సన్నివేశాన్ని; మాయగాన్= కల్పితమైనదాన్నిగా; ఎఱింగి= తెలిసికొని; పదంపడి= పిమ్మట; మాయావి+అయిన= మాయలమారి అయిన; సాల్వున్+చూచి= సాల్వుడిని చూచి; వాని పయిన్+అలిగి= వాడిమీద ఆగ్రహం చెంది; ఏన్= నేను; ఏసినన్= బాణప్రయోగం చేయగా; ఆ+అసురయు= ఆ రాక్షసుడున్నూ; సౌంభకంబున్= సౌంభకమున్నూ; అదృశ్యంబు+అగుటయు= కనిపించక పోవటమున్నూ.

తాత్పర్యం: అంత చాలాసేపటికి నాకు తెలివి వచ్చింది. చూశానుకదా సౌంభకంలో వసుదేవుడు కనిపించలేదు. ఇక అదంతయు రాక్షస కల్పితమాయ అని తెలిసికొన్నాను. పిదప మాయావి అయిన సాల్వుడిపై బాణంవేయగా ఆ రాక్షసుడున్నూ, సౌంభకమున్నూ అదృశ్యం కావటం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అసుర శబ్దం వైకల్పికంగా స్త్రీసమం. అసుర-అసురుడు.

క. అసురుల యాక్రోశధ్వను । లెసఁగెం బదిదిశల నంత నేనును దద్రా
క్షసుల గతాసులఁ జేసితిఁ । బ్రసభంబున శబ్దభేది బాణప్రతతిన్. 193

ప్రతిపదార్థం: పది, దిశలన్= పది దిక్కులలో; అసురుల= రాక్షసుల; ఆక్రోశధ్వనులు+ఎసఁగెన్= హాహాకార విలాపనినాదాలు విస్తరించాయి; అంతన్= అంతట; ఏనును= నేనును; తద్, రాక్షసులన్= ఆ రక్కసులను; ప్రసభంబునన్= వేగంతో; శబ్ద, భేది, బాణ, ప్రతతిన్=శబ్దాన్ని బట్టి భేదించే బాణ సమూహాలతో; గత+అసులన్+చేసితిన్= పోయిన ప్రాణాలు కలవారినిగా చేశాను (సంహరించాను).

తాత్పర్యం: రాక్షసుల హాహాకారాలు దశదిశల విస్తరించాయి. అంతట నేను శబ్దభేదిబాణాలు ప్రయోగించి ఆ రాక్షసులను సంహరించాను.

విశేషం: శబ్దభేది బాణ ప్రయోగం ప్రాచీన భారతీయ సాహిత్యంలోని ఒక మనోహరకళ. లక్ష్యం కనిపించకపోయినప్పటికి కేవలం శబ్దాన్నిబట్టి లక్ష్యాన్ని తాకేటట్లుగా బాణాన్ని ప్రయోగించే నేర్పుకు శబ్దభేదివిద్య అని పేరు.

వ. అంత సాల్వుండును దన సౌంభకంబుఁ బ్రాగ్జ్యోతిషంబుఁ జేసి తానును దానవుండయి పర్వతవర్షంబు నా
పయిం గురిసిన. 194

ప్రతిపదార్థం: అంత; సాల్వుండును; తన సౌంభకంబున్; ప్రాగ్జ్యోతిషంబున్+చేసి= ప్రాగ్జ్యోతిషపురంగా మార్చి; తానును; దానవుండు+అయి= రాక్షసుడుగా మారి; నాపయిన్= నామీద; పర్వత, వర్షంబున్= కొండలవాన; కురిసినన్= కురిపించగా.

తాత్పర్యం: అంత సాల్వుడు తన సౌంభకాన్ని ప్రాగ్జ్యోతిషపురంగా చేశాడు. తాను దానవుడై నామీద పర్వతాల వాన కురిపించాడు.

ఆ. పరుష విషమ భూరి పాషాణ భీషణ । గిరులు వచ్చి నన్నుఁ దెరలఁ గప్ప
వజ్రబాణ మేసి వాని నన్నింటిని । బాచియున్న నన్నుఁ జూచి యపుడు. 195

ప్రతిపదార్థం: పరుష, విషమ, భూరి, పాషాణ భీషణ గిరులు= కఠినాలైన వంకర టింకరగా, ఎగుడు దిగుడుగా ఉన్న మిక్కిలి పెద్దవైన బండలతో, భయంకరమైన కొండలు; వచ్చి; నన్నున్+తెరలన్+కప్పన్= నామీదపడి కలత చెందేటట్లు మెండుగా కప్పగా; వజ్ర, బాణము+ఏసి= వజ్రబాణం ప్రయోగించి (కఠినశిలలను భేదించేది వజ్రం); వానిన్+అన్నింటిని= ఆ కొండలను అన్నింటిని; పాచి, ఉన్న= తొలగించి ఉండగా; నన్నున్+చూచి= నన్ను చూచి; అపుడు.

తాత్పర్యం: ఆ రాక్షసుడు నాపై పెనుగొండలు తండోపతండంగా విసరగా, నేను పిడుగుటమ్ముతో వాటిని తొలగించిఉండగా నన్ను చూచి అపుడు.

క. దారుకుఁ డిట్లనియె 'మహా । వీరు నుపేక్షింపఁదగునె? వీనిని మాయా
ప్రారంభు నుపేక్షింప ర । పార పరాక్రములు పోరఁ బ్రాకృతు నైనన్'. 196

ప్రతిపదార్థం: దారుకుఁడు+ఇట్లు+అనియె; మాయా(ప్రారంభున్= మాయలమారితనం మొదలుపెట్టేవాడిని; మహావీరున్= దండిమగని; వీనిని; ఉపేక్షింపన్+తగునె?= నిర్లక్ష్యంగా వదలవచ్చునా?; అపార పరాక్రములు= మహావీరులు; ప్రాకృతున్+ఐనన్= అల్పుడే ఐనను; పోరన్- యుద్ధంలో; ఉపేక్షింపరు= వదలిపెట్టరు.

తాత్పర్యం: 'యుద్ధనీతి తెలిసిన మహావీరులు పోరాటంలో అల్పుడైన శత్రువును కూడ వదలిపెట్టరు కదా! వీడు మాయలమారి, పరాక్రమశాలి, వీడిని నిర్లక్ష్యంగా వదలిపెట్టదగునా?' అని సారథి అయిన దారుకుడు శ్రీకృష్ణుడికి హితోపదేశం చేశాడు.

విశేషం: రథికుడికి హితోపదేశం చేసే బాధ్యత సారథిది. ఆనాటి రథికుడికి సారథి సేవకమాత్రుడు గాడు, సచివుడు, మిత్రుడు, రాజుగారి మంత్రివర్గంలో సభ్యుడు. అందుచేత శ్రీకృష్ణుడి అంతటివాడికి సయితం సారథి అయిన దారుకుడు చొరవతో సముచిత సూచనలు చేయగలిగాడు. దీనిని బట్టి ఆ కాలంలో 'సారథి' పదవికి ఉండే ప్రాముఖ్యం అరయదగింది.

వ. అనిన వాని పలుకులు విని యలిగి యనలజ్వాలాకరాళంబయి ప్రతికూల రాక్షస యక్షగంధర్వ దైత్యదానవ భస్మసాత్కరణదారుణం బయిన చక్రంబు నభిమంత్రించి సౌంభకంబు పయి వైచిన నది యుగాంతకాల పరివేషభీషణంబయిన రవిమండలంబునుంబోలె గగనంబునం బఱచి సౌంభకమధ్యంబునం బడిన. 197

ప్రతిపదార్థం: అనిన; వాని పలుకులు= ఆ దారుకుని మాటలు; విని= ఆలకించి; అలిగి= రాక్షసుడిపై కోపించి; అనల, జ్వాలా, కరాళంబు+అయి= నిప్పుమంటలచేత భయంకరమైన; ప్రతికూల, రాక్షస, యక్ష, గంధర్వ, దైత్య, దానవ, భస్మసాత్కరణ, దారుణంబు+అయిన, చక్రంబున్= శత్రు పక్షం వహించిన రాక్షసులను, యక్షులను, గంధర్వులను, దైత్యులను, దానవులను మండించి బుగ్గి చేయటంలో భయంకరమైన చక్రాన్ని; అభిమంత్రించి= మంత్రాలను శాస్త్రీయంగా ఉచ్చరించి; సౌంభకంబుపై; వైచినన్= విసరగా; అది= ఆ చక్రం; యుగ+అంత, కాల, పరివేష, భీషణంబు+అయిన= ప్రళయ సమయంలో బింబం చుట్టూ కంకణం వలె గుండ్రంగా ఏర్పడే గొప్ప వెలుగుల చేత భయంకరమైన; రవి, మండలంబునున్+పోలె= సూర్యమండలంవలె; గగనంబునన్+పఱచి= ఆకసంలో వేగంగా వెళ్ళి; సౌంభక మధ్యంబునన్+పడినన్= సౌంభకమనే పట్టణం యొక్క మధ్యలో పడగా.

తాత్పర్యం: ఆ దారుకుడి మాటలు విని, కోపించి మంటలచే భయంకరమై, ప్రతికూలురైన రాక్షసులను, గంధర్వులను, యక్షులను, దైత్యులను, దానవులను మండించి బుగ్గిచేయటంలో దారుణమైన చక్రాన్ని మంత్రించి సౌంభకంమీదికి వేయగా ప్రళయసమయంలో ఏర్పడే గుండ్రని పరివేషంతో వెలుగులు విరజిమ్ముతూ మిగుల భీషణమైన సూర్యమండలంవలె ఆకాశంలో వెళ్ళి సౌంభకం మధ్య పడింది.

చ. తడయక ఘోరదర్శన సుదర్శన పావకుచే దహింపఁగాఁ
బడి పరమేశ్వరోగ్రశరపావకదగ్ధ పురత్రయాభమై
యెడరి ధరిత్రి మీఁదఁ బడియెం జెడి సౌంభక; మంత సాల్వుఁడుం
బడియె మదీయచక్రపటుపాతరయంబున రెండువ్రయ్యలై.' 198

ప్రతిపదార్థం: తడయక= ఆలస్యం కాకుండ; ఘోర, దర్శన, సుదర్శన, పావకుచేన్= భయంకరంగా కనిపించిన 'సుదర్శన' మనే పేరున్న చక్రమనే అగ్నిహోత్రుడిచేత; దహింపఁగాన్+పడి= తగులబెట్టబడి; పరమ+ఈశ్వర+ఉగ్ర, శర, పావక, దగ్ధ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పురత్రయ, ఆభము+ఐ= పరమశివుడి యొక్క భీకరమైన బాణమనే అగ్నిహోత్రుడిచేత కాల్చబడిన త్రిపురాలతో సమానమై; చెడి= పాడైపోయి; సౌంభకము; ఎడరి= భగ్నమయి; ధరిత్రిమీఁదన్+పడియెన్= భూమిపై పడిపోయింది; అంత; సాల్వుఁడున్; మదీయ, చక్ర, పటు, పాత, రయంబునన్= నా చక్రంయొక్క తీవ్రమైన తాకుడు వేగానికి; రెండు, వ్రయ్యలు+ఐ= రెండు ముక్కలై; పడియెన్= పడ్డాడు.

తాత్పర్యం: అంత సౌంభకం ఘోరమైన సుదర్శన చక్రాగ్నిచేత కాల్చబడి, పరమేశ్వరుడి బాణాగ్నిచేత దగ్ధం చేయబడిన త్రిపురాలవలె పాడై భూమిపై పడింది. సాల్వుడు సైతం తీవ్రమైన నా చక్రవేగానికి రెండు ముక్కలై క్రింద పడ్డాడు.'

విశేషం: మహాభారతంలోని సౌంభకవృత్తాంతం ఒక అద్భుతకల్పన. ఇరువదవ శతాబ్దిలో విజ్ఞానశాస్త్రం అత్యద్భుతంగా మానవమేధకు క్రొంగ్రొత్త ఎల్లలు ప్రసాదించింది. మేధావులైన రచయితలు రాబోయే యుగయుగాంతరాల్లో విజ్ఞానవేత్తలు కనిపెట్టబోయే వింతలను గురించి ఊహించి 'వైజ్ఞానిక కల్పనా కథలను' (ఊహాప్రేరితమైన) నవలలను సృష్టించారు. సౌంభకం రోదసీ యానం చేయగల ఒక కృత్రిమగ్రహం వంటిదని తోస్తున్నది. ఇది విజ్ఞులు ఇంకను పరిశోధించదగిన అంశం.

పాండవులు ద్వైతవనంబునకు వచ్చి యుండుట (సం. 3-23-42)

వ. అని యిట్లు సాల్వుం దన చంపిన విధంబు సెప్పి, చక్రధరుండు పాండవుల వీడ్కొని, సుభద్రాభిమన్యులం గాంచనరథం బెక్కించుకొని తోడ్కొని ద్వారవతి కరిగె; ధృష్టద్యుమ్నుండును బ్రతివింధ్యాదులైన ద్రౌపదేయులం దోడ్కొని ద్రుపదుపురంబునకుం జనియె; నిట పాండవులును రథంబు లెక్కి యాయుధంబులు ధరియించి యింద్రసేనాది మూలభృత్యు లిరువదుండ్రు ముందట రా ననేక సహస్ర బ్రాహ్మణ వరులతో ద్వైతవనంబున కరిగి; రంత ధర్మరాజు తమ్ముల కిట్లనియె. 199

ప్రతిపదార్థం: అని; ఇట్లు; సాల్వున్= సాల్వుడిని; తన, చంపిన, విధంబు= తాను చంపిన రీతి; చెప్పి; చక్రధరుండు= చక్రధారి అయిన శ్రీకృష్ణుడు; పాండవుల వీడ్కొని= పాండవులతో తాను వెళ్ళుతున్నట్లు చెప్పి; సుభద్రా+అభిమన్యులన్= సుభద్రను, అభిమన్యుడిని; కాంచన, రథంబు+ఎక్కించుకొని= బంగరు తేరిపై కెక్కించుకొని; తోడ్కొని= తన వెంట పెట్టుకొని; ద్వారవతికి+అరిగె= ద్వారకకు వెళ్ళాడు; ధృష్టద్యుమ్నుండును; ప్రతి వింధ్యాదులు+ఐన= ప్రతివింధ్యుడు మున్నగు వారైన; ద్రౌపదేయులన్= ద్రౌపదికొడుకులను; తోడ్కొని= తన వెంట బెట్టుకొని; ద్రుపదు, పురంబునకున్= ద్రుపదుడి నగరానికి; చనియెన్= వెళ్ళాడు; ఇట; పాండవులును; రథంబులు+ఎక్కి= తేరులు అధిరోహించి; ఆయుధంబులు; ధరియించి; ఇంద్రసేన+ఆది, మూలభృత్యులు= ఇంద్రసేనుడు మున్నగు ప్రధాన సేవకులు; ఇరువదుండ్రు= ఇరవైమంది; ముందట, రాన్= ముందునడిచి దారి చూపించగా; అనేక, సహస్ర, బ్రాహ్మణ, వరులతో= పెక్కువేలమంది బ్రాహ్మణ శ్రేష్ఠులతో; ద్వైత, వనంబునకు= ద్వైతం అనే పేరున్న అడవికి; అరిగిరి= వెళ్ళారు; అంతన్= అటు పిమ్మట; ధర్మరాజు= ధర్మపుత్రుడు; తమ్ములకు+ఇట్లు+అనియెన్= సోదరులతో ఇట్లా పలికాడు.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు తాను సాల్వుడిని చంపిన కథ ధర్మరాజుకు చెప్పాడు. తర్వాత అతడు పాండవులను వీడ్కొని తన చెల్లెలు సుభద్రను, మేనల్లుడైన అభిమన్యుడిని తన బంగరురథంపై కెక్కించికొని ద్వారకకు వెళ్ళాడు. ధృష్టద్యుమ్నుడు తన మేనల్లుండ్రు, ద్రౌపది కొడుకులు అయిన ప్రతివింధ్యుడు మున్నగువారిని తనతోపాటు ద్రుపద

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నగరానికి తోడ్కొని పోయాడు. పాండవులు తమ ముఖ్య సేవకులైన ఇంద్రసేనాది భటులు ఇరవైమందితో వేలకొలది బ్రాహ్మణులతో ద్వైతవనానికి వెళ్ళారు. అప్పుడు ధర్మరాజు తమ్ముళ్ళతో ఇట్లా అన్నాడు.

మధ్యాక్కర.

'ఇది మహోగ్రాటవి, సింహశరభోరగేంద్ర శార్దూల
మద గజాకీర్ణంబు, దీనిలోన నేమఱకుండ వలయు,
నదియునుంగాక పరప్రయోగమాయలు గల, వెఱిఁగి
మది నుండునది' యన్న నన్న కిట్లను మఘవనందనుఁడు. 200

ప్రతిపదార్థం: ఇది; మహా+ఉగ్ర+అటవి= మిక్కిలి భీకరమైన అడవి; సింహ, శరభ+ఉరగ+ఇంద్ర, శార్దూల, మదగజ+ఆకీర్ణంబు= సింహాలతో, శరభాలతో, గొప్ప పాములతో, పెద్దపులులతో, మదపుటేనుగులతో నిండినట్టిది; దీనిలోనన్= ఈ అడవిలో; ఏమఱక+ఉండవలయున్= ఏమరుపాటు లేకుండ జాగరూకతతో నివసించవలసి ఉన్నది; అదియునున్+కాక= అంత మాత్రమే కాక; పర, ప్రయోగ, మాయలు= శత్రువులు పన్నే మాయలు; కలవు; మదిన్= మనస్సులో; ఎఱిఁగి= తెలిసికొని; ఉండునది= ఉండాలి; అన్నన్= అని చెప్పగా; అన్నకు= అగ్రజుడైన ధర్మరాజుకు; మఘవ నందనుఁడు= దేవేంద్రసుతుడైన అర్జునుడు; ఇట్లు= ఈ రీతిగా; అనున్= అంటున్నాడు.

తాత్పర్యం: 'ఇది మిక్కిలి వెఱపుగొలిపే అడవి. ఇందులో సింహాలు, శరభాలు, గొప్పపాములు, పెద్దపులులు, మదించిన ఏనుగులు ఉన్నాయి. ఇందులో జాగ్రత్తగా మెలగవలసి ఉన్నది. అంతేకాక, శత్రువులు మాయలు పన్నవచ్చును. అన్నిటిని మనస్సులో తెలిసికొని మనం మసలుకొనవలసి ఉన్నది' అని పలికిన ధర్మరాజుతో అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.134 విశేషాంశం చూడండి.

వ. 'బ్రహ్మవిదులును దపోవృద్ధులైన బ్రాహ్మణులును నఖిలలోకద్వారంబులనప్రతిహతులైన నారదద్వైపాయనాది మునివరులును నీచేత నుపాసితులయి నీ కుశలంబ కోరుచుండుదురు; భవత్ప్రతాపం బెల్లవారిని రక్షించు నివ్వనంబు సకలకాలకుసుమ ఫలభరిత వనస్పతిశాఖాశిఖారూఢమయూరకీరకోకిలాలాప మధురంబును, బక బలాక కోక కారండవ సారస రమ్యమధుకర సౌమ్య సరోవర సంకులంబును, విమలశీతల జల ప్రవాహ నదీశోభితంబును, మహర్షి గణ సేవితంబునునై యొప్పుచున్నయది; యిందుండుదమని లలితలతావితానాది రమణీయంబులయిన వృక్షమూలంబుల నేవురు వేఱువేఱ నివాసంబులు సేసి నియతాత్ములయి యిష్టంబున దేవ పితృ కార్యంబులు సేయుచుందమ్ముఁజూడవచ్చిన మహామునులకు, బ్రాహ్మణులకు మనఃప్రియంబులయిన యాహారంబులు వెట్టుచు ద్వైతవనంబున నుండునంత. 201

ప్రతిపదార్థం: బ్రహ్మవిదులును= బ్రహ్మజ్ఞానం తెలిసినవారున్నూ; తపస్+వృద్ధులు+ఐన= తపస్సులో ముసలివారైన; బ్రాహ్మణులునున్= విప్రులున్నూ; అఖిల, లోక, ద్వారంబులన్= అన్నిలోకాల గడపల దగ్గర; అప్రతిహతులు+ఐన= అడ్డులేనట్టి; నారద, ద్వైపాయన+ఆది, మునివరులును= నారదుడు, వ్యాసుడు మొదలైన ఋషిశ్రేష్ఠులున్నూ; నీచేతన్+ఉపాసితులు+అయి= నీచేత పూజించబడినవారై; నీ, కుశలంబు+అ= నీక్షేమాన్నే; కోరుచుండుదురు= అభిలషిస్తుంటారు; భవత్, ప్రతాపంబు= నీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యొక్కతేజం; ఎల్లవారిని= అందరిని; రక్షించున్= కాపాడుతుంది; ఈ+వనంబు= ఈ అడవి; సకల, కాల, కుసుమ, ఫల, భరిత, వనస్పతి, శాఖా, శిఖా+ఆరూఢ, మయూర, కీర, కోకిల+ఆలాప, మధురంబును= అన్ని ఋతువులకు సంబంధించిన పువ్వులతో, పండ్లతో, కూడిన చెట్ల కొమ్మల చివర కెక్కిన నెమళ్ల, చిలుకల, కోకిలల కూతలచేత మనోహరమైనట్టిదిన్నీ; బక, బలాక, కోక, కారండవ, సారస, రమ్య, మధుకర, సౌమ్య, సరోవర, సంకులంబును= కొంగలు, కొక్కెరలు, చక్రవాకాలు, కన్నెలేడి పిట్టలు, బెగ్గురు పిట్టలు, అందమైన తుమ్మెదలు మున్నగు వాటిచే అందగించిఉండే నిర్మలమైన సరస్సులచేత దట్టమైనట్టిదియు; విమల, శీతల, జల, ప్రవాహ, నదీ, శోభితంబును= స్వచ్ఛమైన, చల్లనైన నీటిపొరుదల కల నదులచేత సొంపారునట్టిదిన్నీ; మహర్షి, గణ, సేవితంబును= గొప్ప మునుల గుంపులచేత సేవించబడుచుండునట్టిదిన్నీ; ఐ; ఒప్పుచున్న+అది= విలసిల్లుతున్నది; ఇందు+ఉండుదము+అని= ఇచట నివసిద్దామని; లలిత, లతా, వితాన+ఆది, రమణీయంబులు+ అయిన = సుకుమారములైన తీగల గుంపులు మొదలగువాటిచేత సుందరాలైన; వృక్ష, మూలంబులన్= చెట్ల మొదళ్ళలో; ఏవురు= అయిదుగురు; (పంచపాండవులు); వేఱు, వేఱు+అ= ఎవరికి వారు వేరుగా; నివాసంబులు+చేసి= నివసించుచోట్లను ఏర్పరచుకొని; నియత+ఆత్ములు+అయి= నియమంతో కూడిన ఆత్మలు కలవారై, అంటే నిగ్రహం సాధించినవారై; ఇష్టంబునన్= తమ మనస్సుకు నచ్చినట్లు (ఆసక్తితో); దేవ, పితృ, కార్యంబులు, చేయుచున్= దేవకార్యం అంటే పూజలు, పితృకార్యం అంటే తర్పణాలు చేస్తూ; తమ్మున్+చూడవచ్చిన= తమను చూడటానికి వచ్చిన: మహామునులకు= గొప్ప ఋషులకు; బ్రాహ్మణులకు= విప్రులకు; మనస్+ప్రియంబులు+అయిన= మనస్సుకు ప్రీతికరములైన; ఆహారంబులు= భోజనాలు; పెట్టుచు; ద్వైత, వనంబునన్= ద్వైతమనే పేరుకల అడవిలో; ఉండు+అంత= ఉన్నప్పుడు.

తాత్పర్యం: 'బ్రహ్మజ్ఞానులు, తపోవృద్ధులు అయిన బ్రాహ్మణులు, అన్ని లోకాల్లోనూ అడ్డు లేకుండ ప్రవేశింపగల మహాత్ములు నారద వ్యాసాది మహర్షులు నీచే పూజితులై నిత్యం నీ కుశలాన్ని కోరుతూ ఉంటారు. నీ పరాక్రమం అందరినీ కాపాడుతుంటుంది. ఈ ద్వైతవనమా? అన్ని ఋతువులలో వివిధ కుసుమ ఫల భరితమైనది. ఈ మనోహర వనంలోని వృక్షాలపై నెమళ్ళు, చిలుకలు, కోకిలలు మధురంగా కూస్తూ వీనులకు విందు కలిగిస్తున్నాయి. ఇందులోని సరస్సులు కొంగలు, కొక్కెరలు, కన్నెలేడిపిట్టలు, బెగ్గురు పిట్టలు-మున్నగు జలపక్షులతో, తుమ్మెదలతో ప్రసన్నంగా ఒప్పుతున్నాయి. ఇందులో ప్రవహిస్తున్న నదులు నిర్మల శీతల జలవాహినులై ప్రకాశిస్తున్నాయి. ఈ అరణ్యంలో మహర్షులెందరో నివసిస్తూ ఉన్నారు. మనం కూడ ఇక్కడే ఉందాము' అని సుకుమారాలైన లతాసమూహాదులతో రమణీయాలైన చెట్ల మొదళ్ళలో అయిదుగురు వేరువేరుగా నివాసస్థానాలు నిర్మించుకొని, నియతాత్ములై దేవపితృకార్యాలు చేస్తూ, తమకడకు వచ్చిన బ్రాహ్మణోత్తములకు సంప్రీతికరాలైన భోజనాదికాలు సమకూరుస్తూ ద్వైతవనంలో సంతోషంతో నివసించసాగారు.

విశేషం: నన్నయ మహాకవి రచించిన అరణ్యవర్ణనం తరువాతి ప్రబంధకవులకు ఒజ్జబంతి అయింది.

క. పాండవులకడకు ధర్మ వి । దుండు తపోదహనదగ్ధదురితౌఘుఁడు మా
ర్కండేయుం డను మునినా । థుం డంతేవాసిగణముతోఁ జనుదెంచెన్. 202

ప్రతిపదార్థం: పాండవుల కడకున్= పాండవుల దగ్గరకు; ధర్మవిదుండు= ధర్మం తెలిసినవాడు; తపస్+దహన, దగ్ధ, దురిత+ ఓఘుఁడు= తపస్సు అనే అగ్నిచేత తగులబెట్టబడిన పాపాలసమూహం కలవాడు; మార్కండేయుఁడు+అను, ముని, నాథుండు= మార్కండేయు డనే మునిశ్రేష్ఠుడు; అంతేవాసి, గణముతోన్= శిష్యసముదాయంతో; చనుదెంచెన్= వచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పాండవుల దగ్గరకు, ధర్మవేత్త, తపశ్శక్తివలన పాపాలను భస్మం చేసికొన్నవాడు అయిన మార్కండేయ మహర్షి తన ప్రియశిష్యులతో కలిసి వచ్చాడు.

వ. ఇట్లు వచ్చి వారలచేత నర్చితుండయి వనవాస క్లేశదుఃఖితులైన పాండవులను ద్రౌపదిం జూచి యమ్మార్కండేయుం డిట్లనియె. 203

ప్రతిపదార్థం: ఇట్లు; వచ్చి; వారల చేతన్= ఆ పాండవులచేత; అర్చితుండు+అయి= పూజించబడినవాడై; వన, వాస, క్లేశ, దుఃఖితులు+ఐన= అడవిలో నివసించటంవలన ఏర్పడిన కష్టాలచేత దుఃఖం పొందినవారయిన; పాండవులను; ద్రౌపదిన్+చూచి; ఆ+మార్కండేయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ రీతిగా వచ్చి పాండవులచేత పూజించబడినవాడై మార్కండేయమహర్షి, వనవాసకష్టాలను అనుభవిస్తూ ఖిన్నులైన పాండవులను, ద్రౌపదిని చూచి ఇట్లా చెప్పాడు.

సీ. 'పితృనిదేశమ్మునఁ బృథివీశ్వరత్వంబు । విడిచి సానుజుఁడై పవిత్రచరిత
జానకిఁ దోడ్కొని చని వనంబున నున్న । రఘుకులనందను రాముఁ దొల్లి
చూచితి; నిపుడు భూసురవంశపోషకు । సాధుజనస్తుత్యు సత్యధర్మ
నిత్యు ధర్మజు రమణీయకీర్తిప్రియు । శమవంతుఁ జూచితి; సగర భరత

ఆ. నల యయాతి వైన్య నాభాగులాదిగా । నాదిరాజులెల్ల నధిక ధర్మ
సత్యయుక్తిఁ జేసి సకలలోకంబులు । వడసి భాగధేయభాగు లయిరి. 204

ప్రతిపదార్థం: పితృ, నిదేశమ్మునన్= తండ్రి ఆజ్ఞవలన; పృథివీ+ఈశ్వరత్వంబు= రాచరికం; విడిచి; స+అనుజుఁడు+ఐ= తమ్ముడితో సహా; పవిత్ర, చరిత= పావనమైన శీలం కల; జానకిన్+తోడ్కొని, చని= జనకుడి కూతు రయిన సీతను వెంటబెట్టుకొని వెళ్ళి; వనంబునన్+ఉన్న= అడవిలో నివసించిన; రఘుకుల, నందనున్= రఘువంశంలో పుట్టినవాడిని; రామున్= శ్రీరాముడిని; తొల్లి= పూర్వకాలంలో; చూచితిన్; ఇపుడు భూసుర, వంశ, పోషకున్= బ్రాహ్మణ వంశాన్ని పోషిస్తున్నవాడిని; సాధు, జన, స్తుత్యున్= సజ్జనులచేత పొగడబడుతున్నవాడిని; సత్య, ధర్మ, నిత్యున్= ఎల్లప్పుడు సత్యాన్ని, ధర్మాన్ని పాటించేవాడిని; రమణీయ కీర్తి, ప్రియున్= సుందరమైన. యశస్సుపట్ల ఇష్టంకలవాడిని; ధర్మజున్= ధర్మరాజును; శమవంతున్= ఇంద్రియ నిగ్రహం కలవాడిని; చూచితి; సగర, భరత, నల, యయాతి, వైన్య, నాభాగులు; ఆదిగాన్= మున్నగు; ఆది, రాజులు+ఎల్లన్= మొదటిరాజులందరు; అధిక, ధర్మ సత్య, యుక్తిన్+చేసి= గొప్పదైన ధర్మం, సత్యం కలిమిచేత; సకల, లోకంబులు, పడసి= అన్నిలోకాలు పొంది (ధర్మాత్ములు ఊర్ధ్వలోకాలు పొందగలరని ప్రాచీన భారతీయ సంస్కృతి ప్రవచిస్తున్నది); భాగధేయ భాగులు+అయిరి= అదృష్టవంతులు అయ్యారు.

తాత్పర్యం: 'అలనాడు తండ్రి ఆజ్ఞచేత రాజ్యాన్ని త్యజించి పతివ్రత అయిన సీతతో, తమ్ముడితో వనవాసం చేసిన శ్రీరామచంద్రుడిని చూచాను. నేడు బ్రాహ్మణవంశాలను పోషిస్తూ, సజ్జనులచే కొనియాడబడుతూ, సత్యధర్మాలను పాలిస్తూ, రమణీయ యశస్సుతో, శమాన్వితుడై రాజిల్లుతున్న ధర్మరాజును చూచాను. ప్రాచీన రాజర్షులు సగర, భరత, నల, యయాతి, వైన్య, నాభాగ ప్రభృతులు ఇలాగే సత్యధర్మాలు పాటించి ఉత్తమలోకాలు పొంది అదృష్టవంతులయ్యారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మార్కండేయమహర్షి అలనాడు శ్రీరామచంద్రుడిని చూచాడు. నేడు ధర్మరాజును చూచాడు. దీనినిబట్టి మార్కండేయ మహర్షి చిరంజీవి అని తెలియవస్తున్నది. అంతటి మహామునిచేత కొనియాడబడిన మహారాజుగా ధర్మజుని గొప్పతనాన్ని చిత్రిస్తూ ఉన్న ఈ పద్యం విశిష్టమైనది.

వ. పాపసౌబలప్రయుక్తుం డయిన ధార్తరాష్ట్రునట్లు ధర్మువు దప్పినవా రెవ్వరును లేరు; మీరు ధర్మనిత్యులగు సత్యవ్రతులరు గావున మీ కిష్టసిద్ధి యగు' నని మార్కండేయుం డరిగిన, నపరసంధ్యోపాసనాసీనుం డయిన ధర్మరాజును సాయంహోమార్థప్రజ్వలిత జ్వలనంబు లయిన యనేక సహస్ర బ్రాహ్మణాగ్ని హోత్రంబులం జూచి బకదాల్భ్యుండను మహాముని యిట్లనియె. 205

ప్రతిపదార్థం: పాప, సౌబల, ప్రయుక్తుండు+అయిన= పాపాత్ముడైన శకునిచేత ప్రోత్సహించబడిన వాడయిన; ధార్త రాష్ట్రు+అట్లు= దుర్యోధనుడి వలె; ధర్మువు= ధర్మాన్ని; తప్పిన వారు, ఎవ్వరును, లేరు; మీరు; ధర్మ నిత్యులు+అగు= ఎల్లప్పుడు ధర్మం ఆచరించే వారయిన; సత్యవ్రతులరు= సత్యాన్ని దీక్షగా పాటించే వారు; కావున= కాబట్టి; మీకు+ఇష్ట, సిద్ధి+అగును+అని= మీకు కోరినట్టిది లభిస్తుందని చెప్పి; మార్కండేయుండు+అరిగినన్= మార్కండేయుడు వెళ్ళగా; అపర, సంధ్యా+ ఉపాసనా+ ఆసీనుండు+అయిన, ధర్మరాజును= మలిసంజలో చేసే పూజలో కూర్చుండి ఉన్న ధర్మరాజును; సాయం, హోమ+అర్థ, ప్రజ్వలిత, జ్వలనంబులు+అయిన= సాయంకాలం చేసే యజ్ఞం కోసం బాగుగా రాజుకొనేటట్లు చేయబడిన మంటలు గల; అనేక, సహస్ర, బ్రాహ్మణ+అగ్నిహోత్రంబులన్+చూచి= పెక్కువేల బ్రాహ్మణులు వేల్చిన అగ్నిహోత్రాలను చూసి; బకదాల్భ్యుండు; అను; మహాముని= గొప్పఋషి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: పాపాత్ముడైన శకునిప్రోత్సాహంతో ధర్మం తప్పిన దుర్యోధనుడివంటివాడు వేరొకడు లేడు. మీరు నిత్యసత్యవ్రతులు, ధర్మాత్ములు. మీకు అభీష్టసిద్ధి కలుగుగాక' అని ఆశీర్వదించి మార్కండేయమహర్షి వెళ్ళాడు. అంత సాయంకాలసంధ్యావందనం ఆచరిస్తున్న ధర్మరాజును, సాయంసమయ హోమాలను వేల్చుతూ అగ్ని హోత్రాలను ప్రజ్వలింపజేస్తున్న వేలకొలదివిప్రులను బకదాల్భ్యుడు అనే మహాముని చూచి ఇట్లా అన్నాడు.

విశేషం: ధార్తరాష్ట్రుడు - ధృతరాష్ట్రుడి కొడుకు. మార్కండేయుడు - మృకండు మహాముని కొడుకు - ఇవి అపత్యార్థక తద్ధితాలు.

ఉ. 'భూమిసురోత్తముల్ ప్రకృతిపుణ్యవిధాయులు వీరు ఋగ్యజు
స్సామపరాయణుల్ పరమసాధుచరిత్రులు మీకు సంతత
ప్రేమమునన్ శుభోన్నతులు పెంచుచు నుండుటఁ జేసి సద్గుణో
ద్దామ! యరణ్యవాస మిది దద్దయు నొప్పెడు మాకుఁ జూడఁగన్. 206

ప్రతిపదార్థం: సద్గుణ+ఉద్దామ= మంచి గుణాలచేత అధికుడివైన వాడా! ఓ ధర్మరాజా!; భూమిసుర+ఉత్తముల్= బ్రాహ్మణశ్రేష్ఠులు; ప్రకృతి, పుణ్య విధాయులు= సహజంగా పుణ్యాన్ని కలిగించే వారు; వీరు= ఈ బ్రాహ్మణులు; ఋక్+యజుస్+సామ, పరాయణుల్= ఋగ్వేద యజుర్వేద, సామవేదాలలో ఆసక్తికలవారు; పరమ, సాధు, చరిత్రులు= మిక్కిలి మంచిశీలం కలవారు; మీకు; సంతత ప్రేమమునన్= ఎల్లప్పుడు ఉండే వాత్సల్యంతో; శుభ+ఉన్నతులు= శుభాన్ని, గొప్పతనాన్ని; పెంచుచున్= ఎక్కువ చేస్తూ; ఉండుటన్+చేసి= ఉండటంచేత; అరణ్యావాసము+ఇది= మీ ఈ వనవాసం; మాకున్+ చూడఁ గన్= మా ఉద్దేశంలో; తద్దయున్= మిక్కిలి; ఒప్పెడున్= వెలుగొందుతున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'సద్గుణాలచేత గొప్పవాడివయిన ఓ ధర్మరాజా! మా దృష్టిలో మీకు అరణ్యావాసం మిక్కిలి మేలు చేకూర్చేదైంది. సహజ పుణ్యశీలురు, పవిత్ర చరిత్రులు, ఋగ్యజుస్సామవేద పారంగతులైన బ్రాహ్మణోత్తములు నిరంతర వాత్సల్యంతో మీ యోగక్షేమాలను చూస్తూ శుభోన్నతులను పెంచుతున్నారు.

వ. **బ్రాహ్మణానుగ్రహంబునం జేసి తొల్లివైరోచనాదు లనేకకాలంబు లక్షయలక్ష్మీవిభవులయి సముద్రనేమి భూచక్రంబు రక్షించిరి; యనిలసహాయుం డయిన యగ్నిదేవుం డరణ్యంబులు దహించునట్లు బ్రాహ్మణ సహాయుం డయిన మహీశుండు శత్రువర్గంబు నిశ్శేషంబు సేయు; వినీతుం డయి విప్రులచేత ననుశాసితుం డయిన రాజునకు నలబ్ధలాభాది త్రితయంబు సంపన్నంబగు; బ్రాహ్మణరహితుం డయి ధర్మహీనుం డయిన రాజును బ్రజ వలవదు; ప్రజానురాగంబు లేనివానికి రాజ్యంబు సుస్థిరంబు గానేరదు; మీరు బ్రాహ్మణప్రియులరు ధర్మనిత్యుల; రెప్పుడును మీ కభ్యుదయం బగు' నని బకదాల్భ్యుం డరిగినఁ, బాండవులుం దమ యిష్టంబున నుండి దుఃఖోపశమనంబు లయిన కథలు సెప్పుకొనుచున్న యవసరంబున ద్రౌపది ధర్మరాజున కిట్లనియె.207**

ప్రతిపదార్థం: బ్రాహ్మణ+అనుగ్రహంబునన్+చేసి= బ్రాహ్మణులయొక్క దయచేత; తొల్లి= పూర్వకాలంలో; వైరోచన+ఆదులు= వైరోచనుడు (బలి) మున్నగువారు; అనేక, కాలంబులు= పెక్కునాళ్ళు; అక్షయ, లక్ష్మీ విభవులు+అయి= క్షీణించని ఐశ్వర్య ప్రాభవాలు కలవారయి; సముద్రనేమి, భూ, చక్రంబు= కడలియే కమ్మిగా కల భూచక్రాన్ని; రక్షించిరి= కాపాడారు; అనిల, సహాయుండు+అయిన= వాయువు తోడ్పడేవాడుగా కల; అగ్నిదేవుండు; అరణ్యంబులు; దహించునట్లు= కాల్చేటట్లు; బ్రాహ్మణ, సహాయుండు+అయిన= విప్రుల తోడ్పాటు లభించినవాడైన; మహీ+ఈశుండు= రాజు; శత్రు, వర్గంబున్= శత్రుపక్షాన్ని; నిశ్శేషంబు+చేయున్= శేషం లేనట్లుగా (మిగులకుండేటట్లుగా) చేస్తాడు; వినీతుండు+అయి= వినయం కలవాడయి; విప్రులచేతన్= బ్రాహ్మణులచేత; అనుశాసితుండు+అయిన= శిక్షించబడిన; (విద్య కరపబడిన); రాజునకున్; అలబ్ధ, లాభ+ఆది, త్రితయంబు= పొందబడని దాన్ని పొందటం మున్నగు మూడు లాభాలు; సంపన్నంబు+అగు= సమకూరుతాయి; బ్రాహ్మణ, రహితుండు+అయి= బ్రాహ్మణుడు లేకపోయిన వాడై అంటే బ్రాహ్మణుల తోడ్పాటు పొందనివాడై; ధర్మహీనుండు+అయిన= ధర్మం కొరవడిన వాడైన; రాజును= ప్రభువును; ప్రజ= జనసమూహం; వలవదు= ప్రేమించదు; ప్రజా+అనురాగంబు= జనులప్రేమ; లేనివానికి; రాజ్యంబు; సుస్థిరంబు, కానేరదు= చిరకాలం నిలవదు; మీరు; బ్రాహ్మణప్రియులరు= బ్రాహ్మణులకు ఇష్టులు; ధర్మనిత్యులరు= ఎల్లప్పుడు ధర్మం పాటించేవారు; ఎప్పుడును; మీకు+అభ్యుదయంబు+అగున్= మీకు మేలు కలుగుతుంది; అని= అని చెప్పి; బకదాల్భ్యుండు; అరిగినన్= వెళ్ళగా; పాండవులున్, తమ, ఇష్టంబునన్+ఉండి= పాండవులు తమ ఇష్ట ప్రకారం ప్రొద్దు పుచ్చుతూ ఉండి; దుఃఖ+ఉపశమనంబులు+అయిన, కథలు= దుఃఖానికి విరుగుడు కల్పించే (దుఃఖాన్ని శాంతింపజేసే) కథలు; చెప్పుకొనుచున్న; అవసరంబున= కాలంలో; ద్రౌపది, ధర్మరాజునకు+ఇట్లు+అనియెన్= ద్రౌపది ధర్మరాజుతో ఇట్లా పలికింది.

తాత్పర్యం: బ్రాహ్మణుల దయవలన పూర్వకాలంలో వైరోచనుడు మున్నగు రాజులు అపార వైభవ ప్రాభవాలతో భూమండలం ఏలగలిగారు. అగ్నికి వాయువు తోడ్పడినట్లు రాజుకు బ్రాహ్మణులు సాయం చేస్తే అతడు శత్రువులను నిశ్శేషంగా పరిమార్చుతాడు. వినయపరుడై బ్రాహ్మణగురువులచేత నడపబడిన రాజుకు అలబ్ధలాభాదిత్రితయం సమకూరుతుంది. బ్రాహ్మణహీనుడు, ధర్మహీనుడు అయిన రాజు ప్రజాభిమానాన్ని కోల్పోతాడు. ప్రజానురాగం లేకుంటే రాజ్యం సుస్థిరంగా నిలవనేరదు. మీరు బ్రాహ్మణప్రియులు, ధర్మనిత్యులు. మీకు అభ్యుదయం కలుగుగాత!' అని చెప్పి బకదాల్భ్యమునివరుడు వెళ్ళాడు. ఇక, పాండవులు అరణ్యావాసంలో తాము అనుభవిస్తున్న ఇక్కట్లు మరచిపోయే కథలను చెప్పుకొంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నసమయంలో ద్రౌపది ధర్మరాజుతో ఇట్లా అన్నది.

ద్రౌపదీ ధర్మరాజుల సంవాదము (సం. 3-28-2)

ఆ. 'వృద్ధు గొడుకుపలుకు విని క్రూరుఁడై పాప । బుద్ధిఁజేసి మిమ్ము భూతలంబు
వెలువరించి రాజ్యవిభవంబు గొని యిప్పు । డలుక సెడి సుచిత్తుఁ డయ్యె నొక్కొ! 208

ప్రతిపదార్థం: వృద్ధు= (వృద్ధుడు), వయసుమళ్ళినవాడు (ధృతరాష్ట్రుడు); కొడుకు పలుకు, విని= కుమారుడి (దుర్యోధనుడి) మాట విని; క్రూరుఁడు+ఐ= కనికరంలేనివాడై; పాప, బుద్ధిన్+చేసి= పాపకరమైన దుష్టబుద్ధితో; మిమ్మున్= మిమ్మల్ని; భూతలంబు, వెలువరించి= భూమిరాజ్యంనుంచి వెడలగొట్టి; రాజ్యవిభవంబు= రాచరికపు పెంపు; కొని= కైకొని; ఇప్పుడు; అలుక, చెడి= కోపం తగ్గి; సుచిత్తుఁడు= మంచి మనస్సు కలవాడు; అయ్యెన్+ఒక్కొ= అయినాడేమొ!

తాత్పర్యం: 'కొడుకైన దుర్యోధనుడి మాట విని దుర్మార్గుడైన ముసలిరేడు ధృతరాష్ట్రుడు మిమ్మల్ని రాజ్యంనుండి వెడలగొట్టి రాజ్యవైభవం దక్కించుకొని ఇప్పుడైనా మీపట్ల కోపం విడిచి ప్రసన్నచిత్తు డయ్యాడా?

ఆ. అద్దురాత్ముహృదయ మది యయఃపాషాణ । నిష్ఠురంబు; ధర్మనిధుల మిమ్ము
నట్లు గొడుకు లెగ్గ లాడంగఁ బోయిన । వలదనండ కలహవాంఛఁ జేసి. 209

ప్రతిపదార్థం: ఆ+దురాత్ము= ఆ దుష్టమైన ఆత్మకలవాడి, అంటే ధృతరాష్ట్రుడియొక్క; హృదయము= మనసు; అది; అయస్+పాషాణ, నిష్ఠురంబు= ఇనుమువలె రాయివలె కఠినమైనది; ధర్మ, నిధుల= ధర్మానికి నిధుల వంటి వారైన; మిమ్మన్= మిమ్మల్ని; అట్లు= ఆ రీతిగా; కొడుకులు= పుత్రులు; ఎగ్గులు+ఆడంగన్+పోయినన్= పరుష వాక్యాలు పలికినప్పుడు; కలహ, వాంఛన్+చేసి= దెబ్బలాడాలనే కోరికతో; వలదు+అనండు+అ= వలదని అనలేదు కదా!

తాత్పర్యం: దురాత్ముడైన ధృతరాష్ట్రుడి హృదయం ఇనుం వంటిది, బండరాయి వంటిది. ధర్మనిధులైన మిమ్మల్ని తన కొడుకులు పరుషవాక్యాలు పలికినప్పుడు కలహకాంక్ష గల అతడు వాళ్లను వారించలేదుకదా!

సీ. విమలహర్మ్యంబుల విహరించువారలఁ । బ్రియమహార్హాసన శయనరతులఁ
జందనాగురులిప్త చారుసర్వాంగుల । నతనరనాథసేవితుల మిమ్ము
వనమునఁ గ్రుమ్మరువారిఁగాఁ గుశబ్రుసీ । శయనాభిరతులఁగా నియతరూక్ష
భూరేణుధూసరీభూతవిగ్రహులఁగా । ద్రుతవన్యమృగ నిషేవితులఁ గాఁగ

ఆ. నిట్లు సూచి చూచి యే నెట్లు చిత్తోప । శాంతి సేయుదాన? సకల భోగ
విషయవిరతిఁజేసి విధియును ధృతరాష్ట్రు । నట్లు మీకు నహితుఁడయ్యె నొక్కొ! 210

ప్రతిపదార్థం: విమల= నిర్మలాలైన; హర్మ్యంబులన్= మేడలలో; విహరించువారలన్= సంచరించేవారిని; ప్రియ, మహత్+అర్హ+ఆసన+శయన, రతులన్= ఇష్టములైన, మిగుల తగినట్టివైన పీఠాలపై పరుపులపై కోరిక కలిగి అనుభవించేవారిని; చందన+అగురు, లిప్త, చారు, సర్వ+అంగులన్= మంచిగంధంతో, అగరుతో పూయబడి మనోహరాలైన అన్ని అవయవాలు కలిగిన వాళ్ళను; నత, నరనాథ సేవితులన్, మిమ్ము= (దేహం) వంచి నమస్కరించిన రాజులచేత సేవించబడిన మిమ్మల్ని; వనమునన్+క్రుమ్మరు వారిఁగాన్= అడవిలో తిరుగాడే వాళ్ళనుగా; కుశ, బ్రుసీ, శయన+అభిరతులన్+కాన్= దర్భలతో నేయబడిన చాపల పై పరుండటానికి ఆసక్తి గల వాళ్ళనుగా; నియత, రూక్ష, భూరేణు, ధూసరీ భూత విగ్రహులన్+కాన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎల్లప్పుడు కఠినమైన దుమ్ముచేత ధూసరవర్ణంతో కూడిన ఆకారాలు కలవారినిగా; ద్రుత, వన్య మృగ, నిషేవితులన్+కాన్+కన్= వడిగా పరుగెత్తే అడవిజంతువులచేత బాగా సేవించబడే వారినిగా; ఇట్లు= ఈ విధంగా; చూచి, చూచి; ఏను+ఎట్లు; చిత్త+ఉపశాంతి, చేయుదానన్= మనస్సుకు ఊరట కల్పించుకొనేది; సకల, భోగ, విషయ, విరతిన్+చేసి= సమస్తమైన సుఖాల నుండి, ఇంద్రియార్థాల నుండి (విశ్రాంతి) ఉడుకువ కల్పించి; విధియును= బ్రహ్మదేవుడు సైతం; ధృతరాష్ట్ర+అట్లు+అ= ధృతరాష్ట్రుడివలెనే; మీకున్= మీకు; అహితుఁడు+అయ్యెన్+ఒక్కొ= శత్రు వైనాడేమో?

తాత్పర్యం: నిర్మలమైన మేడలపై విహరించేవారు మీరు. ఉచితాసనాలపై మంచి పరుపులపై ఉండేవారు మీరు. చందనం, అగరు మున్నగు సుగంధ ద్రవ్యాలు మైపూతలుగా వాడినవారు మీరు. వినమ్రులైన రాజులచేత సేవలు పొందినవారు మీరు. ఇప్పుడు ఈ అరణ్యంలో దర్భలపై శయనించటానికి ఇష్టపడటం, ధూళి ధూసరిత శరీరులై తిరుగాడటం, పరుగెత్తే వన్యమృగాలను వేటాడి బ్రతకటం మీ వంతు అయింది. అది చూచి నే నెట్లా ఓర్చుకొనగలను? బ్రహ్మదేవుడు కూడ ఆ ధృతరాష్ట్రుడివలెనే మీకు సకలసుఖాల యెడల విశ్రాంతి (ఉడుకువ) కల్పించి మీకు శత్రువైనాడా ఏమి?

క. **భవదాజ్ఞానిగళంబునఁ । దవిలి పరాక్రమము విడిచి ధరణీశ్వర! నీ**
యవరజు లిడుమలఁ బడి కడుఁ । జివికిరి చెఱఁబడిన సింహశిశువుల భంగిన్. **211**

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= ఓరాజా! (ధర్మరాజా!); భవత్+ఆజ్ఞా, నిగళంబునన్+తవిలి= నీదైన ఆజ్ఞ అనే గొలుసులతో బంధించబడి; పరాక్రమము= శౌర్యం; విడిచి= వీడి; నీ+అవరజులు= నీతమ్ములు; (నీవు పుట్టిన తర్వాత పుట్టిన వారు); ఇడుమలన్+పడి; చెఱన్+పడిన= నిర్బంధించబడిన; సింహ శిశువుల, భంగిన్= సింగపు బిడ్డలవలె; కడున్+చివికిరి= మిక్కిలి గాసి చెందారు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీ ఆజ్ఞ అనే గొలుసులచేత బంధించబడి, పౌరుషం కోల్పోయి నీ తమ్ములు కట్టివేయబడిన సింహకిశోరాలవలె కష్టాలపాలయ్యారు.

విశేషం: అలం: రూపకం, ఉపమ.

ఆ. **పరనరేంద్రమకుటపద్మరాగద్యుతి । నరుణ మగు భవత్పదాబ్జయుగము**
పరుషధాతుశిలలపై నిప్పు డరుగుట । నరుణ మయ్యెఁ బర్వతాంతరముల. **212**

ప్రతిపదార్థం: పర, నరేంద్ర, మకుట, పద్మరాగ, ద్యుతిన్= ఇతర రాజుల కిరీటాలలోని పద్మరాగ మణుల కాంతిచేత; అరుణము+అగు= ఎర్రనయిన; భవత్, పద+అబ్జ, యుగము= నీ పాద పద్మములజంట; పరుష, ధాతు, శిలలపైన్= కఠినమైన జేగురురంగు కల రాలపై; పర్వత+అంతరములన్= కొండల మధ్య; ఇప్పుడు+అరుగుటన్= ఇప్పుడు నడయాడటంచేత; అరుణము+అయ్యెన్= ఎర్రగా అయింది.

తాత్పర్యం: అలనాడు ఇతరరాజుల కిరీటాలలోని పద్మరాగమణులచేత నీ పాదాలు ఎరుపెక్కాయి. (అంటే ఇతర రాజులు పద్మరాగమణులు పొదిగిన కిరీటాలు కల తమ తలలు వంచి ధర్మరాజుపాదాలకు మ్రొక్కేవారు. అప్పుడు సుకుమారాలైన ధర్మరాజుపాదాలలో ఎర్రని పద్మరాగమణుల కాంతులు ప్రతిఫలించేవి). ఈనాడు నీవు కొండలమధ్య నడయాడటంచేత కఠినధాతుశిలలలోని ఎర్రరంగువలన నీ సుకుమారపాదాలు ఎరుపెక్కుతున్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: విషమం. గైరికాదిధాతువులు కొండలలో లభించటం సుప్రసిద్ధం. ఆ ధాతుద్రవ్యాలు ఎఱ్ఱరంగు కలిగి ఉంటాయి.

క. అనవరత సౌఖ్యసంపదఁ । బెనుపొందుచు నుండు మీకు భీకర కాంతా
ర నివాసాయాసంబుల । ననఘా! యిబ్బంగి నవయ నలమట వొడమెన్. 213

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా! (ఓ ధర్మరాజా!); అనవరత, సౌఖ్యసంపదన్= ఎడతెగని సుఖాల విభవంతో; పెనుపొందుచున్+ఉండు, మీకు= విలసిల్లుతుండే మీకు; భీకర, కాంతార, నివాస+ఆయాసంబులన్= భయంకరమైన అడవిలో ఉండటంవలన ఏర్పడిన శ్రమలతో; ఈ+భంగి= ఈ విధంగా; నవయన్= కృశించటంవల్ల; అలమట+పొడమెన్= చింత ఏర్పడింది.

తాత్పర్యం: ఏ పాప మెరుగని ధర్మరాజా! ఎల్లప్పుడు సౌఖ్యాలను అనుభవించే మీకు భయంకరమైన అడవిలో నివసించటంచేత ఇట్లా క్లేశం దాపురించింది.

వ. నిత్యంబునుం బదివేవురు బ్రాహ్మణులు బ్రహ్మవిదులు పసిండితళిగల నిష్టాన్నంబులు గుడిచి తృప్తులయినం దద్భుక్తశేషం బుపయోగించుచుండు నీకు వన్యమూలఫలాశనంబు లుపయోగించుచు నన్యులయందుఁ గ్రోధంబు విడిచి యునికి యుచితంబు గాదు. 214

ప్రతిపదార్థం: నిత్యంబునున్= ప్రతిరోజూ; పదివేవురు= పదివేలమంది; బ్రాహ్మణులు; బ్రహ్మవిదులు= బ్రహ్మను తెలిసికొన్న వారు (జ్ఞానులు); పసిండితళిగలన్= బంగారు కంచాలలో; ఇష్ట+అన్నంబులు= ప్రియమైన ఆహారాలు; కుడిచి= ఆరగించి; తృప్తులు+అయినన్= తృప్తి చెందిన వారు కాగా; పిమ్మట; తద్+భుక్త శేషంబు= వారు తినగా మిగిలింది; ఉపయోగించుచుండు; నీకు; వన్యమూల ఫల+అశనంబులు= అడవిలోని వేళ్ళు, పండ్లు తిండిగా; ఉపయోగించుచున్= వాడుకొంటూ; అన్యుల+అందు= ఇతరుల పట్ల, అంటే శత్రువులపట్ల; క్రోధంబు, విడిచి+ఉనికి= కోపం వీడి ఉండటం; ఉచితంబు, కాదు= సరైనదికాదు.

తాత్పర్యం: ఇదివరలో ప్రతిదినము నీవు పదివేలమంది బ్రహ్మవేత్తలైన బ్రాహ్మణులకు, బంగరుకంచాలలో విందుభోజనాలు పెట్టి, ఆ తర్వాత వారి భుక్తిశేషం ఆరగించేవాడివి. ఇప్పుడు అడవిదుంపలు, వేళ్ళు, పండ్లు నీ ఆహారం. నీకు ఇట్టి దుర్దశ తెచ్చిపెట్టిన నీ శత్రువులపై కోపం విడిచిపెట్టటం సరైనది కాదు.

సీ. పదివేల గజముల బలమున విలసిల్లు । ననిలసుతుండు కాఱడవిలోనఁ
గ్రుమ్మరి కాయలుఁ గూరలు దిని పేద । పడినఁ జూచియు, దీర్ఘబాహుయుగళుఁ
డయ్యును బాహుసహస్రంబు కలిగిన । యర్జునుకంటె బలాఢ్యుఁ డగుచు
నేకవేగంబున నేనమ్ము లొక్క య । మ్మేసిన విధమున నేయ నేర్చు

ఆ. నర్జునుండు వనమృగావలిఁ గలిసి యి । ట్లున్నఁ జూచియును సుఖోచితాత్ము
లైన కవలు దీనులై యున్నఁ జూచియు । నుపశమంబుఁ దాల్చి యుండఁ దగునె? 215

ప్రతిపదార్థం: పదివేల గజముల= పదివేల ఏనుగుల; బలమున, విలసిల్లు= బలంతో ఒప్పే; అనిల సుతుండు= భీముడు (వాయుపుత్రుడు); కాఱడవిలోనన్= దట్టమైన అడవిలో; క్రుమ్మరి= తిరిగి; కాయలున్+కూరలు; తిని, పేద+పడినన్+చూచియు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చిక్కిపోవటం చూచి కూడ; దీర్ఘబాహు, యుగళుఁడు+అయ్యును= పొడవైన చేతులు రెండే కలవాడైనప్పటికీ; బాహు, సహస్రంబు, కలిగిన= వేయి చేతులు ఉన్న; అర్జునుకంటె= కార్తవీర్యార్జునుడి కంటె; బల+ఆఢ్యుఁడు+అగుచున్= శక్తి కలిగి ఉన్నవాడవుతూ (అంటే మిక్కిలి పరాక్రమవంతుడవుతూ); ఏక, వేగంబునన్= ఒకే వడితో; ఏను+అమ్ములు= అయిదు బాణాలు; ఒక్క+అమ్ము+ఏసిన, విధమునన్= ఒకే బాణాన్ని ప్రయోగించినట్లు; ఏయ, నేర్చు+అర్జునుండు= ప్రయోగించే నేర్పుగల అర్జునుడు; వన, మృగ+ఆవలిన్= అడవి జంతు సముదాయాలతో; కలిసి; ఇట్లు+ఉన్నన్+చూచియును= ఈ విధంగా నివసించటం చూచి కూడ; సుఖ+ఉచిత+ఆత్ములు+ఐన= సౌఖ్యం పొంద దగిన ఆత్మలు కలవారైన; కవలు= జంట బిడ్డలు (నకులసహదేవులు); దీనులు+ఐ+ఉన్నన్+చూచియున్= అర్తులై ఉండటం చూచికూడా; ఉపశమంబున్= ఓర్పును; తాల్చి+ఉండన్+తగునె= పూని ఉండటం సరియా?

తాత్పర్యం: పదివేల ఏనుగుల బలం కల భీముడు కారడవిలో కాయలు కూరలు తిని మిక్కిలి చిక్కిపోయి ఉన్నాడు. పొడవైన రెండు చేతులు కలవాడైనా, వేయిచేతులు కల కార్తవీర్యార్జునుడికంటె బలవంతుడై, ఒకేసారి సమానవేగంతో అయిదు బాణాలు ఒకే బాణంలా వేయగల నేర్పు ఉన్న ఈ అర్జునుడు అడవిజంతువుల మధ్య తిరుగాడుతున్నాడు. సౌఖ్యాలు అనుభవించదగిన నకుల సహదేవులు దీనులై తిరుగాడుతున్నారు. ఇదంతా చూస్తూ నీవు ఓర్పు వహించి ఊరకుండటం న్యాయమా?

వ. క్షమయును దేజంబును నయ్యయికాలంబులఁ బ్రయోగింపనేరని రాజునకుం బ్రజానురాగ ప్రతాపంబులు లేవను నీ యర్థం బితిహాసంబున వినంబడు; క్షమా తేజంబులలోన నెయ్యది విశేషంబు దానిన నిర్ణయించి చెప్పు మని బలీంద్రుండు దొల్లి తన పితామహుం డయిన ప్రహ్లాదు నడిగిన నాతండు బలీంద్రున కిట్లనియె.216

ప్రతిపదార్థం: క్షమయును= ఓర్పును; తేజంబునున్= ప్రతాపమును; ఆ+అయి, కాలంబులన్= ఆయా సమయాలలో; ప్రయోగింపనేరని= ఉపయోగించ జాలని; రాజునకున్= ప్రభువుకు; ప్రజా+అనురాగ, ప్రతాపంబులు, లేవు+అను= ప్రజలయొక్క ప్రేముడి, పరాక్రమం, ఉండవు అనే; ఈ+అర్థంబు= ఈ భావం; ఇతిహాసంబునన్= జరిగిన చరిత్రలో; వినంబడున్= వినబడుతున్నది; క్షమా, తేజంబులలోనన్= ఓర్పు ప్రతాపాలలో; ఏ+అది= ఏది?; విశేషంబు= గొప్పది; దానిని+అ= దానినే; నిర్ణయించి, చెప్పుము= నిశ్చయించి తెలిపేది; అని; బలి+ఇంద్రుండు= బలి చక్రవర్తి; తొల్లి= పూర్వకాలంలో; తన పితామహుండు+అయిన= తన తాతగారైన; ప్రహ్లాదున్= ప్రహ్లాదుడిని; అడిగినన్; ఆతండు= ఆ ప్రహ్లాదుడు; బలీంద్రునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: క్షమ గొప్పదా? తేజస్సు గొప్పదా? క్షమాతేజస్సులను ఆయా సమయాలలో అవసరాలనుబట్టి ఉపయోగించటం తెలియని రాజు ప్రజాభిమానం, ప్రతాపం కోల్పోతా డని ఇతిహాసంలో వినబడుతున్నది. పూర్వకాలంలో బలీంద్రుడు తన తాతఅయిన ప్రహ్లాదుడిని ఈ ప్రశ్ననే- అంటే, క్షమగొప్పదా? తేజం గొప్పదా? నిశ్చయించి చెప్పవలసిందని - అడిగాడు. అప్పుడు ప్రహ్లాదుడు బలిచక్రవర్తికి ఇట్లా చెప్పాడు.

ఆ. 'క్షమయ తాల్చియుండఁ జన దెల్ల ప్రొద్దుఁ దే। జంబ తాల్చియుండఁ జనదు పతికి;
సంతతక్షముండు సంతతతేజుండు। నగుట దోష మందు రనఘమతులు. 217

ప్రతిపదార్థం: పతికి= ప్రభువుకు; క్షమ+అ= క్షమ మాత్రమే (ఓర్పు ఒక్కటే); ఎల్ల ప్రొద్దున్= అన్ని సమయాలలోను; తాల్చియుండన్+చనదు= పూని ఉండరాదు; సంతతక్షముండు= ఎల్లప్పుడు ఓర్పునే కలిగి ఉండేవాడు; సంతత తేజుండున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎల్లప్పుడు ప్రతాపమే వహించేవాడు; అగుట; అనఘ, మతులు= పాపరహితులైన బుద్ధిమంతులు; దోషము+అందురు= తప్పు అని చెపుతారు.

తాత్పర్యం: సర్వకాల సర్వావస్థలలోనూ ఓర్పు వహించటం తప్పు. అట్లే ఎప్పుడూ ప్రతాపం చూపటం కూడా తప్పే. ప్రభువైనవాడు సంతతక్షముడు, సంతతతేజుడు కాకూడదని, అది దోషమని పెద్దలు చెపుతారు.

వ. అది యెట్లనిన నిత్యక్షమాన్వితుండయిన వానికి భృత్యులు వెఱవక యవమానంబు సేయుదు; రర్థంబుల యం దధికృతులైన వారలు ధనంబు లపహరించి దర్పంబు సూపుదురు; మఱి నిత్యతేజో ఽ ధికుండైన వాఁ డతిక్రూరదండంబున సర్వజనసంతాపంబు సేయుచు గృహగతంబైన సర్పంబునుం బోలె నెప్పుడు నుద్వేగ కరుం డగుం; గావునఁ గాలోచితంబులుగా క్షమాతేజంబులు గల్పించునది. యథాకాల కల్పిత క్షమా తేజుండైన వానికి నుభయలోకసిద్ధి యగు' నని బలీంద్ర ప్రహ్లాద సంవాదంబు సెప్పి వెండియు ద్రౌపది యిట్లనియె. 218

ప్రతిపదార్థం: అది, ఎట్లు+అనిన; నిత్య, క్షమా+అన్వితుండు+అయినవానికిన్= ఎల్లప్పుడును ఓర్పుతో కూడి ఉండేవాడికి; భృత్యులు= సేవకులు; వెఱవక= భయపడక; అవమానంబు+చేయుదురు= అవమానం చేస్తారు; అర్థంబులు+అందు= ధనాలలో; అధికృతులు+ఐన, వారలు= నియోగించబడినవారు; ధనంబులు+అపహరించి= డబ్బు దొంగిలించి; దర్పంబు, చూపుదురు= గర్వం ప్రదర్శిస్తారు; మఱి; నిత్య, తేజస్+అధికుండు+ఐనవాఁడు= ఎల్లప్పుడు ప్రతాపంలో వెలుగొందుతూ అతిశయించేవాడు; అతి, క్రూర, దండంబునన్= మిక్కిలి కఠిన శిక్షలు వేయటంచేత; సర్వ, జన, సంతాపంబు+చేయుచున్= అందరు జనులకు తీవ్రమైన వేదన కల్పిస్తూ; గృహ, గతంబైన= ఇంటిలో ఉన్నట్టి; సర్పంబును+పోలెన్= పామువలె; ఎప్పుడున్= ఎల్లప్పుడు; ఉద్వేగ, కరుండు+అగున్= ఆరాటం కలిగించేవాడు అవుతాడు; కావునన్= కాబట్టి; కాల+ ఉచితంబులు+కాన్= సమయానుకూలాలుగా; క్షమాతేజంబులు= ఓర్పును, ప్రతాపాన్ని; కల్పించునది= ప్రదర్శించేది; యథా, కాల, కల్పిత, క్షమా, తేజుండు+ఐనవానికిన్= సమయానుకూలంగా ఓర్పు, ప్రతాపం చూపించేవాడికి; ఉభయలోకసిద్ధి= రెండులోకాలలో విజయం (ఐహికాముష్మిక సిద్ధి); అగును+అని; బలీంద్ర, ప్రహ్లాద, సంవాదంబు+చెప్పి; వెండియు= మరల; ద్రౌపది; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: దాన్ని వివరించి చెప్పితే - ఎల్లప్పుడు ఓర్పు చూపేవాడిని చూచి సేవకులు భయపడరు; పైగా అవమానిస్తారు. ధనానికి సంబంధించిన విషయాలలో నియమించబడిన అధికారులు ధనాలను అపహరిస్తారు; పైగా గర్వాన్ని ప్రదర్శిస్తారు. ఇక సదా తేజస్సునే ప్రదర్శించేవాడు మిక్కిలి కఠినశిక్షలు విధించటం చేత జనుల కందరికీ తీవ్రవేదన కలిగిస్తాడు. ఇంటిలో ఉన్న పామువంటి వాడయి నిరంతరం ఆరాటం కలిగిస్తాడు. కాబట్టి సమయానుకూలంగా క్షమ, తేజం ప్రదర్శించేవాడే ఐహికాముష్మికసిద్ధిని పొందగలడు' అని బలిచక్రవర్తికి ప్రహ్లాదుడికి మధ్య జరిగిన సంభాషణ వివరించి, మరల ద్రౌపది ధర్మరాజుతో ఇట్లా అన్నది.

తే. 'ఆది నపరాధ మొక్కటి యైన నదియు । నల్పమైనను క్షమియించు నదియుఁ గాక
చెనసి యపరాధములు పెక్కు సేయుచున్న । పాపకౌరవ్యులకు సహింపంగ నేల? 219

ప్రతిపదార్థం: ఆదిన్= మొదట; అపరాధము= తప్పు; ఒక్కటి+ఐనన్= ఒకటి మాత్రమే చేస్తే; అదియున్+అల్పము+ఐనను= అది చిన్న తప్పు మాత్రమే ఐనచో; క్షమియించు+అదియున్= క్షమించదగినది; కాక= అట్లాకాక; చెనసి= ఎదిరించి; అపరాధములు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తప్పులు; పెక్కు= అనేకాలు; చేయుచున్న= చేస్తున్న; పాప కౌరవ్యులకు= పాపులైన కౌరవులపట్ల; సహింపంగన్+ఏల= ఎందుకు క్షమ చూపించాలి?

తాత్పర్యం: 'మొదట ఏదో ఒక తప్పు చేస్తే- ఆ తప్పు చిన్న తప్పు మాత్రమే అయితే- క్షమించవచ్చును గాని, ఎదిరించి వరుసగా పెక్కు తప్పులు చేస్తున్న పాపులైన కౌరవులను క్షమించట మెందుకు?

విశేషం: 'క్షమియించునదియుఁగాక'- అనే పాఠం సందేహాస్పదంగా ఉన్నది. ఎవరు? రాజు లేక జనుడు అని చెప్పాలి. 'క్షమియింపుము' అని ఉండవచ్చు. వావిళ్లప్రతిలో 'క్షమించునదియగాక'- అనే పాఠాంతరం ఉన్నది. 'క్షమియించునదియ - కాక' అనే ఈ పాఠం ఉచితమే. క్షమింపనే వలయును, అట్లు కాకయును; అని అర్థం చెప్పవచ్చును.

క. ఇది తేజంబున కవసర; । ముదితక్రోధుండ వగుమ యొక్కించుక; దు
ర్మదు లగు సుయోధనాదుల । నదయుల వధియింతు రుగ్రులై నీ తమ్ముల్.' 220

ప్రతిపదార్థం: ఇది; తేజంబునకు+అవసరము= ప్రతాపం చూపటానికి తగిన సమయం; ఒక్క+ఇంచుక= కొంచెంగా; ఉదిత క్రోధుండవు+అగుము+అ= ఉదయించిన కోపం కలవాడివి కమ్ము; దుర్మదులు+అగు= చెడుగర్వం కల; సుయోధన+ఆదులన్= దుర్యోధనుడు మున్నగువారిని; అదయులన్= దయలేనివారిని; నీ తమ్ముల్= నీ సహోదరులు; ఉగ్రులు+ఐ= భయంకరులై; వధియింతురు= చంపగలరు.

తాత్పర్యం: ఇది తేజం ప్రదర్శించటానికి అనువైన సమయం. ఒకింత కోపం తెచ్చుకొమ్ము. దుర్మదులైన దుర్యోధనాదులను నీ తమ్ములు భయంకరులై సంహరించగలరు.'

వ. అనిన ధర్మరా జిట్లనియె. 221

ప్రతిపదార్థం: అనినన్= అని ద్రౌపది చెప్పగా; ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అని ద్రౌపది చెప్పగా, ధర్మరాజు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

సీ. 'క్రోధంబు పాపంబు, గ్రోధంబునన చేసి । యగుఁ జువ్వె ధర్మకామార్థ హాని.
గడుఁగ్రోధి గర్జంబు గానండు, క్రుద్ధుండు । గురునైన నిందించుఁ, గ్రుద్ధుఁడైన
వాఁ డవధ్యులనైన వధియించు, మఱి యాత్మ । ఘాతంబు సేయంగఁ గడఁగుఁ గ్రుద్ధుఁ,
దస్మాదృశులకు ధర్మానుబంధుల కిట్టి । క్రోధంబు దాల్చుట గుణమె చెపుమ?

ఆ. యెఱుక గల మహాత్ముఁ డెఱుకయ నజలముల । నార్చుఁ గ్రోధ మను మహానలంబుఁ,
గ్రోధవర్జితుండు గుఱుకొని తేజంబు । దాల్చు దేశకాలతత్త్వ మెఱిఁగి. 222

ప్రతిపదార్థం: క్రోధంబు= కోపం; పాపంబు= పాపం (దురితం, చెడ్డది); క్రోధంబునన్+అ+చేసి= కోపంచేతనే; ధర్మ, కామ+అర్థ, హాని= ధర్మానికి, కామానికి, అర్థానికి చేటు; అగున్+చువ్వె= అవుతుంది సుమా! (అంటే పురుషార్థాలకు మూడింటికి క్రోధంవలన కీడు కలుగుతుందని భావం); కడున్+క్రోధి= మిక్కిలి కోపం పొందినవాడు; కర్జంబు+కానండు= కర్తవ్యాన్ని చూడలేడు; క్రుద్ధుండు= కోపించినవాడు; గురున్+ఐన= గురువునైనను; నిందించున్= తెగడుతాడు; క్రుద్ధుఁడు+

ఐనవాఁడు= ఆగ్రహించినవాడు; అవధ్యులను+ఐనన్= చంపదగనివారిని సయితం; వధియించున్= చంపుతాడు; మఱి= ఇంక; క్రుద్ధుఁడు= కోపించినవాడు; ఆత్మఘాతంబు+చేయంగన్+కడఁగున్= ఆత్మహత్యకు పాల్పడతాడు; అస్మాదృశులకున్= నా వంటివారికి; ధర్మ+అనుబంధులకున్= ధర్మంతో ముడివడిన వారికి; ఇట్టి, క్రోధంబు= ఇటువంటికోపం; తాల్చుట= వహించటం; గుణము+ఎ= మంచిగుణం అవుతుందా; చెపుము+అ= చెప్పుము; ఎఱుక+కల, మహత్+ఆత్ముఁడు= జ్ఞానం కల గొప్పవాడు; ఎఱుక+అన్+జలములన్= జ్ఞాన మనే నీళ్ళతో; క్రోధము+అను, మహా+అనలంబున్= కోపమనే పెనుమంటను; ఆర్చున్= ఆర్పివేస్తాడు; క్రోధవర్జితుండు= క్రోధంచేత విడువబడినవాడు (కోపాన్ని విడనాడినవాడు); గుఱుకొని= ప్రయత్నించి; దేశ, కాల, తత్త్వము+ఎఱిఁగి= దేశ సమయాలయొక్క స్వభావం తెలిసికొని; తేజంబు= ప్రకాశాన్ని; తాల్చున్= ధరిస్తాడు.

తాత్పర్యం: 'కోపం గొప్ప పాపం. కోపంవలన మూడు పురుషార్థాలకు- ధర్మానికి, అర్థానికి, కామానికి కీడు సంభవిస్తుంది కదా! మిక్కిలి కోపించినట్టివాడు కర్తవ్యాన్ని గ్రహించజాలడు. కోపి గురువు నైనను నిందిస్తాడు. కోపం చెందిన వాడు చంపకూడనివారిని సయితం చంపివేస్తాడు; అంతేకాదు. ఆత్మహత్యకుకూడ పాల్పడతాడు. ధర్మంతో ముడివడిన నడవడిక కల నాబోటివారికి కోపంవహించటం తగునా? నీవే చెప్పుము. జ్ఞాని అయిన మహాత్ముడు జ్ఞానమనే నీటితో కోపమనే పెనుమంటను చల్లార్చుతాడు. క్రోధం విడనాడినవాడు సమయ సీమల నిజస్వభావం తెలిసికొని తేజస్వి అవుతాడు.

విశేషం: అలం: రూపకం.

క. **క్షమ గల వానికిఁ బృథ్వీ । సమునకు నిత్యంబు విజయసంసిద్ధి యగున్;**
క్షమి యైనవాని భుజవి । క్రమము గడున్ వెలయు సర్వకార్యక్షమమై. **223**

ప్రతిపదార్థం: క్షమ కలవానికిన్= ఓర్పు ఉన్నవాడికి; పృథ్వీసమునకున్= భూదేవితో సమానుడైన వాడికి; నిత్యంబు= ఎల్లప్పుడు; విజయ, సంసిద్ధి= విశేష జయప్రాప్తి, అంటే గొప్పవిజయం కలగటం; అగున్= ఏర్పడుతుంది; క్షమి+ఐనవాని= క్షమావంతుడి యొక్క; భుజ, విక్రమము= బాహుబలం, అంటే పరాక్రమం; సర్వ, కార్య, క్షమము+ఐ= అన్ని పనులకు సరిపడేటటువంటిదై; కడున్= మిక్కిలి; వెలయున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: భూదేవితో సమానుడైన ఓర్పు కలవాడికి సదా విజయం సిద్ధిస్తుంది. క్షమావంతుడి పరాక్రమం అన్ని సమయాలలోను కార్యసాధకమై రాణిస్తుంది.

విశేషం: క్షమాశక్తికి ప్రాచీన భారతీయ సాహిత్యంలో ఉదాహరణ ప్రాయమైంది భూదేవి. "క్షమయా ధరిత్రీ" అని తెలుగువారి సంభాషణలలో సాధారణంగా వినిపిస్తుంది. భూదేవికి గల పేర్లలో 'క్షమా' అనేది సార్థకమైనది, ప్రసిద్ధమైనది.

వ. **తేజఃప్రభవంబులైన యమర్ష దాక్షిణ్య శౌర్య శీఘ్రత్వంబు లను నాలుగు గుణంబులు క్షమావంతునంద వీర్యవంతంబులగుఁ; దొల్లి కశ్యపగీతలైనగాథలయందీ యర్థంబు వినంబడు, వినుము; వేదంబులు యజ్ఞంబులు శౌచంబును సత్యంబును విద్యయు ధర్మువు సచరాచరం బయిన జగమంతయు క్షమయంద నిలిచినవి; తపస్స్వాధ్యాయ యజ్ఞకర్తలయు బ్రహ్మవిదులయుం బడయు పుణ్యగతులు క్షమావంతులు వడయుదు; రదియునుంగాక, కృష్ణ ద్వైపాయన భీష్మ విదుర కృపద్రోణ సంజయ ప్రభృతులు నా యుపశమంబ**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కీర్తింతు; రుపశమ హీనుండయిన దుర్యోధను కారణంబున ధార్తరాష్ట్రుల కెల్లం బ్రళయం బగు' ననిన ద్రౌపది వెండియు నిట్లనియె. **224**

ప్రతిపదార్థం: తేజస్+ప్రభవంబులు+ఐన= తేజస్సునుండి పుట్టిన; అమర్ష, దాక్షిణ్య, శౌర్య, శీఘ్రత్వంబులు+అను= అసహనం (కోపం), దయ, పరాక్రమం, వేగం అనే; నాలుగు, గుణంబులు= నాలుగు లక్షణాలు; క్షమావంతునందు+అ= ఓర్పుకల వాడియందు మాత్రమే; వీర్యవంతంబులు+అగున్= బలం కలవి అవుతాయి; తొల్లి= పూర్వం; కశ్యపగీతలు+ఐన, గాథల+అందు= కశ్యపుడిచే చెప్పబడిన ప్రబోధకాలు అయిన కథల్లో; ఈ+అర్థంబు= ఈ భావం; వినంబడు; వినుము; వేదంబులు, యజ్ఞంబులు, శౌచంబును, సత్యంబును, విద్యయు, ధర్మవు= వేదాలును, యజ్ఞాలును, పారిశుద్ధ్యమును, నిజమును, చదువును, ధర్మమును; స, చర+అచరంబు+అయిన, జగము+అంతయు= కదలేటి, కదలనట్టి వాటితో కూడిన ప్రపంచమంతయు; క్షమయందు+అ= ఓర్పునందు మాత్రమే; నిలిచినవి; తపస్+స్వాధ్యాయ, యజ్ఞకర్తలయు= తపస్సు, వేదాన్ని అభ్యసించటం, (వేదాధ్యయనం) యజ్ఞాలు- చేసిన వారి యొక్కయు; బ్రహ్మ విదులయున్= జ్ఞానులయొక్కయు; పడయు, పుణ్య, గతులు= పొందే పుణ్య పదవులు; క్షమావంతులు= ఓర్పుకల వాళ్ళు; పడయుదురు= పొందుతారు, అదియునున్+కాక= అంతమాత్రమేకాక; కృష్ణద్వైపాయన, భీష్మ, విదుర, కృప, ద్రోణ, సంజయ, ప్రభృతులు= వ్యాసుడు, భీష్ముడు, విదురుడు, కృపుడు, ద్రోణుడు, సంజయుడు మున్నగువారు; నా, ఉపశమంబు+అ= నా ఓర్పునే; కీర్తింతురు= పొగడుతారు; ఉపశమ, హీనుండు+అయిన= ఓర్పులేనివాడయిన; దుర్యోధను, కారణంబునన్= దుర్యోధనుడి మూలంగా; ధార్తరాష్ట్రులకు+ఎల్లన్= ధృతరాష్ట్రుడి కుమారుల కెల్లరకు; ప్రళయంబు+అగున్= వినాశనం దాపురిస్తుంది; అనినన్= అని చెప్పగా; ద్రౌపది; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: కోపం, దయ, పరాక్రమం, వేగం అనే నాలుగు గుణాలు తేజంనుంచి పుట్టాయి. క్షమావంతుడి పట్ల బలం కలవిగా పరిణమిస్తాయి - అని కశ్యపగీతలలో ఉన్నది. వేదాలు, యజ్ఞాలు, శౌచం, సత్యం, ధర్మం, విద్య, సమస్త చరాచర జగత్తు క్షమమీదే నిలుస్తాయి. బ్రహ్మజ్ఞానులున్నూ, తపస్సు, వేదాధ్యయనం చేసిన యజ్ఞకర్తలున్నూ పొందే ఉత్తమగతులను క్షమావంతులు పొందగలరు. వ్యాసుడు, విదురుడు, భీష్ముడు, కృపుడు, ద్రోణుడు, సంజయుడు మున్నగు ధర్మాత్ములు నా క్షమాగుణాన్నే పొగడుతారు. దుర్యోధనుడి క్షమాహీనతవలన ధార్తరాష్ట్రుల కెల్ల వినాశనం ఏర్పడగలదు' అని చెప్పిన ధర్మరాజుతో ద్రౌపది ఇట్లా పలికింది.

విశేషం: మహాభారతంలో భగవద్గీతతోపాటు పెక్కు గీతలు ఉన్నాయి. మరికొన్ని గీతల ప్రశంస ఎడనెడ కన్పిస్తుంది. నన్నయ మహాకవి పీఠికలో ఉద్ఘోషించినట్లు - మహాభారతాన్ని వ్యాసమహర్షి విశ్వ జనీనమైన విజ్ఞాన సర్వస్వంగా తీర్చి దిద్దాడు. మహాభారతం సర్వదర్శనసమాహారంగా ప్రశస్తి కాంచటానికి కారణం, అందులో విప్రతిపన్నాలుగా కనిపించే విభిన్నవాదాలు సంవాదరూపంలో పొందుపరచబడటం. వాటిలో ద్రౌపదీ ధర్మరాజుల సంవాదం ఒకటి.

మధ్యాక్కర.

'క్షమయంద చిత్తంబు నిల్పి నిర్గతకల్మషబుద్ధిఁ
గ్రమమున ధర్మువునంద వర్తిల్లు కరుణాత్ము నిన్ను
నమర ధర్మంబు రక్షించుఁ బ్రీతితో నని శత్రులందు
సమబుద్ధి సేయంగఁ జనునె నీకు నజాతశత్రుండ! **225**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అజాతశత్రుండ!= శత్రువులు లేనట్టివాడా ఓ ధర్మరాజా!; క్షమయందు+అ= ఓర్పునందే; చిత్తంబు, నిల్పి= మనస్సు ఉంచి; నిర్గత, కల్మష, బుద్ధిన్= పోయిన పాపాలుకల బుద్ధితో; క్రమమునన్= వరుసతప్పక; ధర్మువునందు+అ= ధర్మంలో మాత్రమే; వర్తిల్లు= నడుచుకొనే; కరుణా+ఆత్మున్= దయామయుడైన; నిన్నున్; అమరన్= ఒప్పగా; ధర్మంబు= ధర్మం; ప్రీతితోన్= అనురాగంతో; రక్షించున్= కాపాడగలదు; అని; నీకున్; శత్రులందు= విరోధులపట్ల; సమబుద్ధి= ఋజువైన బుద్ధి; (శత్రుత్వం లేని మనస్తత్వం); చేయంగన్+చనునె= అవలంబించటం సరైనదవుతుందా?

తాత్పర్యం: 'అజాత శత్రుడవైన ధర్మరాజా! నిర్మలమైన బుద్ధితో ఓర్పునందే మనస్సును లగ్నంచేసి నీవు ధర్మంలో ప్రవర్తిస్తున్నావు. అటువంటి కరుణామయుడవైన నిన్ను ఆ ధర్మమే ప్రీతితో కాపాడగలదన్న విశ్వాసంతో, శత్రువులయెడల సమబుద్ధి వహించడం నీకు తగునా?

విశేషం: ద్రౌపదివాదం, ధర్మరాజుపై సునిశితవిమర్శగా స్థూలదృష్టికి గోచరించినా, సూక్ష్మదృష్టికి ధర్మరాజు ఎట్లా సార్థకనాముడు అయ్యాడో, అతడికి ఎట్లా అజాతశత్రుడు అనే బిరుదు ఏర్పడిందో తెల్లమవుతున్నది. వృత్తలక్షణానికి ఆర. 1.134 విశేషాంశం చూడండి.

ఆ. ధర్మదూరులైన ధార్తరాష్ట్రులయంద । ధర్ము వేమి సేయు ధరణినాథ!
నికృతిపరులయందు నికృతి సేయనివారు । వారి నికృతిఁజేసి వధ్యు లండ్రు. 226

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా! (ఓ ధర్మరాజా!); ధర్మ, దూరులు+ఐన= అధర్మపరులైన (ధర్మానికి దూరంగా ఉన్నవారైన); ధార్తరాష్ట్రులయందు+అ= ధృతరాష్ట్రుడి కొడుకులందే; ధర్మువు= ధర్మం; ఏమి, చేయున్= ఏం చేయగలదు? (అధర్మువు= అధర్మం ఏమి చేయకలదని కూడ చెప్పవచ్చును); నికృతి పరుల యందు= మోసగాండ్రపట్ల; నికృతి, చేయనివారు= మోసంగా ప్రవర్తించనివారు; వారి, నికృతిన్+చేసి= వారి మోసంవలన; వధ్యులు= చంపదగినవారు; అండ్రు= అని అంటారు.

తాత్పర్యం: ఓ రాజా! అధర్మవర్తనులైన ధార్తరాష్ట్రులపట్ల నీ ధర్మం ఏమి చేయగలదు? (అధర్మం చేసినా దోషం లేదు). వంచకులపట్ల వంచనతో ప్రవర్తించనివారు, వారి వంచనచేత చంపదగినవారవుతారని పెద్దల అభిప్రాయం.

విశేషం: అనుదురు - అందురు - అండురు - అండ్రు. కర్త పెద్దలు.

క. ఆర్యులకు విహీనతయు న । నార్యుల కున్నతియుఁ జేసి యవినీతుఁడ వై
కార్యము దప్పితి; నీకు న । నార్యులు చుట్టములె, యార్యు లరులె విధాతా!' 227

ప్రతిపదార్థం: విధాతా!= ఓ బ్రహ్మదేవుడా!; ఆర్యులకున్= పూజ్యులైనవారికి; విహీనతయున్= తక్కువతనాన్నీ; అనార్యులకు= అపూజ్యులకు, అంటే దుష్టులకు; ఉన్నతియున్= అభ్యుదయాన్నీ; చేసి= కల్పించి; అవినీతుఁడవు+ఐ= నీతి లేని వాడివై; కార్యము+తప్పితి(వి)= కర్తవ్యాన్ని ఉజ్జగించావు; నీకు; అనార్యులు= అపూజ్యులు; చుట్టములు+ఎ= బంధువులా?; ఆర్యులు= మహానుభావులు; అరులు+ఎ= శత్రువులా?

తాత్పర్యం: (ఈవాక్యాలు ద్రౌపది, బ్రహ్మదేవుడిని సంబోధించి పలికినవి. ఇది ద్రౌపది స్వగతం. ధర్మరాజు వినాలనే ద్రౌపది తన ఆంతరంగిక భావాన్ని బహిర్గత మొనరించింది.) 'ఓ బ్రహ్మదేవుడా! ఆర్యులకు లేమిని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనార్యులకు అభ్యుదయాన్ని చేకూరుస్తున్నావు ఈ రీతిగా నీతిని అతిక్రమించి, నీ కర్తవ్యాన్ని వదలిపెట్టావు కదా! నీకు అనార్యులే బంధుగులా? ఆర్యులు శత్రువులా?

వ. అని, విధాతృని ధర్మువు నాక్షేపించు ద్రౌపదిం జూచి ధర్మ రాజిట్లనియె; 'నాస్తికులయట్లు ధర్మాభిశంకినివై దైవ దూషణంబు సేసెదు; శిష్టచరితంబైన ధర్మంబు నధిక్షేపించుచున్న దుర్మతికిం బ్రాయశ్చిత్తంబు లేదు; ధర్మువు దప్పక నిత్యులై జీవించుచున్న మైత్రేయ మార్కండేయ వ్యాస వసిష్ఠ నారద ప్రభృతులం బరమయోగధరులం బ్రత్యక్షంబ చూచెదము; వీరెల్ల నన్ను ధర్మపరుండని మన్నింతు; రన్యు లన్యాయంబు సేసి రేనియు నే నేల ధర్మువు దప్పుదు? 228

ప్రతిపదార్థం: అని; విధాతృని= బ్రహ్మదేవుడి యొక్క; ధర్మువున్= ధర్మాన్ని; ఆక్షేపించు= తెగడుతున్న; ద్రౌపదిన్+చూచి= ద్రౌపదిని చూచి; ధర్మరాజు; ఇట్లు+అనియెన్; నాస్తికుల వలె; ధర్మ+అభిశంకినివి+ఐ= ధర్మం పట్ల సందేహం కలదానివై; దైవ దూషణంబు= దైవాన్ని దూషించటం; చేసెదు= చేస్తున్నావు; శిష్ట, చరితంబు+ఐన= మంచివారి నడవడి అయిన; ధర్మంబున్+అధిక్షేపించుచున్న, దుర్మతికిన్= ధర్మాన్ని దూషిస్తున్న దుష్టబుద్ధికి; ప్రాయశ్చిత్తంబు= (నిష్కృతి కల్పించే) విరుగుడు; లేదు; ధర్మువు, తప్పక= ధర్మమార్గాన్ని అతిక్రమించక; నిత్యులు+ఐ, జీవించుచు+ఉన్న= ఎల్లప్పుడు జీవిస్తున్న (బతుకుతున్న); మైత్రేయ, మార్కండేయ, వ్యాస, వసిష్ఠ, నారద ప్రభృతులన్= మైత్రేయుడు, మార్కండేయుడు, వ్యాసుడు, వసిష్ఠుడు, నారదుడు మున్నగు వారిని; పరమయోగ ధరులన్= గొప్ప యోగులను; ప్రత్యక్షంబు+అ= మన కనులముందే; చూచెదము= చూస్తున్నాం; వీరు+ఎల్లన్= వీరందరున్నూ; నన్ను; ధర్మపరుండు+అని= ధర్మ నిష్ఠ కలవాడని; మన్నింతురు= గౌరవిస్తారు; అన్యులు= ఇతరులు; అన్యాయంబు+చేసిరి+ఏనియు= అన్యాయం చేసినప్పటికిని; నేను+ఏల= నేనెందుకు; ధర్మువు= ధర్మాన్ని; తప్పుదున్= మీరుతాను?

తాత్పర్యం: (ఇక్కడ ధర్మరాజు తన జీవితతత్త్వాన్ని వివరించాడు. ఇది ద్రౌపదివాదానికి పూర్వపక్షం). ద్రౌపదితో ధర్మరాజు ఇట్లా అన్నాడు: 'నాస్తికుల వలె ధర్మాన్ని మిగుల సందేహిస్తూ దైవదూషణ చేయుట మెందుకు? శిష్టజనుల నడవడియైన ధర్మాన్ని నిందించే దుర్బుద్ధికి నిష్కృతి లేదు. ధర్మాత్ములైన మైత్రేయ, మార్కండేయ, వ్యాస, వసిష్ఠ, నారద ప్రభృతులు నన్ను ధర్మపరుడని గౌరవిస్తున్నారుకదా! అట్టి పరమ యోగీశ్వరులను మనం మన కనుల ముందే చూస్తున్నాం. శిష్టచరితమే ప్రత్యక్ష ధర్మం. ఇతరులు నాపట్ల అన్యాయంగా ప్రవర్తించినా నే నెందుకు ధర్మాన్ని తప్పాలి?

విశేషం: నాస్తికుడు అనే శబ్దానికి 'లేదు' అని చెప్పేవాడు అనిన్నీ; ఆస్తికుడు అనే శబ్దానికి 'ఉన్నది' అని చెప్పేవాడు అనిన్నీ వాచ్యార్థం. ప్రాచీన భారతీయ వాఙ్మయంలో 'నాస్తికుడు' అంటే వేదప్రామాణ్యాన్ని అంగీకరించనివాడు అనిన్నీ, 'ఆస్తికుడు' అంటే వేద ప్రామాణ్యాన్ని అంగీకరించినవాడు అనిన్నీ రూఢ్యర్థం. ఆధునిక వ్యవహారంలో నాస్తికుడంటే దేవుడు లేడనే వాడనిన్నీ, ఆస్తికు డంటే దేవుడు ఉన్నాడనేవాడనిన్నీ పలువురు భావిస్తున్నారు. ద్రౌపది నాస్తికురాలు కాదు. 'నాస్తికుల యట్లు' ఆమె వాదించటం ధర్మరాజుకు నచ్చలేదు. మహాభారతంలో అన్ని వాదాలకు యథోచితంగా వివరణ ఉన్నది. తుదకు తీర్పు చెప్పవలసింది సహృదయులైన చదువరులే.

క. ధీరమతియుక్తిఁ జేసి వి । చారింపఁగ నిక్కువంబు సర్వజన స్వ
ర్గారోహణసోపానం । బారఁగ ధర్మంబ సూవె యతిరమ్యంబై. 229

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధీర, మతి, యుక్తిన్+చేసి= పండిత బుద్ధితో; విచారింపఁగన్= ఆలోచన చేస్తే; నిక్కువంబు= నిజం; సర్వ, జన, స్వర్గ+ఆరోహణ, సోపానంబు= అందరు ప్రజలకు స్వర్గాన్ని ఎక్కటానికి మెట్టు; ఆరఁగ= పరిపూర్ణంగా; అతి రమ్యంబు+ఐ= మిక్కిలి సుందరమై; ధర్మంబు+అ+చూవె= ధర్మమే సుమా! (చూడవె= చూవె).

తాత్పర్యం: తెలివితేటలతో యోచిస్తే సర్వజనులకు స్వర్గారోహణ సోపానం అతిరమ్యమైన ధర్మమే సుమా!

విశేషం: మహాభారతంలో ఈ పద్యం మిక్కిలి ముఖ్యమైంది. మహాభారతం స్వర్గారోహణ పర్వంతో ముగుస్తున్నది. ధర్మమే స్వర్గారోహణకు సోపానం అని ఈ పద్యం నొక్కి వక్కాణిస్తున్నది. మహాభారతానికి అంతరాత్మ ధర్మం. ఈ పద్యంలో నాల్గవ పాదం మొదట 'ఆరఁగ' అనే పాఠానికి 'ఆరయ' అనే పాఠం కొన్ని ప్రతుల్లో కనిపిస్తున్నది. ఈ పద్యంలో మొదటనే 'విచారింపఁగ' అనే ప్రయోగం ఉన్నది. కావున 'ఆరయ' అనే పాఠం స్వీకరిస్తే అది పునరుక్తి దోష మవుతుంది. ఇక 'ఆరఁగ' అనే శబ్దం తెలుగుభాషలో నిండైన, పరిపూర్ణమైన అతిశయించు అనే అర్థాల్ని సంతరించుకొని ఉన్నది. (ఆరఁగ్రాగిన పాలు - పీనులార విని - కృపయార సైరింపుము భార. స్త్రీ పర్వం 1-157) అందుచేత 'ఆరఁగ' పాఠం స్వీకరించబడింది.

వ. తపస్స్వాధ్యాయ బ్రహ్మచర్యదాన ధర్మ యజ్ఞంబులను పుణ్యకర్మంబు లఫలంబు లగునేని వీనినేల ఋషిగణంబులు సేవింతురు; నీ జన్మంబును ధృష్టద్యుమ్ను జన్మంబును బుణ్య కర్మ ఫల సద్భావంబునకు నిదర్శనంబులు గావె? మఱి పుణ్యకర్మఫలంబులు గల యట్ల పాపఫలంబులును గలవు; తొల్లి బ్రహ్మ పుత్త్రులకుం గర్మఫల సద్భావంబుసెప్పె; నందుఁగశ్యపుండు ధర్మప్రబోధనంబునం జేసి పుణ్యఫల ప్రాప్తుండయ్యె; విధాతృ నియోగంబునం బుణ్యపాప ఫలంబు సంప్రాప్తం బగు; విధాతృ ననుగ్రహంబునన కాదె పుణ్యకర్మంబులు ప్రవర్తించి మర్త్యు లమర్త్యత్వంబును బొందుదు' రనిన విని ద్రౌపది యిట్లనియె. 230

ప్రతిపదార్థం: తపస్+స్వాధ్యాయ, బ్రహ్మచర్య, దాన, ధర్మ, యజ్ఞంబులు+అను= తపం, వేద పారాయణం, బ్రహ్మచర్యం, దానం, ధర్మం, యజ్ఞం అనే; పుణ్యకర్మంబులు= పుణ్యకార్యాలు; అఫలంబులు= ఫలాలు లేనట్టివి (అంటే నిరర్థకాలు); అగున్+ఏని= అయితే; వీనిన్= పై వాటిని; ఋషి, గణంబులు= ఋషుల సమూహాలు; ఏల, సేవింతురు= ఎందుకు ఆచరిస్తారు?; నీ, జన్మంబును= నీ పుట్టుకయున్నూ; ధృష్టద్యుమ్ను జన్మంబును= ధృష్టద్యుమ్నుడి పుట్టుకయున్నూ; పుణ్య, కర్మ, ఫల, సత్+భావంబునకున్= పుణ్యకార్యాలు చేయటంవలన ఒనగూడిన ఫలమనే మంచి భావానికి (ఫలం ఉన్నదనటానికి); నిదర్శనంబులు, కావె= ఉదాహరణాలు కావా?; మఱి; పుణ్య, కర్మ, ఫలంబులు= పుణ్యకార్యాలవలన కలిగే ఫలితాలు; కల+అట్లు+అ= ఉన్నట్లే; పాప, ఫలంబులును= పాపాలు చేయటంవలన కలిగే ఫలాలున్నూ; కలవు= ఉన్నాయి; తొల్లి= పూర్వకాలంలో; బ్రహ్మ; తన పుత్త్రులకున్= తన కుమారులకు; కర్మ, ఫల, సత్+భావంబు= కర్మలుచేయటంవలన సంక్రమించే ఫలితాలను బాగా పొందటాన్ని గురించి; చెప్పెన్; అందున్= ఆ కుమారులలో; కశ్యపుండు; ధర్మప్రబోధంబునన్+చేసి= ధర్మబోధచేత; పుణ్య, ఫల, ప్రాప్తుండు+అయ్యె= పుణ్య ఫలాలను పొందినవా డయ్యాడు, విధాతృ, నియోగంబునన్= బ్రహ్మ నిర్ణయం ప్రకారం; పుణ్య, పాప, ఫలంబు= పుణ్యం కాని, పాపం కాని చేస్తే దాని ఫలితం; సంప్రాప్తంబు+అగున్= సంక్రమిస్తుంది; విధాతృ+అనుగ్రహంబునన్+అ, కాదె= బ్రహ్మదేవుడి దయవలననే కదా!; పుణ్య, కర్మంబులు, ప్రవర్తించి= పుణ్యకార్యాలు, చేసి; మర్త్యులు= మనుజులు; (మరణం చెందేవారు); అమర్త్యత్వంబును= చావులేని దివ్యత్వాన్ని; పొందుదురు= పడయుదురు; అనిన, విని, ద్రౌపది, ఇట్లు+అనియెన్= అని చెప్పగా ఆలకించి ద్రౌపది ఇట్లా పలికింది.

తాత్పర్యం: తపస్సు, వేదపారాయణం, బ్రహ్మచర్యం, దానం, ధర్మం, యజ్ఞం అనే పుణ్యకార్యాలు ఫలితాలు లేనట్టివయితే వాటిని ఎంతోమంది ఋషులు ఎందుకు ఆచరిస్తున్నారు? నీ పుట్టుక, ధృష్టద్యుమ్నుడి పుట్టుక

పుణ్యకర్మఫలం ఉన్నదనటానికి ఉదాహరణాలే కదా! పుణ్యకర్మఫలాలు ఉన్నట్లే పాపకర్మఫలాలు కూడ ఉన్నాయి. పూర్వం బ్రహ్మ తన కుమారులకు కర్మఫలాల ఉనికిని గురించి చెప్పాడు. వారిలో కశ్యపుడు ధర్మప్రబోధంచేత పుణ్యఫలప్రాప్తు డయ్యాడు. బ్రహ్మనిర్ణయం ప్రకారం పుణ్య పాప ఫలితాలు సంక్రమిస్తాయి. బ్రహ్మదేవుడి దయ వలననే పుణ్యకార్యాలు చేసి మనుజులు చావులేని దివ్యత్వాన్ని పొందుతారు'- అని చెప్పగా విని ద్రౌపది ఇట్లా పలికింది.

ఆ. 'కర్మఫలము లేదు, కర్మ ఫలాప్తికిఁ । గారణంబు విధియుఁ గా దనంగ
నంత యెఱుకలేనె యార్తనై విధి చెయ్ది । కలసి పలికితిం బ్రియంబు దప్పి, 231

ప్రతిపదార్థం: కర్మ ఫలము= చేసిన పనులకు అనుభవించవలసిన ఫలితం; లేదు= ఉండదు; కర్మ, ఫల+ఆప్తికిన్= కర్మఫలాలు పొందటానికి; కారణము= హేతువు; విధియున్= బ్రహ్మయు; కాదు+అనంగన్= కాదని చెప్పటానికి; అంత+ఎఱుక, లేను+ఎ= అంతమాత్రం జ్ఞానం లేనిదాననా?; ఆర్తను+ఐ= కష్టాలు పొందటంచేత కలిగిన మనోవ్యథతో పరితపించిన దానినై; విధిచెయ్దికి= దైవంయొక్క చేతకు, దురదృష్టానికి; అలసి= విసిగి; ప్రియంబు+తప్పి= అప్రియంగా-కటువుగా; పలికితిన్= మాట్లాడాను.

తాత్పర్యం: 'చేసిన పనులకు అనుభవించవలసిన ఫలం లేదు; కర్మఫలప్రాప్తికి విధికారణం కాజాలదు'- అని చెప్పేటంతటి జ్ఞానం లేని దాననా నేను? దురదృష్టంవలన పడిన అగచాట్లచేత మనస్తాపం కలిగి అట్లా అప్రియంగా మాట్లాడాను.

ఆ. వేదశాస్త్రములును విధివిధానములును । నప్రమాణ మను దురాత్మకులకుఁ
బుణ్యగతులు లేమి భూనాథ! యెఱుఁగని । దానఁగాను ధర్మతత్త్వయుక్తి. 232

ప్రతిపదార్థం: వేద, శాస్త్రములును= వేదాలు, శాస్త్రాలు (నియమన గ్రంథాలు)న్నూ; విధి, విధానములునున్= వర్తించే తీరులును; అప్రమాణము= అంగీకరించవలసినవి కావు; అను= అనే; దురాత్మకులకున్= చెడ్డవారికి; పుణ్యగతులు, లేమి= పుణ్యఫలాలు లేక పోవటం; భూనాథ= ఓరాజా! (భూమికి భర్త అయిన వాడా!); ధర్మ తత్త్వయుక్తిన్= ధర్మానికి సంబంధించిన తత్త్వజ్ఞానంయొక్క కూడికచే; ఎఱుఁగనిదానన్+కాను= తెలియనిదానిని కాను.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నేను ధర్మంయొక్క తత్త్వాన్ని గూర్చిన (గురించిన) పరిజ్ఞానం బొత్తిగా లేని దానిని కాను. వేదాలు, శాస్త్రాలు, అందులో చెప్పబడిన విధులు, నిషేధాలు, ప్రమాణాలు కావు అని చెప్పే చెడ్డవారికి పుణ్యగతులు లేవు అని తెలియనిదాననూ కాను.

వ. తొల్లి నీతిమంతులైన బ్రాహ్మణులు మదీయ జనకునకుం జెప్పంగ వింటి; నెఱుక గలవారికిం గర్మంబు గర్తవ్యంబు; గర్మరహితులయి స్థావరంబులయట్లు జనులు జీవింపనేర; రల్పఫలంబునైనను గర్మంబుఁ బ్రవర్తించుచున్నవారిం జూచెదము; దైవమానుషంబులు గర్మఫలప్రాప్తికి నిమిత్తంబులు; పురుషుండు మనంబున నర్థసిద్ధి నిశ్చయించి కర్మంబునందుఁ గృతోత్సాహుండు గావలయు; నట్టివానికి దైవంబు సహాయం బయి కర్మసిద్ధి గావించు. 233

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; నీతిమంతులు+ఐన= నీతి పరిజ్ఞానం కల; బ్రాహ్మణులు= విప్రులు; మదీయ జనకునకున్= నా తండ్రికి (ద్రుపదమహారాజుకు); చెప్పంగ, వింటిన్= చెప్తుతుంటే విన్నాను; ఎఱుక, కలవారికిన్= జ్ఞానులకు; కర్మంబు= క్రియాచరణం (అంటే కర్తవ్యాలు చేయటం); కర్తవ్యంబు= చేయవలసిన ధర్మం; కర్మ, రహితులు+అయి= క్రియాశూన్యులయి; స్థావరంబులు+అట్లు= జడపదార్థాలవలె; జనులు; జీవింపనేరరు= బ్రతుకజాలరు; అల్పఫలంబున్+ఐనను= తక్కువ ఫలితం కలదే అయినప్పటికిన్నీ; కర్మంబున్= క్రియానిరతిన్, (పనులు చేస్తుండటాన్ని); ప్రవర్తించుచున్న వారిన్= నిర్వర్తిస్తున్నవారిని; చూచెదము= చూస్తుంటాం; దైవ, మానుషంబులు= విధియున్నూ, మానవ యత్నమున్నూ; కర్మ, ఫల, ప్రాప్తికిన్= కర్మవలన కలిగే ఫలసిద్ధికి; నిమిత్తంబులు= కారణాలు; పురుషుండు= మనుజుడు; మనంబునన్= మనస్సులో; అర్థసిద్ధి నిశ్చయించి= తన ధ్యేయ ఫలితాన్ని యోజన చేసి నిర్ణయించుకొని; కర్మంబునందున్= తాను చేయవలసిన కృషిలో; కృత+ఉత్సాహుండు= చేయబడిన ఉత్సాహం కలవాడు, అంటే సంతోష పూర్వకమైన దీక్షతో ఉండేవాడు; కావలయున్; అట్టి వానికి; దైవంబు= విధి; సహాయంబు+అయి= తోడై; కర్మసిద్ధి= చేసినపనికి తగిన ఫలితం; కావించున్= ఏర్పరుస్తుంది.

తాత్పర్యం: తొల్లి నీతికోవిదులైన విద్వాంసులు నాతండ్రితో మాట్లాడేటప్పుడు విన్నాను. జ్ఞానులకు కర్మచేయటం కర్తవ్యం. జడాల వలె జనులు క్రియాశూన్యులై జీవించలేరు. పొందెడి ఫలం తక్కువే అయినా పురుషకారం చేస్తున్నవారు మన కనులముందే ఉన్నారు. కర్మఫలప్రాప్తికి దైవమున్నూ, పురుషకారమున్నూ కారణాలు. పురుషుడు ముందు తన మనస్సులో తన ధ్యేయాన్ని నిర్ణయించుకొని తదుపరి సంతోషంతో కూడిన దీక్షతో పురుషకారానికి పూనుకోవాలి. అట్టివాడికి, అంటే పురుషకారంతో కర్మ చేసేవాడికి, దేవుడు సాయపడి కర్మసిద్ధి కావిస్తాడు.

మధ్యాక్కర.

తిలలందుఁ దైలంబు గాష్ఠములయందుఁ దిరముగా నగ్ని
గలుగు టెఱింగి యుపాయపూర్వము గడఁగి తత్సిద్ధి
యలయక యుత్సాహవంతుఁడు వడయున ట్లనుత్సాహ
మొలసి దైవపరుఁ డిది వడయంగను నోపునె యెందు. 234

ప్రతిపదార్థం: తిలలందున్+తైలంబు= నువ్వుగింజలలో నూనె; కాష్ఠముల+అందున్= కఱ్ఱలలో; తిరముగాన్= స్థిరంగా అగ్ని; కలుగుట+ఎఱింగి= ఉండటం తెలిసికొని; ఉత్సాహవంతుఁడు= సంతోషంతో స్థిరయత్నం చేసేవాడు; ఉపాయ, పూర్వము, కడఁగి= ఉపాయపూర్వకంగా ప్రయత్నించి; అలయక= విడువక శ్రమించి; తద్+సిద్ధి= వాటి లబ్ధిని; పడయు+అట్లు= పొందునట్లుగా, దైవపరుఁడు= విధిని మాత్రమే నమ్ముకొన్నవాడు; అనుత్సాహము= ఉత్సాహం లేమి; ఒలసి= పొంది; ఇది= కర్మఫలసిద్ధిని; ఎందున్= ఎచటనైనను; పడయంగనున్+ఓపునె?= పడయజాలునా?

తాత్పర్యం: నువ్వుగింజల్లో నూనె ఉన్నది కదా! కఱ్ఱల్లో అగ్ని ఉన్నదికదా! వాటిని పొందటానికి ఉత్సాహవంతుడు ఉపాయపూర్వకమైన ప్రయత్నం చేయవలసి ఉంటుంది. పురుషకారాన్ని వీడి కేవలం దైవాన్నే నమ్ముకొన్నవాడు, ఉత్సాహవంతుడు పొందే ఆ సిద్ధిని పొందగలడా? (అంటే కార్యసాఫల్యం పొందగలడా?)

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.134 విశేషాంశం చూడండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మధ్యాక్కర.

కడు నిమ్ముగా దున్ని బీజములు సల్లి కర్షకుం డున్నఁ
దడయక వర్షంబు గురిసి కావించుఁ దత్ఫలసిద్ధి
నడుమఁ బర్జన్యుఁ డనుగ్రహింపనినాఁ డేమి సేయుఁ
గడఁగి చేయంగలవానిఁ జేయును గాక కర్షకుఁడు. 235

ప్రతిపదార్థం: కడున్+ఇమ్ముగా= మిక్కిలి అనుకూలంగా; దున్ని; బీజములు= విత్తనాలు; చల్లి; కర్షకుండు+ఉన్నన్= రైతు ఉంటే; తడయక= ఆలస్యం కాకుండ; వర్షంబు, కురిసి; తద్; ఫల, సిద్ధి= ఆ ఫల ప్రాప్తి; కావించున్= ఏర్పరుస్తుంది; నడుమన్= మధ్యలో; పర్జన్యుఁడు= మేఘుడు; అనుగ్రహింపనినాఁడు= దయచూపని నాడు; కర్షకుఁడు= రైతు; ఏమి+చేయున్= ఏమి చేయగలడు?; కడఁగి= పూని; చేయన్+కల వానిన్= చేయగల పనులను; చేయునుగాక= చేస్తాడు అంతే.

తాత్పర్యం: మిక్కిలి అనువుగా రైతు పొలాన్ని దున్ని విత్తనాలు చల్లవచ్చును. అప్పుడు ఆలస్యం లేకుండ వర్షం కురిస్తే అతనికి ఫలసిద్ధి కలుగుతుంది. అట్లుగాక మేఘుడు దయ చూపకపోతే కర్షకుడు ఎంత శ్రమించినా ఏమి చేయగలడు? అందుచేత కర్షకుడు పురుషకారం చేస్తుండవలసిందేకదా?

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.134 విశేషాంశం చూడండి.

వ. కర్మఫలంబులు దైవమానుషసిద్ధం బులయిననుం బురుషోత్సాహ సముపార్జితంబులయిన నవి సుస్థిరంబులయి సురక్షితంబులయి వర్తిల్లు; ననీహమానుండయి దైవపరుండయిన వాఁడు నీరిలోని యానపాత్రంబునుంబోలె నవసన్నుండగుం గావునఁ గర్మఫలసిద్ధి నిశ్చయించి యుత్సాహవంతుండవయి నీ యనుజుల పరాక్రమంబునం బరుల జయించి మనయందలి యర్థకృశత్వం బపనయింపు 'మనిన, యాజ్ఞసేని వచనంబుల కనుగుణంబుగా భీమసేనుండు ధర్మరాజున కిట్లనియె. 236

ప్రతిపదార్థం: కర్మ, ఫలంబులు= చేసిన పనుల వలన వచ్చే ఫలితాలు; దైవ, మానుష, సిద్ధంబులు+అయిననున్= విధివలన, పురుషకారంవలన సిద్ధించేటటువంటివే అయినను; పురుష+ఉత్సాహ, సముపార్జితంబులు+అయినన్= పురుషుడియొక్క సంతోషపూర్వకమైన దీక్షవలన లభించినవైనచో; అవి; సుస్థిరంబులు+అయి= చిరకాలం ఉండేటటువంటివై; సురక్షితంబులు+అయి= చక్కగా రక్షింపబడినవై; వర్తిల్లున్= ఒప్పుతాయి; అనీహమానుండు+అయి= నిర్లక్ష్యంచేసేవాడై; దైవపరుండు+అయినవాఁడు= విధిని విశ్వసించినవాడు; నీరిలోని, యానపాత్రంబునున్+పోలెన్= నీటిలోని పడవవలె; అవసన్నుండు+అగున్= నశిస్తాడు; కావునన్= కాబట్టి; కర్మ, ఫల, సిద్ధి= ధ్యేయం; నిశ్చయించి= నిర్ణయించుకొని; ఉత్సాహవంతుండవు+అయి= సంతోషపూర్వకమైన ప్రయత్నం చేసినవాడివై; నీ+అనుజుల, పరాక్రమంబునన్= నీ సహోదరుల, శౌర్యంచేత; పరులన్= శత్రువులను; జయించి= గెలిచి; మన+అందలి; అర్థకృశత్వంబు= దారిద్ర్యం (ధనంలేమి); అపనయింపుము= పోగొట్టుము; అనిన; యాజ్ఞసేని వచనంబులకు= ద్రౌపది పలుకులకు; అనుగుణంబుగా= తగినట్లు; భీమసేనుండు= భీముడు; ధర్మరాజునకు+ఇట్లు+అనియెన్= ధర్మపుత్రుడితో ఇట్లా పలికాడు.

తాత్పర్యం: కర్మఫలాలు దైవ మానుష సిద్ధాలు. అయినను పురుషోత్సాహంచేత లభించేవి సుస్థిరాలై, సురక్షితాలై ఉంటాయి. అజాగ్రత్తగాఉంటూ దైవాన్ని మాత్రమే నమ్ముకొన్న వాడు, నీటిలోని పడవవలె మునుగుతాడు. కాబట్టి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లక్ష్యాన్ని నిశ్చయించుకొని, ధ్యేయసిద్ధికై ఉత్సాహంతో నీ సోదరుల పరాక్రమంతో శత్రువులను జయించుము. మన దారిద్ర్యాన్ని తొలగింపుము అని చెప్పగా ద్రౌపదిపలుకులను సమర్థిస్తూ ధర్మరాజుతో భీమసేనుడు ఇట్లా పలికాడు.

భీమసేన ధర్మరాజుల సంవాదము (సం. 3.34.1)

మ. 'పితృపైతామహమైన రాజ్య మరినిర్భేద్యంబు, గాండీవిచే
నతిగుప్తంబు, బలారికైనను నహార్యం బిట్టి దానిన్ సుదు
ర్మతి నన్యార్థము సేసి నీకుఁ జనునే మర్త్యేశ! యుగ్రాటవిన్
వ్రతముల్ సల్పుచు ధర్మలేశచరణవ్యాసక్తి నిట్లుండఁగన్. 237

ప్రతిపదార్థం: పితృ, పైతామహము+ఐన, రాజ్యము= తండ్రితాతలదైన రాజ్యం; అరి, నిర్భేద్యంబు= శత్రువులచేత భేదించరానిది; గాండీవిచేన్= గాండీవ మనే విల్లు ధరించిన అర్జునుడిచేత; అతి, గుప్తంబు= మిక్కిలి కాపాడబడింది; బల+అరికిన్+ఐననున్= ఇంద్రుడికైనను; న+హార్యంబు= హరింపశక్యంకానిది; మర్త్య+ఈశ!= ఓరాజా! (మర్త్యులకు ప్రభువైనవాడా!); ఇట్టి దానిన్= ఇటువంటి రాజ్యాన్ని; సుదుర్మతిన్= మిక్కిలి చెడుబుద్ధితో; అన్య+అర్థము+చేసి= ఇతరుల సొత్తుగా జేసి; ఉగ్ర+అటవిన్= భయంకరమైన అడవిలో; వ్రతముల్, సల్పుచు= నోములు చేస్తూ; ధర్మ, లేశ, చరణ, వి+ఆసక్తిన్= ధర్మంలో అల్పభాగాన్ని ఆచరించే విశేషమైన కోరికతో; ఇట్లు+ఉండఁగన్= ఈ విధంగా ఉండటం; నీకున్+చనున్+ఏ= నీకు తగునా?

తాత్పర్యం: 'తండ్రి తాతల దైన రాజ్య మిది. శత్రువులు జయించలేనిది. అర్జునుడిచే రక్షించబడింది. దేవేంద్రుడికైనా హరించ శక్యం కానిది. దీన్ని ఓ రాజా! పెడబుద్ధితో పరులపాలు చేసి, స్వల్పమైన ధర్మాచరణంలో ఆసక్తి గలిగి భయంకరమైన అడవిలో వ్రతాలు ఆచరిస్తూ ఇట్లా ఉండటం నీకు తగునా?

క. ఆమిషము సింహములచే । గోమాయువు గొన్నయట్లు కువలయరాజ్య
శ్రీ మనచేఁ గొని కౌరవుఁ । డేమని తలఁచునొకొ బుద్ధి నిష్టులుఁ దానున్. 238

ప్రతిపదార్థం: ఆమిషము= మాంసం; సింహములచే= సింహాలనుండి; గోమాయువు= నక్క; కొన్న, అట్లు= తీసికొన్నట్లు; కువలయ, రాజ్యశ్రీ= భూమండలరాజ్యసంపద; మనచేన్= మనదగ్గరనుండి; కొని= అపహరించి; బుద్ధిన్= మనసులో; కౌరవుఁడు= దుర్యోధనుడు; ఇష్టులు, తానున్= హితులు, తాను; ఏమి+అని, తలఁచున్+ఒకొ= ఏమని ఆలోచిస్తున్నాడో కదా!

తాత్పర్యం: సింహాలదగ్గరనుండి మాంసాన్ని నక్క లాగికొన్నట్లు మనదగ్గరనుంచి భూమండలరాజ్యసంపదను అపహరించి దుర్యోధనుడు, హితులు తాను కలిసి ఏమని ఆలోచిస్తున్నాడో కదా!

విశేషం: అలం: ఉపమ. 'ఆత్మార్థం బభిహితంబగునపుడు తల్లింగ సంఖ్యాభిధాయి వచనము ధాతువిశేషణంబుల కగును.' 'ఇష్టులు తానున్.... తలచును'; తాను ఆత్మార్థకం. అభిహితంబగుట= క్రియచే చెప్పబడుట. ఈ పద్యంలో ఆత్మార్థకమైన 'తాను' దుర్యోధనుడిని తెలుపుతున్నది. అది క్రియచే చెప్పబడుతున్నది. అందువలననే తలచునొకొ' - అనే క్రియాపదం తదనుగుణంగా ఏకవచనంలో ఉంది.

క. దుర్మతులను దుర్జనులను । ధర్మస్థితి నోర్వఁదగునె ధరణీశ్వర! దు
ష్కర్ములగు ధార్తరాష్ట్రుల । పేర్మి యడంగింపఁ గడఁగు పృథుభుజశక్తిన్. 239

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధరణీశ్వర!= భూమికి ప్రభువైన ఓ ధర్మరాజా!; దుర్మతులను= చెడుబుద్ధి కలవారైన; దుర్జనులను= చెడ్డమనుజులను; ధర్మస్థితిన్= ధర్మమందలి ఉనికిచేత; ఓర్వన్+తగున్= సహించవచ్చునా? (జయించవచ్చునా?); దుష్కర్ములు+అగు= చెడ్డపనులు చేసే వారైన; ధార్తరాష్ట్రుల, పేర్మి= ధృతరాష్ట్రుడి కుమారుల అతిశయం; పృథు, భుజ, శక్తిన్= గొప్పదయిన బాహుబలాన; అడంగింపన్+కడఁగు= అణచటానికి పూనుకొనుము.

తాత్పర్యం: భూమికి ప్రభువైన ఓ ధర్మరాజా! దుష్టస్వభావం గల చెడ్డవారిని ధర్మప్రవర్తనతో జయించటం సాధ్యమవుతుందా? కావున చెడు నడవడి గల ధార్తరాష్ట్రుల అతిశయాన్ని గొప్ప పరాక్రమంతో అణచటానికి పూనుకొనుము.

వ. ధర్మకామప్రభవంబయి సర్వార్థసాధనంబయిన యర్థంబు విడిచి మిత్త్రుల కప్రియంబు నమిత్త్రులకు హర్షం బునుంగా మునివృత్తిం జేకొని ధర్మువు ధర్మువనుచు ధర్మువునందు చిత్తంబు నిలిపి దుర్బలునట్లు నిర్వేదింపఁ దగునె? 240

ప్రతిపదార్థం: ధర్మ, కామ, ప్రభవంబు+అయి= ధర్మాన్ని, కామాన్ని పుట్టించేదై, (అంటే పురుషార్థాలలో ధర్మసాధనకు, కామసంతృప్తికి ఆధారమైనదయి); సర్వ+అర్థ, సాధనంబు+అయిన= అన్ని ప్రయోజనాలను నెరవేర్చేదైన; అర్థంబు= ధనమును; విడిచి= వీడి; మిత్త్రులకు= హితులకు; అప్రియంబును= అనిష్టాన్ని; అమిత్రులకు= శత్రువులకు; హర్షంబునున్+కా= సంతోషం కలిగేటట్లుగా; మునివృత్తిన్= ఋషులవర్తనను; చేకొని= స్వీకరించి; ధర్మువు, ధర్మువు+అనుచు= ధర్మం, ధర్మం, అంటూ; ధర్మువునందు= ధర్మంపైనే; చిత్తంబు, నిలిపి= మనస్సును ఉంచి; దుర్బలు+అట్లు= బలహీనుడి వలె; నిర్వేదింపన్+తగునె= పరితాపం పొందతగునా?

తాత్పర్యం: పురుషార్థాలు నాలుగింటిలో ధర్మకామాలకు అర్థం ఆధారంవంటిది. అంతే కాక, అర్థమే సర్వప్రయోజనాలు సాధించేటటువంటిది. అట్టి అర్థ పురుషార్థాన్ని సాధించక వదలిపెట్టి మిత్రులు సంతాపం చెందేటట్లు, శత్రువులు సంతోషించేటట్లు మునివలె ప్రవర్తిస్తూ, ధర్మం, ధర్మం అంటూ, ధర్మంపైనే మనస్సు లగ్నం చేసి బలహీనుడివలె పరితపించటం తగునా?

ఆ. బాహుబలము మెఱసి పరుల సంపదలు సే । కొనఁగ లావులేని కుత్సితుండు
నియతదుఃఖవృత్తి నిర్వేద పరుఁడగుఁ । గాక, నీకుఁ దగునె కౌరవేంద్ర! 241

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కౌరవవంశంలో శ్రేష్ఠుడా!; బాహుబలము= పరాక్రమం; మెఱసి= ప్రకటించి; పరుల సంపదలు= శత్రువుల ఐశ్వర్యం; చేకొనఁగన్, లావు, లేని= పరిగ్రహించటానికి శక్తి లేని; కుత్సితుండు= నీచుడు; నియత, దుఃఖ, వృత్తి= తప్పని సరైన శోకంతో కూడిన వర్తనంతో; నిర్వేదపరుఁడు+అగున్+కాక= పరితపించేవాడు అవుతాడేమో కాని; నీకున్+తగునె= నీకు (అది) సరైనదా?

తాత్పర్యం: కౌరవవంశానికి ఇంద్రుడివంటివాడవైన ఓ ధర్మరాజా! ఇతరులకు తన పరాక్రమంచేత ఓడించి వారి ఐశ్వర్యాన్ని చేకొనటానికి బలంలేని నికృష్టుడు ఎవడో పరితాపంతో కృశించి నిరాశ చెందవచ్చునుగాని, నీవంటి గొప్పవాడికి మాత్రం అట్టి నిస్పృహ పనికిరాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. నరనుత! నీ యనుజ్ఞఁగొని నాఁడ విరోధుల నెల్లఁ బోరిలో
సరభసవృత్తి నుక్కడఁగఁ జంపితిమేని మహోగ్రకాననాం
తరముల నుండకుండ నతిదారుణదుర్మృగ సంగమంబునం
బొరయక యుండఁగా మనకుఁ బోలు నమందమనఃప్రియంబుగన్. 242

ప్రతిపదార్థం: నరనుత!= నరులచేత కీర్తించబడినవాడా!; నీ, అనుజ్ఞన్+కొని= నీ అనుమతిని పొంది; నాఁడు+అ= ఆరోజే (అంటే జూదంలో ఓడిన నాడే); విరోధులన్+ఎల్లన్= శత్రువుల నందరిని; సరభస, వృత్తిన్= ఉద్వేగంతో; ఉక్కు+అడఁగన్= చేవ తరిగేటట్లు; చంపితిమి+ఏని= సంహరించి ఉంటే; మహా+ఉగ్ర, కానన+అంతరములన్= మిక్కిలి భయంకరమైన అడవులమధ్య; ఉండకుండన్= నివసించకుండ; అతి, దారుణ, దుర్మృగ, సంగమంబునన్+పొరయక+ఉండఁగాన్= మిక్కిలి ఘోరమైన దుష్ట జంతువులలో కలిసి ఉండకుండటం; అమంద, మనస్+ప్రియంబుగన్= తక్కువకాని అంటే ఎక్కువైన మనస్సంతోషంతో ఉండటం; మనకున్+పోలున్= మనకు సరిపోలుతుంది (సరిపడి ఉండేది).

తాత్పర్యం: ప్రజలచేత పొగడబడిన ఓ ధర్మరాజా! నీ అనుమతి తీసికొని ఆనాడే శత్రువులనందరిని యుద్ధంలో వేగంగా సంహరించి ఉంటే, ఈనాడు మనం ఈ భయంకరమైన అడవుల్లో దుష్టమృగాలమధ్య ఉండకుండా, ఎంతో నెమ్మదితో సంతోషంగా ఉండేవాళ్ళం కదా!

క. సమయాతిక్రమభీతిని । క్షమాయుతులమైన మనలఁ గౌరవులు పరా
క్రమహీనులుగాఁ దలఁతురు । సమరోత్సాహంబు విడిచి జడమతి నున్నన్. 243

ప్రతిపదార్థం: సమయ+అతిక్రమ, భీతిని= ఒప్పందాన్ని మీరటం గురించిన భయంచొప్పున; క్షమా, యుతులము+ఐన= ఓర్పుతో కూడిన వాళ్ళమైన; మనలన్= మనల్ని; సమర+ఉత్సాహంబు, విడిచి= యుద్ధాన్ని గురించిన పరాక్రమ ప్రయత్నం విడిచి; జడ, మతిన్= మందబుద్ధితో; ఉన్నన్= ఉంటే; కౌరవులు= దుర్యోధనాదులు; పరాక్రమహీనులుగాన్= శౌర్యం లేనట్టివారినిగా; తలఁతురు= పరిగణిస్తారు.

తాత్పర్యం: చేసికొన్న ఒప్పందాన్ని అతిక్రమించటం అవుతుందనే భీతితో, యుద్ధోత్సాహాన్ని విడిచి మందబుద్ధితో ఉంటే - మనల్ని కౌరవులు పరాక్రమహీనులుగా భావిస్తారు.

తే. తగిలి నిత్యంబు నేకాంతధర్మనిరతుఁ । డగుట యుక్తమె పురుషున? కట్టి వాని
వెలయ నర్థకామంబులు విడుచుఁ బ్రాణ । విగతు సుఖదుఃఖములు రెండు విడుచునట్లు. 244

ప్రతిపదార్థం: పురుషునకు= మనుజుడికి; తగిలి= పూని; నిత్యంబున్= ఎల్లప్పుడు; ఏకాంత, ధర్మ, నిరతుఁడు+అగుట= ధర్మాన్ని ఒక్కదాన్ని మాత్రమే ప్రీతితో ఆచరించే వాడవటం; యుక్తము+ఎ= తగునా?; అట్టివానిన్= అటువంటి మనుజుడిని; ప్రాణ, విగతున్= చనిపోయినవాడిని; సుఖ, దుఃఖములు, రెండు; విడుచు+అట్లు= వీడే విధంగా; వెలయన్= సుస్పష్టంగా; అర్థ, కామంబులు= అర్థ పురుషార్థం, కామపురుషార్థం; విడుచున్= విడిచిపోతాయి.

తాత్పర్యం: (మానవజీవితం పురుషార్థసాధనకు ఏర్పడింది కదా!) ఏ మానవుడికైనా, ఒక్క ధర్మ పురుషార్థంపైనే సదా చిక్కుకోవటం తగునా? మరణించినవాడిని సుఖదుఃఖాలు రెండున్నూ విడిచినట్లే, కేవల ధర్మపురుషార్థ పరుడిని అర్థకామాలు విడిచి పెడతాయి. అంటే అర్థకామాలను విడిచిన ధర్మపరుడు మృతప్రాయుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ.

సీ. **ధర్మ కామంబులు దఱుగంగ నర్థార్థి । యగువాఁడు పతితుఁ డౌ; నర్థసేవ**
నర్థార్థముగఁ జేయు నతఁ డుగ్రవనములో । గోరక్ష సేయు నక్కుమతిఁబోలు;
నర్థ ధర్మములకు హానిగాఁ గామార్థి । యగు నాతఁ డల్పజలాశయమున
జలచరం బెట్టు లజ్జలములతోఁ జెడు । నట్లు కామంబుతో హానిఁ బొందు;

ఆ. **నర్థ ధర్మములు మహాబ్ధి మేఘము లట్టు । లుభయమును బరస్పరోదయమ్ము;**
లిట్లుగాఁ ద్రివర్గ మెఱిఁగి సామ్యమున సే । వించువాఁడు సర్వవిత్తముండు. **245**

ప్రతిపదార్థం: ధర్మకామంబులు= ధర్మం, కామం; తఱుగంగన్= తగ్గిపోగా; (ఈ పద్యం త్రివర్గానికి సంబంధించింది. త్రివర్గ మంటే ధర్మార్థ కామాలు. అందులో ధర్మకామాలు తరిగినపుడు ఇక మిగిలేది అర్థం). అంటే అర్థం మాత్రమే మిగిలినప్పుడు; అర్థ+అర్థి+అగువాఁడు= ధనం మాత్రమే కోరేవాడు; పతితుఁడు+ఔను= పతనం చెందినవాడు అవుతాడు; అర్థసేవన్= ధనార్జనను; అర్థ+అర్థముగన్= అర్థపురుషార్థ నిర్వహణకు మాత్రమే; చేయు+అతఁడు= చేసేవాడు; ఉగ్రవనములో= భయంకరమైన అడవిలో; గోరక్ష+చేయు= ఆవులను కాపాడటానికి పూనుకొనే; ఆ+కుమతిన్+పోలున్= బుద్ధిహీనుడిని పోలుతాడు; అర్థ, ధర్మములకు, హానిగాన్= అర్థపురుషార్థానికి, ధర్మపురుషార్థానికి హాని కలిగేటట్లు; కామ+అర్థి+అగు+ఆతఁడు= కామ పురుషార్థాన్ని మాత్రమే కోరుకొనేవాడు; అల్ప+జన+ఆశయమున= తక్కువ నీరు కల కొలనులోని; జలచరంబు+ఎట్టులు= చేప ఏవిధంగా; ఆ+జలములతోన్= ఆ తక్కువ నీటితో; చెడు+అట్లు= చెడిపోతుందో అట్లా; కామంబుతో= కామ పురుషార్థ సాధనతో; హానిన్+పొందున్= కీడుపొందుతాడు; అర్థ, ధర్మములు; ఉభయమును= రెండును; మహాబ్ధి, మేఘములు+అట్టులు= గొప్పసముద్రం, మేఘంవలె; పరస్పర+ఉదయమ్ములు= ఒకదానికొకటి వృద్ధి కల్పించేవై (సముద్రంలోని నీరు ఆవిరి మేఘాలకు పుష్టిని ఇస్తుంది. మేఘాలు వర్షం కురిసి సముద్రానికి పుష్టిని చేకూరుస్తాయి. అట్లే అర్థంవలన ధర్మానికి, ధర్మంవలన అర్థానికి పరిపుష్టి కలుగుతుంది); ఇట్లుకాన్= ఈ విధంగా; త్రివర్గము= ధర్మం, అర్థం, కామం; ఎఱిఁగి= తెలిసికొని; సామ్యమున= (పోలిక తెలిసి) సమానంగా; సేవించువాఁడు= పాటించేవాడు; సర్వ, విత్+తముండు= సర్వజ్ఞశ్రేష్ఠుడు.

తాత్పర్యం: (ఈపద్యం త్రివర్గం= ధర్మం, అర్థం, కామసాధనలోని ఆంతర్యాన్ని వివరించేది). ధర్మం, కామం తగ్గిపోయేటట్లు అర్థపురుషార్థాన్ని సేవించేవాడు పతనం చెందుతాడు. కేవలం అర్థంకోసం అర్థసేవచేసేవాడు భయంకరమైన అడవిలో గోవులను రక్షించబూనే మందబుద్ధిని పోలుతాడు. ఇక అర్థధర్మాలు రెండింటిని విడిచి కేవలం కామపురుషార్థ పరాయణుడైనవాడు, నీరు తక్కువ అయిన చెరువులో ఉండే చేప, ఆ అల్పజలాలతో ఎట్లా చెడుతుందో, కామంతో అట్లే చెడిపోతాడు. అర్థ ధర్మాల అనుబంధం సముద్ర మేఘాల సంబంధం వంటిది. సముద్రజలం ఆవిరై మేఘాలకు పరిపుష్టి చేకూరుస్తుంది. మేఘాలు వర్షించి సముద్రానికి పుష్టిని కలిగిస్తాయి. అవి పరస్పరపోషకాలు. ఈ విధంగా త్రివర్గాన్ని- అంటే ధర్మార్థకామాలను సమానంగా సాధించేవాడు సర్వజ్ఞశ్రేష్ఠుడు.

వ. **భవదాచరితంబయిన యీ ధర్మం బర్థకామంబులక కాదు, నీకును నీ బాంధవులకును బాధాకరంబు; దాన యజ్ఞసత్పూజలు గావింప నర్థహీనున కశక్యంబు; జగంబులు ధర్మమయంబులు; ధర్మువునకు మిక్కిలి యొండెద్దియు లే; దయినను నర్థార్థంబు గాని ధర్మువు క్షత్త్రియుల కయుక్తంబు.** **246**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భవత్+ఆచరితంబు+అయిన= నీచే ఆచరించబడిన; ఈ ధర్మంబు= ఈధర్మం; అర్థ, కామంబులకు+అ, కాదు= అర్థానికి, కామానికి మాత్రమే కాదు; నీకును; నీ బాంధవులకును= నీ చుట్టాలకు; బాధాకరంబు= బాధ కలిగించేది; దాన, యజ్ఞ, సత్+పూజలు+కావింపన్= దానం, యజ్ఞం, సత్పురుషులకు పూజలు చేయటానికి; అర్థహీనునకు= ధనం లేనివాడికి; అశక్యంబు= సాధ్యంకాదు; జగంబులు= భువనాలు; ధర్మమయంబులు= ధర్మంతో నిండినవి; ధర్మువునకు మిక్కిలి= ధర్మాన్ని మించినది; ఒండు= వేరొక్కటి; ఎద్దియు= ఏదియు; లేదు; అయినను; అర్థ+అర్థంబు+కాని, ధర్మువు= అర్థంకొరకు కాని ధర్మం; క్షత్రియులకు; అయుక్తంబు= తగనిది.

తాత్పర్యం: నీవు అనుష్ఠిస్తున్న ధర్మం అర్థ పురుషార్థానికి, కామపురుషార్థానికి మాత్రమే కాక, నీకు, నీ బంధువులకు కూడ బాధను కలిగించేది. దానాలు, యజ్ఞాలు, ఉత్తములను పూజించటం ధనహీనుడు చేయలేడు. జగత్తులు ధర్మమయాలు. ధర్మాన్ని మించినది వేరొకటి ఏదీ లేదు. అయినను, అర్థపురుషార్థసాధనకు ఉపకరించని ధర్మం క్షత్రియులకు తగింది కాదు.

ఉ. శత్రుల నాజి నోర్చుటయు, సర్వభయంబులఁ బొందకుండఁగా
ధాత్రిఁ బరిగ్రహించి యుచితస్థితిఁ గాచుటయుం, బ్రియంబుతోఁ
బాత్రుల కర్థ మీగియును, బ్రాహ్మణపూజయుఁ జువ్వె! యుత్తమ
క్షత్రియధర్మముల్ సుగతికారణముల్ విపులార్థమూలముల్. 247

ప్రతిపదార్థం: శత్రులన్= విరోధులను; ఆజిన్= యుద్ధంలో; ఓర్చుటయు= ఓడించటమున్నూ; సర్వభయంబులన్= ఎల్లభయాలు; పొందక+ఉండఁగాన్= పొందకుండేటట్లుగా; ధాత్రిన్= భూమిని; పరిగ్రహించి= చేకొని; ఉచితస్థితిన్= మంచిగా ఉండేటట్లు; కాచుటయున్= కాపాడటమున్నూ; ప్రియంబుతోన్= ప్రీతితో; పాత్రులకు= యోగ్యత ఉన్నవారికి; అర్థము= ధనం; ఈగియును= దానంగా ఇవ్వటమున్నూ; బ్రాహ్మణ, పూజయున్= విప్రులను ఆరాధించటమున్నూ; చువ్వె= చూవె(సుమా); ఉత్తమ క్షత్రియ ధర్మముల్= ఉత్తములైన క్షత్రియులయొక్క ధర్మాలు; సుగతి, కారణముల్= ఉత్తమ గతి పొందటానికి హేతువులు; విపుల+అర్థమూలముల్= విరివి అయిన ప్రయోజనాలకు (సంపదలకు) కారణాలు.

తాత్పర్యం: యుద్ధాలలో శత్రువులను జయించటం, ఎట్టి భయాలు దాపురించకుండ భూమిని తగిన విధంగా ఏలటం, ప్రీతితో పాత్రులైన వారికి ధనం దానంచేయటం, బ్రాహ్మణులను పూజించటం ఉత్తమ క్షత్రియుల ధర్మాలు. సద్గతికి హేతువులైన పుణ్యకార్యాలు. సకలార్థ సాధకాలు.

వ. కేవల ధర్మాచరణంబు శత్రుజయంబునకు సాధనంబు గాదు; నికృతిపరులయందు నికృతియు వలయుఁ; బూర్వభ్రాతలైన యసురుల నమరులు నికృతినగాదె నిర్జించిరి; కావున నీవు సమయధర్మరక్షణవ్రతం బుడిగి శత్రువుల జయింప నుద్యోగింపుము. 248

ప్రతిపదార్థం: కేవల, ధర్మ+ఆచరణంబు= ధర్మాన్ని అనుష్ఠించటం మాత్రమే; శత్రు జయంబునకు= శత్రువులను జయించటానికి; సాధనంబు= ఉపకరణం; కాదు; నికృతి, పరుల+అందు= మోసంచేసేవారిపట్ల; నికృతియు= మోసం కూడ; వలయున్= అవసరం; పూర్వభ్రాతలు+ఐన= పూర్వం సోదరులైన; అసురులన్= రాక్షసులను; అమరులు= దేవతలు; నికృతిన్+అ, కాదె= మోసంచేతనేకదా; నిర్జించిరి= జయించారు; కావున; నీవు; సమయ, ధర్మ, రక్షణ, వ్రతంబు+ఉడిగి= ఒడబాటు నియమాన్ని పాటించాలనే దీక్షను విడిచి; శత్రువులన్= విరోధులను; జయింపన్= గెలవటానికి; ఉద్యోగింపుము= ప్రయత్నించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కేవలం ధర్మాన్ని అనుష్ఠించటం మాత్రంచేతనే శత్రువులను జయించటానికి వీలు కాదు. మోసగాండ్రపై మోసమే ప్రయోగించాలి. పూర్వం తమకు సోదరులైన రాక్షసులను దేవతలు మోసంచేసేకదా జయించారు. కాబట్టి, నీవు శత్రువులతో చేసికొన్న ఒడంబడికను నెరవేర్చాలనే నియమం విడిచి, వాళ్ళను జయించటానికి ప్రయత్నించుము.

క. జయశీలివైన నీకుం । బ్రియ మొనరింపంగ నున్న పృథుయశులు ముదా
శ్రయు లగుదురు సృంజయకే । కయ యదు పాంచాలు రాదిగాఁగల సుహృదుల్. 249

ప్రతిపదార్థం: జయ, శీలివి+ఐన= గెలుపును కోరుకొనే శీలం కలవాడివైన; నీకున్= నీకు; ప్రియము+ఒనరింపంగన్+ఉన్న= ప్రీతిని కలిగించటానికి ఉండే; పృథుయశులు= గొప్పకీర్తికలవారు; సృంజయ, కేకయ, యదు, పాంచాలురు+ఆదిగాన్+కల, సుహృదుల్= సృంజయులు, కేకయులు, యాదవులు, పాంచాలురు మొదలుగాగల మిత్రులు; ముద్+ఆశ్రయులు+అగుదురు= సంతోషానికి ఆశ్రయమైనవారు అవుతారు- అంటే సంతోషిస్తారు.

తాత్పర్యం: జయశీలివైన నీకు, గొప్ప కీర్తి కెక్కిన సృంజయ, కేకయ, యదు, పాంచాలాది మిత్రులు సంతోషంతో ప్రియం చేకూరుస్తారు.

తే. మిత్త్రసంపన్నుఁ డైన నమిత్త్రు మిత్త్ర । బలముతోడ భేదించి దోర్బలముఁ జలముఁ
గలిగి దేశబలంబును గాలబలముఁ । గలుగువాని కసాధ్యంబు గలదె యెందు? 250

ప్రతిపదార్థం: మిత్త్ర సంపన్నుఁడు+ఐనన్= మిత్ర సంపద కలవాడయితే; అమిత్త్రున్= శత్రువును; మిత్త్రబలముతోడన్= మిత్రులయొక్కసాయంతో; భేదించి= భేదిల్లజేసి; దోస్+బలమున్= భుజశక్తిని; చలమున్+కలిగి= మొండిపట్టుదల కలిగి; దేశ, బలంబును= స్థానబలమూ; కాల, బలమున్+కలుగువానికి= కాల బలమూ ఉన్నవాడికి; ఎందున్= ఎక్కడైనా; అసాధ్యంబు= సాధించలేనిది; కలదె= ఉన్నదా?

తాత్పర్యం: (ఈ పద్యంలో పేర్కొన బడినవి మిత్రబలం, దోర్బలం, దేశబలం, కాలబలం.) మిత్రబలసహాయంతో శత్రువులను జయించి, పరాక్రమం, పట్టుదల కలిగి, దేశబలం, కాలబలం కూడ కలిసి వచ్చినవాడికి ఎక్కడైనా అసాధ్యం అనేది ఉంటుందా?

విశేషం: నన్నయభట్టు మహాభారతాన్ని 'నీతి విచక్షణుల్ నీతిశాస్త్రం బని' కొనియాడుతారని అవతారికలో ప్రశంసించాడు. మహాభారతం నీతిని, నీతిసూక్ష్మాలను పలుతావుల హృదయంగమంగా వింగడించింది. స్వకీయ పరాక్రమానికి మిత్రబలం తోడ్పడితే శత్రువులను నిర్జింపవచ్చును. అంతేకాక స్వకీయ పరాక్రమానికి దేశబలం, కాలబలం సయితం తోడ్పడితే ఇక అసాధ్యమనేది ఉండదు. ఈ ప్రకరణంలో దేశబలానికి, కాలబలానికి వివరణ కల్పించకుండా రచయిత సూత్రప్రాయంగా కుదించి చెప్పాడు. "ఉచితకాల సంభావ్యమైన యత్నవిధిగదా సమగ్రఫలంబు నిచ్చు"-మూషిక మార్జాల సంవాదం, శాంతిపర్వం. దేశబలం అంటే స్థానబలం. వేమన స్థానబలాన్ని గురించి చెప్పిన పద్యం చిరస్మరణీయమైనది. "నీళ్లలోన మొసలి నిగిడి యేనుఁగుఁబట్టు, బయట కుక్కచేత భంగపడును." మహాభారతంలో పలుతావుల నీతి ధర్మసూక్ష్మాలు వివరించబడ్డాయి.

తే. బలము గలవానిఁ బలువురు బలవిహీను । లొక్కటై కూడి నిర్జింతు రుత్సహించి
మధువుఁ గొన నుత్సహించిన మనుజుఁబట్టి । కుట్టి నిర్జించు మధుకరకులమునట్లు. 251

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: బలము, కల, వానిన్= శక్తి ఉన్నవాడిని; పలువురు= పెక్కు మంది; బలవిహీనులు= బలంలేని వారు; ఒక్కటి+ఐ, కూడి= ఏకమై; ఉత్సహించి= విజృంభించి; మధువున్+కొనన్= తేనె తీసికొనటానికి; ఉత్సహించిన= ప్రయత్నించిన; మనుజున్= మనుష్యుడిని; పట్టి= గ్రహించి (చేరి); కుట్టి; నిర్జించు= జయించే; మధుకర, కులము+అట్లు= తేనెటీగల గుంపువలె; నిర్జింతురు= ఓడిస్తారు.

తాత్పర్యం: బలం కలవాడిని పెక్కుమంది బలహీనులు ఒకటిగాచేరి, తేనెను తీసికొనటానికి ప్రయత్నించిన మనుష్యుడిని పట్టి కుట్టి నిర్జించే తేనెటీగలగుంపువలె జయిస్తారు.

విశేషం: అలం: ఉపమ.

వ. **శ్వదృతియందలి దుగ్ధంబునుం బోలె దుర్యోధను రాజ్యంబు దూష్యంబగుటఁ బౌర జానపద బ్రాహ్మణ వరులు నీ కనురక్తులయి భవద్రాజ్యంబ వలచి యుండుదురు; దీని నేల యెడ సేసెదు? సర్వాయుధ సనాథంబయిన రథం బెక్కి గజపురంబున కభిముఖుండవై విజయప్రయాణంబు సేయుము.** **252**

ప్రతిపదార్థం: శ్వదృతి+అందలి= కుక్కతోలుతో తయారుచేసిన తిత్తియందలి; దుగ్ధంబునున్+పోలెన్= పాలవలె; దుర్యోధను, రాజ్యంబు= దుర్యోధనుడియొక్క రాజ్యం; దూష్యంబు= దూషించతగింది; అగుటన్; పౌర, జానపద, బ్రాహ్మణ, వరులు= పట్టణవాసులు, పల్లెపట్టుల నివసించే వాళ్ళు, బ్రాహ్మణశ్రేష్ఠులు; నీకు+అనురక్తులు+అయి= నీ పట్ల ప్రేముడి కల వారయి; భవత్, రాజ్యంబు+అ= నీరాజ్యాన్నే, అంటే పరిపాలననే; వలచి+ఉండుదురు= ప్రేమించి ఉన్నారు; దీనిన్+ఏల+ఎడ+చేసెదు= దీన్ని ఎందుకు ఆలస్యం (దూరం) చేస్తావు; సర్వ+ఆయుధ, సనాథంబు+అయిన= సమస్తమైన ఆయుధాలతో కూడిన; రథంబు+ఎక్కి= తేరు నెక్కి; గజపురంబునకు= హస్తినాపురానికి; అభిముఖుండవు+ఐ= ఎదురైన ముఖం కలవాడివై- అంటే ఆ దిక్కుగా; విజయ ప్రయాణంబు= జయం సాధించే పయనం; చేయుము= కొనసాగించుము.

తాత్పర్యం: కుక్కచర్మంతో తయారైన తిత్తియందలి పాలవలె దుర్యోధనుడిరాజ్యం దూష్యం. ఆ రాజ్యంలోని ప్రజలు, పట్టణవాసులు, పల్లెటూళ్ళలో నివసించేవాళ్ళు, బ్రాహ్మణోత్తములు నీ పరిపాలన కోరుకొంటున్నారు. ఇక ఆలస్య మెందుకు? అన్ని ఆయుధాలతోకూడినరథాన్ని అధిరోహించి, రాజధాని అయిన హస్తినాపురివైపు విజయ యాత్ర సాగించుము.

విశేషం: ఉ.వి. సంశోధిత ముద్రణప్రతిలో 'శ్వదృతియందలి' అనే పాఠానికి బదులు 'శూద్రాన్నంబునందలి' అనే పాఠం ఉన్నది. మూలంలో ఇట్లా ఉన్నది: "శ్వదృతౌ క్షీరమాసక్తం బ్రహ్మవా వృషలే యథా'' (3.34.78); "శ్వదృతౌ సారమేయ చర్మకోశే, బ్రహ్మవేదః వృషలే శూద్రే'' అని నీలకంఠీయ వ్యాఖ్య (3.38.81) కాబట్టి 'శ్వదృతియందలి' అనే పాఠమే ఉచితమైనదని గ్రహించడమైనది. ధర్మరాజుకు స్వకీయబలం ఉన్నది. మిత్రబలం, దేశబలం, ప్రజాబలం ఉన్నాయి. ఆలస్యం చేయట మెందుకు? కాలబలం ఉన్నది. ఇక విజయ దండయాత్రకు ఉపక్రమించి హస్తినాపురి వైపు తరలివెళ్ళాలని భీముడి అభిప్రాయం.

మ. **ప్రణుతక్షాత్త్రగుణంబు విక్రమము దర్పం బేర్పడన్ విక్రమ**
క్షణదానం బొనరింపు మీ క్షణమ; విఖ్యాతంబుగా సంగరాం
గణమధ్యంబునఁ జేయు మర్జునబృహద్గాండీవ నిర్ముక్త మా
ర్గణ ధారావళి ధార్తరాష్ట్ర కదళీకాంతార విచ్ఛేదమున్. **253**

ప్రతిపదార్థం: ప్రణుత, క్షాత్ర, గుణంబు= పొగడబడిన క్షత్రియుల లక్షణం; విక్రమము= పరాక్రమం; దర్పంబు= గర్వం; ఏర్పడన్= స్పష్టపడేటట్లుగా; విక్రమ, క్షణ, దానంబు+ఒనరింపుము= పరాక్రమమనే పండుగను దానం చేయుము; ఈక్షణము+అ= ఈక్షణంలోనే (వెంటనే); విఖ్యాతంబుగా= కీర్తి కలిగేటట్లుగా; సంగర+అంగణ, మధ్యంబునన్= యుద్ధరంగమధ్యంలో; అర్జున బృహత్+గాండీవ, నిర్ముక్త, మార్గణ, ధారా+ఆవళి= అర్జునుడియొక్క గొప్ప విల్లైన గాండీవంనుండి విడువబడిన బాణాల వాదరల సముదాయంచేత; ధార్తరాష్ట్ర, కదళీ, కాంతార, విచ్ఛేదమున్= ధృతరాష్ట్రుడి యొక్క కుమారులనే అరటిచెట్ల అడవిని తెగనరకటాన్ని; చేయుము.

తాత్పర్యం: క్షత్రియులలో కొనియాడబడే లక్షణం పరాక్రమం. ఈక్షణంలోనే దర్పం ప్రకాశించేటట్లగా పరాక్రమం అనే పండుగను రణరంగ మధ్యంలో దానం చేయుము. అర్జునుడి గొప్ప గాండీవంనుండి బయలువెడలే బాణపరంపరలచేత ధృతరాష్ట్రుడి కుమారులనే కదళీవనాన్ని తెగనరకుము.

విశేషం: విక్రమక్షణదానము= విక్రమం అనే పండుగ అనేచోట ధార్తరాష్ట్ర కదళీకాంతారం అనే చోట అలంకారం రూపకం. ధార్తరాష్ట్రులు ఉపమేయం. అరటిచెట్ల అడవి ఉపమానం. విక్రమం ఉపమేయం. క్షణము= పండుగ ఉపమానం. ఉపమేయ ఉపమానాలకు అభేద అధ్యవసాయం కల్పించబడింది కాబట్టి ఇవి రూపకాలంకారాలు. అరటిచెట్లను నరకటంలో గల సౌలభ్యం అందరికి అనుభవసిద్ధమే.

క. బహు వాహ సుభట హస్తిక । సహితులు బలవంతులని విచారింపకు నీ
యహితులు మద్బాహుగదా । నిహతికి మార్కొనఁగఁ బోర నిలువం గలరే? 254

ప్రతిపదార్థం: నీ+అహితులు= నీ శత్రువులు; బహు, వాహ, సుభట, హస్తిక, సహితులు= పెక్కు వాహనాలతో, మంచి సైనికులతో, ఏనుగులతో కూడి ఉన్నవారు; బలవంతులు= బలం కలవారు; అని; విచారింపకు= దుఃఖించకు; (వారు); మత్+బాహు, గదా, నిహతికి= నా చేతిలోని గద యొక్క దెబ్బకు; మార్కొనఁగన్= ఎదిరించటానికి; పోరన్= యుద్ధంలో; నిలువన్+కలరే= నిలువజాలుదురా?

తాత్పర్యం: నీ శత్రువులు పెక్కు వాహనాలతో, మంచి సైనికులతో, ఏనుగులతో కూడి ఉన్నారు. బలం కలవారు అని విచారించకు. నా చేతిలోని గదదెబ్బలకు ఎదిరించి వారు యుద్ధంలో నిలువగలరా?

క. అరివరుల నోర్చి సాగర । పరివృత భూచక్రమెల్లఁ బాలింపు; ప్రజా
పరిపాలనంబు కంటెను । ధరణీశ! విశేష మొండు ధర్మువు గలదే? 255

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= భూమికి ప్రభువైన ఓ ధర్మరాజా!; అరి, వరులన్= శత్రుశ్రేష్ఠులను; ఓర్చి= జయించి; సాగర, పరివృత, భూ, చక్రము+ఎల్లన్= సముద్రంచేత చుట్టుకొనబడిన భూమండలాన్ని అంతటినీ; పాలింపు= ఏలుకొనుము; ప్రజా, పరిపాలనంబు, కంటెను= ప్రజలను పరిపాలించటంకంటె; విశేషము= గొప్పదైన; ఒండు=వేరు; ధర్మువు= ధర్మం; కలదే= ఉన్నదా?

తాత్పర్యం: ఓ ధర్మరాజా! శత్రువులను జయించి, సముద్రంచేత చుట్టుకొనబడిఉన్న భూచక్రాన్ని పరిపాలించు. ప్రజలకు చక్కని పరిపాలన సమకూర్చటంకంటె గొప్పదైన ధర్మం వేరొకటి ఉన్నదా?

వ. రాజ్యపదస్థుండైన క్షత్త్రియుండు భూరిదక్షిణంబులైన యజ్ఞంబుల దేవబ్రాహ్మణులం దృప్తులం జేసి బ్రాహ్మణులకు నగ్రహారంబులు గోసహస్రంబులు నిచ్చి దురితంబులవలనం బాసి తమోవిముక్తుండైన చంద్రుండునుం బోలె వెలుంగు' ననిన భీమసేనునకు ధర్మరా జిట్లనియె. 256

ప్రతిపదార్థం: రాజ్య, పదస్థుండు+ఐన, క్షత్త్రియుండు= రాజ్యపదవిలో ఉన్న క్షత్రియుడు, అంటే ప్రభువైన క్షత్రియుడు; భూరి, దక్షిణంబులు+ఐన= గొప్ప దక్షిణలతో కూడిన; యజ్ఞంబులన్= క్రతువుల చేత; దేవ, బ్రాహ్మణులన్= దేవతలను, బ్రాహ్మణులను; తృప్తులన్+చేసి= తనివి చెందేటట్లు చేసి; బ్రాహ్మణులకున్= విప్రులకు; అగ్రహారంబులు= ఊళ్ళు; గో, సహస్రంబులున్= వేలకొలది ఆవులు; (దానంగా) ఇచ్చి; దురితంబుల వలనన్+పాసి= పాపాలనుండి తొలగి; తమస్+విముక్తుండు+ఐన= చీకటి నుండి తొలగిన; చంద్రుండునున్+పోలె= చంద్రుడివలె; వెలుంగున్= వెలుగొందుతాడు; అనిన; భీమసేనునకు; ధర్మరాజు: ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: రాజ్యసంపాదన చేసి ప్రభువైన క్షత్రియుడు భూరిదక్షిణ లిచ్చి యజ్ఞాలు చేసి, బ్రాహ్మణులకు అగ్రహారాలు, వేలకొలది ఆవులు దానం చేసి, పాపాలను పోగొట్టుకొని మబ్బుమాటుననుండి వచ్చి వెలుగొందే చంద్రుడివలె ప్రకాశిస్తాడు'- అని భీముడు చెప్పగా ధర్మరాజు ఇట్లా పలికాడు.

ఉ. 'నీ వచనంబు ధర్మ్యము, వినీతము, నీతియుతంబు, నిష్ట సి
ద్ధ్యావహ, మత్యుదార మిదియైనను నిప్డు దలంపఁగా విచా
రావసరాప్తికిన్ విషయమైనది; కార్య ఫలంబు లెల్ల స
ద్భావమునన్ విచారసులభంబుల యండ్రు విచారపారగుల్. 257

ప్రతిపదార్థం: నీ, వచనంబు, ఇది=ఈ నీ మాట; ధర్మ్యము= ధర్మంతో కూడింది; వినీతము= చక్కగా ప్రతిపాదించబడింది; నీతి, యుతంబున్= నీతితో కూడింది; ఇష్ట, సిద్ధి+ఆవహము= ఆశయాలను నెరవేర్చేటటువంటిది; అతి+ఉదారము= మిక్కిలి గొప్పది; ఐనను= ఐనప్పటికిన్నీ; ఇప్డు= ఇప్పుడు; తలంపన్+కాన్= యోచించగా; విచార+అవసర+ఆప్తికిన్= ఆలోచన చేయవలసిన సమయస్థితిని పొందటానికి; విషయము+ఐనది= అంశమైనది; విచార పారగుల్= మేధావులు; కార్య, ఫలంబులు+ ఎల్లన్= చేసిన పనులకు లభించే ఫలితాలు అన్నికూడా; సత్+భావమునన్= మంచి తలపులు ఉన్నపుడు; విచార, సులభంబులు+అ= యోచనచేత సులువుగా పరిష్కరించదగినవే; అండ్రు= అని అంటారు.

తాత్పర్యం: 'నీమాట ధర్మంతో కూడింది. చక్కగా ఆలోచించిన తర్వాత చెప్పింది. నీతితో నిండింది. ఆశయాలను నెరవేర్చేటటువంటిది. గొప్పతనం కలిగింది. అయితే ఇప్పుడు నీ వాదం విచారించి తేల్చవలసిన అంశం. ఇటువంటి కార్యఫలాలన్నిటినీ సద్భావంతో కూడిన యోజ(చ)న చేత పరిష్కరించటం సులువు- అని మేధావులు అంటారు.

విశేషం: ధర్మరాజు భీముడి వాదాన్ని అంగీకరించజాల నప్పటికిన్నీ, అతడు మనస్సు ఏమాత్రం నొవ్వకుండ బదులు పలికాడు. ధర్మరాజు భీముడిమాట కాదనకుండానే, అతడి వాదం విచారించిన పిదప తేల్చవలసినట్టిదని సుకుమార సుందరంగా చెప్పాడు. ధర్మరాజు మెత్తని పులి.

క. వనమునఁ బండ్రెండేండ్లును । జనపదమున నెఱుఁగకుండ సరి నొక వర్షం
బును జలుపఁ బూని సత్యము । దనరఁగఁ జేసితిఁ బ్రతిజ్ఞ దగ వృద్ధసభన్. 258

ప్రతిపదార్థం: వనమునన్= అడవిలో; పండ్రెండు+ఏండ్లును= పండ్రెండు సంవత్సరాలున్నూ; జనపదమునన్= ప్రజలు నివసించే చోట; ఎఱుఁగకుండ= అజ్ఞాతవాసంగా; సరిన్= సరిగా; ఒక, వర్షంబును= ఒక సంవత్సరమున్నూ; చలుపన్+పూని= కడపటానికి పూనుకొని; సత్యం= నిజం; తనరఁగన్= ఒప్పేటట్లుగా; తగన్= ఉచితంగా; వృద్ధ, సభన్= పెద్దలు ఉన్న కొలువుకూటంలో; ప్రతిజ్ఞ= శపథం; చేసితిన్= పూని ఉన్నాను.

తాత్పర్యం: అరణ్యంలో పండ్రెండేండ్లు, ఊరిలో అజ్ఞాతంగా ఒక సంవత్సరం గడిపేటట్లు పెద్దలుండే సభలో ప్రతిజ్ఞ చేసి ఉన్నాను. ఆ సత్యవ్రతం పాటించవలసి ఉన్నది.

చ. అలఘుగుణంబులం దధికుఁడైన మహాత్ముఁడు రాగకోపమా
యలఁ బడి, యక్షమావివశుఁ డై, యచిరాంశులతావిలాసచం
చలమగు లక్ష్మి కాసపడి, సత్యము ధర్మువుఁ దప్పి సత్సభా
వలిఁ దగువారియొద్దఁ దగువాఁడయి సద్విధి నుండ నేర్చునే? 259

ప్రతిపదార్థం: అలఘు, గుణంబులందు+అధికుఁడు+ఐన, మహా+ఆత్ముఁడు= గొప్ప లక్షణాల్లో అతిశయం సాధించిన మహానుభావుడు; రాగ, కోప, మాయలన్+పడి= ఎక్కుడు అభిమానంలోను, క్రోధంలోను, మాయలలోను పడి; అక్షమా, వివశుఁడు+ఐ= అసహనానికి లోనై; అచిర+అంశు, లతా, విలాస, చంచలము+అగు= అస్థిరమైన మెరుపుతీగె హొయలువలె తాత్కాలికమైన; లక్ష్మికి= సంపదకు; ఆసపడి= కోరి; సత్యము= సత్యాన్ని; ధర్మువున్= ధర్మాన్ని; తప్పి= అతిక్రమించి; సత్+సభా+ఆవలిన్= సజ్జనుల సభలలో; తగువారి+ఒద్దన్= యోగ్యులైన వారి దగ్గర; తగువాఁడు+అయి= తగినవాడయి; సత్, విధిన్= మంచి ప్రవర్తనతో; ఉండనేర్చునే= మనగలుగునా?

తాత్పర్యం: గొప్పగుణాలు ఉండే మహాత్ముడు మెరుపుతీగ వలె చంచలమైన ధనానికి ఆసపడి, రాగకోపాలకు సంబంధించిన మాయలలో పడి అసహనంతో సత్యాన్ని, ధర్మాన్ని అతిక్రమించి యోగ్యత, సభ్యత కలవారి దగ్గర సక్రమంగా మెలగజాలుతాడా?

వ. ఏ నెట్లును సత్యసమయం బతిక్రమింప నోప; శుభోదయకాలంబుఁ బ్రతీక్షించి యుండుము; రాజ్యంబులుఁ బుత్త్రులును ధనంబును యశంబును సత్యంబునకు సమంబులు గా' వనిన భీమసేనుం డిట్లనియె. 260

ప్రతిపదార్థం: ఏను+ఎట్లును= నేను ఏ రీతిగా అయినను; సత్య, సమయంబు= సత్యం పాటించి చేసిన ప్రతిజ్ఞను; అతిక్రమింపన్+ఓపన్= దాటలేను, (మీరలేను); శుభ+ఉదయ, కాలంబున్= మేలు కలిగే సమయాన్ని; ప్రతీక్షించి+ఉండుము= ఎదురుచూస్తూ ఉండుము; రాజ్యంబులున్; పుత్త్రులును; ధనంబును; యశంబును= కీర్తియు; సత్యంబునకు, సమంబులు, కావు+అనిన= సత్యంతో సరిసమానాలు కావు; అనినన్= అనగా; భీమసేనుండు+ఇట్లు+అనియెన్= భీముడు ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: నేను సత్యవ్రతాన్ని ఎన్నడూ వీడజాలను. చేసిన ప్రతిజ్ఞను మీరజాలను. మేలు కలిగే కాలం కొరకు నిరీక్షించి ఉండుము. రాజ్యం, సంతానం, కీర్తి-సత్యంతో సరితూగజాలవు'- అని ధర్మరాజు చెప్పగా భీముడు ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'అంతకుండు జనుల కాసన్నుఁడై యుండ । నిమిషమాత్రమేని నిశ్చయింపఁ
దగని జీవనంబు దద్ద సుస్థిరముగాఁ । జేసి కార్య మెడయుఁ జేయఁదగునె? 261

ప్రతిపదార్థం: అంతకుండు= యముడు; జనులకు= ప్రజలకు; ఆసన్నుఁడు+ఐ+ఉండన్= దగ్గరివాడై ఉండగా; నిమిష, మాత్రము+ఏని= ఒక్క నిమిషమైనను; నిశ్చయింపన్+తగని= నిర్ణయించటానికి తగని; జీవనంబు= బ్రతుకును; తద్ద= మిక్కిలి; సుస్థిరముగాన్= మిక్కిలి స్థిరమైనదిగా; చేసి= నిరూపించుకొని; కార్యము= కర్తవ్యాన్ని, అంటే చేయతగిన పనిని; ఎడయున్+చేయన్+తగునె= ఆలస్యం చేయటం తగునా?

తాత్పర్యం: 'ప్రజలకు యముడు చేరువలో ఉండగా, ఒక్క నిమిషమైనా సుస్థిరమని నిశ్చయించరాని జీవితాన్ని సుస్థిరం అనుకొని, కర్తవ్యాన్ని ఆలస్యం చేయతగునా?

వ. శరీరికి మరణంబు నియతంబు; మరణంబునకు ముందర వైరంబు దీర్పనివాని జన్మంబు నిరర్థకంబు; సకల రాజ సమక్షంబునం బరులచేత నట్లు మన పడిన పరిభవంబునకుం బ్రతీకారంబు సేయునంతకు రేయునుం బగలును నా హృదయంబు దపించుచుండు; నాకంటె నర్జున నకుల సహదేవులుం గుంతీదేవియు నంతస్తాపంబున నెంతయు సంతప్తు లగుచున్నవారు. 262

ప్రతిపదార్థం: శరీరికి= (దేహంకలవాడికి) ప్రాణికి; మరణంబు= చావు; నియతంబు= తప్పని సరైనట్టిది; మరణంబునకు ముందర= చనిపోవటానికి ముందే; వైరంబున్= శత్రుత్వాన్ని; తీర్పని, వాని, జన్మంబు= తీర్చనివాడి పుట్టుక; నిరర్థకంబు= వ్యర్థం; సకల, రాజ, సమక్షంబునన్= అందరు రాజుల ఎదుట; పరులచేతన్= శత్రువులచేత; అట్లు= ఆవిధంగా; మనపడిన= మనం పొందిన; పరిభవంబునకున్+ప్రతీకారంబు= అవమానానికి మారుచేత; చేయు+అంతకున్= చేసేవరకు; రేయునున్+ పగలును= రాత్రింబగళ్ళు; నాహృదయంబు= నా ఎడద; తపించుచుండున్= దుఃఖిస్తూ ఉంటుంది; నాకంటెన్; అర్జున, నకుల, సహదేవులున్+కుంతీదేవియున్; అంతస్తాపంబునన్= లోపలిబాధచేత; ఎంతయు= ఎంతో ఎక్కువగా; సంతప్తులు+అగుచున్నవారు= మిగుల తాపం పొందుతున్నారు.

తాత్పర్యం: పుట్టినవారు గిట్టక తప్పదు. మరణించటానికి పూర్వమే వైరం తీర్చుకొనలేని మనుజుడి జన్మ వ్యర్థం. అంతమంది రాజుల ముందు ఆ విధంగా మనం శత్రువులచేత పడిన అవమానానికి ప్రతీకారం చేసేంతవరకు నా హృదయం రాత్రింబగళ్ళు తపిస్తూ ఉంటుంది. నాకంటె మిక్కుటంగా లోలోపల బాధతో మ్రగ్గేవారు అర్జునుడు, కుంతి, నకుల సహదేవులు.

క. వీరల దుఃఖము దీర్పక । క్రూరనికారులగు రిపులకును ముదముగ ను
గ్రారణ్యములో ధర్మువుఁ । గారుణ్యముఁ దాల్చి యునికి కార్యమె నీకున్? 263

ప్రతిపదార్థం: వీరల, దుఃఖము= వీరు అనుభవిస్తున్న శోకం; తీర్పక= తొలగించక; క్రూర, నికారులు+అగు= దయలేని వంచకులైన; రిపులకును= శత్రువులకు; ముదముగన్= సంతసమవునట్లుగా; ఉగ్ర+అరణ్యములోన్= భయంకరమైన అడవిలో; ధర్మువున్= ధర్మాన్ని; కారుణ్యమున్= దయను; తాల్చి= ధరించి; ఉనికి= ఉండటం; నీకున్= నీకు; కార్యమె= కర్తవ్యమా?

తాత్పర్యం: వీరి (భీమ, అర్జున, నకుల సహదేవులు, కుంతీదేవి అనుభవించే) దుఃఖం తొలగించకుండ, శత్రువులకు సంతోషం కలిగేటట్లుగా, భయంకరమైన అడవిలో ధర్మాన్ని, దయను ధరించి ఉండటం నీకు తగునా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇది బ్రాహ్మణ ధర్మంబుగాని క్షత్త్రియ ధర్మంబు గాదు; మనుప్రణీతంబులైన రాజధర్మంబులు నీ యెఱుంగనియవి లేవు; శత్రుసంహారంబు సేయని నాఁ డత్యంతహాని యగు; నట్లుంగాక. 264

ప్రతిపదార్థం: ఇది= ఇట్టి నీ ప్రవర్తన; బ్రాహ్మణ, ధర్మంబు+కాని= బ్రాహ్మణులు ఆచరించతగిన ధర్మమే కాని; క్షత్రియ ధర్మంబు+కాదు= క్షత్రియులు ఆచరించవలసిన ధర్మం కాదు; మను ప్రణీతంబులు+ఐన= మనువుచేత రచించబడిన; రాజధర్మంబులు= రాజులు ఆచరించతగిన ధర్మాలు; నీ+ఎఱుంగని+అవి, లేవు= నీకు తెలియనివి లేవు; శత్రు సంహారంబు= విరోధులను చంపటం; చేయనినాఁడు= చేయనప్పుడు; అత్యంత, హాని= మిక్కిలి కీడు; అగున్= దాపురిస్తుంది; అట్లున్+కాక= అదీ కాక.

తాత్పర్యం: నీ ప్రవర్తన బ్రాహ్మణులకు అనువైన ధర్మం కాని, క్షత్రియులు ఆచరించవలసిన ధర్మం కాదు. మనువు ధర్మశాస్త్రంలో రచించిన రాజధర్మాలు నీకు తెలియనివి కావు. శత్రువులను తుదముట్టించనినాడు కీడు దాపురిస్తుంది.

తే. వనమునందుఁ బండ్రెండు సంవత్సరంబు । లుండ నేర్చితి మేనియు, నొరు లెఱుంగ
కుండ నజ్ఞాతచర్యయం దొక్క దివస । మైన నుండఁగ నేర; మెట్లనిన వినుము. 265

ప్రతిపదార్థం: వనమునందున్= అడవిలో; పండ్రెండు, సంవత్సరంబులు= పండ్రెండేండ్లు; ఉండ, నేర్చితిమి+ఏనియున్= ఉండగలిగినప్పటికిని; ఒరులు+ఎఱుంగక+ఉండన్= ఇతరులు తెలిసికొనకుండ; అజ్ఞాత, చర్య+అందు= తెలియబడని ప్రవర్తనలో (అజ్ఞాతవాసంలో); ఒక్క దివసము+ఐన= ఒక్క రోజుకూడా; ఉండఁగ నేరము= ఉండజాలం; ఎట్లు+అనిన= ఎట్లని అడిగినట్లయితే; వినుము= చెప్పుతాను వినుము.

తాత్పర్యం: అడవిలో మనం ఎట్లో పండ్రెండేండ్లు ఉండగలిగినా, తదుపరి అజ్ఞాతవాసంలో ఇతరులకు తెలియకుండ ఒక్క దినంకూడా గడుపజాలము. ఎట్లంటే విను.

వ. ఆబాలవృద్ధప్రసిద్ధుండవై పార్థివ సూర్యుండవైన నిన్నును, సింహసంహననులైన నీ తమ్ములను నెఱుఁగని వారు లేరు; మన గూఢభావంబు మేరువు నిగూఢభావంబునుంబోలె నఘటమానం; బిట్లేని నవ్వనవాసక్లేశం బెన్నఁడును మనకుఁబాయనేరదు; మన మిప్పు డివ్వనమునఁ బదుమూఁడు మాసంబులు సలిపితిమి; సంవత్సర ప్రతినిధిగా మాసంబులు సేసికొనుట యెందునుం గల యదియ; దీన ధర్మవిరోధంబు లేదు; విజయారంభంబున కిది యవసరం' బనిన భీమసేను పలుకులు విని నిశ్వాస వ్యాకులిత ముఖుండై, పెద్దయుం బ్రొద్దు చింతించి ధర్మరా జిట్లనియె. 266

ప్రతిపదార్థం: ఆ బాల వృద్ధ ప్రసిద్ధుండవు+ఐ= బాలురు మొదలుకొని ముసలివారివరకు పేరు ప్రఖ్యాతులతో విలిసిల్లే వాడివై; పార్థివ, సూర్యుండవు+ఐన= రాజులలో సూర్యుడివంటి వాడివైన; నిన్నును; సింహసంహననులు+ఐన= సింహాలవంటి శరీరాలు కలవారైన; నీ, తమ్ములనున్= నీసోదరులను; ఎఱుఁగని వారు లేరు; మన, గూఢ, భావంబు= మనం రహస్యంగా ఉండటం; మేరువు, నిగూఢ, భావంబునున్+పోలెన్= మేరుపర్వతం రహస్యంగా ఉండగలగటంవలె; అ, ఘటమానంబు= జరుగనటువంటిది (ఒనగూడనిది); ఇట్లు+ఏనిన్= ఇది ఈ విధంగా జరిగితే; ఈ+వన, వాస, క్లేశంబు= ఈ విధంగా అడవిలో నివసించి క్రగ్గటం; ఎన్నఁడును= ఎప్పటికిని; మనకున్+పాయనేరదు= మనకు తొలగిపోదు (తప్పదు); మనము+ఇప్పుడు; ఈ+వనమునన్=

ఈ అడవిలో; పదుమూఁడు మాసంబులు= పదమూడు నెలలు; సలిపితిమి= గడిపాము; సంవత్సర, ప్రతినిధిగా= ఒక ఏడుకు బదులుగా; మాసంబులు= ఒక్కొక్క నెలను; చేసికొనుట= లెక్కకట్టటం; ఎందునున్+కల+అది+అ= అన్నిచోట్ల ఉన్నట్టిదే; దీనన్= ఈ విధంగా చేస్తే; ధర్మ, విరోధంబు, లేదు= ధర్మవ్యతిరేకత లేదు; విజయ+ఆరంభంబునకున్= గెలుపును పొంద యత్నించటానికి; ఇది, అవసరంబు= ఇది తగినకాలం; అనినన్= అని చెప్పగా; భీమసేను, పలుకులు, విని= భీముడి మాటలు విని; నిశ్వాస, వ్యాకులిత, ముఖుండు+ఐ= నిట్టూర్పులచేత కలత నొందిన మొగం కలవాడై; పెద్దయున్+ప్రొద్దు, చింతించి= చాలాసేపు విచారించి; ధర్మరాజు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! బాలుర నుండి వృద్ధులదాకా అందరిలోప్రసిద్ధుడివై రాజుల్లో సూర్యుడివంటి వాడివైననిన్ను, సింహాలవంటిశరీరాలుగల నీ తమ్ముళ్ళను తెలియనివారులేరు. మనం రహస్యంగా ఉండటం అంటే మేరుపర్వతం మరుగుపడిఉండటం. అది జరిగేదికాదు. అరణ్యవాసాన్ని ఎట్లో గడిపినా- అజ్ఞాతవాసాన్ని ఇతరులకు తెలియకుండ గడపటం ఎట్లా వీలవుతుంది? ఇట్లైతే ఈ మన వనవాసక్లేశం ఎన్నటికీ తొలగిపోదు. ఒక సంవత్సరానికి బదులుగా ఒక నెలను పరిగణించే గణితం లోకంలో బహుళప్రచారంలో ఉన్నది కదా! మనం ఈ అడవిలో పదమూడు నెలలు గడిపాము కావున వీటిని పదమూడు ఏండ్లుగా సరిపెట్టవచ్చును. ఇందు ధర్మవిరోధం లేదు. ఇది విజయ సాధనకు ఒక ఉపకరణం'- అని భీముడు చెప్పగా విని, నిట్టూర్పులచేత కమలిన మొగం కలవాడయి ధర్మరాజు ఇట్లా బదులు పలికాడు.

క. 'క్రమమునఁ బాండిత్య పరా । క్రమ దర్పములందుఁ గడుఁ బ్రగల్భుండవు, మ
ధ్యమ! నీ చెప్పిన యది కా । ర్యమ యయినను ధీరబుద్ధివై విను మనఘా! 267

ప్రతిపదార్థం: అనఘా!= పాప రహితుడా!; మధ్యమ!= కుంతీపుత్రులలో నడిమివాడా! ఓ భీమసేనా!; క్రమమునన్= వరుసగా; పాండిత్య పరాక్రమ దర్పములందున్= పాండిత్యంలోను, శౌర్యంలోను, ఆటోపంలోను; కడున్= మిక్కిలి; ప్రగల్భుండవు= ప్రతిభ కలవాడివి; నీ, చెప్పిన+అది= నీవు చెప్పింది; కార్యము+అ= చేయదగిన పనే; అయినను= కాని; ధీర, బుద్ధివి+ఐ= స్వతంత్ర బుద్ధి కలవాడివై; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: 'అనఘుడ వైన ఓ భీమసేనా! నీకు పాండిత్యం ఉన్నది; పరాక్రమం ఉన్నది; ఆటోపం ఉన్నది. నీవు మిక్కిలి ప్రతిభావంతుడివి. నీవు చెప్పింది చేయదగినదే. అయినా, నేను చెప్పేది విని స్వతంత్రంగా ఆలోచించు.

వ. అల్పోపాయం బైన కార్యంబు సాహసారబ్ధం బైనను దోషంబు లే; దిది మహాకార్యంబు; సాహసక్రియా సాధ్యంబు గాదు; సువిచారితంబై సిద్ధింబొందు; విచారపూర్వారబ్ధ కార్యంబునకు దైవంబును ననుకూలం బగుం గావున నిమ్ముగా విచారింపవలయు. 268

ప్రతిపదార్థం: అల్ప+ఉపాయంబు+ఐన, కార్యంబు= చిన్న ప్రయత్నంచేత నెరవేరేపని; సాహస+ఆరబ్ధంబు+ఐనను= తెగువతో మొదలు పెట్టబడిం దైనను; దోషంబు లేదు= తప్పు లేదు; ఇది; మహా, కార్యంబు= గొప్పపని; సాహస, క్రియా, సాధ్యంబు+కాదు= తెగువతో ముందుకు దూకి చేసే పనుల వలన జరిగేటటువంటిది కాదు; సు, విచారితంబు+ఐ= బాగుగా యోచించబడిందై; సిద్ధిన్+పొందున్= ఫలితం పొందుతుంది; విచార, పూర్వ+ఆరబ్ధ, కార్యంబునకు= ముందు యోచించబడి పిమ్మట మొదలు పెట్టబడిన పనికి; దైవంబునున్= విధియు (అదృష్టమును); అనుకూలంబు+అగున్= తోడుపడుతుంది; కావునన్+ఇమ్ముగా, విచారింపవలయున్= కాబట్టి సంపూర్ణంగా (అనుకూలంగా) ఆలోచించవలసి ఉంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఏదో చిరుప్రయత్నంచేత సిద్ధించే పనిని తెగువతో మొదలు పెట్టినను తప్పు లేదు. ఇది మహాకార్యం. తొందరపడి తెగువతో ముందుకు చొచ్చుకొని చేయతగింది కాదు. చక్కగ ఆలోచించి చేయదగింది సుమా! జాగరూకతతో ముందు ఆలోచించి తదుపరి మొదలు పెట్టిన పనులకే దైవం (అదృష్టం) కూడ కలిసివస్తుంది. కాబట్టి సాంగోపాంగంగా ఈ సమస్యగురించి యోచించవలసి ఉన్నది.

సీ. శూరులు ధృతరాష్ట్రసుతులు దుర్యోధనా । దులు దురాధర్షు లందొఱును మనకు
నాతతాయులు, మఱి యంగభూవిభుఁడును । భూరిశ్రవుఁడు మద్రభూమిపతియు
నాదిగాఁ గల వీరు లవిజేయ విక్రము, । లొలసి తత్సుహృదులై యున్నవారు;
మనచేత జితులైన మనుజేశు లెల్లను । జని సుయోధనుచేత సత్కరింపఁ

ఆ. బడి కడంగి వాని ప్రస్తవంబున నాజి । వేచి ప్రాణములను విడువ నున్న
వారు; వారలెల్ల వసుధఁ బ్రసిద్ధులు । వినఁగ నస్త్రశస్త్రవిద్యలందు. 269

ప్రతిపదార్థం: శూరులు= వీరులు; ధృతరాష్ట్ర సుతులు= ధృతరాష్ట్రుడి కుమారులు; దుర్యోధన+ఆదులు= దుర్యోధనుడు మున్నగువారు; అందొఱును= అందరున్నూ; మనకున్; దురాధర్షులు= త్రోసివేయ తగనివారు; ఆతతాయులు= చంపటానికి ఉద్యుక్తులైనవారు; మఱి= అంతేకాక; అంగభూ, విభుఁడును= అంగదేశపు రాజును (కర్ణుడును); భూరిశ్రవుఁడు; మద్ర, భూమి, పతియున్= మద్రదేశపు రాజు (శల్యుడు); ఆదిగాన్+కల, వీరులు= మొదలుగా గల వీరులు; అవిజేయ విక్రములు= జయింపసాధ్యం కాని పరాక్రమంగలవారు; ఒలసి= కూడుకొని; తద్+సుహృదులు+ఐ+ఉన్నవారు= ఆతడికి మిత్రులై ఉన్నారు; మనచేతన్; జితులు+ఐన= లోగడ ఓడిపోయిన (రాజసూయంలో); మనుజ+ఈశులు+ఎల్లను= రాజులందరున్నూ; చని= వెళ్ళి; సుయోధనుచేత= దుర్యోధనుడి చేత; సత్కరింపన్+పడి= గౌరవించబడి; కడంగి= పూని; వాని ప్రస్తవంబునన్= వాడి విషయంలో; ఆజిన్= యుద్ధాన్ని; వేచి= నిరీక్షించి; ప్రాణములను, విడువన్+ఉన్నవారు= ప్రాణాలను అర్పించటానికి సిద్ధంగా ఉన్నారు; వారలు+ఎల్లన్= వారందరూ; అస్త్ర, శస్త్ర, విద్యలందు= అస్త్రాలకు, (మంత్రంతో కూడిన బాణాలకు) శస్త్రాలకు (ఆయుధాలకు) సంబంధించిన కళలలో; వినఁగన్; వసుధన్= భూమిపై; ప్రసిద్ధులు= పేరుకెక్కిన వారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి కుమారులైన దుర్యోధనాదులందరు వీరులు. మనం చులకనగా చూడదగినవారు కారు. పైగా మనలను చంపటానికి ఉద్యమించే వారు. అంతేకాక, కర్ణుడు, భూరిశ్రవుడు, శల్యుడు జయించ సాధ్యం కానివారు. ఆ దుర్యోధనుడికి వారు మిత్రులై ఉన్నారు. లోగడ మనచేత రాజసూయయాగంలో ఓడిపోయిన రాజులందరు వెళ్ళి దుర్యోధనుడిచే సత్కరించబడి, మనపై పగదీర్చుకోవటానికి యుద్ధానికై నిరీక్షిస్తూ ప్రాణాలు వదలటానికికైనా సిద్ధంగా ఉన్నారు. వాళ్ళంతా అస్త్రశస్త్రవిద్యలలో ఆరితేరి ఈ లోకంలో పేరుకెక్కినవారు.

విశేషం: మద్రభూపతి శల్యుడు నకులసహదేవుల మేనమామ. అయినను అతడు కురుక్షేత్ర సంగ్రామంలో దుర్యోధనుడి పక్షంలో చేరాడు. ముందు జరుగబోయే ఆ సంగతిని- మునుముందుగానే ధర్మరాజు గుర్తించినట్లు ఆరణ్యపర్వంలోనే సాక్ష్యం లభించింది. ఆతతాయులు ఆరుగురు. 1. ఇంటికి నిప్పు పెట్టేవాడు, 2. విషం పెట్టేవాడు, 3. కత్తితో నరికేవాడు 4. ధనం దోచుకొనేవాడు 5. భూమిని అపహరించేవాడు 6. పరస్త్రీని చెరబట్టేవాడు.

క. వినవయ్య! కర్ణుగర్వం । బని నాతఁ డభేద్యకవచుఁ డగుటయు, విలునే
ర్పున నతని బాహువిక్రమ । మును దలఁచిన నాఁడు గన్ను మొగుడదు నాకున్. 270

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వినవయ్య; కర్ణుగర్వంబు= కర్ణుని బాహు గర్వం (దర్పం); అనిన్= యుద్ధంలో; ఆతఁడు= అతడు; అభేద్య కవచుఁడు= భేదించటానికి వీలులేని మైతొడుగు కలవాడు; అగుటయు; విలునేర్పునన్= ధనుర్విద్యానైపుణ్యంలో; అతని, బాహు విక్రమమును= అతని చేతుల లావును; తలఁచిన, నాఁడు= ఆలోచించిన రోజు; నాకున్= నాకు; కన్ను, మొగడదు= కన్నుమూత పడదు, అంటే నిద్రరాదు.

తాత్పర్యం: వినుము. కర్ణుడు బాహుదర్పపూరితుడు. అతడు అభేద్యకవచుడు. అతడి విలునేర్పు, పరాక్రమం తలచినరోజు నాకు నిద్ర పట్టదు.

వ. మఱియు భీష్మ ద్రోణ కృపాచార్యులు సములయ్యును వారియొద్దన యున్నవారు; వార లపార దివ్యాస్త్ర విశారదులు, వారల నోర్చికాని దుర్యోధను నిర్జింపంబోల' దని విచారించు సమయంబున. 271

ప్రతిపదార్థం: మఱియు= అంతేకాక; భీష్మద్రోణకృప+ఆచార్యులు= భీష్ముడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు; సములు+ అయ్యును= సమానులు అయినప్పటికి; అంటే కౌరవ పాండవులకు సమానులే అయినప్పటికిని; వారి+ఒద్దన్+అ+ఉన్నవారు= వారి దగ్గరే (కౌరవుల దగ్గర) ఉన్నవారు; వారలు+అపార, దివ్య+అస్త్ర, విశారదులు= వారు మితిలేని దివ్యమైన అస్త్రాలలో నేర్పరులు; వారలన్+ఓర్చి, కాని= వారిని జయించికాని; దుర్యోధనున్, నిర్జింపన్+పోలదు= దుర్యోధనుడిని జయించ నలవి కాదు; అని, విచారించు, సమయంబున= అని ఆలోచించే సమయంలో.

తాత్పర్యం: అంతేకాక, భీష్మద్రోణకృపాచార్యులు, కురుపాండవులకు సములైనప్పటికీ, కౌరవుల దగ్గరే ఉండటంచేత వారి పక్షాన్నే యుద్ధంలో పాల్గొంటారు. వారు అపార దివ్యాస్త్రకోవిదులు. వారిని జయించిన పిమ్మటే కదా మనం దుర్యోధనుడిని గెలవటం'- అని ఆలోచించేటప్పుడు.

కృష్ణద్వైపాయనుఁడు ధర్మరాజునొద్దకు వచ్చుట (సం. 3-37-20)

క. వారల పుణ్యోదయమున । వారిజభవనిభుఁడు లోకవంద్యుఁడు వచ్చెం
బారాశర్యుఁడు ధర్మశ । రీరుఁడు గృష్ణాజినోత్తరీయుఁడు ప్రీతిన్. 272

ప్రతిపదార్థం: వారల= వారి (పాండవుల) యొక్క; పుణ్య+ఉదయమున= పుణ్య సిద్ధివలన అంటే పుణ్యఫలం వలన; వారిజ, భవ, నిభుఁడు= పద్మంలో జనించిన బ్రహ్మతో సమానమైన వాడు; లోక, వంద్యుఁడు= లోకాలన్నింటిచేత నమస్కరించదగినవాడు; పారాశర్యుఁడు= పరాశరుడి కుమారుడు; ధర్మశరీరుఁడు= ధర్మమే దేహమైన వాడు అంటే మూర్తీభవించిన ధర్మం అని అనదగినవాడు; కృష్ణ+అజిన+ఉత్తరీయుఁడు= నల్ల జింక చర్మం కండువాగా కప్పుకొన్నవాడు; ప్రీతిన్= అనురాగంతో; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఆ పాండవుల పుణ్యపరిపాకంచేత పరాశరుడి కుమారుడు, జగదారాధ్యుడు, బ్రహ్మతో సమానుడు, ధర్మస్వరూపుడు, నల్లజింకతోలును ఉత్తరీయంగా కలవాడైన వ్యాసుడు ఆదరంతో అచటికి వచ్చాడు.

వ. ఇట్లు వచ్చి పరమభక్తిపరులైన పాండవులచేతం బూజితుండై కృష్ణద్వైపాయనుండు ధర్మరాజున కిట్లనియె.273

ప్రతిపదార్థం: ఇట్లు, వచ్చి= ఈ విధంగా వచ్చి; పరమ, భక్తి, పరులు+ఐన= మిక్కిలి పూజ్యభావం (తనపట్ల) కల; పాండవులచేతన్; పూజితుండు+ఐ= ఆరాధించబడి; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇట్లా వచ్చి తనపట్ల మిక్కిలి భక్తి ఉన్న పాండవులచేత అర్చించబడి వ్యాసమహర్షి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

క. 'వీరులగు భీష్మకుంభజ। శారద్వత కర్ణు లమితసత్త్వులు వారిం
బోర వధియించు టెంతయు। భారం బనియున్న నీదు భర మెఱిఁగి మదిన్. 274

ప్రతిపదార్థం: వీరులు+అగు= శూరులైన; భీష్మ, కుంభజ, శారద్వత, కర్ణులు= భీష్ముడు, (కుంభజుడు= కుండలోపుట్టినవాడు) ద్రోణుడు, శారద్వతుడు (శరద్వంతుని కుమారుడైన కృపుడు), కర్ణుడు; అమితసత్త్వులు= మితిలేని బలం కలవారు; వారిన్= వారిని; పోరన్= యుద్ధంలో; వధియించుట= చంపటం; ఎంతయు, భారంబు+అని+ఉన్న= మిక్కిలి బరువు అని ఉండే; నీదు భరము= నీయొక్క బరువు (క్లేశం); మదిన్= మనస్సులో; ఎఱిఁగి= తెలిసికొని.

తాత్పర్యం: 'మహావీరులైన భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, కర్ణుడు గొప్ప పరాక్రమవంతులు. అట్టివారిని యుద్ధంలో చంపటం మిక్కిలి భారమైనపని అని భావించే నీ చింతాభారాన్ని నా మనసులో గుర్తించి, (ఇక్కడికి వచ్చాను).

ఆ. దాని నపనయింపఁగా నిప్డ వచ్చితి; నధికయోగలబ్ధ మతిరహస్య
మీ విశేషవిద్య సేవింపఁగాఁ బార్థుఁ। బనుపు; మితఁడు దీనఁ బడయు సిద్ధి.' 275

ప్రతిపదార్థం: దానిన్= దానిని (నీ భారాన్ని); అపనయింపఁగాన్= తొలగించటానికై; ఇప్డు= ఇపుడు; వచ్చితిన్= అరుదెంచాను; ఈ, విశేష, విద్య= ఈ గొప్పదైన విద్య; అధిక, యోగ, లబ్ధము= గొప్ప యోగంవలన పొందబడింది; అతి, రహస్యము= మిక్కిలి రహస్యమైనది; (దీనిని) సేవింపఁగాన్= అభ్యసించటానికి; పార్థున్= అర్జునుడిని; పనువుము= నియోగించుము; ఇతఁడు= ఈ అర్జునుడు; దీనన్= దీనివలన; సిద్ధిన్= ఫలాన్ని; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: ఆ భారాన్ని తొలగించటానికే వచ్చాను. ఈ విశేష విద్య అధికయోగలబ్ధం, అతిరహస్యం. దీనిని సేవించటానికి అర్జునుడిని నియోగించుము. ఈ (ప్రతిస్మృతి) విద్యాప్రభావం వలన అర్జునుడు ఫలితాన్ని పడసి చరితార్థుడు అవుతాడు'.

విశేషం: ఇచట 'యోగ' శబ్దం ప్రయుక్తం. యోగ శబ్ద నిర్వచనాలు వేదాంత వాఙ్మయంలో స్థూలదృష్టికి విభిన్నాలుగా గోచరించవచ్చును. యోగశబ్దానికి వ్యావహారిక జగత్తులో కలయిక- పొందిక అని అర్థం. సాహిత్య ప్రపంచంలో యోగమంటే సామరస్య సంధానం, సమన్వయ సమ్మేళనం. పతంజలి మహర్షి "యోగః చిత్తవృత్తినిరోధః" - 'యోగమంటే చిత్తవృత్తినిరోధ' మని నిర్వచించాడు. భగవద్గీతలో (1) "సమత్వం యోగ ఉచ్యతే" (2) "యోగః కర్మసు కౌశలం.' యోగమనగా సమతాభావం, క్రియా కౌశలం- అని చెప్పబడింది. యోగికి సమబుద్ధి ఉంటుంది. అతడు నిస్సంగుడు. అతడికి అపజయం అనే ప్రసక్తే లేదు. అందుచేత సాధనసిద్ధికి అభేదాధ్యవసాయం ఏర్పడుతుంది. మహాభారతంలో ఈ 'ప్రతిస్మృతి' ఎటువంటి యోగమో నిష్కర్షగా నిర్వచించటానికి నేడు మనకు వీలుకాక పోయినప్పటికీ, అందులో చిత్తవృత్తి నిరోధం, సమబుద్ధి, క్రియాకౌశలం- త్రిభుజంలోని మూడు భుజాలుగా ఇమిడి ఉన్నాయని చెప్పవచ్చును. ఈ యోగసాధనలో అర్జునుడి ధ్యేయం తన క్రియాకౌశలాన్ని పెంపొందించుకొనటమే. అర్జునుడి యోగసాధన భగవద్గీతోపదేశానికి ముందే ఆరంభించినట్లు దీన్నిబట్టి గ్రహించవచ్చును.

వ. అని ధర్మతనయు నేకాంతప్రదేశంబునకుం దోడ్కొని చని సత్యవతీసుతుండు విధిదృష్ట విధానంబునం బ్రతిస్మృతి యను విద్య నుపదేశించి. 'దీని శక్తి నర్జునుం డధికతపోవీర్యవిభవుండై యింద్ర యమ వరుణ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కుబేరాది దేవతలను నీశ్వరునిఁ బ్రత్యక్షంబు సేసికొని, వారలవలన దివ్యాస్త్రంబులు వడసి శత్రువుల జయించు; మఱి యివ్వనంబు భవచ్చిరనివాసంబునం జేసి విరళ ఫల కుసుమ పాదపంబై మృగకులోపరోధియై యొప్పకున్న యది; యొక్కచోటన పెద్దకాలం బునికి యెవ్వరికిం బ్రీతి జననంబు గాదు; కావున నొండువనంబున కరుగునది' యని చెప్పి యమ్మునివరుం దరిగినఁ, దద్వాక్య ముదితులై ద్వైతవనంబు వాసి పాండవులు బ్రాహ్మణవరులతోన కామ్యకవనంబున కరిగి, సరస్వతీ తీరంబునందు నివాసంబుసేసి, కొండొకకాలం బుండ నొక్కనాఁ డజాతశత్రుం డర్జునుఁ జూచి యిట్లనియె. 276

ప్రతిపదార్థం: అని= ఆవిధంగా చెప్పి; ధర్మతనయున్= ధర్మరాజును; ఏకాంత ప్రదేశంబునకున్= రహస్యమైన చోటికి; తోడ్కొని చని= తీసికొనిపోయి; సత్యవతీ సుతుండు= సత్యవతి కుమారుడు (వేదవ్యాసుడు); విధి, దృష్ట, విధానంబునన్= (శాస్త్రంలోని) సూత్రాలలో చెప్పబడిన రీతిగా; 'ప్రతిస్మృతి'+అను, విద్యన్= 'ప్రతిస్మృతి' అనే పేరు కల విద్యను; ఉపదేశించి= బోధించి; దీని శక్తిన్= దీని ప్రభావం వలన; అర్జునుండు; అధిక, తపస్+వీర్య, విభవుండు+ఐ= ఎక్కువ తపస్సు వలన ఏర్పడే తేజస్సు అనే సంపద కలవాడయి; ఇంద్ర, యమ, వరుణ, కుబేర+ఆది, దేవతలను= ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు మున్నగు దేవతలను; ఈశ్వరునిన్= శివుడిని; ప్రత్యక్షంబు+చేసికొని= సాక్షాత్కరింపచేసికొని; వారలవలన, దివ్య+అస్త్రంబులు= ఆయా దేవతలకు సంబంధించిన మంత్ర బాణాలు; పడసి= పొంది; శత్రువులన్, జయించున్= శత్రువులను గెలుస్తాడు; మఱి= అటుమీద; ఈ+వనంబు= ఈ అడవి; భవత్, చిర, నివాసంబునన్+చేసి= మీరు చాలాకాలం నివసించటంచేత; విరళ, ఫల, కుసుమ, పాదపంబు+ఐ= తగ్గి పోయిన పండ్లు, పువ్వులు చెట్లు కలదై; మృగ, కుల+ఉపరోధి+ఐ= జంతువుల సమూహాలకు ప్రతిబంధకమై; ఒప్పక+ఉన్న+అది= పాడయిపోయింది (తగనిది); ఒక్కచోటన్+అ= ఒకేచోటనే; పెద్ద, కాలంబు+ఉనికి= చాలాకాలం ఉండటం; ఎవ్వరికిన్+ప్రీతి, జననంబు+కాదు= ఎవరికైనా సంతోషాన్ని పుట్టించేది కాదు; కావునన్= కాబట్టి; ఒండు, వనంబునకు= వేరొక అడవికి; అరుగునది= వెళ్ళేది; అని; చెప్పి; ఆ+మునివరుండు= ఆ ఋషిశ్రేష్ఠుడు; అరిగినన్= వెళ్ళగా; తద్+వాక్య, ముదితులు+ఐ= ఆయన యొక్క మాటలకు సంతోషించిన వారై; ద్వైత, వనంబు+పాసి= ద్వైత మనే పేరున్న అడవిని విడిచి; పాండవులు; బ్రాహ్మణ, వరులతోన్+అ= విప్రముఖ్యులతోకూడా; కామ్యక, వనంబునకు+అరిగి= కామ్యక మనే పేరుకల అడవికి వెళ్ళి; సరస్వతీ తీరంబునందు= సరస్వతీనది ఒడ్డున; నివాసంబు+చేసి= నివసించి; కొండొక, కాలంబు+ఉండన్= కొన్ని దినాలు నివసించగా; ఒక్క, నాఁడు= ఒక దినం; అజాత, శత్రుండు= ధర్మరాజు; అర్జునున్+చూచి= అర్జునుడిని కాంచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: వ్యాసమహర్షి ధర్మరాజును రహస్యస్థలానికి తీసికొనిపోయి, 'ప్రతిస్మృతి' అనే విద్యను ఉపదేశించాడు. ఆ విద్యాశక్తివలన అర్జునుడు ఇంద్ర యమ వరుణ కుబేరాది దేవతలను ఉపాసించి, ప్రత్యక్షంచేసుకొని, వారలవలన ఆయా దివ్యాస్త్రాలను సంపాదించి శత్రువులను జయించగలడని చెప్పాడు. (అంటే 'ప్రతిస్మృతి'ని ధర్మరాజు అర్జునుడికి ఉపదేశించాలని వ్యాసమహర్షి హృదయమని తెలుతున్నది). మీ రిచ్చట చాలాకాలంనుండి ఉండటంచేత ఈ అడవిలో ఫలాలు, పుష్పాలు, చెట్లు తరిగిపోయాయి. అందువలన ఇచటి జంతువులకు ఆటంకంగా ఉన్నది. ఇదిగాక, ఒకేచోట చాలాకాలం ఎవరైనను ఉంటే ప్రీతి సన్నగిల్లుతుంది. కాబట్టి మీరు ఇంకొక అడవికి వెళ్ళటం మంచిది' అని వ్యాసమహర్షి పలుకగా పాండవులు సంతసించి బ్రాహ్మణులతోకలిసి కామ్యకవనానికి వెళ్ళి సరస్వతీ నదీ తీరంలో నివసించారు. అంత, ఒకనాడు ధర్మరాజు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

క. 'సాధితశాత్రవులగు భీ । ష్మాదులయం దధిగతాశ్రయం బయ్యెఁ జతుః
పాదం బగుచున్న ధను । ర్వేదము బ్రాహ్మణులయందు వేదమపోలెన్. 277

ప్రతిపదార్థం: సాధిత, శాత్రవులు+అగు= సాధించబడిన విరోధులు కలవారయిన- అంటే శత్రులను జయించిన; భీష్మ+ఆదుల+అందు= భీష్ముడు మున్నుగా కలవారి పట్ల; బ్రాహ్మణుల+అందు; వేదము+అ, పోలెన్= వేదంవలె; చతుర్, పాదంబు+అగుచున్న= నాలుగు పాదాలు కలదిగా అవుతున్న; ధనుస్+వేదము= ధనుర్వేదం, వింటికి సంబంధించిన విజ్ఞానం; అధిగత+ఆశ్రయంబు+అయ్యెన్= పొందిన ఆశ్రయం కలదిగా అయింది.

తాత్పర్యం: వేదం బ్రాహ్మణులలో స్థిరపడినట్లుగా, నాలుగుపాదాలు కలదైన ధనుర్వేదం శత్రువులపై విజయం సాధించిన భీష్మాదులలో స్థిరపడింది.

విశేషం: అలం: ఉపమ.

వ. అయ్యది మహనీయంబయి దివ్యమంత్ర కలితంబయి వారలకు సన్నిహితం బగుఁ గావున. 278

ప్రతిపదార్థం: ఆ+అది= ఆ ధనుర్వేదం; మహనీయంబు+అయి= గొప్పదై; దివ్య మంత్ర కలితంబు+అయి= దేవతా సంబంధమైన మంత్రాలతో కూడిందై; వారలకు= ఆ భీష్మాదులకు; సన్నిహితంబు+అగున్+కావునన్= చేరువగా ఉంటుంది కాబట్టి.

తాత్పర్యం: ఆ మహనీయమైన ధనుర్వేదం దివ్యమంత్రాలతో కూడినదై ఆ భీష్మాదుల దగ్గర ఉన్నది కనుక-

ఉ. వారలు దుర్యోధనుచే। నారాధితు లిష్టసత్క్రియల నగుట రణ
ప్రారంభమయిన నెదిరెడు। వార పరాక్రాంతులై యవశ్యము మనతోన్. 279

ప్రతిపదార్థం: వారలు= భీష్మాదులు; దుర్యోధనుచేన్= దుర్యోధనుడిచేత; ఇష్ట, సత్+క్రియలన్= ఇష్టమైన సత్కారాలచేత; ఆరాధితులు= పూజించబడినవారు; అగుటన్= అవటంచేత; రణ, ప్రారంభము+అయినన్= యుద్ధం మొదలైతే; పర+ఆక్రాంతులు+ఐ= శత్రువులచే ఎదిరింపబడినవారై; మనతోన్; అవశ్యము= తప్పనిసరిగా; ఎదిరెడువారు+అ= తప్పక పోరు సల్పుతారు.

తాత్పర్యం: ఆ భీష్మాదులు, దుర్యోధనుడిచేత ఇష్టసత్కారాలతో పూజించబడ్డారు. అందుచేత యుద్ధం ప్రారంభమైనప్పుడు వారు తప్పక మనలను ఎదిరించి పరాక్రమంతో పోరు సల్పుతారు.

వ. దివ్యాస్త్ర విదులైన వారల నోర్చునట్టి యుపాయంబు గృష్ణద్వైపాయనుండు ప్రసాదించె నీ విద్య నీవు ప్రతిగ్రహించి, కవచకార్ముక ప్రాస ఖడ్గ ధరుండవై యన్యుల కజేయుండవై యుత్తరదిక్కున కరిగి తపోయోగ బలంబున నింద్రుఁ బ్రత్యక్షంబు సేయుము; తొల్లి వృత్రునకు వెఱచి వేల్పులు తమ యాయుధంబులు బలంబులు నింద్రునందు సమర్పించి; రవి యెల్ల నీకుఁ దత్ప్రసాదంబున నగు; మఱి యింద్రునుపదేశంబున నీశ్వరు నారాధించి తదనుగ్రహంబున నిష్టసిద్ధి వడయు; మిది వేదవ్యాసు నుపదేశం' బని. 280

ప్రతిపదార్థం: దివ్య+అస్త్ర, విదులు+ఐన= దేవతలకు సంబంధించిన అస్త్రాలను తెలిసినవారైన; వారలన్+ఓర్చునట్టి= వారిని జయించేటటువంటి; ఉపాయంబు= వెరపు; కృష్ణ ద్వైపాయనుండు= వ్యాసుడు; ప్రసాదించెన్= దయతో ఇచ్చాడు; ఈ విద్య; నీవు; ప్రతిగ్రహించి= (నా దగ్గరనుండి) స్వీకరించి; కవచ, కార్ముక, ప్రాస, ఖడ్గ, ధరుండవు+ఐ= మైతొడుగు, విల్లు, ఈటె , కత్తి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధరించిన వాడివై; అన్యులకు= ఇతరులకు; అజేయుండవు+ఐ= జయించశక్యం కానివాడివై; ఉత్తర దిక్కునకు+అరిగి= ఉత్తర దిశకు వెళ్ళి; తపస్+యోగ, బలంబునన్= తపస్సుయొక్క, యోగంయొక్క శక్తిచేత; ఇంద్రున్= దేవేంద్రుడిని; ప్రత్యక్షంబు+చేయుము= సాక్షాత్కరింపచేసికొనుము; తొల్లి= పూర్వకాలంలో; వృత్రునకు= వృత్రుడు అనే రాక్షసుడికి; వెఱచి= భయపడి; వేల్పులు= దేవతలు; తమ+ఆయుధంబులు= తమతమ శస్త్రాలు; బలంబులున్= శక్తులు; ఇంద్రునందు= ఇంద్రుడికి; సమర్పించిరి= ఇష్టంతో ఇచ్చారు; అవి+ఎల్లన్= అవి అన్నియు; నీకున్; తద్+ప్రసాదంబునన్= ఆతడి దయవలన; అగున్= లభిస్తాయి; మఱి= అంతేకాక; ఇంద్రు+ఉపదేశంబునన్= ఇంద్రుడియొక్క హితబోధవలన; ఈశ్వరున్= శివుడిని; ఆరాధించి= పూజించి; తద్+అనుగ్రహంబునన్= ఆతడి దయవలన; ఇష్టసిద్ధి= కోరుకొన్న లాభాన్ని; పడయుము= పొందుము; ఇది; వేదవ్యాసు+ ఉపదేశంబు= వేదవ్యాసుడి హితబోధ; అని.

తాత్పర్యం: దివ్యాస్త్రవేత్తలైన భీష్మాదులను జయించే ఉపాయం వేదవ్యాసమహర్షి ఉపదేశించాడు. ఆ విద్య నీవు నా దగ్గరనుండి తీసికొనుము. నీవు సమస్తాయుధధారివై ఉత్తర దిక్కుగా వెళ్ళి, తపస్సు చేసి ఇంద్రుడిని సాక్షాత్కరింప చేసికొనుము. తొల్లి వృత్రుడికి భయపడి దేవతలు తమ ఆయుధాలు, బలాలు ఇంద్రుడికి సమర్పించారు. ఆతడి అనుగ్రహంవలన అవి అన్నియు నీకు లభిస్తాయి. తదుపరి ఇంద్రుడి హితబోధన ననుసరించి శివుడిని ఆరాధించి అభీష్టలాభం పొందుము. ఇది వేదవ్యాసమహర్షి ఉపదేశం'- అని ధర్మరాజు అర్జునుడితో చెప్పాడు.

క. ధృతి నియమవ్రతునకు, దీ । క్షితునకుఁ, బార్థునకు, విగతకిల్బిషునకు ధ
ర్మతనూజుఁడు ప్రీతిఁ బ్రతి । స్మృతి నుపదేశించెఁ దా నమిత్రజిగీషన్. 281

ప్రతిపదార్థం: ధృతి, నియమ, వ్రతునకు= ధైర్యంతో, నియమంతో కూడిన వ్రతం కల వాడికి; దీక్షితునకున్= మంత్ర దీక్షను పూనిన వాడికి; పార్థునకున్= అర్జునుడికి; విగత, కిల్బిషునకు= పోయిన పాపాలు కలవాడికి అంటే పాపరహితుడికి; ధర్మతనూజుఁడు= ధర్మపుత్రుడు; ప్రీతిన్= అనురాగంతో; తాన్= తాను; అమిత్ర జిగీషన్= శత్రువులను జయించాలనే కోరికతో; ప్రతిస్మృతిన్= ప్రతిస్మృతి అనే మంత్రవిద్యను; ఉపదేశించెన్= బోధించాడు.

తాత్పర్యం: ధైర్యంగా వ్రతదీక్షపూనినవాడు, పాపరహితుడు, మంత్రాన్ని సాధించాలనే పట్టుదలతో కూడినవాడు అయిన అర్జునుడికి, ధర్మరాజు శత్రువులను జయించాలనే అభిలాషతో 'ప్రతిస్మృతి' అనే విద్యను ఉపదేశించాడు.

విశేషం: ధర్మరాజు అర్జునుడితో 'తపోయోగ బలంబున' ఇంద్రుడిని ప్రత్యక్షం చేసికొమ్మని చెప్పి ఉన్నాడు. అంతేకాక, అతడికి 'ప్రతిస్మృతి' ని ఉపదేశించాడు. అందుచేత అర్జునుడు తపస్సు చేయవలసి ఉన్నది. యోగసాధనకూడ చేయవలసి ఉన్నది. పతంజలి ప్రవచించిన అష్టాంగయోగంలోని అంగాలు; 1. యమం 2. నియమం 3. ఆసనం 4. ప్రాణాయామం 5. ప్రత్యాహారం 6. ధారణ 7. ధ్యానం 8. సమాధి. ఇందులో రెండవ అంగమైన నియమాన్ని పతంజలిమహర్షి పంచశీలగా రూపొందించాడు: 1. శౌచం 2. సంతోషం 3. తపస్సు 4. స్వాధ్యాయం 5. ఈశ్వరప్రణిధానం. నియమానికి కావలసింది దీక్ష. అందుచేత దీక్షితుడైన పార్థుడికి ప్రతిస్మృతిని ధర్మరాజు ఉపదేశించాడు.

వ. అర్జునుండును నయ్యోగవిద్యాగ్రహణప్రభావంబున నధికతేజోమూర్తియై, దివ్యాస్త్రలాభార్థం బగ్రజుచేత ననుజ్ఞాతుండై, విధివిహిత హోమసంతర్పిత వీతిహోత్రుండును బ్రాహ్మణకృత స్వస్త్యయనుండునునై, ధౌమ్యాది మహీసురవరులను భ్రాతృవరులను వీడ్కొని, తపంబున కరుగ సమకట్టిన. 282

ప్రతిపదార్థం: అర్జునుండును; ఆ+యోగ, విద్యా, గ్రహణ, ప్రభావంబునన్= ఆ యోగసాధనను గ్రహించటంచేత సంక్రమించిన మహిమచేత; అధిక, తేజస్+మూర్తి+ఐ= ఎక్కువ తేజంతో కూడిన ఆకారం కలవాడై; దివ్య+అస్త్ర, లాభ+అర్థంబు= దేవతలకు సంబంధించిన అస్త్రాలను పొందటానికై; అగ్రజుచేతన్= (తన కంటె ముందుపుట్టినవాడు) అన్నచేత; అనుజ్ఞాతుండు+ఐ= అనుమతి ఒసగబడినవాడై; విధి, విహిత, హోమ, సంతర్పిత, వీతిహోత్రుండును= శాస్త్రాలలోని సూత్రాలకు అనువుగా వేల్చటంచేత తృప్తిపొందించబడిన అగ్నిహోత్రుడు కలవాడున్నూ; బ్రాహ్మణ, కృత, స్వస్తి+అయనుండునున్+ఐ= విప్రులచేత చేయబడిన 'స్వస్తి' అని చెప్పబడే ఆశీస్సు కలవాడున్నూ (అంటే ప్రయాణం బాగా జరుగకలదనే ఆశీస్సులను బ్రాహ్మణులచేత పొందిన వాడై); ధౌమ్య+ఆది, మహీసురవరులను= ధౌమ్యుడు మొదలుగా గల బ్రాహ్మణశ్రేష్ఠులను; భ్రాతృవరులను= శ్రేష్ఠులైన సోదరులను; వీడ్కొని= వదలి; తపంబునకు= తపస్సు చేసికొనటానికి; అరుగ, సమకట్టిన= వెళ్ళటానికి పూనుకొని ఉండగా.

తాత్పర్యం: 'ప్రతిస్మృతి' విద్యా మహిమవలన అర్జునుడు అధికతేజస్వి అయి వెలుగొందాడు. దివ్యాస్త్రాలను సంపాదించటానికి అన్నగారి అనుమతి గైకొన్నాడు. బయలుదేరే ముందు అగ్నిహోత్రంలో హోమాలు వేల్చి, బ్రాహ్మణుల ఆశీస్సులు పొంది, అందరికి వీడ్కోలు చెప్పాడు. అట్లా తపస్సుకు వెళ్లబోతుండగా.

సీ. **ఆతని గాండీవహస్తు, నక్షయబాణ । తూణీరయుగళు, నుత్తుంగభుజునిఁ**
గనకవర్మావృత ఘనతరతనుఁ జూచి । పొంగి యంతర్హితభూతములును
బ్రాహ్మణప్రవరులుఁ 'బార్థుని మనమునఁ । దలఁచిన యర్థంబు దడయ కిష్ట
సంసిద్ధి యయ్యెడు! సర్వ విఘ్నములును । శాంతిఁ బొందెడు!' మని సంతసమునఁ

ఆ. **బలికి; రంతఁ దరుణి పాంచాలి బీభత్సు । కడకు నరుగుదెంచి కమలనేత్ర**
యరిజయార్థ మరుగు నాతని యుత్సాహ । మెఱిఁగి యిట్టు లనియె నిందువదన. **283**

ప్రతిపదార్థం: ఆతనిన్= ఆ అర్జునుడిని; గాండీవహస్తున్= గాండీవం చేతిలో కలవాడిని; అక్షయ, బాణ, తూణీర, యుగళున్= తరుగని అమ్ములతో ఉన్న రెండు అమ్ముల పొదులు కలవాడిని; ఉత్తుంగ భుజునిన్= ఎత్తైన భుజాలు కలవాడిని; కనక, వర్మ+ఆవృత, ఘనతర, తనున్= బంగారు కవచంచేత చుట్టుకొనబడిన గొప్పదైన శరీరం కలవాడిని; చూచి; పొంగి= ఉత్సాహం పొంది; అంతర్హిత భూతములును= కంటికి కనిపించని ప్రాణులును; బ్రాహ్మణ ప్రవరులున్= బ్రాహ్మణ శ్రేష్ఠులును; పార్థుని, మనమునన్+తలఁచిన+అర్థంబు= అర్జునుడు మనస్సులో కోరిన కోరిక; తడయక= ఆలస్యం లేకుండ; సంసిద్ధి+అయ్యెడు= ఈడేరునుగాక!; సర్వవిఘ్నములును= అన్ని అడ్డంకులున్నూ; శాంతిన్+పొందెడున్+అని= సమసిపోవునుగాక! అని; సంతసమునన్= సంతోషంతో; పలికిరి (ఆశీర్వదించారు); అంతన్; తరుణి, పాంచాలి= మహిళామణి అయిన ద్రౌపది; కమలనేత్ర= పద్మాలవంటి కన్నులు కలది; ఇందు, వదన= చంద్రుడివంటి మొగం కలది; బీభత్సు, కడకున్= అర్జునుడి దగ్గరకు; అరుగుదెంచి= వచ్చి; అరి, జయ+అర్థము+అరుగు= శత్రువులపై విజయం సాధించటానికై వెళ్ళుతున్న; ఆతని+ఉత్సాహము+ఎఱిఁగి= అతడి ఎడదపొంగు గుర్తించి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: గాండీవాన్నీ, అక్షయతూణీరాలనూ ధరించి, బంగారుకవచాన్ని తాల్చి, పయనానికి సిద్ధమవుతున్న ఉన్నతభుజుడైన అర్జునుడిని చూచి బ్రాహ్మణోత్తములున్నూ, కానరాని భూతగణాలున్నూ, సంతోషంతో 'ఇతడికి ఇష్టసంసిద్ధి అగునుగాక!' అని ఆశీర్వదించగా, చంద్రవదన, కమలనేత్ర అయిన పాంచాలి, శత్రువులపై విజయం సాధించటానికై వెళుతున్న ఆతడి ఉత్సాహాన్ని గుర్తించి ఈ విధంగా పలికింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'ఏడు, తల ద్రుతమున కచ్చు పరమగునపుడు మకారమగును.' పొందెడున్+అని= పొందెడుమని.

క. 'అవమానాసహ మగు నీ । యవమక్షత్త్రియ కులంబునం దిం కిట పు
ట్టువు గాకుండెడుఁ; దత్క్షమ । మవు బ్రాహ్మణకులమునంద యయ్యెడు నాకున్. 284

ప్రతిపదార్థం: అవమాన+అసహము+అగు= తిరస్కారం భరించలేని; ఈ+అవమ+క్షత్త్రియ, కులంబునందు= ఈ తక్కువది అయిన క్షత్రియ కులంలో; ఇంక+ఇట= ఇకమీద; పుట్టువు+కాకుండెడున్= జన్మ కలుగకుండుగాక; తద్+క్షమము+అవు= ఆ అవమానాన్ని భరించే ఓర్పుగల; బ్రాహ్మణ, కులమునందు+అ= బ్రాహ్మణ వంశంలోనే; నాకున్= నాకు; అయ్యెడున్= కలుగునుగాక!

తాత్పర్యం: 'అవమానం భరించలేని ఈ పాడు క్షత్రియకులంలో ఇంక నాకు జన్మ కలుగకుండుగాక! ఇకమీద అటువంటి క్షమాగుణం కల విప్రవంశంలోనే నేను పుట్టెదను గాక!

చ. అరికృతదుష్పరాభవమహార్ణవమగ్నుల మమ్ము నందఱం
గరుణ సముద్ధరింపుము జగన్నుత! యన్యులు వూనఁగాని యీ
భరము వహింపఁ బూనిన యపారగుణోన్నతు నిన్ను దిక్కులున్
దరణియు సోముఁడున్ నభము ధాత్రియు గాడ్పును గాచుచుండెడున్.' 285

ప్రతిపదార్థం: జగత్+నుత!= లోకంచేత పొగడబడినవాడా!; అరి, కృత, దుష్పరాభవ, మహార్ణవ, మగ్నులన్, మమ్మున్= శత్రువులచేత చేయబడిన చెడ్డ అవమాన మనే గొప్ప సముద్రంలో మునిగిపోయిన మమ్ములను; అందఱన్= అందరిని; కరుణన్= దయతో; సముద్ధరింపుము= దరిచేర్చుము; అన్యులు= ఇతరులు; పూనన్+కాని= పూనలేని; ఈ, భరము= ఈ బరువు; వహింపన్+పూనిన= భరించటానికి పూనిన; అపార, గుణ+ఉన్నతు= మితిలేని మంచిగుణాలచేత గొప్పవాడి వయిన; నిన్నున్; దిక్కులున్= దిశలును; తరణియు= సూర్యుడును; సోముఁడున్= చంద్రుడును; నభము= ఆకాశం; ధాత్రియు= భూమియు; గాడ్పును= వాయువును; కాచుచుండెడున్= కాపాడుగాత!

తాత్పర్యం: జగత్ప్రశంసలందుకొన్న అర్జునా! శత్రువులు చేసిన అవమానం అనే సముద్రంలో మునిగిన మమ్మి దయతో ఉద్ధరించుము. ఇతరులకు వహింప సాధ్యంకాని ఈ భారాన్ని వహించబూనుకొన్న అపరిమితమైన సద్గుణాలుగల నిన్ను- దిక్కులు, సూర్యుడు, చంద్రుడు, ఆకసం, భూమి, వాయుదేవుడు రక్షింతురు గాక!'

విశేషం: అలం: రూపకం.

వ. అని దీవించి పాంచాలరాజపుత్త్రి దన స్నేహలాలస విలోలాపాంగ విలోకనంబులం బార్థుఁ బరిగృహీత పాథేయుం జేయుచుఁ దద్వియోగతరళంబైన హృదయం బెట్టకేనియు నొక్కింతసేసికొని యుండె; మఱి పార్థుండునుం బూర్వోత్తర దిశాభిముఖుండై యొక్కరుండ యరిగి యైంద్రయోగశక్తినిఖిల భూతదుర్నిరీక్ష్యుం డగుచు హిమశైల గంధమాదనంబుల నతిక్రమించి. 286

ప్రతిపదార్థం: అని= అని పలికి; దీవించి= ఆశీర్వదించి; పాంచాల రాజపుత్త్రి= ద్రౌపది (పాంచాల దేశ ప్రభువు కూతురు); తన, స్నేహ, లాలస, విలోల+అపాంగ, విలోకనంబులన్= తన ప్రేమచేత ఆసక్తములై మిగుల చలించే క్రీగంటి చూపులతో;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పార్థున్= అర్జునుడిని; పరిగృహీత, పాథేయున్+చేయుచున్= తీసికొనబడిన దారిబత్తెం కలవాడినిగా చేస్తూ; తద్+వియోగ, తరళంబు+ఐన, హృదయంబు= అతడి ఎడబాటుబాధచేత చంచలమైన గుండెను; ఎట్టకేనియున్= చివరి కేదో రీతిగా; ఒక్కింత, చేసికొని= కుదుటపరచుకొని; ఉండెన్= ఉండింది; మఱి= ఆ మీద; పార్థుండునున్= అర్జునుడును; పూర్వ+ఉత్తర, దిశా+అభిముఖుండు+ఐ= తూర్పు ఉత్తర దిశలకు నడిమిదైన ఈశాన్య దిక్కుకు ఎదురుమొగం కలవాడై; ఒక్కరుండు+అ= ఒంటరిగానే; అరిగి= వెళ్ళి; ఐంద్ర, యోగ, శక్తిన్= ఇంద్ర సంబంధమైన యోగ మహిమచేత; నిఖిల, భూత, దుర్నిరీక్ష్యుండు+ అగుచున్= సకల ప్రాణికోటికి తేరి చూడరాని వాడవుతూ; హిమశైల= హిమాలయ పర్వతాన్ని; గంధమాదనంబులన్= గంధ మాదన పర్వతాన్ని; అతిక్రమించి= దాటి.

తాత్పర్యం: అని ఆశీర్వదించింది- ద్రౌపది. ప్రేమాసక్తిచే చలించిన ఆమె క్రీగంటి చూపులు అర్జునుడికి దారి బత్తెమయ్యాయి. ఆమె అతడి ఎడబాటు చేత చలించే ఎడదను ఎట్లో కుదుట పరుచుకొని ఉండింది. అటుపై అర్జునుడు పూర్వోత్తరదిశగా పయనమై, ఇంద్ర సంబంధి యోగ శక్తిచేత తేరి చూడరాని తేజం కలవాడై, హిమాలయ, గంధమాదన పర్వతాలను అతిక్రమించి పయనం కొనసాగించాడు.

విశేషం: పూర్వకాలంలో దూరప్రయాణానికి తరలేవారు దారిబత్యాన్ని తీసికొని వెళ్ళటం అవశ్యకర్తవ్యం. పాథేయ మంటే దారిలో ప్రయాణికుడు జీవించటానికి తనవెంట తీసికొని వెళ్ళే వివిధపదార్థసంచయం. ఇట దూరప్రయాణానికై తరలి వెళ్తున్నవాడు అర్జునుడు. అతడికి ఇక పాథేయ మేది? అనురాగలాలస విలోలాలైన తన క్రీగంటిచూపులనే అర్జునుడు పాథేయంగా స్వీకరించినట్లు చేసిందట ద్రౌపది! ఈ మనోహరకల్పనలోని సాహితీస్వారస్యం సహృదయహృదయైకవేద్యం.

ఉ. వీరుఁడు యోగవిద్యయును విల్లును దోడుగ నింద్రకీలమన్
భూరినగంబుపైఁ గడఁగి పోవఁగఁ బోయినఁ 'బోవకుండు ము
గ్రారివిభేది! నీ 'వను మహామధురధ్వని వించె వానికిన్;
బోరన నంతరిక్షమునఁ బొల్చె నిరంతర పుష్పవృష్టియున్. 287

ప్రతిపదార్థం: వీరుఁడు= వీరుడైన అర్జునుడు; యోగవిద్యయును= ప్రతిస్మృతి అనే యోగ విద్యయున్నూ; విల్లును= కోదండమున్నూ; తోడుగన్= తనకు సాయంగా; ఇంద్ర, కీలము+అన్, భూరినగంబు, పైన్= ఇంద్రకీలం అనే పేరున్న గొప్ప కొండపై; పోవఁగన్+పోయినన్= పోవటానికి పోతుండగా; ఉగ్ర+అరి, విభేది!= భయంకరులైన శత్రువులను పరిమార్చేవాడా!; నీవు; పోవకుండుము= వెళ్ళవద్దు; అను= అనే; మహా, మధుర, ధ్వని= గొప్ప తియ్యనైన శబ్దం; వానికిన్= అతడికి; వించెన్= వినిపించింది; బోరనన్= శీఘ్రంగా; అంతరిక్షమునన్= ఆకసంలో; నిరంతర, పుష్ప, వృష్టియున్= ఎడతెగని పూలవానకూడ; పొల్చెన్= వెల్లి విరిసింది.

తాత్పర్యం: వీరుడైన అర్జునుడు గాండీవాన్నీ, ప్రతిస్మృతి అనే యోగవిద్యనూ తనకుతోడు చేసికొని ఇంద్రకీల పర్వతంమీదికి అరుగుతున్నప్పుడు 'భయంకర శత్రువులను పరిమార్చేవాడా! ఆగుము. కదలవద్దు' అనే మధురశబ్దం వినిపించింది. వెంటనే ఆకాశంనుండి అతడిపై పూలవాన కూడ కురిసింది.

వ. దానికి విస్మయం బంది చనువాఁడు ముందట నొక్కవృక్షమూలంబున నున్న వృద్ధబ్రాహ్మణు బ్రహ్మతేజో ౚ ధికు నవిరత యమ నియమ కృశీభూతశరీరుం గని నమస్కరించి, తత్సమీపంబున విశ్రమించియున్న నప్పార్థుం జూచి బ్రాహ్మణుం డిట్లనియె. 288

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దానికిన్= దానికి (అంటే ఆగుమని వినిపించిన ధ్వనికి, పుష్పవృష్టికి); విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; చనువాఁడు= వెళ్ళుతున్నవాడు (అర్జునుడు); ముందటన్= ఎదుట; ఒక్క, వృక్ష, మూలంబునన్= ఒక చెట్టు మొదట; ఉన్న; వృద్ధ, బ్రాహ్మణున్= ముసలిబాపడిని; బ్రహ్మ, తేజస్+అధికున్= జ్ఞానతేజంచేత అధికుడైన వాడిని; అవిరళ, యమ, నియమ, కృశీభూత, శరీరున్+కని= ఎడతెగని యమం, నియమం పాటించటంచేత కృశించిన దేహం కలవాడిని చూచి; నమస్కరించి= మ్రొక్కి; తద్+సమీపంబునన్= ఆతడి చెంత; విశ్రమించి+ఉన్నన్= విశ్రాంతిగైకొంటున్న; ఆ, పార్థున్+చూచి= ఆ అర్జునుడిని చూచి; బ్రాహ్మణుండు+ఇట్లు+అనియెన్= విప్రుడు ఇట్లా పలికాడు.

తాత్పర్యం: అర్జునుడికి ఆశ్చర్యం కలిగింది. అతడికి ముందు ఒక చెట్టుమొదట యమ, నియమ, తపస్సుల వలన చిక్కిన శరీరం కలవాడైనప్పటికిని మహాతేజస్వి అయిన ఒక ముసలి బ్రాహ్మణుని చూచి, మ్రొక్కి, ఆయనప్రక్కన విశ్రాంతి తీసుకొంటున్న ఆ అర్జునుని చూచి, బ్రాహ్మణుడు ఈవిధంగా అన్నాడు.

విశేషం: పతంజలి అష్టాంగయోగంలో 'యమం', 'నియమం' మొదటి రెండు ప్రాథమిక దశలు. యయం:-(1) అహింస (2) సత్యం (3) అస్తేయం (4) బ్రహ్మచర్యం (5) అపరిగ్రహం అనేవి అంగాలు. 281వ పద్యంలోని విశేషాంశాలను అనుశీలించండి.

క. **'ఎందుండి వచ్చి తయ్య? య । నిందితతేజుఁడవు ధర్మనియతుండవు నీ**
కిం దుండ నేల? సిద్ధిం । బొందితి, చేకొను మభీష్టపుణ్యఫలంబుల్. 289

ప్రతిపదార్థం: ఎందు+ఉండి= ఎక్కడనుండి; వచ్చితి(వి)+అయ్య!= వచ్చినావయ్యా!; అనిందిత తేజుఁడవు= నిందించబడని, (ప్రస్తుతించతగిన) తేజం కలవాడివి; ధర్మనియతుండవు= ధర్మంతో కూడిన క్రమశిక్షణ కలవాడివి; నీకు+ఇందు+ఉండన్+ఏల?= నీవు ఇక్కడ ఉండటానికి హేతు వేమి?; సిద్ధిన్+పొందితి(వి)= నీవు కృతకృత్యుడివి; అభీష్ట, పుణ్య, ఫలంబున్= మిక్కిలి ఇష్టాలైన పుణ్యఫలాలను; చేకొనుము= స్వీకరించుము.

తాత్పర్యం: 'ఎక్కడినుంచి నీవు ఇక్కడికి వచ్చావు? నీవు నిష్కళంక తేజస్వివి. ధర్మనియతి కలవాడివి. నీవు ఇక్కడ ఉండట మెందుకు? నీవు కృతకృత్యుడివి. నీకు ఇష్టాలైన పుణ్యఫలాలు స్వీకరించుము.

క. **ఇది శాంతతపస్వుల కా । స్పద; మిందుఁ గృపాణ కవచ బాణాసన సం**
పద దాల్చి యుండ నేటికి? విదిత క్షత్త్రియకులుండవే నీ వనఘా! 290

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; ఇది= ఈ స్థలం; శాంత, తపస్వులకు= వైరాగ్యంతో తపస్సు చేసికొనే ఋషులకు; ఆస్పదము= నెలవు; ఇందున్= ఇక్కడ; కృపాణ, కవచ, బాణ+ఆసన, సంపద= కత్తి, మైతొడుగు, విల్లు వీటి సమృద్ధిని; తాల్చి+ఉండన్+ఏటికి= ఎందుకు ధరించి ఉండాలి; నీవు; విదిత, క్షత్త్రియకులుండవే= ప్రసిద్ధమైన క్షత్రియకులానికి చెందినవాడివా?

తాత్పర్యం: ఇది వైరాగ్యవంతులయిన ఋషులు తపస్సు చేసికొనే ప్రశాంతమైన స్థలం. ఇందు కత్తి, కవచం, ధనుస్సు మున్నగునవి ధరించి ఎందుకున్నావు? అనఘా! నీవు ప్రసిద్ధ క్షత్రియ కులానికి చెందినవాడివా?

వ. **వీత హర్ష క్రోధులైన బ్రాహ్మణులుండెడు పుణ్యనివాసంబున నాయుధంబులు ధరియించి యుండవలవదు; వీని విడువు' మని నిషేధించిన, నవ్విఘ్నవచనంబులకు సంచలింపక యున్న యాతని ధైర్యంబునకు మెచ్చి, సహస్రాక్షుండు నిజరూపంబుఁ జూపి యతని కిట్లనియె. 291**

ప్రతిపదార్థం: వీత, హర్ష, క్రోధులు+ఐన= పోయిన సంతోషం కోపం కలవారైన అంటే సంతోషకోపాలకు అతీతులైన; బ్రాహ్మణులు+ఉండెడు= విప్రులు ఉండే; పుణ్య, నివాసంబునన్= పుణ్యస్థలంలో; ఆయుధంబులు= శస్త్రాలు; ధరియించి ఉండవలవదు= తాల్చి ఉండరాదు; వీనిన్= ఈ ఆయుధాలను; విడువుము+అని= వదలిపెట్టుము అని; నిషేధించినన్= కూడదని ఆజ్ఞాపించగా; ఆ విఘ్నవచనంబులకున్= ఆ అడ్డు మాటలకు; సంచలింపక+ఉన్న= కదలక మెదలక ఉండే; ఆతని ధైర్యంబునకు= ఆతడి సాహసానికి; మెచ్చి; సహస్ర+అక్షుండు= వేయికన్నులు కల ఇంద్రుడు; నిజ, రూపంబున్= తన నిజమైన ఆకారాన్ని; చూపి; అతనికి= ఆ అర్జునుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఈ పుణ్యస్థలంలో సంతోషం, కోపం మున్నగు ఉద్వేగాలు లేని బ్రాహ్మణులు మాత్రమే ఉండటానికి అర్హులు. నీవు ఆయుధాలు ధరించి ఉండకూడదు. వాటిని విసర్జించుము'- అని ఆజ్ఞాపించి నప్పటికిని అర్జునుడు ఏ మాత్రం చలించకపోవటంచేత ఆతని ధైర్యానికి మెచ్చి, ఇంద్రుడు తన నిజరూపాన్ని చూపి ఇట్లా అన్నాడు.

ఆ. 'ఇష్టమైన వరము లిచ్చెదఁ బ్రీతితో । వేఁడు' మనిన నమరవిభున కపుడు
గరము భక్తి మ్రొక్కి కరములు మొగిచి యి । ట్లనియెఁ బురుషవృషభుఁ డర్జునుండు. 292

ప్రతిపదార్థం: ఇష్టము+ఐన, వరములు+ఇచ్చెదన్= నచ్చిన వరాలు నీకు ఇస్తాను; ప్రీతితోన్= సంతోషంతో; వేఁడుము= కోరుకొనుము; అనినన్= అని చెప్పగా; అమరవిభునకు= దేవతల రాజైన దేవేంద్రుడికి; అపుడు, కరము, భక్తిన్, మ్రొక్కి= మిక్కిలి భక్తితో నమస్కరించి; కరములు= మొగిచి= చేతులు మోడ్చి; పురుష, వృషభుఁడు= పురుషశ్రేష్ఠుడు; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీకు ఇష్టమైన వరాలు ఇస్తాను. సంతోషంతో కోరుకొనుము'- అని దేవేంద్రుడు పలుకగా, మిక్కిలి భక్తితో అతడికి నమస్కరించి అర్జునుడు ఈ విధంగా బదులు పలికాడు.

వ. 'దేవా! నా కిష్టంబైన వరంబు భవత్ప్రసాదంబున దివ్యాస్త్రలాభంబ' యనిన 'నది యేమి గహనంబు; దానిన యిచ్చెదఁ; బుణ్యలోకంబులు దేవత్వంబును సర్వకామంబులు వేఁడు' మనిన నర్జునుం డిట్లనియె. 293

ప్రతిపదార్థం: దేవా!= ఓ దేవేంద్రా!; నాకు+ఇష్టంబు+ఐన, వరంబు= నాకు నచ్చిన వరం; భవత్, ప్రసాదంబునన్= నీ దయవలన దివ్య+అస్త్ర, లాభంబు+అ= దేవతా సంబంధాలైన ఆయుధాలను సంపాదించటమే; అనినన్= అని చెప్పగా; అది, ఏమి, గహనంబు= అది ఏమి కష్టసాధ్యమైనది?; దానిన్+అ= దానినే; ఇచ్చెదన్= ఇస్తాను; పుణ్యలోకంబులు= పుణ్యంవలన పొందేలోకాలను; దేవత్వంబును= అమరత్వాన్ని; సర్వకామంబులు= అన్ని కోరికలను; వేఁడుము+అనినన్= కోరుకొనుమని చెప్పగా; అర్జునుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'దేవా! నాకు కావలసింది నీ దయవలన దివ్యాస్త్రసంపాదనం మాత్రమే' అని అర్జునుడు పలుకగా దేవేంద్రుడు 'దాని కేమి? నీవు కోరింది ఇస్తాను, అదేమి కష్టమైనది కాదు. ఇంకా నీవు పుణ్యలోకాలు, అమరత్వం, ఇష్టమైన కోరికల నన్నింటిని కోరుకొనుము' అనగా ఇంద్రుడితో అర్జునుడు ఇట్లా బదులు పలికాడు.

సీ. 'దివిజాధినాథ! నా కవి యెల్ల నేటికిఁ? । బరమాస్త్రలాభంబ కర మభీష్ట;
మరులు సేసిన మహాపరిభవక్లేశంబు । వాపంగ నోపక యేపుటడవి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నురుదుఃఖితుల సహోదరుల నందఱఁ బెట్టి । చనుదెంచి మిన్నక చనిన నన్నుఁ

దగువారు జగములోఁ దెగడరే?' నావుడు । సుతునకుఁ బ్రీతుఁడై శతమఖుండు

ఆ. గరుణ నిట్టులనియెఁ 'బరమాస్త్రలాభంబు । నీకు నిష్టమేని లోకవంద్యు

గరళకంఠు నీశుఁ బరముఁ బ్రసన్నుఁగా । వేగఁ జేయు మధికయోగశక్తి. 294

ప్రతిపదార్థం: దివిజ+అధినాథ!= దేవతలకు అధిపతివైన ఓ దేవేంద్రా!; నాకు; అవి+ఎల్లన్= అవన్నియు; ఏటికిన్= ఎందుకు? పరమ+అస్త్ర, లాభంబు+అ= గొప్పవైన అస్త్రాలను సంపాదించటం మాత్రమే; కరము= మిక్కిలి; అభీష్టము= ఇష్టం; అరులు= శత్రువులు; చేసిన; మహా, పరిభవ, క్లేశంబు= గొప్ప అవమానబాధ; పాపంగన్+ఓపక= తొలగింపజాలక; ఏపు+అడవిన్= దట్టమైన అడవిలో; ఉరు, దుఃఖితులన్= మిక్కుటమైన దుఃఖాన్ని అనుభవించే వారిని; సహోదరులన్= అన్నదమ్ములను; అందఱన్+పెట్టి= అందరిని ఉంచి; చనుదెంచి= వచ్చి; మిన్నక, చనినన్= ఊరకే వెళ్ళితే; నన్నున్; తగువారు= తగినవారు; జగములోన్= లోకంలో; తెగడరే= నిందించరా!; నావుడు= అని చెప్పగా; శతమఖుండు= నూరు యజ్ఞాలుచేసి ఇంద్రుడైనవాడు; సుతునకున్+ప్రీతుఁడు+ఐ= కొడుకుపట్ల సంతోషించినవాడై; కరుణన్= దయతో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికాడు; పరమ+అస్త్రలాభంబు= గొప్ప అస్త్రాలను సంపాదించటం; నీకున్+ఇష్టము+ఏని= నీకు ఇష్టమయితే; అధిక, యోగ, శక్తిన్= మిక్కుటమైన యోగమహిమచేత; లోకవంద్యున్= లోకంచేత నమస్కరించదగిన; గరళకంఠున్= గరళం కంఠంలో కలవాడిని; ఈశున్= శివుడిని; పరమున్= అందరు దేవతలకంటె అధికుడైనవాడిని; ప్రసన్నున్+కాన్= నీపట్ల అనుగ్రహం కలవాడినిగా; వేగన్+చేయుము= శీఘ్రంగా చేసేది.

తాత్పర్యం: 'ఓదేవేంద్రా! నాకు ఆ పుణ్యలోకాలు, అమరత్వం మున్నగునవి ఎందుకు? నాకు కావలసింది పరమాస్త్రలాభం. శత్రువులు చేసిన పరాభవబాధచేత మ్రగ్గుతున్న అన్నదమ్ములను కారడవిలో దిగబెట్టి నేను ఊరక వెళ్ళితే తెలిసినవారు నన్ను నిందించరా?' అని అనగా- అర్జునుడి మాటలకు సంతోషించి దేవేంద్రుడు 'నీకు పరమాస్త్రలాభమే కావాలంటే లోకవంద్యుడైన పరమేశ్వరుడిని ఆరాధించుము. అతిశయించిన యోగశక్తిచేత అతడిని ప్రసన్నుడిగా చేసికొనుము.'

వ. అట్లేని నిఖిల లోకపాల సహితుండై యీశ్వరుండు నీ యభిమతం బొనరించు' నని సహస్రలోచనుండు లోచనాగోచరుం డైన, నర్జునుండును దద్వచనంబున సమాహితచిత్తుండై హిమశైలశిఖరంబున కరిగి వివిధ కుసుమ ఫల వృక్షంబులను విమల నిర్ఝర జలంబులను గమల కుముద కల్హార కలహంస సంకుల పంకజాకరంబులను రమ్యంబైన తపోవనంబునందుఁ బరమేశ్వరు నుద్దేశించి తపంబు సేయందొడంగిన. 295

ప్రతిపదార్థం: అట్లు+ఏని= అట్లయితే; నిఖిల, లోకపాల, సహితుండు+ఐ= అందరు దిక్పాలకులతో కూడినవాడై; ఈశ్వరుండు= శివుడు; నీ+అభిమతంబు= నీకోరిక; ఒనరించున్= ఈడేర్చుతాడు; అని= అనిచెప్పి; సహస్రలోచనుండు= వేయి కన్నులు కలవాడు- ఇంద్రుడు; లోచన+అగోచరుండు+ఐనన్= కన్నులకు కనిపించనివాడు కాగా (అదృశ్యుడు కాగా); అర్జునుండును; తద్+వచనంబునన్= ఆతడి మాటచేత; సమాహిత, చిత్తుండు+ఐ= ఏకాగ్రతతో కూడిన మనస్సు కలవాడై; హిమ, శైల, శిఖరంబునకు= మంచుకొండ కొనకు; అరిగి= వెళ్ళి; వివిధ, కుసుమ, ఫల, వృక్షంబులను= పెక్కు పూలు పూసే చెట్లతో, పెక్కు పండ్లు కాసే చెట్లతో; విమల, నిర్ఝర జలంబులను= నిర్మలాలైన సెలయేటి నీళ్ళతో; కమల, కుముద, కల్హార, కలహంస, సంకుల, పంకజాకరంబులను= పద్మాలు, కలువలు, ఇంచుక తెలుపు ఎరుపు కల కలువలు, ధూమ్రవర్ణాలైన కాళ్ళు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముక్కుకల రాజహంసలు మిక్కుటంగా ఉండేసరస్సులతో (పంకజ+ఆకరంబు= పద్మాలకు స్థానం అయింది, సరస్సు); రమ్యంబు+ఐన= అందమైన; తపస్+వనంబునందున్= తపస్సు చేసికొనే అడవిలో; పరమ+ఈశ్వరున్= పరమశివుడిని; ఉద్దేశించి= ధ్యేయంగా పెట్టుకొని; తపంబు= తపస్సు; చేయన్+తొడంగినన్= చేయటానికి మొదలుపెట్టగా.

తాత్పర్యం: ఆ విధంగాచేస్తే సకల దిక్పాలకులతోకూడినవాడై శివుడు, నీ కోరిక ఈడేర్చుతాడు'- అని చెప్పి దేవేంద్రుడు అదృశ్యుడయ్యాడు. అర్జునుడు దేవేంద్రుడు చెప్పినట్లు ఏకాగ్రత చెందిన మనస్సు కలవాడై హిమాలయ పర్వతశిఖరాలపైకి వెళ్ళి, అక్కడ ఫలవృక్షాల మధ్య, పూలచెట్ల మధ్య, సెలయేళ్ళ మధ్య, రాజహంసలతో, కలువలతో వివిధపద్మాలతో విలసిల్లే సరస్సుల మధ్య గల తపోవనంలో పరమేశ్వరుడినిగురించి తపస్సు చేయటం మొదలు పెట్టగా-

క. సురదుందుభి నాదంబులు । సురపాదప సంభవ ప్రసూన సుగంధో
త్కర వాసిత పవనము వి । స్తరిల్లె నాతనికి హృదయసమ్మద మెసఁగన్. 296

ప్రతిపదార్థం: సుర, దుందుభి, నాదంబులు= దేవతలు మ్రోగించిన భేరీ రవాలు; సుర, పాదప, సంభవ, ప్రసూన, సుగంధ+ఉత్కర, వాసిత, పవనము= దేవలోకంలోని చెట్లనుండి పుట్టిన పూలయొక్క గొప్పపరిమళంతో ఒప్పుతున్న గాలి- అంటే కల్పవృక్షాలనుండి పూచిన పువ్వుల సువాసనతో నిండిన గాలి; ఆతనికి= అర్జునుడికి; హృదయ, సమ్మదము+ఎసఁగన్= గుండె సంతోషంతో నిండేటట్లు; విస్తరిల్లెన్= వ్యాపించింది.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడి హృదయం సంతోషంతో నిండారేటట్లుగా దేవదుందుభులు మ్రోగాయి. కల్పవృక్షాల పువ్వుల సువాసనతో గుబులుకొనిన గాలి వ్యాపించింది.

వ. అందు మనోవాక్కాయ కర్మ నియతుండై పరమేశ్వరుం దనచిత్తంబున నిలిపి, నిరంతర త్రిరాత్రోపవాసంబుల నొక్క మాసంబుఁ జలిపి, ద్విగుణిత త్రిరాత్రోపవాసంబుల రెండవ మాసంబుఁ జలిపి, పక్షోపవాసంబుల మూఁడవ మాసంబు సలిపి, యూర్ధ్వబాహుండై యేకపాదాంగుష్ఠాగ్రంబున నిలిచి, వాయుభోజనంబు సేయుచు నాలవ మాసంబు సలిపి, యిట్లతిఘోరతపంబు సేయుచున్న యర్జునుం జూచి యందలి ఋషులు విస్మయం బంది యీశ్వరుపాలికిం జని యిట్లనిరి. 297

ప్రతిపదార్థం: అందున్= ఆ తపోవనంలో; మనస్+వాక్+కాయ కర్మ, నియతుండు+ఐ= మనస్సు, మాట, శారీరక క్రియలను క్రమశిక్షణకు లోబడేటట్లు చేసినవాడై అంటే త్రికరణశుద్ధి కలవాడై; పరమేశ్వరున్= పరమశివుడిని; తన, చిత్తంబునన్, నిలిపి= తన మనస్సులో పాదుకొల్పి; నిరంతర, త్రిరాత్ర+ఉపవాసంబులన్= ఎడతెగకుండ మూడు రాత్రులు ఆహారాన్ని ఉజ్జగించిన స్థితిలో; ఒక్క, మాసంబున్+చలిపి= ఒక్క నెల గడిపి; ద్విగుణిత, త్రి, రాత్ర+ఉపవాసంబుల= రెట్టింపు చేయబడిన మూడు (ఆరు) రాత్రుల నిరాహార దీక్షపూని; రెండవ, మాసంబున్; చలిపి; పక్ష+ఉపవాసంబులన్= పదైదు దినాల నిరాహారదీక్షతో; మూఁడవ, మాసంబు; చలిపి= మూడవ నెల గడిపి; ఊర్ధ్వ బాహుండు+ఐ= ఎత్తిన చేతులు కలవాడై; ఏక, పాద+అంగుష్ఠ+ అగ్రంబునన్= ఒక పాదంయొక్క బొటనవ్రేలికొసపై మాత్రమే; నిలిచి= (దేహం యొక్క బరువునంతను మోపి) నిలబడి; వాయు భోజనంబు+చేయుచు= గాలిని మాత్రమే ఆహారంగా తీసికొంటూ; నాలవ, మాసంబు, చలిపి= నాల్గవనెల గడిపి; ఇట్లు= ఈ విధంగా; అతి, ఘోర, తపంబు, చేయుచున్న= మిక్కిలి కఠినమైన తపస్సు చేస్తున్న; అర్జునున్+చూచి= అర్జునుడిని చూచి; అందలి= ఆ తపోవనంలోని; ఋషులు= మునులు; విస్మయంబు+అంది= ఆశ్చర్యం పొంది; ఈశ్వరు పాలికిన్+చని= శివుడికడ కేగి; ఇట్లు= ఈ విధంగా; అనిరి= పలికారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అర్జునుడు ఆ తపోవనంలో పరమేశ్వరుడిని గురించి త్రికరణ శుద్ధితో ఘోరతపస్సు చేశాడు. మొదటి నెల నిరంతర త్రిరాత్రోపవాసాలు చేశాడు. రెండవ నెల త్రిరాత్రోపవాసాలు రెట్టింపు చేశాడు. మూడవ నెల పక్షోపవాసంతో గడిపాడు. ఊర్ధ్వబాహుడై ఒక కాలి బొటనవ్రేలిపైననే నిలిచి, గాలిని మాత్రమే ఆహారంగా చేసికొని నాల్గవ నెల గడిపాడు. ఇట్లా మిక్కిలి కఠినతపస్సు చేస్తున్న అర్జునుడిని చూచి ఆ వనంలోని ఋషులు ఆశ్చర్యం పొంది పరమశివుడి దగ్గరకు వెళ్ళి ఇట్లా అన్నారు.

ఉ. 'భూరిబలుండు పాండవుఁ డపూర్వతపం బొనరించుటం దదీ
యోరుతపఃప్రభావ దహనోత్థిత ధూమచయంబు లంబుదా
కారములై వనాంతరము గప్పె జగత్త్రయనాథ! తత్తపో
భారము సర్వజీవుల కపారభయావహ మద్భుతం బిలన్. 298

ప్రతిపదార్థం: జగత్+త్రయ, నాథ!= మూడు లోకాలకు ప్రభువైన ఓ పరమేశ్వరా!; భూరిబలుండు= గొప్ప బలం కలవాడు; పాండవుఁడు= అర్జునుడు; అపూర్వతపంబు+ఒనరించుటన్= ఇంతకుముం దెవరున్నూ చేయని తపస్సు చేయటంచేత; ఇలన్= ఈ భూమిపై; తదీయ+ఉరు, తపః+ప్రభావ, దహన+ఉత్థిత, ధూమ, చయంబులు= ఆతడియొక్క గొప్పదైన తపంయొక్క మహిమ అనే అగ్ని నుండి పైకెగసిన పొగల సముదాయాలు; అంబుద+ఆకారములు+ఐ= మబ్బుల రూపాన్ని పొంది (అంబుద= నీటిని ఇచ్చేది, మేఘం); వన+అంతరము= అడవి మధ్య భాగాన్ని; కప్పెన్= కప్పివేశాయి; తద్+తపస్+ భారము =ఆతని తపస్సుయొక్క బరువు (విశేషం); సర్వజీవులకు= అన్నిప్రాణులకు; అద్భుతంబు= అచ్చెరువు గొలిపేటటువంటిది; అపార, భయ+ఆవహము= మితిలేని భయాన్ని కలిగించేటటువంటిది.

తాత్పర్యం: 'మూడులోకాలకు ప్రభువైన ఓ పరమేశ్వరా! అర్జునుడు గొప్ప బలం కలవాడై, ఇంతకు ముం దెవ్వరున్నూ చేయనట్టి గొప్పతపస్సు చేస్తున్నాడు. ఆతడి తపఃప్రభావం అనే అగ్నినుండి క్రమ్మిన పొగలు దట్టమైన మబ్బులవలె అడవి నంతటినీ క్రమ్ముకొన్నాయి. ఆతడి తపోభారం సర్వప్రాణులకు అంతు లేని ఆశ్చర్యాన్ని, మితిలేని భీతిని కల్గిస్తున్నది.

వ. ఆతని యభిమతంబుఁబ్రసాదించి తత్తపోభారంబు వారింపు' మనిన, వారల పలుకులు విని పరమేశ్వరుండు దరహసితవదనుం డగుచు, 'వాని యభిప్రాయం బే నెఱుంగుదు; నిష్టవర ప్రసాదంబున వానికి మనః ప్రియంబుఁ జేసెద; మీరు మీ యాశ్రమంబుల కరిగి సుఖంబుండుం' డని యప్పుడు. 299

ప్రతిపదార్థం: ఆతని+అభిమతంబున్+ప్రసాదించి= ఆ అర్జునుడియొక్క కోరికను దయతో ఒసగి; తద్+తపస్+భారంబు= ఆ తపస్సువలన కలిగిన బరువును; వారింపుము= తొలగించుము; అనినన్= అని చెప్పగా; వారల= ఆ మునుల; పలుకులు= మాటలు; విని= ఆలకించి; పరమ+ఈశ్వరుండు= పరమశివుడు; దర, హసిత, వదనుండు+అగుచు= చిరునవ్వుతో కూడిన ముఖం కలవాడవుతూ; వాని+అభిప్రాయంబు= ఆతడి అభిప్రాయాన్ని; ఏన్= నేను; ఎఱుంగుదున్= తెలియుదును; ఇష్ట, వర, ప్రసాదంబునన్= అతడికి నచ్చిన కోరికలు ఇవ్వటం చేత; వానికి= ఆ అర్జునుడికి; మనస్+ప్రియంబున్= మనస్సుకు సంతోషాన్ని; చేసెదన్= కలిగిస్తాను; మీరు; మీ, ఆశ్రమంబులకు= మీ ఆశ్రమాలకు (ఆశ్రమమంటే తపస్సు చేసికొనటానికై ఋషులు ప్రత్యేకంగా అడవులలో ఏర్పాటు చేసికొన్న వసతి); అరిగి= వెళ్ళి; సుఖంబు+ఉండుండు+అని= సుఖంగా జీవించండి అని చెప్పి; అప్పుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'అర్జునుడి కోరికను అనుగ్రహించి అతడి తపోభారాన్ని నివారించండి' అని ఋషులు పరమశివుడిని ప్రార్థించారు. పరమేశ్వరుడు చిరునవ్వుతో కూడిన మొగం కలవాడై ఆ మునులతో 'నాకు అర్జునుడి అభిప్రాయం తెలుసు. ఆతడు కోరిన వరాలు ఇచ్చి ఆతడికి సంతోషం కలిగిస్తాను. మీరు మీమీ ఆశ్రమాలకు వెళ్ళి సుఖంగా ఉండండి' అని చెప్పి, అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: సనాతన సంస్కృతిలో మానవజీవితం 1. బ్రహ్మచర్యం 2. గార్హస్థ్యం 3. వానప్రస్థం 4. సన్న్యాసం- అని నాలుగు ఆశ్రమాలుగా విభజించబడింది. గృహం కూడా వాచ్యార్థంలో ఆశ్రమమే. రూఢ్యర్థంలో ఆశ్రమం అంటే వ్రతదీక్ష, నియమ పరిపాలన, పవిత్రత మున్నగు భావాలను సంతరించుకొనటంచేత మునులు అడవిలో ప్రత్యేకంగా నిర్మించుకొన్న ఆవాసాలకు (ఆశ్రమం) పదమైనది.

ఈశ్వరుఁడు కిరాతవేషంబున నర్జునునొద్ద వచ్చుట (సం. 3-40-2)

సీ. **కాంచనవర్ణాపఘనుఁడై మహోన్నత। కార్ముకహస్తుఁడై కాలకంఠుఁ**
డెఱుకురాజయ్యెఁ; నద్రీంద్రతనూజయు। వనచరీభావంబు వఱలఁ దాల్చెఁ;
గుఱుచచేతులు మిడిగ్రుడ్లును గడుకొన్న। తఱటులు మఱి చెంచుఁదలలు నమర
దడవిండ్లు చేపట్టి తడయక యెఱుకులై। యార్చుచు భూతమ్ము లాత్మ సతుల

ఆ. **నెఱుకుసతులఁ గావించి యయ్యెఱుకు రాజు। ముందటం బక్కియల నొక్క మొగిన నిలిచి;**
రంత వేఁటనెపంబున నంధకారి। గదలెఁ దద్వన మెల్లఁ గ్రక్కదలుచుండ. **300**

ప్రతిపదార్థం: కాంచన వర్ణ+అపఘనుఁడు+ఐ= బంగారురంగుతో కూడిన దేహం కలవాడై; మహా+ఉన్నత, కార్ముక, హస్తుఁడు +ఐ= మిక్కిలి ఎత్తైన విల్లు చేబూనినవాడై; కాలకంఠుఁడు= నల్లని కంఠం కల శివుడు; ఎఱుకు, రాజు+అయ్యెన్= కిరాత ప్రభువు అయ్యాడు; అద్రి+ఇంద్ర, తనూజయు= పార్వతియు (గొప్ప కొండ అయిన హిమవంతుడి కూతురు); వనచరీభావంబు= అడవిలో ఉండే స్త్రీ భావాన్ని అంటే ఆటవిక స్త్రీ భూమికను; వఱలన్= ఒప్పేటట్లుగా; తాల్చెన్= ధరించింది; కుఱుచ చేతులు= పొట్టిచేతులు; మిడిగ్రుడ్లును= ఉబ్బెత్తుగా కానవచ్చే కనుపాపలు; కడుకొన్న తఱటులు= అతిశయించిన మొరకుదనాలు; చెంచు+తలలున్+అమరన్= అడవులలో నివసించే చెంచువారి కుండే శిరస్సులు ఏర్పడగా; తడ, విండ్లు, చేపట్టి= 'తడ' అనే చెట్టుకర్రతో తయారైన విండ్లు చేత పట్టుకొని; తడయక= ఎడచేయక; ఎఱుకులు+ఐ= కిరాతులై; ఆర్చుచు= రొదచేస్తూ; భూతమ్ములు= శివుడి అనుచరవర్గమైన భూతగణాలు; ఆత్మ సతులన్= తమ భార్యలను; ఎఱుకు, సతులన్, కావించి= చెంచెతలుగా మార్చి; ఆ, ఎఱుకు, రాజు, ముందటన్= ఆ కిరాత ప్రభువు ముందు; పక్కియలన్= ఇటు అటు ఇరుప్రక్కల; ఒక్క, మొగిన్+అ, నిలిచిరి= వరుసగా నిలిచారు; అంతన్; వేఁట, నెపంబునన్= వేటాడే మిషతో; తద్, వనము+ఎల్లన్= ఆ అడవి అంతయు; క్రక్కదలుచుండన్= అధికంగా కదలుతుండగా; (కదలు+కదలు= క్రక్కదలు); అంధక+అరి= అంధకుడి శత్రువైన శివుడు; కదలెన్= బయలుదేరాడు.

తాత్పర్యం: ఆపాదమస్తకం బంగారుమేనిచాయతో ఒప్పారువాడై, పెద్దవిల్లు చేతబట్టినవాడై పరమశివుడు ఎఱుకల ఱేడుగా మారాడు. పార్వతీదేవి చెంచెత అయింది. భూతగణాలు అరుస్తూ కురుచ చేతులు, మిడిగ్రుడ్లు, మొరటు రూపాలతో తడ విండ్లు దాల్చి చెంచులయ్యారు; వాళ్ళ భార్యలను చెంచెతలుగా మార్చారు. ఆ పరివారం శివుడి ఎదుట, ప్రక్కల నిలిచారు. అప్పుడు ఆ అడవి అంతా అదిరేటట్లుగా శివుడు వేటకై బయలుదేరాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: "మఱి చెంచుఁదనము లమర" - అనే పాఠాంతరం వావిళ్ల ప్రతిలో ఉన్నది. 'తడ' అనేది అడవుల్లో ఉండే ఒకానొకచెట్టు, ఆటవికులు దీని కఱ్ఱను విండ్లు చేయటానికి ఉపయోగిస్తారు. ఇందువల్లనే దీనికి 'ధనుర్వృక్షము', 'ధన్వము'- అనే నామధేయాలు ఏర్పడ్డాయి.

చ. అలబల మంది యందుల మృగావలియున్ విహగంబులున్ భయా
కులగతిఁ బొంది మూఁగలును గుంటులుఁ జీఁకులునైన యట్టు లై,
యులియక, యున్నచో నడఁగి యుండఁ, గిరాతబలంబుతోడఁ బిం
గలనయనుం డుమేశ్వరుఁడు గవ్వడి డాయఁగ వచ్చెఁ జెచ్చెరన్. 301

ప్రతిపదార్థం: అలబలము+అంది= కలకలంపొంది; అందుల= అడవిలోని; మృగ+ఆవలియున్= జంతువుల గుంపులును; విహగంబులున్= పక్షులును; భయ+ఆకుల, గతిన్+పొంది= భీతిచేత చెదరిన స్థితి కలిగి; మూఁగలును= పెదవులు కదపలేనివి; కుంటులున్= పరుగెత్త లేనట్టివి; చీఁకులున్= గుడ్డివి; ఐన+అట్టులు+ఐ= అయినట్లుయి; ఉలియక= రొదచేయక; ఉన్నచోన్+అడఁగి, ఉండన్= ఉన్నచోటన్ అణకువతో ఉండగా; కిరాత, బలంబుతోడన్= ఆటవిక సేనతో; పింగళ, నయనుండు= అగ్నిని నేత్రంగా కలవాడైన శివుడు; చెరన్+చెరన్= వేగంగా; కవ్వడి= అర్జునుడిని (కవ, వడి అంటే జంటవడులు కలవాడు అంటే సవ్యసాచి - రెండు చేతులతో బాణప్రయోగం చేయగలవాడు); డాయఁగ, వచ్చెన్= సమీపానికి వచ్చాడు.

తాత్పర్యం: ఆ అడవిలోని జంతువులు, పక్షులు భయంతో ఆకులపాటు పొందినవై, మూగలుగా, కుంటులుగా, గ్రుడ్డివిగా అయిపోయినట్లు ఉన్నచోటుల్లోనే కదలక మెదలక అణగి ఉన్నాయి. ఆరీతిగా పరమేశ్వరుడు ఆటవిక సేనతో గూడి అర్జునుడిని సమీపించటానికై వేగంగా వచ్చాడు.

విశేషం: ఈ పద్యంలో శివుడికి పర్యాయపదంగా 'పింగళ నయనుండు' అనిన్నీ, అర్జునుడికి 'కవ్వడి' అనిన్నీ ప్రయోగించటంలోని స్వారస్యం సహృదయులు గుర్తించగలరు.

వ. అంత నీశ్వరచోదితుండై మూకుండను దైత్యుండు సూకరంబై భీకరాకారంబున బీభత్సు వధియింప సమకట్టి పయిం బఱతెంచిన. 302

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; ఈశ్వరచోదితుండు+ఐ= శివుడిచేత ప్రేరేపించ బడినవాడై; మూకుండు+అను, దైత్యుండు= మూకుడు అనే పేరుకల రాక్షసుడు; సూకరంబు+ఐ= పంది అయి; భీకర+ఆకారంబున= భయంకరమైన రూపంతో; బీభత్సున్= అర్జునుడిని (రణరంగంలో బీభత్సం కలిగించేవాడిని); వధియింపన్= చంపటానికి; సమకట్టి= పూని; పయిన్+పఱతెంచిన= మీదికి ఉరుకుతూ రాగా.

తాత్పర్యం: అంత, మూకుడు అనే రాక్షసుడు ఈశ్వరుడిచేత ప్రేరేపించబడినవాడై భయంకరమైన పందిరూపం తాల్చి అర్జునుడిని చంపటానికి ఉద్యమించి అతడిపైకి పరుగెత్తుతూ రాగా.

క. అనఘుండు దాని దవ్వులఁ । గని ఘనుఁ డయి పాండవుండు గాండీవ గుణ
ధ్వని సేయుచు డాసినఁ బె । ల్చన యేయఁ గడంగి నిలిచె సంరంభమునన్. 303

ప్రతిపదార్థం: అనఘుండు= పాపరహితు డయిన అర్జునుడు; దానిన్= ఆ పందిని; దవ్వులన్+కని= దూరంనుండి చూచి; ఘనుఁడు+అయి= గొప్పవాడయి; పాండవుండు= పాండురాజుకొడుకైన అర్జునుడు; గాండీవ, గుణ, ధ్వని, చేయుచున్= గాండీవం అనే వింటియొక్క అల్లెత్రాటిని ధ్వనింపచేస్తూ; డాసినన్= పంది దగ్గరకు వస్తే; పెల్చన= కోపంతో; ఏయన్+కడంగి= బాణాలను ప్రయోగించటానికి ఉద్యుక్తుడై; సంరంభమునన్= ఉద్వేగంతో; నిలిచెన్= నిలిచాడు.

తాత్పర్యం: ఆ పందిని అర్జునుడు దూరంనుండే చూచి గాండీవంయొక్క అల్లెత్రాటిని మ్రోగిస్తూ, ఆ పంది తన సమీపానికి వస్తే బాణప్రయోగం చేయటానికి సంసిద్ధుడై ఉద్వేగంతో నిలబడ్డాడు.

వ. అదియు నా క్షణంబ యేసిన యమ్మునుంబోలె నతివేగంబున నాసన్నం బయిన 'దాని నేయ కేయకు' మని యెఱుకురాజు వారించినను వాని వచనం బాదరింపక. 304

ప్రతిపదార్థం: అదియున్= ఆ పందియు; ఆక్షణంబు+అ= ఆక్షణంలోనే; ఏసిన+అమ్మునున్+పోలెన్= ప్రయోగించిన బాణంవలె; అతి వేగంబునన్= మిక్కుటమైన వేగంతో; ఆసన్నంబు+అయినన్= దగ్గరకు రాగా; దానిన్= దానిని; ఏయకు+ఏయకుము= కొట్టకు, కొట్టకు; అని; ఎఱుకు రాజు= కిరాతరాజు; వారించినను= అడ్డు చెప్పినను; వాని, వచనంబు= ఆ కిరాతుడి మాట; ఆదరింపక= సరకుగొనక (లెక్కచేయక).

తాత్పర్యం: ఆ పంది ఆ క్షణంలోనే ప్రయోగించిన బాణంవలె మిక్కిలి వేగంగా తనను సమీపించగా ఎరుకురాజు వారిస్తున్నప్పటికీ అర్జునుడు లెక్క పెట్టకుండ

విశేషం: అలం: ఉపమ.

**చ. పటువిశిఖంబునం బ్రిదశపాలతనూజుఁడు పంది నేసె; ము
న్నట పరమేశ్వరుండును రయంబున దానిన యేసె; నిట్టు లొ
క్కొటఁ బడియెన్ హరార్జునుల ఘోరశరంబులు పందిపైఁ గుభృ
త్తటముపయిన్ వడిం బడు నుదగ్రమహాశనులట్ల మ్రోయుచున్. 305**

ప్రతిపదార్థం: పటు విశిఖంబునన్= తీవ్రమైన బాణంతో; త్రిదశ, పాల, తనూజుఁడు= దేవతలను పాలించే ఇంద్రుడి కొడుకు, అర్జునుడు; పందిన్+ఏసె= పందిని బాణంతో కొట్టాడు; మున్ను+అట= అంతకుముందే అట; పరమేశ్వరుండును= పరమ శివుడును; రయంబున= వేగంతో; దానిన్+అ= ఆపందినే; ఏసెన్= బాణంతో కొట్టాడు; ఇట్టులు= ఈవిధంగా; హర+అర్జునుల= శివుడియొక్క, అర్జునుడియొక్క; ఘోర, శరంబులు= మిక్కిలి భయంకరమైన బాణాలు; పందిపైన్= పందిపై; కు, భృత్= భూమిని మోసేకొండయొక్క; తటముపయిన్= పార్శ్వంపై; వడిన్= వేగంగా; పడు= పడే; ఉదగ్ర, మహా+అశనులు+అట్లు= ఘోరమైన గొప్ప పిడుగులవలె; మ్రోయుచున్= ధ్వనిచేస్తూ; ఒక్కొటన్, పడియెన్= ఒకేసారి పడ్డాయి.

తాత్పర్యం: ఇంద్రసుతుడు మిక్కిలి తీవ్రమైన బాణంతో పందిని కొట్టాడు. అట్లే పరమశివుడుకూడ వేగంగా పందిని బాణంతో కొట్టాడు. ఘోరమైన ఆ రెండు బాణాలున్నూ కొండగట్టుపై పడే గొప్ప పిడుగులవలె మ్రోగుతూ ఆ పందిని ఒకేసారి తాకాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ పద్యం చంపకమాలావృత్తం. తెలుగులో వృత్తరచనలో నన్నయమహాకవి తరువాతికవులకు ఒరవడి తీర్చిదిద్దాడు. ఇందలి అలంకారం ఉపమ.

క. హరుశరమును నరుశరమును। సరి నిరుపక్కియలు దాఁకి జవ మఱి శరసం
భరమునఁ దిరిగె వరాహము। శరనిధి మథనమునఁ దిరుగు శైలము పోలెన్. 306

ప్రతిపదార్థం: వరాహము= పంది; హరు, శరమును= శివుడి బాణమున్నూ; నరు శరమును= అర్జునుడి బాణమున్నూ; సరిన్=సూటిగా; ఇరుపక్కియలు= రెండు ప్రక్కల; తాఁకి= గ్రుచ్చుకొని; జవము+అఱి= బలం (వేగం) తగ్గి; శర, సంభరమునన్= బాణం గ్రుచ్చుకొనటంచేత ఏర్పడిన భారంచేత; శరనిధి, మథనమునన్= సముద్రాన్ని మథించేటప్పుడు; తిరుగు, శైలము+అ, పోలెన్= తిరిగే కొండవలె; తిరిగెన్= గిరగిర తిరిగింది.

తాత్పర్యం: శివుడు ప్రయోగించిన బాణమున్నూ, అర్జునుడు వేసిన అమ్మున్నూ ఏకకాలంలో ఇరువైపుల ఆ పందిని తాకాయి. రెండు ప్రక్కల నాటుకొన్న ఆ రెండు బాణాల భారంవల్ల ఆ వరాహం శక్తి నశించి, క్షీరసాగరమథనసమయంలో తిరిగిన మందరపర్వతంవలె గిరగిర తిరిగింది.

విశేషం: అలం: ఉపమ. వరాహం ఉపమేయం. మందరపర్వతం ఉపమానం. ఇందలి రకారం యొక్క ఆవృత్తి వరాహం గిరగిర తిరిగినతీరును కన్నుల గట్టినట్లు చూపుతోంది.

వ. ఇట్లిద్దఱచేత శరవిద్ధుండై మూకదైత్యుండు సూకరరూపంబు విడిచి నిజరూపంబుతోడ నదృశ్యుండయ్యెఁనంత నర్జునుండు విస్మితుండై ముందట నత్యున్నతచాపధరు మేరుశిఖరాకారు నపార కిరాత పదాతి సమేతు నభినవ యౌవనవనచరీసహస్ర పరివృతు నొక్కపురుషుం గని 'నీ వెవ్వండవు? మనుష్యగోచరంబు గాని యివ్వనంబునఁ బ్రియవనితానుగతుండ వయి యేల క్రుమ్మరియెదు? మఱి నా యేసిన మృగంబు నేసి మృగయాధర్మవిరోధం బేల చేసితి? నిన్ను నిప్పుడ నా నిశితబాణజాలంబుల పాలు సేసెద' ననిన నగుచు నాతనికి నయ్యేటుకురా జిట్లనియె. 307

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఇద్దఱచేత= ఇరువురిచేత (అంటే శివుడిచేత, అర్జునుడి చేత); శర విద్ధుండు+ఐ= బాణాలచేత కొట్టబడిన వాడై; మూక దైత్యుండు= మూకుడు అనే రాక్షసుడు; సూకర రూపంబు, విడిచి= పంది ఆకృతిని విడిచి; నిజ, రూపంబు తోడన్= తన అసలు ఆకారంతో; అదృశ్యుండు+అయ్యెన్= మాయమయ్యాడు; అంతన్; అర్జునుండు; విస్మితుండు+ఐ= అచ్చెరువు పొందిన వాడై; ముందటన్= ఎదుట; అతి+ఉన్నత, చాపధరున్= మిక్కిలి ఎత్తైన విల్లు ధరించిన వాడిని; మేరు, శిఖర+ఆకారున్= మేరు పర్వత శిఖరం వంటి రూపం కలవాడిని; అపార, కిరాత, పదాతి, సమేతున్= మితిలేనట్టి ఆటవిక భటులతో కూడినవాడిని; అభినవ, యౌవన, వనచరీ, సహస్ర, పరివృతున్= వేలకొలది ఆటవిక లైన లేజవరాండ్రచేత చుట్టుకొనబడి ఉన్నవాడిని; ఒక్క, పురుషున్, కని= ఒక మగవాడిని చూచి; నీవు+ఎవ్వండవు= నీవు ఎవడివి?; మనుష్య, గోచరంబు, కాని= మనుషులు కనిపించని (మనుషులు రాలేని), ఈ+వనంబునన్= ఈ అడవిలో; ప్రియ, వనితా+అనుగతుండవు+అయి= ప్రియమైన ఆడవారిచే అనుసరించబడినవాడివై; ఏల= ఎందుకు; క్రుమ్మరియెదు= తిరుగాడుతున్నావు; మఱి; అంతేకాక; నా+ఏసిన= నేను బాణంతో కొట్టిన; మృగంబున్+ఏసి= జంతువును బాణంతో కొట్టి; మృగయా, ధర్మ, విరోధంబు= వేటలోని సంప్రదాయానికి వ్యతిరేకం; ఏల+చేసితి= ఎందుకు చేశావు; నిన్నున్= నిన్ను; ఇప్పుడు+అ= ఈ సమయంలోనే; నా, నిశిత, బాణ, జాలంబుల= నావాడి అయిన అమ్ముల సముదాయాల; పాలు+చేసెదన్= బారిని పడేటట్లు చేస్తాను; అనినన్= అని పలుకగా; నగుచున్= నవ్వుతూ; ఆతనికిన్= ఆ అర్జునుడికి; ఆ+ఎటుకు, రాజు= ఆ ఆటవికుల ప్రభువు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ విధంగా ఇరువురి బాణాలు గుచ్చుకోగా, మూకుడనేరాక్షసుడు పంది ఆకారాన్ని విడిచి నిజరూపం ధరించి మాయమయ్యాడు. అర్జునుడు ఆశ్చర్యపోయాడు. అంత అర్జునుడి ఎదుట పెద్దవిల్లు చేతపూనిన ఎరుకురాజు వచ్చి నిలబడ్డాడు. అతడిచుట్టూ ఆటవిక స్త్రీలు. లేజవరాండ్రు వేలకొలది నిలిచి ఉన్నారు. అతడు మేరుశిఖరం వలె మితిలేని ఆటవిక భటులమధ్య గంభీరంగా నిలిచాడు. అర్జునుడు అతడితో 'నీవు ఎవడవు? మనుష్యులు కానరాని ఈ కారడవిలో ప్రేయసీబృందంతో కూడి ఎందుకు తిరుగాడుతున్నావు? నేను బాణంతో కొట్టిన జంతువునే నీవుకూడ ఎందుకు నీ బాణంతో కొట్టావు? ఇది వేటలో పాటించే ధర్మానికి వ్యతిరేకం కదా! ఇప్పుడే నిన్ను నా వాడిబాణాల పాలు చేస్తాను' అని పలికాడు. ఆ ఎరుకురాజు చిరునవ్వుతో ఇట్లా బదులు పలికాడు.

ఆ. 'ఏను నా మృగంబు నేసితి; నది మదీ! యాస్త్ర నిహతమయ్యె; నవికలముగఁ
జనునె నీకు లేని శౌర్యసంపదఁ జెప్పి । కొనఁగ మదము మిగిలి గుజనునట్లు. 308

ప్రతిపదార్థం: ఏనున్= నేను; ఆ+మృగంబున్+ఏసితిన్= ఆ జంతువును బాణంతో కొట్టాను; అది= ఆ పంది; మదీయ+అస్త్ర; నిహతము+అయ్యెన్= నా యొక్క మంత్రబాణంచేత చంపబడింది; అ+వికలముగన్= కలతలేకుండ; నీకు, లేని, శౌర్య, సంపదన్= నీకు లేని పరాక్రమ విభవం; మదము, మిగిలి= కొవ్వెక్కి; కు, జనున్+అట్లు= చెడ్డ మనుజుడి వలె; చెప్పికొనఁ గన్= ప్రకటించుకోవటం; చనునె= సరిపోతుందా?

తాత్పర్యం: 'ఆ పందిని బాణంతో కొట్టింది నేను. అది నా దెబ్బకు చనిపోయింది. నీవు మదించి, నీచుడివలె, సిగ్గులేకుండ, నీకు లేని పరాక్రమవిభవం ఉన్నట్లు చాటుకొనటం తగునా?

క. పలుకుల నొప్పదు, బీరము । గలవేని రణంబు సేయఁ గడఁగుము, నీ దో
ర్బల మిప్పుడ యుడిపెద' నని । తలరక యేయుచుఁ బినాకి తాఁకెఁ గిరీటిన్. 309

ప్రతిపదార్థం: పలుకులన్= మాటలలో మాత్రమే; ఒప్పదు= సరిపోదు; బీరము+కలవు+ఏని= శౌర్యం కలవాడివైతే; రణంబు+చేయన్+కడఁగుము= యుద్ధం చేయటానికి పూనుకొమ్ము; నీ, దోస్+బలము= నీ భుజశక్తి; ఇప్పుడు+అ= ఇప్పుడే; ఉడిపెదను= మాపుచేస్తాను; అని= అని పలికి; తలరక= చలించక; ఏయుచున్= బాణాలు ప్రయోగిస్తూ; పినాకి= పినాక మనే విల్లు కలవాడు (శివుడు); కిరీటిన్= అర్జునుడిని; తాఁకెన్= డీకొన్నాడు.

తాత్పర్యం: పరాక్రమ దర్పం చూపవలసింది మాటలతో కాదు. నీకు పౌరుషం ఉంటే యుద్ధం చేయటానికి పూనుకొమ్ము. నీ భుజ శక్తిని ఇప్పుడే మాపుచేస్తాను'- అని బాణాలు వేస్తూ పినాకపాణి అయిన పరమశివుడు అర్జునుడితో యుద్ధానికి తలపడ్డాడు.

వ. అంత. 310

తాత్పర్యం: అప్పుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. ప్రతిబలదర్పభంజనుఁడు పార్థుఁడు దారుణబాణవర్ష ము
న్నతి నతివీరుఁడై కురిసినం, బరముండు మహాంబువృష్టిఁ బ
ర్వతము గ్రహించునట్లు బలవంతుఁడు దాని గ్రహించి పోర న
క్షతతనుఁ డయ్యెఁ; వాని నతిగర్వితుఁ బార్థుఁడు సూచి యాత్మలోన్. 311

ప్రతిపదార్థం: ప్రతిబల, దర్ప, భంజనుఁడు= శత్రువుల బలాన్ని, అహంకారాన్ని భంగపరచేవాడు; పార్థుఁడు= అర్జునుడు; ఉన్నతిన్= గొప్పతనంతో; అతివీరుఁడు+ఐ= వీరాధివీరుడై; దారుణ, బాణ, వర్షము= భయంకరమైన బాణాలవాన; కురిసినన్= కురియించగా; పరముండు= శివుడు; బలవంతుఁడు= బలం కలవాడు; మహా+అంబు, వృష్టిన్= గొప్పవానను (నీటి జల్లులను); పర్వతము= కొండ; గ్రహించునట్లు= స్వీకరించునట్లు; దానిన్= ఆ బాణవర్షాన్ని; గ్రహించి= స్వీకరించి; పోరన్= యుద్ధంలో; అక్షత, తనుఁడు+అయ్యెన్= మొక్కవోని దేహం కలవా డయ్యాడు; అతి, గర్వితున్= మిక్కిలి పొగరుకలవాడిని; వానిన్= ఆ ఎరుకలరేడును; పార్థుఁడు= అర్జునుడు; చూచి; ఆత్మలోన్= తన మనస్సులో.

తాత్పర్యం: శత్రువుల అహంకారాన్ని నిర్మూలించే అర్జునుడు బాణాల వానజల్లును ఘోరంగా కురియించాడు. కాని బలవంతుడగు పరమశివుడు, వర్షానికి చలించని కొండవలె ఆ బాణవర్షానికి, చలించక ఉండి, గాయంలేని కాయంతో నిలిచాడు. అప్పుడు ఆ పొగరుబోతు ఎరుకలరేడును చూచి అర్జునుడు తన మనస్సులో ఇట్లా యోచించాడు.

విశేషం: అలం: రూపకం, ఉపమ.

చ. 'ఇతఁడు సురేంద్రుఁడొండెఁ, బరమేశ్వరుఁడొండె, ధనేశుఁడొండెఁ గా
కతులబలప్రభావయుతుఁ డన్యుఁడు గాఁ, డొరుఁడైన మద్భుజా
వితత ధనుర్విముక్త శరవేగము పోర సహించి యిట్టు ల
క్షతుఁడు నమూర్ఛితుండు నయి కంపముఁ బొందక యుండ నేర్చునే. 312

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ ఎరుకలరేడు; సురేంద్రుఁడు+ఒండెన్= దేవేంద్రుడు కాని; పరమ+ఈశ్వరుఁడు+ఒండెన్= పరమ శివుడు కాని; ధన+ఈశుఁడు+ఒండెన్= ధనపతి అయిన కుబేరుడు కాని; కాక= కాకుండ; అతుల, ప్రభావ, యుతుఁడు= సాటిలేని మహిమతో కూడిన వాడు; అన్యుఁడు= మరి వేరేవాడు; కాఁడు; ఒరుఁడు+ఐన= ఇంకొకడే అయితే; మత్, భుజా+వితత, ధనుస్+విముక్త+శర, వేగము= నాదైన భుజబలంచేత విస్తృతమైన వింటినుండి విడువబడిన బాణాల వేగాన్ని; పోరన్= యుద్ధంలో; సహించి= ఓర్చి; ఇట్టులు= ఈ విధంగా; అ, క్షతుఁడున్= గాయపడనివాడు; న, మూర్ఛితుండున్+అయి= స్పృహ కోల్పోనివాడున్నూ అయి; కంపమున్+పొందక= చలించక; ఉండనేర్చునే= ఉండగలడా?

తాత్పర్యం: (ఎరుకలరేడును చూచి అర్జునుడు తనమనస్సులో ఇట్లా తర్కించుకొన్నాడు). 'ఇతడు దేవేంద్రుడైనా లేదా పరమ శివుడైనా లేదా కుబేరుడైనా అయ్యుండాలి. అట్లాకాక, ఇతరుడే అయితే నాభుజశక్తిచేత విస్తృతమైన వింటినుండి ప్రయోగించిన బాణాలధాటికి యుద్ధంలో గాయపడక, మూర్ఛనొందక, చలించక ఇంతసేపు ఉండగలడా?

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. నా యేసిన యపార దుర్వార నారాచంబు లవివేకియందుఁ బ్రయుక్తంబు లయిన సుభాషితంబులుంబోలె వీనియందు నిష్ఫలంబు లగుచున్నయవి. 313

ప్రతిపదార్థం: నా+ఏసిన= నేను ప్రయోగించిన; అపార, దుర్వార, నారాచంబులు= లెక్కకు మిక్కిలి అయినట్టివిన్నీ, వారించటానికి సాధ్యం కానట్టివిన్నీ అయిన బాణాలు; అవివేకి యందున్= వివేకంలేనివాడిపట్ల, అంటే విచక్షణశక్తిలేనివాడిపట్ల; ప్రయుక్తంబులు+అయిన= ప్రయోగించబడిన; సుభాషితంబులున్+పోలె= సూక్తుల వలె; వీనియందు= ఈ ఎరుకురాజుపట్ల; నిష్ఫలంబులు= ప్రయోజనం లేనివి; అగుచున్న+అవి= అవుతున్నాయి.

తాత్పర్యం: నేను ప్రయోగించిన బాణాలు అసంఖ్యాకాలు. ఎవ్వరూ ఎదుర్కొనలేనివి. కాని, ఇవి మూర్ఖుడి పట్ల ప్రయోగించబడిన సూక్తుల వలె ప్రయోజనం లేని వవుతున్నాయే!

విశేషం: సుభాషితం అంటే చక్కగా చిక్కగా చెప్పబడిన వాక్యం. 'అల్పాక్షరముల అనల్పార్థరచన' సుభాషితశైలి. లోకానుభవం సుభాషితానికి జీవనాడి. సంస్కృత వాఙ్మయం సుభాషితరచనకు పేరుకెక్కింది. అన్ని భాషలలో గల సామెతలు సుభాషితాలే. సామెతలే కాక, మహానుభావులు, జ్ఞాన వయోవృద్ధులు, తమ అనుభూతిని సూత్రప్రాయంగా మరువలేని మాటలలో మట్టసంగా కుదించి మదించి సుభాషితాలలో అందించగలరు. కావున సంక్షిప్తత సుభాషితానికి అంతరాత్మ అని చెప్పవచ్చును. ఎంతటి సుభాషితమైనా మూర్ఖుడి పట్ల బూడిదలో పోసిన పన్నీరువలె వ్యర్థమవుతుంది. అంటే సుభాషితవక్త ఎంతటి ప్రతిభావంతుడో శ్రోత సయితం అంతటి మేధావి అయి ఉండాలి- అని ఈ పద్యం నొక్కి వక్కాణిస్తున్నది. అలంకారం: ఉపమ.

ఆ. ఎఱుకు నన్ను నుఱక యేసిన శరములు । నెఱఁకులాడి నాకు నిశితదివ్య
విశిఖతతులయట్లు వేదన గావించు । టిది యపూర్వ; మీతఁ డెవ్వఁ డొక్కొ! 314

ప్రతిపదార్థం: ఎఱుకు= ఆటవికుడు; నన్నున్; ఉఱక= లెక్కచేయక; ఏసిన= ప్రయోగించిన; శరములు= బాణాలు; నెఱఁకులు+ఆడి= మర్మాలు భేదించి; నాకు; నిశిత, దివ్య, విశిఖ, తతుల+అట్లు= వాడి అయిన దేవతా సంబంధమైన బాణాల సముదాయాలవలె అంటే దివ్యాస్త్రాల వలె; వేదన= బాధ; కావించుట= కల్గించటం; ఇది= ఈ సంఘటన; అపూర్వము= నే నిదివరకు ఎన్నడూ అనుభవించనట్టిది; ఈతఁడు= ఈ ఎరుకు; ఎవ్వఁడు+ఒక్కొ!= ఎవడోకదా!

తాత్పర్యం: ఈ ఎరుకు నన్ను లెక్కచేయక నాపై ప్రయోగించిన వాడిబాణాలు నామర్మాలను భేదించాయి. ఇవి సాధారణమైనవి కావు. దివ్యాస్త్రాలను పోలి ఉన్నాయి. ఇది నాకు అపూర్వమైన (ఇది వరకు లేని) అనుభూతి. ఈ ఎరుకు ఎవడై ఉండవచ్చును?

వ. ఇప్పర్వతంబు దైవనివాసంబుగావున నితండు కిరాత రూప ప్రచ్ఛన్నుండైన యెయ్యేని యొక్క దివ్యపురుషుండు గావలయు' నని యశనికల్పంబులైన దివ్యశరంబు లయ్యెఱుకుపయి నేసి యర్జునుం డక్షయబాణంబు లైన తన తూణీరమ్ములయం దమ్ములు గానక 'ఖాండవదహనంబునాఁ డగ్నిదేవుఁడు నా కిచ్చిన యక్షయశరధు లిప్పుడు యుగాంతకాల రిక్తంబులైన శరధులుంబోలె నున్నయవి; యిది యేమి యద్భుతంబో' యనుచు నలిగి గాండీవం బెత్తికొని యెఱుకుపయిం బఱచి. 315

ప్రతిపదార్థం: ఈ+పర్వతంబు= ఈ కొండ; దైవ నివాసంబు= దేవతలు నివసించేచోటు; కావునన్= కాబట్టి; ఇతండు= ఈ ఎరుకు; కిరాత, రూప, ప్రచ్ఛన్నుండు+ఐన= ఎరుకు రూపంలో మారువేషం ధరించినవాడు అయిన; ఎయ్యేని+ఒక్క= ఎవడో ఒక; దివ్యపురుషుండు= దేవతలకు సంబంధించినవాడు; కావలయున్= అయి ఉంటాడు; అని= అని ఆలోచించి; అశని, కల్పంబులు+ఐన= పిడుగులవంటివైన; దివ్య, శరంబులు= దేవతా సంబంధాలైన బాణాలను; ఆ+ఎఱుకు, పయిన్= ఆ ఎరుకురేని మీద; ఏసినన్= వేయగా; అర్జునుండు; అక్షయ, బాణంబులు+ఐన= తరుగని అమ్ములు ఉండే; తన తూణీరమ్ములయందు= తన అమ్ముల పొదులలో; అమ్ములు కానక= బాణాలు కనిపించక; ఖాండవ, దహనంబు, నాఁడు= ఖాండవ మనే పేరున్న వనాన్ని తగుల బెట్టిన సమయంలో; అగ్నిదేవుఁడు; నాకు; ఇచ్చిన; అక్షయ, శరధులు= తరుగని అమ్ముల పొదులు; ఇప్పుడు= ఈ సమయంలో; యుగ+అంత, కాలరిక్తంబులు+ఐన= యుగాల చివర ఏర్పడే ప్రళయ సమయంలో శూన్యాలైన; శరధులున్+పోలెన్= సముద్రాల వలె; ఉన్న+అవి= ఉన్నాయి; ఇది, ఏమి+అద్భుతంబో= ఇది ఎంతటి అచ్చెరువు కొలిపే సంఘటనో; అనుచున్= అని తలుస్తూ; అలిగి= కోపగించి; గాండీవంబు+ఎత్తికొని= గాండీవ మనే వింటిని చేతితో ఎత్తిపట్టుకొని; ఎఱుకుపయిన్+పఱచి= కిరాతుడిపైకి పరుగెత్తి.

తాత్పర్యం: ఈ కొండపై దేవతలు నివసిస్తున్నారుకదా! ఈ ఎరుకు మారువేషంలో ఇక్కడికి వచ్చిన ఏ దివ్యపురుషుడో అయ్యుండాలి' అని తలపోసి, అర్జునుడు అతడిపై పిడుగులవంటి అస్త్రాలను ప్రయోగించాడు. ఖాండవ దహనంవేళ అగ్నిదేవుడు తనకు బహూకరించిన అక్షయతూణీరాలు, ప్రళయకాలంలో ఎండిన సముద్రాలవలె శరవిహీనాలు అయ్యాయి. 'ఇది ఏమి అద్భుతమో!' అని అర్జునుడు తలపోసి ఆగ్రహంతో తనగాండీవాన్నే ఎత్తుకొని ఆ కిరాతుడిపైకి ఉరికాడు.

విశేషం: ఇచట 'శరధి' శబ్దాన్ని శ్లేషార్థంలో నన్నయ మహాకవి ప్రయోగించాడు. శరం= బాణం, నీరు. అక్షయ తూణీరాలు 'శూన్యశరధులు' అయ్యాయి అంటే బాణ రహితాలయ్యాయని అర్థం. ప్రళయ కాలంలో సముద్రాలు 'శూన్య శరధులు' అవుతాయి, అంటే శరవిహీనాలు, నీరులేనట్టివి అవుతాయి- అని అర్థం. ఇచట శ్లేషానుప్రాణిత ఉపమాలంకారం ఉన్నది. అక్షయ తూణీరాలు ఉపమేయం, ప్రళయ కాల సముద్రాలు ఉపమానం, శరశూన్యాలవటం ఉభయాలకు సమానధర్మం.

క. అపహృత గాండీవుఁడు నై। యపరిమిత క్రోధహృదయుఁ డన్నరుఁడు పరం
తపుఁ డెఱుకుమస్తకంబునఁ। గృపాణపాతంబుఁ జేసెఁ గిట్టి కడంకన్. 316

ప్రతిపదార్థం: అపహృత గాండీవుఁడును+ఐ= అపహరించబడిన గాండీవం కలవాడై; అపరిమిత క్రోధ హృదయుఁడు= మితిలేని కోపంతో నిండిన హృదయం కలవాడు; పరంతపుఁడు= శత్రువులను బాధించేవాడు; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; కిట్టి= సమీపించి; కడంకన్= పూనికతో; ఎఱుకు, మస్తకంబునన్= కిరాతుడి శిరస్సుపై; కృపాణ, పాతంబున్+చేసెన్= కత్తి పడేటట్లు చేశాడు అంటే కత్తితో గట్టిగా కొట్టాడు.

తాత్పర్యం: అర్జునుడు గాండీవం ఎత్తి పట్టుకొని కిరాతుడిపైకి విజృంభించాడు కాని అతడి చేతినుండి గాండీవం అదృశ్యమైపోయింది. అప్పుడు అర్జునుడికి మితిమీరిన కోపం వచ్చి కత్తితో ఆ ఎరుకుతలపై కొట్టాడు.

క. అదియు వృథయైనఁ బార్థుఁడు। వదలక వృక్షముల రాల వైచెను రణదు
ర్మదు వనచరు నవి యెల్లం। దదంగముల నడఁగె నద్భుతంబుగ నంతన్. 317

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అదియు= ఆ విధంగా కత్తిని దూసి కిరాతుడి శిరస్సుపై మొత్తటం కూడా; వృథ+ఐనన్= వ్యర్థం కాగా; పార్థుఁడు= అర్జునుడు; వదలక= విడిచి పెట్టక (అంటే పోరుసల్పటం మానక); వృక్షములన్= వృక్షాలతో; రాలన్= రాళ్ళతో; రణ, దుర్మదున్= యుద్ధంలో చెడు గర్వం కల; వనచరున్= ఆటవికుడిపై; వైచెను= విసిరివేశాడు; అవి+ఎల్లన్= ఆ చెట్లు, రాళ్ళు అన్నియున్నూ; అంతన్= అటుమీద; అద్భుతంబుగన్= ఆశ్చర్యకరంగా; తద్+అంగములన్= ఆ ఎరుకు అవయవాలలో; అడఁగెన్= అణగారిపోయాయి.

తాత్పర్యం: తాను విసరిన కత్తి వ్యర్థం కాగా, అర్జునుడు విడువక యుద్ధంలో చెడుగర్వం కల ఎరుకుపై చెట్లు; రాళ్ళు విసిరాడు. అవి కూడ ఆశ్చర్యకరంగా ఆతడి అవయవాలలో అణగారిపోయాయి.

క. హరుఁ బెనఁగి పట్టుకొని భీ। కరబలుఁ డర్జునుఁడు ముష్టిఘాతంబుల సం
గర మొనరించెను; వనచర। వరు లాతని శౌర్యగౌరవముఁ బొగడి రెదన్. 318

ప్రతిపదార్థం: హరున్= శివుడిని; పెనఁగి, పట్టుకొని= కలియబడి పట్టుకొని; భీకరబలుఁడు= భయంకరమైన బలం కలవాడు; అర్జునుఁడు; ముష్టి, ఘాతంబులన్= పిడికిలి పోట్లతో; సంగరము+ఒనరించెను= పోరాటం సలిపాడు; వన, చర, వరులు= ఆటవిక శ్రేష్ఠులు; ఎదన్= తమ హృదయంలో; ఆతని= ఆ అర్జునుడి; శౌర్య గౌరవమున్= పరాక్రమం యొక్క గొప్పతనాన్ని; పొగడిరి= ప్రశంసించారు.

తాత్పర్యం: భయంకరమైన పరాక్రమం కల ఆ అర్జునుడు శివుడితో కలియబడి పట్టుకొని పిడికిటి పోట్లతో యుద్ధం చేశాడు. అర్జునుడి ధైర్యసాహసాలను ఆ వనచరశ్రేష్ఠులు తమ హృదయంలో ప్రశంసించారు.

క. తనదివ్యగాత్రమున న। ర్జును గాత్రనిపీడఁ జేసె శూలధరుం; డం
తన మూర్ఛవోయి పీడిత। తనుఁడై పార్థుండు ధరణితలమునఁ బడియెన్. 319

ప్రతిపదార్థం: శూలధరుండు= త్రిశూలాన్ని ధరించినవాడు- శివుడు; తన, దివ్య గాత్రమునన్= తన దివ్యశరీరంతో; అర్జును, గాత్ర, నిపీడన్+చేసెన్= అర్జునుడియొక్క దేహానికి మిక్కిలి రాపిడి కలిగించాడు; అంతన్+అ= అంతట; పార్థుండు; పీడిత, తనుఁడు+ఐ= బాధించబడిన దేహం కలవాడై; మూర్ఛ+పోయి= స్పృహతప్పి; ధరణి, తలమునన్+పడియెన్= భూమితలంపై పడిపోయాడు.

తాత్పర్యం: శివుడు తన దివ్యదేహంతో అర్జునుడి శరీరానికి గట్టి రాపిడి కలిగించి నొప్పించాడు. అంతట అర్జునుడు ఆ బాధను ఓర్వలేక మూర్ఛపోయి భూమిపై పడిపోయాడు.

వ. అంత. 320

తాత్పర్యం: ఆ తరువాత.

చ. వరదుఁడు పార్థుశౌర్యవిభవంబున కాతని ధైర్యవృత్తికి
న్నరుదుగ మెచ్చి సన్నిహితుఁడయ్యెఁ; జటామకుటేందురేఖయుం
గరమున శూలమున్ గరళకాలగళంబు బృహద్గజాజినాం
బరముఁ దృతీయలోచనముఁ బన్నగహారము నొప్పుచుండఁగన్. 321

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వరదుఁడు= (వరాల నిచ్చేవాడయిన) శివుడు; పార్థు= అర్జునుడియొక్క; శౌర్యవిభవంబునకున్= పరాక్రమ సంపదకు; ఆతని ధైర్యవృత్తికిన్= ఆతడి సాహస ప్రకృతికి; అరుదుగ, మెచ్చి= అసాధారణంగా సంతోషించి; జటా, మకుట+ఇందు, రేఖయున్= కిరీటంవలె దట్టంగా అల్లుకొన్న జడలుగల తలపై చంద్రవంకయున్నూ; కరమునన్= చేతిలో; శూలమున్= త్రిశూలమున్నూ; గరళ, కాల, గళంబు= విషంచేత నల్లనైన గొంతుకయున్నూ; బృహత్+గజ+అజిన+అంబరమున్= పెద్దదైన ఏనుగుతోలుబట్టయున్నూ; తృతీయ, లోచనమున్= మూడవకన్నూ; పన్నగ, హారమున్= పాముదండ; ఒప్పుచుండఁగన్= విలసిల్లుతుండగా; సన్నిహితుఁడు+అయ్యెన్= దగ్గరగా ప్రత్యక్షమయ్యాడు.

తాత్పర్యం: వరదుడైన శివుడు అర్జునుడి ధైర్య సాహసాలకు మెచ్చి కిరీటం వలె జడలు కట్టిన శిరస్సుపై ఉన్న చంద్రవంకతో, చేత త్రిశూలంతో, విషంచేత నల్లనయిన గొంతుకతో, పెద్ద ఏనుగుతోలుబట్టతో, మూడవ కంటితో, పాముదండతో ప్రత్యక్షమయ్యాడు.

వ. ఇట్లు విరూపాక్షుండు నిజరూపంబుతో నర్జునునకు సన్నిహితుండై 'యర్జునా! క్షత్త్రియ లొరు లెవ్వరు నీయట్టి శౌర్య ధైర్యవంతు లెందును లేరు; నీ తపఃక్షాత్త్రగుణంబులకు మెచ్చితి; నీ కోర్కి సఫలంబు సేసెద; దేవాసురమానుషంబైన జగం బంతయు నీవ జయింతు; నా స్వరూపంబు సూడు' మని దివ్యదృష్టి యిచ్చినం జూచి పార్థుండు కృతార్థుండై దండప్రణామంబు సేసి. 322

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; విరూపాక్షుండు= (విరూపమైన కన్నులుకలవాడు) శివుడు (ముక్కంటి); నిజ, రూపంబుతోన్= స్వస్వరూపంతో అంటే అసలు రూపంతో; అర్జునునకు; సన్నిహితుండు+ఐ= ప్రత్యక్షమై (బాగుగా దరిజేరినవాడై); అర్జునా! క్షత్త్రియులు+ఒరులు+ఎవ్వరు= క్షత్రియులలో ఇతరు లెవ్వరున్నూ; నీ+అట్టి, శౌర్య ధైర్యవంతులు+ఎందును, లేరు= నీతో సరిపోలే శౌర్యధైర్యాలు కలవారు ఎవ్వరూ లేరు; నీ, తపస్+క్షాత్ర, గుణంబులకు= నీదైన తపస్సు, క్షాత్రగుణమైన పరాక్రమం అనే లక్షణాలకు; మెచ్చితి= సంతసించాను; నీ కోర్కి= నీవాంఛితం; సఫలంబు+చేసెదన్= నెరవేరేటట్లు చేస్తాను; దేవ+అసుర, మానుషంబు+ఐన= దేవతలకు, రాక్షసులకు, మనుజులకు సంబంధించిన; జగంబు+అంతయున్= జగత్తు అంతయు; నీవు+అ= నీవే; జయింతు= గెలువగలవు; నా, స్వరూపంబు= నా అసలైన ఆకారం; చూడుము; అని= అని చెప్పి; దివ్య, దృష్టి+ఇచ్చినన్= అతిలోకమైన చూపు ప్రసాదించగా; చూచి= చూచి; పార్థుండు= అర్జునుడు; కృతార్థుండు+ఐ= ధన్యుడై; దండప్రణామంబు+చేసి= సాగి (సాష్టాంగంగా) నమస్కరించి.

తాత్పర్యం: పరమశివుడు నిజరూపంతో అర్జునుడికి ప్రత్యక్షమయి 'ఓ అర్జునా! క్షత్రియులలో శౌర్య ధైర్య సాహసాలలో నీకు సాటి అయినవారు ఎవ్వరూ లేరు. నీ తపస్సు, నీ పరాక్రమం అనే లక్షణాలకు నేను సంతసించాను. నీవు కోరిన వరాలు ఇవ్వగలను. దేవతలకు, రాక్షసులకు, మనుజులకు సంబంధించిన జగాన్నంతటిని నీవు జయించగలవు. నా నిజస్వరూపం చూడుము' అని అతనికి దివ్యదృష్టి ప్రసాదించాడు. అర్జునుడు కృతార్థుడై పరమశివుడికి సాగిలి మ్రొక్కాడు.

క. వరదు సురాసురవందితుఁ । గరుణాకరు హరుఁ బినాకకరుఁ గరిచర్మాం
బరు శంకరు గిరిజాసుం । దరు నిట్లని సంస్తుతించెఁ దద్దయు భక్తిన్. 323

ప్రతిపదార్థం: వరదున్= కోరికలు ఈడేర్చేవాడిని; సుర+అసుర, వందితున్= దేవతలచేతను, రాక్షసులచేతను నమస్కరించబడేవాడిని; కరుణా+ఆకరున్= దయామయుడిని; హరున్= శివుడిని; పినాక, కరున్= పినాకమనే విల్లు చేతిలో కలవాడిని;

కరి, చర్మ+అంబరున్= ఏనుగుతోలు బట్టగా కలవాడిని; శంకరున్= మంగళకరుడైన శివుడిని; గిరిజా; సుందరున్= పార్వతీపతిని; (గిరిజ= కొండ కూతురు); ఇట్లు+అని= ఈ విధంగా; తద్దయు= మిక్కుటంగా; భక్తిన్= గౌరవంతో కూడిన ప్రేమతో; సంస్తుతించెన్= మిక్కిలిగా పొగడాడు.

తాత్పర్యం: కోరికలను ఈడేర్చేవాడున్నూ, దేవతలచేత రాక్షసులచేత నమస్కరించబడినవాడున్నూ. దయామయుడున్నూ, పినాకమనే విల్లు చేతిలో కలవాడున్నూ, మంగళకరుడున్నూ, పార్వతీపతియున్నూ అయిన పరమశివుడిని అర్జునుడు అత్యంతభక్తితో ఇట్లా ప్రస్తుతించాడు.

అర్జునుఁడు పరమేశ్వరుని స్తోత్రము సేయుట (సం 3-40-56)

దండకము.

'శ్రీకంఠ, లోకేశ, లోకోద్భవస్థాన సంహారకారీ, పురారీ, మురారి ప్రియా, చంద్రధారీ, మహేంద్రాది బృందార కానంద సందోహ సంధాయి, పుణ్యస్వరూపా, విరూపాక్ష, దక్షాధ్వరధ్వంసకా, దేవ, నీదైన తత్త్వంబు భేదించి బుద్ధిం బ్రధానంబు గర్మంబు విజ్ఞాన మధ్యాత్మయోగంబు సర్వక్రియాకారణం బంచు నానాప్రకారంబులన్ బుద్ధిమంతుల్ విచారించుచున్ నిన్ను భావింతు రీశాన, సర్వేశ్వరా, శర్వ, సర్వజ్ఞ, సర్వాత్మకా, నిర్వికల్ప ప్రభావా, భవానీపతీ, నీవు లోకత్రయీవర్తనంబున్ మహీవాయుఖాత్మాగ్ని సోమార్కతోయంబులం జేసి కావించి సంసార చక్రక్రియా యంత్ర వాహుండవై తాదిదేవా, మహాదేవ, నిత్యంబు నత్యంత యోగస్థితిన్ నిర్మలజ్ఞాన దీప ప్రభాజాల విధ్వస్త నిస్సార సంసార మాయాంధకారుల్ జితక్రోధరాగాదిదోషుల్ యతాత్ముల్ యతీంద్రుల్ భవత్పాద పంకేరుహధ్యాన పీయూష ధారానుభూతిన్ సదా తృప్తులై నిత్యులై రవ్యయా, భవ్య, సేవ్యా, భవా, భర్గ, భట్టారకా, భార్గ వాగస్త్య కుత్సాది నానామునిస్తోత్ర దత్తావధానా, లలాటేక్షణోగ్రాగ్ని భస్మీకృతానంగ, భస్మానులిప్తాంగ, గంగాధరా, నీ ప్రసాదంబునన్ సర్వగీర్వాణ గంధర్వులున్ సిద్ధసాధ్యోరగేంద్రాసురేంద్రాదులున్ శాశ్వతైశ్వర్య సంప్రాప్తులై రీశ్వరా, విశ్వకర్తా, సురాభ్యర్చితా. నాకు నభ్యర్థితంబుల్ ప్రసాదింపు కారుణ్యమూర్తీ! త్రిలోకైక నాథా! నమస్తే నమస్తే నమః'. 324

ప్రతిపదార్థం: శ్రీకంఠ= గరళం(విషం) కంఠంలో కలవాడా!; లోక+ఈశ= లోకాలకు పరిపాలకుడా!; లోక+ఉద్భవ, స్థాన, సంహార, కారీ= లోకాలు పుట్టటం, ఉండటం, లయంకావటం చేసేవాడా!; పుర+అరీ= (మూడు) పురాలకు శత్రువైన వాడా!; ముర+అరి, ప్రియా= మురుడనే రాక్షసుడికి శత్రువైన విష్ణుదేవుడికి ఇష్టమైనవాడా!; చంద్ర, ధారీ= చంద్రుడిని ధరించినవాడా!; మహా+ఇంద్ర+ఆది= మహేంద్రుడు మొదలుగా గల; బృందారక+ఆనంద, సందోహ, సంధాయి= దేవతలకు ఆనందపరంపరను సంధించేవాడా!; పుణ్య స్వరూపా= పుణ్యమే ఆకృతిగా కలవాడా!; విరూప+అక్ష= ఎగుడుదిగుడు కన్నులు కలవాడా!; దక్ష+అధ్వర, ధ్వంసకా= దక్షుడి యజ్ఞాన్ని ధ్వంసం చేసినవాడా!; దేవ= దేవుడా!; నీదు+ఐన, తత్త్వంబు= నీదైన సత్యస్థితి; భేదించి= వింగడించి; బుద్ధిన్= ఆలోచనలో; ప్రధానంబు= మూలమైంది; కర్మంబు= కర్తవ్యం చేయటం; విజ్ఞానము= విశేషమైన ఎరుక; అధ్యాత్మయోగంబు= ఆత్మను గురించిన, ఆత్మకు అతీతమైన దానిని గురించిన సమన్వయం; సర్వ, క్రియా, కారణంబు= అన్ని పనులకు హేతువు; అంచు= అని తలపోస్తూ; నానా, ప్రకారంబులన్= అనేక విధాల; బుద్ధిమంతుల్= మేధావులు; విచారించుచున్= యోచనలు సలుపుతూ; నిన్ను, భావింతురు= నిన్ను ధ్యానం చేస్తారు; ఈశాన= శివా!; సర్వ+ఈశ్వరా= సమస్తాన్ని శాసించేవాడా!; శర్వ= ముక్కంటి!; సర్వజ్ఞ= సమస్తం తెలిసినవాడా!; సర్వ+ఆత్మకా= అన్నిటికి ఆత్మ అయినవాడా!;

నిర్వికల్పప్రభావా= మొక్కవోని మహిమ కలవాడా!; భవానీపతీ= పార్వతీభర్తా!; నీవు; లోక, త్రయీ, వర్తనంబున్= మూడులోకాల నడవడికను; మహీ, వాయు, ఖ+ఆత్మ+అగ్ని, సోమ+అర్క, తోయంబులన్+చేసి= భూమి, గాలి, ఆకాశం, ఆత్మ, నిప్పు, చంద్రుడు, సూర్యుడు, నీళ్లు వీటితో; కావించి= నిర్మించి; సంసార, చక్ర, క్రియా, యంత్ర, వాహుండవు= ప్రపంచం యొక్క చక్రాన్ని (సృష్టి ప్రవర్తనాన్ని) త్రిప్పటంకొరకు యంత్రాన్ని (కీలకాన్ని) ధరించిన వాడివి; ఐతి= అయినవాడివి; ఆది, దేవా= మొదటిదేవుడా!; మహాదేవా= గొప్పదేవుడా!; నిత్యంబున్= ఎల్లప్పుడు; అత్యంత, యోగ స్థితిన్= మిక్కుటమైన యోగంలో ఆరూఢుడవై ఉండటంచేత; నిర్మల, జ్ఞాన, దీప, ప్రభా, జాల, విధ్వస్త, నిస్సార, సంసార, మాయా+అంధకారుల్= స్వచ్ఛమైన ఎరుక అనే జ్యోతియొక్క వెలుగు వెల్లువచేత నాశం చేయబడిన సారంలేని ఐహికమాయ అనే చీకటి కలవారు అంటే స్వచ్ఛమైన జ్ఞానమనే వెలుగుచేత సారరహితమైన సంసార మాయనుండి, చీకటి నుండి వైదొలగినవారు; జిత, క్రోధ, రాగ+ఆది, దోషుల్= జయించబడిన కోపం, ప్రేమ మొదలైన దోషాలు కలవారు, అంటే కోపం, అనురక్తి మున్నగు దోషాలను జయించినవారు; యత+ఆత్ముల్= ఆత్మ నిగ్రహం కలవారు; యతి+ఇంద్రుల్= ముని శ్రేష్ఠులు; భవత్, పాద, పంకేరుహ, ధ్యాన పీయూష ధారా+అనుభూతిన్= నీయొక్క పాద పద్మాలలో నిమగ్నమైన ఆలోచన అనే అమృతం యొక్క ధారను ఎడతెగకుండ క్రోలేవారై- ఆ అనుభవంతో; సదా= ఎల్లప్పుడు; తృప్తులు+ఐ= తనివి చెందినవారై; నిత్యులు+ఐరి= ఎల్లప్పుడు మనగలిగారు; అవ్యయా= నాశరహితుడా!; భవ్యసేవ్యా= పూజింపతగినవారిచేత సేవించ బడేవాడా!; భవా!= అంతా నీవే అయి ఉండేవాడా! భర్గ= శివా!; భట్టారకా= విద్వాంసుడా!; భార్గవ+అగస్త్య, కుత్స, + ఆది, నానాముని, స్తోత్ర, దత్త+అవధానా= భార్గవుడు, అగస్త్యుడు, కుత్సుడు మొదలైన పెక్కుమునులు చేసే స్తోత్రాలలో ఏకాగ్రతతో నిమగ్నమైన మనస్సు కలవాడా!; లలాట+ఈక్షణ+ఉగ్ర+అగ్ని, భస్మీకృత+అనంగ= నుదుటికంటినుండి వెలువడిన భయంకరమైన మంటచేత బూడిదగా చేయబడిన మన్మథుడు కలవాడా! అంటే నుదుటి కంటిమంటచేత మన్మథుడిని బూడిదగా చేసినవాడా!; భస్మ+అనులిప్త+అంగ= బూడిద పూయబడిన దేహం కలవాడా!; గంగా, ధరా= గంగను ధరించినవాడా!; నీ ప్రసాదంబునన్= నీ దయవలన; సర్వ, గీర్వాణ, గంధర్వులున్= అందరు దేవతలు, గంధర్వులును; సిద్ధ, సాధ్య+(ఉరగ+ఇంద్ర=) ఉరగేంద్ర+(అసుర+ఇంద్ర= అసురేంద్ర+ఆదులున్= సిద్ధులు, సాధ్యులు, సర్పశ్రేష్ఠులు, రాక్షసశ్రేష్ఠులు మున్నగు వారును; శాశ్వత+ఐశ్వర్య, సంప్రాప్తులు+ఐరి= ఎల్లప్పుడు నెలకొని ఉండే సంపద పొందినవా రయ్యారు; ఈశ్వరా= పాలకుడా!; విశ్వకర్తా= సృష్టిని నిర్మించినవాడా!; సుర+అభ్యర్చితా= దేవతలచేత ఆరాధించబడినవాడా!; నాకున్; అభ్యర్థితంబుల్= కోరికలు; ప్రసాదింపు= అనుగ్రహించుము; కారుణ్యామూర్తీ= దయ ఆకృతి కొన్నవాడా!; త్రిలోక+ఏక, నాథా= మూడులోకాలకు ఒకే అధిపతి అయినవాడా!; నమః+తే= = నీకు నమస్కారం; నమః+తే= నీకు నమస్కారం; నమః= నమస్కారం.

తాత్పర్యం: 'శ్రీకంఠా! లోకాలకు పాలకుడా! సృష్టి స్థితి లయకారుడా! త్రిపురాలను ధ్వంసం చేసినవాడా! మురుడు అనే రాక్షసుడిని సంహరించిన విష్ణుదేవుడికి ప్రియమైన వాడా! చంద్రవంకను ధరించినవాడా! దేవేంద్రుడు మున్నగు దేవతలకు ఆనందాలను చేకూర్చేవాడా! పుణ్యాలు ఆకృతిగొన్న వాడా! ముక్కంటీ! దక్షుని యజ్ఞాన్ని ధ్వంసం చేసినవాడా! దేవా! మేధావులు నీదైవతత్త్వాన్ని ఆలోచించి, వింగడించి, కర్మం ప్రధానమైనదగు విజ్ఞానం, అధ్యాత్మయోగం సర్వక్రియాకారణమని అనేక విధాల విచారణలు చేస్తూ నిన్ను ధ్యానిస్తారు. సర్వేశ్వరుడవైన శర్వ! సర్వజ్ఞ! సమస్త సృష్టికి ఆత్మవంటివాడా! మొక్కవోని మహిమ కలవాడా! పార్వతీపతీ! నీవు మూడు లోకాల ప్రవర్తనాన్ని - భూమి, గాలి, ఆకాశం, ఆత్మ, అగ్ని, చంద్రుడు, సూర్యుడు, నీళ్లు- ఈ ఎనిమిదింటితో నిర్మించి, ఈ విశ్వసంసార చక్రబంధయంత్రాన్ని ధరించి నడుపుతున్నావు. ఆది దేవుడివి నీవు. మహాదేవుడివి నీవు. నిర్మలమైన జ్ఞానప్రదీప్తి చేత సంసార మాయాంధకారాన్ని నిర్మూలించి, వైరాగ్య సంపన్నులై జితేంద్రియులైన యతీంద్రులు నీ పాదపద్మాలను ధ్యానించటం అనే అమృతాన్ని నిరంతరం క్రోలుతూ సంతృప్తులై, నిత్యులై ఉన్నారు. నాశం లేనివాడా! పూజ్యులచేత

సేవించబడే వాడా! సర్వం నీవే ఐనవాడా! భర్గా! విద్వాంసుడా! భార్గవుడు, అగస్త్యుడు, కుత్సుడు మున్నగు మహర్షులు చేసిన స్తోత్రాలను చెవియొగ్గి వినేవాడా! నుదుటి కంటిమంటచేత మన్మథుడిని బూడిద చేసినవాడా! భస్మం పూయబడిన దేహం కలవాడా! గంగను ధరించిన వాడా! నీ దయవలన గీర్వాణులు, గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు, ఉరగశ్రేష్ఠులు, రాక్షసప్రముఖులు మున్నగువారు ఎడతెగని సంపదలతో వర్ధిల్లినారు. పరిపాలకుడివైనవాడా! విశ్వకర్తా! నా కోరికలు ఈడేర్చుము. ఓ దయామయా! మూడు లోకాలను పాలించే సార్వభౌముడా! సురాభ్యర్చితుడా! నీకు నా నమస్కృతులు.'

విశేషం: ఇది దండకం. తెలుగులో బహుళవ్యాప్తిలో ఉన్న దండక ప్రక్రియ నన్నయనాడే ప్రాచుర్యంలో ఉండటం గమనించదగిన విశేషం. దండకంలో ఈ క్రింది లక్షణాలు అనుశీలించదగినవి. 1. దండకం 'త' గణ ప్రయుక్తం. అంటే రెండు గురువులు ఒక లఘువు త గణమవుతుంది. ఛందస్సులో దండకమంటే 'త' గణ పునరావృత్తి 2. దండకం స్తుతి ప్రధానమైనది. 3. దండకం ఇటు వచనానికి అటు పద్యానికి సాహితీసేతువు వంటిది- అని చెప్పవచ్చును.

వ. అని యిట్లు స్తుతియించి కృతాంజలి యై కిరీటి వెండియు నిట్లనియె. 325

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా పలికి; ఇట్లు= ఈ రీతిగా; స్తుతియించి= పొగడి; కృత+అంజలి+ఐ= చేయబడిన అంజలి కలవాడై అంటే నమస్కరించిన వాడై; కిరీటి= అర్జునుడు; వెండియున్= మరల; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అర్జునుడు ఈ విధంగా పరమేశ్వరుడిని ప్రస్తుతించి మళ్ళీ ఇట్లా పలికాడు.

క. 'ఎఱుకని యెఱుఁగక నీకున్ । మఱకువ నెదిరితిని; దీని మఱువుము; నన్నుం
గఱకంఠా! క్షమియింపుము; । నెఱి నెవ్వరి కెఱుఁగ నగునె నీ చరితంబుల్.' 326

ప్రతిపదార్థం: కఱకంఠా!= నల్లని కంఠం కల పరమశివా!; ఎఱుక+అని= కిరాతుడు అని అనుకొని; ఎఱుఁగక= తెలియక; నీకున్= నిన్ను; మఱకువన్= అజ్ఞానం చొప్పున; ఎదిరితిని= ఎదిరించి పోరాడాను; దీనిన్= దీనిని; మఱువుము= మరచిపొమ్ము; క్షమియింపుము= తప్పు సైరించుము; నీ, చరితంబుల్= నీ ప్రవర్తనలు; నెఱిన్= సంపూర్ణంగా; ఎవ్వరికి+ఎఱుఁగన్+అగునె= ఎవరికైనా తెలియటం సాధ్యమా?

తాత్పర్యం: 'నీవు ఎవరో ఒక ఎఱుకు వని తలపోసి, తెలియక నీతో అజ్ఞానంవలన యుద్ధం చేశాను. నా తప్పు సహించుము. ఓ నీలకంఠా! నీ ప్రవర్తనను ఎవరైనా సంపూర్ణంగా తెలిసికొనగలరా?'

విశేషం: "యెఱుఁగక మిమ్మున్! మఱుకువ మార్కొన్న తప్పు మఱువుఁడు; నన్నుం"- అనే పాఠాంతరం వావిళ్లప్రతిలో ఉన్నది.

వ. అనిన యప్పార్థుం గరుణారస ప్రీతి విస్తారిత విలోకనామృతమ్మున సంతర్పితుం జేసి నగుచు నీశ్వరుండు వాని చేయి పట్టుకొని 'ధనంజయా! నీ చేసిన వ్యతిక్రమంబు క్షమియించితి; నతిమానుషంబైన నీ పరాక్రమంబునకు మెచ్చితిఁ; బూర్వజన్మంబున నీవు నరుండను దేవర్షివి; నారాయణ సఖుండవు; నరనారాయణు లనంగా మీరిద్దఱు బదరీవనంబున ననేకాయుతవర్షంబులు తపంబుఁ జేసిన మహావీర్యవంతులరు; మీ తేజంబున జగంబులు రక్షితంబు లగుచున్నయవి; యిగ్గాండీవమ్ము దొల్లియు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నీయదియ; దీనన చేసి శక్రాభిషేకమ్మునాఁ డసురుల జయించి; తది యిప్పు డక్షయశరధులతోడి మదీయమాయాగ్రస్తంబయ్యె నీగాండీవమ్మును నక్షయశరధులు నీ కిచ్చితిం గొను; మింక నీకిష్టంబైన వరమ్ము వేఁడు మిచ్చెద' ననిన నర్జునుం డిట్లనియె. 327

ప్రతిపదార్థం: అనిన, అప్పార్థున్+ (ఆ+పార్థున్)= అని చెప్పిన ఆ అర్జునుడిని; కరుణా, రస, ప్రీతి, విస్తారిత, విలోకన+ అమృతమ్మునన్= దయ అనే ద్రవంతో తడిసిన సంతోషంతో వ్యాపించిన చూపులు అనే అమృతంతో; సంతర్పితున్+చేసి= తనివి చెందిన వాడినిగా ఒనరించి; నగుచున్= నవ్వుతూ; ఈశ్వరుండు= శివుడు; వాని, చేయి+పట్టుకొని= ఆ అర్జునుడి చేతినిపట్టుకొని; ధనంజయా!= ఓ అర్జునా!; నీ, చేసిన, వ్యతిక్రమంబు= నీవు చేసిన తప్పు; క్షమియించితిన్= మన్నించి సైరించాను; అతి, మానుషంబు+ఐన= మనుజులకు అతీతమైన; నీ, పరాక్రమంబునకున్= నీ శౌర్యానికి; మెచ్చితిన్= సగౌరవంగా సంతోషించాను; పూర్వజన్మంబునన్= పోయిన జన్మలో; నీవు; నరుండు+అను= నరుడనే పేరున్న; దేవర్షివి= (దేవ+ఋషివి) దేవతలలో మునివి; నారాయణ, సఖుండవు= నారాయణుడి చెలికాడివి; నరనారాయణులు+అనంగ= నరుడు నారాయణుడు అనే; మీరు+ఇద్దఱు= మీరిరువురు; బదరీ, వనంబునన్= బదరి అనే పేరుగల అడవిలో; అనేక+అయుత, వర్షంబులు= పెక్కు పదివేల (దీర్ఘ) సంవత్సరాలు; తపంబున్= తపస్సును; చేసిన= చేసినట్టి; మహావీర్యవంతులరు= గొప్పబలం కలవారు; మీ, తేజంబునన్= మీ ప్రభావంవలన; జగంబులు= లోకాలు; రక్షితంబులు+అగుచున్న+అవి= కాపాడబడుతున్నాయి; ఈ+గాండీవమ్ము= ఈ గాండీవ మనే పేరున్న విల్లు; తొల్లియు= లోగడకూడ; నీ+అది+అ= నీదే సుమా!; దీననచేసి= దీనివలన; శక్ర+అభిషేకమ్మునాఁడు= ఇంద్రుడు పట్టాభిషిక్తుడు అయిన దినాన; అసురుల= రాక్షసుల; జయించితి= గెలిచావు; అది; ఇప్పుడు; అక్షయ, శరధులతోడ= తరుగనట్టి అమ్ములపొదులతో; మదీయ, మాయా, గ్రస్తంబు+అయ్యె= నాయొక్క మాయచేత గ్రహింపబడింది అయింది; నీ, గాండీవమ్మునున్; అక్షయ, శరధులు; నీకు+ఇచ్చితిన్= నీకు ఇచ్చాను; కొనుము= స్వీకరించుము; ఇంక= ఇక; నీకు+ఇష్టంబు+ఐన= నీకు కావలసిన; వరంబు= కోరిక; వేఁడుము= కోరుకొనుము; అనినన్= అని శివుడు చెప్పగా; అర్జునుండు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అర్జునుడిపై దయతో కూడిన చూపులనే అమృత రసం ప్రసరింపజేసి అతడిని సంతృప్తి పొందించి, పరమేశ్వరుడు అతని చేయి పట్టుకొని ఇట్లా పలికాడు: 'ఓ ధనంజయా! నీ తప్పు క్షమించాను. లోకాతీతమైన నీ పరాక్రమానికి మెచ్చాను. పూర్వజన్మంలో నీవు నరుడు అనే దేవఋషివి. నారాయణ మహర్షికి ప్రాణ మిత్రుడివి. మీరు ఇరువురు ఎన్నో వేల ఏండ్లు బదరీవనంలో తపస్సు చేసిన మహానుభావులు. మీ ప్రభావంవలన ఈ జగాలు కాపాడబడుతున్నాయి. ఈ గాండీవం పూర్వం కూడా నీదే. దేవేంద్రుడి పట్టాభిషేకసమయంలో నీవు ఈ గాండీవం చేత రాక్షసులను సంహరించావు. ఇప్పుడు నా మాయచేత నీ గాండీవాన్ని, అక్షయతూణీరాలను అదృశ్యం చేశాను. ఇవిగో వాటిని తిరిగి ఇస్తున్నాను. ఇక నీకు ఇష్టమైన వరం కోరుకో, ఇస్తాను' అని పరమశివుడు పలుకగా అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: అర్జునుడికి 'ధనంజయుడు' అనే నామాంతరం రాజసూయయాగానికి ముందు అతడు అనేక రాజులను గెలిచి, కప్పాలు గైకొన్నప్పుడు ఏర్పడింది.

క. 'త్ర్యంబక! నాకు నభీష్ట వ । రంబుఁ బ్రసాదించెదేని రౌద్రము దివ్యా
స్త్రంబనఁ బరఁగిన పాశుప । తంబుఁ బ్రసాదింపు మిందుధర! దయతోడన్. 328

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: త్ర్యంబక!= ఓ ముక్కంటీ!; నాకున్+అభీష్టవరంబున్= నాకు మిక్కిలి ఇష్టమైన వరాన్ని; ప్రసాదించెదు+ఏని= దయచేసి ఇవ్వటానికి పూనుతావేని; రౌద్రము= రుద్రసంబంధమైనది, భయంకరమైనది; దివ్య+అస్త్రంబు+అనన్+పరఁగిన= దేవత్వంతో కూడిన అస్త్రం అనబడిన; పాశుపతంబున్= పాశుపతాన్ని; ఇందుధర!= చంద్రుడిని ధరించినవాడా! దయతోడన్= కృపతో; ప్రసాదింపుము= అనుగ్రహించి ఇమ్ము.

తాత్పర్యం: 'ఓ ముక్కంటీ! ఇందుధరా! నీవు నాకు ఇష్టమైనవరం అనుగ్రహించదలిస్తే అస్త్రాలలో రౌద్రమైన దివ్యాస్త్రంగా చెప్పబడిన పాశుపతాన్ని దయతో ప్రసాదించుము.

వ. ఇదియును బ్రహ్మ శిరంబను నస్త్రంబును యుగాంతకాలంబునందుఁ బ్రయుక్తమ్ములై జగత్సంహారమ్ము సేయు; దీనివలన నభిమంత్రితమ్ములై యనేక శత సహస్ర సంఖ్యల శూలంబులు గదలు నాశీవిషంబుల యట్టి యమ్ములు నుద్భవిల్లునని విందు; నీ కారుణ్యంబున దీనిం బడసి దైత్య దానవ యక్షరాక్షస పిశాచోరగమ్ముల జయింతు; నతివీరులైన భీష్మ ద్రోణాదులను జయింతు; సహజకుండలుండైన కర్ణుని వధియింతు' ననిన నీశ్వరుండుఁ గరుణించి విశుద్ధాత్ముండైన పార్థునకు మంత్రధ్యాన జపహోమ పూర్వకంబుగా సంధాన మోక్షణ సంహార సహితంబుగాఁ బాశుపతాస్త్రం బిచ్చి 'దీనికి నసాధ్యం బెద్దియును లే, దల్పులయందుఁబ్రయుక్తంబైన జగత్సంహారము సేయు. 329

ప్రతిపదార్థం: ఇదియును= ఈ పాశుపతమును; బ్రహ్మశిరంబు+అను+అస్త్రంబును= బ్రహ్మశిరం అనే పేరుగల మంత్రబాణమూ; యుగ+అంత, కాలంబు+అందున్= ప్రళయవేళలో; ప్రయుక్తమ్ములు+ఐ= ప్రయోగించబడినవై; జగత్+సంహారమ్ము+చేయున్= జగత్తునంతటిని లయం చేస్తాయి: దీనివలనన్= ఈ పాశుపతాస్త్రంవలన; అభిమంత్రితమ్ములు + ఐ= మంత్రాలతో సంధింపబడటంచేత గొప్ప మహిమతో కూడుకొన్న; అనేక, శత, సహస్ర, సంఖ్యల= పెక్కువందలు, వేలు సంఖ్యలలో; శూలంబులు= ఈటెలు; గదలున్= గుదియలు; ఆశీవిషంబుల+అట్టి, అమ్ములున్= పాములవంటి బాణాలు; ఉద్భవిల్లున్+అని, విందు= పుట్టుతాయని విన్నాను; నీ, కారుణ్యంబునన్= నీ దయవలన; దీనిన్, పడసి= ఈ పాశుపతాస్త్రాన్ని సంపాదించి; దైత్య, దానవ, యక్ష, రాక్షస, పిశాచ+ఉరగమ్ములన్= దితిసుతులైన రాక్షసులను, దనువుసుతులైన రాక్షసులను, యక్షులను, ఇతర రాక్షసులను, పిశాచాలను, నాగులను; జయింతును= గెలువగలను; (దేవతలలో సిద్ధసాధ్యచారణాదిజాతులు ఉన్నట్లే రాక్షసులలో కూడ దైత్య, దానవ రాక్షసాదులు ఉన్నారని తెలిసికొనాలి); అతి వీరులు+ఐన= వీరాధి వీరులైన; భీష్మ, ద్రోణ+ఆదులను= భీష్ముడు, ద్రోణుడు మున్నగువారిని; జయింతున్= గెలువగలను; సహజకుండలుండు+ఐన= సహజంగా పుట్టుకతోనే చెవులకు గుండ్రని కర్ణభూషణాలు కలిగిఉన్న; కర్ణుని; వధియింతున్= చంపుతాను; అనినన్= అని అనగా; ఈశ్వరుండున్= శివుడును; కరుణించి= దయగలిగి; విశుద్ధ+ఆత్ముండు+ఐన= పరిశుద్ధమైన- అంటే నిర్మలమైన ఆత్మకల; పార్థునకున్= అర్జునుడికి; మంత్ర, ధ్యాన, జప, హోమ, పూర్వకంబుగా= మంత్రాల ఉచ్చారణ, చాంచల్యం లేని ఏకాగ్రచిత్తంతో తలచటం, ఆవృత్తిచేయటం, అగ్నివేల్చటం-ఈ విధానాలతో కూడ; సంధాన, మోక్షణ, సంహార, సహితంబుగాన్= తొడగటం, విడవటం, వెనుకకు మరలించటం సయితంగా; పాశుపత+ అస్త్రంబు+ఇచ్చి= పాశుపత మనే అస్త్రాన్ని ఇచ్చి; దీనికిన్= ఈ పాశుపతాస్త్రానికి; అసాధ్యంబు= సాధించలేనిది; ఎద్దియును, లేదు= ఏదీ లేదు; అల్పులయందున్= అలతివారిపై; ప్రయుక్తంబు+ఐన= వాడబడినట్లయితే; జగత్+సంహారము+చేయున్= ప్రపంచాన్ని అంతటిని నాశనం చేస్తుంది.

తాత్పర్యం: పాశుపతాస్త్రం మరియు బ్రహ్మశిరం అనే అస్త్రం ప్రళయకాలంలో ప్రయోగించబడి జగత్ సంహారం చేస్తాయి. పాశుపతంవలన లక్షల కొలది ఈటెలు, గుదియలు(గదలు), విషసర్పాలవంటి బాణాలు పుట్టుతాయని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విన్నాను. నీ దయవలన ఈ పాశుపతాస్త్రాన్ని పొంది, దైత్య దానవ యక్ష రాక్షస పిశాచ గణాలను, వీరాధివీరులైన భీష్మద్రోణాదులను జయించగలను. సహజ కవచకుండలాలతో పుట్టిన కర్ణుడిని చంపుతాను'- అని ప్రార్థించిన అర్జునుడిని కరుణించి ఈశ్వరుడు అతడికి పాశుపతాస్త్రాన్ని సమంత్రకంగా ప్రయోగ, ఉపసంహారాలు తెలిపి ఇచ్చి, 'ఈ పాశుపతాస్త్రానికి అసాధ్యమైనది ఏదీ లేదు. దీనిని అల్పులపై ప్రయోగిస్తే జగత్తును నాశనం చేస్తుంది.

విశేషం: మహాభారతంలో జగత్సంహారశక్తి గల అస్త్రాలను గురించిన ప్రస్తావన పలుచోట్ల కనిపిస్తున్నది. కేవలం ఇవి ఇతిహాసకర్త ఊహించి కల్పించినవా? అని అధునిక హేతువాదులు ప్రశ్న వేయవచ్చును. ఒక వేళ అవి, రచయిత కల్పించినట్టివే అయితే ఆ రచయిత భావనాబలం అత్యద్భుతం అని ప్రశంసించక తప్పదు. అది విషయాంతరం. అస్త్ర ప్రయోగ విషయంలో ప్రస్తుతప్రకరణంలో నిర్దేశించబడిన అంశాలు (1) మంత్రం (2) ధ్యానం (3) జపం (4) హోమం. ఇందులో జాగరూకతతో అధ్యయనం చేయవలసింది మరొక అంశం ఉన్నది. అస్త్రప్రయోగంలో మూడు అంచెలు ఉన్నాయి. (1) సంధానం (2) మోక్షణం(3) ఉపసంహారం, ప్రళయ సదృశమైన అస్త్రాన్ని సంధానం చేయవచ్చును. దాన్ని ప్రయోగించే కౌశలం (మోక్షణం) వేరు. సరే. సంధాన మోక్షణ కౌశలాలు అబ్బినప్పటికీ, ప్రయోగించిన దాన్ని ఉపసంహరించే శక్తి ఉండాలి. లేకుంటే దానివలన శత్రువులకే కాక, ప్రయోక్తకు, తటస్థజగత్తుకుకూడ అకాల ప్రళయం దాపురించవచ్చు. ఈ హెచ్చరిక-విజ్ఞానశాస్త్రం ఊహించలేని విజయ పరంపరలు సాధిస్తున్న ఈ యుగంవారు సుళువుగా అర్థం చేసికొనగలదిగా ఏనాడో మహాభారతకర్త నొక్కి వక్కాణించటం పేర్కొనతగింది.

ఇక మంత్రధ్యాన జపహోమాలను గురించి గ్రాంథిక జ్ఞానం మాత్రమే పలువురికి ఉన్నది. మంత్రం, జపం, హోమంగురించి కొందరికి ప్రాథమిక పరిజ్ఞానం ఉన్నది. ధ్యానం అష్టాంగాలలో ఒకటి. అష్టాంగాలు: (1) యమం (2) నియమం (3) ఆసనం (4) ప్రాణాయామం (5) ప్రత్యాహారం (6) ధారణ (7) ధ్యానం (8) సమాధి, ఇందులో ధారణా-ధ్యాన-సమాధులు మూడింటిని కలిపి సంయమం అని సమష్టివ్యపదేశం. చిత్తవృత్తిని ఏకాగ్రం చేయటం ధారణ. యోగ సాధన చేసేవారు బహువిషయవ్యగ్రులు కారాదు. వ్యావహారిక జగత్తులో క్రియాశూరులు, సమకాలీన చరిత్రను తీర్చిదిద్దినవారు తమ ధ్యేయాలకు ఏకాగ్రచిత్తంతో అంకితమైనవారే. ఆధ్యాత్మిక సాధనలో చివరిమెట్టు సిద్ధిగా పేర్కొన తగింది సమాధి. ధ్యానం- ఇటు ధారణకు అటు సమాధికి మధ్య వారధి వంటిది. ఇక ధ్యానం అంటే ఏమిటి? మానవ బుద్ధికి అతీతమైన అంశాలు ఎన్నో ఉన్నాయి. జంతువులలో మనస్సు ఉంటుంది. అది ప్రకృతి సిద్ధమైన ప్రజ్ఞ, మానవులలో బుద్ధి ఉన్నది. కాని ఈ బుద్ధి, ఆ బుద్ధికి అనువైన తర్కం ఒక పరిధి దాటి పోలేవు గదా! బుద్ధి-తర్క ప్రజ్ఞ ఎచట ఆగిపోతున్నదో అచటనుండి ఆంతరంగికమైన సమ్యక్స్ఫూర్తి ఆరంభమవుతున్నది. ఈ శక్తి ధ్యానయోగంవలన సిద్ధిస్తున్నది. ధ్యానానికి ముందు తపస్వి గొంగళి పురుగు కావచ్చును. ధ్యానాంతరం సీతాకోక చిలుకగా వెల్వడవచ్చును. ఉపమానాలు అసలు తాత్త్విక దర్శనాన్ని పరిపూర్ణంగా వివరించలేవు కాని, వర్ణనాతీతమైన అనుభూతిని దిఙ్మాత్రంగా సూచించటానికి ఉపకరించవచ్చును. మహాభారతకర్త మంత్రానుసంధానంలో ధ్యానానికి, జప హోమాలతో పాటు ప్రత్యేక ప్రాముఖ్యం కల్పించాడు. అర్థవాద రూపంగా ఎన్నో అంశాలను మహాభారతంలో రచయిత నిక్షేపించాడు. ఇవి భావిపరిశోధకులు తేల్చవలసిన అంశాలు.

క. దీని విధానం బెఱుఁగం । గా నింద్రకుబేర వరుణ కాలాదులకుం
దా నతి గహనం బనినను । మానవులకు నెఱుఁగు టఘటమానము గాదే. 330

ప్రతిపదార్థం: దీని విధానంబు= ఈ పాశుపతాస్త్రంయొక్క క్రమ పద్ధతి; ఎఱుఁగంగాన్= తెలియటానికి; ఇంద్ర, కుబేర, వరుణ, కాల+ఆదులకున్= ఇంద్రుడు, కుబేరుడు, వరుణుడు, యముడు మున్నగువారికి; తాన్= అది; అతి, గహనంబు+అనినను= మిక్కిలి క్లిష్టమైనది అనినప్పుడు; మానవులకున్= మనుజులకు; ఎఱుఁగుట= తెలిసికొనటం; న+ఘటమానము, కాదే= అసాధ్యం కాదా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ పాశుపతాస్త్ర పరిజ్ఞానం, ఇంద్రుడు, కుబేరుడు, వరుణుడు, యముడు మున్నగు వారికే తెలియదు అనినప్పుడు ఇంక మానవమాత్రులు తెలిసికొనటం అసంభవం కదా!

వ. ఈ దివ్యబాణమ్మున నీ వఖిలలోకమ్ములు జయింతు' వని కౌంతేయునకు వరం బిచ్చి పురాంతకుం డంతర్హితుండయ్యె నంత. 331

ప్రతిపదార్థం: ఈ, దివ్య, బాణమ్మునన్= అతిలోకశక్తిగల ఈ అస్త్రం వలన; ఈవు+అఖిలలోకమ్ములు= నీవు సమస్త భువనాలు; జయింతువు= నెగ్గగలవు; అని= అని చెప్పి; కౌంతేయునకు= కుంతికుమారుడైన అర్జునుడికి; వరంబు+ఇచ్చి= వరాన్ని ఇచ్చి; పుర+అంతకుండు= పురాలను నాశనం చేసిన శివుడు; అంతర్హితుండు+అయ్యెన్= మాయమయ్యాడు; అంత= తర్వాత.

తాత్పర్యం: 'ఈ దివ్యాస్త్రం వలన నీవు సమస్త భువనాలు జయిస్తా' వని అర్జునుడికి వరాన్ని ఇచ్చి శివుడు మాయమైన తర్వాత.

చ. అవిరళ సూర్యమండల సహస్ర సమప్రభమై, ధనంజయ
ప్రవరు కరమ్మునన్ వెలుఁగు పాశుపతాస్త్రముఁ జూచి దైత్యదా
నవ సుర యక్ష రాక్షస గణమ్ము గరమ్ము భయమ్ముఁ బొందె; నం
దవనియు దిర్దిరం దిరిగె నబ్ధిశిలోచ్చయసంచయంబుతోన్. 332

ప్రతిపదార్థం: అవిరళ, సూర్య, మండల, సహస్ర, సమ, ప్రభము+ఐ= దట్టమైన సూర్య బింబాలు వేయింటితో సమానమైన వెలుగుకలదై; ధనంజయ ప్రవరు, కరమ్మునన్, వెలుఁగు= శ్రేష్ఠుడైన అర్జునుడి చేతిలో మెరసే; పాశుపత+అస్త్రమున్, చూచి= పాశుపతమనే దివ్యబాణాన్ని చూచి; దైత్య, దానవ, సుర, యక్ష, రాక్షస, గణమ్ము= దితిసుతులు, దానవులు, దేవతలు, యక్షులు, రాక్షసుల సమూహాలు; కరమ్ము= మిక్కిలి; భయమ్మున్+పొందెన్= భీతిని చెందాయి; అందు= అచట; అబ్ధి, శిలా+ఉచ్చయ, సంచయంబుతోన్= సముద్రాలు, కొండల సముదాయంతో; అవనియు= భూమికూడ; దిర్దిరన్= గుండ్రంగా; తిరిగెన్= తిరిగింది.

తాత్పర్యం: అర్జునుడి చేతిలో వేయి సూర్యమండలాల కాంతితో వెలుగొందుతున్న పాశుపతాస్త్రాన్ని చూచి దైత్యులు, దానవులు, దేవతలు, యక్షులు, రాక్షసులు మిక్కిలి భీతి చెందారు. సముద్రాలతో కొండలతో భూమండలం దిర్దిరా తిరిగింది.

క. త్రినయనగాత్రస్పర్శన । మున నిజగాత్రము పవిత్రమును, ముక్తాఘం
బును, నతితేజోవీర్యం । బును నైనఁ బృథాసుతుండు ముదితుం డగుచున్. 333

ప్రతిపదార్థం: త్రినయన, గాత్ర, స్పర్శనమునన్= ముక్కంటి దేహం తాకటంచేత; నిజ, గాత్రము= తన శరీరం; పవిత్రమును= పావనమున్నూ; ముక్త+అఘంబునున్= విడిపోయిన పాపం గలదిన్నీ; అతి, తేజస్+వీర్యంబునున్= మిక్కుటమైన ప్రకాశంతో, బలంతో కూడినట్టిదిన్నీ; ఐనన్= అవటంచేత; పృథాసుతుండు= అర్జునుడు; ముదితుండు+అగుచున్= సంతోషం చెందినవాడవుతూ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ముక్కంటి శరీరాన్ని తాకటంచేత తన శరీరం పావనమై, పాపరహితమై, మిక్కిలి ప్రకాశవంతమై, బలసంపన్న మైనందులకు అర్జునుడు మిగుల సంతోషిస్తూ-

విశేషం: అలం: అంత్యప్రాసం. (త్రినయన శబ్దసాధుత్వాన్ని గురించి పీఠికలో వివరణ చూడండి - సంపా.)

క. మంటి, హరుదేహ మంటం । గంటి; నుమాధీశు నమరకంటకహరు ము
క్కంటిఁ గళకంఠుఁ జూడం । గంటిఁ; గృతార్థుండ నైతిఁ గడుఁ బుణ్యమునన్. 334

ప్రతిపదార్థం: మంటి= (సార్థకమైన జీవితం కలవాడినిగా) బ్రతికాను; హరుదేహము= శివుడి శరీరాన్ని; అంటన్+కంటిన్= ముట్టుకొనగలిగాను; ఉమా+అధీశున్= పార్వతీపతిని; అమర, కంటక, హరున్= దేవతలకు ముళ్ళవంటి వారిని సంహరించేవాడిని; ముక్కంటిన్= మూడు కనుల దేవరను; కళకంఠున్= నల్లని కంఠం కల శివుడిని; చూడన్+కంటిన్= చూడకలిగాను; కడున్, పుణ్యమునన్= గొప్ప పుణ్యంచేత; కృత+అర్థుండను+ఐతి= ధన్యుడి నయ్యాను.

తాత్పర్యం: సార్థకజీవినై బ్రతికాను. పరమశివుడి దేహాన్ని ముట్టుకొనగలిగాను. దేవతలను వేధించే రాక్షసులను సంహరించే ముక్కంటిని, కళకంఠుడిని, ఉమాపతిని చూడగలిగాను. మిక్కుటమైన పుణ్యంవలన చరితార్థుడిని అయ్యాను.

విశేషం: అలం: అంత్యానుప్రాసం, వృత్త్యనుప్రాసం. 'అసురకంటకు హరు' - అనే పాఠాంతరం ఆనందాశ్రమ గ్రంథమాల ప్రతిలో ఉన్నది.

క. ఇమ్ముల ధర్మజునకు జన । సమ్మతునకు రిపుజయంబు సకల మహీ రా
జ్యమ్ము సమకూరె నేఁడు ఘ । నమ్ముగ సర్వప్రయోజనమ్ములతోడన్. 335

ప్రతిపదార్థం: ఇమ్ములు= సంప్రీతిగా; ధర్మజునకున్= ధర్మరాజుకు; జన, సమ్మతునకున్= జనులచేత అంగీకరింపబడేవాడికి; రిపు, జయంబు= శత్రువులపై గెలుపు; సకల, మహీ, రాజ్యమ్ము= సమస్తమైన భూమి ఏలుబడి; నేఁడు= ఇప్పుడు (ఈవేళ); సర్వ, ప్రయోజనమ్ములతోడన్= అన్ని లాభాలతో; ఘనమ్ముగన్= గొప్పగా; సమకూరెన్= ఏర్పడింది.

తాత్పర్యం: ఈ వేళ ధర్మపుత్రుడికి, ప్రజానురంజకుడైనవాడికి, శత్రువులపై గెలుపు లభించింది. సర్వలాభాలతో ఘనంగా భూమండలరాజ్యం సంప్రాప్తించింది.

ఇంద్రుఁడు దేవగణంబులతో నర్జుననకుఁ బ్రత్యక్షం బగుట (సం. 3-42-5)

వ. అని సంతుష్ట హృదయుండై యున్నంత. 336

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా తలపోసి; సంతుష్ట, హృదయుండు+ఐ= తనివి చెందిన హృదయం కలవాడై అంటే సంతృప్తి చెందినవాడై; ఉన్నంతన్= ఉన్నప్పుడు.

తాత్పర్యం: ఆ విధంగా మనస్సులో తలపోసి, తృప్తి చెందిన హృదయం కలవాడై (అర్జునుడు) ఉన్న సమయంలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. హరుచేత సంప్రాప్తవరుఁడయ్యె నరుఁ డని । యెఱిఁగి యింద్రుండు ధనేశ ధర్మ
వరుణాశ్వినులతోడ సురగణ సహితుఁడై । దివ్యవిమానముల్ దివమునందు
వెలుఁగంగఁ గౌరవకులవీరు పాలికి । వరదుఁ డై గరుణతో వచ్చె; నట్టి
యవసరమ్మున ఘనరవగభీరం బైన । మధురవాక్యమున ధర్మప్రభుండు

ఆ. ప్రీతి నిట్టులనియె బీభత్సునకు 'ధర్మ । నిత్య! పాండుపుత్ర! నీకు మెచ్చి
వరము లిచ్చు వేడ్క వచ్చిరి నెయ్యురై । యమరనాథుఁ దొట్టి యమరులెల్ల. 337

ప్రతిపదార్థం: హరుచేత= శివుడిచేత; సంప్రాప్త, వరుఁడు+అయ్యె= లభించిన వరం కలవాడయ్యాడు; నరుఁడు+అని= అర్జునుడని; ఎఱిఁగి= తెలిసికొని; ఇంద్రుండు= ఇంద్రుడు; (ధన+ఈశ) ధనేశ, ధర్మ, వరుణ+ఆశ్వినులతోడ= కుబేరుడు, యముడు, వరుణుడు, ఆశ్వినులతోడ; సురగణ, సహితుఁడు+ఐ= దేవతల సమూహంతో కలిసి; దివ్య, విమానముల్= దైవశక్తి గల విమానాలు; దివమునందు= ఆకాశంలో; వెలుఁగంగన్= ప్రకాశిస్తుండగా; కౌరవ, కుల, వీరు, పాలికిన్= కురువంశంలోని శూరుడి ఒద్దకు; వరదుఁడు+ఐ= వరాలను ఇచ్చేవాడై; కరుణతోఁ= దయతో; వచ్చెన్= అరుదెంచాడు; అట్టి+అవసరమ్మునన్= ఆ సమయంలో; ఘన, రవ, గభీరంబు+ఐన= గొప్ప (లేక మేఘ సదృశమైన) ధ్వనితో లోతైన; మధుర, వాక్యమునన్= తియ్యని పలుకులతో; ధర్మప్రభుండు= యమధర్మరాజు; బీభత్సునకు= అర్జునుడికి; ప్రీతిన్= సంతోషంతో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; ధర్మనిత్య!= ఎల్లప్పుడు ధర్మాన్ని పాటించేవాడా!; పాండుపుత్ర!= పాండురాజు కుమారుడా!; అమర, నాథున్+తొట్టి= దేవేంద్రుడితో మొదలుపెట్టి; అమరులు+ఎల్లన్= దేవతాశ్రేష్ఠులందరు; నీకు; మెచ్చి= మన్నించి; వరములు+ఇచ్చు, వేడ్క= కోరిన కోరికలు ఇచ్చే సంబరంతో; నెయ్యురు+ఐ= మిత్రులై; వచ్చిరి.

తాత్పర్యం: అర్జునుడు పరమశివుడిచే వరాలు సంపాదించినట్లు తెలిసికొని ఇంద్రుడు- కుబేరుడు, యముడు, వరుణుడు, ఆశ్వినులతో, దేవతల సమూహాలతో కలిసి దివ్యవిమానాలు ఆకాశంలో వెలుగొందుతుండగా, కౌరవవంశంలో వీరుడై వెలసిన అర్జునుడి దగ్గరకు దయతో విచ్చేశాడు. ఆ సమయంలో మేఘనిస్వనగంభీరమైన తియ్యని పలుకులతో యమధర్మరాజు అర్జునుడితో ఇట్లా చెప్పాడు. 'ఎల్లప్పుడు ధర్మాన్ని పాటించే ఓ పాండురాజపుత్ర! నిన్ను మెచ్చుకొని, నీకు మిత్రులై దేవేంద్రుడు మున్నగు దేవనాయకులు నీకు వరాలు అనుగ్రహించాలనే అభిమానంతో నీ దగ్గరకు విచ్చేశారు.

వ. వీరలం జూడు' మని దివ్యదృష్టి యిచ్చి 'నీవు నరుండను పూర్వబుుషివి; బ్రహ్మనియోగంబున మనుష్యుండవై యుత్తమ క్షత్త్రియకులంబున నుద్భవిల్లితి; మఱి సూర్యాంశజుండైన కర్ణుని, దేవ దైత్య దానవ గంధర్వ యక్ష రాక్షసాంశజులైన రాజులను వధియింతు; నీ కక్షయకీర్తి యగు' నని దండధరుం డప్రతివారణం బైన దండంబు విధియుక్తంబుగా నిచ్చిన. 338

ప్రతిపదార్థం: వీరలన్+చూడుము+అని= వీరిని చూడు మని చెప్పి; దివ్య, దృష్టి= దేవతలకు సంబంధించిన చూపు; ఇచ్చి= అనుగ్రహించి; నీవు; నరుండు+అను= నరుడు అనే పేరుకల; పూర్వ+బుుషివి= పూర్వకాలానికి సంబంధించిన మునివి; బ్రహ్మ, నియోగంబునన్= బ్రహ్మదేవుడి ఏర్పాటువలన; మనుష్యుండవు+ఐ= మనుజుడవై; ఉత్తమ, క్షత్త్రియ, కులంబునన్= మంచి క్షత్రియ వంశంలో; ఉద్భవిల్లితి= జన్మించావు; మఱి= ఇంక అదనంగా; సూర్య+అంశజుఁడు+ఐన= సూర్యుడియొక్క అంశతో పుట్టిన; కర్ణుని; దేవ, దైత్య, దానవ, గంధర్వ, యక్ష, రాక్షస+అంశజులు+ఐన= దేవతలయొక్క; దితిసుతులయొక్క,

దానవులయొక్క, గంధర్వులయొక్క, యక్షులయొక్క, రాక్షసులయొక్క అంశలతో పుట్టిన; రాజులను= రాజ్యాలను ఏలే ప్రభువులను; వధియింతు= సంహరిస్తావు; నీకు+అక్షయ, కీర్తి+అగును+అని= నీకు తరుగని యశస్సు కలుగుతుందని చెప్పి; దండధరుండు= యమధర్మరాజు (దండం అనే ఆయుధం ధరించినవాడు); అప్రతివారణంబు+ఐన= తిరుగులేనట్టి (శత్రువులచేత నివారించటానికి వీలుపడని); దండంబు= దండమనే ఆయుధాన్ని; విధి, యుక్తంబుగాన్= శాస్త్రాలు నిర్దేశించిన సూత్రాలకు సరిపడేటట్లు; ఇచ్చినన్= ఇవ్వగా.

తాత్పర్యం: వీరినిచూడుము అని యమధర్మరాజు అర్జునుడికి దివ్యదృష్టిని అనుగ్రహించాడు. 'నీవు పూర్వకాలంలో నరుడు అనే ఋషివి. బ్రహ్మదేవుడి ఆదేశంతో మనుజజన్మ ఎత్తి ఉత్తమక్షత్రియవంశంలో ఉద్భవించావు. తదుపరి సూర్యుడి అంశతో పుట్టిన కర్ణుడిని, మఱి, దేవ దైత్య దానవ గంధర్వ యక్ష రాక్షసుల అంశలతో పుట్టిన రాజులను సంహరించగలవు. నీకు తరుగని పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి' అని చెప్పి యమధర్మరాజు తన ఆయుధమైన దండాన్ని అర్జునుడికి శాస్త్రోక్తపద్ధతిలో ఇచ్చాడు.

విశేషం: 'దేవదైత్య దానవ గంధర్వ యక్ష రాక్షసులు' అనే ప్రయోగం నన్నయ పలుతావుల చేశాడు. దేవతలలో, రాక్షసులలో పెక్కు తెగలు కలవు. వీరు అందరు ఆయా తెగలకు సంబంధించినవారు. గంధర్వులు సంగీతకోవిదులు. యక్షులు మాయాదక్షులు. రాక్షసులలో కొందరు కామరూపులు. వీరి అంశలు పంచుకొని భూలోకంలో మానవులు పుట్టుతారని మహాభారత కథనం. మానవులలో అతిలోకమైన ప్రజ్ఞలతో పుట్టేవారు కొందరు కనిపిస్తారు. అట్టివారి ప్రజ్ఞకు కారణం వారు ఆయా దివ్య రాక్షసాంశలతో ఉద్భవించటమే అని మహాభారతంలో చెప్పబడింది. కొందరి అభిప్రాయంలో ఇది ఉత్ప్రేక్ష. మరికొందరి కిది విశ్వాసం.

దివ్యదృష్టి : దేవతలు చర్మచక్షువులకు కనిపించరు. వారిని చూడటానికి అప్రాకృతమైన దివ్యదృష్టి ఉండాలి. కాబట్టి అర్జునుడికి యముడు దివ్యదృష్టిని అనుగ్రహించాడు అని చెప్పబడింది.

ఉ. ఘోరారిదారుణము లగు । వారుణపాశంబు లిచ్చె వరుణుఁడు, మఱి కౌ
బేరాస్త్ర మిచ్చె నపుడు కు । బేరుఁడు విజయునకు నహితభేదికిఁ బ్రీతిన్. 339

ప్రతిపదార్థం: ఘోర+అరి, దారుణములు+అగు= భయంకరులయిన శత్రువుల పాలిటి ఉపద్రవకరాలయిన; వారుణ, పాశంబులు= వరుణుడి ఆయుధాలైన పాశాలు (ఉరిత్రాళ్ళు); వరుణుఁడు= వరుణదేవుడు; ఇచ్చెన్= ఇచ్చాడు; మఱి= అటుపిదప; విజయునకున్= అర్జునుడికి; అహిత భేదికిన్= శత్రువులను భేదించేవాడికి; కుబేరుఁడు= కుబేరదేవుడు; అపుడు= అప్పుడు; కౌబేర+అస్త్రము= కుబేరుడి ఆయుధమైన కౌబేర మనే అస్త్రాన్ని; ప్రీతిన్= సంతోషంతో; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: వరుణుడు అర్జునుడికి, శత్రువులకు భయంకరాలైన వారుణపాశాలను అనుగ్రహించాడు. అనంతరం కుబేరుడు శత్రుసంహారకుడైన అర్జునుడికి ప్రేమతో కౌబేరాస్త్రాన్ని ఇచ్చాడు.

వ. ఇట్లు దివ్యపురుషుండైన పార్థుండు లబ్ధదివ్యదృష్టియై యమర్త్యరూపధరులైన పితృదేవతలతోడం దనముందట నిలిచిన మహానీలవర్ణుండైన వైవస్వతుని, వైడూర్యవర్ణుండై యర్ణవ నదీ శైల సేవితుడైన వరుణేశ్వరుం, జాంబూనద వర్ణుండై యక్ష రాక్షస గణంబుతో నున్న కుబేరునిం జూచి, వారివలన దివ్యాస్త్రంబులు వడసి వాక్పుష్ప ఫల జలంబుల నందఱం దృప్తులం జేసి వెండియు. 340

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దివ్య, పురుషుండు+ఐన= దివ్యత్వం కల మనుజుడయిన; పార్థుండు= అర్జునుడు; లబ్ధ, దివ్య, దృష్టి+ఐ= పొందిన దివ్యదృష్టి కలవాడై; న+మర్త్య, రూపధరులు+ఐన= దేవతల (చావులేనట్టి) రూపాలు ధరించినవారైన; పితృ, దేవతలతోడన్= మరణించిన పిమ్మట దేవతలైన వారితోడ; తన, ముందటన్= తన ఎదుట; నిలిచిన= నిలబడిన; మహా, నీల, వర్ణుండు+ఐన= మిక్కిలి నల్లనిరంగుకలవాడైన; వైవస్వతునిన్= యమధర్మరాజును; వైడూర్య వర్ణుండు+ఐ= వైడూర్య రత్నం వంటి రంగు (ఇంచుక తెలుపు ఇంచుక పసుపు కలిసిన రంగు) కలవాడై; అర్ణవ, నదీ, శైల, సేవితుండు+ఐన= సముద్రాలు, నదులు, కొండలచేత సేవించబడినవాడైన; వరుణ+ఈశ్వరున్= వరుణదేవుడిని; జాంబూనద వర్ణుండు+ఐ= బంగారు రంగు కలిగినవాడై; యక్ష, రాక్షస, గణంబులతోన్+ఉన్న= యక్షులు, రాక్షసుల సముదాయంతో ఉన్న; కుబేరునిన్+చూచి= కుబేరుడిని చూచి; వారివలన= ఆయాదేవుళ్ళవలన; దివ్య+అస్త్రంబులు+పడసి= దివ్యమైన మంత్ర బాణాలు సంపాదించి; వాక్, పుష్ప, ఫల, జలంబులన్= మాటలతో, పువ్వులతో, ఫలాలతో, నీళ్ళతో; అందఱన్= అందరిని; తృప్తులన్+చేసి= తనివి చెందినవారినిగా ఒనరించి; వెండియు= మరల.

తాత్పర్యం: ఈ విధంగా దివ్యత్వం సంపాదించుకొని మహాపురుషుడుగా మారిన అర్జునుడు దివ్యదృష్టి కలవాడై దేవతారూపాలు ధరించిన పితృదేవతలతో తన ముందట నిలిచిన నీలవర్ణుడైన వైవస్వతుడిని, సముద్రాలు, నదులు, కొండలచేత కొలువబడే వాడును, వైడూర్యపు రంగు కలవాడును అయిన వరుణదేవుడిని, యక్ష రాక్షసులతో కలసి ఉన్నవాడు, బంగారు రంగు కలవాడును అయిన కుబేరుడిని చూచి, వారివలన దివ్యాస్త్రాలు పొంది, వారిని మాటలతో, పుష్పాలతో, ఫలాలతో, నీళ్ళతో ఆరాధించి, తృప్తిపరచి, మరియు.

విశేషం: మర్త్యులు= మరణానికి అధీనులు; అమర్త్యులు= మరణం లేని వారు, దేవతలు. మర్త్యులు మరణానంతరం పితృదేవతలు అవుతారు. అమర్త్యులను చూడటానికి చర్మచక్షువులు చాలవు. దివ్యదృష్టి అవసరం.

ఆ. అమరగణసమేతు నైరావణారూఢు । వజ్రధరుఁ ద్రిలోకవంద్యు నింద్రు
వృత్రశత్రు నమరవిభుఁ జూచి యెద నాది । మునివరుండు నరుఁడు ముదము నొందె. 341

ప్రతిపదార్థం: అమర, గణ, సమేతున్= దేవతల సముదాయాలతో కూడిన వాడిని; ఐరావణ+ఆరూఢున్= ఐరావణం అనే (తెల్ల) ఏనుగుపై అధివసించినవాడిని; వజ్రధరున్= వజ్రమనే ఆయుధాన్ని ధరించిన వాడిని; త్రి, లోక, వంద్యున్= మూడులోకాలకు నమస్కరించతగిన వాడిని; ఇంద్రున్= ఇంద్రుడిని; వృత్ర, శత్రున్= వృత్రుడు అనే విరోధిని కల వాడిని; అమర, విభున్= దేవతల ప్రభువును; చూచి= చూచి; ఎదన్= హృదయంలో; ఆది, ముని, వరుండున్= మొదటి ముని శ్రేష్ఠుడు; నరుఁడు= అర్జునుడు; ముదమున్+ఒందెన్= సంతోషం పొందాడు.

తాత్పర్యం: దేవతలచేత పరివేష్టించబడి, ఐరావణమనే తెల్ల ఏనుగును ఎక్కి, వజ్రాయుధాన్ని ధరించి, వృత్రుని శత్రువై, మూడు లోకాలకు ఆరాధ్యుడై ఒప్పుతున్న దేవేంద్రుడిని ఆదిమునిశ్రేష్ఠుడైన అర్జునుడు చూచి హృదయంలో సంతోషం పొందాడు.

ఉ. ఇందుధరప్రసాదమున నిష్టవరంబులు గాంచి బాంధవా
నంద విధాయి యైన నిజనందును దండితశత్రు సద్గుణా
నందితుఁ జూచి వేడ్క నయనంబులు వేయును గన్న తత్ఫలం
బందెఁ బురందరుండు పరమాద్భుత సమ్మదపూరితాత్ముఁడై. 342

ప్రతిపదార్థం: ఇందు, ధర= చంద్రుని ధరించిన వాడైన శివుడియొక్క; ప్రసాదమునన్= దయవలన; ఇష్ట, వరంబులు+కాంచి= తాను కోరిన వరాలు సంపాదించి; బాంధవ+ఆనంద, విధాయి+ఐన= చుట్టాలకు ఆనందం కల్పించేవాడయిన; నిజ, నందనున్= తనకొడుకును; దండితశత్రున్= శిక్షించబడిన శత్రువులు కలవాడిని; (అంటే శత్రువులను జయించిన వాడిని); సత్+గుణ+ఆనందితున్+చూచి= మంచి గుణాలచేత ఆనందం పొందేవాడిని చూచి; వేడ్కన్= సంతోషంతో; నయనంబులు, వేయును, కన్న, తద్+ఫలంబు+అందెన్= కన్నులు వేయింటిని పడసిన ఆ ప్రయోజనాన్ని పొందాడు. (అంటే దేవేంద్రుడు తన కుమారుడైన అర్జునుడిని చూచి తనకు వేయికన్నులు ఉన్నందుకు తగిన ప్రయోజనాన్ని పొందగలిగాడు); పురందరుండు= ఇంద్రుడు; (పురాలను నాశనం ఒనరించినవాడు); పరమ+అద్భుత, సమ్మద, పూరిత+ఆత్ముఁడు+ఐ= మిక్కుటమైన అచ్చెరువుతో కూడిన సంతోషంతో నిండిన ఆత్మకలవాడై.

తాత్పర్యం: ఇందుధరుడైన పరమేశ్వరుడి వరప్రసాదంవలన అభీష్టవరాలు సంపాదించి చుట్టాలకు ఆనందాన్ని కలిగించిన తన కుమారుడిని, శత్రువులను నిర్జించేవాడిని, సద్గుణాలచేత ఆనందం పొందేవాడిని అర్జునుడిని చూచి దేవేంద్రుడు మిక్కుటమైన ఆశ్చర్యంతో, సంతోషంతో నిండిన ఆత్మకలవాడై, వేయికన్నులు ఉన్నందుకు తగిన సత్ఫలాన్ని పొందాడు.

వ. ఇట్లు దేవేంద్రుండు ధనంజయుం జూచి సంతసిల్లి 'నీవు పరమేశ్వరువలనఁ బరమసిద్ధి వడసితివి; దేవకార్యంబు దీర్ప నర్హుండవు గాన నా రథంబుఁ బుత్తెంచెద; నమరావతికి రమ్ము. నీకు దివ్యాస్త్రంబు లంద యిచ్చెద' నని దేవేంద్రుండు దేవగణంబులతో నమరావతికి నరిగె; నర్జునుండును దద్రథాగమనంబు ప్రతీక్షించుచుండు నంత. 343

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దేవేంద్రుండు; ధనంజయున్+చూచి= అర్జునుడిని చూచి; సంతసిల్లి= సంతోషించి; నీవు; పరమేశ్వరువలనన్= పరమశివుని వలన; పరమ, సిద్ధి= గొప్పలాభం; పడసితివి= పొందావు; దేవ, కార్యంబు+తీర్పన్+అర్హుండవు= దేవతలయొక్క పనులను నిర్వహించటానికి సమర్థుడివి; కానన్= కాబట్టి; నా రథంబున్= నా తేరును; పుత్తెంచెదన్= పంపిస్తాను; అమరావతికి= దేవతల రాజధాని అయిన అమరావతికి; రమ్ము; నీకు; దివ్య+అస్త్రంబులు= దివ్యమైన మంత్రబాణాలు; అందు+అ= అక్కడే (అమరావతి లోనే), ఇచ్చెదన్= ఇస్తాను; అని= అని చెప్పి; దేవేంద్రుండు; దేవ, గణంబులతోన్= దేవతల సముదాయంతో; అమరావతికిన్; అరిగెన్= వెళ్ళాడు; అర్జునుండును; తద్+రథ+ఆగమనంబు= ఆ రథంయొక్క రాకను; ప్రతీక్షించుచుండు+అంత= ఎదురుచూస్తూ ఉన్నాడు. అంత.

తాత్పర్యం: ఇట్లా దేవేంద్రుడు తన కుమారుడైన అర్జునుడిని చూచి మిక్కిలి సంతోషించాడు. 'నీవు పరమశివుడి వలన గొప్పవరాలు సంపాదించగలిగావు. దేవతలకు ఉపకారం చేసే యోగ్యత నీకు లభించింది. కావున నా రథం పంపుతాను. అమరావతికి రమ్ము. అచటనే నీకు నేను దివ్యాస్త్రాలు ఇస్తాను' అని పలికి, దేవతల సముదాయంతో దేవేంద్రుడు అమరావతికి వెళ్ళాడు. అర్జునుడు ఆ రథం రాకకై ఎదురుచూస్తూ ఉన్నాడు. అంత.

సీ. వారిదమార్గంబువలన మహానీల । వైజయంతీ విభవంబు వెలయ,
నాబద్ధవివిధరత్నావళిప్రభఁ జేసి । రమ్యమై రోదోంతరంబు వెలుఁగ,
నురునేమిరవమున నుర్వరాధర దరీ । ముఖములు ప్రతిశబ్ద ముఖరితంబు
లగుచుండ, నానావిధాయుధంబులు దాల్చి, । యశనివిద్యుత్సహస్రాభిశోభి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. తాభ్రసదృశమై మహాజవాశ్వాయుత । వాహ్యమాన మైన వరరథంబు
మఘవునాజ్ఞఁ జేసి, మాతలి యుక్తమై । యింద్రతనయుఁ డున్నయెడకు వచ్చె. 344

ప్రతిపదార్థం: వారిద, మార్గంబు వలనన్= మబ్బుల తెరువునుంచి ఆకాశమార్గంనుండి (వారి+ద= నీటిని ఇచ్చేది, మేఘం); మహా, నీల, వైజయింతీ, విభవంబు, వెలయన్= మిక్కుటమైన నీలిరంగుతో నిండిన 'వైజయంతి' అనే ఇంద్రుడి జెండా యొక్క సంపద విలసిల్లగా; ఆబద్ధ, వివిధ, రత్న+ఆవళి, ప్రభన్+చేసి= పొదగబడిన పెక్కు రత్నాల సముదాయాలయొక్క కాంతిచేత; రమ్యము+ఐ= సుందరమై; రోదస్+అంతరంబు, వెలుఁగన్= భూమి ఆకాశాల మధ్య భాగం ధగధగలాడుతుండగా; ఉరు, నేమి, రవమునన్= గొప్పదైన చక్రాల కమ్ముల సవ్వడిచేత; ఉర్వరాధర= భూమిని ధరించే కొండలయొక్క; దరీ, ముఖములు= కొండలలోని గుహల ముందుభాగాలు; ప్రతిశబ్దముఖరితంబులు+అగుచుండన్= ప్రతిధ్వనులచేత మారుమ్రోగు తుండగా; నానా, విధ+ఆయుధంబులు, తాల్చి= అనేక విధాలైన శస్త్రాలను వహించి; అశని, విద్యుత్, సహస్ర+అభిశోభిత+అభ్ర, సదృశము+ఐ= పిడుగులును, వేయి మెరుపు తీగలను గలిగి మిక్కిలి శోభిల్లే మేఘంతో సరిపోలుతున్నవై మహా, జవ+అశ్వ+అయుత= గొప్ప వేగంతో పరుగెత్తగల పదివేల గుర్రాలచే; వాహ్యమానము+ఐన= లాగబడుతున్నదైన; వర, రథంబు= శ్రేష్ఠమైన రథం; మఘవు+ఆజ్ఞన్+చేసి= దేవేంద్రుడి ఆనతి చొప్పున; మాతలి, యుక్తము+ఐ= మాతలి అనే పేరు కల సారథితో కూడినదై; ఇంద్ర, తనయుఁడు+ఉన్న+ఎడకు= అర్జును డుండే తావుకు; వచ్చెన్= వచ్చింది.

తాత్పర్యం: ఇంద్రుడి ఆజ్ఞ చొప్పున, గొప్ప వేగంతో పరుగెత్త గలిగిన పదివేల గుర్రాలు పూన్చిన దివ్య రథం మాతలి అనే సారథి నడుపుతుండగా అర్జును డుండే చోటికి వచ్చింది. ఆ రథం మేఘమండలంనుండి వచ్చేటప్పుడు మిక్కిలి నీలపురంగు గల వైజయంతీ (జెండా) వైభవం వెల్లివిరిసింది. ఆ తేరులో పొదగబడిన పెక్కు రత్నాల సముదాయంయొక్క కాంతులచేత భూమికీ ఆకాశానికీ మధ్య ఉండే భాగం అందంగా వెలుగొందింది. చక్రాల కమ్మలు చేసిన పెనుసవ్వడిచేత పర్వతగుహా ముఖాలు ప్రతిధ్వనించాయి. పెక్కు ఆయుధాలు వహించటంచేత అది పిడుగులతో, వేలకొలది మెరుపుతీగలతో ఒప్పే గొప్ప మేఘాన్ని సరిపోలి ఉన్నది.

విశేషం: వైజయంతి అంటే ఇంద్రుడి జెండా. విష్ణువు ధరించే మాలపేరు కూడా వైజయంతియే.

వ. మాతలియు నర్జునుఁజూచి 'సురాసురకిరీటతటఘటితరత్నప్రభాభాసురపదుండైన మహేంద్రుండు మీయయ్య భవద్దర్శనం బపేక్షించి నిన్ను నమరావతికి రాఁబనిచె, రాజసూయాశ్వమేధ శతంబులం జేసిన వారికైనను దుర్లభం బీరథంబు, దీని నెక్కు' మనిన నర్జునుండును గంగాస్నాన పవిత్రీకృత గాత్రుండై దేవఋషి పితృతర్పణంబులు చేసి మాతలి ప్రయుక్తంబైన యా దివ్యరథం బెక్కి. 345

ప్రతిపదార్థం: మాతలియున్= ఇంద్రుడి సారథి అయిన మాతలియు; అర్జునున్+చూచి= అర్జునుడిని చూచి; సుర+అసుర, కిరీట, తట, ఘటిత, రత్న, ప్రభా, భాసుర, పదుండు+ఐన= దేవతలయొక్క, రాక్షసులయొక్క, మకుటాలయొక్క పార్శ్వాలలో కూర్చబడిన రత్నాలయొక్క కాంతులచేత వెలుగొందే పాదాలు కలవాడు అయిన; మహా+ఇంద్రుండు= మహేంద్రుడు, (దేవేంద్రుడు); మీ, అయ్య= మీ తండ్రి; భవత్+దర్శనంబు= నీయొక్క దర్శనం; అపేక్షించి= కోరి; నిన్ను; అమరావతికి= అమరావతీ పట్టణానికి; రాన్, పనిచెన్= రమ్మని ఆదేశించాడు; రాజసూయ+అశ్వమేధ, శతంబులన్= వందరాజసూయాలు, వంద అశ్వమేధాలు; చేసిన, వారికి+ఐనను= చేసినవారికి సయితం; ఈ, రథంబు= ఈతేరు; దుర్లభంబు= లభించేది కాదు; దీనిన్= దీన్ని; (ఈరథాన్ని); ఎక్కుము= అధిరోహించుము; అనినన్= అని చెప్పగా; అర్జునుండును; గంగా, స్నాన, పవిత్రీకృత, గాత్రుండు+ఐ= గంగలో స్నానం చేయటంచేత పావనం చేయబడిన దేహం కలవాడై; దేవ, ఋషి, పితృ, తర్పణంబులు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేసి= దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు తర్పణాలు చేసి; (తర్పణం= చనిపోయిన పెద్దల ఆత్మలు తృప్తి పొందటానికై, తరించటానికై వదిలే నీళ్ళు); మాతలి, ప్రయుక్తంబు+ఐన= మాతలిచేత నడపబడే; ఆ, దివ్య, రథంబు+ఎక్కి= ఆ దివ్యమైన తేరును అధిరోహించి.

తాత్పర్యం: మాతలి అర్జునుడిని చూచి 'దేవతలు రాక్షసులు మీ తండ్రియైన దేవేంద్రుడికి మ్రొక్కుతుంటారు. అట్లా మ్రొక్కినప్పుడు వారి కిరీటాలలో పొదగబడిన రత్నాలకాంతులచేత ఆయన పాదాలు వెలుగొందుతుంటాయి. అట్టి మహావైభవం గల మీ తండ్రి, నిన్ను చూడాలనే కోరికతో అమరావతికి రమ్మని ఆహ్వానించాడు. వందలకొలది రాజసూయాలు, అశ్వమేధాలు చేసిన వారికి సయితం ఈ రథం దుర్లభం. నీవు ఈ రథా న్నెక్కి స్వర్గలోకానికి రమ్ము' అని పలికాడు. అర్జునుడు గంగలో స్నానం చేసి, పవిత్రమైన దేహంతో దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు తర్పణాలు వదలి, మాతలి నడిపే ఆ దివ్యరథాన్ని ఎక్కాడు.

అర్జునుఁ డమరావతికిఁ బోవుట (సం. 3-43-26)

చ. 'అలఘు తపస్సమాధి నియతాత్ములకున్, బహుపుణ్యలోకకాం
క్షులకు, విశుద్ధమానసులకున్ సతతంబును సంశ్రయంబ వై,
లలిత నిలింప దంపతి విలాస విహార మహోత్సవంబులుం
గలిగి వెలుంగు రత్నమయ కందర సుందర మందరాచలా! 346

ప్రతిపదార్థం: అలఘు, తపస్, సమాధి, నియత+ఆత్ములకున్= గొప్ప తపస్సువలన చేకూరే సమాధిలో లగ్నమైన ఆత్మకల వారికి- అంటే గొప్ప తపస్సువలన నిర్వికల్పసమాధి యోగాన్ని సాధించిన మహానుభావులకు; బహు, పుణ్య, లోక, కాంక్షులకున్= అనేక పుణ్యలోకాలకు వెళ్లే యోగ్యత సంపాదించుకొనగోరే వాళ్ళకు; విశుద్ధ, మానసులకున్= నిర్మలమైన మనస్సులు కలవాళ్ళకు; సతతంబును= ఎల్లప్పుడు; సంశ్రయంబవు+ఐ= ఆధారానివై; లలిత, నిలింప, దంపతి, విలాస, విహార మహా+ఉత్సవంబులున్+కలిగి= సుకుమారమైన దేవతాదంపతులయొక్క హొయలుతో కూడిన వినోదయాత్రలనే గొప్ప ఉత్సవాలతోకూడి; వెలుంగు= శోభించే; రత్న, మయ, కందర, సుందర, మందర+అచలా!= రత్నాలతో నిండిన గుహలతో అందమైన మందరపర్వతమా!

తాత్పర్యం: 'ఓ మందర పర్వతమా! నీవు గొప్ప తపంవలన లభించే నిర్వికల్ప సమాధిని ఆర్జించే మహానుభావులకు, అనేక పుణ్యలోకాలను పొందగోరే మహనీయులకు, పరిశుద్ధమైన మనస్సు కలవారికి ఆశ్రయ మిచ్చేదానివి. సౌకుమార్యం కల స్వర్గదంపతుల విలాసవంతమైన వినోదయాత్రలనే గొప్ప సంబరాలకు నీవు స్థానానివి. రత్నమయాలైన గుహలచేత మనోహరమైనది నీ ఆకృతి.

విశేషం: అలం: అంత్యానుప్రాసం, వృత్త్యనుప్రాసం.

వ. నీయందలి పుణ్యతీర్థంబులు సేవించుచు గంగాంబు ధౌతస్థలరుహ వనస్పతి ఫలంబు లుపయోగించుచు సుఖం బుండితి; నమరావతికిం బోయి వచ్చెద' నని మందరనగంబు వీడ్కొని పురందరనందనుండు దేవ పథంబున కరిగె. 347

ప్రతిపదార్థం: నీ+అందలి= నీలోఉన్న; పుణ్య తీర్థంబులు= పుణ్యాన్ని ఒనగూర్చే స్థలాలు; సేవించుచు= ఆరాధిస్తూ; గంగా+అంబు, ధౌత, స్థల, రుహ, వనస్పతి, ఫలంబులు+ఉపయోగించుచున్= గంగయొక్క నీటిచేత తడుపబడిన చెట్ల పండ్లను వాడుతూ; సుఖంబు+ఉండితిన్= సౌఖ్యం పొందాను; అమరావతికిన్+పోయి, వచ్చెదన్= అమరావతికి వెళ్ళివస్తాను; అని= అని పలికి; మందర, నగంబు= మందర పర్వతానికి; వీడ్కొని= వీడ్కోలు చెప్పి; పురందర, నందనుండు= ఇంద్రుడి కుమారుడైన అర్జునుడు; దేవ, పథంబునకు+అరిగి= దేవతలు పయనించే మార్గానికి వెళ్ళి.

తాత్పర్యం: ఓ మందర పర్వతమా! నీలోని పుణ్యప్రదాలైన తీర్థాలను ఆరాధిస్తూ గంగానదీజలాలచేత తడిసిన స్థలాలలో పుట్టిన చెట్లకు కాసినపండ్లను ఉపయోగిస్తూ ఇన్నాళ్ళు సుఖంగా ఉన్నాను; అమరావతికి వెళ్లివస్తాను' - అని అర్జునుడు మందరపర్వతానికి వీడ్కోలు చెప్పి దేవతలు పయనించేమార్గం చేరుకొన్నాడు.

విశేషం: దేవపథం= దేవతలు పయనించే మార్గం. మనుజులు ప్రయాణం చేసే మార్గాలు వేరు. దేవపథం ఆకాశమార్గం.

సీ. **పరమధర్మస్థితిఁ బ్రజఁ బ్రీతిఁ గాంచిన । రాజులకు, నుదగ్రరణమునందుఁ**
బతుల ప్రస్తవమునఁ బ్రాణముల్ విడిచిన । వీరులకును, యజ్ఞవిధులఁ జేసి
సురలను వసుమతీసురులను దనిపిన । ధర్మాత్ములకు, మహాతాపసులకు,
నిలయంబులై రమణీయంబు లగునట్టి । హర్మ్యవిమానసంహతుల దాని,

తే. **సకలభువనంబులం గల సత్పురముల । కెల్ల నెక్కు డనఁ దగి శిఖీందు రవుల**
దీప్తి లేకున్నఁ దనదైన దివ్యదీప్తి । విస్తరంబున నెప్పుడు వెలుఁగు దాని. **348**

ప్రతిపదార్థం: పరమ, ధర్మ, స్థితిన్= గొప్ప ధర్మాన్ని నిలుపుతూ; ప్రజన్= జనులను; ప్రీతిన్= ప్రేమతో; కాంచిన= (పరిపాలించిన) చూచిన; రాజులకున్; ఉదగ్ర, రణమునందున్= భయంకరమైన యుద్ధంలో; పతుల, ప్రస్తవమునన్= ఏలికల కొరకై (స్వామి భక్తితో); ప్రాణముల్, విడిచిన, వీరులకును= అసువులను అర్పించి పోరాడిన శూరులకు; యజ్ఞ, విధులన్+చేసి= యజ్ఞాలలో విధ్యుక్త కర్మలను నిర్వహించి (శాస్త్ర విధులలో చెప్పబడినట్లు చేసి); సురలను= దేవతలను; వసుమతీ సురులను= భూదేవతలైన బ్రాహ్మణులను; తనిపిన= తృప్తి నందించిన; ధర్మ+ఆత్ములకున్= మహానుభావులకు; మహా, తాపసులకున్= గొప్ప తపస్సు చేసిన వారికి; నిలయంబులు+ఐ= నివసించే స్థలాలై; రమణీయంబులు+అగునట్టి= అందమైనట్టి; హర్మ్య, విమాన సంహతుల, దానిన్= పెక్కు అంతస్తులు కల మేడలు, ఆకాశాన్ని అంటే గోపురాల సమూహాలు కలదానిని; సకల, భువనంబులన్+కల= అన్ని లోకాలలో ఉన్న; సత్, పురములకు+ఎల్లన్+ఎక్కుడు+అనన్+తగి= మంచి పట్టణాలు అన్నిటికంటె అధికమని చెప్పతగిన; శిఖి+ఇందు, రవుల= అగ్ని, చంద్రుడు, సూర్యుల; దీప్తి, లేకున్నన్= వెలుగు లేనప్పటికిని; తనదు+ఐన= తనయొక్క; దివ్య, దీప్తి విస్తరంబునన్= దివ్యమైన వెలుగు వెల్లువచేత; ఎప్పుడు= నిరంతరం; వెలుఁగుదానిన్= ప్రకాశించే దానిని; (అంటే అమరావతీ పట్టణాన్ని).

తాత్పర్యం: అర్జునుడు అమరావతీ పట్టణాన్ని చూచాడు. గొప్ప ధర్మాన్ని నిష్ఠతో పాటించి ప్రజలను పరిపాలించిన రాజులకు, ఘోరయుద్ధంలో స్వామిభక్తి పరాయణులై ఏలికలకొరకు తమ అసువులను అర్పించిన శూరులకు, యజ్ఞయాగాది క్రతువులు చేసి దేవతలను, భూదేవత లయిన బ్రాహ్మణులను సంతృప్తి పరచిన ధర్మాత్ములకు, గొప్ప తాపసులకు నివాసాలైన పెక్కు అంతస్తులు కల మేడలు, గోపురాలు కల దానిని; సమస్త లోకాలలోని గొప్ప

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పట్టణాలకన్న మిన్న అని చెప్పతగినదానిని, సూర్య, చంద్ర, అగ్నిహోత్రుల కాంతి అచట ప్రసరించకున్నను, స్వయంప్రకాశమానమై శోభతో విలసిల్లే దానిని అమరావతిని అర్జునుడు చూచాడు.

విశేషం: (1) అమరావతీ పట్టణం అగ్నిచంద్ర సూర్యుల కాంతి ప్రసారం లేకుండానే స్వయం ప్రకాశమానమైనది. (2) ధర్మాత్ములై ప్రజలను పరిపాలించిన రాజులు స్వర్గానికి వెళ్తారు. (3) యుద్ధంలో పరాక్రమం, స్వామిభక్తి ప్రకటించి అసువులు బాసినవారు (అంటే వీరమరణం పొందినవారు) స్వర్గం చేరతారు. (4) యజ్ఞ యాగాది కర్మలు చేసి దేవతలను, బ్రాహ్మణులను మెప్పించినవారు స్వర్గాన్ని పొందుతారు.

వ. మఱియు ననాహితాగ్నులకు, నతీర్థసేవకులకు, ననృతవాదులకు, వేద విరుద్ధాచారులకు, మాంసాహారులకు, రణపరాఙ్ముఖులకుఁ జొరఁ నవిషయంబును, నతి గహ్వరంబును నైనదాని నమరావతిఁ జొచ్చి, తద్గోపుర సమీపంబున ననవరత గండస్థల గళదవిరళమదజలకుల్యాభిరామంబై నిరంతర నిర్ఝరనీహార నగంబునుం బోలె నొప్పుచున్న యైరావతంబుఁ జూచుచు. సురసిద్ధ సాధ్య గణంబుతో విద్యాధరాప్సరో గంధర్వ కిన్నర జేగీయమానుం డగుచు చను నప్పుడు. 349

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక, (అనాహితాగ్నులు (న+ఆహితాగ్నులు)= ఆహితాగ్నులు కానివారు;) అనాహితాగ్నులకున్= శ్రోత్రియులై నిత్యాగ్నిహోత్ర నిరతులుకానివారికి; అతీర్థసేవకులకున్= పుణ్య స్థలాలు సేవించని వారికి; అనృతవాదులకున్= అసత్యం పలికే వారికి; వేద, విరుద్ధ+ఆచారులకున్= వేదాలకు వ్యతిరేకమైన ప్రవర్తన కలవారికి; మాంస+ఆహారులకున్= మాంసం భుజించే వారికి; రణ, పరాక్+ముఖులకున్= యుద్ధంలో పెడమొగం పెట్టిన వారికి అంటే రణరంగంనుండి పారిపోయిన పిరికివారికి; చొరన్= ప్రవేశించటానికి; న+విషయంబునున్= ప్రదేశం కాని దానిని; అతి, గహ్వరంబునున్+ఐనదానిన్= (సాధారణులకు) ప్రవేశించటానికి వీలులేని దానిని; అమరావతిన్+చొచ్చి= అమరావతిలో ప్రవేశించి; తద్+గోపుర, సమీపంబునన్= ఆ పట్టణద్వారానికి దగ్గరగా; అనవరత, గండస్థల, గళత్+అవిరళ, మదజల కుల్య+అభిరామంబు+ఐ= ఎల్లప్పుడును చెక్కిళ్ళ నుంచి జారుతున్న ఎడతెగని మదజలం పారే కాలువలతో మనోహరమై; నిరంతర, నిర్ఝర, నీహార, నగంబునున్+పోలెన్= ఎడతెగక పారే సెలయేళ్ళతో కూడిన మంచు కొండ (హిమాలయపర్వతం) వలె; ఒప్పుచున్న= విలసిల్లుతున్న; ఐరావతంబున్= ఐరావతమనే పేరుకల ఇంద్రుడితెల్లఏనుగును; చూచుచు; సుర, సిద్ధ, సాధ్య, గణంబుతోన్= దేవతలు, సిద్ధులు, సాధ్యుల సమూహంతో; విద్యాధర+అప్సరస్+గంధర్వ, కిన్నర, జేగీయమానుండు+అగుచు= విద్యాధరులు, అప్సరసలు, గంధర్వులు, కిన్నరులు, జయజయ శబ్దాలు ఉచ్చరిస్తుండగా ఒప్పుతూ; చనునప్పుడు= వెళ్ళేటప్పుడు.

తాత్పర్యం: అమరావతిని - (1) ఆహితాగ్నులు కానివారు (2) తీర్థయాత్రలు చేయనివారు (3) అసత్యం పలికేవారు (4) వేదాలకు వ్యతిరేకంగా నడచుకొనేవారు (5) మాంసం తినేవారు (6) యుద్ధంలో వెన్ను చూపి పారిపోయేవారు - ప్రవేశించటానికి అనర్హులు. అమరావతీ పట్టణంలోని పురద్వారం సమీపంలో ఐరావతం అనే వెల్ల (తెల్ల) ఏనుగు ఉన్నది. గండస్థలంనుండి మదజలధారలు కాలువలుగా స్రవించి మనోహరమై కన్పట్టుతూ, ఆ ఏనుగు ఎల్లప్పుడు పారే సెలయేళ్ళతో కూడిన హిమాలయపర్వతంవలె ఒప్పుతున్నది. అర్జునుడు ఆ ఐరావతాన్ని చూస్తూ అమరావతీపురంలో ప్రవేశించాడు. అప్పుడు దేవతలు, సిద్ధులు, సాధ్యులు, విద్యాధరులు, అప్సరసలు జయజయ శబ్దాలు చేయసాగారు. అట్లా వెళ్ళేటప్పుడు.

విశేషం: అలం: ఉపమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. సకలర్తు సురభి కుసుమిత । సుకుమారోద్యాన తరుల సుడియుచుఁ బ్రణయో
త్సుకుఁడై పవనుఁడు పాండవు । నకు నభిముఖుఁ డయ్యెఁ దన్మనఃప్రియ మెసఁగన్. 350

ప్రతిపదార్థం: సకల+ఋుతు, సురభి, కుసుమిత, సుకుమార+ఉద్యాన తరుల, సుడియుచున్= అన్ని ఋతువులలో పూచి పరిమళించే పువ్వులతో మనోహరాలైన పెంపుడు తోటలలోని చెట్ల చుట్టూ తిరుగాడుతూ; ప్రణయ+ఉత్సుకుఁడు+ఐ= స్నేహభావంతో అతిశయించినవాడై; పవనుఁడు= వాయుదేవుడు; పాండవునకున్= అర్జునుడికి; తద్+మనస్+ప్రియము+ఎసఁగన్= అతడియొక్క మనస్సుకు సంతోషం కలిగేటట్లుగా; అభిముఖుఁడు+అయ్యెన్= ఎదురయ్యాడు (ఎదురుగా వీవసాగాడు).

తాత్పర్యం: అన్ని ఋతువులలో పుష్పించి పరిమళాలు విరజిమ్మే ఉద్యానవనాలలోని వృక్షాల చుట్టూ తిరుగుతూ, స్నేహానురాగ పురస్సరంగా అర్జునుడికి మనఃప్రీతి కల్గిస్తూ వాయుదేవుడు అతడికి అభిముఖుడై వీవదొడగాడు.

క. నరుఁడైన యాదిముని యని । హరిసుతుఁ డని హరిసహాయుఁ డని హరుచేతన్
వరములు వడసిన వాఁడని । సురలెల్లను వచ్చి పార్థుఁ జూచిరి ప్రీతిన్. 351

ప్రతిపదార్థం: నరుఁడు+ఐన= నరుడు అయిన; ఆది, ముని, అని= మొదటి ఋషి అని; హరి, సుతుఁడు+అని= దేవేంద్రుడికుమారుడని; హరి, సహాయుఁడు+అని= విష్ణువుకు తోడుపడేవాడని లేదా ఇంద్రుడికి సాయం చేసేవాడని; హరుచేతన్= శివుడివలన; వరములు+పడసిన, వాఁడు+అని= వరాలు సంపాదించినవాడని; సురలు+ఎల్లను= దేవతలందరు; వచ్చి= అరుదెంచి; ప్రీతిన్= ప్రేమతో; పార్థున్= అర్జునుడిని; చూచిరి= చూచారు.

తాత్పర్యం: ఈతడు నరుడనే ఆదిఋషి అనిన్నీ, ఇంద్రుడికుమారు డనిన్నీ, ఇంద్రుడికి సాయమొనరించే వాడనిన్నీ, పరమశివుడిచేత వరాలు పొందిన వాడనిన్నీ దేవతలు అందరూ వచ్చి అర్జునుడిని ప్రీతితో చూచారు.

వ. అర్జునుండు నయ్యమరావతీ విభవంబు సూచి హర్షించుచు అప్సరోగీయమాన మంగళహిత గీతావహిత మానసుం డగుచు సిద్ధ మునిగణాశీర్వాదంబులు సేకొనుచుం జని, మాతలి నిర్దేశంబున దివ్య రథావతీర్ణుండై. 352

ప్రతిపదార్థం: అర్జునుండు; ఆ+అమరావతీ, విభవంబు+చూచి= ఆ అమరావతి వైభవం చూచి; హర్షించుచున్= సంతోషిస్తూ; అప్సరస్+గీయమాన, మంగళ, హిత, గీత+అవహిత, మానసుండు+అగుచున్= అప్సరసలచేత పాడబడుతున్న శుభాన్నీ శ్రేయస్సును కోరే పాటలయందు ఏకాగ్రమైన మనస్సు కలవాడు అవుతూ; సిద్ధముని, గణ+ఆశీర్వాదంబులు= సిద్ధులయొక్క, మునిగణాలయొక్క దీవనలు; చేకొనుచున్= స్వీకరిస్తూ; చని= వెళ్ళి; మాతలి, నిర్దేశంబునన్= మాతలి చెప్పిన చొప్పున; దివ్య, రథ+అవతీర్ణుండు+ఐ= దివ్యమైన తేరినుంచి దిగినవాడై.

తాత్పర్యం: అర్జునుడు ఆ అమరావతీ పట్టణవైభవం చూచి మిక్కిలి సంతోషించాడు. అప్సరసలు పాడిన మంగళహిత గీతికలు అతడిని మిగుల ఆకర్షించాయి. సిద్ధులు, ఋషులు అతడిని ఆశీర్వదించారు. వారి దీవనలు గైకొంటూ చని అర్జునుడు మాతలి సూచించిన మేరకు దివ్యరథంనుండి దిగాడు.

క. శతమఖునకు భువనావన । రతశీలున కఖిలదేవరాజర్షి సమ
న్వితునకు వజ్రాభీలో । న్నతపృథుభుజునకుఁ గృతప్రణామముం డయ్యెన్. 353

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: శతమఖునకున్= నూరుయజ్ఞాలు చేసిన దేవేంద్రుడికి; భువన+అవన, రత, శీలునకు= లోకాలను రక్షించటంలో ఆసక్తితో కూడిన స్వభావం కలవాడికి; అఖిల, దేవ, రాజర్షి, సమన్వితునకున్= దేవఋషులైన, రాజఋషులైన వారందరితో కూడి ఉన్నవాడికి; వజ్ర+ఆభీల+ఉన్నత, పృథు, భుజునకున్= వజ్రాయుధంచేత (వజ్రాయుధాన్ని ధరించి ఉండటం చేత) భయంకరమైన, ఎత్తైన, పెద్దవైన బాహువులు కలవాడికి; (అర్జునుడు) కృత, ప్రణాముండు+అయ్యెన్= చేయబడిన నమస్కారం కలవాడు అయ్యాడు- అంటే నమస్కరించాడని భావం.

తాత్పర్యం: లోకాలను కాపాడే అభినివేశంతో కూడిన స్వభావం కలవాడున్నూ, సకల దేవర్షి, రాజర్షులతో కూడి ఉన్నట్టివాడున్నూ, వజ్రాయుధాన్ని ధరించటం చేత భీతిగొల్పుతున్న ఎత్తైన పెద్ద భుజములు (బాహువులు) కలవాడున్నూ అయిన దేవేంద్రుడికి అర్జునుడు నమస్కారం చేశాడు.

చ. అనిమిషనాథుఁడుం బ్రచలితాంగద తుంగ భుజాయుగంబునం
దనయునిఁ గౌఁగిలించుకొని తత్క్షణజాత నితాంత సమ్మదం
బునఁ బులకాంకితాంగుఁ డయి మున్ను నిజాంకతలస్థుఁ జేసి య
త్యనఘు నిజాసనార్ధమున నాదట నుంచెఁ గరంబు నెమ్మితోన్. 354

ప్రతిపదార్థం: అనిమిషనాథుఁడున్ (అనిమిషులు= రెప్పపాటులేనివారు, దేవతలు)= దేవతలరాజు దేవేంద్రుడుకూడ; ప్రచలిత+అంగద, తుంగ, భుజా, యుగంబునన్= ఎక్కువగా కదలుతున్న భుజకీర్తు లనే ఆభరణాలుగల ఎత్తైన పొడవైన చేతులతో; తనయునిన్= కొడుకును; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; తద్, క్షణ, జాత, నితాంత, సమ్మదంబునన్= ఆ క్షణంలో పుట్టిన ఎడతెగని సంతోషంతో; పులక+అంకిత+అంగుఁడు+అయి= గగుర్పాటు చెందిన దేహం కలవాడు అయి; మున్ను= ముందుగా; నిజ+అంక, తలస్థున్+చేసి= తన ఒడిలో ఉంచుకొని; అతి+అనఘున్= మిక్కిలి పాపంలేని వాడిని; కరంబు= మిక్కిలి; నెమ్మితోన్= ప్రీతితో; నిజ+ఆసన+అర్ధమునన్= తన పీఠంయొక్క సగభాగంలో (అంటే అర్ధాసనంలో); ఆదటన్+ఉంచెన్= గౌరవంతో ఉంచాడు.

తాత్పర్యం: దేవేంద్రుడు భుజకీర్తులు కదలగా పొడవుపాటిచేతులతో తన కొడుకును కౌగిలించుకొన్నాడు. అట్లా కౌగిలించుకొనటం చేత కలిగిన అమితమైన ఆనందంతో తత్క్షణమే ఆయనకు గగుర్పాటు కలిగింది. అట్లా కలిగిన రోమాంచంతో కూడిన దేహం కలవాడై, అర్జునుడిని తొలుత తన ఒడిలో ఆసీనుడిని కావించి, తదుపరి అర్ధాసన మిచ్చి మిక్కిలి ప్రేమతో సన్మానించాడు.

విశేషం: ప్రాచీన భారతీయ వాఙ్మయంలో రాజులు ఆప్తులకు అర్ధాసన మిచ్చి గౌరవించటం అత్యున్నతమైన మన్ననగా అభివర్ణించబడింది.

క. లీ లైరావతకుంభా । స్ఫాలన కర్కశకరములఁ బలుమరును మరు
త్పాలకుఁ డంటుచు నుండె గు । ణాలంకృతుఁడైన పార్థునంగముఁ బ్రీతిన్. 355

ప్రతిపదార్థం: లీలా+ఐరావత, కుంభ+ఆస్ఫాలన, కర్కశ, కరములన్= వినోదంగా ఐరావతంయొక్క కుంభస్థలాన్ని చరచటంచేత మొద్దుబారిన చేతులతో; పలుమరును= పెక్కుసారులు; మరుత్+పాలకుఁడు= దేవేంద్రుడు; గుణ+అలంకృతుఁడు+ఐన= మంచి గుణాలచేత అలంకరించబడిన; పార్థ+అంగమున్= అర్జునుడియొక్క దేహాన్ని; ప్రీతిన్= ప్రేమతో; అంటుచున్+ఉండెన్= స్పృశిస్తూ ఉండినాడు.

తాత్పర్యం: లీలాపూర్వకంగా ఐరావతంయొక్క కుంభస్థలాన్ని చరచటంచేత కరుకుబారిన చేతులతో పెక్కుమారులు దేవేంద్రుడు, మంచి గుణాలచేత భూషితుడైన అర్జునుడి దేహాన్ని స్పృశించాడు.

వ. ఇట్లధిక విలాసంబుతో సురవిలాసినీ కర కలిత చారుచామీకర దండ చామర సమీరాలోల కుంతలుం డగుచు సురరాజుతో నేకాసనంబున నున్న యప్పార్థుం బాకశాసను శాసనంబున దేవ గంధర్వ సిద్ధ విద్యాధరు లతిప్రీతి నర్చించి రంత. 356

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; విలాసంబుతో= హొయలుతో; సురవిలాసినీ, కర, కలిత, చారు, చామీకర, దండ, చామర, సమీర+ఆలోల, కుంతలుండు+అగుచు= దేవతాస్త్రీల చేతులతో పట్టుకొనబడిన, మనోహరమైన బంగారుదండం కల చామరాల నుండి వీచే గాలిచేత కదల్చబడుతున్న ముంగురులు కలవాడై; సురరాజుతోన్= దేవేంద్రుడితో; ఏక+ఆసనంబునన్+ఉన్న= ఒకే పీఠంపై ఉన్న; ఆ+పార్థున్= పృథకొడుకైన ఆ అర్జునుడిని; పాక, శాసను, శాసనంబునన్= దేవేంద్రుడి ఆజ్ఞవలన; దేవ, గంధర్వ, సిద్ధ, విద్యాధరులు= దేవతలు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు; అతిప్రీతిన్= మిక్కిలి అనురక్తితో; అర్చించిరి= పూజించారు; అంత.

తాత్పర్యం: ఈ విధంగా మిక్కిలి హొయలు వారుతూ, దేవలోకంలోని సుందరాంగనలు మనోహరమైన బంగారు దండాలచేత ఒప్పారే చామరాలతో దేవేంద్రుడితో పాటు ఒకే ఆసనంలో ఉన్న అర్జునుడికి వీచారు. అప్పుడతడు ఆ గాలులతో కదలాడుతున్న ముంగురులతో మిక్కిలి శోభిల్లాడు. ఆ సురరాజుఆజ్ఞచేత అప్పుడు అర్జునుడిని దేవతలు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు మిగుల అనురక్తితో పూజించారు.

తే. పాకశాసనుపనుపునఁ బార్థుఁ డొక్క । మణిమయంబైన మహనీయ మందిరమున
నెలమి గంధర్వ సంగీత హృద్యగోష్ఠి । నుండెఁ జెవులకు నుత్సవం బొందుచుండ. 357

ప్రతిపదార్థం: పాక, శాసను, పనుపునన్= దేవేంద్రుడి ఆజ్ఞవలన; పార్థుఁడు= అర్జునుడు; ఒక్క; మణిమయంబు+ఐన= మణులతో నిర్మించబడిన; మహనీయ, మందిరమునన్= గొప్పభవనంలో; ఎలమిన్= ప్రీతితో; గంధర్వ, సంగీత, హృద్య, గోష్ఠిన్= గంధర్వుల యొక్క నృత్యగానాలతో మనోహరమైన గోష్ఠిలో; చెవులకున్+ఉత్సవంబు+ఒందుచుండన్= చెవుల పండుగ ఏర్పడుతుండగా; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: దేవేంద్రుడి ఆనతి చొప్పున అర్జునుడు ఒక మణిమయ భవనంలో వీనులకు విందైన గంధర్వ సంగీత గోష్ఠిలో కాలం గడుపుతున్నాడు.

విశేషం: గంధర్వులు సంగీత కోవిదులు. 'నృత్యం చ గీతం చ వాద్యం చ సంగీతమ్'- జంత్రగాత్రగాన సమన్వితమైన నృత్యం సంగీతం.

వ. అంత సూర్యాస్తమయ సమయంబునఁ జంద్రుం డుదయించి సాంద్రచంద్రికావిలాసంబున దిగ్వనితల నలంకరించుచుండ, నిలింపపతి పంపున సొంపార నూర్వశి యర్జునసంగమకాంక్షంజేసి చంద్రికాధవళ దుకూలంబు గట్టి, మృగమద కర్పూర కుంకుమోన్మిశ్రిత సుగంధం బలఁది, వివిధ సురభి కుసుమ విసరంబులు ముడిచి, మణిమయ భూషణాలంకృతయై నిలుకడ వడసిన క్రొమ్మెఱుంగుఁ దీఁగయుంబోలె, మణిమయ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మంజీర ఝుళం ఝుళ నినాదంబును, గంకణ, ఝుణ ఝుణత్కారంబును, గటికలాప కింకిణీ క్రేంకారంబును, మదనాజ్ఞా వాద్యఘోషంబునుంబోలె మ్రోయుచుండ, మందగమనంబునఁ బురందరనందను మందిరంబున కరుగుదెంచిన, నప్పురుషసత్తముండు భయభక్తిసంభ్రమంబులతోఁ బ్రత్యుత్థానంబును దండ ప్రణామంబునుం జేసి, కరకమలంబులు మొగిచి యిట్లనియె. 358

ప్రతిపదార్థం: అంతన్= అంతట; సూర్య+అస్తమయ, సమయంబునన్= సూర్యుడు అస్తమించేవేళ; చంద్రుండు+ఉదయించి (నిండుపున్నమి పండువెన్నెల అని గ్రహించాలి. సూర్యుడు అస్తమించటం- చంద్రుడు ఉదయించటం ఏకకాలంలో జరిగేది పూర్ణిమ తిథిలో మాత్రమే); సాంద్రచంద్రికా, విలాసంబునన్= తరపి వెన్నెల హొయలుతో; దిశ్+వనితలన్= దిక్కులనే అంగనలను; అలంకరించుచు+ఉండన్; నిలింపపతి, పంపునన్= దేవేంద్రుడి ఆదేశాన్ని అనుసరించి; సొంపారన్= అందచందాలొలుకుతూ; ఊర్వశి= (స్వర్గంలోని అప్సరస); అర్జున, సంగమ, కాంక్షన్+చేసి= అర్జునుడి సంభోగం కోరి; చంద్రికా, ధవళ, దుకూలంబు, కట్టి= వెన్నెలవలె తెల్లనైన చీరను కట్టి; మృగమద, కర్పూర, కుంకుమ+ఉన్మిశ్రిత, సుగంధంబు +అలఁది= కస్తూరితో, కప్పురంతో, కుంకుమ పువ్వుతో బాగా కలపబడిన చందనం పూసికొని; వివిధ, సురభి, కుసుమ, విసరంబులు= పలురకాలైన సువాసనలతో కూడిన పువ్వులచెండ్లు; ముడిచి= అలంకరించుకొని; మణిమయ, భూషణ+ అలంకృత+ఐ= మణులతో పొదగబడిన ఆభరణాలచేత అలంకరించబడిందై; నిలుకడ+పడసిన, క్రొమ్మెఱుంగున్+ తీఁగయున్+పోలె= సుస్థిరమైన క్రొత్త మెఱుపుతీగ వంటిదై; మణిమయ, మంజీర, ఝుళం ఝుళ, నినాదంబును= మణులతో పొదుగబడిన అందెల ఝుళఝుళ ధ్వనులున్నూ; కంకణ, ఝుణ, ఝుణత్, కారంబును= చేతి కడియాల ఝుణ ఝుణ నిక్వాణాలున్నూ; కటికలాప= మొలనూలి యందలి; కింకిణీ= చిరుగంటల యొక్క; క్రేంకారంబును= 'క్రేం' అని వినిపించే మనోహరధ్వనులున్నూ; మదన+ఆజ్ఞా, వాద్యఘోషంబునున్+పోలె= మన్మథుడి ఆజ్ఞను వెల్లడించే మృదంగాదివాద్యాల ధ్వనులవలె; మ్రోయుచుండ; మంద, గమనంబునన్= మెల్లమెల్లని నడకతో; పురందర, నందను, మందిరంబునకున్= దేవేంద్రుడి కుమారుడైన అర్జునుడి గృహానికి; అరుగుదెంచినన్= రాగా; ఆ+పురుష, సత్తముండు= ఆ పురుషశ్రేష్ఠుడు; భయ, భక్తి, సంభ్రమంబులతోన్= భయం, భక్తి, తొట్రుపాటులతో; ప్రత్యుత్థానంబును= తాను కూర్చున్న పీఠంనుండి లేచి ఎదురేగటమున్నూ; దండ, ప్రణామంబును= సాష్టాంగ నమస్కారం చేసి; కర, కమలంబులు= హస్తపద్మాలు; మొగిచి= ముకుళించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అప్పుడు సూర్యుడు అస్తమించే వేళ చంద్రుడు ఉదయించి తరపి వెన్నెల వెల్లివిరియగా దిక్కులనే అంగనలకు అలంకారం తీర్చిదిద్దాడు. దేవేంద్రుడి ఆదేశంతో ఊర్వశి లావణ్య మొప్పారగా అర్జున సంభోగాన్ని అభిలషించి, వెన్నెల వలె తెల్లనైన చీర సింగారించుకొని మెల్లగా నడయాడుతూ బయలు వెడలింది. కస్తూరి, కర్పూరం, కుంకుమపువ్వుతో మర్దించబడిన శ్రీగంధం మైపూతగా ధరించింది. వివిధ పరిమళాలతో గుబాళించే పువ్వులచెండ్లు ముడిచింది. మణిస్థగితాలై మిరుమిట్లు కొలిపే ఆభరణాలు ధరించి స్థిరమైన మెరపుతీగవలె ప్రకాశించింది. మణులు పొదుగబడిన అందెల ఝుళంఝుళ నినాదాలు, చేతి కంకణనిక్వాణాలు, మొలత్రాటి చిరుమువ్వల క్రేంకారనాదాలు వెరసి మన్మథుని ఆజ్ఞను, చాటే వాద్యధ్వనులవలె ధ్వనించాయి. అట్లా ఆమె మందగమనంతో పురందరనందనుడి (అర్జునుడి) మందిరం చేరింది. పురుషశ్రేష్ఠుడైన అర్జునుడు భయం, భక్తి, సంభ్రమం ముప్పిరిగొనే హృదయంతో ఆమెకు ఎదురేగి సాగిలి మ్రొక్కి, హస్తపద్మాలు మొగిచి ఇట్లా పలికాడు.

క. 'ననుఁ బుత్త్రస్నేహంబున । మనమున మన్నించి శుభసమగ్రునిఁ జేయం
జనుదెంచి తీవు ముదమున । జనయిత్రీ! యేఁ గృతార్థజన్ముఁడ నైతిన్.' 359

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ననున్= నన్ను; పుత్త్ర, స్నేహంబునన్= పుత్రుడిపై కల అనురాగంతో; మనమునన్= మనస్సులో; మన్నించి= అభిమానించి; శుభ, సమగ్రునిన్+చేయన్= మంచిని నిండుగా చేకూర్చటానికి; ముదమునన్= సంతోషంతో; ఈవు= నీవు; చనుదెంచితి= వచ్చావు; జనయిత్రీ!= అమ్మా!; ఏన్= నేను; కృత+అర్థ, జన్ముండన్+ఐతిన్= ధన్యమైన జన్మ కలవాడినైనాను.

తాత్పర్యం: 'అమ్మా! నీవు నాపై గల పుత్రప్రేమతో నన్ను మన్నించటానికి సంతోషంతో ఇక్కడికి దయచేశావా? నీ రాకవలన నా జన్మ ధన్యమైంది'.

తే. **అనిన నూర్వశి యిట్లను నాత్మనేత్ర । మధుపము లతని సౌందర్యమధువుఁ గ్రోలు**
చుండఁ దమకంబు మీఱ యనూన ధర్మ । నిపుణుఁ డగు నర్జునునితోడ నెయ్య మొనర. **360**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఊర్వశి; ఆత్మ, నేత్ర, మధుపములు= తన కన్ను లనే తుమ్మెదలు; అతని= ఆ అర్జునుడి యొక్క; సౌందర్య, మధువున్= అందం అనే తేనెను; క్రోలుచుండన్= ఆస్వాదిస్తుండగా; తమకంబు, మీఱ= ఉద్వేగం ఎక్కువ కాగా; అనూన, ధర్మ, నిపుణుఁడు+అగు= గొప్ప ధర్మాన్ని తెలిసికొని ఉండటంలో నేర్పరి అయిన; అర్జునుని తోడన్; నెయ్యము+ఒనరన్= ప్రణయం ఒప్పేటట్లుగా; ఇట్లు= ఈ విధంగా; అనున్= పలికింది.

తాత్పర్యం: అని అర్జునుడు చెప్పగా విని ఊర్వశి, తన కన్ను లనే తుమ్మెదలు అతడి సొగసు అనే తేనెను క్రోలుతుండగా, వలపుతమకంతో ధర్మాత్ముడైన అర్జునుడితో ఇట్లా పలికింది.

విశేషం: ఊర్వశీ నేత్ర మధుపాలు, అర్జును సౌందర్యమధువు క్రోలటం అనే చోట రూపకాలంకారం ఉన్నది.

చ. **'అనుపమశౌర్య! నీదు సముదగ్ర గుణంబులు నారదాది స**
న్మునివరులెల్లఁ జెప్పఁగఁ బ్రమోదమునన్ భవదీయ సంగమం
బనిశముఁ గోరుచుం దగఁ బ్రియంబున వచ్చితి; నేను గోరఁగా
నను జనయిత్రి వంచు నొక నాయము వల్కెదు వక్రభాషలన్. **361**

ప్రతిపదార్థం: అనుపమ, శౌర్య!= సాటిలేని శౌర్యం కలవాడా! (అన+ఉపమ= అనుపమ= ఉపమానం (పోలిక) చెప్పటానికి వీలులేని); నీదు= నీయొక్క; సమ్+ఉదగ్ర, గుణంబులు= గొప్ప మంచి లక్షణాలు; నారద+ఆది, సత్+ముని వరులు+ఎల్లన్= నారదుడు మొదలైన మంచి ఋషిశ్రేష్ఠు లందరు; చెప్పఁగన్= (పొగడి) చెప్పగా; ప్రమోదమునన్= మిక్కుటమైన సంతోషంతో; భవదీయ, సంగమంబు= నీయొక్క పొందు; అనిశమున్, కోరుచున్= ఎల్లప్పుడు కాంక్షిస్తూ; తగన్= ఒప్పేటట్లుగా; ప్రియంబునన్= ప్రీతితో; వచ్చితిన్= వచ్చాను; నేను, కోరఁగాన్= నేను అభిలషిస్తే; ననున్= నన్ను; జనయిత్రివి= తల్లివి; అంచున్= అంటూ; వక్రభాషలన్= వంకర మాటలతో; ఒక, నాయము= ఏదో ఒక ధర్మం; పల్కెదు= మాటాడతావు.

తాత్పర్యం: 'సాటిలేని పరాక్రమంకల ఓ అర్జునా! నీ గొప్పగుణాలు నారదుడు మున్నగు మహర్షులు పొగడి చెప్పగా విని, సంతోషించి, నీ పొందు కోరి ప్రీతితో నీవద్దకు వచ్చాను. కాని, నీవు నన్ను తల్లిగా సంభావించి వంకరమాటలతో ఏదో ఒక న్యాయం పలుకుతున్నావు. ఇది ఎంత విడ్డూరం!

తే. **నీకు నేనాఁటి తల్లిని నిజము సెపుమ? । యమరలోకంబు వేశ్యలమైన మాకు**
నిట్టి తగవులు నడవ వహీనబాహు । వీర్య! యిచ్చట వావులు వెదకఁజనదు. **362**

ప్రతిపదార్థం: నీకున్= నీకు; ఏనాఁటి, తల్లిని= ఏ దినం (కాలం)లో అమ్మను; నిజము= సత్యం; చెపుము+అ= చెప్పుము; అమర, లోకంబు, వేశ్యలము+ఐన, మాకున్= స్వర్గలోకానికి చెందిన వేశ్యలమైన మాకు; ఇట్టి, తగవులు= ఇట్టి ధర్మాలు; అహీన, బాహు వీర్య!= గొప్ప బాహుబలం కలవాడా!; నడవవు= అన్వయించవు; ఇచ్చటన్= ఈ స్వర్గలోకంలో; వావులు= వరుసలు (పుట్టుకకు సంబంధించిన అనుబంధాలు); వెదకన్+చనదు= అన్వేషించకూడదు.

తాత్పర్యం: గొప్ప బాహుబలం కల ఓ అర్జునా! నీకు నేను ఏ నాడు తల్లి నయినాను? నిజం చెప్పుము. మేము దేవలోకానికి చెందిన వేశ్యలం. ఇట్టి న్యాయాలు, వావి వరుసలు ఇక్కడ వెదకరాదు.

విశేషం: ఊర్వశి అర్జునుడిని సంబోధించే విధం తెలుపతగింది. 'అనుపమశౌర్య', 'అహీన బాహు వీర్య, ఈ సంబోధనలలో ఊర్వశి తనవలపు కూరి పెట్టింది. భూలోకంలోని ధర్మం వేరు. స్వర్గంలోని ధర్మం వేరు. భూలోకంలోని వేశ్యలకే వావివరుసలు లేనపుడు, ఇక కేవలం భోగపరాయణమైన స్వర్గంలోని వేశ్యలకా వావివరుసలు?- అనే ప్రశ్న ఊర్వశి మాటలలో అంతర్గర్భితం.

వ. ఈ లోకంబున వనితలుఁ బురుషులు విచ్చలవిడిఁ గ్రీడింతు; రిచ్చటి కిది యనిందితంబైన యాచారంబు; నీవును ద్రిదివంబునకు వచ్చిన యప్పుడ దివ్యపురుషుండవు గావున నా మనోరథంబు సఫలంబుగా మందార మంజుల మంజరీ మకరంద పాన మత్తు మధుకర గాన మనోహర స్థలంబులను, మేరు శైల కందరంబులను, మంద పవనంబులు గల నందనాది వనంబులయందును, నితాంత కాంత వికసిత కనకారవింద సమధిక సౌరభ సంవాసిత మహానంద కందంబులైన మందాకినీ తీర మణిమయ వేదికలయందును, జంద్రికాసుందరంబులైన సికతాతలంబులను, మఱియు నిర్జర విహార స్థానంబుల ననవరత సురత కేళీ సౌఖ్యాంబుధి నన్ను నోలలార్పు' మనిన, నిర్వికార ధైర్యధుర్యుండై యర్జునుం డిట్లనియె. 363

ప్రతిపదార్థం: ఈ, లోకంబునన్= ఈ స్వర్గంలోకంలో; వనితలున్= స్త్రీలు; పురుషులు= మగవారు; విచ్చలవిడిన్= స్వతంత్రంగా, (ఇష్టానుసారంగా); క్రీడింతురు= వినోదిస్తారు; ఇచ్చటికి+ఇది= ఈలోకంలో ఇది; అనిందితంబు+ఐన= తప్పుకాని; ఆచారంబు= సంప్రదాయం; నీవును; త్రిదివంబునకున్= స్వర్గానికి; వచ్చిన+అప్పుడు+అ= వచ్చినప్పుడే; దివ్య పురుషుండవు= దేవత్వం గల పురుషుడివి; కావునన్= కాబట్టి; నా, మనోరథంబు= నా కోరిక; సఫలంబుగా= ఫలించేటట్లుగా (అంటే ఈడేరేటట్లుగా); మందార, మంజుల, మంజరీ, మకరంద, పాన, మత్త, మధుకర, గాన, మనోహర, స్థలంబులను= మందార వృక్షాలయొక్క సుకుమారమైన పువ్వుల గుత్తులలోని తేనెలను త్రాగి మదించిన తుమ్మెదల పాటలచేత మనస్సును హరించే చోటులలో; మేరు, శైల, కందరంబులను= బంగారు కొండలోని గుహలలో; మంద, పవనంబులు+కల= పిల్ల తెమ్మెరలు వీచే; నందన+ఆది, వనంబుల+అందును= నందనం మొదలుగా గల తోటలలో; నితాంత, కాంత, వికసిత, కనక+అరవింద, సమధిక, సౌరభ, సంవాసిత, మహా+ఆనంద, కందంబులు+ఐన= ఎడతెగని, వెలుగు సొగసు చిమ్ముతూ, వికసించిన బంగారు తామరపువ్వులనుండి వెలువడే ఎక్కువ సువాసనలతో నిండి గొప్ప ఆనందానికి నిలయాలైన; మందాకినీ, తీర, మణిమయ, వేదికల+అందును= స్వర్గలోకంలోని గంగానది ఒడ్డున కల మణులతో నిర్మితాలైన అరుగుల మీదను; చంద్రికా, సుందరంబులు+ఐన= వెన్నెల సొంపారిన; సికతా, తలంబులను= ఇసుక తిన్నెలపైనను; మఱియు; నిర్జర, విహార, స్థానంబులన్= దేవతలు వినోదించే చోటులలో; (నిర్జరులు= ముసలితనంలేని వారు, దేవతలు); అనవరత, సురత, కేళీ, సౌఖ్య+అంబుధి= ఎడతెగని సంభోగ క్రీడయొక్క సౌఖ్యమనే సముద్రంలో; నన్నున్; ఓలలార్పుము+అనినన్= తేలించుమని చెప్పగా; నిర్వికార ధైర్య, ధుర్యుండు+ఐ= వికారం చెందని ధైర్యం వహించినవాడై; అర్జునుండు= అర్జునుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఈ స్వర్గలోకంలో స్త్రీ పురుషులు విచ్చలవిడిగా శృంగార సంభోగాలు అనుభవిస్తారు. ఇది ఇక్కడ తప్పు కాదు. నీవు స్వర్గానికి వచ్చిన దివ్యపురుషుడివి. నీవుకూడ ఇచటి ఆచారాలు పాటించవలసి ఉన్నది. ఇచట శృంగార రసానుభూతికి ఉద్దీపన విభావాలు ఎన్నో ఉన్నాయి. ఇచట మందార కల్పవృక్షాల, సుకుమారాలైన పూలగుత్తులు, ఆ పూలగుత్తులలోని తేనెలను క్రోలి మత్తిల్లి ఝుంకరించే తుమ్మెదల గాన మాధుర్యాలు, బంగారు కొండ గుహలు, పిల్ల తెమ్మెరలు సయ్యాటలాడే నందనోద్యానవనం, వెలుగు వెల్లువ వెదజల్లే పొందామరలు వికసించే మిన్నేటి జాలులు, ఆ మిన్నేటి తీరంలో పొందామరల నెత్తావులు గుబాళించే మణిమయ వేదికలు, వెన్నెల సొగసులు ప్రతిఫలించే ఇసుక తిన్నెలు, ముసలితనం లేని వేలుపుజంటలు విహరించే క్రీడాస్థలాలు ఉన్నాయి. ఇక నీవు నన్ను ఎడతెగని రత కేళీ సౌఖ్యసముద్రంలో ఓలలాడించుము'- అని ఊర్వశి ప్రణయ పరవశత్వంతో పలుకగా, నిర్వికారుడై, చలించని స్థైర్యంతో అర్జునుడు ఇట్లా బదులు పలికాడు.

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం. స్వర్గలోకంలో గంగానది పేరు మందాకిని. భూలోకగంగ పేరు భాగీరథి. పాతాళ లోక గంగ పేరు భోగవతి. మందారం- కల్పవృక్షాలలో ఒకటి. వేల్పుమ్రాను, కల్పవృక్షం కోరిన కోరికలు ఇచ్చే దేవవృక్షసామాన్యం. ఇవి అయిదు. 1. మందారం 2. పారిజాతం 3. సంతానం 4. కల్పకం 5. హరిచందనం.

క. 'ఓహో! యిమ్మెయి ధర్మ। ద్రోహోక్తులు పలుకఁ దగునె? దోసం బది గా
దే? హరి హరి! మనమునఁ దగ। వూహింపక నన్నుఁ బలుకు టుచితమె నీకున్? 364

ప్రతిపదార్థం: ఓహో! (ఆశ్చర్యాన్ని ప్రకటించే శబ్దం); ఈ+మెయిన్= ఈ విధంగా; ధర్మద్రోహ+ఉక్తులు= ధర్మానికి ద్రోహం కలిగించే మాటలు; (ద్రోహమంటే కీడు తలచటం); పలుకన్+తగునె?= మాటాడదగునా?; దోసంబు+అది+కాదె= అది దోషం కాదా! (అది అంటే వావివరుసలు లేని స్వేచ్ఛాశృంగారం); హరి హరి= కృష్ణ కృష్ణా! (వినరాని మాటలు చెవిని పడినప్పుడు హరి హరి! అని భగవన్నామ స్మరణం చేయటం పరిపాటి); మనమునన్= మనస్సులో; తగవు= న్యాయం (వావివరుస); ఊహింపక= యోచించక; నన్నున్+పలుకుట= నాతో (ఈవిధంగా) మాట్లాడటం; నీకున్= నీకు; ఉచితమె= తగునా?

తాత్పర్యం: 'ఓహో! ఈ విధంగా ధర్మానికి కీడు చేసే పలుకులు పలకటం నీకు తగునా! విచ్చలవిడి శృంగారం దోషం కాదా? హరి హరి! ఎంతటి మాట వినవలసి వచ్చింది? నీ మనస్సులో ఏ మాత్రం న్యాయం (వావివరుస) ఆలోచించక ఈ విధంగా మాటాడటం నీకు తగునా?

విశేషం: ఊర్వశి వివరించిన ప్రణయవేదాంతం ప్రపంచవాఙ్మయంలో అచ్చుటచ్చుట విశిష్టతను రూపొందించుకొన్నది. అర్వాచీన పారశీక వాఙ్మయంలో ఉమరుఖయ్యాము ఊర్వశికి పొట్టితమ్ముగుర్ర. మనుచరిత్రంలోని వరూధిని ఊర్వశికి చిన్నారి చిట్టి చెల్లెలే కదా!

ఊర్వశి యర్జును నపుంసకునిఁగా శపించుట

వ. జగంబులు పుట్టింపను మనుపను సమయింపను గర్తలైన దేవతలకు నెట్లు నడచిన నెగ్గు లేదు; నేను గర్మభూమిని జనియించితి; సత్కర్మపరుండ నైన నాకు నిచ్చటి యాచారం బుచితంబు గాదు; మదీయ వంశకర్త యైన పురూరవునకుఁ బత్నివైన కారణంబునను, బురందరునకుఁ బరిచర్య యొనర్చుటం జేసియు

నాకు జనని వగుట సందియంబు లేదు; తల్లీ! నన్నుం బుత్త్రవాత్సల్యంబునం జూడు' మనిన మదనబాణపీడితయై కోపారుణిత నయనంబుల నర్జునుం జూచి యూర్వశి 'యేను గామించి వచ్చిన నా మనోరథంబు విఫలంబుఁ జేసిన వాఁడవు; నీవు మర్త్యలోకంబున మానవర్జితుండవై మానినీమధ్యంబున నపుంసకుండవై యుండు' మని శాపం బిచ్చి నిజగృహంబునకుఁ జనియె; నంతఁ బ్రభాత సమయంబునఁ దద్వృత్తాంతం బంతయు విని సురపతి కొడుకున కిట్లనియె. 365

ప్రతిపదార్థం: జగంబులు= లోకాలు; పుట్టింపను= సృష్టించటానికి; మనుపను= కాపాడటానికి; సమయింపను= లయించటానికి; కర్తలు+ఐన= చేసేవారైన; దేవతలకున్= స్వర్గలోకవాసులకు; ఎట్లు= ఏ విధంగా; నడచినన్= ప్రవర్తించినప్పటికిని; ఎగ్గు= కీడు; లేదు= ఉండదు; నేను; కర్మభూమిని= కర్మ ప్రధానంగా కల భూమిలో; జనియించితి= పుట్టాను; సత్, కర్మ, పరుండను+ఐన= మంచి పనులు చేయటంలో నిష్ఠకలవాడినైన నాకున్; ఇచ్చటి= ఈ స్వర్గలోకంలోని; ఆచారంబు= సంప్రదాయం (పాటించటం); ఉచితంబు, కాదు= మంచిది కాదు; మదీయ, వంశ, కర్త+ఐన= నా వంశానికి నిర్మాత అయిన; పురూరవునకున్= పురూరవుడు అనే రాజుకు; పత్నివి+ఐన, కారణంబునను= భార్యవైన హేతువుచేతనున్నూ; పురందరునకున్= ఇంద్రుడికి; పరిచర్య= సేవలు; ఒనర్చుటన్+చేసియు= చేయటంచేతనున్నూ; నాకు; జననివి+అగుట= తల్లివి అవటం; సందియంబు, లేదు= సందేహంలేదు; తల్లీ!= ఓ జననీ!; నన్నున్= నన్ను; పుత్త్ర వాత్సల్యంబునన్+చూడుము= పుత్త్రుల పట్ల ఉండే ప్రేమతో చూడుము; అనినన్= అని అనగా; మదన, బాణ, పీడిత+ఐ= మన్మథుడియొక్క బాణాలచేత పీడించ బడిందై; కోప+అరుణిత, నయనంబులన్= ఆగ్రహంచేత ఎర్రనైన కన్నులతో; అర్జునున్+చూచి= అర్జునుడిని చూచి; ఊర్వశి; ఏను= నేను; కామించి= వలపుకొని; వచ్చినన్= అరుదెంచగా; నా, మనోరథంబు= నా కోరిక; విఫలంబున్+చేసినవాఁడవు= వ్యర్థం చేసినావు; నీవు; మర్త్య, లోకంబునన్= భూలోకంలో; మాన, వర్జితుండవు+ఐ= అభిమానం లేని వాడివై; మానినీమధ్యంబునన్= ఆడువారి మధ్య; నపుంసకుండవు+ఐ= మగతనంలేనివాడివై; ఉండుము; అని; శాపంబు+ఇచ్చి= శాపాన్ని ఇచ్చి; నిజ, గృహంబునకున్+చనియెన్= తన ఇంటికివెళ్ళింది; అంతన్= అటుపిమ్మట; ప్రభాతసమయంబునన్= తెల్లవారటం కాగా; తద్+ వృత్తాంతంబు+అంతయు= ఆ జరిగిన కథ అంతటిని; విని= ఆలకించి; సురపతి= దేవేంద్రుడు; కొడుకునకు= కుమారుడికి అంటే అర్జునుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: సృష్టి స్థితి లయ శక్తులు కల దేవతలు ఎట్లా ప్రవర్తించినా వారికి చెల్లుబాటు అవుతుంది. నేను 'కర్మభూమి'లో జన్మించినవాడిని. సత్కర్మనిష్ఠచేత తరింప గోరే వాడిని. నీవు మా వంశకర్త అయిన పురూరవుడికి భార్యవు. నా తండ్రి అయిన ఇంద్రుడికి పరిచారికవు. కావున నాకు జనయిత్రివి. నన్ను నీవు పుత్త్రవాత్సల్యంతో చూడుము తల్లీ!'- అని అర్జునుడు ఊర్వశితో చెప్పాడు. ఊర్వశికి కోపం వచ్చింది. మదనబాణపీడిత అయిన ఆమె 'నేను నిన్ను వలచి వస్తే నా కోరిక వమ్ము చేశావు. కాబట్టి నీవు భూలోకంలో నపుంసకుడివై, మానినీమధ్యంలో మానరహితుడివై ఉండుము' - అని శాపం ఇచ్చింది. ఆ రాత్రి జరిగిన సంగతులు తెల్లవారిన పిమ్మట దేవేంద్రుడు విని తన కుమారు డైన అర్జునుడితో ఇట్లా పలికాడు.

విశేషం: అర్జునుడు తాను 'కర్మభూమి'లో జన్మించినట్లు ఊర్వశితో నొక్కి వక్కాణించాడు. భారతదేశాన్ని కర్మభూమిగా పలువురు అభివర్ణించి ఉన్నారు. ఇచట 'కర్మభూమి' అంటే అంతరార్థ మేమిటి? కర్మభూమి అంటే కర్మ చేసేభూమి అని అర్థం చెప్పితే కర్మ చేయని భూమి ఎక్కడైన ఉన్నదా? అని ఎదురు ప్రశ్న వస్తుంది. దీనికి అర్జునుడు ప్రయోగించిన తదుపరి వాక్యం 'సత్కర్మపరుండైన నాకు ఇచటి ఆచారంబు ఉచితంబు గాదు' అనే దాన్ని తోడు చేసికొని యోచించవలసి ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'కర్మసిద్ధాంతం' జగత్ ప్రసిద్ధమైనట్టిది. సత్కర్మ చేస్తే పుణ్యం కలుగుతుంది. దుష్కర్మ ఆచరిస్తే పాపం వస్తుంది. కర్మఫలం అవశ్యం అనుభోక్తవ్యం' - అనేవి కర్మ సిద్ధాంతం లోని మూలసూత్రాలు. కాబట్టి, కర్మ సిద్ధాంతంలో నమ్మకం గల స్థలం 'కర్మభూమి' - అని నిర్వచించవచ్చు. అర్జునుడు చెప్పినట్లు 'కర్మభూమి' లో పుట్టి, కర్మసిద్ధాంతంపై నమ్మకం ఉన్న వారికి తరణోపాయం 'సత్కర్మ పరత్వమే'.

క. 'నీయట్టి ధైర్యవంతుని । నే యుగముల నైనఁ గాన మెన్నండును; ధ
ర్మాయత్తమతివి; మునులకు । నీ యింద్రియజయము గీర్తనీయము తండ్రీ! 366

ప్రతిపదార్థం: తండ్రీ!= ఓ ప్రియకుమారా! (తండ్రి తన కొడుకును ప్రియమార 'తండ్రీ!' అని సంబోధించటం తెలుగులో అనుభవ ఆమ్రేడితం); నీ+అట్టి, ధైర్యవంతునిన్= నీబోటి ధీరత్వం కలవాడిని; ఏ+యుగములన్+ఐనన్= ఏకాలాల్లోనైనా (యుగం దీర్ఘకాలానికి కాలమానం); ఎన్నండును= ఎప్పుడును; కానము= చూడం; (నీవు) ధర్మ+ఆయత్తమతివి= ధర్మానికి స్వాధీనమైన బుద్ధి కలవాడివి; నీ+ఇంద్రియ, జయము= నీవు ఇంద్రియాలపై సాధించిన గెలుపు; మునులకు= మౌనంతో తపస్సు కావించే ఋషులకు; కీర్తనీయము= పొగడతగింది.

తాత్పర్యం: 'తండ్రీ! నీవు ధర్మాత్ముడివి. నీవంటి ధైర్యవంతుని ఏకాలంలోకూడ చూడలేదు. నీవు ఇంద్రియాలపై సాధించిన విజయం ఋషీశ్వరులు కూడ కీర్తించతగింది.

తే. అనఘ! యూర్వశి యిచ్చిన యట్టి శాప । మనుభవింపంగ వలయు నీ కవనియందు;
నింక మీ పదుమూఁడవయేఁడు సత్య । సరణి నజ్ఞాతవాసంబు సలుప వలయు. 367

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ అర్జునా!; ఊర్వశి+ఇచ్చిన+అట్టి, శాపము= ఊర్వశి ఇచ్చిన శాపం; నీకు+అనుభవింపంగవలయున్= నీకు అనుభవించక తప్పదు; అవనియందున్= భూలోకంలో; ఇంక= ఇకమీద; మీ, పదుమూఁడవ, ఏఁడు= (మీరు చేసిన ప్రతిజ్ఞలోని) పదమూడవ సంవత్సరం; సత్యసరణిన్= సత్యాన్ని పాటించే పద్ధతిని బట్టి; అజ్ఞాతవాసంబు= ఇతరులకు తెలియనట్టి నివాసచర్య; సలుపవలయున్= నెరవేర్చాలి.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ అర్జునా! ఊర్వశి ఇచ్చిన శాపం భూలోకంలో నీవు అనుభవించక తప్పదు. మీరు అన్నమాట ప్రకారం పదమూడవ సంవత్సరం అజ్ఞాతవాసం చేయవలసి ఉన్నది కదా!

వ. అక్కాలంబున నీవు షండరూపంబునఁబ్రచ్ఛన్నుండవై, రాజకన్యకలకు నృత్యంబు గఱపుచుండి, తదంత్యంబున శాపమోక్షంబు వడయు' మని యనుగ్రహించె; 'నీ యాఖ్యానంబు విన్న పుణ్యపురుషులు సకలదురిత విముక్తు లగుదు' రని చెప్పి వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 368

ప్రతిపదార్థం: ఆ+కాలంబునన్= ఆ సమయంలో; ఈవు; షండ, రూపంబునన్= నపుంసక ఆకృతితో; ప్రచ్ఛన్నుండవై= ఇతరులకు తెలియనట్టి వాడివై; రాజ కన్యకలకు= రాజుగారి పుత్రికలకు; నృత్యంబున్= నాట్యాన్ని; కఱపుచుండి= నేర్పుచుండి; తద్+అంత్యంబునన్= ఆ పదమూడవ సంవత్సరం చివర; శాపమోక్షంబు= శాపంనుండి విముక్తి; పడయుము= పొందుము; అని; అనుగ్రహించెన్= దయ చూపించాడు; ఈ, ఆఖ్యానంబు= ఈ కథ; విన్న= వినిన; పుణ్యపురుషులు= మంచివారు; సకల, దురిత, విముక్తులు+అగుదురు= అన్ని పాపాల నుండి నిష్కృతి చెందుతారు; అని= అంటూ;చెప్పి;వైశంపాయనుండు= వైశంపాయను డనే ఋషి; జనమేజయునకు= జనమే జయుడనే మహారాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ సమయంలో నీవు నపుంసకరూపంలో మారువేషంతో రాజకన్యలకు నాట్యం నేర్పుతూ ఉంటావు. ఆ గడువు తీరగానే శాపవిమోచనం కలుగుతుంది'- అని ఇంద్రుడు అర్జునుడిపై దయ చూపాడు. 'ఈ కథ విన్న పుణ్యపురుషులు సమస్తపాపాలనుండి విముక్తులు కాగల'రని వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పాడు.

విశేషం: వైశంపాయనుడు వేదవ్యాస మహర్షి శిష్యుడు, వ్యాసుడు భారత ఇతిహాసాన్ని వ్రాసిన మహనీయుడు. అతడు పాండవులకు కౌరవులకు సమకాలీనుడు. భారత కథలో విశిష్ట భూమిక నిర్వహించినవాడు. మహాభారతయుద్ధం అయిన తర్వాత వ్యాసమహర్షి భారతకథను ఎనిమిదివేల శ్లోకాలతో రచించాడు. దానికి 'జయ' మని పేరు. తదుపరి వ్యాసశిష్యులు ఐదుగురు వైశంపాయనుడు, సుమంతుడు, పైలుడు, జైమిని, శుకుడు పంచభారతాలు వ్రాశారు. వైశంపాయన మహర్షి వ్రాసిన భారతం ఇరవైనాలుగు వేల శ్లోకాలు కలది. జనమేజయుడు చేసిన సర్పయాగంలో పఠించబడింది. ప్రధానశ్రోత జనమేజయుడు. అర్జునుడి కుమారుడు అభిమన్యుడు. అభిమన్యుడి కొడుకు పరీక్షిత్తు. పరీక్షితుడి పుత్రుడు జనమేజయుడు. జనమేజయుడు చేసిన సర్పయాగంలో వైశంపాయనమహర్షి తన భారతాన్ని వినిపించాడు. తర్వాత నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులకు ఉగ్రశ్రవసుడు అనే సూతుడు ఏకలక్షశ్లోక సంభృతమైన మహేతిహాసం మహాభారతాన్ని వినిపించాడు. నైమిశారణ్యంలో కులపతి శౌనకుడు పన్నెండేండ్లు సత్రయాగం నిర్వహించాడు. అచటి ప్రధానశ్రోతలు శౌనకాదిమహర్షులు. మహాభారత ప్రోక్తసూతుడు ఉగ్రశ్రవసుడు. అందువలనే మహాభారతంలోని ఆశ్వాసారంభాల్లో 'అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె'. 'దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె'- అనే వాక్య విశేషాలు కనిపిస్తాయి.

సీ. **వజ్రాస్త్ర మాదిగా వరదుఁడై వివిధ ది । వ్యాస్త్రముల్ పార్థున కమర నిచ్చి,**
తత్ప్రయోగంబులుఁ దద్రహస్యంబులుఁ । దన్నివర్తనములుఁ దడయ కపుడ
దయ నుపదేశించి 'దారుణాహవములం । దవిజేయ వీర్యుండ వగుము పేర్మి'
నని మహాసౌహార్దుఁడై చిత్రసేనుఁడన్ । గంధర్వపతితోడ గారవమున

ఆ. **వజ్రధరుఁడు గీతవాద్యనృత్యంబులు । గఱపఁ బంచెఁ బార్థుఁ గడఁగి, యిట్టు**
లమరనాథునొద్ద నర్జునుం డుండ నే । నేఁడు లరిగె నిట మహీతలమున. 369

ప్రతిపదార్థం: వజ్రధరుఁడు= దేవేంద్రుడు; వజ్ర+అస్త్రము+ఆదిగా= వజ్ర మనే అస్త్రం మొదలుగా; వరదుఁడు+ఐ= కోరికలను ఇచ్చేవాడై; వివిధ, దివ్య+అస్త్రముల్= పెక్కుదివ్యాలైన అస్త్రాలు; పార్థునకు= అర్జునుడికి; అమరన్+ఇచ్చి= అనువయ్యేటట్లు ఇచ్చి; తద్+ప్రయోగంబులున్= వాటి అనుసంధానాలు; తద్+రహస్యంబులున్= అందలి లోగుట్లు; తద్+నివర్తనములున్= వాటి ఉపసంహారాలు; తడయక= ఆలస్యంలేకుండ; అపుడు+అ= అపుడే; దయన్= కరుణతో; ఉపదేశించి= నేర్పి; దారుణ+ ఆహవములందు= ఘోరయుద్ధాలలో; పేర్మిన్= గౌరవంతో; అవిజేయ, వీర్యుండవు+అగుము= జయింపరాని బలం కలవాడివి కమ్ము; అని= అని చెప్పి; మహా, సౌహార్దుఁడు+ఐ= గొప్ప సుహృద్భావం కలవాడై; చిత్రసేనుఁడు+అన్= చిత్రసేనుడు అనే పేరు గల; గంధర్వపతితోడన్= గంధర్వరాజుతో; గారవమునన్= గొప్పగా; గీత, వాద్య, నృత్యంబులు= పాటలు, జంత్రాలు, నృత్యాలు అంటే సంగీతశాస్త్రం ('గీతం చ వాద్యం చ నృత్యం చ సంగీతమ్'); పార్థున్= అర్జునుడిని; కడఁగి= పూని; కఱపన్+ పంచెన్= నేర్పటానికి నిర్దేశించాడు; ఇట్టులు= ఈ విధంగా; అమరనాథు+ఒద్దన్= దేవేంద్రుడి దగ్గర; అర్జునుండు+ ఉండన్= అర్జునుడు ఉండగా; ఇట= ఇక్కడ; మహీతలమునన్= భూలోకంలో; ఏను+ఏఁడులు= ఐదు సంవత్సరాలు; అరిగెన్= గడచిపోయాయి.

తాత్పర్యం: దేవేంద్రుడు వజ్రాస్త్రం మున్నగు దివ్యాస్త్రాలను అర్జునుడికి అనుగ్రహించాడు. ఆ అస్త్రాల ప్రయోగ విధానాలు, అందలి లోగుట్టులు, వాటి ఉపసంహార మార్గాలు అన్నిటిని దయతో వెనువెంటనే ఉపదేశించాడు.

'ఘోరసంగ్రామాలలో జయించరాని బలంతో విక్రమించుము'- అని దీవించి గొప్ప సుహృత్‌భావంతో చిత్రసేనుడనే గంధర్వరాజుదగ్గర అర్జునుడు గీతవాద్యనృత్య విద్యలు నేర్చుకొనటానికి ఏర్పాటు చేశాడు. ఈ విధంగా దేవేంద్రుడి దగ్గర అర్జునుడు ఉండగా భూలోకంలో ఐదు సంవత్సరాలు గడిచాయి.

విశేషం: అర్జునుడు స్వర్గలోకంలో గడిపిన కాలం భూలోకకాలమానం ప్రకారం ఐదు సంవత్సరాలు. మూలంలో ఇట్లా ఉన్నది - "గృహీతాస్త్రస్తు కౌంతేయో, భ్రాతౄన్ సస్మార పాండవః । పురందర నియోగాచ్చ పంచాబ్దమవసత్ సుఖీ॥" (సం. 3.45.5) ప్రాచీన భారతీయ వాఙ్మయం దేవమానం వేరు, భూలోకకాలమానం వేరు- అని నిర్దుష్టంగా నిర్ణయించి చెప్పింది. నేడు విజ్ఞాన శాస్త్రజ్ఞులు రోదసీయానయుగంలో భూలోక కాలమానం వేరు, రోదసీ కాలమానం వేరు- అని చెప్తున్నారు. ఇది సామాన్యుల మేధకు అందే యోచన కాదు.

వ. అంత నొక్కనాఁడు రోమశుం డను మహాముని యింద్రునొద్దకు వచ్చి సురగణపూజితుండై సురేంద్రుతో నేకాసనంబున నున్న యర్జునుం జూచి యాశ్చర్యం బంది యింద్రున కిట్లనియె. 370

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; ఒక్కనాఁడు= ఒకానొక దినం; రోమశుండు+అను= రోమశు డనే పేరున్న; మహా, ముని= గొప్పఋషి; ఇంద్రు+ఒద్దకు, వచ్చి= ఇంద్రుడి కడకు వచ్చి; సుర, గణ, పూజితుండు+ఐ= దేవతల సముదాయంచేత అర్చించబడినవాడై; సురేంద్రుతోన్= దేవేంద్రుడితో; ఏక+ఆసనంబునన్= ఒకే పీఠంపై; ఉన్న= ఉన్నట్టి; అర్జునున్+చూచి= అర్జునుడిని చూచి; ఆశ్చర్యంబు+అంది= అచ్చెరువు పొంది; ఇంద్రునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: తరువాత ఒకానొక రోజు రోమశుడు అనే గొప్పముని ఇంద్రునికడకు వచ్చాడు. రోమశుడిని దేవతలందరు అర్చించారు. దేవేంద్రుడితో పాటు అర్ధాసనంపై ఆసీనుడై ఉన్న అర్జునుడిని చూచి, ఆశ్చర్యం పొంది, ఇంద్రుడితో రోమశుడు ఈ విధంగా పలికాడు.

క. 'కోరి యనేకయుగంబు ల । పారతపోయుక్తు లైనవారికిఁ బడయన్
దూరము నీ సభ, మఱి నీ । కారుణ్యం బంతకంటెఁ గడు ద వ్వెందున్. 371

ప్రతిపదార్థం: కోరి= అభిలషించి; అనేక, యుగంబులు= పెక్కు యుగాలు; అపార, తపస్+యుక్తులు+ఐన వారికిన్= మితిలేని తపస్సుతో కూడినవారికి; నీ, సభ= నీసభ; పడయన్+దూరము= పొందటానికి దూరమైనది; మఱి= ఆపైన; నీ, కారుణ్యంబు= నీ దయ; ఎందున్= ఎచటనైనను; అంతకంటెన్= దానికంటె కూడ; కడు= మిక్కిలి; దవ్వు= దూరం.

తాత్పర్యం: 'పెక్కుయుగాలు కోరి దీక్ష వహించి గొప్పతపస్సు చేసినవారు కూడ నీ కొలువుకూటం చేరుకోలేరు. అది వారికికూడ సుదూరం. ఒకవేళ ఇంత సుదూరమైన నీ కొలువుకూటం చేరుకొన్నా నీదయ సంపాదించటం అంతకంటె కష్టం.

వ. అట్టియందు నీతో నొక్కట నేకాసనం బెక్కి నీ రెండవమూర్తియుంబోలె నున్న యిమ్మనుజుం డెందులవాఁ డెవ్వఁ' డనిన నమ్మునీంద్రునకు దేవేంద్రుం డిట్లనియె. 372

ప్రతిపదార్థం: అట్టియందు= అట్టిది ఆ విధంగా ఉంటే, (నీ సభ దుర్లభం, నీదయ అంతకంటె దుర్లభం)- అట్టిదానిలో; నీతోన్+ఒక్కటన్= నీతోపాటు ఒకటిగా; ఏక+ఆసనంబు= ఒకే పీఠం; ఎక్కి= అధిరోహించి; నీ, రెండవ, మూర్తియున్, పోలెన్=

నీ రెండవ స్వరూపంవలె; ఉన్న= ఉన్నటువంటి; ఈ+మనుజుండు= ఈ మానవుడు; ఎందులవాఁడు= ఎక్కడివాడు?; ఎవ్వఁడు= ఎవడు?; అనినన్= అని అడుగగా; ఆ+ముని+ఇంద్రునకున్= ఆ ఋషివరేణ్యుడికి; దేవ+ఇంద్రుండు= దేవేంద్రుడు; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అటువంటి స్థితిలో, నీతోపాటు నీ అర్ధాసనం ఎక్కి నీ రెండవ మూర్తియా? అన్నట్లు తోచే ఈ మానవుడు ఎవడు? ఎక్కడివాడు?'- అని అడుగగా, ఆ మునిశ్రేష్ఠునికి దేవేంద్రుడు ఇట్లా బదులు పలికాడు.

క. **'నరుఁ డను మహర్షి యీతఁడు । నరలోకమునందుఁ బుట్టె నా యంశమునన్**
గురుమతిఁ గౌంతేయుఁడు, భా । సుర తేజుఁ డుపేంద్రసఖుఁడు సువ్వె! మునీంద్రా! **373**

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= మునులలో శ్రేష్ఠుడవైన రోమశా!; ఈతఁడు= నా అర్ధాసనంలో ఉన్న ఈ మనుజుడు; నరుఁడు +అను, మహర్షి= నరుడు అనే పేరుకల గొప్ప ఋషి; నా, అంశమునన్= నాపాలు పంచుకొని; నర, లోకమునందున్+పుట్టెన్= నరలోకంలో జన్మించాడు; గురుమతిన్= గొప్పమేధతో; కౌంతేయుఁడు= కుంతీదేవి కుమారుడు; భాసుర, తేజుఁడు= గొప్ప తేజస్వి; ఉపేంద్ర, సఖుఁడు= విష్ణుదేవుడికి మిత్రుడు; సువ్వె!= సుమా!;

తాత్పర్యం: 'ఓ రోమశ మహర్షీ! ఇతడు నరుడనే మహర్షి. భూలోకంలో నా అంశతో జన్మించినవాడు. ఇతడు మేధావి. కుంతీపుత్రుడు, గొప్ప తేజస్వి, విష్ణుదేవుడి మిత్రుడు.

తరలము.

శివుఁడు వీనికిఁ బ్రీతుఁడై దయ సేసెఁ బాశుపతాస్త్ర; మా
దివిజముఖ్యులతోడ నేనును దివ్యబాణము లిచ్చితిం;
దివిరి యీతఁడు మత్ప్రియంబుగ దేవకార్యము దీర్పఁగా
సవినయస్థితి నున్నవాఁడు నిజప్రతాపబలోన్నతిన్. **374**

ప్రతిపదార్థం: శివుఁడు= పరమేశ్వరుడు; వీనికిన్= ఈ అర్జునుడికి; ప్రీతుఁడు+ఐ= ప్రీతిని పొందినవాడై; పాశుపత+అస్త్రమున్= పాశుపతం అనే అస్త్రాన్ని; దయ+చేసెన్= అనుగ్రహించాడు; దివిజ, ముఖ్యులతోడన్= దేవతా నాయకులతోకలసి; ఏనును= నేనుకూడ; దివ్య, బాణములు= అస్త్రాలను; ఇచ్చితిన్= ఇచ్చాను; తివిరి= పూనికతో; ఈతఁడు= ఇతడు; (ఈ అర్జునుడు); నిజ, ప్రతాప, బల+ఉన్నతిన్= తన యొక్క పరాక్రమంతో కూడిన బలంయొక్క అతిశయంచేత; మత్+ప్రియంబుగ= నా ప్రీతికొరకు; సవినయ స్థితిన్= వినయ భావంతో; దేవకార్యము= దేవతలకు ప్రయోజనకరమైన పనిని; తీర్పఁగా= నెరవేర్చటానికి; ఉన్నవాఁడు= సంసిద్ధుడై ఉన్నాడు.

తాత్పర్యం: పరమేశ్వరుడు ఈ అర్జునుడిని అనుగ్రహించి పాశుపతాస్త్రాన్ని ప్రసాదించాడు. నేనును, దిక్పాలకులతోపాటు ఈతడికి దివ్యాస్త్రాలు ఒసగి ఉన్నాను. ఇప్పుడు ఈతడు తన పరాక్రమ బలోన్నతిచేత నా సంతోషంకొరకు దేవతలకు ప్రయోజనకరమైన కర్తవ్యాన్ని సవినయంగా నెరవేర్చనున్నాడు.

విశేషం: నన్నయ మహాకవి సాధించిన సంస్కృతాంధ్ర భాషలలోని ఛందస్సుల సమన్వయానికి తరలం గీటురాయి అని చెప్పవచ్చును. తరలంలో నాలుగు పాదాలు ఉంటాయి. ప్రతిపాదంలో న - భ - ర - స -జ -జ - గ అనే గణాలు ఉంటాయి. ప్రాస నియమం ఉన్నది. ప్రాసయతి చెల్లదు. ప్రతి పాదంలోనూ 1-12 అక్షరాలకు యతిమైత్రి చెల్లుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముత్యాల సరాల ఛందస్సును నవయుగ కవిచక్రవర్తిగా ఆధునికులు కీర్తిస్తున్న శ్రీ గురజాడ అప్పారావుగారు క్రొంగ్రొత్తగా ప్రచారంలోనికి తెచ్చి ఉన్నారు. 'ముత్యాలసరాలు' తొలి మూడు పాదాలలో 3 మాత్రలు+4 మాత్రలు రెండు మార్లు ఉంటాయి; నాల్గవపాదం అసంపూర్ణంగా ఉంటుంది. తరళం ప్రతిపాదం ఒక 'ముత్యాలసరం' అని అభిజ్ఞులు గుర్తించవలసి ఉంటుంది.

వ. మఱియు వసుమతీ ఖాత గర్వితులైన సగరసుతులం దనదృష్టితీవ్ర దహనంబునం జేసి దహించిన కపిలుం డను మహాముని నారాయణుండయ్యె; నట్టి నరనారాయణు లాదిమునులు జగదుపకారులు జగతీ భారావతరణ కారణులై దైత్యదానవవధార్థంబు మర్త్యంబునం బుట్టినవారు గావున. 375

ప్రతిపదార్థం: మఱియు= అదియునుగాక, వసుమతీ, ఖాత, గర్వితులు+ఐన= భూమిని త్రవ్వటం చేత మదించిన; సగర, సుతులన్= సగరుడియొక్క కొడుకులను; తన, దృష్టి, తీవ్ర, దహనంబునన్+చేసి= తనయొక్క చూపు లనే తీవ్రమైన అగ్నిచేత; దహించిన= కాల్చిన; కపిలుండు+అను, మహాముని= కపిలు డనే పేరు కల గొప్పఋషి; నారాయణుండు+అయ్యెన్= నారాయణుడనే ముని అయ్యాడు; అట్టి; నరనారాయణులు= నరుడున్నూ, నారాయణుడున్నూ; ఆది, మునులు= తొల్లిటి ఋషులు; జగత్+ఉపకారులు= లోకానికి మేలు చేకూర్చేవారు; జగతీ భార+అవతరణ, కారణులు+ఐ= లోకంయొక్క బరువును తీర్చటానికై జన్మించిన హేతువు కలవారై; దైత్య, దానవ, వధ+అర్థంబు= దైత్యులను, దానవులను సంహరించటం కొరకు; మర్త్యంబునన్= భూలోకంలో; పుట్టినవారు= జన్మించినవారు; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: భూమిని పాతాళంవరకు తొలచటంచేత గర్వం చెందిన సగరసుతులను తన వాడి చూపుల అగ్నిచేత కాల్చివేసిన కపిలు డనే గొప్పముని నారాయణు డయ్యాడు. అట్టి నరనారాయణులు ఆదిఋషులు. వారు విశ్వశ్రేయస్సును ఒనగూర్చేవారు; దైత్యులను, దానవులను వధించి, భూభారాన్ని తీర్చటానికై అవతరించిన కారణజన్ములు.

క. దేవతలకు నపకారము । గావించిన యన్నివాతకవచులఁ బాతా
ళావాసుల దానవుల మ । హావీరుఁడు వీఁ డభేద్యుఁ డై వధియించున్.' 376

ప్రతిపదార్థం: దేవతలకున్+అపకారము, కావించిన= స్వర్గవాసులకు కీడు చేసిన; ఆ+నివాత, కవచులన్= ఆ నివాత కవచులు అనే వారిని; పాతాళ+ఆవాసులన్= పాతాళంలో నివసించే వారిని; దానవులన్= రాక్షసులను; మహా, వీరుఁడు= గొప్ప యోధుడు; వీఁడు= ఇతడు (ఈ అర్జునుడు); న+భేద్యుఁడు+ఐ= జయించబడనివాడై; వధియించున్= చంపుతాడు.

తాత్పర్యం: దేవతలకు కీడు చేసిన రాక్షసులు, పాతాళంలో నివసించేవారు అయిన ఆ నివాతకవచులను మహావీరుడైన ఈ అర్జునుడు అజేయుడై సంహరించగలడు.'

వ. అని తత్ప్రభావంబు సెప్పి యింద్రుండు రోమశున కిట్లనియె 'మునీంద్రా! నీవు మర్త్యలోకంబునకుం బోయి ధర్మజుం గని యతనికిం దత్సహోదరులకు సంతోషంబుగా నా యొద్దం బార్థుండున్న కుశలవార్త యెఱింగించి, భీష్మ ద్రోణ కర్ణాది వీరుల నోర్చునట్టి దివ్యాస్త్రంబులు వడసె, నతండు మీ యొద్దకు వేగంబ వచ్చు, వగవకుండుం డని చెప్పి నా వచనంబున ధర్మజు నఖిలతీర్థసేవ సేయం బంపు; మట్లయిన నపేతదురితుండై యఖిల మహీరాజ్యంబు వడయు; నతండు తీర్థాభిగమనంబు సేయునపుడు నీ వాతనికి సహాయుండవు గ'మ్మని యింద్రుండు రోమశుం బనిచె; నిట ధృతరాష్ట్రుం డర్జును దివ్యాస్త్రలాభంబుఁ బారాశర్యువలన నెఱింగి పరమవ్యాకులహృదయుండై సంజయున కిట్లనియె. 377

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని; తద్+ప్రభావంబు= ఆతడి (అర్జునుడి) మహిమ; చెప్పి; ఇంద్రుండు= ఇంద్రుడు; రోమశునకు+ఇట్లు+అనియె; ముని+ఇంద్రా!= ఋషులలో శ్రేష్ఠుడవైన వాడా!; నీవు, మర్త్య, లోకంబునకున్+పోయి= భూలోకానికి వెళ్ళి; ధర్మజున్+కని= ధర్మరాజును చూచి; అతనికిన్= అతడికిన్నీ; తద్+సహోదరులకున్= ఆతడి సోదరులకున్నూ; సంతోషంబుగాన్= సంతోషం కలిగేట్లుగా, పార్థుండు= అర్జునుడు; నా, ఒద్దన్= నా దగ్గర; ఉన్న= ఉన్నట్టి; కుశలవార్త= క్షేమసమాచారం; ఎఱింగించి= తెలిపి; భీష్మ, ద్రోణ, కర్ణ+ఆది, వీరులన్= భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు మున్నగు శూరులను; ఓర్చు+అట్టి= జయించే; దివ్య+అస్త్రంబులు= దివ్యమైన బాణాలు; పడసెన్= పొందాడు; అతండు= అతడు (అర్జునుడు); మీ+ఒద్దకు= మీకడకు; వేగంబు+అ, వచ్చు= శీఘ్రమే రాగలడు; వగవక+ఉండుండు= దుఃఖించ వద్దు; అని, చెప్పి= అని పలికి; నా వచనంబునన్= నా మాట చొప్పున; ధర్మజున్= ధర్మరాజును; అఖిల, తీర్థ, సేవ+చేయన్+పంపుము= సమస్తములైన పుణ్య, క్షేత్రాలు దర్శించటానికి పంపుము; అట్లు+అయినన్= ఆ విధంగా చేస్తే; అపేత, దురితుండు+ఐ= పోగొట్టుకొన్న పాపాలు కలవాడై, అంటేపాపాలు పోయినవాడై; అఖిల, మహీ, రాజ్యంబు= సమస్తభూరాజ్యం; పడయున్= పొందగలడు; అతండు= ఆ ధర్మరాజు; తీర్థ+అభిగమనంబు+చేయునపుడు= పుణ్యక్షేత్రాలకు యాత్రలు చేసేటప్పుడు; నీవు+అతనికి= నీవు ఆ ధర్మరాజుకు; సహాయుండవు కమ్ము= సాయం చేయుము; అని= అని చెప్పి; ఇంద్రుండు= ఇంద్రుడు; రోమశున్= రోమశమునిని; పనిచెన్= నియోగించాడు; ఇట= ఈ భూలోకంలో; అర్జును, దివ్య+అస్త్ర, లాభంబున్= అర్జునుడి దివ్యాలైన అస్త్రాల సంపాదన; పారాశర్యువలనన్= వ్యాసుడి వలన; ఎఱింగి= తెలిసికొని; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; పరమ, వ్యాకుల హృదయుండు+ఐ= మిక్కిలి కలవరపాటు చెందిన హృదయం కలవాడై; సంజయునకు= సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆవిధంగా నరనారాయణుల మహిమ వివరించి, ఇంద్రుడు రోమశునితో ఇట్లా అన్నాడు: 'మునీంద్రా! నీవు భూలోకానికి వెళ్ళి ధర్మరాజును చూచి అతడికి, అతడి తమ్ములకు సంతోషం కలిగేటట్లు నా ఒద్ద అర్జునుడు కుశలంగా ఉన్న వార్త తెలిపి- అర్జునుడు భీష్మ ద్రోణ కర్ణాది మహావీరులను జయించగల దివ్యాస్త్రాలు పొందాడు. అతడు మీ దగ్గరికి శీఘ్రంగా రాగలడు. చింతించవద్దు' అని చెప్పుము. నా మాటగా చెప్పి నీవు ధర్మరాజును తీర్థయాత్రలు చేయ నియోగించుము. అట్లా చేస్తే అతడు పాపరహితుడై తిరిగి సమస్త భూరాజ్యం పొందగలడు. అతడు తీర్థయాత్రలు చేసేటప్పుడు నీ వాతనికి సహాయుడివై ఉండుము'- అని ఇంద్రుడు రోమశుడిని ఆదేశించాడు. ఇక్కడ, భూలోకంలో ధృతరాష్ట్రుడు వ్యాసుడివలన అర్జునుడు దివ్యాస్త్రాలు సంపాదించాడని తెలిసికొని మిక్కిలి కలవరపాటు చెంది, సంజయుడితో ఇట్లా అన్నాడు.

సీ. **'సురసమూహంబుతో సురరాజు నోడించి । ఖాండవం బెక్కటి కాల్చియున్న**
వీరున, కఖిలాబ్ధివృతవసుంధరఁ గల । రాజుల నోర్చి పరాక్రమమున
నగ్రజు రాజసూయాధ్వర మనిచిన । యధికసమర్థున, కర్జునునకుఁ,
బ్రబలసింహమునకుఁ బక్కెర వెట్టిన । యట్లు దేవతలు నెయ్యంబుతోడఁ

ఆ. **బరముఁ దొట్టి పాశుపత మాదిగా దివ్య । శరము లిచ్చి రట్టె! శౌర్య మెసఁగ**
నట్టి నరుఁడు యోధుఁడై యున్న పాండవ । వరులఁ జెనయు నంత వారుఁ గలరె? **378**

ప్రతిపదార్థం: సుర, సమూహంబుతోన్= దేవతల సముదాయంతో; సురరాజున్= దేవేంద్రుడిని; ఓడించి; ఖాండవంబు= ఖాండవమనే పేరుకల అడవిని; ఎక్కటి= ఒంటరిగా; కాల్చి, ఉన్న= దహించి+ఉన్న; వీరునకు= శూరునకు; అఖిల+అబ్ధి, వృత, వసుంధరన్+కల= సమస్తసముద్రాలచేత చుట్టుకొనబడిన భూమిలో ఉన్న; రాజులన్+ఓర్చి= రాజులను జయించి;

పరాక్రమమునన్= శౌర్యంతో; రాజసూయ+అధ్వరము+అనిచిన= రాజసూయ యజ్ఞాన్ని నిర్వహించిన; అధిక, సమర్థునకున్= గొప్ప శక్తి కల అర్జునుడికి; ప్రబల, సింహమునకున్= గొప్ప బలం కల సింహానికి; పక్కెర, పెట్టిన+అట్లు= కవచం తొడిగినట్లు; నెయ్యంబు తోడన్= స్నేహంతో; పరమున్ తొట్టి= పరమశివుడు మొదలుగా గల దేవతలు; పాశుపతము+ఆదిగా= పాశుపతం మొదలైన; దివ్య, శరములు= దివ్యాస్త్రాలు; శౌర్యము+ఎసఁగన్= పరాక్రమం ప్రజ్వలించేటట్లుగా; ఇచ్చిరి+అట్టె= ఇచ్చారుకదా!; అట్టి, నరుఁడు= అటువంటి అర్జునుడు; యోధుఁడు+ఐ+ఉన్న= వీరుడై ఉంటే; పాండవ, వరులన్= శ్రేష్ఠులైన పాండవులను; చెనయు+అంతవారున్= ఎదిరించేవారు; కలరె= ఉన్నారా!

తాత్పర్యం: 'అర్జునుడు సురసేనాసమేతుడైన దేవేంద్రుడిని ఓడించి, ఖాండవవనాన్ని ఒంటరిగా దహనం చేశాడు. సముద్రాలచేత చుట్టబడిన భూమండలంలో ఉండే రాజులను అందరిని జయించి ధర్మరాజుచేత రాజసూయయాగాన్ని మిక్కిలి సామర్థ్యంతో నిర్వహింపజేశాడు. నైసర్గికంగా గొప్ప బలం కల సింహానికి కవచం తొడిగి (కవచంతో) సత్కరించినట్లు పరమశివుడితో పాటు దేవతలు అందరు పాశుపతం మున్నగు దివ్యబాణా లిచ్చి అర్జునుడిని సమ్మానించారు కదా! అట్టి శౌర్యధురంధరుడు యోధుడై ఉండగా ఇక పాండవులను మార్కొనేవారు ఎవరుంటారు?

విశేషం: పక్కెర పెట్టటం: మంచి గుర్రాలకు, పట్టపుటేనుగులకు రత్నాంబరాలు, ఆభరణాలతో కూడిన కంచుకం తొడిగి అలంకరించటం పరిపాటి. ఆరీతిగా ప్రభువులు గుర్రాలకు పట్టపుటేనుగులకు 'పక్కెర వెట్టినట్లు', దేవతలు అర్జునుడికి దివ్యాస్త్రాలు సమకూర్చారు. అసలే అర్జునుడు తేజస్వి. ఇక అతడికి పక్కెరను పోలిన దివ్యాస్త్రాలు సంక్రమించాయి. మఱి అతడికి పట్ట పగ్గాలుంటాయా? - అని ధృతరాష్ట్రుడి ఆవేదన.

క. వారికి, ధర్మువు దప్పని । వారికి, దృఢవచను లైన వారికి, విమలా
చారుల కెద్దియుఁ బడయఁగ । దూరమె, పాండవులఁ బోలుదురె వీరు లొరుల్. 379

ప్రతిపదార్థం: వారికి= ఆ పాండవులకు; ధర్మువు= ధర్మం; తప్పని వారికి; దృఢవచనులు+ఐనవారికి= గట్టి మాటలు కలవారికి అంటే సత్యసంధు లయిన వారికి; విమల+ఆచారులకు= నిర్మలమైన ప్రవర్తన కలవారికి; ఎద్దియున్= ఏదయినను; పడయఁగన్= పొందగా; దూరమె= దూరమా? అంటే ఏదయినను వారు కోరుకొన్నదానిని పొందటం అసాధ్యమా?; వీరులు= శూరులు; ఒరుల్= ఇతరులు; పాండవులన్= పాండవులను; పోలుదురె= సరిపోలుతారా!

తాత్పర్యం: పాండవులు ధర్మం తప్పనివారు; సత్యసంధులు; పరిశుద్ధమైన ప్రవర్తన కలవారు. కనుక వారు దేనిని కోరినా పొందగలరు. ఇతర వీరులు ఎవరైనాసరే పాండవులతో సరిపోలగలరా?

వ. వారలతో విగ్రహించి దుర్యోధనుండు దనకుఁ దన బాంధవులకు సుహృజ్జనంబులకు హాని సేసికొనియె. 380

ప్రతిపదార్థం: వారలతోన్= ఆ పాండవులతో; విగ్రహించి= శత్రుత్వం వహించి; దుర్యోధనుండు= దుర్యోధనుడు; తనకున్= తనకున్నూ; తన బాంధవులకున్= తన చుట్టాలకున్నూ; సుహృత్+జనంబులకున్= మిత్రులైన జనులకున్నూ; హాని= కీడు; చేసికొనియెన్= తెచ్చిపెట్టుకొన్నాడు.

తాత్పర్యం: అట్టి పాండవులతో విరోధం వహించి దుర్యోధనుడు తనకున్నూ, తన బంధుమిత్రులకున్నూ చేతులార కీడు తెచ్చిపెట్టుకొన్నాడు.

ఆ. పర్వతములు వజ్రపాతాహతిని బోక। తక్కునేని, నింద్రతనయు దివ్య
నిశితబాణతతుల నిశ్శేష మగుననఁ। బరుల సైన్య మెట్లు బ్రదుక నేర్చు? 381

ప్రతిపదార్థం: పర్వతములు= కొండలు; వజ్ర, పాత+ఆహతిని= వజ్రాయుధంయొక్క తాకిడి దెబ్బవలన; పోక, తక్కునేనిన్= పగులకుండ నిలిచినప్పటికిని; ఇంద్ర, తనయు= అర్జునుడియొక్క; దివ్య నిశిత, బాణ, తతుల= దివ్యాలైన వాడి అయిన అమ్ముల సముదాయంచేత; నిశ్శేషము+అగున్+అనన్= మిగులనివి అవుతాయని చెప్పితే; పరుల సైన్యము= శత్రుసేన; ఎట్లు= ఏ తీరుగా; బ్రదుకనేర్చున్?= జీవించి ఉంటుంది?

తాత్పర్యం: పర్వతాలు వజ్రాయుధం దెబ్బకు ఒకవేళ పగిలి పోకుండా ఉన్నప్పటికిని, అర్జునుడి దివ్యబాణ సముదాయాలచేత మిగులకుండా నశించిపోతాయి- అని అనగా, ఇక శత్రువులసేన ఎట్లా బ్రతుకుతుంది?

వ. లయకాలోదిత సహస్రకరు కిరణంబులం జరాచరంబులు దప్తంబులగునట్లు పార్థు బాణంబులం జేసి దుర్యోధనాదులు దుస్సహతాపంబుఁ బొందుదు' రని దుఃఖితుం డైన ధృతరాష్ట్రునకు సంజయుం డిట్లనియె. 382

ప్రతిపదార్థం: లయకాల+ఉదిత, సహస్ర, కరు, కిరణంబులన్= ప్రళయ సమయంలో ఉదయించిన సూర్యుడియొక్క (సహస్రకరుడు= వేయిచేతులు గలవాడు) కిరణాలచేత; చర+అచరంబులు= కదిలేటివి, కదలనట్టివి; తప్తంబులు+అగునట్లు= మాడిపోయే విధంగా; పార్థు= అర్జునుడియొక్క; బాణంబులన్+చేసి= బాణాలచేత; దుర్యోధన+ఆదులు= దుర్యోధనుడు మున్నగువారు; దుస్సహ తాపంబున్= సహించలేని బాధను; పొందుదురు= అనుభవిస్తారు; అని= అని చెప్పి; దుఃఖితుండు+ఐన= శోకం పొందినట్టివాడైన; ధృతరాష్ట్రునకు; సంజయుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ప్రళయకాలంలో ఉదయించే సూర్యుడి వేడికిరణాలకు చరాచరాలన్నీ మాడిపోయేటట్లు, అర్జునుడి వాడి బాణాలకు దుర్యోధనాదులు సహించలేని బాధ పొందుతారు' - అని ధృతరాష్ట్రుడు దుఃఖించగా సంజయుడు ఇట్లా అన్నాడు.

క. 'ఈసున దుర్యోధన దు। శ్శాసను లొగిఁ బాండవులకు సభలో నెగ్గుల్
సేసిన విని వారల నను। శాసింపక వగలఁ బొగులఁ జనునే నీకున్? 383

ప్రతిపదార్థం: ఈసునన్= అసూయతో; దుర్యోధన, దుశ్శాసనులు+ఒగిన్= దుర్యోధనుడు, దుశ్శాసనుడు పూనికతో; పాండవులకున్= పాండురాజుకొడుకులకు; సభలోన్= కొలువుకూటంలో; ఎగ్గుల్= అపకారాలు; చేసిన; విని= ఆలకించి; వారలన్= ఆ దుర్యోధన దుశ్శాసనులను; అనుశాసింపక= శిక్షించక; నీకున్= నీకు; వగలన్= దుఃఖంతో; పొగులన్+చనునే= బాధ పడటం తగునా?

తాత్పర్యం: 'దుర్యోధన దుశ్శాసనుల అసూయతో పాండవులకు నిండుసభలో కీడు చేయటం విని, వాళ్ళను శిక్షించకుండ, నీ విప్పుడు దుఃఖంతో బాధపడటం తగునా?

విశేషం: 'శాసింపఁగ వలవ దనఁగఁ జనదే నీకున్'- ఈ పాఠాంతరం కొన్ని ప్రతుల్లో ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. నీయుపేక్షం జేసి దుర్యోధనుచేత దుర్ద్యూత పరాజితులై రాజ్యంబు విడిచి పాండవు లరిగి కామ్యకవనంబున నున్నఁ, గృష్ణుం డనేకరాజసమన్వితుండై వారి యొద్దకు వచ్చి నీ కొడుకులు సేసిన నికారంబునకుం గృష్ణాపరిభవంబునకు దుఃఖితుండై కడు నలిగి, మీకు నెగ్గు సేసిన దుర్యోధనాదుల దూషించి గజపురంబున ధర్మరాజు రాజ్యాభిషిక్తుం జేయుదు ననియు, రాజసూయంబు సేయు నాఁడింద్రప్రస్థంబుననైన విభూతికంటె విశేషవిభూతి గావింతు ననియు, ద్రుపద సృంజయ కేకయ ధృష్టద్యుమ్న బలదేవ సాంబ సాత్యకి ప్రభృతుల సమక్షంబునం బలికి, సత్యసమయులైన పాండవులచేత సంరంభ నివారితుండై, పార్థుసారథ్యంబునకుఁ బ్రార్థితుం డయ్యె నని వింటిమి. 384

ప్రతిపదార్థం: నీ, ఉపేక్షన్+చేసి= నీ ఒప్పరికంవలన (అశ్రద్ధ వల్ల); దుర్యోధనుచేత; దుర్ద్యూత, పరాజితులు+ఐ= దుష్టమైన జూదంలో ఓడించబడిన వారై; రాజ్యంబు, విడిచి= రాజ్యాన్ని వీడి; పాండవులు= పాండురాజు కొడుకులు; అరిగి= వెళ్ళి; కామ్యక, వనంబునన్+ఉన్నన్= కామ్యక మనే పేరుకల అడవిలో ఉండగా; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; అనేక, రాజ, సమన్వితుండు+ఐ= పెక్కుమంది రాజులతో కూడినవాడై; వారి+ఒద్దకున్= ఆ పాండవుల దగ్గరకు; వచ్చి= అరుదెంచి; నీ, కొడుకులు+చేసిన; నికారంబునకున్= మోసానికి; కృష్ణా, పరిభవంబునకు= ద్రౌపదికి జరిగిన అవమానానికి; దుఃఖితుండు+ఐ= చింతించినవాడై; కడు+అలిగి= మిక్కిలి కోపించి; మీకున్+ఎగ్గు+చేసిన= మీకు కీడు ఒనరించిన; దుర్యోధన+ఆదుల= దుర్యోధనుడు మున్నగు వారిని; దూషించి= నిందించి; గజ, పురంబున= హస్తినాపురంలో; ధర్మరాజున్= ధర్మపుత్రుడిని; రాజ్య+అభిషిక్తున్+చేయుదును +అనియు= రాజ్యానికి పట్టాభిషిక్తుడిగా చేస్తాననిన్నీ; రాజ, సూయంబు+చేయునాఁడు= రాజసూయయాగం చేసినప్పుడు; ఇంద్ర, ప్రస్థంబునన్+ఐన= ఇంద్రప్రస్థపురంలో ఏర్పడినట్టి; విభూతికంటె= ఐశ్వర్యంకంటె; విశేష, విభూతి= గొప్ప ఐశ్వర్యం; కావింతున్+అనియు= కలిగేట్లు చేస్తాననియు; ద్రుపద, సృంజయ, కేకయ, ధృష్టద్యుమ్న, బలదేవ, సాంబ, సాత్యకి, ప్రభృతుల, సమక్షంబునన్= ద్రుపదుడు, సృంజయుడు, కేకయుడు, ధృష్టద్యుమ్నుడు, బలదేవుడు, సాంబుడు, సాత్యకి మున్నగువారి ముందు; పలికి= మాటాడి; సత్య, సమయులు+ఐన= సత్యమైన శపథం కలవారైన; పాండవులచేత; సంరంభ, నివారితుండు+ఐ= సంరంభం నుండి నివారింపబడిన వాడై; పార్థు సారథ్యంబునకున్= అర్జునుడి రథాన్ని తోలటానికి; ప్రార్థితుండు+అయ్యెన్= ప్రార్థించబడినవా డయ్యాడు; అని; వింటిమి= విన్నాం.

తాత్పర్యం: నీ అశ్రద్ధవలన పాండవులు దుర్యోధనుడు పన్నిన మాయజూదంలో ఓడిపోయి రాజ్యాన్ని వదలి కామ్యకవనంలో ఉన్నారు. అక్కడికి శ్రీకృష్ణుడు పెక్కుమందిరాజులతో కలసి వెళ్ళి, పాండవులను పరామర్శించి, నీ కొడుకులు చేసిన మోసానికి, ద్రౌపదికి జరిగిన అవమానానికి చింతించి, మిక్కిలి కోపించి 'మీకు కీడు చేసిన దుర్యోధనాదులను నిందించి, ధర్మరాజును హస్తినాపురంలో పట్టాభిషిక్తుడిని కావిస్తాను' అని ప్రతిజ్ఞ చేసి, 'మీకు రాజసూయయాగ సమయంలో ఇంద్రప్రస్థ పురంలో ఏర్పడిన వైభవంకంటె గొప్పవైభవం కలిగిస్తా' నని ద్రుపద, సృంజయ, కేకయ, ధృష్టద్యుమ్న, బలదేవ, సాంబ, సాత్యకి ప్రభృతులముందు పలికాడు. కాని సత్యసంధులైన పాండవులు తాము ఒడంబడిన సమయాన్ని మీరలేమని శ్రీకృష్ణుడి సంరంభాన్ని మాన్పి, అతడిని అర్జునుడికి సారథ్యం చేయటానికి అంగీకరించుమని ప్రార్థించారు - అని విన్నాము.

క. పదుమూఁడేండ్లుం బోయినఁ । బదునాల్గగు నేఁడు ఘనులు పాండవులు జగ
ద్విదితముగ నుత్సహింతురు । వదలక రణమునకుఁ గేశవపురస్కృతులై. 385

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పదుమూఁడు+ఏండ్లున్+పోయినన్= పదమూడు సంవత్సరాలు గడిచిన తర్వాత; పదునాల్గగు+ఏఁడు= పదునాల్గవ ఏట; ఘనులు= గొప్పవారు (అయిన); పాండవులు; కేశవపురస్+కృతులు+ఐ= శ్రీకృష్ణుడిని ముందు పెట్టుకొన్నవారై; వదలక= విడువక; రణమునకున్= యుద్ధానికి; జగత్+విదితముగన్= లోకమంతటికి తేటతెల్లంగా; ఉత్సహింతురు= పూనికతో ప్రయత్నం చేస్తారు.

తాత్పర్యం: గొప్పవారైన పాండవులు పదమూడేండ్లు గడచిన వెనువెంటనే పదునాల్గవ సంవత్సరంలో శ్రీకృష్ణుడిని ముందుపెట్టుకొని విడువని పూనికతో యుద్ధానికి జగద్విదితంగా ప్రయత్నిస్తారు.

క. వరములు వేల్పులచే దు । ష్కర తపమునఁ బడయుదురు జగంబున నొరు; లీ
శ్వరుచే వరములు వడసెం । గరుణ ధనంజయుఁడు తనదు కార్ముకశక్తిన్. 386

ప్రతిపదార్థం: జగంబునన్= లోకంలో; ఒరులు= ఇతరులు; వరములు= కోరికలను; వేల్పులచే= దేవతలచేత; దుష్కర, తపమునన్= కఠినమైన తపస్సుచేత; పడయుదురు= పొందుతారు; ధనంజయుఁడు= అర్జునుడు; తనదు, కార్ముక, శక్తిన్= తన విలువిద్యయొక్క మహిమచేత; ఈశ్వరుచేన్= పరమశివుడివలన; కరుణన్= దయతో; వరములు+వడసెన్= వరాలు పొందాడు.

తాత్పర్యం: లోకంలో ఎవరైనా ఘోరమైన తపస్సులు చేసి దేవతలచేత వరాలు పొందుతుంటారు కదా! అర్జునుడు తన విలువిద్యచేత పరమేశ్వరుడిని మెప్పించి ఆయన కరుణవలన వరాలు పొందాడు.

వ. అయ్యర్జును దివ్యశర సంఘాతంబును, భీమసేను చిత్ర గదా ఘాతంబును, నీ యుపేక్షానిర్ఘాతంబును గౌరవ పరిక్షయంబునకుఁ గారణభూతంబు' లనిన సంజయునకు ధృతరాష్ట్రుం డిట్లనియె. 387

ప్రతిపదార్థం: ఆ+అర్జును= ఆ అర్జునుడియొక్క; దివ్య, శర, సంఘాతంబును= దివ్యమైన బాణాల సముదాయమున్నూ; భీమసేను= భీముడియొక్క; చిత్ర, గదా+ఆఘాతంబును= అద్భుతమైన గదయొక్క తాకిడియున్నూ; నీ, ఉపేక్షా, నిర్ఘాతంబును= నీదైన అశ్రద్ధ అనే పిడుగుపాటున్నూ; కౌరవ, పరిక్షయంబునకున్= కౌరవుల నాశనానికి; కారణ, భూతంబులు= హేతువులైనవి; అనినన్= అని చెప్పగా; సంజయునకు; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: మహావీరుడైన అర్జునుడియొక్క దివ్యాలైన మంత్రబాణాలున్నూ, భీమసేనుడి గదయొక్క దెబ్బలున్నూ, నీదైన అశ్రద్ధ అనే పిడుగుపాటున్నూ కౌరవుల వినాశానికి మూలకారణాలు'- అని సంజయుడు చెప్పగా ధృతరాష్ట్రుడు ఈ విధంగా బదులు పలికాడు.

క. 'వృద్ధుని, జాత్యంధుం డని, । బుద్ధివిహీనుఁ డని నన్నుఁ బుత్త్రుఁడు బల ద
ర్పోద్ధతుఁడై, మెచ్చఁ, డసం । బద్ధంబులె కాని వినఁడు పలికిన పలుకుల్. 388

ప్రతిపదార్థం: వృద్ధు+అని= ముసలి వాడని; జాత్యంధుండు+అని= పుట్టుకచేత గ్రుడ్డివాడని; బుద్ధి, విహీనుఁడు+అని= బుద్ధిలేని వాడని; నన్నున్= నన్ను; పుత్త్రుఁడు= కొడుకు (దుర్యోధనుడు); బల, దర్ప+ఉద్ధతుఁడు+ఐ= బలంచేత ఏర్పడిన గర్వంచేత అతిశయించినవాడై; మెచ్చఁడు= లక్ష్యపెట్టడు; అసంబద్ధంబులె కాని= అవకతవకలనే కాని; పలుకుల్= చెప్పిన మాటలు; వినఁడు= సమ్మతించడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నేను ముసలివాడిననిన్నీ, గుడ్డివాడిననిన్నీ, బుద్ధిలేనివాడిననిన్నీ, నన్ను నా పుత్రుడైన దుర్యోధనుడు కండకావరంచేత మెచ్చడు. వాడికి అసంబద్ధ ప్రలాపాలు మాత్రమే నచ్చుతాయి. వాడు నా మాటలు వినడు.

వ. దుర్యోధనుండు దుర్బుద్ధి యని యేమి సెప్పవలయు? భీష్మ ద్రోణ విదురాదుల నాదరింపక కర్ణశకునుల నాప్తులం జేసికొని వారి వచనంబుల నెగడు, నేనేమి సేయుదు?' నని ధృతరాష్ట్రుండు మిన్నకుండె; నిట పాండవులు పార్థు మసలుటకు దుఃఖితులై. 389

ప్రతిపదార్థం: దుర్యోధనుండు= దుర్యోధనుడు; దుర్బుద్ధి= చెడుబుద్ధి కలవాడు; అని= అంటూ; ఏమి+చెప్పవలయు= ఏమి చెప్పాలి?; భీష్మ, ద్రోణ, విదుర+ఆదులన్= భీష్ముడు, ద్రోణుడు, విదురుడు మున్నగు వారిని; ఆదరింపక= గౌరవించక; కర్ణ, శకునులన్= కర్ణుడిని, శకునిని; ఆప్తులన్+చేసికొని= ప్రియ మిత్రులుగా స్వీకరించి; వారి వచనంబులు+అ= వారి మాటల చొప్పున; నెగడు= పెచ్చుపెరుగుతాడు; నేను+ఏమి+చేయుదున్?= ఏమి చేయగలను?; అని= అని పలికి; ధృతరాష్ట్రుండు; మిన్నక+ఉండెన్= ఊరకున్నాడు; ఇట= ఇచట; పాండవులు; పార్థు, మసలుటకు= అర్జునుడు (తిరిగి రావటానికి) ఆలస్యం చేయటానికి; దుఃఖితులు+ఐ= పరితాపంచెందినవారై.

తాత్పర్యం: దుర్యోధనుడు దుర్బుద్ధికలవాడు. వాడు భీష్మద్రోణ విదురులు మున్నగువారు చెప్పిన మాటలు వినక, కర్ణుడిని శకునిని ప్రియమిత్రులుగా మన్నించి వారిమాటలచొప్పున విర్రవీగుతాడు; నే నేమి చేయగలను?'- అని ధృతరాష్ట్రుడు ఊరకున్నాడు. ఇక్కడ పాండవులు అర్జునుడు తిరిగి రావటంలో జరిగిన జాప్యానికి పరితాపం చెందుతున్నారు.

ఉ. 'పాండవసింహ మర్జునుఁడు పాండుయశంబు వెలుంగుచుండ నా
ఖండలుదొట్టి నిర్జరనికాయముచేత వరంబు గాంచి యె
న్నం డిట వచ్చునొక్కొ? సుజనస్తుతు నాతనిఁ బ్రీతిఁ జూడ నె
న్నండొకొ కాంతు' మంచును మనంబునఁ గోరుచు నుండి రెంతయున్. 390

ప్రతిపదార్థం: పాండవ, సింహము= పాండవులలో సింహంవంటివాడైన అర్జునుడు; పాండు, యశంబు= తెల్లని కీర్తి; వెలుంగుచుండన్= ప్రకాశిస్తుండగా; ఆఖండలు+తొట్టి= దేవేంద్రుడు మొదలుగా కల; నిర్జర, నికాయముచేత= దేవతల సముదాయంచేత; వరంబు+కాంచి= వరం పొంది; ఎన్నండు+ఇట, వచ్చున్+ఒక్కొ!= ఎప్పుడు ఇక్కడికి వస్తాడో!; సుజన స్తుతున్= మంచివారిచేత పొగడబడేవాడిని; ఆతనిన్= అతడిని; ప్రీతిన్= ప్రేమతో; చూడన్+ఎన్నండు+ఒకొ, కాంతుము+అంచును= ఎన్నడు చూడగలమో అని; ఎంతయున్= మిక్కిలి; మనంబునన్= మనస్సులో; కోరుచున్+ఉండిరి= అభిలిషిస్తూ ఉన్నారు.

తాత్పర్యం: 'పాండవులలో సింహంవంటివాడు మా అర్జునుడు. స్వచ్ఛమైన తెల్లనికీర్తితో వెలుగొందుతూ దేవేంద్రుడు మున్నగు దేవతలచేత వరాలు పొంది ఎన్నడు ఇక్కడికి వస్తాడా? మే మెప్పుడు ఆతడిని తిరిగి చూడగలమా?' - అని మనస్సులో అనుకొంటూ అతడిరాకకై ఎదురు చూస్తూ ఉన్నారు.

వ. అట్టి యవసరంబున యుధిష్ఠిరునకు భీముం డిట్లనియె. 391

ప్రతిపదార్థం: అట్టి+అవసరంబునన్= ఆ సమయంలో; యుధిష్ఠిరునకున్= ధర్మరాజుతో; భీముండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో ధర్మరాజుతో భీముడు ఇట్లా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మధ్యాక్కర.

'నీ నిదేశంబున నరిగి పార్థుండు నిష్ఠతోఁ దపము
మానుగాఁ జేయుచునున్నవాఁ డేల మసలెనో రాక?
వాని ధర్మస్థితుఁ బాసియున్న యివ్వర్షముల్ యుగ స
మానంబు లైనవి మనకు నతని సమాగమకాంక్ష. 392

ప్రతిపదార్థం: నీ, నిదేశంబునన్= నీ ఆజ్ఞ చొప్పున; అరిగి= వెళ్ళి; పార్థుండు= అర్జునుడు; నిష్ఠతోన్= దీక్షతో; తపము= తపస్సు; మానుగాన్= ఒప్పేటట్లుగా; చేయుచున్+ఉన్నవాఁడు= చేస్తున్నవాడు; ఏల= ఎందుచేత; రాక= తిరిగిరాకుండా; మసలెనో= ఆలస్యం చేశాడో?; వాని, ధర్మస్థితున్= ధర్మాత్ముడైన ఆతడిని; పాసి+ఉన్న= విడిచి ఉన్న; ఈ+వర్షముల్= ఈ సంవత్సరాలు; అతని, సమాగమ, కాంక్షన్= అతడిని కలిసికొనాలనే కోరికతో; మనకున్= మనఅందరికి; యుగ, సమానంబులు+ ఐనవి= యుగాలతో సమానాలు అయ్యాయి. (యుగం= పెక్కు సంవత్సరాల సమాహారం).

తాత్పర్యం: 'నీ ఆజ్ఞ చొప్పుననే కదా అర్జునుడు దీక్షతో తపస్సు చేయటానికి వెళ్ళింది. మరి తిరిగి రావటంలో ఇంత జాప్య మెందుకు జరుగుతున్నదో? ధర్మవర్తనుడైన అర్జునుడిని ఎడబాసి ఉండే ఈ సంవత్సరాలే, ఆతడిని కలుసుకోవాలనే కాంక్షచేత. మనకు యుగాలతో సమానాలయ్యాయి.

విశేషం: ఇవి భీముడి మాటలు. భీముడికి అర్జునుడిపై గల అనురాగం సుస్పష్టం. అంతర్లీనంగా అర్జునుడు పూనింది తీవ్రతపోనిష్ఠ, ప్రోత్సహించి పంపింది ధర్మరాజు. ఆలస్యమైన మాట నిజమే. కాని, అర్జునుడు పూనిన దీక్ష మహత్తరమైనది. సంవత్సరాలు, అనురాగం చొప్పున యుగాలుగా భాసించటం అనుభవవేద్యమే కదా! వృత్తలక్షణానికి ఆర. 1.134 విశేషాంశం చూడండి.

వ. మఱి పాండవ పాంచాల వీరుల జీవనంబు లాతనియంద నిలిచినవి; తదీయ భుజాశ్రయబలంబునం బరుల జయించి ధరణీరాజ్యంబుఁ బరిగ్రహింత మని యున్నవారము; గావునం గాలయాపనంబు సేయక యర్జునుం దోడ్కొని తేర జనార్దను రాఁ బనిచి నియోగింపుము. 393

ప్రతిపదార్థం: మఱి= అదియునుకాక; పాండవ, పాంచాల, వీరుల, జీవనంబులు= పాండవవంశంలోని, పాంచాలకులంలోని శూరుల బ్రతుకులు; ఆతని+అందు+అ= అర్జునుడిపైననే; నిలిచినవి= ఆధారపడి ఉన్నాయి; తదీయ, భుజ+ఆశ్రయ, బలంబునన్= ఆతడియొక్క భుజాలను ఆశ్రయించిన శక్తివలన; పరులన్= శత్రువులను; జయించి; ధరణీ, రాజ్యంబున్= భూరాజ్యాన్ని; పరిగ్రహింతము= స్వీకరిద్దాము; అని+ఉన్నవారము= అని ఉన్నాం; కావునన్= కాబట్టి; కాల, యాపనంబు+చేయక= కాలహరణం చేయక; అర్జునున్+తోడ్కొని, తేర= అర్జునుడిని తీసికొని రావటానికి; జనార్దనున్= శ్రీకృష్ణుడిని; రాన్+పనిచి= రమ్మని ఏర్పాటు చేసి; నియోగింపుము= నిర్దేశించుము.

తాత్పర్యం: ఇక పాండవ పాంచాల వీరుల బ్రతుకులు అర్జునుడిపై ఆధారపడి ఉన్నాయి. మనం అతడి శౌర్యప్రతాపాలను నమ్ముకొని, ఆతడి శక్తివలన శత్రువులను జయించి భూరాజ్యాన్ని తిరిగి పొందాలని ఆలోచిస్తున్న వాళ్ళం కదా! కాబట్టి, ఇక కాలహరణం చేయకుండా అర్జునుడిని తోడ్కొని తేవటానికై శ్రీకృష్ణుడిని పిలిపించి నియోగించండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. సమయాబ్దంబులకంటె ముందర మహోత్సాహంబునన్ బాహువి
క్రమ మొప్పన్ విజయుండు నేనుఁ దగ సంగ్రామంబులో నేక కా
లమునం దా ధృతరాష్ట్రజాధముల నెల్లం జంపి భూచక్ర రా
జ్యము సేకొందుము కౌరవేంద్ర! మురజిత్సఖ్యప్రసాదంబునన్. 394

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర= కౌరవకులంలో ఇంద్రుడి వంటివాడా!; సమయ+అబ్దంబులకంటె, ముందర= చేసిన ప్రతిజ్ఞలో నిర్ణయించబడిన సంవత్సరాలకు ముందు - అంటే అరణ్యవాస అజ్ఞాత వాసాలు ముగించక ముందే; మహా+ఉత్సాహంబునన్= గొప్పదైన సంతోష తన్మయత్వంతో; బాహు, విక్రమము+ఒప్పన్= భుజబల పరాక్రమం విలసిల్లేటట్లు; విజయుండు= అర్జునుడు; నేనున్= నేనును; తగన్= ఒప్పేటట్లుగా; సంగ్రామంబులోన్= యుద్ధంలో; ఏక, కాలమునందు= ఒకే సమయంలో (అంటే నేనున్నూ అర్జునుడున్నూ కలిసి ఒకేసమయంలో యుద్ధం చేస్తే); ఆ, ధృతరాష్ట్రజ+అధములన్+ఎల్లన్= నీచులైన ఆ ధృతరాష్ట్రుడి కొడుకులను అందరిని; చంపి; భూ, చక్ర, రాజ్యము= భూమండల మంతటిని కలిపిన సామ్రాజ్యాన్ని; మురజిత్, సఖ్య, ప్రసాదంబునన్= శ్రీకృష్ణుడి స్నేహం యొక్క దయవలన; చేకొందుము= పరిగ్రహిద్దాం. (మురజిత్= మురుడనే రాక్షసుడిని జయించినవాడు- కృష్ణుడు)

తాత్పర్యం: (ఇవి భీముడి మాటలు) పన్నెండేండ్లు వనవాసం, ఒక ఏడు అజ్ఞాతవాసం చేయవలసిన శపథాన్ని అతిక్రమించి, అంతకు ముందే పరాక్రమంతో విజృంభించి నేను, అర్జునుడు యుద్ధరంగంలో ధృతరాష్ట్రుడి కుమారుల నందరిని కడతేర్చి, భూమండల సామ్రాజ్యాన్ని అంతటిని కైవసం చేసికొనగలం. నేనూ అర్జునుడూ ఏక కాలంలో యుద్ధం చేస్తే మమ్మల్ని ఎదుర్కొనేవారు ఉండరు. శ్రీకృష్ణుడి స్నేహంవలన సులువుగా మే మీ కార్యం నెరవేర్చగలం.

విశేషం: ఈ పద్యంలో భీమసేనుడు ధర్మరాజును 'కౌరవేంద్ర' అని సంబోధిస్తున్నాడు. పాండవులు కూడ కౌరవ వంశీయులే. ప్రాధాన్యవివక్ష చొప్పున పాండవులని వ్యవహరించబడ్డారు.

వ. సత్యభంగభీతుండవు గావున నీ వింద యుండి పదుమూఁడేండ్లుం జలిపి పదంపడి కరిపురంబునకు వచ్చి రాజ్యాభిషిక్తుండ వగుము; దుష్టద్యూతంబున మనరాజ్యం బపహరించిన సుయోధనుండు సుచిర ప్రతిష్ఠితుండు గాకుండ నిప్పుడ యద్దురాత్ము దూషింతుము; నికృతిపరుల నికృతిన చేసి నిర్జించినఁ బాపంబు లేదు; సర్వ ప్రకారంబులను శత్రువుల జయించి రాజ్యంబు సేకొనుట రాజులకు విధిచోదితంబైన రాజధర్మంబ' యనిన భీమసేను మహాసంరంభంబునకు సంతోషించి ధర్మనందనుండాతనిం దనపైకిం దిగిచికొని మూర్ధాఘ్రాణంబు సేసి యిట్లనియె. 395

ప్రతిపదార్థం: సత్య, భంగ, భీతుండవు, కావునన్= (నీవు) సత్యాన్ని భంగం చేయటానికి వెరచేవాడివి కాబట్టి; నీవు; ఇందు+అ+ఉండి= ఈ అరణ్యంలోనే ఉండి; పదుమూఁడు+ఏండ్లున్+చలిపి= పదమూడు సంవత్సరాలు గడిపి; పదంపడి= పిదప; కరిపురంబునకు= హస్తినాపురానికి; వచ్చి= అరుదెంచి; రాజ్య+అభిషిక్తుండవు+అగుము= రాజ్యానికి పట్టాభిషేకం జరుపుకొమ్ము; దుష్ట, ద్యూతంబున= చెడుజూదంలో; మనరాజ్యంబు= మనం పరిపాలించే రాజ్యాన్ని; అపహరించిన= దొంగిలించిన; సుయోధనుండు= దుర్యోధనుడు; సు, చిర, ప్రతిష్ఠితుండు, కాకుండన్= బాగా చాలకాలం పాతుకొని పోకుండ; ఇప్పుడు+అ= ఇప్పుడే; ఆ+దురాత్మున్= ఆ దుష్టుడిని; దూషింతుము= నిందిస్తాం. నికృతిపరులన్= మోసగాండ్రను; నికృతిన చేసి= మోసాన్నే చేసి; నిర్జించినన్= జయించినప్పటికి; పాపంబు, లేదు= దోషం ఉండదు; సర్వ ప్రకారంబులను= అన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రీతులలో; శత్రువులన్= విరోధులను; జయించి= గెలిచి; రాజ్యంబు, చేకొనుట= రాజ్యాన్ని పరిగ్రహించటం; రాజులకు= ప్రభువులకు; విధిచోదితంబు+ఐన= శాస్త్రాలలోని సూత్రాలచేత నిర్దేశించబడిన; రాజ, ధర్మంబు+అ= రాజులు పాటించదగిన ధర్మమే; అనిన= అని చెప్పగా; భీమసేను= భీముడియొక్క; మహాసంరంభంబునకున్= గొప్ప వేగిరపాటుకు; సంతోషించి= సంతోషాన్ని పొంది; ధర్మనందనుండు= ధర్మపుత్రుడు; ఆతనిన్= భీముడిని; తనపైకిన్+తిగిచికొని= తన పైకి లాగుకొని; మూర్ధన్+ఆఘ్రాణంబు+చేసి= వాత్సల్యంతో తలను వాసన చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: నీవు సత్యసంధుడివి. సమయ భంగం అంటే నీకు భయం. కాబట్టి నీవు ఈ అరణ్యవాసం, అజ్ఞాతవాసం వెరసి పదమూడేండ్లు ముగించుకొని పిమ్మట హస్తినాపురానికి వచ్చి రాజ్యానికి పట్టాభిషిక్తుడివి కమ్ము. చెడుజూదంలో మన రాజ్యాన్ని అపహరించిన దుర్యోధనుడు రాజ్యంలో చాలాకాలం బాగా పాతుకొనే వ్యవధి పొందకుండా వెనువెంటనే మనం అతడిని దూషించాలి. మోసగాండ్రను మోసంచేతనే జయించటం పాపం కాదు. రాజనీతి ప్రకారం శత్రువులను సర్వవిధాల జయించి రాజ్యం పరిగ్రహించ వచ్చును'- అని చెప్పగా భీముడి ఉద్రేకపూరిత వాక్యాలకు సంతోషించి, ధర్మరాజు అతడిని తనపైకి లాగుకొని వాత్సల్యంతో శిరస్సును మూర్కొని, కౌగిలించుకొన్నాడు.

విశేషం: ఇచట భీముడు ఒక ధర్మసూక్ష్మాన్ని ప్రతిపాదించాడు (1) మోసగాండ్రను మోసంచేతనే జయించటం పాపం కాదు. (2) రాజ్య సంపాదన ఏ ఉపాయాలను ప్రయోగించి అయినను చేయవచ్చును. ఈ వాదానికి పూర్వపక్షం నెలకొల్పేవారు ఉన్నారు. (1) వారు గాంధీమహాత్ముడివంటివారు- మోసాన్నిగూడ మంచితనంతోనే ఎదిరించాలి అని అంటారు. (2) మంచి లక్ష్యాన్ని సాధించటానికి మంచిమార్గాలనే అనుసరించాలి- అని ప్రతిపాదిస్తారు.

తే. **'అనలునకు గాడ్పు దోడైన యట్టు లింద్ర । తనయునకు నీవు దోడైనఁ దడయ కాజిఁ**
పోరి రిపులకు బ్రదుకంగఁ బోల; దైన । ననఘ! యిది కోపమునకు ననవసరంబు. **396**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; అనలునకున్= అగ్నిహోత్రుడికి; గాడ్పు= వాయువు; తోడు+ఐన+అట్టులు= తోడుపడిన రీతిగా; ఇంద్రతనయునకున్= అర్జునుడికి; నీవు; తోడు+ఐనన్= సాయం చేస్తే; తడయక= ఆలస్యం కాకుండ; ఆజిన్= యుద్ధంలో; పోరి= పోరుసల్పి; రిపులకున్= శత్రువులకు; బ్రదుకంగన్, పోలదు= జీవించటం జరుగదు; ఐనన్= అయినప్పటికి; ఇది= ఈ సమయం; కోపమునకున్= ఆగ్రహానికి; అనవసరంబు= సరైనది (సమయం) కాదు.

తాత్పర్యం: 'అగ్నిహోత్రుడికి వాయువు తోడైనట్లు అర్జునునికి నీవు తోడైతే, శత్రువులు మిమ్ము ఎదిరించి పోరులో బ్రతకలేరు. కాని, ఇది కోపానికి అదను కాదు.

విశేషం: ఆరణ్య పర్వంలో ప్రథమాశ్వాసంలో ద్రౌపదియు, భీమసేనుడును ధర్మరాజుతో సుదీర్ఘవాదం చేశారు. విజయానికి సకాల ప్రయత్నం అవసరమనే- భీముడి వాదనతో ధర్మరాజు ఏకీభవించకపోలేదు. కాని, ఇది సరైన కాలం కాదు - అని పూర్వపక్షం చేశాడు.

క. **పదుమూఁడేండ్లుం బోయినఁ । బదపడి పార్థుండు నీవుఁ బరనృపతుల దు**
ర్మదుల వధియించి విజయా । స్పదబాహుల రగుఁడు ధర్మపరిరక్షకులై. **397**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పదుమూఁడు+ఏండ్లన్+పోయినన్= పదమూడేండ్లు గడిచిన; పదపడి= పిమ్మట; పార్థుండు= అర్జునుడు; నీవున్= నీవును; పర, నృపతులన్= శత్రురాజులను; దుర్మదులన్= చెడుగర్వం కలవారిని; వధియించి= సంహరించి; ధర్మ, పరి, రక్షకులు+ఐ= ధర్మాన్ని లెస్సగా రక్షించే వారై; విజయ+ఆస్పద, బాహులరు+అగుఁడు= గెలుపునకు నెలవైన చేతులు కలవా రవండి.

తాత్పర్యం: పదమూడు సంవత్సరాలు గడచిన పిమ్మట నీవున్నూ, అర్జునుడున్నూ దుర్మదులైన శత్రురాజులను సంహరించి, ధర్మ సంరక్షకులై విజయం సాధించిన పరాక్రమశీలురు కండి.

వ. ఏ నెట్లును సత్యభంగంబు సేయుట కొడంబడ నోప' నని ధర్మతనయుం డనుజు ననునయించె నని జనమేజయునకు వైశంపాయన కథితంబైన పుణ్యకథ యతిరమణీయంబుగాను. 398

ప్రతిపదార్థం: ఏను= నేను; ఎట్లును= ఏ రీతిగా నయినను; సత్యభంగంబు+చేయుటకు= సత్యానికి విఘాతం కల్పించటానికి; ఒడంబడన్+ఓపను= సమ్మతింపజాలను; అని= అని చెప్పి; ధర్మతనయుండు= ధర్మపుత్రుడు; అనుజున్= తమ్ముడిని; అనునయించెన్= ఓదార్చాడు; అని; జనమేజయునకు; వైశంపాయన, కథితంబు+ఐన= వైశంపాయనుడిచేత చెప్పబడిన; పుణ్యకథ= పుణ్యాన్ని ఇచ్చే కథ; అతి రమణీయంబుగాను= మిక్కిలి సుందరమైనదిగాను.

తాత్పర్యం: నేను ఎట్టి పరిస్థితులలో నైనను కౌరవులతో చేసిన ఒడంబడికకు విరుద్ధంగా ప్రవర్తింపజాలను' - అని ధర్మరాజు తన తమ్ముడైన భీముడిని ఓదార్చాడు. ఇది వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు చెప్పిన కథ. ఈ ఇతిహాసం మిక్కిలి సుందరమైనది. పుణ్యాన్ని ఇచ్చేది.

ఆశ్వాసాంతము

క. బిరుదాంకభీమ! భీమే । శ్వర కృత కృత్య! ప్రసాద సౌజన్య గుణా
భరణ! పరగండ భైరవ! । పరనృప మణి మకుట ఘటిత పద! బుధ వినుతా! 399

ప్రతిపదార్థం: బిరుద+అంక, భీమ!= బిరుదానికి చిహ్నంగా 'భీమ' శబ్దం కలవాడా! అంటే సార్థకమైన భీమ బిరుదం కలవాడా!; భీమ+ఈశ్వర, కృత కృత్య!= భీమేశ్వరుడివలన కృతార్థుడైన వాడా!; ప్రసాద, సౌజన్య, గుణ+ఆభరణ!= నిర్మలమైన స్నేహగుణమనే అలంకారం కలవాడా!; పరగండ, భైరవ!= శత్రువీరులకు భైరవుడి వంటివాడా!; పర, నృప, మణి, ఘటిత, పద!= శత్రురాజులయొక్క మణికిరీటాలచేత తాకబడిన పాదాలు కలవాడా!; బుధ, వినుతా!= మేధావులచేత పొగడబడినవాడా!

తాత్పర్యం: సార్థకమైన భీమబిరుదం కలవాడా! భీమేశ్వరుడిచేత కృతార్థుడ వైనవాడా! మంచితన మనే గుణం ఆభరణంగా కలవాడా! శత్రువీరులకు భైరవుడి వంటివాడా! శత్రురాజుల మణికిరీటాలచేత స్పృశించబడిన పాదాలు కలవాడా! బుధులచేత ప్రశంసించబడినవాడా! (ఓరాజరాజ నరేంద్రా!) మహాభారతాన్ని నన్నయభట్టు రాజరాజ నరేంద్రుడికి అంకితం చేశాడు. అందుచేత ఆంధ్ర మహాభారతానికి ప్రథమశ్రోత ఆ రాజరాజనరేంద్రుడే.

విశేషం: రాజరాజ నరేంద్రుడు శైవుడు. చాళుక్య సామ్రాజ్యంలో శివాలయాలు తామరతంపరగా వెల్లివిరిశాయి. అందులో పంచారామాలు- వాటిలో దాక్షారామం పేర్కొనదగినవి. భీమేశ్వరుడు అంటే చాళుక్యభీముడిచేత ఆరాధించబడిన ఈశ్వరుడు.

ఉత్సాహము.

రాజవంశరత్న! రాజరాజదేవ! నిత్యల
క్ష్మీ జయాభిరామ! ధర్మమిత్త్ర! మిత్త్ర విద్వదం
భోజవన పయోజమిత్త్ర! భూరికీర్తికౌముదీ
రాజితత్రిలోక! నిఖిలరాజలోక పూజితా! **400**

ప్రతిపదార్థం: రాజ, వంశ, రత్న!= రాజ వంశానికి లేదా చంద్ర వంశానికి రత్నం వంటి వాడా! (రత్నం శ్రేష్ఠవాచకం); రాజ రాజ, దేవ!= రాజరాజేశ్వర ప్రతిష్ఠ చేసిన వాడా!; నిత్య, లక్ష్మీ, జయ+అభిరామ!= ఎడతెగని సంపదతో జయంతో మనోహరుడవైన వాడా!; ధర్మమిత్త్ర!= ధర్మానికి చెలికాడా!; మిత్త్ర విద్వత్+అంభోజవన, పయోజమిత్త్ర!= హితులైన పండితులనే తామరపూలతోటకు సూర్యుడి వంటివాడా! (అంభోజ= అంభస్+జ= నీటిలోనుండి పుట్టింది - పద్మం, పయోజ, మిత్త్రుఁడు= సూర్యుడు); భూరి, కీర్తి, కౌముదీ, రాజిత, త్రిలోక= విస్తారమైన యశస్సు అనే వెన్నెలచేత వెలుగొందించబడిన మూడులోకాలు కలవాడా!; నిఖిల, రాజ, లోకపూజితా!= సమస్త రాజ సమూహాలచేత పూజించబడినవాడా!

తాత్పర్యం: (ఓ రాజరాజనరేంద్రా! మహాభారతాన్ని అవధరించుము. అనేది ఈ పద్య తాత్పర్యసారం. ఆశ్వాసాంత పద్యాలన్నింటిలోను సారమిదే.) చాళుక్యరాజ వంశానికి రత్నం వంటివాడా! రాజరాజేశ్వరుడిని దైవంగా కలవాడా! నిత్యలక్ష్మితో, సంతతజయంతో అలరారేవాడా! ధర్మానికి మిత్రుడవైనవాడా! హితులైన విద్వాంసులనే తామరపువ్వుల సముదాయానికి సూర్యుడివంటివాడా! మూడులోకాలలో విస్తరించిన కీర్తి అనే వెన్నెల కలవాడా! రాజులందరిచేత పూజించబడినవాడా!

విశేషం: (1) మిత్త్ర, విద్వదంభోజ వన పయోజ మిత్రుడు రాజరాజనరేంద్రుడు. అంటే విద్వాంసులను సంతోషింపజేసి పోషించేవాడు. 'రాజ మహేంద్ర కవీంద్ర సమాజ సురక్ష్మాజ' అనే సంబోధన ఇచట స్మరించతగింది. నన్నయ తాను రాజరాజ నరేంద్రుడికి అనురక్తుడనని అవతారికలో చెప్పుకొన్నాడు. రాజరాజనరేంద్రుడి విద్వత్పరిపోషణ అభివర్ణితం. (2) రాజ రాజ నరేంద్రుడు 108 రాజరాజేశ్వరాలయాలను కలిదిండిలో నిర్మించినట్లు శాసనం ఉన్నది. శివాలయాలను తమ పేర నిర్మించటం చాళుక్య రాజ వంశ సంప్రదాయం. ఉదాహరణకు భీమేశ్వరాలయాలు. (3) ఆశ్వాసాంత పద్యాలు, ఆశ్వాసాంత గద్యం - అట్లే కావ్యాలలో ఆశ్వాస ఆరంభపద్యం వ్రాసే సంప్రదాయం నన్నయ మహాకవియే తెలుగులో ప్రారంభించినట్లు ఎంచవచ్చును. ఈ ఒరవడినే తర్వాతి కవులందరు అనుసరించారు. (4) ఈ వృత్తం ప్రతిపాదంలోనూ ఏడు సూర్యగణాలపై ఒక గురువు ఉంటుంది. అయిదవ గణం మొదటి అక్షరం యతి. ప్రాస పాటించబడింది.

గద్యము.

ఇది సకల సుకవి జన వినుత నన్నయభట్ట ప్రణీతంబైన శ్రీ మహాభారతంబునం దారణ్యపర్వంబునందుఁ బాండవ వనప్రవేశంబును, గిమ్మీరవధయును, గృష్ణపాంచాలాభిగమనంబును, సౌంభకాఖ్యానంబును, నింద్రకీలాభిగమనంబును, గైరాతంబును, నర్జును తపశ్చరణంబును, నీశ్వరుతోడ యుద్ధంబును, బరమేశ్వరు చేతఁ బాశుపతాస్త్రంబు వడయుటయును, లోకపాలసందర్శనంబును, స్వర్గగమనంబును, నూర్వశి శాపంబును, దేవతలవలన దివ్యాస్త్రలాభంబును నన్నది ప్రథమాశ్వాసము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇది= ఈ మొదటి ఆశ్వాసం; సకల, సుకవిజన, వినుత, నన్నయ భట్ట, ప్రణీతంబు+ఐన= సకల సుకవులచేత ప్రశంసించబడిన నన్నయభట్టుచేత వ్రాయబడిన; శ్రీమహాభారతంబునందు+ఆరణ్య పర్వంబునందున్; పాండవ వన ప్రవేశంబును= పాండవులు అడవిలో ప్రవేశించటమున్నూ; కిమ్మీరవధయును= కిమ్మీరుడనే రాక్షసుడి సంహారమున్నూ; కృష్ణ, పాంచాల+ అభిగమనంబును= శ్రీకృష్ణుడు, పాంచాలురు పాండవులకడకు రావడమున్నూ, సౌంభక+ఆఖ్యానంబును= సౌంభకకథయున్నూ; ఇంద్ర, కీల+అభిగమనంబును= అర్జునుడు ఇంద్రకీలపర్వతానికి వెళ్ళటమున్నూ; కైరాతంబును= కిరాతుడి వృత్తాంతమున్నూ; అర్జును తపశ్చరణంబును= అర్జునుడు తపస్సు చేయటమున్నూ; ఈశ్వరుతోడ యుద్ధంబును= శివుడితో చేసిన యుద్ధమున్నూ; పరమేశ్వరుచేతన్= శివుడిచేత; పాశుపత+అస్త్రంబు+పడయుటయును= పాశుపత మనే అస్త్రాన్ని పొందటమున్నూ; లోకపాల సందర్శనంబును= ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు మున్నగు దిక్పాలురను సందర్శించటమున్నూ; స్వర్గ గమనంబునున్= స్వర్గయాత్రకు వెళ్ళటమున్నూ; ఊర్వశి శాపంబును= ఊర్వశి శపించటమున్నూ; దేవతలవలన= దేవతలనుండి; దివ్య+అస్త్ర, లాభంబునున్= దివ్యమైన అస్త్రాలు పొందటమున్నూ; అన్నది= అనే అంశాలు ఉన్నది; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది కవీంద్రులందరిచేత ప్రశంసించబడిన నన్నయభట్టు వ్రాసిన శ్రీమహాభారతంలోని ఆరణ్యపర్వం. ఇందులో - పాండవులు ఆరణ్యంలో ప్రవేశించటమున్నూ, భీముడు కిమ్మీరుడనే రాక్షసుడిని చంపటమున్నూ, శ్రీకృష్ణుడు, పాంచాలురు పాండవులకడకు రావటమున్నూ, సౌంభకాన్ని గురించిన కథయున్నూ, అర్జునుడు ఇంద్రకీలాద్రికి వెళ్ళటమున్నూ, కిరాతుడి గాథయున్నూ, అర్జునుడు తపస్సు చేయటమున్నూ, ఈశ్వరుడితో యుద్ధం చేయటమున్నూ, పరమశివుడివలన పాశుపతాస్త్రం పొందటమున్నూ, దిక్పాలకులను సందర్శించటమున్నూ, స్వర్గలోకయాత్రకై వెళ్ళటమున్నూ, ఊర్వశి అర్జునుడిని శపించటమున్నూ, అతడు దేవతలవలన దివ్యాస్త్రాలు సంపాదించటమున్నూ అనేవి ఈ మొదటి ఆశ్వాసంలో ఉన్నాయి.

విశేషం: ఆశ్వాసాంతగద్యం విషయసూచిక. పూర్వగ్రంథాలు తాటాకులలో వ్రాయబడుతూ ఉండేవి. కాబట్టి ఇటువంటి విషయ సూచికవలన ప్రక్షిప్తభాగాలు, వినష్టభాగాలు గుర్తించటానికి వీలు కలుగుతుంది. పరిశోధకులకు ఇది అత్యావశ్యకం.

-:ఆరణ్యపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం :-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీరమ్య ధర్మ నిత్య । ప్రారంభవిభాసి! రాజపరమేశ్వర! ఘో
రారి మదకుంభికుంభవి । దారణదారుణకృపాణదక్షిణహస్తా! 1

ప్రతిపదార్థం: శ్రీ, రమ్య, ధర్మ, నిత్య, ప్రారంభ, విభాసి!= శోభా సుందరమైన ధర్మంలో నిరంతర ప్రయత్నంతో వెలుగొందే వాడా! అంటే ధర్మనిర్వహణంలో ఎడతెగని పూనికతో వెలుగొందేటి సొగసైన శోభగలవాడా!; రాజ, పరమ+ఈశ్వర!= రాజ పరమేశ్వరా అనే బిరుదు గలవాడా!; ఘోర+అరి, మదకుంభి, కుంభ, విదారణ, దారుణ, కృపాణ, దక్షిణ, హస్తా!= భయంకరమైన శత్రువులనే మదపుటేనుగుల కుంభస్థలాలను చీల్చివైచే దారుణకృపాణం కలవాడా! [భయంకరమైన శత్రువులయొక్క మదపుటేనుగుల కుంభస్థలాలను చీల్చునట్టి భయానకమైన కత్తి కుడిచేతిలో కలవాడా! అని కూడా చెప్పవచ్చు]

తాత్పర్యం: ఓ రాజరాజ నరేంద్రా! రాజపరమేశ్వర బిరుదాంచితుడా! శోభయమానమైన ధర్మ నిర్వహణంలో ఎడతెగని పూనికతో వెలుగొందేవాడా! భయంకరులైన శత్రువులనే మదపుటేనుగుల కుంభస్థలాలను చీల్చి చెండాడే భయానక ఖడ్గాన్ని కలవాడా!

విశేషం: ఇది ఆరణ్యపర్వంలో ద్వితీయాశ్వాసంలోని మొదటి పద్యం. ఆశ్వాస ఆరంభ పద్యాలను సంబోధన ప్రథమా విభక్త్యంతాలుగా తీర్చిదిద్దే ఒరవడిని తెలుగులో ప్రారంభించినవాడు నన్నయభట్టు. అట్లే ఆశ్వాసాల చివరిపద్యాలు కృతిపతి అయిన రాజరాజనరేంద్రుడి సంబోధనలే. అలనాటి యుద్ధాలలో ఏనుగులు నిర్వహించిన భూమిక కూడ పేర్కొన తగినట్టిదే. పలుతావుల నన్నయభట్టు కృతిపతి అయిన రాజరాజనరేంద్రుడి పరాక్రమప్రాభవాన్ని, యుద్ధకౌశలాన్ని ఉగ్గడించి ఉన్నాడు. [ఏనుగు భూమిపై నడయాడే జంతువు లన్నింటిలో బలమైనది. అట్టి ఏనుగును గూడ ఒడుపుతో సంహరించగల వీరులు అలనాడు కొందరు ఉండేవారు. అందులో రాజరాజనరేంద్రుడు ఒకడని నన్నయ పలుతావుల గళమెత్తి అభివర్ణించాడు. కొప్పం యుద్ధంలో దడిగదేవుడనే పశ్చిమచాళుక్య సామంతుడు చోళచక్రవర్తి అధిష్ఠించిన ఏనుగుతొండాన్ని నరికి బీభత్సం సృష్టించటం, అపుడు చోళ చక్రవర్తి ఆ యుద్ధంలో మరణించటం దక్షిణభారత చరిత్రకు సుపరిచితమైన అంశం. రాజరాజనరేంద్రుడు 'మదకుంభి కుంభ విదారణ దారుణ కృపాణహస్తుడు' అనే అభివర్ణన కేవలం అతిశయోక్తి కాదేమో!]

(సం. 3-49-29)

వ. అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె; నట్లు సాంత్వనవచనంబుల భీమసేనునకుం గోపాటోపోపశమనంబు సేయుచున్న ధర్మరాజునొద్దకు బృహదశ్వుండను మహాముని వచ్చి విధిదృష్ట విధానంబునం బూజితుండయి విశ్రమించియున్న నమ్మునివరునకు ధర్మతనయుం డధర్మపరులయిన పరుల చేతం దమపడిన నికారప్రకారంబంతయు నెఱింగించి యిట్లనియె. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= ఆ పౌరాణికుడు; శౌనక+ఆది, మహామునులకున్+చెప్పెన్= శౌనకుడు మొదలయిన మహర్షులకు చెప్పాడు; అట్లు= ఆ విధంగా; సాంత్వన వచనంబుల= ఓదార్పు మాటలతో; భీమసేనునకున్= భీముడికి; కోప+ఆటోప+ ఉపశమనంబు= ఆగ్రహంయొక్క ఉద్వేగాన్ని అణచటం; చేయుచున్న; ధర్మరాజు+ఒద్దకున్= ధర్మరాజు కడకు; బృహదశ్వుండు+ అను, మహాముని= బృహదశ్వుడనే పేరు గల గొప్ప ఋషి: వచ్చి; విధి, దృష్ట, విధానంబునన్= (శాస్త్రసూత్ర) విధులలో కనిపించే పద్ధతిలో; పూజితుండు+ఐ= ఆరాధించబడిన వాడై; అంటే యథావిధిగా అతిథి సత్కారాన్ని పొందినవాడై; విశ్రమించి+ఉన్నన్= అలసట, తీరి ఉండగా; ఆ+ముని, వరునకు= ఆ ఋషిశ్రేష్ఠుడికి; ధర్మ తనయుండు= ధర్మపుత్రుడు; అధర్మ, పరులు+అయిన= అధర్మాన్ని ఆచరించే వారైన; పరుల చేతన్= శత్రువుల చేత; తమ, పడిన= తాము అనుభవించిన; నికార, ప్రకారంబు+అంతయున్= మోసపు విధమంతయు, అవమానాల తీరు అంతయు; ఎఱింగించి= తెలిపి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ పౌరాణికుడు సూతుడు, శౌనకుడు మున్నగు మహర్షులకు భారత కథను ఈ విధంగా చెప్పాడు: అట్లా భీముడి ఆగ్రహాతిరేకాన్ని శాంతింపజేస్తూ ఉన్న ధర్మరాజుదగ్గరికి బృహదశ్వుడు అనే గొప్పఋషి విచ్చేశాడు. ధర్మరాజు ఆ మహర్షికి యథావిధిగా అతిథిసత్కారాలు చేసి, ఆ మహాముని అలసట తీరిన పిమ్మట తాము అధర్మ పరాయణులైన శత్రువులచేత పడిన పాట్లు, జూదంలో జరిగిన మోసం సవిస్తరంగా చెప్పి ఇట్లా పలికాడు.

విశేషం: మహాభారత కథకుడు ఉగ్రశ్రవసుడనే సూతుడు. నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులకు పన్నెండేండ్లు జరిగిన సత్రయాగంలో మహాభారతం వినిపించాడు. సవిస్తర వివరణకు ప్రథమాశ్వాసంలోని మొదటిపద్యం వివరణను చూడండి.

క. 'పుడమియు రాజ్యము బంధుల । విడిచి మృగావలులఁ గలసి విపినంబులలోఁ
గడుకొని మా య ట్లిడుమలఁ । బడిన నృపులు గలరె యొరులు పరమమునీంద్రా!' 3

ప్రతిపదార్థం: పరమ, ముని+ఇంద్రా= గొప్ప ఋషి శ్రేష్ఠుడా!; పుడమియు= భూమియు (అంటే నివాసభూమిని); రాజ్యము= ఏలుకొంటున్న రాజ్యాన్ని; బంధుల= చుట్టాలను; విడిచి= వదలిపెట్టి; మృగ+ఆవలులన్+కలసి= జంతు సముదాయంతోపాటు; విపినంబులలోన్= అడవులలో; కడుకొని= పూని; మా+అట్లు= మావలె; ఇడుమలన్+పడిన= ఇక్కట్లపాలైన; నృపులు= రాజులు; ఒరులు= ఇతరులు; కలరె= ఉన్నారా?

తాత్పర్యం: 'నివాసస్థలాన్ని, రాజ్యాన్ని, చుట్టాలను విడిచిపెట్టి మృగాలతోపాటు అరణ్యాలలో మా వలె ఈవిధంగా ఇక్కట్ల పాలైన ఇతరరాజులు ఎవరైనా ఉన్నారా? ఓ పరమఋషిశ్రేష్ఠుడా! దయచేసి తెలుపండి'.

వ. అనిన నయ్యుధిష్ఠిరునకు బృహదశ్వుం డిట్లనియె. 4

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+యుధిష్ఠిరునకున్= ఆ ధర్మరాజుకు; బృహదశ్వుండు= బృహదశ్వుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా బదులు పలికాడు.

తాత్పర్యం: అని ప్రశ్నించిన ధర్మరాజుకు బృహదశ్వుడు ఈ విధంగా బదులు పలికాడు.

క. 'దేవసములైన యనుజుల । తో విప్రులతో రథాలితో వచ్చి యర
ణ్యావాసము సేసెదు ధర । ణీవల్లభ! నీవు ధర్మనిష్ఠితబుద్ధిన్. 5

ప్రతిపదార్థం: ధరణీ, వల్లభ!= (భూభర్తవైన) మహారాజా!; దేవ, సములు+ఐన= దేవతలతో సమానులైన; అనుజులతోన్= తమ్ములతో; విప్రులతోన్= బ్రాహ్మణులతో; రథ+ఆలితోన్= రథసమూహంతో; వచ్చి= ఏతెంచి; అరణ్య+ఆవాసము= అడవిలో నివసించటం; నీవు; ధర్మ, నిష్ఠిత, బుద్ధిన్= ధర్మంపై లగ్నమైన బుద్ధితో; చేసెదు= చేస్తున్నావు.

తాత్పర్యం: నీవు ఇడుమలు పడుతూ అడవిలో నివసిస్తున్న మాట నిజమే. కాని, నీకు తోడుగా దేవతలతో సమానులైన తమ్ములు ఉన్నారు. నీకు విజ్ఞానబోధ చేస్తున్న విప్రులు నీతో కలిసి జీవిస్తున్నారు. నీకు రథాలు ఉన్నాయి. పరివారవర్గం ఉన్నది. ఈ విధంగా నీవు అరణ్యానివాసం చేయటం ధర్మలగ్నమైన నీమనస్సును తెలుపుతున్నది.

విశేషం: మహర్షి అయిన బృహదశ్వుడి దృష్టి వేరు. యుధిష్ఠిరుడి దృష్టి వేరు. అడవిలో ఇడుమలు పడుతున్న పాండవులకు లేనివి రాజ్యసుఖాలు మాత్రమే. విజ్ఞాననిధులైన విప్రుల సాహచర్యం ఈ అడవిని ఒక విశ్వవిద్యాలయంగా మార్చిందని బృహదశ్వుడికి తెలుసు. అంతఃపురాలలో, రాజసభలలో హంసతూలికాతల్పాలపై సుఖించే రాజులు మహర్షులదృష్టిలో బంగారు పంజరాలలోని పక్షులు. ఆపదలే శీలానికి వన్నెగూర్చే సదవకాశాలు. అగ్నిలో పడి బంగారం వన్నె హెచ్చి వెలుగొందుతుంది. మట్టి అయితే మాడిపోతుంది. మహనీయులు కష్టాలను అనుభవించటంచేతనే చిరస్మరణీయమైన మహిమను ఆర్జిస్తారు. సానబట్టితేగాని వజ్రం శోభించదు. పాండవులు రాజ్యాన్ని కోలుపోయి అడవులలో ఇడుమలుపడి ఆధ్యాత్మిక విశ్వకళా పరిషత్తులో పట్టభద్రులయ్యారు. అందుచేత మహానుభావుడైన బృహదశ్వుడు అడవిలో ఉండే ధర్మరాజును అభినందించాడే కాని ఓదార్పుమాటలతో జాలి చూపలేదు. పాండవులకంటెకూడ ఎక్కువ బాధలు పడినట్టివారు లేకపోలే దని నలోపాఖ్యానాన్ని చెప్పాడు.

క. నరనుతుఁడు దొల్లి నలుఁ డను । ధరణీశుఁడు జూద మాడి తన విభవము పు
ష్కరుచేత నోటువడి యొ । క్కరుఁడ కరం బిడుమఁ బడఁడె కాననసీమన్. 6

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వకాలంలో; నర, నుతుఁడు= ప్రజలచేత ప్రస్తుతించబడినవాడు; నలుఁడు+అను= నలుడనే; ధరణీ+ఈశుఁడు= రాజు (భూమికి పాలకుడు); జూదము+ఆడి; తన, విభవము= తన సంపద; పుష్కరు, చేతన్= పుష్కరుడనే రాజుచేత; ఓటువడి= ఓడిపోయి; ఒక్కరుఁడు+అ= ఒంటరిగా; కానన, సీమన్= అడవిప్రాంతంలో; కరంబు= మిక్కిలి; ఇడుమన్+పడఁడు+ఎ= కష్టాలుఅనుభవించలేదా!

తాత్పర్యం: పూర్వకాలంలో నలుడనే మహారాజు, ప్రజానురంజకుడై రాజ్యాన్ని ఏలినవాడు జూదమాడి పుష్కరుడిచేత తన సంపదనంతా ఓడిపోయి ఒంటరిగా అడవులలో తిరిగి మిక్కిలి కష్టాలను అనుభవించలేదా!'

విశేషం: ఆరణ్యపర్వం మహాభారతంలోని పదునెనిమిది పర్వాలలోని పెద్దపర్వాలలో ఒకటి. ఇందులోని కథ పెద్దది కాదు. ఆరణ్యపర్వం పెరగటానికి కారణం అందులోని పెక్కు ఉపాఖ్యానాలు. ఎందరో ఋషులు పాండవులను చూడటానికి అరణ్యానికి వచ్చేవారు. వారిని ధర్మరాజు ప్రశ్నించేవాడు. వారు తమకు తోచిన ఉపాఖ్యానాలు చెపుతూ ఉండేవారు. అందుచేత ఆరణ్యపర్వం బృహత్ గ్రంథమైనది. మహాభారతంలోని ఉపాఖ్యానాలన్నింటిలో నలోపాఖ్యానం పెద్దది. సంస్కృత భారతంలో ఎన్నో ఉపాఖ్యానాలు చోటుచేసికొన్నాయి. అవి అన్నీ ప్రాచీనాలే అయినా. కొన్ని ప్రాచీనతరాలు, మరికొన్ని ప్రాచీనతమాలు- అని విద్వాంసుల అభిప్రాయం. అందులో నలోపాఖ్యానం మిక్కిలి ప్రాచీనతమమైనదని కొందరు పరిశోధకుల అభిప్రాయం. పాశ్చాత్యుల దృష్టిలో విషాదాత్మక కృతులకు విలువ అధికం. భారతీయ వాఙ్మయంలో విషాదవృత్తాలైన రచనలు లేవని కొందరు అధిక్షేపించటం కద్దు. విషాదాత్మక రచనలవలన సహృదయులకు భావిత అంతఃకరణ ప్రవృత్తి ఏర్పడి వారి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

హృదయాలు రసక్షాళితాలు అవుతాయని పాశ్చాత్య ఆలంకారికుల అభిప్రాయం. నలోపాఖ్యానం విషాదాంతగాథ కాదు కాని, విషాదాత్మక కృతి అని చెప్పవచ్చును. భావితాంతఃకరణ ప్రవృత్తి, సద్యఃపర నిర్వృతి కావ్యానికి అంతరాత్మ అయితే నలోపాఖ్యానం ప్రపంచ వాఙ్మయంలో 'నిరుపమానమైన రసవత్కావ్యం' - 'సాటిలేని విషాదాత్మక కృతి'- అని చెప్పవచ్చును. మిక్కిలి పురాతనకాలంలో మహాభారతం 'జయం' రచించబడటానికి చాలాకాలం పూర్వమే నలచక్రవర్తిగాథ భారతదేశంలో యుగ యుగాంతరాలలో బహుళవ్యాప్తిని పొందినట్లు, తదుపరి ప్రాచీనతమమైన ఇతిహాసం మహాభారతంలో లీనమైనట్లు ఊహించటం సత్యదూరం అనలేం. ఇంకొక విశేషం: భారతంలోని ధర్మరాజుకు నలోపాఖ్యానంలోని కథానాయకుడైన నలుడికి గల సామాన్యవ్యసనం జూదం. ఇక, బృహదశ్వుడు ప్రస్ఫుటంగా వచించినట్లు ధర్మరాజుకంటె కూడ విషాదాత్మక నాయకుడుగా నలుడు నిర్వహించిన భూమిక ఎక్కువ హృదయవిదారకమైనది. అందుచేత నలోపాఖ్యానం చదివిన వారికి దుఃఖభూయిష్ఠమైన కలియుగబాధనుంచి నిష్కృతి లభిస్తుందన్న పెద్దల ప్రవచనంలో అంతరార్థం ఉన్నదని అంగీకరించవచ్చును.

ధర్మరాజునకు బృహదశ్వుండు నలోపాఖ్యానంబు సెప్పుట (సం. 3-50-1)

వ. అనిన 'నది యె?' ట్లని ధర్మనందనుం డడిగిన బృహదశ్వుం డిట్లనియె; నిషధేశ్వరుండయిన వీరసేనుని కొడుకు నలుం డనువాఁ డనేకాక్షౌహిణీపతి యనవరతాక్షప్రియుం డజేయంబైన తన తేజంబున నెల్లరాజుల జయించి బ్రహ్మణ్యుండయి బ్రహ్మోత్తరంబుగాఁ బ్రజాపాలనంబు సేయుచుండ. 7

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అది+ఎట్లు+అని= అది ఏవిధంగా జరిగిందని; ధర్మనందనుండు+అడిగిన= ధర్మరాజు ప్రశ్నించగా; బృహదశ్వుండు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు; నిషధ+ఈశ్వరుండు+అయిన= నిషధదేశానికి పరిపాలకుడయిన; వీరసేనుని, కొడుకు= వీరసేన మహారాజుయొక్క పుత్రుడు; నలుండు+అనువాఁడు= నలుడనే పేరుకలవాడు; అనేక+అక్షౌహిణీ, పతి= పెక్కు అక్షౌహిణులకు అధినేత; అనవరత+అక్ష, ప్రియుండు= ఎల్లప్పుడును పాచికలపై ప్రీతికలవాడు, అంటే జూదమాడటంలో మిక్కిలి అనురక్తి కలవాడు; అజేయుంబు+ఐన= జయించటానికి వీలులేని; తన తేజంబునన్= తన పరాక్రమంచేత; ఎల్ల, రాజులన్= అందరు రాజులను; జయించి= గెలిచి; బ్రహ్మణ్యుండు+అయి= బ్రాహ్మణులకు హితం ఆచరించేవాడై; బ్రహ్మ+ఉత్తరంబుగాన్= బ్రాహ్మణులకు ఆధిక్యం పొసగేటట్లుగా; ప్రజా, పాలనంబు= ప్రజలను పాలించటం; చేయుచు+ఉండన్= చేస్తుండగా.

తాత్పర్యం: తొల్లి నలుడు అడవులలో ఇడుమలు పడినాడని బృహదశ్వుడు చెప్పగా, అదెట్లా? అని ధర్మరాజు ప్రశ్నించగా బృహదశ్వుడు ఇట్లా చెప్పాడు: నిషధేశ్వరుడైన వీరసేనుడి కొడుకు నలుడు. అతడు మహాతేజస్వి. ఎన్నో అక్షౌహిణులసేనలకు అధినేత. కాని, అతడు జూదంలో మిక్కిలి ప్రీతికలవాడు. అతడు తన పరాక్రమంచేత రాజులందరిని జయించి సార్వభౌముడై ప్రజానురంజకుడై రాజ్యపరిపాలన చేస్తున్నాడు. అతడు బ్రాహ్మణులకు సంప్రీతి ఘటించే పరిపాలన కొనసాగించాడు.

విశేషం: (1) అక్షౌహిణి= సేనాసమూహం. 21870 రథాలు, అన్నే ఏనుగులు, 65610 గుఱ్ఱాలు, 109350 కాల్బలంగల సేనకు అక్షౌహిణి అని పేరు. (2) 'బ్రహ్మోత్తరంబుగా'- అనే పదానికి అర్థం చెప్పటంలో విద్వాంసులలో బహుళచర్చ జరిగింది. ధృతరాష్ట్రపరంగా నన్నయభట్టు ఈమాటను ఇంకొకచోట ప్రయోగించాడు. ఆర్యసంఘం- బ్రహ్మక్షత్రియ వైశ్య శూద్ర సంఘటితం. బ్రహ్మోత్తరంగా పరిపాలించటం అంటే బ్రాహ్మణులకు ప్రాధాన్యమిచ్చి పరిపాలించటం, బ్రాహ్మణులకు ఆధిక్యం ఇవ్వటం అనే అర్థం సందర్భశుద్ధితో అన్వయిస్తుంది. ఇచట 'బ్రహ్మణ్యుండయి' అనే ప్రయోగంకూడ పై అర్థానికి బలం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేకూర్చేదే. ఆదిపర్వంలో నన్నయభట్టు ధృతరాష్ట్రుడు 'బ్రహ్మోత్తరంబుగాఁ బ్రజావృద్ధియు, సస్యవృద్ధియు నగుచుండ' (ఆది. 5.5.) రాజ్యం చేసినట్లు వ్రాశాడు.

సీ. **అట విదర్భాధిపుఁడైన భీముం డను । వాఁ డనపత్యుఁడై వ్రతము లోలి**
సలుపుచు దమనుఁ డ న్సన్మునిఁ బత్నియుఁ । దాను నుపాసించి, తద్వరమున
దమయంతి యను కూఁతు దమ దాంత దమను ల । న్సుతులను బడసె విశ్రుతగుణాఢ్యుఁ;
డందుఁ గన్యారత్న మగు దమయంతి దా । నత్యంతకాంతి రూపాభిజాత్య

ఆ. **విమల గుణ సమృద్ధి వెలుఁగుచు సురసిద్ధ । సాధ్య కన్యలట్టి సఖులు నూర్వు**
రొలసి తన్నుఁ గొలుచుచుండఁగ మహి నొప్పు । చుండె నధికవిభవయుక్తితోడ. **8**

ప్రతిపదార్థం: అట= వేరొకదేశంలో; విదర్భ+అధిపుఁడు+ఐన= విదర్భ దేశానికి రాజైన; భీముండు+అనువాఁడు= భీముడనే వాడు; న+అపత్యుఁడు+ఐ= అపత్యం-అంటే సంతానం లేనివాడై; వ్రతములు= నోములు; ఓలి= వరుసగా; సలుపుచున్= చేస్తూ; దమనుఁడు+అన్, సత్+మునిన్= దమనుడు అనే పేరుగల మంచి ఋషిని; పత్నియున్, తానున్= భార్యయు, తానున్నూ; ఉపాసించి= ఆరాధించి; తద్+వరమునన్= ఆతడు అనుగ్రహించిన వరంచేత; దమయంతి, అను, కూఁతున్= దమయంతి అనే పుత్రికను; దమ, దాంత, దమనులు+అన్, సుతులను= దముడు, దాంతుడు, దమనుడు అనే కొడుకులను; విశ్రుత, గుణ+ఆఢ్యుఁడు= పేరుకెక్కిన మంచి గుణాలతో కూడినట్టివాడు, అంటే భీముడు; పడసెన్= పొందాడు; అందున్= ఆ సంతానంలో; కన్యారత్నము+అగు= పడచులలో మిన్నఅయిన, (కన్యలలో రత్నమైన); దమయంతి; తాన్+అత్యంత, కాంతి, రూప+అభిజాత్య, విమల, గుణ సమృద్ధిన్= తాను మిక్కుటమైన లావణ్యంతో, శరీర సౌష్ఠవంతో, మంచి వంశంలో జన్మించిన గౌరవంతో, నిర్మలమైన మంచి గుణాల పొందికతో; వెలుఁగుచున్= ప్రకాశిస్తూ; సుర, సిద్ధ, సాధ్య, కన్యలు+అట్టి= దేవతలలోని, సిద్ధులలోని, సాధ్యులలోని ఆడపడుచులను పోలినట్టి; సఖులు= చెలికత్తెలు; నూర్వురు= వందమంది; ఒలసి= కలిసి; తన్నున్= తనను; కొలుచుచుండఁగ= సేవిస్తుండగా; అధిక, విభవ, యుక్తితోడన్= గొప్పవైభవంతో; మహిన్= భూమిపై; ఒప్పుచు+ఉండెన్= విలసిల్లుతున్నది.

తాత్పర్యం: అక్కడ విదర్భలో రాజైన భీముడు సంతానహీనుడు. అతడు, అతనిభార్య దమనుడనే గొప్పఋషిని ఆరాధించారు. వారికి దమయంతి అనే కూతురు, దముడు, దాంతుడు, దమనుడు అనే ముగ్గురు కొడుకులు పుట్టారు. కన్యకామణి అయిన దమయంతి, విశేషరూపలావణ్యవతి అయి, సద్వంశంలో పుట్టిన గౌరవం ఒప్పగా, సద్గుణాలతో విరాజిల్లుతూ ఉన్నది. నూరుగురు చెలికత్తెలు, సురసిద్ధసాధ్య కన్యకలతో సాటివచ్చేవారు ఆమెను సేవిస్తూ ఉన్నారు. దమయంతి అత్యధికవైభవంతో తులతూగుతున్నది.

విశేషం: సురలు, సిద్ధులు, సాధ్యులు దేవతలలోని అంతర్వర్గాలకు చెందినవారు.

వ. **అంత.** **9**

తాత్పర్యం: అట్లా కొంతకాలం జరిగిన తరువాత.

క. **నలుగుణములు దమయంతికి । నలునకు దమయంతి గుణగణంబులు జను లి**
మ్ములఁ బొగడుట నిరువురకును । వెలసె మనోభవ వికార విభ్రమ మెదలన్. **10**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నలు, గుణములు= నలుడిలోని మంచి లక్షణాలు; దమయంతికి; దమయంతి, గుణ, గణంబులు= దమయంతిలోని మంచిగుణాల సముదాయాలు; నలునకు; జనులు= ప్రజలు; ఇమ్ములన్= ప్రీతితో; పొగడుటన్= ప్రశంసించటం చేత; ఇరువురకును= ఇద్దరికిని, అంటే నలదమయంతులు ఇద్దరికిని; ఎదలన్= హృదయాలలో; మనస్+భవ, వికార, విభ్రమము= మన్మథుడికి చెందిన మారుపాటువలన ఏర్పడిన వేగిరపాటు, అంటే శృంగార భావోదయం; వెలసెన్= విలసిల్లింది.

తాత్పర్యం: నలుడి సద్గుణాలను దమయంతికి, దమయంతి గుణగణాలను నలుడికి ప్రజలు అభివర్ణించి, ప్రశంసించి, చెప్పటంచేత ఇరువురిలో శృంగారభావాలు వెల్లివిరిశాయి.

వ. ఒక్కనాఁడు నలుఁడు దమయంతీ గుణబద్ధ చేతస్కుండై మదనానలంబు సహింప నోపక ప్రమదవనంబున నుండునంత నంతరిక్షకాంతాహారావళియుంబోలె హంసావళి యవనీతలంబున కవతరించిన. 11

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు= ఒకానొకరోజున; నలుఁడు; దమయంతీ, గుణ, బద్ధ, చేతస్కుండు+ఐ= దమయంతియొక్క మంచిగుణాలచేత కట్టివేయబడిన మనస్సు కలవాడై; మదన+అనలంబు= మన్మథుడియొక్క(అగ్నిని) తాపాన్ని; సహింపన్+ఓపక= తాళలేక; ప్రమదవనంబునన్= ఉద్యానవనంలో; ఉండు+అంతన్= ఉన్నప్పుడు; అంతరిక్ష, కాంతా, హార+ఆవళియున్+పోలె= ఆకాశమనే వనితయొక్క (కంఠంలోని) దండలను పోలుతూ; హంస+ఆవళి= అంచలగుంపు; అవనీ, తలంబునకు= నేలపైకి; అవతరించినన్= దిగగా.

తాత్పర్యం: ఒకానొకనాడు, దమయంతియొక్క మంచిగుణాలచేత ఆకర్షించబడిన మనస్సు కలవాడై నలుడు మదనతాపం తాళలేక ఉద్యానవనంలో విహరిస్తూఉన్నాడు. అప్పుడు ఆకాశమనే సుందరియొక్క మెడలోని దండలను పోలిన హంసలగుంపు భూమిమీద వ్రాలింది.

విశేషం: అలం: ఉపమ. అంచలగుంపు ఆకాశమనే సుందరికి కంఠహారాలుగా భాసిల్లినాయనటం హృదయంగమమైన ఉపమాలంకారం.

ఆ. వీరసేనసుతుఁడు వీరుండు హంసల। నడ బెడంగుఁ జూచి నగుచు వాని
నెగిచి యెగిచి యందు నెగయకుండఁగ నొక్క। హంసఁ బట్టుకొనియె నతిరయమున. 12

ప్రతిపదార్థం: వీరసేన, సుతుఁడు= వీరసేనుడి కొడుకు- నలుడు; వీరుండు= పరాక్రమం కలవాడు; హంసల, నడ, వెడంగున్+చూచి= అంచలనడల సొగసు చూచి; నగుచున్= నవ్వుతూ; వానిన్= ఆ హంసలను; ఎగిచి+ఎగిచి= వెంబడించి వెంబడించి; అందున్= వాటిలో; ఒక్క హంసన్= ఒక అంచను; ఎగయకుండఁగన్= ఎగిరిపోకుండా; (ఎగయక+ఉండన్= ఎగిరిపోకుండా ఉండగా అనికూడా చెప్పవచ్చు;) అతిరయమునన్= మిక్కిలివేగంగా; పట్టుకొనియెన్= పట్టుకొన్నాడు.

తాత్పర్యం: వీరసేనుడి పుత్రుడు, పరాక్రమవంతుడు ఐన నలుడు ఆ హంసల నడకల సొగసు చూచి మురిసిపోయి లోలోపల నవ్వుకొంటూ, తాను వాటిని తరిమి తరిమి, అందులో ఒక హంసను ఎగిరిపోకుండా (ఒక హంస ఎగిరిపోకుండా ఉండగా) మిగులవేగంగా పట్టుకొనగలిగాడు.

విశేషం: నలుడు ఒక హంసను పట్టుకొన్నాడు. ఎట్లా పట్టుకొన్నాడు? 'ఎగయకుండఁగ' - అంటే 'ఎగురకుండ' - అని సమాధానం. అంటే ఇక్కడి ధాతువు 'ఎగయు' - అన్నమాట. అంటే పైకి పోకుండగా నలుడు హంసను పట్టుకొన్నాడు. ఇక,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందు ప్రయోగించబడిన 'ఎగిచి' - అనేది 'ఎగుచు' ధాతువు నుండి ఏర్పడింది. 'ఎగుచు' అనేది 'ఏగు' ధాతువు యొక్క ప్రేరణార్థకం. కనుక 'ఎగయు' 'ఎగుచు' - వేరు వేరు ధాతువులు. నలుడు హంసలను వేగంగా వెంబడించాడు (ఎగిచాడు). అలా వెంట తరమటంలో ఒక హంసను ఎగిరిపోకుండ శీఘ్రంగా పట్టుకోగలిగాడు. నలుడు హంసలను తరుముతూ ఎగురగొడుతూ ఉన్నా ఆ అంచలగుంపులోని ఒక హంస ఎగిరిపోకుండా ఉండగా నలుడు దానిని ఒడుపుగా వేగంగా పట్టుకొన్నాడని కొందరు వ్యాఖ్యాతలు చెప్పారు. ఆ హంస మిగిలిన హంసలతో పాటు ఎగిరిపోకుండా కొంత జాగు చేయటానికి కథలో ఒక పరమార్థం ఉంది. శివుడే ఆ రూపంలో వచ్చి నలదమయంతులకు వివాహం చేసే యత్నం చేశాడని, కాబట్టి ఆ హంస కారణజన్మురాలని కవిసమ్రాట్ విశ్వనాథసత్యనారాయణగారు వివరించారు. వివరాలకు చూడండి పీఠిక. (సంపా.) ఈ పద్యంలోని మూడవపాదంలో కొన్ని ప్రతుల్లో "నెగచి యెగచి" - అనే పాఠభేదం కనిపిస్తున్నది.

ఆ. దాని విడిచి పోవఁగా నోప కఱచుచు । నంతరిక్షముననుహంసలెల్లఁ
బిండుగట్టి తిరుగుచుండె వాతోద్ధూత । శారదాభ్ర శకల చయముఁ బోలె. 13

ప్రతిపదార్థం: దానిన్= ఆ హంసను; విడిచిపోవగాన్+ఓపక= వీడి వెళ్ళిపోలేక; అఱచుచున్= అరుస్తూ; అంతరిక్షమునను= ఆకాశంలో; హంసలు+ఎల్లన్= హంసలన్నీ; పిండుకట్టి= గుమిగూడి; వాత+ఉద్ధూత, శారద+అభ్ర, శకల, చయమున్, పోలెన్= గాలిచేత చెదరగొట్టబడిన శరత్కాలంలోని మేఘాల ముక్కల సముదాయంవలె; తిరుగుచు+ఉండెన్= పరిభ్రమిస్తూ ఉన్నాయి.

తాత్పర్యం: నలుడికి చిక్కిన అంచ(హంస)ను విడిచిపెట్టి వెళ్లిపోజాలక తక్కిన హంసలు అరుస్తూ ఆకాశంలో తిరుగాడజొచ్చాయి. అప్పుడు ఆ హంసలు, గాలిచేత చెదరగొట్టబడిన శరత్కాలంలోని మబ్బుల తునకలసమూహంవలె ఉన్నాయి.

విశేషం: హంసలు తెలుపు. శరదృతువులో మేఘాలు తెల్లగా ఉంటాయి. నేలపై వ్రాలటానికి ముందు హంసలు ఆకాశసుందరి కంఠంలోని వజ్రహారాలవలె ఉన్నాయి. ఇప్పుడు అవి చెదరి ఆకాశంలో తిరుగాడుతున్నాయి. శరత్కాలంలో గాలికి చెదరిన మబ్బు తునకలవలె ఉన్నాయి. రెండు ఉపమానాలున్నూ మనోహరమైనవే. అలంకారం: ఉపమ.

వ. అదియును దన కమ్మనుజేశ్వరుఁ డపాయంబు సేయుంగా వగచి మనుష్య వాక్యంబుల నిట్లనియె: 'నయ్యా! యేను నీకుం బ్రియంబు సేసెద; నీ హృదయేశ్వరియైన దమయంతి పాలికిం బోయి నీ గుణంబులు దానికి వర్ణించి యక్కన్య యన్యుల నపేక్షింపక నీయంద బద్ధానురాగ యగునట్లుగాఁ జేసెద.' 14

ప్రతిపదార్థం: అదియును= ఆ హంసయున్నూ; తనకు; ఆ+మనుజ+ఈశ్వరుఁడు= మనుజులకు పరిపాలకుడైన ఆ రాజు; అపాయంబు= కీడు; చేయుంగా, వగచి= చేస్తాడని తలచి; మనుష్య, వాక్యంబులన్= మనుజులు మాట్లాడే భాషలో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది; అయ్యా!= ఓ మహానుభావా!; ఏను= నేను; నీకున్+ప్రియంబు+చేసెదన్= నేను నీకు ఇష్టమైన మేలు చేస్తాను; నీ, హృదయ+ఈశ్వరి+ఐన= నీ హృదయానికి ఈశ్వరి అయిన, అంటే నీవు ప్రేమించిన; దమయంతి, పాలికిన్+పోయి= దమయంతి కడకు వెళ్ళి; నీ, గుణంబులు= నీలోని మంచిలక్షణాలు; దానికిన్= ఆమెకు (ఆ దమయంతికి); వర్ణించి= ఉగ్గడించి; ఆ+కన్య= ఆ అమ్మాయి; అన్యులన్= ఇతరులను; అపేక్షింపక= కోరుకొనక; నీ యందు+అ= నీ పైననే; బద్ధ+అనురాగ= బంధించబడిన అనురాగం కలది, అంటే నిన్ను వలచినట్టిది; అగునట్లుగాన్; చేసెదన్= చేయగలను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ హంస తనకు ఆ రాజు కీడు చేస్తాడని శంకించి, మనుజసంభాషణలతో ఇట్లా పలికింది. 'మహానుభావా! నేను నీకు ప్రియమైన ఉపకారం చేస్తాను. నీ హృదయేశ్వరి అయిన దమయంతి దగ్గరకు వెళ్ళి, ఆమెకు నీ మహనీయ గుణగణాలు ఉగ్గడించి చెప్పి, ఆ కన్యకామణి నీమీదే వలపు నిలిపేటట్లు చేస్తాను'.

క. అనిన విని హంస పలుకులు । దన హృదయంబునకు నమృతధారాపాతం
బునుబోలె నైన నృపనం । దనుఁ డనురక్తుఁ డయి విడిచెఁ దడయక దానిన్. 15

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; హంస, పలుకులు= అంచమాటలు; తన, హృదయంబునకున్= తన ఎదకు; అమృత, ధారా, పాతంబును, పోలెన్+ఐన= ఎడతెగకుండ అమృతపువాన కురిసినట్లుకాగా; నృప, నందనుఁడు= రాజకుమారుడు (నలుడు); అనురక్తుఁడు+అయి= ప్రేమ కలవాడయి; తడయక= వెనువెంటనే (ఆలస్యంచేయక); దానిన్= ఆ హంసను; విడిచెన్= విడిచిపెట్టాడు.

తాత్పర్యం: ఆ హంస చెప్పినమాటలు నలుడి హృదయానికి కుంభవృష్టిగా అమృతం కురిసినట్లు అనిపించింది. అందుచేత ఆ రాజపుత్రుడు అనురాగంతో ఆ హంసను వెనువెంటనే విడిచిపెట్టాడు.

వ. అంచపిండుతో నదియును విదర్భనగరంబునకుం బఱచి, యం దుపవనంబున సఖీజనపరివృతయై యున్న దమయంతి యంతికంబునకు వచ్చి విహరించుచుండె; నంత వానిం జూచి పరమకౌతుకమ్మున. 16

ప్రతిపదార్థం: అంచ, పిండుతోన్= హంసలగుంపుతో; అదియును= ఆ హంసకూడా; విదర్భ, నగరంబునకున్+పఱచి= విదర్భ పట్టణానికి పారి, అంటే ఆకాశమార్గంలో ఎగిరివెళ్ళి; అందు+ఉపవనంబున= అక్కడి ఉద్యానవనంలో; సఖీ, జన, పరివృత+ఐ= చెలికత్తెలతో చుట్టుకొనబడిందై; ఉన్న= ఉన్నట్టి; దమయంతి+అంతికంబునకు, వచ్చి= దమయంతి సమీపానికి చేరి; విహరించుచు+ఉండెన్= తిరుగాడుతూ ఉండింది; అంత= అటుపిమ్మట; వానిన్+చూచి= ఆ హంసలను చూచి; పరమకౌతుకమ్మునన్= మిక్కుటమైన సంతోషంతో.

తాత్పర్యం: అంచపిండుతో కలిసి ఆ హంసకూడా విదర్భ రాజధానికి ఎగిరివెళ్ళి, అక్కడ ఉద్యానవనంలో చెలికత్తెలతో కలిసి విహరిస్తున్న దమయంతి సమీపానికి వచ్చి నడయాడుతూ ఉన్నది. దమయంతి ఆ హంసలను చూచి మిక్కుటమైన సంతోషాన్ని పొందింది.

తే. ఒండొరులఁ గడవంగ నయ్యువిద లెల్లఁ । బఱచి యొక్కొక్క కలహంసఁ బట్టికొనఁగఁ
జెలువముగ నందు దమయంతిచేతఁ బట్టు । వడియె నలుచేత విడువంగఁబడిన హంస. 17

ప్రతిపదార్థం: ఆ+ఉవిదలు+ఎల్లన్= ఆ అంగనలందరు; ఒండొరులన్+కడవంగన్= ఒకొరినొకరు మీరి; పఱచి= పరుగెత్తి; ఒక్కొక్క= ఒకరు ఒక; కలహంసన్= రాజహంసను; పట్టి కొనఁగన్= పట్టుకోగా; అందున్= ఆ హంసలలో; నలుచేత= నలుడిచేత; విడువంగన్+పడిన హంస= వదలి పెట్టబడిన అంచ; దమయంతిచేతన్; చెలువముగన్= అందంగా; పట్టు+పడియెన్= పట్టువడింది.

తాత్పర్యం: ఆ వనితలందరు ఒకరినొకరు మీరి, పరుగెత్తి ఒక్కొక్కరు ఒక్కొక్క రాజహంసను పట్టుకొన్నారు. అందులో మున్ను నలుడిచేత విడువబడిన హంస దమయంతిచేతనే అందంగా పట్టువడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. దమయంతికి నలునకు సం । గమకారణ దూతయైన కలహంస మనో
జ్ఞమనుష్య వాక్యముల న । ద్దమయంతికి హర్ష మెసఁగఁ దా ని ట్లనియెన్. 18

ప్రతిపదార్థం: దమయంతికి; నలునకున్; సంగమ, కారణ, దూత+ఐన= సంయోగానికి (కలయికకు విధిచే నిర్ణయించబడిన దూత అయిన; (దూత= ఉభయపక్షాలకు సంధిచేయటానికి నియుక్తుడైనవాడు); కలహంస= ఉత్తమ జాతిహంస (రాజహంస); మనోజ్ఞ, మనుష్య, వాక్యములన్= సుందరమైన మనుజ భాషలో; ఆ+దమయంతికి; హర్షము+ఎసఁగన్= సంతోషం అతిశయించగా; తాన్= ఆ హంస; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: దమయంతికి నలుడికి సంయోగం సమకూర్చటానికై విధిచే నిర్ణయించబడిన దూత అయిన ఆ రాజహంస మనోహరమైన మనుజభాషలో దమయంతికి సంతోషం అతిశయించేటట్లు ఈ విధంగా పలికింది.

విశేషం: ఈ పద్యంలో 'కారణదూత' అనే ప్రయోగానికి విద్వాంసులు విశేషార్థాన్ని వివరిస్తున్నారు. ఈ ప్రయోగం హంసకు విశేషణంగా వాడబడింది. 'సంగమకారణదూత'- సంయోగానికి కారణమైన దూత అని స్థూలంగా అర్థం చెప్పవచ్చు. అసలు- నలదమయంతులు విధాతచేత ఒకరికొకరు సృష్టించబడినవారు. అందు 'హంస' నిర్వహించవలసిన భూమిక విధి నిర్ణీతం. 'ఆ హంస నలదమయంతుల సమాగమం కూర్చటంకోసమే జన్మించింది'- అనే అర్థస్ఫూర్తి 'కారణదూత' ప్రయోగంలో కలదని పండితోత్తముల అభిప్రాయం. "కారణజన్ముఁడై కవినికాయము మెచ్చఁగఁ గావ్యకర్తయై"- అనే ప్రయోగం ఇచట స్మరించతగింది. కవినికాయం మెచ్చేటట్లు కావ్యకర్త అవటానికే రచయిత జన్మించాడని ఇందులోని అంతరార్థం. నలుడిచేత విడువబడిన హంసయే దమయంతి చేతికి పట్టువడటం ఇందులోని స్వారస్యం.

వ. 'నీ హృదయేశ్వరుండైన నలునొద్దనుండి వచ్చితి; నపార పారావార పర్యం తానంత మహీతలంబునందు నా చూడని రాజు లెవ్వరు లేరు; సర్వగుణ సౌందర్యంబుల నెవ్వరు నలుం బోలరు. 19

ప్రతిపదార్థం: నీ, హృదయ+ఈశ్వరుండు+ఐన= నీ హృదయానికి నాథుడైన- అంటే నీవు వలచినటువంటి; నలు+ఒద్ద, నుండి= నలుడి దగ్గరనుండి; వచ్చితిన్= అరుదెంచాను; అపార, పారావార, పర్యంత+అనంత, మహీతలంబునందు= ఒడ్డులేని సముద్రంవరకు అంతంలేకుండ విస్తరించిన భూమండలంలో; నా, చూడని= నేను చూడనట్టి; రాజులు+ఎవ్వరు= ప్రభువులు ఎవ్వరున్నూ; లేరు; సర్వ, గుణ, సౌందర్యంబులన్= అన్ని మంచిగుణాలలోను, అందంలోను; ఎవ్వరు= ఏ రాజులున్నూ; నలున్= నలుడితో; పోలరు= సమానులు కారు.

తాత్పర్యం: 'నేను నీ హృదయేశ్వరుడైన నలుడిదగ్గరనుండి వచ్చాను; అంతం, దరి లేని సముద్రంవరకు విస్తరించి ఉన్న ఈ అపార భూమండలంలో రాజులెవ్వరూ సౌందర్యసౌశీల్యాలలో నలుడికి సాటిరారు.

తే. నీవు నలునకుఁ బేర్మితో దేవివైనఁ । గాక నీ సముజ్జ్వల రూప కాంతి విభవ
నిత్య సౌభాగ్య భాగ్యాభిజాత్య భద్ర । లక్షణావలు లవి సఫలంబు లగునె? 20

ప్రతిపదార్థం: నీవు; నలునకున్= నలుడనే వరుడికి; పేర్మితోన్= గౌరవంతో; దేవివి= దేవేరివి; ఐనన్, కాక= అయితే తప్ప; నీ, సముజ్జ్వల, రూప, కాంతి, విభవ, నిత్య, సౌభాగ్య, భాగ్య+అభిజాత్య, భద్ర, లక్షణ+ఆవలులు= మిక్కిలి వెలుగొందే నీ సౌందర్యం, నీ లావణ్య సంపద, నీ ఎడతెగని ఐశ్వర్యం, నీ అదృష్టం, గొప్పవంశంలో జననమందిన నీ గౌరవం, శుభప్రదమైన నీకు గల సద్గుణాలు; అవి= అవన్నీ; సఫలంబులు+అగునె?= ఫలప్రదాలు అవుతాయా? అంటే రాణిస్తాయా? (రాణించవని భావం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ దమయంతీ! నీవు నలుడికి దేవేరివి అయితే తప్ప నీకు గల గొప్పలక్షణాలు- సౌందర్యం, లావణ్యా సంపద, ఐశ్వర్యం, నిత్య సౌభాగ్యం, అదృష్టం, వంశగౌరవం మున్నగునవి రాణించవు.

వ. నీవు నారీరత్నంబ, వాతండు పురుషరత్నంబు; గావున మీ యిద్దఱ సమాగమం బన్యోన్యశోభాకరంబగు' ననిన విని సంప్రాప్త హృదయసమ్మదయై దమయంతి దాని కిట్లనియె. 21

ప్రతిపదార్థం: నీవు, నారీ, రత్నంబవు= నీవు వధువులలో రత్నంవంటిదానివి, అంటే శ్రేష్ఠురాలివి; ఆతండు= ఆ నలుడు; పురుషరత్నంబు= పురుషులలో శ్రేష్ఠుడు; కావున; మీ+ఇద్దఱు+అ= మీ ఇరువురి; సమాగమంబు= కలయిక; అన్యోన్య, శోభా+ఆకరంబు+అగున్= ఒకరికి ఇంకొకరు కాంతి కలిగించేటట్లు అవుతుంది; అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; సంప్రాప్త, హృదయ, సమ్మద+ఐ= హృదయంలో ఏర్పడిన సంతోషం కలదై; దమయంతి; దానికి= ఆ హంసకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పింది.

తాత్పర్యం: నీవు స్త్రీ రత్నానివి. ఆ నలుడు పురుషరత్నం. మీ ఇరువురి సంయోగం ఒకరి కొకరు శోభ చేకూర్చినట్లు ఉంటుంది'- అని హంస పలుకగా దమయంతి మిక్కుటమైన ఆనందం పొంది ఇట్లా అన్నది.

మధ్యాక్కర.

'ఆ రాజుగుణములు నా కెఱింగించి నట్టులు నన్ను
నా రాజునకు నెఱింగించి కరుణ నాయందుఁ గావింపు
మారంగ' ననుడు నిషధవిషయమున కరిగి యా హంస
వీరసేనజునకు దాని గుణరూప విభవముల్ సెప్పె. 22

ప్రతిపదార్థం: ఆ, రాజు, గుణములు= రాజైన ఆ నలుడి గొప్పగుణాలు; నాకు+ఎఱింగించినట్టులు= నాకు తెలియజేసినట్లుగా; నన్నున్= నన్నుగురించి (అంటే నాలోని గొప్పగుణాలను); ఆ, రాజునకున్= ఆ రాజైన నలుడికి; ఎఱింగించి= తెలిపి; నాయందున్= నాపట్ల; కరుణ= దయ; ఆరంగన్= సంపూర్ణంగా; కావింపుము= కల్పించేది; అనుడు= అని చెప్పగా; ఆ, హంస; నిషధ విషయమునకు= నిషధదేశానికి; అరిగి= వెళ్ళి; వీరసేనజునకున్= వీరసేనుడి కుమారుడైన నలుడితో; దాని= ఆ దమయంతి యొక్క; గుణ, రూప, విభవముల్= మంచిగుణాలు, అందం, సంపద గురించి; చెప్పెన్= వచించింది.

తాత్పర్యం: 'ఆ నలమహారాజుగుణాలనుగురించి నా కెట్లా చెప్పావో అట్లాగే నన్నుగురించికూడా నిండైన దయతో ఆరాజుకు తెలియజెప్పుము'- అని దమయంతి అనగానే ఆ హంస నిషధదేశానికి వెళ్ళి, నలమహారాజుకు దమయంతి గుణరూపవైభవాలను గురించి చెప్పింది.

విశేషం: మధ్యాక్కర వృత్తంలోని ప్రతిచరణంలోనూ వరుసగా రెండు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం, రెండు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం ఉంటాయి. అయిదవగణంయొక్క మొదటి అక్షరంతో యతిమైత్రి. ప్రాసనియమం పాటించబడుతుంది.

వ. అంత 23

తాత్పర్యం: అప్పుడు.

చ. నలదమయంతు లిద్దఱు మనఃప్రభవానల బాధ్యమానులై
సలిపిరి దీర్ఘవాసర నిశల్ విలసన్నవనందనంబులన్
నలినదళంబులన్ మృదుమృణాళములన్ ఘనసారపాంసులం
దలిరుల శయ్యలన్ సలిలధారలఁ జందనచారుచర్చలన్. 24

ప్రతిపదార్థం: నల, దమయంతులు= నలుడును, దమయంతియు; ఇద్దఱు= ఇరువురునూ; మనస్+ప్రభవ+అనల, బాధ్యమానులు+ఐ= మన్మథతాపంచేత బాధించబడినవారై (మనః ప్రభవుడు= మన్మథుడు); దీర్ఘ, వాసర, నిశల్= పొడవైన పవళ్ళు, రేలు; విలసత్+నవ, నందనమ్ములన్= ప్రకాశిస్తున్న అపరనందనవనాలలో (నందనవనం స్వర్గలోకంలోని ఉద్యానవనం); నలినదళంబులన్= తామరపూల రేకులలో; మృదు మృణాళములన్= మెత్తనైన తామరతూండ్లలో; ఘనసార, పాంసులన్ =కర్పూరధూళితో; తలిరుల శయ్యలన్= చిగురుటాకుల సెజ్జలపై; సలిల ధారలన్= ఎడతెగకుండ చల్లుకొనిన నీళ్ళలో; చందన, చారు, చర్చలన్= మనోహరమైన గంధపు మైపూతలతో; సలిపిరి= గడిపారు.

తాత్పర్యం: నలదమయంతులు ఇరువురున్నూ (ఒకరికొకరు సుదూరంలో ఉండి) మన్మథతాపంచేత బాధించబడినవారై చెలువం చిందే నందనవనాలవంటి క్రొత్తతోటలలో, తామరపూలరేకులలో, మెత్తని తామరతూండ్లలో, కర్పూరపరాగంతో, మంచి గంధపు మైపూతలతో, చల్లనినీటి జల్లుల్లో, చిగురుటాకుల శయ్యలమీద పెక్కు పొడవయిన రేయింబవళ్ళు గడిపారు.

విశేషం: ఓజోగుణంతో కూడుకొన్న శిథిలబంధం ప్రసాదగుణం. దాని కీపద్యం చక్కని ఉదాహరణం. పూర్వరాగ విప్రలంభ వర్ణనకు సంబంధించిన ఈ పద్యరచన చిత్తవికాసరూపమైన రసానుభూతిని అందిస్తుంది. రసోచితమైన అక్షరరమ్యత గమనించదగింది. మన్మథవిరహాగ్ని తప్తులైన నాయికా నాయకులు శీతలోపచారాలను ఆశ్రయించటం ప్రకరణౌచిత్యం. 'దీర్ఘవాసరనిశల్' అనే సమాసం సార్థకం. విరహంవలన పవళ్ళు, రాత్రులు దీర్ఘాలుగా వారి కనిపించాయని ధ్వని. లేదా - పగళ్ళు దీర్ఘాలైన గ్రీష్మాదులూ, రాత్రిళ్ళు దీర్ఘాలైన హేమంతాదులూ ఈ సమాసంవలన సూచించబడుతున్నవనీ, నలదమయంతులు అన్ని ఋతువుల్లోనూ విరహబాధను విస్తృతంగా అనుభవించారనీ గ్రహించవచ్చును. భావిప్రబంధ శృంగారరసవర్ణనలకు ఈ పద్యం ఒక వెలుగుబాట.

వ. ఇట్లిద్దఱు నన్యోన్యరూపగుణ శ్రవణసంజాతప్రీతులై యుండునంత నంతఃకరణ సంతత మనోజాత సంతాప వివర్ణ వదనయైన యా దమయంతిం జూచి భయసంభ్రమాక్రాంతులై సఖీజను లెల్ల నక్కోమలి వృత్తాంతం బంతయు భీమున కెఱింగించి యిట్లనిరి. 25

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఇద్దఱున్= ఇరువురు; అన్యోన్య, రూప, గుణ, శ్రవణ, సంజాత, ప్రీతులు+ఐ= ఉభయులందుగల అందం, మంచిగుణాల గురించి వినటం వలన పుట్టిన సంతోషం కలవారై; ఉండు+అంతన్= ఉన్నపిదప; అంతఃకరణ, సంతత, మనస్+జాత, సంతాప, వివర్ణ, వదన+ఐన= మనస్సులోపలి ఎడతెగని మన్మథబాధచేత వెలవెల పోయిన ముఖం కలదైన; ఆ, దమయంతిన్+చూచి= ఆ దమయంతిని చూచి; భయ, సంభ్రమ+ఆక్రాంతులు+ఐ= భయంవలన కలిగిన ఉద్వేగంతో కూడినవారై; సఖీ, జనులు+ఎల్లన్= చెలికత్తెలందరు; ఆ+కోమలి= ఆ సుకుమారియొక్క; వృత్తాంతంబు+ అంతయు= సమాచారమంతయు; భీమునకు= (విదర్భరాజైన) భీముడికి; ఎఱింగించి= తెలిపి; ఇట్లు+అనిరి= ఈ విధంగా పలికారు.

తాత్పర్యం: నలదమయంతులు ఇద్దరు ఒకరి రూపగుణాలను గూర్చి మరొకరు వినటంవల్ల ఒకరిపై ఒకరు ప్రేమకలవారై ఉన్నారు. అప్పుడు మన్మథతాపంచేత వెలవెలపోయిన మొగంతో లోలోపల మగ్గుతున్న దమయంతిని చూచి, భయంతో కూడిన తత్తరపాటుతో చెలికత్తెలందరు ఆ సుకుమారిసమాచారాన్ని భీమరాజుకు తెలిపి ఇట్లన్నారు.

సీ. కలహంస పలికిన పలుకులు గుణియించు, । వడి దాని పోయిన వలను చూచుఁ,
బలుకదు సఖులతో లలితాంగి, మిన్నక । యలయుచు నుండుఁ దా ననుదినంబుఁ,
జారువిభూషణాహార విహార శ । య్యాసన భోగంబులందు విముఖి
యయి, రేయుఁ బగలు నిద్రయు నెప్పు డెఱుఁగక । దమయంతి నలుఁ డను ధరణినాథు

ఆ. నంద బుద్ధి నిలిపి, కందర్ప బాధిత । యగుచు నున్నయది ధరాధినాథ!
ధరణిపతుల నొరుల నురుగుణాఢ్యుల విన । నొల్ల దెంత విభవయుక్తు లయిన. 26

ప్రతిపదార్థం: కలహంస= రాజహంస; పలికిన, పలుకులు= చెప్పినమాటలు; గుణియించున్= వల్లె వేస్తుంది; వడిన్= వేగంగా; దాని, పోయిన, వలను= అది (రాజహంస) వెళ్ళిన దిక్కునే; చూచున్= చూస్తుంటుంది; సఖులతో= చెలికత్తెలతో; పలుకదు= మాటాడదు; లలితాంగి= సుకుమారమైన శరీరంకలది (దమయంతి); మిన్నక= ఊరక; అలయుచున్+ఉండున్= అలసిపోతుంటుంది; తాన్= తాను; అనుదినంబున్= ప్రతిదినమును; చారు, విభూషణ+ఆహార, విహార, శయ్యా+ఆసన, భోగంబులందున్= అందమైన ఆభరణాలపట్ల, ఆహార విహారాలలోను, పడకలోను, పీఠంలోను- అంటే ఆయా సౌఖ్యాలలో; విముఖి+అయి= పెడమొగం కలదై- అంటే లెక్కచేయనిదై; రేయున్= రాత్రులు; పగలు= పగళ్ళు; నిద్రయున్= నిద్రను; ఎప్పుడు+ఎఱుఁగక= ఎప్పుడూ తెలియక, అంటే దివారాత్రాలలో ఎప్పుడూ నిద్రపోక; దమయంతి; నలుఁడు+అను= నలుడనే; ధరణి, నాథునందు+అ= రాజుమీదే; బుద్ధి, నిలిపి= మనస్సులో లగ్నంచేసి; కందర్ప, బాధిత+అగుచున్= మన్మథుడిచేత బాధించబడిందవుతూ; ఉన్న+అది= ఉన్నది; ధరా+అధి, నాథ!= ఓ మహారాజా!; ధరణి, పతులన్+ఒరులన్= ఇతర రాజులను; ఉరు, గుణ+ఆఢ్యులన్= గొప్ప గుణాలు కలవాళ్ళను; ఎంత, విభవ, యుక్తులు+అయినన్= ఎంత సంపదతో కూడుకొని ఉన్నవాళ్ళనైనను; వినన్+ఒల్లదు= ఆలకించటానికి ఇష్టపడదు.

తాత్పర్యం: దమయంతి ఆ రాజహంస వెళ్ళినదిక్కునే ఎప్పుడూ చూస్తూ ఉంటుంది. ఆ రాజహంస చెప్పిన మాటలనే వల్లెవేస్తూ ఉంటుంది. ఆ లలితాంగి చెలికత్తెలతో మాటాడటం మానివేసింది. ఏ పనీ చేయకుండానే ఊరక అలసిపోతుంది. ప్రతిదినం ఎట్టి సౌఖ్యాలను ఆశించదు. అందమైన ఆభరణాలపై ఆహార విహారాలపై ఆమెకు అభిలాషలేదు. శయనించటానికి మంచిపరుపు కోరదు. కూర్చొనటానికి మెత్తనిపీఠం కావాలని అడగదు. అసలు నిద్రలేకుండ ఎన్నో రాత్రులు పగళ్ళు ఆమె గడిపింది. ఎల్లప్పుడు నలుడు అనే మహారాజునే స్మరిస్తూ మన్మథతాపంతో క్రుంగి కృశిస్తున్నది. ఓ మహారాజా! ఇతర రాజులు ఎంతటి సంపద కలవారైనా, ఎంతటి గొప్పగుణాలు కలవారైనా వారి విషయం ఏమాత్రం వినటానికి ఇష్టపడదు.

వ. అనిన విని భీముం 'డేమి సేయుదు? నెవ్విధంబున నమ్మహీపతి నిట రావింప నగునో!' యని చింతించుచు సంప్రాప్త యౌవనయైన కూఁతుం జూచి యప్పుడు. 27

ప్రతిపదార్థం: అనిన, విని= అని చెప్పగా విని; భీముండు= భీమరాజు; ఏమి+చేయుదున్= ఏమి చేయగలను?; ఏ+విధంబునన్= ఏరీతిగా; ఆ+మహీపతిన్= ఆ (భూభర్త) రాజును; ఇట= ఇచటికిః రావింపన్+అగునో= రప్పించటానికి వీలవునో?; అని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చింతించుచున్= యోచిస్తూ; సంప్రాప్త, యౌవన+ఐన= ప్రాప్తించిన యౌవనంకలదైన-అంటే యుక్తవయస్సు వచ్చినట్టి కూఁతున్+చూచి= పుత్రికను చూచి; అప్పుడు.

తాత్పర్యం: చెలికత్తెలు అట్లా చెప్పగా విని భీమరాజు 'ఏమి చేయగలను? ఏ ఉపాయంతో ఆ నలమహారాజును ఇచటికి రప్పించగలను?' అని ఆలోచిస్తూ, యుక్తవయస్సు వచ్చిన పుత్రికను చూచి, అపుడు.

క. ఆ వైదర్భుఁడు నిఖిల ధ । రా వలయములోనఁ గలుగు రాజన్యుల నా
నా విషయాధీశ్వరులను । రావించెం దత్స్వయంవర వ్యాజమునన్. 28

ప్రతిపదార్థం: ఆ, వైదర్భుఁడు= ఆ విదర్భరాజు(భీముడు); నిఖిల, ధరా, వలయములోనన్+కలుగు= సమస్త భూమండలంలో ఉన్న; రాజన్యులన్= రాజులను, నానా, విషయ+అధీశ్వరులను= వివిధ దేశాలకు ప్రభువులైన వాళ్ళను; తద్+స్వయంవర, వ్యాజమునన్= ఆ దమయంతియొక్క స్వయంవరం అనే మిషతో; రావించెన్= రప్పించాడు.

తాత్పర్యం: ఆ విదర్భరాజు భీముడు సమస్త భూమండలంలో ఉన్న రాజులను దమయంతీ స్వయంవరమనే మిషతో రప్పించాడు.

విశేషం: పూర్వకాలంలో భారతదేశంలో క్షత్రియ రాజకన్యలు తమకు నచ్చిన వరుడిని ఎన్నిక చేసికొని పెండ్లి చేసికొనేవారు. ఆ బహిరంగ రాజసభకు రాజులందరినీ ఆహ్వానించటం పరిపాటి. ఆ మహోత్సవంలో ప్రధాన భూమిక నిర్వహించే కన్యక రాజపుత్రిక. కావున ఆ మహోత్సవానికి 'స్వయంవరం' అనే పేరు వచ్చింది.

క. మనుజేశ్వరు లెల్లను బో । రన దమయంతీ స్వయంవరమునకు నొప్పం
జనుదెంచిరి సైన్యస్యం । దన ఘట్టన నవనితలము దల్లడపడఁగన్. 29

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వరులు+ఎల్లను= రాజులందరు; బోరున= శీఘ్రంగా; దమయంతీ, స్వయంవరమునకున్= దమయంతి యొక్క స్వయంవరానికి; సైన్య, స్యందన, ఘట్టనన్= భటులయొక్క రథాలయొక్క తాకిడివలన; అవనితలము= భూమిపైభాగం; తల్లడపడఁగన్= తల్లడిల్లేటట్లు; ఒప్పన్= ఒప్పునట్లుగా (తగినట్లుగా); చనుదెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: రాజులందరు ఉత్సాహంతో దమయంతీస్వయంవరానికి విచ్చేశారు. వారి సేనలయొక్క, రథాలయొక్క రాపిడిచేత భూమిపైభాగం తల్లడిల్లింది.

వ. ఆ సమయంబునఁ బర్వత నారదు లను పురాణమునులు భూలోకం బెల్లం గ్రుమ్మరి యింద్రలోకంబునకుం బోయిన నింద్రుండు వారిం బూజించి, భూలోకంబునం గుశలం బడిగి. 'యిది యెట్లు ధర్మపరిపాలనపరులై వీరులై రణనిహతు లైన రాజు లక్షయలోకసుఖంబు లనుభవింప నతిథులై యిందులకు నింతకాలంబయ్యు రాని కారణం బేమి?' యని యడిగిన నారదుం డిట్లనియె. 30

ప్రతిపదార్థం: ఆ, సమయంబునన్= అప్పుడు; పర్వత, నారదులు+అను= పర్వతుడు, నారదుడు అనే; పురాణమునులు= ప్రాచీనఋషులు; భూలోకంబు+ఎల్లన్= భూలోకాన్ని అంతటిని; క్రుమ్మరి= తిరిగి; ఇంద్ర, లోకంబునకున్+పోయినన్= ఇంద్రలోకానికి వెళ్ళగా; ఇంద్రుండు= ఇంద్రుడు; వారిన్= ఆ పర్వత నారదులను; పూజించి= గౌరవించి; భూలోకంబునన్,

కుశలంబు+అడిగి= భూలోకంలోని క్షేమసమాచారం అడిగి; ఇది+ఎట్లు= ఇది ఎట్లాగ?; ధర్మ, పరిపాలనపరులు+ఐ= ధర్మంతో ఏలుబడి కొనసాగిస్తున్న వారై; వీరులు+ఐ= పరాక్రమవంతులై; రణ, నిహతులు+ఐన, రాజులు= రణంలో చంపబడిన రాజులు; అక్షయ, లోక, సుఖంబులు= తరగనట్టి లోకాలలోని సౌఖ్యాలు; అనుభవింపన్= అనుభవించటానికై; అతిథులు+ఐ= మన్ననను అనుభవించే ఆగంతుకులై; ఇందులకున్= ఇచటికి; ఇంతకాలంబు+అయ్యున్= ఇంతకాలం గడచిపోయినప్పటికి; రాని, కారణంబు+ఏమి+అని= రానట్టిహేతువు ఏమి టని; అడిగినన్= అడుగగా; నారదుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ సమయంలో పర్వతుడు, నారదుడు అనే ప్రాచీనఋషులు భూమండలమంతా తిరిగి చూచి ఇంద్రలోకానికి వెళ్ళారు. ఇంద్రుడు వారిని పూజించి భూలోకాన్నిగురించిన కుశలప్రశ్నలు వేసి 'మునీంద్రులారా! ఇంతకుపూర్వం ధర్మపరిపాలన చేసి, యుద్ధాలలో వీరమరణం చెందిన రాజులు అక్షయలోకాల సుఖాలను అనుభవించటానికై అతిథులుగా స్వర్గలోకానికి వస్తూ ఉండేవారు. కానీ, ఇంతకాలమయినా వారు రాకపోవటానికి గల కారణమేమిటి?' అని అడుగగా నారదుడు ఇట్లా చెప్పాడు.

విశేషం: (1) ప్రాచీనభారతీయవాఙ్మయంలో నారదుడిపాత్ర ఒక విశిష్టసృష్టి, నారదుడు త్రిలోకసంచారి. ఆ మునికి తెలియని సమాచారం ఉండదు. ఆయన సంగీతప్రియుడు. కలహభోజనుడు, గొప్ప భగవద్భక్తుడు. (2) అతిథి:- మర్యాదగా ఆహ్వానాన్ని పురస్కరించుకొని విందుకై వచ్చే ఆగంతుకుడు అనేది నేటి వ్యవహారంలోని అర్థం. న+తిథి= తిథిని చూడకుండ (ఆహారార్థం) పయనించి వచ్చేవాడు- అని అసలు అర్థం.

క. 'నర సిద్ధ సాధ్య విద్యా । ధర సురకన్యకలకంటె దమయంతియ సుం
దరి; దాని సుస్వయంవర । మరుదై వర్తిల్లుచున్నయది యిప్డు మహిన్. 31

ప్రతిపదార్థం: నర, సిద్ధ, సాధ్య, విద్యాధర, సుర, కన్యకల కంటెన్= మనుజులలో, సిద్ధులలో, సాధ్యులలో, విద్యాధరులలో, దేవతలలో ఉన్న పెండ్లిగాని ఆడుపడుచులందరికంటె; దమయంతి+అ= దమయంతి ఒక్కతె మాత్రమే; సుందరి= అందకత్తె; దాని= ఆమెయొక్క; సు, స్వయంవరము= గొప్ప స్వయంవరం; ఇప్డు= ఇపుడు; మహిన్= భూలోకంలో; అరుదు+ఐ= అసాధారణమైనదై; వర్తిల్లుచున్న+అది= జరుగుతున్నది.

తాత్పర్యం: 'దమయంతి జగదేకసుందరి. నరులలో, సిద్ధులలో, సాధ్యులలో, విద్యాధరులలో, దేవతలలో అటువంటి సౌందర్యవతి లేదు. ఆమె స్వయంవరమహోత్సవం ఇపుడు భూలోకంలో అసాధారణ వైభవంతో జరుగుతున్నది.

క. అందులకు ధరణిఁ గల నృప । నందను లెల్లను ముదంబునం బోయెడు వే
డ్కం దమలోఁ గలహంబును । గ్రందును లేకున్నవారు గడు నెయ్యమునన్.' 32

ప్రతిపదార్థం: అందులకున్= ఆ దమయంతీ స్వయంవరానికి; ధరణిన్+కల= భూమిలో ఉండే; నృపనందనులు+ఎల్లను= రాజపుత్రులందరును; ముదంబునన్= సంతోషంతో; పోయెడు= వెళ్ళే; వేడ్కన్= కుతూహలంతో; కడునెయ్యమునన్= మిక్కుటమయిన స్నేహంతో; తమలోన్= ఒకరికొకరు; కలహంబును= విరోధాన్ని; క్రందును= పొరపొచ్చాన్ని; లేక+ఉన్నవారు= లేకుండ ఉన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ దమయంతీ స్వయంవరంలో పాల్గొనటానికై భూలోకంలోని రాకుమారులందరు తమలోని అన్యోన్య వైరాలు, అభిప్రాయభేదాలు ఉజ్జగించి, ఉత్సాహంతో, వేడుకతో మిక్కిలి స్నేహంతో ఉంటున్నారు.'

విశేషం: నారదుడికి కావలసింది అన్యోన్యకలహాలు. దమయంతీ స్వయంవర కారణాన కలహభోజనుడైన నారదుడు పాపం పస్తులుండవలసి వచ్చింది.

వ. అనిన నింద్రుండును, లోకపాలవరులును దదాలోకన కౌతుకంబునం గనక రత్నరమ్య దివ్య విమానారూఢులయి చనువారు ముందట దమయంతీ స్వయంవరంబునకుంబోయెడువాని నాదిత్యులలోన విష్ణుండునుంబోలెఁ దేజోధికుండైన వాని ననన్యసాధారణరూపవిభవంబున రెండవ మన్మథుండు నుంబోనివాని నలుం గని యంతరిక్షంబున విమానంబులు నిలిపి భూతలంబునకు వచ్చి వాని కిట్లనిరి. 33

ప్రతిపదార్థం: అనినన్= అని నారదమహర్షి చెప్పగా విని; ఇంద్రుండును= ఇంద్రుడున్నూ; లోకపాలవరులును= గొప్పవారైన దిక్పాలకులున్నూ; తద్+ఆలోకన, కౌతుకంబునన్= ఆ దమయంతీ స్వయంవరాన్ని చూడాలనే వేడుకతో; కనక, రత్న, రమ్య దివ్య, విమాన+ఆ రూఢులు+అయి= బంగారంతో, రత్నాలతో (పొదగబడటంచేత) అందమైన దివ్యవిమానాలలో కూర్చున్నవారై, చనువారు= ప్రయాణించేవారు; ముందట=(తమ కనుల) ముందు; దమయంతీ, స్వయంవరమునకున్+పోయెడువానిన్; ఆదిత్యులలోనన్= సూర్యులలో; విష్ణుండునున్+పోలెన్= విష్ణువువలె; తేజస్+అధికుండు+ఐనవానిన్= తేజస్సుచేత అధికుడైనవాడిని, అంటే మిక్కుటమైన ప్రకాశం గల నలుడిని; అనన్య, సాధారణ, రూప, విభవంబునన్= ఒరులకు సాధారణం గాని సౌందర్యం సంపద చేత; రెండవ, మన్మథుండునున్+పోనివానిన్= అపర మన్మథుడివలె ఉన్నవాడిని; నలున్+కని= నలుడిని చూచి; అంతరిక్షంబునన్= ఆకాశంలో; విమానంబులు; నిలిపి; భూతలంబునకు, వచ్చి= భూమి మీదకు చేరి; వానికి= ఆ నలుడికి; ఇట్లు+అనిరి= ఇట్లా చెప్పారు.

తాత్పర్యం: అని నారదమహర్షి చెప్పగా విని ఇంద్రుడున్నూ, దిక్పాలకులున్నూ, ఆ దమయంతీ స్వయంవరాన్ని చూచే వేడుకతో రత్నాలు పొదగబడిన అందమైన పసిడి విమానాలను ఎక్కి బయలుదేరారు. దారిలో భూమిపై వారి కనులముందు నలుడు కనిపించాడు. ఆ మహారాజుకూడ దమయంతీ స్వయంవరానికి వెళ్ళుతున్నాడు. అతడు సూర్యులలో విష్ణువువలె మిక్కుటమైన కాంతితో వెలుగొందుతున్నాడు; సౌందర్యంలో సాటిలేనివాడై అపరమన్మథుడివలె దీపిస్తున్నాడు. అపుడు దేవతలు ఆకాశంలో తమ విమానాలను నిలిపి భూమిపైకి వచ్చి నిలిచి, నలుడితో ఇట్లా పలికారు.

విశేషం: ఆదిత్యులు పన్నెండుమంది. వారిలో 'విష్ణువు' అధిక తేజస్వి. ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూషుడు, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు - వీరు ద్వాదశాదిత్యులు. "ఆదిత్యానా మహం విష్ణుః" అనే భగవద్గీతావాక్యం ఇట స్మరించదగింది.

సీ. 'నిత్యసత్యవ్రత! నిషధేశ! నీవు మా । కమరంగ దూతవై యభిమతంబు
సేయుము' నావుడుఁ జెచ్చెర 'నట్టుల । చేయుదు మఱి నాకుఁ జెపుఁడు మీర
లెవ్వార? లేను మీ కిష్టంబుగా దూత । నై యేమి సేయుదు?' ననిన, నతని
కమరేశ్వరుం డిట్టు లనియె; 'నే నింద్రుండ; । వీరు దిక్పాలురు విదితయశులు;

ఆ. ధరణి నొప్పుచున్న దమయంతి సుస్వయం । వరముఁ జూచు వేడ్క వచ్చియున్న
వార; మీవు మమ్ము వారిజాక్షికి నెఱిం । గింపు నామధేయ కీర్తనముల. 34

ప్రతిపదార్థం: నిత్య, సత్య, వ్రత!= ఎల్లప్పుడు సత్యాన్ని వ్రతంగా పాటించేవాడా!; నిషధ+ఈశ!= నిషధదేశానికి పాలకుడా!; నీవు; మాకు; అమరంగన్= ఒప్పునట్లుగా; దూతవు+ఐ= హితం కోరే ప్రతినిధివై; అభిమతంబు+చేయుము= కోరిక నెరవేర్చుము; నావుడున్= అనగా; చెచ్చెరన్= వేగంగా; అట్టుల, చేయుదున్= అట్లే చేస్తాను; మఱి= ఇక; నాకున్+చెపుఁడు= నాకు చెప్పండి; మీరలు+ఏ+వారలు= మీరు ఎవరు?; ఏను= నేను; మీకు; ఇష్టంబు+కాన్= ప్రీతి కలిగేటట్లు; దూతను+ఐ= మీకు ప్రతినిధిగా; ఏమి+చేయుదున్= ఏ కర్తవ్యాన్ని నెరవేర్చవలసి ఉన్నది; అనినన్= అని పలుకగా; అతనికి= ఆ నలుడికి; అమర+ఈశ్వరుండు= దేవేంద్రుడు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; ఏను= నేను; ఇంద్రుండ= ఇంద్రుడిని; వీరు; దిక్పాలురు= వీరు దిక్కులను పాలించేవారు; విదితయశులు= ఎల్లరకు తెలిసినట్టి కీర్తి కలవారు; ధరణిన్+ఒప్పుచున్న= భూలోకంలో విలసిల్లుతున్న; దమయంతి, సుస్వయంవరమున్= దమయంతీ శుభ స్వయంవరాన్ని; చూచు, వేడ్కన్= చూడాలనే కుతూహలంచేత; వచ్చి+ఉన్న, వారము= వచ్చినవారము; ఈవు= నీవు; మమ్మున్= మమ్మల్ని; నామధేయ, కీర్తనములన్= పేర్ల బిరుదులతోపాటు ప్రశంసించటం ద్వారా; వారిజ+అక్షికిన్= పద్మనేత్రకు, దమయంతికి; ఎఱింగింపు= తెలియజేయాలి.

తాత్పర్యం: 'ఎల్లప్పుడు సత్యవ్రతాన్ని దీక్షతో పాటించే ఓ నిషధమహారాజా! నీవు మాకు అనువైన దూతగా మా అభీష్టం నెరవేర్చాలని కోరుతున్నాం'- అని చెప్పగా నలుడు వెనువెంటనే మారుపలికాడు. 'అట్లే చేస్తాను. మరి నాకు మీ రెవరో, నేను మీకు ప్రియమొనరించటానికి మీ ప్రతినిధి (దూత) నయి ఏ కర్తవ్యాన్ని నెరవేర్చాలో సెలవిండు' అని చెప్పగా అతడికి దేవేంద్రుడు ఇట్లా చెప్పాడు. 'నేను దేవేంద్రుడిని. వీరు నా సహచరులైన దిక్పాలురు. సుప్రసిద్ధులు. మేము భూలోకంలో జరుగుతున్న దమయంతీ స్వయంవరాన్ని చూచేవేడుకతో విచ్చేసి ఉన్నాం. నీవు పద్మదళాయతాక్షి అయిన దమయంతికి మమ్మల్ని పేర్లతో, బిరుదాలతో ప్రశంసాపూర్వకంగా పరిచయం చేయాలి.

వ. అట్లయిన నక్కోమలి మాయందుఁ దనవలచినవాని వరియించు 'ననిన నింద్రునకుఁ గృతాంజలియై నలుం డిట్లనియె. 35

ప్రతిపదార్థం: అట్లు+అయినన్= ఆ విధంగా నీవు దౌత్యం నెరపిన పిమ్మట; ఆ+కోమలి= ఆ సుకుమారి; మాయందున్= మాలో; తన వలచినవానిన్= తనకు ఇష్టమైనవాడిని; వరియించును= భర్తగా ఎన్నుకొంటుంది; అనినన్= అని చెప్పగా; ఇంద్రునకున్; కృతాంజలి+ఐ= నమస్కరించి; నలుండు= నలుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ విధంగా నీవు దౌత్యం నెరపితే, ఆ సుకుమారి దమయంతి తన ఇచ్చవచ్చినవాడిని మాలో ఒకరిని వరుడిగా ఎన్నుకొంటుంది'- అని ఇంద్రుడు చెప్పగా విని నలుడు ఆతడికి నమస్కరించి ఇట్లా అన్నాడు.

ఆ. 'ఎఱిఁగి యెఱిఁగి నన్ను నేకార్థసముపేతుఁ । బాడియయ్య యిట్టి పనికిఁ బనుప?'
ననిన 'నుత్సుకుండ వై యేల చేసెద । నంటి? చేయకుండ నగునె యింక? 36

ప్రతిపదార్థం: ఎఱిఁగి, ఎఱిఁగి,= తెలిసి, తెలిసి; ఏక+అర్థ+సముపేతున్+నన్నున్= ఒకేధ్యేయం గల నన్ను, అంటే మీకూ నాకూ లక్ష్యం ఒకటే అయిన నన్ను; ఇట్టి, పనికిన్+పనుపన్= ఇటువంటి పనికి నియోగించటం; పాడి+అయ్య?= (మీకు) న్యాయమా?!; అనినన్= అని చెప్పగా; ఉత్సుకుండవు+ఐ= తమకం కలవాడివై; ఏల= ఎందుకు? చేసెదను= చేయగలను; అంటి= అన్నావు; ఇంక= ఇక; చేయకుండన్+అగునె?= చేయకుండటం నీకు వీలౌతుందా? (ఉండదని భావం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'మీరూ, నేనూ ఒకే ధ్యేయసిద్ధికై ప్రయత్నిస్తున్నవారలం. ఆ విషయం మీకు సంపూర్ణంగా తెలిసిందే. అటువంటప్పుడు ఈ పనికి మీరు నన్ను వినియోగించటం న్యాయమా?' అని నలుడు దేవేంద్రుడిని ప్రశ్నించాడు. దేవేంద్రుడు నలుడితో 'నీవేకదా మేము ఏ విషయాన్ని అర్థించినా చేస్తానని ఉత్సాహంతో మాట ఇచ్చావు. ఇక ఆడినమాట నీ వెట్లా తప్పటానికి వీలౌతుంది?

ఆ. **నిన్ను నిత్యసత్యనిరతుఁగా నెఱిఁగి యి । క్కార్యమునకు వలను గలుగు టెఱిఁగి**
పనుప వలసె దూతభావ మపేక్షించి; । దేవహితము, దీనిఁ దీర్పవలయు. 37

ప్రతిపదార్థం: నిన్ను; నిత్య, సత్య, నిరతున్+కాన్= ఎల్లప్పుడు సత్యం పాటించేవాడినిగా; ఎఱిఁగి= తెలిసికొని, ఈ+కార్యమునకున్= ఈ పనికి; వలను, కలుగుట+ఎఱిఁగి= వీలున్నదని తెలిసికొని; దూత భావము+అపేక్షించి= నీ దౌత్యాన్ని కోరి; పనుప వలసెన్= నియోగించవలసి వచ్చింది; దేవ, హితము= దేవతల కొరకైన మేలు; దీనిన్= దీనిని; తీర్పన్, వలయున్= నెరవేర్చాలి.

తాత్పర్యం: నీవు సత్యసంధుడివని తెలుసు. ఈ కార్యం నిర్వహించగలిగే శక్తిసామర్థ్యాలు నీకు కలవనీ మాకు తెలుసు. అందుచేతనే నీ దౌత్యాన్ని మేము కోరుకొన్నది. ఇది దేవతల మేలు కొరకైన కార్యం. నీవు దీనిని నెరవేర్చాలి.

వ. **ఆయుధీయ సురక్షితం బయిన రాజగృహం బెట్లు సొర నగు నని శంకింప వలవదు; దమయంతీ నివేశంబు ప్రవేశించు నపుడు ని న్నెవ్వరు వారింపనోడుదు' రనిన శక్రువచనంబుల నశంకితుం డయి నలుం డప్పుడ విదర్భా నగరంబునకుం బోయి యొక్కరుండ దమయంతీగృహంబు సొచ్చిన. 38**

ప్రతిపదార్థం: ఆయుధీయ+సురక్షితంబు+అయిన=ఆయుధాలు ధరించినభటులచేత బాగా కాపాడబడుతున్న; రాజగృహంబు= రాజుగారి అంతఃపురం; ఎట్లు+సొరన్+అగున్+అని= ఏ విధంగా ప్రవేశించటానికి వీలుంటుందని; శంకింప, వలవదు= సందేహించ నవసరం లేదు; దమయంతీ, నివేశంబు= దమయంతిమందిరం; ప్రవేశించునపుడు= లోనికి వెళ్ళేటప్పుడు; నిన్ను+ఎవ్వరు= నిన్ను ఎవరున్నూ; వారింపన్+ఓడుదురు= అడ్డుపెట్టజాలరు; అనినన్= అని చెప్పగా; శక్రువచనంబులన్= ఇంద్రుడి మాటలచొప్పున; అశంకితుండు+అయి= సందేహం లేనివాడై; నలుండు; అప్పుడు+అ= అప్పుడే; విదర్భానగరంబున కున్+పోయి= విదర్భరాజధానికి వెళ్ళి; ఒక్కరుండు+అ= తా నొక్కడు మాత్రమే; దమయంతీ, గృహంబు+చొచ్చినన్= దమయంతి నివసించే ఇల్లు ప్రవేశించగా.

తాత్పర్యం: 'ఆయుధాలు ధరించిన భటులు బాగా కాపాడుతున్న రాజుగారి అంతఃపురం ఎట్లా ప్రవేశించటానికి వీలవుతుంది? అని శంకించవద్దు. దమయంతీమందిరం ప్రవేశించేటప్పుడు నిన్ను ఎవరూ అడ్డుపెట్టజాలరు'- అని ఇంద్రుడు చెప్పగా, అతడి మాటల ప్రకారం నలుడు అప్పుడే విదర్భరాజధానికి వెళ్ళి తా నొక్కడు మాత్రమే దమయంతి ఇంట్లో ప్రవేశించాడు.

నలుఁడు దమయంతియొద్దకు దేవదూతయై పోవుట (సం. 3-52-10)

సీ. **హంసచేఁ దన వినినంతకంటెను రూప । విభవాతిశయమున వెలయుదాని,**
సురకన్యకలయట్టి సురుచిర శతకన్య । కాళిచేఁ బరివృతయైన దాని,
హృదయేశుఁడైన తన్నెప్పుడు వినుచున్కి । నలయ కాశ్వాసిత యైనదాని,
దమయంతిఁ జూచి కందర్పశరావిద్ధుఁ । డయ్యె నలుం; డంత నతనిఁ జూచి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'యితఁ డపూర్వ మనుజుఁ డెందుండి వచ్చెనో'? యనుచు నుదరిపడి లతాంగు లెల్ల
నాసనములు డగ్గి యప్పు డభ్యుద్గత । లైరి మనములందు హర్ష మెసఁగ. 39

ప్రతిపదార్థం: హంసచేన్= హంసచేత; తన, వినినంత కంటెను= తాను వినిఉన్నదాని కంటె; రూప, విభవ+అతిశయమున= సౌందర్య సంపదయొక్క ఆధిక్యంచేత; వెలయుదానిన్= విలసిల్లుతూ ఉండే దానిని; సురకన్యకల+అట్టి= దేవకన్యకల వంటి; సు, రుచిర, శత, కన్యక+ఆళిచేన్= మిక్కిలి ప్రకాశమానలైన నూర్గురు కన్యకల సమూహంచేత; పరివృత+ఐన, దాని= చుట్టుకొనబడి ఉన్నదానిని; హృదయ+ఈశుఁడు+ఐన= మనోనాథుడైన (మనసార వలచినవాడైన); తన్ను+ఎప్పుడు= తనను గురించి ఎల్లప్పుడును; వినుచు+ఉన్కిన్= వింటూ ఉండటంచేత; అలయక= అలసిపోకుండ; ఆశ్వాసిత+ఐన, దానిన్= ఊరటపొందిన దానిని; దమయంతిన్+చూచి= దమయంతిని చూచి; కందర్ప, శర+ఆవిద్ధుఁడు+అయ్యెన్= మన్మథబాణాలచేత కొట్టబడినవాడు అయ్యాడు; నలుండు= నలుడు; అంతన్= అంతట; అతనిన్+చూచి= ఆ నలుడిని చూచి; ఇతఁడు; అపూర్వ మనుజుఁడు= క్రొత్తవాడు; ఎందుండి, వచ్చెనో= ఎచటనుండి వచ్చి ఉన్నాడో; అనుచున్= అని తలపోస్తూ; ఉదరిపడి= భయపడి; లతా+అంగులు+ఎల్లన్= లతలవంటి శరీరాలుగల అంగనలందరు; ఆసనములు= కూర్చున్న పీఠాలు; డిగ్గి= దిగి; మనములందున్= మనస్సులలో; హర్షము= సంతోషం, ఎసఁగన్= ఉప్పొంగగా; అభ్యుద్గతలు+ఐరి= సగౌరవంగా లేచి నిల్చిన వారు అయ్యారు.

తాత్పర్యం: నలుడు అప్పు డచట దమయంతిని తొలిసారి చూచాడు. అతడికి హంస అలనాడు తనతో చెప్పినదాని కంటె ఆమె సౌందర్యసంపద ఎక్కువగా తోచింది. దేవకన్యకలతో సౌందర్యంలో తులతూగే నూరుమంది చెలికత్తెలు ఆమెను కొలుస్తూ ఉన్నారు. హృదయేశ్వరుడైన నలుడిని గూర్చి సదా వింటున్నందున, దమయంతి అలయక ఊరట పొందుతూ ఉన్నది. అట్టి దమయంతిని చూచి నలుడు మన్మథబాణ పరిపీడితుడయ్యాడు. నలుడిని చూచిన వెంటనే ఆ లలితాంగులందరు అదిరిపడి పీఠాలు దిగి 'ఈ అపూర్వ మనుజుడు ఎవ్వడు? ఎచటినుంచి ఇచటికి వచ్చాడు?' అని ఆశ్చర్యపడి, మనస్సులు సంతోషంతో ఉప్పొంగగా, సగౌరవంగా లేచి నిలబడ్డారు.

వ. అంత. 40

తాత్పర్యం: అట్లా దమయంతి చెలికత్తెలందరూ లేచి నిలబడిన తర్వాత.

క. దమయంతి మనోభవనిభు । నమరేంద్రుప్రతిము దినకరాభు సుధారుక్
సము వరుణసదృశు ధనదో । పము నశ్విసమాను నిషధపతిఁ జూచి నలున్. 41

ప్రతిపదార్థం: దమయంతి; మనస్+భవ, నిభున్= మన్మథుడితో సమానుడిని; అమర+ఇంద్ర, ప్రతిమున్= దేవేంద్రుడితో సమానుడిని; దినకర+ఆభున్= సూర్యుడితో సమానుడిని (ఆభ శబ్దం సమాసోత్తరపదంగా ఉన్నపుడు 'సదృశం' అనే అర్థం ఇస్తుంది); సుధా, రుక్+సమున్= అమృత కిరణుడైన చంద్రుడితో సముడిని; వరుణ, సదృశున్= వరుణుడితో పోలినవాడిని; ధనద+ఉపమున్= కుబేరుడితో పోల్చదగినవాడిని; అశ్వి సమానున్= అశ్వినీదేవతలతో సమానుడిని; నలున్= నలుడిని; నిషధపతిన్= నిషధరాజును; చూచి= చూచి.

తాత్పర్యం: దమయంతి మన్మథుడితో సమానుడు, దేవేంద్ర సదృశుడు, సూర్యతేజస్వి, చంద్రసముడు, వరుణ నిభుడు, కుబేరతుల్యుడు, నిషధరాజు అయిన నలుడిని చూచి-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వారిరుహనేత్ర మదన । ప్రేరితయై లజ్జ యుడిగి భీతిల్లక బృం
దారకమూర్తికి రాజకు । మారున కిట్లనియె మందమందమృదూక్తిన్. 42

ప్రతిపదార్థం: వారి, రుహ, నేత్ర= పద్మాలవంటి కన్నులు కల దమయంతి; (వారి, రుహం= నీటిలో పుట్టింది పద్మం); మదనప్రేరిత+ఐ= మన్మథుడిచేత ప్రేరేపించబడిందై; లజ్జ+ఉడిగి= సిగ్గును వీడి; భీతిల్లక= భయపడక; బృందారక, మూర్తికిన్= దేవతల ఆకారం కలవాడికి; రాజకుమారునకు= రాజపుత్రుడికి; మంద, మంద, మృదు+ఉక్తిన్= మెలమెల్లగా మెత్తనైన మాటలతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: పద్మనయన అయిన దమయంతి మన్మథుడిచేత ప్రేరేపించబడిందై, సిగ్గును అవతలికి త్రోసి, జంకుగొంకులు లేకుండ దివ్యసుందర విగ్రహుడూ, రాకుమారుడూ అయిన నలుడితో మెల్లని మెత్తని పలుకులతో ఇట్లా పలికింది.

వ. 'నీవు మహానుభావుండ వెవ్వండ? విందుల కేమి కారణంబున నేకతంబ వచ్చితి? విది యత్యుగ్రశాసనుండైన మదీయ జనకుచేత సురక్షితంబగుట నెవ్వరికిఁ జొర నశక్యంబు; దీని నెవ్వరు నెఱుంగకుండ నెవ్విధంబునం జొచ్చితివి? నాకు మనోజ వేదనా వివర్ధనుండవైన నీ తెఱం గెఱింగింపు' మనిన దానికి నలుం డిట్లనియె.43

ప్రతిపదార్థం: నీవు, మహానుభావుండవు= నీవు గొప్ప మహిమ కలవాడివి; ఎవ్వండవు= ఎవరివి?; ఇందులకు= ఇచటికి; ఏమి కారణంబునన్= ఏ హేతువుచేత; ఏకతంబు+అ= ఒంటరిగా; వచ్చితివి; ఇది= ఈ అంతఃపురం; అతి+ఉగ్రశాసనుండు+ఐన= మిక్కిలి భయంకరమైన ఆజ్ఞలు అమలు జరిపేవాడైన; మదీయ, జనకుచేతన్= నా తండ్రిచేత; సురక్షితంబు+అగుటన్= బాగుగా కాపాడబడటంచేత; ఎవ్వరికిన్= ఎవరికైనను; చొరన్= ప్రవేశించటానికి; అశక్యంబు= సాధ్యంకానిది; దీనిన్= ఈ అంతఃపురాన్ని; ఎవ్వరున్+ఎఱుంగకుండన్= ఎవ్వరును తెలిసికొనకుండ; ఏ+విధంబునన్= ఏరీతిగా; చొచ్చితివి= చొరబడ్డావు; నాకు; మనోజ, వేదనా, వివర్ధనుండవు+ఐన= మన్మథతాపాన్ని పెంపొందించినవాడివయిన; నీ, తెఱంగు= నీ తీరు; ఎఱింగింపుము= తెలియజేయుము; అనినన్= అని చెప్పగా; దానికిన్= ఆ దమయంతికి; నలుండు= నలుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'నీవు మహానుభావుడివిగా కన్పిస్తున్నావు. నీవు ఎవరివి? ఎచటనుండి ఇచటికి వచ్చావు? ఏకారణంగా వచ్చావు? ఈ అంతఃపురం చండశాసనుడైన మా తండ్రిగారిచేత సురక్షితం. మరి నీవు ఎవ్వరికీ కనపడకుండ ఎట్లా ఇచటికి రాగలిగావు? ఇట్లా ఎవ్వరూ ఇచటికి రాలేరు. నాకు మన్మథతాపాన్ని హెచ్చిస్తున్న నీ తీరుతెన్నులు తెలుపుము'- అని దమయంతి అడుగగా నలుడు ఇట్లా బదులు పలికాడు.

ఆ. 'ఏను దేవదూత నింతి! నలుం డను । వాఁడ; నింద్రదహన వరుణ యములు
నీ స్వయంవరంబు నెమ్మితోఁ జూడంగ । నరుగుదెంచి నన్ను నబల! మున్న. 44

ప్రతిపదార్థం: ఇంతి!= ఓ (దమయంతీ) లలనా!; ఏను= నేను; దేవదూతను= దేవతలకు దూతను; నలుండు+అనువాఁడన్= నలుడు అనేవాడిని; ఇంద్ర, దహన, వరుణ, యములు= ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, యముడు; నీ, స్వయంవరంబు= నీ స్వయంవరాన్ని; నెమ్మితోన్= ప్రీతితో; చూడంగన్+అరుగుదెంచి= చూడటానికై వచ్చి; మున్ను+అ= ముందుగా; నన్నున్; అబల!= ఓ అంగనా! (అబల= బలంలేనట్టిది. స్త్రీవాచకం)

తాత్పర్యం: 'ఓ లలనామణీ! నేను దేవతల దూతను, నాపేరు నలుడు. ఇంద్రుడు, అగ్ని, యముడు, వరుణుడు నీ స్వయంవరాన్ని చూడటానికై వచ్చి ముందుగా నన్ను -

క. నీ యొద్దకుఁ బుత్తెంచిరి; । మాయం దొక్కరు నభీష్టమతి వరియింపం
దోయజముఖిఁ బ్రార్థింపుము; । మాయందఱకును బ్రియం బమర్పుము ప్రీతిన్.' 45

ప్రతిపదార్థం: నీ+ఒద్దకున్= నీ కడకు; పుత్తెంచిరి= పంపారు; మా+అందు= మాలో; ఒక్కరున్= ఒకరిని; అభీష్టమతిన్= ఇష్టానుసారం; వరియింపన్= భర్తగా ఎన్నుకొనటానికి; తోయజ ముఖిన్= పద్మంవంటి ముఖం కలది అయిన దమయంతిని; ప్రార్థింపుము= వేడుకొనుము; మా+అందఱకును; ప్రీతిన్= సంతోషంతో; ప్రియంబు+అమర్పుము= ఇష్టం చేకూర్చుము.

తాత్పర్యం: ఇంద్రాగ్ని యమవరుణులు, తమలో ఒకరిని భర్తగా ఎన్నుకొనుమని నిన్ను ప్రార్థించి, మా అందరికి ప్రీతికలిగించుమని నీకడకు దూతగా పంపారు.'

వ. అని పంచినఁ దత్ప్రసాదంబున నన్యులచేత నలక్షితుండనై వచ్చితి; నింద్రాదులకుఁ బ్రియంబు సేయు' మనిన నవనతవదనయై దమయంతి దొల్లి హంసచేత నలుని విని వానియందు బద్ధానురాగయై నవయుచున్న యది యపు డతని నలుంగా నెఱింగి తద్వచన శ్రవణ దుఃఖాయమాన మానస యగుచు నిట్లనియె. 46

ప్రతిపదార్థం: అని, పంచినన్= అని నియోగించగా; తద్+ప్రసాదంబునన్= ఆ దేవతల దయవలన; అన్యుల చేతన్= ఇతరుల చేత; అలక్షితుండను+ఐ= అగోచరుడనై, అంటే అగుపించనివాడనై; వచ్చితిన్= అంతఃపురం ప్రవేశించగలిగాను; ఇంద్ర+ఆదులకున్= ఇంద్రుడు మున్నగువారికి; ప్రియంబు+చేయుము= ప్రీతి ఘటించుము; అనినన్= అని చెప్పగా; అవనత, వదన+ఐ= క్రిందికి దించినమొగం కలదై; దమయంతి; తొల్లి= పూర్వం; హంసచేత; నలుని, విని= నలుడి గురించి విని; వాని+అందు= ఆ నలుడిపై; బద్ధ+అనురాగ+ఐ= లగ్నమైన ప్రేమకలదై; నవయుచున్న+అది= క్రుంగి కృశిస్తున్నటువంటిది; అపుడు= అప్పుడు; అతని= అతడిని; నలుంగాన్+ఎఱింగి= (తాను వలచిన) నలుడిగా గుర్తించి; తద్+వచన, శ్రవణ, దుఃఖాయమాన, మానస+అగుచున్= ఆతడి మాటలు వినటంచేత శోకంతో నిండిన మనస్సు కలది అవుతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: 'దేవతల దయవలన ఇతరుల కంటబడకుండ నేను ఈ అంతఃపురాన్ని ప్రవేశించగలిగాను. నీవు ఇంద్రప్రభృతులకు ప్రియం చేయుము'- అని నలుడు దమయంతితో పలికాడు. దమయంతి తొల్లి హంస చెప్పిన నాటినుండి నలుడిపై తన వలపు నిలుపుకొని క్రుంగి కృశిస్తూ ఉన్నట్టిది, ఇప్పుడు నలుడినే కనులార చూచింది. కాని, అతడి మాటలు విని మిక్కిలి దుఃఖిస్తూ ఈ విధంగా బదులు పలికింది.

తరువోజ.

'ఏ నేడ? నింద్రాదు లేడ? వారలకు । నెప్పుడు మ్రొక్కుదు; నేను నీ ధనమ
భూనాథ! నీ గుణంబులు హంసచేతఁ । బొలుపుగా విని మనంబున నిల్పియున్న
దాన; భవన్నిమిత్తమున ని ట్లఖిల । ధారుణినాథ సార్థంబు రావింపఁ
గా నిప్డు వలసె లోకఖ్యాతకీర్తి! । కరుణించి పతిబుద్ధిఁ గావింపు మిందు. 47

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఏను+ఏడన్= నేను ఎక్కడ?; ఇంద్ర+ఆదులు= ఇంద్రుడు మున్నగువారు; ఏడ= ఎక్కడ?; వారలకున్+ఎప్పుడు, మ్రొక్కుదున్= వారికి (ఆ దేవతలకు) ఎప్పుడూ నేను నమస్కరిస్తాను; ఏను= నేను; నీ ధనము+అ= నీ సొత్తునే; భూనాథ!= ఓ నలమహారాజా!; నీ, గుణంబులు= నీ మంచి లక్షణాలు; హంసచేతన్; పొలుపుగా విని= ఒప్పుగా విని; మనంబునన్= మనస్సులో; నిల్పి+ఉన్నదానన్= దాచుకొని ఉన్నదానిని; భవత్+నిమిత్తమునన్= నీ కారణంచేత, అంటే నీకొరకే; ఇట్లు= ఈ స్వయంవరం అనే మిష కల్పించి; అఖిల, ధారుణి, నాథ, సార్థంబు= సకల రాజుల సమూహం; ఇప్డు= ఇపుడు; రావింపగాన్, వలసె= వచ్చేటట్లు చేయవలసి వచ్చింది; లోక, ఖ్యాత, కీర్తి!= జగమంతట ప్రసిద్ధిగాంచిన యశస్సుచేత వెలుగొందేవాడా!; ఇందున్= ఇచట; కరుణించి= దయచేసి; పతిబుద్ధిన్+కావింపుము= భర్తగా ఉండటానికి అంగీకరించుము.

తాత్పర్యం: 'మానవమాత్రురాలనయిన నే నెక్కడ? దేవత లైన ఇంద్రాదులు ఎక్కడ? నేను వారిని సదా నమస్కరించి అర్చిస్తానుగదా! ఓ నలమహారాజా! నేను నీ సొత్తును మాత్రమే. నీ గుణాలు హంస చెప్పింది మొదలు నిన్నే సదా నా మనస్సులో ధ్యానిస్తున్నాను. నీ రాకకొరకే ఇపుడు ఈ రాజులందరిని ఆహ్వానించవలసి వచ్చింది. ప్రపంచప్రసిద్ధమైన కీర్తిగల ఓ నలమహారాజా! దయచేసి నాకు పతిగా ఉండటానికి అంగీకరించుము.

విశేషం: ఛందస్సును గురించిన వివరణ ఆరణ్యపర్వం, ప్రథమాశ్వాసం తరువోజ (1.132) దగ్గర చూచేది.

వ. **నీవు దీని కొడంబడనినాఁడు రజ్జు విషాగ్ని జలంబులం బ్రాణ పరిత్యాగంబు సేసికొందు' ననిన దానిం జూచి నలుం డిట్లనియె.** **48**

ప్రతిపదార్థం: నీవు; దీనికి= నీవు నా భర్తగా ఉండటానికి; ఒడంబడని నాఁడు= సమ్మతించని రోజున; రజ్జు, విష+అగ్ని, జలంబులన్= త్రాటితో, విషంతో, అగ్నితో, నీటిచేత; ప్రాణ, పరిత్యాగంబు+చేసికొందున్= ప్రాణాలు వదలుతాను; అనినన్= అని చెప్పగా; దానిన్+చూచి= ఆ దమయంతిని చూచి; నలుండు= నలుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: నీవు నా భర్తగా ఉండటానికి సమ్మతించకపోతే నేను ఉరివేసికొని లేదా విషం త్రాగి లేదా నిప్పులో దూకి లేదా నీటిలో పడి ప్రాణాలు వదలుతాను'- అని చెప్పిన దమయంతిని చూచి నలుడు ఈ విధంగా బదులు పలికాడు.

మత్తకోకిలము.

'భూరిసత్త్వులు సర్వలోకవిభుల్ విభూతిసమృద్ధు లి
ద్ధోరుతేజులు నిన్నుఁ గోరుచు నున్నవా రమరోత్తముల్;
వారి పాదరజంబుఁ బోలనివాని నన్ను మనుష్య సం
సారిఁ గోరఁగఁ జన్నె? నీకుఁ బ్రసన్నులై సుర లుండఁగన్. **49**

ప్రతిపదార్థం: భూరి, సత్త్వులు= గొప్ప బలం కలవారు; సర్వలోక, విభుల్= సమస్తలోకాలకు అధిపతులు; విభూతి, సమృద్ధులు= గొప్ప సంపద కలవారు; ఇద్ధ+ఉరు, తేజులు= ప్రకాశమానమైన గొప్పతేజం కలవారు; నిన్నున్+కోరుచున్+ఉన్నవారు= నిన్ను వలచి ఉన్నారు; అమర+ఉత్తముల్= దేవతాశ్రేష్ఠులు; వారి, పాద, రజంబున్+పోలనివానిన్= వారి పాదాలదుమ్ముతో సరిపోలని వాడిని; మనుష్య= మనుజమాత్రుడిని; సంసారిన్= జనన మరణ సహితమైన ఇహలోకంలోని సంసారంలో ఉన్నవాడిని; నీకు; ప్రసన్నులు+ఐ= నిన్ను చేపట్టటానికి సుముఖులై; సురలు= దేవతలు; ఉండఁగన్= ఉండగా; నన్ను; కోరఁగన్+చన్నె?= కోరవచ్చునా?

తాత్పర్యం: 'గొప్ప శక్తి కలవారు. సకలలోక పాలకులు, ఐశ్వర్య సమృద్ధులు, దేదీప్యమానమైన తేజస్సు కలవారు, దేవతలు నిన్ను వరిస్తుంటే, వారి పాదధూళితో కూడ సాటిరాని నన్ను- ఒక మానవమాత్రుడిని-జననమరణ రూపమైన ఇహలోక సంసారబంధంలో చిక్కుకొన్నవాడిని కోరుకొనదగునా?

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.46 విశేషాంశం చూడండి.

క. దేవతల కప్రియంబులు । గావించు మనుష్యు లధమగతు లగుదు రిలం;
గావున వారి కభీష్టము । గావింపుము; నన్నుఁ బ్రీతిఁ గావుము తరుణీ!' 50

ప్రతిపదార్థం: తరుణీ= ఓ యువతీ!; ఇలన్= భూమిపై; దేవతలకు; అప్రియంబులు= ఇష్టం కాని పనులను; కావించు, మనుష్యులు= చేసే మనుజులు; అధమ, గతులు+అగుదురు= హీనస్థితిని పొందేవారు అవుతారు; కావునన్= కాబట్టి; వారికి+అభీష్టము= ఆ దేవతలకు ఇష్టం; కావింపుము= చేయుము; నన్నున్= నన్ను; ప్రీతిన్= ప్రియంతో; కావుము= కాపాడుము.

తాత్పర్యం: ఓ దమయంతీ! భూలోకంలో దేవతలకు అప్రియాలు చేసినవారు అష్టకష్టాలపాలవుతారు. కావున, ఓ యువతీ! వారి ఇష్టాన్ని పాటించి ప్రీతితో నన్ను రక్షించుము'.

వ. అనిన దమయంతి నయనాంతర్గళిత బాష్పధారాకలిత కపోలయుగళ యగుచుం బెద్దయుంబ్రొద్దు చింతించి 'నీయభిప్రాయంబునకు నిరపాయంబైన యుపాయంబు గంటి; నింద్రాదులు నా స్వయంవరంబునకు వచ్చెదరేని వారి సన్నిధిని నిన్నువరియించెద; నట్లయిన నీకు నిర్దోషంబగు' ననిన నలుండు లోకపాలురపాలికిం బోయి దమయంతికిం దన పలికిన విధంబును దనకు దమయంతి పలికిన విధంబును జెప్పి; నంతఁ బుణ్యతిథి నక్షత్ర శుభముహూర్తంబున దమయంతీ స్వయంవరంబు ప్రవర్తిల్లిన.51

ప్రతిపదార్థం: అనినన్= అని నలుడు చెప్పగా; దమయంతి; నయన+అంతర్గళిత, బాష్ప, ధారా, కలిత, కపోల, యుగళ+అగుచున్= కన్నులలోపలనుండి జారిన కన్నీటివెల్లువతో కూడిన చెక్కిళ్ళు రెండును కలది అవుతూ; పెద్దయున్+ప్రొద్దు= చాలసేపు; చింతించి= విచారించి; నీ+అభిప్రాయంబునకు= నీ ఉద్దేశానికి; నిరపాయంబు+ఐన= అపాయంలేనిదైన - అంటే కీడు కలుగని; ఉపాయంబు= వెరవు; కంటిన్= చూచాను; ఇంద్ర+ఆదులు= ఇంద్రుడు మున్నగువారు; నా, స్వయంవరంబునకు; వచ్చెదరు+ఏని= వచ్చినట్లయితే; వారి, సన్నిధిన= వారి సమక్షమందే; నిన్ను, వరియించెదన్= నిన్ను భర్తగా ఎన్నుకొంటాను; అట్లు+అయినన్= ఆ విధంగా జరిగితే; నీకు; నిర్దోషంబు+అగును= నీ పట్ల తప్పు ఉండదు; అనినన్= అని చెప్పగా; నలుండు= నలుడు; లోక, పాలుర, పాలికిన్+పోయి= దిక్పాలురపాలికి వెళ్ళి; దమయంతికిన్+తన, పలికిన, విధంబును= దమయంతితో తాను చెప్పిన మాటలతీరును; తనకు, దమయంతి, పలికిన, విధంబును= తనతో దమయంతి బదులు పలికిన తీరును; చెప్పెన్= చెప్పాడు; అంతన్= అంతట; పుణ్య, తిథి, నక్షత్ర, శుభ, ముహూర్తంబునన్= శుభప్రదమైన తిథితో, తారాబలంతో కూడిన మంచి లగ్నంలో; దమయంతీ, స్వయంవరంబు; ప్రవర్తిల్లినన్= జరుగగా.

తాత్పర్యం: అని నలుడు చెప్పగా దమయంతి కన్నులు చెమ్మగిల్లాయి. బాష్పాలు పెల్లుబికి ఆమె రెండు చెక్కిళ్లపై ప్రవహించాయి. ఆమె చాలాసేపు యోచించి నలుడితో ఇట్లా పలికింది. 'నీ అభిప్రాయానికి అపాయం లేని ఒక ఉపాయం తట్టింది. ఇంద్రుడు మున్నగు దిక్పాలకులు నా స్వయంవరానికి వస్తే, నేను వారి సమక్షంలోనే నిన్ను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భర్తగా ఎన్నుకొనగలను. అప్పుడు నీపై తప్పు ఏమియు ఉండదుగదా!'- అనిన పిదప, నలుడు దిక్పాలకులదగ్గరకు వెళ్ళి, తాను దమయంతితో చెప్పిన మాటల తీరును, ఆమె తనకు బదులు పలికిన తీరును వివరించి చెప్పాడు. అంతట ఒక శుభముహూర్తంలో తిథినక్షత్రబలం గల లగ్నంలో దమయంతీ స్వయంవరం జరిగింది.

ఆ. 'నలున కాని నలినదళనేత్ర వరియింప। దట్టె చూత' మనుచు నమరవరులు
నలువురును గడంగి నలరూపమున వచ్చి। రా స్వయంవరమున కతిరయమున. 52

ప్రతిపదార్థం: నలున్+అ= నలుడినిమాత్రమే; కాని= తప్ప; నలిన, దళ, నేత్ర= తామరరేకులవంటి కన్నులుగల దమయంతి; వరియింపదు+అట్టె= పతిగా ఎన్నుకొనదట; చూతము= చూతుముగాక; అనుచున్= అంటూ; అమర, వరులు= దేవతలలో శ్రేష్ఠులైన; నలువురును; కడంగి= పూనికతో; నల, రూపమునన్= నలుడి ఆకారం ధరించి; అతిరయమునన్= మిక్కిలి వేగంతో; వచ్చిరి= (స్వయంవర మండపానికి) వచ్చారు.

తాత్పర్యం: 'నలుడిని తప్ప మరెవరిని దమయంతి వరియించదా? చూద్దాం!' అని ఆ దేవతాశ్రేష్ఠులు నలువురు నలరూపం ధరించి వేగంగా స్వయంవరానికి వచ్చారు.

వ. అంత. 53

తాత్పర్యం: అంతట. (ఆ స్వయంవర మంటపంలో ఒక విచిత్ర సన్నివేశం ఏర్పడింది. ఒకేవరుసలో ఐదుగురు నలమహారాజులు కూర్చొని ఉన్నారు. ఆ సమయంలో).

సీ. దమయంతి సితపుష్ప దామాభిశోభిత। హస్తయై చనుదెంచి యంబుజాక్షి
యమ్మహోత్సవ దర్శనాగత రాజన్య। నివహంబు నీక్షించి నెమ్మితోడ
నలువురు వేల్పులు నలుఁదొట్టి యప్పు డే। కాకారులై యున్న నందు నలుని
నేర్పరింపఁగ నేర 'కింద్రాదులను నలు। నెఱుఁగు నుపాయ మిం కెద్ది యొక్కొ?'

ఆ. యనుచు సంశయాకులాత్మయై 'సురలార!। నలు నెఱుంగువిధము నాకుఁ జేయుఁ
డాత్మరూపధరుల రగుఁ' డని పరిదేవ। నంబు సేసెఁ దన మనంబులోన. 54

ప్రతిపదార్థం: దమయంతి; సిత, పుష్ప, దామ+అభిశోభిత, హస్త+ఐ= తెల్లని పూలదండచేత వెలుగొందిన చేతులుకలదై; చనుదెంచి= వచ్చి; అంబుజ+అక్షి= పద్మాలవంటి కన్నులుకలది (అంబుజం= నీటిలో పుట్టింది-పద్మం); ఆ+మహా+ఉత్సవ, దర్శన+ఆగత, రాజన్య, నివహంబున్= ఆ గొప్ప పండుగను చూడటానికై వచ్చిన మహారాజ సమూహాన్ని; ఈక్షించి= చూచి; నెమ్మితోడ= ప్రీతితోడ; నలువురు, వేల్పులు= నలుగురు దేవతలు; నలున్+తొట్టి= నలుడితోపాటు, నలుణ్ణి అనుసరించి; అప్పుడు; ఏక+ఆకారులు+ఐ+ఉన్నన్= ఒకేరూపం కలవారై ఉండగా; అందు= వారిలో; నలునిన్= నలుడిని; ఏర్పరింపఁగ నేరక= గుర్తింపజాలక; ఇంద్రాదులను= ఇంద్రుడు మొదలగువారిని; నలున్ ఎఱుఁగు= నలుని తెలిసికొనే; ఉపాయము= వెరవు; ఎద్ది+ఒక్కో= ఏదైఉండవచ్చును?; అనుచు= అని తలపోస్తూ; సంశయ+ఆకుల+ఆత్మ+ఐ= సందేహంచేత కలత చెందిన మనస్సు కలదై; సురలార!= ఓ దేవతలార!; నలున్= నలుడిని; ఎఱుంగు, విధము= తెలిసికొనేతీరు; నాకున్= నాకు; చేయుఁడు= కలుగజేయండి; ఆత్మ, రూప, ధరులరు+అగుఁడు= మీమీ నిజరూపాలను ధరించిన వారుగా కండి; అని; తన, మనంబులోనన్= తన మనస్సులో; పరిదేవనంబు+చేసెన్= దుఃఖంతో పలికింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు గల దమయంతి తనచేతులతో తెల్లని పూదండ పట్టుకొని వచ్చింది. ఆ స్వయంవర మహోత్సవాన్ని సందర్శించ వచ్చిన రాజన్యసమూహాన్ని వీక్షించింది. కాని, అచట నలుడితోపాటు మరి నలువురు వేల్పులు నలుడి ఆకారంతోనే కనిపించారు. వారిలో అసలు నలుడు ఎవ్వరో ఏర్పరించలేక ఆమె సంశయాకుల చిత్తయై 'ఓ దేవతలారా! నాకు నలుడిని ఎన్నుకొనే పరిజ్ఞానం కలుగజేయండి; మీ నిజస్వరూపాలు ధరించండి' అని తన మనస్సులో దుఃఖిస్తూ ప్రార్థన చేసింది.

వ. దేవతలు దాని పరిదేవనంబు విని కరుణించి, యనిమిషలోచనంబులు నస్వేదగాత్రంబులు నొప్ప నవనీ తలంబు ముట్టక యాసన్నులై నిలిచి; రంత లోకపాలురును భూలోకంబునఁ గల రాజలోకంబు నవలోకించు చుండఁ బుణ్యశ్లోకుండయిన నలు ధర్మవిధానంబున వరియించి, దమయంతి తదీయ స్కంధంబున సుగంధి కుసుమ దామకంబు వెట్టిన. 55

ప్రతిపదార్థం: దేవతలు= వేల్పులు; దాని= దమయంతియొక్క; పరిదేవనంబు= దీనాలాపాలు; విని= ఆలకించి; కరుణించి= దయకలిగి; అనిమిష. లోచనంబులున్= రెప్పపాటులేని కన్నులు; న+స్వేద, గాత్రంబులున్= చెమట లేని దేహాలు; ఒప్పన్= భాసించగా; అవనీ, తలంబు, ముట్టక= నేలపైభాగాన్ని తగులకుండ; ఆసన్నులు+ఐ, నిలిచిరి= దగ్గరగా ఉన్నవారైరి; అంత; లోకపాలురును= దిక్పాలకులున్నూ; భూ, లోకంబునన్+కల= భూలోకంలో ఉండే; రాజలోకంబున్= రాజ సమూహమున్నూ; అవలోకించుచుండన్= చూస్తుండగా; దమయంతి; పుణ్యశ్లోకుండు+అయిన= పుణ్యమైన కీర్తి కలవాడయిన (పుణ్యాత్ముడైన); నలున్= నలుడిని; ధర్మ విధానంబునన్= ధర్మమార్గాన; వరియించి= ఎన్నుకొని; తదీయ, స్కంధంబునన్= ఆతడి భుజంపై; సుగంధి, కుసుమ, దామకంబు= పరిమళించే పూలదండ; పెట్టినన్= వేయగా,

తాత్పర్యం: దేవతలు దమయంతి మొర విని కరుణించారు. వారు రెప్పలు మూతవడని కన్నులతో, చెమటపట్టని దేహాలతో, నేలను అంటక దగ్గరగా నిలిచారు. అంత దిక్పాలకులూ, భూలోకంలోని రాజసమూహమూ చూస్తుండగా పుణ్యశ్లోకుడైన నలుడి భుజంపై (కంఠంలో) పూలదండ వేసి దమయంతి అతడిని వరుడిగా ఎన్నుకొన్నది.

క. దేవతల సాధువాదము । తో విప్రాశీరవంబుతో బహు తూర్యా
రావంబులు సెలఁగెను, బా । రావార రవంబుఁబోలె ననివార్యములై. 56

ప్రతిపదార్థం: దేవతల= వేల్పుల; సాధువాదముతోన్= శుభాకాంక్షల శబ్దాలతో; విప్ర+ఆశీః+రవంబుతోన్= బ్రాహ్మణుల దీవనల ధ్వనులతో, బహుతూర్య+ఆరావంబులు= పెక్కు తూర్యధ్వనులు (తూర్యం= మంగళవాద్యం;) న+నివార్యములు+ఐ= వారించటానికి వీలులేనివై; (అంటే స్వచ్ఛందంగా, సంకులంగా); పారావార, రవంబున్+పోలెన్= సముద్రఘోషవలె; చెలఁగెను= ఉప్పొంగాయి.

తాత్పర్యం: వేల్పుల శుభాకాంక్షల శబ్దాలు, బ్రాహ్మణుల ఆశీర్వాద నినాదాలు, అనేకవిధాల మంగళవాద్యాల ధ్వనులు కలిసి సముద్రఘోషవలె అతిశయించాయి.

విశేషం: అలం: ఉపమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నలుండు స్వయంవరలబ్ధ యయిన దమయంతిం బెండ్లియగుట (సం. 3-54-25)

వ. ఇ ట్లపూర్వ స్వయంవర లబ్ధయైన దమయంతి నత్యంత విలాసంబుతో వివాహంబైన యా నలునకు నింద్రుండు వానియజ్ఞంబులయందు నిజరూపంబుఁజూపను, నగ్నియు వరుణుండును వాని వలచిన చోటన యగ్ని జలంబు లుత్పాదింపను, ధర్ముండు ధర్మువునంద వానిబుద్ధి వర్తిల్లను వరంబు లిచ్చి దేవలోకంబున కరుగువా రెదుర ద్వాపరంబుతో వచ్చు కలిం గని' యెందులకుం బోయెద?' వని యడిగిన నింద్రాదులకుఁ గలి యిట్లనియె. 57

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అపూర్వ, స్వయంవర, లబ్ధ+ఐన= పూర్వకాలంలో ఎన్నడు జరుగనట్టి స్వయంవరంలో లభించినట్టి; దమయంతిన్= దమయంతిని; అత్యంత, విలాసంబుతోన్= గొప్పవైభవంతో; వివాహంబు+ఐన= పెండ్లి కాగా; ఆ నలునకున్; ఇంద్రుండు; వాని, యజ్ఞంబుల+అందున్= ఆ నలుడి క్రతువులలో; నిజ, రూపంబున్+చూపనున్= నిజమైన తన ఆకృతిని చూపటానికి అంటే ప్రత్యక్షమవటానికి; అగ్నియు, వరుణుండును; వాని, వలచిన, చోటన్+అ= ఆ నలుడు కోరిన స్థలంలోనే; అగ్ని= నిప్పు; జలంబులు= నీళ్ళు; ఉత్పాదింపను= కలిగేటట్లు చేయటానికి; ధర్ముండు= యముడు; ధర్మువునందు+అ= ధర్మంపైనే; వానిబుద్ధి= నలుడిబుద్ధి; వర్తిల్లను= వెలసేటట్లును; వరంబులు+ఇచ్చి= వరాలను అనుగ్రహించి; దేవలోకంబునకు= స్వర్గానికి; అరుగువారు= వెళ్ళేవారు; ఎదురన్= ఎదురుగా; ద్వాపరంబుతోన్= ద్వాపరంతో; వచ్చు= వస్తున్న; కలిన్+కని= కలి పురుషుడిని చూచి; ఎందులకున్+పోయెదవు?= ఎక్కడికి పోతున్నావు?; అని; అడిగినన్= ప్రశ్నించగా; ఇంద్రాదులకున్= ఇంద్రుడు మున్నగువారికి; కలి= కలిపురుషుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా అత్యద్భుతమైన స్వయంవరంలో లభించిన దమయంతిని నలుడు మహావైభవోపేతంగా పెండ్లాడాడు. ఇంద్రుడు తాను స్వయంగా ప్రత్యక్షమై నలుడు చేసే యజ్ఞాలలో పాల్గొంటానని వరమిచ్చాడు. అగ్ని, వరుణుడుకూడా నలుడు కోరిన చోటులలో నిప్పు, నీరు లభించేటట్లు వరాలు అనుగ్రహించారు. యమధర్మరాజు నలుడి మనస్సు ధర్మంపైనే లగ్నమయ్యేటట్లు వరం ప్రసాదించాడు. వేల్పులు అట్లా నలుడికి వరాలిచ్చి స్వర్గానికి వెళ్ళుతుండగా మార్గమధ్యంలో ద్వాపరపురుషుడితోపాటు వస్తున్న కలి కనిపించాడు. వారు కలిని 'నీవు ఎక్కడికి పోతున్నావు?' అని ప్రశ్నించారు.

తే. 'అవనిలో దమయంతీ స్వయంవరంబు । విస్తరిల్లుట విని కడు వేడ్కతోడ
నేను దమయంతిచే వరియింపఁబడుదు । నని తదర్థినై యరిగెద నాసఁ జేసి.' 58

ప్రతిపదార్థం: అవనిలోన్= భూలోకంలో; దమయంతీ, స్వయంవరంబు= దమయంతియొక్క స్వయంవరం; విస్తరిల్లుట విని= జరగటం విని; కడు, వేడ్కతోడన్= మిక్కిలి సంబరంతో; ఏను= నేను; దమయంతిచే= దమయంతిచేత; వరియింపన్+పడుదున్= ఎన్నుకొనబడతాను; అని; తత్+అర్థిని+ఐ= ఆ కోరిక కలవాడినై; ఆసన్+చేసి= ఆశతో; అరిగెదన్= వెళ్ళుతున్నాను.

తాత్పర్యం: 'భూలోకంలో దమయంతీ స్వయంవరం జరుగుతుందని వినిఉన్నాను. అందులో నేను దమయంతిచేత వరించబడతాననే సంబరంతో, ఆసతో, కోరికతో వెళ్ళుతున్నాను.'

విశేషం: జరిగేది దమయంతీ స్వయంవరం! ఆమె అతిలోకసౌందర్యవతి. జగదేకసుందరి. ఆమె ఇంద్రాదులనే తిరస్కరించింది. ఇక, కలిపురుషుడి ఆస ఎంతటి హాస్యాస్పదమైనది! శృంగారప్రకృతి మిక్కిలి గహనమైనది. గంభీరమైనది. తాను ఎంతటి కురూపి అయినను జగదేకసుందరిని కాంక్షించవచ్చును కదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన నందఱు నగి'నీ వందుల కేల పోయె? దది ముందర నిర్వృత్తంబయ్యెః నక్కోమలి యొరుల నెవ్వరి మెచ్చక నలుం డను వాని వరియించె' నదినం గలి కరం బలిగి, 'యన్నలునకు దమయంతికి రాజ్య విభవ పరిత్యాగంబును బరస్పర వియోగంబునుం జేసెద' నని నిశ్చయించి, వాని నక్షరతుంగా నెఱింగి, యక్షంబులం జొచ్చి యుండ ద్వాపరుం బనిచి, నలు సేయుచున్న యశ్వమేధాది కానేక భూరి దక్షిణ మహాక్రతువులయు జపహోమ దానాది వివిధ పుణ్యకర్మంబులయుఁ గారణంబునం జొర నవసరంబుఁ గానక, యంతరం బన్వేషించుచుఁ బెద్దకాలం బుండి, యొక్కనాఁ డతండు కృతమూత్రుండయి జలోపస్పర్శనానంతరంబునం బాదశౌచంబు సేయమఱచి సంధ్యోపాసనంబు సేసిన, నుపలబ్ధావసరుం డయి కలి నలునందుఁ బ్రవేశించి, పుష్కరుం డను వాని పాలికిం బోయి త న్నెఱింగించి 'నీవు నలునితో జూదంబాడి వాని రాజ్యంబును సర్వస్వంబును నొడిచికొ' మ్మని చెప్పి తానును వానికి విప్రవేషంబున సహాయుండై యక్షంబులు గొని పుష్కరునితో నొక్కటం జని నలుం గాంచి 'నీవు మాతో జూదం బాడు' మనిన. 59

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; అందఱున్= అందరును; నగి= నవ్వి; నీవు, (కలి); అందులకున్= అందుకొఱకై; (అక్కడికి); ఏల, పోయెదు= ఎందుకు పోతున్నావు?; అది= ఆ దమయంతీ స్వయంవరం; ముందర= పూర్వమే; నిర్వృత్తంబు+అయ్యెన్= జరిగిపోయింది; ఆ, కోమలి= ఆ సుకుమారి; ఒరులన్+ఎవ్వరి, మెచ్చక= ఇతరులను ఎవరిని అంగీకరించక; నలుండు= నలుడు; అనువాని= అనే వరుడిని; వరియించెన్= పతిగా ఎన్నుకొన్నది; అనినన్= అనిచెప్పగా; కలి= కలిపురుషుడు; కరంబు+అలిగి= మిక్కిలి కోపించి; ఆ+నలునకు; దమయంతికి; రాజ్య, విభవ, పరిత్యాగంబును= రాజ్యసంపద తొలగిపోయేటట్లుగను; పరస్పర వియోగంబునున్= ఇరువురును ఒకరినొకరు ఎడబాసి ఉండేటట్లుగను; చేసెదన్= చేయగలను; అని; నిశ్చయించి= నిర్ణయించి; వానిన్= ఆ నలుడిని; అక్ష, రతున్+కాన్+ఎఱింగి= పాచికలలో ఇష్టంకలవాడినిగా తెలిసికొని; అక్షంబులన్+చొచ్చి+ఉండన్= పాచికలలో చొరబడి ఉండటానికి; ద్వాపరున్= ద్వాపర పురుషుడిని; పనిచి= నియోగించి; నలు+చేయుచున్న= నలుడు సలుపుతున్న; అశ్వమేధ+ఆదిక+అనేక, భూరి, దక్షిణ, మహాక్రతువులయు= అశ్వమేధం మొదలయిన గొప్ప బహుమతులతో కూడిన పెక్కుక్రతువుల యొక్క; జప, హోమ, దాన+ఆది, వివిధ, పుణ్య, కర్మంబులయున్= జపాలు, హోమాలు, దానాలు మొదలుగాగల పెక్కు పుణ్యకార్యాలయొక్కయు; కారణంబునన్= హేతువుచేత; చొరన్= చొరబడటానికి; అవసరంబున్= సమయాన్ని; కానక= అరయక; అంతరంబు= అవకాశాన్ని; అన్వేషించుచున్= వెదకుతూ; పెద్ద, కాలంబు+ఉండి= చాలకాలం వేచిఉండి; ఒక్కనాఁడు= ఒకానొక రోజున; అతండు= ఆ నలుడు; కృతమూత్రుండు+అయి= మూత్రంచేసినవాడయి; జల+ఉప స్పర్శన+అనంతరంబునన్= నీటిని ముట్టుకొనిన పిమ్మట; పాదశౌచంబు= కాళ్ళ పరిశుభ్రత (కాళ్లు కడుగుకొనటం); చేయమఱచి= చేయటం మరచి; సంధ్యా+ఉపాసనంబు= సంధ్యావందనం; చేసినన్= చేయటంచేత; ఉపలబ్ధ+అవసరుండు+అయి= లభించిన అదను కలవాడై; కలి= కలిపురుషుడు; నలున్+అందున్= నలుడిలో; ప్రవేశించి= చొరబడి; పుష్కరుండు+అను, వాని పాలికిన్+పోయి= పుష్కరుడనేవాడిదగ్గరకు పోయి; తన్ను+ఎఱింగించి= తానెవరో వివరించి చెప్పి; నీవు; నలునితో; జూదంబు+ఆడి; వాని రాజ్యంబును; సర్వస్వంబునున్= సర్వసంపదలను; ఒడిచికొమ్ము= ఓడించి తీసికొనుము; అని చెప్పి; తాను; వానికిన్= ఆ పుష్కరుడికి; విప్రవేషంబునన్= బ్రాహ్మణుడి ఆకృతితో; సహాయుండు+ఐ= తోడై; అక్షంబులు+కొని= పాచికలనుగైకొని; పుష్కరునితోన్; ఒక్కటన్+చని= కలిసి వెళ్ళి; నలున్+కాంచి= నలుడిని చూచి; నీవు= ఓ నలమహారాజా!; మాతో= పుష్కరుడితో, తనతో; జూదంబు+ఆడుము+అనినన్= జూదాన్ని ఆడుమని అడుగగా.

తాత్పర్యం: కలిపురుషుడి మాటలు విని అందరు నవ్వారు. 'స్వయంవరం జరిగిపోయింది. ఇక నీప్రయాణం నిరర్థకం. ఆ సుకుమారి దమయంతి ఒరులను ఎవ్వరిని మెచ్చక నలమహారాజును వరించింది' అని దేవతలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెప్పగా కలిపురుషుడికి నలుడిపై కోపం వచ్చింది. నలుడికి రాజ్యవైభవం పోగొట్టటానికి, నలదమయంతులకు పరస్పర వియోగాన్ని కల్పించటానికి కలిపురుషుడు నిశ్చయించాడు. నలుడు ద్యూతప్రియు డని కలికి తెలిసింది. అందుచేత పాచికలలో ప్రవేశించుమని కలి తన సహచరుడైన ద్వాపరుడిని నియోగించాడు. తాను నలుడిలో ప్రవేశించ సంకల్పించాడు కాని, అతడికి అవకాశం చాలకాలంవరకు లభించలేదు. నలుడు అనవరతం అశ్వమేధాది యజ్ఞయాగాదులు నిర్వర్తించి, బ్రాహ్మణులకు అపార దక్షిణలు పంచిపెట్టుతూ ఉండేవాడు. జపం, తపం, హోమం, దానధర్మ పుణ్యకార్యాలు అతడి దినచర్యలయ్యాయి. కాని, ఒకనాడు నలుడు మూత్రవిసర్జన అనంతరం పాదప్రక్షాళనం మరచిపోయి సంధ్యావందన మాచరించాడు. అప్పుడు ఆ అశుచిత్వాన్ని ఆధారం చేసికొని కలి నలుడిలో ప్రవేశించాడు. తదుపరి కలి పుష్కరుడనే రాజు వద్దకు వెళ్ళి, తనను తాను పరిచయం చేసికొని, "నలుడితో జూదమాడి నలుడిరాజ్యాన్ని, సర్వసంపదలనూ గెలుచుకొమ్మని" ప్రోత్సహించాడు. పుష్కరుడు అందుకు సమ్మతించాడు. కలి బ్రాహ్మణవేషం ధరించి పాచికలు పట్టుకొని పుష్కరుడితోపాటు నలుడి ఒద్దకు పోయి, ఇద్దరూ అతడిని జూదమాడటానికి ఆహ్వానించారు.

విశేషం: ఈ భూలోకంలో మానవజాతి సమస్తాన్ని పట్టిపీడించే సర్వపాపాలకు సమష్టి పర్యాయపదం కలి. సమస్త దుర్గుణాలలో నీచాతినీచంగా ఎన్నదగింది అసూయ. కలి మూర్తీభవించిన మాత్సర్యం. నలదమయంతులు ఆదర్శదంపతులు. నలుడు పుణ్యమూర్తి. కలిపురుషుడు అతడికి దవుదవ్వులలో నిలువవలసినవాడు. కాని, అటువంటి నలుడిని సమీపించటానికి కలికి అవకాశం కల్పించింది. 'అశౌచం'. మూత్ర విసర్జనానంతరం పాదప్రక్షాళన విస్మరించిన పరమపుణ్యమూర్తిలో కలి అశౌచంవలన ప్రవేశించగలిగాడు. "అశౌచం- కలిపురుషుడికి ప్రవేశద్వారం" అనే నీతి నలోపాఖ్యానంలో అంతర్గర్భితం. విశ్వసాహితీప్రపంచంలో నలోపాఖ్యానంవలె శుచిత్వానికి నిరుపమాన ప్రాధాన్యం కల్పించిన గాథ మరొకటి కనిపించదు. నిరంతరనిత్యజాగృతి, శుచిత్వ పరిరక్షణకు అత్యవసరం- అనే హెచ్చరిక నలోపాఖ్యానంలో సునిశితంగా నిక్షిప్తమైనది. వావిళ్లప్రతిలో 'నీవు మారాజుతో జూదంబాడు మనిన'- అనే పాఠాంతరం ఉన్నది.

క. ద్యూతార్థము తత్కితవా । హూతుఁడనై జూద మాడకుండుట ధర్మా
పేతం బని యభిముఖుఁడై । యాతనితో నలుఁడు జూదమాడఁ గడంగెన్. 60

ప్రతిపదార్థం: ద్యూత+అర్థము= జూదం ఆడటంకొరకు; తత్, కితవ+ఆహూతుఁడను+ఐ= ఆ జూదరులచేత పిలువబడినవాడినై; జూదము+ఆడకుండుట; ధర్మ+అపేతంబు+అని= అధర్మమని; అభిముఖుఁడు+ఐ= అనుకూలుడై, (ఎదురుమొగం కలవాడై- దీనికి వ్యతిరేకం విముఖుడు= పెడమొగం కలవాడు); నలుడు; ఆతనితో= ఆ పుష్కరుడితో; జూదము+ఆడన్= జూదమాడటానికి; కడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: 'జూదమాడటానికై ఆ జూదరులచేత పిలువబడినవాడనై జూదమాడకుండటం అధర్మ' మని తలచి నలుడు సమ్మతించి పుష్కరుడితో జూదమాడటానికి పూనుకొన్నాడు.

విశేషం: జూదాన్ని ప్రాచీనులు సప్తవ్యసనాలలో చేర్చారు. సప్తవ్యసనాలు: 1.మృగయ (వేట) 2. మద్యం 3. మహిళ 4. ద్యూతం 5. వాక్పారుష్యం 6. దండపారుష్యం 7. అర్థదూషణం. ధర్మమూర్తి అయిన నలుడు సప్తవ్యసనాలలో ఒకటిగా ఎన్నబడిన ద్యూతక్రీడకు ఏల అభిముఖుడయ్యాడు? అనే ప్రశ్న ఉదయించక తప్పదు. ఆ ప్రశ్నకు సమాధానం (1) అలనాటి క్షత్రియ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంప్రదాయం. జూదమాడటంకొరకు వచ్చిన ఆహ్వానాన్ని తిరస్కరించరాదు అనేభావం. (2) నలుడు కలిగ్రస్తుడు. జూదంవలన దాపురించే అనర్థాన్ని నలోపాఖ్యానం నొక్కి వక్కాణించింది. జూదాన్ని వ్యసనంగానే అభివర్ణించింది కాని సమర్థించలేదు.

క. కలధనము లెల్ల నొడ్డుచు । నలయక జూదమున విజితుఁడగుచుండె ని జా
ప్తులు వారించిన నుడుగక । నలుఁడు కలిప్రేరణంబునను హతమతియై. 61

ప్రతిపదార్థం: కల, ధనములు+ఎల్లన్= ఉన్న సంపదలు అన్నియు; ఒడ్డుచున్= జూదంలో పణంగా పెట్టుతూ; అలయక= విసుగుచెందక; జూదమునన్= ద్యూతంలో; నిజ+ఆప్తులు= తనయొక్క హితులు; వారించినన్= అడ్డుపడినను; ఉడుగక= విరమించక; కలి ప్రేరణంబునను= కలియొక్క ప్రేరేపణవలన; హతమతి+ఐ= బుద్ధిహీనుడై; నలుఁడు; విజితుఁడు= ఓడిపోయినవాడు; అగుచుండెన్= అవుతుండెను.

తాత్పర్యం: నలుడు జూదం మొదలుపెట్టాడు. తనకున్న సంపదలనన్నింటిని పణంగాపెట్టి అలసట లేకుండా, ఆపకుండా జూదమాడసాగాడు. ఆప్తులు వారించినప్పటికీ, బుద్ధిహీనుడై జూదం మానలేదు. అది కలి ప్రేరణ. జూదంలో నలుడు వరుసగా ఓడుతూనే ఆడుతున్నాడు.

వ. ఇ ట్లనేక మాసంబులు దుర్వ్యసనాసక్తుం డయిన యన్నలుండు వివిధ వస్తువాహన నివహంబు లొడ్డి పుష్కరున కోటువడం బోయిన నెఱింగి పౌర బ్రాహ్మణ ప్రధాన వరులు దమయంతీ పురస్కృతులయి వచ్చి వారించి, కలి సమావేశపరవశుండైన యన్నలుచేతం బ్రతిహతు లయి వలుక కుండి; రంత దమయంతి చింతాక్రాంత చిత్తయై. 62

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అనేక, మాసంబులు= పెక్కునెలలు; దుర్వ్యసన+ఆసక్తుండు+అయిన= దోషకార్యంలో అపేక్ష కలవాడయిన; ఆ+నలుండు; వివిధ, వస్తు, వాహన, నివహంబులు= పెక్కు వస్తువులు, వాహన సముదాయాలు; ఒడ్డి= జూదంలో పణంగాపెట్టి; పుష్కరునకు+ఓటు, పడన్+పోయినన్= పుష్కరుడి చేతిలో ఓడిపోవటానికి సంసిద్ధుడు కాగా; ఎఱింగి= తెలిసికొని; పౌర, బ్రాహ్మణ, ప్రధాన, వరులు= పురజనులలో, విప్రులలో, మంత్రులలో గొప్పవారు; దమయంతీ పురస్కృతులు+ అయి= దమయంతిని తమముందు నిలబెట్టుకొనినవారై; వచ్చి= అరుదెంచి; వారించి= జూదం ఆడవద్దని అడ్డుచెప్పి; కలి సమావేశ పరవశుండు+ఐన= కలియొక్క కలయికచేత వివశత్వం చెందినట్టి; ఆ+నలుచేతన్= ఆ నలుడిచేత; ప్రతిహతులు+అయి= తిరస్కరించబడినవారై; పలుకకుండిరి= మౌనం వహించిరి; అంతన్= అటుపై; దమయంతి; చింతా+ఆక్రాంత, చిత్త+ఐ= దుఃఖంచేత ఆక్రమించబడిన మనస్సుకలదై.

తాత్పర్యం: ఈ విధంగా పెక్కునెలలు దుర్వ్యసనమైన జూదానికి లోబడి, అనేక వస్తువాహనాదులను పణంగా ఒడ్డి పుష్కరుడిచేత ఓటమి చెందటానికి సంసిద్ధుడైన నలుడి దగ్గరికి పౌరబ్రాహ్మణ మంత్రిశ్రేష్ఠులు దమయంతిని తమకు ముందుపెట్టుకొని వచ్చి అతడిని వారించారు. కాని, కలిప్రభావానికి లోబడి వివశుడై ఉన్న నలుడు వారిమాటలు వినలేదు. వారు మారుమాటాడలేక మిన్నకున్నారు. అంత దమయంతి దుఃఖంచేత ఆవరించబడిన మనస్సుకలదై.

ఆ. 'ఎంత యోటువడిన నంతియ జూదంబు । నందుఁ దగులుఁ, జలము నతిశయిల్లు,
నేమి సేయు దాన ? నిది యెగ్గునకు మూల' । మని లతాంగి దుఃఖితాత్మ యగుచు. 63

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఎంత+ఓటు+పడినన్= ఎంతగా ఓడిపోయినప్పటికిని; అంతియ= అంత ఎక్కువగానే; జూదంబునందున్= ద్యూతంలో; తగులున్= తగులుకోవటం అంటే నిమగ్నతయు; చలమున్= మాత్సర్యమును (పట్టుదలయు); అతిశయిల్లున్= పెరుగుతుంది; ఏమి+చేయుదానన్= ఏమి చేయగలను? అంటే నేను కేవలం నిస్సహాయురాలిని అని అర్థం; ఇది= ఈ జూదం; ఎగ్గునకు= కీడుకు; మూలము= హేతువు; అని= అని తలపోసి; దుఃఖిత+ఆత్మ+అగుచున్= పరితపించినట్టి ఆత్మ కలది అవుతూ.

తాత్పర్యం: 'ఓడినకొలది జూదంలో ఆసక్తి, మాత్సర్యం (పట్టుదల) పెరుగుతాయి. ఇక నే నేమి చేయగలను? ఇది కీడుకు మూలకారణం' అని సుకుమారి అయిన దమయంతి మిక్కిలి దుఃఖించింది.

సీ. **అక్షముల్ పుష్కరునందు వశ్యంబులై । యునికియు, నలునియం దొండువిధము**
లగుటయు నెఱిఁగి, నిజాధీశ్వరున కప । జయమ కా లక్షించి, సరసిజాక్షి
భర్తయనుజ్ఞ మున్ బడసి వార్ష్ణేయుఁడన్ । సారథిఁ బిలిచి 'యీ స్యందనమున
నింద్రసేనుండను నిక్కుమారకు నింద్ర । సేన య న్కూఁతుఁ జెచ్చరను దోడు

ఆ. **కొని విదర్భ కరిగి గుఱుకొని మద్బంధు । జనులయొద్దఁ బెట్టి చట్ట రమ్మ'**
యంచు నెమ్మిఁ బుచ్చె నాప్తపురోహిత । మంత్రిబాంధవాభిమతము గాఁగ. **64**

ప్రతిపదార్థం: అక్షముల్= పాచికలు; పుష్కరునందున్= పుష్కరుడి చేతిలో; వశ్యంబులు+ఐ= స్వాధీనములై; ఉనికియు= ఉండటమున్నూ; నలుని+అందు; ఒండు, విధములు+అగుటయున్= వేరొకరీతిగా కావటమున్నూ; ఎఱిఁగి= తెలిసికొని; నిజ+అధీశ్వరునకున్= తన భర్తకు; అపజయము+అ= అపజయమే; కాన్, లక్షించి= ఓటమే అవుతుందని తలపోసి; సరసిజ+అక్షిన్= పద్మాలవంటి కన్నులుగల దమయంతి; భర్త+అనుజ్ఞ= భర్త(నలుడి) అనుమతి; మున్, పడసి= ముందు పొంది; వార్ష్ణే యుఁడు+అన్= వార్ష్ణేయుడు అనే; సారథిన్+పిలిచి= రథ చోదకుడిని పిలిచి; ఈ, స్యందనమునన్= ఈ రథంలో; ఇంద్రసేనుండు+ అను= ఇంద్రసేనుడనే; ఈ+కుమారకున్= ఈ కొడుకును; ఇంద్రసేన+అన్+కూఁతున్= ఇంద్రసేన అనేకూతురిని; చెచ్చెరను= శీఘ్రంగా; తోడుకొని= వెంటబెట్టుకొని; విదర్భకు+అరిగి= విదర్భకు పోయి; గుఱుకొని= పూనుకొని; మత్+బంధు జనుల+ఒద్దన్= నా చుట్టాల దగ్గర; పెట్టి= అప్పగించి; చట్ట, రమ్ము+అ= శీఘ్రంగా రావాలి; అంచున్= అంటూ; ఆప్త, పురోహిత, మంత్రి, బాంధవ+అభిమతము, కాఁగన్= హితులు, వైదికకర్మలు నిర్వహించే గురువులు, సచివులు, చుట్టాలయొక్క అభిప్రాయాన్ని పాటించే; నెమ్మిన్= ప్రీతితో; పుచ్చెన్= పంపింది.

తాత్పర్యం: పాచికలు పుష్కరుడికి అనుకూలంగా ఉండటాన్ని, నలుడికి ప్రతికూలంగా ఉండటాన్ని తెలిసికొని దమయంతి తన భర్తకు ఓటమి సిద్ధిస్తుందని తలపోసి, ముందే భర్త అనుమతిని పొంది, వార్ష్ణేయుడనే సారథిని పిలిచి 'ఈ రథంపై ఇంద్రసేనుడనే కుమారుడిని, ఇంద్రసేన అనే కూతురిని శీఘ్రంగా తీసికొని విదర్భకు వెళ్ళి అక్కడ నా బంధువుల దగ్గర దిగబెట్టి వేగంగా తిరిగిరమ్ము' అని దమయంతి నియోగించింది. ఆమె చేసిన పనిని ఆప్తులు, చుట్టాలు, వైదికకర్మలు నిర్వహించే గురువులు, మంత్రులు ఆమోదించారు.

క. **నలుఁడును ధరణీరాజ్యము । దలఁగఁగ సర్వంబు నపహృతం బైనఁ గడుం**
దలరి దమయంతిఁ దోడ్కొని । వెలువడియె నశేషరాజ్యవిభవచ్యుతుఁడై. **65**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నలుఁడును; ధరణీ, రాజ్యము= భూరాజ్యం; తలఁగఁగన్= తొలగిపోగా; సర్వంబున్= సమస్తమున్నూ; అపహృతంబు+ఐనన్= అపహరించబడింది కాగా; కడున్= మిక్కిలి; తలరి= పరితపించి; దమయంతిన్+తోడ్కొని= దమయంతిని వెంటబెట్టుకొని; అశేష, రాజ్య, విభవ, చ్యుతుఁడు+ఐ= సమస్త రాజ్యసంపద పోయినవాడై; వెలువడియెన్= (పురంనుండి) బయటికి వెళ్ళాడు.

తాత్పర్యం: జూదంలో భూరాజ్యం తొలగిపోయింది. సర్వస్వం అపహరించబడింది. నలుడు మిక్కిలి పరితపించి దమయంతిని వెంటపెట్టుకొని రాజ్యవైభవం, సంపద కోల్పోయి రాజధానినుండి బయటకు వెళ్ళాడు.

తే. **పురమువెలి మూఁ డహోరాత్రములు వసించి । యున్న నలుపాలి కెవ్వరు నోడి రరుగ**
జనవిభుం డైన పుష్కరుశాసనమునఁ । గలికృత ద్యూతవిద్వేష కారణమున. **66**

ప్రతిపదార్థం: పురమువెలి= పట్టణం బయట; మూఁడు+అహోరాత్రములు= మూడు రాత్రుళ్ళు, పగళ్ళు; వసించి= నివసించి; ఉన్న= ఉన్నట్టి; నలుపాలికి= నలుడి దగ్గరకు; జన, విభుండు+ఐన= రాజైన; పుష్కరు, శాసనమునన్= పుష్కరుడి ఆజ్ఞవలన; కలి, కృత, ద్యూత, విద్వేష, కారణమునన్= కలిచేత ఏర్పరచబడిన జూదంమీది కోపంచేత; ఎవ్వరున్= ఎవరుకూడా; అరుగన్= వెళ్ళటానికి; ఓడిరి= జంకారు.

తాత్పర్యం: జూదంలో రాజ్యం కోల్పోయిన నలుడు పురంవెలుపల మూడుదినాలు నివసించాడు. రాజైన పుష్కరుడికి భయపడటంచేత, కలిప్రేరణచేత జూదంపై ఏర్పడిన ద్వేషంచేత పౌరులు ఎవరుకూడా నలుడిదగ్గరికి వెళ్ళలేదు.

వ. **ఇట్లు సర్వజన సత్కారార్హుం డయ్యును నలుండు విధికృతంబున నెవ్వరివలనను సత్కారంబు గానక జలంబు లాహారంబుగాఁ దత్పురసమీపంబున దమయంతీ ద్వితీయుండై యుండి, బుభుక్షాపీడ సహింప నోపక, 'హిరణ్యపక్షంబులతోఁ దమముందటఁ దిరుగుచున్న పక్షులం గని యవి భక్ష్యంబు లగు నని యప్పక్షులం బట్టికొన సమకట్టి తనకట్టిన పుట్టంబు వానిపై వైచిన, నవి పుట్టంబుతోన గగనంబున కెగసి నగుచు విగతవస్త్రుండైన నలున కి ట్లనియె.** **67**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; సర్వజన, సత్కార+అర్హుండు+అయ్యును= జనులందరి చేత సమ్మానం పొందటానికి యోగ్యత కలవాడు అయినప్పటికిని; నలుండు= నలుడు; విధి, కృతంబునన్= దురదృష్టవశాన; ఎవ్వరి వలనను= ఎవరిచేతకూడా; సత్కారంబున్+కానక= సమ్మానం పొందలేక; జలంబులు= నీళ్ళు; ఆహారంబుగాన్= తిండిగా; తద్+పుర సమీపంబునన్= ఆ పట్టణానికి దగ్గరగా; దమయంతీ, ద్వితీయుండు+ఐ= దమయంతిని తోడుగాకలవాడై; ఉండి= కలసి ఉండి; బుభుక్షా, పీడ= ఆకలిబాధ; సహింపన్+ఓపక= తాళజాలక; హిరణ్యపక్షంబులతోన్= బంగారురెక్కలతో; తమ, ముందటన్= తమకు ఎదురుగా; తిరుగుచున్న= విహరిస్తున్న; పక్షులన్+కని= పిట్టలను చూచి; అవి= ఆ పక్షులు; భక్ష్యంబులు= భుజింపతగినవి; అగును+అని= అవుతాయని తలపోసి; ఆ+పక్షులన్+పట్టికొనన్= ఆ పక్షులను పట్టుకొనటానికి; సమకట్టి= పూని; తన, కట్టిన, పుట్టంబు= తాను ధరించిన వస్త్రం; వానిపై= ఆ పక్షులపై; వైచినన్= విసరగా; అవి= ఆ పక్షులు; పుట్టంబుతోనన్= వస్త్రంతోనే; గగనంబునకు= ఆకాశానికి; ఎగసి= ఎగిరి; నగుచున్= పరిహసిస్తూ; విగత, వస్త్రుండు+ఐన= పోయిన పుట్టం కలవాడైన; నలునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాయి.

తాత్పర్యం: సర్వజనులచేత సత్కారాన్ని పొందటానికి యోగ్యత కలవాడైనను నలుడు విధిపరిపాకంచేత, ఎవరిచేతను గౌరవించబడక నీళ్ళు మాత్రమే ఆహారంగా గైకొని దమయంతియు, తాను ఇరువురు మాత్రమే ఆ పట్టణ

సమీపంలో ఉన్నారు. అప్పుడు వారిముందు బంగారురెక్కలు గల పక్షులు విహరిస్తూ కనిపించాయి. నలుడు ఆకలిబాధ తాళలేక ఆ పక్షులు ఆహారంగా ఉపకరిస్తాయని ఆలోచించి, వాటిని పట్టుకొనటానికై తాను కట్టుకొన్న వస్త్రాన్ని తీసి వాటిపై విసిరాడు. ఆ పక్షులు నలుడు విసరిన వస్త్రంతోపాటు ఆకాశంలోకి ఎగిరిపోయి, నవ్వుతూ అతడితో ఇట్లా పలికాయి.

విశేషం: ఆ పక్షులు, బంగారురెక్కలు కలవి. అవి అసలు పక్షులు కావు. నలుడిని ప్రలోభపెట్టటానికి వచ్చిన పాచికలు! పాచికలపైగల వ్యామోహం బంగారురెక్కలు గల పిట్టలుగా ఉత్ప్రేక్షించబడటం మనోహరకల్పన.

నలుండు దమయంతీసహితుండై యడవికిఁ బోవుట (సం.3-58-25)

తే. 'నీ ధనంబును రాజ్యంబు నికృతిఁ గొన్న। యక్షముల మేము; నీ వస్త్ర మపహరింపఁ
బక్షిరూపులమై వచ్చి పార్థివేంద్ర! । యపహరించితి' మని చెప్పి యరిగెఁ జదల. 68

ప్రతిపదార్థం: పార్థివ+ఇంద్ర!= రాజులలో శ్రేష్ఠుడా! అంటే ఓ నలమహారాజా!; నీ ధనంబును= నీ(డబ్బు) సంపదను; రాజ్యంబున్= రాజ్యాన్ని; నికృతిన్+కొన్న= మోసంచేత గ్రహించిన; అక్షములము= పాచికలము; ఏము= మేము; నీ వస్త్రము+ అపహరింపన్= నీవు కట్టుకొన్న వస్త్రాన్ని మోసంతో తీసికొనటానికి; పక్షిరూపులము+ఐ= పిట్టల ఆకారం ధరించినవారమై; వచ్చి= అరుదెంచి; అపహరించితిమి= మోసంతో గ్రహించాం; అని, చెప్పి; చదలన్= ఆకాశంలో; అరిగెన్= వెళ్ళిపోయాయి.

తాత్పర్యం: 'ఓ నలమహారాజా! నీ సంపద, నీ రాజ్యం, మోసగించి పరిగ్రహించిన పాచికలం మేము. పక్షులరూపం ధరించి, నిన్ను మోసగించి నీవు కట్టిన బట్టలను గూడ అపహరించడానికి వచ్చాం, అపహరించాం' అని ఆ పక్షులు నలుడితో చెప్పి ఆకాశమార్గాన్ని బట్టి ఎగిరిపోయాయి.

వ. నలుండును వానిం జూచి విస్మయం బంది 'యీ యక్షంబుల దోషంబునం గా కేమి? నా కిట్టి దయ్యె' ననుచు దమయంతి కట్టిన పుట్టంబుచెఱంగు గట్టికొనియె; నట్లిద్దఱు నేకవస్త్రులయి యొండొరుల మొగంబులు సూచి దుఃఖించుచో నలుండు దమయంతి కి ట్లనియె. 69

ప్రతిపదార్థం: నలుండును= నలుడును; వానిన్+చూచి= ఆ పిట్టలను చూచి; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; ఈ+అక్షంబుల, దోషంబునన్+కాక+ఏమి= ఈ పాచికలదోషంవలన కాక మరేమిటి; నాకు+ఇట్టిది+అయ్యెన్= నాకు, ఇటువంటి అవస్థ దాపురించింది; అనుచున్= అని తలపోస్తూ; దమయంతి, కట్టిన, పుట్టంబు చెఱంగు= దమయంతి ధరించినట్టి చీరకొంగు; కట్టికొనియెన్= కట్టుకొన్నాడు; అట్లు+ఇద్దఱు= ఆ విధంగా ఇరువురు; ఏక వస్త్రులు+అయి= ఒకేచీర ధరించిన వారయి; ఒండొరుల, మొగంబులు, చూచి= ఒకరిమొగం ఒకరు చూచి; దుఃఖించుచోన్= పరితపిస్తున్నపుడు; నలుండు; దమయంతికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: నలుడుకూడ ఆ పిట్టల పలుకులు విని ఆశ్చర్యపోయాడు. 'నాకు ఈ దుఃస్థితి దాపురించటానికి ఈ పాచికల దోషం గాక మరేమి కారణం ఉన్నది?' అని తలపోస్తూ దమయంతి కట్టిన వస్త్రంయొక్క చెరగునే తానుకూడ ధరించాడు. ఈ రీతిగా ఆ ఇద్దరు ఒకేచీర ధరించి ఒండొరుల మొగాలు చూచికొని పరితపిస్తున్నప్పుడు నలుడు దమయంతితో ఇట్లా అన్నాడు.

క. 'ఇది దక్షిణాపథంబున, । కిదియు విదర్భాపురమున, కిది కోసల, కి
య్యది యుజ్జయినికిఁ దెరువులు; । మది నిన్నిటిలోన నరుగ మన కెద్ది యగున్? 70

ప్రతిపదార్థం: ఇది= ఈ బాట; దక్షిణాపథంబునకు= దక్షిణభారతభూమికి; ఇదియు= ఈ బాటేమో; విదర్భాపురమునకు= విదర్భానగరానికి; ఇది= ఈ బాట; కోసలకు= కోసలదేశానికి; ఈ+అది= ఈ బాట; ఉజ్జయినికిన్= ఉజ్జయిని పట్టణానికి; తెరువులు= మార్గాలు; మదిన్= నీ ఉద్దేశం (మనస్సు)లో; ఇన్నిటిలోనన్= ఈ దారులన్నిటిలో; మనకు+ఎద్ది= మనకు ఏది?; అరుగ+అగున్= వెళ్ళటానికి అనువైంది అవుతుంది?

తాత్పర్యం: 'ఇది దక్షిణాపథానికి దారి. ఇది విదర్భాపట్టణానికి పోయేబాట. ఇది కోసల దేశానికి వెళ్ళేమార్గం. ఇది ఉజ్జయినీ నగరానికి వెళ్ళేత్రోవ. ఈ తెరువులు అన్నింటిలో మనం వెళ్ళటానికి నీ ఉద్దేశంలో అనువైనది ఏది?'- అని దమయంతిని నలుడు ప్రశ్నించాడు.

విశేషం: దక్షిణంలో దక్షిణాపథం, ఉత్తరంలో విదర్భ, తూర్పున కోసల, పశ్చిమంలో ఉజ్జయిని పేర్కొనబడినాయి. ఈ శృంగాటకం (నాలుగుదారుల కూడలి)లో మహాభారత రచనాకాలానికే సుదూరాలకు వెళ్ళే సుప్రసిద్ధమైన దారులు భారతదేశంలో ఏర్పడి ఉన్నట్లు గ్రహించవచ్చును.

క. అడవులలో నాతోఁ గడు । నిడుమలు వడనోప; వరుగు మిందుముఖీ! యి
ప్పుడు నీ బంధుజనంబుల । కడ' కనవుడుఁ దరుణి శోకగద్గద యగుచున్. 71

ప్రతిపదార్థం: ఇందుముఖీ!= చంద్రుడివంటి మొగం కలదానా!; అడవులలోన్; నాతోన్= నాతో; కడు+ఇడుమలు= మిక్కిలి కష్టాలు; పడన్+ఓపవు= అనుభవించలేవు; ఇప్పుడు; నీ, బంధుజనంబుల, కడకు= నీ చుట్టాల దగ్గరికి; అరుగుము= వెళ్ళుము; అనవుడున్= అని చెప్పగా; తరుణి= యౌవనవతి అయిన దమయంతి; శోక, గద్గద+అగుచున్= దుఃఖంచేత కంపించిన కంఠస్వరం కలదై.

తాత్పర్యం: చంద్రబింబం వంటి ముఖం గల ఓ దమయంతీ! నాతో ఈ అడవులలో కష్టాలు పడుతూ తిరుగజాలవు. ఇపుడు మీ పుట్టినింటికి పోయి బంధుజనులతో సుఖించుము' - అని నలుడు పలుకగా, దుఃఖంచేత కంపించే కంఠస్వరం కలదై (దమయంతి).

ఆ. అతని కిట్టు లనియె 'నవనీశ! నీవును । నేనుఁ జని విదర్భ నిష్టలీల
నుండుదము; మృగాకులోగ్రవనంబుల । కరుగ నేల? యిడుమ లంద నేల?' 72

ప్రతిపదార్థం: అతనికి= ఆ నలుడితో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= (దమయంతి) పలికింది; అవని+ఈశ!= ఓ రాజా!; నీవును, నేనున్= నీవు మరియు నేను; చని= వెళ్ళి; విదర్భన్= విదర్భలో; ఇష్టలీలన్+ఉండుదము= ఇష్టానుసారంగా ఉందాం; మృగ+ఆకుల+ఉగ్ర, వనంబులకు= క్రూర జంతువులతో వ్యాపించి భీతిగొలిపే (భయంకరమైన) అడవులకు; అరుగన్+ఏల= వెళ్ళటమెందుకు?; ఇడుమలు+అందన్+ఏల= కష్టాలు అనుభవించట మెందుకు?

తాత్పర్యం: దమయంతి నలుడితో ఇట్లా చెప్పింది - 'ఓ నలమహారాజా! నీవూ, నేనూ విదర్భకు వెళ్ళి సుఖంగా ఉందాం. క్రూరమృగాలచేత భయంకరాలైన ఈ అడవులలో కష్టాలను అనుభవించటం ఎందుకు?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని నలుం డవనతాననుండై 'నీ చెప్పినట్ల విదర్భేశ్వరు రాజ్యంబును మన రాజ్యంబ; యేను దొల్లి యధికైశ్వర్యయుతుండనై యందులకుంబోయి బంధుజనులకు హృదయానందంబు సేసి, యిప్పు డివ్విధంబున సర్వస్వహీనుండనై యెట్లు పోవనేర్తు?' ననిన దమయంతి యిట్లనియె. 73

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని; నలుండు= నలుడు; అవనత+ఆననుండు+ఐ= వంచిన మొగం కలవాడై; నీ, చెప్పిన+అట్లు+అ= నీవు చెప్పిన రీతిగానే; విదర్భ+ఈశ్వరు= విదర్భేశ్వరుడి - అంటే విదర్భప్రభువుయొక్క; రాజ్యంబును= రాజ్యం; మనరాజ్యంబు+అ= మన రాజ్యమే; ఏను= నేను; తొల్లి= పూర్వం; అధిక+ఐశ్వర్యయుతుండను+ఐ= ఎక్కువ సంపదతో కూడినవాడినై; అందులకున్, పోయి= ఆ విదర్భకు వెళ్ళి; బంధు, జనులకున్= చుట్టాలకు; హృదయ+ ఆనందంబు+చేసి= హృదయాలకు ఆనందం కల్పించి; ఇప్పుడు+ఈ+విధంబునన్= ఇప్పు డీ రీతిగా; సర్వస్వహీనుండను+ఐ= అంతయు పోగొట్టుకొన్నవాడినై; ఎట్లు= ఏ విధంగా; పోవ, నేర్తును= పోగలను; అనినన్= అని చెప్పగా; దమయంతి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: నలుడు మొగం వాల్చికొని దమయంతితో ఇట్లా చెప్పాడు. 'నీవు చెప్పినట్లు విదర్భప్రభువు రాజ్యంగూడ మనరాజ్యంగానే భావించుకొనవచ్చును. కాని, మునుపు నేను సమస్తసంపదలతో తులతూగుతూ విదర్భకు వెళ్ళి బంధువులందరికి అపరిమితానందాన్ని కలిగించినవాడినికదా! ఇప్పుడు అంతా పోగొట్టుకొని పరమ దరిద్రుడనై అక్కడికి ఎట్లా పోగలను? నాకు ఎట్లా మొగం చెల్లుతుంది?'- అని అనగా అతడితో దమయంతి ఇట్లా అన్నది.

తే. 'అధికదుఃఖరోగార్తున కౌషధంబు । సురుచిరంబుగ భార్యయ చూవె యెందు;
నొనర భార్యాసమేతుఁడై యున్నవాని । కెంతలయ్యును నాపద లెఱుకపడవు. 74

ప్రతిపదార్థం: అధిక, దుఃఖ, రోగ+ఆర్తునకు= తీవ్రమైన దుఃఖంఅనే, రోగంచేత పీడించబడేవాడికి; ఔషధంబు= మందు; సు, రుచిరంబుగన్= సుస్పష్టంగా (సు= మంచి; రుచిరము= వెలుగొందేది); ఎందున్= ఎచటనైనా; భార్య+అ, చూవె= పెండ్లామే సుమా!; ఒనరన్= ఒప్పేటట్లుగా; భార్యా, సమేతుఁడు+ఐ+ఉన్నవానికి= భార్యతో కలిసి ఉండేవాడికి; ఎంతలు+అయ్యునున్= ఎంతెంత తీవ్రాలైనప్పటికిని; ఆపదలు= కష్టాలు; ఎఱుక, పడవు= అనుభవిస్తున్నట్లు తెలియబడవు.

తాత్పర్యం: గొప్పదుఃఖ మనే రోగంతో పీడితుడైనవాడికి మంచిమందు భార్యయే సుమా! భార్యతో కూడి ఉన్నవాడికి ఎంతటి కష్టాలైనా అనుభవిస్తున్నట్లు అనిపించవు.

క. అలసి నెడ, డస్సి నెడ, నాఁ । కలి దప్పియు నైన యెడలఁ గడుకొని ధరణీ
తలనాథ! పురుషునకు ని । మ్ముల భార్యయ పాచుఁ జిత్తమున దుఃఖంబుల్. 75

ప్రతిపదార్థం: అలసిన+ఎడన్= విసిగిఉన్న సమయంలో; డస్సిన+ఎడన్= బడలిన సమయంలో; ఆఁకలి, దప్పియున్+ఐన+ఎడలన్= తిండి తినాలని, నీరు త్రాగాలని అనిపించే సమయాలలో; కడుకొని= పూనుకొని; ధరణీ, తల, నాథ!= (భూస్థలికి భర్త అయిన వాడా) ఓ నలమహారాజా!; పురుషునకున్= మగవాడికి (భర్తకు); ఇమ్ములన్= ప్రీతితో; చిత్తమునన్= మనస్సులోని; దుఃఖంబుల్; భార్య+అ= భార్యయే; పాచున్= పోగొట్టుతుంది.

తాత్పర్యం: ఓ నలమహారాజా! విసిగిఉన్న సమయంలో, బడలిన సమయంలో, ఆఁకలి అయిన వేళలో, దాహం వేసినపుడు, మగవాడికి ప్రీతితో తోడ్పడి, భార్యయే అతడి మనస్సులోని దుఃఖాలను పోగొట్టుతుంది.

వ. కావున నిది మదనుజీవిత యనియు, ననువ్రత యనియు ననుకంపనీయ యనియు, నన్ను విడువక నా యనుగమనంబున కొడంబడు' మనిన 'నట్ల చేయుదుఁ, బ్రాణసమాన వైన నిన్నేల విడుతు; నోడకుండు' మని నలుండు దనదేవి నాశ్వాసించుచు నొక్కటఁ జని విజనంబైన విపినంబున నొక్క సభం గని యందు విశ్రమించి, పరుషధూళిధూసర స్థలంబున శయనించి, మార్గశ్రమ నిమీలిత నయనుండై దుఃఖంబునఁ గన్నులు వొందకున్న లేచి, తనపాదంబుల యంతికంబున నతిక్లేశపరవశయై నిద్రవోయెడు దమయంతిం జూచి. 76

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఇది=ఈమె (దమయంతి); మత్+అను జీవిత= నాపై ఆధారపడి బ్రతికేది; అనియున్; అనువ్రత= తనను అన్నిట అనుసరించేది; అనియున్; అనుకంపనీయ+అనియున్= దయచూపతగిందనిన్నీ; నన్ను, విడువక= నన్ను విడిచిపెట్టక; నా, అనుగమనంబునకున్= నేను వెంట రావటానికి; ఒడంబడుము= సమ్మతించుము; అనినన్= అని పలుకగా; అట్లు+అ+చేయుదున్= అట్లే చేస్తాను; ప్రాణసమానవు+ఐన= ప్రాణంతో సమానమైనదానవైన; నిన్ను+ఏలన్= నిన్నెందుకు?; విడుతున్= విడిచిపెట్టుతాను; ఓడకుండుము= భయపడకుండా ఉండుము; అని= అని చెప్పి; నలుండు= నలుడు; తన, దేవిన్= తనరాణి అయిన దమయంతిని; ఆశ్వాసించుచున్= ఓదార్చుచు; ఒక్కటన్+చని= ఏకాంతంగా వెళ్ళి; వి, జనంబు+ఐన= జనులు లేని; విపినంబునన్= అడవిలో; ఒక్క, సభన్+కని= ఒక గృహాన్ని చూచి (ఒక ఎత్తైన మంటపాన్ని చూచి); అందు= ఆ ఇంటిలో (ఆ స్థలంలో); విశ్రమించి= అలసట తీర్చికొని; పరుష, ధూళి, ధూసర, స్థలంబునన్= మొరటుదుమ్ముతో బూడిదరంగుగా ఉండే నేలపై - కఠినమైన దుమ్ముకొట్టుకొని ఉన్ననేలపై; శయనించి= పండుకొని; మార్గ, శ్రమ, నిమీలిత, నయనుండు+ఐ= దారిలో నడచిన బడలికచేత మూయబడిన కన్నులు కలవాడై; దుఃఖంబునన్= పరితాపంచేత; కన్నులు+పొందకున్నన్= నిదుర (కనుకూర్కు) రాకపోగా; లేచి= మేలుకొని; తన పాదంబుల+అంతికంబునన్= తన అడుగుల దగ్గర; అతి, క్లేశ, పరవశ+ఐ= మిక్కుటమైన బాధకు లోనై; నిద్ర+పోయెడు= నిదురిస్తున్న; దమయంతిన్+చూచి= దమయంతిని చూచి.

తాత్పర్యం: కాబట్టి, ఈమె నాపై ఆధారపడి బ్రతికేదనీ, నన్ను అన్నిట అనుసరించేదనీ, దయ చూపతగినదనీ నన్ను విడువక నేను నీతో రావటానికి సమ్మతించుము'- అని దమయంతి నలుడిని ప్రార్థించింది. నలుడు 'అట్లాగే చేస్తాను. నీవు నాకు నా ప్రాణాలతో సమానురాలవు; నిన్నెందుకు విడిచిపెట్టుతాను? భయపడకుము'- అని దమయంతిని ఓదార్చాడు. అంత వారు అడవిలో ఏకాంతంగా పయనించి ఒక్కచోట ఒక గృహాన్ని (మంటపాన్ని) చూచారు. నిర్మానుష్యమైన ఆ అడవిలోని ఆ ఇంటిలో (ఆ స్థలంలో) మొరటుదుమ్ముతో బూడిదరంగుగా ఉన్న (కఠినమైన దుమ్ము కొట్టుకొని ఉన్న) నేలపై పడుకొన్నారు. నలుడు మార్గాయాసం తొలగించుకొనటానికై కనులు మూసికొన్నాడు. కాని, అతడికి నిదుర రాలేదు. లేచి చూచేసరికి దమయంతి అతడి పాదాలసమీపంలో, దారిలో పడిన శ్రమకు బాగా అలసిపోయి గాఢంగా నిద్రపోతున్నది. అట్టి దమయంతిని చూచి నలుడు.

సీ. 'ధరణిరాజ్యంబుతో ధనమెల్లఁ బరులచే । నపహృతం బగుటయు, నాప్తమిత్త్ర
బంధుజనంబులుఁ బ్రకృతిజనంబులు । విడుచుటయును, మహావిపినభూమిఁ
బత్నితోఁ దన పరిభ్రమియించుటయు నప్డు । దలఁచి శోకించి, యిత్తరుణి దొల్లి
మృదుశయనంబున మెలఁతలు మెలపుతో । నడుగు లొత్తఁగ నిద్ర యనుభవించు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. కోమలాంగి యిపుడు గుఱుకొని పాంసుల। స్థలమునందు నిద్ర దగిలినదియుఁ
బంకజాక్షి నాకు భార్యయై యింత దుః। ఖంబు వొందె దైవఘటనఁ జేసి. 77

ప్రతిపదార్థం: ధరణి, రాజ్యంబుతోన్= భూరాజ్యంతోపాటు; ధనము+ఎల్లన్= సంపద అంతయు; పరులచేన్= శత్రువులచేత; అపహృతంబు+అగుటయున్= అపహరించబడటమున్నూ; ఆప్త, మిత్ర, బంధు జనంబులున్= హితులు, చెలికాండ్రు, చుట్టాలు; ప్రకృతి జనంబులు= సాధారణ ప్రజలు; విడుచుటయును= వీడటమున్నూ; మహా, విపిన, భూమిన్= గొప్ప అడవి ప్రదేశంలో; పత్నితోన్= భార్యతో; తన, పరిభ్రమియించుటయున్= తాను తిరుగాడుతుండటమున్నూ; అప్డు= అపుడు; తలఁచి= తలపోసి; శోకించి= దుఃఖించి; ఈ+తరుణి= ఈ యౌవనవతి అయిన దమయంతి; తొల్లి=మునుపు; మృదు, శయనంబునన్= మెత్తని పరుపుపై; మెలఁతలు= చెలికత్తెలు; మెలపుతోన్= శ్రద్ధతో; అడుగులు+ఒత్తఁగన్= పాదాలు ఒత్తుతుండగా; నిద్ర+అనుభవించు= నిదురపోయే; కోమల+అంగి= సుకుమారి; ఇపుడు= ఇప్పుడు; గుఱుకొని= పూనికతో; పాంసుల, స్థలమునందు= దుమ్ముతో నిండినచోట; నిద్ర+తగిలినదియున్= నిద్రపోతున్నట్టిదియు; పంకజ+అక్షి= (బురదలో పుట్టింది పంకజం= పద్మం) పద్మంవంటి కన్నులుకలది; దైవ, ఘటనన్+చేసి= దైవంయొక్క కూర్పువలన; నాకు; భార్య+ఐ; ఇంత, దుఃఖంబు+పొందెన్= ఇంత పరితాపం పొందింది.

తాత్పర్యం: భూరాజ్యంతోపాటు సమస్తసంపద శత్రువులచేత అపహరించబడటమున్నూ; హితులు, బంధువులు, మిత్రులు, సాధారణ పౌరులు తనను విడనాడటమున్నూ; పెద్ద అడవిలో తాను తిరగటాన్ని నలుడు తలపోసి మిక్కిలి పరితపించాడు. 'ఈ దమయంతి తొల్లి మెత్తనైన పరుపులపై జాగరూకతతో చెలికత్తెలు పాదాలు ఒత్తుతుంటే శయనిస్తుండేది. నేడు ఈ దుమ్మునేలపై నిదురపోతున్నది. విధిపరిపాకంచేత ఇట్టి కష్టాలు ఈమె నాకు భార్య అవటంచేత పొందుతున్నది కదా!'- అని మిక్కిలి దుఃఖించాడు.

వ. ఏను దీని దుఃఖంబుఁ జూడ నోప; నెట యేనియుం బోయెద; నిది నన్నుం గానక తన బంధువుల యొద్దకుం బోయి దుఃఖంబులం బొరయకుండు' నని విచారించి, పోవ సమకట్టి యక్కోమలి మేలుకొనకుండ మెల్లన దాని వస్త్రంబు నర్ధంబు సించి తనకుం బరిధానంబు సేసికొని వెలువడి కొండొకనేలయరిగి, దమయంతి యందు ఘనంబైన తన నెయ్యం బను తీఁగం ద్రెంపనేరక క్రమ్మఱి వచ్చి. 78

ప్రతిపదార్థం: ఏను=నేను; దీని= ఈ దమయంతి; దుఃఖంబున్= దుఃఖాన్ని; చూడన్+ఓపను= చూడజాలను; ఎట+ఏనియున్= ఇంకెక్కడికైనా; పోయెదను= వెళ్ళుతాను; ఇది= ఈ దమయంతి; నన్నున్+కానక= నేను కనిపించక (నన్ను చూడక); తన, బంధువుల+ఒద్దకున్+పోయి= తన చుట్టాల దగ్గరకు పోయి; దుఃఖంబులన్= బాధలను; పొరయక+ఉండున్= పొందక ఉంటుంది; అని; విచారించి= యోచించి; పోవ, సమకట్టి= వెళ్ళటానికి ఉద్యమించి; ఆ+కోమలి= ఆ సుకుమారి అయిన దమయంతి; మేలుకొనకుండన్= నిద్రనుండి లేవకుండ; మెల్లన= మెల్లగా; దాని= ఆ దమయంతియొక్క; వస్త్రంబున్= చీరను; అర్ధంబు= సగం; చించి=త్రెంపి; తనకున్, పరిధానంబు+చేసికొని= తనకు కట్టు వస్త్రంగా చేసికొని; వెలువడి= బయటకు వెళ్ళి; కొండొక, నేల+అరిగి= కొంత ప్రదేశం వెళ్ళి (అంటే కొన్ని అడుగులు వేసి); దమయంతి+అందు; ఘనంబు+ఐన= మిక్కుటమైన; తన నెయ్యంబు+అను= తన స్నేహమనే; తీఁగన్+త్రెంపనేరక= లతను త్రుంచజాలక; క్రమ్మఱి= తిరిగి; వచ్చి= చేరి.

తాత్పర్యం: నేను దమయంతి పరితాపం ఓర్వలేను. కాబట్టి ఎక్కడికైనా వెళ్ళుతాను. నేను వెళ్ళిపోతే ఈమె నన్ను కానక, చేసేది లేక తన బంధువుల దగ్గరకు వెళ్ళిపోతుంది. ఆ విధంగా ఆవిడకు నాతో అడవిలో పడవలసిన బాధలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తగ్గుతాయి'- అని నలుడు విచారించి, తాను పోవటానికి ఉద్యుక్తుడయి, ఆమె చీరలో కొంతమేర చించి తనకు కట్టు పుట్టంగా చేసికొన్నాడు. నలుడు కొన్ని అడుగులు ముందుకు నడిచాడు కాని, అతడి కాళ్ళు కదలలేదు. దమయంతిపై తనకు గల స్నేహమనే లతను త్రెంచుకోలేక తిరిగి వచ్చాడు.

చ. కలి దమయంతిఁ బాప సమకట్టుఁ, బొరింబొరి వాయనోపఁ డా
లలన నుదీర్ణసౌహృదబలంబున; నిట్టులు రెంటఁ జేసి య
న్నలుఁడు విమోహరజ్జులఁ బెనంగి గతాగతకారి యైన యు
య్యెలయును బోలె నూఱడక యెంతయుఁ బ్రొద్దు వినిశ్చితాత్ముఁడై. 79

ప్రతిపదార్థం: కలి= కలిపురుషుడు; దమయంతిన్= దమయంతిని; పాపన్= ఎడం చేయటానికి; సమకట్టున్= పూనుకొంటాడు; ఉదీర్ణ, సౌహృద, బలంబునన్= గొప్పదైన స్నేహంయొక్క బలంతో; ఆ, లలనన్= అంగన అయిన ఆ దమయంతిని; పొరిన్+పొరి= మాటి మాటికి; పాయన్+ఓపఁడు= ఎడబాయజాలడు; ఇట్టులు= ఈ విధంగా; రెంటన్+చేసి= (అటు కలిప్రభావం, ఇటు భార్యమీది స్నేహం) రెండింటివలన; ఆ+నలుఁడు; విమోహరజ్జులన్+పెనంగి= మిక్కుటమైన వలపు అనే త్రాళ్ళతో పెనవేసికొనబడిన వాడై; గత+ఆగత కారి+ఐన= ముందుకు పోయి మరల వెనుకకు వచ్చేటట్లు చేసేదైన; ఉయ్యెలయును+పోలెన్= ఊయలవలె; ఎంతయున్+ప్రొద్దు= చాలసేపు; ఊఱడక= ఊరట చెందక, వి, నిశ్చిత+ఆత్ముఁడు+ఐ= ఒక నిర్ణయానికి రాలేని ఆత్మకలవాడై;

తాత్పర్యం: కలిప్రభావంవలన నలుడు దమయంతిని ఎడంచేయటానికి ఉద్యమించేవాడు; గొప్పదైన స్నేహాను బంధంవలన దమయంతిని వీడజాలక ఉండేవాడు. ఇటు అనురాగబంధం, అటు కలి ప్రభావం. ఈ రెంటివలన నలుడు, అతిశయమైన అనురాగబంధమనే త్రాళ్లు పెనవేసికొని ముందుకు వెనుకకు ఊయలవలె ఊరట చెందలేక, ఒక స్థిరనిశ్చయానికి రాలేక చాలసేపు ఊగిసలాడాడు.

విశేషం: అలంకారం- 'విమోహరజ్జులు' అనేచోట రూపకం. 'నలుడు--- ఉయ్యెలయును బోలె' అనేచోట ఉపమ.

తే. 'బాల నొక్కర్తు నిక్కానపాలు సేసి । నిష్ఠురుండనై యే నెట్లు నేర్తుఁ బోవ'
ననక కలిచేత నాకృష్టుఁడైన నలుఁడు । విగతకరుణుఁడై దమయంతి విడిచి చనియె. 80

ప్రతిపదార్థం: బాలన్= బాలప్రాయంలో ఉన్నదానిని (చిన్నదైన దమయంతిని); ఒక్కర్తున్= ఒకతెను; ఈ+కాన, పాలు+చేసి= ఈ అరణ్యంపాలుచేసి; నిష్ఠురుండను+ఐ= కఠినాత్ముడినై; ఏన్+ఎట్లు= నేను ఏరీతిగా; పోవన్+నేర్తున్= పోగలను; అనక= అని తలపోయక; కలిచేతన్= కలిపురుషుడిచేత; ఆకృష్టుఁడు+ఐన= లాగబడినవాడైన; నలుఁడు= నలమహారాజు; విగత, కరుణుఁడు+ఐ= పోయిన దయ కలవాడై; దమయంతిన్= దమయంతిని; విడిచి= వీడి; చనియెన్= వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: 'చిన్నవయస్సులో ఉన్న దమయంతిని ఈ అడవి పాలుచేసి కఠినాత్ముడినై నేను ఎట్లా పోగలను?'- అని తలపోయక, కలిపురుషుడిచేత ఆకర్షించబడినవాడై నలుడు దయలేని హృదయంతో ఆమెను విడిచి వెళ్ళిపోయాడు.

వ. అంత దమయంతి మేలుకని పతిం గానక, తన వస్త్రార్ధ నికృంతనంబును జూచి లేచి, నలుగడం బరికించి, భయశోకవ్యాకులచిత్త యయి. 81

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; దమయంతి; మేలుకని= నిద్రనుండి లేచి; పతిన్+కానక= భర్త కనిపించకపోగా; తన, వస్త్ర+అర్ధ, నికృంతనంబును+చూచి= తన చీరలో సగభాగం చించబడి ఉండటాన్ని చూచి; నలుగడన్+పరికించి= నాలుగువైపుల చూచి; భయ, శోక, వ్యాకుల, చిత్త+అయి= భయంతో, దుఃఖంతో కలతచెందిన మనస్సు కలదయి.

తాత్పర్యం: అటు పిమ్మట దమయంతి నిద్రనుండి మేల్కొన్నది. కాని, భర్త అచట కనిపించలేదు. తన చీర సగం చించబడి ఉండింది. ఆమె నాలుగువైపుల తేరిపార చూచింది. భయంతో, దుఃఖంతో కలత చెందినదయి- (తర్వాతి పద్యంతో అన్వయం).

సీ. 'హా! మహారాజ! మహామహీ రక్షణ । దక్ష దక్షిణబాహుదండ! దండి
తారాతి! నిషధరాజాగ్రణి! న న్నిట్లు । వీతదయుండవై విడిచి చనఁగఁ
దగునె? నీ వెన్నఁడు ధర్మువు దప్పని । వాఁడవు, సూనృతవ్రతరతుండ;
వోడకు మని నన్ను నూఱడఁ బలికిన । పలు కిట్లు మఱవంగఁ బాడి యగునె?

ఆ. పొదలలోన డాఁగి పొడసూప కిట్లేల । యున్నవాఁడ? విట్టి యుగ్రభావ
మేల నీకు వలసె? నెట వోదు? నిం కెట్లు । గాంతు నిన్ను నుగ్రకాననమున? 82

ప్రతిపదార్థం: హా!= అయ్యో!; మహారాజ= గొప్పరాజా!; మహా, మహీ, రక్షణ, దక్ష, దక్షిణ, బాహుదండ= సువిశాలమైన భూమిని సంరక్షించటానికి సమర్థమైన కుడిభుజం (దండం వంటి కుడిచేయి) కలవాడా!; దండిత+అరాతి!= శిక్షించబడిన శత్రువులు కలవాడా!; నిషధ, రాజ+అగ్రణి!= నిషధదేశాన్ని ఏలే రాజులలో శ్రేష్ఠుడా!; నన్ను+ఇట్లు= నన్ను ఈ రీతిగా; వీతదయుండవు+ఐ= పోయిన దయ కలవాడివై; విడిచి, చనఁగన్+తగునె?= విడిచి వెళ్ళటం తగునా?; నీవు+ఎన్నఁడు= నీవు ఎల్లప్పుడు; ధర్మువు= ధర్మం; తప్పనివాఁడవు= మీరనివాడివి; సూనృత, వ్రత రతుండవు= సత్యమనే వ్రతాన్ని పాటించటంలో ఇష్టం కలవాడివి; ఓడకుము+అని= భయపడకుమనిచెప్పి; నన్నున్; ఊఱడన్+పలికిన, పలుకు= ఓదార్చినట్టి మాటలు; ఇట్లు= ఈ రీతిగా; మఱవంగన్+పాడి+అగునె?= మరచిపోవటం న్యాయమవునా?; పొదలలోనన్= చెట్ల గుబురులలోన; డాఁగి= కనిపించకుండ ఉండి; పొడ+చూపక= అగుపించక; ఇట్లు= ఈ విధంగా; ఏల= ఎందుకు; ఉన్నవాఁడవు= ఉన్నావు; ఇట్టి= ఈ విధమైన; ఉగ్రభావము= కఠినత్వం; ఏల?= ఎందుకు?; నీకు, వలసెన్= నీవు పూనవలసివచ్చింది; ఎట+పోదున్?= ఎక్కడికి పోగలను?; నిన్ను; ఉగ్ర, కాననమునన్= భయంకరమైన అడవిలో; ఇంక+ఎట్లు= ఇంక ఏవిధంగా; కాంతున్= చూడగలను?

తాత్పర్యం: 'ఓ నలమహారాజా! సువిశాలమైన భూమండలాన్ని సంరక్షించటానికి సామర్థ్యం గల దక్షిణబాహువు గలవాడా! శత్రువులను ఓడించినవాడా! ఓ నిషధదేశ ప్రభూ! దయలేకుండ న న్నిట్లా వదలిపెట్టి వెళ్ళటం నీకు తగునా? నీవు ఎన్నడు ధర్మం తప్పనివాడివి. సత్యసంధుడివి. భయపడకు మని నన్ను ఓదారుస్తూ చెప్పినమాటలు నీవు మరవటం న్యాయమా? పొదలలో దాగి ఉన్నావా? ఎందుకు నాకు కనిపించవు. ఎందుకు నీ కీ కఠినత్వం? నే నెచటికి పోగలను? ఈ భయంకరమైన అడవిలో నిన్ను ఇంక నేను ఎట్లా చూడగలను?

విశేషం: దమయంతి ఆక్రందనం హృదయవిదారకం. వేల్పులను కాదని నలుడిని వలచి స్వయంవరంలో ఆతడిని వివాహమాడిన దమయంతి కారడవిలో చేసిన దీనాలాపం విశ్వసాహితీజగత్తులో నిరుపమానమైనది. అరణ్యరోదనానికి ఇంతకంటె చక్కని ఉదాహరణం ఇంకేముంది?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వగవఁగ సాంగోపాంగము । లగు నాలుగు వేదములయు నధ్యయనము పొ
ల్పుగ నొక సత్యముతో నెన । యగునే? యెవ్వియును బోల వటె సత్యంబున్. 83

ప్రతిపదార్థం: వగవఁగన్= ఆలోచించగా; స+అంగ+ఉప+అంగములు+అగు= అంగాలతో, ఉపాంగాలతో కూడినవైన; నాలుగు, వేదములయు; అధ్యయనము= పఠనం, అనుశీలనం; పొల్పుగన్= ఒప్పేటట్లుగా; ఒక సత్యముతోన్; ఎన+అగునే= సాటి అవుతుందా?; సత్యంబున్= సత్యమును; ఎవ్వియును= ఏవైననుకూడా; పోలవు+అటె= పోలవుకదా!

తాత్పర్యం: యోచనచేసి చూస్తే నాలుగువేదాలు, వేదాంగాలు, వేదోపాంగాలు చదివినప్పటికిన్నీ ఆ వైదిక వాఙ్మయ పరిజ్ఞానం అంతయూ ఒక్క సత్యంతో సరితూగదని పెద్దలు చెప్పుతారు. సత్యానికి ఏవియు సరిపోలవు.

విశేషం: నాలుగువేదాలు:- 1. ఋగ్వేదం 2. యజుర్వేదం 3. సామవేదం 4. అథర్వవేదం. వేదాంగాలు (షడంగాలు):- 1. శిక్ష 2. వ్యాకరణం 3. ఛందస్సు 4. నిరుక్తం 5. జ్యోతిషం 6. కల్పం. ఉపాంగాలు:- 1. మీమాంస 2. న్యాయశాస్త్రం 3. పురాణం 4. ధర్మశాస్త్రం. ఉపవేదాలు:- ఋగ్వేదానికి ఆయుర్వేదం, యజుర్వేదానికి ధనుర్వేదం, సామవేదానికి గాంధర్వవేదం, అథర్వవేదానికి స్థాపత్య శస్త్రవేదాలు ఉపవేదాలు. ఇది రుచిరార్థసూక్తి.

వ. ప్రాణ సమానవయిన ని న్నవశ్యంబును విడువనని పలికితి; సత్యప్రతిపాలనంబు సేయు' మని ప్రలాపించుచుం దన యేకాకిత్వంబునకు నబలాభావంబునకుఁ బ్రతిపదన్యాస జాయమాన కంటక మృగ పన్నగభయంబునకు వగవక, నిజనాథు నసహాయత్వంబునకు దుస్సహక్షుత్పిపాసాశ్రమాకులత్వంబునకు వగచుచు. 84

ప్రతిపదార్థం: ప్రాణ, సమానవు+అయిన= ప్రాణాలతో సమానురాలవైన; నిన్ను; అవశ్యంబును= ఎన్నడును; విడువను+అని= విడిచిపెట్టనని; పలికితి= అన్నావు; సత్య, ప్రతిపాలనంబు+చేయుము= ఆడినమాటను తప్పకుండ ఆచరించుము; అని= అంటూ; ప్రలాపించుచున్= గట్టిగా మొరపెట్టుతూ; తన+ఏకాకిత్వంబునకున్= తనయొక్క ఒంటరితనానికి; అబలా, భావంబునకున్= బలంలేని ఆడుతనానికి; ప్రతిపద, న్యాస, జాయమాన, కంటక, మృగ, పన్నగ, భయంబునకున్= ప్రతి అడుగు మోపినప్పుడు పుట్టే- ముండ్లు, క్రూరమృగాలు, పాములవలన కలిగే భయానికి; వగవక= దుఃఖించకుండా; నిజనాథు= తనభర్తయొక్క; అసహాయత్వంబునకున్= తోడులేని స్థితికి; దుస్సహ, క్షుత్, పిపాసా, శ్రమ+ఆకులత్వంబునకున్= భరించరాని ఆకలి, దప్పిక, అలసటవలన కలిగే క్షోభకు; వగచుచు= విచారిస్తూ.

తాత్పర్యం: ఓ నలమహారాజా! 'ప్రాణసమానవైన నిన్ను, ఎన్నడును విడువ'నని నాతో చెప్పావుకదా! నీవు ఆడినమాట నిలుపుకో'- అని దమయంతి బిగ్గరగా మొరపెట్టుకొంటూ అడవిలో తిరిగింది. ఆమె తన ఒంటరితనానికి, అబలగా తన బలహీనతకు, అడుగులు మోపితే ముండ్లవలన, క్రూర జంతువులవలన, పాములవలన దాపురించే భయానికి చింతించలేదు కాని, తన ప్రాణనాథుడైన నలుడికి ఎటువంటి తోడులేనందుకు, భరించరాని ఆకలిదప్పులు శ్రమ మూలంగా ఆయనకు కలిగే వేదనకు దుఃఖించింది.

క. అలయుచుఁ, బులుఁగుల యెలుఁగుల । కులుకుచు, నుగ్రాతపమున కోపక వృక్షం
బులనీడల నిలుచుచు, నెలుఁ । గులఁ బులులం జూచి భయముగొని వగ వగచున్. 85

ప్రతిపదార్థం: అలయుచున్= బడలిపోతూ; పులుగుల+ఎలుఁగులకు+ఉలుకుచున్= పక్షుల అరుపులకు భయపడుతూ; ఉగ్ర+ఆతపమునకు+ఓపక= తీక్ష్ణమైన ఎండకు తాళజాలక; వృక్షంబుల, నీడలన్= చెట్లనీడలలో; నిలుచుచున్= నిలబడుతూ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎలుఁగులన్= ఎలుగుబంట్లను; పులులన్= పెద్దపులులను; చూచి= చూచి; భయము+కొని= భయపడి; వగన్= బాధతో; వగచున్= పరితపిస్తున్నది.

తాత్పర్యం: ఆ అడవిలో దమయంతి అలసట చెందుతున్నది. పక్షుల అరుపులకు భయపడుతున్నది. తీవ్రమైన ఎండ వేడిమిని భరించజాలక చెట్ల నీడలలో నిలుస్తున్నది. ఎలుగుబంట్లను, పెద్దపులులను చూచి భయపడి పరిపరి విధాల పరితపిస్తున్నది.

క. ఏచిన పొదలఁ బొరల్పడఁ । ద్రోచుచు, ముండ్లకును నల్లఁ దొలఁగుచు, దిక్కుల్
సూచుచుఁ, దొడరుచుఁ ద్రెళ్ళుచు । లేచుచు లలితాంగి సంచలించుచు నరిగెన్. 86

ప్రతిపదార్థం: ఏచిన= ఏపుగా ఎదిగిన; పొదలన్= గుబురుచెట్లను; పొరల్పడన్+త్రోచుచు= వెనుకకు పడేటట్లు త్రోస్తూ; ముండ్లకున్= కంటకాలకు; అల్లన్= మెల్లగా; తొలఁగుచున్= తప్పుకొని నడుస్తూ; దిక్కుల్+చూచుచున్= దిక్కులు చూస్తూ (అంటే దారి తెలియక తిరుగాడుతూ); తొడరుచున్+త్రెళ్ళుచున్= తొట్రుపడుతూ, క్రిందపడుతూ; లేచుచున్= లేచినిలబడుతూ; లలిత+అంగి= సుకుమారమైన దేహంగల దమయంతి; సంచలించుచున్= కంపిస్తూ; అరిగెన్= నడిచింది.

తాత్పర్యం: దట్టంగా ఎదిగిన పొదలను ప్రక్కకు నెట్టుతూ, ముండ్లకు మెల్లగా దూరంగా తొలగి నడుస్తూ, దిక్కులు చూస్తూ, తొట్రుపడుతూ, క్రిందపడుతూ, లేస్తూ సుకుమారి అయిన దమయంతి వణుకుతూ అడవిలో తిరుగాడుతున్నది.

వ. ఇ ట్లరుగుచున్న దమయంతి నంతిక న్యస్త చరణయైన దాని నాహారార్థియయి యొక్క యజగరంబు పట్టికొనిన నక్కోమలి మెదల నేరక. 87

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; అరుగుచున్న= నడుస్తున్న; దమయంతిన్= దమయంతిని; అంతిక, న్యస్త, చరణ+ఐన దానిన్= సమీపంలో ఉంచబడిన పాదం కలదానిని; ఆహార+అర్థి+అయి= తిండిని కోరినదై; ఒక్క, అజగరంబు= ఒక కొండచిలువ; పట్టికొనినన్; ఆ+కోమలి= ఆ సుకుమారి అయిన దమయంతి; మెదలనేరక= కొంచెమైనా కదలజాలక.

తాత్పర్యం: ఈ విధంగా నడుస్తూ సమీపించిన దయమంతిని ఆకలిగొన్న ఒక కొండచిలువ పట్టుకోగా, దమయంతి కదలలేకపోయింది.

ఆ. 'ఇంక నైన నన్ను నేల యాలింపవు? నాకు శరణ మగుము నాథ!' యనుచు
నఱచుచున్న దాని యాక్రందనధ్వని । వినుచు నొక్క యెఱుకు వేగ వచ్చి. 88

ప్రతిపదార్థం: ఇంకన్+ఐన= ఇకనైనను; (అంటే ఇంతవరకు నన్ను వదలిపెట్టినప్పటికిని ఆపదలో చిక్కుకొన్నప్పుడైనా); నన్నున్+ఏల+ఆలింపవు= నా మొర ఎందుకు వినిపించుకోవు; నాకు+శరణము+అగుము= నాకు సంరక్షణ చేకూర్చేవాడివి కమ్ము; నాథ!= (నా) భర్త అయిన ఓ నలమహారాజా!; అనుచున్= అని మొరపెట్టుతూ; అఱచుచున్నదాని= కేకలు పెట్టుతున్నదానియొక్క; ఆక్రందన ధ్వని= ఏడుపు సవ్వడి; వినుచున్= ఆలకిస్తూ; ఒక్క+ఎఱుకు= ఒక కిరాతుడు; వేగ= శీఘ్రంగా; వచ్చి= అరుదెంచి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'భర్త వయిన ఓ నలమహారాజా! ఇంతదాక నన్ను ఉపేక్షించావు కాని, ఇప్పుడు ఈ ఆపదలో చిక్కిన మీదటనైన నన్ను సంరక్షించేవాడివి కమ్ము' అని మొఱపెట్టుతున్న దమయంతి ఏడుపుకేకలు విని, ఒక కిరాతుడు వేగంగా వచ్చి.

వ. తన పట్టిన సురియ నప్పెనుఁబాము వదనంబుద్వయ్యం దఱిగిన రాహుముఖవిముక్తయైన చంద్రరేఖయుంబోలె నజగరముఖంబువలన వెలువడిన యా దమయంతి నాశ్వాసించి, తత్సమీప సరోవరస్నాతను వన్యస్వాదు ఫలాహారనుంగాఁ జేసి విగతశ్రమం గావించి, 'నీ వెవ్వరిదాన విట్లేల యేకతంబ యివ్వనంబునకు వచ్చి?' తని యడిగి మధురభాషిణి యైన యమ్మగువవలన నంతవృత్తాంతంబు నెఱింగి.89

ప్రతిపదార్థం: తన, పట్టిన= తాను పట్టుకొన్న; సురియన్= చురకత్తితో; ఆ+పెనున్+పాము= ఆ పెద్దపాముయొక్క; వదనంబు= ముఖం; ద్వయ్యన్+తఱిగినన్= ముక్కలుగా చీల్చగా; రాహు, ముఖ, విముక్త+ఐన= రాహువుమొగంనుండి విడివడి బయటపడిన; చంద్రరేఖయున్+పోలెన్= చంద్రవంకవలె; అజగర, ముఖంబువలనన్= కొండచిలువ ముఖంనుండి; వెలువడిన= బయటకు వచ్చిన; ఆ దమయంతిన్= ఆ దమయంతిని; ఆశ్వాసించి= ఊరడించి; తద్+సమీప, సరోవర, స్నాతను= అచోటికి సమీపంలో ఉన్న సరస్సులో స్నానం చేసిన దానిని; (దమయంతిని); వన్య, స్వాదు, ఫల+ఆహారనున్+కాన్+చేసి= అడవిలో లభించే రుచిగల పండ్లు ఆహారంగా స్వీకరించిన దానినిగా చేసి; విగతశ్రమన్+కావించి= పోయిన అలసట కలదానినిగా చేసి; నీవు; ఎవ్వరిదానవు= నీవు ఎవరికి సంబంధించినదానివి; ఇట్లు+ఏల= ఈ విధంగా ఎందుకు?; ఏకతంబు+అ= ఒంటరిగా; ఈ+వనంబునకున్= ఈ అడవికి; వచ్చితి= వచ్చావు; అని+అడిగి= అని ప్రశ్నించి; మధుర, భాషిణి+ఐన= తియ్యని (ఇంపైన) మంచిమాటలు మాటాడేటటువంటి; ఆ+మగువవలనన్= ఆ అంగనవలన; అంత, వృత్తాంతంబున్= సమస్త సమాచారం; ఎఱింగి= తెలిసికొని.

తాత్పర్యం: తాను పట్టిన చురకత్తితో ఆ కిరాతుడు ఆ కొండచిలువముఖాన్ని ముక్కలుగా తరిగాడు. అంత రాహు ముఖంనుండి వెలువడిన చంద్రరేఖవలె, ఆ పెనుబాముముఖంనుండి దమయంతి బయటపడింది. ఆ కిరాతుడు ఆమెను ఓదార్చి, దగ్గర ఉండే కొలనులో ఆమె స్నానంచేసి బడలిక తీర్చుకొన్న పిదప, ఆమెను ఆ అడవిలో దొరికే మంచి పండ్లు ఆరగింపజేసి 'నీవు ఎవరిదానవు? నీ విట్లా ఎందుకు ఒంటరిగా ఈ అడవికి వచ్చావు?' అని అడిగి, తియ్యగా మాటలు మాట్లాడే ఆమెచేత సమాచారమంతా తెలిసికొని.

కవిరాజ విరాజితము.

రజనికరాననఁ బీనపయోధర । రాజితరాజసుతన్ విలస
ద్గజపతిగామినిఁ జందనగంధిఁ బ్ర । కాశితకాంతిసమన్వితఁ బం
కజదళలోచనఁ జూచి కిరాతుఁడు । కామనిశాతశరాహతుఁడై
నిజహృదయం బెఱిఁగించె లతాంగి క । నింద్యచరిత్రకు వేడుకతోన్. 90

ప్రతిపదార్థం: రజనికర+ఆననన్= చంద్రుడి వంటి ముఖం గల దానిని (రజనికరుడు= రాత్రిని చేసేవాడు చంద్రుడు); పీన, పయోధరన్= బలిసినపాలిండ్లు కలదానిని; రాజిత, రాజసుతన్= ప్రకాశించే రాజకుమారిని; విలసత్+గజపతి, గామినిన్= గజరాజునడకవలె విలసిల్లే మెల్లని నడక గలదానిని; చందనగంధిన్= చందన పరిమళం వెదజల్లే దేహం గలదానిని; ప్రకాశిత, కాంతి, సమన్వితన్= దేదీప్యమానమైన వర్చస్సు కలదానిని; పంకజ, దళ, లోచనన్= పద్మపత్రాలవంటి కన్నులు కలదానిని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చూచి= చూచి; కిరాతుఁడు; కామ, నిశాత, శర+ఆహతుఁడు+ఐ= మన్మథుడియొక్క వాడిబాణాలచేత కొట్టబడినవాడై; లతా+అంగికి= తీగవలె సుకుమారమైన మేను గలదానికి; అనింద్య చరిత్రకు= నిందించదగిన శీలంగల దమయంతికి; వేడుకతోన్= సంబరంతో; నిజ, హృదయంబు= తన హృదయాన్ని, అంటే వలపును; ఎఱిఁగించెన్= తెలిపాడు.

తాత్పర్యం: చంద్రబింబంవంటి మొగం కలది, పెద్దవైన స్తనాలు కలది, లావణ్యవతి అయిన రాజకుమారి, సుందర గజరాజగమన, చందన పరిమళం వెదజల్లే మేనితావి కలది, దేదీప్యమానమైన వర్చస్సు కలది, పద్మదళాల వంటి విశాలమైన కన్నులు కలది అయిన దమయంతిని చూచి, ఆ కిరాతుడు పదునైన మన్మథబాణాలచేత కొట్టబడిన వాడయ్యాడు (కామభావప్రేరితుడయ్యాడు). వెంటనే, అతడు మచ్చలేని చరిత్రగల ఆ లతాంగికి తన మనస్సులోని కోర్కెను వేడుకతో వెల్లడించాడు.

విశేషం: ఈ వృత్తంలోని ప్రతిపాదంలోనూ న,జ,జ,జ,జ,జ,జ,లగ అనే గణాలు వరుసగా ఉంటాయి. 8, 14, 20 అక్షరాలతో యతిమైత్రి.

ఆ. అగ్నిశిఖయుఁ బోలె నంటను డాయను । జూడ రానియట్టి శుభచరిత్ర
నెఱుక లేని కఱకుటెఱు కపేక్షించెఁ గా । దనక తనకు నాయు వల్పమైన. 91

ప్రతిపదార్థం: అగ్ని, శిఖయున్+పోలెన్= అగ్నిజ్వాలవలె; అంటను= ముట్టుకొనటానికి; డాయను= సమీపించటానికి; చూడ, రానియట్టి= చూడటానికి వీలులేనట్టి; శుభచరిత్రన్= మంచి ప్రవర్తన కల దమయంతిని; ఎఱుక లేని= జ్ఞానంలేని; కఱకు+ఎఱుక= మొరటుమానిసి అయిన కిరాతుడు; కాదు+అనక= అది తనకు తగదని ఎంచక; తనకు; ఆయువు= ఆయుస్సు; అల్పము+ఐన= తక్కువ అవటంచేత; అపేక్షించెన్= కామించి కోరుకొన్నాడు.

తాత్పర్యం: దమయంతి పరమ పవిత్రచరిత్ర. అగ్నిజ్వాల వంటిది. ముట్టుకొనటానికి గాని, సమీపించటానికిగాని వీలు కానట్టిది. తేరిపార చూడ వీలులేనిది. అటువంటి అనింద్యచరిత్రను ఆ మొరటు కిరాతుడు తగదని తలచక- తనకు ఆయుర్దాయం తక్కువ కావటంచేత- కామించి కోరుకొన్నాడు.

దమయంతి శాపంబునం గిరాతుండు చచ్చుట. (సం. 3-61-34)

వ. దమయంతి వాని నలిగి చూచి 'యేను పతివత్ర నైతినేని యిద్దురాత్ముండైన కిరాతుం డిప్పుడ మృతుం డయ్యెడు' మని శాపం బిచ్చిన, వాఁ డప్పుడ యగ్నిదగ్ధం బైన వృక్షంబునుంబోలె విగతజీవుండై పడియె; నట్లు పరమపతివ్రతాగుణప్రభావంబున. 92

ప్రతిపదార్థం: దమయంతి; వానిన్+అలిగి, చూచి= ఆ కిరాతుడిని కోపించి చూచి; ఏను= నేను; పతివ్రతను+ఐతిన్+ఏని= నేనే కనుక పతివ్రతను అయితే; (పతివ్రత= భర్తపట్ల అనన్య అనురాగం గలిగి ఆరాధించే భార్య); ఈ, దురాత్ముండు+ఐన= ఈ దుష్టుడైన; కిరాతుండు= ఎఱుకు; ఇప్పుడు+అ= ఇప్పుడే; మృతుండు+అయ్యెడున్+అని= మరణిస్తాడుగాక అని; శాపంబు+ఇచ్చినన్= శాపాన్ని ఇవ్వగా; (శాపమంటే జరిగితీరే తిట్టు); వాఁడు= ఆ కిరాతుడు; అప్పుడు+అ= అప్పుడే; అగ్నిదగ్ధంబు+ఐన= నిప్పుచేత మండిపోయిన; వృక్షంబునున్+పోలెన్= చెట్టువలె; విగతజీవుండు+ఐ= పోయిన ప్రాణం కలవాడై; పడియెన్= నేలపై పడ్డాడు; అట్లు= ఆ విధంగా; పరమ, పతివ్రతా, గుణ, ప్రభావంబునన్= గొప్ప పతివ్రతయొక్క గుణమహిమచేత.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దమయంతి ఆ కిరాతుడిపై కోపించి చూచి 'నేను పతివ్రతనే అయితే దుష్టుడైన ఈ కిరాతుడు ఇప్పుడే ఇచట చనిపోవునుగాక' - అని శపించింది. అంత కిరాతుడు నిప్పుచేత దహించబడిన చెట్టువలె నేలపై కూలి మరణించాడు. అంత తన పాతివ్రత్యమాహాత్మ్యంతో.

విశేషం: ప్రాచీన భారతీయ వాఙ్మయంలో పాతివ్రత్యం మిక్కిలి మహిమ కలిగినట్టిదిగా వర్ణించబడింది. భర్తపట్ల త్రికరణశుద్ధితోడి ప్రేమ కల భార్య పతివ్రత.

క. బాల హృదయమున నృపశా। ర్దూలు నిజాధీశు నిలిపి దుష్టోరగ శా
ర్దూ లాభీల మృగావలి। కోలిన భయ మంద కరిగె నుగ్రాటవిలోన్. 93

ప్రతిపదార్థం: బాల= చిన్నదయిన దమయంతి; హృదయమునన్= తన మనస్సులో; నృపశార్దూలున్= రాజులలో పెద్దపులి వలె శ్రేష్ఠుడైన; నిజ+అధీశున్= తన భర్త అయిన నలమహారాజును; నిలిపి= నెలకొలిపి; దుష్ట+ఉరగ, శార్దూల+ఆభీల, మృగ+ఆవలికిన్= క్రూరాలైన పాముల, పెద్దపులుల, భయంకరమైన మృగాల సముదాయానికి; భయము+అందక= భయపడక; ఉగ్ర+అటవిలోన్= భయంకరమైన అడవిలో; ఓలిన= వరుసగా; అరిగెన్= వెళ్ళింది.

తాత్పర్యం: దమయంతి తన హృదయంలో రాజులలో శ్రేష్ఠుడైన తన భర్త నలమహారాజును ధ్యానిస్తూ, పతివ్రతామాహాత్మ్యంవలన భయంకరారణ్యంలోని క్రూరసర్పాలకు, పెద్దపులులకు, క్రూరమృగాలకు భీతిచెందక వరుసగా పయనం సాగించింది.

వ. మఱియును. 94

తాత్పర్యం: ఇంకా,

సీ. 'సహకార! మత్ప్రియసహకారుఁ, బున్నాగ!। పున్నాగుఁ, దిలక! భూభువనతిలకుఁ,
జందన! బుధహరిచందనుఁ బుష్పితా। శోక! సుహృజ్జనశోకదమను,
వకుళ! కులైకదీపకు, విభీతక! భయో। పేతార్తిహరు నలుఁ బ్రీతితోడఁ
గానరే కానలలోన లోకోత్తరు?' నని ప్రాని ప్రానికి నరిగి యరిగి

ఆ. యడుగు, నడుగు లెండఁ బోడ వాడఁ బొక్కిన। నిర్ఝ రాంతరముల నిలుచుఁ బిలుచు,
గిరుల దరుల యెడల నురుగుహాగృహములఁ। దొంగి తొంగి చూచుఁ దోయజాక్షి. 95

ప్రతిపదార్థం: సహకార!= ఓ సహకార వృక్షమా! (సహకారం= తియ్యమామిడి); మత్+ప్రియ, సహకారున్= నాకు ప్రీతి కలిగించే సాయంచేసే వాడిని; పున్నాగ!= ఓ పున్నాగవృక్షమా! (సురపొన్న చెట్టు); పున్నాగున్= పురుష శ్రేష్ఠుడిని; తిలక!= ఓ తిలకవృక్షమా! (తిలకం= బొట్టుగుచెట్టు); భూ, భువన, తిలకున్= భూలోకంలోని మనుజులలో శ్రేష్ఠుడిని (తిలకం శ్రేష్ఠవాచకం); చందన!= ఓ చందనవృక్షమా!; బుధ, హరిచందనున్= బుద్ధిమంతులకు హరిచందనం వంటివాడిని (హరిచందనం కల్పవృక్షాలలో ఒకటి- అంటే పండితులకు కోరిన కోరికలు ఈడేర్చేవాడిని); పుష్పిత+అశోక!= పుష్పించిన అశోకవృక్షమా!; సుహృద్+జన, శోక, దమనున్= మిత్రుల దుఃఖాన్ని హరింపచేసేవాడిని (మిత్రులకు అశోకుడిని); వకుళ!= ఓ వకుళవృక్షమా! (వకుళం= పొగడ చెట్టు); కుల+ఏక, దీపకున్= వంశమంతటికి ముఖ్యమైన జ్యోతివంటివాడిని; విభీతక!= ఓ విభీతకవృక్షమా! (విభీతకం= తాండ్ర

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెట్టు); భయ+ఉపేత+ఆర్తిహరున్= భయంతో కూడిన వారియొక్క ఆరాటాన్ని తొలగించేవాడిని; లోక+ఉత్తరున్= లోకమంతటిలో శ్రేష్ఠుడిని; నలున్= నలమహారాజును; ప్రీతితోడన్= ప్రేమతోడ; కానలలోనన్= అడవులలో; కానరే= చూడరే; అని= అని విలపిస్తూ; తోయజ+అక్షి= పద్మాలవంటి కన్నులుగల దమయంతి; మ్రాని మ్రానికిన్= చెట్టు చెట్టుకు; అరిగి+అరిగి= వెళ్ళి, వెళ్ళి; అడుగున్= అడుగుతున్నది; అడుగులు= పాదాలు; ఎండన్= ఎండలో; పొడ+పొడన్+పొక్కిన= పొరలు రాలేటట్లు బొబ్బలెక్కగా; నిర్ఝర+అంతరములన్= సెలయేళ్ళ మధ్య; నిలుచున్= నిలబడుతుంది; పిలుచున్= పిలుస్తుంది; గిరుల, దరుల+ఎడలన్= కొండగట్టుల చేరువలో; ఉరు= పెద్ద; గుహా, గృహములన్= గుహల ఉనికిపట్టులలో; తొంగి, తొంగి, చూచున్= మాటిమాటికి లోపలికి దృష్టిని సారిస్తుంది.

తాత్పర్యం: ఈ పద్యంలో దమయంతి ఆర్తితో నలునికై వెదకటం వర్ణించబడింది. తోయజాక్షి అయిన దమయంతి కారడవిలో నలుడిని వెదికింది. చెట్టు చెట్టును అడిగింది. 'ఓ సహకారవృక్షమా! నాకు ప్రీతిని చేకూర్చి నాతో సహకరించే నాభర్త నలమహారాజును చూచావా? ఓ పున్నాగవృక్షమా! పురుషులలో పున్నాగుడైన నలుడిని చూచావా? ఓ తిలకవృక్షమా! భూలోకంలో తిలకుడైన (శ్రేష్ఠుడైన) నలుడిని చూచావా? ఓ చందనవృక్షమా! బుధులలో హరిచందన ప్రాయుడైన నలుడిని చూచావా? పూచిన అశోకవృక్షమా! ఉత్తములగు మిత్రుల శోకాన్ని నివారించే నల చక్రవర్తిని చూచావా? ఓ వకుళవృక్షమా! కులదీపకుడైన నలమహారాజును చూచావా? ఓ విభీతకవృక్షమా! (విభీతకమనగా తాండ్రచెట్టు. ఇది భయమును పుట్టించుటచే దీనికీపేరువచ్చింది) భయోపేతులకు విభీతకుడైన (భయాన్నిపోగొట్టే) నలుడిని చూచావా? నలుడు లోకోత్తరుడు. నలుడిని చూడలేదా?' అని ఆమె ఎండలో అడవిలో అడుగులు బొబ్బలెక్కేటట్లు తిరుగుతూ చెట్టు చెట్టునూ పలకరిస్తూ తిరిగింది. వేడినేలపై నడువలేక సెలయేళ్ళలో నిలబడి పిలిచింది. కొండ చరియల దాపుల్లో వెదకింది. కొండ గుహలలో తొంగితొంగి చూచింది.

విశేషం: ఈ పద్యంలో శ్లేషానుప్రాణితమైన అనుప్రాసం ఉన్నది. సహకారం అంటే తియ్యమామిడి చెట్టు, తోడ్పాటు అని అర్థాలు. అట్లే తక్కిన చెట్లపేర్లకు రెండర్థాలు ఉన్నాయి. అర్థాంతర స్ఫూర్తి శ్లేష, ఏకశబ్ద పునరావృత్తి అనుప్రాసం. దమయంతి దృష్టికి ఆ అడవి అంతయు నలుడి గుణశీల లక్షణమయంగా కనిపించింది. సహకార వృక్షంలో నలుడి సహకారత్వం, పున్నాగ వృక్షంలో నలుడి పున్నాగత్వం, చందనవృక్షంలో హరిచందనత్వం, అశోకవృక్షంలో నలుడి అశోకత్వం, వకుళంలో నలుడి కులదీపకత్వం, విభీతకంలో నలుడి ధైర్యాన్ని, విభీతకత్వాన్ని దమయంతి దర్శించింది. దమయంతికి ఆ అడవి నలుడి విశ్వరూప ప్రదర్శనం అనిపించింది. నలుడిపై ఆమె వలపు అటువంటిది.

వ. ఇట్లు దమయంతి నిజనాథు నన్వేషించుచు భీషణారణ్యంబునం ద్రిమ్మరునది ముందట. 96

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; దమయంతి; నిజ, నాథున్= తన భర్తను; అన్వేషించుచున్= వెదకుతూ; భీషణ+అరణ్యంబునన్= భయంకరమైన అడవిలో; త్రిమ్మరునది= దిక్కుతోచక తిరుగుతున్నట్టిది; ముందట= ఎదురుగా.

తాత్పర్యం: ఈ విధంగా దమయంతి తన భర్తకొరకు వెదకుతూ భయంకరమైన అడవిలో దిక్కుతోచక తిరుగుతూ తన ఎదుట (తర్వాతి పద్యంతో అన్వయం).

మత్తకోకిలము.

వారిభక్షులు పర్ణభక్షులు వాయుభక్షులు శాకనీ
వారభక్షులు వృక్షమూల నివాసయుక్తులునై తపం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బారఁజేయు మహామునీంద్రుల యాశ్రమం బెడఁ గాంచె నం
భోరుహాక్షి పురాసమార్జితపుణ్యకర్మఫలంబునన్. 97

ప్రతిపదార్థం: వారి, భక్షులు= నీటిని ఆహారంగా స్వీకరించి బ్రతికేవారు; పర్ణ, భక్షులు= ఆకులు ఆహారంగా తిని బ్రతికేవారు; వాయు, భక్షులు= గాలిని ఆహారంగా తీసికొని బ్రతికేవారు; శాక, నీవార, భక్షులు= ఆకుకూరలు, నివ్వరిగింజలు ఆహారంగా తిని బ్రతికేవారు; వృక్ష, మూల, నివాస, యుక్తులును+ఐ= చెట్ల మొదళ్ళలో (నివాసాలు గల) నివసిస్తూ ఉన్న వారున్నూ అయి; తపంబు+ఆరన్+చేయు= దీక్షతో తపస్సుచేసే; మహా, ముని+ఇంద్రుల= గొప్ప ఋషివర్యులయొక్క; ఆశ్రమంబు= ఆశ్రమాన్ని; అంభస్+రుహ+అక్షి= పద్మాలవంటి కన్నులు గల దమయంతి; పురా, సమార్జిత, పుణ్య, కర్మ, ఫలంబునన్= పూర్వంలో సంపాదించబడిన పుణ్యకార్యాల ఫలితంగా; ఎడన్= అల్లంతదూరంలో; కాంచెన్= చూచింది.

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు గల దమయంతి తన పూర్వపుణ్యఫలంవలన ఆ అడవిలో అల్లంతదూరాన ఒక ఋష్యాశ్రమ స్థలాన్ని చూచింది. ఆ ఆశ్రమంలో నీరు మాత్రమే ఆహారంగా గొని తపస్సు చేసేవారు, ఆకులు మాత్రమే తిని తపస్సు చేసేవారు, గాలి మాత్రమే క్రోలేవారు, ఆకుకూరలు, నివ్వరిగింజలు తిని తపస్సు చేసేవారు, చెట్ల క్రింద నివసిస్తున్నవారు అయిన మునిశ్రేష్ఠులను చూచింది.

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.46 విశేషాంశం చూడండి.

వ. ఇట్లు మృగవ్యాళ తస్కర కిరాత నిరంతరం బయిన కాంతారంబునం బుణ్యనదీతీరంబున నొక్కముని పల్లియం గని యందు వసిష్ఠ వామదేవ వాలఖిల్య భృగు నారద సదృశులైన మహామునులం గని నమస్కరించియున్న నమ్మునులు దమయంతిం జూచి యచ్చెరువడి 'యవ్వా! నీ వెవ్వరిదాన? వివ్వనదేవతవొ! దేవభామినివొ! దివ్యంబైన తేజంబుతో నేకతంబ యేల క్రుమ్మరియెద?' వనిన వారలకు దమయంతి యిట్లనియె. 98

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; మృగ, వ్యాళ, తస్కర, కిరాత, నిరంతరంబు+అయిన= జంతువులతో, పాములతో, దొంగలతో, ఎఱుకులతో ఎల్లప్పుడును కూడి ఉన్న; కాంతారంబునన్= అడవిలో; పుణ్య, నదీ, తీరంబునన్= పవిత్రమైన నదిఒడ్డున; ఒక్క, ముని, పల్లియన్+కని= ఒక ఋష్యాశ్రమాన్ని చూచి; అందున్= ఆ మునిపల్లెలో; వసిష్ఠ, వామదేవ, వాలఖిల్య, భృగు, నారద సదృశులు+ఐన= వసిష్ఠుడు, వామదేవుడు, వాలఖిల్యులు, భృగువు, నారదుడు-అనే మునులతో సమానులైన; మహా, మునులన్+కని= గొప్ప ఋషివరేణ్యులను చూచి; నమస్కరించి+ఉన్న= వందనాలు అర్పించి ఉండగా; ఆ+మునులు= ఆ ఋషులు; దమయంతిన్+చూచి= దమయంతినికాంచి; అచ్చెరువడి= ఆశ్చర్యం పొంది; అవ్వా= అమ్మా!; నీవు+ఎవ్వరిదానవు= నీవు ఎవరికి సంబంధించినదానివి; ఈ+వన, దేవతవొ= ఈ వనానికి సంబంధించిన దేవతవా?; దేవ, భామినివొ;= అప్సరసవొ (దేవతవొ)!; దివ్యంబు+ఐన= దేవతలకు అనువైన; తేజంబుతోన్= వర్చస్సుతో; ఏకతంబు+అ= ఒంటరిగా; ఏల, క్రుమ్మరియెదవు?= ఎందుకు తిరుగుతున్నావు?; అనినన్= అని అడుగగా; వారలకున్= ఆ మునులకు; దమయంతి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: క్రూరమృగాలు, పాములు, దొంగలు, కిరాతులు ఎల్లప్పుడు తిరుగాడే అడవిలో దమయంతి ఒక పవిత్రమైన నదిఒడ్డున ఒక మునిపల్లెను చూచింది. ఆ ఋష్యాశ్రమంలోని మహర్షులు వసిష్ఠ, వామదేవ, వాలఖిల్య, భృగు, నారదుల వంటివారు. దమయంతి ఆ ఋషీశ్వరులకు నమస్కరించింది. ఆ మునులు దమయంతి అతిలోక సౌందర్యానికి, వర్చస్సుకు ఆశ్చర్యపరవశులై 'అమ్మా! నీవు వనదేవతవా? దేవతాస్త్రీవా? ఎవరవు నీవు? ఈ అడవిలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎందుకు ఈ రీతిగా ఒంటరిగా తిరుగాడుతున్నావు?' అని ప్రశ్నించారు. వారికి దమయంతి ఇట్లా బదులు పలికింది.

క. 'వినుఁ డేఁ బుణ్యశ్లోకుం । డనఁగ సదా యజ్ఞనిరతుఁ డనఁగ ధరిత్రిం
దనరిన నలు భార్యను, స । జ్జననుత దమయంతి యన నెసంగినదానన్. 99

ప్రతిపదార్థం: వినుఁడు; ఏన్= నేను, పుణ్యశ్లోకుండు+అనఁగన్= పవిత్రమైన చరిత్ర కలవాడుగా కీర్తి పొందినవాడు అనగా; సదా= ఎల్లప్పుడు; యజ్ఞనిరతుఁడు+అనఁగన్= యజ్ఞాలు చేయటంలో మిక్కిలి ప్రీతి కలవాడు అనగా; ధరిత్రిన్+తనరిన= భూమిపై విలసిల్లిన; నలు, భార్యను= నలుడి భార్యను; సజ్జన, నుత, దమయంతి+అనన్= మంచివారిచేత కొనియాడబడే దమయంతి అని (అనే పేరుతో); ఎసంగినదానన్= ఒప్పినట్టిదానిని.

తాత్పర్యం: దయచేసి నా వృత్తాంతం అవధరించండి. 'పుణ్యచరిత్రుడుగా కీర్తిని ఆర్జించినవాడున్నూ, ఎల్లప్పుడు యజ్ఞాలు చేయటంలో మిక్కిలి ప్రీతి కలవాడున్నూ అయి భూమండలంపై విలసిల్లిన నలుడి భార్యను నేను. పెద్దలచేత మన్ననలు పొందిన నాపేరు దమయంతి.

వ. విధివశంబున నన్నుం బాసి నా హృదయేశ్వరుం డెట యేనియుం బోయినఁ దదన్వేషణాసక్తచిత్తనై విపిన పరిభ్రమణంబు సేసెద; మీతపోవనంబునకు వచ్చి నలుండు భవత్పాదాభివందన కృతార్థుండై యెక్కడికింబోయె? నతని పోయిన వల నెఱుంగుదురేని నానతిండు; కొన్ని దినంబులలోనఁ దద్దర్శనంబు సంభవిల్లనినాఁడు దేహంబు విడుతు' నని యేడ్చుచున్న దానిం జూచి కరుణించి మును లిట్లనిరి. 100

ప్రతిపదార్థం: విధి, వశంబునన్= దురదృష్టం చొప్పున; నన్నున్+పాసి= నన్ను వదలిపెట్టి; నా, హృదయ+ఈశ్వరుండు= నా భర్త; ఎట+ఏనియున్+పోయి= ఎచటికో తెలియని చోటికి వెళ్లగా; తద్+అన్వేషణ+ఆసక్త, చిత్తను+ఐ= ఆతడిని వెదకటంలో లగ్నమైన మనస్సు కలదానినై; విపిన, పరిభ్రమణంబు= అడవిలో చుట్టూ తిరుగాడటం; చేసెద= సలుపుతున్నాను; మీ, తపస్+వనంబునకున్, వచ్చి= మీ తపోవనానికి వచ్చి; నలుండు; భవత్, పాద+అభివందన, కృత+అర్థుండు+ఐ= మీ అడుగులకు నమస్కరించటంచేత ధన్యుడై; ఎక్కడికిన్+పోయెన్? ఎచటికి వెళ్ళాడు?; అతని, పోయిన, వలను= అతడు వెళ్ళిన దిక్కు; ఎఱుంగుదురు+ఏనిన్= మీకు తెలిసినట్లయితే; ఆనతి+ఇండు= దయచేసి తెల్పండి; కొన్ని దినంబులలోనన్= ఇంక కొన్ని రోజుల లోపల; తద్+దర్శనంబు= ఆతడిని చూడటం; సంభవిల్లనినాఁడు= జరుగనివేళ; దేహంబు, విడుతున్= ఆత్మహత్యకు పాల్పడగలను; అని= అంటూ; ఏడ్చుచున్నదానిన్= శోకిస్తున్న దమయంతిని; చూచి; కరుణించి= దయకలిగి; మునులు+ఇట్లు+ అనిరి= మునులు ఈ రీతిగా అన్నారు.

తాత్పర్యం: విధివిపరిపాకంచేత నన్ను విడిచి నా ప్రాణేశ్వరుడు నలుడు ఎచటికో వెళ్ళిపోయాడు. నేను నా భర్తను వెదకుతూ ఈ అడవిలో తిరుగాడుతున్నాను. మీ తపోవనానికి వచ్చి నలుడు మీ పాదాలకు నమస్కరించి ధన్యుడై ఎటైనా వెళ్ళిపోయాడా? ఆతడు పోయిన వైపు మీకు తెలిసి ఉంటే దయచేసి తెలుపండి. ఇక కొన్ని దినాలలో నేను నా భర్తను చూడలేకపోతే ప్రాణాలు విడిచిపెట్టుతాను'- అని ఏడుస్తున్న దమయంతికి ఆ ఋషివరేణ్యులు ఇట్లా చెప్పారు.

క. 'వనజాయతాక్షి! కతిపయ । దినములఁ జూడంగఁ గాంతు తివిరి నలుని భూ
జననుతు నెప్పటియట్టుల । తన పురమున రాజ్యలీలఁ దనరెడివానిన్. 101

ప్రతిపదార్థం: వనజ+ఆయత+అక్షి!= పద్మాలవలె విశాలమైన కన్నులు గల దమయంతీ!; కతిపయ, దినములన్= కొన్నాళ్ళలో; ఎప్పటి+అట్టులు+అ= యథాప్రకారంగానే; తన పురమునన్= తన రాజధానిపట్టణంలో; రాజ్యలీలన్= దొరతనంచేస్తూ; తనరెడివానిన్= విలసిల్లేవాడిని; భూ, జన, నుతున్= భూమిలోని ప్రజలచేత కీర్తించబడినవాడిని; నలుని; తివిరి= పూనికతో; చూడంగన్+కాంతు= చూడగలవు.

తాత్పర్యం: 'తామరరేకులవంటి విశాలమైన కన్నులు కల ఓ దమయంతీ! కొన్నినాళ్ళలో నీవు నీ భర్త అయిన నలుడిని- పూర్వంవలెనే తన రాజధానీనగరంలో రాజ్యవైభవంతో విలసిల్లేవాడినిగా, ప్రజానురంజకుడైన ప్రభువుగా చూడగలవు.

వ. ఏము తపోదృష్టిం జూచితిమి, దుఃఖింపకుండు' మని తాపసులు దమ యగ్నిహోత్రంబులయు నపారఫల పుష్పతరు నదీ రమ్య తపోవనంబులయుఁదోడ నదృశ్యులైనం జూచి దమయంతి 'యిది కలయో నిక్కువంబో' యని విస్మయం బందుచుం జని, ముందట నొక్క చనుపం గని దానిం జొచ్చునపు డందలి జనంబులు. 102

ప్రతిపదార్థం: ఏము= మేము; తపస్+దృష్టిన్+చూచితిమి= తపస్సుయొక్క మహిమచేత లభించిన చూపుతో చూచాము; దుఃఖింపకుండుము+అని= శోకించకుము అని చెప్పి; తాపసులు= ఋషులు; తమ అగ్నిహోత్రంబులయున్= తమ నిప్పుకుండాలతో; అపార, ఫల, పుష్ప, తరు, నదీ, రమ్య, తపస్+వనంబులయున్+తోడన్= మితిలేని పండ్లు పువ్వులు గల చెట్లతో కూడిన నదీతీరాల్లో విలసిల్లే ఏటిప్రక్కన ఉండటంచేత అందమైన తపస్సు చేసుకొనే తోటలతోడ; అదృశ్యులు+ఐనన్= అంతర్ధానం కాగా; చూచి; దమయంతి; ఇది కలయో= ఇది స్వప్నమో; నిక్కువంబో= నిజమో; అని= అని తలపోసి; విస్మయంబు= అబ్బురపాటు; అందుచున్= పొందుతూ; చని= వెళ్ళి; ముందటన్= ఎదుట; ఒక్క, చనుపన్+కని= ఒక సార్థం చూచి, (సార్థం అంటే వర్తకజన సమూహం, దేశదేశాలకు వాణిజ్యానికై పయనించేది); దానిన్+చొచ్చునపుడు= ఆ గుంపులో ప్రవేశించేటప్పుడు; అందలి, జనంబులు= ఆ సార్థంలోని జనులు.

తాత్పర్యం: మేము తపోదృష్టితో చూచి నీకు ఈ విషయాలు తెలిపాము. శోకించవద్దు' - అని చెప్పి ఆ తాపసులు వారి అగ్నిహోత్రాలతో, పూలు, పండ్లు గల చెట్లతో కూడిన రమ్యమైన ఆ నదీ తీరంలోని ఋష్యాశ్రమాలతో మాయమయ్యారు. దమయంతి అది స్వప్నమా! నిజమా! అని ఆశ్చర్యపడి అడవిలో వెళ్లుతుండగా ఆమె యెదుట ఒక వర్తకుల గుంపు కనిపించింది. దమయంతి ఆ గుంపును చేరటంతో అందున్న వ్యాపారులు (ఆమెను చూచారు)

సీ. పాంసుజాలములు పైఁబ్రాఁకినఁ గరము రూ । క్షములగు నూర్ధ్వాలకముల దాని
నతిమలినంబైన యర్ధవస్త్రంబుచే । నావృతం బగు దేహయష్టి దాని,
నాఁకలి తృష యనిద్ర యను వీని నెఱుఁగక । యున్మాదినియుఁ బోలె నున్న దాని,
దమయంతిఁ జూచి కొందఱు పిశాచం బని । పఱచిరి, కొందఱు భయము వొంది.

ఆ. రందుఁ గొంద ఱధిక హాస్యంబు సేసిరి, । 'యడవి నేమి రోసె' దనిరి కొంద,
'అవ్వ! నీవు వేల్పవగు' దని కొందఱు । మొగిన కేలు మొగిచి మ్రొక్కి రంత. 103

ప్రతిపదార్థం: పాంసు, జాలములు= ధూళికణాల సముదాయం; పైన్+ప్రాఁకినన్= పైకి విస్తరించి వ్యాపించగా; కరము= మిక్కిలి; రూక్షములు+అగు= ఎర్రబారిన; ఊర్ధ్వ+అలకములదానిన్= పై ముంగురులు కలదానిని; అతి, మలినంబు+ఐన=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మిక్కిలిమాసినట్టి; అర్ధ వస్త్రంబుచేన్= సగంచీరచేత; ఆవృతంబు+అగు= కప్పబడిన; దేహ, యష్టిదానిన్= దేహమనే కఱ్ఱ కలదానిని; అంటే మిక్కిలి చిక్కిన శరీరం కల దానిని; ఆఁకలి= తిండికైన తహతహ; తృష= దాహం; నిద్ర= నిదుర; అను= అనే; వీనిన్= వీటిని; ఎఱుఁగక= తెలియక; ఉన్మాదినియున్+పోలెన్= పిచ్చిదానివలె; ఉన్నదాని= కనిపిస్తున్న దానిని; దమయంతిన్= దమయంతిని; చూచి; కొందఱు= కొంతమంది; పిశాచంబు+అని= దయ్యమని; పఱచిరి= పారిపోయారు; కొందఱు, భయము+పొందిరి= భయపడ్డారు; అందున్= ఆ సార్థంలో; కొందఱు= కొంతమంది; అధిక, హాస్యంబు+చేసిరి= మిక్కుటంగా ఎగతాళి చేశారు; కొందఱు= కొంతమంది; అడవిన్+ఏమి, రోసెదు+అనిరి= ఈ అడవిలో ఏమి వెదకుతున్నావు? అని అడిగారు; కొందఱు= కొంతమంది; అవ్వ!= అమ్మా!; నీవు; వేల్పవు+అగుదు= దేవతవు అవుతావు; అని; మొగిన= పూనికతో; కేలు, మొగిచి= చేతులు జోడించి; అంతన్= అంతట; మ్రొక్కిరి= నమస్కరించారు.

తాత్పర్యం: ఆ వర్తకసమూహం దమయంతిని చూచి పలుతెరగుల తలపోశారు. రేగినదుమ్ము నెత్తిపై పడటంచేత ఎఱ్ఱబారిన ముంగురులు కలదానిని, మిక్కుటంగా మాసిపోయిన సగంచీరచేత కప్పబడి బెత్తంవలె కనిపించే శరీరం కల దానిని; ఆకలి, దప్పిక, నిదుర అనే వాటికి దూరమై పిచ్చిదానివలె తిరుగుతున్నదానిని ఆ దమయంతిని చూచి కొందరు ఆమెను దయ్యం అనుకొని భీతితో పారిపోయారు. కొందరు ఆమెను అపహాస్యం చేశారు. కొందరు 'అవ్వా! ఈ అడవిలో నీవు దేనికొరకు వెదకుతున్నావు'? అని ప్రశ్నించారు. కొందరు 'దేవీ! నీవు సాక్షాత్తు భువికి దిగి వచ్చిన దేవతవే' అని కేలు మోడ్చి మ్రొక్కారు.

వ. దమయంతియు సార్థవాహుఁజూచి' యిమ్మహాగహనంబున నిట్టి జనసంకులం బైన సార్థంబు గానంబడియెడు నెట్టి పుణ్యంబో' యని పల్కి, మఱియు నిట్లనియె. 104

ప్రతిపదార్థం: దమయంతియు= దమయంతి సయితం; సార్థవాహున్+చూచి= వర్తక ప్రముఖుడిని చూచి; ఈ+మహా, గహనంబునన్= ఈ గొప్ప అడవిలో; ఇట్టి, జన, సంకులంబు+ఐన= ఈ విధంగా జనులచేత క్రిక్కిరిసిన; సార్థంబు= వర్తకుల గుంపు; కానంబడియెడున్= కనిపిస్తున్నది; ఎట్టి; పుణ్యంబో= ఎటువంటి మంచి కర్మకు ఫలితమో?; అని పల్కి= అని వచించి; మఱియున్= వెండియు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: దమయంతి వర్తకుడిని చూచి ఇట్లా పలికింది - 'ఈ ఘోరారణ్యంలో ఈ వర్తక జనులు కనిపించటం ఎంతటి పుణ్యం!' అని, ఆమె మళ్ళీ ఇట్లా అన్నది.

క. 'ఏను నలు భార్యఁ బుణ్యవి । హీనతఁ బతిఁ బాసి నవసి యేకాంతమ యీ
కానలఁ బరిభ్రమించెదఁ । గానరె ? మీ రమృతసదృశుఁ గరుణాత్ము నలున్?' 105

ప్రతిపదార్థం: ఏను= నేను; నలుభార్యన్= నలుడిభార్యను; పుణ్య, విహీనతన్= పుణ్యం కొరవడటంచేత, అంటే కేవలం దురదృష్టవశాన; పతిన్+పాసి= భర్తను ఎడబాసి; నవసి= మిక్కిలి గాసిచెంది; ఏకాంతము+అ= ఒంటరిగా; ఈ కానలన్= ఈ అడవులలో; పరిభ్రమించెదన్= చుట్టూ తిరుగుతున్నాను; అమృత, సదృశున్= అమృతంతో సరిపోలేవాడిని; కరుణాత్మున్= దయామయుడిని; నలున్= నలుడిని; మీరు; కానరె= చూడలేదా?

తాత్పర్యం: 'నేను నలుడిభార్యను, దురదృష్టవశాన నేను నా భర్తను ఎడబాసి, ఒంటరిగా ఈ అడవులలో కష్టాలపాలై తిరుగాడుతున్నాను. అమృత సమానుడు, దయామయుడు అయిన నలుడిని మీరు ఎచటనైనా చూడలేదా?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఆనంద ముద్రణాలయం వారి ప్రతిలో "గానరె? మీ రమరసదృశుఁ" అనే పాఠాంతరం ఉన్నది. దీనిని బట్టి "నలుడు దేవతలతో సమానుడు"- అనే విశేషార్థం వెల్లడౌతున్నది.

వ. అనిన దానికి సార్థవాహుండు శుచి యను వాఁ డిట్లనియె. 106

ప్రతిపదార్థం: అనినన్= అని దమయంతి చెప్పగా; దానికిన్= ఆ దమయంతికి; సార్థవాహుండు= సార్థంలోని వర్తకుడు; శుచి+అనువాఁడు= శుచి అనే పేరు గల వణిక్ప్రముఖుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అని దమయంతి చెప్పగా శుచి అనే పేరుగల వర్తకప్రముఖుడు దమయంతితో ఇట్లా బదులు పలికాడు.

క. 'నలుఁ గాన మివ్వనంబునఁ । గల వెప్పుడుఁ గాంతు ముగ్రకరులను సింహం
బుల బుక్షంబుల; నిది మ । ర్త్యుల కవిషయ; మాతపంబు దూఱదు దీనన్.' 107

ప్రతిపదార్థం: ఈ+వనంబునన్= ఈ అడవిలో; నలున్+కానము= నలుడిని చూడలేదు; ఉగ్ర, కరులను= భయంకరాలైన ఏనుగులను; సింహంబులన్= సింగాలను; బుక్షంబులన్= ఎలుగుబంట్లను; ఎప్పుడున్= సతతం; కాంతుము= చూస్తూ ఉంటాము; కలవు= ఉన్నాయి; ఇది= ఈ అరణ్యం, మర్త్యులకు= మానవులకు; న+విషయము= చేరగూడని ప్రదేశం; దీనన్= ఈ అడవిలో; ఆతపంబు= ఎండ; దూఱదు= చొరబడదు.

తాత్పర్యం: 'ఈ అడవిలో మేము నలుడిని చూడలేదు కాని, ఇక్కడ ఉండే భయంకరాలైన సింహాలను, ఏనుగులను, ఎలుగుబంట్లను మాత్రం చూస్తూ ఉంటాము. ఈ అడవి మనుజులు ప్రవేశించదగిన ప్రదేశం కాదు. ఇందులోకి సూర్యరశ్మికూడా ప్రవేశించలేదు'.

వ. అనిన 'నిచ్చనుప యెట వోయెడు?' నని యడిగినఁ 'జేదిపతియైన సుబాహుపురంబునకుం బోయెడు' నని చెప్పిన 'నట్లేని మీతోడ వచ్చెద' నని యప్పరమపతివ్రత పతిదర్శన లాలసయై మునుల పలుకులు తలఁచుచు సార్థంబుతో నరిగిన. 108

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఈ+చనుప= ఈ వర్తకులగుంపు; ఎట+పోయెడున్= ఎక్కడికి పోతుంది; అని+అడిగినన్= అని దమయంతి అడుగగా; (శుచి బదులు పలుకుతూ), చేది, పతి+ఐన= చేదిదేశప్రభువు అయిన; సుబాహు పురంబునకున్+పోయెడున్= సుబాహువుయొక్క రాజధానీనగరానికి పోతుంది; అని, చెప్పినన్= అని చెప్పగా; అట్లు+ఏని= అట్లయితే; మీ తోడ, వచ్చెదన్= మీతోపాటు వస్తాను; అని; ఆ+పరమ పతివ్రత= ఆ గొప్ప పతివ్రత; పతిదర్శన లాలస+ఐ= భర్తను చూడాలనే కోరికకలదై; మునుల, పలుకులు= మునుల మాటలు; తలఁచుచు= స్మరిస్తూ; సార్థంబుతోన్= చనుపతో; అరిగినన్= వెళ్ళగా.

తాత్పర్యం: అని శుచి అనే వర్తకప్రముఖుడు చెప్పగా, దమయంతి 'ఈ వర్తకులందరు ఎక్కడికి వెళ్తారు?'- అని ప్రశ్నించింది. 'ఈ వర్తకులందరు చేదిప్రభువు సుబాహువుయొక్క రాజధాని నగరానికి వెళ్తారు'. - అని శుచి బదులు పలికాడు. 'అట్లయితే నేను మీతో వస్తాను'- అని దమయంతి భర్తను చూడాలనే తహతహతో, ఋషివరేణ్యుల మాటలు స్మరిస్తూ, వారితో కలసి వెళ్ళింది.

క. కడునెండ యెక్కు నంతకు । నుడుగక యచ్చనుప నడచి యుగ్రాటవిలో
విడిసె బహుశీతజలముల । బెడఁ గగు నొక చెఱువునొద్దఁ బెద్దయు డప్పిన్. 109

ప్రతిపదార్థం: కడున్+ఎండ= మిక్కుటంగా ఎండ; ఎక్కునంతకున్= (మింటి పైకి) ఎగబ్రాకే వరకు; ఉడుగక= విరమించక; ఆ+చనుప= ఆ సార్థం; నడచి= పయనించి; ఉగ్ర+అటవిలోన్= భయంకరమైన అడవిలో; బహు, శీత, జలములన్= మిక్కిలి చల్లని నీళ్లచేత; బెడఁగు+అగు= మంచిదైన; ఒక, చెఱువు+ఒద్దన్= ఒక తటాకం దగ్గర; పెద్దయు, డప్పిన్= పెను దాహంచేత; విడిసెన్= విడిది చేసింది.

తాత్పర్యం: మిక్కిలిగా పొద్దు ఎక్కేవరకు ఆ వర్తకులు పయనించి, చల్లని నీళ్ళచేత ఆహ్లాదకరంగా కనిపించే చెరువు దగ్గర దాహం తీర్చుకొని విశ్రమించటానికి విడిది చేసారు.

వ. అంత. 110

తాత్పర్యం: అప్పుడు.

సీ. అర్ధరాత్రమునప్పు డందుల కేతెంచె । గజయూథములు జలకాంక్షఁ జేసి
యంబుధి విమలతోయంబు లాస్వాదింపఁ । జనుదెంచు జలధరసమితియట్ల
యచ్చన్వలోన నిద్రాసక్తులైన వా । రున్నత ద్విపముల యుగ్ర పాద
హతిఁ జేసి మర్దితు లైరి కొందఱు, దంత । హతిఁ జేసి భిన్నాంగు లైరి కొంద,

ఆ. ఱఱచి ప్రాణభీతిఁ బఱచి మహీజంబు । లెక్కి రందుఁ గొంద ఱుక్కడంగి;
చనుప యిట్టిపాటఁ బెనుపఱి యవినీతు । సిరియుఁబోలె నడఁగి విరిసి చనియె. 111

ప్రతిపదార్థం: అర్ధ రాత్రము+అప్పుడు= నడిరేయి వేళ; అందులకు= అచటికి; జల, కాంక్షన్+చేసి= నీటిని త్రాగటంకొరకు; గజ, యూథములు= ఏనుగుల గుంపులు; అంబుధి, విమల, తోయంబులు= సముద్రంలోని నిర్మల జలాలు; ఆస్వాదింపన్= గ్రోలటానికి; చనుదెంచు= వచ్చే; జలధర, సమితి+అట్లు+అ= మేఘాల సమూహాల వలె; ఏతెంచెన్= వచ్చాయి; ఆ+చన్వలోనన్= ఆ సార్థంలో; కొందఱు= కొంతమంది; నిద్రా+ఆసక్తులు+ఐనవారు= నిద్రలో తగుల్కొన్నవారు; ఉన్నత, ద్విపముల= పెద్ద ఏనుగుల; ఉగ్ర, పాద, హతిన్+చేసి= భయంకరమైన పాదాలయొక్క తాకిడిచేత; మర్దితులు+ఐరి= మర్దించబడ్డారు, అంటే నలగగొట్టబడి మరణించారు; కొందఱు= కొంతమంది; దంతహతిన్+చేసి= దంతాల తాకిడిచేత; భిన్న+అంగులు+ఐరి= ముక్కలైన శరీరాలు కలవారైనారు (ఎముకలు, అంగాలు విరిగినవారైనారు); అందున్+కొందఱు= వారిలో కొంతమంది; ఉక్కు+అడంగి= స్థైర్యం కోల్పోయి; అఱచి= పెనుకేకలు పెట్టి; ప్రాణభీతిన్= ప్రాణభయంచేత; పఱచి= పరుగెత్తి; మహీజంబులు= చెట్లను; ఎక్కిరి= అధిరోహించారు; చనుప= సార్థం; ఇట్టి, పాటన్= ఇట్టి పరిస్థితి వలన; పెనుపు+అఱి= సమృద్ధిని కోలుపోయి (అంటే సంఖ్యాబలాన్ని కోల్పోయి, క్షీణించి); అవినీతు, సిరియున్+పోలెన్= నీతిబాహ్యుడి ఐశ్వర్యంవలె; విరిసి, చనియెన్= పగిలి (చెదరి) పోయింది.

తాత్పర్యం: నడిరేయి నీరు త్రాగటానికై అడవి యేనుగుల గుంపులు ఆ చెరువు దగ్గరకు వచ్చాయి. ఆ యేనుగులు, సముద్ర జలాలను త్రాగటానికై సముద్రాన్ని చేరిన మేఘాల సమూహాలవలె ఉన్నాయి. ఆ సార్థంలో నిద్రలో నిమగ్నులై ఉండే కొంతమంది ఏనుగుల పాదతాడనంచేత మరణించారు. కొంతమంది ఏనుగుల దంతాలచేత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శరీరాలు చీలి చనిపోయారు. కొంతమంది స్థైర్యం కోల్పోయి అరుస్తూ ప్రాణభీతితో పరుగెత్తి చెట్లు ఎక్కారు. ఈ విధంగా ఆ సార్థం నీతిబాహ్యుడి సంపదవలె క్షీణించి చెదిరిపోయింది.

వ. అట్టి సంక్షోభంబున మరణంబునకుఁ దప్పి దమయంతి యాత్మగతంబున. 112

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; సంక్షోభంబునన్= అలజడిలో; మరణంబునకున్+తప్పి= చావకుండ తప్పించుకొని; దమయంతి; ఆత్మగతంబునన్= తనలో తాను ఇట్లా తలచింది.

తాత్పర్యం: అటువంటి అలజడిలో దమయంతి దైవికంగా చావును తప్పించుకొని తన మనస్సులో ఇట్లా తలపోసింది.

ఆ. 'జీవితార్థు లైన జీవుల సుఖసుప్తు । లైన వారిఁ జంపె నఱవ నఱవ;
మరణకాంక్ష నున్న మగువఁ జంపక నను । మఱచె; విధి కరంబు మందబుద్ధి. 113

ప్రతిపదార్థం: జీవిత+అర్థులు= బ్రతకాలనే కోరిక ఉన్నవారు; ఐన; జీవులన్= ప్రాణులను; సుఖ, సుప్తులు+ఐన వారిన్= సుఖంగా నిద్రిస్తున్నవారిని; అఱవన్+అఱవన్= కేకలు పెట్టుతుండగా; చంపెన్= చంపాడు; మరణ కాంక్షన్+ఉన్న, మగువను= చనిపోవాలనే కోరికతో ఉన్న ఆడుదానిని; ననున్= నన్ను; చంపక= చంపకుండ; మఱచె= విస్మరించాడు; విధి= దైవం; కరంబు= మిక్కిలి; మందబుద్ధి= బుద్ధిహీనుడు.

తాత్పర్యం: 'బ్రతికి ఉండాలనే కోరికతో మైమరచి నిద్రిస్తున్నవారిని, ప్రాణభయంతో కేకలు పెట్టుతూవుండగా చంపివేశాడు. కాని, చావాలనే కోరికతో ఉన్నదానిని నన్ను చంపకుండ మరచిపోయాడు । ఆ విధి మిక్కిలి బుద్ధిహీనుడు కదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. మానవజీవితంలో హృదయవిదారకాలైన విచిత్రవిరోధాభాసాలలో ఇదొకటి!

సీ. ఇచ్చన్వతోఁ జని యివ్వనక్లేశంబు । దలుఁగుదు నని బుద్ధిఁ దలఁచి యున్న
నురుతర సార్థ పయోరాశి హస్తియూ । థాగస్త్యుచేఁ బీత మయ్యె; నదియుఁ
దొలుమేనఁ జేసిన దుష్కృత శక్తియో, । వగవక నా స్వయంవరమునాఁడు
సురవరు లర్థులై చూచుచు నుండఁగ । నలు వరియించిన నాఁటి యెగ్గు

ఆ. దలఁచి యిట్టి యాపదలు సేసిరో వేల్పు, । లమరకోపమునన యయ్యె నాకు
నివ్వియోగదుఃఖ; మింకేమి సేయుదు?' । ననుచు వగచుచుండె నంబుజాక్షి. 114

ప్రతిపదార్థం: ఈ+చన్వతోన్= ఈ సార్థంతో కలిసి; చని= వెళ్ళి; ఈ+వనవాస క్లేశంబు= ఈ అడవిలో పడే బాధ; తలుఁగుదును+అని= తొలగించుకొంటానని; బుద్ధిన్+తలఁచి+ఉన్నన్= మదిలో భావించి ఉండగా; ఉరుతర, సార్థ, పయస్+రాశి= గొప్పదైన సార్థం అనే సముద్రం; హస్తియూథ+అగస్త్యుచేన్= ఏనుగుల గుంపు అనే అగస్త్యుడి చేత; పీతము+అయ్యెన్= త్రాగబడింది అయింది; అదియున్= అదికూడా; తొలుమేనన్= మొదటి శరీరంలో అంటే పూర్వజన్మలో; చేసిన; దుష్కృత, శక్తియో= చెడుకర్మ మహిమ ఏమో?; వగవక= ఆలోచించక; నా, స్వయంవరము, నాఁడు= నా స్వయంవర సమయంలో; సుర, వరులు= దేవతలలో శ్రేష్ఠులు; అర్థులు+ఐ= కోరినవారై; చూచుచున్+ఉండఁగ= చూస్తున్నప్పుడు; నలున్= నలుడిని; వరియించిన,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నాఁటి+ఎగ్గు, తలఁచి= వరించిన సమయంలోని అపకారాన్ని మనసులో పెట్టుకొని; వేల్పులు= దేవతలు; ఇట్టి= ఈ విధమైన; ఆపదలు, చేసిరో= ఇక్కట్టులు తెచ్చిపెట్టారో; ఈ+వియోగ దుఃఖము= ఈ ఎడబాటువలన పరితాపం; అమర కోపమునన్+అ= దేవతల కోపంచేతనే; నాకు+అయ్యెన్= నాకు ఏర్పడింది; ఇంక+ఏమి+చేయుదున్?= ఇక ఏమి చేయగలను?; అనుచున్= అని తలపోస్తూ; అంబుజ+అక్షి= పద్మాలవంటి కన్నులుకల దమయంతి; (అంబుజం= నీటినుండి పుట్టింది, పద్మం); వగచుచుండెన్= దుఃఖిస్తూ ఉండింది.

తాత్పర్యం: ఈ సార్థంతో వెళ్ళి ఈ అడవిలో పడేబాధలు తొలగించుకొందాము'- అని తలచి ఉన్నాను. కాని, ఏనుగుల గుంపు అనే అగస్త్యుడిచేత ఈ సార్థం అనే సముద్రం పీల్చివేయబడింది. ఇది పూర్వజన్మ కర్మఫలమో! లేక నా స్వయంవరంనాడు ఆలోచించక నన్నుకోరి వచ్చిన దేవతాశ్రేష్ఠులు చూస్తుండగా నేను నలుని వరించటం అపకారంగా తలచి ఇటువంటి కష్టాలు నాకు తెచ్చి పెట్టుతున్నారో! నా భర్తతో నాకు ఇటువంటి ఎడబాటు దుఃఖం దేవతల కోపంవలననే కలిగింది. ఇంకేమి చేయగలను?' అని దమయంతి వాపోయింది.

విశేషం: (1) ఆకస్మికంగా ఈ సార్థం ఏనుగులగుంపుచేత ప్రమాదానికి గురికా నేల? ఇది పూర్వజన్మ కర్మఫలితమా? భారతీయ సంస్కృతిలో మిక్కిలి ప్రాధాన్యం వహించిన కర్మ సిద్ధాంతం ఇట ప్రస్తావించబడింది. ఏల నిద్రలో మునిగిఉండే నిర్దోషులు వధించబడ్డారు? అది పూర్వజన్మ కర్మ అవుతుందా? అట్లే అరణ్యక్లేశం తప్పుతుందని దమయంతి చనుపలో చేరింది. తానొకటి తలచితే దైవ మింకొకటి తలచింది కదా! అంతటికిని పూర్వజన్మ కృతమైన కర్మయే కారణం- అని ఆమె వగచింది. (2) అగస్త్యమహర్షి సముద్రజలాన్ని పీల్చిన సుప్రసిద్ధ పురాణగాథ ఇచట ప్రస్తావించబడింది. (3) అలంకారం: రూపకం.

దమయంతి సుబాహుపురంబు ప్రవేశించుట (సం. 3-62-28)

వ. **ఇట్లు దుఃఖించుచు దమయంతి ప్రభాతంబ హతశేషులైన యచ్చనుపలోని బ్రాహ్మణవరులతో ననవరత ప్రయాణంబులం జేదిపతి పురంబు సొచ్చి, జనసంకులంబైన రాజమార్గంబు దటీయ వచ్చుచున్న దాని దినకర ప్రభాపటల ధూసరిత ప్రభాతచంద్రరేఖయుంబోలె దీప్తివిహీనయై డస్సియు రమ్యాకృతియైన దాని దమయంతిం బ్రాసాదగతయైన రాజమాత దవ్వులం గని తన దాది కిట్లనియె.** **115**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దుఃఖించుచున్= పరితపిస్తూ; దమయంతి; ప్రభాతంబు+అ= తెల్లవారినపుడు; హతశేషులు+ఐన= చావగా మిగిలిన; ఆ+చనుపలోని= ఆ వర్తకులగుంపులోని; బ్రాహ్మణ, వరులతోన్= బ్రాహ్మణశ్రేష్ఠులతో; అనవరత, ప్రయాణంబులన్= ఆగని ప్రయాణాలు చేసి (అంటే మార్గమధ్యంలో ఎక్కువగా విడిదిచేయక శీఘ్రప్రయాణాలు చేసి); చేదిపతి, పురంబు= చేదిప్రభువు రాజధానిని; చొచ్చి= ప్రవేశించి; జన సంకులంబు+ఐన= ప్రజలచేత క్రిక్కిరిసినట్టి; రాజమార్గంబు= ప్రధానమైన దారిని, (రాజు పయనించే మార్గం రాజమార్గం); తఁటియ, వచ్చుచున్న దానిన్= చేరవస్తున్న దానిని; దినకర, ప్రభా, పటల, ధూసరిత, ప్రభాత చంద్రరేఖయున్+పోలె= సూర్యుడి కాంతికిరణ సమూహాలచేత బూడిద రంగు కలదిగా చేయబడిన (వెలవెలపోయిన) ప్రాతఃకాలమందలి చంద్రవంకవలె; దీప్తి, విహీన+ఐ= కాంతి తరిగినట్టిదై; డస్సియు= బడలినప్పటికిని; రమ్య+ఆకృతి+ఐన, దానిన్= అందమైన ఆకారం కలదానిని; దమయంతిన్= దమయంతిని; ప్రాసాదగత+ఐన= మేడపై ఉన్న; రాజమాత= రాజుగారి తల్లి; దవ్వులన్+కని= దూరంనుండి చూచి; తనదాదికి= తనసేవకురాలితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా పరితపిస్తూ దమయంతి, తెల్లవారగానే చావగా మిగిలిన ఆ చనుపలోని (వర్తకులగుంపు) బ్రాహ్మణశ్రేష్ఠులతో కలిసి శీఘ్రంగా పయనించి కొన్నాళ్లకు చేదిదేశ రాజధానికి చేరి జనసమ్మర్దం గల రాజమార్గాన్ని సమీపిస్తూ ఉండగా సూర్యకిరణసమూహంచేత బూడిదరంగు కలదిగా చేయబడి వెలవెలపోయిన ప్రాతఃకాల చంద్రరేఖవలె కాంతి కోల్పోయి, అలసిపోయికూడ అందమైన ఆకృతి కలిగిన ఆ దమయంతిని మేడపైనుండి రాజమాత అల్లంతదూరాన చూచి, తన దాదితో ఇట్లా పలికింది.

విశేషం: అలం: ఉపమ. మహాభారతంలోని మనోజ్ఞమైన ఉపమాలంకారాలలో ఇది ఒకటి. ఇచట 'డస్సియు రమ్యాకృతి' గల దమయంతి ఉపమేయం. ప్రభాతవేళలో సూర్యకిరణసమూహాలచేత ధూసరితమైన చంద్రవంక ఉపమానం. సూర్యకిరణ ధూసరితమైనది చంద్రవంక, ధూళి ధూసరితమైనది దమయంతి. కృశత్వం, దీప్తి తరగటం చంద్రవంకకు దమయంతికి సమానధర్మాలే. చంద్రవంక కృశించినా, దీప్తిహీనమైనా మనోహరమైనదే. అట్లే దమయంతికూడ.

తే. **'జీర్ణమై కడు మాసిన చీరగట్టి । ధూళి ధూసరాలకములు దూలుచుండ**
నబల యున్మత్తవేషిణి యైన లచ్చి । కరణి నిట వచ్చుచున్నది కంటె దాని. 116

ప్రతిపదార్థం: జీర్ణము+ఐ= చినిగినట్టిదై; కడు= మిక్కిలి; మాసిన= మలినమైన; చీర= వస్త్రం; కట్టి= ధరించి; ధూళి, ధూసర+అలకములు= దుమ్ముచేత బూడిదవన్నెగల ముంగురులు; తూలుచుండన్= ఇటు అటు కదలుతూ ఉండగా; అబల= మగువ; ఉన్మత్త, వేషిణి+ఐన= పిచ్చిదాని వేషం వేసికొన్న; లచ్చి, కరణిన్= లక్ష్మీదేవివలె; ఇట= ఇచటకు; వచ్చుచున్నది= వస్తున్నది; దానిన్= ఆమెను; కంటె= చూచావుకదా!.

తాత్పర్యం: 'చినిగిపోయి మిక్కిలి మాసినచీర కట్టుకొని, దుమ్ముచేత, ఎర్రవారిన ముంగురులు ఇటూఅటూ కదలుతుండగా, పిచ్చిదానివేషం వేసికొన్న లక్ష్మీదేవివలె ఇటు వస్తున్న ఆమెను చూచావుకదా!.

విశేషం: అలం: ఉపమ. 115-116 పద్యాలు తీర్చిన ఒరవడిలో నన్నయ మహాకవి 'ప్రసన్నకథాకలితార్థయుక్తి' ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. ఆమె ఎవరో రాజమాతకు తెలియదుకదా! అయినను రాజమాత దమయంతిని ఉన్మత్తవేషిణి అయిన లక్ష్మీదేవి వలె, ప్రభాతవేళలో సూర్యరశ్మి తాకిడికి దీప్తి కోల్పోయిన చంద్రవంకవలె ఉపమించటం హృద్యం.

వ. **అక్కోమలియందు నా కతిస్నేహంబై యున్నయది; దానిం దోడ్కొని ర'మ్మనిన నదియు దమయంతిం దోడ్కొని రాజమాత యొద్దకుం జనిన, నా రాజమాతయు దానిం జూచి 'నీవెవ్వరి దాన? వి ట్లేల దుఃఖావేశవివశవై యున్నదానవు చెప్పు' మనిన దమయంతి యిట్లనియె. 117**

ప్రతిపదార్థం: ఆ+కోమలియందు= సుకుమారి అయిన ఆ అంగనపట్ల; నాకు+అతిస్నేహంబు+ఐ+ఉన్న+అది= నాకు మిక్కుటమైన ప్రేమ ఏర్పడింది; దానిన్= ఆమెను; తోడ్కొనిరమ్ము+అనినన్= తీసికొనిరమ్ము అని అనగా; అదియు= ఆ దాదియు; దమయంతిన్+తోడ్కొని= దమయంతిని వెంటపెట్టుకొని; రాజమాత+ఒద్దకున్+చనినన్= రాజుగారి తల్లి దగ్గరగా వెళ్ళగా; ఆ, రాజ, మాతయు; దానిన్+చూచి= ఆమెను (దమయంతిని) చూచి; నీవు+ఎవ్వరి దానవు= నీవు ఎవరికి సంబంధించినదానివి; ఇట్లు= ఈ విధంగా; ఏల= ఎందుకు; దుఃఖ+ఆవేశ, వివశవు+ఐ+ఉన్న= దానవు= శోకంవలన ఏర్పడిన ఉద్వేగంతో వశం తప్పిఉన్నదానివి; చెప్పుము; అనినన్= అని అడుగగా; దమయంతి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నాకు ఆ కోమలాంగిపై అత్యంతమైన ప్రీతి ఏర్పడింది. నీవు పోయి ఆమెను ఇచటికి తోడ్కొని రమ్ము' అని, రాజమాత తన దాదిని నియోగించింది. ఆ దాది వెళ్ళి దమయంతిని వెంటబెట్టుకొని రాజమాత సన్నిధికి వచ్చింది. రాజమాత దమయంతితో 'నీవు ఎవరిదానివి? ఇట్లా ఎందుకు పరమశోకమూర్తివై కనిపిస్తున్నావు?' అని ప్రశ్నించింది. అప్పుడు దమయంతి ఇట్లా బదులు చెప్పింది.

మధ్యాక్కర.

'జితవైరి మత్పతి జూదమాడి నిర్జితుఁడయి చనినఁ
బతితోడ నీడయుఁ బోలె నేనును బాయక యరిగి
యతిబుభుక్షాతురుండైన పతిచేత నవ్వ! దైవాను
మతిఁజేసి వంచితనైతి నొక్కచో మఱచి నిద్రించి. 118

ప్రతిపదార్థం: మత్+పతి= నాభర్త; జిత, వైరి= పరాక్రమంచేత జయింపబడిన శత్రువులు కలవాడు; జూదము+ఆడి; నిర్జితుఁడు+ఐ= ఓడించబడినవాడై; చనినన్= వెళ్ళగా; పతితోడన్= భర్తతో; నీడయున్+పోలెన్= నీడవలె; ఏనును= నేనుకూడ; పాయక= ఆతడిని విడిచిపెట్టక; అరిగి= వెళ్లి; అతి, బుభుక్షా+ఆతురుండు+ఐన= మిక్కిలి ఆకలిచేత పీడితుడైన; పతిచేతన్= భర్తచేత; అవ్వ!= అమ్మా!; దైవ+అనుమతిన్+చేసి= దురదృష్టవశాన; ఒక్కచోన్= ఒకానొకచోట; మఱచి, నిద్రించి= మైమరచి నిద్రపోయి; వంచితన్+ఐతి= మోసగించబడినదానినయ్యాను.

తాత్పర్యం: 'అమ్మా! నా పతి పరాక్రమోపేతుడైన వీరుడు. శత్రువులను జయించినవాడు. కాని, ఆయన జూదమాడి, ఓడిపోయి రాజ్యాన్ని వదలివెళ్ళగా, నేను కూడ నీడవలె వెన్నంటి వెళ్ళి, ఒకచోట మైమరచి నిద్రించి, విధివశాన అతిగా ఆకలిచే బాధితుడైన భర్తచేత మోసగించబడ్డాను.

విశేషం: వృత్తలక్షణానికి ఈ ఆశ్వాసంలోని 22వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.

వ. అంతనుండియు నమ్మహానుభావు నేకవస్త్రు ననికేతను నన్వేషించుచు, సైరంధ్రీవృత్తంబు సేకొని, వియోగానలంబునం గంది, కందమూల ఫలంబుల యాహారంబుగాఁ, బ్రొద్దు వడినచోట నివాసంబుగా, మృగంబుల సహాయంబుగా, వనంబులం పరిభ్రమించితి' నని, బాష్పజలంబులం బయోధరస్థలపరాగంబు పంకంబు సేయుచుఁ బలుకనేరకున్న యా దమయంతికి రాజమాత యిట్లనియె. 119

ప్రతిపదార్థం: అంతనుండియున్= అప్పటినుండి; ఆ+మహా+అనుభావున్= ఆ మహాత్ముడిని; ఏక, వస్త్రున్= ఒకే పుట్టం కట్టుకొన్నవాడిని; అనికేతనున్= ఇల్లు లేనివాడిని; అన్వేషించుచున్= వెదకుతూ; సైరంధ్రీ, వృత్తంబు+చేకొని= సైరంధ్రి యొక్క నడవడిని పాటించి; వియోగ+అనలంబునన్+కంది= భర్తయొక్క ఎడబాటు అనే అగ్నివలన తపించి; కంద, మూల, ఫలంబులు+అ= దుంపలు, వేళ్ళు, పండ్లు మాత్రమే; ఆహారంబు+కాన్= తిండిగా; ప్రొద్దు+పడిన, చోటు+అ= ప్రయాణంలో ఏచోట సూర్యుడు అస్తమిస్తాడో ఆ స్థలమే; నివాసంబు+కాన్= నివసించేచోటుగా; మృగంబులు+అ, సహాయంబు+కాన్= జంతువులే సాయంగా; వనంబులన్= అడవులలో; పరిభ్రమించితిన్= తిరుగాడాను; అని= అనిచెప్పి; బాష్ప, జలంబులన్= కన్నీటితో; పయోధర, స్థల, పరాగంబు, పంకంబు, చేయుచున్= పాలిండ్లపై ఉన్న దుమ్మును బురదగా చేస్తూ; పలుకనేరకున్న= మాటాడజాలనట్టి; ఆ, దమయంతికి; రాజమాత; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అని చెప్పింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అప్పటినుండియు ఏకవస్త్రం మాత్రమే కట్టుకొన్నవాడిని, నిలువ నీడ లేనివాడిని, వెదకుతూ సైరంధ్రి వృత్తిని చేపట్టి భర్త ఎడబాటువలన తపించి దుంపలు, వేళ్ళు, పండ్లు ఆహారంగా, మృగాలే సహాయంగా, ప్రొద్దుకుంకిన వేళ నే నెక్కడ ఉంటే అదే అప్పటికి నివాసంగా అడవుల్లో తిరుగాడాను'- అని చెప్పి దమయంతి విలపించింది. ఆమె కన్నులనుండి కారిన బాష్పధారలచేత ఆమె స్తనాలపై గల దుమ్ము బురదగా మారింది. ఆమె మాటాడలేక మూగవోయిన పిమ్మట, దమయంతితో రాజమాత ఇట్లా చెప్పింది.

విశేషం: (1) సైరంధ్రీవృత్తిని గురించి తర్వాతి పద్యంలో వివరణ ఉన్నది. సైరంధ్రి అంటే సౌశీల్యవతి అయిన పరిచారిక అని సంగ్రహంగా చెప్పవచ్చును. (2) దమయంతి తాను పతిచేత వంచితనని చెప్పింది. కాని తన భర్తపై అది దోషారోపణ కాకుండటానికై ఆయన మహావీరుడు, మహాత్ముడు అని నొక్కి వక్కాణించింది. ఇది గమనించదగిన అంశం. (3) అడవులలో పరిభ్రమిస్తూ దమయంతి పడినపాట్లు వర్ణనాతీతాలు. ఆమెకు అరణ్యంలో ఆవాసస్థల మేది? అది ప్రొద్దు క్రుంకినపుడు ఆమె ఉన్నచోటే, పగలెల్ల అడవులలో తిరగటం, పొద్దుక్రుంకినపుడు తా నెచట ఉంటే ఆచోటనే తాత్కాలికంగా నివసించటం. దమయంతి పడినపాట్లు ఎంతటి కఠిన హృదయాన్నైనా కరిగించగలవు. ఇక, ఆర్ద్రహృదయ అయిన రాజమాతనుగురించి వేరుగా చెప్పవలెనా?

క. 'నీ వుండుము నాకడ నిం । దీవరదళనేత్ర! నీ పతిని రోయఁగ భూ
దేవోత్తములం బంచెద' । నావుడు ని ట్లనియె భీమనందన నెమ్మిన్. 120

ప్రతిపదార్థం: నా కడన్= నా దగ్గర; నీవు+ఉండుము= నీవు ఉండుము; ఇందీవర, దళ, నేత్ర!= నల్లకలువరేకులవంటి కన్నులు కలదానా!; నీపతిని= నీ భర్తను; రోయఁగన్= వెదకటానికై; భూ, దేవ+ఉత్తములన్= బ్రాహ్మణోత్తములను; పంచెదన్= నియోగిస్తాను; నావుడున్= అని చెప్పగా; భీమ, నందన= భీముడి పుత్రిక అయిన దమయంతి; నెమ్మిన్= ప్రీతితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: 'నల్లకలువరేకులవంటి కన్నులు కలదానా! నీవు నాదగ్గర ఉండుము. నీ భర్తను వెదకటానికై బ్రాహ్మణోత్తములను పంపగలను'- అని రాజమాత పలుకగా, సంతోషించి దమయంతి ఇట్లా చెప్పింది.

వ. 'ఏను సైరంధ్రి నయి యుండియు నుచ్ఛిష్టంబు ముట్టను; బదధావనంబు సేయను; బరపురుషులతోఁ బలుక నోపఁ; బతి నన్వేషించు పొంటె నరిగెడు బ్రాహ్మణులతోఁ బలుకుదు; నట్లయిన నీయొద్ద నుండుదు; నొండు విధంబైన నుండనేర' ననిన 'నీకిష్టం బైన విధంబున నాయొద్దన యుండు' మని దాని నతిగౌరవంబునం జేకొని యుండఁ దనకూఁతు సునంద యనుదాని సమర్పించిన. 121

ప్రతిపదార్థం: ఏను=నేను; సైరంధ్రిన్+అయి+ఉండియున్= నేను పరిచారిక నయి ఉన్నప్పటికీన్నీ; ఉచ్ఛిష్టంబు= ఎంగిలి; ముట్టను= తాకను; పద, ధావనంబు, చేయను= కాళ్ళు పిసుకను (కడగను); పరపురుషులతోన్= ఇతరులైన మగవారితో; పలుకన్+ఓపన్= మాటాడజాలను; పతిన్= భర్తను; అన్వేషించుపొంటెన్= వెతకటం కొరకు; అరిగెడు= వెళ్ళే; బ్రాహ్మణులతోన్= విప్రులతో; పలుకుదున్= మాటాడతాను; అట్లు+అయినన్= ఆ రీతిగా అయితే; నీ+ఒద్దన్= నీ దగ్గర; ఉండుదున్= ఉంటాను; ఒండు, విధంబు+ఐనన్= ఇంకొక పద్ధతి అయితే; ఉండనేరను= ఉండజాలను; అనిన్= అని చెప్పగా; నీకు+ఇష్టంబు+ఐన, విధంబునన్= నీకు సమ్మతమైన రీతిగానే; నా+ఒద్దన= నా కడనే; ఉండుము; అని= అని చెప్పి; దానిన్= ఆమెను (దమయంతిని); అతి, గౌరవంబునన్= మిక్కుటమైన మన్ననతో; చేకొని+ఉండన్= చేర్చుకొని ఉండేటట్లుగా; తన, కూఁతు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తన పుత్రిక అయిన; సునంద+అను, దానిన్= సునంద అనే పేరుకలదానిని; సమర్పించినన్= ఇవ్వగా (అంటే సునందను దమయంతిని గూర్చిన రక్షణలో ఉండేటట్లు నియమించగా.)

తాత్పర్యం: 'నేను సైరంధ్రివృత్తిలో ఉన్నప్పటికీ ఎంగిలి తినను. కాళ్ళు పిసకటం వంటి పనులు చేయను. నాభర్తను అన్వేషించటానికి వెళ్ళే బ్రాహ్మణులతో తప్ప ఇతర పురుషులతో మాటాడను. ఆవిధంగా నీ వంగీకరిస్తేనే నీ దగ్గర ఉండగలను' అని దమయంతి చెప్పగా 'నీ ఇష్టం వచ్చిన తీరున ఉండవచ్చు' నని రాజమాత అంగీకరించి, ఆమెను తన కూతురు సునందకు అప్పగించింది.

విశేషం: సైరంధ్రి అంటే -- 'సీరాణాం సమూహం-సైరమ్-తత్ ధరతీతి సైరంధ్రీ'- అనే అర్థం ప్రసిద్ధం. తెర చీరల గుంపును ధరించేది సైరంధ్రి అని భావం. ఆమె లక్షణాలనుగురించిన శ్లోకం - "చతుష్షష్టి కలాభిజ్ఞా, శీలరూపాది సేవినీ। ప్రసాధనోపచారజ్ఞా, సైరంధ్రీ పరికీర్తితా॥". అరవైనాలుగు కళలలో పండితురాలు, శీలం రూపం కలది, వస్త్రాది అలంకరణలు చేసే ఉపచారాలలో బాగా నిపుణురాలు. అటువంటి స్త్రీని సైరంధ్రి అంటారు. విరాటపర్వంలో ద్రౌపది విరటుడి రాణియైన సుదేష్ణవద్ద సైరంధ్రిగా చేరిన సన్నివేశం ఇట సంవదించేది. ద్రౌపదికి ఒరవడి పెట్టినది దమయంతియే. ద్రౌపది ధర్మరాజుతోపాటు బృహదశ్వమహర్షి చెప్పిన నలచరిత్ర విని ఉండింది కదా!

క. అలయక పుణ్యవ్రతములు । సలుపుచుఁ జేదీశుపురిని సైరంధ్రి యనన్
నలుదేవి యుండె నెదఁ బతిఁ । దలఁచుచు దుస్సహవియోగతాపార్దితయై. 122

ప్రతిపదార్థం: అలయక= అలసటచెందక; పుణ్యవ్రతములు= పుణ్యాన్నిఒసగే నోములు; చలుపుచున్= చేస్తూ; చేది+ఈశు, పురిని= చేది దేశపు రాజధాని నగరంలో; ఎదన్= మనస్సులో; పతిన్= భర్తను; తలఁచుచున్= స్మరిస్తూ; దుస్సహ, వియోగ, తాప+అర్దిత+ఐ= భరించరాని (భర్త) ఎడబాటువలన ఏర్పడిన దుఃఖంచేత పీడించబడినదై; నలుదేవి= నలుడి పట్టపురాణి; ఉండెన్= ఉండింది.

తాత్పర్యం: నలుడి పట్టపురాణియైన దమయంతి అలయకుండా పుణ్యప్రదమైన నోములు నోస్తూ, భర్తనే హృదయంలో ధ్యానిస్తూ, భరించరాని వియోగదుఃఖంతో బాధపడుతూ సైరంధ్రిగా చేదిభూపతిపురంలో ఉండింది.

వ. అట నలుండు దమయంతిం బాసి దారుణారణ్యంబులో నరుగువాఁడు ముందట. 123

ప్రతిపదార్థం: అటన్= అచట; నలుండు; దమయంతిన్+పాసి= దమయంతిని ఎడబాసి; దారుణ+అరణ్యంబులోన్= భయంకరమైన అడవిలో; అరుగువాఁడు= వెళ్ళేవాడు; ముందట= తనముందు.

తాత్పర్యం: అచట నలుడు దమయంతిని విడిచిపెట్టి అడవిలో వెళ్ళుతున్నాడు. అంతట అతడు తనముందట.

చ. అవిరళ విస్ఫులింగ నివహంబుల నభ్రపథంబు నంటుచున్
దవదహనం బుదగ్రతరుదాహము సేయుచు నున్నఁ జూచి మా
నవపతి దాని యంతరమునన్ వినియెన్ 'నరనాథ! నన్ను గా
రవమునఁ గావ వేగ యిట ర' మ్మను నార్తమహానినాదమున్. 124

ప్రతిపదార్థం: అవిరళ, విస్ఫులింగ, నివహంబులన్= ఎడతెగని నిప్పురవ్వల సమూహాలతో; అభ్ర, పథంబున్= ఆకాశమార్గాన్ని; అంటుచున్= తాకుతూ; దవ దహనంబు= దావాగ్ని; ఉదగ్ర, తరు, దాహము, చేయుచున్+ఉన్నన్+చూచి= పెద్దపెద్ద చెట్లను దహించి వేస్తుండటం చూచి; మానవ, పతి= రాజు (నలుడు); దాని+అంతరమునన్= ఆ అగ్నిమధ్యంలో; నరనాథ!= ఓ మహారాజా!; నన్ను, గారవమునన్+కావన్= నన్ను మన్ననతో కాపాడటానికై; వేగ= వేగంగా; ఇటన్= ఇచటకు; రమ్ము= రావలసింది; అను= అనేటి; ఆర్త, మహా, నినాదమున్= దుఃఖపూరితమైన గొప్పకేకను; వినియెన్= విన్నాడు.

తాత్పర్యం: ఎడతెగని నిప్పురవ్వల దొంతరలు ఆకాశమార్గాన్ని అంటుతూ పెద్దపెద్ద చెట్లను సైతం దహించివేస్తున్న దావాగ్నిని చూచి, ఆ దావాగ్ని మధ్యంలోనుండి 'ఓ మహారాజా! నన్ను మన్ననతో రక్షించటానికి ఇచటకు వేవేగ రమ్ము' అనే ఆర్తనాదం విన్నాడు.

క. విని శంకింపక చెచ్చెర। ననఘుం డత్యుగ్రతర దవానలమధ్యం
బున కుఱికి కనియె దీనా। ననుఁ గుండలితాంగు నొక్క నాగకుమారున్. 125

ప్రతిపదార్థం: విని= ఆ ఆర్తనాదం విని; శంకింపక= సందేహించక; చెచ్చెరన్= వేగంగా; అనఘుండు= పాపరహితుడు; అతి+ఉగ్రతర, దవ+అనల మధ్యంబునకు= మిక్కిలి తీక్షణమైన దావాగ్ని మధ్యంలోకి; ఉఱికి= దూకి; దీన+ఆననున్= భీతిచెందిన మొగం కలవాడిని; కుండలిత+అంగున్= చుట్టుకొనబడిన దేహం కలవాడిని; ఒక్క, నాగకుమారున్= ఒక పాముకొడుకును; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: పుణ్యాత్ముడైన నలుడు ఆ దీనధ్వని విని, సందేహించక వేగంగా ఆ దావాగ్ని మధ్యంలోకి ఉరికాడు. ఆ అగ్నిమధ్యంలో నిరాశతో క్రుంగిన మొగంకలవాడు, చుట్టలు చుట్టలుగా శరీరాన్ని ముడుచుకొని భయపడుతున్న వాడైన ఒక నాగకుమారుడిని చూచాడు.

వ. అన్నాగకుమారుండును నలునకుం గృతాంజలియై 'యేను గర్కోటకుం డనువాఁడ; గర్మవశంబున నొక్క బ్రహ్మఋషి నుపాలంభించి తచ్ఛాపంబున నెక్కడం గదలనేరకున్నవాఁడ; నియ్యెరగలి చిచ్చు సర్వజీవులకు సంహారకారణంబై పేర్చి నలుదెసలం గలయం బర్వి చనుదెంచుచున్నయది; యీ యపాయంబు దలఁగు నట్లుగా నుద్ధరింపవలయు; నీవు కరుణాత్మకుండవు గావున నిన్ను వేడెద. 126

ప్రతిపదార్థం: ఆ+నాగ, కుమారుండును= ఆ పాప బుడుతడును; నలునకున్; కృత+అంజలి+ఐ= చేసిన నమస్కృతి కలవాడై; ఏను= నేను; కర్కోటకుండు+అనువాఁడన్= కర్కోటకుడు అనే పేరుగలవాడను; కర్మ, వశంబునన్= చేసిన కర్మవలన; ఒక్క, బ్రహ్మ+ఋషిన్= బ్రహ్మజ్ఞాని అయిన ఒక మునిని; ఉపాలంభించి= నిందించి; తద్+శాపంబునన్= అతడి శాపంచేత; ఎక్కడన్= ఎచటికి; కదలనేరక+ఉన్నవాఁడన్= సంచరించలేక ఉన్నవాడిని; ఈ+ఎరగలి, చిచ్చు= ఈ కార్చిచ్చు (దావాగ్ని); సర్వజీవులకున్= సకల ప్రాణులకు; సంహార, కారణంబు+ఐ= మరణ కారకమై; పేర్చి= అతిశయించి; నలుదెసలన్+ కలయన్+పర్వి= నాలుగుదిక్కులు కలిసేటట్లు వ్యాపించి; చనుదెంచుచున్న+అది= వస్తున్నది; ఈ+అపాయంబు= ఈ కీడు; తలఁగునట్లుగాన్= తొలగిపోయేటట్లుగా; ఉద్ధరింపవలయున్= నన్ను కాపాడాలి; ఈవు= నీవు; కరుణా+ఆత్మకుండవు= దయకలవాడివి; కావున= కాబట్టి; నిన్ను; వేడెదన్= ప్రార్థిస్తాను.

తాత్పర్యం: ఆ నాగకుమారుడు నలుడికి నమస్కరించి, 'నాపేరు కర్కోటకుడు. కర్మవశాన ఒక బ్రహ్మర్షిని నిందించి ఆతడి శాపంవలన కదలనేరక పడిఉన్నాను. ఈ దావాగ్ని సకలప్రాణికోటికి మృత్యుకారణమై అన్నివైపుల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విజృంభిస్తున్నది. ఈ కీడునుండి నీవు నన్ను కాపాడ వేడుకొంటున్నాను. నీవు దయామయుడివి. దయచేసి నన్ను రక్షించుము' అన్నాడు.

క. నాలుగుదిశలను దావ । జ్వాలావలి గవిసె; వ్రుంది చానోప; మహీ
పాలక! న న్నొక సరసీ । కూలముఁ జేరంగ నెత్తికొని పొమ్ము దయన్. 127

ప్రతిపదార్థం: నాలుగు, దిశలను= నాలుగుదెసల; దావ, జ్వాలా+ఆవలి= కార్చిచ్చు మంటల వరుసలు; కవిసెన్= సమీపించాయి (వ్యాపించాయి); వ్రుంది= కాలి (నొచ్చి); చాన్+ఓపన్= చనిపోజాలను; మహీపాలక!= ఓ మహారాజా!; నన్ను, ఒక, సరసీ, కూలమున్= నన్నొక సరస్సుయొక్క ఒడ్డుకు; చేరంగన్= చేరేట్లు; దయన్= దయతో ఎత్తికొని; పొమ్ము= మోసికొని తీసుకొని వెళ్ళుము.

తాత్పర్యం: 'ఓ మహారాజా! ఈ కారు చిచ్చుమంటలు నాలుగుదిక్కులా క్రమ్ముకొని సమీపించాయి. ఈ మంటలలో కాలి చనిపోజాలను. కావున, దయతో నన్ను ఎత్తుకొని ఒక చల్లని సరోవరతీరం చేర్చుము.

నలుఁడు కర్కోటకునిచేత దష్టుం డగుట (సం. 3-63-7)

వ. నన్ను రక్షించిన నీకుం బ్రియంబు సేయ నోపుదు' ననిన వాని నెత్తికొని పోవం జులుక నై యంగుష్ఠ ప్రమాణ దేహుండైయున్న నెత్తికొని, నలుం డతిత్వరితగతి నరిగి తాపవర్జితంబైన యొక్క సరోవర సమీపంబున విడువం బోయిన 'నింకను బదియడుగు లరుగుము నీకు శ్రేయఃప్రాప్తిఁ జేసెద ననిన నడుగు లెన్నికొనుచు నరిగి పదియగు నడుగునప్పు డప్పాముచేత దష్టుండై తనరూపంబు విడిచి వికృతరూపంబుతో నున్న నన్నలునకుం గర్కోటకుం డాత్మరూపంబు సూపి యిట్లనియె 'నయ్యా! నీవు నా చేత విషపీడితుండ నైతి నని దుఃఖింపవలదు; ని న్నొరు లెఱింగిన నెగ్గగుం గావున వికృతశరీరుం జేసితి; నెంతకాలంబు నీ శరీరంబున నా విషం బుండు నంతకాలంబును నీకు విషోరగ రాక్షస పిశాచ శత్రునివహంబువలని భయంబు లేదు; సర్వ సంగ్రామజయంబును భార్యాసంగమంబును నెప్పటిరాజ్యవిభవంబును నగు; నీ కెప్పుడేని నిజరూపంబు సేకొన నిష్టం బయ్యె నప్పుడ నన్నుం దలంపు; మీ వస్త్రంబు నీయొద్దకు వచ్చు; దీని ధరియించుడు నిజరూప ప్రాప్తి యగు' నని వరం బిచ్చి వెండియు నిట్లనియె. 128

ప్రతిపదార్థం: నన్ను; రక్షించినన్= కాపాడితే; నీకున్= నీకు; ప్రియంబు= మేలు; చేయనోపుదున్= చేయగలను; అనినన్= అని చెప్పగా; వానిన్= ఆ కర్కోటకుడిని; ఎత్తికొని పోవన్= మోసికొనిపోవటానికి; చులుకనై+అంగుష్ఠ, ప్రమాణ, దేహుండై= తేలికఅయి బొటనవ్రేలంత కొలత గల శరీరం కలవాడై; ఉన్నన్= ఉండగా; ఎత్తికొని= లేవదీసి తన మూపుపై పెట్టుకొని; అతి, త్వరిత, గతిన్= మిక్కిలి వేగం గల నడకతో; అరిగి= వెళ్ళి; తాప వర్జితంబు+ఐన= వేడి లేనిదైన; ఒక్క, సరోవర, సమీపంబునన్= ఒక సరస్సు దగ్గరగా; విడువన్+పోయినన్= విడిచిపెట్టటానికి సిద్ధం కాగా; ఇంకను= ఇంకా అదనంగా; పది, అడుగులు+అరుగుము= పదిఅడుగులు వెళ్ళుము; నీకు, శ్రేయస్+ప్రాప్తిన్+చేసెదన్= నీకు మేలుకలిగేట్లు చేస్తాను; అనినన్= అనిచెప్పగా; అడుగులు+ఎన్నుకొనుచున్= అడుగులు లెక్కపెట్టుకొంటూ; అరిగి= వెళ్ళి; పది+అగు+అడుగు+అప్పుడు= పదవ అడుగు వేసేటప్పుడు; ఆ+పాముచేత; దష్టుండు+ఐ= కరువబడినవాడై; తన రూపంబు= తన ఆకారం; విడిచి= వీడి; వికృత రూపంబుతోన్= వికారమైన ఆకారంతో; ఉన్నన్; ఆ+నలునకున్; కర్కోటకుండు; ఆత్మ, రూపంబు+చూపి= తన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిజస్వరూపం ప్రదర్శించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అయ్యా!= ఆర్యా!; నీవు, నా, చేత; విష. పీడితుండను+ఐతిని+అని= విషంచేత బాధించబడినవాడిని అయ్యానని; దుఃఖింపవలదు= పరితపించవద్దు; నిన్ను+ఒరులు= నిన్ను ఇతరులు; ఎఱింగినన్= తెలిసికొంటే; ఎగ్గు+అగున్+కావునన్= కీడు కలుగుతుంది కనుక; వికృత శరీరున్+చేసితిన్= వికారమైన దేహం కలవాడినిగా చేశాను; ఎంతకాలంబు= ఎంతకాలం; నీ, శరీరంబునన్= నీ శరీరంలో; నా, విషంబు+ఉండున్= నా విషం ఉంటుందో; అంత, కాలంబును= అన్నినాళ్ళును; నీకు; విష+ఉరగ, రాక్షస, పిశాచ, శత్రు, నివహంబు, వలని= విషసర్పాలనుండి, రాక్షసులనుండి, దయ్యాలనుండి, విరోధుల సముదాయంనుండి; భయంబు లేదు; సర్వ, సంగ్రామ, జయంబును= అన్ని యుద్ధాలలో గెలుపున్నూ; భార్యా, సంగమంబునున్= భార్యతో కలయికయున్నూ; ఎప్పటి, రాజ్య, విభవంబునున్= మునుపటి రాజ్యంయొక్క వైభవం(సంపద) లభించటమున్నూ; అగున్= కలుగుతాయి; నీకు+ఎప్పుడు+ఏని= నీకు ఏ సమయంలోనైనా; నిజరూపంబు= అసలైన ఆకారం; చేకొనన్+ఇష్టంబు+అయ్యెన్= స్వీకరించ కోరిక కలిగితే; అప్పుడు+అ= ఆ క్షణంలోనే; నన్నున్+తలంపుము= నన్ను స్మరించుము; ఈ, వస్త్రంబు= ఈ ఉత్తరీయం; నీ+ఒద్దకున్= నీ దగ్గరకు; వచ్చున్= చేరుతుంది; దీని; ధరియించుడు= ఈ వస్త్రాన్ని ధరించగానే; నిజ, రూప, ప్రాప్తి+అగున్= అసలు ఆకారం ఏర్పడుతుంది; అని; వరంబు+ఇచ్చి= వరాన్ని అనుగ్రహించి; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'నన్ను రక్షించుము. నీకు మేలు చేస్తాను' అని కర్కోటకుడు కోరగా, నలుడు వాడిని ఎత్తుకొన్నాడు. కర్కోటకుడు అప్పుడు బొటనవ్రేలి కొలతకు సరిపోయే దేహం కలవాడై ఎత్తుకొనటానికి సులువుగా మారాడు. నలుడు ఆ కర్కోటకుడిని ఎత్తుకొని, త్వరగా వెళ్ళి చల్లని ఒక సరోవరం సమీపంలో విడవటానికి ప్రయత్నించగా, అతడు మరి పదిఅడుగులు వేయుమనిన్నీ, తాను నలుడికి శ్రేయస్సును చేకూర్చుతా ననిన్నీ చెప్పాడు. అంతట నలుడు లెక్కపెట్టుకొంటూ అడుగులు వేస్తున్నపుడు పదవఅడుగు వేసేటప్పటికి కర్కోటకుడు అతడిని కాటు వేశాడు. సర్పదష్టుడైన (కరవబడిన) నలుడు వికృతరూపుడు అయినాడు. కాని, కర్కోటకుడు నలుడికి తన నిజరూపాన్ని చూపి ఇట్లా చెప్పాడు: 'ఆర్యా! నీవు నాచేత కరవబడినందుకు విచారించకుము. ఇప్పుడు నీవు వికృతరూపుడ వవటమే నీకు మేలు. నిన్ను ఎవరైనా గుర్తిస్తే నీకే కీడు. నా విషం నీ శరీరంలో ఉన్నంతకాలం నీకు విషసర్పాలభయం గాని, పిశాచ రాక్షస భీతిగాని, శత్రుభయం గాని ఉండదు. నీకు అన్ని యుద్ధాలలో విజయం కలుగుతుంది. భార్యాసంగమం కలుగుతుంది. పూర్వపు రాజ్యసంపద తిరిగి లభిస్తుంది. నీకు ఎప్పుడు అసలు ఆకృతి కావాలని అనిపిస్తుందో ఆ క్షణం నీ తొల్లిటి ఆకృతి నీకు లభించగలదు. అప్పుడు నన్ను స్మరిస్తే చాలు. నీ దగ్గరకు ఈ వస్త్రం వస్తుంది. ఈ వస్త్రాన్ని కప్పుకొనగానే నీకు అసలు రూపం సంప్రాప్తం అవుతుంది' - అని వరమిచ్చి ఇంకా ఇట్లా పలికాడు.

విశేషం: ఇందులో ప్రస్తావించబడిన అంశాలు: 1. సర్పవిషంచేత వికృతరూపం సంప్రాప్తించటం 2. ఆ విషం విరిగిన పిమ్మట తిరిగి తొల్లిటి రూపం సంప్రాప్తించటం, ఇది కేవలం కవితాకల్పన కాదని అనేవారున్నారు. ఇది భావిపరిశోధనవలన తేలవలసిన అంశం. 3. కర్కోటకపాత్రకు భారతదేశంలో వచ్చిన ప్రాముఖ్యం నిరుపమానం. మేలు చేసిన వాడికి వెనువెంటనే కీడుచేసేవాడికి కర్కోటక శబ్దం పర్యాయపదమైంది. కాని, ఇక్కడ నలుడికి కర్కోటకుడు 'కీడు' రూపంలో 'మేలు' చేశాడు.

మధ్యాక్కర.

'ఇలఁ బ్రసిద్ధుఁడు ఋతుపర్ణుఁ డనెడు మహీశుఁ డిక్ష్వాకు
కులజుండు నీకు సేవ్యుం డగు; నతనిఁ గొలిచి యం దుండు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నెలకొని యతనికి నశ్వహృదయ మనెడి విద్య యిచ్చి,
వెలయ నతనిచేత నక్షహృదయ మ న్విద్యఁ జేకొనుము. 129

ప్రతిపదార్థం: ఇలన్= భూమిలో; ప్రసిద్ధుఁడు= పేరుకెక్కినవాడు; ఋతుపర్ణుఁడు+అనెడు= ఋతుపర్ణుడనే; మహీ+ ఈశుఁడు= భూభర్త(మహారాజు); ఇక్ష్వాకు, కులజుండు= ఇక్ష్వాకువంశంలో పుట్టినవాడు; నీకు, సేవ్యుండు+అగున్= నీకు సేవింపదగినవాడు అవుతాడు; అతనిన్+కొలిచి= అతడిని సేవించి; అందు+ఉండు= అచట ఉండుము; నెలకొని= అచట ఉండి; అతనికిన్; అశ్వ, హృదయము+అనెడి, విద్య= అశ్వహృదయం, అంటే గుర్రాల స్వభావం తెలిసికొనే విద్య; ఇచ్చి= అతనికి నేర్పి; వెలయన్= ఒప్పేటట్లుగా; అతనిచేతన్= అతడినుండి; అక్ష, హృదయము, అన్, విద్యన్= అక్షహృదయం (అంకగణిత రహస్యం తెలిసికొనటం) అనే విద్యను; చేకొనుము= స్వీకరించుము.

తాత్పర్యం: 'ఋతుపర్ణుడనే మహారాజు భూమండలంలో సుప్రసిద్ధుడు, ఇక్ష్వాకువంశంలో పుట్టినవాడు. అతడు నీచేత కొలువదగినవాడు. కాబట్టి, నీవు అతడిని సేవిస్తూ ఉండవలసింది. అతడికి నీ అశ్వహృదయవిద్యను ఉపదేశించి, నీవు అతడినుంచి అక్షహృదయవిద్యను స్వీకరించుము.

విశేషం: ఈ పద్యం పెక్కు వ్రాతప్రతులలో పెక్కురీతుల కన్పిస్తున్నది. వృత్తలక్షణానికి ఈ ఆశ్వాసంలోని 22వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.

వ. మఱియు బాహుకుం డను నామంబుతో సూతవృత్తి నుండు' మని హితోపదేశంబు సేసి కర్కోటకుం డదృశ్యుం డైనఁ, దద్వచనంబున నలుం డయోధ్యాపురంబునకుం జని ఋతుపర్ణుం గని 'యేను బాహుకుం డనువాఁడ నశ్వశిక్షయందుఁగుశలుండ; నన్నసంస్కారంబులు శిల్పంబులుఁబెక్కువిధంబులరచియింప నేర్తు; భవత్సేవార్థినై వచ్చితి' ననిన ఋతుపర్ణుం డిట్లనియె. 130

ప్రతిపదార్థం: మఱియు= అంతేకాక; బాహుకుండు+అను, నామంబుతోన్= బాహుకుడనే పేరుతో; సూత, వృత్తిన్+ఉండుము= రథచోదకుడివిగా ఉండుము; అని; హిత+ఉపదేశంబు= హితవు చెప్పటం; చేసి; కర్కోటకుండు; అదృశ్యుండు+ఐనన్= అంతర్ధానం చెందగా; తద్+వచనంబునన్= అతడిమాట చొప్పున, అంటే కర్కోటకుడి వాక్యానుసారం; నలుండు; అయోధ్యా, పురంబునకున్+చని= అయోధ్యాపట్టణానికి వెళ్ళి; ఋతుపర్ణున్+కని= ఋతువర్ణుడిని చూచి; ఏను= నేను; బాహుకుండు+అనువాఁడన్= బాహుకుడనేవాడిని; అశ్వ, శిక్ష+అందున్= గుర్రాలపెంపకంలో; కుశలుండన్= నేర్పరిని; అన్న, సంస్కారంబులు= వంటలుచేయటం; శిల్పంబులున్= విగ్రహాలను రూపొందించటం; పెక్కువిధంబులన్= ఎన్నోరీతులలో; రచియింపనేర్తున్= కూర్చగలను; భవత్+సేవా+అర్థిని+ఐ= నీ దగ్గర కొలువుచేయటానికై; వచ్చితిన్= అరుదెంచాను; అనినన్= అని చెప్పగా; ఋతుపర్ణుండు+ ఇట్లు+అనియెన్= ఋతుపర్ణుడు ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: మరియు బాహుకుడు అనే పేరు పెట్టుకొని రథసారథివిగా ఉండు'- మని హితవు చెప్పి కర్కోటకుడు మాయమయ్యాడు. ఆ కర్కోటకుడి వచనానుసారం నలుడు అయోధ్యాపురికి వెళ్ళి ఋతుపర్ణుడిని సందర్శించి, 'నేను బాహుకుడనే వాడిని. అశ్వశిక్షలో నేర్పరిని. పాకకళలో నిపుణుడిని. శిల్పవిద్యా నిష్ణాతుడిని; నీ దగ్గర సేవ చేయటానికి వచ్చాను' - అని చెప్పగా ఆతడితో ఋతుపర్ణుడు ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'నాయొద్ద నుండుదేని మ । దీయ రథాశ్వములకును ద్రుతిని శీఘ్రముగాఁ
జేయుము' నావుడు 'నట్టుల । చేయుదు' నని నలుఁడు వాని సేవించెఁ దగన్. 131

ప్రతిపదార్థం: నా+ఒద్దన్= నా కడ; ఉండుదు+ఏని= ఉన్నట్లయితే; మదీయ, రథ+అశ్వములకును= నా రథానికి పూన్చే గుర్రాలకు; ద్రుతిని= నడకను; శీఘ్రముగాన్= వేగమయ్యేటట్లు; చేయుము; నావుడున్= అనగా విని; అట్టుల= ఆ విధంగానే; చేయుదును+అని= చేస్తానని; నలుఁడు; వాని= అతడిని (ఋతుపర్ణుడిని); తగన్= ఒప్పునట్లుగా; సేవించెన్= కొలిచాడు.

తాత్పర్యం: 'నీవు నా ఒద్ద ఉన్నట్లయితే నా రథాశ్వాల గమనాన్ని వేగంచేసి తీర్చిదిద్దుము' అని ఋతుపర్ణుడు చెప్పగా 'అట్లాగే చేస్తాను' అని నలుడు ఆతడి కొలువులో చేరాడు.

వ. ఇట్లు ఋతుపర్ణునొద్దనశ్వాధ్యక్షుండయి దుష్టాశ్వంబుల వశంబుఁజేయుచు, నశ్వారోహకుల నారోహణంబుల శిక్షించుచు, రసవంతంబుగ నన్నసంస్కారంబు సేయుచు, ఋతుపర్ణుచేత నియుక్తు లయిన వార్ష్ణేయ జీవలులు దనకు సహాయులుగాఁ బ్రచ్ఛన్నుండై యుండి యొక్కనాఁడు. 132

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ఋతుపర్ణు+ఒద్దన్= ఋతుపర్ణుడి దగ్గర; అశ్వ+అధ్యక్షుండు+అయి= గుర్రాలకు అధినేత అయి; దుష్ట+అశ్వంబులన్= చెడ్డగుర్రాలను; వశంబున్+చేయుచున్= లొంగదీస్తూ; అశ్వ+ఆరోహకులన్= రౌతులను; ఆరోహణంబులన్= గుర్రాలపై స్వారీలు చేయటంలో; శిక్షించుచున్= నేర్పుతూ; రసవంతంబుగన్= రుచికరంగా; అన్న, సంస్కారంబు+చేయుచున్= ఆహార పదార్థాలను వండుతూ; ఋతుపర్ణు, చేత= ఋతుపర్ణుడిచేత; నియుక్తులు+అయిన= నియమించబడిన వారయిన; వార్ష్ణేయ, జీవలులు= వార్ష్ణేయుడు, జీవలుడు; తనకు, సహాయులు+కాన్= తనకు తోడ్పడేవారు కాగా; ప్రచ్ఛన్నుండు+ఐ= ఇతరులకు తెలియనట్టివాడై; ఉండి; ఒక్కనాఁడు= ఒకానొక రోజున.

తాత్పర్యం: ఈ విధంగా నలుడు ఋతుపర్ణుడి దగ్గర గుర్రాలకు అధినేత అయ్యాడు. అతడు చెడుగుర్రాలను లొంగదీసేవాడు. రౌతులకు స్వారి చేయటం నేర్పేవాడు. అంతేకాక, రుచికరాలైన ఆహారపదార్థాలు వండి వడ్డించేవాడు. ఋతుపర్ణుడిచేత నియోగించబడిన వార్ష్ణేయ జీవలులు నలుడికి తోడ్పడేవారు. ఈ విధంగా నలుడు అజ్ఞాతవాసం చేశాడు. ఒకనాడు.

సీ. 'ఇభరాజగమన! నీ వెందుల కరిగి? త । త్యురుకుచభార! యెందున్నదాన?
వబల! యెవ్వరిచేత నడవులలోఁ బట్టు । వడి? తశనాపేక్షఁ బఱచుచున్న
యుగ్రమృగంబుల యుదరంబులో నున్న । దానవే? నీ తల్లిదండ్రులొద్ద
ధృతి నున్న దానవే? దేశాంతరంబుల । నున్న దానవె?' యంచు నుదితమదన

ఆ. హతి విమోహితాత్ముఁడై హృదయేశ్వరిఁ । దలఁచి రాత్రు లెల్లఁ దాపమునను
నిద్రలేక వంది నిట్టూర్పు లూర్చుచు । నుండె నలుఁడు శోక ముత్కటముగ. 133

ప్రతిపదార్థం: ఇభరాజ, గమన!= (ఓ దమయంతీ!) (ఇభ= ఏనుగు, ఇభరాజము= మదపుటేనుగు, ఇభరాజగమన= మదపుటేనుగునడకవంటి నడక గలది); నీవు; ఎందులకు+అరిగితి= ఎక్కడికి వెళ్ళావు?; అతి+ఉరు, కుచ, భార= మిక్కిలి పెద్దవైన స్తనాలయొక్క భారంగలదానా!; ఎందు+ఉన్నదానవు= ఎచట ఉన్నావు?; అబల= బలంలేని మగువా! (అబల-సాధారణ స్త్రీ వాచకంగా గ్రహించాలి); ఎవ్వరిచేతన్= ఎవరిచేత; అడవులలోన్= అరణ్యాలలో; పట్టు+పడితి= పట్టుబడి ఉన్నావు, అంటే

నిన్ను అరణ్యాలలో ఎవరు పట్టుకొన్నారు?; అశన+అపేక్షన్= ఆహారం కొరకై; పఱచుచున్న= వడిగా తిరుగాడుతున్న; ఉగ్ర మృగంబుల= క్రూరజంతువుల; ఉదరంబులోన్= పొట్టలో; ఉన్నదానవే?; నీ తల్లిదండ్రుల+ఒద్ద= నీ జననీజనకుల కడ; ధృతిన్= ధైర్యంతో; ఉన్నదానవే?; దేశాంతరంబులన్= ఇతరప్రదేశాలలో; ఉన్నదానవె? = నివసిస్తున్నావా!; అంచున్= అంటూ; ఉదిత, మదన, హతిన్= ఉదయించిన మన్మథ తాపంచేత; విమోహిత+ఆత్ముండు+ఐ= మిక్కుటమైన మోహంచేత ఆవరించబడిన ఆత్మకలవాడై; హృదయ+ఈశ్వరిన్+తలఁచి= ప్రేయసి అయిన దమయంతినిగురించి తలపోసి; రాత్రులు+ఎల్లన్= రేలు అన్నింటిలో; నిద్రలేక; తాపమునను= బాధచేత; వంది= దుఃఖించి; నిడు+ఊర్పులు+ఊర్చుచున్= దీర్ఘనిశ్వాసాలు వెలికి విడుస్తూ; శోకము+ఉత్కటముగన్= పరితాపం అతిశయించగా; నలుఁడు= ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: 'మత్తేభంనడక వంటి నడక గలదానా! (దమయంతీ!), నీవు ఎక్కడికి వెళ్ళావోకదా! మిక్కిలి పెద్దవైన స్తనాల బరువు గలదానా ఎక్కడ ఉన్నావో? ఓ అబలా! అడవులలో నీవు ఎవరిచేత పట్టువడ్డావో? ఆహారంకొరకు వడిగా తిరుగుతున్న క్రూర జంతువుల పొట్టలలో ఉన్నావా? నీ తల్లిదండ్రుల ఒద్ద దిటవుగా ఉన్నావా? లేక వేరే ప్రదేశాలలో ఉన్నావా?' అంటూ మదనతాపంతో రాత్రులలో నిదురలేక పలవిస్తూ నిట్టూర్పులు విడుస్తూ మిక్కిలి పరితపిస్తూ నలుడు ఉన్నాడు.

వ. అతని ప్రలాపంబు విని యొక్కనాఁడు జీవలుం డాత్మగతంబున. 134

ప్రతిపదార్థం: అతని= ఆతడి, అంటే బాహుకుడి; ప్రలాపంబు= పలవింత; విని= ఆలకించి; ఒక్కనాఁడు= ఒకానొకరోజున; జీవలుండు= జీవలుడు; ఆత్మగతంబునన్= తనలోతాను.

తాత్పర్యం: ఆ బాహుకుడి పలవింతలు విని ఒకనాడు జీవలుడు తనలో తాను.

క. 'అఱపొఱడు కుఱుచ చేతులు, । నొఱవ శరీరంబుఁ గలిగి యొరులకుఁ జూడం
గొఱగా కుండియు, మన్మథు । నొఱపులఁ బడియెడు నితండు యువతీప్రియుఁడై. 135

ప్రతిపదార్థం: అఱ, పొఱడు, కుఱుచ, చేతులున్= సగం గూనితో పొట్టిచేతులున్నూ; ఒఱవ శరీరంబున్= వికారమైన దేహమున్నూ; కలిగి; ఒరులకున్= ఇతరులకు; చూడన్= చూడటానికి; కొఱగాక+ఉండియు= ప్రియం గాకుండ ఉండికూడా, అంటే చూడటానికి అసహ్యంగా ఉండికూడా; ఇతండు= ఇతడు (ఈ బాహుకుడు); యువతీప్రియుఁడు+ఐ= జవరాలిని ప్రేమించినవాడై; మన్మథు+ఒఱపులన్= మన్మథతాపంలో; పడియెడున్= పడుతున్నాడు (బాధపడుతున్నాడు).

తాత్పర్యం: 'ఈ బాహుకుడి చేతులా పొట్టివి. ఈ గూనివాడి దేహమా వంకరటింకర అయినట్టిది. ఇతరులకు చూడటానికి కూడ కొఱగానట్టిది. ఈ కురూపి ఒక జవరాలిని ప్రేమించటమా? ప్రేమించి మన్మథతాపంతో బాధపడటమా? ఎంత విడ్డూరం?

వ. వీనిచేతఁదలంపంబడియెడు వనిత వీనికంటె లెస్స కాకున్నె!' యనుచు బాహుకునొద్దకు వచ్చి 'నీ తలంచుచున్న భార్యకు, నీకు నేల వియోగం బయ్యె?' నని యడిగిన వానికి బాహుకుం డిట్లనియె.136

ప్రతిపదార్థం: వీనిచేతన్= ఈ బాహుకుడిచేత; తలంపన్+పడియెడు= స్మరించబడేటి; వనిత= మగువ; వీనికంటెన్= ఈ కురూపి అయిన బాహుకుడి కంటె; లెస్స= గొప్పది; కాక+ఉన్నె= కాకుండునా?; అనుచున్= అని ఆలోచిస్తూ; బాహుకు+ఒద్దకు=

బాహుకుడి దగ్గరకు; వచ్చి= అరుదెంచి; నీ తలంచుచున్న= నీవు స్మరిస్తున్న; భార్యకున్= పెండ్లానికి; నీకున్= నీకు; ఏల= ఎందుకు; వియోగంబు+అయ్యెన్= ఎడబాటు కలిగింది; అని= అంటూ; అడిగినన్= ప్రశ్నించగా; వానికిన్= ఆతడికి (ఆ జీవలుడికి); బాహుకుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆహా! వీడిచేత ప్రేమించబడిన వనిత వీడికంటె గొప్పది కాకుండా ఉంటుందా? ఈతడే ఇంత కురూపి అయితే ఇక ఆమె ఎంతటి కురూపిణి కావాలి?'- అంటూ జీవలుడు తలపోసి, బాహుకుడికడకు వచ్చి 'నీవు స్మరిస్తున్న నీ భార్యకూ నీకూ అసలు ఎడబాటు ఎందుకు కలిగింది?' అని ప్రశ్నించాడు. వాడికి బాహుకుడు ఇట్లా బదులు చెప్పాడు.

విశేషం: (1) బాహుకుడు ఒకనాడు జగదేకవీరుడు. భువనైక మోహనుడు. ఈనాడు ఒరులు చూడటానికి కొరగాని కురూపి. ఎంతటి మార్పు? ఎంతటి విధిపరిపాకం? సేవకవృత్తిలో ఉండే జీవలుడికి గూడ బాహుకుడిని చూస్తే జాలి కలుగలేదు సరిగదా అతడు ఈతడిని అపహాస్యం చేశాడుకూడా! (2) ఇక జీవలుడికి బాహుకుడి ప్రేయసినిగురించి ఏమి తెలియును? కాని, ఇట్టి కురూపి భార్య ఎంతటి కురూపిణి కావాలి?'- అనేదే అతడి ఆలోచన. కాని, నిజానికి బాహుకుడిభార్య జగదేకసుందరి. దేవతలు సయితం ఆమెను వలచి ఆమె పొందుకై ఉవ్విళ్ళు ఊరారు. అది విషయాంతరం. జీవలుడు కలలోకూడ ఇట్టి పరిణామం ఊహించుకోలేడు. నలదమయంతుల చరిత్రలో ఏర్పడిన 'మలుపు' చదువరుల గుండెలు కరిగింపచేసేటటువంటిది. కథాశిల్ప సౌష్ఠవంలో విశ్వసాహితీ జగత్తులో నలోపాఖ్యానానికి గల విశిష్టత నిరుపమానమైనది.

ఆ. 'నన్నుఁ జూచి నగరె? నలినాక్షి నా కేల? విప్రయోగ మేల? వినవె తొల్లి
యేలయొ యెఱుంగ నేను, మందప్రజ్ఞుఁ । డను భటుండు దన లతాంగిఁ బాసి. 137

ప్రతిపదార్థం: నన్నున్+చూచి, నగరె?= నన్ను చూచి జనులు నవ్వరా?; నలిన+అక్షి= పద్మాలవంటికన్నులు కలది (ప్రేయసి); నాకు+ఏల?= నాకెందుకు?; అంటే నాబోటి కురూపికి ఒక ప్రేయసి కావాలా? (కావాలంటే నన్ను చూచి ప్రజలు నవ్వరా?); (ఇక) విప్రయోగము+ఏల= విరహం ఎందుకు?; ఏలయో, ఎఱుంగన్+ఏను= ఎందుకో నాకేమి తెలుసు; తొల్లి= పూర్వం; వినవె= వినవా? మందప్రజ్ఞుఁడు+అను, భటుండు= మందప్రజ్ఞుడనే సైనికుడు; తన, లతా+అంగిన్+పాసి= తన లతవంటి దేహం కలిగిన ప్రేయసిని ఎడబాసి.

తాత్పర్యం: 'నన్ను చూచి నవ్వరా? నాకు ఒకప్రేయసి కూడానా? అసలు ప్రేయసే లేనప్పుడు ఇక వియోగం అనేమాట ఎందుకుంటుంది? నీవు వినలేదా? పూర్వకాలంలో ఏకారణంచేత జరిగిందో నాకు తెలియదు కాని, మందప్రజ్ఞుడు అనే సైనికుడు తనప్రేయసిని ఎడబాసి.

విశేషం: ఈ మాటలనుబట్టి బాహుకుడికి తనకు సంక్రమించిన వైరూప్యం తెలిసినట్లే అనిన్నీ, తనవైరూప్యాన్ని గురించి చుట్టూ ఉన్నవారికి సుస్పష్టంగా తెలిసి ఉన్నట్లుకూడ తాను గ్రహించినట్లున్నూ తేలుతున్నది. అయితే, ప్రత్యక్షంగా తన విరహవేదనను జీవలుడు గుర్తించాడుకదా! ఇక తా నెట్లా తప్పుకొనగలడు? నలుడు పోగొట్టుకొన్నది బాహ్యరూపమేకాని ఆంతరంగికమైన తెలివితేటలు మాత్రం కావుకదా! అందుచేత నలుడు సద్యఃస్ఫూర్తితో తన ప్రలాపం తనది కాదనీ, భార్యావియుక్తుడైన మందప్రజ్ఞుడి అభిభాషణాన్ని తాను కాలక్షేపంకొరకై అనుసరించా నని సమ్యక్సమాధానం చెప్పి తప్పించుకొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. దాని నన్వేషించి యెందునుం గానక దుఃఖితుండై ప్రలాపించినం దత్ప్రలాపం బేను ననుకరించితి' నని చెప్పి యి ట్లయోధ్యాపురంబునఁ బ్రచ్ఛన్నుండై బాహుక నామంబుతో నలుం డుండె; నంత నిట విదర్భేశ్వరుండు నలురాజ్యభ్రంశంబు విని కూఁతురు నల్లుండు నెట వోయిరో? యెందున్నవారో? యని శోకించి. 138

ప్రతిపదార్థం: దానిన్= దానిని (తనభార్యను); అన్వేషించి= వెదకి; ఎందునున్+కానక= ఎచటను చూడక; దుఃఖితుండు+ఐ= పరితాపం చెందినవాడై; ప్రలాపించినన్= పెద్దగా విలపించగా; తద్+ప్రలాపంబున్= ఆతడి పలవరాన్ని; ఏనున్= నేను; అనుకరించితిన్= నటించాను; అనిచెప్పి; ఇట్లు= ఈ విధంగా; అయోధ్యాపురంబునన్= అయోధ్య అనే నగరంలో; ప్రచ్ఛన్నుండు+ఐ= ఇతరులకు తెలియబడనట్టివాడై; బాహుక నామంబుతోన్= బాహుకుడు అనే పేరుతో; నలుండు+ఉండెన్= నలుడు ఉండినాడు; అంతన్= అటుపిమ్మట; ఇట= ఇచట; విదర్భ+ఈశ్వరుండు= విదర్భరాజు; నలు= నలుడియొక్క; రాజ్యభ్రంశంబు= రాజ్యం తప్పిపోవటం; విని= ఆలకించి; కూఁతురు= కుమార్తె; అల్లుండున్= అల్లుడున్నూ; ఎట= ఎచటకు; పోయిరో= వెళ్ళారో; ఎందు+ఉన్నవారో= ఎచట ఉన్నారో; అని; శోకించి= దుఃఖించి (చింతించి).

తాత్పర్యం: తన భార్యకొరకు వెదకి వెదకి, ఆమె కన్పించకపోవటంచేత మిక్కిలి పరితపించినవాడై కలవరించాడు. నేను ఆతడి ప్రలాపాలను అనుకరించాను, అంతే. అవి మందప్రజ్ఞుడి మాటలు'- అని చెప్పి నలుడు తప్పించుకొన్నాడు. అట్లా ఆ అయోధ్య అనే పట్టణంలో మారువేషంతో బాహుకుడు అనే మారుపేరుతో నలుడు బ్రతుకు గడుపుతున్నాడు. అంత, ఇట, విదర్భలో భీమరాజు- నలుడు తనరాజ్యం పోగొట్టుకొన్నాడని విని, కూతురు, అల్లుడు ఎక్కడికి వెళ్ళారో, ఎచట ఉన్నారో?- అని చింతిస్తూ ఆందోళనపడుతున్నాడు.

క. వారల రోయఁగఁ బంచె న । పారబలుం డిష్టులైన బ్రాహ్మణుల సదా
చారుల విద్వాంసుల స । త్కారంబులఁ దనిపి వారిఁ గడు నెయ్యమునన్. 139

ప్రతిపదార్థం: అపారబలుండు= గొప్పబలం కలవాడు (విదర్భరాజు); ఇష్టులు+ఐన= తనకు అనురక్తులైన; బ్రాహ్మణుల= విప్రుల; సత్+ఆచారుల= మంచి ప్రవర్తన కలవారిని; విద్వాంసులన్= బాగుగా చదువుకొన్నవారిని; సత్, కారంబులన్= బహుమానాలతో; తనిపి= సంతృప్తిపరచి; వారిన్= ఆ బ్రాహ్మణులను; కడు, నెయ్యమునన్= మిక్కుటమైన స్నేహంతో; వారలన్= వారిని, అంటే నలదమయంతులను; రోయఁగన్= వెదకటానికై; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: మితిలేని బలంకలవాడైన విదర్భరాజు భీముడు, తనకు అనురక్తులు, మంచి నడవడి కలవారు, పెద్ద చదువులు చదువుకొన్నవారు అయిన బ్రాహ్మణులను బహుమానాలతో సంతృప్తులను కావించి, మిక్కుటమైన స్నేహంతో నలదమయంతులను వెదకటానికై నియోగించాడు.

వ. మఱియు నలదమయంతు లున్నచో టెఱింగి వచ్చిన వారికి వెయ్యేసి గద్యాణంబు లిత్తు ననియు, వారలం దోడ్కొని వచ్చినవారికి గోసహస్రంబులు నగ్రహారంబులు నిత్తు ననియుఁ బలికి పంచిన. 140

ప్రతిపదార్థం: మఱియు= అంతేకాక; నల, దమయంతులు+ఉన్నచోటు+ఎఱింగి= నలదమయంతులు ఉన్నచోటు తెలుసుకొని; వచ్చినవారికి; వేయి+ఏసి= (ఒక్కొక్కరికి) వెయ్యివంతున; గద్యాణంబులు+ఇత్తున్+అనియు= వరహాలు ఇస్తాననీ; వారలన్+తోడ్కొని= ఆ నలదమయంతులను వెంటపెట్టుకొని; వచ్చినవారికి; గోసహస్రంబులున్= వేలకొలది ఆవులును; అగ్రహారంబులున్+ఇత్తును+అనియున్= అగ్రహారాలు ఇస్తాననీ; పలికి= చెప్పి; పంచినన్= పంపగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: విదర్భరాజు బ్రాహ్మణులకు చెప్పినమాటలు: (1) నలదమయంతులు ఉన్నచోటు తెలిసికొని వచ్చిన వారికి ఒక్కొక్కరికి వేయి గద్యాణాలు పారితోషికంగా ఇవ్వబడతాయి. (2) నలదమయంతులను తమతోపాటు వెంటబెట్టుకొని వచ్చినవారికి వేలకొలది గోవులు, అగ్రహారాలు, బహుమానాలుగా ఇవ్వబడతాయి.

విశేషం: (1) గద్యాణం తెలుగుదేశంలో అంటే వేంగివిషయంలో చాళుక్యకాలంలో చలామణిలో ఉన్న బంగారునాణెం. గద్యాణప్రసక్తి సంస్కృత మూలభారతంలో లేదు. నన్నయభట్టు సమకాలీనమైన నాణెమును పేర్కొనటం సహజమే. కాని, గద్యాణాలు వ్యాసుడికాలంలోగాని, నలదమయంతుల కాలంలోగాని ఉన్నట్టివికావు. సారస్వతానికి సమకాలీన సమాజానికి గల బింబప్రతిబింబ భావానికి ఇది ఒక ఉదాహరణంగా గ్రహించవచ్చును. (2) అగ్రహారాలు:- అగ్రహారం అనే శబ్దం చాళుక్యులకాలంలో విశేష ప్రాచుర్యం అందింది. అగ్రహారం అంటే వేదవేదాంగపారంగతులైన బ్రాహ్మణులకు రాజుగారు సమర్పించే బహుమానగ్రామం. చాళుక్యులు బ్రాహ్మణులకు అగ్రహారాలను సర్వకర పరిహారంగా అంటే పన్నులు అన్నియు తీసివేసి దానంచేసేవారు. ఆంధ్రమహాభారత రచనంలో నన్నయభట్టుకు తోడ్పడిన నారాయణభట్టుకు నందంపూడి గ్రామాన్ని అగ్రహారంగా చేసి, సూర్యగ్రహణంనాడు 4-11-1054 తేదీన రాజరాజనరేంద్రుడు దానంచేశాడు. అగ్రహార ప్రసక్తి మూల సంస్కృత భారతంలో లేదని వేరుగా చెప్పనక్కరలేదు.

చేదిపురంబున సుదేవుఁడను బ్రాహ్మణుఁడు దమయంతి నెఱుంగుట (సం. 3-65-5)

క. జగతీచక్రమునం గల । నగర మహాగ్రామ పట్టణంబులు కలయన్
జగతీదేవోత్తము లి । మ్ముగ రోసిరి నిఖిల దేశముల కరిగి వడిన్. 141

ప్రతిపదార్థం: జగతీ, దేవ+ఉత్తములు= బ్రాహ్మణశ్రేష్ఠులు; వడిన్= వేగంగా; నిఖిల, దేశములకు= అన్నిదేశాలకు; అరిగి= వెళ్లి; జగతీ, చక్రమునన్+కల= భూమండలంలో ఉండే; నగర, మహాగ్రామ, పట్టణంబులు= రాజధానులవంటి నగరాలు, పెద్దపల్లెలు, పట్టణాలు; కలయన్= అంతటను; ఇమ్ముగన్= సంపూర్ణంగా; (బాగుగా); రోసిరి= వెదికారు.

తాత్పర్యం: బ్రాహ్మణోత్తములు వేగంగా నానాదేశాలకు వెళ్ళి, భూచక్రంలో ఉండే నగరాలు, పెద్దపల్లెలు, పట్టణాలు అంతటను సంపూర్ణంగా (నలదమయంతులకొరకు) వెదికారు.

వ. అందు సుదేవుం డను బ్రాహ్మణుండు చేదిపతియైన సుబాహుపురంబునకుం జని పుణ్యాహంబు సేయింపం బోవు బ్రాహ్మణులతో రాజగృహంబు సొచ్చి; యంతఃపురంబున సునందా సహితయై యున్నదాని ధూమజాల నిబద్ధం బైన యగ్నిప్రభయునుం బోలె నీలాభ్రసంవృతం బైన చంద్రరేఖయుంబోలె బహుపంకనిమగ్నం బైన మృణాళియుంబోలె నేర్పడ కున్ననుం దదీయ భ్రూయుగ మధ్యగతంబైన సూక్ష్మలక్షణం బిమ్ముగా నిరీక్షించి, దాని దమయంతిఁగా నెఱింగి, యాత్మగతంబున 'నిది పతి విముక్తయై శుష్కప్రవాహ యైన నదియునుంబోలె శూన్యకమలయైన నళినియుం బోలె నపేతచూతంబైన వనభూమియుం బోలె నొప్పకుండియుఁ దన పతివ్రతాగుణంబునం జేసి యొప్పుచున్నయది. 142

ప్రతిపదార్థం: అందున్= ఆ బ్రాహ్మణులలో; సుదేవుండు+అను, బ్రాహ్మణుండు= సుదేవుడు అనే పేరుకల బ్రాహ్మణుడు; చేదిపతి+ఐన= చేదిదేశానికి రాజైన; సుబాహు పురంబునకున్= సుబాహుని రాజధానికి; చని= వెళ్ళి; పుణ్య+అహంబు= పుణ్యమైనదినం- అనే పేరిటి మంగళకరమైన శుభకార్యాన్ని; చేయింపన్+పోవు= చేయించటానికై వెళ్ళే; బ్రాహ్మణులతోన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విప్రులతో; రాజ గృహంబు+చొచ్చి= రాజుగారి మందిరం ప్రవేశించి; అంతఃపురంబునన్= రాణివాసంలో; సునందా, సహిత+ఐ= సునంద అనే రాజకుమారితో కలిసి; ఉన్నదాని; ధూమ, జాల, నిబద్ధంబు+ఐన= పొగదొంతరలతో ఉన్నదైన; అగ్ని ప్రభయునున్+పోలె= అగ్నిదీప్తివలె; నీల+అభ్ర, సంవృతంబు+ఐన= నల్లని మేఘాలతో చుట్టుకొనబడిందైన; చంద్రరేఖయున్+పోలెన్= చంద్రవంకవలె; బహు, పంక, నిమగ్నంబు+ఐన= గొప్ప బురదలో మునిగి ఉన్న; మృణాళియున్+పోలెన్= తామరతూడు (తామరకాడలోని దారం) వలె; ఏర్పడక+ఉన్ననున్= స్పష్టంగా తెలియకపోయినను; తదీయ, భ్రూ, యుగ, మధ్యగతంబు+ఐన= ఆమెయొక్క కనుబొమలు రెండింటికి మధ్య ఏర్పడి ఉన్న; సూక్ష్మ, లక్షణంబు= సన్నని గుర్తు; ఇమ్ముగా= చక్కగా; నిరీక్షించి= పరిశీలించి; చూచి; దానిన్= ఆమెను; దమయంతిన్+కాన్+ఎఱింగి= దమయంతి అని తెలిసికొని; ఆత్మ, గతంబునన్= తనలోతాను; ఇది= ఈమె (దమయంతి); పతి విముక్త+ఐ= భర్త నుండి విడివడిందై; శుష్క, ప్రవాహ+ఐన= ఎండిపోయిన నీటిపారుదల కల; నదియునున్+పోలెన్= ఏరువలె; శూన్య, కమల+ఐన= పద్మాలు లేనట్టి; నళినియున్+పోలెన్= తామర తీగవలె; అపేత, చూతంబు+ఐన= మామిడిచెట్టు లేని; వనభూమియున్+పోలెన్= అరణ్యసీమవలె; ఒప్పకుండియున్= శోభించకుండా ఉండి కూడా; తన, పతివ్రతా, గుణంబునన్+చేసి= తన పాతివ్రత్యమహిమచేత; ఒప్పుచున్న+అది= శోభిల్లుతున్నది.

తాత్పర్యం: ఆ విధంగా నానాదేశాలకు వెళ్ళిన బ్రాహ్మణులలోనివాడు సుదేవుడు చేదిరాజు సుబాహుడి రాజధానికి చేరి, పుణ్యాహం నిర్వర్తించే బ్రాహ్మణులతో కలసి రాజమందిరంలోకి వెళ్ళి, అచట అంతఃపురంలో సునందతో కలిసిఉండే దమయంతిని చూచాడు. అప్పుడు దమయంతి పొగదొంతరలతో మిళితమైన అగ్నిదీప్తివలె, నల్లని మబ్బులచేత ఆవరించబడిన చంద్రవంకవలె, పెనుబురదలో మునిగిఉన్న తామరతూడువలె అణగి ఉండి గుర్తించటానికి వీలుగాక ఉండింది. కాని, ఆమె కనుబొమల మధ్య ఉండే పుట్టుమచ్చను బట్టి ఆమెను దమయంతిగా ఆ సుదేవుడు గుర్తించాడు. అతడు తనలో తాను ఇట్లా భావించాడు: 'ఈ దమయంతి భర్తనుండి విడివడి నీటిపారుదల ఎండిపోయిన ఏరువలె, పద్మాలు లేని తామరతీగవలె, మామిడిచెట్టు లేని వనసీమ వలె శోభించకుండ ఉండికూడా తన పాతివ్రత్యమహిమచేత ప్రకాశిస్తూ ఉన్నది.

విశేషం: అలం: ఉపమ.

తే. **అనపహార్యంబు తేజోమయంబు సర్వ । గుణములకు నలంకారంబు గురుతరంబు**
భామలకుఁ బతిభక్తియ పరమ మైన । భూషణం; బిట్టివే పెఱ భూషణములు? **143**

ప్రతిపదార్థం: న+అపహార్యంబు= అపహరించటానికి వీలులేనట్టిది; తేజస్+మయంబు= ప్రకాశమానమైనది; సర్వగుణములకున్= సమస్తగుణాలకు; అలంకారంబు= భూషణం వంటిది; గురుతరంబు= గొప్పది; భామలకున్= స్త్రీలకు; పతిభక్తి+అ= భర్తపట్ల కల భక్తియే; పరమము+ఐన= అన్నిటికంటె గొప్పదైన; భూషణంబు= అలంకారం; ఇట్టివి+ఏ= ఇట్టివా?; పెఱ, భూషణములు= ఇతరాలైన అలంకారాలు.

తాత్పర్యం: ఆడువారికి పతిభక్తియే గొప్పభూషణాలలో గొప్పభూషణం. పాతివ్రత్యానికి సరిపోలు ఆభరణం ఆడువారికి వేరొకటి లేదు కదా! పతిభక్తియే వారినుండి అపహరించటానికి వీలులేనిది, ప్రకాశమానమైనది, మిక్కిలి గొప్పదైనది, సమస్త సద్గుణాలలోనికెల్ల ఎన్నదగినది అయిన అలంకారవిశేషం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. రోహిణికిఁ జంద్రసమాగమంబునుంబోలె దీనికి భర్తృసమాగమం బెన్నం డయ్యెడునో? తుల్యశీల వయోరూపాభిజాత్యులైన నలదమయంతు లొక్కట నుండం జూచి విదర్భేశ్వరుం డెన్నఁడు కృతార్థుం డయ్యెడునో?' యంచు నల్లనల్లన డాయవచ్చి దమయంతి కిట్లనియె. 144

ప్రతిపదార్థం: రోహిణికిన్= రోహిణీ నక్షత్రానికి; చంద్ర, సమాగమంబునున్+పోలెన్= చంద్రుడితో సంయోగంవలె; దీనికిన్= ఈ దమయంతికి; భర్తృ, సమాగమంబు= భర్తతో సంయోగం; ఎన్నండు+అయ్యెడునో= ఎప్పుడు జరుగుతుందో; తుల్య, శీల, వయస్+రూప= ఆభిజాత్యులు+ఐన= సమానమైన స్వభావం, ఈడు, అందంలో జోడు, వంశగౌరవం కలవారైన; నలదమయంతులు; ఒక్కటన్+ఉండన్+చూచి= ఒకచోట కలిసి ఉండటం చూచి; విదర్భేశ్వరుండు= విదర్భరాజు; ఎన్నఁడు= ఎప్పుడు; కృత+అర్థుండు= ధన్యుడు; అయ్యెడున్+ఓ= అవుతాడో; అంచున్= అంటూ; అల్లన+అల్లనన్= మెల్లమెల్లగా; డాయవచ్చి= దగ్గరకు చేరి; దమయంతికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: రోహిణీ నక్షత్రానికి చంద్రుడికి జరిగే సంయోగంవలె ఈ దమయంతికి ఎప్పుడు భర్తతో కలయిక జరుగుతుందో? శీలంలో, అందంలో, వంశగౌరవంలో ఈడుజోడు కుదిరిన నలదమయంతులు ఒకచోట కలిసి కాపురం చేయటం చూచి విదర్భరాజు భీముడు ఎప్పుడు ధన్యుడవుతాడో?'- అని తలపోస్తూ, మెల్లగా దగ్గరకు వచ్చి ఆ బ్రాహ్మణుడు దమయంతితో ఇట్లా చెప్పాడు.

విశేషం: ఆకసంలో రాత్రివేళ రోహిణీ నక్షత్రం చంద్రుడు కలిసి ఉన్నప్పుడు చూపరులకు అది ఒక మనోహరదృశ్యం. భారతీయుల ఖగోళవిజ్ఞానం మిక్కిలి ప్రాచీనమైనది.

తే. 'అవ్వ! నీ తల్లిదండ్రుల కాత్మజులకు । బంధుజనులకుఁ గుశలంబు; భామ! నీదు
కుశల మెఱుఁగునంతకు వంతగూరి వగుచు । చున్నవారు; వారికి వంత యుడుగు నింక. 145

ప్రతిపదార్థం: అవ్వ= అమ్మా!; నీ, తల్లి దండ్రులకు= నీ తల్లికి, తండ్రికి; ఆత్మజులకున్= నీ కొడుకుకు, కూతురుకు; బంధు జనులకున్= చుట్టాలకు; కుశలంబు= క్షేమం; భామ!= ఓ దమయంతీ!; నీదు, కుశలము= నీక్షేమం; ఎఱుఁగు+అంతకు= తెలిసేవరకు; వంత+కూరి= దుఃఖంతో నిండి; వగచుచున్నవారు= పరితపిస్తున్నారు; ఇంక= ఇకమీదట; వారికి= వారలకు; వంత= దుఃఖం; ఉడుగున్= పోతుంది.

తాత్పర్యం: 'అమ్మా! దమయంతీ! నీ తల్లిదండ్రులు, నీ సంతానం, నీ బంధువులు అందరు క్షేమంగా ఉన్నారు. నీ క్షేమం తెలిసేంతవరకు దుఃఖంతో పరితపిస్తున్నారు. ఇకమీద నీ కుశలవార్త విని సంతసిస్తారు.

వ. దేవీ! యేను భవద్భ్రాతృసఖుండ; సుదేవుండను బ్రాహ్మణుండ; విదర్భేశ్వరుండు నీ యున్నచో టెఱుంగం బెక్కండ్రు బ్రాహ్మణులం బుచ్చిన నిందులకు వచ్చి నా పుణ్యంబున నిన్నుం గంటి' ననిన దమయంతి వాని నెఱింగి తన పుత్త్రులఁ దల్లిదండ్రుల బాంధవులం బ్రత్యేకంబ యడిగి, యశ్రుజలంబు లురల నేడ్చుచున్నం జూచి 'యేలకో యిప్పడు సైరంధ్రి యేడ్చుచున్నయది' యని సునంద తన జననికిం జెప్పి పుచ్చిన. 146

ప్రతిపదార్థం: దేవీ= మహారాణీ!; ఏను= నేను; భవత్+భ్రాతృ, సఖుండ= నీయొక్క సోదరుడి మిత్రుడిని; సుదేవుండు+అను= సుదేవుడనే పేరున్న; బ్రాహ్మణుండ= బ్రాహ్మణుడిని; విదర్భ+ఈశ్వరుండు= విదర్భరాజు; నీ+ఉన్నచోటు+ఎఱుంగన్= నీవు

ఉండే స్థలాన్ని తెలిసికొనటానికై; పెక్కండ్రు, బ్రాహ్మణులన్= చాలమంది బ్రాహ్మణులను; పుచ్చినన్= నియోగించగా; ఇందులకున్= ఇచటికి; వచ్చి= అరుదెంచి; నా, పుణ్యంబునన్= నా సుకృతంవలన; నిన్నున్+కంటిన్= నిన్ను చూచాను; అనినన్= అని చెప్పగా; దమయంతి; వానిన్= ఆ బ్రాహ్మణుడిని; ఎఱింగి= తెలిసికొని; తన, పుత్త్రులన్= తన పిల్లలను; తల్లిదండ్రుల; బంధువులన్= చుట్టాలను; ప్రత్యేకంబు+అ= వేర్వేరుగా; అడిగి= (కుశలం) అడిగి; అశ్రు, జలంబులు= కన్నీళ్లు; ఉరలన్= క్రిందకి కారగా; ఏడ్చుచున్నన్+చూచి= విలపిస్తుండగా చూచి; ఏలకో= ఎందుచేతనో; ఇప్పుడు= ఇపుడు; సైరంధ్రి = దమయంతి; ఏడ్చుచున్న+అది= రోదిస్తున్నది; అని= అంటూ; సునంద; తన, జననికిన్= తన తల్లికి; చెప్పిపుచ్చినన్= చెప్పిపంపగా.

తాత్పర్యం: దమయంతీదేవీ! నేను నీ సోదరుడికి మిత్రుడిని. నాపేరు సుదేవుడు. నేను బ్రాహ్మణుడిని. విదర్భప్రభువు నీవు ఉండేచోటు వెదకటానికై పలువురు బ్రాహ్మణోత్తములను పెక్కుదేశాలకు పంపించాడు. నేను ఇచటికి వచ్చి నా సుకృతవిశేషంవలన నిన్ను చూడగలిగాను' - అని చెప్పగా దమయంతి తల్లిదండ్రులగురించి, తన పిల్లల గురించి, చుట్టాలను గురించి కుశలం అడిగి, ఆమె విలపిస్తూ ఉండటం చూచి సునంద ఆ వార్తను తల్లికి నివేదింపజేసింది.

క. చనుదెంచె నంతిపురమున । వనితానివహంబుతోడ వారిజదళలో
చన రాజమాత నృపనం । దన యగు దమయంతికడకుఁ దద్దయు వేడ్కన్. 147

ప్రతిపదార్థం: వారిజ, దళ, లోచన= నీటినుండి పుట్టిన పద్మం (వారిజం) యొక్క రేకులవంటి కన్నులుకలది అయిన; రాజమాత= రాజుగారి తల్లి; నృప, నందన+అగు= రాజపుత్రి అయిన; దమయంతి కడకున్; అంతిపురమున= రాణివాసంలోని; వనితా నివహంబుతోడన్= స్త్రీల సమూహంతో; తద్దయు= మిక్కిలి; వేడ్కన్= కుతూహలంతో; చనుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: పద్మదళాలవంటి కన్నులు గల రాజమాత అంతఃపురంలోని అంగనలను వెంటబెట్టుకొని రాజకుమారి దమయంతి దగ్గరకు మిక్కుటమైన కుతూహలంతో వచ్చింది.

వ. ఇట్లు వచ్చి తమలో మాటలాడుచున్న బ్రాహ్మణుని దమయంతిం జూచి రాజమాత బ్రాహ్మణున కిట్లనియె; 'నయ్యా! ఇది యెవ్వని కూఁతు? రెవ్వని భార్య? యేమి కారణంబునం దనభర్తను బాంధవులనుం బాసి పుణ్యవ్రతంబులు సలుపుచున్నయది? నీ వె ట్లెఱింగి? తిక్కోమలి నామం బేమి?' యని యడిగిన సుదేవుం డిట్లనియె. 148

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; వచ్చి= అరుదెంచి; తమలో మాటలాడుచున్న= పరస్పరం సంభాషణ చేస్తున్న; బ్రాహ్మణుని; దమయంతిన్; చూచి; రాజమాత; బ్రాహ్మణునకు; ఇట్లు+అనియె= ఈ విధంగా పలికింది; అయ్యా!= ఆర్యా!; ఇది= ఈమె; ఎవ్వని, కూఁతురు= ఎవరి పుత్రిక?; ఎవ్వని భార్య?= ఎవరి పెండ్లాము?; ఏమి కారణంబునన్= ఏ కారణంచేత; తన భర్తను= తన పెనిమిటిని; బాంధవులనున్+పాసి= చుట్టాలను విడిచి; పుణ్యవ్రతంబులు= పవిత్రమైననోములు; సలుపుచున్న+అది= చేస్తున్నది; నీవు+ఎట్లు+ఎఱింగితి(వి)= నీవు ఏవిధంగా తెలిసికొన్నావు?; ఈ+కోమలి= ఈ సుకుమారి; నామంబు+ఏమి= పేరేమిటి?; అని; అడిగిన; సుదేవుండు; ఇట్లు+అనియె.

తాత్పర్యం: ఈ విధంగా దమయంతి, బ్రాహ్మణుడు పరస్పరం మాటాడుతుండగా రాజమాత వచ్చి ఆ బ్రాహ్మణుడితో 'అయ్యా! ఈమె ఎవరికూతురు? ఎవరిభార్య? ఏకారణంవలన భర్తను, బంధువులను, ఎడబాసి పుణ్యప్రదమైన నోములు నోస్తున్నది? అసలు ఈమెసంగతి నీ కెట్లా తెలిసింది? ఈమె పేరేమిటి?' అని అడుగగా సుదేవుడు ఇట్లా బదులు పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మధ్యాక్కర.

'నలినాక్షి! యిది విదర్భేశుతనయ, పుణ్యశ్లోకుఁ డైన
నలుదేవి దమయంతి సుమ్ము; విధి కారణమ్మున రాజ్య
చలితుఁడై నిజనాథుఁ డరిగినం దోన చనియె; నవ్వార్త
వెలయంగ విని వీరి రోయఁబంచె భూవిభుఁడు బ్రాహ్మణుల. 149

ప్రతిపదార్థం: నలిన+అక్షి!= పద్మాలవంటి కన్నులు కలదానా! (ఓ రాజమాతా!); ఇది= ఈమె; విదర్భ+ఈశు తనయ= విదర్భరాజు కూతురు; పుణ్య శ్లోకుఁడు+ఐన= పవిత్రమైన చరిత్ర కలవాడైన; నలుదేవి= నలుడియొక్క రాణి; దమయంతి, సుమ్మి; విధి, కారణమ్మునన్= దురదృష్టహేతువుచేత; రాజ్య చలితుఁడు+ఐ= రాజ్యభ్రష్టుఁడై; నిజ, నాథుఁడు= తనభర్త; అరిగినన్= వెళ్ళిపోగా; తోన= ఆతని వెనువెంటనే; చనియెన్= వెళ్ళింది; ఆ+వార్త= ఆ సమాచారం; వెలయంగ, విని= వ్యాపించగా విని; భూవిభుఁడు= రాజు; బ్రాహ్మణులన్= విప్రులను; వీరి= నలదమయంతులను; రోయన్+పంచెన్= వెదకటానికై పుత్తెంచాడు.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులుగల ఓ రాజమాతా! ఈమె విదర్భరాజు పుత్రిక. నలమహారాజుదేవేరి. ఈమెయే దమయంతి సుమా! విధిపరిపాకంవలన నలుడు రాజ్యం పోగొట్టుకొని వెళ్ళిపోయేటప్పుడు, ఈమె భర్తను అనుసరించింది. ఈ వార్త విని విదర్భప్రభువు వీరిని (నలదమయంతులను) వెదకటానికై బ్రాహ్మణులను పంపించాడు.

విశేషం: వృత్తలక్షణానికి ఈ ఆశ్వాసంలోని 22వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.

వ. ఏ నిందులకు వచ్చి, మీచేత సురక్షితయై యున్న యిక్కోమలిం జూచి, దీని భ్రూమధ్యంబునం బద్మప్రభంబై విభూత్యర్థంబుగా విధాతృనిర్మితం బైన పుణ్యలక్ష్మంబు పాంసుపటలచ్ఛన్నం బై యున్న నుపలక్షించి మారాజు పుత్త్రింగా నెఱింగితి' ననిన సునంద శుద్ధోదకంబుల దాని భ్రూమధ్యంబు గడిగిన నది విస్పష్టంబగుడు నందఱు నాశ్చర్యం బంది; రంత. 150

ప్రతిపదార్థం: ఏను+ఇందులకు, వచ్చి= నేను ఇచటికి వచ్చి; మీచేత; సురక్షిత+ఐ, ఉన్న= బాగుగా రక్షించబడిఉన్న; ఈ+కోమలిన్= ఈ సుకుమారిని; చూచి; దీని= ఈమెయొక్క; భ్రూమధ్యంబునన్= కనుబొమల మధ్య; పద్మ, ప్రభంబు+ఐ= పద్మంయొక్క దీప్తికలదియై; విభూతి+అర్థంబుగా= సంపదకు సూచికగా; విధాతృ, నిర్మితంబు+అయిన= బ్రహ్మదేవుడిచేత సృష్టించబడిన; పుణ్యలక్ష్మంబు= సుకృతవిశేషమైన పుట్టుమచ్చ; పాంసు, పటల, ఛన్నంబు+ఐ+ఉన్నన్= దుమ్ము కణాలచేత కప్పబడి ఉండగా; ఉపలక్షించి= అరసి, చూచి; మా, రాజపుత్త్రిన్+కాన్= మారాజు కుమారిగా; ఎఱింగితిన్= తెలిసికొన్నాను; అనినన్= అని చెప్పగా; సునంద; శుద్ధ+ఉదకంబులన్= మంచినీళ్ళతో; దాని= ఆమెయొక్క; భ్రూమధ్యంబు= కనుబొమల మధ్య ప్రదేశాన్ని; కడిగినన్= పరిశుభ్రం చేయగా; అది= ఆ పుట్టుమచ్చ; విస్పష్టంబు+అగుడు= సుస్పష్టంగా కనిపించగా; అందఱున్; ఆశ్చర్యంబు+అందిరి= అచ్చెరువు పొందారు; అంత= అంతట.

తాత్పర్యం: నేను ఇచటికి వచ్చి మీచేత కాపాడబడుతున్న ఈ కోమలి దమయంతిని చూచి ఈమె కనుబొమల మధ్య, ఐశ్వర్యప్రదమైన చిహ్నంగా బ్రహ్మదేవుడు సృష్టించిన పుట్టుమచ్చ, దుమ్ముచేత కప్పబడి ఉండటం పరిశీలించి చూచి మా రాకుమారిగా గుర్తించగలిగాను'- అని సుదేవుడు చెప్పాడు. అంతట సునంద మంచినీళ్ళను తెప్పించి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దమయంతి ముఖం కడుగగా, ఆమె నొసటిపై పద్మకాంతి గల పుట్టమచ్చ స్ఫుటంగా కనిపించింది. అందరు అప్పుడు ఆశ్చర్యం పొందారు. అంత.

సీ. **ఆనందభరితాత్మయై రాజమాత య । క్కమలాక్షిఁ బ్రీతితోఁ గౌఁగిలించి**
కొని, 'తల్లి! నీవు నా కూతుర; వేను నీ । జననియుఁ బేర్మి దశార్ణరాజ
తనయల; మదియు విదర్భేశు సతి యయ్యెఁ; । నే వీరబాహున కింతి నైతి'
ననిన నయ్యవ్వకు నతివినయంబుతో । నలుదేవి మ్రొక్కి, సునంద నెత్తి

ఆ. **కొని, కరంబు నెమ్మిఁ గొన్నిదినంబు లం । దుండి యిట్టు లనియె నొక్కనాఁడు**
'దేవి! యిదియు నదియు ధృతి నాకుఁ బుట్టిన । యిండ్లు; కడుసుఖంబ యిందు నందు. 151

ప్రతిపదార్థం: ఆనంద, భరిత+ఆత్మ+ఐ= ఆనందంతో నిండిన ఆత్మకలదై; రాజమాత; ఆ+కమల+అక్షిన్= కమలాల వంటి కన్నులు కలదానిని, దమయంతిని; ప్రీతితోన్= ప్రేమతో; కౌఁగిలించికొని= ఆలింగనం చేసికొని; తల్లి!= అమ్మా! (దమయంతీ!); నీవు; నా కూతురవు= నా కూతురివే సుమా!; ఏను, నీ, జననియున్= నేనూ నీ తల్లియు; పేర్మి= గౌరవంగల; దశార్ణ, రాజ, తనయలము= దశార్ణ రాజపుత్రికలం; అదియు= నీ తల్లియు; విదర్భేశు, సతి+అయ్యెన్= విదర్భరాజు భార్య అయింది; ఏన్= నేను; వీరబాహునకు+ఇంతిన్+ఐతిన్= వీరబాహుడి భార్యను అయ్యాను; అనినన్= అని చెప్పగా, ఆ+అవ్వకున్= ఆ సతికి; అతి, వినయంబుతోన్= మిక్కిలి అణకువతో; నలుదేవి= నలుడియొక్క భార్య (దమయంతి); మ్రొక్కి= నమస్కరించి; సునందన్+ఎత్తికొని= సునందను లేవదీసి; కరంబు, నెమ్మిన్= మిక్కిలి ప్రీతితో; కొన్ని, దినంబులు= కొన్నినాళ్ళు; అందు+ఉండి= అచట ఉండి; ఒక్కనాఁడు= ఒక దినం; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికింది; దేవి!= రాజమాతా!; ఇదియున్= ఈ వీరబాహుపురం; అదియు= విదర్భయు; ధృతిన్= స్థిరంగా; నాకున్+పుట్టిన+ఇండ్లు= నాకు పుట్టిండ్లే; ఇందున్+అందు= ఇచట, అచట; కడు, సుఖంబు+అ= మిక్కిలి సుఖమే.

తాత్పర్యం: రాజమాత ఆనందంతో నిండిన హృదయంతో దమయంతిని కౌగిలించుకొన్నది. పిమ్మట రాజమాత 'తల్లీ! నీవూ నా కూతురవే సుమా! నేనూ, నీ తల్లీ దశార్ణరాజు పుత్రికలం. నీ తల్లి విదర్భరాజు దేవేరి అయింది. నేను వీరబాహుడి సతిని అయ్యాను'- అని చెప్పగా దమయంతి ఆమె పాదాలకు నమస్కరించింది. తనకు నమస్కరించిన సునందను లేవనెత్తికొని లాలించింది. ఆ విధంగా నలుడిదేవి అయిన దమయంతి అక్కడ కొన్ని దినా లుండి, ఒకానొకనాడు రాజమాతతో 'దేవీ! ఈ పురమూ, విదర్భా నాకు పుట్టిండ్లే. ఇచట, అచట కూడా నాకు సమాన సౌఖ్యమే.

వ. **అయినను దల్లిదండ్రుల ననుజుల నాత్మజులం జూడ వేడుక యైనది; విదర్భకుం బోయెద; నానతి' మ్మని కృతాంజలి యైన దమయంతి నతిస్నేహంబున సుబాహుజనని సుతప్రేషితబలంబుతో సువర్ణమణిమయ విమానోపమానయానంబున నునిచి పుచ్చిన. 152**

ప్రతిపదార్థం: అయినను= అయినప్పటికిని; తల్లి దండ్రులన్= తల్లిని, తండ్రిని; అనుజులన్= సోదరులను; ఆత్మజులన్= కన్నబిడ్డలను; చూడ, వేడుక+ఐనది= చూడటానికి కుతూహలమైనది; విదర్భకున్+పోయెదన్= విదర్భకు వెళ్ళుతాను; ఆనతి+ఇమ్ము= అనుజ్ఞ దయచేయుము; అని; కృత+అంజలి+ఐన= నమస్కృతి చేసినదైన; దమయంతిన్; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రీతితో; సుబాహు, జనని= సుబాహుడి యొక్క తల్లి; సుత, ప్రేషిత, బలంబుతోన్= కొడుకు సమకూర్చిన భటులను

తోడిచ్చి; సువర్ణ, మణిమయ, విమాన+ఉపమాన, యానంబునన్= బంగారం మణులు పొదగబడిన విమానంతో సరిపోవు వాహనంలో; ఉనిచి పుచ్చినన్= ఎక్కించి పంపగా.

తాత్పర్యం: అయినప్పటికి తల్లిదండ్రులను, సోదరులను, కన్నబిడ్డలను చూడాలని నాకు అనిపిస్తున్నది. విదర్భకు వెళ్ళుతాను. అనుజ్ఞ దయసేయుము' - అని నమస్కరించిన దమయంతిని మిక్కిలి ప్రీతితో ఆదరించి, రాజమాత తన కొడుకు సమకూర్చిన భటులతో, బంగారుమయమై నిండుగ మణులు పొదిగిన విమానంవంటి రథంపై పంపగా.

దమయంతి నలు నెడఁబాసి విదర్భాపురంబు సేరుట (సం. 3-66-22)

ఉ. **భామ విదర్భ కేఁగి తన బంధుజనంబులయొద్ద నుండియుం**
గోమలి దేహసౌఖ్యములకున్ వెలియై మలినార్ధవస్త్రమున్
భూమిరజంబు నంగమునఁ బొల్పగుచుండఁగ నుండె జీవిత
స్వామి నిజేశుఁ జూచు దివసంబులఁ గోరుచు సువ్రతంబుతోన్. **153**

ప్రతిపదార్థం: భామ=వనిత (దమయంతి); విదర్భకు+ఏఁగి= విదర్భకు వెళ్ళి; తన, బంధు, జనంబుల+ఒద్దన్+ఉండియున్= తన చుట్టాల కడ ఉన్నప్పటికిని; కోమలి= సుకుమారి; దేహసౌఖ్యములకున్= శరీర సుఖాలకు; వెలి+ఐ= దూరంగా ఉండి; మలిన+అర్ధ, వస్త్రమున్= మాసిన సగం చీరను; భూమి, రజంబున్= పుడమియొక్క దుమ్ము; అంగమునన్= దేహంపై; పొల్పు+అగుచుండఁగన్= ఒప్పుతుండగా; జీవిత, స్వామి, నిజ+ఈశున్= జీవితానికి అధినేత అయిన తన భర్తను; చూచు, దివసంబులన్= చూచే రోజులనే; కోరుచున్= కాంక్షిస్తూ; సువ్రతంబుతోన్= గొప్ప దీక్షతో; ఉండెన్= నివసించింది.

తాత్పర్యం: దమయంతి విదర్భకు వెళ్ళి, బంధువుల ఒద్ద ఉన్నప్పటికిని శరీరసౌఖ్యాలు త్యజించి, మాసిన సగం చీరనే ధరించి, దుమ్ము పేరుకొని పోయినా ఒప్పుతున్న శరీరంతో తన జీవితానికి అధినేత అయిన భర్తను చూచే రోజులకొరకు ఎదురుచూస్తూ దృఢదీక్షతో బ్రతికింది.

వ. **ఇట్లు భర్తృవియోగాతురయై దమయంతి ప్రాణంబు భరియింపనోపక యొక్కనాఁ డేకాంతంబునఁ దన జనని కిట్లనియె.** **154**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; భర్తృ, వియోగ+ఆతుర+ఐ= భర్తయొక్క ఎడబాటుచేత ఏర్పడిన ఉద్వేగం కలదై; దమయంతి; ప్రాణంబు, భరియింపన్+ఓపక= అసువులు భరించలేక; ఒక్కనాఁడు= ఒకానొక దినం; తన, జననికి= తన తల్లికి; ఏకాంతంబునన్= రహస్యంగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: ఈ విధంగా భర్తయొక్క ఎడబాటువలన కలిగిన ఉద్వేగంతో దమయంతి అసువులు భరించలేక ఒకానొకదినం రహస్యంగా తల్లితో ఇట్లా చెప్పింది.

క. **'శోకాపనోదిఁ బుణ్య। శ్లోకుని నలు రోయఁ బనుపు శుభచరితుఁ దదా**
లోకనవిహీననై పర। లోకకృతావాస నగుదు లోకం బెఱుఁగన్'. **155**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: శోక+అపనోదిన్= దుఃఖం పోకార్చేవాడిని; పుణ్యశ్లోకుని= పవిత్రమైన చరిత్ర కలవాడిని; శుభ చరితున్= మంగళకరమైన స్వభావం కలవాడిని; నలున్= నలుడిని; రోయన్+పనుపు= వెదకటానికి పంపుము; తద్+ఆలోకన, విహీనను+ఐ= ఆతడిని చూడటానికి నోచనిదానినై; లోకంబు+ఎఱుఁగన్= జనులందరికి తెలిసేటట్లుగా; పర, లోక, కృత+ఆవాసన్+అగుదున్= పరలోకంలో చేయబడిన నివాసం కలదానిని అవుతాను.

తాత్పర్యం: 'నా దుఃఖాన్ని పోగొట్టగల పుణ్యచరిత్రుడైన నలుడిని వెదకటానికై పంపుము. ఆతడిని చూడకుంటే నేను బహిరంగంగా ఈ లోకాన్ని వదలి పరలోకానికి వెళ్ళుతాను.'

వ. అనిన నదియును గూఁతు నభిప్రాయంబు భీమున కెఱింగించిన, నాతండు నలుమార్గణంబున ఋజుమార్గులయిన బ్రాహ్మణుల నియోగించినం, దన పతి నన్వేషింప నరుగు బ్రాహ్మణులకు దమయంతి యిట్లనియె. 156

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆదియును= ఆమెయు; కూఁతున్+అభిప్రాయంబు= పుత్రికయొక్క ఉద్దేశం; భీమునకు= విదర్భరాజయిన భీముడికి; ఎఱింగించినన్= తెలుపగా; ఆతండు= ఆ భీముడు; నలు, మార్గణంబునన్= నలుడిని వెదకటంలో; ఋజు మార్గులు+అయిన= తిన్నని నడవడి కల; బ్రాహ్మణులన్= విప్రులను; నియోగించినన్= పుత్తెంచగా; తన, పతిన్= తన భర్తను; అన్వేషింపన్+అరుగు= వెదకటానికి వెళ్ళే; బ్రాహ్మణులకున్= విప్రులకు; దమయంతి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: అని చెప్పగా, ఆమె తన కూతురి ఉద్దేశాన్ని భీమరాజుకు తెలిపింది. ఆతడు నలుడిని అన్వేషించటానికై సత్ప్రవర్తన గల బ్రాహ్మణులను నియోగించాడు. తన పతిని వెదకటానికై వెళ్ళే బ్రాహ్మణులతో దమయంతి ఇట్లా చెప్పింది.

ఆ. 'నైషధేశ్వరుండు నలుఁ డిప్పు డసమర్థుఁ । డగుటఁ జేసి తన్ను నన్యు లెఱుఁగ
కుండ నుండుఁ; గాన నురుసభాంతరముల । కరిగి యరిగి యిట్టు లనుడు మీరు. 157

ప్రతిపదార్థం: నైషధ+ఈశ్వరుండు= నిషధ దేశ ప్రజలకు ప్రభువు; నలుఁడు; ఇప్పుడు; అసమర్థుఁడు+అగుటన్+చేసి= సమర్థుడు కాకపోవటంచేత- అంటే తన పదవిని కోలుపోయి నిషధప్రభువుగా లేకుండటంచేత; తన్నున్= తనను; అన్యులు= ఇతరులు; ఎఱుఁగక+ఉండన్= తెలియకుండ; ఉండున్+కానన్= ఉంటాడు కాబట్టి; ఉరు, సభా+అంతరములకున్= గొప్ప కొలువుకూటాలకు; అరిగి+అరిగి= వెళ్ళి, వెళ్ళి; ఇట్టులు+అనుడు= ఇట్లా మీరు చెప్పండి.

తాత్పర్యం: 'నిషధప్రజలకు రాజైన నలుడు ప్రస్తుతం అసమర్థుడు. పదవిని కోలుపోయాడు. కాబట్టి ఇతరులు తనను గుర్తించకుండ అజ్ఞాతవాసం చేస్తూ ఉంటాడు. మీరు పలుదేశాలకు వెళ్ళినపుడు అచటి సభలలో ఈవిధంగా పలకండి.

విశేషం: 'అరిగి యరిగి' అనే ప్రయోగం వలన నలుడిని అన్వేషించటానికి బ్రాహ్మణులు పలు తావులకు వెళ్ళవలసి ఉంటుందన్న సూచన సుస్పష్టం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'నిత్యసత్త్యుండవు; నీ సతి వంచించి । దాని వస్త్రార్థంబు దఱిగి నీకుఁ
బరిధానముగఁ జేసి పాడియే పోవంగ? భార్య భర్తవ్యనాఁ బరఁగు ధర్మ
మది మిథ్య యయ్యెఁ నీయందు; నీ కిట్టి ని । ర్దయబుద్ధిఁ జేకొనఁ దగునె? యట్టి
సాధ్వికిఁ గరుణఁ బ్రసన్నుండ వగు' మని । యెల్లచోఁ బలికిన నెవ్వఁడేనిఁ

ఆ. బలుకు వడఁగ నోడి ప్రతివచనం బిచ్చు । నతఁడు నలుఁడుగాఁ బ్రియంబుతోడ
నెఱిఁగి నన్ను నతని కెఱిఁగించి తోడ్కొని । రండు; రానినాఁడు రం డెఱింగి.' 158

ప్రతిపదార్థం: నిత్యసత్త్యుండవు= ఎల్లప్పుడు సత్యసంధుడివైన వాడివి; నీ, సతిన్= నీభార్యను; వంచించి= మోసంచేసి; దాని వస్త్ర+అర్ధంబు= ఆమె సగం చీరను; తఱిగి= చించి; నీకున్, పరిధానముగన్+చేసి= నీకు కట్టుపుట్టంగా చేసికొని; పాడియే పోవంగన్= పోవటం ధర్మమా?; భార్య= పెండ్లాం; భర్తవ్య= భరించబడేది; నాన్+పరఁగు= అనబడేటటువంటి; ధర్మము+అది= ఆ ధర్మం; నీయందు= నీ పట్ల; మిథ్య+అయ్యెన్= అసత్యమయింది; నీకు+ఇట్టి, నిర్దయ, బుద్ధిన్= నీకు ఇటువంటి దయలేని కఠినవైఖరిని; చేకొనన్+తగునె= స్వీకరించతగునా?; అట్టి, సాధ్వికిన్= అటువంటి ఉత్తమురాలికి; కరుణన్= దయతో; ప్రసన్నుఁడవు+అగుము= అనుగ్రహం కలవాడివి కమ్ము; అని= అంటూ; ఎల్లచోన్= అన్నిచోట్లలో; పలికినన్= ప్రకటించగా; ఎవ్వడు+ఏనిన్= ఎవ్వడైనా; పలుకు+పడఁగన్+ఓడి= మాట పడటానికి ఇష్టపడక; ప్రతివచనంబు+ఇచ్చున్= ఎదురు సమాధానం చెపుతాడో!; అతఁడు= ఎదురు చెప్పినవాడు; ప్రియంబుతోడన్= ప్రీతితో; నలుండు+కాన్+ఎఱిఁగి= నలుడని గుర్తించి; నన్నున్+అతనికి+ఎఱిఁగించి= నా విషయం అతడికి తెలిపి; తోడ్కొని రండు= అతడిని ఇచటికి తీసికొనిరండు; రాని, నాఁడు= అతడు ఇచటికి రాకున్నట్లయితే; ఎఱింగి= తెలిసికొని; రండు= తిరిగిరండు.

తాత్పర్యం: 'నీవు నిత్యసత్యవ్రతుడివి. నీ భార్యను మోసంచేసి ఆమెచీరను సగం చింపి నీవు కట్టుబట్టగా చేసికొని పోవటం న్యాయమా? భరించబడేది భార్య అని కదా ధర్మం. ఆ ధర్మం నీపట్ల అసత్యమైనదిగదా! నీవు ఇటువంటి దయలేని కఠినమైన బుద్ధిని అవలంబించ తగునా? అటువంటి పతివ్రతాశిరోమణి పట్ల అనుగ్రహం చూపుము' - అని అన్ని చోట్ల పలుకండి. ఎవరు ఆ మాటలు విని రోషం చెంది ఎదురు సమాధానం చెపుతాడో అటువంటివాడిని ప్రియమార నలుడిగా గుర్తించి, అతడికి నా విషయం తెలిపి, ఇచటికి తోడ్కొని రండి. ఒకవేళ అతడు ఇచటికి రాకుంటే అతడిని గుర్తుపెట్టుకొని మీరు తిరిగి రండి'.

వ. అని పంచినం, బనిపూని బ్రాహ్మణులు దమయంతి కఱపిన పలుకు లెల్ల సభలం బలికి యెందునుం గానక వచ్చి; రందుఁ బర్ణాదుం డను బ్రాహ్మణుండు దమయంతి కిట్లనియె; 'నే నయోధ్య కరిగి నీ కఱపిన పలుకు లెల్ల ఋతుపర్ణుసభం బలికిన నొక్క పురుషుండు కుఱుచ చేతులవాఁడు ఋతుపర్ణునొద్ద నూఱుగద్యాణంబుల జీవితంబువాఁడు శీఘ్రయానకుశలుండు సూదక్రియానిపుణుండు విరూపాంగుండు బాహుకుం డను నశ్వ శిక్షకుండు విని, నన్ను నేకతంబ కనుంగొని వెలవెల నగుచు దీర్ఘనిశ్వాసపురస్సరుండై యిట్లనియె.159

ప్రతిపదార్థం: అని= అంటూ; పంచినన్= నియోగించగా, పనిపూని= కార్యభారం వహించి; బ్రాహ్మణులు= విప్రులు; దమయంతి, కఱపిన= దమయంతి చెప్పిన; పలుకులు= మాటలు; ఎల్ల, సభలన్, పలికి= అన్ని సభలలో భాషించి; ఎందునున్, కానక, వచ్చిరి= (నలుడిని) ఎచ్చటను చూడలేక తిరిగి వచ్చారు; అందున్= ఆ బ్రాహ్మణులలో; పర్ణాదుండు+అను బ్రాహ్మణుండు= పర్ణాదుడనే విప్రుడు; దమయంతికి; ఇట్లు+అనియె= ఈవిధంగా చెప్పాడు; ఏను= నేను; అయోధ్యకు; అరిగి= వెళ్ళి; నీ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కఱపిన, పలుకులు+ఎల్ల= నీవు నేర్పిన మాటలన్నియు; ఋతుపర్ణు, సభన్= ఋతుపర్ణుడి కొలువుకూటంలో; పలికినన్= మాటాడగా; ఒక్క పురుషుండు= ఒక మగవాడు; కుఱుచ చేతులవాఁడు= పొట్టి చేతులు కలవాడు; ఋతు, పర్ణు+ఒద్ద= ఋతుపర్ణుడి దగ్గర; నూఱు గద్యాణంబుల, జీవితంబు, వాఁడు= వందగద్యాణాలను జీతంగా పొందేవాడు; (జీవితంబు అనే పదానికి జీతంబు అనే పాఠాంతరం కొన్ని ప్రతులలో కానవస్తున్నది. జీవితం యొక్క రూపాంతరమే జీతం); శీఘ్రయాన కుశలుండు= వేగంగా ప్రయాణం చేయటంలో నేర్పరి; సూదక్రియా నిపుణుండు= వంటలు చేయటంలో నేర్పు కలవాడు; విరూప+అంగుండు= వికృతమైన ఆకృతి కలవాడు; బాహుకుండు+అను= బాహుకుడనే పేరుకలవాడు; అశ్వశిక్షకుండు= గుఱ్ఱాలకు శిక్షణ ఇచ్చేవాడు; విని= ఆలకించి; నన్నున్+ఏకతంబు+అ, కనుంగొని= నన్ను రహస్యంగా కలిసికొని; వెలువెలన్+అగుచు= తెల్లబోతూ; దీర్ఘనిశ్వాస పురస్సరుండు+ఐ= నిట్టూర్పులు ముందుగా ప్రసరింపచేస్తున్నవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని నియోగించగా, కర్తవ్యభారాన్ని పూని బ్రాహ్మణులు దమయంతి చెప్పిన మాటలు సకల సభలలో పలికి ఎచ్చటనూ నలుడిని కానక తిరిగి వచ్చారు. కాని, వారిలో పర్ణాదుడు అనే విప్రుడు దమయంతికి ఈ విధంగా చెప్పాడు: నేను అయోధ్యకు వెళ్ళి అచట ఋతుపర్ణుడి సభలో నీవు నేర్పిన మాటలు పలికాను. ఒకడు కురూపి, కురుచ చేతులవాడు, ఋతుపర్ణుడి దగ్గర వంద గద్యాణాల వేతనంతో పనిచేసే సేవకుడు, వంటలు చేయటంలో నేర్పు కలవాడు, వేగంగా ప్రయాణం చేయటంలో నేర్పు కలవాడు, బాహుకుడు అనే గుఱ్ఱాల శిక్షకుడు నా మాటలు విని, నన్ను రహస్యంగా కలిసికొని వేడినిట్టూర్పులు వెదజల్లుతూ ఈ విధంగా పలికాడు.

ఆ. 'పురుషునందు దోషపుంజంబు గలిగిన । నెఱిఁగి యెద సహించునేని భార్య
పురుషునం దభీష్టభోగంబు, దేహాంత । రంబునందు ధర్మరతియుఁ బడయు.' 160

ప్రతిపదార్థం: పురుషునందు= మగనిలో; దోషపుంజంబు= తప్పులు పెక్కు; కలిగినన్= ఉన్నప్పటికీ; ఎఱిఁగి= తెలిసికూడ; ఎదన్= హృదయంలో; సహించును+ఏని= ఓర్చుకొన్నట్లయితే; భార్య= ఆపెండ్లం; పురుషునందు= మగడియందు; అభీష్టభోగంబు= తాను కోరుకొన్న సౌఖ్యం; దేహ+అంతరంబు+అందున్= వేరొక జన్మలో; ధర్మరతియున్= ధర్మంపై ప్రీతిని; పడయున్= పొందగలదు.

తాత్పర్యం: మగడియందు తప్పు లుంటే తెలిసి ఉండికూడ సైరించే భార్య ఎప్పటికైనా ఇహలోకంలో భర్త నుండి తాను కోరిన సౌఖ్యం పొందుతుంది. అట్లాగే ఆ పుణ్యంవలన మరుజన్మలో ధర్మంపట్ల ప్రీతిని పొందగలదు.'

వ. అని యొండెద్దియుం బలుకక తన నివాసంబునకుం బోయె' నని చెప్పిన విని, దమయంతి పెద్దయుం బ్రొద్దు చింతించి 'నలుండు గానివాఁడు ప్రతివచనం బేల యిచ్చు? నింకను వలను గల వారలం బంచి యాతని నిమ్ముగా నెఱుంగవలయు' నని నిజజనని యనుమతంబున సుదేవు రావించి వాని కిట్లనియె.161

ప్రతిపదార్థం: అని; ఒండు+ఎద్దియున్+పలుకక= వేరే ఏదియు మాట్లాడక; తన నివాసంబునకున్+పోయెన్= తాను నివసించే చోటికి వెళ్ళాడు; అని; చెప్పిన; విని; దమయంతి; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; చింతించి= ఆలోచించి; నలుండు, కాని, వాఁడు= నలుడు కాక వేరొకడు; ప్రతివచనంబు= సమాధానం; ఏల+ఇచ్చున్?= ఎందుకు ఇస్తాడు?; ఇంకను; వలను+ కలవారలన్+పంచి= నేర్పుగలవారిని పుత్తెంచి; ఆతనిన్= ఆ ప్రత్యుత్తరం ఇచ్చిన వాడిని; ఇమ్ముగాన్= పరిపూర్ణంగా; ఎఱుంగవలయున్= తెలిసికొనాలి; అని; నిజ, జనని= తన తల్లి; అనుమతంబున= అంగీకృతితో; సుదేవు, రావించి= సుదేవుడిని రప్పించి; వానికి= ఆతడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: అని మాత్రమే చెప్పి, తదుపరి మౌనం వహించి అతడు తన నివాసానికి వెళ్ళాడు' - అని చెప్పగా విని దమయంతి చాలసేపు ఆలోచించి 'అతడు నలుడు కాని పక్షంలో ఎందుకు ఎదురు సమాధానం చెప్పుతాడు? ఇంకను వీలైనవాళ్ళను పంపించి ఆతడి సంగతిని సంపూర్ణంగా తెలిసికొనవలసి ఉన్నది' అని తల్లి అనుమతితో సుదేవుడిని రావించి అతడితో ఇట్లా చెప్పింది.

క. **'న న్నెఱిఁగి తెచ్చినట్లు జ । గన్నుతు నలు నెఱిఁగి తెమ్ము కౌశలమున వి**
ద్వన్నుత! సర్వసుగుణసం । పన్నుండవు నీవ బుద్ధిఁ బరికింపంగన్. **162**

ప్రతిపదార్థం: నన్ను+ఎఱిఁగి, తెచ్చినట్లు= నన్ను గుర్తించి తెచ్చినట్లుగానే; జగత్+నుతున్= జగత్తుచేత స్తుతించబడిన; నలున్= నలుడిని; కౌశలమునన్= సామర్థ్యంతో; ఎఱిఁగి తెమ్ము= గుర్తించి తీసికొని రమ్ము; విద్వత్+నుత!= పండితులచేత కీర్తించబడినవాడా!; బుద్ధిన్+పరికింపంగన్= మెదడుతో ఆలోచించి చూస్తే; నీవు+అ=నీవే; సర్వసుగుణసంపన్నుండవు= సకల సద్గుణాల సంపద కలవాడివి.

తాత్పర్యం: 'విద్వాంసులచేత కీర్తించబడిన ఓ సుదేవా! బుద్ధితో ఆలోచిస్తే నీవే సకల సద్గుణాల సంపద కలవాడివి. నీవు నన్ను గుర్తించి తెచ్చావు కదా! అట్లే లోకులచేత ప్రశంసించబడే నలమహారాజును కూడ వెదకి నేర్పుగ గుర్తించి తీసికొనిరమ్ము.

క. **అరుగు మయోధ్యకు దేశాం । తర విప్రుఁడవై; రవిప్రతాపోన్నతు ను**
త్తరకోసలేంద్రు నుర్వీ । శ్వరుఁ గనఁ జను మనఘు నమరసము ఋతుపర్ణున్. **163**

ప్రతిపదార్థం: దేశ+అంతర, విప్రుఁడవు+ఐ= మరొకదేశానికి చెందిన బ్రాహ్మణుడివిగా; అయోధ్యకున్= అయోధ్యాపురికి; అరుగుము= వెళ్ళుము; ఉత్తర కోసల+ఇంద్రున్= ఉత్తర కోసల దేశానికి రాజును; ఉర్వీ+ఈశ్వరున్= భూపతిని; రవి, ప్రతాప+ఉన్నతున్= సూర్యుడి వంటి ప్రతాపంచేత గొప్పవాడిని; అనఘున్= పాపరహితుడిని; అమరసమున్= దేవతలవంటివాడిని; ఋతుపర్ణున్= ఋతుపర్ణుడిని; కనన్= చూడటానికి; చను= వెళ్ళుము.

తాత్పర్యం: ఓ సుదేవా! నీవు అయోధ్యకు విదేశవిప్రుడివలె వెళ్ళుము. వెళ్ళి ఉత్తరకోసలపతి, సూర్యుడి వంటి ప్రతాపంచేత ఉన్నతుడు, పుణ్యాత్ముడు, దేవతలతో సమానుడు అయిన ఋతుపర్ణుడిని దర్శించుము.

విశేషం: ఉస్మానియా విశ్వవిద్యాలయ సంశోధిత ముద్రిత ప్రతిలో - పై పద్యం ఉత్తరార్ధంలో 'ఉత్తరకోసలేశు భాంగాసరినింగను మనఘు నమరసము' అనే పాఠం ఉన్నది. అందులోని 'భాంగాసరి' - అనే పదానికి 'భాంగస్వరి', 'భాంగాసురి'- అనే పాఠభేదాలు కూడ కనబడుతున్నాయి. కాని, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిలో పాఠాంతరంగా ఇవ్వబడిన ప్రస్తుత పాఠం అర్థప్రసన్నతకు తోడ్పడేదైనందున ఇందులో ప్రధానపాఠంగా స్వీకరించటం జరిగింది.

వ. **'మఱి విదర్భావిభుం డగు భీముండు నలు రోయం బంచి, యెందునుం గానక యింకను దమయంతికిఁ బునఃస్వయంవరంబు రచియింపంబోయిన, నందులకు భూవలయంబునం గల రాజులెల్లను బోయెద'రని యతిత్వరితంబుగా ఋతుపర్ణునకుం జెప్పు' మని పంచిన సుదేవుం డయోధ్యానగరంబునకుం బోయి ఋతుపర్ణుం గాంచి 'విదర్భాపురంబున దమయంతీ ద్వితీయ స్వయంవరం బెల్లియె యయ్యెడు' నని చెప్పిన**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విని ఋతుపర్ణుండు బాహుకుం జూచి 'నాకు దమయంతీ స్వయంవరంబుఁ జూడ నొక్క నాఁటన విదర్భకుం బోవలయు నీ యశ్వశిక్షానైపుణ్యంబుఁ బ్రకాశింపు' మనవుడు 'నట్ల చేయుదు' నని నలుండు దన మనంబున దుఃఖించి. 164

ప్రతిపదార్థం: మఱి= అదియునుగాక; విదర్భా, విభుండు+అగు= విదర్భ రాజైన; భీముండు= భీముడు; నలున్=నలుడిని; రోయన్+పంచి= వెదకటానికి పుత్తెంచి; ఎందునున్+కానక= ఎచటను అతడు కనిపించక పోవటంచేత; ఇంకను= తదుపరి; దమయంతికిన్= దమయంతి కొరకు; పునః స్వయంవరంబు= తిరిగి స్వయంవరం; రచియింపన్+పోయినన్= ఏర్పాటు చేయటానికి పూనగా; అందులకు= ఆ దమయంతీ ద్వితీయ స్వయంవరానికి; భూవలయంబునన్+కల= భూమండలంలో గల; రాజులు+ఎల్లను= రాజులందరును; పోయెదరు= వెళ్ళుతారు; అని= అని చెప్పి; అతి, త్వరితంబుగాన్= మిక్కిలి వేగంగా; ఋతుపర్ణునకున్= ఋతుపర్ణుడికి; చెప్పుము= చెప్పేది; అని= అంటూ; పంచిన= నియోగించగా; సుదేవుండు= సుదేవుడు; అయోధ్యానగరంబునకున్+పోయి= అయోధ్యాపురికి వెళ్ళి; ఋతుపర్ణున్+కాంచి= ఋతుపర్ణుడిని చూచి; విదర్భాపురంబునన్= విదర్భానగరంలో; దమయంతీ, ద్వితీయ, స్వయంవరంబు= దమయంతియొక్క రెండవ స్వయంవరం; ఎల్లియె(ఎల్లి+ఎ)= రేపే; అయ్యెడున్= జరుగుతుంది; అని, చెప్పిన; విని; ఋతుపర్ణుండు; బాహుకున్+చూచి= బాహుకుడిని చూచి; నాకు; దమయంతీ, స్వయంవరంబున్= దమయంతీ స్వయంవరాన్ని; చూడన్= చూడటానికి; ఒక్కనాఁటను+అ= ఒక్క దినంలోపలే; విదర్భకున్+పోవలయున్= విదర్భకు వెళ్ళాలి; నీ, అశ్వ, శిక్షా, నైపుణ్యంబున్= గుఱ్ఱాలను నడిపే నీ నేర్పరితనాన్ని; ప్రకాశింపుము= వెలుగొందజేయుము; అనవుడున్= అని చెప్పగా; అట్ల+చేయుదును+అని= అట్లే చేస్తానని చెప్పి; నలుండు= నలుడు; తన, మనంబునన్= తనమనస్సులో; దుఃఖించి= పరితపించి.

తాత్పర్యం: అంతేగాక, విదర్భప్రభువు భీముడు నలుడిని అన్వేషించటానికై పలువురిని పుత్తెంచి, ఎక్కడా ఆతడి జాడను తెలియజాలక, దమయంతికి ద్వితీయ స్వయంవరాన్ని ఏర్పాటు చేశాడనిన్నీ, అందుకు భూమండలంలోని రాజులందరూ వస్తున్నారనిన్నీ మిక్కిలి శీఘ్రంగా ఋతుపర్ణుడికి చెప్పుము'- అని దమయంతి చెప్పి పంపించింది. సుదేవుడు అంతట అయోధ్యాపురి చేరి ఋతుపర్ణుడిని సందర్శించి విదర్భానగరాన దమయంతీ ద్వితీయస్వయంవరం మరునాడు జరుగుతుందని చెప్పాడు. ఋతుపర్ణుడు అంతట బాహుకుడిని పిలిచి 'నాకు దమయంతీ స్వయంవరం చూడాలని ఉన్నది. అయితే, ఒక దినంలో మనం విదర్భ చేరవలసి ఉన్నది. నీ అశ్వశిక్షా చాతుర్యం వెలుగొందచేయుము' అని చెప్పగా బాహుకుడు అట్లాగే చేస్తానని చెప్పి, తన మనస్సులో మిక్కిలి పరితపించాడు.

ఆ. 'అడవిఁ దన్నుఁ బాసి యరిగిన నలిగి కా । కున్నె యిట్లు సేయ నువిద గడఁగె;
నెట్లయేనిఁ గూర్తు రింతులు మా కని । విశ్వసించువారు వెడఁగు లెందు. 165

ప్రతిపదార్థం: అడవిన్= అడవిలో; తన్నున్+పాసి+అరిగినన్= తనను ఎడబాసి వెళ్ళటంచేత; అలిగి, కాకున్నె= కోపగించుకొనటం వల్లనే కదా!; ఉవిద= ఇంతి (దమయంతి); ఇట్లు= ఈ విధంగా; (అంటే రెండవ స్వయంవరానికి పాల్పడటం); చేయన్= చేయటానికి; కడఁగెన్= పూనింది; ఎట్లు+అ+ఏనిన్= ఏవిధంగానైనను; ఇంతులు= ఆడువారు; మాకు= మమ్ము; కూర్తురు= ప్రేమిస్తూ ఉంటారు; అని; విశ్వసించువారు= నమ్మేవారు; ఎందున్= ఎచటనైనను; వెడఁగులు= వెర్రివారు (వివేకం లేనివారు).

తాత్పర్యం: 'ఆనాడు అడవిలో ఎడబాసి వెళ్ళాను- అనే కదా ఆమె నాపై కోపం పూనింది. లేకుంటే ఈ విధంగా మళ్ళీ రెండవస్వయంవరానికి పూనుకొంటుందా? తా మేమి చేసినా తమనే వనితలు ప్రేమిస్తూ ఉంటారని నమ్మే పురుషులు అవివేకులు'.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ఇది దమయంతిని గురించిన నలుడి అనుభూతి. దాన్ని నలుడు పురుషలోకానికి స్త్రీ జాతికి అన్వయించాడు. దమయంతి ఇంగితజ్ఞానం అద్భుతమైనది. ఆత్మాభిమానధురంధరుడైన నలుడి హృదయాన్ని కదలించగల శక్తి ద్వితీయ స్వయంవరవార్తకు మాత్రమే కలదని గుర్తించిన ఇంగితజ్ఞురాలు దమయంతి.

ఆ. సాధ్వి నాకుఁ గూర్చు సంతతి గలయది। చెలువ యిట్టు లేల చేయు? నైన
నెఱుఁగవలయు దీని నే ఋతుపర్ణుతోఁ। బోదు' నని నలుండు బుద్ధిఁ దలఁచి. 166

ప్రతిపదార్థం: సాధ్వి= సతీమణి అయిన దమయంతి; నాకున్+కూర్చు, సంతతి, కల+అది= నాపై అనురాగం గల బిడ్డలు కలది; చెలువ= మగువ (దమయంతి); ఇట్టులు+ఏల, చేయున్= ఈ విధంగా ఎందుకు చేస్తుంది? (అంటే ఎందుకు రెండవ స్వయంవరానికి పాల్పడుతుంది?); ఐనన్= అయినప్పటికిని; దీనిన్= ఈ విషయాన్ని; ఎఱుఁగవలయున్= అరసి తెలిసికోవలసి ఉన్నది; ఏన్= నేను; ఋతుపర్ణుతోన్+పోదున్= ఋతుపర్ణుడితో వెళ్ళుతాను; అని= అంటూ; నలుండు= నలుడు; బుద్ధిన్= మనస్సులో; తలఁచి= ఆలోచించి.

తాత్పర్యం: నలుడు తనలో తాను ఇట్లా తర్కించుకొన్నాడు- 'దమయంతి పతివ్రతాతిలకం. నాపట్ల అనురాగం గల బిడ్డలు ఉన్నారు ఆమెకు! ఆమె ఈ విధంగా రెండవ స్వయంవరానికి పాల్పడుతుందా? ఇది పరిశీలించవలసిన అంశం. కాబట్టి, నేను ఋతుపర్ణుడితో విదర్భకు వెళ్ళి సర్వం తెలుసుకొని వస్తాను.

వ. తొల్లి వార్ష్ణేయుండు దెచ్చిన తన రథంబునందు నిజహయంబుల నాలక్ష్యమాణ శుభలక్షణంబులు మనోవాయు వేగంబులు నైన వానిం బూన్చికొని వచ్చిన, ఋతుపర్ణుం డా రథంబెక్కునప్పుడు హయంబులు మ్రొగ్గినం జూచి 'యప్పేదగుఱ్ఱంబు లతిదూరం బెట్లు పోవనోపు? నొండు గుఱ్ఱంబులం బూన్పు' మనిన బాహుకుం డిట్లనియె. 167

ప్రతిపదార్థం: తొల్లి= మునుపు; వార్ష్ణేయుండు= వార్ష్ణేయుడు (నలుడి సారథిగా పని చేసినవాడు, ప్రస్తుతం ఋతుపర్ణుడి కొలువులో కుదురుకొన్నవాడు); తెచ్చిన= తీసికొని వచ్చిన; తన రథంబునందు= తనతేరుకు; ఆలక్ష్యమాణ, శుభలక్షణంబులు= మంచి లక్షణాలు కలిగి ఒప్పుతున్నట్టివి; మనస్+వాయు, వేగంబులు= మనోవేగం, వాయువేగం కలిగినట్టివి; ఐనవానిన్= అయినవాటిని; నిజ హయంబులన్= తన గుర్రాలను; పూన్చికొని వచ్చిన= రథానికి కట్టుకొని రాగా; ఋతుపర్ణుండు; ఆ, రథంబు+ఎక్కునప్పుడు= ఆ తేరును అధిరోహించేటప్పుడు; హయంబులు= గుర్రాలు; మ్రొగ్గినన్+చూచి= కొంచెం వంగటం గమనించి; ఆ+పేద, గుఱ్ఱంబులు= ఆ బడుగు గుర్రాలు; అతి దూరంబు= ఎక్కువ దూరం; ఎట్లు, పోవన్+ఓపున్?= ఏవిధంగా పోజాలుతాయి?; ఒండు, గుఱ్ఱంబులన్+పూన్పుము= వేరు గుర్రాలు తెచ్చి రథానికి కట్టుము; అనినన్= అని అనగా బాహుకుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా బదులు పలికాడు.

తాత్పర్యం: బాహుకుడు (నలుడు) ఇదివరలో వార్ష్ణేయుడు అయోధ్యకు తెచ్చి ఉంచిన తన రథానికి, మనోవేగం, వాయువేగం, సమస్త శుభలక్షణాలు గల తన గుర్రాలను కట్టి రథాన్నితెచ్చాడు. ఋతుపర్ణుడు ఆ రథాన్ని ఎక్కుతుండగా ఆ గుర్రాలు కొంచెం క్రిందికి మొగ్గాయి. ఋతుపర్ణుడు అది చూచి బాహుకుడితో 'ఈ బడుగు గుర్రాలు అంతదూరం ఎట్లా పోగలుగుతాయి? వేరే గుర్రాలను పూన్చుము' అని ఆదేశించాడు. అప్పుడు బాహుకుడు ఇట్లా బదులు పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'అవనీశ! యీ హయంబులు । పవనగతిం బఱచుఁ బ్రొద్దువడకుండఁగ నేఁ
డ విదర్భకు' ననవుడు విని । కువలయపతి మెచ్చి బాహుకున కి ట్లనియెన్. 168

ప్రతిపదార్థం: అవనీ+ఈశ!= భూమికి ఈశ్వరుడివంటివాడా, అంటే-ఓ మహారాజా!; ఈ హయంబులు= ఈ గుర్రాలు; నేఁడు+అ= ఈ దినాననే; విదర్భకున్= విదర్భా పట్టణానికి; ప్రొద్దు+పడకుండఁగన్= సూర్యాస్తమయం కాకుండానే; పవనగతిన్= వాయువేగంతో; పఱచున్= పరుగెత్తుతాయి; అనవుడు= అని చెప్పగా; విని= ఆలకించి; కువలయపతి= భూభర్త అయిన మహారాజు; మెచ్చి= అభినందించి; బాహుకునకున్= బాహుకుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఓ రాజా! ఈ గుర్రాలు వాయువేగంతో పరుగెత్తుతాయి. ప్రొద్దు క్రుంకే లోపలే విదర్భకు చేరేటట్లు చేస్తాయి'- అని బాహుకుడు అన్నాడు. అతడి మాటలకు మెచ్చుకొని ఋతుపర్ణుడు ఇట్లా పలికాడు.

వ. 'అట్లయిన నీ హయతత్త్వకౌశలం బెఱింగి నీకు నభిమతం బొనరింతు' నని రథం బెక్కి బాహుక వార్ష్ణేయ సహితుం డయి యరుగువాఁడు. 169

తాత్పర్యం: 'ఆ విధంగా నేడే ప్రొద్దుక్రుంకే లోపల విదర్భ చేరగలిగితే నీకు గుర్రాల స్వభావం తెలిసికోవటంలో, వాటికి శిక్షనివ్వటంలో ఉండే నైపుణ్యాన్ని గుర్తించి నీవుకోరింది ఇస్తాను' అని చెప్పి బాహుకుడితో వార్ష్ణేయుడితో కలిసి ఋతుపర్ణుడు పయనించాడు.

మధ్యాక్కర.

ఎదురను దవ్వులఁ జూచిన పొడవు లెల్లఁ దత్క్షణమ
కదియఁగా, నవ్వి యెంతయును దవ్వయి కనఁబడఁ బిఱుఁద
'నిది దినేశ్వరు రథమో! యనూరుఁడో! యితఁ' డంచు నపుడు
హృదయమునను గడు విస్మయం బందె నిక్ష్వాకుకులుఁడు. 170

ప్రతిపదార్థం: ఎదురను= ఎదురుగా; దవ్వులన్= దూరంగా; చూచిన= కనిపించిన; పొడవులు+ఎల్లన్= రూపాలన్నీ; (తద్,) క్షణము+అ= ఆ క్షణంలోనే; కదియఁగాన్= సమీపించగా; అవ్వి= అవి; ఎంతయును; దవ్వు+అయి= దూరమై; పిఱుఁదన్= వెనుకగా; కనన్+పడన్= కనిపించగా; ఇది= ఈ తేరు; దిన+ఈశ్వరు= సూర్యుడియొక్క; రథమో= తేరో?; ఇతఁడు= ఈ బాహుకుడు; అనూరుఁడో= సూర్యుడి రథసారథి అయిన అనూరుడో?; అంచున్= అంటూ; అపుడు; హృదయమునను= మనస్సులో; ఇక్ష్వాకు, కులుఁడు= ఇక్ష్వాకుకులంలో పుట్టిన ఋతుపర్ణుడు; కడు= మిక్కిలి; విస్మయంబు+అందెన్= ఆశ్చర్యం పొందాడు.

తాత్పర్యం: ఎదురుగా సుదూరంలో కనిపించిన రూపాలు ఆ క్షణంలోనే దగ్గరగా కనిపించి, వెనువెంటనే వెనుకగా మిక్కిలి దూరంలో కనిపించేవి. ఋతుపర్ణుడు 'ఇది సూర్యుడి రథమా? ఈ రథసారథి బాహుకుడా, అనూరుడా?' అని తన మనస్సులో మిక్కిలి ఆశ్చర్యం పొందాడు.

విశేషం: ఇది రథవేగవర్ణనం. దీనిని కాళిదాసమహాకవి వ్రాసిన అభిజ్ఞానశాకుంతలంలోని రథవేగవర్ణనతో సరిపోల్చి చూడండి. వృత్తలక్షణానికి ఈ ఆశ్వాసంలోని 22వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. వార్ష్ణేయుండును బాహుకురథంబు గడపునేర్పున కచ్చెరువడి యాత్మగతంబున. 171

తాత్పర్యం: వార్ష్ణేయుడు కూడా బాహుకుడు రథాన్ని నడిపే నైపుణ్యానికి ఆశ్చర్యపడి, మనస్సులో (ఇట్లా అనుకొన్నాడు)

క. 'ఈతండు శాలిహోత్రుఁడొ! । మాతలియో! నలుఁడొ యొరులు మానవులు జవో
పేతముగ నిట్లు రథహయ । నీతి యెఱుంగుదురె? ధారుణీవలయమునన్. 172

ప్రతిపదార్థం: ఈతండు= ఈ బాహుకుడు; శాలిహోత్రుఁడొ= అశ్వశాస్త్ర రచయితయైన శాలిహోత్ర మహర్షియో; మాతలియో!= దేవేంద్రుడి రథసారథి అయిన మాతలియో!; నలుఁడొ!; మానవులు, ఒరులు= మానవులు ఇంకెవ్వరు; ఇట్లు= ఈ విధంగా; జవ+ఉపేతముగన్= వేగంతో కూడినట్లు; రథ, హయనీతి= తేరులయొక్క, గుర్రాలయొక్క స్వభావపాటవ పద్ధతులు; ధారుణీ; వలయమునన్= భూమండలంలో; ఎఱుంగుదురె?= తెలిసి ఉన్నారా?

తాత్పర్యం: 'ఈ బాహుకుడు అశ్వశాస్త్రకర్తయైన శాలిహోత్ర మునీంద్రుడా? దేవేంద్రుడి రథసారథి అయిన మాతలియా? లేక నలుడా? తదితర మానవులు ఇంత శక్తిమంతంగా ఈ భూలోకంలో రథాలను గురించిన, గుర్రాలను గురించిన దర్శనజ్ఞానం కలవారు ఉన్నారా?

వ. వయోవిద్యావైభవంబుల నితండు నలుంబోలియు వికృతరూపధరుం డయిన కారణం బేమియొ? మహాపురుషులు దైవనియుక్తులై ప్రచ్ఛన్నవృత్తి నుండుదురు; వారి నెఱుంగంబోలునె?' యనుచుఁ జనునప్పుడు ఋతుపర్ణుండు దన యుత్తరీయంబు జారి భూతలంబుపయిం బడిన మలంగి చూచి 'బాహుకా! వార్ష్ణేయుండు వోయి యుత్తరీయంబు దెచ్చునంతకు రథగమనం బించుక మందంబు సేయు' మనిన బాహుకుండును 'నయ్యా! నీ యుత్తరీయంబు వడినయెడ యిచ్చోటికి నొక్క యోజనంబు గలదు; దాని వార్ష్ణేయుం డెట్లు దే నేర్చు?' నని రథగమనవేగమాహాత్మ్యంబు సెప్పుచు ననేకదేశంబులు గడచి చని యొక్క యెడ నగణ్యపర్ణ ఫలశాఖాలంకృతంబైన విభీతకవృక్షంబు గని; రంత ఋతుపర్ణుండు బాహుకున కిట్లనియె. 173

ప్రతిపదార్థం: వయో, విద్యా వైభవంబులన్= వయస్సుకు, జ్ఞాన నైపుణ్యానికి సంబంధించిన గొప్పతనంలో; ఇతండు= ఈ బాహుకుడు; నలున్+పోలియు= నలుడిని పోలి ఉన్నప్పటికిని; వికృత, రూప, ధరుండు+ఐన= వికారరూపాన్ని ధరించినవాడు కావటానికి; కారణంబు+ఏమియొ= హేతువు ఏమై ఉండవచ్చునో?; మహాపురుషులు= గొప్పవారు; దైవ, నియుక్తులు+ఐ= దైవంచేత నియమించబడినవారై; ప్రచ్ఛన్నవృత్తిన్= అజ్ఞాతవర్తనంతో; ఉండుదురు= ఉంటారు; వారిన్= అటువంటివారిని (అంటే అజ్ఞాతరూపంలో ఉన్నవారిని); ఎఱుంగన్+పోలునె= తెలిసికొనటానికి వీలవుతుందా?; అనుచున్= అని తలస్తూ; చనునప్పుడు= వెళ్ళేటప్పుడు; ఋతుపర్ణుండు; తన+ఉత్తరీయంబు= తన పైవలువ; జారి= క్రిందకి ఒరిగి; భూతలంబు, పయిన్+పడిన= భూమిపై పడగా; మలంగి= వెనుకకు తిరిగి; చూచి= అరసి; బాహుకా= ఓ బాహుకా!; వార్ష్ణేయుండు+పోయి= వార్ష్ణేయుడు వెళ్ళి; ఉత్తరీయంబు= పై వస్త్రం; తెచ్చునంతకు= తీసుకొని వచ్చేవరకు; రథగమనంబు= రథం వెళ్ళటం; ఇంచుక= కొంచెం; మందంబు+చేయుము= తగ్గించుము; అనిన= అని చెప్పగా; బాహుకుండును= బాహుకుడును; అయ్యా!= ఆర్యా!; నీ+ఉత్తరీయంబు= నీ పైపుట్టం; పడిన+ఎడ= పడినచోటు; ఈ+చోటికిన్= ఇచటికి; ఒక్క యోజనంబు= ఒక ఆమడదూరం; కలదు; దాని= ఆ ఉత్తరీయాన్ని; వార్ష్ణేయుండు; ఎట్లు= ఏ విధంగా; తేనేర్చును= తీసికొని రాగలడు?; అని=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అని చెప్పి; రథ, గమన, వేగ, మాహాత్మ్యంబు+చెప్పుచున్= రథం వెళ్ళే వేగంయొక్క గొప్పతనాన్ని గురించి చెప్తుతూ; అనేక, దేశంబులు= పెక్కుదేశాలు; కడచి= దాటి; చని= వెళ్ళి; ఒక్క+ఎడన్= ఒకచోట; అగణ్య, పర్ణ, ఫల, శాఖా+అలంకృతంబు+అయిన= లెక్కకు మిక్కిలి అయిన ఆకులతో, పండ్లతో, కొమ్మలతో అలంకరించబడిన; విభీతక, వృక్షంబున్+కనిరి= విభీతకమనే చెట్టును చూశారు (విభీతకవృక్షము= తాండ్రచెట్టు); అంతన్= అంతట; ఋతుపర్ణుండు; బాహుకునకు= బాహుకుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ బాహుకుడు వయస్సుకు, చదువుకు సంబంధించిన గొప్పతనంలో నలుడికి సమానుడే! అయితే ఆకారంలో పోలిక లేదుగదా! రూపం మారటానికి వేరే కారణం ఏదైనా ఉన్నదా? మహాపురుషులు కారణాంతరాల చేత మారురూపంలో ఇతరులకు తెలియ రాకుండ ఉండటం కద్దు. వారిని గుర్తుపట్టటం కష్టం కదా!'- అని వార్ష్ణేయుడు తన మనస్సులో తర్కించుకొంటుండగా, ఋతుపర్ణుడి ఉత్తరీయం జారి నేలపై పడింది. అంతట ఋతుపర్ణుడు 'బాహుకా! రథం ఇంచుక ఆపు! వార్ష్ణేయుడు దిగి నేలపై పడ్డ నా ఉత్తరీయం తెస్తాడు'- అని అన్నాడు. అంతట బాహుకుడు 'మహారాజా! నీ ఉత్తరీయం పడిపోయిన చోటు ఇచటికి ఇప్పుడు ఒక ఆమడ దూరంలో ఉన్నది. (అంటే రథం కొన్ని నిమేషాలలో మిక్కిలి వేగంగా యోజనదూరం పయనించింది). ఇక వార్ష్ణేయుడు అంతదూరం పాదచారి అయి వెళ్ళి ఎట్లా ఆ వస్త్రాన్ని తేగలడు?'- అని బదులు పలికి రథం పోతున్న వేగంయొక్క మహిమను నిరూపించి చెప్పాడు. అటువంటి వేగంతో రథం పయనించి పెక్కు దేశాలను దాటి వెళ్ళింది. ఒకచోట దారిలో ఒక పెద్ద విభీతకవృక్షం (తాండ్రచెట్టు) దట్టమైన ఆకులతో, లెక్కింప నలవికాని రెమ్మలతో, కొమ్మలతో పండ్లతో కన్పించింది. అప్పుడు ఋతుపర్ణుడు బాహుకుడితో ఇట్లా పలికాడు.

ఆ. 'ఎల్లవారు నెఱుఁగ రెల్లవానిని; భిన్న। విషయు లెల్లవారు విద్యలందుఁ;
దొలఁగ కే నెఱుంగుదును దృష్టిమాత్రన । సకల మైన వస్తుచయముసంఖ్య. 174

ప్రతిపదార్థం: ఎల్లవారున్= అందరు; ఎల్లవానిని= సమస్తమైన అంశాలను; ఎఱుఁగరు= తెలియజాలరు; విద్యలందున్= జ్ఞాననైపుణ్యాలలో; ఎల్లవారు= అందరు; భిన్న విషయులు= వేరువేరు విషయాలలో నేర్పరులు; తొలఁగక= తప్పకుండ; దృష్టి మాత్రన= చూపుతో మాత్రమే; సకలము+ఐన= సమస్తమైన; వస్తు, చయము, సంఖ్య= వస్తు సమూహాల లెక్క; ఏను= నేను; ఎఱుంగుదును= తెలిసికొనగలను.

తాత్పర్యం: 'అందరికి అన్ని విషయాలు తెలియవు కదా! జ్ఞాన నైపుణ్యాలలో అందరు వేరు వేరు విషయాలలో గొప్పవారు. నేను చూచినంత మాత్రంతోనే అన్ని వస్తుసమూహాలకు సంబంధించిన సంఖ్యను తప్పిపోకుండా లెక్కకట్టి చెప్పగలను.

విశేషం: సంస్కృతంలోని - "ముఖే ముఖే సరస్వతీ" అనే లోకోక్తిని పై పద్యంలోని ప్రథమ ఖండానికి సారసంగ్రహంగా ఎన్నవచ్చును. ఒక్కొక్కరికి ఒక్కొక్క ప్రజ్ఞ ఉంటుంది. ఎవరున్నూ సర్వజ్ఞులు కారు. ఈ సందర్భంలో సంస్కృతభారతంలో ఈ శ్లోకం ఉంది: "సర్వః సర్వం న జానాతి సర్వజ్ఞో నాస్తి కశ్చన। నైకత్ర పరినిష్ఠాస్తి జ్ఞానస్య పురుషే క్వచిత్॥'' నలోపాఖ్యానం 'ఇతివృత్తం'గా ఎన్నితే అది నిరుపమానమైన కథ. అందులో కథాశిల్పం మాత్రమే కాక ఎన్నో అంతరార్థాలు హృదయంగమంగా నిక్షిప్తాలు. నలుడు రథసారథ్యంలో నిపుణుడు. ఋతుపర్ణుడు గణితశాస్త్రప్రవీణుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇవ్విభీతకంబున ఫల పర్ణ సముదాయ సంఖ్యఁ జెప్పెద విను; మీ రెండు శాఖలం గల పర్ణ ఫలంబులు పదివేలు నొక్కండు; దక్కిన శాఖలం గల యవి రెండువేలుం దొంబదే; ననిన బాహుకుండు విని 'వీని నెన్నికాని నిశ్చయింప నేర' నని తన రథంబు నిలిపి యా వృక్షం బాక్షణంబ యురలం ద్రోచి యయ్యై శాఖలం గల యాకులు పండులు నెన్నిన ఋతుపర్ణుండు సెప్పినయన్ని యయిన నచ్చెరువడి, 'యివ్విద్య నాకు నుపదేశింపవలయు' నని యడిగిన ఋతుపర్ణుం డిట్లనియె. 175

ప్రతిపదార్థం: ఈ+విభీతకంబునన్= ఈ తాండ్రచెట్టులో; ఫల, పర్ణ, సముదాయ సంఖ్యన్= పండ్లు, ఆకులు వెరసి మొత్తం సంఖ్యను; చెప్పెదన్= చెపుతాను; విను= వినుము; ఈ రెండు శాఖలన్+కల= ఈ రెండు కొమ్మలలో ఉండే; పర్ణఫలంబులు= ఆకులు, పండ్లు; పదివేలున్+ఒక్కండు= పదివేల ఒకటి; తక్కిన, శాఖలన్+కల+అవి= మిగిలిన కొమ్మలలో కలవి; రెండు వేలున్+తొంబది+ఏను+అనినన్= రెండువేల తొంబయిఅయిదు అని చెప్పగా; బాహుకుండు= బాహుకుడు; విని= ఆలకించి; వీనిన్+ఎన్నికాని= వీటిని లెక్కపెట్టికాని; నిశ్చయింపనేరను+అని= నిర్ణయించజాలనని పల్కి; తన రథంబు, నిలిపి= తన తేరు ఆపి; ఆ వృక్షంబు= ఆ చెట్టును; ఆ క్షణంబు+అ= వెంటనే; ఉరలన్+త్రోచి= క్రింద పడేట్లు త్రోసి; అయ్యై, శాఖలన్+కల= ఆయా కొమ్మలలో ఉండే; ఆకులు, పండులున్; ఎన్నినన్= లెక్కపెట్టగా; ఋతుపర్ణుండు; చెప్పిన+ అన్ని+ అయినన్= చెప్పినట్లే అన్నియేఉండగా; అచ్చెరువు+పడి= ఆశ్చర్యంపొంది; ఈ+విద్య; నాకున్= నాకు కూడ; ఉపదేశింప వలయును+అని; అడిగినన్= అర్థించగా; ఋతుపర్ణుండు= ఋతుపర్ణుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విభీతకవృక్షంలో ఉండే పండ్లు, ఆకులు మొత్తం లెక్కచెప్పుతాను వినండి. ఈ రెండు కొమ్మలలోను గల ఆకులు, పండ్లు కలిసి పదివేల ఒకటి. తక్కిన కొమ్మలలో కలవి రెండువేల తొంబయిఅయిదు'. అప్పుడు బాహుకుడు వీటిని లెక్కపెట్టితే కాని నిజమని నిశ్చయించజాలనని పలికి, తన రథాన్ని ఆపి, అ క్షణమే ఆ వృక్షాన్ని క్రింద పడద్రోసి ఆయా కొమ్మలలో ఉండే ఆకులు, పండ్లు లెక్కపెట్టగా, ఋతుపర్ణుడు చెప్పిన సంఖ్యలతో సరిపోయాయి. బాహుకుడు ఋతుపర్ణుడి ప్రజ్ఞకు ఆశ్చర్యపోయి ఆ విద్యను తనకు ఉపదేశించుమని ప్రార్థించాడు. అంత అతడికి ఋతుపర్ణుడు ఈ విధంగా చెప్పాడు.

క. 'ఇది యక్షహృదయ మనఁగా । విదితం బగు విద్య; దీని విధ్యుక్తముగా
మది నెఱుఁగు నరుఁడు సంఖ్యా । విదుఁ డగు దుష్కృతకళంకవిషముక్తుఁ డగున్. 176

ప్రతిపదార్థం: ఇది= ఈ ప్రజ్ఞ; అక్ష హృదయము; అనన్+కాన్= అని చెప్పబడుతూ; విదితంబు+అగు, విద్య= తెలియబడినదైన జ్ఞాననైపుణ్యం; దీనిన్= ఈ విద్యను; విధి+ఉక్తముగా= విధులందు చెప్పబడినట్లుగా (అంటే శాస్త్రసూత్రవిధులలో నిర్దేశించబడినట్లుగా); మదిన్= మనస్సులో; ఎఱుఁగు నరుఁడు= తెలిసే మనుజుడు; సంఖ్యావిదుఁడు+అగు= సంఖ్యల ఆంతర్యం తెలిసినవాడు అవుతాడు; దుష్కృత, కళంక, విషముక్తుఁడు+అగున్= పాపాలనుండి, చెడుగుణాలనుండి, విషాలనుండి తొలగినవాడు అవుతాడు.

తాత్పర్యం: 'ఇది అక్షహృదయం అని ప్రసిద్ధికెక్కిన విద్య. దీన్ని శాస్త్రీయంగా అభ్యసించిన మనుజుడు సంఖ్యావేత్త అవుతాడు. అతడు పాపాలనుండి, దుర్గుణాలనుండి, విషంనుండి విముక్తి పొందుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. సకలగుణప్రసిద్ధుఁ డగు సర్వహితుం డగుఁ జూవె!' యంచు బా
హుకునకుఁ బ్రీతితోడ విధియుక్తముగా నుపదేశ మిచ్చె న
త్యకుటిలబుద్ధి నక్షహృదయంబుఁ గరంబు రయంబుతో విద
ర్భకుఁ జను వేడ్కఁజేసి ఋతుపర్ణుఁడు పూర్ణమనఃప్రసన్నుఁడై. 177

ప్రతిపదార్థం: సకల, గుణ, ప్రసిద్ధుఁడు+అగు= అన్ని మంచి లక్షణాలు కలవాడయి; సర్వహితుండు+అగున్+చూవె, అంచున్= అందరికిని మేలు చేకూర్చేవాడు అవుతాడు సుమా అంటూ; అతి+అకుటిల, బుద్ధిన్= మిక్కిలి వంకరకాని మనస్సుతో అంటే సరళమైన బుద్ధితో; కరంబు= మిక్కిలి; రయంబుతోన్= త్వరగా; విదర్భకున్+చను= విదర్భకు పోయే; వేడ్కన్+చేసి= కుతూహలం చేత; ఋతుపర్ణుఁడు; పూర్ణ, మనస్+ప్రసన్నుఁడు+ఐ= నిండు మనస్సుతో అనుకూలుడై; అక్షహృదయంబున్= అక్షహృదయం అనే గణితవిద్యను; ప్రీతితోడన్= సంతోషంతో; బాహుకునకున్; విధియుక్తముగాన్= శాస్త్రీయంగా; ఉపదేశము+ఇచ్చెన్= ప్రబోధం చేశాడు.

తాత్పర్యం: 'ఈ విద్యను పొందిన వ్యక్తి సకల గుణప్రసిద్ధుడై, విశ్వశ్రేయస్సును ఒనగూర్చేవాడు కాగలడు సుమా!' అని అంటూ ఋతుపర్ణమహారాజు మిక్కిలి ప్రసన్నుడై, నిండు హృదయంతో, త్వరితంగా విదర్భకు వెళ్ళవలెననే కుతూహలంతో, సంప్రీతితో బాహుకుడికి అక్షహృదయం అనే గణితవిద్యను శాస్త్రీయంగా ఉపదేశించాడు.

విశేషం: ఇందులో విద్యయొక్క పరమార్థం వివరించబడింది. విశ్వశ్రేయం, సర్వగుణ పరిపూర్ణమైన యశస్సు- విద్యాదర్శాలు. విద్య శాస్త్రీయంగా ఉపదేశించబడాలి. గురువుకు ఉండవలసిన లక్షణాలు: కౌటిల్యం ఏ మాత్రం లేని సరళబుద్ధి, శిష్యుడిపై వాత్సల్యం.

వ. ఇట్లు నలుండు ఋతుపర్ణువలన నక్షహృదయంబు వడసి సంతుష్టుండై 'నీకు నశ్వహృదయం బిచ్చెదఁ బరిగ్రహింపు' మనిన ఋతుపర్ణుం 'డట్ల చేయుదు, నది యంతకు నీయంద యుండనిమ్ము; నా వలసినప్పుడు గొందు' ననియె; నంత నయ్యక్షహృదయ సామర్థ్యంబున నప్పుడు. 178

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; నలుండు; ఋతుపర్ణువలనన్= ఋతుపర్ణుడినుండి; అక్షహృదయంబు= అక్షహృదయం అనే విద్య; పడసి= పొంది; సంతుష్టుండు+ఐ= తనివిచెందినవాడై; నీకున్; అశ్వహృదయంబు= అశ్వహృదయమనే విద్యను; ఇచ్చెదన్= ఉపదేశిస్తాను; పరిగ్రహింపుము= పుచ్చుకొనుము; అనినన్= అని చెప్పగా; ఋతుపర్ణుండు; అట్ల, చేయుదున్= ఆ రీతిగానే చేయగలను; అది= ఆ విద్య; అంతకున్= అంతవరకు, అంటే నేను పరిగ్రహించేవరకు; నీయందు+అ= నీ ఒద్దనే; ఉండనిమ్ము= ఉంచుము; నా వలసినప్పుడు= నాకు కావలసినప్పుడు; కొందున్= గ్రహించగలను; అనియెన్= అని చెప్పాడు; అంతన్= అటుపిమ్మట; ఆ+అక్షహృదయ, సామర్థ్యంబునన్= ఆ అక్షహృదయవిద్యయొక్క శక్తివలన; అప్పుడు.

తాత్పర్యం: ఈ విధంగా నలుడు ఋతుపర్ణుడివలన అక్షహృదయవిద్య సంపాదించి మిక్కిలి సంతృప్తి చెందాడు. అంత బాహుకుడు ఋతుపర్ణుడితో 'నీకు అశ్వహృదయాన్ని ఉపదేశిస్తాను; పరిగ్రహించు' మని చెప్పగా ఋతుపర్ణుడు 'అట్లే పరిగ్రహిస్తాను. ఆ విద్య అంతవరకు నీ దగ్గరే ఉండనిమ్ము. నాకు అవసరమైనపుడు స్వీకరిస్తాను' - అని బదులు పలికాడు. పిదప ఆ అక్షహృదయమనే విద్యామహిమవలన అప్పుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నలుండు గలిచేత విముక్తుం డయి విదర్భకుఁ బోవుట (సం. 3-72-7)

క. నలుఁ దొల్లి యాక్రమించిన । కలి గర్కోటకవిషంబు గ్రక్కుచు నొడలన్
వెలువడి, నలునకు విహితాం । జలియై త న్నెఱుఁగఁ జెప్పెఁ జంచలుఁ డగుచున్. 179

ప్రతిపదార్థం: నలున్= నలుడిని; తొల్లి= మునుపు; ఆక్రమించిన= ఆవహించిన; కలి= కలిపురుషుడు; ఒడలన్= శరీరం నుండి; కర్కోటక, విషంబు, గ్రక్కుచు; వెలువడి= బయటకు వచ్చి; నలునకు, విహిత+అంజలి+ఐ= నలుడికి నమస్కరించినవాడై; చంచలుఁడు+అగుచున్= వణుకుతూ; తన్ను+ఎఱుఁగన్+చెప్పెన్= తనను తెలియజేసికొంటూ మాట్లాడాడు.

తాత్పర్యం: మునుపు నలుడిని ఆవహించిన కలిపురుషుడు కర్కోటకుడి విషాన్ని క్రక్కుతూ, నలుడిశరీరంనుండి బయటకు వచ్చి, అతడికి నమస్కరించి, గజగజ వణికిపోతూ తనను తెలియజేసికొన్నాడు.

ఆ. వానిఁ జూచి నలుఁడు దా నల్గి శాప మీ । నున్నఁ, గలి యెఱింగి 'నిన్నుఁ బొంది
యహివిషంబుచేత ననిశంబు దగ్ధుండ । నైతి; నింక నాకు నలుగ వలదు.' 180

ప్రతిపదార్థం: వానిన్= ఆ కలిని; చూచి= కాంచి; నలుఁడు= నలుడు; తాను+అల్గి= తాను కోపించి; శాపము+ఈన్+ఉన్నన్= శాపం ఇవ్వటానికి సిద్ధంగా ఉండటాన్ని; కలి= కలిపురుషుడు; ఎఱింగి= తెలిసికొని; నిన్నున్+పొంది= నిన్ను ఆవహించి; అహి, విషంబుచేతన్= పాముయొక్క విషంచేత; అనిశంబు= ఎల్లప్పుడు; దగ్ధుండన్+ఐతిన్= తగులబడిపోయాను; ఇంక= ఇక; నాకున్+అలుగ, వలదు= నామీద ఆగ్రహించవలదు.

తాత్పర్యం: ఆ కలిపురుషుడిని చూచి నలుడు కోపించి, అతడిని శపించటానికి సంసిద్ధుడయ్యాడు. ఆ సంగతి తెలిసికొని కలి 'నిన్ను ఆవహించటంచేత ఎల్లప్పుడు కర్కోటకవిషంచేత తగులబడిపోయాను. ఇంక వేరే దండన ఎందుకు? దయచేసి నాపై ఆగ్రహం విడువుము'.

వ. 'నిన్నును నీ చెలువను గీర్తించిన జనంబులు నావలని భయంబు వొరయరు; నాకుం గరుణింపు' మనిన నలుండు గోపం బుడిగెఁ; గలియు నవ్విభీతకవృక్షంబు నాశ్రయించె; నది మొదలుగా విభీతకం బప్రశస్తం బయ్యెఁ; నట్లు నలుండు వికృత రూప మాత్రంబు దక్కఁ దక్కిన దుష్కృతంబులవలన విముక్తుండై రథం బెక్కి యతివేగంబున ఋతుపర్ణ వార్ష్ణేయ సహితుండై విదర్భకుం జనియె; నంత సాయాహ్నంబున. 181

ప్రతిపదార్థం: నిన్నును, నీ చెలువను= నిన్నును మరియు నీ భార్య అయిన దమయంతిని; కీర్తించిన జనంబులు= కొనియాడిన ప్రజలు; నావలని భయంబు= నా మూలంగా ఏర్పడే భయాన్ని; పొరయరు= పొందరు (అంటే నలదమయంతులను కీర్తించిన వారు కలిదోషవిముక్తులు అవుతారు); నాకున్+కరుణింపుము+అనినన్= నాపట్ల దయ చూపుము అని అడుగగా; నలుండు, కోపంబు+ఉడిగెన్= నలుడు ఆగ్రహాన్ని వీడాడు; కలియున్= ఆ కలిపురుషుడున్నూ; ఆ+విభీతకవృక్షంబున్= ఆ విభీతకమనే చెట్టును; ఆశ్రయించెన్= ఆవహించాడు; అది, మొదలుగా= అప్పటినుండి; విభీతకంబు= విభీతకవృక్షం; అప్రశస్తంబు+అయ్యెన్= దుష్టమైనదిగా ఎన్నబడింది; అట్లు= ఆ విధంగా; నలుండు= నలుడు; వికృత, రూప, మాత్రంబున్+తక్క= వికారమైన ఆకృతిమాత్రం తప్ప; తక్కిన= మిగిలిన; దుష్కృతంబులవలన= పాపాలనుండి; విముక్తుండు+ఐ= ముక్తిచెందిన వాడై; రథంబు+ఎక్కి= తేరెక్కి; అతి వేగంబునన్= మిక్కుటమైన రయంతో; ఋతుపర్ణ, వార్ష్ణేయ, సహితుండు+ఐ= ఋతుపర్ణుడితో, వార్ష్ణేయుడితో కూడినవాడై; విదర్భకున్+చనియెన్= విదర్భకు వెళ్ళాడు; అంతన్= అటుపిమ్మట; సాయ+అహ్నంబున= ప్రొద్దు క్రుంకేవేళ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నిన్ను, నీ భార్య అయిన దమయంతినీ ధ్యానించినవారు నావలన భీతిని పొందరు (అంటే కలిదోషవిముక్తులు అవుతారు). దయచేసి నన్ను క్షమించి నామీద కోపం విడువుము'- అని కలిపురుషుడు ప్రార్థించగా నలుడు ఆగ్రహం విడిచాడు. కలి అంతట విభీతకవృక్షాన్ని ఆవహించాడు. ఆనాటినుండి విభీతకవృక్షం మంచిది కాదనే భావం విస్తరించింది. అట్లా నలుడు వికృతమైన ఆకృతి వినా తదితర పాపాలనుండి విముక్తుడై రథాన్నెక్కి మిగులవేగంతో ఋతుపర్ణ వార్ష్ణేయులతో కలిసి విదర్భకు వెళ్ళాడు. అంత ప్రొద్దుక్రుంకేవేళ.

క. మానుగ ఋతుపర్ణుఁడు భీ । మానుజ్ఞాతుఁడయి చొచ్చె నా ప్రోలు రథ
ధ్వానంబు మ్రోయుచుండఁగ । నానాదిఙ్ముఖములను ఘనధ్వనిఁబోలెన్. 182

ప్రతిపదార్థం: మానుగన్= ఒప్పునట్లుగా, అంటే వైభవోపేతంగా; ఋతుపర్ణుఁడు= ఋతుపర్ణమహారాజు; భీమ+అనుజ్ఞాతుఁడు+అయి= భీముడిచే అనుమతించబడినవాడై; రథధ్వానంబు= తేరుయొక్క చప్పుడు; నానాదిక్+ముఖములను= దిగ్దిగంతరాలలో; ఘనధ్వని+పోలెన్= మేఘగర్జనలవలె; మ్రోయుచుండఁగ= నినదిస్తుండగా; ఆ, ప్రోలు= ఆ నగరాన్ని; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: ఋతుపర్ణుడు, భీమరాజు అనుమతితో వైభవోపేతంగా విదర్భాపురిలో ప్రవేశించాడు. ఆతడు పురప్రవేశం చేస్తుంటే ఆతడి రథఘోష దిగ్దిగంతరాలలో మేఘగర్జనవలె ప్రతిధ్వనించింది.

సీ. దమయంతి యా రథధ్వని విని, యిది నలు । రథఘోష మని యనురాగ మొంది,
'నలు నిషధేశుఁ బుణ్యశ్లోకు లోకోప । కారకుఁ జూడంగఁ గాంతు నేఁడు;
ఘనభుజుఁ జూడంగఁ గాననినాఁడుఁ ద । ద్భుజ పరిరంభణోద్భూత సుఖముఁ
బడయని నాఁడును బ్రాణముల్ విడుతు నే' । నని తలంచుచుఁ గమలాయతాక్షి

ఆ. యా రథాధిరూఢుఁడై వచ్చు ఋతుపర్ణుఁ । జూచి యప్పు డధికశోకతప్త
యగుచు నుండె; నంత నా ఋతుపర్ణుండు । భీముఁ గాన వచ్చెఁ బ్రియముతోడ. 183

ప్రతిపదార్థం: దమయంతి; ఆ, రథ, ధ్వని, విని= ఆ తేరు మ్రోత ఆలకించి; ఇది; నలు, రథ, ఘోషము+అని= నలుడి రథధ్వనియే అని; అనురాగము+ఒంది= ప్రేమ ఏర్పడి; నలున్= నలుడిని; నిషధ+ఈశున్= నిషధరాజును; పుణ్యశ్లోకున్= పవిత్రమైన చరిత్ర కలవాడిని; లోక+ఉపకారకున్= లోకానికి శ్రేయస్సును ఒనగూర్చేవాడిని; నేఁడు= ఈ దినం; చూడంగన్+కాంతున్= దర్శించగలను; ఘనభుజున్= గొప్ప భుజాలు కలవాడిని- అంటే పరాక్రమవంతుడిని; చూడంగన్+కానని, నాఁడు= చూడలేకపోయిన దినాన; తద్+భుజ, పరిరంభణ+ఉద్భూత, సుఖమున్+పడయని నాఁడును= ఆతడియొక్క భుజాలవలన ఏర్పడిన కౌగిలినుండి కలిగిన సౌఖ్యం పొందనివేళ; ప్రాణముల్, విడుతును+ఏను+అని= ప్రాణాలను విడిచి పెట్టుతానని తలస్తూ; కమల+ఆయత+అక్షి= పద్మాలను పోలిన సోగకన్నులు కల దమయంతి; ఆ, రథ+ఆరూఢుఁడు+ఐ= ఆ తేరును ఎక్కి; వచ్చు= వస్తున్న; ఋతుపర్ణున్+చూచి= ఋతుపర్ణుడిని చూచి; అప్పుడు; అధిక, శోక, తప్త= మిక్కుటమైన శోకంతో ఉడికినట్టిది; అగుచున్+ఉండెన్= అవుతున్నది; అంతన్= అంతట; ఆ, ఋతుపర్ణుండు; ప్రియముతోడన్= ప్రీతితో; భీమున్= భీమరాజును; కానవచ్చెన్= చూడవచ్చాడు.

తాత్పర్యం: దమయంతి ఆ రథఘోష వినగానే అది నలుడి రథమని గుర్తుపట్టి అనురక్తి చెందింది. నిషధేశుడు, విశ్వజనీనచరితుడు, పుణ్యశ్లోకుడు, లోకోపకారి, పరాక్రమోపేతుడు అయిన నలుడిని నేడు చూడగలుగుతానని

మిక్కిలి సంతోషించింది. ఆతడిని చూడనినాడు, ఆతడి కౌగిలిలో తిరిగి సుఖం అనుభవించనినాడు ప్రాణాలను విడిచిపెట్టుతానని తలపోసి, పద్మాలవంటి సోగకన్నులతో రథంరాకకై నిరీక్షించింది. ఆ రథంపై ఆసీనుడై కనిపించింది ఋతుపర్ణుడు. అతడిని చూచి దమయంతి మిక్కుటమైన శోకవేదనలో మునిగింది. ఋతుపర్ణుడు ప్రీతితో భీమరాజును సందర్శించటానికి వచ్చాడు.

వ. భీముండును వానిం బూజించి యొక్క రమ్యహర్మ్యంబున విడియించిన, ఋతుపర్ణుం డప్పురంబున స్వయంవరం బను శబ్దంబు మొదలుగా వినం గానక యాత్మగతంబున. 184

ప్రతిపదార్థం: భీముండును= భీమరాజును; వానిన్= ఆతడిని, ఆ ఋతుపర్ణ మహారాజును; పూజించి= అర్చించి, ఒక్క=ఒక; రమ్యహర్మ్యంబునన్= అందమైన మేడలో; విడియించినన్= విడిది ఏర్పాటుచేయించగా; ఋతుపర్ణుండు; ఆ+పురంబునన్= ఆ పట్టణంలో; స్వయంవరంబు= స్వయంవరం; అను, శబ్దంబు= అనే మాట; మొదలుగా, వినన్+కానక= మొదలైన శబ్దాలు వినిపించనందువలన; ఆత్మగతంబునన్= తనలో తాను.

తాత్పర్యం: ఆ ఋతుపర్ణుడికి అతిథిసత్కారాలు చేసి భీమరాజు రమణీయమైన ఒక పెద్దమేడలో అతడికి విడిది ఏర్పాటు చేశాడు. కాని ఆ పురంలో స్వయంవరం అనే శబ్దంగాని, స్వయంవరానికి సంబంధించిన సందడిగాని వినరాక ఋతుపర్ణుడు తనలో తాను (ఇట్లా తలపోశాడు).

క. 'ధరణిఁ గల రాజు లిట యె । వ్వరు వచ్చినవారు లేరు; వైదర్భి యొరున్
వరియించు నంత ధర్మే । తరచరితయె?' యనుచు నుండెఁ దద్దయు లజ్జన్. 185

ప్రతిపదార్థం: ధరణిన్+కల, రాజులు= భూమిపై కల ప్రభువులు; ఇట= ఇటు; ఎవ్వరు, వచ్చినవారు, లేరు= వచ్చినవారు ఎవరున్నూ లేరు; వైదర్భి= విదర్భరాజపుత్రిక అయిన దమయంతి; ఒరున్= ఇంకొకరిని; వరియించు+అంత= భర్తగా ఎన్నుకొనేంతటి; ధర్మ+ఇతర, చరితయె= ధర్మ బాహ్యమైన నడవడి కలదా?; అనుచున్= అని తలపోస్తూ; తద్దయు= మిక్కిలి; లజ్జన్= సిగ్గుతో; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: 'భూమండలంలోని రాజులు ఎవరున్నూ ఇక్కడికి రాలేదు. విదర్భరాజపుత్రిక అయిన దమయంతి ఇంకొక మగని వరించేటంత అధర్మప్రవర్తన కలదా?'- అని తలపోస్తూ ఋతుపర్ణుడు మిక్కుటమయిన సిగ్గుతో ఉండిపోయాడు.

వ. బాహుకుండును రథశాల రథాశ్వంబుల బంధించి రథసమీపంబున విశ్రమించియుండె; నంత దమయంతి బాహుక వార్ష్ణేయులతోడ వచ్చిన ఋతుపర్ణుం జూచి విఫలమనోరథయై, యుండనోపక, కేశిని యను దానిం బిలిచి' 'ఋతుపర్ణు నయోధ్యాపతింగా వార్ష్ణేయు సూతపుత్త్రుంగా నెఱింగితి; బాహుకుం డను వాఁ డెవ్వండో? వానియందు నా హృదయంబు ముదితం బగుచున్నయది; మన పర్ణాదునకుఁ బ్రతివచనం బిచ్చినవాఁడు వాఁడ కావలయు; వానికడకుం బోయి యెఱింగి ర' మ్మని పంచిన, నదియును బోయి బాహుకుం, గని 'దమయంతి నీ కుశలం బడుగఁ బుత్తెంచె; నిందుల కేమి కారణంబున వచ్చి?' తనిన దానికి బాహుకుం డిట్లనియె. 186

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: బాహుకుండును= బాహుకుడును; రథశాల= రథాల చావడిలో; రథ+అశ్వంబుల= రథాలకు పూన్చిన గుర్రాలను; బంధించి= కట్టి; రథ సమీపంబున= రథానికి దగ్గరగా; విశ్రమించి+ఉండెన్= సేదదీరుతూ ఉండినాడు; అంతన్= అంతట; దమయంతి; బాహుక, వార్ష్ణేయులతోడ, వచ్చిన= బాహుకుడితో వార్ష్ణేయుడితోపాటు వచ్చిన; ఋతుపర్ణున్+చూచి= ఋతుపర్ణుడిని చూచి; విఫలమనోరథ+ఐ= ఫలించని కోరిక కలదై; ఉండన్+ఓపక= ఉండజాలక; కేశిని+అనుదానిన్+పిలిచి= కేశిని అనే దాసిని పిలిచి; ఋతుపర్ణున్= ఋతుపర్ణుడిని; అయోధ్యాపతిన్+కా= అయోధ్యకు రాజుగా; వార్ష్ణేయు= వార్ష్ణేయుడిని; సూతపుత్త్రుంగాన్= సూతుడి కొడుకైన రథసారథిగా; ఎఱింగితి= తెలిసికొంటిని; బాహుకుండు+అనువాఁడు= బాహుకుడనేవాడు; ఎవ్వండో= ఎవడై ఉంటాడో; వానియందు= ఆ బాహుకుడిపట్ల; నా, హృదయంబు= నా డెందం; ముదితంబు+అగుచున్న+అది= సంతోషాన్ని పొందుతున్నది; మన, పర్ణాదునకు= మనం అయోధ్యకు పంపిన పర్ణాదుడనే బ్రాహ్మణుడికి; ప్రతివచనంబు+ఇచ్చినవాఁడు= ఎదురు సమాధానం చెప్పినవాడు; వాఁడు+అ= కావలయు= ఆతడే కావచ్చును; వాని, కడకున్+పోయి= అతడివద్దకు వెళ్ళి; ఎఱింగి రమ్ము+అని= తెలిసికొని రమ్మని; పంచినన్= నియోగించగా; అదియును= ఆ కేశినియు; పోయి= వెళ్ళి; బాహుకున్+కని= బాహుకుడిని చూచి; దమయంతి; నీ కుశలంబు= నీ క్షేమం; అడుగన్+పుత్తెంచెన్= తెలిసికొమ్మని పంపింది; ఇందులకు= ఇచటికి; ఏమి, కారణంబునన్= ఏ హేతువుచేత; వచ్చితి= అరుగుదెంచావు; అనినన్= అని అడుగగా; దానికి= ఆమెకు; బాహుకుండు= బాహుకుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: బాహుకుడు రథశాలలో తన గుర్రాలను కట్టి, తాను తన రథసమీపంలో సేదతీర్చుకొంటూ ఉన్నాడు. అంత దమయంతి, బాహుకుడితో వార్ష్ణేయుడితో వచ్చిన ఋతుపర్ణుడిని చూచి ఆశాభంగం పొంది, ఊరక ఉండక, కేశిని అనే దాసిని పిలిచి 'ఋతుపర్ణుడు అయోధ్యకు రాజు. వార్ష్ణేయుడిని సూతపుత్రుడిగా నేను గుర్తు పట్టాను. మఱి బాహుకుడు ఎవడై ఉండవచ్చును? అతడిపట్ల నాహృదయం సంతోషం పొందుతున్నది. మనం అయోధ్యకు పంపిన పర్ణాదుడికి ప్రత్యుత్తరమిచ్చినవాడు అతడే అయి ఉండవచ్చును! అతడి దగ్గరకు వెళ్ళి అతడి సంగతి సమాచారాలు తెలిసికొని రమ్మ' - అని నియోగించింది. కేశిని బాహుకుడి దగ్గరకు వచ్చి 'అయ్యా! దమయంతి నీ యోగక్షేమాలను అరసి రమ్మని నన్ను పుత్తెంచింది. ఇచటికి మీరు ఎందుకు వచ్చారు?' - అని అడుగగా ఆమెకు బాహుకుడు ఇట్లా బదులు పలికాడు.

క. 'ప్రియమున దమయంతి పున। స్స్వయంవరము సేయఁ గడఁగి సకలక్షత్త్రా
న్వయవీరుల రావించిన। నయనిధి ఋతుపర్ణుఁ డొక్కనాఁటన వేడ్కన్. 187

ప్రతిపదార్థం: ప్రియమునన్= ప్రీతితో; దమయంతి= దమయంతికి; పునః+స్వయంవరము, చేయన్+కడఁగి= తిరిగి స్వయంవరం చేయటానికి పూని; సకల, క్షత్త్ర+అన్వయ, వీరులన్, రావించిన= సమస్త క్షత్రియ వంశాలలోని వీరులను ఆహ్వానించగా; నయనిధి= నీతికి నిధివంటివాడు, అంటే రాజనీతిపరిజ్ఞానం ఎక్కువగా కలవాడు; ఋతుపర్ణుఁడు; వేడ్కన్= కుతూహలంతో; ఒక్కనాఁటన= ఒక్కదినంలోపలే.

తాత్పర్యం: 'ప్రీతితో దమయంతికి తిరిగి స్వయంవరం సంకల్పించారు కదా! అందుకు అందరు క్షత్రియవీరులను ఆహ్వానించి రప్పించారుకదా! ఆ హేతువుచేత రాజనీతినిధి అయిన మహారాజు ఋతుపర్ణుడు వేడుకతో ఒక్కదినంలోనే.

విశేషం: ఈ పద్యానికి గరిమనాభి 'ఒక్కనాఁటన'= 'ఒక్క దినమందే' అనే పదగుంఫనం. కేశిని బాహుకుడి రాకకు అమాయకురాలివలె కారణం అడిగింది. బాహుకుడుకూడా తనకేమీ తెలియనట్లు ప్రత్యుత్తరం ఇచ్చాడు. అతని మాటలలో గల ఎత్తిపొడుపు గమనించదగినట్టిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వినవె శతయోజనంబులు । సనుదెంచె నయోధ్యనుండి సరి నిందుల; కా
తని రథసారథినై యే । నును వచ్చితి నతనితో మనోవేగమునన్.' 188

ప్రతిపదార్థం: అయోధ్యనుండి; ఇందులకు= ఇక్కడికి; సరిన్= సరిగ్గా; శతయోజనంబులు= నూరామడలు; చనుదెంచెన్= వచ్చాడు; వినవె= వినలేదా? నీవు- అంటే ఋతుపర్ణ మహారాజు ఒక్కదినంలో వంద ఆమడల దూరంలో ఉన్న అయోధ్యనుండి ఇచటికి వచ్చినట్లు నీవు వినలేదా?- అని అర్థం; ఆతని= ఆ ఋతుపర్ణుడి; రథసారథిన్+ఐ= తేరు నడిపే సూతుడినై; అతనితోన్= ఆ ఋతుపర్ణునితో; మనస్+వేగమునన్= మనస్సుతో సరితూగే వేగంతో; ఏనును= నేనుకూడ; వచ్చితిన్= అరుదెంచాను.

తాత్పర్యం: ఋతుపర్ణమహారాజు అయోధ్యనుండి నేరుగా ఇచటికి నూరు ఆమడల మేర ఒక దినంలో వచ్చి చేరిన సంగతి నీవు వినలేదా? ఆతడి రథసారథిని నేను. నేనుగూడ ఆతడితోపాటు మనోవేగంతో వచ్చాను.

విశేషం: ఈ పద్యంలో వాచ్యమైన విషయం- బాహుకుడు ఎవరనే ప్రశ్నకు సమాధానం ఋతుపర్ణుడి సారథి అని; కాని ఇందు ధ్వనించిన అంతరార్థం బాహుకుడు తాను నలుడనని సూచించటం. యావత్ప్రపంచంలో ఒక్కదినంలో నూరు ఆమడల దూరానికి రథాన్ని నడపగలవాడు ఎవడు? నలుడు మాత్రమే. ఆ విషయం దమయంతికి అవగతపూర్వమైన భూతార్థం.

వ. అనిన 'మూఁడవవాఁ డెవ్వఁ?' డని యడిగిన, నక్కేశినికి బాహుకుం డిట్లనియె. 189

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; (కేశిని) మూఁడవవాఁడు= మూడవవ్యక్తి; ఎవ్వఁడు+అనినన్= ఎవడని అడుగగా; ఆ+కేశినికి= కేశిని అనే దానికి; బాహుకుండు= బాహుకుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని, కేశిని 'మూడవవ్యక్తి ఎవరు?' అని అడిగింది. ఆ కేశినికి బాహుకుడు ఇట్లా సమాధానం చెప్పాడు.

క. 'నలు రథచోదకుఁ; డతఁ డ । త్యలఘుఁడు వార్ష్ణేయ నాముఁ' డనవుడు వాఁ డ
న్నలభూపాలకు పోయిన । వల నెఱుఁగండొక్కొ!' యనిన వాఁ డిట్లనియెన్. 190

ప్రతిపదార్థం: అతఁడు, నలు, రథచోదకుఁడు= నలుడి రథసారథి; అతి+అలఘుఁడు= మిక్కిలి తేలికగానివాడు- అంటే ఎక్కువ గౌరవించతగినవాడు; వార్ష్ణేయ, నాముఁడు= వార్ష్ణేయుడనే పేరు కలవాడు; అనవుడు= అని చెప్పగా; వాఁడు= అతడు; (ఆ వార్ష్ణేయుడు); ఆ+నల, భూపాలకు, పోయిన వలను= నలమహారాజు వెళ్ళినచోటును; ఎఱుఁగండు+ఒక్కొ= తెలియజాలడా ఏమి?; అనినన్= అని అడుగగా; వాఁడు= ఆ బాహుకుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'అతడు (ఆ మూడవవ్యక్తి) ఒకానొకనాడు నలుడి రథసారథి. ఆతడి పేరు వార్ష్ణేయుడు. గౌరవించదగిన వ్యక్తిత్వం కలవాడు' అని బాహుకుడు చెప్పగా విని కేశిని 'అయితే ఆ వార్ష్ణేయుడికి నలుడిజాడ తెలయకుంటుందా?' అని ఎదురుప్రశ్న వేసింది. అప్పుడు బాహుకుడు ఇట్లా పలికాడు.

వ. 'వార్ష్ణేయుండును నలుపుత్త్రుల విదర్భేశ్వరునొద్దఁ బెట్టిపోయి, నడుమ నలురాజ్యభ్రంశంబు విని ఋతుపర్ణుం
గొలిచి యుండె; నాతండును నలు నెఱుంగఁడు. 191

ప్రతిపదార్థం: వార్ష్ణేయుండును; నలుపుత్త్రులన్= నలుడి బిడ్డలను; విదర్భేశ్వరు+ఒద్దన్+పెట్టిపోయి= విదర్భరాజుకడపెట్టి వెనుతిరిగి వెళ్ళేటప్పుడు; నడుమన్= మార్గమధ్యంలో; నలు, రాజ్య, భ్రంశంబు= నలుడి రాజ్యం పోవటం; విని= తెలిసికొని, (ఆకర్షించి); ఋతుపర్ణున్+కొలిచి+ఉండెన్= ఋతుపర్ణుడి కొలువులో కుదురుకొన్నాడు; ఆతండును= ఆ వార్ష్ణేయుడును; నలున్+ఎఱుంగఁడు= నలుడిని ఎఱుగడు, అంటే నలుడి జాడలు, ఉనికిపట్టులు అతడికి కూడ తెలియవు అన్నమాట.

తాత్పర్యం: 'వార్ష్ణేయుడు నిషధనుండి నలుడి బిడ్డలను విదర్భకు తీసికొనిపోయి అచట విదర్భరాజుదగ్గర వదలిపెట్టి, తాను వెనుదిరిగిపోతూ, మార్గమధ్యంలో నలుడు రాజ్యాన్ని జూదంలో కోల్పోయిన వార్త తెలిసికొని ఋతుపర్ణుడి కొలువులో చేరాడు. అందువలన వార్ష్ణేయుడికి కూడ నలుడి ఉనికిపట్టులు తెలియవు.

క. **నలుతో నొక్కట నరిగిన । నలినాయతనేత్ర భీమనందన యొండెన్**
నలుఁ డొండె నెఱుఁగుఁగా; క । న్నలు నొరులకు నెఱుఁగఁ గారణము గలదె మహిన్.' **192**

ప్రతిపదార్థం: నలుతోన్= నలుడితో; ఒక్కటన్+అరిగిన= కలిసి వెళ్ళిన; నలిన+ఆయత, నేత్ర= పద్మాలవలె విశాలమైన కన్నులు కలది; భీమనందన= భీమరాజుగారి కూతురు దమయంతి; ఒండెన్= కాని; నలుఁడు+ఒండెన్= నలమహారాజు కాని; ఎఱుఁగున్, కాక= తెలిసికొని ఉంటారు కాని; ఒరులకున్= తదితరులకు; ఆ+నలున్+ఎఱుఁగన్= నలుడి ఉనికిపట్టులు తెలియటానికి; మహిన్= ఈ భూమిలో; కారణము కలదే= హేతువు ఉన్నదా?

తాత్పర్యం: నలుడి ఉనికిపట్టులు నలుడితోపాటు అడవికి వెళ్ళిన పద్మాలవంటి విశాలనేత్రాలు కలిగిన భీమనందన దమయంతికి తెలియాలి, లేదా ఆ నలుడికే తెలియాలి అంతే కాని, ఇతరులకు తెలియటానికి ఎటువంటి అవకాశాలు లేవుకదా!'

వ. **అనిన విని కేశిని యిట్లనియె.** **193**

తాత్పర్యం: అని చెప్పగా విని, కేశిని ఇట్లా పలికింది.

సీ. **'అడవిలో వస్త్రార్థహారియై దయలేక । ప్రాణేశ్వరుఁడు దనుఁ బాసి చనిన**
నాఁటి వస్త్రార్ధంబు నలినాక్షి యిప్పుడుఁ । బరిధానముగఁ బాంసుపటల మలిన
మగుచున్న తనువుతో ననయంబు జడగొన్న । యలకావలులతోడ నవనితలము
శయనంబుగా ధర్మచారిణి దమయంతి । యనఘవ్రతం బిట్టు లాచరించు

ఆ. **చున్న' దనిన నవిరళోద్గత బాష్పపూ । ర్ణంబు లైన లోచనంబు లెఱుక**
వడకయుండ వదనపద్మంబు వాంచి తా । నొండువలను సూచుచుండె నలుఁడు. **194**

ప్రతిపదార్థం: అడవిలోన్= వనంలో; వస్త్ర+అర్ధ, హారి+ఐ= సగం చీర హరించినవాడై; దయ, లేక= కనికరం లేక; ప్రాణ+ఈశ్వరుఁడు= భర్త; తనున్+పాసి= తనను విడిచిపెట్టి; చనిన, నాఁటి, వస్త్రార్ధంబు= వెళ్ళిపోయిన నాటి సగం వస్త్రం; ఇప్పుడున్= నేడుకూడా; నలిన+అక్షి= పద్మాలవంటి కన్నులుకల దమయంతి; పరిధానముగన్= కట్టుపుట్టంగా; పాంసు, పటల, మలినము+అగుచున్న, తనువుతోన్= దుమ్ము దూగర చేత మాసిపోతున్న శరీరంతో; అనయంబు= ఎల్లప్పుడు; జడ+కొన్న= చిక్కుముడులు పడిన; అలక+ఆవళులతోడన్= ముంగురుల గుంపుతో; అవనితలము= భూమిపైభాగం;

శయనంబుగాన్= పడుకొనేచోటుగా; ధర్మచారిణి= పతివ్రతాధర్మమున నడిచే దమయంతి; అనఘవ్రతంబు= పాపరహితమైన నోము; ఇట్టులు= ఈ విధంగా, ఆచరించుచున్నది= నెరవుతున్నది; అనినన్= అనిచెప్పగా; అవిరళ+ఉద్గత, బాష్ప, పూర్ణంబులు+ఐన= ఎడతెగకుండ వెల్లువలుగా పైకి ఉబికివస్తున్న కన్నీటిధారలతో నిండినవైన; లోచనంబులు= నేత్రాలు; ఎఱుక, పడక+ఉండన్= తెలియబడకుండ ఉండేటట్లుగా; వదనపద్మంబు= ముఖపద్మం; (పద్మాన్ని పోలిన ముఖం); వాంచి= క్రిందకు వాల్చి; తాను; ఒండు, వలను= వేరొకవైపుకు (దృష్టి మరల్చి); నలుఁడు; చూచుచుండెన్= చూస్తూ ఉండిపోయాడు.

తాత్పర్యం: 'అడవిలో అలనాడు అర్ధాంగి సగంచీరను హరించి కనికరం లేకుండ తనమీదనే ప్రాణాలు పెట్టుకొని తనతోపాటు అడవికి వచ్చిన ఆమెను వీడి, నలుడు వెళ్ళిపోయాడు కదా! నలినాక్షి దమయంతి ఆనాటి సగం చీరనే నేటికీ తనకు కట్టుపుట్టంగా ధరించి ఉన్నది. ఆమెశరీరం దుమ్ముదూగరతో మలినమై ఉన్నది. ఆమె ముంగురులు జడలుగా అల్లుకొనిపోయాయి! భూమిపై పడుకొని ఆమె నిద్రిస్తున్నది. పరమపతివ్రత అయిన దమయంతి ఇంత కఠోరమైన పవిత్రవ్రతం ఆచరిస్తున్నది' అని కేశిని నిందిస్తుంటే నలుడి కన్నులనుండి ఎడతెగని కన్నీటివెల్లువ పెల్లుబికి వచ్చింది. అతడు తన కన్నులు కేశినికి కనిపించకుండ తన వదనపద్మం వంచి వేరొకవైపున చూడసాగాడు.

వ. కేశినియును బాహుకు పలుకులు నాకారంబును దమయంతి కెఱింగించిన, నది యాతని నలుంగా శంకించి 'యింకను వాని కడ కేఁగుము; వాఁడు ఋతుపర్ణు వంటలవాఁడఁటె; పచనసమయంబున వాని చరితం బిమ్ముగా నెఱింగి ర'మ్మని పంచిన నప్పుడ చని కేశినియు బాహుకునందుల దైవమానుష నిమిత్తాద్భుత క్రియలు సూచి వచ్చి దమయంతి కిట్లనియె. 195

ప్రతిపదార్థం: కేశినియును= కేశిని కూడ; బాహుకు, పలుకులున్= బాహుకుడి మాటలు; ఆకారంబును= రూపాన్ని; దమయంతికి; ఎఱింగించినన్= తెలుపగా; అది= ఆమె (దమయంతి); ఆతని= ఆ బాహుకుడిని; నలుంగా= నలుడిగా; శంకించి= సందేహించి; ఇంకను= మఱియు; వాని కడకు+ఏఁగుము= ఆతనిఒద్దకు వెళ్ళుము; వాఁడు= అతడు (ఆ బాహుకుడు); ఋతుపర్ణువంటలవాఁడు+అఁటె= ఋతుపర్ణుడి దగ్గర వంటలు చేసేవాడు అని చెపుతారు; పచన సమయంబునన్= వంట చేసేటప్పుడు; వాని, చరితంబు= అతడి ప్రవర్తన; ఇమ్ముగాన్= సంపూర్ణంగా; ఎఱింగి రమ్ము= తెలిసికొని రమ్ము; అని= అని చెప్పి; పంచినన్= నియోగించగా; అప్పుడు+అ= వెనువెంటనే; చని= వెళ్ళి; కేశినియు; బాహుకు+అందుల= బాహుకుడిలోని; దైవ, మానుష, నిమిత్త+అద్భుత, క్రియలు= లోకాతీతమైన, దివ్యాలైన, మనుజ సహజాలైన కారణ విశేషాలు గల ఆశ్చర్యకరాలైన కార్యాలు; చూచివచ్చి= కనుగొని, విచ్చేసి; దమయంతికి= దమయంతికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: కేశిని బాహుకుడి మాటలు, రూపం దమయంతికి తెలిపింది. దమయంతి బాహుకుడే నలుడు కావచ్చునని సందేహించి 'ఇంకను ఆతడిని పరీక్షించుము. అతడు ఋతుపర్ణుడి వంటలవాడని చెపుతారు. వంట చేసేటప్పుడు అతడి ప్రవర్తనను సంపూర్ణంగా పరిశీలించి రమ్ము' అని కేశినిని ఆదేశించింది. కేశిని వెంటనే వెళ్ళి తిరిగి వచ్చి బాహుకుడిలో తాను చూచిన లోకాతీతాలు, మనుజసహజాలు అయిన కారణవిశేషాలు గల అద్భుత విషయాలను దమయంతితో ఇట్లా చెప్పింది.

కేశిని యను దూతి దమయంతితో నలుని గుణంబులు సెప్పుట (సం. 3-73-8)

క. 'అతని చరితంబు సెప్పఁగ । నతిమానుష మపగతప్రయాస మదృష్ట
శ్రుతపూర్వము; పరమార్థమ । యతనిని వే ల్పనఁగవలయు నంబుజనేత్రా! 196

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అంబుజ, నేత్రా!= పద్మాలవంటి కన్నులు కలదానా!; అతని, చరితంబు= అతడి ప్రవర్తన (ఆ బాహుకుడి చర్య); చెప్పఁగన్= వర్ణించగా; అతి మానుషము= మనుజ ప్రకృతికి అతీతం, అంటే మానవుల శక్తికి అసాధ్యమైనది; అపగత ప్రయాసము= పోయిన శ్రమకలది (అనాయాసమైనది) సులువుగా అర్థం కానట్టిది; అదృష్టము= పూర్వం చూడబడనిది; అశ్రుత పూర్వము= లోగడ వినబడనిది; పరమ+అర్థము+అ= సత్యమే; అతనిని= ఆ బాహుకుడిని; వేల్పు+ అనఁగవలయున్= దేవతాపురుషుడు అని చెప్పక తప్పదు.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కలదానా! ఆ బాహుకుడి చర్య వర్ణనాతీతం; అతడి శక్తి లోకోత్తరం, మానవాతీతం, ప్రయాస లేనిది; పూర్వం ఇటువంటిది జరిగినట్లుగా ఎవరు చూడలేదు; పూర్వం ఇటువంటిది జరిగినట్లు చెప్పగా ఎవరు వినలేదు; అయినప్పటికీ పరమసత్యమైనది; అతడిని వేల్పు అని చెప్పక తప్పదు.

సీ. **వినవమ్మ! తృణముష్టిఁ గొని వాఁడు వీచుడు । నం దగ్ని యుదయించి యతని వంట**
లమరునంతకు నింధనము లపేక్షింపక । యుడుగక మండుచునుండు; మఱియుఁ
గడఁకతో నంజుళ్ళు గడుగంగ సమకట్టి । జల మపేక్షించుడు సంభవిల్లి
కుంభముల్ నిండి దివ్యాంభఃప్రవాహ మ । క్షయ మగుచుండుఁ దత్క్షణమ చూడ;

ఆ. **నతని కరతలద్వయావమర్దితములై । కందియును మహాసుగంధకుసుమ**
తతులు దొంటియట్ల తమకంపు విడువక । యుండు; నతని తేజ మున్నతంబు.' **197**

ప్రతిపదార్థం: వినవమ్మ= అమ్మా దమయంతీ! వినుము; తృణముష్టిన్+కొని= గడ్డితో కూడిన పిడికిలి పూని; వాఁడు= ఆ బాహుకుడు; వీచుడున్= వీచటంతోనే; అందు= అచట; అగ్ని= నిప్పు; ఉదయించి= ఉద్భవించి; అతని, వంటలు+ అమరునంతకున్= అతడి వంటలు పూర్తి అయ్యేవరకు; ఇంధనములు= కట్టెలు; అపేక్షింపక= కోరక; ఉడుగక= మానక; మండుచున్+ఉండున్= ప్రజ్వలిస్తూ ఉంటుంది; మఱియున్= ఇంకా; కడఁకతోన్= పూనికతో; నంజుళ్ళు= మాంసాలు; కడుగంగ, సమకట్టి= కడగటానికి పూనుకొని; జలము+అపేక్షించుడు= నీరు కావాలని అనుకొనగానే; సంభవిల్లి= పుట్టి; కుంభముల్, నిండి= కడవలు నిండి; దివ్య+అంభస్+ప్రవాహము= దివ్యమైన నీటివెల్లువ; తత్+క్షణము+అ, చూడ= చూస్తే ఆ క్షణంలోనే; అక్షయము+అగుచుండున్= తరుగకుండ ఉంటుంది; అతని= అతడియొక్క; కరతల, ద్వయ, అవమర్దితములు+ఐ= రెండు చేతులతో పిసుకబడినట్టివై; కందియును= నలిగి నలుపెక్కినవి అయ్యునూ; మహా, సుగంధ, కుసుమ, తతులు= గొప్ప పరిమళం గల పూలగుత్తులు; తొంటియట్ల= మునుపటివలెనే; తమ; కంపు, విడువక= తమ పరిమళాన్ని కోల్పోవక; ఉండున్= ఉంటాయి; అతని, తేజము= అతడి ప్రకాశం; ఉన్నతంబు= గొప్పది.

తాత్పర్యం: అమ్మా దమయంతీ! ఆ బాహుకుడి అద్భుతచర్యలు వర్ణనాతీతం. వినవమ్మా విను! వివరించి చెపుతాను. అతడు గడ్డితో కూడిన పిడికిలిని వీచితే అచట నిప్పు ఉద్భవించి అతడి వంట పూర్తి అయ్యేవరకు కట్టెలతో నిమిత్తం లేకుండా ఆరిపోకుండా అట్లే మండుతూ ఉంటుంది. అంతేకాక, మాంసాలు కడగాలని అతడు తలపోసిన వెంటనే నీరు ఉద్భవించి కడవలు నిండిపోయి దివ్యమైన నీటివెల్లువ నిండుగా పెల్లుబుకుతూనే ఉంటుంది. అతడి చేతుల రాపిడికి నలిగిపోయిన పువ్వులగుత్తులు కందిపోయినప్పటికీ మునుపటి పరిమళాలను వెదజల్లుతూనే ఉంటాయి. అతడి తేజస్సు చాలా గొప్పది.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'కంపు'- అనే శబ్దం నన్నయనాటినుండి ఈనాటివరకు అర్థవిపరిణామానికి లోనయింది. నేడు 'కంపు' అంటే దుర్వాసన అనే వ్యవహారమే ఉన్నది. నన్నయనాడు 'కంపు' అంటే పరిమళం (సువాసన) అని అర్థం. నన్నయనాడు అది, దాని- అనేవి స్త్రీ వాచక సర్వనామాలు. ఆమె, ఆమెయొక్క- అనే అర్థాలలో ప్రయుక్తాలు. నేటి నీచార్థం ఆ శబ్దాలకు ఆనాడు లేదు. ఇంధన నిరపేక్షంగా అగ్ని మండటం, సంకల్పమాత్రంచేతనే నీరు ఏర్పడి కడవలు నిండటం, అక్షయ ధారావాహినిగా నీరు ప్రవహించటం - అవి ఆనాడు వ్యాసమహర్షి ఎట్లా ఊహించి వ్రాశాడో? 170వ పద్య వ్యాఖ్యానం పరికించ వేడికోలు.

వ. అనిన విని దమయంతి వెండియుఁ గేశినిం బంచి బాహుకు వండిన నంజుళ్ళు తెప్పించి యాస్వాదించి, బాహుకునందు నలు లక్షణంబులు గలుగు టెఱింగియు, నూఱడనోపక వానిపాలికిం గొడుకునుం గూఁ తునుం గేశినితోడం బుచ్చిన నక్కుమారులం జూచి. 198

ప్రతిపదార్థం: అనిన, విని= అని కేశిని చెప్పగా; ఆలకించి= విని; దమయంతి= దమయంతి; వెండియున్= మరల; కేశినిన్+పంచి= కేశినిని పుత్తెంచి; బాహుకు వండిన= బాహుకుడు వండిన; నంజుళ్ళు= మాంసాలు; తెప్పించి; ఆస్వాదించి= కొద్దిగా రుచిచూచి; బాహుకునందు= బాహుకుడిలో; నలు, లక్షణంబులు= నలుడి గుణాలు; కలుగుట+ఎఱింగియు= ఉండటం తెలిసికొనియు; ఊఱడన్+ఓపక= తృప్తి చెందక; వానిపాలికిన్= బాహుకుడి దగ్గరకు; కొడుకునున్+కూఁతునున్= కొడుకును కూతురిని; కేశిని తోడన్+పుచ్చినన్= కేశినితో పంపగా; ఆ+కుమారులన్+చూచి= ఆ బిడ్డలను చూచి. [ఇక్కడ కుమారుని, కుమార్తెను (కుమారుని) అని రెండు అర్థాలు 'కుమారుల' అనుశబ్దంలో అన్వయింపబడ్డాయి.]

తాత్పర్యం: బాహుకుడి అద్భుత చర్యలను కేశిని దమయంతికి వివరించి చెప్పగా విని, దమయంతి మరల కేశినిని పంపి, బాహుకుడు వండిన మాంసాలు తెప్పించి రుచిచూచి, బాహుకుడిలో నలుడి లక్షణాలు ఉండటం గమనించింది. అంతటితో తృప్తి చెందక, ఆతడి దగ్గరకు కేశినిని తోడిచ్చి తన కొడుకును కూతురును పంపించింది. ఆ బిడ్డల్ని చూచి-

ఆ. వశము గాక బాష్పవారి యొల్కుచు నుండఁ। గొడుకుఁ గూఁతు నెత్తికొని నలుండు
హర్షపులకితంబు లయిన నిజాంకంబు। లందు వారి నునిచి యాదరమున. 199

ప్రతిపదార్థం: నలుండు; వశము+కాక= తన వశం తప్పి; బాష్పవారి= కన్నీరు; ఒల్కుచున్+ఉండన్= కారుతుంటే; కొడుకున్+కూఁతున్+ఎత్తికొని= కుమారుడిని, కుమార్తెను గారాబంతో ఎత్తుకొని; హర్షపులకితంబులు+అయిన= సంతోషంతో గగుర్పాటు చెందినవైన; నిజ+అంకంబులందున్= తన ఒడులలో; వారిన్= ఆ బిడ్డలను; ఉనిచి= పెట్టుకొని; ఆదరమునన్= ప్రీతితో.

తాత్పర్యం: తన వశం తప్పి కన్నీరు కారుతుండగా నలుడు, కొడుకును కూతురిని వాత్సల్యంతో ఎత్తుకొన్నాడు; సంతోషంతో గగురుపాటు పొందిన తన ఒడులలో వారిని ఉంచుకొని ఆదరించాడు.

వ. అక్కేశినిం జూచి 'యిక్కుమారు లిద్దఱు నా కొడుకునుం గూఁతునుం బోలిన వీరి నెత్తికొని దుఃఖించితి' నని తన్నేర్పడకుండం బలికి దాని కిట్లనియె. 200

ప్రతిపదార్థం: ఆ+కేశినిన్+చూచి= ఆ కేశినిని చూచి; ఈ+కుమారులు+ఇద్దఱు= ఈ బిడ్డలు ఇరువురు; నా కొడుకునున్= నా పుత్రుడిని; కూఁతునున్+పోలిన= కూతురిని పోలి ఉండగా; వీరిని= ఈ బిడ్డలను; ఎత్తికొని= కౌగిలించుకొని; దుఃఖించితిన్= పరితపించాను; అని= అనిచెప్పి; తన్ను+ఏర్పడకుండన్+పలికి= తనను గుర్తించకుండ మాటాడి; దానికిన్= ఆ కేశినికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ కేశినిని చూచి 'ఈ బిడ్డలు నా బిడ్డలను పోలిఉండటంచేత నేను నా బిడ్డలను స్మరించి పరితపించాను. వీరిని ఎత్తుకొని లాలించినందుకు వేరుగా తలపవద్దు'- అని తనను గుర్తించటానికి వీలు కాకుండేటట్లుగా మాటాడి మరియు ఇట్లా చెప్పాడు.

క. 'నీ విట పలుమఱు వచ్చుచుఁ । బోవుచు నున్కిఁ గని చిత్తముల నొండుగ నన్
భావింతు రితరజనములు । గావున రావలవ దింకఁ గార్యార్థినివై. 201

ప్రతిపదార్థం: నీవు+ఇట= నీవు ఇక్కడకు; పలుమఱు= చాలా సారులు; వచ్చుచున్+పోవుచున్+ఉన్కిన్= వస్తూ, తిరిగిపోతూ, ఉండటం; కని= అరసి; ఇతర, జనములు= ఇతర ప్రజలు; చిత్తములన్= మనస్సులలో; ఒండుగన్= వేరేవిధంగా; నన్= నన్ను; భావింతురు= తలపోస్తారు; కావున= కాబట్టి; కార్య+అర్థినివి+ఐ= నీ పనిని నెరవేర్చుకొనటానికై; ఇంకన్= ఇక; రావలవదు= (నాకడకు) రావద్దు.

తాత్పర్యం: 'కేశినీ! ఇక నీవు ఏ పనిమీదనైనా నా దగ్గరకు రావద్దు. నీవు ఇచటికి పలుమారులు వస్తూ, పోతూ ఉంటే, చూచేవారు వారి మనస్సులలో నన్ను వేరేవిధంగా భావించవచ్చును సుమా!

వ. ఏము దేశాంతరంబున నుండివచ్చిన అతిథులము; నీకు మాతోడి దేమి?' యనినఁ గేశిని గ్రమ్మఱి వచ్చి, బాహుకు మార్గంబంతయు దమయంతికిం జెప్పిన, నది సంతసించి నిజజనని కిట్లనియె. 202

ప్రతిపదార్థం: ఏము= మేము; దేశాంతరంబుననుండి= వేరొక దేశంనుండి; వచ్చిన, అతిథులము= వచ్చిన ఆగంతుకులం; నీకు; మాతోడిది+ఏమి= మాతో ఉండే పనేమి?; అనినన్= అని చెప్పగా; క్రమ్మఱి వచ్చి= తిరిగివచ్చి; కేశిని; బాహుకు, మార్గంబు+అంతయున్= బాహుకుడి వైఖరినంతటిని; దమయంతికిన్+చెప్పిన; అది= ఆమె (దమయంతి); సంతసించి= ప్రీతిచెంది; నిజ, జననికిన్= తన తల్లికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: మేము వేరొకదేశంనుండి వచ్చిన అతిథులం. నీకు మాతో ఏమి పని? పొమ్ము'- అని బాహుకుడు కసరుకొనగా, కేశిని తిరిగివచ్చి దమయంతికి జరిగిన సంగతి వివరించి చెప్పింది. దమయంతి సంతోషించి తన తల్లికడ కేగి ఇట్లా చెప్పింది.

ఉ. 'సందియ మేల? సర్వగుణసంపదఁ జూడఁగ బాహుకుండు భూ
వందితుఁడైన నైషధుఁ డవశ్యముఁ దా నగు; నా మనంబు నా
నందముఁ బొందుచున్నది ఘనంబుగ; వాఁ డిట వచ్చువాఁడొ? యే
నందుల కేఁగుదాననొ? రయంబున నాపని నిశ్చయింపుమా!' 203

ప్రతిపదార్థం: సందియము+ఏల= సందేహం ఎందుకు?; సర్వ, గుణ, సంపదన్= సకల లక్షణాల పెంపులో; చూడఁగన్= అరయగా; బాహుకుండు= బాహుకుడు; తాను; అవశ్యమున్= తప్పకుండ; భూవందితుఁడు+ఐన= భూలోక ప్రజలచేత నమస్కరించబడినవాడైన; నైషధుఁడు= నిషధరాజు; అగున్= అవును; నా మనంబు= నా మనస్సు; ఘనంబుగన్= గొప్పగా; ఆనందమున్= సంతోషాన్ని; పొందుచున్నది; వాఁడు+ఇట= ఆతడు ఇచటికి; వచ్చువాఁడొ= వచ్చువాడవునో?; ఏన్= నేను; అందులకు= అచటికి; ఏగుదాననొ= వెళ్ళేదానినో?; రయంబునన్= వేగంగా; ఆ పని= ఆ కర్తవ్యం; నిశ్చయింపుమా!= నిర్ణయించాలి సుమా!

తాత్పర్యం: 'ఇక సందేహించవలసిన అగత్యమే లేదు. సమస్త సద్గుణసంపదలో పరిశీలించిచూస్తే బాహుకుడు తప్పనిసరిగా భూజనులచేత నమస్కారాలు అందుకొనే నిషధేశ్వరుడైన నలుడే. నా మనస్సు మిగుల ఆనంద తన్మయమైనది. ఆతడు ఇక్కడికి రావటమా? నేను అతడి దగ్గరకు వెళ్ళటమా? సత్వరం ఈ కర్తవ్యాన్ని నిర్ణయించాలి సుమా!'

విశేషం: బాహుకుడు నలుడే అనే నిర్ణయం సులభ సాధ్యమైనదికాదు. దమయంతి పాత్రచిత్రణం మిక్కిలి హృదయంగమమైనది. (1) దమయంతి అతిలోకసౌందర్యవతి (2) సౌందర్యంతోపాటు దమయంతిలో సౌశీల్యం పెనగొనిఉన్నది. (3) సౌందర్య సౌశీల్యాలేకాక దమయంతికి గల తెలివితేటలు నిరుపమానాలు. ఆమె ముందుగానే మగడి ఓటమిని ఊహించి తనబిడ్డలను విదర్భకు పంపింది. పౌరులను వెంటబెట్టుకొని నలుడిని జూదంనుండి మరల్చటానికి యత్నించింది. తదుపరి నలుడితో వనవాసానికి పోవటం, అరణ్యంలో ఆమె పడినపాట్లు ఆమె పాతివ్రత్యాన్ని చాటునట్టివి. (4) ఆమె ఇంగితజ్ఞానం అనన్యసామాన్యమైనట్టిది. నలుడిని కనుగొనటానికి ఆమె పన్నిన పన్నుగడ అలీక ద్వితీయ స్వయంవర కల్పనం. నలుడి హృదయాన్ని కరిగించి అతడిని ఉద్విగ్నుడిని చేయటానికై బ్రాహ్మణులచేత అనిపించిన ఎత్తిపొడుపుమాటలు. (5) బాహుకవేషధారి అయిన నలుడిని ఆమె గుర్తించిన విధానం ఆమె తెలివితేటలకు, జాగరూకతకు నిదర్శనాలు. బాహుకుడు సుస్పష్టంగా నలుడు కాడు. వార్ష్ణేయుడు ఆతడిని గుర్తించలేకపోయాడు. అతడికి ఒక్కసారి బాహుక సారథ్యాన్ని చూచినపుడు కొంచెం సందేహం కలిగింది. ఆతడు ఊగిసలాడాడే కాని స్థిరనిర్ణయానికి రాలేకపోయాడు. జీవలుడు బాహుకుడిని ద్విపాదజంతువుగానే పరిగణించాడు. ఇక దమయంతి అద్వితీయమేధ బాహుకుడి మాటున అణగిమణగిన నలుడి వ్యక్తిత్వాన్ని గుర్తించగలిగింది. మానవమాత్రుల చర్మచక్షువులు చేయలేని పరిశోధనలో దమయంతి మనోనేత్రం విజయం సాధించింది. (6) దమయంతి పరిశోధన సాంగోపాంగంగా ప్రస్తరించదగ్గది. 1. నలుడి మనస్సుకు వాడిబాణాలవలె నాటే మాటలు విని, పర్ణాదుడికి ఏకాంతంగా బాహుకుడు సమాధానం చెప్పక తప్పిందికాదు. 2. నూరు ఆమడలు ఒక దినంలో రథం నడపగల నేర్పు నలుడికి మాత్రమే ఉన్నది. సుదేవుడు పెట్టిన గడువులో నూరు ఆమడల దూరం రథాన్ని నడిపే బాహుకుడు అయోధ్యనుండి విదర్భ చేరాడుగదా!. 3. నలుడి రథనేమిఘోష దమయంతికి చిరపరిచితం, విదర్భాపురి ఋతుపర్ణుడి రథం చేరగానే దమయంతి నలుడిరథాన్ని గుర్తించగల్గింది. 4. నలపాకం సుప్రసిద్ధం. సంకల్పమాత్రంచేత నిప్పు, నీరు కల్పించగల శక్తి నలుడికి తప్ప మానవమాత్రులు మరెవ్వరికిని ఉండజాలదు. (ఆ శక్తులు అగ్నివరుణాదులవరాలవలన నలుడికి లభించాయి.) ఆ విషయాన్ని కేశినిచేత దమయంతి రూఢి చేసికొన్నది. 5. నలుడు వండిన వంజుళ్ళ రుచి దమయంతికి అనుభవ ఆమ్రేడితం. 6. పుత్రైషణ జీవకోటికి సహజం. కేశినితోపాటు బిడ్డలను బాహుకుడి దగ్గరకు పుత్తెంచింది. బాహుకుడు వారిని కౌగలించుకొని ఆనందబాష్పతన్మయుడు అయ్యాడు. ఇన్ని పరీక్షలు చేసిన పిమ్మట కురూపి అయిన బాహుకుడే ఒకనాటి అతిలోకసౌందర్యనిధి అయిన నలుడని దమయంతి నిశ్చయించింది. 7. చిట్టచివరకు బాహుకుడే స్వస్వరూపంతో దమయంతికి ప్రసన్నుడయ్యాడు. ఇక కథ కంచికి పోయింది.

వ. అనిన నది యప్పుడ భీము ననుమతంబున దమయంతియొద్దకు బాహుకు రావించిన. 204

ప్రతిపదార్థం: అనినన్= అని దమయంతి చెప్పగా; అది= దమయంతి తల్లి; అప్పుడు+అ; భీము+అనుమతంబునన్= భీముడియొక్క సమ్మతిచొప్పున; దమయంతి+ఒద్దకు= దమయంతి దగ్గరకు; బాహుకున్= బాహుకుడిని; రావించిన= రప్పించగా.

తాత్పర్యం: అని దమయంతి చెప్పగా విని ఆమెతల్లి భీముడి అనుమతిపొంది దమయంతి దగ్గరకే బాహుకుడిని రప్పించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **చనుదెంచి యందు దీనా । నన నవిరళపంకమలిననతగాత్రఁ దప**
స్విని నతికృశ దమయంతిం । గనియె నలుం డుదితబాష్పకణకలితముఖిన్. **205**

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; అందు= అచట; దీన+ఆననన్= పరితాపం కల ముఖం కలదానిని; అవిరళ, పంక, మలిన, నత, గాత్రన్= ఎల్లప్పుడు తడిసిన దుమ్ముతో మాసి వంగిన దేహం కలదానిని; తపస్వినిన్= నియమాచరణం కలదానిని; అతి కృశన్= మిక్కిలి కృశించినదానిని; ఉదిత బాష్ప, కణ, కలిత, ముఖిన్= ఉద్భవించిన కన్నీటి బొట్టులతో కూడిన మొగం కలదానిని; దమయంతిన్= దమయంతిని; నలుండు= నలుడు; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: నలుడు అచటికి చేరి దైన్యం ఉట్టిపడే ముఖం కలదీ, ఎల్లప్పుడు దుమ్ముతో మాసి క్రుంగినదేహం కలదీ, చూపరులకు జాలిగొలిపేదీ, చిక్కి కృశించినదీ, జారే కన్నీటిబొట్టులతో కూడిన మొగం కలదీ- ఐన దమయంతిని చూచాడు.

క. **దమయంతి నలుని వికృతాం । గముఁ జూచియు నతని నన్యుఁగా వగవక నె**
య్యమునను లజ్జను నతిసం । భ్రమమున వివశాత్మ యగుచుఁ బతి కిట్లనియెన్. **206**

ప్రతిపదార్థం: దమయంతి; నలుని, వికృత+అంగమున్+చూచియున్= నలుడియొక్క వికారమైన దేహాన్ని చూచికూడా; అతనిన్= అతడిని; అన్యున్+కాన్= పరుడిగా; వగవక= చింతించక; నెయ్యమునను= స్నేహంతోనూ; లజ్జనున్= సిగ్గుతోనూ; అతి, సంభ్రమమునన్= మిక్కిలి తత్తరపాటుతో; వివశ+ఆత్మ+అగుచున్= వశం తప్పిన ఆత్మ కలది అవుతూ; పతికి= భర్తకు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పింది.

తాత్పర్యం: నలుడిదేహం వికారంగా కనిపించినప్పటికిని అతడిని పరుడిగా ఎంచక, స్నేహంతోనూ, సిగ్గుతోనూ, మిక్కుటమైన తత్తరపాటుతోనూ తనను తాను అదుపులో పెట్టుకొనలేకుండా భర్తతో ఇట్లా చెప్పింది.

వ. **'విజనంబైన విపినంబునందు నలసి నిద్రవోయినదాని నబల నతిసాధ్వి ననువ్రత నగ్నిసన్నిధిఁ బాణిగ్రహణవిధి లబ్ధ యైన దానిం బాసి నలునట్లు నిర్దయులై యరిగినవా రొరు లెవ్వరు లేరు.** **207**

ప్రతిపదార్థం: విజనంబు+ఐన= జనులు లేనట్టి; విపినంబునందున్= అడవిలో; అలసి, నిద్ర+పోయినదానిన్= బడలి నిద్రించిన దానిని; అబలన్= బలంలేని ఆడుదానిని; అతి సాధ్విన్= మిక్కిలి మంచినడవడి కలదానిని; అనువ్రతన్= సహధర్మచారిణిని; అగ్ని సన్నిధిన్= అగ్నిదేవుడి సమక్షంలో; పాణి, గ్రహణ, విధి, లబ్ధ+ఐన, దానిన్= శాస్త్రీయమైన వివాహపద్ధతిలో పొందబడినదానిని; నలు+అట్లు= నలుడివలె; పాసి= విడిచిపెట్టి; నిర్దయులు+ఐ= దయలేనివారై; అరిగినవారలు= వెళ్ళినవారు; ఒరులు= ఇతరులు; ఎవ్వరు, లేరు= ఎవరూ లేరు.

తాత్పర్యం: 'జనులు లేని అడవిలో అలసి నిదురపోయినదానిని, బలహీనురాలైన ఆడుదానిని, సహధర్మచారిణి అయి తనవెంట అడవికి వచ్చినదానిని, సౌమ్యమైన సత్ప్రవర్తన కలదానిని, అగ్నిసాక్షిగా శాస్త్రీయమైన పద్ధతిలో పెండ్లిచేసికొని చేపట్టినదానిని నలుడివలె కఠినాత్ములై విడిచిపెట్టి వెళ్ళినవారు ఇతరులు మరెవ్వరూ లేరు.

క. **సురవరులఁ దొఱఁగి తన్నున్ । వరియించితి; నన్నుఁ బుత్త్రవతి నేలొకొ చె**
చ్చెర విడిచె? నాతనికి ని । ష్కరుణున కే నేమి యెగ్గు గావించితినో? **208**

ప్రతిపదార్థం: సురవరులన్= దేవతాశ్రేష్ఠులను; తొఱఁగి= విడిచి; తన్నున్= తననే; వరియించితి= భర్తగా ఎన్నుకొన్నాను; నన్నున్= నన్ను; పుత్రవతిన్= సంతానవతిని; ఏల+ఒకొ= ఎందుకో?; చెచ్చెర= శీఘ్రంగా; విడిచెన్= విడిచిపెట్టాడు; ఆతనికిన్= ఆ నలుడికి; నిష్కరుణునకున్= దయలేనివాడికి; ఏను= నేను; ఏమి+ఎగ్గు+కావించితినో= ఎటువంటి అపచారం చేశానో?

తాత్పర్యం: దేవతాశ్రేష్ఠులను విడిచిపెట్టి తననే భర్తగా ఎన్నుకొన్నానుకదా! అటువంటి నన్ను సంతానవతినైన దానిని, శీఘ్రంగా ఎందుకు విడిచిపెట్టినట్లు? నాపట్ల కనికరం లేకపోవటానికి ఆతడికి నేను ఎటువంటి అపచారం చేశానో?

విశేషం: అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యను విడువరాదు. పైగా సంతానవతి అయినభార్యను విడువరాదని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. తాను సంతానవతి. ఒకవేళ తనపై ప్రేమ లేకున్నా బిడ్డలపై ప్రేమ ఉండాలికదా! కరుణ ఏమాత్రం లేనట్టి కఠినాత్ముడుగా ఉండటానికి నలుడికి తాను ఎటువంటి అపచారం చేయలేదే? ధర్మశాస్త్రాన్నిబట్టిగాని, మానవ సహజమైన పుత్రప్రేమనుబట్టిగాని కేవలం నిర్దోషిని అయిన తన్ను విడవటం నలుడికి భావ్యం కాదని దమయంతి విన్నవించింది. ఇంతవరకు దమయంతి బాహుకుడితో మధ్యమపురుషలో కాక నలుడినిగురించి ప్రథమపురుషలోనే మాటాడింది. అంతవరకు బాహుకుడే నలుడని దమయంతికి నిశ్చితాభిప్రాయం ఏర్పడినను, ప్రత్యక్షంగా తాను బాహుకుడిని చూచింది ఇప్పుడే. కావుననే ప్రథమపురుషలో భాషించి అతడి హావభావాలు పసికట్టి, అతడే నలుడని మళ్ళీ నిశ్చయించుకొనటానికి అట్లా మాటాడింది. ఇక తానే నలుడ నని ప్రకటించుకొనవలసిన వంతు బాహుకుడిదే. ఇచట దమయంతి బాహుకుడితో ఎదురుబొదురుగా నిలిచి మాటాడుతున్నా నలుడిగురించి ప్రథమపురుషలో ప్రస్తావించటం గమనించదగిన అంశం.

వ. 'నిన్ను విడువ నోడకుండు' మని పలికిన యప్పలుకు లేల మఱచెనో?' యని శోకతప్తంబైన తన హృదయంబు దడుపుచున్నయదియునుంబోలె బాష్పధారలం గుచమండలంబు దడుపుచునున్న దమయంతిం జూచి శోకాకులుండై నలుం డిట్లనియె. 209

ప్రతిపదార్థం: నిన్నున్= నిన్ను; విడువను= విడిచిపెట్టను; ఓడకుండుము= భయపడకుము; అని= అంటూ; పలికిన= చెప్పిన; ఆ+పలుకులు= ఆ మాటలు; ఏల= ఎందుకు; మఱచెనో= విస్మరించాడో; అని; శోక, తప్తంబు+ఐన= దుఃఖంచేత తపించబడిందైన; తన హృదయంబు= తన గుండెను; తడుపుచున్న+అదియున్+పోలె= చల్లార్చుతున్నదా అనేటట్లుగా బాష్పధారలన్= కన్నీటి ప్రవాహములతో; కుచమండలంబు= స్తనములున్న ప్రదేశమును- ఎదను; తడుపుచున్+ఉన్న= తడపుతున్న; దమయంతిన్+చూచి; శోక+ఆకులుండు+ఐ= దుఃఖంచేత పరితపించినవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'నిన్ను నేను ఎన్నటికిని విడిచిపెట్టజాలను, భయపడకుము' అని నాతో పలుమారులు చెప్పాడుకదా! ఆ మాటలు ఎట్లా మరిచిపోయాడో?' - అని ఆమె కన్నీరు కారుస్తూ విలపించింది. ఆమె కార్చిన కన్నీరు స్తనాలపై స్రవించటం చూస్తే, దుఃఖంతో కాగిన హృదయాన్ని ఆమె కన్నీటితో తడుపుతున్నట్లు ఉండింది. ఆ దృశ్యాన్ని చూచి నలుడు దమయంతితో ఇట్లా అన్నాడు.

తే. 'కలిసమావిష్టమతి నయి కష్టవృత్తి । నట్టి యిడుమలఁ బడితి నే; నవి మదీయ
తపము బలమున, నీ దుఃఖదాహమునను । నష్టమై పోయెఁ; గలి యిప్డు నన్ను విడిచె. 210

ప్రతిపదార్థం: కలి, సమావిష్ట, మతిన్+అయి= కలిపురుషుడిచేత ఆవహించబడిన బుద్ధి కలవాడినయి; కష్టవృత్తిన్= కష్టాలు అనుభవించి (కఠినప్రవర్తనతో); అట్టి+ ఇడుమలన్= అట్టి కష్టాలను; ఏను= నేను; పడితిన్= అనుభవించాను; అవి=

అవన్నియు (అంటే ఆ అగచాట్లు అన్నీ); మదీయ, తపము, బలమునన్= నా తపస్సుయొక్క మహిమవలన; నీ, దుఃఖదాహమునను= నీ పరితాపమనే నిప్పువలనను; నష్టము+ఐ, పోయెన్= నశించిపోయాయి; కలి= కలిపురుషుడు; ఇప్డు= ఇపుడు; నన్నున్; విడిచెన్= నన్ను విడిచిపోయాడు.

తాత్పర్యం: 'నన్ను కలి ఆవహించటంచేత ఆ విధంగా బుద్ధి చెడి అన్ని కష్టాలపాలు కావలసివచ్చింది. ఆ అగచాట్లు అన్నీ నా తపశ్శక్తిచేత, నీ పరితాపమనే నిప్పువలన తొలగిపోయాయి. ఇపుడు నన్ను కలి విడిచిపోయాడు.

విశేషం: (1) దమయంతి ప్రథమపురుషలో భాషించినను బాహుకుడు ఉత్తమపురుషలో మాటాడటం గమనించదగిన అంశం. బాహుకుడికి తాను నలుడనని తనకు తెలిసినట్టి అంశమే కదా! ఆతడికి ఎట్టి సంశయం లేదు. (2) నలోపాఖ్యానంలోని కథా శిల్పంలోని ముఖ్యాంశాలు రెండు. 1. నలుడు కలి సమావిష్టుడై చెందిన చిత్త విభ్రమం, పడినపాట్లు. 2. దమయంతి పరితాపం- సారాంశాలుగా ఇక్కడ ప్రస్తావించబడ్డాయి.

వ. ఏ నిందులకు నీ తదర్థంబ వచ్చితి; నది యట్లుండె; నన్ను ననురక్తు ననువ్రతుఁ దలంపక యన్యాపేక్షంబున స్స్వయంవరంబు రచియించుట యిది కులస్త్రీధర్మంబు గాదు; రాజుల నెల్ల నీ స్వయంవరంబునకు రావించుటం జేసి కాదే ఋతుపర్ణుండు వచ్చె' ననిన వెఱచి కృతాంజలియై దమయంతి యిట్లనియె. 211

ప్రతిపదార్థం: ఏను= నేను; ఇందులకు= ఇచటికి; నీ, తద్+అర్థంబు+అ= నీ సంగతి అరయటం కోసమే (నీకోసమే); వచ్చితిన్= అరుదెంచాను; అది+అట్లుండె= ఆ విషయం అట్లా ఉండుగాక!; నన్నున్= నన్ను; అనురక్తున్= నీపట్ల ప్రేమకలవాడిని; అనువ్రతున్= సహధర్మచారిని; తలంపక= స్మరించక; అన్య+అపేక్షన్= ఇతరుడిపై కోరికచేత; పునఃస్వయంవరంబు= తిరిగి స్వయంవరం; రచియించుట= కూర్చటం; ఇది= ఈ కార్యం; కులస్త్రీ, ధర్మంబు+కాదు= కులపాలికకు సరైన న్యాయం కాదు; రాజులన్+ఎల్లన్= రాజులను అందరిని; నీ స్వయంవరంబునకున్; రావించుటన్+చేసి, కాదె= నీ యొక్క స్వయంవరానికి రప్పించటంచేతనే కదా!; ఋతుపర్ణుండు= ఋతుపర్ణుడు; వచ్చెన్; అనినన్= వచ్చినారు అని చెప్పగా; వెఱచి= భయపడి; కృత+అంజలి+ఐ= ఘటించిన నమస్కృతి కలదై (అంటే నమస్కరించినదై); దమయంతి; ఇట్లు+అనియెన్= దమయంతి ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: నేను ఇచటికి వచ్చింది నీ విషయం తెలిసికొనటంకొరకే. అది అట్లా ఉండనీ! నేను నీమీద ప్రేమకలవాడిని. సహధర్మచారిని. నన్ను విస్మరించి పరపురుషవాంఛతో తిరిగి స్వయంవరం ఏర్పరచటం కులస్త్రీకి ధర్మం కాదు. రాజులందరిని ఆహ్వానించటంచేతనే కదా ఋతుపర్ణమహారాజు ఇప్పుడు విదర్భకు విచ్చేసింది' - అని నలుడు అధిక్షేపించగా, భయపడి దమయంతి నలుడికి నమస్కరించి ఇట్లా పలికింది.

తే. 'నిన్ను రోయంగ విప్రులు నెమ్మి నరిగి । పలికి రెల్లచో నాచేతఁ బనుపఁబడియ;
యందుఁ బర్ణాదుఁ డను విప్రుఁ డయ్యయోధ్య । కేఁగి ప్రతివచనంబుల నెఱిఁగె నిన్ను. 212

ప్రతిపదార్థం: నిన్ను, రోయంగన్= నిన్ను వెదకటానికై; నాచేతన్= నాచేత; పనుపన్+పడి+అ= పంపబడియే; విప్రులు= బ్రాహ్మణులు; నెమ్మిన్+ అరిగి= ప్రీతితో వెళ్ళి; ఎల్లచోన్= అన్నిచోట్ల; పలికిరి= మాటాడినారు; అందున్= వారిలో; పర్ణాదుఁడు+అను విప్రుఁడు= పర్ణాదుడనే బ్రాహ్మణుడు; ఆ+అయోధ్యకు= ఆ అయోధ్యానగరానికి; ఏఁగి= వెళ్ళి; ప్రతివచనంబులన్= ఎదురుమాటలవలన; నిన్నున్+ఎఱిఁగెన్= నిన్ను తెలిసికొనగలిగాడు.

తాత్పర్యం: 'నిన్ను వెదకటానికై ప్రీతితో నేను పంపగా పలుతావులకు వెళ్ళి పలికిన విప్రులలో, అయోధ్యకు వెళ్ళిన పర్ణాదుడనే బ్రాహ్మణుడు నీ ప్రత్యుత్తరంవలన నిన్ను గుర్తించాడు.

వ. ఆ పర్ణాదువలన ని న్నెఱింగినదానినై ని న్నిట రావించునుపాయంబు దలంచి, యెల్లి దమయంతీ ద్వితీయ స్వయంవరం బగు నని ఋతుపర్ణునందుఁ బ్రకాశింప సుదేవుం డను బ్రాహ్మణుం బుత్తెంచితి. 213

ప్రతిపదార్థం: ఆ, పర్ణాదువలనన్= ఆ పర్ణాదుడనే బ్రాహ్మణుడి వలన; నిన్ను+ఎఱింగిన, దానను+ఐ= నిన్ను తెలిసికొన్న దాననై; నిన్ను+ఇట, రావించు= నిన్ను ఇచటికి రప్పించే; ఉపాయంబు+తలంచి= వెరవును ఆలోచించి; ఎల్లి= రేపు; దమయంతీ ద్వితీయ, స్వయంవరంబు+అగును+అని= దమయంతికి రెండవ స్వయంవరం జరుగుతుందని; ఋతు పర్ణునందున్= ఒక్క ఋతుపర్ణుడికి మాత్రమే; ప్రకాశింపన్= తెలియజేయటానికై; సుదేవుండు+అను, బ్రాహ్మణున్= సుదేవు డనే విప్రుడిని; పుత్తెంచితిన్= నియోగించాను.

తాత్పర్యం: ఆ పర్ణాదుడివలన నీ ఉనికిపట్టులు తెలిసికొన్నదాననై నిన్ను ఇచటికి రప్పించే ఉపాయం ఆలోచించి, రేపే దమయంతి రెండవ స్వయంవరం అని ఒక్క ఋతుపర్ణుడికి మాత్రమే వార్తను తెలియజేయటానికి సుదేవుడనే బ్రాహ్మణుడిని నియోగించాను.

క. నరవరుఁడు నలుఁడు గా కె। వ్వరు శతయోజనము లొక్కవాసరమున వ
త్తురు నరు లొరు? లని దీనిం। బరికింపఁగఁ గడఁగి యిట్లు పంచితి నధిపా! 214

ప్రతిపదార్థం: అధిపా!= ఓ మహారాజా!; నరవరుఁడు= నరులలో శ్రేష్ఠుడైన; నలుఁడు+కాక= నలుడు తప్ప; ఎవ్వరు; నరులు+ఒరులు= ఇతరమనుజులు; ఎవ్వరు; శతయోజనములు= నూరు ఆమడలు; ఒక్క వాసరమునన్= ఒక్కదినంలో; వత్తురు?= రాగలరు?; అని= అని తలపోసి; దీనిన్+పరికింపఁగన్= ఈ విషయాన్ని చూడాలని; కడఁగి= పూని; ఇట్లు+అ= ఈ విధంగా; పంచితిన్= ఏర్పాటు చేశాను. (పంపినాను)

తాత్పర్యం: ఓ నలమహారాజా! నరులలో శ్రేష్ఠుడైన నలమహారాజు తప్ప మానవమాత్రులలో మరెవ్వరు ఒక్కదినంలో నూరుఆమడలమేర దూరంనుండి రాగలరు? అని ఆలోచించి ఈ విధమైన ఏర్పాటు చేశాను.

ఉ. ఏ నతిపాపభావమును నెగ్గుఁ దలంపక యుండునట్లుగా
నానతవైరి! నీ యడుగు లంటఁగ నోపుదు; నట్టిదైన న
న్నీ నలినాప్తుఁ డీ యనలుఁ డీ మృగలాంఛనుఁ డీ సురోత్తముల్
జాను సెడంగ నీ క్షణమ చంపరె! కోపపరీతచిత్తులై.' 215

ప్రతిపదార్థం: ఆనతవైరి!= మిక్కిలి నమస్కరించిన శత్రువులు కలవాడా!; (శత్రువులను జయించినవాడా!;) ఏను= నేను; అతి, పాప, భావమును= మిక్కిలి చెడు ఆలోచనను; ఎగ్గున్= అపచారాన్ని; తలంపక+ఉండునట్లుగాన్= ఆలోచించకుండ ఉండేటట్లుగా; నీ అడుగులు= నీ పాదాలు; అంటఁగన్+ ఓపుదున్= ముట్టగలను- అంటే పాదాలంటి ప్రమాణం చేయగలను; అట్టిది+ఐన= అటువంటిదే అయితే- అంటే నీ పట్ల పాపభావాన్ని అపచారాన్ని తలపోసి ఉన్నట్లయితే; నన్ను; ఈ+నలిన+ ఆప్తుఁడు= ఈ సూర్యుడు; ఈ+అనలుఁడు= ఈ అగ్నిదేవుడు; ఈ; మృగలాంఛనుఁడు= జింకను గుర్తుగాగల ఈ చంద్రుడు; ఈ, సుర+ఉత్తముల్= ఈ దిక్పాలకులు; కోప, పరీత, చిత్తులు+ఐ= ఆగ్రహంతో నిండిన మనస్సులు కలవారై; జాను+చెడంగన్= శోభ అంతరించేటట్లు; ఈ క్షణము+అ= ఈ క్షణంలోనే; చంపరె!= చంపివేయరా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శత్రువులను జయించిన మహావీరుడవైన ఓ నలమహారాజా! నేను ఎటువంటి పాపపు తలంపునుగాని, అపచారాన్నిగాని నీపట్ల తలపోయలేదని నీ పాదాల సాక్షిగా ప్రమాణం చేయగలను. నాలో అటువంటి చెడుతలంపే ఉన్నట్లయితే- ఈ సూర్యుడు, ఈ అగ్నిహోత్రుడు, ఈ చంద్రుడు, ఈ దిక్పాలకులు ఆగ్రహించి, నన్ను ఈ క్షణంలోనే శోభావిహీనగాచేసి చంపివేయరా?'

విశేషం: నలిన+ఆప్తుడు= పద్మాలకు మిత్రుడు, సూర్యుడు. ఇది కవిసమయం. మృగలాంఛనుడు= లేడిని చిహ్నంగా కలవాడు, చంద్రుడు. చంద్రుడిలో గల కళంకం పెక్కు ఉత్ప్రేక్షలకు దారితీసింది. దీన్నికూడ కవిసమయంగా ఎన్నవచ్చును. 'జాను' శబ్దానికి సరైన అర్థం ఇంకను తరచవలసి ఉన్నది. శబ్దరత్నాకరంలో జాను= అందము, సౌందర్యము అనే అర్థాలు ఉన్నాయి. సూర్యరాయాంధ్ర నిఘంటువులో పెక్కు అర్థాలు ఉన్నాయి. 1. సొగసు, సౌందర్యము 2. శోభ 3. విధము 4. విణ.మంజులము, స్పష్టము, అధికము మున్నగు అర్థాలు ఉన్నాయి. నా అభిప్రాయంలో జాను- అంటే పుట్టుపుతో వచ్చే తీరుతీయాలు, సహజ సారళ్యమనే అర్థం చెప్పవచ్చు.

వ. అనుచున్న యవసరంబున నఖిలభూతాంతర్గతుం డయిన వాయుభట్టారకుం డెల్లవారలు విన నాకాశంబున నుండి నలున కిట్లనియె. 216

ప్రతిపదార్థం: అనుచున్న+ అవసరంబునన్= అని చెప్పుతున్న సమయంలో; అఖిల, భూత+అంతర్గతుండు+అయిన= సమస్తమైన భూతాలలో లోపల ఉండే వాడయిన; వాయుభట్టారకుండు= పవిత్రుడైన వాయుదేవుడు; ఎల్లవారలు= అందరు; వినన్= ఆలకిస్తుండగా; ఆకాశంబుననుండి= గగనంనుండి; నలునకు; ఇట్లు+అనియెన్= నలుడికి ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని అంటున్న సమయంలో సమస్తభూతాలలోపల ఉండే వాయుభట్టారకుడు అందరూ వినేటట్లు ఆకాశంనుండి నలుడికి ఇట్లా చాటి చెప్పాడు.

విశేషం: ఈ సృష్టిలోని సమస్త వస్తువులు భూతములే. చేతనాచేతన వస్తువులు సజీవ నిర్జీవ పదార్థాలకు సమష్టి వ్యపదేశం భూతశబ్దం. భట్టారక శబ్దం పూజ్యవాచకం. వాయుభట్టారకుడు అంటే పూజ్యుడైన వాయుదేవుడు అని అర్థం.

చ. 'అమలచరిత్ర నిట్లు దమయంతిఁ బతివ్రతఁ బల్కుదే? నృపో
త్తమ! విను దీనియందు విదితంబగు శీలవిధిన్ సుధాంశుఁడున్
గమలహితుండు నేను నయి కాచితి మొక్కట మూఁడువర్షముల్;
గొమరుగ దీనిఁ జేకొనుము కోమలి నీ కనురక్త' నావుడున్. 217

ప్రతిపదార్థం: నృప+ఉత్తమ!= రాజులలో శ్రేష్ఠుడవైన ఓ నలమహారాజా!; అమల, చరిత్రన్= స్వచ్ఛమైన నడవడి కలిగినదానిని; దమయంతిన్= దమయంతిని; పతివ్రతన్= భర్తయెడ భక్తి కలిగినదానిని; ఇట్లు= ఈ రీతిగా; పల్కుదే= ఆక్షేపిస్తావా?; విను= ఆకర్ణించుము; దీని+అందున్= ఈమెపట్ల; విదితంబు+అగు= తెలియవచ్చిన; శీలవిధిన్= మంచినడవడి తీరుతీయాలవలన; సుధాంశుఁడున్= అమృత కిరణుడైన చంద్రుడున్నూ; కమలహితుండు= పద్మమిత్రుడైన సూర్యుడున్నూ; ఏనున్+అయి= నేనున్నూకలిసి; ఒక్కటన్= కలిసికట్టుగా; మూఁడు, వర్షముల్= మూడు సంవత్సరాలు; కాచితిమి= కాపాడాము; కొమరుగన్= ఒప్పుగ; దీనిన్= ఈమెను (దమయంతిని); చేకొనుము= పరిగ్రహించుము; కోమలి= ఈ సుకుమారి; నీకు+అనురక్త= నీ పట్ల అనురాగం కలిగినట్టిది; నావుడున్= అని పలుకగా.

తాత్పర్యం: 'రాజులలో ఉత్తముడివైన ఓ నలమహారాజా! ఈ దమయంతి నిర్మలమైన ప్రవర్తన కలది. పతివ్రతాశిరోమణి. ఈమెపట్ల అభివ్యక్తమైన సౌశీల్యంచొప్పున సూర్యుడు, చంద్రుడు, నేను కలిసికట్టుగా ఈమెను మూడు సంవత్సరాలు కాపాడాము. ఈమెను నీవు మనసార పరిగ్రహించుము. ఈ కోమలి నీపట్ల అనురాగం కలిగి ఉన్నది'- అని వాయుదేవుడు చాటిచెప్పగా.

క. కురిసె మరుద్వచనానం । తరమున సురపుష్పవృష్టి; దడయక మ్రోసెన్
సురదుందుభి నాదంబులు; । గరము ప్రసన్నుఁడయి వీచె గంధవహుండున్. 218

ప్రతిపదార్థం: మరుత్+వచన+అనంతరమునన్= వాయుదేవుడి మాటల పిమ్మట; సురపుష్పవృష్టి= దేవతల పూలవాన; కురిసెన్= కురిసింది; సురదుందుభి నాదంబులు= దేవదుందుభుల నాదాలు; తడయక= వెనువెంటనే; మ్రోసెన్= మ్రోగాయి; గంధవహుండున్= వాయువుకూడా; కరము= మిక్కిలి; ప్రసన్నుఁడు+అయి= సంప్రీతుడై; వీచెన్= వీచాడు.

తాత్పర్యం: వాయుదేవుడి ప్రకటన పిమ్మట దేవతలు పూలవాన కురిపించారు. వెనువెంటనే దేవదుందుభులు మ్రోగాయి. ప్రసన్నుడై వాయుదేవుడు దివ్యసౌరభం వెదజల్లుతూ వీచాడు.

విశేషం: పురాణేతిహాసాలలో దేవతల పుష్పవృష్టి కురియటం, దేవదుందుభులు మ్రోగటం, ఆధునికులు కొందరు నిరర్థకాలైన అతిశయోక్తులుగా నిరసించవచ్చును. వీటిని వాచ్యార్థంలో స్వీకరించే కువిమర్శకులమాట లకేమిగాని, సహృదయులు వీటి ఆంతర్యం ఎరిగి స్వారస్యం ఆస్వాదించగలరు. నలదమయంతుల పునస్సమాగమాన్ని వర్ణించటానికి, పరిమితమైన అర్థాలు గల పదాలకు శక్తిచాలదు. దేవదుందుభుల మ్రోతలు, దేవతల పుష్పవృష్టులు, సుప్రసన్నుడై వాయుదేవుడు వెదజల్లే దివ్యపరిమళాలు సహృదయులకు అనుభవైకవేద్యాలు. అల మతివిస్తరేణ. అలంకారోక్తి కవీంద్రుల మాతృభాష.

వ. ఇ ట్లెల్ల వారికి నాశ్చర్యంబుగా వాయుదేవుండు దన్నెఱింగించి, దమయంతి పతివ్రతాగుణంబులును బతియందుల యకృత్రిమానురాగంబునుం జెప్పిన విని నలుండు పరమ ప్రమోద పరిపూర్ణ హృదయుండై తత్క్షణంబ కర్కోటకుం దలంచి వాని యిచ్చిన పుట్టంబు పైఁబెట్టుకొని నిజరూపంబు దాల్చిన. 219

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఎల్లవారికిన్= అందరికి; ఆశ్చర్యంబుగాన్= అచ్చెరువు కొలుపేటట్లుగా; వాయుదేవుండు; తన్ను+ఎఱింగించి= తనను తెలిపి; దమయంతి, పతివ్రతాగుణంబులును= దమయంతియొక్క పతివ్రతా లక్షణాలను; పతి+అందుల= భర్తపట్లగల; అకృత్రిమ+అనురాగంబునున్= సహజమైన, (స్వచ్ఛమైన) ప్రేమను; చెప్పిన; విని= తెలుపగా, ఆకర్ణించి; నలుండు= నలుడు; పరమ, ప్రమోద, పరిపూర్ణ, హృదయుండు+ఐ= మిక్కుటమైన సంతోషంతో నిండిన హృదయం కలవాడై; తద్, క్షణంబు+అ= ఆ క్షణంలోనే; కర్కోటకున్+తలంచి= కర్కోటకుడిని స్మరించి; వాని+ఇచ్చిన, పుట్టంబు= ఆతడు ఇచ్చిన వస్త్రం; పైన్+పెట్టుకొని= పైన ధరించి; నిజ, రూపంబు= అసలు ఆకారాన్ని; తాల్చినన్= ధరించగా.

తాత్పర్యం: ఇట్లా ఎల్లవారికి అచ్చెరువు కలిగేటట్లుగా వాయుదేవుడు తనను తెలియజేసికొని, దమయంతి పతివ్రతా లక్షణాలను, ఆమెకు భర్తపట్ల కల స్వచ్ఛమైన అనురాగాన్ని చెప్పగా విని, నలుడు మిక్కుటమైన సంతోషంతో నిండిన మనస్సుకలవాడై, ఆ క్షణంలోనే కర్కోటకుడిని స్మరించి, ఆతడు ఇచ్చిన వస్త్రాన్ని మీద ధరించగా, నలుడికి తన తొల్లిటి ఆకారం ఏర్పడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: కథానిర్వహణం అద్భుతంగా ఉండాలని నాటకలక్షణం. నలదమయంతి కథలో సహజమైన నాటకీయత రాణిస్తూ ఉంటే నన్నయ దానిని పోషించాడు. 'ఎల్లవారికి నాశ్చర్యంబుగా'- అని నన్నయ ధ్వనింపజేసి ప్రసన్న కథాకలితార్థయుక్తిని ప్రదర్శించాడు.

నలుండు నిజరూపంబుతో దమయంతిం గూడుట (సం. 3-75-27)

ఉ. ఆయతబాహుఁ దప్తకనకాంచితవర్ణు మనోజరూపు నిం
ద్రాయితు సూర్యతేజు నిషధప్రభు నన్నలుఁ జూచి పద్మప
త్రాయతనేత్ర యప్డు దమయంతి గరంబు ముదంబు నొంది ల
క్ష్మీయుత యయ్యెఁ బంధులకు మిత్త్రులకున్ హృదయప్రియంబుగన్. 220

ప్రతిపదార్థం: ఆయత బాహున్= పొడుగుపాటి చేతులు కలవాడిని, అంటే ఆజానుబాహుడైన వాడిని; తప్త, కనక+అంచిత, వర్ణున్= అగ్నిలో శుద్ధి చేయబడిన మేలిమిబంగారాన్ని పోలిన రంగు కలవాడిని; మనోజ రూపున్ (మనస్+జ+రూపున్)= మన్మథుడివంటి ఆకృతి కలవాడిని; ఇంద్రాయితున్= ఇంద్రుడితో సమానమైనవాడిని; సూర్యతేజున్= సూర్యుడివంటి తేజస్సు కలవాడిని; నిషధప్రభున్= నిషధరాజైన; ఆ+నలున్= ఆ నలుడిని; చూచి= దర్శించి; పద్మ, పత్ర, ఆయత, నేత్ర= తామరపువ్వురేకులవలె విశాలమైన కన్నులు కలదైన; దమయంతి; అప్డు= అపుడు; కరంబు= మిక్కిలి; ముదంబున్+ఒంది= సంతోషాన్ని పొంది; బంధులకున్= చుట్టాలకు; మిత్త్రులకున్= నెచ్చెలులకు; హృదయప్రియంబుగన్= మనస్సుకు ఆనందం కలిగేటట్లు; లక్ష్మీయుత+అయ్యెన్= శోభతో కూడినట్టిదయింది.

తాత్పర్యం: ఆజానుబాహుడు, మేలిమి బంగారు మేనిచాయకలవాడు, మన్మథరూపుడు, ఇంద్రసమానుడు, సూర్యుడి తేజంవంటి తేజం కలవాడు, నిషధప్రభువు అయిన నలుడు సహజస్వరూపంతో కనిపించగా చూచి, తామరపువ్వురేకుల వంటి విశాలమైన కన్నులు కల దమయంతి సంతోషం పొంగిపొరలి శోభిల్లింది. ఆమె చుట్టాలు, మిత్రులు సంతోషించారు.

వ. ఇట్లు సంగతులైన యయ్యిరువురకు విరహ పరితాపంబు తోడన శరీరమలినత్వంబు వాసెఁ, బర స్పరానురాగంబు తోడన విభూషణశ్రీవిశేష విలేపన యోగంబులు విస్తరిల్లె; నంత నంతయు విని భీముండు జాతసస్య యైన వసుధ తోయసంప్రాప్తి నాప్యాయిత యైన ట్లజ్ఞాతచర్యుం డైన తన పతిం బడసి పరమసంతుష్టహృదయయై చంద్రుతోఁగూడిన రోహిణియుంబోలెఁబతిం గూడి యొప్పుచున్న దమయంతిం జూచి సంతసిల్లి, తన పురంబునం దష్టశోభనంబులు దేవగృహంబులయందు విశేషపూజలు సేయించె; నట్టి మహోత్సవం బెఱింగి ఋతుపర్ణుండు నలునొద్దకు వచ్చి 'నీవు నిఖిలలోక పూజ్యుండ వయ్యును నాయొద్ద బాహుకుం డనంగాఁ బ్రచ్ఛన్న వృత్తి నున్న నిన్ను నెఱుంగక నీచకర్మంబులయందు నియోగించితి; దీని క్షమియించునది' యని నలుచేత సత్కృతుండై యశ్వహృదయోపదేశంబు గొని యయోధ్యకుం జనియె; నిట నలుండును విదర్భాపురంబున నొక్కమాసంబు నివాసంబు సేసి, విదర్భేశ్వరు వీడ్కొని దమయంతి నంద పెట్టి, యొక్క రథంబును బదియా ఱేనుంగులును, నేఁబది గుఱ్ఱంబులు, నాఱునూఱు కాల్బలంబులుఁ దనకుఁ దోడుగా నిషధపురంబున కరిగి, పుష్కరుం గని యిట్లనియె. 221

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సంగతులు+ఐన= కలిసిన; ఆ+ఇరువురకున్= ఆ ఇద్దరికి; విరహతాపంబుతోడన్+అ= వియోగబాధతోపాటుగానే; శరీర, మలినత్వంబు= దేహంలోని మురికి; పాసెన్= విడిచింది; పరస్పర+అనురాగంబు తోడన్+అ=

ఇరువురిమధ్య ఏర్పడిన ప్రేమతో పాటుగా; విభూషణ, శ్రీ, విశేష, విలేపన, యోగంబులు= ఆభరణ శోభ, అసాధారణమైన మైపూతల చేరిక; విస్తరిల్లెన్= ఒనకూడాయి; అంతన్= అంతట; అంతయు విని= సర్వం తెలిసికొని; భీముండు= భీమరాజు; జాత, సస్య+ఐన= అంకురించిన పంటమొక్కలు కలదైన; వసుధ= భూమి; తోయ, సంప్రాప్తిన్= వర్షపాతంవలన; ఆప్యాయిత+ఐనట్లు= తనివి చెందినదైనట్లు; అజ్ఞాత చర్యుండు+ఐన= తెలియబడనట్టి ప్రవర్తనకలవాడయిన, అంటే అజ్ఞాతవాసంలోఉన్న; తన, పతిన్+పడసి= తన భర్తను పొంది; పరమ, సంతుష్ట, హృదయ+ఐ= మిక్కుటమైన తృప్తిని పొందిన హృదయం కలదై; చంద్రుతోన్+కూడిన, రోహిణియున్+పోలెన్= చంద్రుడితో సంయోగం చెందిన రోహిణీనక్షత్రం వలె; పతిన్+కూడి= భర్తతో కలిసి; ఒప్పుచున్న= శోభిస్తున్న; దమయంతిన్+చూచి= దమయంతిని చూచి; సంతసిల్లి= సంతోషించి; తన పురంబునందు= తన నగరంలో; అష్టశోభనంబులు= ఎనిమిది విధాలయిన అలంకారాలు; దేవ, గృహంబుల+ అందున్= కోవెలలలో; విశేషపూజలు= ప్రత్యేకమైన అర్చనలు; చేయించెన్= జరిపించాడు; అట్టి= ఆ విధమైన; మహా+ఉత్సవంబు+ఎఱింగి= గొప్ప పండుగ జరగటం తెలిసికొని; ఋతుపర్ణుండు; నలు+ఒద్దకు= నలుడి దగ్గరకు; వచ్చి= ఏతెంచి; నీవు; నిఖిలలోక, పూజ్యుండవు+అయ్యును= నీవు అన్ని లోకాలచేత అర్చించదగినట్టివాడివే అయినప్పటికి; నా+ఒద్ద= నా దగ్గర; బాహుకుండు+అనంగాన్= బాహుకుడు అనే పేరుమీద; ప్రచ్ఛన్న వృత్తిన్+ఉన్న= తెలియబడనిరీతిలో ఉండటంచేత; నిన్నున్+ఎఱుంగక= నీవు ఎవరో తెలియక; నీచకర్మంబుల+అందున్= అల్పకార్యాలలో; నియోగించితి= నియుక్తుడిగా చేశాను; దీని= నేను చేసినపనిని; క్షమియించునది= మన్నించేది; అని= అనిచెప్పి; నలుచేత; సత్, కృతుండు+ఐ= నలుడిచే గౌరవించబడినవాడై; అశ్వ, హృదయ+ ఉపదేశంబు+కొని= అశ్వహృదయం అనే విద్యను ఉపదేశం పొంది; అయోధ్యకున్+చనియెన్= అయోధ్యాపురికి వెళ్ళాడు; ఇట= ఇచట; నలుండును; విదర్భాపురంబునన్= విదర్భరాజధానిలో; ఒక్కమాసంబు= ఒకనెల; నివాసంబు+చేసి; విదర్భ+ఈశ్వరు= విదర్భప్రభువైన భీమరాజును; భీముడను పేరుగల ప్రభువును, వీడ్కొని= వెళ్ళటానికి అనుమతిని గైకొని; దమయంతిన్= దమయంతిని; అందు+అ= అచటనే; పెట్టి= ఉంచి; ఒక్క రథంబును= ఒకతేరును; పదియాఱు+ఏనుంగులును= పదారు ఏనుగులును; ఏఁబది గుఱ్ఱంబులును= ఏబయి అశ్వాలును; ఆఱునూఱు కాల్బలంబులున్= ఆరువందలమంది భటులును; తనకున్+తోడుగాన్= తనకు సాయంగా; నిషధ, పురంబునకు+అరిగి= నిషధదేశం రాజధానికి వెళ్ళి; పుష్కరున్+కని= పుష్కరుడిని చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఈ విధంగా నలదమయంతులకు తిరిగి సమాగమం జరిగింది. ఇరువురికి విరహతాపం పోయింది. అట్లే ఇరువురికి శరీరమాలిన్యం తొలగింది. ఇరువురికి పరస్పరానురాగం ఏర్పడింది. అట్లే ఆభరణశోభ, చందనాదులతో మైపూతలు ఇరువురికి సంక్రమించాయి. పంటమొక్కలు మొలిచిన భూమి వానకురిసినప్పుడు సంతృప్తి చెందినట్లు, అజ్ఞాతవాసంలో ఉన్న భర్తను పొంది, పరమానందభరితురాలై చంద్రునితో కూడినరోహిణివలె పతితో కలిసి శోభిల్లుతున్న దమయంతిని చూచి, తండ్రి భీమరాజు తన నగరాన అష్టశోభనాలు, దేవళాలలో ప్రత్యేకపూజలు జరిపించాడు. అటువంటి పండుగ వేడుక తెలిసికొని ఋతుపర్ణమహారాజు నలుడి దగ్గరకు వచ్చి 'నీవు జగత్పరిపూజ్యుడివి. కాని, నాదగ్గర బాహుకుడనే పేరుతో అజ్ఞాతవాసంలో ఉన్నావు కావున, నీవు ఎవరో తెలియక నిన్ను అల్పకార్యాలకు నియోగించాను. నన్ను క్షమించుము' - అని ప్రార్థించాడు. తదుపరి ఋతుపర్ణుడు నలుడిచేత సత్కరించబడినవాడై, అతడి దగ్గరనుండి అశ్వహృదయం అనే విద్యను పొంది అయోధ్యకు వెళ్ళాడు. నలుడు విదర్భరాజధానిలో ఒకనెల నివసించి దమయంతిని అచటనే ఉంచి, తాను ఒక రథం, పదారు ఏనుగులు, ఏబదిగుర్రాలు, ఆరువందలమంది కాలిభటులు తోడుగా నిషధదేశరాజధానికి వెళ్ళి పుష్కరుడిని కలిసికొని ఇట్లా చెప్పాడు.

విశేషం: (1) అష్టశోభనములు= ఎనిమిది విధాలైన అలంకారాలు. 1. నీళ్ళు చల్లటం 2. పందిళ్ళు వేయించటం 3. తోరణాలు కట్టించటం 4. చిత్రాలు వ్రాయించటం 5. జెండాలు నెలకొల్పటం 6. పూర్ణకుంభాలు ప్రతిష్ఠించటం 7. ధూపదీపారాధనలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏర్పరచటం 8. నృత్యగీతవాద్యాలు ఏర్పరచటం. (2) ఇరువురికి విరహతాపంతోపాటు శరీర మలినత్వం తొలగింది- అనటం, పరస్పరాభరణాదిక ప్రాప్తి అనురాగంతోపాటూ ఏర్పడటం- అనేచోట సహోక్తి అలంకారం. చంద్రుడితోకూడిన రోహిణి ఉపమానం. నలునితో గూడిన దమయంతి ఉపమేయం. అలంకారం: ఉపమ. జాతసస్య అయిన వసుధ ఉపమానం, నలుడిని పొందిన దమయంతి ఉపమేయం. అలంకారం: ఉపమ.

క. 'దమయంతి రోయిగా జూ । దము నీతో నాడఁ గడఁగెదను, ధరణీరా
జ్యము నీవు నాకు రోయిడు, । మమరఁగ జూదంబు నీకు నభిమతమేనిన్. 222

ప్రతిపదార్థం: జూదంబు, నీకున్+అభిమతము+ఏనిన్= జూదం నీకు ఇష్టమైతే; దమయంతి, రోయిగా= దమయంతిని ధనంగా (పణంగా); జూదము; నీతోన్= నీతోడ; ఆడన్+కడఁగెదను= ఆడటానికి పూనుతాను; ధరణీ, రాజ్యమున్= భూరాజ్యాన్ని; ఈవు= నీవు; నాకు; రోయి+ఇడు= ధనం (పణం) గా ఒడ్డుము.

తాత్పర్యం: 'ఓ పుష్కర మహారాజా! నీకు జూదమాడటం ఇష్టమైతే నేను దమయంతిని పణంగా పెట్టి నీతో జూద మాడటానికి సిద్ధంగా ఉన్నాను. నీవు భూరాజ్యాన్ని పణంగా ఒడ్డి నాతో జూదమాడటానికి సంసిద్ధుడవు కమ్ము.

మత్తకోకిల.

వీరభోజ్యము సుమ్ము రాజ్యము వింటె? నీవును నేను దు
ర్వారవృత్తి రథంబు లెక్కి యవంధ్యవిక్రమ మేర్పడన్
భూరివీరరణం బొనర్తము; పోర నోర్చినవాఁడ యి
ద్ధారుణీతలరాజ్యసంపదఁ దాల్చు వీరగుణోన్నతిన్. 223

ప్రతిపదార్థం: రాజ్యము= ప్రభుత్వానికి లోబడినదేశం; వీర, భోజ్యము, సుమ్ము= వీరులచేత అనుభవించదగింది కదా!; వింటె= (అని) వినిఉంటివే!; నీవును, నేను; దుర్వారవృత్తిన్= నీవూ, నేనూ అప్రతిహతశౌర్యంతో; రథంబులు+ఎక్కి= తేరులపై నిల్చి; అవంధ్య, విక్రమము+ఏర్పడన్= వ్యర్థం కానట్టి పరాక్రమం విలసిల్లగా; భూరి, వీర, రణంబు+ఒనర్తము= గొప్పదైన వీరయుద్ధం చేద్దాము; పోరన్+ఓర్చినవాఁడు+అ= యుద్ధంలో గెలిచినవాడే; వీర, గుణ+ఉన్నతిన్= శౌర్యంయొక్క పెంపుచేత (అంటే పరాక్రమాతిశయంచేత); ఈ+ధారుణీ, తల, రాజ్య, సంపదన్= ఈ భూస్థలిపైగల ప్రభుత్వమనే ఐశ్వర్యాన్ని; తాల్చున్= ధరిస్తాడు.

తాత్పర్యం: రాజ్యాన్ని అనుభవించవలసింది వీరులే సుమా! అనే సుభాషితం విన్నావుకదా! కాబట్టి నీవూ నేనూ రథాలను అధివసించి వ్యర్థంగాని పరాక్రమంతో గొప్ప వీరయుద్ధం సల్పుదాం; రమ్ము; యుద్ధంలో గెలిచినవాడే ఈ సమస్త భూరాజ్యాన్ని వీరపురుషుడుగా ఏలుకొంటాడు!

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.46 విశేషాంశం చూడండి.

వ. ఈ రెంటిలో నీ కెయ్యది యిష్టంబు దానిన కడంగు' మనినం, బుష్కరుండు రణంబునందుఁ బరాజితుండు గావున నలుం దొల్లియు జూదంబున నోడిచిన వాఁడై, యింకను నోడిచి దమయంతిం జేకొని కృతార్థుండ నగుదు నని సంతసిల్లి, 'యేనోటు వడితినేని నఖిలమహీరాజ్యంబు నీయది; నీ వోటువడితేని దమయంతి నాయది' యని పలికి యొడ్డి నలుతో జూద మాడి యోటువడిన. 224

ప్రతిపదార్థం: ఈ రెంటిలోన్= ఈ రెండింటిలో (అంటే జూదమాడటంలో, యుద్ధం చేయటంలో); నీకు+ఎయ్యది, ఇష్టంబు= నీకు ఏది సమ్మతమో; దానిన్+అ, కడంగుము= దానికే పూనుకొనుము; అనినన్= అని అడుగగా; పుష్కరుండు; రణంబునందున్= యుద్ధంలో; పరాజితుండు= ఓడిపోయినవాడు; కావున= కాబట్టి; తొల్లియు= మునుపు; జూదంబునన్= జూదంలో; నలున్= నలుడిని; ఒడిచినవాఁడు+ఐ= గెలిచినవాడై; ఇంకను= మరియు; ఒడిచి= గెలిచి; దమయంతిన్= దమయంతిని; చేకొని= పరిగ్రహించి; కృత+అర్థుండను= చరితార్థుడిని; అగుదును+అని= కాగలనని; సంతసిల్లి= సంతోషించి; ఏను= నేను; ఓటువడితిన్+ఏనిన్= ఓడిపోయినట్లయితే; అఖిల, మహీరాజ్యంబు= సమస్తభూమి ప్రభుత్వం; నీ+అది= నీది; నీవు+ఓటువడితి+ఏని= నీవు ఓడిపోయినట్లయితే; దమయంతి; నా+అది= దమయంతి నాకు దక్కుతుంది; అని, పలికి= అని చెప్పి; ఒడ్డి= పణం నిర్ణయించి; నలుడితో= నలుడితో; జూదము+ఆడి; ఓటువడినన్= ఓడిపోగా.

తాత్పర్యం: 'జూదమాడటం, యుద్ధంచేయటం ఈ రెంటిలో నీకు ఏది ఇష్టమో దానికే నీవు పూనుకొనుము' అని నలుడు పుష్కరుడిని అడిగాడు. లోగడ పుష్కరుడు నలుడిచేతిలో యుద్ధంలో ఓడినవాడు; జూదంలో నలుడిని ఓడించినవాడు. అందుచేత పుష్కరుడికి నలుడితో జూదమాడి దమయంతిని గెలుచుకొనాలనే ఆశ అంకురించింది. అంత, పుష్కరుడు నలుడితో 'మనం తిరిగి జూదమాడుదాము; నీవు గెలిస్తే ఈ సమస్త భూరాజ్యం నీదే; నేను నెగ్గితే దమయంతి నాది'- అని పణం నిర్ణయించుకొని ఇరువురూ జూదమాడారు. అందులో పుష్కరుడు ఓడిపోయాడు.

క. ఘనముగ జంబూద్వీపం। బునఁ గలవా రెల్ల నెఱుఁగఁ బుష్కరుచేతం
గొనియెఁ బునర్ద్యూతంబున। ననఘుఁడు నలుఁ డఖిలరాజ్య మత్యున్నతితోన్. 225

ప్రతిపదార్థం: జంబూ, ద్వీపంబునన్, కలవారు+ఎల్లన్= జంబూద్వీపంలో ఉండే జనులందరు; ఘనముగన్= గొప్పగా; ఎఱుఁగన్= తెలిసికొనేటట్లు; అనఘుఁడు= పాపరహితుడైన; నలుఁడు; పునర్+ద్యూతంబునన్= తిరిగి ఆడిన జూదంలో; పుష్కరుచేతన్= పుష్కరుడి నుండి; అఖిల రాజ్యము= సర్వరాజ్యాన్ని; అతి+ఉన్నతితోన్= మిక్కిలి ఔన్నత్యంతో; కొనియెన్= పరిగ్రహించాడు.

తాత్పర్యం: జంబూద్వీపంలోని ప్రజలందరికి తెలిసేటట్లుగా పుణ్యశీలుడైన నలుడు పుష్కరుడితో రెండవసారి జూదమాడి గెలిచి, సమస్తరాజ్యాన్ని మిక్కిలి గొప్పగా పరిగ్రహించాడు.

వ. ఇట్లు జూదంబునఁ బుష్కరు నోడించి సకల మహీరాజ్యంబును జేకొని నలుండు వాని కిట్లనియె. 226

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; జూదంబునన్= జూదంలో; పుష్కరున్+ఓడించి; సకల, మహీరాజ్యంబును= సమస్తభూమండల ప్రభుత్వాన్ని; చేకొని= పరిగ్రహించి; నలుండు; వానికిన్= పుష్కరుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా జూదంలో పుష్కరుడిని గెలిచి, సమస్త భూరాజ్యాన్ని పరిగ్రహించిన నలుడు అతడితో ఇట్లా అన్నాడు.

క. 'కలిసంప్రాప్తుఁడనై కడు। బలమఱి నీ చేతఁ దొల్లి బలవద్ద్యూత
చ్ఛలజితుఁడ నైతి; నది నీ। బల మని గర్వింప వలదు బలవంతుఁడవై. 227

ప్రతిపదార్థం: కలి, సంప్రాప్తుఁడను+ఐ= కలి పురుషుడిచేత ఆవహించబడినవాడినై; కడు= మిక్కిలి; బలము+అఱి= శక్తి నశించి; నీ చేతన్= నీచేత; తొల్లి= మునుపు; బలవత్+ద్యూత+ఛల, జితుఁడను+ఐతిన్= బలవంతంగా ఆడవలసివచ్చిన

జూదంలో మోసంచేత జయించబడ్డాను; అది= అటువంటి నాఓటమి; నీ, బలము+అని= నీ శక్తి అని; బలవంతుఁడవు+ఐ= బలం కలవాడివయి; గర్వింపవలదు= విర్రవీగవద్దు.

తాత్పర్యం: 'మునుపు నేను కలిచేత ఆవహించబడినవాడినై, బలం నశించి, నీచేత బలవంతపు జూదంలో ఓడిపోయాను. అటువంటి నా ఓటమి నీ బలంవలన లభించిన విజయంగా భావించవద్దు; అది నీ బలమనుకొని గర్వంతో విర్రవీగవద్దు.

వ. నీవు నా పితృవ్యపుత్త్రుండవు; ని న్నెద్దియుం జేయనోపఁ బో' మ్మని పుష్కరుని విడిచిపుచ్చి పుష్కలంబయిన రాజ్యంబుతో నలుం డున్నంత. 228

ప్రతిపదార్థం: నీవు; నా పితృవ్యపుత్త్రుండవు= నా పినతండ్రి కుమారుడవు; నిన్ను+ఎద్దియున్+చేయన్+ఓపన్= నిన్నేమీ చేయలేను; పొమ్ము= వెళ్ళుము; అని= అని చెప్పి; పుష్కరున్= పుష్కరుడిని; విడిచిపుచ్చి= వదలిపెట్టి; పుష్కలంబు+అయిన= సమృద్ధమైన; రాజ్యంబుతో; నలుండు= నలుడు; ఉన్నంతన్= ఉండగా.

తాత్పర్యం: నీవు నా పినతండ్రి కుమారుడవు. కావున నీకు ఎటువంటి కీడును నేను చేయలేను. పొమ్ము'- అని నలుడు పుష్కరుడిని విడిచిపెట్టి సర్వసమృద్ధమైన రాజ్యాన్ని ఏలుతుండగా.

క. భీమ ప్రస్థాపిత యయి । కోమలి దమయంతి పుత్త్రకులుఁ దానును ల
క్ష్మీ మహిమ వెలుఁగుచుండఁగఁ । దామరసదళాక్షి వచ్చెఁ దనపతికడకున్. 229

ప్రతిపదార్థం: భీమ, ప్రస్థాపిత+అయి= భీముడిచే బాగుగా ప్రయాణము చేయించబడినదై (పంపబడినదై); కోమలి, దమయంతి= సుకుమారి అయిన దమయంతి; పుత్త్రకులున్= బిడ్డలు; తానును; లక్ష్మీమహిమ= ఐశ్వర్య ప్రభావం; వెలుఁగుచు+ఉండఁగన్= శోభిల్లుతుండగా; తనపతి కడకున్= తన భర్త అయిన నలుడి దగ్గరకు; తామరస, దళ+అక్షి= పద్మంయొక్క రేకులవలె విశాలాలైన కన్నులు కల దమయంతి; వచ్చెన్= వచ్చింది.

తాత్పర్యం: తండ్రి అయిన భీమమహారాజుచేత పంపబడి, తామరపువ్వు రేకులవంటి కన్నులు కల దమయంతి బిడ్డలు తాను కలిసి, ఐశ్వర్య మహిమతో శోభిల్లుతూ భర్త అయిన నలుడి దగ్గరకు వచ్చింది.

వ. అట్లు తన మనోవల్లభయైన దమయంతింగూడి నలుండు విధివిహితానేకాచరితమఖుండైశతమఖు విలాసంబుతో సకలరత్నయుతంబైన రత్నగర్భాధిరాజ్యంబు సేసెఁ; గావున నక్షజితుండు నైతి నని వగవవలదు; నీవును దైవమానుషసంపన్నుండ వయి శత్రువుల జయించి సకలమహీసామ్రాజ్యంబు వడయుదు' వని బృహదశ్వుండు ధర్మరాజునకు నక్షహృదయం బుపదేశించి. 230

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; తన, మనోవల్లభ+ఐన= తన హృదయేశ్వరి అయిన; దమయంతిన్+కూడి= దమయంతితో కలిసి; నలుండు; విధి, విహిత+అనేక+ఆచరిత, మఖుండు+ఐ= శాస్త్రవిధులలో నిర్దేశించబడిన విధంగా ఆచరించబడిన పెక్కుయజ్ఞాలు కలవాడై (అంటే శాస్త్రీయపద్ధతులలో పెక్కుయాగాలు చేసి); శతమఖు, విలాసంబుతోన్= దేవేంద్రుడి వైభవంతో; సకల, రత్నయుతంబు+ఐన= సమస్త రత్నాలతో కూడి ఉన్న; రత్నగర్భా+అధిరాజ్యంబు+చేసెన్= భూమండలాన్ని గొప్పగా పరిపాలించాడు: కావునన్; అక్ష, జితుండను+ఐతిని+అని= పాచికలచేత (జూదంలో) ఓడిపోయాను అని; వగవ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వలదు= శోకించకుము; నీవును= నీవుకూడ; దైవ, మానుష. సంపన్నుండవు+అయి= దైవసాహాయ్యం, మానుషప్రయత్నంతో కూడిన సంపద కలవాడివయి; శత్రువులన్= విరోధుల; జయించి; సకల, మహీ, సామ్రాజ్యంబు= సమస్త భూసామ్రాజ్యం; పడయుదువు= పొందగలవు; అని= అని చెప్పి; బృహదశ్వుండు= బృహదశ్వ మహాముని; ధర్మరాజునకున్; అక్షహృదయంబు= అక్షహృదయం అనే విద్య; ఉపదేశించి= ప్రబోధించి.

తాత్పర్యం: ఆ విధంగా నలుడు తన హృదయేశ్వరి దమయంతిని కూడి శాస్త్రాలలో నిర్దేశించబడినట్లు పెక్కు యాగాలు చేశాడు. దేవేంద్రవైభవంతో సకల రత్నయుతమైన భూమండలాన్ని గొప్పగా పరిపాలించాడు. కాబట్టి, పాచికలలో ఓడిపోయానని దుఃఖించవద్దు. నీవును దైవసాహాయ్యం, పురుషప్రయత్నం మేళవించిన అభ్యుదయంతో విరోధులను జయించి, సకలభూమండల సామ్రాజ్యాన్ని ఏలగలవు- అని బృహదశ్వుడు ధర్మరాజుకు అక్షహృదయం అనే విద్యను ఉపదేశించాడు.

సీ. ఇన్నలోపాఖ్యాన మెప్పుడు దత్తావ । ధానులై వినువారుఁ దవిలి సభలఁ
జదివెడువారును జగతీశ! కలిదోష । నిర్ముక్తు లగుదురు; నిఖిలపుణ్య
ఫలభాగు లగుదురు; బహుపుత్త్రపౌత్త్రాయు । రారోగ్యధనయుక్తు లగుదు; రెల్ల
విషములకును దుష్టవిషయమ్ములకు దూరు । లగుదురు; ధర్మాత్ము లగుదు; రుర్వి

ఆ. గడుఁ బ్రసిద్ధ మిదియుఁ; గర్కోటకుని, దమ । యంతిఁ, బుణ్యమూర్తియైన నలుని
ఋజుచరిత్రుఁ డైన ఋతుపర్ణుఁ గీర్తింపఁ । గలిభయంబు లెల్లఁ గ్రాఁగు నధిప! 231

ప్రతిపదార్థం: ఈ+నల+ఉప+ఆఖ్యానము= ఈ నలుడిని గురించిన ఉపకథ; ఎప్పుడు; దత్త+అవధానులు+ఐ= ఇవ్వబడిన అవధానం కలవారయి, అంటే శ్రద్ధతో; వినువారున్= ఆలకించేవారు; సభలన్= సమావేశాలలో; తవిలి= పూనికతో; చదివెడువారును= పఠించేవారును; జగతీ+ఈశ= ఓ మహారాజా (ధర్మరాజా!); కలిదోష, నిర్ముక్తులు= కలిదోషంనుండి విముక్తులు; అగుదురు= కాగలరు- అంటే కలిప్రభావంవలన ఏర్పడే భ్రమప్రమాదాలకు, కష్టనష్టాలకు లోనుకారు; నిఖిల, పుణ్య, ఫల, భాగులు+అగుదురు= సమస్త పుణ్యాలు చేయటంవలన లభించే ఫలితాలను భాగంగా పొందేవారు కాగలరు; బహు, పుత్త్ర, పౌత్త్ర+ఆయుస్+ఆరోగ్య, ధన, యుక్తులు+అగుదురు= పెక్కుమంది పుత్రులతో, మనుమలతో, ఆయువుతో, ఆరోగ్యంతో, ధనంతో కూడినవారు కాగలరు; ఎల్లవిషములకును= అన్ని విషాలకు; దుష్ట విషయమ్ములకు= చెడుఅంశాలకు; దూరులు+అగుదురు= తొలగి ఉంటారు; ధర్మ+ఆత్ములు+అగుదురు= ధర్మంతో నిండిన ఆత్మలు కలవారవుతారు; ఉర్విన్= భూమిలో; ఇదియున్= ఈ ఉపాఖ్యానం; కడు= మిక్కిలి; ప్రసిద్ధము= ఎల్లరకు తెలిసినది; కర్కోటకుని; దమయంతిన్; (కర్కోటక, దమయంతులను) పుణ్యమూర్తి+ఐన= పుణ్యం ఆకృతిగాకల; నలుని; ఋజుచరిత్రుండు+ఐన= సత్యప్రవర్తనుడైన; ఋతుపర్ణున్; కీర్తింపన్= ప్రశంసించగా; అధిప!= ఓ మహారాజా!; కలి, భయంబులు+ఎల్లన్= కలివలన ఏర్పడే భయాలన్నియు; క్రాఁగున్= మాడిపోతాయి.

తాత్పర్యం: ఓ మహారాజా! ఈ నలుడిగాథ శ్రద్ధతో వినేవారు, సమావేశాలలో చదివి వినిపించేవారు, కలివలన సంభవించే దోషాలనుండి విముక్తి చెందగలరు. సర్వపుణ్యకార్యాలు చేసినప్పుడు లభించే పుణ్యఫలితాలు నలోపాఖ్యానం విన్నవారికి, వినిపించినవారికికూడ లభిస్తాయి. అటువంటివారికి బహుపుత్త్రలాభం, పౌత్త్రవృద్ధి, ఆయురారోగ్య ధనసంపత్తులు కలుగుతాయి. అన్నివిషాలకు, చెడువిషయాలకు వారు దూరమౌతారు. ధర్మాత్ములౌతారు. ఈ కథ భూలోకంలో ప్రాచీనమైనది; మిగుల ప్రసిద్ధమైనది. కర్కోటకుడిని, దమయంతిని, పుణ్యశ్లోకుడైన నలుడిని, ఋజుచరిత్రుడైన ఋతుపర్ణుడిని ధ్యానించి కీర్తించిన కలిభయాలు తొలగిపోగలవు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇది ఫలశ్రుతి. ఏ కథనైనను వినినవారికి, వినిపించినవారికి కలిగే అభ్యుదయ పరంపరాభివృద్ధి కథచివర వివరించటం ప్రాచీన సాహితీ సంప్రదాయం. ప్రత్యేక ఫలశ్రుతి చెప్పబడటంచేత నలోపాఖ్యానం భారతకథ కంటె ప్రాచీనతరమని, ఆ కథ సుప్రసిద్ధమైనది కావుననే దానిని బృహదశ్వమహాముని ధర్మరాజుకు చెప్పాడని విమర్శకులు పలువురి అభిప్రాయం. ఇందలి పాత్రలు చిరస్మరణీయాలు. కథలోని జిగిబిగి, ఇతివృత్తంలో మలుపులు, గుండెలకు హత్తుకొనేవి. ఫలశ్రుతి స్థూలదృష్టికి అతిశయోక్తి భాజనంగా కనిపించినా సూక్ష్మదృష్టికి నలోపాఖ్యానం సహృదయులకు అతిలోకమైన భావితాంతఃకరణప్రవృత్తిని కల్పిస్తుందని తోచక తప్పదు. భారతదేశంలో యుగయుగాంతరాలనుండి నలోపాఖ్యానం విని, చదివి అలనాడు ధర్మరాజు ప్రభృతులు పొందిన సద్యఃపరనిర్వృతి, చిత్తశాంతి, రసానంద తన్మయత్వం అనుభవించిన సహృదయులు ఎందరెందరో ఉన్నారు.

ధర్మరాజునొద్దకు నారదమహాముని వచ్చుట (సం. 3-80-1)

వ. అని చెప్పి బృహదశ్వుం డరిగినం; బాండవులు గాండీవిరాకయ కోరుచుఁ దదాలోకనప్రీతి నుండునంత నంతరిక్షం బెల్లఁ దనతేజంబున వెలుంగుచుండ నారదుండు వచ్చి యనుజసహితుండైన ధర్మరాజుచేతం బూజితుండై యిట్లనియె. 232

ప్రతిపదార్థం: అని, చెప్పి= అట్లు వచించి; బృహదశ్వుండు= బృహదశ్వమహాముని; అరిగినన్= వెళ్ళగా; పాండవులు= పాండురాజ కుమారులు; గాండీవి= గాండీవధారిఅయిన అర్జునుడియొక్క; రాకయ= రాకనే; కోరుచున్= ఆకాంక్షిస్తూ; తద్+ఆలోకన, ప్రీతిన్= ఆతడిని చూడాలనే ఆసక్తితో; ఉండు+అంతన్= ఉన్నంత; అంతరిక్షంబు+ఎల్లన్= ఆకాశమంతయు; తన, తేజంబునన్= తన ప్రకాశంతో; వెలుంగుచుండన్= శోభిల్లుతుండగా; నారదుండు= నారదమహర్షి; వచ్చి= విచ్చేసి; అనుజ, సహితుండు+ఐన= తమ్ములతో కూడిఉన్నట్టి; ధర్మరాజుచేతన్= ధర్మరాజుచేత; పూజితుండు+ఐ= అర్చించబడినవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి, బృహదశ్వమహర్షి ధర్మరాజును వీడ్కొని వెళ్ళినతరువాత, పాండవులు అర్జునుడి రాకనే కోరుతూ, ఆతడిని చూడాలనే ఆకాంక్షతో నిరీక్షిస్తుండగా, ఆకాశమంతటిని తన కాంతిచేత శోభిల్లజేస్తూ నారదమహర్షి వచ్చి, తమ్ములతో కూడిఉన్న ధర్మరాజుచేత అతిథిసత్కారాలు పొంది ఇట్లా అన్నాడు.

ఆ. 'ధర్మపుత్త్ర! నీ యుదారచరిత్రకు । ధర్మమతికిఁ దృప్తతముఁడ నైతి;
నడుగు మిష్ట మెద్ది?' యనినఁ గృతాంజలి । యై మహీశుఁ డిట్టు లనియె భక్తి. 233

ప్రతిపదార్థం: ధర్మపుత్త్ర!= ఓ ధర్మతనయా!; నీ+ఉదార, చరిత్రకున్= నీయొక్క మంచి నడవడికి; ధర్మమతికిన్= ధర్మంతో కూడిన బుద్ధికి; తృప్తతముఁడన్+ఐతిన్= మిక్కిలి తృప్తి చెందినవాడిని అయ్యాను; (తృప్తుడు, తృప్తతరుడు, తృప్తతముడు అనేవి తర-తమ విశిష్టాలు); అడుగుము+ఇష్టము+ఎద్ది= నీకు ఏది ఇష్టమో కోరుకొనుము; అనినన్= అని అడుగగా; కృత+అంజలి+ఐ= ఘటించిన అంజలి కలవాడై- అంటే నమస్కరించి; మహీ+ఈశుఁడు= రాజు (ధర్మరాజు); భక్తిన్= పూజ్యభావంతో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! నీ గొప్పనడవడికి, నీ ధర్మబుద్ధికి నేను సంపూర్ణ సంతృప్తి చెందాను. నీకు ఇష్టమైనది కోరుకొనుము' - అని నారదమహర్షి చెప్పగా ధర్మరాజు ఇట్లా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. 'మునీంద్రా! నీవు తృప్తుండవైనం ద్రిజగంబులకుం దృప్తియగు; నిన్నుం జూచి కృతార్థుండ నైతి; నా కెప్పుడు నొక్క ధర్మసందేహంబు గలదు; దాని నిర్ణయించి యానతీయవలయు. 234

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= మునులలో ఇంద్రుడి వంటివాడా!; నీవు, తృప్తుండవు+ఐనన్= నీవు సంతృప్తి చెందిన వాడివైతే; త్రిజగంబులకున్= మూడులోకాలకు; తృప్తి+అగున్= తనివి ఏర్పడుతుంది; నిన్నున్+చూచి= నిన్ను సందర్శించి; కృత+అర్థుండను+ఐతి= చరితార్థుడిని అయ్యాను; నాకు+ఎప్పుడున్= నాకు ఎల్లప్పుడు; ఒక్క= ఒక; ధర్మ, సందేహంబు= ధర్మాన్ని గురించిన అనుమానము; ఉన్నది; దానిన్= ఆ ధర్మసందేహాన్ని; నిర్ణయించి= తేల్చి; ఆనతి+ఈయవలయున్= దయచేసి చెప్పాలి.

తాత్పర్యం: 'మునులలో శ్రేష్ఠుడవైనవాడా! నీవు సంతృప్తి చెందితే మూడులోకాలు సంతృప్తి చెందినట్లే. నిన్ను సందర్శించటంచేత నా జన్మ ధన్యమైంది. ఒక ధర్మసందేహం చిరకాలంనుండి నన్ను వేధిస్తున్నది. ఆ ధర్మసందేహాన్ని దయచేసి తీర్చి, నన్ను ఉద్ధరించాలని ప్రార్థిస్తున్నాను.

విశేషం: (1) మహానుభావుడైన నారదమహర్షి ఒక్కడు తృప్తిచెందితే చాలు. ముల్లోకాలు సంతృప్తి చెందినట్లే. (2) మహాత్ముల సందర్శనం చాలు. జన్మ ధన్యమవుతుంది. ఈ రెండుభావాలు ధర్మరాజుశీలానికి మెరుగు పెట్టుతున్నాయి.

**చ. ధరణిఁ బ్రదక్షిణంబుగ ముదంబునఁ గ్రుమ్మఱి తీర్థసేవనా
పరు లగుచున్న ధన్యులు శుభస్థితి నెట్టి ఫలంబు నొందఁ గాం
తురు బహుతీర్థకీర్తనముతో నెఱిఁగింపుము దీని' నావుడున్
నరవరుఁ డైన పార్థునకు నారదుఁ డిట్లని చెప్పెఁ బ్రీతితోన్. 235**

ప్రతిపదార్థం: ధరణిన్= భూమిలో; ప్రదక్షిణంబుగన్= కుడివైపుగా పయనిస్తూ; ముదంబునన్= ప్రీతితో; క్రుమ్మఱి= తిరిగి; తీర్థ, సేవనా, పరులు+అగుచున్న ధన్యులు= పుణ్యక్షేత్రాలను సందర్శించే వారవటంచేత కృతార్థులు అయినవారు; శుభస్థితిన్= శుభకరమైన ఉనికిలో; ఎట్టి, ఫలంబు= ఎటువంటి పుణ్యఫలితాన్ని; ఒందన్+కాంతురు= పొందజాలుదురో; బహు, తీర్థ, కీర్తనముతోన్= పెక్కు పుణ్యక్షేత్రాల అభివర్ణనంతో; దీనిన్= దీనిని; ఎఱిఁగింపుము= తెలుపుము; నావుడున్= అని పలుకగా; నర, వరుఁడు+ఐన= మనుజులలో శ్రేష్ఠుడైన; పార్థునకున్= పృథాపుత్రుడైన ధర్మరాజుకు; నారదుఁడు; ప్రీతితోన్= సంతోషంతో; ఇట్లు+అని, చెప్పెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: భూలోకంలో ప్రదక్షిణంచేస్తూ పుణ్యక్షేత్రాలు సందర్శించి ధన్యులైన మహానుభావులు పొందే పుణ్యఫలం ఎటువంటిదో అనేక దివ్యక్షేత్రాల వర్ణనతోపాటు నాకు తెలుపప్రార్థన' - అని అడిగిన ధర్మరాజుతో నారదుడు ఇట్లా చెప్పాడు.

విశేషం: (1) ప్రదక్షిణం అంటే చుట్టూ తిరగటం. ఎడమనుండి కుడివైపునకు తిరుగుతూ పయనించటం అనేది అసలు అర్థం. (2) తీర్థం అంటే నీరు అని అర్థం. తీర్థమంటే పుణ్యక్షేత్రం అనే అర్థం రూఢికెక్కింది. సాధారణంగా పుణ్యక్షేత్రాలు, పవిత్రనదీతీరాలలో ఉండటం, లేదా అచట పవిత్రంగా భావించబడే జలాలుండటంచేత తీర్థం అంటే ఔపచారికంగా పుణ్యక్షేత్రం అనే అర్థం ఏర్పడింది. (3) పార్థుడు అంటే పృథ (కుంతి) యొక్క కొడుకు. ఈ శబ్దం అర్జునుడికే తరుచుగా వాడబడింది. ధర్మజ భీమార్జునులు మువ్వురును పార్థులే కదా! ఇచట పార్థుడు అంటే ధర్మరాజుకు అన్వయిస్తుంది. అనేక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తీర్థయాత్రలు చేసేవారు తాము ఉన్న ప్రదేశంనుండి ప్రదక్షిణంగా పయనిస్తూ పుణ్యక్షేత్రాలను సందర్శించాలి - అనే సంప్రదాయం ఇందువలన వెల్లడౌతున్నది.

క. ధీరుఁడు భీష్ముఁడు గంగా । ద్వారమునం దొల్లి పితృహితమ్ముగ శుభక
ర్మారంభుఁ డగుచు నుండె ను । దారుం డధ్యయన సంతతవ్రతపరుఁడై. 236

ప్రతిపదార్థం: ధీరుఁడు= ధైర్యంకలవాడు; ఉదారుండు= గంభీరుడు; భీష్ముఁడు; తొల్లి= మునుపు; గంగా, ద్వారమునన్= గంగానదీముఖంలో; అధ్యయన, సంతత, వ్రతుఁడు+ఐ= ఎల్లప్పుడు వేదాలను అభ్యసించే దీక్ష కలవాడై; పితృహితమ్ముగన్= తండ్రికి ప్రీతిగా; శుభ, కర్మ+ఆరంభుఁడు+అగుచున్= సత్క్రియలను చేయటానికి ఉద్యుక్తుడై; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: ధైర్యంకలవాడు, గంభీరుడు, ఐన భీష్ముడు పూర్వం గంగాద్వారంలో నిరంతర వేదాధ్యయన దీక్షను పూనినవాడై తండ్రికి సంప్రీతి ఘటించే సత్క్రియలు చేస్తూ ఉండినాడు.

వ. అతని పితృదేవతాభక్తికిఁ బరమధర్మచరితంబునకు మెచ్చి తద్దర్శనాపేక్షం బులస్త్యుండను మహాముని వచ్చిన నతిభక్తుండయి యా భీష్ముం డమ్మునిఁ గుశపీఠంబున నునిచి యర్ఘ్యపాద్యాదివిధులం బూజించి యతని యడుగులు తల నిడుకొని దక్షిణజానుస్పృష్ట మహీతలుండయి' యేను భీష్ముండ భవద్దాసుండ' నని ముకుళిత హస్తుం డయి యున్న వానికిఁ బులస్త్యుం డిట్లనియె. 237

ప్రతిపదార్థం: అతని= భీష్ముడియొక్క; పితృదేవతా భక్తికిన్= పితృదేవతలపట్ల గల పూజ్యభావానికి; పరమ, ధర్మ, చరితంబునకున్= ధర్మపూరితమైన గొప్ప నడవడికి; మెచ్చి= సంతసించి; తద్+దర్శన+అపేక్షన్= అతడిని చూడాలనే కోరికతో; పులస్త్యుండు+అను, మహాముని= పులస్త్యుడు అనే పేరుకల గొప్పఋషి; వచ్చినన్= రాగా; అతి, భక్తుండు+అయి= మిక్కిలి భక్తికలవాడయి; ఆ, భీష్ముండు; ఆ+మునిన్; కుశ, పీఠంబునన్+ఉనిచి= దర్భల ఆసనంపై కూర్చుండబెట్టి; అర్ఘ్య, పాద్య+ఆది, విధులన్= స్వాగతపూర్వకమైన ఉదకాన్ని, పాదాలు కడుగుకొనే నీళ్లు మొదలైనవాటిని శాస్త్రవిధులలో చెప్పబడిఉన్నట్లుగా సమర్పించి; పూజించి= అర్చించి; అతని, అడుగులు= అతని పాదాలు; తలన్= తన శిరస్సుపై; ఇడుకొని= పెట్టుకొని; దక్షిణ, జాను, స్పృష్ట, మహీతలుండు+అయి= కుడి మోకాలుచేత ముట్టబడిన భూభాగం కలవాడై (కుడి మోకాలిని ముడిచి మోకరిల్లినవాడై); ఏను= నేను; భీష్ముండు= భీష్ముడను; భవత్+దాసుండన్= మీ సేవకుడిని; అని= అని చెప్పి; ముకుళిత హస్తుండు+అయి= ముడిచిన చేతులు కలవాడై, అంటే నమస్కరించి; ఉన్నన్= ఉండగా; వానికిన్= ఆ భీష్ముడికి; పులస్త్యుండు= పులస్త్య మహాముని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: భీష్ముడి పితృదేవతాభక్తికి, అతడియొక్క అత్యంత ధర్మశీలానికి మెచ్చి, ఆతడిని చూడాలనే కోరికతో అతడి దగ్గరకు పులస్త్యుడనే గొప్ప ఋషి వచ్చాడు. భీష్ముడు ఆ ఋషీశ్వరుడిని మిక్కిలి భక్తితో పూజించి, దర్భలఆసనంపై కూర్చుండబెట్టి అర్ఘ్యం, పాద్యం మొదలైన స్వాగతసత్కారాలు సమర్పించి అతడి పాదాలను తన శిరస్సుపై చేర్చుకొని, తన కుడిమోకాలు భూమిపై చేర్చి మ్రొక్కి 'నేను భీష్ముడిని, మీ సేవకుడిని' అని పలికి నమస్కరించి ఉండగా, అతడితో పులస్త్యుడు ఇట్లా పలికాడు.

విశేషం: (1) దర్భల ఆసనం సమర్పించటం, అర్ఘ్యం, పాద్యం ఇచ్చి గౌరవించటం అలనాటి అతిథిసత్కార విశేషాలు. (2) దక్షిణజానువు భూతలం అందేటట్లుగా ఉండి అతిథి పాదాలు తన శిరస్సు సోకేటట్లు నమస్కరించటం గౌరవభక్తి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రపత్తులకు సూచకం. నమస్కరించేటప్పుడు తనపేరు చెప్పుకొనటం సంప్రదాయం. భీష్ముడియందు పితృభక్తి, దేవభక్తి, ధర్మానురక్తి అనే మూడు గుణాలున్నాయి. అవి ఋషుల చేతకూడ గౌరవింపబడేవి. అందువలన పులస్త్యుడు భీష్ముడిని దర్శించ వచ్చాడు. భీష్ముడు కర్మఠుడు. అందువలన తీర్థయాత్రలనుగురించి అడిగాడు. ధర్మజుడు కూడ భీష్ముడివలె కర్మఠుడు. అందువలన మనుమడికి తాతవిన్నకథను నారదుడు వినిపించాడు. ఇది ఇతిహాస మర్యాదకూడా.

క. 'పితృదేవభక్తిఁ బుణ్య । వ్రతచర్యను నీవ యెల్లవారికి నత్యు
న్నతుఁడవు గావున నీచే । ధృతిఁ గానఁగఁబడితి నేఁ బ్రతీపకులేశా! 238

ప్రతిపదార్థం: 'ప్రతీప, కుల+ఈశా!= ప్రతీపుడి వంశంలో శ్రేష్ఠుడవైనవాడా!; పితృదేవ భక్తిన్= పితృదేవతలపై గల పూజ్యభావంలోను; పుణ్యవ్రతచర్యను= పుణ్యం కలిగించే పనులను తదేకదీక్షతో చేయటంలోనూ; నీవు+అ= నీవే; ఎల్లవారికిన్= అందరికంటె; అతి+ఉన్నతుఁడవు= మిక్కిలి ఎత్తైనవాడివి - అంటే గొప్పవాడివి; కావున; నీచే; ధృతిన్= నిష్ఠతో; ఏన్= నేను; కానఁగన్+పడితిన్= సందర్శించబడ్డాను.

తాత్పర్యం: 'ప్రతీపమహారాజు వంశంలో శ్రేష్ఠుడివైనవాడా! ఓ భీష్ముడా! పితృదేవతారాధనలోను, పుణ్యకార్యాలను తదేకదీక్షతో ఆచరించటంలోను నీవే అందరికంటె గొప్పవాడివి. కావుననే నన్ను నీవు ఇంత నిష్ఠతో ఆరాధించావు.

వ. నీ యిష్టంబు సెప్పు; మే నమోఘదర్శనుండ' ననిన భీష్ముండు ముదితహృదయుండై 'మునీంద్రా! నాయందు నీకుఁ బ్రసాదబుద్ధి గలదేనిఁ జెప్పు' మని. 239

ప్రతిపదార్థం: నీ, ఇష్టంబు+చెప్పుము= నీవు ఏది కోరుకొంటావో తెలుపుము; ఏను+అమోఘ, దర్శనుండను= నేను వ్యర్థం కాని దర్శనం కలవాడిని, అంటే నన్ను చూడటంవలన మేలు కలిగితీరుతుంది; అనినన్= అని చెప్పగా; భీష్ముండు; ముదిత, హృదయుండు+ఐ= సంతోషించిన హృదయం కలవాడై; ముని+ఇంద్రా!= మునులలో శ్రేష్ఠుడవైనవాడా!; నాయందున్= నాపై; నీకున్= నీకు; ప్రసాద, బుద్ధి= అనుగ్రహం; కలదేని= ఉంటే; చెప్పుము+అని.

తాత్పర్యం: నీ ఇష్టం తెలుపు. మేలు చేకూర్చకుండ నా సందర్శనం ఎన్నడూ వ్యర్థం కాజాలదు' - అని పులస్త్యమహర్షి పలుకగా భీష్ముడు సంతోషించి 'మునీంద్రా! నీకు నాపట్ల దయకలదేని చెప్పుము' అనగా.

విశేషం: భీష్ముడు పులస్త్యమహర్షిని చెప్పుమని అడిగింది ఏమిటి? ధర్మరాజు నారదుడికి వేసినట్టి ప్రశ్ననే భీష్ముడు అంతకుముందు పులస్త్యమహర్షిని అడిగిఉన్నాడు. ఆ సంగతినే ప్రస్తావించి నారదుడు ధర్మరాజుకు చెప్పాడు. అంటే ఇట నారదుడు చెపుతున్న సమాధానం అలనాడు పులస్త్యుడు భీష్ముడికి చెప్పినటువంటిదే.

క. 'మనుజేంద్ర! నన్ను నీ యడి । గిన యట్ల పులస్త్యుఁ బుణ్యకీర్తను గంగా
తనయుం డడిగిన నతనికి । ననఘచరిత్రునకు నిట్టు లని ముని సెప్పెన్. 240

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్ర!= ఓ మహారాజా! (ధర్మరాజా); నన్నున్= నన్ను; నీ+అడిగిన+అట్లు+అ= నీవు అడిగిన విధంగానే; పులస్త్యున్= పులస్త్యమహర్షిని; పుణ్యకీర్తనున్= పుణ్యమైన కీర్తనం (చరిత్రం) కలవాడిని; గంగాతనయుండు= భీష్ముడు; అడిగినన్= ప్రశ్నించగా; అతనికిన్= భీష్ముడికి; అనఘ చరిత్రునకున్= పాపరహితమైన ప్రవర్తన కలవాడికి; ఇట్టులు+అని= ఈ విధంగా అని; ముని+చెప్పెన్= పులస్త్యమహర్షి చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మనుజులకు అధిపతివైన ఓ ధర్మరాజా! నన్ను నీవు అడిగిన విధంగానే పుణ్యమైన చరిత్రగల పులస్త్య మహర్షిని భీష్ముడు అడుగగా, ఆ పవిత్రచరిత్రుడైన భీష్ముడికి పులస్త్యముని చెప్పాడు. దానినే ఇపుడు నీకు చెప్పగలను.

సీ. కడఁగి బుద్ధీంద్రియ కర్మేంద్రియంబుల । యందు సంయతచిత్తు లైనవారు
ధృతి నహంకారప్రతిగ్రహాపేక్షల । యందు నివృత్తాత్ము లైనవారు
నల్పభోజనులు ననారంభకులు నయ్యు । నత్యంతసంతోషు లైనవారు
సత్యవ్రతులు శుభాచారు లక్రోధను । లగుచు ధర్మాన్వితు లైనవారు

ఆ. నఖిలతీర్థశతము లాడిన ఫలములు । నఖిలయజ్ఞవిధుల నైన ఫలముఁ
బడయుదురు విహీనభాగ్యదుష్కృతులకుఁ । బరమతీర్థసేవఁ బడయ నగునె? 241

ప్రతిపదార్థం: కడఁగి= పూని; బుద్ధి+ఇంద్రియ, కర్మ+ఇంద్రియంబుల+అందు= బుద్ధికి సంబంధించిన ఇంద్రియాలలో మరియు కర్మకు సంబంధించిన ఇంద్రియాలలో; సంయత, చిత్తులు+ఐనవారలు= నిగ్రహంతో కూడిన మనస్సు కలవారు; ధృతిన్= నిష్ఠతో; అహంకార, ప్రతిగ్రహ+అపేక్షల+అందున్= గర్వం, పరులనుండి స్వీకరించటం- అనే కోరికలలో (కోరికల నుండి); నివృత్త+ఆత్ములు+ఐనవారు= మరలిన మనస్సులు గలవారు (వైరాగ్యం కలవారు); అల్ప, భోజనులును= తక్కువ తిండి తినేవారున్నూ; అనారంభకులును= పురుషకారం చేయక ఉదాసీనులై ఉండేవారున్నూ; అయ్యున్= అయినప్పటికిని; అత్యంత, సంతోషులు+ఐనవారు= మిక్కిలి సంతోషంతో ఉండేవారు; సత్య, వ్రతులు= సత్యాన్ని దీక్షతో పాటించేవారు; శుభ+ఆచారులు= మంచి నడవడి కలవారు (విశ్వజనీన ప్రవర్తనులు); అక్రోధనులు= కోపం లేకుండ శాంతచిత్తులైనవారు; అగుచున్; ధర్మ+అన్వితులు+ఐనవారున్= ధర్మంతో కూడినవారు; అఖిల, తీర్థ, శతములు+ఆడిన, ఫలములు= సమస్తపుణ్యక్షేత్రాలు నూరింటిలో స్నానంచేసిన ఫలాలు; అఖిల, యజ్ఞ, విధులను+ఐన, ఫలమున్= పెక్కు యజ్ఞాలను శాస్త్రీయంగా జరిపిన ఫలం; పడయుదురు= పొందగలరు; విహీన, భాగ్య, దుష్కృతులకున్= అదృష్టం లేని పాపాత్ములకు; పరమ, తీర్థ, సేవన్= గొప్ప పుణ్యక్షేత్రాలను సందర్శించే పుణ్యం; పడయన్+అగునె= పొందటం సాధ్యమా!

తాత్పర్యం: బుద్ధీంద్రియ, కర్మేంద్రియాలలో నిగ్రహం కల మనస్సు కలవారు, అహంభావం నుండి మనస్సును మరల్చిన దృఢచిత్తులు, ఇతరులనుండి ఎటువంటి ప్రయోజనాన్ని అపేక్షించక, అపరిగ్రహవ్రతాన్ని వైరాగ్యంతో ఆచరించేవారు, అల్పభోజనంతో సంతృప్తిచెంది, ఎటువంటి ప్రయత్నాలు చేయకుండా ఉండి మిక్కిలి సంతోషంతో ఉండేవారు, సత్యసంధులు, సదాచారులు, శాంతస్వభావులు, ధర్మాత్ములు అయినవారు అఖిలతీర్థాలలో క్రుంకు లిడిన పుణ్యఫలం, సమస్తయజ్ఞాలు చేసిన ఫలితం పొందగలరు. కాని, దురదృష్టవంతులైన పాపాత్ములు గొప్ప తీర్థయాత్రలు చేసినా అట్టి పుణ్యఫలం పొందగలరా? [పొందలేరని భావం]

విశేషం: (1) బుద్ధీంద్రియాలు అయిదు. 1. చర్మం 2. చక్షువు 3. శ్రోత్రం 4. జిహ్వ 5. ఘ్రాణం (2) కర్మేంద్రియాలు అయిదు. 1. వాక్కు 2. పాణి 3. పాదం 4. పాయువు 5. ఉపస్థ - ఈ పది మనస్సుతో చేరితే ఏకాదశేంద్రియాలు అవుతాయి. (3) ఈ ప్రకరణంలో తీర్థయాత్రలు సేవించటంవలన కలిగే పుణ్యం, ఆయా క్షేత్రాల మాహాత్మ్యం వివరించటానికి నారదమహర్షి పూనుకొన్నాడు. ఇందులో అఖిలయజ్ఞాలు చేసినవారు, సమస్తతీర్థయాత్రలు సేవించేవారు పొందే పుణ్యాన్ని ఇంద్రియవిజేతలు వైరాగ్య సంపన్నులు, అనాసక్తయోగులు, సత్యసంధులు, శుభాచారులు, శాంతచిత్తులు అయిన ధర్మాత్ములు పొందగలుగుతారు- అని ఉపోద్ఘాతప్రాయంగా నారదమహర్షి చాటిచెప్పి, తదుపరి తీర్థయాత్ర మహిమను ఉగ్గడిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తిల గో సువర్ణ దానం । బులు నుపవాసములుఁ దీర్థముల సేవయు ని
మ్ములఁ జేయనివారు దరి । ద్రులు రోగులు నగుదు రాత్మదోషము పేర్మిన్. 242

ప్రతిపదార్థం: తిల, గో, సువర్ణ, దానంబులున్= నువ్వులు, ఆవులు, బంగారాల దానాలున్నూ; ఉపవాసములున్= ఆహార విరమణలున్నూ; తీర్థముల సేవయున్= తీర్థయాత్రల సేవయున్నూ; ఇమ్ములన్= ప్రీతితో; చేయనివారు; ఆత్మ,దోషము, పేర్మిన్= స్వయంకృతాపరాధంయొక్క అతిశయంవలన; దరిద్రులు= నిరుపేదలు; రోగులున్= వ్యాధిగ్రస్తులు; అగుదురు= కాగలరు.

తాత్పర్యం: తిలలు, ఆవులు, బంగారం దానాలు చేయనివారు, ఉపవాసాలు చేయనివారు, పుణ్యతీర్థాలు సేవించనివారు, స్వయంకృతాపరాధంవలన నిరుపేదలు, రోగపీడితులు అవుతారు.

విశేషం: తీర్థయాత్రలతో వివిధదానాలు ముడిపెట్టబడటం గమనించదగింది.

క. క్రతుఫలములు వడయఁగ దు । ర్గతులకు దొరకొనదు తీర్థగమనంబునఁ ద
త్క్రతుఫలము లందుదురు దు । ర్గతులును నిది మునులమతము కౌరవవృషభా! 243

ప్రతిపదార్థం: క్రతు, ఫలములు+పడయఁగ= యజ్ఞాలు చేస్తే సంక్రమించే ఫలాలు సంపాదించటానికి; దుర్గతులకు= పాపాత్ములకు; దొరకొనదు= వీలుకాదు; తీర్థగమనంబునన్= తీర్థయాత్రలవలన; దుర్గతులును= పాపాత్ములు సయితం; తద్, క్రతు, ఫలములు= ఆయా యజ్ఞాలు చేస్తే వచ్చే ఫలాలను; అందుదురు= పొందుతారు; కౌరవ వృషభా!= కౌరవులలో శ్రేష్ఠుడా!; ఇది; మునులమతము= ఋషుల అభిప్రాయం.

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడా! పాపాత్ములకు యజ్ఞయాగాదుల ఫలాలు లభించవు. అయినా, అటువంటి పాపాత్ములు తీర్థయాత్రలు చేస్తే యజ్ఞయాగాదులు చేసిన ఫలాలు పొందగలరు. ఇది ఋషివరేణ్యుల అభిప్రాయం.

విశేషం: వృషభ శబ్దం శ్రేష్ఠవాచకం. 'కవి వృషభులు మహాకావ్యమనియు'- నన్నయ ప్రయోగం. వృషభం అంటే వాచ్యార్థం ఎద్దు లేక ఆఁబోతు.

వ. తీర్థగమనఫలం బెల్లపుణ్యంబులకు విశేషంబు; దీని వినుము. 244

ప్రతిపదార్థం: తీర్థగమన, ఫలంబు= తీర్థయాత్రలవలన లభించే ఫలం; ఎల్ల పుణ్యంబులకు= సమస్త పుణ్యాలలో; విశేషంబు= గొప్పది; దీని, వినుము= ఈ అంశాన్ని ఆలకించుము.

తాత్పర్యం: తీర్థయాత్రలవలన లభించే ఫలం అన్ని పుణ్యాలకంటె గొప్పది. ఈ అంశాన్ని ఆలకించుము.

చ. నమితవిరోధి! పుష్కర మనంగ జగద్విదితంబు పుణ్య తీ
ర్థము మునిసిద్ధసేవ్యము; ముదంబున నందుఁ బయోజసంభవుం
డమరులతోడ సన్నిహితుఁడై వసియించుఁ; ద్రిపుష్కరంబులున్
సమములు; వాని నెప్పుడును సంస్కృతి సేసినఁ బాయుఁ బాపముల్. 245

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నమిత, విరోధి!= లొంగిన శత్రువులు కలవాడా! లేదా శత్రువులచేత నమస్కారాలు పొందినవాడా!; పుష్కరము+అనంగన్, పుణ్యతీర్థము= పుష్కరమని పేరుకెక్కిన పుణ్యక్షేత్రం; జగత్+విదితంబు= ప్రపంచ ప్రఖ్యాతి కన్నట్టిది; ముని, సిద్ధ, సేవ్యము= మునులచేత, సిద్ధులచేత సేవించబడేది (సిద్ధులు= పరిపక్వత చెందిన యోగీశ్వరులు); ముదంబునన్= ప్రీతితో; అందున్= ఆ పుష్కరతీర్థంలో; పయోజసంభవుండు= పద్మంలో పుట్టినవాడు బ్రహ్మదేవుడు; అమరులతోడన్= దేవతలతో; సన్నిహితుఁడు+ఐ= కలిసిమెలసి ఉండేవాడై; వసియించున్= నివసిస్తాడు. త్రిపుష్కరంబులున్= మూడు పుష్కరాలున్నూ; సమములు= సమానాలు; వానిన్= ఆ పుష్కరాలను; సంస్మృతి+చేసినన్= సంస్మరిస్తే; పాపముల్= దురితాలు; పాయున్= తొలగిపోతాయి.

తాత్పర్యం: శత్రువులను నిగ్రహించినవాడా! (నమస్కరించిన శత్రువులు కలవాడా!) పుష్కరమనే పుణ్యతీర్థం ప్రపంచప్రఖ్యాతిని ఆర్జించినట్టిది. అది మునులు సిద్ధులు సేవించేటటువంటిది. అందులో బ్రహ్మదేవుడు దేవతలతో కలిసి నివసిస్తాడు. అచ్చటి మూడుపుష్కరాలున్నూ సమానాలే. ఆ పుష్కరాలను సంస్మరిస్తేనే చాలు సమస్తపాపాలు తొలగిపోతాయి.

విశేషం: 'నమిత విరోధి!'- అంటే- (పరాక్రమం చేత) అణచబడిన శత్రువులు కలవాడా!- అనే అర్థంకూడ ఉన్నది. ఈ సందర్భమున ఈ విశేషణం కూడ సార్థకమే.

క. **పదివేలకోట్లతీర్థము । లుదితములై పుష్కరముల నుండు మునీంద్ర**
త్రిదశవరు లందుఁ జేసిరి । మదిఁ గృతకృత్యు లయి తపము మఖములుఁ బ్రీతిన్. 246

ప్రతిపదార్థం: పదివేలకోట్ల, తీర్థములు= పదివేలకోట్ల పవిత్రక్షేత్రాలు; ఉదితములు+ఐ= ఆవిర్భవించి; పుష్కరములన్= పుష్కరాలలో; ఉండున్= ఉంటాయి; ముని+ఇంద్ర, త్రిదశవరులు= ఋషిశ్రేష్ఠులు, దేవతాశ్రేష్ఠులు; అందున్= ఆ పుష్కరాలలో; మదిన్= మనస్సులో; కృత కృత్యులు+అయి= ధన్యులై; తపము= తపస్సును; మఖములున్= యజ్ఞాలును; ప్రీతిన్= సంతోషంతో; చేసిరి= నిర్వహించారు.

తాత్పర్యం: ఆ పుష్కరాలలో పదివేలకోట్ల పవిత్రక్షేత్రాలు ఉద్భవించాయి. ఋషివరేణ్యులు, దేవతాశ్రేష్ఠులు అందులో తపస్సు చేశారు. యజ్ఞాలు చేశారు. మనస్సులో సంప్రీతి చెంది చరితార్థులు అయ్యారు.

వ. **అందుఁ గృతస్నానులై దేవర్షిపితృతర్పణంబులు సేసినవారు దశాశ్వమేధఫలంబులు వడయుదురు; కార్తిక మాసంబున నొక్కదివసంబు పుష్కరసేవ సేయుటయు నొకయేఁ డగ్నిహోత్రంబు వేల్చుటయు సమంబు.247**

ప్రతిపదార్థం: అందున్= ఆ పుష్కరాలలో; కృతస్నానులు+ఐ= చేయబడినస్నానం కలవారై, అంటే స్నానంచేసినవారై; దేవ, ఋషి, పితృ, తర్పణంబులు= దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు శ్రాద్ధక్రియలు; చేసినవారు= నిర్వహించినవారు; దశ+అశ్వమేధ, ఫలంబులు= పది అశ్వమేధయాగాలు చేసిన పుణ్యాలు; పడయుదురు= పొందుతారు; కార్తికమాసంబునన్= కార్తికం నెలలో; ఒక్క, దివసంబు= ఒక దినం; పుష్కర, సేవ, చేయుటయున్= పుష్కరతీర్థాన్ని ఉపాసించటమున్నూ; ఒక, ఏఁడు= ఒక సంవత్సరం; అగ్నిహోత్రంబు, వేల్చుటయు= అగ్నికుండాన్ని ప్రజ్వలింపచేయటమున్నూ; సమంబు= సమానం.

తాత్పర్యం: ఆ పుష్కరాలలో స్నానంచేసి, దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు తర్పణాలు విడిచినవారు పది అశ్వమేధయాగాలు చేసిన పుణ్యఫలాన్ని పొందగలరు. కార్తికమాసంలో ఒకదినం పుష్కరతీర్థాన్ని సేవించటం ఒకసంవత్సరం అగ్నిహోత్రం వేల్చితే లభించే పుణ్యంతో సమానం.

క. అమరవరులందుఁ బురుషో । త్తముఁ డెట్లు విశేషుఁ డట్లు ధరణిం గల తీ
ర్థములందుఁ బుష్కరత్రిత । యము గరము విశేష మభిమతార్థప్రదమై. 248

ప్రతిపదార్థం: అమర వరుల+అందున్= దేవతాశ్రేష్ఠులలో; పురుష+ఉత్తముఁడు= పురుషులలో శ్రేష్ఠుడైన విష్ణువు; ఎట్లు= ఏ విధంగా; విశేషుఁడు= గొప్పవాడో; అట్లు= ఆ విధంగా; ధరణిన్+కల= పుడమిలోఉన్న; తీర్థములందున్= పుణ్యతీర్థాల్లో; పుష్కరత్రితయము= మూడు పుష్కరాలు; అభిమత+అర్థ, ప్రదము+ఐ= కోరిన కోరికలను ఇచ్చేవై; కరము= మిక్కిలి; విశేషము= గొప్పవి.

తాత్పర్యం: దేవతలలో విష్ణుదేవుడు ఏవిధంగా గొప్పవాడో, ఆ విధంగానే కోరినకోర్కెలు తీర్చేవిగా మూడుపుష్కరాలు ఈ భూమిమీది పుణ్యతీర్థాలన్నింటిలో గొప్పవి.

విశేషం: అలం: ఉపమ.

వ. పుష్కరంబునఁ బదియేండ్లు వసియించినవారికి సర్వక్రతుఫలంబును బ్రహ్మలోకప్రాప్తియు నగు; మఱియు జంబూమార్గంబు దండులికాశ్రమంబున నగస్త్యవటంబను తీర్థంబు లాడి యశ్వమేధఫలంబు వడయుదురు; కణ్వాశ్రమంబును ధర్మారణ్యంబును యయాతి పతనంబునుం జూచిన సర్వపాపక్షయంబగు; మహాకాళంబును గోటితీర్థంబును నశ్వమేధ ఫలప్రదంబులు; భద్రవటంబను రుద్రస్థానంబున రుద్రుం బూజసేసి గణపతిత్వంబు వడయుదురు; నర్మదాస్నానంబున దక్షిణసింధుస్నానంబునఁ జర్మణ్వతీ తీర్థ స్నానంబున నగ్నిష్టోమ ఫలంబు లగు. 249

ప్రతిపదార్థం: పుష్కరంబునన్= పుష్కరక్షేత్రంలో; పది+ఏండ్లు= పదిసంవత్సరాలు; వసియించినవారికిన్= నివసించినవారికి; సర్వక్రతు, ఫలంబును= సమస్తయజ్ఞాలు చేసిన పుణ్యమున్నూ; బ్రహ్మలోక ప్రాప్తియున్= సత్యలోకం ప్రాప్తించటమున్నూ (అంటే మరణించిన తర్వాత సత్యలోకంలో నివసించబోవటం); అగున్= కలుగును; మఱియు= మరియు; జంబూమార్గంబు= జంబూమార్గం; తండులిక+ఆశ్రమంబునన్= తండులిక ఆశ్రమంలోని; అగస్త్యవటంబు= అగస్త్యమహర్షి నాటిన మఱ్ఱిచెట్టు ఉండే క్షేత్రమున్నూ; అను, తీర్థంబులు+ఆడి= అనే క్షేత్రాలలోని పుణ్యతీర్థాలలో స్నానంచేసి; అశ్వమేధ, ఫలంబు= అశ్వమేధయాగం చేస్తే లభించే పుణ్యాన్ని; పడయుదురు= పొందగలరు; కణ్వ+ఆశ్రమంబును= కణ్వమహర్షి స్థాపించిన ఆశ్రమమున్నూ; ధర్మ+అరణ్యంబును= ధర్మారణ్యం అనే పేరు కల పుణ్యక్షేత్రమున్నూ; యయాతి పతనంబునున్= యయాతి భూమికి దిగిన ప్రదేశమున్నూ; చూచిన= దర్శిస్తే; సర్వ, పాప, క్షయంబు+అగున్= సమస్తపాపాలున్నూ నశించిపోతాయి; మహాకాళంబును= మహాకాళం అనే పుణ్యక్షేత్రమున్నూ; కోటితీర్థంబునున్; అశ్వమేధఫలప్రదంబులు= అశ్వమేధయాగంయొక్క పుణ్యాన్ని ఇచ్చేవి; భద్రవటంబు+అను= భద్రవటమనే పేరుగల; రుద్రస్థానంబునన్= రుద్ర ప్రతిష్ఠ కలచోట; రుద్రున్+పూజ+చేసి= శివుడిని అర్చించి; గణపతిత్వంబు= గణాధిపత్యాన్ని; పడయుదురు= పొందుతారు; నర్మదాస్నానంబునన్= నర్మదానదిలో స్నానం చేయటంవలన; దక్షిణ సింధుస్నానంబునన్= దక్షిణసింధువులో స్నానం చేయటంవలన; చర్మణ్వతీ, తీర్థస్నానంబునన్= చర్మణ్వతీ నదీతీర్థ జలాలలో మ్రుంకులు ఇడటంవలన; అగ్నిష్టోమ, ఫలంబులు+అగున్= అగ్నిష్టోమయాగం చేయటంవలన సంక్రమించే పుణ్యం లభిస్తుంది.

తాత్పర్యం: పుష్కరక్షేత్రంలో పదిసంవత్సరాలు నివసించేవారికి సర్వయజ్ఞాలు చేసినపుణ్యం మరియు బ్రహ్మలోకప్రాప్తి కలుగుతాయి. జంబూమార్గంలో, తండులికాశ్రమంలోని అగస్త్యవటంలో మ్రుంకులిడినవారికి అశ్వమేధఫలం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దక్కుతుంది. కణ్వాశ్రమం, ధర్మారణ్యం, యయాతిపతనం అనే పుణ్యక్షేత్రాలను సందర్శిస్తే సర్వపాపాలు నశిస్తాయి. మహాకాళం, కోటితీర్థం సందర్శిస్తే అశ్వమేధఫలం లభిస్తుంది. భద్రవటమనే రుద్రస్థానంలో రుద్రుడిని అర్చిస్తే గణాధిపత్యం లభిస్తుంది. నర్మదాస్నానంవలన, దక్షిణ సింధువులో క్రుంకులిడటంవలన, చర్మణ్వతీ నదీ తీర్థ జలాలలో స్నానంచేయటం వలన అగ్నిష్టోమయాగఫలం దక్కుతుంది.

క. అనవద్య వసిష్ఠాశ్రమ । మున నొక దివసంబు శాకమూలాశనులై
జను లుండి పడయుదురు బహు । ధనసంపద గోసహస్రదాన ఫలంబుల్. 250

ప్రతిపదార్థం: అనవద్య, వసిష్ఠ+ఆశ్రమమునన్= పవిత్రమైన వసిష్ఠాశ్రమంలో; ఒక దివసంబు= ఒక దినం; శాక, మూల+అశనులు+ఐ= కూరలు, వేళ్ళు తింటున్నవారై; జనులు+ఉండి= ప్రజలు ఉండి; బహు, ధన, సంపద= గొప్పధనం, ఐశ్వర్యం; గో, సహస్ర, దాన, ఫలంబుల్= వేయి ఆవులను దానం చేసిన పుణ్యాలను; పడయుదురు= పొందగలరు.

తాత్పర్యం: పరమపావనమైన వసిష్ఠాశ్రమంలో జనులు ఒకదినం శాకాహారంతో కూరలు దుంపలు తిని ఉంటే గొప్పధనం, ఐశ్వర్యం, వేయిగోవులను దానం చేసిన పుణ్యాన్నీ పొందగలరు.

వ. మఱి పింగం బను తీర్థంబు సేవించి శతకపిలగోదానఫలంబు వడయుదు; రెందేని నగ్నిదేవుండు ప్రత్యక్షంబై యుండునట్టి ప్రభాసతీర్థం బాడి యగ్నిష్టోమాతిరాత్రఫలంబు వడయుదురు; దుర్వాసునకు విష్ణుదేవుండు వరం బిచ్చుటంజేసి వరదానం బనంబరఁగిన తీర్థం బాడియు, సరస్వతీసాగరసంగమం బాడియు గోసహస్రదాన ఫలంబు వడయుదురు. 251

ప్రతిపదార్థం: మఱి= ఇక; పింగంబు+అను= పింగము అనే; తీర్థంబు, సేవించి= పుణ్యక్షేత్రాన్ని దర్శించి; శత, కపిల, గోదాన, ఫలంబు= నూరు కపిలగోవులను దానంచేసిన పుణ్యాన్ని; పడయుదురు= పొందగలరు; ఎందు+ఏనిన్= ఎచటనైనను; అగ్నిదేవుండు= అగ్నిహోత్రుడు; ప్రత్యక్షంబు+ఐ= సాక్షాత్కరించి; ఉండు+అట్టి= కనిపించేటి; ప్రభాస, తీర్థంబు+ఆడి= ప్రభాసతీర్థంలో క్రుంకులిడి; అగ్నిష్టోమ+అతిరాత్ర, ఫలంబు= అగ్నిష్టోమం, అతిరాత్రం చేసినపుణ్యం; పడయుదురు= పొందుతారు; దుర్వాసునకు= దుర్వాసుడనే మునికి; విష్ణుదేవుండు= విష్ణుదేవుడు; వరంబు+ఇచ్చుటన్+చేసి= వరం ఇవ్వటంవలన; వరదానంబు+ అనన్+పరఁగిన= వరదానమనే పేరుతో విలసిల్లిన; తీర్థంబు+ఆడియు= తీర్థంలో స్నానం చేయు; సరస్వతీ, సాగర సంగమంబు+ఆడియు= సరస్వతీనది సాగరాన్ని చేరేచోటులో స్నానంచేసియు; గో, సహస్ర, దాన, ఫలంబు= వేయి ఆవులను దానంచేసిన పుణ్యాన్ని; పడయుదురు= పొందుతారు.

తాత్పర్యం: పింగం అనేతీర్థాన్ని సేవిస్తే నూరుకపిలగోవులను దానంచేసిన పుణ్యం కలుగుతుంది. అగ్నిహోత్రుడు సాక్షాత్కరించి ఉన్న ప్రభాసతీర్థంలో స్నానమాడితే అగ్నిష్టోమం, అతిరాత్రం అనేయజ్ఞాలు చేసినపుణ్యం సంక్రమిస్తుంది. విష్ణుదేవుడు దుర్వాసుడికి వరమివ్వటంవల్ల 'వరదాన' మని పేరొందిన వరదానతీర్థంలో స్నానమాడితే, మరియు సరస్వతీనది సముద్రంలో కలిసేచోటులో స్నానంచేస్తే వేయిగోవులు దానం చేస్తే వచ్చేపుణ్యం సంప్రాప్తిస్తుంది.

క. ద్వారవతీపురమునఁ బెం । డారక మను తీర్థమును బెడంగై ముద్రా
కారంబులై త్రిశూలా । కారములై పంకజములు గానంగఁబడున్. 252

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ద్వారవతీ, పురమునన్= ద్వారవతీపట్టణంలో; పిండారకము+అను, తీర్థమున; బెడంగు+ఐ= శోభిల్లేవై; ముద్రా+ఆకారంబులు+ఐ= ఉంగరంవంటి ఆకృతి కలవై; త్రిశూల+ఆకారములు+ఐ= త్రిశూలంవంటి రూపాలుకలవై; పంకజములు= పద్మాలు; (పంక, జ, ములు= బురదనుండి పుట్టినవి, పద్మాలు); కానంగన్+పడున్= కనిపిస్తాయి.

తాత్పర్యం: ద్వారవతీపురంలో పిండారకమనే తీర్థంలో ఉంగరాల ఆకృతిలో, త్రిశూలాలరూపంలో శోభిల్లే పద్మాలు కనిపిస్తాయి.

వ. అందుఁ బరమేశ్వరుం బూజించి పాపవిముక్తు లగుదురు; సాగర సింధు సంగమ స్నాతులైనవారు వరుణలోక గతు లగుదురు; శంకుకర్ణేశ్వరంబున నీశ్వరుం బూజించి దశాశ్వమేధ ఫలప్రాప్తు లగుదురు; వసుధారయును వసుసరంబు నను తీర్థంబు లాడి వసుప్రాప్తు లగుదురు; సింధూత్తమస్నానంబున బహుసువర్ణదానఫలం బగు; బ్రహ్మతుంగసేవనంబున బ్రహ్మలోకప్రాప్తి యగు; శక్రకుమారీ విలోకనంబున శక్రలోకగతి యగు; శ్రీ కుండంబునఁ బితామహునకు నమస్కరించియు, సౌవర్ణరాజితంబులైన మత్స్యంబులు గల విమలం బను తీర్థంబాడియు వాసవసాయుజ్యంబు వడయుదురు; బడబ యను తీర్థంబున నగ్నిదేవునకు నైవేద్యం బిచ్చిన నది యక్షయంబై పితృదేవతలకుఁ దృప్తిఁ జేయు, గోసహస్ర దానంబునకు నశ్వమేధ సహస్రంబునకు విశేషంబు. 253

ప్రతిపదార్థం: అందున్= ఆ పిండారక తీర్థంలో; పరమ+ఈశ్వరున్= పరమశివుడిని; పూజించి= అర్చించి; పాప, విముక్తులు+ అగుదురు= పాపంనుండి విముక్తులు అవుతారు; సాగర, సింధు, సంగమ, స్నాతులు+ఐనవారు= సింధునది సముద్రంలో కలిసేచోట స్నానం చేసినవారు; వరుణ, లోక, గతులు+అగుదురు= వరుణలోకానికి వెళ్ళుతారు; శంకు, కర్ణ+ఈశ్వరంబునన్= శంకుకర్ణేశ్వరక్షేత్రంలో; ఈశ్వరున్= ఈశ్వరుడిని; పూజించి= అర్చించి; దశ+అశ్వమేధ, ఫల, ప్రాప్తులు= పది అశ్వమేధాలు చేసిన పుణ్యాన్ని పొందినవారు; అగుదురు= అవుతారు; వసుధారయును= వసుధార అనే తీర్థంలో; వసుసరంబున్= వసుసరం; అను= అనబడే; తీర్థంబులు+ఆడి= ఈ తీర్థాలలో స్నానంచేసి; వసుప్రాప్తులు= ధనం సంపాదించేవారు; అగుదురు= అవుతారు; సింధు+ఉత్తమ, స్నానంబునన్= సింధూత్తమ తీర్థంలో స్నానంచేస్తే; బహు, సువర్ణ, దాన, ఫలంబు+అగు= పెక్కు బంగారునాణేలు దానంచేసిన పుణ్యం లభిస్తుంది; బ్రహ్మతుంగ, సేవనంబునన్= బ్రహ్మతుంగయాత్ర చేస్తే; బ్రహ్మలోక, ప్రాప్తి+అగున్= బ్రహ్మలోకం ప్రాప్తిస్తుంది; శక్రకుమారీ, విలోకనంబునన్= శక్రకుమారిని సందర్శించటంవలన; శక్రలోక, గతి+అగున్= స్వర్గలోకం చేరగలుగుతారు; శ్రీకుండంబునన్= శ్రీకుండ క్షేత్రంలో; పితామహునకు= బ్రహ్మదేవుడికి; నమస్కరించియు= వందనమాచరిస్తే; సౌవర్ణ, రాజితంబులు+ఐన= బంగారువన్నెతో శోభిల్లే; మత్స్యంబులు+కల= చేపలు గల; విమలంబు+అను= విమలం అనే; తీర్థంబు+ఆడియు= తీర్థస్నానం చేసినా; వాసవ, సాయుజ్యంబు= దేవేంద్రుడిలో లీనమవటం; పడయుదురు= పొందుతారు; బడబ+అను, తీర్థంబునన్; అగ్నిదేవునకు= అగ్నిహోత్రుడికి; నైవేద్యంబు+ఇచ్చినన్= నివేదన సలిపితే; అది= ఆ పుణ్యం; అక్షయంబు+ఐ= తరుగనట్టిదై; పితృదేవతలకున్= పితరులకు; తృప్తిన్+చేయున్= తనివి కలిగిస్తుంది; (అది); గో, సహస్ర, దానంబునకున్= వేయి ఆవులను దానంచేయటంకంటె; అశ్వమేధ సహస్రంబునకున్= వేయి అశ్వమేధయాగాలకంటె; విశేషంబు= గొప్పది.

తాత్పర్యం: ఆ పిండారకతీర్థంలో పరమశివుడిని పూజించి పాపంనుండి తొలగుతారు. సింధునది సముద్రంలో కలిసేచోట స్నానంచేస్తే వరుణలోకాన్ని సంపాదిస్తారు. శంకుకర్ణేశ్వరంలో శివుడిని అర్చిస్తే పది అశ్వమేధయాగాలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేసిన పుణ్యం లభిస్తుంది. వసుధార, వసుసరం అనే పుణ్యతీర్థాలలో స్నానమాడితే ధనలాభం కలుగుతుంది. సింధూత్తమతీర్థంలో స్నానంచేస్తే బహుసువర్ణదానఫలం లభిస్తుంది. బ్రహ్మతుంగ తీర్థసేవలవలన సత్యలోకం సిద్ధిస్తుంది. శక్రకుమారీ క్షేత్రయాత్రవలన స్వర్గం లభిస్తుంది. శ్రీకుండంలో బ్రహ్మదేవుడికి నమస్కరిస్తే, బంగారుచేపలు గల విమలతీర్థంలో స్నానంచేస్తే, దేవేంద్రుడితో కలయిక లభిస్తుంది. బడబ అనే తీర్థంలో అగ్నిదేవుడికి నివేదన చేస్తే ఆ పుణ్యం తరుగనిదై పితరులకు సంతృప్తి కలిగిస్తుంది. అది వేయి ఆవులను దానంచేస్తే వచ్చే పుణ్యంకంటె, వేయి అశ్వమేధయాగాలు సల్పిన పుణ్యంకంటె గొప్పది.

క. దేవిక యను తీర్థంబున। దేవసమూహంబుతోడఁద్రినయనుఁ డుండున్;
సేవితమై జనులకు నది। గావించు ననూనధర్మకామార్థంబుల్. 254

ప్రతిపదార్థం: దేవిక, అను, తీర్థంబునన్= దేవిక అనే పుణ్యనదీ తీర్థంలో; దేవ సమూహంబుతోడన్= దేవతలందరితో కలిసి; త్రినయనుఁడు= ముక్కంటి (శివుడు); ఉండున్= నివసిస్తాడు; అది= ఆ దేవికాతీర్థం; జనులకున్= ప్రజలకు; సేవితము+ఐ= సేవించబడిందై; అనూన, ధర్మ, కామ+అర్థంబుల్= గొప్పవైన ధర్మపురుషార్థాన్ని, కామపురుషార్థాన్ని, అర్థపురుషార్థాన్ని; కావించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: దేవిక అనే పుణ్యక్షేత్రంలో ముక్కంటి దేవగణాలతోపాటు నివసిస్తాడు. ఆ క్షేత్ర సందర్శనంవలన ప్రజలకు సాటిలేని ధర్మపురుషార్థం, కామపురుషార్థం, అర్థ పురుషార్థం సంప్రాప్తిస్తాయి.

వ. అర్ధయోజన విస్తృతంబై పంచయోజనాయామంబైన యద్దేవికానదియును, గామాఖ్యంబును, రుద్రతీర్థంబును, యజన యాజన బ్రహ్మ వాలుకంబులును, బ్రహ్మాది దేవతల దీర్ఘ సత్రస్థానంబైన దీర్ఘసత్రంబును సేవించినవారికి నిష్టసిద్ధి యగు; వినశనంబను తీర్థంబున నదృశ్యంబై మేరువునకుం బోవు నెడ నాగోద్భేద, శివోద్భేద, చమసోద్భేదంబుల నెందేని సరస్వతి గానం బడియె నట్టి సరస్వతియందు నభిషిక్తులైనవారు నాగలోకంబు వడయుదురు; శశరూప పుష్కరంబులు గల శశయానం బను తీర్థంబున స్నానంబును గోసహస్రదానంబును సమంబు. 255

ప్రతిపదార్థం: అర్ధయోజన, విస్తృతంబు+ఐ= సగం ఆమడమేర విస్తరించి; పంచ, యోజన+ఆయామంబు+ఐన= అయిదు ఆమడల నిడివిగల; ఆ+దేవికానదియును; కామ+ఆఖ్యంబును= కామం అనే పేరుగల తీర్థంబును; రుద్రతీర్థంబును; యజన, యాజన, బ్రహ్మ, వాలుకంబులును= యజ్ఞాలు చేయటం, యజ్ఞాలు చేయించటం సదా జరుగుతుండే బ్రహ్మవాలుక తీర్థాలును; బ్రహ్మ+ఆది, దేవతల= బ్రహ్మమున్నగు దేవతలకు; దీర్ఘ సత్రస్థానంబు+ఐన= దీర్ఘ సత్రయాగం చేయటానికి స్థానమైన; దీర్ఘ సత్రంబును= దీర్ఘ సత్రమనేతీర్థాన్ని; సేవించినవారికిన్= దర్శించిన వారికి; ఇష్టసిద్ధి+అగు= కోరిన కోరికలు నెరవేరుతాయి; వినశనంబు+అను= వినశనం అనే; తీర్థంబునన్= పుణ్యక్షేత్రంలో; అదృశ్యంబు+ఐ= కనిపించనట్టిదై; మేరువునకున్+పోవు+ఎడన్= మేరుపర్వతానికి పోయేదారిలో గల; నాగోద్భేద, శివోద్భేద, చమసోద్భేదంబులన్= నాగోద్భేదం, శివోద్భేదం, చమసోద్భేదం అనే తీర్థాలలో; ఎందు+ఏని= ఎందులోనైతే; సరస్వతి కానంబడియెన్= సరస్వతి కనబడినదో; అట్టి సరస్వతి+అందున్= ఆ సరస్వతీనదిలో; అభిషిక్తులు+ఐనవారు= స్నానంచేసినవారు; నాగ, లోకంబు= నాగలోకాన్ని; పడయుదురు= పొందుతారు; శశరూప, పుష్కరంబులు+కల= కుందేలు ఆకారంగల పద్మాలు ఉండే; శశయానంబు+అను తీర్థంబున= శశయానమనే పుణ్యక్షేత్రంలో; స్నానంబును= స్నానంచేయటమున్నూ; గో సహస్రదానంబును= వేయి ఆవులను దానం చేయటమున్నూ; సమంబు= సమానం.

తాత్పర్యం: ఆమడలో సగం విస్తరించి, అయిదు ఆమడల నిడివి కల ఆ దేవికానదిని, మఱియు కామం అనే పేరున్న పుణ్యక్షేత్రాన్ని, రుద్రతీర్థాన్ని, యజ్ఞాలు చేయటానికి, చేయించటానికి అనువైన బ్రహ్మావాలుకాన్ని, బ్రహ్మాది దేవతలు దీర్ఘసత్రమనే యజ్ఞం చేసినచోటయిన దీర్ఘసత్రాన్ని సేవించినవారికి కోరినకోరికలు ఈడేరుతాయి. వినశనం అనే తీర్థంలో కనిపించకుండ పోయిన సరస్వతీనది, మేరువుకు వెళ్ళేమార్గంలో ఉండే నాగోద్భేదం, శివోద్భేదం. చమసోద్భేదం అనే పుణ్యతీర్థాలలో ఎక్కడ కనబడుతుందో అటువంటి సరస్వతీనదిలో స్నానం చేసినవారు నాగలోకానికి వెళ్లుతారు. కుందేటి ఆకారంకల పద్మాలుండే శశయానం అనేతీర్థంలో చేసే స్నానం వేయిగోవులను దానంచేయటంతో సమానం.

మధ్యాక్కర.

ఏ మేమ మున్ను పూజింపుదుము రుద్రు నిం దని వేడ్క
తో మునికోటి దారున్న, నీశుఁ డందొఱకును బ్రీతి
గా మతిలోఁ గోటిరుద్రరూపముల్ గావించె నదియు
భూమిఁ బ్రసిద్ధమై రుద్రకోటి నాఁ బొలిచి వెలింగె. 256

ప్రతిపదార్థం: ఏము+ఏము+అ= మేము మేమే; ఇందు= ఇచట; మున్ను= ముందుగా; రుద్రున్= శివుడిని; పూజింపుదుము= అర్చిస్తాం; అని= అంటూ; వేడ్కన్= కుతూహలంతో; మునికోటి= ఋషుల సముదాయం; తారు+ఉన్న= తామందరును ఉంటే; ఈశుఁడు= శివుడు; అందొఱకును= అందరికిని; ప్రీతిగా= సంతోషం కలిగేటట్లుగా; మతిలోన్= సంకల్పంలో; కోటిరుద్ర, రూపముల్ కావించెన్= నూరులక్షల శివాకృతులను ఏర్పరచాడు; అదియు= ఆ చోటు; భూమిన్= భూమిలో; ప్రసిద్ధము+ఐ= ప్రఖ్యాతిని ఆర్జించి; రుద్రకోటి, నాన్= రుద్రకోటి అనబడుతూ; పొలిచి, వెలింగెన్= సొగసుగా శోభిల్లింది.

తాత్పర్యం: 'ఇక్కడ మేమే ముందు శివుడిని అర్చిస్తాం; కాదు, మేమే ముందు శివుడిని పూజిస్తాం'- అని పెక్కుమంది మహర్షులు కుతూహలంతో ఉండగా, శివుడు అందరికీ సంతోషం కలిగించటానికై కోటి రుద్రరూపాలలో ఆవిర్భవించాడు. ఆ దివ్యక్షేత్రం భూమిపై 'రుద్రకోటి' అనే పేరుతో ప్రసిద్ధికెక్కి ప్రకాశించింది.

విశేషం: వృత్తలక్షణానికి ఈ ఆశ్వాసంలోని 22వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.

వ. అందు రుద్రుఁ బూజసేసి రుద్రలోకప్రాప్తు లగుదురు. 257

ప్రతిపదార్థం: అందున్= ఆ రుద్రకోటితీర్థంలో; రుద్రున్= శివుడిని; పూజచేసి= అర్చించి; రుద్రలోక, ప్రాప్తులు+అగుదురు= శివుడిలోకమైన కైలాసాన్ని పొందుతారు.

తాత్పర్యం: అక్కడ రుద్రుడిని అర్చించినవారు శివలోకమైన కైలాసాన్ని పొందుతారు.

క. నరనుత! నైమిశమునఁ బు । ష్కరముల మూఁటను జగత్ప్రకాశితమై యి
ద్ధరణిఁ గురుక్షేత్రము దు । స్తరదురితౌఘముల కెల్ల దవ్వగుచుండున్. 258

ప్రతిపదార్థం: నర, నుత!= నరులచేత పొగడబడినవాడా!; ఈ+ధరణిన్= ఈ భూలోకంలో; కురుక్షేత్రము= కురుక్షేత్రమనే ప్రదేశం; నైమిశమునన్= నైమిశమనే పుణతీర్థం చేత; పుష్కరముల, మూఁటను= పుష్కరత్రయ తీర్థాలచేత; జగత్+ప్రకాశితము+ఐ=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రపంచంలో మిక్కిలి ప్రసిద్ధమై; దుస్తర, దురిత+ఓఘములకు+ఎల్ల= దాట శక్యంకాని పాపాల సమూహాలకు అన్నిటికి; దవ్వు= దూరం; అగుచుండున్= అవుతుంటుంది.

తాత్పర్యం: నరనుతుడవైనవాడా! ఈ లోకంలో కురుక్షేత్రం- నైమిశతీర్థం, పుష్కరత్రయం - అనే పుణ్యక్షేత్రాల చేత ప్రపంచప్రసిద్ధమై దాటరాని పాపసంఘాలన్నింటికి సుదూరంగా విలసిల్లుతూ ఉంటుంది.

విశేషం: కురుక్షేత్రం అనేక పుణ్యతీర్థాలకు ఉనికిపట్టైన 'పుణ్యభూమి' - అని ఇందువలన వెల్లడౌతున్నది.

తే. **అమరలోకనివాసుల యండ్రు విబుధు । లా కురుక్షేత్రవాసుల; నదియు వినఁగ**
నుత్తమంబు దృషద్వతి యుత్తరమునఁ । దపనతేజ! సరస్వతి దక్షిణమున. 259

ప్రతిపదార్థం: తపనతేజ!= సూర్యతేజస్సు వంటి తేజస్సు కలవాడా!; విబుధులు= జ్ఞానులు; ఆ, కురుక్షేత్ర నివాసులన్= ఆ కురుక్షేత్రప్రజలను; అమరలోక, నివాసులు+అ+అండ్రు= స్వర్గలోకంలో నివసించేవారే అని అంటారు; అదియు= ఆ కురుక్షేత్రమును; దృషద్వతి+ఉత్తరమునన్= దృషద్వతి అనే నదికి ఉత్తరదిక్కున; సరస్వతీ= సరస్వతీనదికి; దక్షిణమునన్= దక్షిణదిక్కులో; వినఁగన్= వినటానికి; ఉత్తమంబు= శ్రేష్ఠమైనది.

తాత్పర్యం: సూర్యతేజంవంటి తేజం కలవాడా! ఆ కురుక్షేత్రంలో నివసించే ప్రజలు స్వర్గలోకనివాసులే అని జ్ఞానుల మాట. సరస్వతీనదికి దక్షిణదిశలోను దృషద్వతీనదికి ఉత్తరదిక్కునను ఉత్తమంగా విలసిల్లుతూఉన్న ఆ కురుక్షేత్రంయొక్క మహిమ వీనులకు విందు చేస్తుంటుంది.

వ. **అక్కురుక్షేత్రశమంత పంచకంబుల నడుమ రామహ్రదంబు నడుమఁ బితామహు నుత్తరవేది యనంబడునట్టి కురుక్షేత్రంబు ముట్టిన వారికిఁ, గురుక్షేత్రంబునకుం బోయెద మనిన వారికిఁ, గురుక్షేత్రంబున వసియించెదమని తలంచినవారికి సర్వపాపక్షయం బగుఁ; దదనంతరంబున విష్ణుస్థానంబున విష్ణువు నర్చించిన నశ్వమేధ ఫలం బగుఁ; బారిప్లవం బను తీర్థమాడి యగ్నిష్టోమఫలంబు వడయుదురు; పృథివీతీర్థం బాడిన గోసహస్ర దానఫలం బగు; శాలూకిని యను తీర్థం బాడిన దశాశ్వమేధ ఫలం బగు; సర్పతీర్థం బాడి యందుఁ దరండకుం డను ద్వారపాలకునిం జూచినవారి కిష్టసిద్ధి యగు; నెందేని విష్ణుం డాదివరాహం బయ్యె నట్టి వరాహతీర్థం బాడినవారికి నగ్నిష్టోమ ఫలంబగు; నశ్వినీతీర్థం బాడిన రూపవంతు లగుదురు; జయంతి యందు సోమతీర్థ స్నానంబును, గృతశౌచతీర్థస్నానంబును రాజసూయ పౌండరీక సమంబు; లగ్నివటంబున, ముంజవటంబున నీశ్వరుం బూజించి గాణపత్యంబు వడయుదురు; యక్షిణీతీర్థమాడి యిష్టఫలంబులు వడయుదురు; కురుక్షేత్ర ద్వారంబుఁ బ్రదక్షిణంబు సేసినం బాపక్షయం బగు. 260**

ప్రతిపదార్థం: ఆ+కురుక్షేత్ర, శమంత పంచకంబుల నడుమన్= ఆ కురుక్షేత్రంలో ఉండే శమంత పంచకాలు అనే సరస్సులకు నడుమగల; రామహ్రదంబు నడుమన్= రామహ్రదం అనే సరస్సుకు మధ్య; పితామహు+ఉత్తరవేది+అనంబడు+అట్టి= బ్రహ్మదేవుడియొక్క ఉత్తరవేది అనబడే; కురుక్షేత్రంబు= కురుక్షేత్రాన్ని; ముట్టినవారికిన్= స్పృశించినవారికి; కురుక్షేత్రంబున కున్+పోయెదము+అనిన వారికిన్= కురుక్షేత్రానికి పోతామనే వారికిన్నీ; కురుక్షేత్రంబునన్= కురుక్షేత్రంలో; వసియించెదము+అని= నివసిస్తామని; తలంచినవారికి= భావించినవారికి; సర్వపాపక్షయంబు+అగున్= సమస్తపాపాలు నశిస్తాయి; తద్+అనంతరంబునన్=

అటుపిమ్మట; విష్ణుస్థానంబునన్= విష్ణువు ఉండేచోటున; విష్ణువును+అర్చించినన్= విష్ణుదేవుడిని ఆరాధిస్తే; అశ్వమేధ, ఫలంబు+అగున్= అశ్వమేధం చేసిన పుణ్యం లభిస్తుంది; పారిప్లవంబు+అను, తీర్థము+ఆడి= పారిప్లవం అనే తీర్థంలో స్నానంచేస్తే; అగ్నిష్టోమ, ఫలంబు= అగ్నిష్టోమం అనేయజ్ఞం చేసినపుణ్యం; పడయుదురు= పొందుతారు; పృథివీ, తీర్థంబు+ఆడినన్= పృథివీతీర్థంలో స్నానంచేస్తే; గో, సహస్ర, దాన, ఫలంబు+అగున్= వేయిఆవులను దానంచేసిన పుణ్యం దక్కుతుంది; శాలూకిని+అను, తీర్థంబు+ఆడినన్= శాలూకిని అనేతీర్థంలో స్నానంచేస్తే; దశ+అశ్వమేధ, ఫలంబు+అగు= పది అశ్వమేధయాగాలు చేసిన పుణ్యం వస్తుంది; సర్పతీర్థంబు+ఆడి= సర్పతీర్థంలో స్నానంచేసి; అందున్= అచట ఉండే; తరండకుండు+అను= తరండకుడు అనే; ద్వారపాలకునిన్+చూచిన వారికి= ద్వారబంధాన్ని కావలా కాస్తున్న భటుడి విగ్రహాన్ని సందర్శించిన వారికి; ఇష్ట, సిద్ధి+అగున్= కోరినకోరికలు నెరవేరుతాయి; ఎందు+ఏనిన్= ఏ స్థలంలోనైతే; విష్ణుండు= విష్ణుదేవుడు; ఆది, వరాహంబు+అయ్యెన్= మొదటి వరాహఅవతారం ఎత్తాడో; అట్టి= అటువంటి; వరాహతీర్థంబు+ఆడిన వారికిన్= ఆ వరాహతీర్థంలో స్నానంచేసినవారికి; అగ్నిష్టోమ, ఫలంబు+అగున్= అగ్నిష్టోమయాగం చేసిన పుణ్యం లభిస్తుంది; అశ్వినీ తీర్థంబు+అడిన= అశ్వినీతీర్థంలో స్నానంచేస్తే; రూపవంతులు+అగుదురు= అందంగల ఆకృతి కలవారు అవుతారు; జయంతి+అందు= జయంతి అనే ప్రదేశంలో ఉండే; సోమతీర్థస్నానంబును= సోమతీర్థంలో స్నానంచేయటమున్నూ; కృతశౌచతీర్థస్నానంబును= కృతశౌచమనే తీర్థంలో స్నానం చేయటమున్నూ; రాజసూయ, పౌండరీక సమంబులు= రాజసూయయాగంతో, పౌండరీక యాగంతో సమానాలు; అగ్నివటంబునన్= అగ్నివటతీర్థంలో; ముంజవటంబునన్= ముంజవటమనే తీర్థంలో; ఈశ్వరున్+ పూజించి= శివుడిని అర్చించి; గాణపత్యంబు= గణాలపై ఆధిపత్యాన్ని; పడయుదురు= పొందగలరు; యక్షిణీతీర్థము+ ఆడి= యక్షిణీతీర్థంలో స్నానం చేసి; ఇష్టఫలంబులు+పడయుదురు= కోరిన కోరికలు పొందుతారు; కురుక్షేత్రద్వారంబున్= కురుక్షేత్రాన్ని ప్రవేశించే స్థలంలో కల ద్వారాన్ని; ప్రదక్షిణంబు+చేసినన్= ఎడమనుండి కుడివైపునకు భక్తిభావంతో చుట్టుతిరిగితే; పాప, క్షయంబు+అగు= పాపాలు నశిస్తాయి.

తాత్పర్యం: ఆ కురుక్షేత్రంలో ఉండే శమంతపంచకాల నడుమగల, రామహ్రదం అనే సరస్సు మధ్య బ్రహ్మదేవుడి ఉత్తరవేది ఉన్నది. అటువంటి కురుక్షేత్రాన్ని స్పృశించినవారికిన్నీ, కురుక్షేత్రానికి పోవాలని తలపోసినవారికిన్నీ, కురుక్షేత్రంలో నివసిస్తామని ఆలోచించినవారికిన్నీ సర్వపాపాలు నశిస్తాయి. అటుపిమ్మట విష్ణుస్థానంలో విష్ణుమూర్తిని అర్చిస్తే అశ్వమేధం చేసిన పుణ్యం లభిస్తుంది. పారిప్లవ తీర్థంలో స్నానంచేసినవారు అగ్నిష్టోమయాగం చేసిన పుణ్యం పొందుతారు. పృథివీతీర్థంలో స్నానంచేస్తే వేయిఆవులను దానంచేసిన పుణ్యం లభిస్తుంది. శాలూకిని అనే పుణ్యతీర్థంలో స్నానమాడితే పది అశ్వమేధయాగాల పుణ్యం లభిస్తుంది. సర్పతీర్థంలో స్నానంచేసి అక్కడ ఉండే తరండకుడు అనే ద్వారపాలకుడిని దర్శించిన వారికి కోరినకోరికలు ఈడేరుతాయి. ఎచట విష్ణుదేవుడు ఆదివరాహంగా అవతరించాడో అటువంటి వరాహతీర్థంలో స్నానం చేసినవారికి అగ్నిష్టోమయాగం చేసిన పుణ్యం లభిస్తుంది. అశ్వినీతీర్థంలో స్నానంచేసినవారికి అందమైన రూపాలు ఏర్పడుతాయి. జయంతిలో ఉండే సోమతీర్థంలో స్నానం చేస్తే రాజసూయ యాగం చేసినట్లే; కృతశౌచతీర్థంలో స్నానం చేస్తే పౌండరీకయజ్ఞం చేసినట్లే. అగ్నివటక్షేత్రంలో, ముంజవటక్షేత్రంలో శివుడిని ఆరాధిస్తే గణాలపై ఆధిపత్యం లభిస్తుంది. యక్షిణీతీర్థంలో స్నానంచేస్తే కోరినకోరికలు ఈడేరగలవు. కురుక్షేత్రంలో ఉండే ప్రవేశద్వారానికి ప్రదక్షిణం చేస్తే పాపాలు నశిస్తాయి.

క. వీరుండు క్షత్త్రియులఁ దన । దారుణ పరశువున జామదగ్న్యుఁడు రౌద్రా
కారుఁడు వధియించి తదీ । యారుణమున నేనుమడువు లాపాదించెన్. **261**

ప్రతిపదార్థం: వీరుండు= పరాక్రమం కలవాడు: రౌద్ర+ఆకారుఁడు= కోపంతో కూడిన భయంకరమైన ఆకృతి కలవాడు; జామదగ్న్యుఁడు= జమదగ్ని మహాముని కొడుకైన పరశురాముడు; క్షత్త్రియులన్= రాచకొలంవారిని; తన, దారుణ, పరశువునన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భయానకమైన తన గండ్రగొడ్డలిచేత; వధియించి= చంపి; తదీయ+అరుణమునన్= తత్ సంబంధితమైన నెత్తురుచేత; ఏను మడువులు= ఐదు (కొలనులు) సరస్సులు; ఆపాదించెన్= కల్పించాడు.

తాత్పర్యం: జమదగ్నిమహాముని పుత్రుడైన పరశురాముడు వీరుడు, భయంకరాకారుడు అయి, గండ్రగొడ్డలి ధరించి రాచకొలంవారినందరిని సంహరించి వారిరక్తంతో ఐదు మడుగులు కల్పించాడు.

వ. అందుఁ బితృతర్పణంబు సేసినం బితృదేవత లాతనికిం బ్రత్యక్షంబయి ' నీ కిష్టంబైన వరంబు వేఁడు' మనినఁ బరశురాముండు వారల కిట్లనియె. 262

ప్రతిపదార్థం: అందున్= ఆ శమంతపంచకంలో; పితృ తర్పణంబు+చేసినన్= పితృదేవతలకు శ్రాద్ధకర్మలలో విడిచే నివాపాంజలి విడిస్తే; పితృదేవతలు= పితరులు; ఆతనికిన్= ఆ పరశురాముడికి; ప్రత్యక్షంబు+అయి= సాక్షాత్కరించి; నీకు+ఇష్టంబు+ఐన= నీకు ఇష్టమైన; వరంబు= కోరిక; వేడుము+అనినన్= కోరుకొమ్ము- అని అడుగగా; పరశురాముండు= పరశురాముడు; వారలకు= ఆ పితరులతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ శమంతపంచకమనే సరస్సులలో పితరులకు తర్పణాలు విడువగా పితృదేవతలు పరశురామునికి ప్రత్యక్షమై, నీకు ఇష్టమైన వరం కోరుకొనుమని అడుగగా, అతడు ఈ విధంగా అన్నాడు.

తే. 'క్షత్రవధనైన పాపంబు గ్రాఁగవలయుఁ; । గడఁగి సద్గతియును నాకుఁ బడయవలయు;
నివియుఁ బుణ్యతీర్థంబులై యిద్ధరిత్రిఁ । బరఁగుచుండంగవలయు మీ కరుణఁ జేసి.' 263

ప్రతిపదార్థం: మీ కరుణన్+చేసి= మీ దయవలన; క్షత్రవధన్+ఐన, పాపంబు= రాచకొలంవారిని సంహరించటంచేత సంక్రమించిన పాపం; క్రాఁగవలయున్= నశించాలి; కడఁగి= పూని; నాకున్= నాకు; సత్+గతియును= మంచిస్థానాన్ని- అంటే పుణ్యంవలన లభించే స్థానం; పడయవలయున్= లభించాలి; ఇవియున్= ఈ శమంతపంచకం అనే మడుగులు; పుణ్య, తీర్థంబులు+ఐ= పుణ్యం ఇచ్చేతీర్థాలై; ఈ ధరిత్రిన్= ఈ భూమిపై; పరఁగుచుండంగవలయున్= శోభిల్లుతూ ఉండాలి.

తాత్పర్యం: 'రాచకొలంవారిని సంహరించటంచేత నాకు సంక్రమించిన పాపం నశించాలి. నాకు పుణ్యలోకప్రాప్తి కలగాలి. ఈ శమంతపంచకాలనే సరస్సులు, ఈ భూలోకంలో పరమ పవిత్రతీర్థాలుగా శోభిల్లాలి. మీరు దయచేసి నాకు ఈ వరం ప్రసాదించ ప్రార్థన.'

వ. అని పితృదేవతల వరంబునం బుణ్యతీర్థంబులఁ జేసి; నట్టి రామహ్రదంబు లాడినవారికి నశ్వమేధ ఫలంబగుఁ; గాయశోధనం బను తీర్థం బాడి కాయశుద్ధు లగుదు; రెందేని విష్ణుదేవుండు లోకంబుల నుద్ధరించె నట్టి లోకోద్ధారం బను తీర్థమాడి కులం బుద్ధరింతురు; శ్రీతీర్థం బాడి శ్రీమంతు లగుదురు; కపిలతీర్థం బాడి కపిల గో సహస్ర దాన ఫలంబుఁ బడయుదురు; సూర్యతీర్థం బాడి యం దుపవసించిన సూర్యలోక ప్రాప్తులగుదురు; గో భవనంబను తీర్థంబాడి గోసహస్రసమృద్ధు లగుదురు; శంఖినీ తీర్థంబాడి యుత్తమరూపంబు వడయుదురు; యక్షేంద్ర తీర్థం బాడి తరండకుం డను ద్వారపాలకుం జూచినవారు సరస్వతీ స్నాతులైనవారు నగ్నిష్టోమఫలంబు వడయుదురు; మాతృతీర్థ దర్శనంబునం బ్రజావృద్ధి యగు; బ్రహ్మావర్తంబును, శరవణంబునుం జూచిన, సర్వవ్యాధి విముక్తు లగుదురు; శ్వావిల్లోమాపహం బను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తీర్థంబునం దేకాదశతీర్థంబులు గల; వందుఁ బ్రాణాయామంబు సేసిన విప్రులకు స్వలోమాపనయనం బగు; నెఱుకుచేత నేయంబడి కృష్ణమృగంబు లెందేని నొక్కతీర్థంబు సొచ్చి మానుషత్వంబు వడసె నట్టి మానుష తీర్థం బాడి సర్వదురిత విముక్తులై దేవత్వంబు వడయుదురు; దాని తూర్పున నొక్కయిరవున నాపగ యను మహానదిం బితృతర్పణంబు సేసి పితృదేవోద్దేశంబున నొక్కబ్రాహ్మణునకుం గుడువం బెట్టినఁ గోటిబ్రాహ్మణులు గుడిచిన ఫలంబగుఁ, బితృదేవతలు దృప్తియు నొందుదురు; బ్రహ్మోదుంబరంబు సప్తర్షి కుండంబుఁ గేదారంబును జూచి బ్రహ్మలోకంబు వడయుదురు; కపిల కేదారంబుఁ జూచి పాపవిముక్తులై యదృశ్యు లగుదురు; సరకం బను తీర్థంబాడి కృష్ణచతుర్దశి నాఁ డీశ్వరుం బూజించి యెల్ల కోర్కులం బడయుదురు; మూఁడుకోట్ల కూపహ్రదంబులు గల యిలాస్పదం బను తీర్థంబాడి పితృతర్పణంబులు సేసినవారికి వాజపేయఫలం బగుఁ; గిందాన కింజప్యంబు లను తీర్థంబులందుఁ జేసిన దాన జపంబు లక్షయంబు లగు; నారదతీర్థం బైన యంబాజన్మంబునందుఁ బ్రాణత్యాగంబు సేసినవారు సర్వలోకంబులం బడయుదురు; శుక్లదశమిం బుండరీకం బను తీర్థంబాడి పౌండరీక ఫలంబు వడయుదు; రందు వైతరణీస్నాతులై రుద్రునకు నమస్కరించి సర్వపాపవిముక్తు లగుదు; రెందేని దేవత లనేకసహస్రవర్షంబులు దపంబు సేసి రట్టి ఫలకీవనం బను తీర్థంబాడి యగ్నిష్టోమాతిరాత్రఫలంబులు వడయుదురు; ద్వైపాయనుం డనేకతీర్థంబులు మిశ్రీకరించుటం జేసి మిశ్రకం బనఁబరఁగిన తీర్థం బాడినవారికి సర్వతీర్థస్నానఫలం బగు; వ్యాస వనంబును మనోజవంబును మధువటియు నను తీర్థంబుల నాడిన గో సహస్రదాన ఫలంబు వడయుదురు; కౌశికీ దృషద్వతీ సంగమంబున స్నాతులై సర్వపాప విముక్తు లగుదురు; కిందత్తంబునఁ దిలప్రస్థదానంబు సేసి పితరుల ఋణంబు నీఁ గుదు; రహస్సుదిన తీర్థంబుల నాడి సూర్యలోకప్రాప్తు లగుదురు; మృగధూమంబున గంగాస్నాతులై మహాదేవు నర్చించిన మహాత్ము లశ్వమేధ ఫలంబు వడయుదురు; వామనం బను తీర్థంబాడి వామను నర్చించినవారు విష్ణులోకప్రాప్తు లగుదురు; పావనంబను తీర్థంబాడి కులంబు పవిత్రంబు సేయుదురు; శ్రీకుంజంబున సరస్వతీ స్నాతులై యగ్నిష్టోమ ఫలంబు వడయుదురు; ఋషు లెందే నుండి యాత్రాపరులై కురుక్షేత్రంబునకుం బోదు రట్టి నైమిశకుంజం బాడి ఋషితృప్తి సేయుదురు; బ్రహ్మతీర్థం బాడి వర్ణాంతరులు బ్రాహ్మణు లగుదురు; బ్రాహ్మణులు బ్రహ్మలోక ప్రాప్తు లగుదురు. **264**

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; పితృదేవతల వరంబునన్= పితరులు అనుగ్రహించిన వరంచొప్పున (ఆ శమంత పంచకాలను); పుణ్యతీర్థంబులన్+చేసెన్= పుణ్యక్షేత్రాలుగా చేశాడు; అట్టి= అటువంటి; రామహ్రదంబులు+ఆడిన వారికిన్= పరశురాముడు నిర్మించిన సరస్సులలో స్నానమాడినవారికి; అశ్వమేధఫలంబు+అగున్= అశ్వమేధయాగం చేసినపుణ్యం లభిస్తుంది; కాయశోధనంబు+అను, తీర్థంబు+ఆడి= కాయశోధనం అనే పుణ్యక్షేత్రంలో స్నానంచేసి; కాయశుద్ధులు+అగుదురు= శరీర శౌచాన్ని సంపాదించినవారవుతారు; ఎందు+ఏని= ఏ స్థలమందైతే; విష్ణుదేవుండు= శ్రీమన్మహావిష్ణువు; లోకంబులన్= ప్రపంచాలను; ఉద్ధరించెన్= సంరక్షించాడో; అట్టి= అట్టిచోట ఉండే; లోకోద్ధారంబు+అను= లోకోద్ధారం అనేతీర్థంలో; తీర్థము+ఆడి= స్నానంచేసి; కులంబు+ఉద్ధరింతురు= కులానికి అభ్యున్నతి కలుగజేస్తారు; శ్రీ తీర్థంబు+ఆడి= శ్రీ తీర్థంలో స్నానంచేసి; శ్రీమంతులు+అగుదురు= సంపన్నులవుతారు; కపిలతీర్థంబు+ఆడి= కపిలతీర్థంలో స్నానంచేసి; కపిల, గో, సహస్ర, దాన, ఫలంబున్= కపిలవర్ణంకల వేయి ఆవులను దానంచేసిన పుణ్యం; పడయుదురు= పొందుతారు; సూర్యతీర్థంబు+ ఆడి= సూర్యతీర్థంలో స్నానంచేసి; అందు+ఉపవసించిన= అందులో ఉపవాసం చేస్తే; సూర్యలోక ప్రాప్తులు+అగుదురు= సూర్యలోకాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పొందుతారు; గోభవనంబు+అనుతీర్థంబు+ఆడి= గోభవనం అనే తీర్థంలో స్నానమాడితే; గో, సహస్ర, సమృద్ధులు+అగుదురు= వేయి ఆవుల సంపద కలవారు అవుతారు; శంఖినీ తీర్థంబు+ఆడి= శంఖినీతీర్థంలో స్నానంచేసి; ఉత్తమరూపంబు+పడయుదురు= మంచి ఆకృతిని పొందుతారు; యక్షేంద్ర తీర్థంబు+ఆడి= యక్షేంద్రతీర్థంలో స్నానంచేసి; తరండకుండు+అను; ద్వారపాలకున్+ చూచినవారు= ద్వారపాలకుడిని సందర్శించినవారు; సరస్వతీ, స్నాతులు+ఐనవారున్= సరస్వతీనదిలో స్నానం చేసినవారు; అగ్నిష్టోమ ఫలంబు= అగ్నిష్టోమ యాగంవలన లభించే పుణ్యం; పడయుదురు= పొందుతారు; మాతృతీర్థ, దర్శనంబునన్= మాతృతీర్థాన్ని చూడటంవలన; ప్రజావృద్ధి+అగు= సంతానలాభం కలుగుతుంది; బ్రహ్మావర్తంబును= బ్రహ్మావర్తతీర్థాన్ని; శరవణంబును= శరవణతీర్థాన్ని; చూచిన= దర్శించగా; సర్వవ్యాధి విముక్తులు+అగుదురు= సర్వరోగాలనుండి విముక్తులు అవుతారు; శ్వావిల్లోమాపహంబు+అనుతీర్థంబునందు; ఏకాదశ తీర్థంబులు= పదకొండు తీర్థాలు; కలవు; అందున్= అచట; ప్రాణాయామంబు+చేసిన, విప్రులకు= ప్రాణాయామ యోగాభ్యాసం చేసిన బ్రాహ్మణులకు; స్వలోమ+ అపనయనంబు+ అగు= తమ వెంట్రుకలు తొలగిపోతాయి- అనగా పాపాలు నశిస్తాయి; ఎఱుకుచేతన్= కిరాతకుడిచేత; ఏయంబడి= బాణంతో కొట్టబడి; కృష్ణమృగంబులు= నల్ల జింకలు; ఎందు+ఏనిన్= ఎచట; ఒక్కతీర్థంబు+చొచ్చి= ఒక పుణ్యక్షేత్రంలో ప్రవేశించి; మానుషత్వంబు= మానుష్యరూపం; పడసెన్= పొందాయో; అట్టి; మానుషతీర్థంబు+ఆడి= మానుషమనే తీర్థంలో క్రుంకులిడి; సర్వదురిత, విముక్తులు+ఐ= సమస్తమైన పాపాలనుండి తొలగినట్టివారై; దేవత్వంబు+ పడయుదురు= అటువంటి దేవత్వం పొందుతారు; దాని తూర్పునన్= ఆ మానుషతీర్థానికి తూర్పున; ఒక్క+ఇరవునన్= యుక్తమైన స్థలంలో; ఆపగ+అను, మహానదిన్= ఆపగ అనే మహానదిలో; పితృతర్పణంబు+చేసి= పితరులకు శ్రాద్ధక్రియలు చేసి; పితృదేవ+ఉద్దేశంబునన్= పితృదేవతలను ఉద్దేశించి; ఒక్క, బ్రాహ్మణునకున్= ఒక్క విప్రునకు; కుడువన్+పెట్టిన= భోజనం తినిపిస్తే; కోటిబ్రాహ్మణులు= కోటిమంది బ్రాహ్మణులు; కుడిచిన= భోజనంచేసిన; ఫలంబు+అగున్= పుణ్యం కలుగుతుంది; పితృదేవతలు= పితరులు; తృప్తియున్+ఒందుదురు= తనివి చెందుతారు; బ్రహ్మోదుంబరంబు= బ్రహ్మోదుంబరం అనేతీర్థాన్ని; సప్తర్షికుండంబున్= ఏడుగురు ఋషులగుండం (తీర్థం); కేదారంబును= కేదారాన్ని; చూచి= దర్శించి; బ్రహ్మలోకంబు+ పడయుదురు= సత్యలోకం పొందుతారు; కపిల కేదారంబున్+చూచి= కపిల కేదారమనే పుణ్యక్షేత్రాన్ని సందర్శించి; పాపవిముక్తులై= పాపంనుండి తొలగినవారై; అదృశ్యులు+అగుదురు= కనిపించనివారు కాగలరు; సరకంబు+అను, తీర్థంబు+ఆడి= సరకమనే తీర్థంలో స్నానంచేసి; కృష్ణచతుర్దశినాఁడు= కృష్ణపక్షంలోని చతుర్దశినాడు; ఈశ్వరున్+పూజించి= శివుడిని ఆరాధించి; ఎల్ల కోర్కులన్= అన్ని కోరికలను; పడయుదురు= పొందుతారు; మూఁడు, కోట్ల, కూప, హ్రదంబులు+కల= మూడుకోట్ల నూతులు కల; ఇలాస్పదంబు+అను, తీర్థంబు+ఆడి= ఇలాస్పదం అనే తీర్థంలో స్నానంచేసి; పితృ, తర్పణంబులు+ చేసినవారికి= పితరులకు శ్రాద్ధకర్మలు నిర్వర్తించినవారికి; వాజపేయ, ఫలంబు+అగున్= వాజపేయయాగం చేసిన పుణ్యం దక్కుతుంది; కిందాన, కింజప్యంబులు+అను, తీర్థంబులందున్= కిందానం, కింజప్యం అనేతీర్థాలలో; చేసిన, దాన, జపంబులు= చేసిన దానాల వలన, జపాలవలన లభించే పుణ్యాలు; అక్షయ్యంబులు+అగు= తరుగనట్టివి కాగలవు; నారద, తీర్థంబు+ఐన= నారద మహర్షి ప్రతిష్ఠించిన; అంబా జన్మంబునందున్= అంబాజన్మం అనేతీర్థంలో; ప్రాణత్యాగంబు+చేసినవారు= అసువులు వీడినవారు; సర్వలోకంబులన్+పడయుదురు= సమస్తలోకాలను పొందగలరు; శుక్లదశమిన్= శుక్లపక్షంలోని దశమినాడు; పుండరీకంబు+అను, తీర్థంబు+ఆడి= పుండరీకం అనేతీర్థంలో స్నానంచేసి; పౌండరీక ఫలంబు= పౌండరీకయజ్ఞం చేసినపుణ్యాన్ని; పడయుదురు= పొందుతారు; అందున్= అచట; వైతరణీ, స్నాతులు+ఐ= వైతరణీ నదిలో స్నానంచేసినవారై; రుద్రునకు= శివుడికి; నమస్కరించి= వందనమాచరించి; సర్వ, పాప, విముక్తులు+అగుదురు= సమస్త పాపాలనుండి తొలగుతారు; ఎందేని= ఏ స్థలంలో; దేవతలు= అమరులు; అనేక, సహస్ర, వర్షంబులు= పెక్కువేల ఏండ్లు; తపంబు చేసిరి= తపస్సు చేశారో; అట్టి= ఆ స్థలమైన; ఫలకీవనంబు+అను తీర్థంబు+ఆడి= ఫలకీవనమనే తీర్థంలో స్నానంచేసి; అగ్నిష్టోమ+అతిరాత్ర, ఫలంబులు= అగ్నిష్టోమం, అతిరాత్రం అనే యజ్ఞాలు చేసిన పుణ్యాలు; పడయుదురు= పొందుతారు; ద్వైపాయనుండు= వేదవ్యాసమహర్షి; అనేక, తీర్థంబులు= పెక్కు పుణ్యతీర్థాలను; మిశ్రీకరించుటన్+చేసి= కలపటంచేత; మిశ్రకంబు+అనన్+పరఁగిన= మిశ్రకం అని పిలువబడిన; తీర్థంబు+ఆడినవారికి= తీర్థంలో స్నానంచేసిన వారికి; సర్వ, తీర్థ, స్నాన, ఫలంబు+అగున్=

సమస్త తీర్థాలలో స్నానంచేసిన పుణ్యాలు దక్కుతాయి; వ్యాసవనంబును= వ్యాసవనమనే తీర్థమును; మనోజవంబును= మనోజవం అనే తీర్థమును; మధువటియును= మధువటిఅనే తీర్థమును; అను తీర్థంబులన్+ఆడిన= అనేతీర్థాలలో స్నానంచేస్తే; గో, సహస్ర, దాన, ఫలంబు= వేయి ఆవులను దానం చేసినపుణ్యాన్ని; పడయుదురు= పొందుతారు; కౌశికీ, దృషద్వతీ, సంగమంబునన్= కౌశికీ దృషద్వతులు కలిసినచోట; స్నాతులు+ఐ= స్నానం చేసినవారై; సర్వ పాప విముక్తులు+అగుదురు= అన్ని పాపాలనుండి తొలగినవారగుదురు; కిందత్తంబునన్= కిందత్తం అనే తీర్థంలో; తిల ప్రస్థ దానంబు+చేసి= ఒకప్రస్థం తిలలు (నువ్వులు) దానంచేసి; పితరుల, ఋణంబున్= పితృదేవతల ఋణాన్ని; ఈఁగుదురు= తీర్చుకొంటారు; అహస్+సుదిన తీర్థంబులన్+ఆడి= అహస్సు, సుదినం అనే తీర్థాలలో స్నానంచేసి; సూర్యలోక ప్రాప్తులు+అగుదురు= సూర్యలోకం పొందుతారు; మృగధూమంబునన్= మృగధూమక్షేత్రంలో; గంగాస్నాతులు+ఐ= గంగలో స్నానంచేసినవారై; మహాదేవున్= శివుడిని; అర్చించిన= ఆరాధించిన; మహాత్ములు= మహానుభావులు; అశ్వమేధ ఫలంబు= అశ్వమేధయాగం చేసినపుణ్యం; పడయుదురు= పొందుతారు; వామనంబు+అను తీర్థంబు+ఆడి= వామనమనే తీర్థంలో స్నానంచేసి; వామనున్+అర్చించినవారు= వామనదేవుని ఆరాధించిన వారు; విష్ణులోకప్రాప్తులు+అగుదురు= విష్ణులోకాన్ని పొందుతారు; పావనంబు+అను తీర్థంబు+ఆడి= పావనమనే తీర్థంలో స్నానంచేసి; కులంబు= వంశాన్ని; పవిత్రంబు+చేయుదురు; శ్రీకుంజంబునన్= శ్రీకుంజతీర్థంలో; సరస్వతీ స్నాతులు+ఐ= సరస్వతీనదిలో స్నానంచేసి; అగ్నిష్టోమఫలంబు= అగ్నిష్టోమం అనే యజ్ఞం చేసిన ఫలితం; పడయుదురు= పొందుతారు; ఋషులు+ఎందేని+ఉండి= మునులు ఎచటినుండి; యాత్రాపరులు+ఐ= పయనం మొదలుపెట్టి; కురుక్షేత్రంబునకున్= కురుక్షేత్రానికి; పోదురు= వెళ్ళుతారో; అట్టి= ఆ; నైమిశకుంజంబు+ఆడి= నైమిశకుంజతీర్థంలో స్నానంచేసి; ఋషితృప్తి= మునులకు సంతృప్తి; చేయుదురు= చేస్తారు; బ్రహ్మతీర్థంబు+ఆడి= బ్రహ్మతీర్థంలో స్నానంచేసి; వర్ణాంతరులు= ఇతర వర్ణస్థులు; బ్రాహ్మణులు+అగుదురు= బ్రాహ్మణులుగా అవుతారు; బ్రాహ్మణులు; బ్రహ్మలోక, ప్రాప్తులు= సత్యలోకాన్ని పొందినవారు; అగుదురు= అవుతారు.

తాత్పర్యం: అని పితృదేవతలను ప్రార్థించి వారి వరంవలన శమంతపంచక సరస్సులను పుణ్యతీర్థాలుగా చేశాడు. అటువంటి పరశురాముడి మడుగులలో స్నానంచేసినవారికి అశ్వమేధయాగం చేసిన పుణ్యఫలం లభిస్తుంది. కాయశోధనం అనేతీర్థంలో స్నానంచేస్తే దేహశౌచం సిద్ధిస్తుంది. ఏచోట విష్ణుదేవుడు లోకాలను ఉద్ధరించాడో ఆ స్థలానికి లోకోద్ధారం అనేప్రఖ్యాతి ఏర్పడింది. అచట స్నానం చేసినవారు తమ వంశాన్ని ఉద్ధరిస్తారు. శ్రీతీర్థంలో స్నానంచేస్తే సంపద కలుగుతుంది. కపిలతీర్థంలో స్నానంచేస్తే ఇంచుక ఎరుపు ఇంచుక నలుపు గల ఆవులు వేయింటిని దానంచేసిన పుణ్యం లభిస్తుంది. సూర్యతీర్థంలో స్నానంచేసి ఉపవాసం చేస్తే సూర్యలోకం ప్రాప్తిస్తుంది. గోభవనం అనేతీర్థంలో స్నానంచేస్తే వేలకొలది ఆవులు కలవారవుతారు. శంఖినీతీర్థంలో స్నానమాడితే అందమైన ఆకృతి లభిస్తుంది. యక్షేంద్రతీర్థంలో స్నానంచేసి తరండకుడు అనే ద్వారపాలకుడిని సందర్శించినవారు, సరస్వతీనదిలో స్నానం చేసినవారు అగ్నిష్టోమయాగం చేసినపుణ్యం పొందుతారు. మాతృతీర్థాన్ని సందర్శించినవారికి సంతానవృద్ధి అవుతుంది. బ్రహ్మావర్తం, శరవణం అనే తీర్థాలు సందర్శించినవారు సమస్త రోగాలనుండి విముక్తి చెందుతారు. శ్వావిల్లోమాపహం అనే తీర్థంలో పదకొండు తీర్థాలు ఉన్నాయి. అందులో ప్రాణాయామం చేసి యోగాభ్యాసం చేసిన బ్రాహ్మణులకు (పాపాలు నశించినందుకు సూచకంగా) తమ తమ కేశాలు తొలగిపోతాయి. కిరాతుడిబాణంచేత కొట్టబడి ఎచట లేళ్ళు (కృష్ణజింకలు) మనుజరూపం పొందాయో ఆ స్థలంలో మానుషతీర్థం వెలిసింది. ఆ తీర్థంలో స్నానంచేసినవారు సర్వపాపాలు తొలగి దేవత్వం పొందుతారు. ఆ మానుషతీర్థానికి తూరుపుదిక్కున నిర్ణీతస్థలంలో 'ఆపగ' అనే నదిలో పితృదేవతలకు శ్రాద్ధకర్మలు నిర్వహించి, పితరులను ఉద్దేశించి ఒక బ్రాహ్మణుడికి భోజనం పెట్టితే, కోటి మంది బ్రాహ్మణులకు అన్నదానం చేసిన పుణ్యం లభిస్తుంది. పితృదేవతలు తనివి చెందుతారు. బ్రహ్మోదుంబరం,

సప్తర్షికుండం, కేదారం అనే తీర్థాలను సందర్శిస్తే బ్రహ్మలోకప్రాప్తి అవుతుంది. కపిల కేదారం అనే తీర్థాన్ని చూచినవారు పాపాలు తొలగి అదృశ్యులౌతారు. సరకం అనే తీర్థంలో స్నానం చేసి కృష్ణపక్షంలోని చతుర్దశినాడు శివుడిని అర్చిస్తే కోరిన కోరికలు అన్నీ సిద్ధిస్తాయి. మూడుకోట్ల నూతులు కల ఇలాస్పదం అనేతీర్థంలో స్నానంచేసి పితరులకు తర్పణాలు విడిస్తే వారికి వాజపేయయాగం చేసిన పుణ్యం లభిస్తుంది. కిందానం, కింజప్యం అనేతీర్థాలలో చేసిన దానాల, జపాల పుణ్యాలు ఎన్నటికీ తరుగవు. నారదమహర్షి నిర్మించిన అంబాజన్మం అనేతీర్థంలో అసువులు వదిలితే సమస్త పుణ్యలోకాలను పొందగలరు. శుక్లపక్షదశమినాడు పుండరీకం అనేతీర్థంలో స్నానం చేస్తే పుండరీకయజ్ఞం చేసినపుణ్యం లభిస్తుంది. అందులోని వైతరణీనదిలో స్నానంచేసి శివుడికి వందనమాచరిస్తే సర్వపాపాలు తొలగిపోతాయి. ఎచట దేవతలు వేలకొలది సంవత్సరాలు తపస్సు చేశారో అటువంటి ఫలకీవనం అనే తీర్థంలో స్నానం చేస్తే అగ్నిష్టోమం, అతిరాత్రం అనే యజ్ఞాలు చేసినపుణ్యం లభిస్తుంది. వేదవ్యాసమహర్షి పెక్కుతీర్థాలను కలయబోసి మిశ్రకం అనేతీర్థాన్ని నిర్మించాడు. అచట స్నానం చేసినవారికి సర్వతీర్థాలలో స్నానమాడినపుణ్యం చేకూరుతుంది. వ్యాసవనం, మనోజవం, మధువటి అనేతీర్థాలలో స్నానంచేస్తే వేయిఆవులను దానం చేసిన పుణ్యం లభిస్తుంది. కౌశికీనది, దృషద్వతీనది కలిసేచోట స్నానం చేసినవారు సమస్తపాపాలనుండి విముక్తులవుతారు. కిందత్తతీర్థంలో ఒక ప్రస్థం కొలతగల తిలల (నువ్వుల) ను దానంచేస్తే పితరుల ఋణాన్ని తీర్చుకొంటారు. అహస్సు, సుదినం అనేతీర్థాలలో స్నానంచేస్తే సూర్యలోకం ప్రాప్తిస్తుంది. మృగధూమం అనే క్షేత్రంలో గంగాస్నానంచేసి శివుడిని ఆరాధించిన మహాత్ములకు అశ్వమేధఫలం లభిస్తుంది. వామనం అనేతీర్థంలో స్నానంచేసి వామనవిష్ణువును ఆరాధించినవారు విష్ణులోకానికి వెళ్ళుతారు. పావనం అనే తీర్థంలో స్నానంచేసినవారు వంశాన్ని పవిత్రం చేస్తారు. శ్రీకుంజం అనే తీర్థాన్ని దర్శించి సరస్వతీనదిలో స్నానంచేసేవారు అగ్నిష్టోమయాగం చేసినపుణ్యం పొందుతారు. ఋషులు ఎచటనుండి కురుక్షేత్ర తీర్థయాత్రను మొదలుపెట్టుతారో అట్టి నైమిశకుంజం అనేతీర్థంలో స్నానంచేస్తే ఋషులకు సంతృప్తి కలుగుతుంది. బ్రహ్మతీర్థంలో స్నానమాడితే తదితర వర్ణాలవారు బ్రాహ్మణులు అవుతారు. బ్రాహ్మణులు అచట స్నానం చేస్తే వారికి బ్రహ్మలోకం సిద్ధిస్తుంది.

విశేషం: ఆయా తీర్థాలలో క్రుంకులిడితే లభించే ఆయా పుణ్యఫలితాలు ఇందులో వివరించబడ్డాయి. ఆయా తీర్థాలు సార్థకాలు. అయితే శ్వావిల్లోమాపహం అనేతీర్థానికి అర్థం అనుశీలించదగింది. శ్వావిత్ అంటే ఏదుపంది; శ్వావిల్లోమం అంటే ఏదుపందిలోమం. లోమం= రోమం. ఉపనయనంలో ఏదుపంది రోమస్పర్శ శాస్త్రవిహితం. ఏతద్దోష నివారకమైన పుణ్యక్షేత్రం శ్వావిల్లోమాపహం. అందులో ప్రాణాయామం చేసిన విప్రులకు స్వకీయ రోమాలు (స్వలోమాలు) తొలగిపోతాయి. అంటే, వారి పాపాలు నశిస్తాయి అని భావం. "రోమా ణ్యాశ్రిత్య పాపాని" పాపాలు రోమాలను ఆశ్రయించి ఉంటాయి అనటం ప్రాచీన సంప్రదాయం.

సీ. **అనఘుఁడు మంకణుం డను నొక్క బ్రహ్మర్షి । తన చేయి ప్రయ్యంగ దర్భఁ గొనిన**
సాంద్రమై శాకరసం బందు నిర్గతం । బగుడును హర్షించి యాడుచున్నఁ
జూచి సహింపక సురలును మునులును । హరుపాలి కరిగి 'దేవాదిదేవ!
మునినృత్త మే విధంబున నివృత్తం బగు । నట్లుగాఁ జేయవే' యనిన హరుఁడు

ఆ. **దపసిరూప మపుడు ధరియించి యమ్ముని । కడకు వచ్చి, 'యేమి కారణమున**
నాడె? దేమి విస్మయం బిందుఁ జూచితి? । చెప్ప నుచిత మేనిఁ జెప్పు' మనిన. 265

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనఘుఁడు= పాపరహితుడు (మహాత్ముడు); మంకణుండు+అను+ఒక్క, బ్రహ్మ+ఋషి= మంకణుడు అనే పేరుకల ఒక బ్రహ్మజ్ఞానం ఆర్జించిన ముని (బ్రహ్మ+ఋషి= బ్రహ్మర్షి); తనచేయి చీలేటట్లు; దర్భన్+కొనినన్= దర్భను పట్టుకోగా- అంటే దర్భను పట్టుకొన్నపుడు అతడి చేయి చీలగా; సాంద్రము+ఐ= దట్టమై; అందు= ఆ తెగిన చేతినుండి; శాకరసంబు= ఆకుకూరల ద్రవం; నిర్గతంబు+అగుడును= కారుతుంటే; హర్షించి= సంతోషించి; ఆడుచున్నన్= నృత్యం చేస్తుండగా; చూచి= అరసి; సహింపక= ఓర్చుకొనలేక; సురలును= దేవతలును; మునులును= ఋషులును; హరుపాలికిన్= శివుడి దగ్గరకు; అరిగి= వెళ్ళి; దేవ+ఆదిదేవ!= దేవుళ్లలో మొదటి దేవుడివైనవాడా!; మునినృత్తము= ఋషియొక్క నాట్యం; ఏ+విధంబునన్= ఏ రీతిగా; నివృత్తంబు+అగున్= ఆపివేయబడునో; అట్లుగాన్= ఆ విధంగా; చేయవే+అనినన్= చేయుమని ప్రార్థించగా; హరుఁడు= శివుడు; తపసి రూపము+అపుడు, ధరియించి= తపస్వి ఆకారం అపుడు ధరించి; ఆ+మునికడకున్= ఆ ఋషి దగ్గరికి; వచ్చి= అరుదెంచి; ఏమి, కారణమునన్= ఏ హేతువు చొప్పున; ఆడెదు= నృత్యం చేస్తున్నవాడివి; ఇందున్= దీనిలో; ఏమి, విస్మయంబు+చూచితి= ఏ ఆశ్చర్యకరమైన విషయాన్ని చూచావు?; చెప్పన్+ఉచితము+ఏనిన్= చెప్పటం భావ్యమైతే; చెప్పుము+అనిన= వచింపుము అనగా.

తాత్పర్యం: పాపరహితుడైన మంకణుడు అనే బ్రహ్మర్షి దర్భ పట్టుకొన్నపుడు అతడి చేయి తెగి అందులోనుండి ఆకుకూరద్రవం కారసాగింది. అంత సంతోషించి ఆ ముని నృత్యం చేయ నారంభించాడు. ఆ మంకణమహాముని అవిరళనృత్యాన్ని చూడలేక దేవతలూ, మునులూ శివుడిపాలికి వెళ్ళి 'ఓ దేవాదిదేవా! మంకణమహాముని నృత్యం మానేటట్లు చేయుము' అని ప్రార్థించారు. అంత శివుడు ఒక తపసి ఆకృతి ధరించి వచ్చి 'మంకణమహామునీ! నీవు ఎందుకు ఇట్లా నృత్యం చేస్తున్నావు? ఇందులో నీవు చూచిన వింత ఏమిటి? చెప్పటం ఉచితమని నీకు తోస్తే దయచేసి చెప్పప్రార్థన' అని అడిగాడు.

వ. **'నా కరంబున శాకరసంబు వెలువడిన విస్మితుండ నయి హర్షించి యాడెద' ననిన 'నిది యేమి విస్మయంబు; దీనిం జూడు' మని హరుండు తన యంగుష్ఠంబున యంగుళి తాడనంబు చేసిన నందు హిమసన్నిభం బయిన భస్మంబు వెలువడినం జూచి, లజ్జితుం డయి 'నీవు పరమేశ్వరుండ' వని నమస్కరించి, వేదమంత్రంబుల స్తుతియించి. 'దేవా! నీ ప్రసాదంబున నాకుఁ దపోవర్ధనంబు గావలయు' ననిన, నమ్మునివరునకు నీశ్వరుండు గరుణించి 'నీకుఁ దపోవర్ధన మగు; నేను నీ యాశ్రమంబున నుండుదు' ననియె; నట్టి సప్తసారస్వతతీర్థంబు లాడినవారికి సారస్వతసిద్ధి యగు; బ్రహ్మాదిదేవతలచే నధిష్ఠితంబు లయిన యౌశనసతీర్థంబును గపాలమోచనంబు, విశ్వామిత్రంబుఁ గార్తికేయంబు ననియెడు తీర్థంబుల నాడి పాపవిముక్తు లయి బ్రహ్మలోకంబు వడయుదురు.** **266**

ప్రతిపదార్థం: నా, కరంబునన్= నా చేతిలో; శాక, రసంబు= ఆకుకూరలనుండి వెలువడేటటువంటి ద్రవం; వెలువడినన్= కారిన; విస్మితుండను+అయి= అచ్చెరువు చెందినవాడినై; హర్షించి= సంతోషించి; ఆడెదన్= నృత్యం చేస్తున్నాను; అనినన్= అని చెప్పగా; హరుండు= శివుడు; ఇది+ఏమి, విస్మయంబు= ఇదేమి వింత?; దీనిన్+చూడుము+అని; తన, అంగుష్ఠంబునన్= తనచేతి బొటనవ్రేలిపై; అంగుళి, తాడనంబు, చేసినన్= వ్రేలితో కొట్టగా; అందు= అచటినుంచి; హిమ, సన్నిభంబు+అయిన= మంచుతో సమానమైన (తెల్లనైన); భస్మంబు= బూడిద; వెలువడినన్= బయటికి రాగా; చూచి= అరసి; (మంకణుడు); లజ్జితుండు+అయి= సిగ్గుచెందినవాడయి; నీవు, పరమేశ్వరుండవు+అని= నీవు పరమశివుడివని; నమస్కరించి= వందనంచేసి; వేదమంత్రంబుల, స్తుతియించి= వేద మంత్రాలతో ప్రస్తుతించి; దేవా!= ఈశ్వరా!; నీ, ప్రసాదంబు= నీ అనుగ్రహంవలన; నాకున్; తపస్+వర్ధనంబు= తపస్సుయొక్క అభివృద్ధి; కావలయున్= జరగాలి; అనినన్= అని పలుకగా; ఆ+మునివరునకున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ ఋషిశ్రేష్ఠుడికి; ఈశ్వరుండు= శివుడు; కరుణించి= దయగలిగి; నీకున్+తపోవర్ధనము+అగున్= నీకు తపస్సుయొక్క అభివృద్ధి అవుతుంది; నేను, నీ+ఆశ్రమంబునన్+ఉండుదున్= నేను నీ ఆశ్రమంలో ఉంటాను; అనియెన్= అని అన్నాడు; అట్టి= అటువంటి (మహిమగల); సప్త సారస్వత తీర్థంబులు= సప్త (ఏడు) సారస్వతతీర్థాలు అనబడే వాటిలో; ఆడిన వారికిన్= స్నానంచేసినవారికి; సారస్వతసిద్ధి+అగు= సరస్వతికి సంబంధించిన (సంగీత, సాహిత్యశాస్త్ర) జ్ఞానం లభిస్తుంది, అభినివేశం ఏర్పడుతుంది; బ్రహ్మ+ఆది దేవతలచేన్= బ్రహ్మ మొదలయిన దేవతలచేత; అధిష్ఠితంబులు+అయిన= అధిష్ఠించబడినవైన; ఔశనస తీర్థంబును= ఔశనసం అనే తీర్థమున్నూ; కపాల మోచనంబు= కపాలమోచనమున్నూ; విశ్వామిత్రంబున్= విశ్వామిత్రమున్నూ; కార్తికేయంబున్= కార్తికేయమున్నూ; అనియెడు తీర్థంబులన్+ఆడి= అనబడే తీర్థాలలో స్నానంచేసి; పాపవిముక్తులు+అయి= పాపాలనుంచి తొలగినట్టివారయి; బ్రహ్మలోకంబు+పడయుదురు= సత్యలోకాన్ని పొందుదురు.

తాత్పర్యం: 'నా చేతినుండి శాకద్రవం వెలువడితే అచ్చెరువు చెంది ఆనంద తన్మయత్వంతో నృత్యం చేస్తున్నాను' అని మంకణమహర్షి పలికాడు. అంత తపసిరూపంలో ఉన్న శివుడు 'ఇదేమి వింత? నాచేతిని చూడుము' అని బొటనవ్రేలిని వ్రేలితో కొట్టాడు. అందుండి మంచువలె తెల్లనైన బూడిద వెలువడటం చూచి మంకణమహాముని సిగ్గుపడి 'నీవు పరమేశ్వరుడివి' అని నమస్కరించి వేదమంత్రాలతో ప్రస్తుతించి, 'దేవా! నీ అనుగ్రహంవలన నాకు తపోవృద్ధి కావా' లని అనగా, ఆ మహర్షిని ఈశ్వరుడు కరుణించి 'నీకు తపోవృద్ధి అవుతుంది, నేను నీ ఆశ్రమంలో ఉంటాను' అని చెప్పాడు. అటువంటి సప్త సారస్వతాలు అనే తీర్థాలలో స్నానంచేసినవారికి సారస్వతంలో సమగ్రప్రాప్తి ఏర్పడుతుంది. బ్రహ్మాదిదేవతలచేత అధివసించబడినవైన ఔశనసం, కపాలమోచనం, విశ్వామిత్రం, కార్తికేయం అనే తీర్థాలలో స్నానంచేస్తే పాపాలనుండి విముక్తులై సత్యలోకాన్ని పొందుతారు.

క. వేదములయందు వినఁగఁ బృ । థూదకతీర్థంబ యుత్తమోత్తమము సురేం
ద్రాది సురవరులకును వ్యా । సాది మహాయోగివరుల కాస్పద మగుటన్. 267

ప్రతిపదార్థం: వేదముల+అందున్= వేదాలలో; వినఁగన్= వినగా; పృథూదక, తీర్థంబు+అ= పృథూదకం అనే పుణ్యక్షేత్రమే; సురేంద్ర+ఆది, సురవరులకును= దేవేంద్రుడు మున్నగు దేవతాశ్రేష్ఠులకును; వ్యాస+ఆది, మహాయోగి, వరులకు= వ్యాసుడు మున్నగు గొప్ప యోగిశ్రేష్ఠులకు; ఆస్పదము+అగుటన్= నెలవు అవటంచేత; ఉత్తమ+ఉత్తమము= మేలితీర్థాలలోకెల్ల మేల్తరమైనది.

తాత్పర్యం: వేదాలలో ప్రస్తావించబడిన పుణ్యతీర్థం పృథూదకతీర్థం దేవేంద్రుడు మున్నగు దేవతలకున్నూ, వ్యాసుడు మున్నగు యోగివరేణ్యులకున్నూ నెలవు కావటంచేత అది ఉత్తమోత్తమం.

వ. అందు శరీరత్యాగంబు చేసినవార లపారపాపవిముక్తులై ముక్తు లగుదురు; సురకన్యా సరస్వతీ సంగమ స్నాతులైనవారు బ్రహ్మహత్యాది పాతకంబులవలనఁ బాయుదురు; దర్భినిర్మితంబైన యర్ధకీల తీర్థం బాడిన శూద్రులు బ్రాహ్మను లగుదురు, బ్రాహ్మణులు పరమసిద్ధు లగుదురు; శతంబును సహస్రంబును నను తీర్థంబు లందుఁ జేసిన జపదానోపవాసంబులు శతసహస్రగుణంబులగు; వేల్పు లెల్లం గుమారు సేనాపతింగా నెందే నభిషేకించి రట్టితైజసం బను తీర్థంబును దాని తూర్పున నుండు కురుతీర్థంబును స్వర్గద్వారం బను తీర్థంబును జూచినవారికి స్వర్గద్వారంబు వివృతం బగు; రుద్రపత్ని యను తీర్థంబున శంకరనారాయణుల నర్చించి సర్వదుఃఖ విముక్తు లగుదురు; స్వస్తిపురంబుఁ బ్రదక్షిణంబు సేసి గో సహస్ర దాన ఫలంబు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వడయుదురు; గంగమడువున నొక్క కూపంబున మూఁడుకోట్ల తీర్థంబుల సన్నిహితంబులై యుండు; నందుఁ గృతస్నాను లయినవారికి సర్వతీర్థస్నానఫలం బగు; బదరీవనంబునందు వసిష్ఠాశ్రమంబునం ద్రిరాత్రంబులు బదరీఫల భక్షణంబు సేసి పాపవిముక్తు లగుదు; రేకరాత్రం బను తీర్థంబున నేకరాత్రోపవాసంబు సేసి బ్రహ్మలోకంబు వడయుదు; రాదిత్యాశ్రమం బను వనంబున నాదిత్యుం బూజించి యాదిత్యలోకగతు లగుదురు; దధీచి తీర్థంబునం గన్యాశ్రమంబునందుఁ ద్రిరాత్రంబు వసియించినవారికి స్వర్గఫలం బగు.268

ప్రతిపదార్థం: అందున్= ఆ పృథూదకక్షేత్రంలో; శరీర, త్యాగంబు, చేసిన వారలు= దేహాన్ని వదలిపెట్టినవారు; అపార, పాప, విముక్తులు+ఐ= మితిలేని పాపాలనుండి తొలగినవారై; ముక్తులు= మోక్షం పొందినవారు; అగుదురు= అవుతారు; సురకన్యా, సరస్వతీ, సంగమ స్నాతులు+ఐనవారు= గంగాసరస్వతీ సంగమంలో స్నానంచేసినవారు; బ్రహ్మ, హత్యా+ఆది, పాతకంబులవలనన్+ పాయుదురు= బ్రాహ్మణులను చంపటం మున్నగువాటిచేత సంక్రమించే పాపాలనుండి విముక్తులౌతారు; దర్భి, నిర్మితంబు+ఐన= దర్భిచేత నిర్మించబడిన; అర్ధకీల, తీర్థంబు+ఆడిన= అర్ధకీలతీర్థంలో స్నానంచేసిన; శూద్రులు; బ్రాహ్మణులు+అగుదురు= విప్రులు కాగలరు; బ్రాహ్మణులు= విప్రులు; పరమ, సిద్ధులు+అగుదురు= గొప్ప శక్తులు సిద్ధించిన, పరిణతి చెందిన యోగులు కాగలరు; శతంబును, సహస్రంబునున్+అను, తీర్థంబులన్= శతం, సహస్రం అనే పుణ్యక్షేత్రాలలో; చేసిన= సల్పిన; జప, దాన+ఉపవాసంబులు= జపాలు, దానాలు, ఉపవాసదీక్షలు; శత సహస్ర గుణంబులు+అగు= లక్షరెట్లు అవుతాయి, అంటే వందవేయి మడుంగులు ఎక్కువ పుణ్యాలను ఇస్తాయి; వేల్పులు+ఎల్లన్= దేవతలందరు; ఎందేన్= ఎచట; కుమారున్= కుమారస్వామిని; సేనాపతింగాన్= సైన్యాధిపతిగా; అభిషేకించిరి= పవిత్రస్నానం చేయించారో అంటే పట్టం కట్టారో; అట్టి= అటువంటి స్థలమైన; తైజసంబు+అను, తీర్థంబును= తైజసమనే పేరుగల తీర్థాన్ని; దానికి, తూర్పునన్+ఉండు= దానికి తూర్పుదిక్కులో ఉండే; కురు, తీర్థంబును= కురుతీర్థాన్నీ; స్వర్గద్వారంబు+అను తీర్థంబును= స్వర్గద్వారమనే తీర్థాన్నీ; చూచినవారికిన్= సందర్శించినవారికి; స్వర్గ ద్వారంబు= స్వర్గలోకంలోని ప్రవేశ కవాటం; వివృతంబు+అగున్= తెరువబడి నట్టిది అవుతుంది; రుద్ర, పత్ని+అను, తీర్థంబునన్= రుద్రపత్ని అనేతీర్థంలో; శంకర నారాయణులను= శివకేశవులను; అర్చించి= పూజించి; సర్వ, దుఃఖ, విముక్తులు+అగుదురు= సమస్త పరితాపాలనుండి తొలగినట్టివారు అవుతారు; స్వస్తిపురంబున్+ ప్రదక్షిణంబు+చేసి= స్వస్తిపురం అనే తీర్థంచుట్టూ తిరిగితే; గో, సహస్ర, దాన, ఫలంబు= వేయి ఆవులను దానంచేసిన పుణ్యం; పడయుదురు= ఆర్జిస్తారు; గంగమడువునన్= గంగకొలనులో; ఒక్క, కూపంబునన్= ఒక నూతిలో; మూఁడు, కోట్ల, తీర్థంబులు= ముక్కోటి తీర్థాలు; సన్నిహితంబులు+ఐ= చేరికూడినట్టివై; ఉండున్= ఉంటాయి; అందున్= అచట; కృత స్నానులు+ఐనవారికిన్= స్నానంచేసినవారికి; సర్వ, తీర్థ, స్నాన, ఫలంబు+అగున్= తీర్థాలన్నింటిలో స్నానంచేసిన పుణ్యం లభిస్తుంది; బదరీ వనంబునందున్= బదరీవనంలో; వసిష్ఠ+ఆశ్రమంబునన్= వసిష్ఠాశ్రమంలో; త్రిరాత్రంబులు= మూడు రాత్రులు; బదరీ, ఫల, భక్షణంబు, చేసి= రేగుపండ్లు తిని; పాపముక్తులు= పాపాలనుండి వైదొలగినవారు; అగుదురు= అవుతారు; ఏక రాత్రంబు+అను= ఏకరాత్రం అనేపేరున్న; తీర్థంబునన్= పుణ్యక్షేత్రంలో; ఏక, రాత్ర+ఉపవాసంబు+చేసి= ఒక రాత్రి ఆహారం తీసికొనక ఉంటే; బ్రహ్మలోకంబు= సత్యలోకాన్ని; పడయుదురు= పొందుతారు; ఆదిత్య+ఆశ్రమంబు+అను, వనంబున్= ఆదిత్యుడి పేరుమీద విలసిల్లిన ఆశ్రమంలో; ఆదిత్యున్= సూర్యుడిని; పూజించి= ఆరాధించి; ఆదిత్య, లోక, గతులు+అగుదురు= సూర్యలోకానికి వెళ్ళేవారు ఔతారు; దధీచి, తీర్థంబునన్= దధీచి పేరుపై వెలసిన తీర్థంలో; కన్యా+ఆశ్రమంబునందున్= కన్యాశ్రమంలోను; త్రిరాత్రంబు= మూడురాత్రులు; వసియించినవారికిన్= నివసించినవారికి; స్వర్గఫలంబు= స్వర్గలోకం ప్రాప్తించేపుణ్యం; అగున్= కలుగుతుంది.

తాత్పర్యం: పృథూదకతీర్థంలో దేహం విడిచినవారికి మితిలేని పాపాలనుండి విముక్తి కలుగుతుంది. గంగానది, సరస్వతి కలిసేచోట స్నానం చేసినవారికి బ్రహ్మహత్య మున్నగు పాపాలనుండి నిష్కృతి లభిస్తుంది. దర్భి నిర్మించిన అర్ధకీల తీర్థంలో స్నానంచేస్తే శూద్రులు బ్రాహ్మణులౌతారు; బ్రాహ్మణులు సంపూర్ణయోగులు అవుతారు. శతం,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సహస్రం అనేతీర్థాలలో చేసిన జపాలు, దానాలు, ఉపవాసాలు లక్షరెట్లు పుణ్యాలను ఒసంగుతాయి. తైజసమనే తీర్థంలో దేవతలందరు కలిసి శ్రీ కుమారస్వామిని సేనాపతిగా పట్టంగట్టారు. దానిని, దానికి తూర్పున ఉన్న కురుతీర్థాన్ని, స్వర్గద్వారమనే తీర్థాన్ని చూచినవారికి స్వర్గలోకద్వారం తెరుచుకొంటుంది. రుద్రపత్ని అనేతీర్థంలో శివకేశవులను అర్చిస్తే సర్వదుఃఖాలనుండి విముక్తి కలుగుతుంది. స్వస్తిపురం అనేతీర్థం చుట్టూ ప్రదక్షిణం చేస్తే వేయి ఆవులను దానంచేస్తే వచ్చేపుణ్యం దక్కుతుంది. గంగమడువు అనేతీర్థంలో ఒక నూతిలో మూడుకోట్ల తీర్థాలు చేరి కూడినాయి. అందులో స్నానంచేసినవారికి తీర్థాలన్నింటిలో స్నానం చేసిన పుణ్యం లభిస్తుంది. బదరీవనం అనే తీర్థంలో వసిష్ఠాశ్రమం అనేతీర్థంలో మూడురాత్రులు రేగుపండ్లను తింటే పాపాలు పోతాయి. ఏకరాత్రం అనేతీర్థంలో ఒకరాత్రి ఉపవాసం చేస్తే సత్యలోకం సిద్ధిస్తుంది. ఆదిత్యాశ్రమం అనే అరణ్యంలో సూర్యుడిని ఆరాధిస్తే సూర్యలోక ప్రాప్తి అవుతుంది. దధీచితీర్థంలో కన్యాశ్రమంలో మూడురాత్రులు వసించినవారికి స్వర్గలోకం ప్రాప్తించేపుణ్యం లభిస్తుంది.

క. జలరుహసంభవుఁ డాదిగఁ । గల వేల్పులు ఋషులు సిద్ధ గరుడోరగులున్
నెలనెల సేవింతురు భూ । తలమున సన్నిహిత యనఁగఁ దగు తీర్థంబున్. 269

ప్రతిపదార్థం: జలరుహ, సంభవుఁడు+ఆదిగన్+కల= నీటిలో పుట్టే పద్మంలో పుట్టిన బ్రహ్మదేవుడు మొదలుగా గల; వేల్పులు= దేవతలు; ఋషులు= మునులు; సిద్ధ గరుడ+ఉరగులున్= సిద్ధులు, గరుడులు, పాములు; నెలనెల= ప్రతిమాసమున్నూ; భూతలమునన్= భూమిపై; సన్నిహిత; అనఁగన్+తగు= అనే పేరున్న; తీర్థంబున్= తీర్థాన్ని; సేవింతురు= దర్శిస్తారు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు మున్నగు దేవతలున్నూ, మునులున్నూ, సిద్ధులు, గరుడులు, పాములు అనే జాతులకు చెందిన దేవతలున్నూ, భూమిపై 'సన్నిహిత' అనేపేరుతో విలసిల్లే తీర్థాన్ని ప్రతిమాసంలోనూ దర్శిస్తారు.

వ. సూర్యగ్రహణంబున దాని నాడినవారు శతాశ్వమేధ ఫలంబు వడయుదురు; ధర్ముఁడు తపంబు సేసిన ధర్మతీర్థం బాడి ధర్మశీలు రగుదురు; జ్ఞానపావనంబును సౌగంధికంబును నను తీర్థంబుల నాడినం జూచిన సర్వపాప విముక్తు లగుదురు; దేవశ్రవ యను సరస్వతీప్రాదంబునందు వల్మీకంబున వెలువడు జలధార లాడి పితృతర్పణంబు సేసిన వా రశ్వమేధ ఫలంబు వడయుదురు; సుగంధయు, శతకుంభయుఁ, బంచయక్షయుఁ, ద్రిశూల ఖాతయు నను తీర్థంబు లాడి దుర్గతులవలనం బాయుదురు; తొల్లి పార్వతి యెందేని శాకాహారిణియై దివ్యసహస్రవర్షంబులు తపంబు సేసె నట్టి శాకంభరీతీర్థం బాడి యొక్కదివసంబు శాకాహారులైనవారు పంద్రెండేండ్లు శాకాహార తపంబు సలిపినవారి ఫలంబు వడయుదురు; సువర్ణాఖ్యం బను తీర్థంబున రుద్రుం బూజించి రుద్రలోక గతు లగుదురు; ధూమావతి యను తీర్థంబును రథావర్తం బను తీర్థంబును ధార యను తీర్థంబు నాడి శోకవిముక్తు లగుదురు. 270

ప్రతిపదార్థం: సూర్య గ్రహణంబునన్= సూర్యగ్రహణకాలంలో; దానిన్+ఆడినవారు= సన్నిహిత అనే తీర్థంలో స్నానం చేసినవారు; శత+అశ్వమేధ, ఫలంబు+పడయుదురు= నూరు అశ్వమేధయాగాలు చేసిన పుణ్యం ఆర్జిస్తారు; ధర్ముఁడు= యమధర్మరాజు; తపంబు+చేసిన= తపస్సు చేసిన; ధర్మ, తీర్థంబు+ఆడి= ధర్మతీర్థస్నానం చేస్తే; ధర్మశీలురు+అగుదురు= ధర్మమైన నడవడిక కలిగినవారవుతారు; జ్ఞాన పావనంబును= జ్ఞానపావనమనే తీర్థాన్నీ; సౌగంధికంబునున్; అను, తీర్థంబులన్=

అనే తీర్థాలలో; ఆడినన్= స్నానంచేస్తే; చూచినన్= దర్శిస్తే; సర్వ, పాప, విముక్తులు= పాపాలు అన్నిటినుండి తొలగినవారు; అగుదురు= అవుతారు; దేవశ్రవ+అను= దేవశ్రవ అనే; సరస్వతీ హ్రదంబునందు= సరస్వతీనదివలన ఏర్పడిన మడుగులోని; వల్మీకంబున= పుట్టనుండి; వెలువడు= పైకి ఉబికివచ్చే, జలధారలు+ఆడి= నీటి ప్రవాహంలో స్నానంచేసి; పితృ, తర్పణములు+చేసినవారు= పితరులకు శ్రాద్ధకర్మలు నిర్వహించినవారు; అశ్వమేధ, ఫలంబు+ పడయుదురు= అశ్వమేధయాగాన్ని చేసినపుణ్యాన్ని పొందుతారు; సుగంధయు, శతకుంభయున్+పంచయక్షయున్+త్రిశూలఖాతయున్+అను తీర్థంబులు+ఆడి= సుగంధ, శతకుంభ, పంచయక్ష, త్రిశూలఖాత అనే తీర్థాలలో స్నానంచేసి; దుర్గతుల వలనన్+పాయుదురు= పాపాలనుండి తొలగుతారు; తొల్లి= పూర్వం; పార్వతి; ఎందేని= ఎచ్చోట; శాకాహారిణి+ఐ= కాయగూరలు మాత్రమే ఆహారంగా కలదై; దివ్య, సహస్ర, వర్షంబులు= దేవతాకాలమానంప్రకారం వేయిఏండ్లు; తపంబు+చేసెన్= తపస్సు చేసిందో; అట్టి= ఆ; శాకంభరీ, తీర్థంబు+ఆడి= శాకంభరి తీర్థంలో స్నానంచేసి; ఒక్క దివసంబు= ఒకనాడు; శాక+ఆహారులు+ఐనవారు= కాయగూరలు ఆహారంగా స్వీకరించినవారు; పండ్రెండు+ఏండ్లు= పండ్రెండు సంవత్సరాలు; శాకాహార తపంబు= శాకాహారం మాత్రమే స్వీకరిస్తూ చేసేటటువంటి తపస్సు; సలిపినవారి, ఫలంబు= చేసినవారు పొందేపుణ్యం; పడయుదురు= పొందుతారు; సువర్ణ+ఆఖ్యంబు+అను= సువర్ణమనే పేరున్న; తీర్థంబునన్= పుణ్యక్షేత్రంలో; రుద్రున్+పూజించి= శివుడిని ఆరాధించి; రుద్రలోక గతులు+అగుదురు= కైలాసాన్ని చేరినట్టినవారు అవుతారు; ధూమావతి+అను, తీర్థంబును= ధూమావతి అనే తీర్థాన్ని; రథ+ఆవర్తంబు+అను తీర్థంబును= రథావర్తం అనే తీర్థాన్ని; ధారా+అను తీర్థంబును= ధార అనేతీర్థంలోను; ఆడి= స్నానంచేసి; శోక, విముక్తులు+అగుదురు= దుఃఖంనుండి విముక్తి పొందినవారు అవుతారు.

తాత్పర్యం: సూర్యగ్రహణకాలంలో ఆ సన్నిహితతీర్థంలో స్నానం చేసినవారు నూరు అశ్వమేధయాగాలు చేసిన పుణ్యం పొందుతారు. యమధర్మరాజు తపస్సుచేసిన ధర్మతీర్థంలో స్నానంచేసిన ధర్మస్వభావం కలవారు అవుతారు. జ్ఞానపావనం, సౌగంధికం అనేతీర్థాలలో స్నానంచేసినా, ఆ తీర్థాలను సందర్శించినా సర్వపాపాలనుండి విముక్తులు కాగలరు. దేవశ్రవ అనే సరస్వతీహ్రదంలోని పుట్టనుండి వెలువడే జలప్రవాహంలో స్నానంచేసి పితరులకు శ్రాద్ధకర్మలు నిర్వహించినవారు అశ్వమేధయాగం చేసినపుణ్యాన్ని ఆర్జిస్తారు. సుగంధ, శతకుంభ, పంచయక్ష, త్రిశూలఖాత అనేతీర్థాలలో స్నానంచేసినవారు నరకాలనుండి తప్పించుకొంటారు. పూర్వం పార్వతీదేవి శాకాహారం స్వీకరించి దేవమానం ప్రకారం వేయి సంవత్సరాలు శాకంభరి అనే తీర్థంలో తపస్సు చేసింది. ఆ తీర్థంలో ఒకరోజు శాకాహార వ్రతం నిర్వహించినవారు పండ్రెండు సంవత్సరాలు శాకాహార తపస్సు చేసినపుణ్యం పొందుతారు. సువర్ణం అనే తీర్థంలో శివుడిని ఆరాధించినవారికి కైలాసం సిద్ధిస్తుంది. ధూమావతి అనేతీర్థంలో, రథావర్తం అనే తీర్థంలో, ధార అనేతీర్థంలో స్నానం చేసినవారు దుఃఖంనుండి విముక్తి పొందుతారు.

క. ధారుణిలోపల స్వర్గ । ద్వారం బయి ఋషినిషేవితం బగు గంగా
ద్వారం బాడిన ధన్యులఁ । జేరును శతకోటితీర్థసేవాఫలముల్. 271

ప్రతిపదార్థం: ధారుణిలోపలన్= భూమండలంలో; స్వర్గ, ద్వారంబు+అయి= స్వర్గలోకానికి వాకిలి వంటిదిఅయి; ఋషి, నిషేవితంబు+అగు= మునులచేత సేవించబడినదైన; గంగా ద్వారంబు+ఆడిన= గంగాద్వారం అనే పుణ్యక్షేత్రంలో స్నానంచేసిన; ధన్యులన్= తమ జన్మలు సార్థకాలైన మహాత్ములను; శత, కోటి, తీర్థసేవా, ఫలముల్= నూరుకోట్ల తీర్థాలను సందర్శించిన పుణ్యాలు; చేరును= చేరతాయి.

తాత్పర్యం: భూమండలంలో స్వర్గానికి ప్రవేశమార్గమయినది, మునులచేత సేవించబడినది అయిన గంగాద్వారంఅనే పుణ్యక్షేత్రంలో స్నానంచేసిన ధన్యులకు నూరుకోట్ల తీర్థాలను సేవిస్తే లభించేటటువంటి పుణ్యం దక్కుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియు సప్తగంగా సంగమంబును ద్రిగంగా సంగమంబును శక్రావర్తంబును గనస్వలంబును గంగా సరస్వతీ సంగమంబు నాదిగాఁ గల పుణ్యతీర్థంబుల నాడి పుణ్యలోకంబులు వడయుదురు; భద్రకర్ణేశ్వరంబున రుద్ర పూజయు నరుంధతీవటంబును సింధుప్రభవంబును యమునాప్రభవంబు నను పుణ్యతీర్థంబుల సేవయు సర్వసిద్ధికరంబులు; వేదిక యను తీర్థంబును ఋషికుల్య యను తీర్థంబును గృత్తికా మఘ తీర్థంబులును విద్యాతీర్థంబును వేతసిక యను తీర్థంబునుం జూచి దురితంబులవలనం దొలంగుదురు; బ్రహ్మతీర్థం బాడి పద్మవర్ణయానంబుల బ్రహ్మలోకగతు లగుదురు. 272

ప్రతిపదార్థం: మఱియు= ఇంకను; సప్త గంగా సంగమంబును= ఏడు గంగలు కలిసినచోటు; త్రి గంగా సంగమంబును= మూడు గంగలు కలిసినచోటు; శక్ర+ఆవర్తంబును= శక్రావర్తం అనే తీర్థమున్నూ; కనస్వలంబును= కనస్వలం అనే తీర్థమున్నూ; గంగాసరస్వతీ సంగమంబున్= గంగ, సరస్వతి నదులు కలిసిన చోటు; ఆదిగాన్+కల= మొదలైన; పుణ్య, తీర్థంబులన్+ఆడి= పుణ్యతీర్థాలలో స్నానంచేసి; పుణ్యలోకంబులు+పడయుదురు= పుణ్యలోకాలను పొందుతారు; భద్రకర్ణేశ్వరంబునన్= భద్రకర్ణేశ్వరం అనేతీర్థంలో; రుద్ర, పూజయున్= శివుడి ఆరాధనయు; అరుంధతీవటంబును= అరుంధతి ప్రతిష్ఠించిన మర్రిచెట్టుగల చోటు; సింధు ప్రభవంబును= సింధునది పుట్టినచోటు; యమునా ప్రభవంబును= యమున పుట్టినచోటు; అను పుణ్యతీర్థంబుల సేవయు= అనే పుణ్యతీర్థాల సందర్శనం; సర్వసిద్ధి కరంబులు= అన్ని ఫలాలను ఒనగూర్చేవి; వేదిక+అను, తీర్థంబును; ఋషికుల్య+అను, తీర్థంబును; కృత్తికా, మఘ, తీర్థంబులును= కృత్తిక, మఘ అనే తీర్థాలున్నూ; విద్యాతీర్థంబును= విద్య అనేతీర్థాన్నీ; వేతసిక+అను, తీర్థంబును= వేతసిక అనే తీర్థాన్నీ; చూచి; దురితంబుల వలనన్+తొలగుదురు= పాపాలనుండి విముక్తులు అవుతారు; బ్రహ్మ, తీర్థంబు+ఆడి= బ్రహ్మతీర్థంలో స్నానంచేసి; పద్మ, వర్ణ, యానంబుల= పద్మంవంటి రంగు గల విమానాలలో; బ్రహ్మలోక గతులు+అగుదురు= సత్యలోకాన్ని చేరినవారు అవుతారు.

తాత్పర్యం: మరియు సప్తగంగాసంగమం, త్రిగంగాసంగమం, శక్రావర్తం, కనస్వలం, గంగా సరస్వతీ సంగమం మొదలైన పుణ్యతీర్థాలలో స్నానంచేస్తే పుణ్యలోకాలు లభిస్తాయి. భద్రకర్ణేశ్వరంలో రుద్రపూజ, అరుంధతి నాటిన మర్రిచెట్టు గలస్థలం అరుంధతీవటం, సింధునది పుట్టినచోటు, యమున పుట్టినచోటు- ఆ పుణ్యస్థలాలు సేవించటం వలన సర్వసిద్ధులు కలుగుతాయి. వేదిక, ఋషికుల్య, కృత్తిక, మఘ, విద్య, వేతసిక అనే తీర్థాలను సేవిస్తే పాపాలు తొలగుతాయి. బ్రహ్మతీర్థంలో స్నానం చేస్తే పద్మవర్ణం కల విమానంలో సత్యలోకానికి చేరుతారు.

చ. సురుచిరకీర్తి! నైమిశముఁ జూచిన మాత్రన పాయుఁ బాప మ
చ్చెరువుగ; నందు మాసము వసించి యనంతఫలంబు లొందఁ గాం
తురు; బహుతీర్థసేవనముతోడ సమానము నైమిశంబునం
దరుదుగ నొక్కనాఁడు శుచియై యుపవాసము సేయఁ గాంచినన్. 273

ప్రతిపదార్థం: సురుచిర కీర్తి!= మిగుల ప్రకాశవంతమైన యశస్సు కలవాడా!, ఓ ధర్మరాజా!; నైమిశమున్= నైమిశం అనే అరణ్యతీర్థాన్ని; చూచినమాత్రన= చూచినంత మాత్రాననే; పాపము= దురితం; అచ్చెరువుగన్= అద్భుతంగా; పాయున్= తొలగుతుంది; అందున్= ఆ నైమిశంలో; మాసము వసించి= ఒక నెల నివసించి; అనంత, ఫలంబులు= మితిలేని పుణ్యాలు; ఒందన్+కాంతురు= పొందుతారు; నైమిశంబు+అందు= నైమిశంలో; అరుదుగన్; ఒక్కనాఁడు= ఒకే ఒకదినంలో; శుచి+ఐ= నిర్మలంగా; ఉపవాసము, చేయన్+కాంచినన్= ఆహారం తీసికోకుండా పస్తుంటే; బహు, తీర్థ, సేవనముతోడన్= పెక్కు తీర్థాలను సేవించటంతో; సమానము= తుల్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దేదీప్యమానమైన కీర్తిగల ఓ ధర్మరాజా! నైమిశాన్ని చూస్తే చాలు ఆశ్చర్యకరంగా పాపాలన్నీ పటాపంచలు కాగలవు. అందులో ఒకనెల నివసిస్తే మితిలేని పుణ్యాలు లభిస్తాయి. అచ్చట ఒకే ఒకనాడు శుచిగా ఉపవాసం చేస్తే పెక్కుతీర్థాలను సేవించటంతో సమానమైన గొప్పపుణ్యం చేకూరుతుంది.

విశేషం: నైమిశంలో మహాభారత పురాణ ప్రవచనం పన్డ్రెండేండ్లు జరిగిన సత్త్రయాగసందర్భంగా కొనసాగింది. అట్లే భారతీయ వాఙ్మయంలో సుప్రసిద్ధమైన క్షేత్రమాహాత్మ్య ప్రవచనాలు, వ్రతాచరణల విశిష్ట ప్రబోధాలు మున్నగునవి జరిగాయి. ఈ విధంగా భారతీయసాహిత్యంలో నైమిశానికి నిరుపమానమైన ప్రశస్తి నెలకొని ఉన్నది.

వ. మఱియు గంగోద్భేద తీర్థంబు నిందీవర తీర్థంబు గంగాద్వారంబు దిశాపతి తీర్థంబు లనియెడు తీర్థంబుల నాడి వాజపేయఫలంబుఁ బడయుదురు; బాహుద యను తీర్థం బాడిన ననేకసత్త్రయాగఫలం బగు; నెందేని రాముండు స్వర్గగతుం డయ్యె నట్టి సరయూప్రదేశంబున గోప్రదానం బాడియు, దేవతలకు ఋషులకు యజ్ఞ భూమియయిన తీరంబులు గల గోమతి నాడియు నశ్వమేధ ఫలంబు వడయుదురు; కోటితీర్థంబునం గుమారు నర్చించియు, వారణాసియందు రుద్రు నర్చించియుఁ, గపిలాహ్రదం బాడియు రాజసూయ ఫలప్రాప్తు లగుదురు; మార్కండేయ తీర్థం బయిన గంగాగోమతీ సంగమం బాడియు బ్రహ్మకల్పితం బయిన యూపంబుఁ బ్రదక్షిణంబు సేసియు వాజపేయఫలంబు వడయుదురు. 274

ప్రతిపదార్థం: మఱియు= పిమ్మట; గంగోద్భేద తీర్థంబున్= గంగోద్భేదమనే తీర్థం; (గంగా+ఉద్భేదం= గంగ ఊటగా బయటికి వచ్చినచోటు, అంటే గంగానది జన్మస్థలం); ఇందీవర తీర్థంబు= ఇందీవరం అనే పేరుకల తీర్థం (ఇందీవరం= నల్లకలువ, నల్లకలువలు కల తీర్థం); గంగాద్వారంబు= గంగాద్వారం అనేతీర్థం (గంగ భూమికి అవతరించిన ప్రదేశం, హరిద్వారం); దిశాపతి తీర్థంబులు= దిశాపతులనే తీర్థాలు (దిశాపతి= దిక్పాలకుడు); అనియెడు= తీర్థంబులన్+ఆడి= అనే తీర్థాలలో స్నానంచేసి; వాజపేయ, ఫలంబున్= వాజపేయయాగాన్ని చేసినపుణ్యాన్ని; పడయుదురు= పొందుతారు; బాహుద+అను, తీర్థంబు+ఆడినన్= బాహుద అనే తీర్థంలో స్నానం చేస్తే; అనేక, సత్త్రయాగ, ఫలంబు+అగున్= పెక్కు సత్త్రయాగాలు చేసిన పుణ్యం సంక్రమిస్తుంది; ఎందేని= ఏచోటనైతే; రాముండు= శ్రీరాముడు; స్వర్గ+గతుండు+అయ్యెన్= స్వర్గలోకానికి వెళ్ళాడో; అట్టి= ఆ; సరయూ ప్రదేశంబునన్= సరయూ నది గల స్థలంలో అంటే అయోధ్యలో; గో ప్రదానంబు+ఆడియు= గోప్రదానం అనే తీర్థంలో స్నానం చేసి; దేవతలకు, ఋషులకున్= సురలకు, మునులకు; యజ్ఞభూమి+అయిన= యజ్ఞాలుచేసే చోటులైన; తీరంబులు+కల= గట్లు గల; గోమతిన్+ఆడియున్= గోమతీనదిలో స్నానంచేసి; అశ్వమేధఫలంబు+పడయుదురు= అశ్వమేధయాగం చేసిన పుణ్యం పొందగలరు; కోటి తీర్థంబునన్= కోటితీర్థంలో; కుమారున్= కుమారస్వామిని; అర్చించియు= ఆరాధించియు; వారణాసి+అందు= కాశిలో; రుద్రున్= శివుడిని; అర్చించియున్= పూజించియు; కపిలా, హ్రదంబు+ఆడియు= కపిలాహ్రదంలో స్నానంచేసియు; రాజసూయ, ఫల, ప్రాప్తులు= రాజసూయయాగాన్ని చేసినపుణ్యం పొందినవారు; అగుదురు= అవుతారు; మార్కండేయ, తీర్థంబు+అయిన= మార్కండేయమహర్షిచేత ప్రతిష్ఠించబడిన పుణ్యక్షేత్రమైన; గంగా, గోమతీ, సంగమంబు+ఆడియు= గంగ, గోమతి కలిసేచోట స్నానంచేసియు; బ్రహ్మ, కల్పితంబు+అయిన= బ్రహ్మచేత నిర్మించబడిన; యూపంబున్= యజ్ఞస్తంభాన్ని; ప్రదక్షిణంబు+చేసియు= చుట్టును తిరిగియు; వాజపేయ, ఫలంబు= వాజపేయయాగం చేసిన పుణ్యాన్ని; పడయుదురు= పొందుతారు.

తాత్పర్యం: గంగానది ఉద్భవించిన స్థలం గంగోద్భేదం అనే తీర్థం, ఇందీవరతీర్థం, గంగానది భూమికి దిగిన గంగాద్వారం అనే హరిద్వారతీర్థం, దిశాపతితీర్థాలు- వీటిలో స్నానంచేస్తే వాజపేయయాగం చేసిన పుణ్యం లభిస్తుంది.

బాహుద అనే తీర్థంలో స్నానం చేస్తే పెక్కు సత్త్రయాగాలు చేసినపుణ్యం లభిస్తుంది. శ్రీరాముడు స్వర్గాన్ని చేరిన సరయూనదీ ప్రదేశంలోని గోప్రదానమనే పేరు గల పుణ్యతీర్థంలో స్నానం చేస్తే, దేవతలయొక్క మునులయొక్క యజ్ఞకార్యాలకు ఉనికిపట్టులయిన తీరాలు గల గోమతిలో స్నానం చేస్తే అశ్వమేధయాగం చేసినపుణ్యాన్ని ఆర్జిస్తారు. కోటితీర్థంలో శ్రీకుమారస్వామిని ఆరాధించినా, కాశిలో శివుడిని పూజించినా, కపిలాహ్రదంలో స్నానంచేసినా, రాజసూయయాగం చేసిన పుణ్యం లభిస్తుంది. మార్కండేయమహర్షి నిర్మించిన గంగాగోమతి సంగమం అనే క్షేత్రంలో స్నానంచేసినా, బ్రహ్మ నిర్మించిన యూపస్తంభానికి ప్రదక్షిణం చేసినా వాజపేయయజ్ఞం చేసిన పుణ్యం ఆర్జిస్తారు.

సీ. పలువురఁ గొడుకులఁ బడయంగ వలయు; నం । దొక్కరుం డయినను నోపి గయకు
నరుగునో యనియును, నశ్వమేధం బొప్పఁ । జేయునో యనియును, శ్వేత మైన
యాఁబోతు విడుచునో యనియును గోరుదు । రనవద్యు లైన గృహస్థు లట్టి
గయ కేఁగి యుభయ పక్షములు వసించిఁ । గడుఁ బుణ్యు లుభయపక్షములవారి

ఆ. నుద్ధరింతు; రంద యొగిఁ బిండ మిడిన వా । రనఘ! పితృదయను గృతార్థు లగుదు;
రందు ఫల్గుతీర్థ మాడినవారికిఁ । బరమసిద్ధితో శుభంబు పెరుఁగు. 275

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; పలువురన్, కొడుకులన్+పడయంగ వలయున్= పెక్కుమంది పుత్రులను కనాలి; అందు= ఆ కుమారులలో; ఒక్కరుండు+అయిననున్= ఒక్కడైనను; ఓపి= పూనికతో; గయకున్= గయాక్షేత్రానికి; అరుగునో= వెళ్ళుతాడో; అనియునున్= అని తలపోస్తూ; అశ్వమేధంబు= అశ్వమేధయాగాన్ని; ఒప్పన్= శోభిల్లేటట్లు; చేయునో+అనియును= చేస్తాడేమో అనియున్నూ; శ్వేతము+ఐన= తెల్లనైన; ఆఁబోతు= పెద్దఎద్దును; విడుచునో+అనియును= విడిచిపెట్టునో అనియున్నూ; అంటే గోసంతతి ఉత్పత్తికై ఆంబోతును అందరి మేలుకొరకు దానంచేస్తాడా అనియున్నూ; అనవద్యులు+ఐన= నింద్యులు కాని అంటే పవిత్ర చరిత్రులయిన; గృహస్థులు= గృహస్థాశ్రమంలో ఉండే సంసారులు; కోరుదురు= కాంక్షిస్తారు; అట్టి= అటువంటి; గయకు+ఏఁగి= గయకు వెళ్ళి; ఉభయ పక్షములు, వసించినన్= రెండుపక్షాలు (శుక్ల, కృష్ణ) అంటే ఒకమాసం నివసిస్తే అలా నివసించినటువంటి; కడు+పుణ్యులు= మిక్కిలి పుణ్యులు; ఉభయ పక్షముల వారిన్= ఇటు తండ్రిపక్షంవారిని, అటు తల్లిపక్షంవారిని; ఉద్ధరింతురు= కాపాడతారు; అందు+అ= అచట; అంటే ఆ గయాతీర్థంలో; ఒగిన్= ఒప్పిదంగా; పిండము+ఇడినవారు= పితరులకు పిండప్రదానం చేసినవారు; పితృదయను= పితరుల అనుగ్రహంచేత; కృత+అర్థులు+అగుదురు= చరితార్థులు (ధన్యులు) అవుతారు; అందు= అందలి; ఫల్గు తీర్థము+ఆడినవారికిన్= ఫల్గుతీర్థంలో స్నానంచేసినవారికి; పరమసిద్ధితో= గొప్ప పుణ్యఫలంతో; శుభంబు= మేలు; పెరుఁగున్= వృద్ధి అవుతుంది.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ ధర్మరాజా! పెక్కుమంది కొడుకులు కలగాలనిన్నీ, అందులో ఏ ఒక్కడయినా పూనుకొని గయకు వెళ్ళుతాడా అనిన్నీ, అశ్వమేధయాగం చేస్తాడా అనిన్నీ, తెల్లని ఆఁబోతును దానంగా విడిచిపెట్టుతాడా అనిన్నీ, నిర్మలమైన హృదయంగల గృహస్థులు కోరుకొంటూ ఉంటారు కదా! అట్టి గయకు వెళ్ళి శుక్ల కృష్ణపక్షాలు (ఒకనెల) నివసిస్తే అటువంటి పుణ్యాత్ములు తండ్రివైపువారిని, తల్లివైపువారిని (ఉభయపక్షాలవారిని) ఉద్ధరించిన వారు అవుతారు. అచట పిండప్రదానం చేస్తే పితృదేవతల దయవలన చరితార్థులు అవుతారు. అందులోని ఫల్గుతీర్థంలో స్నానమాడినవారికి గొప్ప పుణ్యఫలంతో పాటు అభ్యున్నతి కూడా కలుగుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱి యక్షిణీతీర్థంబునందు జలపానంబు సేసి బ్రహ్మహత్యాది దోష విముక్తు లగుదురు; మణినాగం బను తీర్థం బాడినవారికి నాశీవిషవిషంబు లొందవు; గౌతమవనంబునం దహల్యాహ్రదం బాడి యుదపానం బను తీర్థం బాడియు నశ్వమేధ ఫలంబుఁ బడయుదురు; రాజర్షి జనక కూపం బాడి విష్ణులోకప్రాప్తు లగుదురు; కంపనయు మహానదియు నను తీర్థంబుల నాడినవారు పౌండరీక ఫలంబు నొందుదురు; దేవపుష్కరిణిని మహేశ్వరధారను మహేశ్వరపదంబున నాడిన నశ్వమేధఫలంబు వడయుదురు; తొల్లి కూర్మరూపుం డయిన యసురచేతం గోటితీర్థంబు లపహృతంబు లయిన వానిఁ దెచ్చి, విష్ణుఁ డెందేని నిలిపె నట్టి మహేశ్వరపథం బను తీర్థంబాడియు, విష్ణుస్థానం బయిన సాలగ్రామం బను తీర్థంబాడి విష్ణు నర్చించియు, నందు సన్నిహిత చతుస్సముద్రం బయిన కూపంబు నాడియు విష్ణులోకగతు లగుదురు; భరతాశ్రమంబునఁ, జంపకారణ్యంబున దేవీసహితు నీశ్వరుం బూజించి మిత్రావరుణలోకంబు వడయుదురు; కన్యాసంవేద్యం బను తీర్థంబునఁ గన్యాదానంబు చేసి యక్షయఫలప్రాప్తు లగుదురు; దేవకూటం బను తీర్థంబాడి బ్రహ్మలోకం బుఁబడయుదు; రెందేని విశ్వామిత్రుండు సిద్ధింబొందె నట్టి కౌశికహ్రదం బాడియుఁ, గుమారవీరాశ్రమంబున నొక్కమాసంబు వసించియు నశ్వమేధ ఫలంబు వడయుదు; రగ్నిధారయుఁ బితామహ సరంబునం బుట్టిన కుమార ధారయు నాడి, త్రిరాత్రోపవాసంబు సేసినవారు బ్రహ్మహత్యాది దోషవిముక్తు లగుదురు; గౌరీశిఖరకుండం బాడిన నందినీకూపం బాడిన నశ్వమేధఫలం బగుఁ; గాళికా కౌశికా సంగమంబునందుఁ ద్రిరాత్రోపవాసంబు సేసినవారు సర్వపాప విముక్తులగుదు; రూర్వశీతీర్థం బాడిన సర్వపూజార్హు లగుదురు; గోకర్ణంబను తీర్థంబాడి జాతిస్మరణంబు వడయుదురు; సరస్వతీ తీర్థస్నాతులయి వృషభ ద్వీపంబునం గుమారుఁ బూజించి దేవవిమానగతు లగుదురు; నందయు, నౌలకమును, గరతోయంబును, గంగాసాగరసంగమంబు నను తీర్థంబు లాడి శతాశ్వమేధ ఫలంబు వడయుదురు; శోణా నర్మదాప్రభవంబును, బదరీతీర్థంబును నాడి యాయుష్మంతు లగుదురు; మహేంద్రంబును రామతీర్థంబును, మతంగ కేదారమ్మును, వంశగుల్మంబు నను తీర్థంబుల నాడి యశ్వమేధఫలంబు వడయుదురు. 276

ప్రతిపదార్థం: మఱి= అదియునుగాక; యక్షిణీ తీర్థంబునందు= యక్షిణి అనేతీర్థంలో; జలపానంబు+చేసి= నీటిని త్రాగి; బ్రహ్మ, హత్యా+ఆది, దోష విముక్తులు+అగుదురు= బ్రాహ్మణులను చంపటం మున్నగు వాటిచేత వచ్చిన పాపాలనుండి తొలగినవారు అవుతారు; మణి, నాగంబు+అను, తీర్థంబు+ఆడిన వారికిన్= మణినాగం అనేతీర్థంలో స్నానంచేసినవారికి; ఆశీవిష విషంబులు= ఆశీవిషములు అంటే పాములు (కోరలందు విషం కలవి), వాటియొక్క విషములు; ఒందవు= పొందవు; దరిజేరవు; గౌతమ, వనంబునందున్= గౌతమఋషి వసించిన అడవిలో; అహల్యా, హ్రదంబు+ఆడి= అహల్య అనే మడువులో స్నానంచేసి; ఉదపానంబు+అను, తీర్థంబు+ఆడియు= ఉదపానం అనే తీర్థంలో స్నానంచేసియు; అశ్వమేధఫలంబున్+ పడయుదురు= అశ్వమేధయాగం చేసినపుణ్యం పొందుతారు; రాజర్షి, జనక కూపంబు= రాజర్షి అయిన జనకుడి పేర విలసిల్లే నూతి నీటిలో; ఆడి= స్నానం చేసి; విష్ణులోక ప్రాప్తులు+అగుదురు= వైకుంఠం ప్రాప్తించినవారు అవుతారు; కంపనయు= కంపన అనునటువంటిదియు; మహానదియున్; అను, తీర్థంబులన్+ఆడినవారు= అనబడే తీర్థాలలో స్నానంచేసినవారు; పౌండరీక ఫలంబున్= పౌండరీకయజ్ఞం చేసినపుణ్యం; ఒందుదురు= పొందుతారు; దేవ పుష్కరిణిని= దేవ పుష్కరిణిలో; మహేశ్వరధారను= మహేశ్వరధార అనేతీర్థంలోను; మహేశ్వర పదంబునన్= మహేశ్వరపదమనే తీర్థంలో; ఆడినన్= స్నానంచేస్తే; అశ్వమేధ ఫలంబు= అశ్వమేధయాగం చేస్తే వచ్చేపుణ్యం; పడయుదురు= పొందుతారు; తొల్లి= పూర్వకాలంలో; కూర్మ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రూపుండు+అయిన= తాబేలు ఆకృతి ధరించిన; అసురచేతన్= రాక్షసుడిచేత; కోటి, తీర్థంబులు= కోటి తీర్థాలు; అపహృతంబులు+అయిన= బలాత్కారంగా అపహరించబడగా; వానిన్+తెచ్చి= ఆ కోటితీర్థాలను తెచ్చి; విష్ణుఁడు= విష్ణుదేవుడు; ఎందేని= ఏ చోట; నిలిపెన్= ప్రతిష్ఠించాడో; అట్టి= ఆ; మహేశ్వర పథంబు+అను, తీర్థంబు+ఆడియు= మహేశ్వరపథం అనే తీర్థంలో స్నానంచేసియు; విష్ణుస్థానంబు+అయిన= విష్ణువుకు నెలవయిన; సాలగ్రామంబు= సాలగ్రామం; అను, తీర్థంబు+ఆడి= అనే తీర్థంలో స్నానంచేసి; విష్ణున్+అర్చించియున్= శ్రీ మహావిష్ణువును పూజించియు; అందున్= ఆ సాలగ్రామమనే తీర్థంలో; సన్నిహిత, చతుర్+సముద్రంబు+అయిన= ఒక్కచోటికి దగ్గరగా తేబడిన నాలుగు సముద్రాల జలం కలిగినది అయిన; కూపంబున్+ఆడియు= నూతిలో స్నానంచేసియు; విష్ణులోక గతులు= వైకుంఠానికి వెళ్ళినవారు; అగుదురు= అవుతారు; భరత+ఆశ్రమంబునన్= భరతుడి పేరుమీద వెలసిన ఆశ్రమంలో; చంపక+అరణ్యంబునన్= చంపకం అనే అడవిలో; దేవీ సహితున్= దేవితో కూడిన; ఈశ్వరున్= శివుడిని; పూజించి; మిత్రావరుణలోకంబు= మిత్రావరుణులు ఉండే లోకాన్ని; పడయుదురు= పొందుతారు; కన్యా, సంవేద్యంబు+అను తీర్థంబునన్= కన్యా సంవేద్యం (సంవరణం) అనేతీర్థంలో; కన్యా దానంబు+చేసి= కన్యను తగిన వరుడికి ఇచ్చి పెండ్లిచేసి; అక్షయ, ఫల, ప్రాప్తులు= తరగని పుణ్యం లభించినట్టివారు; అగుదురు= అవుతారు; దేవ, కూటంబు+అను, తీర్థంబు+ఆడి= దేవకూటం అనేతీర్థంలో స్నానంచేసి; బ్రహ్మలోకంబున్= సత్యలోకాన్ని; పడయుదురు= పొందుతారు; ఎందేని= ఏచోట; విశ్వామిత్రుండు; సిద్ధిన్+పొందెన్= తపస్సుయొక్క సంపూర్ణఫలితాన్ని (బ్రహ్మర్షిపదవిని) పొందాడో; అట్టి= ఆ; కౌశికహ్రదంబు+ఆడియున్= కౌశికహ్రదం అనే తీర్థంలో స్నానంచేసియు; కుమార వీర+ఆశ్రమంబునన్= కుమారవీరుడి ఆశ్రమంలో; ఒక్క మాసంబు= ఒక నెల; వసించియున్= ఉండియు; అశ్వమేధ, ఫలంబు+పడయుదురు= అశ్వమేధ పుణ్యం పొందుతారు; అగ్నిధారయున్= అగ్నిధార అనే తీర్థంలోను; పితామహ, సరంబునన్= బ్రహ్మ సరోవరంలో; పుట్టిన; కుమారధారయున్= కుమారధార అనే తీర్థంలోను; ఆడి= స్నానంచేసి; త్రి, రాత్ర+ ఉపవాసంబు+చేసినవారు= మూడురాత్రులు ఉపవాసండున్నవారు; బ్రహ్మ, హత్యా+ఆది, దోష విముక్తులు+అగుదురు= బ్రహ్మహత్య మున్నగు పాపాలనుండి విముక్తి చెందినవారు అవుతారు; గౌరీశిఖర, కుండంబు= గౌరీశిఖరకుండం అనే తీర్థంలో; ఆడినన్= స్నానం చేయగా; నందినీ కూపంబు+ఆడినన్= నందినీకూపంలో స్నానంచేయగా; అశ్వమేధ ఫలంబు+అగున్= అశ్వమేధయాగ పుణ్యం లభిస్తుంది; కాళికా, కౌశికా, సంగమంబునందున్= కాళికానది, కౌశికానది కలిసిన తీర్థంలో; త్రిరాత్ర+ ఉపవాసంబు+చేసినవారు= మూడురాత్రులు అన్నం తినకుండా ఉపవసించినవారు; సర్వపాప విముక్తులు= పాపాలన్నింటినుండి తొలగినవారు; అగుదురు= అవుతారు; ఊర్వశీ తీర్థంబు+ఆడిన= ఊర్వశీతీర్థంలో స్నానం చేసినట్లయితే; సర్వ, పూజా+అర్హులు+అగుదురు= సమస్తపూజలు పొందటానికి యోగ్యత కలవారు అవుతారు; గోకర్ణంబు+అను, తీర్థంబు+ఆడి= గోకర్ణమనే తీర్థంలో స్నానంచేసి; జాతి స్మరణంబు= పూర్వజన్మస్మృతిని, లేదా, తాను ఏజాతికి చెందితే ఆ జాతిని స్మరించటాన్ని; పడయుదురు= పొందుతారు; సరస్వతీ, తీర్థ, స్నాతులు+అయి= సరస్వతీతీర్థంలో స్నానంచేసి; వృషభ ద్వీపంబునన్= వృషభం అనే పేరున్న దీవిలో; కుమారున్= కుమారస్వామిని; పూజించి= ఆరాధించి; దేవ, విమాన, గతులు= దేవతల విమానాలపై పయనించేవారు; అగుదురు= అవుతారు; నందయున్+ఔలకమును, కరతోయంబును, గంగా సాగర సంగమంబున్+అను, తీర్థంబులు+ఆడి= నంద, ఔలకం, కరతోయం, గంగాసాగరసంగమం అనేతీర్థాలలో స్నానంచేసి; శత+అశ్వమేధ, ఫలంబు= నూరు అశ్వమేధయాగాలు చేసినపుణ్యం; పడయుదురు= పొందుతారు; శోణా, నర్మదా, ప్రభవంబును= శోణానది, నర్మదానది పుట్టినచోటులోను; బదరీతీర్థంబును= బదరీ పుణ్యక్షేత్రంలోను; ఆడి= స్నానంచేసి; ఆయుష్మంతులు+ అగుదురు= ఆయుర్దాయం కలవారు అవుతారు; మహేంద్రంబును; రామతీర్థంబును; మతంగ కేదారమ్మును; వంశగుల్మంబును; అను తీర్థంబులన్+ఆడి= అని పిలువబడే తీర్థాలలో స్నానంచేసి; అశ్వమేధఫలంబు+ పడయుదురు= అశ్వమేధయాగం చేస్తే వచ్చే పుణ్యాన్ని పొందుతారు.

తాత్పర్యం: యక్షిణీతీర్థంలో నీటిని త్రాగితే బ్రహ్మహత్య మున్నగు పాతకాలనుండి తొలగుతారు. మణినాగం అనేతీర్థంలో స్నానంచేసినవారిని సర్పాల విషాలు ప్రవేశించవు (వారికి ఏ హానీ చేయజాలవు). గౌతమవనంలోని

అహల్యాహ్రదంలో స్నానంచేస్తే, ఉదపానం అనే తీర్థంలో క్రుంకులిడితే అశ్వమేధం చేసినపుణ్యం లభిస్తుంది. రాజర్షి అయిన జనకుడి పేర వెలసిన జనకకూపంలో స్నానంచేస్తే వైకుంఠప్రాప్తి కలుగుతుంది. కంపన, మహానది, అనేతీర్థాలలో స్నానంచేసినవారు పౌండరీకయాగం చేసిన ఫలితాన్ని పొందుతారు. దేవపుష్కరిణి, మహేశ్వరధార, మహేశ్వర పదం- వీటిలో స్నానంచేసినవారికి అశ్వమేధయాగం చేసిన పుణ్యం లభిస్తుంది. పూర్వకాలంలో ఒకరాక్షసుడు తాబేలురూపంలో కోటితీర్థాలను అపహరించాడు. అప్పుడు విష్ణుదేవుడు ఆ కోటితీర్థాలను తెచ్చి మహేశ్వరపథంలో నిలిపాడు. ఆ తీర్థంలో స్నానం చేస్తే, విష్ణుస్థానమైన సాలగ్రామం అనేతీర్థంలో స్నానంచేసి విష్ణువును పూజిస్తే, అందులో నాలుగు సముద్రాలు చేరిన నూతిలో స్నానంచేస్తే వైకుంఠానికి వెళ్ళుతారు. భరతాశ్రమంలో చంపకారణ్యంలో దేవీసమేతుడైన శివుడిని పూజిస్తే మిత్రావరుణలోకం సిద్ధిస్తుంది. కన్యాసంవేద్యం అనే తీర్థంలో కన్యాదానం చేస్తే అక్షయపుణ్యం లభిస్తుంది. దేవకూటం అనేతీర్థంలో స్నానంచేస్తే సత్యలోకం సిద్ధిస్తుంది. ఎచట విశ్వామిత్రుడు తపస్సిద్ధిని (బ్రహ్మర్షి పదాన్ని) పొందాడో అట్టి కౌశికహ్రదంలో స్నానంచేస్తే, కుమార వీరాశ్రమంలో ఒకనెల నివసిస్తే అశ్వమేధయాగం చేస్తే వచ్చే పుణ్యం లభిస్తుంది. అగ్నిధార అనేతీర్థంలోను, బ్రహ్మసరస్సునుండి పుట్టిన కుమారధార అనే తీర్థంలో స్నానం చేసి, మూడురాత్రులు ఉపవాసం చేసినవారు బ్రహ్మహత్య మున్నగు పాపాలనుండి విముక్తులు అవుతారు. గౌరీ శిఖరకుండంలోను, నందినీకూపంలోను స్నానంచేస్తే అశ్వమేధయాగం చేసినఫలం పొందుతారు; కాళిక, కౌశిక అనే తీర్థాలు కలసిన చోట మూడురాత్రులు ఉపవాసం చేసినవారు పాపాలన్నింటినుండి విముక్తులు కాగలరు. ఊర్వశీతీర్థంలో స్నానంచేసినవారు సమస్తపూజలకు యోగ్యులు అవుతారు. గోకర్ణతీర్థంలో స్నానంచేసిన వారికి జాతిస్మరణం లభిస్తుంది. సరస్వతీతీర్థంలో స్నానంచేసినవారు వృషభద్వీపంలో కుమారస్వామిని అర్చించినవారు దేవతల విమానాలను అధిరోహిస్తారు. నంద, ఔలకం, కరతోయం, గంగాసాగరసంగమం అనే తీర్థాలలో స్నానంచేసినవారు నూరు అశ్వమేధయాగాలు చేసిన పుణ్యాన్ని ఆర్జిస్తారు. శోణానది, నర్మదానది పుట్టినచోట్లో, బదరీతీర్థంలో స్నానం చేసినవారికి ఆయుర్దాయం పెరుగుతుంది. మహేంద్ర, రామతీర్థ, మతంగ కేదార, వంశ గుల్మాలు అనేతీర్థాలలో స్నానంచేసినవారు అశ్వమేధయాగం చేసిన పుణ్యం ఆర్జిస్తారు (సంపాదిస్తారు).

తే. **పరమమైన తీర్థంబు శ్రీపర్వతంబు । నందు దేవహ్రదం బాడి యాదిదేవు**
నీశు నర్చించి వడయుదు రిష్టఫలము । నశ్వమేధఫలంబును నవనిజనులు. **277**

ప్రతిపదార్థం: పరమము+ఐన, తీర్థంబు= మిక్కిలి గొప్పది అయిన పుణ్యక్షేత్రం; శ్రీపర్వతంబు= శ్రీశైలం; అందు= ఆ శ్రీశైలంలో; దేవహ్రదంబు+ఆడి= దేవతల మడుగులో స్నానంచేసి; ఆదిదేవున్= మొదటిదేవుడిని; ఈశున్= శివుడిని; అర్చించి= పూజించి; అవనిజనులు= భూలోకప్రజలు; ఇష్ట, ఫలమున్= కోరిన కోరికలు; అశ్వమేధ ఫలంబునున్= అశ్వమేధయాగం చేసిన పుణ్యాన్ని; పడయుదురు= పొందుతారు.

తాత్పర్యం: పుణ్యక్షేత్రాలలో గొప్పక్షేత్రం శ్రీశైలం. అందు దేవహ్రదం అనేమడుగులో స్నానంచేసి, భూలోకవాసులు ఆదిదేవుడైన శివుడిని పూజించి అభీష్టాలను, అశ్వమేధయాగం చేసినపుణ్యాన్ని ఆర్జిస్తారు.

వ. **తొల్లి శతక్రతుండు నూఱుక్రతువులు సేయుటంజేసి పవిత్రంబయిన కృష్ణవేణియందు దేవహ్రదం బాడిన సర్వపాపవినాశనం బగుఁ; బాండ్యపర్వతంబునం గావేరీతీర్థంబును, దుంగభద్రయు, సముద్రతీర్థంబును, గన్యాతీర్థంబును నాడి యశ్వమేధఫలంబు వడయుదురు; గాయత్రీస్థానంబునం ద్రిరాత్రంబు గాయత్రీజపంబు**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేసినవారికి జన్మదుఃఖంబులు లేవు; పెన్న యను మహానది నాడిన మయూరహంస విమానగతు లగుదురు; గోదావరీ స్నానంబు సేసిన దశాశ్వమేధ ఫలంబు వడయుదురు; పయోష్ణియు, దండకారణ్యంబును, శరభంగాశ్రమంబును, శుక్రాశ్రమంబును, జమదగ్నిసేవితంబయిన శూర్పారకంబును, సప్తగోదావరీ తీర్థంబును నాడిన పుణ్యులు పుణ్యలోకప్రాప్తు లగుదురు. 278

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వకాలంలో; శతక్రతుండు= దేవేంద్రుడు; నూఱుక్రతువులు= వందయజ్ఞాలు; చేయుటన్+చేసి= చేయటంచేత; పవిత్రంబు+అయిన= పరిశుద్ధమైన; కృష్ణవేణి+అందు= కృష్ణవేణిలో ఉండే; దేవహ్రదంబు+ఆడిన= దేవహ్రదంఅనే తీర్థంలో స్నానం చేస్తే; సర్వ, పాప, వినాశనంబు+అగున్= సమస్తదురితాలు నశిస్తాయి; పాండ్య, పర్వతంబునన్= పాండ్యపర్వతంలోని; కావేరీతీర్థంబునున్= కావేరీతీర్థంలోను; తుంగభద్రయు= తుంగభద్రానదిలో; సముద్రతీర్థంబును= సముద్రతీర్థంలోను; కన్యాతీర్థంబును= కన్యాతీర్థంలోను (కన్యాకుమారిదగ్గరిది); ఆడి= స్నానంచేసి; అశ్వమేధ, ఫలంబు= అశ్వమేధయాగం చేసిన పుణ్యం; పడయుదురు= పొందుతారు; గాయత్రీ స్థానంబునన్= గాయత్రీస్థానం అనే తీర్థంలో; త్రిరాత్రంబు= మూడురాత్రులు; గాయత్రీ, జపంబు, చేసినవారికి= గాయత్రీమంత్రాన్ని జపించినవారికి; జన్మ, దుఃఖంబులు= జనన మరణావృత్తులనే దుఃఖాలు; లేవు; పెన్న+అను= పెన్నఅనే; మహానదిన్+ఆడిన= మహానదిలో స్నానంచేస్తే; మయూర, హంస, విమాన, గతులు+అగుదురు= నెమలిఆకారంతో, హంసరూపంతో ఉండే విమానాలపై విహరించేవారు అవుతారు; గోదావరీ స్నానంబు+చేసిన= గోదావరీ మహానదిలో స్నానంచేస్తే; దశ+అశ్వమేధ, ఫలంబు= పది అశ్వమేధయాగాలు చేసిన పుణ్యం; పడయుదురు= పొందుతారు; పయోష్ణియు= పయోష్ణితీర్థంలోను; దండకారణ్యంబును= దండకారణ్యం అనే పేరున్నతీర్థంలోను; శరభంగ+ఆశ్రమంబునున్= శరభంగ మహాముని స్థాపించిన ఆశ్రమంలోను; శుక్ర+ఆశ్రమంబును= శుక్రుడు స్థాపించిన ఆశ్రమంలోను; జమదగ్ని, సేవితంబు+అయిన= జమదగ్ని మహామునిచేత సేవించబడినదైన; శూర్పారకంబును= శూర్పారక క్షేత్రంలోను; సప్తగోదావరీ తీర్థంబునున్= సప్తగోదావరి (దక్షారామ భీమేశ్వరం) తీర్థంలోను; ఆడిన= స్నానంచేసిన; పుణ్యులు= పుణ్యాత్ములు; పుణ్య, లోక, ప్రాప్తులు+అగుదురు= పుణ్యలోకాలు సిద్ధించినవారు అవుతారు.

తాత్పర్యం: పూర్వకాలంలో దేవహ్రదతీర్థంలో దేవేంద్రుడు నూరుయాగాలు చేశాడు కాబట్టి మిగుల పవిత్రమైన కృష్ణవేణిలోని దేవహ్రదంతీర్థంలో స్నానంచేస్తే సమస్తపాపాలు పోతాయి. పాండ్యపర్వతంలోని కావేరీతీర్థంలో, తుంగభద్రలో, సముద్రతీర్థంలోను, ఆ సమీపంలోని కన్యాకుమారీతీర్థంలోను స్నానమాడితే అశ్వమేధయాగం చేసిన పుణ్యం లభిస్తుంది. గాయత్రీస్థానంలో మూడురాత్రులు గాయత్రీమంత్రజపం చేస్తే జన్మరాహిత్యం కలుగుతుంది. పెన్న అనే మహానదిలో స్నానంచేసినవారు నెమలిఆకృతిలో, హంసఆకృతిలో ఉండే విమానాలపై విహరిస్తారు. గోదావరీస్నానం చేస్తే పదిఅశ్వమేధాలు చేసినపుణ్యం దక్కుతుంది. పయోష్ణియు, దండకారణ్యం, శరభంగాశ్రమం, శుక్రాశ్రమం, జమదగ్ని మహాముని సేవించిన శూర్పారకం, దక్షారామ క్షేత్రంలోని సప్త గోదావరీ తీర్థంలోను స్నానం చేసిన పుణ్యాత్ములకు పుణ్యలోకాలు సిద్ధిస్తాయి.

సీ. అసురుల భయమున నడఁగిన వేదంబు । లోంకారపూర్వమై యుండ నాంగి
రసుఁ డుద్ధరించి సారస్వత ప్రముఖులఁ । జదివించె నెందేని శాశ్వతముగ
నమరనియుక్తుఁడై యజియించె నెందేని । భృగుఁ డెల్లవారికిఁ బేర్మి నట్టి
రమణీయతుంగకారణ్యంబు సూచిన । మాత్రన దురితకర్మంబు లెల్లఁ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. బాయుఁ; గాలంజరం బను పర్వతంబు । నందు దేవహ్రదం బాడి యభిమతములు
వడయుదురు; మేధికంబునాఁ బరఁగు తీర్థ । మాడి మేధాసమన్వితు లగుదు రెందు. 279

ప్రతిపదార్థం: అసురుల, భయమునన్= రాక్షసుల భయంచేత; అడఁగిన= అణగిఉండిన; వేదంబులు= వేదాలు; ఓంకార పూర్వము+ఐ, ఉండన్= ఓంకారం మొదలుగా కలవై ఉండగా; ఆంగిరసుఁడు+ఉద్ధరించి= ఆంగిరసుడనే మహాముని కాపాడి; సారస్వత ప్రముఖులన్= సారస్వతుడు మొదలయిన ప్రసిద్ధులచేత; శాశ్వతముగన్= ఎల్లప్పుడు నిలిచేటట్లు; ఎందేని= ఏచోట; చదివించెన్= పఠింపచేశాడో; భృగుఁడు= భృగుమహర్షి; ఎందేని= ఏచోట; అమర, నియుక్తుఁడు+ఐ= దేవతలచేత నియోగించబడిన వాడై; యజియించెన్= యజ్ఞంచేశాడో; పేర్మిన్= గౌరవంతో; అట్టి= అటువంటి చోటైన; రమణీయ తుంగక+అరణ్యంబు= సుందరమైన తుంగకారణ్యం; చూచిన మాత్రన= సందర్శించినంతమాత్రాననే; ఎల్లవారికిన్= అందరికి; దురిత, కర్మంబులు+ ఎల్లన్= పాపపరిపాకాలన్నీ; పాయున్= తొలగుతాయి; కాలంజరంబు+అను, పర్వతంబునందు= కాలంజరం అనే కొండలో; దేవహ్రదంబు+ఆడి= దేవహ్రదంఅనే తీర్థంలో స్నానంచేసి; అభిమతములు= కోరికలు; పడయుదురు= పొందుతారు; మేధికంబునాన్+పరఁగు= మేధికం అనబరగే; తీర్థము+ఆడి= తీర్థంలో స్నానంచేసి; ఎందున్= ఎప్పుడైనను; మేధాసమన్వితులు+ అగుదురు= మేధావులు అవుతారు.

తాత్పర్యం: రాక్షసులవలని భయంచేత అణగిమణగి ఓంకారం మొదలుగా ఉండే వేదాలను ఉద్ధరించి, ఆంగిరసుడు ఎక్కడ సారస్వతుడు మొదలుగా గల ముఖ్యులచేత చదివించాడో, భృగుమహర్షి దేవతలచేత నియోగించబడినవాడై, ఎక్కడయితే యజ్ఞంచేశాడో అట్టి సుందర తుంగకారణ్యాన్ని గౌరవపురస్సరంగా చూచినంతమాత్రాననే పాపపరిపాకాలన్నీ పటాపంచలవుతాయి. కాలంజరమనే పర్వతంలో ఉండే దేవహ్రదంలో స్నానంచేస్తే కోరినకోరికలు ఈడేరుతాయి. మేధికం అనే తీర్థంలో స్నానంచేస్తే మేధావులవుతారు.

వ. మఱి చిత్రకూటంబున మందాకిని సేవించి, పితృస్థానంబునం గుమారులం బూజించి, జ్యేష్ఠస్థానంబున రుద్రు నర్చించి రామనివాసం బైన శృంగిబేరపురంబున గంగాస్నాతు లయి గంగాధరు నర్చించియు సర్వపాప విముక్తు లగుదురు. 280

ప్రతిపదార్థం: మఱి= అదియునుగాక; చిత్రకూటంబునన్= చిత్రకూటంలో; మందాకినిన్= గంగను; సేవించి= దర్శించి; పితృస్థానంబునన్= పితృదేవతలస్థానంలో; కుమారున్= కుమారస్వామిని; పూజించి= అర్చించి; జ్యేష్ఠస్థానంబునన్= అగ్రస్థానంలో; రుద్రున్+అర్చించి= శివుడిని పూజించి; రామ, నివాసంబు+ఐన= శ్రీరామచంద్రుడు నివసించిన; శృంగిబేరపురంబునన్= శృంగిబేరమనే పట్టణంలో; గంగా, స్నాతులు+అయి= గంగలో స్నానంచేసినవారై; గంగాధరున్= శివుడిని; అర్చించియు= పూజించియు; సర్వ, పాప, విముక్తులు+అగుదురు= సకలదురితాలనుండి విముక్తిని పొందినవారు అవుతారు.

తాత్పర్యం: ఇక, చిత్రకూటంలో మందాకినిని సేవించి, పితృస్థానంలో కుమారస్వామిని పూజించి, అగ్రస్థానంలో శివుడిని అర్చించి, శ్రీరామచంద్రుడు ఒకనాడు నివసించిన శృంగిబేరపురంలోని గంగలో స్నానంచేసి శివుడిని అర్చించినవారు పాపాలన్నింటినుండి తొలగుతారు.

క. యాగశతంబులకంటెఁ బ్ర । యాగ నివాసము విశేష మని మునులు మహా
యోగులు సిద్ధులు సాధ్యులు । నాగులు నందుండుదురు మనఃప్రియ మెసఁగన్. 281

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: యాగశతంబులకంటెన్= నూరు యజ్ఞాలకంటె; ప్రయాగనివాసము= ప్రయాగలో నివసించటం; విశేషము+అని= గొప్పది అని; మునులు; మహాయోగులు; సిద్ధులు; సాధ్యులు; నాగులున్; మనస్+ప్రియము+ఎసఁగన్= మనస్సులో సంతోషం అతిశయించగా; అందు+ఉండుదురు= ఆ ప్రయాగలో ఉంటారు.

తాత్పర్యం: యాగాలు నూరు చేయటంకంటె ప్రయాగలో నివసించటమే మేల్తరమని భావించి ఋషులు, యోగీశ్వరులు, సిద్ధులు, సాధ్యులు, నాగులు మదినిండారిన సంతోషంతో అచట ఉంటారు.

వ. అది ప్రజాపతి యజ్ఞవేది గావున నందు మూఁడగ్ని కుండంబు లెప్పుడుఁగానంబడు; మఱి వేదంబులు యజ్ఞంబులు మూర్తిమంతంబులై యఱువదికోట్లపదివేలు తీర్థంబులు సన్నిహితంబులై గంగా యమునా సంగమంబు సేవించియుండు; నందుఁ గృతస్నాను లైనవారు రాజసూయాశ్వమేధులయు సత్యవాదులయుఁ జతుర్వేదాధ్యయనులయుఁ బుణ్యలోకంబులు వడయుదురు; భోగవతియు వాసుకియు హంసవ్రతంబు నను తీర్థంబుల నాడి దశాశ్వమేధఫలంబులు వడయుదురు. 282

ప్రతిపదార్థం: అది= ఆ ప్రయాగ; ప్రజాపతి, యజ్ఞ, వేది= బ్రహ్మదేవుడియొక్క యజ్ఞవేదిక, యజ్ఞం చేసినచోటు; కావునన్= కాబట్టి; అందున్= ఆ ప్రయాగలో; మూఁడు+అగ్ని కుండంబులు= నిప్పురాజుకొనే గుండాలు మూడు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; కానంబడున్= కనిపిస్తాయి; మఱి= అంతేకాక; వేదంబులు= వేదాలు; యజ్ఞంబులు= క్రతువులు; మూర్తి మంతంబులు+ఐ= ఆకారాన్ని దాల్చినట్టివై; అఱువదికోట్లు, పదివేలు తీర్థంబులు= అరవైకోట్ల పదివేల తీర్థాలు; సన్నిహితంబులు+ఐ= కూడిచేరినట్టివై; గంగా, యమునా, సంగమంబు, సేవించి+ఉండున్= గంగాయమునలు కలిసేచోటును ఆరాధిస్తూ ఉంటాయి; అందున్= అచట; కృతస్నానులు+ఐనవారు= స్నానంచేసినవారు; రాజసూయ+అశ్వమేధులయు= రాజసూయయాగం, అశ్వమేధయాగం చేసినవారియొక్క; సత్యవాదులయున్= సత్యాన్ని వ్రతంగా పాటించేవారియొక్క; చతుర్వేద+అధ్యయనులయున్= నాలుగు వేదాలను పఠించేవారియొక్క; పుణ్య, లోకంబులు= పుణ్యంవలన చేకూరే భువనాలు; పడయుదురు= పొందగలరు; భోగవతియు; వాసుకియు; హంసవ్రతంబున్; అను, తీర్థంబులన్+ఆడి= అనే పేర్లు ఉన్న తీర్థాలలో స్నానంచేసి; దశ+అశ్వమేధ, ఫలంబులు= పది అశ్వమేధయాగాలు చేసిన పుణ్యం; పడయుదురు= పొందగలరు.

తాత్పర్యం: ప్రయాగ బ్రహ్మదేవుడి యజ్ఞవేదిక. కాబట్టి అందులో నిరంతరం మూడు అగ్నికుండాలలో త్రేతాగ్నులు వెలుగుతూ కన్పిస్తాయి. అంతేకాక వేదాలు, యజ్ఞాలు సాకారాలై అరవయికోట్ల పదివేల తీర్థాలు కలసి, చేరి, గంగాయమునా సంగమంలో ఆ పవిత్ర తీర్థాన్ని సేవిస్తూ ఉంటాయి. అచట స్నానంచేసినవారు, రాజసూయ అశ్వమేధ యాగాలు చేసినవారికి, సత్యవ్రతాన్ని ఆచరించేవారికి, చతుర్వేదాలను అధ్యయనం చేసేవారికి లభించే పుణ్యలోకాలను పొందగలరు.

క. విదితముగఁ దీర్థకీర్తనఁ । జదివిన ధన్యులకు వినిన సజ్జనులకు న
భ్యుదయ మగు సర్వతీర్థస । ముదయ స్నాన బహుయాగముల ఫలము లగున్. 283

ప్రతిపదార్థం: విదితముగన్= తేటతెల్లంగా; తీర్థకీర్తనన్= తీర్థాలను గురించిన వర్ణనను; చదివిన= పఠించిన; ధన్యులకు= జన్మతరించిన చరితార్థులకు; వినిన= ఆలకించిన; సజ్జనులకున్= మంచివారికి; అభ్యుదయము+అగున్= మేలుకలుగుతుంది; సర్వ, తీర్థ, సముదయ, స్నాన, బహుయాగముల ఫలములు+అగున్= సమస్త తీర్థాల సముదాయంలో స్నానం చేస్తే వచ్చేపుణ్యం, పెక్కు క్రతువులు చేస్తే వచ్చేపుణ్యం లభిస్తాయి.

తాత్పర్యం: తేటతెల్లంగా తీర్థాలను గురించిన వర్ణన చదివినవారూ, ఆలకించినవారూ అయిన ధన్యాత్ములైన సజ్జనులకు మేలు కలుగుతుంది. సమస్తతీర్థాలలో స్నానం చేస్తే వచ్చేపుణ్యం, పెక్కుక్రతువులు చేస్తే వచ్చే పుణ్యం సిద్ధిస్తాయి.

విశేషం: కొన్ని ప్రతులలో ఇక్కడ ఈ క్రింది రెండు పద్యాలు కూడా చోటుచేసికొన్నాయి.

క. **ఇది నిక్కువ మని మనములఁ । బదిలంబుగఁ దీర్థసేవ భక్తిఁ దలఁచినన్**
విదితముగ దురితహర మగు । సదమల సుజ్ఞాను లగుట సత్యము ధరణిన్. **283 (అ)**

క. **సకలదురితముల వాయుదు । రకలంకమనస్కు లగుదు రార్యోత్తమవ**
ర్తకు లగుదురు సజ్జనగుణ । నికరంబుల వెలయుదురు సునిశ్చితమతులై. **283 (ఆ)**

చ. **వ్రతములు లేనివారు, నుపవాస పరాఙ్ముఖు లైనవారు, దు**
ర్మతులు, విహీనశౌచులుఁ గ్రమంబునఁ దీర్థము లాడనోప; రా
తతగుణశాలి వీ వఖిలధర్మవిదుండవు గావునన్ శుభ
స్థితిఁ జని తీర్థసేవనము సేయుము నీకు నభీష్టసిద్ధిగన్. **284**

ప్రతిపదార్థం: వ్రతములు, లేనివారున్= నోములు దీక్షతో నోచనివారున్నూ; ఉపవాస, పరాక్+ముఖులు+ఐనవారు= ఉపవాసాలకు విముఖులైనవారు (ఉపవాసాలు చేయనివారు); దుర్మతులు= చెడుబుద్ధి కలవారు; విహీన శౌచులున్= శుచిత్వం లేనివారు; క్రమంబునన్= శాస్త్రాలలో విధించబడిన పద్ధతిలో; తీర్థములు+ఆడనోపరు= తీర్థాలలో స్నానం చేయజాలరు; ఈవు= నీవు; ఆతత, గుణ, శాలివి= ప్రకాశించే (విస్తారమైన) మంచి గుణాలు కలవాడివి; అఖిల ధర్మవిదుండవు= సమస్తధర్మాలు తెలిసినవాడివి; కావునన్= కాబట్టి; శుభస్థితిన్= మేలు కలిగేటట్లుగా; చని= వెళ్ళి; నీకున్= నీకు; అభీష్ట సిద్ధిగన్= కోరికలు నెరవేరేటట్లుగా; తీర్థసేవనము= పుణ్యతీర్థాలను దర్శించటం; చేయుము= చేసేది.

తాత్పర్యం: వ్రతాలు చేయనివారు; ఉపవాసాలకు విముఖులైనవారు; చెడ్డవారు, శుచిత్వం లేనివారు, తీర్థయాత్రలు చేయలేరు. నీవు లెక్కకు మిక్కిలిగా మంచిగుణాలు కలవాడివి. సర్వధర్మాలను ఎరిగినవాడివి. కాబట్టి తీర్థాలను సేవించటానికై శుభప్రదంగా వెళ్ళిరమ్ము. నీ కోరికలు ఈడేరును గాక!

వ. **అని సకల తీర్థ కథనంబు సెప్పిన, పులస్త్యువచనంబున భీష్ముండు దొల్లి యెల్ల తీర్థంబులు సేవించి కృతార్థుం డయ్యెఁ; గావున నీవును దీర్థసేవ చేసి.** **285**

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; సకల, తీర్థ, కథనంబు+చెప్పిన= అన్ని తీర్థాలను గురించిన సమాచారం వివరించినటువంటి; పులస్త్యువచనంబునన్= పులస్త్య మహాముని మాటచొప్పున; భీష్ముండు= భీష్ముడు; తొల్లి= మునుపు; ఎల్ల, తీర్థంబులు= అన్ని పుణ్యక్షేత్రాలు; సేవించి= దర్శించి; కృత+అర్థుండు+అయ్యెన్= ధన్యుడయ్యాడు; కావున= కాబట్టి; నీవును= ఓ ధర్మరాజా! నీవుకూడా; తీర్థసేవ చేసి= పుణ్యక్షేత్రాలు దర్శించి.

తాత్పర్యం: ఆ విధంగా సర్వపుణ్యతీర్థాల వృత్తాంతం చెప్పిన పులస్త్యమహర్షిమాటచొప్పున భీష్ముడు ఇదివరలో సకలపుణ్యతీర్థాలు సేవించి ధన్యుడయ్యాడు. కాబట్టి నీవుకూడ తీర్థయాత్రలు చేసి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పూరు పురూరవు లట్లు భ। గీరథ రఘుపతుల యట్లు కృతకృత్యుఁడ వై
ధారుణి రక్షింపుము వి। స్తారగుణాధార। ధీర। ధర్మతనూజా! 286

ప్రతిపదార్థం: పూరు, పురూరవులు+అట్లు= పూరుడివలె, పురూరవుడివలె; భగీరథ, రఘుపతుల+అట్లు= భగీరథుడివలెను; రఘురాముడివలెను; కృతకృత్యుఁడవు+ఐ= చేయవలసిన కార్యములను నిర్వర్తించినవాడివై (ధన్యుడివై); విస్తార, గుణ+ఆధార!= విస్తరించిన పెక్కుమంచి గుణాలకు ఆధారమైనవాడా!; ధీర!= ధైర్యవంతుడా!; ధర్మ, తనూజా!= ధర్మపుత్రుడా!; ధారుణిన్= భూమిని; రక్షింపుము= కాపాడుము.

తాత్పర్యం: లెక్కకు మిక్కిలి అయిన సద్గుణాలకు ఆశ్రయమైనవాడా! ధైర్యవంతుడా! ఓ ధర్మరాజా! పూరుడి వలె, పురూరవుడి వలె, భగీరథుడివలె, శ్రీరాముడివలె కర్తవ్యాలను నెరవేర్చినవాడవై ఈ భూమిని కాపాడుము.

విశేషం: పూరువు, పురూరవుడు భరతవంశంలో సుప్రసిద్ధులైన చక్రవర్తులు. భగీరథుడు ప్రగాఢ ప్రయత్నంచేసి గంగను దివినుండి భువికి దింపాడు. శ్రీరామచంద్రుడు రామాయణకథానాయకుడు, సుప్రసిద్ధవీరుడు.

వ. రోమశుం డను దేవర్షి దేవలోకంబుననుండి నీకడకు వచ్చుఁ; దదుపదేశంబున ధౌమ్యానుమతుండ వయి తీర్థసేవనఁ జేయు' మని చెప్పి నారదుం డరిగిన, నజాతశత్రుండు ధౌమ్యుం జూచి యిట్లనియె. 287

ప్రతిపదార్థం: రోమశుండు+అను, దేవర్షి= రోమశుడు అనే దేవలోకానికి చెందిన ఋషి; దేవలోకంబున నుండి= దేవలోకంనుండి; నీకడకున్= నీ దగ్గరికి; వచ్చున్+వస్తాడు; తద్+ఉపదేశంబునన్= ఆతడి ప్రబోధం చొప్పున; ధౌమ్య+అనుమతుండవు+అయి= ధౌమ్యుడిచేత అనుమతి పొందినవాడివయి; తీర్థ, సేవనన్= తీర్థాలను సేవించటం; చేయుము= చేసేది; అని= అంటూ; చెప్పి= వచించి; నారదుండు= నారదమహర్షి; అరిగినన్= వెళ్ళగా; అజాత, శత్రుండు= పుట్టనటువంటి శత్రువులు కలవాడు (ఎవరిపట్లను ద్వేషభావం లేనివాడు, ధర్మరాజు); ధౌమ్యున్+చూచి= తమ పురోహితుడైన ధౌమ్యుడిని చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: రోమశుడు అనే దేవఋషి నీదగ్గరకు వస్తాడు. ఆ మహర్షి ప్రబోధం చొప్పున మీ పురోహితుడైన ధౌమ్యుడి అనుమతిచొప్పున నీవు తీర్థసేవ చేయుము' అని చెప్పి నారదమహర్షి నిష్క్రమించగా అజాతశత్రువైన ధర్మరాజు ధౌమ్యుడిని చూచి ఇట్లా పలికాడు.

చ. 'అలయక మాకు నందఱ కహర్నిశముం బ్రియకారి యైన య
త్యలఘుపరాక్రమాన్వితు మహాభుజు నర్జును దివ్యసాయకం
బులు వడయంగ నొక్కరున పుచ్చితిఁ దద్దయు వేడ్క నెద్దియుం
దలఁపక; యిప్డు దద్విరహితమ్మగు కామ్యక మొప్ప దయ్యెడిన్. 288

ప్రతిపదార్థం: అలయక= విసుగుకొనక; మాకున్+అందఱకు= మాకందరికి; అహర్నిశమున్= పగలు రాత్రియు; ప్రియకారి+ఐన= ప్రీతిని ఘటించేటి; అతి+అలఘు, పరాక్రమ+అన్వితున్= మిక్కిలి తేలికకాని అంటే గొప్పదైన శౌర్యంతో కూడినవాడిని; మహా, భుజున్= గొప్ప భుజాలు కలవాడిని; అర్జునున్= అర్జునుడిని; ఒక్కరున్+అ= ఒక్కడినే; దివ్య, సాయకంబులు= దివ్యమైన బాణాలు; పడయంగన్= పొందటానికి; తద్దయు= మిక్కిలి; వేడ్కన్= కుతూహలంతో; ఎద్దియున్+తలఁపక= ఏదియు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆలోచించక; పుచ్చితిన్= పంపాను; ఇప్డు= ఇపుడు; తద్+విరహితమ్ము+అగు= ఆతడు లేనట్టి; కామ్యకము= ఈ కామ్యకం అనే అరణ్యం; ఒప్పదు+అయ్యెడిన్= (మాకు) ఇష్టంగా లేదు.

తాత్పర్యం: 'మా అందరికి విసుగు విరామం లేకుండ పగలనక రాత్రనక నిరంతరం ప్రీతి ఘటించే మహాపరాక్రమశాలి అయిన అర్జునుడిని దివ్యాస్త్రాలు సంపాదించటానికై గొప్పవేడుకతో ఒంటరిగా పంపించాను. ఇప్పుడు అతడు లేని ఈ కామ్యకవనం మాకు సమ్మతంగా లేదు.

వ. అంబుదాగమనం బపేక్షించు చాతకంబు లట్లు మన మందఱ మర్జునాగమనంబు ప్రతీక్షించుచున్నవారము; వాఁడును దన పూనిన కార్యంబు నిర్వహించి కాని నివృత్తుండు గాఁ; డవశ్యంబును దివ్యాస్త్రంబులు వడసి యాతని వచ్చునంతకుఁ దీర్థసేవ చేయుద' మనినఁ, 'గరంబు లగ్గగు, నట్ల చేయుద' మని. 289

ప్రతిపదార్థం: అంబుద+ఆగమనంబు= మేఘాల రాకను; అపేక్షించు= కోరే; చాతకంబులు+అట్లు= వానకోయిలలవలె; మనము+అందఱము; అర్జున+ఆగమనంబు= అర్జునుడి రాకను; ప్రతీక్షించుచు+ఉన్న వారము= ఎదురు చూస్తున్నవారం; వాఁడును= ఆ అర్జునుడుకూడ; తన, పూనిన, కార్యంబు= తాను పూనినపనిని; నిర్వహించి కాని= నెరవేర్చికాని; నివృత్తుండు+కాఁడు= వెనుకకు మరలేవాడు కాడు; అవశ్యంబును= తప్పకుండ; దివ్య+అస్త్రంబులు= దేవతా సంబంధమైన మంత్ర బాణాలు; పడసి= సంపాదించి; ఆతని వచ్చునంతకున్= ఆతడు తిరిగి వచ్చేవరకు; తీర్థసేవ= పుణ్యక్షేత్రాల సందర్శనం; చేయుదము+అనిన= చేస్తాముగాక అని చెప్పగా; కరంబు= మిక్కిలి; లగ్గు+అగు= మేలు కలుగుతుంది; అట్లు+అ= ఆ విధంగానే; చేయుదము= చేద్దాము గాక; అని= అని చెప్పి.

తాత్పర్యం: మేఘాల రాకకై ఎదురుచూచే చాతకపక్షులవలె మనమందరం అర్జునుడి రాకకై నిరీక్షిస్తున్నాం. అర్జునుడు తాను చేపట్టిన కార్యాన్ని నిర్వహించక వెనుకకు మరలేవాడు కాడు. అర్జునుడు నిస్సందేహంగా దేవతా సంబంధమైన అస్త్రాలను సంపాదించి వస్తాడు. అంతవరకు మనం తీర్థయాత్రలు చేద్దాం'- అని ధర్మరాజు పలుకగా, ధౌమ్యుడు 'నిజమే, మిక్కిలి మేలు కలుగుతుంది. మనమట్లాగే పుణ్యక్షేత్రాలను సందర్శిద్దాం'- అని అన్నాడు.

విశేషం: (1) ప్రాచీన భారతీయ సంస్కృతిలో తీర్థయాత్రలకు కల్పించబడిన ప్రాముఖ్యం నిరుపమానం. తీర్థయాత్రలవలన అశ్వమేధ, రాజసూయయాగఫలం కంఠోక్తిగా చాటి చెప్పబడింది. ప్రయాణ సౌకర్యాలు లేనినాడు యుగయుగాంతరాలనుండి కాశ్మీరంనుండి కన్యాకుమారివరకు నదీనదాలు, పర్వతపంక్తులు, సరోవరాలు, గుహలు, గుట్టలు, పుట్టలు పరమ పవిత్ర హృదయాలతో వెదకుకొంటూ భారతీయులు తీర్థయాత్రలు సలిపారు. దేశాటనమే నిరుపమాన విద్యాభ్యాసం. భారతీయులలో ఐకమత్యం, ఆధ్యాత్మికభావం పెంపొందించటానికి తీర్థాటనం నిర్వహించిన భూమిక చరిత్రాత్మకమైనది. వివిధ ప్రదేశాల ప్రజలు, జిజ్ఞాసువులై తరచు పుణ్యతీర్థాలలో ఆశ్రమాలలో కలియటంచేత అన్యోన్య సాంస్కృతిక సంపర్కంచేత భారతీయ సంస్కృతి విశ్వజనీనమై వెల్లివిరిసింది. (2) చాతకపక్షులు మేఘాలు వర్షించే చినుకులు మాత్రమే త్రాగునట్టివి అని కవిసమయం.

రోమశమహాముని ధర్మరాజునొద్దకు వచ్చుట (సం. 3-89-1)

ఉ. నాలుగుదిక్కులందును వినన్ విదితంబగుచున్న పుణ్యతీ
ర్థాలి తెఱం గెఱుంగఁగ మహాత్ముఁడు ధౌమ్యుఁ డజాతవైరి కం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దోలిన చెప్పుచున్న తఱి నొప్పుగ రోమశుఁ డేఁగుదెంచెఁ దే
జోలలితుండు నిర్మలయశుం డగు ధర్మతనూజుపాలికిన్. 290

ప్రతిపదార్థం: నాలుగు దిక్కులందును= నాలుగు దిశలలోను; వినన్= వినబడుతూ; విదితంబు+అగుచున్న= తెల్లమవుతున్న; పుణ్య, తీర్థ+ఆలి= పుణ్యక్షేత్రాల సముదాయంయొక్క; తెఱంగు= తీరుతీయాలు; ఎఱుంగఁగ= తెలిసేటట్లుగా; మహా+ఆత్ముఁడు= మహానుభావుడు; ధౌమ్యుఁడు= పాండవుల పురోహితుడు; అజాత వైరికిన్= అజాతశత్రువైన ధర్మరాజుకు; అందు= అచట; ఓలిన= వరుసగా; ఒప్పునట్లుగా; చెప్పుచున్న, తఱిన్= వచించే సమయంలో; నిర్మల యశుండు= స్వచ్ఛమైన కీర్తి కలవాడు; అగు= అయిన; ధర్మ, తనూజు, పాలికిన్= ధర్మపుత్రుడి దగ్గరకు; తేజస్+లలితుండు= తేజో లలితుండు= సుకుమారమైన వర్చస్సు కలవాడైన; రోమశుఁడు= రోమశుడనే ముని; ఒప్పుగన్= శోభిల్లేటట్లు; ఏఁగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: మహాత్ముడైన ధౌమ్యుడు నేల నాలుగు చెరగులలో గల తీర్థాలను గురించి క్రమంగా తేటతెల్లంగా అజాతశత్రువైన ధర్మరాజుకు చెపుతూ ఉన్న సమయంలో స్వచ్ఛమైన కీర్తిగల ఆ ధర్మరాజు దగ్గరకు సుకుమారమైన తేజస్సుతో ప్రకాశిస్తున్న రోమశమహర్షి వచ్చాడు.

విశేషం: ధర్మజుడి తీర్థయాత్రలకు ముగ్గురు మహర్షులు తోడు పడటం విశేషం. నారదుడు తీర్థమహిమలను చెప్పి సంకల్పాన్ని కలిగించాడు. ధౌమ్యుడు ధర్మజుడిని ప్రోత్సహించాడు. రోమశుడు వెంటనడిచి తీర్థసేవ చేయించాడు.

వ. ఇట్లు వచ్చిన మహాముని నతిభక్తి ననుజ బ్రాహ్మణ సహితుండై ధర్మజుండు పూజించి 'మునీంద్రా! యెందుండి వచ్చితి?' రని యడిగిన నాతనికి రోమశుం డిట్లనియె. 291

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వచ్చిన= విచ్చేసిన; మహామునిన్= గొప్పఋషిని; ధర్మజుండు; అతి భక్తిన్= మిక్కిలి భక్తితో; అనుజ, బ్రాహ్మణ, సహితుండు+ఐ= తమ్ములతోడను, విప్రులతోడను కూడినవాడై; పూజించి= అర్చించి; ముని+ఇంద్రా!= మునులలో ఇంద్రుడివంటివాడా!; ఎందు+ఉండి= ఎచటనుండి; వచ్చితిరి?= విచ్చేశారు?; అని= అంటూ; అడిగినన్= ప్రశ్నించగా; ఆతనికిన్= ఆ ధర్మరాజుకు; రోమశుండు= రోమశ మహాముని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా తన వద్దకు వేంచేసిన మునిని ధర్మరాజు తానును, తన తమ్ములును, బ్రాహ్మణులును కలిసి మిక్కిలి భక్తితో, అర్చించి 'మునీంద్రా! ఎచటనుండి తాము ఇచటికి దయచేశారు?' అని ప్రశ్నించగా, ధర్మరాజుతో రోమశమహర్షి ఇట్లా చెప్పాడు.

తే. 'ఎల్లలోకంబులును జూచి యింద్రలోక । లోకనార్థినై యే నింద్రలోకమునకుఁ
బోయి సురరాజుచేఁ బ్రీతిఁ బూజితుండ । నై, మహీనాథ! యందు నీ యనుజు ననఘు. 292

ప్రతిపదార్థం: ఎల్ల, లోకంబులును+చూచి= సమస్త భువనాలను సందర్శించి; ఇంద్రలోక, లోకన+అర్థిన్+ఐ= ఇంద్రలోకాన్ని చూడవలెననే కోరిక కలవాడనై; ఏను= నేను; ఇంద్రలోకమునకున్+పోయి= ఇంద్రలోకానికి వెళ్ళి; సురరాజుచేన్= దేవేంద్రుడిచేత; ప్రీతిన్= సంతోషంతో; పూజితుండను+ఐ= అర్చించబడినవాడినై; మహీ, నాథ!= ఓ రాజా!; అందున్= అచట- ఆ స్వర్గంలో; అనఘున్= పాపరహితుడైన; నీ+అనుజున్= నీ తమ్ముడిని (అర్జునుడిని).

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! సమస్తలోకాలను సందర్శించి నేను, ఇంద్రలోకాన్ని చూడాలన్నకోరికకలిగి అక్కడికి వెళ్ళాను. అక్కడ దేవేంద్రుడి పూజలు అందుకొని స్వర్గలోకంలో ఉండే నీ తమ్ముడైన అర్జునుడిని (చూచాను).

ఉ. ఈసున నీశుఁ దొట్టి సురలెల్ల నభీష్టవరంబు లిచ్చుటం
జేసి కృతార్థుఁ డైన కురుసింహము నూర్జితశౌర్యు నర్జునున్
భాసురతేజు విశ్వపరిపాలకుఁ డైన మహేంద్రుతోడ నే
కాసన మెక్కియున్న మహిమాస్పదు నింద్రతనూజుఁ జూచితిన్. **293**

ప్రతిపదార్థం: ఈసునన్= స్పర్ధతో; ఈశున్+తొట్టి= శివుడు మొదలుకొని; సురలు+ఎల్లన్= దేవతలందరును; అభీష్ట, వరంబులు+ఇచ్చుటన్+చేసి= కోరిన వరాలు అనుగ్రహించటంచేత; కృతార్థుడు+ఐన= చరితార్థుడైన; కురు సింహమున్= కురువంశంలో సింహంవంటివాడిని (శ్రేష్ఠుడిని); ఊర్జిత, శౌర్యున్= దృఢమైన, అధికమైన పరాక్రమం కలవాడిని; భాసురతేజున్= శోభిల్లుతున్న తేజస్సు కలవాడిని; విశ్వపరిపాలకుఁడు+ఐన= జగత్తునంతటిని ఏలుతున్న; మహా+ఇంద్రు తోడన్= దేవేంద్రుడితోడ; ఏక+ఆసనము= ఒకే గద్దెను; ఎక్కి+ఉన్న= అధిష్ఠించి ఉన్న; మహిమ+ఆస్పదున్= గొప్పతనానికి నెలవైనవాడిని; ఇంద్రతనూజున్= ఇంద్రుడికొడుకైన; అర్జునున్= అర్జునుడిని; చూచితిన్= చూచాను.

తాత్పర్యం: శివుడు మున్నగు దేవతలందరు స్పర్ధతో, తమలో తాము పోటీపడి అర్జునుడికి కోరిన వరాలు అనుగ్రహించారు. ఆవిధంగా కృతార్థుడైన కురువంశసింహుడు, దేదీప్యమానమైన పరాక్రమంతో వెలుగొందుతూ దేవేంద్రుడి అర్ధాసనం అధివసించి ఉన్న ఇంద్రవరసుతుడూ ఐన అర్జునుడిని స్వర్గంలో సందర్శించాను.

క. బలవంతు లైన భీష్మా । దుల నర్జునుఁ డోర్చు నూర్జితుండై; మఱి పో
రులఁ గర్ణుండు పదారవ । కళకు సమానుండు గాఁడు కవ్వడితోడన్. **294**

ప్రతిపదార్థం: బలవంతులు+ఐన= శక్తి సంపన్నులైన; భీష్మ+ఆదులన్= భీష్ముడు మున్నగువారిని; ఊర్జితుండు+ఐ= అధికమైన పరాక్రమం కలవాడై; అర్జునుఁడు; ఓర్చున్= ఓడిస్తాడు; మఱి= ఇక; పోరులన్= యుద్ధాలలో; కర్ణుండు= కర్ణుడు; కవ్వడితోడన్= (కవ+వడి= కవ్వడి= సవ్యసాచి= రెండు వడులు కలవాడు అంటే రెండు చేతులతో బాణాలను ప్రయోగించగల నేర్పుకలవాడు) అర్జునుడితో; పదారవకళకు= పదారవ అంశకు అంటే పదారుపాళ్ళలో ఒకపాలుకు; సమానుండు+కాఁడు= సరికాడు.

తాత్పర్యం: బలవంతులైన భీష్మాదులను పరాక్రమవంతుడైన అర్జునుడు యుద్ధంలో అవలీలగా జయించగలడు. ఇంక యుద్ధాలలో కర్ణుడు అర్జునుడితో పదారవపాలుకు కూడ సరితూగ జాలడు.

వ. అతని యున్న విలాసంబు సూచి విస్మితుండ నయిన నాకు నింద్రుండు తత్ప్రభావంబు సెప్పి 'వీఁ డమృత సంభవం బయిన పాశుపతం బను దివ్యాస్త్రంబుఁ బరమేశ్వరుచేతను, నాచేతను యమ వరుణ కుబేరాదుల చేతను దివ్యాయుధంబులఁ బడసె; నితండు మనుష్యుండు గాఁడు; దివ్యపురుషుం; డన్యుల కశక్యం బయిన దేవకార్యంబు దీర్చి మసలక వచ్చు నని మర్త్యలోకంబునకుం బోయి భ్రాతృసహితుం డయిన ధర్మరాజునకుం జెప్పు' మనిన వచ్చితి' నని వెండియు నిట్లనియె. **295**

ప్రతిపదార్థం: అతని+ఉన్న, విలాసంబు+చూచి= ఆ అర్జునుడియొక్క మిరుమిట్లు కొలుపుతున్న హొయలు చూచి; విస్మితుండను+అయిన, నాకున్= అచ్చెరువు పొందిన నాకు; ఇంద్రుండు= ఇంద్రుడు; తద్+ప్రభావంబు= ఆతడియొక్క

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గొప్పతనం; చెప్పి; వీఁడు= ఈతడు (ఈ అర్జునుడు); అమృత సంభవంబు+అయిన= అమృతంనుండి పుట్టిన; పాశుపతంబు= పాశుపతం; అను= అనే; దివ్య+అస్త్రంబున్= దివ్యబాణాన్ని; పరమ+ఈశ్వరు చేతను= పరమశివుడిచేతను; నాచేతను; యమ, వరుణ, కుబేర+ఆదులచేతను= యముడు, వరుణుడు, కుబేరుడు, మున్నగువారిచేతను; దివ్య+ఆయుధంబులన్+ పడసెన్= దేవతాసంబంధాలైన మహిమకల ఆయుధాలను (అస్త్రాలను) పొందాడు; ఇతండు= ఇతడు (ఈ అర్జునుడు), మనుష్యుండు= మనుష్యుడు; కాఁడు; దివ్య పురుషుండు= దేవతలకు సంబంధించినవాడు; అన్యులకు= ఇతరులకు; అశక్యంబు+అయిన= సాధ్యం కానట్టి; దేవకార్యంబు+తీర్చి= దేవతల పనులను నెరవేర్చి; మసలక, వచ్చున్= తడయక తిరిగి వస్తాడు; అని= అని చెప్పి; మర్త్యలోకంబునకున్+పోయి= మనుజులుండే భూలోకానికి పోయి; భ్రాతృ సహితుండు+అయిన= తమ్ములతో కూడిన; ధర్మరాజునకున్= ధర్మపుత్రుడికి; చెప్పుము= చెప్పేది; అనినన్= అని చెప్పగా; వచ్చితిన్= వచ్చాను; అని= ఆ విధంగా చెప్పి; వెండియున్= మఱల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: స్వర్గలోకంలో మిరుమిట్లు గొలిపే హొయలుతో దేదీప్యమానంగా వెలుగుతున్న అర్జునుడిని చూచి నేను అచ్చెరువు పొందాను. ఇంద్రుడు అర్జునుడి గొప్పతనాన్ని నాకు వివరిస్తూ 'ఇతడు పరమశివుడి వలన అమృతంనుండి ఉద్భవించిన 'పాశుపతం' అనే దివ్యాస్త్రాన్నీ, నానుండి, యమ వరుణ కుబేరాదులనుండి పెక్కుదివ్యాస్త్రాలనూ సంపాదించాడు. ఇతడు కేవలం మనుష్యమాత్రుడు కాడు, దివ్యపురుషుడు. ఇతరులకు శక్యం కానట్టి దేవతల పనులను నెరవేర్చి, తడయక తిరిగి భూలోకానికి వస్తాడు. నీవు భూలోకానికి వెళ్ళి, తమ్ములతో కూడి ఉన్న ధర్మరాజుకు ఈ విషయం ఎఱిగించుము' అని నన్ను ఆదేశించాడు'- అని రోమశుడు ధర్మరాజుకు చెప్పి మరల ఇట్లా పలికాడు.

క. **'నిరతముగఁ దీర్థసేవా । పరులగు శాంతాత్ములకుఁ దపస్వులకును దు**
ష్కర మెద్దియు లే దని చె । చ్చెర ధర్మజుఁ దీర్థసేవ సేయింపు మొగిన్. 296

ప్రతిపదార్థం: నిరతముగన్= ఎల్లప్పుడును; తీర్థసేవాపరులు+అగు= తీర్థయాత్రలు దీక్షతో చేసేవారు అయిన; శాంత+ఆత్ములకున్= శాంతమైన ప్రవృత్తి కలవారికిన్నీ; తపస్వులకును= తపస్సు చేసే వారికిన్నీ; దుష్కరము= చేయలేనిది; ఎద్దియు= ఏదికూడా; లేదు= ఉండదు; అని= అని చెప్పి; చెచ్చెరన్= శీఘ్రంగా; ధర్మజున్= ధర్మరాజును; తీర్థసేవ= తీర్థయాత్రల సందర్శనం; ఒగిన్= ఒప్పునట్లుగా; చేయింపుము= చేయింపుము.

తాత్పర్యం: (ఈ మాటలు దేవేంద్రుడు రోమశుడితో చెప్పినవి)' దీక్షతో ఎల్లప్పుడు తీర్థయాత్రలు సేవించటంలో నిమగ్నులైన శాంతచిత్తప్రవృత్తి కలవారికి, తపస్సు చేసేవారికి చేయలేనిదంటూ ఏదీ ఉండదు- అని చెప్పి ధర్మరాజును శీఘ్రంగా తీర్థసేవ చేయించుము.

క. **అని పనిచిన నమరేశ్వరు । పనిఁ దత్పార్శ్వమున నుండి పన్నుగ నిట యేఁ**
జనుదెంచితి నీ కార్యము । ధనంజయున కభిమతంబు ధరణీనాథా! 297

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; పనిచినన్= (ఇంద్రుడు) నియోగించగా; అమర+ఈశ్వరు, పనిన్= దేవేంద్రుడి పనిమూలంగా; తద్, పార్శ్వమునన్+ఉండి= ఆతడి ప్రక్కనే ఉండి; పన్నుగన్= పూనికతో; ఇట= ఇచటకు; ఏన్= నేను; చనుదెంచితిన్= వచ్చాను; ధరణీనాథా!= భూమికి అధినేతవైన ఓ ధర్మరాజా!; ఈ, కార్యము= ఈ పని (నేను ఇచటికి వచ్చి మిమ్మల్ని తీర్థయాత్రలు చేయించే పని); ధనంజయునకు= అర్జునుడికి; అభిమతంబు= ఇష్టం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని చెప్పి, నన్ను నియోగించగా, నేను ఇంద్రుడి ఆదేశం చొప్పున ఆతడి దగ్గరనుండి పూనికతో ఇచటికి వచ్చాను. భూమికి అధిపతివైన ఓ ధర్మరాజా! ఈ పని అర్జునుడికి సమ్మతమైనదే సుమా!

క. అనవద్య తీర్థసేవన । మును గపిలా స్వర్ణ దానములు నుగ్రతపం
బును జేయనివానికిఁ బో । లునె పడయఁగఁ బేర్మి నుభయలోకసుఖంబుల్. 298

ప్రతిపదార్థం: అనవద్య, తీర్థ, సేవనమును= నింద్యం కానట్టి పుణ్యక్షేత్రాలను సందర్శించటం; కపిలా, స్వర్ణ దానములును= కపిలవర్ణంకల గోవులనూ, బంగారాన్నీ దానం చేయటం; ఉగ్రతపంబును= తీవ్రమైన తపస్సును; చేయని వానికిన్= (ఈ కార్యాలను) చేయని మనుజుడికి; పేర్మిన్= గౌరవంతో; ఉభయలోక, సుఖంబుల్= ఇహ పరలోకాలలోని సుఖాలను; పడయఁగన్= పొందటానికి; పోలునె= వీలు అవుతుందా?

తాత్పర్యం: పరమపావనమైన తీర్థసేవనం, కపిల గోవులను, బంగారాన్ని దానంచేయటం, తీవ్రమైన తపస్సు - ఈ ఉత్తమ కార్యాలు చేయనివాడికి ఇహపర సౌఖ్యాలు పొందటానికి వీలుకలుగుతుందా?

వ. ఏను దొల్లి భూమిం గల తీర్థంబు లెల్ల నినుమాఱు సూచితి; నిప్పు డింద్రు నియోగంబున నీతోడన వచ్చి యఖిల తీర్థసేవ సేసెద' ననిన ధర్మజుం డతని కిట్లనియె. 299

ప్రతిపదార్థం: ఏను= నేను; తొల్లి= పూర్వం; భూమిన్+కల, తీర్థంబులు+ఎల్లన్= భూమిపై ఉండే పుణ్యక్షేత్రాల తీర్థాల నన్నింటిని; ఇనుమాఱు= రెండుసార్లు; చూచితిన్= సందర్శించాను; ఇప్పుడు= ఈ సమయంలో; ఇంద్రు, నియోగంబునన్= ఇంద్రుడి ఆదేశం చొప్పున; నీతోడన వచ్చి= నీతోడనే అరుదెంచి; అఖిల, తీర్థ, సేవ+చేసెదన్= అన్ని పుణ్యక్షేత్రాలను సందర్శిస్తాను; అనినన్= అని చెప్పగా; ధర్మజుండు= ధర్మతనయుడు; అతనికిన్= ఆ రోమశుడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఇంతకు మునుపే నేను రెండు పర్యాయాలు భూమండలంలో ఉండే పుణ్యక్షేత్రాలను అన్నిటిని సందర్శించి ఉన్నాను. ఇప్పుడు ఇంద్రుడి ఆదేశానుసారంగా నీతోపాటు సకలపుణ్యతీర్థాలను మరొకసారి సందర్శించగలను'- అని రోమశుడు ధర్మరాజుతో చెప్పగా, అతడు రోమశుడితో ఇట్లా వచించాడు.

ఉ. 'నన్నుఁ దలంచి తీర్థగమనం బొనరింపఁగఁ బంచె నట్టె వి
ద్వన్నుత! దేవవల్లభుఁడు; దానఁ గృతార్థుఁడ నైతి; దానిపై
నిన్ను సహాయుఁగాఁ బడసి నెమ్మి నశేషవిశేషతీర్థముల్
పన్నుగఁ జూడఁ గాంచి కడుభవ్యుఁడ నైతి మునీంద్ర! నీదయన్. 300

ప్రతిపదార్థం: విద్వన్+నుత!= విద్వాంసులచేత పొగడబడినవాడా! ఓ రోమశమహర్షీ!; దేవ, వల్లభుఁడు= దేవేంద్రుడు; నన్నున్+తలంచి= నన్ను గురించి ఆలోచించి; తీర్థ, గమనంబు+ఒనరింపఁగన్= తీర్థయాత్రలు చేయటానికై; పంచెన్+అట్టె= నియోగించాడంటే?; దానన్= దానిచే; కృత+అర్థుఁడన్+ఐతి= చరితార్థుడిని అయ్యాను; దానిపైన్= మఱియును; ముని+ఇంద్ర!= మునులలో ఇంద్రుడివంటివాడా!; నిన్ను= నీవంటి (మహానుభావుడిని); సహాయున్+కాన్= తోడ్పడేవాడినిగా; పడసి= పొంది; నెమ్మిన్= ప్రీతితో; అశేష, విశేష. తీర్థముల్= అన్ని గొప్ప పుణ్యక్షేత్రాలను; పన్నుగన్= ఒప్పేటట్లుగా; చూడన్+కాంచి= సందర్శించగలిగి; నీ దయన్= నీ అనుగ్రహంవలన; కడున్= మిక్కిలి; భవ్యుఁడన్= పవిత్రుడిని; ఐతిన్= కాగలిగాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'విద్వాంసులచేత పొగడబడిన ఓ రోమశమహర్షీ! మునులలో శ్రేష్ఠుడవైనవాడా! దేవేంద్రుడంతటివాడు. నన్నుగురించి ఆలోచించి నేను తీర్థయాత్రలు చేయాలని ఆదేశించటంచేత నా జన్మ ధన్యమైనదిగా భావిస్తున్నాను. మరి నీవంటి మహానుభావుడు సహయాత్రికుడై నాకు తోడుపడటం పేర్కొనతగిన పెద్ద విశేషంకదా! ఇక సమస్త పుణ్యక్షేత్రాలు పూనికతో సందర్శించి నీ దయవలన పవిత్రుడిని కాగలను.

ఆ. విజయుకుశలవార్త వేడుక నీచేత । వినినయంతకంటె విస్తరిల్లె;
హృదయసంప్రమోద మీ రెంట నా' కంచుఁ । దద్ద సంతసిల్లె ధర్మసుతుఁడు. 301

ప్రతిపదార్థం: నాకు; నీచేత; విజయు= విజయుడి (అర్జునుడి); కుశలవార్త= క్షేమ సమాచారం; వేడుక= ఆసక్తితో; వినిన+అంతకంటె= విన్నదానికి మించి; ఈ రెంటన్= ఈ రెండింటివలన (అర్జునుడి కుశలవార్త, తీర్థయాత్రలు చేయవలసినదనెడి ఇంద్రుడి ఆదేశం - అనే ఈ రెండింటిచేత); హృదయ సంప్రమోదము= ఎదలో ఆనందం; విస్తరిల్లెన్= అతిశయించినది; అంచున్= అనుచు; ధర్మసుతుఁడు= ధర్మరాజు; తద్ద= ఎంతయు, సంతసిల్లెన్= సంతోషించాడు.

తాత్పర్యం: మీ ద్వారా అర్జునుడి కుశలవార్త వినినందువలన కలిగిన ఆనందం తీర్థయాత్రలు చేయవలసినదనెడి దేవేంద్రుడి ఆదేశంవలన అతిశయించిం'దని- ధర్మరాజు తన సంతోషాతిరేకాన్ని రోమశమహర్షికి వెల్లడించాడు.

వ. 'మునీంద్రా! యేను దొల్లియు నారద ధౌమ్యుల వచనంబులం దీర్థగమనోన్ముఖుండనై యున్నవాఁడ; నిప్పుడు భవన్నిదేశంబునం దీర్థసేవ సేసి కృతార్థుండ నగుదు' నని కృతనిశ్చయుండై భిక్షాభుజు లయిన బ్రాహ్మణులను యతులను రోమశువచనంబున నివర్తించి, ధౌమ్యపురస్కృత కతిపయ బ్రాహ్మణులతో ననుజులుం దానును గృష్ణాసహితుం డయి కామ్యకవనంబున మూఁడుదినంబులు వసియించి మార్గశీర్ష మాసావసానంబునం దీర్థసేవార్థంబు గృతప్రస్థానుం డయిన యుధిష్ఠిరునకు బ్రాహ్మణు లిట్లనిరి. 302

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= మునులలో ఇంద్రుడివంటివాడా! ఓ రోమశమహర్షీ!; ఏను= నేను; తొల్లియు= ఇంతకు మునుపు కూడ; నారద, ధౌమ్యుల, వచనంబులన్= నారదుడు ధౌమ్యుడు చెప్పిన మాటలవలన; తీర్థ, గమన+ఉన్ముఖుండను+ఐ= పుణ్యక్షేత్రాలకు వెళ్ళవలెననే ఉత్సాహంతో; ఉన్నవాఁడన్= ఉన్నాను; ఇప్పుడు= ఈ సమయంలో; భవత్+నిదేశంబునన్= నీ ఆదేశంవలన; తీర్థ, సేవ+చేసి= తీర్థాలను సందర్శించి; కృత+అర్థుండను+అగుదున్= ధన్యుడను కాగలను; అని= అని చెప్పి; కృత నిశ్చయుండు+ఐ= చేయబడిన నిర్ణయం కలవాడై; భిక్షా, భుజులు+అయిన= భిక్షాటనంవలన లభించే ఆహారం తినేవారయిన; బ్రాహ్మణులను; యతులను= సన్న్యాసులను; రోమశు వచనంబునన్= రోమశుడి మాట చొప్పున; నివర్తించి= వెనుకకు వెళ్ళేటట్లు చెప్పి (నిలువుండని పలికి); ధౌమ్య, పురస్కృత, కతిపయ, బ్రాహ్మణులతోన్= ధౌమ్యుడు మున్నగు కొంతమంది బ్రాహ్మణులతో; అనుజులున్+తానును= తమ్ములును, తానును; కృష్ణా, సహితుండు+అయి= ద్రౌపదీ సమేతుడై; కామ్యక, వనంబునన్= కామ్యకమనే అరణ్యంలో; మూఁడు దినంబులు= మూడునాళ్ళు; వసియించి= ఉండి; మార్గ, శీర్ష, మాస+అవసానంబునన్= మార్గశీర్షం అనే నెల చివరి సమయంలో; తీర్థసేవా+అర్థంబు= పుణ్యక్షేత్రాలను సేవించటంకొరకు; కృత, ప్రస్థానుండు+అయిన= చేసిన ప్రయాణం కలవాడైన, అంటే పయనానికి బయలుదేరిన వాడయిన; యుధిష్ఠిరునకున్; బ్రాహ్మణులు; ఇట్లు+అనిరి= ఈ విధంగా పలికారు.

తాత్పర్యం: 'మునిశ్రేష్ఠుడవైన ఓ రోమశా! నేను ఇంతకుమునుపే నారదుడు ధౌమ్యుడు చెప్పినమాటలవలన తీర్థయాత్రలు చేయటానికై ఉవ్విళ్ళూరాను. ఇంతలో ఇప్పుడు నీ ప్రోత్సాహం లభించింది. ఇక పుణ్యక్షేత్రాలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దర్శించి ధన్యుడనవుతాను' అని నిశ్చయించి, భిక్షాటనం చేసి ఆహారం స్వీకరించే విప్రులను, సన్న్యాసులను రోమశుడి ఆదేశం చొప్పున వెనుకకు మరలించి, ధౌమ్యుడు మున్నగు కొద్దిమంది బ్రాహ్మణులతోపాటు, ద్రౌపదితో, తమ్ములతో పుణ్యతీర్థసేవలకై కామ్యకవనంలో మూడుదినాలు ఉండి, మార్గశీర్షమాసంచివర తీర్థయాత్రలకు బయలుదేరిన ధర్మరాజుతో బ్రాహ్మణులు ఈ విధంగా పలికారు.

ఉ. 'నీ యనుజుల్ ధనుర్ధరు లనింద్యచరిత్రులు దీర్ఘతీక్ష్ణకౌ
క్షేయకపాణు లత్యమలకీర్తులు గావఁగ రోమశుండు తే
జోయుతుఁ డెల్లతీర్థములుఁ జూపఁగఁ దీర్థము లాడువేడ్క ల
క్ష్మీయుత! యిప్డు ని న్ననుగమింపఁగఁ గంటిమి పుణ్యసంపదన్. 303

ప్రతిపదార్థం: లక్ష్మీయుత!= సంపదతో కూడుకొన్నవాడా!; నీ+అనుజుల్= నీ తమ్ములు; ధనుస్+ధరులు= విల్లు ధరించేవారు (అంటే ఆయుధధారులైన వీరులు అనిఅర్థం); అనింద్య, చరిత్రులు= పవిత్రమైన ప్రవర్తన కలవారు; దీర్ఘ, తీక్ష్ణ కౌక్షేయక, పాణులు= నిడివి, వాడి కల కత్తులు తాల్చినవారు; (కౌక్షేయకము= కుక్షి అంటే పొట్టకు ఉంచుకొనే కత్తి); అతి+అమల, కీర్తులు= మిక్కిలి నిర్మలమైన కీర్తి కలవారు; కావఁగన్= కాపాడుతుండగా; తేజోయుతుఁడు= వర్చస్సుతో కూడినవాడు; రోమశుండు= రోమశమహర్షి; ఎల్ల, తీర్థములున్+చూపఁగన్= తీర్థాలన్నింటిని దర్శింప చేస్తూఉండగా; పుణ్యసంపదన్= మా పుణ్య పరిపాకం చేత; ఇప్డు= ఇప్పుడు; తీర్థములు+ఆడు, వేడ్కన్= ఆయా పుణ్యతీర్థాలలో స్నానం చేసే కుతూహలం చేత; నిన్ను; అనుగమింపఁగన్+కంటిమి= అనుసరించగల్గితిమి (నీ వెంట తీర్థయాత్రలకు రాగలుగుతున్నాం.)

తాత్పర్యం: 'నీ తమ్ములు ధనుర్విద్యలో ఆరితేరినవీరులు. పవిత్రమైన ప్రవర్తన కలవారు. నిడివి, వాడిమి కల కత్తులు ధరించేవారు. నిర్మలమైన కీర్తి కలవారు. అటు వారు రక్షిస్తూ ఉండగా, తేజస్వి అయిన రోమశుడు మార్గదర్శకుడయి సకల పుణ్యక్షేత్రాలను దర్శింపచేస్తూ ఉండగా నీవెంట రావటం పుణ్యాసంపదవలన మాకు సమకూడిన అదృష్టం.

వ. రాక్షసపిశాచశ్వాపదంబుల కారణంబున నడవులలో నేకతంబ యరిగి తీర్థసేవ చేయ మాయట్టివారికి నశక్యంబు గావున మీతోడ వచ్చెద' మని బ్రాహ్మణులు ధర్మరాజుచేత ననుజ్ఞాతు లై రంత. 304

ప్రతిపదార్థం: రాక్షస, పిశాచ, శ్వాపదంబుల, కారణంబునన్= రాక్షసులు, పిశాచాలు, క్రూరజంతువులు తిరుగుతుండే కారణంగా; అడవులలోన్= అరణ్యాలలో; ఏకతంబు+అ= ఒంటరిగా; అరిగి= వెళ్ళి; తీర్థ, సేవ, చేయన్= పుణ్యక్షేత్రాలను సందర్శించటం; మా+అట్టి వారికిన్= మాబోటివారికి; అశక్యంబు= సాధ్యం కాదు; కావున= కాబట్టి; మీతోడ, వచ్చెదము+అని= మీతోపాటుగా మేమూ వస్తామని; బ్రాహ్మణులు; ధర్మరాజుచేతన్; అనుజ్ఞాతులు+ఐరి= అనుమతిని పొందారు; అంతన్= అటుపిమ్మట.

తాత్పర్యం: రాక్షసులు, పిశాచాలు, క్రూరజంతువులు సంచరిస్తూ ఉంటాయి కాబట్టి అడవులలో మావంటివారు ఒంటరిగా తీర్థయాత్రలు చేయటం సాధ్యం కాదు. కాబట్టి మేము మీతోపాటు వస్తాం'- అని విప్రులు అర్థించగా ధర్మరాజు సమ్మతించాడు. అప్పుడు.

క. పారాశర్యుఁడు బర్వత । నారదులును బాండురాజనందనుల గుణో
దారుల ననఘులఁ దీర్థ । ప్రారంభులఁ గానవచ్చి పరమప్రీతిన్. 305

ప్రతిపదార్థం: పారాశర్యుఁడున్= పరాశరుడి కుమారుడైన వ్యాసుడున్నూ; పర్వత, నారదులును; గుణ+ఉదారులన్= మంచిగుణాలచేత గాంభీర్యం పెంచుకొన్నవారిని; అనఘులన్= పాప రహితులైన పవిత్రులను; తీర్థ, ప్రారంభులన్= తీర్థయాత్రలకు ఉపక్రమించినవారిని; పాండురాజ, నందనులన్= పాండవులను; పరమప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; కానవచ్చి= చూడటానికి వచ్చి.

తాత్పర్యం: పరాశరమహర్షిపుత్రుడైన వేదవ్యాసుడు, పర్వత నారదులు మంచిగుణాలచేత గొప్పవారుగా పేరుకెక్కిన వారు, పవిత్రులు, తీర్థయాత్రలకు వెళ్ళటం ప్రారంభించినవారు అయిన పాండవులను మిక్కిలి సంతోషంతో చూడవచ్చి.

క. వారలచేఁ బూజితులై । భూరి తపోధనులు లోకపూజ్యులు ధర్మ
ప్రారంభనిత్యమతులకు । వారల కిట్లనిరి సత్యవచనులు గరుణన్. 306

ప్రతిపదార్థం: వారలచేన్= ఆ పాండవులచేత; పూజితులు+ఐ= అర్చించబడినవారై; భూరి, తపస్+ధనులు= విస్తారమైన తపస్సు ధనంగా కలవారు; లోక పూజ్యులు= లోకాలచేత పూజించబడేవారు; సత్య వచనులు= నిజం మాటాడేవారు; కరుణన్= దయతో; ధర్మ, ప్రారంభ, నిత్య, మతులకున్= ధర్మంతోకూడిన యత్నాన్నే నిత్యం ఆలోచించేవారికి; వారలకున్= ఆ పాండవులకు; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: విస్తారమైన తపస్సే ధనంగా కలవారు, లోకాలచేత పూజించబడేవారు, సత్యసంధులు అయిన ఆ మహర్షులు, ధర్మం ఆచరించటంలోనే నిత్యమగు ఆలోచన కలవారైన ఆ పాండవులచేత అర్చించబడినవారై దయతో వారలకు ఈ విధంగా చెప్పారు.

వ. 'శారీరనియమంబులు మానుష వ్రతంబు లనంబడు; మనోబుద్ధి శౌచంబులు దేవవ్రతంబు లనంబడు; నట్టి సౌమ్యవ్రత విశేషంబులు సలుపుచు ఋజుమార్గులరై తీర్థంబులు సేవించునది; తీర్థాభిగమనంబున మహాభిష నాభాగ భరత భగీరథ ముచుకుంద మాంధాతృ సగర సార్వభౌమాష్టక రోమపాదుల యట్ల శత్రుజయంబును సర్వలోకసుఖంబులు వడయుదు' రని చెప్పి మునివరులు మువ్వు రరిగి; రంత నజాతశత్రుండు రోమశున కిట్లనియె. 307

ప్రతిపదార్థం: శారీర, నియమంబులు= దేహానికి సంబంధించిన కట్టుబాట్లు (విధి నిషేధాలు); మానుష, వ్రతంబులు= మనుజులకు సంబంధించిన నోములు; అనంబడున్= అని చెప్పబడతాయి; మనస్+బుద్ధి, శౌచంబులు= మనస్సుకు బుద్ధికి సంబంధించిన నిర్మలత్వం; దేవవ్రతంబులు= దివ్యత్వానికి సంబంధించిన నోములు; అనంబడున్= అని చెప్పబడతాయి; అట్టి= అటువంటి; సౌమ్య, వ్రత, విశేషంబులు= మంచి నోములను ఎన్నుకొని; సలుపుచు= జరుపుతూ; ఋజు, మార్గులరు+ఐ= ఏ లోపం లేని పవిత్రమైన దారిలో ప్రవర్తిస్తూ ఉన్నవారై; తీర్థంబులు= పుణ్యక్షేత్రాలు; సేవించునది= దర్శించేది; తీర్థ+ అభిగమనంబునన్= పుణ్యక్షేత్రాలకు యాత్రచేయటంవల్ల వెళ్ళి; మహాభిష, నాభాగ, భరత, భగీరథ, ముచుకుంద, మాంధాతృ, సగర, సార్వభౌమ+అష్టక, రోమ పాదుల+అట్ల= మహాభిషుడు, నాభాగుడు, భరతుడు, భగీరథుడు, ముచుకుందుడు, మాంధాత, సగరుడు, సార్వభౌముడు, అష్టకుడు, రోమపాదుడు అనే పదిమంది సార్వభౌములవలె; శత్రు, జయంబును= విరోధులపై విజయాన్ని; (అరిషడ్వర్గాలను జయించటమున్నూ); సర్వలోక, సుఖంబులు= సమస్తలోకాలలోని సుఖాలను; పడయుదురు= పొందగలరు; అని= అంటూ; చెప్పి= పలికి; మునివరులు= మునిశ్రేష్ఠులు; మువ్వురు= ముగ్గురు (పర్వత, నారద, వ్యాసులు); అరిగిరి= వెళ్ళారు; అంతన్= అటుపిమ్మట; అజాతశత్రుండు= ధర్మరాజు; రోమశునకు= రోమశమహర్షికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'దేహానికి సంబంధించిన నియమాలు మానుషవ్రతాలు. మనస్సును, బుద్ధిని శుచిగా ఉంచేవి దేవవ్రతాలు. అటువంటి మృదుత్వం గలిగిన నోములను (వ్రతాలను) మాత్రమే ఆచరిస్తూ, తిన్నని నడవడి కలవారై తీర్థయాత్రలు చేయండి. పుణ్యక్షేత్రాలను సందర్శించటంలో ప్రసిద్ధికెక్కిన పదిమంది సార్వభౌములు- మహాభిషుడు, నాభాగుడు, భరతుడు, భగీరథుడు, ముచుకుందుడు, మాంధాత, సగరుడు, సార్వభౌముడు, అష్టకుడు, రోమపాదుడు అనే పూర్వచక్రవర్తులవలె సమస్త లోకాలలోని సుఖాలు పొందండి' అని చెప్పి మునివరేణ్యులు ముగ్గురు- నారద, పర్వత వ్యాసమహర్షులు- వెళ్ళారు. అప్పుడు ధర్మరాజు రోమశుడితో ఇట్లా పలికాడు.

క. 'ధరణి నధార్మికులగు కా । పురుషుల కభివర్ధనంబుఁ బుణ్యచరిత్రం
బరఁగెడు ధార్మికులకు దు । ర్ధర మగు నవివర్ధనంబుఁ దగునె మునీంద్రా! 308

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= ఋషులలో ఇంద్రుడివంటివాడా!; ధరిణిన్= భూలోకంలో; అధార్మికులు+అగు= ధర్మంలేనివారైన; కాపురుషులకు= చెడ్డ మనుజులకు; అభివర్ధనంబున్= అభివృద్ధియు; పుణ్యచరిత్రన్+పరఁగెడు= పవిత్రమైన ప్రవర్తనతో జీవితం గడిపే; ధార్మికులకు= ధర్మాత్ములకు, దుర్ధరము+అగు= భరించరాని; అవివర్ధనంబున్= పతనమును (అభివృద్ధి లేకపోవటం); తగునె= న్యాయమా?

తాత్పర్యం: 'ఓ రోమశమహర్షీ! భూలోకంలో అధర్మపరులైన దుర్జనులకు అభివృద్ధి కలుగుతున్నది. అంతేకాక, పవిత్రచరిత్రులు ధర్మాత్ములు అయిన మంచివారికి భరించరాని కష్టాలు దాపురిస్తున్నవి. ఇది ఏమి న్యాయం?

విశేషం: సముద్రగంభీరుడైన ధర్మరాజు హృదయంలో బడబాగ్నివలె ఎల్లప్పుడు దహించే ప్రశ్న ఇది. ఇది పఠితల మనసులలో కూడ వెలుగొందే ప్రశ్న. ఈ ప్రశ్నకు సమాధానమే ధర్మరాజు ధర్మచరిత్రలోని రహస్యం.

వ. మఱియు నచేతనంబు లయ్యును గిరిసరిత్ సరోవరంబులు పుణ్యతీర్థంబులై జగత్పావనంబులై జనులకు దురితాపహరణంబు లైన కారణం బేమి?' యని యడిగిన నతనికి రోమశుం డిట్లనియె. 309

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక; అచేతనంబులు+అయ్యును= ప్రాణం లేనట్టివి అయినప్పటికిన్నీ; గిరి, సరిత్, సరోవరంబులు= కొండలు, నదులు, సరస్సులు; పుణ్యతీర్థంబులు+ఐ= పుణ్యాన్ని ఒసగే క్షేత్రాలై; జగత్, పావనంబులు+ఐ= లోకంలోని ప్రజలను పవిత్రులను చేసేవై; జనులకు= మనుష్యులకు; దురిత+అపహరణంబులు+ఐన= పాపాలను తొలగించేవైన; కారణంబు+ఏమి= హేతువేమి?; అని= అంటూ; అడిగినన్= ప్రశ్నవేయగా; అతనికిన్= ఆ ధర్మరాజుకు; రోమశుండు= రోమశ మహర్షి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అంతేకాక, ప్రాణాలు లేనట్టివి అయినప్పటికిని కొండలు, నదులు, సరస్సులు పుణ్యతీర్థాలై ఏకారణంచేత పాపాలను తొలగించి, మనుష్యులను పవిత్రులనుగా చేయగలుగుతున్నాయి?' - అని ధర్మరాజు రోమశమహర్షిని ప్రశ్నించాడు.

రోమశుండు ధర్మరాజునకు ధర్మవిశేషంబులు సెప్పుట (సం. 3-92-1)

చ. 'వసుధ నధర్మవర్తు లగు వారల వర్ధన మెన్నడున్ సమం
జసమయి నిల్వనేరదు; భృశంబుగ నాశము వొందు; దుర్మద

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యసను లధర్మవర్తనఁ బ్రవర్ధితు లయ్యును నేము చూడ రా
క్షసులును దైత్యదానవులుఁ గ్రాఁగరె తొల్లి సహస్రసంఖ్యలన్. 310

ప్రతిపదార్థం: వసుధన్= భూమిలో; అధర్మ, వర్తులు+అగు= అధర్మ ప్రవర్తన కలవారయిన; వారల= వారియొక్క; వర్ధనము= అభివృద్ధి; ఎన్నడున్= ఎప్పటికిని; సమంజసము+అయి= తగినదై (మంచిదై); నిల్వనేరదు= స్థిరంగా ఉండదు; భృశంబుగ= తప్పకుండగా; నాశము+పొందు= నశిస్తుంది; దుర్మదవ్యసనులు= చెడుగర్వంతో చెడుపనులు చేసేవారు; అధర్మవర్తనన్= అధర్మంగా నడవటంచేత; ప్రవర్ధితులు+అయ్యునున్= అభివృద్ధి చెందినప్పటికిని; ఏము, చూడన్= మేం చూస్తుండగానే; రాక్షసులును, దైత్య, దానవులున్= పలు తెగలకు చెందినరాక్షసులును; తొల్లి= పూర్వం; సహస్ర సంఖ్యలన్= వేలకొలదిగా; క్రాఁగరె= నశించలేదా.

తాత్పర్యం: 'భూమిపై అధర్మప్రవర్తన కలవారి అభివృద్ధి స్థిరంగా ఎంతోకాలం నిలువనేరదు. తప్పకుండా నాశనమై పోతుంది. ఇక, మా కన్నులముందే ఎందరో రాక్షసులు చెడుగర్వంతో చెలరేగి దుర్మార్గులై ప్రవర్తించి అభివృద్ధి చెందినవారు వేలకువేలు నశించిపోలేదా?

క. **దేవతలు ధర్మవర్తులు। గావున నభివృద్ధిఁ బొంది ఘన మగు నిత్య**
శ్రీవిభవాన్వితు లయి ధర। ణీవల్లభ! యున్నవారు నిరుపమశక్తిన్. 311

ప్రతిపదార్థం: ధరణీ, వల్లభ!= భూమికి పతి అయిన ఓ ధర్మరాజా!; దేవతలు= స్వర్గలోకవాసులు; ధర్మవర్తులు= ధర్మాన్ని పాటించే ప్రవర్తన కలవారు; కావునన్= కాబట్టి; అభివృద్ధిన్= అభ్యుదయాన్ని; పొంది= సంపాదించి; ఘనము+అగు= గొప్పదైన; నిత్య, శ్రీ, విభవ+అన్వితులు+అయి= నిత్యకల్యాణశోభతో కూడినవారయి; నిరుపమ, శక్తిన్= సాటిలేని బలంతో; ఉన్నవారు= ఉన్నారు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! దేవతలు ధర్మప్రవర్తన కలవారు కావున అభివృద్ధి పొంది నిత్యకల్యాణశోభతో, సాటిలేని బలంతో విలసిల్లుతున్నారు.

క. **ధర్మసుత! ధార్తరాష్ట్రుల। ధార్మికులై పెటిఁగి రేనిఁ దడయక విధి చే**
నిర్మూలితు లగుదురు దు। ష్కర్మంబున నసురు లట్ల కడు నస్థిరులై. 312

ప్రతిపదార్థం: ధర్మసుత!= ఓ ధర్మపుత్రా!; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుడి కుమారులు; అధార్మికులు+ఐ= అధర్మ ప్రవర్తన కలవారై; పెటిఁగిరి+ఏనిన్= అభివృద్ధి చెందినప్పటికిని; దుష్కర్మంబునన్= చెడుపనులవలన; అసురులు+అట్ల= రాక్షసులవలె; కడున్= మిక్కిలి; అస్థిరులు+ఐ= నిలకడ లేనివారై; విధిచే= బ్రహ్మదేవుడిచేత; తడయక= ఆలస్యం కాకుండ; నిర్మూలితులు+ అగుదురు= నాశనం చేయబడినవారు అవుతారు.

తాత్పర్యం: ఓ ధర్మపుత్రా! ధృతరాష్ట్రుడి కొడుకులు అధర్మప్రవర్తనచేత నేడు పెంపు పొందినప్పటికీ, వారు చేసే చెడ్డ పనుల ఫలితంగా రాక్షసులవలె అనతికాలంలో విధిచే నాశనం కావించబడతారు సుమా!

వ. **అది యెట్లనిన నధర్మవర్తులయందు దర్పంబు పుట్టు; దర్పంబువలన మానంబు పుట్టు; మానంబువలనఁ గ్రోధంబు పుట్టుఁ; గ్రోధంబు వలనంజేసి లజ్జయు వృత్తంబునుం జెడు; నష్టలజ్జావృత్తులయినవారి నుపశమంబును లక్ష్మియు విడుచు. 313**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అది= అది, అంటే అధర్మపరులపతనం; ఎట్లు+అనినన్= ఏ విధంగా జరుగుతుంది అనే ప్రశ్న వేస్తే; అధర్మవర్తుల+అందున్= అధర్మంగా నడిచేవారిలో; దర్పంబు+పుట్టున్= గర్వం ఉదయిస్తుంది; దర్పంబు వలనన్= గర్వంవలన; మానంబు= మమకారం, స్వాభిమానం; పుట్టున్= ఏర్పడుతుంది; మానంబువలనన్= స్వాభిమానంవలన; క్రోధంబు+పుట్టున్= కోపం ఏర్పడుతుంది; క్రోధంబు వలనన్+చేసి= కోపంచేత; లజ్జయు= సిగ్గును; వృత్తంబున్= ప్రవర్తనమున్నూ; చెడున్= చెడిపోతాయి; నష్ట, లజ్జా, వృత్తులు+అయినవారిన్= పోయిన సిగ్గు, నడవడిక కలవారయినవారిని; ఉపశమంబును= నిగ్రహమున్నూ; లక్ష్మియు= శోభయు (సంపదయు)న్నూ; విడుచున్= విడిచిపెట్టుతాయి.

తాత్పర్యం: అధర్మపరులపతనం ఏవిధంగా దాపురిస్తుంది? అని ప్రశ్నవేస్తే సమాధానం ఇది: అధర్మ ప్రవర్తన కలవారిలో గర్వం ఉద్భవిస్తుంది. గర్వంవలన స్వాభిమానం ఏర్పడుతుంది. స్వాభిమానంవలన కోపం ఉదయిస్తుంది. కోపంవలన సిగ్గుపోతుంది, నడవడిక చెడుతుంది. సిగ్గున్నూ, సత్ప్రవర్తనమున్నూ లేనివారిని నిగ్రహం, శోభ (సంపద) విడిచిపెడతాయి.

క. మీ రమరసదృశులరు ధ । ర్మారంభవిశిష్టమతుల రగుటను సుచిర
శ్రీరమ్యు లగుదు రాజి; జి । తారాతుల రగుదు రుద్ధతాహవములలోన్. 314

ప్రతిపదార్థం: మీరు+అమర, సదృశులరు= మీరు దేవతలతో సమానులు; ధర్మ+ఆరంభ, విశిష్ట, మతులరు= ధర్మమార్గంలో పురుషకారం నెరపటానికి ప్రత్యేకమైన ఆలోచన కలవారు; అగుటను= అవటంచేత; ఆజిన్= యుద్ధంలో; సు, చిర, శ్రీ, రమ్యులు+అగుదురు= మిక్కిలి ప్రకాశమానమైన శోభచేత అందగించేవారు అవుతారు; ఉద్ధత+ఆహవములలోన్= ఘోరయుద్ధాలలో; జిత+అరాతులరు= జయించబడిన శత్రువులు కలవారు అంటే శత్రువులను జయించినవారు; అగుదురు= అవుతారు.

తాత్పర్యం: మీరు దేవతలతో సమానులు. ధర్మం కల పనులలో మాత్రమే పురుషకారం నెరపటానికి ఇష్టపడేవారు. అందువల్ల యుద్ధంలో దేదీప్యమానమైన శోభతో విలసిల్లుతారు. ఘోరయుద్ధంలో శత్రువులను జయిస్తారు.

వ. ధర్మవర్తులైన దేవతలు ఋషులు నాశ్రయించుటం జేసి తీర్థంబులు పవిత్రంబులై సర్వకామప్రదంబులై వర్తిల్లు చుండుఁ; దీర్థసేవను గ్రతువులను దానంబులను బ్రాహ్మణుల దీవనలను జనులు సర్వదుఃఖవిముక్తులయి శ్రేయఃప్రాప్తు లగుదు' రని చెప్పిన నమ్మునివరునివలన నొండు ధర్మస్థితులు వించుఁబాండవు లరిగి నైమిశంబు, నశ్వతీర్థంబును, గంగాఘోషంబును, గన్యాతీర్థంబును, గోమతియును, బాహుదయును, మహానదియును, దేవ యజనం బయిన ప్రయాగయు, గంగా యమునా సంగమంబును నాడి, యందు బ్రాహ్మణులకు గో హిరణ్య దానంబులుసేసి, ప్రయాగం గొన్ని దినంబు లుండి, వేద విదులయిన బ్రాహ్మణులవలన వేదార్థంబు లెఱుంగుచుఁ జని, యనేక పుణ్యనదీసముద్భవం బయిన గయపర్వతంబును, రామసరంబును, బ్రహ్మసరంబును, వైవస్వత తీర్థంబునుం జూచి, గయయందు నక్షయవటంబున నార్షేయం బైన విధానంబునం జాతుర్మాస్యక్రతువులు సేసి, ఋషులవలనం బుణ్యకథలు వినుచున్న యవసరంబున శమఠుండను మహాముని ధర్మరాజున కిట్లనియె. 315

ప్రతిపదార్థం: ధర్మవర్తు లైన, దేవతలు, ఋషులున్+ఆశ్రయించుటన్+చేసి= ధర్మంతో ప్రవర్తించే దేవతలున్నూ మునులున్నూ ఆరాధించటం (ఆశ్రయించటం) చేత; తీర్థంబులు= పుణ్యక్షేత్రాలు, తీర్థాలు; పవిత్రంబులు+ఐ= పావనాలై; సర్వ, కామ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రదంబులు+ఐ= కోరికలు అన్నింటిని ఒనగూర్చేవై; వర్తిల్లుచుండున్= విలసిల్లుతుంటాయి; తీర్థసేవను= పుణ్యక్షేత్రాలను, తీర్థాలను సేవించటంచేత; క్రతువులను= యజ్ఞాలను చేయటంచేత; దానంబులను= దానాలు చేయటంచేత; బ్రాహ్మణుల దీవనలను= విప్రుల ఆశీస్సులచేత; జనులు= ప్రజలు; సర్వ, దుఃఖ, విముక్తులు+ఐ= సకల పరితాపాలనుండి తొలగించబడినవారై; శ్రేయస్+ప్రాప్తులు= మేలును పొందేవారు; అగుదురు+అని, చెప్పినన్= అవుతారని చెప్పగా; ఆ+ముని, వరుని, వలనన్= ఆ మునిశ్రేష్ఠుడివలన; ఒండు= వేరు; ధర్మస్థితులు= ధర్మం గురించిన విషయాలు, వించున్= వింటూ; పాండవులు= పాండురాజు కొడుకులు; అరిగి= వెళ్ళి; నైమిశంబున్= నైమిశంలోను; అశ్వ తీర్థంబున్= అశ్వతీర్థంలోను; గంగా ఘోషంబును= గంగా ఘోషం అనే క్షేత్రంలోను; కన్యాతీర్థంబును= కన్యాతీర్థంలోను; గోమతియును= గోమతీనదిలోను; బాహుదయును= బాహుదా నదిలోను; మహానదియును= మహానదిలోను; దేవ, యజనంబు+అయిన= దేవతలు యజ్ఞంచేసిన చోటు అయిన; ప్రయాగయు= ప్రయాగలోను; గంగా, యమునా, సంగమంబును= గంగయు, యమునయు కలిసే స్థలంలోను; ఆడి= స్నానాలు చేసి; అందున్= అచట; బ్రాహ్మణులకున్= విప్రులకు; గో, హిరణ్య, దానంబులు+చేసి= ఆవులను, బంగారాన్ని దానంచేసి; ప్రయాగన్= ప్రయాగలో; కొన్ని, దినంబులు+ఉండి= కొన్నాళ్ళు నివసించి; వేద, విదులు+అయిన= వేదాలను తెలిసినట్టి; బ్రాహ్మణుల వలనన్= విప్రులనుండి; వేద+అర్థంబులు= వేదాల భావాలను; ఎఱుంగుచున్= తెలిసికొంటూ; చని= వెళ్ళి; అనేక, పుణ్య, నదీ, సముద్భవంబు+అయిన= పెక్కు పుణ్యనదులు పుట్టిన చోటైన; గయ పర్వతంబును= గయుడి పేరుమీద వెలసిన కొండను; రామసరంబును= రామసరస్సును; బ్రహ్మ, సరంబును= బ్రహ్మసరస్సును; వైవస్వత, తీర్థంబును= వైవస్వతుడిపేరుపై వెలసిన తీర్థాన్ని; చూచి= సందర్శించి; గయ+అందున్= గయలో; అక్షయ, వటంబునన్= నశించని మఱ్ఱిచెట్టు దగ్గర; ఆర్షేయంబు+ఐన, విధానంబునన్= ఋషులు నిర్దేశించిన పద్ధతిలో; చాతుర్మాస్య, క్రతువులు+చేసి= నాలుగు మాసాలు జరిగే యజ్ఞాలు చేసి; ఋషుల వలనన్= మునులనుండి; పుణ్యకథలు= పుణ్యాన్ని ఇచ్చే ఆఖ్యానాలు; వినుచున్న+అవసరంబునన్= వింటున్న సమయంలో; శమఠుండు= శమఠుడు; అను, మహాముని= అనే గొప్పఋషి; ధర్మరాజునకు= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ధర్మాత్ములైన దేవతలూ, ఋషులూ ఆశ్రయించటంవలన పుణ్యక్షేత్రాలు పవిత్రాలై అన్ని కోరికలను ఈడేర్చే మహిమ కలవై ఉన్నాయి. తీర్థయాత్రలవలన, యజ్ఞాలవలన, విప్రుల ఆశీస్సులవలన, జనులు పరితాపాలు నశించి మేలు పొందుతారు' - అని రోమశుడు ధర్మరాజుతో చెప్పాడు. పాండవులు ఆ మునివలన వేరు వేరు ధర్మ సూక్ష్మాలు తెలిసికొంటూ, పయనించి నైమిశం, అశ్వతీర్థం, గంగాఘోషం, కన్యాతీర్థం, గోమతి, బాహుద, మహానది, దేవతలు యజ్ఞం చేసిన ప్రయాగ, గంగాయమునాసంగమం- అనే తీర్థాలలో స్నానంచేసి, ప్రయాగలో కొన్నాళ్లు నివసించి, వేదవేత్తలయిన విప్రులవలన వేదాలలోని పరమార్థాలను తెలిసికొని, ప్రయణాలు చేసి, పెక్కు పుణ్యనదుల పుట్టినచోటైన గయపర్వతాన్ని, రామసరస్సునూ, బ్రహ్మసరస్సునూ, వైవస్వతతీర్థాన్ని, చూచి గయలో అక్షయవటంలో ఋషులు నిర్ణయించిన పద్ధతిలో నాలుగు నెలలు పట్టే యజ్ఞాలుచేసి, ఋషులవలన పుణ్యం ఇచ్చే కథలు వింటున్న సమయంలో శమఠుడనే ఋషి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

సీ. **'సరవి నాధూతరజః ప్రియపుత్త్రుండు । గయుఁ డను రాజర్షి క్రతువు లిందు**
బ్రహ్మసరంబునఁ బరఁగంగ మును చేసె; । నాతని యజ్ఞంబులందు సకల
జనభుక్తశేషాన్నశైలంబు లిరువది । యేనగు సంఖ్య దా నెఱుఁగ నయ్యెఁ;
దత్కృతక్రతుబహుదక్షిణాసంఖ్యయు । నుడు సికతా సంఖ్యయును నెఱుంగఁ

ఆ. గాదు జనుల; కట్టి గయునామమున గయ । యనఁగఁ బుణ్యతీర్థ మయ్యె నిదియుఁ;
బితృహితార్థ మిందుఁ బిండప్రదానంబు । సేయఁ గనిన నిష్టసిద్ధి గలుగు'. 316

ప్రతిపదార్థం: సరవిన్= వరుసగా; ఆధూతరజః+ప్రియ, పుత్త్రుండు= ఆధూతరజుడనే వాడియొక్క అనుగు కొడుకు; గయుఁడు+అను, రాజ+ఋషి= గయుడనే రాజర్షి (రాజున్నూ ఋషియున్నూ ఐనవాడు); క్రతువులు= యజ్ఞాలు; ఇందు= ఇక్కడ; బ్రహ్మసరంబునన్= బ్రహ్మ సరస్సులో; పరఁగంగన్= ఒప్పునట్లుగా; మును= పూర్వం; చేసెన్= సలిపాడు; ఆతనిన్= గయుడి; యజ్ఞంబులందు= యజ్ఞాలలో; సకల, జన, భుక్త, శేష+అన్న, శైలంబులు= సర్వప్రజలచేత తినగా మిగిలిన అన్నమనే కొండలు; ఇరువది+ఏను+అగు, సంఖ్య= ఇరవైఅయిదు సంఖ్య; తాన్+ఎఱుఁగన్+అయ్యెన్= తనకు తెలిసినట్టిదయినవి; తద్+కృత, క్రతు, బహుదక్షిణా సంఖ్యయున్= ఆతడు చేసిన యజ్ఞాలలో ఇయ్యబడిన పెక్కు దక్షిణల మొత్తం; ఉడు, సికతా, సంఖ్యయును= నక్షత్రాలయొక్క, ఇసుక రేణువులయొక్క మొత్తమును; జనులకు= ప్రజలకు; ఎఱుఁగన్+కాదు= తెలియటం శక్యంకాదు; అట్టి= అటువంటి; గయు, నామమునన్= గయుడి పేరుమీద; గయ+అనఁగన్= గయ అనబడేటట్లుగా; పుణ్య, తీర్థము+అయ్యెన్= పుణ్యతీర్థం అయింది; ఇదియున్= ఈ గయాక్షేత్రం; పితృ, హిత+అర్థము= పితృదేవతల ప్రీతికొరకు; ఇందున్= ఇచట; పిండప్రదానంబు= పిండాలను దానంచేయటం; చేయన్+కనినన్= చేయగలిగితే; ఇష్ట, సిద్ధి+కలుగున్= కోరిన కోరికలు నెరవేరుతాయి.

తాత్పర్యం: 'ఆధూతరజుడి అనుగుకొడుకు గయుడనే రాజర్షి ఇచట బ్రహ్మసరస్సులో పూర్వం చేసిన యజ్ఞాలలో ప్రజలు తినగా శేషించిన (మిగిలిన) అన్నం ఇరువదిఅయిదు కొండలుగా గుట్టపడింది. ఆ యజ్ఞాలలో గయుడు ఇచ్చిన దక్షిణలసంఖ్యను, నక్షత్రాలసంఖ్యను, ఇసుకరేణువులసంఖ్యను జనులెవ్వరూ తెలిసికొనజాలరు. ఆ గయుడి పేరుమీద విలసిల్లింది ఈ గయాక్షేత్రం. గయాక్షేత్రం పితృదేవతలకు మిక్కిలి ప్రీతిపాత్రమయింది. ఇచట పిండప్రదానం చేసినవారికి కోరినకోరికలు ఈడేరుతాయి.'

విశేషం: 'సరవి నాధూతరజఃప్రియపుత్త్రుండు'' అనేదానికి సంస్కృతమూలం "శమఠోఽకథయ ద్రాజ న్నాధూర్తరజసం'' (భండార్కరుప్రతి). దీనికి పెక్కు పాఠాంతరాలు ఉన్నాయి. "శమఠోఽకథయ ద్రాజ న్నామూర్తరయసం గయం'' (3-93-16). తెలుగులో "అనఘుం డమూర్తరయఃప్రియ పుత్త్రుండు'' అనే పాఠాంతరం ఉన్నది. ఇక్కడ 'ఆధూత రజఃప్రియపుత్త్రుండు' అనే పాఠం గ్రహించబడింది. ఆమూర్త రజస్+ప్రియ, పుత్త్రుండు అనేటప్పుడు గయుడి తండ్రిపేరు ఆ మూర్తరజుఁడు=రజోగుణం మూర్తీభవించినవాడు అనేఅర్థం సుసంగతం.

వ. అని చెప్పిన శమఠువలన గయామాహాత్మ్యంబు విని యగస్త్యాశ్రమంబున కరిగి; రంత ధర్మరాజు రోమశున కిట్లనియె. 317

ప్రతిపదార్థం: అని, చెప్పిన= అంటూ చెప్పగా; శమఠువలన= శమఠుడు అనే మునినుండి; గయా, మాహాత్మ్యంబు= గయాక్షేత్రంయొక్క మహిమ; విని= ఆలకించి; అగస్త్య+ఆశ్రమంబునకు= అగస్త్య మహాముని ఆశ్రమానికి; అరిగిరి= వెళ్ళారు; అంత= అంతట; ధర్మరాజు= ధర్మపుత్త్రుడు; రోమశునకు= రోమశుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: శమఠుడనే మహర్షి గయామాహాత్మ్యాన్ని ధర్మరాజుకు వినిపించాడు. పిమ్మట వారందరు అగస్త్యాశ్రమానికి వెళ్ళారు. అచట ధర్మరాజు రోమశుడితో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మధ్యాక్కర.

'వాతాపి యనువాని నెట్లు సంపె సద్వంద్యుఁ డగస్త్యుఁ?
డాతతతేజో౽ధికుండు నా విందు నమ్మునినాథుఁ;
బ్రీతిని దచ్చరితంబు వినఁగ నభీష్ట మిం' దనిన
నాతని కిట్లని చెప్పె రోమశుం డన్ముని పేర్మి. 318

ప్రతిపదార్థం: వాతాపి+అనువానిన్= వాతాపి అనే వాడిని; సత్+వంద్యుఁడు= మంచివారిచేత నమస్కరించ దగినవాడు, అగస్త్యుఁడు; ఎట్లు+చంపెన్= ఏవిధంగా సంహరించాడు; ఆ+ముని, నాథున్= మునులకు అధిపతి అయిన ఆ అగస్త్యుడిని గురించి; ఆతత, తేజస్+అధికుండు, నాన్= విస్తారమైన వర్చస్సుచేత గొప్పవాడు అనగా; విందున్= వింటూ ఉంటాను; ఇందున్= ఇచట; ప్రీతిని= అనురాగంతో; తత్+చరితంబు= ఆతని చరిత్ర; వినఁగన్= వినాలనే; అభీష్టము= కోరిక; అనినన్= అని అనగా; ఆతనికి (ధర్మరాజుకు); రోమశుండు= రోమశుడు; అన్+ముని= అనే ఋషి; పేర్మిన్= గౌరవంతో; ఇట్లు+అని, చెప్పెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'అగస్త్యమహర్షి వాతాపిని ఏ విధంగా చంపాడు? అగస్త్యమహర్షి సజ్జనులచేత నమస్కరించతగినవాడనిన్నీ, విస్తారమైన తేజస్సుతో వెలుగొందే మహానుభావుడనిన్నీ విని ఉన్నాను. ప్రీతితో ఆ మునీంద్రుడి చరిత్ర ఇచట వినాలని ఉన్నది'- అని అన్న ధర్మరాజుతో రోమశమహర్షి గౌరవపురస్సరంగా ఇట్లా పలికాడు.

విశేషం: వృత్తలక్షణానికి ఈ ఆశ్వాసంలోని 22వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.

క. 'వీతభయుఁ డిల్వలుండును । వాతాపియు ననఁగఁ బరఁగు వరదైత్యులు వి
ఖ్యాతబలులు వసియింతు ర । రాతిహరుల్ మణిమతీపురంబున నొప్పన్. 319

ప్రతిపదార్థం: వీతభయుఁడు= పోయిన భయం కలవాడు - అంటే నిర్భయుడు, భయంలేనివాడు; ఇల్వలుండును= ఇల్వలుడనే వాడును; వాతాపియున్; అనఁగన్+పరఁగు= అనే పేరులతో పిలువబడే; వరదైత్యులు= గొప్ప రాక్షసులు (వరాలు పొందిన రాక్షసులు); విఖ్యాత, బలులు= సుప్రసిద్ధమైన బలవంతులు; అరాతి హరుల్= శత్రువులను చంపేవారు; మణిమతీ పురంబునన్= మణిమతి అనే పట్టణంలో; ఒప్పన్= శోభాయమానంగా; వసియింతురు= నివసిస్తారు.

తాత్పర్యం: 'సుప్రసిద్ధ బలవంతులు, శత్రుసంహారులు, నిర్భయులు అయిన ఇల్వలుడు, వాతాపి అనే రాక్షసులు మణిమతీపురంలో వైభవోపేతంగా నివసిస్తూ ఉన్నారు.

వ. అం దగ్రజుం డయిన యిల్వలుం డొక్కబ్రాహ్మణు నతిభక్తి నర్చించి, 'నాకు సకలకామసిద్ధికరం బగు మంత్రం బుపదేశించు' మని ప్రార్థించి విఫలప్రార్థనుండై యలిగి తన తమ్ముఁ గామరూపధరు వాతాపి నపుడు మేష రూపంబు సేసి వధియించి వాని మాంసం బిమ్ముగా వండించి దాని నా విప్రునకుఁ గుడువం బెట్టించి. 320

ప్రతిపదార్థం: అందు= (ఇల్వల వాతాపులలో); అగ్రజుండు+అయిన= మొదట పుట్టిన అన్నగారయిన; ఇల్వలుండు= ఇల్వలుడు; ఒక్క బ్రాహ్మణున్= ఒకానొక విప్రుడిని; అతి భక్తిన్= మిక్కిలి పూజ్యభావంతో; అర్చించి= ఆరాధించి; నాకున్; సకల, కామసిద్ధికరంబు+అగు= సమస్తమైన కోరికలు ఫలించేటట్లు చేసే మంత్రంబు; ఉపదేశించుము= చెప్పుము; అని=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంటూ; ప్రార్థించి= వేడి; విఫల ప్రార్థనుండు+ఐ= నెరవేరని కోరిక కలవాడై; అరిగి= వెళ్ళి; తన, తమ్మున్= తన తమ్ముడిని; కామరూప ధరున్= ఇష్టమైన ఆకారం ధరించే మహిమ కలవాడిని; వాతాపిన్= వాతాపిని; అపుడు; మేషరూపంబు+చేసి= మేక ఆకారం కలవాడినిగా చేసి; వధియించి= చంపి; వాని, మాంసంబు= ఆతడి మాంసాన్ని; ఇమ్ముగాన్= బాగుగా; వండించి= పచనం చేయించి; దానిన్= ఆ వండిన మాంసాన్ని; ఆ+విప్రునకున్= ఆ బ్రాహ్మణుడికి; కుడువన్+పెట్టించి= తినటానికి పెట్టించి.

తాత్పర్యం: వారిలో అన్నగారు ఇల్వలుడు. అతడు ఒకనాడు ఒక విప్రుడిని భక్తితో పూజించి 'నాకు సమస్తమైన కోరికలు ఈడేరేటటువంటి మంత్రాన్ని ఉపదేశించండి' అని ప్రార్థించాడు. కాని ఆ విప్రుడు అటువంటి మంత్రోపదేశం చేయకపోవటంచేత మరలిపోయి, కామరూపుడైన తన తమ్ముడు వాతాపిని మేకగా మార్చి, ఆ మేక మాంసం వండించి ఆ బ్రాహ్మణుడికి విందుచేశాడు.

తే. **విప్రుకడుపులో నున్న యవ్వీరు ననుజుఁ। బిలిచె 'వాతాపి! ర' మ్మని ప్రియముతోడ;**
జీవితుం డయి వాఁడు చెచ్చెరను విప్రు। కడుపు వ్రచ్చుచు వెలువడి క్రాఁచె విప్రు. **321**

ప్రతిపదార్థం: విప్రు, కడుపు లోన్+ఉన్న= బ్రాహ్మణుడి పొట్టలో ఉన్న; ఆ+వీరున్+ఆ వీరుడిని; అనుజున్= తమ్ముడిని; వాతాపి= ఓ వాతాపీ!; రమ్ము+అని= రావలసిందని; ప్రియముతోడన్= ప్రీతితోడ; పిలిచెన్= పిలిచాడు; వాఁడు= అతడు (ఆ వాతాపి); జీవితుండు+అయి= బ్రతికినట్టివాడయి; చెచ్చెరను= శీఘ్రంగా; విప్రు కడుపు= బ్రాహ్మణుడి పొట్టను; వ్రచ్చుచున్= చీలుస్తూ; వెలువడి= బయటకువచ్చి; విప్రున్= బ్రాహ్మణుడిని; క్రాఁచెన్= చంపాడు.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణుడి పొట్టలో ఉండే ఆ వీరుడిని 'ఓ వాతాపీ! రమ్ము' అని ఇల్వలుడు ప్రీతితో పిలిచాడు. ఆ వాతాపి బ్రతికి శీఘ్రంగా ఆ బ్రాహ్మణుడి పొట్ట చీలుస్తూ బయటికి వచ్చి, ఆ బ్రాహ్మణుని చంపాడు.

వ. **అది మొదలుగా నిల్వలుండు దనకడకు నతిథులై వచ్చు విప్రుల నప్పాట నంతకుపురంబున కతిథులం జేయుచున్నంత; నట నగస్త్యుండు బ్రహ్మచర్యాశ్రమంబునం బెద్దకాలం బుగ్రతపంబు సేయుచు వనంబునఁ బరిభ్రమించు వాఁ డొక్క సల్లకీపల్లవంబున నధోముఖులై వ్రేలుచున్న తన పితరులం జూచి' యివ్విధంబున మీ రున్న కారణం బేమి?' యని యడిగినఁ బితరు లిట్లనిరి.** **322**

ప్రతిపదార్థం: అది, మొదలుగాన్= బ్రాహ్మణుడి హత్య చేయటం మొదలుగా; ఇల్వలుండు; తన, కడకున్= తన దగ్గరికి; అతిథులు+ఐ, వచ్చు= అతిథులుగా వచ్చే; (తిథి చూచికొనకుండ ప్రయాణం చేసి భోజనంకొరకు పరగృహం చేరెడివాడు న+తిథి= తిథిలేనివాడు); విప్రులన్= బ్రాహ్మణులను; ఆ+పాటన్= ఆ రీతిగా; అంతకు, పురంబునకున్= యముడి నగరానికి; అతిథులన్+చేయుచున్నంతన్= అతిథులుగా పంపిస్తూఉండగా; అటన్= అక్కడ; అగస్త్యుండు= అగస్త్య మహాముని; బ్రహ్మచర్య+ఆశ్రమంబునన్= వివాహం చేసికొనకుండ (స్త్రీ సంపర్కం లేకుండ) జ్ఞాన సముపార్జనకై తపోనిష్ఠలో ఉండి; పెద్దకాలంబు= చాలాకాలం; ఉగ్ర, తపంబు+చేయుచున్= కఠినమైన తపస్సు సలుపుతూ; వనంబునన్= అడవిలో; పరిభ్రమించు వాఁడు= తిరుగాడేవాడు; ఒక్క= ఒక; సల్లకీ పల్లవంబునన్= అందుగుచెట్టుచిగురుకు; అధో, ముఖులు+ఐ= తలక్రిందుగా; వ్రేలుచున్న= వ్రేలాడుతున్న; తన, పితరులన్+చూచి= తన పితృదేవతలను చూచి; ఈ+విధంబునన్= ఈ రీతిగా; మీరు+ఉన్న, కారణంబు+ఏమి= మీరు ఉండటానికి కల హేతువు ఏమిటి?; అని= అంటూ; అడిగినన్= ప్రశ్నించగా; పితరులు= పితృదేవతలు; ఇట్లు+అనిరి= ఇట్లా చెప్పారు.

తాత్పర్యం: అప్పటినుండి ఇల్వలుడు తనకడకు అతిథులుగా వచ్చే విప్రులను అదేవిధంగా యముడి పురానికి అతిథులుగా పంపుతుండేవాడు. అప్పుడు అచట బ్రహ్మచర్యదీక్షతో కఠోరతపస్సు చేస్తూ అడవిలో తిరుగుతుండే అగస్త్యమహాముని ఒకనాడు అందుగుచెట్టు చిగురుటాకుకు ఆధారంగా చేసికొని తలక్రిందులుగా వ్రేలాడుతున్న తన పితృదేవతలను చూచి 'ఈ విధంగా మీరు ఉండటానికి కారణం ఏమి?' టని వారిని ప్రశ్నించాడు. అంత పితరులు ఈ విధంగా సమాధానం చెప్పారు.

తే. 'అయ్య! యేము నీ పితరుల; మధికనిష్ఠ। బ్రహ్మచారివై నీవు తపంబు సేయు
చున్నవాఁడవు సంతతి నొల్ల; కదియ। కారణంబుగ మా కూర్ధ్వగతియు లేదు. 323

ప్రతిపదార్థం: అయ్య!= నాయనా!; ఏము= మేము; నీ, పితరులము= నీ పితృదేవతలం; నీవు; సంతతిన్+ఒల్లక= సంతానాన్ని ఇచ్చగించక; బ్రహ్మచారివి+ఐ= వివాహం చేసికొనక ఉన్న జిజ్ఞాసువువై; అధికనిష్ఠన్= ఎక్కువదీక్షతో; తపంబు= తపస్సు; చేయుచున్న వాఁడవు= చేస్తున్నవాడివి; అదియ= అదియే; కారణంబుగన్= హేతువుగా; మాకు+ఊర్ధ్వగతియు; లేదు= మాకు ఉత్తమలోకాల ప్రాప్తి లేదు.

తాత్పర్యం: 'నాయనా! మేము నీ పితృదేవతలం. నీవు సంతానాన్ని ఒల్లక గొప్ప నిష్ఠతో బ్రహ్మచర్యం పాటిస్తూ తపస్సు చేస్తున్నావు కదా! అదే కారణంచేత నీ పితరులమైన మాకు ఉత్తమగతులు లేకపోయాయి.

వ. ఇంకనైనను నీవు వివాహంబై సంతానంబు వడసిన మాకుఁ బుణ్యగతి వడయ నగు' ననిన 'నట్ల చేయుదు' నని యగస్త్యుండు తన తపశ్శక్తింజేసి పుత్త్రకాముండైన విదర్భరాజున కొక్కకూఁతుం బుట్టించిన నది లోపాముద్ర యను నామంబుతో జలంబులయందు నలినియుంబోలె వినీతునందు లక్ష్మియుంబోలె నుద్యుక్తునందు విద్యయుం బోలెఁ బెరిఁగి యౌవనంబు దాల్చి రూపవతియై వయోరూపంబుల ననురూప లయిన కన్యకా శతంబుతో నొప్పుచున్నంత. 324

ప్రతిపదార్థం: ఇంకను+ఐనను= ఇకపైనైనా; నీవు; వివాహంబు+ఐ= పెండ్లి చేసికొని; సంతానంబు+పడసిన= సంతతిని కంటే; మాకున్= నీ పితరులమైన మాకు; పుణ్యగతి= పుణ్యలోకం; పడయన్+అగున్+అనినన్= పొందటానికి వీలవుతుందని అనగా; అట్లు+అ= ఆ విధంగానే; చేయుదును+అని= చేస్తానని; అగస్త్యుండు= అగస్త్యుడు; తన, తపస్+శక్తిన్= తన తపస్సుయొక్క మహిమచేత; పుత్త్ర కాముండు+ఐన= పుత్ర సంతానం కోరుకొంటున్న; విదర్భ, రాజునకున్= విదర్భదేశాన్ని ఏలుతున్న ప్రభువుకు; ఒక్క, కూఁతున్+పుట్టించినన్= ఒక కూతురు పుట్టేటట్లు చేయగా; అది= ఆమె; లోపాముద్ర+అను, నామంబుతో= లోపాముద్ర అనేపేరుతో; జలంబుల+అందు= నీటిలో; నళినియున్+పోలె= తామరపుష్పం వలె; వినీతు+అందు= మంచి శీలం కలవాడిపట్ల; లక్ష్మియున్+పోలెన్= ఐశ్వర్యం వలె; ఉద్యుక్తు+అందున్= ప్రయత్నం చేయటానికి ఉత్సహించే వాడిపట్ల; విద్యయున్+పోలె= చదువు వలె; పెరిఁగి= అభ్యున్నతి చెంది; యౌవనంబు+తాల్చి= పడుచుదనంపేర్మి కలిగి; రూపవతి+ఐ= అందగత్తె అయి; వయస్+రూపంబులన్= వయస్సులోను, రూపంలోను; అనురూపలు+అయిన= ఈడు జోడు కుదిరిన; కన్యకాశతంబుతోన్= నూర్గురు పడుచు పిల్లలతో; ఒప్పుచు+ఉన్నంతన్= విలసిల్లుతుండగా.

తాత్పర్యం: ఇకనైన నీవు పెండ్లి చేసికొని సంతానాన్ని కంటే మాకు పుణ్యగతి లభిస్తుంది' - అని పితరులు చెప్పగా, అగస్త్యుడు అట్లాగే చేస్తానని చెప్పాడు. అటుపై సంతానాన్ని కోరుతున్న విదర్భరాజుకు అగస్త్యుడు తన తపస్సుయొక్క మహిమచేత ఒక కూతురును పుట్టించాడు. ఆమెపేరు లోపాముద్ర. ఆ రాజపుత్రిక నీటిలో పద్మంవలె, వినీతుడి

పట్ల లక్ష్మివలె, పరిశ్రమ చేసేవాడిపట్ల విద్యవలె, దినదినాభివృద్ధి చెందింది. ఆమె యౌవనవతి అయి, ఈడు జోడు కుదిరిన నూర్గురుకన్యలు చెలికత్తెలుగా కొలుస్తుంటే మిక్కిలి శోభిల్లుతూ ఉండింది.

విశేషం: అలం: ఉపమ.

క. తరుణి నగస్త్యుభయంబున । వరియింపఁగ నోడి రాజవరులు మనోజా
తురు లగుచుండిరి; తగియెడు । వరు రోయుచునుండె సుతకు వైదర్భుండున్. 325

ప్రతిపదార్థం: తరుణిన్= యౌవనవతి అయిన లోపాముద్రను; అగస్త్యు భయంబునన్= అగస్త్యుడి పట్ల భీతితో; రాజవరులు= రాజశ్రేష్ఠులు అయిన పెండ్లి కొడుకులు; వరియింపఁగన్+ఓడి= పెండ్లాడటానికి ముందుకు రాలేక; మనస్+జ+ఆతురులు= మన్మథుడిచేత పీడించబడినవారు; అగుచుండిరి; వైదర్భుండున్= విదర్భరాజుకూడ; సుతకున్= కూతురికి; తగియెడు వరున్= సరిపోయే పెండ్లికొడుకును; రోయుచున్+ఉండెన్= వెదకుతూ ఉన్నాడు.

తాత్పర్యం: యౌవనవతి అయిన ఆ లోపాముద్రను అగస్త్యుడి వలని భీతిచేత పెండ్లాడటానికి ముందుకు రాలేక రాకుమారులు మన్మథతాపంతో వెత చెందుతూ ఉండిపోయారు. విదర్భరాజు కూడ తన పుత్రికకు తగిన వరుడికై అన్వేషిస్తూ ఉన్నాడు.

వ. అంత నగస్త్యుండు విదర్భరాజుపాలికి వచ్చి 'నాకు లోపాముద్ర నిచ్చునది' యనిన, విదర్భేశ్వరుండు తన తనూజ నమ్ముని కీ నోపక మనంబున ననుతాపించి యక్కన్యకం జూచి యాత్మగతంబున. 326

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; అగస్త్యుండు= అగస్త్యుడు; విదర్భరాజు పాలికిన్= విదర్భ నేలే ప్రభువు కడకు; వచ్చి; నాకు; లోపాముద్రను; ఇచ్చునది= ఇచ్చిపెండ్లి చేసేది; అనినన్= అని అడుగగా; విదర్భా+ఈశ్వరుండు= విదర్భదేశరాజు; తన, తనూజన్= తన కూతురిని; ఆ+మునికి= ఆ ఋషికి; ఈన్+ఓపక= ఇవ్వజాలక; మనంబునన్= మనస్సులో; అనుతాపించి= మిక్కిలి వ్యథచెంది; ఆ+కన్యకన్+చూచి; ఆత్మగతంబున= తనలో తాను.

తాత్పర్యం: పిమ్మట అగస్త్యుడు విదర్భరాజుదగ్గరకు వచ్చి లోపాముద్రను తనకిచ్చి పెండ్లి చేయుమని అడిగాడు. విదర్భేశ్వరుడు తనకూతురిని ఆ ఋషికి ఇచ్చి పెండ్లి చేయటానికి ఇష్టంలేక తన మనస్సులో మిక్కిలి పరితపించి తనలో తాను ఇట్లా అనుకొన్నాడు.

ఉ. 'నారలు గట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులోఁ దపో
భారమునం గృశుం డయిన బ్రాహ్మణుఁ డీ లలితాంగిఁ బెండ్లియై
నారలు గట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులోఁ దపో
భారము దాల్చియుండు మని పంపక మిన్నక యుండ నేర్చునే? 327

ప్రతిపదార్థం: నారలు+కట్టి= నారతో చేసిన బట్టలు కట్టి; కూరలు+అశనంబుగన్= ఆకులు అలములు తిండిగా చేసికొని; ఉగ్రవనంబులోన్= భయంకరమైన అడవిలో; తపస్+భారమునన్= తపస్సు చేయటం అనే బరువు వలన; కృశుండు+అయిన= చిక్కిపోయిన; బ్రాహ్మణుఁడు; ఈ, లలితాంగిన్= ఈ సుకుమారిని; పెండ్లి+ఐ= వివాహమై; ఉగ్ర వనంబులోన్= ఘోరమైన అడవిలో; నారలు+కట్టి= నారచీరలు ధరించి; కూరలు+అశనంబుగన్= ఆకులు అలములు తిని; తపస్+భారము= తపస్సు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేసే బరువును; తాల్చి+ఉండుము+అని= ధరించి ఉండుము అని; పంపక= నియోగించక; మిన్నక= ఊరక; ఉండనేర్చునే?= ఉండగలడా?

తాత్పర్యం: నారబట్టలు కట్టుకొని, ఆకులు అలములు ఆహారంగా భయంకరమైన అడవిలో కఠోర తపస్సు చేయటంవలన బక్కచిక్కిన బడుగుదేహంతో ఉన్న ఈ నిరుపేదబాపడు- ఈ సుకుమార సుందరాంగి అయిన రాకుమారిని పెండ్లాడి ఆమెను కూడ కారడవులలో నారబట్టలు కట్టుకొని, ఆకులు అలములు తిని తనతోపాటు తపోభారాన్ని మోయుమని నియోగించకుండా ఉంటాడా?

ఆ. ఎఱిఁగి యెఱిఁగి దీని నె ట్లీఁగ నగు భోగ । యోగ్యయైన యది పయోజనేత్ర;
యీనినాఁడు శాప మిచ్చుఁ గా; కిమ్ముని । యేల సైఁచు? నింక నెట్టులొక్కొ!' 328

ప్రతిపదార్థం: భోగ, యోగ్య+ఐన+అది= సుఖాలు అనుభవించటానికి తగినట్టిది; పయోజ నేత్ర= నీటినుంచి పుట్టిన పద్మాలవంటి కన్నులుకలది; దీనిన్= ఈమెను; ఎఱిఁగి+ఎఱిఁగి= తెలిసి తెలిసి; ఎట్లు+ఈఁగన్+అగు= ఎట్లా ఇవ్వటానికి వీలు పడుతుంది?; ఈని, నాఁడు= ఇవ్వని వేళ; ఈ+ముని= ఈ ఋషి; శాపము+ఇచ్చున్+కాక= శాపాన్ని ఇస్తాడు కాని; ఏల సైఁచున్= ఎందుకు సహించి ఊరకుంటాడు?; ఇంకన్= మరి; ఎట్టులు+ఒక్కొ!= ఏ విధంగా చేయనవుతుంది?

తాత్పర్యం: ఈ బ్రాహ్మణుడు ఘోరమైన అరణ్యాలలో తిరుగాడుతూ నారవస్త్రాలు కట్టుకొని తపస్సు చేయటంవలన బక్కచిక్కినదేహంతో ఆకులలములు తిని పొట్ట నింపుకొనే నిరుపేద- అని తెలిసి తెలిసి నా కూతురిని ఎట్లా ఇవ్వాలి? భోగభాగ్యాలతో తులతూగదగిన, పద్మాలవంటి నేత్రాలు గలిగిన ఈమెను అగస్త్యుడికి ఇవ్వ కుంటే శాపమిస్తాడు కాని, ఊరక ఎందుకుంటాడు? ఎందుకు ఓర్చుకుంటాడు? ఇంక ఎట్లా చేయాలి?'

వ. అని వైదర్భుండు దానునుం బత్నియు వగచుచున్న వారిపాలికి వచ్చి లోపాముద్ర యిట్లనియె. 329

ప్రతిపదార్థం: అని= అని తలపోసి; వైదర్భుండు= విదర్భరాజు; తానునున్= తానును; పత్నియు= భార్యయు; వగచుచున్న= విచారిస్తుండగా; లోపాముద్ర; వారి, పాలికి, వచ్చి= వారి దగ్గరకు చేరి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: అని ఆలోచించి విదర్భరాజు తానూ తనభార్య విచారిస్తున్న సమయంలో రాకుమారి లోపాముద్ర తన తలిదండ్రుల వద్దకు వచ్చి ఇట్లా పలికింది.

క. 'ఇమ్మునివరునకు నన్నుఁ బ్రి । యమ్మున నిచ్చునది; మీకు నతిచింతాభా
ర మ్మేల?' యనిన నిరువురు । నమ్ముదితకు సంతసిల్లి యధికవిభూతిన్. 330

ప్రతిపదార్థం: ఈ+ముని వరునకున్= ఈ ఋషి శ్రేష్ఠుడికి; నన్నున్= నన్ను; ప్రియమ్మునన్= ప్రీతితో; ఇచ్చునది= పెండ్లి చేసేది; మీకున్; అతి, చింతా, భారమ్ము+ఏల= మిక్కిలి పరితాపం చెందే బరువు ఎందుకు?; అనినన్= అని చెప్పగా; ఇరువురును= ఆ ఇద్దరును (భార్యాభర్తలు); ఆ+ముదితకున్= ఆ కుమారికి, అంటే ఆ కుమారి చెప్పినమాటలకు; సంతసిల్లి= సంతోషించి; అధిక, విభూతిన్= మిక్కిలి వైభవంతో.

తాత్పర్యం: 'ఈ ఋషిశ్రేష్ఠుడికి నన్ను ప్రీతితో ఇచ్చి పెండ్లి చేయండి. మీరు మిక్కిలి పరితాపం పొంది క్రుంగట మెందుకు?' అని లోపాముద్ర పలుకగా ఆ దంపతులిరువురు మిక్కిలి సంతోషించి, మహావైభవోపేతంగా.

విశేషం: వియ్యానికి, కయ్యానికి సరిసమానులుండాలని తెలుగు సామెత. మహాభారతంలోని ఉపాఖ్యానాలలో మానవ జీవితంలోని వెలుగు నీడలు పడుగుపేకగా అల్లబడి ఎన్నో రహస్యాలు పొందుపరచబడినాయి. రాకుమారి లోపాముద్ర తాను స్వయంగా అగస్త్యుడిని వరించటంలో ఆమె మనస్తత్వంలోని రహస్యం ఏమిటి? అది తల్లిదండ్రులకై ఆమె చేసిన త్యాగమా? మహర్షిపై ఆమెకు అంతరాంతరాలలో ఏర్పడిన గౌరవాభిమానమా? లేక ఆమె చిత్తవృత్తిలో రెండూ కలిసినవా? ఎన్నో ప్రశ్నలు ఉదయించవచ్చును. మానవుల మనస్సు మిక్కిలి గహనమైనది. చిత్ర విచిత్రమైనది. అగస్త్యుడు ఒక అసాధారణ వ్యక్తి. ఆతడిని వరించిన రాకుమారి లోపాముద్ర చిత్తప్రవృత్తికూడా మిక్కిలి లోతైనది. అగస్త్య లోపాముద్రల వైవాహికజీవితం, తదుపరి వారి జీవితచరిత్ర అనుశీలించదగినట్టివి. అందుండి అధ్యయనం చేయదగిన అంశాలు పెక్కు ఉన్నాయి. లోపాముద్ర మహాపతివ్రతాశిరోమణిఅయి అగస్త్యుడిని అనుసరించి ఆయన మన్ననకు పాత్రురాలైనట్టిది. అగస్త్యుడు ఆమెను లాలించి వరం కోరుకొమ్మన్నప్పుడు ఆమె మనఃకుహరాంతరాలలో ఎచ్చటనో దాగుకొని ఉండే భోగలాలసత్వం పైకి ఉబికింది. అప్పుడు మహామహిమోపేతుడైన ఆ మహర్షి ఆమెను అనుగ్రహించగలిగాడు.

అగస్త్యుఁడు లోపాముద్రను వివాహం బగుట (సం. 3-95-9)

వ. విధ్యుక్తంబుగా నక్కోమలి నగస్త్యునకు వివాహంబుఁ జేసిన, నగస్త్యుండు లోపాముద్రం బరిగ్రహించి, దాని దివ్యాంబరాభరణంబు లపనయించి వల్కలాజినధారిణిం జేసి, ధర్మచారిణిం దోడ్కొని చని గంగా ద్వారంబునం దపంబు సేయుచు నొక్కనాఁడు. 331

ప్రతిపదార్థం: విధి+ఉక్తంబుగా= నిర్దేశ సూత్రాలలో చెప్పబడినట్లుగా, అంటే శాస్త్రీయమైన పద్ధతిలో; ఆ+కోమలిన్= ఆ సుకుమారమైన దేహం కల లోపాముద్రను; అగస్త్యునకున్= అగస్త్యుడికి ఇచ్చి; వివాహంబున్+చేసినన్= పెండ్లి చేయగా; అగస్త్యుండు; లోపాముద్రన్= లోపాముద్రను; పరిగ్రహించి= స్వీకరించి; దాని= ఆమెయొక్క; దివ్య+అంబర+ఆభరణంబులు= మేల్తరాలయిన వస్త్రాలు, నగలు; అపనయించి= తీసివేయించి; వల్కల+అజిన, ధారిణిన్+చేసి= నారచీరలు జింకచర్మం కట్టుకొనే దానినిగా చేసి అంటే- నారచీరలు కట్టించి జింకచర్మంతో చేయబడిన అలంకారాలు పెట్టించి; ధర్మ చారిణిన్= ధర్మంలో తనకు సహవ్రతురాలిని; తోడ్కొని= వెంట పెట్టుకొని; చని= వెళ్ళి; గంగా, ద్వారంబునన్= గంగ భూమిని ప్రవేశించే చోట అంటే హరిద్వారంలో; తపంబు+చేయుచున్= తపస్సు చేసికొంటూ; ఒక్కనాఁడు= ఒకానొకరోజు.

తాత్పర్యం: శాస్త్రాలలోని సూత్రాలలో నిర్దేశించబడిన పద్ధతిలో విదర్భరాజు తన కూతురు లోపాముద్రను అగస్త్యుడికి ఇచ్చి పెండ్లిచేశాడు. అంత, అగస్త్యుడు లోపాముద్రను ధర్మపత్నిగా స్వీకరించి, ఆమె ధరించిన గొప్ప ఆభరణాలు, వస్త్రాలు తీసివేయించి, ఆమెచేత నారచీరలు, జింకచర్మం ధరింపజేసి తనవెంట తీసికొని వెళ్ళి గంగాద్వారంలో తపస్సు చేసికొంటూ ఉండగా ఒకానొకదినం.

విశేషం: లోపాముద్ర లోతైన స్వభావం కలిగినది. వివాహం కాగానే భర్త తన మేనిమీది ఆభరణాలన్నింటిని తొలగింపచేశాడు. నారచీరలు కట్టబెట్టాడు. ఆమె కిమ్మనకుండ మగడిమాట పాటించింది. కాని, భర్త తనంతట తాను తనను కోరివచ్చినప్పుడు ఆభరణాలతో తనను అలంకరించి, తానూ అలంకరించుకొని భోగించుమని కోరింది. అప్పు డగస్త్యుడు ఆమె కోర్కెను మన్నించాడు.

క. నీచతరనాభిఁ జపలవి । లోచనఁ బృథుజఘనచక్ర లోపాముద్రం
జూచి మునీంద్రుఁడు మన్మథ । గోచరుఁడై దానిఁ బ్రీతిఁ గూడఁగఁ దివిరెన్. 332

ప్రతిపదార్థం: నీచతర, నాభిన్= మిక్కిలి లోతైన బొడ్డు కలదానిని; చపల విలోచనన్= చలించే కన్నులు కలదానిని; పృథు, జఘన, చక్రన్= విస్తరించిన గుండ్రని మొలకట్టు కలదానిని; లోపాముద్రన్+చూచి; ముని+ఇంద్రుఁడు= మునులలో ఇంద్రుడి వంటి వాడైన; అగస్త్యుఁడు; మన్మథ గోచరుఁడు+ఐ= శృంగార భావానికి లోనైనవాడై; దానిన్= ఆమెను; ప్రీతిన్= ప్రియమార; కూడఁగన్+తివిరెన్= సంభోగించటానికి పూనుకొన్నాడు.

తాత్పర్యం: మునీంద్రుడైన అగస్త్యుడు లోతైన బొడ్డు గలదీ, చలించే కన్నులు గలదీ, విస్తరించిన గుండ్రని మొలకట్టు గలదీ అయిన లోపాముద్రను చూచి, శృంగారభావానికి లోనై ఆమెను సంభోగించటానికి తలపెట్టాడు.

వ. అదియును మునివరు నభిప్రాయం బెఱింగి లజ్జించి ముకుళితకరాంబుజయై యిట్లనియె. 333

ప్రతిపదార్థం: అదియును= ఆమెయు (ఆ లోపాముద్రయు); ముని, వరు+అభిప్రాయంబు= మునిశ్రేష్ఠుడి తలంపును; ఎఱింగి= తెలిసికొని; లజ్జించి= సిగ్గుపడి; ముకుళిత, కర+అంబుజ+ఐ= ముడిచిన చేతులు అనే పద్మాలు కలదై, అంటే నమస్కరించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: ఆ లోపాముద్రకూడా అగస్త్యుడి అభిప్రాయాన్ని గుర్తించి సిగ్గుపడి ఆతడికి భక్తితో నమస్కరించి ఇట్లా పలికింది.

క. 'పతి పత్నిఁ బ్రజార్థముగా । ధృతిఁ బడయుట యెందుఁ గల యదియ యైనను న
న్నతి రుచిరాంబర భూషా । న్వితఁ జేసి మనఃప్రియంబు నిర్మింపు దయన్. 334

ప్రతిపదార్థం: పతి= భర్త; పత్నిన్= భార్యను; ధృతిన్= నిష్ఠతో; ప్రజా+అర్థముగా= సంతానం కొరకై; పడయుట= పొందటం; ఎందున్= ఎక్కడైనా; కల+అదియ+ఐనను= ఉన్నదే అయినప్పటికిని; నన్ను; అతి, రుచిర+అంబర, భూషా+అన్వితన్+చేసి= మిక్కిలి కాంతి గల వస్త్రాలతో, ఆభరణాలతో కూడిన దానిని చేసి; దయన్= కరుణతో; మనఃప్రియంబు (మనస్+ప్రియంబు)= మనస్సుకు ప్రీతిని; నిర్మింపు= కలగజేయుము.

తాత్పర్యం: 'భర్త భార్యను సంతానార్థమై పొందటం ఎక్కడైనా ప్రకృతి సహజమే. అయినను నన్ను శోభాయమానమైన ఆభరణాలతో, వస్త్రాలతో అలంకరించి కరుణతో నా మనస్సుకు ప్రీతిని చేకూర్చుము.

క. మునినాథ! నీవు ననులే । పనమాల్య విభూషణ ప్రసన్నుఁడవై నా
కొనరింపు మపత్యోత్పా । దన మీ ఋతువాసరములు దప్పక యుండన్'. 335

ప్రతిపదార్థం: మునినాథ!= ఋషులలో అధినేతవైనవాడా!; నీవున్= నీవును; అనులేపన, మాల్య, విభూషణ, ప్రసన్నుఁడవు+ఐ= మైపూతలతో, పూలమాలలతో, ఆభరణాలతో అలంకృతుడవై దయచేసి; నాకు; ఈ, ఋతు వాసరములు= సంభోగం ఫలించే దినాలు; తప్పక+ఉండన్= గడిచిపోకుండ ఉండేటట్లు; అపత్య+ఉత్పాదనము= సంతానం కలిగించటం; ఒనరింపుము= చేయుము.

తాత్పర్యం: ఋషులలో నాయకుడివైనవాడా! నీవుకూడ పరిమళంతో కూడిన మైపూతలతో, పూలదండలతో శోభాయమానాలైన ఆభరణాలతో అలంకృతుడవై, నాపట్ల దయ కలిగినవాడివై సంభోగం ఫలించే ఈ దినాలు గడచిపోకుండ నాకు గర్భాధానం చేయుము.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన 'నాకుఁ దపోధనంబ కాని యొండుధనంబు లేదు; నీ కోరినవిధం బెట్లు సేయనేర్తుఁ? దపంబునం జేసి సర్వంబునుం బడయ నగు నంటేని నేను తపోవ్యయంబు సేయ నోప' నని యగస్త్యుండు వసుభిక్షార్థియై శ్రుతర్వుం డను రాజుపాలికిం బోయి వానిచేతం బూజితుం డయి 'యేను ధనార్థినై వచ్చితి నీ పోష్యజన పోషణంబునకు విఘాతంబు గాకుండ మిగులుధనంబు గలదేని నా కి' మ్మని యడిగిన నతం డాయ వ్యయంబులు సమంబు లగుటం జేసి మిగులు లేమి యెఱింగించిన, వాఁడును దానును బ్రధ్నశ్వుండను రాజు పాలికిం బోయిన నతండును నయ్యిరువురం బరమభక్తిం బూజించి తదాగమన ప్రయోజనం బెఱింగి తన యందుల నాయవ్యయంబులు సమంబు లగుట యెఱింగించిన. 336

ప్రతిపదార్థం: అనినన్= అని లోపాముద్ర చెప్పగా; నాకున్= నాకు; తపస్+ధనంబు+అ, కాని= తపస్సు అనే ధనం తప్ప; ఒండు, ధనంబు, లేదు= వేరే డబ్బు లేదు; నీ, కోరిన, విధంబు+ఎట్లు+చేయనేర్తున్= నీవు అడిగినట్లు ఏ విధంగా చేయగలను?; తపంబునన్+చేసి= తపస్సుచేత; సర్వంబునున్= సమస్తాన్ని; పడయన్+అగున్= పొందవచ్చును; అంటేని= అని అంటే; నేను= నేను; తపస్+వ్యయంబు= తపస్సును వ్యయించటం (ఖర్చు చేయటం); చేయన్+ఓపన్+అని= చేయజాలనని చెప్పి; అగస్త్యుండు; వసు, భిక్షా+అర్థి+ఐ= ధనాన్ని యాచించేవాడై; శ్రుతర్వుండు+అను= శ్రుతర్వుడనే పేరున్న; రాజు పాలికిన్= రాజు దగ్గరకు; పోయి= వెళ్ళి; వానిచేతన్= ఆతడిచేత; పూజితుండు+అయి= అర్చించబడినవాడై; ఏను= నేను; ధన+అర్థిని+ఐ= ధనాన్ని కోరుకొన్నవాడినై; వచ్చితిన్= అరుదెంచాను; నీ, పోష్య, జన, పోషణంబునకున్= నీవు పోషించవలసిన వారిని ప్రోచటానికి; విఘాతంబు, కాకుండన్= దెబ్బ తగులకుండ; మిగులు, ధనంబు= శేషద్రవ్యం; కలదేని= ఉంటే; నాకు+ఇమ్ము= నాకు ఇచ్చేది; అని=అంటూ; అడిగినన్= వేడగా; అతండు= అతడు; ఆయ, వ్యయంబులు= రాబడి, ఖర్చులు; సమంబులు= సమానాలు; అగుటన్+చేసి= అవటంచేత; మిగులు, లేమి=శేషించింది లేకుండటం; ఎఱింగించినన్= తెలుపగా; వాఁడును, తానును= ఆ శ్రుతర్వుడున్నూ, అగస్త్యుడున్నూ; బ్రధ్నశ్వుండు+అను= బ్రధ్నశ్వుడనే పేరుకల; రాజు పాలికిన్= రాజు దగ్గరికి; పోయినన్= వెళ్ళగా; అతండునున్= ఆ రాజుకూడ; ఆ+ఇరువురన్= ఆ ఇద్దరిని; పరమ భక్తిన్= మిక్కిలి భక్తితో; పూజించి= అర్చించి; తద్+ఆగమన, ప్రయోజనంబు= వారు రావటానికి గల కారణం; ఎఱింగి= తెలిసికొని; తనయందులన్= తనయొద్ద; ఆయ, వ్యయంబులు= రాబడి, ఖర్చులు; సమంబులు= సమానాలు; అగుట= అవటం; ఎఱింగించినన్= తెలుపగా.

తాత్పర్యం: అని లోపాముద్ర చెప్పగా 'తపస్సు మాత్రమే నా దగ్గర ఉన్న ధనం. వేరే ధనం లేదుకదా! మరి నీవు కోరినవిధంగా నే నెట్లా చేయగలను? తపస్సువలన సమస్తాలు సమకూరుతాయి కదా! అని నీవు అనవచ్చును, కాని నాకు నీ తపశ్శక్తిని వ్యయం చేయటం ఇష్టం లేదు' అని చెప్పి అగస్త్యుడు ధనసంపాదనకొరకై శ్రుతర్వుడు అనే రాజు దగ్గరకు వెళ్ళాడు. శ్రుతర్వుడు అగస్త్యుడిని పూజించాడు. అగస్త్యుడు ఆ రాజును 'నీవు పోషించవలసినవారి పోషణకు భంగం కలగకుండ నాకు ధనం ఇమ్ము. నేను ధనార్థినై నీ దగ్గరకు వచ్చాను' అని చెప్పాడు. శ్రుతర్వుడు తన ఆయవ్యయాలు సమానాలనీ, తన వద్ద మిగులు ధనం లేదనీ బదులు చెప్పాడు. అంత శ్రుతర్వుడున్నూ, అగస్త్యుడున్నూ కలిసి బ్రధ్నశ్వుడు అనే మహారాజు దగ్గరికి వెళ్ళారు. ఆ రాజు కూడ వారిని మిక్కిలి భక్తితో పూజించి తన ఆదాయవ్యయాలు సమానాలని విన్నవించాడు.

విశేషం: అగస్త్యుడు ధనం నిమిత్తం వెళ్ళిన రాజు పేరు కొన్ని ప్రతుల్లో "శ్రుతపర్వుడు"- అని ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఇరువురఁ దోడ్కొని తానును । నరిగెం ద్రసదస్యుఁ డను జనాధిపుకడకుం
గర మర్థితోడ నందఱఁ । బురుకుత్సతనూజుఁ డతఁడు పూజించి తగన్. 337

ప్రతిపదార్థం: ఇరువురన్= ఇద్దరిని (అంటే శ్రుతర్వుడిని, బ్రధ్నశ్వుడిని); తోడ్కొని= వెంటపెట్టుకొని; తానును= అగస్త్యుడు కూడ; త్రసదస్యుఁడు+అను= త్రసదస్యుడు అనే పేరున్న; జన+అధిపు, కడకున్= ప్రజలకు అధిపతి అయిన రాజు దగ్గరకు; అరిగెన్= వెళ్ళాడు; కరము= మిక్కిలి; అర్థితోడన్= ఇష్టంతో; అందఱన్= అందరినీ; అతడు= త్రసదస్యుడు; పురుకుత్స తనూజుఁడు= పురుకుత్సుడి కొడుకు; తగన్= సముచితంగా; పూజించి= అర్చించి.

తాత్పర్యం: అంత, అగస్త్యమహాముని శ్రుతర్వుడిని, బ్రధ్నశ్వుడిని తన వెంటబెట్టుకొని పురుకుత్సుడి కుమారుడైన త్రసదస్యుడు అనే రాజుదగ్గరకు వెళ్ళాడు. త్రసదస్యుడు ఆ ముగ్గురిని పూజించి.

వ. వారల చెప్పినట్లు తన నిర్వాహంబు సెప్పి త్రసదస్యుం డగస్త్యున కిట్లనియె. 338

తాత్పర్యం: ముందువారు చెప్పినట్లే తన ఆదాయవ్యయాలు కూడా సమానమని త్రసదస్యుడు చెప్పి అగస్త్యుడితో ఇట్లా అన్నాడు.

క. 'ఇమ్మణిమతీపురంబునఁ । దమ్ముండును దాను నతిముదంబున నుండున్
నెమ్మిని నిల్వలుఁ డను వాఁ; । డిమ్మహి ధనవంతుఁ డతఁడ యెవ్వరికంటెన్. 339

ప్రతిపదార్థం: ఈ+మణిమతీ, పురంబునన్= మణిమతి అనే పేరుకల ఈ పట్టణంలో; ఇల్వలుఁడు+అనువాఁడు= ఇల్వలుడనే పేరుకలవాడు; నెమ్మినిన్= ఏ కొదువ లేకుండా; తమ్ముండును, తానున్= తమ్ముడు తానూ కలిసి; అతి, ముదంబునన్= మిక్కిలి సంతోషంతో; ఉండున్= ఉంటాడు; ఈ+మహిన్= ఈ భూమిలో; అతఁడు+అ= అతడే; ఎవ్వరి కంటెను= ఎవరికంటే కూడ- అంటే అందరికంటే; ధనవంతుఁడు= సంపన్నుడు.

తాత్పర్యం: 'ఈ మణిమతీ పట్టణంలో ఇల్వలుడనేవాడు తన తమ్ముడితో కలిసి ఉంటాడు. ఈ పురంలోనే కాక ఈ భూమండలంలో అందరికంటె ధనవంతుడు అతడే.

వ. అతండు మన యభిమతంబు దీర్ప నోపు' నని రాజర్షులు ముప్వురు మహర్షిం దోడ్కొని యిల్వలు పాలికిం జనిన నయ్యిల్వలుండును వారి నాతిథ్యవిధానంబుల నర్చించి, వాతాపి నెప్పటియట్ల సంస్కరించి యగస్త్యునకు భోజనంబుగా సమర్పించిన. 340

ప్రతిపదార్థం: అతండు= ఇల్వలుడు; మన+అభిమతంబు= మనకోరిక; తీర్పన్+ఓపును+అని= ఈడేర్చగలడని; రాజర్షులు= రాజులైన ఋషులు; ముప్వురు= ముగ్గురును; మహర్షిన్+తోడ్కొని= గొప్ప ఋషి అయిన అగస్త్యుడిని వెంటపెట్టుకొని; ఇల్వలు, పాలికిన్= ఇల్వలుడి దగ్గరకు; చనినన్= వెళ్ళగా; ఆ+ఇల్వలుండును; వారిన్= వారిని (అగస్త్యుడిని, ముగ్గురు రాజులను); ఆతిథ్య విధానంబులన్= అతిథిసేవ చేసేపద్ధతిలో; పూజించి= అర్చించి; వాతాపిన్= వాతాపిని; ఎప్పటి+అట్లు+అ= లోగడ చేసినట్లే; సంస్కరించి= వంటచేసి (అంటే అతని మాంసాన్ని పచనంచేసి); అగస్త్యునకు; భోజనంబుగా= ఆహారంగా; సమర్పించినన్= వడ్డించగా.

తాత్పర్యం: ఆ ఇల్వలుడు మన కోరిక ఈడేర్చగలడు- అని రాజఋషులు ముప్పురున్నూ ఇల్వలుడి దగ్గరకు వెళ్ళారు. ఆ ఇల్వలుడు వారి నందరిని అతిథిసత్కారాలతో అర్చించి, వాతాపిమాంసాన్ని ఎప్పటిమాదిరిగా పచనం చేయించి, అగస్త్యుడికి ఆహారంగా సమర్పించగా.

తే. దాని నెఱిఁగి యమ్మువ్వురు ధరణిపతులు । మునివరేణ్యున కప్పుడు మ్రొక్కి యనిరి
'విప్రవరులకు భక్ష్యమై వీని తమ్ముఁ । డుదరములనుండి విప్రుల నొగిన చంపు. 341

ప్రతిపదార్థం: దానిన్+ఎఱిఁగి= ఆ విషయాన్ని తెలిసికొని; ఆ+మువ్వురు= ఆ ముగ్గురు; ధరణిపతులు= రాజులు; మునివరేణ్యునకు= ఋషులలో శ్రేష్ఠుడైన అగస్త్యుడికి; అప్పుడు; మ్రొక్కి= నమస్కరించి; అనిరి= చెప్పారు; విప్రవరులకున్= బ్రాహ్మణోత్తములకు; భక్ష్యము+ఐ= ఆహారమై; వీని తమ్ముఁడు= ఇల్వలుడి తమ్ముడు, వాతాపి; విప్రులన్= బ్రాహ్మణులను; ఉదరములన్+ఉండి= పొట్టలలో ఉండి; ఒగిన్+అ= ఒడుపుగా; చంపున్= చంపుతాడు.

తాత్పర్యం: ఆ విషయం తెలిసిన ముగ్గురురాజులు అగస్త్యమహర్షికి నమస్కరించి ఇట్లా అన్నారుః ' ఈ ఇల్వలుడి తమ్ముడు వాతాపి బ్రాహ్మణులకు తాను ఆహారమై తదుపరి వారి పొట్టలను చీల్చి వారిని చంపుతాడు సుమా!

చ. వలవదు వీని యింటఁ గుడువన్; మనకున్ ధన మిచ్చు నేని యి
మ్ములఁ గొనిపోద మిప్పు' డని మున్నెఱిఁగించిన నమ్మునీంద్రుఁ డ
త్యలఘుఁడు వారి మాటకు భయంపడ కెంతయుఁ బ్రీతితోడ న
గ్గలముగఁ జేసె భోజనము గంఠముదాక నకుంఠవీర్యుఁడై. 342

ప్రతిపదార్థం: మనకున్= మనకు; వీని+ఇంటన్= వీడి గృహంలో; కుడువన్+వలవదు= భుజించరాదు; ధనమున్= ధనాన్ని; ఇచ్చున్+ఏని= ఇస్తే; ఇమ్ములన్= ప్రీతితో; కొని పోదము= తీసికొని వెళ్ళుదాము; ఇప్పుడు= ఈ సమయంలో; అని= అంటూ; మున్ను= ముందుగా; ఎఱిఁగించినన్= తెలుపగా; ఆ+ముని+ఇంద్రుఁడు= మునులలో ఇంద్రుడివంటివాడయిన అగస్త్యుడు; అతి+అలఘుఁడు= గొప్పవాడు (మిక్కిలి తేలిక కానివాడు); వారి, మాటకున్= ఆ రాజులమాటకు; భయంపడక= భీతితో వెనుకాడక; ఎంతయున్= మిక్కిలి; ప్రీతితోడన్= ప్రియంతో; భోజనము= ఆహారాన్ని; కంఠము దాక= పీకెవరకు; అకుంఠ వీర్యుఁడు+ఐ= మొక్కవోని బలం కలవాడై; అగ్గలముగన్= ఎక్కువగా; చేసెన్= చేశాడు (భోజనం చేశాడు).

తాత్పర్యం: మనం ఈ ఇల్వలుడి గృహంలో తిండి తినరాదు. ఇప్పుడు ధనమిస్తే ప్రీతితో పరిగ్రహించి వెళ్ళుదాము' - అని ముగ్గురు రాజులు అగస్త్యుడికి తెలిపారు. మిక్కిలి గొప్పవాడయిన ఆ మహర్షి వారి మాటలకు భీతి చెందలేదు, సరిగదా! మిక్కిలిప్రీతితో పీకెవరకు ఆ భోజనం తిని మొక్కవోని బలంతో శోభిల్లాడు.

ఆ. ఇల్వలుండు ననుజు నెప్పటి క్రియఁ బిల్వ । నెఱిఁగి దాని నమ్మునీశ్వరుండు
గడుపుఁ దడవికొనుచుఁ గట్టునఁ ద్రేఁచిన । నసుర జీర్ణమయ్యె నాక్షణంబ. 343

ప్రతిపదార్థం: ఇల్వలుండు= ఇల్వలుడు; అనుజున్= తమ్ముడిని (వాతాపిని); ఎప్పటిక్రియన్= ఎప్పటియట్ల; పిల్వన్= పిలువగా; దానిన్+ఎఱిఁగి= ఆ విషయాన్ని తెలిసికొని; ఆ+ముని+ఈశ్వరుండు= ఋషులలో ఈశ్వరుడివంటివాడైన ఆ అగస్త్యుడు; కడుపున్= పొట్టను; తడవికొనుచున్= నిమురుకొంటూ; గట్టు+అనన్+త్రేఁచినన్= గర్రు అనేశబ్దం కలిగేటట్లు త్రేనుపు తెప్పించుకొనగా; అసుర= రాక్షసుడు; ఆ, క్షణంబు+అ= ఆ క్షణంలోనే; జీర్ణము+అయ్యెన్= అరిగిపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఇల్వలుడు ఎప్పటివలె తన తమ్ముడిని పిలిచాడు. ఆ సంగతి గుర్తించిన అగస్త్యమునీశ్వరుడు పొట్ట నిమురుకొంటూ గ(్రున త్రేన్చాడు. ఆ క్షణంలోనే అగస్త్యమహర్షిపొట్టలో ఆ వాతాపిరాక్షసుడు జీర్ణమైపోయాడు.

విశేషం: ఒక రాక్షసుణ్ణి తిని, అలా పొట్ట నిమురుకొని, పూర్తిగా జీర్ణించుకొని, గ(్రున త్రేన్చిన అగస్త్యమహర్షి జీర్ణశక్తి అనుపమానం. అంతజీర్ణశక్తి తన బిడ్డకు ఉండాలని కాబోలు ఆంధ్రదేశంలో ప్రతితల్లి తన బిడ్డకు పాలు త్రాపి, గోరుముద్దలు తినిపించి, పొట్ట నిమురుతూ 'జీర్ణం-జీర్ణం-వాతాపిజీర్ణం' అని అంటుంది.

ఇ. **ఇల్వలుండును మునివరుశక్తికి భయంపడి విషణ్ణుం డయ్యును బ్రసన్నుండ పోలెఁదన వంచన యేర్పడకుండం**
గృతప్రణాముండై దదాగమనప్రయోజనం బడిగిన వానికి నగస్త్యుం డిట్లనియె. **344**

ప్రతిపదార్థం: ఇల్వలుండును= ఇల్వలుడును; మునివరుశక్తికిన్= ఋషులలో శ్రేష్ఠుడైన అగస్త్యుడి మహిమకు; భయంపడి= వెరపుగొని; విషణ్ణుండు+అయ్యును= దుఃఖించిన వాడయినప్పటికి; ప్రసన్నుండు+అ+పోలెన్= సంతసిస్తున్నవాడివలె; తనవంచన= తాను చేసినమోసం; ఏర్పడకుండన్= తెలియనట్లుగా; కృత, ప్రణాముండు+ఐ= నమస్కరించినవాడై; తద్+ఆగమన, ప్రయోజనంబు= ఆతడి రాకకు గల ప్రయోజనాన్ని గురించి; అడిగినన్= ప్రశ్నించగా; వానికిన్= ఆ ఇల్వలుడికి; అగస్త్యుండు= అగస్త్యుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఇల్వలుడు అగస్త్యమునివరేణ్యుడిమహిమకు భయపడి, విషాదంచెంది తాను ఖిన్నుడు అయినప్పటికీ, తన మోసం బయటపడకుండా, పైకి సంతోష తన్మయుడైనట్లు నటిస్తూ ఆ ఋషికి నమస్కరించి, ఆయన రాకకు గల కారణాన్ని తెల్పుమని వేడగా, అతడికి అగస్త్యమహర్షి ఈ విధంగా బదులు పలికాడు.

సీ. **'ఈ రాజవరులతో నేను ధనార్థినై । వచ్చితి నీకు ద్రవ్యంబు గలుగు**
టెఱిఁగి' నావుడు 'నటులేని మీ కభిమత । మెంత యంతియ ధనమిత్తు' ననినఁ
'బదివేలు మొదవులు బదివేల గద్దియల్ । పసిఁడియు నిమ్మహీపతుల కిమ్ము
యొక్కొక్కనికి మఱి యొక్కని కిచ్చిన । దానికి రెట్టి గోధనము నొక్క

ఆ. **హేమమయరథంబు నిమ్ము నా' కనిన ని । ల్వలుఁడు దత్క్షణంబ తలఁచి యిచ్చె**
నయ్యగస్త్యుచెప్పినంత ధనంబు ము । వ్వురు మహీపతులకుఁ గరము నెమ్మి. **345**

ప్రతిపదార్థం: ఈ రాజ, వరులతోన్= రాజులలో శ్రేష్ఠులైన వీరితో; ఏను= నేను; ధన+అర్థిన్+ఐ= ధనాన్ని కోరేవాడినై; వచ్చితిన్= అరుదెంచాను; నీకు; ద్రవ్యంబు= ధనం; కలుగుట+ఎఱిఁగి= ఉండటం తెలిసి; నావుడున్= అని చెప్పగా; అటులు+ఏని= అట్లయితే; మీకు; అభిమతము= కోరిక; ఎంత= ఎంతయో; అంతియ, ధనము= అంతమేర ధనం; ఇత్తున్= ఇవ్వగలను; అనినన్= అని చెప్పగా; పదివేలు, మొదవులు= పదివేల ఆవులు; పదివేల, గద్దియల్, పసిఁడియున్= పదివేల బంగారునాణాల (గద్యాణాల)బంగారం; ఈ+మహీపతులకు= ఈ రాజులకు; ఇమ్ము+అ= ఇచ్చేది; ఒక్కొక్కనికిన్= ఒక్కొక్కరికి; మఱి= అదనంగా; ఒక్కనికి+ఇచ్చిన దానికి; రెట్టి= రెండింతలు; గోధనమున్= గోవులనే ధనాన్ని; ఒక్క= ఒక; హేమ, మయ రథంబున్= బంగారు తేరును; నాకు; ఇమ్ము; అనినన్= అని చెప్పగా; ఇల్వలుఁడు; తద్, క్షణంబు+అ= ఆ క్షణంలోనే; తలఁచి= సంకల్పించి; ఆ+అగస్త్య, చెప్పినంత, ధనంబు= ఆ అగస్త్యమహర్షి చెప్పినమేరకు ద్రవ్యాన్ని; మువ్వురు= ముగ్గురు; మహీపతులకున్= భూభర్తలైన రాజులకు; కరము= మిక్కిలి; నెమ్మిన్= ప్రీతితో; ఇచ్చెన్= ఇచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఈ రాజన్యులతో నేను ధనార్థినై వచ్చాను. నీవు ధనాఢ్యుడి వని విన్నాను' అని అగస్త్యమహర్షి చెప్పగా, 'మీరు ఎంతకోరుకొంటారో అంత ధనం ఇస్తాను' అని ఇల్వలుడు బదులు పలికాడు. అంత అగస్త్యుడు 'పదివేల ఆవులు, పదివేల గద్యాణాల బంగారం ఈ రాజులకు ఒక్కొక్కరికి ఇమ్ము. వారిలో ఒక్కొక్కరికి ఇచ్చిన మొత్తానికి రెండింతలు గోధనాన్ని, ఒక బంగారు తేరును నాకు ఇమ్ము' అని అడుగగా తత్క్షణమే ఇల్వలుడు ఆ ముప్పురురాజులకు ఆ యా ధనాలు ప్రీతితో ఇచ్చాడు.

వ. మఱియు విరావ సురావములను నశ్వంబులంబూన్చిన సౌవర్ణరథంబును నిరువదివేల మొదవులు నిరువదివేల గద్దెల పసిండియు మునివరున కిచ్చినం దద్రథంబున. 346

ప్రతిపదార్థం: మఱియు= ఇంకను; విరావ, సురావములు+అను= విరావం, సురావం అనే; అశ్వంబులన్= గుర్రాలను; పూన్చిన= కట్టిన; సౌవర్ణ రథంబును= బంగరు తేరును; ఇరువదివేల మొదవులున్= ఇరవైవేల ఆవులు; ఇరువదివేల, గద్దెల, పసిండియు= ఇరవైవేల గద్యాణాల బంగారాన్ని; మునివరునకున్= ఋషిశ్రేష్ఠుడైన అగస్త్యుడికి; ఇచ్చినన్= ఇవ్వగా; తద్+రథంబునన్= ఆ రథంలో.

తాత్పర్యం: అంతే కాక, విరావం సురావం అనే గుర్రాలను కట్టిన బంగరుతేరును, ఇరవైవేల ఆవులను, ఇరవైవేల బంగారుగద్యాణాల బంగారాన్ని మునిశ్రేష్ఠుడికి ఇచ్చాడు. ఆ రథంలో.

క. మునివరనృపతులఁ దద్గో । ధనకాంచనతతులఁ దత్పతాకినులను నో
లిన తాల్చి యగస్త్యాశ్రమ । మునకుం దత్క్షణమ రథ్యములు వడిఁ బఱచెన్. 347

ప్రతిపదార్థం: మునివర నృపతులన్= మునులలో శ్రేష్ఠుడైన అగస్త్యుడిని, రాజులను; తద్, గోధన, కాంచన, తతులన్= ఆ ఆవులనే ధనాన్ని, బంగారు నాణేల సముదాయాలను; తద్+పతాకినులను= వారి సేనలను; ఓలిన; తాల్చి= వరుసగా వహించి; అగస్త్య+ఆశ్రమమునకున్; తద్క్షణము+అ= ఆ క్షణంలోనే; రథ్యములు= గుర్రాలు; వడిన్= వేగంగా; పఱచెన్= పరుగెత్తాయి.

తాత్పర్యం: మునివరుడైన అగస్త్యుడిని, ఆ రాజన్యులను, వారి వారి ఆవులను, బంగారు నాణేలను, వారిసేనలను వరుసగా వహించి, వెనువెంటనే గుర్రాలు అగస్త్యాశ్రమానికి వేగంగా పరుగెత్తాయి.

వ. రాజర్షులు నగస్త్యు వీడ్కొని చని; రంత నగస్త్యుండు లోపాముద్ర కభిమతం బొనరించి. 348

ప్రతిపదార్థం: రాజర్షులున్= రాజులలో ఋషులు; అగస్త్యున్= అగస్త్య మహామునికడ; వీడ్కొని= సెలవు తీసికొని; చనిరి= వెళ్ళారు; అంతన్= అటుపైన; అగస్త్యుండు; లోపాముద్రకు; అభిమతంబు+ఒనరించి= కోరిక తీర్చి.

తాత్పర్యం: రాజర్షులు అగస్త్యుడి దగ్గర సెలవు తీసికొని నిష్క్రమించారు. అగస్త్యుడు లోపాముద్రకోరిక నెరవేర్చాడు.

మధ్యాక్కర.

'పదుగురఁ బోలెడు సుతుల నూర్వురఁ బడయంగ వలతొ?
పదుగుర నూర్వుర కెనయగు సుతులఁ బడయంగ వలతొ?

వదలక వేవురు సుతులఁ బడయఁగ వలతొ? వేవురకుఁ
గదియంగ నుత్తము నొక్కరు వలతొ కమలాయతాక్షి!' 349

ప్రతిపదార్థం: కమల+ఆయత+అక్షి!= పద్మాలవలె విశాలమైన కన్నులు కలదానా!; పదుగురన్= పదిమందిని; పోలెడు= సరిపోలునటువంటి (సమానమైన); సుతులన్+కొడుకులను; నూర్వురన్= వందమందిని; పడయంగ= పొందటానికి; వలతొ?= కోరుతావో?; నూర్వురకు= వందమందికి; ఎనయగు= సాటి అయిన; సుతులన్= కొడుకులను; పదుగురన్= పదిమందిని; పడయంగ= పొందటానికి; వలతొ?= కోరుతావో?; వదలక= విడువక; వేవురు= వేయిమంది; సుతులన్= కొడుకులను; పడయఁగ= పొందటానికి; వలతొ?= కోరుతావో?; వేవురకు= వేయిమందికి; కదియంగన్= సరిపోయే; ఉత్తమున్= మంచివాడిని; ఒక్కరున్= ఒక్కడిని; (కొడుకుగా); వలతొ= కోరుతావో?.

తాత్పర్యం: 'అగస్త్యుడు లోపాముద్రకు వేసిన ప్రశ్నలు. 'నీకు పదిమందితో సమానులయిన వందమంది కొడుకులు కావాలా? నూరుమందితో సమానులయిన పదిమంది కొడుకులు కావాలా? వేయిమంది కొడుకులు కావాలా? వేయిమందికి సాటి అయిన ఉత్తముడైన కొడుకు ఒకడు కావాలా? కమలాలవంటి కన్నులు కలదానా! చెప్పుము'.

విశేషం: వృత్తలక్షణానికి ఈ ఆశ్వాసంలోని 22వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.

వ. అనిన ముదితహృదయయై లోపాముద్ర మునీంద్రున కిట్లనియె. 350

ప్రతిపదార్థం: అనినన్= అని (అగస్త్యుడు) అడుగగా; ముదిత, హృదయ+ఐ= సంతోషించిన హృదయం కలదై; లోపాముద్ర; ముని+ఇంద్రునకు= మునులలో ఇంద్రుడివంటివాడైన అగస్త్యుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: అని అడుగగా సంతోషించి లోపాముద్ర అగస్త్యమునీంద్రుడికి ఇట్లా బదులు పలికింది.

క. 'వేవురఁ బోలెడువాని మ। హావీర్యగుణాఢ్యు నొక్కయాత్మజుఁ బడయం
గా వలతు; నపేతగుణుల్। వేవురు సుతులయ్యు నెందు విఫలమ కాదే.' 351

ప్రతిపదార్థం: వేవురన్+పోలెడు వాని= వేయిమందికి సాటి అయిన; మహా, వీర్య గుణ+ఆఢ్యున్= గొప్పబలం, గుణాలు కలవాడిని; ఒక్క= ఒక; ఆత్మజున్+పడయంగా= కొడుకును పొందటానికి; వలతున్= కోరుకొంటున్నాను; అపేత గుణుల్= గుణవంతులు కానివారు; వేవురు= వేయిమంది; సుతులు+అయ్యున్= కొడుకులు ఉన్నను; ఎందున్= ఎచటనైనను; విఫలము+అ, కాదే= ఫలితం లేనిదే అవుతుంది కదా!

తాత్పర్యం: 'వేయిమందితో సమానుడు, మహాబలశాలి, బుద్ధిమంతుడు అయిన ఒక కొడుకు కావాలి నాకు. బుద్ధిహీనులు వేయిమంది కొడుకులు ఉన్నా లాభమేమి?'

వ. అనిన 'నీ కోరినట్ల గుణవంతుం డయిన కొడుకు నీకు జన్మించు' నని దానికి గర్భాధానంబు సేసి యగస్త్యుండు దపోవనంబున కరిగె; నిట లోపాముద్రయు నేడేండ్లు గర్భంబు దాల్చె; నంత నక్కోమలికి. 352

ప్రతిపదార్థం: అనినన్= అని (లోపాముద్ర) బదులు పలుకగా; నీ, కోరిన+అట్లు+అ= నీవు కోరినవిధంగానే; గుణ వంతుఁడు+అయిన= మంచిగుణాలు కల; కొడుకు= పుత్రుడు; నీకు, జన్మించును= నీకు పుట్టుతాడు; అని= అని చెప్పి;

దానికిన్= లోపాముద్రకు; గర్భ+ఆధానంబు+చేసి= గర్భాన్ని ఉంచి, అంటే పుత్రోత్పత్తి అగునట్లు తన తేజస్సును నిక్షేపించి; అగస్త్యుండు; తపోవనంబునకు= తపస్సు చేసికొనే అరణ్యానికి; అరిగెన్= వెళ్ళాడు, ఇట= ఇచట; లోపాముద్రయున్; ఏడు+ఏండ్లు= ఏడు సంవత్సరాలు; గర్భంబున్+తాల్చెన్= కడుపుతో ఉండింది; అంతన్= అటుపిమ్మట; ఆ+కోమలికి= అ సుకుమారి అయిన లోపాముద్రకు.

తాత్పర్యం: అని లోపాముద్ర బదులు పలుకగా, అగస్త్యమహర్షి 'నీవు కోరినమేరకు నీకు గుణవంతుడైన కొడుకు పుట్టుతాడు' అని చెప్పి ఆమెకు గర్భాధానం చేసి, ఆ ముని తపస్సు చేసికొనటానికై అరణ్యానికి వెళ్ళాడు. ఇట లోపాముద్ర ఏడు సంవత్సరాలు కడుపుతో ఉండింది. అంత సుకుమారి అయిన లోపాముద్రకు.

క. తనయుఁడు దృఢస్యుఁ డనఁగా । ననవద్యుఁడు వేదములు రహస్యంబులతో
నొనరఁగ జపంబు సేయుచు । నినతేజుఁడు పుట్టె భువనమెల్ల వెలుంగన్. 353

ప్రతిపదార్థం: తనయుఁడు= కొడుకు; దృఢస్యుఁడు+అనఁగాన్= దృఢస్యుడు అనే పేరు కలవాడై; అనవద్యుఁడు= ఎటువంటి లోపం లేనివాడు; ఇనతేజుఁడు= సూర్యుడివంటి తేజస్సు కలవాడు; వేదములు; రహస్యంబులతోన్= అంతరార్థాలతో; ఒనరఁగన్= ఒప్పునట్లుగా; జపంబు+చేయుచున్= వల్లె వేస్తూ; భువనము+ఎల్ల= ప్రపంచమంతయు; వెలుంగన్= ప్రకాశించేటట్లుగా; పుట్టెన్= జన్మించాడు.

తాత్పర్యం: ఆ లోపాముద్రకు ప్రపంచమంతా వెలుగొందేటట్లు సూర్యతేజస్వి, నిష్కళంకుడు అయినకొడుకు దృఢస్యుడు అనే పేరు కలవాడు, వేదాలను అంతరార్థాలతో వల్లెవేస్తూ జన్మించాడు.

వ. వానికిం దేజస్వి యను ఋషి పుట్టి యపారంబయిన యిధ్మభారంబు వహించుటంజేసి యిధ్మవాహుం డనం బరఁగె; ని ట్లగస్త్యుండు పుత్త్ర పౌత్త్రవంతుం డయి తన పితరులం బుణ్యలోకగతులం జేసె' నని వైశంపాయన కథితకథాక్రమం బతిరమ్యంబుగాను. 354

ప్రతిపదార్థం: వానికిన్= ఆ దృఢస్యుడికి; తేజస్వి+అను= తేజస్వి అనే పేరు కల; ఋషిపుట్టి= ముని జన్మించి; అపారంబు+ఐన= మితిలేని; ఇధ్మ భారంబు= వంటకట్టెల బరువు; వహించుటన్+చేసి= మోయటంవలన; 'ఇధ్మ వాహుండు'= ఇధ్మవాహుడు; అనన్+పరఁగెన్= అని పిలువబడ్డాడు; ఇట్లు= ఈ విధంగా; అగస్త్యుండు= అగస్త్యుడు; పుత్త్ర, పౌత్త్ర వంతుండు+అయి= కొడుకు, మనుమడు కలవాడై; తన పితరులన్= తన పితృదేవతలను; పుణ్య, లోక, గతులన్+చేసెన్= పుణ్యలోకాలకు వెళ్ళే వారినిగా చేశాడు; అని= అంటూ; వైశంపాయన, కథిత, కథాక్రమంబు= వైశంపాయన మహర్షిచేత చెప్పబడిన కథయొక్క విధానం; అతి, రమ్యంబుగాను= మిక్కిలి మనోహరంగా.

తాత్పర్యం: ఆ దృఢస్యుడికి తేజస్వి అనే పేరుకల ఋషి పుట్టాడు. అతడు మితి లేని వంటకట్టెల బరువు సులువుగా మోయగలగటంచేత అతడికి ఇధ్మవాహుడు అనే నామాంతరం ఏర్పడింది. ఈ విధంగా అగస్త్యుడు పుత్త్ర పౌత్త్రవంతుడు అవటంచేత అతడి పితృదేవతలకు పుణ్యగతులు ఏర్పడ్డాయి. ఇది వైశంపాయన మహర్షిచేత చెప్పబడిన కథావిధానం; మిక్కిలి మనోహరమైనది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆశ్వాసాంతము

క. కలికాలభరతలక్ష్మీ । లలనాస్పద! వీర గుణ విలాస! విరోధి
ప్రళయాంతక! నిఖిలమహీ । వలయోద్వహబాహు! విష్ణువర్ధనమూర్తీ! 355

ప్రతిపదార్థం: కలి, కాల, భరత, లక్ష్మీ, లలనాస్పద!= కలియుగంలో భరతచక్రవర్తికి సంబంధించిన లక్ష్మీదేవికి నెలవైనవాడా!; వీర, గుణ, విలాస!= శౌర్య లక్షణాలతో హొయలు మీరినవాడా!; విరోధి, ప్రళయ+అంతక!= శత్రువులపట్ల ప్రళయకాలంలోని యముడివంటివాడా!; నిఖిల, మహీ, వలయ+ఉద్వహ, బాహు!= సమస్త భూమండలాన్ని గొప్పగా భరించిన చేతులు కలవాడా!; విష్ణు వర్ధన మూర్తీ!= విష్ణువర్ధనబిరుదును సార్థకం చేసే స్వరూపం కలవాడా!

తాత్పర్యం: ~~ఈ~~ కలియుగంలో అలనాటి సుప్రసిద్ధ భరత సార్వభౌముడు ఏలిన రాజ్యలక్ష్మీదేవికి నేడు నెలవైనవాడా! వీరలక్షణాలతో హొయలు మీరినవాడా! శత్రువులపట్ల ప్రళయసమయంలోని యముడివంటివాడా! సమస్త భూమండలాన్ని చక్కగా భరించే బాహుబలం కలవాడా! విష్ణువర్ధన బిరుదాన్ని సార్థకం చేసే స్వరూపం కలవాడా! ఓ రాజరాజనరేంద్రా!

విశేషం: (1) భరతలక్ష్మీలలనాస్పద:- ఆసేతు హిమాచలం విస్తరించిన భూభాగానికి భరతఖండం అనేపేరు చరిత్ర ప్రసిద్ధం. భరతవర్షంలోనిది భరతఖండం. అందులోని భాగం వేంగి. భరతుడనే మహారాజు పరిపాలించటంచేత ఈ దేశానికి ఆ పేరువచ్చింది. అట్టి భరతుడు ఒకనాడు ఏలిన రాజ్యలక్ష్మిని ఏలుతున్న ప్రభువు శ్రీ రాజరాజనరేంద్రుడు. పైపద్యం మొదటి పాదానికి - కలికాల భరత! (కలియుగంలో భరతుడివంటివాడా!); లక్ష్మీలలనాస్పద! (రాజ్యలక్ష్మీ అనే లలనకు ఆశ్రయమైన (నెలవైన) వాడా!)- అని కూడ అర్థ సమన్వయం చేయవీలున్నది. (2) రాజరాజనరేంద్రుడు నన్నయభట్టప్రణీతంబైన శ్రీ మహాభారత కృతిపతి. ప్రథమ ప్రధాన శ్రోత. అందుచేత ఆశ్వాసాంత పద్యాలు. ఆశ్వాసారంభ పద్యాలు అతడి సంబోధనలతో కూడి ఉంటాయి.

పృథ్వీవృత్తము.

సమస్త భువనాశ్రయా! వినయసత్యనిత్యోదయా!
సమీహితగుణ క్రియా! స్థిరవిశాలకీర్తిప్రియా!
నమ న్నృప కిరీట చుంబి చరణద్వయా! సంతత
క్షమాభరణ! రాజరాజ! పరగండభేరుండకా! 356

ప్రతిపదార్థం: సమస్త, భువన+ఆశ్రయా!= సర్వ భువనానికి ఆధారమైనవాడా!; వినయ, సత్య, నిత్య+ఉదయా!= వినయం, సత్యం అనే గుణాలు ఎల్లప్పుడు వికసించేటట్లు ఉండేవాడా!; సమీహిత, గుణ, క్రియా!= గుణాలకు, క్రియలకు పొందిక కలవాడా! అంటే అనుష్ఠానవేదాంతీ!; స్థిర, విశాల, కీర్తి, ప్రియా!= శాశ్వతం, విస్తారం అయిన యశస్సును ఆర్జించటంలో ఇష్టం కలవాడా!; నమత్+నృప, కిరీట, చుంబి, చరణ, ద్వయా!= నమస్కారం చేసే రాజుల కిరీటాలను ముద్దుపెట్టుకొనే రెండు పాదాలు కలవాడా! (అంటే సార్వభౌముడయినవాడా!); సంతత, క్షమా+ఆభరణ= ఎల్లప్పుడు ఓర్పును ఆభరణంగా కలవాడా!; రాజరాజ!= రాజరాజనరేంద్రా!; పర, గండ, భేరుండకా!= శత్రువీరులపట్ల గండభేరుండకంవంటివాడా!

తాత్పర్యం: సకలభువనాలకు ఆధారమైనవాడా! వినయం, సత్యం అనే గుణాలకు నిత్యవికాసం కల్పించేవాడా! త్రికరణశుద్ధి కలిగిన అనుష్ఠాన వేదాంతీ! శాశ్వతమైన, సువిశాలమైన కీర్తిని ఆర్జించటంలో ఇష్టం కలవాడా! సార్వభౌమా! ఎల్లప్పుడు సహనం అనే ఆభరణాన్ని ధరించేవాడా! ఓ రాజరాజనరేంద్రా! శత్రువులపట్ల గండభేరుండపక్షివంటివాడా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) 'భువనాశ్రయ' బిరుదాంకితులు చాళుక్య సమ్రాట్టులు. (2) రాజరాజనరేంద్రుడి శాశ్వత సువిశాలకీర్తి ప్రియత్వంలో ఆంధ్రమహాభారతకృతిపతిత్వం ధ్వనిస్తున్నది. (3) గండభేరుండం: రెండు తలలు మూడుకన్నులు గల పెద్దపక్షి. ఆకారంలో మిక్కిలి పెద్దది. సంస్కృత నిఘంటువులలో 'భేరుండ' శబ్దమే కనిపిస్తున్నది. తెలుగులో 'గండ భేరుండ' మనే ప్రయోగం సుప్రసిద్ధం. (4) ఈ వృత్తపాదంలో వరుసగా జ,స,జ,స,య,లగ గణాలు ఉంటాయి. 12 వ అక్షరం యతి.

గద్యము.

ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్ట ప్రణీతంబైన శ్రీ మహాభారతంబునం దారణ్య పర్వంబున బృహదశ్వు దర్శనంబును, నలోపాఖ్యానంబును, నారదాగమనంబును, సకలతీర్థకీర్తనంబును, రోమశుం డర్జున కుశలవార్తc జెప్పుటయు, రోమశమహాముని యుపదేశంబున ధర్మజు తీర్థాభిగమనంబును, నగస్త్యుండు లోపాముద్రం బరిగ్రహించుటయు వాతాపిభక్షణంబును నన్నది ద్వితీయాశ్వాసము. 357

ప్రతిపదార్థం: ఇది= ఈ రచన; సకల, సుకవి, జన వినుత= అందరు గొప్ప కవుల బృందంచేత ప్రస్తుతించబడిన; నన్నయ భట్ట, ప్రణీతంబు+అయిన= నన్నయభట్టుచేత వ్రాయబడిన; శ్రీ మహాభారతంబునందు= శ్రీ మహాభారతంలో; ఆరణ్యపర్వంబునన్= ఆరణ్యపర్వంలో; బృహదశ్వు, దర్శనంబును= బృహదశ్వుడి సందర్శనమున్నూ; నల+ఉపాఖ్యానంబును= నలుడి గురించిన ఉపకథయున్నూ; నారద+ఆగమనంబును= నారదుడి రాకయున్నూ; సకల, తీర్థ, కీర్తనంబును= సమస్త పుణ్యక్షేత్రాల ప్రశంసయున్నూ; రోమశుండు; అర్జున కుశలవార్తన్= అర్జునుడి క్షేమ సమాచారాన్ని; చెప్పుటయు= ధర్మరాజుకు చెప్పటమున్నూ; రోమశ, మహాముని+ఉపదేశంబునన్= రోమశమహర్షి ప్రబోధంవలన; ధర్మజు తీర్థ+అభిగమనంబునున్= ధర్మరాజు పుణ్యక్షేత్రాల సందర్శనార్థం వెళ్ళటమున్నూ; అగస్త్యుండు; లోపాముద్రన్; పరిగ్రహించుటయు= పెండ్లాడటమున్నూ; వాతాపి, భక్షణంబునున్= వాతాపిని తిని అరిగించుకొనటమున్నూ; అన్నది= అనేటువంటిది; ద్వితీయ+ఆశ్వాసము= రెండవ ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది- సమస్త సుకవుల బృందంచేత ప్రస్తుతించబడిన నన్నయభట్టు రచించిన శ్రీ మహాభారతంలో పదునెనిమిది పర్వాలలో మూడవది అయిన ఆరణ్యపర్వంలో బృహదశ్వుడి దర్శనమున్నూ, నలోపాఖ్యానమున్నూ, నారదుడి రాకయున్నూ, సకలపుణ్యక్షేత్ర వర్ణనమున్నూ, రోమశుడు వచ్చి అర్జునుడి క్షేమవార్త చెప్పటమున్నూ, రోమశమహాముని ఉపదేశించిన విధంగా పాండవులు తీర్థయాత్రలకు వెళ్ళటమున్నూ, అగస్త్యుడి కథయున్నూ, లోపాముద్ర వివాహమున్నూ, వాతాపిభక్షణమున్నూ- అనే అంశాలు కలది రెండవ ఆశ్వాసం.

-:ఆరణ్యపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం:-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము - తృతీయాశ్వాసము

శ్రీ మందిర! బుధజన చిం । తామణి! కోదండపార్థ! ధర్మవిచారో
ద్దామ! నల నృగ భగీరథ । రామ చరిత్రాభిరామ! రాజనరేంద్రా! 1

ప్రతిపదార్థం: శ్రీ, మందిర!= లక్ష్మీ దేవికి నిలయమైనవాడా!; బుధ, జన, చింతామణి!= పండితులైన వారి కోరికలను ఈడేర్చే దేవమణి వంటివాడా!; కోదండ, పార్థ!= విలువిద్యలో అర్జునుడి వంటివాడా!; ధర్మ, విచార+ఉద్దామ!= ధర్మాన్ని అనుశీలించటంలో అధికుడివైనవాడా!; నల, నృగ, భగీరథ, రామ, చరిత్ర+అభిరామ!= నల, నృగ, భగీరథ, రాముల వంటి శీలాన్ని కలిగిఉండటంచేత అందగించినవాడా!; రాజనరేంద్రా!= ఓ రాజరాజనరేంద్రా!

తాత్పర్యం: ఓ రాజరాజనరేంద్రా! లక్ష్మికి ఆస్పదమైనవాడా!, విద్వాంసులు కోరిన కోరికలు తీర్చటంలో దేవమణి అయిన చింతామణి వంటివాడా!, విలువిద్యలో పార్థుడివంటివాడా!, ధర్మాన్నిగురించిన అనుశీలనలో ఆరితేరినవాడా!, నలుడివంటి, నృగుడివంటి, భగీరథుడివంటి, శ్రీరామచంద్రుడివంటి చరిత్రతో శోభిల్లేవాడా!

విశేషం: ఆశ్వాసంలోని మొదటిపద్యం కృతిపతిసంబోధనగా నన్నయభట్టు ఏర్పరచిన సంప్రదాయం తరువాతి కవులకు ఒజ్జ బంతి అయింది. ప్రథమాశ్వాసంలోని మొదటిపద్యవివరణం కూడా అనుశీలించదగింది.

అగస్త్య చరిత్రము (సం. 3-98-1)

వ. అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె; నట్లు ధర్మతనయుం డగస్త్యు మాహాత్మ్యంబు విని వెండియుఁ దచ్చరిత్రంబు రోమశు నడిగిన, నమ్ముని యిట్లనియె. 2

ప్రతిపదార్థం: అక్కథకుండు= ఆ+కథకుండు= (ఉగ్రశ్రవసుడు అనే సూతుడు); శౌనక+ఆది, మహత్+మునులకున్= శౌనకుడు మొదలైన గొప్ప ఋషులకు; చెప్పెన్= చెప్పాడు; అట్లు= ఆ విధంగా; ధర్మ తనయుండు= ధర్మరాజు; అగస్త్య, మాహాత్మ్యంబు= అగస్త్యుడియొక్క మహిమ; విని= ఆలకించి; వెండియున్= మళ్ళీ; తద్+చరిత్రంబు= అతడి వృత్తాంతం; రోమశున్= రోమశుడిని; అడిగినన్= ప్రశ్నించగా; ఆ+ముని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ కథకుడైన ఉగ్రశ్రవసుడు, శౌనకుడు మొదలుగా గల మునులకు భారతకథ చెప్పాడు, అట్లా (ఆ విధంగా) ధర్మరాజు అగస్త్యుడి మహిమను ఆలకించి, మళ్ళీ (తిరిగి) విశేషంగా ఆ మహర్షిచరిత్ర సవిస్తరంగా వినాలనే కుతూహలంతో రోమశుడిని అడుగగా, ఆ ముని ఈవిధంగా చెప్పసాగాడు.

సీ. 'కృతయుగంబునఁ గాలకేయగణంబుతో । వృత్రుఁ డన్నసుర గర్వించి యమర
పతిఁ దొట్టి వేల్పుల బాధించుచున్నఁ ద । ద్భయమున నమరులు బ్రహ్మకడకుఁ

జని 'పోరిలో వృత్రుఁ జంప నుపాయ మె। య్యదియొ మా కానతి' మ్మన నజుండు

'దివిరి సరస్వతీ తీరంబునందు ని। శ్చింతుఁడై తప మొప్పఁ జేయుచున్న

ఆ. యా దధీచికడకు నరిగి వేఁడుండు, ని। జాస్థు లిచ్చు మీకు నమ్మహాత్ముఁ;

దవి జయించు వజ్ర మాదిగా నిఖిలది। వ్యాయుధంబులై సురారివరుల. 3

ప్రతిపదార్థం: కృత, యుగంబునన్= కృతయుగంలో; కాలకేయ గణంబుతో= కాలకేయులు అనే రాక్షస సమూహాలతో; వృత్రుఁడు+అన్+అసుర= వృత్రుడు అనే పేరు కలిగిన రాక్షసుడు; గర్వించి= గర్వం కలవాడై; అమరపతిన్= ఇంద్రుడిని; తొట్టి= మొదలుకొని; వేల్పులన్= దేవతలను; బాధించుచు+ఉన్నన్= కష్టాల పాలుచేస్తుండగా; తద్+భయమునన్= అతడివలని భీతిచేత; అమరులు= దేవతలు; బ్రహ్మకడకున్+చని= బ్రహ్మదేవుడి ఒద్దకు చేరి; పోరిలోన్= యుద్ధంలో; వృత్రున్= వృత్రుడు అనే రాక్షసుడిని; చంపన్= సంహరించేందుకు; ఉపాయము= ఉపాయం (వెఱువు); ఏ+అదియొ= ఏదో; మాకు+ఆనతి+ఇమ్ము= మాకు దయచేసి చెప్పవలసింది; అనన్= అని అడుగగా; అజుండు= పుట్టుక లేనివాడైన బ్రహ్మదేవుడు; తివిరి= పూనికతో; సరస్వతీ తీరంబు నందు= సరస్వతీ నది తీరాన; నిశ్చింతుఁడు+ఐ= ఎటువంటి విచారములు లేని వాడై; తపము= తపస్సు; ఒప్పన్= ఒప్పునట్లుగా; చేయుచున్న= చేస్తున్న; ఆ+దధీచి కడకున్= ఆ దధీచి అనే ముని దగ్గరికి; అరిగి= వెళ్ళి; వేఁడుండు= ప్రార్థించండి; ఆ+మహా+ఆత్ముఁడు= ఆ మహానుభావుడైన దధీచిమహర్షి; నిజ+అస్థులు= తనఎముకలు; మీకున్= మీకు; ఇచ్చున్= ఈయగలడు; అవి= ఆ ఎముకలు; వజ్రము+ఆదిగా= వజ్రం మొదలైన; నిఖిల, దివ్య+ఆయుధంబులు+ఐ= దివ్యమైన సకలాయుధాలుగా రూపొంది; సుర+అరి, వరులన్= వేల్పుల విరోధులలో శ్రేష్ఠులు అయిన వారందరిని; జయించున్= గెలువగలవు.

తాత్పర్యం: 'కృతయుగంలో కాలకేయులనే రాక్షసుల సమూహాలతో కలిసి వృత్రుడనే రాక్షసుడు గర్వంతో దేవేంద్రుడు మొదలైన దేవతలను బాధిస్తున్నాడు. దేవతలు వృత్రుడిబాధలు పడలేక భీతిల్లి బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్లి 'వృత్రుడిని యుద్ధంలో ఎట్లా చంపటానికి వీలవుతుందో అటువంటి ఉపాయాన్ని చెప్పు' మని అడిగారు. అపుడు బ్రహ్మదేవుడు సరస్వతీ నదీ తీరాన నిష్ఠతో తపస్సు చేస్తున్న దధీచిమహర్షిదగ్గరకి వెళ్ళి మీరు ప్రార్థిస్తే అతడు తన ఎముకలను దానం చేయగలడు అనిన్నీ, ఆ ఎముకలు వజ్రం మొదలైన దివ్యాయుధాలుగా మారుతా యనిన్నీ, అవి దేవతల శత్రువులను జయించగలవనిన్నీ- చెప్పాడు.

విశేషం: ప్రాచీన భారతీయ కాలమానం ప్రకారం యుగాలు నాలుగు. 1. కృతయుగం: 17,28,000 సంవత్సరాలు; 2. త్రేతాయుగం: 12,96,000 సంవత్సరాలు: 3. ద్వాపరయుగం: 8,64,000 సంవత్సరాలు: 4. కలియుగం: 4,32,000 సంవత్సరాలు.

వ. అందు వజ్రంబున నింద్రుండు వృత్రు వధియించు' ననిన నమరు లెల్లం గమలాసను శాసనంబున దధీచి పాలికిం జని కృతప్రణాము లై యిట్లనిరి. 4

ప్రతిపదార్థం: అందున్= అట్లా దివ్యాయుధాలైన అస్థికలలోని; వజ్రంబునన్= వజ్రాయుధంతో; ఇంద్రుండు= ఇంద్రుడు; వృత్రున్= వృత్రుడిని; వధియించున్= చంపుతాడు; అనినన్= అని బ్రహ్మదేవుడు చెప్పగా; అమరులు+ఎల్లన్= దేవతలందరు; కమల+ఆసను= కమలం (పద్మం) ఆసనంగా కల బ్రహ్మదేవుడియొక్క; శాసనంబునన్= ఆజ్ఞవలన; దధీచి, పాలికిన్+చని= దధీచి మహర్షి ఒద్దకు వెళ్ళి; కృత, ప్రణాములు+ఐ= నమస్కరించినవారై, (చేసిన ప్రణామం కలవారై); ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: ఆ దధీచిమహర్షి ఎముకలవలన ఏర్పడిన ఆయుధాలలోని వజ్రంవలన ఇంద్రుడు వృత్రుడిని సంహరిస్తాడు'- అని బ్రహ్మదేవుడు చెప్పగా, అతడి ఆజ్ఞవలన దేవతలందరూ దధీచిమహామునివద్దకు వెళ్ళి నమస్కరించి ఇట్లా పలికారు.

క. **'భువనజనస్తుత! నిజగౌ । రవ మెసఁగఁగ నమరపతి పురస్కృతు లగు ని**
ద్దివిజుల కెల్ల హితంబుగ । భవదస్థిచయంబు లిమ్ము పరమమునీంద్రా!' 5

ప్రతిపదార్థం: భువన జన స్తుత!= లోకంలోని ప్రజలందరిచేత పొగడబడినవాడా!; పరమ, ముని+ఇంద్రా!= గొప్పఋషులలో శ్రేష్ఠుడివైన వాడా!; అమరపతి, పురస్కృతులు+అగు= దేవేంద్రుడిని ముందు పెట్టుకొని వచ్చిన; ఈ దివిజులకు+ఎల్లన్= ఈ దేవతలందరికి; హితంబుగన్= మేలయ్యేటట్లు; భవత్+అస్థి+చయంబులు= నీయొక్క ఎముకల సముదాయాలు; నిజగౌరవము+ ఎసఁగఁగన్= తమయొక్క గొప్పతనం శోభిల్లేటట్లుగా; ఇమ్ము= ఇవ్వవలసింది.

తాత్పర్యం: 'ఋషులలో కెల్ల గొప్ప ఋషివైన ఓ దధీచి! నీ గొప్పతనం శోభించేటట్లుగా, దేవేంద్రుడిని ముందు పెట్టుకుని నిన్ను అర్థిస్తున్న ఈ దేవతలందరికీ మేలు కలిగేటట్లు నీ ఎముకలను దానం చేయవలసింది.'

వ. **అనిన విని దధీచి సంతసిల్లి 'కృతార్థుండ నైతి' నని దేవహితార్థంబుగా నిజప్రాణంబుల విడిచె; నమరులెల్ల నమ్మహాముని యస్థు లాయుధంబులుగాఁ బరిగ్రహించి; రందు. 6**

ప్రతిపదార్థం: అనినన్= అని వేల్పులు ప్రార్థించగా; విని; దధీచి= దధీచిమహర్షి; సంతసిల్లి= సంతోషించి; కృత+అర్థుండను= చరితార్థుడిని (ధన్యుడిని); ఐతిన్+అని= అయ్యానని; దేవహిత+అర్థంబుగాన్= దేవతల మేలుకొరకు; నిజప్రాణంబులన్= తన అసువులను; విడిచెన్= విడిచాడు; అమరులు+ఎల్లన్= దేవతలందరూ; ఆ+మహాముని, అస్థులు= ఆ మహాముని ఎముకలను; ఆయుధంబులుగాన్= శస్త్రాలుగా; పరిగ్రహించిరి= తీసికొన్నారు; అందున్= అందు.

తాత్పర్యం: ఆ విధంగా దేవతలు తనను ప్రార్థించగా, దధీచిమహర్షి తన జన్మ ధన్యమైనదని సంతోషించి, దేవతల మేలు కోరి తన ప్రాణాలను విడిచాడు. దేవతలందరూ ఆ మహాముని ఎముకలను ఆయుధాలుగా స్వీకరించారు; అందు.

విశేషం: 'పరోపకారార్థ మిదం శరీరమ్'- అన్న ఆదర్శాన్ని ఆచరించి చూపించిన అనుష్ఠాన వేదాంతిగా దధీచి పౌరాణిక వాఙ్మయంలో సుప్రసిద్ధుడు.

ఆ. **త్వష్ట యంత నూఱుధారల రమ్యమై । యనలకణ కరాళ మైన వజ్ర**
మొనరఁ జేసి 'దీన నోర్వుము దైత్యుల' । ననుచు నిచ్చె దాని నమరపతికి. 7

ప్రతిపదార్థం: అంతన్= అనంతరం; త్వష్ట= త్వష్ట అనే ప్రజాపతి; నూఱు, ధారలన్= వంద అంచులతో; రమ్యము+ఐ= అందంగా ఉన్నట్టి; అనల, కణ, కరాళము+ఐన= అగ్గిరవ్వలచేత భయంకరమైన; వజ్రము+ఒనరన్+చేసి= వజ్రం అనే ఆయుధాన్ని ఒప్పేటట్లుగా చేసి; దీనన్= దీనితో (ఈ ఆయుధంతో); దైత్యులన్= రాక్షసులను; ఓర్వుము= జయించవలసింది; అనుచున్= అని చెప్తుతూ; దానిన్= దానిని; అమరపతికిన్= దేవేంద్రుడికి; ఇచ్చెన్= ఇచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: త్వష్ట అనే ప్రజాపతి నూరు మొనలుతేలి నిప్పురవ్వలతో భయంకరంగా ఉండే వజ్రం అనే ఆయుధాన్ని నిర్మించి 'దీనితో రాక్షసులను జయించు' మని దేవేంద్రుడికి ఇచ్చాడు.

వ. అవ్వజ్రంబున నింద్రుండు వృత్రు వధియించె నంత. 8

ప్రతిపదార్థం: ఆ+వజ్రంబునన్= ఆ వజ్రాయుధంతో; ఇంద్రుండు= ఇంద్రుడు; వృత్రున్= వృత్రుడిని; వధియించెన్= సంహరించాడు; అంతన్= అటుపిమ్మట.

తాత్పర్యం: ఆ వజ్రాయుధాన్ని ప్రయోగించి దేవేంద్రుడు వృత్రుడిని సంహరించాడు. ఆ తరువాత.

చ. అనుపమదివ్యశస్త్రధరులైన యమర్త్యుల కాహవంబులో
మొనయక కాలకేయులు సముద్రముఁ జొచ్చి దివంబు లెల్ల న
వ్వనధి నడంగి యుండి బలవంతులు వెల్వడి రాత్రులెల్ల భూ
జనులకు బాధసేయుచు భృశంబుగ నుండిరి క్రూరచిత్తులై. 9

ప్రతిపదార్థం: అనుపమ, దివ్య, శస్త్ర, ధరులు+ఐన= సాటి లేని గొప్ప ఆయుధాలు ధరించిన వారైన; అమర్త్యులకు= దేవతలకు (మృత్యువు లేనివారికి); ఆహవంబులోన్= యుద్ధంలో; మొనయక= లొంగక; కాలకేయులు= కాలకేయు లనే రాక్షసులు; సముద్రమున్+చొచ్చి= కడలిలో దూరి; దివంబులు+ఎల్లన్= పగళ్ళు అన్నీ (అన్నియున్నూ); ఆ+వనధిన్= ఆ సముద్రంలో; అడంగి, ఉండి= దాగిఉండి; బలవంతులు= బలంగల ఆ రాక్షసులు; రాత్రులు+ఎల్ల= రాత్రి సమయాలన్నింటిలో; వెల్వడి= బయటికి వచ్చి; భృశంబుగన్= మిక్కిలిగా; భూ, జనులకున్= భూప్రజలకు; బాధ+చేయుచున్= పరితాపం కలిగిస్తూ; క్రూర, చిత్తులు+ఐ= దయలేని మనస్సు కలవారై; ఉండిరి= ఉన్నారు.

తాత్పర్యం: సాటిలేని ఆయుధాలు ధరించినవారైన దేవతలకు లొంగక కాలకేయులు అనే రాక్షసులు, పగలంతా సముద్రంలో దాగిఉండి, రాత్రులు బలవంతులై బయటికి వచ్చి, భూప్రజలకు అధికంగా ఉపద్రవాలను కలిగిస్తూ క్రూరులై ఉన్నారు.

వ. మఱియు 'విద్యాతపోయుక్తులై ధర్మచరితులైన వారి కారణంబున జగంబు లపాయంబు నొందక సుఖంబున్న యవి; గావున నట్టి వారిన రోసి వధియించి జగంబుల కపాయంబు సేయుద' మని యసురులు వసిష్ఠాశ్రమంబున నూటతొంబదియేడ్వురను, జ్యవనాశ్రమంబున నూర్వురను, భరద్వాజాశ్రమంబున నిరువదుండ్రనుంగాఁ బలువురు బ్రాహ్మణుల బ్రహ్మమయుల వధియించి, భక్షించి, యిప్పాట ననవరతంబు నఖిల మునిగణాశ్రమంబుల కుపద్రవంబు సేయుచున్న. 10

ప్రతిపదార్థం: మఱియు= అదియున్నూ కాక; విద్యా, తపస్+యుక్తులు+ఐ= విద్యతో, తపంతో కూడుకొన్న వారై; ధర్మచరితులు+ఐన= ధర్మమైన ప్రవర్తన కలవారైన; వారి కారణంబునన్= వారి మూలాన్నే; జగంబులు= భువనాలు; అపాయంబున్+ఒందక= కీడు చెందక; సుఖంబు+ఉన్నయవి, కావున= సుఖంగా ఉన్నాయి కాబట్టి; అట్టి వారిన్+అ= అటువంటివారినే; రోసి= వెదకి; వధియించి= చంపి; జగంబులకు= లోకాలకు; అపాయంబు+చేయుదము+అని= కీడు కలిగిద్దాము- అని ఆలోచించి; అసురులు= రాక్షసులు; వసిష్ఠ+ఆశ్రమంబునన్= వసిష్ఠుడి ఆశ్రమంలో; నూట తొంబది+ఏడ్వురను= నూట తొంభైఏడు మందిని; చ్యవన+ఆశ్రమంబునన్= చ్యవన మహర్షి ఆశ్రమంలో; నూర్వురను= వందమందిని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భరద్వాజ+ఆశ్రమంబునన్= భరద్వాజ మహర్షి ఆశ్రమంలో; ఇరువదుండ్రనున్+కాన్= ఇరవైమంది అగునట్లు; పలువురు బ్రాహ్మణులన్= అనేకమందివిప్రులను; బ్రహ్మమయుల= జ్ఞానమూర్తులను; వధియించి= సంహరించి; భక్షించి= తిని; ఈ+పాటన్= ఈ విధంగా; అనవరతంబున్= ఎల్లప్పుడూ; అఖిల మునిగణ+ఆశ్రమంబులకున్= అందరు ఋషుల ఆశ్రమాలకున్నూ; ఉపద్రవంబు= కీడును; చేయుచున్నన్= కలిగిస్తుండగా.

తాత్పర్యం: ఇంకనూ ఆ కాలకేయులు చాలారకాల ఆగడాలకు పాల్పడ్డారు. 'విద్య, తపస్సులచేత కూడినవారై ధార్మికప్రవర్తన కలిగిన మహానుభావుల మూలాన్నే లోకాలు ప్రమాదానికి లోనుకాకుండా నిలిచి ఉన్నాయి కాబట్టి, అటువంటి పుణ్యాత్ములనే వెదకి వెదకి సంహరించి, లేదా ఈ జగానికి కీడు మూడేటట్లు చేద్దాం గాక'- అని ఆ రాక్షసులు ఆలోచించి వసిష్ఠుడిఆశ్రమంలో నూటతొంభైయేడు మందిని, చ్యవనుడి ఆశ్రమంలో వందమందిని, భరద్వాజుడి ఆశ్రమంలో ఇరవైమందిని- ఈ రీతిగా అనేకులైన బ్రాహ్మణులను, జ్ఞానమూర్తులైనవారిని సంహరించి వారిని భక్షించారు. ఈ విధంగా ఆ కాలకేయులు ఎల్లప్పుడూ ఋషుల ఆశ్రమాలకు ఉపద్రవాలు కల్పించసాగారు.

దేవతలు వైకుంఠమునకుఁ బోయి విష్ణుని స్తుతియించుట (సం. 3-99-11)

క. యాగాది పుణ్యకర్మ । త్యాగము మర్త్యమున నైనఁ దా రధికభయో
ద్వేగంబునఁ బురుహూతపు । రోగములై యగ్నియమవరుణధనదాదుల్. 11

ప్రతిపదార్థం: యాగ+ఆది, పుణ్య, కర్మత్యాగము= యజ్ఞాలు మొదలైన పుణ్యకార్యాలు విడువబడటం; మర్త్యమునన్+ఐనన్= మానవలోకంలో సంభవించటం చేత; తారు= తాము (దేవతలు); అధిక+భయ+ఉద్వేగంబునన్= ఎక్కువ వెఱపుతో కూడుకొన్న ఆవేశంతో; పురుహూత+పురస్+గములు+ఐ= ఇంద్రుడిని ముందు పెట్టుకొని వెళ్ళినవారై; అగ్ని, యమ, వరుణ, ధనద+ఆదుల్= అగ్నిదేవుడు, యమధర్మరాజు, వరుణుడు, కుబేరుడు మొదలైనవారు.

తాత్పర్యం: భూలోకంలో యజ్ఞాలు మొదలైన పుణ్యకార్యాలు జరగకపోవటంచేత మిక్కిలి భీతిని, ఉద్వేగాన్ని చెంది, అగ్నిదేవుడు, యమధర్మరాజు, వరుణుడు, కుబేరుడు మొదలైనవారు దేవేంద్రుడిని తమకు నాయకుడిగా ముందుపెట్టుకొని.

క. చని వైకుంఠంబునఁ ద్రిభు । వనపతి వైకుంఠు గరుడవాహను విష్ణున్
దనుజవిభంజనుఁ గని యి । ట్లని రెంతయు భక్తితోఁ గృతాంజలు లగుచున్. 12

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; వైకుంఠంబునన్= విష్ణుదేవుడి లోకమైన వైకుంఠంలో; త్రి+భువన+పతి= మూడు లోకాలకు అధినేత అయిన; వైకుంఠున్= వికుంఠ నగరాధిపతిఅయిన విష్ణుదేవుడిని; గరుడవాహనున్= గరుడుడిని వాహనంగా కల వాడిని; దనుజవిభంజనున్= రాక్షసులను సంహరించేవాడిని; విష్ణున్= విష్ణుదేవుడిని; కని= సందర్శించి; కృత+అంజలులు= కూర్చిన అంజలి కలవారు (నమస్కరించినవారు); అగుచున్= అవుతూ; ఎంతయున్= మిక్కిలి; భక్తితోన్= గౌరవంతో కూడిన పూజ్యభావంతో; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: వారు వైకుంఠానికి వెళ్ళి మూడులోకాలకు అధినేత, గరుడవాహనుడు, వైకుంఠానికి అధిపతి, రాక్షసులను సంహరించేవాడు అయిన విష్ణుదేవుడిని సందర్శించి మిక్కిలి భక్తితో నమస్కరించి ఇట్లా విన్నవించారు.

వ. 'దేవా! నీవు వరాహరూపధరుండవై మహీతలం బెత్తి, నరసింహరూపంబు దాల్చి యాదిదైత్యు హిరణ్యకశిపు వధించి, వామనుండవై బలిం గట్టి, యజ్ఞమూర్తి వై యజ్ఞవిఘ్నకరుండైన జంభుండను దానవుం జంపి, యండజ జరాయుజస్వేదజోద్భిజ్జంబు లనం బరఁగిన చతుర్విధ ప్రజల రక్షించుచున్న జగద్రక్షకుండవు గావున నీకు విన్నపంబు సేసెద; మిప్పుడు జగంబులకైన యుపద్రవంబు చిత్తగింపుము. 13

ప్రతిపదార్థం: దేవా!= ఓ పరమాత్మా!; నీవు= నీవు; వరాహ, రూప, ధరుండవు+ఐ= వరాహ ఆకారం ధరించిన వాడివై; మహీ, తలంబు+ఎత్తి= భూస్థలిని పైకెత్తి; నరసింహ, రూపంబు+తాల్చి= సగం మనిషి సగం సింహం ఆకారం ధరించి; ఆది, దైత్యున్= మొదటి రాక్షసుడిని; హిరణ్యకశిపున్= హిరణ్య కశిపుడు అనబడేవాడిని; వధించి= సంహరించి; వామనుండవు+ఐ= మరుగుజ్జవై; బలిన్+కట్టి= బలిని బంధించి; యజ్ఞ మూర్తివి+ఐ= యజ్ఞాన్ని ఆకృతిగా ధరించిన వాడివై; యజ్ఞ, విఘ్నకరుండు+ఐన= క్రతువులకు అంతరాయాన్ని కలిగించేవాడైన; జంభుండు+అను= జంభుడు అనే పేరు కల; దానవున్+చంపి= రాక్షసుడిని సంహరించి; అండజ= గ్రుడ్డునుండి పుట్టేటటువంటి; జరాయుజ= మావి వలన అంటే గర్భాశయంనుండి పుట్టేటటువంటి; స్వేదజ= చెమటనుండి పుట్టేటటువంటివి; ఉద్భిజ్జంబులు= భూమిని భేదించుకొని వెలువడేటటువంటివి; అనన్+పరఁగిన= అనబడిన; చతుర్+విధ ప్రజల= నాలుగురకాలైన సంతతులను (ప్రాణుల); రక్షించుచున్న= కాపాడుతున్న; జగత్+రక్షకుండవు= జగత్తును కాపాడేవాడివి; కావున= కాబట్టి; నీకు, విన్నపంబు+చేసెదము= నీకు విన్నవించుకొంటున్నాం; ఇప్పుడు= ఇప్పుడు; జగంబులకు+ఐన, ఉపద్రవంబు= ప్రపంచాలకు ఏర్పడినకీడు; చిత్తగింపుము= దయచేసి ఆలకించుము.

తాత్పర్యం: 'ఓ పరమాత్మా! నీవు వరాహంగా అవతరించి భూమిని పైకెత్తావు; నరసింహరూపం ధరించి హిరణ్యకశిపుడనే మొదటి రాక్షసుడిని సంహరించావు; మరుగుజ్జురూపం ధరించి బలిచక్రవర్తిని బంధించావు; యజ్ఞమూర్తివై యజ్ఞాలకు అంతరాయాలు కల్పించిన జంభుడనే రాక్షసుడిని సంహరించావు. ఈ ప్రపంచంలోని ప్రాణులను అన్నింటిని- గ్రుడ్డునుండి పుట్టేవాటిని (కోళ్ళు, బాతులు, పాములు ఇత్యాదులను), గర్భాశయాలనుండి ఉదయించేవాటిని (మేకలు, మానవులు మొదలగువారిని), చెమటనుండి పుట్టే వాటిని (పేలు మొదలైనవాటిని), తమంతకు తాము భూమినుండి పైకివచ్చేవాటిని (చెట్లు మొ॥ వాటిని) కాపాడుతున్న లోక రక్షకుడవు నీవే. అందుకే నీతో మొర పెట్టుకొనేందుకు వచ్చాం. ఇప్పుడు లోకాలకు ఏర్పడిన విపత్తును దయచేసి ఆలకించుము.

సీ. కాలకేయులు మహాకాయులు పగలెల్ల । జలదుర్గ బలమున జలధినుండి
రే లెల్లఁ జని నలి రేఁగి మునీశ్వరా । శ్రమముల సద్ధర్మచారు లైన
బ్రాహ్మణప్రవరులఁ బాయక వధియింతు । రెట్టి పాపాత్ములు నెయ్యుగముల
బ్రాహ్మణహింస యాపాదింతురే యది । వీరలవలనన వినఁగఁబడియెఁ;

ఆ. బరమసాధు లైన బ్రాహ్మణులకు బాధ । యగుడు మహికి బాధ యగు; ధరిత్రి
కైనబాధఁ జేసి యఖిలలోకంబులుఁ । గరము బాధ నొందుఁ గమలనాభ! 14

ప్రతిపదార్థం: కమల, నాభ!= పద్మం నాభియందు కలవాడా!; మహా+కాయులు= పెద్ద పెద్ద దేహాలు కలవారు; కాలకేయులు= కాలకేయులు అనబడే రాక్షసులు; పగలు+ఎల్లన్= పగటిసమయాలలో, (పగలంతా); జల దుర్గ బలమునన్= జలదుర్గం యొక్క బలంవలన; జలధిన్+ఉండి= సముద్రంలో (నే) ఉండి; రేలు+ఎల్లన్= రాత్రులం దెల్లప్పుడు; చని= వెడలి; నలి, రేఁగి= బాగా విజృంభించి; ముని+ఈశ్వర+ఆశ్రమముల= ఋషిశ్రేష్ఠులు నివసించే ఆశ్రమాలలో; సత్+ధర్మ చారులు+ఐన=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మంచి ధర్మాన్ని ఆచరించేటటువంటి వారైన; బ్రాహ్మణ ప్రవరులన్= విప్రశ్రేష్ఠులను- బ్రాహ్మణ ఉత్తములను; పాయక= విడువక; వధియింతురు= చంపుతారు; ఎట్టి, పాప+ఆత్ములున్= ఎటువంటి దుర్జనులైనా; ఏ+యుగముల= ఏ కాలాలలోనూ; బ్రాహ్మణహింస= విప్రులను బాధించటం; ఆపాదింతురు+ఏ= చేస్తారా!; అది= అటువంటి బ్రాహ్మణ హింస; వీరలవలనన= ఈ కాలకేయుల వలననే; వినఁగన్+పడియెన్= వినబడ్డది; పరమ సాధులు+ఐన= మిక్కిలి సౌమ్యులైన; బ్రాహ్మణులకు= విప్రులకు; బాధ+అగుడు= పరితాపం కలిగితే; మహికిన్= భూమికి; బాధ+అగున్= బాధ కలుగుతుంది; ధరిత్రికి+ఐన, బాధన్+చేసి= భూమికి కలిగిన బాధ వలన; అఖిల లోకంబులున్= సమస్త భువనాలున్నూ; కరము= మిక్కిలి; బాధన్+ఒందున్= వ్యథను చెందుతాయి.

తాత్పర్యం: ఓ పద్మనాభ! కాలకేయులు అనే రాక్షసులు పెద్ద పెద్ద శరీరాలు కలవారు. వారు సముద్రాన్ని జలదుర్గంగా చేసికొని పగలంతా అందులోనే ఉండి రాత్రులలో బయటకు వచ్చి, విజృంభించి ఋషుల ఆశ్రమాలలోని ధర్మాత్ములైన బ్రాహ్మణోత్తములను వదలకుండా సంహరిస్తుంటారు. అటువంటి పాపాత్ములు, ఆవిధంగా బ్రాహ్మణహింస చేసినవారు, అంతకుముందు ఏయుగంలో నైనా ఉన్నారా? అట్లాంటి వాళ్లలో కాలకేయులే ప్రథములని చెప్పవలసి ఉంటుంది. మిక్కిలి సౌమ్యప్రవర్తన కల బ్రాహ్మణులకు కీడు కలిగితే అందువల్ల భూమండలానికంతటికీ బాధ ఏర్పడుతుంది. ఆవిధంగా భూమికి బాధ ఏర్పడితే సమస్త లోకాలూ మిగుల పరితపిస్తాయి.

విశేషం: దుర్గము= పోవటానికి కష్టమైనది. దుర్గాలు ఆరు. 1. ధన్వ దుర్గం= నాలుగు ప్రక్కలా అయిదామడలమేర మరుభూమి గల కోట. 2. మహీదుర్గం= చుట్టూ మట్టిప్రాకారం గల కోట. 3. వార్క్ష దుర్గం= చుట్టూ చెట్టు చేమలు గల కోట. 4. జలదుర్గం= చుట్టూ నీరు గల కోట. 5. నరదుర్గం= చుట్టూ చతురంగబలాలు గల కోట. 6. గిరిదుర్గం= చుట్టూ కొండలు గల కోట. సముద్రం కాలకేయులకు సహజ 'జలదుర్గం' అయింది.

వ. ఎట్లనిన వేదంబులు ధరియించి విప్రులు వేదచోదితంబులైన పుణ్యకర్మంబులు విధియించుటం జేసి హవ్య కవ్యంబుల దేవతలుం బితరులుఁ దృప్తులైన వారివలన నెల్లలోకంబులకు సుఖం బగుం గావున బ్రాహ్మణోపద్రవంబు పరిహరించి లోకంబులు రక్షింపు' మనిన దేవతలకు విష్ణుదేవుం డిట్లనియె. 15

ప్రతిపదార్థం: ఎట్లు+అనినన్= అది ఎట్లా అని అడిగితే; వేదంబులు= వేదాలు; ధరియించి= వహించి; విప్రులు= బ్రాహ్మణులు; వేద చోదితంబులు+అయిన= వేదాలచేత విధించబడిన; పుణ్య కర్మంబులు= పుణ్యాన్ని ఇచ్చే పనులు; విధియించుటన్+చేసి= నిర్వహించటంచేత; హవ్య, కవ్యంబులు= దేవతలకు, పితృదేవతలకు అర్పించే హోమద్రవ్యాలచేత; దేవతలున్= దేవతలున్నూ; పితరులున్= పితృదేవతలున్నూ; తృప్తులు+ఐన= తనివి (తృప్తి) చెందినట్లయితే; వారివలనన్= ఆ దేవతలవలన, పితృదేవతల వలన; ఎల్ల లోకంబులకున్= సర్వప్రపంచాలకు; సుఖంబు+అగున్= సుఖం కలుగుతుంది; కావునన్= కాబట్టి; బ్రాహ్మణ+ఉపద్రవంబు= బ్రాహ్మణులకు జరిగే కీడు; పరిహరించి= తొలగించి; లోకంబులు= ప్రపంచాలను; రక్షింపుము= కాపాడుము; అనినన్= అని చెప్పగా; దేవతలకు= వేల్పులకు; విష్ణుదేవుండు= విష్ణుదేవుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అది ఎట్లా అనగా, బ్రాహ్మణులు వేదాలను చదివి, వేదవిహితాలైన పుణ్యకర్మలు చేయటం వలన వారు వేల్చెడి హవ్యకవ్యాలచేత దేవతలున్నూ, పితృదేవతలున్నూ తృప్తి చెందగలరు. తృప్తులైన దేవతలవలన, పితృదేవతలవలన సమస్తలోకాలకు సుఖం కలుగుతుంది. కాబట్టి బ్రాహ్మణులకు దాపురించిన కీడును తప్పించు'- మని ప్రార్థించగా దేవతలతో విష్ణుదేవు డిట్లా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మత్తకోకిలము.

'కాలకల్పుల నుగ్రతేజులఁ గాలకేయుల భూరిర
త్నాలయస్థుల వీర్యవంతుల నర్ణవంబు సమస్తస
త్త్వాలి దోఁపఁగ వట్టినన్ విషయం బగున్ వధియింపఁగాఁ
బోల దొండువిధంబునం బరిపూర్ణవార్ధిజలోన్నతిన్. 16

ప్రతిపదార్థం: కాలకల్పులన్= యముడితో సమానమైనవారిని; ఉగ్రతేజులన్= భయంకరమైన ప్రతాపం కలవారిని; కాలకేయులన్= కాలకేయులు అనే రాక్షసులను; భూరి రత్న+ఆలయస్థులన్= విస్తారమైన సముద్రంలో ఉన్నవారిని, (రత్న+ఆలయము= రత్నాలకు నిలయమైనది సముద్రం); వీర్యవంతులన్= పరాక్రమం కలవారిని; అర్ణవంబు= సముద్రాన్ని; సమస్త సత్త్వ+ఆలి తోఁపఁగన్= సమస్త జంతుసమూహాలు కనపడేటట్లుగా; వట్టినన్= నీరు లేకుండా చేయగా; వధియింపఁగాన్= సంహరించేందుకు; విషయంబు+అగున్= వీలగును(వీలవుతుంది); ఒండు విధంబునన్= వేరొకరీతిగా (విధంగా); పరిపూర్ణ వార్ధి జల+ఉన్నతిన్= నిండుగా సముద్రపునీరు అతిశయించి ఉండటంచేత; పోలదు= వీలు కాదు.

తాత్పర్యం: 'కాలకేయులు భయంకరమైన ప్రతాపం కలవారు, యముడితో సమానులు. అటువంటి పరాక్రమ వంతులను సముద్రాన్నంతా ఇంకించి (ఇంకజేసి) అందుండే సమస్త ప్రాణకోటి బయల్పడేటట్లు చేస్తేకాని, వధించటానికి సాధ్యం కాదు. నిండుగా నీరుగల సముద్రంలో ఉన్న వారిని వేరొకవిధంగా సంహరించటం వీలు పడదు.

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.46 విశేషాంశం చూడండి.

క. వరుణజలంబుల మిత్రా । వరుణ తనూజుండు వీర్యవంతుండై చె
చ్చెరఁ ద్రావ నోపు; నిందఱు । నరుగుఁడు; ప్రార్థింపుఁ డమ్మహాత్ము నగస్త్యున్.' 17

ప్రతిపదార్థం: వరుణ జలంబుల= వరుణదేవుడివైన నీళ్ళను; మిత్రావరుణ తనూజుండు= మిత్రావరుణులకొడుకు; [అగస్త్యుడు] వీర్య వంతుండు+ఐ= బలం కలవాడై; చెచ్చెరన్= శీఘ్రంగా; త్రావన్+ఓపున్= త్రాగగలడు; ఇందఱున్= ఇంతమంది; అరుగుఁడు= వెళ్లండి; ఆ+మహాత్మున్= ఆ మహానుభావుడిని; అగస్త్యున్= అగస్త్యమహామునిని; ప్రార్థింపుఁడు= వేడికొనండి.

తాత్పర్యం: నీళ్ళు వరుణదేవుడికి సంబంధించినవి. మిత్రావరుణుల కుమారుడైన అగస్త్యుడు ఆ నీళ్ళను తన ప్రభావంతో శీఘ్రంగా త్రాగగలడు. మీరందరూ మహాత్ముడూ, ఋషిశ్రేష్ఠుడూ ఐన ఆ అగస్త్యుడివద్దకు వెళ్ళి అతడిని వేడుకొనండి'.

వ. అనిన నమరు లెల్ల నగస్త్యుపాలికిం జని యమ్మునివరు స్తుతియించి యిట్లనిరి. 18

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అమరులు+ఎల్లన్= దేవతలంతా; అగస్త్యుపాలికిన్+చని= అగస్త్యుడి ఒద్దకు వెళ్లి; ఆ+మునివరున్= ఆఋషిశ్రేష్ఠుడిని; స్తుతియించి= పొగడి; ఇట్లు+అనిరి= ఈ విధంగా పలికారు.

తాత్పర్యం: అని విష్ణుదేవుడు చెప్పగా, దేవత లంతా అగస్త్యమహామునివద్దకు వెళ్ళి ఇట్లా పలికారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'అమరహితంబుగ జగదహి। తము దలఁగుము పేర్మితో బుధస్తుతగుణ! విం
ధ్యము దొల్లి పెరిఁగి జగదహి। తము సేసిన నీవ కావె తలఁగితి దానిన్.' 19

ప్రతిపదార్థం: అమర+హితంబుగ= దేవతలకు మేలు కలిగేటట్లుగా; జగత్+అహితము= ప్రపంచానికి ఏర్పడిన కీడు; పేర్మితోన్= గొప్పతనంతో; తలఁగుము= తొలగించుము; బుధ స్తుత గుణ!= బుధులచేత పొగడబడిన మంచిగుణాలు కలవాడా!; వింధ్యము= వింధ్య పర్వతం; తొల్లి= పూర్వకాలంలో; పెరిఁగి= అతిశయించి; జగత్+అహితము= లోకానికి కీడు; చేసినన్= చేయగా; దానిన్= ఆ కీడును; నీవు+అ+కావె= నీవే కదా; తలఁగితి(వి)= తొలగించావు.

తాత్పర్యం: 'దేవతలకు మేలు కలిగేటట్లుగా, జగత్తుకు ఏర్పడిన విపత్తును నీ గొప్పతనంచేత తొలగించవలసింది. బుధులచేత ప్రశంసించబడిన సద్గుణాలు కలిగిన మహానుభావా! పూర్వం వింధ్యపర్వతం పెరిగి ప్రపంచానికి కీడు చేయగా, ఆ ఉపద్రవాన్ని తొలగించింది నీవే కదా!'

వ. అని దేవత లెల్ల నగస్త్యుఁ గీర్తించి' రనిన విని ధర్మజుం' డిది యెట్లు? వింధ్యం బేల పెరిగె? దానిం
బెరుఁగకుండ నగస్త్యుం డెవ్విధంబున వారించె?' నని యడిగిన, నాతనికి రోమశుం డిట్లనియె. 20

ప్రతిపదార్థం: అని= అని; దేవతలు+ఎల్లన్= దేవతలు అందరున్నూ; అగస్త్యున్= అగస్త్యమహామునిని; కీర్తించిరి= పొగిడారు; అనిన= అని చెప్పగా; విని= విని (ఆలకించి); ధర్మజుండు= ధర్మరాజు, (ధర్మతనయుడు); ఇది+ఎట్లు?= ఇది ఏవిధంగా జరిగింది?; వింధ్యంబు+ఏల పెరిగెన్? వింధ్యపర్వతం ఎందుకు పెరిగింది?; దానిన్= దానిని; పెరుఁగకుండన్= ఎదుగకుండా; అగస్త్యుండు= అగస్త్యుడు; ఏ+విధంబునన్= ఏవిధంగా; వారించెన్?= ఆపాడు?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; ఆతనికిన్= ఆ ధర్మరాజుకు; రోమశుండు= రోమశుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ విధంగా దేవతలందరూ అగస్త్యమహామునిని పొగిడారు'- అని రోమశుడు చెప్పగా ధర్మరాజు విని, 'అది ఏ విధంగా జరిగింది? వింధ్యపర్వతం ఎందుకు పెరిగింది? దానిని పెరుగకుండా అగస్త్యు డేవిధంగా ఆపాడు?' - అని ప్రశ్నించాడు. ఆ ధర్మరాజుప్రశ్నకు రోమశమహర్షి ఈ విధంగా బదులు పలికాడు.

అగస్త్యుఁడు వింధ్యంబు పెరుఁగకుండ వారించుట (సం. 3-101-2)

ఉ. 'నెమ్మి నినుండు మేరుధరణీధరనాథుఁ బ్రదక్షిణంబుగాఁ
ద్రిమ్మరుచున్నఁ జూచి పటుదీధితికిం గర మల్గి వింధ్యశై
ల మ్మనియెన్ 'దినేంద్ర! యచలప్రభు నన్నుఁ బ్రదక్షిణంబు ని
త్యమ్మును జేయ కేల మతి దప్పితి? మేరువుఁ గొల్వ నేటికిన్?' 21

ప్రతిపదార్థం: నెమ్మిన్= ప్రీతితో; ఇనుండు= సూర్యుడు; మేరు ధరణీధరనాథున్= మేరు పర్వతపతిని (ధరణీధరము= పర్వతం); ప్రదక్షిణంబుగాన్= ఎడమనుండి కుడివైపుకు; త్రిమ్మరుచున్నన్+చూచి= తిరుగుతుండగా చూచి; పటు దీధితికిన్= చండికిరణుడైన సూర్యుడి మీద; కరము= మిక్కిలి; అల్గి= కోపించి; వింధ్య శైలము+అనియెన్= వింధ్య పర్వతం చెప్పింది; దిన+ఇంద్ర!= ఓ సూర్యుడా (దినానికి ప్రభువా)!; అచల+ప్రభున్= కొండలకు రాజును; నన్నున్= నన్ను; ప్రదక్షిణంబు= చుట్టు తిరగటం; నిత్యమ్మును= దిన దినమూ; చేయక= చేయకుండా; ఏల= ఎందుకు; మతి+తప్పితి?= బుద్ధిహీనుడవైనావు?; మేరువున్= మేరుపర్వతాన్ని; కొల్వన్+ఏటికిన్= ఆరాధించటం ఎందుకు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ప్రీతితో సూర్యుడు మేరుపర్వతానికి ప్రదక్షిణం చేయటం చూచిన వింధ్యపర్వతానికి చండకిరణుడైన సూర్యుడిపై ఆగ్రహం కలిగింది. 'ఓ దినపతీ! కొండలకు రాజు నైన నాకు ప్రదక్షిణం చేయకుండా నీవు నిత్యం బుద్ధిహీనుడివై ఎందుకు మేరువును ఆరాధిస్తున్నావు'

వ. అని గర్వించి పలికిన నప్పర్వతంబునకు భానుం డిట్లనియె. 22

ప్రతిపదార్థం: అని= అంటూ; గర్వించి= మదంతో; పలికినన్= మాట్లాడగా; ఆ+పర్వతంబునకు= ఆ కొండతో; భానుండు= సూర్యుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు;

తాత్పర్యం: అని గర్వించి పలికిన ఆ కొండతో సూర్యుడు ఇట్లా చెప్పాడు.

క. 'అనవరతము విధియోగం । బున నేఁ ద్రిమ్మరుదు నమరభూధరముఁ బ్రియం
బున నాత్మేచ్ఛ యొనర్పఁగఁ । జన' దనవుడు నలిగి వింధ్యశైలం బంతన్. 23

ప్రతిపదార్థం: అనవరతము= ఎల్లప్పుడూ; విధి యోగంబునన్= బ్రహ్మదేవుడి ఆదేశాన; అమర భూధరమున్= వేల్పుకొండ అయిన మేరుగిరి చుట్టూ; ఏన్= నేను; త్రిమ్మరుదున్= తిరుగుతాను; ప్రియంబునన్= ప్రీతితో; ఆత్మ+ఇచ్ఛ= నా ఇష్టం వచ్చినట్లు; ఒనర్పఁగన్+చనదు= చేయటానికి వీలులేదు; అనవుడు= అని చెప్పగా; అలిగి= కోపగించి; వింధ్య శైలంబు= వింధ్యపర్వతం; అంతన్= అంతట.

తాత్పర్యం: 'బ్రహ్మదేవుడి ఆదేశం ప్రకారం, ఎల్లప్పుడూ నేను మేరువుకు ప్రదక్షిణంగా తిరుగుతున్నాను. నా ఇష్టానుసారం చేసేందుకు వీలులేదు'- అని సూర్యుడు బదులు పలుకగా వింధ్యపర్వతానికి ఆగ్రహం కలిగింది. ఆ తరువాత.

క. ఇన శశి తారాదులకుం । జన రాకుండంగఁ బెరిఁగి జలధరపథ మె
ల్లను గప్పియుండె వింధ్యం । బనుపమ ముత్తుంగమై సురాద్రిస్పర్ధన్. 24

ప్రతిపదార్థం: వింధ్యంబు= వింధ్యపర్వతం; సుర+అద్రి స్పర్ధన్= వేలుపుకొండతో గల మాత్సర్యంతో; అనుపమము= సాటి లేనిదై; ఉత్తుంగము+ఐ= ఎత్తు గలదై; ఇన, శశి, తారా+ఆదులకున్= సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు మొదలైనవాటికి; చన రాకుండంగన్= వెళ్ళేందుకు వీలులేకుండా; పెరిఁగి= ఎదిగి; జలధర, పథము+ఎల్లను= మేఘమార్గం అంతటినీ; కప్పియుండెన్= కప్పివేసింది.

తాత్పర్యం: వింధ్యపర్వతం మేరుపర్వతంతో మాత్సర్యం వహించి, సాటిలేని ఎత్తుకు ఎదిగి, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు మొదలైనవి వెళ్ళేందుకు వీలులేకుండా ఆకాశమార్గాన్ని కప్పివేసింది.

క. రవిశశిగతు లుడుగుడు నిది । దివ మిది రాత్రి యని వసుమతీజనులకు న
ద్దివిజమునివరుల కెఱుఁగఁగ । నవగాఢం బయ్యె; నంధ మయ్యె జగంబుల్. 25

ప్రతిపదార్థం: రవి శశి గతులు= సూర్యుడియొక్క, చంద్రుడియొక్క గమనాలు; ఉడుగుడున్= ఆగిపోవటంచేత; ఇది, దివము= ఇది పగలు; ఇది, రాత్రి= ఇది రేయి; అని= అని; వసుమతీ జనులకున్= భూమియందలి ప్రజలకు; ఆ+దివిజ

ముని వరులకు= ఆ స్వర్గలోకంలోని దేవతలకు, మునిశ్రేష్ఠులకు; ఎఱుఁగఁగన్= తెలియటానికి; అవగాఢంబు+అయ్యెన్= దట్టమైనది (కష్టమైనది); జగంబుల్= లోకాలు; అంధము+అయ్యెన్= చీకటితో నిండినవి.

తాత్పర్యం: సూర్యచంద్రుల గమనాలు ఆగిపోవటంచేత ఇది పగలు, ఇది రాత్రి- అని భూమిమీది ప్రజలు; స్వర్గమందలి దేవతలు, మునివరులు తెలిసికొనలేకపోయారు. ఆ విధంగా దట్టమైన చీకటి లోకాలను అన్నింటినీ కప్పివేసింది.

వ. ఇట్లు పెరిఁగిన వింధ్యంబునొద్దకు వచ్చి వేల్పు లెల్ల దాని వర్ధనంబు వారింపనోపక యగస్త్యపాలికిం జని వింధ్యంబుపెక్కువ యెఱింగించి యి ట్లనిరి. 26

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పెరిఁగిన= వృద్ధిచెందిన; వింధ్యంబు+ఒద్దకు= వింధ్యపర్వతం సమీపానికి; వచ్చి= వచ్చి; వేల్పులు+ఎల్ల= దేవతలంతా; దాని వర్ధనంబు= ఆ పర్వతంయొక్క పెరుగుదలను; వారింపన్+ఓపక= ఆపలేక; అగస్త్యపాలికిన్+చని= అగస్త్యుడి ఒద్దకు వెళ్ళి; వింధ్యంబు పెక్కువ= వింధ్యపర్వతంయొక్క పెరుగుదల; ఎఱింగించి= తెలిపి; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: ఈ విధంగా పెరిగిన వింధ్యపర్వతందగ్గరకు దేవతలు వచ్చారు కాని, ఆ పర్వతం పెరుగుదలను నివారించలేకపోయారు. ఆ తరువాత దేవతలంతా అగస్త్యుడి వద్దకు వెళ్ళి వింధ్యపర్వతం పెరుగుదలను గురించి చెప్పి ఇట్లా అన్నారు.

క. 'భువనవ్యవహారమునకు । వ్యవధానం బయ్యె వింధ్యవర్ధనమున; న
ద్దివసకర రజనికర గతు । లవిహిత మగునట్లు సేయు మమరమునీంద్రా!' 27

ప్రతిపదార్థం: అమర ముని+ఇంద్రా!= దేవర్షులలో శ్రేష్ఠుడివైన ఓ అగస్త్యుడా!; వింధ్య+వర్ధనమునన్= వింధ్య పర్వతం యొక్క పెరుగుదల వలన; భువన వ్యవహారమునకున్= లోకపు పోకడకు; వ్యవధానంబు+అయ్యెన్= అంతరాయం కలిగింది; ఆ+దివసకర+రజనికర+గతులు= ఆ సూర్యుడి చంద్రుడి గమనాలు; అవిహతము+అగునట్లు= యథాప్రకారం జరిగేటట్లు; చేయుము= చేయవలసింది.

తాత్పర్యం: 'దేవర్షి వైన అగస్త్యా!, వింధ్యపర్వతం పెరిగిపోవటంవలన లోకవ్యవహారం స్తంభించింది. తిరిగి సూర్యచంద్రగతులు యథాప్రకారం జరిగేటట్లు చూడవలసింది.'

వ. అని దేవతలు ప్రార్థించిన నగస్త్యుండు లోపాముద్రా సహితుండై వింధ్యంబు సమీపంబునకు వచ్చి, దానిచేతం బూజితుం డై యి ట్లనియె. 28

ప్రతిపదార్థం: అని= అంటూ; దేవతలు= దేవతలు; ప్రార్థించినన్= వేడగా; అగస్త్యుండు= అగస్త్యుడు; లోపాముద్రా సహితుండు+ఐ= లోపాముద్రతో కూడి; వింధ్యంబు సమీపంబునకున్= వింధ్యపర్వతం దగ్గరకు; వచ్చి= వచ్చి; దానిచేతన్= ఆ వింధ్యపర్వతంచేత; పూజితుండు+ఐ= ఆరాధించబడినవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అని దేవతలు ప్రార్థించగా, అగస్త్యమహర్షి తన భార్య అయిన లోపాముద్రతో కలిసి వింధ్యపర్వతం దగ్గరకు వచ్చి, ఆ పర్వతంచేత ఆరాధించబడినవాడై ఇట్లు పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ‘చనియెద దక్షిణదిశ కే; । నొనరఁగఁ దెరు విమ్ము నాకు నుర్వీధర! నీ’

వనవుడు ‘నట్టుల చేయుదు’ । నని పెరుఁగుట యుడిగి వింధ్య మతివినయముతోన్. 29

ప్రతిపదార్థం: ఉర్వీధర= ఓ పర్వతమా!; ఏన్= నేను; దక్షిణ+దిశకు= దక్షిణ దిక్కునకు; చనియెదన్= వెళ్ళుతాను; నాకున్= నాకు; ఒనరంగన్= ఒప్పునట్లుగా; నీవు; తెరువు+ఇమ్ము= మార్గాన్ని (దారిని) ఇమ్ము; అనవుడున్= అనిచెప్పగా; అట్టులు+అ= ఆ విధంగానే; చేయుదున్= చేస్తాను; అని= అని చెప్పి; పెరుఁగుట+ఉడిగి= ఎదగటం మాని; వింధ్యము= వింధ్యపర్వతం; అతి వినయముతోన్= మిక్కిలి వినయంతో.

తాత్పర్యం: ‘ఓ పర్వతమా! నేను దక్షిణదిక్కుకు వెళుతున్నాను. నీవు నాకు మార్గాన్ని ఇవ్వవలసింది’- అని అగస్త్య మహర్షి అడుగగా వింధ్యపర్వతం పెరగటం మాని, వినయంతో ‘అట్లాగే చేస్తాను స్వామీ!’- అని బదులు పలికింది.

వ. ‘భట్టారా! విజయం చేయుం’ డని భూమి సమానమై యున్న దాని కగస్త్యుం డిట్లనియె. 30

ప్రతిపదార్థం: భట్టారా!= పూజ్యుడా!; విజయం చేయుండు+అని= దయ చేయండి, అని పలికి; భూమి సమానము+ఐ+ఉన్నదానికి= భూమియొక్క ఉపరితలంతో సమానంగా క్రిందకు కుంచించుకొని ఉన్న పర్వతంతో; అగస్త్యుండు= అగస్త్య మహాముని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు;

తాత్పర్యం: ‘పూజ్యుడివైన ఆ అగస్త్యమునీ! మీరు దయ చేయుడు’- అని పలికి, వింధ్యపర్వతం భక్తితో ఒదిగి భూతలానికి సమానంగా దిగువకు కుంచించుకొని నిలిచింది. ఆ పర్వతంతో అగస్త్యుడు ఈ విధంగా పలికాడు.

విశేషం: వావిళ్ళ ప్రతిలో ‘భట్టారకా!’ అనే పాఠాంతరం ఉన్నది.

క. ‘నా మగుడి వచ్చునంతకు । భూమీధర! యీప్రకారమున నుండుము; నా

తో మైత్రిఁ జేయు’ మని లో । పాముద్రాధీశ్వరుండు వలికి ముదమునన్. 31

ప్రతిపదార్థం: భూమీధర!= ఓ పర్వతమా!; నా, మగుడి, వచ్చునంతకు= నేను తిరిగి వచ్చేవరకు; ఈ, ప్రకారమునన్+ఉండుము= ఈ రీతిగానే ఉండుము; నాతో మైత్రిన్+చేయుము= నాతో స్నేహం చేయవలసింది; అని= అని; ముదమునన్= సంతోషంతో; లోపాముద్రా+అధీశ్వరుండు= లోపాముద్రభర్త; [అగస్త్యుడు] పలికి= చెప్పి.

తాత్పర్యం: ‘ఓ పర్వతమా! నేను తిరిగి వచ్చేవరకు నీవు ఈవిధంగానే ఉండుము. నాతో స్నేహం చేయుము’ అని పలికి, సంతోషంతో లోపాముద్రాహృదయేశ్వరుడైన అగస్త్యుడు.

వ. దాని నొడంబఱిచి దక్షిణదిశకుం జని లోకంబులకు హితంబుగా నంద యుండె; వింధ్యంబు నగస్త్యుండు మగుడి వచ్చునంతకుఁ బెరుఁగ నోడి యున్న’ దని యగస్త్య మాహాత్మ్యంబు ధర్మజునకుం జెప్పి, వెండియు రోమశుం డిట్లనియె. 32

ప్రతిపదార్థం: దానిన్+ఒడంబఱిచి= ఆ పర్వతాన్ని అంగీకరింపచేసి; దక్షిణ దిశకున్+చని= దక్షిణ దిక్కుకు వెళ్ళి; లోకంబులకు, హితంబుగాన్= విశ్వ శ్రేయస్సుకై; అందు+అ= ఆ దక్షిణ దిక్కునందే; ఉండెన్= ఉండిపోయాడు; వింధ్యంబున్= వింధ్య పర్వతం కూడా; అగస్త్యుండు= అగస్త్యుడు; మగుడి వచ్చునంతకున్= తిరిగి వచ్చేవరకు; పెరుఁగన్+ఓడి+ఉన్నది= ఎదుగుటకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జంకి ఉన్నది; అని= అని; అగస్త్య మాహాత్మ్యంబు= అగస్త్యుడియొక్క మహిమను; ధర్మజునకున్+చెప్పి= ధర్మరాజుకు చెప్పి; వెండియు= మరల; రోమశుండు= రోమశుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: వింధ్యపర్వతాన్ని సమ్మతింపచేసి అగస్త్యుడు దక్షిణదిక్కుకు వెళ్ళి విశ్వకల్యాణంకొరకై అక్కడే ఉండిపోయాడు. ఇక వింధ్యపర్వతం అగస్త్యుడి పునరాగమనాన్ని నిరీక్షిస్తూ పెరగటానికి జంకి అట్లాగే ఉండిపోయింది'- అని ధర్మరాజుకు అగస్త్యుడి మహిమను తెలియచేసి, మరల రోమశుడు ఈ విధంగా వచించాడు.

ఆ. అమరు లెల్లఁ దన్ను నట్లు కీర్తించుచు । నున్నఁ జూచి మునిగణోత్తముండు
వారి నడిగె 'నేమి వచ్చితి? రెఱిఁగింపుఁ' । డని దయాళుఁడై ప్రియంబుతోడ. 33

ప్రతిపదార్థం: అమరులు+ఎల్లన్= దేవతలందరున్నూ; తన్నున్= తనను (అగస్త్యుడిని); అట్లు= ఆ రీతిగా; కీర్తించుచున్+ ఉన్నన్+చూచి= పొగడుచుండటం గమనించి; ముని గణ+ఉత్తముండు= ఋషుల సమూహంలో శ్రేష్ఠుడైన అగస్త్యమహర్షి; దయాళుఁడు+ఐ= దయకలవాడై; వారిన్= వారిని అనగా వేల్పులను; ఏమి+వచ్చితిరి?= ఎందుకొరకు వచ్చారు?; ఎఱిఁగింపుఁడు= తెలియపరచండి; అని= అని; ప్రియంబుతోడన్= ప్రీతితో; అడిగెన్= అడిగాడు.

తాత్పర్యం: దేవతలంతా ఆ రీతిగా తనను ప్రశంసిస్తుండగా, అగస్త్యమహాముని దయకలవాడై 'మీ రెందుకు వచ్చారు? తెలియచేయండి'- అని ప్రీతితో వారిని అడిగాడు.

వ. అనిన. 34

తాత్పర్యం: అట్లా అడుగగా.

చ. అమరులు గాలకేయకృత మైన జగద్భయ మెల్లఁ జెప్పి 'యు
త్తమమునినాథ! తత్ప్రతివిధానము సేసి జగంబుఁ గావఁ జి
త్తము గలదేని విభ్రమమదభ్రతరంగ మహార్ణవంబుఁ బా
నము దగఁ జేసి చేయుము ఘనంబుగ మాకు మనఃప్రమోదమున్. 35

ప్రతిపదార్థం: అమరులు= దేవతలు; కాలకేయ కృతము+ఐన= కాలకేయులు అనే రాక్షసులచేత చేయ బడిన; జగత్+భయము+ ఎల్లన్= జగత్తుకు ఏర్పడిన వెఱపు సమస్తం; చెప్పి= వచించి; ఉత్తమమునినాథ!= మంచి ఋషులకు అధినేతవైన ఓ అగస్త్యమహర్షీ!; తద్+ప్రతివిధానము+చేసి= దానికి విరుగుడు కల్పించి; జగంబున్= లోకాన్ని; కావన్= కాపాడేందుకు; చిత్తము కలదు+ఏని= మనస్సు కలిగితే; విభ్రమమత్+అభ్ర తరంగ మహా+అర్ణవంబున్= తిరుగుడుపాటు కలవై ఆకసాన్ని అంటే కెరటాలతో కూడిన గొప్ప సముద్రాన్ని; పానము తగన్+చేసి= త్రాగటం తగినవిధంగా చేసి- అంటే బాగా త్రాగి; మాకున్= మా అందరికి; ఘనంబుగన్= ఎక్కువగా; మనస్+ప్రమోదమున్= మనసులకు సంతోషాన్ని; చేయుము= చేయవలసింది.

తాత్పర్యం: దేవతలు, కాలకేయులవలన ప్రపంచానికి ఏర్పడిన భయాన్ని గురించి అగస్త్యమహర్షితో చెప్పి, 'మునిశ్రేష్ఠా! ఆ భీతికి విరుగుడు కల్పించి జగత్తును కాపాడతలచినట్లయితే, ఆకాశాన్ని అంటుతూ తిరుగుడు పడే కెరటాలు కల సముద్రాన్ని పానం చేసి, మాకు మిగుల సంతోషాన్ని కలిగించండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఆ తోయధి నీచేతం । బీతం బగుడుం, గడంగి భీమాసుర సం
ఘాతంబుఁ దత్క్షణంబ ని । పాతింతుము దివ్యశస్త్రపటుఘాతములన్.' 36

ప్రతిపదార్థం: ఆ తోయధి= ఆ సముద్రం (తోయ+ధి= జలధి= నీటికి స్థావరం); నీచేతన్+పీతంబు+అగుడున్= నీ చేత త్రాగబడిన వెంటనే; కడంగి= పూని; భీమ+అసుర, సంఘాతంబున్= భయంకరమైన రాక్షసుల బృందాన్ని; తద్+క్షణంబు+అ= ఆ క్షణమందే; దివ్య శస్త్ర పటు ఘాతములన్= దేవతామహిమ కల ఆయుధాలయొక్క బలమైన దెబ్బలచేత; నిపాతింతుము= పడగొట్టగలం.

తాత్పర్యం: ఆ సముద్రజలం నీచేత పానం చేయబడిన వెన్వెంటనే, ఆ క్షణమందే, మేము ఆ భయంకరులైన రాక్షసుల సముదాయాన్ని దివ్యమహిమ కల ఆయుధాలను ప్రయోగించి పడగొట్టగలం.'

అగస్త్యుండు సముద్రోదకంబు పానంబు సేయుట (సం. 3-103-1)

వ. అనిన నగస్త్యుం 'డట్ల చేయుదు' నని యమరవరుల కెల్ల సంతోషంబుగా నప్పుడు. 37

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అగస్త్యుండు= అగస్త్యుడు; అట్లు+అ, చేయుదును+అని= ఆ రీతిగానే చేస్తాను అని; అమరవరులకు+ఎల్ల= దేవతాశ్రేష్ఠులకు అందరకు; సంతోషంబుగాన్= సంతోషం కలిగేటట్లు; అప్పుడు= ఆ సమయాన.

తాత్పర్యం: అని దేవతలు ప్రార్థించగా అగస్త్యుడు 'అట్లాగే చేస్తాను' అని దేవతల కందరికీ సంతోషం కలిగేటట్లుగా అప్పుడు.

సీ. రంగదుత్తుంగ తరంగ హస్తంబుల । నాడెడునది వోలె, నతుల వేగ
వాతావధూతమై వఱలెడునది వోలెఁ, । బర్వత కందరోపాంత తతులఁ
దొడరెడునదివోలె, ధ్రువఫేనవితతుల । నగియెడునది వోలె, నాగనక్ర
మకరకుల క్షుభ్యమాణమై తద్బాధ । కోపనియది వోలె, నుచ్చ భీమ

ఆ. నినద మగుచు నున్న నీరధి యొద్దకు । నమరగణముతో మహామునీంద్ర
గరుడ ఖచర సిద్ధ గంధర్వ పన్నగ । యక్షగణముతోడ నరుగుదెంచి. 38

ప్రతిపదార్థం: రంగత్+ఉత్తుంగ తరంగ హస్తంబులన్= ప్రకాశిస్తున్న ఎత్తైన కెరటాల చేతులతో; ఆడెడు+అది+పోలెన్= నాట్యం చేసేదానివలె; అతుల వేగ వాత+అవధూతము+ఐ= సాటిలేని వేగంతో వీచే గాలిచేత త్రోసివేయబడిందై; వఱలెడు+అది+పోలెన్= ఒప్పుతున్నదానివలె; పర్వత కందర+ఉపాంతతతులన్= కొండ గుహల సమీపాల్లో; తొడరెడు+అది+పోలె= తొట్రుపాటు పడెటటువంటి; దానివలె; ధ్రువ, ఫేన వితతులన్= ఎడతెగని లేదా స్థిరంగా ఉన్న నురుగుల సముదాయాల వలన; నగియెడు+అది+పోలె= నవ్వే దానివలె; నాగ, నక్ర, మకర, కుల క్షుభ్యమాణము+ఐ= పాములు, జలచరాలు, మొసళ్ళు మొదలైన వాటిచేత కల్లోలపరచబడినదై; తద్+బాధకు= ఆవిధంగా కుదుపటం వలన ఏర్పడిన నొప్పికి; ఓపని+అది+పోలెన్= ఓర్చుకొనలేనిదానివలె; ఉచ్చ భీమ నినదము= హెచ్చుగాను, భయంకరంగాను, ధ్వనిస్తున్న; నీరధియొద్దకున్= సముద్రం దరికి; అమర గణముతో= దేవతల సమూహంతో; మహత్+ముని+ఇంద్ర గరుడ, ఖచర, సిద్ధ గంధర్వ, పన్నగ, యక్షగణము తోడన్= గొప్ప మహర్షులు, గరుడులు, ఆకాశసంచారులు, సిద్ధులు, గంధర్వులు, ఉరగులు, యక్షుల సమూహాలతో; అరుగుదెంచి= వచ్చి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ప్రకాశించే ఎత్తైన కెరటాల చేతులతో నాట్యంచేసేదానివలె, మిక్కిలి వేగమైన ఝుంఝుమారుతంచేత తోయబడిన దానివలె, పర్వత గుహల మధ్య ఉరికే దానివలె, స్థిరంగాఉన్న నురుగుల సముదాయంతో నవ్వుతున్న దానివలె, పాములు, జలచరాలు, మొసళ్ళు మొదలైన వాటిచేత కదిపి కుదపబడుతున్నదై, ఆ బాధకు తాళలేనిదానివలె హెచ్చుగా భయంకరంగా ధ్వనిచేస్తున్న సముద్రం దగ్గరికి అగస్త్య మహర్షి గరుడులు, ఆకాశచారులు, సిద్ధులు, ఉరగులు, గంధర్వులు, యక్షులు మొదలైన దేవతాజాతులతో కలిసి వచ్చాడు.

విశేషం: అలం: రూపకానుప్రాణితమైన ఉపమ. కెరటాలు= ఉపమేయం, హస్తాలు= ఉపమానం. నురుగు తెలుపు. నవ్వు తెలుపు. నాగనక్ర మకరకులక్షుభ్యమాణము - ఆ బాధను ఓర్చుకొనలేనట్లున్నది అనటంవలన కాని దానిని కారణంగా వర్ణించటమైంది. ఇక్కడ హేతూత్ప్రేక్ష అలంకారం.

ఉ. అందఱుఁ జూచుచుండఁగ మహాబ్ధిజలంబులఁ ద్రావె విష్టపా
నందకరుం డగస్త్యుఁ డఘనాశనుఁ; డట్లు పయోధి రిక్త మై
నం దిమి కూర్మ కర్కటక నక్ర భుజంగచయంబుతో భయం
బందుచుఁ గాలకేయులు బయల్పడి తోఁచిరి దానిలోపలన్. 39

ప్రతిపదార్థం: విష్టప+ఆనందకరుండు= లోకాలకు ఆనందం కలుగ చేసేవాడు; అఘ నాశనుఁడు= పాపాలను పోగొట్టేవాడు; అగస్త్యుఁడు; అందఱున్= దేవతలందరున్నూ; చూచుచు+ఉండఁగన్= చూస్తుండగా; మహా+అబ్ధి జలంబులన్= గొప్ప సముద్రంలోని నీళ్లను (అప్+ధి= జలధి); త్రావెన్= త్రాగాడు; అట్లు= ఆ రీతిగా; పయోధి= పయస్+ధి= జలధి (సముద్రం); రిక్తము+ఐనన్= వట్టిపోగా; తిమి, కూర్మ, కర్కటక, నక్ర, భుజంగ, చయంబుతోత్= పెద్ద పెద్ద చేపలు, తాబేళ్లు, ఎండ్రకాయలు; మొసళ్ళు, పాములు మొదలైన వాటితో పాటు; కాలకేయులు= కాలకేయులు అనే ఆ రాక్షసులు; భయంబు+అందుచున్= భయపడుతూ; దాని లోపలన్= ఆ సముద్రంలోపల; బయల్పడి= బయటపడి; తోఁచిరి= కన్పించారు.

తాత్పర్యం: జగత్తులకు సంతోషాన్ని కలిగించేవాడున్నూ, పాపాలను నాశనం చేసేవాడున్నూ అయిన అగస్త్యమహర్షి అక్కడ చేరిన దేవతలంతా చూస్తుండగానే ఆ మహాసముద్రజలాలను త్రాగాడు. అంతట తిమింగలాలు, ఎండ్రకాయలు, మొసళ్ళు, తాబేళ్లు, పాములు మొదలైన వాటితోపాటు కాలకేయులు అనబడే రాక్షసులు భయపడుతూ బయటపడి కన్పించారు.

విశేషం: రిక్తమైనన్+తిమి= రిక్తమైనందిమి. ఇది ద్రుత సంధి. నన్నయభట్టు దీనిని ఈ పద్యంలో ప్రాస ఘటితంగా ప్రయోగించాడు.

వ. అంత. 40

తాత్పర్యం: అటు పిమ్మట.

క. గీర్వాణప్రభుఁ డాదిగ । గీర్వాణగణంబు గాలకేయులతోడన్
గర్వించి రణము సేసి ర । ఖర్వపరాక్రములు గడిమిఁ గడు నుద్ధతులై. 41

ప్రతిపదార్థం: గీర్వాణ, ప్రభుఁడు+ఆదిగన్= దేవేంద్రుడు మొదలైన; గీర్వాణ గణంబు= వేల్పుల సమూహం; కాలకేయుల తోడన్= కాలకేయులు అనబడే రక్కసులతో; అఖర్వ, పరాక్రములు= మొక్కవోని శౌర్యం కలవారు; కడిమిన్= ఆధిక్యంతో; కడు+ఉద్ధతులు+ఐ= మిక్కిలి విజృంభించినవారై; గర్వించి= గర్వం కలిగి; రణము+చేసిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: దేవేంద్రుడు మొదలైన దేవతలు కాలకేయులతో మొక్కవోని పరాక్రమంతో విజృంభించి గర్వంతో యుద్ధాన్ని చేశారు.

క. అనిమిషదివ్యాయుధహతి । ననిఁ గొందఱు వడిరి, గొంద ఱధికవిభీతిం
జని పాతాళముఁ జొచ్చిరి । దనుజులు దైత్యులును వీర్యదర్పచ్యుతులై. 42

ప్రతిపదార్థం: దనుజులు, దైత్యులును= వివిధ రాక్షసులు; కొందఱు= కొంతమంది; అనిమిష దివ్య+ఆయుధ హతిన్= దేవతలయొక్క దివ్యమైన శస్త్రాల, అస్త్రాల తాకిడిచేత; అనిన్= యుద్ధంలో; పడిరి= కూలిపోయారు; కొందఱు= కొంతమంది; అధిక+విభీతిన్= మిక్కిలి భయంతో; వీర్య దర్ప చ్యుతులు+ఐ= బలాన్ని, అహంకారాన్ని వీడినవారై; పాతాళమున్= పాతాళలోకంలో; చొచ్చిరి= ప్రవేశించారు.

తాత్పర్యం: దేవతల అస్త్ర శస్త్రాల తాకిడికి కొందరు రాక్షసులు యుద్ధంలో కూలారు. కొందరు భయభ్రాంతులై పాతాళానికి పారిపోయారు.

వ. ఇట్లు కాలకేయులందొట్టి యసురుల నెల్ల నిశ్శేషంబుఁజేసి జగంబుల యుపద్రవం బుడిపిన, దేవత లగస్త్యునిం గీర్తించి యిట్లనిరి. 43

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కాలకేయులన్+తొట్టి= కాలకేయులతో మొదలు పెట్టి; అసురులన్+ఎల్ల= రాక్షసులను అందరినీ; నిశ్శేషంబున్+చేసి= శేషం లేకుండగా చేసి, అనగా నిర్మూలించి; జగంబుల= లోకాల యొక్క; ఉపద్రవంబు+ఉడిపినన్= కీడును మాపగా; దేవతలు= దేవతలు; అగస్త్యునిన్= అగస్త్యుడిని; కీర్తించి= పొగడి; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: ఈ విధంగా కాలకేయులతో మొదలుపెట్టి రాక్షసులందరినీ చంపి, లోకాలకు కలిగిన కీడును పోగొట్టగా దేవతలు అగస్త్యుడిని ప్రశంసించి, ఇట్లా అన్నారు.

క. 'మునినాథ! నీ యనుగ్రహ । మున నుడిగెను బాధ నిఖిలభువనంబుల కి
వ్వనధిఁ బయఃపూర్ణముఁగా । నొనరింపుము; నీవ కాని యొరు లోప రిలన్. 44

ప్రతిపదార్థం: మునినాథ!= ఋషులకు అధినేతవైనవాడా!; నీ+అనుగ్రహమునన్= నీ దయచేత; నిఖిల భువనంబులకు= సమస్త లోకాలకు; బాధ= పరితాపం; ఉడిగెను= తొలగింది; ఈ+వనధిన్= ఈ సముద్రాన్ని; పయస్+పూర్ణమున్+కాన్= నీటితో నిండినట్టిదిగా; ఒనరింపుము= చేయవలసింది; నీవు+అ కాని= నీవేతప్ప; ఇలన్= భూమిపై; ఒరులు= ఇతరులు; ఓపరు= ఈ పనిని చేయలేరు;

తాత్పర్యం: 'ఋషులకు అధినేతవైన అగస్త్యుడా! నీ దయచేత సమస్తలోకాలకు బాధ తొలగిపోయింది. ఇక ఈ సముద్రాన్ని తిరిగి నీటితో నింపవలసింది. ఈ పనిని పృథివిలో నీవు తప్ప మరి ఎవ్వరూ చేయలేరు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇది యనేక సత్త్వాశ్రయంబు గావున రిక్తంబై యుండఁ దగ' దనిన నగస్త్యుం డిట్లనియె. 45

ప్రతిపదార్థం: ఇది= ఈ సముద్రం; అనేక+సత్త్వ+ఆశ్రయంబు= పెక్కు జంతువులకు నెలవైనది; కావున= కాబట్టి; రిక్తంబు+ఐ= శూన్యమైనదై; ఉండన్+తగదు= ఉండరాదు; అనినన్= అని చెప్పగా; అగస్త్యుండు= అగస్త్యుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఈ సముద్రం అనేక జీవరాసులకు నిలయం కాబట్టి నీరు లేకుండా శూన్యంగా ఉండరాదు'- అని దేవతలు అర్థించగా, వారితో అగస్త్యుడు ఈ విధంగా బదులు పలికాడు.

సీ. 'మున్న జీర్ణం బయ్యె మున్నీటి నీరు నా । కడుపున; నే నింకఁ బడయనేర
జలరాశి నిండంగ జల మొండు' నావుడు । నమరులు మునులును గమలగర్భుఁ
గానంగఁ జని 'దేవ! మీనాకరం బేమి । తెఱఁగున నిండు? మా కెఱుఁగఁ జెపుమ!'
యని విన్నపంబు సేసినఁ, బెద్దప్రొద్దు చిం । తించి వారలకు విరించి యనియె

ఆ. 'వనధిఁ బెద్దకాలమున భగీరథుఁ డను । వాఁడు నించుఁ గాని వసుధ నొరులు
పూని దీని నింపఁగా నోప' రనవుడు । నమరవరులు మునులు నరిగి రనిన. 46

ప్రతిపదార్థం: మున్ను+అ= మునుపే; నా కడుపునన్= నా పొట్టలో; మున్నీటి నీరు= సముద్రజలం; జీర్ణంబు+అయ్యె= అరిగిపోయింది; జలరాశి, నిండంగన్, జలము+ఒండు= సముద్రాన్ని నింపేందుకు వేరు నీరు; ఏను+ఇంకన్+పడయనేరన్= నేనింక పొందలేను; నావుడు= అని చెప్పగా; అమరులు= దేవతలు; మునులును= ఋషులు; కమలగర్భున్= బ్రహ్మదేవుడిని; కానంగన్+చని= చూచేందుకై వెళ్లి; దేవ!= భగవంతుడా!; మీన+ఆకరంబు= చేపలకు ఉనికి పట్టయినది- సముద్రం; ఏ+ తెఱఁగున= ఏ రీతిగా; నిండు?= నీటితో పూర్ణమౌతుంది?; మాకు+ఎఱుఁగన్+చెపుము+అ= మాకు తెలియ చేయుమా; అని= అని; విన్నపంబు+చేసినన్= ప్రార్థించగా; పెద్ద+ప్రొద్దు= చాలసేపు; చింతించి= యోచించి; విరించి= బ్రహ్మదేవుడు; వారలకున్= వారికి- అనగా ఆ దేవతలకు; అనియె= చెప్పాడు; వనధిన్= సముద్రాన్ని; పెద్ద+కాలమునన్= చాలాకాలం పిదప; భగీరథుఁడు+అనువాఁడు= భగీరథుడు అనే పేరు కలవాడు; నించున్= నింపుతాడు; కాని= కాని; వసుధన్= భూమియందు; ఒరులు= ఇతరులు; పూని= కడగి; దీనిన్= ఈ సముద్రాన్ని; నింపఁగాన్+ఓపరు= నింపలేరు; అనవుడున్= అని చెప్పగా; అమర+వరులు= దేవతల నాయకులు; మునులు= ఋషులు; అరిగిరి= వెళ్ళారు; అనినన్= అని చెప్పగా.

తాత్పర్యం: 'నా పొట్టలో సముద్రజలం మునుపే అరిగిపోయింది. తిరిగి సముద్రాన్ని నింపేంత నీరు నేను పొందలేను' అని అగస్త్యమహర్షి చెప్పాడు. అంత దేవతలు, మునులు బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్ళి 'దేవా! సముద్రాన్ని నీటితో నింపే మార్గ మేమిటో మాకు తెలియజేయ ప్రార్థన' అని వేడుకోగా, అతడు చాలాసేపు ఆలోచించి, 'చాలాకాలం గడిచిన పిమ్మట భగీరథు డనేవాడు సముద్రాన్ని నీటితో నింపగలడు. ఇతరులు మరి ఎవ్వరూ ఆ పనిని చేయలేరు' అని చెప్పాడు. అంత దేవతలు, మునులు, బ్రహ్మదేవుడిని వీడ్కొని వెళ్లిపోయారు- అని చెప్పగా.

క. 'వనరాశి యేమి కారణ । మున నెట్లు భగీరథుండు భూరిజలౌఘం
బున నించె? దీనిఁ జెప్పుమ' । యని యడిగిన ధర్మజునకు నమ్ముని సెప్పెన్. 47

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వనరాశి= సముద్రం; ఏమి, కారణమునన్= ఏ కారణాన; ఎట్లు= ఏ విధంగా; భగీరథుండు= భగీరథుడు; భూరి జల+ఓఘంబునన్= విస్తారమైన నీటి సమూహంచేత; నించెన్= నింపాడు; దీనిన్+చెప్పుము+అ= దీనిని గురించి చెప్పవలసింది; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; ధర్మజునకున్= ధర్మరాజుకు; ఆ+ముని= ఆ ముని; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'సముద్రాన్ని ఏ కారణాన, ఏ విధంగా భగీరథుడు పెనునీటివెల్లువచే నింపగలిగాడు? ఈ విషయాన్ని విస్తరించి చెప్పవలసింది'- అని అడుగగా ధర్మరాజుకు ఆ మునివరేణ్యుడైన రోమశుడు ఇట్లా చెప్పాడు.

భగీరథుండు జలముచే సముద్రము నించుట (సం. 3-104-6)

వ. తొల్లి యిక్ష్వాకు వంశంబున సగరుం డనురాజు హైహయుల నిర్జించి నిఖిల మహీరాజ్యంబు సేయుచు నపుత్త్రకుండై వైదర్భియు శైబ్యయు నను నిద్దఱు భార్యలతోడం గైలాసంబున కరిగి, యందు. 48

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వకాలంలో; ఇక్ష్వాకు వంశంబునన్= ఇక్ష్వాకు రాజుల వంశంలో; సగరుండు+అను రాజు= సగరుడు అనే ప్రభువు; హైహయులన్= హైహయులు అనే రాజులను; నిర్జించి= జయించి; నిఖిల మహీ రాజ్యంబు+చేయుచున్= సమస్తమైన భూమిని ఏలుకొంటూ; అపుత్రకుండు+ఐ= కొడుకులు లేనివాడై; వైదర్భియు, శైబ్యయున్= వైదర్భి మరియు శైబ్య; అను+ఇద్దరు భార్యల తోడన్= అనే ఇద్దరు భార్యలతో; కైలాసంబునకు+అరిగి= కైలాసానికి వెళ్లి; అందు= అక్కడ.

తాత్పర్యం: పూర్వకాలంలో ఇక్ష్వాకురాజుల వంశంలోనివాడైన సగరుడనే రాజు హైహయులను జయించి సమస్త భూమండలాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. అతడికి కొడుకులు లేరు. అందుచేత సగరుడు తన భార్యలైన వైదర్భితో, శైబ్యతో కైలాసానికి వెళ్లి అక్కడ.

విశేషం: ప్రథమపత్ని విదర్భరాజపుత్రిక- అమె పేరు 'కేశిని' అనీ; ద్వితీయపత్ని అరిష్టనేమి పుత్రిక- ఆమె పేరు 'సుమతి' అనీ రామాయణం బాలకాండలో వస్తుంది.

క. దక్షమఖక్షయకరు నిట । లాక్షజహుత భక్ష్యభక్షితానంగు విరూ
పాక్షు మహోక్షధ్వజుఁ బ్ర । త్యక్షము గావించె నుగ్రతపమున పేర్మిన్. 49

ప్రతిపదార్థం: దక్ష, మఖ, క్షయ, కరున్= దక్షుడియొక్క యజ్ఞాన్ని విధ్వంసం చేసిన వాడిని; నిటల+అక్ష, జ, హుత, భక్ష్య, భక్షిత+అనంగున్= నుదుటి కంటిమంటలో వేల్చబడ్డ వంటకంగా భక్షించబడిన అనంగుడు కలవాడిని (నుదుటికంటిమంటచేత మన్మథుడిని దగ్ధం చేసిన శివుడిని- అని భావం); విరూప+అక్షున్= ముక్కంటిని; మహా+ఉక్ష, ధ్వజున్= గొప్ప వృషభాన్ని పతాకచిహ్నంగా కల శివుడిని; ఉగ్రతపమున పేర్మిన్= ఘోరమైన తపస్సుయొక్క ఆధిక్యంచేత; ప్రత్యక్షము+కావించెన్= సాక్షాత్కరించేటట్లు చేశాడు.

తాత్పర్యం: సగరుడు మిక్కిలి నిష్ఠతో తపస్సుచేసి దక్షుడి యజ్ఞాన్ని ధ్వంసం చేసినవాడున్నూ, మన్మథుడిని తన మూడవకంటిమంటచేత దహించినవాడున్నూ, మూడుకన్నులు కలవాడున్నూ, మహా వృషభాన్ని ధ్వజచిహ్నంగా కలవాడున్నూ అయిన పరమశివుడిని ప్రసన్నుడిని కావించి సాక్షాత్కరింపచేసికొన్నాడు.

తే. హరుఁడు వానికిఁ బ్రత్యక్షమయి వరంబు । వేఁడు మనవుడుఁ 'ద్రైలోక్యవిభుఁడ! నాకు
దయ యొనర్పుము సంతానదాన' మనుచు । వేఁడెఁ బుత్త్రార్థియై కడువేడ్కతోడ. 50

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు; వానికిన్= అతడికి (సగరుడికి); ప్రత్యక్షము+అయి= సాక్షాత్కరించి; వరంబు= వరాన్ని; వేఁడుము+అనవుడున్= కోరుకొనుము అని చెప్పగా; త్రైలోక్య విభుఁడ!= మూడు లోకాలకు అధిపతివైనవాడా!; నాకు; దయన్= దయతో; సంతానదానము+ఒనర్పుము= సంతతిని అనుగ్రహించుము; అనుచున్= అంటూ; పుత్త్ర+అర్థి+ఐ= కొడుకులను కోరుకొంటున్నవాడై; కడు= మిక్కిలి; వేడ్కతోడన్= కుతూహలంతో; వేఁడెన్= అర్థించాడు.

తాత్పర్యం: పరమశివుడు సగరుడికి సాక్షాత్కరించి వరాన్ని కోరుకొనుమని అడిగాడు. సగరుడు 'మూడులోకాలకు అధిపతి వైనవాడా! దయతో నాకు సంతానదానాన్ని అనుగ్రహించు'- అని పుత్త్రార్థియై శివుడిని వేడుకొన్నాడు.

విశేషం: 'పుత్త్ర' శబ్దాన్ని ద్విత్వతకారంతో వ్రాయడం నన్నయకాలంలో ఉండేది. నేడు 'పుత్రుడు' అని వ్రాస్తున్నాం. (దీనిని భాషాశాస్త్రవేత్తలు 'ధ్వనిపరిణామం' అంటారు.)

వ. ఈశ్వరుండు వానికి వైదర్భియం దఱువదివేవురు గొడుకులును, శైబ్యయం దొక్క కొడుకుంగా వరం బిచ్చి, యయ్యఱువదివేవురు నతిదర్పితులై యేకకాలంబునఁ గాలగోచరు లగుదు రనియు, నయ్యొక్క కొడుకు వంశకర్త యగుననియుం జెప్పి యదృశ్యుం డైన. 51

ప్రతిపదార్థం: ఈశ్వరుండు= శివుడు; వానికిన్= అతడికి, ఆ సగరుడికి; వైదర్భి+అందు= విదర్భరాజు పుత్రికఅయిన రాణియందు; అరువది వేవురు= అరవయి వేలమంది కొడుకులును; శైబ్య+అందు= శైబ్య అనే రాణియందు; ఒక్క, కొడుకున్+కాన్= ఒక పుత్రుడు కలిగేటట్లు; వరంబు+ఇచ్చి= వరాన్ని ఇచ్చి; ఆ+అఱువది వేవురున్= ఆ అరవై వేలమంది కొడుకులు; అతి దర్పితులు+ఐ= మిక్కిలి గర్వించిన వారై; ఏక కాలంబునన్= ఒకే సమయాన; కాల గోచరులు+అగుదురు+ అనియున్= మరణిస్తారు అనిన్నీ; ఆ+ఒక్క కొడుకు= ఆ ఒక పుత్రుడు; వంశ కర్త= వంశాన్ని పెంపొందించేవాడు; అగున్+అనియున్= కాగలడనిన్నీ; చెప్పి= చెప్పి; అదృశ్యుండు+ఐనన్= కనిపించనివాడు కాగా- అంటే మాయమై పోగా.

తాత్పర్యం: ఈశ్వరుడు సగరుడికి వైదర్భియందు అరవై వేలమంది కొడుకులున్నూ, శైబ్యయందు ఒకకొడుకున్నూ కలిగేటట్లు వరమిచ్చాడు. ఆ అరవైవేలమంది కుమారులు మిగుల గర్వించి ఒకే సమయంలో మరణిస్తా రనిన్నీ, మిగిలిన ఆ ఒక్క పుత్రుడు వంశోద్ధారకుడు కాగలడనిన్నీ పరమశివుడు వచించి అంతర్ధానం చెందాడు.

క. కొడుకులఁ బలువురఁ బడసియుఁ । బడయనియట్టి దయి ధర్మపత్నులుఁ దానుం
గడు సంతసపడ కరిగెను । దడయక సగరుండు మగుడి తన పురమునకున్. 52

ప్రతిపదార్థం: కొడుకులన్= పుత్రులను; పలువురన్= పెక్కుమందిని; పడసియున్= పొందికూడా; పడయని+అట్టిది+అయి= పొందని రీతిగానే అయి; సగరుండు= సగరుడు; ధర్మపత్నులున్= సహధర్మ చారిణులైన భార్యలూ; తానున్= తానున్నూ; కడు= మిక్కిలి; సంతసపడక= సంతోషించక; తడయక= ఆలస్యం చేయక; మగుడి= తిరిగి; తన+పురమునకున్= తన పట్టణానికి; అరిగెను= వెళ్ళాడు.

తాత్పర్యం: సగరుడు పెక్కుమంది కొడుకులను (పరమేశ్వరుడి వరంవల్ల) పొందినా, పొందనివాడివలె తాను, తన ధర్మపత్నులు సంతోషపడక వెంటనే. తన పురానికి మరలిపోయాడు.

వ. అంతఁ గొంతకాలంబునకు నయ్యిద్దరు గర్భిణులైన నందు వైదర్భికి నొక్కి యలాబూ ఫలంబును, శైబ్యకు నసమంజసుండను కొడుకునుం బుట్టిన. 53

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అంతన్= అటు పిమ్మట; కొంత కాలంబునకున్= కొంత సమయం గడిచిన పిమ్మట; ఆ+ఇద్దరు= ఆ ఇరువురు అనగా వైదర్భియు, శైబ్యయు; గర్భిణులు+ఐనన్= కడుపుతో ఉండగా; అందు= వారిలో; వైదర్భికిన్= విదర్భ రాజతనయకు; ఒక్క= ఒక; అలాబూ ఫలంబును= సొరకాయయున్నూ; శైబ్యకున్= శైబ్య అనే రాణికి; అసమంజసుండు+అను= అసమంజసుడు అనే పేరు కల; కొడుకునున్= పుత్రుడున్నూ; పుట్టినన్= కలిగిన.

తాత్పర్యం: అటు పిమ్మట కొంతకాలం గడిచిన తర్వాత ఆ ఇద్దరు రాణులు గర్భాలు ధరించారు. వైదర్భికి ఒక సొరకాయ, శైబ్యకు అసమంజసుడు అనే ఒక కొడుకు ఉద్భవించగా.

ఆ. 'వరదుఁడైన యీశువరమున నిది యొక్క । వదరు పుట్టె; నెట్టివరమొ!' యనుచు
దానిఁ బాఱవైవఁ దా రున్న నాకాశ । వాణి యిట్టు లనియె వసుమతీశ! 54

ప్రతిపదార్థం: వరదుఁడు+ఐన= వరాలను ఇచ్చేటటువంటి వాడైన; ఈశు+వరమునన్= ఈశ్వరుడియొక్క వరంవలన; ఇది= ఇది; ఒక్క= ఒక; వదరు= సొరకాయ; పుట్టెన్= పుట్టింది; ఎట్టి వరమొ+అనుచు= ఎటువంటి వరమో అంటూ; దానిన్= ఆ సొరకాయను; పాఱవైవన్= పారవేసేందుకు; తారు+ఉన్నన్= తాము ఆలోచిస్తుండగా; ఆకాశవాణి= ఆకాశంనుండి వినిపించే పలుకు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా తెలిపింది; వసుమతీ+ఈశ!= ఓ ధరణీపతీ (ఓ రాజా)! (ఈ సంబోధన తరువాతిపద్యంతో అన్వయం.)

తాత్పర్యం: 'శివుడు కోరిన కోరికలు ఈడేర్చునటువంటి వరదుడు. కాని, అట్టి పరమేశ్వరుడు ఇచ్చిన వరాన ఇదేమి చిత్రమో!; ఒక సొరకాయ పుట్టింది'- అని అనుకొంటూ వారు దానిని అవతల పారవేసేందుకు ఉద్యుక్తులు కాగా, ఆకాశవాణి వారితో ఇట్లా పలికింది.

తే. సాహసం బిట్టు సేయంగఁ జనునె? దీని । బీజములు ఘృతఘటములఁ బెట్టి రక్ష
సేయు; మఱువదివేవు రూర్జితులు సుతు లు । మేశు వరమునఁ బుట్టుదు రిందు నీకు.' 55

ప్రతిపదార్థం: సాహసంబు+ఇట్టు= సాహసం ఈవిధంగా; చేయంగన్+చనునె= చేయటం తగునా?; దీని బీజములు= ఈ (సొరకాయ) విత్తనాలు; ఘృత ఘటములన్+పెట్టి= నేతికుండలలో ఉంచి; రక్ష+చేయుము= రక్షించవలసింది (కాపాడుము); అఱువది వేవురు= అరవై వేలమంది; ఊర్జితులు= దృఢకాయులు, బలవంతులు; సుతులు= కొడుకులు; ఉమా+ఈశు, వరమునన్= పార్వతీపతి అయిన శివుడివరంవలన; ఇందు= ఈ సొరకాయనుండి, నీకు పుట్టెదరు= నీకు ఉద్భవిస్తారు.

తాత్పర్యం: ఓ మహారాజా! తొందరపడి ఈ సొరకాయను అవతల పారవేసే తెగువకు పూనుకోవద్దు. దీని విత్తనాలను నేతి కుండలలో పెట్టి కాపాడుము. దీనినుండి అరవైవేలమంది బలవంతులైన కుమారులు పార్వతీపతి అనుగ్రహంవలన నీకు జన్మిస్తారు.

వ. అనినం దద్వచనానురూపంబు సేసి రక్షించుచున్న రెన్నెలలకు. 56

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; తద్+వచన+అనురూపంబు+చేసి= ఆ (ఆకాశవాణి) చెప్పిన మాటల ప్రకారంగానే; రక్షించుచు+ఉన్నన్= కాపాడుతుండగా; రెన్నెలలకు= రెండునెలలకు.

తాత్పర్యం: అని ఆకాశవాణి చెప్పగా, అట్లే చేసిన రెండునెలల తరువాత.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. సుతషష్టి సహస్రక ము । ద్గతమై వర్ధిల్లి గగనగతిఁ బఱచి శత
క్రతులోకముఁ దొట్టి మదో । ద్ధతిఁ జేసె సమస్తలోకతతులకు బాధల్. 57

ప్రతిపదార్థం: సుత, షష్టి, సహస్రకము= అరవై వేలమంది కొడుకుల సమూహం; ఉద్గతము+ఐ= పుట్టి; వర్ధిల్లి= పెంపొంది; గగనగతిన్+పఱచి= ఆకాశ మార్గంలో విహరించి; శతక్రతు లోకమున్+తొట్టి= (నూరు యజ్ఞాలు చేసిన) దేవేంద్రుడిలోకం మొదలుకొని; సమస్త లోకతతులకున్= అన్ని భువనాలకు; బాధల్= కష్టాలు; మద+ఉద్ధతిన్+చేసెన్= గర్వాతిరేకంచేత కలిగించింది.

తాత్పర్యం: అరవై వేలమంది కొడుకులు పుట్టి పెరిగారు. వారు ఆకాశంలో విహరిస్తూ దేవేంద్రుడిలోకంతో పాటు అన్నిలోకాలకు గర్వంతో పెక్కు బాధలు కలిగించ సాగారు.

క. సగరసుతు లట్లు జగముల । కొగి బాధలు సేయుచున్న నోడి మరుత్ప
న్నగవరు లరిగిరి నాలుగు । మొగములు గల వేల్పుకడకు మునిసంఘముతోన్. 58

ప్రతిపదార్థం: సగరసుతులు= సగరుడికొడుకులు; అట్లు= ఆవిధంగా; జగములకు= లోకాలకు; ఒగి=వరుసగా; బాధలు+చేయుచున్నన్= కష్టాలు పెడుతుండగా; ఓడి= భీతినొంది; మరుత్+పన్నగవరులు= దేవతలలో, పన్నగులలో శ్రేష్ఠులు; నాలుగు, మొగములు+కల, వేల్పు కడకున్= బ్రహ్మదేవుడి దగ్గరకు; ముని+సంఘముతోన్= ఋషుల సముదాయంతోపాటు; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: సగరుడి కుమారులు ఆ విధంగా సమస్తలోకాలకు కీడు కల్పించటంచేత, దేవతలలో, పన్నగులలో శ్రేష్ఠులైన నాయకులు ఋషీశ్వరులతోపాటు బ్రహ్మదేవుడివద్దకు వెళ్ళారు.

ఆ. వారిజాసనుండు వారల వచ్చిన । విధ మెఱింగి 'మీకు వెఱవ నేల?
సగరసుతులు దగ్ధు లగుదురు; దర్పితు । లైనవారి పేర్మి యధ్రువంబు.' 59

ప్రతిపదార్థం: వారిజ+ఆసనుండు= పద్మం ఆసనంగా కలవాడైన బ్రహ్మదేవుడు; వారల వచ్చిన విధము= వారి రాకకు గల కారణం; ఎఱింగి= తెలిసికొని; మీకు వెఱవన్+ఏల= మీరు భయపడటం ఎందుకు?; సగర సుతులు= సగరుడి పుత్రులు; దగ్ధులు= తగులబడునట్టివారు; అగుదురు= అవుతారు; దర్పితులు+ఐన= వారి పేర్మి= గర్వం చెందినవారి గొప్పతనం; న+ధ్రువంబు= ధ్రువమైనది కాదు (అశాశ్వతమైనది).

తాత్పర్యం: బ్రహ్మదేవుడు వారి రాకకు గల కారణం తెలిసికొని 'మీరు భయపడే అవసరం లేదు. సగరుడి కొడుకులు తగులబడి పోగలరు. గర్వం చెందినవారి ఆధిక్యం ఎంతో కాలం నిలవదు'.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. అని కమలసంభవుం డానతిచ్చిన నరిగి యమరవరు లాదిగా నఖిలలోకనివాసు లెల్ల సగరుసుత పరిక్షయం బపేక్షించి యుండునంత. 60

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; కమలసంభవుండు= పద్మమందు పుట్టిన బ్రహ్మదేవుడు; ఆనతి+ఇచ్చినన్= ఆధికారికంగా చెప్పగా; అరిగి= వెళ్ళి; అమర వరులు+ఆదిగాన్= దేవతల నాయకులు మొదలైనవారితోపాటు; అఖిల లోక నివాసులు+ఎల్ల=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అన్ని భువనాలలో నివసించేవారు అందరూ; సగర సుత పరిక్షయంబు= సగరుడియొక్క కొడుకుల వినాశనం; అపేక్షించి= కోరి; ఉండునంతన్= ఉండగా.

తాత్పర్యం: అని బ్రహ్మదేవుడు దయతో వచించాడు. అంత దేవతల నాయకులు, వివిధలోకవాసులు మరలిపోయారు. వాళ్ళందరు తమలో తాము సగరుడి కొడుకుల వినాశనం కోరుకొంటూ ఉన్నారు.

సీ. **అశ్వమేధంబు సేయంగ దీక్షితుఁ డయ్యె । సగరుండు; వాని యశ్వంబు సగర**
తనయులచే రక్షితంబై వసుంధర । యెల్లఁ గ్రుమ్మరి తోయహీన మైన
జలధిలోపల నదృశ్యం బైనఁ గానక । సగరున కెఱిఁగించి, సగరసుతులు
జనకు శాసనమునఁ జని భూతలమునందుఁ । దడయక రోసి పాతాళతలము

ఆ. **నందు రోయఁ గడఁగి యఱువదివేవురు । నొక్క మొగిన గ్రొచ్చి రుదధిలోన**
జలధిపంకమగ్న సత్త్వముల్ నిశితకు । ద్దాలహతి విదారితములు గాఁగ. 61

ప్రతిపదార్థం: అశ్వమేధంబు+చేయంగన్= అశ్వమేధ యాగాన్ని చేసేందుకై; సగరుండు= సగరుడు; దీక్షితుఁడు+అయ్యెన్= నిష్ఠపూనిన వాడైనాడు; వాని+అశ్వంబు= ఆ సగరుడి గుఱ్ఱం - యాగాశ్వం; సగర, తనయులచేన్= సగరుడి కుమారులచేత; రక్షితంబు+ఐ= కాపాడబడినదై; వసుంధర+ఎల్లన్= భూమి అంతటినీ; క్రుమ్మరి= తిరిగి, తిరిగి; తోయ హీనము+ఐన= నీరు లేనటువంటిదైన; జలధి లోపలన్= సముద్రంలో; అదృశ్యంబు+ఐనన్= కనిపించకుండ పోవటంచేత; కానక= చూడక; సగరునకు+ఎఱిఁగించి= సగరుడికి తెలిపి; సగర సుతులు= సగరుడి కొడుకులు; జనకు శాసనమునన్= తండ్రియొక్క ఆజ్ఞవలన; తడయక= ఆలస్యం చేయక; చని= వెళ్ళి; భూతలమునందున్= భూమి పై భాగమందు; రోసి= వెదకి; పాతాళ తలము నందున్= పాతాళ లోకంలో (భూమికి అడుగు భాగాన పాతాళం కలదని ప్రాచీనమతం); రోయన్+కడఁగి= వెదికేందుకు పూనుకొని; అఱువది వేవురున్= అరవై వేలమంది; ఒక్క మొగిన= ఒకేసారి; ఉదధిలోనన్= సముద్రంలో; జలధి, పంక మగ్న సత్త్వముల్= సముద్రమందలి బురదలో నిమగ్నమైన జంతువులు; నిశిత కుద్దాల హతిన్= వాడియైన గడ్డపారల తాకిడిచేత; విదారితములు కాఁగన్= చీల్చబడి ముక్కలు అగునట్లుగా; గ్రొచ్చిరి= త్రవ్వారు.

తాత్పర్యం: సగరుడు అశ్వమేధయాగం చేసేందుకు దీక్ష వహించాడు. యాగాశ్వాన్ని సంరక్షించే బాధ్యతను సగరుడి కొడుకులు పూనారు. సగరుడి గుఱ్ఱం భూమండలమంతా తిరిగి, నీళ్ళు లేని కడలిలో అంతర్ధానమయింది. ఆ విషయాన్ని సగరుడి కొడుకులు తండ్రికి తెలిపి, తండ్రి ఆజ్ఞమేరకు భూమినంతా వెదకి, అందరూ కలిసి ఒకేసారి పాతాళాన్ని త్రవ్వసాగారు. వారు వాడిన వాడియైన గడ్డపారలచేత సముద్రపుబురదలోని జంతువుల దేహాలు తెగి ముక్కలు ముక్కలైనాయి.

వ. **ఇట్లు గ్రొచ్చి గ్రొచ్చి సగరసుతులు సముద్రపూర్వోత్తరదేశంబునం గపిలుం డను మహాముని యాశ్రమ సమీపంబునందుఁ దమగుఱ్ఱంబుఁ గని సంతోసిల్లి.** 62

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; గ్రొచ్చి గ్రొచ్చి= తవ్వి తవ్వి; సగర సుతులు= సగరుడి కొడుకులు; సముద్ర పూర్వ+ఉత్తర దేశంబునన్= సముద్ర ప్రదేశంలో తూర్పు దిక్కుకు ఉత్తరదిశకు మధ్యగా అంటే ఈశాన్యంగా; కపిలుండు+అను= కపిలుడు అనబడే; మహాముని+ఆశ్రమ, సమీపంబునందున్= మహర్షియొక్క ఆశ్రమానికి దగ్గరగా; తమ గుఱ్ఱంబున్+కని= తమ గుఱ్ఱాన్ని చూచి; సంతోసిల్లి= సంతోషించి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా తవ్వి తవ్వి సముద్ర ప్రదేశంలోని ఈశాన్య దిశలో కపిలు డనే మహర్షి ఆశ్రమ సమీపాన తమ గుర్రాన్ని చూచి సంతోషించారు.

ఆ. అశ్వమేధమునకు నర్చితంబైన యీ । యశ్వరాజు నిట్టు లపహరించి
ముచ్చు గొఱక యీ సముద్రదేశంబున । నోట మెడఁద లేక యున్నవాఁడు. 63

ప్రతిపదార్థం: అశ్వమేధమునకున్= అశ్వమేధం అనే యజ్ఞానికి; అర్చితంబు+ఐన= ఆరాధించబడిన; ఈ+అశ్వరాజున్= ఈ గొప్ప గుర్రాన్ని; ఇట్టులు= ఈ రీతిగా; అపహరించి= దొంగిలించి; ముచ్చు, గొఱక= దొంగదున్నపోతు (దొంగముని అనే అర్థంలో నిందావాచకం); ఈ సముద్ర, దేశంబునన్= ఈ కడలి ప్రాంతంలో; ఓటమి+ఎడద లేక= జంకు హృదయంలో లేకుండా; ఉన్నవాఁడు= ఉన్నాడు.

తాత్పర్యం: అశ్వమేధయాగంకొరకై అర్చించబడిన ఈ గుర్రాన్ని అపహరించి దున్నపోతు వంటి ఈ దొంగముని కడలిసీమలో హృదయంలో ఎటువంటి జంకుగొంకులు లేకుండా ఉన్నాడు.

విశేషం: 'ముచ్చుగొఱక'- అనే పదం తెలుగు జాతీయంగా వాడబడింది. పదాల అర్థాలను బట్టిచూస్తే దొంగ అడవిదున్నపోతు అని తాత్పర్యం. దీన్ని లక్ష్యార్థంలో గ్రహించాలి. తెలుగులో దున్నపోతు, కారుపోతు, అడవిదున్న- అనే పదాలు నిందావాచకాలు. శిష్టవ్యావహారికంలో ఈ తిట్లు బాగా ప్రచారంలో ఉన్నాయి. నన్నయ వీటికి అనువుగా ఇక్కడ వాడాడు. సగరపుత్రులు కపిలమహర్షిపై కోపంతో ఆయనను మాటలతో అవమానించారు. దానికి ఆ మహర్షి కోపించి కంటిమంటతో ఆ రాకుమారులను బూడిదబుగ్గి చేశాడు. కపిల మహర్షి కోపాగ్నికి కారణమైన ఆ బలమైన నిందార్థక పదబంధాన్ని తెలుగు జాతీయంగా ప్రయోగించాడు- నన్నయ. లక్ష్యార్థంలో అడవిదున్న స్వభావం వ్యంగ్యం. ఇక్కడ మునిస్వభావాన్ని పేర్కొంటూ- 'ఓట మెడఁద లేక ఉన్నవాఁడు' - అని అన్నారు. 'ఓట మింత లేక యున్నవాఁడు' - అనే పాఠాంతరం కూడా ఉన్నది. తాను చేసిన పనికి ఎటువంటి ప్రతిఫలం వస్తుందో తెలియక మదాంధబుద్ధి కలవాడిని ఉద్దేశించి తెలుగువారు 'దున్నపోతా!' అని తిడతారు. ఇక్కడ కపిలుడు చేసింది దొంగతనమని సగరపుత్రు లనుకొంటున్నారు. దొంగిలించి కూడా, దొంగతనంగా తీసికొని కూడా, సగరపుత్రులు గుర్రాన్ని కనుగొన్న తరువాత కూడా అతడు ఉలుకుపలుకు లేకుండా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నాడు. అట్లా కూర్చోవడం రాకుమారులకు మరీ కోపం తెప్పించింది. దొంగతనం చేసి బయటపడ్డానన్న భయం లేకుండా నిబ్బరంగా కూర్చుంటే ఎవణ్ణైనా తెలుగువాడు 'దొంగ దున్నపోతు' అనే నిందార్థకంతో తిట్టటం సహజం. కపిలమహర్షి నిర్దోషి అని పఠితలకు తెలుసు. అందుకే సగరపుత్రులు కపిలుని కోపాగ్నికి ఆహుతులు కావటం వారికి సమంజసమనిపిస్తుంది. ఇది కళాన్యాయం. ఆ కార్యానికి తగిన కారణంగా ఈ నిందా ప్రయోగాన్ని నన్నయ వాడాడు. కొందరు పండితులు ఈ నిందార్థక పద ప్రయోగం ఔచిత్యవంతంగా లేదని భావిస్తారు. ఉ.వి. ఆం.మ.భా. సంశోధిత ముద్రణప్రతిలో "ముచ్చుగొఱక" - అనే పాఠానికి 'ముచ్చుగొఱగ', 'ముచ్చుగోలు', 'ముచ్చుదొంగ', ముచ్చుగాగ' - అనే పాఠాంతరాలున్నాయి. ఇవన్నీ నిందార్థకాలే. సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'ముచ్చుగోర' - అనే పాఠంతో ఈ పద్యం ఉదాహృతమైనది. 'ముచ్చు+కోర'= అంటే పెద్దదొంగ అని అర్థం. అదీ నిందార్థకమే. ముచ్చు - అంటే దొంగగా కనపడని దొంగ అని అర్థం. పెద్ద దొంగల ముఠా నాయకుడుగా జంకుగొంకులు లేకుండా ముచ్చువలె కూర్చున్నాడే- అని భావం. దొంగముని- లేదా ముచ్చుముని- అని సగరపుత్రులనలేదు. కాని, లక్ష్యార్థ తాత్పర్యం అదే. అందువలన దొంగదున్నపోతులాగా ఉన్న ఈ దొంగ ముని అని సగర కుమారులు నిందించారని తాత్పర్యం ఏర్పడుతుంది. ఇది కపిలుడు వారిని బూడిద చేయటానికి తగిన తెలుగు తిట్టుపదంగా నన్నయ్య వాడాడు. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సగరసుతులు గపిలమహామునికోపాగ్నిచే భస్మమగుట (సం. 3-106-3)

వ. అని పలికి కపిలుం బరిభవించిన నమ్మునివరుఁ డలిగి యనలశిఖలు దూల నతిఘోరదృష్టిం జూచిన నప్పుడు సగరసుతులందఱు భస్మంబైన. 64

ప్రతిపదార్థం: అని పలికి= అని పలికి; కపిలున్+పరిభవించినన్= కపిల మహర్షిని అవమానించగా; ఆ+మునివరుఁడు= ఆ ఋషిశ్రేష్ఠుడు; అలిగి= కోపించి; అనల శిఖలు= అగ్నిజ్వాలలు; తూలన్= చెలరేగగా; అతిఘోర దృష్టిన్+చూచినన్= మిక్కిలి భయంకరమైన చూపులతో చూడగా; అప్పుడు= ఆక్షణంలో; సగర సుతులు+అందఱు= సగరుడి కొడుకులు అందరూ; భస్మంబు+ఐనన్= మండి బూడిద కాగా.

తాత్పర్యం: అని కపిలమహర్షిని అవమానించగా, ఆ ఋషివరేణ్యుడు ఆగ్రహించి అగ్నిజ్వాలలు చెలరేగేటట్లు భయానకమైన చూపు ప్రసరించాడు. అప్పుడు సగరుడి కొడుకులు అందరూ మండి మాడి బూడిద అయిపోయారు.

క. వీరులగు సగరతనయుల । దారుణ దాహంబుఁ జూచి తడయక చని యం
భోరుహగర్భతనూజుఁడు । నారదుఁ డంతయును సగరునకు నెఱిఁగించెన్. 65

ప్రతిపదార్థం: వీరులు+అగు= పరాక్రమం కలవారైన; సగర తనయుల= సగరుడి కొడుకులయొక్క; దారుణ, దాహంబున్= భయానకమైన దహనాన్ని; చూచి= చూచి; తడయక= ఆలస్యం చేయక; చని= వెళ్లి; అంభస్+రుహ గర్భ తనూజుఁడు= పద్మగర్భంనుండి పుట్టిన వాడి పుత్రుడు, అనగా బ్రహ్మకొడుకైన వాడు; నారదుఁడు= నారదుడనే ముని; అంతయును= సర్వమున్నూ; సగరునకున్+ఎఱిఁగించెన్= సగరుడికి తెలిపాడు.

తాత్పర్యం: పరాక్రమోపేతులైన సగరసుతులు కపిలుడి కోపాగ్నికి ఆహుతి అయిన సంగతి ఆలసించకుండా పోయి బ్రహ్మపుత్రుడైన నారదమహర్షి సగరుడికి తెలిపాడు.

క. దాని విని సగరుఁ డురు శో । కానలదందహ్యమానుఁ డయ్యును నయ్యీ
శానువచనంబు దలఁచి ధ । రానాథుఁడు శోకభరపరావృత్తుండై. 66

ప్రతిపదార్థం: దానిన్, విని= దానిని అనగా పుత్రమరణవార్తను ఆలకించి; సగరుఁడు; ఉరుశోక+అనల, దందహ్యమానుఁడు+అయ్యునున్= మిక్కుటమైన దుఃఖమనే అగ్నిచేత మండించబడిన వాడు అయినప్పటికీన్నీ; ఆ+ఈశాను, వచనంబు= ఆ శివుడి మాట; తలఁచి= సంస్మరించి; ధరా నాథుఁడు= భూ భర్త అయినసగరుడు; శోక భర పర+ఆవృత్తుండు+ఐ= దుఃఖభారాన్నుండి వెనుదిరిగినవాడై.

తాత్పర్యం: పుత్రమరణవార్తను విని, సగరుడు మిక్కుటమైన శోకంచేత దహించబడినవాడైనా కూడా, అలనాటి పరమేశ్వరుడి వచనాలను జ్ఞప్తికి తెచ్చుకొని దుఃఖభారంనుండి వెనుదిరిగినవాడై.

వ. అసమంజసపుత్త్రు నంశుమంతుం దనమనుమనిం జూచి, 'యయ్యా! నీయయ్య లఱువదివేవురు నొక్కటఁ గపిలకోపానలకబళితశరీరు లయిరి; భవజ్జనకుం డతిక్రూరహృదయుఁడై పౌరబాలకుల నకారణంబ వధియించి మహానదిలో వైచుచున్న నెఱిఁగి పౌరజనాక్రోశంబునం దనుక్రోశపరుండనై వాని విడిచితి. 67

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అసమంజస పుత్త్రున్= అసమంజసుడి కొడుకును; అంశుమంతున్= అంశుమంతుడిని; తన మనుమనిన్+చూచి= తన మనుమడిని చూచి; అయ్యా!= నాయనా!; నీ+అయ్యలు= నీ తండ్రులు; అరువది వేవురు= అరవై వేలమంది; ఒక్కటన్= ఒక్కమారుగా; కపిల కోప+అనల కబళిత శరీరులు+అయిరి= కపిలుడియొక్క ఆగ్రహ మనే అగ్నిచేత మ్రింగబడిన శరీరాలు కలవారు అయినారు; భవత్+జనకుండు= నీ తండ్రి; అతి క్రూర హృదయుండు+ఐ= మిక్కిలి దయలేని మనస్సు కలవాడై; పౌర బాలకులన్= పురమందలి పసిబిడ్డలను; అకారణంబ= ఏ కారణమూ లేకుండగానే; వధియించి= చంపి; మహానదిలో= మహానదిలో; వైచుచున్నన్+ఎఱిఁగి= విసరి వేయటం తెలిసికొని; పౌర జన+ఆక్రోశంబునందు= పురజనులు పెట్టే మొరయందు; అనుక్రోశ పరుండను+ఐ= సానుభూతి కలవాడినై; వానిన్= అతడిని; విడిచితిన్= వదలిపెట్టాను.

తాత్పర్యం: అసమంజసుడి కొడుకు అంశుమంతుడు. సగరుడు తన మనుమడైన అంశుమంతుడిని చూచి 'నాయనా! నీ తండ్రులు అరవైవేలమంది ఒక్కసారి కపిలమహర్షికోపానికి ఆహుతి అయిపోయారు. నీ తండ్రి అసమంజసుఁడు పౌరబాలకులను సంహరించి కఠోరహృదయుడై నదిలో విసరివేస్తూ ఉండేవాడు. అందువలన పౌరుల ఆక్రోశాన్ని విని జాలిపడి నీ తండ్రిని విడిచివేశాను.

క. కొడుకులకు వగవ; మును నా । కడఁగిన హయమేధమఖము గడచనమికి నేఁ
గడు దుఃఖితుండ నయ్యెదఁ; । దడయక నీ విపుడు దీనిఁ దలఁగుము కడఁకన్.' 68

ప్రతిపదార్థం: కొడుకులకు= పుత్త్రులకొరకు; వగవన్= దుఃఖించను; నా, కడఁగిన= నేను పూనిన; హయమేధ మఖము= అశ్వమేధయాగం; కడచనమికిన్= పూర్తికాకుండ ఉండినందుకు; ఏన్= నేను; కడు= మిక్కిలి; దుఃఖితుండన్+అయ్యెదన్= పరితాపం చెందిన వాడిని అవుతున్నాను; తడయక= ఆలస్యం చేయక; నీవు+ఇపుడు= నీవు ఇప్పుడు; దీనిన్= ఈ దుఃఖాన్ని; కడఁకన్= పూనికతో; తలఁగుము= తొలగించుము.

తాత్పర్యం: నా కొడుకులు మరణించినందుకు నేను అంతగా దుఃఖించను, కాని నేను పూనికతో ఆరంభించిన అశ్వమేధయాగం పూర్తికాలేదని మిక్కిలి వెతచెందుతున్నాను. ఇప్పుడు నీవు నా దుఃఖాన్ని తొలగించేందుకు వెంటనే పూనుకొనుము.'

వ. అనిన నంశుమంతుం డాక్షణంబ చని సగరసుతఖాత ద్వారంబున సముద్రంబు సొచ్చి, యందు సూర్య సహస్రద్యుతియై వెలుంగుచున్న కపిలమహామునికి నమస్కరించి, నిజాగమనప్రయోజనం బెఱింగించినఁ గపిలుండును వానికిం గరుణించి యాజ్ఞీయంబైన యశ్వంబు నిచ్చి యిట్లనియె. 69

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అంశుమంతుండు= అంశుమంతుడు; ఆ క్షణంబు+అ, చని= అప్పటికప్పుడే బయలుదేరి వెళ్లి; సగర సుత ఖాత ద్వారంబున= సగరుడి కొడుకుల చేత త్రవ్వబడిన మార్గాన; సముద్రంబు+చొచ్చి= సముద్రాన్ని ప్రవేశించి; అందు= అచట; సూర్య సహస్ర ద్యుతి+ఐ= వేయి సూర్యుల కాంతి కలిగినవాడై; వెలుంగుచున్న= ప్రకాశిస్తున్న; కపిల మహామునికిన్= కపిలమహర్షికి; నమస్కరించి= వందనం చేసి; నిజ+ఆగమన ప్రయోజనంబు= తనరాకకు కల లక్ష్యం; ఎఱింగించినన్= తెలుపగా; కపిలుండును= కపిలమునియున్నూ; వానికిన్+కరుణించి= అతనియెడ దయ కలిగి; యాజ్ఞీయంబు+ఐన= యజ్ఞంకొరకు ఉద్దేశించబడిన; అశ్వంబున్+ఇచ్చి= గుర్రాన్ని ఇచ్చి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని తాతగారు చెప్పగా, అంశుమంతుడు వెన్వెంటనే బయలుదేరి సగరుడి కొడుకులు త్రవ్విన మార్గాన సముద్రాన్ని చేరి, అక్కడ వేయిసూర్యుల కాంతితో ప్రకాశిస్తున్న కపిలమహర్షికి వందనంచేసి, తనరాకకు గల ఉద్దేశాన్ని తెలిపాడు. కపిల మహర్షి అంశుమంతుడియెడ దయ కలిగి యజ్ఞంకొరకు ఉద్దేశించబడిన గుర్రాన్ని ఇచ్చి ఈ విధంగా చెప్పాడు.

క. **'ఘనభుజ! నీ కారణమునఁ । జనఁ గాంతురు పుణ్యగతికి సాగరులు; ముదం**
బున సగరునకును దొరకును । నొనరఁగ సుతవంతులైన యుత్తముల గతుల్. 70

ప్రతిపదార్థం: ఘనభుజ!= గొప్ప భుజాలు కలవాడా, అనగా పరాక్రమవంతుడా!; నీ, కారణమునన్= నీ హేతువుచేత అనగా నీ వలన; సాగరులు= సగరుడి పుత్రులు; పుణ్య గతికిన్= పుణ్యం వలన లభించే మార్గానికి; చనన్+కాంతురు= వెళ్ళగలరు; సుతవంతులు+ఐన= కొడుకులు ఉన్న; ఉత్తముల గతుల్= మంచివారు పొందే లోకాలు; ముదంబునన్= సంతోషంతో; సగరునకును= సగరుడికి కూడ; ఒనరఁగ= శోభిల్లేటట్లు; దొరకును= లభిస్తాయి.

తాత్పర్యం: 'పరాక్రమం గల ఓ అంశుమంతుడా! నీ మూలాన సగరుడి కొడుకులకు సద్గతులు లభిస్తాయి. సగరుడికి సుత సంతానవంతులకు లభించే పుణ్యలోకాలు సంతోషంతో సమకూరుతాయి.

వ. **మఱియు నీచేతనుపనీతంబైన యీ యశ్వంబున నశ్వమేధంబు సేసి సగరుండు కృతార్థుండగు; నీ పౌత్త్రుండైన భగీరథుచేతఁ దేరం బడియెడు గంగాజలౌఘంబులంజేసి సంసిక్తులై సగరసుతులు స్వర్గగతు లగుదురు; సముద్రంబు సంపూర్ణంబగు' ననిన నంశుమంతుండు సంతుష్టుండై కపిలప్రసాదంబున నశ్వంబుఁ దెచ్చి సగరున కిచ్చి కపిలువచనంబు నెఱింగించిన, సగరుండును బుత్త్రశోకంబుడిగి యశ్వమేధంబు సేసి, సముద్రుం దనకుఁబుత్త్రుగాఁ గల్పించిన నది మొదలు సముద్రంబు సాగరంబు నాఁ బరఁగె; నిట్లు సగరుండు పెద్దకాలంబు రాజ్యంబు సేసి, నిజరాజ్యభారం బంశుమంతునందు సమర్పించి చనిన. 71**

ప్రతిపదార్థం: మఱియు= అంతేకాక; నీచేతన్+ ఉపనీతంబు+ఐన= నీచేత తేబడిన; ఈ+అశ్వంబునన్= ఈ గుర్రంతో; అశ్వమేధంబు+చేసి= అశ్వమేధం అనే యాగాన్ని చేసి; సగరుండు= సగరుడు; కృత+అర్థుండు+అగున్= ధన్యుడు కాగలడు; నీ, పౌత్త్రుండు+అగు= నీ మనుమడగు; భగీరథుచేతన్= భగీరథుడి చేత; తేరం బడియెడు= తేబడే; గంగా జల+ఓఘంబులన్+ చేసి= గంగా నది యొక్క నీటి వెల్లువల చేత; సంసిక్తులు+ఐ= తడుపబడిన వారై; సగరసుతులు= సగరుడి కొడుకులు; స్వర్గగతులు+అగుదురు= స్వర్గలోకానికి వెళ్లేవారవుతారు; సముద్రంబు= సముద్రం; సంపూర్ణంబు+అగున్= నీటితో నిండినట్టిది కాగలదు; అనినన్= అని చెప్పగా; అంశుమంతుండు= అంశుమంతుడు; సంతుష్టుండు+ఐ= సంతోషించినవాడై; కపిల ప్రసాదంబునన్= కపిల మహర్షి అనుగ్రహం వలన; అశ్వంబున్+తెచ్చి= గుర్రాన్ని తోడ్కొని తెచ్చి; సగరునకు+ఇచ్చి= సగరుడికి సమర్పించి; కపిలు, వచనంబున్+ఎఱింగించిన= కపిలుడి మాటలను తెలుపగా; సగరుండును= సగరుడున్నూ; పుత్త్ర శోకంబు+ఉడిగి= కొడుకుల మరణంవలన ఏర్పడిన దుఃఖాన్ని విడిచి; అశ్వమేధంబు+చేసి= అశ్వమేధయాగాన్ని చేసి; సముద్రున్= సముద్రుడిని; తనకున్= తనకు; పుత్త్రున్+కాన్= కొడుకుగా; కల్పించినన్= ఏర్పరచుకొనగా; అది మొదలు= అప్పటినుండి; సముద్రంబు= సముద్రం; సాగరంబు+నాన్+పరఁగెన్= 'సాగరం' అని పిలువబడింది; ఇట్లు= ఈ విధంగా; సగరుండు= సగరుడు; పెద్దకాలంబు= చాలా కాలం; రాజ్యంబు+చేసి= ప్రభుత్వం నెరపి; నిజ రాజ్య భారంబు= తనదైన రాజ్యాన్ని పరిపాలించే బరువును; అంశుమంతునందు= అంశుమంతుడిపై; సమర్పించి= మోపి; చనినన్= వెళ్ళగా (వానప్రస్థాశ్రమానికై అడవికి పోగా).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అంతమాత్రమే కాదు. నీచేత తేబడిన గుర్రంతో సగరుడు అశ్వమేధయాగం చేసి ధన్యుడు కాగలడు. నీ మనుమడు భగీరథుడు తెచ్చే గంగనీటివెల్లువచేత తడిసినవారై సగరుడి కొడుకులు స్వర్గలోకానికి పోగలరు. సముద్రం నీటితో మళ్ళీ నిండగలదు'- అని చెప్పగా, అంశుమంతుడు సంతోషించి, కపిలమహర్షి దయవలన లభించిన యాగాశ్వాన్ని సగరుడికి సమర్పించి, కపిలుడు చెప్పిన మాటలు నివేదించాడు. సగరుడుకూడ కొడుకుల మరణంచేత ఏర్పడిన దుఃఖాన్ని మరచి, అశ్వమేధయాగం చేసి, సముద్రుడిని తన పుత్రుడిగా స్వీకరించాడు. నాటినుండి సముద్రం 'సాగరం' అని పిలువబడసాగింది. ఈ విధంగా సగరుడు చాలకాలం ప్రజాపరిపాలన కొనసాగించి, చివరకు రాజ్య భారాన్ని అంశుమంతుడిపై మోపి, తాను వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించి అడవికి వెళ్ళిపోయాడు.

తే. **తన పితామహునట్టుల ధరణి యేలి । యంశుమంతుండు నిజపుత్త్రుఁ డగు దిలీపు**
నందు రాజ్యభారముఁ బూన్చి యఖిల లోక । పూజితుండు దపోవనంబునకుఁ జనియె. **72**

ప్రతిపదార్థం: తన పితామహున్+అట్టుల= తన తాతగారి వలె; అంశుమంతుండు= అంశుమంతుడు; ధరణి+ఏలి= భూమిని పరిపాలించి; నిజ పుత్త్రుఁడు+అగు= తన కొడుకైన; దిలీపునందు= దిలీపుడిపై; రాజ్య భారమున్= ప్రభుత్వం యొక్క బరువును; పూన్చి= మోపి; అఖిల, లోక, పూజితుండు= సమస్తలోకాలచేత ఆరాధించబడిన వాడు, (ఆ అంశుమంతుడు); తపో వనంబునకున్= (తపస్+వనంబునకున్)= తపస్సు చేసికొనే అడవికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అంశుమంతుడు కూడ, తన తాతగారి వలెనే ప్రజానురంజకంగా రాజ్యాన్ని పరిపాలించి, తన కొడుకైన దిలీపుడిపై ప్రభుత్వ భారాన్ని మోపి, సమస్త లోకాలచేత ఆరాధించబడిన తాను వానప్రస్థాశ్రమం స్వీకరించి, తపస్సు చేసికొనేందుకు అడవికి వెళ్ళాడు.

వ. **దిలీపుండును దన పితామహులైన సాగరు లధోగతులు గాకుండ గంగావతరణంబునందు యత్నంబుసేసి యశక్తుండై.** **73**

ప్రతిపదార్థం: దిలీపుండును= దిలీపు డనే మహారాజు సైతం; తన పితామహులు+ఐన= తన తాతలైన; సాగరులు= సగరుడి కొడుకులు; అధస్+గతులు= అధోగతులు= అధో లోకాలకు పోయేవారు; కాకుండ; గంగా+అవతరణంబునందున్= గంగ క్రిందికి దిగేటట్లు చేయటంలో, (గంగ భూమిపై అవతరించటంలో); యత్నంబు+చేసి= కృషి చేసి; అశక్తుండు+ఐ= శక్తి చాలనివాడై.

తాత్పర్యం: దిలీపమహారాజు తన తాతగారైన సగరుడి కొడుకులు అధమలోకాలకు పోకుండ గంగను భూలోకానికి అవతరింపజేయటానికై కృషి చేశాడు. కాని, అతడి శక్తి అందుకు చాలలేదు.

చ. **ప్రథితయశున్ సుతుం బడసె భారసహిష్ణు మహారథున్ భగీ**
రథుఁడను చక్రవర్తి నపరాజితతేజు నిజాన్వవాయదు
ష్పథవినివర్తకున్ సకలపార్థివజైత్రు మదోద్ధతాసుహృ
న్మథను సురాపగానయసమర్థ తపోగుణయుక్తు నుత్తమున్. **74**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ప్రథిత యశున్= ప్రసిద్ధమైన కీర్తి కలవాడిని; భార సహిష్ణున్= బరువును సహించేందుకు ఇష్టపడేవాడిని; మహారథున్= గొప్ప తేరుపై ఎక్కి పదకొండు వేలమంది విలుకాండ్రతో పరాక్రమంతో యుద్ధం చేయగల వీరుడిని; భగీరథుఁడు+అను చక్రవర్తిన్= భగీరథుడు అనే పేరుగల రారాజును; నిజ+అన్వవాయ దుష్పథ వినివర్తకున్= తనయొక్క వంశాన్ని దుర్గతినుండి వెనక్కు మరలించ గలిగిన వాడిని; సకల పార్థివ జైత్రున్= అందరురాజులను జయించే వాడిని; మద+ఉద్ధత+అసుహృత్+మథనున్= గర్వంచేత విజృంభించిన శత్రువులను నిర్జించేవాడిని; సుర+ఆపగా+అనయ సమర్థ తపస్+గుణ యుక్తున్= దేవలోకంలోని నదిని తీసికొని రావటానికి తగిన సామర్థ్యం గల తపస్సు అనెడి లక్షణంతో కూడిన వాడిని; ఉత్తమున్= మంచివాడిని; సుతున్= కొడుకును; అపరాజిత తేజు= అపజయ మెరుగని తేజస్సు కల వాడిని; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: ఆ దిలీపమహారాజు భగీరథు డనే కుమారుడిని పొందాడు. భగీరథుడు గొప్ప యశస్సును ఆర్జించినవాడు. ఎన్ని కష్టాలనైనా భరించేందుకు వెనకాడని చిత్తప్రవృత్తి కలవాడు. రథంపై అధివసించి పరాక్రమంతో వేలకొలది వీరులను ఎదిరించ గలిగిన మహావీరుడు, ఎందరో రాజులను సామంతులుగా చేసి రాజ్యం చేసిన చక్రవర్తి, అపజయ మెరుగని తేజస్వి, తన వంశాన్ని దుర్గతినుండి కాపాడగల సమర్థుడు, సకల రాజులను జయించినవాడు, గర్వంతో విజృంభించే శత్రువుల ఉక్కడగించేటటువంటివాడు, దేవనదియైన గంగను భూమిపైకి తీసికొనిరాగల సామర్థ్యంతో కూడిన తపోమహిమ కలవాడు. ఉత్తముడు.

వ. ఆ భగీరథు నపారభూభారధురంధరుం జేసి దిలీపుండు తపోవనంబున కరిగిన. 75

ప్రతిపదార్థం: ఆ భగీరథున్= ఆ భగీరథుడిని; అపార భూ భార ధురంధరున్+చేసి= హద్దులేని అనగా అంతులేని భూరాజ్యం యొక్క బరువు మోయగలవాడినిగా - అనగా పరిపాలించేవాడినిగా చేసి; దిలీపుండు= దిలీపుడు; తపస్+వనంబునకు= తపోవనంబునకు= తపస్సు చేసికొనేందుకు అనువైన అడవికి; అరిగినన్= వెళ్ళగా.

తాత్పర్యం: ఆ భగీరథుడిని సువిశాల రాజ్యభారాన్ని భరించే వాడినిగా చేసి, దిలీపుడు తపస్సు చేసికొనేందుకై వాన ప్రస్థాన్ని స్వీకరించి అడవికి వెళ్లిపోయాడు.

తే. కపిలుకోపాగ్నిఁ జేసి సాగరులు గ్రాఁగి । రనియు గతిఁ గానకున్నవా రనియు నెఱిఁగి,
వారలకు హిత మొనరింప వగచి గంగఁ । దేరఁ గడఁగె వీరుండు భగీరథుండు. 76

ప్రతిపదార్థం: కపిలు, కోప+అగ్నిన్+చేసి= కపిల మహర్షి యొక్క కోపం అనే అగ్నిచేత; సాగరులు= సగరుడి కొడుకులు; క్రాఁగిరి= మండిపోయారు; అనియు= అనిన్నీ; గతిన్= ఉత్తమలోకాన్ని చేరేదారి; కానక+ఉన్నవారు= తెలియని స్థితిలో ఉన్నారు; అనియున్= అనిన్నీ; ఎఱిఁగి= తెలిసికొని; వారలకు= ఆ సాగరులకు; హితము= మేలు; ఒనరింప= చేసేందుకు, చేయటానికి; వగచి= ఆలోచించి; వీరుండు= పరాక్రమం కలవాడు; భగీరథుండు= భగీరథుడు; గంగన్= గంగను; తేరన్= తెచ్చేందుకు, (తేవటానికి); కడఁగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: కపిలమహర్షి ఆగ్రహ మనే అగ్నికి సగరుడి కొడుకులు ఆహుతిఅయి, ఉత్తమ లోకాలకు పోలేకుండా ఉన్నట్లు తెలిసికొని, వారికి మేలు చేసేందుకు ఆలోచించి, భూలోకానికి గంగను దింపటానికై మహావీరుడైన భగీరథుడు పూనుకొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు భగీరథుండు గంగావతరణంబునందుఁ గృతనిశ్చయుండై యరిగి బహువిధాకార ధాతుమంతంబులైన యుత్తుంగశృంగంబులను, జలభర వినమ్ర ప్రబల బలాహక వ్యూహ సంఛాదిత శ్యామాయమానంబులైన తుహినస్థలంబులను, సిద్ధ విద్యాధరగంధర్వ గీర్వాణ మిథునసంసేవ్యమానంబులైన నానారత్న కందరంబులను, శుకపిక పారావత శుక్లాపాంగ సారంగ శతపత్ర పుత్ర ప్రియ దాత్యూహ వ్యూహ శబ్ద శబ్దాయమానంబులైన తరువనరేఖలను, సింహ శరభ శార్దూల శుండాల గోలాంగూల కోలాహలాన్వితంబులైన గుహా గహ్వరంబులనుం జేసి రమణీయ భయానకంబైన హిమవత్పర్వతంబున.77

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; భగీరథుండు= భగీరథుడు; గంగా+అవతరణంబునందున్= గంగను భూమిపై అవతరింప చేయటంలో; కృత, నిశ్చయుండు+ఐ= చేయబడిన నిశ్చయం కలవాడై, (స్థిర నిర్ణయాన్ని గైకొన్నవాడై); అరిగి= వెళ్లి; బహు విధ+ఆకార ధాతుమంతంబులు+ఐన= పెక్కు రకాలైన ఆకృతులుగల, మణి (శిల) గైరికాది శైల పదార్థాలు కలవియున్నూ అయిన; ఉత్తుంగ శృంగంబులను= మిక్కిలి ఎత్తైన కొండకోనలను; జలభర, వినమ్ర, ప్రబల, బలాహక, వ్యూహ, సంఛాదిత, శ్యామాయమానంబులు+ఐన= నీటియొక్క బరువుచేత వంగిన పెద్దపెద్ద మబ్బులగుంపులచేత కప్పబడి నల్లనైన; తుహిన, స్థలంబులను= మంచు ప్రదేశాలను; సిద్ధ, విద్యాధర, గీర్వాణ, మిథున, సంసేవ్యమానంబులు+ఐన= సిద్ధులు విద్యాధరులు, గంధర్వులు, గీర్వాణులు అయిన దేవతా జాతులలోని స్త్రీ పురుషుల జంటలచేత సందర్శించబడునట్టివైన; నానా, రత్న, కందరంబులను= పెక్కు రత్నాలు గల గుహలను; శుక, పిక, పారావత, శుక్లాపాంగ సారంగ, శతపత్ర పుత్ర, ప్రియ, దాత్యూహ, వ్యూహ, శబ్ద, శబ్దాయ మానంబులు+ఐన= చిలుకలు, కోయిలలు, పావురాలు, తెల్లని క్రీగంటి చూపులు గలలేళ్ళు, కొదమ నెమళ్ళకు ప్రియమైన వానకోయిలల సముదాయాలయొక్క ధ్వనులచేత ప్రతిధ్వనించబడుతున్న; తరు, వన, రేఖలను= చెట్ల గుంపుల వరుసలను; సింహ, శరభ, శార్దూల, శుండాల, గోలాంగూల, కోలాహల+అన్వితంబులు+ఐన= సింహాలచేత, శరభాలచేత (మీగండ్ల మెకాలచేత), పెద్దపులులచేత, ఏనుగులచేత, కొండముచ్చులచేత చేయబడే కలకల ధ్వనులతో కూడిన; గుహా, గహ్వరంబులనున్= పర్వత బిలాలను; చేసి= కలిగి ఉండటం వలన; రమణీయ భయానకంబు+ఐన= అందంతో పాటు భయాన్ని కలిగించేటటువంటి; హిమవత్+పర్వతంబునన్= మంచుమలయందు, హిమాలయ పర్వతంలో.

తాత్పర్యం: ఈవిధంగా భగీరథుడు గంగానదిని దివినుండి భువికి దింపటానికి స్థిరమైన సంకల్పాన్ని ఏర్పరచుకొన్నవాడై హిమాలయ పర్వతానికి వెళ్ళాడు. ఆ మంచుకొండ, అనేక విధాలైన శైలద్రవ్యాలు గల ఎత్తైన శిఖరాలతో, నీటి బరువుతో వంగిన పెనుమబ్బు దొంతరలతో ఆవరించబడటంచేత నల్లనైన మంచు ప్రదేశాలలో సిద్ధులు, సాధ్యులు, విద్యాధరులు, గంధర్వులు, గీర్వాణులు అనే తెగలకు చెందిన స్త్రీ పురుషుల జంటలు విహరించేటటువంటి రత్నమయాలైన గుహలతో, చిలుకలు, కోకిలలు, పావురాలు, తెల్లనైన వాల్గంటి చూపులు గల లేళ్ళు, కొదమ నెమిళ్లు, వాటికి ప్రీతిని కలిగించే వానకోకిలల గుంపులు చేసే ధ్వనులతో ప్రతిధ్వనించే చెట్ల వరుసలతో, సింహాలు, శరభాలు, పెద్దపులులు, ఏనుగులు, కొండముచ్చులు చేసే కోలాహల ధ్వనులతో అందంతో పాటు భయాన్ని రేకెత్తించేటటు వంటిదిగా విలసిల్లుతూ ఉంది.

చ. సతతకృతోపవాసముల శాకఫలోదకమూలపారణ
వ్రతముల దేవపూజల నపారజపంబులఁజేసి నిష్ఠతో
నతులతపంబు సేసె నమరాపగ నుర్వికిఁ దెచ్చు వేడ్కతో
ధృతియుతుఁడై దిలీపకులదీపుఁడు దివ్యసహస్రవర్షముల్. 78

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దిలీప కుల దీపుఁడు= దిలీపుడి వంశాన్ని వెలిగించేటటువంటివాడు అనగా భగీరథుడు; ధృతి యుతుఁడు+ఐ= పూనికతో కూడినవాడై; అమర+ఆపగన్= దేవగంగను; ఉర్వికిన్= భూమికిన్; తెచ్చు= తీసుకొని వచ్చే; వేడ్కతోన్= అభిలాషతో; దివ్య, సహస్ర వర్షముల్= దేవమానంలో వేయి ఏళ్ళు; సతత కృత+ఉపవాసముల= ఎల్లప్పుడు ఆచరించే ఉపవాస దీక్షలతో; శాక, ఫల+ఉదక, మూల, పారణ, వ్రతములన్= ఉపవాసం చేసిన మరునాడు ఆకుకూరలు, పళ్ళు, నీళ్ళు, వేళ్ళు మాత్రమే తినేటటువంటి నియమాలతో; దేవ పూజలన్= దేవతలను ఆరాధించటంలో; అపార, జపంబులన్+చేసి= మితిలేని మంత్రావృత్తులు చేయటంలో; నిష్ఠతో= మిక్కిలి దీక్షతో; అతుల తపంబు+చేసెన్= సాటిలేని తపస్సు చేశాడు.

తాత్పర్యం: దిలీపవంశానికి దీపం వంటి వాడైన భగీరథుడు, గొప్ప పూనిక కలవాడై, ఆ హిమవత్పర్వతంలో దేవమానంలో వేయేళ్ళు దీక్షతో గంగానదిని దివినుండి భువికి దింపటానికై కటిక ఉపవాసాలు చేస్తూ, ఉపవాసం ముగిసిన మర్నాడు ఆకుకూరలు, పళ్ళు, నీళ్ళు, వేళ్ళు మాత్రమే భుజించి దేవతలను అర్చిస్తూ, మంత్రాలను ఆవృత్తి చేస్తూ సాటిలేని తపస్సు చేశాడు.

వ. ఆ భగీరథు తపంబునకు మెచ్చి గంగాదేవి ప్రత్యక్షంబై 'నీ యిష్టంబు సెప్పు' మనినం గృతాంజలియై యిట్లనియె.79

ప్రతిపదార్థం: ఆ భగీరథు తపంబునకు= ఆ భగీరథుడు చేసిన తపస్సుకు; మెచ్చి= ప్రీతిచెంది; గంగాదేవి= గంగాదేవి; ప్రత్యక్షంబు+ఐ= సాక్షాత్కరించి; నీ ఇష్టంబు= నీ కోరిక; చెప్పుము+అనినన్= చెప్పుమని అడుగగా; కృత+అంజలి+ఐ= కూర్చబడిన దోయిలి కలవాడై, అనగా దోసిలి ఒగ్గి నమస్కరించినవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ భగీరథుడు చేసిన కఠోరతపస్సుకు ప్రీతి చెంది గంగాదేవి సాక్షాత్కరించి, నీకు ఇష్టమైన కోరిక కోరుకొమ్మని అడుగగా, అతడు అంజలి ఘటించి నమస్కరించి ఇట్లా పలికాడు.

సీ. 'తపనతేజుండైన కపిలుకోపంబున । గతజీవులై పుణ్యగతులయందు
నిహతులై మత్పితామహు లున్నవారు; నీ । దగు పుణ్యజలముల సగరసుతులు
సిక్తులై స్వర్గానుభుక్తిఁ బ్రాపింతురు । గావున దేవి! యిద్దేవపథము
నందుండి వసుమతి కొందంగఁ జనుదేర । వలయు' నావుడు 'మహీవలయమునకు

ఆ. నేను వచ్చునపుడు నా నిరంతర జలౌ । ఘంబు దాల్ప నీలకంఠుఁ డోపుఁ
గాని యొరులు దాల్పఁగా నోప; రయ్యుమా । నాథుకరుణఁ బడయు నన్నుఁ దాల్ప.' 80

ప్రతిపదార్థం: తపనతేజుండు+ఐన= సూర్యుడి యొక్క తేజస్సు కలవాడైన; కపిలు, కోపంబున= కపిల మహర్షి ఆగ్రహం చొప్పున; గతజీవులు+ఐ= పోయిన ప్రాణాలు కలవారై; పుణ్యగతుల+అందు= పుణ్యమార్గాలలో; నిహతులు+ఐ= దెబ్బతిన్నవారై; మత్+పితామహులు= నా తాతలు; ఉన్నవారు= ఉన్నారు; నీదు+అగు= నీదైన; పుణ్యజలములన్= పుణ్యం చేకూర్చే జలాల చేత; సగరసుతులు= సగరుడి కొడుకులు; సిక్తులు+ఐ= తడుపబడినవారై; స్వర్గ+అనుభుక్తిన్= స్వర్గాన్ని అనుభవించే స్థితిని; ప్రాపింతురు= పొందుతారు; కావున= కాబట్టి; దేవి!= ఓ గంగా దేవీ!; ఈ+దేవ పథమునందుండి= ఈ దేవతల మార్గం నుండి; వసుమతికి= భూమికి; ఒందంగన్= ఒప్పునట్లు; చనుదేర వలయు= రావలసింది; నావుడు= అని చెప్పగా; మహీవలయమునకున్= భూమండలానికి; నేను, వచ్చునపుడు= నేను దిగి వచ్చేటప్పుడు; నా నిరంతర జల+ఓఘంబు+తాల్పన్= ఎడతెగని నా నీటి సమూహాన్ని (వెల్లువను) ధరించేందుకు; నీలకంఠుఁడు+ఓపున్= నల్లనికంఠం కల శివుడు తాళగలడు; కాని= కాని; ఒరులు= (ఆ శివుడు తప్ప) ఇతరులు; తాల్పఁగాన్+ఓపరు= ధరించ శక్తులు కారు; ఆ+ఉమా నాథు= ఆ పార్వతీపతి యొక్క; కరుణన్= దయను; నన్నున్+తాల్ప= నన్ను ధరించేందుకు; పడయు= పొందుము.

తాత్పర్యం: 'సూర్యుడి వంటి తేజస్సు కల కపిల మహాముని ఆగ్రహానికి గురియై మరణించి పుణ్యగతుల చెందకుండా నా తాతలు అల్లాడి పోతున్నారు. నీ పుణ్యజలాల మహిమచేత సగరపుత్రులు స్వర్గలోకాన్ని పొందగలరు. కావున ఓ గంగాదేవీ! నీవు ఈ దేవమార్గంనందుండి భూమండలానికి దిగి రావాలని నా ప్రార్థన' అని భగీరథుడు గంగను ప్రార్థించాడు. అంత ఆ గంగాదేవి 'నేను దివినుండి భువికి దిగి వచ్చేటప్పుడు ఎడతెగని నా నీటి వెల్లువను భరించజాలువాడు ఆ పరమేశ్వరు డొక్కడే. శివుడికి తప్ప ఇతరులు ఎవరికీ అది సాధ్యం కాదు. కావున నీవు ముందు ఆ పార్వతీపతిదయ చూరగొని నన్ను భరించటానికి అతడిని ప్రసన్నుడిని చేసికొనుము'.

వ. అనిన గంగాదేవివచనంబునఁ గైలాసంబున కరిగి, భగీరథుండు భగవంతు నంతకాంతకు నీశ్వరుగుఱించి పెద్దకాలంబు తపంబు సేసిన, నీశ్వరుండు వానికి సన్నిహితుండయి 'నీవు భూలోకంబునకు గంగావతరణంబు సేయు; మేను గంగ ధరియించెద' ననిన భగీరథుండు వెండియు గంగ నారాధించిన నాతనికిం గరుణించి. 81

ప్రతిపదార్థం: అనిన= అని చెప్పగా; గంగాదేవి వచనంబునన్= గంగాదేవి మాట ప్రకారం; భగీరథుండు= భగీరథుడు; కైలాసంబునకు+అరిగి= శివుడి నివాసమైన కైలాసానికి వెళ్ళి; భగవంతున్= దేవుడైనవాడిని; అంతక+అంతకున్= అంతకుడిని (యముడిని) అంతమొందించిన వాడిని; ఈశ్వరు= శివుడిని; గుఱించి= కూర్చి; పెద్ద కాలంబు= చాలాకాలం; తపంబు+చేసినన్= తపస్సు చేయగా; ఈశ్వరుండు= శివుడు; వానికి= అతడికి- ఆ భగీరథుడికి; సన్నిహితుండు+ఐ= దగ్గరకు వచ్చినవాడై; నీవు; భూలోకంబునకున్= భూమిపైకి; గంగా+అవతరణంబు+చేయుము= గంగ దిగేటట్లు చేయుము; ఏను= నేను; గంగ= గంగను; ధరియించెదన్= ధరిస్తాను; అనినన్= అని చెప్పగా; భగీరథుండు= భగీరథుడు; వెండియు= మళ్ళీ; గంగన్+ఆరాధించినన్= గంగను అర్చించగా; ఆతనికిన్= ఆ భగీరథుడిపై; కరుణించి= దయచూపి.

తాత్పర్యం: అని చెప్పగా, గంగాదేవి మాటచొప్పున భగీరథుడు కైలాసానికి వెళ్ళి, భగవంతుడైన ఈశ్వరుడినిగురించి చాలాకాలం కఠోరతపస్సు చేశాడు. ఈశ్వరుడు భగీరథుడి తపస్సుకు మెచ్చి అతడికి ప్రత్యక్షమై, 'నీవు గంగాదేవిని దివినుండి భువికి అవతరింపజేయుము; నేను గంగను ధరించగలను' అని ఆనతిచ్చాడు. భగీరథుడు మళ్ళీ గంగను అర్చించాడు. అంతట గంగాదేవి భగీరథుడిని కరుణించింది.

మ. ఇలకున్ గంగ తరంగసంగతులతో నేతెంచె నాశాంతరం
బులు నాకాశముఁ గప్పుచుం దగ మహాభూత ప్రపంచంబుతోఁ
జెలువై యుండఁగ దాని నీశ్వరుఁడు దాల్చెన్ సంగతోత్తుంగ పిం
గళజూటాగ్రమునందుఁ బద్మదళసంకాశంబుగా లీలతోన్. 82

ప్రతిపదార్థం: ఇలకున్= భువికి; గంగ= గంగానది; తరంగ, సంగతులతోన్= అలల కలయికలతో; ఆశా+అంతరంబులున్= దిక్కుల మధ్యభాగాలు; ఆకాశమున్= ఆకాశాన్ని; కప్పుచున్= క్రమ్ముతూ; మహాభూత ప్రపంచంబుతోన్= గొప్ప ప్రాణికోటుల సముదాయంతో; చెలువు+ఐ+ఉండఁగన్= విలసిల్లుతుండగా; తగన్= ఒప్పునట్లుగా; ఏతెంచెన్= వచ్చింది; దానిన్= ఆ గంగను; ఈశ్వరుఁడు= శివుడు; సంగత+ఉత్తుంగ, పింగళ, జూట+అగ్రమునందున్= చక్కగా పొసగి ఉన్నదీ; ఎత్తైనదీ, గోరోజనం రంగు కలదీ అయిన జడముడి చివరి భాగంలో; పద్మ, దళ, సంకాశంబుగాన్= తామరపువ్వురేకుతో సరిపోలేటట్లుగా; లీలతోన్= వినోదంగా; తాల్చెన్= ధరించాడు.

తాత్పర్యం: గంగానది, అలల కలయికలతో ఆకాసాన్నీ, దిగంతరాలనూ కప్పుతూ భూమిపైకి వచ్చింది. గొప్ప ప్రాణికోటుల సమూహాలతో శోభిల్లేటటువంటి ఆ గంగను శివుడు తన ఎత్తైన గోరోజనం రంగు కల జటాజూటం పైభాగాన తామరపూరేకు పోలికగా విలాసంగా ధరించాడు.

విశేషం: ఈ పద్యం గంగావతరణ వర్ణన. నన్నయ ఈ పద్యానికి ముందు వచనాలనూ సీసపద్యాన్నీ వ్రాశాడు. గంగావతరణ వర్ణనకై ఛందస్సు మార్చి మత్తేభపద్యాన్ని కూర్చాడు. సందర్భానికి అనువుగా ఛందస్సు మార్చి వాడే పద్ధతి తెలుగులో నన్నయనాటి నుండి నేటివరకూ కొనసాగుతున్నది. ఇటువంటి ఛందోవైవిధ్యం సంస్కృతవాఙ్మయంలోకాని, ప్రపంచంలో పెక్కు సారస్వతాలలో కాని కనిపించదు. ఛందో వైవిధ్య ప్రయోగం తెలుగుకవితకు గల విశిష్టత. ఈ పద్యంలో బిందు పూర్వక గకార ప్రయోగ పౌనఃపున్యం దీర్ఘ సంస్కృత సమాస పునరావృత్తి అనిర్వచనీయమైన దివ్యానుభూతిని అందిస్తున్నది. ఇది సహృదయ హృదయైక వేద్యం. నన్నయకవితాశిల్పానికి అంతర్భాగమైన అక్షరరమ్యతకూ, ప్రసన్నకథాకవితార్థయుక్తికీ ఈ పద్యం ఉదాహరణప్రాయం.

సీ. **సుర ముని సిద్ధ ఖేచరవరుల్ వచ్చి య । చ్చెరువంది చూడంగ హరుశిరంబు**
నందుండి భువనైకవందిత సురనది। ధరణీతలంబున కరుగుదెంచి
కలహంసగతియు నిర్మలఫేనహాసంబు । నాకీర్ణ మీనవిలోకనములు
నాలోల పవన వాచాలిత కల్లోల । లసితమృదూక్తులు నెసఁగుచుండఁ

తే. **బ్రీతితో భగీరథుఁ డను దూతచేత । నీతయై మహామునిపరిపీత రిక్త**
మగు సరిత్పతిఁ గూడి, యాసగరజులకు । హితముగా దాని నించె నాతతజలముల. **83**

ప్రతిపదార్థం: సుర, ముని, సిద్ధ, ఖేచర వరుల్= దేవతలు, మునులు, సిద్ధులు ఆకాశంలో సంచరించే వారిలో శ్రేష్ఠులు; వచ్చి= వచ్చి; అచ్చెరువు+అంది= ఆశ్చర్యం చెంది; చూడంగన్= దర్శించగా; హరు శిరంబు నందుండి= శివుడి తలపై నుండి; భువన+ఏక వందిత= జగత్తులోని ప్రజలందరిచేత ముఖ్యంగా ఆరాధించబడిన; సుర నది= వేలుపుటేరు, గంగానది; ధరణీ తలంబునకున్= భూమిపైభాగానికి; అరుగుదెంచి= వచ్చి; కలహంస, గతియు= రాజహంస నడకయున్నూ; నిర్మల ఫేన హాసంబున్= స్వచ్ఛమైన నురుగు అనే నవ్వు; ఆకీర్ణ, మీన, విలోకనములు= చెదరిన చేపలు అనే చూపులు; ఆలోల, పవన, వాచాలిత, కల్లోల, లసిత, మృదు+ఉక్తులున్= కదిలేటి గాలులచేత మిగుల చప్పుడౌతున్న పెద్ద కెరటాల యొక్క శబ్దాలనెడి శోభిల్లే మెత్తని మాటలు; ఎసఁగుచుండన్= శోభిల్లుతుండగా; ప్రీతితో= సంతోషంతో; భగీరథుఁడు+అను= భగీరథుడు అనే; దూతచేత= సంధానకర్తచేత; నీత+ఐ= వెంటగొనిపోబడేటటువంటిదై; మహా, ముని, పరిపీత, రిక్తము+అగు= గొప్ప ఋషి (అగస్త్యుడి) చేత త్రాగబడి శూన్యమైన; సరిత్+పతిన్+కూడి= సముద్రుడిని చేరి (సరిత్+పతి= నదులకు భర్త= సముద్రుడు); ఆ+సగరజులకున్= ఆ సగరుడి కొడుకులకు; హితముగా= మేలు కలిగేటట్లుగా; దాని= ఆ సముద్రాన్ని; ఆతత+జలములన్= విస్తారమైన నీటితో; నించెన్= నింపింది.

తాత్పర్యం: దేవతలు, ఋషులు, సిద్ధులు మున్నగు శ్రేష్ఠులైన ఆకాశసంచారులు వచ్చి ఆశ్చర్యంతో గంగావతరణాన్ని దర్శించారు. శివుడి జటాజూటంనుండి, ప్రజలందరిచేత ఆరాధించబడే దేవనది గంగ దివినుంచి భువికి దిగింది. కలహంస నడక, స్వచ్ఛమైన నురుగు అనే చిరునవ్వు, కదిలే చేపలు అనే చూపులు, వీస్తున్న గాలిచేత ధ్వనించే కెరటాల సవ్వడులు అనే నర్మభాషణాలు కలదై, సంతోషంతో భగీరథుడు అనే దూత వెంట పెట్టుకుని తీసికొని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పోతూఉండగా, అగస్త్యమహర్షిచేత త్రాగబడి శూన్యమై ఉన్న సముద్రుడివద్దకు ఆ సగరసుతులకు మేలుచేయటంకొరకు పయనమై వెళ్ళి, ఆ సముద్రుడిని విస్తారమైన నీటితో నింపింది.

విశేషం: అలం: రూపకం. ఇక్కడ గంగానది నాయిక. సరిత్పతియైన సముద్రుడు నాయకుడు. భగీరథుడు సంధానకర్తయైన దూత. శృంగార నాయికా లక్షణాలు కలహంసగతి, ఫేనహాసం, మీనవిలోకనాలు, ఆలోల పవన వాచాలిత కల్లోల లసిత మృదూక్తులు. రక్తుడైన నాయకుడిని కూడటానికి వెళ్ళే గంగ ఉత్తమనాయిక. సాగరుల సముద్ధరణ ఆమె ధ్యేయం.

క. సాగరులకు సద్గతిగా । సాగరమున కట్లు సలిలసంపూర్ణముగా
భూగతయై భాగీరథి । భాగీరథకీర్తి భువనపంక్తుల నించెన్. 84

ప్రతిపదార్థం: సాగరులకు= సగరుడి పుత్రులకు; సత్+గతిగాన్= మంచి గతి కలిగేటట్లుగా; సాగరమునకు= సముద్రానికి; అట్లు= ఆ విధంగా; సలిల సంపూర్ణముగా= నీరు నిండేటట్లుగా; భాగీరథి= గంగానది; భూగత+ఐ= భువికి దిగినట్టిదై; భాగీరథకీర్తి= భగీరథుడియొక్క యశస్సు; భువనపంక్తులన్= పెక్కు లోకాలలో; నించెన్= నింపింది.

తాత్పర్యం: సగరుడి కొడుకులకు పుణ్యగతి కలిగేటట్లుగా, సముద్రానికి నిండా నీరు నిండేటట్లుగా, గంగానది భూలోకానికి దిగివచ్చి భగీరథుడి యశస్సును సమస్తలోకాలలో వ్యాపింప చేసింది.

విశేషం: గంగానది విశ్వజనీన చరితయై దివినుండి భువికి అవతరించింది. గంగకు భాగీరథి అనే పర్యాయపదం ఏర్పడటానికి ఉపపత్తిని ఈ పద్యం వెల్లడిస్తున్నది. అందుచేతనే గంగానదిని ప్రజలు పరమపవిత్రభావంతో చూస్తున్నారు.

వ. అని యిట్లు గంగావతరణంబును, భగీరథు మాహాత్మ్యంబును రోమశుండు సెప్పిన విని ధర్మజుం డనుజ సహితుండై యరిగి నందయు నపరనందయును నను మహానదులయందుఁగృతస్నానుండై హేమ కూటంబున నుపలంబులవలన వెలువడు దహనంబున నాహూతంబులై వచ్చు మేఘంబులను జూచి విస్మయంబంది దాని విధం బడిగిన వానికి రోమశుం డిట్లనియె; 'ఋషభకూటంబున ఋషభుండను ముని యతికోపనుండై యెవ్వరు వలికిన నపుడె యుగ్రానలాకారుండై యుపలంబులవలన వెలువడు మేఘంబులం బిలిచి వారల వారించు; దానంజేసి తపోదాన ధర్మ శమదమరహితులైన జనుల కది దురారోహంబు; దేవతలు దేవదర్శనులైన ఋషులు నమ్మునిం జూడ వత్తు; రిందు దేవఋషులు యజ్ఞంబు సేసిన యజ్ఞభూములందుఁ గుశాకారంబులయిన దూర్వాంకురంబులు యూపాకారంబులైన వృక్షంబులుఁ గానంబడు' ననిన నా పుణ్యతీర్థంబున స్నానంబు సేసి యరుగుచున్న ధర్మరాజునకు రోమశుం డిట్లనియె. 85

ప్రతిపదార్థం: అని= అంటూ; ఇట్లు= ఈ విధంగా; గంగా+అవతరణంబును= గంగ అవతరించటమున్నూ; భగీరథు, మాహాత్మ్యంబును= భగీరథుడి గొప్పతనాన్ని; రోమశుండు= రోమశ మహర్షి; చెప్పిన విని= చెప్పగా ఆలకించి; ధర్మజుండు= ధర్మరాజు; అనుజ సహితుండు+ఐ= తమ్ముళ్ళతో కూడినవాడై; అరిగి= వెళ్ళి; నందయున్= నంద అనే పేరుకల; అపర నందయునున్= అపరనంద అనే పేరుకల; మహానదుల+అందున్= గొప్ప నదులలో; కృత+స్నానుండు+ఐ= చేయబడిన స్నానం కలవాడై, అనగా ఆ నదులలో స్నానం చేసి; హేమకూటంబునన్= హేమకూటం అనే పేరుకల పర్వతశిఖరమందు; ఉపలంబుల వలనన్= రాళ్ళనుంచి; వెలువడు= ఉద్భవించే; దహనంబునన్= మంటచేత; ఆహూతంబులు+ఐ= పిలువబడినట్టివై;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వచ్చు; మేఘంబులన్= మబ్బులను; చూచి= దర్శించి; విస్మయంబు+అంది= అచ్చెరువు నొంది, ఆశ్చర్యపడి; దాని విధంబు+అడిగినన్= దాని రీతిని గురించి ప్రశ్నించగా; వానికిన్= అతడికి అనగా ఆ ధర్మరాజుకు; రోమశుండు= రోమశుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; ఋషభకూటంబున= ఋషభకూటం అనే పర్వత శిఖరంమీద; ఋషభుండు+అను= ఋషభుడు అని పిలువబడే; ముని= ఋషి; అతికోపనుండు+ఐ= మిక్కిలి కోపం కలవాడై; ఎవ్వరు+పలికినన్= ఎవరు మాట్లాడినా; అపుడే= ఆ క్షణమందే; ఉగ్ర+అనల+ఆకారుండు+ఐ= భయంకరమైన అగ్ని వంటి రూపం కలవాడై; ఉపలంబుల వలనన్= రాళ్ళనుండి; వెలువడు= బయటికి వచ్చే; మేఘంబులన్+పిలిచి= మబ్బులను ఆహ్వానించి; వారలన్= వారిని; వారించు= అడ్డగిస్తాడు; దానన్+చేసి= అందువలన; తపస్+దాన, ధర్మ, శమ, దమ, రహితులు+ఐన= తపం, దానం, ధర్మం, అంతరింద్రియ నిగ్రహం, బాహ్యేంద్రియ నిగ్రహం లేనివారు అయిన; జనులకు= ప్రజలకు; అది= ఆ ఋషభకూటం; దుస్+ఆరోహంబు= ఎక్కేందుకు సాధ్యం కానిది; దేవతలు= వేల్పులు; దేవ దర్శనులు+అయిన, ఋషులున్= దేవతల సాక్షాత్కారం పొందే మునులు; ఆ+మునిన్= ఆ ఋషిని; చూడవత్తురు= దర్శించేందుకు వస్తారు; ఇందు= ఇక్కడ, ఇచ్చట; దేవ+ఋషులు= దేవ మునులు; యజ్ఞంబు+చేసిన= యజ్ఞం చేసిన; యజ్ఞ భూములందున్= యజ్ఞవాటికలలో; కుశ+ఆకారంబులు+అయిన= దర్భల వంటి ఆకారంలో ఉన్న; దూర్వా+అంకురంబులు= గరిక మొలకలును; యూప+ఆకారంబులు+ఐన= యజ్ఞంలో నాటబడే స్తంభాల వంటి రూపాలు కల; వృక్షంబులున్= చెట్లున్నూ; కానంబడును+అనినన్= కనిపిస్తాయి అని చెప్పగా; ఆ+పుణ్య తీర్థంబునన్= పుణ్యాన్ని ఇచ్చే ఆ దివ్య క్షేత్రాన; స్నానంబు+చేసి= మునకలు వేసి స్నానాలు చేసి (క్రుంకులిడి); అరుగుచున్న= వెళుతున్న; ధర్మరాజునకు= ధర్మరాజుకు; రోమశుండు+ఇట్లు+అనియెన్= రోమశుడు ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అంటూ ఈ విధంగా గంగ భూమికి దిగిన కథను, భగీరథుడియొక్క మహిమను రోమశుడు చెప్పగా విని, ధర్మరాజు తన తమ్ముళ్ళతోపాటు ప్రయాణం చేసి నంద, అపరనంద అనే నదులలో స్నానం చేశాడు. హేమకూట పర్వతంలోని రాళ్ళనుండి పుట్టే అగ్నివలన ఆకర్షించబడి వచ్చే మబ్బులను చూచి పాండవులు ఆశ్చర్యం చెందారు. ఆ వింతనుగురించి చెప్పుమని పాండవులు రోమశమహర్షిని ప్రశ్నించగా అతడు ఈ విధంగా చెప్పాడు: 'ఋషభకూటంలో ఋషభుడు అనేటటువంటి ముని మిక్కిలి కోపస్వభావం కలవాడు. ఎవరు ఏమి మాట్లాడినా అతడికి కోపం వచ్చి మండిపడి రాళ్ళనుండి వెలువడే మబ్బులను పిలిచి వారిని వారిస్తాడు. అందుచేత తపోదాన ధర్మాలు, శమదమాలు లేని వారికి ఆ స్థలం ప్రవేశించ రానిది. దేవతలు, దేవతలను చూచే ఋషులు మాత్రమే ఆ మునిని సందర్శించటానికి వస్తారు. ఇక్కడ దేవతలు యజ్ఞాలు చేశారు. ఆ యజ్ఞ స్థలాలలో గరికపోచలు దర్భల రూపంలో మొలుస్తుంటాయి. అక్కడి చెట్లు యజ్ఞశాలలలోని యూపస్తంభాల వలె ఉంటాయి.' ఆమాటలు విని, ఆ పుణ్యక్షేత్రంలో స్నానంచేసి వెళుతున్న ధర్మరాజుతో రోమశుడు మళ్ళీ ఈ విధంగా చెప్పాడు.

విశేషం: ఆధ్యాత్మిక పురోగమనంలో ప్రాచీన భారతీయ సంస్కృతి తపం, దానం, ధర్మం, శమదమాలకు ఒనగూర్చిన ప్రాముఖ్యానికి ఈ గద్యం పునరుద్ఘాటనం. పై శబ్దాల విశేషార్థాలు లోగడ వివరించబడ్డాయి.

క. 'ఇది విశ్వామిత్రుని యా । స్పద; మిది కౌశికి యనంగఁ బరఁగినయది; య
ల్లది ఋశ్యశృంగుఁ డను ముని । హ్రద' మనవుడు ధర్మతనయుఁ డమ్ముని కనియెన్. 86

ప్రతిపదార్థం: ఇది= ఈ ప్రదేశం; విశ్వామిత్రుని+ఆస్పదము= విశ్వామిత్రుడి నెలవైన ఆశ్రమం; ఇది; కౌశికి+అనంగన్= కౌశికి అనే పేరుతో; పరఁగిన+అది= శోభిల్లింది; అల్లది= అదుగో అది; ఋశ్య శృంగుఁడు+అను= ఋశ్యశృంగుడు అనే పేరు కల; ముని హ్రదము= ఋషియొక్క సరస్సు; అనవుడు= అని చెప్పగా; ధర్మతనయుఁడు= ధర్మరాజు; ఆ+మునికి= ఆ ఋషియైన రోమశుడితో; అనియెన్= ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఇది విశ్వామిత్రుడు ఉన్న ఆశ్రమం. ఈ నదికి కౌశికి అని పేరు. అదుగో అక్కడ కనిపిస్తున్న సరోవరం ఋశ్యశృంగుడు అనే ఋషిది'- అని రోమశుడు చెప్పగా ధర్మరాజు అతడితో ఇట్లా అన్నాడు.

రోమశుఁడు ధర్మజునకు ఋశ్యశృంగుచరిత్రము సెప్పుట (సం. 3-110-6)

వ. 'ఋశ్యశృంగుం డను ముని జన్మంబును దచ్చరితంబును వినవలయు; నది యె?' ట్లని యడిగిన రోమశుం డిట్లనియెఁ 'దొల్లి కశ్యపపుత్త్రుండగు విభాండకుండను మునివరుం డఖండితబ్రహ్మచర్యంబునం దపంబు సేయుచు నొక్కనాఁ డొక్క మడువున నీళ్ళాడుచున్న యవసరంబున. 87

ప్రతిపదార్థం: ఋశ్యశృంగుండు+అను= ఋశ్యశృంగుడు అనెడి; ముని జన్మంబును= ఋషి పుట్టుకయు; తద్+చరితంబును= అతడి వృత్తాంతమును; వినవలయును= ఆలకించవలెను; అది+ఎట్లు+అని+అడిగిన= అది ఎట్లా అని అడుగగా; రోమశుండు= రోమశుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; తొల్లి= పూర్వం; కశ్యప పుత్త్రుండు+అగు= కశ్యపుడి కొడుకైన; విభాండకుండు+అను= విభాండకుడు అనే పేరు కలిగిన; ముని వరుండు= ఋషి శ్రేష్ఠుడు; అఖండిత బ్రహ్మచర్యంబునన్= మొక్కవోని బ్రహ్మచర్యంతో; తపంబు+చేయుచున్= తపస్సు చేస్తూ; ఒక్కనాఁడు= ఒకరోజు; ఒక్క మడువున= ఒక చెరువులో; నీళ్ళు+ఆడుచున్న= స్నానం చేస్తున్న; అవసరంబునన్= సమయాన.

తాత్పర్యం: ధర్మరాజు ఋశ్యశృంగుడి జన్మవృత్తాంతాన్ని, అతని చరిత్రను, వినాలని ఉన్నదని రోమశుడిని అడుగగా, ఆ మహర్షి ధర్మరాజుకు ఇట్లా చెప్పాడు: పూర్వకాలంలో కశ్యపుడి కొడుకు విభాండకుడు అనే మహర్షి మొక్కవోని బ్రహ్మచర్యదీక్షతో తపస్సు చేస్తున్నాడు. అతడు ఒకరోజు ఒక చెరువులో స్నానం చేసే సమయాన.

విశేషం: ఋశ్యశృంగరూపానికి ఋష్యశృంగుడు అని రూపాంతరమున్నది. అమరకోశాది నిఘంటువుల్లోను పెక్కు రామాయణ భారతప్రతుల్లోను రెండు తీరులుగా ప్రయోగించబడింది.

క. సురుచిరసురూపగుణసుం । దరి యూర్వశి యను లతాంగి తద్దర్శనగో
చర యగుడు నపుడ రేత । స్ఖలనం బమ్మునికి నయ్యెఁ గామకృతమునన్. 88

ప్రతిపదార్థం: సురచిర, సురూప, గుణ, సుందరి= మిక్కిలి ప్రకాశమానమైన గొప్ప సౌందర్య లక్షణాలు కల అందగత్తె; ఊర్వశి+అను= ఊర్వశి అనే పేరు కల; లతా+అంగి= తీగవంటి శరీరం కలది; తద్+దర్శన గోచర+అగుడున్= అతడి కంటికి కన్పించగా; అపుడు+అ= అప్పుడే; ఆ+మునికిన్= ఆ మునికి; కామకృతమునన్= మన్మథుడి వలన; రేతస్+స్ఖలనంబు= వీర్యపాతం; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: అతిలోక లావణ్యవతి, నిరతిశయ సౌందర్యరాశి అయిన ఊర్వశి అనే సుకుమారి ఆ ఋషికి కనిపించింది. వెంటనే ఆ మహర్షి మన్మథవికారానికి లోనయ్యాడు. అతడి వీర్యం జారిపడింది.

వ. అయ్యమోఘవీర్యంబుతో మిశ్రం బయిన జలంబు నొక్కదుప్పిపెంటి ద్రావి గర్భంబుఁదాల్చిన నందు ఋశ్యశృంగుం డను కుమారుండు జన్మించి, తండ్రినిం, దదాశ్రమంబునుంగాని యొండెఱుంగక ఘోరతపంబు సేయుచున్నంత. 89

ప్రతిపదార్థం: ఆ+అమోఘు, వీర్యంబుతోత్= ఆ మొక్కవోని రేతస్సుతో; మిశ్రంబు+అయిన= కలిసిపోయిన; జలంబున్= నీటిని; ఒక్క, దుప్పి, పెంటి= ఒక ఆడుదుప్పి; త్రావి= త్రాగి; గర్భంబున్+తాల్చినన్= గర్భంధరించగా; అందు= ఆ దుప్పి యందు; ఋశ్యశృంగుండు+అను= ఋశ్యశృంగుడు అనేటటువంటి; కుమారుండు= కొడుకు; జన్మించి= పుట్టి; తండ్రినిన్= తండ్రిని; తద్+ఆశ్రమంబునున్= ఆ ఆశ్రమాన్ని; కాని= తప్ప; ఒండు+ఎఱుంగక= వేరొకటి తెలియకుండ; ఘోరతపంబు, చేయుచు+ఉన్నంతన్= కఠోరమైన తపస్సు చేస్తున్నంతలో.

తాత్పర్యం: విభాండకుడి రేతస్సుతో కలిసిన నీటిని ఒక ఆడుదుప్పి త్రాగి గర్భం ధరించింది. ఆ దుప్పికి ఋశ్యశృంగుడు అనే పుత్రుడు జన్మించాడు. ఆ ఋశ్యశృంగుడు తండ్రిని, అతడి ఆశ్రమాన్ని తప్ప వేరొకటి తెలియక మిక్కిలి అమాయకుడుగా కఠోరతపస్సు చేస్తున్నాడు.

తే. **బలియుఁ డంగాధిపతి రోమపాదుఁ డనఁగ। ధరణిఁ బరఁగిన వీరుండు దన పురోహి**
తాపరాధకృతమున బ్రాహ్మణులచేత। విడువఁబడినఁ దన్మహి కనావృష్టి యయ్యె. **90**

ప్రతిపదార్థం: బలియుఁడు= బలవంతుడు; అంగ+అధిపతి= అంగదేశానికి రాజు; రోమపాదుఁడు+అనఁగ= రోమపాదుడు అనే పేరుతో; ధరణిన్= భూమిపై; పరఁగిన= విలసిల్లిన; వీరుండు= శూరుడు; తన, పురోహిత+అపరాధ, కృతమునన్= తాను పురోహితునకు చేసిన అపరాధంవలన; బ్రాహ్మణులచేత= విప్రులచేత; విడువన్+పడినన్= విడిచిపెట్టబడటంచేత; తద్+మహికి= ఆ భూమికి; అనావృష్టి+అయ్యెన్= వానలు కురవకపోవటం సంభవించింది.

తాత్పర్యం: బలవంతుడైన రోమపాదుడు అంగదేశానికి రాజు. ఆ మహావీరుడు పురోహితునకు తాను చేసిన తప్పువలన ఆ రాజ్యంలోని విప్రులు ఆ రాజును విడనాడారు. అందుచేత అంగదేశంలో వానలు కురవటం మానివేశాయి.

వ. **దానికి వెఱచి యాతండు బ్రాహ్మణులఁ బరమభక్తి నుపాసించి 'యీ యనావృష్టి దోషం బేమి కారణంబున నయ్యె? దీనికిం దగిన ప్రతీకారం బెద్ది?' యని యడిగిన, వానికిం బ్రసన్నులై బ్రాహ్మణు లిట్లనిరి.** **91**

ప్రతిపదార్థం: దానికి= ఆ అనావృష్టికి; వెఱచి= భయపడి; ఆతండు= అతడు- రోమపాదుడు; బ్రాహ్మణులన్= విప్రులను; పరమభక్తిన్= మిక్కిలి భక్తితో; ఉపాసించి= పూజించి; ఈ+అనావృష్టి దోషంబు= ఈ వానలేమి అనే దోషం; ఏమి కారణంబునన్= ఏ కారణంచేత; అయ్యెన్= కలిగింది; దీనికిన్= దీనికి; తగిన ప్రతీకారంబు+ఎద్ది= సరిఅయిన విరుగుడు ఏది; అని+అడిగిన= అని ప్రశ్నించగా; వానికిన్= అతడికి- ఆ రోమపాదుడికి; ప్రసన్నులు+ఐ= సుముఖులై; బ్రాహ్మణులు= విప్రులు; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: అనావృష్టికి వెరచి అంగదేశపురాజైన రోమపాదుడు బ్రాహ్మణులను ఆరాధించి, ఏకారణాన దేశంలో వానలు కురవటం లేదు? అని అడిగి, దానికి విరుగుడు చెప్పం డని వేడగా బ్రాహ్మణులు ప్రసన్నులై రాజుతో ఇట్లా చెప్పారు.

క. **'కడు దర్పితుఁడని నిన్నున్। విడిచిరి బ్రాహ్మణులు; వారు విడుచుడు నమరుల్**
విడిచిరి; దానన వర్షము। దడసె భవద్దేశమునకు ధరణీనాథా! **92**

ప్రతిపదార్థం: ధరణీనాథా!= ఓ రాజా!; కడు= మిక్కిలి; దర్పితుఁడు+అని= గర్వం కలవాడు అని; నిన్నున్= నిన్ను; బ్రాహ్మణులు= విప్రులు; విడిచిరి= వదలివేశారు; వారు, విడుచుడున్= బ్రాహ్మణులు నిన్ను విడిచిపోవటంచేత; అమరుల్= దేవతలు; విడిచిరి= (నిన్ను) వదలిపోయారు; భవత్+దేశమునకు= నీ దేశానికి; దానన= అందుచేత; వర్షము= వాన; తడసెన్= ఆలసించింది.

తాత్పర్యం: 'భూమికి భర్తవైన ఓ రాజా! నీవు చాలా గర్వం కలవాడవని బ్రాహ్మణులు నిన్ను విడిచివేశారు. వారు విడవటంచేత దేవతలు కూడా విడిచివేశారు. అందుచేత నీ దేశంలో వానలు కురవటం లేదు.

ఉ. **శాంతుఁడు ఋశ్యశృంగుఁడను సన్ముని యున్నయెడన్ ధరిత్రికిన్**
సంతతవర్షణం బగు భృశంబుగ; నట్టివరంబు దొల్లి వృ
త్రాంతకుచే దయం బడసె నమ్ముని; గావున ఋశ్యశృంగు వే
దాంతసువేది రాఁబనుపు మంగమహీశ్వర! నీదు నేర్పునన్.' **93**

ప్రతిపదార్థం: శాంతుఁడు= కామక్రోధాదులను జయించి శమ ప్రవృత్తితో ఉండేయోగి; ఋశ్యశృంగుఁడు+అను= ఋశ్యశృంగుడు అనే పేరుకల; సత్+ముని= మంచిఋషి; ఉన్న+ఎడన్= ఉన్న చోటులో; ధరిత్రికిన్= భూమికి; భృశంబుగన్= అధికంగా; సంతత వర్షణంబు+అగున్= ఎప్పుడూ వానలు కురవటం సంభవిస్తుంది; అట్టి= అటువంటి; వరంబు= వరం; తొల్లి= మునుపు; ఆ+ముని= ఆ ఋషి; వృత్ర+అంతకుచేన్= దేవేంద్రుడివలన; దయన్= కరుణతో; పడసెన్= పొందాడు; కావున= కాబట్టి; అంగ మహీ+ఈశ్వర!= అంగదేశానికిరాజా!; వేదాంత, సు, వేదిన్= వేదాంతాన్ని బాగా తెలిసినటువంటి వాడిని; ఋశ్యశృంగు= ఋశ్యశృంగుడిని; నీదు నేర్పునన్= నీ సామర్థ్యంవలన; రాన్+పనుపుము= వచ్చేటట్లుగా చేయవలసింది.

తాత్పర్యం: ఓ అంగరాజా! శాంతప్రవృత్తి కల యోగి ఋశ్యశృంగుడనే మహాముని ఉన్నచోట ఎల్లప్పుడూ వానలు మిక్కుటంగా కురుస్తుంటాయి. ఆ మహర్షి అటువంటి వరాన్ని దేవేంద్రుడి దయవలన సంపాదించాడు. కాబట్టి నీ సామర్థ్యంతో ఆ మహామునిని, వేదాంతవేత్తను, అంగదేశానికి రప్పించుము.

వ. **అనిన విని రోమపాదుండు దన చేసిన బ్రాహ్మణావమానంబునకుం దగిన ప్రాయశ్చిత్తంబుఁ జేసి, బ్రాహ్మణ వచనంబున నపుడ బుద్ధిమంతులతో విచారించి విదగ్ధవేశ్యాంగనలం బిలువంబంచి 'మీనేర్చువిధంబుల ఋశ్యశృంగుం బ్రబోధించి యిటఁ దోడ్కొనిరం' డని పంచిన.** **94**

ప్రతిపదార్థం: అనిన= అని చెప్పగా; విని= విని; రోమపాదుండు; తన చేసిన= తాను చేసిన; బ్రాహ్మణ+అవమానంబునకున్= బ్రాహ్మణులకు జరిగిన భంగపాటుకు; తగిన= సరిపోయే; ప్రాయశ్చిత్తంబున్+చేసి= దోషనివారణకు నిష్కృతి చేసి; బ్రాహ్మణ వచనంబునన్= బ్రాహ్మణుల మాట చొప్పున (మాట ప్రకారం); అపుడు+అ= ఆ క్షణమందే; బుద్ధిమంతులతో= తెలివికల వారితో; విచారించి= యోచించి; విదగ్ధ, వేశ్యా+అంగనలన్= చతురలైన వేశ్యకాంతలను; పిలువన్+పంచి= పిలిపించి; మీ నేర్చు విధంబుల= మీనేర్పును ప్రయోగించి ఏ విధంగానైనా; ఋశ్యశృంగున్= ఋశ్యశృంగుడిని; ప్రబోధించి= ప్రేరేపించి; ఇటన్, తోడ్కొని, రండు= ఇక్కడికి తీసికొని రండి; అని+పంచినన్= అని నియోగించగా.

తాత్పర్యం: రోమపాదుడు తాను బ్రాహ్మణులకు చేసిన అవజ్ఞకు తగిన ప్రాయశ్చిత్తం చేసి, వారు చెప్పినట్లు తెలివి గలవారితో కర్తవ్యాన్నిగురించి ఆలోచించి, వేశ్యలలో చతురలు అయిన సుందరీమణులను పిలిపించి 'మీమీ చాకచక్యం ఉపయోగించి, ఏ రీతిగా అయినా ఋశ్యశృంగుడి మనసు రంజింపచేసి యిక్కడకు తోడ్కొనిరండి' అని నియోగించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఆ వేశ్యాజను లధిక ర । సావహభక్ష్యములు విలసదనులేపన మా
ల్యావళులుఁ గొనుచు నరిగిరి । నావాశ్రమమునను నమరనారులలీలన్. 95

ప్రతిపదార్థం: ఆ వేశ్యా జనులు= ఆ వేశ్యలసముదాయాలు; అధిక, రస+ ఆవహ, భక్ష్యములు= ఎక్కువ రుచికరాలైన ఆహారపదార్థాలు; విలసత్+అనులేపన, మాల్య+ఆవళులున్= శోభిల్లుతున్నటువంటి, పరిమళిస్తున్నటువంటి మైపూతలు, పువ్వుల సముదాయాలు; కొనుచున్= పుచ్చుకొని; నావ+ఆశ్రమమునను= నావపై నిర్మించిన ఆశ్రమంలో; అమర నారులలీలన్= దేవతా సుందరీమణుల వలె (అప్సరసలవలె); అరిగిరి= పయనించి వెళ్ళారు.

తాత్పర్యం: ఆ వేశ్యాంగనలు తమతో మిగుల రుచికరాలయిన ఆహారపదార్థాలను, పరిమళిస్తున్న వివిధ పుష్పాలను, అనులేపనాలను, తీసికొని నావపై నిర్మించిన ఆశ్రమంలో అప్సరసవలె పయనించి వెళ్ళారు.

విశేషం: నవాశ్రమం అంటే క్రొత్తగా నిర్మించిన ఆశ్రమమని బ్రౌణ్య నిఘంటువు చెప్పింది. అయితే నావపై నిర్మించిన ఆశ్రమమనే అర్థంలో సంస్కృత మహాభారతం ఆ ప్రయోగాన్ని ప్రయోగించింది. మూలంతో - 'సాతు నవ్యాశ్రమం చక్రే రాజకార్యార్థ సిద్ధయే। సందేశాచ్చైవ నృపతేః స్వబుద్ధ్యా చైవ భారత' 3.111.1. ఈ శ్లోక తాత్పర్యాని కనుగుణంగా 'నావాశ్రమమునను నమరనారులలీలన్' అనే పాఠాన్ని స్వీకరించటమైనది. సంశోధిత ప్రతిలోని 'నావాశ్రమమునకు నమరనారులలీలన్' అనే పాఠంకంటె ఇది సందర్భానికి అనువుగా ఉన్నది. 'పావనునాశ్రమమునకును బణఁతులు లీలన్', 'పావన మగువాని నిజతపోవనమునకున్' (ఇందులో యతిభంగం ఉన్నది)- అనే పాఠంతరాలు కూడా ఉన్నాయి.

వ. అట విభాండకుండును యథాకాలం బగ్నిహోత్రంబు వేల్పం దన పుత్త్రు ఋశ్యశృంగు సమర్పించి, వన్యఫలాహరణార్థంబు వనంబున కరిగిన యవసరంబున నందొక్క జరద్వేశ్య దనకూతు నభినవ యౌవన విలాస విభాసిని నమ్మునిపుత్త్రుపాలికిం బుచ్చిన, దానిం జూచి ఋశ్యశృంగుండు సంభ్రమంబున. 96

ప్రతిపదార్థం: అట= అక్కడ, ఆ ఆశ్రమంలో; విభాండకుండును= విభాండకమునియున్నూ; యథా కాలంబు= తగిన సమయంలో; అగ్నిహోత్రంబు, వేల్పన్= అగ్నిని ప్రజ్వలింప చేసేందుకు; తన పుత్త్రున్= తనకుమారుడిని; ఋశ్యశృంగున్= ఋశ్యశృంగుడిని; సమర్పించి= ఏర్పాటుచేసి, నియోగించి; వన్యఫల+ఆహరణ+అర్థంబు= అడవిలో పళ్ళు తీసికొని వచ్చుటకై; వనంబునకు= అడవికి; అరిగిన= వెళ్ళిన; అవసరంబునన్= సమయంలో; అందు= అక్కడ; ఒక్క; జరత్+వేశ్య= ముసలి బోగంది; తన కూఁతున్= తన పుత్రికను; అభినవ, యౌవన, విలాస, విభాసినిన్= కొత్త యౌవనంయొక్క హొయలుతో కులుకుతున్న దానిని; ఆ+ముని, పుత్త్రు పాలికిన్= ఆ ఋషి కుమారుడైన ఋశ్యశృంగుడి వద్దకు; పుచ్చినన్= పంపగా; దానిన్+చూచి= ఆ వేశ్యాపుత్రికను చూచి, ఋశ్యశృంగుండు= ఋశ్యశృంగుడు; సంభ్రమంబునన్= ఆదరంతో కూడిన తొట్రుపాటుతో.

తాత్పర్యం: ఆ ఆశ్రమంలో విభాండకమహాముని తగినవేళలో అగ్నిహోత్రాన్ని రాజుకొనేటట్లు చేయటానికి తన కుమారుడైన ఋశ్యశృంగుడిని నియోగించి తాను అడవిలో దొరికే పళ్ళు మొదలైనవాటిని తెచ్చేందుకు అడవిలోకి వెళ్ళాడు. ఆ అదను కనిపెట్టి ఒక ముసలివేశ్య కొంగ్రొత్త యౌవనపు మిసిమిహొయలుతో కులుకుతున్న పడుచుపిల్ల అయిన తన పుత్రికను ఋషికుమారుడైన ఋశ్యశృంగుడికడకు పంపింది. ఋశ్యశృంగుడు తన దగ్గరకు వచ్చిన ఆ లేజవరాలిని చూచి ఆదరంతో కూడిన తత్తరపాటుతో (ఆమెకు స్వాగతసత్కారాలు చేసేందుకై ఎదురువెళ్ళి.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఋశ్యశృంగుఁడు వేశ్యను మునికుమారునిఁగా భావించుట (సం. 3-111-9)

మధ్యాక్కర.

'ఎందుండి వచ్చితి ఋషికుమార! యే నెన్నఁడు నిట్టి
సుందరాకారు మునిసుతు నేఁ దొల్లి చూచి యెఱుంగ
నిందుండు మీ' వని కృష్ణమృగచర్మకృతకుశాసనము
నం దుండఁగాఁ బనిచె ఋషి యను బుద్ధి నత్తన్విఁ బ్రీతి. 97

ప్రతిపదార్థం: ఋషికుమార!= ఓ మునిపుత్రా!; ఎందుండి వచ్చితి= ఎక్కడినుంచి వచ్చావు; ఏన్= నేను; ఎన్నఁడున్= ఎప్పుడున్నూ; ఇట్టి= ఇటువంటి; సుందర+ఆకారున్= అందమైన రూపం కలవాడిని; మునిసుతున్= ఋషి కుమారుడిని; తొల్లి= మునుపు; ఏన్= నేను; చూచి+ఎఱుంగన్= చూచి ఉండలేదు; ఈవు= నీవు; ఇందు+ఉండుము= ఇక్కడ మా ఆశ్రమంలో ఉండుము; అని= అని చెప్పి; ఋషి+అను, బుద్ధిన్= ఋషి అని అనుకొన్న బుద్ధితో; ఆ+తన్విన్= ఆ సుకుమారిని; కృష్ణ, మృగ, చర్మ, కృత, కుశ+ఆసనము నందు= నల్లజింకతోలుతో చేయబడిన దర్భల చాపయందు; ఉండగాన్= కూర్చొనుమని; ప్రీతిన్= ఆసక్తితో; పనిచెన్= నియోగించాడు.

తాత్పర్యం: 'ఓ మునికుమారా! నీవు ఏ ఆశ్రమంనుండి ఇక్కడకు వచ్చావు? నేను ఇంతకు ముందు ఎప్పుడూ నీ వంటి అందమైన రూపం గల ఋషిపుత్రుడిని చూచి ఉండలేదు (చూడలేదు). నీవు ఇక్కడే ఉండవలసింది' అని ఋశ్యశృంగుడు ఆ వేశ్యాకుమారిని చూచి, ఋషికుమారకుడు అనే భ్రాంతిలో పడి, ఆమె కూర్చునేందుకు నల్లజింకతోలుతో చేసిన దర్భాసనాన్ని పరిచాడు.

విశేషం: మహాభారతంలోని ఉపాఖ్యానాలలో ఋశ్యశృంగుడిగాథకు ప్రత్యేకత ఉన్నది. ఋశ్యశృంగుడికి నాగరజగత్తుతో బొత్తిగా పరిచయం లేదు. విభాండకుడు పుట్టుకనుండి తన కొడుకును తన ఆశ్రమంలోనే పెంచాడు. ఋశ్యశృంగుడు అమాయిక కోమలమైన చిత్తప్రవృత్తితో పెరిగినవాడు. తన దగ్గరకు వచ్చిన వేశ్యాంగనను, ఋశ్యశృంగుడు మరొక ఋషికుమారుకుడే అనుకొన్నాడు. స్త్రీ పురుష లింగ విచక్షణ నెరుగలేని అంతటి అమాయిక కోమలచిత్త ప్రవృత్తి అతడిది. ప్రకృతిలో స్త్రీ పురుష భిన్నధ్రువాలకు కల సహజ లలితమైన ఆకర్షణ ఈ కథలో హృదయంగమంగా వివరించబడింది. వృత్తలక్షణానికి ఆర. 2.22 విశేషాంశం చూడండి.

వ. మఱియు నర్ఘ్యపాద్యాదివిధులను వన్యస్వాదుఫలదానంబులం దాని కతిథిపూజ సేయ నున్న నది యమ్మునివరున కిట్లనియె. 98

ప్రతిపదార్థం: మఱియున్= అదీకాక; అర్ఘ్య, పాద్య+ఆది, విధులను= స్వాగత సత్కారానికి అతిథికి అందించే నీరు, కాళ్ళు కడుక్కొనేందుకు ఇచ్చే నీరు మొదలైన శాస్త్రీయసూత్రాలకు అనుగుణంగా; వన్య, స్వాదు, ఫలదానంబులన్= అడవిలో దొరికే రుచికరమైన ఫలాలను అందించటాలతో; దానికి= ఆ వేశ్యాకుమారికి; అతిథి, పూజ= అతిథికి చేసే స్వాగతసత్కారాలు; చేయన్+ఉన్నన్= చేయటానికి పూనుకోగా; అది= ఆ వేశ్య; ఆ+మునివరునకు= ఆ ఋషిశ్రేష్ఠుడైన ఋశ్యశృంగుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: అదీకాక, ఆ ఋశ్యశృంగుడు ఆ వేశ్యాకుమారికి అర్ఘ్యం, పాద్యం సమర్పించి అడవిలో దొరికే రుచికరాలైన పళ్ళు సమర్పించి స్వాగతసత్కారం చేసేందుకు పూనుకోగా ఆమె యిట్లా చెప్పింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'మా యాశ్రమ మిందులకున్ । న్యాయనిధీ! మూఁడుయోజనంబులు గల దేఁ
బోయెద; నీవును విజయం । చేయుమ యందులకుఁ; జెలిమి సేయుము నాతోన్. 99

ప్రతిపదార్థం: న్యాయనిధీ!= న్యాయానికి నిధియైనవాడా, అనగా ధర్మమూర్తీ!; మా+ఆశ్రమము= మా ఆశ్రమం; ఇందులకున్= ఈ మీ ఆశ్రమానికి; మూఁడు; యోజనమ్ములు+కలదు= మూడు ఆమడల దూరాన ఉన్నది; ఏన్= నేను; పోయెదన్= వెళ్ళుతాను; ఈవును= నీవుకూడ; అందులకున్= అక్కడికి, అంటే మా ఆశ్రమానికి; విజయం చేయుము+అ= దయచేసి రావలసింది; నాతోన్= నాతోటి; చెలిమి= స్నేహం; చేయుము= చేయవలసింది.

తాత్పర్యం: 'ఓ న్యాయనిధీ! మా ఆశ్రమం ఇక్కడికి మూడు ఆమడల దూరాన ఉన్నది. నీవు కూడ దయచేసి అక్కడికి వేంచేయుము. నాతో స్నేహం చేయుము.

వ. అట్లేని నీచేత సత్కారంబుఁగొందు' ననిన ఋశ్యశృంగుం 'డట్లు సేయుదు' నని దాని నాతిథ్య విధానంబునం బూజించి తనకు దాని యిచ్చిన దివ్యగంధమాల్యంబులును సరసభక్ష్యపానంబులును, విచిత్రవస్త్రంబులుం బరిగ్రహించిన నదియును. 100

ప్రతిపదార్థం: అట్లు+ఏని= నీ వట్లా సమ్మతిస్తే; నీచేత; సత్కారంబున్+కొందున్+అనిన= సమ్మానాన్ని గైకొంటాను అనగా; ఋశ్యశృంగుండు; అట్లు= ఆ విధంగా; చేయుదును+అని= చేస్తానని చెప్పి; దానిన్= ఆమెను- ఆ వేశ్యాపుత్రికను; ఆతిథ్య, విధానంబునన్+పూజించి= అతిథి మర్యాదలతో శాస్త్రోక్తంగా పూజించి; తనకు; దాని+ఇచ్చిన= ఆమె ఇచ్చిన; దివ్య, గంధ, మాల్యంబులును= గొప్ప పరిమళాలను వెదజల్లే మైపూత ద్రవ్యాలను, పువ్వులను; సరస భక్ష్య, పానంబులును= రుచికరాలైన తిను బండారాలను, పానకాలను; విచిత్ర, వస్త్రంబులును= అద్భుతమైన వస్త్రాలను; పరిగ్రహించినన్= పుచ్చుకోగా; అదియును= ఆమె కూడా.

తాత్పర్యం: నీవు మా ఆశ్రమానికి వచ్చేందుకు అంగీకరించినట్లైతే నేను నీ అతిథి సత్కారాలను గైకొంటాను'- అని వేశ్యాపుత్రిక ఋశ్యశృంగుడితో చెప్పగా, అత డందుకు సమ్మతించి, ఆమెను ఆతిథ్య స్వాగతసత్కారాలతో అర్చించి, ఆమె తనకు బహూకరించిన సుగంధపుష్పాలను, అద్భుతాలైన బట్టలను, తినుబండారాలను, పానీయాలను పరిగ్రహించాడు. ఆమెయున్నూ.

క. మునిముందటఁ గందుకన । ర్తన మృదుగీతములయందుఁ దనకౌశల మె
ల్లను జూపి విరచితాలిం । గనయై మునిపతికి ముదము గావించె మదిన్. 101

ప్రతిపదార్థం: ముని ముందటన్= ఋషి ఎదుట-ఆ ఋశ్యశృంగుడి సమక్షంలో; కందుక, నర్తన, మృదు, గీతముల+అందున్= బంతి ఆటలో, నాట్యంలో, మనోహరమైన పాటలలో; తన, కౌశలము+ఎల్లను= తన చాతుర్యాన్ని అంతా; చూపి= ప్రదర్శించి; విరచిత+ఆలింగన+ఐ= ఘటించిన కౌగిలి కలదై- ఋశ్యశృంగుడిని తన బిగికౌగిలిలో అదిమిపట్టి; ముని పతికిన్= ఋషి శ్రేష్ఠుడైన ఋష్యశృంగుడికి; మదిన్= మనస్సులో; ముదము= సంతోషం; కావించెన్= కలిగించింది.

తాత్పర్యం: ఆ వేశ్యాపుత్రిక ఋశ్యశృంగుడి ఎదుట బంతి ఆటలో, నాట్యకళలో, మనోహరమైన పాటలు పాడటంలో తనకు కల చాతుర్యాన్నంతా ప్రదర్శించి, అతడిని తన బిగికౌగిలిలో చేర్చుకొని ఆ ఋషివరుడికి మిక్కిలి సంతోషం కలుగజేసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు ఋశ్యశృంగుం బ్రబోధించి వేశ్యాపుత్త్రి యరిగిన, దాని పోయినవలను సూచుచు ఋశ్యశృంగుఁ డగ్ని హోత్రంబు వేల్వమఱచి విపరీతబుద్ధియై యున్ననంత నడవినుండి వన్యఫలంబులు గొనివచ్చివిభాండకుండు గొడుకుం జూచి 'యి ట్లేల చింతాపరుండవై యగ్నిహోత్రంబు వేల్వక కాలాతిక్రమంబు సేసి?' తనినఁ దండ్రికి ఋశ్యశృంగుం డిట్లనియె. 102

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఋశ్యశృంగున్= ఋశ్యశృంగుడిని; ప్రబోధించి= బాగా ప్రేరేపించి; వేశ్యా పుత్త్రి= వేశ్యాకుమారి; అరిగిన= వెళ్ళగా; ఋశ్యశృంగుండు; దాని, పోయిన, వలను= ఆమె వెళ్ళిన వైపే; చూచుచు= చూస్తూ; అగ్నిహోత్రంబు, వేల్వ, మఱచి= అగ్నిని ప్రజ్వలింపచేయటం- సమిధలు మొదలైన వాటిని అందులో వేయటం విస్మరించి; విపరీత బుద్ధి+ఐ+ఉన్నన్= తారుమారైన మనసుతో ఉండగా; అంత= అంతట; అడవినుండి; వన్య ఫలంబులు= అడవిపళ్ళు; కొనివచ్చి= తీసికొనివచ్చి; విభాండకుండు; కొడుకున్+చూచి; ఇట్లు+ఏల= ఈ విధంగా ఎందుకు; చింతా పరుండవు+ఐ= విచారగ్రస్తుడివై; అగ్నిహోత్రంబు వేల్వక= అగ్నిని రగుల్కొల్పకుండా; కాల+అతిక్రమంబు+చేసితి= కాలాన్ని అతిక్రమించావు; అనినన్= అని అడుగగా; తండ్రికిన్; ఋశ్యశృంగుండు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా ఋశ్యశృంగుడికి దేహేంద్రియస్పృహను చక్కగా వికసింపచేసి వేశ్యాకుమారి వెళ్ళిపోయింది. ఋశ్యశృంగుడు ఆ వేశ్యాపుత్రిక వెళ్ళినవైపే తన దృష్టిని నిలిపి అగ్నిహోత్రాలను వేల్చక పరాకుతో తారుమారైన బుద్ధితో అట్లాగే ఉన్నాడు. అంతలో అడవినుంచి పళ్ళుమొదలైనవాటిని సేకరించి ఆశ్రమానికి వచ్చి విభాండకుడు తనకొడుకును చూచి ఈ రోజు ఇట్లా ఎందుకు అగ్నిహోత్రాన్ని వేల్చకుండా చింతాక్రాంతుడివై ఉన్నావు? కాలాన్ని అతిక్రమించా వెందుకు?' అని అడుగగా అతడికి ఋశ్యశృంగుడు ఇట్లా బదులు పలికాడు.

విశేషం: వేశ్యాపుత్రిక ఋశ్యశృంగుడిని 'ప్రబోధించి' వెళ్ళిపోయిందట. 'ప్రబోధించు' అన్న ప్రయోగం ఇక్కడ చాలా అర్థవంతమైనది. తెలియని వాడికి తెలియ చెప్పటం. 'బోధించటం' ఇక ప్రబోధం అంటే ఏమిటి? మానవ మనస్సు (మస్తిష్కం) లో ఎన్నో అరలు, పొరలు, ఎన్నో దొంతరలు ఉంటాయి. శృంగార లాలసత్వం వాసనారూపాన నిద్రాణమై సమస్తజీవకోటిలో అంతరాంతరాలలో అణగి ఉంటుంది. ఆ శృంగారప్రవృత్తిని జాగృతంచేసి ఋశ్యశృంగుడి మనసులో మేలుకొల్పింది వేశ్యాకుమారి. నిద్రాణమై ఉన్న ఆంతరంగిక ప్రజ్ఞలను మేలుకొల్పుటమే ప్రబోధం అని చెప్పవచ్చును. పై వచనం మూడవ పంక్తిలో వావిళ్లప్రతిలో 'కాలాతిక్రమణంబు సేసి'- అనే పాఠం ఉన్నది.

సీ. 'కాంచనవర్ణుండు గడు రూపవంతుండు । గమ్మని జడలతో ఘనము లగుచు
ననయంబు వట్రువలగు రెండు పిండంబు । లురమున విలసిల్లుచుండ, నఱుత
వెలుఁగుచు జపమాల వ్రేలంగ, నన్నువ । నడుమును వడఁకంగ, నడచునపుడు
కలహంసకూజితకలనాద మెసఁగ నా । పాలికి నేఁ డొక్క బ్రహ్మచారి

ఆ. వచ్చిపోయె; వానివదనంబువలన వె । ల్వడు సుగంధిమధురభాషితంబు
పొలుచు వినఁగ సమదపుంస్కోకిలాలాప । చారు వగుచు హృదయ సమ్మదముగ. 103

ప్రతిపదార్థం: కాంచన వర్ణుండు= బంగారు రంగు కలవాడు; కడు= మిక్కిలి; రూపవంతుండు= అందగాడు; కమ్మని జడలతోన్= సొగసైన జడలతో; ఘనములు+అగుచున్= పెద్దవిగా ఉన్నటువంటి; అనయంబు= ఎల్లప్పుడు; వట్రువలు+అగు= గుండ్రంగా ఉన్నటువంటి; రెండు+పిండంబులు= రెండు ఉండలు; ఉరమునన్= వక్షస్థలమందు; విలసిల్లుచుండన్=

శోభిల్లుతుండగా; అఱుతన్= కంఠమందు; వెలుఁగుచు= ప్రకాశమానమై; జపమాల= జపం చేసుకునేందుకు అనువైన దండ; వ్రేలంగన్= వేలాడగా; అన్నువ= అలతి అయిన; నడుమును= కౌను; వడఁకంగ= అల్లాడగా; నడచునపుడు= నడుస్తున్నప్పుడు= కలహంస, కూజిత, కలనాదము= రాజహంసక్రేంకారం వలె అవ్యక్త మధుర నినాదం; ఎసఁగ= అతిశయించగా; నేఁడు= ఈ రోజు; నా, పాలికి= నా దగ్గరకు; ఒక్క= ఒక; బ్రహ్మచారి= ఋషి కుమారుడు; వచ్చిపోయె= వచ్చి వెళ్ళిపోయాడు; వాని, వదనంబు వలన= అతడి ముఖంనుండి; వెల్వడు= బయటికి వచ్చే; సుగంధి, మధుర, భాషితంబు= మంచి పరిమళంతోకూడిన తియ్యనైనపలుకు; సమద, పుంస్కోకిల+ఆలాప, చారువు+అగుచు= మదించిన గండుకోయిలయొక్క కూజితంవలె సొంపారుతూ; హృదయ, సమ్మదముగన్= డెందానికి ఆనందంగా; వినఁగన్= వినటానికి; పొలుచున్= ఒప్పినది.

తాత్పర్యం: 'నేడు నాదగ్గరకు ఒక బ్రహ్మచారి వచ్చివెళ్ళాడు. అతగాడు మిగుల రూపవంతుడు; బంగారురంగు కలిగి మిక్కిలి అందమైన జడలు కలవాడు. అతడి వక్షస్థ్సలాన గుండ్రనివై, ఘనములై విలసిల్లే రెండు మాంసపు ముద్దలు ఉన్నాయి. అతడి కంఠంలో ఒక చక్కటి జపమాల వెలుగుతున్నది (ప్రకాశిస్తున్నది). అతడి సన్నటి నడుము వణుకుతున్నది. అతడు నడిచేటప్పుడు (ఆతని పాదాలనుండి) కలహంస కూజితంవలె అవ్యక్త మధురమైన ధ్వని వెలువడుతున్నది. అతడి ముఖంనుండి వెలువడే మాటలు తీయనివై, సుగంధాన్ని వెదజల్లేటటువంటివై వినటానికి మదించిన గండుకోయిలల ఆలాపాలవలె మనస్సుకు ఆనందం కొలుపుతున్నాయి.

విశేషం: ఈ సీసపద్యంలోని అర్థాంతరస్ఫూర్తి హృదయంగమమైంది. ఋశ్యశృంగుడు 'బ్రహ్మచారి' అనుకొని అభివర్ణించింది నిజానికి వేశ్యాపుత్రికను. కాంచన వర్ణం, కమ్మని జడలు, ఘనములు, వట్రువలు అయిన రెండు మాంసపిండాలు ఆ బ్రహ్మచారి వక్షస్థ్సలాన ఉన్నాయి. అవి వేశ్యాపుత్రిక వక్షోజాలు. కంఠమందు జపమాలగా ఋశ్యశృంగుడు భావించింది ఆమె ధరించిన వజ్రహారం. సన్నటి (అన్నువ) నడుముతో ఆమె నడయాడేటప్పుడు వెలువడే కలహంస కూజిత కలనాదం ఆమె చరణమంజీర క్వణదణుకింకిణీరవం. ఆమె నోటినుంచి వెలువడే గీతాలు గండుకోయిలల ఆలాపాలవలె డెందాన్ని అలరిస్తున్నాయి. పుంస్కోకిలాలాపం: పాడేటటువంటిది మగకోకిలేకాని ఆడకోకిల కాదు. నన్నయ లోకజ్ఞుడు. ప్రతిభాశాలి. అతడు పుంస్కోకిలాలాపాన్నే ప్రస్తావించాడు. పలువురు కవులు కోకిలవధూకలకాకలీధ్వనులను వర్ణించటం వేరు. నన్నయ పరిజ్ఞానం వేరు. పైపద్యం రెండవ పంక్తిలో కొన్ని ప్రతుల్లో 'వట్రువలగు రెండు శృంగంబు లురమున' - అనే పాఠాంతరం ఉన్నది.

క. ఆ ఋషికుమారు కట్టిన । చీరలు నతిమృదులములు విచిత్రములు; మనో
హారము వాని బృహత్కటి । భారము; నం దొక్క కనకపట్టము వెలుఁగున్. 104

ప్రతిపదార్థం: ఆ ఋషికుమారుకట్టిన చీరలున్= ఆ మునికుమారుడు కట్టుకొన్న వస్త్రాలు; అతిమృదులములు= మిక్కిలి మెత్తటివి; విచిత్రములు= అత్యద్భుతాలైనవి; వాని బృహత్+కటిభారమునందు= అతడి బరువైన పెనుమొలయందు అంటే విశాలమైన జఘనభాగమందు; మనస్+హారము= మనోహారము-మనసును హరించేటటువంటిది; ఒక్క, కనక, పట్టము= ఒక బంగారు పట్టీ (ఒడ్డాణం); వెలుఁగున్= ప్రకాశిస్తున్నది.

తాత్పర్యం: ఆ ఋషిపుత్రుడు కట్టిన వస్త్రాలు ఆహా! ఎంత సుకుమారాలైనవి! ఎంత అద్భుతమైనవి! వాడి విశాల జఘనప్రదేశమందు మనసును హరించే ఒక బంగారు ఒడ్డాణం శోభిల్లుతున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఋశ్యశృంగుడు ఎంత అమాయిక కోమలమనస్కుడైనా వేశ్యాపుత్రిక వేషభాషలు అతడిని ఆకర్షించాయి. ఈ ఆకర్షణలో లౌకికకాలుష్యం లేదు, కాని, నైసర్గికమైన, ప్రకృతిసిద్ధమైన, వర్ణనాతీతమైన ఒకానొక అనుభూతి తొణికిసలాడుతున్నది. ఆ ఋషి కుమారుడు ధరించిన వస్త్రాలు అరణ్యాలలో ఋషికుమారులు ధరించే నారబట్టలు కావు గదా. అవి అతి మృదులములైన పీతాంబరాలు. వాడి విశాల జఘనభారమందు శోభిల్లే కాంచనపట్టం, కాంచన కాంచీదామం. సాధారణ బ్రహ్మచారులకు, వనవాసాన శుష్కించిన బ్రహ్మచారులకు బృహత్కటిభారం ఉండదు. ఈ బ్రహ్మచారికి గల బృహత్కటిభారం ఋశ్యశృంగుడిని ఆకర్షించింది!

క. పవనసమీరిత మధుసం । భవ వివిధప్రసవసౌరభముఁ బోలి ముని
ప్రవరుని తనువునయం దు । ద్భవమై రమ్యమయి సౌరభము విలసిల్లున్. 105

ప్రతిపదార్థం: పవన, సమీరిత, మధు, సంభవ, వివిధ, ప్రసవ, సౌరభమున్+పోలి= గాలిచేత వ్యాపింప చేయబడిన వసంతమందు పుట్టిన పెక్కు పువ్వుల నెత్తావులను పోలి; ముని, ప్రవరుని, తనువున+అందు= ఋషిశ్రేష్ఠుడి శరీరమందు; ఉద్భవము+ఐ= పుట్టినదై; రమ్యము+అయి= సొంపైనదై; సౌరభము= సువాసన; విలసిల్లున్= శోభిల్లుతుంది.

తాత్పర్యం: ఆ మునిశ్రేష్ఠుడి తనువునుండి వెలువడిన సొగసైన నెత్తావి, ఆమనిలో వికసించే వేర్వేఱు పూలపైనుండి వీతెంచే గాలియందలి సౌరభంవలె రమ్యంగా విలసిల్లుతున్నది.

విశేషం: ఆ బ్రహ్మచారిశరీరంనుండి వెలువడే సుగంధం వసంతఋతువులో వికసించే నానాపుష్పసౌరభాలను పోలి శోభిల్లుతుంది- అనటంచేత ఆ వేశ్య పూసికొన్న అత్తరుల నెత్తావి ద్యోతకమవుతున్నది.

వ. మఱియు నక్కుమారుం డొక్క యెఱ్ఱనిఫలంబు దన దక్షిణపాణితలంబున నందంద చఱచుచు నది నేలంబడి యెగయం బోయిన వలనికి వ్రాలుచు వాతావధూతంబైన బాలవృక్షంబునుం బోలె నొప్పుచున్న నమ్మునిపుత్త్రు నందు నా హృదయంబు దద్దయుం దగిలినయది. 106

ప్రతిపదార్థం: మఱియున్= వెండియు; ఆ+కుమారుండు= ఆ బ్రహ్మచారి; ఒక్క+ఎఱ్ఱని, ఫలంబు= ఒక ఎఱ్ఱని పండు; తన, దక్షిణ, పాణి, తలంబునన్= తనకుడిచేతి పైభాగాన; అందు+అందు+అ= అక్కడక్కడా; చఱచుచున్= కొట్టూ, కొడుతూ, చరుస్తూ, అది= ఆ పండు; నేలన్+పడి= భూమిపై పడి; ఎగయన్= ఎగురగా; పోయిన, వలనికి, వ్రాలుచు= పోయిన చోటికి వంగుతూ; వాత+అవధూతంబు+ఐన= గాలిచేత అటూ ఇటూ ఊపబడిన; బాలవృక్షంబునున్+పోలెన్= చిన్నచెట్టువలె; ఒప్పుచున్నన్= విలసిల్లుతుండగా; ఆ+ముని, పుత్త్రు+అందు= ఆ ముని కుమారుని యందు; నాహృదయంబు= నా హృదయం; తద్దయున్= మిక్కుటంగా; తగిలినయది= తగుల్కొన్నది.

తాత్పర్యం: మరియున్నూ, ఆబ్రహ్మచారి ఒక ఎర్రని పండును తన కుడి అరచేతితో మోదుతూ, అది నేలమీదపడి మళ్ళీ మీదికి ఎగిసేటప్పుడు దానియెడకు వాలుతూ గాలిచేత విసరబడిన చిన్నచెట్టువలె తూగాడినాడు. ఆ ఋషి కుమారుడిపట్ల నా హృదయం మిక్కుటంగా ఆకర్షితమైనది.

విశేషం: (1) ఇది కందుకక్రీడాభివర్ణన అన్నది తేటతెల్లం. (2) ఉపమాలంకారం: వాతావధూతమైన బాలవృక్షం ఉపమానం. కందుకక్రీడా నిపుణ అయిన వేశ్యాంగన ఉపమేయం. చెట్టు మొదలు కదలదు. గాలిచేత కొమ్మలు, రెమ్మలు కదులుతాయి. అట్లాగే వేశ్యాంగన పాదాలు కదలకుండా చేతులను మాత్రమే ఆడించింది. ఇది సమానధర్మం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. నన్నును గౌఁగిలించుకొని నా వదనంబునకున్ నిజాస్య మా
సన్నముఁ జేసి యొక్క మృదుశబ్దము సేసె మనోహరంబుగా;
నెన్నఁడు నట్టి శబ్దము మునీశ్వర! మున్ విని యే నెఱుంగ; న
య్యన్నువ బ్రహ్మచారిముఖ మంబురుహంబు సమంబు సూడఁగన్. 107

ప్రతిపదార్థం: నన్నును= నన్ను; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; నా వదనంబునకున్= నాముఖానికి; నిజ+ఆస్యము= తనముఖం; ఆసన్నమున్+చేసి= దగ్గరికి కలిసేటట్లు చేసి; ఒక్క= ఒక; మృదు, శబ్దము= మెత్తటిసవ్వడి; మనస్+హరంబుగాన్= మనసును హరించేటట్లుగా; చేసె= వెలువడ చేశాడు; ముని+ఈశ్వర!= మునులలో ఈశ్వరుడి వంటివాడా! ఋషిశ్రేష్ఠుడా!; ఎన్నఁడున్= ఎప్పుడు; అట్టి, శబ్దము= అటువంటి (వీనులకు విందైన) ధ్వని; మున్= మునుపు; ఏన్= నేను; విని= విని; ఎఱుంగను= ఎఱుగను; ఆ+అన్నువ, బ్రహ్మచారి, ముఖము= ఆ లేత ఋషికుమారుడి ముఖం; చూడఁగన్= చూడగా; అంబురుహంబు సమంబు= పద్మంతో సమానం.

తాత్పర్యం: ఓ ఋషిశ్రేష్ఠుడా! ఆ బ్రహ్మచారి నన్ను ఆలింగనం చేసికొని, నా ముఖానికి దగ్గరగా తన ముఖం చేర్చి మనోహరమైన ఒక మృదునాదం వెలువడచేశాడు. వీనులకు విందైన అటువంటి మధుర ధ్వని మునుపెన్నడూ నేను వినలేదు. అరసిచూడగా ఆ లేత బ్రహ్మచారి ముఖం తామరపువ్వుతో సరిపోలుతుంది.

విశేషం: 'ఆ బ్రహ్మచారి' తనను కౌగిలించుకొన్న తరువాత ముద్దుపెట్టుకొన్నట్లు ఋశ్యశృంగుడు తండ్రికి వర్ణించి చెప్పవలసి ఉన్నది. అయితే ముద్దు ఋశ్యశృంగుడికి అనుభవామ్రేడితమైనట్టిదికాదు కదా. అనుభవైక వేద్యమైన విషయాన్ని వర్ణించేందుకు మాటలు చాలవు. మాటలలో చెప్పలేని అనుభూతిని మాటలలో చెప్పటమే కవితాకళలోని విచిత్ర విరోధాభాసం. ముద్దును ఏమాత్రం వాచ్యం చేయకుండా ఋశ్యశృంగుడు చేసిన అభివర్ణన చదివితే సహృదయులు తలలూపక తప్పదు కదా. ఇక భారతీయ సాహిత్యంలో కవులు ఎందరెందరో యుగయుగాంతరాలలో నాయికముఖాన్ని పద్మంతో పోల్చారు. అంత పాత పడిన ఉపమానం వేరొకటి లేదేమో. అయినా ఋశ్యశృంగుడు 'అయ్యన్నువ బ్రహ్మచారి ముఖ మంబురుహంబు సమంబు' అనగా ఆ తామరపువ్వులో సృష్టి ప్రారంభ సమయంలోని తొలి ఉషస్సు సౌరు తొణికిసలాడుతున్నది. ఋశ్యశృంగుడు క్రాంతదర్శియై ఆ బ్రహ్మచారి ముఖంలో అంబురుహ శోభ సందర్శించాడు. అలం: ఉపమాలంకారం.

వ. నా యిచ్చిన వన్యస్వాదుఫలంబు లాదరించి యారగింప కమ్మునికుమారుం డమృతోపమానంబు లైన ఫలంబులు నతిమధురంబులైన పానీయంబులు నాకు నిచ్చిన నుపయోగించితి. 108

ప్రతిపదార్థం: నా+ఇచ్చిన= నేను ఇచ్చిన; వన్య, స్వాదు, ఫలంబులు= అడవిలోని రుచికరాలైన పళ్ళు; ఆదరించి= మన్నించి; ఆరగింపక= తినక; ఆ+ముని, కుమారుండు= ఆ ఋషి పుత్రుడు; అమృత+ఉపమానంబులు+ఐన= అమృతంతో సరిపోల్చతగిన; ఫలంబులును= పళ్ళున్నూ; అతి, మధురంబులు+ఐన= మిక్కిలి తీయనైన; పానీయంబులు= పానకాలు; నాకున్+ఇచ్చినన్= నాకు సమర్పించగా; ఉపయోగించితిన్= స్వీకరించాను.

తాత్పర్యం: నేను ఇచ్చిన అడవిలోని మంచిపళ్ళను ఆదరించి తినకుండా, ఆ ఋషికుమారుడు అమృతంతో సరిపోలేటటువంటి పళ్ళను, మిక్కిలి తియ్యనైన పానీయాలను నాకు ఈయగా నేను ఉపయోగించాను.

క. తన చేతి పుష్పములఁ జ । ల్లిన నంతటఁ జెదరి యవి యళిప్రకరనిషే
వన మొప్ప నున్నయవి; యి । వ్వనకుసుమము లట్లు గావు వరగంధంబుల్. 109

ప్రతిపదార్థం: తన చేతి పుష్పములన్= తన చేతిలోని పువ్వులను; చల్లినన్= విసరగా; అవి= ఆ పువ్వులు; అంతటన్= అన్ని వైపుల; చెదరి= అటూ ఇటూ పడి; అళిప్రకర నిషేవనము+ఒప్పన్= తుమ్మెదల గుంపులచేత చక్కగా ఆస్వాదించబడుతూ; ఉన్న+అవి= ఉన్నాయి; ఈ+వనకుసుమముల+అట్లు= ఈ అడవిలోని పూవుల వలె; కావు= కావు; వరగంధంబుల్= (అవి) శ్రేష్ఠమైన పరిమళం కలవి.

తాత్పర్యం: ఆ బ్రహ్మచారి తనచేతిలోని పువ్వులను వెదచల్లగా, అవి అంతటా చెదరిపడి తుమ్మెదలచేత చక్కగా సేవించబడుతూ శోభిల్లాయి. అవి ఈ అడవిపూల వంటివి కావు. (అనగా ఈ అడవి పూలు అంతగా వాసన లేనివని భావం.) ఆ పువ్వులు శ్రేష్ఠమైన పరిమళం కలవి.

వ. నాకు నమ్మునిపుత్త్రునాశ్రమంబునందు వానితో నొక్కటఁ దపంబు సేయుచుండు నిష్టం' బనినఁ గొడుకు పలుకులు విని విభాండకుండు విస్మితుండై 'తపస్వుల తపంబులకు విఘ్నంబులు సేయ ననేక రూపులయి రాక్షసులు వనంబునం గ్రుమ్మరుచుండుదురు; తజ్జనదత్తంబు లయిన పానీయంబు లపేయంబు; లతి సుగంధులయిన కుసుమంబులు మునులకు వర్జనీయంబు' లని కొడుకుం బ్రబోధించి, యెప్పటియట్ల వన్యఫలంబులు దేర నరిగిన. 110

ప్రతిపదార్థం: నాకున్= నాకు; ఆ+ముని, పుత్త్రు= ఆ ఋషి కుమారుడియొక్క; ఆశ్రమంబునందు, వానితోన్, ఒక్కటన్= ఏకాంతంగా వాడితో కలిసి ఆశ్రమంలో; తపంబు+చేయుచుండన్= తపస్సు చేస్తూ ఉండటం; ఇష్టంబు+అనినన్= కోరిక అయినది అనగా; కొడుకు, పలుకులు= కుమారుడి మాటలు; విని= ఆలకించి; విభాండకుండు= విభాండక ముని; విస్మితుండు+ఐ= అచ్చెరువందినవాడై; తపస్వుల, తపంబులకు= మునుల తపస్సులకు; విఘ్నంబులు+చేయన్= ఆటంకాలు కల్పించేందుకు; అనేక, రూపులు+ఐ= పెక్కు ఆకారాలు (రూపాలు) ధరించినవారై; రాక్షసులు; వనంబునన్= అడవిలో; క్రుమ్మరుచు+ఉండుదురు= తిరుగుతూ ఉంటారు; తద్+జన దత్తంబులు+అయిన= ఆ జనాలచేత ఇవ్వబడిన; పానీయంబులు= పానీయాలు; అపేయంబులు= త్రాగకూడనివి; అతి, సుగంధులు+ఐన= మిక్కుటమైన పరిమళం కల; కుసుమంబులు= పువ్వులు; మునులకు= ఋషులకు; వర్జనీయంబులు= వదలిపెట్టతగినవి; అని= అని చెప్పి; కొడుకున్= కుమారుడికి; ప్రబోధించి= హెచ్చరించి; ఎప్పటి+అట్ల= యథాప్రకారం; వన్యఫలంబులు= అడవిలో దొరికేటటువంటి పండ్లు; తేరన్+అరిగిన= తెచ్చేందుకు వెళ్ళగా.

తాత్పర్యం: ఆ ఋషికుమారుడితో కలిసి మెలిసి ఆతని ఆశ్రమంలో ఏకాంతంగా తపస్సు చేయాలని నాకోరిక- అని ఋశ్యశృంగుడు తండ్రికి చెప్పగా, కుమారుడి మాటలు విన్న విభాండకుడు ఆశ్చర్యం పొందాడు. 'ఋషుల తపస్సులకు అంతరాయాలు కల్పించేందుకై రక్కసులు అడవులలో అనేకరూపాలతో తిరుగాడుతూ ఉంటారు. అటువంటివారు ఇచ్చే పానీయాలు స్వీకరించతగనివి. మిక్కుటమైన సువాసనగల పువ్వులను మునులు ఉపయోగించకూడదు' అని విభాండకుడు కొడుకుకు జాగ్రత్తలు వచించి, ఎప్పటివలె అడవిలో దొరికే పండ్లు తెచ్చేందుకై అరణ్యంలోకి వెళ్ళాడు.

క. చనుదెంచి తరుణి మునినం। దను చిత్తంబునకు వైకృతముఁ జేసె; విలా
సినుల సహాలాప సహా। సన సహయానములు బంధసమములు గావే! 111

ప్రతిపదార్థం: తరుణి= లేజవరాలు (వేశ్యపుత్రిక), చనుదెంచి= వచ్చి; ముని, నందను, చిత్తంబునకు= ముని కుమారుడి యొక్క మనస్సుకు; వైకృతమున్+చేసె= వికారభావాన్ని పొందేటట్లు చేసింది- అంటే మనసులో మార్పు కలిగించింది; విలాసినుల= విలాసవతులయొక్క; సహ+ఆలాప, సహ+ఆసన, సహ, యానములు= కలిసిమెలిసి మాట్లాడటం, కూర్చొనటం, ప్రయాణం చేయటం; బంధ సమములు+కావే!= కట్టువడుటతో సమానాలైనవి కావా!

తాత్పర్యం: వేశ్యాపుత్రిక అయిన లేజవరాలు వచ్చి ఋషికుమారుడైన ఋశ్యశృంగుడి మనస్సులో వికారాన్ని కల్గించింది. అందచందాలతో హొయలొలికే మిటారికత్తెలతో కలిసిమెలసి మాట్లాడటం, దగ్గరగా ఒకచోట కూర్చోవటం, తిరుగాడటం కట్టువడుటతో సమానాలు కదా!

విశేషం: (1) అలం: అర్థాంతరన్యాసం. (2) నన్నయ కవితాశిల్పానికి విశిష్టత చేకూర్చిన నానారుచిరార్థసూక్తి నిధిత్వానికి ఈ పద్యం ఉదాహరణప్రాయం.

వ. ఇట్లు ఋశ్యశృంగుండు విలాసినీమోహితుండయి, తండ్రి కెఱింగింపక సుచరిత్రంబయిన తన యాశ్రమంబు విడిచి, మనుష్యయోగంబునం దగిలి యక్కోమలి పిఱుందన చని, యంగదేశంబు సొచ్చి, యందు రోమపాదు నాదేశంబున రాజాశ్రయం బను వనంబున నుండునంత. 112

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఋశ్యశృంగుండు; విలాసినీ, మోహితుండు+అయి= వేశ్యచేత మిగుల ఆకర్షించబడినవాడై; తండ్రికి+ఎఱింగింపక= తండ్రికి తెలియజేయకుండా; సుచరిత్రంబు+అయిన= మంచిప్రవర్తనతో కూడిన; తన+ఆశ్రమంబు, విడిచి= తన ఆశ్రమాన్ని విడిచిపెట్టి; మనుష్య, యోగంబునన్+తగిలి= మనుష్యులకు సాధారణమైన నడవడి కూర్పులో చిక్కుకొని; ఆ+కోమలి= ఆ సుకుమారి యొక్క; పిఱుందన= వెనువెంటనే; చని= వెళ్ళి; అంగ, దేశంబు+చొచ్చి= అంగరాజ్యంలో ప్రవేశించి; అందు= ఆ అంగదేశంలో; రోమపాదు+ఆదేశంబునన్= రోమపాదుడియొక్క ఆజ్ఞప్రకారం; రాజ+ఆశ్రయంబు= రాజాశ్రయంబు+అను= వనంబునన్= రాజాశ్రయం అనే తోటలో; ఉండు+అంత= ఉన్నప్పుడు.

తాత్పర్యం: ఈ విధంగా ఋశ్యశృంగుండు లేజవరాలైన వారకాంతచేత ఆకర్షితుడై, ఆమె వలపులో చిక్కుకొని తండ్రికి తెలియకుండా మంచిప్రవర్తనకు నెలవైన తన ఆశ్రమాన్ని విడిచిపెట్టి, మానవులకు సాధారణమైన నడవడికలో చిక్కుకొని, ఆ సుందరాంగి వెనువెంట వెళ్ళి అంగదేశం చేరి, అక్కడ రోమపాదుడిఆజ్ఞప్రకారం 'రాజాశ్రయం' అనే తోటలో ఉండగా.

విశేషం: ఇక్కడ 'మనుష్యయోగంబునం దగిలి' అన్న పదగుంఫనం ప్రత్యేకించి అనుశీలించ తగింది. 'యోగ' శబ్దాన్ని గురించిన విపులవ్యాఖ్యానం ప్రకరణాంతరంలో (ప్రథమాశ్వాసం) వ్రాయబడింది. వలపు - విలాసినీ వ్యామోహం మానవ సహజమైన యోగం. ఇంద్రియలౌల్యం మానుషయోగమైతే. ఇంద్రియ నిగ్రహం, తపస్సు అధిమానవయోగం. యోగ శబ్దానికి 'పొందిక', 'కూడిక' అన్న అర్థం బహుళవ్యాప్తం. సామరస్య సంధానం యోగానికి అంతరాత్మ, ఐహికం గాని, ఆముష్మికంగానీ లలిత కళాత్మకమైన సామరస్యసంధానంతో మేళవిస్తే అది యోగమౌతుంది. ఇక్కడ ఋశ్యశృంగుడు దివ్యయోగం నుండి జారి మనుష్యయోగంలో చిక్కుకొన్నాడు. ఈవచనంలో పెక్కు భారతప్రతుల్లో 'రాజాశ్రమంబను' - అనే పాఠాంతరం కనిపిస్తుంది. వావిళ్లప్రతిలో 'రాజశ్రయంబను భవనంబున' - అనే పాఠభేదం ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మత్తకోకిలము.

అమ్మునీశునివాసశక్తిఁ దదంగదేశమునందు మే
ఘమ్ము లెల్ల వలంకులం గడుఁ గ్రమ్మి సర్వజనప్రమో
దమ్ముగాఁ బ్రభవద్బృహజ్జలధార లొప్పఁగ వృష్టిఁ జే
సె మ్మహానదులున్ మహాసరసీవరంబులు నిండఁగన్. 113

ప్రతిపదార్థం: ఆ+ముని+ఈశు= ఆ ఋషిశ్రేష్ఠుడి యొక్క; నివాస శక్తిన్= నివసించటంయొక్క మహిమచేత; తత్+అంగ దేశమునందు= ఆ అంగరాజ్యంలో; మేఘమ్ములు+ఎల్ల= మబ్బులన్నీ; వలంకులన్= దిక్కులన్నిటినీ; కడున్+క్రమ్మి= మిక్కుటంగా కప్పి; సర్వ, జన, ప్రమోదమ్ముగాన్= అందరు ప్రజలకూ సంతోషాన్ని కలిగించేటట్లుగా; ప్రభవత్, బృహత్+జల, ధారలు+ ఒప్పఁగ= పుట్టుతున్న గొప్పనీటి ధారలు విలసిల్లగా; మహాసరసీవరంబులు= గొప్ప సరస్సులు; మహా నదులున్= గొప్ప నదులును; నిండఁగన్= నిండేటట్లుగా; వృష్టిన్+చేసెన్= వాన కురిపించాయి.

తాత్పర్యం: ఆ ఋశ్యశృంగ మహాముని నివసించటంవలన ఏర్పడిన మహిమచేత ఆ అంగదేశం మబ్బులు దిక్కులన్నిటా వ్యాపించి ప్రజలందరికీ ఆనందం కలిగేటట్లుగా కారుతున్న పెనునీటి ధారలతో పెద్ద సరస్సులు, గొప్పనదులు పొంగి పొరలేటట్లు వాన కురిపించాయి.

విశేషం: వలంకులు= దిక్కులు; వలకు వలను రూపాంతరం; 'కెలంకులు' అనే పాఠాంతరం అనేక ప్రతులలో కనబడుతున్నది. కెలను అంటే దిక్కు. రూపాంతరం కెలఁకు. వృత్తలక్షణానికి ఆర. 1.46 విశేషాంశం చూడండి.

ఆనందాశ్రమ గ్రంథమాలప్రతిలో 'మహానది దీర్ఘికా సరసీనదంబులు నిండఁగాన్' - అనే పాఠాంతరం ఉన్నది.

వ. ఇట్లు ఋశ్యశృంగు నాగతంబున నంగవిషయంబున నవగ్రహదోషంబు నిరస్తంబైన సంతసిల్లి రోమపాదుండు తన కూఁతు శాంత యనుదాని నత్యంతకాంతిమతి నమ్మునివరునకు వివాహంబు సేసి. 114

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఋశ్యశృంగు+ఆగతంబునన్= ఋశ్యశృంగుడి రాకవలన; అంగవిషయంబునన్= అంగదేశంలో; అవగ్రహ, దోషంబు= అనావృష్టి అనే బాధ; నిరస్తంబు+ఐనన్= తొలగిపోగా; రోమపాదుండు; సంతసిల్లి= సంతోషించి; తన, కూతు= తన పుత్రిక; శాంత+అనుదానిన్= శాంత అనేపేరు కల ఆమెను; అత్యంతకాంతిమతిన్= మిక్కిలి లావణ్యం కలదానిని; ఆ+మునివరునకు= ఆ ఋషిశ్రేష్ఠుడికి; వివాహంబు+చేసి= పెళ్లిచేసి.

తాత్పర్యం: ఈ విధంగా ఋశ్యశృంగుడి రాకవలన అంగదేశంలో వర్షం లేకపోవడమనే దోషం తొలిగిపోవటంచేత రోమపాదుడు సంతోషించి అతడికి లావణ్యారాశి అయిన తనకూతురు శాంత నిచ్చి పెళ్ళిచేశాడు.

క. అనుభోగయోగ్యములుగా । ధనరాసులు భూషణములు దాసీనివహం
బును గాంచనమయ శయ్యా । సనములు ముని కిచ్చె హృదయసంతోషముగాన్. 115

ప్రతిపదార్థం: అనుభోగ యోగ్యములుగా= అనుభవించేందుకు అర్హత కలవిగా; ధనరాసులు= డబ్బుల కుప్పలు; భూషణములు= ఆభరణాలు; దాసీ, నివహంబును= దాసీస్త్రీల సముదాయమున్నూ; కాంచన, మయ, శయ్యా+ఆసనములు= బంగారంతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేయబడిన మంచాలు, కూర్చొనే పీఠాలు (కుర్చీలు); హృదయ సంతోషముగాన్= డెందానికి ఆనందం కొలిపేటట్లు; మునికి+ఇచ్చెన్= ఋషికి కట్నంగా సమర్పించాడు.

తాత్పర్యం: అనుభవించేందుకు తగినటువంటి ధననిధులు, ఆభరణాలు, దాసీసమూహాలు, బంగారు శయ్యలు, ఆసనాలు మొదలైనవి హృదయం ఉప్పొంగేటట్లుగా ఋశ్యశృంగుడికి కట్నంగా రోమపాద మహారాజు సమర్పించాడు.

విభాండకుఁడు ఋశ్యశృంగుని వెదకుచు వచ్చుట (సం. 3-113-11)

వ. మఱియు గోసహస్రంబు లనేకంబు లిచ్చి గోకులసంకులంబుగా ఘోషంబులు దేశంబుల నెల్ల నిలిపి నిత్య సత్కారంబుల ఋశ్యశృంగునకుఁ బ్రియంబుసేయుచుండె; నంత నట విభాండకుండు దన యాశ్రమంబునఁ గొడుకుం గానక యెల్లదేశంబులు రోయుచు నంగదేశంబునకు వచ్చి గోగణసంకీర్ణబైన యొక్కఘోషంబు నందు గోపసత్కృతుండై యొక్క దివసంబు వసియించి 'యిది యెవరి ఘోషం?' బని గోపాలకుల నడిగిన వార లి ట్లనిరి. 116

ప్రతిపదార్థం: మఱియు= అదనంగా; గోసహస్రంబులు= వేలకొద్ది ఆవులు; అనేకంబులు+ఇచ్చి= పెక్కు ఇచ్చి; గో, కుల, సంకులంబుగా= ఆవులమందల గుంపులతో కూడిన; ఘోషంబులు= గొల్లపల్లెలు; దేశంబులన్+ఎల్ల= వివిధ ప్రదేశాలలో; నిలిపి= ఏర్పాటుచేసి; నిత్యసత్కారంబుల= దినం దినం చేసే మర్యాదలతో; ఋశ్యశృంగునకున్; ప్రియంబు= ప్రీతిని; చేయుచుండెన్= చేస్తున్నాడు; అంతన్= అటుమీద; అట= అక్కడ, ఋశ్యశృంగుడి ఆశ్రమంలో; విభాండకుండును= విభాండకమునియున్నూ; తన+ఆశ్రమంబునన్= తన ఆశ్రమంలో; కొడుకున్= పుత్రుడిని; కానక= చూడక; ఎల్ల, దేశంబులు= రాజ్యాలన్నీ; రోయుచున్= వెదకుతూ; అంగదేశంబునకు= అంగదేశానికి; వచ్చి= వచ్చి; గో, గణ, సంకీర్ణంబు+ఐన= ఆవుల మందలచేత క్రిక్కిరిసిఉన్న; ఒక్కఘోషంబునందు= ఒక గొల్లపల్లెలో; గోప, సత్కృతుండు+ఐ= గొల్లలచేత పూజించబడినవాడై; ఒక్కదివసంబు వసియించి= ఒక్క రోజు ఉండి; ఇది= ఇది; ఎవరి, ఘోషంబు?= ఎవరికి చెందిన ఆవులమంద?; అని= అంటూ; గోపాలకులన్= గొల్లలను; అడిగిన= ప్రశ్నించగా; వారు= వారు (ఆ గోపాలకులు) ఇట్లు+అనిరి= ఈ రీతిగా పలికారు.

తాత్పర్యం: అదనంగా వేలకొద్దీ ఆవులను ఇచ్చి, ఆవులతో క్రిక్కిరిసిన గొల్లపల్లెలను వివిధప్రదేశాలలో నెలకొల్పి ప్రతిదినం సత్కారాలు చేస్తూ రోమపాదుడు ఋశ్యశృంగుడికి ప్రీతి కలిగిస్తున్నాడు. అంత అక్కడ ఋషివాటికలో విభాండకుడికి కొడుకు కనిపించకపోవటంచేత అతడిని వెదకుతూ దేశదేశాలు పయనించి, విభాండకుడు చివరకు అంగదేశాన్ని చేరి, ఆవులతో నిండిన ఒక గొల్లపల్లెలో గోపాలకులచేత సత్కారాలను పొంది, 'ఇది ఎవరి ఆవులమంద?' అని అడిగాడు. అప్పుడు ఆ గోపాలురు ఇట్లా బదులు పలికారు.

క. 'యతినాథ! వినవె యిది నీ । సుతుఘోషం; బిదియ కాదు చూడ ననేకా
యుతఘోషంబులు గల వు । న్నతగుణునకు ఋశ్యశృంగునకు నిద్ధరణిన్. 117

ప్రతిపదార్థం: యతినాథ!= ఋషులకు అధినేతవైన ఓ విభాండకమహర్షీ!; వినవు+ఎ= వినలేదా (వినండి!); ఇది= ఇది; నీ సుతుఘోషంబు= నీ కొడుకుయొక్క ఆలమందల గొల్లపల్లె; ఇది+అ, కాదు= ఇది మాత్రమే కాదు; చూడన్= పరిశీలించగా; ఈ ధరణిన్= ఈ పుడమిపై; అనేక+అయుత, ఘోషంబులు= పెక్కు పెద్ద ఆవులమందలు; ఉన్నతగుణునకు= గొప్ప మంచిగుణాలు కలవాడైన; ఋశ్యశృంగునకున్= ఋశ్యశృంగుడికి; కలవు= ఉన్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఋషులకు అధినేతవైన ఓ విభాండకమహర్షీ! ఇది నీ కుమారుడియొక్క ఆలమంద, ఈ ఒక్క ఆలమంద మాత్రమే కాదుకదా! ఎన్నో పెద్ద పెద్ద ఆవులమందల ఈ పుడమిలో (ఈరాజ్యంలో) ఎన్నోచోట్ల గొప్పగుణాలు కలవాడైన ఋశ్యశృంగుడికి ఉన్నాయి.'

వ. అనిన విని విభాండకుండు సంతసిల్లి ఋశ్యశృంగు తొఱ్ఱుపట్ల విశ్రమించుచు రోమపాదుపురంబునకు వచ్చి యందు శాంతా సహితుండైన ఋశ్యశృంగుం జూచి సంతుష్ట హృదయుండై, తన కొడుకుం గోడలిం దోడ్కొని నిజాశ్రమంబున కరిగె; నందు వసిష్ఠున కరుంధతియు, నగస్త్యునకు లోపాముద్రయు, ముద్గలునకు నాలాయనియైన యింద్రసేనయుంబోలెఁ దనకుఁ బరమభక్తియుక్తియై శాంత పరిచర్య సేయుచుండ ఋశ్యశృంగుండు సుఖంబుండె' నని చెప్పిన నా కౌశికప్రదంబున నందఱు నభిషిక్తులై యేనూఱు మహానదుల సమాగమస్థానంబైన గంగాసాగర సంగమంబుఁ జూచుచు సముద్రతీరంబునం జని కళింగదేశంబున వైతరణి యను మహానదిం గని; రంత రోమశుండు ధర్మరాజున కిట్లనియె. 118

ప్రతిపదార్థం: అనిన= అని పలికిన; విని= విని; విభాండకుండు= విభాండక మహర్షి; సంతసిల్లి= సంతోషించి; ఋశ్యశృంగు= ఋశ్యశృంగుడియొక్క; తొఱ్ఱుపట్ల= ఆలమంద లుండే చోట్ల; విశ్రమించుచున్= విశ్రాంతి తీసికొంటూ; రోమపాదు పురంబునకు వచ్చి= రోమపాదుడి రాజధానీనగరం చేరి; అందు= అక్కడ; శాంతా, సహితుండు+ఐన= శాంతతో కూడుకొనిఉన్న; ఋశ్య శృంగున్+చూచి= ఋశ్యశృంగుడిని చూచి; సంతుష్ట, హృదయుండు+ఐ= తనివి చెందిన హృదయం కలవాడై; తన, కొడుకున్+కోడలిన్= తన కొడుకును, కోడలిని; తోడ్కొని= తన వెంటబెట్టుకొని; నిజ+ఆశ్రమంబునకు= తన ఋషివాటికకు; అరిగెన్= వెళ్ళాడు; అందున్= ఆ ఆశ్రమంలో; వసిష్ఠునకు= వసిష్ఠమహర్షికి; అరుంధతియు; అగస్త్యునకు; లోపాముద్రయు; ముద్గలునకు= ముద్గలమునికి; నాలాయని+ఐన= నాలాయని (కాశిరాజు) కూతురైన; ఇంద్రసేనయున్; పోలెన్= పోలునట్లుగా; తనకున్= తనకు (ఋశ్య శృంగుడికి); పరమ, భక్తి, యుక్త+ఐ= మిక్కిలి భక్తితో కూడినటువంటిదై; శాంత= శాంతాదేవి; పరిచర్య, చేయుచుండ= సేవ చేస్తుండగా; ఋశ్యశృంగుండు; సుఖంబు+ఉండెన్= సుఖంగా ఉండినాడు; అని= అంటూ; చెప్పినన్= చెప్పగా; ఆ కౌశిక, హ్రదంబునన్= ఆ కౌశికుడి పేరు మీదుగా వెలసిన మడుగులో; అందఱున్= ధర్మరాజు ప్రభృతులు; అభిషిక్తులు+ఐ= స్నానం చేసినవారై; ఏనూఱు, మహా, నదుల= ఐదువందల గొప్ప ఏరుల; సమాగమ, స్థానంబు+ఐన= కలిసేటటువంటి చోటు అయిన; గంగా, సాగర, సంగమంబున్= గంగానది సముద్రంలో కలిసేచోటును; చూచుచు= దర్శిస్తూ; సముద్ర తీరంబునన్= సముద్ర తీరరేఖను అనుసరించి; చని= వెళ్ళి; కళింగ, దేశంబునన్= కళింగదేశాన; వైతరణి+అను= వైతరణి అనేపేరు కలిగిన; మహానదిన్+కనిరి= గొప్పనదిని చూచారు; అంత= అటుతరువాత (పిమ్మట); రోమశుండు= రోమశుడు; ధర్మరాజునకు= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని గోపాలకులు చెప్పగా విభాండకమహాముని మిక్కిలి సంతసించాడు. అక్కడనుండి విభాండక మహర్షి పయనించి, మార్గమధ్యంలో ఋశ్యశృంగుడి ఆవులమందలు ఉన్న తావులలో విశ్రమిస్తూ, చివరకు రోమపాదుడి రాజధానిని చేరి అక్కడ శాంతాదేవితోపాటు ఉన్న ఋశ్యశృంగుడిని చూచి సంతృప్తి చెందిన హృదయం కలవాడైనాడు. తదుపరి విభాండకుడు తన కొడుకును కోడలిని వెంటబెట్టుకొని తన ఆశ్రమానికి వెళ్ళాడు. అంత శాంతాదేవియున్నూ ఋశ్యశృంగుడికి- అరుంధతి వసిష్ఠుడికీ, ఇంద్రసేన ముద్గలుడికీ, లోపాముద్ర అగస్త్యుడికీ వలె పరమభక్తితో సేవచేస్తుండగా, ఋశ్యశృంగుడు సుఖంగా జీవితం గడిపాడు'- అని రోమశుడు ధర్మరాజుకు చెప్పాడు. పిమ్మట అందరు ఆ కౌశిక సరోవరంలో స్నానంచేశారు. ఐదునూర్ల మహానదులకు సంగమస్థానమైన గంగాసాగర సంగమాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సందర్శిస్తూ, తీరరేఖను బట్టి పయనించి కళింగదేశం చేరి అక్కడ వైతరణి అనే మహానదిని సందర్శించారు. అప్పుడు రోమశుడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

క. 'మునిదేవవరులు యజ్ఞము । లొనరించిరి తొల్లి దీని యుత్తరతీరం
బున; నిది పుణ్యాస్పదమై । తనరును యజ్ఞావభృథశతస్నానములన్. 119

ప్రతిపదార్థం: మునిదేవవరులు= మునులలో, దేవతలలో శ్రేష్ఠులు; దీని ఉత్తరతీరంబునన్= ఈ వైతరణీనది ఉత్తరపు గట్టున; తొల్లి= పూర్వకాలంలో; యజ్ఞములు= యజ్ఞాలు; ఒనరించిరి= చేశారు; యజ్ఞ+అవభృథశత, స్నానములన్= యజ్ఞం పరిసమాప్తమైనప్పుడు నూరుసార్లు చేసిన స్నానాలచేత; ఇది= ఈ వైతరణీనది; పుణ్య+ఆస్పదము+ఐ= పుణ్యానికి నెలవై; తనరును= ఒప్పుతున్నది.

తాత్పర్యం: 'పూర్వకాలంలో ఈ వైతరణీ మహానది ఉత్తరతీరంలో ఋషీశ్వరులు, దేవతాశ్రేష్ఠులు ఎన్నో యజ్ఞాలు చేశారు. యజ్ఞ పరిసమాప్తి సమయాన శతాధికంగా చేసిన అవభృథస్నానాలవలన ఈ మహానది పుణ్యానికి నెలవైనది.

వ. మఱియు సకలయజ్ఞంబుల యందును బ్రశస్తంబయిన పశుభాగంబు పశుపతికి దేవతలును ఋషులును నిందుఁ గల్పించి; రీ తీర్థం బాడినవారు దేవయానగతు లగుదు' రనినం గృష్ణాసహితుండై ధర్మతనయుండు దమ్ములుం దానును వైతరణీస్నానంబు సేసి, రోమశుం జూచి 'మునీంద్రా! నాకు భవత్ప్రసాదంబున నఖిలలోకంబులుం గాననయ్యె, వైఖానసుల వేదాధ్యయన శబ్దంబులు విననయ్యె 'ననిన విస్మితుండై రోమశుండు 'వైఖానస నివాసం బిందులకు ముప్పదివేల యోజనంబులు గలదు; వారల యధ్యయన శబ్దంబులు వింటివి గావున నీవు దివ్యుండ' వంచు నరిగి యనవరత ఫలాలంకృతంబైన యొక్క వనంబుఁ గని 'యిందుఁ దొల్లి స్వాయంభువుండైన విశ్వకర్మ యజ్ఞంబు సేసి. 120

ప్రతిపదార్థం: మఱియు= విశేషించి; సకల యజ్ఞంబుల+అందును= అన్ని యజ్ఞాలలోను; ప్రశస్తంబు+ఐన= గొప్పదిగా ఎన్నదగిన; పశుభాగంబు= పశుభాగం అనే నివేదన; పశుపతికిన్= శివుడికి; దేవతలును, ఋషులును= దేవతలు, మునులు కలిసి; ఇందున్= ఈచోట; కల్పించిరి= ఏర్పాటు చేశారు; ఈ తీర్థంబు+ఆడినవారు= ఈ తీర్థంలో స్నానంచేసినవారు; దేవయానగతులు+అగుదురు= దేవతలు పయనించే మార్గాన వెళ్లేవారు కాగలరు; అనినన్= అని చెప్పగా; ధర్మతనయుండు= ధర్మపుత్రుడు; తమ్ములున్+తానును= తాను, తనసోదరులు; కృష్ణాసహితుండు+ఐ= ద్రౌపదితో పాటు; వైతరణీ స్నానంబు+చేసి= వైతరణీ నదిలో స్నానాలు చేసి, రోమశున్+చూచి= రోమశుడిని చూచి; ముని+ఇంద్రా!= ముని శ్రేష్ఠుడా!; నాకు= నాకు; భవత్+ప్రసాదంబునన్= నీయొక్క దయవలన; అఖిలలోకంబులున్= సమస్త జగత్తులు; కానన్+అయ్యెన్= కన్పించాయి; వైఖానసుల, వేద+అధ్యయన, శబ్దంబులు= వైఖానసులయొక్క వేదాలు చదువుతున్న నాదాలు; వినన్+అయ్యెన్= వినిపించాయి; అనిన= అని చెప్పగా; విస్మితుండు+ఐ= ఆశ్చర్యం పొందినవాడై; రోమశుండు; వైఖానసనివాసంబు= వైఖానసులు నివసించేచోటు; ఇందులకు= ఈ చోటికి; ముప్పదివేలయోజనంబులు= ముప్పదివేల ఆమడలదూరాన; కలదు= ఉన్నది; వారల+అధ్యయనశబ్దంబులు= వారు వేదాలను చదివే ధ్వనులు; వింటివి= విన్నావు; కావున= కాబట్టి; నీవు, దివ్యుండవు= నీవు మనుష్యశక్తికి అతీతమైన దివ్యశక్తి కలవాడివి; (దివ్య పురుషుడవు); అంచున్= అనిచెపుతూ; అరిగి= వెళ్ళి; అనవరతఫల+అలంకృతంబు+ఐన= ఎల్లప్పుడూ పండ్లతో కళకళలాడుతూ ఉండే; ఒకవనంబున్+కని= ఒక తోటను చూచి; ఇందున్= ఇక్కడ; తొల్లి= పూర్వం; స్వాయంభువుండు+ఐన= స్వాయంభువ మనువుకు సంబంధించిన; విశ్వకర్మ= విశ్వకర్మ అనే మహనీయుడు; యజ్ఞంబు+చేసి= యజ్ఞాన్ని చేసి,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఇక్కడ విశేషించి పేర్కొన తగిన అంశం ఏమిటంటే- సకలక్రతువులలో గొప్పదిగా ఎన్నదగిన పశుభాగాన్ని దేవతలు, ఋషిశ్రేణ్యులు కలిసి ఇక్కడ పశుపతికి ఏర్పాటు చేశారు. ఈ తీర్థంలో స్నానంచేసినవారు దేవతలు వెళ్లేటటువంటి మార్గాన పోగలరు'- అని చెప్పగా ధర్మరాజు తానున్నూ, తమ్ములున్నూ, ద్రౌపదితోపాటు వైతరణీనదిలో స్నానంచేసి, రోమశుడితో, 'మునివరేణ్యా! నాకు నీ దయవలన సమస్తలోకాలు కనిపిస్తున్నాయి. వైఖానసులు చేస్తున్న వేదపారాయణం నాకు వినపడుతున్నది' అని చెప్పగా రోమశుడు ఆశ్చర్యపోయి' వైఖానసులు నివసించే చోటు ఇక్కడికి ముప్పైవేల ఆమడల దూరంలో ఉన్నది. వారు చేస్తున్న వేదపారాయణం నీకు వినపడటంచేత నీకు మానవమాత్రులకు లేనటువంటి దివ్యశక్తి ఉన్నది; నీవు దివ్య పురుషుడవు' అని చెపుతూ ప్రయాణం చేసి, ఎల్లప్పుడూ పండ్లతో ఉండే ఒక తోటను చూచి, 'ఇక్కడ పూర్వకాలాన స్వాయంభువమనువుకు చెందిన విశ్వకర్మ యజ్ఞం చేసి.

క. దక్షుఁ డయి యజ్ఞదక్షిణ । దక్షిణభూభాగ మెల్లఁ దా నిచ్చె నశే
ష క్షితిధర వనములతో । నక్షయమతిఁ గశ్యపునకు నార్త్విజ్యమునన్. 121

ప్రతిపదార్థం: తాన్= తాను (విశ్వకర్మ); దక్షుఁడు+అయి= సమర్థుడై; యజ్ఞదక్షిణ= యజ్ఞం చేయించినందుకు ఇచ్చే సంభావనగా, అక్షయమతిన్= తరుగని బుద్ధితో; అశేష, క్షితిధర, వనములతోన్= సమస్తమైన కొండలు, అరణ్యాలతోపాటు; దక్షిణ, భూ, భాగము+ఎల్లన్= దక్షిణ దిక్కున ఉండే భూమిభాగాన్ని అంతటినీ; కశ్యపునకున్= కశ్యప మహామునికి; ఆర్త్విజ్యమునన్= ఋత్విజునకు ఇచ్చే సంభావనగా; ఇచ్చెన్= సమర్పించాడు.

తాత్పర్యం: విశ్వకర్మ సమర్థుడై దక్షిణదిక్కున గల భూభాగమంతటినీ, కొండలు, అరణ్యాలతోపాటు కశ్యపమహర్షికి నిండుమనస్సుతో యజ్ఞం జరిపించి ఋత్విజుడికి ఇచ్చే సంభావనగా సమర్పించాడు.

విశేషం: యజ్ఞాన్ని చేయించే పురోహితులు ఋత్విజులు. యజ్ఞం జరిపించినందుకు వారి కిచ్చే ధనానికి యజ్ఞదక్షిణ అనిపేరు. యజ్ఞకర్త నుండి ధనం పుచ్చుకొని యజ్ఞం చేయించే ఋత్విజులు పదహారుమంది. 1. బ్రహ్మ 2. ఉద్గాత 3. హోత 4. అధ్వర్యుడు 5. బ్రాహ్మణాచ్ఛంసి 6. ప్రస్తోత 7. మైత్రావరుణుడు 8. ప్రతిప్రస్తోత 9. పోత 10. ప్రతిహర్త 11. అచ్ఛా వాకుఁడు 12. నేష్ట 13. ఆగ్నీధ్రుడు 14. సుబ్రహ్మణ్యుఁడు 15. గ్రావస్తుతుఁడు 16. ఉన్నేత.

వ. దాని కలిగి భూదేవి గశ్యపునకుం బట్టీక రసాతలంబునకుం బోయినఁ దత్ప్రసాదార్థియై కశ్యపుం డుగ్రతపంబు సేసినం బ్రసన్నయై భూదేవి నీరిలోనుండి వెలువడి వేదిరూపంబునం గశ్యపునకు నిజరూపంబు సూపె; నవ్వేది యిది సుమ్ము! దీని నెక్కినవారు వీర్యవంతు లగుదు; రీమంత్రంబున దీని నెక్కుండు; పెఱనాఁ డిది దా వీక సముద్రంబు సొచ్చు' నని, 'యగ్నిర్మిత్రో యోని' యనునివి యాదిగాఁ గల మంత్రంబు లుపదేశించిన.122

ప్రతిపదార్థం: దానికి+అలిగి= అందుకు కోపించి; భూదేవి= భూదేవత; కశ్యపునకున్= కశ్యపమునికి; పట్టు+ఈక= పట్టుబడక; రసాతలంబునకున్= పాతాళానికి; పోయినన్= వెళ్ళగా; తత్+ప్రసాద+అర్థి+ఐ= ఆమెయొక్క దయను అభిలషించినవాడై; కశ్యపుండు= కశ్యపమహర్షి; ఉగ్ర, తపంబు+చేసినన్= కఠోరమైన తపస్సు చేయగా; భూదేవి; ప్రసన్న+ఐ= సుముఖత కలది అయి; నీరిలోనుండి= నీటిలో నుండి; వెలువడి= బయటికి వచ్చి; వేది, రూపంబునన్= తిన్నె ఆకృతిలో; కశ్యపునకు= కశ్యపుడికి; నిజరూపంబు= తన ఆకారాన్ని; చూపెన్= కనిపింపచేసింది; ఆ+వేది= ఆ అరుగు; ఇది= ఇదే; సుమ్ము!= సుమా!; దీనిన్= దీనిని- ఈ వేదిని; ఎక్కినవారు= అధిరోహించినవారు; వీర్యవంతులు= పరాక్రమం కలవారు; అగుదురు= కాగలరు (అవుతారు); ఈ మంత్రంబున= ఈ మంత్రాన్ని ఉచ్చరిస్తూ; దీనిన్= ఈ వేదిని; ఎక్కుండు= అధిరోహించండి; పెఱ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నాఁడు= కానివేళ; ఇది= ఈ వేది; తావు+ఈక= చోటీయక; సముద్రంబు+చొచ్చు= సముద్రంలో ప్రవేశిస్తుంది; అని= అని చెప్పి; "అగ్నిర్మిత్రోయోనిః" = అగ్నిర్మిత్రోయోనిః; అనునివి= అనే ఈ పదాలు; ఆదిగాన్+కల= మొదటగల (ఆ పదాలతో మొదలయ్యే); మంత్రంబులు= మంత్రాలు; ఉపదేశించినన్= ఉపదేశించగా.

తాత్పర్యం: అందుకు భూదేవికి కోపంవచ్చింది. ఆమె కశ్యపుడికి పట్టుపడక పాతాళానికి వెళ్ళిపోయింది. కశ్యప మహర్షి భూదేవి అనుగ్రహాన్ని సంపాదించేందుకు కఠోరతపస్సు చేశాడు. అంత భూదేవి ప్రసన్నురాలై నీటిలోనుండి వెలువడి వేదిరూపంలో కశ్యపుడికి సాక్షాత్కరించింది. ఆ వేదియే ఇది. ఈ వేదిని అధిరోహించినవారు మిగుల పరాక్రమంతో తేజరిల్లుదురు. ఈ మంత్రాన్ని ఉచ్చరిస్తూ మాత్రమే ఈ వేదిని ఎక్కాలి. లేకపోతే ఇది సముద్రంలోకి పోగలదు. అని రోమశుడు చెప్పి 'అగ్నిర్మిత్రోయోనిః' అనే పదాలతో ప్రారంభమయ్యే మంత్రాలను ఉపదేశించాడు.

విశేషం: మంత్రము= నిర్ణీతాలైన అక్షర సమామ్నాయాన్ని పునరావృత్తిగ వల్లెవేసే విధానం. (బీజాక్షరసంపుటి).

క. అనుజులు దానును ముని శా । సనమున నవ్వేది యెక్కి సమధికవీర్యం
బున నొప్పె బ్రాహ్మణులదీ । వన లెసఁగఁగ ధర్మసుతుఁడు వాసవలీలన్. 123

ప్రతిపదార్థం: ధర్మసుతుఁడు= ధర్మపుత్రుడు; అనుజులు= తమ్ములు; తానును= తానున్నూ (ధర్మజుడున్నూ); ముని శాసనమునన్= ఋషి ఆజ్ఞ చొప్పున; ఆ+వేది= ఆ అరుగు; ఎక్కి= అధిరోహించి; సమధిక వీర్యంబునన్= మిగుల అతిశయించిన పరాక్రమ తేజస్సు చేత; బ్రాహ్మణుల= విప్రుల; దీవనలు+ఎసఁగఁగన్= ఆశీస్సులు విలసిల్లగా; వాసవలీలన్= ఇంద్రుడి వలె; ఒప్పెన్= శోభించాడు.

తాత్పర్యం: ఆముని నిర్దేశించిన ప్రకారం ధర్మరాజు తమ్ములతో సహా ఆ వేదిక మీదికి ఎక్కాడు. దానివలన అతడికి అమితమైన బలం ఏర్పడింది. బ్రాహ్మణుల ఆశీస్సులతో ధర్మజుడు ఇంద్రుడివలె ప్రకాశించాడు.

క. ధరణీసురవర మునిగణ । పరివృతులై యరిగి కనిరి పాండవులు వియ
చ్చర నిర్జర సేవిత సుం । దర కందర మగు మహేంద్రధరణీధరమున్. 124

ప్రతిపదార్థం: పాండవులు= పాండునందనులు; ధరణీసుర, వర, మునిగణ, పరివృతులు+ఐ= బ్రాహ్మణశ్రేష్ఠులచేత, మునిబృందంచేత చుట్టుకొనబడినవారై; అరిగి= ప్రయాణించి; వియత్+చర, నిర్జర, సేవిత, సుందర, కందరము+అగు= ఆకాశగమనంకలవారిచేత, దేవతలచేత సేవించబడి, అందమైన గుహలు కలిగిఉన్న; మహేంద్ర ధరణీ ధరమున్= మహేంద్రపర్వతాన్ని; కనిరి= చూచారు.

తాత్పర్యం: బ్రాహ్మణప్రవరులు మునులబృందం తమ చుట్టూ రాగా, పాండవులు ఆకాశగమనం కలవారైన దేవతల చేత సేవించబడుతూ అందమైన గుహా ప్రదేశాలు గలిగిన మహేంద్రపర్వతాన్ని చూచారు.

వ. అందుల మహాతపోధనులకు నమస్కార సత్కారంబుల మనఃప్రియంబు సేసి ధర్మరా జిట్లనియె. 125

ప్రతిపదార్థం: అందుల= అందున్న; మహాతపస్+ధనులకు= గొప్ప తపస్సు అనే సంపద కలవారికి; నమస్కార, సత్కారంబులన్= వందనాలతో, గౌరవమర్యాదలతో; మనస్+ప్రియంబు= మనస్సులకు సంతోషాన్ని; చేసి= కలిగించి; ధర్మరాజు= ధర్మజుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తపస్సే సంపదగా కలిగి అందున్న మహర్షులకు నమస్కరించి, సత్కారాలు చేసి వారి మనసులు రంజింపజేసి ధర్మరాజు ఈ విధంగా చెప్పాడు.

తే. 'పరమమునులార! యిగ్గిరిఁ బరశురాము । శుభచరిత్రుని మీ రెప్డు సూతు రట్టె!
యమ్మహాభాగు మీచూచు నవసరంబు । నందు మాకును జూడంగ నమరునొక్కొ?' 126

ప్రతిపదార్థం: పరమ మునులార!= గొప్పఋషులార!; ఈ+గిరిన్= ఈ కొండమీద; పరశురామున్= పరశువు ఆయుధంగా కల రాముడిని; శుభ చరిత్రుని= మంచిచరిత్ర కలవాడిని; మీరు+ఎప్డు= మీరు ఎల్లప్పుడూ; చూతురు+అట్టె= చూస్తూ ఉంటారట; ఆ+మహాభాగున్= ఆ మహనీయుడిని; మీ, చూచు+అవసరంబునందున్= మీరు దర్శించే సమయాన; మాకును+ చూడంగన్+అమరును+ఒక్కొ?= మాకు కూడ చూచేందుకు వీలు కలుగుతుందా?

తాత్పర్యం: 'గొప్పమునులార! ఈ కొండపై మీరు ఎల్లప్పుడు శుభచరిత్ర కల మహానుభావుడు పరశురాముడిని చూస్తూ ఉంటారటకదా! మేముకూడ ఆ మహానుభావుడిని మీరు చూచేటప్పుడు దర్శించటానికి వీలుకలుగుతుందా?'

వ. అనిన నమ్మునిసంఘంబులోన రామానుచరుండైన యకృతవ్రణుం డను ముని ధర్మరాజున కిట్లనియె. 127

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; ఆ+ముని, సంఘంబులోనన్= ఆ ఋషుల సమూహంలో; రామ+అనుచరుండు+ఐన= పరశురాముడిని అనుసరించే శిష్యుడైన; అకృతవ్రణుండు+అను, ముని= అకృతవ్రణుడు అనేఋషి; ధర్మరాజునకు= ధర్మపుత్రుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా ఆ ఋషులబృందంలో పరశురాముడి శిష్యుడైన అకృతవ్రణుడు అనే ఋషి ధర్మరాజుతో ఈ విధంగా బదులు పలికాడు.

తే. 'ధర్మతనయ! మీరాక ముందఱ యెఱుంగు । జామదగ్న్యుండు నిర్మలజ్ఞానదృష్టి
ననఘ! యెల్లి చతుర్దశి నమ్మహాత్ముఁ । జూతు రిమ్మును; లీవును జూడు మిచట.' 128

ప్రతిపదార్థం: ధర్మతనయ!= ఓ ధర్మరాజా!; జామదగ్న్యుండు= జమదగ్ని కుమారుడైన పరశురాముడు; నిర్మలజ్ఞానదృష్టిన్= స్వచ్ఛమైన జ్ఞానమనెడి చూపులతో; మీరాక= మీరు ఇక్కడికి రావటం; ముందఱ= ముందే; ఎఱుంగున్= ఎరిగిఉన్నాడు; అనఘ!= పాపరహితుడైన ధర్మరాజా!; ఎల్లి= రేపు; చతుర్దశిన్= చతుర్దశి తిథిని; ఆ+మహాత్మున్= ఆ గొప్ప ఆత్మకలవాడిని-పరశురాముడిని; ఈ+మునులు= ఈ ఋషులు; చూతురు= చూస్తారు; ఇచటన్= ఇక్కడ; ఈవును= నీవున్నూ; చూడుము= సందర్శించవలసింది.

తాత్పర్యం: 'పాపరహితుడవైన ఓ ధర్మరాజా! రేపు చతుర్దశినాడు మహాత్ముడైన పరశురాముడిని ఈ ఋషులు దర్శించగలరు. నీవున్నూ వారితోపాటు పరశురాముడిని దర్శనం చేసికొనవచ్చును.'

వ. అనిన ధర్మతనయుండు మహేంద్రంబున నా రాత్రి వసియించి యకృతవ్రణు నిట్లని యడిగె. 129

ప్రతిపదార్థం: అనిన= అని చెప్పగా; ధర్మతనయుండు= ధర్మరాజు; మహేంద్రంబునన్= మహేంద్ర పర్వతమందు; ఆ రాత్రి; వసియించి= ఉండి; అకృతవ్రణున్= అకృతవ్రణుడిని, ఇట్లు+అని= ఈ విధంగా; అడిగెన్= ప్రశ్నించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని అకృతవ్రణుడు చెప్పగా ధర్మరాజు ఆ రాత్రి మహేంద్రపర్వతమందు వసించి అతడిని ఈ విధంగా ప్రశ్నించాడు.

క. 'భువన జన స్తుతుఁ డగు భా । ర్గవు చరితము వినఁగ నాకుఁ గడుఁ గౌతుకగౌ
రవ మైనది; దాని ముని । ప్రవర! యెఱింగింపు కర్ణపథరమ్యముగన్. 130

ప్రతిపదార్థం: భువనజనస్తుతుఁడు+అగు= అన్ని లోకాలలోని జనులందరిచేత పొగడబడినవాడైన; భార్గవుచరితము= భృగుమహర్షి వంశంలో జన్మించిన పరశురాముడి వృత్తాంతం; వినఁగ= వినటానికి; నాకున్= నాకు; కడున్= మిక్కిలి; కౌతుక, గౌరవము+ఐనది= కుతూహలంతో కూడిన పూజ్యభావం ఏర్పడింది; ముని, ప్రవర!= ఋషులలో శ్రేష్ఠుడివైన ఓ అకృతవ్రణా!; దాని= దానిని, (ఆ పరశురాముడి గాథను); కర్ణ, పథ, రమ్యముగన్= చెవుల మార్గానికి అందంగా- వీనులవిందుగా; ఎఱింగింపు= తెలియజేయవలసింది.

తాత్పర్యం: 'మునిశ్రేష్ఠుడివైన అకృతవ్రణ మహర్షీ! సమస్తలోకాల యందలి జనులచేత పొగడబడినటువంటి పరశురాముడి చరిత్ర వినటానికి నా మనస్సు కుతూహలంతో ఉవ్విళ్ళూరుతున్నది. ఆ భార్గవవంశీయుడైన మహనీయుడి వృత్తాంతం నాకు వీనులవిందుగా వినిపించ వేడికోలు.'

విశేషం: ధర్మరాజు తీర్థయాత్రలను పురస్కరించుకుని ఆయాస్థలాలకు సంబంధించిన గాథలను గురించి రోమశమహర్షిని, వివిధ మహర్షులను, గ్రుచ్చిగ్రుచ్చి ప్రశ్నిస్తున్నాడు. ఆయా ఋషులు ఆయాగాథలను వివరిస్తున్నారు. స్వయంసంపూర్ణాలైన ఈ పౌరాణిక గాథలకు ఐక్యసంధానం గావించింది ధర్మరాజు జిజ్ఞాస. ఈ విధంగా ఆరణ్యపర్వం భారతంలో బృహత్పర్వంగా రూపొందింది.

అకృతవ్రణుఁడు ధర్మరాజునకుఁ బరశురాముని మహిమ సెప్పుట (సం. 3-115-9)

వ. అని యడిగిన ధర్మరాజునకు నకృతవ్రణుం డిట్లని చెప్పెఁ దొల్లి కన్యాకుబ్జంబున గాధియను రాజు కూఁతు సత్యవతి యనుదాని భృగుపుత్త్రుండగు ఋచీకుండను మహాముని వివాహార్థియై గాధి నడిగిన నమ్మునివరునకు వాఁ డిట్లనియె. 131

ప్రతిపదార్థం: అని= అంటూ; అడిగినన్= ప్రశ్నించగా; ధర్మరాజునకున్= ధర్మపుత్రుడికి; అకృతవ్రణుండు= అకృతవ్రణుడు; ఇట్లు+అని= ఈ విధంగా; చెప్పెన్= చెప్పాడు; తొల్లి= పూర్వకాలంలో; కన్యాకుబ్జంబునన్= కన్యాకుబ్జం అనే పేరుకల పట్టణంలో; గాధి+అను, రాజు, కూఁతు= గాధి అనేపేరు గల ప్రభువుయొక్క పుత్రిక; సత్యవతి, అను, దానిన్= సత్యవతి అనే పేరుకల అమ్మాయిని; భృగుపుత్త్రుండు+అగు= భృగుపుత్త్రుండు+అగు= భృగు మహర్షి కొడుకైన; ఋచీకుండు+అను, మహాముని= ఋచికుడు అనే మహర్షి; వివాహ+అర్థి+ఐ= పెళ్ళాడేందుకు; గాధిని= గాధిరాజును; అడిగినన్= అర్థించగా; ఆ+మునివరునకున్= ఆ ఋషిశ్రేష్ఠుడికి; వాఁడు= అతడు-ఆ గాధిరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని ప్రశ్నించగా ధర్మరాజుకు అకృతవ్రణుడు ఇట్లా చెప్పాడు: పూర్వకాలంలో కన్యాకుబ్జం అనే పట్టణంలో గాధి అనే రాజుకు కూతురైన సత్యవతి అనే కన్యకను భృగుమహర్షి కుమారుడైన ఋచీకమహాముని పెళ్ళాడకోరి గాధిని అర్థించాడు. ఆ మహారాజు గాధి, ఆ మహర్షి ఋచీకుడికి ఇట్లా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'ఒక్క కర్ణంబు నీలోత్పలశ్యామమై । తను వెల్ల శశిహంసధవళ మైన
యిట్టి గుఱ్ఱములు వే యిక్కన్య కుంకు వి । ట్లీ నోపుదేని మునీంద్ర! దీని
నమరంగఁ బెండిలి యగు; మిది మాకుల । ధర్మంబు' నావుడుఁ దరుణిఁ బెండ్లి
యగువేడ్క భార్గవుఁ డప్పుడ వరుణేంద్రు । పాలికిఁ జని వానిఁ బడసి తెచ్చె;

ఆ. నవనినాథ! గంగయందుఁ గన్యాకుబ్జ । పురవరంబునందుఁ బుట్టె నట్టి
హయసహస్ర మమలమై; నాఁటఁగోలెను । నశ్వతీర్థ మనఁగ నయ్యె నదియు. 132

ప్రతిపదార్థం: ఒక్కకర్ణంబు= ఒకచెవి; నీల+ఉత్పలశ్యామము+ఐ= నల్లకలువవలె నల్లగా; తనువు+ఎల్ల= శరీరమంతా; శశి, హంస, ధవళము+ఐన= చంద్రుడివలె హంసవలె తెల్లనైన; ఇట్టి, గుఱ్ఱములు= ఇటువంటి అశ్వాలు; వేయి= వేయి; ఈ+కన్యకు= ఈ ఆడపడుచుకు; ఉంకువ= శుల్కం; ఇట్లు= ఈ విధంగా; ఈన్+ఓపుదు+ఏని= ఇవ్వగలిగిన వాడవయితే; ముని+ఇంద్ర!= మునీంద్ర!= మునులలో శ్రేష్ఠుడా!; దీనిన్= దీనిని ఈ కన్యకను; అమరంగన్= ఒప్పిదంగా; పెండిలి+అగుము= వివాహం చేసికొనుము; ఇది= ఈ ఏర్పాటు; మా కులధర్మంబు= మా వంశంలోని ఆచారం; నావుడున్= అని చెప్పగా; తరుణిన్= జవ్వనిఅయిన ఆ కన్యకను; పెండ్లి+అగు= వివాహమాడే; వేడ్కన్= కుతూహలంతో; భార్గవుఁడు= భృగుమహర్షి పుత్రుడు; అప్పుడు+అ= ఆ సమయంలోనే; వరుణ+ఇంద్రుపాలికిన్= వరుణ ప్రభువు దగ్గరకు; చని= వెళ్ళి, వానిన్= ఆ గుర్రాలను; పడసి= సంపాదించి; తెచ్చెన్= తీసికొనివచ్చాడు; అవనినాథ!= భూ భర్తయైన ఓ మహారాజా, ధర్మరాజా!; కన్యాకుబ్జపురవరంబు నందున్= కన్యాకుబ్జం అనే నగరరాజంలోని; గంగయందున్= గంగానదిలో నుండి; అమలము+ఐ= స్వచ్ఛమై; అట్టి= అటువంటి; హయసహస్రము= వేయిగుర్రాలు; పుట్టెన్= జన్మించాయి; నాఁటన్+కోలెను= ఆ దినం నుండి; అదియు= ఆ కన్యాకుబ్జంలోని గంగానది; అశ్వతీర్థము+అనఁగన్= అశ్వతీర్థం అనే పేరుతో; అయ్యెన్= విలసిల్లింది.

తాత్పర్యం: 'ఓ మహర్షీ! ఒక చెవి నల్లకలువవలె నల్లగా, మిగిలిన దేహమంతా చంద్రునివలె, హంసవలె తెల్లగా ఉండాలి, ఇటువంటి వెయ్యి గుర్రాలను కన్యాశుల్కంగా నీవు తెచ్చిఇచ్చినట్లైతే నీవు నా కూతురు సత్యవతిని వివాహం చేసికొనగలవు. ఇది మావంశ సంప్రదాయం' అని గాధిప్రభువు చెప్పాడు. అంత భృగుమహర్షి యొక్క పుత్రుడైన ఆ ఋచీకుడు వరుణప్రభువు దగ్గరకు పోయి అటువంటి గుర్రాలను సంపాదించి తెచ్చాడు. ఓ ధర్మరాజా! ఆవిధంగా అటువంటి వేయిగుర్రాలు కన్యాకుబ్జనగర మందలి గంగానది నుండి అవతరించాయి. అందువలన ఆనాటినుండి కన్యాకుబ్జంలోని గంగానదికి అశ్వతీర్థం అనే పేరు ఏర్పడింది.

విశేషం: ఋచీకుడు కోరిన వేయి గుఱ్ఱాలను వరుణుడు కన్యాకుబ్జ సమీపంలోని గంగానది నుండి అందజేసినాడు. అందువలన అచ్చటి గంగానదికి అశ్వతీర్థమనే పేరు ఏర్పడింది. వరుణుడు ఇచ్చిన ఆ తెల్లని గుర్రాలకు ఒక చెవి మాత్రం నల్లగా ఉంటుంది. ఆ నలుపు నల్లకలువ వంటి నలుపు. అది కూడ చెవిపైభాగంలో మాత్రమే; చెవిలోపలి భాగం మాత్రం ఎఱ్ఱగా ఉంటుంది.

వ. ఋచీకుండును గాధికి నిచ్ఛాసమంబులైన హయంబుల నిచ్చి వానికూఁతు సత్యవతిం బాణిగ్రహణవిధిం బరిగ్రహించి సుఖంబున్నఁ, గన్యాకుబ్జంబునకు భృగుండు వచ్చి వారలచేతం బూజితుండై కొడుకునుం గోడలినిం జూచి సంతసిల్లి యొక్కనాఁడు కోడలి కిట్లనియె. 133

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఋచీకుండును= ఋచీకుడున్నూ; గాధికిన్= గాధిప్రభువుకు; ఇచ్ఛాసమంబులు+ఐన= కోరినకోరికకు అనురూపాలైన; హయంబులన్+ఇచ్చి= గుర్రాలను ఇచ్చి; వాని, కూఁతు= వానియొక్క పుత్రిక; సత్యవతిన్= సత్యవతిని; పాణిగ్రహణ విధిన్= శాస్త్రీయమైన వైవాహికపద్ధతిలో; పరిగ్రహించి= స్వీకరించి (పెళ్ళాడి); సుఖంబు+ఉన్నన్= సుఖంగా నివసిస్తుండగా; భృగుండు= భృగుమహర్షి; కన్యాకుబ్జంబునకు; వచ్చి= వచ్చి; వారల చేతన్= వారిచేత అనగా ఋచీకుడిచేత, సత్యవతిచేత; పూజితుండు+ఐ= అర్చించబడినవాడై; కొడుకునున్ కోడలినిన్, చూచి; సంతసిల్లి= సంతోషించి; ఒక్కనాఁడు= ఒకానొకరోజు; కోడలికిన్= కోడలితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఋచీకుడు, గాధిమహారాజు కోరిన కన్యాశుల్కాన్ని సమర్పించి అతడి పుత్రిక సత్యవతిని శాస్త్రోక్త విధానంగా పెళ్ళాడి సుఖంగా కాలం గడుపుతున్నాడు. అంత కన్యాకుబ్జానికి భృగుమహర్షి విచ్చేసి, వారిచేత పూజించబడినవాడై, కొడుకును కోడలిని చూచి సంతోషించి ఒకరోజు కోడలికి ఇట్లా చెప్పాడు.

క. 'లలితాంగి! యేను నీ గుణ। ముల కతిహృష్టుండ నైతి ముద మొనరఁగ ని
మ్ముల నిచ్చెద వేడుము నీ। వలచు వరం' బనిన సత్యవతి యి ట్లనియెన్. 134

ప్రతిపదార్థం: లలిత+అంగి!= సుకుమారమైన దేహం కలదానా!; ఏను= నేను; నీ గుణమ్ములకు= నీ మంచి లక్షణాలకు; అతి, హృష్టుండును+ఐతి= మిక్కిలి సంతోషం పొందినవాడిని అయినాను; ముదము+ఒనరఁగన్= సంతోషం కలిగేటట్లుగా; నీ, వలచు, వరంబు= నీకు ఇష్టమైన వరాన్ని; వేడుము= కోరుకొనుము; ఇమ్ములన్= సంప్రీతితో; ఇచ్చెద= అనుగ్రహిస్తాను; అనిన= అని పలుకగా; సత్యవతి= సత్యవతి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: 'సుకుమారివైన ఓ సత్యవతీ! నీలోని మంచిగుణాలకు నేను మిక్కిలి సంతృప్తి చెందాను. సంతోషం కలిగేట్టు సంప్రీతితో నీవు కోరిన వరాన్ని అనుగ్రహిస్తాను. నీకు ఇష్టమైన వరాన్ని కోరుకొనుము' అని భృగుమహర్షి చెప్పగా, కోడలు సత్యవతి ఇట్లా బదులు పలికింది.

వ. 'దేవా! నీప్రసాదంబున నాకొక్క కొడుకును, మజ్జనని కొక్క కొడుకు నుదయింపవలయు' నని మ్రొక్కినం గరుణించి భృగుండు 'నీకోరిన యట్లయగు; శుచిస్నాతలయి నీవు మేడిమ్రానిం గౌఁగిలింపుము; నీజనని నశ్వత్థంబుఁగౌఁగిలింపు మను' మనిన నయ్యిద్దఱుఁ దదాలింగన విపర్యాసంబు సేసిన నెఱింగి భృగుండు గోడలి కిట్లనియె. 135

ప్రతిపదార్థం: దేవా!= మహానుభావా!; నీ ప్రసాదంబునన్= నీ దయవలన; నాకు+ఒక్క, కొడుకును= నాకు ఒక పుత్రుడును; మత్+జననికి= నాతల్లికి; ఒక్క కొడుకును; ఉదయింప= వలయును+అనిన= పుట్టవలెను అని; మ్రొక్కినన్= నమస్కరించగా; కరుణించి= దయతలచి; భృగుండు= భృగుమహర్షి; నీ, కోరిన+అట్లు+అ+అగు= నీవు కోరిన విధంగానే జరుగుగాక; శుచిస్నాతలు+అయి= పరిశుభ్రంగా స్నానాలు చేసినవారై; నీవు=నీవు; మేడి, మ్రానిన్= మేడిచెట్టును; కౌఁగిలింపుము= ఆలింగనం చేసికొనవలసింది; నీ, జననిన్= నీతల్లిని; అశ్వత్థంబున్= రావిచెట్టును; కౌఁగిలింపుము+అనుము= ఆలింగనం చేయుమని చెప్పుము; అనినన్= అని చెప్పగా; ఆ+ఇద్దఱున్= ఆ ఇరువురున్నూ; తద్+ఆలింగన, విపర్యాసంబు, చేసినన్= కౌగిలించుకొనటంలో తారుమారు చేయగా; ఎఱింగి= తెలిసికొని; భృగుండు= భృగుమహర్షి; కోడలికి= కోడలితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'దేవా! నీ అనుగ్రహంవలన నాకు ఒక కొడుకు, నా తల్లికి ఒక కొడుకు కలుగుగాక' అని సత్యవతి భృగుడిని ప్రార్థించి నమస్కరించగా, ఆయన కరుణించి 'నీవు కోరినట్లే జరుగునుగాక! మీరు పరిశుభ్రంగా స్నానంచేసి, నీవు మేడిచెట్టును కౌగిలించుకో; నీ తల్లి అశ్వత్థాన్ని ఆలింగనం చేసికొనుగాక' అని ఆనతిచ్చాడు. కాని, సత్యవతి అశ్వత్థవృక్షాన్ని, ఆమెతల్లి మేడిచెట్టును కౌగిలించుకొన్నారు. ఆ విషయాన్ని భృగుడు తెలిసికొని కోడలితో ఇట్లా పలికాడు.

విశేషం: 'శుచిస్నాతలు' - అనగా 'ఋతుస్నాతలు' అని అర్థం. ఋతుమతులు నాల్గవదినము శుద్ధికొరకు చేసే స్నానం ఋతుస్నానం. అదే శుచిస్నానం. శుచిస్నానం చేసినవారు శుచిస్నాతలు. చూడు: సంస్కృత భారతం, భండార్కరు ప్రచురణ, III - 115 - 23 శ్లో.

ఉ. 'పుత్త్రుఁడు నీకు బ్రహ్మకులపూజ్యుఁడు పుట్టియు వాఁడు దారుణ
క్షత్త్రచరిత్త్రుఁడై పరఁగు గర్వమునన్; మఱి నీ సవిత్రికిన్
క్షత్త్రియుఁ డుద్భవిల్లియు నఘక్షయకారణుఁడున్ మహాతపః
పాత్త్రుఁడు నై ధృతిం బడయు బ్రాహ్మణభావము భూరితేజమున్.' 136

ప్రతిపదార్థం: నీకు= నీకు; బ్రహ్మకులపూజ్యుఁడు= బ్రాహ్మణ సంఘాలచేత పూజించబడేవాడు; పుత్త్రుఁడు= కొడుకు; పుట్టియు= ఉద్భవించికూడ; వాఁడు= ఆకొడుకు; దారుణక్షత్త్రచరిత్త్రుఁడు+ఐ= మహాభయంకరమైన క్షత్రియ ప్రవర్తన కలవాడై; గర్వమునన్= మదంతో; పరఁగు= ఒప్పుతాడు; మఱి= ఇక; నీ సవిత్రికిన్= నీ తల్లికి; క్షత్త్రియుఁడు= క్షాత్రం కలవాడు; ఉద్భవిల్లియున్= పుట్టియు; అఘక్షయకారణుఁడున్= పాపాలు నశించేందుకు హేతువైనవాడున్నూ; మహా తపస్+పాత్త్రుఁడును+ఐ= గొప్పతపస్సుకు అర్హత కలిగిన వాడున్నూ అయి; బ్రాహ్మణ, భావము= బ్రహ్మజ్ఞానాన్ని; భూరి, తేజమున్= గొప్ప తేజస్సును; ధృతిన్= నిష్ఠతో; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: 'బ్రాహ్మణులందరికీ పూజ్యుడైన కొడుకు నీకు పుడతాడు; కాని, అతడు దారుణమైన క్షత్రియ ప్రవృత్తి కలవాడై గర్వంతో ప్రవర్తిస్తాడు. మరి నీతల్లికి క్షత్రియుడుగా పుట్టినప్పటికీ ఆ పుత్రుడు గొప్ప తపస్వి అయి, పాపనివారకుడై బ్రాహ్మణభావం, విజ్ఞానం, గొప్పతేజస్సులను నిష్ఠతో పొందగలడు'.

వ. అనిన సత్యవతి గృతాంజలియై క్షత్రియభావంబు తన పుత్త్రునకుంగాక పౌత్త్రున కగునట్లుగా శ్వశురువలన వరంబు వడసి కతిపయకాలంబునకు గర్భిణియై. 137

ప్రతిపదార్థం: అనిన= అని చెప్పగా; సత్యవతి= సత్యవతి; కృత+అంజలి+ఐ= భక్తితో దోసలి ఘటించినదై, నమస్కరించినదై; క్షత్రియభావంబు= క్షత్రియులకు అనువైన భావం; తనపుత్త్రునకున్+కాక= తనకొడుకుకు గాక; పౌత్త్రునకు+అగునట్లుగా= మనుమడికి కలిగేటట్లుగా; శ్వశురు వలన= మామవలన; వరంబు+పడసి= వరాన్ని పొంది; కతిపయకాలంబునకున్= కొంతకాలానికి; గర్భిణి+ఐ= గర్భవతి అయి.

తాత్పర్యం: అని భృగుడు చెప్పగా, సత్యవతి ఆ మహర్షికి నమస్కరించి క్షత్రియభావం తన కొడుకుకు కాక, మనుమడికి కలిగేటట్లు మామగారివలన వరాన్ని పొంది, కొంతకాలానికి గర్భవతి అయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **ఆదిమునిచరితుఁ బడసెఁ బ్ర। సాదసమన్వితు సుపుత్త్రు జమదగ్నిఁ జతు**
ర్వేదంబులయందు ధను। ర్వేదమునందును నతిప్రవీణు మహాత్మున్. 138

ప్రతిపదార్థం: (ఆ సత్యవతి) ఆదిమునిచరితున్= తొల్లిటి ఋషుల శీలం కలవాడిని; ప్రసాద సమన్వితు= నిర్మలత్వం కలవాడిని; సుపుత్త్రున్= మంచి కొడుకును; చతుర్+వేదంబుల+అందు= నాలుగు వేదాలలో; ధనుర్+వేదమునందును= విలువిద్యలోను; అతిప్రవీణున్= మిక్కిలి నైపుణ్యం కలవాడిని; మహాత్మున్= మహానుభావుడిని; జమదగ్నిన్= జమదగ్ని అనే పేరు కలవాడిని; పడసెన్= పొందింది.

తాత్పర్యం: ఆ సత్యవతి ప్రసన్నగుణం కలవాడున్నూ, నాలుగు వేదాలలోనూ, విలువిద్యలోనూ మిక్కిలి నేర్పు కలవాడున్నూ, తొల్లిటి ఋషులను పోలిన మహాత్ముడున్నూ అయిన సుపుత్రుడిని జమదగ్ని అనేవాడిని కన్నది.

వ. **ఆ జమదగ్ని ప్రసేనజితుండను రాజుకూఁతు రేణుక యనుదాని వివాహంబయి దానియందు రుమణ్వత్సుషేణ వసు విశ్వావసు రాములను వారినైదుగురు కొడుకులం బడసి, వనంబున నుగ్రతపంబు సేయుచు, నొక్కనాఁడు వన్యఫలంబులు దేరం గొడుకులు వోయిన రేణుక వారి పిఱుందన పోయి యొక్క సరోవరంబునందు సభార్యుండయి జలక్రీడలాడు చున్నవాని మార్తికావత పతియగు చిత్ర రథుండను రాజుం జూచి కామమోహితయై వ్యభిచరించిన, దాని దుశ్చరితం బెఱింగి జమదగ్ని కోపోన్మాదపరవశుండై. 139**

ప్రతిపదార్థం: ఆ జమదగ్ని; ప్రసేనజితుండు+అను; రాజు; కూఁతు; రేణుక+అను దానిన్= రేణుక అనే దానిని (వధువును); వివాహంబు+అయి= పెండ్లాడి; దాని+అందు= ఆమెవలన; రుమణ్వత్; సుషేణ, వసు, విశ్వాసను, రాములు+అను వారిన్= రుమణ్వంతుడు, సుషేణుడు, వసుడు, విశ్వావసుడు, రాముడు అనేవారిని; ఐదుగురుకొడుకులన్+పడసి= ఐదుగురు పుత్రులను పొంది; వనంబునన్= అరణ్యంలో; ఉగ్ర తపంబు+చేయుచున్= కఠోరమైన తపస్సు చేస్తూ; ఒక్కనాఁడు= ఒక్కరోజు; వన్యఫలంబులు= వన్యఫలాలను; తేరన్= తెచ్చేందుకై; కొడుకులు+పోయిన= కొడుకులు వెళ్ళగా; రేణుక= రేణుక; వారి పిఱుందనపోయి= వారి వెనువెంటనే వెళ్ళి; ఒక్క సరోవరంబునందు= ఒక సరస్సులో; సభార్యుండు+అయి= భార్యలతో కూడినవాడై; జలక్రీడలు+ఆడుచున్నవాని= నీటిలో ఆటలు ఆడుతున్నవాడిని; మార్తికావతిపతి+అగు= మార్తికావతం అనే దేశానికి రాజయిన; చిత్రరథుండు= చిత్రరథుడు; అను, రాజున్+చూచి= అనే ప్రభువును చూచి; కామ, మోహిత+ఐ= వలపుచేత తబ్బిబ్బై; వ్యభిచరించినన్= మనస్సు చలించగా; దాని, దుస్+చరితంబు= ఆమె చెడునడవడిని; ఎఱింగి= తెలిసికొని; జమదగ్ని= జమదగ్ని; కోప+ఉన్మాద పరవశుండు+ఐ= ఆగ్రహంచేత ఏర్పడిన వెర్రిచేత వశం తప్పినవాడై.

తాత్పర్యం: జమదగ్నిమహాముని ప్రసేనజితుడు అనేరాజుకూతురు రేణుకను వివాహమాడి, ఆమెయందు రుమణ్వంతుడు, సుషేణుడు, వసుడు, విశ్వావసుడు, రాముడు అనే అయిదుగురు కొడుకులను పొందాడు, జమదగ్ని ఒకరోజు అరణ్యంలో తీవ్రమైన తపస్సులో నిమగ్నుడై ఉన్నాడు. పుత్రులు అడవిలో దొరికే పండ్లు తెచ్చేందుకై వెళ్ళారు. వారివెంట రేణుక కూడా అడవికి వెళ్ళి, అక్కడ ఒక సరోవరంలో భార్యలతో కలసి జలక్రీడలాడుతున్న మార్తికావత దేశాధీశుడైన చిత్రరథు డనేరాజును చూచింది. ఆమె మనస్సు చలించింది. మానసికమైన ఆమె చెడు నడవడిని తెలిసికొని భర్త అయిన జమదగ్ని ఆగ్రహావేశపరవశుడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: క్రీడంతం సలిలే దృష్ట్వా సభార్యం పద్మమాలినమ్ ।
బుద్ధిమంతం తతస్తస్య స్పృహయామాస రేణుకా ॥ 7॥
వ్యభిచారాత్తు సా తస్మాత్ క్లిన్నాంభసి విచేతనా ।
ప్రవివేశాశ్రమం త్రస్తా తాం వై భర్తాన్వబుధ్యత ॥ 8 ॥ - III - 116 అధ్యా.

సంస్కృత భారతంలో రేణుక చిత్రరథుడిని చూచి మానసిక చాంచల్యానికి (మానసిక వ్యభిచారానికి) లోనైనట్లు చెప్పబడింది,

క. తనయుల నలువురఁ గ్రమమునఁ । బనిచెన్ జమదగ్ని దనదు భార్య వధింపన్;
జననీఘాతము పాతక । మని వారలు పలుకకుండి రవ్యవసితులై. 140

ప్రతిపదార్థం: తనయుల= కొడుకులను; నలువురన్= నలుగురినీ; క్రమమునన్= వరుసగా; జమదగ్ని= జమదగ్ని మహర్షి; తనదు భార్య వధింపన్= తనభార్యను చంపుమని; పనిచెన్= నియోగించాడు; వారలు= ఆ నలుగురు కొడుకులు; జననీఘాతము= తల్లిని చంపటం; పాతకము+అని= పాపమని; అవ్యవసితులు+ఐ= స్థిర నిశ్చయానికి రాలేనివారై; పలుకక+ఉండిరి= మాట్లాడకుండా ఉన్నారు.

తాత్పర్యం: జమదగ్నిమహర్షి తన కొడుకులు నలుగురినీ తన భార్యను చంపేందుకు వరుసగా నియోగించాడు. కాని, వారు తల్లిని చంపటం పాపమని అట్టి ప్రయత్నానికి పూనుకొనక మారుపలుకలేదు.

క. కడు నలిగి యమ్మునీంద్రుఁడు । గొడుకులకును శాప మిచ్చె 'ఘోరాటవిలో
జడమతి మృగపక్షుల య । ట్లుడుగక యజ్ఞానవృత్తి నుండుం' డనుచున్. 141

ప్రతిపదార్థం: కడున్= మిక్కిలి; అలిగి= కోపించి; ఆ+ముని+ఇంద్రుఁడు= ఆ ఋషివరేణ్యుడు; ఘోర+అటవిలో= భయంకరమైన అడవిలో; జడమతిన్= మందబుద్ధితో; మృగపక్షుల+అట్లు= జంతువులవలె, పక్షులవలె; అజ్ఞాన వృత్తిన్= జ్ఞానరహితమైన స్థితిలో; ఉడుగక= మానక, ఉండుండు+అనుచున్= ఉండండి అంటూ; కొడుకులకును= కొడుకులకు; శాపము+ఇచ్చెన్= శపించాడు.

తాత్పర్యం: ఆ ఋషివరేణ్యుడైన జమదగ్ని కోపించి 'భయంకరమైన అడవిలో బుద్ధిలేకుండ, జ్ఞానశూన్యులై జంతువులవలె, పక్షులవలె ఉండండి'- అని కొడుకులను శపించాడు.

వ. మఱియు నిశిత పరశుహస్తు రాముం జూచి 'దీని వధియింపు' మని జమదగ్ని పంచిన, వాఁడు గురువచనంబునం దల్లిం దత్క్షణంబ వధియించిన. 142

ప్రతిపదార్థం: మఱియు= అంతేకాక; నిశిత, పరశు, హస్తు= వాడియైన గండ్రగొడ్డలి హస్తంలో గలవాడిని; రామున్+చూచి= రాముడిని చూచి; దీని= ఈ రేణుకను; వధియింపుము+అని= సంహరించుము; అని= అంటూ; జమదగ్ని= జమదగ్ని; పంచిన= ఆజ్ఞాపించగా; వాఁడు= ఆ పరశురాముడు; గురు వచనంబునన్= తండ్రియొక్క మాట ప్రకారం; తల్లిన్= అమ్మను; తద్+క్షణంబు+అ= ఆ క్షణంలోనే; వధియించినన్= చంపగా.

తాత్పర్యం: మరియున్నూ, వాడి అయిన గండ్రగొడ్డలి చేతిలో గల రాముడిని చూచి 'ఈ రేణుకను సంహరించు' మని జమదగ్నిమహర్షి ఆదేశించాడు. పరశురాముడు తత్క్షణమే తండ్రిమాటప్రకారం తల్లిని సంహరించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. శమితనిజక్రోధుండై । జమదగ్ని తనూజు సాహసమునకుఁ దనవా
క్యము లంఘింపమికిఁ బ్రస । న్నమనస్కుండై తనూజునకు నిట్లనియెన్. 143

ప్రతిపదార్థం: శమిత, నిజ, క్రోధుండు+ఐ= శమించిన తన కోపం కలవాడై అనగా కోపం తగ్గినవాడై; జమదగ్ని= జమదగ్ని మహర్షి; తనూజు, సాహసమునకున్= కుమారుడి తెగువకు; తన, వాక్యము, లంఘింపమికిన్= తనమాట దాటకుండా ఉన్నందుకు; ప్రసన్న, మనస్కుండు+ఐ= ప్రీతిచెందిన మనస్సు కలవాడై; తనూజునకు= పుత్రుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: కోపం తగ్గినవాడై జమదగ్ని తన కొడుకైన పరశురాముడు చూపిన తెగువకు, తనమాట దాటకపోవటానికి మిక్కిలి సంతోషించిన మనస్సు కలవాడై తన కుమారుడితో ఇట్లా పలికాడు.

వ. 'నా వచనంబున నతిదుష్కరంబైన కార్యంబు సేసితి; నీ కిష్టంబైన వానినెల్లను వేఁడు మిచ్చెద' ననిన రాముండు సంతుష్టహృదయుండై 'మదీయజనని జీవించియుండను, దద్వధదోషనిష్కృతియు, సహోదరులు శాపవిముక్తులయి యెప్పటియట్ల యుండను, సమరంబుల నా కప్రతిహతశక్తియు, దీర్ఘాయువుంగాఁ బ్రసాదింపుం' డని తండ్రివలనం దన యభిమతంబులు వడసి యుండునంతఁ గొండొక కాలంబున.144

ప్రతిపదార్థం: నా, వచనంబునన్= నా మాట చొప్పున; అతిదుష్కరంబు+ఐన= చేయటానికి మిక్కిలి కష్టమైన; కార్యంబు= పనిని; చేసితి= చేశావు; నీకు+ఇష్టంబు+ఐన, వానిన్+ఎల్లను= నీకు ఇష్టమైన వరాలను అన్నింటినీ; వేఁడుము= అర్థించుము; ఇచ్చెదను= ఇవ్వగలను (ఇస్తాను); అనిన= అని పలుకగా; రాముండు= పరశురాముడు; సంతుష్ట, హృదయుండు+ఐ= సంతోషించిన హృదయం కలవాడై; మదియ, జనని= నా తల్లి; జీవించి+ఉండను= జీవించి ఉండేటట్లు; తద్+వధదోషనిష్కృతియు= ఆమెను చంపటం వలన వచ్చిన పాపం పోయేటట్లు; సహోదరులు= తోడపుట్టినవారు; శాప, విముక్తులు+అయి= శాపంనుండి నిష్కృతి పొందినవారై; ఎప్పటి+అట్ల= యథాప్రకారం; ఉండను= ఉండేటట్లు; సమరంబులన్= యుద్ధాలలో; నాకు= నాకు; అప్రతిహతశక్తియు= ఎదురు లేనట్టి బలాన్ని; దీర్ఘ+ఆయువున్+కాన్= చిరకాలం బ్రతికేటటువంటి వాడయ్యేటట్లు; ప్రసాదింపుండు= అనుగ్రహించండి; అని= అంటూ; తండ్రివలనన్= తండ్రివలన; తన+అభిమతంబులు= తన కోరికలు; పడసి= పొంది; ఉండునంతన్= ఉన్నంత; కొండొక, కాలంబునన్= కొంతకాలానికి.

తాత్పర్యం: 'నామాటమేరకు నీవు మిక్కిలి కష్టతరమైన పనిని చేశావు. నీవు ఇష్టమైన వరాలను అన్నిటినీ కోరుకొనుము; ఇస్తాను' అని జమదగ్ని పరశురాముడితో అన్నాడు. అనగా పరశురాముడు సంతోషించిన హృదయం కలవాడై 'నా తల్లి తిరిగి బ్రతకాలి. ఆమెను సంహరించినపాపంనుండి నాకు విముక్తి కలగాలి. నా సహోదరులకు శాపవిమోచన మేర్పడివారు యథాపూర్వం ఉండాలి. యుద్ధాలలో నాకు ఎదురులేని బలం కలగాలి. నేను చిరకాలం జీవించేవాడిని కావాలి' అని అర్థించి తండ్రిఅయిన జమదగ్నిమహర్షివలన ఆ వరాల నన్నింటినీ పొందాడు. అంత కొంతకాలానికి.

చ. అమితబలుండు హైహయుఁ డహర్పతితేజుఁ డజేయబాహువి
క్రముఁడు సహస్రబాహుఁ డనఁగా విదితుం డగువాఁడు తద్వనాం
తమున మృగవ్యఖిన్నుఁ డయి తా జమదగ్ని మహామునీంద్రు నా
శ్రమమున కేఁగుదెంచె బహుసైన్యముతో నధికశ్రమార్తుఁడై. 145

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అమితబలుండు= అంతులేని బలం కలవాడు; హైహయుఁడు= హైహయు వంశానికి చెందినవాడు-కార్తవీర్యుడు; అహస్+పతి, తేజుఁడు= అహర్పతితేజుడు- సూర్యుడి వంటి తేజస్సు కలవాడు; అ, జేయ, బాహు, విక్రముఁడు= జయించటానికి వీలుకాని చేతుల పరాక్రమం కలవాడు; సహస్రబాహుఁడు+అనఁగా, విదితుండు+అగువాఁడు= సహస్రబాహుడు (వేయి చేతులు కలవాడు) అని ప్రశస్తి పొందినవాడు; తద్+వన+అంతమునన్= ఆ అరణ్యం లోపల; మృగవ్యఖిన్నుఁడు+అయి= వేటలో అలసిపోయి; తాన్= తాను; జమదగ్ని, మహాముని+ఇంద్రు= జమదగ్ని మహాముని శ్రేష్ఠుడి; ఆశ్రమమునకు= ఋషివాటికకు; బహు, సైన్యముతోన్= అధికసంఖ్య కల సేనతో; అధిక, శ్రమ+ఆర్తుఁడు+ఐ= ఎక్కువ అలసటచేత బడలిన శరీరం కలవాడై; ఏఁగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: అపారమైనబలం కలవాడు, హైహయవంశంలో పుట్టినకార్తవీర్యుడు అనేవాడు, సూర్యుడి వంటి వర్చస్సు కలవాడు, జయించరాని బాహుశౌర్యం కలవాడు, సహస్రబాహుడనే పేరుతో ప్రసిద్ధుడైనవాడు ఆ అరణ్యంలో వేటాడుతూ బడలినవాడై, జమదగ్ని మహర్షి ఆశ్రమానికి గొప్ప సైన్యంతో శ్రమచేత మిక్కిలి నొచ్చినవాడై ప్రవేశించాడు.

వ. అందు మునివరుచేతం బూజితుం డయ్యును వాఁడు దనరాజ్యమదంబున మెచ్చక యయ్యాశ్రమవాసుల కవమానంబు సేసి, యందలి వృక్షంబు లెల్ల విఱిచి, జమదగ్ని హోమధేనువును దరుణవత్సంబుతోఁ గట్టికొని పోయిన, నప్పు డవ్వనంబుననుండి సమిత్కుశఫలంబులు గొని వచ్చిన రామునకు జమదగ్ని యిట్లనియె. 146

ప్రతిపదార్థం: అందు= ఆ ఆశ్రమంలో; ముని, వరుచేతన్= మునులలో శ్రేష్ఠుడైన జమదగ్నిచేత; పూజితుండు+అయ్యును= సత్కరించబడిన వాడైననూ; వాఁడు= ఆ హైహయుడైన కార్తవీర్యుడు; తన, రాజ్య, మదంబున= తనకు గల ప్రభుత్వగర్వంచేత; మెచ్చక= లక్ష్యపెట్టక; ఆ+ఆశ్రమవాసులకు= ఆ ఆశ్రమంలో నివసించే వారికి; అవమానంబు+చేసి= అగౌరవం చేసి; అందలి= అక్కడి; వృక్షంబులు+ఎల్లన్= చెట్లను అన్నిటినీ; విఱిచి= ముక్కలుచేసి; జమదగ్ని, హోమ, ధేనువును= జమదగ్ని హోమంకొరకు ఉపకరించేటటువంటి ఆవును; తరుణ, వత్సంబుతోన్= లేగదూడతో; కట్టి, కొనిపోయినన్= కట్టి, తీసికొనిపోగా; అప్పుడు= అపుడు; ఆ+వనంబున నుండి= ఆ అడవినుండి; సమిత్+కుశ, ఫలంబులు= మోదుగు పుడకలు, దర్భలు, పండ్లు; కొనివచ్చిన= తీసికొని వచ్చినట్టి రామునకున్= పరశురాముడికి; జమదగ్ని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ ఆశ్రమంలో జమదగ్నిచేత పూజించబడినవాడైకూడా, కార్తవీర్యుడు రాజ్యమదంతో ఆ ఋషిని లక్ష్యపెట్టక, ఆశ్రమంలో నివసించే వారిని అవమానించాడు. ఆ ఆశ్రమంలోని చెట్లను విరిచివేశాడు. హోమధేనువును దాని లేగదూడతోసహా బంధించి తీసికొనిపోయాడు. అది జరిగిన కొద్దిసేపటికి రాముడు దర్భలు మొదలైన యజ్ఞపరికరాలను తీసికొని అడవినుండి తిరిగివచ్చాడు. అప్పుడు జమదగ్ని రాముడితో ఇట్లా అన్నాడు.

క. 'వినవయ్య! కార్తవీర్యుఁడు । మన ధేనువుఁ బట్టుకొని సమర్థుం డయి పె
ల్చన పోయె; నేమి సేయుద?' మనవుడు రాముండు విని మహాక్రోధమునన్. 147

ప్రతిపదార్థం: వినవయ్య!= ఆలకించవయ్యా!; కార్తవీర్య మహారాజు; మన, ధేనువున్= మన ఆవును; పట్టుకొని= లాగుకొని; సమర్థుండు+అయి= శక్తికలవాడై; పెల్చన= పటాటోపంతో; పోయెన్= వెళ్ళిపోయాడు; ఏమి+చేయుదము?= ఏమి (ప్రతీకారం) చేయగలం?; అనవుడు= అని చెప్పగా; రాముండు= పరశురాముడు; విని= విని; మహాక్రోధమునన్= మిక్కిలి కోపంతో.

తాత్పర్యం: 'వినవయ్యా! మన ఆవును కార్తవీర్యుడు బలవంతంగా సగర్వంగా పటాటోపంతో పట్టుకొని పోయాడు. వాడు సామర్థ్యం కలవాడు. మనం ఏం చేయగలం?' అని జమదగ్ని చెప్పగా విని పరశురాముడు కోపోద్రిక్తుడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. గురువచనబోధితుండై । సరభసగతి వాని పిఱుఁదఁ జని, తద్బలమున్
శరవృష్టి ముంచి చంపె న । పరిమిత లయకాలమేఘపటలమపోలెన్. 148

ప్రతిపదార్థం: గురు, వచన, బోధితుండు+ఐ= తండ్రియొక్క మాటలచేత ప్రేరేపించబడినవాడై; సరభసగతి= వేగం గల గమనంతో; వాని, పిఱుఁదన్+చని= అతడి (కార్తవీర్యుడి) వెనుకనే వెళ్లి; అపరిమిత, లయ, కాల, మేఘ, పటలము+అ+పోలెన్= పరిమితి లేని ప్రళయకాలంలోని మబ్బుల దొంతరవలె; తద్+బలమున్= అతడి సైన్యాన్ని; శర, వృష్టిన్, ముంచి= బాణాలవానచేత మునిగేటట్లు చేసి; చంపెన్= సంహరించాడు; మఱియును= ఇంకను,

తాత్పర్యం: తండ్రిమాటలచేత ప్రేరేపించబడినవాడై పరశురాముడు వేగంగా కార్తవీర్యుడిని వెంటాడి వెళ్ళి, ప్రళయకాలంలోని మేఘసమూహంవలె అతడి సైన్యాన్ని శరవృష్టిచేత ముంచి, చంపాడు.

విశేషం: అలం: శ్లేషానుప్రాణితమైన ఉపమ. శరము= బాణము, జలము. పరశురాముడు- ప్రళయమేఘం, శరములు కురవటం శ్లేష.

వ. మఱియును. 149

తాత్పర్యం: ఇంకనూ.

పరశురాముఁడు కార్తవీర్యునిఁ జంపుట (సం. 3-116-24)

చ. బలిమి నశేషలోకపరిభావిమహాద్భుతశౌర్యసంపదం
బొలుచు సహస్రబాహుకరముల్ గులిశాతినిశాతబాణధా
రల నతివీరుఁడై తునిమి రాముఁ డరాతులకున్ భయంబుగాఁ
గలహములోన వాని నతిగర్వితుఁ జంపెఁ బరాక్రమోన్నతిన్. 150

ప్రతిపదార్థం: బలిమిన్= బలంతో; అ, శేష, లోక, పరిభావి, మహా+అద్భుత, శౌర్య, సంపదన్+పొలుచు= సమస్తమైన జగత్తును జయించి అవమానించగల గొప్ప అచ్చెరువు కొలిపే పరాక్రమ సంపదచేత విలసిల్లే; సహస్ర, బాహు, కరముల్= వేయిభుజాలు చేతులు; కులిశ+అతి, నిశాత, బాణ, ధారలన్= వజ్రం వలె మిక్కిలి వాడిఅయిన అమ్ముల వరుసలచేత; అతి, వీరుఁడు+ఐ= వీరాధివీరుడై; రాముఁడు= పరశురాముడు; తునిమి= నరికి; అరాతులకున్= శత్రువులకు; భయంబు+కాన్= వెరపు కొలిపేటట్లుగా; కలహములోనన్= యుద్ధంలో; పరాక్రమ+ఉన్నతిన్= శౌర్యంయొక్క పెంపుచేత; వానిన్= అతడిని- ఆ కార్తవీర్యుడిని; అతి గర్వితున్= మిక్కిలి మదించిన వాడిని; చంపెన్= సంహరించాడు.

తాత్పర్యం: పరశురాముడు వీరాధివీరుడై వజ్రాయుధంవంటి మిక్కిలి వాడియైన అమ్ములవరుసలు ప్రయోగించి, బలంచేత సమస్తలోకాలను జయించి అవమానించగల అచ్చెరువు కొలిపే గొప్ప పరాక్రమ ప్రాభవంతో విలసిల్లే కార్తవీర్యుడి యొక్క వేయిభుజాలను, చేతులను నరికి, మిక్కిలి మదించిన కార్తవీర్యుడిని శౌర్యంయొక్క పెంపుచేత యుద్ధంలో సంహరించాడు.

వ. అంతం గార్తవీర్యుని పుత్త్రులు బద్ధవైరులై రామరహితం బయిన జమదగ్న్యాశ్రమంబునకు వచ్చి, యందు. 151

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; కార్తవీర్యుని పుత్త్రులు= కార్తవీర్యుడి కొడుకులు; బద్ధ, వైరులు+ఐ= గాఢంగా ఏర్పడిన శత్రుత్వం కలవారై; రామ, రహితంబు+అయిన= పరశురాముడు లేనట్టి; జమదగ్ని+ఆశ్రమంబునకు= జమదగ్నియొక్క ఋషివాటికకు; వచ్చి; అందున్= అక్కడ,

తాత్పర్యం: తరువాత కార్తవీర్యుడి కొడుకులు పగబట్టి పరశురాముడు లేనప్పుడు జమదగ్ని ఆశ్రమానికి వచ్చి, అక్కడ.

మ. **మునులం దిట్టుచుఁ బుష్పవృక్షతతు లున్మూలించుచుం గ్రూరులై**
యనవద్యున్ జమదగ్నిఁ బట్టి బలిమిన్ 'హా రామ! హా రామ!' యం
చును నాక్రోశము సేయుచుండఁగ మునుల్ శోకింప ధర్మాత్ము న
మ్మునిముఖ్యున్ వధియించి రాగ్రహమహామోహాంధులై హైహయుల్. **152**

ప్రతిపదార్థం: హైహయుల్= హైహయ వంశంలో జన్మించిన కార్తవీర్యుడి కొడుకులు; మునులన్+తిట్టుచున్= ఋషులను తిడుతూ; పుష్ప, వృక్ష, తతులు= పువ్వులతో కూడినచెట్లను; ఉన్మూలించుచున్= వేళ్ళతోపాటు పెకలిస్తూ; క్రూరులు+ఐ= కఠినాత్ములై; అనవద్యున్= గొప్పవాడిని (అనింద్యుడిని); జమదగ్నిన్= జమదగ్నిని; బలిమిన్= బలిమితో; పట్టి= బంధించి; హా రామ! హా రామ!= ఓ రామా! ఓ రామా!; అంచునున్= అంటూ; ఆక్రోశము+చేయుచుండఁగ= గట్టిగా విలపిస్తుండగా; మునుల్= ఋషులు; శోకింప= దుఃఖించగా; ధర్మ+ఆత్మున్= ధర్మమందు నిష్ఠకలవాడిని; ఆ+మునిముఖ్యున్= మునులలో గొప్పవాడిని, ఆగ్రహ, మహా, మోహ+అంధులు+ఐ= కోపంచేత ఏర్పడిన గొప్ప అజ్ఞానంతో కూడిన ఆవేశంచేత గ్రుడ్డివారై; వధియించిరి= చంపారు.

తాత్పర్యం: హైహయవంశంలో జన్మించిన కార్తవీర్యుడి పుత్రులు కఠినాత్ములై ఋషులను తిట్టారు. ఆశ్రమంలో పువ్వులతో కలకలలాడుతున్న చెట్లను కూకటివేళ్ళతోపాటు పెకలించి వేశారు. గొప్పవాడైన జమదగ్ని మహర్షిని బలవంతంగా పట్టుకొని బంధించారు. అతడు 'ఓ రామా! ఓ రామా!' అని బిగ్గరగా విలపిస్తుండగా, ఋషులు శోకిస్తుండగా ఆ ధర్మాత్ముడైన ఋషిశ్రేష్ఠుడిని, కోపంతో, అజ్ఞానంతో కూడిన ఆవేశంతో సంహరించారు.

చ. **వఱలఁగ రాముఁ డంత ననవద్యుఁడు వచ్చి బహుప్రలాపి యై**
యఱచుచునున్న తల్లిని గృతాంతవశస్థితుఁ డైన తండ్రి ను
క్కఱఁ గని తీవ్రశోకపరిఘాతహతుం డయి తత్ప్రకార మం
దెఱిఁగి ముహూర్తమేనియు సహింపఁగ నోపక కోపదీప్తుఁడై. **153**

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; న+అవద్యుఁడు= గొప్పవాడు; రాముఁడు= పరశురాముడు; వఱలఁగ= విలసిల్లేటట్లుగా; వచ్చి= అరుదెంచి; బహు, ప్రలాపి+ఐ= ఎక్కువగా ఏడుస్తూ; అఱచుచున్+ఉన్న= బిగ్గరగా బొబ్బలు పెడుతున్న; తల్లిని= జనయిత్రిని; కృతాంత, వశ, స్థితుఁడు+ఐన= యముడి అధీనంలోకి పోయిన- మరణించిన; తండ్రిన్= తండ్రిని; ఉక్కు+అఱన్+కని= స్థైర్యం చెదరిపోవగా చూచి; తీవ్ర, శోక, పరిఘాత, హతుండు+అయి= గాఢమైన దుఃఖం అన్న పెద్ద దెబ్బచేత కొట్టబడినవాడై; తత్+ప్రకారము= ఆ జరిగిన సంగతి; అందు= అక్కడ; ఎఱిఁగి= తెలిసికొని; ముహూర్తము+ఏనియున్= క్షణకాలమైనా; సహింపఁగన్+ఓపక= తాళలేక; కోపదీప్తుఁడు+ఐ= ఆగ్రహంచేత ప్రజ్వలించబడినవాడై.

తాత్పర్యం: అటుపిమ్మట గొప్పవాడైన పరశురాముడు ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. అక్కడ తల్లి బిగ్గరగా ఏడుస్తూ అరుస్తున్నది. మరణించిన తండ్రిశవం పడి ఉన్నది. దానినిచూచి, అక్కడ జరిగినదంతా తెలిసికొని, మిక్కిలి గాఢమైన దుఃఖం అనే దెబ్బచేత కొట్టబడినవాడై పరశురాముడు ఒక్కక్షణమైనా తాళలేక ఆగ్రహంతో ప్రజ్వలించినవాడై.

చ. 'అనఘుని వీతరాగుఁ గరుణాత్ముఁ బ్రశాంతుని దాంతు నిమ్మహా
మునివరుఁ జూచి చూచి యధముల్ వధియించిరి; దీనఁ జేసి దు
ర్జను లగుచున్న క్షత్త్రియులఁ జంపుదు' నంచుఁ బ్రతిజ్ఞ సేసె భూ
వినుతుఁడు జామదగ్న్యుఁ డతివీరుఁడు లోకభయంకరాకృతిన్. 154

ప్రతిపదార్థం: అధముల్= నీచులు; అనఘుని= పాపం లేనివాడిని, పరమపుణ్యాత్ముడైన వాడిని; వీత, రాగున్= రాగం వీడిన వాడిని; ప్రశాంతుని, దాంతున్= శాంతి, దాంతి కలవాడిని; కరుణా+ఆత్మున్= దయతో నిండిన ఆత్మకలవాడిని; ఈ+మహామునివరున్= ఈ గొప్ప ఋషులలో గొప్పవాడిని-జమదగ్నిని; చూచిచూచి= అరసి అరసి (అంటే అనాలోచితంగా కాక, ఆలోచించి బుద్ధిపూర్వకంగా చేయాలి అని చేసిన నేరం అది అన్నమాట); వధియించిరి= సంహరించారు; దీనన్+చేసి= దీనిచేత; దుర్జనులు= చెడ్డవారు; అగుచున్న, క్షత్రియులన్= అవుతున్న క్షత్రియులను; చంపుదున్= సంహరిస్తాను; అంచున్= అంటూ; భూ వినుతుఁడు= భూమండల మంతటి చేత పొగడబడినవాడు; అతివీరుఁడు= గొప్ప శూరుడు (వీరులకంటె అధికుడైన వీరుడు); జామదగ్న్యుఁడు= జమదగ్నికుమారుడైన పరశురాముడు; లోక భయంకర+ఆకృతిన్= జగత్తుకు భయం కలిగించే ఆకారంతో; ప్రతిజ్ఞ+చేసెన్= శపథం చేశాడు.

తాత్పర్యం: 'నీచులైన హైహయులు పుణ్యాత్ముడున్నూ రాగరహితుడున్నూ, దయార్ద్ర హృదయుడున్నూ, ఇంద్రియాలను జయించిన మహాత్ముడున్నూ, ప్రశాంతుడున్నూ, దాంతుడున్నూ అయినటువంటి జమదగ్ని మహర్షిని బుద్ధిపూర్వకంగా చంపారు. ఇది తెలియక చేసిన నేరం కాదు. ఇటువంటి ఘోరకృత్యాలను చేయటానికి వెనుతీయని క్షత్రియజాతిని అంతటినీ సంహరించగల'నని లోకవినుతుడు, వీరాధివీరుడు, జమదగ్నికుమారుడైన పరశురాముడు జగత్తుకు భయంగొలిపే ఆకారం వహించి శపథం చేశాడు.

విశేషం: ప్రశాంతుడు, దాంతుడు అనగా ఇంద్రియాలను, అరిషడ్వర్గాలను, కామక్రోధాదులను జయించినవాడు.

వ. ఇట్లు కృతప్రతిజ్ఞుండై క్షత్త్రియులనెల్ల వధియించి, దిగ్దంతిదంతార్గళాఘూట మహీచక్రంబు సాధించి, విధివిహిత విధానాధ్వరుండై కశ్యపునకు నార్త్విజ్య దక్షిణగా నఖిలభూవలయంబు నిచ్చి, నిస్సంగుండై మహేంద్ర పర్వతంబునం దపోనిత్యుండై యున్నవాఁ డని పరశురాము చరితంబు సెప్పిన విని, ధర్మజుం డనుజబ్రాహ్మణసహితుండై మునిగణోపదేశంబునం జతుర్దశినాఁడు పరశురాముం జూచి, పరమభక్తిం బూజించి తత్ప్రతిపూజితుండై దక్షిణదిక్కునకుం జని. 155

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; కృత, ప్రతిజ్ఞుండు+ఐ= చేయబడిన శపథం కలవాడై; క్షత్రియులను+ఎల్లన్= క్షత్రియులనందరినీ; వధియించి= సంహరించి; దిక్+దంతి, దంత+అర్గళ+ఆఘూట, మహీచక్రంబు= దిక్కులందలి ఏనుగుల దంతాలనేటువంటి గడియమ్రానులు ఎల్లలుగా గల భూమండలాన్ని; సాధించి= జయించి; విధి, విహిత, విధాన+అధ్వరుండు+ఐ= శాస్త్రాలలోని సూత్రాలచేత నిర్దేశించబడిన పద్ధతిలో యజ్ఞాన్ని నిర్వహించినవాడై; కశ్యపునకున్= కశ్యప మహర్షికి; ఆర్త్విజ్య దక్షిణగాన్=

ఋత్విజుడికి ఇచ్చే సంభావన ద్రవ్యంగా; అఖిల, భూ, వలయంబున్= సమస్తమైన భూ మండలాన్ని; ఇచ్చి= దానంగా సమర్పించి; నిః+సంగుండు+ఐ= ఎటువంటి అనుబంధాలు లేనివాడై; మహేంద్ర, పర్వతంబునన్= మహేంద్రం అనేపేరు గల పర్వతంపై; తపస్+నిత్యుండు+ఐ= తపస్సునందు ఎల్లప్పుడూ నిష్ఠ కలవాడై; ఉన్నవాఁడు+అని= ఉన్నవాడని; పరశురాము చరితంబు+చెప్పిన= పరశురాముడియొక్క ఉదంతాన్ని వినిపించగా; విని; ధర్మజుండు= ధర్మతనయుడు; అనుజ, బ్రాహ్మణ, సహితుండు+ఐ= సోదరులతో బ్రాహ్మణులతో కూడుకొన్నవాడై; ముని, గణ+ఉపదేశంబునన్= ఋషులబృందంయొక్క హితబోధచేత; చతుర్దశి, నాఁడు= చతుర్దశి తిథి దినాన; పరశురామున్+చూచి= పరశురాముడిని సందర్శించి; పరమభక్తిన్= మిక్కిలి భక్తితో; పూజించి= అర్చించి; తద్+ప్రతి, పూజితుండు+ఐ= అతడిచేత తిరిగి పూజించబడినవాడై; దక్షిణ, దిక్కునకున్+చని= దక్షిణ దిశకు వెళ్ళి.

తాత్పర్యం: ఈ విధమైన శపథం చేసి, క్షత్రియుల నందరినీ సంహరించి, దిగ్గజాల దంతాలనే గడియమ్రానులు ఎల్లలుగా గలిగిన (దిగ్గజాల దంతాలచేత మోయబడుతున్న) భూమండలాన్ని అంతటినీ జయించి, శాస్త్రోక్తంగా యజ్ఞాన్ని చేసి, ఋత్విజుడికి సమర్పించేటటువంటి సంభావనద్రవ్యంగా సమస్త భూమండలాన్ని కశ్యపుడికి దానంచేసి, ఎటువంటి బంధాలులేని వైరాగ్యంతో కూడినవాడై మహేంద్రగిరి అనేకొండ మీద నిరంతరతపోనిష్ఠతో పరశురాముడు ఉన్నాడు'- అని చెప్పగా ఆలకించి ధర్మరాజు తన తమ్ములతో, బ్రాహ్మణులతో కలిసి చతుర్దశి తిథినాడు పరశురాముడిని సందర్శించి అతడిని అర్చించి అతడిచేత తిరిగి అర్చించబడినవాడై దక్షిణదిశకు తరలివెళ్ళాడు.

విశేషం: భూమిని అష్టదిగ్గజాలు మోస్తున్నట్లు ప్రాచీన భారతీయ సంప్రదాయం అష్టదిగ్గజాలు: 1. ఐరావతం 2. పుండరీకం 3.వామనం 4. కుముదం 5. అంజనం 6. పుష్పదంతం 7. సార్వభౌమం 8. సుప్రతీకం.

క. భూవినుతంబై త్రిభువన । పావనమై త్ర్యంబకప్రభవమైన జలౌ
ఘావళిఁ బవిత్ర మగు గో । దావరిఁ బుణ్యనదిఁ గనియె దక్షిణగంగన్. 156

ప్రతిపదార్థం: భూ, వినుతంబు+ఐ= భూమియందు కొనియాడబడినదై; త్రిభువనపావనము+ఐ= మూడు లోకాల్లోనూ పవిత్రమైనదై; త్ర్యంబక, ప్రభవము+ఐన= త్ర్యంబకం అనేస్థలంలో పుట్టిన; జల+ఓఘ+ఆవళిన్= నీటిప్రవాహాల సముదాయంచేత; పవిత్రము+అగు= పావనమైన; గోదావరిన్= గోదావరిని; పుణ్యనదిన్= పుణ్యం ఇచ్చే ఏరును; దక్షిణగంగన్= దక్షిణదిశలో ఉన్న గంగానదిని; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: భూమండలంలో సుప్రసిద్ధమై మూడులోకాలను పవిత్రం చేసేటటువంటిదై త్ర్యంబకమనేచోట పుట్టిన నీటివెల్లువచేత పావనమైన పుణ్యనది దక్షిణగంగ అయిన గోదావరిని దర్శించాడు.

శా. గో దేవ క్షితిదేవ భక్తిపరుఁడై గోదావరీస్నాతుఁడై
గోదానంబులు హేమదానములుఁ బెక్కుల్ రత్నదానంబులన్
భూదేవోత్తమపూజ సేయుచు జగత్పూజ్యుండు ధర్మాత్మజుం
డాదిత్యాభుఁ డనేకతీర్థశతసేవాసక్తపుణ్యాత్ముఁడై. 157

ప్రతిపదార్థం: గో, దేవ, క్షితిదేవ, భక్తి పరుఁడు+ఐ= గోవులయందు, భూదేవులైన బ్రాహ్మణులయందు భక్తి కలవాడై; గో, దానంబులు= ఆవులను దానం ఇవ్వటం; హేమ, దానములున్= బంగారాన్ని దానంచేయుటలు; పెక్కుల్= ఎన్నో,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రత్నదానంబులన్= రత్నాలను దానాలు చేయటం చేతను; భూ, దేవ+ఉత్తమ, పూజ+చేయుచు= బ్రాహ్మణోత్తములను అర్చిస్తూ; జగత్+పూజ్యుండు= లోకం అంతటిచేత అర్చించతగినవాడు; ధర్మ+ఆత్మజుండు= ధర్మసుతుడు; ఆదిత్య+ఆభుఁడు= సూర్యుడితో సమానమైనవాడు; అనేక, తీర్థ, శత, సేవా, సక్త, పుణ్య+ఆత్ముఁడు+ఐ= అనేక పుణ్యక్షేత్రాలను వందలకొద్దీ సేవించటంలో లగ్నమైన పుణ్యమైన ఆత్మ కలవాడై.

తాత్పర్యం: గోవులందు, దేవతలందు, భూదేవులైన బ్రాహ్మణులందు భక్తికలవాడై గోదావరీనదిలో స్నానం చేసి, ఆవులను దానంచేయుటంతో, బంగారాన్ని, పెక్కురత్నాలను దానం చేయటంతో బ్రాహ్మణులను సత్కరిస్తూ జగత్తుచేత పూజించదగిన ధర్మపుత్రుడు సూర్యుడితో సమానమైనవాడు పెక్కుపుణ్యక్షేత్రాలను వందలకొద్దీ సందర్శించాలనే కోరిక గల పుణ్యాత్ముడై.

వ. ద్రవిడదేశంబున నగస్త్యతీర్థంబాడి, యందుఁ దొల్లి యర్జును చేసిన గోసహస్రదానాది వివిధ దానంబులు విని, వానిం బ్రశంసించుచుం జని శూర్పారకంబను తీర్థంబునం బర్వతోత్సేధంబైన పరశురాము వేదిం గని, సముద్రతీరంబునకుం జని ప్రభాసతీర్థంబునం బండ్రెండుదినంబులు పవనాంబుభక్షుండై పంచాగ్ని మధ్యంబున ధర్మజుండు తపంబు సేసిన. 158

ప్రతిపదార్థం: ద్రవిడ, దేశంబునన్= తమిళదేశాన; అగస్త్య, తీర్థంబు+ఆడి= అగస్త్యుడిపేర వెలసిన పుణ్యక్షేత్రంలో స్నానంచేసి; అందున్= అక్కడ, తొల్లి= పూర్వం; అర్జును, చేసిన= అర్జునుడు చేసినట్టి; గో, సహస్ర, దాన+ఆది, వివిధ, దానంబులు= వేయిగోవులదానం మొదలైన పలుదానాలనుగురించి; విని; వానిన్= ఆ అర్జునుడిని; ప్రశంసించుచున్= పొగడుతూ; చని= వెళ్ళి; శూర్పారకంబు+అను= శూర్పారకం అనేటువంటి; తీర్థంబునన్= పుణ్యక్షేత్రంలో; పర్వత+ఉత్సేధంబు+ఐన= కొండవలె పొడుగ్గా విస్తరించి ఉన్న; పరశు, రాము, వేదిన్+కని= పరశురాముడి అరుగును చూచి; సముద్ర, తీరంబునకున్+చని= సముద్రంయొక్క గట్టును చేరి; ప్రభాస తీర్థంబునన్= ప్రభాస మనే పుణ్యక్షేత్రంలో; పండ్రెండు, దినంబులు= పన్నెండు రోజులు; పవన+అంబు, భక్షుండు+ఐ= గాలిని, నీళ్ళను మాత్రమే ఆహారంగా గైకొన్నవాడై; పంచ+అగ్ని, మధ్యంబున= అయిదు అగ్నుల మధ్య; ధర్మజుండు= ధర్మరాజు; తపంబు= తపస్సు; చేసినన్= చేయగా.

తాత్పర్యం: ద్రవిడదేశంలోని అగస్త్యతీర్థంలో స్నానంచేసి, అక్కడ పూర్వం అర్జునుడు చేసిన వేయి ఆవులదానం, మున్నగు దానాల పొగడ్తలు విని సంతోషించి, అర్జునుడిని అభినందిస్తూ వెళ్ళి శూర్పారకమనే తీర్థాన్ని చేరి, అక్కడ కొండవలె పొడవుగా వ్యాపించి ఉన్న పరశురాముడి వేదికను చూచి, అక్కడినుండి సముద్రతీరానికి వెళ్ళి ప్రభాసతీర్థాన పన్నెండురోజులు గాలినీరుమాత్రమే ఆహారంగా గైకొని ధర్మరాజు పంచాగ్నిమధ్యంలో తపస్సుచేశాడు.

విశేషం: పంచాగ్నులు: 1. పూర్వాగ్ని 2. దక్షిణాగ్ని 3. పశ్చిమాగ్ని 4. ఉత్తరాగ్ని 5. సూర్యుడు. ఇవి కాయక్లేశయుతమైన తపస్సుకు చెందినవి.

ఆ. దాని నెఱిఁగి రామదామోదరులు వృష్ణి। వరులతోడఁ బ్రీతి నరుగుదెంచి
కనిరి సకలతీర్థగమనపరిక్లేశ। కృశులఁ బాండుసుతుల విశదయశుల. 159

ప్రతిపదార్థం: దానిన్+ఎఱిఁగి= పాండవులరాకనుగురించి తెలిసికొని; రామ, దామోదరులు= బలరాముడు, శ్రీకృష్ణుడున్నూ; వృష్ణి, వరులతోడన్= యాదవులలో ఒకతెగ అయిన వృష్ణివంశంలోని నాయకులతో కలిసి; ప్రీతిన్= ప్రేమతో; అరుగుదెంచి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వచ్చి; సకల, తీర్థ, గమన, పరిక్లేశ, కృశులన్= అన్ని పుణ్యక్షేత్రాలకు వెళ్ళటం చేత ఏర్పడిన శ్రమ వలన కృశించిన వారిని; విశద, యశులన్= అందరికీ తేటతెల్లమైన కీర్తికలవారిని; పాండు, సుతులన్= పాండవులను; కనిరి= సందర్శించారు.

తాత్పర్యం: ప్రభాసతీర్థానికి పాండవులు వచ్చినట్లు తెలిసికొని, బలరాముడు, శ్రీకృష్ణుడున్నూ వృష్ణిజాతికి చెందిన నాయకులతో కలిసి అక్కడికి వచ్చి, ఎన్నో పుణ్యక్షేత్రాలను సందర్శించటంచేత డస్సి, కృశించినవారున్నూ, స్వచ్ఛమైన కీర్తి గలవారున్నూ అయిన పాండవులను సందర్శించారు.

విశేషం: ప్రభాసతీర్థం యాదవరాజ్యంలోనిది. పశ్చిమ సముద్రతీరంలో ఉన్నది.

క. చీరాజినధారుల నవి । కారతపోయుతులఁ జూచి కడు దుఃఖితులై
వారిజదళాక్షి ద్రౌపది । నూరార్చి రుదార హిత మృదూక్తుల నొప్పన్. 160

ప్రతిపదార్థం: చీర+అజిన, ధారులన్= నారబట్టలు, జింకచర్మము ధరించిన వారిని; అ వికార, తపస్+యుతులన్= చలించని నిష్ఠగల తపస్సుతో కూడినవారిని; చూచి= సందర్శించి; కడు= మిక్కిలి; దుఃఖితులు+ఐ= వెతచెందినవారై; వారి, జ, దళ+అక్షి= (నీటినుండి పుట్టిన) పద్మంలోని రేకులవంటి కన్నులు కలది అయిన; ద్రౌపదిన్= ద్రౌపదిని; ఉదార, హిత, మృదు+ఉక్తులన్= ఔదార్యంతో కూడినవై మేలును కోరే మెత్తటి మాటలతో; ఒప్పన్= ఒప్పునట్లుగా; ఊరార్చిరి= ఓదార్చారు.

తాత్పర్యం: నారబట్టలు, జింకచర్మాలు ధరించిన వారిని, చలించని తపోనిష్ఠతో గూడిన పాండవులను చూచి వారు మిక్కిలి వెత చెందారు. పద్మదళాక్షి అయిన ద్రౌపదిని ఔదార్యంతో కూడి మేలును కోరే మెత్తటిపలుకులతో ఊరడించారు.

వ. వారికి ధర్మతనయుండు తమ వనవాసతీర్థగమనాయాసంబును, నర్జును దివ్యాస్త్రలాభంబును, నింద్రునొద్ద నాతని యునికియుం జెప్పిన విని రాముండు గృష్ణాదులైన వృష్ణివరుల కిట్లనియె. 161

ప్రతిపదార్థం: వారికి= రామకృష్ణాదులకు; ధర్మతనయుండు= ధర్మరాజు; తమ, వనవాస, తీర్థ, గమన+ఆయాసంబునున్= తాము అనుభవించిన అరణ్యవాస ఖేదాన్ని, పుణ్యక్షేత్రసందర్శనానికి పడిన ప్రయాసనున్నూ; అర్జును, దివ్య+అస్త్ర, లాభంబును= అర్జునుడియొక్క దివ్యమైన మంత్రబాణాల సంపాదనమున్నూ; ఇంద్రు+ఒద్దన్= దేవేంద్రుడి దగ్గర; ఆతని= అర్జునుడియొక్క; ఉనికియున్= ఉనికిని; చెప్పిన= చెప్పగా; విని= ఆలకించి; రాముండు= బలరాముడు; కృష్ణ+ఆదులు+ఐన= శ్రీకృష్ణుడు మొదలుగాగల; వృష్టి, వరులకు= వృష్ణి వంశానికి సంబంధించిన నాయకులకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: బలరామ శ్రీకృష్ణాదులకు ధర్మరాజు తాము అరణ్యంలో పడిన బాధలను, తీర్థయాత్రలు సేవించటంలో అనుభవించిన కష్టాలను, అర్జునుడు దివ్యాస్త్రాలను సంపాదించటాన్ని, దేవేంద్రుడివద్ద ఉండటాన్ని వివరించగా విని, శ్రీకృష్ణుడు మొదలైన వృష్ణినాయకులతో బలరాముడు ఇట్లా పలికాడు.

సీ. 'మతిహీనుఁడై తన సుతునిపల్కులు విని । ధృతరాష్ట్రుఁ డీ పాండుసుతులఁ బాప
భీరుల నపగతధారుణీరాజ్యులఁ । జేసి యుగ్రారణ్యవాసగతులఁ
గావించె; నిది ధర్మువే? విచారవిహీనుఁ । డయ్యెఁ; భీష్మాదులు నెయ్యమున ని
వారింపఁగా దీని నేరర; ధృఢసత్య । రతులకు దేవనిర్మితుల కహిత

ఆ. మాచరించుచున్న నీచదుర్యోధనా । దులకు వర్ధనమును నలఘు లైన
పాండునందనులకు దండితారుల కవ । ర్ధనము నిట్లు సేయఁ జనునె విధికి. 162

ప్రతిపదార్థం: మతి, హీనుఁడు+ఐ= బుద్ధిలేనివాడై; తన, సుతుని, పల్కులు= తన కుమారుడి మాటలు; విని= ఆలకించి; ధృతరాష్ట్రుఁడు; ఈ పాండుసుతులన్= ఈ పాండవులను; పాప, భీరులన్= పాపమంటే భయపడే వారిని; అపగత, ధారుణీ, రాజ్యులన్+చేసి= పోగొట్టబడిన భూమిరాజ్యం కలవారినిగా చేసి; ఉగ్ర+అరణ్యావాసగతులన్+కావించెన్= ఘోరమైన అడవిలో నివసించేటటువంటి వారినిగా చేశాడు; ఇది= ఇట్లా చేయటం; ధర్మువే?= ధర్మమా?; విచార, విహీనుఁడు+అయ్యె= ఆలోచన లేనివాడైనాడుకదా; భీష్మ+ఆదులు= భీష్ముడు మొదలైనవారు; నెయ్యమున= మైత్రితో; దీని= ఈ దుష్కృత్యాన్ని; నివారింపఁగా, నేరరు+అ= నివారింపజాలరా; దృఢ, సత్య, రతులకు= సత్యమునందు గట్టి ఇష్టం కలవారికి; దేవ, నిర్మితులకు= దైవాంశసంభవులకు; అహితము= కీడు; ఆచరించుచున్న= చేస్తున్న; నీచ, దుర్యోధన+ఆదులకు= దుష్టులైన దుర్యోధనుడు మొదలైనవారికి; వర్ధనమునన్= అభివృద్ధియున్నూ; అలఘులు+ఐన= గొప్పవారైన; పాండు, నందనులకు= పాండవులకు; దండిత+అరులకు= దండించబడిన శత్రువులు కలవారికి, అనగా శత్రువులను జయించిన మహావీరులకు; అవర్ధనమున్= కష్టనష్టాలను కలిగించటం (పెంపులేకపోవటం); ఇట్లు= ఈ విధంగా; విధికిన్= బ్రహ్మదేవుడికి; చేయన్+చనునె= చేయటం తగునా?

తాత్పర్యం: 'ధృతరాష్ట్రుడు బుద్ధిలేనివాడై తన కుమారులు చెప్పినమాటలు విని ఈ పాండవులను, పాపానికి జంకేటటువంటివారిని, రాజ్యంనుండి వెళ్ళగొట్టి, ఘోరమైన అడవులలో నివసించేటట్లు చేశాడు. ఇది ధర్మమా? ధృతరాష్ట్రుడు ఆలోచనలేనివాడయ్యాడు. భీష్మాదులు అయినా స్నేహంతో ఈ దుష్కృత్యాన్ని నివారించలేదే! సత్యనిష్ఠ దృఢంగా పాటించేవారికి, దైవాంశసంభూతులకు, శత్రువులను జయించిన మహావీరులకు, పాండవులకు అన్యాయాన్ని చేస్తున్న దుష్టదుర్యోధనాదులకు అభ్యుదయాన్ని, గొప్పవారైన పాండవులకు కష్టనష్టాలను కలిగించటం బ్రహ్మదేవుడికి న్యాయమా?

క. ధరణీతలంబు నిర్ధా । ర్త రాష్ట్రముగఁ జేసి యనఘు ధర్మైకధురం
ధరు ధర్మతనూజు వసుం । ధర కధిపతిఁ జేయకుండఁ దగునే మనకున్?' 163

ప్రతిపదార్థం: ధరణీ, తలంబు= భూమి పైభాగాన్ని; నిర్+ధార్త రాష్ట్రముగన్+చేసి= ధృతరాష్ట్రుడి కొడుకులు లేకుండగా చేసి; అనఘు= పాపరహితుడిని; ధర్మ+ఏక+ధురంధరున్= ధర్మాన్ని సాటిలేని విధంగా తానొక్కడే ధరించేవాడిని; ధర్మతనూజున్= ధర్మపుత్రుడిని; వసుంధరకు= భూమికి; అధిపతిన్+చేయకుండన్= రాజును చేయకపోవటం; మనకున్+తగునే= మనకు తగునా?

తాత్పర్యం: భూమిపై ధార్తరాష్ట్రులు లేకుండా చేసి, పాపరహితుడున్నూ, ధర్మాన్ని అద్వితీయంగా ధరించే వాడున్నూ అయిన ధర్మరాజును భూమికి ప్రభువుగా చేయకుండటం మనకు తగునా?'

వ. అనిన బలదేవునకు సాత్యకి యిట్లనియె. 164

తాత్పర్యం: అని పలుకగా బలరాముడితో సాత్యకి ఇట్లా అన్నాడు.

చ. 'అనుపమశౌర్యవంతుల రనంతబలాఢ్యుల రీవు నీ జనా
ర్దనుఁడును సాంబసారణులు దర్పకవీరుఁడు నుండఁ బాండునం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దనులు సుయోధనాదుల కృతంబున నిట్టు లనాథులట్ల యి
వ్వనమున నుండఁగాఁ దగునె వన్యఫలాశనహీనవృత్తితోన్. 165

ప్రతిపదార్థం: అనుపమ, శౌర్యవంతులరు= సాటిలేని పరాక్రమం కలవారు; అనంత, బల+ఆఢ్యులరు= అంతం లేని బలంకలవారు; ఈవును= నీవున్నూ; ఈ జనార్దనుఁడును= ఈ శ్రీకృష్ణుడున్నూ; సాంబ, సారణులు= సాంబుడున్నూ, సారణుడున్నూ; దర్పక, వీరుఁడున్= వీరుడైన మన్మథుడున్నూ, అంటే వీరుడైన ప్రద్యుమ్నుడున్నూ (ప్రద్యుమ్నుడు పూర్వజన్మలో మన్మథుడు కాబట్టి అతడిని మన్మథుడని పిలవటం పరిపాటిగా ఉండేది); ఉండన్= ఉండగా; పాండునందనులు= పాండవులు; సుయోధన+ఆదుల, కృతంబునన్= దుర్యోధనుడు మొదలైనవారి చేతలవలన; ఇట్టులు= ఈ విధంగా; అనాథులు+అట్ల= దిక్కులేనివారివలె (రక్షకులు లేని వారివలె); ఈ+వనమునన్= ఈ అరణ్యంలో; వన్య, ఫల+అశన, హీన, వృత్తితోన్= అడవిపండ్లు ఆహారంగా తినే తక్కువస్థితిలో; ఉండఁగాన్+తగునె?= ఉండటం యోగ్యమా?

తాత్పర్యం: 'సాటిలేని పరాక్రమం కలవారు, అంతు లేని బలం కలవారు నీవూ, శ్రీకృష్ణుడూ, సాంబుడూ, సారణుడూ, ప్రద్యుమ్నుడూ ఇంతమంది మహావీరులు మీరు అండగా ఉండగా, పాండవులు దిక్కుమాలిన అనాథులవలె అరణ్యంలో అడవిపండ్లు ఆహారంగా తింటూ తిరుగాడటం సమంజసమా?

తరలము.

అహితచిత్తవిదారణక్రియలందుఁ బ్రౌఢములై జగ
త్కుహరమంతయు మ్రోయుచుండఁగ ఘోరయాదవసైన్య స
న్నహనదుందుభినాదముల్ గగనంబు దిక్కులు నిండ దు
స్సహము లయ్యెడు ధార్తరాష్ట్రుల సైన్యవీరభటాలికిన్. 166

ప్రతిపదార్థం: ఘోర, యాదవ, సైన్య, సన్నహన, దుందుభి, నాదముల్= భయంకరమైన యాదవులయొక్క సేనల యుద్ధ ప్రయత్నాన్ని సూచించే భేరీధ్వనులు; అహిత, చిత్త, విదారణ, క్రియలందున్= శత్రువుల మనస్సులను చీల్చే పనులలో; ప్రౌఢములు+ఐ= గొప్పసామర్థ్యం కలవై; జగత్, కుహరము+అంతయు= ప్రపంచం అనే గుహ అంతటా; మ్రోయుచుండఁగన్= ధ్వనిస్తుండగా; గగనంబు= ఆకాశం; దిక్కులు= దిక్కులు; నిండన్= పూర్తిగా వ్యాపించగా; ధార్తరాష్ట్రుల= ధృతరాష్ట్రుడి కొడుకుల; సైన్య, వీర, భట+ఆలికిన్= సేనలోని శూరులైన సైనికుల సముదాయానికి; దుస్సహములు+అయ్యెడున్= భరించ శక్యం కానివి అవుతాయి.

తాత్పర్యం: భయంకరమైన యాదవసేనలయొక్క యుద్ధసన్నాహాలను సూచించే భేరీనినాదాలు, శత్రువుల మనసులను చీల్చటంలో గొప్పసామర్థ్యం కలవై ప్రపంచమంతా మారుమ్రోగి ఆకాశం, దిక్కులూ నిండిపోతుంటే ధృతరాష్ట్రుడి కొడుకుల సైన్యంలోని భటులకు భరించ శక్యం కానివి కాగలవు.

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.374 విశేషాంశం చూడండి

మ. ఘనమై నీ పృథుబాహులాంగలముఖాఘాతంబుతోడన్ జనా
ర్దన శార్ఙ్గచ్యుతసాయకావలియుఁ గందర్పేషుజాలంబు నీ

యనిరుద్ధోగ్ర శిలీముఖాలియు మదీయాస్త్రౌఘమున్ ధార్తరా
ష్ట్రనికాయోత్తమకాయఖండనపటిష్ఠం బయ్యెడుం బోరిలోన్. 167

ప్రతిపదార్థం: ఘనము+ఐ= గొప్పదై; నీ, పృథు, బాహు, లాంగల, ముఖ+ఆఘాతంబుతోడన్= నీదైన పెద్దదగు బాహువునందలి నాగలిమొన దెబ్బచేతను; జనార్దను= శ్రీకృష్ణుడియొక్క; శార్‌ఙ్గ, చ్యుత, సాయక+ఆవళియున్= శార్‌ఙ్గం అనేపేరుగల ధనుస్సునుండి వెలువడే బాణాల వరుసలును; కందర్ప+ఇషు, జాలంబున్= మన్మథుడి (ప్రద్యుమ్నుడి) అమ్ములును; ఈ+అనిరుద్ధ+ఉగ్ర, శిలీముఖ+ఆలియు= ఈ అనిరుద్ధుడియొక్క వాడిబాణాల సమూహాలున్నూ; మదీయ+అస్త్ర+ఓఘమున్= నాదైన మంత్రబాణాల వెల్లువయున్నూ; పోరిలోన్= యుద్ధంలో; ధార్తరాష్ట్ర, నికాయ+ఉత్తమకాయ, ఖండన, పటిష్ఠంబు+అయ్యెడున్= ధృతరాష్ట్రుడి కుమారుల గుంపుయొక్క శిరస్సులను నరకటానికి సామర్థ్యం కలిగినట్టివి అవుతాయి.

తాత్పర్యం: గొప్పదైన నీ నాగలిమొనదెబ్బతో కూడిన, శ్రీకృష్ణుడి శార్‌ఙ్గమనే ధనుస్సునుండి వెలువడిన బాణాలు, ప్రద్యుమ్నుడి అమ్ములు, ఈ అనిరుద్ధుడి వాడిబాణాల వరుసలు, నా మంత్రబాణాలున్నూ, ధృతరాష్ట్రుడి కుమారుల శిరస్సులను యుద్ధంలో ఖండించటానికి సామర్థ్యం కలవి కాగలవు.

విశేషం: బలరాముడి ఆయుధం నాగలి. శ్రీకృష్ణుడివిల్లుపేరు శార్‌ఙ్గం. మన్మథావతారమైన ప్రద్యుమ్నుడు రుక్మిణీ, శ్రీకృష్ణుల కొడుకు. అనిరుద్ధుడు ప్రద్యుమ్నుడి కొడుకు.

వ. కేకయసృంజయ పాంచాల వృష్ణిభోజాంధకవీరులుం గృష్ణానుమతులయి యుద్ధంబున ధృతరాష్ట్ర పుత్త్రులను భీష్మ ద్రోణ కర్ణాదులను వధియింతురు; ధర్మరాజుతమ్ములుం దానును సమయాబ్దంబులు సలిపి రాజ్యాభిషిక్తుండగు నంతకు నతిరథు నభిమన్యు నఖిలరాజ్య రక్షకుంజేసి యుండుద' మనిన సాత్యకి పలుకుల కనుకూలుండయి వాసుదేవుండు ధర్మరాజున కిట్లనియె. 168

ప్రతిపదార్థం: కేకయ, సృంజయ, పాంచాల, వృష్ణి, భోజ+అంధక వీరులున్= కేకయులు, సృంజయులు, పాంచాలులు, వృష్ణులు, భోజులు, అంధకులు అయినట్టి శూరులందరూ; కృష్ణ+అనుమతులు+అయి= శ్రీకృష్ణుడియొక్క అనుమతిపొందినవారై; యుద్ధంబున= యుద్ధంలో; ధృతరాష్ట్ర పుత్త్రులను= దుర్యోధనుడు మొదలైన ధార్తరాష్ట్రులను; భీష్మ, ద్రోణ, కర్ణ+ఆదులను= భీష్ముడిని, ద్రోణుడిని, కర్ణుడు మొదలైనవారిని; వధియింతురు= సంహరిస్తారు; ధర్మరాజు, తమ్ములున్+తానును= ధర్మరాజు సోదరులును, తానున్నూ; సమయ+అబ్దంబులు= ప్రతిజ్ఞకు అనుగుణమైన సంవత్సరాలు (అంటే పన్నెండేళ్ళ అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం); సలిపి= పాటించి; రాజ్య+అభిషిక్తుండు+అగు+అంతకున్= పట్టాభిషేకస్నానం (అభిషేకం అంటే స్నానం. సింహాసనాన్ని అధిష్ఠించేందుకు ముందు సలిపేస్నానం); అయ్యే ఆ సమయంవరకు; అతిరథున్= గొప్పవీరుడైన (అతిరథుఁడు అనగా ఆనాడు రథికులలో ఉన్నతశ్రేణికి చెందినవాడు); అభిమన్యున్= అభిమన్యుడిని (అర్జునుడికి, సుభద్రకు ఉదయించిన పుత్రుడు, శ్రీకృష్ణుడి మేనల్లుడు); అఖిల, రాజ్య, రక్షకున్+చేసి= సమస్తరాజ్యాన్ని కాపాడేవాడినిగా నియమించి; ఉండుదము+అనిన= ఉండగలవారం అనిచెప్పగా; సాత్యకి పలుకులకు= సాత్యకి చెప్పిన మాటలకు; అనుకూలుండు+అయి= సమ్మతించినవాడై; వాసుదేవుండు= వసుదేవుడి కొడుకైన శ్రీకృష్ణుడు; ధర్మరాజునకు= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: కేకయులు, సృంజయులు, పాంచాలులు, వృష్ణులు, భోజకులు అంధకులలో గల వీరులు శ్రీకృష్ణుడి అనుమతితో పోరిలో ధృతరాష్ట్రుడి కొడుకులను, భీష్మ, ద్రోణ, కర్ణాదివీరులను సంహరించగలరు, ధర్మరాజు తన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తమ్ముళ్ళతోపాటు తాము చేసిన ప్రతిజ్ఞను అనుసరించి పదమూడేళ్ళు గడిపి పిదప రాజ్యాభిషిక్తుడు కావచ్చును. అంతవరకు అభిమన్యుడు రాజప్రతినిధిగా ఉండగలడు' అని సాత్యకి పలుకగా శ్రీకృష్ణుడు అతడి మాటలకు అంగీకారం తెలిపి ధర్మరాజుతో ఈ విధంగా చెప్పాడు.

ఉ. 'ఈతని పల్కినట్ల ధరణీశ్వర! నీరిపులన్ మహాబలో
పేతులఁ బోరఁ జంపుదు రభేద్యులు వీరలు; మీకు భూతధా
త్రీతలరాజ్య మెల్ల నగుఁ దెల్లము' నావుడు ధర్మనందనుం
డాతతకీర్తి యిట్లనియె నమ్మురవైరికి సీరపాణికిన్. 169

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= భూమికి ఈశ్వరుడివైన ఓ ధర్మరాజా!; ఈతని, పల్కినట్లు+అ= ఇతడు అనగా ఈ సాత్యకి చెప్పినట్లుగానే; న+భేద్యులు= జయించ శక్యంకానివారు; వీరలు= ఈ యాదవులు; మహాబల+ఉపేతులన్= గొప్పబలంతో కూడినవారిని; నీ, రిపులన్= నీ శత్రువులను; పోరన్= యుద్ధంలో; చంపుదురు= సంహరించగలరు; భూత, ధాత్రీ, తల, రాజ్యము+ఎల్లన్= సమస్త ప్రాణకోటితో నిండిన భూరాజ్యమంతయున్నూ; మీకున్+అగున్= మీకు దక్కుతుంది; తెల్లము= సుస్పష్టం; నావుడు= అని చెప్పగా; ఆతత, కీర్తి= గొప్ప యశస్సు కలవాడైన; ధర్మ, నందనుండు= ధర్మపుత్రుడు; ఆ+మురవైరికిన్= మురుడనే రాక్షసుడికి శత్రువైన శ్రీకృష్ణుడికి; సీరపాణికిన్= నాగలి చేతియందు కలవాడికి- అనగా హలాయుధుడైన బలరాముడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఇతడు చెప్పినట్లుగా మహాబలవంతులైన నీ శత్రువులను అసాధ్యులైన వీరు యుద్ధంలో చంపుతారు. మీకు భూతలరాజ్యమంతా దక్కుతుంది' అని అనగా శ్రీకృష్ణుడితో ధర్మరాజు ఈ విధంగా పలికాడు.

ఉ. 'మీ దయ మాకుఁ గల్గఁగ నమిత్రుల నోర్చుట యేమి పెద్ద? ధ
ర్మోదయనిత్యబుద్ధులను నుత్తమకీర్తుల నొప్పు ద్రోణభీ
ష్మాదుల సన్నిధానమున నమ్మెయిఁ బల్కిన పల్కు దప్పఁగాఁ
గా' దని ధర్మనందనుఁడు గ్రమ్మఱిచెన్ యదువీరకోపముల్. 170

ప్రతిపదార్థం: మీ, దయ= మీయొక్క కరుణ; మాకున్+కల్గఁగన్= మాయందు ఉండగా; అమిత్రులన్+ఓర్చుట= శత్రువులను జయించటం; ఏమి, పెద్ద?= ఏమంత గొప్ప పని?; ధర్మ+ఉదయనిత్య, బుద్ధులనున్= ఎల్లప్పుడూ ధర్మం వికసించి ఉండే బుద్ధుల చేతను; ఉత్తమ, కీర్తులన్+ఒప్పు= మంచి పేరుతోను విలసిల్లేటటువంటి; ద్రోణ, భీష్మ+ఆదుల= ద్రోణుడు, భీష్ముడు మొదలైనవారి; సన్నిధానమునన్= సమక్షంలో; ఆ+మెయిన్= ఆ విధంగా; పల్కిన పల్కు= ఆడినమాట; తప్పన్+కాన్+కాదు+అని= మీరరాదుకదా అని; యదు, వీర, కోపములన్= యదువీరుల ఆగ్రహాలను; ధర్మనందనుఁడు= ధర్మరాజు; క్రమ్మఱిచెన్= మరలించాడు.

తాత్పర్యం: 'మీ దయ మాయెడ ఉండగా, శత్రువులను జయించటం ఏమంత గొప్పకార్యం? ఎల్లప్పుడూ ధర్మం వికసించి ఉండే ఉత్తమ బుద్ధుల చేతను, శ్రేష్ఠమైన యశస్సు చేతను విలసిల్లుతున్న భీష్ముడు, ద్రోణుడు మొదలైన మహానుభావుల ఎదుట ఆనాడు ఆ విధంగా ప్రతిజ్ఞ చేసి, ఆడినమాట తప్పటం భావ్యం కాదు కదా!' అని చెప్పి ధర్మరాజు యదువీరుల ఆగ్రహాన్ని మరలింపచేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: బలరాముడు ఇప్పుడు ఇంతగా పాండవులను పొగడి, దుర్యోధనాదులను తెగడి, పాండవపక్షపాతిగా కనిపిస్తున్నాడు. కాని, కాలాంతరాన బలరాముడు దుర్యోధన పక్షపాతియా అన్నట్లుగా మాట్లాడతాడు. మానవజీవితంలో అవస్థాభేదాన్ని బట్టి మనుష్యుల మనసులలో ఏర్పడే పరిణామాన్ని మహాభారతం అత్యద్భుతంగా చిత్రించింది. ఆదర్శప్రేరితుడు బలరాముడు. శ్రీకృష్ణుడు అనుష్ఠాన వేదాంతి. ఇద్దరి శీలాలలో గల తారతమ్యం సూక్ష్మానుశీలనయోగ్యం. యాదవవీరు లందరూ కలిసి ధర్మరాజుతో తమ సానుభూతిని తెలుపటానికి వారు పలికిన మాటలు ఇవి. వారికి ధర్మరాజు సత్యసంధత తెలిసిందే. పాండవులు తమ రాజ్యభాగంలోని ప్రభాస తీర్థానికి విచ్చేశారు. ఈ మాటలలోని ఆంతర్యం గ్రహించతగింది. ఇప్పటికే పాండవుల అరణ్యవాసం సగం మేర పూర్తి అయింది. ఇప్పు డిక కౌరవులపై యుద్ధ ప్రతిపాదనకు అంతరార్థం యాదవులకు పాండవులయెడ గల ప్రగాఢసానుభూతిని వెల్లడించటమే.

వ. యాదవులు పాండవుల వీడ్కొని పోయి; రిట పాండవులు సోమమిశ్రితతోయ యైన పయోష్ణియందుఁ గృతస్నానులయి యున్న నందు ధర్మరాజునకు రోమశుం డిట్లనియె. 171

ప్రతిపదార్థం: యాదవులు= యదువంశజులైనవారు; పాండవులన్= పాండురాజు కొడుకులనుండి; వీడ్కొని= సెలవుగైకొని; పోయిరి= వెళ్ళారు; ఇట= ఇక్కడ; పాండవులు= పాండురాజు పుత్రులు; సోమ, మిశ్రిత, తోయ+ఐన= సోమరసంతో కలిసినట్టి నీరుకల; పయోష్ణి+అందు= పయోష్ణి అనే నదిలో; కృత, స్నానులు+అయి= స్నానం చేసినవారై; ఉన్నన్= ఉండగా; అందు= అక్కడ; ధర్మరాజునకు; రోమశుండు= రోమశుడనే మహర్షి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: యాదవవీరులు పాండవులను వీడ్కొని వెళ్ళారు. ఇక్కడ పాండవులు సోమరసంతో కలిసిన నీరుగల 'పయోష్ణి' నదిలో స్నానం చేసి ఉండగా, రోమశుడు ధర్మరాజుతో ఈవిధంగా చెప్పాడు.

క. 'మనుజేంద్ర! దీని తీరం । బున నృగుఁ డను రాజు యజ్ఞములఁ జేసిన నం
దనిమిషపతి తృప్తుండై । దనుజుల నోర్చె నటె ఘోరతరశస్త్రములన్. 172

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్ర!= మనుష్యులకు ఇంద్రుడివైన ఓ ధర్మరాజా!; దీని, తీరంబున= ఈ పయోష్ణి ఒడ్డున; నృగుఁడు+అను, రాజు= నృగుడు అనే పేరుకల ప్రభువు; యజ్ఞములన్= యజ్ఞాలు; చేసినన్= చేయగా; అందు= అక్కడ; అనిమిషపతి= దేవతలకు రాజైన ఇంద్రుడు; తృప్తుండు+ఐ= తృప్తి చెందినవాడై; ఘోర, తర, శస్త్రములన్= మిక్కిలి భయంకరాలైన ఆయుధాలతో; దనుజులను= రాక్షసులను; ఓర్చెన్+అటె= జయించాడు కదా.

తాత్పర్యం: 'ఓ మహారాజా! ఈ పయోష్ణి ఒడ్డున నృగుడు అనే ప్రభువు యజ్ఞాలు చేశాడు. దేవతలకు ప్రభువైన దేవేంద్రుడు ఆ యజ్ఞాలవలన తనివి చెందినవాడై మిక్కిలి భయంకరాలైన ఆయుధాలతో రాక్షసులను సంహరించాడు.

వ. మఱియు నింద తొల్లి యాధూర్తరజసుండైన గయుండు హిరణ్మయంబులయిన చషాలస్థాలీ యూప చమస పాత్రీస్రుక్స్రువంబులును దేవస్థాపితంబులయిన యూపంబులు నొప్ప నేడశ్వమేధంబులు సేసి, యసంఖ్యాతంబు లయిన ధనంబుల ఋత్విజులను సదస్యులనుం బూజించి సువర్ణమయగోదానంబు లనేకంబులు బ్రాహ్మణుల కిచ్చి యక్షయంబులయిన యింద్రలోకసుఖంబుల బడసెఁ; బయోష్ణియందుఁ గృతస్నానులైనవారు దేవసాయుజ్యంబుఁ బడయుదు' రని చెప్పుచుం జని నర్మదాస్నానంబుఁ జేసి, వైడూర్యపర్వతంబుఁ గని రోమశుండు ధర్మరాజున కిట్లనియె; 'నిది త్రేతా ద్వాపర సంధి. యీ సరోవరతీరంబు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శర్యాతి యజ్ఞప్రదేశంబు; మఱియు నిందు భృగుపుత్త్రుం డయిన చ్యవనుండు శర్యాతి యను రాజుకూఁతు సుకన్య యను దాని వివాహంబయి, వాని యజ్ఞంబున నింద్రు నాదరింపక యాశ్వినుల సోమపీథులం జేసె' ననిన నది యెట్లని యడిగిన ధర్మరాజునకు సౌకన్యాఖ్యానంబు సవిస్తరంబుగా రోమశుం డిట్లని చెప్పె. 173

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; ఇందు+అ= ఇక్కడే; తొల్లి= పూర్వం; ఆధూర్తరజసుండు+ఐన= అధూర్తరజసుడు అనే తండ్రికి కుమారుడైన; గయుండు= గయుడు; హిరణ్మయంబులు+అయిన= బంగారంతో చేయబడినటువంటివైన; చషాల, స్థాలీ, యూప, చమస పాత్రీ, స్రుక్, స్రువంబులును= యజ్ఞోపకరణాలతో (చషాలము= యూపస్తంభం చివర ఉండే కడియం, స్థాలి= వంటపాత్ర, యూపము= యజ్ఞపశువుకు కట్టే స్తంభం, చమసపాత్ర= చతురస్రమైన యజ్ఞపాత్ర, స్రుక్+స్రువములు= చిన్నగరిటె, పెద్దగరిటెవంటివి); దేవ, స్థాపితంబులు+అయిన= దేవతలచేత ప్రతిష్ఠించబడినవైన; యూపంబులున్= యజ్ఞపశువులను కట్టేకొయ్యలు; ఒప్పన్= విలసిల్లగా; ఏడు+అశ్వమేధంబులు= ఏడు అశ్వమేధ యాగాలు; చేసి=చేసి; అసంఖ్యాతంబులు+అయిన= లెక్కకు మీరిన; ధనంబులు= ధనాలతో; ఋత్విజులను= యజ్ఞం చేయించే పురోహితులను; సదస్యులనున్= యజ్ఞంలో లోటుపాట్లులేకుండ గమనించే పండితులను; పూజించి= అర్చించి; సువర్ణమయ, గోదానంబులు= బంగారుమయమైన గోదానాలను; (బంగారుసొమ్ములతో అలంకరించబడిన గోవుల యొక్క దానాలను); అనేకంబులు= పెక్కు; బ్రాహ్మణులకు+ఇచ్చి= విప్రులకు దానమిచ్చి; అక్షయంబులు+అయిన= తరుగనటువంటి; ఇంద్రలోక, సుఖంబులన్+పడసెన్= స్వర్గలోక భోగాలను అనుభవించాడు; పయోష్ణియందున్= పయోష్ణి అనబడే నదిలో; కృతస్నానులు+ఐనవారు= స్నానంచేసినవారు; దేవసాయుజ్యంబు= దేవతలతో ఐక్యమవటాన్ని; పడయుదురు= పొందగలరు; అని చెప్పుచున్= అని చెప్పుతూ; చని= వెళ్ళి; నర్మదా, స్నానంబున్+చేసి= నర్మదానదిలో స్నానంచేసి; వైడూర్య, పర్వతంబున్+కని= వైడూర్యాలు గల కొండను చూచి; రోమశుండు= రోమశుడు; ధర్మరాజునకు= ధర్మరాజుకు; ఇట్లు+అనియె= ఈవిధంగా చెప్పాడు; ఇది, త్రేతా, ద్వాపర, సంధి= ఇది త్రేతాయుగం చివర ద్వాపరయుగం ప్రారంభమయేందుకు కొంచెం ముందు ఉన్న నడిమికాలం; ఈ, సరోవర, తీరంబు= ఈ సరస్సుతీరం; శర్యాతి, యజ్ఞ, ప్రదేశంబు= శర్యాతి అనే మహారాజు యజ్ఞం చేసిన స్థలం; మఱియున్= ఇంకనూ; ఇందు= ఇక్కడ; భృగు, పుత్త్రుండు+ఐన= భృగుమహర్షి కొడుకైన; చ్యవనుండు= చ్యవన మహర్షి; శర్యాతి+అను, రాజు, కూఁతు= శర్యాతి అనేప్రభువు పుత్రిక; సుకన్య+అనుదానిన్= సుకన్య అన్నపేరు కలదానిని; వివాహంబు+అయి= పెళ్లిచేసికొని; వాని, యజ్ఞంబునన్= శర్యాతి చేసిన యాగంలో; ఇంద్రున్= ఇంద్రుడిని; ఆదరింపక= లక్ష్యపెట్టక; అశ్వినులన్= అశ్వినీదేవత లిద్దరిని; సోమపీథులన్+చేసెన్= సోమరసాన్ని త్రాగినవారినిగా చేశాడు; అనినన్= అని చెప్పగా; అది= ఆకథ; ఎట్లు+అని= ఎట్టిది అని; అడిగిన= ప్రశ్నించిన; ధర్మరాజునకు= ధర్మరాజుకు; సౌకన్య+ఆఖ్యానంబు= సుకన్యకు సంబంధించిన కథ; సవిస్తరంబుగా= మిక్కిలి విస్తారంగా; రోమశుండు= రోమశుడు; ఇట్లు+అని, చెప్పెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఇంకను ఇక్కడ పూర్వకాలాన ఆ ధూర్తరజసుడి కొడుకైన గయుడు గొప్ప యజ్ఞాన్ని చేశాడు. ఆ యజ్ఞంలో వాడబడిన ఉపకరణాలన్నీ - యూపస్తంభాల చివర తొడిగే కడియాలు, వంటపాత్రలు, చిన్నవి, పెద్దవి గరిటెలు - అన్నీ బంగారంతో చేయబడినవే!. యూపాలు దేవతలచేత స్థాపించబడినవి. గయుడు యజ్ఞాలను నిర్వహించిన ఋత్విజులను, యజ్ఞాలను సక్రమంగా నడిపించిన పరీక్షాధికారులను లెక్కకు మించిన బంగారునాణాలతో అర్చించి బంగారు తొడుగులతో కూడిన ఆవులను బ్రాహ్మణులకు దానంచేసి, ఇచ్చి తరగని స్వర్గలోక భోగాలను పొందాడు. అటువంటి ఆ పయోష్ణి నదిలో స్నానంచేసినవారు దేవతలతో ఐక్యం కాగలరు' - అని చెపుతూ పయనించి నర్మదానదిలో స్నానంచేసి అనంతరం అచటి వైడూర్య పర్వతాన్ని చూచి, ధర్మరాజుతో రోమశుడు ఇట్లా అన్నాడు. 'త్రేతాయుగం చివర ద్వాపరయుగం ప్రవేశించటానికి కొంచెం పూర్వం శర్యాతి మహారాజు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యజ్ఞం చేసినచోటు ఇది. ఇక్కడ భృగుమహర్షి కొడుకైన చ్యవనమహర్షి శర్యాతిరాజుకూతురు సుకన్య అనే దానిని పెళ్ళాడాడు. పిదప శర్యాతి చేసిన యజ్ఞంలో ఇంద్రుడిని లక్ష్యపెట్టక అశ్వినీదేవతలను సోమరసాన్ని త్రాగేవారిగా చేశాడు' అని చెప్పగా ధర్మరాజు 'అది ఎట్లు? ఆ కథ చెప్పవలసింది' అని అడిగాడు. రోమశమహర్షి ధర్మరాజుకు సౌకన్యోపాఖ్యానాన్ని సవిస్తరంగా చెప్పాడు.

విశేషం: వేదకాలంలో సోమపానం మిక్కిలి ప్రాచుర్యంలో ఉన్న అలవాటు. సోమలతనుండి సోమరసాన్ని తీసి పానీయంగా రూపొందించి త్రాగేవారు. ఈ విషయంపై నవీనులు గొప్ప పరిశోధనలు చేశారు కాని సోమలతలను గుర్తించటంలో వృక్ష శాస్త్రజ్ఞులు కూడ విజయాన్ని సాధించ లేకపోయారు. యజ్ఞాలలో సోమపానం ఉగ్గడించబడింది. అలనాటివారు ఆ సోమరసాన్ని ఎట్లా పానీయంగా తయారుచేసేవారో నేటివారికి తెలియదు. వేదకాలపు ఆర్యులు విడిపోయి పలుదేశాలకు వెళ్ళారు. వాటిలో ఇరానుదేశం ఒకటి. అక్కడ సోమలతగా చెప్పబడే లతలు ఉన్నాయని చెప్తున్నారు. ఇది భావిపరిశోధనలవలన తేలవలసిన అంశం.

రోమశుఁడు ధర్మరాజునకు సౌకన్యాఖ్యానంబు సెప్పుట (సం. 3-122-1)

క. 'ఇక్కొలని సమీపంబునఁ । బెక్కగు వేలేండ్లు తపము భృగుసుతుఁడు గరం
బక్కజముగ నొనరించెను । వెక్కస నియమమున నిరతవీరాసనుఁడై. 174

ప్రతిపదార్థం: ఈ+కొలని, సమీపంబునన్= ఈ సరస్సుకు దగ్గరగా; పెక్కు+అగు, వేల+ఏండ్లు= ఎన్నోవేల సంవత్సరాలు; భృగుసుతుఁడు= భృగుమహర్షికొడుకు; తపము= తపస్సును; వెక్కస, నియమమునన్= మిక్కుటమైన నిష్ఠతో; నిరత, వీర+ ఆసనుఁడు+ఐ= ఎల్లప్పుడూ వీరాసనం'తో ఉండి; కరంబు= మిక్కిలి; అక్కజముగన్= ఆశ్చర్యంగా; ఒనరించెను= చేశాడు.

తాత్పర్యం: 'ఈ సరస్సుకు దగ్గరగా భృగుమహర్షి కుమారుడైన చ్యవనమహాముని ఎన్నో వేల సంవత్సరాలు ఎడతెగని వీరాసనంతో ఉండి ఆశ్చర్యకరమైన నిష్ఠతో గొప్పతపస్సు చేశాడు.

విశేషం: వీరాసనం- యోగాసనాలలో ఒకటి. వీరాసనానికి స్థైర్యం, నిశ్చలత్వం ప్రధానాంశాలు. ఎక్కువసేపు వీరాసనంలో కూర్చోవటం కష్టం. కాని, చ్యవనమహర్షి ఎన్నో వేలసంవత్సరాలు వీరాసనస్థితుడై తపస్సు చేశాడని మహాభారతం ఉగ్గడిస్తున్నది.

క. అమ్మునిదేహము వల్మీ । కమ్మునఁ గప్పంగఁబడి నికటవల్లీ గు
ల్మమ్ములు పైఁ బ్రాఁకిన నన । యమ్మును నేర్పడక యుండె నవ్వనభూమిన్. 175

ప్రతిపదార్థం: ఆ+ముని, దేహము= ఆ ఋషిశరీరం; వల్మీకమ్మునన్= పుట్టచేత; కప్పంగన్+పడి= కప్పబడి; నికట, వల్లీ, గుల్మమ్ములు= సమీపంలోని తీగలు, పొదలు; పైన్+ప్రాఁకినన్= ఆ పుట్టమీద ప్రాకగా; ఆ+వన, భూమిన్= ఆ అరణ్యసీమలో; అనయమ్మునున్= ఎల్లప్పుడూ; ఏర్పడక+ఉండెన్= కనిపించకుండా ఉన్నాడు.

తాత్పర్యం: ఆ మునిశరీరం పుట్టచేత కప్పబడింది. సమీపంలోని తీగలు, పొదలు ఆ పుట్టను అలముకొన్నాయి. అందుచేత ఆ మునిదేహం ఆ అరణ్యసీమలో కనిపించకుండా మాటుపడి ఉన్నది.

విశేషం: రామాయణ కావ్యకర్త అయిన 'వాల్మీకి' మహర్షినిగురించి ఇటువంటి కథే లోకంలో సుప్రసిద్ధం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అంతం బెద్దకాలంబునకు శర్యాతి యనురాజు దన చతుస్సహస్ర దేవీనివహంబుతోడఁ దత్సరోవరంబున విహరింప నరిగిన నాతని కూఁతురు సుకన్య యనునది యిష్టసఖులతోఁ గ్రుమ్మరుచున్న నవ్వల్మీకంబునందు.176

ప్రతిపదార్థం: అంతన్= అటుతర్వాత; పెద్ద, కాలంబునకు= చాలాకాలానికి; శర్యాతి+అను, రాజు= శర్యాతి అనేపేరు కలిగిన ప్రభువు; తన, చతుర్+సహస్ర, దేవీ, నివహంబు తోడన్= తన నాలుగువేల రాణుల సముదాయంతో; తద్+సరోవరంబునన్= ఆ కొలనులో; విహరింపన్+అరిగినన్= వినోదించటానికి వెళ్ళగా; ఆతని, కూఁతురు= ఆ శర్యాతి ప్రభువుయొక్క కుమార్తె; సుకన్య+అనునది= సుకన్య అనే పేరు కలది; ఇష్టసఖులతోన్= (తనకు) ఇష్టమైన చెలికత్తెలతో; క్రుమ్మరుచున్నన్= విహరిస్తుండగా; ఆ+వల్మీకంబునందు= ఆ పుట్టలో.

తాత్పర్యం: అటుతర్వాత చాలాకాలం గడిచిన పిమ్మట, శర్యాతి అనేమహారాజు తన నాలుగువేల రాణుల సమూహంతో ఆ కొలనులో విహరించటానికి వచ్చాడు. ఆ మహారాజుకూతురు తన అనుంగు నెచ్చెలులతో ఆ అడవిలో తిరుగుతుండగా ఆపుట్టలో.

క. విద్యుల్లతాంగి భార్గవు। నుద్యన్నయనములు మెఱచుచున్నను విలసత్
ఖద్యోతద్యుతులొకొ యని। సద్యస్సంజాతబుద్ధి సంభ్రమ యగుచున్. 177

ప్రతిపదార్థం: విద్యుత్+లతాంగి= మెరుపుతీగవంటి దేహం కలది; భార్గవు+ఉద్యత్+నయనములు= చ్యవనుడియొక్క ప్రకాశమానాలైన కన్నులు; మెఱచుచున్నను= వెలుగుతుండగా; విలసత్+ఖద్యోత, ద్యుతులు+ఒకొ= శోభిల్లేటటువంటి మిణుగురు పురుగుల వెలుగులు కాబోలు; అని= అని తలపోసి; సద్యస్+సంజాత+బుద్ధి= అప్పటికప్పుడు పుట్టిన; సంభ్రమ+అగుచున్= బుద్ధియందలి సంభ్రమం కలది ఔతూ.

తాత్పర్యం: మెరుపు తీగవంటి శరీరంకల ఆ సుకన్య మెరుస్తూ వెలుగొందుతున్న చ్యవనమహర్షికన్నులను చూచి, అవి మిణుగురు పురుగుల వెలుగులు కావచ్చునని అప్పటికప్పుడు పుట్టిన ఊహతో వేగిరపాటు కలదై.

వ. అప్పు డప్పుట్ట గ్రొప్పించిన నలిగి నిమీలితనయనుండై చ్యవనుండు శర్యాతిసైన్యంబుల కెల్ల మూత్రపురీష నిరోధంబుఁ జేసిన, నది దనసైన్యాపరాధంబున నయ్యెఁగా వగచి, వాఁ డెల్లవారి నడిగి తత్కారణం బెఱుంగ నేరక చింతాపరుండై యున్నఁ, దండ్రికడకు వచ్చి సుకన్య యిట్లనియె. 178

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయాన; ఆ+పుట్ట; గ్రొప్పించినన్= త్రవ్వించగా, (పల్లం చేయించగా); అలిగి= కోపించి; నిమీలిత, నయనుండు+ఐ= కళ్ళు మూసికొన్నవాడై; చ్యవనుండు= చ్యవన మహర్షి - భార్గవుడి కొడుకు; శర్యాతి, సైన్యంబులకు+ఎల్ల= శర్యాతి మహారాజుగారి సేనలలోని భటులందరికీ; మూత్ర, పురీష, నిరోధంబున్+చేసినన్= మూత్రం, పురీషం రాకుండా ఆపగా; అది= అది; తన, సైన్య+అపరాధంబునన్= తనసైన్యంలోని భటులు చేసిన తప్పువలన; అయ్యెన్+కాన్+వగచి= అయినట్లు చింతించి; వాఁడు= అతడు- ఆ శర్యాతి; ఎల్లవారిన్+అడిగి= అందరినీ ప్రశ్నించి; తత్+కారణంబు= ఆ హేతువు; ఎఱుంగనేరక= తెలియజాలక, తెలిసికోలేక; చింతాపరుండు+ఐ+ఉన్నన్= విచారిస్తూ ఉండగా; తండ్రికడకు= తండ్రి దగ్గరకు; వచ్చి= వచ్చి; సుకన్య= సుకన్య; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: అప్పుడు ఆ పుట్టను త్రవ్వించింది. అందుకు చ్యవనమహర్షికి కోపం వచ్చి అతడు కన్నులు మూసికొని శర్యాతిసైన్యంలోని భటులకు మూత్రపురీషాలు [మలమూత్రాలు] బంధించేటట్లు చేశాడు. శర్యాతి తనసైనికులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేసిన తప్పిదం వలన అట్లా అయిందని భావించి అందరిని ప్రశ్నించి అసలు కారణం ఎరుగలేక విచారిస్తుండగా, తండ్రివద్దకు వచ్చి ఇట్లా చెప్పింది.

తే. 'మిన్న మిడుఁగుఱు లట్టులై మెఱసి రెండు । మెఱుఁగు లొక పుట్టలో నున్న నెఱుఁగ కేను
బుట్ట గ్రొప్పించి యారెంటి పొడవుఁ గాన । కుడిగి వచ్చితి విస్మయపడి మనమున. 179

ప్రతిపదార్థం: మిన్న, మిడుఁగుఱులు+అట్టులు+ఐ= శ్రేష్ఠమైన మిణుగురు పురుగువలె; మెఱసి= ప్రకాశించి; రెండు మెఱుఁగులు= రెండు వెలుగులు; ఒక, పుట్టలోన్+ఉన్నన్= ఒక పుట్టలో ఉండగా; ఏను= నేను; ఎఱుఁగక= తెలియక; పుట్ట= పుట్టను; గ్రొప్పించి= పల్లంగా త్రవ్వించి; ఆ రెంటి, పొడవున్= ఆ రెండు మెఱుగుల రూపు (పొడ); కానక= చూడక; ఉడిగి= విరమించి, పుట్టను త్రవ్వించటం మాని; మనమున= మనస్సులో; విస్మయపడి= ఆశ్చర్యపడి; వచ్చితిన్= తిరిగివచ్చాను.

తాత్పర్యం: రెండు వెలుగులు ఒకపుట్టలో కనిపించాయి. అవి శ్రేష్ఠమైన మిణుగురు పురుగులుగా భావించి నేను తెలియక పుట్టను త్రవ్వించాను. కాని, ఆ రెండింటి వెలుగుల పొడగాన లేక మనస్సులో ఆశ్చర్యపడుతూ ఆప్రయత్నాన్ని విరమించాను.

వ. ఈ సైన్య నిరోధంబున కిది నిమిత్తంబగునో?' యనిన, శర్యాతి యప్పు డా పుట్టయొద్దకు వచ్చి, యందుఁ
దపః క్లేశంబునఁ గృశత్వగస్థిభూతశరీరు నతివృద్ధు భార్గవుం గని నమస్కరించి యిట్లనియె. 180

ప్రతిపదార్థం: ఈ, సైన్య, నిరోధంబునకు= ఈ సేనకు కలిగిన అవరోధానికి; ఇది= ఇది - అంటే నేను పుట్టను త్రవ్వించటం; నిమిత్తంబు+అగునో+అనిన= కారణం కాబోలునేమో అని చెప్పగా; శర్యాతి= శర్యాతి; అప్పుడు= ఆ సమయాన; ఆ+పుట్ట+ఒద్దకు= ఆ పుట్టదగ్గరకు; వచ్చి= వచ్చి; అందున్= ఆ పుట్టలో; తపస్+క్లేశంబునన్= తపస్సు చేయటంచేత ఏర్పడినకష్టంవలన; కృశ, త్వక్+అస్థిభూత, శరీరున్= సన్నగిల్లి తోలు ఎముకలుగా మారిన దేహం కలవాడిని; అతివృద్ధున్= మిక్కిలి ముసలివాడిని; భార్గవున్+కని= భృగు నందనుడైన చ్యవనుడిని చూచి; నమస్కరించి= వందనం చేసి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ సేనకు ఏర్పడిన అవరోధానికి నేను చేసినపని-పుట్టను తవ్వించటం-కారణం కావచ్చేమో'- అని చెప్పగా, శర్యాతి వెంటనే ఆ పుట్టదగ్గరకు వెళ్ళి అందులో చిరకాలం తపస్సు చేయటంచేత మిక్కిలి శుష్కించి కేవలం తోలు, ఎముకలు మాత్రమే మిగిలిన దేహం కలవాడైన ముసలివాడిని, భృగుమహర్షి కొడుకైన చ్యవనమహామునిని చూచి వందనం చేసి యిట్లా పలికాడు.

క. 'అమితంబగు మీ తపము మ । హిమ యెఱుఁగక యిట్లు చేసె నిది; దీని సహిం
పుము; దయ మత్సైన్యనిరో । ధము వాపుమ; యెఱుక గలరె తరుణులు ధరణిన్.' 181

ప్రతిపదార్థం: అమితంబు+అగు= మితిలేనటువంటి; మీ, తపము, మహిమ= మీ తపస్సుయొక్క గొప్పశక్తి; ఎఱుఁగక= తెలియక; ఇది= ఈ సుకన్య; ఇట్లు= ఈ విధంగా; చేసెన్= చేసింది; దీనిన్= ఈ అపచారాన్ని; సహింపుము= సహించవలసింది (క్షమించవలసింది); దయన్= దయతో; మత్+సైన్య, నిరోధము= నా సేనకు ఏర్పడిన చేటు; పాపుము+అ= తొలగించుమా; ధరణిన్= భూలోకాన; తరుణుల్= వయస్సులో ఉన్న ఆడపిల్లలు; ఎఱుక+కలరె= వివేకం కలవారా? (కాదుకదా)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఓ ఋషీశ్వరా! మీ తపస్సుయొక్క మాహాత్మ్యం తెలియక, మా అమ్మాయి సుకన్య ఈ విధంగా చేసింది. ఆమె అపరాధాన్ని క్షమించ ప్రార్థన. దయతో నా సైన్యానికి ఏర్పడిన ఆపద తొలగించవలసింది. భూమిపై లేజవరాళ్ళు అయిన ఆడపిల్లలకు వివేకం ఉంటుందా!'

వ. అనిన భార్గవుండు కరుణించి 'యతిశయ రూపయౌవన గర్వితయైన యాకన్యకం బరిగ్రహించి కాని సహింప' ననిన శర్యాతి తన కూఁతు నమ్మునివరున కిచ్చి నిజసైన్యనిరోధంబుఁ బాచిగొని చనిన. 182

ప్రతిపదార్థం: అనిన= అని ప్రార్థించగా; భార్గవుండు= భృగు నందనుడైన చ్యవనుడు; కరుణించి= శర్యాతిపై దయ తలచి; అతిశయ, రూప, యౌవన, గర్విత+ఐన= మిక్కుటమైన అందం, పడుచుదనంతో పొగరెక్కిన; ఆ+కన్యకన్= ఆ సుకన్యను; పరిగ్రహించి కాని= స్వీకరించి కాని (పెండ్లాడికాని); సహింపను+అనిన= క్షమించను అని చెప్పగా; శర్యాతి= శర్యాతి మహారాజు; తన కూఁతున్= తన పుత్రిక అయిన సుకన్యను; ఆ+మునివరునకు= ఋషిశ్రేష్ఠు డయిన ఆ చ్యవనుడికి; ఇచ్చి= వివాహం చేసి; నిజ, సైన్య, నిరోధంబున్= తనసేనకు ఏర్పడిన చేటు; పాచికొని= తొలగించుకొని; చనినన్= వెళ్ళగా.

తాత్పర్యం: అని శర్యాతి మహారాజు ప్రార్థించాడు. భృగునందనుడైన చ్యవనమహర్షికి శర్యాతిపై దయ కలిగింది. కాని, మిక్కుటమైన అందం, పడుచుదనంతో పొగరెక్కిన రాజపుత్రిక సుకన్యను తాను పెండ్లాడికాని క్షమించను అని చెప్పాడు. అప్పుడు శర్యాతి తనపుత్రిక అయిన సుకన్యను చ్యవనుడికి ఇచ్చి పెళ్ళిచేసి, తనసేనకు కలిగిన చేటు తొలగించుకొని వెళ్ళాడు.

ఆ. పతికిఁ బరమభక్తిఁ బరిచర్య సేయుచు । నొనరఁగా సుకన్య యుండునంత
నా లతాంగికడకు నాశ్వును లేతెంచి । త మ్మెఱుంగఁ జెప్పి దాని కనిరి. 183

ప్రతిపదార్థం: పతికిన్= భర్తకు; పరమభక్తిన్= మిక్కిలి భక్తితో; పరిచర్య+చేయుచున్= సేవచేస్తూ; ఒనరఁగా= ఒప్పునట్లుగా; సుకన్య= సుకన్య; ఉండునంతన్= ఉండిఉండగా; ఆ, లతా+అంగి, కడకున్= సుకుమారమైన తీగవంటి శరీరం కల ఆ సుకన్య దగ్గరకు; ఆశ్వినులు= అశ్వినీ దేవతలు; ఏతెంచి= అరుదెంచి, వచ్చి; తమ్ము+ఎఱుంగన్+చెప్పి= తా మెవరో ఆమెకు తెలియజేసి; దానికి= ఆమెతో; అనిరి= ఇట్లా చెప్పారు.

తాత్పర్యం: ఆ సుకన్య తనభర్త అయిన చ్యవనుడికి మిక్కిలి భక్తితో సేవలు చేస్తున్నది. సుకుమారమైన తీగవంటి శరీరంకల ఆ సుకన్య దగ్గరకు (సౌందర్యమూర్తులు, నిత్యయౌవనులు అయిన) అశ్వినీదేవతలు వచ్చి, తాము ఎవరో ఆమెకు తెలియజెప్పి ఇట్లా పలికారు.

విశేషం: అశ్వినీదేవతలు కవలలు. స్వర్గలోకంలోని జంటవైద్యులు. పురుషసౌందర్యానికి అశ్వినీదేవతలను ఆదర్శప్రాయంగా అభిర్ణించటం పౌరాణికవాఙ్మయంలో కనిపిస్తుంది.

వ. 'అవ్వా! నీ వెవ్వని కూఁతుర? వెవ్వని భార్య?' వని యడిగిన 'నేను శర్యాతికూఁతుర; భార్గవుం డయిన చ్యవనుని భార్య'నని చెప్పిన విని వారలు నగి 'యక్కటా! యిట్టి రూపవిభవంబులు వడసి కామభోగబాహ్యుఁ డయిన వృద్ధు భార్గవుని వరియించి నీ జవ్వనం బెల్ల వృథచేసి; తింకనైనను నీవయోరూపంబులకుం దగిన వరు వరియింపు; మేము వానిఁ దెచ్చెద' మనిన నప్పలుకులు సహింపక సుకన్య యాశ్వినుల కిట్లనియె. 184

ప్రతిపదార్థం: అవ్వా!= అమ్మా!; నీవు+ఎవ్వని, కూఁతురవు= నీవు ఎవరి కూతురివి?; ఎవ్వని (ఏ+వాని) భార్యవు= ఎవరి భార్యవు?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; ఏన్= నేను; శర్యాతి, కూఁతుర= శర్యాతి మహారాజు కూతురిని; భార్గవుండు+ అయిన= భృగుమహర్షి కొడుకైన; చ్యవనుని భార్యను= చ్యవన మహర్షి భార్యను; అని, చెప్పిన= అని బదులు చెప్పగా; విని= ఆలకించి; వారలు= ఆ అశ్వినీ దేవతలు; నగి= నవ్వి; అక్కటా!= అయ్యో!; ఇట్టి= ఇటువంటి; రూప, విభవంబులు= రూపసంపదలు; పడసి= పొంది; కామ, భోగ, బాహ్యుఁడు+అయిన= శృంగారానికి, ఐశ్వర్య సౌఖ్యానికి వెలిఅయిన వాడైన; వృద్ధున్= ముసలివాడిని; భార్గవుని= భృగుడి కుమారుడైన చ్యవనుడిని; వరియించి= పెళ్ళాడి; నీ, జవ్వనంబు+ఎల్లన్= నీ యౌవనం అంతటినీ; వృథ, చేసితి(వి)= వ్యర్థం చేశావు; ఇంకన్+ఐనను= ఇకమీదైనా; నీ, వయస్+రూపంబులకున్= నీ యౌవనానికి, అందానికీ; తగిన, వరు= తగిన వరుడిని; వరియింపుము= కోరుకొని పెండ్లాడుము; ఏము= మేము; వానిన్= నీవు కోరినవాడిని; తెచ్చెదము= తీసికొని రాగలం; అనినన్= అని వచించగా; ఆ+పలుకులు= ఆ మాటలు; సహింపక= అంగీకరించక; సుకన్య= సుకన్య; అశ్వినులకు= అశ్వినీ దేవతలకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: 'అవ్వా! నీవు ఎవరి కూతురివి? ఎవరి భార్యవు?' అని అశ్వినీదేవతలు సుకన్యను అడిగారు. 'నేను శర్యాతిపుత్రికను, భార్గవనందనుడైన చ్యవనుడి భార్యను' అని ఆమె సమాధానం చెప్పగా, ఆశ్వినులు పకపక నవ్వి 'నీ అందం ఎటువంటిది? ఆభిజాత్య సంపదలు ఎటువంటివి? శృంగారకేళికికాని, ఐశ్వర్య భోగాలకు కాని కొరగాని ఈముసలి చ్యవనుడిని పెళ్ళాడి నీవు నీసౌందర్యాన్ని యౌవనాన్ని వ్యర్థం చేసికొన్నావు. ఇకనైనా నీకు తగిన వరుడిని కోరుకొనుము. మేము అతడిని నీకు సమకూర్చగలం' అని వచించగా సుకన్య వారి మాటలను ఆదరించక ఈ విధంగా బదులు పలికింది.

ఆ. 'చ్యవనునందు నాకు సంతతప్రీతియై । యుండ నిట్లు పలుకు టుచిత మగునె?'
యని నిజేశ్వరునకు నప్పుడ వారల । పలుకు లెఱుఁగఁ జెప్పెఁ బంకజాక్షి. 185

ప్రతిపదార్థం: చ్యవను+అందు= చ్యవన మహర్షి యందు; నాకు= నాకు; సంతతప్రీతి+ఐ+ఉండన్= ఎడతెగని ప్రేమ ఉండగా; ఇట్లు= ఈ విధంగా; పలుకుట= మాట్లాడటం; ఉచితము+అగునె?= భావ్యమగునా?; అని= అని చెప్పి; పంకజ+అక్షి= పద్మాలవంటి కన్నులు గల సుకన్య; నిజ+ఈశ్వరునకున్= తన భర్తకు, అనగా చ్యవనుడికి; అప్పుడు+అ= ఆ క్షణమందే; వారల, పలుకులు= వారు చెప్పినమాటలు; ఎఱుఁగన్+చెప్పెన్= తెలియచెప్పింది.

తాత్పర్యం: 'నా భర్త అయిన చ్యవనమహర్షియందు నాకు ఎడతెగనిప్రేమ ఉండగా మీరు ఈవిధంగా మాట్లాడటం భావ్యమా?' అని ఆమె ఆశ్వినులకు సమాధానం చెప్పి, వారు తనకు చెప్పిన పలుకులన్నీ పద్మాక్షి అయిన ఆ సుకన్య తనభర్తకు తెలిపింది.

వ. చ్యవనుండు దాని పతివ్రతాత్వంబునకు సంతోసిల్లి 'వారల పలుకుల కొడంబడు' మని పంచిన నది పతి చేత ననుజ్ఞాతయై చని' నాకు నవయౌవనవరుం గావింపుం' డనిన నాశ్విను లప్పుడక్కొలను సొచ్చిరి; భార్గవుండును వారితోడ సరఃప్రవేశంబు సేసె; నిట్లమ్మువ్వురు నవయౌవను లయి సుకన్యకడకు వచ్చి నిలిచి 'మాయందు నీ వలచువానిని వరియింపు' మనిన నది తనపతియైన భార్గవుని వరియించె; నంత నయ్యాశ్వినుల కతిప్రీతుండై చ్యవనుం డిట్లనియె. 186

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: చ్యవనుండు= చ్యవనమహర్షి; దాని= ఆమెయొక్క, ఆ సుకన్యయొక్క; పతివ్రతాత్వంబునకు= భర్తయందుకల ఏకైక భక్తిభావానికి; సంతోసిల్లి= సంతసించి; వారల, పలుకులకు= వారు చెప్పిన మాటలకు; ఒడంబడుము= అంగీకరించుము; అని, పంచినన్= అని ఆజ్ఞాపించగా; అది= ఆ సుకన్య; పతిచేతన్= భర్తచేత; అనుజ్ఞాత+ఐ= అంగీకారం పొందినటువంటిదై; చని= వెళ్ళి; నాకు= నాకు; నవ, యౌవన, వరున్= కొత్తపడుచుదనంగల పెళ్ళికొడుకును; కావింపుండు= సమకూర్చండి; అనినన్= అని చెప్పగా; ఆశ్వినులు= అశ్వినీదేవతలు; అప్పుడు+అ= అప్పుడే; ఆ+కొలను= ఆ కొలనులోకి; చొచ్చిరి= ప్రవేశించారు; భార్గవుండును= భృగుడి కొడుకు చ్యవనుడున్నూ; వారితోడ= ఆ ఆశ్వినులవెంబడే; సరస్+ప్రవేశంబు+ చేసెన్= కొలనులో ప్రవేశించాడు; ఇట్లు= ఈ విధంగా; ఆ+ముప్పురు= ఆముగ్గురున్నూ; నవ, యౌవనులు+అయి= కొత్త పడుచుదనం కలవారై; సుకన్య, కడకు= సుకన్య దగ్గరకు; వచ్చి= వచ్చి; నిలిచి= నిలబడి; మా+అందు= మా ముగ్గురిలో; నీ వలచువానిని= నీకు ఇష్టమైన వాడిని; వరియింపుము+అనినన్= ఎన్నుకొనుము అని చెప్పగా; అది= ఆ సుకన్య; తనపతి+ఐన= తన భర్త అయిన; భార్గవుని= చ్యవనుడిని; వరియించెన్= ఎన్నుకొన్నది; అంతన్= అటుపిమ్మట; ఆ+ఆశ్వినులకు= ఆ అశ్వినీ దేవతలయెడ; చ్యవనుండు= చ్యవనుడు; అతిప్రీతుండు+ఐ= మిక్కిలి అభిమానం కలవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: చ్యవనుడు సుకన్యయొక్క పతిభక్తికి మిక్కిలి సంతోషించి 'అశ్వినీదేవతలు చెప్పిన ప్రకారం చేయు' మని నియోగించాడు. సుకన్య తనభర్త ఆజ్ఞాపించిన విధాన ఆశ్వినులతో 'నాకు క్రొత్త పడుచుదనం గల పెళ్ళికొడుకును సమకూర్చండి' అని అడిగింది. వారు ఆ కొలనులో ప్రవేశించారు. చ్యవనమహర్షి కూడా ఆ అశ్వినీ దేవతలవెంట ఆ కొలనులో ప్రవేశించాడు. అట్లా ఆ ముగ్గురూ ఆ సరస్సునుండి నవయౌవనులై తిరిగి బయటకు వచ్చి, సుకన్యను చేరి 'మా ముగ్గురిలో నీకు నచ్చినవాడిని ఎన్నుకొనుము' అని అన్నారు. అంత సుకన్య తన భర్త అయిన చ్యవనుడినే వరించింది. చ్యవనుడు అశ్వినీదేవతలయెడ మిక్కిలి ప్రీతి కలవాడై ఇట్లా పలికాడు.

విశేషం: ఈ ఘట్టంలో సంస్కృత భారతంలో కొలనిలో మునిగి లేచిన ముప్పురు - అశ్వినీ దేవతలు, చ్యవనుడు - సమానమైన రూపాన్ని - అంటే నవయౌవనంలో ఉన్న చ్యవనుడి ఆకృతిని ధరించినట్లు స్పష్టీకరించబడింది. చూ.III 123-20 శ్లో. (నీలకంఠీయము).

చ్యవనుఁ డాశ్వినుల సోమపీథులఁ జేయుట (సం. 3-124-21)

తే. **'ఏను మీ కారణంబున నిపుడు లబ్ధ । యౌవనుండనై ధన్యుండ నైతి; మిమ్ము**
సోమపీథులఁ జేసెద సురలరాజు । సూచుచుండఁగ శర్యాతిసుక్రతువున.' **187**

ప్రతిపదార్థం: ఏను= నేను; మీ కారణంబునన్= మీ మూలాన; ఇపుడు= ఇప్పుడు; లబ్ధ యౌవనుండను+ఐ= పొందబడిన పడుచుదనం కలవాడినై; ధన్యుండన్+ఐతి= కృతార్థుడిని కాగలిగాను; మిమ్ము= మిమ్మల్ని; శర్యాతి, సు, క్రతువున= శర్యాతి చేసే మంచి యజ్ఞంలో; సురల, రాజు= దేవేంద్రుడు; చూచుచుండఁగన్= చూస్తుండగా; సోమ, పీథులన్+చేసెదన్= (పవిత్రమైన) సోమరసాన్ని తాగేవారినిగా చేస్తాను.

తాత్పర్యం: 'నేను మీ మూలాన నేడు తిరిగి నవయౌవనాన్ని సంతరించుకోగలిగాను, కృతార్థుడి నైనాను. శర్యాతి మహారాజు చేసే యజ్ఞంలో దేవేంద్రుడు చూస్తూ ఉండగా మీచేత సోమరసాన్ని త్రాగిస్తాను.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని చెప్పిన నాశ్వినులు సంతసిల్లి యరిగి; రిట శర్యాతి భార్గవు జరాభార పరిత్యాగంబు విని విస్మితుండై యల్లునిం గూఁతుం జూడవచ్చిన, నాతని సత్కృతుం జేసి భార్గవుం డిట్లనియె. 188

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అంటూ చ్యవనుడు చెప్పగా; ఆశ్వినులు= అశ్వినీదేవతలు; సంతసిల్లి= సంతోషించి; అరిగిరి= వెళ్ళారు; ఇట= ఇక్కడ; శర్యాతి= శర్యాతి మహారాజు; భార్గవు, జరా, భార, పరిత్యాగంబు= చ్యవనుడియొక్క ముసలితనపు బరువు వీడిపోవటం; విని= ఆలకించి; విస్మితుండు+ఐ= ఆశ్చర్యం పొందినవాడై; అల్లునిన్= జామాతను; కూఁతున్= పుత్రికను; చూడవచ్చినన్= చూడటానికి రాగా; ఆతనిన్= ఆ శర్యాతిని; సత్కృతున్+చేసి= సమ్మానించి; భార్గవుండు= చ్యవనుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చ్యవనుడు చెప్పగా, ఆశ్వినులు సంతోషించి వెళ్ళారు. ఇక్కడ శర్యాతి మహారాజు తన అల్లుడు తిరిగి పడుచుదానాన్ని పొందాడని విని ఆశ్చర్యపడి, అల్లుడినీ, కూతురినీ చూడటానికి వచ్చాడు. చ్యవనుడు మామగారైన శర్యాతిని మర్యాదలతో మన్నించి యిట్లా చెప్పాడు.

క. 'విదితముగ నిన్నుఁ జేయిం । చెదఁ గ్రతువు ధరాధినాథ! చేయుము నీ క
భ్యుదయం బగు సంభారస । ముదయము సమకట్టు' మనిన మునివచనమునన్. 189

ప్రతిపదార్థం: ధరా+అధినాథ!= భూమికి అధినాథుడివైన ఓ మహారాజా!; విదితముగ= అందరికీ తెలిసేటట్లుగా, అనగా నీకు కీర్తి లభించేటట్లుగా; క్రతువు= యజ్ఞం; నిన్నున్+చేయించెదన్= నీచేత చేయించగలను; చేయుము= యజ్ఞాన్ని చేయుము; నీకు+అభ్యుదయంబు+అగు= నీకు మేలు కలుగుతుంది; సంభార సముదయము= వస్తు సామగ్రిని అంతటినీ; సమకట్టుము= సమకూర్చుము; అనిన, ముని, వచనమునన్= అని చెప్పిన మునియొక్క మాటలప్రకారం.

తాత్పర్యం: 'ఓ మహారాజా! నీకు గొప్పకీర్తి కలిగేటట్లుగా నీచేత యజ్ఞాన్ని చేయించగలను; నీకు మేలు కలుగుతుంది. యజ్ఞానికి కావలసిన వస్తుసామగ్రిని సర్వాన్ని సమకూర్చుము!' అని చెప్పిన, మునివరుడి మాటలను అనుసరించి.

క. అనఘుఁడు శర్యాతి మఖం । బొనరించె విధిప్రయోగయుతముగ; నం దా
శ్వినులకు సోమం బీఁ బో । యిన భృగుపుత్త్రునకు నలిగి యింద్రుం డనియెన్. 190

ప్రతిపదార్థం: అనఘుఁడు= పాపం లేనివాడు; శర్యాతి= శర్యాతిమహారాజు; మఖంబు= యజ్ఞాన్ని; విధి, ప్రయోగ, యుతముగన్= శాస్త్రంలోని సూత్రాలు నిర్దేశించిన విధానం ప్రకారం; ఒనరించెన్= చేశాడు; అందు= ఆ యజ్ఞంలో; ఆశ్వినులకున్= అశ్వినీదేవతలకు; సోమంబు= సోమరసాన్ని; ఈన్+పోయిన= ఇవ్వటానికి (ఇచ్చేందుకు) ఉద్యుక్తుడైన; భృగు, పుత్త్రునకున్= చ్యవనుడిపై; అలిగి= ఆగ్రహించి; ఇంద్రుండు= దేవేంద్రుడు; అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పుణ్యాత్ముడైన శర్యాతి మహారాజు శాస్త్రాలలో చెప్పబడినట్లు యజ్ఞాన్ని యథావిధిగా నిర్వహించాడు. ఆ యజ్ఞంలో అశ్వినీదేవతలకు సోమరసం ఇవ్వటానికి సంసిద్ధుడైన చ్యవనుడిపై కోపించి ఇంద్రుడు ఇట్లా పలికాడు.

క. వీరిద్దఱు సోమార్హులు । గా; రమరుల వెజ్జు; లిది యకర్తవ్యము; బృం
దారకులు గానివారికి । వారింపక సోమ మిచ్చువారుం గలరే? 191

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వీరు+ఇద్దఱు= ఈ అశ్వినీదేవతలు ఇద్దరు; సోమ+అర్హులు, కారు= సోమాన్ని స్వీకరించేందుకు యోగ్యత కలవారు కారు; అమరుల, వెజ్జులు= (వీరు) దేవతలకు వైద్యం చేసేవారు; ఇది= ఈ విధంగా సోమరసాన్ని వీరికి ఇవ్వటం; న+కర్తవ్యము= చేయకూడని పని; బృందారకులు+కానివారికి= దేవతలు కానివారికి; వారింపక= అడ్డులేకుండగా; సోమము+ఇచ్చు, వారున్= సోమరసాన్ని ఇచ్చేవారుకూడా; కలరే?= ఉన్నారా? (ఉంటారా?)

తాత్పర్యం: ఈ అశ్వినీదేవతలు ఇద్దరు దేవతలకు వైద్యం చేసేవారు. వీరు సోమరసానికి అర్హులు కారు. ఇది చేయకూడని పని. అడ్డులేకుండ వీరికి సోమం ఇచ్చేవారు ఉంటారా?

విశేషం: యజ్ఞంలో సోమరస పానానికి సంప్రదాయ సిద్ధమైన యోగ్యత కలవాడు ఇంద్రుడు. ఇంద్రుడు దేవతలపక్షాన సోమరసాన్ని పరిగ్రహించి త్రాగుతాడు. అశ్వినీ దేవతలకు అట్టి అర్హత అంతవరకు లేదు. ఇంద్రుడి దృష్టిలో ఆశ్వినులు దేవతలకు వైద్యసేవ చేసే భృత్యులు. వారికి తదితర బృందారకులతో సమాన ప్రతిపత్తి ఇవ్వటం దేవతలకు ప్రభువైన ఇంద్రుడికి ఇష్టం లేదు. సోమపానాన పంక్తిబాహ్యులుగా పరిగణించబడుతున్న అశ్వినీదేవతలకు సమానప్రతిపత్తి కల్పించి రసాన్ని ఇవ్వటం చ్యవనమహర్షి క్రొత్తగా ప్రవేశపెట్టిన మర్యాద.

వ. అనిన నింద్రువచనం బాదరింపక చ్యవనుం డాశ్వినుల సోమపీథులం జేసిన, దాని సహింపక యింద్రుం డలిగి. 192

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఇంద్రు వచనంబు= ఇంద్రుడిమాట; ఆదరింపక= లక్ష్యపెట్టక; చ్యవనుండు= చ్యవనుడు; ఆశ్వినుల= ఆశ్వినీ దేవతలను; సోమపీథులన్+చేసిన= సోమరసాన్ని త్రాగినవారినిగా చేయగా; దానిన్= చ్యవనుడి ఆ చర్యను; సహింపక= ఓర్వక; ఇంద్రుండు= ఇంద్రుడు; అలిగి= కోపించి

తాత్పర్యం: అని ఇంద్రుడు పలుకగా, చ్యవనమహర్షి అతడి పలుకులు సరకుకొనక (లెక్కచేయక) ఆశ్వినులకు సోమరసాన్ని ఇచ్చి త్రాగించాడు. అందుకు ఇంద్రుడు ఆగ్రహించి,

క. జృంభించి వజ్ర మెత్తిన । జంభాంతకు వజ్రయుత భుజాస్తంభము సం
స్తంభించి యతనిఁ బటుసం । రంభంబునఁ జంపఁ గడఁగి రౌద్రాకృతితోన్. 193

ప్రతిపదార్థం: జృంభించి= అతిశయించి; వజ్రము+ఎత్తినన్= వజ్రాయుధాన్ని ప్రయోగించటానికి ఉద్యుక్తుడు కాగా; జంభాంతకున్= జంభుడు అనే రాక్షసుడిని వధించినట్టి ఇంద్రుడియొక్క; వజ్ర, యుత, భుజా, స్తంభము= వజ్రంతో కూడిన స్తంభంవంటి భుజస్కంధం; సంస్తంభించి= కదలకుండేటట్లుగా చేసి; అతనిన్= ఆ ఇంద్రుడిని; పటు, సంరంభంబునన్= గొప్ప వేగిరిపాటుతో కూడిన యత్నంతో; చంపన్+కడఁగి= సంహరించదలచి; రౌద్ర+ఆకృతితోన్= భయంకరమైన రూపంతో.

తాత్పర్యం: చ్యవనుడిమీద ప్రయోగించేందుకు ఇంద్రుడు తన వజ్రాయుధాన్ని ఎత్తాడు. అంతట చ్యవనుడు వేగిరపాటుతో కూడిన గొప్ప యత్నంతో రౌద్రాకారుడై ఇంద్రుడు ఎత్తినచేతిని వజ్రాయుధంతో పాటు స్తంభింపచేసి అతణ్ణి చంపుటకు ప్రయత్నించి-

క. చ్యవనుఁడు వేల్చిన నం దు । ద్భవ మయ్యె నపారఘోరబలయుతుఁడు మహా
జవుఁడు మదుం డను రాక్షసుఁ । డవనిచర ద్యుచర భీకరాకారుండై. 194

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: చ్యవనుఁడు= చ్యవనమహర్షి; వేల్చినన్= అగ్నిలో హోమం చేయగా; అందు= అందులోనుండి; న+పార, ఘోర, బల, యుతుఁడు= మితి లేని భయంకరమైన పటుత్వం కలవాడు; మహాజవుఁడు= గొప్ప వేగంకలవాడు; మదుండు= మదుడు; అను= అనేటటువంటి; రాక్షసుఁడు= రాక్షసుడు; అవనిచర, ద్యుచర, భీకర+ఆకారుండు+ఐ= భూమిమీద సంచరించే మనుష్యులకు, ఆకాశంలో విహరించే దేవతలకు భయాన్ని కలిగించే రూపం కలవాడై; ఉద్భవము+అయ్యెన్= ఉద్భవించాడు.

తాత్పర్యం: చ్యవనమహర్షి హోమం చేయగా, అందులోనుండి మితిలేని భయంకరమైన శక్తి కలవాడున్నూ, గొప్పవేగం కలవాడున్నూ అయిన రాక్షసుడు మదుడు అనేపేరు కలవాడు- భూమిమీద సంచరించే వారికి, ఆకాశంలో సంచరించేవారికి భీతిని కొలిపే గొప్పరూపం కలవాడై ఆవిర్భవించాడు.

క. ఇట్లుద్భవించి, దశ సహస్ర యోజనాయామంబులైన బాహుదండంబులయు, శత యోజనాయామంబులైన చతుర్దంష్ట్రలయు, దశ యోజనాయామంబులైన దశనంబులయు, శశిరవిమండల సదృశంబులైన నయనంబులయుఁ, గాలాగ్ని సన్నిభంబైన వక్త్రంబును, దిగ్భూనభోభాగసంకటంబైన శరీరంబునుందోడ భూమి నొక్కహనువును దివంబును నొక్కహనువుగా వదనగహ్వరంబు దెఱచి, జగజ్జనసంత్రాసనవ్యగ్ర సంచలనంబైన దీర్ఘ జిహ్వా నధరోష్ఠ పుటంబు నాకుచు నత్యుగ్రనాదంబున దిక్కులు వ్రచ్చుచు వచ్చు మహారాక్షసుం జూచి సురేంద్రుండు వెఱచి, భార్గవస్తంభితభుజుండు గావున వాని నెద్దియుం జేయనేరక చ్యవను నొద్దకు వచ్చి కృతాంజలియై 'మునీంద్రా! నీ తపోవీర్య మహారంభంబు మిథ్య యగునే? యాశ్వినులు నేడు మొదలుగా సోమార్హు లగుదురు; నీవు నాకుఁ బ్రసన్నుండవై క్షమింపు' మనిన. 195

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ఉద్భవించి= పుట్టి; దశ, సహస్ర, యోజన+ఆయామంబులు+ఐన= పదివేల ఆమడల పొడుగుకల; బాహుదండంబులయు= లావుపాటి కర్రలవంటి భుజాలతోను; శతయోజన+ఆయామంబులు+ఐన= నూరు ఆమడల పొడవుకల; చతుర్+దంష్ట్రలయు= నాలుగు కోరలతోను; దశ, యోజన+ఆయామంబులు+ఐన= పది ఆమడల పొడుగున్న; దశనంబులయు= దంతాలతోను; శశి, రవి, మండల, సదృశంబులు+ఐన= చంద్రుడియొక్క సూర్యుడియొక్క బింబాలతో సమానమైన; నయనంబులయున్= కన్నులతోను; కాల+అగ్నిసన్నిభంబు+ఐన= ప్రళయకాలంలోని అగ్నితో సమానమైన; వక్త్రంబును= నోరును; దిక్+భూ, నభస్+భాగ, సంకటంబు+ఐన= దిక్కులూ, భూమీ, ఆకసమూ వీటి మధ్యభాగంలో నిండిపోయిన; శరీరంబునున్= దేహమున్నూ; తోడ= కూడి; భూమిన్= పుడమిని; ఒక్క హనువును= ఒక దవడగా; దివంబునున్= ఆకసాన్ని; ఒక్క= ఒక; హనువుగాన్= దవడగా; వదన, గహ్వరంబు+తెఱచి= నోరు అనెడి గుహను విప్పి; జగత్+జన, సంత్రాసన, వ్యగ్ర, సంచలనంబు+ఐన= జగత్తులోని ప్రజలకు భీతిని తత్తరపాటును గొలుపుతూ మిగుల త్వరగా కదలుతున్న; దీర్ఘజిహ్వన్= పొడుగాటినాలుకతో; అధర+ఓష్ఠ, పుటంబు= క్రిందిపెదవి భాగాన్ని; నాకుచున్= నాలికతో; తడుపుతూ; అతి+ఉగ్ర, నాదంబున= మిక్కిలి భయంకరమైన ధ్వనితో; దిక్కులు వ్రచ్చుచు= దిక్కులను భేదిల్లజేస్తూ; వచ్చు= వచ్చు; మహా+రాక్షసున్+చూచి= అతికాయుడైన రాక్షసుడిని చూచి; సుర+ఇంద్రుండు= దేవేంద్రుడు; వెఱచి= భయపడి; భార్గవ, స్తంభిత, భుజుండు= భృగు పుత్రుడైన చ్యవనుడిచేత స్తంభింపచేయబడిన భుజం కలవాడు; కావున= కాబట్టి; వానిన్= అతడిని, ఆ రాక్షసుడిని; ఎద్దియున్= ఏమీ; చేయనేరక= చేయలేక; చ్యవను+ఒద్దకు, వచ్చి= చ్యవనుడి వద్దకు వచ్చి; కృత+అంజలి+ఐ= నమస్కరించినవాడై; ముని+ఇంద్రా!= ఋషులలో శ్రేష్ఠుడివైనవాడా!; నీ, తపస్+వీర్య, మహా+ఆరంభంబు= నీదైన తపస్సుకు సంబంధించిన విశేషశక్తితో కూడిన గొప్పయత్నం; మిథ్య+అగునే?= వ్యర్థం అవుతుందా?; ఆశ్వినులు= అశ్వినీదేవతలు; నేడు, మొదలుగాన్= ఈనాటినుండి; సోమ+అర్హులు= సోమరసపానానికి తగినవారు; అగుదురు= కాగలరు; నీవు, నాకున్; ప్రసన్నుండవు+ఐ= నా యెడల దయగల వాడివై; క్షమింపుము= నేను చేసిన తప్పును మన్నించుము; అనినన్= అని పలుకగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈవిధంగా ఆ రాక్షసుడు ఉద్భవించాడు. ఆ రాక్షసుడి చేతుల పొడుగు పదివేల ఆమడలు! అతడి నాలుగు కోరల పొడుగు నూరామడలు! అతడి దంతాల నిడివి పది ఆమడలు! అతడి కన్నులు సూర్యచంద్రబింబాలతో సమానాలు. అతడి నోరు ప్రళయకాలంలోని అగ్నిగోళంవంటిది!. అతడి శరీరం దివికి భువికి వ్యాపించి దిగ్దిగంతరాలకు ఒరపిడి పెట్టేటువంటిది. ఆ రాక్షసుడు నోరు విప్పినపుడు ఒక దవడ భూమికీ, ఒక దవడ ఆకాశానికీ వ్యాపించింది. అతడి నోటిలోని నాలుక లోకంలోని ప్రజలందరికీ భీతిని కల్పించేటటువంటిదై వేగంగా చలిస్తూ క్రిందిపెదవిని నాకుతున్నది. మిక్కిలి భయంకరమైన ధ్వనిచేస్తూ మీదికి ఉరుకుతూ వస్తున్న అతికాయుడైన ఆ రక్కసుడిని చూచి దేవేంద్రుడు భీతిల్లి, భృగునందనుడిచేత కదలకుండా స్తంభించబడిన భుజం కలవాడవటంచేత అతడిని ఏమీ చేయలేక చ్యవనుడి వద్దకు వచ్చి నమస్కరించి 'ఓ ఋషిసత్తమా! నీ తపశ్శక్తివలన చేసిన ప్రయత్నం వ్యర్థమౌతుందా? ఆశ్వినులు నేటినుండి సోమరసాన్ని యజ్ఞాలలో గైకొనటానికి అర్హులు కాగలరు. నీవు నాయందు దయ కలిగి, నేను చేసిన తప్పు మన్నించి, నన్ను కాపాడవలసింది' అని ప్రార్థించగా.

క. మునినాథు నలుకతోడన । యనిమిషపతి వజ్రయుత మహాభుజ సంస్తం
భన మడిగె; నంత భృగునం । దను వీడ్కొని యింద్రుఁ డరిగెఁ దన పురమునకున్. 196

ప్రతిపదార్థం: ముని, నాథు+అలుక, తోడన= ఋషిశ్రేష్ఠుడైన చ్యవనుడి కోపంతోపాటు; అనిమిష, పతి, వజ్ర, యుత, మహా, భుజ, సంస్తంభనము= దేవేంద్రుడియొక్క వజ్రాయుధంతో కూడిన గొప్ప బాహువు కదలకపోవటం; ఉడిగెన్= మానింది; అంతన్= అటుపిమ్మట; భృగు, నందనున్= భృగుపుత్రుడైన చ్యవనుడిని; వీడ్కొని= సెలవు తీసికొని; ఇంద్రుఁడు= దేవేంద్రుఁడు; తన పురమునకున్= తన నగరమైన అమరావతికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: మునిశ్రేష్ఠుడైన చ్యవనుడికోపం తీరిపోవటంతోనే దేవేంద్రుడి భుజం స్తంభించటంకూడ తొలగిపోయింది. అనంతరం దేవతలప్రభువైన ఇంద్రుడు, చ్యవనుడి దగ్గర సవినయంగా సెలవు తీసికొని తన పట్టణానికి వెళ్ళాడు.

విశేషం: అలంకారం: సహోక్తి, అటు చ్యవనుడి ఆగ్రహంతోపాటు ఇటు దేవేంద్రుడి భుజస్తంభనం పోవటం ఒక దానితోపాటు ఇంకొకటి జరుగటం అభివర్ణితం కాబట్టి ఇది సహోక్తి అలంకారం.

వ. అమ్మద రాక్షసుండు నాక్షణంబ చ్యవను నుపదేశంబున మద్య స్త్రీ మృగయాక్షంబుల నాశ్రయించె; నాశ్వినులు సోమపీథులై దివంబున కరిగి; రిట భార్గవుండైన చ్యవనుండు దన దపోమహత్త్వంబునందుఁ బ్రకాశింపఁ జేయుటంజేసి నాటంగోలె నది యార్చీకపర్వతంబు నాఁ బరఁగె' నని రోమశుండు సెప్పిన నందులఁ బుణ్య సరోవరంబునం గృతస్నానులై పాండవు లరిగి, యంత శంతను శునక నరనారాయణ విధాతృ తపోవన స్థానంబై దేవర్షినివాసంబైన సైంధవారణ్యంబునం జంద్రసరోవరంబునందు రోమశనియుక్తులై చరువులుసేసి యతిథులం బూజించి చని యమునానదిం గని; రంత వారలకు రోమశుం డిట్లనియె. 197

ప్రతిపదార్థం: ఆ+మదరాక్షసుండున్= ఆ మదుడు అనే పేరు కలరాక్షసుడు; ఆ+క్షణంబు+అ= ఆ త్రుటిలోనే; చ్యవను+ఉపదేశంబున= చ్యవనుడి ప్రబోధంవలన; మద్య, స్త్రీ, మృగయా+అక్షంబులన్= కల్లును, స్త్రీలను, వేటను, పాచికలను; ఆశ్రయించెన్= ఆధారంచేసికొన్నాడు; ఆశ్వినులు= అశ్వినీదేవతలు; సోమపీథులు+ఐ= యజ్ఞాలలో సోమరసాన్ని త్రాగటానికి అర్హత పొందినవారై; దివంబునకు= స్వర్గానికి; అరిగిరి= వెళ్ళారు; ఇట= ఇక్కడ; భార్గవుండు+ఐన= చ్యవనుండు= భృగుమహర్షి

కొడుకైన చ్యవనుడు; తన, తపస్+మహత్త్వంబున్= తన తపస్సు యొక్క మహిమను; అందున్= అక్కడ; ప్రకాశింపన్+ చేయుటన్+చేసి= వెలుగొందజేయటం చేత; నాటన్+కోలెన్= ఆనాటినుండి; అది= ఆ పర్వతస్థలం; ఆర్చీక, పర్వతంబు= ఆర్చీక పర్వతం; నాన్+పరఁగెన్= అనే పేరు పొందింది; అని= అని; రోమశుండు= రోమశుడు; చెప్పినన్= చెప్పగా; అందులన్= అక్కడున్న; పుణ్య, సరోవరంబునన్= పవిత్రమైన కొలనులో; పాండవులు= పాండు నందనులు; కృత, స్నానులు+ఐ= స్నానం చేసినవారై; అరిగి= వెళ్ళి; అంత= అటుపిమ్మట; శంతను, శునక, నర, నారాయణ, విధాతృ, తపస్+వన, స్థానంబు+ఐన= శంతనుడికి, శునకుడికి, నరనారాయణులకు, బ్రహ్మకు తపస్సుచేసికొన్న అరణ్యం అయినట్టిదియున్నూ; దేవ+ఋషి, నివాసంబు+ఐన= దేవలోకానికి చెందిన ఋషులు నివసించేటటువంటిదియున్నూ అయిన; సైంధవ+అరణ్యంబునన్= సైంధవమనే పేరుగల అరణ్యంలో; చంద్ర, సరోవరంబునందు= చంద్రుడిపేరుమీద వెలసిన కొలనులో; రోమశనియుక్తులు+ఐ= రోమశమహర్షి చెప్పిన తీరుగా (పాండవులు); చరువులు= హోమంలో వేల్చేటటువంటి అన్నాలు; చేసి= వండి, అక్కడ సన్నిహితులై ఉండే దేవతలకు, పితరులకు, ఋషులకు ప్రీతికరంగా హోమం చేసి; అతిథులన్+పూజించి= ఆగంతకులను అర్చించి; చని= ప్రయాణించి; యమునా, నదిన్= యమున అనేపేరుకల నదిని; కనిరి= చూశారు; అంతన్= అటుపిమ్మట; వారలకు= ఆ పాండవులకు; రోమశుండు= రోమశమహర్షి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: మదుడు అనే ఆ రాక్షసుడు చ్యవనమహర్షి ఆదేశంప్రకారం కల్లులోనూ, స్త్రీలలోనూ, వేటలోనూ, పాచికలలోనూ ప్రవేశించాడు. అశ్వినీదేవతలు యజ్ఞాలలో సోమరసాన్ని పడసి త్రాగే అర్హతను సంపాదించుకొని స్వర్గానికి వెళ్ళారు. భార్గవనందనుడైన చ్యవనమహర్షి తన తపస్సుయొక్క మహిమను అక్కడ వెలుగొందజేయటంచేత ఆకొండకు ఆర్చీకపర్వతం అనేపేరు కలిగింది- అని రోమశమహర్షి చెప్పగా, అక్కడి పుణ్యసరస్సులో పాండవులు స్నానంచేసి వెళ్ళారు. అంత శంతనుడు, శునకుడు, నరుడు, నారాయణుడు బ్రహ్మదేవుడు తపస్సు చేసిన స్థలమూ, దేవమునులు నివాస స్థానమూ అయిన సైంధవారణ్యంలో ఉన్న చంద్రసరస్సులో రోమశుడి ఆదేశంప్రకారం హోమాన్నాలతో హోమాలు చేసి, అతిథిపూజ కావించి, ప్రయాణించి పాండవులు యమునానదిని చేరారు. అపుడు పాండవులతో రోమశుడు ఇట్లా చెప్పాడు.

విశేషం: మహాభారతంలో అర్థవాదరూపాలైన కల్పనలు పెక్కు ఉన్నవి. ఈ కథలో చ్యవనమహర్షి ఇంద్రుడిని సంహరించటానికి రౌద్రాకృతితో ఉద్భవింపచేసిన రాక్షసుడు- జగత్తునంతటినీ ఆవరించిన అతికాయుడు, భీకరాకారుడు - ఇంద్రుడు చ్యవనుడిని శరణువేడగా, నిరర్థకుడై నిలువవలసి వచ్చింది. కాని, జగత్కంటక మహిమకల ఆ రాక్షసుడిని చ్యవనమహర్షి మద్యంలో, మహిళలలో, మృగయలో, పాచికలలో ప్రవేశపెట్టాడట. అనగా మకారత్రయం, (మద్యం, మహిళ, మృగయ), జూదం అనేవి జగత్కంటకమైన మహారాక్షసప్రవృత్తికి ఆకరాలు అని చాటిచెప్పటమే కదా!

మాంధాతృ చరిత్రము (సం. 3-125-22)

క. **'ఇది యమున యను మహానది । త్రిదశనదీనిభము; దీని తీరమున జగ**
ద్విదితుఁడు మాంధాతృఁడు సం । పదఁ గ్రతువులఁ జేసెఁ దొల్లి బహువత్సరముల్.' **198**

ప్రతిపదార్థం: ఇది= ఇది (ఈనది); యమున+అనుమహానది= యమున అనేపేరుగల గొప్పనది; త్రిదశ, నదీ, నిభము= దేవతలనదితో సమానం- అంటే గంగానదితో సమానమైనది; దీని, తీరమున= ఈ యమునానది గట్టున; జగత్+ విదితుఁడు= లోకంలోని జనులకు అందరికీ తెలిసినవాడు; మాంధాతృఁడు= మాంధాతృడు; తొల్లి= పూర్వకాలంలో; బహు, వత్సరముల్= ఎన్నో ఏళ్ళు; సంపదన్= ఐశ్వర్యంతో; క్రతువులన్= యజ్ఞాలను; చేసెన్= చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఇది యమునానది. దేవతలనది అయిన గంగానదితో సమానమైనది. ఈ యమునానదీ తీరాన పూర్వకాలాన ఎన్నోఏళ్ళు ఎంతోసంపద వెచ్చించి జగత్ప్రసిద్ధుడైన మాంధాతృడు పెక్కు యాగాలను చేశాడు.'

వ. అనిన 'మాంధాతృ జన్మంబును వాని చరితంబును వినవలతుం జెప్పు 'మని యడిగిన ధర్మరాజునకు రోమశుం డిట్లనియె. 199

ప్రతిపదార్థం: అనిన= అని చెప్పగా; మాంధాతృ, జన్మంబును= మాంధాత పుట్టుకను; వాని, చరితంబును= ఆ మాంధాత జీవితకథను; విన, వలతున్= వినటానికి ఇష్టపడతాను (ఇచ్ఛగిస్తాను); చెప్పుము= చెప్పవలసింది; అని= అంటూ; అడిగిన= కోరగా; ధర్మరాజునకు= ధర్మపుత్రుడికి; రోమశుండు= రోమశమహర్షి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: రోమశుడు అట్లా యముననుగురించి చెప్పగా, ధర్మరాజు మాంధాత పుట్టుకను, అతడి జీవిత వృత్తాంతాన్ని గూర్చి ఆలకించటానికి కుతూహలం కలిగి ఆ కథ వినిపించుమని కోరాడు. అంత ధర్మరాజుకు రోమశుడు ఇట్లా చెప్పాడు.

ఉ. 'వీకున నశ్వమేధములు వే యొనరించిన ధర్మశీలుఁ, డి
క్ష్వాకుకులోద్భవుండు, బలవంతుఁ, డనంతయశుం, డవార్యవీ
ర్యాకరుఁ, డుత్తముండు యువనాశ్వుఁ డపత్యము లేమిఁ జేసి దుః
ఖాకులుఁడై ప్రధానవరులందు సమర్పిత రాజ్యభారుఁడై. 200

ప్రతిపదార్థం: వీకునన్= పూనికతో; అశ్వమేధములు= అశ్వమేధయాగాలు; వేయి+ఒనరించిన= వేయిచేసిన; ధర్మ, శీలుఁడు= ధర్మస్వభావం కలవాడు; ఇక్ష్వాకు, కులంలో పుట్టినవాడు; బలవంతుఁడు= బలంకలవాడు; అనంత, యశుండు= మితిలేని కీర్తికలవాడు; అవార్య, వీర్య+ఆకరుఁడు= వారించటానికి వీలులేని పరాక్రమానికి నెలవైనవాడు; ఉత్తముండు= మంచివాడు; యువనాశ్వుఁడు= యువనాశ్వుడు అనే పేరు కల రాజు; అపత్యము= సంతానం; లేమిన్+చేసి= లేకుండటంచేత; దుఃఖ+ఆకులుఁడు+ఐ= శోకంచేత పరితపించినవాడై; ప్రధాన, వరులందు= మంత్రులపై; సమర్పిత, రాజ్య, భారుడు+ఐ= మోపబడిన ప్రజాపరిపాలనయొక్క బరువు కలవాడై.

తాత్పర్యం: 'పూనికతో వేయి అశ్వమేధయాగాలు చేసిన ధర్మచరిత్రుడు, ఇక్ష్వాకువంశంలో పుట్టినవాడు, గొప్ప బలం కలవాడు, మితిలేని కీర్తికలవాడు, వారించటానికి వీలులేని శౌర్యం కలవాడు, మంచివాడు, ఐన యువనాశ్వుడు అనేరాజు సంతానం లేకపోవటంచేత మిక్కిలి పరితపించి మంత్రులపై రాజ్యపరిపాలనభారం మోపి.

వ. భృగునాశ్రమంబునకుం జని పుత్త్రకాముండై పెద్దకాలం బమ్మునిఁ నుపాసించిన నయ్యువనాశ్వునకుం గరుణించి భృగుండు పుత్త్రకామేష్టిఁ జేసి యందు మంత్రపూతజలపూరితంబై పుత్త్రోదయకారణంబైన కలశంబు వడసి దాని రక్షించియుండ ఋత్విజులం బంచిన. 201

ప్రతిపదార్థం: భృగు+ఆశ్రమంబునకున్+చని= భృగుమహర్షి ఆశ్రమానికి వెళ్ళి; పుత్త్ర కాముండు+ఐ= కొడుకును కోరుకొనేవాడై; పెద్ద, కాలంబు= చాలాకాలం; ఆ+మునిన్= ఆఋషిని; ఉపాసించినన్= భక్తితో సేవించగా; ఆ+యువనాశ్వునకున్= ఆ యువనాశ్వుని యెడల; కరుణించి= దయకలిగి; భృగుండు= భృగుడు; పుత్త్రకామ+ఇష్టిన్+చేసి= పుత్రుడికొరకు కావించే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యజ్ఞాన్ని చేసి; అందున్= ఆ యజ్ఞంలో; మంత్ర, పూత, జల, పూరితంబు+ఐ= మంత్రాలచేత పవిత్రమైన నీళ్ళచేత నిండినట్టిదై; పుత్త్ర+ఉదయ, కారణంబు+ఐన= కొడుకు పుట్టటానికి హేతువైన; కలశంబు= పాత్రను; పడసి= పొంది; దానిన్= ఆ పవిత్ర కలశాన్ని; రక్షించి+ఉండన్= కాపాడటానికి; ఋత్విజులన్+పంచినన్= ఋత్విజులను నియోగించగా.

తాత్పర్యం: భృగుమహర్షి ఆశ్రమానికి వెళ్ళి పుత్రసంతానాన్ని కోరి చాలాకాలం ఆ మహర్షిని ఆరాధించాడు. భృగుమహర్షి యువనాశ్వుడిపై దయకలిగి పుత్రకామేష్టిని జరిపి, అందులో మంత్రాలచేత పవిత్రమైన నీటితో నిండిన పాత్రను, పుత్రుడు పుట్టటానికి హేతువైన దానిని పొంది, దానిని కాపాడటానికి ఋత్విజులను నియమించాడు.

ఆ. రాత్రి జాగరణభరశ్రాంతులై వారు । నిద్రఁ బొంది; రంత నీరు వట్టి
ధారుణీశ్వరుండు తన్మంత్రకలశోద । కంబు లెల్లఁ ద్రావెఁ గడుపునిండ. 202

ప్రతిపదార్థం: రాత్రి= రేయి; జాగరణ, భర, శ్రాంతులు+ఐ= మేలుకొనటంచేత ఏర్పడిన భారంచేత బడలిపోయినవారై; వారు= ఆ ఋత్విజులు; నిద్రన్, పొందిరి= నిద్రపోయారు; అంత= అప్పుడు; నీరు+పట్టి= దాహం బాగా వేసిన ధారుణీ+ఈశ్వరుండు= ధారుణీశ్వరుండు- రాజు (యువనాశ్వుడు); తద్, మంత్ర, కలశ+ఉదకంబులు+ఎల్లన్= ఆ కలశంలో ఉన్న మంత్రంచేత పవిత్రాలైన నీళ్ళను అన్నిటినీ; కడుపు, నిండన్= పొట్ట నిండేటట్లుగా; త్రావెన్= త్రాగాడు.

తాత్పర్యం: యజ్ఞం ముగిసిన ఆ రాత్రి ఋత్విజులు అందరు అలసిపోయి నిద్రపోయారు. రాజైన యువనాశ్వుడు దాహంవేసి కలశంలోని మంత్రపూతమైన యజ్ఞోదకాన్ని పొరపాటున మొత్తం త్రాగాడు.

వ. దాని నెఱింగి భృగుండు యువనాశ్వుం జూచి 'నీకుఁ బుత్త్రార్థంబుగా మదీయ తపోవీర్యలబ్ధంబైన యిమ్మంత్ర జలంబు నీ భార్య కీనున్నచో నీవధిక పిపాసాపరుండవయి యుపయోగించి యకర్తవ్యంబుఁజేసితి; దైవకృతం బెవ్వరికిఁ దప్పింప నశక్యంబు; దీనంజేసి నీకు గర్భంబై యింద్రసదృశుండైన పుత్త్రుం డుద్భవించు' ననిన విని యువనాశ్వుండు దనపురంబునకుం జని యున్నంత నూఱేండ్లకు యువనాశ్వువామభాగంబు భేదించుకొని బాలార్క తేజుండైన బాలకుండు వెలువడిన, నక్కొడుకుం జూడ నింద్రుండు వచ్చి, వాని వదనంబున నిజప్రదేశినిఁ బెట్టి 'యమృతమయంబగు దీనిం ద్రావు' మనిన, నింద్రు వచనంబున నమరులెల్ల నక్కుమారునకు మాంధాతృం డను నామంబుఁ జేసి; రట్లు సురేంద్ర సంవర్ధితుండై. 203

ప్రతిపదార్థం: దానిన్+ఎఱింగి= ఆ విషయాన్ని తెలిసికొని అనగా యువనాశ్వుడు యజ్ఞకలశంలోని మంత్ర పూరిపూతమైన నీళ్ళు త్రాగటాన్ని తెలిసికొని; భృగుండు= భృగుమహర్షి; యువనాశ్వున్+చూచి= యువనాశ్వుడిని చూచి; నీకున్= నీకు; పుత్ర+అర్థంబుగా= కొడుకు పుట్టటంకొరకై; మదీయ, తపస్+వీర్య, లబ్ధంబు+ఐన= నా తపస్సు యొక్క బలంచేత పొందబడినటువంటిదై; ఈ+మంత్రజలంబు= మంత్రాలచేత పవిత్రమైన ఈ నీరు; నీ, భార్యకు= నీ భార్యకు; ఈన్+ఉన్నచోన్= ఇవ్వాలని, ఉండగా; ఈవు= నీవు; అధిక, పిపాసా, పరుండవు+అయి= చాలా (మిక్కిలి) దాహంతో కూడినవాడివై; ఉపయోగించి= వాడి అనగా త్రాగి; అకర్తవ్యంబున్= చేయరానిపని; చేసితి(వి)= చేశావు; దైవకృతంబు= దైవంచేత ఏర్పరచబడినటువంటిది; ఎవ్వరికిన్= ఎవ్వరికైననూ; తప్పింపన్= తప్పించటానికి; అశక్యంబు= సాధ్యం కానిది; దీనన్+చేసి= దీనివలన; నీకు, గర్భంబు+ఐ= నీకు గర్భం వచ్చి; ఇంద్ర, సదృశుండు+ఐన= ఇంద్రుడితో సమానుడైన; పుత్త్రుండు= కొడుకు; ఉద్భవించున్= పుట్టుతాడు; అనిన విని= అని చెప్పగా విని; యువనాశ్వుండు= యువనాశ్వ మహారాజు; తన, పురంబునకున్+చని= తన రాజధానికి వెళ్ళి; ఉన్నంత= ఉండగా; నూఱు+ఏండ్లకు= వంద సంవత్సరాలకు; యువనాశ్వువామభాగంబు= యువనాశ్వుడి ఎడమభాగాన్ని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భేదించుకొని= చీల్చుకొని; బాల+అర్క, తేజుండు+ఐన= ఉదయభానుడి వెలుగుతో సమానమైన కాంతిగల; బాలకుండు= శిశువు (బాలుడు); వెలువడినన్= బయటకు రాగా; ఆ+కొడుకున్+చూడన్= ఆ కొడుకును చూడటానికై; ఇంద్రుండు= ఇంద్రుడు; వచ్చి= వచ్చి; వాని, వదనంబున= ఆ శిశువునోటిలో; నిజ, ప్రదేశినిన్+పెట్టి= తన చూపుడు వ్రేలిని పెట్టి; అమృత, మయంబు+అగు= అమృతంతో నిండిన; దీనిన్= దీనిని; త్రావుము+అనినన్= త్రాగుము అనిచెప్పగా; ఇంద్రు, వచనంబునన్= ఇంద్రుడిమాటప్రకారం; అమరులు+ఎల్లన్= దేవతలందరూ; ఆ+కుమారునకున్= ఆ కుమారుడికి; మాంధాతృండు+అను= మాంధాతృడు అనే; నామంబున్+చేసిరి= పేరుపెట్టారు; అట్లు= ఆ విధంగా; సుర+ఇంద్ర, సంవర్ధితుండు+ఐ= దేవతలరాజైన, ఇంద్రుడిచేత పెంచబడినవాడై.

తాత్పర్యం: ఆ విషయాన్ని తెలిసికొని, భృగుమహర్షి యువనాశ్వుడిని చూచి 'నీకు కొడుకు పుట్టాలని నా తపోమహిమవలన పొందబడిన మంత్రపూతాలైన ఈ నీళ్ళను నీభార్యకే ఇవ్వాలని ఉంచాను. కాని, నీవు చాలా దప్పికగొన్నవాడవై వాటిని త్రాగావు. దైవఘటనను ఎవ్వరూ తప్పించలేరుకదా! దీనివలన నీవు కడుపుతో ఉండగలవు, నీకు ఇంద్రుడితో సమానుడైన కొడుకు పుట్టగలడు'- అనిచెప్పగా యువనాశ్వుడు తన రాజధానికి తరలిపోయాడు. నూరుసంవత్సరాల తర్వాత యువనాశ్వుడి ఎడమప్రక్కను చీల్చుకొని కుమారుడు పుట్టాడు. ఆ బాలకుడు ఉదయభానుడికాంతితో తేజరిల్లాడు. ఆ శిశువును దర్శించటానికి దేవేంద్రుడు వచ్చి, ఆ శిశువు నోట్లో తన చూపుడు వ్రేలుంచి 'ఇది అమృతమయం; దీనిని చీకుము' అని చెప్పగా, దేవేంద్రుడి ఆమాట ప్రకారం దేవతలు ఆ బాలకుడికి మాంధాతృడు అని పేరు పెట్టారు. ఆ విధంగా మాంధాతృడు దేవేంద్రుడిచేత పోషించబడిన వా డయ్యాడు.

విశేషం: ఇంద్రుడు ఆ శిశువు నోటిలో తన చూపుడు వ్రేలిని ఉంచి అమృతాన్ని త్రావిస్తూ "అయం (ఇతడు) మాం(నన్ను) ధాస్యతి (పానము చేయును)" - అని పలికాడు. అందువలన దేవతలెల్ల - మాం ధాస్యతి ఇతి మాంధాతా - అనే వ్యుత్పత్తి ప్రకారం ఆ బాలకునకు "మాంధాతా" - అని సార్థకంగా నామకరణం కావించారు.

తే. **ధ్యానమాత్రన చేసి వేదములు సర్వ। శాస్త్రములు ధనుర్వేదము సకల దివ్య**
సాయక ప్రయోగంబులుఁ జట్ట వచ్చి। పొందె మాంధాతృఁ ద్రిభువనపూజ్యు నొప్ప. 204

ప్రతిపదార్థం: ధ్యాన, మాత్రన, చేసి= ఏకాగ్రతతో మనస్సున యోచించినంత మాత్రాననే; వేదములు= వేదాలు; సర్వ, శాస్త్రములు= అన్ని శాస్త్రాలు; ధనుస్+వేదము= విలువిద్య; సకల, దివ్య, సాయక, ప్రయోగంబులున్= దివ్యాలైన అమ్ముల వాడకాలు అన్నియున్నూ; చట్ట, వచ్చి= త్వరగా వచ్చి; త్రి, భువన, పూజ్యున్= మూడులోకాలచేత అర్చించ తగినవాడిని; మాంధాతృన్= మాంధాతను; ఒప్పన్= ఒప్పునట్లుగా; పొందెన్= చెందాయి.

తాత్పర్యం: ధ్యానం చేయటంచేత మాత్రమే ఆ మాంధాతను నాలుగు వేదాలున్నూ, వివిధ శాస్త్రాలున్నూ, విలువిద్య, దివ్యాలైన అమ్ములను ప్రయోగించే విధానాలున్నూ శీఘ్రమే వచ్చి చేరాయి. అతడు మూడులోకాలలో గౌరవించదగిన గొప్పతనాన్ని పొందాడు.

వ. **మఱియు నమ్మాంధాతృండు మహేంద్రుచేత మహామహీరాజ్యంబున కభిషిక్తుండై చక్రవర్తియై శక్రు నర్ధాసనం బెక్కి యాజగవం బను ధనువును దివ్యాస్త్రంబులు నభేద్యకవచంబును ధరియించి నిఖిల లోక జైత్రుండై**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంపూర్ణదక్షిణక్రతువు లనేకంబులు చేసి పద్మసంఖ్యలు గోదానంబుల బ్రాహ్మణులం దనిపి నిజశాసనంబునం బ్రజల నెల్ల నిలిపి. 205

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; ఆ+మాంధాతృండు= ఆ మాంధాత; మహా+ఇంద్రుచేతన్= దేవేంద్రుడిచేత; మహా మహీరాజ్యంబునకు= గొప్పవిస్తారం కల భూమండల ప్రభుత్వానికి; అభిషిక్తుండు+ఐ= ప్రభువుగా మంత్రజలంతో అభిషేకించబడినవాడై; చక్రవర్తి+ఐ= రాజరాజై; శక్రు+అర్ధ+ఆసనంబు+ఎక్కి= దేవేంద్రుడియొక్క సగం గద్దెపై ఎక్కి, అనగా ఇంద్రుడితో సమానంగా ఇంద్రుడి సింహాసనం మీద కూర్చుండి - అని భావం; ఆజగవంబు+అను, ధనువును= ఆజగవం అనేపేరుకల వింటిని; దివ్య+అస్త్రంబులు= దివ్యాలైన మంత్రబాణాలు; న+భేద్య, కవచంబును= భేదించటానికి వీలులేని కవచాన్ని, (తనుత్రాణాన్ని); ధరియించి= ధరించి; నిఖిల, లోక, జైత్రుండు+ఐ= సమస్తలోకాలను జయించినవాడై; సంపూర్ణ, దక్షిణ, క్రతువులు+అనేకంబులు, చేసి= పూర్తి దక్షిణలిచ్చి చేసే అనేకయజ్ఞాలు నెరవేర్చి; పద్మసంఖ్యలు= కోటానుకోట్లు; గోదానంబుల= ఆవులను దానంగా ఇవ్వటంవలన; బ్రాహ్మణులన్+తనిపి= విప్రులను సంతృప్తిపరచి; నిజ, శాసనంబునన్= తన ఆజ్ఞ ప్రకారం; ప్రజలన్+ఎల్లన్= జనులందరినీ; నిలిపి= శాసించి.

తాత్పర్యం: ఇంకనూ, ఆ మాంధాత సమస్త భూమండలానికి రాజరాజుగా దేవేంద్రుడిచేత పట్టాభిషిక్తుడై, దేవేంద్రుడి సింహాసనం మీద ఆ ఇంద్రుడితో పాటు అధివసించి, 'ఆజగవం' అనే విల్లును చేపట్టి, పెక్కుమంత్రబాణాలను, భేదించటానికి వీలులేని కవచాన్ని ధరించి, అన్నిలోకాలను జయించిన జగదేకవీరుడై, సంపూర్ణమైన దక్షిణలు ఇచ్చి పెక్కుయాగాలు చేసి, కోటానుకోట్ల సంఖ్యలో విప్రులకు ఆవులను దానంచేసి వారిని సంతృప్తులను చేసి, ప్రజలను తన ఆజ్ఞకు లోబడి నడుచుకొనేవారినిగా చేసి.

మధ్యాక్కర.

భూమి కనావృష్టి యైనఁ గడు నల్గి పురుహూతుతోడ
భీమసంగ్రామంబుఁ జేసెఁ, దన దివ్యపృథు సాయకముల
సామజావలి నేయునట్లు మేఘసంచయముల నేసి
భూమికిఁ గురియించె వర్షములు సస్యముల్ వృద్ధిఁ బొంద. 206

ప్రతిపదార్థం: భూమికి= పుడమికి; అనావృష్టి+ఐనన్= వానలు కురవకపోవటం జరుగగా; కడు= మిక్కిలి; అల్గి= కోపించి; పురుహూతుతోడన్= దేవేంద్రుడితో; భీమ, సంగ్రామంబున్= భయంకరమైన యుద్ధాన్ని; చేసెన్= చేశాడు; తన, దివ్య, పృథు, సాయకముల= తనయొక్క దివ్యమైనవి, విస్తారమైనవి అయిన అమ్ములచేత; సామజ+ఆవలిన్= ఏనుగుల గుంపులను; ఏయునట్లు= కొట్టేటట్లు; మేఘ, సంచయములన్= మేఘాల సమూహాలపై; ఏసి= బాణాలను ప్రయోగించి; సస్యముల్= పంటలు; వృద్ధిన్+పొందన్= పెంపుచెందేటట్లు; భూమికిన్= భూమికి; వర్షముల్= వానలు; కురియించెన్= కురిపించాడు (కురిసేటట్లుచేశాడు).

తాత్పర్యం: పుడమిలో వానలు కురవకపోవటంచేత మాంధాత మిక్కిలి ఆగ్రహంచెంది, దేవేంద్రుడితో భయంకరమైన యుద్ధాన్ని చేశాడు. ఏనుగులను కొట్టేవిధంగా తన మంత్రబాణాలను మేఘాలపై విరివిగా ప్రయోగించి పంటలు వృద్ధి చెందేటట్లుగా భూమిపై వానలు కురిపించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 2.22 విశేషాంశం చూడండి.

వ. ఇది యమ్మాంధాతృ దేవయజనస్థానంబు; మఱి యిక్కురుక్షేత్రంబునందు సరస్వతీతీరంబున సోమకుండను వాఁడు యజ్ఞంబు సేసి పుత్త్రశతంబుఁ బడసె' ననిన 'నది యె'ట్లని ధర్మజుం డడిగిన రోమశుం డిట్లనియె.207

ప్రతిపదార్థం: ఇది= ఈస్థలం; ఆ+మాంధాతృ దేవయజనస్థానంబు= ఆ మాంధాత దేవయజ్ఞం చేసినచోటు; మఱి= ఇక; ఈ+కురు, క్షేత్రంబునందున్= ఈ కురుక్షేత్రంలో; సరస్వతీ, తీరంబున= సరస్వతీనది తీరంలో; సోమకుండు+అనువాఁడు= సోమకుడు అనే పేరు కలవాడు; యజ్ఞంబు+చేసి= యజ్ఞంచేసి; పుత్త్ర, శతంబున్= నూరుగురు కొడుకులను; పడసెన్= పొందాడు; అనినన్= అని చెప్పగా; అది= ఆ వృత్తాంతం; ఎట్లు= ఏరీతిగా జరిగింది; అని= అని; ధర్మజుండు= ధర్మరాజు; అడిగినన్= ప్రశ్నించగా; రోమశుండు= రోమశుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఇది ఆ మాంధాత యజ్ఞంచేసినచోటు. ఇక ఈ కురుక్షేత్రంలో సరస్వతీనది తీరాన సోమకుడనే రాజు యజ్ఞంచేసి నూరుగురు కొడుకులను పొందాడు'- అని చెప్పగా ధర్మరాజు ఆ కథను వివరించి చెప్పుమని కోరాడు. అంత రోమశుడు ఇట్లా చెప్పాడు.

సోమకుండను రాజర్షి చరిత్రము (సం. 3-127-2)

క. 'సోమకుఁడను రాజర్షి మ । హా మఖ మొనరించి జంతుఁ డను నొక్క సుతున్
భూమీశ! పడసె; నాతని । భామలు నూర్వురును గొడుకుఁ బరమప్రీతిన్. 208

ప్రతిపదార్థం: భూమి+ఈశ!= ఏ రాజా!; సోమకుఁడు+అను, రాజ+ఋషి= సోమకుడు అనేపేరుకల రాజ ఋషి; మహామఖము= గొప్పయజ్ఞం; ఒనరించి= చేసి; జంతుఁడు+అను+ఒక్క, సుతున్= జంతుడు అనేపేరు కల ఒక్క కొడుకును,; పడసెన్= పొందాడు; ఆతని, భామలు= ఆరాజు భార్యలు; నూర్వురును= వందమంది; పరమ, ప్రీతిన్= గొప్పప్రేమతో; కొడుకున్= కుమారుడిని (తరువాత పద్యంతో అన్వయం).

తాత్పర్యం: 'ఓరాజా! సోమకుడు అనేరాజర్షి గొప్ప యజ్ఞంచేసి, జంతుడు అనేపేరుకల కొడుకును పొందాడు. ఆ రాజు రాణులు నూరుమందీ ఆ కుమారుడిని మిక్కిలి ప్రేమతో.

క. తమ తమ పుత్త్రుఁడ కాఁ జి । త్తములం జేకొని దయం బృథగ్భావము లే
క ముదంబునఁ బెంచిరి లో । కమున జనుల్ చోద్యమందఁగాఁ గడువేడ్కన్. 209

ప్రతిపదార్థం: తమ, తమ, పుత్త్రుఁడు+అ కాన్= తమ తమ సొంత కొడుకుగానే; చిత్తములన్= మనస్సులలో; చేకొని= పాటించి; దయన్= కరుణతో; పృథక్+భావము, లేక= వేరు అనే తలపు లేకుండా; ముదంబునన్= సంతోషంతో; లోకమున, జనుల్= లోకంలోని ప్రజలు; చోద్యము+అందఁగాన్= ఆశ్చర్యం చెందగా; కడు, వేడ్కన్= మిక్కిలి ప్రేమతో; పెంచిరి= లాలించారు.

తాత్పర్యం: ఆ రాజుకు గల నూరుగురు భార్యలు ఏకైక పుత్రుడైన జంతుడిని తమ తమ సొంత బిడ్డగానే భావించి, వేరుభావం లేకుండా సంతోషంతో లోకంలోని ప్రజలు ఆశ్చర్యపడేటట్లుగా లాలించి పెంచారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఒక్కనాఁ డబ్బాలకు కుఱువు చీమ గుట్టినఁ దద్వేదన సహింప నోపక యేడ్చుచున్నవాని కడకుఁ దల్లులందఱుఁ బఱతెంచి యేడ్చిన నయ్యాక్రందన ధ్వని విని సంభ్రమించి సోమకుం డంతఃపురంబునకుం జని కొడుకు నూరార్చి సభాస్థితుండై మంత్రులకు ఋత్విజులకు నిట్లనియె. 210

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు= ఒకరోజు; ఆబాలకు, కుఱువు= ఆ బాలకుడితొడను; చీమ, కుట్టినన్= చీమ కుట్టగా; తద్+వేదన= ఆ నొప్పి; సహింపన్+ఓపక= తాళలేక; ఏడ్చుచున్న, వాని కడకున్= ఏడుస్తూ ఉన్నవాని దగ్గరకు; తల్లులు+అందరున్= తల్లులందరూ; పఱతెంచి= అరుదెంచి; ఏడ్చినన్= ఏడ్వగా; ఆ, ఆక్రందన, ధ్వని= ఆ రోదన ధ్వని; విని= విని; సంభ్రమించి= తత్తరపాటుతో బాధను పొంది; సోమకుండు= సోమకుడు; అంతఃపురంబునకున్+చని= రాణివాసానికి వెళ్ళి; కొడుకున్+ఊరార్చి= పుత్రుడిని బుజ్జగించి; సభా, స్థితుండు+ఐ= కొలువు తీర్చినవాడై; మంత్రులకు= సచివులకు; ఋత్విజులకున్= యజ్ఞంచేయించే పురోహితులకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా (ఇట్లా) చెప్పాడు.

తాత్పర్యం: ఒకరోజున ఆ బాలుడి తొడకు గండుచీమ కుట్టింది. వాడు ఆ బాధకు తట్టుకోలేక పెద్దగా ఏడ్వసాగాడు. అతడి ఏడ్పు విని తల్లులందరూ పరుగెత్తుకొని వచ్చారు. అతడి బాధను చూచి వారుకూడా. గొల్లున ఏడ్చారు.ఆ రోదన ధ్వనిని సోమకుడు విన్నాడు, వెంటనే అంతఃపురానికి వెళ్ళాడు. కొడుకును ఓదార్చాడు. ఆపైన సభకు తిరిగి వచ్చి మంత్రులతో, ఋత్విజులతో ఇట్లా అన్నాడు.

విశేషం: 'కురువు' శబ్దానికి 'కుఱువు' అనే రూపంకూడా కనపడుతున్నది.

ఆ. 'కోరి యొక్క కొడుకుఁ గొడుకుగా నే నెట్లు । నమ్మియుండనేర్తు? నాకు సతులు
శతము గలిగియుండ సంతాన మల్పమై । యునికి మీకుఁ జూడ నుచిత మగునె?' 211

ప్రతిపదార్థం: కోరి= కావాలని తలపోసి; ఒక్క, కొడుకున్= ఒక్క కొడుకును; కొడుకుగాన్= కొడుకుగా; ఏన్= నేను; ఎట్లు= ఏరీతిగా (ఎట్లా); నమ్మి+ఉండ, నేర్తు= విశ్వసించి= ఉండగలను; నాకున్= నాకు; సతులు= భార్యలు; శతము= నూరుమంది; కలిగి+ఉండ= కలిగిఉండగా; సంతానము= బిడ్డలు; అల్పము+ఐ= తక్కువగా; ఉనికి= ఉండటం; చూడన్= ఆలోచింపగా, మీకున్= నా మేలు కోరే మీకందరికీ; ఉచితము+అగునె= తగినదిగా కన్పిస్తున్నదా?

తాత్పర్యం: 'నాకు నూరుమంది భార్యలున్నారు కాని కుమారుడు ఒక్కడే ఉన్నాడు. భార్యలు హెచ్చుమంది. సంతానం లొచ్చు. ఏకైక పుత్రుడు పుత్రుడు అని నమ్మవచ్చునా? మీ కందరికీ ఇది సముచితంగా కనిపిస్తూ ఉందా?'

వ. అనిన వానికి ఋత్విజు లిట్లనిరి. 212

ప్రతిపదార్థం: అనిన= అని చెప్పగా; వానికి= ఆ రాజుకు; ఋత్విజులు= యజ్ఞం చేయించే పురోహితులు; ఇట్లు+అనిరి= ఈవిధంగా చెప్పారు.

తాత్పర్యం: అని అడుగగా సోమకమహారాజుకు యజ్ఞం చేయించే పురోహితులు ఈవిధంగా బదులు పలికారు.

తే. 'ధరణినాథ! నీ భార్యాశతంబునందుఁ । బరఁగ నూర్వురుపుత్త్రులఁ బడయ నీకు
నభిమతం బేనిఁ దగుఁ దగదనక నీవు । కడఁగి మా చేయఁబంచిన క్రతువు సేయు. 213

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధరణినాథ!= పుడమికి భర్తవైన ఓ(సోమక) మహారాజా!; నీ, భార్యా, శతంబునందున్= నీ నూరుగురు పత్నుల వలన; పరఁగ= ఒప్పుగా; నూర్వురు, పుత్రులన్= వందమంది కొడుకులను; పడయ= పొందడానికి; నీకు= నీకు; అభిమతంబు+ఏనిన్= కోరిక ఉంటే; తగున్+తగదు+అనక= ఇది మంచిది, ఇది చెడ్డది అని చెప్పక; నీవు= నీవు; కడఁగి= పూనికతో; మా, చేయన్+పంచిన= మేము చేయుమని చెప్పిన; క్రతువు= యజ్ఞం; చేయు(ము)= చేయవలసింది.

తాత్పర్యం: 'ఓ సోమకమహారాజా! నీ నూరుమంది రాణులవలన నీకు నూరుగురు కొడుకులు పుట్టాలని కోరిక ఉంటే, మేము ఆదేశించిన యజ్ఞం చేయుము, ఇది తగింది. ఇది తగదు, అని ఎదురు చెప్పకుము.

వ. **ఈ జంతుం బశువుగా వధించి తద్వపాహవ్యంబుల హవ్యవహుం దనిపిన, దాన నీ నూర్వురు భార్యలకు నూర్వురు కొడుకులు పుట్టుదు; రందగ్రజుండైన జంతుండు సౌవర్ణ లక్షణ లక్షిత సవ్యపార్శ్వుండై యుదయించు' నని చెప్పి ఋత్విజులచేత సోమకుండు ననుజ్ఞాతుండై.** **214**

ప్రతిపదార్థం: ఈ జంతున్= జంతుడు అనేపేరుకల ఈ రాజపుత్రుడిని; పశువుగాన్= యజ్ఞంలో బలి ఇచ్చే పశువుగా; వధించి= చంపి; తద్+వపా, హవ్యంబుల= అతడియొక్క నాభిక్రింది పలుచని మాంసపు (క్రొవ్వు) పొరతో కూడిన, ఆహుతితో; హవ్యవహున్= అగ్నిహోత్రుడిని; తనిపిన= తృప్తి చెందించినచో; దాన= దానివలన; నీ, నూర్వురు, భార్యలకు= నీ నూరుగురు భార్యలకు; నూర్వురు, కొడుకులు= వందమంది కొడుకులు; పుట్టుదురు= జన్మిస్తారు; అందు= వారిలో; అగ్రజుండు+ఐన= మొదట జన్మించే వాడైన; జంతుండు= జంతుడు; సౌవర్ణ, లక్షణ, లక్షిత, సవ్య, పార్శ్వుండు+ఐ= బంగారు లక్షణాలతో శోభిల్లే కుడిపార్శ్వం కలవాడై; ఉదయించున్= పుట్టుతాడు; అనిచెప్పి= అని చెప్పి; ఋత్విజులచేతన్= యజ్ఞాన్ని చేయించే పురోహితులచేత; సోమకుండున్= సోమకుడు; అనుజ్ఞాతుండు+ఐ= అనుమతి పొందినవాడై.

తాత్పర్యం: ఓ సోమక మహారాజా! నీ ఏకైకపుత్రుడైన జంతుడిని యజ్ఞపశువు చేసి సంహరించి, ఆతడి కడుపులోని వపను హవ్యంగా చేసి, అగ్నిహోత్రుడిని తృప్తిచెందిస్తే నీ నూరుగురు భార్యలకు నూరుమంది కొడుకులు పుట్టగలరు. వారిలో ముందుపుట్టిన జంతుడు తన కుడి ప్రక్క దేహభాగం బంగారులక్షణాలతో శోభిల్లేవా డవుతాడు'- అని ఋత్విజులు చెప్పారు. సోమకుడు ఋత్విజుల అనుమతి పొంది.

విశేషం: వపాశబ్దానికి అర్థం నిర్వచించటంలో పండితులలో ఏకవాక్యత లేదు. కొందరు మెదడు అనిన్నీ, మరికొంతమంది కడుపులో బొడ్డుక్రింద ఉల్లిపొరవలె ఉండే మాంసపు (క్రొవ్వు) పొర- అనిన్నీ అర్థం చెపుతున్నారు.

క. **తనయుఁ బశువఱిచి తద్వపఁ । గొని వేల్చినఁ జూచి యార్తకురరీనాదం**
బున నేడ్చిరి కడు నడలుగఁ । దనుమధ్యలు నూర్వురును సుతస్నేహమునన్. **215**

ప్రతిపదార్థం: తనయున్= కొడుకును; పశువు+పఱిచి= యజ్ఞంలో బలిపశువుగా చేసి; తద్+వపన్= అతని నాభి క్రింది పలుచని మాంసపు (క్రొవ్వు) పొరను; వేల్చినన్= హోమంచేయగా; చూచి= అరసి; తనుమధ్యలు= స్త్రీలు, సన్నటి నడుము కలవారు; నూర్వురును= వందమంది; సుత స్నేహమునన్= పుత్రుడిమీద గల అనురాగంచేత; కడున్+అడలుగన్= మిక్కిలి దుఃఖంతో; ఆర్త, కురరీ, నాదంబునన్= బాధతో దుఃఖిస్తున్న భయపడిన ఆడుగొర్రెలు చేసే ధ్వనివంటి ధ్వనితో; ఏడ్చిరి= ఆక్రందనలు చేశారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కొడుకును యజ్ఞంలో బలిపశువుగా చేసి అతడి వపను హోమంగా వేల్చటం చూచి నూరుగురు తల్లులు మిక్కిలి అడలుతూ కుమారుడిమీద గల ప్రేమతో ఆడుగొర్రెలు బాధతో అరచినట్లు పెద్దపెట్టున ఏడ్చారు.

క. ఇమ్ముగఁ దద్ధూమాఘ్రా । ణమ్మున గర్భములు దాల్చి నాతులు నవమా
సమ్ములు నిండుడుఁ గనిరి ము । దమ్మున జంతుప్రముఖసుతప్రకరమ్మున్. 216

ప్రతిపదార్థం: ఇమ్ముగన్= సంపూర్ణంగా; తద్+ధూమ+ఆఘ్రాణమ్మున= ఆ వపాహోమంయొక్క పొగను పీల్చటంవలన; నాతులు= స్త్రీలు (సోమకుడి భార్యలు); గర్భమ్ములు+తాల్చి= కడుపుతో ఉండి; నవ, మాసమ్ములు= తొమ్మిదినెలలు; నిండుడున్= నిండగానే, పూర్తికాగానే; ముదమ్మునన్= సంతోషంతో; జంతు, ప్రముఖ, సుతప్రకరమ్మున్= జంతుడు మొదలైన కొడుకులసమూహాన్ని; కనిరి= ప్రసవించారు.

తాత్పర్యం: ఆ వపాహోమంయొక్క పొగను బాగా పీల్చటంవలన సోమకుడి భార్యలు నూరుగురు గర్భవతులై, తొమ్మిది నెలలు నిండినపిదప సంతోషంతో జంతుడు మొదలుగా గల నూరుగురు కొడుకులను ప్రసవించారు.

వ. అందు జంతునకు నందఱు నెప్పటియట్ల తల్లులు సమస్నేహలై యుండం బుత్త్రులు నూర్వురుం బెరిఁగి సమర్థులైయున్నఁ బెద్ద కాలంబునకు ఋత్విజుండు పరలోకగతుండై ఘోరనరకానలంబున నెరియుచు నుండె; నంత సోమకుండును దేహత్యాగంబు సేసి, యమరలోకంబున కరుగువాఁడు ముందట నరకానల పచ్యమానుండయ్యెడు ఋత్విజుం జూచి' యి ట్లేల త్రీవ దుఃఖోపహతుండవైతి?' వని యడిగిన వాఁ డిట్లనియె. 217

ప్రతిపదార్థం: అందున్= ఆ బిడ్డలలో; జంతునకున్= జంతుడిపట్ల; అందఱున్, తల్లులు= అందరు తల్లులు; ఎప్పటి+అట్ల= లోగడవలెనే; సమ, స్నేహలు+ఐ+ఉండన్= సమమైన ప్రేమతో ఉండగా; పుత్త్రులు= కొడుకులు; నూర్వురున్= నూరుగురు; పెరిగి= ఎదిగి; సమర్థులు+ఐ+ఉన్నన్= శక్తి కలవారై ఉండగా; పెద్ద, కాలంబునకు= చాలాకాలం గడిచిన పిదప; ఋత్విజుండు= యజ్ఞంచేయించిన పురోహితుడు; పరలోకగతుండు+ఐ= పరలోకానికి వెళ్ళినవాడై (అంటే మరణించినవాడై); ఘోర, నరక+ అనలంబునన్= భయంకరమైన నరకలోకంలోని అగ్నిలో అనగా నరకంలోని భయంకరమైన అగ్నిలో; ఎరియుచున్+ఉండెన్= కాగుతున్నాడు; అంత= అటుపిదప; సోమకుండును= సోమక మహారాజున్నూ; దేహ, త్యాగంబు+చేసి= మరణించి; అమర, లోకంబునకు= స్వర్గలోకానికి; అరుగువాఁడు= వెళ్ళుతూ; ముందట= ముందుగా (దారిలో); నరక+అనల, పచ్యమానుండు+ అయ్యెడు= నరకంలోని అగ్నిలో వేపబడుతున్న; ఋత్విజున్+చూచి= యజ్ఞం చేయించిన పురోహితుడిని చూచి; ఇట్లు+ఏల= ఈ రీతిగా ఎందుకు; తీవ్ర, దుఃఖ+ఉపహతుండవు+ఐతివి?= గాఢమైన పరితాపంచేత కొట్టబడినవాడిని అయినావు?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; వాఁడు= ఆ ఋత్విజుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అట్లా పుట్టిన పుత్రులయెడ అందరు తల్లులు జంతుడియెడ లోగడ చూపిన ప్రేమనే సమానంగా చూపసాగారు. ఆ నూరుగురు కొడుకులు పెరిగి పెద్దవారై సమర్థులు అనేపేరు తెచ్చుకొన్నారు. చాలాకాలం గడచినపిదప, ఆ యజ్ఞాన్ని చేయించిన ఋత్విజుడు మరణించి నరకలోకంలో భయంకరమైన అగ్నిలో మలమల మాడుతున్నాడు. అంత సోమక మహారాజు కూడ మరణించి, స్వర్గలోకానికిపోతూ ముందుగా దారిలో నరకలోకంలోని అగ్నిలో వేగుతున్న ఋత్విజుడిని చూచి, 'నీవు ఈవిధంగా ఎందుకు తీవ్ర దుఃఖానికి లోనైనావు?' అని అడుగగా అతడు ఇట్లా బదులు పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. **'అవనినాథ! నీకు నార్త్విజ్య మొనరించి । చూవె యిట్టి నరకపావకమునఁ**
బడినవాఁడ; నీకు బహుపుణ్య లోకముల్ । గలవు; నన్నుఁ గావవలయుఁ గరుణ.' 218

ప్రతిపదార్థం: అవని, నాథ!= పుడమికి భర్తవైన ఓ సోమక మహారాజా!; నీకున్+ఆర్త్విజ్యము+ఒనరించి= నీకు యజ్ఞంలో ఋత్విజుడిగా పనిచేయటం వలన; ఇట్టి= ఇటువంటి; నరక, పావకమునన్= నరకంలోని అగ్నిలో; పడినవాఁడన్= పతనమైనవాడిని; చూవె= సుమా; నీకున్= నీకు; బహు, పుణ్య, లోకముల్, కలవు= నీకు ఎన్నో పుణ్యగతు లున్నాయి; కరుణన్= దయతో; నన్నున్= నన్ను; కావవలయున్= కాపాడాలి.

తాత్పర్యం: ఓ సోమక మహారాజా! నీ యజ్ఞంలో ఋత్విజుడిగా పనిచేయటం చేతనే సుమా! నాకు ఈ నరకాగ్నిలో పడటం సంభవించింది. నీకేం? నీకు ఎన్నో పుణ్యగతులు లభించిఉన్నాయి. దయతో నువ్వే నన్ను కాపాడాలి.

వ. **అనిన సోమకుండు ధర్మరాజు పాలికిం జని తచ్ఛాసనంబునం బుణ్యలోకంబులకుం బోవుచుండి యిట్లనియె. 219**

ప్రతిపదార్థం: అనిన= అని చెప్పగా; సోమకుండు= సోమకుడు; ధర్మరాజు, పాలికిన్+చని= యముడి వద్దకు వెళ్ళి; తత్+శాసనంబునన్= అతడి ఆజ్ఞమేరకు; పుణ్యలోకంబులకున్= పుణ్యగతులకు; పోవుచుండి= వెళ్ళుతూ; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని ఆ ఋత్విజుడు పలుకగా, సోమకుడు యముడి దగ్గరకు వెళ్ళి, అతడి శాసనాన పుణ్యలోకాలకు పోతూ, ఇట్లా చెప్పాడు.

క. **'నా కారణమున ఋత్విజుఁ । డేకాంతమ నరకగతికి నేఁగెను వానిం**
దోకొని పోయెద' నని శుభ । లోకంబున కరిగెఁ ద్రిదశలోకస్తుతుఁడై. 220

ప్రతిపదార్థం: నా, కారణమున= నా మూలాన; ఋత్విజుఁడు= యజ్ఞాన్ని చేయించిన ఈ పురోహితుడు; ఏకాంతమ= ఒంటరిగా; నరక, గతికిన్= నరకలోకానికి; ఏఁగెను= వెళ్ళాడు; వానిన్= అతనిని (ఆ ఋత్విజుడిని); తోకొనిపోయెదను= నాతోపాటు తీసికొని వెళ్తాను; అని= అని చెప్పి; త్రిదశ, లోక, స్తుతుఁడు+ఐ= స్వర్గలోకంచేత స్తుతించబడినవాడై; శుభ, లోకంబునకు= పుణ్యలోకానికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'ఈ ఋత్విజుడు నామూలాన కదా ఈ నరకలోకంలో పడి మ్రగ్గవలసి వచ్చింది. అతడిని నాతోపాటు స్వర్గలోకానికి తీసికొనివెళ్ళగలను'- అని చెప్పి అతడిని తనవెంట పుణ్యగతికి తీసికొని వెళ్ళాడు. ఆ సోమక మహారాజును స్వర్గలోకం ప్రస్తుతించింది.

విశేషం: ఈ కథలోని ముఖ్యాంశాలు(1) నరమేధం జరిగింది. (2) నరమేధం చేసిన రాజుకు స్వర్గమున్నూ, చేయించిన ఋత్విజుడికి నరకమున్నూ ప్రాప్తించాయి. (3) ఆరాజు తాను స్వర్గానికి వెళ్ళుతూ కూడా స్వార్థాన్ని వీడి తనమూలాన నరకంలో మ్రగ్గుతున్న ఋత్విజుడిని ఉద్ధరించటం.

వ. **ఇట్లు యజ్ఞపుత్త్రుం డైన సోమకుండు తన తపోయజ్ఞఫలంబున ఋత్విజు నరకవిముక్తుంజేసి పుణ్యలోక గతుండయ్యె ; నిందుఁ దొల్లి ప్రజాపతి సహస్ర వార్షికంబైన యిష్టాకృతంబను సత్త్రయాగంబుఁ జేసి;**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నాభాగుండైన యంబరీషుం డిందు యజ్ఞంబులం జేసి పరమసిద్ధికిం జనియె; నిది నహుష యజ్ఞదేశం; బిందు దశపద్మ సంఖ్య ధనంబుల నాతండు సదస్యులం బూజించె; నిది సార్వభౌమ యజ్ఞస్థానం; బిది యయాతి యజ్ఞాయతనంబు; వాని సవనంబున కింద్రుండు వచ్చె; నిది రామహ్రదం, బిది నరనారాయణాశ్రమం, బిది ప్లక్షావతరణంబను యమునాతీర్థం; బిందు దేవతలును ఋషులును సారస్వత యాగంబుఁ జేసి; రిది దేవర్షియైన సంవర్తుచేత రక్షితం; బిందు భరతుం డనేక యాగంబులు సేసి సర్వలోకంబులుం జూచె; నీవు నిందుఁ గృతస్నానుండవై సర్వలోకంబులుం జూడు' మనిన ననుజసహితుండై ధర్మతనయుం డత్తీర్థంబున స్నానంబుఁ జేసి రోమశున కిట్లనియె. 221

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; యజ్ఞ పుత్త్రుండు+ఐన= యజ్ఞంవలన కొడుకును పొందినట్టి వాడైన; సోమకుండు= సోమకమహారాజు; తన, తపస్+యజ్ఞ, ఫలంబున= తనయొక్క తపస్సు అనేటటువంటి యజ్ఞానికి సంక్రమించే ఫలితంగా; ఋత్విజున్= యజ్ఞం చేయించిన పురోహితుడిని; నరక, విముక్తున్+చేసి= నరకంనుండి తప్పించి; పుణ్య, లోక, గతుండు+ అయ్యెన్= పుణ్యలోకానికి వెళ్ళినవా డయ్యాడు; ఇందున్= ఇక్కడ; తొల్లి= పూర్వకాలంలో; ప్రజాపతి= బ్రహ్మదేవుడు; సహస్ర, వార్షికంబు+ఐన= వేయి సంవత్సరాలు పట్టిన; ఇష్టాకృతంబు+అను= ఇష్టాకృతం అనే పేరు కల; సత్రయాగంబున్+చేసెన్= సత్రయాగాన్ని సలిపాడు; నాభాగుండు+ఐన= నాభాగవంశీయుడు అయిన; అంబరీషుండు= అంబరీషుడు; ఇందు= ఇక్కడ; యజ్ఞంబులన్+చేసి= యజ్ఞాలు చేసి; పరమ, సిద్ధికిన్+చనియెన్= మిక్కిలి ఉత్కృష్టమైన గతిని పొందాడు; ఇది= ఈచోటు; నహుష, యజ్ఞ, దేశంబు= నహుషుడు యజ్ఞం చేసినచోటు; ఇందున్= ఇక్కడ; దశ, పద్మ, సంఖ్య= పదిపద్మాల లెక్కగల; ధనంబులన్= నిధులతో; ఆతండు= ఆ నహుషుడు; సదస్యులన్= యజ్ఞంలో లోటుపాట్లు రాకుండా గమనించే పండితులను; పూజించెన్= పూజించాడు. అర్చించాడు; ఇది= ఈచోటు; సార్వభౌమ, యజ్ఞస్థానంబు= సార్వభౌముడి యజ్ఞస్థలం; ఇది= ఈచోటు; యయాతి,యజ్ఞ+ఆయతనంబు= యయాతి యజ్ఞం చేసిన స్థలం; వాని, సవనంబునకు= అతడి యజ్ఞానికి; ఇంద్రుండు= ఇంద్రుడు; వచ్చెన్= వచ్చాడు; ఇది= ఈ చోటు; రామహ్రదంబు= రామహ్రదం; ఇది= ఈ చోటు; నర, నారాయణ+ఆశ్రమంబు= నరుడు, నారాయణుడు తపమొనర్చిన ఆశ్రమస్థానం; ఇది= ఈ చోటు; ప్లక్షావతరణంబు= ప్లక్షద్వీపం నుండి నదివెలువడ్డచోటు; అను= అనేటటువంటి; యమునా, తీర్థంబు= యమునానదికి చెందిన పుణ్యస్థలం; ఇందు= ఇక్కడ; దేవతలును, ఋషులును= దేవతలు, మునులు కలిసి; సారస్వతయాగంబున్+చేసిరి= సరస్వతికి సంబంధించిన యజ్ఞాన్ని చేశారు; ఇది= ఈచోటు; దేవ, ఋషి+ఐన= దేవతలకు చెందిన ముని అయిన; సంవర్తుచేత= సంవర్తుడిచేత; రక్షితంబు= కాపాడబడునట్టిది; ఇందు= ఇక్కడ; భరతుండు= భరతుడు అనేరాజు; అనేక, యాగంబులు+చేసి= అనేకయాగాలు చేసి; సర్వలోకంబులున్= లోకాలనన్నింటినీ; చూచెన్= దర్శించాడు; ఈవును= నీవుకూడా; ఇందున్= ఇక్కడ; కృత, స్నానుండవు+ఐ= స్నానంచేసి; సర్వలోకంబులున్ + చూడుము= అన్నిలోకాలనూ దర్శించవలసింది; అనినన్= అని చెప్పగా; అనుజ, సహితుండు+ఐ= తమ్ముళ్ళతోపాటు; ధర్మ తనయుండు= ధర్మరాజు; ఆ+తీర్థంబున= ఆనీటిలో; స్నానంబున్+చేసి= స్నానంచేసి; రోమశునకు= రోమశ మహర్షికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా తెలిపారు.

తాత్పర్యం: ఈ విధంగా యజ్ఞంవలన కొడుకులను పొందిన సోమకమహారాజు తన తపస్సు అనేయజ్ఞం యొక్కఫలంగా తన ఋత్విజుడిని నరకంనుండి వెలువడచేసి పుణ్యగతిని పొందాడు. ఇక్కడ పూర్వకాలాన బ్రహ్మదేవుడు వేయి ఏళ్ళ గడువు కల సత్రయాగం 'ఇష్టాకృతం' అనేదానిని చేశాడు. ఇక్కడ నాభాగుడి వంశంలో పుట్టిన అంబరీషుడు యజ్ఞాలు చేసి మిక్కిలి ఉత్తమగతికి వెళ్ళాడు. ఇది నహుషుడు యజ్ఞం చేసినచోటు. ఇక్కడ అతడు నూరు అర్బుదాల ధనాన్ని యజ్ఞంలో లోటుపాట్లులేకుండా గమనించే పండితులకు దక్షిణగా ఇచ్చాడు. ఇది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సార్వభౌముడి యజ్ఞవాటిక. ఇది యయాతి యజ్ఞం చేసినస్థలం. అతడి యజ్ఞానికి దేవేంద్రుడు వచ్చాడు. ఇది రామహ్రదం. ఇది ప్లక్షావతరణం అనేతీర్థం. ఈ యమునా తీర్థాన దేవతలున్నూ, మునులున్నూ సరస్వతికి సంబంధించిన యజ్ఞాన్ని చేశారు. ఇది దేవఋషియైన సంవర్తుడిచేత కాపాడబడేటటువంటిది. ఇక్కడ భరతుడు చాలా యజ్ఞాలు చేసి సర్వలోకాలను దివ్యదృష్టితో చూడగలిగాడు. నీవుకూడా ఇక్కడ స్నానంచేసి ఆ లోకాలను అన్నిటినీ ఒకసారి దర్శించవలసింది'- అని చెప్పగా ధర్మరాజు తనతమ్ముళ్ళతోపాటు ఆ తీర్థంలో స్నానంచేసి రోమశుడితో ఈవిధంగా చెప్పాడు.

విశేషం: 'పద్మ' సంఖ్య అంటే పది అర్బుదాలు. అర్బుదం అంటే పదికోట్లు, కోటి అంటే నూరులక్షలు.

శా. **'దేవర్షిద్యుచరాహిలోకములు నాదిత్యాశ్వినీలోకముల్**
దేవాధీశ్వరుఁ జూచితిన్; మఱియు నద్దేవేంద్రునొద్దన్ సగాం
డీవోద్దామమహాభుజార్గళుఁ గిరీటిన్ సవ్యసాచిన్ జయ
శ్రీవిభ్రాజితుఁ బార్థుఁ జూచితి జగత్సేవ్యా! మునీంద్రోత్తమా!' **222**

ప్రతిపదార్థం: జగత్+సేవ్యా!= లోకంచేత సేవించతగినవాడా!; ముని+ఇంద్ర+ఉత్తమా!= ఋషులలో శ్రేష్ఠులైన వారిలో మంచివాడా! దేవ+ఋషి, ద్యు, చర+అహి, లోకములున్= దేవర్షులు ఉండే లోకమున్నూ, ఆకాశంలో చరించేవారు ఉండే లోకమున్నూ, సర్పాలు నివసించే పాతాళలోకమున్నూ; ఆదిత్య+అశ్వినీ, లోకముల్= సూర్యుడిలోకం, ఆశ్వినులలోకమున్నూ; దేవ+అధీశ్వరున్= దేవేంద్రుడిని; చూచితిన్= దర్శించాను; మఱియు= ఇంకను; ఆ+దేవేంద్రు+ఒద్దన్= ఆ దేవేంద్రుడి దగ్గర; స, గాండీవ+ఉద్దామ, మహా, భుజ+అర్గళున్= గాండీవమనే వింటితో గూడిన గడియమ్రానుల వంటి గొప్ప భుజములు గలిగి గంభీరుడైఉన్న వాడిని; కిరీటిన్= కిరీటం గల అర్జునుడిని; సవ్యసాచిన్= కవ్వడిని; జయశ్రీ, విభ్రాజితున్= జయలక్ష్మితో శోభిల్లేవాడిని; పార్థున్= అర్జునుడిని; చూచితిన్= దర్శించాను;

తాత్పర్యం: 'జగత్తు అంతటిచేత ఆరాధించదగినట్టివాడా!. మునులలో శ్రేష్ఠులైన వారిలో శ్రేష్ఠుడా! ఓ రోమశమహర్షీ! నేను దేవర్షుల లోకాన్ని చూచాను; ఆకాశగమనం కల ఖేచరుల లోకాన్ని చూడకలిగాను. సర్పలోకాన్ని దర్శించాను. ఇంకా దేవేంద్రుడిని చూడగలిగాను, అక్కడ దేవేంద్రుడి దగ్గర గడియమ్రానుల వలె పొడవైన గాండీవమనే ధనువును ధరించి మిగుల గంభీరంగా తేజరిల్లుతున్న కిరీటిని, జయలక్ష్మితో శోభిల్లుతున్న పార్థుడిని, కవ్వడిని చూచాను'.

వ. **అనిన రోమశుండు వెండియు ధర్మరాజున కిట్లనియె.** **223**

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; రోమశుండు= రోమశుడు; వెండియు= మరల; ధర్మరాజునకు= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈవిధంగా ధర్మరాజు చెప్పగా మరల రోమశుడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

క. **'ఇది దక్షుమఖస్థానం; । బిదియు సరస్వతి యనంగ నిలఁ బరఁగు మహా**
నది; యిందుఁ ద్రిదశతతితోఁ । ద్రిదశజ్యేష్ఠుండు సేసెఁ దివిరి మఖంబుల్. **224**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇది= ఈ చోటు; దక్షు= దక్షుడియొక్క; మఖస్థానంబు= యజ్ఞంచేసినచోటు; ఇది= ఇది; సరస్వతి+అనంగన్= సరస్వతి అనేపేరుమీద; ఇలన్+పరఁగు= పుడమిపై ఒప్పేటటువంటి; మహానది= గొప్పనది; ఇందున్= ఈ సరస్వతి నదియొక్క గట్టుమీద; త్రిదశ, తతితోన్= దేవతల సమూహంతో; త్రిదశ, జ్యేష్ఠుండు= దేవతలకు అగ్రజుడైనవాడు- బ్రహ్మదేవుడు; తివిరి= పూనికతో; మఖంబుల్= యజ్ఞాలు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ఇది దక్షుడు యజ్ఞం చేసిన స్థలం. ఇది భూలోకంలో సరస్వతి అనేపేరు కల గొప్పనది. ఈ సరస్వతీ నదీతీరాన వేల్పులలో మొదటపుట్టిన బ్రహ్మదేవుడు యజ్ఞాలు చేశాడు.

వ. ఇది పంచయోజన ప్రమాణంబైన ప్రజాపతియజ్ఞవేది; ఇందు దేహత్యాగంబు సేసి మర్త్యు లమర్త్యత్వంబుం బొందుదురు; తొల్లి సరస్వతి నిషధదేశంబున భూమి సొచ్చి యిచ్చమసోద్భేదంబునందుఁ గానంబడియె; నిది సింధుతీర్థం; బిందు లోపాముద్ర నగస్త్యుండు ప్రతిగ్రహించె. 225

ప్రతిపదార్థం: ఇది= ఈచోటు; పంచ, యోజన, ప్రమాణంబు+ఐన= అయిదు ఆమడల నిడివి కల; ప్రజాపతి, యజ్ఞ, వేది= బ్రహ్మదేవుడు యజ్ఞం చేసిన అరుగు; ఇందు= ఇక్కడ; దేహ, త్యాగంబు+చేసి= శరీరాన్ని విడిచి; మర్త్యులు= మానవులు- మరణశీలురైనవారు; న+మర్త్యత్వంబున్= చావులేని దైవభావాన్ని; పొందుదురు= సంపాదిస్తారు; తొల్లి= పూర్వకాలాన; సరస్వతి= సరస్వతీనది; నిషధ, దేశంబున= నిషధదేశంలో; భూమి+చొచ్చి= భూమిలోకి చొరబడి; ఈ+చమసోద్భేదంబునందున్= ఈ చమసోద్భేదం అనే తీర్థంలో; కానంబడియె= కనిపించింది; ఇది= ఈ స్థలం; సింధు, తీర్థంబు= సింధుతీర్థం అనేపేరు కలిగింది; ఇందు= ఇక్కడ; అగస్త్యుండు= అగస్త్య మహాముని; లోపాముద్రన్= లోపాముద్ర అనే తన ధర్మపత్నిని; ప్రతిగ్రహించెన్= పాణిగ్రహణం చేశాడు.

తాత్పర్యం: ఇది అయిదు ఆమడల మేర నిడివి కలిగిన వేదిక. దీనిపై పూర్వం బ్రహ్మదేవుడు యజ్ఞాన్ని చేశాడు. ఇక్కడ శరీరాన్ని విడిచిన మనుష్యులు దేవతాభావాన్ని పొందగలరు. పూర్వకాలాన సరస్వతీనది నిషధదేశంలో భూమిలోపలికి అంతర్ధానమై మళ్ళీ ఈ 'చమసోద్భేదం' అనేతీర్థంలో బయటపడింది. ఇది సింధుతీర్థం. ఇక్కడే అగస్త్యమహర్షి లోపాముద్రను తన ధర్మపత్నిగా స్వీకరించాడు.

విశేషం: 'చమసం' - అంటే మోదుగువంటి కర్రతో చతురస్రాకారంగా చేయబడిన యజ్ఞపు ఉపకరణం. బ్రహ్మదేవుడు యజ్ఞం చేసిన చోటగల విశాలమైన అటువంటి యజ్ఞపాత్రను భేదించుకొని సరస్వతీ నది వెలువడింది. అందువలన అచ్చటి పుణ్యతీర్థానికి 'చమసోద్భేద' మనే పేరు ఏర్పడింది.

తే. ఇదియు విష్ణుపదంబు; దా నిది విపాశ; । యిదియుఁ గాశ్మీరమండలం; బిది వితస్త;
మిదియు మానసద్వార; మిం దిందువంశ! । పరశురాముండు మును హంసపథముఁ జేసె. 226

ప్రతిపదార్థం: ఇదియు= ఈచోటు; విష్ణుపదంబు= విష్ణుపదం అనే పుణ్యతీర్థం; తాన్+ఇది, విపాశ= తాను ఇది విపాశ అనే పుణ్య నది; ఇదియున్= ఈక్షేత్రం; కాశ్మీర, మండలంబు= కాశ్మీరదేశం; ఇది=ఇది; వితస్తము= వితస్తం అనే పవిత్ర నది; ఇదియు= ఇదియున్నూ; మానస, ద్వారము= మానస సరస్సు యొక్క ద్వారం; ఇందు= ఇక్కడ; ఇందువంశ!= చంద్రవంశానికి చెందినవాడా, ఓధర్మరాజా!; పరశురాముండు= పరశురాముడు; మును= తొల్లి; హంసపథమున్= హంసపథం అనే క్షేత్రాన్ని; చేసెన్= నిర్మించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: చంద్రవంశానికి చెందినటువంటి ధర్మరాజా! ఈ పుణ్యతీర్థానికి విష్ణుపదం అని పేరు. ఈ పుణ్యనదికి విపాశ అని పేరు. ఇది కాశ్మీర మండలం. ఈ నదికి వితస్తం అని పేరు. ఈక్షేత్రానికి మానసద్వారం అనిపేరు. దీనిని పూర్వం పరశురాముడు హంసపథంగా నిర్మించాడు.

విశేషం: ప్రతిపుణ్యక్షేత్రానికి, తీర్థానికి ఏదోఒక విశిష్టత చెప్పబడింది. వాటిలో ఒకటి విష్ణుపదం. భారతంలో అభివర్ణితాలైన పుణ్యక్షేత్రాలను; తీర్థాలను అన్నిటినీ నేడు గుర్తించటం కష్టం. ఆరణ్యపర్వంలోని రెండో ఆశ్వాసంలో కొన్ని పుణ్యక్షేత్రాల, తీర్థాల వర్ణన ఉన్నది. మూడో ఆశ్వాసంలోకూడా అటువంటి వర్ణన ఉన్నది. అక్కడక్కడా పునరుక్తి లేకపోలేదు. రెండో ఆశ్వాసంలో నారదమహర్షి ధర్మరాజుకు చెప్పిన పుణ్యక్షేత్రాల, తీర్థాల అభివర్ణన ఉన్నది. మూడో ఆశ్వాసంలో ధర్మరాజాదులు దర్శించిన పుణ్యక్షేత్రాల, తీర్థాలవర్ణనం ఉన్నది. విష్ణుపదం అంటే బహుశా విముక్తి కల్పించే తీర్థంగా ఏర్పడిఉంటుంది. మానససరోవరం యొక్క ద్వారం మానసద్వారం. ఇక్కడి కొండలోనే పరశు రాముడు ఈ ఆశ్రమాన్ని నిర్మించాడు. ఆ ఆశ్రమం పేరు 'హంసపథం'.

శిబి యను రాజర్షిచరిత్రంబు రోమశుఁడు ధర్మరాజునకుఁ జెప్పుట (సం. 3-130-15)

వ. ఇక్కొలనం జైత్రమాసంబునందు మహామునులచేతం బూజితుండై యుమాసహితుం డీశ్వరుండు వారికిం బ్రత్యక్షంబగుటయు నరుంధతీ సహితుండై వసిష్ఠుం డిందుల వసియించె; నిది భృగుతుంగం బను పర్వతం; బిందు నుశీనరపతి శిబియను వాఁడు దొల్లి యజ్ఞంబు సేయుచున్న నింద్రాగ్నులు వాని మహాగుణంబు లెఱుంగవేఁడి యింద్రుండు శ్యేనం బైన, నగ్ని కపోతంబై శ్యేనభయంబునఁ బఱతెంచి శిబిమఱువు సొచ్చిన దాని నెగిచికొని వచ్చి శ్యేనంబు శిబి కిట్లనియె. 227

ప్రతిపదార్థం: ఈ+కొలనన్= మానసమనే ఈసరస్సులో; చైత్ర, మాసంబునందు= చైత్రమాసంలో; మహామునులచేతన్= గొప్పఋషులచేత; పూజితుండు+ఐ= ఆరాధించబడ్డవాడై; ఉమాసహితుండు+ఈశ్వరుండు= పార్వతీదేవితో కూడిన పరమశివుడు; వారికిన్= ఈ ఋషులకు; ప్రత్యక్షంబు+అగుటయున్= కన్పించటమున్నూ; అరుంధతీ, సహితుండు+ఐ= తన ధర్మపత్ని అయిన అరుంధతితోపాటు; వసిష్ఠుండు= వసిష్ఠమహర్షి; ఇందుల= ఇక్కడ; వసియించెన్= నివసించాడు; ఇది= ఈక్షేత్రం; భృగుతుంగంబు+అను పర్వతంబు= భృగుతుంగ మనే పేరు కల కొండ; ఇందున్= ఇక్కడ; ఉశీనరపతి= ఉశీనర దేశమునకు రాజు అయిన; శిబి+అనువాఁడు= శిబి అనేవాడు; తొల్లి= పూర్వకాలాన; యజ్ఞంబు+చేయుచున్నన్= యజ్ఞం చేస్తుండగా; ఇంద్ర+అగ్నులు= ఇంద్రుడు, అగ్నియున్నూ; వాని= అతడియొక్క; మహాగుణంబులు= గొప్పలక్షణాలు; ఎఱుంగ, వేఁడి= తెలిసికొనటానికి సంకల్పించిన వారై; ఇంద్రుండు= ఇంద్రుడు; శ్యేనంబు+ఐన= డేగ కాగా; అగ్ని= అగ్నిహోత్రుడు; కపోతంబు+ఐ= పావురంగా మారి; శ్యేన, భయంబునన్= డేగవలని భీతిచేత; పఱతెంచి= పారిపోయి వచ్చి; శిబి= శిబియొక్క; మఱువు+చొచ్చినన్= శరణను ఆశ్రయించగా; దానిన్= ఆపావురాన్ని; ఎగిచికొని, వచ్చి= వెంబడించి వచ్చి; శ్యేనంబు= డేగ; శిబికి= శిబితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఈ మానస సరోవరమందు చైత్రమాసంలో మహర్షులచేత ఆరాధించబడి, పార్వతీదేవితో కూడి పరమేశ్వరుడు వారికి దర్శనాన్ని అనుగ్రహించాడు. అందువలన ఇక్కడ అరుంధతీదేవితోపాటు వసిష్ఠమహర్షి నివసించాడు. ఇది భృగుతుంగ పర్వత శిఖరం. ఇక్కడ ఉశీనరపతి శిబిచక్రవర్తి పూర్వకాలంలో యజ్ఞం చేశాడు. అప్పుడు ఆ మహానుభావుడి గుణగణాలు పరీక్షించతలచారు ఇంద్రాగ్నులు. ఇంద్రుడు డేగరూపం ధరించాడు. అగ్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పావురంగా మారాడు.డేగవలని భీతితో పావురం పరుగెత్తుకొనివచ్చి శిబిచక్రవర్తిని శరణు వేడింది. డేగ పావురాన్ని వెంటాడుతూ వచ్చి శిబితో ఇట్లా పలికింది.

ఆ. 'నిన్ను సత్యధర్మనిర్మలుఁగా విందు; । నట్టి నీకుఁ బాడియయ్య యిప్పు
డతిబుభుక్షితుండనై యున్న నాకు నా । హారవిఘ్న మిట్టు లాచరింప? 228

ప్రతిపదార్థం: నిన్ను= ఓ శిబిచక్రవర్తీ, నిన్ను; సత్య, ధర్మ, నిర్మలున్+కాన్= సత్యాన్ని, ధర్మాన్ని అనుష్ఠించడం వలన కళంకం లేనటువంటి వాడినిగా; విందున్= వింటుంటాను; అట్టి, నీకున్= అటువంటి కీర్తికల నీకు; ఇప్పుడు= ఇప్పుడు; అతి బుభుక్షితుండను+ఐ+ఉన్న= మిక్కిలి ఆకలితో అల్లాడుతున్న; నాకున్= నాకు; ఆహార, విఘ్నము= తిండికి ఆటంకం; ఇట్టులు= ఈ విధంగా; ఆచరింప= ఆచరించటం, (వర్తిల్లచేయటం); పాడి+అయ్య?= న్యాయమా?

తాత్పర్యం: 'అయ్యా! శిబిచక్రవర్తీ! నీవు సత్యాన్ని, ధర్మాన్ని ఆచరించటం చేత నిష్కళంకమైన వాడివని వినిఉన్నాను. ఇప్పుడు నేను మిక్కిలి ఆకలితో ఉండగా నాకు ఆహారవిఘ్నం చేయటం నీకు న్యాయమా?

వ. సర్వభూతంబులు నాహారంబున జీవించి వర్ధిల్లు; నిది నాకు భక్ష్యంబు గానినాఁడు బుభుక్షావేదనం జేసి ప్రాణ వియోగం బగు; నట్లయిన నా పుత్త్రులు భార్యయు జీవింపనేర; రొక్కకపోతంబు రక్షించి పెక్కు జీవులకు హింస సేయుట ధర్మవిరోధంబు. 229

ప్రతిపదార్థం: సర్వభూతంబులున్= అన్ని ప్రాణులున్నూ; ఆహారంబునన్= తిండివలన; జీవించి= బ్రతికి; వర్ధిల్లున్= వృద్ధిచెందుతాయి; ఇది= ఈ పావురం; నాకున్= నాకు; భక్ష్యంబు+కానినాఁడు= ఆహారం కాకపోయినట్లైతే; బుభుక్షా, వేదనన్+చేసి= ఆకలిబాధచేత; ప్రాణ, వియోగంబు+అగున్= ప్రాణాలు పోగలవు; అట్లు+అయిన= ఆవిధంగా జరిగితే; నా, పుత్త్రులు= నా బిడ్డలు; భార్యయు= భార్యయున్నూ; జీవింపనేరరు= జీవించలేరు; ఒక్క, కపోతంబు= ఒక పావురాన్ని; రక్షించి= కాపాడి; పెక్కు, జీవులకున్= అనేక ప్రాణులను; హింస+చేయుట= హింసించటం, (బాధ కలిగించటం); ధర్మవిరోధంబు= ధర్మానికి వ్యతిరేకం.

తాత్పర్యం: సకలప్రాణులు ఆహారం మూలంగానే బ్రతికి పెంపొందుతాయి. ఈ పావురం నాకు ఆహారం కానినాడు నాప్రాణాలు నిలువవు. అట్లా జరిగితే నా సంతానం, నాభార్య బ్రతుకలేరు. ఒక్క పావురాన్ని నీవు కాపాడి ఇన్ని ప్రాణులను హింసించటం ధర్మానికి వ్యతిరేకం కదా!

క. ధర్మజ్ఞు లైన పురుషులు । ధర్మువునకు బాధ సేయు ధర్మువునైనన్
ధర్మముగా మదిఁ దలఁపరు; । ధర్మువు సర్వంబునకు హితంబుగ వలయున్. 230

ప్రతిపదార్థం: ధర్మజ్ఞులు+ఐన పురుషులు= ధర్మాన్ని తెలిసినటువంటివారు; ధర్మువునకు= ధర్మానికి; బాధ+చేయు= ఉపహతి కల్పించే- అంటే హాని కలిగించే; ధర్మువును+ఐనన్= ధర్మాన్నిసైతం; ధర్మముగా= ధర్మమైనదిగా; మదిన్= మనస్సులో; తలఁపరు= ఎంచరు; ధర్మువు= ధర్మం అనేది; సర్వంబునకు= సమస్తమైన వాటికీ; హితంబుగ= మేలు చేకూర్చేదిగా; వలయున్= ఉండాలి.

తాత్పర్యం: ధర్మస్వరూపాన్ని ఎరిగిన జ్ఞానులు ధర్మానికి కీడు కలిగించే ధర్మాన్నైనా, ధర్మంగా మనస్సులో భావించరు. అచ్చమైన ధర్మం, జగత్తు కంతటికీ మేలు చేకూర్చాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మహాభారతం పంచమవేదం. మహాభారతంలో చాలాచోట్ల ధర్మంపై చర్చలు కొనసాగాయి. ధర్మస్వరూప నిరూపణకు, ధర్మసూక్ష్మ వివరణకు మహాభారతంలో పేర్కొనదగినవి, ముఖ్యమైనవి రెండు ఉపాఖ్యానాలు ఉన్నాయి. (1) ధర్మవ్యాధోపాఖ్యానం (2) శిబి గాథ. 'అహింసా పరమో ధర్మః' అన్న అహింసా నిర్వచనంలో ధర్మసూక్ష్మాన్ని అరయవలసి ఉన్నది. బౌద్ధమతానికి 'అహింసా పరమో ధర్మః' అన్నది జీవనాడి. పరోపకారార్థం తమ శరీరాలను అర్పించి 'పరోపకారార్థ మిదం శరీరమ్' అన్న వాక్యానికి జీవదుదాహరణాలు బౌద్ధవాఙ్మయం ప్రపంచించిన బోధిసత్త్వులు, శిబి, జీమూత వాహనుడు మొదలైన మహనీయులు. ఈ పద్యం ధర్మసూక్ష్మానికి జీవనాడి విశ్వశ్రేయం అని ప్రతిపాదిస్తున్నది. ఏది ధర్మం? రెండు ధర్మాలు విప్రతిపన్నాలైనవి ఉన్నట్లైతే పరమధర్మ మేది? ఇక్కడ డేగ ఈప్రశ్ననే శిబికి వేసింది. పావురాన్ని కాపాడటం ధర్మంగా నీవు భావిస్తే, నా ఆహారం మాట ఏమవుతుంది? అని శిబిని డేగ సూటిగా అడిగింది. 'ఒక ధర్మానికి హాని కలిగించే మరొక ధర్మం విశ్వజనీనం కాలేదు. అది ఆభాస ధర్మమే కాని పరమధర్మం కాదు' అని ఈపద్యంలో డేగ ప్రతిపాదించింది. అంతేకాక - ఈ పద్యంతోపాటు తరువాతి గద్యాన్నికూడ అనుసంధించాల్సిఉంది ఈ ధర్మసూక్ష్మచర్చలో.

వ. ఇక్కపోతంబు నాకు వేదవిహితంబైన యాహారంబు; 'శ్యేనాః కపోతాన్ ఖాదయన్తి' యను వేదవచనంబు గలదు గావున దీని నాకు నాహారంబుగా ని' మ్మనిన దానికి శిబి యిట్లనియె. 231

ప్రతిపదార్థం: ఈ+కపోతంబు= ఈ పావురం; నాకున్= నాకు; వేద, విహితంబు+ఐన+ఆహారంబు= వేదాలచేత నిర్దేశించబడిన ఆహారం; శ్యేనాః= డేగలు; కపోతాన్= పావురాలను; ఖాదయన్తి= తింటాయి; అను= అనే; వేద వచనంబు= వేదవాక్యం; కలదు= ఉన్నది; కావున= కాబట్టి; దీని= ఈ పావురాన్ని; నాకున్= నాకు; ఆహారంబుగాన్= ఆహారంగా; ఇమ్ము= ఇవ్వవలసింది; అనిన= అని చెప్పగా; దానికి= ఆ డేగకు; శిబి= శిబి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా తెలిపాడు.

తాత్పర్యం: ఈపావురం నాకు వేదాలచేత విధించబడిన ఆహారం. డేగలు పావురాలను భక్షిస్తాయి- అనే వేదవాక్యం ఉన్నదికదా! కాబట్టి ఈ పావురాన్ని నాకు ఆహారంగా నీవు వదలాలి'- అని డేగ పలుకగా దానికి శిబి ఈవిధంగా బదులు పలికాడు.

విశేషం: డేగలకు పావురాలు ప్రకృతిసిద్ధాలైన ఆహారంకదా. ఇక 'అహింసా పరమో ధర్మః' అన్నది ఎట్లా చెల్లుతుంది? ఇంద్రుడు, అగ్ని గొప్ప పరీక్షనే తెచ్చిపెట్టారు. పంచమవేదం ఈ పరీక్షకు ఎటువంటి పరిష్కారం చూపించింది?

తే. 'ప్రాణభయమున వచ్చి యిప్పక్షి నన్ను। నాశ్రయించె; నాశ్రితు నెట్టి యధముఁ డయిన
విడువఁ డనినను నే నెట్లు విడుతు దీని?। నాశ్రితత్యాగ మిది ధర్మ వగునె? చెపుమ. 232

ప్రతిపదార్థం: ప్రాణభయమున= ప్రాణాలవలని (ప్రాణాలు పోతాయి) అనే భయంచేత; వచ్చి= వచ్చి; ఈ+పక్షి= ఈపులుగు; నన్నున్= నన్ను; ఆశ్రయించెన్= రక్షించే ఆధారంగా గైకొన్నది; ఆశ్రితున్= తన రక్షణను వేడి ఉన్నవాడిని; ఎట్టి+ అధముఁడు+అయినన్= ఎంతటి నీచుడయినా; విడువడు= విడువడు; అనినను= అన్నాకూడ, అన్ననూ, ఏను= నేను; ఎట్లు= ఎట్లా, ఏవిధంగా; దీనిన్= ఈపక్షిని; విడుతు= విడవగలను; ఆశ్రిత, త్యాగము= ఆశ్రయించినవారిని విడిచిపెట్టటం; ఇది= ఇది; ధర్మువు+అగునె?= ధర్మం కాగలదా? చెపుము+అ= చెప్పవలసింది.

తాత్పర్యం: 'ఈపావురం ప్రాణభయంతో వచ్చి నన్ను ఆశ్రయించింది. ఆశ్రయించినవారిని ఎటువంటి నీచుడైనా విడువలేడు కదా! ఇక నేను ఎట్లా నన్ను ఆశ్రయించిన పావురాన్ని విడిచిపెట్టగలను? ఆశ్రితులను విడవటం ధర్మం కాగలదా? నీవే చెప్పుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. నీవు పక్షివయ్యును ధర్మ మెఱింగినట్లు పలికితి; శరణాగత పరిత్యాగంబుకంటె మిక్కిలి యధర్మం బొం డెద్ది? నీయాఁకలి దీననకాని యొంట నుపశమింపదే? నీయత్నం బాహారార్థంబేని యిప్పు డివ్వనంబున మృగ మహిషవరాహఖగ మాంసంబులు దీనికంటె మిక్కిలిగాఁ బెట్టెద; నిక్కపోతంబువలని యాగ్రహం బుడుగుము; దీని నే నెట్లును విడువ' ననిన శ్యేనం బిట్లనియె. 233

ప్రతిపదార్థం: నీవు=నీవు (ఓ డేగా); పక్షివి+అయ్యును= పక్షివి అయినప్పటికిన్నీ; ధర్మము+ఎఱింగినట్లు= ధర్మం తెలిసినట్లుగా; పలికితి(వి)= మాట్లాడావు; శరణ+ఆగత, పరిత్యాగంబుకంటె= శరణానికై - అంటే కాపాడుమని అర్థిస్తూ - వచ్చినవారిని విడనాడటం కంటె; మిక్కిలి+అధర్మంబు= అధికమైన అధర్మం; ఒండు+ఎద్ది= వేరొకటి= ఏది ఉన్నది?; నీ+ఆఁకలి= నీ బుభుక్ష; దీననకాని= ఈ పావురాన్ని భక్షించటంవలనకాని; ఒంటన్= వేరొక మార్గాన; ఉపశమింపదే?= ఉడుగదా?; నీ యత్నంబు= నీపూనిక; ఆహార+అర్థంబు+ఏని= తిండికోసమే అయినట్లైతే; ఇప్పుడు= ఇపుడు; ఈ+వనంబునన్= ఈ వనంలో; మృగ, మహిష, వరాహ, ఖగ, మాంసంబులు= లేళ్ళయొక్క, దున్నలయొక్క, పందులయొక్క మాంసాలు; దీనికంటె= ఈ పావురంకంటె; మిక్కిలిగాన్= అధికంగా; పెట్టెదన్= సమకూరుస్తాను; ఈ+కపోతంబు వలని+ఆగ్రహంబు= ఈ పావురంమీద నీకు గల కోపాన్ని; ఉడుగుము= మానుకొమ్ము; దీనిన్= ఈ పావురాన్ని; ఏను+ఎట్లును, విడువను= నేను ఏరీతిగానైనా విడువలేను; అనినన్= అని చెప్పగా; శ్యేనంబు= డేగ; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పింది.

తాత్పర్యం: నీవు పక్షివి అయినాకూడా ధర్మం తెలిసినట్లుగా మాట్లాడుతున్నావు. ఆశ్రయం కోరి వచ్చిన వారిని విడువటం కన్నా అధికమైన అధర్మం ఉన్నదా? నీ ఆకలి ఈ పావురాన్ని తింటేకాని తీరదా? నీ ప్రయత్నం కేవలం నీ పొట్టపోసుకొని ఆకలి తీర్చుకొనటానికే అయితే ఇప్పుడు ఈ అడవిలో ఎన్ని జంతువులు లేవు? లేళ్ళు, దున్నలు, పందులు, పక్షులు, వీటి మాంసాలను ఈ పక్షికంటె అధికంగా నీకు సమకూర్చగలను. ఈ పావురంమీద ఆగ్రహాన్ని విడిచిపెట్టుము. నేను ఎట్లా అయినా కూడా, ఈ పక్షిని విడవను సుమా!'- అని శిబి పలుకగా, డేగ అతడితో ఇట్లా బదులు పలికింది.

ఆ. 'నాకు విహితభక్షణం బిది; యిప్పక్షిఁ । బూని కావ నీకు బుద్ధియేని
యవనినాథ! దీనియంత నీ మాంసంబు । దూఁచి నాకుఁ బెట్టు తొలఁగ కిపుడ.' 234

ప్రతిపదార్థం: ఇది, నాకు, విహిత, భక్షణంబు= ఈ పక్షి నాకు ప్రకృతిచేత నిర్ణీతమైన ఆహారం; ఈ+పక్షిన్= ఈ పిట్టను; పూని కడగి; కావ= రక్షించాలని; నీకు, బుద్ధి+ఏని= నీకు ఆలోచన కలిగినట్లైతే; అవనినాథ!= పుడమికి భర్తవైన ఓరాజా!; దీని+అంత= దీనితో సరితూగే; నీ మాంసంబు= నీ శరీరంలోని మాంసం; తూఁచి= సరితూచి; నాకున్= నాకు; తొలఁగక= మానక; ఇపుడు+అ= ఇప్పుడే; పెట్టు= సమకూర్చుము.

తాత్పర్యం: 'ఓ మహారాజా! ఈ పావురం నాకు ప్రకృతి సహజంగా ఏర్పడిన ఆహారం. ఈ పక్షిని రక్షించాలనే అభిప్రాయం నీకు కలిగినట్లైతే దీని బరువుతో సరిసమానమైన తూకం కల నీ శరీరమాంసం ఇపుడు వెనుదీయక నాకు ఇమ్ము.'

చ. అనిన 'ననుగ్రహించితి మహావిహగోత్తమ!' యంచు సంతసం
బున శిబి తత్క్షణంబ యసిపుత్త్రిక నాత్మశరీరకర్తనం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బనఘుఁడు సేసిచేసి తన యంగమునం గల మాంసమెల్లఁ బె
ట్టినను గపోతభాగమ కడిందిగ డిందుచు నుండె నత్తులన్. 235

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అనుగ్రహించితి= దయచూపినావు; మహత్+విహగ+ఉత్తమ!= గొప్పపక్షులలో శ్రేష్ఠమైనదానా! ఓ డేగా!; అంచు= అని అంటూ; అనఘుఁడు= పాప రహితుడు; శిబి= శిబి చక్రవర్తి; సంతసంబున= సంతోషంతో; తద్+క్షణంబు+అ= ఆ క్షణమే; అసి పుత్త్రికన్= చిరుకత్తితో; ఆత్మ, శరీర, కర్తనంబు, చేసి, చేసి= తన శరీరాన్ని కోసి కోసి; తన+అంగమునన్= తన దేహంలో; కల= ఉన్న; మాంసము+ఎల్లన్= మాంసమంతటినీ; పెట్టినను= సమర్పించిననూ; ఆ+తులన్= ఆ త్రాసులో; కపోత భాగము+అ= పావురం ఉన్న పక్షమే; కడిందిగ= మిక్కిలిగా; డిందుచున్+ఉండెన్= దిగిపోతూ ఉన్నది.

తాత్పర్యం: అని డేగ పలుకగా సంతోషించి శిబిచక్రవర్తి 'పక్షులలో కెల్ల నీవు ఉత్తమపక్షివి. నీవు నా పై దయచూపావు' అని చెప్పి తత్క్షణమే చిరుకత్తితో తన శరీరంలోని మాంసాన్ని కోసి తరాజుతో తూకం వేయసాగాడు. కాని, అతడి దేహంలోని మాంసం అంతా సమర్పించినాకూడా, ఆ తులాభారంలో పావురం ఉన్నభాగమే క్రిందికి దిగుతున్నది.

క. దానికి నచ్చెరువడి ధర । ణీనాథుఁడు తనువునందు నెత్తురు దొరుఁగం
దాన తుల యెక్కెఁ నంతన్ । వాని గుణోన్నతికి మెచ్చి వాసవదహనుల్. 236

ప్రతిపదార్థం: దానికిన్= తనశరీరంలోని మాంసాన్ని ఎంత కోసివేసినా ఆపావురం బరువుతో సరితూగకపోవటానికి; ధరణీ నాథుఁడు= భూభర్త అయిన శిబి; అచ్చెరువు+పడి= ఆశ్చర్యపడి; తనువునందు= దేహమందు; నెత్తురు+తొరుఁగన్= రక్తం కారగా; తాను+అ= తానే; తుల+ఎక్కెన్= త్రాసులోకి ఎక్కాడు; అంతన్= అంతట; వాసవ, దహనుల్= ఇంద్రుడున్నూ, అగ్నియున్నూ; వాని, గుణ+ఉన్నతికి= ఆ శిబిచక్రవర్తి గొప్పగుణాలకు; మెచ్చి;

తాత్పర్యం: తన శరీరంలోని మాంసం ఎంతకోసి తులలో వేసినప్పటికీ, ఆ పావురంబరువుకు సరితూగక పోవటంచేత ఆశ్చర్యపడి శిబిచక్రవర్తి తానే తక్కెడలో ఎక్కాడు. అతడి ఆత్మార్పణపూర్వకమైన త్యాగానికి, గొప్పగుణానికి ఇంద్రుడు, అగ్నిహోత్రుడు అభినందించి.

వ. శ్యేనకపోత రూపంబులు విడిచి నిజరూపంబులఁ జూపి 'నీ ధైర్య శౌర్యాది గుణంబు లనన్యసాధారణంబులు గావున నీకీర్తి నిత్యంబై శబ్ద బ్రహ్మంబు గలయంత కాలంబును వర్తిల్లుచు నుండెడు' మని శిబికి వరం బిచ్చి యింద్రాగ్నులు చని; రిది యమ్మహాపురుషు పుణ్యస్థానంబు; మఱియు ననవరత ఫలవృక్షంబులు గల యిది యౌద్దాలకియైన శ్వేతకేతు తపోవనం; బిందు సరస్వతి మనుష్య స్త్రీరూపధారిణియై శ్వేతకేతుని సేవించె; మాతుల భాగినేయులైన యష్టావక్రశ్వేతకేతు లిందు యుగ్రతపంబుఁజేసి' రనిన 'నం దష్టావక్రు మాహాత్మ్యంబు విన వలతు' నని యడిగిన, యుధిష్ఠిరునకు రోమశుం డిట్లనియెఁ; 'దొల్లి యేకపాదుం డనుమునివరుండు తనవిద్యావిభవంబున సుజాత యను దాని వివాహంబై వనంబున ఘోరతపంబు చేయుచు ననవరతంబును శిష్యుల వేదంబులు చదివించుచున్నఁ బెద్దకాలంబునకు సుజాత గర్భిణియైనఁ దద్గర్భంబున నున్న యర్భకుం డొక్కనాఁడు తండ్రి కిట్లనియె. 237

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: శ్యేన, కపోత, రూపంబులు= డేగ, పావురాలయొక్క ఆకారాలు; విడిచి= వదలి; నిజ, రూపంబులన్+చూపి= తమ అసలు ఆకారాలను ప్రదర్శించి; నీ ధైర్య, శౌర్య+ఆదిగుణంబులు= నీయొక్క తెగువ, పరాక్రమం మొదలైన గొప్పలక్షణాలు; అనన్య సాధారణంబులు= ఇతరులలో ఉన్నట్టివి కావు; కావునన్= కాబట్టి; నీ, కీర్తి= నీకీర్తి; శబ్ద, బ్రహ్మంబు, కల+అంతకాలంబును= శబ్దబ్రహ్మం ఉండేటంతకాలమున్నూ; వర్తిల్లుచున్+ఉండెడు+అని= వ్యాపించి ఉంటుంది అని; వరంబు+ఇచ్చి= వరాన్ని అనుగ్రహించి; ఇంద్ర+అగ్నులు= ఇంద్రుడున్నూ, అగ్నియున్నూ; చనిరి= వెళ్ళారు; ఇది= ఈ స్థలం; ఆ+మహాపురుషు= ఆ మహానుభావుడియొక్క; పుణ్య, స్థానంబు= పుణ్యక్షేత్రం; మఱియు= ఇంకనూ; అనవరత, ఫల, వృక్షంబులు కల= ఎల్లప్పుడు కాస్తున్న పండ్ల చెట్లున్న; ఇది= ఈ స్థలం; ఔద్దాలకి+ఐన= ఉద్దాలక సుతుడైన; శ్వేతకేతు, తపస్+వనంబు= శ్వేతకేతుడు తపస్సు చేసిన వనం; ఇందు= ఇక్కడ; సరస్వతి= సరస్వతి; మనుష్య, స్త్రీ రూపధారిణి+ఐ= మానవస్త్రీ రూపం ధరించి; శ్వేతకేతుని, సేవించె= శ్వేతకేతు మహర్షికి పరిచర్య చేసింది; మాతుల భాగినేయులు+ఐన= మేనమామ చెల్లెలి కొడుకులు అయిన, (మేనమామ, మేనల్లుండ్రయిన); అష్టావక్ర శ్వేతకేతులు= అష్టావక్రుడున్నూ, శ్వేతకేతుడున్నూ; ఇందు+అ= ఇక్కడే; ఉగ్ర, తపంబున్+చేసిరి= ఘోరమైన తపస్సును చేశారు; అనినన్= అని చెప్పగా; అందు= అందులో; అష్టావక్రు మాహాత్మ్యంబు= అష్టావక్రుడి మహిమను; విన వలతున్= ఆలకించ గోరుతున్నాను; అని= అంటూ; అడిగిన= కోరగా; యుధిష్ఠిరునకున్= ధర్మరాజుకు; రోమశుండు= రోమశుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు; తొల్లి= పూర్వకాలాన; ఏకపాదుండు= ఏకపాదుడు అనే పేరు కలిగిన; మునివరుండు= ఋషిశ్రేష్ఠుడు; తన, విద్యా, విభవంబున= తన చదువుయొక్క గొప్పతనంచేత; సుజాత+అనుదాని= సుజాత అనేపేరు కల వధువును; వివాహంబు+ఐ= పెళ్ళాడి; వనంబున= అడవిలో; ఘోర, తపంబు చేయుచున్= కఠోరమైన తపస్సుచేస్తూ; అనవరతంబును= ఎల్లప్పుడున్నూ; శిష్యులన్= తనదగ్గర చదువుకొనే విద్యార్థులచేత; వేదంబులు, చదివించుచున్నన్= వేదాలను వల్లెవేయిస్తుండగా; పెద్దకాలంబునకున్= చాలాకాలానికి; సుజాత= సుజాత; గర్భిణి+ఐనన్= కడుపుతో ఉండగా; తద్+గర్భంబునన్= ఆమె కడుపులో; ఉన్న= ఉన్నటువంటి; అర్భకుండు= శిశువు; ఒక్కనాఁడు= ఒక్కరోజు; తండ్రికి= తండ్రికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: డేగ, పావురం తమరూపాలు వదలివేశాయి. అప్పుడు ఇంద్రుడు అగ్నిహోత్రుడు నిజరూపాలతో ప్రత్యక్షమై శిబిచక్రవర్తితో 'మహానుభావా! నీత్యాగం, ధైర్యం, శౌర్యం మొదలైన గుణాలు మరి ఎవ్వరిలో కనిపించవు. నీకీర్తి మానవులు శబ్దబ్రహ్మాన్ని ఉపాసిస్తుండేంతవరకు విలసిల్లుతుంటుంది' అని అతడిని అభినందించి, వరమిచ్చి అతడిని వీడుకొలిపి వెళ్ళిపోయారు. ఇది ఆ మహాపురుషుడి క్షేత్రం. ఎప్పుడూ పండ్లతో శోభిల్లే ఈతోట ఉద్దాలకుడి కుమారుడైన శ్వేతకేతు తపోవనం. ఇక్కడ సరస్వతి మానవస్వరూపం ధరించి శ్వేతకేతుడికి సేవచేసింది. శ్వేతకేతుడున్నూ అష్టావక్రుడున్నూ మేనమామ, మేనల్లుళ్ళు. వారిరువురు ఇక్కడ ఉగ్రతపస్సు చేశారు.- అని రోమశుడు చెప్పగా ధర్మరాజు 'అష్టావక్రుడి మాహాత్మ్యం వినగోరుతున్నా'నన్నాడు. అందుకు రోమశుడు ఇట్లా వివరించాడు: 'ఏకపాదుడనే మునివరుడు మహావిద్వాంసుడు. అతడు సుజాత అనే ఆమెను పెళ్ళాడాడు. శిష్యులచేత నిరంతరం వేదాధ్యయనం, విద్యాభ్యాసం చేయిస్తూ ఉండగా భార్య అయిన సుజాత గర్భవతి అయింది. ఒకనాడు గర్భంలో ఉన్న శిశువు తండ్రితో ఇట్లా అన్నాడు.

విశేషం: శిబి చక్రవర్తి కీర్తి శబ్దబ్రహ్మం ఉండేంతకాలం విస్తరిస్తుందని ఇంద్రాగ్నుల ప్రవచనం. శబ్దం అక్షర సమామ్నాయంగా రూపొంది, సారస్వత ప్రతిపత్తిని ఆర్జించి, చిరకాలం మనగలగటం అందరికీ తెలిసిన విషయమే. శబ్దము = అక్షరము = నశించనిది. అంతేకాక, శిబిత్యాగం లోకోత్తరమైనది. శిబి కథ సనాతన వైదిక సారస్వతంలో మాత్రమే గాక, బౌద్ధ, జైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గాథలలో కూడ సుప్రసిద్ధమైనది. ఇతివృత్త గౌరవం గల శిబి చక్రవర్తి గాథ శబ్ద బ్రహ్మోపాసకులు- సాహితీవేత్తలు విడువలేనట్టిది. ఆ మాటనే ఇంద్రాగ్నులు వరంగా ప్రసాదించినట్లు మహాభారతకథనం.

రోమశుఁడు ధర్మరాజునకు నష్టావక్రు చరితంబు సెప్పుట (సం. 3-132-8)

క. 'ఎడఁబడక యహోరాత్రులు । వడిఁగొని చదివింప నిట్లు వలయునె శిష్యుల్
గడు నిద్రలేమి నెంతయు । జడమతులై చదువు దప్పఁ జదువుచు నుండన్.' 238

ప్రతిపదార్థం: శిష్యుల్= విద్యార్థులు; కడు, నిద్ర, లేమిన్= బొత్తిగా నిద్రలేకపోవటంచేత; ఎంతయున్= ఎంతో, చాలా; జడ, మతులు+ఐ= మందబుద్ధులై; చదువున్= విద్యను, తప్పన్+చదువుచున్+ఉండన్= తప్పులుగా చదువుతుండగా; ఎడఁబడక= తీరిక లేకుండా నిరంతరం; అహస్+రాత్రులు= అహోరాత్రులు-పగళ్ళున్నూ రాత్రులున్నూ; వడిన్+కొని= వేగంగా; ఇట్లు= ఈ రీతిగా; చదివింపన్, వలయునె= చదువులోనే నిమగ్నులై ఉండేటట్లు చేయటమెందుకు.

తాత్పర్యం: నీ శిష్యులు పగలనక, రేయనక ఎడతెరపిలేకుండా విద్యాభ్యాసం చేయటంచేత వారు మందబుద్ధులవుతూ నిద్ర లేకపోవటంచేత వేదపాఠాలను తప్పుగా చదువుతున్నారు. ఈవిధంగా తప్పులు చదివించటం ఎందుకు?'

వ. అని యుపాలంభించి పలికిన నలిగి యేకపాదుండు 'నీ వధ్యయనంబునకు వక్రంబుగాఁ బలికితివి గావున నెనిమిదివంకలు గల శరీరంబుతో జన్మింపు' మని కొడుకునకు శాపం బిచ్చిన. 239

ప్రతిపదార్థం: అని= అంటూ; ఉపాలంభించి= తెగడుతూ; పలికినన్= మాట్లాడగా; అలిగి= ఆగ్రహించి; ఏకపాదుండు= ఏకపాదుడు; నీవు; అధ్యయనంబునకు= వేద పఠనమునకు; వక్రంబుగాన్= వంకరగా; పలికితివి= మాట్లాడావు; కావునన్= కాబట్టి; ఎనిమిది, వంకలు+కల= ఎనిమిది వంకరలు కల; శరీరంబుతో= దేహంతో; జన్మింపుము= పుట్టుము; అని= అని; కొడుకునకు; శాపంబు+ఇచ్చినన్= శాపం ఇవ్వగా.

తాత్పర్యం: అని నిందించిన గర్భస్థశిశువుమీద ఆగ్రహించి తండ్రి అయిన ఏకపాదుడు 'నీవు వేదాధ్యయనాన్ని వక్రంగా విమర్శించావు కాబట్టి అష్టావక్రుడివై పుట్టుము' అని శపించాడు.

ఆ. అగ్నికల్పుఁడై మహాత్ముఁడు కడుపునఁ । బెరుఁగుచుండె; నంత సరసిజాక్షి
ప్రసవకాల మైనఁ బతి కొక్కనాఁ డిట్టు । లనియెఁ బ్రసవభారమునకు వెఱచి. 240

ప్రతిపదార్థం: అగ్ని కల్పుఁడు+ఐ= నిప్పుతో సమానుడై; మహాత్ముఁడు= మహానుభావుడు; కడుపునన్= గర్భంలో; పెరుఁగు చుండెన్= వృద్ధి చెందుతున్నాడు; అంత= అంతట; సరసిజ+అక్షి= పద్మాలవంటి కన్నులు కలది- సుజాత; ప్రసవ, కాలము+ఐనన్= పురుడు వచ్చేసమయం సమీపించగానే; ప్రసవ, భారమునకు= పురిటిబరువుకు; వెఱచి= భయపడి; పతికి= భర్తకు; ఒక్క నాఁడు= ఒకరోజు, ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: సుజాత కడుపులో నిప్పుతో సమానుడైన మహానుభావుడు పెరుగుతున్నాడు. అంత, పద్మాలవంటి కన్నులుగల ఆ సుజాత ప్రసవసమయం సమీపించటం గమనించి, ప్రసవభారాన్ని తలచుకొని భయపడి, భర్తతో ఒకరోజు ఈవిధంగా అన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'ధరణిఁ గడుఁ బేదవారును । బురిటికి ఘృత తైల ధాన్యములఁ జెచ్చెర ముం
దర సంగ్రహింతు; రవి మన । కరయఁగ నతిదుర్లభంబు లర్థము లేమిన్. 241

ప్రతిపదార్థం: ధరణిన్= భూమిపై; కడున్= మిక్కిలి; పేదవారును= దరిద్రులు కూడ; పురిటికి= ప్రసవానికి; ఘృత, తైల, ధాన్యములన్= నేయి, నూనె, తిండిగింజలను; చెచ్చెర= త్వరగా; ముందర= ముందుగానే; సంగ్రహింతురు= తెచ్చిపెట్టుకొంటారు; అవి= అవి, ఆ ఘృతతైల ధాన్యాదులు; అరయఁగన్= ఆలోచించి చూస్తే; మనకు= మనకు; అర్థము, లేమిన్= ధనం లేకపోవటంచేత; అతి, దుర్లభములు= సాధించటానికి మిక్కిలి కష్టమైనవి.

తాత్పర్యం: 'భూమిమీద మిక్కిలి నిరుపేదలు కూడ పురిటిసమయానికి ముందే వేగంగా నేయి, నూనె, తిండిగింజలు తెచ్చిపెట్టుకుంటారు. మనం ధనం లేనివారం కాబట్టి మనకు అవి సులభంగా దొరికేవి కావు.

వ. ఏమి 'సేయుదు? నెవ్విధంబున నీప్రసవక్లేశంబువలనఁ బాయుదు?' ననిన నేకపాదుండు ధనార్థియయి జనకరాజుపాలికిం జని వాని యజ్ఞంబునందు వరుణపుత్త్రుండైన వందితో వివాదంబు సేసి యోటువడి జలమగ్నుండై యున్న, నిట సుజాత ప్రసూతియై యష్టావక్రుం గనియెఁ; దత్కాలంబున నుద్దాలకుభార్య శ్వేతకేతుం గనియె; నిట్లు మాతులభాగినేయు లిద్దఱు సవయస్కులై పెరిఁగి పండ్రెండేండ్లొక్కట నుద్దాలకుతోఁ జదివి యధ్యయనశూరులై రందు. 242

ప్రతిపదార్థం: ఏమి+చేయుదున్?= ఏమి చేయగలను?; ఏ+విధంబునన్= ఏరీతిగా; ఈప్రసవ, క్లేశంబు వలనన్= ఈ పురిటి బాధలు; పాయుదున్?= తొలగించుకుంటాను?; అనినన్= అని చెప్పగా; ఏకపాదుండు= ఏకపాదుడు; ధన+అర్థి+అయి= ధనాన్ని ఆశించినవాడై; జనక, రాజు, పాలికిన్+చని= జనకప్రభువు దగ్గరకు వెళ్ళి; వాని, యజ్ఞంబునందు= ఆ జనకుడు చేస్తున్న యాగంలో; వరుణ, పుత్త్రుండు+ఐన= వరుణుడి కొడుకైన; వందితో= వంది అనేవాడితో; వివాదంబు+చేసి= చర్చించి; ఓటు+పడి= పరాజయమంది; జల, మగ్నుండు+ఐ= జలంలో మునిగి దాగినవాడై; ఉన్నన్= ఉండగా; ఇట= ఇక్కడ; సుజాత= సుజాత; ప్రసూతి+ఐ= పురిటి ఇల్లాలై; అష్టావక్రున్= అష్టావక్రుడిని; కనియెన్= ప్రసవించింది; తద్+కాలంబునన్= ఆ సమయంలో; ఉద్దాలకు, భార్య= ఉద్దాలకుడి పత్ని; శ్వేతకేతున్= శ్వేతకేతుడిని; కనియెన్= ప్రసవించింది; ఇట్లు= ఇట్లా; మాతుల భాగినేయులు+ఇరువురు= మేనమామ మేనల్లుండ్లిరివురూ; సవయస్కులు+ఐ= ఒకే వయస్సు కలవారై; పెరిఁగి= పెరిగి; పండ్రెండు+ఏండ్లు= పన్నెండేళ్ల కాలం; ఒక్కఁటన్= ఒకచోట; కలసిమెలసి; ఉద్దాలకుతోన్ చదివి= ఉద్దాలకుడి దగ్గర దీక్షతో విద్యలను అభ్యసించి; అధ్యయనశూరులు+ఐరి= చదువులో శౌర్యం కలవారు అయినారు; అందు= అందులో.

తాత్పర్యం: ఏం చేయగలను? ఏవిధంగా ఈ ప్రసవబాధనుండి విముక్తి పొందగలను? - అని సుజాత పలుకగా ఏకపాదుడు ధనసంపాదనకొరకై జనకమహారాజు ఆస్థానానికి వెళ్ళాడు. అక్కడ వరుణకుమారుడైన వందితో వాదించి, పరాజయాన్ని పొంది, నీటిలో మునిగియుండగా, ఇక్కడ సుజాత ప్రసవించి అష్టావక్రుడిని కన్నది. అదే సమయాన ఉద్దాలకుడి భార్య శ్వేతకేతుడిని ప్రసవించింది. ఇట్లా మేనమామ. మేనల్లుండ్లిరువురు సమవయస్కులై కలసిమెలసి పెరిగి, ఉద్దాలకుడి సన్నిధిలో పన్నెండేళ్ళు దీక్షతో వేద విద్యాభ్యాసం చేసి చదువుల్లో మేటిశూరు లైనారు. అందు.

తే. తండ్రి యనుచు నుద్దాలకుఁ దనకుఁ, గరము । ప్రీతితో శ్వేతకేతుని భ్రాత యనుచు
ననఘచరితుఁ డష్టావక్రుఁ డనుదినంబు । నొం డెఱుంగక సుఖలీల నుండు నంత. 243

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనఘచరితుఁడు= పాపంలేని శీలం కలవాడు; అష్టావక్రుఁడు= అష్టావక్రుడు; ఉద్దాలకున్= ఉద్దాలకుడిని; తనకున్+తండ్రి+అనుచున్= తనకు తండ్రి అని తలపోస్తూ; కరము= మిక్కిలి; ప్రీతితో= అభిమానంతో; శ్వేతకేతుని= శ్వేతకేతుడిని; భ్రాత= సోదరుడు; అనుచున్= అని తలపోస్తూ; అనుదినంబున్= నిత్యమూ; ఒండు+ఎఱుంగక= ఇతర మేదీ తెలియక; సుఖలీలన్= సుఖంగా; ఉండునంతన్= ఉండగా.

తాత్పర్యం: అష్టావక్రుడు తనకు ఉద్దాలకుడే తండ్రి అనీ, శ్వేతకేతుడు సహోదరుడు అనీ భావిస్తూ మరి వేరు తలపులు లేకుండా సుఖంగా బ్రతుకుతున్నాడు. అంత.

వ. ఒక్కనాఁ డుద్దాలకు కుఱు వెక్కియున్న యష్టావక్రుం జూచి శ్వేతకేతుండు సహింపక 'నీ వేల మాయయ్య కుఱువెక్కి యుండె? దీవు వోయి మీయయ్య కుఱు వెక్కు' మని చేయిపట్టి యీడ్చిన, నేడ్చుచుం దల్లికడకుం జని యష్టావక్రుం డిట్లనియె. 244

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు= ఒకరోజు; ఉద్దాలకు, కుఱువు= ఉద్దాలకుడి తొడపై; ఎక్కి+ఉన్న= ఎక్కి కూర్చొనిఉన్న; అష్టావక్రున్+చూచి= అష్టావక్రుడిని చూచి; శ్వేతకేతుండు= శ్వేతకేతుడు; సహింపక= ఓర్వక, ఓర్వలేక; నీవు+ఏల= నీవు ఎందుకు; మా+అయ్య= మాతండ్రియొక్క; కుఱువు= తొడ; ఎక్కి+ఉండెదు= ఎక్కిఉన్నావు; ఈవు= నీవు; పోయి= వెళ్ళి; మీ+అయ్య= మీనాన్నయొక్క; కుఱువు+ఎక్కుము= తొడపై ఎక్కుము; అని= అంటూ; పట్టి+ఈడ్చినన్= చేతిని పట్టుకొని ఈవలకు లాగగా; ఏడ్చుచున్= దుఃఖిస్తూ; తల్లి కడకున్+చని= తల్లి దగ్గరకు వెళ్ళి; అష్టావక్రుడు; ఇట్లు+అనియె= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఒకనాడు అష్టావక్రుడు ఉద్దాలకుడి తొడపై ఎక్కి ఆడుకొంటున్నాడు. ఆ దృశ్యాన్ని చూచి శ్వేతకేతుడు ఓర్వలేక అష్టావక్రుడి చేతిని పట్టుకొని ఈవలికి లాగి, 'నీవు ఎందుకు మానాన్న తొడపై ఎక్కావు? వెళ్ళి నీవు మీనాన్నతొడపై ఎక్కుము'- అని నిష్ఠురా లాడగా, అష్టావక్రుడు ఏడుస్తూ తల్లిదగ్గరకు వెళ్ళి ఇట్లా పలికాడు.

క. 'మా యయ్య యెవ్వ? రెక్కడఁ । బోయిరి? సెప్పు' మని తెల్లముగ నడిగి తప
శ్శ్రీయుతుఁడు తండ్రికడకుం । బోయెం దన మామ నెయ్యమునఁ దోడ్కొనుచున్. 245

ప్రతిపదార్థం: మా+అయ్య+ఎవ్వరు?= నా తండ్రి ఎవరు?; ఎక్కడన్+పోయిరి?= ఎక్కడికి వెళ్ళారు?; చెప్పుము= తెలియచెప్పుము; అని= అని; తెల్లముగన్= సుస్పష్టంగా; అడిగి= ప్రశ్నించి; తపస్+శ్రీ, యుతుఁడు= తపస్సు అనే సంపదతో కూడినవాడు; తన, మామన్= తన మేనమామను; నెయ్యమునన్= ప్రీతితో; తోడ్కొనుచున్= వెంటబెట్టుకొని; తన, తండ్రి, కడకున్= తన తండ్రి దగ్గరకు; పోయెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'మాతండ్రి ఎవరు? ఎక్కడికి వెళ్ళారు? చెప్పుము' అని సుస్పష్టంగా తల్లిని అడిగి తెలిసికొని మేనమామను ప్రియమార వెంటబెట్టుకొని అష్టావక్రుడు తన తండ్రివద్దకు వెళ్ళాడు.

వ. ఇట్లష్టావక్రుండు దానును శ్వేతకేతుండును జనకరాజు యజ్ఞంబునకుం జని యందు దౌవారిక నివారితులై 'మూకాంధ బధిర పంగు స్త్రీ బ్రాహ్మణ సుప్రవేశం బగుచున్న యీ రాజద్వారంబున మమ్ము విద్వాంసుల బ్రాహ్మణుల నేల వారించెద?' రనిన దౌవారికుం డిట్లనియె. 246

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అష్టావక్రుండు= అష్టావక్రుడు; తానును= తానున్నూ; శ్వేతకేతుండును= శ్వేతకేతుడున్నూ; జనకరాజు= జనకప్రభువుయొక్క; యజ్ఞంబునకున్+చని= యజ్ఞానికి వెళ్ళి; అందు= అక్కడ; దౌవారిక, నివారితులు+ఐ= ద్వారపాలకులచేత అడ్డగించబడినవారై; మూక+అంధ, బధిర, పంగు, స్త్రీ, బ్రాహ్మణ, సుప్రవేశంబు+అగుచు+ఉన్న= మూగవాళ్ళు, గుడ్డివాళ్ళు, చెవిటివాళ్ళు, కుంటివాళ్ళు, ఆడవాళ్ళు, బ్రాహ్మణులు అందరకూ అడ్డులేకుండా సులువుగ ప్రవేశించుటకు వీలైన; ఈ రాజ, ద్వారంబున= ఈ పెద్దవాకిలి ద్వారాన; మమ్మున్= మమ్మల్ని; విద్వాంసులన్= పండితులను; బ్రాహ్మణులన్= బ్రాహ్మణులను; ఏల= ఎందుకు; వారించెదరు= వారిస్తారు; అనిన= అని ప్రశ్నించగా; దౌవారికుండు= ద్వారపాలకుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈరీతిగా అష్టావక్రుడు, శ్వేతకేతుడు జనకమహారాజు చేస్తున్న యజ్ఞానికి వెళ్ళారు. కాని, ద్వారపాలకుడు అక్కడవారిని లోపలికి పోనీయక అడ్డగించాడు. అంత వారు 'ఈ వాకిలిగుండా మూగవాళ్ళు, గుడ్డివాళ్ళు, చెవిటివాళ్ళు, స్త్రీలు, బ్రాహ్మణులు పలువురు లోపలికి సులువుగా ప్రవేశిస్తున్నారు కదా! మేము బ్రాహ్మణులం, పండితులం. మమ్మల్ని ఎందుకు అడ్డగిస్తావయ్యా? తెలుపుము' - అని ప్రశ్నించగా వారికి ఆ ద్వారపాలకుడు ఇట్లా బదులు పలికాడు.

క. 'అలఘులగు వృద్ధవిద్వాం । సులకు మహాయాజ్ఞికులకుఁ జొర నర్హంబై
విలసిల్లు యజ్ఞసభ సొర । వలవదు చనుఁ; డీరు చిఱుతవారల' రనినన్. 247

ప్రతిపదార్థం: అలఘులు+అగు= గొప్పవారైనటువంటి (తేలికైనవారు కానివారైన); వృద్ధ, విద్వాంసులకు= ముదుసలి పండితులకు; మహాయాజ్ఞికులకున్= గొప్ప ఋత్విజులకు; చొరన్= చొరబడటానికి; అర్హంబు+ఐ= తగినట్టిదై; విలసిల్లు= శోభించే; యజ్ఞసభ= యజ్ఞానికి సంబంధించిన సభ; చొర, వలవదు= ప్రవేశించ వీలవదు; చనుఁడు= వెళ్ళిపొండి; ఈరు, చిఱుతవారలరు= మీరు బాలురు; అనినన్= అని చెప్పగా.

తాత్పర్యం: 'మహానుభావులైన వృద్ధ విద్వాంసులు, అనుభవజ్ఞులైన ఋత్విజులు మాత్రమే ఈ యజ్ఞవాటికలో ప్రవేశించటానికి అర్హులు, మీరు చిన్నవారు. ఈ యజ్ఞసభలో ప్రవేశించే అర్హత మీకు లేదు'- అని చెప్పగా.

క. 'అలయక యేండ్లు గడుం బె । క్కులు జీవించుట నర గలుగుటయుం దగు వృ
ద్ధుల లక్షణమే? జ్ఞానము । గలఁ డేనిన్ బాలుఁ డయినఁ గడు వృద్ధు మహిన్. 248

ప్రతిపదార్థం: అలయక= అలసిపోకుండా; ఏండ్లు= సంవత్సరాలు; కడున్+పెక్కులు= మిగుల అనేకాలు; [చాలాకాలం] జీవించుట= బ్రతకటం; నర, కలుగుటయున్= వెంద్రుకలు తెల్లనగుట; తగు= తగినట్లు; వృద్ధుల, లక్షణమే?= ముసలివారికి చిహ్నాలా?; జ్ఞానము+కలఁడు+ఏనిన్= జ్ఞానం కలిగినవాడైతే; మహిన్= భూమిమీద; బాలుఁడు+అయినన్= వయసులో చిన్నవాడే అయినా; కడు= మిక్కిలి, చాలా; వృద్ధు= పెద్దవాడే.

తాత్పర్యం: 'చాలా సంవత్సరాలు ఓర్పుతో బ్రతకటం, వెంద్రుకలు తెల్లబడటం ముసలివారికి చిహ్నాలా? జ్ఞానం కలవాడైతే బాలుడైనా భూమిమీద వృద్ధుడే.

వ. కృతాధ్యయనశీలుండై యాచారపరుండైన వాఁడు బాలుండయ్యును సర్వజన సంభావనీయుండగు; బాలురని మమ్ము నవమానింప వలవ; దేము జనకరాజ సదనంబున దర్పితులైన వేదవాదులతో వాదంబు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సేయ సమకట్టి వచ్చినవార' మనిన దౌవారికుండు వారి నప్పుడు రాజానుమతుండై లబ్ధప్రవేశులం జేసె; నంత. 249

ప్రతిపదార్థం: కృత+అధ్యయన, శీలుండు+ఐ= చేయబడిన అధ్యయనం శీలంగా కలవాడై, అంటే లెస్సగా వేదం చదువుకొని సదా ఆ చదువుపైనే దృష్టికల వాడైన; ఆచార, పరుండు+ఐనవాఁడు= అనుష్ఠాన వేదాంతిగా మంచి సంప్రదాయాలను ఆచరించేటటువంటివాడు; బాలుండు+అయ్యును= వయస్సులో చిన్నవాడే అయినప్పటికిని; సర్వ, జన, సంభావనీయుండు+అగు= జనులందరిచేత మన్నించ దగినట్టివా డౌతాడు; బాలురు= వయసులో చిన్నవారు; అని= అని తలపోస్తూ; మమ్ము= మమ్మల్ని; అవమానింప వలవదు= అవమానించవద్దు, తక్కువ చేయవద్దు; ఏము= మేము; జనక, రాజ, సదనంబున= జనక ప్రభువు యొక్క కొలువులో; దర్పితులు+ఐన= గర్వించిన; వేదవాదులతో= వేదాలనుగురించి వాదాలను చేసేవారితో; వాదంబు= చర్చ; చేయన్= చేయటానికి; సమకట్టి= పూని, పూనుకొని; వచ్చినవారము= వచ్చినవారం; అనినన్= అని చెప్పగా; దౌవారికుండు= ద్వారపాలకుడు; వారిన్= ఆ బాలకులను అంటే అష్టావక్రుడిని, శ్వేతకేతుడిని; రాజ+అనుమతుండు+ఐ= రాజుచేత అనుమతించబడినవాడై; లబ్ధప్రవేశులన్+చేసెన్= పొందబడినప్రవేశం కలవారిగా చేశాడు.

తాత్పర్యం: చక్కగా చదువు చదువుకొని ఆ చదువు తన నిత్యజీవితంలో ప్రతిఫలించేటట్లు తన ప్రవర్తనను తీర్చిదిద్దుకొనేవాడు, వయస్సులో చిన్నవాడే అయినప్పటికీ ప్రజలందరిచేత మన్నించదగిన వాడు కాగలడు. మమ్మల్ని వయస్సులో చిన్నవారమని అవమానించవద్దు. మేము జనకమహారాజుగారి సభలో గర్వంతో విర్రవీగుతున్న వేదవాదులతో సిద్ధాంత రాద్ధాంతాలు చేసి చర్చించటానికి వచ్చాము'- అని చెప్పగా, ద్వారపాలకుడు, రాజుగారి అనుమతి పొంది ఆ బాలకులైన అష్టావక్ర శ్వేతకేతులను లోపలికి ప్రవేశపెట్టాడు.

సీ. **జనకభూపాలుని సంప్రశ్నముల కెల్ల । నేర్పడ నుత్తరం బిచ్చి వాని**
సభయందు భూసురసంఘమధ్యంబున । వరుణపుత్త్రుం డైన వందితోడ
వాదంబు చేసి, గర్వంబున నాతని । నొడిచి, తద్విజితులై యొదిఁగియున్న
ధరణీసురులఁ దన తండ్రితో నిగ్రహ । ముక్తులఁ జేసి సన్మునికుమారుఁ

తే. **డధికతేజుఁ డష్టావక్రుఁ డఖిలలోక । పూజితుం డైన జనకుచేఁ బూజ లంది**
యేకపాదుఁ దోడ్కొని పేర్మి నేఁగుదెంచె । బుధనుతుండు నిజాశ్రమంబునకు నొప్ప.' 250

ప్రతిపదార్థం: జనక, భూపాలుని= జనక మహారాజుయొక్క; సంప్రశ్నములకు+ఎల్లన్= గొప్పప్రశ్నలు అన్నింటికి; ఏర్పడన్= సరిపోయేటట్లుగా; ఉత్తరంబు= సమాధానాలు; ఇచ్చి= చెప్పి; వాని సభయందు= ఆ జనక మహారాజు కొలువుకూటంలో; భూసుర, సంఘ, మధ్యంబునన్= బ్రాహ్మణుల సమూహం మధ్య; వరుణ, పుత్త్రుండు+ఐన= వరుణుడి కొడుకైన; వందితోడ= వంది అనే పండితుడితో; వాదంబు, చేసి= వాదించి, తర్కించి; గర్వంబునన్= దర్పంతో; ఆతనిన్= ఆ వందిని; ఒడిచి= ఓడించి; తత్ [తద్]+విజితులు+ఐ= అతడిచేత, (ఆ వందిచేత) పరాజయం పొంది; ఒదిఁగి+ఉన్న= అణగిఉన్న; ధరణీ, సురులన్= బ్రాహ్మణులను; తన తండ్రితోన్= తన తండ్రితోపాటుగా; నిగ్రహ, ముక్తులన్+చేసి= బంధ విముక్తులుగా చేసి; సత్+ముని కుమారుఁడు= మంచివాడైన ఋషిపుత్రుడు; అధిక, తేజుఁడు= అధికమైన వర్చస్సు కలవాడు; అష్టావక్రుఁడు= అష్టావక్రుడు; అఖిల, లోక, పూజితుండు+ఐన= సమస్తలోకాలచేత పూజించబడిన; జనకుచేన్+పూజలు+అంది= జనకమహారాజుచేత సన్మానించబడినవాడై; ఏకపాదున్= ఏకపాదుడిని; తోడ్కొని= తనవెంట తీసికొని, ఉంచుకొని;

బుధ+నుతుండు= పండితులచేత ప్రశంసించబడినవాడు, అష్టావక్రుడు, పేర్మిన్= గౌరవంతో; నిజ+ఆశ్రమంబునకున్= తన ఆశ్రమానికి; ఒప్పన్= శోభాయమానంగా; ఏఁగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: జనకమహారాజు అడిగిన చిక్కుప్రశ్నలకు అన్నింటికీ సరిపడే సమాధానాలు చెప్పి, అతడి కొలువుకూటంలో బ్రాహ్మణసమూహాలమధ్యనున్న వరుణసుతుడైన వందితో వాదించి, అతడిని ఓడించి, మునుపు అతడితో వాదించి పరాజితులై అణగి ఉన్న బ్రాహ్మణులను తన తండ్రితోపాటుగా బంధవిముక్తులుగా చేసి, మిక్కుటమైన తేజస్సుకల ఆ మునికుమారుడైన అష్టావక్రుడు, సర్వలోకాలచేత పూజించబడిన జనకమహారాజుచేత సన్మానితుడై, పండితులచేత ప్రశంసించబడినవాడై, ఏకపాదుడిని తనవెంట పెట్టుకుని శోభయమానంగా తన ఆశ్రమానికి చేరుకొన్నాడు.

విశేషం: ఈ పద్యం మూడవ పంక్తిలో "తద్విజితులై యుదధినున్న"- అనే పాఠాంతరం కొన్ని ప్రతుల్లో ఉన్నది.

వ. **అని చెప్పుచు నరిగి, 'యిది సమంగ యను పుణ్యనది; యిందు భరతుండు రాజ్యాభిషిక్తుఁడయ్యెఁ; దొల్లి యింద్రుండు లక్ష్మీప్రాప్తుండై దీని జలోపస్పర్శనంబునఁ బాపవిముక్తుండయ్యె; నిది మైనాకకుక్షి; యిం దదితి పుత్త్రార్థినియై తపంబు సేసె; నిది ఋషిదైవతంబైన కనఖల నగం; బిది గంగానది; యిందు సనత్కుమారుండు సిద్ధింబొందె; నిది యుష్ణగంగ; యిందుఁ గృతస్నానులైనం గృతార్థు లగుదు; రిది రైభ్యాశ్రమం; బిది భరద్వాజాశ్రమం; బిందు భరద్వాజసుతుండు యవక్రీతుండు తపోవిద్యాగర్వంబున నపగతజీవుం డయ్యె; ననిన 'నది యె?' ట్లని ధర్మతనయుం డడిగిన రోమశుం డిట్లనియె.** **251**

ప్రతిపదార్థం: అని చెప్పుచున్+అరిగి= అని ఆయాతీర్థ మాహాత్మ్యాలు ప్రవచిస్తూ ప్రయాణించి; ఇది= ఈ స్థలం; సమంగ+అను= సమంగ అనే పేరు కల; పుణ్యనది= పవిత్రమైననది; ఇందు= ఇక్కడ; భరతుండు= భరతుడు; రాజ్య+అభిషిక్తుఁడు+అయ్యెన్= రాజ్యానికి అభిషేకించబడ్డాడు; (సింహాసనం అధివసించటానికి ముందు చేసేస్నానం అభిషేకం); తొల్లి= పూర్వం ఇంద్రుడు; లక్ష్మీ, ప్రాప్తుండు+ఐ= సంపదను పొందినవాడై; దీని, జల+ఉప, స్పర్శనంబునన్= ఈ నదీజలాలను పైన చల్లుకోవటం వలన; పాప, విముక్తుండు+అయ్యెన్= పాపాలనుండి తొలగినవాడు అయ్యాడు; ఇది= ఈచోటు; మైనాకకుక్షి= మైనాకకుక్షి అనే పుణ్యక్షేత్రం; ఇందు= ఇక్కడ; అదితి= కశ్యపుడి భార్య, దక్షప్రజాపతి కూతురు; పుత్త్ర+అర్థిని+ఐ= కొడుకులను కోరినదై; తపంబు+చేసెన్= తపస్సు చేసింది; ఇది= ఈ చోటు; ఋషిదైవతంబు+ఐన= ఋషులను దైవతాలుగా గల; కనఖల,నగంబు= కనఖల అనే పర్వతం; ఇది= ఇది; గంగా నది= గంగ అనేనది; ఇందు= దీనిలో; సనత్కుమారుండు= సనత్కుమార మహర్షి; సిద్ధిన్+పొందెన్= సిద్ధి పొందాడు; ఇది= ఇది; ఉష్ణగంగ= ఉష్ణగంగ అనేతీర్థం; (ఉష్ణగంగ= వేడినీటి ఊట కలది); ఇందున్= ఈ ఉష్ణగంగలో; కృత, స్నాతులు+ఐనన్= చేయబడిన స్నానం కలవారు-అంటే-స్నానం చేసిన వారు; ఐనన్= ఐనన్=ఐనచో; కృత+అర్థులు+అగుదురు= కోరిన కోరికలు ఈడేరినవారు అవుతారు; ఇది, రైభ్య+ఆశ్రమంబు= ఇది రైభ్యుడి ఆశ్రమం; ఇది, భరద్వాజ+ఆశ్రమంబు= ఇది భరద్వాజుడి ఆశ్రమం; ఇందున్= ఈ ఆశ్రమంలో; భరద్వాజ, సుతుండు= భరద్వాజుడి కొడుకైన; యవక్రీతుండు= యవక్రీతుడు; తపస్+విద్యా గర్వంబునన్= తపస్సు వలన లభించిన పాండిత్యంయొక్క దర్పంచేత; అపగత, జీవుండు+అయ్యెన్= పోగొట్టుకొనబడిన ప్రాణాలు కలవాడైనాడు; అనినన్= అని చెప్పగా; అది= ఆ వృత్తాంతం; ఎట్లు= ఏవిధమైనట్టిది; అని= అంటూ; ధర్మతనయుండు= ధర్మసుతుడు; అడిగినన్= ప్రశ్నించగా; రోమశుండు= రోమశుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్తుతూ ప్రయాణించి అనేకతీర్థయాత్రలు చేస్తూ రోమశుడు ధర్మరాజుకు ఆ యా పుణ్యక్షేత్రాలను గురించి వివరించి చెప్పాడు. 'ఇది సమంగ అనే పుణ్యనది. ఇందులో భరతుడు రాజ్యాభిషిక్తుడైనాడు. పూర్వం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇంద్రుడు సంపదను పొంది, దీనిజాలాన్ని పైన చల్లుకొనటంచేత పాపాలనుండి విముక్తి పొందాడు. ఇది 'మైనాకకుక్షి' అనే పుణ్యక్షేత్రం. ఇక్కడ అదితి కొడుకులను కోరి తపస్సు చేసింది. ఇది కనఖల పర్వతం. ఇది ఋషిదైవతం. ఇది గంగానది. ఇందులో సనత్కుమారుడు సిద్ధి పొందాడు. ఇది 'ఉష్ణగంగ'. ఇక్కడ స్నానం చేసినవారి కోరికలు ఈడేరుతాయి. ఇది రైభ్యాశ్రమం. ఇది భరద్వాజాశ్రమం; ఇందులో భరద్వాజ మహర్షి పుత్రుడైన యవక్రీతుడు తనతపస్సు వలన, పాండిత్యం వలన ఏర్పడిన గర్వంచేత అసువులు కోల్పోయాడు' అని రోమశుడు చెప్పగా, ఆ వృత్తాంతం సవిస్తరంగా చెప్పు మని ధర్మరాజు అడిగాడు. రోమశుడు ఇట్లా బదులు పలికాడు.

విశేషం: (1) ఈ గద్యం మొదట 'అని చెప్పుచు నరిగి' అన్న పదగుంఫనం మిక్కిలి అర్థవంతమైనది. రోమశమహర్షి పాండవులచేత వివిధతీర్థాలు సేవింపచేస్తూ ఆయా స్థలాలలో ఆయా సమయాలలో చెప్పినమాటలు ఇవి అని గ్రహించవచ్చును.

(2) ఈ ఆరణ్యపర్వం ద్వితీయాశ్వాసంలో పుణ్యక్షేత్రాభివర్ణన ఉన్నది. మళ్ళీ తృతీయాశ్వాసంలో కూడ పుణ్యక్షేత్రాభివర్ణన ఉన్నది. మొదటిది నారదప్రోక్తం. రెండవది రోమశప్రోక్తం. కొంతమంది ఆధునిక విమర్శకులు ద్వితీయాశ్వాసంలోని వర్ణన వైశంపాయన కథితం అనిన్నీ, ఆనాడు భారతదేశంలో ఉన్న తీర్థాలసంఖ్య, సూతుని కాలాన అంటే శౌనకుడి సత్రయాగ సమయాన పెరిగింది కాబట్టి మళ్ళీ తీర్థయాత్రలను అభివర్ణించటం జరిగిందనీ భావిస్తున్నారు.

రోమశుఁడు ధర్మరాజునకు యవక్రీతుచరిత్రంబు సెప్పుట (సం. 3-135-12)

క. 'అలఘులు రైభ్య భరద్వా। జులు తమలో సుహృదులై విశుద్ధ తపోని
శ్చలితమతు లివ్వనంబున। నొలసి తపం బొప్పఁ జేయుచుండిరి నెమ్మిన్. 252

ప్రతిపదార్థం: అలఘులు= గొప్పవారు; రైభ్య, భరద్వాజులు= రైభ్యుడున్నూ, భరద్వాజుడున్నూ; తమలో, సుహృదులు+ఐ= తాము ఒకరికొకరు స్నేహితులై; విశుద్ధ, తపస్+నిశ్చలిత, మతులు= నిర్మలమైన తపంచేత సుస్థిరమైన బుద్ధికలవారు అంటే చిత్తవృత్తులను నిరోధించినయోగులు; ఈ+వనంబునన్= ఈ అరణ్యంలో; ఒలసి= పూని; నెమ్మిన్= ప్రీతితో; తపంబు= తపస్సు; ఒప్పన్= ఒప్పేటట్లుగా; చేయుచు+ఉండిరి= ఆచరిస్తూ ఉండినారు.

తాత్పర్యం: మహానుభావులైన రైభ్యుడు, భరద్వాజుడు తమలో తాము మిత్రులై, చిత్తవృత్తులను నిగ్రహించే యోగీశ్వరులై ఈ అరణ్యంలో ప్రీతితో తపస్సు చేస్తూ ఉండేవారు.

వ. అందు రైభ్యుండు కృతాధ్యయన శూరులైన యర్థావసు పరావసులను తన యిద్దఱు పుత్త్రులతో విద్వత్పూజితుండై యున్నవానిం జూచి సహింపనోపక భరద్వాజసుతుఁడు యవక్రీతుండు తపోబలంబున నఖిల వేదశాస్త్రాగమంబులు పడయుదు నని సమిద్ధంబైన యగ్నియందు సంధార్యంబు సంధించుచు నుగ్రతపంబు సేయుచున్న, దాని సహింపనోపక యింద్రుండు వానియొద్దకు వచ్చి 'నీ వేమి యుద్దేశించి యుగ్రతపంబు చేసెద?' వనిన శక్రునకు యవక్రీతుం డిట్లనియె. 253

ప్రతిపదార్థం: అందు= వారిలో; రైభ్యుండు= రైభ్యుడు; కృత+అధ్యయన, శూరులు+ఐన= అధ్యయనం చేయటంలో శూరులైన అనగా, వేదాన్ని అభ్యసించటంలో బాగా ఆరితేరినవారైన; అర్థావసు, పరావసులు+అను= అర్థావసుడు, పరావసుడు అనేపేర్లు గల; తన+ఇద్దరు పుత్త్రులతోన్= తన ఇద్దరు కొడుకులతో; విద్వత్+పూజితుండు+ఐ+ఉన్నవానిన్= విద్వాంసులచేత

అర్చించబడుతూ ఉన్నవాడిని; చూచి= అరసి; సహింపన్+ఓపక= ఓర్వలేక; భరద్వాజసుతుఁడు= భరద్వాజముని కుమారుడైన; యవక్రీతుండు= యవక్రీతుడనే పేరుగలవాడు; తపస్+బలంబునన్= తపస్సుయొక్క శక్తివలన; అఖిల, వేద, శాస్త్ర+ ఆగమంబులు= సమస్తమైన వేదాలు, శాస్త్రాలు, దేవ పూజా విధానాలు; పడయుదును= పొందుతాను; అని= అని తలపోసి; సమిద్ధంబు+ఐన= రగుల్చబడిన; అగ్నియందు= నిప్పులో; సంధార్యంబు= హోమద్రవ్యం; సంధించుచున్= వేలుస్తూ; ఉగ్ర, తపంబు+చేయుచున్నన్= తీవ్రమైన తపస్సు చేస్తుండగా; దాని= ఆ తీవ్రతపస్సును; సహింపన్+ఓపక= తాళలేక; ఇంద్రుండు= ఇంద్రుడు; వాని+ఒద్దకు, వచ్చి= ఆ యవక్రీతుడి వద్దకు వచ్చి; నీవు= నీవు; ఏమి+ఉద్దేశించి= దేనిని లక్ష్యంగా పెట్టుకొని; ఉగ్ర, తపంబు+చేసెదవు= తీవ్రమైన తపస్సు చేస్తావు; అనినన్= అని అడుగగా; శక్రునకున్= ఇంద్రుడికి; యవక్రీతుండు= యవక్రీతుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: వారిలో రైభ్యుడి కొడుకులు అర్థావసుడు, పరావసుడు అనేవారు ఇద్దరూ వేదశాస్త్రాలను చక్కగా అధ్యయనం చేసి గొప్ప పాండిత్యాన్ని ఆర్జించారు. రైభ్యుడు కొడుకులతో కలసి విద్వాంసులచేత పూజించబడిన వాడవటంచేత భరద్వాజుడి కుమారుడైన యవక్రీతుడికి మాత్సర్యం ఏర్పడింది. అందుచేత తాను కష్టపడి, ఎంతోకాలం వెచ్చించి వేదాలు, శాస్త్రాలు, భగవత్పూజా విధానాలను అభ్యసించటంకంటె తపస్సుచేసి ఆ జ్ఞానాన్ని సంపాదించాలని తలపోశాడు. అంతట యవక్రీతుడు రగుల్చబడిన నిప్పులో హోమద్రవ్యాలు వ్రేల్చి హోమం చేస్తూ తీవ్రమైన తపస్సు చేస్తుండగా, అతడి ఉగ్రతపస్సుకు తాళలేక ఇంద్రుడు అతడి దగ్గరకు వచ్చి 'నీవు ఏమి కోరి ఇంతటి గాఢతపం చేస్తున్నావు?' అని అడిగాడు. ఇంద్రుడికి యవక్రీతుడు ఇట్లా బదులు పలికాడు.

ఆ. 'చదువకయును నాకు సర్వవేదంబులు । సర్వశాస్త్రములును సంభవిల్ల
వలయు నని తలంచి వదలక నిష్ఠతో । నుగ్రతపముఁ జేయుచున్నవాఁడ.' 254

ప్రతిపదార్థం: చదువకయును= విద్యాభ్యాసాన్ని ఏ గురువుదగ్గర చేయకుండా; నాకు= నాకు; సర్వ, వేదంబులు= సకల వేదాలు; సర్వ, శాస్త్రములును= సమస్త శాస్త్రాలు; సంభవిల్లవలయున్= సంప్రాప్తించాలి; అని, తలంచి= అని తలపోసి; వదలక= విడువక; నిష్ఠతోన్= దీక్షతో; ఉగ్ర, తపమున్= తీవ్రమైన తపస్సును; చేయుచున్నవాఁడన్= చేస్తున్నాను.

తాత్పర్యం: 'ఏ గురువు దగ్గర విద్యాభ్యాసం చేయకుండానే సర్వవేదాలు, సకలశాస్త్రాలు అవగతం కావాలి- అని నిష్ఠతో తీవ్రమైన తపస్సు చేస్తున్నాను.'

వ. అనిన వాని కింద్రుం డిట్లనియె. 255

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; వానికి= ఆ యవక్రీతుడికి; ఇంద్రుండు= ఇంద్రుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని యవక్రీతుడు చెప్పగా అతడితో ఇంద్రుడు ఇట్లా అన్నాడు.

క. 'గురుముఖమునఁ బడయక దు । ష్కరతపమునఁ జేసి పడయఁగాఁబడు విద్యల్
పరమార్థము మదమును మ । త్సరమును గావించు నెట్టిసాధుల కైనన్. 256

ప్రతిపదార్థం: గురు ముఖమునన్= గురుప్రబోధంవలన; పడయక= పొందక; దుష్కర, తపమునన్+చేసి= తీవ్రమైన తపస్సుచేత; పడయఁగాన్+పడు= పొందబడేటటువంటి; విద్యల్= విద్యలు; ఎట్టి= ఎటువంటి; సాధులకు+ఐనన్= మంచివారికైనాకూడ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరమ+అర్థము= పరమమైన ప్రయోజనం విషయంలో (ఉత్కృష్టమైన ఫలితాన్ని ప్రసాదించడంలో); మదమును= గర్వాన్ని; మత్సరమును= అసహనాన్ని (అసూయను); కావించున్= కల్పిస్తుంది.

తాత్పర్యం: 'అధ్యాపకుడి ద్వారా జరిగే ప్రబోధాన్ని పొందక తీవ్రమైన తపస్సువలన పొందేటటువంటి విద్యలు పరమార్థంలో ఎటువంటి మంచివారికైనా కూడా గర్వాన్ని, అసూయను రేకెత్తిస్తాయి.

వ. 'ఇది విద్యోపార్జనంబున కుపాయంబు గా' దని వారించి వాసవుఁ డరిగిన, నుడుగక యవక్రీతుం డెప్పటియట్ల తపంబుఁ జేయుచున్నఁ దదీయ తపస్తప్తమానసుండై వృద్ధశ్రవుండు వృద్ధవిప్రరూపంబు ధరించి యశక్తుండై శోషించిన శరీరంబుతోడ సికతాముష్టి పరంపర నపారగంభీరగంగాప్రవాహంబునందు సేతుబంధంబు చేయుచున్న నవ్విప్రుం జూచి యవక్రీతుండు నగుచు నిట్లనియె. 257

ప్రతిపదార్థం: ఇది= ఈ తీవ్రతపం; విద్యా+ఉపార్జనంబునకు= విద్యను సంపాదించటానికి; ఉపాయంబు= మార్గం; కాదు+అని= కాదని; వారించి= అడ్డుచెప్పి; వాసవుఁడు= ఇంద్రుడు; అరిగినన్= వెళ్ళగా; ఉడుగక= తపస్సు విరమించక; యవక్రీతుండు= యవక్రీతుడు; ఎప్పటి+అట్ల= లోగడ మాదిరిగానే; తపంబున్= తపస్సును; చేయుచున్నన్= చేస్తూఉండటంచేత; తదీయ, తపస్+తప్త, మానసుండు+ఐ= అతడియొక్క తపస్సుచేత కాల్చబడిన మనస్సుకలవాడై; వృద్ధశ్రవుండు= ఇంద్రుడు; వృద్ధ, విప్ర, రూపంబు= ముసలి బ్రాహ్మణుడిరూపం; ధరించి= ధరించి; న+శక్తుండు+ఐ= బలంలేనివాడై; శోషించిన= ఎండిన; శరీరంబుతోడ= దేహంతో; సికతా, ముష్టి, పరంపరన్= ఇసుకతో కూడిన పిడికిళ్ళ వరుసతో; అపార, గంభీర, గంగా, ప్రవాహంబునందున్= మితిలేనటువంటి, మిక్కిలి లోతైనటువంటిది అయిన గంగనీటివెల్లువయందు; సేతు, బంధంబు చేయుచున్నన్= ఆనకట్ట కడుతున్న; ఆ+విప్రున్+చూచి= ఆ బ్రాహ్మణుడిని చూచి; యవక్రీతుండు= యవక్రీతుడు; నగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఇది విద్యను సంపాదించటానికి తగిన పద్ధతి కాదు'- అని చెప్పి ఇంద్రుడు వెళ్ళిపోయాడు. కాని, యవక్రీతుడు ఎప్పటిమాదిరిగానే తపస్సు చేయ నారంభించాడు. అంతట అతడి తీవ్ర తపస్సుచేత తపింపజేయబడిన మనస్సుకలవాడై ఇంద్రుడు కృశించిపోయిన దేహం గల ముసలి బ్రాహ్మణుడి ఆకారం ధరించి, బలం లేకున్నా పిడికిళ్ళతో ఇసుకను పోస్తూ మితిలేనటువంటి లోతుగల గంగ నీటివెల్లువకు అడ్డంగా ఆనకట్ట కట్టే యత్నం చేస్తూ ఉండినాడు. ఆ బ్రాహ్మణుడి యత్నం చూచి యవక్రీతుడు పరిహసిస్తూ ఇట్లా పలికాడు.

క. 'శతవర్షవృద్ధుఁడవు నీ । వతికృశుఁడ వశక్యమైన యర్థమునం దా
స్థత యేల సేసి కడు దు । ర్మతి వై? తిం కెన్నఁ డిది సమాప్తిం బొందున్?' 258

ప్రతిపదార్థం: శత, వర్ష, వృద్ధుఁడవు= నూరేళ్ళు నిండిన ముసలివాడివి; నీవు= నీవు; అతి కృశుఁడవు= మిక్కిలి కృశించినవాడివి; న+శక్యము+ఐన= సాధ్యం కాని; అర్థమునందు= లక్ష్యమందు; ఆస్థత= ఆసక్తి; ఏల+చేసి= ఎందుకు చేసి; కడు= మిక్కిలి; దుర్మతివి+ఐతి?(వి)= చెడ్డబుద్ధి కలవాడివి అయినావు?; ఇంక= ఇకమీద; ఎన్నఁడు= ఎప్పటికి; ఇది= ఈ సేతువు; సమాప్తిన్+ పొందున్?= పూర్తి అవుతుంది?

తాత్పర్యం: 'నీవు నూరేళ్ళు నిండిన ముసలివాడివి కదా! మిక్కిలి కృశించి ఉన్నావు. ఎందుకు అసాధ్యమైన లక్ష్యమందు ఆసక్తిచూపి మందబుద్ధివైనావు! ఇంక ఏనాటికి ఈ ఆనకట్ట పూర్తి కాగలదయ్యా?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన నింద్రుండు వానిం జూచి 'యేను నీయట్ల యఘటమానంబైన యర్థంబునందు యత్నంబుఁ జేసెద' నని నిజరూపంబుఁ జూపి 'యిట్లు నిరర్థకప్రయాసం బేల చేసె? దుడుగు 'మనిన 'నే నెట్లు నుడుగ; నాయభిమతంబు సఫలంబు సేయవలయు' నన యవక్రీతుండు శక్రువలనం దనయభిమతంబు వడసి, తత్ప్రకారంబుఁ దండ్రికిం జెప్పిన విని భరద్వాజుఁడు కొడుకుగర్వంబు సహింపక దేవగీతలైన గాథల యర్థంబు వానికి నిట్లని చెప్పె. 259

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఇంద్రుండు= ఇంద్రుడు; వానిన్+చూచి= ఆ యవక్రీతుడిని చూచి; ఏను= నేను; నీ+అట్ల= నీవలెనే; న+ఘటమానంబు+ఐన= అసాధ్యమైన; అర్థంబునందు= లక్ష్యమందు; యత్నంబున్+చేసెదన్= ప్రయత్నం చేస్తాను, పాటుబడుతున్నాను; అని= అని చెప్పి; నిజ, రూపంబున్= తన అసలు ఆకారాన్ని; చూపి= ప్రదర్శించి; ఇట్లు= ఈవిధంగా; నిరర్థక ప్రయాసంబు= నిర్+అర్థక, ప్రయాసంబు= అసంగతమైన శ్రమ; ఏల చేసెదు?= ఎందుకు చేస్తున్నావు?; ఉడుగుము= విరమించుము; అనినన్= అని చెప్పగా; ఏను= నేను; ఎట్లున్+ఉడుగన్= ఏవిధంగాకూడ మానను; నా+అభిమతంబు= నా కోరిక సఫలంబు+చేయవలయున్= నెరవేరేటట్లు చేయతగును; అనన్= అని చెప్పగా; యవక్రీతుండు= యవక్రీతుడు; శక్రువలనన్= ఇంద్రుడివలన; తన+అభిమతంబు= తనకోరిక; పడసి= పొంది; తత్+ప్రకారంబున్= ఆ సంగతిని; తండ్రికిన్+ చెప్పినన్= తన తండ్రికి వినిపించగా; విని= ఆలకించి; భరద్వాజుఁడు= భరద్వాజుడు; కొడుకుగర్వంబు= పుత్రుడియొక్క గర్వం; సహింపక= ఓర్వలేక; దేవగీతలు+ఐన= దేవతలచేత ఉదాహరించబడి, 'దేవగీతలు' అనే పేర ప్రసిద్ధికెక్కిన; గాథల+అర్థంబు= గానం చేయటానికి అనువైన పద్యరచనల భావాన్ని; వానికిన్= అతనికి - ఆ యవక్రీతుడికి; ఇట్లు+అని= ఈవిధంగా; చెప్పెన్= వచించాడు.

తాత్పర్యం: అనిన తరువాత ఇంద్రుడు యవక్రీతుడిని చూచి ఇట్లా పలికాడు; 'నేను నీవలెనే అసాధ్యమైన లక్ష్యమందు కృషిచేస్తున్నాను' అని తన అసలు ఆకారాన్ని ప్రదర్శించి 'ఈవిధంగా ప్రయోజనం లేని వృథాప్రయాస పడటం మానుము' అని చెప్పగా, యవక్రీతుడు 'నేను ఏవిధంగాకూడ లక్ష్యం సిద్ధించేవరకు నా తీవ్ర తపం విరమించలేను; నాకోరిక ఈడేర్చుము' అని చెప్పి, ఇంద్రుడివలన తనకోరిక నెరవేరేటట్లు వరం సంపాదించాడు. తరువాత యవక్రీతుడు తాను సాధించిన విజయాన్నిగురించి తండ్రికి తెలిపాడు. దానిని విని, భరద్వాజుడు కొడుకుగర్వాన్ని సహించక దేవగీతలుగా సుప్రసిద్ధాలైన పద్యగాథల భావాన్ని యవక్రీతుడికి ఈవిధంగా తెలిపాడు.

సీ. 'బాలధి యను మునిప్రవరుండు పుత్త్రశో । కాపన్నుఁడై ఘోరమగు తపంబుఁ
జేసి వేల్పులదయఁ జిరజీవిగాఁ బుత్త్రుఁ । బడసె మేధావి నాఁ బరఁగువాని
వాఁడు నాయుష్యగర్వమున మునీంద్రుల । నెవ్వరి మెచ్చక యేఁగి యొక్క
ధనుషాక్షుఁ డను తపోధనునొద్ద గర్వించి । పలికిన నలిగి తపస్వి వాని

ఆ. నంత కాంతికమున కరుగంగఁ జేసి; గ । ర్వంబు చెట్ట; యెట్టివారి నైనఁ
గ్రాఁచుఁ దత్క్షణంబు గర్వంబు; గర్వంబు । నొడిచియున్నవాఁడ యుత్తముండు. 260

ప్రతిపదార్థం: బాలధి+అను= బాలధి అనే పేరు కల; ముని ప్రవరుండు= ఋషిశ్రేష్ఠుడు; పుత్త్ర, శోక+ఆపన్నుఁడు+ఐ= కొడుకుయొక్క మరణంచేత తపించినవాడై; ఘోరము+అగు= భయంకరమైన; తపంబున్+చేసి= తపస్సు చేసి; వేల్పుల దయన్= దేవతల కరుణవలన; చిరజీవిగాన్= చిరకాలం బ్రతికేటటువంటి వాడుగా; పుత్త్రున్= కొడుకును; మేధావి నాన్=

మేధావి అనేపేరుతో; పరఁగువానిన్= ఒప్పేవాడిని; పడసె= పొందాడు; వాఁడున్= ఆ మేధావి; ఆయుష్య, గర్వమునన్= తనకు ఆయుస్సు కలదనే ధైర్యంతో; ముని+ఇంద్రులన్= ఋషివరేణ్యులను; ఎవ్వరిమెచ్చక= ఎవ్వరిని సరకుదేయక; ఏఁగి= వెళ్ళి; ఒక్క, ధనుషాక్షుఁడు+అను= ధనుషాక్షుడు అనేపేరు కల ఒక; తపస్+ధను+ఒద్ద= తపస్సు ధనంగా కలవాడిదగ్గర; గర్వించి= గర్వించి; పలికిన= మాట్లాడగా; తపస్వి= ఋషి; అలిగి= ఆగ్రహించి; వానిన్= అతడిని- ఆ మేధావిని; అంతక+అంతికమునకు= యముడి దగ్గరకు; అరుగంగన్+చేసె= వెళ్ళేటట్లు చేశాడు; గర్వంబు= గర్వం; చెట్ట= చెడ్డది; ఎట్టివారిన్+ఐనన్= ఎటువంటి వారిసైనా; గర్వంబు= గర్వం; తద్+క్షణంబు= ఆ క్షణమందే; క్రాఁచున్= తగులబెడుతుంది; గర్వంబున్= గర్వాన్ని; ఒడిచి+ఉన్న వాఁడు+అ= వీడి ఉన్నవాడే; ఉత్తముండు= మంచివాడు.

తాత్పర్యం: 'బాలధి అనబడే మునివరేణ్యుడు, పుత్రుడి మరణంవలన పరితపించి, ఉగ్రమైన తపస్సుచేసి దేవతలను మెప్పించి, చిరంజీవిఅయిన పుత్రుడిని పొందాడు. అతడిపేరు మేధావి. అతడు తాను ఆయుస్సు కలవాడినన్న గర్వంతో మునివరేణ్యులను లక్ష్యపెట్టక విచ్చలవిడిగా తిరుగసాగాడు. ఒకనాడు ధనుషాక్షుడు అనే తపోధనుడిని లక్ష్యంచేయక పొగరుబోతుగా మాట్లాడగా ఆ తపస్వి ఆగ్రహించి మేధావిని యముడిసన్నిధికి పోయేటట్లు చేశాడు. ఎంతటివారికైనా గర్వం చెడ్డది. గర్వం ఎవ్వరినైనా క్షణంలో కాల్చివేస్తుంది. గర్వం వీడినవాడే మంచి మనుష్యుడు.

వ. కావున నీవు గర్వంబు విడిచి యకోపనుండవై పరమశాంతు లైన రైభ్యుకొడుకులతోడ నిర్మత్సరుండవయి యుండు' మనిన 'నట్లసేయుదు; నాకు రైభ్యుండు భవత్సమానుండ' యని యవక్రీతుండు తన విద్యావిభవంబు మునిసభల విస్తరించుచు నొక్కనాఁడు రైభ్యాశ్రమంబునకుం జని, యందు. 261

ప్రతిపదార్థం: కావున= కాబట్టి; నీవు= నీవు; గర్వంబు, విడిచి= గర్వం విడిచి; న+కోపనుండవు+ఐ= కోపం లేని వాడివై; పరమ, శాంతులు+అయిన= మిక్కిలి శాంతస్వభావం కల; రైభ్యు, కొడుకులతోడ= రైభ్యుడి కొడుకులతో; నిర్మత్సరుండవు+అయి= అసూయ లేనివాడివై; ఉండుము= ఉండుము; అనినన్= అనిచెప్పగా; అట్లు+అ+చేయుదున్= ఆ రీతిగానే చేయగలను; నాకు= నాకు; రైభ్యుండు= రైభ్యుడు; భవత్+సమానుండు+అ= నీతో సమానమైనవాడు; అని= అని చెప్పి; యవక్రీతుండు= యవక్రీతుడు; తన, విద్యా, విభవంబు= తనపాండిత్యంయొక్క ప్రకర్ష; ముని, సభల= ఋషుల సభలలో; విస్తరించుచున్= వెల్లడిస్తూ; ఒక్కనాఁడు= ఒకానొకరోజు; రైభ్య+ఆశ్రమంబునకున్+చని= రైభ్యుడియొక్క ఆశ్రమానికి వెళ్ళి; అందు= ఆ ఆశ్రమంలో.

తాత్పర్యం: కాబట్టి, నీవు అహంకారాన్ని విడిచి, కోపం లేనివాడివై, మిక్కిలి శాంతస్వభావం కలవారైన రైభ్యుడి కొడుకుల యెడల అసూయ లేనివాడివై ఉండుము'- అని భరద్వాజుడు యవక్రీతుడితో చెప్పాడు. యవక్రీతుడు 'అట్లాగే చేస్తాను; నాకు రైభ్యుడు నీతో సమానుడు' అని సమాధానం చెప్పాడు కాని, ఋషుల సభలలో తన పాండిత్య ప్రకర్ష ప్రదర్శించసాగాడు. ఒకనాడు యవక్రీతుడు రైభ్యుడి ఆశ్రమానికి వెళ్ళి అక్కడ.

ఉ. కోమల కీర షట్చరణ కోకిలనాద మనోహరంబు ను
ద్దామ వసంత పుష్ప భరిత క్షితిజ ప్రకరంబు నైన యా
రామమునందుఁ జూచె మునిరాజకుమారుఁడు రైభ్యుకోడలిం
దామరసాక్షిఁ గృష్ణ యనుదానిఁ బరావసుభార్యఁ బ్రీతితోన్. 262

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ముని, రాజ, కుమారుఁడు= ఋషులలో శ్రేష్ఠుడైన భరద్వాజుడి కొడుకు- యవక్రీతుడు; కోమల= సుకుమారమైన; కీర= చిలుకలయొక్క; షట్+చరణ= తుమ్మెదలయొక్క; కోకిల= కోయిలలయొక్క; నాద= శబ్దాలచేత; మనస్+హరంబున్= మనస్సులను హరించేటటువంటిది; ఉద్దామ, వసంత, పుష్ప, భరిత, క్షితిజ, ప్రకరంబును+ఐన= గొప్పదైన ఆమనిపూలతో నిండినచెట్ల సమూహాలు కలదైన; ఆరామమునందున్= తోటలో; తామరస+అక్షిన్= పద్మాలవంటి కన్నులు కలదానిని; రైభ్యుకోడలిన్= రైభ్యుడి కోడలిని (కుమారుడి భార్యను); కృష్ణ+అనుదానిన్= కృష్ణ అనే పేరు కలదానిని; పరావసు, భార్యన్= పరావసుడి భార్యను; ప్రీతితోన్= అనురాగంతో; చూచెన్= చూచాడు.

తాత్పర్యం: చిలుకల, కోయిలల, తుమ్మెదలయొక్క సుకుమారమైన నాదాలచేత మనోహరమై, ఆమునిపువ్వులతో నిండిన గొప్పచెట్ల సమూహాలతో కూడిన పూలతోటలో, మునిశ్రేష్ఠుడి పుత్రుడైన యవక్రీతుడు పద్మాలవంటి కన్నులు కలది, రైభ్యుడి కోడలు, పరావసుడి భార్య అయిన కృష్ణ అనే పేరుగల సుందరిని అనురాగలాలసుడై చూచాడు.

విశేషం: ఇది ఉత్పలమాలావృత్తం. దీనిలోని మకారప్రాసం ఉ- 'ద్దామ - ఆ-రామము - కోమల - తామరసాక్షి' పదఘటితం. ఉద్దామ - ఆరామ అనే పదాలను పూర్వపాదంనుండి తదుపరి పాదానికి మకారప్రాసంగా మలచటం తెలుగు ఛందానికి కల ప్రత్యేకత, నన్నయ మహాకవి తరువాతి కవులకు పెట్టిన ఒరవడి, సంస్కృతాన వృత్తాలలో ఏ పాదానికి ఆ పాదం ఛందస్సులో విరిగి, స్వయం సమృద్ధంగా ఉంటుంది. అక్కడ ప్రాసనియతి, కన్నడంలో యతినియతి లేదు. కోమల.... కోకిల, ద్దామ.... భరిత క్షితిజ, రామము ..... మునిరాజ, తామర .... దాని- ఇవి యతులు. తెలుగు పద్యగానంలో యతిప్రాసలు మృదంగనినాదం సమకూరుస్తాయి. నన్నయ కవితకు విశిష్టత చేకూర్చిన అక్షరరమ్యత ఈ పద్యంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది, వినిపిస్తుంది.

ఆ. దానిఁ జూచి మదనతప్తుఁడై తన యభి । ప్రాయ మెఱుఁగఁ జెప్పెఁ బంకజాక్షి;
కదియు శాపభీతి నప్పటి కొడఁబడి । నట్లు పలికి పెలుచ నరుగుదెంచి. 263

ప్రతిపదార్థం: దానిన్+చూచి= ఆమెను చూచి (రైభ్యుడి కోడలైన కృష్ణను చూచి); మదన, తప్తుఁడు+ఐ= మన్మథ తాపానికి గురిఅయి; తన+అభిప్రాయము= తన మనసులోని భావం; పంకజ+అక్షికి= పద్మాలవంటి కన్నులుగల ఆకృష్ణకు; ఎఱుఁగన్+చెప్పెన్= తెలియచేశాడు; అదియు= ఆమెయు; శాపభీతిన్= శాపం వలని భయంచేత అనగా యవక్రీతుడు శపిస్తాడనే భయంచేత; అప్పటికి= ఆ సమయానికి; ఒడఁబడినట్లు= అంగీకరించినట్లు; పలికి= మాట్లాడి; పెలుచన్= శీఘ్రంగా; అరుగుదెంచి= వచ్చి.

తాత్పర్యం: ఆమెను చూచి, మన్మథతాపానికి గురియై, యవక్రీతుడు ఆమెకు తన మనస్సులోని కోరికను తెలిపాడు. పద్మాలవంటి కన్నులుకల ఆ కృష్ణ, ముని శాపమిస్తాడనే భయంతో అప్పటికి సమ్మతించినట్లు నటించి, వేగంగా వచ్చి.

క. తమ మామకుఁ దద్వృత్తాం । తము నంతను దెలియఁ జెప్పి తరుణి విలోలా
క్షములందు బాష్పసలిలో । ద్గమముగఁ దల వాంచి యుండెఁ గడుఁగోపమునన్. 264

ప్రతిపదార్థం: తరుణి= యువతి; తమ మామకున్= తమ మామగారికి; తద్+వృత్తాంతమున్= ఆ సంగతిని; అంతను= సర్వమున్నూ; తెలియన్+చెప్పి= తెల్లంగా విశదీకరించి; విలోల+అక్షములందు= మిక్కిలి చలించే కన్నులలో; బాష్ప, సలిల+ఉద్గమముగన్= కన్నీరు కారుతుండగా; కడున్= మిక్కిలి; కోపమునన్= ఆగ్రహంతో; తల= శిరస్సు; వాంచి+ఉండెన్= వాల్చి ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: యౌవనంలో ఉన్న కృష్ణ తన మామగారికి చలించునట్టి కన్నులనుండి నీరు ఉప్పొంగి ప్రవిస్తుండగా, జరిగిన సంగతి తెలియచెప్పి, మిక్కుటమైన కోపంతో తలవాల్చి నిలిచి ఉన్నది.

వ. రైభ్యుండు నయ్యవక్రీతున కలిగి నిజకోపానల శిఖాయమానైక జటావలంబనకరుండై హుతాశనునందు వేల్చి, యయ్యగ్నికుండంబునందు. 265

ప్రతిపదార్థం: రైభ్యుండు= రైభ్యుడు; ఆ+యవక్రీతునకు= ఆ యవక్రీతుడిపై; అలిగి= కోపించి; నిజ, కోప+అనల, శిఖాయమాన+ఏక, జటా+అవలంబన, కరుండు+ఐ= తనయొక్క ఆగ్రహం అనేటటువంటి అగ్నియొక్క జ్వాలగా రూపొందిన ఒక జడను గ్రహించిన చేయి కలవాడై; హుతాశనునందు= అగ్నిహోత్రంలో; వేల్చి= హోమంచేసి; ఆ+అగ్ని, కుండంబునందున్= ఆ అగ్నికుండంలో.

తాత్పర్యం: రైభ్యుడికి యవక్రీతుడిపై పట్టరాని కోపం వచ్చింది. రైభ్యుడు తనకోపం అనే అగ్ని యొక్క జ్వాలతో సమానమైన ఒక జడను శిఖనుండి లాగి చేతితో పుచ్చుకొని అగ్నిహోత్రంలో వేల్చాడు. ఆ అగ్నికుండంలో.

**క. లలితాంగిఁ బడసెఁ దనకో । డలిరూపముకంటెఁ గడు బెడంగగు రూపో
జ్జ్వలకాంతి గలుగుదానిం । బొలఁతుక నొక్కర్తు నతితపోవీర్యమునన్. 266**

ప్రతిపదార్థం: లలిత+అంగిన్= సుకుమారమైన దేహం కలదానిని; తన, కోడలి, రూపముకంటెన్= తనకోడలి ఆకారం కంటె; కడు= మిక్కిలి; బెడంగు+అగు= మనోహరమైన; రూప+ఉజ్జ్వల, కాంతి, కలుగు దానిన్= అందమయిన ఆకృతి కలిగి ప్రకాశించే లావణ్యం కలదానిని; పొలఁతుకన్= సుందరిని; ఒక్కర్తున్= ఒక్కదానిని; అతి+తపస్+వీర్యమునన్= గొప్పతపస్సుయొక్క బలంచేత; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: తన కోడలికంటె మిక్కుటమైన సౌందర్యం, లావణ్యం కలిగిన ఒక సుందరాంగిని తన గొప్ప తపోమహిమచేత పొందాడు.

వ. మఱియు నొక్కజట యవలంబించి వేల్చిన నందు వికృత దంష్ట్రాకరాళంబైన ముఖంబుతో శూలహస్తుండైన యొక్కరాక్షసుండు పుట్టె; నయ్యిద్దఱు ముకుళితహస్తులై 'మాకుం బని యేమి?' యని యడిగిన 'నవినీతుండైన యవక్రీతు వధియింపుం' డని పంచిన. 267

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; ఒక్క, జట+అవలంబించి= (తన శిఖయందలి) ఒక్క జడ పుచ్చుకొని; వేల్చినన్= హోమం చేయగా; అందున్= ఆ అగ్నికుండంలో; వికృత, దంష్ట్రా, కరాళంబు+ఐన= వంకర కోరలతో భయంకరమైన ముఖంతో; శూల, హస్తుండు+ఐన= బల్లెంతో కూడిన చేయికలవాడైన (చేత బల్లెం ధరించిన); ఒక్క, రాక్షసుండు, పుట్టెన్= ఒక రాక్షసుడు పుట్టాడు; ఆ+ఇద్దరు= ఆ ఇద్దరు; ముకుళిత, హస్తులు+ఐ= మోడ్చిన చేతులు కలవారై; మాకున్+పని+ఏమి?= మేము చేయవలసిన పని ఏమిటి?; అని= అంటూ; అడిగినన్= ప్రశ్నించగా; అవినీతుండు+ఐన= సత్ప్రవర్తన లేనటువంటి; యవక్రీతున్= యవక్రీతుడిని; వధియింపుండు= సంహరించండి; అని= అని చెప్పి; పంచినన్= నియోగించగా.

తాత్పర్యం: రైభ్యుడు ఇంకనూ, ఒకజడను పరిగ్రహించి హోమం చేశాడు. ఆ హోమకుండంనుండి వంకరకోరలతో భయాన్ని కొలిపే ఒక రాక్షసుడు జన్మించాడు. ఆ రాక్షసుడి చేతిలో బల్లెం ఉన్నది. ఆ ఇద్దరూ చేతులు జోడించి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నమస్కరించి, 'మేము చేయవలసిన కర్తవ్యాన్ని శాసించండి' అని అడుగగా 'దుష్టస్వభావం కల యవక్రీతుడిని సంహరించండి' అని రైభ్యుడు వారిని ఆదేశించాడు.

క. ఆ తరుణి మున్న చని మద । నాతురుఁడై వికృతచిత్తుఁడై యున్న యవ
క్రీతు కరకమండలువుం । బ్రీతిఁ బ్రబోధించి కొనియె బెడఁగుగ నంతన్. 268

ప్రతిపదార్థం: అంతన్= అంతట; ఆ తరుణి= ఆ జవరాలు; మున్ను+అ= ముందుగా; చని= వెళ్ళి; మదన+ఆతురుఁడు+ఐ= మన్మథుడి ఉద్రేకానికి లోబడినవాడై; వికృత, చిత్తుఁడు+ఐ= మనస్సులో స్వస్థత కోల్పోయినవాడై; ఉన్న= ఉన్నట్టి; యవక్రీతు, కర, కమండలువున్= యవక్రీతుడి చేతిలో ఉన్న కమండలాన్ని (కమండలువు= ఋషులు చేతితో పట్టుకొని ఉండే జలపాత్రిక); ప్రీతిన్+ప్రబోధించి= అనురాగం అంకురింపచేసి; బెడఁగుగన్= విలాసంగా; కొనియెన్= సంగ్రహించింది.

తాత్పర్యం: ఆ జవ్వని ముందుగా వెళ్ళి మదనోద్వేగంతో వికారమైన మనస్సుతో ఉన్న ఆయవక్రీతుడిదగ్గరకు చేరి, అనురాగాన్ని మేలుకొలిపి, విలాసంగా అతడిచేతిలో ఉన్న కమండలాన్ని సంగ్రహించింది.

విశేషం: (1) నన్నయభట్టు- 'ప్రబోధించు' అన్న పదాన్ని ప్రయోగించిన స్థలాలు ప్రత్యేకంగా అనుశీలించతగినవి. తాను సంకల్పించిన భావాన్ని ఎదుటివారి మనస్సులను ఆకర్షించేటట్లు చేసి సుస్థిర ప్రభావాన్ని వహించటం అనే అర్థంలో 'ప్రబోధించు' అనే పదం ప్రయుక్తం. (2) అతడు మదనాతురుడు. వికృతచిత్తుడు. అందుచేత ప్రబోధ ప్రభావం సులువుగా ప్రసరించింది.

క. అపహృత కమండలుండై । యపవిత్రుం డగుటఁ జేసి యధికతపోవీ
ర్య పరిక్షయ మగుడును నా । తపస్విసుతు రాక్షసుండు దడయక తాఁకెన్. 269

ప్రతిపదార్థం: అపహృత, కమండలుండు+ఐ= అపహరించబడిన కమండలం కలవాడై; న+పవిత్రుండు+అగుటన్+చేసి= పావనత్వాన్ని కోల్పోయినవాడు అవటంచేత; అధిక, తపస్+వీర్య, పరిక్షయము+అగుడును= మిక్కుటమైన తపస్సుయొక్క శక్తి నశించిపోవటం వలన; ఆ తపస్వి, సుతున్= ఆ ఋషికుమారుడిని; రాక్షసుండు= రాక్షసుడు; తడయక= ఆలస్యంచేయక; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: తన కమండలం ఆ లేజవరాలిచేత అపహరించబడింది. అందుచేత యవక్రీతుడు అపవిత్రుడైనాడు. అతని గొప్ప తపశ్శక్తి నశించిపోయింది. అందుచేత రాక్షసుడు ఆలస్యం చేయక ఆ ఋషికుమారుడైన యవక్రీతుడిని ఎదుర్కొన్నాడు.

వ. వానికి వెఱచి పఱచి యవక్రీతుండు మహానదులు గొలంకులు సొచ్చిన నవి శుష్కంబులైనఁ దన జనకు నగ్నిహోత్రంబుఁ జొచ్చునంత. 270

ప్రతిపదార్థం: వానికి= అతడికి- ఆ రాక్షసుడికి; వెఱచి= భయపడి; పఱచి= పారిపోయి; యవక్రీతుండు= యవక్రీతుడు; మహానదులు= గొప్పయేరులలో; కొలంకులు= సరస్సులలో; చొచ్చినన్= ప్రవేశించగా; అవి= ఆ నదులున్నూ, కొలనులున్నూ; శుష్కంబులు+ఐనన్= ఇంకిపోగా; తన, జనకు+అగ్నిహోత్రంబున్= తన తండ్రి అగ్నిశాలను; చొచ్చునంత= ప్రవేశించినంత;

తాత్పర్యం: ఆ రాక్షసుడికి భయపడి యవక్రీతుడు పారిపోయి గొప్పనదులలో, సరస్సులలో ప్రవేశించాడు. కాని, అవి ఎండిపోయినవి. అంత అతడు తనతండ్రియొక్క అగ్నిహోత్రశాలలో ప్రవేశించి దాక్కొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. మునికుమారు నెగిచికొని వచ్చి నిశితశూ । లాయుధమునఁ బొడిచి యాసురమున
రక్కసుండు చంపి, యక్కాంతయును దాను । నరిగె రైభ్యుకడకు నాక్షణంబ. 271

ప్రతిపదార్థం: రక్కసుండు= రాక్షసుడు; మునికుమారున్= ఋషిపుత్రుడిని; ఎగిచికొని వచ్చి= వెంబడించి చేరి; నిశిత, శూలాయుధమునన్= వాడిఅయిన బల్లెముతో; పొడిచి= గుచ్చి; ఆసురమునన్= రాక్షసత్వంతో; చంపి= వధించి; ఆ+కాంతయును+ తానున్= ఆ వనితయు, తానున్నూ; ఆ క్షణంబు+అ= ఆక్షణమే; రైభ్యు కడకున్= రైభ్యుడి దగ్గరకు; అరిగె= వెళ్ళారు.

తాత్పర్యం: ఆ రాక్షసుడు ఋషిపుత్రుడైన యవక్రీతుడిని వెంటాడి, వాడియైన ఈటెపోటుతో అతడిని క్రూరంగా పొడిచి చంపాడు. పిమ్మట ఆ రాక్షసుడున్నూ, ఆజవ్వనియున్నూ రైభ్యుడిదగ్గరకు వెళ్ళారు.

విశేషం: ఇక్కడ సంస్కృత భారతంలో యవక్రీతుడు తన తండ్రియొక్క అగ్నిహోత్రశాలను ప్రవేశింపబోతున్నంతలో గృహపాలకుడైన సేవకుడు ద్వారంలో అతడిని అడ్డగించినట్లు, వెంట తరుముకొని వస్తున్న ఆ రక్కసుడు అపుడు యవక్రీతుడిని శూలంతో పొడిచి వైచినట్లు ఉంది. తన జనకుని అగ్నిహోత్రగృహాన్ని ప్రవేశిస్తే రాక్షసుని వలన భయం ఉండదని యవక్రీతుని అభిప్రాయం. యవక్రీతుడు అశుచియై ఉన్నందున కాబోలు గృహపాలకుడు అతడిని అగ్నిహోత్రశాలలోనికి ప్రవేశించనీయక అడ్డగించాడు. చూ. భండార్కరు సంస్థ ప్రతి III-137 అధ్యా., 17&18 శ్లో.; III-138 అధ్యా,, 7&8 శ్లో.

వ. రైభ్యుండును వానికి భార్యగాఁ గృత్తి నిచ్చె; నంత నిట భరద్వాజుండు వనంబుననుండి వచ్చి తన కెప్పుడుం బ్రత్యుత్థానంబు జేయునగ్నులప్పు డడంగియున్న నచ్చెరువడి గృహపాలకుండైన శూద్రువలన నంత వృత్తాంతం బెఱింగి, నిహతుం డైన పుత్త్రుం జూచి దుఃఖితుండై. 272

ప్రతిపదార్థం: రైభ్యుండును= రైభ్యుడుకూడ; వానికి= ఆ రాక్షసుడికి; భార్యగాన్= భార్యగా; కృత్తిన్= కృత్తిని (హోమకుండంలో ఉద్భవించిన లేజవరాలిని); ఇచ్చెన్= ఇచ్చాడు; అంతన్= అటుపిమ్మట; ఇట= ఇక్కడ; భరద్వాజుండు= భరద్వాజ మహర్షి; వనంబుననుండి= అరణ్యంలోనుండి; వచ్చి= వచ్చి; తనకు+ఎప్పుడున్= తనకు ఎల్లప్పుడు; ప్రత్యుత్థానంబు+చేయు= లేచి నిల్చొను; అగ్నులు= నిప్పులు; అప్పుడు= ఆ సమయాన; అడంగి+ఉన్నన్= అణగిపోయి, నివురుగప్పి ఉండగా; అచ్చెరువడి= ఆశ్చర్యమంది; గృహ, పాలకుండు+ఐన= ఇంటిని కాపాడేటటువంటి; శూద్రువలనన్= సేవకుడి వలన; అంత, వృత్తాంతంబు= జరిగినదంతయు; ఎఱింగి= తెలిసికొని; నిహతుండు+ఐన= మరణించినటువంటి; పుత్త్రున్+చూచి= కొడుకును చూచి; దుఃఖితుండు+ఐ= శోకించినటువంటివాడై.

తాత్పర్యం: రైభ్యుడు ఆ రాక్షసుడికి భార్యగా కృత్తిని ఇచ్చాడు. అంత, ఇక్కడ భరద్వాజుడు అడవినుండి ఆశ్రమానికి వచ్చాడు. నిత్యం అతడికి లేచి స్వాగతం ఆచరించే అగ్నులు ఆనాడు అణగి నివురుగప్పి ఉన్నాయి. భరద్వాజుడికి ఆశ్చర్యం కలిగింది. అంత గృహపాలకుడైన సేవకుడివలన జరిగిన సంగతి తెలిసికొని కుమారుడి మరణానికి మిక్కిలి దుఃఖించాడు.

ఆ. 'రైభ్యుఁ డధికకోపరతుఁ డంటి, నమ్ముని । యాశ్రమంబుదెసకు నరుగ వలవ
దంటి; వినఁగ నొల్లవైతి నా పలుకులు; । గర్వితునకు బుద్ధి గాన నగునె?' 273

ప్రతిపదార్థం: రైభ్యుఁడు= రైభ్యమహాముని; అధిక, కోపరతుఁడు+అంటిన్= మిక్కుటమైన ఆగ్రహ స్వభావం కలవాడు అని చెప్పిఉన్నాను; ఆ+ముని+ఆశ్రమంబు, దెసకున్= ఆ ఋషియొక్క ఆశ్రమం దిక్కుకు; అరుగ, వలవదు+అంటి= వెళ్ళ వద్దు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అని చెప్పి ఉన్నాను; నా పలుకులు= నా మాటలు; విన(గన్= వినటానికి; ఒల్లవు+ఐతి(వి)= ఇష్టపడలేదు; గర్వితునకు= గర్వంలో ఉన్నవాడికి; బుద్ధి= మంచి అభిప్రాయం; కానన్+అగునె?= కనిపిస్తుందా?

తాత్పర్యం: రైభ్యుడు మిక్కిలి కోపంకలవాడని నీకు నేను ముందుగానే చెప్పిఉన్నాను కదా! ఆ మునిఆశ్రమంప్రాంతానికి వెళ్ళవద్దని కూడా హెచ్చరించి ఉన్నాను. నీవు నామాట వినలేదు. గర్వం కలవాడికి మంచిబుద్ధి కలుగుతుందా!'

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. **అని ప్రలాపించుచు భరద్వాజుండు వాని దహించి, పుత్త్రశోక దహనంబు సహింపనోపక తద్దహనంబున దేహ త్యాగంబుఁ జేసె; నంత బృహద్ద్యుమ్నుండను రాజు సత్త్రయాగంబు చేయుచుండి, రైభ్య పుత్త్రుల నర్థావసుపరావసులం దనకు ఋత్విజులంగా వరియించిన నయ్యిరువురుఁదండ్రిచే ననుజ్ఞాతులై వానియజ్ఞంబు నడుపుచుండి, యొక్కనాఁడు పరావసుండు నిజాశ్రమంబునకు వచ్చువాఁడు వేగుఁబోక చీఁకటి నడవిలో నేకతంబ తనకు నెదురుగా వచ్చు రైభ్యు నెఱుంగక మృగంబకా వగచి నిజప్రాణ భయంబున వధియించి పదంపడి యెఱింగి పరమదుఃఖితుండై ప్రేతకార్యంబులు దీర్చి, బృహద్ద్యుమ్ను సత్త్రంబునకు వచ్చి తన చేసిన పితృఘాతం బగ్రజునకుం జెప్పి యిట్లనియె. 274**

ప్రతిపదార్థం: అని= అంటూ; ప్రలాపించుచు= ఏడుస్తూ; భరద్వాజుండు; వానిన్= (ఆ యవక్రీతుడి శరీరాన్ని) అతనిని; దహించి= అగ్ని సంస్కారంచేసి; పుత్త్ర, శోక, దహనంబు= కుమారుడిమరణం వలన ఏర్పడిన దుఃఖ మనే అగ్నిని; సహింపన్+ఓపక= తాళలేక; తద్+దహనంబునన్= ఆమటంలో పడి; దేహ, త్యాగంబున్+చేసెన్= శరీరాన్ని వీడాడు; అంతన్= అటుపిమ్మట; బృహద్ద్యుమ్నుండు+అను, రాజు= బృహద్ద్యుమ్నుడు అనేపేరు కల ప్రభువు; సత్రయాగంబున్= సత్త్రయాగాన్ని; చేయుచు+ఉండి= చేయటానికి ఉపక్రమించి ఉండి; రైభ్యపుత్త్రులన్= రైభ్యుడి కొడుకులను; అర్థావసు, పరావసులన్= అర్థావసుడు, పరావసుడు అనేవారిని; తనకు= తనకు; ఋత్విజులంగా= యాజ్ఞికులుగా; వరియించినన్= ఎన్నుకొనగా; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరున్నూ; తండ్రిచేన్= తండ్రిచేత; అనుజ్ఞాతులు+ఐ= అనుమతి పొందినవారై; వాని యజ్ఞంబు= అతడి యజ్ఞం, ఆ బృహద్ద్యుమ్నుడి సత్రయాగం; నడుపుచుండి= నిర్వహిస్తూ; ఒక్కనాఁడు= ఒకానొకరోజు; పరావసుండు= పరావసుడు; నిజ+ఆశ్రమమునకు= తన ఋషివాటికకు; వచ్చువాఁడు= వచ్చేటప్పుడు; వేగుఁబోక= తెల్లవారుజామున, చీఁకటిన్= అంధకారంలో; అడవిలోన్= అరణ్యంలో; ఏకతంబు+అ= ఒంటరిగా; తనకున్+ఎదురుగా వచ్చు= తనకు ఎదురుగా వచ్చే; రైభ్యున్= రైభ్యుడిని; ఎఱుంగక= తెలియక; మృగంబు+అ+కా వగచి= జంతువు అని తలపోసి; నిజ, ప్రాణ, భయంబున= తన అసువులపై భీతిచొప్పున; వధియించి= సంహరించి; పదంపడి= అటు పిమ్మట; ఎఱింగి= తెలిసికొని; పరమ, దుఃఖితుండు+ఐ= మిక్కిలి శోకించినవాడై; ప్రేత, కార్యంబులు= శవానికి చేయవలసిన అగ్నిసంస్కారాదులు నెరవేర్చి; బృహద్ద్యుమ్ను, సత్రంబునకున్= బృహద్ద్యుమ్న మహారాజుయొక్క సత్రయాగశాలకు; వచ్చి= అరుదెంచి; తన, చేసిన, పితృ, ఘాతంబు= తాను చేసిన పితృవధ; అగ్రజునకున్+చెప్పి= అన్నగారికి నివేదించి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని ఏడుస్తూ భరద్వాజుడు, యవక్రీతుడి శరీరానికి అగ్నిసంస్కారం చేసి, పుత్రశోకమనే అగ్నికి తాళలేక తానున్నూ ఆ చితిలో పడి దేహాన్ని త్యజించాడు. అంతట బృహద్ద్యుమ్నుడు అనే రాజు సత్రయాగం చేయ సంకల్పించి, రైభ్యుడి కొడుకులైన అర్థావసు పరావసులను ఋత్విజులుగా ఎన్నుకొన్నాడు. వారున్నూ, తమ తండ్రి రైభ్యుడి అనుమతిని పొంది బృహద్ద్యుమ్నుడి యజ్ఞాన్ని నడుపుతున్నారు. ఒకానొకరోజు పరావసుడు వేకువచీకటిలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తన ఆశ్రమానికి మరలి వస్తున్నాడు. ఎదురుగా రైభ్యుడు వచ్చాడు. ఆ అడవిలో పరావసుడు ఒంటరిగా వస్తున్న రైభ్యుడిని క్రూరమృగంగా భ్రమించి తనప్రాణాలు కాపాడుకొనదలచి, అతడిని సంహరించాడు. తదుపరి తాను చంపింది తన తండ్రినే అని పరావసుడు తెలిసికొని మిక్కిలి దుఃఖించి, తండ్రి శవానికి అగ్నిసంస్కారాదులు నిర్వర్తించి బృహద్యుమ్నుని సత్రయాగశాలకు వచ్చి తాను చేసిన పితృహత్యను అన్నగారికి నివేదించి ఇట్లా పలికాడు.

తే. 'నీవు దీని నొక్కరుఁడవు నిర్వహింప । నోప; వే నొక్కరుండ నయ్యును గడంగి
నడప నోపుదుఁ గావున నాతదర్థ । మాచరింపుము బ్రహ్మహత్యావ్రతంబు.' 275

ప్రతిపదార్థం: నీవు= నీవు; దీనిన్= ఈ సత్రయాగాన్ని; ఒక్కరుఁడవు= ఒక్కడివై, ఒంటరిగా; నిర్వహింపన్+ఓపవు= నెరవేర్చజాలవు; ఏను= నేను; ఒక్కరుండన్+అయ్యును= నేను ఒంటివాడినైనప్పటికీ; కడంగి= పూని; నడపన్+ఓపుదున్= నిర్వహించగలను; కావున= కాబట్టి; నాతదర్థము= నాకు బదులుగా; బ్రహ్మహత్యా, వ్రతంబు= బ్రాహ్మణుడిని చంపినపాపం పోగొట్టే నోము; ఆచరింపుము= చేయుము.

తాత్పర్యం: 'ఓ అర్థావసూ! ఈ సత్రయాగాన్ని నీవు ఒక్కడివై నిర్వహించలేవు. నేను ఒక్కడినే అయినా నిర్వహించగలను. కాబట్టి నీవు నాకు బదులుగా బ్రహ్మహత్యను పోగొట్టే వ్రతాన్ని చేయుము'.

వ. అనిన నర్థావసుం'డట్లు సేయుదు' నని బ్రహ్మహత్యావ్రతంబులు సలుపుచుండెఁ; బరావసుండును నొక్కరుండ సత్త్రయాగంబు జరుపుచుండె; నంత నర్థావసుండు బ్రహ్మహత్యాప్రాయశ్చిత్తంబులఁ జేసి యా సత్త్రయాగంబునకు వచ్చిన, వానిం జూచి పరావసుండు బృహద్యుమ్నున కిట్లనియె. 276

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అర్థావసుండు= అర్థావసుడు; అట్లు+చేయుదున్= ఆ విధంగా చేస్తాను; అని= అనిచెప్పి; బ్రహ్మహత్యావ్రతంబులు= బ్రాహ్మణుడిని చంపినందుకు సంక్రమించిన పాపాలను పోగొట్టే నోములను; సలుపుచుండెన్= చేస్తున్నాడు; పరావసుండును= పరావసుడు సయితం; ఒక్కరుండు= తాను ఒక్కడే; సత్త్రయాగంబు= సత్రయాగాన్ని; జరుపుచుండెన్= నిర్వహిస్తున్నాడు; అంతన్= అటుపిమ్మట; అర్థావసుండు= అర్థావసుడు; బ్రహ్మ, హత్యా, ప్రాయశ్చిత్తంబులన్+ చేసి= బ్రాహ్మణుడిని చంపినందువలన కలిగిన పాపానికి పరిహారాలు చేసి; ఆ సత్త్రయాగంబునకు= ఆ సత్రయాగం నిర్వహించటంకొరకై; వచ్చిన= రాగా; వానిన్+చూచి= అతడిని (ఆ అర్థావసుడిని) చూచి; పరావసుండు= పరావసుడు; బృహద్యుమ్నునకు= బృహద్యుమ్న మహారాజుతో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా తెలిపాడు.

తాత్పర్యం: అని చెప్పగా అర్థావసుడు అంగీకరించి తాను బ్రహ్మహత్యాపాతకానికి నిష్కృతి కలిగించే వ్రతాలు చేయసాగాడు. పరావసుడు తాను ఒక్కడే సత్రయాగాన్ని నిర్వహిస్తున్నాడు. అంతట, అర్థావసుడు బ్రహ్మహత్య వలన ఏర్పడిన పాపం తొలగటానికి పరిహారవ్రతాలు నిర్వర్తించి తిరిగి సత్రయాగాన్ని నిర్వహించటానికి రాగా, అతడిని చూచి పరావసుడు బృహద్యుమ్నమహారాజుతో ఇట్లా అన్నాడు.

క. 'ఇమ్ముని నీ యజ్ఞాయత । నమ్ముఁ బ్రవేశింపఁదగఁడు నరనాయక! యు
గ్రమ్ముగ సలిపెడు శుభకా । ర్యమ్ములకుం బాసి బ్రహ్మహత్యావ్రతముల్.' 277

ప్రతిపదార్థం: ఈ+ముని= అర్థావసుడు; నీ యజ్ఞ+ఆయతనమ్మున్= నీ యాగశాలలో; ప్రవేశింపన్+తగఁడు= ప్రవేశించటానికి అర్హుడు కాడు; నర నాయక!= ఓ మహారాజా!; శుభకార్యములకున్+పాసి= మంచివిగా జరిగే క్రియలను; వీడి; ఉగ్రమ్ముగన్=

తీవ్రంగా; బ్రహ్మ, హత్యా, వ్రతముల్= బ్రాహ్మణుడిని చంపటంచేత ఏర్పడే పాపం పరిహరించటానికై నోములు; సలిపెడున్= చేస్తున్నాడు.

తాత్పర్యం: 'ఓ బృహద్ద్యుమ్న మహారాజా! ఈ ఋషి నీ యాగశాల ప్రవేశించటానికి యోగ్యుడు కాడు. ఇతడు శుభకార్యాలను విడిచి, తీవ్రమైన బ్రహ్మహత్యాపాతకాన్ని పరిహరించే వ్రతాలు చేస్తున్నాడు.'

వ. అనవుడు, బృహద్ద్యుమ్నప్రేరితులైన జనులచేత నుత్సార్యమాణుం డయి యర్థావసుం డనియెఁ 'బరావసుండు గాని యేను బ్రహ్మఘాతకుండఁ గాను; వానికై వ్రతంబు సలిపి తత్పాతకవిముక్తుఁ జేసితి' నని చెప్పిన యర్థావసు యథార్థకథనంబునకు మెచ్చి యగ్నిపురోగములైన దేవతలు వాని కిట్లనిరి. 278

ప్రతిపదార్థం: అనవుడు= అని చెప్పగా; బృహద్ద్యుమ్న ప్రేరితులు+ఐన= బృహద్యుమ్నుడిచేత ఆదేశించబడి (ఆజ్ఞాపించబడిన); జనులచేతన్= మనుష్యులచేత; ఉత్సార్యమాణుండు+అయి= తొలగించబడినవాడై; అర్థావసుండు; అనియెన్= చెప్పాడు; పరావసుండు+కాని= పరావసుడే కాని; ఏను= నేను; బ్రహ్మ, ఘాతకుండన్+కాను= బ్రాహ్మణుడిని చంపినవాడిని కాను; వానికై= అతడి కొరకు; వ్రతంబు, సలిపి= నోములు నోచి; తత్+పాతక, విముక్తున్+చేసితి= అతడిని పాపంనుండి తొలగించాను; అని చెప్పిన= అని చెప్పినటువంటి; అర్థావసు యథార్థ కథనంబునకు= అర్థావసుడు చెప్పిన నిజమైన మాటలకు; మెచ్చి= మన్నించి; అగ్ని, పురస్+గములు+ఐన= అగ్నిని ముందు పెట్టుకొన్నవారైన; దేవతలు= వేల్పులు; వానికి= అతడికి; ఇట్లు+అనిరి= ఈవిధంగా చెప్పారు.

తాత్పర్యం: అని చెప్పగా, బృహద్ద్యుమ్న మహారాజుయొక్క అనుచరులు యజ్ఞశాలలోనికి ప్రవేశించనీయక తనను వారించటం చేత అర్థావసుడు ఇట్లా చెప్పాడు: 'బ్రహ్మహత్య చేసింది పరావసుడే కాని నేను కాదు. అతడి పాపాలు తొలగటంకొరకై నోములు నోచిన వాడిని నేను.' ఆమాటలు విని వేల్పులు అతడు చెప్పిన సత్యానికి అతడిని అభినందిస్తూ ఇట్లా పలికారు.

దేవత లర్థావసునకు మెచ్చి కోరిన వరంబు లెల్ల నిచ్చుట (సం. 3-139-18)

తే. 'తమ్ముచేసిన దురితముల్ తలఁగఁ బూని । ధర్మబుద్ధివై వ్రతములు పేర్మిఁ జలిపి
తనఘ! నీకు నభీష్టంబు లైన వరము । లడుగు మిచ్చెద; మీ మెచ్చు గడవ నగునె!' 279

ప్రతిపదార్థం: తమ్మ, చేసిన= తమ్ముడుచేసిన; దురితముల్= పాపాలు; తలఁగన్+పూని= తొలగించటానికి ప్రయత్నించి; ధర్మబుద్ధివి+ఐ= ధర్మమందు మనస్సు కలవాడివై; వ్రతములు= నోములు; పేర్మిన్= గౌరవంతో; చలిపితి= నెరవేర్చావు; అనఘ!= పాపరహితుడివైన ఓ పవిత్రుడా!; నీకున్= నీకు; అభీష్టంబులు+ఐన= మిక్కిలి ఇష్టాలైన; వరములు= కోరికలు; అడుగుము= వేడుకొమ్ము; ఇచ్చెదము= ఇస్తాము; ఈ మెచ్చు, కడవన్+అగునె= ఈ నీ గొప్పతనం ఊరకే తొలగిపోవదగింది కాదు.

తాత్పర్యం: 'పాపరహితుడివైన ఓ పవిత్ర చరిత్రుడా! అర్థావసు మహర్షీ! నీ తమ్ముడు చేసినపాపాలను తొలగించటానికి పూనిన ధర్మాత్ముడివి నీవు. నీవు చేసిన వ్రతాలు గొప్పవి. నీకు మిక్కిలి ఇష్టాలైన వరాలు కోరుకొనుము ఇస్తాం. నీ గొప్పతనం బహూకృతికి అర్హమైనది.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనినఁ దన తండ్రియు భరద్వాజుండును యవక్రీతుండు నెప్పటియట్ల జీవించియుండను, నిజజనకుండు పరావసుచేత నిహతుం డగుట నిస్తరింపను వలయు నని ప్రార్థించి, దేవతల వరంబున నర్థావసుండు రైభ్య భరద్వాజ యవక్రీతుల సంజీవితులం జేసిన నద్దేవతలకు యవక్రీతుం డిట్లనియె. 280

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన (చెప్పగా); తన తండ్రియు= తనతండ్రియు; భరద్వాజుండును= భరద్వాజుడున్నూ; యవక్రీతుండును= యవక్రీతుడున్నూ; ఎప్పటి+అట్లు+అ= లోగడమాదిరిగానే; జీవించి+ఉండను= బ్రతికి ఉండేటట్లు (జీవించాలి); నిజ జనకుండు= తనతండ్రి; పరావసుచేత= పరావసుడిచేత; నిహతుండు+అగుట= చంపబడటం; నిస్తరింపను= (చంపటం వలన ఏర్పడిన) పాపం పరిహరింపను- పాపం పరిహరించబడటం; వలయున్+అని= కావాలని; ప్రార్థించి= వేడుకొని; దేవతల= వేల్పుల; వరంబునన్= అనుగ్రహంవలన; అర్థావసుండు= అర్థావసుడు; రైభ్య, భరద్వాజ, యవక్రీతుల= రైభ్యుడిని, భరద్వాజుడిని, యవక్రీతుడిని; సంజీవితులన్+చేసినన్= తిరిగి బ్రతికించగా; ఆ+దేవతలకు= ఆ వేల్పులకు; యవక్రీతుండు= యవక్రీతుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా, తనతండ్రియును, భరద్వాజుడున్నూ యవక్రీతుడున్నూ యథాపూర్వంగా బ్రతికి ఉండాలనీ, పరావసుచేత తండ్రి చంపబడిన దోషం పరిహరించబడాలనీ వరాలు అనుగ్రహించండని వేల్పులను అర్థావసుడు ప్రార్థించాడు. దేవతల దయవలన, అర్థావసుడు రైభ్య భరద్వాజ యవక్రీతులను తిరిగి బ్రతికించాడు. అప్పుడు యవక్రీతుడు దేవతలతో ఇట్లా పలికాడు.

విశేషం: ఈ వచనం రెండవ పంక్తిలో "పరావసుచేత నిహతుండగుట వాని విస్మరింపను వలయునని"- అనే పాఠాంతరం కొన్ని ప్రతుల్లో ఉంది. దీనిని బట్టి పరావసునిచేత నిహతుడైన విషయం తండ్రియగు రైభ్యునకు తెలియకూడదని అర్థావసుడు దేవతలను కోరినట్లు వెల్లడౌతున్నది.

తే. 'ఏను బహువేదశాస్త్రమ్ము లెఱిఁగి, వ్రతము । లెల్లఁ జేయుచు రైభ్యుచే నిట్లు హతుఁడ
నైతి; నాకంటె రైభ్యున కధికశక్తి । యైన తెఱఁ గెట్టు?' లనిన నిట్లనిరి సురలు. 281

ప్రతిపదార్థం: ఏను= నేను; బహు, వేద, శాస్త్రమ్ములు= వివిధవేదాలు, శాస్త్రాలు; ఎఱిఁగి= తెలిసికొని; వ్రతములు+ఎల్లన్= నోములన్నింటినీ; చేయుచున్= అనుష్ఠిస్తూ; రైభ్యుచేన్= రైభ్యుడిచేత; ఇట్లు= ఈ రీతిగా; హతుఁడను+ఐతిన్= చంపివేయబడ్డాను; నాకంటెన్= నాకంటె; రైభ్యునకు= రైభ్యుడికి; అధికశక్తి= ఎక్కువ మహిమ; ఐన+తెఱుఁగు= ఏర్పడినమార్గం; ఎట్టులు?= ఎట్లా సంభవించింది?' అనినన్= అని అడుగగా; సురలు= వేల్పులు; ఇట్లు+అనిరి= ఈవిధంగా తెలిపారు.

తాత్పర్యం: 'నేను వివిధశాస్త్రాలను, వేదాలను ఎరిగినవాడిని, సమస్తవ్రతాలు దీక్షతో ఆచరించినవాడిని. కాని, ఈ విధంగా రైభ్యుడిచేత ఏల సంహరించబడినాను? నాకంటె రైభ్యుడికి హెచ్చుశక్తి ఏరీతిగా లభించింది?' అని ప్రశ్నించగా, యవక్రీతుడికి దేవతలు ఈవిధంగా సమాధానం చెప్పారు.

క. 'గురుశుశ్రూష యొనర్చుచుఁ । బరమక్లేశమునఁ జేసి పడసిన విద్యల్
స్ఫురియించుఁగాక; గురుముఖ । విరహితముగఁ బడసినవియు వెలయునె యెందున్? 282

ప్రతిపదార్థం: గురు, శుశ్రూష= గురువుగారికి పరిచర్య; ఒనర్చుచున్= చేస్తూ; పరమ, క్లేశమునన్+చేసి= మిక్కిలి కష్టపడటంచేత; పడసిన, విద్యల్= పొందిన చదువులు; స్ఫురియించున్+కాక= శోభిల్ల గలవుకాని; గురు, ముఖ, విరహితముగన్= అధ్యాపకుడి

ముఖతః; (నోటిద్వారా) ఉపదేశపూర్వకంగా అభ్యసించకుండా; పడసినవియు= పొందినట్టివి; ఎందున్= ఎక్కడైనా; వెలయునె= శోభిల్లుతాయా!.

తాత్పర్యం: 'గురువుగారికి పరిచర్యచేస్తూ, మిక్కుటమైన ప్రయాసను ఓర్చుకొని అభ్యసించిన చదువులు శోభిస్తాయి కాని, అధ్యాపకుడి ద్వారా (గురు ముఖత); అభ్యసించకుండా ఆర్జించిన విద్యలు ఎక్కడైనా శోభిస్తాయా!

వ. నీవు గురుముఖంబునం బడయక యొండు విధంబునం బడయుటం జేసి నీయధ్యయనశ్రుతంబులు నిర్వీర్యంబు లయ్యె; గురుసంతోషకరుండై రైభ్యుండు బ్రహ్మజ్ఞానం బుపార్జించెం గావున నాతం డిట్టి శక్తివడసె నని దేవతలు దివంబున కరిగి; రిది యవక్రీతు నివాసం; బిందు వసియించినవారు దురిత విముక్తులగుదు; రిది కాలశైలం; బిది సప్తవిధం బైన గంగ; యిది మనుష్యుల కగోచరం; బింద యుండి సమాధి శౌచపరులై చూడుం; డిది మందరనగం; బిందు నానాప్రహరణపాణులై యష్టాశీతిసహస్రగంధర్వులు కిన్నరకింపురుష సుపర్వులు సురేంద్రుం గొలిచి పోయెద; రిందుల కాఱునూఱుయోజనంబులు గలదు కైలాసపర్వతం; బందు గుబేరుం డుండు' నని రోమశుండు సెప్పినం బాండవులు కృతసమాధిశీలురై వాని నెల్లం జూచి; రంత నంతక సుతుండు భీమున కిట్లనియె. 283

ప్రతిపదార్థం: నీవు= నీవు; గురు, ముఖంబునన్= గురువు నోటినుంచి; పడయక= పొందక; ఒండు, విధంబునన్= వేరొక విధంగా; పడయుటన్+చేసి= సంపాదించటంచేత; నీ అధ్యయన, శ్రుతంబులు= నీ చదువులు, వేదాలు; నిర్+వీర్యంబులు+అయ్యె= పటుత్వం లేనివి అయినాయి; గురు, సంతోష, కరుండు+ఐ= అధ్యాపకుడికి సంతోషం కలిగించినవాడై; రైభ్యుండు= రైభ్యుడు; బ్రహ్మజ్ఞానంబు= వేదాలను గూర్చిన జ్ఞానాన్ని; ఉపార్జించెన్= సంపాదించాడు; కావునన్= కాబట్టి; ఆతండు= ఆ రైభ్యుండు; ఇట్టి, శక్తి= ఈ విధమైన మహిమ; పడసెన్= పొందాడు; అని= అని చెప్పి; దేవతలు= వేల్పులు; దివంబునకు+అరిగిరి= స్వర్గానికి వెళ్ళారు; ఇది= ఈ చోటు; యవక్రీతు నివాసంబు= యవక్రీతుడు నివసించిన స్థలం; ఇందు= ఇక్కడ; వసియించినవారు= ఉన్నవారు; దురిత, విముక్తులు+అగుదురు= పాపంనుండి విడివడిన వారౌతారు. ఇది= ఈ క్షేత్రం; కాలశైలంబు= కాలపర్వతం; ఇది= ఇది; సప్త, విధంబు+ఐన= ఏడు పాయలు అయిన; గంగ= గంగానది; ఇది= ఇది; మనుష్యులకు= మానవులకు; న+గోచరంబు= కనిపించనటువంటిది; ఇందు+అ+ఉండి= ఇక్కడే నిలిచి; సమాధి, శౌచ, పరులు+ఐ= సమాధి యోగానికి చెందిన నిర్మలత్వాన్ని అలవరచుకొన్నవారై; చూడుండు= చూడండి; ఇది; మందరనగంబు= మందరమనే పేరుకల పర్వతం; ఇందు= ఈ పర్వతంలో; నానా, ప్రహరణ, పాణులు+ఐ= పెక్కువిధాలైన ఆయుధాలను ధరించిన చేతులు కలవారై; అష్ట+అశీతి సహస్ర గంధర్వులు= 88వేల మంది గంధర్వులు; కిన్నర, కింపురుష, సుపర్వులు= కిన్నరులు, కింపురుషులు, దేవతలు; సుర+ఇంద్రున్= దేవేంద్రుడిని; కొలిచి, పోయెదరు= సేవించి వెళ్ళుతారు; ఇందులకు= ఇక్కడికి; అఱు, నూఱు, యోజనంబులు= ఆరువందల ఆమడలు (ఆమడల దూరాన); కైలాస పర్వతంబు= కైలాసం అనేకొండ; కలదు= ఉన్నది; అందున్= ఆ కైలాస పర్వతమందు; కుబేరుండు+ఉండున్= కుబేరుడు (అనే దిక్పాలకుడు, ధనాధీశుడు) ఉంటాడు; అని= అంటూ; రోమశుండు+చెప్పినన్= రోమశమహర్షి చెప్పగా; పాండవులు= పాండుసుతులు; కృత, సమాధి, శీలురు+ఐ= చేయబడిన సమాధి అనే యోగం యొక్క స్వభావం కలవారై అనగా సమాధి శీలాన్ని పొందినవారై; వానిన్+ఎల్లన్+చూచిరి= ఆ క్షేత్రాలను అన్నింటినీ దర్శించారు; అంతన్= అటుపిమ్మట; అంతక, సుతుండు= ధర్మపుత్రుడు; భీమునకు= భీమసేనుడితో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: నీవు గురుముఖతః వేదాది విద్యలు పొందలేదు. వేరువిధంగా విద్యలను ఆర్జించటంచేత, అవి శక్తి విహీనాలు అయినాయి. గురువు సంతసిల్లేటట్లు రైభ్యుడు వేదశాస్త్రాదుల జ్ఞానం ఆర్జించటంచేత అతడికి ఇటువంటి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మహిమ ఏర్పడింది- అని చెప్పి వేల్పులు స్వర్గానికి వెళ్ళిపోయారు. ఇది యవక్రీతుడు వసించిన చోటు. ఇక్కడ నివసించిన వారి(కి) పాపాలు నశిస్తాయి. ఇది కాలపర్వతం. ఇది ఏడుపాయల గంగానది. ఇది మనుష్యులకు కనిపించదు. ఇక్కడనే ఉండి, సమాధియోగానికి సంబంధించిన శుచిత్వాన్ని సాధించి దర్శించండి. ఇది మందరగిరి. ఇందు పెక్కు ఆయుధాలు ధరించి ఎనభైఎనిమిదివేలమందిగంధర్వులు, కింపురుషులు, కిన్నరులు, వేల్పులు దేవేంద్రుడిని కొలిచి వెళ్ళుతారు. ఇక్కడికి ఆరువందల ఆమడల దూరంలో కైలాసపర్వతం ఉన్నది. అక్కడ కుబేరుడు ఉంటాడు' - అని రోమశుడు చెప్పాడు. అపుడు పాండవులు సమాధియోగాన్ని సాధించినవారై ఆ యా పుణ్యక్షేత్రాలను దర్శించారు. అంతట ధర్మరాజు భీమసేనుడికి ఈ విధంగా చెప్పాడు.

సీ. 'దుర్గమం బైన యీ దుర్గమార్గంబున । నడవంగ నేర; మున్నతరథముల
నింద్రసేనాదుల నీ ధౌమ్యవిప్రుల । ద్రుపదతనూజను దోడికొనుచు
సహదేవుఁడును నీవు చట్టనఁ గ్రమ్మఱుఁ; । నేనును నకులుండు నేఁగి రోమ
శాదేశమునఁ జేసి యఖిలతీర్థంబులు । నాడి వచ్చెదము; మా యరుగుదెంచు

ఆ. నంత కెంతయును బ్రయత్నంబుతోఁ గృష్ణఁ । గాచి యుండుఁ' డనిన ఘనుఁడు భీముఁ
డనియె 'నిట్టి రాక్షసాకీర్ణవనములో । నిన్నుఁ బాయనగునె నిమిషమేని. 284

ప్రతిపదార్థం: దుర్గమంబు+ఐన= నడవటానికి వీలులేని; ఈ, దుర్గ, మార్గంబున= పోగూడనిదారిలో; నడవంగనేరము= నడవలేము; ఉన్నత, రథములన్= పెద్ద తేరులను; ఇంద్రసేన+ఆదులన్= ఇంద్రసేనుడు మొదలైన వారిని; ఈ, ధౌమ్య, విప్రుల= ఈ ధౌమ్యుడిని, బ్రాహ్మణులను; ద్రుపదతనూజను= ద్రౌపదిని; తోడికొనుచున్= వెంటపెట్టుకొని; సహదేవుడును, నీవు= సహదేవుడున్నూ, నీవున్నూ; చట్టనన్+క్రమ్మఱుఁడు= శీఘ్రంగా మరలండి; ఏనును, నకులుండున్= నేనూ, నకులుడున్నూ; రోమశ+ఆదేశమునన్+చేసి= రోమశుడి ఆజ్ఞను అనుసరించి; ఏఁగి= వెళ్ళి; అఖిల, తీర్థంబులున్= అన్ని తీర్థాలలో; ఆడి, వచ్చెదము= స్నానంచేసి రాగలం (వస్తాం); మా+అరుగుదెంచునంతకు= మేం వచ్చేవరకు; ఎంతయును= మిక్కిలి; ప్రయత్నంబుతోన్= పూనికతో; కృష్ణన్= ద్రౌపదిని; కాచి+ఉండుఁడు= రక్షించండి; అనినన్= అని చెప్పగా; ఘనుఁడు= గొప్పవాడు; భీముఁడు+అనియెన్= భీముడు చెప్పాడు; ఇట్టి= ఈవిధమైన; రాక్షస+ఆకీర్ణ, వనములో= రక్కసులతో నిండిన అడవిలో; నిన్నున్= నిన్ను; నిమిషము+ఏని= నిమిషమైనా; పాయన్+అగునె?= విడిచి ఉండవచ్చునా?

తాత్పర్యం: 'ఈ మార్గం నడవటానికి కష్టమైనది. ఈ దారిలో నడచి వెళ్ళలేం. పెద్దతేరులను, ఇంద్రసేనుడు మొదలైన ముఖ్యభటులను, ఈ ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణులను, ద్రౌపదిని వెంటబెట్టుకొని నీవూ, సహదేవుడూ శీఘ్రంగా మరలిపొండి. నేనున్నూ, నకులుడున్నూ కలిసి వెళ్ళి రోమశమహర్షి ఆజ్ఞానుసారం అన్ని తీర్థాలలో స్నానంచేసి రాగలం. మేము తిరిగి వచ్చేవరకూ జాగ్రత్తగా ద్రౌపదిని కాపాడండి'- అని ధర్మరాజు పలుకగా గొప్పవాడైన భీముడు ఇట్లా అన్నాడు: రాక్షసులతో నిండినటువంటి ఇట్టి అడవిలో నిన్ను ఒక్క నిమిషమైనా ఎడబాసి ఉండటం నాకు తగునా?

చ. అనఘచరిత్రు నర్జును మహాభుజు నొక్కనిఁ బాసి వంతఁ బొం
దిన యెడ నిట్టిచోట సహదేవుఁడు నేనును గృష్ణయున్ జగ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జ్జనునుత! నిన్నుఁ బాసిన నసహ్యతరం బగు తీవ్రతాపవే

దన యగు; నీకు మాకు నుచితంబె పరస్పరభేద మెన్నఁడున్. **285**

ప్రతిపదార్థం: జగత్+జననుత!= లోకంలోని జనులచేత పొగడబడినవాడా!; అనఘ చరిత్రున్= పాపరహితమైన పవిత్ర ప్రవర్తన కలవాడిని; అర్జునున్= అర్జునుడిని; మహాభుజున్= గొప్పపరాక్రమం కలవాడిని; ఒక్కనిన్+పాసి= ఒక్కడిని విడిచి; వంతన్= బాధను; పొందిన+ఎడన్= అనుభవిస్తున్నాం కదా; ఇట్టి, చోటు+అ= ఇటువంటి స్థలంలో; సహదేవుడు; ఏనును+కృష్ణయున్= నేనున్నూ ద్రౌపదియున్నూ; నిన్నున్+పాసినన్= నిన్ను ఎడబాసినచో; అసహ్యతరంబు+అగు= ఓర్చటానికి మరింత కష్టమైన; తీవ్రతాపవేదన+అగున్= మిక్కుటమైన బాధవలన దుఃఖం కలుగుతుంది; నీకు, మాకున్= నీకు, మాకు మధ్య; ఎన్నఁడున్= ఎప్పుడైనా; పరస్పర, భేదము= ఒండొరులు వేఱుపడటం; ఉచితంబె?= సరియైనటువంటిదా?

తాత్పర్యం: జగత్తులోని ప్రజలు అందరిచేత ప్రస్తుతించబడిన ఓ ధర్మరాజా! పరమపవిత్రమైన ప్రవర్తన కల అర్జునుడు ఒకడిని మాత్రమే ఎడబాసి ఇంత వేదన పొందుతుండగా, నేను సహదేవుడు ద్రౌపది ఇప్పుడు నిన్ను కూడ ఎడబాసినట్లైతే మరింత భరించరాని బాధ, దుఃఖం మాకు కలుగుతాయి. నీకూ, మాకూ మధ్య పరస్పరం వేఱుపడటం ఎన్నడైనా భావ్యమా? (కాదని అభిప్రాయం).

క. కడు డస్సి నడవనోపని । యెడ నీ కమలాయతాక్షి నీ కవలను నేఁ

దడయక నఱకట నిడికొని । కడఁకం గొనివత్తు విషమగహనాంతములన్. **286**

ప్రతిపదార్థం: కడు= చాలా, మిక్కిలి; డస్సి= బడలి; నడవన్+ఓపని+ఎడన్= నడవలేని అప్పుడు; ఈ, కమల+ఆయత+అక్షిన్= కమలాలవలె విశాలమైన కన్నులు కల దానిని, ద్రౌపదిని; ఈ కవలను= ఈ జంట బిడ్డలను- ఈ నకుల సహదేవులను; ఏన్= నేను; తడయకన్= వెంటనే, ఆలస్యం చేయక; అఱకటన్+ఇడికొని= భుజాలపై పెట్టుకొని, (అఱక+కడ= అఱకడ); విషమ, గహన+అంతములన్= ఎత్తు పల్లాలతో నిండిన అడవుల లోపల; కడకన్= పూనికతో; కొనివత్తున్= మోసికొని వస్తాను (రాగలను).

తాత్పర్యం: చాలా అలసిపోయి నడవలేకపోయినప్పుడు, కమలాలవంటి కన్నులు కల ఈ ద్రౌపదిని, కవలలు అయిన నకుల సహదేవులను నేను నా వీపుపైకి ఎక్కించుకొని పూనికతో మిట్టపల్లాలతో నిండిన అడవులు, కొండలు దాటేవరకు మోసి తీసికొని రాగలను.

విశేషం: 'దడయక యఱకడ నిడికొని' - అని పాఠాంతరం

వ. ఈ రథంబులతోఁ బోవ నిమ్ము గాదేని వీని నింద్రసేనాదుల నెందేనిం బెట్టి పోద' మనిన రోమశుం డిట్లనియె. 287

ప్రతిపదార్థం: ఈ రథంబులతోన్= ఈ తేరులతో; పోవన్= ప్రయాణించటం; ఇమ్ము+కాదు+ఏని= అనుకూలం కాకపోతే; వీనిన్= ఈ రథాలు మున్నగు వాటిని; ఇంద్రసేన+ఆదులను= ఇంద్రసేనుడు మొదలైనవారిని; ఎందు+ఏనిన్= ఎక్కడైనా; పెట్టి= ఉంచి; పోదము= ప్రయాణిద్దాం; అనిన= అనగా; రోమశుండు= రోమశుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ రథాలతో పోవటం అనుకూలం కాకపోతే వీటిని, ఇంద్రసేనుడు మొదలైన వారిని, ఎక్కడైనా ఉంచి మనం ప్రయాణిద్దాం'- అని చెప్పగా రోమశుడు ఇట్లా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'అతులతపోవీర్యబలో । న్నతిఁ బోదము గంధమాదనంబునకు; సమా
గతు నందుఁ గాంతు మర్జును । నతివీరు నుదారు సురగణార్చితుఁ బార్థున్.' 288

ప్రతిపదార్థం: అతుల, తపస్+వీర్య, బల+ఉన్నతిన్= సాటిలేని తపస్సు యొక్క పరాక్రమం యొక్క శక్తియొక్క ఉన్నతిచేత-అతిశయంచేత; గంధమాదనంబునకు= గంధమాదన పర్వతానికి; పోదము= వెళ్ళుదాం; అందున్= ఆ కొండ మీద; సమాగతున్= (స్వర్గంనుండి) వచ్చేటటువంటి; అర్జునున్= అర్జునుడిని; అతి వీరున్= గొప్ప శూరుడిని; ఉదారున్= త్యాగ గుణం కలవాడిని; సురగణ+అర్చితున్= దేవతల సమూహాలచేత పూజించబడిన వాడిని; పార్థున్= పృథయొక్క కొడుకును; కాంతుము= చూడగలం.

తాత్పర్యం: మనం సాటిలేని తపో వీర్యబల మహిమాతిశయంచేత గంధమాదనపర్వతానికి వెళ్ళుదాం. అక్కడ మనం ఇంద్రలోకం నుండి రాగల ఆ మహావీరుడు, త్యాగస్వభావం కలవాడు, దేవతలచేత పూజించబడినవాడు ఐన అర్జునుడిని చూడగలం.

విశేషం: గంధమాదన పర్వతం, పురాణాలలో భూలోకానికి, స్వర్గలోకానికి పొలిమేరగా వర్ణించబడింది.

వ. అనిన నందఱు సంతసిల్లి యరుగువారు ముందర ననేకప హయరథసనాథంబై యపారకిరాతబల సంకులంబైన దానిఁ బుళిందాధిపతి యైన సుబాహుపురంబుఁ గని, యందు వానిచేతం బూజితులై తమ రథసూతహయనివహంబుల నింద్రసేనాదిభృత్యులను సుబాహునొద్దం బెట్టి, పాదచారులై పాంచాలిని బ్రాహ్మణులను రక్షించికొని గంధమాదనంబున కభిముఖులై యరిగి; రంత ధర్మతనయుండు భీమున కిట్లనియె. 289

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; అందఱు= అంత మంది; సంతసిల్లి= సంతోషించి; అరుగువారు= వెళ్ళుతున్నవారు; ముందర= తమ యెదుట; అనేకప, హయ, రథ, సనాథంబు+ఐ= ఏనుగులు, గుర్రాలు, తేరులతో కూడినటువంటిదై; అపార, కిరాత, బల, సంకులంబు+ఐనదానిన్= మితి లేని ఆటవికభటులతో క్రిక్కిరిసినదానిని; పుళింద+అధిపతి+ఐన= పుళిందులు అనబడే ఆటవికులకు ప్రభువైన; సుబాహు, పురంబున్+కని= సుబాహుడి రాజధానిని చూచి; అందు= ఆ పురంలో; వానిచేతన్= ఆ సుబాహుడిచేత; పూజితులు+ఐ= అర్చించబడిన వారై; తమ, రథ, హయ, సూత, నివహంబులన్= తమ తేరులు, గుర్రాలు, రథ సారథుల సముదాయాలను; ఇంద్రసేన+ఆది, భృత్యులన్= ఇంద్రసేనుడు మొదలైన సేవకులను; సుబాహు+ఒద్దన్= సుబాహుడి దగ్గర; పెట్టి= ఉంచి; పాద, చారులు+ఐ= కాలినడకతో పయనించేవారై; పాంచాలిని= ద్రౌపదిని; బ్రాహ్మణులను= విప్రులను; రక్షించికొని= కాపాడుకొని; గంధమాధనంబునకు= గంధమాదన పర్వతానికి; అభిముఖులు+ఐ= ఎదురైన ముఖాలు కలవారై; అరిగిరి= వెళ్ళారు; అంత= అటుతర్వాత; ధర్మతనయుండు= ధర్మరాజు; భీమునకు= భీమసేనుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా అందరూ సంతోషించారు. ఇక పాండవులు సపరివారంగా ముందుకు పయనించి ఆటవికులకు ప్రభువైన సుబాహుడి రాజధాని చేరారు. ఆ సుబాహుడి నగరం ఏనుగులతో, గుర్రాలతో, రథాలతో సమ్మర్దమైనది. మితిలేని ఆటవిక భటులతో క్రిక్కిరిసినటువంటిది. పాండవులు ఆ సుబాహు డందించిన అతిథిమర్యాదలను పొంది అతడిదగ్గర తమ రథాలను, సారథులను, గుర్రాలను, ఇంద్రసేనుడు మొదలైన సేవకులను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉంచి, తాము పాదచారులై గంధమాదనపర్వతం ఉన్న దిక్కుకు పయనించారు. అంతట ధర్మరాజు భీముడితో ఇట్లా పలికాడు.

సీ. 'అలిగి వజ్రాయుధునైనను బోరిలో । నోర్వంగ నోపు నత్యుగ్రవీరు.
జవమునఁ బవనుఁ దేజంబున నాదిత్యుఁ । బోలినవాని, నంభోజనేత్రు,
నాయతబాహుఁ, గృతాస్త్రు, సింహస్కంధు । సర్వధనుర్ధరాచార్యు, విజయు,
నిత్యక్షమాన్వితు, నీ తమ్ము నర్జును । శుభగుణసుందరుఁ జూచునంత

ఆ. కధికతాపతప్త మైనది నా చిత్త; । మొనర నతనితోడ నొక్కటునికి
యెన్నఁ డొక్కొ మనకు! నిందఱ కగునాతఁ । డేల మసలెనొక్కొ యిన్ని యేండ్లు!' 290

ప్రతిపదార్థం: అలిగి= కోపించి; వజ్ర+ఆయుధున్+ఐనను= వజ్రాన్ని ఆయుధంగా కలిగిన దేవేంద్రుడిని సైతం; పోరిలోన్= యుద్ధంలో; ఓర్వంగన్+ఓపు= జయించగల; అతి+ఉగ్రవీరు= మిక్కిలి భయంకరమైన శూరుడిని; జవమునన్= వేగంలో; పవనున్= వాయుదేవుడిని; తేజంబునన్= ప్రకాశంలో; ఆదిత్యున్= సూర్యుడిని; పోలిన వానిన్= పోలినవాడిని; అంభోజనేత్రున్= పద్మాలవంటి కన్నులు కలవాడిని; ఆయతబాహున్= నిడివి అయిన చేతులు కలవాడిని; కృత+అస్త్రు= అస్త్రాల ప్రయోగంలో ఆరితేరినవాడిని; సింహస్కంధు= సింహంమూపు వంటి మూపు కలవాడిని; సర్వ, ధనుస్+ధర+ఆచార్యు= అందరు విలుకాండ్రకు గురువు అయినవాడిని; విజయు= విజయాన్నందుకొనేవాడిని; నిత్య, క్షమా+అన్వితు= ఎల్లప్పుడూ ఓర్పుతో కూడి ఉండేవాడిని; నీ తమ్మున్= నీ తమ్ముడైన; అర్జునున్= అర్జునుడిని; శుభ, గుణ, సుందరున్= మంచి గుణాలచేత అందమైన వాడిని; చూచునంతకున్= దర్శించేటంతవరకూ; నా, చిత్తము= నా మనస్సు; అధిక, తాప, తప్తము+అయినది= మిక్కలి బాధచే కాగినటువంటిది అయింది; ఒనరన్= ఒప్పునట్లుగా; అతనితోడన్= ఆ అర్జునుడితో; ఒక్కట+ఉనికి= ఒకచోట చేరి ఉండటం; మనకు; ఎన్నడు+ఒక్కొ= ఎన్నడో కదా!; ఇందరకు+అగు= ఇంతమందికి ఇంతగా ప్రీతిపాత్రుడయ్యే; ఆతడు= ఆ అర్జునుడు; ఇన్ని+ఏండ్లు= ఇన్ని సంవత్సరాలు; ఏల= ఎందుచేత, మసలెన్+ఒక్కొ= ఆలస్యం చేశాడోకదా.

తాత్పర్యం: 'కోపం వస్తే యుద్ధంలో వజ్రాయుధం అస్త్రంగా కల దేవేంద్రుడిని సైతం ఓడించ గల మిక్కిలి భయంకరమైన శౌర్యం కలవాడు, వేగంలో వాయుదేవుడికి, వర్చస్సులో సూర్యుడికి సాటివచ్చేవాడు, పద్మాలవంటి కన్నులు కలవాడు, ఆజానుబాహుడు, విలువిద్యలో ఆరితేరినవాడు, సింహపుమూపులవంటి భుజాలు గలవాడు, విలుకాండ్ర కందరికీ గురువు. ఎల్లప్పుడూ గెలుపునందే వీరుడు. సదా ఓర్పుతో కూడి ఉండేవాడు, నీ తమ్ముడు అర్జునుడు. అటువంటి మంచిగుణాలచేత సుందరుడైన వాడిని చూచేంతవరకు నా మనసు మిక్కిలి పరితాపంచేత కాగుతున్నది. తిరిగి అతడితో కలిసిఉండటం మనకు ఎప్పటికి చేకూరుతుందో కదా! మన అందరి మనసులను ఇంతగా ఆకట్టుకొన్న అర్జునుడు ఇన్ని ఏండ్లు ఎందుకు ఆలస్యం చేశాడో!'.

విశేషం: మహాభారతంలోను, ప్రాచీన భారతీయ సాహిత్యంలోను పలుతావుల స్త్రీ పురుషులను వర్ణించే సందర్భంలో ఆంగికాభివర్ణన కనిపిస్తుంది. ఇది సాముద్రిక శాస్త్రంలోని విశేషాలను వర్ణించటం కాదు. అర్జునుడు అంభోజనేత్రుడు. 'అంభోరుహనేత్ర స్త్రీ పాత్రలకు పలుచోట్ల పర్యాయపదం. 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం'. ఇంద్రియాలన్నింటిలో కన్నులకు కల ప్రాధాన్యాన్ని ప్రాచీనులు గుర్తించారు. అట్లాగే చేతులు, మూపు, నుదురు మొదలైన అవయవాలు వీరుని రూపవైభవచిహ్నాలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. అనుచుం బార్థవిలోకనంబు మదిలో నర్థింపఁగా ధర్మజుం
డనవద్యుల్ గడువేడ్కతో నరిగి తా రప్పాండవుల్ గంధమా
దనశైలేంద్రముఁ గాంచి రున్నతబృహద్ధాతుస్థలీసంహతిన్
ఘనసంధ్యాగమశంక సన్మునులకుం గావించు దానిన్ మహిన్. 291

ప్రతిపదార్థం: అనుచున్= అని తలపోస్తూ; పార్థ, విలోకనంబు= అర్జునుడిని చూడటం; మదిలోన్= మనస్సులో; అర్థింపఁగా= కోరుకోగా; ధర్మజుండు= ధర్మరాజు; అనవద్యుల్= దోషం లేని పవిత్ర చరిత్రులు; తారు= తాము; ఆ+పాండవుల్= ఆ పాండవులు; కడు= మిక్కిలి; వేడ్కతోన్= సంతోషంతో; అరిగి= పయనించి; మహిన్= భూమిపై; ఉన్నత, బృహత్+ధాతు, స్థలీ, సంహతిన్= ఎత్తైన పెద్దవైన, ధాతువులుండే స్థలాల సమూహాలతో; ఘన, సంధ్యా+ఆగమ, శంక= గొప్పదైన సంజకెంజాయలు క్రమ్ముతున్నాయనే భ్రాంతిని; సత్+మునులకున్= గొప్ప ఋషులకు; కావించుదానిన్= ఏర్పరచే దానిని; గంధమాదన, శైల+ఇంద్రమున్= పర్వతాలలో శ్రేష్ఠమైన గంధమాదనాన్ని; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: అని తలపోస్తూ అర్జునుడిని చూడాలి అనే కోరిక మనస్సులో ఏర్పడగా, పవిత్రచరిత్రులైన పాండవులు ధర్మరాజుతో పాటు మిక్కిలి వేడుకతో ప్రయాణం చేసి, గొప్ప గైరికాదిధాతువులు పలుచోట్ల ఉండటంచేత సంజకెంజాయలు క్రమ్ముతున్నాయనే భ్రాంతిని భూలోకంలోని మహర్షులకు కలిగించే గంధమాదనపర్వతరాజాన్ని సందర్శించారు.

విశేషం: అలం: భ్రాంతిమంతం.

క. నానావర్ణ శిలావిహ । గానేక మృగాభిరామమై భూనారీ
నానాభరణవిభూషిత । పీనోన్నతకుచముఁ బోలె వెలిఁగెడు దానిన్. 292

ప్రతిపదార్థం: నానా, వర్ణ, శిలా, విహగ+అనేక, మృగ+అభిరామము+ఐ= పెక్కు రంగులు కల రాళ్ళతోను, పక్షులతోను, పలుజంతువులతోను అందంగా ఉన్నదిన్నీ; భూ, నారీ, నానా, ఆభరణ, విభూషిత, పీన+ఉన్నత, కుచమున్+పోలెన్= భూదేవియొక్క పెక్కు అలంకారాలచేత అలంకరించబడిన దట్టమైన ఎత్తైన చన్నువలె; వెలింగెడుదానిన్= శోభిల్లేదానిని అనగా ఆ గంధమాదనాన్ని.

తాత్పర్యం: పెక్కు రంగులు గల రాళ్ళతో, పక్షులతో, పలుజంతువులతో సుందరమై, పలు ఆభరణాలచేత అలంకరించబడిన భూదేవియొక్క స్తనంవలె వెలుగొందుతున్న గంధమాదనాన్ని (చూచారు).

విశేషం: అలం: ఉపమ. పైపద్యం నాలుగవ పాదంలో కొన్ని ప్రతులలో "కుచముఁబోలె బెడఁగగుదానిన్"- అనే పాఠాంతరం ఉన్నది.

పాండవులు గంధమాదనపర్వతంబునకుం బోవుట (సం. 3-143-1)

క. లలితాచ్ఛ స్ఫటిక శిలా । తలములపైఁ బాఱు విమలతర నిర్ఝరిణీ
జలపూరములను తారో । ల్లల దురుహారాలి నుజ్జ్వలం బగు దానిన్. 293

ప్రతిపదార్థం: లలిత+అచ్ఛ, స్ఫటిక, శిలా, తలములపైన్= మనోహరమైనవి; నిర్మలమైనవి, అయిన స్ఫటికశిలలు కల ప్రదేశాలపై; పాఱు= ప్రవహించే; విమల, తర, నిర్ఝరిణీ, జల, పూరములను= మిక్కిలి స్వచ్ఛమైన సెలయేళ్ళయొక్క నీటి వెల్లువలనెడి; తార+ఉల్లలత్+ఉరు, హార+ఆలిన్= ముత్యాలతో చలించే గొప్పదండల సముదాయంతో; ఉజ్జ్వలంబు+అగు= ప్రకాశించే; దానిన్= దానిని.

తాత్పర్యం: సొగసైనవి, నిర్మలమైనవి అయిన స్ఫటికపు రాళ్ళుకల ప్రదేశాలపై ప్రవహించే మిక్కిలి స్వచ్ఛమైన సెలయేటి నీటివెల్లువలనెడి, చలించే ముత్యాల హారాలతో ప్రకాశించే గంధమాదనాన్ని చూచారు.

విశేషం: ఇక్కడ గంధమాదనంపై ప్రవహించే సెలయేళ్ళు ముత్యాలహారాలవలె ఉన్నవి అని భావం. గంధమాదనపర్వతం భూదేవి స్తనం వలె ఉన్నది. అందున్న సెలయేళ్ళు స్తనాన్ని ఆవరించిన ముత్యాలహారాలవలె ఉన్నాయి. వెనుకటి పద్యానికి ఇది అనుబంధం.

ఉ. **వారలు గంధమాదన మవార్యబలాఢ్యులు సొచ్చుచో మహా**
మారుత మప్డు వీచె నహిమద్యుతిమార్గము దిఙ్ముఖంబులన్
భూరుహపత్రమిశ్ర మయి భూరిపరాగము గప్పఁగా ధరి
త్రీరుహశాఖలున్ విఱిగి త్రెళ్ళఁగ గుల్మలతాలి సాల్పడన్. **294**

ప్రతిపదార్థం: వారలు= పాండవులు; న+వార్య, బల+ఆఢ్యులు= అడ్డగించటానికి వీలులేని బలం కలవారు; గంధమాదనము+చొచ్చుచోన్= గంధమాదనం చేరేటప్పటికి; అప్డు= ఆ సమయంలో; మహా మారుతము= పెనుగాలి; అ, హిమ, ద్యుతి, మార్గము= సూర్యుడి దారిని (న+హిమ= మంచు కాని, ద్యుతి= వెలుగు అనగా వేడివెలుగు కలవాడు సూర్యుడు); దిక్+ముఖంబులన్= దిక్కుల మొగాలను; భూ, రుహ, పత్ర, మిశ్రము+అయి= చెట్లయొక్క ఆకులతో కలిసి; భూరి, పరాగము= ఎక్కువైన దుమ్ము; కప్పఁగాన్= చుట్టుముట్టుగా; ధరిత్రీ రుహశాఖలున్= చెట్లకొమ్మలు; విఱిగి= ముక్కలై; త్రెళ్ళఁగన్= పడిపోగా; గుల్మ, లతా+ఆలి= పొదలు, తీగలు మొదలైనవి; సాల్పడన్= వరుసగా క్రింద పడిపోయేటట్లు; వీచెన్= ప్రసరించింది.

తాత్పర్యం: మహాపరాక్రమవంతులైన పాండవులు గంధమాదన పర్వతాన్ని చేరుకోగానే, పెనుగాలి వీచింది. సూర్యుడిదారి (ఆకాశం), దిగ్దిగంతాలు చెట్ల ఆకులతో కలిసిన దుమ్ముచేత ఆవరించబడ్డాయి. చెట్లకొమ్మలు విరిగి పడ్డాయి. పొదలు లతలు నేలమట్టా లైనాయి.

చ. **కడువడిగాడ్పుచే విఱుగఁగాఁ బడి త్రెళ్ళు మహీరుహాళి చ**
ప్పుడు విని యందఱుం జెదరి భూమిపయిన్ గగనం బుదగ్రతం
బడియెనొ శైలశృంగములు భగ్నము లయ్యెనొ యంచు ధూళి నె
క్కడఁ జననేర కొండొరులఁ గానక యుండిరి సంచలాత్ములై. **295**

ప్రతిపదార్థం: కడు= మిక్కిలి; వడిగాడ్పుచే= వేగంగల గాలిచేత (ఝంఝామారుతంచేత); విఱుగఁగాన్+పడి= ముక్కలు చేయబడి; త్రెళ్ళు= క్రిందకూలు; మహీరుహ+ఆళి, చప్పుడు= చెట్ల సమూహంవలన కలిగే శబ్దం; విని= ఆలకించి; అందఱున్+చెదరి= పాండవులందరూ ఇటూ అటూ చెదిరిపోయి; భూమిపయిన్= నేలమీద; గగనంబు= నింగి; ఉదగ్రతన్= భయంకరంగా; పడియెనొ= పతనం అయిందో; శైల, శృంగములు= కొండల కొమ్ములు; భగ్నములు+అయ్యెనొ= పగిలిపోయినవో;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంచు= అని తలపోస్తూ; ధూళిన్= దుమ్మువలన; ఎక్కడన్= ఎక్కడికీ; చననేరక= వెళ్ళలేక; సంచల+ఆత్ములు+ఐ= మిక్కిలి కదలిన హృదయాలు కలవారై; ఒండొరులన్= ఒకరిని ఒకరు; కానక= చూడజాలక; ఉండిరి= ఉన్నారు.

తాత్పర్యం: ఝంఝూమారుతంచేత విరుగగొట్టబడి క్రింది పడే చెట్ల సమూహాల చప్పుడు విని, అందరు ఇటూ అటూ కదలిపోయి, నింగి విరిగి భయంకరంగా నేలపై పడిందా, కొండ శిఖరాలు పగిలిపోయినాయా అని తలపోస్తూ మిక్కిలి కంపించిన హృదయాలు కలవారై, దుమ్ము దట్టంగా వ్యాపించటంచేత ఒకరిని ఒకరు చూడలేక పోయారు.

వ. ఇట్లు మహారేణుపటలం బంధకారంబునుంబోలె నీరంధ్రంబై కప్పినఁ బతిత తరు విటప లతా గుల్మంబులు కరతలంబులం బాయం ద్రోచుచు విశాలదృఢతరుమూలంబు లాశ్రయించి యగ్నిహోత్రంబులతో ధౌమ్య ధర్మజ సహదేవు లొక్కచోట, నుద్యద్గదా కార్ముకుండైన భీమసేనుండును ద్రౌపదియు నొక్కచోట, రోమశుండును నకులుండును బ్రాహ్మణులు నొక్కచోటనుగా నందఱు వేఱు వేఱ యుండి రంత. 296

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మహారేణుపటలంబు= గొప్పదుమ్ముకణాల సమూహం; అంధకారంబునున్+పోలె= చీకటివలె; నీరంధ్రంబు+ఐ= దట్టంగా; కప్పినన్= మూయగా (అంతట ఆవరించగా); పతిత తరు విటప లతా గుల్మంబులు= పడిపోయిన చెట్లయొక్క కొమ్మలు, తీగలు, పొదలు; కరతలంబులన్= అరచేతులతో; పాయన్+త్రోచుచు= ప్రక్కకు నెట్టుతూ; విశాల, దృఢ, తరు, మూలంబులు= పెద్దవి, చెక్కు చెదరనటువంటివి అయిన చెట్ల మొదళ్లను; ఆశ్రయించి= చేరి; అగ్నిహోత్రంబులతో= ఆరాధనకు ఉపకరించే నిప్పుతో; ధౌమ్య, ధర్మజ, సహదేవులు+ఒక్కచోటన్= ధౌమ్యుడు, ధర్మరాజు, సహదేవుడున్నూ ఒకచోట; ఉద్యత్+గదా, కార్ముకుండు+ఐన= ప్రకాశిస్తున్న గద, విల్లు పట్టుకొనిఉన్న; భీమసేనుండును= భీముడును; ద్రౌపదియున్= ద్రౌపదియును; ఒక్కచోటన్= ఒక స్థలంలో; రోమశుండును, నకులుండును, బ్రాహ్మణులును= రోమశుడు, నకులుడు, విప్రులును; ఒక్క చోటను+కాన్= ఒక్క స్థలంలో ఉండేటట్లుగా; అందఱు= అందరు; వేఱు, వేఱ= వేరు వేరు స్థలాలలో; ఉండరి= నిలిచి ఉన్నారు; అంతన్= అటు పిమ్మట.

తాత్పర్యం: ఈ విధంగా గొప్ప దుమ్ము దూమారం రేగి చీకటివలె దట్టంగా వ్యాపించింది. పడిపోయిన చెట్ల కొమ్మలను, తీగలను పొదలను అరచేతులతో అవతలకు త్రోస్తూ, పెద్దపెద్ద చెట్ల మొదళ్ళను చేరి నిలిచి పాండవబృందం మూడు భాగాలుగా విడిపోయింది. ధౌమ్యుడు ధర్మరాజు సహదేవుడు ఒకచోట, గద, విల్లు పట్టుకొని భీముడు ద్రౌపది ఒకచోట, రోమశుడు నకులుడు విప్రులు ఒకచోట వేరు వేరై చేరి నిలిచారు.

చ. కురిసెఁ బ్రచండవృష్టి ఘనఘోషము లెల్ల కెలంకులన్ భయం
కరములుగాఁ గరాళకరకాతతు లొప్పఁ దటిల్లతాళి వి
స్ఫురితముగాఁ బ్రపూర్ణ జలపూరముల న్గిరికుంజభూరిని
ర్ఝరతటినీతటీనికట సాలచయంబు విమూలితంబుగన్. 297

ప్రతిపదార్థం: ప్రచండ, వృష్టి= గొప్పవాన; ఘన, ఘోషములు= మేఘ గర్జనలు; ఎల్ల కెలంకులన్= అన్ని దిక్కులలో; భయంకరములు, కాన్= భయం కలిగించేవి కాగా; కరాళకరకా+తతులు= భయానకమైన వడగళ్ళు; ఒప్పన్= విలసిల్లగా; తటిత్+లతా+ఆళి= తటిల్లతాళి= మెరుపు తీగల సమూహం; విస్ఫురితముగాన్= మిరుమిట్లు కొలుపగా; ప్ర, పూర్ణ, జల, పూరములన్= మిక్కిలి నిండిన నీటి వెల్లువలచేత; గిరి, కుంజ, భూరి, నిర్ఝరతటినీ, తటీ, నికట, సాలచయంబు= కొండలదరి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నున్న పొదలు, పెద్ద సెలయేళ్ళు గట్ల దరి నున్న మద్దిచెట్ల సమూహం; విమూలితంబుగన్= వేళ్ళతోపాటు పెకలి పడిపోయేటట్లుగా; కురిసెన్= కురిసింది.

తాత్పర్యం: గొప్పవాన కురిసింది. చుట్టుప్రక్కల మేఘగర్జనలు భయాన్ని సృష్టించాయి. పెద్దపెద్ద వడగళ్ళు పడ్డాయి. మెరుపు తీగలు మిరుమిట్లు కొలిపాయి. నీరు అంతటా ఆవరించి ప్రవహించసాగింది. కొండల దరి నున్న పొదలు, పెద్ద పెద్ద సెలయేళ్ళు గట్ల దాపున ఉన్న (పెద్ద) మద్ది చెట్లు వేళ్ళతోపాటు పెకలించబడి కూలాయి.

వ. **అట్లు గాడ్పుతోడి వాన పెద్దయుంబ్రొద్దు కురిసి యుడిగిన నందఱు నొక్కచోటికి వచ్చి యెప్పటియట్ల యరుగు నెడ, నతివిషమ శిలాసంకటపథంబున నడవనేరక ద్రౌపది తొడరిపడి మూర్ఛిత యైనం బవనతనయుం డక్కోమలి నెత్తికొని యజనాస్తరణంబుపయిం బెట్టి కదళీదళంబుల వీచుచున్నం గవలు దాని పల్లవతామ్ర పాదతలంబు లాయుధాభ్యాసవశంబునం గిణీభూతంబులయిన తమ కరతలంబులంజేసి మెత్తన యొత్తుచుండి; రట్టి యవసరంబున ద్రౌపదిం జూచి దుఃఖితుం డయి ధర్మతయుం డిట్లనియె. 298**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; గాడ్పుతోడివాన= గాలితో కూడిన వర్షం; పెద్దయున్+ప్రొద్దు= చాలా సేపు; కురిసి= వర్షించి; ఉడిగినన్= వెలసిపోగా, వెలిశాక; అందఱున్= పాండవులంతా; ఒక్క, చోటికి, వచ్చి= ఒకే స్థలానికి చేరి; ఎప్పటి+అట్ల= అంతకుమునుపు వలె; అరుగు+ఎడన్= వెళ్లుతూ ఉండగా; అతి, విషమ, శిలా, సంకట, పథంబున= మిక్కిలి ఎగుడుదిగుడైన రాళ్లచేత బాధకల్గించే దారిలో; నడవనేరక= నడవలేక; ద్రౌపది= పాంచాలి; తొడరిపడి= తొట్రుపడి; మూర్ఛిత+ఐనన్= తెలివి కోల్పోవగా; పవన, తనయుండు= వాయుపుత్రుడైన భీముడు; ఆ+కోమలిన్= అక్కోమలిన్= సుకుమారి అయిన ఆ ద్రౌపదిని; ఎత్తికొని= మోసితెచ్చి; అజిన+ఆస్తరణంబుపయిన్+పెట్టి= జింకతోలు చాపమీద పడుకొనబెట్టి; కదళీదళంబులన్= అరటి ఆకులతో; వీచుచున్నన్= వీచుచుండగా; దాని= ఆమె యొక్క; పల్లవ, తామ్ర, పాద, తలంబులు= చిగురుటాకుల వలె ఎఱ్ఱనైన అరికాళ్ళను; ఆయుధ+అభ్యాసవశంబునన్= అస్త్రాలను చాలాసార్లు ప్రయోగించి ఉన్న అలవాటు చేత; కిణీ భూతంబులు+అయిన= కాయలు కాసిన; తమ, కరతలంబులన్+చేసి= తమ అరచేతులతో; కవలు= నకుల సహదేవులు; మెత్తన+ఒత్తు చుండిరి= మెత్తగా పిసుకుతున్నారు (ఒత్తుతున్నారు). అట్టి అవసరంబున= ఆ సమయంలో; ద్రౌపదిన్+చూచి= పాంచాలిని చూచి; దుఃఖితుండు+అయి= పరితప్తుడై; ధర్మతనయుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ విధంగా పెనుగాలితో చాలాసేపు పెద్దవాన కురిసి వెలిసింది. పాండవబృందంలోనివా రందరున్నూ ఒకచోటికి చేరి మళ్ళీ ప్రయాణం కొనసాగించారు. దారి అంతా ఎత్తుపల్లాలతో రాళ్ళతో, కూడి బాధకలిగించేదిగా ఉండటం చేత ద్రౌపది నడవలేక మూర్ఛిల్లింది. భీముడు ఆమెను ఎత్తుకొని జింకతోలుచాపమీద పడుకొనబెట్టి, అరటి ఆకులతో వీవసాగాడు. నకులసహదేవులు ఆయుధాల ఒరిపిడిచేత కాయలు కాసిన తమ అరచేతులతో చిగురుటాకుల వలె ఎఱ్ఱనైన ఆమె పాదాలను ఒత్తుతున్నారు. ఆ సమయంలో ధర్మరాజు ద్రౌపది అవస్థను చూచి మిక్కిలి పరితపించి ఇట్లా పలికాడు.

అక్కర. **'అరుణ సరోరుహ రమ్య మృదులంబులైన యీ తన్వి**
చరణతలంబులు గొడిగరాలపైఁ జనుచున్కిఁ జేసి

పరుసంబులై కడు నెఱ్ఱనైనవి పద్మాయతాక్షి

పరఁగ నా కారణంబునను నీ దుఃఖభారంబు దాల్చె. 299

ప్రతిపదార్థం: అరుణ, సరోరుహ, దళ, రమ్య, మృదులంబులు+ఐన= ఎఱ్ఱతామర పువ్వు రేకుల వలె అందమైన మెత్తనైన (సరస్+రుహ= సరోరుహ- తామర పువ్వు); ఈ+తన్వి, చరణ, తలంబులు= ఈ సుకుమారి యొక్క పాదాలు; గొడిగ, రాలపైన్= గులకరాళ్ళపై; చనుచున్కిన్+చేసి= నడవటంచేత; పరుసంబులు+ఐ= కఠినాలై; కడున్= మిక్కిలి; ఎఱ్ఱనైనవి= నెత్తురు చింది ఎరుపురంగుగా మారాయి; పద్మ+ఆయత+అక్షి= పద్మాలవలె అనగా పద్మపత్రాలవలె నిడువైన కన్నులు కలది- ద్రౌపది; పరఁగ= ప్రవర్తిల్లి; నా, కారణంబునను= నా మూలాన్నే; ఈ, దుఃఖ, భారంబున్+తాల్చెన్= ఈ దుఃఖ మనే బరువును మోసింది.

తాత్పర్యం: 'ఎఱ్ఱతామరపువ్వులరేకులవలె మెత్తనైన యీ సుకుమారిపాదాలు ఈ గులకరాళ్ళపై ప్రయాణించటం చేత నొచ్చి నెత్తురు చింది ఎఱ్ఱబడ్డాయి. పద్మపత్రాల వలె విశాలనేత్రాలు కల ఈ ద్రౌపది నా మూలాన్నే కదా ఇటువంటి పడరానిపాట్లు పడుతున్నది.

విశేషం: ఉ.వి. ఆంధ్రమహాభారత సంశోధిత ముద్రణ ప్రతిలో ఈ పద్యంలోని మొదటి చరణం ఇలా ఉన్నది - " అరుణ సరోరుహదళ మృదువులైన యాతన్వి రమ్య''. ఇందులో యతిమైత్రి లేదు. "అరుణసరోరుహదళ మృదులంబులైన యిత్తరుణి'' అనే పాఠాంతరం సూచించబడింది. అందులో ఛందోభంగం ఉన్నది. ఈ రెండింటిని కలిపి ఆలోచించి ఛందోభంగం, యతిభంగం లేని పైపాదాన్ని- "అరుణసరోరుహ రమ్య మృదులంబులైన యీతన్వి''- తి.తి.దేవస్థానం కంట్రోలర్ ఆఫ్ పబ్లికేషన్స్ శ్రీ కరణం జువ్వలకంటి కృష్ణమూర్తి గారు సూచించారు. దానిని కృతజ్ఞతలతో స్వీకరించటమైనది. (సంపా.)

సీ. సముచితంబగు మృదుశయన తలంబున। శయనించు నిత్తన్వి సదమలాంగి

పరుసంపు ఱాలపైఁ బడి తీవ్రవేదనఁ। బొందినయది; మహాపురుషు లైన

పాండవులకుఁ బ్రియభార్యయై నాపుత్త్రి। సుఖ ముండు నని మది సోమకుండు

పాయక సంతోషపడి యుండుఁ గాకున్నె' యని విలాపించు నయ్యమతనూజు

ఆ. నుచితవచనరచన నూరార్చి రప్పుడు। ధౌమ్యుఁదొట్టి సకలధరణిసురులు;

మూర్ఛ దేఱె నంత ముదిత ద్రౌపది శీత। మందపవనసేవ్యమాన యగుచు. 300

ప్రతిపదార్థం: సముచితంబు+అగు= తనకు తగినటువంటి; మృదు, శయన, తలంబున= మెత్తనైన పరుపులపై; శయనించు= పడుకొనేటటువంటి; ఈ+తన్వి= ఈ సుకుమారి; సదమల+అంగి= లావణ్యవతి; పరుసంపు, ఱాలపైన్= కఠినాలైన శిలలపై; పడి= ఒత్తుకొని; తీవ్రవేదనన్= తీవ్రమైన బాధను; పొందిన+అది= అనుభవించింది; మహాపురుషులు+ఐన= గొప్ప వీరులైన; పాండవులకున్= పాండురాజుకొడుకులకు; ప్రియభార్య+ఐ= ప్రియపత్ని అయి; నా, పుత్త్రి= నా కూతురు; సుఖము+ ఉండును+అని= సౌఖ్యాన్ని అనుభవిస్తుంది అని తలపోసి; మదిన్= మనస్సులో; సోమకుండు= ద్రుపదుడు; పాయక, సంతోషపడి+ఉండున్= ఎడతెగని సంతోషాన్ని అనుభవించి ఉంటాడు; కాక+ఉన్నె= కాబోలు; అని= అంటూ; విలాపించు= దుఃఖించు; ఆ+యమతనూజున్= యముడి పుత్రుడైన ఆ ధర్మరాజును; అప్పుడు= ఆ సమయంలో; ధౌమ్యున్+తొట్టి= ధౌమ్యుడు మొదలైన; సకల, ధరణి, సురులు= బ్రాహ్మణులందరూ; ఉచిత, వచన, రచనన్= తగిన మంచిమాటల కూర్పుచేత;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఊరార్చిరి= ఊరడించారు; అంతన్= అంతట; ముదిత, ద్రౌపది= సంతోషించిన పాంచాలి; శీత, మంద, పవన, సేవ్యమాన+అగుచు= చల్లని పిల్లగాలులచేత సేవించబడినది అవుతూ; మూర్ఛ+తేఱెన్= మూర్ఛనుండి తెలివి పొందింది.

తాత్పర్యం: తగిన మెత్తని పరుపులపై పవళించే ఈ సుకుమారి సుందరాంగి కఠినశిలలపై నడచి మిక్కిలి తీవ్రమైన వ్యథను పొందింది. మహావీరులైన పాండుసుతులకు భార్య అయి తన కూతురు సుఖపడుతుందని మనస్సులో భావించి ద్రుపదుడు ఎంతో సంతోషించి ఉంటాడు!' అని దుఃఖిస్తున్న ధర్మరాజును ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణులందరూ సమయోచితాలైన వాక్యాలతో ఊరడించారు. అంత ద్రౌపది చల్లని పిల్లతెమ్మెరలు సోకటంచేత మూర్ఛనుండి తేరుకొన్నది.

వ. దాని నాశ్వాసించి ధర్మరాజు భీమున కిట్లనియె. 301

ప్రతిపదార్థం: దానిన్= ఆమెను, పాంచాలిని; ఆశ్వాసించి= ఓదార్చి; ధర్మరాజు= ధర్మరాజు; భీమునకు= భీముడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: పాంచాలిని ఓదార్చి, ధర్మరాజు భీముడితో ఇట్లా చెప్పాడు.

క. 'ఈ రాజపుత్త్రిఁ దోడ్కొని । దారుణ పాషాణ దుష్పథంబులఁ జనఁగా
నేర; మిది నడువ నోపదు । భూరిభుజా!' యనిన ననిలపుత్త్రుం డంతన్. 302

ప్రతిపదార్థం: భూరి, భుజా!= గొప్ప, బుజాలు కలవాడా!; ఈ రాజపుత్త్రిన్= రాకుమార్తె అయిన ఈ ద్రౌపదిని; తోడ్కొని= వెంటపెట్టుకొని; పాషాణ, దుష్పథంబులన్= భయంకరమైన రాళ్ళతో నిండిన కఠినమార్గాలలో; చనఁగానేరము= వెళ్ళలేము; ఇది= ఈమె, ఈ ద్రౌపది; నడువన్+ఓపదు= నడవలేదు; అనినన్= అని చెప్పగా; అనిల పుత్త్రుండు= వాయుసుతుడు-భీముడు; అంతన్= అటు పిమ్మట.

తాత్పర్యం: 'మనం ఈ రాకుమారియైన ఈ పాంచాలిని తోడ్కొని భయంకరమైన శిలలతో నిండిన కఠినమార్గాలలో పయనించలేం. ఈమె నడువ జాలక ఉన్నది. పరాక్రమోపేతుడివైన భీమసేనా! యోచించుము' అని చెప్పగా భీముడు అప్పుడు.

క. అగ్రజుననుమతమున న । త్యుగ్రనిశాచరసమేతు నుడుమార్గగు వీ
రాగ్రణి ఘటోత్కచుం దన । యగ్రసుతుం దలఁచె ధీరు హైడింబు వెసన్. 303

ప్రతిపదార్థం: అగ్రజు+అనుమతమునన్= అన్నగారి అనుమతి ప్రకారం; అతి+ఉగ్ర, నిశాచర, సమేతున్= మిక్కిలి భయంకరులైన రక్కసులతో కూడినవాడిని; ఉడు, మార్గగున్= నక్షత్రపథాన సంచరించేవాడిని; వీర+అగ్రణిన్= వీరులలో గొప్పవాడిని; తన+అగ్రసుతున్= తన పెద్ద కుమారుని; ధీరున్= ధైర్యం కల వాడిని; హైడింబున్= హిడింబ కొడుకును; ఘటోత్కచున్= ఘటోత్కచుడిని; వెసన్= వేగంగా; తలఁచెన్= స్మరించాడు.

తాత్పర్యం: భీమసేనుడు అన్నగారి అనుమతి ప్రకారం, మిక్కిలి భయంకరులైన రాక్షసులతో కూడిఉన్నవాడు, ఆకాశమార్గాన సంచరించే వాడు. వీరులలో మొదట పేర్కొనతగినవాడు, ధైర్యవంతుడు హిడింబకొడుకు, తన జ్యేష్ఠ కుమారుడు ఐన ఘటోత్కచుడిని స్మరించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అతఁడును రాక్షససైన్యా । న్వితుఁడై తత్క్షణమ వచ్చి నిర్జరవరస
మ్మితులకుఁ బ్రణమిల్లెం దన । పితృవరులకు బ్రాహ్మణులకుఁ బెద్దయు భక్తిన్. 304

ప్రతిపదార్థం: అతఁడును= వాడున్నూ, ఆ ఘటోత్కచుడున్నూ; రాక్షస, సైన్య+అన్వితుఁడు+ఐ= రాక్షస సేనలతో కూడినవాడై; తత్+క్షణము+అ= ఆ క్షణమందే; వచ్చి= వచ్చి; నిర్జర, వర, సమ్మితులకున్= శ్రేష్ఠులైనవేల్పులతో సమానులైన వారికి; తన, పితృవరులకున్= శ్రేష్ఠులైన తన తండ్రులకు; బ్రాహ్మణులకున్= విప్రులకు; పెద్దయు, భక్తిన్= గొప్ప గౌరవంతో కూడిన ప్రేమతో; ప్రణమిల్లెన్= నమస్కరించాడు.

తాత్పర్యం: ఆ ఘటోత్కచుడును తన రాక్షసబలంతో ఆ త్రుటిలో అరుదెంచి దేవతాశ్రేష్ఠులతో సమానులైన తన తండ్రులకు, విప్రులకు మిక్కిలి భక్తితో నమస్కరించాడు.

వ. ఇట్లు మ్రొక్కి పని యే మని ముకుళితహస్తుం డయి తన ముందర నున్న కొడుకుం గౌఁగిలించుకొని భీముండు వాని కిట్లనియె. 305

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; మ్రొక్కి= వందనం చేసి; పని+ఏమి+అని= చేయవలసిన పని చెప్పండి అని; ముకుళిత, హస్తుండు+ఐ= జోడించిన చేతులు కలవాడై; తనముందరన్+ఉన్న= తన ఎదుట ఉన్న; కొడుకున్= కొడుకును; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; భీముండు= భీమసేనుడు; వానికిన్= ఆ ఘటోత్కచుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ఆ విధంగా వందనం చేసి, చేయవలసిన పనిని ఆదేశించండి- అని చేతులు జోడించి నిలిచిన కొడుకును ఆలింగనం చేసికొని భీముడు ఇట్లా చెప్పాడు.

తే. 'అబల యిది, భవన్మాత, నిత్యాధ్వగమన । ఖిన్న యైనది గజరాజఖేలగమన;
దీని నీ వెత్తికొని చనుదెమ్ము మాస । మీపమున' నని సుతు నియమించె నపుడు. 306

ప్రతిపదార్థం: భవత్+మాత= భవన్మాత= నీ తల్లి; ఇది= ఈమె; అబల= బలంలేనటువంటిది; నిత్య, అధ్వగమన, ఖిన్న+ఐనది= అనుదినం చేసిన పయనంచేత (నడచినందువలన) దారిబడలిక చెందింది; గజరాజఖేలగమనన్= మత్తేభం వలె వినోదంగా నడిచేటటువంటిది; దీనిన్= ఈమెను; ఈవు= నీవు; ఎత్తికొని= మోసికొంటూ; మా, సమీపమునన్= మాకు దగ్గరగా; చనుదెమ్ము= వస్తూండుము; అని= అని; అపుడు= ఆసమయంలో; సుతున్= కొడుకును; నియమించెన్= ఆదేశించాడు.

తాత్పర్యం: 'నీ తల్లి అయిన ఈమె బలం లేనటువంటిది. అనుదినం ప్రయాణం చేసి దారిబడలిక చెందింది. మదపుటేనుగువలె లీలగా నడిచేటటువంటిది ఈమె. నీవు ఈమెను మోసికొంటూ మాకు దగ్గరగా నడిచిరా' అని భీముడు తన కొడుకును ఆదేశించాడు.

వ. వాఁడును బితృవచన చోదితుండై 'యిమ్మార్గం బతిపరుష శిలావిషమంబు; పాదచారుల కగమ్యంబు గావున మిమ్మందఱ నెత్తికొని యశ్రమంబున నరిగెద' నని ధౌమ్య పాండవ ద్రౌపదులం దా నెత్తుకొని, బ్రాహ్మణుల నెత్తికొనం దన రాక్షసబలంబులం బంచె; రోమశుండు సిద్ధగతి నరిగె; నిట్లందఱు గగనమార్గంబునం జని గంగాతీరంబున నరనారాయణాశ్రమంబైన బదరీవనంబుఁ గని, రాక్షసస్కంధావతీర్ణులై యందు. 307

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వాఁడును= అతడున్నూ- ఆ ఘటోత్కచుడున్నూ; పితృ, వచన, చోదితుండు+ఐ= తండ్రియొక్క మాటలచేత ప్రేరేపించబడిన వాడై; ఈ+మార్గంబు= ఈ దారి; అతి, పరుష, శిలా, విషమంబు= మిక్కుటమైన కఠినమైన రాళ్ళచేత మిట్ట పల్లాలు కలది; పాదచారులకు= కాలినడకన పోయేవారికి; న+గమ్యంబు= చేరరానిది; కావున= కాబట్టి; మిమ్ము+అందఱను= మిమ్మల్ని అంతమందిని; ఎత్తికొని= మోసికొని; అశ్రమంబునన్= శ్రమలేకుండా, సులభంగా; అరిగెదన్= వెళ్ళగలను; అని= అనిచెప్పి; ధౌమ్య, పాండవ, ద్రౌపదులన్= ధౌమ్యుడిని, పాండవులను, పాంచాలిని; తాన్+ఎత్తుకొని= తాను మోసికొని; బ్రాహ్మణులన్= విప్రులను; ఎత్తికొనన్= మోసి తెచ్చేందుకు; తన, రాక్షస, బలంబులన్= తన రాక్షసి మూకలను; పంచెన్= నియోగించాడు; రోమశుండు= రోమశమహర్షి; సిద్ధ, గతిన్= సిద్ధులు వెళ్ళే ఆకాశ మార్గాన; అరిగెన్= వెళ్ళాడు; ఇట్లు= ఈ రీతిగా; అందఱు= అంతమంది; గగన, మార్గంబునన్= ఆకాశ వీథిలో; చని= వెళ్ళి; గంగా, తీరంబున= గంగానదితీరాన; నర, నారాయణ+ఆశ్రమంబు+ఐన= నరుడు నారాయణుడు అనే ఋషులు పూర్వం తపస్సు చేసినటువంటి పుణ్యక్షేత్రమైన; బదరీ, వనంబున్= బదరి అనే పేరుకల అడవిని; కని= చూచి; రాక్షసస్కంధ+అవతీర్ణులు+ఐరి= రక్కసుల మూపులనుండి క్రిందికి దిగినవా రైనారు; అందు= అక్కడ.

తాత్పర్యం: ఆ ఘటోత్కచుడున్నూ తండ్రిమాటచేత ప్రేరేపించబడినవాడై. 'ఈ దారి కఠిన శిలలతో కూడిన మిట్ట పల్లాలతో పాదచారులకు పయనించి శక్యం కానటువంటిది. కాబట్టి, మిమ్మల్ని అందరినీ ఎత్తుకొని సులువుగా నేను తీసికొని వెళ్లగలను' అని చెప్పి ద్రౌపదిని, పాండవులను, ధౌమ్యుడిని తన మూపుపై ఉంచుకొని, విప్రులను మోసికొని తెచ్చేందుకు తన రాక్షసులమూకలను నియోగించాడు. రోమశమహర్షి సిద్ధులు వెళ్ళే ఆకాశమార్గాన వెళ్ళాడు. ఇట్లా పాండవబృందంలోని వారందరూ, ఆకాశవీథిలో పయనించి గంగ ఒడ్డున గల బదరీవనంలో పూర్వం నరుడు. నారాయణుడు అనే ఋషులు తపస్సు చేసిన ఆశ్రమం దగ్గర రాక్షసుల మూపులపైనుండి క్రిందకు దిగారు. ఆ బదరీవనంలో.

క. లలితమధుస్రవఫలములు । విలసిత మృదుపత్రతతులు వృత్తస్కంధం
బులు నవిచలితచ్ఛాయలు । గల బదరీతరులఁ జూచి కడు విస్మితులై. 308

ప్రతిపదార్థం: లలిత, మధు, స్రవ, ఫలములు= మనోహరాలైన తేనె స్రవించే పండ్లు; విలసిత, మృదు, పత్ర, తతులు= శోభిల్లేటటువంటి మెత్తనైన ఆకుల సమూహాలు; వృత్త, స్కంధంబులు= గుండ్రంగా ఉన్న బోదెలు; న+విచలిత+ఛాయలు= కదలని నీడలు; కల= ఉన్న; బదరీతరులన్= రేగు చెట్లను; చూచి= చూచి; కడు= మిక్కిలి; విస్మితులు+ఐ= ఆశ్చర్యం చెందిన వారై.

తాత్పర్యం: మనోహరాలై తేనెలు స్రవించేటటువంటి పళ్ళు, మెత్తనై మనోజ్ఞాలైన ఆకులు, గుండ్రటి బోదెలు, కదలక (మార్పులేక) స్థిరంగా ఉండే నీడలు గల రేగుచెట్లను చూచి వారు ఆశ్చర్యం చెందారు.

వ. సురసిద్ధముని సేవితంబైన భాగీరథిం జూచి, యందుఁ గృతస్నాను లయి నియమవ్రతంబులు సలుపుచు సమాధియోగంబున మైనాకశైలంబును హిరణ్యశృంగంబును బిందుసరంబునుం జూచి, బదరీవనంబునం దాఱుదివసంబులు నివాసంబు సేసి యుండునంత; నొక్కనాఁడు. 309

ప్రతిపదార్థం: సుర, సిద్ధ, ముని, సేవితంబు+ఐన= వేల్పులచేత, సిద్ధులచేత, ఋషులచేత, సేవించబడిన; భాగీరథిన్+చూచి= గంగానదిని దర్శించి; అందున్= ఆ గంగలో; కృతస్నానులు+ఐ= స్నానం చేసిన వారై; నియమ, వ్రతంబులుసలుపుచున్=

నిష్ఠతో నోములు చేస్తూ; సమాధి, యోగంబునన్= సమాధి అనే యోగవిద్యవలన; మైనాక, శైలంబును= మైనాక పర్వతాన్ని; హిరణ్య శృంగంబును= హిరణ్య శిఖరాన్ని; బిందుసరంబునున్= బిందుసరం అనే పేరు కల సరోవరాన్ని చూచి; బదరీ, వనంబునందున్= బదరికాశ్రమంలో; ఆఱు, దివసంబులు= ఆరు దినాలు; నివాసంబు+చేసి= నివసించి; ఉండు+అంతన్= ఉండగా; ఒక్కనాఁడు= ఒకానొక రోజున.

తాత్పర్యం: దేవతలచేత, సిద్ధులచేత, ఋషులచేత సేవించబడిన గంగానదిని చూచి అందులో స్నానం చేసిన వారై, నియమంతో కూడిన నోములు నోస్తూ, సమాధియోగంచేత మైనాకశైలం, హిరణ్యశృంగం, బిందుసరం అనే పుణ్యక్షేత్రాలను చూచి, బదరికాశ్రమంలో ఆరుదినాలు నివసించారు. అంత ఒకరోజు.

విశేషం: (1) భాగీరథి అనేపేరు గంగకు రావటానికి కారణం భగీరథుడు గొప్ప తపస్సు చేసి నింగి నుండి నేలకు అవతరింపజేయుటం చేతనే. ఆరణ్యపర్వంలో ఈ కథ పూర్వోక్తం. (2) ఇక్కడ నియమవ్రతం, సమాధియోగం- అనే ప్రయోగాలు మిక్కిలి అర్థవంతమైనవి. ఈ ఆరణ్యపర్వం- ప్రథమాశ్వాసంలో అష్టాంగయోగంలోని నియమంగురించి సమాధినిగురించి, యోగంగురించి విపులంగా వివరించబడింది. నియమం : అష్టాంగ యోగంలో రెండవది. ఇది బాహ్యాంభ్యంతర శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వరప్రణిధానం అని 5. విధాలు. అష్టాంగ యోగాలు : 1. యమం 2. నియమం 3. ఆసనం 4. ప్రాణాయామం 5. ప్రత్యాహారం 6. ధారణ 7. ధ్యానం 8. సమాధి. బదరీవనంనుండి పాండవులు మైనాక శైలాన్ని, హిరణ్యశృంగాన్ని, బిందుసరం అనే పుణ్యతీర్థాలను సమాధియోగంలో దర్శించినట్లుగా చెప్పబడింది. సమాధియోగసిద్ధులకు దూరదర్శనం మొదలైన సిద్ధులు అలవడతాయని చెప్పబడింది.

చ. **అలఘులు గంధమాదన మహాధరణీధరసానురత్నవే**
దులఁ బవమాననందనుఁడు ద్రోవదియున్ విహరించుచున్నచో
లలితసహస్రపత్రకమలంబు సమీరవిధూతమై మహీ
తలముపయిన్ వడిం బడియెఁ దద్దయుఁ బొల్పుగ వారిముందటన్. 310

ప్రతిపదార్థం: న+లఘులు= తేలిక కానివారు, అనగా గొప్పవారు; ద్రోవదియున్, పవమాననందనుఁడు= ద్రౌపదియు, వాయుపుత్రుడైన భీమసేనుడు; గంధమాదన, మహాధరణీధరసానురత్నవేదులన్= గంధమాదనమనే గొప్ప కొండచరియలలో ఉన్న రత్నాలతో కూడిన అరుగులపై; విహరించుచున్నచో= వినోదంగా సంచరించే చోట; సమీర, విధూతము+ఐ= గాలిచేత త్రోసివేయబడి; లలిత, సహస్ర, పత్ర, కమలంబు= మనోహరమైన వేయి రేకులు కల తామర పువ్వు; మహీ, తలము, పయిన్= భూభాగంపై; వడిన్= వేగంగా; తద్దయున్+పొల్పుగ= మిక్కిలి శోభిల్లేటట్లుగా; వారిముందటన్= వారి ఎదుట; పడియెన్= పడింది.

తాత్పర్యం: గొప్పవారైన వాయుసుతుడగు భీమసేనుడూ, ద్రౌపదీ గంధమాదనమనే పర్వతపు చరియలలోని రత్నాల అరుగుల మీద వినోదంగా సంచరిస్తూ ఉండగా, మనోహరమైన వేయిరేకులు గల తామర పువ్వొకటి మిగుల సొంపులీనుతూ గాలివాటున వారి యెదుటి ప్రదేశంలో వచ్చి పడింది.

వ. **ఆ సౌగంధిక కమలంబుఁ జూచి దాని యపూర్వరమణీయత్వంబునకు ననన్యకుసుమసాధారణంబయిన సౌరభ్యంబునకు నోటువడి ద్రుపదరాజపుత్రి ముదితచిత్తయై 'యక్కటా! యిది యొక్క పువ్వ యయ్యు నపూర్వంబై మనోనయనానందకరం బైనది; యిట్టి కుసుమంబులు కడుం బెక్కులు గావలవదె!' యని 'కురంగటం గలవేని తెచ్చి యిచ్చి నాకు మనఃప్రియంబుఁ జేయు' మని యప్పుడ యప్పువ్వు ధర్మరాజుకడకుం**

గొనిపోయె; నిట భీముండు దాని యభిమతంబుఁజేయం గడంగి, రుక్మపృష్ఠంబైన ధనుశ్శ్రేష్ఠంబును నాశీవిషోపమానంబులైన బాణంబులు ధరియించి, యక్కమలంబు దెచ్చిన గాడ్పున కభిముఖుండై గంధమాదనంబున వివిధరత్న బంధుర కందర కదళీ షండ దర్శనంబులను, మందార మందిర సుగంధ గంధవహస్పర్శనంబులను, నలికుల కోకిలాలాప శ్రవణంబులను, సర్వర్తు కుసుమ సురుచిర గంధాఘ్రాణంబులను, నతిమధుర ఫలాస్వాదనంబులను, బద్ధప్రమోదహృదయుం డగుచుఁ దన కెదిరి వచ్చు మృగంబులం దాఁకి గజంబు నెత్తి గజంబుపై వైచుచు సింహంబు నెత్తి సింహంబుపై వైచుచు నల్పమృగంబులం గరతలప్రహారంబులం బ్రహరించుచు. 311

ప్రతిపదార్థం: ఆ సౌంగధిక, కమలంబున్+చూచి= నెత్తావితో గుబాళిస్తున్న ఆ తామర పువ్వును చూచి; దాని= ఆ పువ్వు యొక్క; అ, పూర్వ, రమణీయత్వంబునకున్= ఇంతకు ముందు తా నెన్నెడు ఎక్కడా చూడనటువంటి అందచందాలకు; న+అన్య= అనన్య, కుసుమ, సాధారణంబు+అయిన= మరి ఏ యితరమైన పువ్వులలో ఉండనట్టి; సౌరభ్యంబునకున్= సుగంధానికి- నెత్తావికి; ఓటువడి= లొంగిపోయి- ఆకర్షించబడి; ద్రుపద, రాజ, పుత్రి= ద్రౌపది; ముదిత, చిత్త+ఐ= సంతోషించిన మనస్సు కలది అయి; అక్కటా!= ఆహా!; ఇది+ఒక్క, పువ్వు+అ+అయ్యున్= ఇది పువ్వు మాత్రమే అయినప్పటికిని; మనస్+నయన+ఆనందకరంబు+ఐనది= మనసుకు, నేత్రాలకు సంతోషాన్ని సమకూర్చే టటువంటిది అయింది; ఇట్టి= ఇటువంటి; కుసుమంబులు= పువ్వులు; కడున్= మిక్కిలి; పెక్కులు= అనేకాలు; కావలవదె!= కావాలని కోరదగింది కదా!; అని= అని తలపోసి; కురంగటన్= సమీపంలో; కలవు+ఏని= ఉన్నట్లయితే; తెచ్చి+ఇచ్చి= తీసికొని వచ్చి ఇచ్చి; నాకు, మనస్+ప్రియంబున్= నా మనసుకు ప్రీతిని; చేయుము+అని= ఘటించుమని, చెప్పి; అప్పుడు+అ= ఆ సమయమందే, వెంటనే; ఆ+పువ్వు= ఆ పువ్వు= ఆ పువ్వును; ధర్మరాజు కడకున్= ధర్మరాజు దగ్గరకు; కొనిపోయెన్= తీసికొని వెళ్ళింది; ఇట= ఇక్కడ; భీముండు= భీముడు; దాని+అభిమతంబున్= ఆమె కోరికను; చేయన్+కడంగి= తీర్చటానికి పూనుకొని; రుక్మపృష్ఠంబు+ఐన= వెనుకభాగాన బంగారం కల; ధనుస్+శ్రేష్ఠంబునున్= గొప్ప వింటిని; ఆశీవిష+ఉపమానంబులు+ఐన= పాములతో పోల్చతగినట్టివి అయిన; బాణంబులు= అమ్ములు; ధరియించి= తాల్చి; ఆ+కమలంబున్= ఆ తామరపువ్వును; తెచ్చిన= తీసికొని వచ్చిన; గాడ్పునకు= గాలికి; అభిముఖుండు+ఐ= ఎదురైన ముఖం కలవాడై; గంధమాదనంబున= గంధమాదనమనే కొండపై; వివిధ, రత్న, బంధుర, కందర, కదళీ, షండ, దర్శనంబులను= అనేక విధములైన రత్నాలతో కూడిన పెక్కు గుహలను, ఆ గుహల సమీపాన అరటి చెట్ల సమూహాలను తిలకించటంవలన; మందార, మందిర, సుగంధి, గంధవహ, స్పర్శనంబులను= మందార పుష్పాలనే మందిరాలందు ప్రసరించటం చేత నెత్తావి గలిగిన గాలుల తాకిడి వలనను; అలి, కుల, కోకిలా+ఆలాప, శ్రవణంబులను= తుమ్మెదల బారుల యొక్కయు, కోకిలల యొక్కయు నాదాలను వినటం చేతను; సర్వ+ఋతు, కుసుమ, సురచిర, గంధ+ఆఘ్రాణంబులనున్= అన్ని ఋతువులలో పూసేటటువంటి పువ్వులయొక్క మిగుల మనోహరమైన పరిమళాలను పీల్చటం చేతను; అతి, మధుర, ఫల+ఆస్వాదనంబులను= మిక్కిలి తియ్యనైన పళ్ళను ఆరగించటంచేతను; బద్ధ, ప్రమోద, హృదయుండు+అగుచున్= సంతోషంతో నిండిన గుండె కల వాడవుతూ; తనకు+ఎదిరి, వచ్చు= తనకు ఎదురుగా వచ్చే; మృగంబులన్= జంతువులను; తాఁకి= ఎదుర్కొని; గజంబున్+ఎత్తి= ఏనుగును ఎత్తి; గజంబుపైన్= ఏనుగు మీద; వైచుచు= వేస్తూ; సింహంబున్+ఎత్తి= సింహాన్ని ఎత్తి; సింహంబుపైన్= మరొక సింహంపై; వైచుచున్= పడవేస్తూ; అల్ప మృగంబులన్= చిన్నజంతువులను; కర, తల, ప్రహారంబులన్= అరచేతి చరుపులతో; ప్రహరించుచున్= కొట్టుతూ.

తాత్పర్యం: ఆ సౌగంధికకమలాన్ని చూచి; ద్రౌపది తాను అంతకు ముందెప్పుడూ అటువంటి అందమైన పువ్వును చూడలేదని ఆ పువ్వులోని నెత్తావి మరి వేరేపూలలో కనిపించదని, ఆ పువ్వు సొగసుకు ఎంతో సంతోషించి, 'ఆహా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇది ఒక్క పువ్వు మాత్రమే అయినా, ఇంతవరకు ఎప్పుడూ ఎక్కడా ఇంతగా మనసుకు విందు, కళ్ళకు పండుగ కల్పించిన పువ్వు కనిపించ లేదు కదా!' అని మిక్కిలి సంతోషించి, 'ఇటువంటి పువ్వులు మరికొన్ని లభిస్తే ఎంత బాగుంటుంది! సమీపాన ఉంటే తెచ్చి ఇచ్చి నా మనసుకు ఆహ్లాదం కల్పించుము' అని ఆమె భీముడిని కోరి ఆ పుష్పాన్ని ధర్మరాజుకు చూపటానికై వెళ్ళింది. ఇక్కడ భీమసేనుడు ద్రౌపదికోరిక ఈడేర్చటానికి బయలుదేరాడు. వెనుకవైపు బంగారపు తొడుగు కల వింటివి, పాములతో సమానాలైన అమ్ములను ధరించి, ఆ తామరపువ్వును తెచ్చిన గాలికి అభిముఖుడై భీముడు వెళ్ళుతున్నాడు. ఆ గంధమాదనపర్వతాన భీముడు రత్నాలతో కూడిన పెక్కు గుహలు, అరటితోటలు చూస్తూ, మందార పుష్పాల సుగంధాన్ని ప్రసరించే వాయువులను పీలుస్తూ, తుమ్మెద ఝుంకారాలను, కోకిలల ఆలాపాలను ఆలకిస్తూ, అన్ని ఋతువులలో పూచే పువ్వుల పరిమళాలను ఆఘ్రాణిస్తూ, మిక్కిలి తియ్యనైన పళ్ళను ఆరగిస్తూ ఆనందిస్తూ ముందుకు వెళ్లాడు. ఎదురైన జంతువులను ఎదుర్కొంటూ, ఒక ఏనుగును ఎత్తి మరొక ఏనుగుమీదకు, ఒక సింహాన్ని ఎత్తి మరొక సింహంపైకి విసురుతూ, చిన్న జంతువులను అరచేతులతో కొట్టుతూ భీముడు విహరించాడు.

భీముఁడు సౌగంధికహరణార్థంబు పోవుట (సం. 3-146-292)

సీ. గమనవేగంబున ద్రుమలతాజాల సం। చాలన సేయుచు శైలగుహల
నడఁగి యదృశ్యలై కడువేడ్కతోఁ దన్నుఁ। జూచు ఖేచర సిద్ధ సుర భుజంగ
గరుడ గంధర్వ కిన్నర కామినులచేత। మానుగా నభివీక్ష్యమాణుఁ డగుచు
వ్రాఁకులు విఱుచుచు వీఁకతోఁ దీఁగలు। పెఱుకుచుఁ బదహతిఁ బృథునగేంద్ర

ఆ. మద్రువ నున్నతంబు లయి నెడ లెక్కుచు। మదగజంబువోలె మధ్యముండు
పవన వైనతేయ పటుజవయుక్తుఁడై। యరిగె గంధమాదనాంతరమున. 312

ప్రతిపదార్థం: గమన, వేగంబునన్= నడకవేగం ధాటికి ద్రుమ, లతా, జాలసంచాలన+చేయుచు= చెట్లయొక్క తీగలయొక్క సముదాయాన్ని బాగుగా చలింపజేస్తూ; శైల, గుహలన్= కొండ గుహలలో; అడఁగి= దాగికొని; అదృశ్యలు+ఐ= కనిపించకుండా; కడు= మిక్కిలి; వేడ్కతోన్= ప్రీతితో; తన్నున్+చూచు= తనను తిలకించే; ఖేచర, సిద్ధ, సుర, భుజంగ, గరుడ, గంధర్వ, కిన్నర, కామినుల చేతన్= ఖేచరులైన, సిద్ధులకు, వేల్పులకు, పాములకు, గరుడులకు, గంధర్వులకు, కిన్నరులకు సంబంధించిన (వివిధ దేవతా జాతులలోని) కాంతలచేత; మానుగాన్= ప్రీతితో; అభివీక్ష్య మాణుఁడు+అగుచున్= లెస్సగా చూడబడినవాడవుతూ; వ్రాఁకులు, విఱుచుచు= చెట్లను విరుస్తూ; వీఁకతోన్= ఉత్సాహంతో; తీఁగలు= లతలు; పెఱుకుచున్= నిర్మూలిస్తూ; పద, హతిన్= పద ఘట్టనవలన- కాళ్ళ తాకిడివలన; పృథు, నగ+ఇంద్రము= పెద్ద పర్వత రాజం; అద్రువన్= అదరగా; ఉన్నతంబులు+అయిన= ఎత్తుగా ఉన్న; ఎడలు+ఎక్కుచు= స్థలాలు అధిరోహిస్తూ; మద, గజంబు+పోలె= మదించిన ఏనుగువలె; మధ్యముండు= భీముడు, (కుంతీపుత్రులలో మధ్య పుట్టినవాడు); పవన, వైనతేయ, పటు, జవ, యుక్తుఁడు+ఐ= వాయువు వంటి, వినత కొడుకైన గరుత్మంతుడి వంటి వేగంతో కూడినటువంటి వాడై; గంధమాదన+అంతరమునన్= గంధమాదనమనే ఆ కొండ మధ్య భాగాన; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: భీమసేనుడు గంధమాదనపర్వతమధ్యభాగంలో విహరిస్తూ వెళ్లాడు. అతడి నడకతాకిడికి చెట్లు, తీగలు మొదలైనవి మిగుల కదలిపోయాయి. ఆకాశసంచారులైన సిద్ధులు, దేవతలు, నాగులు, గరుడులు, గంధర్వులు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కిన్నరులు మున్నుగాగల వివిధ జాతులకు చెందిన దివ్య కామినులు ఆ కొండ గుహలలో దాగి తాము అతడికి కనిపించకుండా, భీముడిని మిక్కిలి ప్రీతితో చూడసాగారు. పెద్ద పెద్ద మ్రాకులను విరుస్తూ, ఉత్సాహం పెల్లుబుకగా తీగలు పెరుకుతూ ముందుకు సాగాడు. అతడి పాదాల తాకిడికి గంధమాదన పర్వతరాజం అదరసాగింది. ఆ విధంగా భీముడు ఎత్తయిన శిఖరాలను అధిరోహిస్తూ, వాయువును, గరుత్మంతుడిని పోలిన వేగంతో మత్తేభంవలె తిరుగాడాడు.

విశేషం: (1) 'ఇన గణత్రయంబు నింద్ర ద్వయంబును హగణ పంచకంబు నాటవెలది'. ఆటవెలది పద్యంలో 1, 3 పాదాలలో 3 సూర్య గణాలు 2 ఇంద్ర గణాలు, 2, 4 పాదాలలో 5 సూర్యగణాలు ఉంటాయి. గురువు+లఘువు, మూడు లఘువులు= సూర్యగణాలు. ఈ పద్యంలో ఎత్తుగీతిలో మొదట 'అధ్రువ' అన్న పదం ఉన్నది. అధ్రువలో 3 లఘువులే. 'ధ్రు' 2 సంయుక్తాక్షరం అనీ, అందుచేత అది గురువు కావాలనీ స్థూలదృష్టికి గోచరిస్తుంది. కాని అధ్రువ అన్నప్పుడు 'అ' గురువు కాదు. తేల్చి పలికాలి. దీనికి ఛందస్సులో శిథిలద్విత్వం అని పేరు. (2) భీముడి విశృంఖల వీర వినోదాన్ని గంధమాదనంలో అదృశ్యలై వివిధ దేవతాంగనలు చూచారు. 'కామిని' శబ్దం స్త్రీ వాచకమైన పర్యాయపదమే అయినా ఇక్కడ సార్థకం. (3) మ్రాను= ఏకవచనం. మ్రాఁకులు= బహువచనం.

వ. ఇట్లరుగువాఁడు నిజసింహనాదశ్రవణపరిత్రస్తంబులై యెగసి పఱచు పక్షుల యార్ద్రపక్షంబులు చూచి ముందట నాసన్నంబునం గొలను కలుగవలయు నని యుపలక్షించి యతిత్వరితగతిం జని, పవనవశ సంచలిత తట మహావన తమాలతాల హింతాల విశాల కదళీదళ వీజ్యమానశీతలజలపరిపూర్ణంబైన యొక్కసరోవరంబుఁ గని, యందుఁ గృతావగాహుండై నవనళినదళమ్మృణాలవలయాలంకృతుండగుచు దాని వెలువడి యనేకయోజనవిస్తారాయామ రమణీయంబైన కదళీషండంబుఁ జొచ్చి, యందు శంఖధ్వానంబుఁ జేసిన. 313

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అరుగు వాఁడు= వెళ్ళేటటువంటివాడు (భీముడు); నిజ, సింహ నాద, శ్రవణ, పరిత్రస్తంబులు+ఐ= తనయొక్క సింహనాదాన్ని వినటంచేత భయపడి (వీరులు ఉత్సాహపూరితంగా చేసేటటువంటి సింహగర్జనను పోలే నాదానికి 'సింహనాదం' అని పేరు వచ్చింది.); ఎగసి= పైకి ఎగిరి; పఱచు= పారిపోయే; పక్షుల= పులుగుల; ఆర్ద్ర, పక్షంబులు= నీటిచేత తడిసిన రెక్కలు; చూచి= చూచి; ముందటన్= ఎదురుగా; ఆసన్నంబునన్= దగ్గరలో; కొలను= చెరువు; కలుగవలయును+అని= ఉండాలి అని; ఉపలక్షించి= తలపోసి; అతి, త్వరితగతిన్= మిక్కిలి వేగమైన నడకతో; చని= వెళ్ళి; పవన, వశ, సంచలిత, తట, మహావన, తమాల, తాల, హింతాల, విశాల, కదళీ, దళ, వీజ్యమాన, శీతలజల, పరిపూర్ణంబు+ఐన= గాలి వీచటంచేత కదల్చబడిన ఒడ్డులందు గల గొప్ప అడవిలో ఉన్న చీకటిచెట్లు, తాడిచెట్లు, గిరక తాడిచెట్లు, నిడివి గల అరటి చెట్ల ఆకులు- 'వీటన్నిటి చేత వీచబడి చల్లనైన నీటిచే నిండిన; ఒక్క= ఒక; సరోవరంబున్+కని= సరస్సును చూచి; అందున్= ఆ సరోవరంలో; కృత+అవగాహుండు+ఐ= స్నానం చేసిన వాడై; నవ, నళినదళ, మృణాల, వలయ+ అలంకృతుండు+అగుచున్= క్రొత్తగా వికసించిన తామర పూవుల రేకులతో, తామర తూడులతో గుండ్రని హారాలుగా చేసి అలంకరించుకొన్న వాడు అవుతూ; దాని, వెలువడి= ఆ సరస్సునుండి బయటికి వచ్చి; అనేక, యోజన, విస్తార, ఆరామ, రమణీయంబు+ఐన= పెక్కు ఆమడల మేర గలదై మిగుల అందంగా కనిపిస్తున్న; కదళీషండంబున్= అరటి చెట్ల సముదాయాన్ని; చొచ్చి= ప్రవేశించి; అందున్= అక్కడ; శంఖ, ధ్వానంబున్+చేసినన్= శంఖాన్ని పూరించి పెద్ద ధ్వని చేయగా.

తాత్పర్యం: ఈ రీతిగా వెళ్ళుతున్న భీముడు, తన సింహనాదంచేత భయపడి పైకి ఎగిరిపోయే పక్షుల రెక్కలు తడిసి ఉండటం చూచి, ముందర సమీపంలో కొలను ఉన్నట్లు భావించి మిక్కిలి వేగంగా వెళ్ళాడు. ఆ కొలను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గట్టున గొప్ప అరణ్య మున్నది. ఆ వనంలో చీకటిచెట్లు; తాడిచెట్లు, గిరకతాడిచెట్లు. విశాలమైన ఆకులు కల అరటి చెట్లు ఉన్నాయి. ఆ చెట్ల ఆకులు గాలిచేత కదిలించబడి వీవటంచేత ఆ కొలనులోని జలం ఎల్లప్పుడూ చల్లగా ఉన్నది. భీముడు ఆ సరోవరాన్ని చేరి అందులో మునిగి స్నానం చేసినవాడై క్రొత్త తామర పూలరేకులతో, తామర తూళ్ళతో గుండ్రని దండలు చేసి ధరించినవాడై వెలువడి, పెక్కు ఆమడలమేర విస్తరించి అందంగా శోభిల్లుతున్న అరటితోపులో ప్రవేశించి అందులో శంఖం పూరించి గొప్పధ్వనిని చేశాడు.

క. ఆ శంఖరవంబు మహేం । ద్రాశనినిర్ఘోషభీమమై దిక్కులు నా
కాశంబు నిండె; నంత గు । హాశయుఁడై యున్న హనుమ యను కపి పెలుచన్. 314

ప్రతిపదార్థం: ఆ శంఖ, రవంబు= ఆ శంఖంనుండి వెలువడిన ధ్వని; మహా+ఇంద్ర+అశని, నిర్ఘోష, భీమము+ఐ= దేవేంద్రుడి పిడుగుయొక్క పెద్దధ్వనివలె భయానకమై; దిక్కులున్= దిక్కులు; ఆకాశంబు= గగనం; నిండెన్= నిండింది; అంత= అటు పిమ్మట; గుహాశయుఁడు+ఐ+ఉన్న= కొండగుహలో శయనించి ఉన్న; హనుమ+అను= హనుమంతుడు అనే; కపి= వానరుడు; పెలుచన్= వేగంగా.

తాత్పర్యం: భీముడు చేసిన ఆ శంఖధ్వని దేవేంద్రుడి పిడుగుయొక్క ధ్వనివలె భయానకమై దిగ్దిగంతరాలు, ఆకాశం క్రమ్మింది. అంతట ఆ పర్వతంలోని ఒక గుహలో శయనించి ఉన్న హనుమంతుడు అనే కోతి వేగంగా.

క. దాని విని బెదరి లేచి 'మ । హానాదం బిది మనఃప్రియం బయ్యెఁ; మదీ
యానుజు శంఖధ్వానము । దా నగు' నని యెఱిఁగి హృష్టతనురుహుఁ డగుచున్. 315

ప్రతిపదార్థం: దాని, విని= ఆ భీముడి శంఖ ధ్వని విని; బెదరి= తల్లడిల్లి, ఉలిక్కిపడి; లేచి= మేల్కొని; మహానాదంబు+ఇది= ఇది గొప్ప శబ్దం; మనస్+ప్రియంబు+అయ్యెన్= మనసుకు ప్రీతి కొలిపింది; మదీయ+అనుజు, శంఖధ్వానము, తాన్+అగు= అది నా తమ్ముడియొక్క శంఖధ్వనియే; అని+ఎఱిఁగి= అని తెలిసికొని; హృష్ట, తనురుహుఁడు+అగుచున్= సంతోషంచేత నిక్కపొడిచిన వెంట్రుకలు కలవా డవుతూ.

తాత్పర్యం: ఆ శంఖనాదం విని హనుమంతుడు ఉలిక్కిపడి మేల్కొన్నాడు. 'ఇది గొప్పనాదం. మనస్సుకు ప్రీతిని కలిగిస్తున్నది. ఇది నా సోదరుడి శంఖారావమే' అని సంతోషంతో హనుమ రోమాంచ పులకిత దేహుడైనాడు.

క. భీమునకు మార్గనిరోధంబుగా మహావృక్షంబు లురలం ద్రోచి యేకాయనపథంబున కడ్డంబుగా శయనించి లాంగూలలీలాచాలనంబుఁ జేసిన. 316

ప్రతిపదార్థం: భీమునకు= భీముడికి; మార్గ నిరోధంబుగా= దారికి అడ్డుగా; మహావృక్షంబులు= పెద్ద పెద్ద చెట్లు; ఉరలన్+త్రోచి= అడ్డుపడేటట్లు వేసి; ఏక+అయన, పథంబునకు= ఒకరు మాత్రమే నడవటానికి వీలై ఉన్న (ఇరుకైన) కాలిబాటకు; అడ్డంబుగాన్= అవరోధంగా; శయనించి= పడుకొని; లాంగూల, లీలా, చాలనంబున్+చేసిన= తోకను వినోదంగా అటూ ఇటూ త్రిప్పుతూ కదిలిస్తూ ఉండగా.

తాత్పర్యం: అంత, భీముడు ముందుకు సాగిపోవటానికి వీలు లేకుండా, హనుమంతుడు- దారికి అటూ ఇటూ అడ్డంగా గొప్ప గొప్ప చెట్లను పెల్లగించి పడవేశాడు. ఇరుకైన ఒక్కరు మాత్రమే నడవటానికి వీలై ఉన్న కాలిబాటకు అడ్డంగా తాను శయనించి తన తోకను వినోదంగా ఇటూ అటూ కదిలిస్తూ ఉండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. గోలాంగూలోత్తము లాం । గూల స్ఫోటనరవంబు ఘోరంబై వా
చాలతఁ జేసె నశేషమృ । గాలి భయం బంద గిరిగుహాంతర మురలన్. 317

ప్రతిపదార్థం: గోలాంగూల+ఉత్తము= కోతులలో శ్రేష్ఠుడైన వానియొక్క; లాంగూల, స్ఫోటన, రవంబు= తోకను అటునిటు వేగంగా కదిపేటటువంటి ధ్వని; ఘోరంబు+ఐ= భయానకమై; అశేషమృగ+ఆలి= సమస్త జంతువులును; భయంబు+అంద= భయపడగా; గిరి, గుహా+అంతరము+ఉరలన్= కొండగుహల మధ్యభాగాలు సంచలించగా; వాచాలతన్+చేసెన్= అంతటా ప్రతిధ్వనించింది.

తాత్పర్యం: కోతులలో శ్రేష్ఠుడైన హనుమ తోకను కదిలించే ధ్వని భయానకమై ఆప్రదేశమంతా ప్రతిధ్వనించింది. కొండ గుహల మధ్యభాగాలు సంచలించాయి. సమస్తజంతువులు భయపడ్డాయి.

వ. అయ్యపూర్వధ్వని విని భీముండు విస్మితుండై చని కదళీషండమధ్యంబున నొక్క విశాలశిలాతలంబుపయి శయనించినవాని. 318

ప్రతిపదార్థం: ఆ+అపూర్వ, ధ్వని= అంతకు ముందు ఎప్పుడూ వినిపించనట్టి ఆ నాదం; విని= ఆలకించి; భీముండు= భీముడు; విస్మితుండు+ఐ= ఆశ్చర్యపడి; చని= వెళ్ళి; కదళీ, షండ, మధ్యంబునన్= అరటి తోపు మధ్య; ఒక్క, విశాల, శిలా, తలంబు, పయి= ఒక నిడివి అయిన పెద్ద రాతి మీద; శయనించిన వాని= పవ్వళించి ఉన్న వాడిని.

తాత్పర్యం: ముందెన్నడూ వినని ఆ ధ్వనిని విని భీముడు ఆశ్చర్యం చెందాడు. అతడు అరటితోపు మధ్య ఒక నిడుపైన బండమీద పవళించినవాడిని (హనుమను సమీపించాడు)

సీ. హ్రస్వపీనగ్రీవు, నచలితాయతహను, । నతిచపలస్వభావాభిరాముఁ,
దనుమధ్య కటిచక్రు, దహనకణాకార । తామ్రోష్ఠు, నతికృశదశనకరజుఁ,
బృథులవిద్యుత్పుంజపింగాక్షు, నుత్తుంగ । దృఢవక్షు, నాజానుదీర్ఘబాహు,
నూర్ధ్వలాంగూల మత్యున్నతధ్వజలీలఁ । గ్రాలుచు నుండ నేకాంతయోగ

ఆ. నిద్ర నున్న ధర్మనిర్మలు హనుమంతుఁ । జూచి పాండురాజసుతుఁడు వాని
నిద్రఁ జెఱుపఁ గడఁగి నిజసత్త్వ మేర్పడ । సింహనాద మొప్పఁ జేసె డాసి. 319

ప్రతిపదార్థం: హ్రస్వ పీన గ్రీవున్= పొట్టిది, బలిసినది అయిన కంఠభాగం కలవాడిని; అచలిత+ఆయత, హనున్= కదలని పొడుగాటి మీదిదవడ కలవాడిని; అతి, చపల, స్వభావ+అభిరామున్= మిక్కిలి చంచలమైన స్వభావంచేత అందగించిన వాడిని; తనుమధ్యకటిచక్రు= సన్నటి నడుముతో కూడిన గుండ్రని మొల కలవాడిని; దహన, కణ+ఆకార, తామ్ర+ఓష్ఠున్= అగ్గిరవ్వ వలె ఎర్రనైన పెదవులు కలవాడిని; అతి, కృశ, దశన, కరజున్= మిక్కిలి సన్ననైన దంతాలు, గోళ్ళు కలవాడిని; పృథుల, విద్యుత్+పుంజ, పింగ+అక్షున్= మెరుపు తీగల సముదాయంవంటి గోరోజనవర్ణం కల కన్నులు కలవాడిని; ఉత్తుంగ, దృఢ, వక్షున్= ఎత్తయినటువంటి బలిష్ఠమైన రొమ్ము కలవాడిని; ఆజాను, దీర్ఘ, బాహున్= మోకాళ్ళ వరకు వ్యాపించిన నిడివైన చేతులు కల వాడిని; ఊర్ధ్వ, లాంగూలము= ఎత్తుగా నిక్కబొడిచిన తోక; అతి+ఉన్నత, ధ్వజ, లీలన్= మిక్కిలి ఎత్తుగా ఉన్న జెండావలె; క్రాలుచున్+ఉండన్= ప్రకాశిస్తుండగా; ఏకాంత యోగ నిద్రన్+ఉన్న= తదేక ధ్యానయోగమనే గాఢమైన నిద్రలో ఉన్న; ధర్మ, నిర్మలున్= ధర్మం చేత స్వచ్ఛమైన వాడిని; హనుమంతున్= ఆంజనేయుడిని; చూచి= దర్శించి; పాండు, రాజ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సుతుఁడు= పాండురాజుయొక్క పుత్త్రుడైన భీముడు; వాని, నిద్రన్= అతడి నిద్రను; చెఱుపన్+కడఁగి= పోగొట్టటానికి పూని; డాసి= సమీపించి; నిజ, సత్త్వము+ఏర్పడన్= తన బలం తెలిసేటట్లుగా; సింహనాదము= సింహగర్జన వంటి పెద్ద ధ్వని; ఒప్పన్= ఒప్పేటట్లు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: పొట్టిగా బలిష్ఠంగా ఉన్న కంఠభాగం కలవాడిని, కదలనటువంటి పొడుగైన దవడ కలవాడిని, బొత్తిగా నిలుకడ లేని స్వభావం కలిగి ఉండటంచేత ముచ్చట గొలిపేవాడిని, సన్నటి నడుముతోడి గుండ్రని మొల కలవాడిని, నిప్పు కణం వలె ఎర్రనైన పెదవులు కలవాడిని, మిక్కిలి కృశించిన దంతాలు గోళ్ళు కలవాడిని, నిడివిఅయి, మెరుపు తీగల దొంతర వలె గోరోజనవర్ణంతో భాసించే కన్నులు కలవాడిని, గాఢమైన ధ్యాన యోగ నిద్రలో ఉన్నవాడిని, ధర్మంచేత నిర్మలమైన వ్యక్తిత్వం కలవాడిని, హనుమంతుడిని పాండురాజపుత్రుడైన భీముడు చూచి, అతడి నిద్రను చెడగొట్టటానికి పూనుకొని, దగ్గరకు చేరి తన బలం వ్యక్తమయ్యేటట్లు గొప్పగా సింహనాదం చేశాడు.

వ. **హనుమంతుఁడును మెల్లమెల్లన మేల్కని జృంభ సంభృత జలార్ద్రసంచల విలోచనుం డగుచు ననాదరంబున నాతనిం జూచి యిట్లనియె.** **320**

ప్రతిపదార్థం: హనుమంతుఁడును= ఆంజనేయుడును; మెల్ల, మెల్లన= మెల్లమెల్లగా; మేల్కని= నిద్ర లేచి; జృంభ, సంభృత, జల+ఆర్ద్ర, సంచల, విలోచనుండు+అగుచున్= ఆవులింతలచేత ఏర్పడిన నీటిచేత తడిసి కదిలేటటువంటి కన్నులు కలవాడు ఔతూ; న+ఆదరంబునన్= నిరాదరంతో లెక్క చేయక; ఆతనిన్+చూచి= వాడిని చూచి- ఆ భీముడిని చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: (ఆ సింహనాదాన్ని విని) ఆంజనేయుడు మెల్ల మెల్లగా నిద్ర వీడి మేలుకొన్నాడు. ఆవులింతలవలన ఏర్పడిన నీటిచేత తడిసి కదిలే కన్నులు కలవాడై, భీముడిని నిర్లక్ష్యంగా చూచి ఈ విధంగా పలికాడు.

విశేషం: నిద్రనుండి మేల్కొనేటప్పుడు ఆవులింతలు ఏర్పడటం, కన్నుల నీరు క్రమ్మటం, కోతి కాబట్టి కదిలే కన్నులు కలిగి ఉండటం సహజం. ఈ వర్ణన 'స్వభావోక్తి' అలంకారం.

తే. **'అతిజరారోగభరమున నలసి యొలసి। యొదిఁగి సుఖనిద్రమై నిట్టులున్న వానిఁ**
గడుమదంబున నేమియుఁ గరుణ లేక। యేల బోధించి తయ్య! నీ వెఱిఁగి యెఱిఁగి. **321**

ప్రతిపదార్థం: అతి, జరా, రోగ, భరమునన్= మిక్కుటమైన ముసలితనంయొక్కయు, వ్యాధులయొక్కయు భారంచేత; అలసి+ఒలసి= డస్సి, క్షీణించి; ఒదిఁగి= అణగి; సుఖ, నిద్రమైన్= గాఢ నిద్రలో; ఇట్టులు+ఉన్న వానిన్= ఈ విధంగా ఉన్న వాడిని; కడు, మదంబునన్= మిక్కుటమైన గర్వంతో; ఏమియున్+కరుణ, లేక= ఏ మాత్రమూ జాలి లేకుండా; నీవు= నీవు; ఎఱిఁగి+ఎఱిఁగి= పూర్తిగా తెలిసినవాడివై; ఏల= ఎందుకు; బోధించితి+అయ్య?= నిద్ర మేల్కొల్పినావయ్యా?

తాత్పర్యం: 'మిక్కుటమైన ముసలితనం యొక్క, వ్యాధుల యొక్క భారం వలన బడలి, అలసట చెంది అణగి ఒక మూల ఒదిగి నిద్రిస్తున్నాను కదా. ఇంచుకైనా జాలి లేకుండా నీవు మిక్కిలి గర్వంతో, తెలిసి తెలిసి ఎందుకు నా నిద్ర పాడుచేసి మేలుకొలిపావయ్యా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. తిర్యగ్జాతులు ధర్ము వెఱుంగవు గాక; సర్వభూతదయాస్వరూపంబైన ధర్ము వెఱింగెడువారు మనుష్యుల కారె! యిట్టి మనుష్యజన్మంబు వడసి వృద్ధోపసేవ సేయవు గాకేమి ధర్ము వెఱుంగక నిర్దయుండవై మాబోఁటి పేద మృగంబులకు భయంబుగ గర్జిలితి; వీ వెవ్వండవు? మనుష్య గోచరంబు గాని యివ్వనంబున కేల వచ్చితి? సిద్ధగతి లేనివారి కిట వోవ నశక్యం; బమృతకల్పంబులైన యీ ఫలమూలంబు లుపయోగించి క్రమ్మఱుము; నీయందు బద్ధస్నేహుండఁ గాన బుద్ధి సెప్పితి; నా పలుకులు చేకొను' మనిన భీముం డిట్లనియె. 322

ప్రతిపదార్థం: తిర్యక్+జాతులు= జంతువుల తెగలు; ధర్మువు+ఎఱుంగవు= ధర్మాన్ని తెలియజాలవు; కాక= కాని; సర్వ, భూత, దయా, స్వరూపంబు+అయిన= అఖిల ప్రాణులయందు కరుణతో కూడిన; ధర్మువు+ఎఱింగెడు వారు= ధర్మాన్ని తెలిసిన వారు; మనుష్యులు+అ+కారె= మనుషులే కదా; ఇట్టి= ఇటువంటి; మనుష్య, జన్మంబు+పడసి= మనుష్యుడి పుట్టుకనొంది; వృద్ధ+ఉపసేవ, చేయవు+కాక+ఏమి= నీవు పెద్దల శుశ్రూష చేయలేదా యేమి?; ధర్మువు+ఎఱుంగక= ఎటువంటి ధర్మాన్ని తెలియక; నిర్+దయుండవు+ఐ= దయలేని వాడివై; మాబోఁటి= మా వంటి; పేద, మృగంబులకు= అల్ప జంతువులకు; భయంబుగ, గర్జిలితివి= భీతి కలిగేటట్లు పెద్ద కేక పెట్టావు; ఈవు+ఎవ్వండవు?= నీవు ఎవ్వరివి?; మనుష్య, గోచరంబు+కాని= మనుషులకు కనిపించనటువంటి; ఈ+వనంబునకున్= ఈ అడవిలోకి; ఏల, వచ్చితి?= ఎందుకు అరుదెంచావు; సిద్ధ, గతి, లేనివారికి= అతిలోకశక్తుల వలన కలిగిన నడక లేనివారికి; ఇట+పోవన్= ఇక్కడ చరించటానికి; న+శక్యంబు= సాధ్యం కాదు; అమృత, కల్పంబులు+ఐన= అమృతంతో సమానాలయిన; ఈ, ఫల, మూలంబులు= ఈ పళ్ళు, వేళ్ళు; ఉపయోగించి= ఆరగించి; క్రమ్మఱుము= మరలిపొమ్ము; నీ+అందు= నీ యెడ; బద్ధ, స్నేహుండన్+కాన= అనుసంధించబడిన నెయ్యం కలవాడిని కాబట్టి; బుద్ధి+చెప్పితి= హితవును ఉపదేశించాను; నా పలుకులు= నా మాటలు; చేకొనుము= స్వీకరించుము- అనగా నేను చెప్పిన ప్రకారం చేయుము; అనిన= అని పలుకగా; భీముండు= భీముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: జంతువులకు ధర్మం తెలియదు కాని, సకలజీవులయెడ దయ కలిగి ఉండటం అనే ధర్మం తెలిసిన వారు మనుష్యులు మాత్రమే కదా! అటువంటి మనుష్యజన్మ లభించిన నీవు పెద్దలను ఉపాసించి మంచీ చెడూ తెలిసికోలేదా ఏమి? ధర్మం తెలిసికొనక జాలి లేని వాడివై మాబోటి అల్పజంతువులు దద్దరిల్లేటట్లు ఎందుకు గర్జించావు? నీవు ఎవరివి? మనుష్యులు మసలని ఈ అడవికి ఎందుకు వచ్చావు? అతిలోకమైన శక్తులు గల మనుష్యులు తప్ప ఈ అడవిలో మరి ఎవ్వరు తిరుగలేరు. అమృతంతో సమానమైనవి ఈ పండ్లు, వేళ్ళు, వీటిని ఆరగించి మరలిపొమ్ము. నీయందు నాకు మిక్కుటమైన నెయ్యం ఏర్పడింది కాబట్టి నీకు ఈ హితవు చెప్పుతున్నాను. నేను చెప్పిన మాటల ప్రకారం చేయుము'- అని చెప్పగా, భీముడు ఈ విధంగా మారుపలికాడు.

తే. 'క్షత్త్రియప్రవరుండ విఖ్యాతబలుఁడఁ । బాండుతనయుండ గొంతిగర్భంబునందు
వాయువరమునఁ బుట్టినవాఁడ; నన్ను । భీముఁ డండ్రు భూజనులు కపిప్రభుండ! 323

ప్రతిపదార్థం: కపి, ప్రభుండ!= కోతులలో నేత అయిన వాడా!; క్షత్త్రియ ప్రవరుండన్= క్షత్త్రియులలో శ్రేష్ఠుడిని; విఖ్యాత, బలుఁడన్= బలం కలవాడిగా సుప్రసిద్ధుడిని; పాండు, తనయుండన్= పాండురాజు కొడుకును; గొంతి, గర్భంబునందు= కుంతీ దేవి కడుపున; వాయు, వరమునన్= వాయు దేవుని వరాన; పుట్టినవాఁడన్= జన్మించినవాడిని; భూజనులు= భూలోకంలోని ప్రజలు; నన్ను= నన్ను; భీముఁడు+అండ్రు= భీముడు అనే పేరుతో పిలుస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'కోతులకు నేత అయినవాడా! నేను క్షత్రియులలో శ్రేష్ఠుడిని, మహావీరుడిగా సుప్రసిద్ధుడిని. పాండురాజు పుత్రుడిని. గాలిదేవరదయవలన కుంతికి జన్మించిన వాడిని. భూప్రజలు నన్ను భీముడు అనే పేరుతో పిలుస్తారు.

వ. ఏ నిక్కడఁ గార్యార్థినై పోయెద; నాకుఁ దెరు వి; మ్మీనినాఁడు దొల్లి శతయోజన విస్తారంబయిన సముద్రంబు లంఘించి లంకకుం బోయిన హనుమంతు నట్ల నిన్ను నీ పర్వతంబు లంఘించి పోదు' ననిన హనుమంతుం 'డతం డేమి కారణంబున సముద్రలంఘనంబుఁ జేసె? నెఱుంగు దేనిం జెప్పు' మనిన వానికి భీముం డిట్లనియె. 324

ప్రతిపదార్థం: ఏను= నేను; ఇక్కడన్+ఇప్పుడు; కార్య+అర్థిని+ఐ= ఒకానొక ప్రయోజనాన్ని ఉద్దేశించిన వాడనై; పోయెద= వెళ్తున్నాను; నాకున్+తెరువు+ఇమ్ము= నాకు దారి ఇమ్ము; ఈని, నాఁడు= ఇవ్వనివేళ; తొల్లి= పూర్వం; శత, యోజన, విస్తారంబు+అయిన= నూరామడల మేర వైశాల్యం కలిగిన; సముద్రంబు= సముద్రాన్ని; లంఘించి= దాటి; లంకకు+పోయిన= లంకకు వెళ్ళిన; హనుమంతు+అట్ల= ఆంజనేయుడివలె; నిన్నున్= నిన్ను; ఈ పర్వతంబు= ఈ కొండను; లంఘించి= దూకి, దాటి; పోదున్= వెళ్ళగలను; అనిన= అని చెప్పగా; హనుమంతుండు అతండు= ఆ హనుమంతుడు; ఏమి, కారణంబునన్= ఏ హేతువు చేత; సముద్ర, లంఘనంబున్= సముద్రాన్ని దూకి దాటటం; చేసెన్?= చేశాడు?; ఎఱుంగుదు+ఏని= తెలిసినట్లయితే; చెప్పుము= చెప్పవలసింది; అనినన్= అని చెప్పగా; వానికి= ఆ హనుమకు; భీముండు= భీముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: నేను ఇపు డొక పనిమీద వెళ్ళుతున్నాను. నాకు దారి విడువుము; నీవు నాకు దారి విడువక పోతే, అలనాడు నూరామడలమేర విస్తారమైన కడలిని దూకి దాటి, లంకకు వెళ్ళిన ఆంజనేయుడివలె నేను నిన్ను, ఈ కొండను అవలీలగా దూకి దాటి పోగలను'- అని చెప్పగా భీముడితో 'ఏకారణాన హనుమంతుడు సముద్రాన్ని దాటి లంకకు వెళ్ళాడో నీకు తెలిస్తే తెలియజేయుము' అనగా భీముడు ఈవిధంగా చెప్పాడు.

క. 'అలఘుం డిక్ష్వాకుమహా । కుల వీరుఁడు రాఘవుండు గురువచనంబున్
సలుప వనవాసియై తన । లలనం గోల్పడియె నట్టె లంకేశ్వరుచేన్. 325

ప్రతిపదార్థం: అలఘుండు= గొప్పవాడు, తేలికకానివాడు; ఇక్ష్వాకు, మహా, కుల, వీరుఁడు= ఇక్ష్వాకు మహారాజుయొక్క గొప్ప వంశం లోని శూరుడు; రాఘవుండు= రఘువంశంలో జన్మించిన శ్రీరాముడు; గురు వచనంబున్= తండ్రి మాటను; సలుప= ఆచరించటానికి; వన, వాసి+ఐ= అరణ్యంలో నివసించిన వాడై; తన, లలనన్= తన కాంతను- తన భార్యను; లంకా+ఈశ్వరుచేన్= లంకకు ప్రభువైన రావణుడిచేత; కోల్పడియెన్+అట్టె= పోగొట్టుకొన్నాడు కదా.

తాత్పర్యం: 'గొప్ప ఇక్ష్వాకువంశంలో జన్మించిన మహాపురుషుడున్నూ, రఘుమహారాజువంశానికి చెందిన వాడున్నూ అయిన శ్రీరాముడి, పితృవాక్యపరిపాలనకై అరణ్యంలో నివసించి తన భార్యఅయిన సీతాదేవిని లంకకు అధిపతి అయిన రావణుడిచేత పోగొట్టుకొన్నాడు కదా!

క. సీతాన్వేషణపరులై । నీతిఁ గపిప్రవరు లరిగి నిరతంబుగ సం
పాతి యను పక్షిచేత మ । హీతనయ సువార్త లెల్ల నెఱిఁగి కడంకన్. 326

ప్రతిపదార్థం: సీతా+అన్వేషణ, పరులు+ఐ= సీతను వెదకు నట్టివారలై; నీతిన్= మంచి ప్రవర్తనతో; కపి, ప్రవరులు= కోతుల నాయకులు; అరిగి= వెళ్ళి; నిరతంబుగన్= స్థిరంగా; సంపాతి+అను+పక్షిచేతన్= సంపాతి అనే పేరు కల పక్షి వలన; మహీ, తనయ= భూపుత్రి అయిన సీతయొక్క; సువార్తలు= క్షేమసమాచారాలు; ఎల్లన్= అన్నియు; ఎఱిఁగి= తెలిసి; కడంకన్= పూనికతో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సీతను వెదకే ప్రయత్నంలో నీతిగల వానరనాయకులు ఆసక్తితో సాగిపోతూ, సంపాతి అనే పక్షి సీతయోగక్షేమాలను గురించి చెప్పగా తెలిసికొని, పట్టుదలతో.

క. వారలు వారిధి గడవఁగ । నేరక తా రున్న యెడ ననిలసత్త్వమునన్
వారిధి లంఘించె మహా । వీరుఁడు హనుమంతుఁ డనఁగ విందుఁ గపీంద్రా! 327

ప్రతిపదార్థం: కపి+ఇంద్రా!= వానరులలో శ్రేష్ఠుడివైన వాడా!; వారలు= వారు- ఆ కపి ప్రవరులు; వారిధి= సముద్రాన్ని; కడవఁగ నేరక= దాటలేక; తారు+ఉన్న+ఎడ= తాము ఉన్నప్పుడు; అనిల, సత్త్వమునన్= వాయువు యొక్క శక్తితో; మహా వీరుఁడు= గొప్ప వీరుడు; హనుమంతుఁడు= ఆంజనేయుడు; వారిధి= సముద్రాన్ని; లంఘించెన్= దాటాడు; అనఁగ= అని చెప్పగా; విందున్= వింటుంటాను.

తాత్పర్యం: కోతులలో శ్రేష్ఠుడివైనవాడా! ఆ కోతులనేతలు సముద్రాన్ని దాట లేక వారందరూ నిర్వేదంతో నిలిచిపోయినప్పుడు, హనుమంతుడు వాయుదేవుడిశక్తివంటి శక్తితో సముద్రాన్ని లంఘించాడని విన్నాను.

వ. ఏను హనుమంతునంతియ బలపరాక్రమంబులు గలవాఁడ; నా పౌరుషంబుఁ జూపుదునే?' యనిన నవ్యక్త హాసముఖుం డగుచు 'నన్నా! యేను ముదిసినవాఁడ లేవ నోపం; బోయెదవేని నాతోకం బాయంద్రోచి పొ' మ్మనిన మెచ్చక తన వామకరంబున నెత్తం బోయి వశంబుగాక. 328

ప్రతిపదార్థం: ఏను= నేను; హనుమంతు+అంతియ= ఆంజనేయుడి అంత; బల, పరాక్రమంబులు+కలవాఁడన్= శక్తి శౌర్యాలు కలవాడిని; నా, పౌరుషంబున్= నా పరాక్రమాన్ని; చూపుదునే?= చూపాలా?; అనినన్= అని చెప్పగా; అవ్యక్త, హాస, ముఖుండు+అగుచున్= పైకి కనిపించని నవ్వు ముఖంలో కలవా డౌతూ; అన్నా!= సోదరా!; ఏను= నేను; ముదిసినవాఁడన్= ముసలివాడిని; లేవన్+ఓపన్= లేవలేను; పోయెదవు+ఏని= వెళ్ళదల్చుకుంటే; నా, తోఁకన్= నా తోకను; పాయన్+త్రోచి= అవతలికి (ప్రక్కకు) నెట్టి; పొమ్ము= వెళ్ళుము; అనిన= అని చెప్పగా; మెచ్చక= లెక్కచేయక; తన, వామ, కరంబునన్= తన యెడమ చేత్తో; ఎత్తన్+పోయి= ఎత్తటానికి ప్రయత్నించి; వశంబు+కాక= శక్యం కాక.

తాత్పర్యం: నేను హనుమంతుడితో సమానమయిన శక్తిశౌర్యాలు కలవాడిని. నా పరాక్రమాన్ని ప్రదర్శించమంటావా?' అని భీముడు పలుకగా హనుమంతుడు చిరునవ్వును తన ముఖంలో పైకి కనిపించకుండా అణచుకొని, 'అన్నా! నేను ముసలివాడిని కదా! లేవలేను; నీవు ముందుకే పోదలిస్తే దయచేసి నా తోకను కొద్దిగా అవతలికి నెట్టి వెళ్ళుము' అని చెప్పగా భీముడు లెక్క చేయకుండా నిర్లక్ష్యంగా తన ఎడమచేతితో తోకను నెట్టబోయి, శక్యం కాక.

ఉ. ఏపున రెండుచేతులను నిమ్ముగఁ బట్టి యమర్చి యెత్తఁగా
నోపక మొగ్గతిల్లఁబడి యుద్గతఘర్మజలార్ద్రదేహుఁ డై
కాపురుషుండుఁ బోలె నిజగర్వము దక్కి యడంగి యుండెఁ జిం
తాపరుఁడై వృకోదరుఁడు దద్దయు లజ్జ నధోముఖంబుతోన్. 329

ప్రతిపదార్థం: ఏపునన్= ఉత్సాహంతో; రెండు, చేతులను= రెండు చేతులతో; ఇమ్ముగన్+పట్టి= బాగుగా పట్టుకొని; అమర్చి= అనుసంధించి; ఎత్తఁగాన్+ఓపక= ఎత్తలేక; మొగ్గతిల్లన్+పడి= మొగ్గవాలినట్లు వెల్లకిలపడి; ఉద్గత, ఘర్మ, జల+ఆర్ద్రదేహుఁడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

+ఐ= వెలువడిన చెమటనీటితో తడిసిన శరీరం కలవాడై; కాపురుషుండున్+పోలె= అల్పమానవుడి వలె; నిజ, గర్వము+తక్కి= తన మదాన్ని వీడి; వృక+ఉదరుఁడు= (తోడేలు పొట్టవంటి కడుపు కలవాడు) భీముడు; చింతాపరుఁడు+ఐ= దుఃఖించిన వాడై; తద్దయు= మిక్కుటమైన; లజ్జన్= సిగ్గుతో; అధస్+ముఖంబుతోన్= క్రిందకు వాల్చిన ముఖంతో; అడంగి= అడకువతో; ఉండెన్= ఉండినాడు.

తాత్పర్యం: (భీముడు ఎడమ చేతితో ఆంజనేయుడి తోకను కదుపలేక పోయి, అటు తర్వాత), ఉత్సాహంతో తన బలాన్నంతా ఉపయోగించి రెండుచేతులు అమర్చి తోకను కదిలించ జూచాడు కాని, ఆ తోకను కదల్చ లేక పోయాడు. అతడి దేహమంతా చెమటనీటితో తడిసి పోయింది. అప్పుడతడు అల్పమానవుడివలె గర్వం వీడి, విచారిస్తూ సిగ్గుతో తలవంచుకొని నిలిచాడు.

వ. ఇట్లు క్కపివరు లాంగూలంబుఁ గదల్ప నోపక భీముండు కృతప్రణాముం డయి 'ని న్నెఱుంగక నా పలికిన దురుక్తంబులు సహింపవలయు; నీవు కపిరూప ధరుండవైన సిద్ధుండవో, గంధర్వుండవో; దేవవరుండవో నా కెఱింగింపు' మనిన హనుమంతుండు భీముం జూచి నగుచు 'నేను గేసరిక్షేత్రంబున వాయుభట్టారకునకుం బుట్టిన వాఁడ; నీ చెప్పిన హనుమంతుండ; నీవు నా యనుజుండవు; దొల్లి రఘుకులేశ్వరుం డయిన రామ దేవుండు రావణుం డను రాక్షసుచేత నపహృతభార్యుండై సుగ్రీవాది వానరుల నసంఖ్యాతసంఖ్యలవారిం దనకు సహాయులం జేసికొని సేతుబంధనంబున సముద్రంబు లంఘించి సమరంబున రావణు వధియించి యందు నా కెలసంబునకు మెచ్చి. 330

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఆ+కపివరు= కోతులలో శ్రేష్ఠుడయిన అతని; లాంగూలంబున్= తోకను; కదల్పన్+ఓపక= కదల్చలేక; భీముండు= భీముడు; కృత, ప్రణాముండు+అయి= నమస్కరించి నటువంటి వాడై; నిన్ను+ఎఱుంగక= నిన్ను గురించి తెలియక; నా, పలికిన= నేను మాట్లాడిన; దుర్+ఉక్తంబులు= చెడ్డ మాటలు; సహింపవలయు= ఓర్చుకోవాలి; నీవు= నీవు; కపి, రూప, ధరుండవు+ఐన= కోతి ఆకారాన్ని ధరించిన; సిద్ధుండవో= సిద్ధులకు చెందిన వేల్పువో; గంధర్వుండవో= గంధర్వుడివైన వేల్పువో; దేవ, వరుండవో= దేవతలలో శ్రేష్ఠుడివో; నాకు+ఎఱింగింపుము= నాకు తెలియజెప్పుము; అనిన= అని అడుగగా; హనుమంతుండు= హనుమంతుడు; భీమున్+చూచి= భీముడిని చూచి; నగుచున్= నవ్వుతూ; ఏను= నేను; కేసరిక్షేత్రంబున= కేసరి అనే వాడి భార్య అయిన అంజనాదేవికి (క్షేత్రము= ఆడది భార్య); వాయుభట్టారకునకున్= పూజ్యుడైన గాలి దేవరకును; పుట్టిన వాఁడ= జన్మించిన వాడిని; నీ, చెప్పిన= నీవు చెప్పినట్టి; హనుమంతుండన్= హనుమంతుడిని; ఈవు= నీవు; నా+అనుజుండవు= నాకు తమ్ముడివి; తొల్లి= పూర్వకాలాన; రఘు, కుల+ఈశ్వరుండు+అయిన= రఘువంశానికి ప్రభువైన; రామ, దేవుండు= దేవుడైన శ్రీరాముడు; రావణుండు+అను, రాక్షసుచేతన్= రావణుడు అనే పేరు గల రాక్షసుడి చేత; అపహృత, భార్యుండు+ఐ= అపహరించబడిన భార్యకలవాడై; సుగ్రీవ+ఆది, వానరులన్= సుగ్రీవుడు మొదలైన కోతులను; న+సంఖ్యాత, సంఖ్యల, వారిన్= లెక్క పెట్టలేనంతమంది వానరులను; తనకు= తనకు; సహాయులన్+చేసికొని= తోడుపడే వారినిగా చేసికొని; సేతుబంధనంబున= వారిధి కట్టటం చేత; సముద్రంబు= కడలిని; లంఘించి= దాటి; సమరంబునన్= యుద్ధమందు; రావణు= రావణుడిని; వధియించి= సంహరించి; అందు= ఆ యుద్ధంలో; నా కెలసంబునకు= నా సేవకు; మెచ్చి= సగౌరవంగా పొగడి.

తాత్పర్యం: ఈ విధంగా ఆ కపివరుడి తోకను కదల్చలేక, భీముడు అతడికి నమస్కరించి 'నిన్ను తెలియలేక నేను మాట్లాడిన చెడ్డ పలుకులు క్షమించ ప్రార్థన. నీవు కోతి ఆకృతి తాల్చిన సిద్ధుడివో! గంధర్వుడివో! దేవశ్రేష్ఠుడివో!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దయచేసి నాకు తెలుపుము.' అనగా- హనుమంతుడు భీముడిని చూచి నవ్వుతూ, 'నేను కేసరిభార్య అయిన అంజనా దేవికి, పూజ్యుడైన వాయు దేవుడివరంవలన జన్మించిన వాడిని. ఇంతకుముందు నీవు పేర్కొనిన హనుమంతుడిని నేనే! నీవు నా తమ్ముడివే. పూర్వకాలాన రఘువంశంలో జన్మించిన ప్రభువు శ్రీరామదేవుడు రావణుడు అనే రాక్షసుడు తన భార్యను అపహరించగా, సుగ్రీవుడు మొదలైన లెక్కకు మించిన సంఖ్యగల వానరుల తోడ్పాటుతో వారధి కట్టి, సముద్రాన్ని దాటి, యుద్ధంలో రావణుడిని సంహరించి, అందు నా సేవకు మెచ్చి.

మధ్యాక్కర.

'నరసురస్తుత్యమై యెంతకాలంబు నా కీర్తి నిలుచు
నిరతంబుగా నంత కాలమున్ నీవు నిత్యుండ వగుచుఁ
బరఁగు' మని వరముఁ దగ దయంజేసి ప్రభుఁ డుర్వి యెల్ల
సరిఁ బదునొక్కండు వేలయేం డ్లేలి చనియెఁ దా దివికి.' 331

ప్రతిపదార్థం: నర, సుర, స్తుత్యము+ఐ= మనుష్యుల చేతను, దేవతల చేతను, పొగడబడినటువంటిదై; ఎంత, కాలంబు= ఎంత సమయం; నా, కీర్తి; నిలుచు= నిలచి ఉంటుందో; అంత, కాలమున్= అంత సమయం; నీవు= నీవు; నిరతంబుగాన్= ఎడతెగకుండా; నిత్యుండవు+అగుచున్= చిరంజీవివి అవుతూ; పరఁగుము= శోభిల్లుము; అని= అని చెప్పి; వరమున్= అనుగ్రహాన్ని; తగన్= ఒప్పునట్లుగా; దయన్+చేసి= దయతో ఇచ్చి; ప్రభుఁడు= శ్రీరామచంద్ర ప్రభువు; ఉర్విన్+ఎల్ల= భూమిని అంతటినీ; సరిన్, పదునొక్కండు, వేల, ఏండ్లు= సమంగా పదకొండు వేల సంవత్సరాలు; ఏలి= పరిపాలించి; తాన్= తాను; దివికి= స్వర్గానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'నరులచేత, దేవతలచేత నా కీర్తి ఎంతకాలం శ్లాఘించబడుతుందో అంతకాలం నీవు చిరంజీవి వై భూమిమీద వర్ధిల్లు' మని శ్రీరామచంద్రప్రభువు నాకు వరాన్ని అనుగ్రహించి, తాను పదకొండు వేలయేళ్ళు భూమిని పరిపాలించి స్వర్గాన్ని అలంకరించాడు.'

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 2.22 విశేషాంశం చూడండి.

వ. అనిన విని భీముండు వాని నప్పుడు హనుమంతుం గానెఱింగి సంతసిల్లి వెండియు నమస్కరించి 'భవద్దర్శనంబునం గృతార్థుండ నయితి' నని యిట్లనియె. 332

ప్రతిపదార్థం: అనిన= అని చెప్పగా; విని= ఆలకించి; భీముండు= భీముడు; వానిన్= ఆ వానరుడిని; అప్పుడు= అపుడు; హనుమంతున్+కాన్+ఎఱింగి= హనుమంతుడిగా తెలిసికొని; సంతసిల్లి= సంతోషాన్ని పొంది; వెండియు= మళ్ళీ; నమస్కరించి= వందనం చేసి; భవత్+దర్శనంబునన్= నిన్ను సందర్శించటం వలన; కృత+అర్థుండను= ధన్యుడిని; అయితిని= అయినాను; అని= అని పలికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా ఆలకించి, భీముడు ఆ వానరమే హనుమంతుడు అని తెలిసికొని, సంతోషాన్ని చెంది, అతడికి మళ్ళీ వందనం ఆచరించి, 'నిన్ను చూడటంచేత ధన్యుడిని అయినాను' అని చెప్పి ఇట్లా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'బలిముఖుండ! దయయుఁ గలవేని దొల్లి య । ర్ణవము గడచి చనిననాఁటి నీదు
రూపుఁ జూడ వలతుఁ, జూపు నా' కనవుడు । వాని కిట్టు లనియె వానరుండు. 333

ప్రతిపదార్థం: బలిముఖుండ!= వానరుడివైన ఓ ఆంజనేయా!; దయయున్+కలవు+ఏని= నీవు నామీద దయ ఉన్న వాడివి అయితే; తొల్లి= పూర్వం; అర్ణవము= కడలిని; కడచి= దాటి; చనిన= వెళ్ళిన; నాఁటి= ఆనాటి; నీదు= రూపున్= నీ ఆకృతిని; చూడ వలతున్= చూడకోరుతాను; నాకున్+చూపు= నాకు చూపించవలసింది; అనవుడు= అని పలుకుగా; వానరుండు= హనుమంతుడు; వానికి= భీముడికి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'వానరుడుగా కనిపిస్తున్న ఓ ఆంజనేయా! నామీద నీకు దయ ఉన్నట్లయితే, దయచేసి అలనాడు నీవు సముద్రాన్ని దాటిన ఆకారాన్ని నేడు నాకు చూపించుము' అని అడుగగా, ఆ వానరుడు భీముడికి ఇట్లా బదులు పలికాడు.

క. 'అక్కాలంబున రూపం । బిక్కాలమునందుఁ జూప నెట్లగుఁ? గాలం
బొక్క విధంబున నుండక । పెక్కు ప్రకారముల నుండు భిన్నావస్థన్. 334

ప్రతిపదార్థం: ఆ+కాలంబునన్, రూపంబు= ఆ సమయంలోని ఆకారం; ఈ+కాలమునందున్= ఈ సమయంలో; చూపన్= ప్రదర్శించటం; ఎట్లు+అగున్?= ఏ రీతిగా వీలవుతుంది?; కాలంబు= కాలం; ఒక్క, విధంబునన్= ఒకే రీతిగా; ఉండక= ఉండక, అంటే మారుతూ; పెక్కు ప్రకారంబులన్= పలు రీతులుగా; భిన్న+అవస్థన్= వేరు వేరు స్థితిగతులలో; ఉండున్= ఉంటుంది.

తాత్పర్యం: 'సముద్రాన్ని దాటే సమయంలోని ఆ ఆకారం ఈ సమయంలో ప్రదర్శించటం ఏవిధంగా వీలవుతుంది? కాలం ఒకే రీతిగా ఉండదు. పలువిధాలుగా మార్పు చెందుతూ వేరు వేరు స్థితిగతులలో ఉంటుంది.

వ. దానం జేసి కృత త్రేతా ద్వాపర కలియుగంబుల సంఖ్యలు వేఱు వేఱయి, యందుల చరాచర భూతంబులు భిన్నప్రకారంబులై వర్తిల్లు' ననిన 'నయ్యై యుగంబుల యాచార ప్రవర్తనంబులు నా కేర్పడం జెప్పు' మనిన భీమునకు హనుమంతుం డిట్లనియె. 335

ప్రతిపదార్థం: దానన్+చేసి= ఆకారణం చేత; కృత, త్రేతా, ద్వాపర, కలియుగంబుల, సంఖ్యలు= కృత యుగంయొక్క, త్రేతాయుగం యొక్క, ద్వాపరయుగం యొక్క, కలియుగం యొక్క పరిమాణ సంఖ్యలు; వేఱు వేఱు+ఐ= భిన్న భిన్నాలుగా; అందుల= ఆయా యుగాలలోని; చర+అచర, భూతంబులు= కదలని, కదిలేటి అనగా చేతనాచేతన పదార్థాలన్నీ; భిన్న, ప్రకారంబులు+ఐ= వేరు వేరు పద్ధతులు కలివియై; వర్తిల్లున్= కొనసాగుతాయి; అనినన్= అని చెప్పగా; అయ్యై= ఆయా; యుగంబుల= యుగాలలోని; ఆచార, ప్రవర్తనంబులు= అనుష్ఠానాలు, నడవడుల సంప్రదాయాలు; నాకు= నాకు; ఏర్పడన్+చెప్పుము= విశదంగా తెలియ చేయవలసింది; అనిన= అని అడుగగా; హనుమంతుండు= ఆంజనేయుడు; భీమునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా తెలిపాడు.

తాత్పర్యం: ఆ కారణంచేత కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం- వీటి పరిమితుల సంఖ్యలు భిన్నమైనవి. అట్లే ఆయా యుగాలలోని చేతనాచేతనాలు వేరు వేరు రీతులు గలిగి ప్రవర్తిల్లుతాయి'- అని ఆంజనేయుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బదులు పలుకగా భీముడు 'ఆయా యుగాలలోని నడవడికల సంప్రదాయాలు, అనుష్ఠానాలు నాకు వివరించి చెప్పవలసింది' అని ప్రార్థించాడు. అంత హనుమంతుడు భీముడికి ఇట్లా చెప్పాడు.

భీమునకు హనుమంతుఁడు చతుర్యుగాచార వర్తనంబులను దెలుపుట (సం. 3-148-10)

తే. **'కృతమ కాని కర్తవ్యంబు గృతయుగంబు । నందు లేదు; చతుష్పాద మగుచు ధర్మ**
మనఘ! వర్తిల్లు; నచ్యుతుం డయ్యుగమున । శుక్లవర్ణుఁడై ప్రజలఁ గాచుచు వెలుంగు. 336

ప్రతిపదార్థం: కృతము+అ, కాని= చేయబడినదే కాని; కర్తవ్యంబు= చేయవలసినది; కృతయుగంబునందు= కృతయుగంలో; లేదు= లేదు; అనఘ!= ఓ పాపరహితుడివైనవాడా!; ధర్మము= ధర్మువు; చతుః+పాదము+అగుచు= చతుష్పాదమగుచు= నాలుగు పాదాలు కలిగినటువంటిది అవుతూ; వర్తిల్లున్= జరుగుతుంది; ఆ+యుగమున= ఆ యుగంలో; అచ్యుతుండు= విష్ణు దేవుడు; శుక్లవర్ణుఁడు+ఐ= తెల్లటి రంగు కలవాడై; ప్రజలన్= ప్రజలను; కాచుచు= సంరక్షిస్తూ; వెలుంగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: 'పాపరహితుడివై ఓ భీమసేనా! కృతయుగంలో చేయటమే గాని చేయవలసినటువంటిది లేదు. ధర్మం నాలుగు పాదాలలో వర్తిస్తుంది. విష్ణుదేవుడు ఆయుగంలో తెల్లటిరంగు కలవాడై ప్రజలను కాపాడుతూ వెలుగొందుతుంటాడు.

విశేషం: కృతయుగంలో నిర్వహించవలసిన కర్తవ్యాలను నూటికి నూరుపాళ్ళు అందరూ నిర్వహిస్తారు. కాబట్టి చేయబడనటువంటి కర్తవ్యమే ఆ యుగాన ఉండదని చెప్పబడింది. అందుచేత ధర్మం నాలుగుపాదాలతో వర్తిల్లుతుంది. నాల్గుపాదాలు అంటే నూటికి నూరుపాళ్ళు. పాదం అంటే ఒకటిలో నాల్గవ వంతు. నేటి పరిభాషలో 1/4=25 శాతం.

వ. **అది సనాతనధర్మసనాథం; బందుల బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రు లేకవేదక్రియాయోగ్యులై యకామ ఫలసంయోగంబునఁ బుణ్యలోకంబులు వడయుదు; రందు నసూయాభిచార దర్పపైశున విగ్రహ క్రోధమదమత్సర భయ సంతాప వ్యాధి ప్రజాక్షయేంద్రియక్షయంబులు లేవు; మఱియుఁ ద్రేతాయుగంబునందుఁ ద్రిపాదంబై ధర్మువు వర్తిల్లు; నందు జనులు నిత్యసత్యవ్రతశీలురై యజ్ఞతపో దానాది క్రియల వర్తింతు; రందు రక్తవర్ణుండయి విష్ణుభట్టారకుండు ప్రజారక్షణంబుఁ జేయు. 337**

ప్రతిపదార్థం: అది= ఆ కృతయుగం; సనాతన, ధర్మ, సనాథంబు= శాశ్వతమైన ధర్మంతో కూడి ఉండి నటువంటిది; అందులన్= ఆ యుగంలో; బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులు= బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు; ఏక, వేద, క్రియా, యోగ్యులు+ఐ= ఒకే విధమైన వేదం నిర్దేశించిన కార్యాలను చేయటానికి తగిన అర్హత కలవారై; న+కామ, ఫల, సంయోగంబునన్= కోరుకోకుండా సంక్రమించే ఫలాలచేత కూడుకొనే వారు అవటంచేత; పుణ్య, లోకంబులు= ఉత్తమగతులు; పడయుదురు= పొందగలరు; అందున్= ఆ కృతయుగంలో; అసూయా+అభిచార, దర్ప, పైశున, విగ్రహ, క్రోధ, మద, మత్సర, భయ, సంతాప, వ్యాధి, ప్రజాక్షయ+ఇంద్రియ క్షయంబులు, లేవు= మంచి గుణాలలో దోషాలను ఆరోపించటం, శత్రువులపై ద్వేషంతో చేసే మంత్ర కర్మలు, డాంబికత్వం, లోభం, కలహం, కోపం, గర్వం, ఓర్వలేమితనం, వెరపు, దుఃఖం, రోగం, జననాశనం, ఇంద్రియాల శక్తుల వినాశనాలు, ఉండవు. మఱియున్= ఇంకను; త్రేతాయుగంబునందున్= త్రేతా యుగాన; ధర్మువు= ధర్మం; త్రి, పాదంబు+ఐ= మూడు పాదాలు కలదై; వర్తిల్లున్= మనగలదు, వర్తిల్లుతుంది; అందు= ఆత్రేతాయుగంలో; జనులు= ప్రజలు; నిత్య, సత్య, వ్రత, శీలురు+ఐ= ఎల్లప్పుడూ నిజం చెప్పటంలో నిష్ఠ కల వారై; యజ్ఞ+తపస్+దాన+ఆది,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క్రియల= యజ్ఞాలు, తపస్సు, దానాలు చేయటం మొదలైన కార్యాలలో; వర్తింతురు= ప్రవర్తిస్తూ ఉంటారు; అందున్= ఆ త్రేతాయుగంలో; రక్త, వర్ణుండు+అయి= ఎర్రటి రంగు కలవాడై; విష్ణు, భట్టారకుండు= పూజ్యుడైన విష్ణుదేవుడు; ప్రజా, రక్షణంబున్+చేయు= జనులను కాపాడుతాడు.

తాత్పర్యం: ఆ కృతయుగంలో శాశ్వత స్వరూపమైన ధర్మంతో కూడి ఉంటుంది. అందు బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు శూద్రులు ఒకే విధమయిన వేదం ఆదేశించే కార్యాలను ఆచరించే యోగ్యత కలవారై ఉంటారు. వారికి కోరికలు లేకుండగానే సంక్రమించే ఫలాలవలన ఉత్తమగతులు సంప్రాప్తిస్తాయి. ఆ యుగంలో దుర్గుణవిజృంభణ ఉండదు. మంచి గుణాలకు చెడుఉద్దేశాలు ఆరోపించబడవు. శత్రువులపై పగ తీర్చుకొనటానికి మంత్ర తంత్ర కర్మలు జరగవు. డాబు, పిసినిగొట్టుతనం, కలహస్వభావం, కోపం, గర్వం, ఓర్వలేనితనం, వెఱపు, దుఃఖం, రోగం, ప్రజానాశనం, ఇంద్రియ పటుత్వంతగ్గటం ఉండవు. ఇంక త్రేతాయుగంలో ధర్మం మూడుపాదాలతో ప్రవర్తిల్లుతుంది. అందులో జనులు ఎల్లప్పుడూ నిజం చెప్పటం అనే నిష్ఠతో ఉంటారు. యజ్ఞాలు, తపస్సు, దానం మొదలైన పుణ్యకార్యాలను చేయటంలో ప్రజలు ఆసక్తి కలవారౌతారు. ఆ త్రేతాయుగంలో పూజనీయుడైన విష్ణుదేవుడు ఎర్రటిరంగు కలవాడై ప్రజలను కాపాడుతాడు.

తే. ద్వాపరంబున రెండుపాదములఁ జేసి । నడుచు ధర్మువు వేదముల్ నాల్గుదెఱఁగు
లై ప్రవర్తిల్లు వేదశాస్త్రార్థ చోది । తంబులై ధర్మకామముల్ ధరణిఁ బరఁగు. 338

ప్రతిపదార్థం: ద్వాపరంబున= ద్వాపరయుగంలో; ధర్మువు= ధర్మం; రెండు, పాదములన్+చేసి= రెండు పాదాలతో; నడచున్= వర్తిల్లుతుంది; వేదముల్= వేదాలు; నాల్గు, తెఱఁగులు+ఐ= నాలుగు తీరులై; ప్రవర్తిల్లున్= నడుస్తాయి; వేద, శాస్త్ర+అర్థ, చోదితంబులు+ఐ= వేదాలయొక్క, శాస్త్రాలయొక్క పరమార్థం చేత నడుపబడినవై; ధర్మ, కామముల్= ధర్మము, కామము; ధరణిన్= భూమిపై; పరఁగున్= విలసిల్లుతాయి.

తాత్పర్యం: ద్వాపరయుగంలో ధర్మం రెండు పాదాల నడుస్తుంది. వేదాలు నాలుగు తెరగులుగా ప్రవర్తిల్లుతాయి. వేదాలలోను, శాస్త్రాలలోను ప్రతిపాదించబడిన భావాలచేత నడుపబడి ధర్మకామాలు విలసిల్లుతాయి.

తే. సత్యశమహీను లగుదురు జనులు గామ । కాములై చేయుదురు బహుక్రతువు లోలి;
నందుఁ ద్రైలోక్యవందితుం డచ్యుతుండు । కృష్ణవర్ణుఁడై జగము రక్షించు మఱియు. 339

ప్రతిపదార్థం: జనులు= ప్రజలు; సత్య, శమ, హీనులు+అగుదురు= నిజం పలకటమున్నూ, మనస్సు మొదలగు అంతరింద్రియాల నిగ్రహమున్నూ లేని వారవుతారు; కామ, కాములు+ఐ= కోరికలను కోరేవారై; బహు, క్రతువులు= పెక్కు యాగాలు; చేయుదురు= చేస్తారు; అందున్= ఆ ద్వాపర యుగంలో; త్రైలోక్య, వందితుండు= మూడు లోకాలచేత నమస్కరించబడేవాడు; అచ్యుతుండు= విష్ణువు (శ్రీకృష్ణుడు); కృష్ణ, వర్ణుఁడు+ఐ= నల్లటిరంగు కలవాడై (నీలవర్ణం కలవాడై); జగము= లోకాన్ని; రక్షించున్= కాపాడుతాడు; మఱియు= ఇంకను.

తాత్పర్యం: ద్వాపరయుగంలో ప్రజలు నిజం మాట్లాడరు. అంతరింద్రియ నిగ్రహాన్ని కోల్పోతారు. కోరికలయెడ ఆసక్తి కలవారై పెక్కు యజ్ఞాలు నిర్వహిస్తారు. ముల్లోకాల చేత నమస్కరింపబడే విష్ణుదేవుడు నీలవర్ణుడై జగత్తును కాపాడుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కలియుగమునందు ధర్మము । బలమఱి వర్తిల్లు నేకపాదంబున; నం
దలఘుఁడు కృష్ణుఁడు జగతీ । వలయము రక్షించుఁ బీతవర్ణుం డగుచున్. 340

ప్రతిపదార్థం: కలియుగమునందున్= కలియుగంలో; ధర్మము= ధర్మువు; బలము+అఱి= శక్తి నశించి; ఏక పాదంబునన్= ఒకే చరణంతో; వర్తిల్లున్= నడుస్తుంది; అందున్= ఆ కలియుగంలో; న+లఘుఁడు= తేలిక కానివాఁడు అనగా గొప్పవాడు; కృష్ణుఁడు= విష్ణు దేవుడు; పీత, వర్ణుండు+అగుచున్= పసుపురంగు కలవాడై; జగతీ, వలయము= సృష్టి మండలాన్ని; రక్షించున్= కాపాడుతాడు.

తాత్పర్యం: కలియుగంలో ధర్మం, శక్తి తగ్గి ఒకే పాదాన నడుస్తుంది. అప్పుడు విష్ణుదేవుడు పసుపురంగు కల వాడై ప్రపంచాన్ని కాపాడుతాడు.

వ. అందుల జనులు తమోగుణ యుక్తులై కామక్రోధాది దోషవశంబునం దమ్మెఱుంగక యధర్మవర్తు లగుదు; రందుఁ జేసిన తపోదానాది కర్మంబులు స్వల్పంబులయ్యును బహుఫలంబు లగు' నని యుగవర్తన ప్రకారంబులఁ జెప్పి, 'నీ కిష్టావాప్తి యయ్యెడు, నరుగు' మనిన భీముం డిట్లనియె. 341

ప్రతిపదార్థం: అందుల జనులు= ఆ కలియుగంలోని ప్రజలు; తమస్+గుణ, యుక్తులు+ఐ= తమోగుణం కలవారై; కామ, క్రోధ+ఆది, దోష, వశంబునన్= కోరికలు, కోపం హెచ్చు అవటం మొదలగు ఆరు విధాలైన తప్పుల మూలాన (అరిషడ్వర్గాలనే దోషాలకు వశులై ఉండటం వలన); తమ్ము+ఎఱుంగక= తమను తాము తెలిసికొనక; న+ధర్మ, వర్తులు= అధర్మానికి లోబడినవారు; అగుదురు= అవుతారు. అందున్= కలియుగంలో; చేసిన= ఆచరించిన; తపస్+దాన+ఆది, కర్మంబులు= తపస్సు, త్యాగ బుద్ధితో ఇతరులకు దానం చేయటం మొదలైన పనులు; స్వల్పంబులు+అయ్యును= తక్కువవే అయినప్పటికీ; బహు, ఫలంబులు= హెచ్చు ఫలితాలను ఇచ్చేటటువంటిది; అగున్= కాగలవు; అని= ఈ ప్రకారంగా; యుగ, వర్తన, ప్రకారంబులన్= యుగాలు నడిచే రీతులను; చెప్పి= చెప్పి; నీకు+ఇష్ట+అవాప్తి= నీకు అభిమతం చేకూరటం; అయ్యెడున్= అవుతుంది; అరుగుము= వెళ్ళుము; అనినన్= అని చెప్పగా; భీముండు= భీముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ కలియుగంలోని జనులు కోరికలు, కోపం మొదలైన ఆరు దుర్గుణాలను (అరిషడ్వర్గాలను) పెంచుకొని, తమను తాము తెలిసికొనలేని ఆవేశం కలిగి అధర్మమార్గంలో నడుస్తారు. కాని, ఆ కలియుగంలో చేసిన తపం, దానం మొదలైన సత్కార్యాలు స్వల్పమైనవైనా హెచ్చు ఫలాలను ఇస్తాయి' అని హనుమంతుడు ఆయా యుగాలు ప్రవర్తించే తీరు తెన్నులు తెలియజెప్పి 'నీ అభీష్టం నెరవేరుతుంది వెళ్ళు' మని పలుకగా భీముడు ఇట్లా అన్నాడు.

విశేషం: ఇందులో తమోగుణ ప్రస్తావన ఉన్నది. సత్త్వము-రజస్సు-తమము అని మూడు గుణాలు. ఈ జగత్తు త్రిగుణ సమ్మేళనంగా అభివర్ణితం. వీటికి శక్తులు అని కూడా నామాంతరం ఉంది. భగవద్గీతలో సత్త్వ రజస్తమోగుణాలను గురించిన సవిస్తరమైన వివరణ ఉన్నది. స్థూలంగా సత్త్వం అంటే మంచితనం. అహింసాదాన ధర్మదయా నిగ్రహప్రవృత్తి. రాజసం అంటే తీవ్రత, ఆటోపం, బలం మొదలైన గుణాల ఉత్కర్ష. తామసం అంటే దుర్జనత్వం. హింసా క్రౌర్య అజ్ఞానాల విజృంభణం అని చెప్పవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

హనుమంతుఁడు భీమునకుఁ దనపూర్వరూపంబుఁ జూపుట (సం. 3-149-1)

క. 'నీ నాఁటి తనువుఁ జూచియ । కాని యవశ్యంబు పోవఁ; గావునఁ గపినా
థా! నాకుఁ జూపు' మనవుడు । వానికిఁ దనరూపుఁ జూపె వానరుఁ డంతన్. 342

ప్రతిపదార్థం: నీ, నాఁటి, తనువున్= నీ యొక్క అలనాటి దేహాన్ని అంటే- నీవు అలనాడు సముద్రాన్ని లంఘించినప్పటి నీదేహాన్ని; చూచియ, కాని= దర్శించిన తరువాతే కాని; అవశ్యంబు, పోవన్= నిశ్చయంగా వెళ్ళను; కావునన్= కాబట్టి; కపినాథా!= ఓ వానర శ్రేష్ఠుడా!; నాకున్+చూపుము= నాకు (అలనాటి నీ నిజ స్వరూపం) ప్రదర్శించుము; అనవుడు= అని చెప్పగా; వానరుఁడు= హనుమంతుఁడు; అంతన్= అంతట; వానికిన్= ఆ భీముడికి; తన, రూపున్= తన ఆకారాన్ని; చూపెన్= చూపించాడు.

తాత్పర్యం: 'ఓ వానరశ్రేష్ఠుడా! నీలు పూర్వకాలాన ఆనాడు సముద్రాన్ని లంఘించిన నాటి నీ నిజ స్వరూపాన్ని చూడనిదే నేను నిశ్చయంగా ఇక్కడినుండి కదిలి వెళ్ళను. కాబట్టి నీవు దయచేసి నాకు నీ నిజస్వరూపాన్ని చూపించ వలసింది' అని భీముడు ప్రార్థించాడు. అంత హనుమంతుడు భీముడికి తన నిజరూపాన్ని ప్రదర్శించాడు.

చ. అతులితమై ద్వితీయ కనకాద్రి యొకో యిది నా నిజాంగ మూ
ర్జితముగఁ బెంచి పుచ్ఛమునఁ జేసి దిగంతము లందుచున్న యు
న్నతుఁ గపినాథుఁ జూచి కురునందనుఁ డప్డు నిమీలితాక్షుఁ డై
మతి నతివిస్మితుం డగుచు మారుతి కిట్లనియెన్ భయంబునన్. 343

ప్రతిపదార్థం: ఇది= ఈ స్వరూపం; అతులితము+ఐ= సాటిలేనటువంటిదై; ద్వితీయ, కనక+అద్రి+ఒకో!= ఓహో! రెండవ బంగరు కొండ అగునా! (రెండవ మేరు పర్వతమా!); నాన్= ఇది అన్నట్లుగా; నిజ+అంగము= తన శరీరం; ఊర్జితముగన్= ఎక్కువగా; పెంచి= పెరిగేటట్లుగా చేసి; పుచ్ఛమునన్+చేసి= తోకతో; దిక్+అంతములు= దిక్కుల చివరి కొసలు; అందుచున్న= తాకుతున్న; ఉన్నతున్= ఎత్తయిన వాడిని; కపి, నాథున్= వానరులలో శ్రేష్ఠుడైన వాడిని; చూచి= చూచి; కురునందనుఁడు= కురువంశంలో పుట్టిన భీముడు; అప్డు= అపుడు; నిమీలిత+అక్షుఁడు+ఐ= మూతలు పడిన కన్నులు కలవాడై; మతిన్= మనస్సులో; అతి, విస్మితుండు+అగుచున్= మిక్కిలి ఆశ్చర్యం చెందిన వాడై; భయంబునన్= భయంతో; మారుతికి= హనుమంతుడితో; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: సాటి లేనటువంటి ఈ రూపం రెండవ మేరుపర్వతమా! అనిపించేటట్లుగా తన శరీరాన్ని పెద్దగా పెంచి, తోకతో దెసల కొసలు తాకుతున్న హనుమంతుడి ఎత్తయిన నిజస్వరూపాన్ని చూచి, కురువంశ కుమారుడైన భీముడు కన్నులు మూసికొని, మనస్సులో మిగుల ఆశ్చర్యపడుతూ భయంతో మారుతికి ఇట్లా విన్నివించుకొన్నాడు.

క. 'అతిభీషణ మిది యత్య । ద్భుత మోహో! చాలు; భూనభోమధ్యవ్యా
పిత మయ్యె భవద్దేహా । యతత్వ ముపసంహరింపు' మనవుడుఁ గపియున్. 344

ప్రతిపదార్థం: అతి, భీషణము+ఇది= ఇది మిక్కిలి భయం (వెఱపు) కొలిపేటటువంటిది; అతి+అద్భుతము= మిక్కిలి ఆశ్చర్యం గొలిపేటటువంటిది; ఓహో!= ఎంత ఆశ్చర్యకరం!; చాలు= ఇక అవసరం లేదు; భూ, నభస్+మధ్య,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యాపితము+అయ్యెన్= భూమికి, ఆకాశానికి మధ్యస్థలంలో అంతా విస్తరించింది; భవత్+దేహ+ఆయతత్వము= నీ శరీరం యొక్క నిడివిని; ఉపసంహరింపుము= ఇక విరమించుము; అనవుడున్= అని చెప్పగా; కపియున్= ఆంజనేయుడున్నూ.

తాత్పర్యం: 'ఓహో! ఎంత భయంకరమైనది నీ ఆకారం! ఎంత ఆశ్చర్యకరంగా ఉన్నది! నీ శరీరం యొక్క నిడివి భూమ్యాకాశాల మధ్యన గల రోదసి నంతటినీ ఆక్రమించిందే!! ఈ నీ నిజస్వరూపాన్ని దయచేసి ఉపసంహరించ వలసింది' అని భీముడు కోరాడు. అంతట హనుమంతుడు.

క. తన యెప్పటి రూపముఁ జే । కొని 'దీనికి నినుమడుం గగుం బ్రతిబలముం
గనినప్పుడు నా రూపం । బనుపమముగ' ననిన హనుమ కనిలజుఁ డనియెన్. 345

ప్రతిపదార్థం: తన+ఎప్పటి రూపమున్= తనకు ఎప్పుడూ ఉండే ఆకృతిని; చేకొని= స్వీకరించి; దీనికిన్= నీవు ఇప్పుడు చూచినటువంటి నా ఆకారానికి; నా రూపంబు= నా ఆకారం; ప్రతి బలమున్= శత్రుసేనలను; కనినప్పుడు= చూచినప్పుడు; అనుపమముగన్= పోలికలేనట్లుగా; ఇనుమడుంగు+అగున్= రెండు రెట్లు హెచ్చు కాగలదు; అనినన్= అని చెప్పగా; హనుమకు= ఆంజనేయుడితో; అనిలజుఁడు= వాయుపుత్రుడైన భీముడు; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: హనుమంతుడు తాను ఎప్పుడూ ధరించే ఆకారాన్ని తిరిగి పొందాడు. 'శత్రుబలాన్ని చూచినపుడు నా ఆకారం నీవు చూచిన దానికి రెండింతలు పెరుగుతుంది. ఆ ఆకారానికి పోలికే లేదు సుమా!' అని చెప్పాడు. అంత భీముడు ఆంజనేయుడికి ఇట్లా బదులు పలికాడు.

ఉ. 'ఉన్నతిఁ బూని నీవు బలియుం డగు రావణు నశ్రమంబునం
బన్నుగఁ జంపనోపు పటుబాహుబలాఢ్యుఁడ విట్టియున్నతున్
నిన్ను సహాయుఁగా బడసి నిర్మలనీతిపరుండు రాఘవుం
దన్నరభోజనాన్వయుల నాజి వధించుట యేమి చోద్యమే?' 346

ప్రతిపదార్థం: ఉన్నతిన్+పూని= గొప్పతనం వహించి; నీవు= నీవు; బలియుండు+అగు= బలం కలిగినట్టి వాడైన; రావణున్= రావణుడిని; న+శ్రమంబునన్= శ్రమ లేకుండా- తేలికగా; పన్నుగన్= యుద్ధంలో తగినట్లు; చంపన్+ఓపు= సంహరించగల; పటు, బాహు, బల+ఆఢ్యుఁడవు= సమర్థవంతమైన భుజపరాక్రమం కలవాడివి; ఇట్టి+ఉన్నతున్= ఇటువంటి గొప్పవాడిని; నిన్ను= నిన్ను; సహాయున్+కాన్= తోడుపడే వాడినిగా; పడసి= పొంది,; నిర్మల, నీతి, పరుండు= స్వచ్ఛమైన నీతికలవాడు; రాఘవుండు= శ్రీరాముడు; ఆ+నర, భోజన+అన్వయులన్= మనుష్యులను ఆహారంగా తినేటటువంటి రాక్షస వంశీయులను; ఆజిన్= యుద్ధంలో; వధించుట= చంపటం; ఏమి, చోద్యమే?= ఏమి వింత?

తాత్పర్యం: 'నీవు గొప్పవాడివి, నీవు పూనుకొని అంతటి బలవంతుడైన ఆ రావణుడిని సైతం సులువుగా యుద్ధంలో సంహరించ కలిగినవాడివి. అట్టి గొప్ప పరాక్రమం కల నిన్ను సహాయుడిగా గొని, రఘువంశంలో జన్మించిన శ్రీ రామచంద్రుడు నరమాంసభక్షకులైన రాక్షసులను యుద్ధంలో చంపటం ఏమంత వింత కాదు.'

వ. అనిన వాని కతిప్రీతిమంతుండై హనుమంతు డిట్లనియె 'నయ్యా! నీవు సౌగంధిక సరోవరంబునకుం బోయెద వే నందు సాహసంబు సేయవలవ; దది యక్షరాక్షసరక్షితంబై దేవతోపభోగయోగ్యంబై యుండు; దేవతలు

బలిహోమ నమస్కారంబులఁజేసి భక్తిసాధ్యులు గాని సాహసక్రియాసాధ్యులు గారు; నీవు నిజధర్మ నిష్ఠితుండవై పరమధర్మంబు లెఱుంగునది; యెందేని హీనబుద్ధులు విమోహింతు రట్టి ధర్మాధర్మవిభాగంబు లెఱుంగు విద్వాంసుల నుపాసించి శుభాచారుండవు గావలయు; నాచారంబున ధర్మంబు వుట్టు; ధర్మంబువలన వేద ప్రతిష్ఠ యగు; వేదంబులం జేసి యజ్ఞంబులు ప్రవర్తిల్లు; నట్టి యజ్ఞంబువలన దేవతలు తృప్తు లగుదురు.347

ప్రతిపదార్థం: అనిన= అని చెప్పగా; వానికి= అతడికి అనగా భీముడి పట్ల; అతి, ప్రీతిమంతుండు+ఐ= మిక్కిలి ప్రేమ కలవాడై; హనుమంతుండు= ఆంజనేయుడు; ఇట్లు= ఈ విధంగా, ఇట్లా; అనియెన్= చెప్పాడు; అయ్యా!= నాయనా!; నీవు= నీవు; సౌగంధిక, సరోవరంబునకున్= సౌగంధికములు అనేటటువంటి తామర పువ్వులు పూచే సరస్సుకు; పోయెదవు+ఏని= వెళ్ళినట్లయితే; అందు= అక్కడ; సాహసంబు+చేయ, వలవదు= తొందర పడి పరాక్రమాన్ని ప్రదర్శించవద్దు; అది= ఆ సరస్సు; యక్ష, రాక్షస, రక్షితంబు+ఐ= యక్షులచేతను, రాక్షసులచేతను కాపాడబడునటువంటిదై; దేవతా+ఉపభోగయోగ్యంబు+ఐ= వేల్పుల చేత అనుభవించతగినది అయి; ఉండు= ఉంటుంది; దేవతలు= వేల్పులు; బలి, హోమ, నమస్కారంబులన్+చేసి= నైవేద్యాలచేత, అగ్నిలో వేల్చటం చేత, వందనాలు చేయటం ద్వారా; భక్తి, సాధ్యులు, కాని= ఆరాధన భావంతో వశమయ్యేటటువంటి వారే కాని; సాహసక్రియా, సాధ్యులు, కారు= తొందరపాటుతో కూడిన పనులచేత వశమయ్యేవారు కారు; నీవు= నీవు; నిజ, ధర్మ, నిష్ఠితుండవు+ఐ= నీవు ఆచరించవలసిన ధర్మమందు దీక్ష కలవాడివై; పరమ ధర్మంబులు= ధర్మాలలో కెల్ల ఉత్తమములైన ధర్మాలను; ఎఱుంగునది= తెలిసికొనేది; ఎందేని= అటువంటి ఉత్తమములైన ధర్మాలను తెలిసికొనటంలో; హీన, బుద్ధులు= అల్పబుద్ధులు, సరియైన తెలివి తేటలు లేనివారు; విమోహింతురు= భ్రమకు లోను అవుతారో; అట్టి= అటువంటి; ధర్మ+అధర్మ, విభాగంబులు= ధర్మాధర్మ విచక్షణలను; ఎఱుంగు= తెలిసినట్టి; విద్వాంసులను= పండితులను; ఉపాసించి= ఆరాధించి; శుభ+ఆచారుండవు+కావలయున్= మంచి ప్రవర్తన కలవాడివి కావాలి; ఆచారంబున= ప్రవర్తనవలన అనగా మహానుభావులు పలువురు ఆచరించేటటువంటి తీరు తెన్నులలో వర్తించటం వలన; ధర్మంబు= ధర్మం; పుట్టు= ఉద్భవిస్తుంది; ధర్మంబు వలన= ధర్మం వలన; వేద, ప్రతిష్ఠ+అగు= వేదాల యొక్క స్థిరమైన ఉనికి ఏర్పడుతుంది; వేదంబులన్+చేసి= వేదాలచేత; యజ్ఞంబులు= క్రతువులు; ప్రవర్తిల్లున్= జరుగుతాయి; అట్టి= అటువంటి; యజ్ఞంబువలన= వేదాలచేత ప్రతిపాదించబడిన క్రతువులు జరగటంవలన; దేవతలు= వేల్పులు; తృప్తులు= తృప్తి చెందినవారు; అగుదురు= అవుతారు.

తాత్పర్యం: అని భీముడు పలుకగా అతడి యెడ మిక్కిలి ప్రేమతో హనుమంతుడు ఇట్లా చెప్పాడు: 'నాయనా! నీవు సౌగంధికాలు అనే పేరు కల నూరురేకుల బంగారు తామరపువ్వులు గల కొలనుకు పోయినట్లయితే, అక్కడ తొందరపడి నీ శౌర్యం ప్రదర్శించటానికి పూనుకొనవద్దు. ఆ సరోవరాన్ని యక్షులు, రాక్షసులు కాపాడుతుంటారు. అది దేవతలు అనుభవించేటటువంటిది. దేవతలు ఆరాధనకు లొంగుతారు. బలులు, హోమాలు, నమస్కారాల వలన సంతృప్తి చెందుతారు. వారు భక్తిభావం చేత ప్రసన్నులౌతారు గాని, శౌర్యపరాక్రమాలచేత సాధించతగినవారు కారు. నీవు నీ ధర్మాన్ని ఆచరించటంలో దీక్ష పూనుము. పరమధర్మాన్ని తెలిసికొనుము. సరిఅయిన తెలివితేటలు లేనివారు ఎక్కడ పొరపడతారో అట్టి ధర్మాధర్మవిచక్షణను పండితులను ఆశ్రయించి తెలిసికొనుము. ఆవిధంగా నీవు సరి అయిన ప్రవర్తన అలవరచుకొనుము. మహాత్ములయొక్క ప్రవర్తన పలువురిచేత అనుసరించబడినదై.

ఉత్తమమగు ఆచారం అవుతుంది. అటువంటి ఆచారం నుండి ధర్మం జన్మిస్తుంది. ధర్మం వలన వేదం పాదుకొంటుంది. వేదాలవలన యజ్ఞాలు జరుగుతాయి. అటువంటి యజ్ఞాలు జరగటంచేత దేవతలు తృప్తి చెందుతారు.

ఆ. కార్యసిద్ధిపొంటెఁ గాలంబు దేశంబు । నెఱిఁగి బుద్ధిమంతు లెల్లప్రొద్దు
సాహసంబు విడిచి సామాద్యుపాయప్ర । యుక్తి చేయుదురు యథోచితముగ. 348

ప్రతిపదార్థం: బుద్ధిమంతులు= తెలివి కలవారు; ఎల్లప్రొద్దు= ఎల్లప్పుడూ; కార్య, సిద్ధి, పొంటెన్= కార్యం జయప్రదమవటానికి; కాలంబు= తగిన కాలాన్ని; దేశంబున్= తగిన స్థలాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; సాహసంబు విడిచి= తొందరపాటును విడిచిపెట్టి; సామ+ఆది+ఉపాయ, ప్రయుక్తి= సామం మొదలైన ఉపాయాలను ఉపయోగించి; యథా+ఉచితముగన్= ఆయాసమయాలకు ఆయా స్థలాలకు; తగినట్లుగా; చేయుదురు= ఆచరిస్తారు.

తాత్పర్యం: ఏ కర్తవ్యాన్ని నెరవేర్చటంలోనైనా బుద్ధిమంతులు తగిన సమయాన్ని తగిన స్థలాన్ని తెలిసికొని సాహసాన్ని వదలి సామదాన భేద దండోపాయాలను ఏవిధంగా ప్రయోగించతగునో అట్లాగే ప్రయోగించి విజయాన్ని సాధిస్తారు.

విశేషం: విజయ సాధనకు ప్రాచీనులు పేర్కొన్న నాలుగు ఉపాయాలు (1) సామం= మంచితనం ఉపయోగించటం, (2) దానం= ధనం ఇవ్వటం (3) భేదం= శత్రువులలో చీలికలు ఏర్పరచటం (4) దండం= పరాక్రమం చూపి శత్రువులను శిక్షించటం. చతుర్విధోపాయాలను ప్రయోగించటంలో మొదటిది సామం. చిట్ట చివరిది దండం అని మరువకూడదు.

వ. మఱియు సర్వకార్యంబులు మంత్రమూలంబులు గావున విద్వాంసులై ప్రబుద్ధులైనవారలతో మంత్రంబుఁ జేయునది; బాలకులయు నధికశ్రీదర్పితులయు లుబ్ధులయు లఘుజనంబులయుఁ దోడ మంత్రంబు సేయవలదు. 349

ప్రతిపదార్థం: మఱియు= ఇంకను; సర్వ, కార్యంబులు= అన్ని పనులు; మంత్ర, మూలంబులు= ఆలోచనే ఆధారంగా కలవి; కావున= కాబట్టి; విద్వాంసులు+ఐ= పండితులై; ప్రబుద్ధులు= ఐనవారలతో= గొప్పతెలివితేటలు కలవారితో; మంత్రంబున్+ చేయునది= ఆలోచించాలి; బాలకులయున్= చిన్నపిల్లలతో; అధిక శ్రీదర్పితులయు= అమితమైన ధనంచేత గర్వించే వారలతో; లుబ్ధులయు= పిసినిగొట్టులతో; లఘు జనంబులయున్+తోడన్= నీచులు అయిన వారితో; మంత్రంబు+చేయవలదు= ఆలోచించటం కూడదు.

తాత్పర్యం: ఇంకనూ అన్ని పనులు నెరవేరటానికి ఆలోచన అవసరం. కాబట్టి పండితులై గొప్ప తెలివి తేటలు కలవారితో ఆలోచన చేయాలి. బాలకులతో, ఎక్కువ సంపదతో విర్రవీగే వారితో, పిసినిగొట్టులతో, నీచులతో ఆలోచన చేయకూడదు.

తే. జనులు నిగ్రహానుగ్రహశక్తుఁ డైన । రాజు శాసనమునఁ జేసి రమణతోడ
నోలిఁ దమ తమ మర్యాద లొక్కనాఁడుఁ । దప్ప నోడుదు రిమ్మహీతలమునందు. 350

ప్రతిపదార్థం: జనులు= ప్రజలు; నిగ్రహ+అనుగ్రహ, శక్తుఁడు+ఐన= దండించటానికి, దయ చూపటానికి సామర్థ్యం కల; రాజు, శాసనమునన్+చేసి= ప్రభువు యొక్క ఆజ్ఞచేత; రమణతోడన్= సంతోషంతో; ఓలిన్= వరుసగా; ఒక్కనాఁడున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒకరోజు కూడా; ఈ, మహీ, తలము, నందు= ఈ భూలోకంలో; తమ, తమ, మర్యాదలు= తమ తమ విధులు; తప్పన్= అతిక్రమించటానికి, ఓడుదురు= భీతిల్లుతారు.

తాత్పర్యం: దండించటానికి, దయ చూపటానికి శక్తికల రాజు యొక్క శాసనం వలన ప్రజలు నిరంతరం సంతోషిస్తూ, భూతలం మీద ఒకనాడు కూడా తమ తమ విధులను తప్పటానికి వెనుకాడుతారు.

వ. నీవు నిగ్రహానుగ్రహసమర్థుండవు గావున నీ కెల్లవారును వశ్యు లగుదురు; నిన్నుఁ జూచుటంజేసి నా నయనంబులు సఫలంబయ్యెః నీకెద్ది యిష్టంబు దానిం జేసెద. 351

ప్రతిపదార్థం: నీవు= నీవు; నిగ్రహ+అనుగ్రహ, సమర్థుండవు= దండించటానికికాని, దయ చూపటానికి కాని శక్తి కల వాడివి; కావున= కాబట్టి; నీకు= నీకు; ఎల్లవారును= అందరున్నూ; వశ్యులు+అగుదురు= లోబడిన వారు అవుతారు; నిన్నున్+ చూచుటన్+చేసి= నిన్ను చూడటం చేత; నా నయనంబులు= నా కళ్ళు; సఫలంబు+అయ్యెన్= ఫలంతో కూడినవి అయినాయి, ధన్యమైనాయి; నీకున్+ఎద్ది= నీకు ఏది; ఇష్టంబు= ప్రీతి కలిగించేదో; దానిన్= దానిని; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: నీవు దయ చూపగలవు, దండించ గలవు. ఈ రెండు శక్తులు నీకు ఉన్నాయి. అందుచేత అందరూ నీకు లోబడి ఉంటారు. నిన్ను చూడటంచేత నా కన్నులు సార్థకాలైనాయి. నీకు ఏది ఇష్టమో చెప్పుము. నేను దానినే చేస్తాను.

మత్తకోకిలము.

మీకు నెగ్గొనరించి యున్న యమిత్రులన్ హతబుద్ధులం
జీకురాజు తనూజులం గురుసింహ! నీకుఁ బ్రియంబుగా
నేకమాత్రన పోరిలో వధియించి నాగపురంబు నా
నాకులాద్రి శిలావలీ గహనంబు సేయుదు' నావుడున్. 352

ప్రతిపదార్థం: మీకున్= మీకు; ఎగ్గు= అపకారం; ఒనరించి, ఉన్న= చేసిఉన్న; అమిత్రులన్= శత్రువులను; హతబుద్ధులన్= చెడిన తెలివితేటలు కలవారిని; చీకురాజు తనూజులన్= గ్రుడ్డి ప్రభువు అయిన ధృతరాష్ట్రుడి కొడుకులను; కురుసింహ!= కురు వంశ మందలివారిలో సింహంవంటివాడా!; నీకున్= నీకు; ప్రియంబుగాన్= సంతోషంగా; ఏక మాత్రన= ఒంటరిగా; పోరిలోన్= యుద్ధంలో; వధియించి= సంహరించి; నాగపురంబు= హస్తినాపురిని; నానా, కులాద్రి, శిలా+ ఆవలీగహనంబు+ చేయుదున్= పెక్కుకుల పర్వతాలయొక్క రాళ్ళ సముదాయంతో నిండి, ప్రవేశించ వీలుకాని దానినిగా చేయగలను; నావుడున్= అని చెప్పగా.

తాత్పర్యం: కురువంశంలో సింహంవంటివాడివైన ఓ భీమా! మీకు కీడు చేసిన శత్రువులను చెడిపోయిన తెలివి తేటలు కలవారిని, గుడ్డి ప్రభువు కొడుకులను నీకు సంతోషం కలిగేటట్లుగా నేను ఒక్కడినే యుద్ధంలో సంహరించి హస్తినాపురాన్ని పెక్కు కుల పర్వతాలలోని రాళ్ళు రప్పలతో కప్పి, చొరరాని అడవిగా మార్చి వేయగలను'- అని ఆంజనేయుడు చెప్పగా భీముడు (ఇట్లా చెప్పాడు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మత్తకోకిలము.

'ఇంతయుం గపినాథ! నీ కిది యేమి పెద్ద? మహాహవా
భ్యంతరంబున నుద్ధతప్రతిపక్షవీరుల నేము ని
ర్జింతు; మెవ్వరు మాకు మీ దయఁజేసి మార్కొను నంత య
త్యంతవీరులు లేరు భూవిదితప్రతాపబలోన్నతిన్.' 353

ప్రతిపదార్థం: కపి, నాథ!= వానరులలో శ్రేష్ఠుడ వైనవాడా!; ఇంతయున్= ఇది అంతా- అంటే అసహాయశూరుడవై ఒంటిగా మా శత్రువులను అందరినీ యుద్ధంలో సంహరించటం; నీకు= నీకు; ఇది+ఏమి, పెద్ద?= ఇది ఏమంత ఘనకార్యం?; మహా+ఆహవ+అభ్యంతరంబునన్= గొప్పదైన పోరుమధ్యలో; ఉద్ధత, ప్రతిపక్ష, వీరులన్= గర్వించిన శత్రుశూరులను; ఏము+అ= మేమే; నిర్జింతుము= జయించగలం; మీ దయన్+చేసి= మీ దయవలన; భూవిదిత ప్రతాప, బల+ఉన్నతిన్= భూమండలమంతటికీ తేటతెల్లమైన పరాక్రమంతో కూడిన గొప్పతనంతో; మార్కొను+అంత= (మమ్ము) ఎదిరించ గలిగేటంతటి; అత్యంత వీరులు= మిగుల గొప్పవారైన శత్రువీరులు; మాకున్= పాండవులమైన మాకు; ఎవ్వరు= ఎవ్వరూ; లేరు= లేరు. (మీ దలయవలన మా పరాక్రమ, శక్తులను మించిన ప్రతివీరులెవ్వరూ ఈ భూమండలంలో లేరని భావం).

తాత్పర్యం: 'వానరులలో శ్రేష్ఠుడివైనవాడా! నీవు ఒక్కడివే అసహాయుడివై మా శత్రువులను అందరినీ యుద్ధంలో సంహరించగలవు. ఇది నీకు ఒక ఘనకార్యమా! గర్వించిన శత్రువీరులను మేమే యుద్ధంలో జయించగలం. మీ దయవలన ఈ భూలోకంలో తేటతెల్లమైన పరాక్రమం గల మేము జయించలేని గొప్ప వీరులు ఎవ్వరూ లేరు.'

విశేషం: మత్తకోకిల వృత్తలక్షణానికి ఆర. 1.46 విశేషాంశం చూడండి.

వ. అనిన విని భీమసేనునకు హనుమంతుం డిట్లనియె 'నన్ను రణాంతరంబునం దలంచునది; నీ యందు సౌహృదంబున నాహవంబులో నతిరథుండైన యర్జును రథధ్వజంబునం దుండి మీ బలపరాక్రమంబులం జూతు' నని భీముం గౌఁగిలించుకొని, వానికి సౌగంధిక సరోవర మార్గంబుఁజూపి, హనుమంతుం డంతర్హితుం డైనఁ, దదాలింగన విగతశ్రముండును విపులజవశక్తియుక్తుండును నై భీమసేనుండు. 354

ప్రతిపదార్థం: అనిన విని= అని చెప్పగా ఆలకించి; భీమసేనునకు= భీముడికి; హనుమంతుండు= ఆంజనేయుడు; ఇట్లు+అనియె= ఈ విధంగా చెప్పాడు; నన్ను= నన్ను; రణ+అంతరంబునన్= యుద్ధం మధ్యలో; తలంచునది= స్మరించవలసింది; నీ+అందు సౌహృదంబునన్= నీ యందలి నెయ్యం చొప్పున; ఆహవంబులోన్= యుద్ధంలో; అతిరథుండు+ఐన= రథికులలో శ్రేష్ఠుడు అయిన; అర్జును రథధ్వజంబు నందు+ఉండి= అర్జునుడియొక్క తేరిజెండాపై ఉండి; మీ, బల, పరాక్రమంబులన్+చూతును= మీ బల, పౌరుషాలను చూస్తాను; అని= అని చెప్పి; భీమున్= భీముడిని; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; వానికిన్= అతడికి- ఆ భీముడికి; సౌగంధిక, సరోవర, మార్గంబున్+చూపి= సౌగంధికాలు అనే వేయి రేకుల బంగారు తామర పువ్వులు పూచేటువంటి కొలనుకు దారిని చూపి; హనుమంతుండు= ఆంజనేయుడు; అంతర్హితుండు+ఐనన్= కనిపించకుండా మాయం కాగా; తత్+ఆలింగన విగత శ్రముండును= అతడి-అనగా ఆంజనేయుడియొక్క కౌగిలింతచేత పోగొట్టబడిన శ్రమకలవాడున్నూ; విపుల, జవ, శక్తి, యుక్తుండునున్+ఐ= ఎక్కువ వేగం, బలం కలవాడున్నూ అయి; భీమసేనుండు= భీముడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని చెప్పిన ఆలకించి భీముడికి హనుమంతుడు యిట్లా చెప్పాడు: 'నన్ను యుద్ధంలో సంస్మరించుము; నీ మీది నెయ్యంతో నేను మహావీరుడైన అర్జునుడి రథంపై ఉండే జెండాపై ఉండి, యుద్ధంలో మీ బలాన్ని, మీ శౌర్యాలను తిలకిస్తాను' అని భీముడిని కౌగిలించుకొని, అతడికి సౌగంధికాలు అనే వేయిరేకుల బంగారు తామర పువ్వులు పూచేటటువంటి కొలనుకు దారిచూపి హనుమంతుడు మాయమయ్యాడు. అంతట భీముడు హనుమంతుడు కౌగిలించుకోవటం వలన, పోయిన శ్రమ కలవాడై నూతనోత్సాహంతో కొంగ్రొత్త జవసత్వాలతో ఒప్పారాడు.

సీ. **వారిధారల ననివారిత నిర్గళ । ద్దానధారలఁ దటిద్ధామములను**
దశనధామంబుల నశనిఘోషంబుల । ఘోరబృంహిత బృహద్ఘోషణముల
నివి ఘనబృందంబు లివి గజయూథంబు । లని విచారింపంగ నక్కజంబు
లై లలితోత్తుంగ శైలశృంగంబులఁ । ద్రిమ్మరు జలధరద్విరదతతుల

ఆ. **విస్మయంబుతోడ వీక్షించుచుం జని । రజతగిరిసమీపరమ్యభూమి**
నక్కుబేరవనమునందు సౌగంధిక । కమలవనముఁ గనియె ఘనభుజుండు. **355**

ప్రతిపదార్థం: వారి ధారలన్= నీటి జాలులచేత; న+నివారిత, నిర్గళత్+దాన, ధారలన్= ఎడతెగకుండా స్రవించే మదజలం యొక్క ధారలచేత; తటిత్+ధామములను= విద్యుల్లతల యొక్క వెలుగుల చేత; దశన ధామములను= దంతాలయొక్క కాంతుల చేత; అశని, ఘోషంబులన్= పిడుగుల చప్పుళ్ళ చేత; ఘోర, బృంహిత, బృహత్+ఘోషణములన్= భయంకరాలైన బృంహితాలనే గొప్పధ్వనులచేత (ఏనుగు ఘీంకారానికి బృంహితం అనిపేరు); ఇవి= ఇవి; ఘన, బృందంబులు= మేఘాల సమూహాలు; ఇవి= ఇవి; గజయూథంబులు= ఏనుగుల గుంపులు; అని, విచారింపంగన్= అని వేరువేరుగా ఆలోచించి తెలిసికొనటానికి; అక్కజంబులు+ఐ= వీలుకానంతగా అచ్చెరువు కొలిపేటటువంటివై; లలిత+ఉత్తుంగ, శైల, శృంగంబులన్= మనోహరాలైన ఎత్తయిన కొండలయొక్క శిఖరాలపై; త్రిమ్మరు= సంచరించే; జలధర, ద్విరద, తతుల= మబ్బుల గుంపులను, ఏనుగుల గుంపులను; విస్మయంబుతోడ= ఆశ్చర్యంతో; వీక్షించుచున్= చూస్తూ; చని= వెళ్ళి; రజత, గిరి, సమీప, రమ్య, భూమిన్= వెండికొండకు చేరువలో ఉన్న సొగసైన ప్రదేశమందలి; ఆ+కుబేరువనము నందున్= ఆ కుబేరుడి తోటలో; ఘన, భుజుండు= గొప్ప భుజాలు కలవాడు- పరాక్రమం కల భీముడు; సౌగంధిక కమలవనమున్= సౌగంధికములనే పేరుగల తామరపువ్వులుగల తోటను; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: గొప్ప భుజాలు కల భీముడు, ఆ కుబేరుడి తోటలో సౌగంధిక కమలాలు ఉన్న సరోవరాన్ని చూచాడు. అతడు మార్గమధ్యాన వెండికొండకు చేరువలో ఉన్న సొగసైన ప్రదేశమందు కల కొండశిఖరాలను ఆశ్చర్యంగా చూచాడు. ఆ కొండలపై ఎత్తైన శిఖరాలమీద సంచరించే మేఘాల సమూహాలను, ఏనుగుల గుంపులను చూచాడు. ఏవి ఏనుగులో, ఏవి మేఘాలో వేరుపరచటం వీలు కానట్లుగా, ఆ మేఘాలు, ఏనుగులు అక్కడ ఉన్నాయి. మేఘాలకు నీటిధారలు ఉన్నాయి. ఏనుగులకు దానజలధారలు (మదించిన ఏనుగులకు గండస్థలాలనుండి దాన జలం కారుతుందని సుప్రసిద్ధం) ఉన్నాయి. మేఘాలలో విద్యుల్లతలు వెలుగులీనుతున్నాయి. ఏనుగులలో దంతాలు ప్రకాశిస్తున్నాయి. మేఘాలకు పిడుగుల ధ్వనులు ఉన్నాయి. ఏనుగులకు ఘీంకార రవాలు ఉన్నాయి. అందుచేత ఇవి ఏనుగులు- ఇవి మేఘాలు అని వేరు పరచటం వీలుకాకపోయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: రూపకాలంకారం : ఉపమానుప్రాణితం.

క. అందుల హేమాంబుజ మక । రంద రసామోద మృదుతరశ్వసనుం డా
నందంబుఁ జేసెఁ దన ప్రియ । నందనునకు భీమసేనునకు నభిముఖుండై. 356

ప్రతిపదార్థం: అందుల= అక్కడి; హేమ+అంబుజ, మకరంద, రస+ఆమోద, మృదుతర, శ్వసనుండు= బంగారు తామరపూలలోని తేనెద్రవంతో కూడి సుదూరం వ్యాపించే నెత్తావిలో మిగుల మెత్తనైన వాయుదేవుడు; తన, ప్రియనందనునకున్= తన ప్రేమకు పాత్రుడైన కొడుకుకు; భీమసేనునకున్= భీముడికి; అభిముఖుఁడు+ఐ= ఎదురైనవాడై; ఆనందంబున్+చేసెన్= సంతోషాన్ని కల్పించాడు.

తాత్పర్యం: ఆ సరోవరంలో గల బంగారు తామరపూలలో ఉన్న తేనెల ద్రావకాలతో తడిసి సుదూరం వ్యాపించే నెత్తావితో మెత్తనై వాయుదేవుడు, తన ప్రియసుతు డైన భీమసేనుడికి ఎదురు వచ్చి మిక్కిలి సంతోషం కలిగించాడు.

విశేషం: ఆమోద శబ్దానికి రెండు అర్థాలు ఉన్నాయి. 1) సంతోషంతో అంగీకారం తెలపటం 2) దూర దూరాలకు వ్యాపించేటటువంటి నెత్తావి. ఇక్కడ భీముడికి వాయుదేవుడు స్వాగత పూర్వకమైన ఆమోదాన్ని ప్రసరింపజేశాడు. రెండర్థాలూ ఇక్కడ పొసగుతాయి. అలంకారం - శ్లేష.

వ. అంత. 357

తాత్పర్యం: అప్పుడు.

క. వీరుండై సౌగంధిక । వారిజములు గొనఁగ నిట్లు వచ్చినవానిన్
భూరిపరాక్రము భీము ను । దారగదాహస్తుఁ జూచి తా రుద్ధతులై. 358

ప్రతిపదార్థం: వీరుండు+ఐ= పరాక్రమం కలవాడై; సౌగంధిక, వారిజములు= సుగంధంతో కూడిన పద్మాలు; కొనఁగన్= సంగ్రహించటానికై; ఇట్లు= ఈ విధంగా; ఇట్లా; వచ్చిన వానిన్= వచ్చిన వాడిని; భూరి, పరాక్రము= గొప్ప శౌర్యం కలవాడిని; ఉదార, గదా, హస్తున్= పెద్దగద చేతిలో కలవాడిని; భీమున్= భీముడిని; చూచి= దర్శించి; తారు= తాము; ఉద్ధతులు+ఐ= గర్వించినవారై.

తాత్పర్యం: పరాక్రమం కలవాడై సౌగంధిక కమలాలను తీసికొని పోవటానికి ఈ రీతిగా అరుదెంచిన భీముడిని గొప్ప శౌర్యం కలవాడిని, పెద్దగద చేతిలో ధరించినవాడిని చూచి, తాముకూడా గర్వించినవారై.

వ. దాని రక్షించి యున్న పదివేవురు రాక్షసు లాక్షణంబ విచిత్రాయుధ పరిచ్ఛదులై పఱతెంచి 'వీఁ డొక్క దివ్య పురుషుం డాయుధంబులు ధరియించినవాఁ, డజినంబులు గట్టిన వాఁ, డధికతేజస్వి, తపస్వి వేషధరుం డిందులకు వచ్చినవాఁ' డని యచ్చెరువందుచు భీమసేనుం డాయవచ్చి యి ట్లనిరి. 359

ప్రతిపదార్థం: దానిన్= ఆ సరోవరాన్ని; రక్షించి, ఉన్న= కాపాడుతున్న; పదివేవురు, రాక్షసులు= పదివేల మంది రాక్షసులు; ఆ క్షణంబు+అ= ఆ క్షణమందే; విచిత్ర+ఆయుధ, పరిచ్ఛదులు+ఐ= ఆశ్చర్యం కొలిపే వింత వింత శస్త్రాలనే ఉపకరణాలతో కూడినవారై; పఱతెంచి= పరుగున వచ్చి; వీఁడు= ఇతడు; ఒక్క, దివ్య, పురుషుండు= ఒక అతిలోకశక్తి గల అంటే దేవతాశక్తి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గల మనుష్యుడు; ఆయుధంబులు= శస్త్రాలు; ధరియించినవాఁడు= పూనినవాడు; అజినంబులు= లేడితోళ్ళు; కట్టినవాఁడు= ధరించినవాడు; అధిక, తేజస్వి= గొప్ప ప్రకాశం కలవాడు; తపస్వి, వేష, ధరుండు= మునులు ధరించే ఆహార్యాన్ని ధరించినవాడు; ఇందులకు= ఇక్కడికి; వచ్చినవాఁడు= వచ్చాడు; అని= అని తలపోస్తూ; అచ్చెరువు+అందుచు= ఆశ్చర్యాన్ని పొందుతూ; భీమసేనున్= భీముడిని; డాయ వచ్చి= సమీపించి; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: ఆ సరోవరాన్ని సంరక్షిస్తున్న పదివేలమంది రాక్షసులు ఆ క్షణంలోనే వింత వింత ఆయుధాలు ధరించి వేగంగా వచ్చి భీముడిని చూచి, 'ఇతడు ఎవ్వడో దివ్య పురుషుడై ఉండాలి; గొప్ప తేజస్సు కలవాడై ఉన్నాడు. ఆయుధాలు ధరించి ఉన్నాడు. ఇతడు వీరుడు మాత్రమే కాదు; ఋషివలె గొప్ప తేజస్సుతో విలసిల్లుతున్నాడు. లేడి చర్మాలు వస్త్రాలుగా ధరించి ఉన్నాడు'- అని ఆశ్చర్యపడుతూ ఆతడిని సమీపించి ఇట్లా పలికారు.

తరలము.

> **'ఇది కుబేరువనంబు; దీనికి నెవ్వరుం జనుదేర నో**
> **డుదురు; నీ విట వచ్చి యేల కడుం బ్రమాదముఁ జేసి? తిం**
> **దుదితతేజుఁడు గ్రీడ లాడుచు నుండు నింతులుఁ దాను స**
> **మ్మదముతోడఁ గుబేరుఁ డీ రుచిమత్సరోజవనంబునన్. 360**

ప్రతిపదార్థం: ఇది= ఈ ఉద్యానవనం; కుబేరు, వనంబు= కుబేరుడి తోట; దీనికిన్= ఈ తోటలోనికి; ఎవ్వరున్= ఎవ్వరున్నూ; చనుదేరన్+ఓడుదురు= వచ్చేందుకు వెనుకాడుతారు; నీవు+ఇట, వచ్చి= నీవు ఇక్కడికి వచ్చి; ఏల= ఎందుకు; కడున్= మిక్కిలి; ప్రమాదమున్+చేసితి= ముప్పు తెచ్చు కొన్నావు; ఇందున్= ఇక్కడ- ఈ తోటలోని కొలనులో; ఉదిత తేజుఁడు= ఉదయించిన తేజస్సు కలవాడు- దేదీప్యమానంగా వెలిగే వర్చస్సు కలవాడు; కుబేరుఁడు= దిక్పాలకుడు అయిన కుబేరుడు; ఇంతులున్+తాను= తన భార్యలు, తాను; సమ్మదముతోడన్= సంతోషంతో; ఈ రుచిమత్+సరస్+జ వనంబునన్= శోభాయమానంగా ప్రకాశించే ఈ తామర కొలనులో; క్రీడలు= ఆటలు; ఆడుచున్+ఉండున్= వినోదిస్తుంటాడు.

తాత్పర్యం: 'ఇది దిక్పాలకుడైన కుబేరుని తోట, ఈ తోటదరికి ఎవ్వరైన చేరటానికి వెనుకాడుతారు. నీవు ఇక్కడికి ఎందుకు వచ్చావు? ఎందుకు ప్రమాదాన్ని తెచ్చుకొంటున్నావు? ఈతోటలోని తామర కొలనులో దేదీప్యమానమైన వర్చస్సు కల కుబేరుడు తన భార్యలతో జలక్రీడలు ఆడుతుంటాడు.

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.374 విశేషాంశం చూడండి

వ. **దీని తీరంబున దేవర్షిగణంబులు దేవతార్చనంబులఁజేయుదు; రిందుల జలంబు లమృతోపమానంబులు; మఱి వైడూర్యనాళంబులై యపూర్వసౌరభంబులైన కనకకమలంబులు గలుగుటం జేసి యక్షరాక్షసాక్షౌహిణీ రక్షితం బగు దీని మహిమం బెఱుంగక యింతదూరంబు వచ్చిన వీరుం డెవ్వండ? వేమి కారణంబున వచ్చి?' తనిన వారికి భీముం డిట్లనియె. 361**

ప్రతిపదార్థం: దీని తీరంబునన్= ఈ కొలను గట్టున; దేవ+ఋషి, గణంబులు= దేవతల, మునుల సమూహాలు; దేవతా+అర్చనంబులన్= దేవతలకు పూజలను; చేయుదురు= చేస్తారు; ఇందుల జలంబులు= ఈ సరోవరంలోని నీళ్ళు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అమృత+ఉపమానంబులు= అమృతంతో సరిపోలేటటువంటివి; మఱి= ఇంకను; వైడూర్య, నాళంబులు+ఐ= వైడూర్యాలు అనేమణుల వంటి కాడలు కలిగి; అపూర్వ, సౌరభంబులు+ఐన= మునుపు ఎన్నడూ లేనటువంటి నెత్తావి కలిగిన; కనక, కమలంబులు= బంగారు పద్మాలు; కలుగుటన్+చేసి= ఉండటంచేత; యక్ష, రాక్షస+అక్షౌహిణీ, రక్షితంబు+అగు= యక్షులతో, రాక్షసులతో కూడిన అక్షౌహిణిసైన్యంచేత కాపాడబడేటటువంటి; దీని, మహిమంబు= ఈ సరోవరం యొక్క గొప్పతనం; ఎఱుంగక= తెలియక; ఇంత, దూరంబు= ఇంత దూరం; వచ్చిన= వచ్చిన; వీరుండు+ఎవ్వండవు= వీరుడివి నీవు ఎవరివి?; ఏమి కారణంబునన్= ఎందుచేత; వచ్చితి(వి)= అరుదెంచావు; అనిన= అని ప్రశ్నించగా; వారికి= ఆ కుబేరభటులకు; భీముండు= భీముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ కొలను గట్టున దేవతలు, ఋషులు దైవపూజలు చేస్తారు. ఈ సరోవరంలోని నీళ్ళు అమృత తుల్యాలు. ఈ కొలనులోని సౌగంధికకమలాలు బంగారురేకులతో వైడూర్యమణినాళాలతో వే రెక్కడా ఇంతకు ముందు ఎన్నడూ లేని పరిమళంతో ఒప్పారేటటువంటివి. యక్షరాక్షసభటులు గల అక్షౌహిణీ సైన్యం ఈ కొలనుగొప్పతనం తెలియక వచ్చిన నీవు ఎవడవు? ఇక్కడికి ఎందుకై వచ్చావు'- అని ప్రశ్నించగా భీముడు వారికి ఇట్లా బదులు పలికాడు.

విశేషం: వైడూర్యం- విడూరదేశంలో పుట్టిన రత్నం. తెలుగులో పిల్లికన్నురత్నం అంటారు.

మత్తకోకిలము.

'ఏను పాండుసుతుండ భీముఁడ నిద్ధతేజుఁడ ధర్మరా
జానుజన్ముఁడ; ద్రౌపదీహృదయప్రియం బొనరింపఁగాఁ
బూని యిక్కమలాకరంబునఁ బుష్పముల్ గొన వచ్చితిన్;
వీనిఁ గొందు నవశ్యమున్ సురవీరు లడ్డము వచ్చినన్.' 362

ప్రతిపదార్థం: ఏను= నేను; పాండుసుతుండు+అ= పాండురాజు కొడుకును; భీముఁడన్= భీముడు అనే పేరు కల వాడిని; ఇద్ధ, తేజుఁడన్= అడ్డులేని పరాక్రమం కలవాడిని; ధర్మరాజ+అనుజన్ముఁడన్= ధర్మరాజు తమ్ముడిని; ద్రౌపదీ, హృదయ, ప్రియంబు= ద్రౌపది హృదయానికి సంతోషం; ఒనరింపఁగాన్= కలిగించటానికై; పూని= దీక్ష వహించి, ఈ+కమల+ఆకరంబునన్= ఈ కొలనులోని; పుష్పముల్= పువ్వులు; కొనవచ్చితిన్= తీసికొని పోవటానికై, వచ్చాను; సురవీరులు= దేవతలలోని శూరులు; అడ్డము, వచ్చినన్= అడ్డు తగిలి అవరోధం కల్పించినప్పటికినీ; వీనిన్= ఈ పువ్వులను; అవశ్యమున్= తప్పకుండా; కొందున్= తీసికొని వెళ్ళగలను.

తాత్పర్యం: 'నేను పాండురాజుకొడుకును. నా పేరు భీముడు. నేను ధర్మరాజు తమ్ముడిని. ద్రౌపదిదేవికి సంతోషం కలిగించటానికై ఈ కొలనులోని సౌగంధిక కమలాలను తీసికొని పోవ వచ్చాను. అప్రతిహతమైన పరాక్రమం కలవాడినైన నేను, దేవతలు అడ్డగించినా లెక్కపెట్టక ఈ పువ్వులను తప్పక తీసికొని వెళ్ళుతాను.

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.46 విశేషాంశం చూడండి.

వ. అనిన వార లిట్లని 'రయ్యా! నీవు దివ్యపురుషుండ; వీ సౌగంధిక కమలంబులు గొనియెదేని కుబేరున కెఱింగించి తదాదేశంబునం గొనుము; నీవు ధర్మజానుజుండవు గావున నీకు ధర్మపథంబు తప్పం జన' దనిన రాక్షసులఁ గటాక్షదృష్టిం జూచి భీమసేనుం డిట్లనియె. 363

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనిన= అని భీముడు పలుకగా; వారలు= కుబేరుడి భటులు; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు; అయ్యా!= ఆర్యా!; నీవు= నీవు; దివ్య పురుషుండవు= అతిలోకశక్తి కలవాడివి; ఈ, సౌగంధిక, కమలంబులు= సౌగంధికాలు అనే పేరు కల ఈ తామర పువ్వులు; కొనియెదు+ఏని= తీసికొని వెళ్ళదలిస్తే; కుబేరునకు+ఎఱింగించి= కుబేరుడికి తెలిపి; తత్+ఆదేశంబునన్= అతని ఆజ్ఞ ప్రకారం; కొనుము= తీసికొని వెళ్లవలసింది; నీవు= నీవు; ధర్మజ+అనుజుండవు= ధర్మరాజుయొక్క తమ్ముడివి; కావున= కాబట్టి; నీకు= నీకు; ధర్మపథంబు= ధర్మమార్గం; తప్పన్+చనదు= అతిక్రమించటానికి వీలు లేదు; అనిన= అని చెప్పగా; రాక్షసులన్= రాక్షసులను; కటాక్ష, దృష్టిన్+చూచి= కడకంటి చూపులతో చూచి; భీమసేనుండు= భీముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని భీమసేనుడు చెప్పాడు. అంత కుబేరుడి భటులు ఈ విధంగా బదులు పలికారు: 'ఆర్యా! నీవు సామాన్య మానవుడివి కావు; లోకాతీత మైన శక్తి కలవాడివి; నీకు ఈ సౌగంధిక కమలాలను తీసికొని పోవాలనే అభిప్రాయం ఉన్నట్లయితే, దయచేసి ఆ విషయం మాదొర కుబేరుడికి తెలిపి, ఆయన ఆనతితో తీసుకొని వెళ్ళుము. నీవు ధర్మరాజు యొక్క తమ్ముడవు కాబట్టి నీవు ధర్మమార్గం తప్పకూడదుకదా!' అనగా, వారిని కడకంటితో చూస్తూ, భీముడు ఈ విధంగా అన్నాడు.

క. **'గిరినిర్ఝరములఁ బుట్టిన । సరోవరం బిదియు సర్వసామాన్యముగా**
కరుదుగ నొక్కని యదియే? పరఁగఁ గుబేరుండు దీనిఁ బడసెనె మొదలన్? 364

ప్రతిపదార్థం: గిరినిర్ఝరములన్= కొండలలోని సెలయేళ్ళవలన; పుట్టిన= పుట్టిన; సరోవరంబు= కొలను; ఇదియు= ఈ కొలను; సర్వసామాన్యము+కాక= అందరికీ సమానంగా చెందేటటువంటిది కాక; అరుదుగన్= అపూర్వంగా; ఒక్కని+అదియే?= ఒక్కడికి చెందిందా?; పరఁగన్= ఒప్పునట్లుగా; దీనిన్= ఈ కొలనును; మొదలన్= మొదట; కుబేరుండు= కుబేరుడు; పడసెనె?= పొందాడా?

తాత్పర్యం: 'ఈ కొలను కొండలలో ప్రవహించే సెలయేళ్ళవలన ఏర్పడినటువంటిది. ఇది అందరికి చెందినది కాక ఏ ఒక్కరి సొత్తు కాజాలదు. దీనిని మొదట కేవలం కుబేరుడే సంపాదించాడా?

తే. **ఉత్తమక్షత్త్రియుం డేల యొరుల నడిగి । వేఁడువాఁ డగుఁ? దన భుజవిక్రమమున**
నన్యధనము లుపార్జించి యర్థిజనుల । కిచ్చి కీర్తి దిక్కుల వెలయించుఁ గాక. 365

ప్రతిపదార్థం: ఉత్తమక్షత్రియుండు= శ్రేష్ఠుడైన క్షత్రియుడు; ఏల= ఎందుకు; ఒరులన్= ఇతరులను; అడిగి; వేఁడు వాఁడు+అగున్= యాచించేవాడు అవుతాడు; తన, భుజ, విక్రమమునన్= సొంతశౌర్యం వలన; అన్య ధనములు= ఇతరుల సొత్తులు; ఉపార్జించి= సంపాదించి; అర్థి, జనులకు+ఇచ్చి= ప్రార్థించే ప్రజలకు దానంచేసి; దిక్కులన్= దెసలలో; కీర్తి= యశం; వెలయించున్+ కాక= ప్రకాశింపచేస్తాడు కాని.

తాత్పర్యం: ఉత్తముడైన క్షత్రియుడు ఇతరులను ప్రార్థించడు. ఎవరినీ దానం చేయుమని వేడుకొనడు. తన శౌర్య సాహసాలవలన ఇతరులను జయించి, వారి ధనాలు కైవసం చేసికొని, తనను ప్రార్థించేవారికి దానం చేసి తన యశస్సు దెసలలో వెల్లివిరిసేటట్లు చేస్తాడుకదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీముఁడు యక్షరాక్షసులతో యుద్ధంబు సేయుట (సం. 3-152-12)

వ. నాకు మిమ్మును మీ కుబేరుం బ్రార్థించి కాని యిక్కొలని పువ్వులు గొనంగాదొకో?' యని భీముండు రాక్షసుల నాదరింపక సౌగంధికవనంబు సొచ్చి కనకకమలంబులుం గొని యుత్తమవీర్యవంతంబు లైన తత్సలిలంబు లుపయోగించి యనంతబలసంపన్నుండై యున్న; నాతనిం జూచి రాక్షసు లలిగి యుద్యతాయుధహస్తులై తాఁకిన భీముండును భీకరాకారుండై. 366

ప్రతిపదార్థం: నాకు= నాకు; మిమ్మును= మీ అందరినీ; మీ, కుబేరున్= మీ దొరగారైన కుబేరుడిని; ప్రార్థించి కాని= వేడుకొనికాని; ఈ, కొలని, పువ్వులు= ఈ సరోవరంలోని పుష్పాలు; కొనన్+కాదు+ఒకో?= తీసికొని వెళ్ళటానికి కుదురదా?; అని= అని పలికి; భీముండు= భీముడు; రాక్షసులన్= రాక్షసులను; ఆదరింపక= లెక్కచేయక, సరకు చేయక; సౌగంధిక, వనంబు+చొచ్చి= సౌగంధిక కమలాల సముదాయం కల కొలను ప్రవేశించి; కనక, కమలంబులున్+కొని= బంగారు తామర పూలను తీసికొని; ఉత్తమ, వీర్యవంతంబులు+ఐన= గొప్ప శక్తి (మహిమ) కలిగినవైన; తత్+సలిలంబులు= ఆ కొలనులోని నీళ్లు; ఉపయోగించి= వాడి, త్రాగి; అనంత, బల, సంపన్నుండు+ఐ= మితిలేని శక్తి కలవాడై; ఉన్నన్= ఉండగా; ఆతనిన్+చూచి= ఆ భీముడిని చూచి; రాక్షసులు= రాక్షసులు; అలిగి= కోపించి; ఉద్యత+ఆయుధ, హస్తులు+ఐ= ఎత్తబడిన శస్త్రాలు హస్తాలలో కలవారై; తాఁకినన్= ఎదిరించగా; భీముండును= భీముడుకూడ; భీకర+ఆకారుండు+ఐ= భయంకరమైన రూపం కలవాడై.

తాత్పర్యం: నాకు మీ అందరి అనుజ్ఞ అనవసరం. నేను మీ దొరగారైన కుబేరుడిని అంతకంటే వేడుకొనను. నా అంతట నేను ఈ సరోవరంలోని బంగారు తామరపూలను ఎందుకు తీసికొనలేనో చూస్తాను కాక!'- అని భీముడు ఆ రాక్షసులను లెక్కచేయక, కొలనులోనికి ప్రవేశించి సౌగంధికకమలాలను కోసి, ఆ కొలనులోని గొప్ప శక్తి గల నీళ్ళను త్రాగి, మితిలేని శక్తిని పుంజుకొని ఉండగా, అతనిని చూచి రాక్షసులు ఆగ్రహించి ఆయుధ సన్నద్ధులై భీముడితో పోరాటానికి దిగారు.

**చ. తన గదఁ జేసి రాక్షసుల దారుణశస్త్రచయంబు నశ్రమం
బున నతివీరుఁడై విరిచి పోర నిశాచరులన్ బడల్పడన్
ఘనభుజదండ చండహతిఁ గ్రాఁచిన నుక్కఱి రక్కసుల్ కుబే
రున కెఱిఁగింపఁ బాఱిరి సరోషవృకోదరభీమకర్మముల్. 367**

ప్రతిపదార్థం: తన, గదన్+చేసి= తనగదతో; రాక్షసుల= రాక్షసులయొక్క; దారుణ, శస్త్ర చయంబు= భయంకరమైన ఆయుధాలసమూహాన్ని; న+శ్రమంబునన్= సులువుగా; అతి, వీరుఁడు+ఐ= గొప్పశౌర్యం కలిగినవాడై; విరిచి= విరుగకొట్టి; పోర= యుద్ధంలో; నిశాచరులన్= రాక్షసులను, (రాత్రి సంచరించేటటువంటి వారిని); బడల్+పడన్= బడలికనొందేటట్లుగా; ఘన, భుజ, దండ, చండ, హతిన్= గొప్పదైన తన భుజం అనే కంబం యొక్క తీవ్రమైన తాకిడిచేత; క్రాఁచినన్= తపింపచేయగా; రక్కసుల్= రాక్షసులు; ఉక్కు+అఱి= బలం తగ్గి; స, రోష, వృకోదర, భీమ, కర్మముల్= ఆగ్రహంతో కూడిన భీముడియొక్క భయంకరచర్యలు; కుబేరునకు+ఎఱిఁగింపన్= కుబేరుడికి తెలియజెప్పటానికి; పాఱిరి= పరుగెత్తారు.

తాత్పర్యం: భీముడు తన గదతో సులువుగా మహావీరుడై రాక్షసులభయంకరాయుధాల నన్నిటినీ వమ్ముచేసి, యుద్ధంలో ఆ రాక్షసులందరు అలసిపోయేటట్లు చేశాడు. తన బాహుదండంతో కొట్టి బాధ నొందేటట్లు చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ రాక్షసులు బలం తరిగిన వారై, ఆగ్రహించిన భీముడి భీకరచర్యలను గురించి కుబేరుడికి తెలపటానికి పరుగెత్తారు.

వ. కుబేరుండును బాంచాలీ ప్రియకరంబైన పవనతనయు పరాక్రమారంభంబు విని మెచ్చి దాని నుపేక్షించె; నట్లు భీమసేనుండు రాక్షససేన నోడించి సౌగంధిక కమలంబులు గొని తత్తీరకుసుమితలతాపాదపవనంబున విహరించుచున్నంత నట. 368

ప్రతిపదార్థం: కుబేరుండును= కుబేరుడు కూడ; పాంచాలీ ప్రియకరంబు+ఐన= ద్రౌపదికి సంతోషాన్ని చేకూర్చేటటువంటి; పవనతనయు= భీముడియొక్క; పరాక్రమ+ఆరంభంబు= శౌర్యసంరంభం; విని= ఆలకించి, మెచ్చి= ప్రశంసించి; ఉపేక్షించెన్= ప్రతిక్రియచేయటాన్ని గురించి పట్టించుకోలేదు; అట్లు= అట్లా, ఆ రీతిగా; భీమసేనుండు= భీముడు; రాక్షస, సేనన్= రాక్షసుల సైన్యాన్ని; ఓడించి= జయించి; సౌగంధిక, కమలంబులు= సౌగంధికకమలాలను (మిక్కుటమైన నెత్తావిని వెదజల్లే తామర పువ్వులు); కొని= తీసికొని; తత్+తీర, కుసుమిత, లతా, పాదప, వనంబునన్= ఆ కొలనుగట్టునందు పుష్పించిన తీవలు, చెట్లు గలిగిన తోటలో; విహరించుచున్నంతన్= వినోదంగా తిరుగుతుండగా; అట= అక్కడ.

తాత్పర్యం: కుబేరుడున్నూ, ద్రౌపదిని సంతోషపెట్టటంకొరకు భీముడు ప్రదర్శించిన శౌర్య విజృంభణాన్ని అభినందించి, ప్రతిక్రియ చేయటం మానాడు. ఆ విధంగా భీముడు రాక్షసవీరులను గెలిచి, సౌగంధికపుష్పాలను సంగ్రహించి, ఆసరోవరంగట్టున లతలతో, చెట్లతో, పూలతో కళకళ లాడుతున్న తోటలో విహరిస్తూ ఉండినాడు. అక్కడ.

క. వడిఁ బడియెఁ బిడుగు లుడుగక, । వడఁకె మహీతలము, పాంసువర్షము గురిసెం
గడు నెఱ్ఱ నయ్యె దిశ, లే । ర్పడకుండె నినుండు తిమిరపటలావృతుఁడై. 369

ప్రతిపదార్థం: పిడుగులు= పిడుగులు, (అశనులు); ఉడుగక= మానక; వడిన్= వేగంగా; పడియెన్= పడ్డాయి; మహీ, తలము= భూమిపైభాగం; వడఁకె= వణికింది; పాంసు, వర్షము= దుమ్ముావాన; కురిసెన్= వర్షించింది; దిశలు= దిక్కులు; కడున్= మిక్కిలి; ఎఱ్ఱన్+అయ్యె= ఎఱ్ఱగా మారాయి; తిమిర, పటల+ఆవృతుఁడు+ఐ= చీకట్ల సమూహాలచేత ఆవరించబడి; ఇనుండు= సూర్యుడు; ఏర్పడక+ఉండెన్= కనిపించకున్నాడు.

తాత్పర్యం: వేగంగా, ఎడతెగకుండా పిడుగులు పడ్డాయి. భూమి కంపించింది. దుమ్ముావాన కురిసింది. దిక్కులన్నీ ఎరుపురంగుధూళితో కప్పబడ్డాయి. సూర్యుడు చీకట్ల దొంతరలతో కప్పబడి కనిపించకున్నాడు.

వ. ఇట్టి మహోత్పాతంబు లుపలక్షించి విస్మితుండై ధర్మతనయుం 'డివి భీమాహవ పిశునంబులై కానంబడియె నేమఱకుండ వలయు' నని నాలుగుదిక్కులుం జూచి భీమసేనుం గానక తన సమీపంబున నున్న పాంచాలి కిట్లనియె. 370

ప్రతిపదార్థం: ఇట్టి= ఇటువంటి- ఈ విధాలైన; మహా+ఉత్పాతంబులు= గొప్ప అపశకునాలు; ఉపలక్షించి= చూచి; విస్మితుండు+ఐ= అచ్చెరువందినవాడై; ధర్మతనయుండు= ధర్మరాజు; ఇవి= ఈ ఉత్పాతాలు; భీమ+ఆహవ, పిశునంబులు+ఐ= భయంకరమైన యుద్ధానికి చెందిన కలహసూచనలై; కానంబడియెన్= కనిపించాయి; ఏమఱకుండవలయున్= ఉపేక్షించటం తగదు; అని= అని తలపోసి; నాలుగుదిక్కులున్+చూచి= నాలుగు దిక్కులూ పరికించి; భీమసేనున్+కానక; భీముడిని చూడక; తన, సమీపంబునన్+ఉన్న= తన దగ్గర ఉన్న; పాంచాలికి= ద్రౌపదితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధాలైన అపశకునాలను చూచి ధర్మరాజు ఆశ్చర్యపడి, 'ఇవి భయంకరమైన యుద్ధాన్ని సూచించే కలహసూచనలు, జాగ్రత్తగా ఉండాలి'- అని తలపోసి, నాలుగు దిక్కులూ పరికించాడు. అక్కడ భీముడు కనిపించలేదు. అంతట ధర్మరాజు తనకు చేరువగా ఉన్న ద్రౌపదితో ఇట్లా అన్నాడు.

విశేషం: 1. భీమ+ఆహవ, పిశునంబులు అనే సమాసానికి రెండర్థాలు చెప్పవచ్చును. 1. భీమ- అంటే భయంకరమైన- అనే అర్థాన్ని అనుసరించి 'భయంకరమైన యుద్ధాన్ని సూచించేవి'- అని. 2. భీముడి యొక్క యుద్ధప్రీతికి కలహానికి సూచకములైనవి. ఇక్కడ రెండు అర్థాలు ఉపపన్నాలే. 2. ఉత్పాతములు= అపశకునాలు, అసాధారణ దృశ్యాలు, విచిత్ర సంఘటనలు. ఇవి 3 రకాలు 1. దివ్యం అపూర్వగ్రహనక్షత్ర దర్శనం. 2. అంతరిక్షం- సూర్యచంద్రులచుట్టూ గుడులు ఏర్పడటం 3. భీమం - జాడ్యాలు మొదలైనవి.

క. **'ప్రియసాహసుండు భీముఁడు । భయవిరహితుఁ డెందుఁ బోయె బహురాక్షససం**
శ్రయ మిగ్గిరి గంధర్వా । న్వయ సేవ్యం బేకచరుఁడు వాఁ డెయ్యెడలన్. **371**

ప్రతిపదార్థం: ప్రియ, సాహసుండు= సాహసకృత్యాలలో ప్రీతికలవాడు; భీముఁడు= భీముడు; భయ, విరహితుఁడు= బొత్తిగా భయం లేనటువంటివాడు; ఎందున్+పోయె= ఎక్కడికి వెళ్ళాడు; బహు, రాక్షస, సంశ్రయము= అనేకమంది రాక్షసులచేత కూడి ఉండేది; ఈ+గిరి= ఈ కొండ; గంధర్వ+అన్వయ, సేవ్యంబు= గంధర్వుల కులంచేత ఆరాధించబడేటటువంటిది; వాడు= ఆ భీముడు; ఏ+ఎడలన్= ఏ స్థలమందైనా; ఏక చరుఁడు= ఒంటరిగా తిరుగాడేవాడు.

తాత్పర్యం: 'ఏడీ భీముడు? ఎక్కడికి వెళ్ళాడు? అతడికి సాహసకృత్యాలు అంటే చాలాప్రీతి. బొత్తిగా భయంలేనివాడు! ఈ కొండపై రాక్షసులు, గంధర్వులు తిరుగాడుతుంటారు. ఆ భీముడు ఎక్కడికైనా ఒంటరిగా పోయే స్వభావం కలవాడు.

ఆ. **భూరిభుజుఁడు దానె పోయెనో? నీ వెట । యేని పుచ్చితో నిజేచ్ఛ నతని?'**
నని యజాతశత్రుఁ డడిగినఁ బతికిఁ బాం । చాలి యిట్టు లనియె సంభ్రమమున. **372**

ప్రతిపదార్థం: భూరి భుజుఁడు= గొప్పభుజాలు కలవాడు అనగా మహావీరుడు; తానె= తనంతట తానుగానే; పోయెనో?= వెళ్ళాడా?; నీవు= నీవు; ఎట+ఏని= ఎక్కడికైనా కూడా; అతనిన్= భీముడిని; నిజ+ఇచ్ఛన్= (తన) నీదైన కోరికచేత; పుచ్చితో?= పంపించావా?; అని= అంటూ; న+జాత, శత్రుఁడు= పుట్టుకచేత శత్రువులు లేనటువంటివాడు- ధర్మరాజు; అడిగినన్= ప్రశ్నించగా; పాంచాలి= ద్రౌపది; పతికిన్= భర్తకు; సంభ్రమమునన్= తొట్రుపాటుతో; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: గొప్ప పరాక్రమం కల భీముడు తనంతట తానే వెళ్ళాడా? లేక ఏదైనా కోరి నీవు అతడిని ఎక్కడికైనా పంపావా?'- అని అజాతశత్రుడైన ధర్మరాజు అడిగాడు. అంతట ద్రౌపది తొట్రుపాటుతో ఈవిధంగా పలికింది.

మధ్యాక్కర.

'ధరణీశ! నీకు నాయిచ్చిన పసిఁడి తామరపువ్వు
గురువాయువశమున వచ్చినను దానిఁ గొని యిట్టిపువ్వు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లరుదు గాన కుఱంగటం గలిగెనేని యర్థిఁ దె మ్మనిన
నరిగె నీశానుదిక్కునకు నీ తమ్ముఁ డతివేగమునను.' 373

ప్రతిపదార్థం: ధరణి+ఈశ!= ఓరాజా! భూమికి ప్రభువు అయినవాడా!; నీకు= నీకు; నా+ఇచ్చిన= నేను ఇచ్చిన; పసిఁడి, తామర, పువ్వు= బంగారపు కమలం; గురు, వాయు, వశమున= పెద్దగాలిచేత విసరబడి; వచ్చినను= రాగా; దానిన్= ఆ పువ్వును; కొని= గ్రహించి; ఇట్టి, పువ్వులు= ఈ మాదిరి పుష్పాలు; అరుదు= అసాధారణం; కాన= కాబట్టి; కుఱంగటన్= సమీపాన; కలిగెనేని= ఉన్నట్లయితే; అర్థిన్= ప్రీతితో; తెమ్ము= తెచ్చిపెట్టుము; అనినన్= అని కోరగా; నీ తమ్ముఁడు; అతి వేగమునను= అతివేగంగా; ఈశానుదిక్కునకున్= ఈశాన్యదిశకు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'ఓ రాజా! నీకు నేను ఇచ్చిన బంగారు తామర పువ్వు పెద్దగాలిచేత విసరగొట్టబడి నాదగ్గర పడింది. అటువంటి పువ్వులు దరిదాపున ఉన్నట్లయితే నాకు తెచ్చిపెట్టుమని కోరగా, నీ తమ్ముడైన భీముడు మిక్కిలి వేగంగా ఈశాన్యదిక్కుకు వెళ్ళాడు'

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 2.22 విశేషాంశం చూడండి

వ. అనిన 'నట్లేని యందఱము వాని పోయిన వలనం బోవుద' మని యెప్పటియట్ల రాక్షసస్కంధారూఢులై
గగనగతి నరిగి సౌగంధిక తీరంబున. 374

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అట్లు+ఏని= ఆ విధంగా జరిగినట్లయితే; అందఱము= మనమంతా కలిసి; వాని, పోయిన, వలనన్= అతడు వెళ్ళినదిక్కుకే; పోవుదము= వెళ్ళుదాము; అని= అని పలికి; ఎప్పటి+అట్లు+అ= ఎప్పటి మాదిరిగానే; రాక్షస, స్కంధ+ఆరూఢులు+ఐ= రాక్షసులయొక్క భుజాలమీద కూర్చున్నవారై; గగన గతిన్= ఆకాశమార్గాన; అరిగి= వెళ్ళి; సౌగంధిక, తీరంబున= నెత్తావిచిమ్మే బంగారు తామరపూలు గల కొలను గట్టున.

తాత్పర్యం: అని ద్రౌపది చెప్పగా ధర్మరాజు 'సరే అట్లా అయితే మనమందరం భీముడు వెళ్ళినదిక్కుకే వెళ్ళుదాంగాక!' అని ఎప్పటివలెనే రాక్షసులమూపులపై ఎక్కి ఆకాశమార్గాన పయనించి, సౌగంధికపుష్పాలు గల కొలనుగట్టుకు చేరారు.

చ. అతులబలాఢ్యు నుద్యతగదాయుధహస్తుఁ బటుప్రతాపవ
ర్ధితయశుఁ బాండునందనుఁ దదీయమహోగ్రగదావిఘాత దా
రిత పృథుయక్ష రాక్షస శరీరచయంబులుఁ జూచి విస్మయ
స్మితముఖు లైరి బ్రాహ్మణసమేతులు ధర్మసుతాదు లచ్చటన్. 375

ప్రతిపదార్థం: న+తుల, బల+ఆఢ్యున్= సాటిలేని బలంతో కూడినవాడిని; ఉద్యత, గదా+ఆయుధ, హస్తున్= వెలుగొందుతున్న గద అనే ఆయుధాన్ని చేతితో పైకెత్తి పట్టుకొని ఉన్న వాడిని; పటు, ప్రతాప, వర్ధిత, యశున్= గొప్పశౌర్యంచేత వృద్ధిపొందిన కీర్తి కలవాడిని; పాండు, నందనున్= పాండురాజు యొక్క కొడుకైన భీముడిని; తదీయ, మహా+ఉగ్ర, గదా, విఘాత, దారిత, పృథు, యక్ష, రాక్షస, శరీర, చయంబులున్= అతడి యొక్క మిక్కిలి భయంకరమైన గదయొక్క దెబ్బలచేత చీల్చబడిన యక్షులయొక్క రాక్షసులయొక్క గొప్ప దేహాల సముదాయాలను; చూచి= చూచి; బ్రాహ్మణ, సమేతులు= బ్రాహ్మణులతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కూడుకొన్నవారు; ధర్మసుత+ఆదులు= ధర్మరాజు మొదలైనవారు; అచ్చటన్= అక్కడ; విస్మయ స్మిత, ముఖులు+ఐరి= ఆశ్చర్యంతో కూడిన చిరునవ్వుముఖాలు కలవారైవారు.

తాత్పర్యం: సాటిలేనిబలం కలవాడు, పైకెత్తిన గదాయుధాన్ని చేతకలవాడు, పటిష్ఠమైన పరాక్రమంచేత వృద్ధి పొందిన కీర్తి కలవాడు అయిన పాండు పుత్రుడు భీమసేనుడినీ, అతడి భయంకరగదా ఘాతాలచేత చీల్చబడిన యక్షరాక్షసుల పెద్ద శరీరాల సమూహాలనూ, బ్రాహ్మణులతో కలసి ధర్మరాజు మొదలైనవారు ఆ కొలను గట్టున చూచి ఆశ్చర్యంతో కూడిన చిరునవ్వుముఖాలు కలవారయ్యారు.

వ. భీమసేనుండును ధౌమ్య ధర్మజ రోమశులకు మ్రొక్కి, తనకు మ్రొక్కిన కవలఁ గౌఁగిలించుకొని, వైడూర్యనాళంబులైన కనకకమలంబులు ద్రౌపది కిచ్చి యున్నంత నాతనికి ధర్మరా జిట్లనియె. 376

ప్రతిపదార్థం: భీమసేనుండును= భీముడున్నూ; ధౌమ్య ధర్మజరోమశులకున్= ధౌమ్యుడికి, ధర్మరాజుకు, రోమశుడికి; మ్రొక్కి= నమస్కరించి; తనకు, మ్రొక్కిన= తనకు నమస్కరించిన; కవలన్= నకులసహదేవులను; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; వైడూర్య, నాళంబులు+ఐన= పిల్లికన్ను రత్నాలవంటి కాడలుగల కనక, కమలంబులు= సౌగంధికపద్మాలు; ద్రౌపదికి+ ఇచ్చి+ఉన్నంతన్= ద్రౌపదికి బహూకరించి ఉండగా; ఆతనికి= ఆ భీముడికి; ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: భీముడు- ధౌమ్యుడికి, రోమశుడికి, ధర్మరాజుకు నమస్కరించాడు. భీముడికి నకుల సహదేవులు నమస్కరించారు. వారిని భీముడు కౌగిలించు కొన్నాడు. తరువాత వైడూర్యాలవంటి కాడలు కలిగిన బంగారు తామర పూలను భీముడు ద్రౌపదికి బహూకరించాడు. అంతట ధర్మరాజు భీముడితో ఇట్లా పలికాడు.

ఆ. 'చనునె నీకు నిట్టి సాహసక్రియఁ జేయ? । నెల్లవారికంటె నెఱుక గలవు
గురుభుజుండ! నాకుఁ గూర్తేని చేయకు । మయ్య! యిట్టి చెయ్వు లనఘ! యింక'. 377

ప్రతిపదార్థం: గురు భుజుండ!= గొప్ప భుజాలు కలవాడా! అనగా మహావీరుడా!; ఎల్లవారికంటెన్= అందరికంటె; ఎఱుక+కలవు= జ్ఞానం కలిగినటువంటి వాడివి నీవు; ఇట్టి= ఇటువంటి; సాహస, క్రియన్= తెగువతో కూడిన చర్య; చేయన్= చేయటం; చనునె?= తగునా? (కూడునా); అనఘ!= పాపరహితుడివైనవాడా!; నాకున్+కూర్తు+ఏని= నాయందు నీకు ప్రేమ ఉన్నట్లయితే; ఇంక= ఇకమీద; ఇట్టి, చెయ్వులు= ఇటువంటి పనులు; చేయకుము+అయ్య!= చేయవద్దన్నా!.

తాత్పర్యం: 'పరాక్రమం కలిగిన ఓ భీమసేనా! అందరికన్నా ఎక్కువ జ్ఞానం కలవాడివి నీవు. ఇటువంటి సాహసకృత్యాలు ఆచరించటం నీవంటి జ్ఞానికి తగునా? పాపరహితుడి వైన ఓ భీమసేనా! నీకు నాయందు ప్రేమ ఉంటే నీవు ఇకమీద ఇటువంటి పనులు చేయకూడదుసుమా!'

వ. అని కఱపి యి ట్లందఱుం గుబేరోద్యానవనంబున విహరించుచున్నంతఁ దద్రక్షకులైన యక్షులు వచ్చి.378

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; కఱపి= ప్రబోధించి, (నచ్చచెప్పి); ఇట్లు= ఈ విధంగా; అందఱున్= అందరూ; కుబేర+ఉద్యాన, వనంబునన్= కుబేరుడితోటలో; విహరించుచున్నంతన్= వినోదంగా తిరుగుతుండగా; తద్+రక్షకులు+ఐన= ఆ వనాన్ని కాపాడుతుండేవారైన; యక్షులు, వచ్చి= యక్షులు వచ్చి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని ధర్మరాజు భీముడికి నచ్చేటట్లుగా హితోపదేశం చేశాడు. ఇట్లా అందరూ కుబేరుడితోటలో వినోదంగా తిరుగుతుండగా, ఆ తోటలను కాపాడేవారైన యక్షులు వచ్చి;

క. దేవర్షియైన రోమశు । దేవేంద్ర సమాను నయ్యుధిష్ఠిరు ధరణీ
దేవోత్తములం గని విన । యావనతులు భక్తి నిట్టు లని రందఱకున్. 379

ప్రతిపదార్థం: దేవ+ఋషి+ఐన= దేవతలకు చెందిన ముని అయిన; రోమశున్= రోమశుడిని; దేవేంద్ర, సమానున్= దేవేంద్రుడితో సమానుడైన; ఆ+యుధిష్ఠిరు= ఆధర్మరాజును; ధరణీ, దేవ+ఉత్తములన్= బ్రాహ్మణశ్రేష్ఠులను; కని= చూచి; వినయ+అవనతులు= పూజ్యభావంతో వంగినటువంటివారై; అందఱకున్= ధర్మరాజు బృందంలోని వారందరికీ; ఇట్టులు+అనిరి= ఈవిధంగా చెప్పారు.

తాత్పర్యం: దేవర్షి అయిన రోమశుడిని, దేవేంద్రుడితో దీటైన ధర్మరాజును, శ్రేష్ఠులైన విప్రులను చూచి భక్తితో వంగి నమస్కరించి ఈవిధంగా పలికారు.

వ. 'మీ రిందు మసలవల; దిది యక్ష రాక్షస ప్రచారఘోరం' బనిన నందుండ నొల్లక పాండవులు తత్సమీపంబున నివాసంబుఁ జేసికొని రాక్షస బలంబుతో ఘటోత్కచుఁ బోవంబనిచి యుండు నంత, జటాసురుం డను రాక్షసుండు బ్రాహ్మణరూపధరుండై' యేను వేదవిదుండ, ధనుర్వేదవిదుండైన పరశురాము శిష్యుండ' ననుచుం బాండవుల సేవించుచున్నంత నొక్కనాఁడు. 380

ప్రతిపదార్థం: మీరు= మీరు; ఇందు= ఇక్కడ; మసలవలదు= తిరుగవద్దు; ఇది= ఈ తోట; యక్ష, రాక్షస, ప్రచార, ఘోరంబు= యక్షులు, రాక్షసులు తిరగటంచేత భయంకరమైనది; అనినన్= అని చెప్పగా; పాండవులు= పాండురాజుకొడుకులు; అందు= ఆ తోటలో; ఉండన్+ఒల్లక= ఉండటానికి ఇష్టపడక; తద్+సమీపంబున= ఆ తోటకు దగ్గరగా; నివాసంబున్+చేసికొని= వసతిని ఏర్పరచుకొని; రాక్షస బలంబుతో= రాక్షస సైన్యంతో; ఘటోత్కచున్= ఘటోత్కచుడిని; పోవన్+పనిచి+ఉండునంత= వెళ్ళిపొమ్మని ఆనతిచ్చి ఉండగా; జటాసురుండు+అను, రాక్షసుండు= జటాసురుడు అనే పేరు కల రాక్షసుడు; బ్రాహ్మణరూప, ధరుండు+ఐ= బాపడి ఆకారం ధరించినవాడై; ఏను= నేను; వేద విదుండన్= వేదాలను తెలిసినవాడిని; ధనుస్+వేద, విదుండు+ఐన= విలువిద్యలో ఆరితేరినవాడైన; పరశురాము, శిష్యుండన్= పరశురాముడి శిష్యుడిని; అనుచున్= అని చెప్తుతూ; పాండవులన్= పాండుపుత్రులను; సేవించుచున్నంతన్= పరిచర్యలు చేస్తుండగా; ఒక్కనాఁడు= ఒకరోజు.

తాత్పర్యం: 'మీరు ఇక్కడ విహరించవద్దు. ఈ తోటలో యక్షులు, రాక్షసులు సంచరించటంచేత ఇది భయంకరమైనటువంటిది' అని చెప్పారు. అంత పాండవులు ఆ తోటకు దగ్గరగా వసతి ఏర్పరచుకొని, రాక్షసులతోపాటు ఘటోత్కచుడిని వెళ్ళుమని ఆనతిచ్చి అక్కడే ఉన్నారు. అపుడు జటాసురుడు అనే పేరుగల రాక్షసుడు బ్రాహ్మణవేషం ధరించి, 'నేను వేదాలను చదివినవాడిని. విలువిద్యలో ఆరితేరిన పరశురాముడి శిష్యుడిని' అని చెప్పి చేరి పాండవులను సేవిస్తున్నాడు. అపుడు ఒకరోజు.

ఆ. మృగవిరోధిబలుఁడు మృగయావినోదార్థ । మడవి కనిలతనయుఁ డరిగినట్టి
యవసరమున నజ్జటాసురుఁ డాసురా । కారవికృతరూపకంబుఁ దాల్చి. 381

ప్రతిపదార్థం: మృగ, విరోధి, బలుఁడు= సింహం వంటి బలం కలవాడు; అనిలతనయుఁడు= వాయుపుత్రుడైన భీముడు; మృగయా, వినోద+అర్థము= వేటచేత వినోదించటం కొరకు; అడవికి= అడవికి; అరిగినట్టి+అవసరమునన్= వెళ్లినవేళ; ఆ+జటాసురుఁడు= ఆ జటాసురుడు; ఆసుర+ఆకార, వికృత, రూపకంబున్= రాక్షసుడి ఆకారానికి సంబంధించిన వికార స్వరూపాన్ని; తాల్చి= ధరించి.

తాత్పర్యం: సింహం వంటి బలం కలవాడు, వాయుపుత్రుడు అయిన భీముడు వినోదం కొరకు వేటకు వెళ్ళిన సమయాన, ఆ జటాసురుడు నిజరాక్షసరూపాన్ని ధరించి భయంకరమైన ఆకారంతో.

క. చనుదెంచి ద్రౌపదిని యమ । తనూజు నకులుం దదాయుధంబులతోఁ బె
ల్చన యెత్తికొని మహాజవ । మునఁ బఱచె మహీసురోత్తములు భయమందన్. 382

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; ద్రౌపదిని= పాంచాలిని; యమ, తనూజు= ధర్మపుత్రుడిని; నకులున్= నకులుడిని; తత్+ఆయుధంబులతోన్= వారియొక్క శస్త్రాలతోసహా; పెల్చన= బలాత్కారంగా; ఎత్తికొని= తన మూపున ధరించి; మహీసుర+ఉత్తములు= బ్రాహ్మణోత్తములు; భయము+అందన్= భయపడేటట్లుగా; మహాజవమునన్= మిక్కిలివేగంగా; పఱచెన్= పరుగెత్తాడు.

తాత్పర్యం: (ఆ జటాసురుడు) వచ్చి, ద్రౌపదిని, ధర్మరాజును, నకులుడిని బలవంతంగా ఎత్తుకొని, వారి ఆయుధాలతో పాటు తన మూపున ధరించి గొప్పవేగంతో పరుగెత్తాడు. వాడిని చూచి విప్రశ్రేష్ఠులు భీతిచెందారు.

వ. అంత సహదేవుండు భీముం బిలుచుచు వనంబున కరిగె; నిట ధర్మతనయుం డధర్మవర్తి యైన యసుర కిట్లనియె. 383

ప్రతిపదార్థం: అంత= అప్పుడు; సహదేవుండు= సహదేవుడు; భీమున్+పిలుచుచున్= భీముడిని రమ్మని కేకలువేస్తూ; వనంబునకు= అరణ్యానికి; అరిగెన్= వెళ్ళాడు; ఇట= ఇక్కడ; ధర్మతనయుండు= ధర్మరాజు; న+ధర్మవర్తి+ఐన= ధర్మంకాని పద్ధతిలో నడిచేవాడైన; అసురకు= రాక్షసుడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అంత సహదేవుడు భీముడిని పిలుస్తూ అరణ్యంలోనికి వెళ్ళాడు. అప్పుడు ధర్మరాజు అధర్మపరుడైన ఆ రాక్షసుడితో ఇట్లా అన్నాడు :

క. 'దేవాసురాదు లిం దుప । జీవింతురు మనుజులకు విశేషసుఖంబుల్
గావించుచు నమ్మనుజులఁ । గావంగలవార మేము గౌరవయుక్తిన్. 384

ప్రతిపదార్థం: దేవ+అసుర+ఆదులు= దేవతలు రాక్షసులు మొదలైనవారు; ఇందు= ఈ భూలోకంలో; మనుజులకు= నరులకు; విశేష, సుఖంబుల్= గొప్పసౌఖ్యాలను; కావించుచున్= చేస్తూ; ఉపజీవింతురు= ఆశ్రయించి బ్రతుకుతుంటారు; ఆ+మనుజులన్= ఆ మనుష్యులను, ఆ నరులను; గౌరవ, యుక్తిన్= మన్ననతో కూడిన భావంతో; కావన్+కలవారము= రక్షించే శీలం కలవారం; ఏము= మేము.

తాత్పర్యం: 'దేవతలు, రాక్షసులు మొదలగువారు ఈ లోకాన్ని ఆశ్రయించుకొని ఉంటూ, ఇందలి మానవులకు విశేషమైన సౌఖ్యాలను ప్రసాదిస్తూ ఉంటారు. ఆ మానవులను మన్ననతో కాపాడుతూ ఉండేవాళ్ళం కదా మేము!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్టి మా కపకారంబు సేయుట లగ్గు గాదు; నీవు ధర్మ్ము వెఱుంగవు; విశ్వసించినవారికిం గుడువంబెట్టినవారికి నెగ్గుచేయుట కడుంబాపంబు గావున. 385

ప్రతిపదార్థం: ఇట్టి, మాకు= ఈ విధంగా పరోపకార పారీణులమైన మాకు; అపకారంబు చేయుట= కీడుచేయటం; లగ్గు+కాదు= మంచిది కాదు; నీవు= నీవు; ధర్మ్మువు= ధర్మం; ఎఱుంగవు= తెలియనట్టివాడివి; విశ్వసించినవారికిన్= నమ్మినవారికిన్నీ; కుడువన్+పెట్టినవారికిన్= తిండిపెట్టిన వారికిన్నీ; ఎగ్గు చేయుట= కీడు చేయటం; కడున్+పాపంబు= మిక్కిలి చెడ్డపని; కావున= కాబట్టి.

తాత్పర్యం: ఈ విధంగా పరోపకార పారీణులమైన మాకు నీవు కీడు తలపోయటం భావ్యం కాదు. నీకు ధర్మం తెలియదు. నమ్మినవారికి, తిండి పెట్టినవారికి కీడు చేయటం గొప్పపాపం కాబట్టి.

మధ్యాక్కర.

మాయావి! మా యాయుధములు మా కిచ్చి మాతో రణమ్ము
సేయు; మివ్విధమునఁ బోవఁ దగ' దంచుఁ జిక్కనై యసుర
నాయతబాహుఁడు గరము భరముగా నదిమె ధర్మజుఁడు
మాయావి యగు వానిగమనవేగంబు మందమై యుండ. 386

ప్రతిపదార్థం: మాయావి!= ఓమాయలు నేర్చినవాడా!; మా+ఆయుధములు= మా శస్త్రాలు; మాకు+ఇచ్చి= మాకు తిరిగి ఇచ్చివేసి; మాతో, రణమ్ము, చేయుము= మాతో యుద్ధం చేయుము; ఈ+విధమునన్= ఈ విధంగా; పోవన్= పోవటం; తగదు+అంచున్= భావ్యం కాదంటూ; ఆయతబాహుఁడు= పొడుగైన చేతులు కలవాడు; ధర్మజుఁడు= ధర్మరాజు; అసురన్= రాక్షసుడిని, చిక్కన+ఐ= గాఢంగా; మాయావి+అగు, వాని= మాయలు నేర్చినటువంటివాడి యొక్క; గమనవేగంబు= నడక తీవ్రత; మందము+ఐ+ఉండ= తగ్గేటట్లుగా; కరము భరముగాన్= మిక్కిలి బరువు అనిపించేటట్లుగా; అదిమెన్= నొక్కాడు.

తాత్పర్యం: మాయలు నేర్చిన ఓరాక్షసుడా! మా ఆయుధాలు మా కిచ్చి మాతో యుద్ధం చేయుము. నీవు ఈ విధంగా పరుగెత్తి పోవటం భావ్యం కాదు'- అని పలుకుతూ ధర్మరాజు తన పొడుగైన చేతులతో గట్టిగా పట్టి అదిమి ఆ మాయావి అయిన రాక్షసుడి గమనవేగం తగ్గించాడు.

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 2.22 విశేషాంశం చూడండి.

వ. ఇట్లు ధర్మజు నిబిడపీడన వేదనాభరంబున విగతవేగుండై యరుగు జటాసురున కడ్డంబు వచ్చి సహదేవుం డిట్లనియె. 387

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ధర్మజు, నిబిడ, పీడన, వేదనా, భరంబున= ధర్మరాజుచేత చేయబడిన దట్టమైన పీడనం వలన కలిగిన బాధయొక్క బరువువలన- ధర్మరాజు తనను గట్టిగా నొక్కటంచేత కలిగిన బాధవలన; విగత, వేగుండు+ఐ= పోయిన వేగం కలవాడై; అరుగు= వెళ్లుచున్న; జటాసురునకు= జటాసురుడు అనే రాక్షసుడికి; అడ్డంబు, వచ్చి= అడ్డుగా చేరి నిలబడి; సహదేవుండు= సహదేవుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు తనను గట్టిగా అదిమి పట్టడంచేత కలిగిన బాధచేత గమనవేగం తగ్గినవాడై రాక్షసుడు మెల్లమెల్లగా వెళ్ళసాగాడు. సహదేవుడు ఆ రాక్షసుడికి అడ్డువచ్చి ఈ విధంగా పలికాడు.

క. 'న న్నెఱుఁగవె? పాండవుఁడఁ, బ్ర। సన్నయశోవీర్యయుతుఁడ సహదేవుఁడ; న
త్యున్నతి యేర్పడ నిప్పడ। ని న్నోర్చెదఁ జక్క నెదిరి నిలువుము పోరన్.' 388

ప్రతిపదార్థం: నన్నున్+ఎఱుఁగవె?= నన్ను తెలియవా?; పాండవుఁడన్= నేను పాండురాజు కొడుకును; ప్రసన్న, యశస్+వీర్య, యుతుఁడ= నిర్మలమైన కీర్తితో, పరాక్రమంతో కూడినవాడిని; సహదేవుఁడన్= సహదేవుడనే పేరు కలవాడిని; అతి+ ఉన్నతి+ ఏర్పడన్= మిక్కిలి గొప్పతనం కలిగేటట్లుగా; ఇప్పుడు+అ= ఇప్పుడే; నిన్ను+ఓర్చెదన్= నిన్ను జయిస్తాను; పోరన్= యుద్ధంలో; చక్కన్+ఎదిరి, నిలువుము= సూటిగా ఎదిరించి నిలువుము.

తాత్పర్యం: 'ఓ రాక్షసుడా! నీవు నన్ను ఎరుగవా? నేను పాండురాజు కొడుకును. సహదేవుడిని. నిర్మలమైన కీర్తి, విక్రమం కలవాడిని. నా గొప్పతనం తేటతెల్లమయ్యేటట్లు ఇప్పుడే నిన్ను ఓడించగలను. తిన్నగా నిలిచి నాతో యుద్ధం చేయుము.'

భీముఁడు జటాసురునితో యుద్ధము సేయుట (సం. 3-154-28)

వ. అనుచున్న యవసరంబున ననిలసుతుం డనిలవేగంబున నరుదెంచి జటాసురుచేత నిగృహీతులై గగనగతిం జను ధర్మజ నకుల ద్రౌపదులను, మహీతలగతుం డైన సహదేవుం జూచి యయ్యసుర కిట్లనియె. 389

ప్రతిపదార్థం: అనుచున్న+అవసరంబునన్= అని చెప్పుతున్న సమయంలో; అనిలసుతుండు= వాయుపుత్రుడైన భీమసేనుడు; అనిల, వేగంబునన్= గాలివంటి శీఘ్రగమనంతో; అరుదెంచి= వచ్చి; జటాసురుచేతన్= జటాసురుడిచేత; నిగృహీతులు+ఐ= చెరపెట్టబడినవారై; గగన, గతిన్+చను= ఆకాశమార్గాన వెళ్ళే; ధర్మజ, నకుల, ద్రౌపదులను= ధర్మరాజును, నకులుడిని, ద్రౌపదిని; మహీతల, గతుండు+ఐన= భూభాగాన నిలిచిఉన్న; సహదేవున్+చూచి= సహదేవుడిని చూచి; ఆ+అసురకు= ఆ రాక్షసుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని అంటున్న సమయంలో వాయుదేవుడి సుతుడైన భీమసేనుడు వాయువేగాన అక్కడికి వచ్చాడు. అతడికి, జటాసురుడిచేత కొనిపోబడుతున్న ధర్మరాజు, నకులుడు, ద్రౌపది ఆకాసంలోనూ, క్రింది భూమిపై నిలిచిన సహదేవుడున్నూ కనిపించారు. అంత భీముడు ఆ రాక్షసుడితో ఇట్లా అన్నాడు.

తే. 'అతిథివై వచ్చి నీవు మాయందుఁ గుడిచి। యసురవై యిట్లు యెగ్గు సేయంగ నగునె?
యెందుఁ గుడిచినచోటికి నెగ్గు సేయ। రెట్టి దుర్జను లైనను నెఱుక విడిచి. 390

ప్రతిపదార్థం: అతిథివి+ఐ= ఆగంతుకుడివై; వచ్చి= వచ్చి; నీవు; మా+అందున్+కుడిచి= మాతోపాటు తిండి తిని; అసురవు+ఐ= రాక్షసుడివై; ఇట్లు= ఈ రీతిగా, అనగా తిండిపెట్టి ఆదరించినవారిని అపహరించుకొని పోవటంగా; ఎగ్గు+చేయంగన్+అగును+ఎ= కీడు చేయటం భావ్యమా?; ఎందున్= ఎక్కడైననూ; ఎట్టి, దుర్జనులు+ఐనను= ఎంతటి చెడ్డవారు అయినప్పటికీ; ఎఱుక విడిచి= జ్ఞానం వీడి; కుడిచిన, చోటికిన్= తిండిపెట్టినవారికి; ఎగ్గు+చేయరు= కీడు చేయరు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నీవు మాదగ్గరకు అతిథివిగా వచ్చి మాతోపాటు తిండి తిని, రాక్షసుడివై ఉపకారం చేసినవారికి అపకారం చేయటం నీకు తగునా?; ఎంతటి చెడ్డవారైనప్పటికీ, తిండి పెట్టినవారికి బుద్ధి లేకుండా కీడు చేయరు.

వ. నీవు బుద్ధిగలవేని వీరిని విడిచి నీ ప్రాణంబులు రక్షించుకొను; మట్లు గానినాఁడు బక హిడింబ కిమ్మీరులం జంపిన ట్లశ్రమంబునం జంపుదు' ననిన విని జటాసురుండు వారల విడిచి భీమసేనున కభిముఖుండై.391

ప్రతిపదార్థం: నీవు బుద్ధి+కలవు+ఏని= నీకు తెలివి తేటలు ఉన్నట్లయితే; వీరిని= ధర్మరాజాదులను; విడిచి= వదలి; నీ, ప్రాణంబులు= నీ ప్రాణాలు (అసువులు); రక్షించుకొనుము= కాపాడుకొమ్ము; అట్లు కాని నాఁడు= ఆ విధంగా జరుగని రోజు; బక, హిడింబ, కిమ్మీరులన్= బకుడిని, హిడింబుడిని, కిమ్మీరుడిని; చంపినట్లు= చంపినవిధంగా; న+శ్రమంబునన్= సులువుగా, శ్రమలేకుండగా; చంపుదును= వధిస్తాను; అనిన= అని చెప్పగా; విని= విని; జటాసురుండు= జటాసురుడు; వారల, విడిచి= ధర్మరాజాదులను విడిచి; భీమసేననకు= భీముడికి; అభిముఖుండు+ఐ= ఎదురైన ముఖం కలవాడై.

తాత్పర్యం: నీవు బుద్ధిగలవాడవైతే ధర్మరాజాదులను విడిచి నీ ప్రాణాలు దక్కించుకొమ్ము. ఆవిధంగా చేయకపోతే బకుడిని, హిడింబుడిని, కిమ్మీరుడిని, సంహరించినట్లుగానే నిన్ను అవలీలగా చంపుతాను'- అని చెప్పగా జటాసురుడు ధర్మరాజాదులను విడిచి భీముడివైపు తిరిగి ఇట్లా పలికాడు.

క. 'రయమున నీచేత నిహతు । లయిన సురారాతులకు రణాంతరమున నీ
దయిన రుధిరమున నుదక । క్రియఁ జేసెద బక హిడింబ కిమ్మీరులకున్'. 392

ప్రతిపదార్థం: రణ+అంతరమున= యుద్ధంలో; నీచేత, నిహతులు+అయిన= నీచేత సంహరించబడినవారైన; సుర+అరాతులకు= దేవతలకు శత్రువులైన రాక్షసులకు; బక హిడింబ కిమ్మీరులకున్= బకుడికీ, హిడింబుడికీ, కిమ్మీరుడికీ; రయమున= శీఘ్రంగా; నీదు+అయిన= నీయొక్క; రుధిరమునన్= నెత్తురుతో; ఉదక క్రియన్= శ్రాద్ధక్రియ (నీటితో తర్పణం విడిచేపని); చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: 'నాడు నీచేత యుద్ధంలో సంహరించబడిన బకుడికీ, హిడింబుడికీ, కిమ్మీరుడికీ, వేగంగా నేడు నీ నెత్తుటితో తర్పణక్రియలు నిర్వహిస్తాను.'

క. అనుచుఁ గడు నలిగి మారుత । తనయు మహాబాహు నసుర దాఁకె; మరున్నం
దనున కెడ సొచ్చి మాద్రీ । తనయులు తత్క్షణమ వానిఁ దాఁకిరి వీఁకన్. 393

ప్రతిపదార్థం: అనుచున్= అని పలుకుతూ; కడున్+అలిగి= మిక్కిలి కోపించి; మారుత, తనయు= వాయుపుత్రుడైన భీముడిని; మహాబాహున్= గొప్ప చేతులు కలవాడిని- మహావీరుడిని; అసుర= రాక్షసుడు; తాఁకె= ఎదుర్కొన్నాడు; మరుత్+నందనునకు= వాయుపుత్రుడైన భీముడికి; ఎడ+చొచ్చి= సాయంగా ప్రక్కకు చేరి; మాద్రీ, తనయులు= మాద్రి కొడుకులు అయిన నకుల సహదేవులు; తద్+క్షణము+అ= ఆ త్రుటిలో; వీఁకన్= ఉత్సాహంతో; వానిన్= ఆరాక్షసుడిని- ఆ జటాసురుడిని; తాఁకిరి= మార్కొన్నారు.

తాత్పర్యం: అని చెప్పుతూ, మిక్కిలి ఆగ్రహించి, ఆ జటాసురుడు వాయుపుత్రుడైన భీముడిని మార్కొన్నాడు. తత్క్షణమే, వాయుసుతుడికి తోడుగా మాద్రీతనయులైన నకుల సహదేవులు ఆ రాక్షసుడిని ఎదుర్కొన్నారు.

సీ. వారల నిద్దఱ వారించి భీముండు । దాఁకె జటాసురు వీఁకతోడ;
భీమాసురులకు సంగ్రామంబు గడుఘోర । మయ్యెఁ; నిర్మూలంబు లయ్యె వారి
యూరుఘట్టనముల ధారుణీరుహములు; । పదఘట్టనములఁ గ్రక్కదలె ధరణి;
భూరుహపాణులై పోరి యాసన్న భూ । రుహములు వొలిసిన బృహదుదగ్ర

ఆ. శిలలఁ గొంతసేపు చెలఁగి పోరాడి రొం । డొరులు పెనఁగి పట్టి పరుషభంగి
నుగ్రు లైన వాలిసుగ్రీవులట్టుల । యుద్ధ మొప్పఁ జేసి రిద్ధబలులు. 394

ప్రతిపదార్థం: వారలన్+ఇద్దఱ= వారిని ఇద్దరినీ అనగా నకుల సహదేవులు ఇద్దరినీ; వారించి= ఆపి; భీముండు= భీముడు; జటాసురు= జటాసురుడిని; వీఁకతోడ= పరాక్రమంతో; తాఁకె= మార్కొన్నాడు; భీమ+అసురులకు= భీముడికిన్నీ, రాక్షసుడికిన్నీ; సంగ్రామంబు= యుద్ధం; కడు, ఘోరము+అయ్యె= మిక్కిలి భయంకరంగా జరిగింది; ధారుణీరుహములు= చెట్లు; వారి+ఊరు, ఘట్టనములన్= వారి తొడలయొక్క తాకిడిచేత; నిర్మూలంబులు+అయ్యె= నాశనమైనవి; పద, ఘట్టనములన్= అడుగుల తాకిడికి ధరణి= భూమి; కదలె+కదలె= క్రక్కదలె= బాగుగా కంపించింది; భూరుహపాణులు+ఐ= చెట్లు చేతులందు కలవారై; పోరి= యుద్ధంచేసి; ఆసన్న, భూరుహములు= దగ్గరగా ఉన్న చెట్లు; పొలిసిన= నశించగా; బృహద్+ఉగ్ర+శిలలన్= పెద్ద భయంకరమైన రాళ్ళతో; కొంతసేపు= కొంత కాలం; చెలఁగి=విజృంభించి; పోరాడిరి= యుద్ధంచేశారు; ఒండొరులు= ఒకరిని ఒకరు; పెనఁగి పట్టి= పెనవేసికొంటూ కుస్తీపట్లు పట్టి; పరుష, భంగిన్= కఠినమైన రీతిలో; ఉగ్రులు+ఐన= భయంకరులైన; వాలి, సుగ్రీవుల+అట్లు= వాలి, సుగ్రీవులవలె; ఇద్ధ, బలులు= దేదీప్యమానమైన బలం కలవారు (భీముడు మరియు జటాసురుడున్నూ); యుద్ధం= పోరాటం, ఒప్పన్+చేసిరి= ఒప్పేటట్లుగా చేశారు.

తాత్పర్యం: నకుల సహదేవులను ఇద్దరినీ వారించి, భీముడు విజృంభించి జటాసురుడితో తలపడ్డాడు. భీముడికీ, జటాసురుడికీ ఘోరయుద్ధం జరిగింది. వారి తొడల తాకిడిచేత చెట్లు నశించాయి. వారి పాదాల తాకిడి చేత భూమి కంపించింది. వారు ఇద్దరూ పోరు సలిపేటప్పుడు దగ్గరగా ఉన్న చెట్లు నశించటంచేత భయంకరమైన గండ శిలలతో యుద్ధం కొనసాగించారు. అట్లా దేదీప్యమానమైన బలం కల ఆ ఉభయులు వాలిసుగ్రీవులవలె యుద్ధం చేశారు.

విశేషం: 1. రామాయణ గాథలోని సుప్రసిద్ధపాత్రలు వాలిసుగ్రీవులు 2. రామాయణకథ భారతం కంటె ప్రాచీనం.

క. భీమాసుర వీరుల ము । ష్టాముష్టి రణచ్ఛటచ్ఛటాశబ్దం బు
ద్దామం బై తద్విపిన మ । హామృగపక్షులకు నతిభయావహ మయ్యెన్. 395

ప్రతిపదార్థం: భీమ+అసుర వీరుల= భీముడియొక్క, అసురవీరుడైన జటాసురుడియొక్క; ముష్టాముష్టి రణ+ఛటత్+ఛటా శబ్దంబు= పిడికిలి పిడికిలితో కలిసేటట్లు చేసే యుద్ధంలోని ఛట ఛట అనే శబ్దం; ఉద్దామంబు+ఐ= భయంకరమై; తత్+విపిన, మహామృగ పక్షులకున్= ఆ అరణ్యంలోని గొప్ప జంతువులకున్నూ; పిట్టలకున్నూ; అతి, భయ+ఆవహము= మిక్కిలి భయం కలిగించేది అయింది.

తాత్పర్యం: భీముడున్నూ, జటాసురుడున్నూ చేసే పిడికిలి పోట్ల పోరులోపుట్టే ఛటచ్ఛటలచప్పుడులు భయంకరంగా వ్యాపించి, ఆ అడవిలోని గొప్ప జంతువులకూ, పక్షులకూ మిక్కిలి భయాన్ని కలిగించాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. అంత భీమసేనుఁ డంతకాకారుఁడై। వాని బలవిహీనుఁగా నెఱింగి
తడయ కపుడు వాని మెడ గ్రుంగఁ బిడికిటఁ। బొడిచె; నసుర ముడిఁగి పడియెఁ బుడమి. 396

ప్రతిపదార్థం: అంత= అంతట; భీమసేనుఁడు= భీముడు; అంతక+ఆకారుఁడు+ఐ= యముడివంటి రూపం కలవాడై; వానిన్= ఆ జటాసురుడిని; బల విహీనున్+కాన్= బలం లేనివాడినిగా; ఎఱింగి= తెలిసికొని; తడయక= ఆలసించక; అపుడు= అప్పుడు; వాని మెడ= వాడి మెడను; క్రుంగన్= దిగబడిపోయేటట్లుగా; పిడికిటన్= ముష్టితో; పొడిచెన్= గట్టిగా గ్రుచ్చాడు; అసుర= రక్కసుడు; ముడిఁగి= ముడుచుకొనిపోయి; పుడమిన్= భూమిపై; పడియెన్= పడ్డాడు.

తాత్పర్యం: అంతటు భీమసేనుడు యముడి వంటి ఆకారం కలవాడై విజృంభించి, ఆరాక్షసుడిని బలం లేనివాడినిగా గుర్తించి, ఆలస్యం చేయకుండా వాని మెడ క్రుంగి వాలిపోయేటట్లు తన పిడికిలితో గట్టిగా కొట్టాడు. అంత ఆరాక్షసుడు దేహం ముడుచుకొనిపోయి పుడమిపై పడ్డాడు.

వ. ఇట్లు నిర్ఘాత నిపాత భిన్నోన్నత నీలగిరి శృంగంబునుంబోలె నేలఁబడిన జటాసురుశరీరం బెత్తి యొక్క విశాల పరుషపాషాణంబుపై జర్జరితంబుగా వైచి, వానిం గాలగోచరుంగాఁ జేసిన వాయుపుత్త్రుపరాక్రమంబు ధౌమ్యరోమశాది మహీసురవరులు వర్ణించి రని వైశంపాయన కథితంబైన కథ రమ్యంబుగ. 397

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; నిర్ఘాత, నిపాత, భిన్న+ఉన్నత, నీల, గిరి, శృంగంబునున్+పోలె= పిడుగు పడటంచేత ప్రక్కలైన ఎత్తయిన నల్లటి కొండ శిఖరంవలె; నేలన్+పడిన= భూమి మీద పడిన; జటాసురు, శరీరంబు= జటాసురుడియొక్క దేహాన్ని; ఎత్తి= పైకెత్తి; ఒక్క= ఒక్క; విశాల, పరుష, పాషాణంబుపై= పెద్దదైన కఠినమైన రాతిబండపై; జర్జరితంబుగా, వైచి= ముక్కలు ముక్కలు అయ్యేటట్లుగా విసరివేసి; వానిన్= ఆ రాక్షసుడిని; కాల, గోచరున్+కాన్+చేసిన= సంహరించగా; వాయుపుత్త్రు= గాలిపట్టి అయిన భీముడి యొక్క; పరాక్రమంబు= శౌర్యాన్ని; ధౌమ్య, రోమశ+ఆది, మహీసుర, వరులు= ధౌమ్యుడు, రోమశుడు మొదలైన విప్రశ్రేష్ఠులు; వర్ణించిరి= వర్ణించారు (విస్తరించి చెప్పారు); అని= అంటూ; వైశంపాయన కథితంబు+ఐన= వైశంపాయనుడిచేత చెప్పబడిన కథ; రమ్యంబుగ= సొగసుగా.

తాత్పర్యం: ఈ విధంగా జటాసురుడి దేహం పిడుగుపడి బ్రద్దలైన నీలగిరిశిఖరంవలె నేలపై పడగా, భీమసేనుడు ఆ రాక్షసదేహాన్ని ఎత్తి ముక్కలు ప్రక్కలు అయ్యేటట్లు ఒక పెద్ద బండరాతిమీద విసరివైచాడు. ఆ విధంగా ఆ రాక్షసుడు మృతిచెందాడు. అప్పుడు ధౌమ్యుడు, రోమశుడు మొదలైన బ్రాహ్మణశ్రేష్ఠులు వాయుసుతుడైన భీముడి శౌర్యాన్ని గొప్పగా శ్లాఘించారు- అని వైశంపాయనుడు కథను కడుంగడు సొగసుగా వినిపించాడు.

ఆశ్వాసాంతము

క. భూపకులతిలక! నృపవి। ద్యాపారగ! నిత్యసత్యధనధాన్యదయా
లాపచతురాస్య! ధర్మ। వ్యాపారవిచార! విష్ణువర్ధన నృపతీ! 398

ప్రతిపదార్థం: భూప, కుల, తిలక!= రాజుల వంశానికి తిలకంవంటివాడా, రాజశ్రేష్ఠుడా!; నృప, విద్యా, పారగ!= రాజ నీతి పరిజ్ఞానంలో అవతలి ఒడ్డును చేరినవాడా! అనగా రాజనీతిలో క్షుణ్ణమైన పరిజ్ఞానం కలవాడా!; నిత్యసత్య, ధన, ధాన్య, దయా+ఆలాపచతురాస్య!= నిత్యసత్యవ్రతంలో, ధనంలో, పంటగింజలలో, కరుణలో, నిండైన మాటలు పలకటంలో

బ్రహ్మదేవుడివంటివాడా!; ధర్మ, వ్యాపార, విచార= ధర్మం ఎట్లా ఆచరించాలో చర్చించేవాడా! అనగా ధర్మాధర్మాల సూక్ష్మాలను బాగా చర్చించేవాడా!; విష్ణువర్ధన నృపతీ!= విష్ణువర్ధన బిరుదాంకితుడివైన ఓ రాజా!- అనగా విష్ణువర్ధన బిరుదాన్ని ఆర్జించిన మహారాజవంశంలో పుట్టినవాడా!

తాత్పర్యం: రాజులలో శ్రేష్ఠుడివైన ఓ రాజరాజనరేంద్రా! రాజనీతిలో క్షుణ్ణమైన పరిజ్ఞానాన్ని ఆర్జించినవాడా! నిత్యసత్యం, ధనం, ధాన్యం, దయ, అనే నాలుగు అంశాలలో నిండైన మాటలు పలికే చతురాస్యుడా! ధర్మసూక్ష్మాలను చర్చించి తెలిసికొనేవాడా! ఓ విష్ణువర్ధనబిరుదాంకితుడివైన రాజరాజనరేంద్రా!

విశేషం: 1. ఆశ్వాసాంత పద్యాల గురించిన వివరణ 2. వైశంపాయన కథిత భారత గాథను గురించి 3. శౌనకాది మహర్షులకు రోమశుడు చెప్పిన మహాభారతాన్ని గురించి విశేష వివరణలు పూర్వోక్తాలు. ఆరణ్యపర్వం ఒకటవ రెండవ ఆశ్వాసాల చివర విశేష వివరణలను అరయవచ్చు. 4. నిత్యసత్య ధనధాన్యదయా+ఆలాపచతురాస్య అనే పదగుంఫనంలో చతురాస్యుడు అనగా నాలుగు ముఖాలు కల బ్రహ్మ, ఇక్కడ నాలుగంశాలకు నాలుగుముఖాలు ఉన్నాయి. ఇది ఇందులోని స్వారస్యం.

వసంత తిలకము.

శ్రీరమ్య! రాజకులశేఖర! రాజరాజా! । భూరిప్రతాప! పరిభూతవిరోధివర్గా!
హారామృతాబ్జహర హాస తుషార కుంద । స్ఫారద్యశః ప్రసర పాండుకృత త్రిలోకా! **399**

ప్రతిపదార్థం: శ్రీ రమ్య!= శ్రీచేత సొగసైనవాడా! (శ్రీ అనేపదానికి సంపద - కాంతి - శోభ - ఇట్లా ఎన్నో అర్థాలు ఉన్నాయి. అందుచే శ్రీరమ్య అనగా లోకాతీతమైన శోభచేత వర్ధిల్లునటువంటివాడా! అని విశాలమైన అర్థం చెప్పవచ్చు.) రాజ, కుల, శేఖర!= రాజులసమూహాలలో శ్రేష్ఠుడివైనవాడా లేదా, రాజవంశానికంతటికీ శ్రేష్ఠుడైనవాడా! ఉత్తమోత్తముడవైన మహారాజా!; రాజరాజా!= సార్వభౌమా! (రాజరాజనరేంద్రుడా); భూరిప్రతాప!= గొప్పపరాక్రమంకలవాడా!; పరిభూత, విరోధి, వర్గా!= జయించబడిన శత్రువుల సముదాయం కలవాడా! శత్రుపరంపరలపై విజయం సాధించినవాడా!; హార+అమృత+అబ్జ, హర, హాస, తుషార, కుంద, స్ఫారత్+యశస్+ప్రసర, పాండుకృత, త్రిలోకా!= ముత్యాలదండవలె, అమృతంవలె, తెల్ల తామరపువ్వువలె, శివుడివలె, నవ్వువలె, మంచువలె, మొల్లపువ్వువలె వెలుగొందే కీర్తి వ్యాపించటంచేత తెలుపుగా చేయబడిన మూడులోకాలు కలవాడా!

తాత్పర్యం: ఓ రాజ రాజనరేంద్రా, శ్రీరమ్యుడా, రాజులలో శ్రేష్ఠుడివైన వాడా, గొప్పశౌర్యం కలవాడా, శత్రువులను జయించి వారిని పరాభవానికి లోనైనవారిగా చేసినటువంటివాడా, ముత్యాలహారంవలె, అమృతంవలె, శ్వేతపద్మంవలె, శివుడివలె, నవ్వువలె, మంచువలె, మొల్లపువ్వువలె వెలుగొందే కీర్తి వ్యాపించటంచేత తెలుపుగా చేయబడిన మూడులోకాలు కలవాడా!

విశేషం: 1. హారం అంటే నూరు పేటలు కల ముత్యాలదండ 2. ముత్యములు, అమృతం, శివుడు, నవ్వు, మంచు, మొల్లపువ్వు, కీర్తి, తెల్లగా ఉంటాయని కవిసమయం. 3. ఈ వృత్తంలో ప్రతిచరణానికీ త,భ,జ,జ,గగ - అనే గణాలుంటాయి. 8వ అక్షరం యతిమైత్రి. ప్రాస పాటించబడింది.

గద్యము:

ఇది సకల సుకవి జన వినుత, నన్నయభట్ట ప్రణీతంబైన శ్రీమహాభారతంబునం దారణ్య పర్వంబున దధీచికథయును, నగస్త్యు మాహాత్మ్యంబును, భగీరథు ప్రయత్నంబునుం, గంగావతరణంబును,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఋశ్యశృంగు చరితంబును, బరశురాము చరితంబును, గార్తవీర్యు వధయును, రామకృష్ణాదుల యాగమనంబును, సౌకన్యాఖ్యానంబును, జ్యవనుండు సంయాతియజ్ఞంబున నశ్వినుల సోమపీథులం జేసి వారిచేత జవ్వనంబు వడయుటయు, మాంధాతృ జన్మంబును, సోమకుండు యజ్ఞంబుఁ జేసి పుత్త్రశతంబు వడయుటయు, జంతూపాఖ్యానంబును, శ్యేన కపోతంబులై యింద్రాగ్నులు శిబిమాంసంబు గొనుటయు, నష్టావక్రు మాహాత్మ్యంబును, రైభ్యయవక్రీతుల సంవాదంబును, భీముండు సౌగంధిక హరణార్థం బరుగుటయు, హనుమద్దర్శనంబును, రామాయణకథయును, భీముండు గంధమాదనంబునం దుండు కొలనికిం బోయి యక్ష రాక్షసుల వధియించుటయు, గంధమాదనంబున నందఱుం గూడుటయు, జటాసురవధయు నన్నది తృతీయాశ్వాసము. 400

ప్రతిపదార్థం: ఇది= ఈరచన; సకల, సుకవి, జన, వినుత, నన్నయభట్ట, ప్రణీతంబు+ఐన= సర్వ సత్కవుల బృందంచేత ప్రశంసించబడిన నన్నయభట్టుచేత వ్రాయబడిన; శ్రీమహాభారతంబునందు= శ్రీ మహాభారతం అనే గ్రంథమందు; ఆరణ్య పర్వంబున= వనపర్వమందు; దధీచికథయునున్= దధీచిని గురించిన వృత్తాంతము; అగస్త్య, మాహాత్మ్యంబును= అగస్త్యముని యొక్కమహిమ; భగీరథు ప్రయత్నంబునున్= భగీరథుడి యొక్క కృషియున్నూ; గంగా+అవతరణంబును= గంగ క్రిందికి (భూమి మీదకు) దిగటమున్నూ; ఋశ్యశృంగు చరితంబును= ఋశ్యశృంగుడి వృత్తాంతమున్నూ; పరశురాము చరితంబును= పరశురాముడి కథయున్నూ; కార్తవీర్యు వధయును= కార్తవీర్యుడి సంహారమున్నూ; రామకృష్ణ+ఆదుల+ఆగమనంబును= బలరాముడు శ్రీకృష్ణుడు మొదలైన వారి రాకయున్నూ; సౌకన్యా+ఆఖ్యానంబును= సుకన్యవృత్తాంతమున్నూ; చ్యవనుండు= చ్యవనుడు; సంయాతియజ్ఞంబునన్= సంయాతి అనే రాజు జరిపిన క్రతువులో; అశ్వినుల= అశ్వినీదేవతలను; సోమపీథులన్+చేసి= సోమరసాన్ని త్రాగేవారినిగా చేసి; వారిచేత= ఆ అశ్వినులచేత; జవ్వనంబు= యౌవనం; పడయుటయు= పొందటమున్నూ; మాంధాతృ జన్మంబును= మాంధాత పుట్టుకయున్నూ; సోమకుండు= సోమకుడు; యజ్ఞంబున్+చేసి= క్రతువును చేసి; పుత్త్ర శతంబు= నూరుమంది కొడుకులను, పడయుటయు= పొందటమున్నూ; జంతు+ఉపాఖ్యానంబును= జంతునియొక్క చిరుకథయు; శ్యేనకపోతంబులు+ఐ= డేగపావురాలై; ఇంద్ర+అగ్నులు= ఇంద్రుడు, అగ్నియు; శిబిమాంసంబు= శిబియొక్క మాంసం; కొనుటయున్= తీసికొనటమున్నూ; అష్టావక్రు, మాహాత్మ్యంబును= అష్టావక్రుడి మహిమయున్నూ; రైభ్య, యవక్రీతుల సంవాదంబును= రైభ్యుడికీ యవక్రీతుడికీ మధ్య జరిగిన సంభాషణమున్నూ; భీముండు= భీముడు; సౌగంధిక, హరణ+ అర్థంబు+అరుగుటయు= సౌగంధికాలనే పొందామర పూలను తేవటానికై వెళ్ళటమున్నూ; హనుమత్+దర్శనంబును= హనుమంతుని చూడటమున్నూ; రామాయణ, కథయును= రామాయణగాథయున్నూ; భీముండు= భీముడు; గంధమాదనంబునందు+ఉండు= గంధమాదనమనే పేరుకల కొండపై ఉండే; కొలనికిన్+పోయి= సరోవరానికి వెళ్ళి; యక్ష, రాక్షసుల= యక్షులను, రాక్షసులను; వధించుటయు= సంహరించటమున్నూ; గంధమాదనంబునన్= గంధమాదనపర్వతాన; అందఱున్= పాండవ బృందంలోని వారందరూ; కూడుటయు= కలిసిచేరటమున్నూ; జటాసురవధయున్= జటాసురుడి సంహారమున్నూ; అన్నది= అనే వృత్తాంతాలతో కూడినది; తృతీయ+ఆశ్వాసము= మూడవ ఆశ్వాసం.

తాత్పర్యం: ఈ రచన శ్రీ మహాభారతమందలి ఆరణ్యపర్వంలోని మూడవ ఆశ్వాసం. దీనిని రచించింది సమస్త సత్కవిబృందాలచేత పొగడబడిన నన్నయభట్టు. ఇందున్న అంశాలు- దధీచి తన వెన్నెముకను దేవతలకు దానమీయటం. అగస్త్యమహర్షియొక్క మహిమలు. భగీరథుడు చిరస్మరణీయమైన కృషి చేసి గంగను భూమికి దింపటం, ఋశ్యశృంగుడి వృత్తాంతం. పరశురాముడి చరిత్ర. కార్తవీర్యుడి వృత్తాంతం, అతడి మరణం. బలరాముడు శ్రీ కృష్ణుడు మున్నగువారు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాండవులను సందర్శించటం, సుకన్య చరిత్ర. చ్యవనమహర్షి సంయాతి మహారాజు చేసిన క్రతువులో అశ్వినీ దేవతలను సోమపీథులను చేసి వారివలన యౌవనాన్ని పొందటం, మాంధాత మహారాజు జన్మవృత్తాంతం, సోమకుడు అనే రాజర్షి వృత్తాంతం, జంతుడనే రాకుమారుడి గాథ, శిబిచక్రవర్తి చరిత్ర- ఇంద్రుడు, అగ్ని, డేగ పావురాలుగా వచ్చి శిబిమాంసం తీసుకోవటం, అష్టావక్రమహర్షి మాహాత్మ్యం, రైభ్య, యవక్రీతుల సంవాదం, భీముడు సౌగంధిక కమలాలను తేవటానికి వెళ్ళటం, హనుమంతుడిని సందర్శించటం, రామాయణ సంక్షిప్తగాథ. భీముడు గంధమాదనాన ఉన్న సరోవరానికి వెళ్ళటం, యక్షరాక్షసవధ, గంధమాదనాన పాండవ సమావేశం, జటాసురవధ.

-: ఆరణ్యపర్వంలో తృతీయాశ్వాసం సమాప్తం :-

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము - చతుర్థాశ్వాసము

శ్రీ రాజరాజ! కులని । స్తార! సుధాహార హీర సన్నిభ కీర్తీ!
శ్రీరమణ! ధనుర్విద్యా । పారగ! కోదండపార్థ! పార్థివ తిలకా! 1

ప్రతిపదార్థం: శ్రీ రాజరాజ!= శ్రీ రాజరాజనరేంద్రా!; కులనిస్తార!= కులానికి అనగా క్షత్రియ జాతికి (వంశానికి) తరించేమార్గం కల్పించే వాడా!; సుధా, హార, హీర, సన్నిభ, కీర్తీ!= అమృతంతో, ముత్యాల పేరుతో, వజ్రంతో సమానమైన యశస్సు కలవాడా!; శ్రీరమణ= లక్ష్మీదేవిని సంతసింప చేసేవాడా!; ధనుస్+విద్యా, పారగ!= విలువిద్యయందు చివరితీరానికి చేరినవాడా!; కోదండ, పార్థ!= వింటియందు అర్జునుడివంటివాడా!; పార్థివతిలకా!= రాజశ్రేష్ఠుడా!.

తాత్పర్యం: ఓ రాజరాజ నరేంద్రా! వంశోద్ధారకుడా! అమృతంతో, ముత్యాల హారంతో, వజ్రంతో సమానమైన యశస్సు కలవాడా! లక్ష్మీదేవికి సంతోషాన్ని కలిగించేవాడా! విలువిద్యలో చివరిదరికి చేరినవాడా! విలుకాండ్రలో అర్జునుడివంటివాడా! రాజులలో శ్రేష్ఠుడా!

విశేషం: (1) ఇది ఆశ్వాసారంభ పద్యం. ఆశ్వాసంలోని తొలి పద్యమున్నూ, ఆశ్వాసంలోని తుదిపద్యాలున్నూ సంబోధన ప్రథమావిభక్తిలో రచించి కృతిభర్తను ప్రశంసించే సంప్రదాయాన్ని తెలుగువాఙ్మయంలో నెలకొల్పిన మహాకవి నన్నయభట్టు. (2) అట్లే ఆశ్వాసారంభపద్యం శ్రీకారంతో ఆరంభించటం సాహితీసంప్రదాయ మైనది. (3) అమృతం, ముత్యాలు, వజ్రం తెల్లగా ఉండేవి. కీర్తి తెల్లగా ఉండటం కవిసమయం. (4) తిలకం అనగా బొట్టు. తిలకం శ్రేష్ఠవాచకంగా సుప్రసిద్ధం.

వ. అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె; నట్లు పాండవులు నరనారాయణ స్థానంబునఁ గొన్ని దినంబు లుండి యొక్కనాఁడు ధర్మతనయుండు దమ్ముల కిట్లనియె. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= ఆ కథను చెప్పునట్టి సూతుడు; శౌనక+ఆది, మహామునులకున్+చెప్పెన్= శౌనకుడు మొదలైన గొప్ప ఋషులకు చెప్పాడు; అట్లు= ఆ రీతిగా; పాండవులు= పాండురాజు కొడుకులు; నర, నారాయణ, స్థానంబునన్= నరుడు నారాయణుడు తపస్సు చేసిన చోట- అనగా బదరికాశ్రమంలో; కొన్ని, దినంబులు+ఉండి= కొన్ని నాళ్లు నివసించి; ఒక్క, నాఁడు= ఒకానొక రోజున; ధర్మతనయుండు= ధర్మసుతుడు; తమ్ములకున్= సోదరులకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: మహాభారతకథను సూతుడు, శౌనకుడు మొదలైన ఋషులకు చెప్పాడు. ఆ విధంగా పాండవులు నరుడూ నారాయణుడూ తొల్లి తపస్సు చేసిన బదరికావనంలో కొన్ని నాళ్ళు నివసించారు. అంతట, ఒకనాడు ధర్మరాజు తన తమ్ములతో ఈ విధంగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: సూతుడు శౌనకాది మహర్షులకు మహాభారతాన్ని నైమిశారణ్యంలో పండ్రెండేండ్లు జరిగిన సత్రయాగంలో వినిపించాడు. ఆ వివరాలన్నింటిని మొదటి ఆశ్వాసంలో విశేషాంశాలుగా సవిస్తరంగా చెప్పటం జరిగింది.

మధ్యాక్కర.

'ఏనేఁడు లగుదెంచె నర్జునుఁ డేఁగి, యింత కేతెంచుఁ
బూని దివ్యాస్త్రముల్ వడసి, యమ్మహాభుజు భూరిసత్త్వు
నానతరిపువర్గుఁ జూడఁ గాంతు మిం' దంచు బ్రాహ్మణుల
తో నేఁగె నుత్తరమించి ధర్మనిత్యుఁడు ధర్మజుండు. 3

ప్రతిపదార్థం: అర్జునుండు+ఏఁగి= అర్జునుడు వెళ్లి; ఏను+ఏఁడులు+అగుదెంచెన్= ఐదేండ్లు అయినవి; దివ్య+అస్త్రముల్= దేవతలకు సంబంధించిన ఆయుధాలు; పూని= ప్రయత్నించి; పడసి= పొంది (సంపాదించి); ఇంతకున్= ఇప్పటికి; ఏతెంచున్= వస్తాడు; ఆ+మహాభుజున్= గొప్ప పరాక్రమం గల ఆ వీరుడిని; భూరి, సత్త్వున్= గొప్ప బలం కలవాడిని; ఆనత, రిపు, వర్గున్= లొంగదీయబడిన శత్రువుల కూటం కలవాడిని; ఇందున్= ఇచట; చూడన్+కాంతుము= చూడగలం; అంచున్= అని పలుకుతూ; ధర్మనిత్యుఁడు= ధర్మాన్నే ఎప్పుడు పాటించేవాడు; ధర్మజుండు= ధర్మసుతుడు; ఉత్తరమించి= ఉత్తర దిక్కుకొంతదాటి; బ్రాహ్మణులతోన్= విప్రులతో; ఏఁగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'అర్జునుడు వెళ్లి ఐదేండ్లు గడిచినవి; దివ్యమైన అస్త్రాలు సంపాదించి ఇప్పుడు రాగలడు; ఆ మహాపరాక్రమోపేతుడిని, ఆ బలశాలిని, శత్రువుల సమూహాలను జయించిన వాడిని ఇక్కడ చూడగలం' అని పలుకుతూ, ధర్మరాజు బ్రాహ్మణులతో కలిసి ఉత్తరదిక్కుకొంతదాటి పయనించాడు.

విశేషం: మహాభుజు, భూరిసత్త్వు, ఆనతరిపువర్గు- అనే విశేషణాలు అర్జునుడికి ఒకే పద్యంలో వాడటంలో ధర్మజుడికి తమ్ముడిని చూడాలన్న ఆసక్తి వ్యంగ్యంగా స్ఫురిస్తున్నది. దివ్యాస్త్రాలను ధరించిన అర్జునుడికి భుజబలం, పరాక్రమం, శత్రుమర్దన సామర్థ్యం క్రమంగా పెంపొందుతా యని ధ్వని. వృత్తలక్షణానికి ఆర. 2.22 పద్యవిశేషాంశం చూడండి.

వ. **ఇట్లు గంధమాదన పుణ్యతీర్థావలోకనపరు లయి పాండవు లరిగి పదియేడగు దివసంబున వృషపర్వుండను రాజర్షియాశ్రమంబుఁ గని, యం దతిప్రీతి నాతనిచేతఁ బూజితు లయి యేడుదివసంబులు వసియించి బ్రాహ్మణుల నెల్ల నందు నిలువం బనిచి, వృషపర్వోపదిష్ట మార్గంబున ధౌమ్యరోమశప్రభృతి కతిపయ బ్రాహ్మణ వరులతోఁ జని యష్టమదివసంబున. 4**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవులు; గంధమాదన, పుణ్య, తీర్థ+అవలోకన, పరులు+అయి= గంధమాదన పర్వతంలో ఉన్న పుణ్యక్షేత్రాలను దర్శించటంలో ఆసక్తికల వారై; అరిగి= ఉత్తర దిక్కుకొంతదాటి వెళ్లి; పది+ఏడు+అగు, దివసంబునన్= పదునేడవ రోజున; వృషపర్వుండు+అను, రాజర్షి+ఆశ్రమంబున్= వృషపర్వుడు అనే పేరుకల రాజు అయిన ఋషియొక్క ఆశ్రమాన్ని; కని= చూచి; అందు= ఆ ఆశ్రమంలో; అతి ప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; ఆతనిచేతన్= ఆ వృషపర్వుడు అనే రాజర్షిచేత; పూజితులు+అయి= అర్చించబడిన వారై; ఏడు, దివసంబులు= ఏడునాళ్ళు; వసియించి= ఉండి; బ్రాహ్మణులన్+ఎల్లన్= అందరు విప్రులను; అందున్= ఆ ఆశ్రమంలో; నిలువన్+పనిచి= ఉండుడని చెప్పి; వృషపర్వ+ఉపదిష్ట, మార్గంబునన్= వృషపర్వుడు నిరూపించి చెప్పిన దారిని బట్టి; ధౌమ్య, రోమశ, ప్రభృతి, కతిపయ, బ్రాహ్మణవరులతోన్= ధౌమ్యుడు రోమశుడు మున్నగు కొద్దిమంది విప్రశ్రేష్ఠులతో; చని= వెళ్ళి; అష్టమ, దివసంబునన్= ఎనిమిదవ నాడు.

తాత్పర్యం: ఈ విధంగా గంధమాదనంలోని పుణ్యక్షేత్రాలను సందర్శించి ఉత్తరదిశకొంతదాటి పయనించి పాండవులు పదునేడవనాడు వృషపర్వుడు అనే రాజర్షి ఆశ్రమం చేరారు. ఆ వృషపర్వ మహారాజు పాండవ బృందానికి అతిథి సత్కారాలు చేసి గౌరవించాడు. అక్కడ వాళ్లు ఏడు రోజులు ఉన్నారు. ఆ తరువాత విప్రబృందాన్ని ఆ రాజర్షి ఆశ్రమంలో నిలిపి, రోమశుడు ధౌమ్యుడు మున్నగు కొద్దిమందివిప్రులతో కలిసి వృషపర్వుడు సూచించిన దారిన పయనించి వెళ్ళారు.

క. విమల స్ఫాటిక హాటక । రమణీయ దరీ నిరంతర శ్వేతనగేం
ద్రము మాల్యవంతమును ను । త్తమచరితులు సూచు చరిగి తద్విపినమునన్. 5

ప్రతిపదార్థం: విమల, స్ఫాటిక, హాటక, రమణీయ, దరీ నిరంతర, శ్వేత, నగ+ఇంద్రము= నిర్మలమైన పటికపు రాళ్లచేత, బంగారంచేత, సొగ సైన గుహలతో ఎల్లప్పుడు తెల్లగా ఉండే పర్వతశ్రేష్ఠమైన; మాల్యవంతమును= మాల్యవంతం అనే పేరు కల పర్వతాన్ని; ఉత్తమ, చరితులు= మంచి శీలం కల వారైన ఆ పాండవులు; చూచుచున్= సందర్శిస్తూ; అరిగి= పయనించి; తద్+విపినమునన్= ఆ అరణ్యంలో.

తాత్పర్యం: ఉత్తమ చరిత్రులైన ఆ పాండవులు 'మాల్యవంతం' అనే పేరుకల గొప్ప కొండను చూచారు. ఆ పర్వతం నిర్మల మైన పటికరాళ్ళతోనూ బంగారంతోనూ కూడిన అందమైన గుహలు కలిగి ఎల్లప్పుడూ తెల్లగా ఉంది. ఆ అరణ్యంలో.

క. చలదళి పుంస్కోకిల కుల । కల రవముఖరిత లతాంత కమ్ర ఫలాళీ
లలిత మహీరుహ మాలా । మిళితోద్దేశముల విశ్రమించుచు లీలన్. 6

ప్రతిపదార్థం: చలత్+అళి, పుంస్కోకిల, కుల, కల, రవ, ముఖరిత, లతా+అంత, కమ్ర, ఫల+ఆళీ, లలిత, మహీరుహ, మాలా, మిళిత+ఉద్దేశములన్= చలిస్తున్న (ఎగురుతున్న) తుమ్మెదలయొక్క, గండుకోకిలల సమూహాల యొక్క అవ్యక్తమధురమైన నాదంచేత మ్రోగుతూ పువ్వులు, సొగసైన పండ్ల సముదాయాలు కలిగిన మృదువైన చెట్ల గుంపులతో కూడిన ఎత్తయిన ప్రదేశాలలో; విశ్రమించుచున్= సేదతీర్చుకొంటూ; లీలన్= వినోదంగా.

తాత్పర్యం: (పాండవులు) వినోదంగా ఆ అరణ్యంలో విహరించారు. అందులోని ఎత్తయిన ప్రదేశాలలో విశ్రమించారు. అక్కడ చెట్ల వరుసలు మిక్కిలి సొగసుగా పువ్వులతో పండ్లతో నిండి ఉన్నవి. సంచరించే తుమ్మెదల ఝుంకారాలతో గండుకోకిలల అవ్యక్తమధురనినాదాలతో ఆ వనం మారుమ్రోగుతూ ఉన్నది.

వ. అందు విహరించుచున్న నొక్కనాఁడు శ్వేతకి యను పుణ్యనదివలన మారుతానీతంబు లై తమ ముందటం బడిన పంచవర్ణ సురభి కుసుమంబులం జూచి యందఱు విస్మయం బంది; రంత నేకతంబున నొక్కశశికాంత శిలాతలంబుపయి నున్న భీమసేనునకు ద్రుపదరాజపుత్త్రి యి ట్లనియె. 7

ప్రతిపదార్థం: అందున్= ఆ అరణ్యంలో; విహరించుచు+ఉన్నన్= వినోదంగా తిరుగాడుతుండగా; ఒక్క, నాఁడు= ఒక రోజున; శ్వేతకి+అను పుణ్యనది వలనన్= శ్వేతకి అనే పేరుకల పుణ్యనదినుండి; మారుత+ఆనీతంబులు+ఐ= గాలిచేత (వేగంగా) తీసికొని రాబడినవై; తమ, ముందటన్+పడిన= తమ ఎదుట వచ్చిపడిన; పంచ, వర్ణ, సురభి, కుసుమంబులన్+చూచి=

ఐదురంగులు కలిగి పరిమళించే పూవులను చూచి; అందఱు= పాండవ బృందంలోని వారు అందరు; విస్మయంబు+అందిరి= ఆశ్చర్యం చెందారు; అంతన్= అటు పిమ్మట; ఏకతంబునన్= ఒంటరిగా; ఒక్క= ఒక; శశి, కాంత, శిలా, తలంబు, పయిన్= చంద్రకాంతశిల పైన; ఉన్న= కూరుచొని ఉన్న; భీమసేనునకున్= భీముడితో; ద్రుపదరాజపుత్త్రి= ద్రౌపది; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆ వనంలో వినోదార్థం తిరుగాడుతూ ఉండగా, ఒకనాడు శ్వేతకి అనే నదినుండి గాలిచేత విసరివేయబడి పాండవబృందముందు అయిదురంగులు కలిగి నెత్తావులు విరజిమ్ముతున్న పువ్వులు వచ్చి పడ్డాయి. ఆ పువ్వులను చూచి అందరూ ఆశ్చర్యపోయారు. అంతట ఏకాంతంగా ఒక చంద్రకాంత శిలావేదికమీద, కూర్చొని ఉన్న భీమసేనుడితో ద్రౌపది ఈ విధంగా అన్నది.

క. 'ప్రకటముగఁ దొంటి సౌగం । ధిక కనకాబ్జములకంటె దివ్యసుగంధా
ధిక కుసుమము లివి దద్దయు । సుకుమారము; లిట్టివానిఁ జూచి యెఱుంగన్. 8

ప్రతిపదార్థం: ఇవి= ఈ పువ్వులు; ప్రకటముగన్= తేట తెల్లంగా; తొంటి= మునుపటి; సౌగంధిక, కనక+అబ్జముల కంటెన్= సౌగంధికాలనే బంగారు తామరపువ్వుల కంటె; సుగంధ+అధిక, కుసుమములు= (ఈ పువ్వులు) దివ్యమైన పరిమళంచేత గొప్పవి; తద్దయు= మిక్కిలి; సుకుమారములు= కోమలమైనవి; ఇట్టి వానిన్= ఇటువంటి పువ్వులను; చూచి+ఎఱుంగన్= ఇంతకు ముందు చూడలేదు.

తాత్పర్యం: 'ఈ పువ్వులు మునుపు మనం చూచిన సౌగంధికాలనే పసిడితామరపువ్వులకంటెకూడ గొప్ప పరిమళాలు కలవి. ఇవి సౌకుమార్యంలో ఆ సౌగంధిక కమలాలను మించినవి. ఇటువంటి పువ్వులను నేను ఇంతకు ముందు ఎన్నడూ చూడలేదు.

వ. ఇప్పువ్వులు నాకుఁ దెచ్చి యిచ్చి మనఃప్రియంబు సేయు' మనిన, భీముండు తత్క్షణంబ చని చక్రవాళ నగ సమున్నతం బయిన గిరిశృంగం బెక్కియందు వివిధరత్నరచిత రమ్య ప్రాకార పరివృతం బయిన వైశ్రవణు నివాసంబు గని శంఖధ్వానంబు సేసిన. 9

ప్రతిపదార్థం: ఈ+పువ్వులు= ఈ పువ్వులు; నాకున్+తెచ్చి+ఇచ్చి= నాకు తీసికొని వచ్చి ఇచ్చి; మనస్+ప్రియంబు= మనస్సుకు తృప్తిని; చేయుము= కల్గించుము; అనినన్= అని చెప్పగా; భీముండు= భీముడు; తద్+క్షణంబు+అ= ఆత్రుటిలోనే-అనగా వెనువెంటనే; చని= వెళ్ళి; చక్రవాళ, నగ, సమున్నతంబు+అయిన= చక్రవాళ పర్వతంవలె మిక్కిలి ఎత్తుగా ఉన్న; గిరి, శృంగంబు+ఎక్కి= కొండ కొనకు ఎక్కి; అందున్= అచట; వివిధ, రత్న, రచిత, రమ్య, ప్రాకార, పరివృతంబు+అయిన= పెక్కు విధములైన మణులచేత నిర్మించబడి అందమైన చుట్టుగోడచేత చుట్టుకొనబడిఉన్న; వైశ్రవణు, నివాసంబున్= కుబేరుడి యొక్క భవనాన్ని; కని= చూచి; శంఖధ్వానంబు+చేసినన్= శంఖాన్ని ఒత్తి పెద్దధ్వని చేయగా.

తాత్పర్యం: ఈ పువ్వులు నాకు తెచ్చి ఇచ్చి నా మనస్సుకు సంతోషాన్ని కలిగించుము'- అని భీముడితో ద్రౌపది పలికింది. భీమసేనుడు వెనువెంటనే బయలుదేరి చక్రవాళపర్వతంవలె మిక్కిలి ఎత్తయిన ఆ కొండకొసకు ఎక్కి, అక్కడ పలు తెరగుల మణులతో నిర్మించిన ప్రాకారంతో ఆవరించబడి ఉన్న కుబేరుడి నివాస భవనాన్ని చూచాడు; శంఖనాదం చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. దాని విని యక్షరాక్షస । సేనలు పఱతెంచి భీమసేను మహాసే
నానీసన్నిభుఁ దాఁకిరి । నానాయుధధరులు దారుణధ్వను లెసఁగన్. 10

ప్రతిపదార్థం: దాని, విని= ఆ శంఖధ్వనిని ఆలకించి; నానా+ఆయుధ ధరులు= అనేక శస్త్రాలను తాల్చినవారు; యక్ష, రాక్షస, సేనలు= యక్షులు, రాక్షసులు అయిన భటులతో కూడిన సైన్యాలు; దారుణ ధ్వనులు= భయంకరమైన నినాదాలు; ఎసఁగన్= విస్తరించగా; పఱతెంచి= పరుగున వచ్చి; మహా సేనానీ, సన్నిభున్= గొప్ప సేనాధిపతి- (కుమారస్వామితో) సమానుడైనవాడిని; భీమసేనున్= భీముడిని; తాఁకిరి= ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: ఆ శంఖనాదాన్ని విని యక్షరాక్షసభటులు గల సైన్యాలు పెక్కుఆయుధాలను ధరించి సింహనాదాలు చేస్తూ పరువెత్తి వచ్చి కుమారస్వామితో సమానుడైన భీమసేనుడితో తలపడ్డారు.

క. వాయుసుత ప్రేరిత శిత । సాయకముఖ దళిత రాక్షస ప్రకర బృహ
త్కాయాభ్ర గళిత శోణిత । తోయంబుల నవనిధరనదులు గడు నిండెన్. 11

ప్రతిపదార్థం: వాయు, సుత, ప్రేరిత, శిత, సాయక, ముఖ, దళిత, రాక్షస, ప్రకర, బృహత్+కాయ+అభ్ర, గళిత, శోణిత, తోయంబులన్= వాయుదేవునికుమారుడు అయిన భీముడిచేత ప్రయోగించబడిన వాడిబాణాలకొనలచేత చీల్చబడిన రాక్షసుల సమూహాలయొక్క పెనుదేహాలు అనే మబ్బులనుండి జారిన నెత్తురు అనే నీటిచేత; అవనిధర, నదులు= కొండవాగులు; కడు= మిక్కిలి; నిండెన్= నిండాయి.

తాత్పర్యం: వాయుసుతుడైన భీముడిచేత విడువబడిన వాడిబాణాలకొనలచేత చీల్చబడిన రాక్షసుల పెద్ద దేహాలు అనే మేఘాలనుండి కారిన నెత్తురు అనెడి నీటిచేత కొండవాగులు నిండి ప్రవహించాయి.

విశేషం: అలం: రూపకం.

ఉ. ఉక్కఱి యిట్లు మధ్యముమహోగ్రశరంబుల కోర్వనోప కా
రక్కసు లెల్ల నాహవపరాఙ్ముఖు లైనఁ గడంగి భీముఁ దా
నెక్కటి దాఁకె దిక్కరి సహింపక సింహముఁ దాఁకు నట్టులం
దక్కజుఁ డుద్యతాయతగదాయుధుఁడై మణిమంతుఁ డల్కతోన్. 12

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మధ్యము= భీముడి యొక్క (కుంతీకుమారులలో - ధర్మజభీమఅర్జునులలో - భీముడు మధ్యముడు); మహా+ఉగ్ర, శరంబులకు= మిక్కిలి భయంకరమైన బాణాలకు; ఓర్వన్+ఓపక= సహించజాలక; ఆ+రక్కసులు+ ఎల్లన్= ఆ రాక్షసులు అందరున్నూ; ఉక్కు+అఱి= బలం నశించి; ఆహవ+పరాక్+ముఖులు+ఐనన్= యుద్ధంలో పెడమొగాలు పెట్టినవారు కాగా; అందు= ఆ సైన్యంలో; అక్కజుఁడు= అధికుడు; మణిమంతుఁడు= మణిమంతుడు (అనే వీరుడు); తాన్= తాను; అల్కతోన్= కోపంతో; ఉద్యత+ఆయత, గదా+ఆయుధుఁడు+ఐ= గొప్పదైన గదాయుధాన్ని పైకెత్తి పట్టుకొనినవాడై; దిక్+కరి= దిగ్గజం; సింహమున్= సింహాన్ని; సహింపక= లెక్కచేయక; తాఁకునట్టులు= తలపడే టట్లుగా; కడంగి= పూని; భీమున్= భీమసేనుడిని; ఎక్కటి, తాఁకెన్= ఒంటరిగా ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా భీముడియొక్క మిక్కిలి భయంకరమైన బాణాలకు ఓర్వజాలక ఆ రాక్షసులు అందరు శక్తి హీనులై యుద్ధంనుండి వెనుదిరిగి పారిపోయారు. అంత, మణిమంతుడు అనే సేనాని, పొడవైన గదాయుధాన్ని పైకెత్తి పట్టుకొని ఆగ్రహోదగ్రుడై దిగ్గజం సింహాన్ని ఎదిరించినట్లుగా, భీముడిపై విజృంభించాడు.

విశేషం: (1)అలం: ఉపమ. (2) ఎనిమిది దిక్కులందు భూమిని భరించేవి అష్టదిగ్గజాలు అని ప్రాచీన సంప్రదాయ సిద్ధమైన అభిప్రాయం. 1. ఐరావతం, 2. పుండరీకం, 3. వామనం, 4. కుముదం, 5. అంజనం, 6. పుష్పదంతం, 7. సార్వభౌమం, 8. సుప్రతీకం - ఇవి అష్టదిగ్గజాలు.

క. **ఆ రాక్షసు నతివీరుఁ గు । బేరసఖుం బవనసుతుఁ డభేద్యుఁడు నిజదు**
ర్వారతరశాతసాయక । ధారావర్షమునఁ గప్పె దారుణభంగిన్. **13**

ప్రతిపదార్థం: అభేద్యుఁడు= భేదించరానివాడు- అంటే జయించటానికి సాధ్యం కానివాడు; పవన, సుతుఁడు= వాయుపుత్రుడైన భీముడు; అతివీరున్= గొప్ప శూరుడిని; కుబేర, సఖున్= కుబేరుడి యొక్క మిత్రుడిని; ఆ రాక్షసున్= ఆ రక్కసుడిని- అనగా మణిమంతుడిని; నిజ, దుర్వార, తర, శాత, సాయక, ధారా వర్షమునన్= వారించటానికి మిక్కిలి వీలులేని తనదైన వాడిఅయిన బాణాల పరంపర అనే వానచేత; దారుణభంగిన్= భయంకరమైన విధంగా; కప్పెన్= కప్పివేశాడు.

తాత్పర్యం: అజేయుడైన భీమసేనుడు మహావీరుడున్నూ, కుబేరుడి మిత్రుడున్నూ అయిన మణిమంతుడనే ఆ రాక్షసుడిపై మిగుల వాడియైన బాణాలపరంపరను ప్రయోగించి ఆ బాణాలవర్షంతో ఆతడిని భయంకరంగా కప్పివేశాడు.

క. **గద ద్రిప్పి భీముమీఁదను । వదలక మణిమంతుఁ డలిగి వైచిన నది వి**
ద్యుదుదితప్రభానిభం బై । పదిదిశలు వెలుంగ భీముపైఁ బఱతెంచెన్. **14**

ప్రతిపదార్థం: వదలక= విడువక; మణిమంతుఁడు= మణిమంతుడు; అలిగి= కోపించి; గద, త్రిప్పి= గదను త్రిప్పి; భీము మీఁదను= భీమసేనుడిపై; వైచినన్= ప్రయోగించగా; అది= ఆ గద; విద్యుత్+ఉదిత, ప్రభా, నిభంబు+ఐ= మెరుపుతీగనుండి వెలువడిన కాంతితో సమానమైనదై; పది, దిశలు= పది దిక్కులు; వెలుంగన్= ప్రకాశించగా; భీముపైన్= భీమసేనుడిపై; పఱతెంచెన్= దాడిచేయటానికి వచ్చింది.

తాత్పర్యం: మణిమంతుడు కోపించి, తన చేతిగద త్రిప్పి, గురిపెట్టి భీమసేనుడిపైకి విసిరాడు. ఆ గద మెరపు తీగవంటి కాంతితో మిరుమిట్లు గొల్పుతూ పది దిక్కులను ప్రకాశింపజేస్తూ భీమసేనుడిపైకి వేగంగా వచ్చింది.

విశేషం: ఈ పద్యం మూడవ పాదంలో "వి-ద్యుదిన ప్రభానిభంబై"- అనే పాఠాంతరం కొన్ని ప్రతుల్లో ఉంది. కాని 'న' కు బదులు 'త' అనునదియే సరియైన పాఠం-

క. **దానిఁ దన నిశితబాణవి । తానంబున జర్జరీకృతముఁ జేసి మరు**
త్సూనుఁడు గుహ్యక రాక్షస । సేనల కెల్లను భయంబు సేయుచు నలుకన్. **15**

ప్రతిపదార్థం: మరుత్+సూనుఁడు= వాయుపుత్రుడు - భీముడు; గుహ్యక, రాక్షస, సేనలకు+ఎల్లను= గుహ్యకులూ రాక్షసులూ అయిన సేనలలోని భటులందరికీ; భయంబు+చేయుచున్= భయం కలిగిస్తూ; అలుకన్= కోపంతో; దానిన్= అ గదను; తన,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిశిత, బాణ, వితానంబునన్= తనయొక్క వాడియైన అమ్ముల సముదాయంచేత; జర్జరీ, కృతమున్+చేసెన్= ముక్కలు ముక్కలుగా కొట్టాడు;

తాత్పర్యం: వాయుపుత్రుడైన భీముడు ఆ గదను తన వాడిబాణాలచేత తుత్తునియలు చేశాడు. ఆతడి ఆగ్రహానికి గుహ్యకభటులు రాక్షసభటులు మిక్కిలి భయం పొందారు.

క. ఘనుఁ డమ్మణిమంతుఁడు కాం । చనదండోద్భాసి యైన శక్తి మరున్నం
దనుమీఁద వైచె; నది యా । తని భుజపార్శ్వమ్ము దాఁకి ధారుణిఁ బడియెన్. 16

ప్రతిపదార్థం: ఘనుఁడు= గొప్పవాడు; ఆ+మణిమంతుఁడు= ఆ మణిమంతుడు; కాంచన, దండ+ఉద్భాసి+ఐన= బంగారు పిడితో వెలుగొందునట్టిదైన; శక్తి= శక్తి అనే ఆయుధాన్ని (బాకు వంటిది); మరుత్+నందను మీఁద= వాయుపుత్రుడైన భీమసేనుడి మీద; వైచెన్= విసరాడు; అది= ఆ శక్తి; ఆతని, భుజ, పార్శ్వమ్ము = ఆ భీముడి భుజముయొక్క ప్రక్కను; తాఁకి= ఆని; ధారుణిన్= భూమిపై; పడియెన్= పడింది.

తాత్పర్యం: గొప్పవాడయిన ఆ మణిమంతుడు బంగారుపిడితో వెలుగొందే ఆయుధమైన శక్తిని భీముడిపై విసిరాడు. ఆ శక్తి భీముడి భుజపార్శ్వాన్ని తాకి నేలపై పడింది.

చ. గదఁ గొని భీముఁ డంత లయకాలకృతాంతుఁడపోలె నేల గ్ర
క్కదల నదల్చి నిల్చిన, నకంపితుఁడై మణిమంతుఁ డాజి దు
ర్మదుఁడు త్రిశూల మెత్తికొని మధ్యముపై ననలస్ఫులింగముల్
సెదరఁగ వైచె; దానిఁ జెఱిచెన్ ఘనుఁ డగ్గదచేత భీముఁడున్. 17

ప్రతిపదార్థం: భీముఁడు= భీమసేనుడు; అంతన్= అంతట; గదన్+కొని= గదను పట్టుకొని; లయ, కాల, కృతాంతుఁడు+ అ+పోలె= ప్రళయ సమయంలోని యముడి వలె; నేల= భూమి; గ్రక్కదలన్= మిక్కుటంగా కదలగా; అదల్చి, నిల్చినన్= ధట్టించి నిల్వగా; ఆజిన్= యుద్ధంలో; దుర్మదుఁడు= చెడు గర్వం కలవాడు; మణిమంతుఁడు= మణిమంతుడు; అకంపితుఁడు+ఐ= కంపం చెందని వాడై; త్రిశూలము= మూడు మొనలు గల బల్లెమును; ఎత్తికొని= చేత పుచ్చుకొని; అనల, స్ఫులింగముల్= నిప్పురవ్వలు; చెదరఁగ= ఇటునటు వ్యాపించగా; మధ్యముపైన్= భీముడిపై; వైచెన్= విసిరాడు; దానిన్= ఆ త్రిశూలాన్ని; ఘనుఁడు= గొప్పవాడు; భీముఁడున్= భీమసేనుడున్నూ; ఆ+గద చేతన్= ఆ గద చేత; చెఱిచెన్= వమ్ము చేశాడు.

తాత్పర్యం: భీముడు తనచేత గదాయుధాన్ని ధరించి, ప్రళయకాలయముడివలె నేల కంపించేటట్లుగా ధట్టించి నిల్చాడు. మణిమంతుడు ఏ మాత్రం జంకకుండా యుద్ధంలో చెడ్డగర్వం కలవాడై త్రిశూలం చేతబట్టి నిప్పురవ్వలు చెదరేటట్లుగా భీముడిపై విసరి వైచాడు. భీముడు తన గదచేత ఆ త్రిశూలాన్ని విఫలం కావించాడు.

వ. ఇట్లు తనశక్తిశూలంబు లశక్తి నిహతంబైనఁ బరిత్యక్త మదుండై మణిమంతుం డంతరిక్షంబున కెగసిన.18

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తన, శక్తి, శూలంబులు= తన శక్తి, త్రిశూలం- అనే ఆయుధాలు; అ శక్తి= శక్తిలేక- లేదా - శక్తికానట్టి అనగా గదాయుధంచేత; నిహతంబు+ఐనన్= నాశనం చేయబడటంచేత; పరిత్యక్త, మదుండు+ఐ= పూర్తిగా త్యజించిన గర్వం కలవాడై; మణిమంతుండు= మణిమంతుడు; అంతరిక్షంబునకున్= ఆకసానికి; ఎగసినన్= ఎగురగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ రీతిగా, తాను ప్రయోగించిన గొప్ప ఆయుధాలైన 'శక్తి' 'త్రిశూలం' శక్తిచాలక, భీముడి ఆయుధాలచేత వమ్ము కావటంచేత, గర్వం ఉడిగి మణిమంతుడు ఆకసానికి ఎగిరాడు.

క. 'పోవకు పోవకు' మనుచు మ । హావీరుఁడు గద యమర్చి యమ్మణిమంతున్
లా వఱఁగ వైచె నగ్గద । తో వాఁడును బడియెఁ బ్రతిహతుం డై నేలన్. 19

ప్రతిపదార్థం: పోవకు= పోవద్దు; పోవకుము= వెళ్లిపోవద్దు; అనుచు= అని అంటూ; మహావీరుఁడు= (భీముడు) గొప్పవీరుడు; గద+అమర్చి= గదను పట్టుగా పట్టి; ఆ+మణిమంతున్= ఆ మణిమంతుడిని; లావు+అఱఁగన్= బలము క్రుంగేటట్లుగా; ఆ+గదతో= ఆ గదతో; వైచెన్= కొట్టాడు; వాఁడును= ఆ మణిమంతుడును; ప్రతిహతుండు+ఐ= ఆ విధంగా గదతో కొట్టబడినవాడై; నేలన్= పుడమిమీద; పడియెన్= పడ్డాడు.

తాత్పర్యం: భీముడు ఆకసానికి ఎగసి తప్పించుకొన జూచే ఆ మణిమంతుడితో. 'పోవకు, పారిపోకు, అని అంటూ తనగదను త్రిప్పి ఆతనిపై విసరాడు. ఆ గదాఘాతంతో మణిమంతుడు నేలపై కూలి మరణించాడు.

క. పోర మణిమంతుఁ డిట్లు స । మీరణసుతుచేతఁ బ్రాప్తమృతుఁ డై పడినన్
వారక పఱచిరి భయమున । నా రాక్షసు లార్తనాదు లై తూర్పునకున్. 20

ప్రతిపదార్థం: పోరన్= యుద్ధంలో; మణిమంతుఁడు= మణిమంతుడు; ఇట్లు= ఈ రీతిగా; సమీరణ, సుతుచేతన్= వాయుపుత్రుడైన భీముడిచేత; ప్రాప్త, మృతుఁడు+ఐ= ప్రాప్తించిన మృత్యువు కల వాడై అనగా మరణించి; పడినన్= పుడమిపై పడిపోగా; ఆ, రాక్షసులు= ఆ రక్కసులు; ఆర్త, నాదులు+ఐ= దుఃఖంతో దీనమైన స్వరాలను చేసేవారై అనగా ఏడుస్తూ; తూర్పునకున్= తూరుపు దిక్కుకు; భయమునన్= భీతితో; పఱచిరి= పారిపోయారు.

తాత్పర్యం: యుద్ధంలో మణిమంతుడు ఈ రీతిగా భీముడిచేత మరణించటం చూచి, మిగిలిన రక్కసులు రోదిస్తూ తూర్పుదెసగా భయంతో పారిపోయారు.

వ. అట ధర్మరాజు, భీముండు పోయిన వలను ద్రౌపదిచే నెఱింగి యార్ష్టిషేణుం డను మునివరు నాశ్రమంబున ధౌమ్యద్రౌపదీప్రభృతులంబెట్టి, రోమశనకుల సహదేవయుతుండై తద్గిరిశృంగం బెక్కికుబేరసదన సమీపంబున నిజగదాఘాతపాతిత మణిమదాది రాక్షస దారుణ రణమధ్యంబున నున్న మధ్యమునొద్దకుం జనియె; నంత.21

ప్రతిపదార్థం: అటన్= అక్కడ; ధర్మరాజు; భీముండు; పోయిన వలను= వెళ్లిన దిక్కును; ద్రౌపదిచేన్= ద్రౌపదివలన; ఎఱింగి= తెలిసికొని; ఆర్ష్టిషేణుండు+అను= ఆర్ష్టిషేణుడు అనునట్టి; మునివరు+ఆశ్రమంబునన్= ఋషిశ్రేష్ఠుడియొక్క ఆశ్రమంలో; ధౌమ్య, ద్రౌపదీ, ప్రభృతులన్+పెట్టి= ధౌమ్యుడు ద్రౌపది మున్నగు వారలను ఉంచి; రోమశ, నకుల, సహదేవ, యుతుండు+ఐ= రోమశుడితో నకులుడితో సహదేవుడితో కూడిన వాడై; తద్+గిరి, శృంగంబు+ఎక్కి- ఆ కొండకొనభాగాన్ని అధిరోహించి; కుబేర, సదన, సమీపంబునన్= కుబేరుడియొక్క ఇంటికి చేరువగా; నిజ, గదా+ఆఘాత, పాతిత, మణిమత్+ఆది, రాక్షస, దారుణ, రణ, మధ్యంబునన్= తన గదయొక్క దెబ్బలచేత క్రిందపడి పోయిన మణిమంతుడు మొదలైన రక్కసులతో కూడిన భయంకరమైన యుద్ధరంగ మధ్యభాగంలో; ఉన్న= నిలిచి ఉన్న; మధ్యము+ఒద్దకున్= భీముడి దగ్గరకు; చనియెన్= వెళ్ళాడు; అంతన్= ఆ తరువాత.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అక్కడ, ధర్మరాజు భీముడు వెళ్లిన దిక్కును ద్రౌపదివలన తెలిసికొన్నాడు. ఆర్‌ష్టిషేణుడు అనే ఋషిరేణ్యుడి ఆశ్రమంలో ద్రౌపదిని ధౌమ్యుడిని మున్నగువారిని ఉంచి, ధర్మరాజు రోమశ నకుల సహదేవులతోపాటు ఆ కొండ శిఖరాన్ని అధిరోహించి, కుబేరుడి భవనానికి చేరువగా, తన గద తాకిడికి చచ్చి పడి ఉన్న మణిమంతుడు మొదలైన రాక్షసులతోకూడిన ఆ భయంకర రణరంగంమధ్య నున్న భీముడిని చూచి, అతడి దగ్గరకు వెళ్ళాడు. ఆ తరువాత.

క. హతశేషు లైన రాక్షసు । లతిరయమునఁ బాఱి చెప్పి రప్పుడ యలకా
పతికి సవిస్తరముగ నిజ । మతిఁ బవనజువిక్రమంబు మణిమద్వధయున్. 22

ప్రతిపదార్థం: హత శేషులు+ఐన= చావగా మిగిలి ఉన్న వారైన; రాక్షసులు= రక్కసులు; అతి, రయమునన్= మిక్కిలి వేగంగా; పాఱి= పరుగెత్తి; అప్పుడు+అ= వెంటనే; అలకాపతికిన్= అలక అనే పట్టణానికి అధిపతి అయిన కుబేరుడికి; నిజ, మతిన్= తమ బుద్ధికి అనువైన రీతిగా; పవనజు, విక్రమంబు= వాయుపుత్రుడైన భీముడి పరాక్రమాన్ని గురించి; మణిమత్+వధయున్= మణిమంతుడియొక్క సంహారాన్నిగురించి; సవిస్తరముగన్= వివరాలతో సహా; చెప్పిరి= చెప్పారు.

తాత్పర్యం: చావగా మిగిలిన రక్కసులు మిక్కిలి వేగంగా పరుగెత్తి, ఆ అలకాపురానికి అధిపతి అయిన కుబేరుడికి తమ బుద్ధికి అందినంతమేరకు వాయుపుత్రుడైన భీముడి పరాక్రమాన్నిగురించి, మణిమంతుడి సంహారాన్నిగురించి వివరాలన్నిటితో విన్నవించారు.

వ. దాని విని కుబేరుండు విస్మితుండై యాత్మగతంబున. 23

ప్రతిపదార్థం: దాని, విని= (చావగా మిగిలినవారు) చెప్పినదానిని విని; కుబేరుడు; విస్మితుండు+ఐ= ఆశ్చర్యపడిన వాడై; ఆత్మగతంబునన్= తనలో.

తాత్పర్యం: భీముడి పరాక్రమప్రాభవాన్నిగురించి విని కుబేరుడు అచ్చెరువంది తనలో ఈ విధంగా తలపోశాడు.

క. 'తలఁకక మును సౌగంధిక । ములు గొని, యిప్పుడును దర్పమున నిందుల పు
వ్వులు గొని మణిమత్ప్రభృతులఁ । బలువుర వధియించె నెట్టి బలియుఁడొ!' యనుచున్. 24

ప్రతిపదార్థం: తలఁకక= జంకక; మును= ఇంతకుముందు; సౌగంధికములు+కొని= పసిడి నెత్తావితామరపువ్వులు సంగ్రహించి; ఇప్పుడును= మరల నేడు; దర్పమునన్= గర్వంతో; ఇందుల, పువ్వులు= ఇచటి పూలను; కొని= గ్రహించి; మణిమత్+ప్రభృతులన్= మణిమంతుడు మున్నగు వారిని; పలువురన్= పెక్కు మందిని; వధియించెన్= సంహరించాడు; ఎట్టి= ఎటువంటి; బలియుఁడొ= బలవంతుడో; అనుచున్= అని తలపోస్తూ.

తాత్పర్యం: 'ఇంతకుముందు ఈ భీముడు జంకుగొంకులు లేకుండా పసిడి తామరపువ్వులు కొనిపోయాడు. ఇప్పుడు ఈ పూలను సగర్వంగా సంగ్రహించి, మణిమంతుడు మొదలైన మహావీరులను సంహరించాడు. ఈతడు ఎంతటి బలవంతుడో కదా!' అని తలపోస్తూ.

వ. సురగరుడగంధర్వయక్షరాక్షససహితుం డయి యక్షప్రభుం డరుగుదెంచి పాండవులం గని, వారిలోన గదాకృపాణ బాణబాణాసనధరుం డయి రణకాంక్ష నున్న మహావీరు మారుతాత్మజుం జూచి పరమప్రీతచిత్తుం డయిన. 25

ప్రతిపదార్థం: సుర, గరుడ, గంధర్వ, యక్ష, రాక్షస, సహితుండు+అయి= దేవతలు, గరుడులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులతో కూడిన వాడయి; యక్షప్రభుండు= కుబేరుడు; అరుగుదెంచి= వచ్చి; పాండవులన్+కని= పాండవులను చూచి; వారిలోనన్= ఆ పాండవులలో; గదా, కృపాణ, బాణ, బాణాసన, ధరుండు+అయి= గద, కత్తి, అమ్ములు, విల్లు ధరించినవాడై; రణ, కాంక్షన్= యుద్ధంచేయాలని కోరిక గలవాడై; ఉన్న= ఉన్నటువంటి; మహావీరున్= గొప్పశూరుడిని; మారుత+ఆత్మజున్= వాయుపుత్రుడైన భీముడిని; చూచి= కాంచి; పరమ, ప్రీత, చిత్తుండు+అయిన= మిక్కిలి సంతోషంతో కూడిన మనస్సు కలవాడైన.

తాత్పర్యం: అంత, కుబేరుడు సపరివారంగా, దేవతలు, గరుడులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు తనను కొలువగా వచ్చి, పాండవులను చూచాడు. వారిలో భీముడు గద, కత్తి, అమ్ములు ధనువు ధరించి యుద్ధపు కోరిక గలవాడై నిలిచి ఉన్నాడు. ఆ మహావీరు డైన వాయుసుతుడిని చూచి కుబేరుడు మిక్కిలి సంతసించిన మనస్సు కలవాడైనాడు.

ఆ. **అక్కుబేరునకు మహామతుల్ పాండవుల్ । మ్రొక్కి; రంత ధర్మమూర్తి యైన**
ధర్మతనయుఁ జూచి తద్దయు దయతోడ । నిట్టు లనియెఁ గిన్నరేశ్వరుండు. **26**

ప్రతిపదార్థం: ఆ+కుబేరునకున్= ఆ కుబేరుడికి; మహామతుల్= గొప్ప బుద్ధికలవారు; పాండవుల్= పాండురాజుసుతులు; మ్రొక్కిరి= నమస్కరించారు; అంతన్= అంతట; ధర్మమూర్తి+ఐన= రూపుగొనిన ధర్మం అయిన; ధర్మతనయున్+చూచి= ధర్మరాజును చూచి; కిన్నర+ఈశ్వరుండు= కిన్నరులకు ప్రభువు అయిన కుబేరుడు; తద్దయు= మిక్కుటమైన; దయతోడన్= కరుణతో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ కుబేరుడికి బుద్ధిమంతులైన పాండవులు నమస్కరించారు. అంతట, ఆకారం ధరించిన ధర్మమైన ధర్మరాజును చూచి, కిన్నరులకు ప్రభువు అయిన కుబేరుడు మిగుల దయతో ఇట్లా పలికాడు.

విశేషం: పాండవులు విశిష్ట వ్యక్తులు. ఎదుటివారు అవినయాన్ని ప్రకటించినా కయ్యానికి కాలు దువ్వినా యుద్ధానికి సిద్ధం. పెద్దలు ఎదురైతే వినయంతో నమస్కరించటం వారి సంస్కారం. ధర్మజుడు పెద్దలకు ముందుగా నమస్కరిస్తాడు, అందరి నమస్కారాలను తిరిగి పొందుతాడు. తమ్ములు అతడిని అనుసరిస్తారు.

వ. **'అయ్యా! నీయనుజుండు మత్ప్రియసఖుండైన మణిమంతు వధియించి నా కపకారంబు సేసె నని లజ్జింపవలవ; దది యగస్త్యశాపనిమిత్తంబున నయ్యె' నని భీమసేను డాయంబిలిచి 'నీ చేసినసాహసంబు నా కుపకారంబు గావున నిన్ను మెచ్చితి' ననిన నక్కుబేరునకుం గృతాంజలి యయి ధర్మతనయుం డి ట్లనియె.27**

ప్రతిపదార్థం: అయ్యా!= ఆర్యా!; నీ+అనుజుండు= నీ తమ్ముడు; మత్+ప్రియ, సఖుండు+ఐన= నాకు ఇష్టుడైన మిత్రుడైన; మణిమంతున్, వధియించి= మణిమంతుడిని సంహరించి; నాకు+అపకారంబు= నాకు కీడు; చేసెను+అని; లజ్జింప వలవదు= సిగ్గు చెంద వద్దు; అది= ఆ సంఘటన; అగస్త్య, శాప, నిమిత్తంబునన్+అయ్యెన్= అగస్త్యుడియొక్క శాపం కారణంగా జరిగింది; అని= అని చెప్పి; భీమసేనున్= భీముడిని; డాయన్+పిలిచి= దగ్గరకు (చేరేటట్లు) ఆహ్వానించి; నీ, చేసిన, సాహసంబు= నీవు ఒనరించిన తెగువ; నాకు+ఉపకారంబు= నాకు మేలు; కావున= కాబట్టి; నిన్ను, మెచ్చితిన్= నిన్ను గౌరవించాను; అనినన్= అని చెప్పగా; ఆ+కుబేరునకున్; కృత+అంజలి+అయి= చేయబడిన నమస్కారం కలవాడై; ధర్మతనయుండు= ధర్మసుతుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'అయ్యా! నీ తమ్ముడు నా ప్రియమిత్రుడిని సంహరించి నాకు కీడు చేశాడని సిగ్గు చెందవద్దు; అది అగస్త్యముని ఇచ్చిన శాపం కారణంగా జరిగింది' అని చెప్పి భీముడిని తనదగ్గరికి ఆహ్వానించి, 'నీవు చేసిన సాహసం వలన, నాకు జరిగింది ఉపకారమే కాబట్టి నేను నిన్ను మెచ్చాను' అని చెప్పాడు. ధర్మరాజు కుబేరుడికి నమస్కరించి ఈ విధంగా అన్నాడు.

ఆ. 'ఇట్టి శాప మమ్మునీంద్రుండు దా నేల । యిచ్చె? దాని నాకు నెఱుఁగఁ జెప్పు'
మనిన విస్తరించి యమరాజసుతునకు । నక్కుబేరుఁ డిట్టు లనుచుఁ జెప్పె. 28

ప్రతిపదార్థం: ఇట్టి శాపము= ఇటువంటిశాపం; ఆ+ముని+ఇంద్రుండు= ఆ ఋషిశ్రేష్ఠుడు; తాన్+ఏల+ఇచ్చె?= తాను ఎందుకు ఇచ్చాడు?; దానిన్= ఆ ఆకథను; నాకు+ఎఱుఁగన్+చెప్పుము= నాకు విశదంగా చెప్పుము; అనినన్= అని అడుగగా; విస్తరించి= వివరించి; యమరాజ సుతునకున్= యమధర్మరాజు కుమారుడైన ధర్మరాజుకు; ఆ+కుబేరుఁడు; ఇట్టులు+అనుచున్+చెప్పెన్= ఈ క్రింది విధంగా వివరించి చెప్పాడు.

తాత్పర్యం: 'ఈ విధమైన శాపాన్ని మునిశ్రేష్ఠు డైన అగస్త్యుడు ఎందుకు ఇచ్చాడు? ఆవిషయాన్ని నాకు సవిస్తరంగా చెప్పుము' అని అడుగగా యమధర్మరాజుసుతుడైన ధర్మరాజుకు కుబేరుడు ఈ విధంగా తెలిపాడు.

వ. 'తొల్లికుశావతి యను పుణ్యనదీతీరంబున నమరులెల్ల సత్త్రయాగంబు సేయుచుండి నన్ను రావించిన నేనును బుష్పకవిమానారూఢుండ నై త్రిశతమహాపద్మసంఖ్యల యక్షరాక్షసబలంబుతో గగనగతి నందులకుఁ బోవునెడ నూర్ధ్వబాహుండై యమునా తీరంబున నుగ్రతపంబు సేయుచున్న యగస్త్యమహామునిమీఁద నా ప్రియసఖుం డైన మణిమంతుం డెఱుంగక నిష్ఠీవనంబు సేసిన నలిగి యమ్మునివరుండు నా కిట్లనియె. 29

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; కుశావతి+అను= కుశావతి అనే పేరుకల; పుణ్య, నదీ, తీరంబునన్= పుణ్యాన్ని ఇచ్చే ఏటిగట్టుదరిని; అమరులు+ఎల్లన్= వేల్పులు అందరు; సత్త్రయాగంబు+చేయుచుండి= సత్రయాగం అనే యజ్ఞాన్ని చేస్తూ; నన్ను, రావించినన్= నన్ను ఆహ్వానించి రప్పించగా; ఏనును= నేనున్నూ; పుష్పక, విమాన+ఆరూఢుండను+ఐ= పుష్పకమనే పేరుకల విమానాన్ని అధిరోహించినవాడి నై; త్రి, శత, మహాపద్మ, సంఖ్యల= మూడువందల మహాపద్మ సంఖ్యలు కల; యక్ష, రాక్షస, బలంబుతోన్= యక్షులు రాక్షసులు ఐన భటులతో; గగన గతిన్= ఆకాశమార్గాన; అందులకున్= ఆ సత్త్రయాగానికి; పోవు+ఎడన్= వెళ్ళేటప్పుడు; ఊర్ధ్వ+బాహుండు+ఐ= ఎత్తిన చేతులు కలవా డై; యమునా, తీరంబునన్= యమునానదిగట్టున; ఉగ్ర, తపంబు= కఠిన మైన తపస్సు; చేయుచున్న+అగస్త్యమహాముని మీఁదన్= చేస్తున్నటువంటి అగస్త్యమహర్షి పైన; నా ప్రియసఖుండు+ఐన= నాకు అనుగునెచ్చెలి అయిన; మణిమంతుండు= మణిమంతుడు; ఎఱుంగక= తెలియక; నిష్ఠీవనంబు+చేసినన్= ఉమ్మివేయగా; అలిగి= ఆగ్రహించి; ఆ+ముని, వరుండు= ఆ ఋషిశ్రేష్ఠుడు; నాకు+ఇట్లు+అనియెన్= నాతో ఈ రీతిగా పలికాడు.

తాత్పర్యం: 'పూర్వకాలంలో కుశావతి అనే పుణ్యనదీతీరాన వేల్పులు అందరు సత్త్రయాగాన్ని చేస్తూ నన్ను ఆహ్వానించారు. నేను పుష్పకవిమానం అధిరోహించి మూడువందల మహాపద్మసంఖ్యలు గల యక్షరాక్షసపరివారంతో బయలుదేరాను. మేము గగనమార్గాన పయనిస్తూ ఉండగా భూమిపై యమునాతీరంలో ఆగస్త్యమహర్షి చేతులు పైకెత్తికొని, కఠోర మైన తపస్సును చేస్తూ ఉన్నాడు. అప్పుడు నా అనుగుచెలికాడు మణిమంతుడు తెలియక ఉమ్మివేశాడు. అది అగస్త్యమహర్షిపైన పడింది. అందుకు ఆగ్రహించి నాతో ఆ మహర్షి ఇట్లా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'నీవు సూచుచుండ నీ యిష్టుఁ డిమ్మణి । మంతుఁ డిపుడు దనదు మదముపేర్మి
నన్ను నరయ కుమిసె నామీఁద కష్టదు । ర్మదుఁడు పొలియు నొక్క మనుజుచేత. 30

ప్రతిపదార్థం: నీవు+చూచుచు+ఉండన్= నీవు చూస్తూ ఉండగనే; నీ+ఇష్టుఁడు= నీ అనుగునెచ్చెలి; ఈ+మణిమంతుఁడు= ఈ మణిమంతుడు; ఇపుడు= ఇప్పుడు; తనదు, మదము, పేర్మిన్= తన గర్వంయొక్క అతిశయంచేత; నన్నున్= నన్ను; అరయక= చూడకుండగా; నామీఁద= నాపై; ఉమిసెన్= ఉమ్మివేశాడు; కష్ట, దుర్మదుఁడు= ఇతరులకు నొప్పి కలిగించే చెడ్డ గర్వంకలవాడు (మణిమంతుడు); ఒక్క, మనుజుచేతన్= ఒక మనుష్యుడిచేత; పొలియున్= చచ్చిపోతాడు.

తాత్పర్యం: నీ సమక్షంలోనే నీవు చూస్తూ ఉండగనే నీ అనుగుమిత్రుడు ఈ మణిమంతుడు మదాతిశయంతో నన్ను చూడకుండ నామీద ఉమ్మివేశాడు. ఇతరులకు నొప్పి గలిగించే చెడ్డమదంగల ఆ మణిమంతుడు ఒక మనుష్యుడిచేతిలో చచ్చుగాక!

వ. మఱియు నీ యక్ష రాక్షస బలంబులు వానిచేత నిహతు లగుదు; రిద్దురితంబు దద్దర్శనంబునం బాయు నని యెం గావున నిట్టి శాపఫలంబునకు నీ యనుజుండు నిమిత్తం బయ్యె' నని చెప్పి, వెండియు ని ట్లనియె 'ధృతియును దాక్ష్యంబును దేశకాలంబులును బరాక్రమంబును మంత్రవిధానంబు నను పంచవిధాంగంబు నెఱింగిన క్షత్రియుండు ధర్మవిదుండై ధరణీచక్రంబు నిర్వక్రమంబుగా రక్షించి పుణ్యలోకంబు పడయుఁ; గర్మవిశేషంబు లెఱుంగక వృథారంభుం డై సాహసంబున వర్తిల్లువానికిం బాతకం బగుట నిశ్చయంబు.31

ప్రతిపదార్థం: మఱియు= ఇంకను; నీ, యక్ష, రాక్షస, బలంబులు= నీయొక్క యక్షులు రక్కసులు అయిన భటులు; వానిచేతన్= ఆ మనుజుడిచేత; నిహతులు+అగుదురు= సంహరించబడతారు; ఈ+దురితంబు= ఈ పాపం; తద్+ దర్శనంబునన్= ఆతడిని చూడటం వలన; పాయును= పోతుంది; అనియెన్= అని చెప్పాడు; కావునన్= కాబట్టి; ఇట్టి, శాప, ఫలంబునకున్= ఈ విధమైన శాపంయొక్క ఫలితానికి; నీ+అనుజుండు= నీ తమ్ముడు; నిమిత్తంబు+అయ్యెన్= కారణం అయినాడు; అని= అంటూ; చెప్పి= పలికి; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; ధృతియును= ధైర్యమున్నూ; దాక్ష్యంబును= సమర్థతయున్నూ; దేశ, కాలంబులు= స్థలమున్నూ సమయమున్నూ; పరాక్రమంబును= శౌర్యమున్నూ; మంత్ర విధానంబును= రహస్యాలోచన; అను= అనెడి; పంచవిధ+అంగంబున్= అయిదు తీరులు కల విధానాన్ని; ఎఱింగిన= తెలిసిన; క్షత్రియుండు= ప్రభువు; ధర్మ, విదుండు+ఐ= ధర్మాన్ని ఎరిగినవాడై; ధరణీ చక్రంబు= భూమండలాన్ని; నిర్వక్రంబుగాన్= వంకరలేకుండ బుజుమార్గంలో; రక్షించి= కాపాడి; పుణ్య, లోకంబు+పడయున్= పుణ్యం ఆర్జించేవారు పోయేగతులు పొందుతాడు; కర్మ, విశేషంబులు+ఎఱుంగక= చేసేపనులందలి ఆంతర్యం తెలియక; వృథా+ ఆరంభుండు+ఐ= వ్యర్థ ప్రయత్నాలు కలవాడై; సాహసంబునన్= తెగువతో; వర్తిల్లువానికిన్= నడచునట్టి వాడికి; పాతకంబు+ అగుట= పాపం దాపురించటం; నిశ్చయంబు= తప్పదు.

తాత్పర్యం: ఇంకను, నీ యక్ష రాక్షసభటులు ఆ మనుజుడిచేత సంహరించబడతారు! ఆ పాపం ఆతడిని చూడటంచేత తీరిపోతుంది! అని చెప్పాడు. కాబట్టి నీ తమ్ముడు, మణిమంతుడిచావుకూ, నా యక్షరాక్షస బలాలు చనిపోవటానికీ నిమిత్తమాత్రుడే. అది ఆ శాపఫలం'- అని చెప్పి మరల ఇట్లా వచించాడు. '1.ధైర్యం 2. సామర్థ్యం 3. దేశకాలాలు 4. శౌర్యం 5. రహస్యమంత్రాంగం అనే పంచవిధమైన రాజనీతి అంగాలను తెలిసిన ప్రభువు భూచక్రాన్ని సవ్యంగా పరిపాలించి పుణ్యగతులను పొందుతాడు. చేసేకర్మలలోని ఆంతర్యాన్ని తెలిసికొనక తెగువతో వ్యర్థమైన ప్రయత్నాన్ని చేసేవాడికి పాపం సంక్రమించటం తప్పదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పరిపాలన=ధైర్యం+దక్షత+దేశకాలపరిగణనం+పరాక్రమం+రహస్యమంత్రాంగం- ఇది కుబేర రాజనీతి. కేవల పరాక్రమప్రదర్శన రాజనీతి కాదు - అనే హెచ్చరిక మరువరానిది.

క. కావున నిరతమ్ము మరు । ద్దేవాత్మజు సాహసైకధృతి గాకుండన్
భూవల్లభ! శిక్షింపుము । నీ విమలజ్ఞానధర్మనిష్ఠితబుద్ధిన్. 32

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; భూవల్లభ!= భూమికి భర్త వయిన రాజా!; మరుత్+దేవ+ఆత్మజున్= వాయుదేవుడి పుత్రుడైన భీముడిని; నిరతమ్ము= ఎల్లప్పుడును; సాహస+ఏక ధృతి= తెగువను మాత్రమే ప్రదర్శించే ధైర్యశాలి; కాకుండన్= కాకుండగా; నీ, విమల, జ్ఞాన, ధర్మ, నిష్ఠిత, బుద్ధిన్= నీదైన నిర్మలమైన జ్ఞానంతో ధర్మంతో కూడిన ఆలోచనతో; శిక్షింపుము= ప్రబోధించుము.

తాత్పర్యం: భూమికి ప్రభువైన ఓ ధర్మరాజా! నీవు నిర్మలమైన జ్ఞానంతో ధర్మంతో కూడిన బుద్ధిమంతుడవు, పరాక్రమాన్ని ప్రదర్శించటానికి వీలుచాలులు ఎరుగ వలయును. కావున, నీ తమ్ముడైన వాయుదేవుడిపుత్రుడిని కేవలం తెగువనుమాత్రమే ప్రదర్శించే ధైర్యశాలి కాకుండగా ప్రబోధించుము.

వ. నిన్నును నీ తమ్ములను ధర్మానిల శక్రాశ్వినులు రక్షించునట్ల యే నెప్పుడు రక్షింతు; నా నియోగంబున మత్పరిచారకులు మీకు నిత్యంబును నన్న పానాదులు దెచ్చియిచ్చుచుండ నార్ష్టిషే ణాశ్రమంబున నొక్కపక్షంబు వసియించునది. 33

ప్రతిపదార్థం: నిన్నును= నిన్నును; నీ తమ్ములను= నీ సహోదరులను; ధర్మ+అనిల, శక్ర+ఆశ్వినులు= యముడు, వాయువు, ఇంద్రుడు, అశ్వినీదేవతలు; రక్షించునట్లు+అ= కాపాడేటట్లుగనే; ఏనును= నేనున్నూ; రక్షింతున్= కాపాడతాను; నా నియోగంబునన్= నా పనుపువలన; మత్+పరిచారకులు= నా సేవకులు; మీకున్= మీకు; నిత్యంబును= ప్రతిదినమూ; అన్న, పాన+ఆదులు= అన్నం నీరు మున్నగునవి; తెచ్చి+ఇచ్చుచు+ఉండన్= తీసికొనివచ్చి మీకు ఇస్తూఉండగా; ఆర్ష్టిషేణ+ఆశ్రమంబునన్= ఆర్ష్టిషేణ మునియొక్క ఆశ్రమంలో; ఒక్కపక్షంబు= పదునైదు రోజులు; వసియించునది= నివసించండి.

తాత్పర్యం: నిన్నును, నీ తమ్ములను యమధర్మరాజు, వాయుదేవుడు, ఇంద్రుడు ఆశ్వినులు కాపాడేటట్లుగానే నేను కూడా మిమ్మల్ని రక్షించగలను, నా ఆజ్ఞచొప్పున నా సేవకులు మీకు ప్రతిదినం అన్నం నీళ్ళు మొదలైనవి సమకూర్చగలరు. మీరు పదునైదుదినాలు ఆర్ష్టిషేణ మహర్షి ఆశ్రమంలో నివసించండి.

సీ. 'మానితయశుఁడు భీమానుజుం డర్జునుం । డమరులచేత దివ్యాస్త్రతతులు
వడసి దేవేశ్వరుకడ నున్నవాఁ; డతం । డుపకారి యయ్యె దేవోత్తమునకు;
సప్తమేధాధ్వరప్రాప్తపుణ్యుఁడు ధర్మ । మతి భవత్పితృపితామహుఁడు ఘనుఁడు
శంతనుఁ డతనిచే సంతర్పితుం డయ్యెఁ । గుఱుకొని మీదైన కుశల మడిగె;

ఆ. నరుగుదెంచు నింత కయ్యర్జునుండు మీ । కభిమతార్థసిద్ధి యగును సిద్ధ'
మని యెఱుంగఁ జెప్పి యలకాధినాథుండు । యక్షగణముతోడ నరిగె నంత. 34

ప్రతిపదార్థం: మానితయశుఁడు= మన్నించబడిన కీర్తికలవాడు; భీమ+అనుజుండు= భీముడికి తమ్ముడు- అనగా, అర్జునుడు; అమరులచేతన్= వేల్పులచేత; దివ్య+అస్త్ర, తతులు= దివ్యాలైన ఆయుధాల సముదాయాలు; పడసి= పొంది; దేవ+ఈశ్వరుకడన్=

దేవేంద్రుడి దగ్గర; ఉన్నవాఁడు= ఉన్నాడు; దేవ+ఉత్తమునకున్= దేవేంద్రుడికి; అతండు= అతడు; ఉపకారి+అయ్యెన్= మేలుచేకూర్చినవాడు అయినాడు; సప్త, మేధ+అధ్వర, ప్రాప్త, పుణ్యుఁడు= ఏడు అశ్వమేధ యాగాలు చేయటంచేత లభించిన పుణ్యం కలవాడు; ధర్మమతి= ధర్మంతో కూడిన బుద్ధికలవాడు; భవత్+పితృ పితామహుఁడు= మీ తండ్రికి తాతఐనవాడు; ఘనుఁడు= గొప్పవాడు; శంతనుఁడు= శంతనుడు అనే ప్రభువు; అతనిచేన్= ఆ అర్జునుడి చేత; సంతర్పితుండు+అయ్యెన్= సంతృప్తిచెందింపబడిన వాడైనాడు; గుఱుకొని= పూని; మీదైన= మీయొక్క; కుశలము= క్షేమాన్ని గురించి; అడిగెన్= అడిగాడు; ఆ+అర్జునుండు= ఆ అర్జునుడు; ఇంతకు= ఇప్పుడు; అరుగుదెంచున్= వస్తాడు; మీకు+అభిమత+అర్థసిద్ధి+అగును= మీరు కాంక్షించే కోరిక మీకు ఈడేరుతుంది; సిద్ధము+అని= జరిగినట్లే అని; అలకా+అధినాథుండు= అలకాపట్టణానికి ప్రభువు అయిన కుబేరుడు; ఎఱుంగన్+చెప్పి= తెలిసేటట్లు చెప్పి; యక్ష, గణముతోడన్= యక్షుల సముదాయంతో; అరిగెన్= వెళ్ళాడు; అంతన్= అంతట.

తాత్పర్యం: గౌరవించబడిన కీర్తిగల అర్జునుడు వేల్పులచేత దివ్యాస్త్రాలను పొందాడు. ఇప్పు డతడు దేవేంద్రుడి కడ ఉన్నాడు; అతడు దేవేంద్రుడికి మేలు చేసినవా డైనాడు; అంతేగాక, మీ తండ్రిగారికి తాతగారైనట్టి వాడున్నూ, ఏడు అశ్వమేధయాగాలు చేసి పుణ్యాన్ని ఆర్జించినవాడున్నూ అయిన శంతనునిచేత మన్నించబడినాడు. ఆయన మీ అందరి కుశలమడిగినాడు. మీ సోదరుడైన ఆ అర్జునుడు ఇప్పుడు మీదగ్గరకు రావటానికి సిద్ధంగా ఉన్నాడు. మీ కోరికలు ఈడేరగలవు. అన్నియు మీకొరకు సంసిద్ధం'- అని పాండవులను అభినందించి కుబేరుడు యక్షగణాలతోపాటు నిష్క్రమించాడు; అంతట.

వ. ఇట్లు ధర్మరాజు కుబేరునాదేశంబున నార్ష్టిషేణాశ్రమంబున నున్న నాతనికి నొక్కనాఁడు ధౌమ్యుండు నిజాంగుళి నుత్తరదిగ్భాగంబు సూపుచు ని ట్లనియె. 35

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; ధర్మరాజు, కుబేరు+ఆదేశంబునన్= కుబేరుడి యొక్క ఆనతిచొప్పున; ఆర్ష్టిషేణ+ ఆశ్రమంబునన్+ఉన్నన్= ఆర్ష్టిషేణుడియొక్క ఆశ్రమంలో ఉండగా; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఒక్క, నాఁడు= ఒక రోజున; ధౌమ్యుండు= ధౌమ్యమహర్షి; నిజ+అంగుళిన్= తన చూపుడు వ్రేలితో; ఉత్తరదిక్+భాగంబు= ఉత్తర దిక్కువైపు; చూపుచున్= చూపిస్తూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు కుబేరుడి ఆనతిచొప్పున ఆర్ష్టిషేణుడి ఆశ్రమంలో నివసిస్తూ ఉన్నాడు. అంత, ఒకనాడు ధౌమ్యమహర్షి తన చూపుడువ్రేలితో అతడికి ఉత్తరదిక్కును చూపిస్తూ ఇట్లా అన్నాడు.

క. 'అది మందరనగ మక్కడ । నది మేరుగిరీంద్ర మమ్మహాశైలము నె
న్మిదిదిక్కుల వసియింతురు । త్రిదశేశ్వరు దొట్టి యష్టదిక్పాలవరుల్. 36

ప్రతిపదార్థం: అది= అదిగో అది; అక్కడన్= అచట ఉన్నది; మందర, నగము= మందరం అనే పేరుకల కొండ; అది= అది; మేరుగిరి+ఇంద్రము= మేరువు అనే పేరుకల గొప్పకొండ; ఆ+మహాశైలము= ఆ గొప్ప కొండయొక్క; ఎన్మిది దిక్కులన్= ఎనిమిది దిక్కులలోను; త్రిదశ+ఈశ్వరున్+తొట్టి= దేవేంద్రుడు మొదలుగా కల; అష్ట+దిక్+పాలవరుల్= ఎనిమిది దిక్కులను పాలించే అధిపతులు; ఎన్మిది దిక్కులన్= ఎనిమిది దిక్కులలోను; వసియింతురు= నివసిస్తూ ఉంటారు.

తాత్పర్యం: 'అదిగో! చూడుము. అది మందరపర్వతం, అల్లదిగో! అదియే మేరుపర్వతం, ఈ గొప్పకొండకు ఎనిమిదివైపుల దేవేంద్రుడు మున్నగు అష్టదిక్పాలకులు వసిస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. కనకగిరిం బ్రదక్షిణముగా శశిభాస్కరతారకాగణం
బనవరతంబుఁ ద్రిమ్మరు మహామునిసప్తకమండలంబుతో
ననఘ! తదీయతుంగశిఖరాగ్రమునందుఁ బయోరుహాసన
త్రినయన విష్ణు లుండుదురు దేవగణంబులు గొల్చుచుండఁగన్.' 37

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; శశి, భాస్కర, తారకా, గణంబు= చంద్రుడు, సూర్యుడు నక్షత్రసముదాయాలు; మహాముని, సప్తక, మండలమ్ముతోన్= గొప్పఋషులు ఏడుగురు కల వలయంతో; కనకగిరిన్= పసిడికొండను- మేరుపర్వతాన్ని; అనవరతంబున్= ఎల్లప్పుడును; ప్రదక్షిణముగాన్= ఎడమనుండి కుడివైపునకు; త్రిమ్మరు= తిరుగుతూ ఉంటారు; తదీయ, తుంగ, శిఖర+అగ్రమునందున్= ఆ మేరువుయొక్క ఎత్తయిన శిఖరంయొక్క పైభాగంలో; పయోరుహాసన, త్రినయన, విష్ణులు= పద్మం ఆసనంగా కల బ్రహ్మదేవుడున్నూ, మూడుకన్నులు కల శివుడున్నూ, విష్ణువున్నూ; దేవగణంబులు= వేల్పుల గుంపులు; కొల్చుచుండఁగన్= ఆరాధిస్తూ ఉండగా; ఉండుదురు= ఉంటారు.

తాత్పర్యం: ఓ పాపరహితుడా! మేరుపర్వతంచుట్టూ ఎల్లప్పుడు చంద్రుడు, సూర్యుడు, నక్షత్రసముదాయం, సప్తర్షి మండలంతో పాటు ప్రదక్షిణాలు చేస్తూ ఉంటారు. ఆ పసిడికొండకొనపై పద్మం ఆసనంగా కలబ్రహ్మదేవుడు, మూడుకన్నులు కల పరమశివుడు, విష్ణుదేవుడు, వేల్పులసమూహాలు సేవిస్తూ ఉండగా కొలువుదీరి ఉంటారు.'

విశేషం: మేరుపర్వతం ఉత్తరాన కలదని ప్రాచీనవేదవాఙ్మయనిర్దేశం. ఉత్తరధ్రువానికి సూర్యచంద్రులు, నక్షత్రసముదాయం సప్తర్షిమండలం ప్రదక్షిణం చేస్తున్నట్లు తిరగటం నవీనభూగోళవేత్తలు నిర్దేశించినట్టిదేకదా! ప్రాచీనుల ఖగోళశాస్త్రపరిజ్ఞానానికి ఈ వర్ణన ఒక ఉదాహరణం.

వ. అని చెప్పుచుండఁ బాండవు లం దొక్కమాసంబు నివాసంబు సేసి; రంత. 38

ప్రతిపదార్థం: అని= అంటూ (ఆవిధంగా); చెప్పుచుండన్= వర్ణిస్తూ ఉండగా; పాండవులు= పాండురాజుకుమారులు; అందున్= ఆ ఆశ్రమంలో; ఒక్కమాసంబు= ఒకనెల; నివాసంబు+చేసిరి= నివసించారు; అంత= ఆమీద.

తాత్పర్యం: అని చెప్పుతూ ఉండగా పాండవులు ఆ ఆశ్రమంలో ఒకనెల నివసించారు.

ఉ. అంబర మాత్మదీప్తినివహంబున నొప్పఁగ మాతలిప్రయు
క్తం బగు దివ్యకాంచనరథంబు లసచ్చపలాంశుపుంజ ర
మ్యం బగు దాని నెక్కి ధృతిమందరుఁ డింద్రసుతుండు నాకలో
కంబుననుండి వచ్చెఁ బ్రవికాశితతేజుఁ డినప్రకాశుఁ డై. 39

ప్రతిపదార్థం: ధృతి, మందరుఁడు= ధైర్యంలో మందరపర్వతం వంటివాడు; ప్రవికాశిత తేజుఁడు= మిరుమిట్లుకొల్పెడి వర్చస్సు కలవాడు; ఇంద్ర, సుతుండు= ఇంద్రుడి కుమారు డైన అర్జునుడు; అంబరము= ఆకాశం; ఆత్మదీప్తినివహంబునన్= తన దైన వెలుగుల సముదాయం చేత; ఒప్పఁగన్= శోభిల్లగా; లసత్+చపలా+అంశు, పుంజ, రమ్యంబు+అగుదానిన్= దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న మెఱుపుల యొక్క కాంతుల సమూహాలను పోలి సొగసై ఉన్న దానిని; మాతలి, ప్రయుక్తంబు+అగు= మాతలి (దేవేంద్రుడి రథసారథి) చేత నడుపబడిన; దివ్య, కాంచన, రథంబు= దేవలోకానికి సంబంధించిన బంగారుతేరు; ఎక్కి= అధిరోహించి; ఇనప్రకాశుఁడు+ఐ= సూర్యుడివంటి ప్రకాశం కలవాడై; నాక లోకంబున నుండి= స్వర్గలోకంనుండి; వచ్చెన్= వచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధైర్యంలో మందరపర్వతంతో పోల్చతగినవాడు, లెస్సగా ప్రకాశించే తేజస్సు కలవాడు, దేవేంద్రుడి కుమారుడు అయిన అర్జునుడు- మిరుమిట్లుగొలిపే మెరుపులవంటి కాంతి సమూహాలతో సుందరమై, మాతలి నడుపుతున్న దివ్యకాంచన రథాన్ని అధిరోహించి, సూర్యుడివలె వెలుగుతూ స్వర్గలోకంనుండి వచ్చాడు.

వ. ఇట్లు చనుదెంచి ధనంజయుండు రోమశధౌమ్యధర్మజభీమసేనులపాదంబులకుం బరమభక్తి మ్రొక్కి వినయావనతులయిన కవల నెత్తి కౌఁగిలించుకొని, ద్రౌపదీహృదయనయనాంబుజంబుల కానందంబు సేయుచున్నంత, నందఱు సంతసిల్లి మాతలి నతిప్రీతిఁ బూజించిన, నతండును దివ్యరథంబు గొని దివంబున కరిగె; నట్టి యవసరంబున. 40

ప్రతిపదార్థం: ఇట్లు+ఈ విధంగా; చనుదెంచి= వచ్చి; ధనంజయుండు= అర్జునుడు; రోమశ, ధౌమ్య, ధర్మజ, భీమసేనుల, పాదంబులకున్= రోమశుడి, ధౌమ్యుడి, ధర్మజుని, భీమసేనుడి పాదాలకు; పరమ, భక్తిన్= మిక్కిలి భక్తితో; మ్రొక్కి= నమస్కరించి; వినయ+అవనతులు+అయిన= వినయంతో వంగి నమస్కరించినవారలైన; కవలన్= (నకులసహదేవులను) జంటను; ఎత్తి= పైకి లేవనెత్తి; కౌఁగిలించుకొని= ఆలింగనం సల్పి; ద్రౌపదీ, హృదయ, నయన+అంబుజంబులకున్= ద్రౌపదియొక్క మనస్సు, కన్నులు అనే పద్మాలకు; ఆనందంబు+చేయుచున్నంతన్= గొప్ప సంతోషాన్ని కలిగిస్తూ ఉండగా; అందఱు= పాండవ బృందంలోని వారందరును; సంతసిల్లి= సంతోషించి; మాతలిన్= దేవేంద్రుడి రథసారథిని; అతి ప్రీతిన్= మిక్కలి ప్రేమతో; పూజించినన్= అర్చించగా; అతండును= ఆ మాతలియు; దివ్యరథంబు+కొని= దేవతారథాన్ని తీసికొని; దివంబునకున్= స్వర్గానికి; అరిగెన్= వెళ్ళాడు; అట్టి+అవసరంబునన్= అటువంటి సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా అర్జునుడు స్వర్గలోకంనుండి భూలోకానికి వచ్చాడు. అతడు రోమశుడికి, ధౌమ్యుడికి, ధర్మజుడికి, భీమసేనుడికి, పాదనమస్కారాలు చేసి, తనకు వినయంతో వంగి పాదనమస్కారం చేసిన నకులసహదేవులను ఎత్తి కౌగిలించుకొన్నాడు. ఆ దృశ్యం ద్రౌపదిహృదయానికీ, కన్నులకూ మిక్కిలి ఆనందాన్ని కలిగించింది. అందరూ సంతసిల్లారు. పాండవ బృందంలోని వారందరూ మాతలిని సత్కరించి మన్నించారు. మాతలి దివ్యరథాన్ని తీసికొని స్వర్గలోకానికి తిరిగి వెళ్ళాడు. ఆ సమయంలో.

క. దిననాథుఁ డస్తగిరిఁ బొం । దినఁ జీఁకటిఁ బాచి యాత్మతేజమున దిగం
గనల విభూషించుచు రజ । నినాథకలహంస గగననిమ్నగ నొప్పెన్. 41

ప్రతిపదార్థం: దిన నాథుఁడు= సూర్యుడు; అస్తగిరిన్= పడమటికొండను, సహ్యాద్రిని; పొందినన్= చేరగా; చీఁకటిన్= అంధకారాన్ని; పాచి= త్రోసి; ఆత్మ, తేజమునన్= తనదైన వెలుగుచేత (వెన్నెలచేత); దిక్+అంగనల= దిక్కులు అనే వనితలను; విభూషించుచున్= అలంకరిస్తూ; రజనినాథ, కలహంస= చంద్రుడు అనే రాజహంస; గగన నిమ్నగన్= ఆకాశంఅనేనదిలో; ఒప్పెన్= శోభిల్లాడు.

తాత్పర్యం: సూర్యుడు అస్తమించాడు. అప్పుడు చీకటిని తొలిగిస్తూ, తన వెన్నెలచేత దిక్కులు అనే వనితలను అలంకరిస్తూ, చంద్రుడు అనెడి కలహంస ఆకాశమనే నదిలో శోభిల్లాడు.

విశేషం: అలం: రూపకం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ఆరాత్రి యర్జునుం డనుజులనందఱ నొద్దఁబెట్టుకొని యిష్టపూర్వకథలు సెప్పుచు శయనించె; నంతఁబ్రభాతం బగుడు సిద్ధమునిగణంబులయు రోమశధౌమ్యులయుఁ దమ్ములయుఁదోడ ధర్మతనయుండు సుఖోపవిష్టుం డై యున్నంత. 42

ప్రతిపదార్థం: ఆ రాత్రి= ఆ రేయి; అర్జునుండు; అనుజులన్+అందఱన్= సోదరులను అందరిని; ఒద్దన్+పెట్టుకొని= దగ్గరగా ఉంచుకొని; ఇష్ట+పూర్వ+కథలు= తమకు ప్రీతికరమైన, లోగడ జరిగిన గాథలను; చెప్పుచు; శయనించెన్= పరుండినాడు; అంతన్= అటుపిమ్మట; ప్రభాతంబు+అగుడున్= తెల్లవారటంచేత; సిద్ధ, ముని, గణంబులయు= తపస్సు పూర్తి అయి పరిణతి చెందిన ఋషుల సమూహాలతో; రోమశ ధౌమ్యులయున్= రోమశుడితో ధౌమ్యుడితో; తమ్ములయున్+తోడన్= సోదరులతోడ; ధర్మ తనయుండు= ధర్మరాజు; సుఖ+ఉపవిష్టుండు+ఐ= సుఖంగా కూర్చొని; ఉన్నంతన్= ఉండగా.

తాత్పర్యం: ఆ రేయి అర్జునుడు సోదరు లందరితో కలిసి శయనించి, వారికి నచ్చిన పూర్వకథలు చెప్పి వారిని అలరించాడు. అంతట తెల్లవారిన పిమ్మట ధర్మరాజు, తపస్సులో పరిపూర్ణత చెందిన మహర్షులతో, ధౌమ్యుడితో రోమశుడితో, సహోదరులతో కూడి సుఖంగా కూర్చొని ఉండగా.

ఇంద్రుఁడు పాండవులయొద్దకు వచ్చుట (సం. 3-162-5)

సీ. బోరన సురదుందుభుల నినాదంబులు । గిన్నరగంధర్వగీతరవము
లెసఁగ సహస్రసూర్యేందుమండలములు । వోలె విమానముల్ పొలిచి వెలుఁగఁ
బాండవాలోకనపరుఁడై సహస్రాక్షుఁ । డమరగణంబుతో నమ్మహాద్రి
కేతెంచెఁ; బ్రీతి నయ్యింద్రున కందఱు । నంత నభ్యుద్గతు లైరి; పాండ

ఆ. వాగ్రజుండు దాను ననుజులు నింద్రుపా । దాంబుజముల కెరఁగి యధికభక్తి
శాస్త్రదృష్టవివిధసత్కారవిధులఁ బూ । జించె నమరఖచరసిద్ధపూజ్యు. 43

ప్రతిపదార్థం: బోరనన్= పెద్దగా; సుర, దుందుభుల, నినాదంబులు= వేల్పుల నగారాల మ్రోతలు; కిన్నర, గంధర్వ, గీత, రవములు = కిన్నరుల గంధర్వుల పాటల సవ్వడులు; ఎసఁగన్= విలసిల్లగా; సహస్ర, సూర్య+ఇందు, మండలములు+పోలెన్= వేయి సూర్యుల చంద్రుల బింబాల వలె; విమానముల్= ఆకసాన సంచరించే తేరులు; పొలిచి= శోభిల్లి; వెలుఁగన్= ప్రకాశించగా; పాండవ+ఆలోకన పరుఁడు+ఐ= పాండురాజు కొడుకులను చూడవలె ననే కోరిక కలవాడైన; సహస్ర+అక్షుఁడు= వేయికన్నులదేవర అయిన ఇంద్రుడు; అమర, గణంబుతోన్= వేల్పులసమూహాలతో; ఆ+మహా+అద్రికిన్= ఆ గొప్పకొండకు; ఏతెంచెన్= వచ్చాడు; ప్రీతిన్= ప్రేమతో; అందఱున్= ఆ పాండవబృందంలోని వారు అందరున్నూ; ఆ+ఇంద్రునకున్= ఆ దేవేంద్రుడికి; అంతన్= అంతట; అభ్యుద్గతులు+ఐరి= లేచి ఎదురేగి, నమస్కరించారు; పాండవ+అగ్రజుండు= పాండవులలో మొదట పుట్టినవాడైన-అనగా పెద్దవాడైన ధర్మరాజు; తానున్= తాను; అనుజులున్= తమ్ములు; ఇంద్రు పాద+అంబుజములకున్= ఇంద్రుడి పాదాలనెడి పద్మాలకు; ఎరఁగి= నమస్కరించి; అధిక, భక్తిన్= మిక్కిలి భక్తితో; శాస్త్ర, దృష్టి, వివిధ, సత్కార, విధులన్= శాస్త్రాలలో కన్పించే ఆయా ఆతిథ్యమర్యాదల ననుసరించి; అమర, ఖచర, సిద్ధ, పూజ్యున్= వేల్పులచేత, ఆకాశగమనం కల వారిచేత, సిద్ధులచేత ఆరాధించబడేవాడిని; పూజించెన్= యథావిధిగా అర్చించాడు.

తాత్పర్యం: గొప్పగా దేవదుందుభులు మ్రోగాయి. కిన్నరుల పాటలు, గంధర్వుల గానాలు విన్పించాయి. ఆకసాన విమానాలు మిరుమిట్లు గొల్పాయి. దేవేంద్రుడు పాండవులను చూచే కోరికతో అచటికి వచ్చాడు. అంతట పాండవులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అందరు మిక్కిలి ప్రేమతో దేవేంద్రుడికి ఎదురేగి శాస్త్రాలలో విధించబడిన అతిథిసత్కారాలు సలిపి, అతడి పాదపద్మాలకు నమస్కరించారు.

వ. ఇంద్రుండును వారల నందఱ నతిమధురవచనంబుల నభినందించుచుఁ దదంతికస్థితు నధికతపోయుక్తు ధనంజయుం జూపి ధర్మజున కి ట్లనియె. 44

ప్రతిపదార్థం: ఇంద్రుండును= దేవేంద్రుడు కూడ; వారలన్+అందఱన్= ఆ పాండవ బృందములోని వారిని అందరిని; అతి, మధుర, వచనంబులన్= మిక్కిలి తియ్యని మాటలచేత; అభినందించుచున్= సంతోషింప జేసే మన్నన తెలుపుతూ; తద్+అంతికస్థితున్= వారి ప్రక్కన కూర్చొనిఉన్న; అధిక, తపస్+యుక్తున్= గొప్పతపస్సుచేత కూడినవాడిని; ధనంజయున్+చూపి= అర్జునుడిని చూపించి; ధర్మజునకున్= ధర్మపుత్రుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఇంద్రుడుకూడ పాండవబృందంలోనివారిని అందరినీ మిక్కిలి తియ్యనైన పలుకులతో మన్నించి సంతోషింపజేశాడు. పిమ్మట, వారలకు దగ్గరగా కూర్చొని ఉన్న అర్జునుడిని, గొప్ప తపస్సుతో కూడినవాడిని చూపించి, ధర్మరాజుతో ఈ విధంగా చెప్పాడు.

క. 'ఘనుఁ డీపార్థుఁడు నా వల । నన దివ్యాస్త్రప్రయోగ నయనిపుణుం డై
దనుజుల నివాతకవచుల । ననిఁ జంపి సురావలికిఁ బ్రియం బొనరించెన్. 45

ప్రతిపదార్థం: ఘనుఁడు= గొప్పవాడు; ఈ పార్థుఁడు= కుంతీకుమారు డైన ఈ అర్జునుఁడు; నావలనన్= నామూలాననే; దివ్య+అస్త్ర, ప్రయోగ, నయ, నిపుణుండు+ఐ= దివ్యాలైన ఆయుధాలను వాడటంలో ప్రశస్తమైన నేర్పును సాధించినవాడై; దనుజుల= రక్కసుల; నివాతకవచులన్= నివాతకవచులు అనెడి వారిని; అనిన్= యుద్ధంలో; చంపి= సంహరించి; సుర+ఆవలికిన్= వేల్పులసముదాయానికి; ప్రియంబు= ప్రీతిని; ఒనరించెన్= కలిగించాడు.

తాత్పర్యం: కుంతీకుమారుడైన ఈ అర్జునుడు గొప్పవాడు. నావలననే ఇతడు దివ్యాలైన ఆయుధాలు సంపాదించి, వాటిని ప్రయోగించటంలో తగు సామర్థ్యాన్ని ఆర్జించినవాడై నివాతకవచులు అనే రక్కసులను సంహరించి వేల్పుల సమూహానికి మిక్కిలి ప్రీతిని కలిగించాడు.

క. ఈతఁడు పరాక్రమమున న । రాతుల వధియించి యిద్ధరారాజ్యము వి
ఖ్యాతముగ నిచ్చు నీకు మ । హాతేజుఁ డజేయవీర్యుఁ డని నెవ్వరికిన్. 46

ప్రతిపదార్థం: ఈతఁడు= ఈ అర్జునుడు; పరాక్రమమునన్= శౌర్యంతో; ఆరాతుల= శత్రువులను; వధియించి= చంపి; ఈ+ధర, రాజ్యము= ఈ భూరాజ్యాన్ని; నీకున్= నీకు; విఖ్యాతముగన్= మంచిపేరు ప్రతిష్ఠలతో; ఇచ్చున్= ఇస్తాడు; (ఇతడు) మహాతేజుఁడు= గొప్ప తేజస్సుకలవాడు; ఎవ్వరికిన్= ఎవరికైనను; అనిన్= యుద్ధంలో; అజేయ, వీర్యుఁడు= జయించ నలవికాని శౌర్యం కలవాడు,

తాత్పర్యం: ఈ అర్జునుడు శౌర్యంలో శత్రువులను సంహరించి, ఈ భూరాజ్యాన్ని నీకు ఇవ్వగలడు. ఇతడు మహాతేజస్వి. ఈతడిని యుద్ధంలో గెలవడం ఎవ్వరికీ శక్యం కాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అని చెప్పి యనిమిషప్రభుఁ । డనిమిషనివహంబుతోడ నమరావతికిం
జనియె నిజాలోకనమున । కనఘులు పాండవులు హర్షమందుచు నుండన్. 47

ప్రతిపదార్థం: అని= అనుచు; చెప్పి= పలికి; అనిమిష, ప్రభుఁడు= రెప్పలు వాల్చని వేల్పులకు దొర అయిన దేవేంద్రుడు; అనిమిష, నివహంబుతోడన్= వేల్పుల సమూహంతో; అమరావతికిన్= ముఖ్యపట్టణ మైన అమరావతికి; నిజ+ఆలోకనమునకున్= తన చూపులచేత, వారిని చూడటంవలన; అనఘులు= పాపరహితులు; పాండవులు= పాండురాజు కొడుకులు; హర్షము+ అందుచున్+ఉండన్= సంతసిల్లుతూ ఉండగా; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అని వచించి, దేవేంద్రుడు దేవతాపరివారంతోపాటుగా వేల్పుల రాజధాని అయిన అమరావతికి వెళ్ళాడు. దేవేంద్రుడు తమను ఆదరంతో చూచినందుకు పుణ్యాత్ములైన పాండవులు మిక్కిలి సంతోషం పొందారు.

మధ్యాక్కర.

ఘనముగ ధనదేంద్రపాండుసుతసమాగమ మొక్కయేఁడు
దనరంగ బ్రహ్మచర్యవ్రతస్థు లై తగిలి నిత్యంబు
వినిన పుణ్యాత్ములును జదివినవారు విభుత నూఱేండ్లు
నొనర జీవింతు రత్యంత మగు కాంతియుక్తు లై ధరణి. 48

ప్రతిపదార్థం: ఘనముగన్= గొప్పగా; ధనద+ఇంద్ర, పాండుసుత, సమాగమము= కుబేరుడి యొక్కయు ఇంద్రుడి యొక్కయు పాండవుల యొక్కయు కలయిక (గూర్చిన ఈ కథ); ఒక్క+ఏఁడు= ఒక సంవత్సరం; తనరంగన్= ఒప్పుగ పూనికతో; బ్రహ్మచర్య, వ్రతస్థులు+ఐ= బ్రహ్మచర్య దీక్షను పాటించిన వారై అనగా స్త్రీ సంగమాన్ని పరిహరించినవారై; తగిలి= నిష్ఠతో; నిత్యంబు= ప్రతిదినమూ; వినిన= విన్న; పుణ్య+ఆత్ములును= పుణ్యం కలిగినవారున్నూ; చదివినవారు= పఠించిన వారున్నూ; ధరణి= భూమిపై; అత్యంతమగు, కాంతి, యుక్తులు+ఐ= గొప్ప వెలుగుతో కూడినవారై; విభుతన్= గొప్పతనంతో; నూఱు+ఏండ్లున్= వందసంవత్సరాలు; ఒనరన్= ఒప్పేటట్లుగా; జీవింతురు= బ్రదుకుతారు.

తాత్పర్యం: కుబేరుడూ, ఇంద్రుడూ, పాండవులూ కలిసిన ఈ కథను బ్రహ్మచర్యవ్రతాన్ని పాటిస్తూ ఒక సంవత్సరకాలం పూనికతో నిత్యమూ ఎవరు చదువుతారో, వింటారో అట్టివారు మిక్కిలి తేజస్సు కలవారై, మహావైభవంతో భూమిపై నూరేండ్లు బ్రదుకగలరు.

విశేషం: మహాభారతం తొలిరూపం జయం. పిదప పంచభారతాలు. చిట్టచివరకు నైమిశారణ్యంలో సూతుడు శౌనకాది మహర్షులకు పన్నెండేండ్ల సత్రయాగంలో వినిపించింది 'మహాభారతం'. ఆ పంట్రెండేండ్ల సత్రయాగంలో సూతుడు మహాభారతాన్నే గాక, మఱికొన్నింటిని- ఆయా పురాణ గాథలు మొదలైన వాటిని- విన్పించాడని సంప్రదాయ కథనం. ఇందులో సమకాలీన సమాజంలోని సుప్రసిద్ధాలైన కథలు అన్నీ చేరి మహాభారతం ప్రాచీనవిజ్ఞానసర్వస్వకల్పకంగా పరిణమించిందని పెక్కుమంది ఆధునికవిద్వాంసుల అభిప్రాయం. ఈ పద్యంలో చెప్పబడిన 'ఫలశ్రుతి' వలన ఈ కథకు గల స్వయంప్రతిపత్తి వెల్లడి అవుతున్నది. వృత్తలక్షణానికి ఆర. 2.22 విశేషాంశం చూడండి.

వ. ఇట్లు సురేంద్రుం దరిగిన ధర్మతనయుం దర్జునుం జూచి పరమానందభరితహృదయుం డై యిట్లనియె.49

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సుర+ఇంద్రుండు= దేవేంద్రుడు; అరిగినన్= వెళ్ళగా; ధర్మతనయుండు; అర్జునున్+చూచి; పరమ+ఆనంద, భరిత, హృదయుండు+ఐ= గొప్పఆనందంతో నిండిన మనస్సు కలవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఈ విధంగా దేవేంద్రుడు స్వర్గలోకానికి వెడలగా, ధర్మరాజు అర్జునుడిని చూచి గొప్పఆనందంతో నిండిన హృదయం కలవాడై ఇట్లా పలికాడు.

సీ॥ 'హరుఁ డాదిగాఁ గల యమరగణంబుచేఁ । బడసి దివ్యాస్త్రముల్ పరమ మైన
యుపకార మమరుల కొనరించె నీపార్థుఁ । డని నాకుఁ జెప్పె వృత్రాంతకుండు;
దివ్యాస్త్రలాభమ్ము దేవేంద్రునకుఁ బ్రీతి । గా వేల్పులకు నుపకారి వైన
విధమును మా కిప్డు విన వేడ్క యైనది' । యని తన్ను నడిగిన నగ్రజునకు

ఆ. నగ్రజన్మపూజ్యు లగు ధౌమ్య రోమశ । భ్రాతృవరులయొద్దఁ బాండవేయుఁ
డసదృశప్రభావుఁ డతివీరుఁ డర్జునుఁ । డాత్మచరిత మిట్టు లనుచుఁ జెప్పె. 50

ప్రతిపదార్థం: హరుఁడు+ఆదిగాన్+కల= శివుడు మున్నగువారైన; అమర గణంబుచేన్= వేల్పుల సముదాయంచేత; దివ్య+అస్త్రముల్= దివ్యాలైన గొప్ప మంత్రబాణాలు; పడసి= సంపాదించి; పరమము+ఐన= మిక్కిలి గొప్ప దైన; ఉపకారము= మేలు; అమరులకున్= దేవతలకు; ఒనరించెన్= చేశాడు; ఈ, పార్థుఁడు+అని= ఈ అర్జునుడు, అని అంటూ; వృత్ర+అంతకుండు= వృత్రుడిని సంహరించిన దేవేంద్రుడు; నాకున్= నాకు; చెప్పె= చెప్పాడు; దివ్య+అస్త్ర, లాభమ్ము= దివ్యాలైన మంత్రబాణాలు సంపాదించిన విధాన్ని; దేవేంద్రునకున్+ప్రీతిగా= దేవేంద్రుడికి ఇష్టమైనవిధంగా; వేల్పులకున్= దేవతలకు; ఉపకారివి+ఐన, విధమును= మేలుచేకూర్చినవాడ వైన రీతిని; మాకు+ఇప్డు, వినన్, వేడ్క+ఐనది= ఇపుడు మాకు వినవలెననే కుతూహలం ఏర్పడింది; అని; తన్నున్= తనను (అర్జునుడిని); అడిగినన్= ప్రశ్నించగా; అగ్రజునకున్= అన్నకు అనగా ధర్మరాజుకు; అగ్ర, జన్మ, పూజ్యులు+అగు= గొప్ప పుట్టుకవలననూ తనకంటె ముందు పుట్టటంవలననూ, అర్చించతగినవారు అయిన; ధౌమ్య, రోమశ, భ్రాతృవరుల+ఒద్దన్= ప్రముఖులైన ధౌమ్యుడి యొద్ద, రోమశుడి యొద్ద, సోదరులయొద్ద; పాండవేయుఁడు= పాండురాజు కుమారు డైన అర్జునుడు; న+సదృశ, ప్రభావుఁడు= సాటిలేని మహిమ కలిగినవాడు; అతివీరుఁడు= గొప్పవీరుడు; అర్జునుఁడు= అర్జునుడు; ఆత్మచరితము= తనదైన కథ; ఇట్టులు+అనుచున్+చెప్పెన్= ఈ విధంగా జరిగిందని వివరించి చెప్పాడు.

తాత్పర్యం: 'శివుడు మున్నగు దేవతలచేత నీవు దివ్యా లైన అస్త్రాలను సంపాదించి వేల్పులకు గొప్ప ఉపకారం చేశా వని దేవేంద్రుడు నిన్నుగూర్చి గొప్పగా పలికాడుకదా! నీవు ఏయే దివ్యాస్త్రాలను ఏవిధంగా ఆర్జించగలిగినావు? వృత్రుడిని సంహరించిన దేవేంద్రుడు సంతసించేటట్లుగా వేల్పులకు ఎటువంటి మేలు చేకూర్చగలిగినావు? ఆయా వృత్తాంతాలను మాకు వీనుల విందుగా సవిస్తరంగా విన్నవించుము. మాకు విన కుతూహలంగా ఉన్నది' అని అడుగగా, అన్న అయిన ధర్మరాజుకును, గొప్పపుట్టుకచేత పూజ్యులైన ధౌమ్యరోమశులకు, అన్నదమ్ములకు సాటిలేని ప్రభావం గల అర్జునుడు తన కథను ఈవిధంగా చెప్పాడు.

వ. 'ఏను భవదాదిష్టవిద్యాప్రకారంబున తపోనియుక్తుండ నై హిమవంతంబునకుం జని, యందు నా ముందట వృద్ధబ్రాహ్మణుం డై యున్న వృద్ధశ్రవుం గని, తదుపదేశంబున నీశ్వరుగుఱించి యుగ్రతపంబు సేసిన,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నీశ్వరుండు గిరాతరూపధరుండై నాతోడ నతిఘోరయుద్ధంబుసేసి, నాకుఁబ్రసన్నుఁడై నిజరూపంబుఁ జూపి, పాశుపతాస్త్రంబుఁ బ్రసాదించె; ననంతరంబ నింద్రాది దేవతలవలన నైంద్రాగ్నేయయామ్యరాక్షసవారుణ వాయవ్యకౌబేరగాంధర్వ పైశాచబ్రాహ్మ్యంబు లనంబరఁగు దివ్యాస్త్రంబులు వడసి, మహేంద్రానుగృహీతుండ నై మాతలి ప్రయుక్తం బైన దివ్యరథం బెక్కి యీ శరీరంబుతోడన యమరావతి కరిగి, యం దమరేంద్రునాచార్యుఁగా వరించి తత్ప్రసాదంబున దివ్యాస్త్రంబులు వడసి తత్ప్రయోగంబులును నుపసంహారంబులును నివర్తనంబులును బ్రాయశ్చిత్తంబులును బ్రతిఘాతంబులును నేర్చిన నాకు సంతసిల్లి సురేంద్రుం డిట్లనియె. 51

ప్రతిపదార్థం: ఏను= నేను; భవత్+ఆదిష్ట, విద్యా, ప్రకారంబునన్= నీచేత ఆదేశించబడిన విద్యను అనుసరించటం చొప్పున; తపస్+నియుక్తుండను+ఐ= తపస్సునందు నిష్ఠ కలవాడనై; హిమవంతంబునకున్= హిమాలయపర్వతానికి; చని=వెళ్లి; అందున్= అచట; నా ముందటన్= నా యెదుట; వృద్ధ, బ్రాహ్మణుండు+ఐ+ఉన్న= ముసలివిప్రుడి వేషంలో ఉన్న; వృద్ధశ్రవున్+కని= దేవేంద్రుడిని; చూచి; తద్+ఉపదేశంబునన్= ఆతడి హితవచనం చొప్పున; ఈశ్వరు గుఱించి= శివుడిని ఉద్దేశించి; ఉగ్ర, తపంబు+చేసినన్= కఠిన తపస్సు చేయగా; ఈశ్వరుండు= శివుడు; కిరాతరూపధరుండు+ఐ= చెంచు ఆకృతి ధరించినవాడై; నాతోడన్= నాతో; అతి ఘోరయుద్ధంబు+చేసి= మిక్కిలిభయంకరమైన పోరు సలిపి; నాకున్+ప్రసన్నుఁడు+ఐ= నాయెడ అనుగ్రహం కలవాడై; నిజరూపంబున్+చూపి= తన అసలు ఆకారమును చూపించి (ఆకృతి ప్రదర్శించి); పాశుపత+అస్త్రంబున్= పాశుపతం అనే మంత్రబాణాన్ని; ప్రసాదించెన్= దయతో ఇచ్చాడు (అనుగ్రహించాడు); అనంతరంబు+అ= అటుపిమ్మట; ఇంద్ర+ఆది+దేవతల వలనన్= ఇంద్రుడు మున్నగు వేల్పుల వలన; ఐంద్ర+ఆగ్నేయ, యామ్య, రాక్షస, వారుణ, వాయవ్య, కౌబేర, గాంధర్వ, పైశాచ, బ్రాహ్మ్యంబులు+అనన్+పరఁగు= ఇంద్రుడికి, అగ్నికి, యముడికి, రాక్షసులకు, వరుణుడికి, వాయువుకు, కుబేరుడికి, గంధర్వులకు, పిశాచులకు, బ్రహ్మకు సంబంధించినవి అని చెప్పబడే; దివ్య+అస్త్రంబులు= దివ్యాలైన (మహిమాన్వితాలైన) మంత్రబాణాలు; పడసి= పొంది; మహా+ఇంద్ర+అనుగృహీతుండను+ఐ= దేవేంద్రుడిచేత అనుమతి పొందినవాడ నై; మాతలి, ప్రయుక్తంబు+అయిన= మాతలిచేత తోలబడునట్టి; దివ్యరథంబు+ఎక్కి= దేవలోకానికి సంబంధించిన తేరును ఎక్కి; ఈ+శరీరంబుతోడన్+అ= ఈ దేహంతోనే; అమరావతికి+అరిగి= స్వర్గలోకంలోని రాజధాని అయిన అమరావతికి వెళ్ళి; అందున్= అచట; అమర+ఇంద్రున్= దేవేంద్రుడిని; ఆచార్యుఁగాన్= గురువుగా; వరించి= ఎన్నుకొని; తద్+ప్రసాదంబునన్= ఆతడి దయవలన; దివ్య+అస్త్రంబులు= దివ్యాలైన మంత్రబాణాలు; పడసి= పొంది; తద్+ప్రయోగంబులును= ఆయా అస్త్రాలు వాడే విధానాలను; ఉపసంహారంబులును= ప్రయోగించిన వాటిని వెనుకకు మళ్ళించే విధానాలను; నివర్తనంబులును= ఇంకొకవైపునకు మరల్చే పద్ధతులను; ప్రాయశ్చిత్తంబులును= దొరలిన దోషాలకు చేసే నిష్కృతులను; ప్రతిఘాతంబులును= ఎదుటి వారు ప్రయోగించే వాటిని వమ్ముచేసే రీతులను; నేర్చినన్= అభ్యసించగా; నాకు, సంతసిల్లి= నాయెడ సంతోషం ప్రకటించి; సుర+ఇంద్రుండు= దేవేంద్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: నేను, నీ ఆదేశంప్రకారం మంత్రవిద్యోపాసన చేసి తపస్సులో నిష్ఠకలవాడనై హిమాలయపర్వతాలకు వెళ్ళాను. అక్కడ దేవేంద్రుడు ముసలివిప్రుడివేషం ధరించి నాకు కన్పించి, నన్ను ఈశ్వరుడినిగూర్చి తపస్సు చేయుమని ప్రబోధించాడు. నేను ఈశ్వరుడిని గూర్చి ఘోరతపస్సు చేశాను. పరమశివుడు కిరాతరూపంతో నాతో భయంకరయుద్ధం చేసి, నన్ను మెచ్చి, నాకు తన నిజస్వరూపం చూపి, నాయందు అనుగ్రహం కలవాడై నాకు పాశుపతాస్త్రాన్ని ప్రసాదించాడు. పిమ్మట ఇంద్రుడు మున్నగు వేల్పులవలన, నాకు ఐంద్రం, ఆగ్నేయం, యామ్యం, రాక్షసం, వారుణం, వాయవ్యం, కౌబేరం, గాంధర్వం, పైశాచం, బ్రాహ్మ్యం అనే అస్త్రాలు లభించాయి. దేవేంద్రుడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనుమతి చొప్పున, మాతలి నడిపే దివ్యరథాన్ని అధిరోహించి నేను ఈ దేహంతోనే స్వర్గలోకపురాజధాని అయిన అమరావతికి వెళ్ళాను. స్వర్గంలో దేవేంద్రుడిని గురువుగా ఎన్నుకొని నేను ఆతడిదయవలన వివిధ దివ్యాస్త్రాలను సాంగోపాంగంగా అభ్యసించాను. ఆయా అస్త్రాలను వాడటాన్నీ, వాటిని తిరిగి వెనుకకు మరలించే విధానాలను, మరోవైపునకు మరల్చే పద్ధతులను, దొరలిన దోషాలను పరిహరించే పద్ధతులను, ఎదుటివారు ప్రయోగించే వాటిని వమ్ముచేసే రీతులను నేర్చాను. దేవేంద్రుడు సంతసిల్లి ఈ విధంగా పలికాడు.

క. 'నీ వఖిలాస్త్రవిదుండవు । గావున నిన్నాజి నోర్వఁగా నోప రొరుల్;
దేవతలకు బ్రాహ్మణులకుఁ । గావింపు హితంబు; దీనఁ గడు సిద్ధి యగున్. 52

ప్రతిపదార్థం: నీవు= నీవు; అఖిల+అస్త్ర, విదుండవు= సమస్తమైన మంత్రబాణాలను తెలిసినవాడవు; కావునన్= కాబట్టి; నిన్ను+ఆజిన్+ఓర్వగాన్= నిన్ను యుద్ధంలో జయించటానికి; ఒరుల్= ఇతరులు; ఓపరు= సమర్థులు కారు; దేవతలకున్= వేల్పులకు; బ్రాహ్మణులకున్= విప్రులకు; హితంబు= మేలు; కావింపు= చేయుము; దీనన్= దీనివలన; కడు= మిక్కిలి; సిద్ధి+అగున్=కోరికలు ఈడేరుతాయి (జన్మసఫలమౌతుంది).

తాత్పర్యం: 'నీవు సమస్తమైన అస్త్రాలను తెలిసినవాడవు. కాబట్టి ఇతరులు ఎవ్వరూ నిన్ను యుద్ధంలో జయించజాలరు; నీవు వేల్పులకు, విప్రులకు మేలు చేకూర్చుము, నీకు దీనివలన జన్మసాఫల్యం ఏర్పడుతుంది.

క. నాకు గురుదక్షిణార్థము । నాకహితార్థంబుగా జనస్తుతబుద్ధిం
జేకొని నా పనిచినపనిఁ । బ్రాకటముగఁ జేయు మహితభంజనశక్తిన్. 53

ప్రతిపదార్థం: నాకున్= నాకు; గురుదక్షిణ+అర్థము= అధ్యాపకుడికి సమర్పించే బహుమతిగా; నాక, హిత+అర్థంబుగాన్= స్వర్గానికి మేలు కలుగజేసేటట్లుగా; జనస్తుతబుద్ధిన్= ప్రజలచేత ప్రశంసించబడే బుద్ధిని; చేకొని= స్వీకరించి; నా+పనిచిన, పనిన్= నేను నియోగించిన కార్యాన్ని; అహితభంజనశక్తిన్= శత్రువులను నిర్మూలించే సామర్థ్యంతో; ప్రాకటముగన్= అందరికి తెలిసేటట్లుగా; చేయుము= నెరవేర్చుము.

తాత్పర్యం: నాదగ్గర నీవు అస్త్రవిద్య నేర్చుకొన్నావు. కాబట్టి నీవు నాకు సమర్పించవలసిన గురుదక్షిణ ప్రజలు ప్రశంసించేటట్లుగా వేల్పులకు మేలు చేయటమే. నేను నియోగించిన కర్తవ్యాన్ని శత్రువులను నిర్మూలించే సామర్థ్యంతో లోకవిదితంగా నీవు నెరవేర్చాలి.

విశేషం: 'గురుదక్షిణ'- ప్రాచీన భారతీయ సంస్కృతిలో ఒక విశిష్ట సంప్రదాయం. జిజ్ఞాసువు, యోగ్యుడు అయిన శిష్యుడికి విద్య నేర్పటం గురువుకు విధి. విద్యాభ్యాసం ముగిసిన పిమ్మట గురువుగారి కోరిక ఈడేర్చి 'గురుదక్షిణ' చెల్లించటం శిష్యుడి విధి.

తే. జలధికుక్షిలోనుండి వీరులు నివాత । కవచు లను మూఁడుకోట్ల దానవులు బలిమిఁ
ద్రిదశులకు బాధసేయుచుండుదురు; వారు । నిహతు లగుదురు నీచేత మహితకీర్తి!' 54

ప్రతిపదార్థం: మహితకీర్తి!= గొప్పయశస్సుకల ఓ అర్జునా!; జలధి, కుక్షిలోన్+ఉండి= సముద్రగర్భంలో ఉండి; వీరులు= పరాక్రమం కల శూరులు; నివాతకవచులు+అను= నివాతకవచులు అనే పేరు కల; మూఁడు, కోట్ల, దానవులు= మూడు

కోట్ల రక్కసులు; బలిమిన్= బలంతో; త్రిదశులకున్= వేల్పులకు; బాధ+చేయుచుండుదురు= కష్టాలను కల్పిస్తూ ఉంటారు; వారు= ఆ నివాతకవచులు; నీచేతన్= నీమూలాన; నిహతులు+అగుదురు= చావగలరు.'

తాత్పర్యం: గొప్ప యశస్సు నార్జించిన ఓ అర్జునా! కడలికడుపులో దాగి పరాక్రమవంతులైన వీరులు 'నివాతకవచులు' అని పిలువబడే మూడుకోట్ల రాక్షసులు బలగర్వంతో వేల్పులకు బాధలు కల్పిస్తున్నారు. వారు నీచేత యుద్ధంలో చావగలరు.

వ. **అని తన తొడిగిన దివ్యభూషణంబుల మణికిరీటంబున నన్ను విభూషితుం జేసి, స్పర్శరూపం బైన యభేద్య కవచంబు నిచ్చి, యజగరసన్నిభం బయిన యిగ్గొనయంబు గాండీవంబునం దాన యోజించి, పదివేల హంసమయూరవర్ణమాననీయహయంబులం బూనిన రథంబు మాతలిప్రయుక్తం బైన దాని నెక్కం బనిచి 'నివాతకవచవధార్థం బరుగు' మని నియోగించిన, నింద్రు వీడ్కొని చనుచున్న నాకు దేవత లి ట్లనిరి.55**

ప్రతిపదార్థం: అని= అని పలికి; తన, తొడిగిన= తాను ధరించిన; దివ్యభూషణంబులన్= దివ్యాలైన అలంకారాలతో; మణికిరీటంబునన్= మణులతో పొదగబడిన కిరీటంతో; నన్ను; విభూషితున్+చేసి= అలంకరించబడిన వాడినిగా చేసి, అలంకరించి; స్పర్శ రూపంబు+ఐన= చేతితో తాకుటచేత మాత్రమే తెలియబడెడు; అభేద్య, కవచంబున్= భేదించటానికి వీలులేని కవచాన్ని; ఇచ్చి= అనుగ్రహించి; అజగర, సన్నిభంబు+అయిన= కొండచిలువతో సమాన మైన; ఈ+గొనయంబు= ఈ అల్లెత్రాటిని; గాండీవంబునన్= గాండీవం (వింటి)లో; తాను+అ= తానే; యోజించి= సజ్యంచేసి= కూర్చి; పది, వేల, హంస, మయూర, వర్ణ, మాననీయ, హయంబులన్= పదివేల హంసలయొక్కయు నెమిళ్లయొక్కయు రంగులతో శోభిల్లే గుర్రాలతో; పూనిన= కట్టబడిన; రథంబు= తేరు; మాతలి, ప్రయుక్తంబు+ఐన దానిన్= మాతలిచేత నడుపబడే దానిని; ఎక్కన్+పనిచి= అధిరోహించ నియోగించి; నివాతకవచవధ+అర్థంబు= నివాతకవచులను చంపటంకొరకు; అరుగుము+అని= వెళ్లుము అని; నియోగించినన్= ఆజ్ఞాపించగా; ఇంద్రున్= ఇంద్రుడిని; వీడ్కొని= సెలవు గైకొని; చనుచున్న= వెళ్ళుతున్న; నాకున్= నాతో; దేవతలు= వేల్పులు; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: అని పలికి దేవేంద్రుడు తాను ధరించిన భూషణాలను నాకు తొడిగాడు, మరియు మణులతో పొదగబడిన కిరీటాన్ని నాకు అలంకరించాడు. చేతితో తాకితేనే తెలియదగిన కవచాన్ని నాకు ఇచ్చాడు. కొండచిలువతో సమాన మైన ఈ అల్లెత్రాటిని నా గాండీవానికి తానే సంధించి కూర్చి ఎక్కుపెట్టే విధానం నేర్పించాడు. పదివేల హంసల నెమిళ్ల రంగులతో శోభిల్లే గుర్రాలు కలదీ, మాతలి సారథ్యం చేసేదీ అయిన తేరును అధిరోహింపచేశాడు. నన్ను నివాతకవచులను సంహరించటానికి వెళ్ళుమని నియోగించాడు. దేవేంద్రుడికడ సెలవుగైకొని, వెళ్ళుతున్న సమయంలో వేల్పులు నాతో ఇట్లా పలికారు.

చ. **'ఈ రథ మెక్కి తొల్లి యమరేంద్రుఁ డనేకసహస్రసంఖ్య దే**
వారుల వృత్రశంబరబలాదుల నుద్ధతులన్ జయించె; వీ
రారివిభేది! నీవును బలాఢ్యుఁడవై వధియింపు ముగ్రమా
యారతులన్ నివాతకవచాసురులన్ సమరాంతరంబునన్'. 56

ప్రతిపదార్థం: ఈ రథము+ఎక్కి= ఈ తేరును అధిరోహించి; తొల్లి= పూర్వకాలంలో; అమర+ఇంద్రుఁడు= దేవేంద్రుడు; అనేక, సహస్ర, సంఖ్య= పెక్కువేలసంఖ్యకల; దేవ+అరులన్= దేవతల శత్రువులను; వృత్ర, శంబర, బల+ఆదులన్=

వృత్రుడు, శంబరుడు, బలుడు మున్నగు వారిని; ఉద్ధతులన్= గర్వించిన వారలను; జయించెన్= గెల్చాడు; వీర+అరి, విభేది!= శూరు లైన శత్రువులను జయించు ఓఅర్జునా!; నీవును= నీవు కూడ; బల+ఆఢ్యుఁడవు+ఐ= బలం కలిగిన వాడవై; ఉగ్రమాయారతులన్= భయంకర మైన మాయలతో వినోదించేవారిని; నివాతకవచ+అసురులన్= 'నివాతకవచులు' అనబడే రక్కసులను; సమర+అంతరంబునన్= యుద్ధం జరిగేటప్పుడు; వధియింపుము= సంహరించుము.

తాత్పర్యం: 'వీరులైన శత్రువులను జయించే ఓ అర్జునా! పూర్వకాలంలో ఈ రథాన్ని అధిరోహించి దేవేంద్రుడు పెక్కువేలమంది రాక్షసులను, దేవతల శత్రువులగు వృత్రుడు, శంబరుడు, బలుడు మున్నగువారిని, మిక్కుట మైన మదంకలవారిని జయించాడు. నీవుకూడ, బలంకలవాడ వై పెక్కుమాయలతో వినోదించే 'నివాతకవచులు' అనే రక్కసులను యుద్ధంలో సంహరించుము.'

వ. అని నాకు దేవదత్తం బను శంఖం బిచ్చిన, నేనును మాతలిసహితంబుగా రథం బెక్కి యతిత్వరితగతి నరిగి.57

ప్రతిపదార్థం: అని=అని చెప్పి; నాకు; దేవదత్తంబు= (దేవతలచే ఇవ్వబడింది); దేవదత్తం; అను శంఖంబు= అనే శంఖాన్ని; ఇచ్చినన్= అనుగ్రహించగా; నేనును= నేనుకూడ; మాతలి, సహితంబుగాన్= మాతలితోపాటుగా; రథంబు+ఎక్కి= తేరును అధిరోహించి; అతి, త్వరిత, గతిన్= మిక్కిలివేగంగా; అరిగి= వెళ్ళి.

తాత్పర్యం: అని చెప్పి దేవతలు నాకు 'దేవదత్తం' అనే పేరుగల శంఖాన్ని బహూకరించారు. ఆపైన నేను మాతలితోపాటు రథంఎక్కి మిక్కిలివేగంగా పయనించి.

విశేషం: పాండవులలో అర్జునుడికి 'కిరీటి' అనేపేరు ఏర్పడటానికి కారణం ఆతడు దేవేంద్రదత్త మైన దివ్యకిరీటాన్ని ధరించటమే. అర్జునుడికి దేవతలు బహూకరించిన శంఖానికి 'దేవదత్తం' అనే సార్థకనామం ఏర్పడింది.

అర్జునుఁడు నివాతకవచు లను రాక్షసుల జయించిన కథ (సం. 3-166-1)

క. ఫేనవదూర్మిచయంబుల । నానావిధ మీన కూర్మ నక్రంబుల శై
లానుకృతి నొప్పుచున్న మ । హానీరధిఁ గంటి నేను నమ్మాతలియున్. 58

ప్రతిపదార్థం: ఫేనవత్+ఊర్మి, చయంబుల= నురుగుతో కూడిన కెరటాల సముదాయంతో; నానా, విధ, మీన, కూర్మ, నక్రంబులన్= పెక్కు రకాలైన చేపలు తాబేళ్ళు మొసళ్ళతో; శైల+అనుకృతిన్= కొండలతో పోల్చదగిన; మహానీరధిన్= గొప్ప సముద్రాన్ని; ఏనున్+ఆ+మాతలియున్= నేను కూడా ఆ మాతలితో కలిసి; కంటిన్= చూచాను.

తాత్పర్యం: నేనును ఆ మాతలితోపాటు, ఆ మహాసముద్రాన్ని సందర్శించాను. ఆ సముద్రం నురుగుతో కూడిన కెరటాలదొంతరలతో చేపలు తాబేళ్లు మొసళ్లు గలిగి పర్వతాలతో పోల్చదగినట్లు కన్పించింది.

విశేషం: అలం: ఉపమ.

వ. ఆ సముద్రోదరంబున విశాలాట్టాలక ప్రతోళికాలంకృతం బైన పురంబుఁ గని తద్ద్వారంబున శంఖధ్వానంబు సేసిన, నది సకలదిఙ్మహీధరగుహాకుహరంబులయందుఁ బ్రతిశబ్దజనకం బైన, దాని విని యలిగి దానవులు నానావిధాయుధసన్నద్ధు లయి నిజకాయకాళిమతమోభూతభువను లగుచు వచ్చి నారథంబుఁ బరివేష్టించి.59

ప్రతిపదార్థం: ఆ+సముద్ర+ఉదరంబునన్= ఆ కడలి మధ్యభాగంలో విశాల+అట్టాలక, ప్రతోళికా+అలంకృతంబు+ఐన= పెద్దపెద్ద బురుజులతో వీథులతో అలంకరించబడిన దైన; పురంబున్= నగరాన్ని; కని= చూచి; తద్+ద్వారంబునన్= ఆ పట్టణం యొక్క వాకిట్లో; శంఖ ధ్వానంబు= శంఖంయొక్క చప్పుడు; చేసినన్= సల్పగా; అది= ఆ ధ్వని; సకలదిక్+మహీధర, గుహా, కుహరంబుల అందున్= అన్ని దిక్కులలో గల కొండలందలి గుహల మధ్యభాగాలయందు; ప్రతిశబ్దజనకంబు+ఐన= మారుమ్రోగగా; దానిన్= ఆ ధ్వనిని; విని= ఆలకించి; అలిగి= కోపగించి; దానవులు= రక్కసులు; నానా, విధ+ఆయుధన్, సన్నద్ధులు+అయి= పెక్కురకాలైన శస్త్రాలతో కూడినవారు అయి; నిజ, కాయ, కాళిమ, తమస్+భూత, భువనులు+అగుచున్= తన శరీరాలనలుపుచేత చీకట్లు క్రమ్మబడిన లోకాలు కలవారు ఔతూ; వచ్చి; నా రథంబున్= నాయొక్కతేరును; పరివేష్టించి= చుట్టుముట్టి.

తాత్పర్యం: ఆ కడలిలోపల పెద్దపెద్ద బురుజులతో పెద్దపెద్ద వీథులతో అలంకరించబడిన నగరాన్ని చూచి ఆ పురముఖద్వారం వద్ద నిలిచి శంఖాన్ని పూరించాను. ఆ శంఖధ్వని సమస్తదిక్కులలోని కొండగుహలలో మారుమ్రోగింది. దానిని విని రాక్షసులు కోపించి పెక్కు విధాలైన ఆయుధాలు సమకూర్చుకొనినవారై నా రథాన్ని చుట్టుముట్టారు. వారి నల్లని శరీరాలనుండి వెలువడే నలుపుదనంచీకట్లు లోకాన్ని ముసురుకొన్న ట్లనిపించింది.

క. **ఉరుశస్త్రవృష్టి నాపైఁ । గురిసినఁ దత్క్షణమె యొక్కొకొనిపయి నేనున్**
వరుసం బదేసిబాణము । లరుదుగ నేసితి మహాభయంకరభంగిన్. **60**

ప్రతిపదార్థం: ఉరు, శస్త్ర, వృష్టి= గొప్ప దైన బాణాలవాన (ఆయుధవర్షం); నాపైన్= నాపయిన; కురిసినన్= వర్షించగా; తద్+క్షణము+ఎ= వెనువెంటనే; నేనున్= నేను సయితం; ఒక్కొకొనిపయి= ఒక్కొక్కరి మీద; వరుసన్= క్రమంగా; పది+ఏసి, బాణములు= పదిచొప్పున అమ్ములు; అరుదుగన్= అసాధారణపద్ధతిలో; మహా, భయంకర, భంగిన్= మిక్కిలి వెరపు కలిగించే తీరులో; ఏసితిన్= ప్రయోగించాను.

తాత్పర్యం: ఆ రాక్షసులు నా మీద గొప్ప ఆయుధాలను వర్షించారు. వెనువెంటనే నేను కూడ, ఒక్కొకరిపై పదేసి అమ్ములు భయంకరంగా అసాధారణమైన పద్ధతిలో ప్రయోగించాను.

క. **దనుజులు మదీయరథమా । ర్గనిరోధముగాఁ బ్రచండకాండప్రకరం**
బునఁ గప్పిరి రోదోంతర । మనిమిషులును ఋషులుఁ జూచి యద్భుతమందన్. **61**

ప్రతిపదార్థం: దనుజులు= రాక్షసులు; మదీయ, రథ, మార్గ, నిరోధముగాన్= నాయొక్కతేరు పోవుదారిని అడ్డగించేటట్లుగా; ప్రచండ, కాండ, ప్రకరంబునన్= తీవ్రా లైన అమ్ములదొంతరలతో; రోదస్+అంతరము= భూమిఆకాశాల మధ్యభాగాన్ని; అనిమిషులును= దేవతలును; ఋషులున్= మునులు; చూచి= కాంచి; అద్భుతము+అందన్= అచ్చెరువందేటట్లుగా; కప్పిరి= మూసివేశారు.

తాత్పర్యం: రాక్షసులు నా తేరు పోయే దారికి అడ్డంగా, భూమికీ ఆకసానికీ ఉన్న మధ్యప్రదేశాన్ని తీవ్రమైన అమ్ములదొంతరలతో కప్పివేసి, దేవతలును మునులును అచ్చెరువందేటట్లుగా చేశారు.

క. **కడుభయమున మాతలి చే । డ్పడి రథచోదనమునం దపాటవుఁ డైనన్**
వడి నేన రథము గడుపుచుఁ । దడయక యేసితిఁ గడంగి దానవులపయిన్. **62**

ప్రతిపదార్థం: కడు, భయమునన్= మిక్కిలి వెరపుతో; మాతలి= దేవేంద్రుడి రథసారథి; చేడ్పడి= మూర్ఛిల్లి; బాధపడి, చలించి; రథచోదనమునందు= తేరు నడపటంలో; అపాటవుఁడు+ఐనన్= సామర్థ్యం లేనివాడుకాగా; వడిన్= శీఘ్రంగా; ఏను+అ= నేనే; రథము+కడపుచున్= తేరును నడుపుతూ; తడయక= ఆలస్యం లేకుండగా; కడంగి= పూని; దానవులపయిన్= రక్కసులమీద; ఏసితిన్= అమ్ములను ప్రయోగించాను.

తాత్పర్యం: మిక్కుట మైన భీతిచేత దేవేంద్రుడి రథసారథి అయిన మాతలి అప్పుడు రథం నడిపే సామర్థ్యాన్ని కోలుపోయి స్పృహ తప్పిపడిపోయాడు. ఇక, నేనే తేరును శీఘ్రంగా నడపుకొంటూ ఆలస్యం చేయకుండా రక్కసులమీద అమ్ములు ప్రయోగించాను.

వ. మాతలి నన్నుం జూచి సంతసిల్లె నంత. 63

ప్రతిపదార్థం: మాతలి= దేవేంద్రుడి రథసారథి; నన్నున్+చూచి= నాసామర్థ్యాన్ని చూచి; సంతసిల్లెన్= సంతోషించాడు; అంతన్= అంతట.

తాత్పర్యం: నా సామర్థ్యాన్ని కాంచి, మాతలి మిక్కిలి సంతోషించాడు. అంతట.

చ. అతుల రణాంతరంబున నిరంతర మ త్పటు బాణ దారితో
చ్ఛ్రిత దనుజాంగ నిర్గళ దసృగ్జల ధారలు సూడ నొప్పె నా
తత గిరి శృంగ సంగ దళిత ప్రచల జ్జల వాహ జాల సం
తత గళ దంబుధారల విధంబున నంబర మెల్లఁ గప్పుచున్. 64

ప్రతిపదార్థం: అతుల, రణ+అంతరంబునన్= సాటిలేని యుద్ధమధ్యంలో; నిరంతర, మత్, పటు, బాణ, దారిత+ఉత్+శ్రిత, దనుజ+అంగ, నిర్గళత్+అసృక్+జల, ధారలు= ఎడతెగకుండ ప్రవర్తిల్లే నా తీవ్రమైన అమ్ములచేత ముక్కలుచేయబడిన, చీల్చబడి, పైకెగరగొట్టబడిన రాక్షసులదేహాలనుండి స్రవించెడి నెత్తుటి నీటిజాలులు; ఆతత, గిరి, శృంగ, సంగ, దళిత, ప్రచలత్+జలవాహ, జాల, సంతత, గళత్+అంబు, ధారల విధంబునన్= విరివి అయిన కొండకొనలను తగులుకొని కత్తిరించబడి మిక్కిలి చలిస్తూ ఉండే మబ్బుల సముదాయంనుండి ఎడతెగకుండ జారెడు నీటిజాలుల రీతిగా; అంబరము+ఎల్లన్+కప్పుచున్= ఆకసాన్ని అంతటిని ఆవరించి; చూడన్+ఒప్పెన్= చూడటానికి సొగసుగా ఉండింది.

తాత్పర్యం: అది సాటిలేనియుద్ధం. నా తీవ్రమైన అమ్ములచేత ఖండించబడి పైకెగసిన రాక్షసులదేహాలనుండి కారిన నెత్తురులనే నీటిధారలు, విరివిఅయిన కొండకొనలకు తగిలి ముక్క లై చెల్లాచెదరైన మేఘాల సముదాయంనుండి ఎడతెగక స్రవించే నీటిధారలవలె ఆకసాన్ని అంతటిని ఆవరించి చూడ ఇంపుగా ఉండింది.

విశేషం: అలం: ఉపమ

వ. అంత నయ్యసురులు మాయాయుద్ధంబు సేయ సమకట్టి నామీఁద వర్షాస్త్రంబు లేసిన. 65

ప్రతిపదార్థం: అంతన్= అంతట; ఆ+అసురులు= ఆ రాక్షసులు; మాయా, యుద్ధంబు= లేనిది ఉన్నట్లు భ్రమింపజేసే నైపుణ్యంతో కూడిన పోరాటం; చేయన్+సమకట్టి= చేయటానికి పూని; నామీఁదన్= నాపయి; వర్ష+అస్త్రంబులు= వాన కురిసే మంత్రబాణాలు; ఏసినన్= ప్రయోగించగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అంతట, ఆ రాక్షసులు నాతో మాయాయుద్ధానికి పూనుకొని, నామీద వర్షం కురిసే మంత్రబాణాలను ప్రయోగించారు.

విశేషం: కొన్ని ప్రతుల్లో, 'వరుణాస్త్రంబు లేసిన'- అనే పాఠాంతరం ఉంది.

క. బలరిపుఁడు నాకు నిచ్చిన । యలఘునిశాతముఖశోషణాస్త్రంబున ని
ర్గళదవిరళజలధారా । వలి నెల్లను దత్క్షణంబు వట్టఁగఁ జేసెన్. 66

ప్రతిపదార్థం: బలరిపుఁడు= బలుడు అనే రాక్షసుడికి శత్రు వైన దేవేంద్రుడు; నాకున్= నాకు; ఇచ్చిన= బహూకరించిన; అలఘు, నిశాత, ముఖ, శోషణ+అస్త్రంబునన్= గొప్ప దైన, వాడి అయిన, కొన గలిగి, ఎండింపజేసెడి మంత్రబాణం; నిర్గళత్+అవిరళ, జల, ధారా+ఆవలిన్+ఎల్లను= ఎడతెగకుండా కారెడి నీటివెల్లువ నంతటిని; తద్+క్షణంబు+అ= ఆత్రుటిలోనే; వట్టఁగన్+చేసెన్= ఎండిపోయేటట్లు చేసింది.

తాత్పర్యం: నేనుకూడ, దేవేంద్రుడు నాకు బహూకరించిన శోషణాస్త్రాన్ని ప్రయోగించాను. అది ఎడతెగకుండ కురుస్తున్న వాననీటివెల్లువను తత్క్షణమే ఇంకి ఎండిపోయేటట్లు చేసింది.

సీ. అద్దానవులు దారుణాశ్మవర్షంబులుఁ । గురిసిన నవి నన్నుఁ దెరలఁ గప్పి;
నేనును గులిశాస్త్ర మేసి పాషాణముల్ । నుఱుము గావించితి; నుఱక వెండి
యసురులు నామీఁద ననలాస్త్రజాలంబు । లేసిన గాడ్పుతో మ్రోసి యగ్ని
కణములు నాపయిం గవిసిన నేనును । సలిలాస్త్రముల వాని బల మడంచి

ఆ. యున్నఁ, దిమిరబాణ ముగ్రంబుగా వార । లేసి; రంత దిక్కు లెల్లఁ గప్పి;
నంధకారమగ్నుఁ డై చలియించి మా । తలి ప్రతోద మెడలి ధరణిఁ బడియె. 67

ప్రతిపదార్థం: ఆ+దానవులు= ఆ రాక్షసులు; దారుణ+అశ్మ, వర్షంబులున్= భయంకర మైన రాళ్ళవానలు; కురిసినన్= వర్షించగా; అవి= ఆ రాళ్లవానలు; నన్నున్+తెరలన్+కప్పెన్= నన్ను కన్పించకుండ మూసినవి; ఏనును= నేను; కులిశ+అస్త్రము+ఏసి= వజ్రాస్త్రాన్ని ప్రయోగించి; పాషాణముల్= రాళ్లు; నుఱుము+కావించితిన్= పొడిపొడి చేశాను; ఉఱక= లెక్కసేయక; వెండి= తిరిగి; అసురులు= రాక్షసులు; నామీఁద= నాపై; అనల+అస్త్ర, జాలంబులు= అగ్ని మయములగు మంత్రబాణాల సముదాయాలు; ఏసినన్= ప్రయోగించగా; గాడ్పుతో, మ్రోసి= గాలితో నినదించి; అగ్ని, కణములు= నిప్పురవ్వలు; నా పయిన్+కవిసినన్= నా మీద వచ్చిపడగా; ఏనును= నేనుకూడ; సలిల+అస్త్రములన్= నీరు కురిసే మంత్రబాణాలచేత; వాని= ఆ అగ్నిబాణాలయొక్క; బలము+అడంచి= శక్తిని నాశనం చేసి; ఉన్నన్= ఉండగా; తిమిరబాణము= చీకట్లు కల్పించే అస్త్రం; ఉగ్రంబుగాన్= భయంకరంగా; వారలు= ఆ రాక్షసులు; ఏసిరి= ప్రయోగించారు; అంత= అంతట; దిక్కులు+ఎల్లన్+కప్పెన్= చీకట్లు దిశలన్నిటినీ ఆవరించాయి; అంధకార, మగ్నుఁడు+ఐ= చీకటిలో మునిగిపోయి; చలియించి= కంపించి; మాతలి= దేవేంద్రుడి సారథి; ప్రతోదము+ఎడలి= చేతిలోని కొరడా వదలిపెట్టి; ధరణిన్= భూమిపై; పడియెన్= పడ్డాడు.

తాత్పర్యం: ఆ రాక్షసులు భయంకర మైన రాళ్ళవానలు కురిపించి నన్ను కప్పివేశారు. నేనుకూడ వజ్రాస్త్రాన్ని ప్రయోగించి ఆ రాళ్లు నుగ్గునుగ్గు అయ్యేటట్లు చేశాను. ఆ రాక్షసులు నా మీద అగ్నేయాస్త్రాన్ని ప్రయోగించగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వారుణాస్త్రంతో దానిని వమ్ముచేశాను. ఆపైన దానవులు చీకట్లు క్రమ్మే అస్త్రాన్ని ప్రయోగించారు. దానివల్ల చీకట్లు దిగ్దిగంతరాలలో క్రమ్ముకొన్నవి. ఆ చీకట్లలో మాతలి కంపించి, తన చేతిలోని కొరడాను జారవిడిచి భూమిపై పడిపోయాడు.

క. తురగములు పఱవ నేరక । వరరథవహనంబునందు వంధ్యము లయ్యెన్;
సురసారథి ననుఁ గానక । 'హరినందన! యెందుఁ బోయి' తనెఁ గడు భీతిన్. 68

ప్రతిపదార్థం: తురగములు= గుర్రాలు; పఱవనేరక= పరుగెత్తలేక; వర, రథ, వహనంబునందు= గొప్పరథాన్ని మోయటంలో; వంధ్యములు+అయ్యెన్= అసమర్థాలు అయినవి; సుర సారథి= దేవతలసారథి మాతలి; ననున్= నన్ను; కానక= చూడలేక; హరినందన!= దేవేంద్రుడి పుత్రుడ వైన ఓఅర్జునా!; ఎందున్+పోయితి= ఎచటికి వెళ్ళినా వయా అని; కడు, భీతిన్= గొప్ప భయంతో; అనెన్= అని అన్నాడు.

తాత్పర్యం: గుర్రాలు పరుగిడలేక పోయాయి. ఆ గొప్పరథాన్ని ఈడ్వలేకపోయాయి; దేవతలసారథి అయిన మాతలి, 'దేవేంద్రుడి, పుత్రుడ వైన ఓ అర్జునా! నీవు ఎక్కడ ఉంటివయా?' అని భయంతో అరచాడు.

క. 'అమృతనిమిత్తంబున ము । న్నమరాసురయుద్ధ మయ్యె; నది యింతభయ
భ్రమజనకము గా; దిది యు । గ్రము దనుజు లవార్యవీర్యగర్వితు లగుటన్. 69

ప్రతిపదార్థం: అమృత, నిమిత్తంబునన్= అమృతం కారణంగా; మున్ను= తొల్లి; అమర+అసుర, యుద్ధము+అయ్యెన్= వేల్పులకు రక్కసులకు పోరాటం జరిగింది; అది= ఆ యుద్ధం; ఇంత= ఇంతటి; భయ, భ్రమ, జనకము= భయాన్ని ఆందోళనను కలిగించేది; కాదు= కాలేదు; ఇది= ఇప్పుడు జరుగుతున్న పోరాటం; దనుజులు= రాక్షసులు; న+వార్య, వీర్య, గర్వితులు+అగుటన్= వారించటానికి వీలులేని పరాక్రమం కలిగిన వారు కావటంచేత; ఉగ్రము= భయంకర మైనది.

తాత్పర్యం: 'తొల్లి రాక్షసులకూ దేవతలకూ అమృతంకొరకు గొప్పయుద్ధం జరిగింది కాని, అది ఇప్పటి యుద్ధమంతటి భయంకర మైనది కాదు. ఇప్పటి ఈ పోరాటంలో రాక్షసులు వారించటానికి వీలులేని పరాక్రమం కలవారైనందున ఈ యుద్ధం మిక్కిలి భయంకరమైనది.

తే. బ్రహ్మచేత నిర్మింపఁగఁబడిన భువన । సంప్లవం బిది' నావుడు 'సంగరమున
సంచలింపక నాభుజశక్తిఁ జూచు । చుండు' మనవుడు మాతలి చోద్య మందె. 70

ప్రతిపదార్థం: బ్రహ్మచేతన్= సృష్టికర్తచేత; నిర్మింపఁగన్+పడిన= ఏర్పాటుచేయబడిన; భువన, సంప్లవంబు+ఇది= ప్రపంచ విధ్వంసం ఇది; నావుడున్= అని చెప్పగా; సంగరమునన్= యుద్ధంలో; సంచలింపక= కంపించక; నా భుజశక్తిన్= నా పరాక్రమం; చూచుచుండుము= చూస్తూ ఉండుము; అనవుడున్= అని చెప్పగా; మాతలి= దేవేంద్రుడి సారథి; చోద్యము+అందెన్= ఆశ్చర్యం చెందాడు.

తాత్పర్యం: ఇది బ్రహ్మదేవుడు నిర్ణయించిన ప్రపంచ ప్రళయం'- అని చెప్పగా, 'ఈయుద్ధంలో నీవు నా పరాక్రమాన్ని చూచెదవుగాక' అని అన్నాను. అనగా దేవేంద్రుడి సారథి అయిన మాతలి ఆశ్చర్యపడ్డాడు.

ఉ. వాసరనాయకుం దలఁచి వజ్రవరంబున సూర్యబాణ మే
నేసితి నింద్రుఁ దొట్టి సుర లెంతయు సంతస మందఁగా జగ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

త్రాసి తమిస్రరాశి నిహతంబుగ దిక్కులు ద్రెళ్ళఁగా మహో
గ్రాసురు లాహవంబున భయంపడ మాతలి మెచ్చి యార్వఁగన్. 71

ప్రతిపదార్థం: ఏను= నేను; వాసర, నాయకున్+తలఁచి= దినవాయకు డైన సూర్యుడిని స్మరించి; వజ్రి+వరంబునన్= దేవేంద్రుడి అనుగ్రహం చొప్పున; సూర్యబాణము= సూర్యాస్త్రాన్ని; ఏసితిన్= ప్రయోగించాను; ఇంద్రున్+తొట్టి= ఇంద్రుడు మొదలుగా కల; సురలు= వేల్పులు; ఎంతయు, సంతసము+అందఁగా= మిక్కిలి సంతోషించగా; జగత్+త్రాసి, తమిస్ర, రాశి= ప్రపంచానికి భయం కల్పించే చీకటిప్రోవు; నిహతంబుగన్= అంతరించగా; దిక్కులు+త్రెళ్ళఁగా= దిక్కులు తేటపడగా; మహా+ఉగ్ర+అసురులు= మిక్కిలి భయంకరులు అయిన రక్కసులు; ఆహవంబునన్= యుద్ధంలో; భయంపడ= భీతి చెందగా; మాతలి= దేవేంద్రుడిసారథి; మెచ్చి= అభినందించి; ఆర్వఁగన్= పెనుకేక వేయగా.

తాత్పర్యం: సూర్యుడిని స్మరించి, దేవేంద్రుడి అనుగ్రహంతో నాకు లభించిన సూర్యాస్త్రాన్ని ప్రయోగించాను. దేవేంద్రుడు మున్నగు దేవతలు అందరు సంతసించారు, ప్రపంచానికి భయం కలిగించే చీకట్లు పటాపంచలైనవి. దిక్కులు తేటతెల్లమై కన్పించినవి. మిక్కిలి భయంకరులైన రాక్షసులు యుద్ధంలో భీతిల్లారు. దేవేంద్రుడి రథసారథి మాతలి నన్ను అభినందిస్తూ ఆనందంతో పెద్దకేక వేశాడు.

క. గాండీవముక్తదారుణ । కాండవిఖండీకృతాపఘను లై దనుజుల్
భండనముఖమునఁ జేడ్వడి । గొండలు వడినట్టు వడిరి కుతలం బద్రువన్. 72

ప్రతిపదార్థం: గాండీవ, ముక్త, దారుణ, కాండ, విఖండీకృత+అపఘనులు+ఐ= గాండీవం (వింటి) నుండి విడివడిన భయంకర మైన బాణాలచేత ఖండించబడిన శరీరములు కలవారై; దనుజుల్= రాక్షసులు; భండనముఖమునన్= యుద్ధం యొక్క ముంగల; చేడ్పడి= దెబ్బతిని; కొండలు+పడినట్టు= పర్వతాలు కూలినట్లు; కు తలంబు= భూభాగం; అద్రువన్= అదరగా; పడిరి= కూలారు.

తాత్పర్యం: నా గాండీవంనుండి వెలువడిన భయంకరమైన బాణాలచేత ఖండించబడిన శరీరములు కలవారై, రాక్షసులు యుద్ధంలో కొండలు కూలినట్లు, భూభాగం కంపించగా కూలిపోయారు.

విశేషం: అద్రువన్=IIU ఇచట. ద్రు అను సంయుక్తాక్షరానికి ముందున్న 'అ' గురువు కాదు. దీనికి ఛందస్సులో 'శిథిలద్విత్వం' అని పేరు. చదివేటప్పుడు కుతలం.... బద్రువన్ అని 'బ' తేల్చి పలుకవలెను.

వ. ఇట్లు నివాతకవచులు మదీయదివ్యాస్త్రనిహతులై మహీతలంబునం బడిన; నట యసురకాంతలయాక్రందన ధ్వను లాకసం బద్రువ నొక్కటఁ బురంబున నెగసె; నంత నద్దానవపురంబుఁ బురందరుపురంబుకంటె నతిసుందరం బైన దానిం జూచి మాతలి కి ట్లంటి. 73

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; నివాతకవచులు= నివాతకవచులు అనే రక్కసులు; మదీయ, దివ్య+అస్త్ర నిహతులు+ఐ= నాయొక్క దివ్యమైన మంత్రబాణాలచేత మరణించిన వారై; మహీతలంబునన్+పడినన్= భూమిపైభాగాన కూలిపడగా; అట= అచట; అసురకాంతలు= రాక్షసులస్త్రీలు; ఆక్రందన ధ్వనులు= బిగ్గరగా ఏడ్చే శబ్దాలు; ఆకసంబు+అద్రువన్= ఆకాశం దద్దరిల్లగా; ఒక్కటన్= ఒకేసారిగా; పురంబునన్= పట్టణంలో; ఎగసెన్= వ్యాపించాయి; అంతన్= అటు పిమ్మట; ఆ+దానవ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పురంబున్= ఆ రాక్షసుల పట్టణాన్ని; పురందరు పురంబుకంటెన్= దేవేంద్రుడినగర మైన అమరావతికంటె; అతి, సుందరంబు+ఐనదానిన్= మిక్కిలిసొగసైనదానిని; చూచి=కని; మాతలికి= దేవేంద్రుడి సారథికి; ఇట్లు+అంటిన్= ఈవిధంగా అన్నాను.

తాత్పర్యం: ఈ విధంగా నివాతకవచులు దివ్యాలైన నా మంత్రబాణాలచేత మరణించి భూమిపైభాగాన కూలిపడ్డారు. అచట రాక్షసస్త్రీలఏడుపులు పెనుబొబ్బలు ఆకసాన్ని దద్దరిల్ల చేశాయి. అంతట, దేవేంద్రుడిముఖ్యపట్టణమైన అమరావతికంటె ఎంతయో అందంగా ఉన్న ఆ రాక్షసులపట్టణాన్ని చూచి నేను మాతలితో ఇట్లా అన్నాను.

క. **'నిరుపమరత్ననిరంతర । వరగృహముల నొప్పి సుఖనివాసం బగు ని**
ప్పురి నుండ నొల్ల కొండొక । పురి నుండఁగ నేల వలసెఁ బురుహూతునకున్.' **74**

ప్రతిపదార్థం: నిరుపమ, రత్న, నిరంతర, వర, గృహములన్= సాటిలేని మణులతో ఎడతెగకుండ కట్టబడిన గొప్పఇండ్లతో; ఒప్పి= శోభిల్లి; సుఖ, నివాసంబు+అగు= నివసించడానికి సుఖంగా ఉండే; ఈ+పురిన్= ఈపట్టణంలో; ఉండన్+ఒల్లక= నివసించటానికి ఇష్టపడక; పురుహూతునకున్= ఇంద్రుడికి; ఒండు+ఒక+పురిన్= మరొక పట్టణంలో; ఉండఁగన్+ఏల, వలసెన్= ఎందుకు నివసించవలసివచ్చింది.

తాత్పర్యం: 'సాటిలేని రత్నాలతో దట్టంగా పొదుగబడిన ఇండ్లతో శోభిల్లే ఈ నగరంలో సుఖనివాసం చేయక వేరొక పట్టణాన ఇంద్రు డేల నివసించవలసి వచ్చింది?'

వ. **అనిన మాతలి యి ట్లనియె.** **75**

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; మాతలి= ఇంద్రుడిసారథి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని నేను ప్రశ్నించగా మాతలి ఈవిధంగా ప్రత్యుత్తరం ఇచ్చాడు.

సీ. **'అసురులవలన భయం బైన యపుడు వే । ల్పులకు సేమంబుగా బలవిరోధి**
యీప్రోలు జలధిలో నిమ్ముగ నిర్మించె; । దనుజులు పదపడి వనజగర్భు
వలనఁ దపోవీర్యవంతు లై యిందుండ, నమరులచేతఁ గయ్యమున నజితు
లై యుండఁ బడసిన, నమరేంద్రుఁ డెఱిఁగి త । ద్విజయార్థముగఁ బంచె విజయ! నిన్నుఁ;

ఆ. **నమరులకు నసాధ్యు లైనట్టి వీరల । నీవ యోర్చి' తనుచు నెమ్మితోడ**
నన్ను సంస్తుతించి నరనాథ! మాతలి । గడఁగి యపుడు రథముఁ గ్రమ్మఱించె. **76**

ప్రతిపదార్థం: విజయ!= ఓఅర్జునా!; అసురులవలనన్= రాక్షసులవలన; భయంబు+ఐన+అపుడు= వెఱపు కలిగినప్పుడు; వేల్పులకు= దేవతలకు; సేమంబుగా= క్షేమంగా; బలవిరోధి= దేవేంద్రుడు; ఈ+ప్రోలు= ఈ నగరాన్ని; జలధిలోన్= సముద్రంలో; ఇమ్ముగన్= సంప్రీతితో; నిర్మించెన్= కట్టించాడు; దనుజులు= రాక్షసులు; పదపడి= పిమ్మట; వనజ, గర్భువలనన్= బ్రహ్మదేవుడివలన; తపస్+వీర్యవంతులు+ఐ= తపస్సు అనే బలం కలవారై; ఇందు+ఉండన్= ఇందు ఉండుటకొరకై; అమరులచేతన్= వేల్పులచేత; కయ్యమునన్= యుద్ధంలో; అజితులు+ఐ+ఉండన్= ఓడిపోకుండ ఉండటానికై; పడసినన్= వరాన్ని సంపాదించగా; అమరేంద్రుఁడు= దేవేంద్రుడు; ఎఱిఁగి= తెలిసికొని; తద్+విజయ+అర్థముగన్= వారిని జయించటంకొరకై;

నిన్ను; పంచెన్= నియోగించాడు; అమరులకున్= వేల్పులకు; న+సాధ్యులు+ఐనట్టి= జయించటానికి అలవికానట్టి; వీరలన్= ఈ నివాతకవచులను; ఈవు+అ= నీవే; ఓర్చితి= జయించావు; అనుచున్= అని చెప్పుతూ; నెమ్మితోడన్= ప్రీతితో; నన్నున్; సంస్తుతించి= పొగడి; నరనాథ!= రాజైన ఓ ధర్మరాజా!; మాతలి= దేవేంద్రుడిసారథి; కడఁగి= పూని; అపుడు= అప్పుడు; రథమున్= తేరును; క్రమ్మఱించెన్= మరల్చాడు.

తాత్పర్యం: 'ఓ అర్జునా! రాక్షసులవలన భీతి ఏర్పడిన సమయంలో, దేవతలయోగక్షేమాలను కాపాడగోరి దేవేంద్రుడు ఈ పట్టణాన్ని సముద్రంలో నిర్మించాడు. తరువాత రాక్షసులు తపస్సుచేసి తాము తపోబల సంపన్నులై ఈపట్టణంలో ఉండటానికీ, దేవతలచేత యుద్ధంలో జయించబడక ఉండటానికీ బ్రహ్మదేవుడి వలన వరం పొంది, ఈ పురాన్ని ఆక్రమించారు. వారిని జయించటానికే దేవేంద్రుడు నిన్ను నియోగించాడు. దేవతలకు జయింప శక్యంగాని వీరులను నివాతకవచులను నీవు గెల్చావు- అని ప్రశంసించి, మాతలి రథాన్ని మరలించాడు' అని అర్జునుడు ధర్మరాజుతో చెప్పాడు.

వ. ఇట్లు నివాతకవచులం జంపి క్రమ్మఱి వచ్చునెడ నాముందట నొక్క తపోవనంబును నతివిచిత్రం బైన పురంబునుం గని 'యిది యెవ్వరిపురం?' బని యడిగిన నాకు మాతలి యి ట్లనియె. 77

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నివాతకవచులన్= నివాతకవచులు అనబడే రక్కసులను; చంపి= సంహరించి; క్రమ్మఱివచ్చు+ఎడ= తిరిగి వచ్చేటపుడు; నా, ముందటన్= నాయెదుట; ఒక్కతపస్+వనంబునన్= తపస్సు చేయటానికి అనువైన ఒక అరణ్యమున్నూ; అతి విచిత్రంబు+ఐన= మిక్కిలి వింతైన; పురంబునున్+కని= ఒక పట్టణాన్నీ, చూచి; ఇది= ఈ పట్టణం; ఎవ్వరిపురంబు= ఎవరినగరం; అని= అంటూ, అడిగినన్= ప్రశ్నించగా; నాకున్= నాతో; మాతలి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా నివాతకవచులను సంహరించి తిరిగి వస్తున్నప్పుడు నాయెదుట ఒక తపోవనమున్నూ, మిక్కిలి అచ్చెరువు కలిగించే ఒక నగరమున్నూ కన్పించాయి. 'ఇది ఎవ్వరిపురం?' అని నేను ప్రశ్నించగా, మాతలి ఇట్లా సమాధానం చెప్పాడు.

క. 'వినవె పులోమయుఁ గాలక । యునుననఁగా నిరువు రసురయువతులు గమలా
సను నారాధించిరి తప । మున దివ్యసహస్రవర్షములు గడునిష్ఠన్. 78

ప్రతిపదార్థం: వినవె= ఆలకించలేదా, (శ్రద్ధగా వినుము అనిన్నీ, ఇంతకుముందు వినలేదా అనిన్నీ భావం); పులోమయున్= పులోమ (అనేస్త్రీ); కాలకయునున్= కాలక (అనేస్త్రీ); అనఁగాన్= అనే పేరు కల; ఇరువురు+అసుర, యువతులు= ఇద్దరు రాక్షస వనితలు; తపమునన్= తపస్సుచేసి; దివ్య, సహస్ర, వర్షములు= దేవమానం ప్రకారం వేయిఏండ్లు; కడు+నిష్ఠన్= మిక్కుటమైన దీక్షతో; కమల+ఆసనున్= బ్రహ్మదేవుడిని (కమలం ఆసనంగా కలవాడిని); ఆరాధించిరి= అర్చించారు.

తాత్పర్యం: 'పులోమ, కాలక అనబడే ఇద్దరు రాక్షస యువతులు దేవమానం ప్రకారం వేయి సంవత్సరాలు మిక్కిలి నిష్ఠతో తీవ్రమైన తపస్సు చేసి బ్రహ్మదేవుడిని ఆరాధించారు. ఆ విషయం నీవు వినలేదా?

క. కనకమయ మైన యీప్రో । లునఁ దమసుతు లాహవంబులో నమరులచే
తను వధ్యులు గాకుండను । వనజజుచేఁ బడసి రసురవనితలు వరముల్. 79

ప్రతిపదార్థం: అసురవనితలు= రాక్షస స్త్రీలు; కనక, మయము+ఐన= బంగారంతో కూడిన; ఈ ప్రోలునన్= ఈ పట్టణంలో; తమ, సుతులు= తమ కొడుకులు; ఆహవంబులోన్= యుద్ధంలో; అమరులచేతను= దేవతలచేత; వధ్యులు+కాకుండను= చంపబడేవారు కాకుండగా; వనజజుచేన్= బ్రహ్మదేవుడిచేత (పద్మంలో పుట్టినవాడిచేత); వరముల్+పడసిరి= వరాలను పొందారు.

తాత్పర్యం: బంగారంతో నిర్మించబడిన ఈ నగరంలో నివసించే తమకొడుకులు యుద్ధంలో దేవతలచేతిలో మరణించకుండేటట్లుగా రాక్షసవనితలు బ్రహ్మదేవుడిచేత వరాలను పొందారు.

వ. ఇది హిరణ్యపురం; బిందుఁ బౌలోమకాలకేయు లను నసురు లరువది వేలుండుదురు వా రమరులచేత నవధ్యు' లనిన 'నట్లేని దానిపయిం బోదము; రథంబు పఱపు' మని యేను మాతలిం బంచిన. 80

ప్రతిపదార్థం: ఇది= (ఈనగరం)ఇది; హిరణ్యపురంబు= హిరణ్యపురం (పసిడిప్రోలు); ఇందున్= ఈ పురంలో; పౌలోమ, కాలకేయులు+అను= పులోమకొడుకులు, కాలకకొడుకులు, అనబడే; అసురులు= రక్కసులు; అరువది, వేలు+ఉండుదురు= అరువదివేలమంది ఉంటారు; వారు= ఆ పౌలోములు కాలకేయులు; అమరులచేతన్= దేవతలచేత; అవధ్యులు= చావులేనివారు; అనినన్= అని చెప్పగా; అట్లు+ఏని= అట్లా అయితే; దానిపయిన్+పోదము= ఆనగరంమీద దండెత్తివెళ్ళుదాము; రథంబు+పఱపుము= తేరు నడుపుము; అని= అని చెప్పి; ఏను= నేను; మాతలిన్= మాతలిని; పంచినన్= నియోగించగా.

తాత్పర్యం: ఇది హిరణ్యపురం; ఈ నగరంలో పులోమకొడుకులు, కాలకకొడుకులు పౌలోములు, కాలకేయులు అనబడే రక్కసులు అరువదివేలమంది ఉన్నారు. వీరు దేవతలచేత చావులేనివారు'- అని మాతలి చెప్పాడు. అంతట నేను 'అట్లయితే ఆ నగరంమీద దండయాత్రకు రథాన్ని పోనిమ్ము' అని, మాతలిని ఆదేశించాను.

చ. అతఁడును సప్తమారుతరయంబున దివ్యరథంబుఁ దత్సురా
హితపురి భూరి వప్రముపయిం బఱపెన్ సురవైరు లంత ను
ద్ధతు లయి ప్రోలు వెల్వడి రథంబులు షష్టిసహస్రకంబుతో
శతమఖబుద్ధిఁ జేసి కడు సైఁపక తాఁకిరి నన్ను నల్కతోన్. 81

ప్రతిపదార్థం: అతఁడును= ఆ మాతలియు; సప్త, మారుత, రయంబునన్= ఏడువాయువులవేగంతో; దివ్య రథంబున్= దేవతాసంబంధమైన రథాన్ని; తద్+సుర+అహిత పురి= ఆ దేవతల శత్రువుల నగరంయొక్క; వప్రము పయిన్= ప్రాకారశిఖరంపై; పఱపెన్= పోనిచ్చాడు; సుర వైరులు= రాక్షసులు; అంతన్= అంతట; ఉద్ధతులు+అయి= విజృంభించినవారు అయి; ప్రోలు వెల్వడి= నగరంనుండి బయటకు వచ్చి; రథంబులు, షష్టి, సహస్రకంబుతోన్= అరువదివేలతేరులతోన్; నన్ను; శతమఖ, బుద్ధిన్+చేసి= దేవేంద్రుడు అని తలపోసి; కడు, సైఁపక= మిక్కిలి ఓర్వక; అల్కతోన్= కోపంతో; తాఁకిరి= ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: ఆ మాతలి ఏడువాయువుల వేగంతో దేవతారథాన్ని, ఆ దేవతల శత్రువుల నగరంలోని కోటకొమ్మలపైకి నడిపించాడు. అంతట అందలి రాక్షసులు విజృంభించి, నగరంనుండి బయటికి వచ్చి, నన్ను దేవేంద్రుడు అని భావించి, ఆగ్రహించి, అరువదివేల తేరులతో చుట్టుముట్టారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఏనును వారల యఱువదివేలరథంబులకు గతినిరోధంబుగా వితతవృక్షవికటశిలాప్రభవంబు లయిన దివ్యబాణంబు లేసిన, నసురులు మాయాయుద్ధనిబద్ధబుద్ధులై తమపురంబుతోడన దివంబున కెగసి మదీయమార్గణార్గళనిరుద్ధమార్గు లై నేలంబడిన, వీరల నొండువిధంబున నోర్వరా దని తలంచి. 82

ప్రతిపదార్థం: ఏనును= నేనును; వారల+అరువది వేల రథంబులకు= ఆ రాక్షసులయొక్క అరువది వేల తేరులకు; గతి, నిరోధంబుగా= దారికి అడ్డుగా; వితత, వృక్ష, వికట, శిలా, ప్రభవంబులు+అయిన= విస్తరించబడిన చెట్లను, వికృతా లైన రాళ్లను పుట్టించేవి అయిన; దివ్య, బాణంబులు+ఏసినన్= అతిలోకా లైన అమ్ములు ప్రయోగించగా; అసురులు= రక్కసులు; మాయా, యుద్ధ, నిబద్ధ, బుద్ధులు+ఐ= మాయాయుద్ధాన్ని కొనసాగించటంలో లగ్నమైన మనస్సులు కలవారై; తమ పురంబుతోడన= తమ నగరంతోపాటు; దివంబునకున్= ఆకసానికి; ఎగసి= ఎగిరి; మదీయ, మార్గణ+అర్గళ, నిరుద్ధ, మార్గులు+ఐ= నాయొక్క బాణా లనే గొప్ప గడియమానుల చేత అడ్డగించబడినదారి కలవారై; నేలన్+పడినన్= భూమిమీద పడగా, వీరలన్= ఈ రక్కసులను; ఒండు విధంబునన్= వేరురీతిగా; ఓర్వరాదు+అని= గెలువరాదు అని; తలంచి= తలపోసి.

తాత్పర్యం: నేనును, ఆరాక్షసులయొక్క అరువదివేలతేరులు కదలటానికి వీలులేనట్లుగా పెక్కుచెట్లను, బండరాళ్లను కల్పించే దివ్యబాణాలను దారికి అడ్డంగా ఏర్పడేటట్లు ప్రయోగించాను. ఆ రక్కసులు కపట యుద్ధాన్ని చేయటానికి సంకల్పించినవారై తమ నగరంతోపాటు ఆకసానికి ఎగిరారు. కాని, నా బాణా లనెడి పెద్ద గడియలచేత అడ్డగించబడి భూమిపై పడ్డారు. ఇక, వీరిని వేరుతీరుగా గెలవటానికి వీలులే దని తలపోసి.

చ. ఉరగఫణాగ్రరత్నకిరణోల్లసదుగ్రభుజున్ వృషాంకు శం
కరు శశిఖండమండితశిఖండు శివున్ హృదయాంబుజంబునం
దిరముగ నిల్పి పాశుపతదివ్యశరం బరివోసి యేసితిన్
సురరిపుకోటిమీఁద సురసూతుఁడు మాతలి చూచి మెచ్చఁగన్. 83

ప్రతిపదార్థం: ఉరగ, ఫణా+అగ్ర, రత్న, కిరణ+ఉల్లసత్+ఉగ్రభుజున్= పాముల పడగల చివర కల మణుల వెలుగులచేత ప్రకాశించే భయంకర మైన భుజాలు కలవాడిని; వృష+అంకున్= ఎద్దుగుర్తు కలవాడిని; శంకరు= శివుడిని; శశిఖండ మండిత శిఖండున్= చంద్రవంకచేత అలంకరించబడిన సిగ కలవాడిని; శివున్= శివుడిని; హృదయ+అంబుజంబునన్= డెందం అనే తామరపువ్వులో; తిరముగన్= దిటవుగ; నిల్పి= పాదుకొల్పి; పాశుపత, దివ్య, శరంబు= పాశుపతం అనెడి దివ్య మైన మంత్రబాణాన్ని; అరివోసి= అనుసంధించి; సుర, రిపు, కోటిమీఁదన్= దేవతలకు శత్రువు లైన ఆ రాక్షసులగుంపులపై; సురసూతుఁడు= దేవతల సారథి; మాతలి; చూచి= కనుగొని; మెచ్చఁగన్= అభినందిచేటట్లుగా; ఏసితిన్= ప్రయోగించాను.

తాత్పర్యం: పాముల పడగలపై గల రత్నాల కాంతులచేత వెలుగొందే భయంకర మైన భుజాలు కలవాడిని, వృషభాన్ని జెండా పై గుర్తుగా కలవాడిని, చంద్రవంకను సిగలో భూషణంగా ధరించినవాడిని, నా డెందము అనెడి తామరపూవులో పాదుకొల్పి, పాశుపత మనే అస్త్రాన్ని మాతలి చూచి అభినందించేటట్లుగా ప్రయోగించాను.

విశేషం: 1) హరిసూతుఁడు మాతలి - అనే పాఠాంతరం కొన్ని ప్రతుల్లో ఉన్నది. 2) మెచ్చి చూడఁగన్, మెచ్చి యార్వఁగన్- ఈ పాఠాంతరాలు కొన్ని ప్రతుల్లో కనిపిస్తున్నాయి.

వ. ఆ దివ్యాస్త్రప్రభావంబున సింహశరభశార్దూలశుండాలమహిషమహోక్షయక్షరాక్షసపిశాచపన్నగ గంధర్వరూపంబు లుద్భవిల్లి యసురుల నెల్ల విగతాసులం జేసిన. 84

ప్రతిపదార్థం: ఆ+దివ్య+అస్త్ర, ప్రభావంబునన్= ఆ అతిలోకశక్తి కల మంత్రబాణంయొక్క మహిమవలన; సింహ, శరభ, శార్దూల, శుండాల, మహిష, మహోక్ష, యక్ష, రాక్షస, పిశాచ, పన్నగ, గంధర్వ, రూపంబులు= సింగములు, శరభములు పెద్దపులులు, ఏనుగులు, దున్నలు, ఎద్దులు, యక్షులు, రాక్షసులు, పిశాచులు, పాములు, గంధర్వులయొక్క ఆకృతులు; ఉద్భవిల్లి= పుట్టి; అసురులన్= రాక్షసులను; ఎల్లన్= అందరిని; విగత+అసులన్+చేసినన్= పోయిన ప్రాణాలు కలవారిగా చేయగా.

తాత్పర్యం: దివ్యమైన ఆ పాశుపతాస్త్ర మహిమవలన సింహాలు, శరభాలు, పెద్దపులులు, ఏనుగులు, దున్నలు, ఎద్దులు, యక్షులు, రాక్షసులు, పన్నగులు, పిశాచులు, గంధర్వులు పుట్టి రాక్షసులను అందరిని సంహరించగా.

క. వంచనయును మాయయు మా । యించి పరాక్రాంతి నయ్యుమేశాస్త్రమునం
గ్రంచఁ నంతకపురి కేఁ । గించితిఁ బౌలోమకాలకేయాసురులన్. 85

ప్రతిపదార్థం: వంచనయును= మోసాన్ని; మాయయు= కపటత్వాన్నీ; మాయించి= తొలగించి; పర+ఆక్రాంతిన్= మిక్కిలి గొప్పదైన పరాక్రమంతో; ఆ+ఉమేశ+అస్త్రమునన్= ఆ పాశుపతం అనే మంత్రబాణంతో; క్రంచఁన్= శీఘ్రంగా; పౌలోమ, కాలకేయ+అసురులన్= పౌలోములు కాలకేయులు అనబడే రాక్షసులను; అంతక పురికి= యమధర్మరాజు పట్టణానికి; ఏఁగించితిన్= పంపించాను (చంపానని భావం).

తాత్పర్యం: మోసాన్ని, దుర్భ్రమను తొలగింపజేసి, మిక్కుటమైన పరాక్రమంతో విజృంభించి, పాశుపతాస్త్రాన్ని ప్రయోగించి, పౌలోములు, కాలకేయులు అనబడే ఆ రాక్షసులనుసంహరించి యమపురికి వెడలేటట్లుగా చేశాను.

వ. ఇట్లు హిరణ్యపురనివాసులం గృతాంతపురనివాసులం జేసి వచ్చి వాసవునకు మ్రొక్కిన, వాసవుండును నివాతకవచపౌలోమకాలకేయుల వధప్రకారం బంతయు మాతలివలన విని సంతసిల్లి నా కి ట్లనియె.86

ప్రతిపదార్థం: ఇట్లు= ఈరీతిగా; హిరణ్యపుర, నివాసులన్= హిరణ్యపురంలో నివసించే వారలను - పౌలోమ కాలకేయులను; కృతాంత, పుర, నివాసులన్+చేసి= యముడినగరంలో నివసించేవారినిగా చేసి; వచ్చి= ఏతెంచి; వాసవునకున్= దేవేంద్రుడికి; మ్రొక్కినన్= నమస్కరించగా; వాసవుండును= దేవేంద్రుడును; నివాతకవచ, పౌలోమ, కాలకేయుల, వధ+ప్రకారంబు= నివాతకవచుల యొక్కయు పౌలోములయొక్కయు కాలకేయులయొక్కయు, సంహారంతీరు; అంతయున్= సమస్తమున్నూ; మాతలివలనన్= దేవేంద్రుడి సారథివలన; విని= ఆలకించి; సంతసిల్లి= సంతోషించి; నాకు+ఇట్లు+అనియెన్= నాతో ఈ రీతిగా పలికాడు.

తాత్పర్యం: ఈ విధంగా నేను ఆ హిరణ్యపురవాస్తవ్యులను యమపురివాస్తవ్యులుగా చేసి మరలివచ్చి దేవేంద్రుడికి నమస్కరించాను. దేవేంద్రుడు, మాతలివలన నివాతకవచుల, పౌలోముల, కాలకేయుల సంహారాన్నిగూర్చి విని, సంతోషించి నాతో ఈ విధంగా పలికాడు.

చ. 'సురలకుఁ బ్రీతి సేసితి; వసుంధర కేఁగుము; నిన్ను నీ సహో
దరులు నిరంతరంబును ముదంబునఁ జూడఁగఁ గోరుచున్నవా;
రరిమదభేది! నీకు విషమాజిముఖంబుల మార్కొనంగ నో
పరు నరు లెవ్వరున్; హరి కిభంబులు మార్కొనునయ్య యెయ్యెడన్? 87

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సురలకున్= దేవతలకు; ప్రీతి+చేసితి= సంతసం చేకూర్చావు; వసుంధరకు+ఏఁగుము= భూలోకానికి వెళ్ళుము; నిన్నున్= నిన్ను; నీ సహోదరులు= నీ అన్నదమ్ములు; ముదంబునన్= సంప్రీతితో; చూడఁగన్+కోరుచున్నవారు= చూడవలె నని ఆకాంక్షిస్తున్నారు; అరి మదభేది!= శత్రువుల గర్వాన్ని బ్రద్దలుకొట్టే ఓ అర్జునా!; నీకు; విషమ+ఆజిముఖంబుల= ఘోరమైన యుద్ధాలలో; మార్కొనంగన్= ఎదిరించగా; నరులు; ఎవ్వరున్= ఎవ్వరున్నూ; ఓపరు= సమర్థులు కారు; హరికిన్= సింహాన్ని; ఇభంబులు= ఏనుగులు; ఎయ్యెడన్= ఎక్కడనైనా; మార్కొనున్+అయ్యా= ఎదుర్కొనగలవయ్యా? (ఎదుర్కొనలేవని భావం).

తాత్పర్యం: శత్రువులగర్వాన్ని అణచేవాడవైన ఓ అర్జునా! నీవు దేవతలకు సంప్రీతి సంఘటించావు; నీ అన్నదమ్ములు నిన్ను చూడవలె నని తహతహలాడుతున్నారు. యుద్ధాలలో నిన్ను మానవు లెవ్వరూ ఎదుర్కొనలేరు; సింహాన్ని ఏనుగులు ఎదుర్కొనగలవా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. **ద్రోణద్రోణజ కృపగీ । ర్వాణనదీజాంగపతు లవశ్యమును భవ**
ద్బాణహతిఁ జేసి సమర । క్షోణిఁ బరిక్షీణబలు లగుదు రవజితులై.' **88**

ప్రతిపదార్థం: ద్రోణ, ద్రోణజ, కృప, గీర్వాణనదీజ+అంగపతులు= ద్రోణుడు, ద్రోణునికొడుకు అయిన అశ్వత్థామ, కృపుడు, దేవనది అయిన గంగానదికి జన్మించిన భీష్ముడు, కర్ణుడును; అవశ్యమును= తప్పని సరిగా; భవత్+బాణ, హతిన్+చేసి= నీయొక్క అమ్ములదెబ్బలచేత; సమరక్షోణిన్= యుద్ధరంగంలో; అవజితులు+ఐ= ఓడించబడినవారై; పరిక్షీణబలులు= మిగుల తరిగినబలం కలవారు; అగుదురు= ఔతారు.

తాత్పర్యం: ద్రోణుడు, ద్రోణుడిపుత్రు డైన అశ్వత్థామ, కృపాచార్యుడు, దేవనదీసూను డైన భీష్ముడు, అంగదేశ ప్రభు వైన కర్ణుడు నీ అమ్ములదెబ్బలచేత ఓడించబడినవారై రణరంగంలో పూర్తిగా బలాన్ని కోల్పోతారు.

క. **అనిన నమరేంద్రు వీడ్కొని । చనుదెంచితి' నని కిరీటి శతమఖలోకం**
బునఁ దన చేసినవిధ మ । త్యనఘుం డేర్పడఁగఁ జెప్పె నందఱు వినఁగన్. **89**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అమర+ఇంద్రున్= దేవేంద్రుడిని; వీడ్కొని= సెలవుగైకొని; చనుదెంచితిన్= వచ్చాను; అని= అనిచెప్పి; కిరీటి= అర్జునుడు; శతమఖలోకంబునన్= దేవేంద్రుడిలోకంలో; తన, చేసిన, విధము= తాను చేసిన పనులతీరు; అందఱు వినఁగన్= అందరును ఆలకించేటట్లుగా; అతి+అనఘుండు= పాపాలు లేని మిక్కిలిగొప్పవాడు- అర్జునుడు; ఏర్పడఁగన్+చెప్పెన్= తేటతెల్లంగా వివరించి చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా, నేను దేవేంద్రుడికడ సెలవు తీసికొని ఇక్కడికి వచ్చాను'- అని అర్జునుడు తాను స్వర్గలోకంలో చేసిన పనుల నన్నింటిని అందరూ ఆలకించేటట్లుగా తేటతెల్లంగా చెప్పాడు.

వ. **ధర్మరాజును దమ్ముఁడు సేసిన మహాపరాక్రమంబునకుఁ జతురంభోధిపర్యంతమహీరాజ్యం బప్పుడు తనకు సంప్రాప్తం బైనంతియ సంతసిల్లి.** **90**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధర్మరాజును= ధర్మపుత్రుడుసయితం; తమ్ముఁడు+చేసిన= తన సోదరుడు చేసిన; మహాపరాక్రమంబునకున్= గొప్ప శౌర్యానికి; చతుర్+అంభోధి, పర్యంత, మహీ, రాజ్యంబు= నాలుగు సముద్రాలవరకు విస్తరించిన భూరాజ్యం; అప్పుడు= అప్పుడే; తనకు= తనకు; సంప్రాప్తంబు+ఐనంతియ= సంక్రమించినట్లుగానే; సంతసిల్లి= సంతసించి.

తాత్పర్యం: తన తమ్ముడైన అర్జునుడు ప్రదర్శించిన శౌర్యసాహసాలు ఆలకించి, ధర్మరాజు- తనకు అప్పుడే నాలుగుసముద్రాలచేత పరివేష్టించబడిన సమస్తభూమండలసామ్రాజ్యం సంక్రమించినట్లుగనే మిక్కిలి సంతోషించాడు.

ఆ. 'దివ్యబాణములు తదీయప్రయోగముల్ । మాకుఁ జూపు' మనిన మఘవసుతుఁడు
వేఱువేఱ చూపె వేలుపు లిచ్చిన । యస్త్రశస్త్రములు నిజాగ్రజునకు. 91

ప్రతిపదార్థం: దివ్య బాణములు= గొప్పఅస్త్రాలు; తదీయ ప్రయోగముల్= వాటిని ఉపయోగించే విధానాలు; మాకున్+చూపుము= మాకు ప్రదర్శించి చూపుము; అనినన్= అని అడుగగా; మఘవసుతుఁడు= దేవేంద్రుడికొడుకైన అర్జునుడు; వేలుపులు+ఇచ్చిన= దేవతలు బహూకరించిన; అస్త్ర, శస్త్రములు= మంత్రబాణాలు, ఆయుధవిశేషాలు; నిజ+అగ్రజునకున్= తన అన్నగారికి; వేఱు వేఱ= విడివిడిగా; చూపెన్= ప్రదర్శించాడు.

తాత్పర్యం: 'దేవతలు బహూకరించిన అస్త్రాలు, అవి ఉపయోగించే తీరుతెన్నులు మాకు చూపుము' అని ధర్మరాజు అర్జునుడిని అడిగాడు. అర్జునుడు దేవతలు తనకు ఇచ్చిన మంత్రబాణాలు, ఆయుధవిశేషాలు తన అన్నగారైన ధర్మరాజుకు విడివిడిగా ప్రదర్శించి చూపాడు.

వ. మఱియును. 92

తాత్పర్యం: ఇంకను.

చ. సురవిశిఖ ప్రయోగములు సూపఁ దొడంగిన నేల దిర్దిరం
దిరిగెఁ, బయోనిధుల్ గలఁగె, దిగ్గజముల్ మదమేది కుందె, భా
స్కరరుచి మాసెఁ, బావకశిఖాతతి తోన యడంగె గాడ్పు, లం
బరమున నిల్చి రీశ్వరుఁడు బ్రహ్మయు నాదిగ వేల్పులందఱున్. 93

ప్రతిపదార్థం: సుర, విశిఖ, ప్రయోగములు= దివ్య మైన అస్త్రాలను ప్రయోగించటాలు; చూపన్+తొడంగినన్= ప్రదర్శించడానికి ఉపక్రమించగా; నేల= భూమి; దిర్దిరన్+తిరిగెన్= వేగంగా తిరుగాడింది; పయస్+నిధుల్= సముద్రాలు; కలఁగెన్= కలతచెందాయి; దిక్+గజముల్= దిక్కులం దుండే ఏనుగులు; మదము+ఏది= గర్వం ఉడిగి; కుందెన్= క్రుంగిపోయాయి; భాస్కరరుచి= సూర్యుడి ప్రకాశం; మాసెన్= తగ్గిపోయింది; పావక, శిఖా, తతి= అగ్నిహోత్రుడి జ్వాలల సముదాయం; తోన= వెనువెంటనే; గాడ్పులు= వాయువులు; అడంగెన్= అణగారి పోయాయి; ఈశ్వరుఁడు= శివుడు; బ్రహ్మయున్= బ్రహ్మదేవుడు; ఆదిగ, వేల్పులు= మొదలైన దేవతలు; అందఱున్= అందరును; అంబరమునన్= ఆకసంలో; నిల్చిరి= నిల్చున్నారు.

తాత్పర్యం: అర్జునుడు తాను సంపాదించిన దివ్యాస్త్రాలప్రయోగాలను అన్నగా రైన ధర్మరాజుకు చూపేటప్పుడు భూమి దిర్దిర తిరిగింది. సముద్రాలు ఘూర్ణిల్లాయి, దిగ్గజాలు గర్వం వీడి క్రుంగిపోయాయి. సూర్యుడికాంతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మాసిపోయింది, వాయువులు అగ్నిజ్వాలలతోపాటే అణగారిపోయాయి. శివుడు, బ్రహ్మదేవుడు మున్నగుదేవతలందరు ఆకసంలో గుమిగూడి నిల్చారు.

వ. అంత సురగణచోదితుం డైన నారదుం డర్జునుపాలికి వచ్చి యి ట్లనియె. 94

ప్రతిపదార్థం: అంతన్= అంతట; సుర, గణ, చోదితుండు+ఐన= దేవతలసమూహాలచేత పంపించబడిన; నారదుండు= నారదుడు; అర్జును, పాలికిన్= అర్జునుడికడకు; వచ్చి= ఏగుదెంచి; ఇట్లు+అనియెన్= ఆవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అంతట దేవతలచేత పంపబడిన నారదమహర్షి అర్జునుడి దగ్గరకువచ్చి ఇట్లా పలికాడు.

తే. 'ఎదురు లేక దివ్యాస్త్రంబు లిట్లు నీకుఁ । బాడియే ప్రయోగింపంగఁ బాండుపుత్త్ర!
సిద్ధ మివి యధిష్ఠానవర్జితము లయ్యె । నేని మూఁడులోకములు దహించు నొగిని.' 95

ప్రతిపదార్థం: ఎదురు లేక= శత్రువులు ఎదుట లేకుండగా; దివ్య+అస్త్రంబులు= దేవతామహిమ కల మంత్రబాణాలను; ఇట్లు= ఈ రీతిగా; ప్రయోగింపంగన్= విడుచుట; నీకున్+పాడియే= నీకు న్యాయమా; పాండు పుత్త్ర!= పాండురాజుకు కొడుకు వైన ఓ అర్జునా!; ఇవి= ఈ అస్త్రాలు; అధిష్ఠాన, వర్జితములు+అయ్యెనేని= ఆశ్రయించతగిన లక్ష్యాలు లేకపోతే; ఒగిని= వరుసగా; మూఁడులోకములు= మూడులోకాలను; దహించున్= తగులపెట్టగలవు; సిద్ధము= ఇది జరిగితీరేది.

తాత్పర్యం: 'పాండుసుతుడ వైన ఓ అర్జునా! ఎదురుగా భేదించలసిన లక్ష్యం లేకుండా ఈ దివ్యాస్త్రాలను ప్రయోగిస్తే, అవి మూడులోకాలను దహించ కలవు సుమా!'

వ. అని యర్జును వారించి నారదుం డరిగిన, నమరులు నిజస్థానంబుల కరిగి; రిట్లు పాండవు లందుఁ బదిమాసంబు లుండునంత; నొక్కనాఁ డమరకన్యకలు వచ్చి యర్జునున కి ట్లనిరి. 96

ప్రతిపదార్థం: అని= అని పలికి; అర్జును వారించి= అర్జునుడిని ఆపి; నారదుండు= నారదుడు; అరిగినన్= వెళ్లగా; అమరులు= దేవతలు; నిజ స్థానంబులకున్= తమనివాసాలకు; అరిగిరి= వెళ్ళారు; ఇట్లు= ఈ రీతిగా; పాండవులు= పాండురాజుకొడుకులు; అందున్= ఆ ఆశ్రమంలో; పది, మాసంబులు+ఉండునంతన్= పదినెలలు నివసించిన పిదప; ఒక్క, నాఁడు= ఒక దినమున; అమర కన్యకలు= వేల్పుల ఆడపడుచులు; వచ్చి= అరుదెంచి; అర్జుననకున్= అర్జునుడితో; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: అని పలికి, అర్జునుడిని అస్త్రప్రదర్శనం నుండి విరమింపజేసి నారదుడు వెళ్ళాడు. దేవతలుకూడ తమతమ నివాసస్థానాలకు వెళ్ళారు. అంత పాండవులు ఆ ఆశ్రమంలో పదినెలలు ఉన్నారు. అప్పుడు వేల్పులఆడపడుచులు అర్జునుడికడకు వచ్చి ఇట్లా పలికారు.

తే. 'వనమునందును బంద్రెండువత్సరములు । నలయ కజ్ఞాతవాస మేకాబ్దకంబు
పూని నిర్విఘ్నవృత్తిఁ జల్పుదురు మీరు । పగఱ నిర్జింతు రాహవాభ్యంతరమున. 97

ప్రతిపదార్థం: మీరు; వనమునందును= అరణ్యంలో; పంద్రెండు, వత్సరములున్= పండ్రెండుఏండ్లు; అలయక= శ్రాంతిచెందక; అజ్ఞాత వాసము= ఇతరులకు తెలియకుండ నివసించటం; ఏక+అబ్దకంబు= ఒక్కఏడు; పూని= దీక్షతో; నిర్విఘ్న, వృత్తిన్=

ఆటంకాలు లేనట్లుగా; చల్పుదురు= నిర్వహించగలరు; ఆహవ+అభ్యంతరమునన్= యుద్ధంలో; పగఱ= శత్రువులను; నిర్జింతురు= జయిస్తారు.

తాత్పర్యం: అడవిలో పన్నెండేండ్లున్నూ, ఇతరులకు తెలియరాకుండ అజ్ఞాతవాసంలో ఒక యేడున్నూ మీరు ఎట్టి అడ్డంకులు లేకుండ నిర్వహించగలుగుతారు. అటుపిమ్మట యుద్ధంలో శత్రువులను జయించగలరు.

తే. నీ పరాక్రమబలమున నిఖిలధరణి । రాజ్యభారంబు నీ ధర్మరాజు పూను;
రఘుకులాధీశ్వరుం డైన రాముకీర్తి । యట్ల నీ కీర్తి త్రిజగంబులందుఁ బరఁగు.' 98

ప్రతిపదార్థం: నీ, పరాక్రమ, బలమున= నీ శౌర్యవిశేషంచేత; నిఖిల, ధరణి= సమస్త పృథివియొక్క; రాజ్యభారంబున్= పరిపాలించే కార్యపు బరువును; ఈ ధర్మరాజు= ఈ ధర్మసుతుడు; పూనున్= వహిస్తాడు; రఘుకుల+అధీశ్వరుండు+ఐన= రఘుమహారాజుయొక్క వంశంలో ప్రభువైన; రాము కీర్తి+అట్లు+అ= శ్రీరామచంద్రుడి యశస్సువలె; నీ, కీర్తి= నీయశస్సు; త్రిజగంబులందున్= మూడులోకాలలో; పరఁగున్= శోభిల్లుతుంది, వ్యాపిస్తుంది.

తాత్పర్యం: నీ శౌర్యవిశేషంవలన ఈ ధర్మరాజు సమస్తభూసామ్రాజ్యాన్ని పరిపాలించే భారాన్ని వహిస్తాడు; రఘువంశంలో జన్మించిన ప్రభువగు ఆ రామచంద్రుడి కీర్తివలె నీ కీర్తి ముల్లోకాలలో వెలుగొందుతుంది.

వ. అని యాదేశించి దేవకన్యకలు వోయిన, నిట దేవర్షి యైన రోమశుండు ధర్మరాజునకు ధర్మానుశాసనంబు సేసి దివంబున కరిగె; నంతఁ బాండవు లెప్పటియట్ల ఘటోత్కచసేనానీతు లై క్రమ్మఱి వృషపర్వునివాసంబు సూచుచు బదరీవనంబున నొక్కరాత్రి వసియించి, సుబాహుపురంబునకు వచ్చి యందుఁ దమ పరిచారకు లైన యింద్రసేనాదులం గూడి నిజరథారూఢు లై ఘటోత్కచుం బోవం బనిచి హిమవత్పర్వతంబునందు దేవర్షి బ్రహ్మర్షులయజ్ఞప్రదేశంబుల ననేకవిధయూపంబులు సూచుచు నొక్కవర్షం బుండి; రంత నొక్కనాఁడు.99

ప్రతిపదార్థం: అని+ఆదేశించి= అని తమ అభిమతాన్ని తెలిపి; దేవకన్యకలు= వేల్పుపడుచులు; పోయినన్= వెడలిపోగా; ఇట= ఇచట; దేవ+ఋషి+ఐన= దేవతలముని అయిన; రోమశుండు= రోమశుడు; ధర్మరాజునకున్= ధర్మపుత్రుడికి; ధర్మ+అను శాసనంబు+చేసి= ధర్మాన్ని గూర్చిన విషయాలను ఆదేశించి; దివంబునకు= స్వర్గలోకానికి; అరిగెన్= వెళ్ళాడు; అంతన్= అంతట; పాండవులు= పాండురాజుసుతులు; ఎప్పటి+అట్లు+అ= యథాప్రకారంగా; ఘటోత్కచ, సేనా+ఆనీతులు+ఐ= ఘటోత్కచుడి యొక్క సేనచేత మోసికొని రాబడిన వారై; క్రమ్మఱి= వెనుకకు మరలి పయనించి; వృషపర్వు, నివాసంబు+ చూచుచు= వృషపర్వుడి ఆశ్రమాన్ని దర్శిస్తూ; బదరీవనంబునన్= బదరికాశ్రమంలో; ఒక్క, రాత్రి= ఒకరేయి; వసియించి= ఉండి; సుబాహుపురంబునకున్= సుబాహుడి రాజధానికి; వచ్చి= విచ్చేసి; అందున్= అచట; తమ, పరిచారకులు+ఐన= తమసేవకులు అయిన; ఇంద్రసేన+ఆదులన్+కూడి= ఇంద్రసేనుడు మున్నగువారలను చేరి; నిజరథ+ఆరూఢులు+ఐ= తమ తేరులను ఎక్కినవా రై; ఘటోత్కచున్+పోవన్+పనిచి= ఘటోత్కచుడిని పొమ్మని ఆదేశించి; హిమవత్+పర్వతంబునందు= హిమాలయపర్వతంలో; దేవ+ఋషి, బ్రహ్మ+ఋషుల= దేవతల ఋషులయొక్కయు, బ్రహ్మజ్ఞానులయిన మునులయొక్కయు; యజ్ఞప్రదేశంబులన్= యజ్ఞాలు చేసిన చోట్లలో; అనేకవిధ యూపంబులు= పెక్కు విధాలైన బలి కంబాలు; చూచుచున్= దర్శిస్తూ; ఒక్క, వర్షంబు= ఒక యేడు; ఉండిరి= నివసించారు; అంత= అంతట; ఒక్కనాఁడు= ఒక రోజున.

తాత్పర్యం: అని తమఅభిప్రాయాలు వెలిబుచ్చి వేల్పుపడుచులు వెళ్ళారు. ఇచట దేవఋషి అయిన రోమశుడు ధర్మరాజుకు ధర్మప్రబోధం చేసి స్వర్గలోకానికి చేరాడు. అంతట పాండవులు యథాప్రకారం ఘటోత్కచుడిసేనలతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాటు తిరుగుపయనం చేసి వృషపర్వుడి ఆశ్రమాన్ని సందర్శించి, బదరికాశ్రమంలో ఒకరేయి వసించి, సుబాహుపురానికి వచ్చి, అచట తమసేవకు లైన ఇంద్రసేనాదులను కలిసి, తమ రథాలను ఎక్కి, ఘటోత్కచుడిని వీడ్కొల్పారు. తదుపరి, హిమాలయపర్వతంలోని, దేవర్షులు బ్రహ్మర్షులు యజ్ఞాలు చేసిన పెక్కుచోట్లలో గల యూపస్తంభాలను చూస్తూ ఒకసంవత్సరం గడిపారు. అంతట ఒకరోజున.

అజగరోపాఖ్యానము (సం. 3-176-5)

క. మృగయార్థ మరిగి హిమవ । న్నగ భూములయందుఁ బవననందనుఁ డొక ప
న్నగుచేతఁ బట్టువడి యి । మ్ముగ ధర్మతనూజుచేత మోక్షితుఁ డయ్యెన్. 100

ప్రతిపదార్థం: మృగయా+అర్థము+అరిగి= వేటకొరకు వెళ్ళి; హిమవత్+నగ, భూములయందున్= హిమాలయపర్వతప్రదేశాలలో; పవన నందనుఁడు= వాయుపుత్రుడు-భీముడు; ఒక=ఒక; పన్నగుచేతన్= పాముచేత; పట్టు+పడి= పట్టుకొనబడి; ఇమ్ముగన్= ప్రీతిగా; ధర్మతనూజుచేతన్= ధర్మపుత్రుడిచేత; మోక్షితుఁడు+అయ్యెన్= విడిపించబడినవాడు అయినాడు.

తాత్పర్యం: వాయుసుతు డైన భీముడు వేటకొరకు వెళ్ళి హిమాలయపర్వత ప్రదేశాలలో ఒక పాముచేత పట్టువడి ధర్మరాజుచేత విడిపించబడినాడు.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 101

తాత్పర్యం: అని చెప్పగా విని జనమేజయుడు వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు.

మధ్యాక్కర.
'పదివేల గజముల బలము గలవాఁడు పౌలస్త్యుతోడఁ
గదనంబు సేసి యనేక యక్షరాక్షసుల నిర్జించి
యుదితశౌర్యోన్నతుం డైనవాఁడు వృకోదరుఁ డేల
పదపడి నిగృహీతుఁ డయ్యెఁ దా నొక్కపన్నగుచేత?' 102

ప్రతిపదార్థం: పదివేల గజముల బలము+కలవాఁడు= పదివేల ఏనుగుల శక్తి కలవాడు; పౌలస్త్యుతోడన్= కుబేరుడితో; కదనంబు+చేసి= యుద్ధం చేసి; అనేక, యక్ష, రాక్షసులన్= పెక్కుమంది యక్షులను రాక్షసులను; నిర్జించి= జయించి; ఉదిత, శౌర్య+ఉన్నతుండు+ఐనవాఁడు= ప్రకటించబడిన పరాక్రమంయొక్క అతిశయంకలవాడు; వృకోదరుఁడు= భీముడు; ఏల= ఎందులకు; పదపడి= మఱియును; తాను; ఒక్కపన్నగుచేతన్= ఒక పాముచేత; నిగృహీతుఁడు+అయ్యెన్= పట్టుపడ్డాడు?

తాత్పర్యం: 'భీముడు పదివేలఏనుగుల బలం కలవాడుకదా! కుబేరుడితో యుద్ధం చేసి పెక్కుమంది యక్షులను రాక్షసులను జయించి, తన పరాక్రమాన్ని తేటతెల్లం చేసినవాడు చివరకు ఒకపాముచేత ఏ రీతిగా పట్టుబడ్డాడు?'

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 2.22 విశేషాంశం చూడండి.

వ. అనిన విని వైశంపాయనుం డి ట్లనియె; భీముం డొక్కండ హిమవదుత్తుంగశృంగోపాంతకాంతారంబుల మృగయాభ్రాంతిఁ బరిభ్రమించుచుండి యతిశ్రాంతుం డయి తత్ప్రదేశంబున. 103

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= జనమేజయుడి ప్రశ్నను విని; వైశంపాయనుండు= వైశంపాయనమహర్షి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు; భీముండు= భీముడు; ఒక్కండు+అ= ఒంటరిగా; హిమవత్+ఉత్తుంగ, శృంగ+ఉపాంత కాంతారంబులన్= హిమాలయపర్వతాలలోని మిక్కిలి ఎత్తయిన శిఖరాల దాపున కల అడవులలో; మృగయా భ్రాంతిన్= వేటతమకంతో; పరిభ్రమించుచు+ఉండి= తిరుగాడుతూ ఉండి; అతి, శ్రాంతుండు+అయి= మిక్కిలి డస్సినవాడై; తద్+ ప్రదేశంబునన్= ఆ చోటున.

తాత్పర్యం: అని జనమేజయుడు ప్రశ్నించాడు. అతడికి వైశంపాయనుడు ఈ రీతిగా సమాధానం చెప్పాడు. భీముడు ఒంటరిగా హిమాలయ పర్వత శిఖరాల దాపున గల అడవులలో వేటతమకంతో ఇటునటు తిరుగాడుతూ మిక్కిలి డస్సి, ఒకచోట.

మ. అశనాశావివృతాస్యగహ్వరుఁ, గృతాంతాకారు, నిశ్వాస ధూ
మశిఖాధూసరితోగ్రదుర్గతరుగుల్మవ్రాతు, హారిద్ర వ
ర్ణశరీరున్, భృశరూక్షదర్శను, మహానాగప్రభుం గాంచె న
ర్ధశశాంకద్యుతి హారిదారుణ చతుర్దంష్ట్రున్ జగత్త్రాసకున్. 104

ప్రతిపదార్థం: అశన+ఆశా+వివృత+ఆస్యగహ్వరున్= ఆహారంకొరకై కోరికచేత తెరువబడిన నోరు అనెడిగుహ కలవాడిని; కృతాంత+ఆకారున్= యముడివంటి ఆకృతి కలవాడిని; నిశ్వాస, ధూమ, శిఖా, ధూసరిత+ఉగ్ర, దుర్గ, తరు, గుల్మ, వ్రాతున్= నిట్టూర్పులనెడి పొగలసెగలచేత బూడిదరంగుగా చేయబడిన భయంకరమై దట్టమై చొరసాధ్యంకానివి అయిన చెట్లు, పొదలు కలవాడిని; హారిద్రవర్ణ శరీరున్= పసుపురంగుదేహం కలవాడిని; భృశ, రూక్ష, దర్శనున్= మిక్కిలికరకైన చూపులు కలవాడిని; అర్ధ, శశాంక, ద్యుతి, హారి, దారుణ, చతుర్+దంష్ట్రున్= చంద్రవంక వెలుగును హరించే భయంకరమైన నాలుగుకోరలు కలవాడిని; జగత్+త్రాసకున్= ప్రపంచానికి భీతి కొలిపేవాడిని; మహానాగప్రభున్= గొప్పపాపరేనిని; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: భీముడు ప్రపంచానికి భీతికొలిపే కొండచిలువను చూచాడు. ఆ అజగరం ఆహారంకొరకైన కోరికతో నోరు తెరిచిఉన్నది. ఆనోరు గుహవలె ఉన్నది. ఆ పాముఆకృతి యముడివలె ఉన్నది. ఆ పాము తన నిట్టూర్పులనుండి వదలిన పొగలచేత ఆ అడవిలోని దట్టమైన చెట్లను, పొదలను భయంకరమైన బూడిదరంగుగలవానినిగా మార్చివేసింది. ఆ పాము శరీరచ్ఛాయ పసుపురంగుగా ఉంది, ఆ పాము చూపులు మిగుల కరకుగా, భీకరంగా ఉన్నాయి. ఆ పాపరేనికి చంద్రవంక కాంతులను మించిన నాలుగువంకర కోరలు ఉన్నాయి.

వ. అమ్మహాజగరం బామిషార్థి యై భీముం బట్టికొని వాని భుజయుగంబుఁ దనముఖంబున నంగంబు నిజాంగంబునఁ జిక్కం బంధించిన నాగాయుతబలుం డయ్యును తదంగసంగంబున దుర్బలుండై మెలంగనేరక భీముం డప్పాము బలవీర్యంబులకు విస్మితుం డయి 'యిది ప్రకృతిసర్పంబుగా; దెయ్యదియేనియు నొక్కయద్భుతరూపం' బని విచారించుచు దాని కిట్లనియె. 105

ప్రతిపదార్థం: ఆ+మహా+అజగరంబు= ఆగొప్ప కొండ చిలువ; ఆమిష+అర్థి+ఐ= మాంసాన్ని (ఆహారంకొరకై) కోరెడిదై; భీమున్= భీముడిని; పట్టికొని= బంధించి; వాని, భుజ, యుగంబున్= ఆతడి రెండు భుజాలను; తన, ముఖంబునన్= తన నోటితో; అంగంబున్= (అతని) శరీరాన్ని; నిజ+అంగంబునన్= తన దేహంతో; చిక్కన్+బంధించినన్= గట్టిగా చుట్టిపట్టగా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నాగ+ఆయుత, బలుండు+అయ్యును= పదివేల ఏనుగులతో సమానమైన బలం కలవాడు అయినప్పటికిని; తద్+అంగ, సంగంబునన్= ఆ పాము శరీరంయొక్క కలయికచేత; దుర్బలుండు+ఐ= బలంపోయినవాడై; మెలంగనేరక= కదలజాలక; భీముండు; ఆ+పాము, బల, వీర్యంబులకున్= ఆ పాముయొక్కబలానికీ, శౌర్యానికీ; విస్మితుండు+ఐ= అచ్చెరువు పొందినవాడై; ఇది= ఇది (ఈపాము); ప్రకృతి, సర్పంబు+కాదు= సహజమైన పాము కాదు; ఎయ్యది+ఏనియున్= ఏదియో; ఒక్క+ అద్భుతరూపంబు+అని= ఒక వింత ఆకృతి అని; విచారించుచున్= తలపోస్తూ; దానికిన్= ఆ పాముకు, ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ గొప్ప పెనుబాము మాంసాన్ని తనకు ఆహారంగా కోరి భీముడిని పట్టుకొని అతడి రెండు భుజాలు తన ముఖంతోను, అతడి శరీరాన్ని తన శరీరంతోను బంధించింది. భీముడు పదివేల యేనుగుల బలంగలవాడే అయినా, ఆ పాముచేత చుట్టుకొనబడిన శరీరం గలవాడై, కదలజాలక, దాని బలానికీ శౌర్యానికీ అచ్చెరువుపడి, అది సహజమైన సర్పం కాదనీ, ఏదో ఒక అద్భుతమైన ఆకృతి కావచ్చుననీ తలపోసి, ఆ పాముతో ఇట్లా పలికాడు.

మత్తకోకిలము.

'ఏను భీముఁడఁ బాండవేయుఁడ నిద్ధతేజుఁడ ధర్మరా
జానుజుండఁ బిశాచపన్నగయక్షరాక్షసవీరులం
బూని పోరుల నోర్వనోపెడు భూరివీరుఁడ నాగపం
చాననాదులఁ బట్టి వ్రచ్చు ననంతబాహుబలాఢ్యుఁడన్. 106

ప్రతిపదార్థం: ఏను=నేను; భీముఁడన్= భీముడను; పాండవేయుఁడన్= పాండురాజు కొడుకును; ఇద్ధ తేజుఁడన్= పరిశుద్ధమైన ప్రకాశం [పరాక్రమం] కలవాడను; ధర్మరాజు+అనుజుండన్= ధర్మరాజు తమ్ముడను; పిశాచ, పన్నగ, యక్ష, రాక్షస, వీరులన్= పిశాచు లైన పాములైన, యక్షులైన, రక్కసులు అయిన శూరులను; పూని= దీక్షతో; పోరులన్= యుద్ధాలలో; ఓర్వన్+ఓపెడు= జయించగల; భూరి+వీరుఁడన్= గొప్పశూరుడను; నాగ+పంచానన+ఆదులన్= ఏనుగులు, సింహాలు మొదలైనవాటిని; పట్టి= బంధించి, వ్రచ్చు= చీల్చి చంపెడి; అనంత, బాహు, బల+ఆఢ్యుఁడన్= అంతు లేని పరాక్రమశక్తి కలవాడను.

తాత్పర్యం: 'నేను భీముడిని, పాండురాజుకొడుకును, పరిశుద్ధ మైన తేజస్సు కలవాడను, ధర్మరాజుతమ్ముడను, పిశాచపన్నగయక్షరాక్షసవీరులను యుద్ధాలలో జయించజాలిన గొప్పశూరుడను, ఏనుగులు సింహాలు మున్నగు వాటిని పట్టి ముక్కలు చేయగల మితిలేని బాహుబలం కలవాడను.

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.46 విశేషాంశం చూడండి.

ఆ. ఇట్టి నన్నుఁ బట్టి యిప్పాట బంధించు । నట్టి శక్తి యెట్టు లయ్యె నీకు?
నిది నిసర్గశక్తియే? వరదానసం । సిద్ధి యైన యదియె? చెప్పు' మనిన. 107

ప్రతిపదార్థం: ఇట్టి= ఇటువంటి; నన్నున్= నన్ను; పట్టి= పట్టుకొని; ఈ+పాట= ఈరీతిగా; బంధించు+అట్టి శక్తి= కదలకుండ నిగ్రహించే బలం; నీకు; ఎట్టులు+అయ్యెన్= ఏవిధంగా ఏర్పడింది?; ఇది= ఇది; నిసర్గ, శక్తియే= సహజమైనబలమా?; వర, దాన, సంసిద్ధి+ఐన+అదియె= వరాన్ని ఇవ్వటంవలన ఏర్పడినట్టిదా?; చెప్పుము+అనిన= వచించుము- అని అనగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ రీతిగా నావంటిబలవంతుడిని పట్టి బంధించేశక్తి నీకు ఏ విధంగా లభించింది? ఇది నీకు పుట్టుకతో ఏర్పడిన బలమా? లేక, ఏ దివ్యుడి వరంవలననో పొందిన సిద్ధియా, నాకు తెలియ చెప్పుము'- అని ప్రశ్నించాడు.

వ. అదియును దిర్యగ్జాతి యయ్యును దనపూర్వస్మృతి సెడకుండ వరంబుఁ గాంచుటంజేసి వాని కి ట్లనియె.108

ప్రతిపదార్థం: అదియును= ఆ పామును; తిర్యక్+జాతి+అయ్యును= పశుపక్ష్యాదిజాతికి చెందిందే అయినప్పటికీన్నీ; తన, పూర్వ, స్మృతి= తనకు గల పూర్వజన్మజ్ఞానం; చెడకుండన్= చెడక ఉండేటట్లు; వరంబున్+కాంచుటన్+చేసి= వరాన్ని పొందటంచేత; వానికిన్= అతడికి- ఆ భీముడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నది.

తాత్పర్యం: పశుపక్ష్యాదులకోవకు చెందిందే అయినా ఆ పాము తనకు పూర్వజన్మపరిజ్ఞానం ఉండటంచేత, భీముడితో ఇట్లా పలికింది.

క. 'ఇది నా వరలాభంబున । నుదయించినశక్తి; యెట్టియున్నతబలసం
పదు లైన జీవులును నా । కెదిరిచి బలహీను లగుదు రివ్విపినమునన్. 109

ప్రతిపదార్థం: ఇది= నాకు గల ఈ అసాధారణశక్తి; నా, వర, లాభంబునన్= నేను పొందిన వరం వలననే; ఉదయించిన శక్తి= ఏర్పడిన బలం; ఎట్టి= ఎటువంటి; ఉన్నత, బల, సంపదులు+ఐన= గొప్ప శక్తిసంపదలు కల; జీవులును= ప్రాణులుకూడ; ఈ+విపినమునన్= ఈ అడవిలో; నాకు+ఎదిరిచి= నన్ను ఎదిరించి; బలహీనులు= బలంకోలుపోయినవారు; అగుదురు= ఔతారు.

తాత్పర్యం: ఈ అసాధారణ మైన బలం నాకు దివ్యవరంవలననే చేకూరింది; ఎంతటి బలసంపదలు కల ప్రాణులైనా ఈ అరణ్యంలో నన్ను ఎదిరిస్తే బలాన్ని కోలుపోతారు.

ఆ. ఎదురఁ బడినవాని వదలక శార్దూల । శరభసామజాదిసత్త్వతతులఁ
బట్టి తినుచు నున్న యట్టి నా కిప్పుడు । భక్ష్య మైతి వీవు పాండుపుత్త్ర! 110

ప్రతిపదార్థం: ఎదురన్+పడినవానిన్= ఎదురుగా వచ్చినవాటిని; వదలక= విడువక; శార్దూల, శరభ, సామజ+ఆది, సత్త్వ, తతులన్= పెద్దపులులు, శరభాలు (ఎనిమిదికాళ్ళు కల పెద్దమెకాలు), ఏనుగులు మున్నగు జంతువులసముదాయాలను; పట్టి= నిగ్రహించి; తినుచున్+ఉన్న+అట్టి= ఆహారంగా పట్టుకొని తింటున్న; నాకు+ఇప్పుడు= నాకు ఈనాడు; పాండు పుత్త్ర!= పాండురాజు కుమారుడైన ఓ భీమా!; ఈవు= నీవు; భక్ష్యము+ఐతివి= ఆహారంగా దొరికావు.

తాత్పర్యం: పాండురాజు కొమరుడవైన ఓ భీమసేనా! నాకు ఎదురుపడిన జంతువులను అన్నింటిని- పెద్దపులులుకాని శరభాలుకాని ఏనుగులుకాని పట్టి తింటున్న నాకు, ఇప్పుడు నీవు ఆహారంగా దొరికావు.

ఆ. శక్రపదవిఁ బొంది సద్బ్రాహ్మణుల కవ । మాన మేనుఁ జేసి మదము పేర్మి
ననఘ! యిట్టు లైతి నం దొక్క మునివరు । శాపశక్తిఁ దొంటిశక్తి దఱిఁగి.' 111

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓభీమసేనా!; ఏనున్= నేను కూడ; శక్ర పదవిన్= దేవేంద్ర పదవిని; పొంది= ఆర్జించి; మదము, పేర్మిన్= గర్వాతిరేకంచేత; సత్+బ్రాహ్మణులకు= మంచి విప్రులకు; అవమానము= అగౌరవాన్ని; చేసి= కల్పించి; అందున్= అచట- ఆ స్వర్గంలో; ఒక్క, ముని, వరు, శాపశక్తిన్= ఒక ఋషిశ్రేష్ఠుడి శాపం యొక్క ప్రభావం వలన; తొంటి శక్తి= వెనుకటిమహిమ; తఱఁగి= తగ్గి; ఇట్టులు+ఐతిన్= ఈ విధంగా అయినాను.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ భీమసేనా! నేను ఒకనాడు దేవేంద్రపదవిని అధిష్ఠించినవాడను సుమా! అప్పుడు గర్వాతిరేకంతో ఒక విప్రోత్తముడికి అవమానం చేసి, ఆతడి శాప ప్రభావం వలన మునుపటిమహిమ తొలగి ఇప్పుడు ఈ రీతిగా సర్పాన్ని అయినాను.

వ. అని దుఃఖించిన యజగరంబునకు భీముం డి ట్లనియె. 112

ప్రతిపదార్థం: అని= అంటూ; దుఃఖించిన= శోకించినట్టి; అజగరంబునకున్= పెనుబాముతో; భీముండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని అంటూ శోకిస్తున్న పెనుబాముతో భీము డిట్లా అన్నాడు.

క. 'కడుకొని కడుదుఃఖములై । నెడ నుచితమె? యాత్మనింద యెయ్యెడల మనం
బెడలక యేకాకృతి నె । ప్పుడు నుండుట సూవె పురుషు పురుషార్థ మిలన్. 113

ప్రతిపదార్థం: కడుకొని= పూని; కడు దుఃఖములు+ఐన= మిక్కిలిబాధలు కలిగిన; ఎడన్= పట్టున; ఆత్మనింద= తన్ను తాను దూషించుకొనటం; ఉచితమె?= భావ్యమా?; ఇలన్= భూమియందు; ఏ+ఎడల= ఏ పట్టుల నైనా; మనంబు+ఎడలక= మనస్సు విడివడక; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; ఏక+ఆకృతిన్= ఒకే రీతిగా; ఉండుట= ఉండటమే; పురుషు= మనుజుడియొక్క; పురుషార్థము= పురుషుడికి లక్ష్యమైన ప్రయోజనం; చూవె= సుమా!

తాత్పర్యం: 'దుఃఖం సంప్రాప్తమైనప్పుడు తన్ను తాను నిందించుకొనటం భావ్యమా? భూలోకంలో కష్టసుఖాలు దాపురించినప్పుడు మనస్సును ఒకే రీతిగా అదుపులో పెట్టుకొనటమే మనుజులకు పురుషార్థం సుమా!

ధర్మరాజు భీమసేనుని వెదకఁబోవుట (సం. 3-176-40)

వ. పురుషకారంబునంజేసి దైవంబు నివర్తింప నెవ్వ రోపుదు? రేను మహాబలుండ నయ్యును భవద్గృహీతుండ నై యిట్టియవస్థం బొందితి; నాత్మత్యాగంబునకు వగవ; నపహృతరాజ్యానుభోగులై మద్భ్రాతృవరులు దుర్గమంబైన యిప్పర్వతకందరంబునం గ్రుమ్మరుచున్నవారు నన్నుఁ గానక యెంత దుఃఖింతురో యని వగచెద' ననుచున్నంత; నిట ధర్మతనయుండు దీప్తం బైన శివారుతంబు విని యతిశంకితచిత్తుండయి యనంతరంబ తన దక్షిణభుజాస్పందనం బుపలక్షించి మీఁద లగ్గగు నంచు ననుజమధ్యంబున ననిలజుం గానక యర్జునుం గవలను గృష్ణారక్షణార్థంబు నియోగించి ధౌమ్యపురోగమభూసురవరులతో భీము రోయుచుం దదీయపాదతల లలిత హలకులిశ కలశజలజాది లక్షణాలంకృతం బైన పాంసుపథంబునం జని ముందట. 114

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పురుషకారంబునన్+చేసి= మనుషులు చేసే ప్రయత్నంవలన; దైవంబు= విధిని; నివర్తింపన్= మరల్చటానికి; ఎవ్వరు+ఓపుదురు?= ఎవరు సమర్థులు?; ఏను=నేను; మహాబలుండను+అయ్యును= నేను గొప్పబలం కలవాడను అయినప్పటికిని; భవత్+గృహీతుండను+ఐ= నీచేత పట్టుబడినవాడనై; ఇట్టి= ఇటువంటి; అవస్థన్+పొందితిన్= స్థితిని పొందాను; ఆత్మత్యాగంబునకున్= నా వినాశానికి; వగవను= దుఃఖించను; అపహృత, రాజ్య+అనుభోగులు+ఐ= అపహరించబడిన రాజ్యసౌఖ్యాలు కలవారై; మత్+భ్రాతృవరులు= నా సహోదరులు; దుర్గమంబు+ఐన= నడవటానికి వీలుకాని; ఈ+పర్వత, కందరంబునన్= ఈ కొండచరియలో; క్రుమ్మరుచున్నవారు= తిరుగాడుతున్నవారు; నన్నున్+కానక= నేను కన్పించకపోవటంచేత; ఎంత దుఃఖింతురో= ఎంతగా శోకిస్తారో; అని; వగచెదను= దుఃఖిస్తాను; అనుచున్నంతన్= అని చెప్తుతుండగా; ఇట=ఇచట; ధర్మ తనయుండు= ధర్మసుతుఁడు; దీప్తంబు+ఐన= తీవ్ర మైన; శివా రుతంబు= నక్కకూత; విని= ఆలకించి; అతి, శంకిత, చిత్తుండు+అయి= మిక్కిలిసందేహంతో (అశుభశంకతో) కూడిన మనస్సుకలవా డై; అనంతరంబు+అ= అటుపిమ్మట; తన, దక్షిణ, భుజా, స్పందనంబు= తనయొక్క కుడిభుజం అదరటం; ఉపలక్షించి= గమనించి; మీఁదన్= అటుపిమ్మట; లగ్గు+అగున్= శుభం కలుగుతుంది; అంచున్= అంటూ; అనుజ మధ్యంబునన్= తమ్ములమధ్యలో; అనిలజున్+కానక= వాయుపుత్రు డైన భీముడిని కాంచక; అర్జునున్= అర్జునుడిని; కవలను= నకుల సహదేవులను; కృష్ణా, రక్షణ+అర్థంబు= ద్రౌపదిని కాపాడటం కొరకై; నియోగించి= నియమించి; ధౌమ్య, పురోగమ, భూసురవరులతో= ధౌమ్యుడు ముందుగా గల బ్రాహ్మణశ్రేష్ఠులతో; భీము రోయుచున్=భీముడిని వెదకుతూ; తదీయ, పాదతల, లలిత, హల, కులిశ, కలశ, జలజ+ఆది, లక్షణ+అలంకృతంబు+ఐన= ఆతడియొక్క పాదతల మందలి మనోజ్ఞమైన నాగలి, వజ్రాయుధం, కలశం, పద్మం, మున్నగు గుర్తులచేత అలంకరించబడిన; పాంసు పథంబునన్= దుమ్ముకలదారిలో; చని= వెళ్ళి; ముందట= తన ఎదురుగా.

తాత్పర్యం: మానుషయత్నంవలన విధివిలాసాన్ని ఎవరు తప్పించగలరు? నేను గొప్పబలం కలవాడను అయినా నీచేత పట్టుబడితినికదా! ఇట్టి దురవస్థ నాకు ప్రాప్తించినందుకు నేను దుఃఖించను. నేను మరణించటానికి వగవను కాని, రాజ్యాన్ని పోగొట్టుకొని, సుకరంగా నడువ వీలుకాని ఈ కొండ చరియలో తిరుగాడుతున్న నా సోదరులు నన్ను కానక ఎంతగా దుఃఖిస్తూ ఉన్నారో - అని చింతిస్తున్నాను' - అని భీముడు చెప్తుతూ ఉండగా, ఇట ధర్మరాజు తీవ్ర మైన నక్కకూత విని అశుభాన్ని శంకించి బాధపడ్డాడు. కాని అంతలో అతడి దక్షిణభుజం అదిరింది. ముందు కీడు సూచించబడినను, తదుపరి శుభం కలుగగల దని భావించాడు. అపుడు చూడగా తమ్ముల మధ్య భీముడు కన్పించలేదు. అనంతరం ధర్మరాజు ద్రౌపదిని కాపాడటానికై అర్జునుడిని, నకులసహదేవులను నియమించి, తాను ధౌమ్యుడు మున్నగు బ్రాహ్మణులతోపాటు భీముడిని వెదకుతూ బయలుదేరి, భీముడి పాదతలంలో ఉన్న మనోజ్ఞమైన నాగలి, వజ్రాయుధం, పూర్ణకలశం, పద్మం మున్నగు శుభలక్షణాలచేత అలంకరించబడిన దుమ్ముగల దారివెంట వెళ్ళి, తనముందట.

విశేషం: శివారుతం అపశకునంగా, కుడిభుజం అదరటం శుభసూచనగా మహాభారతరచనాకాలంనుండి వస్తున్న విశ్వాసాలు. పాదాలయందు ఉండే హలం, కులిశం, కలశం, పద్మం మున్నగు చిహ్నాలు మహాపురుషలక్షణాలుగా భారతీయ సాముద్రిక శాస్త్రప్రవచనం.

క. గిరిశిఖరాభోగబృహ । త్తరభుజగశరీరవేష్టితశరీరుం డై
భరమునఁ గదలఁగ నేరక । పరమశ్రమ మదర నున్న పవనజుఁ గనియెన్. 115

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: గిరి, శిఖర+ఆభోగ, బృహత్తర, భుజగ, శరీర, వేష్టిత, శరీరుఁడు+ఐ= కొండ శిఖరం వలె పరిపూర్ణమై మిగుల పెద్దదైన ఆ పెనుబాము యొక్క శరీరం చేత చుట్టుకొనబడిన దేహం కలవాడై; భరమునన్= బడలికచేత; కదలఁగ నేరక= కదలజాలక; పరమ, శ్రమము+అడరన్, ఉన్న= మిగుల అతిశయించిన శ్రమతో కూడిఉన్న; పవనజున్= వాయుపుత్రుడైన భీముడిని; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: కొండ శిఖరం వంటి ఆ పెనుబాముయొక్క శరీరంచేత పెనవేయబడిన దేహం కలవాడై మిక్కిలి డస్సిపోయి కదలజాలక ఉన్న భీముడిని ధర్మరాజు చూచాడు.

క. కని యాత్మగతంబున 'ని । య్యనిలజుఁ డొకపాముచేత నవిచేష్టితుఁడై
తన లావు దఱిఁగి ప్రాకృత । జనుక్రియ నిట్లున్నవాఁ డసామర్థ్యమునన్. 116

ప్రతిపదార్థం: కని= చూచి; ఆత్మగతంబునన్= తనలో తాను; ఈ+అనిలజుఁడు= వాయుసుతుఁ డైన ఈ భీముడు; ఒక, పాముచేతన్= ఒక సర్పంచేత; అవిచేష్టితుఁ డు+ఐ= కదలికలేని దేహం కలవాడై; తన, లావు, తఱిఁగి= తన బలం కోలుపోయి; ప్రాకృత, జను, క్రియన్= పామరుడివలె; అసామర్థ్యమునన్= శక్తిలేకుండగా; ఇట్లు+ఉన్నవాఁడు= ఈరీతిగా ఉన్నాడు.

తాత్పర్యం: భీముడిని చూచి ధర్మరాజు తనలో తాను తలపోశాడు: 'ఈ వాయుపుత్రుడు అకటా! ఒక పాముకు చిక్కి కదలికలేనివా డై శక్తిసామర్థ్యాలు కోలుపోయి ఒక సామాన్యమానవుడివలె ఉన్నాడుకదా!

వ. ఇది యేమి యాశ్చర్యంబొ!' యనుచు ననిలజుం జూచి దుఃఖితుం డై ధర్మజుం డయ్యజగరంబున కి ట్లనియె; 'నయ్యా! నీవు సర్పరూపంబుఁ దాల్చిన దైత్యుండవో దేవతవో చెప్పు; మేను యుధిష్ఠిరుండ; ని న్నడిగెద; నిమ్మహాభుజు నాయనుజు నామిషార్థివై పట్టితేని నీకు బుభుక్షానివృత్తి యగునట్లుగాఁ జాలినంత మృగమాంసంబుఁ బెట్టెద; వీని విడువు' మనిన ధర్మరాజునకు నయ్యజగరం బిట్లనియె. 117

ప్రతిపదార్థం: ఇది+ఏమి+ఆశ్చర్యంబొ+అనుచున్= ఇది- అనగా అంతటిబలవంతు డైన భీముడు ఒక పాముకు చిక్కి చేష్టలుదక్కి ఉండటం ఎంతటి వింతయో అని తలపోస్తూ; అనిలజున్+చూచి= వాయుపుత్రు డైన భీముడిని చూచి; దుఃఖితుండు+ఐ= పరితపించినవాడై; ధర్మజుండు= ధర్మతనయుడు; ఆ+అజగరంబునకున్= ఆ పెనుబాముతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అయ్యా!= ఆర్యా!; నీవు=నీవు; సర్ప రూపంబున్+తాల్చిన= పాము ఆకృతిని గైకొన్న; దైత్యుండవో= రాక్షసుడవో; దేవతవో= వేల్పువో; చెప్పుము; ఏను=నేను; యుధిష్ఠిరుండన్= యుధిష్ఠిరుడను; నిన్ను+అడిగెదన్= నిన్ను అర్థిస్తున్నాను; ఈ+మహా, భుజున్= గొప్పపరాక్రమం కల ఈతడిని; నా+అనుజున్= నా తమ్ముడిని; ఆమిష+అర్థివి+ఐ= మాంసాన్ని కోరెడివాడ వై; పట్టితివి+ఏని= నిగ్రహించినట్లయితే; నీకున్=నీకు; బుభుక్షా, నివృత్తి+అగునట్లుగాన్= ఆకలి తీరేటట్లుగా; చాలినంత= సరిపోయినంత; మృగ మాంసంబున్= జంతువులమాంసాన్ని; పెట్టెదన్= సమకూరుస్తాను; వీనిన్= ఇతడిని; విడువుము+అనినన్= విడిచిపెట్టుము అని అడుగగా; ధర్మరాజునకున్= ధర్మతనయుడికి; ఆ+అజగరంబు= ఆ పెనుబాము; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పింది.

తాత్పర్యం: ఇది ఎంతటివింత!' అని తలపోస్తూ ధర్మరాజు వాయుపుత్రుడిని చూచి మిక్కిలి పరితపించి, ఆ పెనుబాముతో ఇట్లా అన్నాడు: 'ఆర్యా! నీవు పాము ఆకృతిలో ఉన్న రక్కసుడవో, దేవతవో చెప్పుము. నేను యుధిష్ఠిరుడను; నిన్ను అర్థిస్తున్నాను, మహాపరాక్రమోపేతు డైన నా తమ్ముడిని నీవు మాంసంకొరకే పట్టుకొంటే, వీడిని విడిచిపుచ్చుము. నీ ఆకలి తీరేటంత మృగమాంసాన్ని నీకు సమకూర్చగలను' అని చెప్పాడు.

సీ. 'వినవయ్య! నహుషుఁడన్ జనపతి నేను మీ। పూర్వజులకు నట పూర్వజుండ;

ననఘ! సుత్రామున కెనయగువాఁడ; నై। శ్వర్యగర్వంబున నార్యవృత్తి

విడిచి వివేకంబు సెడి సహస్రోత్తమ। బ్రాహ్మణధృత మైన బ్రహ్మరథము

నెక్కి బ్రాహ్మణులకు నక్కజం బగు నవ। మానంబు సేసినదాన నాకుఁ

ఆ. గలశభవుఁ డగస్త్యుఁ డలిగి యత్యుగ్రాహి। వగు మటంచు శాప మప్పు డిచ్చె;

మునివరేణ్యశాపమునఁ జేసి యిప్పాట। నవయుచున్నవాఁడ నాఁటఁగోలె. 118

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; వినవయ్యా= ఆలకించుము; ఏను= నేను; నహుషుఁడు+అన్= నహుషుఁడు అనబడే; జనపతిన్= రాజును; మీ పూర్వజులకున్= మీ పితామహప్రపితామహులకు, (మీవంశంలో మీకంటె ముందుపుట్టినవారికి); పూర్వజుండన్= ముందుపుట్టినవాడను; సుత్రామునకున్= దేవేంద్రుడికి; ఎన+అగువాఁడన్= సమానుడను; ఐశ్వర్య గర్వంబునన్= (రాజసప్రవృత్తివలన ఏర్పడిన) ఐశ్వర్య మదంచేతన్; ఆర్య, వృత్తి, విడిచి= పూజ్యులైన వారి ఉత్తమ మార్గాన్ని వీడి; వివేకంబు+చెడి= విచక్షణజ్ఞానం నశించి; సహస్ర+ఉత్తమ, బ్రాహ్మణ, ధృతము+ఐన= వేయిమంది గొప్ప విప్రులచేత పూన్చబడిన; బ్రహ్మరథమున్= జ్ఞానులు మోసే తేరు; ఎక్కి= అధిరోహించి; బ్రాహ్మణులకున్= జ్ఞానులకు; అక్కజంబు+అగు= అచ్చెరువు కొలుపే; అవమానంబు+చేసిన= అగౌరవం చేయగా; దానన్= దానివలన; నాకున్=నాకు; కలశ, భవుఁడు= అగస్త్యుడు- కలశంలో జన్మించిన అగస్త్య మహర్షి; అలిగి= కోపించి; అతి+ఉగ్ర+అహివి+అగుము+అటంచున్= మిక్కిలి భయంకర మైన పాము వు కమ్ము అంటూ; శాపము+అప్పుడు+ఇచ్చెన్= అప్పుడు శాపాన్ని ఇచ్చాడు; ముని, వరేణ్య, శాపమునన్+చేసి= ఋషులలో శ్రేష్ఠుడు అయిన అగస్త్యుడిశాపంచేత; ఈ+పాట= ఈ రీతిగా; నాఁటన్+కోలెన్= ఆ దినంనుండి; నవయుచున్నవాఁడన్= కష్టపడుతూ ఉన్నాను.

తాత్పర్యం: పాపరహితుడ వైన ఓ ధర్మరాజా! నా వృత్తాంతాన్ని ఆలకింపుము. నేను మీ వంశంలో మీకంటె ముందు పుట్టినవారికంటె ముందు పుట్టినవాడను. నహుషుడనే రాజును; దేవేంద్రుడితో సమానుడను; ఐశ్వర్యమదంచేత మంచితనాన్ని కోలుపోయి విచక్షణజ్ఞానం లేకుండ వేయిమంది బ్రాహ్మణులు మోస్తున్న రథాన్ని అధిరోహించి నేను బ్రాహ్మణులను అవమానించాను. కలశంలో జన్మించిన మహానుభావుడగు అగస్త్యమహర్షి కోపించి నన్ను 'మిక్కిలిభయంకర మైన పాము వు కమ్ము' అని శపించాడు. నాటినుండి నేను ఈ దురవస్థ ననుభవిస్తున్నాను.

విశేషం: బ్రహ్మరథం అనగా బ్రహ్మజ్ఞానులు అయిన బ్రాహ్మణోత్తములు సబహుమానంగా మోసేటటువంటి (వహించే) తేరు. ఇట్టి అసాధారణ గౌరవం మహాపురుషులకు మాత్రమే దక్కుతుంది.

వ. విధివిలసితంబు పెర్మి నీ కే మని చెప్పుదు? 119

ప్రతిపదార్థం: విధి, విలసితంబు, పేర్మి= దైవవిలాసంయొక్క అతిశయం; నీకు+ఏమని, చెప్పుదున్?= నీకు నేను ఏ విధంగా వివరించి చెప్పగలను?

తాత్పర్యం: విధివిలాసమహిమను నీకు నేను ఏ విధంగా వర్ణించి చెప్పగలను ?

చ. చదివితి నెల్లవేదములు, సత్క్రియఁ జేసితి నూఱుయజ్ఞముల్,

విదితముగా సురేంద్రపదవీస్థితిఁ బొందితి, దుర్మదంబునం

దుదిఁ బెనుబాము నై యధికదుఃఖుఁడ నైతి సుఖంబు దుఃఖమున్

వదలక చేయుచోట బలవద్విధి కేమి భరంబు సెప్పుమా! 120

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఎల్ల, వేదములు= సమస్తవేదాలను; చదివితిన్= అభ్యసించాను; నూఱు యజ్ఞముల్= నూరు జన్నాలను; సత్+క్రియన్+చేసితి= బాగా నిర్వహించాను; విదితముగాన్= అందరకు తెలిసేటట్లుగా; సుర+ఇంద్ర, పదవీస్థితిన్+పొందితిన్= దేవేంద్రుడిపదవిని అధిష్ఠించాను; దుర్మదంబునన్= చెడుగర్వంచేత; తుదిన్= చివరకు; పెను+పామును+ఐ= పెద్దసర్పంగా మారి; అధిక, దుఃఖుఁడన్+ఐతిన్= మిక్కుటమైన దుఃఖంకలవాడిని అయ్యాను; సుఖంబు, దుఃఖమున్= సుఖాన్నిగాని పరితాపాన్నిగాని; వదలక చేయుచోటన్= విడువక కల్పించేచోట; బలవత్+విధికి= బలమైన దైవానికి; ఏమి భరంబు= ఏమి బరువు; చెప్పుమా!= వచించుమా!

తాత్పర్యం: నేను సమస్తవేదాలను చదివినవాడనే. ఎన్నోపుణ్యకార్యాలు చేసి నూరుయజ్ఞాలు నిర్వహించి, దేవేంద్రపదవిని అధిష్ఠించినవాడనే. కాని, చెడు గర్వంవలన తుదకు ఈ పాముగా మారి నేను ఈ దురవస్థకు లోనుగావలసి వచ్చింది కదా! సుఖదుఃఖాలను యథేచ్ఛగా కల్పించగల బలం దైవానికి ఉన్నది. దైవం చేయలేని పని ఏమి ఉన్నది? చెప్పుము.

వ. **అయ్యగస్త్యుచేత నిట్లు శాపగ్రస్తుండనై శక్రాసనంబువలనం బాసి యిట వచ్చుచునుండి 'మునీంద్రా! నాకుఁ బూర్వస్మృతి సెడకుండను, బలవంతంబు లైన సత్త్వంబులు నన్ను ముట్టునప్పుడ బలహీనంబు లై భక్ష్యంబులు గాను, శాపవిమోక్షంబున కుపాయంబును బ్రసాదింపు' మని కృతాంజలి నై యున్న నాకుం గరుణించి మునివరుండు నా వేడిన వరంబు లిచ్చి వెండియు ని ట్లనియె.** **121**

ప్రతిపదార్థం: ఆ+అగస్త్యుచేతన్= అగస్త్యమునిచేత; ఇట్లు= ఈరీతిగా; శాప గ్రస్తుండను+ఐ= శాపానికి లోనయినవాడనై; శక్ర+ఆసనంబువలనన్+పాసి= దేవేంద్రుడిగద్దె వీడి; ఇట= ఇక్కడకు; వచ్చుచున్+ఉండి= వస్తూఉండగా; ముని+ఇంద్రా!= ఋషులలో గొప్పవాడా!; నాకున్= నాకు; పూర్వ, స్మృతి= పూర్వజన్మజ్ఞానం; చెడక+ఉండను= నశించిపోకుండా ఉండటానికి; బలవంతంబులు+ఐన, సత్త్వంబులు= బలంకలిగిన జంతువులు; నన్నున్= నన్ను; ముట్టునప్పుడు+అ= సమీపించేటప్పుడు; బలహీనంబులు+ఐ= బలంపోయినట్టివై; భక్ష్యంబులుగాను= తినదగినవిగాను; శాప, విమోక్షంబునకున్= శాపానికి విరుగుడు కలగటానికి; ఉపాయంబును= వెరవును; ప్రసాదింపుము+అని= అనుగ్రహించుము అని; కృత+అంజలినై+ఉన్న, నాకున్=దోసిలి యొగ్గి, ఉన్ననాపై; కరుణించి= దయచూపి; మునివరుండు= ఋషులలో శ్రేష్ఠుడు; [అగస్త్యుడు] నా వేడిన= నేను కోరిన; వరంబులు+ఇచ్చి= వరాలు అనుగ్రహించి; వెండియు= మరల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అగస్త్యుడిచేత నేను శపించబడినవాడనై, దేవేంద్రపదవికి దూరమై ఇక్కడకు వచ్చేటప్పుడు నేను ఆ మహర్షిని ప్రార్థించాను. 'ఓమునిశ్రేష్ఠుడా! నేను సర్పజన్మాన్ని ఎత్తిన పిదపకూడ నాకు పూర్వజన్మపరిజ్ఞానం ఉండేటట్లున్నూ, బలం కల జంతువులు నా దరి చేరిన వెంటనే బలం కోలుపోయి నాకు ఆహారంగా అయ్యేటట్లున్నూ, నా శాపం తీరే మార్గాన్నీ అనుగ్రహించుము' అని అంజలి ఘటించాను. ఆ మునీశ్వరుడు నాయందు దయకలిగి నేను వేడిన వరాలు అనుగ్రహించి, మరల ఇట్లా అన్నాడు.

క. **'క్రమమున నీ చేసిన ప్ర । శ్నములకుఁ బ్రత్యుత్తరములు సన్మతి నత్యు**
త్తముఁ డెవ్వఁ డిచ్చు నతనిక । తమునను శాపాంత మగు బుధస్తుత! నీకున్. **122**

ప్రతిపదార్థం: బుధస్తుత!= బుధులచేత పొగడబడినవాడా!; క్రమమున= వరుసగా; నీ, చేసిన, ప్రశ్నములకున్= నీవు అడిగిన ప్రశ్నలకు; సత్+మతిన్= మంచిబుద్ధితో; ప్రతి+ఉత్తరములు= సమాధానాలు; అతి+ఉత్తముఁడు= మిగుల శ్రేష్ఠుడగు; ఎవ్వడు+ఇచ్చున్= ఎవడు చెప్పుతాడో; అతని కతమునను= అతడి కారణంగా; నీకున్= నీకు; శాప+అంతము+అగున్= శాపం తీరిపోతుంది.

తాత్పర్యం: బుద్ధిమంతులచేత పొగడిబడినవాడా! నీవు అడిగిన ప్రశ్నలకు గొప్పబుద్ధితో ఎవ్వడు సరిఅయిన సమాధానాలు చెప్పుతాడో, వాడికారణంగా నీకు శాపం తీరిపోతుంది.

వ. అది దీర్ఘకాలంబునంగాని కా' దనియె; నేనును దద్వచనం బవలంబించి పెద్దకాలం బియ్యడవి నున్నవాఁడ; నేఁడు నీ తమ్ముఁడు నాకు నష్టప్రాప్తం బైన భక్ష్యం బయ్యె; నోపుదేని నా ప్రశ్నములకుఁ బ్రత్యుత్తరంబు లిచ్చి వీని విడిపించుకొ' మ్మనిన ధర్మజుం డి ట్లనియె. 123

ప్రతిపదార్థం: అది= నీ శాప విమోచనం; దీర్ఘకాలంబునన్+కాని= చాలకాలం గడిచినపిమ్మట కాని; కాదు+అనియెన్= జరుగదు అని చెప్పాడు; ఏనును= నేను కూడ; తద్+వచనంబు+అవలంబించి= ఆతడి మాటలను అనుసరించి; పెద్ద కాలంబు= చాలనాళ్ళు; ఈ+అడవిన్= ఈ అడవిలో; ఉన్నవాఁడ= ఉన్నాను; నేఁడు= ఈరోజు; నీ తమ్ముండు= నీ సోదరుడు; నాకు= నాకు; నష్ట ప్రాప్తంబు+ఐన= పోయినది తిరిగి లభించినట్టిదిగా; భక్ష్యంబు+అయ్యెన్= ఆహారం అయినాడు; ఓపుదు(వు)+ఏని= శక్తి ఉంటే, సమర్థుడవైతే; నా ప్రశ్నములకున్= నేను అడిగే ప్రశ్నలకు; ప్రతి+ఉత్తరంబులు= సమాధానాలు; ఇచ్చి=ఒసగి, చెప్పి; వీనిన్= ఈ భీముడిని; విడిపించుకొమ్ము= నానుండి విడుదల చేసికొనుము; అనినన్= అని చెప్పగా; ధర్మజుండు= ధర్మతనయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: నీ శాపవిమోచనం ఎంతోకాలం గడిస్తేకాని జరుగదు'- అని చెప్పాడు. నేను ఆమునీశ్వరుడి మాటలను అనుసరించి, ఈ అడవిలో చిరకాలంనుండి ఉన్నాను. నేడు నీ తమ్ముడు నాకు పోయినవస్తువు లభించినట్లుగా ఆహారంగా లభించాడు. నీకు శక్తి ఉంటే నేను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పి, నీ తమ్ముడిని విడిపించుకొనుము' అని అనగా, ధర్మరాజు ఇట్లా బదులు పలికాడు.

విశేషం: నీ తమ్ముడు దుష్టకాల ప్రాప్తుండై నాకు, నీ తమ్ముడు నాకు లబ్ధకాల ప్రాప్తుండై- అనే పాఠాంతరాలు కొన్ని ప్రతులలో గోచరిస్తున్నాయి.

క. 'నీ యడిగిన యర్థాభి । ప్రాయములకు నుత్తరంబు పరువడిఁ జెప్పన్
ధీయుత! బ్రాహ్మణులకుఁ గా । కాయతమతు లయ్యు నొరుల కవి విషయములే? 124

ప్రతిపదార్థం: ధీయుత!= బుద్ధిమంతుడవైనవాడా!; నీ+అడిగిన= నీవు ప్రశ్నించెడి; అర్థ+అభిప్రాయములకున్= భావవిశదీకరణలకు; ఉత్తరంబు= సమాధానాలు; పరువడిన్+చెప్పన్= తగురీతిగా చెప్పటానికి; బ్రాహ్మణులకున్+కాక= విప్రులకు కాక; ఆయతమతులు+ అయ్యున్= విస్తారమైన బుద్ధికలవారు అయినప్పటికిని; ఒరులకున్= ఇతరులకు; అవి= ఆ ప్రశ్నలకు సమాధానాలు; విషయములే= తెలిసిన) అంశాలా?

తాత్పర్యం: బుద్ధిమంతుడా! నీవు అడిగేప్రశ్నలకు జ్ఞానసంపన్ను లైన బ్రాహ్మణోత్తములు మాత్రమే సరిఅయిన సమాధానాలు చెప్పగలరు. కాని, ఎంతటి తెలివితేటలు ఉన్నవారైనా తదితరులకు అవి తెలిసినఅంశాలు కాగలవా?

విశేషం: మహాభారతంలో 1) నహుషప్రశ్నలు 2) యక్షప్రశ్నలు బహుళప్రచారం పొందినట్టివి. సంక్లిష్టా లైన ప్రశ్నలకు ధర్మరాజు సదుత్తరాలు చెప్పగలిగాడు. అరణ్యవాసంలో ధర్మరాజు గొప్పగొప్పఋషులకడ, విద్వాంసులకడ ఎన్నో వేదాంతవిషయాలను జిజ్ఞాసువు అయి నేర్చుకొన్నాడు. ఒకవిధంగా, ధర్మరాజు పండ్రెండేండ్లు విద్యార్థిగా నిరంతరవిద్యార్జన చేసినట్లు చెప్పవచ్చును. ధర్మరాజు అరణ్యాన్ని వేదాంతవిశ్వవిద్యాలయంగా మార్చుకొన్నాడు. ఈపద్యంలో నన్నయ నిపుణంగా కాకువును నిబంధించి ఆ ప్రశ్నలకు ధర్మజుడు సమాధానాలు చెప్పగలడని భావికథార్థాలను ధ్వనింపచేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మరాజు నహుషప్రశ్నంబులకుఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట (సం. 3-177-13)

వ. అయినను నా నేర్చు విధంబునం జెప్పెద నడుగు' మనిన నజగరం బి ట్లనియె. 125

ప్రతిపదార్థం: అయినను= అయినప్పటికి; నా నేర్చువిధంబునన్= నాకు తెలిసినంతవరకు; చెప్పెదన్; అడుగుము; అనినన్= అని అనగా; అజగరంబు= ఆ కొండచిలువ; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నది.

తాత్పర్యం: అయినప్పటికిని, నాకు తెలిసిన మేరకు నీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పగలను అడుగుము, అని అనగా, ఆ కొండచిలువ ఈవిధంగా అడిగింది.

ఆ. 'ఘనుఁడ! యే గుణములు గలవాఁడు బ్రాహ్మణుం? । డతని కెఱుఁగఁదగినయట్టి వస్తు
వెద్ది? దీని నాకు నెఱిఁగింపు' మనిన ని । ట్లనుచుఁ జెప్పెఁ బాండవాగ్రజుండు. 126

ప్రతిపదార్థం: ఘనుఁడ!= ఓ గొప్పవాడా!; ఏ గుణములు+కలవాఁడు= ఎట్టి లక్షణాలు ఉన్నవాడు; బ్రాహ్మణుండు= విప్రుడు; అతనికిన్+ఎఱుఁగన్+తగిన+అట్టి, వస్తువు+ఎద్ది?= అతడికి తెలియతగిన పదార్థం ఏది?; దీనిన్= దీనిన్; నాకున్= నాకు; ఎఱిఁగింపుము= తెలుపుము; అనినన్= అని అడుగగా; ఇట్లు+అనుచున్= ఈ విధంగా; పాండవ+అగ్రజుండు= పాండవులలో మొదట పుట్టినవాడు అనగా ధర్మరాజు; ఇట్లు+అనుచున్= ఈ విధంగా; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'ఓ గొప్పవాడా! ఏ గుణాలున్నవాడు బ్రాహ్మణుడని అనబడుతాడు? అతనికి తెలియదగిన పరమార్థమేది? ఈ విషయాన్ని సవిస్తరంగా నాకు తెలుపునది' అని కొండచిలువ ప్రశ్నించగా, పాండవులలో అగ్రజుడైన ధర్మరాజు ఈ విధంగా బదులు పలికాడు.

సీ. 'సత్య క్షమా దమ శౌచ దయా తపో । దాన శీలంబు లెందేనిఁ గాన
నగు నట్టి వాఁడు బ్రాహ్మణుఁడు; సుఖంబు దుః । ఖంబు నై నెడ విమోహంబు నొంద
కునికియ వానికి నుత్తమం బగు విద్య' । యనిన 'నీ చెప్పిన గుణము లివియు
క్రియ శూద్రునందుఁ గల్గిన నతం డుత్తమ । ద్విజుఁడు గానేర్చునే? నిజము విడిచి
ఆ. నట్టు లయిన బ్రాహ్మణాదివర్ణవిభాగ । మెట్లు గలుగునయ్య? హీను లధికు
లను వివేక మది యపార్థకం బగుఁగాదె!' యనిన ననియె నంతకాత్మజుండు. 127

ప్రతిపదార్థం: సత్య, క్షమా, దమ, శౌచ, దయా, తపస్+దాన, శీలంబులు= నిజంపలకటం, ఓర్పు, ఇంద్రియ నిగ్రహం, నిర్మలత్వం, కరుణ, తపస్సు, త్యాగం, ఉత్తమ స్వభావం తమ నడవడిలో; ఎందు+ఏని= ఎవనియందు; కానన్+అగున్+అట్టి వాఁడు= కన్పించునో అటువంటివాడు; బ్రాహ్మణుఁడు= విప్రుడు (జ్ఞానంకలవాడు, ఆధ్యాత్మికమైన విజ్ఞత కలవాడు); సుఖంబు దుఃఖంబును+ఐన+ఎడ= సుఖంకాని శోకంకాని ఏర్పడినప్పుడు; విమోహంబున్+ఒందకునికియ= విభ్రాంతిని పొందకుండ ఉండటం; వానికిన్= అట్టివాడికి- అనగా అట్టిజ్ఞాని అయిన ఋజువర్తనం కలిగిన బ్రాహ్మణుడికి; ఉత్తమంబు+అగు, విద్య= గొప్పదైన చదువు; అనినన్= అని అనగా; (ధర్మరాజు చెప్పగా); నీ, చెప్పిన గుణములు= నీవు వచించిన లక్షణాలు; ఇవియున్= ఇవి అన్నియున్నూ; క్రియన్= ఆచరణలో శూద్రునందున్= శూద్రుడియందున అనగా శూద్రకులంతో పుట్టినవాడికి; కల్గినన్= ఉంటే; అతండు= అట్టిశూద్రుడు; ఉత్తమ ద్విజుఁడు+కానేర్చునే= శ్రేష్ఠుడగు బ్రాహ్మణుడు కాగలడా?; నిజము, విడిచినట్టులు+ అయిన= అసలు పుట్టుకకు సంబంధించిన యాథార్థ్యాన్ని వదలి పెట్టితే; బ్రాహ్మణ+ఆది, వర్ణ, విభాగము= విప్రులు మున్నగు కులాల విచక్షణ; ఎట్లు, కలుగున్+అయ్య?= ఏ విధంగా నిర్ణయించటానికి వీలు కలుగుతుంది?; హీనులు= తక్కువవారు; అధికులు= గొప్పవారు; అను= అనెడి; వివేకము= విచక్షణ అది=అది; అపార్థకంబు+అగున్+కాదె= అర్థరహితం కాదా?;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనినన్= అని (నహుషుడు) అడుగగా; అంతక+ఆత్మజుండు= యముడికొడుకు, ధర్మరాజు; అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'సత్యం, సహనం, ఇంద్రియ నిగ్రహం, శుచిత్వం, కరుణ, తపస్సు, త్యాగం, సత్స్వభావం అనే గుణాలు ఎవడి ప్రవర్తనలో ప్రస్ఫుటంగా కన్పిస్తాయో అట్టివాడే బ్రాహ్మణుడు. సుఖం దుఃఖం ఏర్పడే పట్టులలో తాను మోహం పొందక సమబుద్ధితో ఉండగలగటమే బ్రాహ్మణుడు ఆర్జింపతగిన గొప్పచదువు'- అని ధర్మరాజు పలికాడు. అంతట, నహుషుడు 'ఓధర్మరాజా! నీవు బ్రాహ్మణత్వం సత్ప్రవర్తనవలన సద్గుణాలవలన మాత్రమే సంప్రాప్తిస్తుందని పలుకుతున్నావు. అట్లయితే, నీవు పేర్కొనిన ఆ సద్గుణాలు, ఆ సత్ప్రవర్తన శూద్రకులంలో పుట్టినవాడిలో కన్పిస్తే ఆతడిని బ్రాహ్మణుడు అని చెప్పగలవా? అపార్థం కలుగకుండ వివరించవలసింది'- అని ఎదురు ప్రశ్న వేయగా ధర్మరాజు ఇట్లా తెలిపాడు.

విశేషం: ప్రాచీనభారతీయసాహిత్యంలో సంఘంలో బ్రాహ్మణుడికి విశేషప్రతిపత్తి ఉండేది. బ్రాహ్మణుడు అనగా బ్రహ్మజ్ఞానాన్ని ఆర్జించేవాడు. ఎవడు బ్రాహ్మణుడు? మహాభారతంలో రెండుతావుల గ్రుచ్చి గ్రుచ్చి వేయబడింది ఈ ప్రశ్న. (ఈ ప్రశ్నే యక్షప్రశ్నలలోకూడ ఉన్నది). బౌద్ధవాఙ్మయంలో బుద్ధుడి ప్రబోధంగా పేరొందిన ధమ్మపదంలో ఒక అధ్యాయం ఈ ప్రశ్నకు సమాధానంగా ప్రత్యేకించబడింది. బ్రాహ్మణత్వం జన్మచేతమాత్రమే లభించదు- అనే విషయాన్ని 'ద్విజ' శబ్దం నొక్కి చెప్పుతున్నది. ద్విజుడు- అనగా రెండుపుట్టుకలు కలవాడు. ఒక పుట్టువు ప్రాకృతజన్మం; జ్ఞానసముపార్జనపిమ్మట లభించేది రెండవజన్మం. (యక్షప్రశ్నలనుకూడ పరికించండి).

వ. 'ప్రమాదంబున వర్ణసంకరం బయినప్పుడు వర్ణ పరీక్షార్థంబుగా బ్రాహ్మణాదులకు వృత్తంబు వేఱువేఱ స్వాయం భువుం డైన మనువు సెప్పె; సత్యాదిగుణంబులు శూద్రునందుఁగలిగెనేని వాఁడు సచ్ఛూద్రుండుఁగాక బ్రాహ్మణుండు గానేర్చునే? యవి బ్రాహ్మణునందు లేనినాఁడు శూద్రుం డనంబడుఁ గావున వృత్తంబ యుత్తమంబు. 128

ప్రతిపదార్థం: ప్రమాదంబునన్= ఆకస్మికమైన వైపరీత్యాలు ఏర్పడినప్పుడు; వర్ణ, సంకరంబు+అయినప్పుడు= కులాలు కలిసిపోయిన సమయంలో; వర్ణపరీక్షా+అర్థంబుగాన్= కులాలను పరీక్షించి నిర్ణయించటం కొరకై; బ్రాహ్మణ+ఆదులకున్= విప్రులు మున్నగువారలకు; వృత్తంబు= శీలం; వేఱు వేఱ= వివిధరీతులలో; స్వాయంభువుండు+ఐన, మనువు= స్వాయంభువ మనువు; చెప్పెన్= నిర్ణయించాడు; సత్య+ఆది, గుణంబులు= సత్యం మున్నగు లక్షణాలు; శూద్రునందున్= శూద్రకులాలలో జన్మించినవాడియందు; కలిగెన్+ఏని= ఉన్నట్లయితే; వాఁడు= అట్టి శూద్రుడు; సత్+శూద్రుండున్+కాక= మంచిశూద్రుడు అని చెప్పదగునుకాని; బ్రాహ్మణుండు+కానేర్చునే= బ్రాహ్మణుడు కాగలడా?; అవి= ఆ సత్యాది సద్గుణాలు; బ్రాహ్మణునందున్= విప్రుడియందు; లేనినాఁడు= ఉండని సందర్భంలో; (అతడు) శూద్రుండు+అనంబడున్= శూద్రుడే అనబడతాడు; కావునన్= కాబట్టి; వృత్తంబు+అ= ప్రవర్తనమే; ఉత్తమంబు= గొప్పది.

తాత్పర్యం: ప్రమాదాలు సంభవించి వర్ణసాంకర్యం ఏర్పడినప్పుడు కులాలను నిర్ణయించటానికై వేరువేరు ప్రవర్తనలను, గుణాలను స్వాయంభువమనువు నిర్ణయించి చెప్పాడు. సత్యం మున్నగు మంచి లక్షణాలు శూద్రకులంలో జన్మించినవాడిలో ఉన్నప్పుడు అతడు మంచిశూద్రుడు కాగలడుకాని బ్రాహ్మణుడు కాగలడా? అట్టి సద్గుణాలతో కూడిన సత్ప్రవర్తన బ్రాహ్మణకులంలో పుట్టినవాడిలో లేనియెడల, అట్టివాడు శూద్రుడు అని చెప్పక తప్పదు. కాబట్టి సత్ప్రవర్తనే గొప్పది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. వృత్తవంతుండు వెండియు వివిధగతుల । వృత్తవంతుండు గా నేర్చు; వృత్తహీనుఁ
డైనవాఁడు విహీనుండ యండ్రు గాన । విత్తరక్షకుఁ గడు మేలు వృత్తరక్ష. 129

ప్రతిపదార్థం: వృత్తవంతుండు= మంచినడవడి కలవాడు; వెండియున్= మరల; వివిధగతులన్= పెక్కుభంగుల; వృత్తవంతుండు+కానేర్చున్= సౌశీల్యవంతుడు కాగలడు; వృత్త, హీనుఁడైనవాఁడు= సత్ప్రవర్తన లేనివాడు; విహీనుండు+అ= ఏమీ లేనివాడే; అండ్రు= అని అంటారు; కానన్= కాబట్టి; విత్తరక్షకున్= ధనాన్ని రక్షించుకొనటంకంటె; వృత్తరక్ష= నడవడిని కాపాడుకొనటమే; కడు= మిక్కిలి; మేలు= శుభం.

తాత్పర్యం: మంచినడవడి కలవాడు, మరల మరల పెక్కుభంగుల తన సౌశీల్యాన్ని కాపాడుకొనగలడు. సత్ప్రవర్తన లేనివాడు, ఎన్నటికిని లేనివాడే. ధనాన్ని కాపాడుకొనటంకంటె తన సౌశీల్యసత్ప్రవర్తనలు కాపాడుకొనటమే మేలు.

విశేషం: 'వృత్తవంతుండు..... వృత్తహీనుఁడు' - అనే పై పంక్తికి 'విత్తహీనుండు వెండియు వివిధ విధుల విత్తవంతుండు గానేర్చు వృత్తహీనుఁ'- అనే పాఠాంతరం కొన్ని ప్రతులలో కనబడుతున్నది.

వ. అనిన నజగరం బి ట్లనియె. 130

తాత్పర్యం: అని ధర్మరాజు పలుకగా ఆ కొండచిలువ ఈ విధంగా అన్నది.

తే. 'అప్రియంబుఁ జేసియు మఱి యనృతవాది । యయ్యు హింస గావింపని యమ్మహాత్ముఁ
డేఁగు సుగతికి నం; డ్రది యె ట్లహింస । యనఘ! యింత విశేష మెట్లయ్యె చెపుమ!' 131

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైనవాడా!; అప్రియంబున్+చేసియు= ఇతరులకు ప్రీతి కలిగించని పనులు- అనగా అపకారాలు చేసికూడా; మఱి; అనృతవాది+అయ్యున్= అసత్యాలు పలికినవాడు అయినప్పటికిని; హింస, కావింపని= హింసను చేయని; ఆ+మహాత్ముఁడు= ఆ మహనీయుడు; సుగతికిన్= పుణ్యలోకానికి; ఏఁగున్= వెళ్ళుతాడు; అండ్రు= అని అంటారు; అది+ఎట్లు= అని యే రీతిగా సాధ్యపడుతుంది; అహింస= ఇతరులను హింసించ కుండటం; ఇంత విశేషము= ఇతంటి గొప్ప మహిమకలది; ఎట్లు+అయ్యెన్= ఎట్లు కాగలిగింది; చెపుము+అ= వచింపుము.

తాత్పర్యం: పాపరహితుడవైన మహాత్మా! ఇతరులకు అపకారాలు చేసి, అసత్యాలు పలికినప్పటికిని హింస చేయనివాడు పుణ్యలోకాన్ని ఆర్జిస్తాడు అని పెద్దలు చెప్పుతారు. ఇది యెట్లా సాధ్యం? 'అహింస' ఇంతటి పరమధర్మం ఎట్లా అయిందో దయచేసి నాకు వివరించి చెప్పుము.

వ. అనిన ధర్మతనయుం డి ట్లనియె; 'దానంబును బ్రియంబుచేఁతయును సత్యంబును నహింసయు ననునవి నాలుగును సమంబుల యయినను నహింస విశేషం; బెట్లనిన దేవమనుష్యతిర్యగ్యోను లను మూఁడు గతులయందును మనుష్యుండు దానాదిగుణంబులు గలిగి యహింసాపరుం డయిన దేవగతి వడయు; విపరీతవర్తనుండు తిర్యగ్యోనులం బొందు' నని యిట్లు తన చేసినప్రశ్నంబులకు నుత్తరంబులు చెప్పిన ధర్మరాజున కతిప్రీతుం డై భీమసేనుని విడిచి శాపవిముక్తుండై దివ్యరూపంబు సేకొనియున్న నహుషువలన నధ్యాత్మవిద్యారహస్యంబు లిమ్ముగా నెఱింగి యుధిష్ఠిరుండు వృకోదరుం దోడ్కొని నిజాశ్రమంబునకు వచ్చియున్నంత. 132

ప్రతిపదార్థం: అనినన్= (నహుషుడు) ఆ విధంగా చెప్పగా; ధర్మతనయుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; దానంబును= ఇతరులకు త్యాగబుద్ధితో ఇవ్వటం; ప్రియంబుచేఁతయును= ఉపకారం చేయటమున్నూ; సత్యంబునున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిజాన్ని దీక్షగా పలకటమున్నూ; అహింసయున్= భూతదయ కలిగి ఇతర ప్రాణులకు కీడుచేయక పోవటమున్నూ; అనునవి= అనే ధర్మాలు నాలుగున్నూ; సమంబులు+అ= సమానాలే; అయిననున్= అయినప్పటికినీ; అహింస= ఇతరప్రాణులను హింసించకపోవటం; విశేషంబు= గొప్పది; ఎట్లు+అనినన్= అది ఏ విధంగా చెల్లుతుంది అంటే; దేవ, మనుష్య, తిర్యక్+యోనులు= దేవతల యొక్కయు, మానవుల యొక్కయు, జంతువుల యొక్కయు, గర్భాలు; అను మూఁడు గతుల+అందును= అనే టటువంటి మూడు మార్గాలలోనూ; మనుష్యుండు= మనుజుడు; దాన+ఆది+గుణంబులు= దానం మున్నగు లక్షణాలు; కలిగి= కలిగిఉండి; అహింసా, పరుండు+అయినన్= అహింసను దీక్షతో అనుసరించేవాడు అయితే; దేవగతి+పడయు= దేవలోకాన్ని పొందుతాడు- అనగా పునర్జన్మలో దేవతలలో ఒకడుగా జన్మిస్తాడు; విపరీత, వర్తనుండు= వ్యతిరేకంగా ఆచరించేవాడు- అనగా హింసాపరుడు అయినవాడు; తిర్యక్+యోనులన్+పొందున్= జంతువులకు పుట్టుతాడు; అని= అంటూ; ఇట్లు= ఈ విధంగా; తన, చేసిన, ప్రశ్నంబులకున్= తాను అడిగిన ప్రశ్నలకు; ఉత్తరంబులు= సమాధానాలను; చెప్పినన్= వచించగా; ధర్మరాజునకు= ధర్మతనయుడికి; అతి ప్రీతుండు+ఐ= మిక్కిలి ప్రేముడి కలవాడై; భీమసేనుని, విడిచి=భీముడిని వదలిపెట్టి; శాప విముక్తుండు+ఐ= శాపంనుండి విడుదల పొందినవాడై; దివ్య, రూపంబు+చేకొని= దేవతల ఆకృతి పొందినవాడై; ఉన్న= ఉండిన; నహుషు వలనన్= నహుషుడిమూలాన; అధ్యాత్మ, విద్యా, రహస్యంబులు= పరలోకాలకు సంబంధించిన జ్ఞానంలోని నిగూఢవిషయాలను; ఇమ్ముగాన్+ఎఱింగి= సంపూర్ణంగా తెలిసికొని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; వృకోదరున్+తోడ్కొని= భీముడిని వెంటపెట్టుకొని; నిజ+ఆశ్రమంబునకు= తన నెలవుకు; వచ్చి+ఉన్నంతన్= చేరిఉండగా.

తాత్పర్యం: అని ఆ కొండచిలువ అనగా, ఈ విధంగా చెప్పాడు; 'దానం, పరోపకారం, సత్యం, అహింస- అనేవి నాలుగున్నూ సమానాలైన గొప్పధర్మాలే. అయినను, వాటిలో 'అహింస' మిక్కిలి గొప్పది. జీవుడు- దేవతలలో మనుజులలో జంతువులలో పునర్జన్మం ఎత్తుతూ ఉంటాడుకదా! అందులో దానదయాది గుణాలు కలవాడై అహింసను దీక్షతో ఆచరించినవాడు దేవజన్మం పొందుతాడు; హింసాపరుడు జంతువుగా జన్మిస్తాడు. దానాది సద్గుణాలు కలిగి అహింసాపరుడైన మనుజుడికి దివ్యత్వం లభిస్తుంది కాబట్టి అహింస పరమధర్మంగా పేర్కొనబడింది' అని చెప్పాడు. అంతట నహుషుడు, ధర్మరాజు చెప్పిన సమాధానాలకు మిక్కిలి ప్రీతిచెందినవాడై భీముడిని విడిచిపెట్టాడు. అప్పుడు నహుషుడికి శాపవిమోచనం ఏర్పడి దివ్యమైన ఆకృతితో నిలిచి, ధర్మరాజుకు పెక్కు ఆధ్యాత్మిక విద్యారహస్యాలను బోధించాడు. అంతట ధర్మరాజు, భీముడిని తోడ్కొని తన నెలవుకు వెళ్ళాడు. అప్పుడు,

క. ఖరకిరణతాపమున నురు । తరదవదాహమున శోషితము లైన వనాం
తరతరుతతి కాప్యాయన । కర మై వర్షాగమంబు కడు బెడఁగయ్యెన్. 133

ప్రతిపదార్థం: ఖర, కిరణ, తాపమునన్= తీక్ష్ణ మైన ఎండవేడిమి వలన; ఉరుతర దవ దాహమునన్= అంతకంటె ఎక్కువఅయి అడవిలో వ్యాపించిన అగ్గివలన; శోషితములు+ఐన= ఎండిపోయిన; వన+అంతర, తరుతతికిన్= అడవిమధ్యలో ఉన్న చెట్లసమూహాలకు; ఆప్యాయనకరము+ఐ= ప్రీతిని కలిగించేదై; వర్షా+ఆగమంబు= వానకాలం రాక; కడు= మిక్కిలి; బెడఁగు+అయ్యెన్= మనోహరమై ఒప్పినది.

తాత్పర్యం: తీక్ష్ణమైన ఎండవేడిమిచేతను, అంతకంటె ఎక్కువవేడిమి కల్పించే దావానలంవలనను అడవిలోని చెట్లు మిక్కిలి ఎండిపోయినవి. అట్టి చెట్ల సముదాయానికి సంప్రీతి ఘటించే వానకాలం మిక్కిలి శుభకరమై ఆహ్లాదకరమై అరుదెంచినది.

క. నాలుగుకెలఁకుల నవఘన । జాలంబులు ప్రేలి కురిసె ఝంఝూనిలవే
గాలోలము లై బహుల । స్థూలపయోధార లోలిఁ దుములంబులుగాన్. 134

ప్రతిపదార్థం: నాలుగు కెలఁకులన్= నాలుగువైపులను; నవ, ఘన, జాలంబులు= క్రొత్తవైన నల్లని మేఘాల గుంపులు; ఝంఝా+అనిల, వేగ+ఆలోలములు+ఐ= పెనుగాలి వీచే వేగంచేత కదలించబడి; బహుల, స్థూల, పయస్+ధారలు= విస్తారమైన పెద్దవైన జడివాన ధారలు; ఓలిన్= వరుసగా; తుములంబులుగాన్= దట్టమైనవిగా; వ్రేలి, కురిసెన్= క్రమ్ముకొని వర్షించాయి.

తాత్పర్యం: నాలుగుదెసలను క్రమ్ముకొని, క్రొక్కారుమొగిలు దొంతరలు తీవ్రమైన పెనుగాలితాకిడిచేత కదల్పబడి, దట్ట మైన జడి వానజల్లులు మిన్ను మన్ను ఆవరించుకొని పెద్ద పెద్ద ధారలుగా వర్షించాయి.

విశేషం: కెలను- ఏకవచనం; కెలఁకులు బహువచనం. 'వ్రాలికురిసె' అనే పాఠాంతరం కొన్ని చోట్ల కనబడుతున్నది.

క. ఘనతరధర్మతమం బొకొ । యనఁగ ఘనాఘనతమిస్ర మవిరళ మై క
ప్పిన జనులకు వస్తువిభా । వన మొక్కొకమాటు గలిగె వైద్యుతరుచులన్. 135

ప్రతిపదార్థం: ఘన, తర, ధర్మ, తమంబు+ఒకొ+అనఁగ= మిక్కిలి గొప్పదైన స్వాభావిక మైన చీకటా అనేటట్లుగా; ఘనాఘన, తమిస్రము= మబ్బులవలన ఏర్పడిన అంధకారం; అవిరళము+ఐ= దట్టమై; కప్పిన= ముసరగా; జనులకున్= ప్రజలకు; వస్తు విభావనము= వస్తువులను గుర్తించకలగటం; వైద్యుత, రుచులన్= మెరపుతీగెల యొక్క వెలుగులచేత; ఒక్కొకమాటు= అప్పుడప్పుడు; కలిగెన్= కలిగింది.

తాత్పర్యం: కురిసేమబ్బులచేత వ్యాపించిన అంధకారం, స్వాభావికంగా ఏర్పడిన దట్టమైన చీకటా అనునట్లుగా మిక్కుటమై కప్పింది. అప్పుడప్పుడు మెరుపులు మెరిసినప్పుడు కలిగే వెలుగుల వలననే జనులకు ఆ చీకట్లలో ఉన్న వస్తువులు కనపడుతూ ఉండేవి.

విశేషం: 'ఘనతరనైశతమంబొకొ' అనేది పాఠాంతరం, అప్పుడు- ఘనతర, నైశ, తమంబు+ఒకొ= మిక్కిలి ఎక్కువైన రేయిచీకటి ఒకొ- అని అర్థం ఏర్పడుతుంది. ఈ పాఠాంతరమే సమంజసంగా కన్పిస్తున్నది. నిశాసంబంధమైనది నైశము.

చ. అరుదుగఁ దత్పయోదసమయంబున నొక్కట విస్తరిల్లె నం
బరమున నంబుదధ్వనియుఁ బల్వలభూముల భూరిదర్దురో
త్కరరవముల్ మహీరుహ శిఖండములందు శిఖండి తాండవాం
తరమదమంజులస్వన ముదారతరం బగుచున్ వనంబునన్. 136

ప్రతిపదార్థం: అరుదుగన్= అచ్చెరువుగా; తద్+పయోద, సమయంబునన్= ఆ వర్షాకాలంలో; ఒక్కట= ఒకేమారుగా; అంబరమునన్= ఆకసాన; అంబుదధ్వనియున్= మేఘాల గర్జనలున్నూ; పల్వలభూములు= నీటిగుంటలు కల చోట్లలో; భూరి, దర్దుర+ఉత్కర, రవముల్= విస్తార మైన కప్పలసముదాయాల బెకబెకలు; మహీరుహ, శిఖండములందు= చెట్లకొసలలో; శిఖండి, తాండవ+అంతర, మద మంజుల, స్వనము= నెమిళ్ళు నృత్యం చేసేటప్పుడు మత్తిల్లి కావించే మనోజ్ఞమైన ధ్వని (క్రేంకారాలు); వనంబునన్= అడవిలో; ఉదారతరంబు+అగుచున్= మిక్కిలి ఒప్పి గొప్పగా శోభిస్తూ; విస్తరిల్లెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: అడవిలో ఆ వర్షాకాలంలో ఆశ్చర్యకరంగా ఆకసంలో మేఘాల గర్జనలున్నూ నేలపై నీటిగుంటలలో కప్పల బెకబెకలున్నూ, చెట్లకొసలపై నర్తించే నెమిళ్ల క్రేంకారరావాలున్నూ ఒకేసారి అంతటా విస్తరించాయి.

విశేషం: అలం: స్వభావోక్తి.

చ. దళిత నవీన కందళ కదంబ కదంబక కేతకీ రజో
మిళితసుగంధబంధుర సమీరణ మన్ సఖి యూచుచుండఁగా
నులియుచు పువ్వుగుత్తులను నుయ్యెల లొప్పఁగ నెక్కి యూఁగె ను
ల్లలదళినీకులంబు మృదులధ్వనిగీతము విస్తరించుచున్. 137

ప్రతిపదార్థం: దళిత, నవీన, కందళ, కదంబ కదంబక కేతకీ, రజస్+మిళిత, సుగంధ, బంధుర, సమీరణము+అన్ సఖి= అప్పుడే వికసించిన మొగ్గలుగల కడిమి చెట్ల పూలగుంపుల వాసనతోనూ, మొగలిపూల పుప్పొడితోమా కలిసిన దట్టమైన పరిమళంతో కూడుకొనిన వాయువు అనే నెచ్చెలి; ఊచుచు+ఉండఁగాన్= ఇటునటు కదలికలు కలిగిస్తూ ఉండగా; ఉలియుచు= ధ్వనిచేస్తూ; పువ్వు, గుత్తులు+అను= పుష్పగుచ్ఛాలు అనే; ఉయ్యేలలు= డోలికలు; ఒప్పఁగన్+ఎక్కి= ఒయారంగా ఎక్కి; ఉల్లలత్+అళినీ కులంబు= విలాసంగా చలిస్తున్న ఆడు తుమ్మెదలగుంపు; మృదుల, ధ్వని, గీతము= మనోహర మైన నినాదం అనే పాటలను; విస్తరించుచున్= వ్యాపింపచేస్తూ; ఊఁగెన్= ఊగెను.

తాత్పర్యం: ఆడు తుమ్మెదలగుంపులు మనోహరమైన పాటలు పాడుతున్నట్లు మెత్తని రొద చెస్తున్నాయి. ఆ ఆడుతుమ్మెదలు పువ్వులగుత్తులు అనే ఊయల లెక్కాయి. ఈ ఊయెలను వాయువు అనే నెచ్చెలి ఊపుతూ ఉన్నది. ఆ వాయువు అరవిచ్చిన కడిమిమొగ్గల పూవులగుంపుల సువాసనలతో, మొగలిపువ్వుల పుప్పొడులతో కలిసిన దట్టమగు పరిమళంతో కూడిఉన్నది.

విశేషం: అలం: రూపకం ఈ పద్యం రెండవ పాదంలో 'సమీరణుఁడన్ సఖుఁ డూచుచుండఁగా' అనే పాఠాంతరం కొన్ని ప్రతుల్లో ఉన్నది.

క. సురచాపచిత్రగగన । స్ఫురణం బురణించునట్లు భూవనిత నిరం
తరచిత్రిత యై యొప్పెను । సురుచిరనవతృణశిలీంధ్రసురగోపములన్. 138

ప్రతిపదార్థం: భూవనిత= భూదేవి; సుర, చాప, చిత్ర, గగన, స్ఫురణన్+పురణించునట్లు= ఇంద్రధనుస్సు బొమ్మతో కూడిన ఆకసాన్ని తలపింపచేస్తున్నట్లుగా; సురుచిర, నవ, తృణ, శిలీంధ్ర, సురగోపములన్= బాగా వెలుగొందే క్రొత్తపచ్చగడ్డితో, పుట్టగొడుగులతో, ఆర్ద్రకీటకాలతో; నిరంతర చిత్రిత+ఐ= సదా రంగురంగుల కూర్పులతో చిత్రించబడినదై; ఒప్పెన్= విలసిల్లింది.

తాత్పర్యం: క్రొత్తగా మొలకెత్తిన పచ్చగడ్డి, పుట్టగొడుగులు, ఆర్ద్రకీటకాలు - వీటియొక్క రంగురంగుల కూర్పుతో సదా ప్రకాశిస్తున్న భూదేవి వన్నె చిన్నెల ఇంద్రధనుస్సుతో వెలుగొందే ఆకాశంవలె విలసిల్లింది. [ఆర్ద్ర - ఆరుద్ర-పురుగు. వానకురిసి నేలతడిగా ఉన్నపుడు కలుగునట్టి పట్టువంటి దేహం గల ఒకపురుగు]

విశేషం: అలం: ఉపమ. భూవనిత అనుచో రూపకం, సమష్టిపై రూపకానుప్రాణితమైన ఉపమ. 'తృణ శిఖీంధ్ర'- అనే పాఠాంతరం కొన్ని ప్రతులలో ఉన్నది.

వ. తత్సమయానంతరంబున. 139

తాత్పర్యం: ఆ వర్షాకాలానికి తరువాత.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. భూసతికిం దివంబునకుఁ బొ ల్పెసఁగంగ శరత్సమాగమం
బాసకల ప్రమోదకర మై విలసిల్లె మహర్షిమండలో
పాసిత రాజహంస గతి భాతి ప్రసన్న సరస్వతీక మ
బ్జాసనశోభితం బగుచు నబ్జజయానముతో సమానమై. 140

ప్రతిపదార్థం: భూసతికిన్= భూదేవికిని; దివంబునకున్= స్వర్గలోకానికి; పొల్పు+ఎసఁగంగన్= అందం చిందులాడేటట్లుగా; శరద్+సమాగమంబు= శరదృతువుయొక్క కలయిక; ఆసకల, ప్రమోదకరము+ఐ= అందరకు ఆనందాన్ని కలిగించేదై; మహర్షి, మండల+ఉపాసిత, రాజహంస, గతి, భాతి= మహర్షులసమూహంచేత ఆరాధించబడిన రాయంచల నడక మాదిరిగా; ప్రసన్న, సరస్వతీకము= నిర్మల మైనసరస్వతితో కూడిన; అబ్జాసన, శోభితంబు= బ్రహ్మదేవుడితో కూడింది; అగుచున్; అబ్జజు, యానముతో, సమానము+ఐ= బ్రహ్మదేవుడివాహన మైన హంసతో సమాన మై; విలసిల్లెన్= ఒప్పారింది.

తాత్పర్యం: సర్వజనులకు సంతోషాన్ని కలిగిస్తూ శరత్తు భూదేవికీ స్వర్గానికీ అందం చిందిస్తూ విలసిల్లింది. శరత్తు, మహర్షుల సమూహంచేత ఆరాధించబడిన రాజహంసల గమనాన్ని స్ఫురింపజేసింది. స్వచ్ఛ మైన సరస్వతితో కూడిన బ్రహ్మదేవుడితో, బ్రహ్మదేవుడివాహన మైన హంసతో సమానమై ఒప్పారింది.

విశేషం: శరత్కాలం తెల్లని వెన్నెలరాత్రులకు సుప్రసిద్ధం. శరదృతువు ఇటు నేలకు అటు నింగికి శోభ చేకూరుస్తుంది; శరదృతువునందే సప్తర్షిమండలం స్ఫుటంగా ఆకసంలో ఉదయించి కన్పిస్తుంది. రాజహంసలు శరత్కాలంలోనే మానససరోవరాన్ని చేరుకొంటాయి. సరస్వతి తెలుపు. ఆమె నామాంతరం శారద. బ్రహ్మదేవుడి వాహనం హంస తెలుపు. అతడు అబ్జజుడు; తామర పువ్వులు శరత్కాలంలో శోభిస్తాయి. అలం : ఉపమ. 'రాజహంస గతిభాసి'- అని పాఠాంతరం కొన్ని ప్రతులలో ఉన్నది.

ఉ. శారదరాత్రు లుజ్జ్వలలసత్తరతారకహారపంక్తులం
జారుతరంబు లయ్యె వికసన్నవకైరవగంధబంధురో
దారసమీరసౌరభము తాల్చి సుధాంశువికీర్యమాణ క
ర్పూరపరాగపాండురుచిపూరము లంబరపూరితంబు లై. 141

నన్నయభట్ట కవిత్వము సంపూర్ణము

ప్రతిపదార్థం: శారదరాత్రులు= శరత్కాలంలోని రాత్రులు; ఉజ్జ్వల, లసత్+తర, తారక, హార, పంక్తులన్= మిక్కిలి ప్రకాశించే నక్షత్రాలతో కూర్చబడిన దండల వరుసలతో; వికసత్+నవ, కైరవ+గంధ, బంధుర+ఉదార, సమీప, సౌరభము, తాల్చి= వికసించిన క్రొత్తతెల్లకలువల ఘాటైన సువాసనతో కూడిన గొప్పదైన గాలి యొక్క పరిమళం వహించి; సుధాంశు, వికీర్యమాణ, కర్పూర, పరాగ, పాండు, రుచి, పూరములు= అంతట వెదజల్లబడిన కప్పురపుపుప్పొడివంటి చంద్రుడియొక్క తెల్లని వెన్నెల వెల్లువలతో; అంబర, పూరితంబులు+ఐ= ఆకసాన్ని నింపినట్టి వై; చారుతరంబులు+అయ్యెన్= మిక్కిలి సుందరాలు అయినవి.

తాత్పర్యం: అవి శరత్కాలంలోని రాత్రులు; మిక్కిలి ప్రకాశమానా లైన నక్షత్ర మాలికలతో కూడిఉన్నవి, వికసించిన కొంగ్రొత్త తెల్లకలువల దట్టమైన సుగంధంతో కూడిన గొప్పగాలి యొక్క పరిమళాన్ని వహించాయి, అంతటా వెదజల్లబడిన కప్పురపుపుప్పొడివలె ఆకసాన్ని అవరించిన చంద్రుడి వెన్నెలవెల్లువలు కలిగి ఆకాశాన్ని నిండుకొని మిక్కిలి సొగసుగా ఉన్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'పూరములం బరిపూరితంబులై' - అనే పాఠాంతరం కొన్ని ప్రతులలో ఉన్నది. ఆరణ్య పర్వానికి సంబంధించిన తాటాకు వ్రాతప్రతులన్నిటిలోనూ ఈపద్యం చివర 'నన్నయభట్టు కవిత్వం సంపూర్ణం'- అనే వ్రాత కనపడుతున్నది. అందువలన విద్వాంసులు అందరు ఇంచుమించుగ ఏకగ్రీవంగా ఈ విషయాన్ని అంగీకరించి ఉన్నారు. ఇక, ఈ పద్యం చివర కొందరు పండితోత్తములు ఒక స్వారస్యాన్ని ఉల్లేఖిస్తున్నారు. నన్నయభట్టు ఇట అసంపూర్ణంగా ఆరణ్యపర్వశేషాన్ని ఎందుకు వదలిపెట్టాడు? ఈ ప్రశ్నకు పలువురు పండితులు పలురీతుల సమాధానాలు చెప్పుతున్నారు. కొందరు నన్నయభట్టు మరణాన్ని, మరికొందరు రాజరాజనరేంద్రుడి మరణాన్ని కారణంగా ఊహిస్తున్నారు. అందరూ అంగీకరించిన విషయం- ఇచట నన్నయమహాకవికవిత ఆగిపోవటం. ఈ పద్యంలోని చివరిపదగుంఫనం- పాండురుచిపూరములు+అంబరపూరితంబులై- అని విరవటానికి బదులు- పాండురుచిపూరములన్+పరపూరితంబులై అని సంధి విశ్లేషించిన, నన్నయ వ్రాసిన చివరిపద్యంలో చివరిమాట 'పరపూరితంబులై' అని ఏర్పడుతున్నది. నన్నయమహాకవి ఇకపై భారతం తాను వ్రాయటం పొసగదు అనిన్నీ, అది పరపూరితం కాక తప్పదు అనిన్నీ సూచించటానికే ఇట్లా వ్రాశాడా? లేక కేవలం యాదృచ్ఛికంగా నన్నయ ఘంటం నుండి అట్టిపదగుంఫనం వెలువడిందా? భవభూతిమహాకవి- ఋషికల్పుల వాక్కులను అర్థం అభిసరిస్తుందని చెప్పి ఉన్నాడు (ఋషీణాం పునరాద్యానాం వాచ మర్థోఽనుధావతి). రాజరాజనరేంద్రుడు నన్నయమహాకవిని మహాభారతాన్ని తెలుగున రచించుమని కోరినప్పుడే, ఆ మహాకవి చెప్పిన సమాధానం అనుశీలించతగింది.

'అమలినతారకాసముదయంబుల నెన్నను సర్వవేదశా
స్త్రముల యశేషసారము ముదంబునఁ బొందను, బుద్ధిబాహు వి
క్రమమున దుర్గమార్థజలగౌరవభారత భారతీసము
ద్రముఁ దఱియంగ నీదను విధాతృన కైనను నేరఁబోలునే.' (ఆది. 1.19)

పైపద్యంలో ఎవ్వరైనా ఒకరు భారతం తుదముట్టవ్రాయజాల రని తెలిపిఉన్నాడు. అందులో ఒక స్వారస్యం ఉన్నది. తనకే కాదు కదా! ఆ పని 'విధాతృన కైనను నేర బోలునే' అన్నాడు. అనగా సాధ్యమైతే కవిబ్రహ్మకు సాధ్యం కావలె. కాని, నన్నయ తనకు పిమ్మట సుమారు రెండువందల సంవత్సరాల తదుపరి పుట్టే కవిబ్రహ్మకూడ మహాభారతాన్ని పూర్తిచేయలే డని చెప్పాడా? కవుల వాక్శుద్ధికి ఎన్నో నిదర్శనాలు పెద్దలు చూపగలరు.

నన్నయమహాకవి మహాభారతం వ్రాసేనాటికి జ్ఞానవయోవృద్ధుడు. రాజరాజనరేంద్రుడు క్రీ.శ. 1022 ఆగష్టు పదునారవ తేదీన పట్టాభిషిక్తు డైనాడు. నందంపూడి శాసనకాలం 4-11-1054 తేదీ సూర్యగ్రహణకాలం; దానగ్రహీత నారాయణభట్టు. ఆయన మహాభారతరచనలో నన్నయభట్టుకు తోడ్పడినట్లు మహాభారతఅవతారికలో ఉన్నది. కావున నన్నయభట్టు మహాభారతరచనలో క్రీ.శ. 1055 సంవత్సరప్రాంతంలో ఆరంభించినట్లు చెప్పటం పూర్వపక్షం లేని సిద్ధాంతం. అంటే రాజరాజనరేంద్రుడు పట్టాభిషిక్తుడైన 32 సంవత్సరాల తరువాత నన్నమాట!

నన్నయభట్టుమహాకవి ఉద్దేశపూర్వకంగానే తాను వ్రాసిన చివరిపద్యంచివర 'పరపూరితంబుగన్' అనే పదగుంఫనం ప్రయోగించినట్లు ఊహించటం బహుశః సత్యదూరం కాదేమో!

ఆరణ్యపర్వ చతుర్థాశ్వాసంలో

నన్నయభట్టు కవిత్వం సంపూర్ణం.

-: ఇది ఆరణ్యపర్వ ప్రథమభాగం :-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపుటము - 4

ఆరణ్యపర్వము

మొదటి భాగము (1,2,3,4 ఆశ్వాసములు)

గద్యపద్య ప్రథమపాద సూచి

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అ		అంత భీమసేనుఁ	523	అంబుదాగమనం బపేక్షించు	322
అంచపిండుతో నదియును	190	అంత సహదేవుండు	518	అక్కథకుండు శౌనకాది	1
అంతం గార్తవీర్యుని	412	అంత సాల్వుండును	76	అక్కథకుండు శౌనకాది	183
అంతం బెద్దకాలంబునకు	425	అంత సాల్వుండును దన	83	అక్కథకుండు శౌనకాది	351
అంతఁ గొంత కాలంబునకు	369	అంత సురగణచోదితుండైన	563	అక్కథకుండు శౌనకాది	527
అంత	40	అంత సూర్యాస్తమయ	160	అక్కాలంబున నీవు	166
అంత	47	అందగ్రజుండయిన	335	అక్కాలంబున రూపం	497
అంత	136	అందఱుఁ జూచుచుండఁగ	365	అక్కుబేరునకు మహామతుల్	536
అంత	140	అందుఁ గృతస్నానులై	293	అక్కురుక్షేత్రశమంత	299
అంత	187	అందుఁ బరమేశ్వరుం బూజించి	296	అక్కేశినిం జూచి	272
అంత	192	అందుఁ బితృతర్పణంబు	301	అక్కోమలియందు	234
అంత	200	అందు జంతునకు నందఱు	442	అక్షముల్ పుష్కరునందు	211
అంత	205	అందు మనోవాక్కాయ	130	అఖిల రాజలోక పరివృతుండయి	57
అంత	231	అందు మునివరుచేతం	411	అగ్నికల్పుఁడై మహాత్ముఁడు	453
అంత	365	అందు రుద్రుఁ బూజసేసి	298	అగ్నిశిఖయుఁబోలె	223
అంత	508	అందు రైభ్యుండు	459	అగ్రజు ననుమతమున	482
అంతకుండు జనుల కాసన్నుఁడై	115	అందులకు ధరణిఁ గల	196	అట ధర్మరాజు భీముండు	534
అంత దమయంతి మేలుకని	218	అందుల జనులు తమోగుణ	500	అట నలుండు దమయంతిం	237
అంత నగస్త్యుండు	338	అందుల మహాతపోధనులకు	402	అట విదర్భాధిపుఁడైన	187
అంతన మూర్ఛ దేఱి	72	అందుల హేమాంబుజ	508	అట విభాండకుండును	388
అంత నయ్యసురులు	552	అందు వజ్రంబున నింద్రుండు	352	అట్టి మదీయ సేనోత్సాహంబును	80
అంత నీశ్వర చోదితుండై	133	అందు విహరించుచున్న	529	అట్టి యందు నీతో నొక్కట	168
అంతనుండియు నమ్మహానుభావు	235	అందు శరీరత్యాగంబు	307	అట్టి యర్థంబువలన	13
అంత నెంతయుం బ్రొద్దునకుఁ	82	అందు సుదేవుండను	246	అట్టి యవసరంబున ద్వారవతి	81
అంత నొక్కనాఁడు	168	అంబర మాత్మదీప్తి	541	అట్టి యవసరంబున యుధిష్ఠిరునకు	176
				అట్టి సంక్షోభంబున	232

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అట్లయిన నక్కోమలి	198
అట్లయిన నీ హయతత్త్వ	259
అ ట్లసంఖ్యాత	78
అట్లు గాడ్పుతోడి వాన	480
అట్లు తనమనోవల్లభయైన	285
అట్లేని నిఖిలలోకపాల	129
అట్లేని నీచేత సత్కారంబుఁ	390
అడరఁగ ధర్మనందనుఁ	22
అడవిఁ దన్నుఁబాసి యరిగిన	257
అడవిలో వస్త్రార్థహారియై	269
అడవులలో నాతోఁ గడు	214
అతండు మన యభిమతంబు	343
అతఁడును రాక్షస సైన్యాన్వితుఁడై	483
అతఁడును సప్తమారుత	558
అతని కిట్టు లనియె	214
అతని చరితంబు సెప్పఁగ	270
అతని పితృదేవతాభక్తికిఁ	289
అతని ప్రలాపంబు విని	243
అతని యున్న విలాసంబు	324
అతి జరారోగభరమున	491
అతిథివై వచ్చి నీవు	520
అతి భీషణ మిది	501
అతిశయితామరోత్తముఁ	25
అతుల తపోవీర్య బలో	475
అతుల బలాఢ్యు నుద్యత	515
అతుల రణాంతరంబున	552
అతులితమై ద్వితీయ	501
అది దీర్ఘకాలంబునం గాని	574
అది ప్రజాపతి యజ్ఞవేది	319
అది మందరనగ మక్కడ	540
అది మొదలుగా నిల్వలుండు	336
అదియు నాక్షణంబ	134
అదియును దన కమ్మనుజేశ్వరుఁ	189
అదియును దిర్యగ్జాతి	568
అదియును మునివరు	341
అదియు వృథయైనఁ బార్థుఁడు	139
అది యెట్లనిన నధర్మ	331
అది యెట్లనిన నిత్యక్షమా	95
అది సనాతన ధర్మసనాథం	498
అది సర్వదోషముల	11
అద్దానవులు దారుణాశ్మ	553
అద్దురాత్ము హృదయమది	91
అధిక దుఃఖరోగార్తున	215
అనఘచరిత్రు నర్జును	473
అనఘ యూర్వశి యిచ్చిన	166
అనఘుండు దాని దవ్వులఁ	133
అనఘుఁడు మంకణుం	305
అనఘుఁడు మైత్రేయుండను	39
అనఘుఁడు శర్యాతి	430
అనఘుని వీతరాగుఁ	414
అనపహార్యంబు తేజోమయంబు	247
అనలాస్త్రమట్లు వక్షముఁ	70
అనలునకు గాడ్పు దోడైన	179
అనవద్య తీర్థసేవనమును	326
అనవద్య వసిష్ఠాశ్రమమున	295
అనవరతము విధియోగంబున	360
అనవరత సౌఖ్యసంపదఁ	93
అనవుడు బృహద్ద్యుమ్ను	470
అనవుడు రాక్షసుం	49
అనిఁ గర్ణశకుని	53
అని కమలసంభవుం	371
అని కఱపి యిట్లందఱుం	516
అని కృతాంజలి యయిన	56
అని గర్వించి పలికిన	360
అని చెప్పిన నాశ్వినులు	430
అని చెప్పిన శమరువలన	334
అని చెప్పి బృహదశ్వుం	287
అని చెప్పి యనిమిష ప్రభుఁ	545
అని చెప్పుచుండఁ బాండవు	541
అని చెప్పుచు నరిగి	458
అని తత్ప్రభావంబు సెప్పి	170
అని తన తొడిగిన	549
అని తమలోఁ బలుకుచున్న	27
అని దీవించి పాంచాల	125
అని దుర్యోధనుం జూచి	42
అని దుఃఖించిన యజగరంబు	569
అని దేవతలు ప్రార్థించిన	361
అని దేవత లెల్ల	359
అని ధర్మతనయు నేకాంత	120
అని ధౌమ్యుండు	20
అనిన	363
అనినం దద్వచనానురూపంబు	370
అనినఁ దనతండ్రియు	471
అనిన గంగాదేవి వచనంబునఁ	381
అనిన దమయంతి	204
అనిని దానికి	230
అనిన ధర్మతనయుం డిట్లనియె	577
అనిన ధర్మతనయుండు మహేంద్రంబున	403
అనిన ధర్మరాజిట్లనియె	96
అనిన నందఱు నగి	208
అనిన నందఱు సంతసిల్లి	475
అనిన నంశుమంతుం	375
అనిన నగస్త్యుండట్ల	364
అనిన నజగరం బిట్లనియె	577
అనిన నట్లేని యందఱుము	515
అనిన నది యప్పుడ	274
అనిన నదియును గూఁతు	253
అనిన నది యెట్లని	186
అనిన ననుగ్రహించితి	450

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనిన నమరులెల్ల	358
అనిన నమరేంద్రు వీడ్కొని	561
అనిన నమ్మునిసంఘంబులోన	403
అనిన నయ్యుధిష్ఠిరునకు	184
అనిన నర్జునుండు	62
అనిన నర్థావసుండట్లు	469
అనిన నవవతాస్యుండయి	41
అనిన నాకుఁ దపోధనంబ	342
అనిన నింద్రుండును	197
అనిన నింద్రుండు వానిం	462
అనిన నింద్రువచనం	431
అనిన నిచ్చనుప	230
అని ననివృత్తులై	58
అనిన నీకోరినట్ల	347
అనిన నూర్వశి యిట్లను	162
అనిన బలదేవునకు	418
అనిన భార్గవుండు	427
అనిన మాతలి యిట్లనియె	556
అనిన మాంధాతృ జన్మంబును	435
అనిన ముదిత హృదయయై	347
అనిన మూఁడవవాఁడెవ్వఁడని	268
అనిన మైత్రేయుం	42
అనిన యప్పార్థుం గరుణా	144
అనిన రోమశుండు	445
అనిన వాని కతిప్రీతిమంతుండై	502
అనిన వాని కింద్రుం	460
అనిన వానికి ఋత్విజు	440
అనిన వాని పలుకులు	84
అనిన వార లిట్లని	510
అనిన విని కేశిని	269
అనిన విని జనమేజయుండు	565
అనిన విని దధీచి సంతసిల్లి	353
అనిన విని దమయంతి	272
అనిన విని ధృతరాష్ట్రుండు	35
అనిన విని నలుం	215
అనిన విని బ్రాహ్మణులు	7
అనిన విని భీమసేనునకు	506
అనిన విని భీముండు	496
అనిన విని భీముండేమి	194
అనిన విని రోమపాదుండు	387
అనిన విని విభాండకుండు	399
అనిన విని వైశంపాయనుం	565
అనిన విని హంసపలుకులు	190
అనిన సక్రోధుండయి	62
అనిన సత్యవతి	407
అనిన దానికి సార్థవాహుండు	230
అనిన సోమకుండు	443
అని నాకు దేవదత్తం బను	550
అని పంచినం బనిపూని	254
అని పంచినఁ దత్ప్రసాదంబున	202
అని పంచిన నప్పుడ	30
అని పనిచిన నమరేశ్వరు	325
అని పలికి కపిలుం	374
అని పలికిన విదురు	26
అని పితృదేవతల	301
అని ప్రలాపించుచు	468
అని ప్రసన్నుండైన	45
అనిమిషదివ్యాయుధ	366
అనిమిషనాథుఁడుం	159
అనిమొన సాల్వుఁడు	72
అని యందఱు ద్రుపద	63
అని యడిగిన ధర్మరాజునకు	404
అని యర్జును వారించి	563
అని యాదేశించి దేవ	564
అని యిట్లు గంగావతరణంబును	383
అని యిట్లు సాల్వుం	85
అని యిట్లు స్తుతియించి	144
అని యుగాంత్యకాల	54
అని యుపాలంభించి	453
అని యొండెద్దియుం బలుకక	255
అని విధాతృని ధర్మువు	100
అని వైదర్భుండు దానునుం	339
అని సంతుష్టహృదయుండై	149
అని సకలతీర్థ కథనంబు	320
అనుచుం బార్థవిలోకనంబు	477
అనుచుఁ గడునలిగి	521
అనుచు నెప్పటియట్ల	32
అనుచున్న యవసరంబున	279
అనుచున్న యవసరంబున	520
అనుజులు దానును	402
అనుపమ దివ్యశస్త్రధరులైన	354
అనుపమశౌర్య	162
అనుపమశౌర్యవంతుల	418
అనుభోగయోగ్యములుగా	397
అనృతము మదమును	56
అన్నాగకుమారుండును	238
అపహృత కమండలుండై	466
అపహృత గాండీవుఁడునై	139
అపహృత సర్వస్వులమై	7
అప్పు డప్పుట్ట గ్రొప్పించిన	425
అప్రియంబుఁ జేసియు	577
అబల యిది భవన్మాత	483
అమరగణసమేతు	152
అమరలోక నివాసుల	299
అమరవరులందుఁ	294
అమరహితంబుగ	359
అమరులు గాలకేయ	363
అమరులెల్లఁ దన్ను	363
అమలచరిత్ర నిట్లు	279

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అమితంబగు మీతపము	426
అమితబలుండు హైహయుఁ	410
అమితభుజశక్తి	41
అమృతనిమిత్తంబున	554
అమ్మదరాక్షసుండు	433
అమ్మహాజగరం	566
అమ్మాయాశరములు	75
అమ్ముని దేహము వల్మీకమ్మున	424
అమ్మునీశు నివాసశక్తిఁ	397
అయినను దల్లిదండ్రుల	251
అయినను నానేర్చు విధంబునం	575
అయ్యగస్త్యుచేత నిట్లు	573
అయ్యది మహనీయంబయి	122
అయ్యపూర్వధ్వని విని	490
అయ్యమోఘవీర్యంబుతో	385
అయ్య! యేము నీ పితరుల	337
అయ్యర్జును దివ్యశర	175
అయ్యవసరంబున నేను	63
అయ్యా! నీయనుజుండు	536
అరికృత దుష్పరాభవ	125
అరివరుల నోర్చి సాగర	112
అరుగు మయోధ్యకు	256
అరుణసరోరుహరమ్య	480
అరుదుగఁ దత్పయోద	579
అర్జునుండు నయ్యమరావతీ	158
అర్జునుండును నయ్యోగ విద్యా	123
అర్థమ యనర్థమూలం	12
అర్ధయోజన విస్తృతంబై	297
అర్ధరాత్రమునప్పు డందుల	231
అఱపాఱుడుకుఱుచచేతులు	243
అలఘుం డిక్ష్వాకుమహా	493
అలఘుగుణంబులం	114
అలఘుతపస్సమాధి	155

పద్యము	పుట
అలఘుతపోభరంబున	40
అలఘులగు వృద్ధవిద్వాంసులకు	456
అలఘులు గంధమాదన	485
అలఘులు రైభ్యభరద్వాజులు	459
అలబలమంది యందుల	133
అలయక పుణ్యవ్రతములు	237
అలయక మాకు నందఱ	321
అలయక యేండ్లు గడుం	456
అలయుచుఁ బులుఁగుల	220
అలసినెడ డస్సినెడ	215
అలిగి వజ్రాయుధు నైనను	476
అల్పోపాయంబైన కార్యంబు	117
అవనినాథ! నీకు	443
అవనిలో దమయంతీ	207
అవనీనాథ! తదాహవాంతరము	79
అవనీశ! యీ హయంబులు	259
అవమానాసహమగు	125
అవినీతుల వధ్యులఁ	53
అవిరళవిస్ఫులింగ	237
అవిరళ సూర్యమండల	148
అవ్వజ్రంబున నింద్రుండు	354
అవ్వ! నీ తల్లిదండ్రుల	248
అవ్వా! నీ వెవ్వని కూఁతుర	427
అశనాశావివృతాస్యగహ్వరుఁ	566
అశ్వమేధంబు సేయంగ	372
అశ్వమేధమునకు	373
అసమంజసపుత్త్రు	374
అసురుల భయమున	317
అసురుల యాక్రోశధ్వను	83
అసురులవలన భయంబైన	556
అస్మత్పోషణోపాయచింత	8
అహితచిత్తవిదారణ	419

పద్యము	పుట
ఆ	
ఆ ఋషికుమారు కట్టిన	392
ఆ జమదగ్ని ప్రసేనజితుండను	408
ఆతని గాండీవహస్తు	124
ఆతని యభిమతంబుఁ	131
ఆతరుణి మున్న చని	466
ఆతోయధి నీచేతం	364
ఆత్మోపభోగార్థ మర్థ	13
ఆది నపరాధ మొక్కటి	95
ఆదిమునిచరితుఁ బడసెఁ	408
ఆ దివ్యాస్త్ర ప్రభావంబున	559
ఆనందభరితాత్మయై	251
ఆ పర్ణాదువలన నిన్నెఱింగిన	278
ఆబాలవృద్ధ ప్రసిద్ధుండవై	116
ఆభగీరథు తపంబునకు	380
ఆభగీరథు నపారభూభార	378
ఆమిషము సింహములచే	105
ఆయతబాహుఁదప్త	281
ఆయుధీయ సురక్షితంబయిన	199
ఆ రాక్షసు నతివీరుఁ గుబేర	532
ఆ రాజు గుణములు	192
ఆ రాత్రి యర్జునుం డనుజుల	543
ఆర్యులకు విహీనతయు	99
ఆ వేశ్యాజను లధిక రసావహ	388
ఆ వైదర్భుఁడు నిఖిల	195
ఆ శంఖరవంబు మహేంద్రాశని	489
ఆశ్రితులను భక్తులగువారి	7
ఆ సమయంబునఁ బర్వత	195
ఆ సముద్రోదరంబున	550
ఆ సౌగంధిక కమలంబుఁ	485
ఇ	
ఇంకనైన నన్ను నేల	221
ఇంకనైనను నీవు వివాహంబై	337

పద్యము	పుట
ఇంతయుం గపినాథ! నీ కిది	506
ఇందుధరప్రసాదమున	152
ఇంద్రుండును వారల నందఱ	544
ఇఁకనయినను వారి రావించి	24
ఇక్కపోతంబు నాకు వేద	449
ఇక్కొలనం జైత్రమాసంబునందు	447
ఇక్కొలని సమీపంబునఁ	424
ఇచ్చున్నతోఁ జని యువ్వన	232
ఇట్టి నన్నుఁబట్టి యిప్పాట	567
ఇట్టి మహోత్పాతంబు లుపలక్షించి	513
ఇట్టి మా కపకారంబు సేయుట	519
ఇట్టి శాప మమ్మునీంద్రుండు	537
ఇట్లక్కపివరు లాంగూలంబుఁ	495
ఇట్లధికవిలాసంబుతో	160
ఇట్లనేకమాసంబులు	210
ఇట్లనేక సహస్రమహీసురవరుల	22
ఇట్లపూర్వ స్వయంవర లబ్ధ	207
ఇట్లరుగుచున్న దమయంతి	221
ఇట్లరుగువాఁడు నిజసింహ	488
ఇట్లష్టావక్రుండు దానును	455
ఇట్లిద్దఱుచేత శర	135
ఇట్లిద్దఱు నన్యోన్యరూప	193
ఇట్లు ఋతుపర్ణునొద్ద	242
ఇట్లు ఋశ్యశృంగుండు	396
ఇట్లు ఋశ్యశృంగుం బ్రబోధించి	391
ఇట్లు ఋశ్యశృంగు నాగతంబున	397
ఇట్లు కాలకేయులం దొట్టి	366
ఇట్లు కృతప్రతిజ్ఞుండై	414
ఇట్లు గంధమాదనపుణ్య	528
ఇట్లు గ్రొచ్చిగ్రొచ్చి సగరసుతులు	372
ఇట్లు చనుదెంచి ధనంజయుండు	542
ఇట్లు చారుదేష్ణు నిష్ఠుర	69
ఇట్లు జూదంబునఁ బుష్కరు	284

పద్యము	పుట
ఇట్లు తనశక్తి శూలంబు లశక్తి	533
ఇట్లు దనచేతం బూజితుండై	40
ఇట్లు దమతోడన వన	6
ఇట్లు దమయంతి నిజనాథు	225
ఇట్లు దివ్య పురుషుండైన	151
ఇట్లు దుఃఖించుచు దమయంతి	233
ఇట్లు దేవేంద్రుండు ధనంజయుం	153
ఇట్లుద్భవించి దశసహస్ర	432
ఇట్లు ధర్మజు నిబిడపీడన	519
ఇట్లు ధర్మరాజు కుబేరు	540
ఇట్లు ధర్మరాజు వచనంబునఁ	52
ఇట్లు నలుండు ఋతుపర్ణు	263
ఇట్లు నిర్ఘాతనిపాతభిన్నోన్నత	523
ఇట్లు నివాతకవచులం జంపి	557
ఇట్లు నివాతకవచులు మదీయ	555
ఇట్లు పాండవులు గృత	6
ఇట్లు పెరిఁగినవింధ్యంబు	361
ఇట్లు బ్రహ్మాస్త్రపీడితుండయి	75
ఇట్లు భగీరథుండు గంగా	379
ఇట్లు భర్తృవియోగాతురయై	252
ఇట్లు మహారేణుపటలం	479
ఇట్లు మూర్ఛితుండయిన	72
ఇట్లు మృగావ్యాళ తస్కర	226
ఇట్లు మ్రొక్కి పని యేమని	483
ఇట్లు యజ్ఞపుత్త్రుండైన	443
ఇట్లు వచ్చి తమలో మాట	249
ఇట్లు వచ్చిన మహాముని	323
ఇట్లు వచ్చి పరమభక్తి	119
ఇట్లు వచ్చి వారలచేత	88
ఇట్లు విరూపాక్షుండు నిజ	141
ఇట్లు సంగతులైన	281
ఇట్లు సర్వజనసత్కారార్హుం	212
ఇట్లు సురేంద్రుం డరిగిన	545

పద్యము	పుట
ఇట్లు హిరణ్యపురనివాసులం	560
ఇట్లెల్లవారికి నాశ్చర్యంబుగా	280
ఇట్లొక్కముహూర్తంబు	51
ఇతఁడు సురేంద్రుఁ డొండెఁ	137
ఇత్తఱిఁ బన్నిపోయి పయినెత్తి	33
ఇది కుబేరువనంబు దీనికి	509
ఇది తేజంబున కవసర	96
ఇది దక్షిణాపథంబున	214
ఇది దక్షు మఖస్థానం బిదియు	445
ఇది నా వరలాభంబున	568
ఇది నిక్కువమని	320
ఇది పంచయోజన ప్రమాణం	446
ఇది బ్రాహ్మణ ధర్మంబు గాని	116
ఇది మహోగ్రాటవి సింహ	86
ఇది యక్షహృదయ మనఁగా	262
ఇది యనేక సత్త్వాశ్రయంబు	367
ఇది యమునయను మహానది	434
ఇది యమ్మాంధాతృ దేవయజన	439
ఇదియును బ్రహ్మశిరంబను	146
ఇదియు విష్ణుపదంబు	446
ఇది యేమి యాశ్చర్యంబొ	571
ఇది విద్యోపార్జనంబున	461
ఇది విశ్వామిత్రుని యాస్పద	384
ఇది శాంతతపస్వుల	127
ఇది సకలసుకవిజనవినుత	181
ఇది సకలసుకవిజనవినుత	350
ఇది సకలసుకవిజనవినుత	524
ఇది హిరణ్యపురం బిందుఁ	558
ఇనశశితారాదులకుం	360
ఇన్నలోపాఖ్యాన మెప్పుడు	286
ఇప్పర్వతంబు దైవనివాసంబు	138
ఇప్పువ్వులు నాకుఁ దెచ్చి యిచ్చి	530
ఇభరాజగమన! నీ వెందుల	242

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఇమ్మణిమతీపురంబునఁ	343
ఇమ్ముగఁ దద్ధామాఘ్రాణమ్మున	442
ఇమ్ముని నీయజ్ఞాయతనమ్ముఁ	469
ఇమ్మునివరునకు నన్నుఁ	339
ఇమ్ముల ధర్మజునకు	149
ఇరువురఁ దోడ్కొని తానును	343
ఇలఁ బ్రసిద్ధుఁడు ఋతుపర్ణుఁ	240
ఇలకున్ గంగతరంగ	381
ఇల్వలుండు దనుజు	344
ఇల్వలుండును మునివరు	345
ఇవ్విభీతకంబున ఫలపర్ణ	262
ఇష్టమృష్టాన్నములఁ దొల్లి	8
ఇష్టమైన వరము లిచ్చెదఁ	128
ఈ	
ఈ జంతుం బళువుగా వధించి	(441)
ఈతండు శాలిహోత్రుఁడా!	260
ఈతఁడు పరాక్రమమున	544
ఈతని పల్కినట్ల	421
ఈ దివ్యబాణమ్మున	148
ఈ పురుషోత్తముండు	62
ఈ రథంబులతోఁ బోవనిమ్ము	474
ఈ రథమెక్కి తొల్లి	549
ఈ రాజపుత్త్రిఁ దోడ్కొని	482
ఈ రాజవరులతో నేను	345
ఈ రెంటిలో నీ కెయ్యది	283
ఈ లోకంబున వనితలుఁ	163
ఈశ్వరుండు వానికి	369
ఈసున దుర్యోధన	173
ఈసున నీకుఁ దొట్టి సురలెల్ల	324
ఈ సైన్య నిరోధంబున కిది	426
ఉ	
ఉక్కటి యిట్లు మధ్యము	531
ఉత్తమ క్షత్త్రియుండేల	511
ఉత్తరాయణగతుండై	19
ఉద్యద్బులులు గుమారులు	67
ఉన్నతిఁ బూని నీవు	502
ఉరగఫణాగ్రరత్న	559
ఉరుశస్త్రవృష్టి నాపైఁ	551
ఋ	
ఋచీకుండును గాధికి	405
ఋశ్యశృంగుండను ముని	385
ఎ	
ఎంత యోటువడిన నంతియ	210
ఎందుండి వచ్చితయ్య	127
ఎందుండి వచ్చితి ఋషికుమార!	389
ఎట్లనిన వేదంబులు	357
ఎడఁబడక యహోరాత్రులు	453
ఎదురఁబడినవాని	568
ఎదురను దవ్వులఁ జూచిన	259
ఎదురులేక దివ్యాస్త్రంబు లిట్లు	563
ఎఱిఁగి యెఱిఁగి దీని	339
ఎఱిఁగి యెఱిఁగి నన్ను	198
ఎఱుకని యెఱుఁగక	144
ఎఱుకు నన్ను నుఱక	138
ఎల్ల నెయ్యములకుఁ	36
ఎల్ల లోకంబులును జూచి	323
ఎల్లవారు నెఱుఁగ	261
ఏ	
ఏచిన పాదలఁ బొరల్పడఁ	221
ఏ నఖిలతీర్థ దర్శనార్థంబు	41
ఏ నతిపాపభావమును	278
ఏ నిందులకు నీతదర్థంబ	277
ఏ నిందులకు వచ్చి మీచేత	250
ఏ నిక్కడఁ గార్యార్థినై	493
ఏను దీనిదుఃఖంబుఁ	217
ఏను దేవదూత నింతి	201
ఏను దొల్లిభూమింగల	326
ఏను ధర్మసుతుఁడ నీతండు	49
ఏను నలుభార్యఁ బుణ్యవిహీనతఁ	229
ఏను నామృగంబు నేసితి	136
ఏనును వాని పిఱుందన	78
ఏనును వారల యఱువది	559
ఏను బకాసురుననుజుఁడఁ	48
ఏను బహువేదశాస్త్రమ్ము	471
ఏను పాండుసుతుండ భీముఁడ	510
ఏ నుభయపక్షంబులవారికి	28
ఏను భవదాదిష్టవిద్యా	546
ఏను భీముఁడఁ బాండవేయుఁడ	567
ఏను మీకారణంబున	429
ఏను సముద్రతీరంబున	64
ఏను సైరంధ్రి నయియుండియు	236
ఏను హనుమంతు నంతియ	494
ఏ నెట్లును సత్యభంగంబు	180
ఏ నెట్లును సత్యసమయం	114
ఏ నేఁడు లగుదెంచె నర్జునుం	528
ఏ నేడ? నింద్రాదు లేడ?	202
ఏపున రెండుచేతులను	494
ఏమి సేయుదు నెవ్విధంబున	454
ఏము తపోదృష్టిం జూచితిమి	228
ఏము దేశాంతరంబుననుండి	273
ఏ మేమ మున్ను పూజింపుదుము	298
ఒ	
ఒండొరులఁ గడవంగ	190
ఒక్కకర్ణంబు నీలోత్పల	405
ఒక్కనాఁ డబ్బాలకు కుఱువు	440
ఒక్కనాఁ డుద్దాలకు కుఱువెక్కి	455
ఒక్కనాఁడు నలుఁడు	188
ఓ	
ఓహో! యిమ్మెయిధర్మ	164

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
క	
కడఁగి బుద్ధీంద్రియ	291
కడఁగి సమబుద్ధి వీనికిఁ	44
కడుకొని కడుదుఃఖములై	569
కడుడస్సి నడవనోపని	474
కడుదర్పితుఁడని నిన్నున్	386
కడు నలిగి యమ్మునీంద్రుఁడు	409
కడు నిమ్ముగా దున్ని	104
కడునెండ యెక్కునంతకు	231
కడుభయమున మాతలి	-
కడువడి గాడ్పుచే	474
కనకగిరిం బ్రదక్షిణముగా	541
కనకమయమ్మైన	557
కని యాత్మగతంబున	571
కపిలు కోపాగ్నిఁజేసి	378
కర్ణజయద్రథగాంధారు	3
కర్ణు నగవు లోకగర్వితుండగు	60
కర్మ ఫలంబులు దైవమానుష	104
కర్మఫలము లేదు కర్మఫలాప్తికిఁ	102
కల ధనములెల్ల నొడ్డుచు	210
కలహంస పలికిన	194
కలికాల భరత! లక్ష్మీ	349
కలి దమయంతిఁ బాప	218
కలియుగమునందు ధర్మము	500
కలిసంప్రాప్తుఁడనై కడు	284
కలిసమావిష్టమతి నయి	276
కా	
కాంచనవర్ణాపఘనుఁడై	132
కాంచనవర్ణుండు గడు	391
కార్యగతుల తెఱఁగు	28
కార్యసిద్ధిపొంటెఁ గాలంబు	504
కాలకల్పుల నుగ్రతేజులఁ	358
కాలకేయులు మహాకాయులు	356
కావున నిది మదనుజీవిత	216
కావున నిరతమ్ము	539
కావున నీవు గర్వంబు	463
కావున బంధుమిత్రధన	11
కిమ్మీరుండనురక్కసుఁ	45
కుబేరుండును బాంచాలీ	513
కురిసెఁ బ్రచండవృష్టి	479
కురిసె మరుద్వచనానంతరమున	280
కులదూషకు దూషించి	25
కృతము కాని కర్తవ్యంబు	498
కృతయుగంబునఁ గాలకేయ	351
కృతాధ్యయనశీలుండై	456
క్రూరతర ధార్తరాష్ట్ర	3
కే	
కేకయస్సృంజయపాంచాల	420
కేవల ధర్మాచరణంబు	109
కేశినియును బాహుకు పలుకులు	270
కొ	
కొడుకులఁ బలువురఁ	369
కొడుకులకు వగవ మును	375
కో	
కోమల కీర షట్చరణ	463
కోరి యనేకయుగంబు ల	168
కోరి యొక్కకొడుకుఁ	440
క్ర	
క్రతుఫలములు వడయఁగ	292
క్రమమునఁ బాండిత్యపరాక్రమ	117
క్రమమున నీచేసిన	573
క్రూరతరధార్తరాష్ట్ర	
క్రోధంబు పాపంబు గ్రోధంబుననఁ	96
క్ష	
క్షత్రవధనైన పాపంబు	301
క్షత్రియ ప్రవరుండ	492
క్షమగలవానికిఁ బృథ్వీ	97
క్షమయందు చిత్తంబు నిల్పి	98
క్షమయ తాల్చియుండఁ	94
క్షమయును దేజంబును	94
ఖ	
ఖరకిరణతాపమున	578
గ	
గదఁగొని భీముఁడంత	533
గద ద్రిప్పి భీముమీఁదను	532
గమనవేగంబున ద్రుమ	487
గాండీవ మాదిగాఁ గల	27
గాండీవముక్తదారుణ	555
గిరినిర్ఝరములఁ బుట్టిన	511
గిరిశిఖరాభోగబృహత్తర	570
గీర్వాణప్రభుఁ డాదిగ	365
గురుముఖమునఁ బడయక	460
గురువచనబోధితుండై	412
గురుశుశ్రూష యొనర్చుచుఁ	471
గోదేవక్షితిదేవభక్తిపరుఁడై	415
గోలాంగూలోత్తము లాంగూల	490
ఘ	
ఘనతరదైత్యదానవ	79
ఘనతరధర్మతమం బొకొ	579
ఘనభుజ! నీకారణమునఁ	376
ఘనముగ జంబూద్వీపంబునఁ	284
ఘనముగ ధనదేంద్ర	545
ఘనమై నీ పృథుబాహు	419
ఘనుఁ డమ్మణిమంతుఁడు	533
ఘనుఁడ! యేగుణములు	575
ఘనుఁ డీపార్థుఁడు నావలనన	544
ఘోర పరాక్రముల్ ప్రబల	50
ఘోరారిదారుణములగు	151
ఘోరాహవరంగమునకు	73

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
చ	
చదివితి నెల్ల వేదములు	572
చదువకయును నాకు	460
చనియెద దక్షిణదిశ కే	362
చని వైకుంఠంబునఁ	355
చనుదెంచి తరుణి	395
చనుదెంచి ద్రౌపదిని	518
చనుదెంచి మహామునివరు	42
చనుదెంచి యందు	275
చనుదెంచె నంతిపురమున	249
చనునె నీకు నిట్టి సాహసక్రియఁ	516
చనునె యధర్మద్యూతం	2
చలదళి పుంస్కోకిల కుల	529
చారుదేష్ణుపైఁ గడువాఁడి	70
చీరాజినధారుల నవికార	417
చెట్టసేసి తింకనయినఁ	74
చ్యవనుండు దాని	428
చ్యవనుఁడు వేల్చిన నందు	431
చ్యవనునందు నాకు	428
జ	
జగంబులు పుట్టింపను	(164)
జగతీచక్రమునం గల	246
జనకభూపాలుని	457
జనులు నిగ్రహానుగ్రహ	504
జయశీలివైన నీకుం	110
జలధికుక్షిలోనుండి	548
జలములందు మత్స్యంబులు	12
జలరుహసంభవుఁ డాదిగఁ	309
జాంబవతేయు బృహద్విశిఖంబు	68
జితవైరి మత్పతి	235
జీర్ణమై కడుమాసిన చీర	234
జీవితార్థులైన జీవుల	232
జృంభించి వజ్రమెత్తిన	431

పద్యము	పుట
త	
తండ్రియనుచు నుద్దాలకుఁ	454
తగిలి నిత్యంబు నేకాంత	107
తడయక ఘోరదర్శన	84
తత్సమయానంతరంబున	580
తన గదఁ జేసి రాక్షసుల	512
తనచేతి పుష్పములఁ	394
తన దివ్యగాత్రమున	140
తనపట్టిన సురియ	222
తన పితామహునట్టుల	377
తనయుఁడు దృఢస్యుఁ డనఁగా	348
తనయుఁ బశువటిచి	441
తనయుల నలువురఁ	409
తన యెప్పటి రూపముఁ	502
తనుకుచునున్న నీహృదయ	61
తపనతేజుండైన కపిలు	380
తపస్స్వాధ్యాయ బ్రహ్మచర్య	101
తపస్సిద్ధులైనవారు దమ	18
తమతమ పుత్త్రుఁడ	439
తమ మామకుఁ దద్వృత్తాంతము	464
తమ్ము చేసిన దురితముల్	470
తరుణి నగస్త్యుభయంబున	338
తలఁకక మును సౌగంధికములు	535
తిర్యగ్జాతులు ధర్మ వెఱుంగవు	492
తిలగోసువర్ణ దానంబులు	292
తిలలందుఁ దైలంబు	103
తిలలును నీళ్ళును	4
తీర్థగమన ఫలంబెల్ల	292
తురగములు పఱవ నేరక	554
తేజఃప్రభవంబు లైన	97
తొల్లి కుశావతియను	537
తొల్లి నీతిమంతులైన	102
తొల్లి యిక్ష్వాకు వంశంబున	368

పద్యము	పుట
తొల్లి వార్ష్ణేయుండు దెచ్చిన	258
తొల్లి వేదాధ్యయనంబు	60
తొల్లి శతక్రతుండు	316
తొల్లి సకలగోమాత	36
త్రినయన గాత్రస్పర్శనమున	148
త్ర్యంబక! నాకు నభీష్ట	145
త్వష్ట యంత నూఱుధారల	353
ద	
దక్షమఖక్షయకరు	368
దక్షుఁడయి యజ్ఞదక్షిణ	401
దనుజులు మదీయరథ	551
దమయంతికి నలునకు	191
దమయంతి నలుని	275
దయమంతి మనోభవనిభు	200
దమయంతి యారథధ్వని	265
దమయంతియు సార్థవాహుం	229
దమయంతి వాని నలిగి	223
దమయంతి రోయిగా	283
దమయంతి సితపుష్ప	205
దళితనవీనకందళ	580
దానం జేసి కృత	497
దానన చేసి ధృతరాష్ట్రుండు	29
దానిఁ జూచి మదనతప్తుండై	464
దానిఁ దన నిశితబాణ	532
దాని కలిగి భూదేవి	401
దానికి నచ్చెరువడి	451
దానికి విస్మయం బంది	126
దానికి వెఱచి యాతండు	386
దాని నన్వేషించి	245
దాని నపనయింపఁగా	120
దాని నాశ్వాసించి	482
దాని నెఱింగి భృగుండు	436
దాని నెఱిఁగి యమ్మువ్వురు	344

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
దాని నెఱిఁగి రామ	416
దాని నొడంబఱిచి	362
దాని రక్షించి యున్న	508
దాని విడిచి పోవఁగా	189
దాని విని కుబేరుండు	535
దాని విని బెదరి	489
దాని విని యక్ష	531
దాని విని సగరుఁ	374
దారుకుఁ డిట్లనియె	83
దిననాథుఁ డస్తగిరి	542
దిలీపుండును దన	377
దివిజాధినాథ! నా కవి	128
దివ్యబాణములు తదీయ	562
దివ్యాస్త్ర విదులైన	122
దీనిం జిత్తగింపుము	37
దీని తీరంబున దేవర్షి	509
దీనివిధానం బెఱుఁగంగా	147
దుర్గమంబైన	473
దుర్మతులను దుర్జనులను	105
దుర్యోధనుండు దుర్బుద్ధి	176
దేవతల కప్రియంబులు	204
దేవతలకు నపకారము	170
దేవతల సాధువాదము	206
దేవతలు దాని పరిదేవనంబు	206
దేవతలు ధర్మవర్తులు	331
దేవమూర్తులు పాండుపుత్త్రులు	23
దేవర్షి ద్యుచరాహి లోకములు	445
దేవర్షి యైన రోమశు	517
దేవసములైన యనుజులతో	184
దేవా! దీనాననంబులయి	37
దేవా! నా కిష్టంబైన వరంబు	128
దేవా! నీప్రసాదంబున	406
దేవా! నీవు వరాహరూప	356
దేవాసురాదు లిం దుపజీవిం	518
దేవిక యను తీర్థంబున	297
దేవీ! యేను భవద్భ్రాతృసఖుండ	248
ద్యూతార్థము తత్కృతవా	209
ద్రవిడ దేశంబున నగస్త్య	416
ద్రోణ ద్రోణజ కృప గీర్వాణనదీ	561
ద్వాపరంబున రెండుపాదములఁ	499
ద్వారవతినుండి యేయు యుధాను	63
ద్వారవతీపురమునఁ	295
ధ	
ధరణిఁ గడుఁ బేదవారును	454
ధరణిఁగల రాజులిట	266
ధరణిఁ బ్రదక్షిణంబుగ	288
ధరణి నధార్మికులగు	330
ధరణినాథ! నీభార్యాశతంబునందుఁ	440
ధరణిరాజ్యంబుతో ధనమెల్లఁ	216
ధరణీతలంబు నిర్ధార్తరాష్ట్రముగఁ	418
ధరణీదేవసహస్ర	30
ధరణీశ! నీకు నాయిచ్చిన	514
ధరణీసురవర మునిగణ	402
ధర్మకామంబులు దఱుగంగ	108
ధర్మకామప్రభవంబయి	106
ధర్మజ్ఞులైన పురుషులు	448
ధర్మతనయ మీరాక	403
ధర్మదూరులైన ధార్త	99
ధర్మపుత్త్ర నీయుదార	287
ధర్మరహితులైన ధార్త	29
ధర్మరాజును దమ్ముఁడు	561
ధర్మవర్తులైన దేవతలు	332
ధర్మసుత ధార్తరాష్ట్రుల	331
ధారుణిలోపల స్వర్గ	310
ధీరమతియుక్తిఁజేసి	100
ధీరుఁడు భీష్ముఁడు గంగా	289
ధృతరాష్ట్రుండును దనకు	32
ధృతినియమవ్రతునకు	123
ధృతియుతులై సత్యవ్రత	35
ధ్యానమాత్రన చేసి వేదములు	437
న	
ననుఁ బుత్త్ర స్నేహంబున	161
నన్నుఁ జూచి నగరె నలినాక్షి	244
నన్నుఁ దలంచి తీర్థగమనం	326
నన్నును గౌఁగిలించుకొని	394
నన్ను రక్షించిన నీకుం	239
నన్నెఱిఁగి తెచ్చినట్లు	256
నన్నెఱుఁగవె పాండవుఁడఁ	520
నమితవిరోధి పుష్కర	292
నరక శిశుపాలు రాదిగ	56
నరనుత నీయనుజ్ఞఁ గొని	107
నరనుత నైమిశమునఁ	298
నరనుతుఁడు దొల్లి నలుఁడను	185
నరవరుఁడు నలుఁడు	278
నరసిద్ధసాధ్య విద్యాధర	196
నరసురస్తుత్యమై యెంతకాలంబు	496
నరుఁడను మహర్షి యీతఁడు	169
నరుఁడు నారాయణుండు	57
నరుఁడైన యాదిముని	158
నలదమయంతు లిద్దఱు	193
నలినాక్షి యిది విదర్భేశు	250
నలుండును వానిం జూచి	213
నలుఁగాన మివ్వనంబునఁ	230
నలుఁడును ధరణీరాజ్యము	211
నలుఁ దొల్లి యాక్రమించిన	264
నలుగుణములు దమయంతికి	187
నలుతో నొక్కట నరిగిన	269
నలున కాని నలినదళనేత్ర	205
నలురథచోదకుఁ డతఁ డ	268

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
నాకరంబున శాకరసంబు	306
నాకారణమున ఋత్విజుఁ	443
నాకు గురుదక్షిణార్థము	548
నాకు నమ్మునిపుత్త్రు	395
నాకు మిమ్మును మీకుబేరుం	512
నాకు విహితభక్షణం బిది	450
నాకు వెఱచి యెల్లవారును	48
నా దేహంబునఁ బుట్టిన	26
నానావర్ణశిలావిహగానేక	477
నా పలుకులు నీ కొడుకు	45
నా మగుడివచ్చునంతకు	362
నాయిచ్చిన వన్యస్వాదు	394
నాయేసిన యపారదుర్వార	138
నాయొద్దనుండుదేని మదీయ	242
నారలుగట్టి కూర లశనంబుగ	338
నాలుగు కెలఁకుల నవఘన	578
నాలుగు దిక్కులందును	322
నాలుగు దిశలను	239
నా వచనంబున నతి	410
నా వచనంబున నెగడు	29
నిత్యంబునుం బదివేవురు	93
నిత్యసత్యవ్రత నిషధేశ	197
నిత్యసత్యుండవు నీసతి	254
నిన్నును నీ చెలువము	264
నిన్ను నిత్యసత్యనిరతుఁగా	199
నిన్నును నీ తమ్ములను	539
నిన్ను రోయంగ విప్రులు	277
నిన్ను విడువ నోడకుండు	276
నిన్ను సత్యధర్మనిర్మలుఁగా	448
నిరతంబుగా నేను నీవను	57
నిరతముగఁ దీర్థసేవా	325
నిరుపమ రత్ననిరంతర	556
నీకు నపత్యశతంబు	37
నీకు నేనాఁటి తల్లిని	162
నీచతరనాభిఁ జపల	340
నీ తపమునకు మెచ్చితి	21
నీధనంబును రాజ్యంబు	213
నీ నాఁటితనువుఁ జూచియ	501
నీ నిదేశంబున నరిగి	177
నీపరాక్రమబలమున	564
నీయంతఃకరణ ప్రవృత్తి	59
నీయందలి పుణ్యతీర్థంబులు	155
నీయట్టి ధైర్యవంతుని	166
నీయడిగిన యర్థాభిప్రాయములకు	574
నీయనుజుల్ ధనుర్ధరు	328
నీయిష్టంబు సెప్పు మే నమోఘ	290
నీయుపేక్షంజేసి దుర్యోధను	174
నీయొద్దకుఁ బుత్తెంచిరి	202
నీవఖిలాస్త్రవిదుండవు	548
నీవచనంబు ధర్మ్యము	113
నీవజ్రము రక్షింపఁగ	36
నీవిట పలుమఱు వచ్చుచుఁ	273
నీవుండుము నాకడ నిందీవర	236
నీవుఁ బాండుండు విదురుండు	38
నీవు గురుముఖంబునం	472
నీవు దీని కొడంబడనినాఁడు	203
నీవు దీని నొక్కరుఁడవు	469
నీవు దొల్లి గంధమాదనంబునం	54
నీవు నలునకుఁ బేర్మితో	191
నీవు నాకొడుకుల యున్నతి	26
నీవు నాపితృవ్యపుత్త్రుండవు	285
నీవు నారీరత్నంబ వాతండు	192
నీవు నిగ్రహానుగ్రహ	505
నీవు నీసుతుండు నెఱిఁ	32
నీవు పక్షివయ్యును ధర్మ	450
నీవు బుద్ధిగలవేని వీరిని	521
నీవు మహానుభావుండ	201
నీవు సూచుచుండ నీయిష్టఁ	538
నీ వెవ్వరివాఁడ వెవ్వండ	47
నీ హృదయేశ్వరుండైన నలు	191
నెమ్మిగలవాని నా	30
నెమ్మి నినుండు మేరు	359
నైషధేశ్వరుండు నలుఁ	253
న్యాయవిదుండు గామ్యక	40
ప	
పటువిశిఖంబునం ద్రిదశ	134
పతికిఁ బరమభక్తి	427
పతిపత్నిఁ బ్రజార్థముగా	341
పదివేలకోట్ల తీర్థము	293
పదివేల గజముల బలముగల	565
పదివేల గజముల బలమున	93
పదుగురఁ బోలెడు	346
పదుమూడేండ్లుం బోయినఁ బద	179
పదుమూడేండ్లుం బోయినఁ బదు	174
పరనరేంద్రమకుటపద్మ	92
పరమధర్మస్థితిఁ బ్రజఁ	156
పరమమునులార! యుగ్గిరిఁ	403
పరమమైన తీర్థంబు	316
పరశు పాశాంకుశ కరవాల	80
పరువడి నగ్నిహోత్రములు	6
పరుషవిషమభూరి	83
పర్వతములు వజ్రపాతా	173
పలుకుల నొప్పదు బీరము	136
పలువురఁ గొడుకులఁ	313
పవనసమీరితమధుసంభవ	393
పాంచజన్యరవముఁ బంచ	77
పాండవసింహ మర్జునుఁడు	176
పాండవహితుఁడగు విదురుఁడు	32
పాండవులకడకు ధర్మ	87

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
పాంసుజాలములు పైఁబ్రాఁకినఁ	228	ప్రియసాహసుండు భీముఁడు	514	భువనవ్యవహారమునకు	361
పాకశాసను పనుపునఁ	160	ఫేనవదూర్మిచయంబుల	550	భూతరాశి దొల్లి పుట్టి	19
పాపసౌబలప్రయుక్తుండయిన	89	బ		భూపకులతిలక! నృప	523
పాయకయుండుదు రాక్షస	48	బకహిడింబులు హతులైనఁ	52	భూమి కనావృష్టియైనఁ	438
పారాశర్యుఁడుఁ బర్వత	328	బలముగలవానిఁ బలువురు	110	భూమిసురోత్తముల్ ప్రకృతి	89
పార్థివప్రభుఁడైన పాండు	59	బలరిపుఁడు నాకు నిచ్చిన	553	భూరిబలుండు పాండవుఁ	131
పితృదేవభక్తిఁ బుణ్య	290	బలవంతు లైన భీష్మాదుల	324	భూరిభుజుఁడు దానె పోయెనో	514
పితృనిదేశమ్మునఁ బృథివీ	88	బలిమి నశేషలోక	412	భూరిసత్త్వులు సర్వలోక	203
పితృపైతామహమైన రాజ్య	105	బలిముఖుండ దయయుఁ	497	భూవినుతంబై త్రిభువన	415
పుడమియు రాజ్యముఁ గోల్పడి	34	బలియుఁ డంగాధిపతి	386	భూసతికిం దివంబునకుఁ	581
పుడమియు రాజ్యము బంధుల	184	బహువాహ సుభట హస్తిక	112	భృగు నాశ్రమంబునకుం	435
పుణ్యకర్మంబులు వొలిసిన	82	బాలధి యను మునిప్రవరుండు	462	భ్రాతృపుత్త్ర బంధుజనంబులు	60
పుత్త్రుఁడు నీకు బ్రహ్మకుల	407	బాల నొక్కర్తు నిక్కానపాలు	218	మ	
పురమువెలి మూఁ డహోరాత్రములు	212	బాలహృదయమున నృప	224	మంటి హరుదేహ మంటం	149
పురుషకారంబునంజేసి	569	బాహుకుండును రథశాల	266	మతి వారికి మాకును గడు	28
పురుషునందు దోషపుంజంబు	255	బాహుబలము మెఱసి	106	మతిహీనుఁడై తనసుతుని	417
పుష్కరంబునఁ బదియేండ్లు	294	బిరుదాంకభీమ! భీమేశ్వర	180	మనుజేంద్ర! దీనితీరం	422
పూజ్యుఁడవు పురాణపురుషుండ	54	బోరన సురదుందుభుల	543	మనుజేంద్ర! నన్ను నీయడిగిన	290
పూరు పురూరవులట్లు	321	బ్రహ్మచేత నిర్మింపఁగఁబడిన	554	మనుజేంద్ర! సర్వమాయా	81
పౌరిని వారలచేతి యున్నత	50	బ్రహ్మవిదులును దపో	86	మనుజేశ్వరు లెల్లను బోరన	195
పౌర మణిమంతుఁ డిట్లు	534	బ్రాహ్మణానుగ్రహంబునం	90	మఱి చిత్రకూటంబున	318
పోవకు పోవకు మనుచు	534	భ		మఱి తృణ జల ధాన్య	66
ప్రకటముగఁ దొంటి సౌగంధిక	530	భట్టారా! విజయంచేయుండని	362	మఱి పాండవ పాంచాల	177
ప్రణుతక్షాత్రగుణంబు	111	భవదాచరితంబయిన	108	మఱి పింగం బను తీర్థంబు	295
ప్రతినరపాలకాలు	65	భవదాజ్ఞానిగళంబునఁ	92	మఱి యక్షిణీ తీర్థంబునందు	314
ప్రతిబలదర్పభంజనుఁడు	137	భామ విదర్భకేఁగి తన	252	మఱి యార్తునకు శయనంబును	14
ప్రతివిహితమాయు నత్యా	47	భీమప్రస్థాపిత యయి	285	మఱియుఁ దృష్టాతురుం డర్థ	11
ప్రథితయశున్ సుతుం బడసె	377	భీమసేనుండును ధౌమ్య	516	మఱియు గంగోద్భేద తీర్థంబు	312
ప్రమాదంబున వర్ణసంకరం	576	భీమాసురవీరుల	522	మఱియు గోసహస్రంబు	398
ప్రాణభయమున వచ్చి	449	భీముండును వానిం బూజించి	266	మఱియు నక్కుమారుం డొక్క	393
ప్రాణసమానవయిన	220	భీమునకు మార్గనిరోధంబుగా	489	మఱియు నచేతనంబు	330
ప్రియమున దమయంతి	267	భువనజనస్తుత నిజ	353	మఱియు ననాహితాగ్నులకు	157
		భువనజనస్తుతుఁడగు	404	మఱియు నమ్మాంధాత్రుండు	437

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
మఱియు నర్ఘ్యపాద్యాది	389
మఱియు నలదమయంతు	245
మఱియు నింద తొల్లి	422
మఱియు నిశితపరశుహస్తు	409
మఱియు నీచేత నుపనీతంబైన	376
మఱియు నీ యక్షరాక్షస	538
మఱియును	224
మఱియును	412
మఱియును	562
మఱియు నొక్కజట	465
మఱియు బాహుకుండను	241
మఱియు భీష్మ ద్రోణ	119
మఱియు వసుమతీఖాత	170
మఱియు విద్యాతపోయుక్తులై	354
మఱియు విరావ సురావములను	346
మఱియు సకలయజ్ఞంబుల	400
మఱియు సప్తగంగాసంగమంబును	311
మఱియు సర్వకార్యంబులు	504
మఱియు సారథిం జూచి	73
మఱి విదర్భావిభుండగు	256
మాతలి నన్నుం జూచి సంతసిల్లె	552
మాతలియు నర్జునుఁ జూచి	154
మానితయశుఁడు భీమానుజుం	539
మానుగ ఋతుపర్ణుఁడు	265
మాయందు లేని గుణములు	5
మాయయ్య యెవ్వరెక్కడఁ	455
మాయావి మా యాయుధములు	519
మాయాశ్రమ మిందులకున్	390
మిత్రసంపన్నుఁడైన నమిత్రు	110
మిన్నుమిడుఁగుఱు లట్టులై	426
మిమ్మను ధర్మార్థవిదుండైన	31
మీకు నెగ్గొనరించి యున్న	505
మీదయ మాకుఁ గల్గంగ	421
మీ రమరసదృశులరు	332
మీ రిందు మసలవల దిది	517
మునికుమారు నెగిచికొని	467
మునిదేవవరులు యజ్ఞము	400
మునినాథ! నీ యనుగ్రహ	366
మునినాథ! నీవు	341
మునినాథు నలుకతోడన	433
మునిముందటఁ గందుక	390
మునివర నృపతులఁ	346
మునీంద్రా! నీవు తృప్తుండవైనం	288
మునీంద్రా! యేను దొల్లియు	327
మునులం దిట్టుచుఁ బుష్ప	413
మున్న జీర్ణంబయ్యె మున్నీటి	367
మృగయార్థ మరిగి హిమ	565
మృగవిరోధిబలుఁడు	517
మేలగు తత్పురబాహ్య	66
మొనసి యధర్మద్యూతం	24
య	
యతినాథ! వినవె యిది	398
యాగశతంబులకంటెఁ	318
యాగాది పుణ్యకర్మ త్యాగము	355
యాదవులు పాండవుల	422
ర	
రంగదుత్తుంగతరంగ	364
రక్షోఘ్నమంత్రముల నారాక్షస	47
రజనికరాననఁ బీన	222
రథి కిమ్ముగానియెడ	74
రయమున నీచేత నిహతు	521
రవిశశిగతు లుడుగుడు	360
రాక్షస పిశాచ శ్వాపదంబుల	328
రాజర్షియైన ధర్మరాజు	39
రాజర్షులు నగస్త్యు	346
రాజవంశరత్న! రాజరాజ	181
రాజ్యపదస్థుండైన క్షత్రియుండు	113
రాత్రి జాగరణ భర	436
రానేల? వచ్చి నవయంగా నేల?-	7
రామవిక్రముఁ డజేయుఁ	67
రైభ్యుండు నయ్యవక్రీతున	465
రైభ్యుండును వానికి భార్యగాఁ	467
రైభ్యుఁ డధికకోపరతుఁ డంటి	467
రోమశుం డను దేవర్షి	321
రోహిణికిఁ జంద్రసమాగమం	248
ల	
లయకాలోదిత సహస్రకరు	173
లలితమధుస్రవఫలములు	484
లలితాంగిఁ బడసెఁ దన	465
లలితాంగి! యేను నీగుణ	406
లలితాచ్ఛస్ఫటికశిలా	477
లీ లైరావతకుంభాస్ఫాలన	159
వ	
వంచనయును మాయయు	560
వగవఁగ సాంగోపాంగము	220
వజ్రసంహనను లవార్య	43
వజ్రాస్త్ర మాదిగా వరదుఁడై	167
వడిఁ బడియెఁ బిడుగు	513
వనగతులని వారలపైఁ	35
వనజాయతాక్షి కతిపయ	227
వనమునందుఁ బండ్రెండు	116
వనమునందును బండ్రెండు	563
వనమునఁ బండ్రెండేండ్లును	113
వనమునకు వచ్చి నవయంగ	18
వనరాశి యేమికారణమున	367
వనవాసము సేయుచుఁ	31
వయోవిద్యావైభవంబుల	260
వరదుఁడు పార్థశౌర్య	140
వరదుఁడైన యీశువరమున	370
వరదు సురాసురవందితుఁ	141

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
వరములు వేల్పులచే	175	వారిదమార్గంబువలన	153	వీతభయుఁ డిల్వలుండును	335
వరుణజలంబుల మిత్రా	358	వారిధారల ననివారిత	507	వీతహర్షక్రోధులైన	127
వఱలఁగ రాముఁ డంత	413	వారిభక్షులు పర్ణభక్షులు	225	వీనిచేతఁ దలంపంబడియెడు	243
వలచి హితంబునఁ బథ్యముఁ	64	వారిరుహనేత్ర మదన	201	వీనిపుట్టిన పాపంపువేళఁ	24
వలవ దుడుగుండు మీరని	5	వారిరుహమిత్రు నమరోరగ	19	వీరభోజ్యము సుమ్ము రాజ్యము	283
వలవదు వీనియింటఁ గుడువన్	344	వార్ష్ణేయుండును నలుపుత్రుల	268	వీరలం జూడు మని దివ్య	150
వశము గాక బాష్పవారి	272	వార్ష్ణేయుండును బాహుకు	260	వీరల దుఃఖము దీర్పక	115
వసుధ నధర్మవర్తులగు	330	వాసర నాయకుం దలఁచి	554	వీరల విడువ నోప	18
వసుమతీరాజ్యంబు వలన	52	విక్రమము విడిచి సమరా	74	వీర లింకఁ బాండవుల	33
వసు రుద్రాదిత్యాదులు	17	విజనంబైన విపినంబునందు	275	వీరసేనసుతుఁడు వీరుండు	188
వాఁడును బిత్రువచన	483	విజయు కుశలవార్త	327	వీరిద్దఱు సోమార్వులు	430
వాతాపి యనువాని నెట్లు సంపె	335	విదితముగఁ దీర్ఘకీర్తనఁ	319	వీరుండు క్షత్రియులఁ దన	300
వానిఁ జూచి నలుఁడు దా నల్గి	264	విదితముగ నిన్నుఁ జేయించెదఁ	430	వీరుండై సౌగంధిక	508
వానికిం దేజస్వియను ఋషి	348	విద్యుల్లతాంగి భార్గవు	425	వీరుఁడు యోగవిద్యయును	126
వానికి వెఱచి పఱచి	466	విధివశంబున నన్నుం	227	వీరులగు భీష్మకుంభజ	120
వానినెల్ల నస్మదీయ	78	విధివిలసితంబు పేర్మి	572	వీరులగు సగరతనయుల	374
వానియేయు శరంబుల	68	విధ్యుక్తంబుగా నక్కోమలి	340	వీరులగు సాల్వయోధుల	78
వాయుసుతప్రేరితశిత	531	వినయవిహీనుల దుర్యోధన	63	వృత్తవంతుండు వెండియు	577
వారల చెప్పినట్ల తన	343	వినవమ్మ! తృణముష్టిఁ గొని	271	వృద్ధని జాత్యంధుండని	175
వారలచేఁ బూజితులై	329	వినవయ్య! కర్ణుగర్వం	118	వృద్ధు గొడుకుపలుకు విని	91
వారలతో విగ్రహించి	172	వినవయ్య! కార్తవీర్యుఁడు	411	వేగవంతుఁడను వీరుఁడు	69
వారల నిద్దఱ వారించి	522	వినవయ్య! నహుషుఁడన్	572	వేదములయందు వినఁగఁ	307
వారల పుణ్యోదయమున	119	వినవె పులోమయుఁ గాలక	557	వేదశాస్త్రములును విధి	102
వారల రోయఁగఁ బంచె	245	వినవె శతయోజనంబులు	268	వేవురఁబోలెడువాని మహా	347
వారలు గంధమాదన	478	విని శంకింపక చెచ్చెర	238	వ్యాధి శ్రమానిష్టసంస్పర్శ	10
వారలు దుర్యోధనుచే	122	వినుఁ డేఁ బుణ్యశ్లోకుం డనఁగ	227	వ్రతములు లేనివారు	320
వారలు వారిధి గడవఁగ	494	విను మేనును నీవును	35	**శ**	
వారలు సమయము దప్పిన	42	విప్రు కడుపులో నున్న యప్పీరు	336	శక్రపదవిఁ బొంది సద్బ్రాహ్మణుల	568
వారికి ధర్మతనయుండు	417	విమలస్ఫాటికహాటక	529	శతమఖునకు భువనావన	158
వారికి ధర్మువు దప్పని	172	విమలహర్మ్యంబుల విహరించు	91	శతవర్ష వృద్ధుఁడవు	461
వారికి వాసుదేవ ధృష్టద్యుమ్నులు	43	వీఁడు నీచేత వధ్యుండు గాఁడు	76	శత్రుల నాజి నోర్చుటయు	109
వారిజాసనుండు వారల	371	వీకున నశ్వమేధములు	435	శమితనిజక్రోధుండై	410

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
శరణనినవారిఁ గరుణా	60
శరీరికి మరణంబు	115
శాంతుఁడు ఋశ్యశృంగుఁడను	387
శారదరాత్రు లుజ్జ్వల	581
శారీర నియమంబులు	329
శారీర మానస మహాదారుణ	9
శివుఁడు వీనికిఁ బ్రీతుఁడై	169
శూరులు ధృతరాష్ట్రసుతులు	118
శోకభయస్థానంబు లనేకంబులు	9
శోకమూర్ఛితుండై మహీతలంబు	9
శోకాపనోదిఁ బుణ్యశ్లోకుని	252
శ్యేనకపోతరూపంబులు	451
శ్రీకంఠ! లోకేశ! లోకోద్భవ	142
శ్రీకీర్తి శ్రీవల్లభ!	1
శ్రీమందిర! బుధజన	351
శ్రీరమ్యధర్మనిత్య	184
శ్రీరమ్య! రాజకులశేఖర!	524
శ్రీరాజరాజ! కులనిస్తార!	527
శ్వద్యుతియందలి దుగ్ధంబు	111
స	
సంకల్పజం బైన కామంబునఁ	16
సందియ మేల సర్వగుణ	273
సకలగుణప్రసిద్ధుఁడగు	263
సకల దురితముల (283-అ)	320
సకలర్తుసురభికుసుమిత	158
సగరసుతు లట్లు జగముల	371
సతతకృతోపవాసముల	379
సత్యక్షమాదమశౌచ	575
సత్యభంగభీతుండవు	178
సత్యశమహీను లగుదురు	499
సమయాతిక్రమభీతిని	107
సమయాబ్దంబులకంటె	178
సమరవిముఖత్వమును	73
సమరసన్నద్ధుఁడై సమస్త	34
సమస్త భువనాశ్రయా! వినయ	349
సముచితంబగు మృదు	481
సరవి నాధూత రజః	333
సర్వజనులును ధృత	31
సర్వభూతంబులు నాహారం	448
సవ్యాపసవ్య విచిత్రమండల	75
సహకార మత్ప్రియసహకారున్	224
సాంబుఁ బాయు మనుచుఁ	69
సాగరులకు సద్గతిగా	383
సాధితశాత్రవు లగు	121
సాధుసమ్మతంబు లైన	4
సాధ్వి నాకుఁ గూర్చు సంతతి	258
సాల్వబాణవిగతసత్త్వుఁడ	74
సాల్వుండు నిజసేనాసంక్షోభ	70
సాహసం బిట్టుసేయంగఁ	370
సీతాన్వేషణపరులై	493
సుజనుల సహవాసంబునఁ	39
సుతషష్టిసహస్రక	371
సుర గరుడ గంధర్వ	535
సురచాపచిత్రగగన	580
సురదుందుభినాదంబులు	130
సురమునిసిద్ధఖేచరవరుల్	382
సురలకుఁ బ్రీతిసేసితి	560
సురవరులఁ దొఱఁగి తన్నున్	275
సురవిశిఖప్రయోగములు	562
సురసమూహంబుతో సుర	171
సుర సిద్ధ మునిసేవితంబైన	484
సురుచిరకీర్తి నైమిశముఁ	311
సురుచిర సురూపగుణ	385
సూర్యగ్రహణంబున దాని	309
సోమకుఁడను రాజర్షి	439
స్నేహార్ణవ మగ్నుండయి	10
హ	
హంసచేఁ దన వినినంతకంటెను	199
హంసవర్ణోత్తమ హయములఁ	71
హతశేషులైన రాక్షసు	535
హనుమంతుఁడును మెల్ల	491
హరుఁ డాదిగాఁ గల	546
హరుఁడు వానికిఁ బ్రత్యక్ష	368
హరుఁ బెనఁగి పట్టుకొని	140
హరుచేత సంప్రాప్తవరుఁడయ్యె	150
హరుశరమును నరు	135
హా మహారాజ! మహామహీ	219
హారివిషయాభిలాషము	15
హితుఁడైన తన పురోహితు	21
హ్రస్వపీనగ్రీవు నచలితాయత	490

*****

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 5

ఆరణ్యపర్వ శేషము

(4వ ఆశ్వాసము 142వ పద్యమునుండి 5,6,7 ఆశ్వాసములు)

కృతికర్త

ఎఱ్ఱాప్రెగ్గడ

వ్యాఖ్యాత

డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్య

ప్రధానసంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITHRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Aranyaparvamu of Yerrapreggada
Vol. V.
Cantos 4 (concluding portion),5,6, and 7

Commentary by
Dr. Nanduri Ramakrishnamacharya

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Publications Series No.604
First Edition : August 2000
First Re-print : 2006

Second Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D. Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్పైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియు వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్

భారతీయుల విజ్ఞాన సర్వస్వం భారతం. ఈ గ్రంథం తొలుతటిపేరు 'జయం'. వేదవాఙ్మయం యొక్క సారం ఇందులో ఇమిడి ఉన్నందున ఇది పంచమ వేదంగా ప్రశస్తిగాంచింది. పూర్వం దేవతలు, ఋషులు – దీని మహిమను పరీక్షించదలచి – నాలుగు వేదాలను ఒక వైపు, ఈ గ్రంథాన్ని మరోవైపు తులలోపెట్టితూచినారట! ఈ గ్రంథం ఉన్నవైపే అధికంగా ముల్లు చూపినందువలన, ఈ జయేతిహాసం మిగుల మహత్త్వం కలదిగా, చతుర్వేదాలకన్న బరువైనదిగా వెల్లడయింది. ఆనాటి నుండి ఈ గ్రంథానికి 'మహాభారత' మనే నామధేయం సార్థకంగా స్థిరపడింది. "మహత్త్వాత్ భారవత్త్వాత్ చ మహాభారత ముచ్యతే" – అనే నిర్వచనం అలా ఏర్పడింది. 'భరత వంశీయుల చరిత్ర భారతం' – అనే వ్యుత్పత్తి కూడ ఇందుకు తోడయింది.

భారతంలోని భాగాలకు పర్వాలని పేరు. 'పర్వ' మంటే చెఱకు గణుపు. మహాభారతం పదునెనిమిది గణుపులు గల చక్కని చిక్కని చెఱకు గడవంటిదని వ్యాసభగవానుని అభిప్రాయం. చెఱకుగడలో ప్రతి గణుపులోనూ మధురరసం సమృద్ధిగా ఉన్నట్లే, భారతంలో గల ప్రతి పర్వంలోనూ కావ్యరసం పుష్కలంగా నెలకొని ఉంటుందనే భావం ఇందులో వెల్లడౌతున్నది. "భారతం చేక్షుఖండం చ ప్రతిపర్వరసోదయమ్"– అనే ఆర్యోక్తి ఈ సత్యాన్ని చాటుతూవుంది.

మహాభారతం దివినుండి భువికి దిగివచ్చిన దివ్యగంగావాహిని; పారిజాత కల్పవృక్షం; సమస్త కళలతో విరాజిల్లే పూర్ణచంద్రుడు; అమృతకలశం – ఇలా ఈ జాతీయ కావ్యం యొక్క మాహాత్మ్య వైభవం ఆ యా సందర్భాల్లో అనేక రీతుల అభివర్ణింపబడింది.

దేవభాషలో అవతరించిన భారతం కాలక్రమేణ తమిళ, కర్ణాటాది దేశభాషలలోనికి అనువదింపబడుతూవచ్చింది. ప్రాంతీయ భాషలలో వెలువడిన ఆ యా భారతానువాదాలన్నిట్లోనూ తెలుగులో 'కవిత్రయం' వారు రచించిన ఆంధ్రమహాభారతం విశిష్టమై విలసిల్లుతూవుంది. కృష్ణద్వైపాయనుడు ఏ పరమార్థాన్ని మూలంలో నిరూపించాడో, ఆ నిరూపితార్థం చెక్కుచెదరకుండా పుణికి పుచ్చుకొని ఆవిర్భవించిన స్వతంత్రరచన ఆంధ్రమహాభారతం. కవిత్రయం కావించిన పునఃసృష్టి !

ఆంధ్రావళికి ఆదికావ్యాన్ని ప్రసాదించిన మహాకవులు ముగ్గురూ త్రిమూర్తుల వంటివారు. వారిలో ఆదికవియే విష్ణువు, కవిబ్రహ్మయే బ్రహ్మదేవుడు, ప్రబంధ పరమేశ్వరుడే పరమేశ్వరుడు. ఈ ముగ్గురు సారస్వత మూర్తులు వేరు వేరు కాలాల్లో, తెలుగుదేశంలోని వేరు వేరు ప్రాంతాల్లో తమ తమ రచనల్ని కొనసాగించినప్పటికీ, కవిత్రయ భారతం స్వరూపంలోనూ, సందేశంలోనూ ఏకవాక్యతతో విలసిల్లుతూవుంది. ఇది ఆంధ్రావనికి దైవికంగా సిద్ధించిన అదృష్ట విశేషం ! తరతరాల తెలుగు జాతికి ఆదర్శంగా తెనుగు సాహితీ మందిరంపై నిర్మించిన సమున్నత స్వర్ణగోపురం ఆంధ్రమహాభారతం ! ఆ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సుందర గోపురాన్ని నెలకొల్పిన అక్షరశిల్పులు “కవిత్రయం” అందరకూ ఆరాధ్యులు !!

భారతంలోని పర్వాల్లో మూడవది ఆరణ్యపర్వం, ధర్మాత్ములైన పాండునందనులకు విజయం తథ్యమనే విషయానికి స్పష్టమైన నిదర్శనాలు మొదటిసారిగా ఈ పర్వంలో గోచరిస్తాయి. ‘ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ భగవానుడు ఉంటాడు; ఎక్కడ భగవానుడు ఉంటాడో అక్కడ విజయం నిశ్చయం’.

“యతో ధర్మః తతో విష్ణుః, యతో విష్ణుః తతో జయః’

– అనేదే ఆరణ్యపర్వం యొక్క ప్రధాన సందేశం !

‘ధర్మోవిగ్రహవానివ’ – అని కొనియాడబడిన ధీరోదాత్తుడు యుధిష్ఠిరుడు. ధర్మమూర్తియైన ఆ మహారాజు రోమశుడనే మహర్షిని అడిగిన ప్రశ్న – తీర్థయాత్రల ప్రయోజనాన్ని గూర్చి తెలిపేది – ఈ సందర్భంలో ముఖ్యంగా ప్రస్తావింపదగి ఉంది :

అచేతనాలైన కొండలు, నదులు, సరస్సులు మొదలైనవి జనుల పాపాలను పోగొట్టేవై ఉండటానికి గల కారణమేమి? – అని ధర్మజుడి ప్రశ్న.

ధర్మపరాయణులైన దేవతలు, ఋషులు వాటిని ఆసక్తితో ఆశ్రయించి ఉండటం చేత పర్వతాలు, నదులు, సరోవరాలు మొదలైనవి పవిత్రాలై, పుణ్యతీర్థాలై, జనుల పాపాలను నివారిస్తూ, వారి వారి కోరికలను ఈడేరుస్తూ, జగత్తును పావనం చేస్తూ ఉంటాయి – అని రోమశుడి సమాధానం.

(ఆరణ్యపర్వం, రెండవ ఆశ్వా., 309వ వచనం, 317వ వచనం.)

ఈ సమాధానం తీర్థయాత్రలయొక్క ప్రాముఖ్యాన్ని, పరమార్థాన్ని చక్కగా విశదీకరిస్తూ వుంది.

తిరుమల తిరుపతి దేవస్థానములు చేపట్టి నిర్వహిస్తూ వున్న అనేక ధార్మిక ప్రచురణల కార్యక్రమాల్లో “వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారత ప్రచురణ ప్రణాళిక” విస్తృతమైనది, విశిష్టమైనది. ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా నన్నయభట్టారకుని ఆదిపర్వం (రెండు భాగాలు), సభాపర్వం – ఇటీవలే (కడచిన మే నెలలో) దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు గౌ॥ శ్రీ దండు శివరామరాజు మహోదయుల కరకమలాల మీదుగా ఆవిష్కరింపబడినాయి.

ఇప్పుడు ప్రచురితమైన ఆరణ్యపర్వం మూడవ సంపుటం. ఈ సంపుటం కూడ గ్రంథ పరిమితి ననుసరించి, పాఠకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని రెండు భాగాలుగా వింగడింపబడింది. ఆరణ్యపర్వం రెండు భాగాల్లో ఇది రెండవ భాగం. ఈ రెండవభాగం ప్రథమభాగ రచయిత అయిన నన్నయభట్టు పేర ఎఱ్ఱాప్రెగడ రచించినది. ఈ విధంగా ఆరణ్యపర్వాన్ని తెలుగులో రెండు వేర్వేరు భాగాలుగా ప్రచురించటం ఇదే ప్రథమం.

ఒకానొక ప్రాచీన కవి కవిత్రయ భారతాన్ని వాగ్దేవిశారద ధరించిన ముత్యాలహారంగా వర్ణించాడు. ఆ హారంలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కొంతమేర నన్నయ్యభట్టు కూర్చాడు. ఆ మాలికలో చాలా భాగాన్ని తిక్కనసోమయాజి సమకూర్చాడు. ఈ ఇరువురు కవీంద్రులు కూర్చిన భాగాలు రెంటిని ఎఱ్ఱాప్రెగ్గడ అరణ్యపర్వశేష రచనమనే తన కూర్పుతో సొంపుగా కలిపి, ఆ ముత్యాల కంఠమాలకు సమగ్రతను సుందరమైన ఏకరూపతను తీర్చిదిద్దినాడు. అలా ఆ మహాకవి సంధానించిన అరణ్యపర్వశేషం ఈ రెండవ భాగం. ఈ భాగం ఆంధ్ర మహాభారత కావ్యహారం నడుమ వెలుగులీనుతున్న సువర్ణ పతకంగా భాసిస్తూవుంది. ఈ సువర్ణ పతకం నట్టనడుమ నీలికాంతుల నిగ్గులతో ప్రకాశించే నాయకమణి రామోపాఖ్యానం !!

ఈ పర్వానికి వ్యాఖ్యను సమకూర్చినవారు డా॥ నందూరి రామకృష్ణమాచార్యులుగారు. దీనిని పరిష్కరించినవారు 'వ్యాఖ్యాసహిత కవిత్రయాంధ్రమహాభారతం ప్రాజెక్టు' ప్రధాన సంపాదకులు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు. మరియు, ఈ వాఙ్మయ యజ్ఞంలో పలుతెఱగుల పాలుపంచుకొంటున్న విద్వాంసులు, విద్యావేత్తలు అనేకులు ! సుగృహీత నామధేయులయిన ఈ సహృదయులందరికీ పేరుపేరున కృతజ్ఞతాభివాదాలు తెలుపుతున్నాము.

నిత్యకల్యాణ మూర్తి అయిన వేంకటేశ్వరుని అనుగ్రహ విశేషం వలన, వ్యాఖ్యాన సమేతమైన ఈ జయేతిహాసం సర్వజనులకు జయప్రదము, ఆనంద సంధాయకము కాగలదని మా ఆశయము, ఆకాంక్ష.

అనతికాలంలోనే ప్రతులన్నీ చెల్లిపోయిన కారణంగా పునర్ముద్రిస్తున్నాము. ఎప్పటిలాగే పాఠకులు సమాదరిస్తారని ఆశిస్తున్నాను.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీవేంకటేశ్వరస్వామి వారి దివ్యానుగ్రహంతో తిరమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమస్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 - 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్లవేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జూలై 11వ తేదీన హైదరాబాదు బాలాజీభవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయం జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరం. మూలములో ఉన్న కఠినపదాలు పరిహరించి, సుబోధకములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథంగ వ్రాయవలెను. అర సున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్లవేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమిష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నందూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్పురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్లవేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిగమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగాపర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీమధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జులై 3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్దారెడ్డి గారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఓరియంటల్ కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక"ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥కె. సర్వోత్తమరావు	**శ్రీడి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్**

సలహాసంఘం

ఆచార్య తూమాటిదొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీకాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిని అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జూలై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీడి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీస్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలో ని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్లకొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పంద్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి, విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి''.

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాష్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదక మండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంపాదకమండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య
డా॥ కె.జె. కృష్ణమూర్తి
శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
డా॥ కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

శ్రీ ఎ. సుభాష్‌గౌడ్
డా॥ మేడసాని మోహన్
డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద
డా॥ బిరుదురాజు రామరాజు
డా॥ ఎం. కులశేఖరరావు
డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలులలోని సభ్యులయొక్క సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటా లన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్తపాత్రను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ప్రథమ సంపుటం - ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం - సభాపర్వం వెలువడినాయి. ఇప్పటి కార్యనిర్వహణాధికారి అయిన డా॥ పి. కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారు వచ్చిన తక్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణను గూర్చి ఆసక్తితో గమనిస్తూ అన్నివిధాల సహకరించి ఆది సభా పర్వాల విడుదలకు ఏర్పాటు చేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాల నిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ ప్రణాళిక వ్యాఖ్యాసహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. తరువాతి సంపుటాలు సైతం త్వరలోనే వెలుగుచూడనున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారతం' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి అధికారికమైన ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన సహృదయులు డా॥ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారికి అనేక ధన్యవాదాలు. తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి డా॥ పి.కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. సాహిత్య ప్రీతి కలవారైన తి.తి.దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ కె.నారాయణ, ఐ.ఏ.ఎస్., గారికి వందనములు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంబంధిత విభాగాధిపతిగా నూతనముగా వచ్చి సలహామండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన డా॥ పి. రంగారావు, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయసహకారాలందించిన తదితర అధికార గణానికి నమస్సులు. ఈ ప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధాన పాత్ర వహించిన - వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదక మండలి, సలహా మండలి) యందలి విద్యావేత్తలు ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు - ఈ విద్వాంసులందరికి నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి. దేవస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడం వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్ కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానిక పండితవర్యుల ఒక ఉపసంఘం (ఎడిటోరియల్ సెల్) నిర్మాణానికి సిఫారసు చేయగా, దేవస్థానం ఆమేరకు ఎడిటోరియల్ కమిటీలో ఉన్న **డా॥ కె.సర్వోత్తమరావు, డా॥ కె.జె.కృష్ణమూర్తి గారలతో స్థానికులైన విద్వాంసులు, పండితవరేణ్యులు శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీ ముదివర్తి కొండమాచార్యులు** గారలతో ఎడిటోరియల్ సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈ సెల్ ఉపకారం మరువరానిది. వీరు వర్క్‌షాపువలె శ్రీ వేంకటేశ్వర లైబ్రరీ మరియు పరిశోధన కేంద్రంలో నిర్వహించబడ్డ కవిత్రయ మహాభారత యజ్ఞంలో పాలుపంచుకొన్నారు. అందువలననే అతి త్వరితకాలంలో ఆరణ్యపర్వ శేషభాగం ముద్రణ ఔతూ ఉండగా విరాటపర్వం కూడ ప్రెస్సుకు పంపగల్గుతున్నాము. తక్కిన పర్వసంపుటాలను ఇలాగే అందించగలమని ఆశిస్తున్నాము.

"సప్తగిరి" సంపాదకులుగా ఉండి, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి ప్రముఖ పాత్ర వహించిన కీ.శే. కాత్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్నివిధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె.రాధారమణ, డాక్టర్ ఎ.సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి.ఎన్.శ్రీనివాసన్ గారికి, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పాఠకులకు అతి తక్కువ వ్యవధిలో ముద్రించిన టి.టి.డి. ముద్రణాలయ అధికారి శ్రీ ఐ.పార్వతీశ్వర రావు గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీవేంకటేశ్వరస్వామి వారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ ఎన్.ఎస్. రామమూర్తి
కన్వీనర్
సంపాదకుడు - సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదకమండలి

అధ్యక్షులు

అజేయ కల్లం, ఐ.ఎ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకులు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం

సంపాదకమండలి సభ్యులు

ఆచార్య నందూరి రామకృష్ణమాచార్యులు

శ్రీపొత్తూరి వేంకటేశ్వరరావు

ప్రొ॥ఎస్.బి. రఘునాథాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె.జె. కృష్ణమూర్తి

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

డా॥ రంగారావు (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ ఎం. కులశేఖరరావు

డా॥ మేడసాని మోహన్ (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు

డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ ఎం. బుద్ధన్న

కన్వీనర్

డా॥ ఎన్.ఎస్.రామమూర్తి,

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా. 1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా 1,2
4. డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా. 2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా. 4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా. 5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్న శాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	అను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	అను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	అను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది.	-	ఆదిపర్వం
సభా.	-	సభాపర్వం
ఆర .	-	ఆరణ్యపర్వం
విరా.	-	విరాటపర్వం
ఉద్యో.	-	ఉద్యోగపర్వం
భీష్మ.	-	భీష్మపర్వం
ద్రోణ.	-	ద్రోణపర్వం
కర్ణ.	-	కర్ణపర్వం
శల్య.	-	శల్యపర్వం
సౌప్తి.	-	సౌప్తికపర్వం
స్త్రీ.	-	స్త్రీ పర్వం
శాంతి.	-	శాంతిపర్వం
అను.	-	అనుశాసనికపర్వం
అశ్వ.	-	అశ్వమేధపర్వం
ఆశ్ర.	-	ఆశ్రమవాసపర్వం
మౌస.	-	మౌసలపర్వం
మహా.	-	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	-	స్వర్గారోహణపర్వం
సం.	-	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	-	సంస్కృత మహాభారతము
అను.	-	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	-	ప్రధాన సంపాదకుడు

క.	-	కందపద్యం
వ.	-	వచనం
ఆ.	-	ఆటవెలది
తే.	-	తేటగీతి
సీ.	-	సీసం
ఉ.	-	ఉత్పలమాల
చ.	-	చంపకమాల
మ.	-	మత్తేభ విక్రీడితం
శా.	-	శార్దూల విక్రీడితం
ఆశ్వా.	-	ఆశ్వాసం
క్రీ.శ.	-	క్రీస్తుశకం
య.	-	యగణం
మ.	-	మగణం
త.	-	తగణం
ర.	-	రగణం
జ.	-	జగణం
భ.	-	భగణం
న.	-	నగణం
స.	-	సగణం
ల.	-	లఘువు
గ.	-	గురువు
అలం.	-	అలంకారం
సం.	-	సంవత్సరం
మొ.	-	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పీఠిక

[పీఠిక విషయసూచిక-1. కవిత్రయ కీర్తన సంప్రదాయం-పు. 2; 2. ప్రబంధపరమేశ్వర బిరుదం : ఆరణ్యపర్వశేషం-పు2; 3. ప్రబంధపరమేశ్వరుడు : త్రిముఖాత్మకత-పు.4; 4. ప్రాచీన మహాకవులవలె కవిత్వం చెప్పటం; ప్రబంధ పరమేశ్వరత్వం-పు.5; 5. విశిష్ట ప్రక్రియా నిర్మాణ దక్షత : ప్రబంధ పరమేశ్వరత్వం-పు.5; 6. ఆరణ్యపర్వశేష వస్తు వైశిష్ట్యం: ప్రబంధ పరమేశ్వరత్వం-పు.6; (1) పురాణవస్తువు-పు.7; (2) పురాణ వస్తువిశేషాలు-పు.9; (3) ఇతిహాస శ్రవణం : ఇతరాంశాలు-పు.13; (4) ఇతిహాస శ్రవణఫలం-పు.13; (5) యక్ష ప్రశ్నలు : ధర్మజపరిజ్ఞానం-పు. 16; 7. ఆరణ్యపర్వశేష నిర్వహణ నైపుణ్యం : ప్రబంధ పరమేశ్వరత్వం-పు. 18; (1) ఆరణ్యపర్వశేషం: ప్రబంధపరమేశ్వరుని ప్రయోగపర్వం-పు 19; (2) నన్నయ ప్రసాదకవి: ఎఱ్ఱయ మధురకవి-పు.20; (3) విడమరచి, విస్తరించి, మధురంగా, మనోహరంగా చెప్పటం-పు.21; (4) ఎఱ్ఱన కవిత: ఆర్ద్రమైన ఆత్మీయత, మాధుర్యం-పు.22; (5) ధర్మవ్యాధోపాఖ్యానం: విడమరచి చెప్పే విద్య-పు.24; (6) కుమారస్వామి కథ : విస్తరించి చెప్పే విద్య-పు.22; (7) పరిక్షితుని కథ: మధురంగా చెప్పే విద్య-పు.29; 8. ఆరణ్యపర్వశేష కవితా వ్యక్తిత్వం : ప్రబంధ పరమేశ్వరత్వం-పు.32; (1) 'కావ్యశయ్యఁ గీలించిన కీర్తి'-పు.34; (2) కవిత్రయ కవితాశయ్యలు-పు.35; (3) ఎఱ్ఱన కావ్యశయ్య : భారతీవృత్తి-పు.35; (4) ఎఱ్ఱన రచన : మాధురీగుణం, పాంచాలీ రీతి-పు.38; (5) ఎఱ్ఱనకవిత మంజుల వాగమృత ప్రవాహం-పు.38; 9. ప్రబంధపరమేశ్వరుడు : చతురోక్తి పథాలు-పు.39; (1) చతురోక్తి : సూక్తివైచిత్రి-పు.40; (2) చతురోక్తి : మధురోక్తి-పు.43; (3) చతురోక్తి : అలంకృతోక్తి : అలంకారధ్వని-పు.43; (4) చిత్రకవిత: శబ్దవైచిత్రి-పు.44; (5) ఎఱ్ఱన వాగ్విలాసం; అతి గాంభీర్య విభూతి-పు.46; (6) శరత్కాలవర్ణనం: వస్తు-అలంకార ధ్వనులు-పు.47; (7) మూడు పద్యాల ముడులు: మూడు గుణాల సందడులు-పు.51; (3) మూడు రసాభాసాలు-పు.58; (4) మూడు ఉక్తివైచిత్రులు- పు.60; (5) మూడు వీరరసభేదాలు-పు.61; (6) ముగ్గురు పతివ్రతల కథలు-పు.63; (7) మూడు ఎఱ్ఱ(న) గుర్తులు-పు.64; (8) మూడు రుచుల ముప్పన్నె సొబగు-పు.66; 11. రామాయణ కథ మధుర మనోహరం-పు.67; 12. సావిత్రి కథ మధురమహోజ్జ్వలం- పు.70; 13.ఆరణ్యపర్వం : అంతరార్థం-పు.75; 14. కవిత్రయ మహాభారతం : వ్యాఖ్యానం-పు.76;] [(ఆరణ్యపర్వకథాసారం (రెండవభాగం) : అనుబంధం-పు. 78.]

ఉ. "భారత కావ్యహార మొక భాగము నన్నయభట్టు గూర్చె ము
క్తారమణీయ వాక్యములఁ దక్కిన భాగము సోమయాజి పెం
పార నొనర్చె, రెంటిఁ గలయన్ శివదాసుఁడు మధ్యనాయక
శ్రీ రచియించె శారద ధరింపఁ, గవిత్రయకీర్తి మించఁగన్".

చింతలపూడి ఎల్లనార్యుడు (తారకబ్రహ్మరాజీయము)

శ్రీమదాంధ్ర మహాభారతం శారద మక్కువతో ధరించే ముక్తారమణీయ కావ్యహారం. అందులో కొంతభాగం నన్నయభట్టు కూర్చాడు. తక్కిన భాగం తిక్కన సోమయాజి సమకూర్చాడు. శంభుదాసుడైన ఎఱ్ఱాప్రెగ్గడ ఆ దండకు మధ్యనాయక మణిశ్రీని సంధానించాడు. దానితో కవిత్రయ కీర్తి మిన్నంటింది. ఆంధ్ర భారతి ధరించే భారత కావ్యహార నాయకమణి శ్రీ- ఎఱ్ఱాప్రెగ్గడ నన్నయ పేర వెలయించిన ఈ ఆరణ్యపర్వశేషం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

1. కవిత్రయ కీర్తన సంప్రదాయం

నన్నయ తిక్కనలు తమ తమ భాగాలను ముక్తా రమణీయ వాక్యాలతో రచించినట్లు ఆ విశేషణాన్ని ఇద్దరికీ అన్వయించేటట్లు పద్యంలో నాయకమణిగా అనుసంధించాడు చింతలపూడి ఎల్లనార్యుడు. నన్నయ తిక్కనల మీద ఎఱ్ఱాప్రెగ్గడకున్న సమగౌరవ భావం పై పద్యంలో ధ్వని. ఆ యిద్దరి కవితలు ఎంత అందంగా ఉన్నా, ఆ రెండు భాగాలను పరమరమణీయంగా అనుసంధానం చేసిన ప్రబంధపరమేశ్వరత్వం శంభుదాసుడైన ఎఱ్ఱనదే. ప్రబంధం అంటే పూర్వాపర సంగతి అనీ, రెండింటిని కలిపి వేసే గట్టిముడి అనీ అర్థాలున్నాయి. ఆ రెండువిధాలా ఎఱ్ఱన కృతి సార్థకమే. కాబట్టి తెలుగులో కవిత్రయ భావనకు ప్రారంభాన్నీ, పరిపూర్ణతనూ ఇచ్చిందీ, తెలుగు కవుల కా ముగ్గురిని కలిపి కీర్తించే ఒక సాహితీ సంప్రదాయాన్ని కల్పించిందీ ఎఱ్ఱాప్రెగ్గడే. కవిత్రయ కీర్తనం భావి కావ్యావతారికలకు కాంతి తోరణంగా ప్రకాశించింది. జక్కన కవి ఆ కవిత్రయ భావనకు మొదటిసారి కట్టిన ముక్తా తోరణం మచ్చుకు గమనిద్దాం.

ఉ. “వేయివిధంబులందుఁ బదివేవురు పెద్దలు సత్ప్రబంధముల్
పాయక చెప్పి రిట్లు రసబంధుర వాగ్విభవాభిరామ ధౌ
రేయులు శబ్దశాసన వరేణ్యులు నాఁగఁ బ్రశస్తి కెక్కిరే
యేయెడ నన్నపార్యుగతి నిద్ధర? నట్టి మహాత్ముఁ గొల్చెదన్.

చ. పరువడి భారతాఖ్య గల పంచమవేదము నాంధ్రభాష సు
స్థిరత రచించుచోఁ గృతిపతిత్వముఁ గోరి ప్రసన్నుఁడైన యా
హరిహరనాథుచేఁ బడసె నవ్యయసౌఖ్యపదంబు నెవ్వఁ డా
పురుషవరేణ్యుఁ దిక్కకవిఁ బూని నుతింతుఁ గృతాధ్వరోత్సవున్.

ఉ. ఈ త్రయిఁ దాఁ బ్రబంధ పరమేశ్వరుఁడై విరచించె శబ్ద వై
చిత్రి నరణ్యపర్వమున శేషము శ్రీ నరసింహ రామ చా
రిత్రములన్ బుధవ్రతగరిష్ఠత నెఱ్ఱయ శంభుదాసుఁ డా
చిత్రకవిత్వ వాగ్విభవ జృంభితుఁ గొల్చెద భక్తియుక్తితోన్. (విక్కమార్కచరిత్రము : 1.12-14)

లోకంలో త్రిమూర్తి భావనం త్రివేణీ భావనం వలెనే కవిత్రయ భావనం ఆంధ్ర సాహిత్య జగత్తులో సుప్రతిష్ఠితం. జక్కన వారిని బిరుదనామాలతో గుర్తించి పై పద్యాలలో ఒక వైశిష్ట్యాన్ని ప్రతిపాదించాడు. నన్నయ ‘శబ్దశాసనుడు’, తిక్కన ‘సోమయాజి’, ఎఱ్ఱన ‘ప్రబంధ పరమేశ్వరుడు’. బిరుదనామాల ప్రశస్తి తెలుగులో ఎఱ్ఱన కాలంలోనే అరుణోదయ స్ఫూర్తిని పొందింది.

2. ప్రబంధ పరమేశ్వర బిరుదం : ఆరణ్య పర్వశేషం

సీ. ‘భవ్యచరిత్రుఁ డాపస్తంబ సూత్రుండు। శ్రీ వత్సగోత్రుండు శివపదాబ్జ
సంతతధ్యాన సంసక్త చిత్తుఁడు సూర। నార్యునకును బోతమాంబికకును
నందనుఁ డిలఁ బాకనాటిలో నీలకం। ఠేశ్వరస్థానమై యెసక మెసఁగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు। ధన్యుండు ధర్మైకతత్పరాత్ముఁ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. డెఱ్ఱనార్యుండు సకల లోకైక విదితుఁ । డయిన నన్నయభట్ట మహాకవీంద్రు
సరససారస్వతాంశ ప్రశస్తి దన్నుఁ । జెందుటయు సాధుజనహర్షసిద్ధిఁ గోరి.

క. ధీరవిచారుఁడు తత్కవి । తారీతియుఁ గొంత దోఁపఁ దద్రచనయ కా
నారణ్య పర్వశేషము । పూరించెఁ గవీంద్ర కర్ణపుట పేయముగాన్'. (ఆర. 7.469-470)

ఎఱ్ఱన అరణ్యపర్వశేషాన్ని పూరించాడని తెలియటానికి ఆ కవియే తెరచిన వాఙ్మయ కవాటం ఈ పద్యద్వయం. మొదటి సీసపద్యం చదువగానే, ఆదిపర్వావతారికలో నన్నయభట్టు తనను గురించి చెప్పిన 'తనకులబ్రాహ్మణు ననురక్తు....' అనే సీస పద్యం తెలుగు వారి మనసులలో తళుక్కుమంటుంది. నన్నయ లౌకిక వ్యక్తిత్వాన్నీ, సాహితీ వ్యక్తిత్వాన్నీ ఆ పద్యం ఎట్లా రేఖాచిత్రంగా గీచి చెప్పిందో, ఎఱ్ఱయను గురించి పై సీస పద్యం కూడా ఒక చిత్రపటాన్ని అట్లా చిత్రించి మన కందించింది.

ఎఱ్ఱయ లౌకిక వివరాలు - పాకనాటిలో నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంవలన క్షేత్రగౌరవాన్ని పొందిన గుడ్లూరు జన్మస్థానంగా పుట్టి, పుట్టిన ఊరికే పుట్టెడు గౌరవం తెచ్చిన పుణ్యాత్ముడు. ఆపస్తంబసూత్రుడు, శ్రీవత్సగోత్రుడు, శివపదారాధనతత్పరుడు, పోతమాంబా సూరనార్యులనే పుణ్యదంపతుల పుత్రుడు. అతడు భవ్యచరిత్రుడు. ధర్మైక తత్పరుడు.

ఎఱ్ఱయ కవితా వ్యక్తిత్వ వివరాలు- సకల లోకానికీ తెలిసిన నన్నయభట్టు అనే మహాకవీంద్రుడి సరస సారస్వతాంశ ఎఱ్ఱయకు అబ్బింది - అనే ప్రశస్తి లోకంలో బాగా ఉన్నవాడు. చాల మంది సహృదయులు 'మీకు నన్నయ కవితారీతి కొంత అబ్బింది కదా! మీరు కూడా నన్నయవలె ఎందుకు కావ్య రచన చేయకూడదు? చేస్తే, మాకు అంతకంటె ఆనందం మరేముంటుంది?' అని ఎఱ్ఱయతో అంటూ ఉంటే- వారిని ఎట్లాగైనా సంతోషపెట్టాలనే అభిలాష పడినవాడు. అంతేకాదు - వారికి హర్షసిద్ధి కలిగే ఉపాయాన్ని గాఢంగా ఆలోచించిన ధీరవిచారుడు. ఆలోచించగా ఆలోచించగా అతడికి ఒక అద్భుతమార్గం తోచింది. నన్నయ కొంతమేరకు రచించగా మిగిలిన ఆరణ్యపర్వభాగం - ఆరణ్యపర్వశేషం - ఎవరైనా అర్హులు పూరించవలసి ఉన్నది. దాదాపు రెండున్నర శతాబ్దాల తరువాత నన్నయ కవితారీతి కొంత స్ఫురించి, నన్నయయే ఇన్నాళ్ళకు తన కవిత్వం తిరిగి చెప్పుతున్నాడా అన్నట్లు రచిస్తున్న తాను ఆ ఆరణ్య పర్వ శేషాన్ని నన్నయ రచనగానే వ్రాస్తే ఎంత బాగుంటుంది? అని అపూర్వంగా ఆలోచించినవాడు. ఆ విధంగా చేస్తే కవీంద్రులు (మహాకవులు) చెవులదొప్పలతో తన కవితను ఆస్వాదిస్తారని భావించినవాడు. నన్నయవలె తనను గురించి ప్రథమ పురుషలోనే చెప్పుకొనే నిరహంకార ప్రవృత్తి కలవాడు - ఎఱ్ఱాప్రెగ్గడ.

ఆరణ్యపర్వశేషం నన్నయపేర రచించినప్పుడు ఎఱ్ఱనకు ప్రత్యేకంగా బిరుదులున్నట్లు లేవు. 'శివపదాబ్జ సంతత ధ్యాన సంసక్త చిత్తు'డైనా శంభుదాసుడనే అభిజ్ఞనామం ఇంకా కుదురుకొన్నట్లు లేదు. కాగా, ఆరణ్యపర్వశేష రచనం వలన ఆయనకు ప్రబంధ పరమేశ్వరుడనే బిరుదనామం లోకంలో వ్యాపించిందని తన తాతగారైన ఎఱపోతసూరి ప్రశంసగా ఎఱ్ఱన చెప్పిన పద్యం సూచిస్తున్నది.

ఉ. "ఉన్నత సంస్కృతాది చతురోక్తి పథంబులఁ గావ్యకర్తవై
యెన్నికమైఁ బ్రబంధపరమేశుఁ డనంగ నరణ్యపర్వశే
షోన్నయ మంత్రభాష సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి తా
నన్నయభట్ట తిక్కకవినాథుల కెక్కిన భక్తి పెంపునన్". (నృసింహపురాణము 1.17)

ఎఱ్ఱన కృతులు నాలుగు. 1. రామాయణం, 2. ఆరణ్యపర్వ శేషం, 3. హరివంశం, 4. నృసింహపురాణం. (ఈ రచనలు ఏ వరుసలో వ్రాశాడన్న దానిపై భిన్నాభిప్రాయా లున్నాయి). వీటిలో ఆరణ్యపర్వశేషం నిర్వహించటంలో- నన్నయ సారస్వతాంశను కవితారీతిని ఆవహింపజేసికొనటంతోనూ, తిక్కన పలుకుబడిని రంగరించుకొనటంతోనూ, నన్నయ తిక్కనల ప్రక్కన ఎఱ్ఱన కవిత్రయంలో ఒకడుగా మాన్యత గడించుకొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎఱ్ఱన స్వభావరీత్యా కావ్యకర్త. 'లోకోత్తర వర్ణనానిపుణ కవికర్మ కావ్యమ్'- అనే లక్షణం చేత సహజంగా వర్ణనా నిపుణుడైన కవి ఎఱ్ఱన. ఇది సామాన్య లక్షణం. అతడికి 'ప్రబంధ పరమేశ్వరుడు' అనే కీర్తి వచ్చింది. ఇది విశిష్టార్థ బోధక వాచకం. ప్రకృష్టమైన బంధం ప్రబంధం. ఒక కవి తన రచనా శైలిచేత స్వీయ ముద్ర గల కవితారీతిచేత ఒక రచనను ప్రజల హృదయాలలో కలకాలం నిలపగలిగితే దానిని ప్రబంధం అనాలి. ఎఱ్ఱయ తనకు ముందు విశిష్ట రచనా శైలులు గల మహాకవులు తెలుగులో ఇద్దరే అన్నట్లు - నన్నయ తిక్కనలను పేర్కొన్నాడు. వారిద్దరిలో నన్నయ సరససారస్వతాంశ తనకు కొంత చెందిందని లోకంలో ప్రసిద్ధికెక్కాడు. దీనినిబట్టి ప్రబంధపరమేశ్వరత్వం అంటే- పూర్వకవుల రచనా రీతిలో రచన చేయగల ప్రజ్ఞాప్రావీణ్యం కలిగి ఉండటమే. నన్నయ తరువాత నన్నయవలె పద్యం చెప్పగల ఎఱ్ఱాప్రెగ్గడ తెలుగులో మొదటి 'ప్రబంధపరమేశ్వరు' డయ్యాడు. దానికి అక్షరసాక్ష్యం ఆరణ్యపర్వశేషం.

3. ప్రబంధపరమేశ్వరుడు : త్రిముఖాత్మకత

బిరుదాలకు అర్థం చెప్పటం కష్టం. 'కవిబ్రహ్మ' 'ప్రబంధపరమేశ్వరుడు' - ఈ రెండూ (ఎఱ్ఱన పేర్కొన్నవే) సమానార్థకాలని కొందరు విమర్శకు లన్నారు. అది స్థూలమైన పరిగణనం. సూక్ష్మ పరిశీలన చేస్తే 'బ్రహ్మ' శబ్దం సృజనాత్మక శక్తినీ, 'పరమేశ్వర' శబ్దం సర్వశక్తిమత్త్వాన్నీ (ప్రభుత్వాన్నీ) ధ్వనింపజేస్తాయి. ప్రబంధం కావ్యవాచియే అయినా దాని రచనా బంధం అందులోని ప్రధాన లక్షణం. ఒక్కొక్క ప్రబంధానికి ఒక్కొక్క రచనా బంధం (సంఘటన) సహజంగా రాణిస్తుంది. ప్రక్రియకు అనువైన రచనాబంధం ప్రసిద్ధంగా రాణించేటట్లు ప్రపంచించటం కూడా ప్రబంధపరమేశ్వరత్వమే. ఎఱ్ఱన నన్నయ శైలిని కూర్చగలడు, పురాణ శైలి వ్రాయగలడు, కావ్యశైలి నిర్మించగలడు, ప్రబంధ శైలి ప్రదర్శించగలడు. తిక్కన పద్ధతి వేరు. ప్రక్రియలు వేరైనా అతడి శైలి ఒక్కటే - కావ్యరూపక మిశ్రశైలి. కాని, ఎఱ్ఱన బహురూపశైలిని ప్రక్రియానుగుణంగా ప్రకటించగలిగాడు. అప్పటి కది గొప్ప వైచిత్రి, అపూర్వ ఫణితి. అందువలననే ఆతడి కా బిరుదం వచ్చింది.

ఎఱ్ఱన చేసిన ప్రతిప్రయోగం యౌగికంగా ఒక ప్రబంధం. ప్రబంధ శబ్దాన్ని ప్రక్రియాపరంగా, రచనా పరంగా అన్వయించుకొనాలి. రెండు గాని, అంతకంటె ఎక్కువ గాని ప్రక్రియల యొక్క లక్షణాలకూ, గుణాలకూ, స్వభావాలకూ ఏర్పడే గాఢమైన అనుబంధాన్నీ, సంఘటననూ, అంటుకట్టునూ ప్రక్రియాపరమైన ప్రబంధంగా గుర్తిస్తాం. దానికి తగినట్లు రచనలో సాగించే శబ్దార్థ రూపమైన శైలి కూడా ప్రబంధమే. అంటే - ప్రక్రియోచితమైన శైలిని ప్రదర్శించగల ఉక్తివైచిత్రి కూడా ప్రబంధపరమేశ్వరత్వంగా పరిగణించబడుతుందన్న మాట!

ఎఱ్ఱన ప్రయోగాలలోని ప్రబంధ స్వభావాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చును.

1. ఆరణ్య పర్వశేషము - కావ్యకవితాశైలి+ఇతిహాస వస్తువు+ కథా కథనాత్మక వర్ణనాత్మక మిశ్ర పద్ధతి.
2. హరివంశము - పురాణకవితాశైలి + ఇతిహాస వస్తువు + కథాకథన పద్ధతి.
3. నృసింహపురాణము - ప్రబంధకవితాశైలి + పురాణవస్తువు + వర్ణనాత్మక పద్ధతి.

వీటిలో నన్నయ తిక్కనలకు అనువుగా ఎఱ్ఱన మలచుకొన్నది మొదటి రకం ప్రబంధ శైలి. దానిని అతడు అన్ని ప్రక్రియలలోనూ పాటించలేదు. ఆయా ప్రక్రియలకు అనుగుణమైన శైలులను ఆయన వేరువేరుగా నిర్మించుకొన్నాడు. హరివంశంలో వస్తువు ఇతిహాసమైనా ఎఱ్ఱన పలికింది. పురాణ శైలి. నృసింహపురాణం వస్తుతః పురాణమైనా అందులో ఎఱ్ఱయ నిబంధించింది వర్ణనాత్మక ప్రబంధశైలి. అందుకే ఎఱ్ఱన కవిత పై మూడు ప్రయోగాలలో మూడు రకాలుగా ముచ్చట గొలుపుతుంది. అందువలననే ఆయన ప్రబంధ పరమేశ్వరత్వం కూడా మూడు రకాలుగా సార్థకమౌతుంది. 1. పూర్వమహాకవుల కవిత్వాంశలతో కవిత్వం చెప్పటం మొదటిరకం ప్రబంధ పరమేశ్వరత్వం. 2. వివిధ సాహిత్య ప్రక్రియల లక్షణాలను జోడించి ఒక వినూత్న

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మిశ్ర ప్రక్రియను రూపొందించటం మరొక రకమైన ప్రబంధ పరమేశ్వరత్వం. 3. ప్రక్రియకు తగిన కవితా శైలిని కల్పించటంతో పాటు దాని వ్యక్తిత్వానికి ప్రాణప్రదమైన ఉక్తిచమత్కృతి నొకదానిని పొందుపరచటం మూడో రకమైన ప్రబంధపరమేశ్వరత్వం. ఈ మూడు రకాల ప్రబంధ పరమేశ్వరత్వ గుణాలను వరుసగా ఆరణ్యపర్వశేష రచనతో, హరివంశ నృసింహ పురాణ రచనలతో సాధించిన మహాకవి ఎఱ్ఱాప్రెగ్గడ. ప్రబంధ పరమేశ్వరత్వానికి త్రిముఖాత్మక మహత్త్వాన్ని ప్రసాదించిన తొలి తెలుగు కవి ఎఱ్ఱన. అందుకే ఆయన అన్ని విధాలా అర్హుడైన ప్రబంధపరమేశ్వరుడు.

4. ప్రాచీన మహాకవులవలె కవిత్వం చెప్పటం ; ప్రబంధ పరమేశ్వరత్వం

తాను చూపిన ప్రబంధ మార్గాన్ని అనుసరించే కవులను భావికాలంలో కలిగి ఉండటం కూడా ప్రబంధ పరమేశ్వరత్వమే. నన్నయాది కవులు పూర్వకవిస్తుతిని చేశారు. అందులో వారి వారి అభీష్ట కవులను, వారి కవితాగుణాలను యథావకాశంగా ప్రస్తుతించారు. కాని, ఆయాకవుల కవితావైలక్షణ్యాలను తమ కవితలలో ప్రతిఫలింప చేసికొన్నట్లు గాని, వారి వారి కవిత్వాంశాలు తమకు సంక్రమించినట్లుగాని చెప్పిన జాడలు కానరావు. తెలుగులో మొదటిసారి ఎఱ్ఱన తనకవితలో నన్నయ సరససారస్వతాంశ ప్రతిఫలించిందనీ, నన్నయ కవితా రీతి కొంత కనపడుతుందనీ చెప్పుకొన్నాడు. ఇది పూర్వకవి స్తుతి కాదు. ప్రభావ ప్రసార ప్రశస్తి సంస్కృత వాఙ్మయంలో ఈ సంప్రదాయం సుప్రతిష్ఠితంగా ఉండేది. అటువంటి దానిని తెలుగులో వెలుగులోకి తెచ్చిన తొలికవి ఎఱ్ఱన. ఎఱ్ఱన తరువాత ఆ సంప్రదాయాన్ని ఒక ఘంటాపథంగా మార్చినవాడు శ్రీనాథుడు.

సీ. "వచియింతు వేములవాడ భీమన భంగి। నుద్దండలీల నొక్కొక్కమాటు;
భాషింతు నన్నయభట్టు మార్గంబున। నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు;
వాక్రుత్తుఁ దిక్కయజ్వ ప్రకారము రసా। భ్యుచితబంధముగ నొక్కొక్కమాటు;
పరిఢవింతుఁ బ్రబంధపరమేశ్వరుని తేవ। సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు...." (కాశీఖండము. 1.13)

కవిసార్వభౌముడు తన కవితపై పూర్వాంధ్ర మహాకవుల కవితారీతుల ప్రభావాలున్నాయని పేర్కొనటం ఆయన అనుకరణశీలాన్ని తెలిపే అవగుణం కాదు. అవిచ్ఛిన్న సంప్రదాయ పోషకుడైన కవి తనకు ముందున్న కవితారీతులలో తన ప్రజ్ఞాప్రాభవాన్ని ప్రకటిస్తూనే స్వతంత్ర కవితారీతిని భావికవుల కందించే సాహితీ సంప్రదాయాన్ని సంపన్నం చేస్తాడని పై సీస పద్యం చెప్పక చెప్పుతున్నది. ఈ మార్గం ప్రబంధ పరమేశ్వరుడైన ఎఱ్ఱన చూపిందే. అయితే ఈ ప్రస్థానాన్ని ప్రబంధపరమేశ్వరుల వంటి అరుదైన ప్రజ్ఞావంతులే చేయగలరు. అసమర్థులు ఆ మార్గాన్ని అనుసరిస్తే అనుకర్తలుగా మిగిలిపోతారు. ఎఱ్ఱన వలె యుగకర్తలు కాలేరు. ప్రాచీన కవుల కవితలలో తాను మెచ్చుకొన్న గుణాలు చెప్పటం వేరు. వారి కవితల నుండి తాను తెచ్చుకొన్న గుణాలు చెప్పటం వేరు. మొదటి పద్ధతి నన్నయాదులు నేర్పింది. రెండో పద్ధతి ఎఱ్ఱన ఆరంభించింది. ఆ పద్ధతిలో మార్గదర్శకుడైన ఎఱ్ఱాప్రెగ్గడ ప్రథమ ప్రబంధ పరమేశ్వరుడు.

5. విశిష్టప్రక్రియా నిర్మాణ దక్షత : ప్రబంధపరమేశ్వరత్వం

కావ్యేతిహాసం నన్నయ తిక్కనలు అపూర్వంగా దిద్దితీర్చిన ప్రక్రియ. దానిని మించి మరొక రచన చేయటం, ఎఱ్ఱనకు కూడా అసాధ్యమే. మహాభారతంమీది భక్తి చొప్పున, నన్నయ తిక్కనల కవితా మహత్త్వం మీద మక్కువ చొప్పున భారత ఖిలభాగమైన హరివంశాన్ని తెలుగుచేసి ఎఱ్ఱన మేలు చేశాడు. హరివంశాన్ని పురాణేతిహాసంగా ఎఱ్ఱన సంభావించాడు. కావ్యేతిహాసంకంటె విలక్షణమైనది 'పురాణేతిహాసం'. దానికి ఒక ప్రక్రియా గౌరవాన్ని కలిగించి తెలుగులో హరివంశాన్ని నిర్మించాడు. సంస్కృత హరివంశ ప్రక్రియ కంటె ఇది భిన్నమైనది. నన్నయ తిక్కనల బాటలో నడిచి ఎఱ్ఱన గూడ మహాభారత ఖిలభాగానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విలక్షణ ప్రక్రియా గౌరవాన్ని కలిగించి తెలుగు రచనను పునస్సృష్టిగా నిర్వహించాడు. దానికి సమకాలీనాంధ్ర సాహిత్య ప్రక్రియలు కూడా దోహదం చేసి ఉంటాయి. తిక్కన యుగంలో మార్కండేయ మహాపురాణం వెలసింది. మారన దానిని ఒక విలక్షణ కవితాశైలిలో రచించాడు. ఎఱ్ఱన అతడికంటె ఒక ప్రత్యేకతను ప్రదర్శించాడు. హరివంశ వస్తువును ఇతిహాసగతిలో సాగించి, కవితను పురాణశైలిలో నిబంధించాడు. ఆకృతికి ఇతిహాసంగా, అనుభూతికి పురాణంగా ఎఱ్ఱన చేతిలో హరివంశం రూపొందింది. నన్నయ తిక్కనల కంటె భిన్నమైన కవితాశైలి కావటం చేత, కావ్యేతిహాసంకంటె విలక్షణమైన మిశ్ర ప్రవృత్తి గల ప్రక్రియ కావటం చేత ఎఱ్ఱన హరివంశానికి ప్రత్యేక గౌరవం ఏర్పడింది. కొందరు హరివంశ రచన వలననే ఎఱ్ఱన ప్రబంధపరమేశ్వరు డయ్యాడన్నారు. అది కూడా కాదన లేని సత్యం!

నృసింహపురాణమని పిలువబడే ఎఱ్ఱన రచనను 'నరసింహావతారం బను పురాణ కథ' అని కవియే గద్యలో చెప్పుకొన్నాడు. అంటే దశావతారాలలో ఒకటైన నృసింహావతారపు ఆవిర్భావ కథను పురాణ కథగా ఎఱ్ఱన రూపొందించదలచు కొన్నాడన్నమాట! అదే కథా నిర్మాణ ధ్యేయమైతే నృసింహావతారానికి కారణాలైన కథార్థాలను సంవిధానం చేయటమే కావ్య నిర్మాణమర్మమౌతుంది. కాని, ఎఱ్ఱన దానికి క్షేత్ర మాహాత్మ్య లక్షణాన్ని కూడా జోడించాడు. అందువలన మొదటా, చివరా అహోబిలక్షేత్ర ప్రశస్తి అమర్చటం జరిగింది. క్షేత్ర మాహాత్మ్యంలో దైవ, క్షేత్ర, తీర్థ, పర్వ, భక్తచరిత్రలు, మహిమలు, వర్ణనలు యథావకాశంగా చోటు చేసికొంటాయి. ఎఱ్ఱన అంతటితో ఆగలేదు. కావ్య సహజమైన అష్టాదశవర్ణనలు కూడా యథావకాశంగా అందులో పొందుపరచాడు. ఆ వర్ణనలలో అలంకృతిశైలిని ప్రవేశపెట్టి రచనలో రీతికి, శయ్యకు ప్రాధాన్యమిచ్చి ప్రబంధ స్పృహను పోషించాడు. ఇట్లా తయారైన ఆ రచన- నాలుగు ప్రక్రియల నాణెమైన మిశ్రమం. పురాణకథ+క్షేత్ర మాహాత్మ్యం+కావ్యవర్ణనలు+ప్రబంధశైలి. ఇటువంటి సంశ్లిష్ట మిశ్ర ప్రయోగం అంతకు ముందు ఎవ్వరూ చేయలేదు. అందువలన నృసింహపురాణం అపూర్వ ప్రక్రియా ప్రయోగంగా ఆ కాలంలో ప్రకాశించింది. దానినే 'ప్రబంధపురాణం' అనే ప్రక్రియగా నేడు పిలుస్తున్నాం ప్రబంధ పురాణం ప్రబంధపరమేశ్వరత్వానికి ప్రకృష్టమైన తార్కాణం.

6. ఆరణ్యపర్వ శేష వస్తు వైశిష్ట్యం : ప్రబంధపరమేశ్వరత్వం

ఆంధ్ర మహాభారతంలో నన్నయ రచించిన ఆరణ్యపర్వ భాగానికీ, ఎఱ్ఱన పూరించిన ఆరణ్యపర్వశేషానికీ వస్తు స్వభావాన్ని బట్టి స్పష్టమైన భేదం కనపడుతుంది. నన్నయ భాగంలో మైత్రేయ బృహదశ్వులు, నారద వ్యాసమునీంద్రులు చెప్పిన కథాంశాలు పాండవుల అరణ్యవాస జీవితంతో పెనవేసికొని విస్తృతంగా వినిపిస్తాయి. వాటిలో ధర్మజాదుల తీర్థయాత్రా విశేషాలే సగానికి సగం వ్యాపించి ఉండటం గమనిస్తాం. కాగా, ఎఱ్ఱన పూరించిన భాగంలో మార్కండేయమహర్షి చెప్పిన కథాంశాలే ప్రముఖ పాత్ర వహిస్తాయి. పాండవవనవాస జీవిత కథా ఘట్టాలు పరిమితంగా ఉంటాయి. స్థూలంగా ఈ స్వభావాన్ని సమీక్షిస్తే నన్నయ భాగంలో ఇతిహాస స్వభావం ఎక్కువ. ఎఱ్ఱన భాగంలో పురాణ స్వభావం ఎక్కువ.

ఎఱ్ఱన (క్రీ.శ. 1280-1364) ప్రబంధపురాణకావ్యయుగ నాయకుడు. హరివంశంలో పురాణ కవితను, నృసింహపురాణంలో ప్రబంధ కవితను వెలార్చిన ఎఱ్ఱన వస్తుతః పురాణ ప్రబంధ కవిత్వాలకు ఒక వారధిగా ఆ కాలంలో నిలిచాడు. పురాణ మార్గంలో పోతనాదులకు, ప్రబంధ మార్గంలో శ్రీనాథ పెద్దనాదులకు మార్గదర్శకుడైనాడు. మఱి ఆరణ్యపర్వ శేష రచనలో ఎఱ్ఱన నిర్వహించిన పాత్ర ఎటువంటిది? అనే ప్రశ్న అత్యంత ప్రాధాన్యాన్ని వహిస్తుంది. విమర్శకు లీయంశంపై భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చారు.

ఏమైనా, ఎఱ్ఱనకు నన్నయ కవిత్వాంశ కొంత ఉన్నది. నన్నయ వలె పద్యం నడపగలడు. ఒక్కొకసారి ఆయనను బాగా అనుకరించగలడు, అనుసరించగలడు, కొన్నిసార్లు నన్నయ పద్యానికి దీటుగా అనుసృజనం చేయగలడు. కాని, ఎఱ్ఱన వాణిలో నన్నయ కంటె విశిష్టమైన పౌరాణిక, ప్రాబంధిక వాక్పాకం మిలమిలలాడుతూ ఉంటుంది. ఆ కవిత్వ స్వభావాన్ని ప్రక్రియా స్వభావానికి అనుగుణంగా సంవదించగలిగే అవకాశం ఆరణ్యపర్వశేషంలో ఎఱ్ఱయకు లభించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భారతేతిహాసంలో పురాణలక్షణ విశిష్టమైన వస్తువును ఇతిహాసోచితంగా నిర్వహించే ఘట్టాలు ఎఱ్ఱయ పూరణ చేసిన భాగంలో ఉండటం విశేషం. అవి కల్పాంతంలో కూడా చిరంజీవిగా ఉండే మార్కండేయుడు చెప్పటం మరీ విశేషం. అటువంటి పురాణ విశేషాలు ఇతిహాస వస్తువులో ఉండటం సహజం. క్రీ.పూ. 4వ శతాబ్ది ప్రాంతం వాడైన కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో ఇతిహాస స్వరూపం గురించి చెప్పాడు. రాజు పూర్వాహర్భాగంలో హస్త్యశ్వప్రహరణ విద్యాభ్యాసాలు చేయాలనీ, పశ్చిమాహర్భాగంలో ఇతిహాసశ్రవణం చేయాలనీ పేర్కొన్నాడు. ధర్మరాజు అరణ్య వాసంలో కూడా అట్లాగే విస్తృతమైన ఇతిహాస శ్రవణం చేశాడు. దానికి అరణ్యపర్వంలో మునీంద్రులు చెప్పిన కథలే సాక్ష్యాలు. ఇతిహాసమంటే- ''పురాణ మితివృత్త మాఖ్యాయికోదాహరణం ధర్మశాస్త్రమర్థశాస్త్రం చేతిహాసం'' (అర్థశాస్త్రమ్. 1.5) అని కౌటిల్యుడు చెప్పాడు. అంటే- ఇతిహాసంలో కొంత పురాణం ప్రవర్తిల్లుతుందనీ, కార్యకారణ సంబద్ధమైన ప్రఖ్యాతవృత్తం నిబంధించబడుతుందనీ, నాయకనాయకేతరుల చేత చెప్పబడే కొన్ని ఆఖ్యాయికలూ, దృష్టాంతరూపాలైన కొన్ని గాథలూ, ధర్మార్థ శాస్త్ర విషయ చర్చలూ సంతరించబడి ఉంటాయనీ స్పష్టమౌతున్నది. ఈ లక్షణాలన్నీ ఆరణ్యపర్వశేషంలో అమరి ఉండటం గమనార్హం.

(1) పురాణ వస్తువు

''ఇదంవా అగ్రే నైవ కించి దాసీత్ - ఇత్యాదికం జగతః ప్రాగవస్థా ముపక్రమ్య సర్గ ప్రతిపాదకం వాక్యజాతమ్ పురాణమ్'' అని విద్యారణ్యులు ఐతరేయబ్రాహ్మణ భాష్యోపోద్ఘాతంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని గురించి తెలిసికొనే జిజ్ఞాస ధర్మరాజుకు సహజంగా ఉండటం అతిడి ఉత్తమ క్షత్రియ సంస్కారం. ఎవరి వద్ద నుండి ఎటువంటి విజ్ఞానాన్ని ఎట్లా రాబట్టుకొనాలో ధర్మరాజుకు తెలిసినంతగా మరొకరికి తెలియదు. మార్కండేయు డొక్కడే సర్గాన్ని గురించి స్వీయానుభవంతో వాస్తవంగా చెప్పగల మహర్షి. అందువలన 'సకల చరాచరోత్పత్తి స్థితి విలయ ప్రకారంబులు నీకుం బెక్కుమాఱులు ప్రత్యక్షంబులయి కానంబడి యుండుఁ గావున ని న్నడిగెద- లోకంబులు విలయకాలంబున నెట్టిభంగి యగు నెఱింగింపుము' (ఆర. 4.239) అని అన్నాడు. మహా ప్రళయ సమయంలో సముద్రాలన్నీ పొంగి ఏకార్ణవమై నప్పుడు వటవృక్షపత్ర శయనం మీద పరుండి ఉన్న పరమసుందర బాలకరూప పరమాత్మను దర్శించి, ఆయన గర్భకుహరంలో సంగుప్తమై ఉన్న సృష్టినంతా సందర్శించి, వెలువడి, బ్రహ్మ చేసే ప్రతిసర్గాన్ని పరికించిన కథను మార్కండేయ మహర్షి చెప్పటం ఇతిహాసంలోని పురాణాంశం. ఆ దృశ్యాన్ని స్వయంగా దర్శించి ఇది ఇట్లా జరిగింది అని వాస్తవ కథనంగా మార్కండేయుడు చెప్పటంలో పురాణం ఇతిహాస స్ఫూర్తిని పొందింది. నిత్యుడైన ఆ పరమాత్ముడే మానుష రూపధారియైన శ్రీకృష్ణుడని పేర్కొనటం వలన సర్గకథనానికి కూడా సాక్షిభూతుడు దొరికాడు. సృష్టి, స్థితిలయకారకుడైన పరమాత్ముడు భూతలంపై అవతరించి వాటిని తన జీవిత కాలంలో చరిత్రలో ప్రవర్తింపజేస్తాడని ఇతిహాస స్పృహతో ధ్వనింపజేసినట్లైనది. రాజు తెలియదగిన పురాణాంశంలో సర్గం మొదటిది. సర్గాన్ని దర్శించినవారు మరికొందరున్నారు. వారిలో ముఖ్యులు వైవస్వత మనువు, సప్తర్షులు. ప్రళయకాలంలో ఏకార్ణవ గర్భాన భద్రమైన ఓడలో ఉండి మహామత్స్యరూపుడైన నారాయణుడి మహిమను, కరుణను, స్వయంగా తెలిసికొనిన ఆ అద్భుత అనుభూతిని తెలిపే కథ వైవస్వత మనువృత్తాంతం. అనేక మన్వంతరాలను చూచిన మార్కండేయుడే ఈ అంశాన్ని కూడా తెలియచెప్పగలడు. కాబట్టి పురాణ సర్గ విశేషానికి సంబంధించిన కథను మార్కండేయుడి నడిగి ధర్మజుడు చెప్పించుకొని విన్నాడు. సృష్టి ప్రాగవస్థను గురించి చెప్పిన ఈ ఘట్టాలలో సైతం ఎఱ్ఱన కావ్య పురాణ ప్రబంధ రచనా ధోరణులను యథావకాశంగా ప్రవేశపెట్టి రచించటం విశేషం. సామాన్యంగా సర్గాది విషయాలు విజ్ఞానాత్మకంగా, గంభీరంగా, సమాధి భాషలో, ప్రతీకాత్మకంగా ఉంటాయి. కాని,ఎఱ్ఱయ కవితలో అవి సరసవర్ణనా మధురాలుగా మారాయి.

(అ) పరమాత్ముడి గర్భంలో ప్రవేశించి మార్కండేయుడు దర్శించిన లోక సముదాయాన్ని వర్ణించిన ఈ పద్యం పురాణ కథన రూపమైన కవితకు నిదర్శనం.

సీ. 'గంగాదినదులతోఁ గనకశైలాదిభూ। ధరములతో సముద్రములతోడ
వివిధ పట్టణ నవద్వీప వర్షములతో। బహుకర్మరతులైన ప్రజలతోడఁ
బక్షిమృగవ్యాళ పశుసంఘములతోడఁ। దద్దయు నొప్పారు ధాత్రిఁ గంటి
సూర్యేందుతారకా జ్యోతిరుజ్జ్వలమైన। గగనంబుఁ బవనమార్గములుఁ గంటి

తే. శక్రయమవరుణాది నిర్జరసమేత। మైన నాకంబు గంటి మహాహియక్ష
రాక్షసాసుర విద్యాధర ప్రముఖులఁ। గంటి, వేయేల సకలలోకములుఁ గంటి.' (ఆర. 4. 256)

చూచిన వస్తువుల పట్టీని చెప్పే పద్యం ఇది. అయితే, ఉదరంలో బ్రహ్మాండాన్ని చూచిన అద్భుతరసావేశంతో మార్కండేయుడు చెప్పిన పద్యంగా ఎఱ్ఱన నిర్మించాడు. 'కంటి' అనే క్రియను ప్రతివాక్యం చివర కూర్చటం వలన అద్భుతం వ్యక్తమైంది. భూమిపై ఉన్న నదీనద సముద్ర పర్వతాదులను 'తో' అనే తృతీయా విభక్తి ప్రత్యయంతో (కరణ కారకంతో) వేర్వరచి చెప్పటం అద్భుత భావోద్దీపకంగా ఉన్నది. క్రియా, కారక ప్రత్యయాల పునరావృత్తితో, సమాసఘటనలో వర్ణ పునరావృత్తితో పద్యాన్ని అక్షర వైచిత్రిమయం చేశాడు ఎఱ్ఱన. ఇది పురాణ కవితా రీతి. నన్నయ వలె అక్షరరమ్యతను ప్రదర్శిస్తూనే క్రియకారక ప్రయోగ వైచిత్రిని చేర్చి ఎఱ్ఱయ తన సూక్తివైచిత్రిని వెలార్చా డిందులో.

(ఆ) ఆలంకృత వర్ణనా వైచిత్రితో కావ్యశైలిని ప్రదర్శించాడు ఎఱ్ఱన - ఏకార్ణవ వర్ణనంలో.

సీ. 'గరుసులు గడవంగఁ గదలి యల్లల్లన। యొత్తుచు నెడముల నుత్తరించి
వేడుకఁ జేతులు విచ్చి యాడెడునట్లు। లోలోర్మిపంక్తులఁ గ్రాలి క్రాలి
ప్రచురహాసస్ఫూర్తి పచరించుచాడ్పున। నురుఫేనరోచులఁ దెరలు గవిసి
యురువడి వర్ధిల్లుచున్న జలంబుచేఁ। బొంగారి దెసలెల్ల మ్రింగికొనుచుఁ

ఆ. బ్రబల విలయకాల పటురయ బహుళస। మీరణౌఘ దుర్నివార మగుచు
నుగ్రభంగిగాఁ బయోనిధు లొక్కటఁ। బెల్లు రేఁగి జగము లెల్ల ముంచె'. (ఆర. 4.227)

పయోధులు ఉగ్రభంగితో విచ్చలవిడిగా విజృంభించి లోకాలను ముంచివేశాయి. విలయ నాట్యం చేసే పయోధులను వర్ణిస్తూ పయోధులనే ప్రచండ యోధులనో, వీరులనో, భూతాలనో, సావయవ రూపకంగా చేసి వర్ణించవచ్చును. కాని ఆరోపితమైన ఉపమానాన్ని చెప్పకుండా ఊహించుకొనేటట్లు చేసి, చెప్పని లోపాన్ని స్ఫురింపచేయకుండా ఉండేటట్లు చేసే అలంకృతోక్తి వైచిత్రి ఎఱ్ఱయకు ఉగ్గుతో వచ్చిన విద్య. ఒక ప్రాంతాన్ని ఆక్రమించటానికి దండుగా, దండిగా క్రమ్ముకొని వస్తున్న ప్రచండవీరుల ఉగ్ర పరాక్రమ విస్ఫూర్తిని, విభావానుభావ స్ఫూర్తితో వర్ణించడం పై పద్యంలోని వర్ణనాత్మక శిల్పం. సీమలు దాటి ముందుకుసాగి, మెల్లమెల్లగా త్రోసికొంటూ క్రమ్ముకొని, దూరాలను అతిక్రమించటం (సముద్రాలనే) వీరుల విజృంభణ చర్య. విజయాలను సాధించినప్పుడూ, పగరను దాడికి పిలిచేటప్పుడూ (ఎత్తైన అలలనే) చేతులెత్తి ఆడించి తమ పరాక్రమాన్ని ప్రకాశింప చేయటం ఆంగిక చేష్టా విశేషం. ప్రచురహాసాలంటే వికటాట్టహాసాలు. వీరుల విజృంభణంలో తిరుగులేని పురోగమనం సాగుతున్నప్పుడు విజయగర్వద్యోతకమైన (ఫేనరోచులనే) అట్టహాసం చేయటం సాత్త్వికభావ విశేషం. వేగంగా పొంగుతున్న జలంతో (ఇక్కడే చలంతో అనే చమత్కార స్ఫూర్తి గమ్యం) దిక్కులన్నీ ఆక్రమించటం రౌద్ర భావ వ్యంజకమైన ఆంగికాభినయ విశేషం. ప్రళయకాల వాయుతరంగాలవలె అడ్డగించటానికి అసాధ్యమైన ప్రచండవేగంతో ముందుకు చొచ్చుకొని వచ్చే వేగాభినయ విశేషం ఉగ్రభంగిమ. ఇట్లా పయోనిధులనే ప్రచండవీరులు ఒకే సమయంలో గుమికూడి పెచ్చు పెరిగి భూమినంత ఆక్రమించిన ఒక పెద్ద దాడిని వర్ణించిన స్ఫూర్తి ఈ పద్యంలో ఎఱ్ఱన కల్పించాడు. నిరవయవ రూపకంతో వస్తు ధ్వనిని సాధించే శిల్పం ఎఱ్ఱయలో ఎక్కువ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సావయవరూపకంతో వస్తుధ్వనిని సాధించే శిల్పం నన్నయలో ఎక్కువ. నన్నయ రీతిలో పద్యాన్ని ఎత్తుకొన్నా ఎఱ్ఱన ఫణితిలో దాన్ని నిర్వహించడం ఇందులో గమనార్హం. ఇటువంటి పద్యాలు ఎన్నో ఎఱ్ఱయ రచనలో ఆణిముత్యాలవలె అందగిస్తూ ఉంటాయి. కావ్యశైలికి అవి కమనీయ కరదీపికలు.

(ఇ) వర్ణనలకు అవకాశం ఉంటే అదనెరిగి విస్తరించటం, లేనిచోట పదనెరిగి కల్పించుకొనటం, ఆయా సందర్భాలలో రీతి శయ్యాగుణ విశిష్టమైన ప్రబంధోచిత పద్యరచనా విన్యాసాలను వెలార్చటం - అనే మెలకువలు సర్గాది వర్ణన ఘట్టాలలో కూడా ఎఱ్ఱన అవలీలగా ప్రదర్శించగలడు. ఉదాహరణకు- నూరు సంవత్సరాల అనావృష్టి తరువాత, ప్రచండ సూర్య సప్తకం విజృంభించి జలాన్ని హరించి లోకాలను దగ్ధం చేసిన తరువాత, కొన్నేళ్ళు సంవర్తవలాహక మేఘాలు క్రమ్మి పుష్కలంగా వర్షిస్తాయి. ఆ ఘట్టంలో ఎఱ్ఱన మూడు వృత్తాలను ఎన్నుకొని, మబ్బులు క్రమ్మటం,ఉరుములు ఉరమటం, ధారాపాతంగా వర్షించటం అనే అవస్థాత్రయాన్ని వర్ణనారమణీయంగా పఠితల మనస్సులలో ప్రత్యక్షీకరింప చేయటం ప్రబంధ రచనా రీతి. గమనించండి.

మ. 'సితపీతారుణనీల పింగరుచులై స్నిగ్ధంబులై యుద్యతా
యతవిద్యుల్లలితంబులై ఘనగిరీంద్రాకార ఘోరంబులై
తతనిర్ఘాత నిపాత భీమభిదురధ్వానంబులై సంతతో
ద్ధత సంవర్తవలాహకంబులు వెసం దోఁతెంచు దిగ్భిత్తులన్.

ఉ. పెల్లునఁ గూలుతజ్జలము పెక్కువ నొక్కట నమ్మహానలం
బెల్లను నాఱిపోవుఁ బృథివీశ్వర! యేఱులు నబ్ధులున్ వెసం
దొల్లిటియట్ల నిండుఁ; బటుతోయద సంఘము లంతఁ బోక గ
ర్జిల్లుచు వెండియుం గురియుఁ జిత్రము గాఁగ ననేక కాలముల్.

శా. ధారాపాత నితాంతవేగమున నిద్ధాత్రీతలం బాహతం
బై రూపేది మునుంగుఁ దోయములలో; నత్యంత గంభీరవాః
పూరంబంతయు ముంచి మించుటయు దిగ్భూమీ నభోభాగముల్
వే రూపింపఁగ రాకయుండఁ దమముల్ వేష్టించుఁద్రైలోక్యమున్'. (అర. 4.245 - 247)

రచనా రామణీయకంతో విభావావస్థాత్మికమైన దృశ్యపరికల్పనం ఎఱ్ఱన ప్రబంధశైలిలో ఉన్నవైచిత్రి. ఇది తరువాతి ప్రబంధ కవులకు శిల్పభిక్ష పెట్టింది. సర్గ ప్రతిసర్గాది పురాణ వస్తువును సైతం ప్రబంధ రచనా సుందరంగా ఆవిష్కరించే ఎఱ్ఱన ప్రతిభ ప్రబంధ పరమేశ్వరత్వాన్ని ప్రకటించింది.

(2) పురాణవస్తు విశేషాలు

కుమారిలభట్టు తన తంత్రవార్తికంలో పురాణాలు పురషార్థసాధనకు ఉపయోగపడతాయని అన్వయించి చెప్పాడు. "తేన సర్వస్మృతీనాం ప్రయోజనవతీ ప్రామాణ్యసిద్ధిః । తత్ర యావద్ధర్మమోక్ష సంబన్ధి తద్వేద ప్రభవమ్ । యత్త్వర్థ సుఖ విషయం తల్లోక వ్యవహారపూర్వక మితి వివేక్తవ్యమ్ । ఏషైవేతిహాసపురాణ యో ర ప్యుపదేశ వాక్యానాం గతిః । ఉపాఖ్యానాని త్వర్థవాదేషు వ్యాఖ్యాతాని । యత్తు పృథివీవ్యాపార కథనం తద్ధర్మాధర్మ స్మరణమూలం । దేశకాల పరిమాణ మపి లోక జ్యోతిశ్శాస్త్ర వ్యవహార సిద్ధ్యర్థం దర్శన గణిత సంప్రదాయానుమానపూర్వకమ్ । భావికథన మపి త్వనాదికాల ప్రవృత్తయుగ స్వభావ ధర్మాధర్మానుష్ఠాన ఫల విపాక వైచిత్ర్య జ్ఞాన ద్వారేణ వేదమూలమ్.... " (తంత్ర వార్తికమ్. జై. 1.3.1) (స్మృతులకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రామాణికత్వం పురాణాల వలన ప్రతిష్ఠాపిత మౌతుంది. అందలి ధర్మమోక్ష సంబంధమైన వస్తు జాలమంతా వేదప్రభవమే. అర్థ సుఖ విషయజాలమంతా లోకవ్యవహార పూర్వకమే. ఈ విధంగా స్మృతులలో ఉండే అంశాలను వివేచించి తెలిసికొనాలి. అదే విధంగా పురాణేతిహాసాలలోని ఉపదేశ వాక్యాలను కూడా వివేచించాలి. వాటిల్లోని ఉపాఖ్యానాలను అర్థవాదాలుగా వ్యాఖ్యానించవచ్చును. కించిద్దర్శన పూర్వకం, కించిద్వేద మూలం అయిన పృథివీ విభాగాది కథనం తద్ధర్మాధర్మసాధన ఫలోపభోగ ప్రదేశ వివేకార్థం ఉపయోగ పడుతుంది. దర్శన గణిత సంప్రదాయానుపూర్వక మైన దేశకాల పరిగణన కథనం అనాది కాల ప్రవృత్త యుగ స్వభావ ధర్మాధర్మానుష్ఠాన ఫల విపాకవైచిత్ర్య జ్ఞానార్థం పురాణాలలో అభివర్ణితాలై ఉంటాయి. ఈ సమన్వయాన్ని బట్టి లోకవేద ప్రభవాలైన ధర్మాదులను అభివర్ణించటం చేత పురాణాలు లోకానికి పురుషార్థ సాధన పరిజ్ఞానాన్ని అందించటానికి ఏర్పడినవని స్పష్టమౌతున్నది.

పాశ్చాత్యులు పురాణవాఙ్మయాన్ని మైథాలజీ (Mythology) అని పిలుస్తారు. దానిలో దైవలీలలే కాక, సర్గ ప్రతిసర్గాదులవంటి అంశాలూ, ఖగోళ రహస్యాలూ, స్వర్గ నరకాది పరలోక విషయాలూ, పుణ్యపాపఫలానుభవ విశేషాలూ, నరులు చేసే ఆముష్మిక పుణ్యకర్మలకు దేవతలు తృప్తులై లోకానికి వారు చేసే ప్రత్యక్షప్రత్యుపకారాదులు, అట్లే దేవతల ఆగ్రహచర్యలు వర్ణించబడతాయని పేర్కొన్నారు. అతి ప్రాచీన విషయాల యొక్క ఉత్పత్తి వికాసాల నెరిగించే కథలలో కొన్ని స్థానిక చరిత్రలే పురాణ గాథలుగా పరివర్తనం చెందటం కూడా కనపడుతుంది. పురాణ వాఙ్మయం సూర్యుడి చుట్టూ తిరుగుతున్నదని చెప్పినా ఆశ్చర్యం లేదని విమర్శకులు భావిస్తున్నారు. (చూడు: The Outlines of Mythology by Lewis Spencer. p.25)

పురాణ వాఙ్మయంలో కానవచ్చే కథాంశాలను గురించి పైన పేర్కొనబడిన లక్షణాలను స్థూలంగా గమనిస్తే ఆరణ్యపర్వశేషం పురాణ కథార్థ బీజ సంపుటిగా ప్రత్యక్షమౌతుంది. మచ్చుకు కొన్ని ఉదాహరణలు.

(అ) దర్శన గణిత సంప్రదాయానికి సంబంధించిన దేశకాల పరిగణన కథనం, అనాది కాల ప్రవృత్త యుగ స్వభావ విశేష కథనం- ఆరణ్యపర్వ చతుర్థాశ్వాసంలో ధర్మరాజు 'కలియుగంలో సకల ధర్మలోపం జరుగుతుందని అంటారు. దాని తీరును వివరించండి'- అని అడిగాడు. మార్కండేయ మహర్షి చతుర్యుగ స్వభావాలను చెప్పి, కలియుగ లక్షణాలు వివరించి, విష్ణువు కల్కిగా అవతరించి ధర్మాన్ని సముద్ధరించి కృతయుగారంభానికి నాంది నాలపిస్తాడని చెప్పటం పురాణ కథాంశమే.

(ఆ) ఖగోళ రహస్యాలు - ఇందులో జ్యోతిషాది విజ్ఞాన విశేషాలు కూడా పరిగణించబడతాయి. ఆరణ్యపర్వశేషంలో ఇంద్రుడు దేవసేనకు కాబోయే భర్తను గురించి నిర్ణయించటానికి తత్కాల ముహూర్త స్వభావాన్ని ప్రమాణంగా తీసికొని గుణించటం గమనార్హం. ఆమె ప్రశ్న అడిగిన కాలం రౌద్ర ముహూర్తం. అమావాస్యనాడు చంద్ర సూర్యుల సంగమ కారణంగా ఆ ముహూర్తం సిద్ధిస్తుంది. ఆ సమయంలో పూర్వ సంధ్యారుణ కాంతులు సముద్రంలో ప్రతిఫలించి రక్తారుణమైన యుద్ధభూమిని స్ఫురింపచేస్తున్నాయి. కాబట్టి ఆ సముద్ర తీరంలో సురాసురుల నడుమ మహా యుద్ధం జరుగుతుందని నిర్ణయించాడు. భృగువు, అంగిరసుడు మొదలైన ఋషులు అగ్నిలో వేల్చే హవ్యాలను మోసికొని అగ్నిదేవుడు సోమాగ్నులతో సమావేశమయ్యాడు. కాబట్టి అటువంటి ముహూర్తం దేవసేనకు కాబోయే భర్త (దేవసేనకు నాయకుడు) సూర్యుడు, చంద్రుడు, అగ్ని, రుద్రుడు అనే దేవతల అంశాలతో కూడి ఉండటం తథ్యమని ఇంద్రుడు నిర్ణయించాడు. ఇది ఖగోళ విజ్ఞాన సంబంధి కథాంశం.

కుమారస్వామి కథ చాల వరకు ఖగోళ రహస్యాలతో కూడుకొన్నదే. ముఖ్యంగా ఆరుగురు ఋషుల భార్యలు రోహిణీ నక్షత్రం ప్రక్కన అభిజిత్తు నక్షత్ర స్థానంలో కృత్తికలుగా అగ్నిదైవత్యమనే నక్షత్రంగా ఆకాశంలో ప్రకాశించేటట్లు ఇంద్రుడు నిర్దేశించిన కథ ఖగోళ శాస్త్ర సంబంధికావటం సుస్పష్టం. కుమారస్వామి కథ ఖగోళ శాస్త్ర సంబంధి కాగా, ఆతడి చుట్టూ ఉన్న ఉపగ్రహాల కథలన్నీ మంత్రతంత్ర శాస్త్రాలకు సంబంధించినవి. ఎఱ్ఱయ నాటి సమాజ పరిస్థితులకు, విశ్వాసాలకు ఇవి సముచితంగా అమరి ఉండి ఉండవచ్చును కూడా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(ఇ) స్వర్గనరకాది పరలోక విషయాలు

(i) **ఇంద్రద్యుమ్నుడి కథ -** స్వర్గలోక భోగాలకు సంబంధించింది. నరుడు తాను చేసిన పుణ్యకార్యాల వలన కలిగే కీర్తి ఎంతకాలం భూలోకంలో ఉంటుందో అంతకాలం అతడికి స్వర్గలోక నివాసం ఉంటుందని చెప్పే ఆ కథను మార్కండేయ మహర్షి (చతుర్థాశ్వాసంలో) ధర్మజుడికి చెప్పాడు.

(ii) **వ్రీహిద్రోణోపాఖ్యానం:-** వ్యాసుడు ధర్మరాజుకు వ్రీహి ద్రోణాఖ్యానం చెప్పాడు. అందులో ముద్గలుడికి దేవదూత పుణ్యలోకాల స్వరూప స్వభావాలను గురించి వివరించి చెప్పాడు. స్వర్లోకం, బ్రహ్మలోకం - ఈ రెండులోకాల అనుభవాలలో ఉండే తారతమ్యాన్ని విన్న తరువాత, ముద్గలుడు పుణ్యఫల భోగానంతరం భూతలంపై జన్మించే అవకాశమున్న స్వర్గం కంటె శాశ్వతమోక్షప్రదమైన బ్రహ్మలోకమే ఉత్తమమని భావించి, దానవ్రతం వలన కలిగిన స్వర్గాన్ని త్యజించి తపస్సు చేత సిద్ధించిన బ్రహ్మలోకాన్ని పొందిన కథ- స్వర్గం కంటె మోక్షం మానవులు పొందదగిన గమ్యమని ఉపదేశిస్తున్నది.

(ఈ) ధర్మాధర్మానుష్ఠాన ఫలవిపాక వైచిత్రి:- ఈ శాఖకు సంబంధించిన కథలు ఆరణ్య పర్వశేషంలో విశేష ఖ్యాతిని పొంది ఉన్నాయి.

(i) పతివ్రతామాహాత్మ్యం ధర్మవ్యాధోపాఖ్యానం, కౌశికుడి కథ మొదలైనవి పేర్కొనదగినవి, ఉత్తమ గార్హస్థ్య ధర్మానికీ, పుత్ర ధర్మానికీ, అహింసా ధర్మానికీ ధర్మవ్యాధోపాఖ్యానం బోధనా కల్పతరువు. ఎఱ్ఱన పురాణ వస్తు నిర్వహణ ప్రజ్ఞకు చక్కని తెరువు.

(ii) బ్రాహ్మణ ధర్మ నిర్వహణంతో మృత్యువును జయించవచ్చునని చెప్పే కథ తార్క్ష్యుడి ఆశ్రమ ధర్మవృత్తాంతం: ఆ ఆశ్రమ వాసుల ధర్మనుష్ఠాన గీతి ఈ పద్యం.

శా. 'ఆలస్యం బొక యింత లేదు; శుచి యాహారంబు; నిత్యక్రియా
జాలం బేమఱ; మర్చనీయు లతిథుల్; సత్యంబ పల్కంబడున్;
మే లై శాంతియు బ్రహ్మచర్యమును నెమ్మిం దాల్తు; మిట్లొట నె
క్కాలంబుం బటురోగమృత్యుభయశంకం బొంద మే మెన్నడున్.' (ఆర. 4.190)

ధుంధుమారుడి చేత పొరపాటున చంపబడిన బ్రాహ్మణ బాలుడు పునర్జీవితుడు కావటం తార్క్ష్యాశ్రమవాసుల ధర్మానుష్ఠాన ఫలమే. పై పద్యం నన్నయవలె ఎఱ్ఱన తీర్చిదిద్దిన రుచిరార్థ సూక్తి. సర్వమానవులకు వర్తించే సాధారణ ధర్మ సంహిత ఈ సూక్తి.

(iii) బ్రాహ్మణులు క్షత్రియులు నిజ వర్ణాశ్రమ ధర్మ నిర్వహణంలో పాటించదగిన బాధ్యతలను చెప్పటంలో ప్రసిద్ధిచెందిన కథ అత్రిగౌతమ సంవాదం. గృహస్థుడైన బ్రాహ్మణుడు సంతానాన్ని పొంది, వారి సుఖ జీవితానికి వలసిన ద్రవ్యాన్ని ఆర్జించి వారి కిచ్చి, తాను వానప్రస్థాశ్రమానికి వెళ్ళాలి. వెళ్ళేటప్పుడు భార్య తనతో వస్తానంటే తీసికొనిపోవాలి. లేదా పుత్రుల రక్షణలో ఉంచి వెళ్ళాలి. ఒకవేళ స్వయంగా ధనాన్ని ఆర్జించే అవకాశం లేకపోతే రాజు నర్థించి అర్థ సంపాదనం చేయవచ్చును. ఏమైనా అర్థం స్వీయభోగానికి కాదు, ఆశ్రమ ధర్మ నిర్వహణం కొరకే - అనే తాత్పర్యం అత్రి అనే బ్రాహ్మణుడి కథ చెప్పింది.

అత్రి గౌతములు క్షత్రియ ధర్మ విధులను గురించి తమకున్న భిన్నమైన అభిప్రాయాలను ప్రకటించారు. వారిరువురి వాదాలను సనత్కుమారుడు విని తీర్పు చెప్పాడు. రాజే ధర్మ నిర్వహణంలో బ్రహ్మ, ఇంద్రుడు, ఈశ్వరుడు, సన్మునీంద్ర ప్రశంసాపాత్రుడు ఔతాడని అత్రివాదం. రాజున కా అర్హతలు లేవని గౌతముడి వాదం. సనత్కుమారుడు అత్రినే సమర్థించి ఇట్లా ప్రకటించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. 'అత్రి నిజంబ పల్కెఁ; దగ నాతని వాక్యము ధర్మయుక్త; మీ
ధాత్రి సమస్తమున్ బృహదుదగ్రభుజాగ్రమునందుఁ దాల్చు సత్
క్షత్రియుఁ డెల్లవారలను గావను బ్రోవఁ బ్రభుండు గావునన్
శత్రునిషూదనుం డతఁడు శక్రుఁడు నీశ్వరుఁడున్ విధాతయున్'. (అర.4.202)

అత్రి బ్రాహ్మణ ధర్మాన్ని ఆచరించి పురుషార్థ సాధకుడయ్యాడు. క్షత్రియ ధర్మాన్ని లోకంలో చాటి ధర్మప్రభువుల జీవన ధర్మాన్ని ప్రబోధించాడు. ఎఱ్ఱన ఈ పురాణార్థాన్ని సారరసార్ద్రసుందరంగా ఆవిష్కరించాడు.

(iv) ఈ వరుసలో అత్యుత్తమమైనది సరస్వతీ గీత. దీనివలన విశిష్ట ధర్మాలు తెలుస్తాయి. తార్క్ష్యుడు భారతి నారాధించి ఆమె నుండి భౌతిక సౌఖ్యాలు వరంగా కోరలేదు. 'మానవుడికి ఉత్తమ ధర్మ మేది? ఏ ధర్మాన్ని ఆచరిస్తే పరమపుణ్యాత్ముడై శాశ్వతమైన పుణ్యలోకాలను పొందుతాడు? బోధించు' మని అడిగాడు. అంటే తార్క్ష్యుడు భారతిని బ్రాహ్మణు డాచరించవలసిన పరమ ధర్మ జ్ఞానాన్ని భిక్షగా అడిగాడు. ఆమె సూత్రప్రాయంగా ఇట్లా చెప్పింది.

మ. 'ధృతి వేదంబులు నాలుగుం జదివి భూదేవుండు నానాధ్వర
వ్రతుఁడై యుండెడు నట్టి పుణ్యుఁ డమరావాసంబునం దుండు ను
న్నత వృత్తస్తనభార మంథర మరున్నారీ పరీరంభసం
భృత రోమాంచ సమంచితాంగుఁ డగుచుం బెక్కేండ్లు సంప్రీతితోన్.' (అర. 4.210)

పురాణ కవితా శైలిలో చెప్పిన ఈ పద్యానికి వివరణంగా ఎఱ్ఱన నాలుగైదు పద్యాలు రచించాడు. ఇవన్నీ కర్మకాండకు సంబంధించినవే. శ్రుతి తత్త్వాన్ని చెప్పుతుంది. స్మృతి దానిని పురుషార్థసాధనోచితంగా ఆచరించే జీవన విధానంలోని విధులను వివేచిస్తుంది. వేదార్థ బృంహితమైన స్మృతి లక్షణాలను కవితామయం చేసి చెప్పేది ఇతిహాసం. పారమార్థిక విషయాలను సైతం ప్రబంధ కవితాబంధురంగా చెప్పటం ఎఱ్ఱన ఇతిహాసానికి నేర్పిన హితం. పై పద్యంలో తాత్పర్యమంతా ఒక యెత్తు. 'ఉన్నత వృత్తస్తన భారమంథర మరున్నారీ పరీరంభ సంభృత రోమాంచ సమంచితాంగు' డనే సమాస మొక్కటీ ఒక్క యెత్తు. పురాణ కథనంలో ప్రబంధ సూక్తి వైచిత్రి ఇది. "కుంభినీధరసుతా కుచకుంభ పరిరంభ మహాలోలుపాయో న్నమశ్శివాయ" అని పరమేశ్వర స్తవంలో కూడా ప్రబంధ పరమేశ్వరుడు ప్రసాదించిన సూక్తి వైచిత్రిని పుక్కిటపట్టి పులకించిపోయాడు కవిసార్వభౌముడైన శ్రీనాథుడు.

(ఉ) పుణ్యపాప ఫలానుభవ విశేషాలు

(i) వలచిన పురుషులను వంచించే పాపకార్యాన్ని ఆచరించటం వలన సుశోభన తండ్రిశాపానికి గురియై కపట వర్తనులైన పుత్రులను పాపఫలంగా పొందింది.

(ii) ఆమె మొదటి కొడుకు శలుడు వామదేవుడి నుండి వామ్యాశ్వాలను తెచ్చి, ఇచ్చిన మాట ప్రకారం వాటిని తిరిగి ఇవ్వకపోగా, అహంకరించి వామదేవుడిని అవమానించి, సంహరించేందుకు ప్రయత్నం చేయటంతో బ్రాహ్మణాగ్రహానికి గురియై చనిపోయాడు. పరులధనాన్ని పాపబుద్ధితో హరిస్తే ప్రాణాపాయం తప్పదని శలుడి కథ చాటి చెప్పింది.

(iii) శలుడి తమ్ముడు నలుడు. అన్నను మించిన అహంకారి. వామదేవుడికి వామ్యహయాల నివ్వకపోగా అతడిని విషబాణంతో చంపాలని యత్నం చేశాడు. ఆ బాణం అతడి పుత్రుడిని బలిగొన్నది. అయినా మరల అహంకరించి బాణాన్ని ప్రయోగించబోయాడు. వామదేవుడి తపశ్శక్తివలన నిశ్చేష్టుడయ్యాడు. చివరకు చేసేది లేక అతడిని శరణువేడి ప్రాణాలతో బైటపడ్డాడు. అధర్మాన్ని ఆచరించి, దాని ఫలాన్ని అనుభవించి, పశ్చాత్తాపపడి మరల ధర్మాచరణ ఫలాన్ని పొందిన కథ ఇది. పాపం చేసిన ఫలం పశ్చాత్తాపంతో సగం పోతుంది. మరల చేయనని నిశ్చయించటంతో పూర్తిగా పోతుంది- అని నిరూపించింది ఈ కథ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(3) ఇతిహాసశ్రవణం : ఇతరాంశాలు

కౌటిల్యుడి అర్థశాస్త్రంలో రాజు వినే ఇతిహాసాంశాలుగా చెప్పబడిన వాటిలో పురాణ కథల తరువాత- ప్రఖ్యాత వస్తువులైన కథలు, ఆఖ్యాయికలు, దృష్టాంతరూపాలైన కథలు, ధర్మార్థ విషయ చర్చలూ ఉన్నాయి. ఆరణ్యపర్వశేషంలో ఇవన్నీ కూడా ఉండటం గమనార్హం.

1. ప్రఖ్యాత కథలు: ధర్మరాజు మార్కండేయ మహర్షిని కొన్ని ప్రఖ్యాత కథలను గురించి ప్రశ్నించాడు. అతడి వలన వాటిని ప్రామాణికంగా వివరంగా విని తెలిసికొనాలని భావించాడు. లోకంలో ఇదివరకే ప్రసిద్ధమై ధర్మజుడి దృష్టి కవి వచ్చాయి. అందువలన ప్రసిద్ధవృత్తాలే. అటువంటివి- వైవస్వతుడి చరిత్రం, కువలాశ్వచరిత్రం, లేదా ధుంధుమారుడి కథ, మధుకైటభ వృత్తాంతం, అంగిరసుడనే అగ్ని చరిత్రం మొదలైనవి.

2. ఆఖ్యాయికలు - బ్రాహ్మణ ప్రభావం, కర్ణుడి జన్మవృత్తాంతం చెప్పే కథలు, మున్నగునవి.

3. దృష్టాంతరూప కథలు - రామాయణ కథలు - రామాయణ కథ, సావిత్ర్యుపాఖ్యానం, వ్రీహిద్రోణాఖ్యానం.

4. ధర్మార్థ విషయ చర్చ - ధర్మవ్యాధకౌశిక సంభాషణం, అత్రి గౌతముల సంవాదం, సత్యాద్రౌపదీసంవాదం, యక్షప్రశ్నలు ధర్మజుడి సమాధానాలు ఇత్యాదులు.

(4) ఇతిహాస శ్రవణఫలం

ఆరణ్యపర్వశేషంలోని ఇతిహాసాంశాలను వినిన ధర్మజుడు ధర్ముడు పెట్టిన యక్షప్రశ్నల పరీక్షలో నెగ్గాడు. ఈ సంవిధానం ఇతిహాసకథార్థాలలో గల అంతరార్థం.

ఆరణ్యపర్వంలో ధర్మజుడు చేసింది శ్రవణ, మనన, నిదిధ్యాసనలు. శ్రవణం ద్వారా విని, మననం ద్వారా మథించి, తెలిసికొన్న తత్త్వాన్ని అనుభవంలోకి తెచ్చుకొనటంలో చేసే తీవ్రమైన ప్రయత్నమే నిదిధ్యాసనం. శంకరులు 'వివేక చూడామణి' లో శ్రవణ మనన నిదిధ్యాసనల తారతమ్యాన్ని చెప్పారు.

"శ్రుతేః శతగుణం విద్యా న్మననం మననా దపి,
నిదిధ్యాసం లక్షగుణ మనంతం నిర్వికల్పకమ్."

శ్రవణం కంటె మననం వందరెట్లు గొప్పది. మననం కంటె నిదిధ్యాసనం లక్షరెట్లు శక్తిమంతమైనది. నిర్వికల్ప సమాధి వీటన్నిటికంటె లెక్కలేనన్ని రెట్లు గొప్పది. బ్రహ్మానందాన్ని పొందటానికి శ్రవణాదులు మూడూ మూడు మెట్లు. ప్రతిసాధకుడూ సాధించవలసిన సాధనత్రయం. ధర్మజుడు నిరంతర శ్రవణ మనన నిదిధ్యాసనల వలన సాధనత్రయాన్ని సాధించి సిద్ధిపొందాడు. శంకరులు ఆత్మబోధలో -

"శ్రవణాదిభి రుద్దీప్తో జ్ఞానాగ్ని పరితాపితః,
జీవః సర్వమలా న్ముక్తః స్వర్ణవత్ ద్యోతతే స్వయమ్."

అని అన్నారు. శ్రవణ మనన నిదిధ్యాసనల వలన ప్రదీప్తుడై, జ్ఞానాగ్నివలన తేజోవంతుడై, సర్వపాపాల నుండి విముక్తుడై, జీవుడు బంగారం వలె ప్రకాశిస్తాడు. యక్షపరీక్షలో ఉత్తీర్ణుడైన ధర్మజుడు పుటం పెట్టిన బంగారంవంటివాడు.

ధర్మరాజు ధర్మవీరుడు. అతడిలోనిది ధర్మజ్ఞానాగ్ని, ధర్మాన్ని గురించిన సమగ్ర విజ్ఞానాన్ని శ్రవణ మననాల ద్వారా నిదిధ్యాసనలో నిలపటం ఆరణ్యపర్వంలోని ఇతిహాస శ్రవణ ఫలం. "వేదోక్తో హి ద్వివిధో ధర్మః ప్రవృత్తి లక్షణో నివృత్తి లక్షణశ్చ" అని శంకర గీతా భాష్యం. ప్రవృత్తి ధర్మం నివృత్తితో సమన్వయం పొంది శీలంగా మారటమే ఉత్తమ సంస్కారం. అది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సత్సంగాదులవలననే సాధ్యం. "విద్వద్భి స్సేవిత స్సద్భిః నిత్య మద్వేష రాగిభిః । హృదయేనా భ్యనుజ్ఞాతో ధర్మః" అని మనుస్మృతి. ద్వేషరాగ రహితులైన విద్వాంసులు నిత్య మాచరించేది ధర్మం.

"అహింసా సత్య మస్తేయం శౌచ మింద్రియనిగ్రహః,
దానం దమో దయా క్షాంతిః సర్వేషాం ధర్మసాధనమ్".

అని యాజ్ఞవల్క్యస్మృతి చెప్పుతున్నది. అహింస, సత్యం, అస్తేయం, శౌచం, ఇంద్రియ నిగ్రహం, దానం, దయ, క్షాంతి మొదలైన వాటి ద్వారా ధర్మసాధనం చేయవచ్చును.

"ధృతి క్షమా దయా஽స్తేయం శాంత మింద్రియనిగ్రహః,
హ్రీ ర్విద్యా సత్య మక్రోధో దశకం ధర్మలక్షణమ్".

అని మహాభారతం చెప్పుతున్నది. ధృతి, క్షమ, దయ, అస్తేయం, శౌచం, ఇంద్రియ నిగ్రహం, లజ్జ, విద్య, సత్యం, అక్రోధం అనే పది లక్షణాలు కలది ధర్మం. ఈ ధర్మాన్ని తెలిసికొని, ఆయా జీవిత పరిస్థితులలో మననం చేసికొని, అనుమానాలను పెద్దల నడిగి తీర్చికొని, దానిని అనుభవంలోనికి తెచ్చుకొనటం ధర్మస్వరూపాన్ని పరిపూర్ణంగా పొందటం.

యక్ష ప్రశ్నల చివర ధర్ముడు తన రూపాలు పది అని పేర్కొన్నాడు.

"యశః సత్యం దమః శౌచ మార్జవం హ్రీ రచాపలమ్,
దానం తపో బ్రహ్మచర్య మిత్యేతా స్తనవో మమ". (సం.3.298.7)

యశస్సు, సత్యం, శౌచం, ఋజుభావం, లజ్జ, స్థిరత (అచాపలత్వం), దానం, తపస్సు, బ్రహ్మచర్యం - అనేవి పది - ధర్మ శరీరాలు. ధర్ముడిని చేరటానికి ఆరు మార్గాలు ఆయనే చెప్పాడు.

"అహింసా సమతా శాంతి స్తపః శౌచ మమత్సరః,
ద్వారా ణ్యేతాని మే విద్ధి ప్రియోహ్యసి సదా మమ". (సం. 3.298.8)

అహింస, సమత్వం, శాంతి, తపస్సు, శౌచం, మాత్సర్య రాహిత్యం అనేవి ధర్మ దర్శనానికి ఆరు ద్వారాలు. ధర్మరాజుకు వీటన్నిటి మీద అనురాగ మున్నదనీ, అధికార మున్నదనీ ధర్ముడు ప్రశంసించాడు. వీటిని ధర్మజుడు సాధించిన విధం ఆరణ్యపర్వ ప్రబంధ ధ్వని. దాని సిద్ధికి పరీక్ష యక్షప్రశ్నల ఘట్టం. తెలుగులో 'యక్షప్రశ్న' లంటే గడ్డుప్రశ్నలనే భావం ఏర్పడటానికి వాటిల్లో ఉండే గాఢతయే కారణం. ధర్మవ్యాధుడు కౌశికుడికి అహింసా స్వరూపాన్ని వివరించి చెప్పాడు.

తే. 'హింస సేయనివాఁడు లేఁ డిజ్జగమున । నొక్కఁడైనను దమతమ యోపినట్లు
హింసతెరువున కెడగల్గి యేఁగవలయు । నదియ చూవె యహింసనా నతిశయిల్లు'. (ఆర. 5.60)

దానిని ధర్మరాజు తెలిసికొని అనుష్ఠాన వేదాంతి అయ్యాడు. కౌశికుడు ధర్మవ్యాధుడిని ప్రశంసిస్తూ చెప్పిన ఈ క్రింది పలుకులు సమతా గుణాన్ని ధర్మజుడి మనసున కెక్కించాయి. తుల్యమనస్కత సమత.

చ. 'నిజగుణదోష కర్మముల నెట్టన మేలును గీడు వచ్చుఁ; ద
త్ప్రజనిత సౌఖ్య దుఃఖములఁ బ్రాజ్ఞులు దుల్యమనస్కులై మనో
రుజలును దేహజంబులగు రోగములున్ హిత ధర్మకర్మ భే
షజములఁ జేసి పాపుదురు సర్వము సాత్త్వికదృష్టిఁ జూచుచున్.' (ఆర. 5. 139)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ మాటలు ధర్మరాజును తుల్యమనస్కుడైన ప్రాజ్ఞుడిగా మార్చాయి.

చ. ‘అనఘుఁడు సాత్త్వికుండగు మహాత్ముఁడు బోధనిరూఢి సర్వముం
గనికొని లోకవృత్తములు గా వని రోసి సమస్తసంగ భం
గనిరతుఁడై తొఱంగు మమకారవికార మహంక్రియాచ్యుతిం
బనుపడి సంయమప్రకట భావన నుత్తమశాంతి గైకొనున్’. (అర. 5.98)

అనే ధర్మవ్యాధుడి ప్రబోధం ధర్మరాజును శాంతివలన సాత్త్వికుడైన మహాత్ము డయ్యేటట్లు చేసింది.

క. ‘మనమున నింద్రియముల వ । ర్తనమును సరిగా నొనర్చు ధర్మంబు దపం
బని చెప్పుదు; రిట్టితపం । బనఘా! నీయంద కలిగె నభినవ భంగిన్’. (అర. 6.124)

అని దుర్వాసోముని ముద్గలుడిని కీర్తించిన పద్యం విని, అది తనకే వర్తించేటట్లు జీవితాన్ని తపస్సుతో మలచుకొన్నాడు ధర్మరాజు.

ఆ. ‘పాపవర్తనుండు బ్రాహ్మణుం డయ్యును । నిజము శూద్రుకంటె నీచతముఁడు;
సత్యశౌచధర్మశాలి శూద్రుండయ్యు । నతఁడు సద్ద్విజుండ యనిరి మునులు’. (అర. 5.137)

అనిన కౌశికుడి బోధలు ధర్మరాజును నిత్యశౌచిగా మార్చాయి.

చ. అరయఁగ జీవితంబు గడు నస్థిర; మింత యెఱింగి యాత్మ నె
వ్వరిదెసఁ గీడు రోయక ధ్రువంబగు మైత్రి భజించి సత్కృపా
నిరతుఁడు నిష్పరిగ్రహుఁడు నిత్యతపస్వియు నిత్యతృప్తుఁడుం
బరమశమాన్వితుండు నగు బ్రాహ్మణుఁడొందు సనాతనస్థితిన్’. (అర. 5.111)

ఎవ్వరిపట్ల కీడు తలపెట్టకుండా దృఢమైన మైత్రి భజించటం అమత్సరభావం. దానిని పొంది బ్రహ్మగుణ స్థితుడైనాడు ధర్మరాజు.

ఈ విధంగా ఆరణ్య పర్వశేషంలో ధర్మబోధ విశేషాలు తెలిసికొని ధర్మరాజు ఆ ఆరు మార్గాల ద్వారా ప్రస్థానం చేసి పరిపూర్ణ ధర్మదర్శనం చేయగలిగాడు.

ఎఱ్ఱాప్రెగ్గడ పై మార్గషట్కాన్ని తెలుగులో చెప్పలేదు. ధర్మదేవత రూపాలను పదిగా కాక ఎనిమిదిగా పేర్కొన్నాడు. శంభుదాసుడు పరమేశ్వరుడి అష్టమూర్తులను ధర్ముడిలో దర్శించినట్లున్నాడు. ప్రసన్నుడైన ధర్ముడి ప్రసంగ మిది-

మత్తకోకిలము

‘ఏను ధర్ముఁడఁ జువ్వె రాజకులేంద్ర! సత్యము శౌచమున్
దానముం దపమున్ శమంబును దాంతియున్ యశముం బరి
జ్ఞానయుక్తియు నాదుమూర్తులు; సమ్మదంబున నిష్టు మ
త్సూను నుత్తమధార్మికున్ నినుఁ జూచువేడుక వచ్చితిన్.’ (అర.7.462)

ధర్ముడు అష్టవిధ ధర్మస్వరూపుడు, శుద్ధ జ్ఞానమూర్తి, అతడి పుత్రుడు ధర్మరాజు. అతడు ఆ ధర్మాలను ఆచరించి చూపించేవాడు. తండ్రి సిద్ధుడు. కొడుకు సాధకుడు. సాధన సమగ్రంగా సంపన్నం కావటంచేత ఉత్తమ ధార్మికు డయ్యాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అతడిని అనుగ్రహించటానికి వచ్చాడు వాత్సల్యరసమూర్తి, పరిపూర్ణ ధర్మదీప్తి - యమధర్మరాజు. ఇది ఎఱ్ఱన చిత్రించిన నిర్వహణ ఘట్టం.

ధర్మరాజు సత్యాన్ని పాటించి అరణ్యాజ్ఞాతవాసవ్రతాన్ని నిర్వహిస్తున్నాడు. శ్రీకృష్ణాదులు ధర్మజుడి కొరకు యుద్ధం చేసి రాజ్యాన్ని సంపాదించి ఇస్తామని చెప్పినా పెద్దలముందు చేసిన ప్రతిజ్ఞకే అతడు బద్ధుడైనాడు. ధర్మరాజు ఆచరణ శీలుడైన సత్యవ్రతుడు. సత్యశీలం వలన అతడికి అంతర్బహిశ్శౌచాలు అలవడ్డాయి. అతడు ఆలోచనలో ఆచరణలో సత్యశౌచ ధర్మశాలి. సత్యం వలన శౌచం, దాని వలన ధర్మం ఉత్తముడికి సాధ్యమౌతాయి. శౌచంవలన సత్యశీలుడు స్వార్థపరిత్యాగంతో కూడిన పరార్థ, పరమార్థ వర్తనాన్ని పొందుతాడు. అతడిలో దానగుణం దానివలన ఏర్పడుతుంది. ఆరణ్యవాసంలో కూడా నిరతాన్నదానం, శరణాగతరక్షాదానం ధర్మజుడి శీలానికి బంగారానికి తావి వలె అబ్బాయి. దుర్యోధన సైంధవుల పట్ల ఆయన చూపిన ఔదార్యం దానగుణం వలన ఏర్పడిన సాత్త్విక గుణ సంపత్తి. వ్యాసభట్టారకుడు ధర్మజుడికి చేసిన బోధలో ఒకటైన వ్రీహి ద్రోణాఖ్యానం దాన తపస్సుల తులనాత్మక వివేకాన్ని కలిగించింది. అన్యాయార్జితమైన విత్తంతో చేసేదానం కంటె యుక్తన్యాయార్జిత విత్తంతో చేసే దానం అల్పమైనా మాన్యమౌతుందని వేదవ్యాస వచనం. అన్యాయార్జిత విత్తంతో దుర్యోధనుడు వైష్ణవ యజ్ఞం చేసి భూరి దానా లిచ్చాడు. వాటి కంటె అరణ్యంలో న్యాయార్జిత విత్తంతో చేసే ధర్మజుడి దానం విశేష ఫలప్రదమని తాత్పర్యం. వ్యాసుడు ధర్మరాజును తపస్సు చేయుమని హితబోధ చేశాడు. దానివలన అతడికి క్షమ, అహింస, సత్యం, సమత, ఇంద్రియ జయం, శమం, పరిత్యాగం- అనే గుణ సప్తకం అలవడుతుందని చెప్పాడు. (ఆర. 6.108) మూలంలో చెప్పబడిన ధర్మద్వారాలన్నీ తపస్సువలన తెరుచుకొంటాయని తెలుగులో స్పష్టమౌతున్నది. తపస్సువలన కలిగే సిద్ధి అంతరింద్రియ నిగ్రహమైన శమం. ఆ రెండింటి వలన పురుషుడు స్థితప్రజ్ఞుడౌతాడు. అతడి జీవితం ఆదర్శవంతమౌతుంది. దానివలన అతడికి యశస్సు లభిస్తుంది. ఆ యశస్సును నిష్కళంకంగా నిలుపుకొనటానికి జీవన ధర్మంలో నిత్య జాగృతుడై ఉండాలి. అది పరిజ్ఞానయుక్తి. దానిని పరీక్షించేదే యక్ష ప్రశ్నల పరీక్ష.

(5) యక్షప్రశ్నలు : ధర్మజ పరిజ్ఞానం

పరిజ్ఞానం అంటే ఉపరిజ్ఞానం కాదు. లోకవర్తనాన్ని పరమార్థతత్త్వంతో వివేచించే గాఢమైన విజ్ఞానం. అప్పుడే అది అనుభవజ్ఞానంగా మారిన శాస్త్రజ్ఞానమై పరిజ్ఞానం అనబడుతుంది. తెలుగులో 'వాడి కామాత్రం పరిజ్ఞానం లేకపోయె' అనే వాడుక ఉంది. జ్ఞానమంటే శాస్త్ర జ్ఞానం, బ్రహ్మజ్ఞానం. పరిజ్ఞానమంటే దానిని ఆచరణలో నిలిపిన అనుభవ జ్ఞానం. యక్షప్రశ్నలు శాస్త్ర జ్ఞానం అనుభవ జ్ఞానంగా మారిన పరిజ్ఞానాన్ని పరీక్షించేవి.

యక్షప్రశ్నలలో మొదటి నాలుగూ సూర్యుడికి సంబంధించినవి. అవి సూర్యుడిని గురించిన భౌతిక శాస్త్రజ్ఞానానికి గాని, పౌరాణిక ఐతిహాసిక విజ్ఞానానికి కాని సంబంధించినవి కావు. జ్ఞాన ప్రతీక అయిన సూర్యతత్త్వానికీ ధర్మానికీ ఉన్న సంబంధ పరమార్థానికి సంబంధించినవి. అందుకే మొదటి ప్రశ్న-సూర్యుడిని నడిపే శక్తి ఏది? అని మొదలౌతుంది. ధర్మజుడు బ్రహ్మమని సమాధానం చెప్పాడు. 'అథాతో బ్రహ్మజిజ్ఞాసా' అని బ్రహ్మసూత్రాలు మొదలైనట్లు యక్షప్రశ్నలు ఆరంభ మయ్యాయి. సూర్యుడిని సేవిస్తూ తిరిగేవారు సురకోటి అనీ, సూర్యు డస్తమించటానికి కారణం ధర్మమనీ, సూర్యుడికి ఆధారం సత్యమనీ చెప్పే నాలుగు ప్రశ్నలు సమాధానాలు జ్ఞాన దీపికలు. అనశ్వరమైన బ్రహ్మం జ్ఞానశక్తి. దానిని సేవించేవారు దేవతలు. అందువలననే బ్రహ్మజ్ఞాన విదులు భూసురు లనబడతారు. బ్రహ్మజ్ఞానులు కూడా కర్మను వదలరాదు. సంగరహితులై తామరాకుపై నీటి బిందువువలె వర్తిస్తూ ధర్మాన్ని సక్రమంగా నిర్వహించాలి. అందుకు సూర్యోదయాస్తమయాలు సాక్ష్యం. ఉదయానికి ధర్మ మెంత మూలమో అస్తమించటానికి కూడా ధర్మ మంతే మూలమని తెలియటం ధర్మసూక్ష్మం. ఎఱ్ఱన మాటలలో అది పరిజ్ఞానం. సూర్యుడికి ఆధారం సత్యం. అంటే సర్వజ్ఞానానికి ఆధారం సత్యమని భావం. ఈవిధంగా మొదటి నాలుగు ప్రశ్నలు జ్ఞానవిషయకమైన పరిజ్ఞానాన్ని పరీక్షించేవి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తరువాత యక్షు డడిగిన తొమ్మిది ప్రశ్నలు శ్రోత్రియులైన బ్రాహ్మణుల మాహాత్మ్య పరిజ్ఞానానికి సంబంధించినవి. ఆరణ్యపర్వశేషంలో బ్రహ్మక్షత్రియ మాహాత్మ్యాలను గురించి, వారిద్దరి కుండే అవినాభావసంబంధాన్ని గురించి ధర్మరాజు మార్కండేయ మహర్షిని గ్రుచ్చిగ్రుచ్చి అడిగితెలిసికొన్నాడు. 'తొల్లి యధర్మంబునకు వెఱచి బ్రాహ్మణులు నిజతేజోబలంబులు క్షత్త్రియులందు నిక్షేపించిరి; నాఁటంగోలె బ్రాహ్మ్యంబువలన క్షత్త్రంబు ప్రవర్తిల్లుచుండు; బ్రహ్మక్షత్త్రంబులు పరస్పర సంశ్రయంబులు; వెలిగా వర్తింపనేరవు. క్షత్త్రియుండు బ్రాహ్మణ సంసేవనంబునం దేజోనిరూఢుండయి యాదిత్యుండు చీఁకటి నడంచునట్లు దురితంబుల నడంచును.' (ఆర. 4.204) అని తెలిసికొన్నాడు. ఆ పరిజ్ఞానంతో ధర్మజుడు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగాడు.

ఆరణ్యపర్వశేషంలో ధర్మవ్యాధోపాఖ్యానం మాతృపితృసేవాధర్మ ప్రభావ ప్రబోధకం. అది వినిన తరువాత భూమికంటె గొప్పదైనది తల్లి అనీ, ఆకాశం కంటె పొడవైనవాడు తండ్రి అనీ చెప్పగలిగిన పరిజ్ఞానం కరతలామలకం కావటంలో ఆశ్చర్యం లేదు. ఆ రెండు ప్రశ్నలూ సర్వవర్ణాశ్రమ సామాన్యధర్మ పరిజ్ఞానసారం.

తరువాతి పది ప్రశ్నలు లోక పరిజ్ఞానానికి సంబంధించినవి. మృతుడికి మిత్రు డెవ్వడు? అనే ప్రశ్నతో ఇహపరసంబంధ పరిజ్ఞాన పరీక్ష మొదలౌతుంది. ఆ మిత్రుడు ధర్మమని చెప్పిన ధర్మరాజు ధర్మ పరిజ్ఞాని, ఇహపరకర్మ భోగాల వివరణం వినిన వివేకచూడామణి.

ధర్మువునకు కుదురు దాక్షిణ్యమని చెప్పిన అంశంనుండి లోకానికి దిక్కు సజ్జనులే అని తేల్చి చెప్పిన అంశం వరకూ వ్యాపించియున్న ప్రశ్నలన్నీ ధర్మ స్వరూప స్వభావాలను గురించి ధర్మజుడికున్న పరిజ్ఞానాన్ని పరీక్షించేవే. అందులో ఉత్తమ ధర్మం అహింసగా పేర్కొనటం గమనార్హం. ధర్మవ్యాధోపాఖ్యానంలో అహింసా స్వరూపం వివేచించబడింది. అది యక్షప్రశ్నల ఘట్టంలో పరిజ్ఞానంగా ప్రసన్నమైంది.

'దేనివలన జలం, అన్నం, సంభవిస్తాయి? విషం వంటి దేది? శ్రాద్ధ విధికి సమయ మేది?'- మొదలైన ప్రశ్నలు వేదవిహిత కర్మానుష్ఠానానికి సంబంధించినవి. చివరి మూడు ప్రశ్నలూ మానవుడి ఉత్తమ శీలానికి ఉండే లక్షణాలకు సంబంధించినవి. ధర్మవిజ్ఞానం ఒక ధర్మ సాధకుడిని తయారు చేయాలి. జ్ఞానం ఆచరణంలో బ్రతకాలి. శీలం ధర్మఫలం, 'విత్తరక్షకుఁ గడు మేలు వృత్తరక్ష' (ఆర. 4.129) అన్న ధర్మజుడి ఆశయం ఇతిహాస శ్రవణం వలన కలిగే పార్యంతిక ఫలం.

ధర్ముడు: మనుజుడు వేటిని పరిత్యజిస్తే జనప్రియుడు, నిశ్శోకుడు, అర్థవంతుడు, సుఖి ఔతాడు?

ధర్మరాజు: మానవుడు గర్వం వదలి సర్వజన సమ్మతు డౌతాడు. క్రోధాన్ని అణచుకొని శోకానికి దూరమౌతాడు. లోభాన్ని విడిచి అర్థాఢ్యుడౌతాడు. తృష్ణను త్యజించి సుఖుడౌతాడు.

ధర్ముడు: ఎటువంటివాడు పురుష శబ్దవాచ్యుడు?

ధర్మరాజు: భూమ్యాకాశాలు నిండిన కీర్తిసంపద ఎవరికుంటుందో అతడే పురుషుడు.

ధర్ముడు: సర్వధని అయినవా డెవ్వరు?

ధర్మరాజు: ప్రియాప్రియాలు, సుఖదుఃఖాలు, భూతభవిష్యద్వర్తమానాలు ఎవరికి సమంగా కనిపిస్తాయో అతడు సర్వధని- అంటే సర్వార్థసిద్ధుడు.

ఈ మూడు ప్రశ్నలు ధర్మజుడు తన శీలాన్నే అనుశీలించుకొని వినయంతో ఆవిష్కరించాడా? అన్నట్లుంటాయి. ఆ తరువాత ధర్ముడు కూడా మరే ప్రశ్న వేయలేకపోయాడు. ధర్మ పరిజ్ఞానం శిఖరం చివరి ప్రశ్న. దానిని అధిరోహించిన ధర్మరాజు సర్వార్థసిద్ధుడే!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యక్షప్రశ్నల ఘట్టంలో ప్రబంధపరమేశ్వరుడు తెలుగువారి కిచ్చిన తియ్యని మాకందం- ఇతిహాసశ్రవణ పరిజ్ఞానానికే ఒక అందం.

క. 'శ్రుతమువలన శ్రోత్రియుఁ డగు। నతుల తపోయుక్తిఁ గడు మహత్త్వము వడయున్
ధృతిచే సహాయయుతుఁ డగు। నతిశయముగ బుద్ధిమంతుఁ డగు బుధసేవన్'. (అర.7.428)

ఆరణ్యపర్వమంతా ధర్మజుడి బుధజనసేవతో నిండిపోయింది. దానితో ఆయన బుద్ధిమంతు డయ్యాడు. తరతరాలుగా మనలను బుద్ధిమంతులను చేస్తున్నాడు. ఇతిహాస ఫలాన్ని విశ్వజనీనంగా పొందండని మనల కందరికీ మిత్రసమ్మితంగా ప్రబోధిస్తున్నాడు.

7. ఆరణ్యపర్వశేష నిర్వహణ నైపుణ్యం : ప్రబంధపరమేశ్వరత్వం

ఆరణ్యపర్వం సహజంగానే రెండు భాగాలుగా విభక్తమై ఉన్నది. స్థూలంగా - మొదటి భాగం నహుషప్రశ్నలతో, రెండవ భాగం యక్షప్రశ్నలతో ముగుస్తాయి. తెలుగులో దాదాపుగా నన్నయ, ఎఱ్ఱయలు ఈ రెండు భాగాలనూ వరుసగా నిర్వహించటం కాలపురుషుడి క్రియావైచిత్రి. ఈ రెండు భాగాలలో ఉన్న సామ్యభేదాలను గురించి ఆరణ్యపర్వ ప్రథమ భాగపీఠికలో కొంత సమీక్షించటం జరిగింది. మరికొన్ని విశేషాలు ఇక్కడ ముచ్చటించటం సమంజసం.

ఎఱ్ఱాప్రెగ్గడ 'నన్నయభట్ట తిక్క కవినాథుల కెక్కిన భక్తిపెంపునన్' ఆరణ్యపర్వశేషాన్ని ఆంధ్ర భాషలో 'సుజనోత్సవ' మొప్పగా నిర్వహించాడు. కాబట్టి ఎఱ్ఱన రచన నన్నయ తిక్కన రచనలవలె అనువాదం కాదు అనుసృజనం. అనుసృజనంలో మూలంలోని తాత్పర్యం చెడకుండా ఉంటుంది. కాని, వస్తు నిర్వహణం మాత్రం ఎఱ్ఱన ప్రతిభాశక్తితో ఉన్మీలితమౌతుంది. దీనిని అనుశీలించటానికి గణాంకం కంటె గుణాంకనం ఎక్కువగా ఉపకరిస్తుంది. అయినా, గణాంకం గుణ మూల్యాంకనానికి కొంత తోడ్పడవచ్చును.

సంస్కృత మహాభారతంలో వనపర్వం 13,664 శ్లోకాలలో, 16 ఉపపర్వాలతో కూడి ఉన్నది. తెలుగులో అది ఏడాశ్వాసాలలో 2894 గద్య పద్యాలలో అవతరించింది. అందులో నన్నయ 6981 శ్లోకాలు గల భాగాన్ని 1299 గద్యపద్యాలలోనూ, ఎఱ్ఱయ 6683 శ్లోకాలు గల భాగాన్ని 1595 గద్యపద్యాలలోనూ నిర్మించారు. ఈ గణాంకాలను పరిగణనంలోకి తీసికొని, డాక్టర్ పాటిబండ మాధవశర్మగా రిట్లా నిర్ణయించారు - "నన్నయ మూలముకంటె ఎఱ్ఱయ మూలము మూడువందల శ్లోకములు తక్కువ. నన్నయ మూలముకంటె ఎఱ్ఱనయనువాదము మూడువందల గద్యపద్యములు ఎక్కువ. మూలమునకు ఎక్కువ సన్నిహితమగుటయు, ఎడనెడ రసభావానుగుణములైన వివరణలు వర్ణనలు ఎక్కువగా చేరుటయు కారణములుగా ఎఱ్ఱయ యనువాదము నన్నయ యనువాదముకంటె కొంత భిన్నమై, తిక్కన మార్గము ననుసరించుచు, శ్రీనాథాదులకు త్రోవచూపుచున్నట్లున్నది. (ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమివారి ఆంధ్ర మహాభారతము - ఆరణ్యపర్వ పీఠిక. పుట. 53). కవిత్రయంవారిది కథానువాదమనే ఆలోచనధారలో అనుశీలించిన శర్మగారి మాటలలో ఎఱ్ఱన స్వతంత్రవైఖరిని గుర్తించటమే ప్రస్తుతాంశం.

ఎఱ్ఱన నన్నయ పేరనే ఆరణ్యపర్వశేషం రచించటం చేత తవ కవితలో కానబడే సాపేక్ష లక్షణాలను ప్రత్యేకంగా చెప్పలేదు. నన్నయ కవితారీతి కొంత తన కవితారీతిలో ఉంటుందని మాత్రం చెప్పి ఊరుకొన్నాడు. కాగా- ఆ లక్షణాలను - హరివంశం, నృసింహపురాణావతారికలనూ వివిధ కవులు ఎఱ్ఱనను గురించి చేసిన ప్రశంసలనూ ఆధారంగా చేసికొని సూత్రీకరించుకొనవలసి వస్తున్నది. దీనికి తోడు ఆరణ్యపర్వశేషం ఎప్పుడు రచించాడు? ఆయన రచనలలో ఇది ఎన్నోది? అప్పటి ఆయన కవితా దృక్పథం, కావ్యశైలీ పరిపాకం ఎటువంటిది? అనే ప్రశ్న లెన్నో ఎదుట నిలుస్తాయి. వాటికి చెప్పుకొనే సమాధానాలే ఆరణ్యపర్వశేష కవితానుశీలనానికి ప్రాతిపదికలు కాగలుగుతాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(1) ఆరణ్యపర్వశేషం : ప్రబంధపరమేశ్వరుని ప్రయోగపర్వం

సాహిత్య చరిత్రకారులు ఎఱ్ఱన కృతులను రెండు జంటలుగా భావించి పౌర్వాపర్య నిర్ణయానికి పూనుకొన్నారు. రామాయణ హరివంశాలు (ఇవి ప్రోలయ వేమారెడ్డికి అంకితమైనవి) ఒక జంట, ఆరణ్యపర్వశేషం, శ్రీలక్ష్మీ నరసింహావతారమనే నృసింహపురాణం మరొక జంట. (వీటిలో నృసింహపురాణం అహోబల నృసింహస్వామి కంకితం). ఆరణ్యపర్వ రచనంవలన ప్రబంధ పరమేశ్వర ప్రశస్తి ఎఱ్ఱనకు వచ్చినట్లు నృసింహపురాణంలో చెప్పబడి ఉంది కాబట్టి, ఈ రెంటిని కలిపి చెప్పటం విమర్శకులకు పరిపాటి అయింది. కావ్యశైలీ పరిణామ దృష్టితో చూస్తే ఆరణ్యపర్వశేషం హరివంశ నృసింహపురాణాల కంటె ముందే ఉండాలని చాలమంది భావించారు. కొందరు హరివంశాన్ని చివరి రచనగా పేర్కొన్నారు. కవిశైలి మొదట ప్రాథమికంగా అప్రౌఢంగా ఉంటుందనీ, తరువాత సలక్షణంగా, ప్రౌఢతరమౌతుందనీ, క్రమంగా అది పరిపక్వమై, ప్రసన్నతనూ, సారళ్యాన్నీ పొందుతుందనీ భావించే వర్గం వారికి హరివంశమే చివరి కావ్యం. అనుకర్త నుండి యుగకర్తగా ఎఱ్ఱన ఎదిగాడని భావించే వారికి అతడి రచనలో ప్రౌఢ ప్రబంధ కవితా పరీపాకమే తరువాతి కవులకు మార్గదర్శకమైనది. కాబట్టి నృసింహపురాణమే చివరి రచన. ఇదే సత్యానికి సన్నిహితమైన సమాలోచన. అయితే సమస్య ఏమంటే - ఎఱ్ఱన తరువాత అతడి హరివంశాన్ని అనుసరించేవారు కొందరూ, నృసింహపురాణాన్ని అనుసరించేవారు కొందరూ కనబడతారు. ఏ వర్గం వారికి ఆ రచన గొప్పదిగా అనిపించటం సహజం. వివిధ వాదాల కదే మూలం కూడా.

ఎఱ్ఱన మొదట రామాయణం రచించాడని చాల మంది అంగీకరిస్తున్నా, ఆ కావ్యం ఉపలభ్యం కావటం లేదు. దాదాపు 46 పద్యాలు మాత్రం దొరుకుతున్నాయి. దానికి కారణం అది ప్రాథమికమైనదీ, సంగ్రహమైనదీ, అప్రౌఢమైనదీ అయిన రచన అయి ఉండవచ్చును. లేదా ఆరణ్యపర్వంలో ఎఱ్ఱన చెప్పిన రామాయణ కథను చదివిన తరువాత ఆ కావ్యం విస్మృతిలో పడిపోయి ఉండవచ్చును. ఎఱ్ఱనకు ఆప్తమిత్రుడు, ప్రోలయవేమారెడ్డి తమ్ముడు, మహాసేనాని అయిన మల్లారెడ్డి చదలవాడలో రామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించినప్పుడు ఎఱ్ఱయచేత రామాయణం వ్రాయించి ఉండవచ్చును. మల్లారెడ్డి ప్రోత్సాహంతో ప్రోలయ వేమారెడ్డికే ఎఱ్ఱయ కృతినిచ్చి ఉంటాడు. ప్రోలయ వేమారెడ్డి "చేతోమోద మెలర్ప రామకథ మున్ జెప్పించి యత్యుత్తమ ఖ్యాతిం బొందితి, నింక నేను దనియన్ గావ్యామృతాస్వాదనన్" అని హరివంశం కూడా చెప్పించుకొన్నాడు. అటువంటి రామాయణం కూడా కాలగర్భంలో కలసిపోయింది. భారత పరాంశమైన 'హరివంశం' మాత్రం చిరంజీవిగా నిలిచింది. కారణం తెలియదు.

ఎఱ్ఱన రామాయణాన్ని 'వల్మీకభవు వచోవైఖరి' ననుసరించి చెప్పాడని చదలవాడ మల్లన పేర్కొన్న దానిని బట్టి, వాల్మీకి రామాయణాన్ని యథామూలంగా తెలుగులోకి అనువదించి ఉండవచ్చును. తెలుగులో యథావాల్మీకంగా రచించిన రామాయణాలకు అంత ప్రాచుర్యం లేదు. ప్రాచీనులు (ఎంతటి గొప్పవారైనా) వ్రాసిన అటువంటి రామాయణాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఎఱ్ఱన రామాయణానికి కూడా అటువంటి స్థితియే ఏర్పడి ఉండవచ్చును. తెలుగు ప్రజలు అవాల్మీకకల్పనలున్న రామాయణాలనే ఆదరిస్తారు.

ప్రాచీన కాలంలో ఒక పరిపాటి ఉండేది. ఎవరైనా భారతం వ్రాయదలచుకుంటే ముందుగా రామాయణాన్ని రచించేవారట! దానిని అనుసరించి నన్నయ భారతానికి ముందు రాఘవాభ్యుదయాన్ని వ్రాశాడనే ఒక వదంతి ఉన్నది. తిక్కన నిర్వచనోత్తర రామాయణ రచన చేయటం ప్రసిద్ధం. ఆ బాటలో నడచిన ఎఱ్ఱన ఆరణ్యపర్వశేష హరివంశ రచనలకు ముందే రామాయణం రచించి ఉండవచ్చును. ఇది ఊహామాత్రమే.

రామాయణం తరువాత ఆరణ్యపర్వశేషమే ఎఱ్ఱన రచించి ఉంటాడు. దీని దొక ప్రత్యేకమైన చరిత్ర. ఎఱ్ఱయకు చిన్ననాటి నుండే కావ్యరచన చేసే ఆసక్తి ఉండేది. అందులోనూ నన్నయ తిక్కనలవలె తానూ ఒక మహాకవి కావాలని ఆయన కలలు కన్నాడు. దేవుడి కంకితమైన నృసింహపురాణం అవతారికలో తన ఆత్మ సంవేదన వినిపించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. "మించిన వేడ్క వీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మ రా
యంచలు కూయఁ గ్రౌంచమును నావలఁ గూయఁ గడంగుభంగిఁ బ్రౌ
ఢాంచిత శబ్దసారులు మహాకవు లాద్యులు కావ్యశయ్యఁ గీ
లించిన కీర్తిసంగసుఖలీలకు నేనును గాంక్షఁ జేసితిన్". (నృ.పు.1.13)

ఆ ఆశను ఆశయంగా మార్చుకొన్నాడు. నన్నయ కవితారీతిని సాధించాడు. నన్నయకు వారసు డనిపించుకొన్నాడు. ఎఱ్ఱనది ఏకలవ్యభక్తివలె కనపడుతుంది. నన్నయ పేరనే తన కవితను వ్రాయ నారంభించాడు. ఎఱ్ఱన గుప్తభక్తి పండించిన గొప్ప కవిత ఆరణ్యపర్వశేషం. అయితే, హరివంశంలో, నృసింహపురాణంలో పరిణతి చెందిన కవిత్వ మహత్త్వశక్తులు ఇందులో అంకురావస్థ నుండి పుష్పావస్థకు పెరుగుతున్నాయి. అందువల్లనే ఆరణ్యపర్వశేషం ఎఱ్ఱాప్రెగ్గడ సర్వకావ్యకళాజగత్తుకు బీజ సంపుటి. వటపత్రశాయి గర్భ కుహరంలో గుప్తంగా దాగి ఉండి, మార్కండేయ మహర్షికి బీజప్రాయంగా సర్వజగత్ సృష్టి దర్శనమిచ్చినట్లు ఆరణ్యపర్వశేషంలో ఎఱ్ఱన కవితాకళా వైభవం బీజప్రాయంగా ప్రత్యక్షమౌతుంది. ఈ రచన కూడా నరాంకితమే. నన్నయ్యలో పరకాయ ప్రవేశం చేసిన ఎఱ్ఱయ్యకు రాజరాజ నరేంద్రుడు తప్ప మరొక రాజేంద్రుడు కనపడడు. అందువలననే కాబోలు ముగిసిన ఆరణ్యపర్వం ముచ్చట ఎత్తకుండానే ప్రోలయ వేమారెడ్డి భారత పరాంశమైన హరివంశ ప్రసక్తి తెచ్చాడు. తానూ, తన తాత ఎఱపోత సూరీ తప్ప సమకాలీనులలో మరెవ్వరూ ఆరణ్యపర్వశేష పూరణ ప్రసక్తిని వాచ్యం చేసినట్లు ప్రస్తావించకపోవటం ఎఱ్ఱన పాటించిన పరమౌచిత్యం! ఆరణ్యపర్వశేషం ప్రబంధ పరమేశ్వరుడి ప్రయోగభూమి.

(2) నన్నయ ప్రసాదకవి : ఎఱ్ఱయ మధుర కవి

నన్నయ ప్రతి ఆశ్వాసం చివర తాను ఆభాగంలో ప్రదర్శించిన కవితా కళాంశాన్ని సూచించాడు. ఎఱ్ఱయ దానిని పాటించాడు.

ఆరణ్యపర్వం

1. ప్రథమాశ్వాసం	-	పుణ్యకథ యతిరమణీయంబుగాను'.....	(1.398)	నన్నయ
2. ద్వితీయాశ్వాసం	-	'కథాక్రమం బతిరమ్యంబుగాను'...	(2.354)	నన్నయ
3. తృతీయాశ్వాసం	-	'కథ రమ్యంబుగ....	(3.397)	నన్నయ
4. చతుర్థాశ్వాసం	-	'ఎఱింగించిన తెఱంగు...'	(4.414)	ఎఱ్ఱయ
5. పంచమాశ్వాసం	-	'కథావిశేషంబు సవిస్తరంబుగా...'	(5.435)	ఎఱ్ఱయ
6. షష్ఠాశ్వాసం	-	'ఆఖ్యానంబు విఖ్యాత మాధుర్యమనోహరంబుగా'	(6.409)	ఎఱ్ఱయ
7. సప్తమాశ్వాసం	-	'సవిస్తర మధురంబుగా నుపన్యసించి...'	(7.467)	ఎఱ్ఱయ

నన్నయ ప్రసన్నకథాకలి(వి)తార్థయుక్తితో కవిత చెప్పి కథాకవితకు మార్గదర్శి అయినవాడు. ఆరణ్యపర్వంలో ఆఖ్యానం పరిమితం. ఆఖ్యానకాలు, ఉపాఖ్యానాలు విశేషం. కథను ఏకవాక్యతతో అందంగా చెప్పే గుణాన్ని రమణీయమన్నాడు నన్నయ. కథా సంవిధాన శిల్పాన్ని రమ్యత అన్నాడు. కథా నిర్మాణాన్ని కవితామయంగా ఆస్వాదయోగ్యంగా చెప్పటం రమణీయమనీ, రమ్యమనీ నన్నయ నిర్దేశం. (ఈ అంశాలను గురించి ఆరణ్యపర్వం పీఠిక మొదటి భాగంలో పరిశీలించాం)

ఎఱ్ఱయ కూడా నన్నయవలె కథాకథనం మీదనే శ్రద్ధ వహించి దానిని వర్ణనామయం చేసి, రచనలో తాను పాటించిన నాలుగంశాలను చెప్పాడు. అవి ఆయా ఆశ్వాసాల కథలను తీర్చిదిద్దిన పద్ధతులలో కానవచ్చే శిల్ప విశేషాలు. ఆరణ్యపర్వ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శేషంలోని చతుర్థాశ్వాసంలో మార్కండేయ మహర్షి చెప్పిన పురాణవస్తు విశేషాలు విస్తారంగా ఉన్నాయి. వాటిని తాను తెలిపిన పద్ధతిని గమనించుమన్నాడు ఎఱ్ఱన. పంచమాశ్వాసంలో ధార్మికాంశాలు, రసవత్కథాంశాలు కలిసి ఉన్నాయి. వాటిల్లో కథా విశేషాలను విస్తరించి రచించే పద్ధతిని ఎఱ్ఱన ప్రదర్శించాడు. ఆరవ ఆశ్వాసంలోని ప్రధాన కథను చెప్పే పద్ధతిలో స్పష్టంగా అందరికీ తెలిసేటట్లు ప్రసిద్ధ మాధుర్యగుణ ప్రధానమైన రచననూ, మనోహరమైన వర్ణనలనూ చేసి రక్తి కట్టించి ఆస్వాదయోగ్యతను ఎఱ్ఱన పెంచాడు. సప్తమాశ్వాసం విస్తరించి చెప్పటం చేత మనసుకు తియ్యదనం కలిగేటట్లు ఎఱ్ఱయ ప్రపంచించాడు. ఈ లక్షణాలు ఆయా ఆశ్వాసాలకే కాక ఎఱ్ఱయ ఆరణ్యపర్వశేషానికంతా వర్తిస్తాయని కూడా సంభావించవచ్చును.

నన్నయ రమ్య, రమణీయ శబ్దాలను వాడితే, ఎఱ్ఱయ మధుర, మాధుర్య, మనోహర శబ్దాలను వాడాడు. కవిత్వంలో చిత్తాన్ని రమింపజేసే గుణం రమ్యత; చిత్తరమణం ప్రసాదగుణ సహజ స్వభావం; చిత్తాన్ని ద్రవింపచేసే గుణం మాధుర్యం. నన్నయ ప్రసాదగుణానికీ, ఎఱ్ఱన మాధుర్య గుణానికీ కవితలో ప్రాధాన్యాన్ని కల్పించారని ఆ పదజాలం చెప్పుతున్నది. కవిత్వం వలన సహృదయుల హృదయాలు పొందిన ద్రవస్థితిని 'మధురం' అంటారు. అట్టి ద్రవస్థితిని కలిగించే రచనా గుణాన్ని 'మాధుర్య' మంటారు. దానిని కథా సన్నివేశాల్లో, వర్ణనాదులలో ప్రదర్శించినప్పుడు కలిగే అభివ్యక్తి శక్తిని 'మనోహరత్వ' మంటారు. ఇట్లా తన కవిత్వాన్ని అనుశీలించటానికి అనువైన సూచనలను ధ్వనిమయంగా చేయటం నన్నయబాటయే. నన్నయ ప్రసాద కవి, ఎఱ్ఱయ మధుర కవి.

మాధుర్యం వస్తువునూ, రచననూ, రసాన్నీ ఆశ్రయించి ప్రసరిస్తుంది. స్త్రీలకు సంబంధించిన కథార్థాలు అధికంగా ఉన్నప్పుడుకాని, పరమాత్మభావనంతో ఆత్మరసమైన ఆనందాన్ని అభివ్యక్తం చేసే కథార్థాలను ఆర్ద్రంగా చెప్పినప్పుడుగానీ, కరుణాది రసాలు ప్రవర్తిల్లిన ఘట్టాలను చిత్రించినప్పుడుగాని వస్తుపరమైన మాధుర్యం వ్యక్తమౌతుంది. రచనలో మాధుర్యం శబ్దార్థాలను ఆశ్రయించి అభివ్యక్తమౌతుంది. పృథక్పదత్వంలో శబ్దాన్నాశ్రయించిన మాధుర్యం మనస్సును ఆకర్షిస్తుంది. ఉక్తివైచిత్ర్యంలో అర్థగుణమైన మాధుర్యం ఉన్మీలిస్తుంది. తద్భావనం హృదయాన్ని ఆర్ద్రం చేస్తుంది. నన్నయ రచనలో శబ్దగుణమైన మాధుర్యానికి ఉక్తివైచిత్రి ఉపబలకం. ఎఱ్ఱయ రచనలో అర్థగుణమైన ఉక్తివైచిత్రికి శబ్దగుణం ఊతం ఇస్తుంది. తిక్కన గారిది అర్థగుణ ప్రధాన రచన. ఆయన రచనలలో ఉక్తివైచిత్రికి శబ్దగుణ మాధుర్యం ఊడిగం చేస్తుంది. ఈ తారతమ్యాన్ని గమనిస్తే ఎఱ్ఱయ నన్నయ రీతికి సన్నిహితుడు. నన్నయ కవిత రమింపచేస్తుంది. తిక్కన కవిత మనసును వికసింప చేస్తుంది. వీరిద్దరికీ నడుమ ఎఱ్ఱయ కవిత హృదయాలను ద్రవింపచేస్తుంది. ఈ మూడో గుణం కవిత్రయంవారి ఆంధ్ర భారత కవిత్వానికి ఒక పరిపూర్ణతను కలిగించింది. అందుకే ఎఱ్ఱన ప్రబంధపరమేశ్వరుడు.

(3) విడమరచి, విస్తరించి, మధురంగా, మనోహరంగా చెప్పటం

ఆరణ్యపర్వశేషంలో భారత కథ 35 శాతం, మార్కండేయుడు చెప్పిన సర్గాది పురాణ ధర్మకథార్థాలు 35 శాతం, రామకథ, సావిత్రికథల వంటి ఉపాఖ్యానాలు 30 శాతం మేరకు వ్యాపించి ఉన్నాయి. అంటే ఆఖ్యానంకంటే ఉపాఖ్యానాల భాగమే ఎక్కువ. దాదాపు మూడింట రెండు వంతులు. ఉపాఖ్యానాలన్నీ ధర్మజుడి ప్రశ్నలకు సమాధానాలే. ఆ ప్రశ్నలు కూడా మూడు రకాల ఆసక్తుల నుండి పుట్టాయి.

మొదటిది- పురాణ జిజ్ఞాస. రెండవది - బ్రహ్మక్షత్రియ, పుత్ర, పతివ్రతాదుల మాహాత్మ్య శ్రవణాసక్తి. మూడవది: తనవలె తన భార్యవలె అవమానాలు, అగచాట్లు పడినవారి వృత్తాంతాలు వినాలనే అభిలాష. ఈ మూడు రకాల కథలను నిర్వహించటంలో ఎఱ్ఱన - విడమరచి చెప్పటం, విస్తరించి చెప్పటం, మధురంగా చెప్పటం అనే మూడు పద్ధతులను ఎన్నుకొన్నాడు. ఇక మిగిలింది ప్రధాన కథ. దానిని ఈ లక్షణాలతోపాటు మనోహరంగా కూడా చెప్పాడు ఎఱ్ఱన. కాబట్టి ఎఱ్ఱయ కథాకథన శిల్పానికి నాలుగు ముఖాలు. అవి - విడమరచి, విస్తరించి, మధురంగా, మనోహరంగా చెప్పే విద్యలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(4) ఎఱ్ఱన కవిత : ఆర్ద్రమైన ఆత్మీయత, మాధుర్యం

శంభుదాసుడు సహజంగా శివకేశవ భక్తి రసార్ద్రచిత్తుడు. అందువలన అతడి వాక్కు ప్రసాదమధురం, స్వీయవాగ్విలాసాన్ని కథాగత పాత్రలకు కూడా అంటగట్టే స్వభావం ఆయనకు లేకపోలేదు. కొన్ని పాత్రలు ఎఱ్ఱన కవితలో భక్తులయ్యాయి. మచ్చుకు ఉదంకుడిని ముందుగా చెప్పవచ్చును.

ఉ. 'శంకరసన్నిభుండు జనశంకరుఁడున్ గరుణాకరుం డనా
తంకుఁ డుదంకుఁ డన్మని వ్రతస్థితుఁడై మరుభూమియందు ని
శ్శంకమతిన్ వసించి యనిశంబును నవ్యయు నచ్యుతున్ మనః
పంకజవేదిపై నిడి తపం బొనరించె ననేకవర్షముల్'. (అర. 4.373)

ఈ పద్యం ఎఱ్ఱన ఆత్మీయత నుండి ఆవిర్భవించింది. స్వయంగా శంకర సన్నిభుడైన శంభుదాసుడు అచ్యుతుడిని స్వీయమనః పంకజవేదికపై ఉంచి అనేక సంవత్సరాలు కవితా తపస్సు చేసి చతుర్విధ పురుషార్థ సాధన రూపాలైన నాలుగు కావ్యాలు రచించాడు. ఉదంకుడు ప్రచ్ఛన్న శంభుదాసుడు.

మార్కండేయ మహర్షి పాత్రలో ఎఱ్ఱన పరకాయప్రవేశం చేశాడు. మూలంలో లేని 'మంజుల వాగమృత ప్రవాహం' (4.164) ఆయన వాక్కులో ప్రసాదమధురంగా పొంగించాడు. మార్కండేయుడు ప్రబంధ పరమేశ్వరుడి కవితాభివ్యక్తికి కమనీయ వాహిక. తన కిష్టమైన పురాణ కావ్య ప్రబంధ వాగ్విలాసాల నన్నింటినీ ఆయన కథాకథన శిల్పంతో విడమరచి, వివరించి, మధురంగా చెప్పటంలో నిక్షేపించాడు. అందుకే మూల భారతంలో మార్కండేయ కథనం విషయ విజ్ఞాన భాండార ప్రదర్శనం, ఎఱ్ఱయ కవితలో మధుర వాగ్విలాస మధుధార. కవి ఏమి చెప్పాడన్నది మూలంలో ముఖ్యం, ఎట్లా చెప్పాడన్నది ఎఱ్ఱయ రచనలో ముఖ్యం.

ప్రసాద మాధుర్యాలు భక్తికవితకు శ్వాసకోశాలు. మార్కండేయుడు ఎంతటి దార్శనికుడో అంతటి ఆర్ద్రచిత్తుడు. దార్శనికుడికి ఉండే ప్రసాదవాగ్వృత్తి, ఆర్ద్రుడికుండే రసార్ద్రచిత్తవృత్తి ఆయన వాక్కులలో మిలమిలలాడుతూ ఉంటాయి. పరమసుందర బాలాకారుడైన వటపత్రశాయి పాదపద్మాలకు మ్రొక్కి, జిజ్ఞాసతో అడిగిన మాటలు మనసును ద్రవింపచేస్తాయి.

శా. 'ఈ యేకార్ణవ మీ వటక్షితిరుహం బీ పర్ణపర్యంక మి
ట్లై యొప్పారుచు నుండఁగా నుదరభాగైక ప్రదేశంబునం
దీ యీరేడు జగంబులున్ మెలఁగఁగా నిట్లున్న బాలత్వమే
నేయందంబున నిశ్చయించి సుఖినై యేపారుదుం జెప్పవే'. (అర. 4.261)

త్రికంలోని ఈకారం ప్లుతంగా ఉచ్చరించబడే కాకువు అద్భుతం నుండి పుట్టిన భక్తిమాధుర్యాన్ని పరమ చమత్కారంగా ఆవిష్కరించింది. ఆర్ద్రత ఈ పద్య హృద్యోక్తిలోని భక్తి మాధుర్యం.

వటపత్రశాయి అయిన మధురబాలుడిని పాండవ ప్రాణ బంధువైన ప్రౌఢ గోపాలుడిగా గుర్తించి పారవశ్యంతో చెప్పే పద్యం భక్తి పరిపక్వతకు పరమోదాహరణం.

శా. 'నా కమ్మెఁ బొడసూపెఁ దాను గృపతో నా కందు, నేఁ డియ్యెడన్
నీకున్ గాదిలిచుట్టమై సచివుఁడై నెయ్యంబుమై నున్న పు

ణ్యాకారుం గమలాయతాక్షుఁ గరుణైకాయత్తు నత్యుత్తమ
శ్లోకుం గృష్ణునిఁ గంటి నా సుకృతముల్ శోభిల్లెఁ బక్వంబులై.' (అర. 4.281)

మొదటి పద్యంలో అద్భుతం నుండి పుట్టిన మాధుర్యం, రెండవ పద్యంలో భక్తిరసార్ద్రచిత్తం నుండి పుట్టిన మాధుర్యం. ఈ మధురోక్తి ఎఱ్ఱయ వాక్కుకు పూచిన భక్తిసుమం. పోతన భాగవత భక్తి కవితకు ఈ రచన ప్రథమావతారం.

మాధుర్యగుణంతో కవిత్వాన్ని మనోహరంగా మార్చటం ఎఱ్ఱన వాగ్విలాసం. దీనినే సూక్తివైచిత్రిగా తరువాతి వారు చెప్పుకొన్నారు. మార్కండేయమహర్షి యుగధర్మాలను చెప్పే సందర్భంలో కుప్పగా పడి ఉన్న విశేషాలను ఎన్నిక చేసి, వర్గీకరించి, విడమరచి, విశ్లేషించి, వాటిని తగిన వృత్తాలలో, తగిన పాకాలలో రీతులలో గుణోత్కృష్టంగా చెప్పటం ఎఱ్ఱయ పాటించిన విధానం.

(1) విడమరచి చెప్పే పద్ధతికి ఏ చరణానికి ఆచరణం విరిగే సీసపద్యం ఛందోమయ సాక్ష్యం. మచ్చుకు చూడండి- కలియుగ ధర్మకథనంలో -

సీ. 'సత్యంబు నరులకు సంక్షిప్తమగు; సత్య । హాని నాయువు గడు నఱిగి పోవు;
నాయువు దఱిఁగిన నల్పంబులగు విద్య; । లల్పవిద్యలను మోహంబు మిగులు;
మోహంబువలనఁ బై ముసురు లోభంబు; లో । భావేశమునఁ గామ మగ్గలించుఁ;
గామంబు పెంపునఁ గడఁగుఁ గ్రోధంబు; క్రో । ధంబున వైర మెంతయును బెరుఁగు;

ఆ. వైరమున నశేషవర్ణులు నన్యోన్య । పీడ సేయుచును విభిన్నబుద్ధి
నొక్కఁ డొకని మేర నుండక వర్ణసం । కరము సేయఁగలరు కలియుగమున'. (అర.4.287)

కలియుగ ధర్మాలలో అనేక రకాలు కలగూరగంపగా చెప్పబడి ఉన్నాయి. వాటిలో సర్వజన సామాన్యమైన ప్రవర్తన విశేషాలను గుదికూర్చి, ఒక పద్యంలో విస్పష్టంగా విడమరచి చెప్పటం పురాణ కవితలోని వైశిష్ట్యం. ఎఱ్ఱయ ఆ పద్ధతిలో నిష్ణాతుడు. వస్తు విస్తృతిని బట్టి వృత్తాన్ని ఎన్నుకొనటం, విడమరచి చెప్పే పద్ధతిని బట్టి పాదగతిని సాగించటం వస్తువును మధురతరం చేసే కథన శిల్పం.

కలియుగంలో జనపదాల స్థితిగతులను తెలిపే చోట ఎఱ్ఱన ఆవేదనపడి చెప్పినట్లున్నది. దానికి కారణం లేకపోలేదు. కాకతీయ సామ్రాజ్యం పడిపోయిన తరువాత తురుష్కుల దాడుల వలన తెలుగునాట హైందవ సంస్కృతితో పాటు, జానపద జీవనం కూడా కలుషితం, కష్టతరం, దుఃఖమయంగా మారింది. ఆ దుర్భరస్థితి నుండి దేశాన్ని సముద్ధరించాలని కంకణం కట్టుకొన్న రాచకొండ, దేవరకొండ, నాయక రాజులు, అద్దంకి రెడ్డి ప్రభువులు, విద్యారణ్య శిక్షణలో విజృంభించిన అనెగొంది ప్రభువులు ఆ కాలంలో సాగించిన సమష్టి దేశభక్తి ఉద్యమంలో పాల్గొన్న మహాకవి ఎఱ్ఱన - కలియుగ లక్షణాలంటే వేరే ఎక్కడా లేవనీ ఆనాటి సంక్షోభ సమాజంలోనే ఉన్నాయనీ భావించి సమకాలీన సామాజిక స్పృహకు స్పందించిన ఆత్మీయతతో ఈ ఘట్టాన్ని ఆర్ద్రంగా రచించాడు. ఆయన నగరాలలో కంటె జనపదాలలో ఎక్కువగా నివసించాడు. అ సంవేదన ఈ పద్యంలో ప్రతిధ్వనిస్తుంది.

మ. 'వివిధ వ్యాఘ్రమృగోరగాకులము లై, విస్తీర్ణశూన్యాటవీ
నివహాభీలములై, యరాజకములై, నిర్మూలధర్మంబులై
ద్రవిళాభీర తురుష్కబర్బరపుళింద వ్యాప్తి దుష్టంబు లై
భువిలో నెల్లెడఁ బాడగున్ జనపదంబుల్ దస్యుగాంతంబునన్'. (అర. 4.289)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాడుబడ్డ గ్రామాల దుర్భరస్థితి ఇందులో కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు ఎఱ్ఱన. క్రూరమృగాల విహారంతో భయాందోళన చెందటం, వ్యవసాయ భూములు తగ్గి అడవులు పెరగటంతో రక్షణకు దూరం కావటం, అరాజకాలు కావటంతో గ్రామాలలో న్యాయం లేకపోవటం, ధర్మస్థితి భగ్నం కావటంతో జీవన విధానం చిల్లులుపడటం కలియుగ ధర్మాలుగా ఎఱ్ఱయ చెప్పాడు. మూలంలో ఉన్నవన్నీ ఆయన చెప్పాడా లేదా అన్నదికా దిక్కడ ప్రశ్న. వీటికి కారణం 'ద్రవిళాభీర తురుష్కబర్బర పుళింద వ్యాప్తి'తో గ్రామాలు దుష్టములైపోవటమే అని ఎఱ్ఱన భావం. ఎందుకంటే మూలంలో తురుష్కుల ఆగడాలు ఉండటానికే వీలు లేదు. ఎఱ్ఱయ రచనలో అవి ముఖ్యపాత్ర వహించాయి. అంటే- ఆంధ్ర భారతంలోని జనపదాలు ఎఱ్ఱయ కాలంలోనివే అని స్పష్టం. స్వంతంగా చూచిన కష్టాలను అందరికీ తెలిసేటట్లు ప్రత్యేకంగా ఒక వృత్తంలో తనకు నచ్చిన ప్రబంధశయ్యలో ఎఱ్ఱన ఆవిష్కరించాడు. అంతే కాదు. కలియుగ ధర్మాల ఘట్టాన్ని స్వీయానుభవామ్రేడితంగా చెప్పటంతో ఎఱ్ఱయ రచన ఆత్మీయతతో కూడుకొన్న ఒక సంవేదనగా మారింది. అది రచనలో రవళిస్తూ పఠితల హృదయాన్ని ద్రవింప చేస్తుంది. ఎఱ్ఱయ యుగధర్మకథనం ఒకరకమైన ఆత్మాశ్రయ కరుణ రస ఖండ కావ్యం!

దాని ముగింపులో ఎఱ్ఱయ చెప్పిన ఆ కృతయుగం ఆయన చూచిందో, లేక ఆశించిందో ఏమైనా ఈ పద్యం సామాజిక జీవన మధుర సంగీతం!

శా. 'ఆరామవ్రజ చైత్యసద్మవన దేవాగార సౌమ్యంబు లై
భూరి బ్రహ్మతపస్వి సంకులములై పుణ్యాధ్వరారంభసం
భారోదారములై నితాంత ఫలిత భ్రాజిష్ణు సస్యంబులై
యారూఢస్థితి నెల్లదేశములు నొప్పారుం బ్రకాశంబులై'. (ఆర. 4.312)

హిందూ ధర్మోద్ధరణం కొరకు కృష్ణకు దక్షిణాన వెలసిన నాయక, రెడ్డిరాజ్యాల సమూహాన్ని ఉద్దేశించి ఈ పద్యం పుట్టి ఉండవచ్చును. 'ఎల్లదేశములు' అవే అయి ఉండవచ్చును. ఏమైనా ఎఱ్ఱన భారతీవృత్తికి ఇది మధురఫలం.

(5) ధర్మవ్యాధోపాఖ్యానం : విడమరచి చెప్పే విద్య

వర్ణాశ్రమాల కతీతంగా గార్హస్థ్య ధర్మనిర్వహణం ఎంతటి విశ్వజనీనమయిందో చెప్పుతూ వైదిక ధర్మాచరణ వైదుష్యాన్ని వెన్నలా పంచిపెట్టే మధురగాథలు పతివ్రత కథ, ధర్మవ్యాధోపాఖ్యానం.

కథా జీవితానికి ఒక బలమైన బీజం ఉంటుంది. దానిని పఠితల దృష్టికి తెచ్చేటట్లు, వారి మనసులలో పదిలంగా నిలిచేట్లు చెప్పే పద్ధతి విడమరచి చెప్పే కవితా విధానంలో పాటించే మొదటి విలువ.

పతివ్రతకు పతిసేవ ముఖ్యమా? అతిథి సత్కారం ముఖ్యమా? ఆ రెండింటికీ పోటీ వస్తే ఏది ముందు? ఏది వెనుక? అని పతివ్రత కథలోని ప్రధానమైన ప్రశ్న. కౌశికుడు అతిథి ధర్మం గొప్పదనేవాడు. పతివ్రత పతిసేవా ధర్మం ఉత్తమమనేది. అయితే వీరిద్దరికీ వాదు వస్తే ఎఱ్ఱన రచించిన రెండు పద్యాలు మనకు రెండు మధురావిష్కృతులుగా దొరుకుతాయి.

కౌశికుడు అతిథి నిరాదరణకు ఆగ్రహించి పతివ్రతతో అన్న మాటలు.

ఉ. 'నీమగఁ డంత యెక్కుఁడె? మనీషులు భూసురు లింత తక్కువే?
కోమలి! యేల యిట్లు గడుఁగ్రొవ్వునఁ గానవు లోకవంద్యులన్?
భూమిసురేంద్రులన్; దివిజపుంగవుఁ డాదిగ భక్తిఁ గొల్చుచో
నేమిట నొక్కొ! వారు గడునెల్లిద మై రిటు నీకు నిచ్చటన్'. (ఆర. 5.16)

సతీధర్మాన్ని ధిక్కరిస్తూ పలికిన ఈ పద్యం కథా పరమార్థాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షం. ఇది ఎంత తీవ్రంగా వెలువడిందో అంతకంటె తీవ్రంగా పతివ్రత సమాధానం వెలువడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'దేవతాసములు భూదేవతావరు లౌట । యేను దన్మాహాత్మ్య మెఱుఁగనయ్య?
యొక విప్రుఁ డలిగి పయోనిధి జలము ల । పేయముల్ గాఁగ శపింపఁ డెట్లు?
దండక విషయంబు దగ్ధంబు సేయండె । యలుకమై నొక్కమహాద్విజుండు?
వాతాపి యను దైత్యవరు మ్రింగి యఱిగించు । కొనఁడె భూదేవుఁ డొక్కరుఁడు గినిసి?

తే. ధరణి మఱియును బెక్కువిధంబులందు । బ్రహ్మవిదులైన బ్రాహ్మణ ప్రభుల మహిమ
వినమె? యెఱిఁగి యెఱింగి సద్వినుతచరిత! కొఱవి గొని వెఱ్ఱినే తలఁ గోఁకికొనఁగ?' (అర. 5.19)

రెండూ అధిక్షేపాత్మక అభివ్యక్తులే. కౌశికుడి పద్యం పూర్వార్ధంలోని రెండు చరణాలూ ప్రశ్నలుగా పలికితే, సీసపద్యంలో నాలుగు చరణాలను ప్రశ్నలుగా మారుపలికింది పతివ్రత. ఆమెది రెట్టింపు అధిక్షేపం. అతడిది ఆచరించని శాస్త్ర జ్ఞానం. ఆర్ద్రత లేని అహంకారం, సత్సంగం లేని సంస్కారం, నిగ్రహంలేని ఆగ్రహం, ప్రమాదంలో పడ్డ బ్రాహ్మణ భావం. ఇన్ని అవగుణాలు ఆ కౌశికుడిలో గూడుకట్టుకొని ఒక్కటిగా అతడి మాటలలో మారుమ్రోగుతున్నాయి. వాటన్నిటినీ విడమరచి అతడికి అర్థమయ్యేటట్లు పతివ్రత సీసపద్య మెత్తుకొని ఒక్కొక్కపాదంలో ఒక్కొక్క మహాబ్రాహ్మణుడు నిర్వహించిన ఘనకార్యాన్ని ఉటంకించి ఎత్తిపొడిచింది. వారందరూ 'బ్రాహ్మణప్రభువు' లని వెటకారంగా వెక్కిరించింది. అట్టివారట బ్రహ్మవిదులట! అని అవహేళనంగా నవ్వింది. అంతమందిని అంతవ్యంగ్యంగా అధిక్షేపించి 'సద్వినుత చరిత!' అని కౌశికుడిని సంబోధించి విపరీత వ్యంగ్య ధోరణిని ప్రదర్శించింది. అంతటితో ఆగకుండా తాను కొఱవితో తలగోకుకొనే తెలివితక్కువ దానిని కానని హెచ్చరించింది. ఆ మాట మనీషినని విర్రవీగే కౌశికుడికి కశాఘాతంవలె తగిలింది. పతివ్రత పతిసేవలో ఎంత నిపుణురాలో, హితబోధలో కూడ అంత చతురురాలు. పతివ్రత పలుకులు ఎఱ్ఱయ చతురోక్తులు.

'చతురవచోనిధి' గా పేరుగాంచిన అల్లసాని పెద్దన ఎఱ్ఱన చతురోక్తులను అక్కడక్కడ కొల్లగొట్టాడు. "ఏమిటనొక్కొ వారు గడునెల్లిదమై రిటు నీకు నిచ్చలున్' అన్న కౌశికుడి చతురోక్తి పెద్దన్నగారి వరూథిని నోట మధురోక్తిగా మారింది. "నీకింత భయంబులేకడుగ నెల్లిదమైతిమె మాట లేటికిన్" (మను.2.41). పురుషుడు పలికిన చతురోక్తిని స్త్రీ నోట మధురోక్తిగా మార్చాడు పెద్దన. ఎఱ్ఱన పతివ్రత చేత పలికించిన సీసం - ప్రబంధ నాయికలకు సూక్తివైచిత్రిగా మారిపోయింది. "వెలివెట్టరే బాడబులు పరాశరుఁ బట్టి । దాశకన్యాకేళిఁ దప్పుఁజేసి" (మను. 2.73) వంటి పద్యాలు ఎఱ్ఱయ అభివ్యక్తులకు అనుసృజన శిల్పాలే.

గహనమైన తాత్త్విక వేదాంత విషయాలను సుగమమైన రుచిరార్థసూక్తులవలె పలికించటం ఎఱ్ఱయకు నన్నయవలె అబ్బిన సూక్తివైచిత్రి.

(i) సత్పురుషులు ధర్మాచరణం వలన పొందే లాభాలు:

చ. 'చిరముగ ధర్మముల్ నడపఁ జిత్తము దేఱుఁ; బ్రసన్నచిత్తుఁడై
పరువడి నింద్రియార్థముల భంగులు రిత్తలుగా నెఱింగి చె
చ్చెర నవి యంతవట్టు నిరసించి తపో దమ సత్యశీలతం
బరిణతి నొందుఁ; బొందుఁ బిదపం బరమార్థపద ప్రభావమున్'. (అర. 5.77)

(ii) ఇంద్రియాలను జయించిన ఉదారుడి స్వభావాన్ని చెప్పే ఆలంకారికోక్తి:

చ. 'అరదము దేహ; మింద్రియము లశ్వము; లాత్ముఁడు సూతుఁ; డమ్మహా
తురగచయంబు ధైర్యమను తోరపుఁబగ్గములన్ దృఢంబుగా
నురవడిఁ బోక యుండ వెరవొప్పఁగఁ బట్టినవాఁడు సేమపుం
దెరువున నేఁగు; నప్పరమ ధీరుఁడు సువ్రె యుదారుఁ డయ్యెడన్'. (అర. 5.92)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మ విషయాలను సూక్తులుగా వెలయించటం వెలలేని విలువ. ధారణలో నిలిచే పద్యాలను ఆణిముత్యాలవలె ఆవిష్కరించే ప్రతిభ ఎఱ్ఱన సూక్తివైచిత్రిలో ఒక కళ.

(6) కుమారస్వామి కథ : విస్తరించి చెప్పే విద్య

పంచమాశ్వాసాన్ని 'కథావిశేషంబు సవిస్తరంబుగా' చెప్పానని ఎఱ్ఱన పేర్కొన్నాడు. కుమారస్వామి కథ మూలంలో తొమ్మిది అధ్యాయాలలో (213-221) 354 శ్లోకాలలో ఉండగా,ఎఱ్ఱన తెలుగులో 115 గద్యపద్యాలలో చెప్పాడు. ఈ అంకెలు సవిస్తరంగా చెప్పే పద్ధతిని భౌతికంగా సూచించవు. అయితే, ఎఱ్ఱయ కథ అనీ, కథా విశేషమని రెండంశాలు చెప్పాడు. కథా విశేషమంటే వర్ణనమే. ఆయన ప్రబంధ పరమేశ్వరత్వ సూచకమైన లక్షణం వర్ణనం. "ఇతివృత్తమును వర్ణనలచే అలంకరించెడి నూత్న పద్ధతికి సూత్రధారు డగుటచే నాతని కాబిరుదము కలిగియుండును"- అన్న ఆచార్య పింగళి లక్ష్మీకాంతముగారి మాటలు ఇక్కడ స్మరణీయాలు (ఆంధ్ర సాహిత్య చరిత్ర. పు.275). విస్తరణమంటే ఎఱ్ఱయ దృష్టిలో ఇతివృత్తాన్ని వర్ణనలతో విస్తరించటమే. దీనికి అనుబంధంగా కథా భాగాన్ని అనువుగా సంగ్రహించటమని కూడా ఆయన చెప్పినట్లు గ్రహించాలి.

మూలంలో కుమారస్వామి కథ సాఫీగా, సరళంగా పురాణ పద్ధతిలో నాతిసంగ్రహంగా సాగుతుంది. ఎఱ్ఱన కథను కుదించి సారవంతం చేశాడు. యథావకాశంగా వర్ణనలను నిర్వహించి తనదైన ప్రబంధశయ్యను చతురోక్తి విలాసాలతో ప్రదర్శించాడు. మచ్చుకు ఒకటి, రెండు ఉదాహరణలు.

(i) సప్తర్షులు అమావాస్యాహోమం చేయసమకట్టారు. దేవతలందరూ హవిర్భాగాలు తీసికొనటానికి విచ్చేశారు. అగ్ని ఆహవనీయాగ్నిలో ఆవేశించి ఆహుతుల నందుకొని దేవతల కందిస్తూ సప్తర్షి భార్యలను చూచి మోహించాడు. ఈ భాగంలో మూలం.

శ్లో: "నిష్క్రామంశ్చాప్య పశ్య త్స పత్నీ స్తేషాం మహాత్మనామ్ ।
స్వేష్వాశ్రమేషూపవిష్టాః స్నాయంతీ శ్చ యథా సుఖమ్॥
రుక్మవేదినిభా స్తాస్తు చంద్రలేఖా ఇవామలాః।
హుతాశనార్చిప్రతిమాః సర్వా స్తారా ఇవాద్భుతాః॥
స తద్గతేన మనసా బభూవ క్షుభితేంద్రియః।
పత్నీర్దృష్ట్వా ద్విజేంద్రాణాం వహ్నిః కామవశం యయౌ॥
సభూయ శ్చింతయామాస న న్యాయ్యం క్షుభితో ఽ స్మియత్।
సాధ్వీః పత్నీ ర్ద్విజేంద్రాణా మకామాః కామయామ్యహమ్॥
నైతాః శక్యా మాయాద్రష్టుం స్ప్రష్టుం వా ప్యనిమిత్తతః।
గార్హపత్యం సమావిశ్య తస్మా త్పశ్యా మ్యభీక్ష్ణశః ॥
సంస్పృశన్నివ సర్వా స్తాః శిఖాభిః కాంచన ప్రభాః।
పశ్యమానశ్చ ముముదే గార్హపత్యం సమాశ్రితః ॥" (సం. 3.213. 42-47)

ఆరు శ్లోకాల మూలం మూడు పద్యాల తెలుగు భాగంగా అవతరించింది. అది అనువాదం కాదు. అనుసృజనం, మూలతాత్పర్యానికి మధురమైన విస్తరణం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'ఆ సమయంబున నమ్మునీంద్రుల భార్య । లందఱు సుస్నాన మొందఁజేసి,
రమణీయ మాల్యాంబర విభూషణాద్యలం । కారంబు లొనరించి గారవమునఁ
జనుదెంచి పతులకు సన్మతిం బరిచర్య । సేయుచు మెలఁగంగ వాయుసఖుఁడు
మెలఁతల వాలిక మెఱుఁగు గన్నుల యొప్పుఁ । దెలినవ్వుమొగముల విలసనంబు

సీ. నడబెడంగులు నన్నువ నడుములందు । వెలయు వళులభావంబులు వలుదచన్నుఁ
గవలనిక్కును నేర్పడఁ గని కరంగి । మదనమార్గణ విదళితహృదయుఁ డయ్యె'.

వ. 'ఇట్లు వికలేంద్రియుండై వైశ్వానరుం డమ్మునిపత్నులయందుఁ దగిలిన డెందంబు మగిడింప నేరక వారలం గదియ నప్పళించి గార్హపత్యకుండంబున నావేశించి'

చ. 'అతివలు దన్నుఁ జేరుటకు నాసపడుం; బొరిఁ జేరుచోట నా
యతవిలసచ్ఛిఖాగ్రముల నల్లన వారల నంటుఁ; గౌతుకం
బతిశయమై తదంగలత లాదటఁ గౌఁగిటఁ జేర్పఁగోరుఁ; గం
పితధృతియై కలంగుఁ గడుఁ బెల్లగు రాగరసంబు ముంపఁగన్'. (అర. 5.195-197)

ఎఱ్ఱయ తన కథావిశేష విస్తరణ బీజాలను రెండు చోట్ల నాటాడు. అవి- 'మదనమార్గణ విదళిత హృదయుఁడయ్యె' అని ఒకచోట, 'కలంగుఁ గడుఁ బెల్లగు రాగరసంబు ముంపఁగన్' అని మరొక చోట. సుందరాంగులైన అన్యకాంతలయందు వలపు పెంచుకొని మోహపారవశ్యంలో, రతిభావదీప్తితో శృంగారహావభావాలను లీలలను దశావిస్ఫూర్తితో వెలారిస్తే అది నిజానికి శృంగారరసాభాసం. దానిని 'రాగసాగరంగా' మార్చి రమణీయంగా రక్తికట్టించిన తిక్కన నాటకీయరచనాపద్ధతి ఎఱ్ఱనకు స్ఫూర్తినిచ్చింది. సప్తర్షుల భార్యలను చూచి విరాళి ననుభవించే అగ్నిభట్టారకుడు విరాటపర్వంలోని కీచకతుల్యుడుగా భాసించటం సహజం. ఆ పాత్ర చిత్రణంలో తిక్కనపెట్టిన బాణి ఎఱ్ఱయకు విస్మృతి వివేకంగా తోచింది. కీచకుడు 'మనోజవికారమగ్నుఁడై' (విరా. 2.31) 'వలరాజుబారికి నగ్గమయ్యె' (విరా. 2.86) 'రాగసాగరపూర నిర్మగ్నుఁడయ్యె' (విరా.2.33) అని తిక్కన చేసిన వర్ణనలు ఎఱ్ఱనకు ఒజ్జబంతులయ్యాయి. అభినయ స్ఫోరకమైన కీచక విరహాన్ని విభావ విస్ఫూర్తిని ఈ చిన్ని సన్నివేశంలో కొండను అద్దంలో చూపినట్లు ఎఱ్ఱయ ప్రదర్శించాడు. కీచకఘట్టంతో పోలిస్తే ఇది ఒక వెలుగురవ్వ. ఈ కథలో ఇది రసభావ విస్తర శిల్పం.

మూలంలో ఋషిపత్నులు బంగారువన్నెవారు, చంద్రరేఖలవలె నిర్మలులు, అగ్ని శిఖలకు ప్రతిరూపాలు. నక్షత్రాలవలె వెలిగేవారు, చూచేవారికి అబ్బురపాటు కలిగించేవారు. వ్యాసుడిది స్థిరచిత్రవైఖరి. ఎఱ్ఱన వారిని చలచిత్రాలుగా మార్చి ప్రాణంపోశాడు. మేనికాంతులను వదలివేసి మేనితళుకుబెళుకులను ప్రదర్శింపజేశాడు. మూలంలోని ఋషిపత్నుల మేనికాంతులు చూస్తే ఎదుటివారికి ఆశ్చర్యంతోపాటు ఆరాధన భావం కూడా కలుగుతుంది. అయినా వారిపై వలపు పెంచుకొని హుతాశనుడు కాముకుడయ్యాడు. వ్యాస హృదయం మూలంలో అదే. ఎఱ్ఱయది ప్రబంధ కవి హృదయం. అందువలన ఋషిపత్నులకు రమణీయ మాల్యాంబర విభూషణాద్యలంకారాలు తొడిగించాడు. వారు పరిచర్యలు చేస్తుంటే భక్తిప్రపత్తులకు బదులు 'వాలికమెఱుంగుఁ గన్నులయొప్పు, తెలినవ్వు మొగముల విలసనంబు, నడబెడఁగులు, నన్నువ నడుములందు వెలయు వళుల భావంబులు, వలుద చన్నుఁగవల నిక్కులు' స్పష్టంగా అగ్నికి కనపడేటట్లు ప్రదర్శింప జేశాడు. ఎఱ్ఱన సృష్టిలో ఆ ఋషిపత్నులు శాంత రసమూర్తులు కారు. శృంగార రసదీప్తులు. వారిని "ఏర్పడ' చూస్తే ఏమౌతుంది? ఎంతటివాడైనా ముందు నిలువునా కరగిపోతాడు. ఆ తరువాత మన్మథుడి బాణాల బారిన పడి వివశహృదయు డౌతాడు. అగ్నిపని అదే అయింది. ఎఱ్ఱయ కైశికీవృత్తిని మధురంగా పోషించి రసికుల హృదయాలను ద్రవింపచేశాడు. అది ఆయన ప్రబంధ పరమేశ్వర బిరుద మహిమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎఱ్ఱన వర్ణనం మూలవిరుద్ధంగా ఉన్నది. అది వివేచకులకు అనౌచిత్య మనిపించవచ్చును. ఎఱ్ఱన ఇక్కడ సూక్తి వైచిత్రిని ప్రదర్శించి సన్నివేశ మాధుర్యాన్ని సంరక్షించాడు. అగ్నివంటి వాడిని ఆకర్షించగలిగిన అందం అపూర్వశృంగార విభావాల వలననే ఆవిష్కృతం కావాలి. అగ్నికి కామభావం కలుగకపోతే కథ లేదు. మూలంలో ఋషిపత్నుల రూపాలు రతిభావోద్దీపకాలు కావు. అందువలన ఎఱ్ఱన వారిని రసానుకూల రమణీయ విలాస వీచికలుగా మార్చాడు. అగ్ని వారిని పొందాలని ఆశపడ్డాడు. మూలంలో అగ్ని పతివ్రతల తేజస్సులను చూచి, మహర్షుల మహిమలను తలచి వారిని కామించటానికి మొదట భయపడ్డాడు. కాని, కామాన్ని అణచుకొనలేక వారి సామీప్యస్పర్శాది సుఖాలను కోరి గార్హపత్యాగ్నిలో ఆవేశించి నిత్యసాంగత్య సౌఖ్యం కొరకు ప్రాకులాడాడు. అగ్ని ఋషులవలనిభయంతో వితర్కించిన వైనాన్ని ఎఱ్ఱన వదలివేశాడు. శృంగార పరంగా ఇది పెద్దమార్పు కామాతురులకు లజ్జాభయాలు ఉండవని తెలుగులో అగ్నిదేవుడు తేల్చిచెప్పాడు. అందువలననే శృంగారనాయకుడి వలె రాగరసంలో మగ్నుడు కాగలిగాడు. రాగరసం నాట్యరసం. దానిని కావ్యరసంగా సాగరమంతచేసి తిక్కన తెలుగు కవితలో తీర్చిదిద్దాడు. దానిని ఎఱ్ఱన ఒక పద్యంలో చిత్రించి సరోవరంగా చూపించాడు.

సన్నివేశం చిత్రమైనది. అగ్ని ఉన్నచోటి నుండి కదలలేడు. కాని కాళ్ళులేని వాడు కాడు. అగ్నికుండం అతడి అవధి. దానిని దాటలేడు. మనసును ఆపుకొనలేడు. ఋషిపత్నులే ఆయన వద్దకు రావాలి. వారికి అగ్నిమీద భక్తి ఉన్నది కాని, రక్తి లేదు. అందువలన అర్చనా విధుల సమయంలోనే అగ్నిసేవలు చేసికొంటారు. కాగా. అతడు పడే విరహం దయనీయం. ఆ వనితలు తన దగ్గరికి రావాలని ఆశపడతాడు. వచ్చేదాకా అఱ్రులు చాస్తాడు. వచ్చిన క్షణాలను వృథా చేసికొనకుండ బాగా చాచిన శిఖాగ్రాలతో (చేతికొనవేళ్ళతో తాకినట్లు) తాకుతాడు; దర్శన, స్పర్శనాలు వారి పొందుకోరే ఆసక్తిని పెంచేవి. లతలవంటి వారి శరీరాలను బిగికౌగిట చేర్చాలని ఉబలాటపడేవాడు. కాని, అది తీరని కోర్కెగా మిగిలిపోయేది. తన కా అదృష్టం జీవితంలో కలిగే అవకాశం లేదేమోనని నిరాశచెంది, ధైర్యాన్ని కోల్పోయేవాడు. అప్పుడు మనసులో ఎంతో బాధపడేవాడు. కాని, ఆ విరహం అతడి రతిభావాన్ని పెంచి ఒక మధురవేదనగా పొంగి, చివరకు ఆతడినే ఆ రాగరసంలో ముంచివేసింది. ఈ పరిణామ సుందరమైన రసభావవివృతి మూలంలో లేదు.

'కడు పెల్లగు రాగరసంబు' అనే మాట వాడిన ఎఱ్ఱన రెండు ప్రయోజనాలు సాధించాడు. ఒకటి: ఇక్కడ తిక్కన బాటను అనుసరించానని వ్యంగ్యంగా చెప్పటం. రెండవది - తిక్కన 'రాగసాగర' శబ్దాన్ని వాడినప్పుడు చేసిన వ్యాఖ్యను మనకు జ్ఞాపకం చేసి, తన సూక్తి వైచిత్రిని, చతురవాక్య విలాసాన్నీ ప్రదర్శించటం. తిక్కన పద్యం ఇక్కడ స్మరణీయం -

తే. 'ఉన్న పాంచాలిఁ గనుఁగొని యన్నరాధ ! ముఁడు వివేకవిహీనుఁడై ముదితుఁ డగుచు
మదన వికృతియకాఁ దనమదిఁ దలంచి । రాగసాగరపూర నిర్మగ్నుఁ డయ్యె". (విరా. 2.33)

సహజ శరీర విలాససుందరి అయిన పాంచాలి స్వేదాది సాత్త్విక భావాలను భయంవలన ప్రదర్శిస్తే- వాటిని శృంగార సాత్త్వికభావాలుగా భావించి కీచకుడు వలపు తలపును పెంచుకొన్నాడు. ఇక్కడ ఋషుల భార్యలూ అంతే. సహజ శరీర విలాసభాసినులు. వారు తన పొందు కంగీకరిస్తారని భావించటం అగ్ని అవివేకం. అయినా మదన వికారానికి లోనుకావటం అనౌచిత్యం. కీచకుడు దీనిని తెలియక రాగరసమనే సముద్రంలో మునిగిపోయాడు. అత డింక తేలటం కష్టం- అని తిక్కన తెలిపాడు. ఎఱ్ఱన 'కడుపెల్లగు' రాగరసాన్ని చెప్పాడే కాని అది సాగరమని సావయవ రూపకం చేయలేదు. అది ఆయన చతురోక్తి. అగ్నిని కీచకుడివలె రాగరసంలో ముంచి, తిక్కన తీర్పును మన భావనకు వదలి అలంకార ధ్వనిని అపూర్వంగా నిర్వహించిన ఎఱ్ఱన ప్రతిభ అల్పాక్షరాలలో అనల్పార్థ విస్తృతిని ప్రదర్శించ గలిగిన ప్రబంధ పరమేశ్వర విభూతి.

(ii) కుమారస్వామి కథ రౌద్రరసభావోన్నిద్రం. నానారసాభ్యుదయోల్లాసం. కథ వేగంగా సాగుతూ ఉంటుంది. మధ్యమధ్య రసోచిత వర్ణనలు వికసిత కమలవనాల వలె రాణిస్తాయి. భిన్నరసాల ముద్రలు గల ప్రబంధశయ్యల సూక్తి వైచిత్రులు లాస్యం చేస్తాయి. మచ్చుకు రెండుమూడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

1) భయానక రసోక్తి వైచిత్రి:

మ. ‘కులశైలంబులు గ్రక్కునం గదలె, దిక్కుల్ వ్రయ్యలయ్యెన్, మహీ
వలయంబంతయు దిర్దిరం దిరిగె, దేవవ్రాతముల్ సాధ్వసా
కులతం బొందెఁ, బయోధు లన్నియును సంక్షోభించె, సప్తాశ్వస
ప్తులు బిట్టుల్కి రథంబు నల్దెసలకుం బోనీడ్చె సంభ్రాంతమై.’ (అర. 5.208)

2) శివసాక్షాత్కార మధురోక్తి వైచిత్రి:

శా. ‘నానాసిద్ధగణంబు గొల్వఁ బరమానందంబునం జంద్రరే
ఖా నవ్యాంచితమౌళి భూరి భుజగాకల్పోజ్జ్వలాకారుఁ డీ
శానుం డానత శంకరుండు గిరిజాసంయుక్తుఁడై వచ్చెఁ ద
త్సేనానిం బ్రియసూను షణ్ముఖుని వీక్షింపం గడుం బ్రేమతోన్.’ (అర. 5.233)

3) యుద్ధవీర రసోన్నిద్ర అలంకృతోక్తి వైచిత్రి:

శా. ‘గీర్వాణ ప్రవిముక్త బాణ పటల క్రీడా విలూనంబులై
గర్వోన్మత్త సురారి శీర్షములు వీఁకం డొల్లెఁ గల్పచ్ఛిదా
నిర్విద్ధాంబుద మండలోద్గత మహానిర్ఘాత పాతావధూ
తోర్వీభృద్ఘన గండశైలములతో నూహింపఁ దుల్యంబులై’. (అర. 5.276)

ఉ. ‘లోహిత రత్నభూషణుఁడు లోహిత మాల్యధరుండు విస్ఫుర
ల్లోహిత లోచనుండు నవలోహిత వస్త్రుఁడు లోహితాస్యుఁడై
యాహవకేళికిం గడఁగునప్పుడు సూడఁగ నొప్పె లోక ని
ర్దాహ సమిద్ధ నూతన పతంగుఁడ పోలె రథాధిరూఢుఁడై’. (అర. 5.282)

ఈ పద్యాలలో కొన్నింట నన్నయ తిక్కనల పద్యాల ఎత్తుగడలు కనపడవచ్చును. కాని, నిర్వహణ, సమాస సంఘటన, అభివ్యక్తి వైచిత్రి ఎఱ్ఱయ వాగ్విలాసమే. విశేషమేమంటే నన్నయ తిక్కనలలో కంటె ఎఱ్ఱన పదబంధంలో అకుంఠితమైన ఆర్ద్రత భారతీవృత్తి నాశ్రయించి ప్రసాదమధురంగా ప్రవహిస్తుంది. అందువలన ఎఱ్ఱయ కథావిశేష విస్తృతి ఆయన రచనా సంస్కృతి!

(7) పరిక్షితుని కథ : మధురంగా చెప్పేవిద్య

మార్కండేయమహర్షి బ్రాహ్మణప్రభావాన్ని తెలిపే వామదేవ వృత్తాంతాన్ని చెప్పటానికి పూనుకొని ఆ కథకు పూర్వరంగమైన సుశోభనా పరిక్షితుల వృత్తాంతాన్ని చెప్పాడు. వారిరువురిది చిత్రమైన శృంగారగాథ. సుశోభన కప్పలరాజు కూతురు. మనోహర మానవాకృతితో మనుజపతులను ఆకర్షించి అగచాట్ల పాలుచేసేది. పరిక్షితుడు ఆమెను వనంలో ఒంటరిగా ఉండగా చూచాడు. వారిరువురి మధ్య ఈ విధంగా సంభాషణ సాగింది.

ఉ. ‘ఎవ్వరిదాన వంబుజదళేక్షణ! యేకత మిట్టు లేల నీ
వివ్వనభూమియందుఁ జరియించెదు?; నావుడుఁ దండ్రి పంపునం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దివ్వనభూమియందుఁ జరియించెద సద్వరుఁ గోరి; కన్య; నే
నెవ్వరి దానఁ గావలయు నేర్పడఁ జెప్పుము రాజనందనా!' (ఆర. 4.323)

ఈ ఎఱ్ఱన పద్యం ఎంత అదృష్టం చేసికొన్నదో! ఒకపద్యంలోని పూర్వాపరార్ధాలలో ఉక్తి చాతుర్యంతో కూడుకొన్న సంభాషణలు నిబంధించాడు ఎఱ్ఱాప్రెగ్గడ. ఈ పద్యం 'ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ! యొంటి చరించె దోటలే కివ్వన భూమి?'.... (మను.2.39) అనే మనుచరిత్ర పద్యానికి త్రోవ చూపిందని చాలమంది విమర్శకులు గుర్తించారు. అందులో అనుమానం లేదు. అయితే ఆ పద్య నిర్మాణ చాతుర్యం వేరు. ఈ పద్య నిర్మాణ చాకచక్యం వేరు. అది ఒకపాత్ర మాట్లాడే మహనీయ వాక్యసంపుటి. ఇది నాయికానాయకుల మనసులు గుబాళించే మధుర వాక్య విలాసమంజరి. ఎఱ్ఱన శృంగార రసమధుర రమణీయోక్తి వైచిత్రికి ఈ పద్యం రత్నరాజం.

ఈ పద్యంలోని చమత్కారమంతా 'ఎవ్వరిదానవు?' అని అతడు అడగటంలోనూ, 'ఎవ్వరి దానఁ గావలయు'నని ఆమె తిరిగి ప్రశ్నించటం లోనూ ఉంది. 'ఎవ్వతె వీవు?' అన్న పద్యంలో పెద్దన ఈ చమత్కారాన్ని చేయలేక పోయాడు. ఆయన చతురోక్తి అంతా 'భీతహరిణేక్షణ!' అనే సంబుద్ధిలో నిబంధించాడు. చాలామంది విమర్శకులు దీనిని పట్టించుకోకుండా పెద్దన ఎఱ్ఱన ననుసరించాడని చెప్పుతారు. పద్యాల ఎత్తుగడలను చూచి ప్రభావ పరిశీలనం చేసేవారు చేసే పొరపాట్లలో ఇది ఒకటి. అది అలా ఉంచుదాం.

ఈ పద్యంలో ప్రతిపదం చతురోక్తి పథంలో నడిచిందే. పరిక్షితుడు - 'ఎవ్వరిదానవు?' అన్నాడే కాని 'ఎవ్వతెవు?' అని అనలేదు. పెండ్లి కాని పిల్ల అయితే తండ్రిపేరు చెప్పుతుంది. వివాహిత అయితే భర్త పేరు చెపుతుంది. ఆ రెండిట్లో ఏదో ఒకటి ముందుగా తెలిసికొనాలని నాయకుడి ఆసక్తి. ఆ తరువాత 'అంబుజదళేక్షణ!' అని సంబుద్ధి. అది ఆమె కన్నుల అందాన్ని కీర్తించేదే కాదు, కన్నార్పకుండా చూస్తున్న ఆమె ఆసక్తిని గూడా చెప్పకచెప్పే విశేషణం. ఆ చూపు ఆమె వివాహిత కాదని అతడు ఊహించటానికి ఆస్కారం కలిగించింది. వెంటనే అతడు మాటల గాలాలను వేశాడు మనసును పట్టుకొందామని. పైవాక్యంలో పదా లెంత ముఖ్యమో, వాటి కూర్పు కూడా అంత సార్థకం. 'ఒంటరిగా- ఈ విధంగా - ఎందుకు - ఈ వనభూమిలో - చరిస్తున్నావు?' అని అతడి ప్రశ్న. ఇది అమాయకపు ప్రశ్న కావచ్చును. చతురుడైన రసికు డడిగే ప్రశ్న కావచ్చును. ఆమె ఒంటరిగానే ఉన్నదేమో తెలిసికొందామన్న కుతూహలం, ఆమె విలాసంగానే ఉన్నది కాని విషాదంగా లేదు - దానికి కారణం తెలిసికొందామనే ఆసక్తి. ఆమె ఏ ప్రయోజనం కొరకు ఇల్లు వెడలి అడవిలోకి వచ్చిందో తెలిసికొందామనే ఆకాంక్ష ముప్పిరికొన్న ప్రశ్న అది. కథకు కావలసిం దంతవరకే. పెద్దన ప్రవరుడి చేత 'ఒంటి చరించె దోటలే కివ్వనభూమి?' అని ప్రశ్న నడిగించటంలో ఎఱ్ఱన చాతుర్యాన్ని వాడుకొన్నాడు.

పరిక్షితుడికి దీటైన సమాధానం చెప్పింది సుశోభన. అతడి ప్రశ్నలోని వరుసను ఆ వైపునుండి ఈ వైపుకు నరుక్కొంటూ రావటం సూక్తి చాతుర్యం. ఈ శిల్పాన్ని కొల్లగొట్టి "ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు భూసురేంద్ర!" (మను.2.41) అనే పద్యంలో పెద్దన వాడుకొన్నాడు. పెద్దనది పెద్ద వ్యూహం. ఎఱ్ఱనది జిలుగు శిల్పం. 'ఇవ్వనభూమియందుఁ జరియించెద' అనే మాటలు ప్రశ్నలోనివే ఎన్నుకొని పునరుక్తిగా పలికింది సుశోభన. అయితే ముందు 'తండ్రిపంపున' వెనుక- 'సద్వరుఁగోరి' అని కలిపి చెప్పింది. తండ్రి తన కూతురిని మంచి వరుడిని వెదుక్కొనుమని అడవులకు పంపాడట! ఆశ్చర్యకరమైన సమాధానం. ఆ చర్యవెనుక ఏదో దేవరహస్యం ఉండే ఉండాలి. ఆమె వరుడు ఆ అడవికి వచ్చినవాడే కావాలి. అంతవరకెవ్వరూ రాలేదు. అప్పుడు పరిక్షితుడు వచ్చాడు. ఆమె నాతడు చూచిన సంఘటన స్వయంవర ఘట్టంగా మారుతుందా? ఆమె మొదటి వాక్యం ఎంతటి ఉత్కంఠను అతడిలో లేపింది! ఆమె ఒక్కమాటలో 'కన్యను' అని ప్రకటించింది. ఆమె కింకా వరుడు దొరకలేదని తేలింది. అయితే, అతడి హృదయంలో ఒక అనుమానం మిగిలి ఉంది. ఆమె వివాహం ఆమె నిర్ణయం మీద ఆధారపడి ఉందా? కాబోయే వరుడి కోరిక మీద ఆధారపడి ఉందా? - అని. దానిని పసిగట్టిన సుశోభన చతురోక్తిని వ్యంగ్యవైభవంతో విసిరింది. 'ఏ నెవ్వరి దానఁ గావలయు నేర్పడఁ జెప్పుము రాజనందనా!' అని. ఆమె సమాధానంలో ఎవ్వరిదానవంటే - పేరు

బైటపెట్టని ఒక తండ్రి కూతురనని చెప్పింది. ఆమె క్షత్రియ వివాహయోగ్య అవునా కదా? అన్న ప్రశ్న ఊగిసలాడుతూనే ఉంది. దానికి 'రాజనందనా!' అనే సంబుద్ధి సమాధానం. 'నీవెట్లాగూ క్షత్రియుడవే కాబట్టి, యువకుడవు కాబట్టి నే నెవ్వరి భార్యను కావాలో తేటపడేటట్లు నీవే చెప్పుము' అని అడిగింది. అంతవరకూ వారి మాటలలో ఏదో అభిలాష అంతర్వాహినిగా సాగుతూ గూఢార్థ గుంఫనంగా సంభాషణ సాగింది. ఇద్దరిలో ఎవరికి ఎవరూ తీసిపోరని నిరూపించుకొన్నారు. ఇక ఆ నర్మోక్తులు, గూఢోక్తులు, వ్యంగ్యోక్తులు మాని మనసును వాచ్యం చేయుమని కోరింది సుశోభన. ఆమె రూపంకంటె ఆమె మాటలు అతడి కెంతో నచ్చాయి. ఆ మాట ఎఱ్ఱన 'దాని ప్రగల్భ వచనంబులకు నధిక విలోలుండై' తన మనసులోని మాటను ఆమెకు తెలియపరిచాడని బైటపెట్టాడు.

ఆమె ఆ తరువాత 'జలక్రీడలకు తనను పిలువకుండా ఉంటే ఆతడిని పెండ్లాడతా' నని ఒక కట్టడి చేసింది. ఆమె మాటల అబ్బురపాటులో మునిగిపోయిన ఆతడు మారుమాటాడకుండా ఒప్పుకొన్నాడు. విశేషమేమంటే సుశోభనా పరిక్షితుల వివాహం మాటకట్టడి మీద ఆధారపడి ఉన్నది. ఆ ఆయువుపట్టును గ్రహించి ఎఱ్ఱన ఆ చిన్నికథకు ఉక్తివైచిత్రిని ఊపిరిగా నిలిపాడు. ఆ ఉక్తి వైచిత్రికి ఉజ్జ్వలనీలమణి ఈ పద్యం.

సుశోభనా పరీక్షితుల వృత్తాంతం మూలంలో 43 శ్లోకాల నిడివి కలది (3. 190.1 నుండి 43 వరకు). దీనిని ఎఱ్ఱయ 17 గద్యపద్యాలలో రచించాడు. అంత చిన్నకథలో నాలుగైదు రత్నాలవంటి పద్యాలను నిర్మించాడు. వాటిలో మరొక ఉదాహరణం.

చ. 'అతులిత పుష్పపల్లవ ఫలాన్విత భూరుహభూరి వల్లరీ
వితతముఁ జారుకైరవ నవీన సరోరుహషండ మండలా
యత సరసీమనోహరము నైన పురోపవనంబునన్ సము
న్నత విభవుండు వాసభవనంబు లొనర్పఁగఁ బంచి యిమ్ములన్.' (ఆర. 4.325)

ఈ పద్యం నన్నయ అక్షర రమ్యతకు అపరావతార మనుకొనవచ్చును. కాని, నన్నయ ప్రసాద గుణం కంటె ఓజోమాధుర్యం పాలు ఎక్కువ. నిజానికి ఈ పద్యం నృసింహపురాణ రచనకు పురివిప్పుకొంటున్న ఎఱ్ఱయ ప్రబంధశయ్యలోని మధురాభివ్యక్తి. భారతీవృత్తి ప్రదర్శించే మరొక విలాసం.

ప్రకృతి వర్ణనం ఎఱ్ఱనలోని ప్రబంధ పరమేశ్వర విభూతిని రెచ్చగొడుతుంది. ఆయన నృసింహావతార ధోరణిలో విజృంభిస్తాడు. మచ్చు కొకటి రెండు.

వర్షర్తు వర్ణనం

మ. 'ఉరు ఘర్మౌఘ విఘాత సంవిహిత విశ్వోల్లాసమై సంచల
త్సరసాంభోద నినాద తూర్యరవమై చంచద్బలాకాగరు
ద్భరలీలా నవచామర స్ఫురణమై పర్జన్య సామ్రాజ్య మొ
ప్పె రమామందిరమై యుదగ్రశిఖినీ పింఛాతపత్రంబులన్.' (ఆర.6.388)

పర్జన్య సామ్రాజ్యంతో వర్షాకాలాన్ని రూపకం చేసి వర్ణించిన ఈ పద్యం ఎఱ్ఱన ప్రబంధశయ్యలోని అలంకృతోక్తి. వర్షర్తు చిహ్నాలను రాజ లాంఛనాలుగా రూపించిన పద్ధతి ఇందులోని ఉక్తి వైచిత్రి.

సముద్ర వర్ణనం:

స్రగ్ధర:'లీలం గల్లోలమాలోల్లిఖిత గగనమై లీన నానాకుళీర
వ్యాళోగ్ర గ్రాహమీనావళుల నెసఁగి దుర్వార వారోఘ గంభీ

రాలంఘ్య ప్రౌఢవేగం బగుచు బహుతరాయామ విస్తారమై బి
ట్టాలోకింపంగ నుగ్రంబగు జలనిధి నంతంతటం గంటి మంతన్'. (ఆర. 7.16)

భీకర రమణీయమైన సముద్ర స్వరూప స్వభావాలను ఓజోమధురంగా వర్ణించిన ఈ పద్యం ఎఱ్ఱన ప్రబంధోక్తియే.

ఎఱ్ఱయ కవిత ఆరణ్యపర్వశేషంలో నన్నయ తిక్కన కవితల కొకవారధి వంటిదని భావించటం ప్రసిద్ధంగా ఉన్నది. కాని, పరిశీలించి చూస్తే నన్నయ తిక్కనల బాటలలో చతురోక్తి పథాలను కల్పించి ప్రబంధయుగానికి దారులు చూపిన మార్గదర్శిగా, మహర్షిగా ఎఱ్ఱన దర్శనమిస్తాడు.

8. ఆరణ్యపర్వశేష కవితా వ్యక్తిత్వం : ప్రబంధ పరమేశ్వరత్వం

కావ్యకళారహస్య కోవిదులు కవిత్వంలో - వస్తుకళ, భావకళ, రచనాకళ ఉంటాయని గుర్తించారు. ఇతిహాసాదులలో వస్తుకళ రాణిస్తుంది. కావ్యకవితలో అది ఒక్కటి చాలదు. 'నహి కవే రితివృత్తమాత్ర నిర్వాహేణ ఆత్మపదలాభః ఇతిహాసాదేవ తత్సిద్ధేః'- అని ధ్వన్యాలోకకర్త నిర్దేశించటం ప్రసిద్ధమే. కావ్యంలో భావకళకు పట్టం కట్టాలి. నన్నయ తిక్కన్నలు ఆంధ్రమహాభారతాన్ని కావ్యేతిహాసంగా తీర్చిదిద్దుతూ అందులో వస్తుకళతోపాటు భావకళకు ప్రాణం పోశారు. నన్నయ కవితలో వస్తుకళకు భావకళ పోషకం. తిక్కన కవితలో భావకళకు వస్తుకళ సాధకం.

ఎఱ్ఱాప్రెగ్గడ నన్నయరీతికి రచనాకళను ఉపరంజకంగా అనుసంధించాడు. ఆ తరువాత శ్రీనాథుడు వస్తుభావ రచనాకళలను ముప్పేటగా పేనాడు. వారిద్దరి మధ్య నాచనసోముడు రచనాకళకు కవితలో రాజ్యం కట్టి మిగిలిన వాటితో ఆ కళకు దాస్యం చేయించాడు. ఆంధ్ర కవితాపరిణామ దశలో ఎఱ్ఱన కవిత ఒక మలుపు. రచనాకళను గౌరవించినా వస్తు భావకళలకు ఉపపోషకంగా నిలిపి మన్నించిన గౌరవం ఎఱ్ఱాప్రెగ్గడకు దక్కింది. కవిత్రయ కవిత్వానికీ తరువాతి కావ్య ప్రబంధకవిత్వానికీ ఆయన కవిత ఒక మధుర పరిణామ దశ. నన్నయ తిక్కనల కంటె రచనాకళలో ఎఱ్ఱయ ఒక అడుగు ముందుకు వేశాడు. దానిని ఆయన ఏ పేరుతోనూ పిలవ లేదు. కాని, తరువాతి వారు దానికి తమకు నచ్చిన పేర్లుపెట్టి పిలిచారు. ఎందువల్లనంటే - తెలుగు కవులు కవితాకళలో చేసే విన్నూత ప్రయోగాల కన్నిటికీ సంస్కృత లక్షణ గ్రంథాలలో పేర్లూ, నిర్వచనాలూ దొరకవు. తెలుగు కవుల కవితాకళలో క్రొత్త క్రొత్త పారిభాషిక పదాల సృష్టి జరిగింది. ఎఱ్ఱయ కవితా లక్షణాలని చెప్పేవన్నీ అటువంటి సాపేక్ష దేశీ సంప్రదాయ సంజనితాలే. అయితే, వాటికి ప్రాతిపదికలు సంస్కృత, ప్రాకృత, దేశి సంప్రదాయ భూమికల నాశ్రయించే ఉంటాయి.

ఎఱ్ఱాప్రెగ్గడ 'ఉన్నత సంస్కృతాది చతురోక్తి పథంబులఁ గావ్యకర్త'యై ఆరణ్యపర్వశేషాన్ని రచించి ప్రబంధపరమేశ్వరు డయ్యాడని ఎఱపోతసూరి చెప్పాడు. ఉక్తి అంటే సుందరమైన కవితాభివ్యక్తి. చతురమైన ఉక్తి అంటే నిపుణమైన లేదా ప్రౌఢమైన కవితాభివ్యక్తి. 'చతతే కాంక్షతే ప్రయోజన మితి చతురః' అని గురుబాల ప్రబోధిక. అంటే - ఉద్దిష్టమైన ఒక ప్రయోజనానికి సాధనభూతుడైన వాడు చతురుడు. అటువంటి లక్షణం కలిగింది చతురోక్తి. దాని వలన కవి సాధించేది రసం. 'సాధ్యోహి రసోయథా తథం కవిభిః' అని ఆర్యోక్తి. రససిద్ధిని కాంక్షించి తత్సాధకంగా శబ్దార్థాలను ప్రయోగించటం చాతుర్యం. అటువంటి చాతుర్యాన్ని ప్రదర్శించి రసాన్ని సాధించటంలో ఉత్తమ ప్రస్థానాలు సంస్కృతాది సాహిత్యాలలో జరిగి ఉన్నాయి. ఆ పరిజ్ఞానం బాగా ఉన్నవాడు, వాటిని ఏ యే ప్రక్రియలలో ఏవిధంగా ప్రయోగించాలో తెలిసిన ప్రయోక్త - ప్రబంధ పరమేశ్వరుడు.

ఉక్తి, సూక్తి పదాలు అందమైన కవితాభివ్యక్తిని కలిగించే శబ్దార్థ ప్రయోగ వైచిత్రిని తెలిపే పారిభాషిక సంకేతాలు. తెలుగులో సూక్తుల ప్రసక్తి నన్నయ నన్నెచోడాదులు తెచ్చారు. నన్నయ 'నానా రుచిరార్థసూక్తి నిధి'. అక్కడ సూక్తి అంటే రుచికరమై చమత్కారయుక్తమైన కూర్పు అని అర్థం చెప్పారు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు. ఆ చమత్కారం ఒక్కొక్క పదంలోనూ, పదబంధంలోనూ, సమాసంలోనూ, కారకంలోనూ, వాక్యంలోనూ బహుభంగుల చూడవచ్చునని వారు పేర్కొన్నారు. సూక్తులంటే ఒక కవివాగ్వృత్తిని ముద్రించుకొన్న అందమైన కవితాభివ్యక్తులనీ, ప్రియమైన మాటలనీ, శ్రేష్ఠములైనమాటలనీ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మృదుమధురమైన మాటలనీ, సుభాషితాలు, నీతులు, జాతీయాలు, లోకోక్తులు, నానుడులు మొదలైనవనీ విమర్శకులు వివేచిస్తున్నారు.రుచిరార్థమంటే రమణీయార్థ ప్రతిపాదకమనీ, కావ్యసందర్భంలో ఒప్పిదాలై భాసించే వాచ్యలక్ష్య వ్యంగ్యార్థాలనీ కొందరు వ్యాఖ్యానించారు. సూక్తిని అలంకార పర్యాయవాచిగా కొందరు భావిస్తున్నారు. నన్నయ కవిత్వంలో వాటినన్నింటినీ ఆయా దృక్పథాలతో వివేచిస్తున్నారు.

నన్నెచోడుడు తన కుమారసంభవ కావ్యంలో సూక్తులు (1.35, 36) సదుక్తులు (1.39) చతురోక్తులు (1.39) అని ప్రయోగించాడు. సూక్తులు అంటే అందంగా చెప్పిన మాటలు లేదా, సుభాషితాలు. సదుక్తులంటే నిర్దుష్టమైన సాధుశబ్దాలు, చతురోక్తులంటే ప్రౌఢోక్తులు అని విమర్శకులు భావిస్తున్నారు. కావ్యానికి సూక్తులకంటె చతురోక్తులే సౌభాగ్య హేతువులని నమ్మినవాడు నన్నెచోడుడు.

క. "చతురోక్తుల నుతపదబహు । గతుల నలంకార భావకాంతి రసార్థో,
న్నతిఁ గృతి నతిరసికులు వర । సతిగతి నెఱిఁగింపవలదె సౌభాగ్యమునన్". (కుమా. 1.39)

అని అనటమే అందుకు తార్కాణం. చతురోక్తిమయ కవిత్వంలో నుతపద బహుగతులు, అలంకార భావకాంతులు, రసార్థోన్నతి ఉంటాయని నన్నెచోడుని నిర్దేశం. ఎఱ్ఱాప్రగడ సూరి చెప్పిన 'చతురోక్తి పథంబు' లకూ దీనికీ ఏమైనా సంబంధం ఉన్నదా అని ఆలోచించాలి. నుతపద బహుగతులు- విశిష్ట పదరచనా రూపాలైన రీతిప్రస్థానాలనూ, అలంకార భావకాంతులు- అలంకార గుణప్రస్థానాలనూ, రసార్థాలు- రసధ్వని ప్రస్థానాలనూ సూచిస్తున్నాయి. వీటన్నింటిలో చతురోక్తులుండటం సర్వసాధారణం. రీతి, గుణాలంకార, రసధ్వని ప్రస్థానాలలో ఆయా కావ్యాత్మ ప్రయోజనాలను సాధించే ప్రౌఢోక్తుల ప్రయోగ విధానాలు- చతురోక్తి పథాలుగా ఎఱ్ఱయనాటికి చెప్పబడుతూ ఉండవచ్చును.

వాఙ్మయాన్నంతా ఉక్తివిశేషంగానూ, ఉక్తి సముదాయంగానూ భావించే భోజుడు - సరస్వతీ కంఠాభరణంలో-

"వక్రోక్తి శ్చ రసోక్తి శ్చ । స్వభావోక్తి శ్చ వాఙ్మయమ్,
సర్వాసు గ్రాహిణీం తా సు । రసోక్తిం ప్రతిజానతే". (5.8)

అని అన్నాడు. అతడి దృష్టిలో సాహిత్యం వక్రోక్తి. రసోక్తి, స్వభావోక్తిమయం. ఆ మూడింటిలో రసోక్తులే శ్రేష్ఠమని పేర్కొన్నాడు. ఉక్తులకూ సాహిత్య ప్రస్థానాలకూ అవినాభావ సంబంధం ఉన్నదని భోజుడి మాటలు చెప్పక చెప్పుతున్నాయి.

ఎఱ్ఱాప్రెగ్గడ కూడా చతురోక్తులు (నృ.పు.అవ.17), మధురోక్తులు (నృ.పు.అవ.21), హృద్యోక్తులు (హరి.పూ.1.51) అని మూడు రకాలు పేర్కొన్నాడు. కాని, ఆయన చెప్పిన సందర్భాలను బట్టి మధురోక్తులు, హృద్యోక్తులు ఒకటే కావచ్చును. లేదా మనసును కరగించేవి మధురోక్తులు, మనసును ఆకర్షించేవి హృద్యోక్తులు కావచ్చును. ఏమైనా ఆరణ్యపర్వశేషం చతుర, మధుర, హృద్యోక్తుల మయమని స్పష్టం. ఎఱ్ఱన కవిత్వంలో చతుర వచోవైభవంతోపాటు మధురవచో వైదగ్ధ్యం కూడా కవితకు హృద్యత నేర్పరచింది.

కీ.శే. నోరి నరసింహశాస్త్రిగారు ఎఱ్ఱాప్రెగ్గడ కవితాపాకాన్ని గురించి అంతర్గత సాక్ష్య మాధారంగా ఈవిధంగా వివేచించారు-

మ. "క్రమపాకంబునఁ గెంపుతోడి నలుపెక్కన్ మిక్కుటం బైన గం
ధము దిక్కుల్ సురభీకరింప రసమంతర్గామియయ్యున్ వెలిం
గమియం గాఱుచు నున్న చాడ్పున విలోక ప్రీతిఁ గావింప హృ
ద్యములై యున్నవి చూచితే ఫలము లీ తాళద్రుమ శ్రేణులన్".(హరివంశము. పూర్వభాగము.7.77)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

“ఈవిధముగా ధేనుకాసురుని తాళవనములోని ఫలములను బలరామునికి శ్రీకృష్ణుడు చూపుచు పలికినాడు. ముట్టినంతనే స్రవించిపోవు ద్రాక్షఫలముల రసము కాదు. అతికష్టసాధ్యమగు నారికేళరసమును గాదు ఎఱ్ఱయ కభిమానమైనది! అంతర్గామియై చిక్కని రసముండుటే కాక అది వెలిం గమియం గారుచున్నట్లుండి నేత్రపర్వము చేయుచు ఉచితమగు పాకముచే దట్టమగు సుగంధము దిక్కులు నిండిపోవునట్లు చేయగల తాళఫల రసపాక మతని కభిమానపాత్ర మైనది.

“అతడు తనకావ్యములలో స్తోత్రము చేసినది సంస్కృత కవులలో వ్యాస వాల్మీకులను, తెలుగువారిలో నన్నయ తిక్కనలను మాత్రమే. ఎఱ్ఱయకు సూక్ష్మ విషయములలో గూడ ఔచిత్యవిచార మెక్కువ. ఏ కావ్యములో ఎవరిని ముందు స్మరించవలెనో కూడ అతడు విచారించియే చేసెను. ఈ నలువురి స్మరణచే అతని కెట్టి కవిత్వమభిమానమో కూడ సూచించినాడు. ఆంధ్రమహాకవులను మహర్షులగు వ్యాసవాల్మీకులతో పోల్చుట సాహసము కాని, కవితామార్గములలో నన్నయకు వాల్మీకి ఫక్కియు, తిక్కనకు వ్యాసఫక్కియు నిష్టములనుటకు అభ్యంతరముండదు. అంతర్గామి రస మొకరికిని, వెలింగమియంగారు రస మొకరికిని కావ్యరచనలో అభిమతములు. ఈ రెండు మార్గముల రసయోగము సాధించుట ఎఱ్ఱయ ఆదర్శమా?’ (ఎఱ్ఱయ కవిత - వ్యాసం). ఔననియే శాస్త్రిగారి అభిప్రాయం. వస్తుకళలో అంతర్గామి అయిన రసమున్నూ, భావకళలో వెలింగమియంగారు రసమున్నూ ఒప్పారటం సహజం. ఈ రెంటికీ సంగమక్షేత్రం ఎఱ్ఱయ కవిత. అంటే - వస్తుకళకు భావకళతో వన్నెబెట్టే కవిత ఎఱ్ఱయది.

(1). ‘కావ్యశయ్యఁ గీలించిన కీర్తి’

ఎఱ్ఱాప్రెగ్గడ ‘ప్రౌఢాంచిత శబ్దసారులు, మహాకవులు, అయిన నన్నయ తిక్కనల ‘కావ్యశయ్యఁ గీలించిన కీర్తి సంగ సుఖలీలను’ పొందాలని భావించాడు. ఇందులో వాడిన ‘కావ్యశయ్య’ కవితాశైలికి సంబంధించింది. దీని నాధారంగా చేసికొని కీ.శే. శిరోమణి వేదాల తిరువేంగళాచార్యులవారు ఎఱ్ఱన కవితా వివేచనం చేశారు.

“శయ్యా పాకములు సముచితముగా నాదరింపఁబడి యందఱి మనసులకును నవగాహనమై యానందదాయకమగు హితరచన....తెనుఁగు మహాభారతమున మన కవిత్రయము స్వరసముగాఁ గూర్చినది. అయితే కేవలము వైదర్భీశయ్య యగుచో నది కథాకలితార్థయుక్తి కనువుగాదు. గౌడీశయ్య యగుచో జగద్ధితము కాదు. పాంచాలీశయ్య యగుచోఁ బై రెండింటికిని మధ్యస్థమై పై రెండు గుణములను సమకూర్చగలదు. “అశ్లిష్టశ్లథభావాంతు పురాణచ్ఛాయ యాన్వితాం, మధురాం సుకుమారాంచ పాంచాలీం కవయో విదుః” అని కదా వామనాచార్య డన్నది. కాని, యిది సాంస్కృతికుల మతము. అయితే, మన యాదికవి సకలాంధ్రభువనోపజీవ్యుడు నన్నయభట్టారకుఁడు సర్వేసర్వత్ర సరసోదాత్తమగు వైదర్భీ శయ్యయే చాల జాగ్రత్తగా ఉపయోగించి, ద్రాక్షాపాకముతో మేళవించి, కథాగమనమున కడ్డుతగులకుండ రసమయమగు రచన యొనరించెను. ఆ మార్గమే కవిబ్రహ్మయగు తిక్కనయు నించుమించుగా నమలోదాత్తమగు శయ్యాపాకముతోనే తన భావమంజుల కవితను సాగించెను. మన యెఱ్ఱన మహాకవి వారిరువురియందును హరిహరులందువలె గాఢభక్తి తత్పరత గలవాఁ డగుటవలన నిరువురి రచనలను ననుసరింపఁ బూని, తన శక్తి కొలఁదిఁ బాంచాలీశయ్యలో విశ్రాంతుడయ్యెను. కనుకనే నన్నయ రచనలో నెచ్చటను వర్ణనల వలనఁ గథాగమన మడ్డుపడక రసమంజులముగాఁ గథాప్రవాహ మత్యంతోదాత్తముగా శ్రవణాంజలిపుట పేయమగు నక్షరరమ్యతతోఁ గవిత యెసలారును. కవిబ్రహ్మ తిక్కన రచనా విన్యాసము కూడా నించుమించుగా నాత్రోవలోనే యనుభావ బహుళమగు భావముతో నుజ్జ్వలమై వర్ణన లెడనెడఁ గొంచెము వ్యవధానము కల్గించినను, దానినిఁ దోపనీయని స్ఫూర్తితో సాగిపోవును. మన యెఱ్ఱన మహాకవి రచనయుఁబై యిరువురి త్రోవలఁ దప్పిపోవక యటనట వర్ణనలు కథాభావములందు పర్యవసింపఁగా సరళముగా, శిథిలమధురమగు నడకతో మాఘమాసపు సరస్వతీ ప్రసన్నతతో మృదువుగాఁ జదువరులఁ దనవంక నాకర్షించును.” (ఆంధ్ర మహాభారతోపన్యాసములు- శ్రీ ఎఱ్ఱన మహాకవి ఆరణ్యపర్వశేషము (వ్యాసం) ఆంధ్ర సారస్వత పరిషత్తు: చతుర్థముద్రణం, 1966-పుట, 38,39.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీ వేదాల తిరువేంగళాచార్యులవారు కవిత్రయ శైలీ స్వరూపాన్ని కావ్యశాస్త్ర దృష్టితో విశ్లేషించి ఇచ్చిన తీర్పు ఇది:

నన్నయశైలి- "మూలగతములగు భావములను వివక్షితములగు విశిష్ట భావాంతరములచే వ్యంగ్యసరళినిఁ బోషించి రసపరిణతములుగా నాస్వాదింపఁ జేయునట్టి మహోజ్జ్వలమగు ననువాదమున రసైకప్రవణమైన దృష్టియు, లోకులవాడుక యందలి సంస్కృతమున నెక్కుడాదరమును, దెనుఁగున స్వభావాదరణ గల తీరును, సహజమగు కైశికీవృత్తియు, సుందరమగు వైదర్భీరీతియు, ద్రాక్షాపాకమును, లోకహితైక నిరతమగు దృష్టియు నన్నయ భట్టారకునిది."

తిక్కనశైలి- "అనువాదమున ననుభావ విశేషములచే (మూల వివక్షితములైనను గాకున్నను గూడ) మూలగత భావముల నుజ్జ్వలముగాఁ బ్రదర్శించుటయు ద్రాక్షాపాకమును, దెనుఁగు జాతీయమగు నుడికారము సొగసున నత్యధికమగు దృష్టియు, సంస్కృతము విషయమున సామాన్యమగు దృష్టియుఁ, గొలఁది ప్రబంధ బీజధోరణియు, నర్ధకైశికీవృత్తియు, సామాన్యముగా వైదర్భీ రీతియు, జనానంద సంధానమునఁ జూపును దిక్కనది."

ఎఱ్ఱనశైలి- "అనువాదమున సామాన్య దృష్టియుఁ, గదళీపాకము, స్వతంత్రమగు సూక్తివైచిత్రియుఁ, దెనుఁగు సంస్కృతముల సమాదరణమును, బాంచాలీ రీతియు, జనులనుఁ దృప్తిపరచుటలో శ్రద్ధయు, నెఱ్ఱన కున్నవి". (పై గ్రంథమే, పుట.85)

(2). కవిత్రయ కవితాశయ్యలు

నన్నయశైలి - ధ్వని ప్రస్థానం, వస్తుధ్వని - రసదృష్టి - కైశికీవృత్తి - వైదర్భీరీతి - ద్రాక్షాపాకం - ప్రసాదగుణం.

తిక్కనశైలి - ధ్వని ప్రస్థానం, రసధ్వని - అభినయ దృష్టి - సాత్త్వతి, అర్ధకైశికీవృత్తి - వైదర్భీరీతి - ద్రాక్షాపాకం - ప్రసాదగుణం.

ఎఱ్ఱన శైలి- ధ్వని ప్రస్థానం, అలంకార ధ్వని - చతురోక్తి - భారతీవృత్తి - పాంచాలీరీతి - కదళీపాకం - మాధుర్య గుణం.

(3). ఎఱ్ఱన కావ్యశయ్య : భారతీవృత్తి

ఆధునికుల శైలీ విచారం వంటిదే ప్రాచీనుల శయ్యావివేచనం. శయ్య అంటే పదమైత్రి. "మాలాకారో రచయతి యథాసాధు విజ్ఞాయ మాలాం, యోజ్యం కావ్యే ష్వవహితధియా తద్వదేవాభిధానః" అని భామహుడు. మాలాకారుడు ఏ పూవు తరువాత ఏ పూవును ఏ విధంగా కూర్చి అల్లితే అందంగా ఉంటుందో తెలిసికొని తెలిసి దండను మనోహరంగా ఎట్లా తయారు చేస్తాడో కవి కూడా అట్లాగే శబ్దమైత్రితో రచనా సౌందర్యాన్ని సృష్టిస్తాడు. (దీనినే ఇంగ్లీషులో ' The choice of best words in best place' అని అంటారు.) దీనిని 'పరివృత్త్యసహిష్ణుత' అంటారు. అంటే కవి రచనలో ప్రయోగించిన పదాల పొందికనుండి ఏ పదాన్ని అయినా మార్చి మరొక పద్ధతిలో చెప్పటానికి వీలులేని కూర్పరితనం అన్నమాట! దీనివలన కవిశైలి రూపుకట్టుతుంది. 'Style is the man' అని అన్నట్లు కావ్యశయ్యయే కవిశైలి. శైలియే కవి వ్యక్తిత్వం.

శయ్యా (శైలి) స్వభావాన్ని నిర్దేశించేవి- వృత్తులు, రీతులు, గుణాలు, పాకాలు. అర్థగంభీరిమ పాకం అని అంటాడు విద్యానాథుడు. వృత్తి, రీతి, గుణాల కలయికవలన పుట్టిన ఆస్వాదం పాకం. దీనినే ఆధునికులు రుచి (Taste) అంటారు. వాడే పదార్థాలు ఒకటే అయినా వండే పిండివంటల రుచులు ఏ విధంగా మారుతుంటాయో ఆ విధంగానే శబ్దమైత్రి రూపమైన శయ్యలకు, అర్థవైవిధ్యంతో కలిగించే రుచి స్వభావ భేదాలనుబట్టి పాకం మారుతుంది.

ప్రధాన రుచి స్వభావాలను బట్టి పాకం నవవిధాలని కొందరూ, మూడు విధాలని చాలమంది భావించారు. అవి- ద్రాక్షాపాకం, కదళీపాకం, నారికేళపాకం. శబ్దమైత్రివలన ఏర్పడే రచనలోని రుచి అందులోని అర్థగంభీరిమను ఆస్వాదింపజేసే పద్ధతిగా గుర్తించబడింది. పాకమంటే అర్థాస్వాదన భేదమన్నమాట. ప్రచుర పదాలకై కూర్పుతో అర్థాన్ని ఆపాతంగా ఆస్వాదించటానికి అనువైన అర్థాస్వాదనరుచి ద్రాక్షాపాకం. గూఢమైన అర్థాస్వాదన రుచి నారికేళపాకం. ఎక్కువ ప్రయత్నం లేకుండా మక్కువతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కలిగే అర్థాస్వాదన రుచి కదళీపాకం. రుచిలో ఉండే ఆస్వాద స్వాదుత్వాన్ని మధురమని పిలుస్తారు. ద్రాక్షాపాకాన్ని సర్వాకార మధురమనీ, కదళీపాకాన్ని ప్రచురమైన మధురమనీ, నారికేళపాకాన్ని అల్పమధురమనీ వివేచిస్తారు. ఈ సంప్రదాయం తెలిస్తే - ఎఱ్ఱన ఆరణ్యపర్వశేషాన్ని 'విఖ్యాత మాధుర్యమనోహరంబుగా', 'సవిస్తర మధురంబుగా' రచించినట్లు చెప్పటంలోని ఆంతర్యం అవగత మౌతుంది. నన్నయ తిక్కనల శయ్యలలోని రుచి ప్రధానంగా సర్వాకారమధురమైన ద్రాక్షాపాకం కాగా, ప్రబంధ పరమేశ్వరుడి శయ్య ప్రచురమైన- లేదా - ప్రఖ్యాతమైన - లేదా - సర్వాంగంగా కాక ఎక్కువ భాగం మధురమని పిలువబడే కదళీపాకంగా అమరిందని స్పష్టం. రాయల ఆముక్తమాల్యదవంటి ప్రబంధంలోని రుచి నారికేళపాకం కాబట్టి అది అల్పమధురం. తాత్పర్యమేమంటే- ఎఱ్ఱయ పాకం నన్నయపాకంవలె సర్వాకారమధురం కాక, ఎక్కువ భాగం మధురం కాబట్టే "తత్కవితారీతియుఁ గొంత దోఁపఁ దద్రచనయకా నారణ్యపర్వశేషము పూరించె" నని పేర్కొన్నాడు.

అలంకారవాదులవలె గాక ధ్వనిరసవాదులవలె వృత్తి. రీతి, గుణాదులు రసధర్మాలని నమ్మే నన్నయ తిక్కనల మార్గంలో నడిచినవాడే ఎఱ్ఱాప్రెగ్గడ. వృత్తులు నాట్యాశ్రయాలు కావటం చేత సాక్షాత్ రసోపస్కారకాలు. రీతులు రచనాశ్రయాలు. గుణ విశిష్ట పదరచనలే రీతులు. గుణాలవలన రీతులు, రీతులవలన వృత్తులూ రూపుకట్టుతాయి. గుణాలు ఎన్నైనా ముఖ్యమైనవి మూడు. అవి: ప్రసాదం, ఓజస్సు, మాధుర్యం. మిగిలినవి ఈ మూడింటిలో అంతర్భవిస్తాయి. అట్లాగే శబ్దార్థ గుణాల పరిగణనం ఆచారంలో ఉన్నా శబ్దగుణాలలో అర్థగుణాలను కూడా దర్శించటం ధ్వని రస సంప్రదాయం. వృత్తులు నాలుగు. అవి: కైశికి, ఆరభటి, సాత్త్వతి, భారతి. రసాభివ్యక్తికి ఇవి రమణీయోపకరణాలు. నాట్య సంప్రదాయం నుండి తెచ్చుకొన్న వృత్తులను శ్రవ్యకావ్యరీతుల కనుగుణంగా అన్వయించటం సాహితీసంప్రదాయం. కైశికీవృత్తి శృంగారకరుణాది సుకుమార రసార్థాలలో, ఆరభటీ వృత్తి రౌద్ర బీభత్సాది ఉద్ధతరసార్థాలలో, భారతీవృత్తి హాస్య శాంతాద్భుతాది ఈషన్మృదు రసార్థాలలో, సాత్త్వతీవృత్తి, వీరభయానకాదులైన ఈ షత్ప్రౌఢరసార్థాలలో ప్రవర్తిల్లుతాయి.

ఆరణ్యపర్వ శేష కథార్థాలలో మూడు రకాల కథార్థాలున్నాయి. మార్కండేయ మహర్షి చెప్పే పురాణ ధర్మ ప్రబోధ కథార్థాలు శాంతాద్భుత రస ప్రధానాలై భారతీవృత్తికి అనుకూలాలుగా ఉన్నాయి. ఘోషయాత్ర, సైంధవ వృత్తాంతం, కర్ణదానవీరవృత్తాంతం, మొదలైన ప్రధాన కథలలోని ఘట్టాలు వీరరౌద్ర రసోల్లాసాలుగా ప్రకాశిస్తున్నా, ఒకవైపు ధర్మజుడి శాంత ప్రవృత్తి,, మరొకవైపు కర్ణుడి త్యాగప్రవృత్తి, చివరకు యక్షప్రశ్నలలో ధర్మరాజు శమదమప్రవృత్తి వీరరౌద్రాదులను శాంతాద్భుతాలలో అంతర్భవింపచేస్తున్నాయి.

ఇవి కాక- రామాయణకథ, సావిత్ర్యుపాఖ్యానం ధర్మజుడి చిత్తశాంతికై చెప్పబడ్డాయి. రామాయణ కథలో వీరరౌద్రాలు, సావిత్రి కథలో శాంతాద్భుతాలు పరితకు అనుభూయమానాలౌతున్నాయి. మొత్తం మీద పరిశీలిస్తే ఆరణ్యపర్వశేషంలోని కథార్థాలకు భారతీవృత్తి పరమ రమణీయంగా అమరి ఉంటుంది. కైశికి దానికి ఉపబలకంగా ఉంటుంది. అందుకే కాబోలు తెలుగు సాహిత్యంలో వెలసిన భారతీస్తుతులలో పరమోదాత్తమైన పద్య శిరోమణి ఎఱ్ఱయ గళంలో వినిపించింది. భక్తిరసావతారమైన పోతన్నను కూడా ప్రలోభపెట్టిన పద్యరాజ మిది-

ఉ. 'అంబ, నవాంబుజోజ్జ్వల కరాంబుజ; శారద చంద్ర చంద్రికా
డంబర చారుమూర్తి, ప్రకటస్ఫుటభూషణ రత్నరోచిరా
చుంబిత దిగ్విభాగ, శ్రుతిసూక్త వివిక్తనిజప్రభావ, భా
వాంబరవీథి విశ్రుత విహారి ననుం గృపఁ జూడు భారతీ!' (ఆర: 4.215)

ఎఱ్ఱయకు పూర్వం భారతీవృత్తిని చేపట్టి ఇంత పరమోదాత్తంగా నిర్వహించిన కవి కానరాడు. ఎఱ్ఱయ ఎన్నుకొన్న కావ్య వస్తువులన్నీ భారతీవృత్తికి అనుకూలాలే. అందువలన భారతీవృత్తి పరిపోషణలో ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరు డయ్యాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సాత్త్వతి అంటే సత్త్వప్రకాశమైన మనస్సు. మనః ప్రభవాలైన హర్షశౌర్య త్యాగాదులను సాత్త్వతాలని పిలుస్తారు. వాటిని ప్రధానంగా కలది సాత్త్వతీవృత్తి అని శార్ఙ్గదేవుడు తెలిపాడు. కోమలప్రౌఢార్థ సందర్భం కలది సాత్త్వతి అని భోజుడు భావించాడు. ఈషత్ప్రౌఢార్థం కలది సాత్త్వతి అని విద్యానాథు డన్నాడు. ఎఱ్ఱన ఆరణ్యపర్వశేషంలోని కొన్ని ఘట్టాలలో సాత్త్వతిని సందర్భసుందరంగా హృదయరంజకంగా పోషించాడు. ముఖ్యంగా రామాయణ కథలో, సావిత్ర్యుపాఖ్యానంలో, కర్ణుడి కథలో.

ఆరణ్యపర్వంలోని నన్నయ భాగంలో సాత్త్వతీవృత్తికి అనుకూలంగా ఉన్న కథార్థాలు ఎక్కువ. భీమార్జునుల వీరవిహార గాథలు వీరరౌద్ర భయానకరస ఘట్టాలు. అందువలన నన్నయలో భారతీవృత్తి తక్కువ. అయితే ఆయన సాత్త్వతీవృత్తి కంటె కైశికీవృత్తిని ఎక్కువగా పాటించాడు. గుణాలనన్నింటినీ ప్రసాదగుణంలో పొదిగే నన్నయ వృత్తులనన్నింటినీ కైశికితో కరగ్రహణం చేయించి తన ప్రయోగ నైపుణ్యం ప్రకటించాడు. తిక్కన కైశికిని సాత్త్వతికి పోషకంగా నిలపటంలో దిట్ట. విమర్శకులు నన్నయ తిక్కన లిద్దరి రచనలనూ కైశికీవృత్తి ప్రధానాలుగా పరగణిస్తారు. ఆపైన తారతమ్యాలను గుర్తిస్తారు. ఎఱ్ఱన రచనలో కూడా కైశికీవృత్తి కనుకూలమైన కథార్థాలున్నాయి.

నన్నయ భాగంలోవలె ఎఱ్ఱయ భాగంలో స్త్రీలను గురించిన కథార్థాలు విస్తారంగా ఉండటం విశేషం. నన్నయ భాగంలో ద్రౌపది మనోవేదన, సౌగంధికాది పుష్పాలపై చూపిన వలపు వర్ణించబడ్డాయి. ఆనాటి కౌరవ సభలో తనకేశాలు పట్టి లాగి పరిభవించిన కౌరవుల దుశ్చర్యలను తలచి శ్రీకృష్ణుడితో మొరపెట్టుకొన్నది ద్రౌపది. ధర్మరాజుతో వాదించి అతడి మనసు మార్చి రణం చేయించి అరణ్యవాసం నుండి విముక్తం కావాలని యత్నించింది. అర్జునుడి వలని విప్రలంభాన్ని సున్నితంగా అనుభవించింది, సమస్యల మధ్య సతమతమౌతున్నా సౌగంధికాది పుష్పాల వలన కలిగే సుఖం కొరకు తాపత్రయపడి భీమాదులను చిక్కులలో పడవేసింది. ఆ భాగంలో స్త్రైణమైన ద్రౌపది కథలో తీవ్రవేదన అధికం; సుఖప్రదమైన రక్తి తక్కువ. అంటే కరుణాది రసాలకున్న ప్రాధాన్యం శృంగారాదులకు లేదు. అయినా ప్రసన్నమైన నన్నయ రచనలో కైశికీవృత్తి ప్రధాన భూమిక నిర్వహించింది.

అయితే ఉపాఖ్యానాలలో నలదమయంతుల చరిత్ర నన్నయ కొకవరం. దమయంతీ పరంగా శృంగారాన్నీ, విప్రలంభాన్నీ విస్తారంగా పోషించే అవకాశం ఆయనకు దొరికింది. కైశికీవృత్తి అందులో పురివిప్పుకొన్నది. మిగిలిన ఉపాఖ్యానాలలో కూడ అగస్త్యలోపాముద్ర చరిత్రం, ఋశ్యశృంగ వృత్తాంతం, సౌకన్యాఖ్యానం మొదలైన కథార్థాలను చిత్రించేటప్పుడు పోషించిన శృంగారంలో కైశికీవృత్తిని నన్నయ కుశలంగా పోషించాడు.

ఎఱ్ఱన భాగంలో కూడా స్త్రీ గాథలు విస్తారంగానే ఉన్నాయి. మార్కండేయుడు చెప్పిన కథలలో పతివ్రత కథ, స్వాహాదేవి కథ, సత్యాద్రౌపదుల సంవాదం, సైంధవుడు ద్రౌపదిని మోహించి ఆమె పట్ల రతిభావస్ఫోరకంగా పలికిన ఘట్టం, సీతాసావిత్రుల పాతివ్రత్యమహిమల కథలు శృంగారకరుణ రసానుకూలంగా ఉన్నాయి. అయితే నన్నయ భాగంలోని స్త్రీ ప్రవృత్తుల కంటె ఎఱ్ఱయ భాగంలోని స్త్రీ పాత్రల ప్రవృత్తులు ఈషత్ప్రౌఢాలని చెప్పకతప్పదు. వీరిలో కరుణం కంటె ధార్మిక వీరచైతన్యమే ఎక్కువగా భాసిస్తుంది.

ద్రౌపదికి కురుసభలో జరిగిన అవమానంతో పోల్చుకుంటే సైంధవుడి వలన కలిగిన పరాభవం గొప్పది కాదు. మొదటి దానికి ప్రతీకారం జరుగలేదు; రెండోదానికి ఆమె కళ్ళ ఎదుటనే ప్రతీకారం జరిగింది. సీతలో కరుణం ధర్మవీరానికి అంగమైపోయింది. సావిత్రిలోని శృంగారం మృత్యుంజయ వ్రతనిష్ఠలో శమించిపోయింది. పతివ్రత భర్తృసేవలో నిమగ్నురాలైనా శృంగారమూర్తి కాదు; ధర్మజ్ఞాన చైతన్యమూర్తి. మొత్తంమీద ఎఱ్ఱన చిత్రించిన స్త్రీ పాత్రలు ధర్మమూర్తులే. అందుకే ఎఱ్ఱయకు కైశికీవృత్తి అనువు కాలేదు. సాత్త్వతి సబబు కాలేదు. భారతీవృత్తిని చేపట్టవలసి వచ్చింది. మిగిలిన మూడు వృత్తులనూ భారతితో ముడివేసి ప్రబంధ పరమేశ్వరు డయ్యాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(4) ఎఱ్ఱన రచన : మాధురీగుణం, పాంచాలీ రీతి

రచనలో కవి వాడే వర్ణాలు గుణాలను వ్యంజింపచేస్తాయి. గుణాల వలన రీతు లేర్పడతాయి. గుణాలవలెనే రీతులూ రసధర్మాలే. మాధుర్యగుణ విశిష్టమైన పదరచన వలన వైదర్భీరీతి, ఓజోగుణ విశిష్ట పదరచన వలన గౌడీ రీతి, ప్రసాద గుణ పదరచనవలన పాంచాలీరీతి ఏర్పడతాయి - అని సామాన్యంగా లక్షణకారులు చెప్పారు. కాని ప్రతిభావంతులైన కవులు వక్తృవాచ్య ప్రబంధాల యొక్క ఔచిత్యాన్ని బట్టి ఈ సంఘటనలు మార్చవచ్చును. (పాక, వృత్తి, గుణ, రీతుల, సంవిధానం సంఘటన).

పైగుణరీత్యాదులను గురించి ఆలంకారికులలో ఏకాభిప్రాయం లేదు. నిరంకుశులైన కవులు తమ ప్రస్థానాన్ని ఎన్నుకొని ఆయా కావ్యాంశాలను గురించి తదనుగుణమైన అభిప్రాయా లేర్పరచుకొనవచ్చును. దానికి ఉదాహరణంగా నన్నయ తిక్కనల కవిత్వంలో ప్రసాద గుణం, వైదర్భీరీతి ఉన్నాయనీ, ఆ రెంటినీ వారు తెలుగులో సంఘటించారనీ ఆంధ్రధ్వన్యాలోక కర్త శ్రీమాన్ వేదాల తిరువేంగళాచార్యులు భావించి నిరూపించటం దానికి తార్కాణం. ఆయనే ఎఱ్ఱన రచనలో మాధురీగుణం, పాంచాలీ రీతి ఉన్నాయని వివేచించారు. ఇటువంటి సమన్వయం పండితరాయాదులు ఇదివరలో అంగీకరించిందే. సామాన్య విశేష దోషాలు లేకుండా మధుర సుందర పద వర్ణ విన్యాసం కలిగి, నిర్మాత యొక్క వ్యుత్పత్తిని వెల్లడి చేసే ప్రసాద గుణములు కలదానిని వైదర్భి అని పండితరాయల అభిమతం. సమాసయుక్తమై అత్యద్భుత పదజాలంతో కూడి ఓజఃకాంతి గుణసహితమై ఉన్న ఆడంబర బంధం గౌడీరీతి అనీ, సమాసయుక్తమైన అయిదారు పదాలు కలిగి ఓజఃకాంతి వర్జితమై మధుర సుకుమారమైనది పాంచాలీ రీతి అనీ భోజుడి లక్షణం. వైదర్భీ గౌడీ రీతుల మేలికలయిక పాంచాలి అని విశ్వనాథుడి అభిప్రాయం. ఇటువంటి లక్షణాల ననుసరించి నన్నయ తిక్కనలది వైదర్భీ రీతి అని, ఎఱ్ఱనది పాంచాలి రీతి అని నిశ్చయించవచ్చును. వీటికి సమాంతరంగా ఇంగ్లీషులో The plain and elegent style', The elevated and forcible style', అని పేర్కొనవచ్చును.

(5) ఎఱ్ఱన కవిత మంజుల వాగమృత ప్రవాహం

రీతిని మార్గమని కొందరు పిలిచారు. 'రియంతే పరంపరయా గచ్ఛంతి అనయా కరణసాధనోయం రీతి శబ్దః మార్గపర్యాయః'. రసపదవిని పొందటానికి తోడ్పడే మార్గంగా రీతిని సంభావించడం గమనార్హం. గుణాలు దానిలో నడుస్తాయి కాబట్టీ, వాఙ్మధుధార అందులో ప్రవిస్తుంది కాబట్టి రీతి అనే పేరు కుదిరిందట! "రిణంతి గచ్ఛంతి అస్యాం గుణాః ఇతి, రీయతే క్షరతి అస్యాం వాఙ్మధుధారా ఇతివా రీతిః అధికరణేక్తిః" (కామధేనువ్యాఖ్య). ఎఱ్ఱన ఈ ప్రస్థానానికి చెందినవాడు కాబట్టి రీతిని గుణ ప్రసారమార్గంగా, వాఙ్మధుధారగా ఎఱ్ఱన భావించాడు.

ఆరణ్యపర్వశేషంలో మూడింట రెండు వంతులు మార్కండేయ మహర్షి కథనం. ఆయన రీతి (శైలి) మంజులవాగమృత ప్రవాహమట!

ఉ. 'ఏనును బాండునందనులు నిమ్మునిముఖ్యులు నిప్డు లోక స
మ్మానితవాక్య! నీ దయిన మంజుల వాగమృత ప్రవాహమున్
వీనులదోయి నించుచును వేడుకఁ గ్రోలికొనంగ నాత్మలం
బూనెద; మస్మదీప్సితము పూర్ణము సేయఁగ నర్హ మెమ్మెయిన్". (అర. 4,164)

శ్రీకృష్ణాదులు శ్రోతలు. వారు శ్రవణానందంగా మార్కండేయ కథాకథన విధానాన్ని ఆస్వాదించాలని కోరుకొంటున్నారు. ఆ మహర్షి మాటలు 'మంజులవాగమృత ప్రవాహమట' - దానిలోని కవితామధువును వీనులనే దోసిళ్ళతో ఎత్తుకొని త్రాగి ఆత్మానందాన్ని పొందాలట. మహర్షి మాటలకు ఎఱ్ఱన వేసిన విశేషణం అమూలకం! అంటే - ఆ మహర్షినోట పలికే ఎఱ్ఱయ మాటలలో మాధుర్యగుణమనే మధుధార ప్రవహించి పాంచాలీ రీతిగా రూపొందుతుందన్న మాట!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆరణ్యపర్వాంతంలో యక్షరూపుడైన ధర్ముడు ధర్మజుడి పట్ల ప్రసన్నుడై 'ప్రసాదమధురంబైన ఆలోకనంబు' ప్రసరించాడట! ఇది ఎఱ్ఱయ రీతి ముద్ర. ఆయన కవిత్వాన్ని ఆలోకించేవారు (అనుశీలించేవారు) కూడా ప్రసాదమధురమైన గుణవద్రచనను పరిశీలించాలని హెచ్చరిక! మంజుల వాగమృత ప్రవాహమంటే కోమలమైన ప్రసాదగుణంచేత సహజంగా భాసించే ఎఱ్ఱన మహాకవి వాక్కు వస్తు (ప్రబంధ) స్వభావాన్ని అనుసరించి మాధురీ మహిమను ప్రదర్శించిందని సూచన! ప్రసాదమాధుర్యం ఎఱ్ఱన వాగ్వైభవం!

(9) ప్రబంధ పరమేశ్వరుడు : చతురోక్తి పథాలు

ప్రబంధపరమేశ్వరు డంటే ఎఱ్ఱాప్రెగ్గడయే - అని ఆయన జీవిత కాలంలోనే ప్రసిద్ధికెక్కాడు. తరువాతి కవులు ఆయన పేరుకంటె బిరుదానికే పెద్దపీట వేశారు. ఆయన కవితను వడబోశారు. తమ కవితా ప్రస్థానాలకు ఎఱ్ఱయ కవిత ఏ విధంగా దారులు చూపిందో సమీక్షించుకొంటూ ఆయన కవితాగుణాలను కీర్తించారు. అట్లా కీర్తించిన వారిలో మొదట పేర్కొనదగినవారు శ్రీనాథ, జక్కనలు. వీరు కవిత్రయాన్నీ, వారి కవితా వైలక్షణ్యాలనూ విశేషించి పేర్కొన్నారు. అయితే, వారు ఎఱ్ఱనను వారి చూపులతో అంచనావేసి ప్రశంసించారన్న సత్యాన్ని మరువరాదు.

ఆంధ్ర కవితా పరిణామంలో శ్రీనాథ యుగం ఒక పెద్ద మలుపు. దానికి తోడ్పడిన సమీప ప్రేరక శక్తులలో ముఖ్యుడు ఎఱ్ఱాప్రెగ్గడ. శ్రీనాథ యుగారంభంనాటికి అంటే క్రీ॥శ॥ 1400 సంవత్సరం నాటికి తెలుగులో చతుర్విధ కవితా ప్రక్రియలకు ప్రాచుర్యం రావటం ప్రారంభమైంది. 15,16 శతాబ్దాలలో ఆశు, మధుర, చిత్ర, విస్తర కవితలూ, 17, 18 శతాబ్దాలలో ఆశు, బంధ, గర్భ, చిత్ర కవితలూ తెలుగు కవితా రంగంపై తమ ప్రభావాన్ని ప్రదర్శించాయి. శ్రీనాథ యుగం నుండి వెలసిన మహాకవులందరూ చతుర్విధ కవితలలో చతురులై ఉంటారు. ఏదో ఒక శాఖలో ప్రౌఢులై ఉంటారు. ఆ మారే కాలానికి మొదట మార్గం చూపినవారు ఎఱ్ఱాప్రెగ్గడ, నాచన సోముడు. వీరిద్దరూ విస్తరకవితలే వ్రాశారు. కాని, వాటిలో తమ వాగ్విలాసాలను ప్రదర్శించి ఆశు, మధుర, చిత్ర కవితా సౌగంధ్యాలను గుబాళింప చేశారు. వారిరువురిలో కవిత్రయంలో స్థానాన్ని పొందినవాడూ, ధ్వని సంప్రదాయంలో సాగినవాడూ అయిన ఎఱ్ఱన శ్రీనాథాదులకు మహర్షివలె కనిపించాడు. చమత్కార ప్రస్థానంలో సాగిన నాచనసోముడు ఒంటివాడై కొంతకాలం నిలిచిపోయాడు. శ్రీనాథాదులు ఎఱ్ఱయపట్ల చేసిన ప్రశంసలను ఈ భూమికతో సమీక్షించాలి.

> "పరిఢవింతుఁబ్రబంధ పరమేశ్వరుని తేవ
> సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు" (కాశీఖండము. 1.13)

అని శ్రీనాథుడి ప్రశంస. 'సూక్తి వైచిత్రి' అనేది సంస్కృత లక్షణ గ్రంథాలలో రూఢికెక్కిన పారిభాషిక పదం కాదు. ఆ మాటకు వస్తే ఆ సీసపద్యంలో వాడిన వేములవాడ భీమకవి 'ఉద్దండలీల', నన్నయభట్టు 'వాక్ప్రౌఢి', తిక్కయజ్వ 'రసాభ్యుచితబంధం' కూడా అటువంటివే. అంతే కాదు - అవి శ్రీనాథుడి కవితా ప్రస్థానానికి తోడ్పడిన పూర్వ కవుల కవితారీతులు. రీతులు రసధర్మాలని నమ్ముతూనే రసాన్ని పొందటానికి గుణాలకంటె రీతులే మధురమైన మార్గాలని నమ్మిన కవిసార్వభౌముడు శ్రీనాథుడు. ఆయనకు ముందున్న ప్రబంధపరమేశ్వరుడు కూడా రీతులను రసధర్మాలని నమ్మినవాడే కాని, ధ్వని సంప్రదాయాన్ని అనుసరించి రీతి గుణాలలోనే పర్యవసిస్తుంది అనే మతాన్ని ('రీతిర్హిగుణేష్వేవ పర్యవసితా' - ధ్వన్యాలోకం, లోచనవ్యాఖ్య. తృ.ఉ.44) అనుసరించి ఆరణ్యపర్వశేషాన్ని రచించి నన్నయ తిక్కనల త్రోవన నడిచాడు. అక్కడి నుండి హరివంశ నృసింహపురాణాలలో శ్రీనాథుడికి బాటలువేస్తూ సాగాడు. ఎఱ్ఱన పరిణామకవి. అందువలననే శ్రీనాథాదులు కవిత్రయంలో ఒకడైన ఎఱ్ఱయను మహర్షిగా భావించి నమస్కరిస్తారు; హరివంశ నృసింహ పురాణ రచయితగా ఆతడిని మార్గదర్శిగా పురస్కరిస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(1) చతురోక్తి : సూక్తివైచిత్రి

శ్రీనాథుడు ఉక్తివైచిత్రినే సూక్తివైచిత్రిగా చెప్పాడేమో అని అనుమానించటానికి వీలుంది. ఎందువల్లనంటే- ఆ కాశీఖండంలోనే ఎఱ్ఱయను 'సత్ప్రబంధపరమేశ్వరు' డని ఉపసర్గతో కలిపి విశేషంగా పేర్కొన్నాడు. అది ఆయన సూక్తి వైచిత్రి. ఉక్తివైచిత్రి అంటే అందమైన కవితాభివ్యక్తిని ఆవిష్కరించటంలో ప్రదర్శించే ఆకర్షణీయమైన విలాసవైవిధ్యం. ఇది సర్వ కవిసామాన్య ధర్మం. సూక్తివైచిత్రి అంటే - అది ఆ కవే చేయగలడు అని చెప్పుకోతగినట్లు విశిష్టంగా కొట్టవచ్చినట్లు అందమైన కవితాభివ్యక్తిని ఆవిష్కరిస్తూనే అందులో ప్రదర్శించే ఆకర్షణీయమైన విలాసవైవిధ్యం. ఇది శబ్దార్థాల సంఘటనలకు సంబంధించినదే కాదు; దానికి పరివేషంగా వెలిగే సౌందర్యాభివ్యక్తి శక్తికి సంబంధించినది. సూక్తి - సౌందర్యాభివ్యక్తి సంబంధి. వైచిత్రి - దాని ప్రయోగ వైవిధ్య ప్రౌఢికి సంబంధించినది. ఇది కవి ప్రతిభాజన్యమై ఎప్పటికప్పుడు అపూర్వంగా భాసించేది కాబట్టి లక్షించదగిందే కాని లక్షణం చెప్పలేనిది. మచ్చుకు ఒకటి రెండు ఉదాహరణలు:

బ్రాహ్మణ వేషంలో ఇంద్రుడు కర్ణుడివద్దకు వచ్చాడు. అతడు ఇంద్రుడని తెలియకే కర్ణుడు సహజదానగుణ ప్రేరితుఁడై బంగారు నగలున్న ప్రమదలు కావాలా? గోగణాలతో నిండిన గ్రామాలు కావాలా? కోరుకొమ్మన్నాడు.

"హిరణ్యకంఠీః ప్రమదా । గ్రామాన్వా బహుగోకులాన్
కిం దదానీతి తం విప్ర । మువాచాధిరథి స్తతః." (సం. 3.294.2)

ఎఱ్ఱన ఈ భావాన్ని ఒక కందంలో చెప్పితే సరిపోయేది. కాని, ఒక వృత్తం ఎత్తుకొన్నాడు.

చ. 'అలసవిలాసలాలస రసాన్వితలైన నితంబినీజనుల్
వలసిన, భూరివిస్ఫురితవస్తుసమగ్రము లైన గ్రామముల్
వలసిన, నుల్లసన్మణిసువర్ణ విభూషణగోధనావళుల్
వలసినఁ గోరు మిచ్చెద ధ్రువంబుగ నావుడు నాతఁ డిట్లనున్.' (ఆర.7.359)

ఈ పద్యంలో చెప్పిన భావం చిన్నది. చెప్పిన తీరు పెద్దది. శబ్దార్థాల సంఘటనతో ఒక అభివ్యక్తిని ఎఱ్ఱన కల్పించాడు. అడిగేవాడిని ఆకర్షించేవి వస్తువులే అని వ్యాసుడి హృదయం. అందుకే నగలున్న ప్రమదలంటే చాలనుకొన్నాడు. ఎఱ్ఱయ పెట్టు నగలు తీసి పుట్టునగలు పెట్టాడు. నగలవలన ప్రమదలైనారు మూలంలో. అలసవిలాసలాలస రసాన్వితలు కావటం చేత నితంబినులైనారు తెలుగులో. "హిరణ్యకంఠీః" అనే విశేషణంలో కోమలత్వం కొరవడింది. ఎఱ్ఱయ మసృణత్వ మనే శబ్దగుణం గల శ్లేషను అనుప్రాసతో కూడిన సౌందర్యంతో కలిపి ఒక పాదాన్ని సృష్టించాడు. అది ఆయన పోకడగానే అనిపించింది. మూలంలో గ్రామాలు బహుగోకులాలు. వ్యాసుడి కాలంలో గోవులే ధనాలు గ్రామాలకు. ఎఱ్ఱయకాలంనాటికి అగ్రహారాలు, నల్లిళ్ళు ప్రసిద్ధం. అందువలననే భూరివిస్ఫురిత వస్తు సమగ్రాలైన గ్రామాలుగా అవి మారాయి. వస్తు సమగ్రతకు భూరి విస్ఫురత్వం ప్రదర్శించటం ఎఱ్ఱయ అభివ్యక్తి శిల్పం. దీనినే సాహిత్యపరంగా అన్వయిస్తే ఆయన అభివ్యక్తి లక్షణం. కావ్య వస్తువు (వర్ణ్య వస్తువు) నిండుగా ఉండాలంటే దానిని దండిగా అందంగా ఆకర్షణీయంగా చెప్పాలని భావం. ఈ పద్యంలో ప్రతి చరణం అందుకు నిదర్శనం. మూలంలోని బంగారు నగలను, గోకులాలను మణిధనావళులతో కలిపి మూడోచరణాన్ని సంపన్నం చేశాడు ఎఱ్ఱయ. 'ఉల్లసన్మణి సువర్ణ విభూషణ గోధనావళుల్'- అభివ్యక్తిలో మూలంలో లేని మాధుర్యం ఏర్పడింది. 'వలసిన' అనే క్రియతో మూడు చరణాల మొదళ్ళు విరగటంతో దాత యొక్క దానోత్సాహం వ్యక్తమౌతుంది. మూలంలో ఏదో ఒకటి తీసికొమ్మని కర్ణు డడిగాడు. కవచకుండలాలు రెండూ కోరుకొనేవాడికి ఆమాట తరువాత ఇబ్బంది పెట్టవచ్చును. అందుకని ఎఱ్ఱన 'లేదా' అనే మాటను లేకుండా చేశాడు. అన్నీ కావాలన్నా అడుగు, అభ్యంతరం లేదన్నాడు. భూరిదాన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విస్ఫురత్వం కర్ణుడు భవిష్యత్తులో చేయబోయే భూరిదాన మహత్త్వానికి మహనీయ భూమికగా ఎఱ్ఱయ సిద్ధం చేశాడు. పద్యం మొత్తం మీద వక్త, వస్తువు, ప్రబంధ సందర్భాలను ధ్వనింపచేసే భావాన్ని అభివ్యక్తి సౌందర్యంతో ఆవిష్కరించినట్లుంటుంది. ఇటువంటి కవితా స్వభావం నన్నయ తిక్కనలలో కూడా ఉన్నది. ఎఱ్ఱయలో అది భూరి విస్ఫురత్వాన్ని సంతరించుకొన్నది. శ్రీనాథుడు దీనిని తన కవితలో భూరికవితావైభవంగా ప్రదర్శించాడు. దీనికి ఆ కవిసార్వభౌముడు సంకేతించిన పదం - 'సూక్తివైచిత్రి'. శ్రీనాథుడి కవితలో దాని పరిపూర్ణావతారం ఇట్లా ఉంటుంది-

శా. "కాలాంతఃపురకామినీకుచతటీ కస్తూరికా సౌరభ
శ్రీలుంటాకము చందనాచలతట శ్రీఖండసంవేష్టిత
వ్యాలస్ఫారఫణాకఠోరవిషనిశ్వాసాగ్ని పాణింధమం
బేలా నాపయి దక్షిణానిలము పక్షీ! సేయు దాక్షిణ్యమున్." (శృం.నై. 2.32)

శ్రీనాథుడి సమగ్రసూక్తి వైచిత్రికి ఎఱ్ఱయది బీజప్రాయమే. ఆరణ్యపర్వశేషంలో కనపడే 'సూక్తివైచిత్రి' అంకురావస్థలోనిదే. అదే నృసింహపురాణంలో పుష్పావస్థకు చేరింది. మచ్చుకీ పద్యం చూడండి.

ఉ. "శ్రీస్తనకుంకుమద్రవ నిషిక్తభుజాంతర భాగవిస్ఫుర
త్కౌస్తుభరత్న నూత్నరుచి గర్వితనాభిసరోజ సౌరభ
ప్రస్తుత మత్తభృంగరవరాగరసోల్బణ భోగి భోగత
ల్పాస్తరణుం దలంచు సుకృతాత్ము లపాస్తసమస్త కల్మషుల్". (నృ.పు. 2.37)

ఈ పరిణామ దశను గమనిస్తే ఎఱ్ఱన చతురోక్తి పథాలలో సాధించిన ఒక నేర్పు సూక్తివైచిత్రి.

అభివ్యక్తి సమాసాడంబరానికి సంబంధించింది కాదు. చెప్పే విధంలో కొట్టవచ్చినట్లు కనపడే సంఘటనకు సంబంధించింది. ఎఱ్ఱన పైపద్యం మాధురీ శబ్దగుణ సమన్వితం. ఈ క్రింది పద్యం అర్థగుణమైన మాధురికి మధురాభివ్యక్తి.

సత్యవంతుడు పునర్జీవితుడై సావిత్రితో కూడి నెమ్మదిగా ఆశ్రమానికి బయలుదేరాడు. ఆ సందర్భంలో యముడి వరంవలన కన్నులు వచ్చిన ద్యుమత్సేనుడు శైబ్యతో కలిసి పుత్రుడు కానరాలేదని, ఆశ్రమాలన్నీ చుట్టివచ్చి, కానంతా తిరిగి, కాళ్ళకూ చేతులకూ గాయాలైనా లెక్క చేయక, ఉన్మత్తుడివలె రోదించాడని మూలం.

"ఏతస్మిన్నేవకాలేతు । ద్యుమత్సేనో మహావనే
లబ్ధచక్షుః ప్రసన్నాత్మా । దృష్ట్వా సర్వం దదర్శ హ ॥
స సర్వానాశ్రమాన్ గత్వా । శైబ్యయా సహ భార్యయా
పుత్రహేతోః పరామార్తిం । జగామ మనుజర్షభ ॥
తావాశ్రమా న్నదీ శ్చైవ । వనాని చ సరాంసి చ
తాం స్తాన్దేశాన్విచిన్వన్తౌ । దంపతీ పరిజగ్మతుః ॥
శ్రుత్వా శబ్దంతు యత్కించి । దున్ముఖౌ సుతశంకయా
సావిత్రీ సహితో ఽ భ్యేతి । సత్యవా నిత్యధావతామ్ ॥
భిన్నైశ్చ పరుషైః పాదైః । సవ్రణైః శోణితోక్షితైః
కుశకంటకవిద్ధాంగా । వున్మత్తా వివ ధావతః ॥" (సం. 3.282.1-5)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ సన్నివేశాన్ని ఎఱ్ఱన తెలుగులో నిర్మించిన తీరు ప్రబంధపరమేశ్వరత్వాన్ని చాటుతుంది.

ఉ. "కన్నులు వచ్చి యెల్లెడలుఁ గన్గొని వృద్ధనరేంద్రుఁ డాత్మకుం
గన్నులుఁ బోలె నైన తన గాదిలిపుత్త్రుఁ డు గాననంబులో
నెన్నఁడు లేని యింత తడవేటికిఁ జిక్కెనొ యంచు నార్తితోఁ
గన్నులు లేనియ ట్లతఁడుఁ గానక యేడ్చె సతీసమేతుఁడై'.

తరలము:

'కొడుకు నిందును నందు రోయుచుఁ గోరి ప్రేమభరంబునం
గొడుకు సద్గుణకోటి యెల్లను గోటిభంగుల నోలి ను
గ్గడన సేయుచు సత్యవంతునిఁ గానరే మునులార! యే
యడవిలోపల నంచు 'హా సుత' యంచు ధైర్యము డించుచున్.' (ఆర. 7.269,270).

మూలానికీ తెలుగుకూ పోలిక లేదు - రెండింటికీ అభివ్యక్తి భిత్తికలు వేరుకాబట్టి. మూలంలో శైబ్యాద్యుమత్సేనులు కన్నులు వచ్చినా కొడుకును కానక, కానలలో తిరుగుతూ ఉన్మత్తులవలె రోదించారు. కుశకంటకాలు గ్రుచ్చుకొని వారి శరీరాంగాలు పాదాలు గాయపడి నెత్తురులు కారాయి. కన్నులు వచ్చాయి కాబట్టి తిరిగారు. కన్నులున్నా కాళ్ళకు గాయాలు తప్పలేదు. దానికి కారణం వారు ఉన్మత్తులవలె అయిపోవడమే అని మూలం. మూలవర్ణనం సహజసుందరంగా ఉన్నది. అందులో వైచిత్రి లేదు. చమత్కారం లేదు. ఉన్మత్తులవలె శైబ్యాద్యుమత్సేనులను సహజంగా చిత్రించటం దాని తాత్పర్యం.

ఎఱ్ఱన సృష్టికి భిత్తిక వేరు. ద్యుమత్సేనుడు ఉదాత్తుడు, ధీరుడు. కొడుకంటే అతడికి ఆరవప్రాణం. అతడికి కన్నులు వచ్చాయి. నాలుగుదిక్కులా పరికించి చూచాడు. తనకు దిక్కైన గాదిలి కొడుకు కనపడలేదు. కన్నులు లేనప్పుడు కన్నకొడుకు ఆత్మకు కన్నులుగా ఉండేవాడు. కన్నులు వచ్చి లోకాన్ని చూపించాయి కాని తన కన్నకొడుకును చూపించలేకపోయాయి. లోచూపు లేని పైచూపు ఆయనకు ఆవేదన కలిగించింది. ఒక్కగా నొక్కడైన తన గారాబు కొడుకు అడవిలో ఎందుకు అంతగా ఆలస్యం చేశాడో? అని వితర్కించాడు. ఎఱ్ఱన ఇక్కడ పద్యాన్ని ధ్వనిమయంగా గొప్పగా నిర్వహించాడు. కన్నులు లేని విధంగా, దేనినీ చూడలేని శూన్యదృక్కులతో భార్యాసహితుడై ఆర్తితో దుఃఖించాడట ద్యుమత్సేనుడు. వితర్కానంతరం ఆర్తిని పొందాడట! అట్లా చిత్రించటం సూక్తివైచిత్రి. పుత్రుడు చనిపోయి ఉంటాడేమో అన్న శంక ఆర్తికి కారణమైనదని ధ్వని. అందుకే అంతటి దుఃఖం. ఒకవేళ కొడుకు పోతే? ఏడవటం సహజం. ఇక్కడ ఏడ్పులో ఒక అర్థవైచిత్రి ఉంది. కొడుకు ఆత్మకు కన్నులవంటివాడు. లోచూపు పోతుంది. వచ్చిన వెలిచూపుతో చూడదగింది నాలుగుదిక్కుల లోకం కాదు. తనకు దిక్కైన కన్నకొడుకును కన్నులతో చూడలేని దుఃస్థితియే ఏర్పడితే అంతా శూన్యమే. మరేగతీ లేదు. కళ్ళున్న కబోది కొడుకులేని తండ్రి. ఆ భావం రాగానే తల్లిదండ్రులను కడతేర్చే కొడుకులేని ఒక అభాగ్యస్థితి రాజుకు తోచింది. దాన్ని సగభాగంగా పంచుకొనే ఇల్లాలిని దగ్గరికి తీసికొన్నాడు ద్యుమత్సేనుడు. ఒక్క కొడుకు ఇద్దరిని గ్రుడ్డివారిని చేశాడు. ఈ పద్యం శబ్దవైచిత్రివలె పైకి కనపడుతుంది. కాని అర్థం విచిత్రమైన పాత్ర నిర్వహిస్తుంది. అందులోనూ తెలుగుపదాలు. 'కన్నులు వచ్చి కన్గొనటం. ఆత్మకు కన్నులవంటి గాదిలి పుత్త్రుఁడు కనపడకపోవటం, కన్నులు లేని యట్లతఁడు గానక' - అనే వాక్యాలలో పదాలకంటె జాతీయాలవలె అవి ఇచ్చే అర్థాలే పద్యానికి ప్రాణాలు. మరికొంత లోతుగా ఆలోచిస్తే ఆ పదాలను ఆ వరుసలో ఆ విధంగా కూర్చటంలో కవితాశయ్య ఏర్పడింది. పద్యం తీర్చిదిద్దిన కవితా సౌందర్యాభివ్యక్తిగా ప్రత్యక్షమైంది. ఇది ఎఱ్ఱయ నాటికి చతురోక్తి. శ్రీనాథుడి నాటికి సూక్తివైచిత్రి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(2) చతురోక్తి : మధురోక్తి

'కన్నులు వచ్చి.... ' అనే పద్యంలో భావతీవ్రతను భాషావైచిత్రితో చిత్రించగా, 'కొడుకునిందును.....' అనే పద్యంలో అభినయరమ్యతతో ప్రదర్శించాడు. మొదటి పద్యం చతురోక్తిమయం. రెండో పద్యం మధురోక్తిమయం. ప్రేమగౌరవంతో తల్లిదండ్రులు కొడుకును అక్కడా ఇక్కడా వెదకారు. కొడుకు సద్గుణకోటిని కోటి విధాలుగా మక్కువతో కీర్తించారు. అడవిలో ఎక్కడైనా చూచారా? అని కనపడిన మునులందరినీ పదేపదే పేరు పేరునా అడిగారు. ఎక్కడా కొడుకు జాడ తెలియలేదు. చివరకు మనోధైర్యం జారిపోయింది. గుండె పగిలిపోయింది. 'హా కుమారా!' అని ఎలుగెత్తి ఆకాశంవైపు చూచి అరిచారు. నాటకీయంగా సాగిన ఈ వర్ణనలో ద్యుమత్సేన దంపతులు ఉన్మత్తులు కారు. ఉదాత్తులే. ఆర్తితో కొడుకు గుణాలను కోటి విధాలుగా కీర్తించటం, మక్కువతో ఎదురైన వారినల్లా అడిగి తెలిసికొనటం వారి ప్రేమ హృదయాల దుఃఖ భారానికి వాచికాభినయం. వచ్చిన కన్నులలో వత్తులు వేసికొని వెదకటం వారి ఆంగికాభినయం. చివరకు అధైర్యంతో 'హా కుమారా!' అని పిలవటం సాత్త్వికాభినయం. మనసున్న కన్నవారు మమకారం కొద్దీ వేదన వేయి విధాలుగా వ్యక్తం చేసిన అభివ్యక్తి అభినయం కాని, మూలంలో వలె ఉన్మత్త వర్తనం కాదు, ఔచిత్యం చెడని ఉదాత్తవర్తనం. ఎఱ్ఱన దీనిని మధురోక్తి అంటాడు. భోజుడు రసోక్తి అంటాడు. ఛందోమర్మజ్ఞులు దీనిని తరలోక్తి అన్నా అనవచ్చును.

(3) చతురోక్తి : అలంకృతోక్తి : అలంకారధ్వని

ఉక్తి అంటే అందమైన వాక్కనీ, సూక్తి అంటే అలంకృతమైన వాక్కనీ కొందరంటారు. ఒకటి శబ్దానికి చెందిందీ, మరొకటి అర్థానికి సంబంధించిందీ అనేవారున్నారు. చతురోక్తి పథంలో అలంకృతోక్తి ఒక అందమైన అభివ్యక్తి. అయితే ఎఱ్ఱన సూక్తివైచిత్రి అలంకార సంప్రదాయానికి గాని, వక్రోక్తి సంప్రదాయానికి గాని చెందింది కాదు. ధ్వని సంప్రదాయ సంబంధి. ప్రత్యేకించి చెప్పవలసివస్తే అది అలంకార ధ్వని ప్రస్థానం. అందులో నన్నయ వస్తు ధ్వనినీ, తిక్కన రస ధ్వనినీ, ఎఱ్ఱన అలంకార ధ్వనినీ అభిమానించి పోషించి ధ్వనిత్రయ సమగ్రదర్శనాన్ని మహాభారతాని కందించారు. అలంకార ధ్వని అలంకారాన్నీ, వస్తువునూ, పరంపరగా రసాన్నీ కూడా ధ్వనింపజేయవచ్చునని ఆలంకారికులు అభిప్రాయపడ్డారు. ఈ వివరాలు ఆదిసభా పర్వపీఠికలలో వివరించడమైనది.

ఎఱ్ఱన అలంకారధ్వనిని అనంతముఖాలుగా నిర్వహించాడు. ఆరణ్యపర్వంలో ఎన్నో పద్యా లున్నాయి. మచ్చుకు ఒకటి. రామాయణ కథలో రామలక్ష్మణులు పంపాసరోవరాన్ని సమీపించారు. ఎఱ్ఱన వారి కనులముందు ఆ సరోవర రసస్వాదుమూర్తిని ధ్వనిమయంగా ఆవిష్కరించాడు.

సీ. 'కమనీయకమలినీ కహ్లారదళకేస । రాన్విత జలముల నర్ఘ్యవిధియుఁ
దరళతరంగహస్తములఁ బాద్యంబు ను । న్మదచక్ర సారస మధుప హంస
రుతులఁ బ్రియోక్తులు రుచిరవానీరని । వేశనచ్ఛాయల విశ్రమంబు
మందసంచారిత మారుతంబుల నురు । తాపనోదనమును దగిలి యెపుడు

ఆ. నాచరించుచును సమంచితాతిథి జన । సేవనమునఁ దనరు జీవనంబు
ఫలము నొంద నొప్పు పంపాసరోవరం । బెదురఁ గాంచి రన్నరేంద్రసుతులు'. (ఆర. 6.364)

మరొక కవి అయితే ఈ పద్యంలో సమస్త వస్తు విషయసావయవ రూపకాన్నే వాడేవాడు. ఎఱ్ఱన దానిని ఏకదేశ వివర్తిరూపకం చేయటమే ఇక్కడ వైచిత్రి. పంపాసరోవరమునందు అతిథిసేవానురక్త అయిన వనితాస్వభావాన్ని ఆరోపించటం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అలంకారధ్వని. పఠితకు దాని వలన చమత్కారం కలగటమే కాకుండా అట్టి సీతాస్వరూపాన్ని రాముడి భావవీథిలో తోపింపచేసి పూర్వకథార్థ భావనం కలిగించటం వస్తు ధ్వని. సీతాస్మరణంవలన రాముడు శోకమూర్తిగా మారుతాడు. అలంకార వ్యంగ్యోక్తి రసానుభూతి వరకు పరంపరానుభూతిని కలిగించటం అలంకారధ్వని. దీనిని చతురోక్తి అని అంటారు కొందరు; సూక్తి వైచిత్రి అంటారు కొందరు. కవితలోని ఆలంకారికోక్తి వైచిత్రి చర్వణం వలన సజాతీయ భావనిష్ఠమైన సహృదయుడి చిత్తవృత్తి నాయక చిత్తవృత్తితో సహానుభూతిని పొందటానికి సౌముఖ్యం ఏర్పడుతుంది. చతురవాక్కు సాధించే పరమప్రయోజనం కూడా అదే.

శబ్దవైచిత్రి అంటే అక్షరరమ్యత అనీ, సూక్తివైచిత్రి అంటే అర్థగతమైన ప్రౌఢత అనీ డా॥ పాటిబండ మాధవ శర్మగారు అభిప్రాయపడ్డారు. (చూడు: ఆరణ్యపర్వ పీఠిక- సాహిత్య అకాడమి ప్రచురణ) అలంకార సందర్భాలు, రసభావాది వ్యంజకాలు అయిన ఎఱ్ఱన వర్ణనలలో ఆ రెండు లక్షణాలనూ వారు వివేచించారు. ఎఱ్ఱనకు శబ్దాలంకారాల కంటె అర్థాలంకారాల మీదనే ఎక్కువ మక్కువన్నారు. ఎఱ్ఱన ఉపమాలంకార ప్రయోగ ప్రౌఢతను సమీక్షిస్తూ, అర్థశ్రౌతీభేదాలతో ఒప్పారే పూర్ణోపమలలో ఎఱ్ఱన అర్థోపమలను వాడి చమత్కారాన్ని సాధిస్తాడని చెప్పుతూ ఈ క్రింది పద్యాన్ని ఉదాహరించారు.

తే. 'అని తలంచుచు నల్లన యక్కుమారుఁ। జేరఁ బోయిన నాతఁడు సితసరోజ
రేఖ దలకొనఁగా నలరించెఁ గన్ను। లవధరించెను నను లోచనాంచలముల'. (ఆర. 4.254)

నేత్రవికాసం సరోజవికాసంవలె ఉన్నదని చెప్పే ఉక్తివైచిత్రి ఇది. ఇది నేత్రోన్మీలనానుభవ వర్ణనాన్ని చమత్కరిస్తున్నది. దీనివలన ఎఱ్ఱన శబ్దాలంకారాలలో అర్థాలంకారాలలో, అందులోనూ ప్రౌఢోక్తి శిల్పాలలోను ప్రసిద్ధుడని వారు వివేచించారు.

(4) చిత్రకవిత : శబ్దవైచిత్రి

శ్రీనాథయుగంలోనివాడే అయిన జక్కన తన విక్రమార్క చరిత్రలో ఎఱ్ఱయ కవిత్వాన్ని ప్రస్తుతించాడు. ఎఱ్ఱన శబ్దవైచిత్రితో ఆరణ్యపర్వశేషాన్ని రచించాడనీ, శ్రీనృసింహపురాణ రామాయణాదులలో పాండిత్య ప్రకర్షను ప్రదర్శించి చిత్ర కవిత్వ వాగ్విభవజృంభితుడైనాడనీ పేర్కొన్నాడు. జక్కన తాత పెద్దయామాత్యుడు నెల్లూరు తిక్కభూపతి ఆస్థానంలో చతుర్విధ కవితాకోవిదుడై ప్రశంసలందుకొన్నవాడట. తండ్రి అన్నయ 'జనవినుత రసప్రసంగ సంగత కవిరాజుల' ప్రశంసల నందుకొన్నవాడట. కృతిపతి అయిన జన్నయసిద్ధమంత్రి విక్రమార్క చరిత్రాన్ని 'ప్రబంధశయ్యగా' చెప్పుమని అడిగాడు. "స్వాభావిక నవకవితా। ప్రాభవముల నుభయ భాషఁ బ్రౌఢిమఁ జెప్పన్। భూభువనంబున సరిలే। రా భారతి నీవుఁ దక్క నన్నయ జక్కా!" (1.24) అని ప్రశంసించాడు. జక్కన కవితాశయాలలో ప్రతిపద్య వైచిత్రి ప్రధానమని తోస్తున్నది.

క. "ప్రతిపద్యముఁ జోద్యముగాఁ। గృతి జెప్పిన నొప్పుఁగాక కృతి నొక పద్యం
బతిమూఢుఁడైనఁ జిత్రతఁ। బ్రతిపాదింపఁడె ఘుణాక్షర న్యాయమునన్" (1.17)

అని ఆయన పేర్కొన్నాడు. ఈ వివరాలను బట్టి చూస్తే జక్కన కాలంలో చతుర్విధ కవితా సమర్థులైన కవులకు, వారివంశాలలో పుట్టిన కవులకు రాజాస్థానాలలో గౌరవం ఉన్నట్లు స్పష్టమౌతుంది. అయితే ఆశు, మధుర, చిత్ర, విస్తర కవిత్వాలలో కవితా కళ గల మేటి ప్రక్రియగా విస్తరకవితనే భావించేవారు. కాగా, ఆ కాలంలో 'స్వాభావిక నవకవితా ప్రాభవాలు' నవకవులకు ఉపాదేయాలుగా ఉండేవి. అవి 'ప్రబంధశయ్య'లో కవిత్వం చెప్పటం. అందులో చిత్ర కవిత్వ స్వభావం సంఘటించటం అప్పటి నవ్యత్వం. అయితే చతుర్విధ కవితా ప్రస్థానాలలో రెండు శాఖ లున్నట్లున్నాయి. 1. చతుర్విధ కవితా శాఖలలో చిత్ర కవిత్వ మొకటి అని భావించే శాఖ. అందులో ఆశు, మధుర, చిత్ర, విస్తర కవితా ప్రక్రియలు సమంగా పరిగణించబడతాయి. కవితా స్వభావాన్ని బట్టి చేసే వివేచన అది. 2. ఇక రెండవ శాఖ విస్తరకవిత్వ శాఖకే సంబంధించింది. అందులో నాలుగురకాల కవిత్వా లుంటాయి. అవి ఆశు, బంధ, గర్భ, చిత్రకవితలు. నన్నెచోడుడు ఈ శాఖకు చెందినవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎఱ్ఱన ఈ పద్ధతివాడు కాడు. అందులోనూ ఎఱ్ఱన జక్కనల కాలంలో (వారిద్దరూ దాదాపు సమకాలీనులే) కావ్యంలో కథాకథన ధోరణికంటె ప్రతిపద్యం చోద్యంగా చెప్పే ఒక నవ్యధోరణి 'ప్రబంధశయ్య'గా ప్రాచుర్యం పొందుతున్నది. కాబట్టి జక్కన దృష్టిలో కథాకథనంలో ప్రతిపద్య వైచిత్రికి కృషి చేయటం నవీన ప్రబంధ ధోరణి. అదే ఆనాటి చిత్రకవిత్వ వాగ్విభవజృంభణం. దానికి ఆచార్యుడు ప్రబంధ పరమేశ్వరుడని జక్కన కీర్తించాడు. అయితే అందులో ఆరణ్యపర్వశేష రచనలో ప్రతి పద్య శబ్దవైచిత్రి స్పృహ మాత్రమే కనపడుతుందనీ మిగిలిన వాటిల్లో అది విస్తరించిందనీ ఆయన గుర్తించాడు. మొత్తం మీద ఎఱ్ఱయలో జక్కన చూచిన క్రొత్తదనం చిత్రకవిత్వ వాగ్విభవజృంభణం. దాని ఆదిదశ ఆరణ్యపర్వశేషంలో శబ్దవైచిత్రిగా సాక్షాత్కరిస్తుంది.

ఆరణ్యపర్వశేషం మీద పరిశోధన చేసిన డా॥ ఓగేటి అచ్యుతరామ శాస్త్రిగారు ఎఱ్ఱన కవితలో చిత్రకవిత్వం లేదని చెప్పి, ఆతడి అలంకార ప్రయోగవైచిత్రియే చిత్రకవిత్వ వాగ్విభవంగా వ్యాఖ్యానించారు. ఎఱ్ఱన రాజరాజును 'విచిత్రా లంకారోజ్జ్వల కవితాలాప కలాప సంతతానందమతీ! (ఆర. 6.1) అనీ, 'మహాకావ్య రస ప్రయోజనారూఢమతీ!' (ఆర. 7.1) అనీ సంబోధించాడు. ఆ రెండు సంబుద్ధులూ ఎఱ్ఱయ కవితా లక్షణాలకు ప్రతిరూపాలని వారు భావించారు. అంతేకాక, చిత్రముద్రిత పద్య సప్తకాన్ని గుర్తించి వ్యాఖ్యానించారు. వారు ఉదాహరించిన పద్యా లివి-

1. ఉ. 'పెల్లునఁగూలు తజ్జలము... వెండియుం గురియుఁ జిత్రముగాఁగ ననేకకాలముల్' (ఆర. 4.246)
2. వ. 'అత్యంతవిచిత్రంబైన యీ వృత్తాంతంబు నాకు ననుభవగోచరంబైనయది' (ఆర. 4.280)
3. క. 'ఆ దివ్యాస్త్రజ్వలనము... నొనరించెఁ జిత్రముగ నొకమాత్రన్' (ఆర. 4.411)
4. ఉ. 'పాపవినిశ్చయుండు... చిత్రముగ భూమితలంబునఁ ద్రెళ్ళె....' (ఆర. 6.190)
5. ఉ. 'వీరుఁడు చిత్రయోధి దృఢవేధి.....సహదేవుఁడు దేవనిభుండు పెంపునన్' (ఆర. 6.214)
6. మ. 'కృతహస్తుండు.... నొప్పారిరి చిత్రవారిధర పంక్తిచ్ఛన్న శైలాకృతిన్' (ఆర. 7.82)
7. ఉ. 'జైత్రులు గోత్రభూమిధరసారులు.... ఉల్లసచ్చిత్ర ధనుఃకళావిదు లజేయులు.... చిత్తవృత్తులై.' (ఆర.7.118)

వీటిపై డాక్టర్ అచ్యుతరామ శాస్త్రిగారి వ్యాఖ్య గమనార్హం - "ఎఱ్ఱనార్యుడు ఈ చిత్రవిచిత్ర శబ్దములను ముద్రించి రచించిన పద్యములు ఆరణ్యపర్వశేషమున ఈ యేడుమాత్రమే కాన్పించుచున్నవి. వీనిలో మొదటి పద్యమున ప్రలయ ప్రకారము 'చిత్రముగ' తోచిన విధము వర్ణింపబడినది. రెండవ వచనమున సృష్టి ప్రకారము 'విచిత్రంబై' అనుభవగోచరమైన విధము సూచించబడినది. మూడవ పద్యమునందలి చిత్ర శబ్దమువెనుక యోగవిద్యా ప్రభావము గుప్తమొనర్పబడిన విధము గ్రహించబడినది. నాల్గవ పద్యమునందలి చిత్రశబ్దము అదృశ్యశక్తి ప్రభావమును గర్భీకరించుకొన్న విధ మూహింపబడినది. అయిదవ పద్యమందలి చిత్ర శబ్దమునకు, దేవ శబ్దమునకు అంతస్సూత్రత గోచరించు విధ మూహింపబడినది. ఆరవ పద్యము నందలి చిత్రశబ్దము ద్వారా ప్రకృతిగత చిత్రత్వము, దేహధారుల తత్కాలస్థితియందు పోల్చబడిన విధము గుర్తింపబడినది. ఏడవ పద్యమందలి విచిత్రశబ్దము దివ్య ద్వారా ప్రకృతిగత చిత్రత్వము, దేహధారుల తత్కాలస్థితియందు పోల్చబడిన విధము గుర్తింపబడినది. ఏడవ పద్యమందలి విచిత్రశబ్దము శాంబరీ శక్తిని, దివ్య శక్తిని గర్భీకరించుకొన్నవైనము గమనింపబడినది. దీనిని బట్టి యెఱ్ఱన ఈ చిత్ర విచిత్ర శబ్దములను ఏదియో ఒకానొక అద్భుత తత్త్వమును ప్రతిపాదించుటకు ప్రయోగించినట్లు చెప్పవచ్చును. అంతేకాదు - ఒక విషయమును ఇంతకంటె మించి చెప్పుటకు సాధ్యము కాదు అని తోచినప్పుడు ఈ శబ్దములను ప్రయోగించి, ఆపైని మనయూహకే వదలివేయుచున్నాడనియు ననిపించును. అతని యితర ప్రబంధములలో గూడ, ఈ ప్రయోగము లున్నట్లున్నవి. వానిని గూడ గుర్తించి యీతని 'యలౌకిక' చిత్రకవిత్వతత్త్వము 'లోనారయుట' ఆవశ్యకము." (ఎఱ్ఱన ఆరణ్యపర్వశేషము (1989) పు. 124-125)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎఱ్ఱన కవితలోని శబ్దవైచిత్రికి ఒక ఉదాహరణము:

చ. 'పతివిరహంబు దుస్సహము: భర్తృవినాకృత యైన కాంత దూ
షిత యగు సర్వమంగళ విశేషములందును; గాన మత్ప్రియుం
డతులితకీర్తిశాలి, సుగుణాఢ్యుఁడు, సాళ్వసుతుండు లబ్ధజీ
వితుఁడుగ నిమ్ము ధర్మపదవీ పరిరక్షణ! పుణ్యవీక్షణా!' (ఆర.7.249)

సావిత్రి యముడిని భర్తప్రాణాలను కోరే నాల్గవ వరాన్ని కోరుతూ తన కోరికకు తగిన హేతువును నిబంధిస్తూ కార్యకారణబద్ధంగా పలికిన వాక్యాలివి. ఇందులోని కావ్యలింగాలంకారం సావిత్రి ఉక్తులకు వైచిత్రిని కల్పించింది. అది సార్థక శబ్ద సమాస ప్రయోగాల వలన సిద్ధించింది. దీనిలోని సమాస ప్రయోగవైచిత్రిని గురించి డా॥ అచ్యుతరాయ శాస్త్రిగారి వ్యాఖ్య ఇది - "ఇందు రెండవ పాదమున 'కాన', నాల్గవ పాదమున 'ఇమ్ము' అన్న తెలుగు శబ్దములు రెండును విరామచిహ్నములుగ పని చేసి పద్యమంతటిని మూడంశములుగ విరియజేయుట గమనింపగలము. ఈ రెండును దక్క తక్కిన పద్యమంతయు సంస్కృత పదపరీమళభరితమే. ఇచట 'భర్తృవినాకృతయైన' అన్నది ముఖ్యము. భర్తలేకుండా చేయబడినది అని యర్థము. భర్త లేనిది యనుటకు బదులు ఇట్లు చెప్పుట శబ్ద వైచిత్రికి ఉదాహరణము. సత్యవంతుని కిది కాలమృత్యువు కాదు; అకాలమృత్యువు. ఇది జరిగినట్లున్నను ఇప్పటికైనను జరుగనట్లు చేసికొనుటకు వీలున్నది. ఈ సర్వార్థమును సూచించు ప్రయోగ మిది. ఇది మూలమున మూడుసార్లు ప్రయోగింపబడినది:

"న కామయే భర్తృవినాకృతా సుఖం। న కామయే భర్తృవినాకృతా దివమ్,
న కామయే భర్తృవినాకృతా శ్రియం। న భర్తృహీనా వ్యవసామి జీవితుమ్". (సం. 3.281.52)

దీనిని ఎఱ్ఱన ఒక్కమాఱు మాత్రమే ప్రయోగించి తక్కిన భావమునంతయు 'సర్వమంగళ విశేషములందు' అన్న వాక్యమున నిమిడ్చినాడు. మూలమున భర్తృ శబ్దము నాలుగుమారులు ప్రయోగించబడినది. రెండు, మూడు, నాల్గు పాదములందలి భర్తృ శబ్దమును ఎఱ్ఱన తన పద్యమునందలి మూడవపాదములో మూడు విశేషణములుగా అన్యథాకరించినాడు. 'భర్తృ వినాకృతయైన కాంత' - అని ఒక్కమారు ప్రయోగించుటవలన, అది ప్రయోగించిన తీరును బట్టి 'వైచిత్రిని' ని సంతరించుకొన్నది. ఎఱ్ఱనార్యుని యిట్టి ప్రయోగములను చూచియే కావలయును శ్రీనాథుడు శృంగార నైషధమున 'గమికర్మీకృతనైకనీవృతా' వంటి మూల ప్రయోగాలను తెలుగునకు దించుకొనినాడు." (ఎఱ్ఱన అరణ్యపర్వశేషము - పుట 145-146)

క. 'తల్లడపడి యరదము డిగి। విల్లును నమ్ములును విడిచి వెల్లనగుచు మే
నెల్లఁ జెమర్పఁగ నూర్పులు। పెల్లుగ నమ్మనుజపశువు పెలుచం బఱచెన్'. (ఆర. 6.244)

ఈ పద్యంలో 'మనుజపశువు' అనే సమాసాన్ని కల్పించివాడటంలో శబ్దవైచిత్రి ఉంది. పద్యమంతా అచ్చిక తద్భవపదాలే కాని ఈ సమాసం సంస్కృత పద విశిష్టం. ఇందులో రూపకాలంకారాన్ని కవి ప్రౌఢంగా నిబంధించాడు. కందంలోని పూర్వార్ధంలో మనుజ చేష్టలు చెప్పబడ్డాయి. తల్లడిల్లటం, రథం దిగటం, ధనుర్బాణాలను వదలివేయటం, మొగం వెలవెలలాడేటట్లు సిగ్గుపడటం ఇవి మానవచేష్టలు. మేనెల్లచెమర్చటం, ఊర్పులు పెల్లుగా విడవటం - అనేవి పశు లక్షణాలు. వివేక హీనుడైన సైంధవుడు పశుతుల్యుడు. వావివరుసలు లేని పశుప్రవృత్తిని ప్రదర్శించిన సైంధవుడి శీలాన్ని ఒక్కమాటలో ధ్వనింపచేసిన ఎఱ్ఱన శబ్దవైచిత్రి ఇది.

(5) ఎఱ్ఱన వాగ్విలాసం : అతిగాంభీర్య విభూతి

శ్రీనాథయుగంలోనివారైన నందిమల్లయ ఘంట సింగయలు 'కీర్తితంబులయిన శంభుదాసుని వాగ్విలాసాలను నెమ్మనంబున నిలిపా'మని చెప్పారు. (వరాహపురాణము.1.18). దక్షిణాంధ్రయుగంలో ఉన్న గణపవరపు వేంకటకవి శ్రీప్రబంధ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాజ వేంకటేశ్వర విజయవిలాసంలో సూక్తిప్రౌఢికి ప్రబంధ పరమేశుడైన ఎఱ్ఱాప్రెగడను తలుస్తానని పేర్కొన్నాడు. మరెందరో కవులు ఈ బాటలో చెప్పి ఉండవచ్చును. సూక్తివైచిత్రి. ఉక్తివైచిత్రి, వాగ్విలాసం, సూక్తిప్రౌఢి - ఇటువంటి వన్నీ తరతమ భేదాలతో చతురోక్తుల కవితాభివ్యక్తులలోని సంఘటనా వైవిధ్యాన్ని సూచిస్తున్నాయి.

మ. 'అతిగాంభీర్యవిభూతి నేకచుళుకాహంకారనిశ్శేషశో
షితపాథోధిపయస్కుఁడైన ముని దోఁచెం బుణ్యతేజోమయా
కృతి నయ్యామ్యదిగంతవీథిఁ బ్రకటక్రీడాకళాగర్వగ
ర్జిత మండూకకళంకితాంబుశుచితాసిద్ధి ప్రదాచార్యుఁడై.' (అర.4. 145)

అగస్త్య నక్షత్రోదయం వర్షర్తువులోని బురదనీటిని తేర్చి శరదాగమనాన్ని సూచిస్తుంది. ఎఱ్ఱన రచించిన ఈ పద్యం అమూలకం. ఆరణ్యపర్వశేషంలోని గొప్ప పద్యాలలో ఇది ఒకటి. కారణం ఇందులోని ప్రబంధశయ్య, భారతీవృత్తి, మాధురీ గుణం, పాంచాలీ రీతి. వీటన్నింటిని మించి సూక్తిప్రౌఢి, వాగ్విలాసం, ఉక్తివైచిత్రి. ఇన్ని కలిసి పండిన పంట ఈ పద్యం.

తోచింది ఎవరు? అగస్త్యుడనే నక్షత్రం. కాని, నక్షత్రమని చెప్పకుండా పేరుకూడా చెప్పకుండా, నిండుగర్వంతో దోసిలెత్తి సముద్రజలాలనన్నింటినీ త్రాగిన ముని అని సూచించాడు. ఈ పద్యంలో కర్తపేరు గూఢంగా ఉన్నది. వృత్తిమాత్రం వాచ్యమైంది. వృత్తిచేత వక్త పేరు వ్యంగ్యంగా ధ్వనించబడింది. ఒక దీర్ఘ సమాసం చేత, ఒక లోకహిత చర్యావర్ణనం చేత కర్త ఊహించబడుతున్నాడు. ఆ ముని 'అతి గాంభీర్యవిభూతి' కలవాడట. ఈ చెప్పే తీరంతా 'అతి గాంభీర్యవిభూతి'గా పరితకు తోస్తున్నది. నిజానికి వ్యంగ్య గౌరవంతో సాగుతున్న ఈ పద్యంలోని శబ్దాలు అర్థవైచిత్రితో ఎన్నో విశేషాలను ప్రతీయమానం చేస్తున్నాయి. మూలంలో లేని ఈ ముని ఎందుకు వచ్చాడు? ఎఱ్ఱయ ఎందుకు తెచ్చాడు? ఆయనయే ఎఱ్ఱయ ఏమో! అయితే ఆయన సూక్తిప్రౌఢి-లేదా-ఉక్తివైచిత్రి- 'అతి గాంభీర్యవిభూతి'ని ప్రదర్శిస్తుందన్నమాట! అది ఆయన వాగ్విలాసవైఖరి. ఎఱ్ఱన ఆ ముని వలెనే పుణ్యతేజోమయాకృతి. ఆయన ఆచార్యుడైన యుగకర్త. శబ్దాడంబరమనే కప్పలరొద నుండి కవితా జీవనాన్ని తేర్చి ప్రసాదమాధుర్య బంధురం చేయటానికి అవతరించిన ప్రబంధాచార్యుడు ఎఱ్ఱన. ఈ భావన ఆ ప్రబంధశయ్య -సూక్తివైచిత్రి-వలన ఏర్పడిందే. ఆ ఆచార్యుడైన ముని ఎఱ్ఱన గురువు కూడా కావచ్చును. ఆ భావన కూడా ధ్వనిమయమై మరొక మధురానుభవానికి తోడ్పడుతుంది. పద్యంలోని శబ్దార్థాభివ్యక్తి యొక్క వ్యంగ్యశక్తి వలన భారతారణ్యశేష పూరణకర్త భారతాంబరవీథిలో అవతరించిన పుణ్యసంఘటన ప్రసాదమధురంగా స్ఫురిస్తుంది. ఇట్టి అర్థవ్యక్తి నందించే అభివ్యక్తిని ఎఱ్ఱయభాషలో - 'అతిగాంభీర్యవిభూతి' అనవచ్చును.

(6) శరత్కాల వర్ణనం : వస్తు-అలంకార ధ్వనులు

ఆరణ్యపర్వశేషరచన 'స్ఫురదరుణాంశురాగరుచి'తో పొంపిరివోయినట్లు ప్రారంభమౌతుంది. నన్నయ కవిత్వం శరత్కాల పూర్ణిమానిశలో ఆగుతుంది. ఎఱ్ఱయ కవిత్వం ఉదయారుణ కాంతులతో తెల్లవారినట్లు వెలుగులు చిమ్ముతుంది. నన్నయ శరత్కాల వర్ణన ఒక భరతవాక్యంవలె, ఎఱ్ఱయ శరత్కాల వర్ణనం ఎత్తుగడ ఒక నాందీ వాక్యంవలె భాసిస్తాయి. ఆ ఘట్టంలోని ప్రతి వర్ణనాంశం ధ్వనిమయం.

శరత్కాలవర్ణనలో నన్నయ రెండు పద్యాలు వ్రాసి విశ్రాంతి పొందితే, ఎఱ్ఱయ దానిని అయిదు పద్యాలతో ఎందుకు సాగించి ముగించాడు? - అనే ప్రశ్న మొదట ఉత్పన్నమౌతుంది. ఆరణ్యపర్వం ఏడాశ్వాల ప్రబంధం. ఒక్కొక్క ఆశ్వాసానికి ఒక్కొక వైశిష్ట్యం ఉంది. అట్లాగే ఆ ఏడు పద్యాలలో కూడా. ప్రతి పద్యం చోద్యంగా చెప్పిందే. నన్నయ పద్యాలు వస్తు ధ్వనికి శరత్పూర్ణిమ. ఎఱ్ఱయ పద్యాలు అలంకార ధ్వనికి అరుణోదయం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ‘భూసతికిం దివంబునకుఁ బొల్పెసఁగంగ శరత్సమాగమం
బాసకల ప్రమోదకరమై విలసిల్లె మహర్షి మండలో
పాసిత రాజహంసగతిభాతి ప్రసన్న సరస్వతీక మ
బ్జాసన శోభితం బగుచు నబ్జజుయానముతో సమానమై’. (ఆర. 4.140)

ఇది నన్నయ పద్యం. శరత్కాలం వచ్చింది. భూమికీ స్వర్గానికీ సంబంధం కలిపింది. అందరికీ ఆనందాన్ని తెచ్చింది - ఇది ఒక భాగం. ఇందులో పాశుపతాస్త్ర వృత్తాంతం ధ్వని. రాబోయే యుద్ధంలో భీష్మాదులను వధించే ఉపాయాన్ని ఆలోచిస్తున్న ధర్మజుడి వ్యూహంలో అరణ్యవాసం యుద్ధ విజయ సన్నాహమే. అందులో వ్యాసుడి దయవలన ప్రతిస్మృతి విద్య లభించటం, దానిని అర్జునుడికి ధర్మజు డివ్వటం, అతడు దానిచేత పరమేశ్వరుడిని మెప్పించి పాశుపతాస్త్రాన్ని పొందటం, ఆపైన దేవేంద్రుడి ఆహ్వానంపై ఇంద్రలోకానికి వెళ్ళటం, దేవతల దయవలన మహాస్త్రాలను సంపాదించటం, జగదేకవీరుడిగా ప్రశంసలంది ఇంద్ర సింహాసనంలో సగ భాగం మీద ఆసీనుడు కావటం- అనే కథార్థాలు ‘భూసతికిం దివంబునకుఁ బొల్పెసఁగంగ శరత్సమాగమం బాసకల ప్రమోదకరమై విలసిల్లె’ నన్న వాక్యంలో నన్నయ ధ్వనింపజేశాడు.

ఆ శరత్కాలం ఎట్లా సాగిందంటే - బ్రహ్మదేవుడి యానంతో సమానంగా సాగిందట. పద్మజుడు పద్మనాభుడిభక్తుడు, ఆరణ్యపర్వశేషంలో ధర్మజుడు శ్రీకృష్ణుని శరణువేడిన విజ్ఞుడు. బ్రాహ్మణుల మధ్య, ఋషుల మధ్య నివసిస్తూ యజ్ఞతపోవిధుల నాచరిస్తూ మహర్షుల వలన వేదపురాణేతిహాస సకల శాస్త్ర రహస్య విశేషాలను అడిగి తెలిసికొంటూ వింటూ, ద్రౌపది భీమాదులు వాదించినా, ధర్మ విశేషాలనూ, నీతి రహస్యాలనూ వివరిస్తూ ఉచితానుచిత వివేక విశారదుడైన రాజహంస ధర్మజుడే. రాజహంస బ్రహ్మవాహనం. అది మహర్షి మండలోపాసితం, ప్రసన్న సరస్వతీకం, బ్రహ్మ తనపై అధివసించటం చేత ప్రకాశమానం. ఈ లక్షణాలన్నీ ధర్మజుడికి వర్తిస్తాయి. ధర్మజుడు శ్రీకృష్ణాశ్రితుడు, నిరంతరం మహర్షుల సత్సాంగత్యంలో ఉండి ప్రసన్నమైన సరస్వతిని (వాక్కు) కలవాడు. శ్రీకృష్ణుని అండ ఉండటం చేత సర్వార్థాలనూ సాధించగల జీవన ప్రస్థానాన్ని అరణ్యంలో కూడా వివేకంతో ముందుకు సాగిస్తున్నాడు. హంసమీద ఎక్కి ప్రయాణం చేసే బ్రహ్మగమనంగా శరత్కాలగమనం భాసించిందనే ఈ వర్ణనలో ఆరణ్యపర్వంలోని ప్రథమాశ్వాస కథార్థాలు ధ్వనింపబడుతున్నాయి. ‘లోనారసి’ చూచేవారికి ఇది ‘మేలు’ అనిపిస్తుంది. ‘ప్రసన్న సరస్వతి-’ నన్నయ భారతి.

ఉ. ‘శారదరాత్రు లుజ్జ్వల లసత్తర తారకహార పంక్తులం
జారుతరంబు లయ్యె వికసన్నవ కైరవ గంధబంధురో
దార సమీర సౌరభము తాల్చి సుధాంశు వికీర్యమాణక
ర్పూరపరాగ పాండురుచి పూరములం బరిపూరితంబులై.’ (ఆర. 4.141)

ఇది నన్నయ రెండవ పద్యం. ఇందులో వర్ణించబడినవి శారదరాత్రులు. అవి ఉజ్జ్వల లసత్తర తారకహార పంక్తులతో అందంగా భాసించాయి. క్రొత్తగా వికసిస్తున్న కలువపూల సువాసనలను తెచ్చే ఉదారమందపవనాలతో ఆ రాత్రులు పరిమళభరితాలుగా రాణించాయి. కర్పూర కళికల పొడివలె అచ్చమైన తెల్లనికాంతుల చంద్రుడి వెన్నెలలతో నిండిపోయాయి - అని పైపద్య భావం.

ఆరణ్యవాసంలో అర్జునుడు తపస్సుకు వెళ్ళిన తరువాత అతడు మరల తిరిగి వచ్చేంతవరకు ధర్మజుడు చింతా క్రాంతుడై ఉన్నాడు. విజయసూచకమైన శరత్కాలంలో అది రాత్రికాలం. అయితే అందులో చీకటి లేదు, చంద్రకాంతి ఉంది. బృహదశ్వ, నారద, ధౌమ్య, రోమశాది మహర్షులు ధర్మజుడి చిత్తోపశాంతికై ఎన్నో కథలు గాథలు చెప్పారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అందులో బృహదశ్వుడు చెప్పిన నలోపాఖ్యానం కళాపూర్ణోదయం వంటిది. దాని వెన్నెల ప్రకాశం ధర్మజుడి చిత్తం మీద బాగా ప్రభావం చూపింది. ఆ పైన రోమశుడు చెప్పిన అర్జున మహాస్త్ర లాభ వృత్తాంతం ధర్మజుడికి మనోల్లాసాన్ని కలిగించింది. శరత్కాలరాత్రులలో ధర్మజుడి మనస్తాపం తగ్గి విజయాశలు క్రమంగా వెలుగొందటం తారకహారపంక్తుల కాంతితోరణం. విరిసే కలువ పూవులు విరజిమ్మే వాసనలు ఋషులు చెప్పే కథలలోని ప్రసన్నకథాకలితార్థయుక్తులైన కవితా పరిమళాలు. అర్జునుడు ఇంద్రలోకంలో పొందిన గౌరవం పాండుతనయుల సుధాంశు ధవళకీర్తి లోకమంతా నిండిన సుఖాన్ని కలిగించింది. ఈ పద్యంలో ఆరణ్యపర్వ ద్వితీయాశ్వాసంలోని కథార్థాల కాంతులు ధ్వనిమయాలై చారుతరాలౌతున్నాయి.

చ. 'స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి నిరస్తనీరదా
వరణములై దళత్కమలవైభవ జృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతరహంస సారస మధువ్రత నిస్వనముల్ సెలంగఁగాఁ
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళఁ జూడఁగన్'. (ఆర. 4.142)

ఇది ఎఱ్ఱయ మొదటి పద్యం. అరుణాంశురాగరుచి ఎఱ్ఱన కవిత్వారంభ స్ఫోరకమైన ధ్వనిగా పలువురు గుర్తించారు. అదొక విశేషం. ఇక వస్తువుకు సంబంధించి ఈ పద్యం తృతీయాశ్వాస కథార్థాలను ధ్వనింపజేస్తున్నది. అందుకే ఇది ఎఱ్ఱయ ముద్ర గల పద్యం. నన్నయ బాటకు కొనసాగింపు.

అర్జునుడి వార్త తెలియటం చేత ధర్మరాజు మనసులో విజయావకాశాల అరుణాంశురాగ కాంతులు ఆశాకిరణాలవలె అంకురించాయి. భీష్మాదివీరులవలన కలిగే ముప్పుల వలని భయాలమబ్బులు క్రమంగా తొలగిపోయాయి. అర్జునుడి దర్శనమయ్యేదాకా తీర్థయాత్రలు సాగించాడు ధర్మరాజు. తీర్థాలను సేవించాడు. రోమశుడు చెప్పిన తీర్థ మాహాత్మ్యాలను విన్నాడు. ధర్మ కర్మ జ్ఞానోదయం కలిగింది. శారద వాసరముఖంవలె ధర్మరాజు మొగం తేజోవంతమయింది. ఆ తీర్థగాథలో అగస్త్య భగీరథ ఋశ్యశృంగ పరశురామ కార్తవీర్య మాంధాతృ సోమక శిబి సుకన్యాదుల చరిత్రలు 'ఉద్ధురతర హంస సారస మధువ్రత నిస్వనాల' వంటివని ధ్వని. సౌగంధిక పుష్పాపహరణ గాథలోని భీముడి విజృంభణం 'దళత్కమలవైభవ విజృంభణం'లో సూచితం. శబ్దం వలన, అర్థం వలన, వస్తు సూచనం చేసే ఉక్తివైచిత్రి ఇందులో స్పష్టం.

శా. 'దానాంభః పటలంబునం బృథుపయోధారావళిం దాల్చి గ
ర్జా నిర్ఘోషము బృంహితచ్ఛలనఁ బ్రచ్ఛాదించి ప్రావృట్పయో
దానీకంబు శరద్భయంబున నిగూఢాకారతన్ డిగ్గె నాఁ
గా నొప్పారె మదోత్కట ద్విరద సంఘంబుల్ వనాంతంబునన్'. (ఆర. 4.143)

ఎఱ్ఱయగారి ఈ పద్యం సూక్తి ప్రౌఢికి, ప్రబంధశయ్యకు, అలంకార ధ్వనికి పరమోదాహరణం. కొంత మంది విమర్శకులు ఇందులో ధ్వనితమైన కథార్థాలను వివేచించే యత్నం చేశారు. పద్యంలోని ద్విరదాలు పాండవ సూచకాలని, ప్రచ్ఛాదించటం అజ్ఞాతవాస సూచనమని కొందరు భావించారు. ఘోషయాత్రా సూచకమని కొందరన్నారు. నన్నయను మదద్విరదంగా పూర్వకవి స్తుతిలో ఎఱ్ఱయ భావించాడు కాబట్టి, ఆ ద్విరదమే కాలాంతరంలో నిగూఢాకారతతో వనపర్వమధ్యంలో దిగి విహరించిందనీ, దానిని ఎఱ్ఱాప్రెగ్గడగా కొందరు ఊహించారు. ఇన్ని ఊహలకు అవకాశమున్న అలంకార ధ్వన్యాత్మకమైన పద్య మిది! కాగా చతుర్థాశ్వాస వస్తువును ధ్వనింపజేసిన పద్ధతిని వివేచించటం ప్రస్తుతం.

ఈ పద్యంలోని అలంకారం ఉత్ప్రేక్ష. ఉపమానముయొక్క తాదాత్మ్యాన్ని ఉపమేయమునందు సంభావించటం దాని లక్షణం. ఇక్కడ ఉపమేయం మదోత్కట ద్విరద సంఘాలు (మదించి ఏనుగుల గుంపులు). శరత్కాల భయంచేత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వర్షాకాల మేఘాల రహస్యరూపాలతో అడవులలో తిరుగుతున్నాయా అన్నట్లున్నాయి అవి. అట్లా ఊహించటానికి కారణం అవి మేఘాల నీటిధారలవలె మదజల ధారలను కలిగి ఉన్నాయి. మేఘాల గర్జలవలె ఘీంకారాలను చేస్తున్నాయి. చూడగా మేఘాలే తమ రూపాలను కప్పిపుచ్చుకొని గూఢరూపాలతో తిరుగుతున్నాయా అన్నట్లు ఊహించటానికి అనువుగా ఉన్నాయి.

ఈ అలంకారం ఆరణ్యపర్వ చతుర్థాశ్వాసంలోని ప్రధాన కథార్థాలను భావించటానికి అనువుగా ఉన్నది. మేఘాల గుంపుల వంటివారు దేవగణాలు. భీముడు సువర్ణమయ పంచవర్ణసురభికుసుమాలను తెచ్చే సందర్భంలో కుబేరసేన నోడించాడు. ఆ సందర్భంలో సురగరుడ గంధర్వ యక్షరాక్షస సహితుడైన కుబేరుడు భూతలానికి దిగి ధర్మజాదుల నాశీర్వదించి, వారి కిదివరకే ఉన్న ధర్మానిలశక్రాశ్వినుల రక్షలతోపాటు తన రక్షను కూడా అనుగ్రహించాడు. ఆ తరువాత ఇంద్రుడు సమస్త దేవగణాలతో ధర్మజుడికి దర్శనమిచ్చి పార్థుడి జగదేకవీర పరాక్రమాన్ని ప్రశంసించి, అతడివలన యుద్ధంలో విజయం, తరువాత రాజ్యప్రాప్తి కలుగుతుందని సూచించాడు. ఆరణ్యపర్వంలో ఇదొక అద్భుత సన్నివేశం. స్వర్గంలోని దేవతలు భూమిపైకి దిగుతారు. భూమిమీది అర్జునుడు దేవలోకంలో విహరించి విజయయాత్రలు చేస్తాడు. దేవతలు వార్షుక మేఘాలవలె పార్థుడిపై అస్త్ర శస్త్రాలనే వరాలను వర్షిస్తారు. దేవతలు గెల్వలేని రాక్షసులను నరుడు జయిస్తాడు. దివంలో నివసించే దేవతలు భువిమీద పాండవుల సహాయం కోరుతారు. వారిని దైవాంశసంభూతులుగా కీర్తిస్తారు. శ్రీకృష్ణార్జునులు నరనారాయణావతారులు. ధర్మజాదులు ధర్మానిల శక్రాశ్వినుల అంశావతారాలు. నిజానికి వీరందరూ దేవలోకంలో ఉండదగినవారే. కాని, భావి మహాభారత యుద్ధంలో రాక్షసాంశ సంభూతులను వధించి ధర్మస్థాపన చేయటానికై భూతలం మీద అవతరించారనీ, దైవలక్షణాలను దాచుకొని మానవ వీరులుగా అడవులలో సంచరిస్తున్నారనే భావం ఆరణ్యపర్వ చతుర్థాశ్వాసం కలిగిస్తుంది. పాండవులు ప్రచ్ఛన్న రూపాలతో తిరుగుతున్న దేవతలే అనే అంశాన్ని అందంగా ధ్వనింపజేసి చెప్పిన ఆలంకారిక అభివ్యక్తి ఈ పద్యం.

క. 'కలనీలకంఠకోలా। హలలీలలు సెలఁగె, రాజహంసకులంబుల్
విలసించె, సప్తపర్ణా। వలి విగళిత కుసుమ కుటజవాటిక లడఁరెన్'. (ఆర.4.144)

ఈ పద్యంలోని 'నీలకంఠ కోలాహల లీలలు' అనే సమాసంలోని అర్థవైచిత్రిచేత రౌద్రాంశ సంభూతుడైన కుమారస్వామి పరాక్రమ లీలావిశేషాలు, మహిషాసుర సంహారం మొదలైన కథలు సూచించబడ్డాయి. 'రాజహంస కులంబు' లనే సమాసంలోని అర్థ వైచిత్రి వలన మార్కండేయ మహర్షి, ధర్మవ్యాధుడు, ధర్మరాజు ధ్వనించబడుతున్నారు. పురాణ వివేకజ్ఞుడు మార్కండేయ మహర్షి, ధర్మసూక్ష్మతత్త్వజ్ఞుడు ధర్మవ్యాధుడు, చిత్రసేనుడి చెర నుండి దుర్యోధనుడిని సబాంధవంగా విడిపించి శరణాగత ధర్మవివేకాన్ని ప్రదర్శించినవాడు ధర్మజుడు. వీరందరు స్వభావం చేత రాజహంసలే. వీరందరికథలూ పంచమాశ్వాసంలో విలసిల్లాయి. ఏడాశ్వాసాల ఆరణ్యపర్వంలో నేర్వదగిన ధర్మసారమంతా ఈ ఆశ్వాసంలోనే ఉన్నది. పంచమాశ్వాసం ఆరణ్యపర్వ ధర్మనికుంజం. పై పద్యంలో చెప్పబడిన సప్తవర్ణి ఆరణ్యపర్వమే. దాని నుండి రాలిన పూలు అందులోని ధర్మవిశేషాలే. ఈ వస్త్వలంకార ధ్వనులను అక్షరరమ్యంగా చెప్పింది ఈ కందం.

మ. 'అతిగాంభీర్యవిభూతి.... శుచితాసిద్ధి ప్రదాచార్యుఁడై' - (ఆర. 4.145)

ఈ పద్యంలో కానవచ్చే ధ్వనిని గురించి ముందే కొంత చర్చించాం. ఇప్పు డిది ఆరణ్యపర్వ షష్ఠాశ్వాస వస్తు తత్త్వాన్ని ధ్వనింపచేసే విధాన్ని సమీక్షిద్దాం. ఈ పద్యంలో తోచేది పుణ్యతేజోమయాకృతుడైన ముని. ఆరవ ఆశ్వాసంలో ఆమూలాగ్రం తోచేది మహాప్రళయాలను దర్శించిన మహాపుణ్యాత్ముడు మార్కండేయ మహాముని. ఆయన చేసిన పని ఏమిటి? ప్రకట, క్రీడా, కళా, గర్వ, గర్జిత, మండూక, కళంకిత, అంబువులకు నిర్మలత్వాన్ని కలిగించాడు. ఈ శబ్దాల కూర్పువలన ఏర్పడే అర్థవైచిత్రి ఇక్కడ వ్యంగ్యం. ఈ ఆశ్వాసంలో బురదనీరువలె కలతబారింది ధర్మజుడి మనస్సు. ఈ ఆశ్వాసంలో క్రీడాకళాగర్వ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గర్జితులు కర్ణ దుర్యోధన సైంధవులు. దుర్యోధనుడి మెప్పుకొరకు అర్జునుడిని ఆహవంలో హతమొనరించేంతవరకు కాళ్ళకు గోళ్ళు తీసికొననని కర్ణుడు ప్రతిజ్ఞ చేసి ధర్మజుడికి రాత్రిళ్ళు నిద్రలేకుండా చేశాడు. వైష్ణవ యజ్ఞాన్ని చేసి తృప్తిపడక పాండవులను వధించి రాజసూయం చేయాలని దుర్యోధనుడు సంకల్పించాడు. వావివరుసలు కూడా చూడక ద్రౌపదిని పరాభవించటానికి ప్రయత్నించిన మానవపశువు సైంధవుడు పాండవులకు మానని మనోవేదన కలిగించాడు. ద్రౌపది పడిన పాట్లను తలచుకొని భర్తలు బడబాగ్నులవలె మండిపోతున్నారు. కర్ణ దుర్యోధన సైంధవులు పలికిన ప్రగల్భాలు వాననీటిలోని కప్పల బెకబెకలు, ఈ ఆశ్వాసమంతా ఆ నిష్ఫల ప్రగల్భాలతో మారుమ్రోగిపోయింది. పాండవులు కార్యశూరులై కష్టాల నెదుర్కొన్నా, మనసులోని కలతమాత్రం బురదనీరువలె కల్మషాన్ని కలిగించింది. దానిని తన దివ్య కథామృతశక్తితో తేర్చి ధర్మజాదుల మనసులను ప్రసన్నం చేస్తున్న కథ షష్ఠాశ్వాసం. అగస్త్యనక్షత్రోదయ ప్రశంస వస్తుధ్వనికి విలువైన ఉదాహరణం.

ఈ పద్యంలో కూడా ఉత్ప్రేక్షాలంకారం ఉన్నది. ఉపమేయం 'నిర్మలకమలాకరములు'. ఇవి రెల్లుగడ్డి పొదలతో చుట్టబడి ఉన్నాయి. ఊహించే వారికి అవి శరత్కాల మేఘాలతో చుట్టబడి అందంగా ఉండే అవకాశానికి ప్రతిబింబాలో అన్నట్లు ఉన్నాయట! సప్తమాశ్వాసాన్ని గురించిన చక్కని ముగింపు ఈ అలంకార ధ్వని. ఇందులో వర్ణ్య వస్తువు నిర్మలజల సరోవరాలు. ఆరణ్యపర్వం చివరి ఘట్టంలో నాలుగుసార్లు సరోవరాల ప్రసక్తి వచ్చింది. రామాయణ కథలో పంపాసరోవరం, సావిత్రి కథలో ఆమె భర్తతో కలిసి చూచిన సరోవరాలు, కర్ణుడి కథలో ఆతడు సూర్యుడికి అర్ఘ్యమిచ్చి దానాలు చేసే సరోవరం, యక్షప్రశ్నల ఘట్టంలో ధర్మజుడు తమ్ములను బ్రతికించుకొన్న భవ్యసరోవరం, ఇవి భౌతిక సరోవరాలు. నిర్మల సరోవరాలు రసానుభూతి పొందే సహృదయుల చిత్తాలను ధ్వనింపజేస్తున్నాయి. గగనం బ్రహ్మానందం. అతి ప్రతిబింబించిన సరోవరం బ్రహ్మానంద సహోదరమైన రసానుభవం. రామాయణంలోని సరోవరం యుద్ధ వీరం, సావిత్ర్యుపాఖ్యానంలోని సరోవరం తపోవీరం, కర్ణుని కథలోనిది దానవీరం, యక్షసరోవరం ధర్మవీరం. చతుర్విధ వీర రసానంద సూచకం నిర్మల కమలాకర ప్రశంస. రామాదుల వృత్తాంతాలు శరత్కాలమేఘాలు. ధర్మరాజు పొందిన చిత్తశాంతి రెల్లుపొదలు. శరత్కాలం ధర్మజుని ధర్మవీర రసవ్యంజకం. ఈ విధంగా ముగింపులో రస విషయాన్ని ధ్వనింపజేసి ఎఱ్ఱన అలంకార వస్తు రసధ్వనుల నిర్వహణంలో ప్రబంధపరమేశ్వరు డనిపించుకొన్నాడు.

ఉక్తివైచిత్రి అంటే - సంభాషణలో మాటల నేర్పరితనం అని ఒక అర్థం చెప్పవచ్చును. వాటిని ఎన్నో రకాలుగా ప్రకటించవచ్చును. మచ్చుకు రెండు మూడు విశేషాలు.

ఒక భావ వ్యక్తీకరణలో పాత్ర యొక్క భావావస్థ ప్రకటితమయ్యేటట్లు మూడు పద్యాలను వరుసగా చెప్పే ఒక ఉక్తివైచిత్రిని ఎఱ్ఱన కొన్ని చోట్ల పాటించాడు. ఉదా:

(1) లోకంలో ఇహలోక సుఖాలను పొందేవారినీ, పరలోక సుఖాలను పొందేవారినీ, ఉభయలోక సుఖాలను పొందేవారినీ చెప్పటానికి మూడు వృత్తాలు ఎత్తుకొని ముచ్చటగా విడమరచి వరుసగా చెప్పటం - (4.175, 176, 177)

(2) మహాప్రళయకాలంలో ఏకార్ణవం ఏర్పడటం - (4,245, 246, 247)

(3) ఉదంకుడి విష్ణు స్తుతి - (4,375,376,377)

(4) పాంచాలి సత్యభామతో తన పతిసేవా పద్ధతి చెప్పటం- (5,296,297,298)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(5) అసురవరులు దుర్యోధనుడి జన్మ కారణం చెప్పటం- (6,43,44,45)

(6) సైంధవుడు ద్రౌపదిపై అంకురించిన మోహాన్ని వ్యక్తీకరించటం- (6,147,148,149)

(1) ధర్మవిశేషాలు తెలిపేటప్పుడు ఎఱ్ఱన నన్నయ మార్గంలో ప్రసాదగుణాన్ని పోషించాడు. అయితే అందుట్లో శబ్దార్థ గుణలక్షణాలను రెండింటినీ కలిపి నిర్వహించాడు. మార్కండేయ ప్రోక్తంగా ఇహ, పర, ఉభయలోకాలు పొందేవారి వర్ణనం చేసే మూడు పద్యాలు శబ్దార్థగుణాలైన ప్రసాదలక్షణాలు కలవి. వాటికితోడు అర్థవ్యక్తిని పోషకంగా నిలిపాడు. విడమరచి చెప్పే పద్ధతిలో ప్రసాదగుణాన్ని నిపుణంగా వాడతాడు ఎఱ్ఱన. ఆ పద్యత్రయంలో మొదటిది రుచిరార్థ సూక్తి కూడా.

చ. 'ధనములు సాల గల్గి సతతంబును నింద్రియవాంఛ సల్పుచున్
మనమున నెన్నఁడున్ సుకృతమార్గము పొంతకుఁ బోక లోభమో
హనిహతబుద్ధులై తిరుగునట్టి జనుల్ పరలోక సౌఖ్యముల్
గనుటకు నేర; రిప్పటి సుఖంబులు మేలయి తోఁచు వారికిన్.' (అర.4.175)

(2) మహాప్రళయ కాలంలోని ఏకార్ణవ వర్ణనంలోని వస్తు స్వభావాన్ని బట్టి ఎఱ్ఱన ప్రసాదంలో ఓజస్సును మిశ్రమం చేశాడు. దీన్ని పూర్వమే కొంత పరిశీలించాం.

(3) విష్ణుస్తుతి భక్తిభావ ప్రపూర్ణం కాబట్టి మాధుర్యగుణంలో రచన చేశాడు ఎఱ్ఱన. శబ్దగుణమైన మాధుర్యానికి పృథక్పదత్వం, అర్థగుణ ప్రధానమైన మాధుర్యానికి ఉక్తివైచిత్ర్యం లక్షణాలు. భక్తిపోషకంగా మొదటి పద్యంలో నామకీర్తనం, రెండవ పద్యంలో భావ మాధుర్యం పోషించి మూడవ పద్యంతో ఉభయాత్మక పద్ధతిని పాటించి పదవైచిత్రిని ప్రదర్శించాడు. మొదటి రెండు పద్యాలూ నన్నయ బాణీవే. మూడవది ఎఱ్ఱయ శబ్దవైచిత్రి. మూడింట రెండు మత్తకోకిలలు కావటంతో మాధుర్యాన్ని సౌకుమార్యంతో మహనీయం చేయటం జరిగింది. ఇది ఛందౌచిత్యం. ఛందోవైచిత్రి కాదు.

మత్తకోకిలము

'విక్రమత్రయలీల నోలిన విష్టప త్రితయంబుఁ బె
ల్లాక్రమించితి క్రూరులైన సురారివీరులఁ బ్రస్ఫుర
చ్చక్ర విక్రమకేళిఁ ద్రుంచితి సర్వయజ్ఞఫలావహ
ప్రక్రియాత్ముఁడ వీవు నిశ్చలభావభవ్య జనార్దనా!' (4.377)

ఇది నన్నయశైలి కంటె భిన్నమైనది. ప్రబంధశయ్యకు దగ్గరైనది.

(4) సత్యభామ పలుకులు స్వభావం చేత మధురాలు, చెప్పటంలో ప్రసాద మధురాలు. నాటకీయంగా పాత్రోచితాలు. ఇందులో వాక్యవైచిత్రి విశేష లక్షణం. ఆమె పలికిన మొదటి పద్యం తెలుగునాట బాగా ప్రచారం చెందింది కూడా!

చ. 'అలయక మంత్రతంత్ర వివిధౌషధ భంగులఁ జేసి యెంతయున్
వలతురు నాథు లంట మగువా! కడు బేలతనంబు; దాన మున్
గలిగిన ప్రేమయుం బొలియుఁ గాని యొకండును సిద్ధిఁ బొంద; ద
ప్పాలఁతుకతోడి మన్కి యహిపొత్తుగఁ జూచు విభుం డెఱింగినన్'. (5.296)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వాక్యాలలో వ్యావహారికత కనపడుతుంది. అంటే - లోకంలో మాట్లాడేటప్పుడు సామాన్యంగా వాక్యవిన్యాసాలలో ఏయే పదక్రమాలను పాటిస్తామో వాటిని పద్యంలో రూపొందించటం. సత్యభామ నోట ఆ లక్షణం తేటగా ప్రసరించింది. అది ఎఱ్ఱయ సూక్తివైచిత్రి.

(5) సత్యభామ మాటలను ప్రసాదమాధుర్యంలో పలికించి, అసురవరుల పలుకులను మాధుర్యౌదార్య మిశ్రమంగా సాగించటం ఎఱ్ఱన నన్నయ దగ్గర నేర్చిన శిల్పం. కాని, దానికి ఎఱ్ఱన శబ్దవైచిత్రిని జోడించి ప్రబంధశయ్యను కల్పిస్తాడు. మూడూ ఉత్పలమాలలు కావటం సమతాగుణ పోషకం. సమత మాధుర్య పోషకం.

ఉ. 'ఏము తపంబు సేసి పరమేశ్వరు నీశ్వరుఁ బార్వతీమనః
కాముకుఁ గామవైరి నవికారుఁ బురాంతకుఁ బ్రీతుఁ జేసినం
గామితదాయి యైన శితికంఠుఁడు నిన్ను సృజించి యిచ్చె ను
ద్దామదయావిధేయుఁడు ముదంబున మాకు నధీశ్వరుండుగన్'. (6.43)

ఈ పద్యం రాక్షసులు రాజసంతో పలికింది. కాని, భక్తితో విశ్వాసంతో చెప్పింది. వినేవాడు నమ్మేటట్లు చెప్పాలని పరమేశ్వరుడిని అనేక నామాలతో పేర్కొన్నారు. అందులో ఆడంబరం ఉంది. ఆతురత ఉంది. కావలసిన దానికంటె ఎక్కువ చెప్పటం ఉంది. కాబట్టి వికటత్వం భాసిస్తుంది. దాన్ని ఉదారత అనే గుణంగా చెప్పాలి. పరమేశ్వరుడు పరమదయాళువు అనే భావాన్ని 'ఉద్దామదయావిధేయుఁడు' అని చెప్పి, ఆసుర స్వభావముద్రితమైన వికటత్వాన్ని ప్రదర్శిస్తారు. అందుకే ఇక్కడ గుణం మాధుర్యౌదార్యాల మధుర మిశ్రమం.

(6) విరాటపర్వంలోని కీచకుడివంటివాడు ఆరణ్యపర్వంలోని సైంధవుడు. ద్రౌపదిని మోహించి, కామించి రత్యావేశంతో శృంగారోక్తులు పలికిన ధీరోద్ధతుడు. తెలుగు భారతంలో ముందు కీచకుడు పుట్టి తరువాత సైంధవుడు పుట్టినట్లుంటుంది. తిక్కన తీర్చిదిద్దిన కీచకుడి నీడలు సైంధవుడి మీద పడక తప్పదు. కాని, ఈ పాత్రను పోషించినవాడు ప్రబంధపరమేశ్వరుడు - ఉత్పలమాలాత్రయంలో ఉజ్జ్వలంగా పలికించాడు. ద్రౌపదిని ఆశ్రమంద్వారం వద్ద చూచి ఆమె అందానికి విలాసానికి ఆశ్చర్యపోయి, మన్మథాయత్తమైన చిత్తంతో సఖుడైన కోటికాస్యుడితో ఈ విధంగా అన్నాడు సైంధవుడు.

ఉ. 'ఇన్నలినాక్షి యెవ్వతియొ? యివ్విపినంబున నేకతంబ యి
ట్లున్న నిమిత్త మేమియొ? సురోత్తమ కన్యయొ? యక్షకాంతయో?
పన్నగ భామయో? మనుజభామిని గామి నిజంబ; యిట్టి చె
ల్వున్నదియే మహీతలము నుగ్మలు లెవ్వరియందు నారయన్.'

ఉ. 'లీల యెలర్పఁగా నబల లేఁజిగురాకును బోలె నొప్పు కెం
గేలు కదంబశాఖతుదిఁ గీల్కొనఁ జేసి వసంత విభ్రమో
న్మీలితబాలవల్లిక్రియ మేలగు చూడ్కుల మించి పావక
జ్వాలయపోలెఁ జిత్తము నిజం బెరియింపఁ దొడంగెఁ జూచితే?'

ఉ. 'ఈ కమలాక్షి నాకు హృదయేశ్వరి యైనఁ ద్రిలోకరాజ్యముం
జేకుఱ నేలినట్లు విలసిల్లనె? దర్పకవీరు బంటుఁగాఁ
గైకొని సర్వభోగములుఁ గాంతు; నొడంబడఁ బల్కి దీనికిన్
నాకును బొందొనర్చి కరుణం జరితార్థునిఁ జేయవే ననున్'. (అర. 6.147 - 149)

మూలంలో కంటె ఈ మాటలు ముగ్ధమోహనంగా ఉన్నాయి. మూలంలో రతిభావ వ్యక్తీకరణమే ఉన్నది. ఎఱ్ఱయ దానిని శిల్పీకరించాడు. మూలంకంటె ముచ్చటైన సన్నివేశచారుత్వాన్ని, ఉక్తివైచిత్ర్యాన్ని జోడించాడు. పునస్సృష్టి చేశాడు. మూలంలోని మాట లివి-

శ్లో. "కస్య త్వేషానవద్యాఙ్గీ యది వాసి న మానుషీ ॥
వివాహార్థో న మే కశ్చి దిమాం దృష్ట్వాతిసుందరీమ్
ఏతా మేవాహ మాదాయ గమిష్యామి స్వమాలయమ్ ॥
గచ్ఛ జానీహి సౌమ్యైనాం కస్య కాచ కుతోఽ పి వా
కిమర్థ మాగతా సుభ్రూ రిదం కంటకితం వనమ్ ॥
అపి నామ వరారోహా మా మేషా లోకసున్దరీ
భజే దద్యాయతాపాఙ్గీ సుదతీ తనుమధ్యమా ॥
అప్యహం కృతకామః స్యా మిమాం ప్రాప్య వరస్త్రియమ్
గచ్ఛ జానీహి కో న్వస్యా న్వథ ఇత్యేవ కోటిక ॥ (సం. 3.248. 12-16)

మరొక వివాహానికి తరలిపోతున్న దక్షిణ నాయకుడు సైంధవుడు. ద్రౌపదిని చూచి ఎవరి భార్యయో, మనుష్యస్త్రీ అగునో కాదో, ఆమె ఒంటరిగా ఆ కీకారణ్యానికి ఎందుకు వచ్చిందో తెలిసికొని రమ్మంటాడు కోటికాస్యుడిని. ఆమె వివాహానికి అంగీకరిస్తే మరెవరినీ వివాహమాడకుండా ఆమెను చేపట్టి ఇంటికి తిరిగిపోతానంటాడు. మూలంలోని సైంధవుడు రసికుడూ కాడు. మాట నేర్పరీ కాడు. వట్టి మదించిన కాముకుడు. వెనుక ముందు ఆలోచించలేని ఆవేశపరుడు. ఎఱ్ఱయ అతడిని సంస్కరించాడు. అందాన్ని చూచి ఆశ్చర్యపడి, ఆర్ద్రతను ప్రకటించే భావుకతను, కాల్పనిక చిత్తవృత్తిని అతడిలో నారుపోశాడు. పై వాటిలోని మొదటి పద్యంలో అతడు వ్యక్తం చేసిన భావాలు మూలంలో అతడివి కావు. అతడి వెంట వస్తున్న వీరులవి. మెరుపుతో మెరుస్తున్న మేఘంవలె వనానికే వెలుగుతెస్తున్న ద్రౌపదిని చూచి వారంతా ఆమె అప్సరసో, దేవకన్యో, లేక దేవతలు కల్పించిన మాయో! అని ఆశ్చర్యపోయారు. ప్రథమ వీక్షణంలో కలిగే ఆ అద్భుతం మూలంలో ఇతరులకు దక్కింది. వితర్కం మాత్రం సైంధవుడికి మిగిలింది. ద్రౌపదిని చూచి మనుజభామో కాదో అని అనుమానం వచ్చినా, దాన్ని నిశ్చయించుకొనే తెలివి అతడికి ఉన్నట్లు లేదు. ఆమెనే అడిగి తెలిసికొనాలనుకొంటాడు. ఎఱ్ఱన అతడికి ఈ రెండు దుస్థితుల నుండి తప్పించి మొదటి పద్యాన్ని నిర్మించాడు. రతి భావాంకురం క్రమదశాభివృద్ధి చెందటం ఆ పద్యంలోని శిల్పం.

చూడగానే ఆమె కన్నులు అతడిని ఆకర్షించాయి. అందుకే 'ఇన్నలినాక్షి' అని అన్నాడు. త్రికసంధిని ఆశ్చర్య వ్యంజకంగా వాడటం ఉక్తివైచిత్రి. ఇన్నలినాక్షి, ఎవ్వతియొ, ఇవ్విపినంబున- అని ముమ్మారు వరుసగా ప్రయోగించి ప్రథమ వీక్షణంలో కలిగిన రాగగాఢతను ఎఱ్ఱన రచనలో వ్యక్తం చేశాడు. ఎవ్వతియొ అని అనటం ఆమె రూపవైభవానికి కలిగిన అబ్బురపాటు వలన. అడవిలో ఏకాంతంగా ఉండటానికి ఏదో కారణ ముంటుందనే ఆసక్తి, తన కొరకే నేమో అన్న మోహం కలగటం సహజం. ఎవరు? అన్న ప్రశ్నకు తన వివేకాన్ని ఉపయోగించి ఉల్లేఖంగా ఊహించటం భావుకుడైన రసికుడి లక్షణం. ఆమె మనుజవనిత కావటానికి వీల్లేదు. అది నిజం అని నిశ్చయించటం - అద్భుతం నుండి రాగోదయమైన చిహ్నం. భూతలంమీద ఇంత అందగత్తె లేదని ప్రశంసించటం రాగం పల్లవించిన దానికి గుర్తు. ఎఱ్ఱయ యతి కోసం వాడాడనుకొన్నా 'ఉగ్మలి' శబ్దాన్ని ప్రయోగించి అపూర్వతను ప్రదర్శించే ఉక్తివైచిత్రి ప్రదర్శించాడు. పద్యంలోని మాటలు, వాక్యాలు పాత్ర మనసును క్రమంగా ఆవిష్కరించాయి. ఎఱ్ఱయ భావ క్రమోన్మీలన చిత్ర కళాకోవిదుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రెండవ పద్యం ఎఱ్ఱన అపూర్వ సృష్టి. ద్రౌపది కొక రమణీయ భంగిమ నేర్పి ఛాయాచిత్రం తీసి చూపించాడు ఎఱ్ఱన. స్థిరచిత్రం నన్నయ శిల్పం. చలచిత్రం తిక్కన శిల్పం. ఇందులో నన్నయ బాట కనపడుతుంది. ఆశ్రమ ప్రాంగణంలో విరగబూచిన కడిమి చెట్టు, చెట్టుకొమ్మల చివర చిగురాకులున్నాయి. ద్రౌపది చిగురాకుల వంటి వేళ్ళున్న తన చేతిని ఒక కొమ్మ చివర చేర్చింది. ఆ చెట్టుకే మారుచిగురాకు తొడిగినట్లుంది. అదొక ఆశ్చర్యం. అందం కూడా. ఆమె అట్లా నిలబడితే చెట్టుకు తీగ అల్లుకొన్నట్లున్నది. వసంతకాల ప్రభావ విజృంభణం వలన బాగా పూలు వికసించిన లేత తీవెగా ఉన్నది. ఆమె కన్నులు పద్మాలని వేరే చెప్పనవసరం లేదు. ఆమె చూపులు ఇంపుగొలుపుతున్నాయి. ఆమె శరీర భంగిమలో ఒక లీల కొట్టవచ్చినట్లు కనపడుతున్నది. లీల శృంగార విలాస చేష్ట, సామాన్యంగా ఆ భంగిమలో నిలువబడిన శృంగారనాయిక ప్రియ సమాగమాకాంక్షతో విరహాన్ని వ్యక్తం చేస్తూ తన్మయత్వాన్ని ప్రదర్శిస్తూ ఉంటుంది. ఆ విషయం తెలిసిన రసికుడు, నాట్య శాస్త్రకోవిదుడు సైంధవుడు. ఎఱ్ఱని కడిమి చెట్టు, దానినిండా ఎఱ్ఱని పూలు, ఆమె అనురాగమూర్తి, ఆమె కన్నులు ఎఱ్ఱని పద్మాలు, ఆమె చేతులు ఎఱ్ఱని చిగురాకులు, ఆమె భంగిమ రాగభావాభివ్యక్తి- ఆ దృశ్యాన్ని చూచిన సైంధవుడి హృదయం రాగజ్వాలగా మారింది. బయటి దృశ్యమే లోని భావదృశ్యమై ప్రజ్వలించింది. మొదటి పద్యం రాగోదయాన్ని, రెండవ పద్యం రాగ విజృంభణాన్నీ తెలుపుతున్నాయి. 'వసంత విభ్రమోన్మీలిత బాలవల్లి క్రియ' అన్న ఉపమాలంకారంలో వాడిన విభ్రమ, ఉన్మీలిత శబ్దాలు రసభావ వ్యంజకాలై ఉక్తివైచిత్రిని వెలారుస్తున్నాయి.

మూడవ పద్యం రాగహృదయం కలలుకంటున్న దృశ్యం చిత్రించిన ఊహాచిత్రం. 'ఇన్నలినాక్షి' 'ఈ కమలాక్షి' అయింది. ఆశ్చర్యం నుండి ఆవిర్భవించిన ఊహాప్రవృత్తి దీర్ఘాక్షరంలో ధ్వనించబడింది. ఆమె కమలాలవంటి కన్నులు ఇంకా అతడిని తాడిస్తూనే ఉన్నాయి. ఆమె హృదయేశ్వరి అయితే త్రిలోక సామ్రాజ్యం లభించినట్లు పొంగిపోతాడట! మన్మథుడిని బంటుగా జేసికొని అన్ని భోగాలనూ పొందుతాడట! ఈ మాటలు ఉత్తమ సంస్కారి అయిన రసికవల్లభు డనే రమణీయోక్తులు. ఎఱ్ఱన సైంధవుడు తిక్కన కీచకుడి తమ్ముడు. అయితే అతడి మాటలు, చూపులు, ఊహలు నన్నయ బాటలో సాగిన ఎఱ్ఱయ ప్రబంధశయ్యలు. నన్నయే ఈ ఘట్టం రచిస్తే మొదటి రెండు పద్యాలు వ్రాసి ఊరుకుండేవాడేమో! ఎఱ్ఱయ మూడో అడుగు ముందుకు వేసి ప్రబంధ పరమేశ్వరుడయ్యాడు.

పరిశీలిస్తే ప్రబంధ పరమేశ్వరుడి రచనలో ఇటువంటి సంభాషణా సూక్తివైచిత్రులు కుప్పలు తెప్పలు.

ఉ. "నన్నయభట్టుఁ గావ్యరచనా నిధిఁ, దిక్కన సోమయాజి న
చ్ఛిన్న మహత్త్వ సంవిహితశేముషి, నెఱ్ఱయప్రెగ్గడన్ సము
త్పన్న నవ ప్రబంధరస భావన నింపునఁ బ్రార్థనాంజలుల్
మున్నుగ నాత్మలోఁ దలఁతు ముప్వురఁ; ముప్వురఁ బోలు పుణ్యులన్."

ఈ పద్యం నిశ్శంక కొమ్మయ కవి రచించిన వీరమాహేశ్వరంలోనిదని కీ.శే.వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ప్రబంధ రత్నాకరంలో ఉదాహరించారు. అతడి కాలం ఏదైనా కవిత్రయాన్ని వారి వారి ప్రత్యేక కవితా వ్యక్తిత్వాలతో స్మరించి కవితాసిద్ధిని పొందాలని భక్తితో భావించే ఒక అవిచ్ఛిన్న సంప్రదాయానికి ఈ పద్యం మరొక ఉదాహరణం. ఈ విధంగా ఎన్నో పద్యాలను పేర్కొనవచ్చును. అది ఒక ప్రత్యేక ప్రయత్నమే ఔతుంది.

నిశ్శంక కొమ్మయ నన్నయలో కావ్యరచనా నిధిని, తిక్కనలో నిరంతరమైన మహాకవిత్వ దీక్షతో కూడిన ప్రజ్ఞాప్రాభవాన్నీ, ఎఱ్ఱనలో ఎప్పుడూ క్రొత్తక్రొత్తగా ప్రబంధరచనలో, రసభావనలో ప్రయోగాలు చేసే ఆసక్తినీ దర్శించాడు. ఆధునికులలో కవి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు; "ఋషివంటి నన్నయ రెండవవాల్మీకి, తిక్కన్న శిల్పపుఁదెనుఁగుతోఁట; ఎఱ్ఱన్న సర్వమార్గేచ్ఛావిధాతృండు" అని ప్రశంసించారు. పురాణమార్గం, ఇతిహాస మార్గం, కావ్యమార్గం, ప్రబంధమార్గం మొదలైన వాటిల్లో ఇచ్ఛవచ్చినట్లు సంచరించ గల సృజనాత్మక శక్తి సంపన్నుడు ఎఱ్ఱన అని వారి అభిప్రాయం. 'ప్రబంధపరమేశ్వర' బిరుదానికి వారిచ్చిన అరుదైన వ్యాఖ్య!

10. ఆరణ్యపర్వశేషం : ఆఖ్యానవైచిత్రి

ఆరణ్యపర్వశేషంలోని అఖ్యానం (ప్రధానకథ) వైశాల్యంలో చిన్నదైనా వైచిత్రిలో గొప్పది. శంభుదేవుని ఆకృతికి అష్టవిధ విభూతులవలె శంభుదాసుడి రచనకు అష్టవిధ వైచిత్రులున్నాయి. కవిత్రయంలో మూడవ వాడైన ప్రబంధపరమేశ్వరుడు ఈ భాగాన్ని రచించాడు కాబట్టి ఆ వైచిత్రులన్నీ ముచ్చన్నెలతో, ముప్పేటగా ముచ్చట గొలుపుతూ ఉంటాయి.

(1) మూడు మలుపులు

మహాభారత కథా జీవితాన్నే మార్చివేయగలిగిన పెద్ద మలుపులు మూడు ఆరణ్యపర్వశేషంలో ఉన్నాయి. అవి: 1.ఘోషయాత్ర ఘట్టం, 2. సైంధవోదంతం, 3. కర్ణుడు కవచకుండలాలు దానం చేయటం. వనవాస క్లేశ దుఃఖితులైన పాండవులను, విశేషించి పాండవ పట్టమహిషి అయిన ద్రౌపదిని, తమ అనంత సంపదల విలాసాల ప్రదర్శనంతో వెక్కిరించి వారు మనసులో కుమిలిపోయేటట్లు చేసి తాము సంతోషించే దుష్టవ్యూహం పన్నింది దుష్టచతుష్టయం. పాపం నలుగురిది అయినా ఫలభోక్త అయినవాడు దుర్యోధనుడే. దుర్యోధనుడు గంధర్వపతిచేత బంధితుడై ఇంద్రుడిచేత చంపబడితే కథ మరొక విధంగా ఉండేది. నిజాని కది ఊహించలేనిది. హస్తినాపురం ధృతరాష్ట్రపాలనలోనే ఉండేది. దుర్యోధనుడు చనిపోయినా ధర్మజుడు అరణ్యాజ్ఞాతవాసాలు పూర్తి చేయకుండా తిరిగి రాజధానికి వెళ్ళేవాడు కాడు. అది అట్లా ఉండగా- కాదగిన కార్యాన్ని గంధర్వులే తీరిస్తే పాండవులకు మిగిలే కార్యమేముంది? వారి ప్రతిజ్ఞ లేమౌతాయి?. పాశుపతాస్త్రం ఏమౌతుంది? దుర్యోధనుడు బందీ అయినా కర్ణుడు కాలేదు. అతడు యుద్ధం చేసి దుర్యోధనుడిని విడిపించేనా? ఒకసారి ఓడిన ఆ వీరుడు అందుకు సాహసించేవాడో లేదో?- అన్నీ ఊహలే. కథ చెల్లాచెదరైపోయింది. చెదరిన ఆ కథా సూత్రాలనన్నింటిని ధర్మరాజు సప్రయత్నంగా తమ్ములసాయంతో ఒకచోటికి తెచ్చి ముడివేసి భారత కథకు ప్రాణంపోశాడు.

క. 'శరణంబని వచ్చిన భీ। కరశత్రువు నయినఁ బ్రీతిఁ గావఁగవలయుం;
గరుణాపరుల తెఱం గిది;। యిరవుగ సరిగావు దీని కే ధర్మంబుల్. (ఆర. 5.413)

శరణాగతత్రాణరూపమైన దయ యమతనయుడి అష్టవిభూతులలో ఒకటి. అది కథను చావనీయకుండ ప్రాణం పోసింది. ఇది మొదటి మలుపు.

అర్జునుడు పాశుపతాస్త్రాన్ని సంపాదించినా, భీష్మకర్ణాదులను చంపగలిగిన అస్త్రశక్తి అతనికి ఉన్నదని దేవేంద్రుడు ప్రకటించినా, స్వేచ్ఛామరణవరబలం గల భీష్ముడినీ, సహజకవచకుండలరక్ష గల కర్ణుడినీ వధించే ఉపాయ ద్వారాలు కథలో ఇంకా తెరువబడలేదు. అందువలన పాండవ విజయం అనుమానాస్పదంగా ఊగిసలాడుతున్నది. కర్ణుడి కవచకుండలాలను హరించటానికి ఇంద్రుడు పాండవపక్షపాతియై మాయోపాయాన్ని పన్నాడు. బ్రాహ్మణరూపంలో వాటిని దానంగా అడిగితే కర్ణుడు ఇవ్వటం తథ్యం. ఒకవేళ అదే జరిగితే కథలో పట్టుతగ్గుతుంది. అర్జునుడి ప్రతివీరుడి ప్రతాపం నిర్వీర్యమౌతుంది. అర్జునుడి ప్రతిజ్ఞకు అర్థం లేకుండాపోతుంది. అందుకని సూర్యుడు కర్ణుడిచేత ఇంద్రుడి శక్తిని ప్రత్యుపకారంగా అడిగింప జేస్తాడు. శక్తి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అవక్రవిక్రముడైన ఒక వీరుడిని చంపగలుగుతుంది. దానిని కర్ణుడు ప్రాణాపాయ సమయంలో ప్రయోగించాలి. ఆ నియమం మహాభారత కథలో ఒక అపూర్వమైన ఆసక్తిని పోషిస్తుంది. మహాభారత యుద్ధంలో ఘటోత్కచ వధదాకా సాగే ఉత్కంఠకు ఈ మలుపు బీజం.

ఉజ్జ్వలాకారులైన పాండవులూ ద్రౌపదీ అజ్ఞాతవాసంలో ఇతరులచేత తెలియబడకుండా ఉండటం నిజానికి అసాధ్యం. ఆ సమస్య పాండవుల హృదయాలలో బడబాగ్నివలె రగులుతూనే ఉన్నది. భీమాదులు ధర్మజుడి యెదుట ఎన్నోసార్లు అన్నారు. కూడా! కాని, ధర్మాన్ని నమ్మిన ధర్మరాజు మౌనంగా ఉండిపోయాడు. కథలో అది ఒక యక్షప్రశ్నగా మిగిలిపోయింది. యక్షప్రశ్నల తరువాత ధర్ముడు పాండవులకు అజ్ఞాతవాసంలో కోరుకొన్న రూపాలు కలిగేటట్లు, ఇతరులు వారిని గుర్తించకుండా ఉండేటట్లు వరమిచ్చాడు. దానితో భావికథ శుభపరిణామాలతో సాగుతుందని ధైర్యమేర్పడింది.

ఈ విధంగా ఆఖ్యానంలోని మూడు మలుపులు కథాగతికి క్రమంగా ప్రాణం పోసి, ఉత్కంఠను పెంచి, శుభపరిణామాలకు దారితెరిచాయి. ఎఱ్ఱన భాగంలో ఇవి ఆసక్తిదాయకంగా పోషించబడ్డాయి.

(2) మూడు రహస్యాలు

చిత్రసేనుడి బారినుండి దుర్యోధనుడు ధర్మరాజు దయవలన విముక్తుడై ఆ అవమానభారానికి తట్టుకోలేక ప్రాయోపవేశానికి పూనుకొన్నాడు. కర్ణ దుశ్శాసనశకుని లెంత చెప్పినా తన నిశ్చయాన్ని మార్చుకొనకుండ ఆమరణనిరాహారదీక్ష పూనాడు. ఆ రాత్రి అసురులు అతడిని కృత్యసహాయంతో పాతాళలోకానికి పిలిపించుకొని, అతడికి హితబోధ చేశారు. అసురులందరూ పరమేశ్వరుడిని గూర్చి తపస్సు చేసి, వజ్రకాయుడైన దుర్యోధనుడిని వరప్రసాదంగా పొందారని చెప్పారు. అతడు వారికి నాయకుడనీ, ఆశాదీపమనీ పొగిడారు. కర్ణ సహాయంతో పాండవులను చంపగలడని ధైర్యం చెప్పారు. అడ్డులేకుండా రాజ్యాన్ని దుర్యోధనుడే పాలిస్తాడని ప్రకటించారు. దుర్యోధనుడు వారి మాటలు నమ్మి భవిష్యత్తుపై ఆశపెంచుకొని మరునా డుదయమే ప్రాయోపవేశాన్ని మాని హస్తినాపురానికి బయలుదేరాడు. కాని, ఆ రాత్రి జరిగిన ఆ రహస్యాన్ని ఎవరికీ బయటపెట్టలేదు. ఆరణ్యపర్వశేషంలోని ఈ కీలకమైన రహస్యం భావి దుర్యోధన జీవన విధానంమీదా, కర్ణుడిపై పెంచుకొనే ఆశలమీదా, యుద్ధంలో విజయం తథ్యమనే నమ్మకం మీదా బలంగా ప్రభావం వేసింది. నిజానికి - ప్రాయోపవేశంలో ప్రాణాలు పోయే దుర్యోధనుడికి ప్రాణదానం చేసిన రహస్యం భావికథకు జీవనదానం చేసింది.

ధర్మరాజుచేత విముక్తుడైన సైంధవుడు గంగాద్వారంలో పరమేశ్వరుని గూర్చి తపస్సు చేసి అర్జునుడిని తప్ప, మిగిలిన పాండవులను ఒకనాటి యుద్ధంలో జయించగలిగేటట్లు వరాన్ని పొందాడు.

చ. ‘విజయుఁ డొకండు దక్క నతివీరులఁ బార్థుల నున్న నల్వురన్
నిజ మొకనాఁటికయ్యమున నీవు జయింపుము; ఫల్గునుండు స
ర్వజగదజయ్యు విక్రముఁడు; వాని నెదుర్కొని నాకు నైనఁ బో
ర జితునిఁ జేయు టెంతయు భరంబగు; నిక్కము వల్కితిం జుమీ’. (అర. 6.257)

ఈ నిక్కాన్ని బయటికి పొక్కకుండా సైంధవుడు హృదయంలో దాచాడు. అది రాబోయే మహాభారత యుద్ధంలో అభిమన్యుడి మరణానికి కారణమౌతుందని తెలిసికొనే పఠిత ఆర్ద్రుడైపోతాడు.

మూడవ రహస్యం కర్ణుడి జన్మరహస్యం. ఆరణ్యపర్వశేషంలో సూర్యుడు కర్ణుడి క్షేమంగోరి ఇంద్రుడికి కవచకుండలాలను దానం చేయవద్దని హితవు చెప్పాడు. ఆ విధంగా తనంతట తాను కర్ణుడి మేలుకోరి పలకటానికి ఒక దేవరహస్యం ఉన్నదనీ,

అది కాలాంతరంలో కాని బయటపడదనీ చెప్పి ఊరుకొన్నాడు. ఆ దేవరహస్యమే కర్ణుడికి శాపమై కాటందింది. కర్ణుడి జన్మరహస్యాన్ని మొదట దాచింది తల్లికుంతి, ఆమె కట్టడితో ఆపై సూర్యుడు. దేవరహస్యాలు తెలిసికొనగలిగిన దివ్యాదివ్యులెవ్వరో ఒకరిద్దరికి తప్ప - కృష్ణవ్యాసభీష్మాదులకు తప్ప - మిగిలిన వారికి కూడ వారికివలె చూచాయగానైనా తెలియదు. తెలిసినవారు కూడా దేవరహస్యాన్ని భద్రంగా హృదయపేటికలలో పెట్టి తాళం వేశారు. కర్ణ జన్మరహస్యం బయటపడితే పాండవకౌరవ వైరం లేదు; దుర్యోధనుడికి బలం లేదు; చివరకు భారత కథే లేదు. ఈవిధంగా మూడు రహస్యాలు ఎఱ్ఱయ భాగంలో ముప్పిరిగొని భావికథను ముందుకు లాగాయి. రహస్యాల ఫలాలు బయటపడటమే తప్ప రహస్యాలు బయటపడటమనేది కథలో ఉండదు. అదే కథా రహస్యం కూడా.

(3) మూడు రసాభాసాలు

ఆరణ్యపర్వశేషంలో దుర్యోధన కర్ణ సైంధవులు మూడు రకాల రసాభాసాలకు విభావాలుగా నిలిచారు. దుర్యోధనుడు ధీరోద్ధతుడు, సచివాయత్తసిద్ధుడు. అతడికి స్వయంప్రతిభ తక్కువ. కాని, ఆడంబరం, అహంకారం, కుటిలవర్తనం ఎక్కువ. అతడి ఘోషయాత్ర వీరయాత్ర కాదు; కపటదండయాత్ర. అతడు చిత్రసేనుడితో చేసింది వీరయుద్ధమే అయినా తాను చేసిన ప్రతాపోక్తులను ప్రగల్భాలుగా నిరూపించుకొన్న అప్రగల్భుడు. ఓడి, ధర్మజుడి చేత విడువబడి, ప్రాయోపవేశం కూడా చేసి, కారణాంతరం వలన మాని, ఆటోపంగా హస్తినాపురానికి చేరి, లజ్జారహితుడై భీష్మాదులముందు అవినయాన్ని ప్రదర్శించిన దుర్యోధనుడు చేసిన ప్రతిపనీ ఆభాసానికి అమూల్యోదాహరణమే. అసురులతో జరిగిన పాతాళ సమావేశం తరువాత దుర్యోధనుడు ససైన్యుడై బయలుదేరిన ఘట్టం ఎఱ్ఱయ ప్రబంధశయ్యలో రచించాడు. నన్నయ ప్రసిద్ధ పద్యపు ఎత్తుగడతో సగందాకా పద్యాన్ని సాగించాడు.

చ. 'రయవిచలత్తురంగమ తరంగములన్ మదనాగనక్రసం
చయములఁ జంచలచ్చటుల సైనిక మత్స్యములన్ మహోన్నతం
బయి కురురాజచంద్రు నుదయంబునఁ దద్దయుఁ బొంగెఁ బ్రస్ఫుర
ద్ధ్వయద మనోహర ప్రకట భంగులఁ దద్బలవార్ధి యుద్ధతిన్'. (ఆర. 6.58)

రూపకసమాస సుందరమైన ఈ పద్యంలో కురురాజచంద్రుడు కర్త. ఆయన ఉదయమంటే పుట్టుక కా దిక్కడ. అసురవీరుల ప్రబోధంచేత ప్రేరితుడై భవిష్యత్తులో పాండవులను చంపి కురురాజ్యాన్ని నిష్కంటకంగా పాలించగలననే మనోధైర్యంతో, వెనుకటి దైన్యాన్ని వీడి, నూతనోత్సాహంతో హస్తినవైపు ప్రయాణభేరి మ్రోగించిన ఉత్సాహమూర్తి యొక్క అవతారం అని అర్థం. ఈ పద్యం ఒక విజయాన్ని సాధించి మరొక విజయం కొరకు పోయే రాజు యొక్క సైన్య వర్ణనమైతే వీరరౌద్ర రసపోషకంగా ఉండేది. ఓడినరాజు ఉద్ధతితో తిరిగిపోతుంటే అది రసాభాసమే అవుతుంది. అసందర్భమైన ఆలంకారిక రచన ఆభాసానికి దారితీస్తుంది. అయితే అసందర్భంగా అనిపించే ప్రబంధశయ్య దుర్యోధనుడి అవివేకాన్ని, ఆడంబర ప్రవృత్తినీ, లజ్జారాహిత్యాన్నీ వ్యంజింపజేయటానికి, అతడివెంట నడుస్తున్న ఆ సముద్రంవంటి సైన్యవాహిని సజీవసాక్షిగా మలచి హాస్యం పుట్టించటానికి కవి ప్రౌఢంగా ఇటువంటి రచనను ప్రవేశపెట్టవచ్చును. ఎఱ్ఱయ చేసిన పని అదే.

ఈ పద్యంలోని పూర్వభాగమంతా నన్నయదే. ఆయన సభాపర్వంలో శిశుపాలసైన్య విజృంభణాన్ని ఇదే విధంగా వీర రసాభాస శిల్ప ఖండికగా రచించాడు. దానిని గుర్తెరిగి, నన్నయరీతిలో తానూ ఆపని చేశానని ఎఱ్ఱయ వ్యంగ్యంగా సూచించాడు. పై పద్యం ఎత్తుగడను అనుకరణ మంటాం. కాని ఒక విధమైన రసాభాస శిల్పానికి నన్నయ పెట్టిన ఒరవడిని తాను మన్నించి తరువాతి తరాలవారికి అందిస్తున్నానన్న స్పృహతో రచించిన ఎఱ్ఱయ పద్యం ప్రయోగ ప్రతిభకు ప్రమాణం.

అంతటి ఆర్భాటంతో హస్తినాపురికి పోయిన దుర్యోధనుడిని భీష్ముడు ఇట్లా అధిక్షేపించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. 'హితులై పెద్దలు బుద్ధి సెప్పఁగఁ గ్రియాహీనుండవై త్రోచి పో
యితి దుష్టాత్ములఁ గూడి; దానికి ఫలం బెట్లయ్యెనో చూచితే?
గతవిద్వేషుఁడు ధర్మనందనుఁడు గల్గంబట్టి యప్పాట దు
ర్గతికిం దప్పితి గాక; చిక్కితిగదా గంధర్వుచే నాజిలోన్.' (అర. 6.61)

ఈ పద్యంలోని సూక్తివైచిత్రి దుర్యోధనాలంబితమైన రసాభాసాన్ని ధర్మజుడి ధర్మవీరానికి అంగంగా, పోషకంగా నిబంధించే పద్ధతిని వ్యంగ్యంగా నిర్దేశించింది.

దుర్యోధనుడు రాజసూయం చేయాలని ఉబలాటపడటం మరొక రసాభాసం. దానిని కర్ణుడు బలపరచటం, పురోహితుడు అభ్యంతరం చెప్పటం, రాజసూయంబదులు వైష్ణవ యజ్ఞం చేయవచ్చునన్న పురోహితుడి సూచన ననుసరించి ఆ యజ్ఞానికి పూనుకొనటం మరింత రసాభాసం. యజ్ఞం అయిపోయిన తరువాత దుర్యోధనుడు భవిష్యత్తులో పాండవులను సంహరించి తప్పక రాజసూయం చేస్తాననటం, అతడిచేత కర్ణుడు చేయిస్తానని ప్రతిజ్ఞ చేయటం ఆసక్తిని కలిగిస్తూనే నవ్వు పుట్టించే రసాభాసం. యుద్ధం చేసి నవ్వులపాలైన దుర్యోధనుడు యజ్ఞం చేసి ఎగతాళి పాలైనాడు పఠితల ఎదుట.

దుర్యోధనుడు చేసిన యజ్ఞం ముగిసిన తరువాత దక్షిణలు పుచ్చుకొన్న వారు, సన్మానా లందుకొన్నవారు దుర్యోధనుడి ఎదుట యజ్ఞవైభవాన్ని అద్భుతంగా కీర్తించారు.

శా. 'సారోదారవిభూతిమై మును హరిశ్చంద్రుం డొనర్చెం గ్రియా
పారీణుండయి రాజసూయ మది సెప్పన్ వింటి; మయ్యజ్ఞముం
గౌరవ్యోత్తముఁడైన ధర్మసుతుఁడుం గావింపఁగాఁ గంటి మే;
మా రెండున్ సరిగావు నీ మఖముతో నత్యున్నతిన్ భూవరా!' (అర. 6.88)

ఇవి ముఖస్తుతులు. అసలు మాటలు అంతరంగంలోనివి. ఎక్కడో మనసు విప్పి చెప్పుకొంటారు. ఎఱ్ఱన ఆ సంగతి కూడా చెప్పి బండారాన్ని బయటపడవేశాడు. '....కొంద! అయ్యుధిష్ఠిరు రాజసూయంబు చిదుర । పాలుఁ బోల దీ మఖము వైభవ సమృద్ధి! నని తలంచిరి నిజహృదయంబులందు' (అర. 6.90). ఇది ఆ ప్రశంసకు విరుగుడు. దీనివలన దుర్యోధనుడి యజ్ఞకార్యోత్సాహం ఆభాసగా పఠితల హృదయాలలో మారిపోతుంది. ఇది మొదటి ఆభాసం.

అగ్నికి వాయువు తోడైనట్లు దుర్యోధనుడి యత్నానికి కర్ణుడి ప్రోత్సాహం దోహదంగా నిలిచింది. కర్ణుడిపాత్ర చిత్రమైనది. అతడు స్వయంగా ధీరోదాత్తుడు. ధీరోద్ధతుడైన దుర్యోధనుడిని మెప్పించటానికి ఉద్ధతుడివలె వ్యవహరిస్తాడు. అందువలననే దానాదులలో అతడు ధీరోదాత్తుడు. అతని స్వంత జీవితం వేరు; దుర్యోధనుడియొద్ద సేవా జీవితం వేరు. ఒకరు రసాభాసం పాలైతే మరొకరు వారితోపాటు కావలసిందే. చిత్రసేనుడితో జరిగిన యుద్ధంలో ఒంటరిపోరు చేయలేక పారిపోయిన కర్ణుడు మహాభారత యుద్ధంలో అర్జునుడిని సంహరిస్తాననీ, అందాకా కాళ్ళగోళ్ళు తీయించుకోననీ భీకర ప్రతిజ్ఞ చేశాడు. దుర్యోధనుడు మహానందంతో అతడిని కౌగిలించుకొంటాడు. ధర్మరాజు కర్ణప్రతిజ్ఞను విని విషణ్ణుడౌతాడు. మరి పఠిత?

పాండవు లొకసారి ప్రతిజ్ఞ చేస్తే దానిని సాధించి తీరుతారన్న విశ్వాసం పఠితలకు వారేర్పరిచారు. కర్ణాదులు ప్రతిజ్ఞ చేస్తారు. కాని, అది తీరటం దైవాధీనం. ఈ సత్యం తెలిసిన సహృదయులు కర్ణుడి ప్రతిజ్ఞను విని కన్నులలో నవ్వుకొంటారు. అంతటి వీరం ఆభాసమైపోతుంది.

సైంధవఘట్టంలో శృంగారరసాభాసం ఒక చిత్రమైన విచికిత్స. సైంధవుడు అటు ఉద్ధతుడు కాడు. ఇటు లలితుడు కాడు. రెంటికి చెడ్డ రేవడి. అతడు వట్టి ఇంద్రియలోలుడు. ద్రౌపది నొంటరిగా చూచి మదనశర పీడితుడై కోటికాస్యుడితో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వలపుమాటలు పలికినప్పుడు రసికుడివలె కనపడతాడు. కాని, ద్రౌపదితో మాట్లాడినప్పుడు కాని, ఆమెను బలవంతంగా రథంమీద ఎక్కించుకొని తరలిపోయేటప్పుడు కాని, అతడు ధర్మదృష్టి నేమాత్రమూ ప్రదర్శించలేదు. పాండవ పరాక్రమాన్ని తక్కువ అంచనా కట్టి ప్రమాదం తెచ్చుకొన్న అపరిణతుడు. యుద్ధభూమి నుండి పారిపోతున్న సైంధవుడిని చూచి భీముడు' ఇట్టి కడిమి నమ్మియే ప్రల్లదంబులు సేయఁ దొడఁగితి'వా? అని అవహేళనం చేశాడు. అతడితో కలిసి సహృదయులు కూడా పరిహసిస్తారు.

వరుసకు చెల్లెలైన ద్రౌపదిని పరిభవించాలని భావించిన సైంధవుడు 'మానవపశువు'. అతడి చేష్టలు అనౌచిత్యాలు. అందువలన అవి రసభంగహేతువులు. ఈ ఘట్టంలో రసచర్చ కడు సున్నితం. స్త్రీ పురుష లిద్దరిలో ఒకరికి మాత్రమే కోరిక ఉండి రెండవ వారికి లేకపోతే ఆభాసం. అయితే, కోరకూడని వనితను కోరినా, పురుషుడిని కోరినా అది రసభంగం. శృంగార రస రీత్యా సైంధవుడు ద్రౌపదిని వాంఛించటం ఆభాసంకంటె రసభంగమే కావాలి. ద్రౌపది అనౌచిత్యాన్ని ఎత్తి చూపింది. అతడు పట్టించుకొనలేదు. అప్పుడు ఆమె పాండవ వీర ప్రశంస చేసింది. వారితో వైరం ప్రాణహానికి దారితీస్తుందని భయపెట్టింది. సైంధవుడు దానిని లెక్కచేయలేదు. ఆమెను బలవంతంగా ఎత్తుకొని పోయాడు. చివరకు అటు శృంగారంలోనూ, ఇటు పౌరుషంలోనూ అల్పుడని నిరూపించుకొన్నాడు. అయినా, అతడి సాహసం పాండవుల మనసులపై ఒకగాయం మిగిల్చింది. అందువలన అసమర్థుడి సాహసం శృంగారవీర రసాభాసంగా ఈ ఘట్టంలో పఠితలకు స్ఫురిస్తుంది. రసపరంగా ఇది ఒక సంశ్లిష్ట ప్రయోగం. ఎఱ్ఱన ఈ ఘట్టాన్ని నిపుణంగా నిర్వహించి ప్రబంధ గౌరవాన్ని కాపాడాడు, మరొక ఊరట ఏమిటంటే, సైంధవోదంతం ఆరణ్యపర్వ శేషంలో రామాయణం, సావిత్రి చరిత్రంవంటి కథలను వినటానికి హేతువయింది. అది కీడులో మేలు.

(4) మూడు ఉక్తివైచిత్రులు

కాకువువలన ఉక్తివైచిత్రి కలుగుతుందని అంటారు. అపకారం చేసి చేజిక్కిన శత్రువును వెటకారం చేస్తూ పలికే మాటలకు భారతంలో మొదట చెప్పుకొనేవి నన్నయ ద్రోణుడితో అనిపించినవి.

క. 'వీరెవ్వరయ్య? ద్రుపదమ । హారాజులె? యిట్లు కృపణులయి పట్టువడన్
వీరికి వలసెనె? యహహ! మ । హారాజ్యమదాంధకార మది వాసెనొకో!' (ఆది. 6.90)

ఇటువంటి సూక్తివైచిత్రులను వెలార్చే అవకాశాలు మూడు దొరికాయి ఎఱ్ఱనకు. అందులో రెండు ధర్మరాజు పాత్ర చేత, ఒకటి ద్రౌపది పాత్రచేత పలికించాడు.

ఘోషయాత్ర ఘట్టంలో దుర్యోధనుడి బంధవిముక్తుడిని చేసి ధర్మరా జన్న పద్యం-

ఉ. 'ఎన్నఁడు నిట్టి సాహసము లింక నొనర్పకు మయ్య; దుర్జనుం
డన్నున సాహసక్రియలయందుఁ గడంగి నశించుఁ; గావునం
గ్రన్నన తమ్ములన్ దొరలఁ గైకొని యిమ్ములఁ బొమ్ము వీటికిన్;
సన్నుత! దీని కొండొక విషాదముఁ బొందకుమీ మనంబునన్'. (అర. 5.434)

సైంధవుడిని మందలిస్తూ ధర్మజుడన్న మాటలు-

ఆ. 'ఎట్టికష్టుఁడైన నిట్టిపాపము సేయ । నెత్తికొనునె? ధరణి నీవు దక్క;
నరుగు మింక నేమి యందుము నిన్ను నిం । ద్రియవిలోలు నల్పు ధృతివిహీను.' (అర. 6.252)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్రౌపది సత్యభామను సున్నితంగా మందలిస్తూ నవ్వులాటగా చేసిన ఎత్తిపొడుపు-

క. 'నను నిట్లు దుష్టవనితా । జనము నటులుగాఁ దలంపఁ జనునే నీకున్?
మన సొప్పదు పురుషోత్తము । వనితవుగాఁ దగవు నీవు వనరుహనయనా!' (ఆర. 5.294)

ద్రోణుడు బ్రాహ్మణుడు, ద్రౌపదీ ధర్మజులు క్షత్రియులు. నన్నయ అన్నట్లు- "నిండుమనంబు నవ్యనవనీత సమానము, పల్కు దారుణాఖండల శస్త్రతుల్యము జగన్నుతవిప్రులయందు; నిక్కమీ రెండును రాజులందు విపరీతము" (ఆది.1.100). ద్రోణుడి వాక్కులు పరుషాలు, తీవ్రాలు, ధర్మజుడి వాక్కులు చతురాలు, నిశితాలు. ద్రౌపదివాక్కులు వ్యంగ్యాలు, వెటకారాలు, అధిక్షేపించబడే వారి అధికారాలను బట్టి కూడ వక్తలు సూక్తివైచిత్రులను మలచుకొంటారు. ద్రుపదుడు తామసికుడు; సైంధవుడు అల్పుడు, నీచుడు, దుర్యోధనుడు రాజసికుడు, సత్యభామ అహంకారి. అందువలన ద్రోణుడు బాణాలవలె మాటలను ప్రయోగించాడు. ధర్మజుడు దుర్యోధనుడికి చెంపపెట్టుగాను, సైంధవుడికి పాదతాడనంగానూ దెబ్బకొట్టినట్లు చెప్పాడు. ద్రౌపది సత్యభామకు కూరలో తిరుగబోత వేసినట్లు చెప్పింది. పాత్రోచిత కాకువైచిత్రి నిర్వహణంలో నన్నయతో దీటైనవాడు ఎఱ్ఱాప్రెగ్గడ. అందుకే తెలుగువారికి కాకువులంటే ఈ నాలుగు పద్యాలు 'శ్లోకచతుష్టయం' వలె నెమరుకు వస్తాయి.

(5) మూడు వీరరస భేదాలు

వీరరస పరిణామ వికాస దశలను పరిశీలిస్తే ఎఱ్ఱన కాలంనాటికి వీరరసం మూడు రకాలు- అనేవాదం సమసిపోయి నాలుగురకాలనే వాదం ప్రాచుర్యంలోకి వచ్చింది. విద్యానాథాదులు దాన, ధర్మ, దయా, యుద్ధ, వీరాలను పేర్కొన్నారు. ఆరణ్యపర్వశేషంలో చతుర్విధ వీరరస వైచిత్రి పోషించబడింది. ఈ భాగంలో నాయకపక్షంలో ధర్మరాజు, ప్రతినాయకపక్షంలో కర్ణుడు రసస్థితిని ప్రదర్శించిన ప్రధానపాత్రలు.

నాయకుడైన ధర్మరాజు ధర్మవీరరసానికి ఉదాత్త విభావం. నిజానికి ధర్మవీరమే మూలవీరం. 'ధర్మవీర ఏవ రసానాం రసః' అనే వాదం ఆంధ్ర భారత రసపోషణకు ఆయుస్సూత్రం. (చూడు. రసోల్లాసం-(1980) జి.వి. సుబ్రహ్మణ్యం). అయితే ధర్మసాధకుడైన ధర్మరాజు ఆయా సన్నివేశాలలో ఆయాప్రయోజనాలను బట్టి దాన, దయా, యుద్ధాది వీరాలను ప్రదర్శిస్తూ ఉంటాడు. కాని, అన్నిభేదాలూ ధర్మవీరపోషకాలే. అందులోని భాగాలే. ఘోషయాత్రలో శరణాగత ధర్మరక్షకై గంధర్వులతో యుద్ధం చేసి దుర్యోధనాదులను విడిపించుమని భీమాదులను ఆదేశించాడు ధర్మరాజు. యుద్ధం చేసేది అనునాయకులైన భీమాదులు. వారి యుద్ధవీరం ధర్మజుని ధర్మవీరానికి అంగమయింది. ఆ సందర్భంలో ధర్మజుడు దయాభావపూర్ణుడై. దుర్యోధనుడిని వదలిపెట్టాడు. అందువలన సన్నివేశగతంగా ధర్మవీరంలో పార్శ్వమైన దయావీరం ప్రాధాన్యాన్ని పొందుతుంది. ఎఱ్ఱన ఈ మర్మం తేటపడేటట్లు ఆ ఘట్టాన్ని చిత్రించాడు.

అమాత్యులు వచ్చి ధర్మరాజును శరణువేడుతూ - "నీయనుజవ్రాతముఁ గావవే కరుణ నిండారంగ రాజోత్తమా!' (5.402) అని ప్రార్థించారు. భీముడు దుష్టుడైన దుర్యోధనుడి పట్ల 'కృపసేయవలదు' (5.407) అని ధర్మరాజును హెచ్చరించాడు. ధర్మరాజు భీముడిని అనునయిస్తూ 'శరణుజొచ్చిన వారి పట్ల కరుణ చూపటం నీకు మాత్రం ధర్మం కాదా!' (5.408) అని అంటాడు. భీముడు ధర్మరాజును 'మనుజనాథ! కేవలంపుఁగరుణపూని యుండు దరయ నెప్పుడు' (5.410) అని విసుక్కుంటాడు. 'శరణుకోరినవారిని రక్షించటం కరుణాపరుల పద్ధతి; ఆ దయకు ఏ ధర్మాలూ సరికావు' అని ధర్మజుడు తేల్చి చెప్పాడు (5-413). ఇట్టి చోట్ల ఆ సందర్భంలో దయావీరమే ప్రధానంగా పేర్కొన్న ఎఱ్ఱన దుర్యోధనుడిని వదలిపెట్టిన ఘట్టంలో ధౌమ్యాది మునులందరూ 'ధర్మతనయు ధార్మికత్వాన్ని' కీర్తించారని చెప్పటం గమనార్హం. ఇది రసపోషణ విధానం తెలిసిన కవి చేసే రచన. తాత్పర్య మేమంటే- ఈ ఘట్టంలో ప్రధానమైనది దయావీరం, దానికి పోషకం యుద్ధవీరం. దయావీరం ధర్మవీరంలో అంతర్భాగం. మహాభారత ప్రధానరసమైన ధర్మవీరానికి ఇక్కడి దయావీరం అంగం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సైంధవ పరాభవ ఘట్టంలో ప్రధాన రసం రౌద్రం. శత్రుకృతాపరాధానికి క్రుద్ధులై పాండవులందరు యుద్ధానికి సిద్ధమై మహాయుద్ధంలో శత్రు సంహారాన్ని నిర్దాక్షిణ్యంగా చేయ నారంభించారు. యుద్ధం రౌద్రరసోన్నిద్రం. సైంధవుడు బంధువు. గాంధారికి అల్లుడు, అనుచితం చేసినా, మరణదండనార్హుడైనా, గాంధారికి కలిగే దుఃఖాన్ని తలచి ధర్మజుడు అతడిని చంపవద్దని తమ్ముల నాదేశించాడు. భీముడు సైంధవుడిని 'ఒడలెల్లఁ బిండికూడుగఁ । బొడిచి', రాజవేషాన్ని వికల్పించి 'పాండవదాసుడ' నని పలికించి ధర్మజుడి వద్దకు తెచ్చాడు. 'పాండవదాస' బిరుదం సైంధవుడికి ప్రాణదానం చేయించింది. ఇందులోని రససమన్వయం సున్నితం.

కామదూషితుడైన సైంధవుడి వలన పాండవపత్నికి దుఃఖం కలిగింది. ఆమెను ఎత్తుకొనిపోవటం పాండవుల పట్ల అతడు చేసిన అపరాధం. దానివలన పాండవులలో క్రోధం ప్రజ్వలించింది. అవమానం వలన ఆగ్రహం రౌద్రరూపం తాల్చింది. ఈ కథలో ద్రౌపది చేత పాండవుల వీరరౌద్రప్రతాపతేజోవైభవాలను కీర్తింపజేసే పద్యాలను పుంఖానుపుంఖంగా ప్రబంధశయ్యలో రచించి ఎఱ్ఱన ప్రబంధపరమేశ్వర గౌరవానికి పాత్రుడయ్యాడు. విరాటపర్వంలో తిక్కనకు ఇటువంటి అవకాశం దొరికింది. ఎఱ్ఱయకు ఇక్కడ దొరికింది. పోటీపడి పద్యాలు వ్రాశారా అన్నట్లు ఉంటాయి. అయితే అజ్ఞాతవాసంలో అంతటివారు ఆ విధంగా దీనంగా ఉన్నారని చెప్పే పద్యాలు తిక్కనవి. ఇక్కడ పాండవ పరాక్రమమూర్తులను వర్ణించి సైంధవుడిని భయపెట్టి ఆపదనుండి తనను రక్షించుకొనేయత్నంగా ద్రౌపది చేత పలికించినవి. ఓజోగుణభూయిష్ఠమైన ఎఱ్ఱయ రచన నన్నయ తిక్కనల రీతికంటె విలక్షణమైనది. భారతీవృత్తి, పాంచాలీ రీతి, ప్రబంధశయ్య వీటి శైలీ విలాసాలు.

ద్రౌపది పాండవులను రెండు ఘట్టాలలో కీర్తించిన పద్యాలను రెండు తెగలుగా చెప్పవచ్చును. 1. బెదరింపు పద్యాలు 2. అదలింపు పద్యాలు. మొదటి తెగవి - ఆశ్రమంలో పాండవ పరోక్షంలో చెప్పినవి. రెండవ తెగవి రణరంగంలో వారిని చూపిస్తూ ప్రత్యక్షంగా చెప్పినవి. మొదటి తెగలో అలంకార ప్రౌఢోక్తులు, రెండవ తెగలో ఉదాత్తమధురోక్తులు. మొదటి తెగలో పాత్రల రీతి వర్ణనం ప్రధానం; అందువలన పాంచాలీరీతి ప్రధాన రచనగా గోచరిస్తుంది. రెండవ తెగలో పాత్రల రూపగుణ వర్ణనం ప్రధానం కాబట్టి, మాధుర్యగుణ ప్రధానంగా రచన సాగింది. అది ఎఱ్ఱన ఔచిత్యదృష్టి. మొదటిసారి వర్ణించిన పద్యాలలో కొన్ని

1.	హిమవత్పాదవనాంత కేళిరతిమై-	(ధర్మరాజు)	6.175
2.	శాతనఖాగ్ర ఖండిత లసన్మదకుంజర-	(భీముడు)	6.176
3.	చలజిహ్వాగ్రవిలీఢ విస్ఫురితదంష్ట్రాభీషణంబైన-	(అర్జునుడు)	6.177
4.	బోరనవిస్ఫులింగములు వొడ్మఁగ-	(నకులసహదేవులు)	6.178

హిమవత్పర్వతగుహాంతరంలో కోపారుణనేత్రాలతో ఉన్న మదించిన ఏనుగును సమీపించి సిళ్ళు చూపటం వంటిదే ధర్మజుడికి ఎదురుగా కనిపించటం. మదించిన ఏనుగుల కుంభస్థలాలను వాడిగోళ్ళతో పగులగొట్టగా రాలిన ముత్యాలతో నిండిన గుహాంతర ప్రాంతంలో నిద్రిస్తున్న సింహాన్ని జూలుపట్టి లాగటమే భీముడిని ఉసికొల్పటం. వాడికోరలతో కూడుకొన్న నాల్కతో భీషణంగా లంఘించే బెబ్బులిని కర్రతో కొట్టి రెచ్చగొట్టి దానినుండి తప్పించుకొనవచ్చునేమో కాని అర్జునుడి వాడి బాణాల తాకిడికి చావని వారుండరు. విస్ఫులింగాలు రాలగా ఘోరవిషాన్ని వెళ్ళగ్రక్కే పాముల జంటను సమీపించి పాదాలతో త్రొక్కి రెచ్చగొట్టినట్లు కవలను ధిక్కరించి పాతాళంలో దాగినా మృత్యువు తప్పదు. పాండవ స్వభావాలను అలంకృతోక్తి వైచిత్రితో వెలార్చిన పాండవరౌద్రం సైన్యసంహారంతో చల్లారుతుంది. ధర్మరాజులోని ధర్మవీరం జాగృతమై దయావీరంగా జాలువారుతుంది. సైంధవుడి ప్రాణం నిలుస్తుంది. బంధుభావం దయాభావానికి ప్రేరకం. రౌద్రాన్ని నిగ్రహించుకొనే శక్తి ధర్మజుడికి జన్మసిద్ధం. భీమాదులకు ఆతడి శిక్షణలో సాధ్యం. దానిని నిపుణంగా నిర్వహించి చూపించాడు కథలో ఎఱ్ఱన.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కర్ణుడి దానవీరగాథ అపూర్వం. దానం కూడా ధర్మస్వరూపమే. కర్ణుడి జన్మవ్రతం దానం. అయితే అతడు దానాన్ని కీర్తికాంక్షతో చేస్తాడు కాని, మోక్షకాంక్షతో చేయడు. ఆతడి ప్రవృత్తిని బట్టి ఒక్కొకసారి దానవీరం యశోవీరానికి అంగంకూడా కావచ్చును. నా 'వీరరస' గ్రంథంలో యశోవీరమనే భేదాన్ని క్రొత్తగా చెప్పటం జరిగింది. దానికి కీర్తి పొందాలన్న ఉత్కటోత్సాహమే స్థాయి. కర్ణునినోట వెలువడిన ఈ పద్యత్రయం యశోవీర త్రివర్ణ పతాక!

మ. 'మతిఁ గుంతీసుతపక్షపాతి యగుచున్ మాయాస్వరూపంబుతో
జితదైత్యుండు శతక్రతుండు నను భిక్షింపంగ నేతెంచు న
ట్టి తెఱంగైనఁ దదీయకీర్తియ చుమీ డిందుం; ద్రిలోకీసము
న్నతమై యొప్పు మదీయకీర్తి; యిది సూ నాపుణ్య మెబ్భంగులన్'.

ఆ. 'కీర్తి విడువఁజాలఁ; గీర్తితో మెలఁగంగఁ । జావు వచ్చెనేనిఁ జత్తుఁ గాని
జగములోన నెల్ల సడికంటెఁ జావు మే । లనఁగఁ బరఁగుమాట యనఘ! వినవె?'

మ. 'కీర్తియ యిచ్చుఁ బుణ్యగతిఁ, గీర్తియ తల్లియుఁబోలెఁ బ్రోచు, స
త్కీర్తియ యాయువున్ సిరియు; గీర్తి విహీనుఁడ చూ శవంబు; దు
ష్కీర్తను నెల్ల చేటులును గిట్టి హరించు ననండె తొల్లి భ
క్తార్తిహరుండు నాఁ బరఁగు నంబుజసూతి జగద్ధితంబుగన్'. (ఆర. 7.292-294)

మహాభారతంలో యశోవీరానికి ఏకైక నాయకపాత్ర కర్ణుడు. అది స్థాయి కందుకొన్న ఘట్టం ప్రబంధపరమేశ్వరుని సూక్తివైచిత్రిలో ప్రకాశించింది.

(6) ముగ్గురు పతివ్రతల కథలు

ఆరణ్యపర్వంలో దమయంతి, సీత, సావిత్రి, ద్రౌపది - అనే పతివ్రతా చతుష్టయం ప్రత్యక్షమౌతుంది. అందులో దమయంతి పాత్ర నన్నయ కవితలో అమృతాభిషేకం చేసికొన్నది. ఎఱ్ఱయ ప్రబంధశయ్యపై మిగిలిన ముగ్గురూ స్వర్ణాభిషేకం చేయించుకొన్నారు.

ద్రౌపది తన వర్తనమే తన జీవిత సందేశమని చాటే ఉపన్యాసం సత్యభామకు చెప్పింది. తన జీవితానుభవాలలో నుండి ఏరిన రత్నాలతో పతివ్రతా లక్షణహారాన్ని కూర్చి ఉపదేశోపహారంగా లోకానికి అందించింది. మహాభారతంలో తనను గురించి తానే ఎక్కువగా చెప్పుకొన్న పాత్ర ద్రౌపది. అందులోనూ తన పతివ్రతా స్వభావాన్ని గురించి తానే చెప్పుకొన్నది ఎఱ్ఱయ కవితలోనే. అది విశేషం.

సైంధవ దుర్నయోదంతం ధర్మజ ద్రౌపదుల మనస్సులను కలత పెట్టింది. ఆమెవలె మహారాణి అయి పరపురుషుడిచేత అపహృతయై దుఃఖపడిన వనితకథను వినాలనీ, ఆమె విరహంతో బాధపడిన పురుషుని కథ వినాలనీ ధర్మజుడు మనసుపడ్డాడు. మార్కండేయమహర్షి రామాయణ కథ చెప్పాడు. సీతారాములు రావణాది రాక్షస వీరులచేత పడిన యాతనలు వినిన తరువాత ధర్మజుడు కొంత కుదుట పడ్డాడు. ఆ తరువాత పతిభక్తి తాత్పర్యంతో అఖిలదుఃఖాల కోర్చి శుభాలు పొందిన పతివ్రత కథను చెప్పుమన్నాడు. మార్కండేయుడు అల్పాయుష్కుడైన భర్తను తన వ్రతనిష్ఠామహిమతో పునర్జీవితుడిని చేయటమే కాక, అతడికి పూర్ణాయువును, శతపుత్ర సంతతి కలిగేటట్లు, అతడి తండ్రికి కంటిచూపు, రాజ్యవైభవం మరల కలిగేటట్లు, ఆమె తండ్రికి శత పుత్ర సంతానం కలిగేటట్లు యముడివలన వరాలు పొంది తననూ, తనవారినీ ఉద్ధరించిన ఉత్తమ పతివ్రత చరిత్ర- సావిత్రి కథను వినిపించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దమయంతి స్వయంవరంలో దేవతలను, కలిని కాదని నలుడిని వివాహమాడినందుకు ఫలితంగా భర్తకు దూరమైనది. అయినా, ధైర్యంతో తననూ, తన బిడ్డలనూ, రక్షించుకొని దీక్షతో కష్టాల కోర్చి భర్తను విపత్తు నుండి తప్పించుకొనే ప్రజ్ఞను ప్రదర్శించింది. భార్యచేత ప్రేమించబడినవాడు, ఉద్ధరించబడినవాడూ నలుడు. నలుడి జీవితాన్ని ఉద్ధరించిన ప్రేమశక్తి దమయంతి.

సీత శివధనుర్భంగవీరుడైన రాముడిని స్వయంవరంలో వివాహమాడింది. మనసా వాచా కర్మణా భర్త ననుసరించింది. రాక్షసమాయకు లోనై భర్తకు దూరమై రావణుడి వద్ద కొంతకాలం ఉన్నది. కాముకుడైన రావణుడి అంతఃపురంలోని అశోకవనంలో ఉన్నా సర్వకాల సర్వావస్థలలో రాముడినే స్మరిస్తూ తన పవిత్ర మానసికవ్రతాన్ని పాటించింది. స్త్రీకి పతిని త్రికరణశుద్ధిగా ప్రేమించి సేవించి తరించడమే జీవితలక్ష్య మని సీతకథ చెప్పిన సందేశం. రాముడు సీతామనోరాముడు. ఆమె కొరకు వానరుల స్నేహం చేసి వారిధిని దాటి, రావణుని వధించి అపూర్వ పరాక్రమాన్ని ప్రదర్శించాడు. పరపురుషు నింట ఉండి కూడా నిష్కళంక చరిత్రగా ఉండగలిగిన స్త్రీ వృత్తాంతం విని, సైంధవ వృత్తాంతం జరిగిన తరువాత కలిగిన మనస్తాపాన్ని చల్లార్చుకొని ఉంటాడు ధర్మజుడు. సీతను రావణు డెత్తుకొనిపోయిన కథకూ, సైంధవుడు ద్రౌపది నెత్తుకొనిపోయిన కథకూ హస్తిమశకాంతరం ఉన్నది. సీత పడ్డ కష్టాలతో, రాముడు చేసిన యుద్ధంతో పోలిస్తే పాండవులకు కలిగిన కష్టం విస్మరించదగిందని స్పష్టమౌతుంది.

సావిత్రి కథ అన్నిటా భిన్నమైనది. యమదర్శనం చేసికొని ఆయనతో మాటలాడి, పతిప్రాణాలతో కలిసి నడిచిపోయి, సతీపతులప్రాణ చైతన్యాలకు అద్వైతస్థితి ఉంటుందని నిరూపించిన నిరుపమాన తపోనిధి సావిత్రి. ఆమె వంటిదే ద్రౌపది అన్నారు ఋషులు - వంశాన్ని, కులాన్ని, భర్తలను ఉద్ధరించటంలో చిత్రమేమంటే ఆరణ్యపర్వశేషంలో యముడిని చూచి, అతడితో మాట్లాడి, మాటలతో మెప్పించి, వరాలు పొంది, మృతులను సైతం బ్రతికించుకొనగలిగిన శక్తిగల వ్యక్తులు ఇద్దరే కనపడతారు. కథగా మిగిలిన సావిత్రి, కథను సృష్టించిన ధర్మరాజు. ఆ రెండు పాత్రలు ఆరణ్యపర్వశేషానికే కొసమెరుపులు.

ద్రౌపది అచ్చమైన ఇల్లాలు. ఆమె దమయంతివలె భర్తల చేత వదలబడలేదు. సీతవలె భర్తకు దూరం కాలేదు. సావిత్రివలె మృతులైన భర్తలను బ్రతికించుకొనలేదు. అయితే ఆయా పతివ్రతలు ఆయా పతివ్రతా ప్రవృత్తుల వలన ఏయే ఫలాలను సాధించారో వాటిని భారతకాలంలో కులసతిగా సాగించింది. ఆరణ్యపర్వంలో చెప్పబడిన పతివ్రతల మహిమలన్నీ ఒక యెత్తు. ద్రౌపది పాటించే కులసతి ధర్మం ఒక్కటీ ఒకయెత్తు.

చ. 'పతిఁ గడవంగ దైవతము భామల కెందును లేదు; ప్రీతుఁడై
పతి గరుణించెనేనిఁ గలభాషిణి భాసురభూషణాంబరా
న్వితధనధాన్యగౌరవము విశ్రుత సంతతియున్ యశంబు స
ద్గతియును గల్గు; నొండు మెయిఁ గల్గునె? యెన్ని తెఱంగు లారయన్.' (ఆర. 5.314)

ఎన్ని తెరగుల పతివ్రతలచరిత్రలైనా చెప్పే పరమార్థ మిదే!

(7). మూడు ఎఱ్ఱ(న) గుర్తులు

ఆరణ్యపర్వశేష పూరణం ఎఱ్ఱయ చేశాడని నిర్ణయించటానికి ముఖ్యంగా మూడు గుర్తులు చెప్పుకొనవచ్చును. 1.ఛందో విశేషాలు. 2. కర్ణుడి జన్మవృత్తాంతం. 3. మూలంలోని శిబిదుర్వాసాదుల వృత్తాంతాలను వదలిపెట్టటం.

ఈక్రింది ఛందోవిశేషాలు ఎఱ్ఱాప్రెగ్గడ నన్నయకంటె విలక్షణంగా పాటించినవి. వాటి వివరాలను డా॥ పాటిబండ మాధవశర్మగారి మాటలలో-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

"ఆరణ్యపర్వశేషమున ఎఱ్ఱయ రచించిన గద్యపద్యములు మొత్తము 1595. వాని వివరణములు - గద్యము - 496, కందము-413, సీసము-102, తేటగీతి-109, ఆటవెలది-91, చంపకమాల-135, ఉత్పలమాల-126, శార్దూలము-18, మత్తేభము-69, మత్తకోకిల-13, తరలము-8, తరువోజ 2, ఉత్సాహము-2, స్రగ్ధర-2, మహాస్రగ్ధర-2, మాలిని-1, వనమయూరము-1, లయగ్రాహి-1, మధ్యాక్కర-1, మధురాక్కర-2, స్రగ్విణి-1. గద్యములతో కలిపి మొత్తము 21 భేదములు. నన్నయ రీతి కొంత తోచునట్లు చేయుటలో ఎఱ్ఱయ ఛందముల విషయమునను గొంతయత్నము చేసెను. ఇతరులు వాడని, తాను ఇతరగ్రంథములలో వాడని మధ్యాక్కరను, మధురాక్కరను నన్నయ వాడెను గనుక తానును వాడెను. (కాని యతిస్థాన విషయమున నన్నయతో భేదించెను. నన్నయ మధ్యాక్కరలో అయిదవ గణము మొదట యతిని పాటించగా ఎఱ్ఱన నాల్గవ గుణము మొదట యతిని నిలిపెను. (4.309); నన్నయ మధురాక్కరను ఒక్కటే వాడినాడు (4.49) ఎఱ్ఱన రెండు రచించెను. (6,352, 7.309). కాని, వాని లక్షణాలలో భేదము లేదు). సీసములందు, ఆటవెలదులందు నన్నయ పాటించిన యతి, ప్రాసయతి నియమములు తానును ఈ పర్వమున పాటించెను. నన్నయ వ్రాసిన 13 సీసభేదములలో 7 భేధములు మాత్రమే వాడెను. కాని, నన్నయ వాడిన సర్వప్రాసయతి సీసమున నొక విశేషనియమును పాటించుచు రెండు సీసములు వ్రాసెను. (6.369, 7.350). సీసపాదములందు ఉభయఖండములందును ఒకే ప్రాసాక్షరము పాటించుట యందలి విశేషము. (పై పద్యములలోని రెండవ దానిలో) ఎత్తుగీతియందలి సర్వపాదములందును ప్రాసాక్షరము పాటింపబడినది. నన్నయ రచనలో నిట్టివి లేవు. లాక్షణికులు చెప్పిన సీసభేదములలో ఇవి యిముడవు."

"నన్నయ రచించిన 251 సీసములలో 225 సీసములకు ఎత్తుగీతులు ఆటవెలదులు. ఎఱ్ఱయ రుచి దీనికి భిన్నము. ఆయన వ్రాసిన 102 సీసములలో 62 సీసములకే ఆటవెలదులు గలవు. తేటగీతి, ఆటవెలది విషయమున గూడ నన్నయ నియమములను ఎఱ్ఱయ పాటించెను. వీనిలో మూడింట రెండువంతులు కేవల యతిమైత్రి గలవి. భిన్నవృత్తములు స్వీకరించుటలో నన్నయకు, ఎఱ్ఱనకు ఎంతో రుచిభేదము కనపడుచున్నది. నన్నయకంటె ఎఱ్ఱన పద్యములందును, విశేషించి వృత్తములందును ఎక్కువ ఆసక్తి ప్రదర్శించినట్లు స్పష్టము. వారు రచించిన భాగము లందలి వస్తు స్వభావము దీనికి కారణమైనను, ప్రధాన కారణము వారి అభిరుచి భేదమే." (ఆరణ్యపర్వపీఠిక-ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణ-పు.61-62)

కర్ణుడి జన్మవృత్తాంతం ఆదిపర్వంలో నన్నయ రచించాడు. అందులో కర్ణుడు సద్యోగర్భ సంజాతుడు. ఎఱ్ఱన భాగంలో కూడా కర్ణుడి జన్మవృత్తాంతం చెప్పబడింది. కాని, అందులో కుంతి నవమాసాలు రహస్యంగా మోసి కన్నబిడ్డ. ఈ భేదం మూలంలోనే ఉన్నది. నన్నయే ఈ భాగం రచించి ఉంటే ఏమి చేసేవాడో తెలియదు. ఎఱ్ఱయ మూలానికి న్యాయం చేశాడు. ఆ కథను రసవత్తర వర్ణనా మాధుర్యంతో నింపివేశాడు. నన్నయ కర్ణుడి రూపాన్ని ఎఱ్ఱయ కంటె మనోహరంగా చెప్పాడు. (ఆది. 5.26) బిడ్డను గంగలో వదలిపెట్టేటప్పుడు వాత్సల్యానికీ అపవాద భీతికీ నడుమ ఏర్పడిన సంఘర్షణను నన్నయ రమణీయంగా విశేష వృత్తాలలో వ్యక్తం చేశాడు (ఆది. 5.28,29). నన్నయ విస్తరించిన చోట ఎఱ్ఱయ తలవంచి నడిచి, కుంతి మనస్సులో పరిపరివిధాల మథనపడిన వేదనను వివరించకుండా నన్నయ సూచించి విడిచిన చోట ఎఱ్ఱయ తన ప్రబంధ పరమేశ్వరత్వాన్ని ప్రదర్శించాడు. (ఆర. 7.342-348) ఆ పద్య సప్తకం చక్కని వత్సల రసఖండకావ్యం. ఆ పద్యాలలో తక్కిన అన్నీ ఒక యెత్తు; అంతటి అందగాడైన బాలుడు మునుముందు యువకుడై ఎందరి యువతుల మనసులు దోచుకుంటాడో ఎందరి వీరులను భయపెడతాడో అని భావించిన పద్యమొక్కటీ ఒక యెత్తు. అది ఎఱ్ఱన ముద్ర. అక్షరరమ్యత నందగించుకొన్న ప్రసన్నమధుర చతురరచన.

ఉ. 'లాలితయౌవనోజ్జ్వల విలాసములం దిలకించు సుందరా
భీలవిచేష్టితం బమర భీమమనోభవసింహరేఖమై
వ్రాలవె యింక నీ వెలమి వామవిలోచన లంగజన్మలీ
లాలసలై విపక్షులు భయాలసులై ధృతి యేది చూడఁగన్.' (ఆర. 7.345)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నన్నయ కుంతి పసికందును పసికందుగానే భావించి దుఃఖించింది. ఎఱ్ఱయ కుంతి పసిగ్రుడ్డులో భావి జీవితాన్నంతా కలలుగని కన్నీరుపెట్టింది. ఆమె కంటె ఈమె అధికురాలు.

కొన్ని సంస్కృత ప్రతులలో కానవచ్చే కొన్నికథలు ఎఱ్ఱయ ఆరణ్యపర్వశేషంలో చోటుచేసికొనలేదు. అవి ఎఱ్ఱయ అనుసరించిన మూలప్రతులలో లేకపోవచ్చును. లేదా ఆయనే ఔచిత్య దృష్టితో వదలి ఉండవచ్చును. దక్షిణాది ప్రతులలో సామాన్యంగా కానవచ్చే కథలు ఎఱ్ఱయ భాగంలో లేకపోవటం చేత వాటిని అతడు కావాలనే వదలినట్లు భావించటానికి వీలున్నది. అట్టి వాటిలో మార్కండేయుడు చెప్పిన ఇంద్ర బక సంవాదం, యయాతి చరిత్ర, నేదుక వృషాదర్భుల వృత్తాంతం, ఇంద్రాగ్నులు శిబిని పరీక్షించటం, శిబి మహిమాభివర్ణనం, దుర్వాసుడు దుర్యోధన ప్రేరితుడై వేలాది శిష్యులతో ధర్మజుడి ఆశ్రమానికి వచ్చి, భోజనాలయిన తరువాత ద్రౌపది విశ్రాంతి తీసికొంటున్న సందర్భంలో - వారందరికి మృష్టాన్న భోజనాలు పెట్టుమని అడగటం, చివరకు శ్రీకృష్ణ ప్రభావంతో కుక్షులు నిండి, పాండవులకు శ్రీకృష్ణుడి అండ ఉన్నదని తెలిసి తిరిగిపోయిన కథ మొదలైనవి. పరిశీలించి చూస్తే వీటిని వదలటంలోనే ఔచిత్యం ఉన్నది.

మార్కండేయుడి కన్న వృద్ధతము డెవరో తెలిసికొనగోరిన ధర్మజుడి ప్రశ్నకు సమాధానంగా ఇంద్రద్యుమ్నాదుల చరిత్ర చెప్పబడింది. దీర్ఘాయువుకు తోడ్పడే జీవన విధానాలను వివరించే ఇంద్ర బక సంవాదం వంటివి వదలటం సమంజసమే. క్షత్రియమాహాత్మ్యాన్ని చెప్పే శిబిచక్రవర్తి కథ ఆరణ్యపర్వంలోని నన్నయ భాగంలో చెప్పబడి ఉన్నది. కావున పునరుక్తిని పరిత్యజించటం న్యాయమే. దుర్వాసుడి కథ వ్యాస భారతంలో చేరిన ప్రక్షిప్త కథ కావచ్చును. అటువంటి కథలు తమిళ భారతంలోనూ, తెలుగులోని స్త్రీల పాటలలోనూ కనపడుతున్నాయి. దుర్వాసుడి కథ కృష్ణమహిమను, ద్రౌపదిభక్తిని చెప్పేది. పై కథలు లేకపోయినా ప్రధాన కథకు ఎటువంటి ప్రమాదం లేదు. ఆరణ్యపర్వంలోని వస్తుగాఢతకు అవి అంతగా తోడ్పడవు కూడా.

ఆరణ్యపర్వశేషంలోని ఈ మూడు గుర్తులూ ఎఱ్ఱన కర్తృత్వాన్ని బలపరచే ప్రమాణాలు.

(8) మూడు రుచుల మువ్వన్నె సొబగు

కవిత్రయ కవిత ఆంధ్ర మహాభారతంలో త్రివేణీ సంగమంవలె కలిసింది. వస్తుధ్వని, కథాకథనరీతి గల నన్నయ కవిత గంగవలె సాగింది. రసధ్వని, నాటకీయ ఫణితి గల తిక్కన కవిత యమునవలె పొంగింది. అలంకారధ్వని, వర్ణనాత్మక ఫణితి గల ఎఱ్ఱన కవిత సరస్వతి వలె భాసించింది. ఎఱ్ఱనలో నన్నయ తిక్కనలు ప్రవహించారు. ఎఱ్ఱయ భారతీవృత్తిగా నిలిచాడు.

మూల భారతంలోని కథ వ్యాసుడిదైనా, తెలుగులో పండిన పద్యాలూ, అందులోని గుణాలూ కవిత్రయ ప్రతిభాజన్యాలే. అందులో శబ్దాన్ని శిల్పీకరించి గుణవృద్ధిని సాధించే తారకమంత్రం నన్నయ తెలుగు కవితకు ఉపదేశిస్తే, తిక్కన అర్థాన్ని ఆవిష్కరించే అనల్పగుణసిద్ధిని బ్రహ్మసూత్రంగా తెలుగు కవితకు ప్రబోధించాడు. ఎఱ్ఱన చతురర శబ్దార్థ గుణాలతో శోభాతిశయత్వాన్ని అలవరించే ఆర్జవం కవితకు ఆగమసూత్రంవలె నేర్పాడు. నన్నయ శబ్దగుణ మార్గం రథాలు నడిచే రాజమార్గంవలె తెలుగు కవితలో సాగింది. తిక్కన గారి అర్థగుణ మార్గం ఓడలు సాగే జలమార్గంగా మిగిలిపోయింది. రాజమార్గం నలుగురూ నడవటానికి, వింతలూ, వినోదాలూ, సాములూ, గరడీలు ప్రదర్శించటానికి వీలైన త్రోవ. అందువలననే ఎఱ్ఱన నన్నయ మార్గాన్ని అలంకరించి ఉత్సవయాత్ర సాగించాడు. తిక్కన మార్గం 'తన కావించిన సృష్టి తక్కొరుల చేతం గాదునాన్' సాగిందని పేర్కొన్నాడు. రసమార్గంలో విహరించ నేర్చినవారికి మాత్రం జలమార్గం నిపుణంగా పయనించటానికి వీలైన త్రోవ. పాదయాత్రతో బాటను తరించవచ్చును. యానపాత్ర ముంటేనే జలమార్గాన్ని తరించగలిగేది. శబ్దగుణం రచనకు యానపాత్ర. శబ్దగుణ ప్రస్థానానికి మహారథి నన్నయ. అర్థగుణ ప్రస్థానానికి కర్ణధారి అయిన అతిరథుడు తిక్కన. ఉభయగుణాలను ఉజ్జ్వలంగా పండించుకొని అలంకారకవచాన్ని తొడుక్కొన్న సమరథి ఎఱ్ఱన. సమరథి సామర్థ్యంలో అతిరథ మహారథుల జాడలు తోచినా నూత్నరుచితో వెలిగే ఒక మువ్వన్నె కాంతి ప్రకాశిస్తూ ఉంటుంది. ప్రబంధపరమేశ్వరుడి ఆరణ్యపర్వశేషం ఆ మువ్వన్నె వెలుగు!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

డా॥ పాటిబండ మాధవ శర్మగారు ఆ ముప్వన్నె ముచ్చటను ఒక పద్యంలో త్రివేణీసంగమంవలె దర్శించారు-

శా. 'ప్రీతుండై చనుదెంచె నాశ్రిత జనాభీష్ట క్రియాశీలుఁ డు
దీతామ్నాయుఁడు, నిర్విధూత దురితక్లేశుండు, యోగామృత
స్ఫీతస్వాంతుఁ డనంత సంతత సమావిర్భూత కారుణ్యధా
రాతోయస్నపనైక శీలుఁ డగు పారాశర్యుఁ డచ్చోటికిన్'. (ఆర. 6.103)

"ఈ పద్యమునందలి ధార నన్నయది, విఱుపులు తిక్కనవి, పదము లిరువురివి, కూర్పు ఎఱ్ఱనది. ఈ పద్యమున కవిత్రయ మున్నది. కవిత్రయమున కాశ్రయమైన వేదవ్యాసు డున్నాడు." ఇది మూడు రుచుల ముప్వన్నెసొబగు.

11. రామాయణ కథ మధురమనోహరం

ఆరణ్యపర్వశేషంలో రామాయణ కథ పెద్ద ఉపాఖ్యానం. ఎఱ్ఱన దానిని షష్ఠాశ్వాసంలో కొంత భాగం, సప్తమాశ్వాసంలో కొంత భాగం చెప్పాడు. మూలంలో 19 అధ్యాయాలలో (సం. 3. 258-276) 727 శ్లోకాలలో వ్యాపించి ఉన్న రామకథను ఎఱ్ఱన 315 గద్యపద్యాలలో రచించాడు. అంటే - తెలుగులో వివరంగా వ్రాసినట్లే. ఎఱ్ఱన షష్ఠాశ్వాసంలోని ఆఖ్యానాన్ని విఖ్యాతమాధుర్య మనోహరంగానూ, సప్తమాశ్వాసంలోని ఆఖ్యానాన్ని సవిస్తరమధురంగానూ, ఉపన్యసించానని పేర్కొన్నాడు. ఉభయాశ్వాసాలలో వ్యాపించి ఉన్న రామాయణకథ ఉభయస్వభావాలనూ కలిగి ఉంటుంది. అయితే బాలకాండ నుండి కిష్కంధ కాండవరకు ఉన్న కథ ఒక భాగంగా, సుందర యుద్ధకాండలు మరొక భాగంలో ఎఱ్ఱన ఎన్నుకొన్నాడు. మొదటి భాగాన్ని 147 గద్యపద్యాలలో, రెండో భాగాన్ని 168 గద్యపద్యాలలో చెప్పాడు. పూర్వార్ధం కంటె ఉత్తరార్ధమే విస్తరించింది.

రామాయణ కథను ఎందుకు చెప్పాడు? ఎట్లా చెప్పాడు? అనే ప్రశ్నలు ప్రస్తుతాలు. శ్రోత అడిగినట్లు ఈ కథను మార్కండేయుడు చెప్పాడు. మూలంలో ధర్మరాజు నాలుగు ప్రశ్నలు సూటిగా వేశాడు- "కస్మి న్నామ కులే జాతః? కిం వీర్యః కిం పరాక్రమః? రావణః కస్యవా పుత్రః? కిం వైరం తస్య తేనహి?" (3.258.4). ఈ ప్రశ్నలు తెలుగులో మారు రూపం తాల్చాయి. 'రాముం డెవ్వని వంశంబునవాఁడు? రావణుఁడెవ్వని తనయుండు? ఏమి నిమిత్తంబున సీతాపహరణంబు సేసె? రామరావణులకు సంగ్రామం బెట్లు ప్రవర్తిల్లె?" - అని ఎఱ్ఱన వేయించిన ప్రశ్నలు.

పాండవసైంధవ సంబంధాలు బావమరదుల సంబంధాలు. ఇరుతెగలవారు ఉత్తమ వంశజాతులే. అయినా సైంధవు డనౌచిత్యానికి పాల్పడ్డాడు. ఈ భూమికతో ధర్మరాజు రామరావణుల వంశప్రసక్తిని ముందుగా తెచ్చి ఉంటాడు. సైంధవుడి కథలో ఉభయ వర్గాల పరాక్రమాలను తులనాత్మకంగా చెప్పుకొన్న వైఖరి కనపడుతుంది. ద్రౌపది పాండవుల పరాక్రమాన్నీ, కోటికాస్య సైంధవులు సైంధవ పరాక్రమాన్నీ కీర్తించటం స్పష్టం. ఆ భూమికతో రామరావణ పరాక్రమాలను గురించి ధర్మజుడు మూలంలో అడిగాడు. తెలుగులో ఆ ప్రశ్న లేదు. మూలంలో రామరావణ వైరమెందుకు గలిగిందని ప్రశ్న. దానికి కారణం శూర్పణఖకు జరిగిన అవమానం, ఖరదూషణాది రాక్షస సంహారం. సీతాపహరణం ప్రతీకార వ్యూహంలో భాగం. అందువలన అది డొంక తిరుగుడు ప్రశ్న. ఎఱ్ఱన దానికి బదులు సీతాపహరణం ఎందుకు చేశాడని అడిగించాడు. శ్రోత- సైంధవుడు ద్రౌపదిని హరించటానికీ, రావణుడు సీతను హరించటానికీ ఉన్న భేదాన్ని తెలిసికొనదలిచాడు. ఆ తరువాత యుద్ధం జరిగింది. సైంధవ ఘట్టంలో కూడా విపుల యుద్ధం సాగింది. రామరావణ యుద్ధం కూడా అట్లాగే సాగి ఉండాలని భావించి ఆ వివరాలు ఎఱ్ఱనగారి ధర్మరాజు అడిగాడు. మూలంలోని ప్రశ్నలకంటె తెలుగులోని ప్రశ్నలు శ్రోతృహృదయంలో ఉన్న ఆకాంక్షను క్రమబద్ధం చేసి ఆవిష్కరించినవి. కథా జీవితానికి బాట వేసినవి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆరణ్యపర్వశేషంలో రామాయణ కథ - కథ కొఱకు చెప్పింది కాదు, కళ కొరకు చెప్పింది. మూలంలో రూపుకట్టని ఎన్నో రూపచిత్రాలు తెలుగులో మధురంగా మనోహరంగా సజీవంగా కళ్ళ ఎదుట నిలుస్తాయి. దానికి కారణం ఎఱ్ఱయ ప్రబంధశయ్య. భరతుడు చిత్రకూటంలో శ్రీరామదర్శనం చేసికొనటం రామాయణంలో ఒక ప్రసిద్ధ ఘట్టం. ఆ సందర్భంలో శ్రీరామ రూపవర్ణనం మధురంగా ఉండాలి. కాని, మూలంలో- ''దదర్శ చిత్రకూటస్థం, స రామం సహలక్ష్మణమ్, తాపసానా మలంకారం ధారయంతం ధనుర్ధరమ్'' (సం. 3.261.37) అని చెప్పబడి ఉన్నది. వేషానికి తపస్విగా ఉన్నా ధనుర్ధారియై లక్ష్మణ సహితుడై ఉన్న రాముడిని చిత్రకూటంలో చూచాడని మాత్రం చెప్పి ఊరుకొన్నాడు మూలకర్త. ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరుడై రామమూర్తిని దర్శింపజేశాడు-

మ. 'కనియెం గోమలనీల మేఘ సుభగాకారున్ జటావల్కలా
జినధారున్ సితభూతి భూషితుని రాజీవాక్షుఁ గల్యాణకీ
ర్తనుఁ గాకుత్స్థ కులప్రదీపకుని సీతాలక్ష్మణోపేతు స
న్మునిలోకార్చితు సత్కృపాభరణు రామున్ రాజచూడామణిన్.' (ఆర. 6.309)

ఎఱ్ఱయ్య మాధుర్య గుణంలో మనోహరంగా చిత్రించిన రామరూపచిత్ర మిది. కథలో ఆయువుపట్టులైన వ్యక్తుల దర్శనాలను 'కనియెన్' అనే క్రియతో ప్రారంభించటం ఎఱ్ఱయ తీరు. రామాయణంలో రాముడు, సావిత్రి కథలో యముడు ఒక ప్రబంధశయ్యలో భిన్న రసాలకు ప్రాణచిత్రాలుగా నిలిచారు.

మ. 'కనియెం గోమలి నీలమేఘ విలసత్కాలాంజనాకారు ఘో
రనిశాతోత్కట దంష్ట్రు నుజ్జ్వలచలద్రక్తాక్షుఁ బ్రత్యగ్రకాం
చనవర్ణాంబరు నంత్యకాల దహనజ్వాలా ప్రచండున్ జగ
జ్జన సంత్రాసను నొక్కదివ్యుఁ బటుపాశప్రౌఢ హస్తోద్ధతున్'. (ఆర. 7.217)

నన్నయ స్థిరచిత్రాల ప్రసన్న శిల్పి. ఎఱ్ఱయ మధురశిల్పి.

ఒక చిన్న ఉపాఖ్యానంలో రామాయణంలోని ప్రధాన పాత్రల అక్షర రూపశిల్పాలను నిలిపి ఒక ఆర్ట్‌గ్యాలరీ సృష్టించాడు ప్రబంధ పరమేశ్వరుడు. విభీషణుఁడు (6.278), ఋక్షవానరవీరులు (6.292), త్రిదండి వేషంలో రావణుడు (6.336), జటాయువు చేసిన గాయాలతో నిలిచిన రావణుడు (6.348), వాలిసుగ్రీవుల ఉగ్రరూపాలు (6.380), త్రిజటాస్వప్నంలో కనపడిన విభీషణ రాఘవ మూర్తులు (6.398, 399) అశోకవనంలో విషణ్ణమూర్తి సీత (7.28), సుషేణుడు (7.37); వానరవీరులు (7.64); కుంభకర్ణుడు (7.97), ఇంద్రరథం (7.146), కృశాంగి అయిన సీత (7.156). ఈ చిత్రాలు ఉపాఖ్యానాన్ని ఒక ప్రబంధంగా మార్చి వేశాయి. ఇంత తక్కువ కథలో ఇన్ని ఎక్కువ చిత్రాలు ఒక్కచోట కొలువు తీరటం అపూర్వం.

ఎఱ్ఱయగారి స్థిరరూప చిత్రాలు మధురంగా ఉంటే, చలచిత్రాలు మనోహరంగా ఉంటాయి. రామాయణంలో బంగారు లేడిని వర్ణించలేకపోతే అతడు కవే కాడని తెలుగువారు అనుకొంటారు. మూలంలో లేడికంటె వేగంగా కథ పరుగెత్తటంతో వర్ణనలకు తావే లేకపోయింది. భయంతో పరుగెత్తుతున్న బంగారు లేడిని ఎఱ్ఱన స్వభావోక్తి సుందరంగా మనకు చూపించి కన్నుల పండువు చేశాడు.

మ. 'పఱచున్ దవ్వుగఁ జేయలంతి నిలుచుం బట్టీక యాసాసలం
బిఱువోవుం బొదలందు డిందుఁ బొడమున్ బిట్టుల్కి వేదాఁటుఁ గ్ర
మ్మఱఁ జూచుం జెవి దార్చి నిల్చు మలయున్ మట్టాడుఁ గోరాడు నే
మఱినట్లుండుఁ దృణంబు మేయు నెలయున్ మాయామృగం బిమ్ములన్'. (ఆర. 6.327)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

హరిణవర్ణనంలో తెలుగు సాహిత్యంలో మొదటి వరుసలో నిలిచే మోహన సృష్టి ఇది. మనోహరత్వానికి మారు పే రీ రచన. ఇటువంటివే మరి రెండున్నాయి. దేని కదే.

మధువనంలో విజయోత్సాహంతో విహరించే వానరవీరుల విచిత్ర సహజచేష్టల మనోహర వర్ణనం.

ఉ. 'తేనెలు గ్రోలి క్రోలి, కడుఁ దియ్యని కమ్మని పండు లింపు సొం
పానఁగ నాని యాని, పరపందిన నీడలు మెచ్చి మెచ్చి, మం
దానిలశైత్యసౌరభ సమగ్రతకుం గడుఁ జొక్కి చొక్కి, యు
ద్యానమునందు మారుతసుత ప్రముఖుల్ విహరించి తృప్తులై'. (7.11)

లాటానుప్రాస శబ్దవైచిత్రి వానరచేష్టలలోని మాధుర్యాన్ని మనోహరంగా మలచి ఆస్వాదనీయతను పెంచిందీ రచనలో. ఎఱ్ఱయ చలచ్చిత్రాలలో ఉత్తమమైనది - సీతాదేవి శోకానుభావ చిత్రం. తిక్కన ప్రక్కన ఎఱ్ఱనను నిలిపే సాత్త్విక భావచిత్రం.

సీ. 'కన్నీరు జడిగొని క్రమ్మఁ బ్రాఁ కెక్కిన । కమ్రకపోల భాగములు గలిగి
యవశమై యొఱఁగిన యంగవల్లిక పొంత । నున్న భూమీరుహం బూత గాఁగ
వెడలు నిట్టూర్పుల వేఁడిమిఁ బగిలిన । యధరపల్లవము గారాకుఁ బోలఁ
దలఁపుల సందడి దండడించిన తాల్మి । గదిరి శిరఃకంపగతుల బెరయ

ఆ. నున్న పుణ్యమూర్తి నుత్తమ సౌందర్య । నవనతాస్య నార్త యైనదానిఁ
గని విదేహతనయఁ గా నెఱింగితి నేను । హా రఘుప్రవీర యనుచు నడల'. (అర. 7.28)

తిక్కన అభినయ శిల్పాన్ని, అచ్చ తెలుగు పదాల పొందికను, రసాభ్యుచిత బంధాన్ని పుక్కిటపట్టిన ఎఱ్ఱయ రచన ఈ పద్యం - మాధుర్య మనోహరత్వాలకు మచ్చుతునక.

ఎఱ్ఱన తిక్కన యుద్ధ వర్ణనలలోని మేలిమి శిల్పాన్ని తెచ్చి తన రణ చైతన్య చిత్రాలు మలచి రామాయణ కథను రక్తికట్టించాడు. యుద్ధాలలో ద్వంద్వ యుద్ధాల కొక ప్రత్యేకస్థానం ఉన్నది. వాలిసుగ్రీవులు, రామరావణులు, లక్ష్మణమేఘనాదులు మొదలైన వీరుల జంట యుద్ధాలు మూలంలో మాటమాత్రంగా ఉన్నా, ఎఱ్ఱన వీర రౌద్రరసతరంగాలుగా మలచాడు. యుద్ధ ఘట్టాలలో వీరోచిత ప్రసంగాలకు కూడా ప్రాముఖ్యం ఉంటుంది. ఆంగికాభినయానికి అవి వాచికాభినయ గౌరవాన్ని కలిగిస్తాయి. వీటికి తోడు కవి స్వీయ ప్రతిభతో వీరవిభావాలను వర్ణించి ప్రత్యేకతను ప్రదర్శిస్తాడు. వీటికన్నిటికి ఎఱ్ఱయ రామాయణ కథలో ఎన్నదగిన ఉదాహరణ లున్నాయి. సంభాషణలకు- 6వ ఆశ్వాసంలోని 269, 318, 320, 338, 341, 405, 406, యుద్ధ చైతన్య చిత్రాలకు-6. 346, 347, 380-384, 7. 64,66, 82-84, 118, 127, 142 మొదలైనవి. పుష్పకారూఢులై అయోధ్యకు బయలుదేరిన సీతారామచంద్రుల దర్శనం ప్రబంధ పరమేశ్వరుడు మధుర మనోహరంగా చేయించాడు.

మ. 'అవిరోధంబుగ జానకీసహితుఁడై యాబద్ధరత్నప్రభా
నవపుష్పం బగు పుష్పకం బను విమానం బెక్కి యర్కాన్వయ
ప్రవరుం డిమ్ముల నేఁగె సమ్మదభరప్రాగ్భాగవారాకర
ప్లవమానుం డగుచుం బురంబునకుఁ బ్రాప్తశ్రీవిశేషోన్నతిన్.' (అర. 7.166)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆరణ్యపర్వశేషంలోని రామాయణం కథ యథావాల్మీకం కాదు. "రామోపాఖ్యానమునందలి విశేషాంశములను స్వర్గీయ పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రిగారు విపులముగా చర్చించినారు. వాల్మీకి రామాయణములో లేని నూతనాంశములెన్నియో దీనియందు గలవు. అందులో కొన్ని- రావణకుంభకర్ణాదుల పూర్వజన్మ వృత్తాంతము, వాలిసుగ్రీవులు యుద్ధము చేయుచుండగా హనుమంతుడు సుగ్రీవుని హారాలంకృతుని చేయుట, త్రిజటాకథా సందర్భమున అవింధ్యుడను వృద్ధరాక్షసుని వృత్తాంతము మున్నగునవి. సీత యగ్ని ప్రవేశము చేసినట్లు ఎఱ్ఱన వ్రాయలేదు. రామాయణ సన్నివేశములను గూర్చి విభిన్న కథనములు ప్రాచీనము నుండియు వాడుకలో నుండునట్లు తోచును" అని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనముగా రన్నారు. (ఆరణ్య పర్వపీఠిక- 'ఎఱ్ఱాప్రెగడ'- ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆంధ్ర మహాభారత సంశోధిత ముద్రణం పు. 77).

ఎఱ్ఱన రామాయణం దొరకలేదన్న దిగులు ఈ కథ చదువుకొన్న తెలుగువారికి తీరిపోతుంది.

12. సావిత్రి కథ మధురమహోజ్జ్వలం

భారతీయ సాహిత్యంలో సావిత్రికి పతివ్రతామణులలో అగ్రతాంబూలం అందుతుంది. 'పతిభక్తి తాత్పర్యంబున నఖిల దుఃఖంబుల కోర్చి శుభంబులొందిన పుణ్యసతి చరిత్రం' (ఆర. 7.169)గా సావిత్రి కథ ఆరణ్యపర్వశేషంలో చెప్పబడింది. ఈ కథంతా చెప్పి మార్కండేయు డిట్లా అన్నాడు.

క. 'తనమగని, నత్తమామల । జననీ జనకులను దన్ను సకలంబును దా
ఘనముగ సముద్ధరించెను । జనవర! సావిత్రి ధర్మ చరితము కంటే!'

తే. 'ఆ పతివ్రతయట్ల యీ యాజ్ఞసేని । పరమకల్యాణ కర్మసంభావనీయ
యధిప! మిమ్మును మీ యఖిలాన్వయంబు। నుద్ధరించు మహాభాగ్యయుక్తిఁ జేసి'. (ఆర.7.279,280)

'సావిత్రి ధర్మచరితము కంటే!' - అన్నాడు ఋషి. 'వింటే!' అనలేదు. అంటే - సావిత్రి ఆచరించిన ధర్మాన్ని దర్శించావా? అని భావం. చూచేది, వినేది భౌతిక దృష్టికి కనపడే ప్రవృత్తి ధర్మం. బుద్ధితో దర్శించేది నివృత్తి ధర్మం. సావిత్రి జీవితంలో నైష్ఠికురాలైన వ్రతశీలి. ఆ వ్రతం పతివ్రతమే. దానివలన లౌకిక, అలౌకిక, భౌతిక ఆధ్యాత్మిక ఫలాల నామె సాధించింది. దానిని దర్శించి తెలిసికొనాలి. అంటే - సావిత్రి కథ దర్శనమూల మని తాత్పర్యం. ఆధ్యాత్మిక అంతరార్థ దర్శనం కథాఫలమని ఫలితాంశం. సావిత్రి కథ లౌకికకథ కాదు; ఆధ్యాత్మిక ప్రతీకాత్మక అభివ్యక్తి.

సావిత్రిది ధర్మ చరితము - ధర్మాన్ని శీలంగా మార్చుకొన్న ప్రవృత్తి చరితము. చరితమంటే కథ అనే అర్థం లౌకికం. శీలం అనే అర్థం పారమార్థికం. ఆమె తమవారినందరినీ ఉద్ధరించింది. తమను తాము ఉద్ధరించుకొని ఇతరులను ఉద్ధరించేవారే ఉత్తములు. సావిత్రి అటువంటి ఉత్తమురాలు.

ఆమె తనపతిని ఉద్ధరించింది. ఎట్లా? ముందు ప్రేమించి, ఆ తరువాత వివాహమాడి, పతివ్రతగా ఆయన ననుసరించి, ఆపై మృత్యువు నుండి విముక్తుడిని చేసి ఉద్ధరించింది. వివాహమాడిన సంవత్సరానికి విగతజీవు డౌతాడని తెలిసి తెలిసి పెండ్లాడి, మృత్యుభయం లేకుండ పతివ్రతాన్ని చేపట్టి అమృతత్వాన్ని సాధించిన సావిత్రిశీలం పతివ్రతా దర్శనానికే ఒక ప్రతీక. సావిత్రి కథను వ్యాఖ్యానించాలంటే సావిత్రి ధర్మశీలాన్ని దర్శించి వివేచించాలి. ఎందరో మహానుభావులు వేదకాలం నుండి సావిత్రి కథాతత్త్వాన్ని వ్యాఖ్యానిస్తూనే ఉన్నారు. అది యుగయుగాల కథ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సావిత్రికథలో కొన్ని గ్రంథగ్రంథులున్నాయి. సవితృసంబంధమైన శక్తి- అంటే పరిశుద్ధజ్ఞానం సావిత్రి. ఆమెను ఉపాసించాడు మద్రేశుడు పదునెనిమిదేండ్లు. 18 బ్రహ్మసంఖ్య. దానిసిద్ధి సావిత్రి దర్శనం. అతడు కొడుకును కోరాడు. ఆమె కూతురు నిచ్చింది. మద్రేశుడు తన వంశాన్ని ఉద్ధరించే కొడుకును కోరాడు. సావిత్రి ఉభయవంశాలను ఉద్ధరించగల పుత్రిక నిచ్చింది. మద్రేశుడికి ఆధ్యాత్మికంగా పుత్రిక విలువ తెలియదు. అందువలన తన కోర్కె సఫలం కాలేదని బాధపడి దేవితో మొరపెట్టుకొన్నాడు. ఆ మొర నాలకించిన సావిత్రి 'యోగమూర్తి, గాఢకారుణ్య వికచహృత్కమల'. ఈ మాటలు ఎఙ్టన ఎందుకు వాడినట్లు?

ఆత్మను పరమాత్మతో యోగం చేయగలశక్తి యోగశక్తి. ఆమె స్త్రైణమైన చైతన్యమూర్తిగా నిలిచి ఉన్నది. యోగవిద్య స్త్రీ శక్తి యొక్క చిత్కళయే. వివాహమంటే స్త్రీ-పురుషునితో యోగించటమే. జీవాత్మ పరమాత్మతో అద్వైత సిద్ధి పొందినట్లు. ఈ రహస్యాన్ని దానిశక్తిని, తత్ఫలాన్నీ స్త్రీ గార్హస్థ్య ధర్మనిర్వహణం ద్వారా జీవితానుభవంగా మారుస్తుంది. స్త్రీ పురుషునితో సంసారం చేయటం ఆధ్యాత్మికంగా వారిరువురు అమృతమూర్తులని, పరమాత్మ స్వరూపులనీ, ద్వైతం లేదనీ, ఉన్నా అది లౌకికమనీ నిరూపించటమే. ఆ తత్త్వమంతా చెపితే తెలిసికొనే వివేకం మద్రేశుడికి లేదు. అందువలన పుత్రుడి నివ్వటానికి బ్రహ్మ ఆజ్ఞ లేదని చెప్పింది సావిత్రి. అంటే అతడి కింకా బ్రహ్మజ్ఞానస్థాయిలో తత్త్వదర్శనం చేసే శక్తి రాలేదనీ, అది కుమార్తె వలననే కలుగుతుందని చెప్పింది. పుత్రిక కారణంగా కాలాంతరంలో నూరుగురు కొడుకులు కలుగుతారని తెలిపింది. అతడు కోరింది ఒక కొడుకునైతే, సావిత్రీదేవి ఇచ్చింది పుత్రశతాన్ని. దైవయోగం వలన కలిగించగలిగిన శక్తిమంతురాలైన పుత్రికను, ఒక పుత్రిక నూర్గురు పుత్రులతో సమానమన్నట్లు సూచించింది. నిజానికి - ఇవన్నీ దేవరహస్యంగా దాచవలసినవే. మద్రేశుడి దైన్యాన్ని చూచి తల్లివలె కరిగిపోయింది సావిత్రి. గాఢమైన దయతో వికసించిన హృదయంతో ఆ సంగతులన్నీ చెప్పింది. శక్తి రూపిణి అయిన స్త్రీ కరుణిస్తే మాతృవాత్సల్యం అమృతమై వర్షిస్తుంది.

సావిత్రీదేవి ప్రసాదంతో మద్రపతికి పుత్రిక పుట్టింది. ఆమె కూడా సావిత్రియే. పరాశక్తి వనితగా జన్మించి పతివ్రతం నిర్వహించి కులాన్ని ఉద్ధరిస్తుంది. అది ఒక యోగప్రస్థానం. వనితకు కన్యాత్వం, పురుషుడికి బ్రహ్మచర్యం పుట్టుకతో వచ్చే దివ్యలక్షణాలు. స్త్రీ తన కన్యాత్వాన్ని బ్రహ్మచర్యంతో యోగింప చేస్తుంది. అది ధర్మం, యోగం. బ్రహ్మలో చరించే పురుషతత్త్వంతో యోగమైన స్త్రీ- బ్రహ్మంలోనే చరిస్తుంది. అప్పుడు పురుషుని కంటె స్త్రీ తత్త్వతః భిన్నం కాదు. దీనిని సాధించటానికే ఉపవాసవ్రతం. దేవుడితో కలిసి వసించటం ఉపవాసం. పరమాత్మ చైతన్యమైన భర్తతో కలిసి పరమాత్మ చైతన్యంగా జీవించే జీవాత్మ యోగసాధనమే ఉపవాస వ్రతం. సావిత్రి త్రిరాత్రోపవాసం చేస్తుంది. దీని తాత్పర్యం యోగపరంగా చెప్పుకొనాలి. శరీరాలుగా రెండుగా బ్రతికే భార్యాభర్తలలో భార్య ఉపవసించటం వలన మొదటి రాత్రి దేహభావం తొలగిపోతుంది. రెండవ రాత్రి ఆత్మభావంలో అభేదస్థితి కలుగుతుంది. మూడవ రాత్రి అద్వైతసిద్ధి ఏర్పడుతుంది. ఈ సాధన సావిత్రీదేవీ దత్తమైన ఆత్మజ్ఞానం వలన పుట్టుకతోనే తెలిసికొనిన స్థితప్రజ్ఞురాలు మద్రేశుడి కూతురు సావిత్రి.

సావిత్రి యుక్తవయస్కురాలుకావటం గార్హస్థ్య ధర్మాన్ని ఆశ్రయించి పతివ్రతాన్ని ప్రారంభించే సమయ మాసన్నం కావటం. ఆమె తనంతట తాను ఎన్నుకొన్న వరుడు సత్యవంతుడు. నిత్యసత్యస్వరూప జ్ఞానానంద చైతన్యం సత్యవంతుడనే భర్త. అతడల్పాయుష్కుడని, సంవత్సరంలో చనిపోతాడని నారదుడి హెచ్చరిక. అప్పుడు సావిత్రి అన్నమాట లివి -

క. 'వినుము మనోవాక్కాయము । లను మూఁడుదెఱంగు లందు నంతఃకరణం
బనఘ! ప్రధానము గావున । మనసునఁ గైకొన్న భర్త మానుటఁ దగునే?'. (ఆర. 7.183)

భర్తృభావన శరీరస్పృహతో, వాక్స్పృహతో, అంతరంగ స్పృహతో మూడంచెలలో ఉంటుందనీ, అందులో చివరిదే భర్తృ భావనకు ముఖ్యమనీ సావిత్రి చెప్పింది. ఆ భావన యోగులైన వారికే ఏర్పడుతుంది. నారదుడు దానిని గుర్తించి, వెంటనే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆమెకు సత్యవంతుడితో వివాహం చేయుమని అనుమతించాడు. 'కమలానన చేసిన పుణ్యగౌరవంబున నయినం బ్రియుండు పరిపూర్ణచిరాయు రుపేతుఁడయ్యెడున్' - అని ఆశీర్వదించాడు నారదుడు.

అనుకొన్న ప్రకారం వివాహమైపోయింది. సావిత్రి వనవాసయోగ్యమైన నారచీరలు కట్టి, దీక్షావ్రతంతో పతిసేవ చేస్తున్నది. త్రిరాత్రోపవాసవ్రతం చేసింది. ఆ తరువాత భర్తతో కలిసి అడవికి పోయింది. పెద్దలు ఆమెకు 'సౌభాగ్య భాగ్యవర్ధనం' కావాలని ఆశీర్వదించారు. పతియొక్క పరిపూర్ణానురాగం సౌభాగ్యం. దానిని పూర్తిగా పొందటం భాగ్యం. అంటే పతివ్రత తనకును భర్తకును యోగసిద్ధిలో ఎటువంటి భేదం లేదని అనుభవంలోకి తెచ్చుకొనటం. దీనినే భార్యాభర్తల అద్వైతసిద్ధి అంటారు.

సత్యవంతుడు మృతి చెంది దేహాన్ని వదలుతాడు. సావిత్రి దేహంతో బ్రతికి ఉంటుంది. అద్వైతసిద్ధి పొందిన తరువాత, శరీరావరణ భావం పోయి ఆధ్యాత్మిక స్థితియే ఆమెలో జాగృతమై ఉంటుంది. అందువలన మృత్యువు అటువంటి దంపతులను విడదీయలేడు. అందుకే దూతలను పంపక తానే వచ్చాడు. తన రాక గమనించి దర్శించగలిగిన సావిత్రి ఆత్మజ్ఞానానికి ఆశ్చర్యపోయాడు యముడు. సత్యవంతుడి ప్రాణాలను బంధించి యముడు తనవెంట తీసికొనిపోతున్నా, సావిత్రి ఆయన వెంటనే ఎటువంటి అవరోధాలు లేకుండా పోగలిగింది. ఎట్లా? ఆ ప్రశ్నయే సావిత్రి కథలో యక్షప్రశ్న.

" By her power of austerity, it appears that her life and her husband's life is inseparable and hence God of Death had to surrender and give her the boon of restoring her husband to life". (The light of Ramayana P.325) అని జస్టిస్ పమిడిఘంటం కోదండ రామయ్యగారు మంచి తీర్పు చెప్పారు. యమపాశబద్ధుడైన సత్యవంతుడి జీవుడు సావిత్రి జీవుడి కంటె భిన్నుడు కాడని సావిత్రి తన త్రిరాత్రోపవాసయోగసిద్ధి వలన యముడి కర్థమయ్యేటట్లు చేసింది. అందువలననే భర్తవెంట యోగయానం చేయగలిగింది. సావిత్రి యముడివెంట పోవటం లేదు. యముడే సత్యవంతుడితోపాటు సావిత్రిని కూడా తత్త్వతః తీసికొనిపోతున్నాడు. కాగా, సావిత్రి జీవుడికంటె సత్యవంతుడి జీవుడు కూడా భిన్నుడు కాడు. ఆ సత్యం సత్యవంతుడి అనుభవంలో లేదు. అందువలన అతడు పేరుకు సత్యవంతుడు. అర్హతకు సత్పురుషుడు, సత్యసాధకుడు. దాని ఫలమే యమపాశబద్ధత. సావిత్రి అమృత జీవి. ఆమెతో అభిన్నుడైన సత్యవంతుడు మృతస్థితిని పొందటానికి వీలులేదు. సత్యవంతుడి మృతి ఆపాదితమే కాని సహజం కాదు. ఆ స్థితి సావిత్రి పతివ్రతాయోగసిద్ధివలన అతడికి కలిగింది. యముడు సందిగ్ధంలో పడ్డాడు-' 'సత్యవంతుడి ప్రాణాలు తీయబోయి సావిత్రి ప్రాణాలు కూడా తీశానా?' అని. పరీక్షించి చూచాడు. సావిత్రి పతివ్రత యోగప్రస్థాన సిద్ధులను క్రమంగా ఆవిష్కరిస్తూ వస్తున్నది. గమనించాడు.

క. 'పతు లెందుఁ జనిన నచటికి । సతులుం జనవలదె? నీ ప్రసాదమునను మ
త్పతిభక్తి కతమునను సం । స్తుతగుణ! నా కరుగరాని చోటుం గలదే?' (అర. 7.222)

పై పద్యంలోని వాక్యాలు ఎఱ్ఱన చతురోక్తులు. కాకువులు వాటి ప్రాణాలు. చనవలదె? అరుగరాని చోటుం గలదే? అనే మాటలు రెండర్థాల నిచ్చేవి. భర్త ఎక్కడికి వెళ్ళితే అక్కడికి భార్య వెళ్ళకూడదా? ఇది ఒక లౌకికార్థం. తప్పకుండా వెళ్ళాలి అనో, వెళ్ళకుండా ఆపవచ్చునా? అనో (చనన్+వలదె?) ఏర్పడే అర్థవిశేషం ధర్మపరమైన అర్థం. వెళ్ళకూడని చోటున్నదా అని లౌకికార్థం. ధర్మప్రసాదం చేత, పతిభక్తి ప్రభావం చేత (పురుషకారదైవానుకూల్యాల అనుసంధానం వలన) వెళ్ళలేని చోటు ఉన్నదా? అని ధర్మపరమైన అర్థం. లౌకికార్థం తెలిసినవారు లౌకికులు. అందులోని ధర్మతత్త్వం తెలిసినవారు ధర్మదేవతలు. వారు లోకంలో సజ్జనులవలె దర్శనమిస్తారు. వారిదర్శనం పాపనాశనం చేస్తుంది. ఏదోవిధంగా ఫలాన్నిస్తుంది. ఇది ధర్మవర్తనం వలన కలిగే యోగం. దానిని చతురోక్తి పథంలో పలికింది సావిత్రి. యము డాశ్చర్యపోయాడు-ఆమె చతుర (ప్రగల్భ) వచనాలకు. ఆమె ఉదారవాగ్భంగికి మెచ్చి పతిప్రాణాలు తప్ప ఏదైనా వరమిస్తానన్నాడు. సాళ్వభూపతికి కనుచూపు వచ్చేటట్లు వరం కోరింది సావిత్రి. యముడు దానిని ప్రసాదించాడు. కథలో ధర్మసూక్తి సావిత్రిది. చతురోక్తి ఎఱ్ఱయది.

వరమిస్తే భర్తనుండి వేరుపడుతుం దనుకొన్నాడు యముడు. ఆమె మరల యోగయానం సాగించింది. మొదటివరం పతివ్రతాధర్మంలోని సహగమన ధర్మానికి అందినఫలం. ఆపైన సావిత్రి ఆర్యధర్మాన్ని గురించి ప్రస్తావించింది. యముడు ఆర్యుడు కావటంతో ఆశ్రితుల కోర్కెలు తుదముట్టతీర్చటం ఆయన కర్తవ్యం. అతడు ధర్మదేవత. ధార్మికు లాచరిస్తున్న ధర్మానికి అనుగుణమైన ఫలాన్ని అందించాలి. అతడు జీవులకు కర్మఫలాలను సమంగా సమకూరుస్తాడు కాబట్టి సమవర్తి. భూతాలను నియమిస్తాడు కాబట్టి యముడు, పాపాలను శమింపచేస్తాడు కాబట్టి శమనుడు. ఈ మాటలతో సావిత్రి యముడిని ప్రశంసించింది. ఇది పైకి ప్రశంసే కాని, లోనారసి చూస్తే పతివ్రత స్వీయధర్మంతో సాధించే యోగశక్తుల ఫలాన్ని ప్రకటించటం. అంటే పతివ్రతా ధర్మయోగంవలన సర్వార్థసిద్ధి, సర్వధర్మ సమభావం, సత్కర్మాచరణశీలం, శమదమాది తపస్సిద్ధులు కలుగు తాయని సావిత్రి చెప్పింది. అవి ఆమె సాధించిన సిద్ధులు. వాటికి తగిన ఫలాన్ని గుర్తించి ఇవ్వటం ధర్మదేవత ధర్మం- అని పలికింది. ఇవి చమత్కార వాక్కులు కావు. మధురోక్తులు.

ఆ మాటలు విని, దప్పికవేసినవాడు చల్లని నీరు త్రాగి ఎంత సంతోషపడతాడో అంత ఆనందం పొందా డా ధర్మదేవుడు. ఆమె మాటల చమత్కారాన్ని చూచి కాదు, ఆమె పొగడ్తలకు ఉబ్బిపోయి కాదు. సావిత్రి ధర్మాన్ని వాఙ్మనః క్రియలలో సమంగా సాధించి ఆచరిస్తున్నందుకు. అందుకే ఆర్ద్రుడై పతిప్రాణాలు తప్ప ఏ వరమైనా కోరుకొనుమన్నాడు. ద్యుమత్సేనుడు కోల్పోయిన రాజ్యం తిరిగి అతడికి లభించేటట్లు కోరింది. యము డావరాన్ని ప్రసాదించాడు. పతిభక్తికి తగిన ఫలాన్ని పొందావు, ఇక తిరిగి పొమ్మని సావిత్రిని కోరాడు.

ఆమె తాను తిరిగిపోవటం తన ధర్మం కాదని ప్రతిపాదించింది. 'ధర్మాత్ములు తాము చేసే ధర్మాన్ని ఏ పరిస్థితులలోనూ వదలకూడదనీ, ఆ దీక్షలో మోహతాపాలకు తావుండరాదనీ ధర్మం తెలిసినవారు చెప్పుతారు. ప్రథమ ధర్మాధ్యక్షుడైన యమధర్మరాజే ఆ ధర్మస్థితిని రక్షించకపోతే ఇక మరెవరు దిక్కు?' అని ప్రశ్నించింది.

క. 'కావునఁ బతియనుగమనం । బేవిధమున విడువఁ దగునె? యెట్లయినను మో
హావేశముఁ బొందక ధ । ర్మావస్థితి సలుపవలదె? యవహితబుద్ధిన్.' (ఆర. 7.238)

ఈ పద్యంలో పతి అనుగమనం చేయకుండా విడవటం ధర్మమేనా? మోహావేశాలకు లోనుకాకుండా ధర్మాన్ని నిలపటం ధార్మికుల కర్తవ్యం కాదా?- అని తన ధర్మాచరణస్థితి యొక్క నిత్యత్వాన్ని స్థిరపరిచింది. 'పతి అనుగమన' మంటే మృతియా? యమపాశబద్ధతయా? పతి ఎక్కడికి పోతున్నాడని సతి ఆయన వెంటపోవాలి? ఈ ప్రశ్నలన్నీ తలయెత్తుతాయి. సావిత్రికి పతిస్థితియే సతిస్థితి. ఆతడు మృతుడైతే సతి మృతిపొందటమే ధర్మం. యము డామె ప్రాణాలను కూడా తీసికొనిపోవాలి కాని, రాకూడదని అడ్డుపెట్టకూడదు- అని ఆమె తాత్పర్యం.

సతీపతుల మధ్య సావిత్రి సాధించిన అభేదభావస్థితిని యముడు గమనించాడు. ఆమెను 'ప్రకటధర్మవిశేష తత్పరు' రాలని అభినందించి, పతిప్రాణం తప్ప మరొకదాన్ని కోరుకొనుమన్నాడు. మద్రేశ్వరుడికి పుత్రశతం కలగాలని కోరింది. ఆ వరాన్ని ధర్ముడిచ్చాడు. మూలంలో సావిత్రి అయిదు వరాలు కోరింది. మద్రేశ్వరుడికి శతపుత్రలాభం వరంగా ప్రసాదించిన తరువాత సావిత్రి తనకు కూడా శతపుత్రలాభాన్ని వరంగా కోరుతుంది. యముడు దానినీ ఇస్తాడు. ఆ తరువాత భర్త లేకుండ పుత్రు లెట్లా కలుగుతారు? అది ధర్మవిరుద్ధం కాదా? అని ప్రశ్నించి యముడిని ఉచ్చులో పడవేస్తుంది. చివరకు తప్పనిసరియై సత్యవంతుడి ప్రాణాలను తిరిగి ఇచ్చాడు. ఎఱ్ఱన ఈ భాగం వదిలాడు. ఆ ప్రశ్న అడిగిన సావిత్రి అచ్చమైన లౌకిక ప్రజ్ఞ ప్రదర్శించింది. ఉదాత్తత కోల్పోయింది. అందువలన ఎఱ్ఱన వదలిఉంటాడు.

సతీసహగమనానికి ధర్మయోగపరమైన వ్యాఖ్యానం చేసింది సావిత్రి. యమధర్మరాజు ఉక్కిరిబిక్కిరయ్యాడు. కాలంతీరిన సత్యవంతుడిని తీసికొనివెళ్ళే హక్కు ఉంది కాని, కాలం తీరనిది మరణంలో సతిని పతితో అనుగమనం చేయించే హక్కు యముడికి లేదు. యముడు అప్పుడొక చమత్కారం చేశాడు. 'సావిత్రీ! నీవు నీపతి వెంట చాల దూరం నడిచివచ్చావు. నీ అనుగమన ధర్మంలో చాల అలసిపోయావు. ఇక తిరిగి పొ'మ్మన్నాడు. ఆమె వెంటనే స్పందించింది. భర్త నాశ్రయించిన ఆమెకు అలసట లేదనీ, 'సతులకు నన్యమెట్టిదియును ధర్మమె భర్తృ సంశ్రయము కాక' అనీ తేల్చిచెప్పింది.

సావిత్రి పతివ్రతాధర్మ ప్రస్థానంలో సాధించింది అద్వైతయోగసిద్ధి. దానివలన ఆమెకు అమృతసిద్ధి కలిగింది. ఆమెవలన కలిగిన యోగంతో సత్యవంతుడు మృతుడు కాలేడు. దానిని ధర్ముడు గుర్తించి పరిష్కారం కొరకు యోచించాడు. సావిత్రి ఆత్మధర్మనిరతులైన పుణ్యాత్ముల వర్తనాన్నీ, సాప్తపదీన న్యాయాన్నీ ఉపన్యసించింది. 'పతివినాకృత' (పతిలేకుండా చేయబడిన వనిత) లోకంలో ఎట్లా దూషిత ఔతుందో, సర్వమంగళ విశేషాలకు దూరమౌతుందో చెప్పింది. ధర్మాచరణానికీ, తత్ఫలసిద్ధికీ జీవితంలో ఇహపర సంబంధం ఉంటుందని విడమరచి చెప్పింది. భార్యాభర్తలు కలిసి ఇహంలో ఉంటేనే, పరంలో అనుభవించదగిన అద్వైతయోగసిద్ధి కలుగుతుందని వివరించింది. ఆమెలో పతివ్రతా ధర్మం అమృతయోగంగా నిలిచింది. అది లౌకికంగా ఫలించాలి. అదే సిద్ధులు సాధకుల కివ్వగలిగిన వరం. ధర్ముడు ప్రసన్నుడైనాడు. పూర్ణఫలాన్ని అందించాడు.

చ. 'కొను మిదె నీ మనఃప్రియునిఁ గోమలి, వీఁడు చతుశ్శతాబ్దముల్
మను నిటమీఁదఁ; బుత్రులఁ గ్రమంబున నూర్వురఁ గాంచుఁ; గీర్తివ
ర్ధనుఁ డగు, సంతతాధ్వర వితానములం బరితుష్టిసేయు న
య్యనిమిషకోటి కెల్లను, నిజాన్వయమౌళివిభూషణంబగున్'. (ఆర. 7.251)

ఈ పద్యం తరువాత జరిగిన కథ అంతా సావిత్రి సాధించిన వరాల ఫలానుభవమే. ఆ వరుసనంతా మధురంగా చెప్పి ఎఱ్ఱన సావిత్రి కథను సర్వాంగసుందరం చేశాడు.

ఎఱ్ఱన సావిత్రి కథలోని తాత్త్వికార్థాన్ని ధ్వనిమయం చేయగల చతురోక్తులను రచనలో మణులవలె నిబంధించాడు. ఆ కాంతులలో కథలోని బోధ వెలుగులోకి వచ్చింది.

సావిత్రి కథను ఎన్నుకొని అరవిందయోగి ఒక మహాకావ్యాన్ని ఆంగ్లంలో రచించారు. ప్రపంచసాహిత్యంలో సమున్నతాధ్యాత్మికేతిహాసంగా అది ప్రసిద్ధికెక్కింది. ఆయన భావంలో సావిత్రికథ అమృతత్వసాధన యోగం. పరాశక్తి ప్రాపంచికక్లేశ విమోచనార్థం మానవరూపంలో సావిత్రిగా అవతరించింది. మూర్తీభవించిన సత్యమే సత్యవంతుడు. మానవలోకంలో సత్యాన్ని స్థాపించటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్న మానవప్రవృత్తికి ప్రతినిధి సత్యవంతుడు. అతడు విధివశాత్తు మరణిస్తాడు. అయితే ఆ మానవయత్నం విషాదాంతం కారాదు. అందువలన మూర్తీభవించిన దివ్యానుగ్రహమైన సావిత్రి అసత్యసూత్రధారి అయిన యముడితో పోరి, తన తేజస్తత్త్వంతో మృత్యుదేవతా స్వరూపాన్ని లయం చేసి, మానవుడికొరకు, మానవ జగత్తు కొరకు అమృతత్వాన్ని సంపాదించింది.

సావిత్రి మగడిని ఉద్ధరించటమంటే ఈ విధంగా నిశ్చయించగలిగితే మిగిలినవారిని ఉద్ధరించిన కథకు భాష్యం చెప్పటం సులభం. దైవానుగ్రహం లేని సత్యసాధకుడు సత్యవంతుడు. ఆ కొడుకును నమ్ముకొన్న తల్లిదండ్రులకు రెండు కళ్ళూ పోయాయి. అంటే వారికి ఇహపరాలూ గ్రుడ్డివైపోయాయి. ఇహసుఖాలు దూరమయ్యాయి కాని, వారు తపస్సుకూ, జ్ఞానార్జనకూ అనువైన అడవిలో ఉండటంవలన సత్సంగభాగ్యం లభించింది. దానికి ఫలంగా దివ్యానుగ్రహరూపురాలైన సావిత్రి సత్యవంతుడిని చేరింది. ఆమెను ప్రేమతో ఆరాధించాడు సత్యవంతుడు. ఆమె 'యోగమూర్తి', 'గాఢకారుణ్యవికచహృత్కమల'

అయింది. సత్యవంతుడితో యోగించి తన అమృతత్వయోగసిద్ధిని పంచింది. తాను మృత్యువును మెప్పించింది. సత్యవంతుడికి అమృతత్వసిద్ధిని పొందించే యోగాన్ని ప్రసన్నబుద్ధితో అందించింది. అతడు తల్లిదండ్రులకు ఆత్మచక్షువుల వంటివాడు. అతడి వలన ద్యుమత్సేన దంపతులు లౌకిక ఆధ్యాత్మిక దృష్టులను పొంది సావిత్రీ సత్యవంతుల ధర్మయోగాన్ని ఆరాధించారు. వారికి రాజ్యసుఖాలు అందాయి. సావిత్రి అత్తమామలు ఇహపరసుఖాలు పొందారు. మద్రపతి పుత్రశతాన్ని పొందాడు. అతడికి కోరిక అదే. సావిత్రి స్వయంగా గార్హస్థ్యధర్మాచరణంలో సతి పతివ్రతాయోగం ద్వారా సాధించగలిగిన పూర్ణఫలం సాధించింది. దానికి సుమంగళీత్వమని పేరు పెట్టింది. లోకంలోని సాధ్వుల కందరికీ అది ఒక సాత్త్విక యోగమనీ, దానివలన జగత్కల్యాణం కలుగుతుందనీ, తన జీవితమే ఒక సందేశంగా చెప్పింది. ద్రౌపది కూడా పతివ్రతా ధర్మమార్గానుశీల. ఆమె పతులను భక్తితో సేవించి క్రమంగా ధర్మానురక్తినీ, కర్మాభిరతినీ, భక్తిప్రవృత్తినీ, జ్ఞానరతినీ, ఋజుమతినీ సాధించి, తననూ తన వంశాన్నీ ఉద్ధరించగలుగుతుందని మార్కండేయుడు చెప్పాడు. ఇది ఉపాఖ్యాన తత్త్వం. కథ మధురం. బోధ మహోజ్జ్వలం. ఎఱ్ఱన తీర్చిదిద్దిన విధం మధురమహోజ్జ్వలం.

13. ఆరణ్యపర్వం : అంతరార్థం

క. 'ఆరణ్యపర్వ మనఁగా । నారణ్యప్రముఖ షోడశాంతః పర్వా
ధారమయి సకలసూరి స । భారమ్యం బగు తృతీయపర్వము వెలయన్.' (ఆది. 1.40)

అని నన్నయభట్టు పర్వసంగ్రహంలో చెప్పినట్లు ఆరణ్యపర్వం సకలసూరిసభారమ్యం. పండితసభలలో రమ్యత కవితావిలాసాలను వివేచించటంలోనే కాక, తత్త్వవివేచన చేయటంలో కూడ దర్శనమిస్తుంది. అందువలన భారత, రామాయణ, భాగవతాది పవిత్రగ్రంథాలలో నిబంధించబడే ఆధ్యాత్మికమైన అంతరార్థాలను మథించి వెలికితీసి ఆత్మానంద నవనీతాన్ని అందించటం సూరిసభల సంస్కృతి. మహాభారతంలోని అంతరార్థాన్ని గురించి అనేక విశేషాలను వ్యాఖ్యానించి చెప్పిన పండితులు దేశంలో ఎందరో ఉన్నారు. వారిలో డా॥ వేదుల సూర్యనారాయణ శర్మగారొకరు. వారు 'అంతరార్థ మహాభారతము' (ముక్తి సాధనామార్గము) అనే గ్రంథాన్ని క్రీ.శ. 1985లో రచించారు. అందులో భారతంలోని ప్రసిద్ధ కథాంశాలకన్నిటికి ఆధ్యాత్మికమైన అంతరార్థాలను చెప్పారు. వాటిలో ఆరణ్యపర్వ కథార్థాలకు వా రిచ్చిన అంతరార్థ విశేష సూచిక-

	ఆరణ్యపర్వకథాంశం	**ఆధ్యాత్మిక సాధన రూప అంతరార్థం**
1.	సూర్యోపాసన	- జ్ఞానధ్యాన సాధన
2.	పాశుపతాస్త్రప్రాప్తి	- ఇంద్రియ వశీకరణ సాధన
3.	నలోపాఖ్యానం	- అసంగతత్త్వ సాధన
4.	తీర్థయాత్రా ఫలం	- ఆత్మగుణలాభసాధన
5.	అగస్త్యుని మాహాత్మ్యం	- నిశ్చలతత్త్వంతో మాయానాశన సాధన
6.	వింధ్యగర్వాపహరణం	- తార్కికహేతువాద ఖండనా సాధన
7.	అగస్త్యుడు సముద్ర జలపానం చేయటం	- నిశ్చలతత్త్వసాధనలో భగవంతుని ఆవరించిన మాయను నాశనం చేసే సాధన
8.	పరశురామోపాఖ్యానం	- పరమానందానుసంధాన సాధన
9.	సుకన్యోపాఖ్యానం	- అద్వైతసిద్ధి సాధన

10.	సోమకోపాఖ్యానం	- ప్రకృతి ప్రలోభనంతో సాధనాభ్రష్టతను నివారించుకొనే సాధన
11.	సౌగంధిక పద్మాపహరణం	- వ్యష్టిగతానందంలో సమష్టిగత నిర్విషయ బ్రహ్మానంద సంధాన సాధన
12.	జటాసురవధ	- త్రిపుటీగత మాయావినాశన సాధన
13.	నివాతకవచ కాలకేయుల వధ	- కుంభకయోగగతి తామసికవృత్తివినాశసాధన
14.	మత్స్యోపాఖ్యానం	- అహంకార మమకార విచారణ సాధన
15.	భర్తృవశీకరణం గూర్చి సత్యభామా ద్రౌపదుల సంభాషణ	- పరమాత్మవశీకరణ సాధన
16.	ఘోషయాత్ర	- తామసిక దుష్కార్యనివారణ సాధన
17.	సీతారాముల చరిత్ర	- ప్రకృతి పురుషైక్య సాధన
18.	సావిత్ర్యుపాఖ్యానం	- పరమాత్మను చేర్చే నిస్స్వార్థసాధన
19.	ఇంద్రునిచే కర్ణుని కవచకుండలాల అపహరణం	- ముక్తిని కోరే మనస్సు ద్వారా కుంభక యోగ గత దోషనివారణ సాధన

మహాభారతం ప్రతిపర్వరసోదయం. ప్రతిపర్వం అంతరార్థ మహోదయం.

14. కవిత్రయ మహాభారతం : వ్యాఖ్యానం

ఆంధ్రుల ఆదికావ్యమైన ఆంధ్ర మహాభారతానికి సమగ్రవ్యాఖ్య వెలువడటం ఆంధ్ర సాహిత్య చరిత్రలో అరుదైన ఘట్టం. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యానుగ్రహ పూర్ణఫలంగా ఇది తెలుగువారికి అందటం అదృష్టవిశేషం. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు సాగించే బృహత్తర ధర్మప్రచారయజ్ఞంలో ఈ అక్షర సమారాధనం ఆంధ్రావళికి మోదాన్ని కలిగించే అమృతసంభావనం. ఈ పవిత్ర మహత్తర పుణ్యకార్యంలో స్వామిపక్షాన కార్యకర్తలై ఈ భారతభారతిని సేవిస్తున్న మాన్యులు, మహనీయులు- టి.టి.డి. బోర్డ్‌ఛైర్మన్, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, సంపాదకవర్గ సభ్యులూ, సలహామండలి సభ్యులూ, అంతేకాక ఎన్నో విధాల ఈ కార్యక్రమ విజయానికి నిరంతరం కృషి చేస్తున్న అధికార, అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతాంజలులు.

ఈ గ్రంథాన్ని ఆమూలాగ్రం చదివి ఆమోదించి, ప్రోత్సహించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకులకూ, కంట్రోలర్ ఆఫ్ పబ్లికేషన్స్‌కూ నా ధన్యవాదాలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటిగా- రెండు భాగాలలో - వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపుదిద్దుకొన్నది. ఆరణ్యపర్వం మూడవ సంపుటిగా సిద్ధమయింది. అందులో నన్నయ రచించిన ఆరణ్యపర్వభాగం మొదటి భాగంగాను, నన్నయ పేర ఎఱ్ఱయ పూరించిన ఆరణ్యపర్వశేషం ఈ రెండవ భాగంగానూ వెలువడుతున్నాయి. ఈ విధంగా ఆరణ్యపర్వం రెండు భాగాలుగా రావటం కూడా ఇదే ప్రథమం. ఒక క్రొత్త ఒరవడి కూడా. ఆరణ్యపర్వశేషాన్ని రచించి ప్రబంధపరమేశ్వరుడుగా ప్రసిద్ధి పొందిన ఎఱ్ఱాప్రెగ్గడ కవితా వ్యక్తిత్వాన్ని విస్తృతంగా, సమన్వయాత్మకంగా, సాధ్యమైనంత విషయ సమగ్రంగా చిత్రించే పీఠికతో వెలువడటం ఇందులో విశేషం. సహృదయులు ఈ ప్రయత్నానికి సంతోషిస్తారని ఆశిస్తున్నాను.

విద్వత్కవులు, పండితులు, రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షులు అయిన డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యుల వారు ఆరణ్యపర్వానికి రమణీయ వ్యాఖ్య రచించారు. వారు మొదట సరళగ్రాంథిక భాషలో వ్రాయగా, దానిని శిష్ట

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యావహారికంలోకి మార్చటం జరిగింది. దానికి వారు దయతో అంగీకరించారు. దీనిని శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించటం ముదావహం. వారికి నా కృతజ్ఞతలు.

ఆరణ్యపర్వశేషం ప్రూఫులు సరిచూడటంలో తోడ్పడిన విద్వన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారికి, డాక్టర్ వి. సీతాకల్యాణి గారికి, డాక్టర్ జె. రామ సుబ్బలక్ష్మి గారికి, శ్రీమతి జి. సుశీల, శ్రీమతి లక్ష్మీవిద్యానాథ్‌గారలకు నా ధన్యవాదాలు. భారతం మీద వచ్చిన లఘువ్యాఖ్యలను సేకరించటంలో తోడ్పడిన డాక్టర్ దంటు హేమలత గారికి ముద్రణ కనువైన అక్షరాకృతి నిచ్చిన శ్రీ దత్తసాయి గ్రాఫిక్స్ అధినేత్రి డాక్టర్ జి.యస్. లక్ష్మిగారికి నా శుభాకాంక్షలు.

భక్తజన కల్పద్రుమమైన భద్రమూర్తి పద్మావతీ సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ధర్మకల్పద్రుమమైన ఈ భారత వ్యాఖ్యకు ప్రభువు. సత్యశివసుందరమైన ఆ స్వామి దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యా సంపుటిని వాఙ్మయారాధనలోని భాగంగా పుణ్యపూజాకుసుమ మంజరిగా భక్తితో సమర్పించుకొంటున్నాను.

హైదరాబాదు
వృష ఉగాది
25-3-2001

జి.వి. సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు
కవిత్రయ మహాభారత ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆరణ్యపర్వశేషం - కథాసారం

ఎర్రనైన కిరణాల రాగరుచితో శరత్కాల సూర్యోదయ సమయాలు ప్రకాశించాయి. ఆకాశం మబ్బులు వీడి తేటపడింది. పద్మాలు వికసించాయి. రాజహంసలు, బెగ్గురు పిట్టలు, తుమ్మెదలు చేసే మధుర నాదాలు వ్యాపించాయి. నెమళ్ళు నాట్యం చేస్తూ క్రేంకార నాదాలు చేశాయి. వర్షాకాల మేఘాలు శరత్కాలానికి భయపడి నేలకు దిగి వచ్చినట్లుగా ఏనుగుల గుంపులు మదజలాలు వర్షిస్తూ ఘీంకరిస్తూ వనాలలో తిరిగాయి. దక్షిణాన ఆకసంలో అగస్త్య నక్షత్రం కనిపించింది. తెల్లని మబ్బులు క్రమ్ముకొన్న ఆకాశంవలె రెల్లుపూలు చుట్టూ కాసిన సరస్సులు బింబ ప్రతిబింబ భావంతో రాణించాయి. అటువంటి రమణీయ శరత్కాలంలో పాండవులు సరస్వతీ నదిని సేవించి కామ్యకవనం చేరారు.

శ్రీకృష్ణుడా సంగతి తెలిసికొని పాండవులను చూచి యోగక్షేమాలు తెలిసికొనటానికి సత్యభామా సమేతుడై కామ్యకవనానికి వచ్చాడు. అదే సమయంలో మార్కండేయ మహర్షి కూడా పాండవుల ఆశ్రమానికి వచ్చాడు. పాండవులు వారందరికీ అతిథి సత్కారాలు చేశారు.

శ్రీకృష్ణుడు ధర్మజుడి ధర్మనిష్ఠను ప్రశంసించాడు. అర్జునుడు పరమేశ్వరుడిని మెప్పించి పాశుపతాస్త్రాన్ని పొందినందుకు అభినందించాడు. శమదమాది గుణాలను సహజసంపదగా పొంది ఉన్న ధర్మరాజు సార్థక నామధేయుడని ప్రశంసించాడు. దుర్యోధనాదులు నిండుసభలో దుర్నీతివర్తనులై, చేసిన పాపకృత్యాలను సహించిన ధర్మజుని క్షమాశీలాన్ని మెచ్చుకొన్నాడు. కౌరవసభలో ధర్మజుడు కొంచెం కోపగించుకొన్నా భీమాదులు శత్రువర్గాన్ని నాశనం చేసి ఉండేవారనీ, తమ్ములనే సముద్రాలకు ధర్మజుడి సత్యసంయమనం చెలియలి కట్టవలె నిలిచిందని వ్యాఖ్యానించాడు. అంధక వృష్ణి భోజ కుకురాది వంశాలకు చెందిన యాదవ ప్రభువులందరూ ధర్మరాజుపట్ల బంధుప్రేమతో ఉన్నారనీ, ధర్మరాజు కొరకు కౌరవులతో యుద్ధం చేసి వారిని జయించి విజయాన్ని సాధించగలరనీ, దానికి ధర్మజుడు సంకల్పిస్తే చాలు. మరుక్షణంలో నాలుగు సముద్రాల చేత ఆవరించబడిన అఖిలభూమండలానికీ అతడే సార్వభౌముడౌతాడనీ ఉత్తేజపరిచాడు.

శ్రీకృష్ణుడి సాదర వచనాలకు ధర్మజుడు వినమ్రుడైనాడు. మిగిలి ఉన్న వనవాసాన్నీ, ఆపైన అజ్ఞాతవాసాన్నీ ముగించి మాటనిలబెట్టుకొని, ఆ తరువాత పరాక్రమంతో రాజ్యాన్ని జయిస్తే, నిందలు రావని సవినయంగా శ్రీకృష్ణుడికి నివేదించాడు. 'మేమందరం నీ శరణుకోరి ఉన్నాం. మా కార్యభారాన్నంతా నీవే నిర్వహించాలి. మాకు పరమశుభాలు ప్రసాదించాలి' అని వేడుకొన్నాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజును పరమప్రీతితో సంభావించాడు.

శ్రీకృష్ణుడు ద్రౌపదిని సాదరంగా పలుకరించాడు. ఉపపాండవులందరూ యాదవరాజకుమారులతో కలిసి వివిధ రాజవిద్యలను అభ్యసిస్తూ సంతోషంతో కాలం గడుపుతున్నారనీ, ప్రద్యుమ్నుడు వారందరికీ దివ్యాస్త్ర ప్రయోగంలో శిక్షణ ఇచ్చాడనీ, సుభద్ర అభిమన్యుడి మీది కంటె ఉపపాండవుల మీద అనురాగాన్ని అధికంగా చూపుతున్నదనీ చెప్పి ఆమెను ఊరటపరిచాడు. త్వరలో వారందరూ ఉజ్జ్వలమైన శుభాలను పొందుతారని చెప్పి ఆమెను అనునయించాడు.

అంతలో మార్కండేయ మహర్షి పాండవుల ఆశ్రమానికి వచ్చాడు. అందరూ ఆ మహర్షికి ఆహ్వానం పలికారు. అతిథిసత్కారాలన్నీ అయిన తరువాత శ్రీకృష్ణుడు ఆ మహర్షి యొక్క మంజుల వాగమృత ప్రవాహాన్ని చెవులారా క్రోలి ఆనందాన్ని పొందే అవకాశాన్ని కలిగించుమని కోరాడు. దేవతలకు, రాజులకు, బ్రాహ్మణులకు, పతివ్రతలకు సంబంధించిన పుణ్యకథలను వినిపించుమని అడిగాడు.

అదే సమయానికి నారద మహాముని అక్కడకు వచ్చాడు. అందరూ ఆయనను పూజించారు. నారదుడు కూడా మార్కండేయ మహర్షిని ప్రోత్సహించాడు. శ్రీకృష్ణుడికీ, పాండవులకూ ప్రియాన్నీ హితాన్నీ కలిగించే పుణ్యకథలు వినిపించుమని చెప్పి వెళ్ళాడు. అప్పుడు ధర్మరాజు మార్కండేయమహర్షితో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మరాజు: మే మెప్పుడూ ధర్మాన్ని తప్పకుండా నడుచుకుంటాం. అయినా, నా కెప్పుడూ తీరని కష్టాలే. అటు - కౌరవులు ఎప్పుడూ పాపాలు చేస్తుంటారు. కాని, వారు సౌఖ్యాలనూ, అభ్యుదయాలనూ పొందుతున్నారు. ఈ విపరీత స్థితి ఏమిటి? అని నే నెప్పుడూ విచారిస్తుంటాను. నరుడు ఇప్పుడు చేసే కర్మలకు ఫలాన్ని ఇహంలో పొందుతాడా? పరంలో అనుభవిస్తాడా? ఇహపరాలలో రెండింటా పొందుతాడా? దేవుడిని నమ్మిని వాడికి కర్మఫలం ఉండదా? ఈ శరీరంతోనే కర్మఫలం కూడా తొలగిపోతుందా? ఈ అనుమానాలను నీవే తీర్చగలవు. నాకు వాటిని గురించి వివరంగా చెప్పుము.

మార్కండేయుడు: పూర్వం బ్రహ్మదేవుడు ప్రథమసృష్టి చేసినప్పుడు పవిత్రులు, ధర్మనిరతులు, సత్యసంపన్నులు, సత్యవాదులు, సత్య సంకల్పులు, బ్రహ్మజ్ఞానులు, స్వచ్ఛందజీవులు అయిన మానవులను కల్పించాడు. వారు దేవమార్గాలలో విహరిస్తూ చేసిన కర్మకు సులభంగా అధికఫలాన్ని పొందేవారు. సర్వధర్మాలను తెలిసి, మాత్సర్యం లేనివారై, వేలసంఖ్యలలో సంతానాన్ని పొందుతూ, అనేక వేల సంవత్సరాలు దీర్ఘాయుష్కులై నివసిస్తూ ఉండేవారు. కొంతకాలం గడిచేసరికి ఆ మానవులు కామక్రోధాది గుణాలకు లోనయ్యారు. మాయా ప్రవర్తనులయ్యారు. దేవతలకు దూరమయ్యారు. అల్పాయువులు, అల్పబల శరీర సత్త్వులు, దరిద్రులు, నిష్ఫలారంభులు, బహురోగ పీడితులు, నాస్తికులు అయ్యారు. ఒకరిమీద మరొకరు అసూయలు పెంచుకొని, పాపకార్యాలు చేస్తూ, పశుపక్ష్యాదులుగా పుట్టుతూ, నరకయాతనలు అనుభవిస్తూ, పుట్టుచావుల చక్రభ్రమణంలో చిక్కి చిక్కుల పాలౌతున్నారు. వారు చేసిన పుణ్యపాపాలు వారివెంటనే నీడలాగా సాగిపోతూ వాటి ఫలాలను అనుభవింపజేస్తూ మరల మరల వారికి జన్మలను కలిగిస్తున్నాయి. ధర్మరాజా! ఎంతవారికైనా పాపపుణ్యాల ఫలాలు అనుభవించక తప్పదు. శరీరం నశించి పోతుంది కాని,చేసిన కర్మమాత్రం చెడిపోదు. దాని ఫలం అనుభవించక తప్పదు.

సంపదలతో తులతూగుతూ, ఇంద్రియలోలురై, పాపచింతలతో జీవించేవారు పరలోకసౌఖ్యాలు పొందలేరు. వారికి ఇహలోక సుఖాలే మేలుగా అనిపిస్తాయి. నియమనిష్ఠాపరులై, తీర్థయాత్రలు చేస్తూ, వేదాధ్యయన పరాయణులై జీవించేవారు ఇహంలో కష్టాలనుభవించినా, పరంలో కలిగే సుఖమే తృప్తిని కలిగిస్తుంది. ధర్మమార్గంలో జీవితాన్ని సాగిస్తూ, గృహస్థాశ్రమ విధులు నిర్వహిస్తూ, యజ్ఞయాగాలు చేసేవారు ఇహంలోనూ, పరంలోనూ సౌఖ్యాలను అనుభవిస్తారు. సత్యం, శమం శౌచం లేనివారై, నాస్తికులై, చేయరాని పనులు చేస్తూ జీవించేవారు ఇహపరాలకు రెంటికీ చెడ్డ రేవడులై దుఃఖాల ననుభవిస్తారు. మానవుల కర్మగతి పద్ధతి ఇది.

ధర్మరాజా! మీరు దివ్యులు. దేవతలకు హితం చేయటానికి ఈ భూతలం మీద మీరు అవతరించారు. మీరు శత్రువులనందరినీ సంహరిస్తారు. పరాక్రమ ప్రభావంతో భూమిని పాలిస్తారు. చివరికి మీ దేవభావాన్ని పొందుతారు.

ఈ మాటలు విని ధర్మరాజు బ్రాహ్మణప్రభావాన్ని గురించి చెప్పుమని మార్కండేయమహర్షిని కోరాడు. ఆ మునీంద్రుడు ఈ విధంగా చెప్పాడు-

పూర్వం హైహయవంశంలో ధుంధుమారుడు అనే రాకుమారుడు ఉండేవాడు. అతడు వేటకు వెళ్ళి, పొదలమాటున జింకచర్మాన్ని ఉత్తరీయంగా ధరించి ఉన్న ఒక బ్రాహ్మణ యువకుడిని జింకగా భ్రమించి బాణంతో కొట్టాడు. ఆ వేటుకు ఆ యువకుడు మరణించాడు. ధుంధుమారుడు ఆ బ్రాహ్మణ మృతకళేబరాన్ని చూచి, మిక్కిలి విచారించి, రాజధానికి తిరిగివెళ్ళి, జరిగిన సంగతి పెద్దలకు చెప్పి, వారిని వెంటబెట్టుకొని అడవికి వచ్చి ఆ శవాన్ని చూపించాడు.

ఆ సమీపంలోనే తార్క్ష్యుడు అనే మహర్షి ఆశ్రమం ఉన్నది. వారందరూ కలిసి అక్కడికి వెళ్ళారు. జరిగిన సంగతి చెప్పారు. ఆ బ్రాహ్మణ యువకుడిని చంపిన మహాపాపాన్ని తొలగించుకొనే ఉపాయం చెప్పుమని ప్రార్థించారు. అప్పుడు తార్క్ష్యుడు వారితో ఇట్లా పలికాడు - 'మా ఆశ్రమంలోని వారికి భయం, రోగం, చావు మొదలైన వాటిచేత కలిగే బాధలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉండవు. మూడు లోకాల వారికీ ఈ సంగతి తెలుసు'- అని చెప్పి, చనిపోయాడని భావించే ఆ యువకుడిని సజీవుడిగా వారి ముందు చూపించాడు. చనిపోయినవాడు ఆ విధంగా మరల బ్రతికిన మహిమకు కారణమేమిటిని వారు అడిగారు. తార్క్ష్యుడు ఇట్లా చెప్పాడు - 'మా ఆశ్రమవాసులమందరం మాంద్యం లేని వారం, శుచి అయిన ఆహారం తినేవారం, నిత్యం ఆచరించే విధులను తప్పక నిర్వహించే వారం. అతిథులను అర్చిస్తాం. నిజమే పలుకుతాం, బ్రహ్మచర్యాన్నీ, శాంతచిత్తవృత్తినీ కలిగి ఉంటాం. అందువలన మేమెన్నడూ రోగమృత్యుభయం లేనివారమై ఉంటాం. ఇది మా మహిమ. కాబట్టి మీకు బ్రహ్మహత్యాదోషం లేదు.' ధర్మరాజా! 'బ్రాహ్మణ ప్రభావం ఇటువంటిది. అంతేకాక, బ్రాహ్మణ క్షత్రియ మహిమను తెలిపే ఒక ఇతిహాసాన్ని చెప్పుతాను వినుము' అని మార్కండేయమహర్షి ఈ విధంగా చెప్పాడు.

పూర్వం అత్రి అనే బ్రాహ్మణశ్రేష్ఠుడున్నాడు. ఆయన తపస్సు చేయాలని అడవికి పోదలచాడు. భార్యను 'నాతో తపోవనానికి వస్తావా? లేదా కొడుకుల దగ్గర ఉంటావా?' అని అడిగాడు. 'గృహస్థాశ్రమంలో ఉన్న యజమాని కుటుంబ భారాన్ని మోయటానికి తగిన వసతులను పుత్రులకు కల్పించి వానప్రస్థాశ్రమాన్ని తీసికొనటం ధర్మం' అని చెప్పి, 'వైన్యభూపతి అర్థులకు విరివిగా దానం చేస్తున్నాడు. ఆయనను అడిగి ద్రవ్యాన్ని సంపాదించి కొడుకులకు ఇచ్చి తపోవనానికి వెళ్ళు' మని అత్రి భార్య తన భర్తకు హితవు చెప్పింది. భార్య హితవు అత్రికి ధర్మయుక్తంగా తోచింది. అతడు వైన్యుడి వద్దకు వెళ్ళాడు. ఆ రాజు అశ్వమేధయాగం చేస్తూ విప్రులకు అపార ధనాలను దానం చేస్తున్నాడు. అత్రి అతడిని దర్శించి ఆశీర్వదించి ఇట్లా ప్రశంసించాడు -

'ఓ రాజా! నీవే బ్రహ్మవు, నీవే సమస్త జనసార్వభౌముడవు. నీవే సమస్త ధర్మ విశారదుడవు, నిన్ను పోలిన రాజులు ఈ భూమండలంలో మరెవ్వరూ లేరు. ఋషులందరూ నిన్నే ప్రశంసావాక్యాలతో కీర్తిస్తూ ఉంటారు.'

ఆ మాటలు విని సభలో ఉన్న గౌతమ మహాముని మండిపడ్డాడు. 'అత్రీ! ఈ రాజే బ్రహ్మ అనీ, ఇంద్రుడనీ, ఈశ్వరుడనీ నోరరిగేటట్లు ఎందుకు అట్లా కీర్తిస్తావు? డబ్బు కాశపడి ఒక సామాన్య మానవుడిని అసామాన్యుడిగా కీర్తించటం దేనికి?' - అని అధిక్షేపించాడు. అతడికి అత్రి ఇట్లా బదులు చెప్పాడు - 'గౌతమా! నీకు ఉచితానుచితాలు తెలిసినట్లు లేదు. లోకాలను నిర్మలమైన నీతితో, పరాక్రమంతో పరిపాలించే ప్రభువు ధర్మాలకన్నింటికి కుదురు. అటువంటి రాజును కీర్తించటంలో తప్పేమున్నది?' అని ప్రశ్నించాడు. గౌతముడు వెటకారంగా- 'తల నరిసినంత మాత్రాన జ్ఞానివి కావు. జ్ఞానవృద్ధుల మాటలే ప్రమాణాలు' అని అన్నాడు. క్రమంగా వారిద్దరి మధ్యా మాటా మాటా పెరిగి వాదం తీవ్రరూపం తాల్చింది. ఆ సభలో కాశ్యపుడనే ముని సనత్కుమారుడిని మధ్యవర్తిగా ఉంచితే బాగుంటుందని సూచించాడు. సదస్యులందరూ దాని కంగీకరించి సనత్కుమారుడి దగ్గరకు వెళ్ళి వాదసారాంశాన్ని చెప్పారు. అంతా విని సనత్కుమారుడు అత్రి వాదాన్ని సమర్థించాడు. 'అత్రి మాట నిజం. అతని వాదం ధర్మయుక్తం. రాజ్యాన్ని తన భుజబలంతో వహించి, ప్రజలను రక్షిస్తాడు కాబట్టి అతడు ప్రభువు. శత్రువులను సంహరించి అతడే ఇంద్రుడు, ఈశ్వరుడు, బ్రహ్మ అనబడతాడు. రాజు ప్రజలందరికీ పూజించదగినవాడు. అతడి శాసనం వలన మంచివారు, మునులు మంచిమార్గంలో నడుస్తుంటారు. కాబట్టి ఆతడి ఆజ్ఞను ఎవ్వరూ జవదాట రాదు. క్షత్రియ మాహాత్మ్యం ప్రశంసనీయం. వేదాలు రాజును - విరాట్టు, సమ్రాట్టు, విధిజితుడు, సత్యమన్యుడు, యథాజీవుడు, ధర్ముడు- అనే పేర్లతో ప్రశంసించాయి. పూర్వం బ్రాహ్మణులు అధర్మానికి భయపడి తమ తేజస్సులను, బలాలను క్షత్రియులలో నిక్షేపించారు. అప్పటినుండి బ్రాహ్మణ మాహాత్మ్యం వలన క్షత్రియ పరాక్రమం ప్రవర్ధిల్లుతూ ఉన్నది. బ్రాహ్మణ మహిమ, క్షత్రియ మహిమ ఒక దానిని ఒకటి ఆశ్రయించుకొని ఉంటాయి. విడివిడిగా ఉండలేవు. క్షత్రియుడు బ్రాహ్మణ సేవవలన తేజస్వియై సూర్యుడు చీకట్లను చీల్చినట్లుగా పాపాలను పటాపంచలు చేస్తాడు. అందువలన క్షత్రియుడే అందరికంటె అధికుడవటం నిశ్చయం' - అని తీర్పు చెప్పాడు సనత్కుమారుడు. ఋషు లా తీర్పును వైన్యుడికి నివేదించారు. వైన్యుడు సంతోషించి అత్రికి కోటి ధనాలను కానుకలుగా ఇచ్చాడు. వాటిని అత్రి తనపుత్రుల కిచ్చి తాను తపస్సుకై అడవికి పోయాడు.

సరస్వతీ గీత

పూర్వకాలంలో తార్క్ష్యుడు అనే మునీంద్రుడు భారతిని గురించి తపస్సు చేశాడు. ఆ దేవి ప్రత్యక్షమైంది. ఆ ముని భారతిని ఇట్లా అడిగాడు. 'తల్లీ! మానవుడికి ధర్మం ఏది? పురుషుడు దేనివలన పుణ్యాత్ముడై ఉత్తమ గతులు పొందగలడు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పి ధన్యుడిని చేయుము', భారతి ఇట్లా చెప్పింది - 'నాలుగు వేదాలు చదివి, వివిధ యజ్ఞాలు చేసిన బ్రాహ్మణుడు స్వర్గానికి పోయి అప్సరసలతో కలిసి పెక్కేండ్లు సుఖిస్తాడు. దూడతో కూడిన పాడి ఆవును యోగ్యుడైన బ్రాహ్మణుడికి దానం ఇస్తే ఆ ఆవు మేనిమీద ఎన్ని రోమాలుంటాయో అన్నివేల సంవత్సరాలు స్వర్గంలో ఉంటాడు. ఒక ఆబోతును దానం చేస్తే స్వర్గలోకాన్ని పొందుతాడు. ఏడేండ్లు దీక్షతో అగ్నిని నేతితో వేల్చి సేవిస్తే ఏడు తరాల పితృదేవతలతో సహా స్వర్గానికి పోతాడు. ఎల్లప్పుడు దేవతలను అగ్నిహోత్రం ద్వారా తృప్తిపరచినవాడు గోలోకభోగాలను అనుభవిస్తాడు. అగ్నిహోత్రం నా ఆత్మ. యజ్ఞద్రవ్యాలన్నీ నావే. నేను అగ్నిముఖం నుండి పుట్టుతాను. జ్ఞానుల సంశయాలను తీరుస్తాను. స్వాధ్యాయ దానవ్రత పరాయణులు శోకరహితులౌతారు. మధుక్షీరాది ద్రవ్యాలతో ఇంద్రాగ్ని ప్రముఖులైన దేవతలను తృప్తిపరిచే యజ్ఞశీలురు నాలోకాన్ని పొందుతారు' అని చెప్పిన భారతిని తార్క్ష్యుడు భక్తితో స్తుతించి తరించాడు- అని మార్కండేయ మహర్షి ధర్మరాజుకు చెప్పాడు.

వైవస్వత మనువృత్తాంతం

వైవస్వత మనువు ఏవిధంగా మహిమాన్వితుడయ్యాడు? అని ధర్మరాజు అడుగగా మార్కండేయు డిట్లా వివరించాడు-

చాక్షుష మన్వంతరంలో వైవస్వతుడు పదివేలేండ్లు నిరాహార దీక్షతో తపస్సు చేశాడు. ఒకనాడు ఒక సరోవరంలో స్నానంచేసి ఒడ్డున నిలిచి ఉండగా ఒక చిన్నచేప వచ్చి తనను ఆ కొలనిలో పెద్దచేపల బారినుండి రక్షించి, ఒక భద్రమైన చోటికి చేర్చుమని వేడింది. అందుకు ప్రత్యుపకారం చేస్తానని మాట ఇచ్చింది. అతడు ఆశ్చర్యపడి ఆ చిరుచేపను ఒక నూతిలో వదిలాడు. రోజూ దాని యోగక్షేమాలు విచారించేవాడు. అది క్రమంగా పెరిగి పెద్దదై తిరగటానికి చోటు చాలక పోవటంతో మరొక మేలైన చోటికి చేర్చుమని వైవస్వతుడిని కోరింది. అప్పుడు దానిని తీసికొని వెళ్లి ఒక బావిలో వదిలాడు. కొన్నాళ్ళకు ఆ చేప బలిసి బావిలో ఉండలేక పోయింది. అతడు దానిని గంగలో విడిచాడు. కాలక్రమంగా అది పెరిగి పెద్దదయింది. గంగమడుగు చాలకపోతే వైవస్వతుడు దానిని సముద్రంలో వదిలాడు.

అప్పుడు చేప వైవస్వతుడితో ఇట్లా అన్నది- 'నీవు నాకు మేలు చేశావు. నీకు నేనొక మేలు చేస్తాను. కొద్ది కాలంలో మహాప్రళయం జరుగబోతున్నది. మహాసముద్రాలన్నీ పొంగి ఏకం కాబోతున్నాయి. దాన్ని మన్వంతర సంధి అంటారు. కాబట్టి నీవు ఒక పెద్ద ఓడను బలమైన తాళ్లతో కట్టి అందులో అన్నిరకాల ధాన్యాలు, బియ్యాలు భద్రపరుచుము. సప్తర్షులతో కలిసి ఆ ఓడనెక్కి సముద్రతీరానికి చేరి నన్ను స్మరించుము. నే నొక పెద్ద కొమ్ముగల రూపంతో కనబడి మీకు మేలు చేస్తాను' - అని చెప్పి వెళ్ళింది. ఆ చేప చెప్పినట్లు వైవస్వతుడు ఒక నౌకను నిర్మించి, సప్తర్షులతో కలిసి సముద్రతీరం చేరి, ఆ చేపను స్మరించాడు. ఆ చేప ఎత్తైన ఆకారంతో పొడుగైన కొమ్ముతో కనపడింది. ఆ చేప కొమ్ముకు ఓడ తాడును తగిల్చి కట్టాడు. అపరిమితమైన వేగంతో ఆ చేప ఆ నావను సముద్ర మధ్యానికి లాగికొని తీసికొనిపోయింది. క్రమంగా సముద్రాలన్నీ పొంగి ఏకమయ్యాయి. లోకాలన్నీ నీటిలో మునిగిపోయాయి. లోకమంతా ఏకార్ణవమైపోయింది. ఆ నీటి నడుమ పెక్కువేలేండ్లు ఆ చేప ఆ ఓడను త్రిప్పుతూనే ఉంది. క్రమంగా వెల్లువ తగ్గింది. ఓడను హిమవత్పర్వతశిఖరం దగ్గరకు చేర్చి, ఆ చేప ఆ శిఖరానికి ఓడను కట్టివేయుమని వైవస్వతుడితో చెప్పింది. అత డట్లాగే చేశాడు. ఆనాటి నుండి ఆ కొండ కొమ్ముకు 'నౌకాబంధం' అనే పేరు వచ్చింది.

వారితో ఆ మహామత్స్యం ఈ విధంగా చెప్పింది - 'ఓ వైవస్వతమనూ! సప్తర్షులారా! మహాప్రళయకాలంలో ప్రమాదం రాకుండ మిమ్మల్ని నేను కాపాడాను. నేను ఈ అనంత విశ్వానికి కర్తనైన ఈశ్వరుడిని. మీమీద దయతో ఈ చేప రూపంతో మిమ్మల్ని ఇన్నివిధాల కాపాడాను. మీరు నిర్భయులై ఉండండి. ఈ మనువు- దేవతలు, అసురులు, మానవులు మొదలైన

వారితో కూడుకొనే జగత్తును సృష్టిస్తాడు. నాదయ వలన అతడికి పరమజ్ఞానోదయం ఔతుంది' అని కరుణించి మహామత్స్యం అంతర్ధానమయింది. వైవస్వతుడు ఘోరతపస్సు చేసి సకలచరాచర భూతకోటిని సృష్టించాడు.

ఫలశ్రుతి : ఉత్తమమైన ఈ వైవస్వతుడి చరిత్రం భక్తితో విన్నవారికీ చదివిన వారికీ మహాపాపాలన్నీ మాయమైపోతాయి. ఇహపరసుఖాలు సిద్ధిస్తాయి.

ధర్మరాజు : ఓ మార్కండేయ మహర్షీ! నీవు బ్రహ్మదేవుడివంటి వాడివి. నీ మాహాత్మ్యం అద్భుతమైనది. మహాప్రళయకాలంలో కూడా నీవు సాక్షీభూతుడవై ఉంటావు. సృష్టి సమస్తం నీటిలో మునిగినప్పుడు పద్మపీఠం మీద ప్రకాశించే బ్రహ్మదేవుడిని ఆరాధించగలిగే పుణ్యాత్ముడవు. ఆ ప్రభావాన్ని ఆ పరమాత్మయే నీకు అనుగ్రహించాడు. యముడి శిరస్సును ఎడమకాలితో తన్నిన మృత్యుంజయుడవు నీవు. ఈ సకల చరాచర సృష్టి లయ ప్రకారాలను ఎన్నోసార్లు నీవు చూచి ఉంటావు. కాబట్టి ఎన్నో అద్భుత విశేషాలు నీవలన తెలిసికొనగలను. కాబట్టి - ప్రళయ కాలంలో లోకాలు ఏవిధంగా ఉంటాయో తెలుపుము.

మార్కండేయుడు : ధర్మజా! నీకు ఇష్టసఖుడుగా, మంత్రిగా, నీకు హితుడై ఉన్న ఈ పుణ్యాత్ముడు శ్రీకృష్ణుడే శాశ్వతుడు, అఖిల భూతాలకు పరమేశ్వరుడు, ఆదిదేవుడు, జగదాది జన్ముడు, ఆదిమధ్యాంతరహితుడు, కారణజన్ముడు, అజరుడు అయిన పరమాత్మ, ఆ విశాలనేత్రుడు, ఆ కనకాంబరధారి, పద్మనాభుడు, ఇంద్రాది వంద్యుడు అయిన మహావిష్ణువు. ఆ మహాత్ముడిని వినయంతో స్మరించి, అతని అనుమతితో వివరిస్తాను వినుము.

యుగాలు నాలుగు. కృత, త్రేతా, ద్వాపర, కలి యుగాలు. అవి మొత్తం కలిస్తే పన్నెండువేల దివ్య సంవత్సరాల కాలం అవుతుంది. దాన్ని మహాయుగం అంటారు. వేయి మహాయుగాల కాలం బ్రహ్మకు ఒక పగలు (బ్రహ్మదివసం). దాని చివర నూరేళ్ళపాటు అనావృష్టి కలుగుతుంది. ఆ సమయంలో సూర్యుడు ఏడు రూపాలు ధరించి నదీనదాల్లోని, సముద్రాల్లోని నీటినంతా ఆవిరిచేసి లోకాలను మండింపజేస్తాడు. ఆ మంటతోపాటు పెద్దగాలి వీస్తుంది. దానితో మూడు లోకాలూ బూడిదై పోతాయి. ఆ తరువాత పర్వతాకారాలతో ప్రళయమేఘాలు క్రమ్మి, దిక్కులు పిక్కటిల్లేటట్లు ఉరుముతూ ధారాపాతంగా చాలాకాలం వర్షించి ఆ మంటలనన్నిటినీ ఆర్పుతాయి. భూగోళమంతా లోతైన నీటిలో మునిగిపోతుంది. చీకట్లు వ్యాపిస్తాయి. దిక్కులు తెలియవు. అప్పుడు బ్రహ్మదేవుడి ఆజ్ఞతో ఒక పెనుగాలి చెలరేగి వీస్తుంది. దాని వేగానికి ఆ మేఘాలన్నీ చెల్లాచెదరౌతాయి. ఆ గాలిని పీల్చి బ్రహ్మదేవుడు నీటి నడుమ పద్మంమీద నిద్రిస్తాడు. దాన్ని కల్పాంతం అంటారు. అటువంటి కల్పాంతాలు ఎన్నో గడిచాయి. మరెన్నో గడవనున్నాయి.

కల్పాంతంలో నేను పెను చీకటిలో ఒంటరిగా ఎంతోకాలం తిరుగవలసి వచ్చేది. ఒకసారి ఆ ప్రళయజల మధ్యంలో నాకు ఒక పెద్ద మర్రిచెట్టు కనపడింది. ఆ చెట్టు ఆకుల శయనం మీద నీలమేఘశ్యాముడు, చంద్రవదనుడు అయి ఉదయిస్తున్న సూర్యుడివలె ప్రకాశిస్తూ నిద్రిస్తూ కుసుమకోమలుడైన ఒక బాలుడిని చూచి ఆశ్చర్యపోయాను. అతను ఎవరో అని తలపోస్తూ సమీపించాను. ఆ బాలుడు కనుదమ్ములు విచ్చి నావైపు ఓరగా చూచి మధురస్వరంతో పలకరించాడు. 'అయ్యా! నీవు బాగా అలసినట్లున్నావు. విశ్రాంతి తీసుకో, అవకాశమిస్తాను, ఇదిగో నా శరీరంలో ప్రవేశించి శయనించుము' అని నోరు తెరిచాడు. నేను బలవంతంగా ఆ నోట్లోకి లాగబడ్డాను. ఆ బాలుడి కడుపులోనికి ప్రవేశించాను. అందులో సమస్త లోకాలనూ, సమస్త సృష్టి విశేషాలనూ కన్నారా చూచాను. వాటినన్నిటినీ దర్శిస్తూ నూరేండ్లు అందులో తిరిగాను. మనసులో భయం వేసింది. ఆ మాయాబాలుడి దివ్యపాదాలను భక్తితో ధ్యానించాను. ఆ బాలుడి శ్వాసవేగంతో అతడి ముఖం నుండి బయటపడ్డాను. ఆ వటపత్రశాయిని దర్శించాను. అతడు నా యోగక్షేమాలను అడిగి తెలిసికొన్నాడు. అతడి పాదాలను నా తలమీద పెట్టుకొని 'నీదయ వలన సకల చరాచర ప్రపంచాన్ని నీలో దర్శించాను. కాని, నీ మాయాప్రభావం నాకు అర్థం కాలేదు. నీ మహిమను నీవే వివరించి నాకు చెప్పాలి' అని ప్రార్థించాను. విష్ణుదేవుడు ఇట్లా చెప్పాడు-

'మహర్షీ! నా మహిమను దేవతలు మునులు కూడా తెలియలేరు. నీవు పుణ్యాత్ముడవు పితృభక్తుడవు కావటం చేత నీకు చెప్పుతాను వినుము. నేను నారాయణుడను. నారములంటే నీళ్ళు. నారములే స్థానంగా కలవాడను కాబట్టి నారాయణు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

డనబడుతున్నాను. నేను శాశ్వతుడను, లోకాలను సృష్టించేవాడిని, పాలించేవాడిని, లయించేవాడిని, చిదానందమూర్తిని, బ్రహ్మ, ఇంద్రుడు, ఈశ్వరుడు, యముడు, కుబేరుడు, వరుణుడు మొదలైన దేవతలు నామూర్తులే. భూమియే నా పాదద్వయి. అగ్నియే నా ముఖం. సూర్యచంద్రులు నా కన్నులు, ఆకాశం నా శిరస్సు. ఇటువంటి నారూపం అద్భుతమైనది. నేను మహాదక్షిణలతో కూడుకొన్న ఎన్నో యజ్ఞాలు చేశాను. అటువంటి యజ్ఞాలు చేస్తూ భువిలో రాజులూ, వైశ్యులూ నన్ను సేవిస్తూ ఉంటారు. ప్రళయకాలంలో సముద్రంలో మునిగిన భూమిని ఉద్ధరించే ఆదివరాహాన్ని నేనే. వేయి పడగలతో భూభారాన్ని మోసే ఆదిశేషుడను నేనే. సప్తసముద్రాలు నీటిని దహించే బడబాగ్నిని నేనే. ప్రళయకాలంలో ఆ నీటిని త్రాగేదీ నేనే, మరల వదిలేదీ నేనే. సృష్ట్యారంభకాలంలో నానోటి నుండి, భుజాల నుండి, తొడలనుండి, పాదాల నుండి క్రమంగా నాలుగు వర్ణాలవారిని సృష్టిస్తాను. నా ముఖం నుండి నాలుగు వేదాలు ఉదయిస్తాయి. చివరకు అవి నాలోనే లయమౌతాయి. నిరహంకారులు, క్రోధరహితులు, నిస్సంగులు, అధ్యాత్మవిదులు, సత్యనిష్ఠులు, మహామునులు నన్ను మోక్షాపేక్షతో సేవిస్తూ ఉంటారు. నక్షత్రాలు, తారాగణం, గ్రహాలు, ఆకాశం, వాయువులు, దశదిశలు - అన్నీ నారూపాలే. సముద్రాలన్నీ శయనంగా నేను నిత్యానందమూర్తినై పవళించి ఉంటాను. దానం, సత్యం, తపస్సు, జ్ఞానం, అహింస - అనబడే సాత్త్వికగుణాలూ, కామం, క్రోధం, అజ్ఞానం వంటి తామసగుణాలూ అన్నీ నాలోనివే. ఈ జగత్తులో వ్యక్తమై కనపడేదంతా నేను. అవ్యక్తంగా ఉండేదీ నేనే. ఇందులో సందేహం వద్దు. లోకంలో ధర్మానికి హాని ఎప్పుడు కలుగుతుందో, అధర్మం ఎప్పుడు విజృంభిస్తుందో, దైత్యులు క్రూరులై ఎప్పుడు గర్వంతో అతిశయిస్తారో, దేవత లెప్పుడు దైన్యస్థితిని పొందుతారో, అప్పుడు నేను మంచి కుటుంబంలో పుట్టి, నా ప్రభావంతో దేవతలను, దేవేంద్రుడిని ఉత్తమ ధర్మపదవిలో నిలుపుతాను. నేను కృతయుగంలో తెల్లగాను, త్రేతాయుగంలో ఎర్రగాను, ద్వాపరయుగంలో నల్లగానూ, కలియుగంలో పసుపుపచ్చగానూ ఉండే దేహాలతో ప్రకాశిస్తూ నాలుగు యుగాలలోనూ ధర్మస్థాపనం చేస్తాను. నా వృత్తాంతాన్నంతా నీకు చెప్పాను. సృష్టికర్త అయిన బ్రహ్మ నాలో సగపాలు.

నారాయణనామంతో, బాలకరూపంతో, శంఖచక్రధారినై, ఏకార్ణవంలో వేయి మహాయుగాలు యోగనిద్రలో ఉంటాను. అటువంటి భయంకర కల్పాంతాన్ని చూచి నీవు భయపడటం తెలిసికొని, నీమీది దయతో నాలో గుప్తంగా ఉన్న సకలలోకాలను నీకు చూపించాను. నీ వింక యథేచ్ఛగా విహరించుము. బ్రహ్మ చేసే సృష్టిని కన్నారా దర్శించుము - అని ఆదేశించి ఆ బాలుడు అదృశ్యమయ్యాడు. అద్భుతమైన ఆ అనుభవం నేను ప్రత్యక్షంగా పొందాను.

ఓ ధర్మరాజా! నా కప్పుడు ఆవిధంగా దర్శనమిచ్చిన బాలదేవుడే, ఈ నాడు నీకు గాదిలిచుట్టంగా, మంత్రిగా, మిత్రుడుగా ఉన్న శ్రీకృష్ణుడు. పుణ్యాకారుడు, కమలాక్షుడు, కరుణామయుడు, ఉత్తమశ్లోకుడు అయిన శ్రీకృష్ణుడిని నా పుణ్యాలపంటగా దర్శించగలిగాను. ఈ దేవదేవుడి దర్శనం వలననే నాకీ పూర్వ సంఘటనలన్నీ జ్ఞాపకానికి వచ్చాయి. శ్రీకృష్ణుడు పరమాత్మ, మహావిష్ణువు. ఆయనను శరణుపొందుము? అని మార్కండేయ మహర్షి బోధించాడు.

ధర్మరాజాదులు శ్రీకృష్ణుడిని పరమాత్మగా భావించి కీర్తించారు.

కలికాల ప్రభావం

ధర్మరాజు : మహర్షీ! కలియుగంలో కలిగే ధర్మలోపం గురించి చెప్పండి.

మార్కండేయుడు: కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలతో పరిపూర్ణంగా నడుస్తుంది. త్రేతాయుగంలో మూడు పాదాలతో,ద్వాపరంలో రెండు పాదాలతో, కలియుగంలో ఒకపాదంతో మాత్రమే ప్రవర్తిల్లుతుంది.

కలియుగంలో మానవులలో సత్యవర్తనం క్షీణిస్తుంది. దాని వలన ఆయుఃప్రమాణం తగ్గుతుంది. దాని వలన విద్య స్వల్పమౌతుంది. అల్పవిద్యల వలన మోహం పెరుగుతుంది. మోహం వలన లోభం, దాని వలన కామం, దాని వలన క్రోధం, దాని వలన వైరం, దాని వలన మానవుల మధ్య పరస్పర పీడనం పెరుగుతుంది. దానివలన తమ తమ మేరలు మీరి వర్ణ సంకరానికి పాల్పడతారు. బ్రాహ్మణులు జపనియమ స్వాధ్యాయ విధులను వదలిపెట్టుతారు. శూద్రులు విస్తారంగా తపస్సులు చేస్తారు.

కలియుగాంతంలో జనపదాలు పాడైపోతాయి. అవి క్రూరమృగాలకు నెలవులౌతాయి. అడవులు విస్తరిల్లుతాయి. ధర్మం నశిస్తుంది. ద్రవిళాభీరతురుష్క బర్బర పుళిందాదులు విజృంభిస్తారు. క్షత్రియజాతులు శౌర్యం, సంపద, తేజస్సు, మైత్రి కోల్పోయి శూద్రులవలె తిరుగాడుతారు. సుగంధద్రవ్యాలు, ద్రావణాలు సారవిహీనాలౌతాయి. పంటల దిగుబడి తగ్గిపోతుంది. ఆవుల పాడి తరిగిపోతుంది. చెట్లకు పూలు ఫలాలు పూయటం, కాయటం తగ్గుతుంది. రాజులు పన్నులు విరివిగా వసూలు చేయటానికి ప్రజలను పీడిస్తారు. బ్రాహ్మణులు వర్తక వ్యాపారాది వృత్తులు చేస్తారు.

కలియుగంలో వర్ణాశ్రమ ధర్మాలు నాస్తిక వేదాంతంతో నిండుతాయి. ప్రజలు పుణ్య పాప చింత లేకుండా దేహరక్షణే ముఖ్యమనుకొంటారు. వానలు సకాలంలో కురవవు. విత్తనాలు సారం కోల్పోయి పొల్లుగా మారతాయి. క్రయవిక్రయాలలో మోసం పెరుగుతుంది. కుదువబెట్టిన డబ్బును కూడా కాజేస్తారు. మంచివారు అష్టకష్టాలు పడతారు, రోగాలతో బాధపడుతూ అల్పాయుష్కులౌతారు. పాపులు సిరిసంపదలతో తులతూగుతూ చాలాకాలం బ్రతుకుతారు. వ్యవసాయంలో తిండిగింజల పంటలకంటే వ్యాపారపు పంటలు ఎక్కువౌతాయి. గొర్రెల పాడి పెరుగుతుంది. మగవారికి ఆడువారితో వివాహేతర సంబంధాలు ఎక్కువౌతాయి. చాలామంది మాంసాహారు లౌతారు. పితృదేవకార్యాలు దేశకాలపాత్రాల కనుగుణంగా జరుగవు. బ్రాహ్మణులలో హేతువాదం ప్రబలుతుంది. వారు వేదాలను నిందిస్తారు. సదాచారాలను యజ్ఞయాగాలను విడనాడుతారు. ఆడువారివి, బలహీనులవి, దీనులవి, బంధువులవి అయిన సర్వద్రవ్యాలను అపహరించే దుష్టులు; తల్లిదండ్రులను, కన్నబిడ్డలను, మిత్రులను చంపేవారు, యథేచ్ఛావిహారులు- లోకంలో గౌరవించబడతారు. బ్రాహ్మణులు ఆ దుర్మార్గులను ఆశ్రయించి, వా రిచ్చిన ద్రవ్యాలను గ్రహిస్తూ, అవమానాల పాలౌతారు. రాజులు ప్రజలను రక్షించేబదులు బహిరంగంగా దోపిడీ చేసే దొంగల్లాగా వారిని దోచుకొంటారు. సాధువుల సొత్తులను, స్త్రీధనక్షేత్రాలను హరిస్తారు. రాజులమధ్య వైరం పెరిగి పరస్పర యుద్ధాలు చేసికొంటారు. ప్రజానష్టం బాగా జరుగుతుంది.

కలికాలంలో కొడుకు తండ్రిని, భార్య భర్తను అవమానిస్తారు. భార్యాభర్తలు ఒకరి నొకరు తిరస్కరించుకొంటూ స్వేచ్ఛగా చరిస్తూ ఉంటారు. దేవతారాధనలు, పితృదేవతార్చనలు, వేదవేదాంగాధ్యయనాలు తగ్గిపోతాయి. అజ్ఞానాంధకారం అలముకొంటుంది. లోకం దుష్టులతో నిండిపోతుంది.

కలియుగంలో ప్రజల ఆయుఃప్రమాణం పదహారేండ్లకు పడిపోతుంది. ఏడెనిమిదేళ్ళ వయస్సులోనే ఆడపిల్లలు సంతానవతులౌతారు. దాతలు కరువై బీదలు దొంగతనాలకు పాల్పడతారు. ఎంత తెలిసిన వారైనా క్రూరులై పాపానికి ఒడిగడతారు. బ్రాహ్మణులు అన్నాన్నీ, వేదాన్నీ విక్రయిస్తారు. స్త్రీలు డబ్బుకొరకు మానాన్ని అమ్ముకొంటారు. శూద్రులు కోపోద్రేకాలకు లోనై చాలామందిని నిర్దాక్షిణ్యంగా చంపుతారు. దొంగలముఠాలవారు చెలరేగి ద్రవ్యాన్ని అపహరించటమే కాక ప్రాణాలు కూడా తీస్తారు. బ్రాహ్మణులు తమకు దిక్కెవ్వరూ లేక దీనులై నాలుగు దిక్కులా పరుగెత్తుతారు. జనులు బాధలు పడలేక కాకులవలె అడవులలో తలదాచుకొంటారు. శూద్రులు వేదార్థాలను వివరిస్తుంటే బ్రాహ్మణులలో పెక్కుమంది వింటారు. వారికి దాసులై మిక్కిలి నిందించదగిన పనులు చేస్తారు. కలికాలంలో దేవాలయాలు, బ్రాహ్మణాగ్రహారాలు, పవిత్ర ఆశ్రమాలు పాడైపోతాయి. చెడిన ఆడువారికి, మద్యపానానికి గిరాకీ పెరుగుతుంది. ఈ కాలంలో శిష్యులు గురువులను నిందిస్తారు. గురువులు శిష్యులను మోసగిస్తారు. జనుల మధ్య మంచి సంబంధాలు ఉండవు. కరవులు తరుచుగా ఏర్పడుతాయి. ప్రజలు ఎప్పుడూ భయాందోళనలకు గురి ఔతూ ఉంటారు. ఈ విధంగా కలికాలంలో ధర్మాలన్నీ తలక్రిందులౌతాయి. దేశాలు పట్టణాలు నాశనమౌతాయి. ప్రజలు శాంతిభద్రతలను కోల్పోయి కొండల్లో గుట్టల్లో నదీ తీరాల్లో తలదాచుకొంటారు.

కలియుగాంతంలో శంబళగ్రామంలో కల్కి అవతార పురుషుడు - విష్ణుయశుడు అనే పేరుగల బ్రాహ్మణుడు - పుట్టుతాడు. అతడు స్మరణమాత్రంతోనే సర్వశాస్త్రాలనూ, సమస్త అస్త్రశస్త్రాలనూ సులువుగా సంపాదించి సార్వభౌముడౌతాడు. అతడు పూనికతో మ్లేచ్ఛులను సంహరించి ధర్మాన్ని తిరిగి స్థాపిస్తాడు. అశ్వమేధయాగం చేస్తాడు. అతడు భూమిని బ్రాహ్మణధనంగా

భావించి, వారికి పంచిపెట్టి, తాను తపోవనానికి పోతాడు. అతడు నెలకొల్పిన ధర్మపద్ధతిలో, చాతుర్వర్ణ్య వ్యవస్థలో ప్రజలు తమ తమ విధులు నిర్వహిస్తూ ఉంటారు. దానివలన అటుపైన కృతయుగం ప్రవర్తిల్లుతుంది.

కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుంది. అన్ని దేశాలూ ఆదర్శప్రాయంగా ఒప్పారుతాయి. జనులు ఆయురారోగ్యాలతో ధర్మనిష్ఠమైన బుద్ధితో కలకాలం జీవిస్తూ సుఖిస్తారు. కృత, త్రేతాయుగ, ద్వాపర యుగాలు క్రమంగా వర్తిల్లుతాయి. ధర్మరాజా! ఇప్పుడు ఒక హితవు చెప్పుతున్నాను వినుము. 'నీవు బ్రాహ్మణులకు హితమైన కార్యాలను ఆచరించుము. విప్రులు సంతృప్తి చెందితే నీకు అనంతపుణ్యఫలం కలుగుతుంది. అంతేకాక, నీవు సమస్త ప్రాణులను దయతో చూడుము. ప్రజలను బిడ్డలవలె పాలించుము. లోగడ పెద్దలు చేసిన నిర్ణయాలను పరిశీలించుము. అజ్ఞానాన్ని తొలగించుము. అహంకారాన్ని త్యజించుము. సత్యాన్ని ప్రేమించుము. కాలగతులను తెలిసికొని జ్ఞానాన్ని నిరంతరం పెంచుకొమ్ము. భరతవంశజుడవు కాబట్టి నీవు సహజంగా నిర్మలుడవు, ప్రాజ్ఞుడవు'.

ధర్మరాజు ఆ మాటలు విని మునీంద్రుడికి నమస్కరించాడు. తాను ముని చెప్పినట్లు పూర్వం నుండి ఆచరిస్తున్నట్లు విన్నవించుకొన్నాడు. లోభ మాత్సర్యాది గుణాలను త్యజించి, ధర్మశాసనం సమగ్రంగా చెల్లేటట్లు చేస్తానని వాగ్దానం చేశాడు. అంతేకాక బ్రాహ్మణప్రభావాన్ని మరింత వివరించుమని కోరాడు. మార్కండేయమహర్షి మరొక ఇతిహాసాన్ని ధర్మరాజుకు చెప్పాడు.

వామదేవుడి వృత్తాంతం

పూర్వకాలంలో పరిక్షితుడు అనే రాజు అయోధ్యను పాలిస్తూ ఉండేవాడు. సూర్యవంశజుడైన ఆ రాజు సూర్యుడివలె తేజస్సుతో వెలుగుతూ ఉండేవాడు. అతడు ఒకనాడు గుర్రమెక్కి అడవికి వేటకు వెళ్ళాడు. అనేక మృగాలను వేటాడాడు. ఒకచోట ఆ మహారాజు ఒక అందగత్తెను చూచి, మదనభావానికి వశుడై ఆమెను సమీపించాడు. ఆమెకూడా ఆతడిని నర్మగర్భంగా చూచి వలపును ప్రకటించింది. ఆమె తండ్రి యాజ్ఞ చొప్పున తగిన వరుడి కొరకు అన్వేషిస్తూ ఆ అడవిలో నడయాడుతున్నదని తెలిసికొని ఆమెపైగల తన వలపును తెలియపరిచాడు. ఆమె అతడిని వివాహమాడటానికి అంగీకరించింది. కాని, ఆమెను ఎప్పుడూ జలవిహారానికి నియోగించకూడదని కట్టడి చేసింది. అతడు ఆ నియమానికి కట్టుబడి ఆమెను రాజధానికి తనతో తీసికొనిపోయాడు. అక్కడ క్రీడాభవనాలలో, ఉద్యానవనాలలో ఆమెతో రమిస్తూ విహరించాడు. ఒకనాడు విలాసభవనం నుండి వెలువడిన పరిక్షితుడి శరీరం చెమటతో తడిసింది. అందువలన సమీప సరోవరంలో స్నానం చేయాలని అనుకొన్నాడు. తన ప్రియురాలిని కూడా రమ్మని, సరోవరంలో దిగి జలకాలాడుమని పిలిచాడు. ఆమె చిరునవ్వు నవ్వుతూ ఆ కొలనులో దిగి వెంటనే అదృశ్యమైపోయింది.

రాజు అందుకు ఆశ్చర్యపడిపోయాడు, ఆ కొలనంతా ప్రియురాలి కొరకు గాలించాడు. నీరంతటినీ తోడి బైట పోయించాడు. అయినా ఆమె కనపడలేదు. కాని, అడుగున ఎన్నో కప్పలు ఉండటం గమనించాడు. అవే తన ప్రియురాలిని మ్రింగి ఉంటాయని భావించి, ఆగ్రహించి, తన రాజ్యంలో ఉన్న కప్పలనన్నింటిని వెదకి వెదకి చంపటానికి భటులను ఆజ్ఞాపించాడు. వారు నీటిపట్టులనన్నింటినీ గాలించి కప్పలను చంపి కుప్పలుగా పోయ నారంభించారు.

దానిని గమనించి కప్పలరేడు ఒక మహర్షి రూపం ధరించి పరిక్షితుడు వద్దకు వచ్చి అతడి కప్పలమీది ద్వేషానికి కారణమడిగాడు. తన ప్రేయసికి చేసిన అపకారానికి ప్రతిగా కప్పలను చంపుతున్నాని ఆ రాజు చెప్పాడు. ఆ మాటలు విని మునివేషం వదలి కప్పలనాయకుడైన ఆయువు నిజరూపంతో కనపడి, పరిక్షితుని ప్రేమించిన కన్య తన కూతురనీ, ఆమె పేరు సుశోభన అనీ ప్రకటించాడు. ఆమె తన వలపుతో అంతకుముందే ఎందరినో మోసగించిందని చెప్పాడు. రాజు కోరికపై ఆమెను నిజరూపంతో అతడికి అప్పగించాడు. ఆమె రాజులను చులకనగా భావించి మోసగించింది కాబట్టి ఆమెకు పుట్టే కొడుకులు మోసగాండ్రు ఔతారని శపించాడు. ఆయువు కూతురుకు హితవు చెప్పి వెళ్ళిపోయాడు. పరిక్షితుడు సుశోభనయందు శలుడు, నలుడు, వలుడు అనే ముగ్గురు కొడుకులను పడశాడు. వారిలో పెద్దవాడైన శలుడికి పట్టం కట్టి తపోవనానికి పోయాడు.

ఒకనాడు శలుడు బంగారు తేరు మీద అడవికి వేటకు వెళ్ళాడు. ఎన్నో మృగాలను సంహరించాడు. ఒక మృగాన్ని వాడియైన బాణంతో కొట్టాడు. గ్రుచ్చుకొన్న బాణంతో ఆ లేడి తప్పించుకొని పారిపోసాగింది. దాని వెంట రథాన్ని పరుగెత్తించాడు. కాని, ఆ రథాశ్వాలు అంతవేగంగా రథాన్ని లాగలేకపోయాయి. రథసారథి వామ్యజాతి గుర్రాలైతే రథాన్ని అద్భుత వేగంతో లాగగలవని రాజుకు విన్నవించుకొన్నాడు. వామ్యహయాలు వామదేవుడనే మహర్షి వద్ద ఉంటాయని తెలియచెప్పాడు. శలుడు వామదేవాశ్రమానికి వెళ్ళి, ఆ వామ్యాశ్వాలను అర్థించాడు. ఆ ముని కరుణించి, పని తీరిన తరువాత వెంటనే ఆ గుర్రాలను తిరిగి తన కిచ్చే కట్టడితో ఆ రాజుకు వామ్యాశ్వాలను ఇచ్చాడు. శలుడు ఆ కట్టడి కంగీకరించి, వామ్యాశ్వాలను రథానికి పూన్చుకొని, మృగాన్ని వెంటాడి దానిని చంపి, తన పట్టుదల సాధించి సంతృప్తి చెందాడు. కాని, ఆ వామ్యాశ్వాలను వామదేవుడికి తిరిగి ఇవ్వకుండానే తన రాజధానికి వెళ్ళాడు. 'ఆ మేటి గుర్రాలు రాజుల వద్ద ఉండదగినవి కాని, పేదబాపడి కెందు'కని భావించి అహంకరించి ఆ గుర్రాలను తన అంతఃపురంలో ఉంచుకొన్నాడు.

నెల రోజులు గడిచాయి. వామదేవుడు శలుడి దురహంకారాన్ని పసికట్టాడు. అశ్వాలను అడిగి తెమ్మని తన శిష్యుడైన ఆత్రేయుడిని పంపాడు. ఆత్రేయుడు రాజును దర్శించి వామదేవుడి సందేశాన్ని వినిపించాడు. శలుడు దురహంకారంతో దుర్భాషలాడి గుర్రాలనిచ్చేది లేదని, తిరిగి పొమ్మని, తిరస్కరించాడు. ఆత్రేయుడు తిరిగి వెళ్ళి గురువు కా సంగతి చెప్పాడు. వామదేవు డాగ్రహించాడు. శలుడి దగ్గరకు స్వయంగా వెళ్ళాడు. పరద్రవ్యాపహరణం పాపహేతువని హెచ్చరించి తన గుర్రాలను తిరిగి ఇచ్చి మాట నిలబెట్టుకొనుమని కోరాడు. శలుడు అతడి మాటలు పట్టించుకొనలేదు. బ్రాహ్మణులకు గుర్రాలు నిరుపయోగాలనీ, గుర్రాలకు బదులు ఎద్దులను గాని, అధికసంఖ్యలో కంచరగాడిదలను గాని ఇస్తానని చెప్పాడు. అంతటితో ఆగక వామ్యజాతి గుర్రాలను ముని కోరటం అనుచితమని నిందించి, తిరిగిపొమ్మని పరుషంగా పలికాడు. అతడి మాటలను వామదేవుడు సహించలేకపోయాడు. 'విప్రుల ధనాన్ని అపహరించటమే ఒక పాపం. దానికి బదులు మరేదో ఇస్తాననటం హాస్యాస్పదం. అది అన్యాయం'- అని అన్నాడు. ఆ మాటలకు శలుడు మండిపడ్డాడు. వామదేవుడిని పట్టి బంధించి శూలాలతో చంపండని భటుల నాజ్ఞాపించాడు. వామదేవుడి ముఖం కోపంతో ఎర్రబారింది. అందులో నుండి ఆ క్షణంలో అనేకమంది రాక్షసులు పుట్టి, శలుడిపై లంఘించి శూలాలతో పొడిచి అతడిని చంపివేశారు. మునీంద్రుడు తిరిగి వెళ్ళాడు.

శలుడి తరువాత అతడి తమ్ముడు నలుడు రాజయ్యాడు. కొంతకాలం గడిచింది. వామదేవుడు మరల రాజాస్థానానికి వచ్చి, తన గుర్రాలను తిరిగి ఇచ్చి ధర్మాన్ని కాపాడుమని నలుడిని అడిగాడు. నలుడు మండిపడ్డాడు. వామదేవుడికి యుక్తాయుక్త విచక్షణ లేదని నిందించాడు. విషబాణంతో వామదేవుడి వక్షాన్ని చీల్చిచంపుతానని సారథిని- విల్లును సిద్ధం చేయుమన్నాడు. ఆ మాటలు వామదేవుడికి ఈటెలుగా చెవులకు తాకాయి. 'ఓ రాజా! నీవు ప్రయోగించే బాణం అంతఃపురంలో ఉన్న పసివాడైన నీ కొడుకును సంహరిస్తుంది చూడు' మని హెచ్చరించాడు. వామదేవు డన్నంత పని అయింది. అంతఃపురంలో బాలుడు చనిపోయాడని స్త్రీలు రోదించనారంభించారు. నలుడు కోపోద్రిక్తుడయ్యాడు. బాణంతో బ్రాహ్మణుడిని చంపటానికి వింటినారి సారించాడు. కాని, వామదేవుడి మహిమతో నలుడి చేతులు అమ్ముతో పాటు స్తంభించిపోయాయి. నలుడు ఆశ్చర్యపడి, చేసేది లేక తలవంచుకొన్నాడు. కొంత తడవు విచారించి అందరూ వినేటట్లు ఈవిధంగా ప్రకటించాడు. 'నేను అనేక దుర్భాషలాడాను, అవన్నీ వమ్మయిపోయాయి. బాణం వేసే శక్తి నాకు పోయింది. బ్రాహ్మణమాహాత్మ్యం నిజంగా గొప్పది. నేను వామదేవుడి ముందు ఓడిపోయాను. ప్రజలారా! మీ ముందు ఈ మహామునిని శరణు వేడుతున్నాను'- అని పేర్కొన్నాడు. అందరూ అతడితోపాటు మునీంద్రుడిని శరణు వేడారు. వామదేవుడు ప్రసన్నుడై స్తంభన స్థితి నుండి రాజును విముక్తుడిని చేశాడు. మృతబాలుడిని తిరిగి బ్రతికించాడు. నలుడు తన అంతఃపురం నుండి వామ్యాశ్వాలను తెప్పించి వామదేవుడికి వినయంతో సమర్పించాడు. వామదేవుడు వామ్యాశ్వాలను తీసికొని తన ఆశ్రమానికి వెళ్ళాడు. బ్రాహ్మణప్రభావం - అంటే ఇటువంటిది- అని మార్కండేయ మహర్షి ధర్మరాజుకు వివరించి చెప్పాడు.

ఇంద్రద్యుమ్నుడి కథ

ధర్మరాజు : మార్కండేయ మహర్షీ! మీ కంటె వృద్ధుడైన పురుషుడు ఈ లోకంలో ఎవరైనా ఉన్నాడా? ఉంటే తెలపండి.

మార్కండేయుడు: ఇంద్రద్యుమ్ను డనే రాజు స్వర్గలోకంలో ఎంతోకాలం ఉన్నాడు. క్రమంగా అతడి కీర్తి తగ్గింది. అందువలన అతడిని స్వర్గం నుండి భూమికి పంపారు. అతడు నావద్దకు వచ్చాడు. 'నన్ను గుర్తించగలవా?' అని

నన్నడిగాడు. 'నేను గుర్తించలేను కాని, హిమవత్పర్వత శిఖరం మీద ఉండే ప్రావారకర్ణుడనే గుడ్లగూబ నాకన్న వయసులో పెద్దది. అది నిన్ను గుర్తించవచ్చు' నని నేనన్నాను. ఇంద్రద్యుమ్నుడు తనతో నన్ను కూడా రమ్మన్నాడు. 'రసఘుటికసేవించి ఉన్నాను. కనుక రాజాలను' అని అనినప్పటికీ అతడు గుర్రంగా మారి తన వీపుమీద నన్నెక్కించుకొని ఆ గుడ్లగూబ వద్దకు తీసికొనిపోయాడు. ప్రావారకర్ణుడు కూడా అతడిని గుర్తించలేకపోయాడు. ఇంద్రద్యుమ్నమనే సరోవరంలో నాళీకజంఘుడనే పేరుగల బకవల్లభుడు తనకంటె పెద్దవాడున్నాడని ప్రావారకర్ణుడు పేర్కొన్నాడు. అతడిని కూడా తన వీపుమీద కూర్చుండబెట్టుకొని నాళీకజంఘుడి వద్దకు వెళ్ళాడు. ఆ కొంగల రేడు కూడా ఇంద్రద్యుమ్యుడిని గుర్తించలేకపోయాడు. కాని, అతడికంటె వృద్ధుడైన అకూపారుడనే తాబేటిరేడు ఆ కొలనులోనే ఉన్నాడని పేర్కొన్నాడు. అతడిని పిలిచి ఇంద్రద్యుమ్నుడిని గుర్తించగలవా? అని అడిగారు. అతడు కొంచెం సేపు జ్ఞాపకం తెచ్చుకొని కన్నుల నుండి ఆనందబాష్పాలు రాలుతూ ఉండగా గద్గదస్వరంతో ఇట్లా అన్నాడు.

'అయ్యో! ఎంతమాట! ఇంద్రద్యుమ్న మహారాజును నేను ఎట్లా మరచిపోగలను? ఆయన మహాత్ముడు. నన్ను ఎన్నో ఆపదలనుండి కాపాడాడు. ఎన్నో యజ్ఞాలు చేశాడు. ఆ యజ్ఞాలలో దక్షిణలుగా లెక్కకు మించి గోవులకదంబాలను బ్రాహ్మణులకు అర్పిస్తుండేవాడు. ఆ ఆవుల గిట్టల తాకిడికి పల్లపు గొయ్యిగా ఏర్పడినదే ఈ సరోవరం. ఇది లోక ప్రసిద్ధం.'

ఆ మాటలు వినగానే దేవదూతలు వచ్చి విమానం తెచ్చి ఇంద్రద్యుమ్నుడిని స్వర్గానికి రమ్మని ఆహ్వానించారు. అతడి కీర్తి లోకంలో శాశ్వతంగా నిలిచి ఉండేది కాబట్టి స్వర్గలోక సౌఖ్యాలు శాశ్వతంగా అనుభవించవచ్చు నన్నారు. అంటే - ఈ లోకంలో ఎవరి కీర్తి ఎంతకాలం నిలిచి ఉంటుందో వారు అంతకాలం వరకు స్వర్గలోక సౌఖ్యాలను అనుభవిస్తా రన్నమాట!

ఇంద్రద్యుమ్నుడు మార్కండేయ మహర్షిని, ప్రావారకర్ణుడిని, నాళీకజంఘుడిని వారి వారి చోట్లలో దింపి, తాను దివ్యరథమెక్కి స్వర్గలోకం చేరుకొన్నాడు. మార్కండేయుడు చెప్పిన ఈ కథను ధర్మజుడు విని సంతోషించాడు. మార్కండేయుడి కంటె కూడా వృద్ధు డున్నాడని తెలిసి ఆశ్చర్యపడ్డాడు.

ధర్మరాజు : మార్కండేయ మహర్షీ! ఇక్ష్వాకు వంశంలో పుట్టిన కువలాశ్వుడికి ధుంధుమారుడనే పేరు ఎట్లా ఏర్పడిందో చెప్పండి.

మార్కండేయుడు: ఉదంకుడనే ముని అనేక సంవత్సరాలు విష్ణువును గూర్చి తపస్సు చేశాడు. అతడి తపస్సుకు మెచ్చి విష్ణువు ప్రత్యక్ష మయ్యాడు. ఉదంకు డా దేవదేవుడిని అనేక విధాలుగా స్తుతించాడు. విష్ణువు ఉదంకుడిని వరం కోరుకొనుమన్నాడు. విష్ణు దర్శనం కంటె కోరదగిందేముంటుందని అంటూనే తన మనస్సు ఎల్లప్పుడూ సత్యధర్మశమభావాలతో సుస్థిరంగా ఉండి విష్ణువుపై దృఢభక్తి కలిగి ఉండాలని కోరుకొన్నాడు. ఆ వరాన్ని విష్ణుదేవుడు ప్రసాదించి, అతడి వలన త్రిలోకహితం కలిగే ఒక పని సాధించబడుతుందని పేర్కొన్నాడు. "ధుంధుడనే రాక్షసుడు లోకాలకు ఉపద్రవాలను కలిగిస్తాడు. అతడిని వధించటానికై బృహదశ్వుని కుమారుడైన కువలాశ్వుడిని నీవు ప్రేరేపించాలి. ఆ రాజు నా దయవలన కలిగే యోగబలంతో, నీ యాజ్ఞ చొప్పున ఆ రాక్షసుడిని సంహరిస్తాడు. నీ వలన కలిగే ఆ సత్కార్యానికి లోకాలన్నీ సంతోషిస్తాయి' అని వివరించి విష్ణువు అంతర్ధానమయ్యాడు. ఉదంకుడు మరల తపస్సులో మునిగాడు.

ఇక్ష్వాకు వంశంలో బృహదశ్వుడికి కువలాశ్వుడు పుత్రుడై పుట్టాడు. అతడికి ఇరవై ఒక్కవేల మంది కొడుకులు పుట్టి అస్త్రశస్త్రవిద్యలలో ఆరితేరారు. బృహదశ్వుడు కువలాశ్వుడికి పట్టం కట్టి, తపోవనానికి పోవాలని నిశ్చయించాడు. ఆ సంగతి తెలిసి ఉదంకుడు అయోధ్యకు వచ్చాడు. ధుంధుడు చేసే దుండగాలను అతడితో చెప్పాడు. మధుకైటభుల కొడుకైన ధుంధుడు బ్రహ్మవలన పొందిన వరబలంతో దేవగంధర్వాదులను ముప్పతిప్పలు పెట్టాడు. ఆ తరువాత ఉదంకాశ్రమ సమీపంలో గల సముద్రతీరంలోని ఇసుక తిన్నెలలో ఒక పెద్ద సొరంగం త్రవ్వుకొని అందులో హాయిగా పవళించి నిద్రిస్తున్నాడు. అతడు పీల్చిన

గాలి వదలేటప్పుడు అది పెనుగాలిగా మారి అగ్నిజ్వాలలతో పొగలతో నిండి భయంకరంగా వ్యాపించి కొండలను, అడవులను, ఇసుక రేణువులతో మాటు పడేటట్లు చేస్తుంది. 'సంవత్సరాని కొకసారి ఏడురోజులపాటు ఆ సంకటం మా ఆశ్రమవాసుల కేర్పడుతుంది. కాబట్టి నీవా రాక్షసుడిని చంపి మాకూ లోకానికీ శాంతిని కూర్చి తపోవనానికి వెళ్ళు' మని కోరాడు. 'ఆ రాక్షసుడిని చంపటానికి పూనుకొనే వీరుడికి విష్ణువు తన యొక్క శక్తిసామర్థ్యాలు ప్రసాదిస్తాడ'ని పేర్కొన్నాడు.

బృహదశ్వుడు తపోవనానికి పోవ సంకల్పించి అస్త్ర సన్యాసం చేయటం వలన తన కుమారుడైన కువలాశ్వుడికి ఆ బాధ్యత నప్పగించాడు. కువలాశ్వుడు తన పుత్రులందరూ వెంటరాగా, అపార చతురంగ సైన్యంతో ధుంధుడి మీదికి దండయాత్రకు బయలుదేరాడు. విష్ణువు తన శక్తిని కువలాశ్వుడికి దత్తం చేశాడు. దేవతలు అతడిని ఆశీర్వదించారు. కువలాశ్వుడి కొడుకులు వివిధాయుధాలతో ఇసుక తిన్నెలను వారం రోజులపాటు త్రవ్వారు. నిద్రిస్తున్న ధుంధుడు సారంగంలో కనపడ్డాడు. అతడి ముక్కులలో నుండి వేడి నిట్టూర్పు గాలులు అగ్ని జ్వాలలతో కలిసి వెలువడుతున్నాయి. కువలాశ్వుడి కుమారులు వివిధాయుధాలను ప్రయోగించి ధుంధుడిని నిద్రలేపారు. ఆ రాక్షసుడు నిద్రలేచి నోరు తెరిచి ఆవులించాడు. ఆ నోటిలో నుండి వెలువడ్డ మంటలకు కువలాశ్వుడి కుమారులలో ముగ్గురు తప్ప అందరూ- కపిలమహర్షి కోపాగ్నికి ఆహుతి అయిన సగరపుత్రులవలె- దగ్ధులయ్యారు.

కువలాశ్వుడు కోపోద్రిక్తుడై ధుంధుడిని ముట్టడించాడు. అతడు లేచాడు. అతడి దేహం నుండి అగ్నిజ్వాలలు భయంకరంగా వెలువడుతున్నాయి. మండుతున్న భల్లాన్ని అతడు ప్రయోగించాడు. కువలాశ్వుడు విష్ణుయోగ శక్తి వలన అతడి దేహం మీది మంటల నార్పి, బ్రహ్మాస్త్ర ప్రయోగంతో అతడిని వధించాడు. అతడి పరాక్రమానికి మెచ్చి దేవతలూ, ఋషులూ అతడికి 'ధుంధుమారు' డనే బిరుదనామాన్ని ప్రసాదించారు. ఉదంకుడు, ఇంద్రుడు ప్రసన్నులై కువలాశ్వుడిని వరం కోరుకొనుమన్నారు. అతడు బ్రాహ్మణభక్తినీ, నిరంతర దాన శీలాన్ని, విష్ణువుతోటి చెలిమినీ, వరాలుగా కోరుకొన్నాడు. వా రా వరా లిచ్చి వెడలిపోయారు. కువలాశ్వుడు అయోధ్యకు తిరిగి వచ్చి సముజ్జ్వల సామ్రాజ్య సౌఖ్యాల ననుభవించాడు.

మధుకైటభుల వృత్తాంతం

ధర్మరాజు : మునీంద్రా! ధుంధుడు మధుకైటభుల పుత్రుడని చెప్పారుకదా! వారు ఏకాలం వారు? వారు చివర కేమైనారు?

మార్కండేయుడు: పూర్వం ప్రళయకాలంలో మూడు లోకాలూ ఏకార్ణవంగా ఏర్పడిన నీటిలో మునిగి ఉండగా, విష్ణువు శేషశయనం మీద పవ్వళించి యోగనిద్రలో ఉండగా చాలాకాలం గడచింది. పిదప మధుకైటభులు బలగర్వితులై విష్ణుదేవుడి నాభీ కమలంలో ఉన్న బ్రహ్మదేవుడిని పట్టి మోదారు. ఆ దెబ్బలకు బ్రహ్మదేవుడు 'ఆదిపురుషా! నన్ను రక్షించు' అంటూ ఆక్రందన చేశాడు. విష్ణువు యోగనిద్ర నుండి మేల్కొని భయంకర పరాక్రములైన మధుకైటభులను చూచి, 'వరాలు కోరుకొనండి ఇస్తాను' అని ప్రకటించాడు.

మధుకైటభులు గర్వంతో అట్టహాసం చేశారు. 'వరాలు నీ విచ్చేదేమి? మేమే నీ కిస్తాం కోరుకో'మ్మన్నారు. అదే సమయమని మహావిష్ణువు తన చేతిలో వారు మరణించాలని వరం వేడుకొన్నాడు. మధుకైటభులు తమ వాగ్దానాన్ని పాటించి, జగమంతా జలమయమని భావించి, ఉపాయాన్ని ఊహించి, నీరులేని చోట విష్ణువు తమను సంహరించటానికి అంగీకరించారు. విష్ణువు తన తొడలనే వేదికగా చేసి, సుదర్శన చక్రంతో మధుకైటభుల తలలను నరికాడు. ఆ మధుకైటభులకు పుట్టిన వాడు ధుంధుడు.

తల్లిదండ్రులు-పుత్రులు

ధర్మరాజు : పుత్రుల కొరకు పడే ఆయాసంలో తల్లిదండ్రు లిద్దరిలో ఎవరిపాలు ఎక్కువ?

మార్కండేయుడు: సంతానాన్ని ఉదరంలో నవమాసాలు కష్టపడి మోసి ప్రాణసంశయ స్థితిని పొంది కడుపార కనేది తల్లి. సంతానం కోరి తపస్సులు, యజ్ఞాలు, దానాలు, వ్రతాలు, తీర్థయాత్రలు చేసి పాటుపడి ప్రయత్నం చేసేవాడు తండ్రి. ఈ విధంగా పుత్రుడి (సంతానం) కొరకు తల్లిదండ్రు లిద్దరూ పడేపాట్లు సమానమే.

ధర్మరాజు : తల్లిదండ్రుల పట్ల పుత్రుడు ఏవిధంగా మసలుకొనాలి?

మార్కండేయుడు: తనయుడు తమకు భక్తుడై ఉంటాడనీ, ధర్మానురక్తుడై వర్తిస్తాడనీ తల్లిదండ్రులు ఆశపడుతూ ఉంటారు. వారి ఆశలకు, ఆశయాలకూ ఫలసిద్ధి కలిగించేవాడే పుత్రుడు. ఎవడి ప్రవర్తనంవలన తల్లిదండ్రులు సంతోషపడతారో ఆ తనయుడు ధర్మాన్నీ, కీర్తినీ సమానంగా పొందుతాడు. చివరకు అక్షయపదాలను అందుకొంటాడు.

పతివ్రతామాహాత్మ్యం

ధర్మరాజు : ఇంద్రియాలను నిగ్రహించి, మనస్సును నియమించి, అహంకారాన్ని అణచుకొని, సద్భక్తి పెంపుతో ఎల్లప్పుడూ భర్తృశుశ్రూషలో నిమగ్నలైన పతివ్రతలు లోకోత్తరలు. వారి చరిత్రలు ధర్మసూక్ష్మాలతో కూడి ఉంటాయి. వాటిని తెలిసికొనటం కష్టం. కాబట్టి, పతివ్రతా మాహాత్మ్యాన్ని వివరించండి.

మార్కండేయుడు: భర్తృశుశ్రూషలో నిత్యాసక్తురాలైన పతివ్రతకు యజ్ఞదాన తపస్సులు చేసిన ఫలాలు సులభంగా లభిస్తాయి. ఈ తాత్పర్యాన్ని బోధించే ఒక ఇతిహాసం చెప్పుతాను వినుము. అందులో నీవడిగిన అంశాలన్నీ తేటపడతాయి.

పూర్వం కౌశికుడనే బ్రాహ్మణుడు నిరంతరం వేదాధ్యయనం చేస్తూ ఒక గ్రామంలో ఉన్నాడు. ఒకనాడు ఆయన గ్రామసమీపంలోని ఒక చెట్టు క్రింద కూర్చుండి వేదాలు వల్లెవేస్తున్నాడు. ఆ చెట్టుమీది ఒక కొంగ అతడి మీద రెట్టవేసింది. అతడు కోపంతో తీక్షణంగా ఆ కొంగవైపు చూచాడు. అది చచ్చి క్రింద పడింది. ఆ దృశ్యాన్ని చూచి కౌశికుడు బాధపడ్డాడు. తన హృదయ కాఠిన్యాన్ని నిందించుకొన్నాడు. నిష్కారణంగా ఒక జీవిని హింసించినందుకు మనశ్శాంతిని కోల్పోయాడు. చాలాసేపు చింతించాడు. మధ్యాహ్న మయింది. గ్రామంలోకి పోయి బ్రాహ్మణవీథిలో ఒక గృహం ముందు నిలిచి, 'భిక్షాం దేహి' అని అన్నాడు. ఆ ఇంటి ఇల్లాలు భిక్ష నివ్వటానికి పాత్రను సిద్ధపరచుకునే లోపలే ఆమె భర్త ఆకలితో సోలుతూ తూలుతూ వచ్చాడు. ఆ ఇల్లాలు ఆయనకు స్నానం చేయించి, భక్తితో భోజనం పెట్టి, సెజ్జపై అతడు పరుండగా తాంబూల మిచ్చి, పాదాలొత్తి, ఆతడు నిద్రించిన తరువాత ముంగిట్లో ఉన్న బ్రాహ్మణుడికి భిక్షపెట్టటానికి వెళ్లింది.

కౌశికుడు ఆమెను చూచి కసరుకొన్నాడు. కన్నెఱ్ఱ చేసి, భిక్షను ఆలస్యంగా పెట్టి తనను అవమానించినట్లు నిష్ఠురాలాడాడు. ఆ పతివ్రత తన భర్త రాకను, తాను ఆతడికి చేసిన శుశ్రూషను పేర్కొని, తాను తప్పేమీ చేయలేదనీ, దానిని సహించాలనీ పేర్కొన్నది. మగువలకు మగని కంటె అతిథులు ముఖ్యమనీ, లోకవంద్యులైన బ్రాహ్మణులను ఇంద్రాదులే భక్తితో పూజిస్తుంటే ఆమె అవమానం చేసిందని కౌశికుడు నిష్ఠురమాడాడు. అవమానితులైన బ్రాహ్మణులు కోపగిస్తే వారి క్రోధాగ్నిశిఖలు భూమినంతా దగ్ధం చేస్తాయన్న సంగతి తెలియదా? అని గద్దించాడు. ఆమెకూడా తనకు బ్రాహ్మణమాహాత్మ్యం తెలుసుననీ, వారిని అవమానించటం కొరవితో తల గోక్కొనటమేననీ చెప్పింది. అయినా, తన పాలిటి దైవం పతియే అనీ, త్రికరణశుద్ధిగా ఆయనను సేవించటం కంటె మరొక ధర్మం లేదనీ పేర్కొన్నది. కౌశికుడు కోపాగ్నితో కొంగను చంపిన విషయం పేర్కొని దానిని తన పాతివ్రత్య మహిమ వలన తెలిసికొన్నానని హెచ్చరించింది. బ్రాహ్మణులు క్రోధమోహాలనే అంతశ్శత్రువులను ముందుగా జయించాలని హితవు చెప్పింది. సత్యం పలికేవాడు, అహింసావ్రతుడు, గురుజనహితం కోరేవాడు, ఇంద్రియాలను జయించి సర్వభూతాలను తనవలె భావించేవాడు, కామరహితుడు, షట్కర్మనిరతుడు, పుణ్యాత్ముడు అయినవాడే బ్రాహ్మణుడని ఆర్యులు పేర్కొంటారనీ శమదమాదులు విప్రుల ధర్మసాధనలనీ, వేదవిహిత విధులు ముఖ్యంగా ఆచరణీయాలనీ పేర్కొన్నది. ధర్మం అనేక మార్గాలలో అన్వయించుకొనవలసిన అతిసూక్ష్మమైన విద్య అనీ, స్వాధ్యాయపరుడైన కౌశికుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మసూక్ష్మాన్ని తెలియలేదనీ చెప్పింది. జితేంద్రియుడు, సత్యవాది, మాతాపితృ భక్తియుక్తుడైన ధర్మవ్యాధుడనే కిరాతుడు మిథిలానగరంలో ఉంటాడనీ, అతడిని దర్శించి ధర్మాలన్నింటినీ తెలిసికొమ్మని హితవు చెప్పింది. వనితలు ఎట్టి అపరాధాలు చేసినా క్షమార్హులు కాబట్టి తనపై కోపగించవద్దని కోరింది. కౌశికుడు ఆమె మాటలకు చిత్తశాంతి పొంది, ఆమెను ఆశీర్వదించి, ధర్మవ్యాధుడిని దర్శించటానికి వెంటనే బయలుదేరాడు.

మిథిలానగరంలో మాంస విక్రయవృత్తిలో నిమగ్నుడై ఉన్న ధర్మవ్యాధుడిని చూచాడు. మాంస విక్రయశాలకు కొంతదూరంగా తొలగిపోయి నిలిచాడు. ధర్మవ్యాధుడు కౌశికుడిని గుర్తించి సమీపించి కుశల మడిగాడు. పతివ్రత పంపగా వచ్చిన సంగతి తనకు తెలుసునని చెప్పి, కౌశికుడిని తన యింటికి అతిథిగా తీసికొని వెళ్ళాడు. పతివ్రత ప్రదర్శించిన జ్ఞానానికే ఆశ్చర్యపడిన కౌశికుడు ధర్మవ్యాధుడి జ్ఞానానికి మరీ ఆశ్చర్యపోయాడు. కౌశిక ధర్మవ్యాధుల మధ్య సంభాషణ ఈ విధంగా సాగింది-

కౌశికుడు : ధర్మవ్యాధా! నీవు ధర్మం తెలిసినవాడవు. ఈ విధంగా జీవహింస చేయటం ఉత్తమ పద్ధతియా? నా మనస్సు దీనికి విచారిస్తున్నది.

ధర్మవ్యాధుడు: బ్రాహ్మణులకు తపస్సు, స్వాధ్యాయం, సత్యం, శౌచం, బ్రహ్మచర్యం పరమధర్మాలు. అట్లాగే రాజులకు దండనీతి, వైశ్యులకు వ్యవసాయం, పశుపాలనం, వాణిజ్యం, శూద్రులకు శుశ్రూష, మాకు మృగమాంసవిక్రయంతో జీవించటం వృత్తిధర్మం. వంశపరంపరగా వచ్చే ఆచారం దాటరానిది. మా రాజైన జనకుడు వర్ణ ధర్మ రక్షకుడు. ఆ ధర్మాన్ని ఉల్లంఘిస్తే తన కొడుకునైనా మా రాజు దండిస్తాడు. కాబట్టి నేను నా వృత్తి ధర్మాన్ని పరిత్యజించలేను. నేను స్వయంగా జీవహింస చేయను. మాంసాన్ని క్రయం చేసి, ముక్కలు చేసి విక్రయిస్తాను. ఇది నా బ్రతుకు తెరువు. ఇందులో నాకు మనశ్శాంతి కలుగుతుంది.

వృత్తిధర్మంతోపాటు నేను పెద్దల సేవ చేస్తాను. విప్రులను దేవతలను ఆరాధిస్తాను. సత్యశౌచాలను పాటిస్తాను. పనివారిని దయతో చూచుకొంటాను. ఓర్పుతో, అసూయకు లోనుగాక, ఆశకు పోక, పరదూషణం చేయక ఏకపత్నీవ్రతంతో, వ్రతనిష్ఠలతో, సమచిత్తంతో జీవిస్తాను. కాబట్టి తక్కువ కులంలో పుట్టినా పవిత్రుడనే. ప్రసంగవశంగా ఈ మాటలు నన్ను గురించి చెప్పాను గాని, ఇక నీకు ధర్మ విశేషాలు వివరిస్తాను వినుము - అని అన్నాడు.

ధర్మవ్యాధుడి ధర్మబోధలు

ధర్మరాజు : మార్కండేయ మహర్షీ! తక్కువ కులంలో పుట్టినవాడు కూడా ఎటువంటి నడవడిక కలవాడైతే ఉత్తమ ధార్మికలోకాలను పొందగలడు?

మార్కండేయుడు: ధర్మరాజా! నీ వడిగిన అంశాల కన్నిటికీ ధర్మవ్యాధోపాఖ్యానంలో సమాధానాలు దొరుకుతాయి వినుము. ధర్మవ్యాధుడు కౌశికుడికి ఈ విధంగా ధర్మబోధ చేశాడు-

ధర్మవ్యాధుడు: ప్రతివాడూ తన కుల ధర్మాన్ని పరమధర్మంగా పాటించాలి. మనసులో దయ కలిగి ఉండాలి. అందరి భావాలనూ విని సహించి, విషయవాంఛలు వదలుకోవాలి. త్యాగశీలుడికి అసాధ్యమనేది ఉండదు. సత్యహితవచనం, సుజనుల పట్ల గౌరవభావం, కామక్రోధ విద్వేషాలతో మనసు కలుషితమైనా ధర్మం తప్పకుండా ఉండటం, ద్వంద్వాతీత ప్రవృత్తి కలిగి ఉండటం, విశ్వశ్రేయోభావనం, కీడు చేసిన వారికి కూడా మేలు చేయటం- అనే గుణాలు ఉత్తముల లక్షణాలు. ఇతరులకు కీడు తలపెట్టితే ఆ పాపమే వాడికి కీడు చేస్తుంది. నాస్తికుల మాటలు విని ధార్మికులు తమ ధర్మాలపట్ల ఆసక్తిని కోల్పోరాదు. పాపం తెలియక చేసినా దానికి విచారిస్తే సగం పోతుంది. ఇకముందు అటువంటి పాపం చేయనని సంకల్పిస్తే పాపమంతా పోతుంది. క్రోధలోభాలు మహాపాపాలు; వాటిని జయించినవాడు ఉత్తముడు. గడ్డితో కప్పబడిన బావులవలె కపట ధర్మాలు కొన్ని మార్గంలో తగలవచ్చు. వాటికి దూరంగా ఉండి శిష్టాచారాలను పాటించటం ధర్మం.

కౌశికుడు : శిష్టాచారాలని వేటిని అంటారు? వాటిని తెలపండి.

ధర్మవ్యాధుడు: దానం, సత్యం, తపస్సు, యజ్ఞం, ఆర్జవం, కామలోభరాహిత్యం, గురుజన శుశ్రూష, కోపం లేకపోవటం, దమం, సంతోషం, నిరంతరాధ్యయనం, దాంభికత్వ రాహిత్యం, దైన్యరాహిత్యం, అసూయా రాహిత్యం, అహంకార రాహిత్యం, ధర్మానురక్తి, నాస్తిక గోష్ఠికి దూరంగా ఉండటం, శీలాన్ని రక్షించుకొనటం, పుణ్య తీర్థాలను సేవించటం, శౌచం, భూతదయ, మితహితోక్తి, సంశ్రితమిత్ర గుప్తి - అనేవి శిష్టాచారాలు. శిష్టాచారాలపథంలో ప్రవేశించిన తరువాత మరొక మార్గాన్ని అవలంబించటం దుర్లభం.

శిష్టాచారంలో ధర్మానికి ప్రాముఖ్యం ఉంటుంది. సత్యం, అహింస దానికి తోడుగా ఉంటాయి. అహింస ధర్మాలన్నిటిలో మిన్న. అది సత్యంతో కూడి ఉండటంచేత శిష్టాచారాలలో సత్యానికే అధిక ప్రాధాన్య ముంటుందని పండితులు పేర్కొన్నారు. ధర్మాలు మూడు రకాలు. 1. వేదవిహితాలు 2. శాస్త్రవిహితాలు 3. శిష్టాచారాలు అని. ఈ మూడూ ఉత్తమ గతులు కలిగిస్తాయి.

కౌశికా! నీవు నా వృత్తి హింసాబహుళమని పేర్కొన్నావు. అయితే ఇది హింస, ఇది అహింస అని విభజించటం ఎవరికీ సాధ్యం కాదు. ప్రాణులు తమ కర్మకు ఫలరూపంగానే చనిపోతాయి. చంపేవాడు నిమిత్తమాత్రుడే. అంతేకాక పశువులకు చెట్లు చేమలు పండ్లు ఆకులు ఆహారంగా బ్రహ్మ సృజించాడు. శిబిచక్రవర్తి తన శరీరాన్ని హింసించి ఇంద్రాగ్నులకు ఆమెతగా అందించలేదా? అయినా అతడికి ఉత్తమగతి వచ్చింది. పూర్వం రంతిదేవుడు ప్రతిరోజూ రెండు వేల గోవుల చొప్పున వేయి సంవత్సరాలు వధించలేదా? బ్రాహ్మణులు యజ్ఞాలలో పశువులను వధిస్తారు కదా! వారందరికి ఉత్తమగతులు కలగలేదా? అగ్ని కార్యాలలో, పితృదేవ కార్యాలలో మాంసాన్ని వినియోగించటం, శేషాన్ని భుజించటం ఆచారమే కదా! రైతు పొలం దున్నేటప్పుడు నాగలి కొన తగిలి ఎన్ని జీవులు నశించవు? అది హింస ఔతుందా? మానవుల అడుగుల క్రిందపడి ఎన్ని సూక్ష్మజీవులు నశించటం లేదు? నీరు, భూమి, ఆకాశం, అన్నీ జంతుమయాలే. అన్నిటా అనుక్షణం హింస జరుగుతూనే ఉంది. దీనిని గమనించకుండా కొందరు 'మేము హింసచేయము' అని అంటూ ఉంటారు. అహింసావ్రతాన్ని పాటిస్తారు. కూరలు, పండ్లూ కోయటం, తినటం హింస కాదా? ఈ లోకంలో హింస చేయనివాడు లేడు. అయితే వీలైనంతవరకు హింసకు దూరంగా ఉండటమే అహింస.

ధర్మం బహువిధాలుగా ఉంటుంది. దానికి శ్రుతి ఎంత ప్రమాణమో, పెద్దల ఆచారం కూడా అంతే ప్రమాణం! జీవుల మేలు కొరకు పలికే అబద్ధం సత్యవాక్య ఫలాన్ని ఇస్తుంది. జీవులకు భయం కలిగించే అచ్చమైన సత్యం కూడా అసత్యమౌతుంది. ప్రాణరక్షణలో, పెండ్లిలో అబద్ధమాడినా సత్యం కంటె మించిన ఫలాన్నిస్తుంది. ఇటువంటివి ధర్మసూక్ష్మాలు.

మానవుడు తన కర్మఫలానికి తానే కర్త. ఆపద కలిగినప్పుడు మూఢులు దేవుడిని నిందిస్తారు. అది తప్పు. మంచివారు చేసే పనులు కొన్ని విఫలమౌతాయి. దుర్మార్గు లాచరించే కొన్ని కర్మలు విశేషంగా ఫలిస్తాయి. అటువంటి వన్నీ కర్మఫలాలని తెలిసికొమ్ము.

జీవలక్షణం

కౌశికుడు : ధర్మవ్యాధుడా! జీవు డెటువంటి వాడు?

ధర్మవ్యాధుడు : జీవుడు సనాతనుడు, పాపరహితుడు. కర్మవశాన అనిత్యమైన దేహంలో ప్రవేశిస్తాడు. దేహం నశించినా జీవుడు చెడడు. ఒక దేహాన్ని వదలి మరొకదాన్ని చెంది సుఖదుఃఖాలను పొందుతాడు. కర్మవశాన మరల మరల అనేక దేహాలను ధరిస్తూ ఉంటాడు.

పుణ్యకర్మలవలన దేవజన్మ వస్తుంది. పుణ్యపాప సాంకర్యం వలన మానవ జన్మ ఏర్పడుతుంది. పాపాలు చేస్తే క్రిమికీటకాది జన్మలు ఏర్పడతాయి. ఈ విధంగా జీవుడు మోహసముద్రంలో మునిగి తేలుతూ ఉంటాడు. ఎన్నడూ తీరం చేరడు. పండితు లీసంగతి తెలిసికొని పాపమార్గాన్ని వీడి ధర్మమార్గాన్ని ఆశ్రయిస్తారు. సత్కర్మలు చేస్తారు. ధర్మాచరణ వలన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనస్సు తేటపడుతుంది. దానివలన క్రమంగా ఇంద్రియాలను జయించి తపస్సు, దమం, సత్యశీలతను సాధిస్తారు. చివరకు మోక్షాన్ని పొందుతారు.

కౌశికుడు : ఇంద్రియాలంటే ఏవి? వాటిని నిగ్రహించకపోతే ఎటువంటి పాపా లేర్పడతాయి? నిగ్రహించగలిగితే ఎటువంటి సత్ఫలితాలు కలుగుతాయి?

ధర్మవ్యాధుడు: ఇంద్రియ జ్ఞానానికి మనసు మూలం. మనస్సు కామక్రోధాలకు వశమై ఇంద్రియ సుఖాలను కోరుతూ ఉంటుంది. మొదట రాగం, దానివలన లోభం అలవడుతుంది. లోభికి దయ ఉండదు. గర్వం పెరుగుతుంది. అతడు పాపాలకు పాల్పడతాడు. న్యాయమైన మాటలు వినడు: చెడ్డవారితో చెలిమి చేస్తాడు. త్రికరణశుద్ధిని కోల్పోతాడు. ఇహపరాలకు దూరమౌతాడు. కాబట్టి మంచివారితో స్నేహం చేసి ఇంద్రియాలను జయించి ఉత్తమగతి పొందటం మేలు.

ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి- అనేవి పంచభూతాలు. వాటి గుణాలు క్రమంగా శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం - అనేవి. పంచభూతాలు ఆకసం మొదలుకొని వరుసగా అనులోమ పద్ధతిలో పుట్టుతాయి. ప్రతిలోమగతిలో లయిస్తాయి. ఆరవ ఇంద్రియం మనస్సు, ఏడవ, ఎనిమిదవ ఇంద్రియాలు బుద్ధి, అహంకారాలు. సత్త్వరజస్తమస్సులు మూడు గుణాలు. ఇవన్నీ అవ్యక్తంలో నుండి పుట్టి అవ్యక్తంలోనే అంతర్భవిస్తాయి.

ఇంద్రియాలు శబ్దాది విషయాలలో ఎప్పుడూ రమిస్తూ ఉంటాయి. ధీరుడు ఆ సంగతిని గ్రహించి ఇంద్రియాలను జయిస్తాడు. సర్వభూతాలలో వ్యాపించిఉన్న పరమాత్మగా తనను తాను తెలిసికొంటాడు. విషయ విముఖమైన బుద్ధివైభవమే యోగం. యోగి తపస్సులో స్థిరపడతాడు. స్వర్గ నరకాలనేవి వేరే ఎక్కడా లేవు. ఇంద్రియాలను నిరోధించటమే స్వర్గం. ఇంద్రియాలను నిరోధించలేని బలహీనతే నరకం. దేహం రథం, ఇంద్రియాలు గుర్రాలు. ఆత్మ రథసారథి. ధైర్యమనే బలమైన పగ్గాలతో సారథి రథాన్ని తోలుతాడు. ఆ రథాన్ని ఎక్కి పోయేవాడు ధీరుడు. ఇంద్రియాలు లాగేవైపుకే మనస్సు పరుగెత్తుతూ ఉంటుంది. దాని వేగాన్ని నిగ్రహించక పోతే సముద్రంలో పెను తుపానుకు గురి అయిన ఓడవలె బుద్ధి చెడిపోతుంది. ఇంద్రియాలనూ మనస్సునూ వశం చేసికొన్న మానవుడు ధ్యానసమాధిసమగ్రు డౌతాడు. అతడిని దేవతలూ, మునులూ కీర్తిస్తారు.

కౌశికుడు : సత్త్వరజస్తమో గుణాల స్వభావాలు తేటపడేటట్లు వివరించుము.

ధర్మవ్యాధుడు : తమోగుణం మోహమయం, గర్హణీయం. సత్త్వగుణం నిత్యప్రకాశవంతం. రజోగుణం ఆ రెండు గుణాల మిశ్రరూపం. ఏడుపుగొట్టుతనం, నిద్ర, దైన్యం, మోహం, ఓర్పులేనితనం- తమోగుణ లక్షణాలు. రాగం, లోభం, జడత, అభిమానం- రాజస గుణ లక్షణాలు. ధైర్యం, శాంతి, సంతోషం, విద్య మొదలైనవి సాత్త్విక గుణ లక్షణాలు. సాత్త్విక గుణ సంపన్నుడు జ్ఞానియై నిరహంకార చిత్తవృత్తితో తాపస ప్రవృత్తిని పొంది శాంతిని అనుభవిస్తాడు. శూద్రుడు సత్త్వగుణుడైతే వచ్చే జన్మలలో క్రమంగా వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ భావాన్ని పొంది ముక్తుడౌతాడు.

కౌశికుడు: దేహంలోని ధాతువుల నాశ్రయించి అగ్ని ఎట్లా ఉంటాడు? శరీర వాయువు లుండే తావు లేవి? తెలియచెప్పుము.

ధర్మవ్యాధుడు: ఆత్మాగ్ని మూర్ధప్రదేశం వరకు వ్యాపించి ఉంటుంది. నాభి దానికి ఆశ్రయం. ప్రాణం మరొక అగ్ని రూపంలో శిరస్సు నాశ్రయించి ఉంటుంది. ఆ అగ్ని జీవాత్మ. ప్రాణాపాన వాయువులు రెండూ ఆ అగ్నిని ప్రకాశింపజేస్తాయి. అపానవాయువు గుదస్థానంలోని అగ్నితో కూడి ఉంటుంది. మలమూత్ర విసర్జనలో తోడ్పడుతుంది. ఉదానవాయువు కంఠతలంలో ఉంటుంది. కర్మఫలయత్నకారిగా శరీరంలోని కీళ్ళలో సంచరిస్తుంది. ప్రాణాపాన వాయువులు, సమానుడనే అగ్ని అన్నరసాన్ని జీర్ణం చేస్తూ, నాభిస్థానంలో ఉండి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శరీర ధాతువులను పోషిస్తూ ఉంటాయి. ఈ అంశాలను యోగదర్శనం ద్వారా తెలిసికొనవచ్చును. ప్రాణాయామం చేసే యోగి అభ్యాసంతో ఆత్మను సహస్రారంలో నిలుపగలడు. దేహమంతా ప్రాణాపాన సమాన సహితుడై చరించే అగ్ని జీవాత్ముడుగా తెలిసికొంటాడు. సరోవరంలోని నీటి మీది తామరాకు ఎట్లా అసంగంగా ఉంటుందో అట్లాగే జీవాత్మ దేహంలో అంటీ అంటక నిలుస్తాడు. ఆ జీవాత్మే పరమాత్మ, సకల భూతాలలో వెలుగొందే పరమాత్మను, అవ్యయుడిని, జ్యోతిర్మయుడిని అద్వైత బుద్ధితో దర్శించి జ్ఞానులు ఆనందిస్తారు. దానిని బ్రహ్మవిద్య అంటారు.

బ్రహ్మజ్ఞాని శుభాశుభ కర్మలలో మగ్నుడు కాడు. సుఖదుఃఖాలవంటి ద్వంద్వాలలో సమబుద్ధిని కలిగి ఉంటాడు. అతడి దినచర్య విశిష్టం. ఆహారాన్ని నియమంగా స్వీకరిస్తాడు. జితేంద్రియు డౌతాడు. పూర్వాపర రాత్రి సమయాలలో యోగధారణ చేస్తాడు. జ్ఞానోదయమై ఆత్మానుసంధానం చేసికొంటూ గాలికి కదలాడని దీపం వలె ప్రకాశిస్తూ అమృతత్వాన్ని పొందుతాడు. యోగి ఏమరుపాటు లేకుండా ఎప్పుడూ కామక్రోధాలను జయించాలి. నిత్యం కర్మ చేస్తున్నా, ఫలాన్ని కోరకుండా ఉండాలి. మనశ్చాంచల్యాన్ని మట్టుపెట్టాలి. అటువంటి వాడు ఎవడైనా బ్రాహ్మణుడే.

జీవితం అస్థిరమని తెలిసికొని, ఎవరికీ కీడు తలపెట్టకుండా, అందరితో మంచి స్నేహభావంతో కలసిమెలసి తిరుగుతూ దయార్ద్ర హృదయుడై, ప్రతిఫలాన్ని ఆశించకుండా, నిత్యతపస్విగా, నిత్యతృప్తుడుగా, శమగుణాన్వితుడుగా ఉండేవాడు బ్రాహ్మణుడు. అతడు బ్రహ్మస్థితిని పొందుతాడు.

ఈవిధంగా ధర్మవ్యాధుడు కౌశికు డడిగిన ధర్మాంశాల నన్నింటినీ వివరించి చెప్పాడు. ధర్మవ్యాధుడిని సర్వజ్ఞుడిగా కౌశికుడు కీర్తించాడు. జ్ఞానబోధ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపాడు.

జ్ఞానానికి మూలమైన ధర్మం

ఉత్తమ జ్ఞానాన్ని పొందటానికి మూలమైన ధర్మ విశేషాన్ని ధర్మవ్యాధుడు కౌశికుడికి ప్రత్యక్షంగా చూపించాలని తలచాడు. కౌశికుడిని ఇంటిలోపలిభాగంలోకి తీసికొనిపోయాడు. అందమైన చతుశ్శాల. అందులో సుగంధాలు విరజిమ్మే మేడ. అందులోని గదిలో గొప్పవైన ఆసనాల మీద కూర్చుండి ఉన్న తన తల్లిదండ్రులను దర్శింపచేశాడు. వారికి నమస్కరించి యోగక్షేమాలు అడిగి తెలిసికొన్నాడు. అతడి తల్లిదండ్రులు ఈ విధంగా అన్నారు - 'కుమారా! నీవంటి కొడు కుండగా మాకేమి లోటు? నీవు చేసే ధర్మమే నీకు రక్ష. అదే నీకు ఆయువును, అర్థసంపత్తిని కలుగజేస్తుంది. నీ శీలం వలన మనవంశం పవిత్రమైంది. నీవు మానవరూపంలో ఉన్న దేవతవేమో అనిపిస్తుంది. త్రికరణశుద్ధిగా తల్లిదండ్రులను పూజించే నిన్ను ముందుగా పేర్కొని, తరువాతే పరశురాముడిని చెప్పాలి. పితృభక్తిలో మరెవ్వరూ నీకు సాటి రారు.' ఆ మాటలు విని ధర్మవ్యాధుడు కౌశికుడిని వారికి పరిచయం చేశాడు. అతిథి మర్యాదలు నడిపాడు. ఆపైన ఇట్లా అన్నాడు.

'వీరు నా తల్లిదండ్రులు. వీరికి శుశ్రూష చేయటం వలననే నేనీ జ్ఞానాన్ని పొందాను. అందరూ దేవతలను ఆరాధిస్తారు. నా పాలిటి దేవతలు నా కన్న తల్లిదండ్రులే. సుగంధద్రవ్యాలతో, మనోహర భక్ష్యభోజ్యాలతో వారిని తృప్తి పొందించి, భార్యాపుత్రసహితుడనై నేనే వీరిని స్వయంగా సేవిస్తాను. వీరి సేవయే నాకు వేదాధ్యయనం, యజ్ఞవ్రత పుణ్యకార్యాచరణం. తల్లి, తండ్రి, గురువు, అగ్ని, ఆత్మ- అనే అయిదుగురినీ ఎవడు సుగతిని కోరి పూజిస్తాడో వాడే ధర్మాత్ముడు.

పతివ్రత పంపితే నీవు ధర్మజ్ఞానం తెలిసికొనటానికి నావద్దకు వచ్చావు. ఆమె అనుగ్రహం వలన నీ కన్నీ నేను చెప్పాను. కానీ, నీ పట్ల నాకంత ఆదరం లేదు. దానికి కారణం- నీవు చేసిన ఒక అకార్యమే. అదేమంటే నీ తల్లిదండ్రులకు నీవొక్కడవే కుమారుడవు. వారు వృద్ధులయ్యారు. నీవే వారిని సేవించి కడతేరుస్తావని ఆశతో బ్రతుకుతున్నారు. అటువంటి వారిని నీవు కాదని వేదాధ్యయన నిమిత్తం నిశ్చింతగా ఇల్లు వెడలి ఒంటరిగా వచ్చేశావు. నీ పోకకు మీ తల్లిదండ్రుల అనుమతి తీసికొనలేదు. నీవు వారిని వీడి వచ్చిన తరువాత వారు గుండె పగిలేటట్లు చాలాకాలం దుఃఖించారు. ఆ శోక తీవ్రత వలన వారి కళ్ళు పోయాయి. నీవు తప్ప వారి శోకాన్ని ఎవరు ఆర్పగలరు? వారిని సేవించలేని నీ వేదాధ్యయనం నిష్ఫలం. కాబట్టి తిరిగి ఇంటికి వెళ్ళుము. నీ తల్లిదండ్రులను శ్రద్ధతో సేవించుము. నా మాట వినుము. నీకు మేలు జరుగుతుంది.'

ధర్మవ్యాధుడి హితవును శిరసావహించి, తల్లిదండ్రుల సేవకై పోవ నిశ్చయించి కౌశికుడు ధర్మవ్యాధుడితో ఈ విధంగా పలికాడు. 'నా అదృష్టంవలన నీతోటి స్నేహం దొరికింది. నాకు ఆనందం కలిగింది. నేను శుభాలు పొందటానికి అర్హుడనయ్యాను. నా పాపాన్ని ప్రబోధంతో ప్రక్షాళనం చేసి, నా పాలిటి దేవుడ వనిపించుకొన్నావు. లోకంలో ధర్మమార్గం అందరికీ అందదు. ఏ పదివేల మందికో ఒకడు ధర్మపరాయణుడు ఉంటే ఉండవచ్చును. కాని, సనాతనధర్మ విజ్ఞానాన్ని ఆశ్రయించి నీవలె జీవితాన్ని సాగిస్తున్న పండితులు ఉండటం అరుదు. నీవు నిజంగా శూద్రుడవని నే ననుకొనటం లేదు. నీ చరిత్ర గమినిస్తే నాకు అద్భుతమనిపిస్తుంది. నీవు ఏకారణంతో ఇటువంటి జన్మ నెత్తావో నాకు తెలియచెప్పుము. త్రికాలాలూ నీకు తెలిసే ఉంటాయి.' అతడి మాటలు విని ధర్మవ్యాధుడు తన పూర్వజన్మ వృత్తాంతం ఇట్లా చెప్పాడు.

ధర్మవ్యాధుడి పూర్వజన్మ వృత్తాంతం

ధర్మవ్యాధుడు పూర్వజన్మలో బ్రాహ్మణుడు. వేదవేదాంగ విదుడు. అతడికి ఒక క్షత్రియ కుమారుడు మిత్రుడు. అతడితో కలిసి ధనుర్వేదాన్ని కూడా అభ్యసించాడు. ఒకనాడు మిత్రులిద్దరూ కలిసి వేటకు వెళ్ళారు. బ్రాహ్మణుడు పొరపాటున పొదలచాటున తపస్సు చేసికొంటున్న మునిని మృగమని భ్రమించి బాణంతో కొట్టాడు. ఆ ముని బాణఘాతానికి బాధపడుతూ అరిచాడు. జరిగిన పొరపాటు తెలిసికొని బ్రాహ్మణుడు ఆ మునిని సమీపించి ఊరడింపు మాటలు పలికాడు. ఆ ముని కోపించి కులవృత్తి కాని వేట నెన్నుకొని జీవహింస చేసినందుకు రాబోయే జన్మలో బోయవాడిగా పుట్టుమని శపించాడు. తెలియక చేసిన అపరాధానికి హీనజన్ముడిగా పుట్టే శాపం ఇవ్వవద్దని ఆ బ్రాహ్మణుడు మునిని వేడుకొన్నాడు. ఆ తపస్వి దయార్ద్రుడై బోయవాడైనా అతడు సర్వధర్మవేత్తగా ఉంటాడనీ, తల్లిదండ్రులను భక్తితో పూజించి గురుశుశ్రూషాఫలంగా సర్వశుభాలను పొందుతాడనీ, పూర్వజన్మ జ్ఞానం కూడా అతడికి స్మృతిలో ఉంటుందనీ, మరుజన్మలో బ్రాహ్మణుడౌతాడనీ అనుగ్రహించాడు. బ్రాహ్మణుడు ముని శరీరంలో నాటిన బాణాన్ని నిపుణంగా బైటికి తీసి, ఉపచారాలు చేసి, అతడిని ఆశ్రమానికి చేర్చాడు. అతడి సేవల వలన ఆ మునికి ప్రాణాపాయం తప్పింది. ఆ బ్రాహ్మణుడే ధర్మవ్యాధుడు.

కౌశికుడు ధర్మవ్యాధుని మహత్త్వాన్ని కీర్తించాడు. శాపఫలంగా అనుభవిస్తున్న బోయ జీవితానికి విచారించవద్దనీ స్నేహభక్తిపూర్వక వచనాలు పలికి తన తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి, వారిని భక్తితో సేవించి కృతార్థుడయ్యాడు.

అంగిరసుడు అగ్ని అయిన కథ

ధర్మరాజు : మార్కండేయ మునీంద్రా! అగ్నిదేవుడు మహా తపస్సు ఎందుకు చేశాడు? అంగిరసుడు ఏకారణం వలన అగ్ని అయ్యాడు? అగ్నులు ఎన్నివిధాలుగా అతిశయిల్లుతూ ఉంటాయి?

మార్కండేయుడు: పూర్వం ఒకసారి అగ్నికి దేవతలమీద కోపం వచ్చింది. వారి హవ్యాలను మోయకుండా అలిగి అరణ్యానికి పోయి అగ్నిదేవుడు ఘోర తపస్సు చేయనారంభించాడు. చాలాకాలం గడిచింది. ఒకనాడు అగ్ని తనలో ఈ విధంగా తలపోశాడు. 'నేను అడవులకు వచ్చి నారూపాన్ని ఉపసంహరించుకొని వెలుగకుండా ఉంటే లోకజీవితమే స్తంభించిపోతుంది. బ్రహ్మదేవుడు వెంటనే మరొకరిని అగ్నిపదంలో నియోగిస్తాడు. నేను రెంటికి చెడ్డ రేవడినౌతాను కాబట్టి, ఇక్కడ ఉండక, తిరిగి వెళ్ళుతాను' అని నిశ్చయించుకొని తన స్థానాన్ని సమీపించాడు. అప్పటికే బ్రహ్మనియోగంతో అంగిరసుడు త్రిలోకాగ్నిగా ప్రజ్వరిల్లుతున్నాడు. అతడిని చూచి అగ్ని భయపడి తిరుగుమొగం పెట్టాడు. కాని, అంగిరసుడు వినయంతో అగ్నివద్దకు వచ్చి అతడి ప్రథమాగ్ని పదాన్ని స్వీకరించుమని వేడాడు వినయంతో. అగ్ని ప్రథమాగ్ని పదవిని తిరిగి అంగీకరించలేదు. చివరకు అంగిరసుడు వేడుకోగా అగ్ని ప్రథమాగ్నిగా, అంగిరసుడు ద్వితీయాగ్నిగా అగ్నికి ప్రథమపుత్రుడిగా ఉండేటట్లు అంగీకరించాడు. నాటి నుండి అంగిరసుడు అగ్ని పుత్రుడుగా అపరాగ్నివలె రాణించాడు. అతడికి శివ అనే కన్యతో వివాహమైంది. వారికి బృహత్కీర్తి, బృహజ్జ్యోతి, బృహద్బ్రహ్మ, బృహన్మనసుడు, బృహన్మంత్రుడు, బృహద్భానుడు, బృహస్పతి అనే ఏడుగురుకొడుకులూ, భానుమతి, రాగ, సినీవాలి, కుహువు, అర్చిష్మతి,

మహిష్మతి, మహామతి అనే ఏడుగురు కూతుళ్ళూ జన్మించారు. వారందరికీ వివాహాలై పుత్రపౌత్ర పరంపరాభివృద్ధిగా అగ్నివంశం విస్తరిల్లింది. ఇట్లా ఏర్పడిన అనేక వహ్నులు సకల ధర్మక్రియా సాధకులై ప్రకాశించారు. (వివరాలకు చూడు: ఆరణ్య. 5.153-174). అగ్ను లెందరైనా వారి ఆత్మ అయిన తేజస్సు ఒక్కటే.

కుమారస్వామి వృత్తాంతం

ధర్మరాజు : మార్కండేయ మహర్షీ! మహాసేనుడైన కుమారస్వామి అగ్నికి, కృత్తికలకు, శివుడికీ కుమారుడైన కారణ మేమిటి? వినవలెనని ఉన్నది. విస్తరించి చెప్పండి.

మార్కండేయుడు: పూర్వం ఒకసారి ఇంద్రుడు దైత్యులతో యుద్ధం చేసి ఓడిపోయి దేవతలతో కలిసి మానసమనే పర్వతానికి పారిపోయి తలదాచుకొన్నాడు. రాక్షసులను జయించగలిగిన సేనాపతి ఎప్పుడు లభిస్తాడో అని విచారిస్తూ ఏకాంతంలో ఉండిపోయాడు.

కేశి అనే రాక్షసుడు దేవసేన అనే కన్యను బలవంతాన చెరపట్టి తీసికొని పోతుండగా ఆమె సహాయార్థం ఎలుగెత్తి మొరపెట్టుకొన్నది. ఇంద్రుడు వజ్రాయుధంతో రంగంలోకి దిగి కేశిని పారద్రోలి దేవసేనను రక్షించాడు. ఆమె అరిష్టనేమి అనే ప్రజాపతి కూతురు. ఆమె తన అక్క దైత్యసేనతో కలిసి, తండ్రి అనుమతి పొంది, మానసపర్వత ప్రాంతంలో విహరిస్తూ ఉండగా కేశి వారిని అనేక పర్యాయాలు సమీపించి వింత వింత మదన వికార చేష్టలను ప్రదర్శించి వారిని ఆకర్షించ ప్రయత్నించాడు. అతడి చేష్టలు దైత్యసేనకు సమ్మతమయ్యాయి కాని, దేవసేనకు ప్రీతి కలిగించలేదు. కేశి దైత్యసేనను ఆకట్టుకొని ఆమెను వశంచేసికొని తీసికొనిపోయాడు. ఆ తరువాత దేవసేనను కూడా బలవంతంగా వశం చేసికొనటానికి ప్రయత్నం చేశాడు. ఇంద్రుడు రంగంలోకి దూకి ఆమెను రక్షించాడు. దేవసేన చరిత్రను తెలిసికొన్న ఇంద్రుడు ఆమెను ఒక వరాన్ని కోరుకొమ్మని అడిగాడు. దేవసేన తండ్రి అరిష్టనేమి తన కూతురుకు ప్రసిద్ధ పౌరుషవంతుడైన పురుషుడు భర్త కాగలడని చెప్పి ఉన్నారు. దేవసేన ఆ సంగతి ఇంద్రుడికి తెలిపి, తన కటువంటి భర్తను చేకూర్చి పెట్టుమని వేడుకొన్నది. తన భర్త దేవదానవులకు అజేయుడై ఉండాలనీ, భయంకర శత్రువులను తునుమాడగలిగి ఉండాలనీ, మూడు లోకాలనూ రక్షించగలగాలనీ, ఇంద్రుడికి మిత్రుడై ఉండాలనీ, ఉత్తమగుణశోభితుడై ఉండాలనీ దేవసేన కోరుకొన్నది. అటువంటి భర్తను తనకు కూర్చుమని వేడుకొన్నది.

ఆమె భర్త ఎవ్వరై ఉంటాడా? అని ఇంద్రుడు కొంత సేపు ఆలోచించాడు. అప్పటి కాలగ్రహస్థితులను గమనించాడు. అది రౌద్రముహూర్తం. సూర్యచంద్రులు కలిసి ఉండే అమావాస్యాతిథి ఆరంభం. ఉదయసంధ్యా రాగంలో ఎఱ్ఱబారిన సముద్ర జలం ఆ సమీపాన జరుగబోయే దేవదానవ యుద్ధ సూచకం. సూర్యోదయ సమయంలో భృగువు, అంగిరసుడు మొదలైన మునులు అందించే హవ్యాలను గ్రహించి అగ్నిదేవుడు సూర్యమండలంలో ప్రవేశిస్తున్న ముహూర్త మది. సూర్యసోమాగ్ని సమాగమం గల రౌద్రమూహూర్తం అది. కాబట్టి దేవసేన భర్త కూడా సూర్యసోమాగ్ని తేజంతో పుట్టేవాడై ఉండాలని ఇంద్రుడు భావించాడు. ఆమెను బ్రహ్మవద్దకు తీసికొనిపోయాడు. ఆమెకు కానున్న భర్త ఎవరో తెలుపుమని కోరాడు. ఆమె భర్త పరాక్రమవంతుడూ, త్రిలోకరక్షకుడూ యశస్వీ ఔతాడనీ, అతడు దేవసేనాపతి భావాన్ని పొంది దేవతలను రక్షిస్తాడనీ, ఆ సంఘటన త్వరలో జరుగుతుందనీ బ్రహ్మదేవుడు చెప్పాడు. ఇంద్రుడు సంతోషించాడు.

కొంత సేపటికి సప్తర్షులు అమావాస్యాహోమం చేయబూనారు. మొదట అగ్నిని ఆహ్వానించారు. అతడి ద్వారా హవ్యాలను అఖిల దేవతలకు అందించారు. ఆ యజ్ఞ సమయంలో సుందరులైన సప్తర్షి భార్యలు శుచులై తనూవిలాసాలు విలసిల్లగా తమ తమ భర్తలకు యజ్ఞకార్యంలో సహకరించారు. ఆయా సందర్భాలలో వారి అందచందాలను చూచిన అగ్నిదేవుడు వారిపై మరులుగొన్నాడు. గార్హపత్యాగ్నిలో ప్రవేశించి తన జ్వాలలతో మునిపత్నులను స్పృశించాలనీ, కౌగిట చేర్చాలనీ ఉల్లాసపడ్డాడు. అంతలో ఆ యజ్ఞం ముగిసింది. కాని, అగ్నిదేవుడి విరహం పెరిగింది. సప్తర్షుల భార్యల పొందు దుర్లభంగా భావించి అగ్నిదేవు

డొక అరణ్యానికి పోయి ఏకాంతస్థలంలో శరీరత్యాగం చేయాలని తలపెట్టాడు. ఆ సంగతి అగ్నిదేవుడి భార్యయైన స్వాహాదేవి గమనించింది. భర్తకు ప్రియం చేయాలని భావించి సప్తర్షులలో ఒకడైన అంగిరసుడి భార్య శివ అనే ఆమె రూపం ధరించి అగ్నిదేవుడిని సమీపించింది. సప్తర్షుల భార్యలందరూ మనోహర విలాసంతో కూడిన అగ్నిదేవుడి సౌందర్యానికి ఆకర్షితులై అతడి పొందుకోరి విరహంతో అక్కడికి వచ్చారనీ, ముందుగా పొందుగోరి శివ వచ్చినట్లుగా చెప్పింది. అగ్నిదేవుడు ఆమెను కాదంటే విరహంతో ప్రాణాలు వదలుతానని పలికి, అతడి వలపును కోరింది. అగ్ని అనుకూలించాడు. శివరూపంలో ఉన్న స్వాహాదేవి అగ్నిదేవుడు కోరిన కోర్కెలు తీర్చి అతడిని సంతోషపెట్టింది. అనంతరం అతడి తేజోధాతువును ధరించి ఆడ గరుడపక్షి రూపంలో ఆకసానికి ఎగసి, అత్యంతవేగంగా శ్వేతపర్వతానికి పోయి, అక్కడ ఒకచోట రెల్లుగడ్డితో కప్పబడిన ఒక బంగారు కుండలో అగ్నిదేవుడి శుక్లాన్ని భద్రపరచింది. ఆ విధంగా ఒక్క అరుంధతి రూపం తప్ప మిగిలిన ఆరుగురు మహర్షి భార్యల రూపాలను వరుసగా ధరించి, అగ్నిదేవుడితో క్రీడించి, అతడి శుక్లాన్ని క్రమంగా ఆ బంగారు పాత్రలో భద్రపరచింది. అందులోనుండి సూర్యతేజంతో, పన్నెండు చేతులతో, ఆరు మొగాలతో, దశదిశలు వెలిగే ప్రకాశంతో, తేజోవంతుడైన కుమారస్వామి ఉద్భవించాడు.

కుమారోత్పత్తి క్రమం ఈ విధంగా సాగింది. శుక్లపక్షపాడ్యమినాడు అగ్ని వీర్యం నిక్షేపించబడింది. విదియనాడు గర్భం వ్యక్తమైంది. తదియనాడు కుమారుడి శరీరం ఆవిర్భవించింది. చతుర్థినాడు అది సకలావయవ సంపూర్ణమైంది. పంచమినాడు కుమారస్వామి నిండురూపంతో లేచి, ఆ కొండలో దాచబడి ఉన్న శివధనుస్సును (త్రిపుర సంహారంలో శివుడుపయోగించిన విల్లును) పైకెత్తి, అల్లెత్రాటిని మ్రోగించాడు. ఆ భయంకర ధ్వనికి ఐరావత సుప్రతీకాలనే దిగ్గజాలు కోపించి కుమారస్వామిపై దాడిచేయగా ఆ రెంటిని పట్టి రెండు చేతులతో నిలిపాడు. మరొక చేతిలో సహజసిద్ధమైన శక్తిని, ఇంకొక చేతిలో విలాసంగా ధరించే కోడిని, రెండు చేతులతో పూరిస్తున్న శంఖాన్నీ ధరించాడు. ఆరుముఖాలలో ఆరు చేతుల బొటనవ్రేళ్ళను ఉంచుకొని బాల్యక్రీడగా చీకుతూ, వాడియైన బాణంతో క్రౌంచపర్వతాన్ని భేదించాడు. శక్తిపాతంతో శ్వేతగిరి శిఖరాన్ని కూల్చాడు. ఆరుముఖాలతో పెద్దపెట్టున ఘోషించాడు. ఆ శబ్దానికి కులపర్వతాలు కంపించాయి. దిక్కులు బ్రద్దలయ్యాయి. నేల గిర గిర తిరిగింది. సముద్రాలు సంక్షోభించాయి. సూర్యరథాశ్వాలు నలుదిక్కులకూ లాగాయి. ఆ మహోత్పాతాలకు భయపడి మునులు శాంతిక్రియలు చేశారు.

ఆ సమయాన చైత్రరథ నివాసులైన జనులు కుమారస్వామి అగ్నిదేవుడికి అంగిరఃప్రముఖ మునీంద్రుల సతుల వలన పుట్టిన బాలుడనీ, అతడి వలన ఆ అనర్థం కలిగిందనీ ఆక్రోశించారు. ఆ అపవాదులు విని సప్తర్షులలో వసిష్ఠుడు తప్ప మిగిలినవారు తమ భార్యలను వదలిపెట్టారు. కొంతమంది జనులు ముని భార్యలు నిర్దోషులనీ, వారి వేషాలతో పతిని కూడింది అగ్ని భార్య స్వాహాదేవియే అనీ అన్నారు. ఈ వాదోపవాదాలను విని స్వాహాదేవి స్వయంగా సప్తర్షుల వద్దకు వెళ్ళి తనవలన జరిగిన విశేషమంతా చెప్పి, ఋషిపత్నులు నిర్దోషులని విన్నవించింది. ఆమె ఎంత చెప్పినా ఋషు లామెమాటలు పట్టించుకొనలేదు. తమ భార్యల నేలుకొనలేదు.

కుమారస్వామికి విశ్వామిత్రుడు జాతకర్మాది విధులు నిర్వహించాడు. దేవతలందరు ఇంద్రుడి వద్దకు వెళ్ళి కుమారస్వామి పరాక్రమాన్ని వినిపించి, అతడి వలన ఇంద్రపదవికి చేటురాకుండ అతడిని వధించుమని హితవు చెప్పారు. ఇంద్రుడు కుమారస్వామిని చంపటానికి సప్తమాతృకలను నియోగించాడు. వారు కుమారస్వామి యొక్క మహాతేజస్సును చూచి భయపడి, వారు లోకమాతలు కాబట్టి అతడు కూడా వారిని మాతృభావంతో గౌరవించవలసిందిగా కోరారు. కుమారస్వామి వారిని మాతలుగా స్వీకరించాడు. అగ్నికూడ తన కొడుకు వద్దకు వచ్చి అతడి రక్షణలో నిలిచాడు. సప్తమాతృకల కోపం నుండి పుట్టిన లోహితాస్య-కుమారుడికి దాదిగా కుదిరి అతడిని లాలించింది. సకలభూత గణాలు వచ్చి కుమారస్వామిని పరివేష్టించి నిలిచాయి.

అది తెలిసి ఇంద్రుడు తన అపారసైన్యాన్ని కుమారుడిపై పంపాడు. కుమారస్వామి ముఖం నుంచి వెలువడిన మంటలు వారిని కాల్చివేయ నారంభించాయి. వారు భయపడి కుమారస్వామిని శరణువేడారు. ఆ సంగతి తెలిసి ఇంద్రుడు క్రుద్ధుడై అతడి మీద వజ్రాయుధం ప్రయోగించాడు. అది కుమారుడి కుడి పార్శ్వాన్ని తాకింది. ఆ భాగంలోనుండి విశాఖుడనే శక్తిధరుడు మేకమొగంతో పుట్టాడు. అతడివెంట కన్యాకుమార గణాలు అసంఖ్యాకంగా పుట్టాయి. ఆ సంరంభం చూచి ఇంద్రుడు భయపడి కుమారస్వామిని శరణువేడాడు. వా రిరువురి చుట్టూ చేరి దేవతలు హర్షనాదాలు చేశారు.

అగ్నికుమారుడు, అజానుబాహుడు, కవచధారి, తేజస్వి, కుండల మండితుడు, కనకకిరీటధారి, యువకుడు, సర్వలక్షణయుక్తుడు అయిన కుమారస్వామిని చూచి, వరించి లక్ష్మీదేవి అతడిని పొందింది. ఆరవరోజు మహామునులందరు కుమారస్వామిని సమీపించి విశేషంగా ప్రస్తుతించి, ఇంద్రపదవిని స్వీకరించుమని అతడిని కోరారు. ఇంద్రుడు కూడా వారి అభిమతాన్ని బలపరిచాడు. కాని, కుమారస్వామి ఇంద్రపదవిని కోరక, ఇంద్రుడికి హితుడుగా ఉండి దేవకార్యాన్ని తీర్చటానికి దేవతల సైన్యాధిపత్యానికి అంగీకరించాడు. దేవవిరోధులను సంహరించటానికి ప్రతిజ్ఞ చేశాడు. ఇంద్రుడు సంతోషించి కుమారస్వామిని దేవసేనానిగా అభిషేకించాడు. దేవగణాల సంతోషం మిన్నుముట్టింది.

అప్పుడు పరమేశ్వరుడు గిరిజాసమేతంగా కుమారస్వామి వద్దకు వచ్చాడు. కుమారుడిని కౌగిలించుకొన్నాడు. విశ్వకర్మ నిర్మితమైన బంగారపు పూలమాలను బహూకరించాడు. పరమేశ్వరుడికి కుమారస్వామి కొమరుడౌతాడు. ఎట్లాగంటే - పూర్వం రుద్రుడు తన వీర్యాన్ని అగ్నియందు సంగ్రహించాడు. ఆ తేజో విశేషం చేత అగ్నిదేవుడు కుమారుడిని ఉత్పాదింపచేశాడు.అంతేకాక అగ్నియే రుద్రుడని వేదాలు తెలిసిన విప్రులంటారు. కాబట్టి అగ్నిపుత్రుడు రుద్రపుత్రుడని కూడా చెప్పవచ్చును. స్వాహాదేవి కృత్తికలు అనే పేర ప్రసిద్ధిచెందిన ఆరుగురు ఋషిపత్నుల రూపాలను గైకొని ప్రియుని పొంది శ్వేతపర్వతంలో రేతస్కందం చేయటం వలన పుట్టాడు కాబట్టి కుమారస్వామి కార్తికేయుడనీ, స్కందుడనీ ప్రసిద్ధికెక్కాడు. ఇంద్రుడు బ్రహ్మవద్ద భద్రంగా ఉంచిన దేవసేన అనే కన్యను తెచ్చి కుమారస్వామి కిచ్చి వివాహం చేశాడు. అప్పు డతడు రెండర్థాలలో దేవసేనాపతి- (దేవతలసేనకు నాయకుడు, దేవసేనకు భర్త) అయ్యాడు. కుమారస్వామిని లక్ష్మీదేవి పంచమినాడు, దేవసేన షష్ఠినాడు పొందటం చేత ఆ రెండు తిథులు శుభ తిథులయ్యాయి.

అదే సమయంలో మునుల చేత పరిత్యక్తలైన మునిభార్య లారుగురు కుమారస్వామిని సమీపించి, తమ గోడు వినిపించి, పుణ్యలోకాలను కోల్పోయి దుఃఖిస్తున్న తమకు పుణ్యగతులను కల్పింప వేడారు. వారికి పుత్రుడిగా అనుగ్రహించి తమ దుఃఖాన్ని తీర్చుమని కోరారు. కుమారస్వామి వారి ప్రార్థన మన్నించి, ఇంద్రుని సంప్రదించి రోహిణీ నక్షత్ర సమీపంలో ఖాళీగా ఉన్న అభిజిన్నక్షత్ర స్థానంలో కృత్తికలుగా ఆరుగురికి అగ్నిదైవత్యమనే పేర ఆకాశంలో స్థానం కల్పించాడు. ఆ తరువాత స్వాహాదేవి వచ్చి 'నేను నీ తల్లిని, నీ వద్దనే ఉంటా' నని కోరింది. కుమారు డంగీకరించాడు.

ఆ పిమ్మట కుమార మాతృకలు ఏడుగురు వచ్చి తమను జగన్మాతలుగా చేయుమని కోరారు. కుమారుడు వారిని వేరేవరం కోరుకొనుమన్నాడు. శిశువులకు పీడ గలిగించే శక్తిని వరంగా అడిగారు. ఆ కోరిక నివ్వటానికి సమ్మతి లేకపోయినా ఇచ్చిన మాటకు కట్టుబడి- శిశువులు పుట్టింది మొదలు పదహారేళ్ళవరకు సప్తమాతృకల పీడ కలుగగలదని వరమిచ్చాడు. స్కందాపస్మారమనే పేరుగల దైత్యుడిని తన దేహం నుండి పుట్టించి వారికి రక్షకుడిగా నిలిపాడు. బలిశాంతులవలన వారి పీడ తొలగేటట్లు సూచించాడు. వారు కలిగించే పీడలన్నీ పరమేశ్వరభక్తుల నేమీ చేయలేవని అభయమిచ్చాడు.

అప్పుడు స్వాహాదేవి కుమారస్వామిని ఒక వరం కోరింది. అగ్నికీ స్వాహాదేవికీ ఎప్పుడూ ఎడం లేకుండా ఉండే వరమది. ఆమె కోరికను మన్నించి కుమారస్వామి - ద్విజులు అగ్నిలో హవ్యము లిచ్చేటప్పుడు స్వాహాకారంతో కలిపి ఇవ్వాలని కట్టడి చేశాడు. దాని వలన అగ్నితో స్వాహాదేవికి నిత్యసహవాసం సిద్ధించింది.

అంత బ్రహ్మదేవుడు సకలముని గణాలతో కూడి అక్కడకు వచ్చాడు. కుమారస్వామిని అభినందించి, పార్వతీ పరమేశ్వరులను అతని తల్లిదండ్రులుగా పరిచయం చేశాడు. కుమారస్వామి వారిని పూజించి స్తుతించాడు. దేవతలు కానుకలందించారు. ఈశ్వరుడు కుమారుని కౌగిటచేర్చి లాలించాడు. అతడిని వెంటబెట్టుకొని, దేవమునిగణాలు బారులు తీరి వెంటరాగా ఉత్సాహంగా సాగి భద్రవటం చేరాడు. కుమారస్వామిని సప్తమారుత స్కంధానికి అధిపతిని చేశాడు. దేవతలకు ఎప్పుడూ మేలు చేయుమన్నాడు. శివపదధ్యానాన్ని మరువ వద్దన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ సమయంలో మహిషాసురుడు దేవతలపై తన భీకరసైన్యాన్ని పంపాడు. వారి ధాటికి భూమి కంపించింది. ఎన్నో ఉత్పాతాలు కలిగాయి. రాక్షససైన్యం భీకరంగా విజృంభించి దేవసేనను చీల్చి చెండాడింది. దేవతల సైన్యం ఛిన్నాభిన్నమైంది. దేవేంద్రుడు వారినందరిని పురికొల్పి తాను శత్రువులపై విరుచుకపడ్డాడు. పోరు భయంకరంగా సాగింది. రాక్షససైన్యం దేవతల చేతుల్లో నుగ్గు నుగ్గు అయింది. ఆ సంగతి గమనించి మహిషాసురుడు మండిపడి దేవతలపై తిరుగబడ్డాడు. ఒక మహాపర్వతాన్ని రెండు చేతులతో ఎత్తి దేవసైన్యం మీద విసిరాడు. పదివేలమంది దేవసైనికులు దాని క్రిందపడి చనిపోయారు. ఆ దృశ్యం చూచి ఇంద్రుడే భయపడి పారిపోయాడు. అంత మహిషాసురుడు రుద్రుని రథం మీద దాడిచేసి దాని అగ్రభాగాన్ని పట్టుకొన్నాడు. హరుడు రాక్షసుల చేజిక్కాడని మునులు దేవతలు భయపడ్డారు. శివుడు మందహాసంతో కుమారస్వామిని ఆ రాక్షసవధ చేయుమని ఆజ్ఞాపించాడు. కుమారస్వామి ప్రళయమహాగ్ని జ్వాలవలె రాక్షసుల మీద విజృంభించాడు. దేవతలు ధైర్యంతో ఆతడి వెంట నిలిచారు. స్కందుడు తన సహజశక్తిని రాక్షసుడిపై విసిరాడు. అది ఆ దానవుడిని దహనం చేసి చంపింది. కుమారుడు మరల మరల శక్తిని ప్రయోగించి దానవ సైన్యాన్ని మట్టుపెట్టాడు. దేవతలు, దేవేంద్రుడు ఆనందోత్సాహాలతో కుమారస్వామిని కీర్తించారు. లోకత్రయంలో కుమారస్వామి కీర్తి వ్యాపించింది. పరమేశ్వరుడు కుమారుడిని కౌగిలించుకొని ఆశీర్వదించాడు. తనపట్ల ఎంతటి భక్తి చూపుతారో అంతటి భక్తి కుమారస్వామి పట్ల కూడా చూపండని దేవతలకు పరమేశ్వరుడు ఆదేశించాడు. శివుడు భద్రవటం చేరాడు. అమరులు తమ నివాసాలకు పోయారు.

ఈ విధంగా షణ్ముఖుడు ఒక్కదినంలో రాక్షసులనందరినీ చంపాడు. జగాల నన్నింటినీ రక్షిస్తానని దయాగుణంతో అభయమిచ్చాడు. అటువంటి కుమారస్వామి కథను ఎవరు భక్తితో వింటారో, కీర్తిస్తారో, వారు సర్వదోషాల నుండి విముక్తులై, దివ్యశుభాలను పొందుతారు.

సత్యాద్రౌపదీ సంవాదం

మార్కండేయమహర్షి ధర్మరాజు కోరిన కథలను చెపుతున్న ఆ సమయంలో సత్యభామా ద్రౌపదులు ఏకాంత స్థలంలో కూర్చుండి ఈ విధంగా సంభాషించుకొన్నారు.

సత్యభామ: ద్రౌపదీ! నీ భర్తలు సామాన్యులు గారు. లోకపాలకుల వంటివారు, పరాక్రమవంతులు, నిర్మల చరిత్రం కలవారు. అంతటి వారిని నీవు ఒకేరకంగా అనురాగంతో ఏవిధంగా సేవిస్తావు? నీ భర్తలయిదుగురూ ఒకరికంటె మరొకరు నీకు అనురక్తులు కావటం ఆశ్చర్యంగా ఉంది. అందరూ నీతో ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడతారు కాని కోపగించుకోరు. పతుల వలన నీవు పొందే ఈ విశేష సౌభాగ్యానికి కారణం ఏమిటి? ఏదైనా వ్రతం చేసిన ప్రభావమా? మంత్రౌషధ మహిమా? నాకు తెలియచెప్పుము. నీ వలన ఆ కిటుకు తెలుసుకొని నా భర్త అయిన శ్రీకృష్ణుడిని నా వశం చేసికొని, అత్యంత స్నేహానురాగాలను పొందుతాను.

ద్రౌపది : (సత్యభామ మాటలు ద్రౌపదికి కొంచెం కోపం తెప్పించాయి. కాని, కోపాన్ని అణచుకొని చిరునవ్వు మొగం మీద పులుముకొని నిబ్బరంగా ఇట్లా అన్నది) సత్యా! నన్ను ఈ విధంగా దుర్మార్గురాలుగా భావించటం నీకు న్యాయమేనా? నీవు శ్రీకృష్ణదేవుడి భార్యవైనావు కాబట్టి నిన్ను నే నేమీ అనలేకపోతున్నాను. అంతటి వాడి భార్యవు నీవు ఇంతటి మాటలు అనవచ్చునా? (అంటూ ఎగతాళిగా నవ్వులాట కన్నట్లుగా అంటూనే సత్యభామ అవివేకం ఆమెకే తెలిసి వచ్చేటట్లు నిపుణంగా మాట్లాడింది.)

మంత్రాలను, తంత్రాలను, ఔషధాలను అనేక విధాలుగా ప్రయోగిస్తే భర్తలు భార్యలను వలచి వారి వలలో పడతారని అనుకొనటం వెర్రితనం. వాటి వలన భర్తలకు భార్యలపై అంతకు ముందున్న ప్రేమకూడా పోతుంది కాని, లాభ మేమీ కలుగదు. మంత్రతంత్రాలతో మగడిని లొంగదీసుకొనాలనుకొనే భార్యతో కలిసి జీవించటం పాముతో పొత్తువలె భర్త భావిస్తాడు. మగడిని వశం చేసికొనటానికి పెట్టే మందులూ మాకులూ వికటిస్తే భర్తకు మూగతనం, జడత్వం, వివిధ రోగాలూ మొదలైన బాధలేర్పడవచ్చును. ఆ బాధలు భార్యవలన ఏర్పడినవని తెలిస్తే ఆమె లోకనిందకు పాల్పడి, దుర్గతిపాలు కావలసి వస్తుంది.

కాబట్టి భార్య భర్త పట్ల కపటచర్యలు చేయరాదు. అతడి మనస్సును తెలిసికొని తదనుగుణంగా మసలితే అదే అన్నిపనులూ సాధించి పెట్టుతుంది.

పాండవులపట్ల నే నెట్లా వర్తిస్తూ పతుల అనురాగాన్ని పొందగలిగానో చెప్పుతాను వినుము. నా పతులు మరే వనితలతో కూడినా నేను కోపగించుకొనను. ఎప్పుడూ అహంకరించను; మదాన్ని ప్రదర్శించకుండా, ప్రమాదానికి లోనుకాకుండా వారందరికి ఏకాగ్రతతో ఎప్పుడూ భక్తితో సేవలు చేస్తుంటాను. చూపులో, పలుకులో, కోర్కెలో, స్నేహంలో ఎప్పుడూ ఎటువంటి తేడా లేకుండా ఉంటాను. దేవతలనైనా పరపురుషులుగా భావిస్తాను. స్నానభోజన శయన సేవలను పతులకు నేనే స్వయంగా నిర్వహిస్తాను. పతులకు ఆసనపాద్య విధులు నేనే చేస్తాను. ఇతరుల చేత ఆ పనులు చేయించను. ఆయా కాలాలలో క్రమం తప్పకుండా స్నానభోజనాదులను అమర్చటం, ధనధాన్యాలు వృథావ్యయం కాకుండా చూడటం, ఇంటి పనులు చక్కదిద్దుకొనటం, బంధువులకు ప్రమోదం కల్గించటం మొదలైన బాధ్యతలన్నీ నేనే నిర్వహిస్తాను. ముందువాకిట్లో చాలాసార్లు నిలవటం, యువతులతో కలసిమెలసి తిరగటం, గిల్లికజ్జాలు పెట్టుకొనటం, హాస్యపు మాటలతో పెద్దగా విరగబడి నవ్వటం- మొదలైనవి నాకు నచ్చనివి. భర్తలు ఇంట్లో లేకపోతే, ప్రవాసంలో ఉంటే నేను పుష్పగంధాదులతో అలంకరించుకొనను, పతులనే మనస్సులో తలపోస్తూ ఉంటాను. అత్తకు భక్తితో సేవలు చేస్తాను. ఆమె చెప్పినట్లు వింటాను. గురు విప్రజనాతిథి పూజలు భక్తిభావంతో చేస్తాను. ఓర్పు, మెత్తదనం, మంచిమనసు అనే గుణాలను ఎల్లప్పుడూ కలిగి ఉంటాను.

పాండవులు నాపట్ల చాల మృదువుగా ఉంటారని వారిని లెక్కచేయక తేలికగా చూడను. వారికి కోపం వస్తే విషసర్పాలవలె క్రూరులని తెలిసి జాగ్రత్తగా సేవిస్తాను. ప్రతినిత్యం ధర్మరాజుపంక్తిలో ఎనిమిదివేల మంది బ్రాహ్మణులు, పదివేలమంది యతులు బంగారు పళ్ళాలలో భోజనం చేస్తారు. వారందరికీ అన్నపానాదులు, వస్త్రభూషణ సత్కారాలూ సక్రమంగా జరిగేటట్లు స్వయంగా నేను పర్యవేక్షిస్తాను. అంతేకాక ధర్మరాజు కొలువులో నూరువేల మంది పరిచారకులు రేయింబవళ్ళు అతిథి సత్కారాలు సమకూర్చటంలో నిమగ్నులై ఉంటారు. వారి బాధ్యతలు, జీతబత్యాలు, యోగక్షేమాలు అన్నీ నేనే చూస్తుంటాను. అట్లాగే ఉత్తమ గజాశ్వాలు నూరువేలకు పైగా ఉన్నాయి. వాటి పోషణ బాధ్యతలను నేనే నిర్వహిస్తాను. చిట్టచివరకు గోపాలకులను, భృత్యులను కూడా స్వయంగా పలకరించి వారి యోగక్షేమాలను విచారిస్తాను. ఈ పనులన్నీ నిర్వహించి రాత్రి ఒకజాము మాత్రమే కలత నిద్రపోయి వెంటనే లేచి కార్యనిర్వహణ దీక్షలో మునిగిపోతాను. నాభర్తలు ఆ విషయాలన్నీ నా మీద వదలి నిశ్చింతగా తమ రాజ్యభార వ్యవహారాలలో నిమగ్నులై ఉంటారు. ఇటువంటి ప్రవర్తనతో నా పతుల అనురాగాన్ని పొందగలుగుతున్నానే కాని, నీవనుకొన్నట్లు మందుమాకుల మహిమల వలన గాని, మరే ఇతర ఇంద్రజాలాల వలన గాని కాదు సుమా!

సత్యభామ : (సిగ్గుపడి తలవంచుకొని) నాకు తెలియక అజ్ఞానంతో నిన్నిట్లా అడిగాను. నా తెలివి తక్కువతనానికి మన్నించుము. నా మాటలు నవ్వులాటల కన్నవిగా తీసికొమ్ము. ఈ లోకంలో నీ చరిత్ర మహిమ గౌరవించదగింది.

పతివ్రతాధర్మాలు

ద్రౌపది : సత్యభామా! పతి మనస్సును ఆకట్టుకొనే నిపుణమైన ఉపాయాలను చెప్పుతాను వినుము. ఇవి ఉత్తమమైనవి. ధర్మంతో కూడినవి, మంచి నడవడి కలిగించేవి.

పతిని మించిన దైవం సతికి మరొకరు లేరు. పతి సంతోషించి కరుణిస్తే ధనధాన్య సంతాన గౌరవాలూ, కీర్తి, సద్గతులూ కలుగుతాయి. ఎప్పుడైన ఎంతో కష్టపడితేనే గాని కాస్త సుఖం కలుగదు. పతి సేవవలన అమితమైన శుభం సుఖం లభిస్తుంది. కాబట్టి ఎప్పుడూ భర్త పట్ల అనుకూలభావం, ప్రేమ, భయభక్తులు, ప్రీతి ప్రసరిస్తే అతడు సతిపట్ల ఆసక్తుడౌతాడు.

శ్రీకృష్ణుడు నీ ముంగిట్లోకి రాగానే లేచి ఎదురుపోయి మనసారా ఆహ్వానించుము. అంతఃపురంలోకి చేరగానే ఆసనాది గౌరవాలన్నీ నీవే స్వయంగా సమకూర్చుము. నీ మగడు మనసుపడి నీతో గోముగా చెప్పిన వలపు మాటలను నీ ప్రాణ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్నేహితురాండ్రకు కూడా చెప్పవద్దు. ఆ మాటలు సవతులకు తెలిస్తే రవరవలు కలుగుతాయి. శ్రీకృష్ణుడి మనస్సు విరుగుతుంది. పతికి నచ్చిన మిత్రులు విందుకు వస్తే వారిని ఆదరించుము. పతికి నచ్చని వారు నీకు మిత్రులైనా వారిని నీవు మెచ్చుకొనవద్దు. నీకు పుత్రులైనను ప్రద్యుమ్నాదులతో కలిసి ఏకాంతంలో ఒకే ఆసనంలో ఉండ తగదు. లోకులు పలుగాకులు. ఉత్తమ కుల సతులతో స్నేహం చేయుము. శీలం లేని వనితలకు దూరంగా మసలుకొమ్ము. ఈవిధంగా నడచుకొనటమే పతిసౌభాగ్యలాభానికి ఉపాయం.

సత్యభామ : (సంతోషంతో) ద్రౌపదీ! నీవు ధర్మజ్ఞురాలవు. నీ భర్తలు దేవతల వంటివారు. ధర్మతేజో బలశౌర్య సంపన్నులు. కాబట్టి వారికి ధరణీరాజ్యం తప్పక దక్కుతుంది. మీకు కీడుచేసిన కౌరవులకు దిక్కులేని చావు మూడుతుంది. వారి వనితలు రోదిస్తుంటే చూచి నీవు సంతోషపడతావు. ఉత్తములైన కొడుకులను కన్న ఇల్లాలివి. నీకు చింత వద్దు. నీ కొడుకులను రుక్మిణీ సుభద్రలు తమ కొడుకులుగా ప్రేమతో చూచుకొంటున్నారు. వారి దిగులు నీకు వద్దు. నిశ్చింతగా ఉండుము.

అంతలో కృష్ణుడు పాండవులను వీడ్కొని ప్రయాణానికి సిద్ధమయ్యాడు. సత్యభామ ద్రౌపదిని స్నేహపూర్వకంగా కౌగిలించుకొని వీడ్కోలు పలికింది. అంత సత్యభామా సహితుడై శ్రీకృష్ణుడు ద్వారవతీపురానికి వెళ్ళాడు. మార్కండేయమహర్షి పాండవుల నాశీర్వదించి తిరిగి తన ఆశ్రమానికి వెళ్ళాడు.

పాండవులు కామ్యకవనం నుండి ద్వైతవనానికి చేరారు. అప్పుడు హస్తినాపురం నుండి ఒక బ్రాహ్మణుడు వచ్చి పాండవులను దర్శించి, తిరిగి హస్తినాపురానికి వెళ్ళి, ధృతరాష్ట్రుడితో పాండవుల వనవాస జీవిత క్లేశాలను గురించి వివరించి చెప్పాడు. వాటిని విని ధృతరాష్ట్రుడు దుఃఖించాడు. దుర్యోధనుడి దుర్వర్తనానికి వాపోయాడు. మహాబలవంతులైన పాండవులు అరణ్యవాస క్లేశాలవలన పొందుతున్న బాధలను పేరుపేరున పేర్కొని పరితపించాడు. ప్రత్యేకించి భీమార్జునుల పరాక్రమాలను, ప్రతీకార పౌరుషాలను తలచి లోలోన భయపడ్డాడు. కౌరవులు పాండవులపట్ల చేసిన కీడులను వరుసగా స్మృతికి తెచ్చుకొని పాండవుల వలన రాబోయే కీడును శంకించి కౌరవనాశనం దాపురించిందని దద్దరిల్లాడు. దుర్యోధనుడు ధృతరాష్ట్రుడి మనోవేదనను పసికట్టి శకుని కర్ణులతో కూడి రహస్య సమావేశం జరిపి, కార్యాలోచనం చేశాడు.

ఘోషయాత్ర

పాండవులు ద్వైతవన సరోవర తీరంలో ఉన్నారు. వారు వనవాస క్లేశాలను అనుభవిస్తున్నారనీ, వారి ముందు కౌరవసంపదను ప్రదర్శించి వారికి మరింత దుఃఖాన్ని కలిగించాలనీ దుష్టచతుష్టయం పన్నాగం పన్నింది. ద్వైతవనంలో ఉన్న గోవులు క్రూరమృగబాధకు గురి అవుతున్నాయనీ, తత్క్షణమే ప్రభువులు వాటికి రక్షణ కల్పించాలనీ సమంగుడనే గోపాలుడి ద్వారా నాటకమాడించి ఒక వినతిని కల్పించారు. దానిని నమ్మినా ధృతరాష్ట్రుడు మొదట దుర్యోధనాదులను గోరక్షకు పంపటానికి అంగీకరించలేదు. శకుని నచ్చ చెప్పిన తరువాత ఎట్టకేలకు సమ్మతించాడు. అయితే, ఆ వనంలోనే నివసిస్తున్న పాండవుల కెటువంటి కీడును తలపెట్టవద్దని హెచ్చరించాడు. దుర్యోధనుడు దాని కంగీకరించి ఘోషయాత్ర ప్రకటించాడు. మహావైభవంగా, అట్టహాసంగా, సకుటుంబ పరివారంగా దుర్యోధనాదులు ద్వైతవనం చేరి వసతిగృహాలుగా డేరాలు వేయించి, వినోద విలాసాలతో కాలం గడపసాగారు. గోవుల సంపదను పరిశీలించి తగిన భద్రతలను ఏర్పాటు చేశారు. ధార్తరాష్ట్రుల సంపదలనూ, వైభవాలనూ చూచి పాండవులూ, ద్రౌపదీ మనసులలో బాధపడాలని వారి పన్నాగం.

ద్వైతవనంలో దుర్యోధనాదులు కొంతకాలం మృగయా వినోదం సాగించారు. ద్వైతసరోవర ప్రాంతంలో ధర్మరాజు యజ్ఞదీక్షితుడై ఉన్నాడని తెలిసి, సరోవరానికి ఆవలి ఒడ్డున క్రీడాగృహాలను నిర్మించటానికి భటులను ఆజ్ఞాపించాడు. ఆ ప్రయత్నాన్ని కొందరు గంధర్వులు అడ్డగించారు. చిత్రసేనుడనే గంధర్వరాజు క్రీడార్థం కల్పించుకొన్న కొలను కాబట్టి, ఇతరులు దానిని ఉపయోగించరాదని హెచ్చరించారు. కౌరవసేనలు వారి మాటలు లెక్కసేయక చిత్రసేనుడి గంధర్వసేనతో యుద్ధానికి సిద్ధమయ్యారు. పోరు ఘోరంగా జరిగింది. గంధర్వుల దాడికి కౌరవసైన్యం నిలవటం కష్టతరమైంది. దుశ్శాసన కర్ణాది వీరులందరూ తమ తమ సైన్యాలతో పోరుకు దిగారు. దుశ్శాసనాదులు గంధర్వుల దాడికి ఆగలేక వెనుదిరిగి దుర్యోధనుడి వద్దకు వెళ్ళారు.

కర్ణ డొక్కడే రణరంగంలో నిలిచి గంధర్వులను ఎదుర్కొన్నాడు. వేలమంది గంధర్వులను చంపాడు. కాని, వెంటనే శతసహస్ర సంఖ్యలో గంధర్వులు వచ్చేవారు, రణరంగమంతా నిండి శత్రువులను ముంచి వేశారు. అప్పుడు దుర్యోధనుడు శకుని దుశ్శాసనాది వీరులతో కలిసి ససైన్యుడై కదనరంగానికి కదలి వెళ్ళాడు. భయంకర యుద్ధం సాగింది. కౌరవవీరుల బాణవర్షానికి గంధర్వులు చాలామంది నేలగూలారు. ఆ సంగతి తెలిసి గంధర్వపతి అయిన చిత్రసేనుడు మదగజాన్ని ఎక్కి కోపంతో కౌరవుల మీదకు స్వయంగా ససైన్యుడై యుద్ధానికి వచ్చాడు. చిత్రసేనుడు మాయాయుద్ధ నిపుణుడు, వివిధాస్త్రాలను ప్రయోగించి గాలి ఆడకుండా చేశాడు. సూర్యకిరణాలు సోకకుండా చీకట్లు కల్పించాడు. కౌరవసేనలో ప్రతి ఒక్కొక్క వీరుడికీ పదిమంది చొప్పున గంధర్వులు చుట్టుముట్టి హతమార్చటం మొదలు పెట్టారు. ఆ ధాటికి ఆగలేక కౌరవసైన్యం ధర్మరాజును శరణువేడటానికి పరుగెత్తటం మొదలుపెట్టింది. కర్ణుడు వారందరికీ ధైర్యం చెప్పి, పారిపోకుండా ఆపి, కులపర్వతం వలె స్థిరంగా నిలిచి గంధర్వులను వీరోచితంగా ఎదుర్కొన్నాడు. దుర్యోధనాదులందరూ అతడికి అండగా నిలిచారు.

అప్పుడు అనంతసత్త్వులైన గంధర్వులు కర్ణుడిని చుట్టుముట్టారు. అతడి రథాన్ని కూలగొట్టారు. కర్ణుడు వికర్ణుడి రథ మెక్కి రణభూమికి దూరంగా తొలగిపోయాడు. దుర్యోధనుడు పోరు సాగించాడు. చిత్రసేనుడు అతడిపై విజృంభించి రథాన్ని విరుగగొట్టాడు. దుర్యోధనుడి జుట్టుపట్టి లాగి నేలపై పడవేశాడు. పెడకేల బంధించి సింహనాదం చేశాడు. అతడి ఆజ్ఞతో గంధర్వులు దుశ్శాసనాది భ్రాతృవర్గాన్నీ, కౌరవుల భార్యలనూ, మంత్రులనూ పట్టి బంధించారు. ఆ దృశ్యం చూచి కౌరవసైన్యంలోని మిగిలిన వారంతా ఆక్రోశిస్తూ పరుగెత్తి ధర్మరాజును శరణువేడారు. జరిగిన కథంతా చెప్పారు. దుర్యోధనుడికి సకుటుంబంగా చిత్రసేనుడి చెరనుండి విముక్తి కలిగించుమని ధర్మరాజును శరణువేడారు.

భీమసేను డప్పుడు పెద్దగా నవ్వి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు. 'మనం చేయవలసిన పని గంధర్వులే చేశారు. ఎంతో మంచి పని జరిగింది! మన కే భారమూ లేకుండా. ఇప్పుడు ఊరకుంటే చాలు మనకు జయం కలుగుతుంది. పుట్టుక నుండి కపటిగా పాపాలకు దిట్టగా పెరిగి లోకులచేత తిట్లుపడ్డ ఆ క్రూరుడికి బ్రహ్మదేవుడు తగిన శాస్తి చేశాడు. వనవాస క్లేశాల ననుభవిస్తున్న మనలను పరిహసించటానికి పన్నాగం పన్ని వచ్చిన ఆ పాపి తన పాపఫలాన్ని అనుభవిస్తున్నాడు. వాడి మీద దయచూపవలసిన అవసరం లేదు.'

ధర్మరా జామాటలు విని భీముడితో ఈ విధంగా పలికాడు - 'భీమసేనా! ఇది పరుషవాక్యాలు పలికే సమయమా? శరణుజొచ్చిన వారిని కరుణతో చూడటం నీ ధర్మం కాదా? ఒక వంశంలో పుట్టి, జ్ఞాతులమైన వారం మనం. అర్థసంబంధమైన అభిప్రాయభేదాలు మనమధ్య ఉండవచ్చును. కాని, ఇతరులవలన మనకు అవమానం కలిగేటప్పుడు ఒకరు మరొకరిని ఆదుకొనకపోవటం నింద్యం. దుర్యోధనుడు దుర్మార్గుడే కావచ్చును. భార్యలతో సహా పగవారిచేత పట్టుబడగా మనం ఉపేక్ష చేస్తే కులహాని అవుతుంది. అంతే కాదు, శరణువేడిన వారిని రక్షించటం సామాన్యక్షత్రియుడికే ధర్మం కాగా, నీవంటి బలవంతులకు అవశ్యకర్తవ్యమని వేరే చెప్పవలెనా? లెమ్ము, నీవూ, నీ తమ్ములూ రథా లెక్కి వెళ్ళి దుర్యోధనుడి చెరవిడిపించండి'- అని ధర్మరాజన్నాడు. భీముడు కోపంతో దుర్యోధనుడు తమకు పూర్వం చేసిన అపకారాలనన్నింటినీ అన్నకు గుర్తు చేసి, వాటిని మరచిపోయి ఎప్పుడూ దయచూపితే, కార్యహాని అవుతుందని హెచ్చరించాడు. అప్పుడు ధర్మరాజు భీమసేనుడిని బుజ్జగిస్తూ ఇట్లా అన్నాడు.

'రక్షించుమని వేడితే బలహీనుడైనా తనకు ఓపినంత చేస్తాడు. నీవంటి శూరుడు దీనుల వైఖరి చూచి కూడా ఊరకుంటాడా? భయంకర శత్రువైనా శరణని వస్తే సంతోషంతో రక్షించాలి. ఇది దయామయుల తీరు. దానికి ఏ ధర్మాలూ సరిగావు. దుర్యోధనుడు మీ బలశౌర్యాలు తెలిసిన వాడు కాబట్టి, మీరు తప్పక తనను విడిపిస్తారనే ఆశతో వీరందరినీ పంపి ఉంటాడు. అతడిని రక్షిస్తే పుణ్యం, కీర్తి కలుగుతాయి. నిజానికి నేను ని న్నింత బలవంతపెట్టకూడదు. అయినా నేను యజ్ఞదీక్షలో ఉన్నాను కాబట్టి నేను వెళ్ళరాదు కాబట్టి, నిన్ను వెళ్ళమంటున్నాను. ముందుగా గంధర్వులను సామోపాయంతో నచ్చచెప్పి పని సాధించండి. సామమార్గంలో మాట వినకపోతే శత్రువుల నోడించి కార్యాన్ని పూర్తి చేయండి. తద్వారా నాయజ్ఞాన్ని

సఫలం చేయండి.' ధర్మజుడి మాటలకు భీముడు ఎట్టకేలకు అంగీకరించాడు. అర్జునుడు కూడ ధర్మరాజు ఆజ్ఞను తీసికొని దుర్యోధనుడి చెరవిడిపిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. నకుల సహదేవులు భీమార్జునుల వెంట నడిచి గంధర్వసేనలపై విజృంభించారు.

చిత్రసేనుడు వారిని అస్త్రశస్త్రాలతో ఎదుర్కొన్నాడు. అర్జునుడు సౌమ్యంగా దుర్యోధనుడిని చెరవిడిపించుమని కోరాడు. కాని,అతడి మాట పట్టించుకొనకుండా గంధర్వపతి అర్జునుడి రథాన్ని భగ్నం చేయపోయాడు. కవ్వడి విజృంభించి గంధర్వులను బాణవర్షంతో నొప్పించాడు. అప్పుడు గంధర్వులు చెరపట్టిన దుర్యోధనాదులను రక్షించుకొంటూ ఆకాశానికి ఎగిరి గంధర్వలోకంవైపు పరుగెత్తసాగారు. అర్జునుడు ఆకాశమంతా బాణాలతో కప్పి వారిని నిలువరించాడు. గంధర్వులు వలలో చిక్కిన పక్షులవలె విలవిలలాడారు. గంధర్వులు భీమాదుల మీద అస్త్రశస్త్రాలు ప్రయోగించారు. అర్జునుడు ఆగ్నేయాస్త్రంతో వారిని మంటలలో చిక్కుకొనేటట్లు చేశాడు. చిత్రసేనుడు మాయాయుద్ధం చేశాడు. అర్జునుడు శబ్దభేదులైన బాణాలతో చిత్రసేనుడి శరీరాన్ని గాయపరిచాడు. అప్పుడు చిత్రసేనుడు యుద్ధం చాలించి అర్జునుడి ఎదుట నిలిచి ఈవిధంగా అన్నాడు:

చిత్రసేనుడు : అర్జునా! దురాత్ముడైన ఈ దుర్యోధనుడు మిమ్మల్ని అపహసించటానికి ఈ వనానికి భార్యాబంధు సమేతంగా వచ్చాడు. ఇతడిని బంధించి తెమ్మని ఇంద్రుడు నన్ను పంపాడు. అందువలన దుర్యోధనాదులను ఇంద్రుడివద్దకు తీసికొని పోతున్నాను. నీవు నన్ను అడ్డగించబోకుము. నీవు నా స్నేహితుడవు. నీమీద నాకు మాత్సర్యం లేదు.

అర్జునుడు : చిత్రసేనా! ఈ సుయోధనుడు మాకు సహోదరుడు. కాబట్టి ఇతడిని వదలిపెట్టటం నీ కర్తవ్యం. అట్లా చేస్తే ధర్మరాజు సంతోషిస్తాడు. ఇంద్రుడి ఆజ్ఞ అయినా మరేదైనా దానిని ధర్మరాజు సమక్షంలో చెప్పి, ఆయన ఎట్లా ఆదేశిస్తే అట్లా చేయవలసిందే. కాబట్టి నా మాట విని ధర్మరాజు కడకు రమ్ము - అని పలికి, చిత్రసేనుడిని ఒప్పించి ధర్మరాజు వద్దకు తీసికొని వెళ్ళాడు.

చిత్రసేనుడు పెడరెక్కలు విరిచికట్టిన దుర్యోధనుడిని స్వయంగా ధర్మరాజు ఎదుట నిలిపి, అతడి దుష్టస్వభావాన్ని బయటపెట్టాడు. ధర్మరాజు చిత్రసేనుడి ఔదార్యాన్ని కొనియాడి, అతడిని గౌరవించి, గంధర్వలోకానికి సాగనంపాడు. ఆపైన దుర్యోధనాదుల బంధాలను ఊడదీయించాడు. 'ఎప్పుడూ ఇటువంటి సాహసాలు చేయకుము సోదరా! దుర్జనుడు సాహసిస్తే నశిస్తాడు. కాబట్టి వెంటనే నీ తమ్ములను కుటుంబాలను తీసికొని నగరానికి వెళ్ళిపొమ్ము. దీన్ని మనసులో పెట్టుకొని బాధపడకుము' - అని మెత్తగా మందలించి దుర్యోధనుడిని వీడ్కొలిపి పంపించాడు. ధర్మజుడి ధర్మప్రవృత్తిని ధౌమ్యాదులందరూ ప్రశంసించారు.

దుర్యోధనుడు పాండవుల చేత విడిపించబడిన అవమానాన్ని, అపకీర్తిని భరించలేక నగరానికి తిరిగిపోతూ మార్గమధ్యంలోనే ప్రాయోపవేశం మొదలు పెట్టాడు. కర్ణ, శకుని, దుశ్శాసనాదులు ఎన్నో రీతుల చెప్పిచూచారు. కాని, ఫలం లేకపోయింది. ఆనాటి రాత్రి పాతాళవాసులైన రాక్షసులు కృత్యను సృష్టించి పంపి దుర్యోధనుడిని తమవద్దకు తెప్పించుకొన్నారు. అతడి పూర్వజన్మ వృత్తాంతం వివరించి చెప్పారు. రాక్షసులు తపస్సుచేసి పరమేశ్వరుడిని మెప్పించి రాక్షసపతిగా అతడిని పొందారు. పరమేశ్వరుడు స్వయంగా సృష్టించటం వలన అతడి శరీర పూర్వభాగం సహజవజ్రతుల్యం. అస్త్రశస్త్రాలు ఆ భాగాన్ని ఏమీ చేయలేవు. అయినా కోమలంగా, మనోహరంగా, స్త్రీ జనరంజకంగా ఉంటుంది. దుర్యోధనుడు భూలోకంలో పుట్టటంతోనే అతడికి సహాయంగా అనేక దైత్యదానవగణాలు వివిధ రాజకులాలలో భగదత్తాది రాజకుమారులుగా పుట్టారు. భీష్మద్రోణకృపాదులు దేవాంశసంభవులైనా, వారి భావాలు రాక్షసావేశాలై ఉంటాయి. అందువలన యుద్ధంలో నిర్దయులై బంధువులను సంహరిస్తారు. పాండవులు బంధుప్రేమను విడిచి యుద్ధానికి దిగి దుర్యోధనుడి చేత సంహరించబడతారు. అతడి మనసులో అర్జునుడి వలన భయం ఉండటం రాక్షసులు పేర్కొని, నరకాసురాంశతో కర్ణుడు పుట్టాడనీ, అతడు తన దివ్యాస్త్రాలతో కృష్ణార్జునులను సంహరిస్తాడనీ చెప్పారు. పాండవరక్షణార్థం ఇంద్రుడు కర్ణుడి కవచకుండలాలను కపటరూపంతో అపహరిస్తాడు. భూమిపై వేయి లక్షలమంది సంశప్తకులు పుట్టారు. వారందరు దనుజులు. వారు యుద్ధంలో ఇంద్రసుతుడైన అర్జునుడిని నిగ్రహిస్తారు. శత్రుకంటకాలు లేని భూతలాన్ని దుర్యోధనుడు పాలిస్తాడని రాక్షసులు ధైర్యం చెప్పారు. రాక్షస

వంశానికే దుర్యోధనుడు ఆశాకిరణమని అభివర్ణించారు. ప్రాయోపవేశం చేయవద్దని చెప్పారు. కృత్య ఎప్పటివలె ఆతడిని వసతిమందిరంలో ఉంచింది. దుర్యోధను డది నిజమని నమ్మాడు. పాండవులను చంపగల ధైర్యం తెచ్చుకొన్నాడు. దైత్యులు తనతో చెప్పిన అంశాలను రహస్యంగా తనమదిలో దాచుకొన్నాడు. తెల్లవారగానే కర్ణుడు వచ్చి తాను రాబోయే మహాయుద్ధంలో అర్జునుడిని సంహరిస్తానని తన ఆయుధ మంటి శపథం చేశాడు. కర్ణుడి మాటలు, రాత్రి దానవులు చెప్పిన మాటలు ఒకటిగా ఉండటం గమనించి దుర్యోధనుడు ప్రాయోపవేశాన్ని వదలి హస్తినాపురానికి ససైన్యంగా వెళ్ళాడు.

భీష్మాదులు ఘోషయాత్రలో జరిగిన సంఘటనలు తెలిసికొని పాండవులతో కలిసి ఉండుమని దుర్యోధనుడికి హితవు చెప్పారు. కాని, అతడు ఆ మాటలు పెడచెవిన పెట్టి తాతను అనాదరించాడు; కర్ణుడి అండను నమ్మి ఉప్పొంగిపోయాడు. ధర్మరాజువలె దుర్యోధనుడు కూడా రాజసూయ యాగం చేయాలని సంకల్పించాడు. కర్ణశకునులు ఆ అభిప్రాయాన్ని బలపరచారు. ఆ విషయాన్ని పురోహితుడితో సంప్రతించారు. అతడుకూడా విద్వజ్జనులతో విచారించి పాండవులను జయించకుండా రాజసూయం చేయటం ధర్మం కాదు కాబట్టి దాని వంటి ఫలమిచ్చే వైష్ణవమనే యజ్ఞాన్ని పేర్కొన్నాడు. దుర్యోధనుడు పెద్దల అనుమతితో వైష్ణవ యజ్ఞాన్ని వివిధ దక్షిణలతో వైభవోపేతంగా చేశాడు.

ఆ యజ్ఞానికి పాండవులను ఆహ్వానించటానికి ఒకదూతను పంపారు. ధర్మరాజు తాము వనవాసవ్రతంలో ఉండటం చేత రాలేమని సందేశం పంపాడు. భీముడు క్రోధోద్రిక్తుడై ఇట్లా పలికాడు. ‘ఓ దూతా! పదమూడేళ్ళు పూర్తికాగానే ధర్మరాజు శస్త్రాస్త్రాలనే యజ్ఞాగ్నిలో కౌరవులనే పశువులను వేలుస్తూ యుద్ధమనే సత్రయాగం చేయటానికి వస్తాడు కాని, అందాకా హస్తినాపురానికి రా’ డని దుర్యోధనుడితో చెప్పుమని నిష్ఠురంగా పలికాడు. యజ్ఞంలో పాల్గొన్న సభాసదులలో కొందరు ఆ వైష్ణవ యజ్ఞం అపూర్వమని ప్రశంసించారు. మరికొందరు ధర్మజుడి రాజసూయమే ఆ యజ్ఞముకంటె ఉదాత్తమైనదని భావించారు. యజ్ఞాంతంలో అవభృథ స్నానం చేసి దుర్యోధనుడు పెద్దల ఆశీస్సులతో బంగారు సింహాసనం మీద తేజరిల్లాడు. అప్పుడు కర్ణుడు దుర్యోధనుడికి ఆనందం కలిగేటట్లుగా - యుద్ధంలో అర్జునుడిని చంపేంతవరకు కాళ్ళగోళ్ళు తీసికొన నని శపథం చేశాడు. దుర్యోధనుడు ఉప్పొంగిపోయాడు. అనంత సంపదను ప్రియసత్కారాలతో పంచిపెడుతూ త్యాగభోగాలతో తులతూగుతూ ఉన్నాడు. కర్ణుడి శపథం విని ధర్మరాజు విషణ్ణుడై కంటిమీద కూరుకు లేకుండా వేదనపడ్డాడు.

వ్రీహిద్రోణోపాఖ్యానం

పాండవులు ద్వైతవనం నుండి కామ్యకవనం చేరారు. అక్కడకు వ్యాసమునీంద్రుడు వచ్చాడు. పాండవుల పూజలందుకొని వారికి ఈ విధంగా బోధించాడు.

మానవులకు సుఖదుఃఖాలు వరుసగా వస్తూ ఉంటాయి. పండితు లాసత్యం తెలిసికొని మోదఖేదాలు పొందకూడదు. ధర్మరాజా! నీవు ఆపదలకు ఓర్చుకొని తపస్సు చేయుము. తపస్సు సకల సౌఖ్యాలను కలిగిస్తుంది. క్షమ, అహింస, సత్యం, సమత, ఇంద్రియనిగ్రహం, శమం, పరిత్యాగం - అనేవి తపో లక్షణాలు. వీటిలో ఒక్కొక్కటి ఉత్తమ గతికి సోపానాలు, తపశ్శక్తితో కూడిన దానం చేస్తే అధిక ఫలం కలుగుతుంది. కష్టార్జితమైన ధనాన్ని దానం చేయటం ఉత్తమం. అన్యాయార్జితమైన విత్తాన్ని దానం చేయటం మూర్ఖన్యాయం. దానివలన ఫలమేమీ ఉండదు. న్యాయంగా ఆర్జించిన ధనం కొద్దిగానైనా సరే గౌరవప్రదం. అది యోగ్యుడైన వాడికి దానం చేస్తే ఎంతో ఫలిస్తుంది. దానికి ఉదాహరణంగా ఈ కథ వినుము.

పూర్వం కురుక్షేత్రంలో ముద్గలుడనే విప్రుడు ఉంఛవృత్తితో జీవించేవాడు. ఆ పుణ్యాత్ముడు అతిథిప్రియుడు. అతడు పక్షోపవాసవ్రతం చేపట్టాడు. పాడ్యమి మొదలు పదునాల్గు రోజులు ఒక్కొక్క గింజగా తూమెడు వడ్లు సమకూర్చేవాడు. పర్వదినాన (అమావాస్య పూర్ణిమలలో) ఆ బియ్యాన్ని పాకం చేసి, దేవపితృపూజలు చేసి, పుత్రకళత్రాదులతో భుజిస్తూ దేహయాత్ర సాగిస్తుండేవాడు.

ఒక పర్వదినాన ముద్గలుడి ఇంటికి దుర్వాసమునీంద్రుడు అతిథిగా వచ్చాడు. ముద్గలు డతడిని పూజించి అన్నం వడ్డించాడు. దుర్వాసుడు వండిన అన్నమంతా తిన్నంత తిని మిగిలిన దానిని దేహమంతా పులుముకొని వెళ్ళాడు. ముద్గలుడికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తినటానికి ఏమీ మిగులలేదు. అయినా, అతడు నిర్వికారంగా పక్షోపవాసవ్రతం సాగిస్తూనే ఉన్నాడు. దుర్వాసుడు, ఆరు పర్వాలు వరుసగా వచ్చి ముద్గలుడిని పరీక్షించాడు. కాని, అతడిలో ఎటువంటి అసహనం కనపడలేదు. దానవ్రతంలో దీక్ష తగ్గలేదు. దుర్వాసు డతని దానశీలతకు మెచ్చి బొందితో స్వర్గం పొందే వరం ప్రసాదించి వెళ్ళాడు. ఆ తరువాత దేవదూత దివ్యరథాన్ని తెచ్చి ముద్గలుడిని స్వర్గానికి రమ్మని ఆహ్వానించాడు. ముద్గలుడు స్వర్గలోకంలోని గుణదోషాలను తెలుపుమని దేవదూత నడిగాడు. అత డీవిధంగా చెప్పాడు.

స్వర్గం ఈలోకానికి పైగా ప్రకాశమానంగా ఉంటుంది. అది దివ్యదృష్టితో చూడగలిగింది, దేవయానంతో చేరగలిగింది. తపస్వులు, సోమయాజులు, సత్యసంధులు, ఉత్తములు, జితేంద్రియులు, సమబుద్ధి కలవారు. దానపరులు, రణశూరులు - ఆ లోకంలో నివసిస్తారు. అందులో అప్సరసలు, సాధ్యులు, దేవమునులు వేరువేరుగా తగిన చోట్ల ఉంటారు. ముప్ఫయిమూడు వేల యోజనాల విస్తీర్ణం గల మేరుపర్వత శిఖరం మీద ఆ లోకం ఉంటుంది. నందన వనోద్యానాలు పుణ్యాత్ముల విహారస్థలాలు. అక్కడి వారికి ఆకలిదప్పులు, శీతోష్ణబాధలు, జరారోగ బాధలు ఉండవు. మనస్సు కాహ్లాదం కలిగించే ప్రకృతి సౌందర్యం అక్కడ ఉంటుంది. ఆ లోకవాసులు దివ్యదేహాలతో దివ్యభోగాలను అనుభవిస్తూ ఉంటారు. దివ్య విమానాలలో తిరుగుతూఉంటారు. ఆ లోకం మీద బ్రహ్మలోకం ఉన్నది. అందులో శోక మనేది ఉండదు. మానవులు, బ్రహ్మలు, మునులు అందులో వసిస్తారు. లోభం, క్రోధం, పాపం, అపకీర్తి, దుఃఖం, మరల పుట్టటం అనేవి అక్కడివారి కుండవు. ప్రళయం తరువాత కూడా ఆ లోకం నిలిచి ఉంటుంది. ఇంద్రాదులు కూడా ఆ లోకాన్ని పొందాలని అనుకొంటారు.

స్వర్గంలో ఉండే దోషాలు కూడా వినుము. జీవు లాలోకంలో పుణ్యఫలాలను అనుభవిస్తారే కాని, పుణ్యం చేసికొనలేరు. పుణ్యఫలానంతరం మరల భూమిపై జన్మ లెత్తుతూ ఉంటారు. స్వర్గ సుఖం నిత్యం కాదు. అందులోని వారు అసూయలకు పాల్పడతారు. అయినా బ్రహ్మలోకం తరువాత స్వర్గమే ఉత్తమం - అని దేవదూత వివరించాడు. ముద్గలుడు పునర్జన్మలేని బ్రహ్మలోకాన్ని పొందగోరి స్వర్గలోక భోగాన్ని త్యజించాడు. ఉంఛవృత్తి మాని జ్ఞానయోగంతో సమత్వాన్ని సాధించి మోక్షాన్ని పొందాడు.

కాబట్టి ధర్మరాజా! నీవు రాజ్యాన్ని కోల్పోయావని విచారించక తపస్సు చేయుము. దాని వలన శుభాలు కలుగుతాయి. పదమూడవ యేడు ముగియగానే రాజ్యం నీకు లభిస్తుంది - అని చెప్పి ధర్మరాజును ఓదార్చి వ్యాసుడు తన ఆశ్రమానికి పోయాడు.

సైంధవపరాభవం

ఒకనాడు పాండవులు తృణబిందుడి ఆశ్రమంలో ధౌమ్యుడిని, ద్రౌపదిని ఉంచి వేటకు వెళ్ళారు. ఆ సమయంలో సైంధవుడు సాల్వకన్యను వివాహమాడే నిమిత్తమై ఆ వైపునుండి ససైన్యుడై తరలిపోతున్నాడు. ఆశ్రమ ద్వారంలో నిలిచి ఉన్న ద్రౌపదిని చూచాడు. ఆమె యొక్క అపూర్వ లావణ్యవైభవాన్ని చూచి మోహించి ఆమెకు తన కోర్కెను కోటికాస్యుడనే మిత్రుడి ద్వారా తెలియపరిచాడు. దూతకు ద్రౌపది తన వివరాలు తెలిపి, తాను పాండవపత్ని అనీ,సంతానవతీ అనీ, పేర్కొని, పాండవులు వేటనుండి తిరిగి వచ్చేంతవరకు ఉండి వారి అతిథ్యాన్ని స్వీకరించి వెళ్ళుమని చెప్పుతుంది. ఆ సంగతి కోటికాస్యుడు సైంధవుడికి నివేదించాడు.

సైంధవుడు మదనాతురుడై, రథం, దిగి, ద్రౌపది ఉన్న ఆశ్రమంలో ప్రవేశించి, ఆమెను పలకరించాడు. ఆమె అతిథి మర్యాదలు చేసింది. సైంధవు డామెను వలపుగొన్న మాటలతో పలకరించి తనవెంట రమ్మని అనుచితమాడాడు. ఆమె తనకు చెల్లెలని కూడా భావించకుండా కామాంధకారంతో మాట్లాడిన అతడి వైఖరికి నిష్ఠురంగా సమాధానం చెప్పింది. పాండవులు ఆగ్రహిస్తే అతడికి కలిగే విపత్తును చెప్పి హెచ్చరించింది. అయినా, అతడు లెక్కచేయకుండా ఆమెను బలాత్కారంగా ఎత్తుకొని, రథం మీద ఉంచుకొని బయలుదేరాడు. ద్రౌపది ధౌమ్యుడిని పిలుస్తూ ఆక్రందించింది. ధౌమ్యుడు సైంధవుడిని హెచ్చరిస్తూ అతడి రథం వెంట పరుగిడసాగాడు.

పాండవులకు అడవిలో అపశకునాలు ఎదురయ్యాయి. కలతచెంది వారందరూ కలిసి ఆశ్రమానికి తిరిగివచ్చారు. ద్రౌపది చెలికత్తె అయిన ధాత్రేయిక వలన జరిగినదంతా తెలిసికొన్నారు. అందరూ సైంధవుడి మీదకు లంఘించారు. వారి రథాలను చూచి సైంధవుడు వారిని పరిచయం చేయుమని ద్రౌపదిని కోరాడు. ఆమె క్రమంగా పాండవ పరాక్రమ మూర్తులను వర్ణించి చెప్పి, వారిబారిన పడినవారికి మృత్యువు తప్పదని హెచ్చరించింది.

పాండవులు దిక్కులు చీకట్లు క్రమ్మేటట్లు బాణాలు గుప్పించారు. త్రిగర్త, శిబి, సింధు, సౌవీర సైన్యాలు పాండవుల నెదుర్కొన్నాయి. భీముడు సైంధవుడినీ, యుధిష్ఠిరార్జునులు సౌవీరులనూ, నకుల సహదేవులు మిగిలిన వారినీ ఢీకొన్నారు. సంకుల సమరం సాగింది. రణభూమి శవమయం అయిపోయింది. సైంధవుడు ద్రౌపదిని నేలపై దిగవిడిచి రథం తోలుకొని పలాయనం చిత్తగించాడు. భీమార్జునులు ఆ దుర్మార్గుడిని విడిచిపెట్ట దలచలేదు. పాంచాలి క్రుద్ధురాలై సైంధవుడిని చంపటానికి వారిద్దరినీ పురికొల్పింది. ధర్మరాజు మాత్రం సైంధవుడిని చంపవద్దని హెచ్చరించాడు. ధౌమ్యధర్మజద్రౌపదులను, నకుల సహదేవులను ఆశ్రమానికి తిరిగి పంపి, భీమార్జునులు అతడిని వెన్నంటి తరిమి పట్టుకొన్నారు. భీముడు సైంధవుడిని చితకపొడిచాడు. మొగంనుండి నెత్తురుకారుతూ అతడు మూర్ఛపోయాడు. వాడియైన కత్తితో అతడి తల, మీసం గొరిగి 'పాండవదాసుడ'నని సభలలో చెప్పుకొనటానికి అంగీకరించినందువలన సైంధవుడిని ప్రాణాలతో వదిలాడు. ధర్మజుడి ఆనతి మేరకు భీమార్జునులాతడిని ప్రాణాలతో తీసికొని పోయి' ఇడుగో పాండవ దాసుడు' అని అన్న పాదాలముందు పడవేశారు. పాండవదాసుడైతే ప్రాణాలతో వదలివేయండని ధర్మజుడు పలికాడు. ద్రౌపది అతడి దైన్యాన్ని చూచి వదలిపెట్టుమన్నది. సైంధవుడు అవమానభారంతో క్రుంగుతూ వెళ్ళిపోయాడు. ధర్మరాజు చూపిన కరుణకు అక్కడివారందరూ జయజయ ధ్వానాలు చేశారు.

సైంధవుడు విషణ్ణుడై గంగాద్వార క్షేత్రం వద్దకు వెళ్ళి, పరమేశ్వరుడిని గూర్చి బొటనవ్రేలి మీద నిలిచి తపస్సు చేశాడు. శివుడనుగ్రహించి ప్రత్యక్షమై వరం కోరుకొనుమన్నాడు. సైంధవుడు పాండవులనైదుగురను ససైన్యంగా ఓడించే వరం కోరాడు. శివుడది అసాధ్యమని పేర్కొన్నాడు. అర్జునుడిని జయించటం తనకే కష్టతరమని పలికాడు. పార్థుడు లేనప్పుడు మిగిలిన పాండవులను ఒకనాటి యుద్ధంలో నిలువరించగలిగే వరాన్ని ప్రసాదించి అంతర్ధానమైనాడు. సైంధవుడు తిరిగి సింధు దేశానికి వెళ్ళాడు.

ఆ తరువాత కొన్నాళ్ళకు కామ్యకవనంలో ఉంటున్న పాండవులవద్దకు మార్కండేయ మహర్షి వచ్చాడు. సైంధవుడు పాంచాలి పట్ల వ్యవహరించిన తీరును ధర్మరాజు చెప్పాడు. అతడిని అవమానించటానికి తాము పడ్డ కష్టాన్ని కూడ వివరించాడు. ద్రౌపదివలె కష్టాలపాలైన వనితగాని, ధర్మరాజువలె శోకసముద్రంలో మునిగిన రాజుకాని ఏకాలంలోనైనా ఎవరైనా ఉన్నారా? అని అడిగాడు. మార్కండేయముని సీతారాము లున్నారని పేర్కొన్నాడు. వారి కథను వివరించాడు.

రామాయణకథ

ధర్మరాజు : మార్కండేయ మహర్షీ! రాము డెవరి వంశంవాడు? రావణుడు ఎవరి కొడుకు? అతడు ఏ కారణం వలన సీతను అపహరించాడు? రామరావణయుద్ధం ఏ విధంగా ప్రవర్తిల్లింది? నాకు వివరించి చెప్పండి.

మార్కండేయుడు : ఇక్ష్వాకు వంశంలో ప్రసిద్ధుడైన అజమహారాజు కొడుకు దశరథుడు. అతడికి ముప్వురు భార్యలు. కౌసల్యకు రాముడు, కైకేయికి భరతుడు, సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్నులు జన్మించారు. రాముడు విదేహరాజైన జనకుడి కూతురు సీతను వివాహమాడాడు.

బ్రహ్మమానసపుత్రుడైన పులస్త్యుడికి వైశ్రవణుడు పుత్రుడు. అతడు బ్రహ్మనుగూర్చి తపస్సుచేసి నలకూబరుడనే కొడుకును, లోకపాలకత్వం, ధనేశ్వరత్వం, లంకానగరం, శంకరుడితో స్నేహం - అనే వరాలను పొందాడు. అతడి మహిమను చూచి తండ్రి అయిన పులస్త్యుడు అసూయపడి, తన శరీరం నుండి విశ్రవసుడిని సృష్టించి వైశ్రవణుడికి కీడు చేయుమని ఆజ్ఞాపించాడు. ఆ సంగతి తెలిసి వైశ్రవణుడు విశ్రవసుడి వద్దకు వెళ్ళి, అతడిని ప్రసన్నుడిని చేసికొని నృత్తగీత విద్యావిశారద

లయిన ముగ్గురు రాక్షస స్త్రీలను అతడికి పరిచారికలుగా ఇచ్చాడు. వారు పుష్పోత్కట, మాలిని, పాక(బక) - అనేవారు. వారు చేసే సేవలకు ప్రీతుడై విశ్రవసుడు వారికి పుత్రదానం చేశాడు. పుష్పోత్కటకు రావణ కుంభకర్ణులు, మాలినికి విభీషణుడు, పాక(బక)కు ఖరుడు, శూర్పణఖ అనే కవలబిడ్డలు జన్మించారు. వారు క్రమంగా పెరిగి పెద్దవారయ్యారు. రావణుడు లోకమందు లోకభయంకరుడయ్యాడు. కుంభకర్ణుడు క్రూరుడుగా మారాడు. విభీషణుడు ఉత్తమచిత్తుడయ్యాడు. ఖరుడు బ్రాహ్మణులను చంపి వారి మాంసం తినేవాడయ్యాడు, శూర్పణఖ పాపకర్మురాలయింది.

వారందరూ వేదవేదాంగాలను నేర్చుకొని గంధమాదన పర్వతం మీద ఉంటూ, వైశ్రవణుని సంపద తపస్సిద్ధమని తెలిసి మత్సరబుద్ధితో వారుకూడా తపస్సులు చేయ సంకల్పించారు. రావణుడు వాయుభక్షకుడై ఘోరతవస్సు చేశాడు. నియతాహారుడై కుంభకర్ణుడు, పర్ణాహారుడై విభీషణుడు తపస్సులు చేశారు. ఖరశూర్పణఖలు వారికి సపర్యలు చేశారు. వేయి సంవత్సరాలు గడిచాయి. రావణుడు తన పదితలలలో ఒకదానిని ఖండించి అగ్నిలో వేల్చాడు. అట్లాగే వేయేండ్ల కొక తల చొప్పున ఆహుతి చేస్తూ వచ్చాడు. పదో తలను త్రెంచుకొనే సమయంలో బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకొనుమన్నాడు. సమస్త దేవతలు, పితృగణాలు, దైత్యులు, సర్పాలు, గంధర్వులు, రక్షోగణాలు, విద్యాధరయక్షజాతులు తననేమీ చేయలేనట్లు, కామరూపంతో స్వేచ్ఛగా విహరించ గలిగేటట్లు వరాలు కోరాడు. 'మనుష్యుల వలన తప్ప ఇతరుల వలన నీకు ప్రాణభయం ఉండ' దని బ్రహ్మ వరమిచ్చాడు. కుంభకర్ణుడు గాఢమైన నిద్రను కోరాడు. దానిని బ్రహ్మ ప్రసాదించాడు. విభీషణుడు ఆపదల సమయంలోకూడా తన మనస్సు పాపచింతలకు లోనుకాకుండ ధర్మబద్ధమై ఉండాలనీ, బ్రహ్మాస్త్రాన్ని ప్రసాదించాలనీ కోరాడు. రాక్షసుడైనా విభీషణుడు ధర్మబుద్ధి కలవాడని తెలిసి అతడు అడిగిన వరాలిచ్చి, అమరత్వాన్ని ప్రసాదించాడు బ్రహ్మ.

రావణుడు వరగర్వంతో వైశ్రవణుడిపై దండెత్తాడు. వైశ్రవణుడు భీతుడై యక్షకింపురుషులతో కలిసి లంకానగరం విడిచి గంధమాదన పర్వతం వైపు పోతూ ఉండగా ఆతడిని అవమానించి పుష్పక విమానాన్ని హరించాడు. కుబేరుడు కోపించి ఆ విమానం రావణుడి శత్రువుల పాలౌతుందని శపించాడు. రావణుడు రాక్షస రాజ్యానికి రాజుగా పట్టాభిషిక్తుడయ్యాడు. అతడు దేవేంద్రాదులను జయించి, వారి పదవులను ఆక్రమించి జగద్రావణం చేసి, రావణుడని లోకంలో ప్రఖ్యాతి పొందాడు.

దేవతలు రావణుడి ఆగడాలను బ్రహ్మకు నివేదించుకొన్నారు. బ్రహ్మ ఆ సమస్యను అంతకుపూర్వమే విష్ణువుతో నివేదించాడు. ఆ దేవదేవుడు మానవాకారంతో అవతరించి ఆ రాక్షసుడిని సమూలంగా నశింపచేస్తానని మాట ఇచ్చాడు. ఇంద్రాది దేవతలు భల్లూక వానర జాతులలో మహావీరులై పుట్టుతారనీ, భయపడవద్దనీ బ్రహ్మ దేవతలకు, ఋషులకూ నివేదించాడు. వారి యెదుటనే దుంధుభి అనే గంధర్వ వనితను పిలిచి మంథర అనే కుబ్జరూపంగా భూలోకంలో పుట్టి తగినవిధంగా దేవకార్యాన్ని నిర్వహించటానికి నియోగించాడు. ఆ తరువాత దేవతలందరూ తమ తమ అంశలతో మహాకపివీరులను భువిపై పుట్టించారు.

ధర్మరాజు : మహర్షీ! దశరథుడు ధర్మమూర్తి అయిన రాముడిని అరణ్యానికి ఎందుకు పంపాడు? ఆ కథ చెప్పండి.

మార్కండేయుడు: దశరథ మహారాజు తన కొడుకులలో పెద్దవాడైన శ్రీరాముడు అన్నివిధాలా యౌవరాజ్య పట్టాభిషేక యోగ్యుడని నిరూపించి అభిషేకానికి ముహూర్తం నిర్ణయించాడు. ఆ శుభదినంనాడు మంథర ప్రబోధానికిలోనై కైకేయి దశరథ మహారాజును రెండు వరా లడిగింది. ఒకటి - యౌవరాజ్య పదవిలో భరతుడికి పట్టాభిషేకం చేయాలి. రెండు- రాముడు పదునాలుగేండ్లు అడవిలో గడపాలి. ఆ మాటలు విన్న దశరథుడు పిడుగుపడ్డ చెట్టువలె మూర్ఛితుడై భూమిపై పడ్డాడు. ఆ సంగతి రాముడు తెలిసికొని తన తండ్రి సత్యప్రతిజ్ఞుడు అగుగాక- అని తలచి సీతాసమేతంగా అడవికి బయలుదేరాడు. లక్ష్మణుడు వారిని అనుసరించాడు. రాముడు వనానికి వెళ్ళాడని తెలిసి దశరథుడు తద్వియోగ దుఃఖంతో రాముడినే స్మరిస్తూ ప్రాణాలు వదిలాడు.

దశరథ మరణానంతరం కైకేయి భరతుడిని పిలిపించింది. తండ్రి మరణవార్త వినిపించింది. రాముడు వనానికి వెళ్ళాడని చెప్పింది. అర్హుడైన అతడిని రాజ్యభారాన్ని స్వీకరించుమని కోరింది. భరతుడా మాటలు విని కోపశోకాలతో కలత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెందాడు. తల్లి చేసిన ఆ దురంతానికి దురపిల్లాడు. తల్లిని నిందించాడు. తండ్రికి అపరక్రియలు నిర్వర్తించాడు. వెంటనే మంత్రిసామంతబంధు పౌర వర్గాలతో చిత్రకూట పర్వతానికి వెళ్ళి రాముడిని దర్శించాడు. పితృమరణవార్త అన్నలకు తెలియచెప్పాడు. శ్రీరాముడిని తిరిగివచ్చి రాజ్యభారాన్ని చేపట్టుమని అనేక విధాల ప్రార్థించాడు. రాముడు తమ తండ్రి సత్యవాక్పరిపాలకుడుగా చిరకీర్తి పొందాలంటే తాను అరణ్యవాసం చేయటమే ధర్మమని ప్రబోధించి, భరతుడి కోరికపై తన పాదుక లాతని కిచ్చి పంపాడు. భరతుడు పాదుకలను నందిగ్రామంలో ఉంచి సేవిస్తూ, రాముడి రాకకై ఎదురుచూచాడు.

రాముడు చిత్రకూటం నుండి శరభంగ మహర్షి వద్దకు వెళ్ళాడు. ఆయన ఆదేశంతో దండకారణ్యంలో ప్రవేశించి గోదావరీ తీరంలో పంచవటిలో ఆశ్రమం నిర్మించుకొని ఉన్నాడు. అప్పుడు శూర్పణఖ వారికి అపకారం తలపెట్ట రాగా రామలక్ష్మణులు కోపించి దాని ముక్కు చెవులు కోసి అవమానించారు. ఆమె రోదించింది. ఖరదూషణులు పదహారు వేల రాక్షసులతో రామలక్ష్మణులపై దాడిచేశారు. వారిని క్షణకాలంలో చంపి రాముడు దండకారణ్యాన్ని రాక్షసభయం నుండి దూరం చేశాడు. శూర్పణఖ జరిగినదంతా లంకలోని రావణుడికి నివేదించింది. అతడు వెంటనే గోకర్ణ క్షేత్రానికి వెళ్ళి అక్కడ తపస్సు చేసికొంటున్న మారీచుడిని చూచి, రాముడిని అవమానించటానికి అతడి సహాయాన్ని అర్థించాడు. మారీచుడు రామపరాక్రమాన్ని రావణుడికి నివేదించాడు. అతడితో వైరం కులక్షయ కారకమని హితవు చెప్పాడు. ఆ మాటలకు రావణుడు కోపించి మారీచుడిని చంపబోయాడు. అతడి చేతిలో చచ్చేదానికంటె రాముడి చేతిలో మరణించటమే ముక్తిదాయకమని భావించి మారీచుడు రావణుడికి సహాయం చేయటానికి అంగీకరించాడు. బంగారు లేడి రూపం దాల్చి సీతను ప్రలోభపెట్టాలనీ, రాము డా లేడిని వెన్నంటి దూరదూరాలకు పోవాలనీ, అప్పుడు రావణుడు సీతను చెరపట్టాలనీ వ్యూహం సిద్ధం చేశాడు.

మారీచుడు కనకమృగరూపంలో రామాశ్రమ ప్రాంతంలో తిరుగాడసాగాడు. జానకి ఆ మృగాన్ని పట్టి తెమ్మని రాముడిని కోరింది. విధివశాన రాముడు ఆమె కోర్కెను తీర్చటానికి మాయామృగం వెంట బయలుదేరాడు. ఆ మాయామృగం రాముడికి చిక్కక అతడిని చాలాదూరం అడవిలోకి తీసికొని వెళ్ళింది. రాముడు విసిగి దానిని బాణంతో కొట్టాడు. ఆ లేడి రాముడిగొంతుతో 'హా లక్ష్మణా! సీతా!' అంటూ అరిచి కుప్పకూలిపోయింది. సీత ఆ పిలుపు విని రాముడి కేదో ఆపద కలిగిందని శంకించి లక్ష్మణుడిని ఆతడికి సాయం పొమ్మని కోరింది. 'రాముడు సర్వరక్షకుడు. అతడి కే కీడూ రాదు. అది రాక్షసమాయ; రాముడిప్పుడే తిరిగివస్తాడు' - అని లక్ష్మణుడు సీతకు ధైర్యం చెప్పాడు. కాని, సీత కోపంతో వివేకాన్ని కోల్పోయి లక్ష్మణుడి సంకల్పాన్ని శంకించి నిందించింది. రాముడి తరువాత తాను లక్ష్మణుడికి వశం కానని నిష్ఠురాలాడి లక్ష్మణుడి శీలాన్ని అవమానించింది. అతడు చేసేది లేక, ఆమె మాటలు భరించలేక, ఆమెను ఒంటిగా వదలి అన్నగారి కొరకు అడవిలోకి వెళ్ళాడు.

ఆ సమయంలో రావణుడు మాయా సన్న్యాసి వేషంలో సీతను సమీపించాడు. ఆతడిని అతిథిగా భావించి సీత పూజలు చేసింది. ఆమె సౌందర్యానికి ఆశ్చర్యపడి, రావణుడు తనను రావణుడిగా పరిచయం చేసికొని, తన పరాక్రమ విశేషాలను కీర్తించుకొని, తనకు భార్య కమ్మని కోరాడు. రాముడు సామాన్య మానవుడనీ, అతడితో కలసి అడవులలో ఇడుమలు పడవద్దనీ, తనను పొంది పరమభోగాల ననుభవించుమనీ కోరాడు. సీత తన పతిభక్తిని చాటిచెప్పే పలుకులు పలికింది. మిన్ను విరిగి నేల గూలినా రాముడిని దప్ప అన్యుని స్మరించనన్నది. రావణుడు భయంకరాకారాన్ని తాల్చి ఆమె నెత్తుకొని ఆకాశానికి ఎగసి లంకవైపు వేగంగా పోజొచ్చాడు. సీత తన దీనస్థితిని ఎలుగెత్తి రోదిస్తూ తెలిపింది. 'రక్షించండి' అని విలపించింది. ఆమె మాటలు విని సమీప పర్వత గుహలో నుండి జటాయువు రెక్కలు ఎగిరే కులపర్వతం వలె ఎగసి, రావణుడిపై దాడిచేశాడు. ఇద్దరి నడుమ పోరు ఘోరంగా సాగింది. కాని, చివరకు దశకంఠుడు రెక్కలను నరకటంతో జటాయువు నేలకూలాడు. రావణుడు వేగంగా పోసాగాడు. సీత నిరాశచెంది మార్గమధ్యంలో కొందరు కపివరులను గమనించి చింపిన చీర కొంగులో తన ఆభరణాలను మూటకట్టి, దానిని వారిముందు పడేటట్లు విడిచింది. రావణుడు లంకకు చేరి సీతను అశోకవనంలో ఉంచి, ఆమెకు కాపలాగా రాక్షసీ గణాన్ని ఏర్పరచి అంతఃపురానికి వెళ్ళాడు.

రాముడు మాయామృగాన్ని చంపి తిరిగివస్తూ ఎదురుగా వస్తున్న లక్ష్మణుడిని చూచి సీత నొంటిగా వదలివచ్చినందుకు మందలించాడు. కాని, లక్ష్మణుడు సీత తనను అవమానించి పలికిన మాటలు చెప్పి తన తప్పు లేదని మనవి చేసికొన్నాడు. రాముడు బాధపడుతూ ఆశ్రమానికి చేరాడు. చైతన్యం లేని శరీరం వలె సీత లేని కుటీరాన్ని చూచాడు. మూర్ఛపోయాడు.

లక్ష్మణుడి సేవలతో కొంతసేపటికి తెప్పరిల్లాడు. సీతాన్వేషణకు తమ్ముడితో కలిసి బయలుదేరాడు. మార్గంలో జటాయువును దర్శించారు. అతడు చెప్పిన కథనంతా విన్నారు. రావణుడు సీతను తీసికొని పోయిన దిక్కు చూపించి జటాయువు ప్రాణాలు విడిచాడు. అతడికి రామలక్ష్మణులు అత్యంత గౌరవంతో అగ్నిసంస్కారం చేసి దక్షిణాభిముఖులై పయనించారు.

దారిలో కబంధుడు లక్ష్మణుడిని కబళించబోయాడు. రాముడు అతడి బాహువును నరికి లక్ష్మణుడిని రక్షించాడు. లక్ష్మణుడు అతడి రెండవ బాహువును నరికాడు. కబంధుడు శాపవిముక్తుడై విశ్వావసుడనే గంధర్వుడుగా నిలిచాడు. అతడు సీత లంకలో ఉన్నదనీ, రామలక్ష్మణులు పంపా సరోవరం దాటి ఋశ్యశృంగ పర్వతం చేరి, సుగ్రీవుడితో చెలిమి చేస్తే కార్యసిద్ధి కలుగుతుందనీ చెప్పి అంతర్ధానమయ్యాడు. అతడు సూచించినట్లు రామలక్ష్మణులు ఋశ్యశృంగ పర్వతం చేరి సుగ్రీవుడితో స్నేహం చేశారు. సుగ్రీవుడు సీత జారవిడిచిన ఆభరణాల మూటను రాముడికి సమర్పించాడు. రాముడు వాలిని చంపి వానరరాజ్యాన్ని సుగ్రీవుడికి ఇస్తానని ప్రతిజ్ఞ చేశాడు. సుగ్రీవుడు సీతను తేవటంలో రాముడికి సహాయ పడతానని మాట ఇచ్చాడు.

ఆ తరువాత రామ సహాయంతో సుగ్రీవుడు కిష్కంధకు వెళ్ళి వాలిని ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానించాడు. వాలి రోషోద్రేకంతో సుగ్రీవుడిపై విజృంభించాడు. తార హితవు చెప్పినా పట్టించుకొనలేదు. వాలి సుగ్రీవుల మధ్య భీకరమైన ద్వంద్వ యుద్ధం ప్రవర్తిల్లింది. ఇద్దరిదీ ఒకేరూపం కావటంతో రాముడు వాలిపై బాణం సంధించటం కష్టమైపోయింది. అదనెరిగి లక్ష్మణుడి ప్రేరణతో హనుమంతు డొక చిగురాకు దండను సుగ్రీవుడి మెడలో గుర్తుగా ఉంచాడు. రాముడు వాలిని గుర్తించి అతడి గుండెపై బాణంతో కొట్టాడు. వాలి రాముడిని నిందిస్తూ ప్రాణాలు వదిలాడు. రాముడు తారను సుగ్రీవుడికి వశం చేసి, అతడిని వానర సామ్రాజ్య ప్రభువుగా పట్టాభిషేకం చేశాడు.

అప్పుడు గ్రీష్మకాలం ముగుస్తున్నది. వర్షర్తువు ముందున్నది. ఆ సమయం దాటగానే వానర సేనలతో సీతాన్వేషణం చేయిస్తానని సుగ్రీవుడు మాట ఇచ్చాడు. రామలక్ష్మణులను అంతవరకు మాల్యవత్కూటంలో నివసించడానికి వసతి కల్పించాడు.

అశోకవనంలో సీత- వలలో చిక్కిన లేడిపిల్లవలె చిక్కి రామధ్యాన వివశురాలై శోకిస్తూ ఉన్నది. రాక్షసీగణం సీత చుట్టూ చేరి రావణ ప్రశంస చేసి సీతమనసు బాధపెట్టేవారు. సీత వారితో తెగవేసి చెప్పింది. తాను రాముడిని తప్ప అన్యపురుషుల నాశించనని. ఆ సంగతిని రావణుడికి తెలియచెప్పటానికి రాక్షసస్త్రీలు వనితలు అతడి వద్దకు వెళ్ళారు. ఆ సమయంతో త్రిజట అనే సాత్త్విక రాక్షసవనిత సీతను సమీపించి అవింధ్యుడనే వృద్ధ దైత్యుడు తెలిపిన రామక్షేమ వార్తను, సుగ్రీవాదులతో కలిసి చేస్తున్న యుద్ధ యత్నాలను గురించి సీతకు నివేదించింది. తనకు వచ్చిన స్వప్న వృత్తాంతం వివరించి రావణపతనం, రామవిజయం, సీతారామ పునస్సమాగమం, శ్రీరామ పట్టాభిషేకం మొదలైనవి తప్పక జరుగనున్నాయని ధైర్యం చెప్పింది. సీత ఆ మాటలపై విశ్వాసం ఉంచి కొంత ఊరట చెందింది.

రావణుడు దేవదానవగంధర్వాది భూతవర్గాలను జయించగలిగాడే కాని మన్మథుడిని జయించలేకపోయాడు. ఒకనాడు సీతను స్మరించి మదనతాపాన్ని ఓర్వలేక దివ్యమాల్యాభరణాలను అలంకరించుకొని అశోకవనానికి బయలుదేరాడు. అలంకరించుకొన్న రావణుడు నడుస్తున్న కల్పవృక్షంవలె ఉన్నా, చూడటానికి శ్మశానంలో ఉన్న మర్రిచెట్టువలె భయంకరంగా కనపడుతున్నాడు. అతడు రోహిణీ నక్షత్రాన్ని సమీపించే శనైశ్చరుడివలె సీతను సమీపించి ప్రణయపూర్వకంగా ఈ విధంగా పలికాడు.

రావణుడు : ఓ మదిరాక్షీ! నీ వెందుకు అనవసరంగా ఆవేదనపడతావు? అలంకృతవై నన్ననుగ్రహించుము. వేయిమాట లెందుకు? దేవయక్షరాక్షస అప్సరఃకిన్నర పన్నగాసురాంగన లెందరున్నా వారందరినీ కాదని నిన్ను నే ననురాగంతో ఆదరించటం నీ అదృష్టం సుమా! దీన్ని నీవు తెలిసికొనలేక పోతున్నావు. గర్వంతో కూడుకొన్న ఆలోచనలే చేస్తున్నావు. ఇక రాము డంటావా? గౌరవాన్నీ, రాజ్యాన్నీ కోల్పోయి అరణ్యంలో దుఃఖ సముద్రంలో మునిగిన ఒక అల్పమానవుడు. అతడి మీద అమితంగా వలపు లొలకపోస్తూ మనసును

వగపు వెల్లువలో తల్లడిల్లగా చేసికొంటూ ఈ విధంగా ఉండటం ఏమి సుఖం? చెప్పుము. నేను సకల లోకాలకు అధిపతిని. నాకు బంట్లుగా పదునాలుగుకోట్లమంది దానవులు, ఇరువది ఎనిమిది కోట్లమంది రాక్షసులు, ఎనుబదిఆరు కోట్ల మంది యక్షులు సేవలు చేస్తారు. ధనాధిపతి కుబేరుడు నా అన్న. బ్రహ్మతో తుల్యుడైన విశ్రవసుడు నా తండ్రి. కుబేరుడి విలాసవనితలైన గంధర్వాప్సరోగణాలు నన్ను సేవిస్తారు. నాకు 'పంచమలోకపాలకుడు' అనే కీర్తి త్రిలోకాలలో వ్యాపించి ఉంది. ఇంద్రభవనం (స్వర్గం)లో వలెనే నా ఇంటకూడా భక్ష్యభోజ్యాది వస్తువులు తామరతంపరలుగా ఉన్నాయి. ఇంతటి నా వైభవానికీ, ఇంతటి నా జీవితానికి నీవు అధీశ్వరివై సుఖంగా భోగించుము.

సీత : (క్రోధశోక వ్యాకుల హృదయంతో ఒక గడ్డిపోచను చూస్తూ, రావణుడివైపు చూడకుండా అతడిని గడ్డిపోచవలె హీనుడిగా పరిగణిస్తూ) అక్కటా! నేను పరాంగనను, అబలను, పతివ్రతను, చూడ నేను మానవాంగనను, నీవు రాక్షసుడవు. మనిద్దరికి పొత్తెక్కడ? మనసులో అనురాగం ఆవంతలేని ఆడదాని పొందు ఏమంత సౌఖ్యం కలిగిస్తుంది? అదట్లా ఉంచుము. నీవు బ్రహ్మదేవుడి మనుమడివనీ, లోకపాలకుడితో సమానుడవనీ, శివుడి స్నేహితుడైన కుబేరుడి తమ్ముడవనీ నీ మహిమను నీవే చెప్పుకొన్నావు. ఇట్టి నీవు ధర్మాన్ని తెలిసికొని పాపవర్తనాన్ని విడవటం నీ కర్తవ్యం కాదా? సిగ్గులేకుండా ఈ విధంగా ప్రగల్భాలు పలకటం ప్రతాపమా? ఔచిత్యమా? (అని అంటూ పైటకొంగు కప్పుకొని దయనీయంగా దుఃఖించింది).

రావణుడు మరికొన్ని దుర్భాషలాడి. అంతర్ధానమయ్యాడు. సీత రాక్షసీజనుల చేత రక్షించబడుతూ అశోకవనిలో శోకమూర్తిగా ఉన్నది.

సీతాన్వేషణ

శ్రీరాముడు మాల్యవంత పర్వత గుహామందిరంలో వర్షర్తువును సీతా విరహంతో వెళ్ళబుచ్చాడు. శరదృతువు వచ్చింది. రాత్రులు దీర్ఘమయ్యాయి. వెన్నెలలు క్రుమ్మరిస్తున్నాయి. రాముడు సీతా విరహాన్ని సహించలేక లక్ష్మణుడిని సుగ్రీవుడి వద్దకు పంపాడు. సీతాన్వేషణ యత్నాలు మొదలుపెట్టి కృతజ్ఞుడై మసలాడా సరి. లేదా సుగ్రీవుడిని వాలివలెనే సంహరించుమని ఆదేశించాడు. సుగ్రీవు డప్పటికే కపి సేనలను నాల్గుదిక్కులా పంపాడు. నెలరోజుల గడువిచ్చాడు. గడువు పూర్తి కావటానికి అప్పటికి అయిదు రోజులింకా మిగిలి ఉన్నాయి. ఆ సంగతి సుగ్రీవుడు స్వయంగా వచ్చి రాముడికి నివేదించాడు. సుగ్రీవుడి చిత్తశుద్ధికి రాముడు హర్షించాడు.

తూర్పు, పడమర, ఉత్తరం దిక్కులకు పోయిన వానర వీరులు తిరిగి వచ్చి సీత జాడ తెలియలేదని రాముడికి నివేదించారు. రాముడు ఖిన్నుడైనాడు. దక్షిణ దిశకు పోయిన కపివీరులు తప్పక సీతాక్షేమ వార్త తెస్తారని ప్రాణాలు నిలువ బెట్టుకొని ఉన్నాడు. మరొక నెల గడిచింది. వానరులు మధువనంలోని పండ్లను విశృంఖలంగా తిని దానిని పాడు చేస్తున్నారన్న వార్త సుగ్రీవుడికి అందింది. అంగద జాంబవదాదులు, హనుమదాదులు సీతను కనుగొన్న హర్షాన్ని ప్రదర్శిస్తున్నట్లు కపిరాజు పసిగట్టాడు. దానిని రాముడికి సూచించాడు.

దక్షిణ దిశకు వెళ్ళిన వానరులందరూ సుగ్రీవ లక్ష్మణ సహితుడై ఉన్న రాముడిని చూచి సంతోషాతిశయంతో నమస్కరించారు. మతిమంతుడైన హనుమంతుడు తాను లంకానగరంలో సీతను చూచిన శుభవార్తను రాముడికి నివేదించాడు. ఆ పైన సీతాన్వేషణ యాత్రను గురించి విపులంగా వివరించి చెప్పాడు.

వానరులందరూ దక్షిణాభిముఖంగా పయనిస్తూ ఒకపెద్ద భూవివరం (సొరంగం)లో ప్రవేశించి కొన్ని వేలయోజనాలు చీకట్లో పయనించారు. సూర్యప్రకాశంలో వెలుగొందే మయుడి నగరాన్ని కనుగొన్నారు. అందులోని ప్రభావతిని దర్శించారు. ఆమె పెట్టిన విందులు భుజించి, సహ్యదర్దుర పర్వతాలను దాటి దక్షిణ సముద్ర తీరానికి చేరారు. ఆ విశాల వారాశిని

దాటలేమనీ, సీతను కాంచలేమనీ, తమ బ్రతుకులు నిరర్థకాలనీ తలంచి కపులందరూ నిరశనవ్రతం పట్టారు. సీతారక్షణలో జటాయువు ప్రదర్శించిన భక్తిపరాక్రమాలను ప్రశంసించారు. వారి మాటలు విని సంపాతి పర్వతం మీదినుండి దిగి అక్కడికి వచ్చి, తన సోదరుడు జటాయువు మరణించిన వార్త తెలిసికొని, విచారించి, సీత లంకలో ఉంటుందనీ, పదివేల యోజనాల విస్తీర్ణమున్న సముద్రాన్ని దాటటానికి ఉపాయం ఆలోచించండనీ సలహా చెప్పి వెళ్ళాడు.

వానరుల ప్రేరణతో హనుమంతుడు సముద్రలంఘన యత్నం చేశాడు. లంకానగరం చేరాడు. అశోకవనంలో మూర్తీభవించిన శోకరసంవలె నున్న సీతను చూచాడు. నిరంతరం రామస్మరణ చేస్తున్న ఆమెను సీతగా గుర్తించాడు. ఆమెను సమీపించి తనను రామదూతగా పరిచయం చేసికొన్నాడు. రామలక్ష్మణుల కుశలవార్త తెలిపాడు. సుగ్రీవ సహాయంతో లంకపై రాముడు దాడిచేసి సీతను చెరనుండి విముక్తురాలిని చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ధైర్యం చెప్పాడు.

సీతకు త్రిజట చెప్పిన మాటలు స్మృతికి వచ్చాయి. ఆమె హనుమంతుడి మాటలు నమ్మింది; శిరోమణిని ఆనవాలుగా ఇచ్చింది. చిత్రకూటంలో జరిగిన కాకాసుర వృత్తాంతాన్ని గుర్తుగా చెప్పింది. హనుమంతుడిని వీడ్కోలిచ్చి పంపింది. అతడు లంకాదహనం చేసి, వారధి దాటి రాముడిని జేరి కథనంతా చెప్పి, సీత పంపిన ఆనవాలును రాముడి కిచ్చాడు. ఆ శిరోరత్నాన్ని రాముడు కౌగిలించుకొని సీతయే తనకు లభించినంత హర్షాన్ని పొందాడు. వెంటనే లంకపై యుద్ధయాత్ర ప్రకటించాడు.

అపార కపిసైన్యం సమకూడింది. ఒక సుముహూర్తాన రణభేరి మ్రోగించి దక్షిణసముద్ర తీరాన్ని చేరింది. వారందరికీ సముద్రం దాటటం ఒక పెద్దప్రశ్నగా మారింది. ఎన్నో యోచనలు చేశారు. వాటన్నింటిని రాముడు కాదన్నాడు. లక్ష్మణుడితో కలిసి సముద్ర తీరంలో దర్భశయనాలపై వసించి ఉపవాసముండి సముద్రుడిని ఉపాసించారు. అతడు ప్రత్యక్షమై రాముడి కోరిక నడిగాడు. వానరసేన లంకకు చేరటానికి అనువుగా నీటిని చీల్చికొని బాట ఇమ్మని రాముడు సముద్రుడిని కోరాడు. సముద్రుడు అట్లా చేస్తే అది ఒక విపరీతమైన సంప్రదాయమౌతుందని చెప్పి వారధి కట్టి దాటండని సూచించాడు. మయుడి కుమారుడైన నలుడి సహాయంతో కపులు వారధి నిర్మించారు. రాముడు అపార కపిసేనతో సముద్రాన్ని దాటి లంకను ముట్టడించాడు.

రామరావణయుద్ధం

సాగరాన్ని దాటేముందే విభీషణుడు మంత్రులతో కలిసివచ్చి రాముడిని శరణు వేడాడు. అతడిని లంకా సామ్రాజ్యానికి ప్రభువుగా పట్టాభిషేకం చేస్తానని రాముడు ప్రతిజ్ఞ చేశాడు. శుకసారణులనే రాక్షసులు మారురూపాలతో రామసైన్యంలో గూఢచారి వృత్తితో మెలగుతూ ఉండగా విభీషణుడు వారిని గుర్తించి రాముడికి ఒప్పజెప్పాడు. రాముడు వారికి రామసైన్య విశేషాలనన్నింటినీ చూపజేసి తిరిగి లంకకు పంపాడు. వారు వెళ్ళి కపిసైన్యం దుర్జయమని రావణుడికి హితవు చెప్పారు. కాని, అతడు దానిని పెడచెవినబెట్టి యుద్ధానికి సిద్ధమయ్యాడు. రాముడు యుద్ధం మొదలు పెట్టే ముందు సామోపాయంగా అంగదుడిని రాయబారిగా రావణుడి వద్దకు పంపాడు. అంగదుడి హితవు రావణుడు వినకపోగా అతడిని దండించబోయాడు. అంగదుడు కుప్పించి ఎగసి రామసైన్యంలో దూకాడు. సామదానాదులు విఫలమయ్యాయి. ఇక మిగిలింది దండోపాయమే.

లంకానగర దుర్గం శత్రుదుర్భేద్యం. కోట గోడలమీద నల్లమబ్బులవలె రాక్షసులు భయంకరంగా నిలబడి ఉన్నారు. వీరోత్సాహంతో పొంగులువారుతున్న వానరవీరులు వేనకువేలు ఒక్కసారిగా కుప్పించి కోట గోడలమీద వాలి, రాక్షసవీరులను చంపి, బురుజుల నాక్రమించి, నగరవాసులకు భయం కలిగించారు. రావణుడు కోటానకోట్ల రాక్షసవీరులను వారిపైకి పంపాడు. వారు విజృంభించి కపివీరులను పారద్రోలి ప్రాకారాన్ని మరల కైవసం చేసికొన్నారు. కోతులతో కపిలవర్ణంతో వెలిగిపోయిన కోట మరల రాక్షసులతో మేఘవర్ణంగా మారింది.

రామలక్ష్మణులు యుద్ధానికి నాంది పలికారు. వానరవీరులు గుమికూడి కోటగోడ లెగబ్రాక నారంభించారు. రాక్షస కపివీరులకు బాహాబాహి యుద్ధం సాగింది. రావణుడు- పర్వతుడు, ప్రఘసుడు, ఖరుడు, క్రోధవశుడు, ప్రరుజుడు అనే

అయిదుగురు సేనాపతులను రాక్షసపిశాచ సేనలతో యుద్ధానికి పంపాడు. వారు అదృశ్యాకారులై విజృంభించి వానరసేనను నొప్పించారు. వారిని విభీషణుడు స్వయంగా ఢీకొని సేనాపతులను చంపి, రాక్షససైన్యంలో సగభాగాన్ని అంతమొందించాడు. మిగిలిన సగం సైన్యం లంకలోకి పరుగెత్తిపోయింది.

రావణుడు క్రుద్ధుడై మంత్రులతో కలిసి యుద్ధరంగానికి వచ్చాడు. రాముడు రావణుడితో, లక్ష్మణుడు ఇంద్రజిత్తుతో, సుగ్రీవుడు విరూపాక్షుడితో, తారుడు నిఖర్వటుడితో ఎదుర్కొని వీరోచిత యుద్ధం చేశారు. రాముని పరాక్రమం అవక్రమని తెలిసి రావణుడు లంకకు తిరిగి వెళ్ళాడు. అతడి వెంట అతడి కొడుకులు, మంత్రులు కూడా వెళ్ళారు. అప్పుడు రావణుడి సేనాని ప్రహస్తుడు ప్రతాపంతో కపిసేనను ఎదుర్కొన్నాడు. విభీషణుడికీ ప్రహస్తుడికీ భీకరయుద్ధం సాగింది. విభీషణుడు ప్రయోగించిన శక్తితో ప్రహస్తుడు నేలకూలాడు. వెంటనే ధూమ్రాక్షుడు ప్రచండంగా పూనుకొని కపిసేనను నుగ్గు చేయనారంభించాడు. అతడిని హనుమంతుడు అనంతబలంతో ఢీకొన్నాడు. ఇంద్రుడికీ వృత్రాసురుడికీ జరిగిన యుద్ధాన్ని తలపించేటట్లు వారిద్దరూ వివిధాయుధాలతో భయంకరమైన యుద్ధం చేశారు. చివరకు హనుమంతుడు ఒక మహావృక్షంతో కొట్టిన దెబ్బలకు ధూమ్రాక్షుడు నెత్తురుకక్కి చచ్చాడు.

రావణుడు విషణ్ణుడై మరొకమార్గం లేక గాఢనిద్రలో ఉన్న కుంభకర్ణుడిని లేపి కపిసేన మీదకు పంపాడు. కుంభకర్ణుడు కపివీరులను లెక్కచేయక సరాసరి శ్రీరాముడిమీదకే నడిచాడు. అడ్డం వచ్చి యుద్ధం చేస్తున్న కపివీరులను వేలమందిని పొట్టనబెట్టుకొన్నాడు. సుగ్రీవుడు కోపించి అతడిమీద లంఘించాడు. ఆ రాక్షసుడు కపివీరుడిని పట్టాడు. దానిని చూచి లక్ష్మణుడు కుంభకర్ణుడి మీద పిడుగువంటి బాణాన్ని వేశాడు. ఆ రాక్షసుడు ఆ దెబ్బకు నొచ్చుకొని సుగ్రీవుడిని వదలి, కోపించి లక్ష్మణుడితో పోరుకు సిద్ధమయ్యాడు. సౌమిత్రి అతడి బాహువులు త్రుంచాడు. కాని, వెంటనే ద్విగుణీకృతంగా బాహువులు మొలవటం గమనించాడు. కోపించి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అది కుంభకర్ణుడిని నిలువునా కూల్చింది.

తమ్ముడి చావుకు రావణుడు విచారించాడు. అప్పుడు అతడి పెద్దకొడుకు మేఘనాదుడు తండ్రి అనుమతితో మాయాయుద్ధ పాండిత్యాన్ని ప్రదర్శించి వానరవీరులను గగ్గోలు పరిచాడు. లక్ష్మణుడికీ, మేఘనాదుడికీ మధ్య భీకరాస్త్ర ద్వంద్వ యుద్ధం సాగింది. అంతలో అంగదుడు పూనుకొని ఒకమద్దిచెట్టుతో ఆ రాక్షసుడి రథాన్ని ధ్వంసం చేశాడు. మేఘనాదుడు అదృశ్యుడై ఆకాశంలో విహరిస్తూ మాయాయుద్ధం చేయటం మొదలుపెట్టాడు. రామలక్ష్మణులు శబ్దభేది దివ్యాస్త్రాలు ప్రయోగించారు. సుగ్రీవాదులు వృక్షాలు తీసికొని ఆకసానికి ఎగసి యుద్ధం చేశారు. ఇంద్రజిత్తు సుగ్రీవాదుల ప్రయత్నాలను వమ్ముచేసి రామలక్ష్మణులను అస్త్రాలతో బంధించి గాయపరచి మూర్ఛపడేటట్లు వేశాడు. విభీషణుడు బ్రహ్మాస్త్ర ప్రయోగం చేసి వారిని బంధ విముక్తులను చేశాడు. సుగ్రీవుడు విశల్యకరణి అనే ఔషధంతో వారి విరిగిన ఎముకలను, కలిగిన గాయాలను మానేటట్లు చేశాడు. రామలక్ష్మణులు మరల యుద్ధం ప్రారంభించారు. శ్వేతుడైన గుహ్యుడు పంపిన దివ్యజలాలను విభీషణుడు రామలక్ష్మణులకు అందించాడు. ఆ జలంతో కన్నులు కడుక్కోగానే అదృశ్య వస్తువులన్నీ కంటికి స్పష్టంగా గోచరించాయి. అన్నదమ్ము లామేఘనాదుని నొప్పించారు. అతడు ఆశ్చర్యపోయి హోమం చేయటానికి పూనుకొన్నాడు. అతడు హోమాన్ని పూర్తిచేస్తే అజేయుడౌతాడు. అందువలన విభీషణుడు లక్ష్మణుడిని అతని పైకి పురికొలిపి వధించుమని ప్రేరేపించాడు. లక్ష్మణు డతనిపై విజృంభించాడు. ఇరువురి మధ్య ఘోరయుద్ధం జరిగింది. చివరకు లక్ష్మణుడి నిశిత బాణాలకు ఇంద్రజిత్తు భుజాలనూ, శూలానికి తలనూ కోల్పోయి చెట్టువలె నేలపై కూలి మరణించాడు.

పుత్రశోకాన్ని భరించలేక రావణుడు క్రుద్ధుడై అశోకవనానికి వెళ్ళి కత్తితో సీతను చంపటానికి పూనుకొన్నాడు. అప్పుడు అవింధ్యుడనే వృద్ధుడు స్త్రీవధ వీరోచిత కార్యం కాదని హితవు చెప్పి ఆ పని మాన్పించాడు. రావణుడు పౌరుషంతో కపిసేన మీద దండెత్తాడు. మాయాయుద్ధంలో తనదేహం నుండి అనేకమంది వీరులను సృష్టించి కపిసేనను సంక్షోభ పరిచాడు. రామలక్ష్మణులు వారినందరినీ సంహరించారు. రావణుడు మాయాయుద్ధాన్ని ప్రచండంగా సాగించాడు. ఇంద్రుడు మాతలితో తన రథాన్ని రాముడికి పంపాడు. రథారూఢుడైన రాముడు రావణుడిపై శస్త్రాస్త్రాలను నిరాఘాటంగా ప్రయోగించాడు. చివరకు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి దశకంఠుడిని తుదముట్టించాడు. ఇంద్రాది దేవతలు శ్రీరాముడిని కీర్తించి పూలవాన కురిపించారు. శ్రీరాముడు విభీషణుడికి లంకారాజ్య పట్టాభిషేకం చేశాడు.

విభీషణుడు అవింధ్యుడితో కలిసి సీతను సగౌరవంగాతెచ్చి శ్రీరాముడి కర్పించారు. దుష్టాచారుడైన రావణుడు తన యింట నుంచుకొన్న సీతను తాను గ్రహిస్తే లోకనింద వస్తుందని శ్రీరాముడు సీతను పరిగ్రహించనన్నాడు. శత్రువుపై ప్రతీకారంగానే యుద్ధం చేసి విజయం సాధించా నన్నారు. సీత అతడి మాటలకు మూర్ఛపోయి, కొంతసేపటికి తేరుకొని, తన సచ్చరిత్రం తేటపడేటట్లు అగ్నిప్రవేశం చేయటానికి సిద్ధమైంది. అప్పుడు పంచభూతాలు అందరూ వినేటట్లుగా సీతా శీలపావిత్ర్యాన్ని పతివ్రతామహత్వాన్ని చాటిచెప్పాయి. ఆ తరువాత బ్రహ్మదేవుడు దేవగణాలతో ప్రత్యక్షమై సీతాదేవి పవిత్రచరిత్రాన్ని కీర్తించాడు. శ్రీరాముడు సీతను పరిగ్రహించి, సర్వసేనాసమేతుడై పుష్పకమెక్కి అయోధ్య చేరి, భరతాదులను కూడి, పట్టాభిషిక్తుడై అనేకయాగాలు చేసి, అనేక వేలేండ్లు భూమిని ధర్మమయంగా పాలించాడు.

శ్రీరాముడు వనవాసక్లేశాలను అనుభవించి, శత్రువులు చేసిన అపకారం వలన కలిగిన దురవస్థలకు ఓర్చి, శుభాలను పొందినట్లే, ధర్మరాజుకూడా వనవాస దుఃఖానంతరం సర్వసామ్రాజ్యసౌఖ్యాన్ని పొందగలడని మార్కండేయమహర్షి చెప్పాడు. ధర్మజుడు రాముడి పరాక్రమాన్ని జానకి పాతివ్రత్య మహిమనూ తెలిసికొని ఆశ్చర్యపోయాడు.

సావిత్రికథ

పతిభక్తితో సమస్త దుఃఖాలను సహించి శుభాలు పొందిన పుణ్యవతి చరిత్రం వినాలని ఉన్నదని ధర్మరాజు అడుగగా మార్కండేయమహర్షి సావిత్రికథను చెప్పాడు.

అశ్వపతి మద్రదేశానికి అధిపతి. సంతానం కొరకు అతడు పదునెనిమిదేళ్ళు సావిత్రీదేవిని గురించి తపస్సు చేశాడు. ఆ దేవి ప్రత్యక్షం కాగా పుత్రుడిని వరంగా కోరుకొన్నాడు. ఆమె పుత్రిక కలుగుతుందని అనుగ్రహించింది. ఆమె కారణంగా అశ్వపతికి నూరుగురు పుత్రులు పుట్టుతారని చెప్పి దేవి అంతర్ధానం చెందింది. ఆ రాజుకు మాళవి అనే భార్యయందు సావిత్రి అనే పుత్రిక జన్మించి, శుక్లపక్షచంద్రబింబం వలె పెరిగి యౌవనవతి అయింది. ఆమె సౌందర్యం దేవతాస్త్రీలకంటె మిన్నగా ఉండేది. సాళ్వదేశాధిపతి అయిన ద్యుమత్సేనుడి కొడుకు సత్యవంతుడు తనకు తగిన గుణవయోరూప వైభవాలు కలవాడుగా తెలిసికొని, సావిత్రి మనసులో అతడినే భర్తగా నిశ్చయించుకొని, సహజమైన సిగ్గుతో ఎవరికీ చెప్పకుండా ఉండింది.

ఒకనాడు నారదుడు అశ్వపతి వద్దకు వచ్చాడు. తండ్రివద్దనున్న సావిత్రిని చూచి త్వరలో వివాహం చేయుమని సలహా చెప్పాడు. సావిత్రి తాను సత్యవంతుడినే వివాహమాడుతానని తండ్రికి తెలిపింది. ద్యుమత్సేనుడు రాజ్యాన్ని కోల్పోయి, చూపును కోల్పోయి అడవులలో నివసిస్తున్నా అతడి కొడుకైన సత్యవంతుడినే ఆమె ఎన్నుకొన్నది. అశ్వపతి ఆ సత్యవంతుడి గుణశీలాదులను గురించి సర్వజ్ఞుడైన నారదుడిని అడిగాడు. ఆ మహర్షి ఇట్లా చెప్పాడు: 'ఎల్లప్పుడూ సత్యం పలకటం చేత సత్యవంతుడని సార్థక నాముడయ్యాడు. అతడికి చిత్రాశ్వుడనే రెండోపేరు ఉన్నది. తేజస్సులో సూర్యుడిని, బుద్ధిలో బృహస్పతిని, పరాక్రమంలో ఇంద్రుడిని, ఓర్పులో భూమిని, కాంతిలో చంద్రుడిని, అందంలో అశ్వినిదేవతలను పోలి ఉంటాడు. తపస్సు, శమం, దమం, దానం, బ్రాహ్మణభక్తి అధికంగా ఉన్నవాడు. అంతటివాడిలో ఒకదోషం కూడా ఉన్నది. ఈనాడు మొదలుకొని ఒక సంవత్సరానికి చనిపోతాడు. ఇది చెప్పవలసినమాట కాబట్టి చెప్పుతున్నా' నని నారదుడు పలికాడు. అశ్వపతి ఆ అల్పాయుష్కుడైన వరుడిని వీడి మరొక వరుడిని కోరుకొమ్మని సావిత్రిని అడిగాడు.

ఆమె తన నిర్ణయాన్ని ఇట్లా చెప్పింది- 'మనోవాక్కాయకర్మలలో మనస్సు ముఖ్యమైనది. అట్టి మనస్సుతో ప్రేమించిన భర్తను మానటం ధర్మమా? సత్యవంతు డెటువంటి వాడైనా కానీ, నేను అతడిని తప్ప మరొకరిని కోరను.' ఆమె మాటలు విని అశ్వపతి ఏమీ అనలేక నారదుడివైపు దీనంగా చూచాడు. ఆ మహర్షి ఇట్లా అన్నాడు.

'నీ కూతురు సుగుణాల కుప్ప. ఆమె మనసు మార్చటం మనకు శక్యం కాదు. ఇంక అనుమానం ఎందుకు? ఆ వరుడికిచ్చి వెంటనే వివాహం చేయుము. ఆమె చేసిన పుణ్యమహిమవలననైనా ఆమె భర్త పరిపూర్ణచిరాయువు పొందగలడు'. నారదుడి మాటలు అశ్వపతి శిరసావహించి సావిత్రి వివాహానికి నిశ్చయించాడు. ఆ దేవర్షి దేవలోకానికి వెళ్ళాడు.

ఒక మంచిరోజున అశ్వపతి తన కుమార్తెను సర్వవివాహ సంభారాలతో సహా తీసికొని ద్యుమత్సేనుడి వద్దకు వెళ్ళి, సావిత్రిని సత్యవంతుడి కిచ్చి పెండ్లి చేయటానికి వచ్చినట్లు తెలిపి, ఆమెను కోడలిగా స్వీకరించుమని అతడిని కోరాడు. 'రాజ్యాన్ని కోల్పోయి అడవులలో కష్టాలు పడుతున్న తమతో ఆ సుకుమారి ఉండి ఓర్చుకొనగలదా?' అని ద్యుమత్సేను డడిగాడు. అతడితో అశ్వపతి ఇట్లా అన్నాడు. 'కలిమిలేములు కలకాలం ఉండేవి కావు. కలిమికి పొంగటం, లేమికి క్రుంగటం ధీరుల స్వభావం కాదు. ఆ సంగతి నాకు తెలుసు. మా అమ్మాయి కూడా వయసుకు చిన్నదైనా, తెలివితేటలలో ధీమంతురాలు. మా కూతురిని గురించి నే నింతకంటె ఎక్కువ చెప్పటం న్యాయంకాదు. నీతో వియ్యమందుదామని మనసుపడి వచ్చాను. నా ప్రార్థన మన్నించకుండా ఉండటం మీకు న్యాయం కాదు' అని వేడుకొన్నాడు. ద్యుమత్సేను డంగీకరించాడు. ఆశ్రమవాసులైన ముని గణాల సమక్షంలో సావిత్రీ సత్యవంతుల వివాహం శాస్త్రోక్తంగా జరిగింది. అశ్వపతి అల్లుడికీ, కూతురికీ కానుక లిచ్చి తన రాజధానికి తిరిగి వెళ్ళాడు.

సావిత్రి రాణివాసపు అలంకారాలను తీసివేసి, నారచీరలు కట్టి, భక్తితో భర్తకు సేవలు చేసింది. అత్తమామలను కథలతో, మాటలతో, సేవలతో సంతోషపెట్టింది. క్రమంగా కాలం గడిచింది. సంవత్సరం ముగియటానికి నాలుగు రోజులు తక్కువగా ఉన్నది. నారదుడు పేర్కొన్నట్లు నాల్గవ రోజు తన భర్త చనిపోతాడని తెలిసిన సావిత్రి త్రిరాత్రోపవాసవ్రతం చేపట్టింది. అత్తమామలు వారించగా, కష్టమైన ఆ వ్రతాన్ని పరమశుభాలు కోరి ప్రారంభించాననీ, కారణం కాలాంతరంలో తెలియవస్తుందనీ సావిత్రి వారికి నచ్చజెప్పింది.

నాల్గవరోజు తెల్లవారుజాముననే సావిత్రి నిద్రలేచింది. భర్త మరణించే దినమని మనసులో సంతాపం చెందింది. వ్రతవిధులాచరించింది. అత్తమామలకూ, ఆశ్రమ విప్రులకూ నమస్కరించి సుమంగళిగా భర్తృవాల్లభ్యాన్ని పొందేటట్లు నిండుదీవెన లందుకొన్నది. త్రిరాత్రులు ముగిసాయి కాబట్టి, ఆనాడు పారణచేయుమని అత్తమామలు కోరినా ఆనాడు ప్రొద్దుకుంకేవరకు ఉపవాసవ్రత దీక్ష పట్టానని చెప్పి వారిని ఒప్పించింది. సమిధలు, దర్భలు, ఫలాలు తేవటానికి సత్యవంతుడు అడవికి బయలుదేరాడు. అతడివెంట తానూ వెళ్ళటానికి సావిత్రి సిద్ధమయింది. సత్యవంతుడూ, అత్తమామలూ వద్దన్నా తన కోర్కెను మన్నించండని వారిని ప్రార్థించింది. ఎన్నడూ, ఏమీ కోరని సావిత్రి కోరికను వారు కాదనలేకపోయారు. సత్యవంతుడు తన వెంటవచ్చిన సావిత్రికి అడవిలోని ఎన్నో ప్రకృతి రమణీయ దృశ్యాలను చూపాడు. ఆ తరువాత ఎన్నో ఫలాలు కోసి బుట్టనింపాడు. ఆ తరువాత ఒక చెట్టెక్కి గొడ్డలితో కట్టెలకై కొమ్మలను నరుకుతున్నాడు. ఉన్నట్లుండి ఆయాసపడుతూ గొడ్డలి క్రింద పారవేసి క్రిందకు దిగాడు. అతడి మొగం వెలవెలపోయింది. శరీరం వశం తప్పింది, మనస్సు భ్రమచెంది తూలింది. తల శూలాలతో పొడుస్తున్నట్లు నొప్పిపుట్టింది. నేలమీద నిలవలేకపోయాడు- కొంతసేపు విశ్రాంతి తీసికొందామని సావిత్రి తొడపై తలనుంచి పవళించాడు. క్రమంగా అతడు సోలిపోయాడు. నిశ్చేతనుడయ్యాడు.

అప్పుడు సావిత్రి యెదుట నీలమేఘంవలె నల్లనైనవాడు, పెద్దకోరలతో, ఎర్రనిచూపులతో, బంగారుబట్టలతో, భయంకరాకారంతో ప్రళయాగ్నివలె ప్రజ్వలిస్తూ, పాశధరుడై ఒక దివ్యపురుషుడు నిలిచాడు. మెల్లగా అతడు సత్యవంతుడిని సమీపించాడు. సావిత్రి భయపడి, పతిశరీరాన్ని ప్రక్కన ఉంచి ఆ దివ్యపురుషుడితో ఇట్లా మాట్లాడింది.

సావిత్రి : అయ్యా! మీ రెవరు? ఇక్కడికి ఏం చెయ్యాలని వచ్చారు?

యముడు : అమ్మా! నేను కాలుడను. పాతివ్రత్య మహిమవలన నీవు నన్ను చూడగలిగావు కాని, నేను ఇతరులకు కానరాను. నీ భర్త పరమ పుణ్యాత్ముడు కాబట్టి నేనే స్వయంగా వచ్చాను. అతడి అంత్యకాలం వచ్చింది. నేనే ఇతడి ప్రాణాలను తీసికొని పోతాను. (అని ప్రకాశిస్తున్న సత్యవంతుడి జీవుడిని (ప్రాణాలను) దేహం నుండి బయటికి లాగి భయంకర పాశంతో గట్టిగా బిగించి, దక్షిణదిశగా ఘోరమైన మార్గంలో పయనం సాగించాడు).

సావిత్రి : (తన భర్త దేహాన్ని రహస్యస్థలంలో దాచి యముని వెంట బయలుదేరింది)

యముడు : (ఆమెను చూచి దయతో) నీవు కోమలాంగివి. ఎందుకు వస్తున్నావు? వద్దు ఈ బాట ఇకమీద నీవు నడవటానికి శక్యం కానిది.

సావిత్రి : పతులెక్కడికి పోతే సతులుకూడా అక్కడికి పోవాలి కదా! మహానుభావా! నీ దయవలన, నా పతిభక్తి వలన నేను ప్రవేశించలేని చోట్లున్నాయా? అన్ని మార్గాలలోనూ ధర్మమార్గం ప్రధానం. అటువంటి ధర్మానికి సజ్జనులే ఆధారమని పెద్దలంటారు. సజ్జనులలో ఉత్తముడవు నీవు. నీ దర్శనం వలన పరమశుభాలను పొందకుండా నేను వట్టి మనుషులవలె ఊరకే ఎట్లా తిరిగిపోతాను? (అని ప్రగల్భంగా మాట్లాడింది).

యముడు : ఓ కోమలాంగీ! నీ ఉదార వాక్యవిన్యాసానికి నేను మెచ్చుకొంటున్నాను. నాకు మనసు ప్రసన్నమయింది. నీ భర్త జీవితం తప్ప ఏదైనా వరం కోరుకో ఇస్తాను.

సావిత్రి : ప్రభూ! సాళ్వభూపతి రాజ్యాన్ని కోల్పోయి అడవులలో ఇడుమలు పడుతూ జీవిస్తున్నాడు. ఆయనకు కనుచూపు వచ్చేటట్లు కరుణించుము.

యముడు : తథాస్తు! నీవింక రావద్దు. తిరిగి వెళ్ళుము. (వేగంగా పోసాగాడు)

సావిత్రి : (కొంతదూరం వెళ్ళి) దేవా! ఉత్తములైనవారు త్రికరణశుద్ధిగా ఎప్పుడూ ఎవ్వరికీ ఎగ్గుచేయరు. దీనులైన వారిని దయతో కాపాడాలని చూస్తారు. ఇవ్వదలచుకొంటే ఎదుటివారి కోర్కెలన్నీ తీరేటట్లుగా నిండుగా దండిగా ఇస్తారు. ఆశ్రయించిన వారి మనస్సులకు అధికమైన ఆనందాన్ని కలిగిస్తారు. నీకు తెలియని ధర్మం ఏముంది? ధర్మగతులన్నీ నీ అధీనాలే. అందువలననే నీవు ధర్మదేవతగా వెలిశావు. సమస్త జీవులకూ వారివారి కర్మఫలాలను సమబుద్ధితో సమకూరుస్తావు కాబట్టి నీవు సమవర్తివని జగత్ప్రసిద్ధి పొందావు. సర్వభూతాలనూ నీవు యమిస్తావు (నియమిస్తావు) కాబట్టి నిన్ను యముడని పిలుస్తారు. పాపాలను శమింపజేస్తావు కాబట్టి నీవు శమనుడవైనావు.

యముడు : సావిత్రీ! దప్పిక గొన్నవారికి చల్లని నీరిస్తే ఎట్లా సంతోషం కలుగుతుందో అట్లా నిష్కల్మషమైన నీ సమంజస వాక్యాలు నన్ను సంతోషపెట్టాయి. కాబట్టి, సత్యవంతుడి ప్రాణాలు తప్ప ఏ కోరికనైనా అడుగుము. దాన్ని సఫలం చేస్తాను.

సావిత్రి : దేవా! ద్యుమత్సేనుడు శత్రువుల వలన కోల్పోయిన రాజ్యాన్ని తిరిగిపొందేటట్లు వరమిచ్చి నన్ను అనుగ్రహించుము.

యముడు : అట్లే అగుగాక! ఇక నీవు రావద్దు. ఆగిపో, నీ భక్తి నీమగడికి చెందింది. ఇది దుర్గమమైన త్రోవ. నీ వడిగినవన్నీ ఇచ్చాను. ఇక రావటానికి అనుజ్ఞ లేదు.

సావిత్రి : ప్రథమ ధర్మాధ్యక్షా! ధర్మాత్ములు తాము చేసే ధర్మాచరణలను ఎన్నడూ ఎటువంటి పరిస్థితులలోనూ తప్పరు. ధార్మికులు మోహాన్నీ, తాపాన్నీ పొందరు. కాబట్టి, భర్తను అనుసరించటాన్ని సతి ఏవిధంగానూ విడవటం ధర్మంకాదు. సమాహితంతో మనసును నిలిపి మోహావేశం పొందకుండా ధర్మస్థితిలో ఉండేటట్లు చేయటం దోషంకాదు కదా!

యముడు : నీవు ధర్మవిశేషాలు బాగా తెలిసినదానవు కాబట్టి, నీ భర్త బ్రతుకుతప్ప ఏదైనా వరం కోరుకొమ్ము.

సావిత్రి : దేవా! మా తండ్రి మద్రేశ్వరుడు. మగసంతానం లేనివాడు. ఆయనకు నూరుగురు కొడుకులు కలిగేటట్లు వరాన్ని ప్రసాదించుము.

యముడు : నీ వడిగిన వరాన్ని ఇచ్చాను. ఇవ్వేళ నీవు చాలాదూరం వచ్చి అలసిపోయావు. ఇక తిరిగిపోవటం మంచిది.

సావిత్రి : నాకు దప్పిక లేదు. నా పతి చరణాలయందు భక్తితో ఆసక్తమై ఉన్న నా మనసు అలసిపోలేదు. భర్తను ఆశ్రయించి ఉండటం తప్ప, భార్యలకు మరొకధర్మం లేదుకదా! ఆత్మధర్మంతో కూడుకొన్న పుణ్యాత్ములు దొరకటం దుర్లభం. వారు పుణ్యతీర్థాలవలె పవిత్రమూర్తులు. వారిని దర్శిస్తే సమస్త పాపాలు శాంతిస్తాయి. వాళ్ళ వలననే కదా సూర్యచంద్రులు గతులు తప్పకుండా తిరుగుతున్నారు. సముద్రాలు పొంగకుండా ఉన్నాయి. ఈ భూమి నిబ్బరంగా నిలిచి ఉంది. మరొకమాట! ఏడుమాట లాడితే ఎటువంటి వారైనా మంచివారికి బంధువు లౌతారని లోకంలో ప్రసిద్ధి ఉంది. మరి మీతో చాలా సేపటి నుండి ఇన్ని మాటలు మాట్లాడటం వలన మీకు నేనే బంధువునని వేరే చెప్పాలా? కాబట్టి మిత్రుల, బంధువుల మనసులోని కోర్కెలను తీర్చటం మీవంటి మహానుభావులకు అవశ్యకర్తవ్యం.

యముడు : నీకు ప్రసన్నుడయ్యాను. నీ మనసులో ఉన్న కోరిక నొకదానిని వరంగా కోరుకొమ్ము ఇస్తాను.

సావిత్రి : ధర్మమూర్తీ! ఇంతకుముందు సత్యవంతుడి జీవితం తప్ప ఏదైనా కోరుకొనుమని అడుగుతూ ఉండేవాడివి. ఇప్పుడామాట లేదు. కాబట్టి సంతోషంతో అడుగుతాను. సతికి వైధవ్యం భరించరానిది. భర్త లేని వనిత శుభకార్యాలన్నింటిలోనూ దూరంగా ఉంచబడుతుంది. నా సతీధర్మం సురక్షితంగా నిలిచేటట్లు సుగుణాలశాలి అయిన నా భర్తను నాకు అనుగ్రహించి పుణ్యాత్ముడ వనిపించుకొమ్ము!

యముడు : (అంగీకారంతో సత్యవంతుడిని పాశవిముక్తుడిని చేసి) ఓ కోమలీ! ఇడుగో నీ మనోనాథుడు. తీసికొనుము.ఇత డిక మీద నాలుగు శతాబ్దాలు జీవిస్తాడు. నూరుగురు కొడుకులను క్రమంగా కంటాడు. అనేక యజ్ఞాలు చేసి, అమరులను సంతోషపెట్టి కీర్తిమంతుడౌతాడు. అతడి వంశానికే వన్నెతెస్తాడు. (అని చెప్పి అదృశ్యుడయ్యాడు).

సావిత్రి తిరిగివచ్చి, పతి శిరస్సును తన తొడపై ఉంచుకొని కూర్చున్నది. కొంతసేపటికి సత్యవంతుడు చైతన్యవంతుడయ్యాడు. చాలాసేపు నిద్రపోయినట్లు, కలలో ఒక బలవంతుడు తనను బలవంతంగా లాగినట్లు, అది కలగా కాక నిజమైనట్లు భయంపుడుతున్నట్లు, పేర్కొంటూ ఆ బలవంతు డెవరో చెప్పుమని సత్యవంతుడు సావిత్రిని అడిగాడు. ఆమె ఆ సంగతంతా రేపు చెప్పుతానని పలికి, చీకటిపడుతున్నది కాబట్టి, త్వరగా ఆశ్రమానికి వెళ్ళాలని హెచ్చరించింది. అతడు చాలా నీరసించి ఉన్నాడు. అంతప్రొద్దుపోయే దాకా తల్లిదండ్రులకు దూరంగా ఉన్నందుకు వారెంత విచారిస్తున్నారో అని ఆవేదనపడ్డాడు. సావిత్రి అతడిని ఓదారుస్తూ, బరువుగా ఉన్న పండ్లబుట్టను చెట్టుకు తగిలించి, గొడ్డలి నిపుణంగా చేతపట్టుకుని, భర్తను తన చేతులతో పొదివిపట్టి, అడుగులలో అడుగులు వేయించుకొంటూ మెల్లగా, మాటలతో మనసు నుల్లాస పరుస్తూ సావిత్రి సత్యవంతుడిని ఆశ్రమానికి తీసికొనిపోసాగింది.

యము డిచ్చిన వరంవలన ద్యుమత్సేనుడికి చూపు వచ్చింది. కన్నులువచ్చినా ఆత్మకు కన్నులవంటి కొడుకును కాంచలేక కన్నులు లేనివాడి వలెనే ఆ రాజు సతీసమేతంగా దుఃఖించాడు. ఆశ్రమవాసులు ఆ రాజుకు దృష్టివచ్చినందుకు ఆశ్చర్యపడ్డారు. కొడుకు త్వరలో తిరిగివస్తాడని ఆ రాజదంపతులకు ధైర్యం చెప్పసాగారు. అంతలో సావిత్రీ సమేతుడై సత్యవంతుడు వచ్చాడు. తల్లిదండ్రు లా కొడుకును కౌగిలించుకొని, వారి రాకలోని ఆలస్యానికి కారణాన్ని అడిగారు. సావిత్రి జరిగిన కథంతా చెప్పింది. ద్యుమత్సేన వంశాన్ని ఆపత్సముద్రంనుండి రక్షించిన నావగా ఆమెను అందరూ కీర్తించారు. ఆ తరువాత ద్యుమత్సేనుడికి రాజ్యం దక్కింది. సత్యవంతుడు యువరాజయ్యాడు. ఆ విధంగా సావిత్రి తన భర్తను, అత్తమామలను, తల్లిదండ్రులను, వంశాన్ని ఉద్ధరించింది. సావిత్రి వంటిదే ద్రౌపది. పరమపతివ్రత. ధర్మాత్మురాలు, ఉభయవంశాలను ఉద్ధరించే పుణ్యాత్మురాలు- అని మార్కండేయమహర్షి చెప్పాడు. అనంతరం తిరిగి తన ఆశ్రమానికి వెళ్ళాడు.

కర్ణుడి దానవీరం

పాండవ వనవాసంలో పన్నెండవ యేడు గడుస్తున్నది. కర్ణుడి సహజ కవచకుండలాలను బ్రాహ్మణరూపంలో దానంగా గ్రహించి, రాబోయే మహాయుద్ధంలో అర్జునుడికి మేలు చేయాలని ఇంద్రుడు సంకల్పించాడు. ఆ తలపు తెలిసికొని సూర్యుడు ముందుగానే కర్ణుడి దగ్గరకు బ్రాహ్మణవేషంలో వచ్చి, అతడికి ఇంద్రుడి వ్యూహాన్ని గురించి వివరించి చెప్పాడు. అప్పుడు కర్ణుడు తన జన్మవ్రతమైన దానవ్రతాన్ని ప్రాణంపోయినా విడనాడనని పలుకుతాడు. 'శతక్రతుడు, జితదైత్యుడు, స్వర్గాధిపతి, దేవతల సార్వభౌముడు అయిన ఆ దేవేంద్రుడే పాండవపక్షపాతంతో మాయాబ్రాహ్మణవేషంతో నన్ను భిక్షకోసం యాచించటానికే వస్తే అతడి కీర్తియే తరిగిపోతుంది. నా కీర్తి మూడు లోకాలు నిండి పెరిగిపోతుంది. అదే జరిగితే అంతకంటె పుణ్యం మరేముంటుంది?' అని దానవీరుడైన కర్ణుడు ప్రాణాలకంటె కీర్తి గొప్పదని చెప్పి సూర్యుడి మాటను మృదువుగా కాదన్నాడు. సూర్యుడెన్నో విధాలుగా బ్రతిమలాడి చెప్పాడు. అట్లా కర్ణుడి మీద వాత్సల్యాన్ని ప్రకటించటానికి దేవనిర్మితమైన రహస్యం ఒకటి ఉన్నదని కర్ణ జన్మవృత్తాంతాన్ని సూచించి రహస్యంగా ఉంచాడు. కాలాంతరంలో అది వెలువడుతుందని పలికాడు. కర్ణార్జునుల నడుమ పగ పెరిగి యుద్ధం వస్తే సహజ కవచకుండలధారి అయిన కర్ణుడు అర్జునుడికంటె అధికుడౌతాడు. అర్జును డాతడిని చంపలేడు. అందువలన ఇంద్రుడు కర్ణుడిని మోసం చేసి, తన కొడుకుకు మేలు చేసికొనదలచాడు. కాబట్టి కవచకుండల దానం మానుమని సూర్యుడు కర్ణుడికి హితవు చెప్పాడు. అయినా, కర్ణుడు దాని నంగీకరించలేదు. సూర్యుడు అతడిపట్ల జాలిపడ్డాడు. చివరకు ఒక ఉపాయం చెప్పాడు. ఇంద్రుడి వద్ద అమోఘమైన శక్తి అనే ఆయుధం ఉంది. అది శత్రువును సంహరించి మరల తిరిగివస్తుంది. కవచకుండలాలను దానం చేసే కర్ణుడు వాటికి ప్రతిఫలంగా ఇంద్రశక్తిని పొందవలసిందిగా సూర్యుడు సూచించి అంతర్ధానమయ్యాడు. సూర్యుడన్నంత పనీ జరిగింది. కపట బ్రాహ్మణవేషంతో వచ్చి ఇంద్రుడు కర్ణుడి కవచకుండలాలను దానంగా పొందాడు. కర్ణుడి కోరికపై ఇంద్రుడు శక్తిని అతడి కిచ్చాడు. అయితే, ప్రాణసంశయ స్థితిలో అసాధ్యుడైన మహావీరుడి మీద ఆ శక్తిని ఒక్కసారి మాత్రమే ప్రయోగించి అతడిని సంహరించటానికి వీలుంటుందనీ, ఆ ప్రయోజనం తీరిన తరువాత ఆ శక్తి ఇంద్రుడిని చేరుతుందని చెప్పి శక్తి ప్రదానం చేశాడు. కర్ణుడు శక్తిని గ్రహించి, దానిని అర్జునుడిపై ప్రయోగించి దివిజనాథుడికి తగిన బుద్ధిచెప్పాలని లోలోన భావించి సంతృప్తుడైనాడు. ఇంద్రుడి మహిమవలన కవచకుండలాలు కోల్పోయినా, కర్ణుడి శరీరం ఉదయభానుడి అరుణవర్ణంతో ప్రకాశించింది. కర్ణుడి కవచకుండలాల సంగతి తెలిసి పాండవులు సంతోషించారు. కౌరవులు చింతించారు.

ఈ సందర్భంలోనే జనమేజయుడికి వైశంపాయనుడు కర్ణజన్మవృత్తాంతాన్ని వివరించి చెప్పాడు.

యక్షప్రశ్నలు

మార్కండేయమహర్షి వలన అనేక పుణ్యకథలు విని ధర్మరాజు మరల ద్వైతవనానికి తిరిగివచ్చాడు. ఒకనాడు ఒక బ్రాహ్మణుడు తాను కోల్పోయిన అరణిని తన కిప్పించుమని ధర్మరాజును శరణు వేడాడు. మృగ మొకటి ఆ అరణిని కొమ్ముకు తగిలించుకొని పారిపోయిందనీ, అరణి లేకపోతే నిత్యానుష్ఠానం నిలిచిపోతుందనీ, దానిని త్వరగా తెచ్చి ధర్మస్థితిని కాపాడుమనీ ధర్మరాజు నా బ్రాహ్మణుడు ప్రార్థించాడు.

అరణిని తేవటానికి ధర్మరాజు తమ్ములతో కలిసి బయలుదేరాడు. మృగం వారికి చిక్కకుండా చాలాదూరం పరుగెత్తి చివరకు కనపడకుండా పోయింది. పాండవులకు దాహం వేసింది. ఒక మర్రిచెట్టు నీడన పాండవులు విశ్రాంతి తీసికొనటానికి ఆగారు. అప్పుడు వారి మధ్య ఈ క్రింది సంభాషణ జరిగింది.

నకులుడు : ఉత్తమ కులశీలాలతో, దయాగుణంతో, ధర్మాచరణ బుద్ధితో జీవిస్తున్న మనకు ఈ విధమైన అలజడి రావటానికి మూలకారణ మేమిటి?

ధర్మరాజు : సుఖదుఃఖాలకు కారణం వారు వారు చేసికొన్న పూర్వకర్మమే. మరొక కారణం ఉండటానికి వీలులేదని ప్రాజ్ఞు లంటారు.

భీముడు : ఆనాడు ప్రాతికామి పోయి పాంచాలిని నిండుకొలువులోనికి తెచ్చినప్పుడు కోపోద్రేకంతో కౌరవులందరిని మట్టుపెట్టకుండా నే నూరుకొన్నందుకు ఈ ఆపద మనకు కలిగింది.

అర్జునుడు : తమ్ముడా! ఆనాడు ఆ సభలో ఆ కర్ణుడు మదించి ఆ విధంగా పలికిన మాటలను విని కూడా కోపగించుకొనకుండా తలవంచుకొని సామాన్య జనుడివలె అడవులకు నడచిరావటంవలననే మన కీ అనంతదుఃఖాలు మీదపడ్డాయి.

సహదేవుడు : కపటద్యూతపరుడు, దుష్టుడు అయిన ఆ శకునిని పట్టి వెంటనే ప్రాణాలు తీయకపోవటం చేతనే మనం అడవులలో ఈ అగచాట్లు పడుతున్నాం.

ఆ మాటలు విన్న ధర్మరాజు నకులుడిని పిలిచి, దగ్గరలో ఏదైన నీటికొలను ఉంటే గమనించి, అక్కడినుండి నీరు తెచ్చి తమకు దప్పిక తీర్చవలసిందిగా కోరాడు. నకులుడు చెట్టెక్కి చూచి, సరోవరాన్ని గుర్తించి, అక్కడికి వెళ్ళి, నీటిని త్రాగబోగా, ఒక అశరీరభూతం అతడిని వారించింది. తటాకం తనదనీ, జలాలు త్రాగాలంటే ముందుగా తానడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలనీ హెచ్చరించింది. ఆ మాటలు లెక్కచేయక నకులుడు నీరు త్రాగి ఆ సరోవరతీరంలో నిశ్చేష్టితుడై పడిపోయాడు.

నకులుడు రావటం ఆలస్యమైనదని ధర్మరాజు సహదేవుడిని పంపాడు. అతడూ అట్లాగే వ్యవహరించి సరోవర తీరంలో పడిపోయాడు. ఆ తరువాత అర్జునుడు, ఆ తరువాత భీముడు కూడా అదేవిధంగా అయినారు. చివరకు ధర్మరాజే స్వయంగా తమ్ములను వెదకికొంటూ వచ్చి, వారి పరిస్థితిని గమనించి కొన్నిక్షణాలు విషాదంతో నిర్విణ్ణుడైపోయాడు.

క్రమంగా ధైర్యం తెచ్చుకొని పరిస్థితులను పరిశీలించాడు. ఎవరూ వచ్చిన జాడలు లేవు. యుద్ధం జరిగిన జాడలు లేవు. భీమాదుల శరీరాలపై గాయాలు కానరావు. మరెందుకు వారట్లా ఉన్నారో తెలియక మథనపడ్డాడు. కౌరవులు పన్నిన పన్నాగమే అని శంకించాడు. భీమాదుల మొగాలు వివర్ణాలు కాకపోవటం చేత, త్రాగిన నీరు విషమయం కాదని నిశ్చయించాడు. మహావైభవంతో జీవించవలసిన భీమాదు లనాథలుగా పడిఉన్నందుకు విచారించాడు. వారందరూ మృతిపొందితే తాను హస్తినాపురి కేగి తల్లికీ బంధువులకూ ఏమని సమాధానం చెప్పేదని బిగ్గరగా శోకించాడు. అతడు దప్పికకు ఆగలేకపోయాడు. కొలనులో దిగాడు. అశరీరభూతం అతడిని వారించింది.

'ఓ ధర్మరాజా! నే నొక కొంగను. ఈ జలాశయం నా సొత్తు. నీ తమ్ములు నా మాట మన్నించక నీరుగ్రోలి ప్రాణాలు కోల్పోయారు. నీవూ అట్లాగే చేస్తే నీపనీ అంతే ఔతుంది. నే నడిగిన ప్రశ్నలకు తగిన సమాధానాలు చెప్పి నీరు త్రాగితే నీకు మేలౌతుంది' అని హెచ్చరించింది. ధర్మరాజు ఆలోచిస్తూ ఇట్లా పలికాడు. 'అయ్యా! నీవు బకరూపంలో ఉన్న రుద్రుడవా? అగ్నివా? వాయువువా? లేకపోతే కులపర్వతాలవంటి నా తమ్ములను పడద్రోచే బలం ఒక పక్షికి కలుగుతుందా? దేవాసురగంధర్వయక్షాదులకు కూడా దుర్జయులైన ఈ వీరులను ఈ విధంగా చేసి, కానివాడవుగా ఉన్న నిన్ను భావిస్తే నాకు అద్భుత భయకౌతుకాలు ఏర్పడుతున్నాయి. ఇంతకు నీ వెవ్వరవు? నీ ఉద్దేశ మేమిటి? నాకు తెలిపి నా హృదయవేదనను మాన్పు' మని వేడుకొన్నాడు.

అప్పుడు తాటిచెట్టంత పొడవున భయంకరాకారంతో ఒక యక్షుడు ఆ సరోవర తీరంలో నిలబడి అతడి అనుమతి లేకుండ ఆ నీరు త్రాగితే ఎంతటి వారైనా చనిపోతారనీ, ధర్మరాజు విచారశీలుడు కాబట్టి ఆలోచించ గలిగాడనీ, తన ప్రశ్నలకు సమాధానాలు చెప్పవలసిందనీ అడిగాడు. ధర్మజుడు వినయశీలుడై 'నానేర్చు విధంగా చెప్పుతాను. అడుగు' మన్నాడు.

యక్షుడి ప్రశ్నలు - ధర్మరాజు సమాధానాలు

01. సూర్యుడిని నడిపే శక్తి ఏది? - బ్రహ్మము.

02. సూర్యుడిని సేవిస్తూ తిరిగే దెవ్వరు? - సురకోటి.

03. సూర్యుడు దేనివలన అస్తమిస్తాడు? - ధర్మునిచేత.

04. సూర్యుడికి ఆధారమేది? - సత్యం.

05. శ్రోత్రియుడని దేనివలన పిలువబడతాడు? - శ్రుతమువలన.

06. పురుషుడు దేనివలన మహత్వాన్ని పొందగలడు? - తపస్సు చేత.

07. పురుషుడు దేనిచేత సహాయయుతు డౌతాడు? - ధృతిచేత.

08. పురుషుడు దేనిచేత బుద్ధిమంతు డౌతాడు? - బుధులను సేవించటం చేత.

09. బ్రాహ్మణుడు దేనివలన దేవభావాన్ని పొందుతాడు? - అధ్యయనం వలన.

10. అతడికి సాధుభావం ఏవిధంగా కలుగుతుంది? - అధికవ్రతశీలం వలన.

11. అతడికి అసాధుత్వం దేనివలన కలుగుతుంది? - శిష్టవృత్తిని వదలటం వలన.

12. అతడు దేనివలన మానుషు డౌతాడు? - మృత్యుభయం వలన.

13. జీవన్మృతుడు ఎటువంటి వాడు? - దేవాతిథి పితృభృత్య జనాలకు అన్నం పెట్టకుండా తానే తినేవాడు.

14. భూమికంటే గొప్పదైన దెవరు? - తల్లి.

15. ఆకాశం కంటె పొడవైన దెవరు? - తండ్రి.

16. గాలికంటె వేగం కలిగిన దేది? - మనస్సు.

17. గడ్డిపోచకంటే హీనమైన దేది? - చింత.

18. నిద్రిస్తూ కూడా కన్ను మూయని దేమిటి? - చేప.

19. పుట్టికూడా చేతనత్వం పొందని దేది? - గ్రుడ్డు.

20. రూపముండి హృదయం లేని దేది? - రాయి.

21. వేగం వలన ప్రకాశించేది ఏది? - ఏరు.

22. బాటసారికి, రోగార్తుడికి, గృహస్థుడికి, మృతుడికి మిత్రులెవరు?

-వరుసగా... సార్థము, వైద్యుడు, సద్భార్య, చేసినధర్మం.

23. ధర్మువుకు కుదురేది? - దాక్షిణ్యం.

24. కీర్తికి ఆశ్రయ మేది? - దానం.

25. స్వర్గానికి అనువైన మార్గ మేది? - సత్యం.

26. సుఖాల కన్నిటికీ ఆశ్రయ మేది? - శీలం.

27. నరుడికి ఆత్మ ఎవ్వరు? - పుత్రుడు.

28. మానవుడికి దైవికమైన చుట్ట మెవ్వరు? - భార్య.

29. మానవుడి జీవిక దేనివలన కలుగుతుంది? - పర్జన్యుడి వలన.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

30. మానవుడు దేనిని కొనియాడి అభివృద్ధి చెందుతాడు? - దానం.

31. ఉత్తమ ధర్మ మేది? - అహింస.

32. ఎప్పుడూ పండి ఉండేది ఏది? - యాగకర్మ.

33. దేనిని నిగ్రహిస్తే ప్రయోజనసిద్ధి కలుగుతుంది? - మనోऽహంకారం.

34. ఎవరితోడి చెలిమి ఎన్నటికీ చెడిపోకుండా ఉంటుంది? - సజ్జన స్నేహం.

35. లోకానికి ఎవరు దిక్కు? - సజ్జనులు.

36. దేనివలన జలమూ, అన్నమూ సంభవిస్తాయి? - ఆకాశం, భూమి, జలం.

37. విషం వంటి దేది? - విప్ర ధనం.

38. శ్రాద్ధవిధికి సమయ మేది? - బ్రాహ్మణుల రాక.

39. మానవుడు వేటిని వదలిపెట్టితే సర్వజనసమ్మతుడు, నిశ్శోకుడు, అర్ధవంతుడు, సుఖి కాగలడు? - గర్వం, క్రోధం, లోభం, తృష్ణ.

40. పురుషు డెవ్వడు? - యశస్వి

41. సర్వధని అయినవా డెవ్వడు? - సమచిత్తుడు.

ధర్మరా జిచ్చిన సముచిత సమాధానాలకు యక్షుడు సంతోషించి 'నలుగురు తమ్ములలో ఒకడిని మాత్రం బ్రతికిస్తాను. అతడి నెన్నుకో'మ్మని ధర్మరాజును అడిగాడు. ధర్మరాజు నకులుడిని బ్రతికించుమని కోరుకొన్నాడు. 'భీమార్జునులలో ఎవరైనా అయితే నీకు సహాయకులుగా అండదండలందించ గలిగిన మేటి వీరులౌతారుగాని నకులుడు ఎందుకు పనికివస్తా' డని యక్షుడు ప్రశ్నించాడు. 'కుంతీపుత్రులలో మొదటివాడిని నేనున్నాను. అట్లాగే మాద్రి పుత్రులలో నకులుడు బ్రతికి ఉండటం ధర్మ' మని ధర్మరాజన్నాడు. యక్షుడు ధర్మరాజు యొక్క ధర్మబుద్ధికి, సమచిత్తానికి సంతోషించి, చనిపోయిన భీమాదుల నందరినీ పునర్జీవితులను చేశాడు. ధర్మాత్ముడని ప్రజలచేత పొగడబడే ధర్మరాజు ధర్మహానికి ఓర్వడని నిరూపించుకొన్నాడు.అతడు అన్నివిధాలా సార్థకనామధేయుడు.

'ఓ యక్షనాయకా! నీవు యక్షమాత్రుడ వని నేననుకొనటం లేదు. ఏ ఇంద్రుడవో, కుబేరుడవో, అగ్నిదేవుడవో, వాయుదేవుడివో, కాక జగన్మాన్యుడైన నా తండ్రి ధర్మదేవతవో దయతో ఎరిగించుము' అని ధర్మరాజు ప్రార్థించాడు.

ఆ మహాత్ముడు చిరునవ్వుతో ఇట్లా అన్నాడు- 'ఓ రాజేంద్రా! నేను ధర్ముడను. సత్యం, శౌచం, దానం, తపస్సు, శమము, దాంతి, యశస్సు, జ్ఞానం అనేవి నా మూర్తులు. ఉత్తమ ధార్మికుడవు, నా కుమారుడవు అయిన నిన్ను చూడాలనే వేడుకతో వచ్చాను. నన్నాశ్రయించిన వారు దుర్గతి పొందరు. కాబట్టి నీ కిష్టమైన వరం కోరుకొమ్ము' అని అన్నాడు.

ధర్మరాజు సంభ్రమంతో భక్తిభావంతో ధర్ముడికి నమస్కరించి స్తుతించాడు. హరిణం అపహరించిన బ్రాహ్మణుడి అరణిని తిరిగి ఇప్పించి కర్మలోపం ధర్మలోపం కాకుండా కరుణించుమని అడిగాడు. ధర్మజుని ధర్మబుద్ధికి సంతోషించి ఆ మాయ నంతా తానే కల్పించానని తెలిపి, ధర్ముడు అరణిని ధర్మరాజుకు తిరిగి ఇచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'ధర్మజా! పదమూడవ యేడు వస్తూ ఉన్నది. మీరు అజ్ఞాతవాసం చేయవలసి ఉన్నది. ఆ కాలంలో మీరు ఎవ్వరు ఎక్కడ ఏ రూపంలో తిరగాలని అనుకొంటే ఆ రూపాలు మీకు ఏర్పడుతాయి. మిమ్మల్ని అజ్ఞాతవాసంలో ఎవ్వరూ పాండవులని గుర్తించకుండా ఉండేటట్లు వరమిస్తున్నాను. ఇంకేదైనా కావాలంటే అడుగుము' అని ధర్ముడు పలికాడు.

'దేవా! ధర్మదేవతవు నీవే దయతో ప్రత్యక్షమయ్యావు, ధన్యుడనైనాను. ఇంకేమి కోరేది? ఎప్పుడూ నామనస్సు ధర్మమందే స్థిరమై ఉండేటట్లు అనుగ్రహించు' మన్నాడు. ఆ దేవు డాతడికి ఆ వరం అనుగ్రహించాడు. పాండవులు తిరిగి ఆశ్రమానికి వెళ్ళారు. బ్రాహ్మణునికి అరణి నిచ్చివేశారు. బ్రాహ్మణాశీస్సులను పొందారు.

ఈ విధంగా పాండవులు అరణ్యవాసవ్రతాన్ని నియతితో పూర్తి చేశారు.

ఇంతవరకు నన్నయపేర ఎఱ్ఱన రచించిన ఆరణ్యపర్వశేషం.

ఇది ఆరణ్యపర్వ కథాసారంలో రెండవభాగం.

ఇంతటితో ఆరణ్యపర్వ కథాసారం ముగిసింది.

జి.వి. సుబ్రహ్మణ్యం

ప్రధాన సంపాదకుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతం

సంపుటము - 5

ఆరణ్యపర్వము

(శేష భాగము)

(ఆరణ్యపర్వశేషము : ఎఱ్ఱాప్రెగ్గడ విరచితము)

విషయసూచిక

చతుర్థాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
శ్రీకృష్ణుఁడు సత్యభామతోడఁ బాండవులయొద్దకు వచ్చుట	3-180-7	602
మార్కండేయుండను మహాముని పాండవులయొద్దకు వచ్చుట	3-180-39	609
మార్కండేయుఁడు ధర్మరాజునకు బ్రాహ్మణ ప్రభావంబు సెప్పుట	3-182-1	617
అత్రి గౌతముల పరస్పర సంవాదము	3-183-11	624
మార్కండేయుండు ధర్మరాజునకు వైవస్వతు వృత్తాంతంబును చెప్పుట	3-185-1	634
మార్కండేయుఁడు ధర్మరాజునకుఁ బ్రళయప్రకారంబు సెప్పుట	3-186-13	642
నారాయణుఁడు మార్కండేయునకుఁ దన ప్రభావంబు సెప్పుట	3-187-1	651
మార్కండేయుఁడు ధర్మరాజునకుఁ గలియుగ ధర్మంబులు సెప్పుట	3-188-5	660
కలియుగంబున విష్ణుండు గల్కిరూపంబున ధర్మంబు ప్రతిష్ఠించుట	3-188-89	670
మార్కండేయుండు ధర్మరాజునకు బ్రాహ్మణప్రభావంబు సెప్పుట	3-190-1	675
మార్కండేయుండు ధర్మరాజునకు నింద్రద్యుమ్నుని కథ సెప్పుట	3-191-2	693
మార్కండేయుఁడు ధర్మరాజునకుఁ గువలాశ్వచరిత్రము సెప్పుట	3-192-4	698
మార్కండేయుఁడు ధర్మరాజునకు మధుకైటభుల చరిత్రము సెప్పుట	3-194-13	708

పంచమాశ్వాసము

ధర్మరాజునకు మార్కండేయుఁడు పుత్త్రున కుండఁదగు గుణంబులం దెల్పుట	3-196-1	721
మార్కండేయుఁడు ధర్మజునకుఁ బతివ్రతామాహాత్మ్యంబు సెప్పుట	3-196-20	724

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కౌశికుం డను బ్రాహ్మణుండు ధర్మవ్యాధుని యొద్దకుఁ బోవుట	3-197-1	733
ధర్మవ్యాధుఁడు కౌశికునకు ధర్మవిశేషంబు లెఱిఁగించుట	3-198-19	738
ధర్మవ్యాధుఁడు కౌశికున కహింసాస్వరూపంబు సెప్పుట	3-199-1	745
ధర్మవ్యాధుఁడు కౌశికునకు జీవలక్షణంబులు సెప్పుట	3-200-26	752
ధర్మవ్యాధుఁడు కౌశికునకు బ్రహ్మవిద్యా ప్రపంచం బెఱింగించుట	3-201-16	757
ధర్మవ్యాధుఁడు కౌశికునకు సత్త్వరజస్తమోగుణంబుల తెఱం గెఱింగించుట	3-203-3	762
ధర్మవ్యాధుఁడు కౌశికునిఁ దన జననీజనకుల యొద్దకుఁ దోడ్కొని పోవుట	3-204-3	770
ధర్మవ్యాధుఁడు కౌశికునకుఁ దన పూర్వజన్మవృత్తాంతంబు సెప్పుట	3-205-21	777
మార్కండేయుఁడు ధర్మరాజునకు నంగిరసుం డగ్నియైన తెఱంగు సెప్పుట	3-207-5	784
ఇంద్రుఁడు కేశియను రాక్షసునిఁ బాఱఁదోలుట	3-213-10	799
అగ్నిదేవుండు మునిపత్నులం గామించుట	3-213-42	806
కుమారస్వామి యవతారము	3-211-17	810
ఇంద్రుఁడు కుమారస్వామిపై నెత్తివచ్చుట	3-216-3	816
ఈశ్వరుండు గుమారస్వామియొద్దకు వచ్చుట	3-218-25	825
కుమారస్వామి సప్తమాతృకల బాలగ్రహంబులఁ జేయుట	3-219-18	832
ఈశ్వరుండు కుమారసహితుండై భద్రవటంబు సేరుట	3-221-1	839
కుమారస్వామి మహిషాసురుం జంపుట	3-221-29	842
సత్యాద్రౌపదీ సంవాదము	3-222-1	854
ద్రౌపది సత్యభామకుఁ బతివ్రతాధర్మంబులు సెప్పుట	3-223-1	864
ధృతరాష్ట్రుండు పాండవుల వనవాసక్లేశంబునకు దుఃఖించుట	3-225-8	871
కర్ణ శకుని దుర్యోధనులు మంతనంబు సేయుట	3-226-9	879
కర్ణ సౌబలులు ధృతరాష్ట్రుచేత ఘోషయాత్ర కనుజ్ఞ గొనుట	3-227-2	885
దుర్యోధనుఁడు ఘోషయాత్రవోవుట	3-228-23	890
చిత్రసేనుండను గంధర్వరాజు దుర్యోధనునితో యుద్ధము సేయుట	3-230-21	901
భీమార్జున నకులసహదేవులు గంధర్వులతో యుద్ధంబు సేయుట	3-233-5	911
చిత్రసేనుఁడు ధర్మరాజునొద్దకు వచ్చి దుర్యోధను విడిచిపెట్టి పోవుట	3-235-11	919

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

షష్ఠాశ్వాసము

దుర్యోధనుని విషాదము	3-236-1	924
దుర్యోధనుండు ప్రాయోపవేశంబు సేయఁబూనుట	3-238-10	932
ప్రాయోపవిష్టుండైన దుర్యోధనునిఁ గృత్య పాతాళంబునకుఁ గొనిపోవుట	3-239-18	944
దుర్యోధనుఁడు ప్రాయోపవేశము మాని కరిపురంబునకుఁ బోవుట	3-240-40	952
దుర్యోధనుఁడు వైష్ణవంబను యజ్ఞంబు సేయుట	3-242-1	960
ద్వైతవనంబునందలి మృగసమూహము ధర్మజు స్వప్నంబునందు వచ్చి తమ దుఃఖంబు సెప్పుట	3-244-2	969
వ్యాసుఁడు ధర్మజునకు వ్రీహిద్రోణాఖ్యానంబు సెప్పుట	3-246-3	977
ముద్గలునకు దేవదూత పుణ్యలోకంబుతెఱంగు సెప్పుట	3-247-2	983
సైంధవుఁడు ద్రౌపదిం జూచి మోహించుట	3-248-6	990
ద్రౌపది సైంధవునితో నిష్ఠురోక్తులు పలుకుట	3-252-1	1003
సైంధవుఁడు ద్రౌపదిని బలాత్కారముగా నెత్తికొని పోవుట	3-252-23	1010
పాండవు లేవురు సైంధవుపై యుద్ధమునకుఁ బోవుట	3-253-21	1016
అర్జునుఁడు సౌవీరకుమారులం బన్నిద్దఱఁ జంపుట	3-255-27	1029
భీముఁడు సైంధవుం బట్టికొని పరిభవించుట	3-256-9	1036
ధర్మజునకు మార్కండేయుఁడు రామాయణకథ సెప్పుట	3-258-4	1044
బ్రహ్మ రావణ కుంభకర్ణ విభీషణులకు వరంబు లిచ్చుట	3-259-26	1052
దశరథుఁడు రామవిశ్లేషముచే సురలోకగతుం డగుట	3-261-29	1063
మారీచుండు మాయామృగంబై చనుదెంచుట	3-262-24	1073
రావణుఁడు సీత నెత్తికొని లంకకుఁ బోవుట	3-262-39	1081
శ్రీరాముఁడు కబంధుఁడను రాక్షసుం జంపుట	3-263-27	1089
వాలి సుగ్రీవుల యుద్ధము	3-264-27	1098
త్రిజట తన స్వప్నవృత్తాంతము సీతతోఁ జెప్పుట	3-264-53	1106

సప్తమాశ్వాసము

రాముఁడు లక్ష్మణుని సుగ్రీవునొద్దకుఁ బంపుట	3-266-4	1117
హనుమంతుఁడు రామునితో సీతం జూచిన వృత్తాంతంబు సెప్పుట	3-266-38	1124
వానరవీరులు నానాదేశంబులనుండి సుగ్రీవునొద్దకు వచ్చుట	3-267-1	1134
రాముఁడు దర్భశయనుండై సముద్రుం బ్రార్థించుట	3-267-30	1139
అంగదు రాయబారము	3-267-54	1146
ప్రహస్తధూమ్రాక్షుల యుద్ధము	3-270-1	1155
కుంభకర్ణుండు యుద్ధము సేయుట	3-271-1	1162
ఇంద్రజిత్తు లక్ష్మణునితోడ యుద్ధము సేయుట	3-272-8	1171
ఇంద్రజిత్తు లక్ష్మణునిచేతఁ జచ్చుట	3-273-22	1179
శ్రీరాముఁడు రావణాసురుని సంహరించుట	3-274-24	1186
మార్కండేయుఁడు ధర్మరాజునకు సావిత్ర్యుపాఖ్యానంబు సెప్పుట	3-277-5	1197
సావిత్రి సత్యవంతుని వివాహం బగుట	3-279-25	1207
సత్యవంతుఁడు సావిత్రీసహితుండై వనంబునకుం బోవుట	3-280-29	1213
సావిత్రి యమునివలన నభీష్టవరంబులు వడయుట	3-281-26	1220
సత్యవంతుఁడు సావిత్రితోడ మరలి తన యాశ్రమంబునకు వచ్చుట	3-281-97	1234
సూర్యుఁడు బ్రాహ్మణవేషంబునఁ గర్ణునకు హితంబు సెప్పుట	3-284-4	1241
సూర్యుఁడు గర్ణునితో నింద్రుచే శక్తిఁ గైకొను మని సెప్పుట	3-286-14	1251
కుంతి దుర్వాసునకుఁ బరిచర్య సేయుట	3-288-12	1257
కుంతి సూర్యునివరంబున గర్భంబు దాల్చి కర్ణుం గాంచుట	3-292-1	1266
ధర్మరాజు బ్రాహ్మణుని యరణిఁ దెచ్చుటకుఁ బోవుట	3-295-7	1283
నకులాదులు యక్షుని నిరాకరించి నీరు ద్రావి మూర్ఛితు లగుట	3-296-12	1289
ధర్మరాజు యక్షప్రశ్నముల కుత్తరంబు లిచ్చుట	3-297-26	1302

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వ శేషము

(4వ ఆశ్వాసము 142వ పద్యము నుండి 5,6,7 ఆశ్వాసములు)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము -చతుర్థాశ్వాసము

ఇక్కడ నుండి ఎఱ్ఱాప్రెగ్గడ కవిత్వము

శ్రీమదాంధ్ర మహాభారతం అన్ని వ్రాత ప్రతులలోనూ "ఇక్కడ నుండి ఎఱ్ఱాప్రెగ్గడ కవిత్వము" అనే శీర్షిక కానవస్తున్నది. విద్వాంసులు అందరు ఏకగ్రీవంగా ఈ విషయాన్ని ఆమోదిస్తున్నారు.

ఎఱ్ఱన పూరించిన ఆరణ్యపర్వశేషంలోని కవిత్వంలో ఆతడి ఆత్మీయతాముద్ర కనబడుతుంది. అయినను, 'సకలలోకైక విదితుడైన నన్నయభట్టు మహాకవీంద్రు సరస సారస్వతాంశప్రశస్తి' తనను చెందగా తాను "తత్కవితారీతియుఁ గొంత దోఁప' - 'తద్రచనయ కా' ఆరణ్యపర్వశేషాన్ని పూరించానని చెప్పుకొన్నాడు.

అనగా ఎఱ్ఱాప్రెగ్గడ తాను వ్రాసిన భాగాన్ని నన్నయభట్టుపేరుమీదనే కొనసాగించాడు. ఆశ్వాసాంత పద్యాలు రాజరాజనరేంద్రుడి సంబోధనలే. ఆశ్వాసాంత గద్యలలో 'ఇది సుకవిజనవినుత నన్నయభట్ట ప్రణీతంబైన శ్రీ మహాభారతంబునందు' - అని రచించాడు.

ఎఱ్ఱాప్రెగ్గడ చేసింది నిష్కామ సారస్వతసేవ. శైలిలోనూ, కొన్ని ఛందోవిషయాలలోను ఎఱ్ఱాప్రెగ్గడ తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకొని ఉండటంచేత విమర్శకులు, సాహితీవేత్తలు ఈతడి భారతకవితకు గల విశిష్టతను గుర్తించి ఉన్నారు. భారతరచనవలననే 'కవిత్రయం'లో ఎఱ్ఱనకు తరతరాల తెలుగుసాహిత్యచరిత్రలో సముచితస్థానం లభించింది.

చ. **స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి నిరస్తనీరదా**
వరణము లై దళత్కమలవైభవజృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతరహంససారసమధువ్రతనిస్వనముల్ సెలంగఁగాఁ
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళఁ జూడఁగన్. **142**

ప్రతిపదార్థం: స్ఫురత్+అరుణ+అంశు, రాగ, రుచిన్= ప్రకాశిస్తున్న ఎర్రనికిరణాలుకల, అనగా-బాలసూర్యుడికాంతియొక్క తళతళచేత; పొంపిరి+పోయి= అతిశయించి; నిరస్త, నీరద+ఆవరణములు+ఐ= తొలగించబడిన మబ్బుల చుట్టుకొనుటలు కలవై, అనగా మబ్బులు క్రమ్మటం తొలగినవై; దళత్, కమల, వైభవ, జృంభణము= వికసిస్తున్న పద్మాల సంపదయొక్క అతిశయం; ఉల్లసిల్లన్= వ్యక్తమయ్యేటట్లుగా; ఉద్ధురతర, హంస, సారస, మధువ్రత, నిస్వనముల్= మిక్కిలి దట్టంగా వ్యాపించిన హంసలయొక్క, బెగ్గురు పిట్టలయొక్క, తుమ్మెదలయొక్క మ్రోతలు; చెలంగఁగాన్= విస్తరించగా; వాసర, ముఖంబులు= దినారంభసమయాలు, అనగా ప్రొద్దు పొడుపులు; శారద, వేళన్= శరత్కాలంలో; చూడఁగన్= చూడటానికి; కరము= మిక్కిలి; వెలింగెన్= శోభించాయి.

తాత్పర్యం: శరత్కాలంలో సూర్యోదయ సమయాలు కనులపండువుగా శోభిల్లాయి. అప్పుడు మబ్బులు క్రమ్మటాలు తొలగిపోయాయి, బాలభానుడి అరుణకిరణాలు విస్తరించాయి. పద్మాలు వికసించి, శోభాయమానంగా వెలుగొందాయి. హంసలు, బెగ్గురుపిట్టలు, తుమ్మెదలు చేసే కలరవాలు వెల్లివిరిశాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఉద్ధురం అంటే దట్టంగా వ్యాపించటం, ఉద్ధురతరము= మిక్కిలి దట్టంగా వ్యాపించటం. విశేషణాలకు 'తర-తమ' ప్రత్యయాలు చేరినపుడు ఆధిక్యాన్ని సూచిస్తాయి.

శా. దానాంభఃపటలంబునం బృథుపయోధారావళిం దాల్చి గ
ర్జానిర్ఘోషము బృంహితచ్ఛలనఁ బ్రచ్ఛాదించి ప్రావృట్పయో
దానీకంబు శరద్భయంబున నిగూఢాకారతన్ డిగ్గె నాఁ
గా నొప్పారె మదోత్కటద్విరదసంఘంబుల్ వనాంతంబునన్. 143

ప్రతిపదార్థం: వన+అంతంబునన్= అడవిలోపలిభాగంలో; మద+ఉత్కట, ద్విరద, సంఘంబుల్= పొగరు ఎక్కిన ఏనుగుల గుంపులు; దాన+అంభస్+పటలంబునన్= మదజలాల సముదాయంచేత; పృథు, పయస్+ధారా+ఆవళిన్= ఎక్కువైన నీటిధారల సముదాయాన్ని; తాల్చి= ధరించి; గర్జా, నిర్ఘోషము= మేఘాలు చేసే ధ్వనిని; బృంహిత+ఛలనన్= ఏనుగులు చేసే ఘీంకారం అనే మిషతో; ప్రచ్ఛాదించి= కప్పిపుచ్చి; ప్రావృట్+పయోద+అనీకంబు= వానకాలపు మబ్బుల గుంపు; శరద్+భయంబునన్= శరదృతువు వలని వెరపుచేత; నిగూఢ+ఆకారతన్= రహస్యమైన ఆకృతితో; డిగ్గెన్= (భూమికి) దిగినవి; నాన్+కాన్= అన్నట్లుగా; ఒప్పారెన్= విలసిల్లాయి.

తాత్పర్యం: అడవిలో మదించిన ఏనుగులగుంపులు విలసిల్లాయి. శరత్కాలానికి వెరచి, వానకాలంలోని మబ్బుల గుంపు మారువేషంలో భూమికి దిగి వచ్చాయా అన్నట్లు అవి కన్పించాయి. మదించిన ఏనుగులు కాబట్టి వాటికి మదజలం స్రవించటం కద్దు. అవి మబ్బులకు ఉండే నీటిజల్లులో అన్నట్లున్నాయి. అట్లే, ఏనుగులు చేసే బృంహితధ్వనులు మేఘాలగర్జనలో అన్నట్లున్నాయి.

విశేషం: అలం : ఉత్ప్రేక్ష. మదపుటేనుగులు ఉపమేయం. వానకారు మబ్బులు ఉపమానం.

క. కలనీలకంఠకోలా। హలలీలలు సెలఁగె, రాజహంసకులంబుల్
విలసించె, సప్తపర్ణా । వలి విగళిత కుసుమ కుటజ వాటిక లడరెన్. 144

ప్రతిపదార్థం: కల, నీలకంఠ, కోలాహల, లీలలు= అవ్యక్తమధురాలైన నెమళ్ళకలకల ధ్వనులతో కూడిన విలాసాలు; చెలఁగెన్= ఒప్పినాయి; రాజహంస, కులంబుల్= రాజహంసల గుంపులు; విలసించెన్= శోభిల్లాయి; సప్త పర్ణ+ఆవలి, విగళిత, కుసుమ, కుటజ, వాటికలు= ఏడాకుల అరటిచెట్ల గుంపులు; రాలిన పువ్వులు గల కొండమల్లె (పొన్న) పొదరిండ్లు; అడరెన్= విలసిల్లాయి.

తాత్పర్యం: నెమళ్ళ కలరవాలతో కూడిన ఆటలు విలసిల్లాయి. అనగా నెమళులు అవ్యక్తమధురాలైన ధ్వనులు చేస్తూ నృత్యం చేశాయి. రాజహంసలగుంపులు శోభిల్లాయి. ఏడాకుల అరటిచెట్ల గుంపులు మరియు పూలురాలిన కొండమల్లెల పొదలు విలసిల్లాయి.

విశేషం: శరత్కాలంలో నెమళుల క్రేంకారనాదాలు విస్తరిల్లుతాయి. రాజహంసలకు శరదృతువు వినోదవిహారసమయం. ఆ ఋతువులో కొండమల్లె (పొన్న) చెట్లనుండి తెల్లని పువ్వులు రాలుతాయి. 'రాజహంసకులములన్ దిలకించె సప్తపర్ణావళి విగళిత కుసుమ కుటజ వాటికల గెడన్' - ఈ పాఠాంతరం కొన్ని ప్రతులలో ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. అతిగాంభీర్యవిభూతి నేకచులుకాహంకారనిశ్శేషశో
షితపాథోధిపయస్కుఁ డైన ముని దోఁచెం బుణ్యతేజోమయా
కృతి నయ్యామ్యదిగంతవీథిఁ బ్రకటక్రీడాకళాగర్వ గ
ర్జితమండూకకళంకితాంబుశుచితాసిద్ధిప్రదాచార్యుఁ డై. 145

ప్రతిపదార్థం: అతిగాంభీర్య, విభూతిన్= మిక్కుటమైననిండుదనంతో కూడినవైభవంచేత; ఏక, చుళుక+అహంకార, నిశ్శేష, శోషిత, పాథోధి, పయస్కుఁడు= ఒకపుడిసిలితో - గర్వంతో శేషం లేకుండ అంటే మిగులకుండగా ఎండించబడిన సముద్రజలాలు కలవాడు, అనగా గర్వంతో ఒక్క పుడిసిలి పట్టి సముద్రజలం అంతటినీ ఒక్కచుక్కకూడ మిగులకుండ ఎండింపచేసినవాడు; ఐన= అయినట్టి; ముని= ఋషి, అనగా అగస్త్యుడు, అగస్త్యనక్షత్రం; ఆ+యామ్య, దిగంత(దిక్+అంత)వీథిన్= ఆ దక్షిణదిశ చివరిభాగంలోని బాటలో; పుణ్య, తేజస్+మయ (తేజోమయ)+ఆకృతిన్= శుభం పావనం ఐన కాంతితో కూడినరూపంతో; ప్రకట, క్రీడా, కళా, గర్వ, గర్జిత, మండూక, కళంకిత+అంబు, శుచితా, సిద్ధిప్రద+ఆచార్యుఁడు+ఐ= వ్యక్తమైన ఆటసొబగులోని పొగరుతో పెద్దధ్వని చేసే (బెక బెక మనే) కప్పలచేత బురదగా చేయబడిన నీటికి నిర్మలత్వ ప్రాప్తిని ప్రసాదించే గురువై; తోఁచెన్= కానుపించాడు.

తాత్పర్యం: ఆ శరత్కాలంలో ఆకసాన దక్షిణదిశలో అగస్త్యనక్షత్రం కన్పించింది. ఆ అగస్త్యుడు మిక్కుటమైన నిండు వ్యక్తిత్వంగల మహర్షి. ఆయన సమస్త సముద్రజలాన్ని తనపుడిసిలి పట్టి, ఒక్కచుక్క మిగులకుండ త్రాగివేశాడు. అంతవరకు బెకబెకమని సవ్వడి చేస్తూ క్రీడాలాలసాలైన కప్పలవలన బురదగా చేయబడిన నీళ్లకు నిర్మలత్వాన్ని ప్రసాదించే గురువు ఆ అగస్త్యుడు.

విశేషం: 1) వర్షాకాలంలో కప్పలు బెక బెక మంటాయి. అది కప్పలకు ఋతుకాలం. వర్షాకాలంలో నీళ్లు బురదగా ఉంటాయికదా. శరత్కాలంలో అగస్త్యనక్షత్రోదయ మౌతుంది. అప్పుడు నీరు నిర్మల మౌతుంది. 2) అగస్త్యమహర్షి తన తపోమహిమవలన సముద్రజలాలను పుడిసిలితో పానంచేసిన పురాణగాథ సుప్రసిద్ధం. కాలకేయాదిరాక్షస నిగ్రహార్థం అగస్త్యుడు సాగరజలాలను పుడిసిలి బట్టి నిశ్శేషంగా పానం చేశాడు.

తే. విశదశారదాంబుద పరివేష్టనమునఁ । బోలుచు గగనంబు ప్రతిబింబములో యనంగ
వికచకాశవనీ పరివేష్టనమున । నతిశయిల్లె నిర్మలకమలాకరములు. 146

ప్రతిపదార్థం: విశద, శారద+అంబుద, పరివేష్టనమునన్= స్వచ్ఛమైన శరదృతువుకు సంబంధించిన మబ్బుల చుట్టురేకచేత; పోలుచు= ఒప్పునట్టి; గగనంబు= ఆకాశంయొక్క; ప్రతిబింబములు+ఒ= మారురూపాలో; అనంగన్= అన్నట్లుగ; వికచ, కాశ, వనీ, పరివేష్టనమునన్= పూచిన రెల్లుచెట్ల గుంపులతో చుట్టబడటంచేత; నిర్మల, కమల+ఆకరములు= స్వచ్ఛమైనసరస్సులు (కమల+ఆకరములు= పద్మాలకు నెలవులు); అతిశయిల్లెన్= శోభిల్లాయి.

తాత్పర్యం: తెల్లని శరత్కాల మేఘాలు చుట్టుముట్టి ఉన్న ఆకసానికి ప్రతిరూపాలో అను నట్లు తెల్లనిపూలు పూచిన రెల్లుమొక్కలచేత చుట్టుకొనబడిన నిర్మలసరస్సులు శోభిల్లాయి.

విశేషం: 1)అలం : ఉత్ప్రేక్ష. 2) శరదృతువులోని మేఘాలు తెల్లగా ఉంటాయి. అవి ఆకసంలో ఉంటాయి. రెల్లుపూలుకూడ తెల్లగా ఉంటాయి. అవి సరస్సుల చుట్టూ ఉంటాయి. శరదృతువులో రెల్లుపూలు పూస్తాయి. ఆకసం నిర్మల సరోవర జలాలలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిఫలిస్తూ ఉంటుంది. ఆకాశంలోని తెల్లమబ్బులే నిర్మలమైన నీటిలో ప్రతిఫలించాయా అన్నట్లు సరోవరాలలో రెల్లుపూలు శోభిల్లాయి.

వ. అట్టి శారదాగమంబున నుత్ఫుల్లకమలకల్హారకేసరకరాళకలితకల్లోలమాలినియు, ననేకమునిలోకసతత సంసేవ్యమాన విపుల పులినోత్సంగయు, నిరంతర తీర వానీర వనమండలీవిలసితయు, నాకాశసంకాశవిశద సలిలయు నైన సరస్వతీమహానది ననుదినస్నానపానాదివిశేషంబులం బరితోషంబు నొందుచుఁ బాండునందనులు మరుభూమిం గొన్నిదినంబులు వసియించి, తదనంతరంబ ధౌమ్యాదిభూసురులు నింద్రసేనాదిభృత్యులు దోడ నరుగుదేరఁ గామ్యకవనంబునకు వచ్చి, యచ్చటిమునులచేత నభినందితులై, యందు సముచితవర్తనంబుల నున్నంత; నొక్కనాఁడు. 147

ప్రతిపదార్థం: అట్టి, శారద+ఆగమంబునన్= శరత్కాలం వచ్చినప్పుడు; ఉత్ఫుల్ల, కమల, కల్హార, కేసర, కరాళ, కలిత, కల్లోల మాలినియున్= వికసించిన పద్మాలయొక్క ఇంచుక తెలుపు ఇంచుక ఎరుపురంగు కల సౌగంధిక పుష్పాలయొక్క కింజల్కాల సర్జ రసతైలంతో కూడిన కెరటాల దొంతరలదండ కలదిన్నీ; అనేక, ముని, లోక, సతత, సంసేవ్యమాన, విపుల, పులిన+ఉత్సంగయున్= పెక్కు మంది ఋషులసముదాయంచేత ఎల్లప్పుడు ఆరాధించబడుతున్న విశాలమైన ఇసుకతిన్నెలనెడి ఒడి కలదిన్నీ; నిరంతర, తీర, వానీరవన, మండలీ విలసితయున్= దట్టంగా ఒడ్డునందుండే నీటి ప్రబ్బలి తోపుల గుంపులచే శోభిల్లేదిన్నీ; ఆకాశ, సంకాశ, విశద, సలిలయున్= ఆకసంతో సరిపోలే స్వచ్ఛమైన నీరు కలదిన్నీ; ఐన; సరస్వతీ, మహానదిన్= సరస్వతి అనే పేరు కల గొప్ప ఏటిలో; అనుదిన, స్నాన, పాన+ఆది, విశేషంబులన్= ప్రతిరోజు స్నానం చేయటం నీరు త్రాగటం మున్నగు గొప్ప పనులచేత; పరితోషంబున్= సంతసాన్ని; ఒందుచున్= పొందుతూ; పాండునందనులు= పాండవులు; మరుభూమిన్= మరువు అనే పేరుకల దేశంలో; కొన్ని, దినంబులు= కొన్ని రోజులు; వసియించి= నివసించి; తద్+ అనంతరంబు+అ= అటుపిమ్మట; ధౌమ్య+ఆది, భూసురులున్= ధౌమ్యుడు మున్నగు బ్రాహ్మణులున్నూ, ఇంద్రసేన+ఆది, భృత్యులు= ఇంద్రసేనుడు మున్నగు సేవకులున్నూ; తోడన్= తమతో; అరుగుదేరన్= రాగా; కామ్యక, వనంబునకున్= కామ్యకం అనే పేరు కల అరణ్యానికి వచ్చి; అచ్చటి, మునులచేతన్= అచట ఉన్న ఋషులచేత; అభినందితులు+ఐ= సంతోషింపజేయబడినవారై; అందున్= (ఆ కామ్యకవనంలో;)సముచిత వర్తనంబులన్= ఎప్పటికప్పటికి సరిపడే పనులు చేస్తూ; ఉన్న+అంతన్= ఉండగా; ఒక్క, నాఁడు= ఒక రోజున.

తాత్పర్యం: అది శరదృతువు. ఆ శరత్కాలంలో సరస్వతీ మహానదిలో నిత్యమూ క్రుంకులిడుతూ, ఆనదీజలాలు త్రాగుతూ పాండవులు సంతోషంతో మరుదేశంలో కొన్ని నాళ్ళు గడిపారు. వికసించిన కమలాలతో, సౌగంధికపుష్పాలతో, ఆ పుష్పపరాగ తైలంతో తడిసిన కెరటాల దొంతరలతో, పెక్కుమంది ఋషులచేత ఎల్లప్పుడు ఆరాధించబడే ఇసుకతిన్నెలతో పాండవులకు ఆ సరస్వతీనది కనులపండువుగా కన్పించింది. అటు పిమ్మట పాండవులు ధౌమ్యుడు మున్నగు బ్రాహ్మణులు, ఇంద్రసేనుడు మున్నగు సేవకులు తమతోపాటు రాగా, కామ్యకవనం చేరి అక్కడి ఋషులచేత అభినందించబడి, అచట యథోచితకర్తవ్యాలు నెరవేరుస్తున్నారు. ఒకనాడు.

విశేషం: మహాభారతంలో పలుతావుల సరస్వతీ మహానది ప్రసక్తి ఉన్నది. వేదాలలో పెక్కుపర్యాయాలు సరస్వతీనది అభివర్ణితం. ఇప్పుడు 'ప్రయాగ' గంగా యమునా సంగమ క్షేత్రం. ఒకానొకప్పుడు సరస్వతికూడ అచ్చటనే కలిసెడిదనీ, అందుచేతనే దానికి 'త్రివేణీక్షేత్ర' మనే నామం ఏర్పడిం దనీ పెద్దల ప్రవచనం. ఇప్పుడు సరస్వతి 'అంతర్వాహిని' అని అంటారు. భారతదేశంలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏర్పడిన భౌగోళికమైన మార్పులలో పేర్కొన దగినది సరస్వతీనది అంతర్ధానం. ఒకనొకప్పుడు జీవనదిగా ఉన్న సరస్వతీ మహానది ఎప్పుడు ఎట్లు ఇంకిపోయింది? ఈ విషయంపై పెక్కురు ఇంకను పరిశోధనలు చేస్తున్నారు.

క. వాసవనందనసఖుఁ డగు । భూసురుఁ డొకఁ డరుగుదెంచి భూవినుతగుణో
ద్భాసితు ధర్మజు విప్రస । భాసీనుం గాంచి యిట్టు లనియెం బ్రీతిన్. 148

ప్రతిపదార్థం: వాసవ నందన సఖుఁడు+అగు= దేవేంద్రుడి కుమారుడైన అర్జునుడి యొక్క మిత్రుడు అయిన; భూసురుఁడు+ఒకఁడు= ఒక బ్రాహ్మణుడు; అరుగుదెంచి= వచ్చి; భూ, వినుత, గుణ+ఉద్భాసితున్= భూమి యందలి ప్రజలచేత పొగడబడిన మంచి లక్షణాలు కలిగి ప్రకాశిస్తున్న; విప్ర, సభా+ఆసీనున్= బ్రాహ్మణు లున్నసభలో కూర్చొని ఉన్నవాడిని; ధర్మజున్= ధర్మరాజును; కాంచి= చూచి; ప్రీతిన్= సంతోషంతో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: బ్రాహ్మణులమధ్య కూర్చొని కొలువుదీరి ఉన్న ధర్మరాజువద్దకు, అర్జునుడిమిత్రు డైన బ్రాహ్మణుడు ఒకడు వచ్చి అనురాగంతో ఈ విధంగా వచించాడు.

చ. 'జనవర! నీవుఁ దమ్ములును సమ్మద మొప్పఁగ నివ్వనంబునం
దునికి ధ్రువంబుగా విని మహోజ్జ్వలతేజుఁడు దేవకీసుతుం
డనఘుఁడు మిమ్ముఁ జూచుటకునై యిదె వచ్చుచునున్నవాఁడు మీ
కును ననిశంబుఁ దా హితము కోరుచునుండు నతండు నెయ్యుఁడై. 149

ప్రతిపదార్థం: జనవర!= ఓ రాజా!; నీవున్= నీవున్నూ; తమ్ములును= (నీ) సోదరులున్నూ; సమ్మదము+ఒప్పఁగన్= ప్రీతి ఇంపెసలారగా; ఈ+వనంబునందున్= ఈ అడవిలో; ఉనికి= ఉండటం; ధ్రువంబుగాన్= నిశ్చయంగా; విని= ఆలకించి; మహా+ఉజ్జ్వల, తేజుఁడు= గొప్పగా వెలుగొందే కాంతి కలవాడు; అనఘుఁడు= పాప రహితుడు; దేవకీ, సుతుండు= దేవకి యొక్క కుమారుడు; మిమ్మున్+చూచుటకున్+ఐ= మిమ్ములను దర్శించటానికి; ఇదె= ఇదిగో; వచ్చుచున్+ఉన్నవాఁడు= వస్తున్నాడు; అతండు= అతడు (దేవకీసుతుడైన ఆ కృష్ణుడు); తాన్= తాను; నెయ్యుఁడు+ఐ= మిత్రుడై; మీకునున్= మీకు; అనిశంబున్= ఎల్లప్పుడున్నూ; హితము+అ= మేలునే; కోరుచున్+ఉండున్= కోరుతుంటాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఈ అడవిలో నీవూ, నీసోదరులూ నెమ్మదితో ఉన్నట్లు నిశ్చయంగా తెలిసికొని, మీకు సదా మేలుకోరే మీ మిత్రుడు, గొప్ప తేజస్వి, పాపరహితుడు, దేవకీసుతుడు అయిన శ్రీకృష్ణుడు మిమ్మల్ని చూడవలె ననే కోరికతో ఇక్కడకు ఇప్పుడే వస్తున్నాడు.

వ. మఱియు ననేకయుగసహస్రజీవియు నప్రమేయతపఃప్రభాసియు వినుతవిధేయుఁడును నైన మార్కండేయుండును భవదీయదర్శనార్థం బీక్షణంబ చనుదెంచు' నని చెప్పిన యనంతర ముహూర్తంబున.150

ప్రతిపదార్థం: మఱియున్= అదియునుంగాక; అనేక, యుగసహస్ర, జీవియున్= పెక్కు వేల యుగాలు బ్రదికినట్టివాడున్నూ; అప్రమేయ, తపస్+ప్రభాసియున్= గొప్ప తపస్సుచేత ప్రకాశించే వాడున్నూ; వినుత, విధేయుఁడునున్= మహాత్ములయెడ అణకువ కలవాడున్నూ; ఐన= ఐనట్టి; మార్కండేయుండును= మృకండుమహామునిపుత్రుడున్నూ; భవదీయ, దర్శన+అర్థంబు= నిన్ను చూడటం కొరకై; ఈ క్షణంబు+అ= ఈ నిమేషకాలంలోనే, చనుదెంచున్= వస్తాడు; అని చెప్పిన, అనంతర, ముహూర్తంబునన్= అనిచెప్పిన తరువాతి క్షణంలోనే.

తాత్పర్యం: అంతేకాక, పెక్కువేల యుగాలు జీవించినవాడున్నూ, గొప్ప తపస్సు చేసిన వాడున్నూ, మహాత్ములపట్ల వినయవిధేయతలు చూపేవాడున్నూ, మృకండు మహర్షి పుత్రుడున్నూ ఐన మార్కండేయుడు ఈ క్షణంలోనే నిన్ను చూడటంకొరకై వస్తున్నాడు' అని చెప్పిన మరుక్షణంలోనే.

శ్రీకృష్ణుఁడు సత్యభామతోడఁ బాండవులయొద్దకు వచ్చుట (సం. 3-180-7)

సీ. **శైబ్యసుగ్రీవాదిజవనాశ్వయుక్త మై । యాబద్ధనూత్నరత్నాంశుపటల**
భాసితం బై చారుపతగ పతాకా వి । భూషితగగన మై పొలుపు మిగులు
దివ్యరథంబున దేవకీసుతుఁడు ప్రి । యంబున సత్యభామాన్వితముగఁ
దరళసౌదామినీదామసముజ్జ్వల । ధారాధరోత్సంగతలమునందు

ఆ. **శచియుఁ దాను వెలుఁగు శతమఖుండును బోలె । నరుగుదెంచె ఘనరథాంగనేమి**
విపులఘోష తాండవిత బర్హిశబ్ద శ । బ్దాయమాన వనవిభాగుఁ డగుచు. **151**

ప్రతిపదార్థం: శైబ్య, సుగ్రీవ+ఆది, జవన+అశ్వ, యుక్తము+ఐ='శైబ్యం' 'సుగ్రీవం' మొదలైన వేగంగా పోయే గుర్రాలతో కూడినదై; ఆబద్ధనూత్నరత్న+అంశు, పటల, భాసితంబు+ఐ= కూర్చబడిన రతనాల వెలుగుల సముదాయంతో ప్రకాశించేదై; చారు, పతగ, పతాకా, విభూషిత గగనము+ఐ= మనోహర మైన పక్షి (గరుత్మంతుడి) జెండాచేత అలంకరించబడిన ఆకసం కలిగినదై; పొలుపు, మిగులు= అందంతో అతిశయించిన; దివ్య, రథంబునన్= దేవతాసంబంధమైన మహిమ కల్గిన తేరియందు; దేవకీ సుతుఁడు= దేవకి కుమారుడైన శ్రీకృష్ణుడు; ప్రియంబునన్= ప్రేమతో; సత్యభామా+అన్వితముగన్= సత్యభామతో కూడి; తరళ, సౌదామినీ, దామ, సముజ్జ్వల, ధారాధర+ఉత్సంగ, తలమునందున్= మెరుస్తున్న మెరుపు తీగెల దండలతో ప్రకాశిస్తున్న మేఘాల ఒడియందు; శచియున్+తాను, వెలుఁగు, శతమఖుండును, పోలెన్= (భార్యయైన) శచితోపాటు వెలుగొందే దేవేంద్రుడివలె; ఘన, రథాంగ, నేమి, విపుల ఘోష, తాండవిత, బర్హి, శబ్ద, శబ్దాయమాన, వన, విభాగుఁడు+అగుచున్= గొప్పవైన రథచక్రాల పట్టాలయొక్క ఎక్కువైన నాదంచేత నర్తిస్తున్న నెమళ్ళు చేసే సవ్వడులచేత ధ్వనిస్తున్న అడవి కలవాడౌతూ; అరుగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: దేవకీనందనుడైన శ్రీకృష్ణుడు, తన దేవేరి అయిన సత్యభామతోపాటు, రథాన్ని ఎక్కి గొప్ప వైభవం ఒప్పారేటట్లుగా ధర్మరాజును సందర్శించటానికై ఏతెంచాడు. శ్రీకృష్ణుడు సత్యభామతోపాటు రథంపై ఉన్నప్పుడు వారిరువురు మెరపు తీగలతో మిరుమిట్లు గొల్పుతూ ఉన్న మేఘాల మధ్య ప్రకాశిస్తున్న దేవేంద్రుడూ శచీదేవివలె వెలుగొందారు. ఆ రథంమీద గరుడలాంఛనంతో చెక్కబడిన జెండా ధగ ధగ లాడుతున్నది. ఆ రథానికి శైబ్యసుగ్రీవాది అశ్వాలు పూన్చబడ్డాయి. అది పొదగబడిన క్రొత్త రత్నాల కాంతులతో వెలుగొందుతూ ఉన్నది. ఆ రథచక్రాల సవ్వడి మేఘగర్జనలవలె ధ్వనించింది. ఆ ధ్వనికి అడవిలో ఉన్న నెమళ్ళు నృత్యం చేయసాగాయి.

విశేషం: శ్రీకృష్ణుడు విష్ణుమూర్తి అవతారం. విష్ణుదేవుడి రథానికి కట్టే గుఱ్ఱాలు. 1. శైబ్యం 2. సుగ్రీవం 3. మేఘపుష్పం 4. వలాహకం. మేఘగర్జనలకు నెమళ్ళు నృత్యం చేయటం సహజం. ఆ శ్రీకృష్ణుడి రథచక్రఘోష మేఘగర్జనను పోలటంచేత అక్కడ అడవిలోని నెమళ్ళు నృత్యం చేసినట్లు ఇక్కడ అభివర్ణితం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు వచ్చి వాసుదేవుండు రథావతరణంబు సేసి, ధర్మనందనున కభివందనం బొనరించి, భీమార్జున నకుల సహదేవులం గౌఁగిలించుకొని, ద్రౌపదిం గారవించి, ధౌమ్యాది మహీసురులచేత నభినందితుం డయ్యెఁ; నంతఁ గౌంతేయాగ్రజుండు గదాధరునకు నర్ఘ్యాదిసత్కారంబులు నిర్వర్తించి, తమ్ములుం దానును విప్రజనంబులు నతనిం బరివేష్టించి యుండి; రప్పుడు కృష్ణుండు ధనంజయుం దన చేరువ నునిచికొని చిరకాల దర్శనోల్లసితంబు లైన యాలోకనంబుల నతని యాకారం బత్యాదరంబున నభినందించి ధర్మరాజున కి ట్లనియె. 152

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; వచ్చి= ఏతెంచి; వాసుదేవుండు= వసుదేవుడి కుమారుడైన శ్రీకృష్ణుడు; రథ+అవతరణంబు +చేసి= తేరునుండి దిగి; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; అభివందనంబు+ఒనరించి= నమస్కారం చేసి; భీమ+అర్జున, నకుల, సహదేవులన్= భీముడిని, అర్జునుడిని, నకులుడిని, సహదేవుడిని; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; ద్రౌపదిన్+ గారవించి= ద్రౌపదిని మన్నించి; ధౌమ్య+ఆది, మహీ సురులచేతన్= ధౌమ్యుడి మొదలైన బ్రాహ్మణులచేత; అభినందితుండు+ అయ్యెన్= అభినందించబడినవాడు అయ్యాడు; అంతన్= అంతట; కౌంతేయ+అగ్రజుండు= కుంతీకుమారులలో మొదటివాడు-ధర్మరాజు; గదా ధరునకున్= శ్రీకృష్ణుడికి; అర్ఘ్య+ఆది, సత్కారంబులు= స్వాగత పురస్సర మైన పూజాద్రవ్యాలు ఇవ్వటం మొదలైన మన్ననలు; నిర్వర్తించి= చేసి; తమ్ములున్+తానును= తన సోదరులున్నూ తానున్నూ; విప్ర జనంబులున్= బ్రాహ్మణులున్నూ; అతనిన్= అతడిని (అనగా శ్రీకృష్ణుడిని); పరివేష్టించి+ఉండిరి= చుట్టూ కూర్చొని ఉన్నారు; అప్పుడు= ఆ సమయంలో; కృష్ణుడు; ధనంజయున్= అర్జునుడిని; తన చేరువన్= తనకు దగ్గరగా; ఉనిచికొని= ఉంచుకొని; చిరకాల, దర్శన+ఉల్లసితంబులు+ఐన= చాలాకాలానికి చూడటంవలన మిక్కిలి వికసించిన; ఆలోకనంబులన్= చూపులతో; అతని+ఆకారంబు= అతడి (అర్జునుడి) రూపాన్ని; అతి+ఆదరంబునన్= మిక్కిలి మన్ననతో; అభినందించి= సంతోషపడేటట్లు చేసి; ధర్మరాజునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: వసుదేవుడికుమారుడైన శ్రీకృష్ణుడు ఈ విధంగా వచ్చి రథాన్ని దిగి, ధర్మరాజుకు నమస్కరించాడు. భీముడిని, అర్జునుడిని, నకులుడిని, సహదేవుడిని కౌగిలించుకొని మన్నన తెలిపాడు. ద్రౌపదిని గౌరవించాడు. ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణులు శ్రీకృష్ణుడిని గౌరవించారు. ధర్మరాజు శ్రీకృష్ణుడికి అర్ఘ్యాన్ని ఇచ్చి, స్వాగత సత్కారాలు సలిపాడు. అంతట ధర్మరాజూ అతని తమ్ములూ బ్రాహ్మణులూ శ్రీకృష్ణుడి చుట్టూ కూర్చున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుడిని తనకు దగ్గరగా చేర్చుకొని, చాలాకాలం తరువాత కలిసికొనటంచేత ఏర్పడిన అభిమానం చొప్పున అతడిపై అనురాగం జాలువారే చూపులు పరపి, అభినందించాడు. ఆ తరువాత శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: శ్రీకృష్ణుడి గద పేరు 'కౌమోదకి'. శ్రీకృష్ణుడికి దానివలన గదాధరుడు అనే పేరు ఏర్పడింది.

**సీ. 'భాగ్యంబు గాదె యీ పార్థుండు హరుఁ డాది । యైన నిర్జరసమూహంబువలన
నెలమిఁ గృతాస్త్రుఁడై యేతెంచు; టరయంగ । ధన్యుండ వైతివి ధర్మతనయ!
నీ ధర్మనిష్ఠయు నీ తపంబును జూవె । యింతకుఁ గారణం బిద్ధచరిత!
రాజ్యంబుకంటెను రాజేంద్ర! ధర్మంబె । యిష్టమై యుండు నీ కెల్లనాఁడు ;**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. వేదవేదాంగ విదుఁడవు, వివిధయజ్ఞ । కర్త వైతి, ధనుర్వేదకర్మఠుఁడవు,
ధరణి యెల్ల నేలెడి రాజధర్మ మమర । సులభ మయ్యె నీ కిహపరశోభనంబు. 153

ప్రతిపదార్థం: ఈ పార్థుండు= ఈ అర్జునుఁడు; హరుఁడు+ఆది+ఐన= శివుడు మున్నగువారైన; నిర్జర, సమూహంబువలనన్= దేవతల సముదాయం వలన; ఎలమిన్= ప్రీతితో; కృత+అస్త్రుఁడు+ఐ= ఆర్జించిన అస్త్రాలు కలవాడై; ఏతెంచుట= రావటం; భాగ్యంబు, కాదె= అదృష్టం కదా; అరయంగన్= పరిశీలించగా; ధర్మతనయ!= ఓధర్మరాజా!; ధన్యుండవు+ఐతివి= చరితార్థుడవు అయినావు; నీ, ధర్మ, నిష్ఠయున్= నీకు ధర్మం నిర్వహించటంలో ఉన్న తదేకదీక్షయున్నూ; నీ, తపంబును= శరీరక్లేశాన్ని ఓర్చుకొని, ఇంద్రియాలను కైవసం చేసికొనే నీ సాధన; చూవె= కదా; ఇంతకున్+కారణంబు= ఇంతవరకు మీరు సాధించిన ఘనకార్యాల సముదాయానికి హేతువు; ఇద్ధ, చరిత!= ప్రకాశించే నడవడి కలవాడా!; రాజ+ఇంద్ర!= రాజేంద్ర= రాజులలో ఇంద్రుడివంటి వాడా, రాజశ్రేష్ఠుడా!; నీకున్+ఎల్లనాఁడు= నీకు అన్ని సమయాలలో; రాజ్యంబు కంటెను= భూమిని పాలించటం కంటె కూడా; ధర్మంబు+ఎ= ధర్మమే; ఇష్టము+ఐ+ఉండున్= సమ్మతమై ఉంటుంది; వేద, వేద+అంగ, విదుఁడవు= వేదాలను, వేదాంగాలను తెలిసినట్టి పండితుడవు; వివిధ, యజ్ఞ, కర్తవు+ఐతివి= ఎన్నో జన్నాలు చేసినవాడవు అయితివి; ధనుస్+వేద, కర్మఠుఁడవు= విలువిద్యలో ఆరితేరినవాడవు; ధరణి+ఎల్లన్= భూమినంతటిని; ఏలెడి= పరిపాలించేటి; రాజధర్మము= రాజులకు సంబంధించిన కర్తవ్యనిర్వహణం; అమరన్= ఒప్పియుండగా; నీకున్= నీకు; ఇహ, పర, శోభనంబు= ఈ లోకంలోనూ పరలోకంలోనూ కూడ కలిగే మేలు సులభము+అయ్యెన్= సులువు అయింది.

తాత్పర్యం: ధర్మరాజా! ఆ అర్జునుడు పరమేశ్వరుడు మొదలుగా గల దేవతలనేకుల దయవలన అస్త్రలాభం పొంది రావటం నీ భాగ్యంకదా! దానివలన నీవు కృతార్థుడ వైనావు. ఓ పవిత్రచరిత్రా! ధర్మాచరణలో నీకున్న నిష్ఠ, నీ తపస్సే దీనికంతకు కారణం. ఓ రాజశ్రేష్ఠుడా! నీ కెల్లప్పుడూ రాజ్యంకంటె ధర్మమే ఇష్టమై ఉంటుంది. నీవు వేదవేదాంగాలను తెలిసినవాడవు, అనేక యజ్ఞాలు చేసినవాడవు, విలువిద్యలో ఆరితేరినవాడవు. భూమి నంతటినీ పరిపాలించగల రాజధర్మం నీయందు ప్రకాశిస్తూ, నీకు ఇహంలోనూ పరంలోనూ శుభాన్ని సులభ సాధ్యం చేసింది.

చ. దమమును సత్యయుక్తియును ధైర్యనిరూఢియు నిత్యతృప్తియున్
శమమును నీకు నైజములు; సన్మతి నర్థవశంబుఁ గామలో
భములును బొందఁ; వట్లగుటఁ బార్థివకుంజర! ధర్మరాజనా
మమునఁ ద్రిలోకపూజ్యమహిమం బొగడొందెద విట్టిధంబునన్.' 154

ప్రతిపదార్థం: పార్థివ, కుంజర!= రాజులలో శ్రేష్ఠుడైనవాడా!; దమమును= ఇంద్రియ నిగ్రహమున్నూ; సత్య, యుక్తియును= నిజాన్నే మాటాడే నైపుణ్యమున్నూ; ధైర్య, నిరూఢియున్= చిత్తస్థైర్యమున్నూ; నిత్య, తృప్తియున్= ఎల్లప్పుడున్నూ తనివి చెందటమున్నూ; శమమును= అంతరింద్రియ నిగ్రహమున్నూ; నీకున్= నీకు (ధర్మరాజునకు); నైజములు= స్వభావసిద్ధాలు; సత్+మతిన్= సన్మతిన్= మంచి బుద్ధి ఉండటంచేత; అర్థ వశంబున్= ధనానికి లోబడటం; కామలోభములును+పొందవు= కోర్కెలకు దురాశలకు నీవు లోబడవు; అట్లు+అగుటన్= ఆ విధంగా ఉండటంచేత; ధర్మరాజ నామమునన్= ధర్మరాజు అనే పేరుతో; ఈ+విధంబునన్= ఈ రీతిగా; త్రిలోక, పూజ్య, మహిమన్= మూడులోకాలలో ఆరాధించదగిన గొప్పదనంతో; పొగడు+ఒందెదవు= కీర్తి నార్జిస్తూ ఉన్నావు.

తాత్పర్యం: ఇంద్రియ నిగ్రహం, సత్యసంధత, ధైర్యసాహసాలు, ఎల్లప్పుడూ తనివిచెంది ఉండటం, అంతరింద్రియ నిగ్రహం నీకు సహజగుణాలు. మంచిబుద్ధి కలవాడవైనందున నీవు ధనానికి లోబడిఉండవు. నీకు దురాశలు లేవు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాజులలో శ్రేష్ఠుడవైన ఓధర్మరాజా! నీవు సార్థకనామధేయుడవు. అందుచేతనే, నీకు మూడులోకాలలోనూ ఆరాధించదగిన గొప్పదనం ఏర్పడింది.'

వ. అని వెండియు. 155

ప్రతిపదార్థం: అని, వెండియున్= అనిచెప్పి, మరియు.

తాత్పర్యం: అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

శా. 'ద్యూతవ్యాజమునన్ సభాంగణమునన్ దుర్యోధనుం డట్లు దు
ర్నీతిం గూరి యొనర్చినట్టి యఘముల్ నిష్కంపధైర్యోన్నమ
చ్చేతస్సారుఁడ వైన నీ కొకనికిం జెల్లెన్ సహింపంగ; వి
ఖ్యాతక్షాంతులు లేరె ధార్మికులు? నిక్కం, బిట్టిరే యెవ్వరున్? 156

ప్రతిపదార్థం: ద్యూత, వ్యాజమునన్= జూదం అనే మిషచేత; సభా+అంగణమునన్= సభా ప్రదేశంలో; దుర్యోధనుండు= దుర్యోధనుడు; అట్లు= ఆవిధంగా; దుస్+నీతిన్+కూరి= చెడ్డ నీతిలో చొచ్చి; ఒనర్చినట్టి= చేసినట్టి; అఘముల్= పాపాలు; నిస్+కంప, ధైర్య+ఉత్+నమత్+చేతస్+సారుఁడవు+ఐన= చలించని ధైర్యంచేత పెంపొందించబడిన మనస్ స్థైర్యం కలిగినవాడవు అయిన; నీకున్+ఒకనికిన్= నీకు ఒక్కడికి మాత్రమే; సహింపంగన్+చెల్లెన్= ఓర్చుకొనటానికి వీలైంది; ధార్మికులు= ధర్మం ప్రకారం నడచుకొనేవారు; విఖ్యాత, క్షాంతులు= పేరు కెక్కిన సహనస్వభావం కలవారు; లేరె= లేరా, (అనగా ఉన్నారు కాని); ఎవ్వరున్= ఇంకెవ్వ రైనను; నిక్కంబు= నిజంగా; ఇట్టిరు+ఏ= ఇట్టి వారలా? (నీవంటివారలు కారు సుమా).

తాత్పర్యం: 'ధర్మరాజా! ఆనాడు నిండుకొలువుకూటంలో జూదం అనే మిష కల్పించి దుర్యోధనుడు ఆరీతిగా ఎంతటి దురంతాలకు ఒడి గట్టాడు! అటువంటి ఘోరమైన పాపకృత్యాలను నీవు కాబట్టి సహించ గలిగావు. నీ క్షమాగుణం ప్రశంసించతగింది, చలించని మనోధైర్యంతో కూడిన అట్టి సహనం నీకొక్కడికే చెల్లింది. లోకంలో సహనశీలురు పలువురు ఉండవచ్చు నేమో కాని, నిజంగా నీవంటివారు మరెవ్వరైనా ఉన్నారా?

ఉ. ఉల్లము సత్యసంయమము నూనినవాఁడవు నీవు విక్రమం
బొల్లమిఁ గౌరవాధములయుద్ధతి యమ్మెయిఁ జెల్లెఁగాక; యొం
డెల్లను నేల? నీదుమది నించుక కిన్క జనించినన్ మహీ
వల్లభ! యప్డ రూపఱదె వారక వైరికులంబు సర్వమున్. 157

ప్రతిపదార్థం: మహీవల్లభ!= భూమికి భర్తవైన ఓ రాజా- ధర్మరాజా!; సత్య, సంయమమున్= సత్యవ్రతం గల; ఉల్లమున్= మనస్సును; ఊనినవాఁడవు= కలవాడవు; నీవు= నీవు; విక్రమంబు+ఒల్లమిన్= పరాక్రమం ప్రదర్శించటానికి ఇష్టపడకపోవటంచేత; కౌరవ+అధముల= కౌరవ కులంలో నీచులైనవారి (దుర్యోధనాదులయొక్క); ఉద్ధతి= దర్పం; ఆ+మెయిన్= ఆవిధంగా; చెల్లెన్+కాక= సాగింది కాని; ఒండు+ఎల్లనున్+ఏల?= వేరొక రీతి అంతా ఎందుకు?; నీదు, మదిన్= నీ మనస్సులో; ఇంచుక, కిన్క= కొంచెం కోపం; జనించినన్= పుట్టినట్లైతే (కలిగినట్లైతే); అపుడు+అ= అప్డ= అప్పుడే; వారక= ఉడుగక; వైరి, కులంబు= శత్రుసముదాయం; సర్వమున్= సమస్తమున్నూ; రూపు+అఱదె= నశించదా?

తాత్పర్యం: 'ధర్మరాజా! నీవు సత్యసంధతతో కూడిన హృదయంకలవాడవు. హింసతో కూడిన పరాక్రమం నీకు ఇష్టం కాలేదుకాని, నీవే కాస్త కోపించి విజృంభించి ఉంటే కౌరవులదర్పం ఆ విధంగా కొనసాగిఉండేది కాదు. వేరుమాట లెందుకు? నీ మనస్సులో ఇంచుక కోపం ప్రజ్వరిల్లినట్లయితే నీ శత్రువు లందరూ ఆ క్షణంలో నశించి పోయి ఉండేవారుకదా!

చ. వినుత భవన్నియోగ మను వేల యలంఘ్యము గాన యిమ్మెయిన్
ఘనభుజవీచివిభ్రమవికాసముఁ జూపక నిల్చెఁ గాక స
జ్జనసుత! చూడ నీ యనుజసాగరముల్ దఱితోడ విద్విష
జ్జనలయకాలులై కడఁగు సర్వజగంబుల నాక్రమింపఁగన్. 158

ప్రతిపదార్థం: సత్+జన నుత!= మంచివారిచేత పొగడబడినవాడా!; నీ+అనుజసాగరముల్= నీ తమ్ములు అనే సముద్రాలు; వినుత= గొప్పగా పొగడబడిన; భవత్+నియోగము+అను, వేల= నీయొక్క ఆజ్ఞ అనే చెలియలికట్ట; అలంఘ్యము= దాట రానిది; కాన= కాబట్టి; ~~ఈ~~+మెయిన్= ~~ఈ~~విధంగా; ఘన, భుజ, వీచి, విభ్రమ, వికాసమున్= గొప్పవైన భుజాలు అనే కెరటాల ఉవ్వెత్తు పొంగును; చూపక నిల్చెన్+కాక= ప్రదర్శించకున్నాయి కాని; చూడన్= అరయగా; తఱితోడన్= అవకాశం వచ్చినపుడు; విద్విషత్+జన, లయకాలులు+ఐ= శత్రువులు అయిన జనులకు ప్రళయకాలంలోని యములు ఔతూ; సర్వ జగంబులన్= అన్ని లోకాలను; ఆక్రమింపఁగన్= కైవసం చేసికొనటానికి; కడఁగున్= పూనుకొంటాయి.

తాత్పర్యం: నీ తమ్ములు సముద్రాలవంటివారు. నీ ఆనతి అనే చెలియలికట్ట వారికి మీరరానిది. అందుచేత వారు పరాక్రమవిజృంభణం చూపక ఆగారు. వారి భుజ పరాక్రమప్రాభవం ఉవ్వెత్తుగా లేచి పొంగారే కడలి కెరటాల వంటిది! అయినప్పటికిని అవకాశం వచ్చినప్పుడు సమస్తలోకాలను ఆక్రమించుకొనగలిగిన శక్తి వారికి ఉన్నది. అదను దొరికినప్పుడు వారు శత్రువులను ప్రళయకాలంలోని యముడివలె విజృంభించి నాశనం చేయగలరు!

విశేషం: అలం: రూపకం. ధర్మరాజు నియోగం=వేల. అనుజులు= సాగరాలు, ఘనభుజాలు= వీచి విభ్రమ వికాసం. ఉపమేయాలకు, ఉపమానాలకు అభేదాధ్యవసాయం కల్పించబడింది. ప్రళయకాలంలో సముద్రాలు, యముడు విజృంభించటం ఉపపన్నం.

ఉ. అంధక వృష్ణి భోజ కుకురాన్వయభూపతు లెల్ల నీదెసన్
బాంధవ సౌహృద ప్రణయ భక్తివిశేషము లొప్ప నీ మనో
గ్రంథి యడంగఁజేయ నెసకంబునఁ బూనినవారు లోభ మో
హాంధులు ధార్తరాష్ట్రులు జనాధిప! మార్కొనువారె వారలన్? 159

ప్రతిపదార్థం: జన+అధిప!= జనులకు అధిపతి అయినవాడా, ఓ ధర్మరాజా!; అంధక, వృష్ణి, భోజ, కుకుర+అన్వయ, భూపతులు+ఎల్లన్= అంధక, వృష్ణి, భోజ, కుకుర వంశాలకు సంబంధించిన రాజులు అందరున్నూ; నీదెసన్= నీయెడ; బాంధవ, సౌహృద, ప్రణయ, భక్తి, విశేషములు+ఒప్పన్= చుట్టరికం, మైత్రి, ప్రేమ, ఆరాధనతో కూడిన గొప్పభావాలు అలరారేటట్లుగా; నీ, మనస్+గ్రంథి= నీ మనస్సుకు సంబంధించిన కంతివంటి బాధను; అడంగన్+చేయన్= అణగేటట్లు చేయటానికి; ఎసకంబునన్= మిక్కుటమైన ఉత్సాహంతో; పూనినవారు= పట్టుదల వహించి ఉన్నారు; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుడి

కుమారులైన కౌరవులు; లోభ, మోహ+అంధులు= దురాశచేత, భ్రాంతిచేత కనులు కాననివారు; వారలన్=వారిని (ఆ రాజులనందరిని); మార్కొనువారు+ఎ?= ఎదిరించి పోరాడగలిగినవారా?

తాత్పర్యం: ధర్మరాజా! అంధక, వృష్ణి, భోజ, కుకుర వంశాలకు చెందిన ప్రభువులు అందరూ నీయెడ బంధు ప్రేమతో, స్నేహంతో, పూజ్యభావంతో నీ మానసిక వ్యాకులతను పోగొట్టటానికై ఉత్సహిస్తున్నారు. దురాశతో భ్రాంతితో కన్నులు కన్పించక గ్రుడ్డివారైన ధార్తరాష్ట్రులు ఆ రాజులను అందరిని ఎదిరించి పోరాడగలరా?

క. చతురంభోధిపరీత । క్షితితల సామ్రాజ్యలక్ష్మికిం బతివి జగ
న్నుత! నీవ; నీవు దలఁచిన । నతిదుష్కర మెందు లే దనర్గళమహిమన్.' 160

ప్రతిపదార్థం: జగత్+నుత!= లోకంలోని ప్రజలచేత పొగడబడినవాడా, ఓ ధర్మరాజా!; నీవు+అ= నీవే; చతుర్+అంభస్+ధి, పరీత, క్షితి తల, సామ్రాజ్య, లక్ష్మికిన్= నాలుగు సముద్రాలచేత చుట్టుకొనబడి ఉన్న గొప్ప రాజ్యసంపదకు; పతివి= భర్తవు; అనర్గళ, మహిమన్= అడ్డు లేని ప్రాభవంతో; నీవు= నీవు; తలఁచినన్= తలచుకొంటే; ఎందున్= ఎచ్చటను; అతిదుష్కరము= మిక్కిలి చేయలేనిది అంటూ ఏదీ; లేదు= లేదు.

తాత్పర్యం: జగత్తులోని ప్రజలచేత పొగడబడిన ఓ ధర్మరాజా! నీవు సంకల్పిస్తే చేయలేని పని ఎక్కడాలేదు. నాలుగుసముద్రాలచేత ఆవరించబడిన సువిశాల సామ్రాజ్యానికి నీవే సార్వభౌముడవు.'

విశేషం: జగత్+నుత= జగన్నుత, జగత్తు అనగా జగత్తులోని ప్రజలు. ఇది అజహల్లక్షణ అని ఆలంకారిక నిర్దేశం. జగత్తు అనే పదాన్ని వదలకుండ జగత్తులోని ప్రజలు అని ఇట అర్థం చెప్పవలసివచ్చింది. కావున అజహత్= వదలని, లక్షణ= లక్షణార్థం.

వ. అనిన సంతసిల్లి కుంతీనందనుండు దేవకీనందనుతోడ 'దేవా! యెవ్విధంబున నైన నల్పావశిష్టంబైన వనవాసకాలంబును నజ్ఞాతవర్తనంబును దీర్చి, లోకనింద్యంబు గాని విక్రమంబునం బగఱ జయింపఁ గోరెదము; దీని నంతయు నిర్వహించు భారంబు నీయదియ; నిన్ను శరణంబు సొచ్చిన మాకుం బరమశోభనంబులును సులభంబు లగుట నిశ్చయంబుగాదె!' యనియె; నప్పుడు కృష్ణుండు నిజసమీపంబున నున్న పాంచాలిం జూచి యిట్లనియె. 161

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన; కుంతీనందనుండు= కుంతియొక్క కొడుకు ధర్మరాజు; సంతసిల్లి= సంతోషించి; దేవకీనందనుతోడన్= దేవకియొక్క కొడుకైన శ్రీకృష్ణుడితో; దేవా!= ప్రభువా!; ఏ+విధంబునన్+ఐనన్= ఏ విధంగానైనా; అల్ప+అవశిష్టంబు+ఐన= కొద్దిగా మిగిలి ఉన్నట్టి; వన, వాస, కాలంబునున్= అడవిలో నివసించవలసిన సమయాన్ని; అజ్ఞాత, వర్తనంబును= ఒరులకు తెలియకుండ బ్రదుక వలసిన నడవడికను; తీర్చి= నిర్వహించి; లోక, నింద్యంబు కాని= లోకులచేత నిందింపదగని; విక్రమంబునన్= పరాక్రమంచేత; పగఱన్= శత్రువులను; జయింపన్+కోరెదము= గెలువటానికి కోరుకొంటున్నాం; దీనిన్+అంతయున్= ఈ పనినంతటిని; నిర్వహించు= నెరవేర్చే; భారంబు= బరువు; నీ+అది+అ= నీదే; నిన్నున్= నిన్ను; శరణంబు+చొచ్చిన= కాపాడవలెననే కోరికతో ప్రార్థించి చేరిన; మాకున్= మాకు (పాండవులకు); పరమ, శోభనంబులును= గొప్ప మేళ్ళు; సులభంబులు+అగుట= సులువుగా చేకూరుట; నిశ్చయంబు= ధ్రువం; కాదె= కదా; అనియెన్= అని అన్నాడు; అప్పుడు= ఆ సమయంలో, కృష్ణుండు= కృష్ణుడు; నిజసమీపంబునన్+ఉన్న= తనకు దగ్గరగా ఉన్న; పాంచాలిన్= ద్రౌపదిని; చూచి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శ్రీకృష్ణుడు చెప్పిన మాటలకు ధర్మరాజు సంతోషించాడు. అప్పుడు ధర్మరాజు ఈవిధంగా సమాధానం చెప్పాడు- 'దేవా! మా ఒడంబడిక ప్రకారం ఇంక మేము నిర్వహించవలసిన అరణ్యవాసం ఎంతోకాలం మిగిలి ఉండలేదు. ఆ స్వల్పవనవాసాన్నీ, మరియు ఒకయేడు అజ్ఞాతవాసాన్నీ ఎట్లో ముగియజేసికొన్నపిమ్మట మాపరాక్రమం చూపటం మంచిది. అప్పుడు మమ్మల్ని లోకం నిందించదు కదా! దీనినంతా నిర్వహించేభారం నీదే. మేము నీభక్తులం; నిన్ను శరణు చొచ్చిఉన్నాం. ఇక మాకు మేలు కలగటం ధ్రువం'. అంతట శ్రీకృష్ణుడు తనకు దగ్గరగా నిలిచిఉన్న ద్రౌపదితో ఈవిధంగా పలికాడు.

సీ. **'నీ పుత్త్రులేవురు నీరజలోచన! । యదుకుమారులుఁ దారు ముదముతోడ**
ననుపమ స్నేహసమాహితహృదయు లై । కరిహయారోహణపరతఁ దగిలి
యాడుచు, వివిధశస్త్రాస్త్ర ప్రయోగముల్ । గఱచుచు నొండెల్ల మఱచి యున్న
వారు; ప్రద్యుమ్నుండు వారికి దివ్యాస్త్ర । జాతంబు లెల్లను బ్రీతి నొసఁగెఁ;

ఆ. **దన్వి యా సుభద్ర తన పుత్త్రుకంటె నీ । తనయులందుఁ గూర్మిఁ దనరఁ జేయు;**
నూఱడిల్లు మింక; నుజ్జ్వలోన్నతులఁ బెం । పారఁ గాల మనతిదూర మయ్యె'. 162

ప్రతిపదార్థం: నీరజలోచన!= పద్మాలవంటి కన్నులు కల ద్రౌపదీ!; నీపుత్త్రులు= నీకొడుకులు; ఏవురు= ఐదుగురు; యదు, కుమారులున్= యదువంశంలోని బాలురూ; తారు= తామూ; ముదముతోడన్= సంతోషంతో; అనుపమ, స్నేహ, సమాహిత, హృదయులు+ఐ= సాటిలేని చెలిమితో ఏకమైన హృదయాలు కలవారలై; కరి, హయ+ఆరోహణ, పరతన్= ఏనుగులను, గుర్రాలను ఎక్కి స్వారి చేయటంలోని దీక్షతో; తగిలి+ఆడుచున్= ఉత్సహిస్తూ; వివిధ, శస్త్ర+అస్త్రప్రయోగముల్= పెక్కు శస్త్రాలను అస్త్రాలను ప్రయోగించటం; కఱచుచున్= నేర్చుకొంటూ; ఒండు+ఎల్లన్, మఱచి, ఉన్నవారు= మిగిలినది అంతా విస్మరించి ఉన్నారు; వారికిన్= (ద్రౌపదికుమారులకు, యాదవకుమారులకు); ప్రద్యుమ్నుండు; దివ్య+అస్త్ర, జాతంబులు+ఎల్లను= దైవసంబంధ మైన మంత్రబాణ సముదాయాలను అన్నింటిని; ప్రీతిన్= సంతోషంతో; ఒసఁగెన్= ఇచ్చాడు; తన్వి, ఆ సుభద్ర= సుకుమారి అయిన ఆ సుభద్ర; (శ్రీకృష్ణుడి చెల్లెలు- అర్జునుడిభార్య); తన, పుత్త్రుకంటెన్= తనకొడుకు (అభిమన్యుడి) కంటె; నీ, తనయులందున్= నీయొక్క కొడుకులయందు; కూర్మిన్= ప్రేముడిని; తనరన్+చేయున్= విలసిల్లజేస్తుంది; ఇంకన్= ఇకమీద; ఊఱడిల్లుము= ఉపశాంతిచెందుము; ఉజ్జ్వల+ఉన్నతులన్+పెంపు+ఆరన్= వెలుగొందే అభివృద్ధితో అతిశయించటానికి; కాలము= సమయం; అనతిదూరము+అయ్యెన్= తక్కువ దూరం అయింది- అంటే సమీపించింది.

తాత్పర్యం: 'ద్రౌపదీ! నీఐదుగురు కొడుకులు యాదవరాజకుమారులతో పాటు సంతోషంగా కాలం గడుపుతున్నారు. వారు యదుకుమారులతోపాటు ఏనుగులను ఎక్కటం, గుర్రాలను స్వారీ చేయటం మున్నగు వీరకృత్యాలతో అస్త్రశస్త్రాలు ప్రయోగించటం అభ్యసిస్తూ, మిగిలిన అంశాలను అన్నిటినీ మఱచి ఉత్సాహంతో ఉన్నారు. ప్రద్యుమ్నుడు వారందరికి దివ్యాస్త్రాలను ప్రీతితో ఇచ్చాడు. సుభద్ర తన కొడుకుమీదకంటె, ఎక్కువ ప్రేముడితో నీకొడుకులను ఆదరిస్తున్నది. ఇక నీవు ఊరడిల్లవచ్చును. పాండవులెల్లరు ఉజ్జ్వలమైన ఉన్నతులతో వెలుగొందే శుభసమయం సమీపిస్తున్నది.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మార్కండేయుండను మహాముని పాండవులయొద్దకు వచ్చుట (సం. 3-180-39)

వ. అని యాశ్వాసించు సమయంబునం బరమతపోవృద్ధుం డయిన మార్కండేయుండు సనుదెంచినం గృష్ణుండును బాండవులును నతని నెదుర్కొని యథోచితవిధులం బూజించిరి; మునీంద్రుండును బ్రత్యేకంబ వారి కుశలంబు లడిగెఁ; దదనంతరంబ యందఱు నాసీనులై యున్నయెడఁ బాండవహితార్థియై వనజోదరుం డమ్మునివరున కి ట్లనియె. 163

ప్రతిపదార్థం: అని= ఆవిధంగా చెప్పి; ఆశ్వాసించుసమయంబునన్= (ద్రౌపదిని) ఓదార్చే సమయంలో; పరమ, తపస్+వృద్ధుండు= మిక్కుట మైన తపస్సుచేత అధికుడైన వాడు; మార్కండేయుండు= మార్కండేయుడు (అనెడి ముని); చనుదెంచినన్= రాగా; కృష్ణుండును= శ్రీకృష్ణుడును; పాండవులును; అతనిన్= (మార్కండేయుడిని); ఎదుర్కొని= ఎదురుగా వెడలి స్వాగతం చెప్పి; యథా+ఉచిత, విధులన్= ఆ (సమయానికి) తగినట్లు, సంప్రదాయానికి అనుగుణమైన మర్యాదలతో; పూజించిరి= ఆరాధించారు; ముని+ఇంద్రుండును= ఋషులలో శ్రేష్ఠుఁడు అయిన మార్కండేయుడును; ప్రత్యేకంబు+అ= విడివిడిగా, విశేషంగా; వారి కుశలంబులు= వారి యోగక్షేమాలు; అడిగెన్= ప్రశ్నించి తెలిసికొన్నాడు; తద్+అనంతరంబు+అ= అటుమీదట; అందఱున్= అందరును; ఆసీనులు+ఐ+ఉన్న+ఎడన్= కూర్చొని ఉన్న సమయంలో; పాండవ, హిత+అర్థి+ఐ= పాండవులమేలు కోరినవాడై; వనజ+ఉదరుండు= శ్రీకృష్ణుడు; ఆ+మునివరునకున్= ఆమునులలో శ్రేష్ఠుడైన వాడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ విధంగా చెప్పి శ్రీకృష్ణుడు ద్రౌపదీదేవిని ఊరడించాడు. ఆ సమయాన తపోవృద్ధుడైన మార్కండేయ మహర్షి అక్కడికి వచ్చాడు. వచ్చిన మునీశ్వరుడికి కృష్ణుడూ పాండవులూ ఎదురేగి ఆహ్వానించి, ఆతిథ్యస్వాగత మర్యాదలతో అతడిని అర్చించారు. మార్కండేయుడు అందరి యోగక్షేమాలు విచారించాడు. అందరు కూర్చొని ఉన్నపిదప, పాండవుల మేలుకోరేవాడై శ్రీకృష్ణుడు ఆ మునివరుడితో ఇట్లా పలికాడు.

ఉ. 'ఏనును బాండునందనులు నిమ్మునిముఖ్యులు నిప్డు లోకస
మ్మానితవాక్య! నీదయిన మంజులవాగమృతప్రవాహమున్
వీనులదోయి నించుచును వేడుకఁ గ్రోలికొనంగ నాత్మలం
బూనెద; మస్మదీప్సితము పూర్ణము సేయఁగ నర్హ మెమ్మెయిన్. 164

ప్రతిపదార్థం: లోక, సమ్మానిత, వాక్య!= లోకంలోని జనులచేత గౌరవించబడినమాటలు కలవాడా!; ఏనును= నేనున్నూ; పాండునందనులున్= పాండవులున్నూ; ఈ+ముని ముఖ్యులున్= మునులలో శ్రేష్ఠులైన వీరున్నూ; ఇప్డు= ఇప్పుడు; నీదు+అయిన= నీ యొక్క; మంజుల, వాక్+అమృత, ప్రవాహమున్= మనోహరమైన మాటలు అనే అమృతధారను; వీనులదోయిన్= రెండుచెవులలోనూ; నించుచును= నింపుకొంటూ; వేడుకన్+క్రోలికొనంగన్= సంబరంతో ఆస్వాదించ గోరి; ఆత్మలన్+పూనెదము= మనసార కోరుకొంటాము; ఏ+మెయిన్= ఏవిధంగానైనా; అస్మత్+ఈప్సితము= మాకోరిక; పూర్ణము, చేయఁగన్= నెరవేర్చటానికి; అర్హము= తగింది.

తాత్పర్యం: 'వాక్య నిపుణుడవైన మార్కండేయమహర్షీ! నేనున్నూ, పాండవులున్నూ ఇక్కడి మునిశ్రేష్ఠులున్నూ మీ మాటలను వినవలె నని ఉవ్విళ్ళూరుతున్నాం. మీ పలుకులు లోకంలోని ప్రజ లెల్లరూ గౌరవించేవి. మీ వాగమృతం మా వీనులకు విందు చేయాలి. మా ఈ కోరికను తాము దయచేసి మన్నించ వేడికోలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. కావున. **165**

తాత్పర్యం: కాబట్టి.

క. దేవ నరదేవ ధరణీ । దేవ చరిత్రములు భర్తృదేవత లనఁగా
భూవినుత లయిన సతుల ప్ర । భావము లెఱిఁగింపు మోలిఁ బ్రస్ఫుటములుగన్.' **166**

ప్రతిపదార్థం: దేవ, నరదేవ, ధరణీదేవ, చరిత్రములు= దేవతలయొక్కయు, రాజులయొక్కయు, బ్రాహ్మణులయొక్కయు జరిగినకథలు; భర్తృదేవతలు= పతివ్రతలు; అనఁగాన్= అని; భూవినుతలు= భూమియందు కీర్తించబడినవారు అనగా అశేషభూజనులచేత ప్రశంసించబడినవారు; అయిన; సతుల= మంచి ఇల్లాండ్ర యొక్క; ప్రభావములు= మహిమలు; ఓలిన్= వరుసగా; ప్రస్ఫుటములుగన్= తేటతెల్ల మయ్యేటట్లుగా; ఎఱిఁగింపుము= తెలియజెప్పుము.

తాత్పర్యం: దేవతల, రాజుల, బ్రాహ్మణుల వృత్తాంతాలను, మహాపతివ్రతలుగా భూలోకంలో యశస్సు నార్జించిన సతీమణుల మహిమలను వరుసగా తేటతెల్ల మయ్యేటట్లు ఎఱిగించుము.'

వ. అని యడుగుచున్నయెడ నారదుం డేఁగుదెంచిన, నందఱు ప్రత్యుద్గతు లయి ప్రణమిల్లి యాతని నుచితసత్కారంబులం బ్రీతునింజేసిన, నమ్మహాముని మార్కండేయునింజూచి 'కృష్ణపాండవప్రియార్థంబుగాఁ బరమపుణ్య కథాకథనం బొనరింతువుగాక!' యని పలికి వారల నామంత్రణంబు సేసి నిజేచ్ఛం జనియెఁ; దదనంతరంబ ధర్మతనయుండు మార్కండేయున కి ట్లనియె. **167**

ప్రతిపదార్థం: అని, అడుగుచున్న; ఎడన్= ఆ విధంగా ప్రశ్నిస్తున్న సమయంలో; నారదుండు= నారదుడు; ఏఁగుదెంచినన్= రాగా; అందఱు= అచట ఉన్న పాండవులు మున్నగువారు అందరున్నూ; ప్రత్యుద్గతులు+అయి= లేచి (సగౌరవంగా) నిల్చినవారై; ప్రణమిల్లి= నమస్కరించి; ఆతనిన్= ఆ నారద మహర్షిని; ఉచిత, సత్కారంబులన్= తగినమర్యాదలతో (మన్నించి); ప్రీతునిన్= సంతృప్తి చెందినవాడినిగా; చేసినన్= చేయగా; ఆ+మహాముని= ఆ నారదమహర్షి; మార్కండేయునిన్; చూచి; కృష్ణ, పాండవ, ప్రియ+అర్థంబుగాన్= శ్రీకృష్ణుడికి పాండవులకు సంతసం కలిగేటట్లుగా; పరమ పుణ్య, కథా, కథనంబు= గొప్పశుభ ఫలాల నిచ్చే వృత్తాంతాలను చెప్పటం; ఒనరింతువు+కాక= చేయుదువు గాక; అని పలికి= అని చెప్పి; వారలన్; ఆమంత్రణంబు, చేసి= వీడ్కోలు చెప్పి; నిజ+ఇచ్ఛన్= తనకు ఇష్టమైన చొప్పున; చనియెన్= వెళ్ళాడు; తద్+ అనంతరంబు+అ= అటు పిమ్మట; ధర్మతనయుండు= ధర్మపుత్రుడు; మార్కండేయునకున్; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని ప్రశ్నిస్తున్న సమయాన నారదమహాముని అక్కడికి వచ్చాడు. అందరున్నూ ఆమహర్షికి ఎదురేగి నమస్కరించి, తగిన మర్యాదలతో సంభావించి అతడిని ఆనందింప జేశారు. ఆ నారదమహర్షి, మార్కండేయుడిని చూచి, 'కృష్ణుడు, పాండవులు సంతోషించేటట్లు పుణ్యకథలు చెప్పుము' అని పలికి, వారలను వీడ్కొని తాను ఇచ్చ వచ్చిన చొప్పున వెళ్ళాడు. అటుపిమ్మట ధర్మరాజు మార్కండేయ మహర్షితో ఈ విధంగా అన్నాడు.

సీ. 'కడఁగి ధర్మముతోడ నడచుచు నే మిట్లు । దందడి దుఃఖంబుఁ బొందుటయును
నేపున నెప్పుడు పాపంబు సేయుచు । ధృతరాష్ట్రజులు సుఖోన్నతు లగుటయుఁ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గని యివ్విపర్యయమునకు నే నూహింతుఁ। బాయక నరుఁ డిప్డు సేయు కర్మ
మున ఫల మిందుఁ బొందునొ? పరలోకంబు। నందుఁ బొందునొ? యిందు నందుఁ గనునొ?

ఆ. విశ్వకర్తయైన యీశ్వరుఁ గానని। పురుషుఁ గర్మఫలము పొరయకున్నె?
యొడలితోనఁ గృతము వెడలిపోవునొ? యిది। దెలియవలయు నాకు నలఘుపుణ్య! 168

ప్రతిపదార్థం: అలఘుపుణ్య!= తక్కువకాని, అనగా గొప్పపుణ్యం కలవాడా!; కడఁగి= పూని; ధర్మముతోడన్= న్యాయంతో కూడిన ప్రవర్తనతో; నడచుచున్= ప్రవర్తిస్తూ; ఏము= మేము; ఇట్లు= ఈవిధంగా; దందడి= అధికమైన; దుఃఖంబు= బాధ; పొందుటయును= అనుభవించటయున్నూ; ఏపునన్= అతిశయించి; ఎప్పుడు= ఎల్లప్పుడు; పాపంబు= పాపం; చేయుచున్= ఆచరిస్తూ; ధృతరాష్ట్రజులు= ధృతరాష్ట్రుడి కొడుకులు; సుఖ+ఉన్నతులు= సౌఖ్యాన్ని పొందటంచేత గొప్పవారు; అగుటయున్; కని= చూచి; ఈ+విపర్యయమునకున్= ఈతారుమారునకు; ఏన్= నేను; ఊహింతున్= ఈవిధంగా ఊహచేస్తాను (భావిస్తాను); నరుఁడు= మానవుడు; ఇప్డు= ఇపుడు; చేయు= ఒనరించే; కర్మమునన్= పనివలన; ఫలము= ఫలితం; ఇందున్= ఈ ఇహలోకంలో; పొందునొ?= అనుభవిస్తాడా?; పర, లోకంబునందున్= మరణించిన పిదప ఐన లోకంలో; పొందునొ?= అనుభవిస్తాడా?; ఇందున్= ఈ లోకంలోనూ; అందున్= పరలోకంలోనూ; కనునొ?= పొందుతాడా?; విశ్వ కర్త+ఐన= సృష్టినిర్మాత అయిన; ఈశ్వరున్= దేవుడిని; కానని= చూడని; పురుషున్= మనుజుని= మానవుడిని; కర్మఫలము= చేసిన పనుల ఫలితం; పొరయక+ఉన్నె= చేరకుండునా; ఒడలితోనన్= దేహంతోనే; కృతము= చేసినకర్మ; వెడలిపోవునొ?= తొలగిపోతుందా?; ఇది= ఈవిషయం; నాకున్, తెలియవలయున్= నాకు తెలిసికొనవలసినట్టిది.

తాత్పర్యం: 'మార్కండేయ మహామునీ! మేము పూనికతో ధర్మం ఆచరిస్తున్నవారమే అయినప్పటికీ ఈవిధంగా ఇడుమలు పొందుతూ మిక్కుట మైన దుఃఖాన్ని అనుభవిస్తున్నాం. ధృతరాష్ట్రుడి కొడుకులు ఎల్లప్పుడు పాపకార్యాలనే చేస్తున్నవారే అయినప్పటికీ గొప్పసౌఖ్యాలను అనుభవిస్తున్నారు. ఈ విపరీతస్థితిని గురించి నేను ఎక్కువగా ఆలోచించవలసి వస్తోంది. నా ఈ ధర్మసందేహాన్ని దయచేసి తాము తీర్చాలి. మనుజుడు ఈభూలోకంలో ఇప్పుడు చేసే కర్మఫలం ఇక్కడే ఇప్పుడే అనుభవిస్తాడా? పరలోకంలో అనుభవిస్తాడా? లేక ఇహంలోనూ పరంలోనూ కూడా అనుభవిస్తాడా? సృష్టికర్తఅయిన పరమేశ్వరుడిని సందర్శించని మానవుడిని కర్మఫలం పొందకుండా ఉంటుందా? మరణించిన పిదప శరీరపాతంతోపాటు చేసిన కర్మకూడా వెడలిపోతుందా? ఓ మహానుభావా! ఈ విషయాన్ని నాకు తేటతెల్లం చేయండి.

విశేషం: ఇది గొప్ప ప్రశ్న! చెడ్డవారు ఎందుకు సౌఖ్యాలు అనుభవిస్తున్నారు? మంచివారికే ఎందుకు దుఃఖం సంప్రాప్తిస్తున్నది? మహాభారతంలో ఈ ప్రశ్నకు సమాధానం పలుతావుల చర్చించబడింది.

వ. ఇంతయు నెఱింగింప నీవ యర్హుండ' వనినఁ బరమజ్ఞాననిధి యైన యత్తపోనిధి యతని కి ట్లనియెఁ 'దొల్లి విధాత ప్రథమకల్పంబున నత్యంతనిర్మలంబులును ధర్మతంత్రంబులును నైన శరీరంబులు సృజియించె; నట్లు పుట్టింపఁబడిన యా మనుష్యులు మహాసత్త్వసంపన్నులు, సత్యవాదులు, సత్యసంకల్పులు, బ్రహ్మభూతాత్ములు, స్వచ్ఛందజీవులు నై దేవయానంబుల విహరించుచు ననాయాసంబున నధికఫలసిద్ధిం బొందుచు, సర్వ ధర్మజ్ఞులై విగతమత్సరులై బహుసహస్రసంతానులై బహుసహస్ర సంవత్సరాయుష్కులై వర్తిల్లుచుండి; రంతఁ గాలాంతరంబునం గామక్రోధాది గుణంబులు దమ్ముం బొందుటయు మాయా ప్రవర్తనులై దేవతలచేత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విడువంబడి యల్పాయువులు, నల్పబలశరీరసత్త్వులును, దరిద్రులును, నిష్ఫలారంభులును, బహురోగ పీడితులును, నాస్తికులును నై యొండొరుల మెచ్చక దురితంబులు సేయుచుఁదిర్యగ్యోనులం బుట్టుచు, నరకాగ్నులం గ్రాఁగుచు, గతాగతభ్రమణంబుల నలయం దొడంగి; రిట్లు దిరుగుచున్న సంసార చక్రంబునందు. 169

ప్రతిపదార్థం: ఇంతయున్= ఈ విషయాన్ని అంతటిని; ఎఱింగింపన్= తెలియచెప్పటానికి; ఈవు+అ= నీవుమాత్రమే; అర్హుండవు= తగినవాడవు, సమర్థుడవు; అనినన్= అని చెప్పగా; పరమ, జ్ఞాన, నిధి+ఐన= మిక్కిలి గొప్ప దైన జ్ఞానానికి నెలవు, పాదు అయిన; ఆ+తపస్+నిధి= తపస్సుకు ఆకరమైనవాడైన ఆ మార్కండేయ మహర్షి; అతనికిన్= అతడికి అనగా ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు; తొల్లి= పూర్వకాలంలో; విధాత= బ్రహ్మదేవుడు; ప్రథమ+కల్పంబునన్= మొట్టమొదటి 'కల్పం'లో (కల్పం అనగా మనుష్యమానంలో నాలుగు యుగాలు వేయిమారులు తిరిగి వస్తే బ్రహ్మకు ఒక పగలు ఔతుంది); అత్యంత, నిర్మలంబులును= మిక్కిలి స్వచ్ఛమైనవిన్నీ; ధర్మ, తంత్రంబులును+ఐన= ధర్మాన్ని అనుసరించి నడిచేవిన్నీ అయిన; శరీరంబులు= దేహాలు; సృజియించెన్= నిర్మించాడు; అట్లు= ఆవిధంగా; పుట్టింపఁబడిన= సృజించబడిన; ఆ, మనుష్యులు= ఆ మానవులు; మహాసత్త్వ సంపన్నులు= మిక్కిలి బలవంతులు; సత్యవాదులు= నిజం మాటాడేవారున్నూ, సత్యసంకల్పులు= నిజమయ్యే కోరికలు కలవారున్నూ; బ్రహ్మ, భూత+ఆత్ములు= జ్ఞానానుభూతిని పొందినవారున్నూ, (బ్రహ్మస్వరూపాన్ని పొందినవారు); స్వచ్ఛందజీవులును+ఐ= స్వాతంత్ర్యం కలిగి నడవడికను దిద్దుకొనినవారున్నూ అయి; దేవ, యానంబుల= దేవతలు చరించే మార్గాలలో; విహరించుచున్= తిరుగుతూ; అనాయాసంబునన్= శ్రమలేకుండగా; అధిక, ఫల, సిద్ధిన్= మిక్కుటమైన ఫలితం లభించటాన్ని; పొందుచున్= పొందుతూ; సర్వ, ధర్మ, జ్ఞులు+ఐ= అన్నిధర్మాలను తెలిసినవారై; విగత, మత్సరులు+ఐ= పోయిన మాత్సర్యం కలవారై అనగా అసూయాద్వేషాలు లేనివారై; బహుసహస్ర సంతానులు+ఐ= పెక్కువేలమంది కొడుకులు, కూతుళ్ళు కలవారై; బహుసహస్ర, సంవత్సర+ఆయుష్యులు+ఐ= పెక్కువేలేండ్ల ఆయుర్దాయం కలవారై; వర్తిల్లుచున్+ఉండిరి= బ్రదుకుతూ ఉండేవారు, సంచరిస్తూ ఉండేవారు; అంతన్= అటుపిమ్మట; కాల+అంతరంబునన్= తరువాతి కాలంలో; కామ, క్రోధ+ఆది, గుణంబులు= కామం, కోపం మొదలైన లక్షణాలు; తమ్మున్= తమను (అనగా ఆ మానవులను); పొందుటయున్= చేరటంవలన; మాయా, ప్రవర్తనులు+ఐ= చెడు నడవడిక కలవారై; దేవతలచేతన్= వేల్పులచేత; విడువన్+పడి= వదలివేయబడినవారై; అల్ప+ఆయువులు= తక్కువ కాలం బ్రదికేవారు; అల్ప, బల, శరీర, సత్త్వులును= తక్కువబలం, కల్గిన దేహం, సత్త్వగుణంకలవారున్నూ; దరిద్రులును= బీదవారున్నూ; నిష్ఫల+ఆరంభులును= ఫలించని ప్రయత్నాలు చేసేవారు - అనగా చేసిన ప్రయత్నాలు విఫలమయ్యేవారున్నూ; బహు, రోగ, పీడితులును= పెక్కు జబ్బులచేత బాధపడేవారున్నూ; నాస్తికులునున్+ఐ= వేదాలను, దేవుడిని తిరస్కరించే వారున్నూ అయి; ఒండొరులన్= ఒండు+ఒరులన్= ఒకరిని ఒకరు; మెచ్చక= అంగీకరించక; దురితంబులు= పాపాలు; చేయుచున్= ఆచరిస్తూ; తిర్యక్+యోనులన్= జంతువులయందు, పక్షులయందు; పుట్టుచున్= జన్మిస్తూ; (తిర్యగ్యోనులందు పుట్టటం అంటే పక్షిజాతులందుగాని, మృగజాతులందుగాని జన్మించటం); నరక+అగ్నులన్= నరకంలోని నిప్పు లందు; క్రాఁగుచున్= మండుతూ; గత+ఆగత, భ్రమణంబులన్= పోవటం, రావటం - అంటే చావటం పుట్టటం అనే వలయాలలో తిరగటంవలన; అలయన్+తొడంగిరి= అలసట చెందారు; ఇట్లు= ఈ రీతిగా; తిరుగుచున్న; సంసార, చక్రంబునందున్= ప్రపంచ మనే వలయంలో.

తాత్పర్యం: ఆ ప్రశ్నకు ఆ మార్కండేయమహర్షి మాత్రమే సముచితసమాధానం చెప్పగల సమర్థుడని ధర్మరాజు ఆ మహర్షిని ప్రశంసించాడు. గొప్పజ్ఞానం కలవాడైన మార్కండేయమహర్షి ధర్మరాజుతో ఈవిధంగా చెప్పాడు. 'ఓధర్మరాజా! పూర్వకాలంలో, బ్రహ్మదేవుడు తొలుత సృష్టికి ఉపక్రమించిన సమయంలో మనుష్యులశరీరాలు నిర్మలాలై ఉన్నాయి. వారు పుణ్యాత్ములై ఉన్నారు. అట్టి మనుజులు గొప్పబలవంతులై ఎల్లప్పుడు సత్యాన్నే పలికే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వారు. వారి కోరికలు ఈడేరేవి. వారు జ్ఞానులు. వారు సర్వతంత్రస్వతంత్రులై దేవతలు వెళ్ళే దారులలో పయనించగలిగారు. తక్కువ ప్రయత్నంతో ఎక్కువఫలితాలను సులువుగా పొందగలిగారు. వారు సమస్త ధర్మాలు తెలిసికొనగలిగారు. వారికి అసూయ మొదలైన దుర్గుణాలు ఉండేవి కావు. వారికి వేలకొలది కొడుకులు, కూతుళ్ళు ఉండేవారు. వారు వేలకొలది సంవత్సరాలు జీవించేవారు, కాని, కాలం గడచినపిదప, మనుష్యులలో కామం, క్రోధం మొదలైన దుర్గుణాలు ప్రవేశించాయి. వారి ప్రవర్తనలో మాయ చొరబడింది. అందుచేత దేవతలు వారిని విడనాడారు. తదుపరి, వారు బలం లేని శరీరాలతో, ఆయుర్దాయం క్షీణించి, దరిద్రులై, చేసిన గొప్ప ప్రయత్నాలకు తక్కువ ఫలితాలు పొంది, పెక్కు జబ్బులచేత పీడించబడసాగారు. ఇక ఒకరినొకరు నిందించుకొంటూ. వేదాలను దేవుడిని నిరసించి పాపకార్యాలు చేస్తూ, మరణానంతరం పశుపక్షులుగా తిరిగి జన్మించసాగారు, నరకంలోని అగ్నిలో వేగుతూ, పుట్టుతూ చస్తూ, మరల పుట్టుతూ చస్తూ సంసారవలయంలో చిక్కుకొని బ్రదుకసాగారు.

విశేషం: పుట్టటం, చావటం, మరలా పుట్టటం, చావటం అనే విషవలయాన్నిగూర్చి భారతీయవేదాంతులు పలుతావుల నొక్కి వక్కాణించి ఉన్నారు. తొలుత సృష్టియొక్క తొలిఉషస్సులలో ధర్మదేవత కామధేనురూపాన నాల్గుపాదాలతో నడిచిన దనిన్నీ, రాను రాను కలియుగంలో ఏకపాదమాత్రంగా నిలిచిన దనిన్నీ మూలమహాభారతంలో కనబడుతుంది.

చ. **మనుజులు పుణ్యపాపములు మానక యి ట్లొనరించుచుం దుదిం**
దనువు దొఱంగి పోవునెడఁ దప్పదు నీడయవోలెఁ గర్మమున్
వెనుకన యేఁగి భూరిసుఖవిస్మృతియుం బటుదుఃఖదైన్యమున్
దనుకఁగఁ జేయుఁ; గ్రమ్మఱఁగఁ దాన యొనర్చు భవంబు దేహికిన్. **170**

ప్రతిపదార్థం: మనుజులు= మానవులు; పుణ్య, పాపములు= మంచివిచెడ్డవి అయిన పనులు; మానక= విడువక; ఇట్లు+ఒనరించుచున్= ఈవిధంగా చేస్తూ; తుదిన్= చివరకు; తనువు= శరీరం; తొఱంగిపోవు+ఎడన్= విడిచిపెట్టే సమయంలో; నీడ+అ+పోలెన్= ఛాయవలె; కర్మమున్= చేసిన క్రియల ఫలితంకూడా; తప్పదు= తప్పదు; వెనుకన్+అ= వెనువెంటనే; ఏఁగి= వెళ్ళి; భూరి, సుఖ, విస్మృతియున్= గొప్ప సౌఖ్యాన్ని మరచుటయున్నూ; పటు= మిక్కిలి; దుఃఖ, దైన్యమున్= శోకంవలన ఏర్పడే కష్టాన్ని; తనుకఁగన్+చేయున్= ఏర్పడేటట్లు చేస్తుంది; క్రమ్మఱఁగన్= మరల; దేహికిన్= శరీరం ధరించినవాడికి, అనగా మానవుడికి; తాను+అ= తానే అనగా ఆ కర్మమే; భవంబు= పుట్టుక; ఒనర్చున్= కలుగజేస్తుంది.

తాత్పర్యం: ఈ విధంగా జననమరణాల వలయంలో తగుల్కొని మానవులు పుణ్యాలు పాపాలు విడనాడక చేయటంచేత, చనిపోయిన తరువాత కూడా వారి కర్మ నీడవలె వెనువెంటనే నడచివెళ్ళి, సౌఖ్యాన్ని మరపుకు తెచ్చి, దుఃఖం వలన అధిక దైన్యానికి పాల్పడ జేసి శరీరధారులకు మరల మరల జన్మలను కలిగిస్తూనే ఉంటుంది.

క. **విను మనుజున కెవ్విధమునఁ । దన చేసిన సుకృత దుష్కృతంబులు నెఱయం**
దన కనుభవింపఁ బా లివి; । తనువు సెడుం గాని కర్మతతి సెడ దనఘా! **171**

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడైన వాడా! (ధర్మరాజా); విను= ఆలకించుము; మనుజునకున్= మానవునకు; ఏ విధమునన్= ఏ రీతిగా నైనా; తన, చేసిన= తాను చేసినట్టి; సుకృత, దుష్కృతంబులు= పుణ్య పాపాలు; నెఱయన్= నిండుగా; తనకున్= తనకు; అనుభవింపన్+పాలివి= అనుభవింపదగినవి; తనువు= శరీరం; చెడున్+కాని= పాడయిపోతుంది-అనగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నశించిపోతుంది కాని; కర్మ, తతి= పుణ్యపాపకర్మలు చేయటం వలన ఏర్పడే ఫలితాల సముదాయం; చెడదు= చెడిపోదు-అనగా నశించదు.

తాత్పర్యం: పాపరహితుడ వైన ఓ ధర్మరాజా! నేను వివరించేది సావధానంగా ఆలకించుము. మనుజులు తాము చేసిన పుణ్యపాపాలఫలం ఏవిధంగానైనా సరే అనుభవించక తప్పదు. శరీరం నశించిపోతుంది కాని, కర్మ (ఫల) సముదాయంమాత్రం ఎన్నటికీ నశించదు.

వ. మఱియు నొక్క నిదర్శనంబు సెప్పెద. 172

ప్రతిపదార్థం: మఱియున్= అదనంగా; ఒక్క= మరియొక; నిదర్శనంబు= ఉదాహరణం; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: అంతే కాక, నీకు మరొక ఉదాహరణను వివరించి చెప్పగలను.

క. ఈ లోకమ యగుఁ గొందఱ; । కా లోకమ కొందఱకు; నిహంబును బరమున్
మే లగుఁ గొందఱ కధిపా! । యే లోకము లేదు వినవె యిలఁ గొందఱకున్. 173

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా! (ఓధర్మరాజా!); కొందఱకున్= కొంత మందికి; ఈ, లోకము+అ= ఈలోకం మాత్రమే; అగున్= ఏర్పడుతుంది, అనగా కొందరికి ఈభూలోకం సుఖంగా ఉంటుంది; కొందఱకున్= కొంతమందికి; ఆ లోకము+అ= ఆలోకం మాత్రమే అనగా కొంతమందికి పరలోకసౌఖ్యం మాత్రమే ప్రాప్తిస్తుంది; కొందఱకున్= కొంతమందికి; ఇహంబును= ఈ లోకమున్నూ; పరమున్= పరలోకమున్నూ; మేలు+అగున్= శుభంగా పరిణమిస్తుంది; ఇలన్= భూలోకంలో; కొందఱకున్= కొంత మందికి; ఏ, లోకము= ఏలోకం కూడా; లేదు= ఉండదు అనగా కొందరు ఏలోకంలోకూడా (ఇహంలోగాని పరంలోగాని) మేలు పొందలేరు; వినవు+ఎ= సావధానంగా విందువుగాక.

తాత్పర్యం: ధర్మరాజా! కొందరు ఈభూలోకంలో సౌఖ్యం అనుభవిస్తారు. కొందరకు పరలోకసౌఖ్యం కలుగుతుంది. కొందరికి ఇహపరాలలో రెండింటను మేలు కలుగుతుంది. కొందరికి ఇహపరసౌఖ్యాలు రెండూ దక్కవు. ఈ విషయాన్ని సావధానంగా వివరిస్తాను.

వ. అది యెట్లంటేని. 174

ప్రతిపదార్థం: అది= ఆవిషయం; ఎట్లు+అంటి(వి)+ఏని= ఏవిధంగా జరుగుతుందని ప్రశ్నించావా.

తాత్పర్యం: ఆ విషయం ఏరీతిగా సంభవిస్తుందని నీవు ప్రశ్నిస్తే దానికి సమాధానం చెప్పుతాను.

చ. ధనములు సాలఁ గల్గి సతతంబును నింద్రియవాంఛ సల్పుచున్
మనమున నెన్నఁడున్ సుకృతమార్గము పొంతకుఁ బోక లోభమో
హనిహతబుద్ధు లై తిరుగునట్టి జనుల్ పరలోకసౌఖ్యముల్
గనుటకు నేర; రిప్పటి సుఖంబులు మేలయి తోఁచు వారికిన్. 175

ప్రతిపదార్థం: లోభ, మోహ, నిహత, బుద్ధులు+ఐ= ఇతరుల ద్రవ్యాన్ని కైవసం కావించుకొనవలె ననే అత్యాశచేతను, ధర్మ మేదో తెలియక పోవటంవలన కలిగే తబ్బిబ్బుచేతను పోగొట్టబడిన బుద్ధికలవారై; తిరుగు+అట్టి; జనుల్= ప్రజలు; ధనములు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంపదలు; చాలన్= మిక్కుటంగా; కల్గి= ఉండి; సతతంబును= ఎల్లప్పుడున్నూ; ఇంద్రియ, వాంఛ, సల్పుచున్= ఐహిక సౌఖ్యాలను అనుభవించవలె ననే కోరికలు కోరుతూ; మనమునన్= మనసులో; ఎన్నఁడున్= ఎప్పుడున్నూ; సుకృత, మార్గము= పుణ్య పథం, మంచి త్రోవ; పొంతకున్= వైపునకు; పోక= వెళ్లక; పరలోక, సౌఖ్యముల్= ఆముష్మికసుఖాలు; కనుటకున్= పొందటానికి; నేరరు= సమర్థులు కారు; వారికిన్= అట్టివారికి- అనగా ధనవంతులై విషయలోలురై తిరుగాడేవారికి; ఇప్పటి, సుఖంబులు= వర్తమానకాలంలో భూలోకంలో అనుభవించే సౌఖ్యాలు; మేలు+అయి= మంచివి అయి; తోఁచున్= కన్పిస్తాయి.

తాత్పర్యం: అధిక సంపదలు కలిగి, పుణ్యం ఆర్జించే మార్గాలవైపునకు పోవక, లోభ మోహాలకు లోనై, విషయసుఖాలను అనుభవించవలె నని మనస్సులో ఎల్లప్పుడు తలపోసే వారు, ఆముష్మిక సౌఖ్యాన్ని సంపాదించ సమర్థులు కారు. వారికి ఐహికసుఖాలే మంచివిగా కనబడుతూ ఉంటాయి.

విశేషం: ఇంద్రియాలు పది. జ్ఞానేంద్రియాలు - చర్మం, కన్ను, చెవి, జిహ్వ, ముక్కు అయిదు. కర్మేంద్రియాలు- వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ - అయిదు. ఇంద్రియ నిగ్రహంతో కూడిన ఆత్మసంయమనమే విశ్వవిజయంగా సనాతన భారతీయసంస్కృతి పలుతావుల నొక్కి చెప్పింది.

మ. **ఉపవాసవ్రత సంతతాధ్యయన తీర్థోపాసనాది క్రియై**
క పరత్వంబునఁ జేసి యైహికము దుఃఖప్రాయమై పోవఁగా
విపులానందముఁ బొందఁ గల్గుఁ దుది నావిర్భూతభోగైకలో
లుపబుద్ధిం జిరపుణ్యశీలురకు నా లోకంబునన్ భూవరా! **176**

ప్రతిపదార్థం: భూ, వరా!= భూమికిభర్తవయిన ఓరాజా! (ఓధర్మరాజా!); ఉపవాస, వ్రత, సంతత+అధ్యయన, తీర్థ+ఉపాసన+ఆది, క్రియా+ఏక, పరత్వంబునన్= ఆహారం స్వీకరించక నియమంతో ఉండే నోములవలన ఎల్లప్పుడూ (వేదాలుమున్నగువాటిని) చదవటం, పుణ్యతీర్థాలకు యాత్రలు చేసి, జపాలు మున్నగు పనులను చేయటంలో మాత్రమే నిమగ్నమైఉండటం; చేసి= చేత; ఐహికము= ఈలోకంలోని అనుభవం; దుఃఖ, ప్రాయము+ఐ= శోకంతో కూడిందై; పోవఁగాన్= సాగగా; తుదిన్= చివరకు; ఆవిర్భూత, భోగ+ఏక, లోలుప, బుద్ధిన్= కేవల సౌఖ్యాలే (నిజమైన సౌఖ్యాలే) అనుభవించవలెనన్న తలంపు కలగటంచేత; చిర, పుణ్య, శీలురకున్= ఎల్లప్పుడున్నూ మంచిపనులనే చేసే స్వభావం కలవారికి; ఆ, లోకంబునన్= (మరణానంతరం చేరునట్టి) మరొకలోకంలో-అనగా పరలోకంలో; విపుల+ఆనందమున్= గొప్పదైన సంతోషం; పొందన్+కల్గున్= అనుభవించటానికి వీలు కల్గుతుంది.

తాత్పర్యం: ధర్మరాజా! నియమ నిష్ఠలతో కూడిన ఉపవాసవ్రతాలు, వేదాధ్యయనం, తీర్థయాత్రలు, మొదలైన పుణ్యకార్యాలు నిరంతరంగా చేయటంచేత ఈ లోకంలోని అనుభవం దుఃఖమయం కాగా, చివరకు కేవల సౌఖ్యాలే సత్యమైన సౌఖ్యాలే అనుభవించాలనే తలంపు జనించటంచేత చిరపుణ్యశీలురైన వీరికి పరలోకంలో గొప్ప సౌఖ్యాన్ని పొందటానికి వీలు కలుగుతుంది.

విశేషం: ఈ ప్రకరణంలో - సంస్కృత మహాభారతమూలంలోని ఈ శ్లోకం అనుశీలించదగింది.

యే యోగయుక్తాస్తపసి ప్రసక్తాః । స్వాధ్యాయశీలా జరయన్తి దేహాన్ ।
జితేంద్రియా భూతహితే నివిష్టా । సైషామసౌ నాయమరిఘ్నలోకః ॥ 11-186-39

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ధర్మము సల్పుచుం దగిలి ధర్మపథంబునఁ జేసి యర్థముం
బేర్మియుఁ గాంచి ధర్మవిధిఁ; బెండిలి యై ప్రజలన్ సృజించి స
త్కర్మములం బ్రశస్తములుగాఁ గ్రతువుల్ వొనరించు సజ్జనుల్
ధర్మజ! యిందు నందును ముదంబునఁ గాంతు రభీష్టసౌఖ్యముల్. 177

ప్రతిపదార్థం: ధర్మజ!= ఓధర్మరాజా!; ధర్మము+అ= ధర్మం మాత్రమే; సల్పుచున్= చేస్తూ; తగిలి= నిష్ఠతో; ధర్మ, పథంబునన్+చేసి= ధర్మమార్గాన్ని అనుసరించి; అర్థమున్= ధనాన్ని; పేర్మియున్= ఘనతను; కాంచి= పొంది; ధర్మ, విధిన్= ధర్మప్రకారంగా; పెండిలి+ఐ= వివాహం చేసికొని; ప్రజలన్= సంతానాన్ని; సృజించి= పుట్టించి, (కని); సత్, కర్మములన్= మంచి పనులు; (చేసి); ప్రశస్తములు, కాన్= మెచ్చ దగినట్లుగా; క్రతువుల్= యజ్ఞాలు; పొనరించు= చేసే; సత్+జనుల్= మంచివారు; అభీష్ట, సౌఖ్యముల్= కోరుకొనిన సుఖాలు; ఇందున్= ఈ భూలోకంలో; అందును= ఆ పరలోకంలోనూ; కాంతురు= పొందగలరు.

తాత్పర్యం: ధర్మరాజా! ధర్మాన్ని ఆచరించి, ధర్మమార్గాన్ని అనుసరించి, ధనాన్ని, గొప్పతనాన్ని ఆర్జించి, ధర్మయుక్తంగా వివాహం చేసికొని సంతానాన్ని కని, మంచికర్మలను ఆచరించి, మెచ్చదగిన యజ్ఞాలను చేసే మంచివారు ఈ భూలోకంలో ఆ పరలోకంలోకూడ వారు కోరుకొన్న సౌఖ్యాలను అనుభవిస్తారు.

ఆ. సత్యమును శమంబు శౌచంబు లేక, నా । స్తిక్యమును నిషిద్ధసేవనంబు
గలిగి తిరుగు దుష్టకష్టజనశ్రేణి । పొలియు నుభయలోకములకుఁ గాక. 178

ప్రతిపదార్థం: సత్యమును= సత్యాన్ని పాటించటం; శమంబు= ఇంద్రియ నిగ్రహం; శౌచంబు= శుచిత్వం అనగా పరిశుభ్రత; లేక= ఉండకుండగా; నాస్తిక్యమును= (వేదాల యందు) దేవుడియందు నమ్మకం లేకపోవటం; నిషిద్ధ, సేవనంబు= శాస్త్రాలు కూడదని వెలివేసినవాటిని ఆచరించటం; కలిగి= ఉండి; తిరుగు= సంచరించే; దుష్టకష్ట, జన, శ్రేణి= చెడ్డవారు, పాపులు అయిన మనుజుల సముదాయం; ఉభయ, లోకములకున్= రెండు లోకాలకు (అనగా ఇహ పరాలు రెండింటికి); కాక= సరిపడక; పొలియున్= నశిస్తుంది.

తాత్పర్యం: నిజాన్ని చెప్పక, ఇంద్రియనిగ్రహం పాటించక; పరిశుభ్రత (పవిత్రత) కలిగిఉండక, చేయగూడని పనులను చేస్తూ, నాస్తికులై తిరిగేవారు ఇహపరలోకాలు రెంటికి చెడినవారై చెడునడవడికతో దుఃఖాన్ని అనుభవిస్తూ నశిస్తారు.

వ. ఇది మనుష్యుల కర్మగతిప్రకారంబు. 179

ప్రతిపదార్థం: ఇది; మనుష్యుల= మానవుల; కర్మ, గతి, ప్రకారంబు= కర్మ నడిచే తీరు.

తాత్పర్యం: ఇది మానవుల కర్మ నడిచే తీరు.

చ. జనవర! మీరు దివ్యులరు; సమ్మతి దేవహితార్థ మి మ్మహిన్
జననము నొందినారరు; ప్రశస్తపరాక్రమలీలఁ బేర్చి యిం

క నఖిలశత్రునిర్మథనకర్మ మొనర్చి మహీభరంబు దీ
ర్చి నియతిఁ బెక్కు జన్నములు సేసి భజింతురు దేవభావమున్.' 180

ప్రతిపదార్థం: జనవర!= ఓ రాజా! (ధర్మరాజా!); మీరు; దివ్యులరు= దేవతల అంశలతో పుట్టినవారు; ఈ+మహిన్= ఈ భూలోకంలో; సమ్మతిన్= అంగీకారంతో; దేవహిత+అర్థము= దేవతలకు మేలు చేయటం కొరకై; జననమున్+ఒందినారరు= పుట్టారు; ఇంకన్= ఇక మీదట; ప్రశస్త, పరాక్రమ, లీలన్= మెచ్చదగిన శౌర్య మహిమ చేత; పేర్చి= అతిశయించి; అఖిల, శత్రు, నిర్మథన, కర్మము= సమస్తశత్రువులను సంహరించే కార్యాన్ని; ఒనర్చి= నిర్వహించి; మహీ, భరంబు+తీర్చి= భూమియొక్క బరువును తగ్గించి; నియతిన్= నిష్ఠతో; పెక్కు జన్నములు= అనేక యజ్ఞాలు; చేసి= ఒనర్చి; దేవ, భావమున్= దివ్యత్వాన్ని; భజింతురు= సేవిస్తారు - అనగా పొందుతారు.

తాత్పర్యం: జనపతివైన ధర్మరాజా! మీరు వేల్పుల అంశలతో ఈ భూలోకంలో జన్మించారు. దేవతల సమ్మతితో, వారికి మేలుచేయటం కోసం మీరు పుట్టారు. ఇకపై మీరు మీ పరాక్రమ వైభవాన్ని ప్రదర్శించి, సమస్తశత్రువులను జయించి, భూభారాన్ని తగ్గిస్తారు. పెక్కుయజ్ఞాలు చేసి, తప్పక దివ్యత్వాన్ని పొందుతారు'.

మార్కండేయుఁడు ధర్మరాజునకు బ్రాహ్మణప్రభావంబు సెప్పుట (సం. 3-182-1)

వ. అనిన విని ధర్మనందనుండు 'బ్రాహ్మణప్రభావంబు వినవలతుం జెప్పవే' యనిన మార్కండేయుం డిట్లని చెప్పెఁ; దొల్లి హైహయవంశోద్భవుండైన ధుంధుమారుండను కుమారుండు మృగయాసక్తుండై వనంబునఁ గ్రుమ్మరువాఁ డొక్కయెడం దృణలతాగుల్మమధ్యంబునం గృష్ణాజినోత్తరీయుం డై యున్నవాని నొకవిప్రు దవ్వులం గని మృగం బను బుద్ధిం జేసి యేసి, డాయంజని, నిశ్చేతనుండైన యతనిం జూచి యత్యంతదుఃఖితుండయి పురంబునకుం బోయి నిజవంశవృద్ధులైన హైహయుల కంత వృత్తాంతంబునుం జెప్పి, వారిం దోడ్కొని వచ్చి యవ్విప్రకళేబరంబు సూపిన. 181

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ధర్మనందనుండు= ధర్మరాజు; బ్రాహ్మణ, ప్రభావంబు= బ్రాహ్మణులయొక్క మహిమ; వినవలతున్= ఆలకించగోరుతున్నాను; చెప్పవే= వచింపవలయును; అనినన్= అని పల్కగా; మార్కండేయుండు= మార్కండేయుడు; ఇట్లు+అని= ఈవిధంగా; చెప్పెన్= వచించాడు; తొల్లి= పూర్వకాలంలో; హైహయ, వంశ+ఉద్భవుండు+ఐన= హైహయ వంశంలో పుట్టిన; ధుంధుమారుండు+అను= ధుంధుమారుడు అనే పేరు కల; కుమారుండు= పుత్రుడు (యువకుడు); మృగయా+ఆసక్తుండు+ఐ= వేటయందు మిక్కిలి ఇష్టంకలవాడై; వనంబునన్= అడవిలో; క్రుమ్మరు వాఁడు= తిరిగేవాడు; ఒక్క+ఎడన్= ఒకచోట; తృణ, లతా, గుల్మ, మధ్యంబునన్= గడ్డితీగల, పొదల సందున; కృష్ణ+అజిన+ ఉత్తరీయుండు+ఐ= జింకచర్మాన్ని పైన వేసికొనే వస్త్రంగా కప్పుకొన్నవాడై; ఉన్నవానిన్= ఉన్నవాడిని; ఒక, విప్రున్= ఒక బ్రాహ్మణుడిని; దవ్వులన్+కని= దూరం నుండి చూచి; మృగంబు+అను, బుద్ధిన్+చేసి= లేడి అనే ఊహతో (జింకగా భావించి); ఏసి= (బాణాన్ని) ప్రయోగించి; డాయన్+చని= దగ్గరకు వెళ్ళి; నిస్+చేతనుండు+ఐన= కదలిక లేక ఉండగా (చనిపోయి ఉండగా); అతనిన్+చూచి= వాడిని చూచి; అతి+అంత, దుఃఖితుండు+అయి= మిక్కిలివిషాదంతో కూడినవాడై; పురంబునకున్+పోయి= నగరానికి వెళ్ళి; నిజ, వంశ, వృద్ధులు+ఐన= తనవంశంలో వయసు మళ్ళిన పెద్దలు అయిన; హైహయులకున్= హైహయవంశంలో పుట్టినవారికి; అంత, వృత్తాంతంబునున్= సమస్త సమాచారాన్ని; చెప్పి; వారిన్= వారలను; తోడ్కొని వచ్చి= వెంట బెట్టుకొని తీసికొని తెచ్చి; ఆ+విప్ర, కళేబరంబు= ఆ బ్రాహ్మణుడియొక్క శరీరాన్ని; చూపినన్= చూపగా.

తాత్పర్యం: అని చెప్పగా, ధర్మరాజు బ్రాహ్మణమహిమను వినగోరి, ఆ విషయాన్ని వివరించుమని అడుగగా మార్కండేయమహర్షి ఈ విధంగా చెప్పాడు: పూర్వకాలంలో హైహయవంశానికి చెందిన రాజకుమారుడు ధుంధుమారుడు వేటకొరకై అడవిలో తిరుగుతూ జింక చర్మాన్ని ఉత్తరీయంగా ధరించి, పొదలమాటున ఉన్న ఒక యువకుడిని చూచి, జింకగా భ్రమించి బాణప్రయోగం చేసి దగ్గరకు వెళ్ళాడు. అక్కడ ఆ విప్రుడి మృతకళేబరాన్ని కాంచి, మిక్కిలి దుఃఖించి, రాజధానికి వెళ్ళి జరిగినసంగతి తన పెద్దవారికి వివరించి, వారిని వెంటబెట్టుకొని అడవికి తోడ్కొనితెచ్చి, ఆ బ్రాహ్మణుడి శవాన్ని చూపాడు.

తే. **వార లందఱు వందురి వగచి యచటి । కతిసమీపంబునను దార్క్ష్యుఁడను మునీంద్రు**
నాశ్రమం బున్న నయ్యెడ కరిగి కనిరి । దేవమునిసిద్ధలోకప్రతీక్ష్యుఁ దార్క్ష్యు. 182

ప్రతిపదార్థం: వారలు+అందఱు= వారలు అనగా వృద్ధ హైహయులు అందరు; వందురి= దుఃఖించి; వగచి= విచారించి; అచటికిన్= ఆ ప్రదేశానికి; అతి సమీపంబునను= మిక్కిలి దగ్గరగా; తార్క్ష్యుఁడు+అను= తార్క్ష్యుడు అనే పేరుకల; ముని+ఇంద్రు+ఆశ్రమంబు+ఉన్నన్= ఋషులలో శ్రేష్ఠుడైన వాడి కుటీరం ఉండగా; ఆ+ఎడకున్= ఆ చోటికి; అరిగి= వెళ్ళి; దేవ, ముని,సిద్ధ, లోక, ప్రతీక్ష్యున్= వేల్పులు, ఋషులు, సిద్ధులసమూహాలు ఎదురుచూడదగినవాడిని; తార్క్ష్యున్; కనిరి= చూచారు.

తాత్పర్యం: అంతట, ఆ వృద్ధహైహయులు అందరున్నూ, అచటికి దగ్గరగా ఉన్న తార్క్ష్యుడు అనే పేరుగల మహర్షి ఆశ్రమానికి వెళ్ళారు. ఆ మహర్షి సందర్శనానికై వేల్పులు, మునులు, సిద్ధులు ఎదురుచూడటం కద్దు. అంతటి మహానుభావుడు ఆ తార్క్ష్య మహర్షి

క. **కని భక్తి మ్రొక్కుటయు, న । య్యనఘుఁడు దీవించి వారి కర్హమ్మగు పూ**
జనము లొనరింపఁ బంచెం । దన శిష్యులఁ బరమసంశితవ్రతుఁడు దయన్. 183

ప్రతిపదార్థం: కని= చూచి; భక్తిన్= భక్తితో; మ్రొక్కుటయున్= నమస్కారం చేయగా; ఆ+అనఘుఁడు= పాపరహితుడైన ఆ మహానుభావుడు; దీవించి= ఆశీర్వదించి; వారికిన్= (ఆ హైహయులకు); అర్హమ్ము+అగు= తగినట్లుగా; పూజనములు= సత్కారపూర్వకంగా చేసే ఆతిథ్యమర్యాదలు; ఒనరింపన్= చేయటానికి; తనశిష్యులన్= తనదగ్గర చదువుకొనే విద్యార్థులను; పరమ, సంశిత, వ్రతుఁడు= తీక్ష్ణమైన వ్రతానుష్ఠానం కలవాడు; దయన్= కరుణతో; పంచెన్= నియోగించాడు.

తాత్పర్యం: ఆ హైహయులు తనను సందర్శించి నమస్కారం చేయగా, తీక్ష్ణమైన వ్రతానుష్ఠానంతో కూడిన గొప్ప సౌశీల్యం కల ఆ మహర్షి వారిని దీవించి, వారికి ఆతిథ్యమర్యాదలు చేయటానికి తనశిష్యులను నియోగించాడు.

వ. **హైహయులు నమ్మునీంద్రునకు సాష్టాంగదండప్రణామంబుసేసి 'మహాత్మా! యిక్కుమారుండు మృగయాసక్తుం డై వచ్చి యింతకుమున్న యివ్వనంబున నొక్కబ్రాహ్మణుం గృష్ణాజినసంవృతు నతిశాంతుం బాపంబునం జేసి మృగం బను బుద్ధి నేసిన నతండు మృతుం డయ్యె; నేము మహాపాతకదూషితుల మైతిమి గావున మీ చేయు సత్కారంబుల కర్హులము గా; మిప్పాపంబున కెయ్యది నిష్కృతి?' యనిన నవ్వుచుఁ దార్క్ష్యుం డి ట్లనియె. 184**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: హైహయులున్= హైహయ వంశంలో పుట్టినవారు; ఆ+ముని+ఇంద్రునకున్= మునులలో శ్రేష్ఠుడైన ఆతడికి; స+అష్ట+అంగ, దండ, ప్రణామంబు+చేసి= ఎనిమిది అవయవాలు భూమిని తాకేటట్లుగా నమస్కారం చేసి; మహా+ఆత్మ!= గొప్పఆత్మకలవాడా!; ఈ+కుమారుండు= ఈ(రాజ)పుత్రుడు; మృగయా+ఆసక్తుండు+ఐ= వేటయందు మిక్కిలి కోరిక కలవాడై; వచ్చి= చేరి; ఇంతకున్, మున్ను+అ= ఇంతకు ముందే; ఈ+వనంబునన్= ఈ అడవిలో; ఒక్క, బ్రాహ్మణున్= ఒక విప్రుడిని; కృష్ణ+అజిన, సంవృతున్= జింకచర్మంచేత చుట్టబడినవాడిని (జింకచర్మాన్ని కప్పుకొని ఉన్నవాడిని); అతిశాంతున్= వికారాలు ఉపశమించిన మిక్కిలి నెమ్మదితో కూడినవాడిని; పాపంబునన్+చేసి= పాపంచేత (పాపంప్రాప్తించేకర్మవలన); మృగంబు+అను, బుద్ధిన్= జింక అనే ఊహతో; ఏసినన్= (బాణాన్ని ప్రయోగించి) కొట్టగా; అతండు= (ఆ బ్రాహ్మణయువకుడు); మృతుండు+అయ్యెన్= మరణించాడు; ఏము= మేము; మహా, పాతక, దూషితులము+ఐతిమి= గొప్ప పాపంచేత చెరుపబడినవారము ఐనాము; కావునన్= కాబట్టి; మీ, చేయు= మీరు చేసే; సత్కారంబులకున్= గౌరవమర్యాదలకు; అర్హులము, కాము= తగినవారము కాము; ఈ+పాపంబునకున్= ఈ పాపానికి; ఏ+అది= ఏది; నిష్కృతి= పరిహారం; అనినన్= అని అడుగగా; నవ్వుచున్= నవ్వుతూ; తార్క్ష్యుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: హైహయులు మహానుభావుడైన ఆ ఋషికి సాష్టాంగ నమస్కారం చేసి, 'మహాత్మా!, యువకుడైన ఈ రాకుమారుడు వేటపట్ల తమకంతో- జింకచర్మం ధరించి పొదల మాటున ప్రశాంతంగా తపస్సు చేసికొంటున్న బ్రాహ్మణకుమారుడిని, జింకగా భ్రాంతి చెంది, బాణంతో కొట్టి సంహరించాడు. అందుచేత మేము అందరం పాతకుల మైనాము. కాబట్టి, మీరు చేసే ఈ ఆతిథ్యసత్కారాలు పొందే అర్హతను మేము కోల్పోయాం. ఈ మహాపాపానికి ఏదైనా పరిహారం ఉన్నదా? దయచేసి తెలుపండి' అని విన్నవించారు. అంతట ఆ మహర్షి చిరునవ్వుతో ఇట్లా బదులు పలికాడు.

క. 'వినుఁ డెన్నఁడు మా యాశ్రమ । మున నెవ్వారలకు లేవు భూరిభయవ్యా
ధినిరోధమృత్యుదోషా । ద్యనేకదుఃఖములు త్రిజగదాశ్చర్యముగన్. 185

ప్రతిపదార్థం: వినుఁడు= ఆలకించండి; ఎన్నఁడు= ఎప్పుడైనా కాని; మా+ఆశ్రమమునన్= మా ఆశ్రమంలో; ఏ+వారలకున్= ఎట్టివారికి కాని; త్రి, జగత్+ఆశ్చర్యముగన్= మూడులోకాలకు అచ్చెరువు కొలిపేటట్లుగా; భూరి, భయ, వ్యాధి, నిరోధ, మృత్యు, దోష+ఆది+అనేక, దుఃఖములు= గొప్పవైన వెఱపు, రోగం, చెరబడటం, చావు మున్నగు దోషాలవలన ఏర్పడే పెక్కు బాధలు; లేవు= ఉండవు.

తాత్పర్యం: 'ఆలకించండి. మా ఆశ్రమంలో ఏ కాలంలోనూ, ఎవరికిగాని భయం, రోగం, చావు, చెరబడటం, వీటివలన సంక్రమించే బాధలు ఏర్పడవు. ఈ విషయం మూడులోకాలకు అచ్చెరువు గొలిపేటటువంటిది.'

వ. అని పలికి తనపుత్త్రు నధికతపోబలసమన్వితుం జూపి. 186

ప్రతిపదార్థం: అని పలికి= అనిచెప్పి; అధిక, తపస్+బల, సమన్వితున్= గొప్పతపస్సు అనే బలంచేత కూడినవాడైన; తన, పుత్త్రున్= తనకుమారుడిని; చూపి.

తాత్పర్యం: అని చెప్పి, గొప్పతపస్సు అనే బలం కలిగిన తన కుమారుడిని చూపించి (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'ఈతఁ డగునె మీ బాలకు । చేత నిహతుఁ డైనవాఁడు సెప్పుఁ' డనుడు వా
రాతఁడ తమ మును చూచిన । యాతం డగుటకు మహాద్భుతాత్మకు లగుచున్. 187

ప్రతిపదార్థం: మీ, బాలకుచేతన్= మీ(రాజ)పుత్రుడిచేత; నిహతుఁడు+ఐనవాఁడు= చంపబడినవాడు; ఈతఁడు+అగునన్+ఎ= ఇతడే అగునా?; చెప్పుఁడు= వచించండి; అనుడున్= అని చెప్పగా; వారు= (ఆ హైహయులు); ఆతఁడు+అ= అతడే; తమ, మును, చూచిన, ఆతండు+అగుటకున్= తాము లోగడ చూచిన వాడే కావటంవలన - అనగా చంపబడినవాడే కావటంవలన; మహా+అద్భుత+ఆత్మకులు+అగుచున్= గొప్ప ఆశ్చర్యాన్ని పొందిన హృదయాలు కలవారు ఔతూ.

తాత్పర్యం: 'ఈతడేనా మీ రాజకుమారుడిచేత చంపబడినవాడు? చెప్పండి' అని ఋషీశ్వరుడు హైహయులను అడిగాడు. ఆ హైహయులు అతడిని చూచి, లోగడ మరణించినవాడు, తాము చూచినవాడు ఆ యువకుడే అని గుర్తించి ఆశ్చర్యం చెందారు.

క. 'మృతుఁ డయి క్రమ్మఱ సం । జీవితుఁ డయ్యె నితండు; కరము విస్మయ మిది భూ
నుత! యిట్టి మహిమ కలిమికిఁ । గత మెయ్యది? యానతిమ్ము కారుణ్యమునన్. 188

ప్రతిపదార్థం: భూనుత!= భూమి యందలి ప్రజలచేత పొగడ బడినవాడా!; ఇతండు= ఈ బ్రాహ్మణకుమారుడు; మృతుఁడు+అయి= చనిపోయి; క్రమ్మఱన్= మరల; సంజీవితుఁడు+అయ్యెన్= తిరిగి బ్రదికినవా డయ్యాడు; ఇది= ఇది; కరము= మిక్కిలి; విస్మయము= ఆశ్చర్యకరమైనది; ఇట్టి= ఈవిధమైన; మహిమ, కలిమికిన్= ప్రభావం కలిగి ఉండటానికి; కతము+ఏ+అది= కారణం ఏది; కారుణ్యమునన్= దయతో; ఆనతి+ఇమ్ము= వివరించి చెప్పండి.

తాత్పర్యం: 'భూజనులచేత పొగడబడిన ఓ మహానుభావా! ఈ బ్రాహ్మణ కుమారుడు మరణించి మరల బ్రతికాడు. ఇది మిక్కిలి ఆశ్చర్యకరమైన అంశం. మీకు ఇట్టి మహిమ ఏర్పడటానికి గల కారణం దయచేసి వివరించి చెప్పండి'.

వ. అని యడిగినఁ దార్క్ష్యుం డిట్లనియె. 189

తాత్పర్యం: ఆవిధంగా అడుగగా తార్క్ష్యుడు ఇట్లా అన్నాడు.

శా. ఆలస్యం బొక యింత లేదు, శుచి యాహారంబు, నిత్యక్రియా
జాలం బేమఱ, మర్చనీయు లతిథుల్, సత్యంబ పల్కంబడున్,
మేలై శాంతియు బ్రహ్మచర్యమును నెమ్మిం దాల్తు; మట్లౌట నె
క్కాలంబుం బటురోగమృత్యుభయశంకం బొంద మే మెన్నఁడున్. 190

ప్రతిపదార్థం: ఆలస్యంబు+ఒక+ఇంత, లేదు= జాగుచేయటం ఎంతమాత్రమూ ఉండదు; ఆహారంబు= భోజనం; శుచి= పరిశుభ్రంగా ఉంటుంది; నిత్య, క్రియా, జాలంబు+ఏమఱము= ప్రతిదినమూ జరుపవలసిన పనులను చేయటం ఏమాత్రమూ మరచిపోము; అతిథుల్= ఇంటికి వచ్చేవారు; అర్చనీయులు= పూజింపబడుతుంటారు; సత్యంబు+అ= నిజం మాత్రమే; పల్కంబడున్= మాచే వచించబడుతూ ఉంటుంది; నెమ్మిన్= ప్రీతితో; మేలు+ఐ= శుభంకలిగి, లేదా మేలు పొంది; శాంతియున్= ఎట్టి వికారాలు లేని నెమ్మదియు; బ్రహ్మచర్యమును= ఇంద్రియనిగ్రహంతో కూడిన నిష్కామవ్రతాన్ని; తాల్తుము=

ధరిస్తాము; అట్లు+ఔటన్= ఆ విధంగా ఉండటంచేత; ఏము= మేము; ఎన్నఁడున్= ఎప్పుడుకూడా; ఏ+కాలంబున్= ఏ సమయంలో కూడా; పటు, రోగ, మృత్యు, భయ, శంకన్= తీవ్రమైనరోగ, మరణ, భయ, ఆందోళనలను; పొందము= అనుభవించం.

తాత్పర్యం: మహర్షి చెప్పిన సమాధానం ఇది - ' ఈఆశ్రమంలో మేము కొన్ని నియమాలను నిష్ఠతో ఆచరిస్తాం. ఇక్కడ మేం ఎన్నడున్నూ కాలహరణం చేయం. ఆహారం పరిశుభ్రంగా ఉంచుతాం. అతిథులను పూజిస్తాం. సత్యవ్రతాన్ని సదా పాటిస్తాం. శాంతి, బ్రహ్మచర్యం మాకు మేలైన అనుష్ఠానాలు. ఇట్టి నియమాలను నిష్ఠతో పాటించటంచేత, ఇక్కడ మాకు మృత్యుభయమే లేదు. అట్లాగే ఎటువంటి భయాందోళనలకూ ఈ ఆశ్రమంలో తావు లేదు.

విశేషం: కాలంయొక్క విలువను గుర్తించి ఒక్క నిముసంకూడ వృథాపుచ్చక పోవటం, ఆహారపరిశుభ్రత, అతిథిసత్కారం, సత్యవ్రతం, బ్రహ్మచర్యదీక్ష, శాంతి - అలనాటి ప్రాచీనభారతీయ ఆశ్రమజీవితంలో మృత్యుంజయసిద్ధిగా అనుష్ఠించబడేవని స్పష్టం.

వ. ఇది యస్మదీయ ప్రభావంబు; మీకుఁ బాతకభయంబువలవ; దరుగుం' డనినం దార్క్ష్యు వీడ్కొని హైహయులు నిజనివాసంబులకుం జనిరి; భరతవంశోత్తమ! యిట్టిది బ్రాహ్మణప్రభావం' బని మఱియు మార్కండేయుండు 'బ్రహ్మక్షత్రస్వరూపనిదర్శనం బయిన యొక్కయితిహాసంబు సెప్పెద విను' మని ధర్మరాజున కిట్లనియె.191

ప్రతిపదార్థం: ఇది, అస్మదీయ, ప్రభావంబు= ఇది మాదైన మహిమ; మీకున్= మీకు; పాతక, భయంబు= పాపం దాపురిస్తుందనే వెరపు; వలవదు= పెట్టుకొన నవసరం లేదు; అరుగుండు= వెళ్ళండి; అనినన్= అని చెప్పగా; తార్క్ష్యున్= తార్క్ష్యుడిని (వద్ద); వీడ్కొని= సెలవుగైకొని; హైహయులు; నిజ, నివాసంబులకున్= తాము నివసించే గృహాలకు; చనిరి= వెళ్ళారు; భరత, వంశ+ఉత్తమ!= భరతవంశాన పుట్టిన వారిలో శ్రేష్ఠుడా! (ధర్మరాజా!); బ్రాహ్మణ, ప్రభావంబు= బ్రాహ్మణులయొక్క మహిమ; ఇట్టిది= ఇటువంటిది; అని= అనిచెప్పి; మఱియున్= మరల; మార్కండేయుండు; బ్రహ్మ, క్షత్ర, స్వరూప, నిదర్శనంబు+అయిన= బ్రాహ్మణులయొక్కయు, క్షత్రియుల యొక్కయు కలరూపును (నిజస్వభావాన్ని) తెలిపేదైన; ఒక్క+ఇతిహాసంబు= ఒక కథ; చెప్పెదన్= వినిపిస్తాను; వినుము; అని; ధర్మరాజునకున్= ధర్మపుత్రుడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఇది మా మహిమ. మీకు పాపం వస్తుందనే భయం లేదు వెళ్ళండి' అని చెప్పగా, ఆ హైహయులు ఆ మహర్షి వద్ద సెలవు తీసికొని, తమ ఇండ్లకు వెళ్ళారు. భరతవంశంలో శ్రేష్ఠుడవైన ఓధర్మరాజా! బ్రాహ్మణులయొక్క మాహాత్మ్యం ఇటువంటిది' అని చెప్పి, 'ఈ గాథయేకాక, బ్రాహ్మణుల క్షత్రియుల స్వభావాలను వివరించే మరొక గాథ కూడ వినిపిస్తాను; సావధానంగా ఆలకించుము' అని మార్కండేయమహర్షి ధర్మరాజుతో ఈవిధంగా అంటున్నాడు.

విశేషం: మహాభారతంలో - 'సంబోధనలు' పలురీతుల కానిపిస్తాయి. 'మీకు పాతకభయంబు వలవ దరుగుండు' - అనే మాటలు తార్క్ష్యుడు హైహయులకు చెప్పినవి. ఇక-'భరతవంశోత్తమ' అనే సంబోధనం - మార్కండేయమహర్షి ధర్మరాజును ఉద్దేశించినట్టిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. వినుతచరిత్రుఁ డత్రి యను విప్రవరుండు తపం బొనర్పఁ గా
ననమున కేఁగుచుండి తన నాతిఁ గనుంగొని యిట్లనుం 'దపం
బున కిదె యేను బూని వనభూమికిఁ బోవుచు నున్నవాఁడ, నో
వనరుహనేత్ర! నీవు నట వచ్చెదొ పుత్త్రులయొద్ద నుండెదో.' 192

ప్రతిపదార్థం: వినుతచరిత్రుఁడు= మిక్కిలి గొప్పగా పొగడబడిన జీవితం కలవాడు; అత్రి+అను, విప్రవరుండు= అత్రి అనే పేరుగల బ్రాహ్మణోత్తముడు; తపంబు+ఒనర్పన్= తపస్సు చేసికొనటానికి; కాననమునకున్= అడవికి; ఏఁగుచున్+ఉండి= వెళ్ళుతూ; తన, నాతిన్= తన వనితను (భార్యను); కనుంగొని= చూచి; ఇట్లు+అనున్= ఈవిధంగా వచించాడు; ఓవనరుహనేత్ర!= పద్మాలవంటి కన్నులు కలదానా!; ఇది+ఎ= ఇదే= ఇప్పుడే; ఏను= నేను; తపంబునకున్= తపస్సు చేసికొనటానికై; పూని= సిద్ధపడి; వనభూమికిన్= అడవికి; పోవుచున్+ఉన్నవాఁడన్= వెళ్లుతూ ఉన్నాను; నీవున్= నీవు కూడా; అట వచ్చెదు+ఒ= అక్కడికి వస్తావో; పుత్త్రులయొద్దన్= కొడుకులదగ్గర; ఉండెదో= నివసిస్తావో.

తాత్పర్యం: మహానుభావుడైన అత్రి అనే బ్రాహ్మణశ్రేష్ఠుడు తపస్సుచేసికొనటానికై అడవికి వెళ్ళాలని తలపోసి తన భార్యను సమీపించి, ఈవిధంగా అన్నాడు: 'పద్మాలవంటి కన్నులుకలదానా! ఏను తపస్సు చేసికొనటానికై అరణ్యానికి పోవ సంకల్పించాను. నీవు నాతోపాటు అరణ్యానికి వస్తావా? లేక, నీకొడుకులదగ్గరనే ఉంటావా?'

చ. అనుటయు భార్య యిట్లనియె 'నక్కట! పుత్త్రులకుం గుటుంబభా
ర నియమవృత్తు లెల్లను దిరంబుగఁ జేయక యాశ్రమాంతరం
బునకు మహాత్మ! నీకు నిటు వోవుట ధర్మువు గాదు; వైన్యభూ
జనపతి యిచ్చు నర్థులకుఁ జాలఁగ; నర్థము వేఁడు మవ్విభున్.' 193

ప్రతిపదార్థం: అనుటయున్= అనిచెప్పగా; భార్య= అత్రి మహర్షి పెండ్లం; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పింది; అక్కట!= అయ్యో!; మహా+ఆత్మ!= ఓ మహానుభావా!; పుత్త్రులకున్= కొడుకులకు; కుటుంబ, భార, నియమ, వృత్తులు+ఎల్లను= కుటుంబాన్ని ఏవిధంగా మోయవలెనో అందుకు ఏర్పరచదగిన కట్టుబాటులు, జీవనోపాయాలు అన్నిటిని; తిరంబుగన్= నిలుకడగా; చేయక= ఏర్పాటు చేయకుండా; ఆశ్రమ+అంతరంబునకున్= ఇంకొక ఆశ్రమానికి; ఇటు, పోవుట= ఈవిధంగా పోవటం, నీకున్= నీకు; ధర్మువు+కాదు= ధర్మం కాదు; వైన్యభూజనపతి= వైన్యప్రభువు; అర్థులకున్= వేడినవారికి; అర్థము= ధనం; చాలఁగన్= మిక్కుటంగా; ఇచ్చున్= దానంచేస్తాడు; ఆ+విభున్= ఆ రాజును; వేఁడుము= ప్రార్థించుము.

తాత్పర్యం: అని చెప్పగా అత్రిభార్య ఈవిధంగా సమాధానం చెప్పింది. 'అయ్యో, ఓ మహానుభావా! కుటుంబంయొక్క బరువును ఏవిధంగా భరించవలెనో, ఎట్టి ఏర్పాటులు అవసరమో, కొడుకులకు బాగా విశదీకరించి కట్టుబాటులు, జీవనాధారాలు చేయకుండానే, గృహస్థాశ్రమాన్ని విడిచి వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించటం మీబోటివారికి ధర్మంకాదు. వైన్యమహారాజు వేడినవారికి ధనాన్ని దానం చేస్తాడు. ఆప్రభువును ప్రార్థించి కావలసిన ధనాన్ని సంపాదించి కొడుకులకు ఇచ్చి, అటుపిమ్మట నీవు తపస్సుకై అడవికి పోవచ్చును.'

విశేషం: ప్రాచీన భారతీయ సంస్కృతి ప్రకారం మానవజీవితం - బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం - అని నాలుగు ఆశ్రమాలుగా వింగడించబడింది. శైశవేఽభ్యస్తవిద్యానాం యౌవనే విషయైషిణామ్ । వార్ధకే మునివృత్తీనాం యోగేనాంతే

తనుత్యజామ్॥'' అని కాళిదాసు రఘువంశం. చిన్నతనంలో విద్యాభ్యాసం చేయాలి; యౌవనంలో గృహస్థాశ్రమాన్ని స్వీకరించి విషయ భోగాలను అనుభవించాలి; ముసలితనంలో వానప్రస్థంలో ఇంద్రియనిగ్రహంతో ఇలువీడి కుటుంబానికి దూరంగా ఉండాలి. మరణించటానికి పూర్వమే సన్న్యాసం స్వీకరించాలి. ఇది సనాతన భారతీయసంప్రదాయం. ఏ వయసుకు తగిన ఆశ్రమం ఆ వయస్సున పాటించాలి. ఆమరణ బ్రహ్మచర్యాన్నిగాని శాశ్వతభోగలాలసత్వాన్నిగాని సనాతనభారతీయసంస్కృతి శాసించ లేదు.

వ. **అనినం గొండొక విచారించి భార్యపలుకులు ధర్మయుక్తంబు లగుటకు సంతసిల్లి, యమ్మహాద్విజుం డప్పుడు చని యశ్వమేధాధ్వరదీక్షితుండయి, విప్రులకు నపారధనంబు లిచ్చుచున్న వైన్యుం గని యాశీర్వాద పురస్సరంబుగా ని ట్లనియె.** **194**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+మహా, ద్విజుండు= ఆ గొప్పబ్రాహ్మణుడు; కొండొక, విచారించి= కొంత ఆలోచన చేసి; భార్య, పలుకులు= పెండ్లాం చెప్పిన మాటలు; ధర్మ, యుక్తంబులు+అగుటకున్= ధర్మంతో కూడినవి కావటంచేత; సంతసిల్లి= సంతోషించి; అప్పుడు= ఆ వేళలో; చని= వెళ్ళి; అశ్వమేధ+అధ్వర, దీక్షితుండు+అయి= అశ్వమేధ మనే యజ్ఞాన్ని చేయటానికి పూనినవాడై; విప్రులకున్= బ్రాహ్మణులకు; అపార, ధనంబులు= మితి లేని ద్రవ్యాలను; ఇచ్చుచున్+ఉన్న= దానం చేస్తున్న; వైన్యున్= వైన్యుడు అనేరాజును; కని= చూచి; ఆశీర్వాద, పురస్సరంబుగాన్= దీవెనలు మొట్టమొదట చేసినవాడై; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: అత్రికి భార్య చెప్పిన మాటలు నచ్చినవి. ఆమె మాటాడింది ధర్మంగా ఉన్నట్లు ఆయన భావించి, కొంత తడవు ఆలోచించి, ఆ బ్రాహ్మణోత్తముడు వైన్య మహారాజు కడకు వెళ్ళాడు. అప్పుడు ఆ మహారాజు అశ్వమేధయాగ దీక్ష వహించి ఉంటూ బ్రాహ్మణులకు మితి లేని ధనాలను దానం చేస్తున్నాడు. అత్రి మహాముని ఆ మహారాజును సమీపించి మొట్టమొదట ఆశీర్వాదం చెప్పి, తదుపరి ఈవిధంగా అన్నాడు.

ఉ. **'నీవ విధాత, వింద్రుఁడవు నీవ, సమస్తజనేశ్వరుండవున్**
నీవ, యశేషధర్మములు నీవ యెఱుంగుదు, నిన్నుఁ బోలఁగా
నీ వసుధాతలంబున మహీశ్వరు లెవ్వరు లేరు, సన్మునీం
ద్రావలి యెప్డు నిన్నుఁ గొనియాడుఁ బరిస్ఫుటవాక్యభంగులన్.' **195**

ప్రతిపదార్థం: నీవు+అ= నీవే; విధాతవు= బ్రహ్మదేవుడవు; నీవు+అ= నీవే, ఇంద్రుఁడవు= వేల్పులరాజవు; నీవు+అ= నీవే; సమస్త, జన+ఈశ్వరుండవున్= సమస్తజనులకు పతియైన పరమేశ్వరుడవు; నీవు+అ= నీవే; అశేష, ధర్మములు= సమస్త ధర్మాలు; ఎఱుంగుదు= తెలిసిఉన్నావు; ఈ, వసుధా, తలంబునన్= ఈభూతలంలో; నిన్నున్+పోలఁగాన్= నీతో సరితూగ గల; మహీ+ఈశ్వరులు= మహారాజులు; ఎవ్వరున్ లేరు= ఎవరూ లేరు; పరిస్ఫుట, వాక్య, భంగులన్= తేటతెల్లమయ్యే వాక్యాల తీరు తీయాలతో; సత్+ముని+ఇంద్ర+ఆవలి= ఉత్తమ ఋషుల సముదాయం; ఎప్డు= ఎల్లప్పుడు; నిన్నున్= నిన్ను; కొనియాడున్= ప్రశంసిస్తుంది.

తాత్పర్యం: 'ఓ మహారాజా! నీవే బ్రహ్మదేవుడవు; నీవే ఇంద్రుడవు; సమస్తధర్మాలు తెలిసిన వాడవు నీవే; నీతో సరిపోలిన మహారాజులు ఈ భూప్రపంచంలో మరి ఎవ్వరూ లేరు. తేటతెల్ల మయ్యే మాటల నుడికారపు ఇంపు సొంపులతో మేలి ఋషులు మహానుభావులు నిన్ను సదా ప్రశంసిస్తారు.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. అని పలుకంగ గౌతమమహాముని యచ్చట నుండి యంతయున్
విని, కలుషించి, 'యేల యిటు వీఁకున నో రఱగంగఁ బ్రేలె; దీ
జనపతియే విధాతయును శక్రుఁడు నీశుఁడు నర్థకాంక్షి వై
మనమున శంక లేక యొక మానవు నింత నుతింప నేటికిన్?' 196

ప్రతిపదార్థం: అని పలుకంగన్= అని వచించగా; గౌతమ, మహా, ముని= గౌతముడు అనే గొప్పఋషి; అచ్చటన్+ఉండి= అక్కడ ఉండి; అంతయున్; విని; కలుషించి= కోపించి; ఏల= ఎందుకు; ఇటు= ఈవిధంగా; వీఁకునన్= పూనికతో; నోరు+అఱుగంగన్= నోరు అరిగేటట్లుగా; ప్రేలెదు= నోటికి వచ్చినట్లు మాటాడతావు; ఈ జనపతియే= ఈమహారాజే; విధాతయును= బ్రహ్మయును; శక్రుఁడున్= ఇంద్రుడూ; ఈశుఁడున్= శివుడూనా; అర్థకాంక్షివి+ఐ= ధనాన్ని కోరుతున్నవాడి వై; మనమునన్= మనస్సులో; శంకలేక= జంకు గొంకులు లేకుండా; ఒక మానవున్= ఒక మనుష్యుడిని; ఇంత= ఈవిధంగా గొప్ప చేసి; నుతింపన్+ఏటికిన్?= పొగడటం ఎందుకు?

తాత్పర్యం: అని అత్రి ఆ విధంగా ప్రశంసించగా, అక్కడ ఉన్న గౌతమమహర్షి ఆ స్తోత్రాన్ని అంతా విని, ఆగ్రహించి ఈ విధంగా పలికాడు: 'ఓ అత్రీ! నీవు కేవలం ధనకాంక్షతో నోటికి వచ్చినట్లు ప్రేలుతున్నావు. ఈ మహారాజు నిజంగా బ్రహ్మదేవుడా? ఇంద్రుడా? శివుడా? జంకు గొంకులు ఏమాత్రం లేకుండా ఒక మానవమాత్రుడిని ఈ విధంగా ప్రస్తుతించటం దేనికి?'

అత్రిగౌతముల పరస్పరసంవాదము (సం. 3-183-11)

వ. అనుటయు నత్రి యి ట్లనియె. 197

తాత్పర్యం: అని చెప్పిన పిమ్మట అత్రిమహర్షి ఈ విధంగా అన్నాడు.

ఉ. 'ఊరక మీఱ నాడెదవు; యుక్త మయుక్తము నాత్మఁ జూడఁగా
నేరవు; సర్వలోకములు నిర్మలనీతిపరాక్రమంబు లొ
ప్పారఁగ నేలి ధర్మముల కన్నిటికిం గుదురై వెలుంగు ధా
త్రీరమణుండు మేటిగ నుతింపఁగ వోలదె నాకు నిమ్మెయిన్?' 198

ప్రతిపదార్థం: ఊరక, మీఱన్+ఆడెదవు= నిరర్థకంగా అధికప్రసంగం చేస్తున్నావు; యుక్తము= తగింది; అయుక్తమున్= తగనిది అని; ఆత్మన్+చూడఁగాన్+నేరవు= ఆంతర్యంలో విచారించ జాలవు; సర్వ, లోకములు= సమస్తమైన ప్రపంచాలను; నిర్మల, నీతి, పరాక్రమంబులు= స్వచ్ఛమైన నీతి, శౌర్యాలు; ఒప్పు+ఆరఁగన్= విలసిల్లేటట్లుగా; ఏలి= పరిపాలించి; ధర్మములకున్+ అన్నిటికిన్= సమస్తమైన ధర్మాలకు; కుదురు+ఐ= నెలవై (ఆలవాలమై); వెలుంగు= ప్రకాశించే; ధాత్రీ, రమణుండు= రాజు (భూమికి సంతసం చేకూర్చే భర్త); మేటిగ= గొప్పగా; ఈ+మెయిన్= ఈ రీతిగా; నాకున్; నుతింపఁగన్+పోలదు+ఎ= పొగడటం సరికాదా?

తాత్పర్యం: 'ఏది ఉచితం, ఏది అనుచితం అనే ఆంతర్యం విచారించకుండ నీవు నిరర్థకమైన అధిక ప్రసంగానికి పాల్పడ్డావు. రాజే ధర్మానికి కుదురు. రాజే స్వచ్ఛమైన శౌర్యంతో సమస్తలోకాలను పరిపాలించే ప్రభువు. ధర్మ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రక్షణకు, పరిపాలనకు ఆధారకేంద్రమైన రాజు యొక్క గొప్పతనాన్ని స్థానాన్ని గుర్తించి ఈ రీతిగా ప్రశంసించటం నాకు తగదా?'

విశేషం: కేవలం ధనకాంక్షచేత ఒక మానవమాత్రుడిని ఇంద్రుడు చంద్రుడు ఈశ్వరుఁడు అని ముఖ స్తుతి చేయటం అనుచితం- అని గౌతమమహర్షి ఆక్షేపణం. ధర్మనిర్వహణలో సామాజికవ్యవస్థకు పరిపాలనలో కేంద్ర గరిమనాభి రాజు. అతడు వ్యవస్థగాని వ్యక్తి మాత్రుడు కాడు. అతడి గౌరవభూమిక గుర్తించటం నేరం కాజాలదు- అని అత్రి వాదం. ఇది సులభంగా తేలే వివాదం కాదు కాబట్టి మధ్యవర్తి అయిన తగవరి కావలసి వచ్చింది.

వ. అని త న్నాక్షేపించిన గౌతముండు. 199

తాత్పర్యం: అని తనను విమర్శించగా గౌతముడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

ఆ. 'కలయ నరలు వచ్చి తల తెల్ల నైనంతఁ । జేసి నీకు నెట్లుఁ జేరు నెఱుక?
జ్ఞానవృద్ధుఁడైన వాని మాటలు గదా । సభలఁ జెల్లు నార్యజనుల కెక్కి.' 200

ప్రతిపదార్థం: కలయన్, నరలు, వచ్చి= ముసలితనంచేత తెల్లనైన వెంద్రుకలు అలముకొని; తల= శిరస్సు; తెల్లన+ ఐనంతన్+చేసి= తెలుపు రంగుగా మారినంతమాత్రంచేత; నీకున్; ఎఱుక= తెలివిడి, జ్ఞానం; ఎట్లున్= ఏవిధంగా; చేరున్= ఏర్పడుతుంది; జ్ఞాన వృద్ధుఁడు+ఐన వాని మాటలు కదా= వయస్సుచేత కాక పాండిత్యంచేత పెద్దవాడు అయినవాడి పలుకులు కదా; ఆర్య జనులకున్+ఎక్కి= పూజించతగినవారి మనస్సులలో చేరి; సభలన్= పెద్దల సమావేశాలలో; చెల్లున్= సరిపడతాయి.

తాత్పర్యం: 'వయసుమళ్లి, తలవెంద్రుకలు తెల్లబడినంతమాత్రాన నీకు జ్ఞానం సంక్రమిస్తుందా? పాండిత్యంలో పెద్ద అయినవాడిమాటలు సభలలో రాణిస్తాయి. ఆర్యులు జ్ఞానవృద్ధుడి మాటలనే అంగీకరిస్తారు కదా!'

వ. అని తొడంగి యయ్యిరువురు మహానాదంబుగా వివాదంబు సేయుచుండఁగాశ్యపనామధేయుం డైన ముని సభాసదులైన మునులం జూచి వీరలవాదు మనచేతఁ జక్కంబడదు; సకలధర్మజ్ఞుం డయిన సనత్కుమారు నడుగుద' మనిన నా సదస్యులందఱు సనత్కుమారుపాలికిం జని యత్రిగౌతములవివాదంబు తెఱం గెఱింగించిన, నతండు వారల కి ట్లనియె. 201

ప్రతిపదార్థం: అని= అని వచించి; తొడంగి= (వాదుకు) ఉపక్రమించి; ఆ+ఇరువురు= ఆ ఇద్దరు (ఋషులు); మహా, నాదంబుగాన్= పెద్ద రొద పుట్టేటట్లుగా; వివాదంబు= మాటల జగడం; చేయుచుండన్= సలుపుతుండగా; కాశ్యప నామధేయుండు+ ఐన= కాశ్యపుడు అనేపేరు కల; ముని= ఋషి; సభాసదులు+ఐన= సభలో ఉన్న; మునులన్+చూచి= ఋషులను చూచి; వీరల వాదు= (అత్రిగౌతమమునుల) వివాదం; మనచేతన్= (ఇక్కడ ఈసభలో ఉన్న) మనచేత; చక్కన్+పడదు= సరిగాదు, తీరదు; సకల ధర్మజ్ఞుండు+అయిన= సమస్త మైన ధర్మాలు తెలిసినవాడైన; సనత్కుమారున్= సనత్కుమారుడిని; అడుగుదము= కోరుదాం; అనినన్= అని చెప్పగా; ఆసదస్యులు+అందఱు= ఆసభలో ఉన్నసభ్యులు అందరున్నూ; సనత్కుమారు, పాలికిన్= సనత్కుమారుడు ఉన్నచోటికి; చని= వెళ్ళి; అత్రిగౌతముల, వివాదంబు, తెఱంగు= అత్రి గౌతముల మాటలజగడపు తీరు; ఎఱింగించినన్= తెలియజేయగా; అతండు= ఆ సనత్కుమారుడు; వారలకున్= ఆసదస్యులకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అత్రి గౌతములు ఇరువురున్నూ ఆవిధంగా మాటలజగడాన్ని ఆరంభించారు. అది పెద్దరొదగా మారింది. అప్పుడు కాశ్యపుడు అనే పేరుకల ఋషి, సదస్యులైన మునులతో ఈవిధంగా అన్నాడు- 'వీరి వాదం మనవంటివారు తీర్పు చెప్పదగింది కాదు. సమస్తధర్మాలు తెలిసిన సనత్కుమారుడిని అడిగితే ఆయన తగవరిగా తీర్పు చెప్పవచ్చును.' ఆ మాటలు విని, ఆ సదస్యు లందరు కలిసి సనత్కుమారుడి దగ్గరికి వెళ్ళి, అత్రిగౌతముల వివాదాన్ని వివరించి చెప్పారు. సనత్కుమారుడు ఆ వివాదాన్ని సావధానంగా ఆలకించి ఈ విధంగా చెప్పాడు.

చ. **'అత్రి నిజంబ పల్కెఁ; దగ నాతని వాక్యము ధర్మయుక్త; మీ**
ధాత్రి సమస్తమున్ బృహదుదగ్రభుజాగ్రమునందుఁ దాల్చు సత్
క్షత్రియుఁ డెల్లవారలను గావను బ్రోవఁ బ్రభుండు; గావునన్
శత్రునిషూదనుం డతఁడు శక్రుఁడు నీశ్వరుఁడున్ విధాతయున్. **202**

ప్రతిపదార్థం: అత్రి= అత్రి (మహర్షి); నిజంబు+అ= నిజమే; పల్కెన్= చెప్పాడు; తగన్= ఒప్పునట్లుగా; ఆతని, వాక్యము= అతడు చెప్పినమాట; ధర్మ యుక్తము= ధర్మంతో కూడింది; ఈ, ధాత్రి, సమస్తమున్= ఈభూమి అంతయు; బృహత్+ఉదగ్ర, భుజ+అగ్రమునందున్= పెద్దది, గొప్పది అయిన భుజంయొక్క పైభాగంలో; తాల్చు= ధరించే; సత్‌క్షత్రియుఁడు= మంచిక్షత్రియుడు; ఎల్లవారలను= అందరిని; కావను= రక్షించటానికి; ప్రోవను= పోషించటానికీ; ప్రభుండు= ప్రభువు; కావునన్= కాబట్టి; అతఁడు= అట్టిరాజు; శత్రునిషూదనుండు= శత్రువులను నిర్జించేవాడు; శక్రుఁడు= వేల్పులఱేడైన ఇంద్రుడు; ఈశ్వరుఁడున్= శివుడును; విధాతయున్= బ్రహ్మదేవుడుకూడ.

తాత్పర్యం: 'అత్రి చేసింది సరైన వాదమే. ఆతడి ప్రతివాదన సత్యమైనదే, ధర్మంతో కూడినదే. ఈ భూమండలాన్ని సమర్థవంతమైన తనభుజస్కంధంమీద ధరించే సత్‌క్షత్రియుడు, అందరిని కాపాడే ప్రభువు, శత్రువులను నిర్జించేవాడు, కాబట్టి అతడే ఇంద్రుడు, ఈశ్వరుడు, బ్రహ్మదేవుడు అని చెప్పటం సముచితం.

క. **జనులకు నెల్లను బూజ్యుఁడు । జనపాలుం; డతని మహితశాసనమున స**
జ్జనులును మునులును సద్విధిఁ । జనువారలు గాక; కడవఁ జన దెవ్వరికిన్. **203**

ప్రతిపదార్థం: జనపాలుండు= రాజు; జనులకున్+ఎల్లను= ప్రజలందరికి; పూజ్యుఁడు= ఆరాధించదగినవాడు; అతని మహిత శాసనమునన్= అతడియొక్క గొప్పఆజ్ఞవలన; సత్+జనులును= మంచి మనుజులున్నూ; మునులును= ఋషులున్నూ; సత్+విధిన్= మంచి మార్గంలో; చనువారలు= ప్రవర్తించేవా రౌతారు; కాక= ఆవిధంగా కాక; ఎవ్వరికిన్= ఎవరికైనను; కడవన్+చనదు= అతడి ఆజ్ఞను జవదాటటానికి వీలు కాదు.

తాత్పర్యం: ప్రజలందరికి ఆరాధించతగినవాడు ప్రజలను పరిపాలించే ప్రభువు. మీరజాలని ఆతడి ఆజ్ఞవలననే మంచివారు, ఋషులు మంచిమార్గంలో నడవగలరు. ఎవ్వరూ ఆతడి ఆనతి జవదాట రాదు.

వ. **క్షత్త్రియప్రభావం బే మనవచ్చు! విరాట్టు, సమ్రాట్టు, విధిజితుండు, సత్యమన్యుండు, యథాజీవుండు, ధర్ముండు నను భవ్యనామంబుల నిగమంబులు పార్థివుం గొనియాడుఁ; దొల్లి యధర్మంబునకు వెఱచి బ్రాహ్మణులు నిజతేజోబలంబులు క్షత్త్రియులందు నిక్షేపించిరి; నాఁటంగోలె బ్రాహ్మ్యంబువలన క్షత్త్రంబు ప్రవర్తిల్లుచుండు; బ్రహ్మక్షత్త్రంబులు పరస్పరసంశ్రయంబులు; వెలిగా వర్తింప నేరవు; క్షత్త్రియుండు బ్రాహ్మణ సంసేవనంబునం**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దేజోనిరూఢుం డయి యాదిత్యుండు చీఁకటి నడంచునట్లు దురితంబుల నడంచు; నట్లగుటంజేసి క్షత్త్రియుండు సర్వాధికుం డగుట నిశ్చయం' బనిన, నమ్మునులందఱుఁ జని వైన్యునకుఁ దత్ప్రకారం బంతయు నెఱింగించిన నా భూవరుం డత్త్రిం జూచి. 204

ప్రతిపదార్థం: క్షత్త్రియ, ప్రభావంబు= క్షత్త్రియుడి మహిమ- అనగా రాజకులానికి సంబంధించినవాడి శక్తి; ఏమి+అనవచ్చున్!= ఏవిధంగా చెప్పవీలవుతుంది!; విరాట్టు= విశేషమైన దక్షత గల ప్రభువు; సమ్రాట్టు= గొప్ప రాజు; విధి, జితుండు= అదృష్టాన్ని జయించినవాడు; సత్య, మన్యుండు= సత్యంకొరకైన కోపం కలవాడు; యథా, జీవుండు= ప్రాణి కోటిని క్రమబద్ధంగా శాసించేవాడు; ధర్మిండు= ధర్మంతో కూడిన నడవడిక కలవాడు; అను= అనునట్టి; భవ్య, నామంబులన్= మనోహరమైన పేళ్ళతో; నిగమంబులు= వేదాలు; పార్థివున్= రాజును; కొనియాడున్= పొగడుతాయి; తొల్లి= పూర్వం; అధర్మంబునకున్= ధర్మం లేమికి; వెఱచి= భయపడి; బ్రాహ్మణులు= బ్రహ్మజ్ఞానం కలమేధావులు; నిజ, తేజస్+బలంబులు= తమవైన వెలుగు శక్తులు; క్షత్త్రియులందున్= రాచకొలంవారియందు; నిక్షేపించిరి= దాచిపెట్టారు; నాఁటన్+కోలెన్= ఆసమయంనుండి; బ్రాహ్మ్యంబువలనన్= బ్రాహ్మణులకు సంబంధించిన మహిమ వలన; క్షత్త్రంబు= క్షత్రియులకు సంబంధించిన పరాక్రమం; ప్రవర్తిల్లుచుండున్= ఒప్పుతూ ఉంటుంది; బ్రహ్మ, క్షత్త్రంబులు= బ్రాహ్మణుల మహిమ, క్షత్రియులమహిమ; పరస్పర, సంశ్రయంబులు= ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉండేవి; వెలిగాన్= ఒకదానిని విడిచి వేరొకటి ఉండేవిగా; వర్తింపనేరవు= ఒప్పవు; క్షత్త్రియుండు= రాచకొలంవాడు; బ్రాహ్మణ, సంసేవనంబునన్= బ్రాహ్మణులను సేవించటంవలన; తేజస్+నిరూఢుండు+అయి= వెలుగుతో కూడుకొన్నవాడై; ఆదిత్యుండు= సూర్యుడు; చీఁకటిన్= అంధకారాన్ని; అడంచు+అట్లు= పోగొట్టే రీతిగా; దురితంబులన్= పాపాలను; అడంచున్= పోగొట్టుతాడు; అట్లు= ఆవిధంగా; అగుటన్+చేసి= జరుగుటవలన; క్షత్త్రియుండు= పరాక్రమం కలిగిన రాచకులంవాడు; సర్వ+అధికుండు+అగుట= అందరిని మించేవాడు కావటం; నిశ్చయంబు= దృఢమైన నిర్ధారణ; అనినన్= అని చెప్పగా; ఆ+మునులు+అందఱున్= ఆఋషులు అందరున్నూ; చని= వెళ్లి; వైన్యునకున్= వైన్యుడు అనే పేరుకల ఆరాజుకు; తద్, ప్రకారంబు+అంతయున్= ఆవిధంగా జరిగిన సంగతిని అంతటిని; ఎఱింగించినన్= తెలుపగా; ఆ, భూ, వరుండు ఆరాజు (అనగా వైన్యమహారాజు); అత్త్రిన్+చూచి= అత్రిని కనుగొని.

తాత్పర్యం: పరాక్రమంతో భూజనులను పరిపాలించే ప్రభువుయొక్క మహిమను ఏవిధంగా వర్ణించటానికి వీలౌతుంది? విశిష్టమైన పరిపాలనాదక్షత కలవాడు, గొప్పప్రభువు, అదృష్టాన్ని తనవశం చేసికొన్నవాడు, సత్యాన్ని కాపాడటానికి ఆగ్రహావేశం కలవాడు, ప్రజలను క్రమశిక్షణతో నడిపించేవాడు, ధర్మంతో కూడిన నడవడిక కలవాడు అనే అర్థాలు కల శబ్దాలతో వేదాలు రాజును అభివర్ణిస్తాయి. పూర్వకాలంలో అధర్మం ప్రబలుతుందేమోననే భయంతో, బ్రాహ్మణులు తమశక్తి యుక్తులను రాజులయందు దాచిపెట్టారు. ఆ సమయంనుండి, బ్రాహ్మణులతేజస్సు క్షత్రియులగొప్పతనం ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. క్షాత్రబలం లేని బ్రాహ్మణశక్తి, బ్రాహ్మణశక్తి లేని క్షాత్రం రాణించజాలవు. క్షత్రియుడు బ్రాహ్మణులను పూజించటంచేత, తేజస్సును ఆర్జించి, సూర్యుడు చీకటిని పోగొట్టేటట్లు పాపాలను హరింపచేయగలడు. అందుచేత క్షత్రియుడు అందరికంటె అధికుడు. ఇది నిశ్చయం' అని సనత్కుమారుడు తీర్పుచెప్పాడు. అంతట ఆతీర్పును వినిన ఆ మునులు ఆసంగతిని వైన్యమహారాజు కడ కేగి విన్నవించారు. అప్పుడు వైన్యమహారాజు అత్రిని గౌరవించి, (ఈవిధంగా పలికాడు).

క. 'నను నెల్లజనులకంటెను । ఘనుఁ డని కొనియాడి తీవు కడు నిజముగఁ గా
వున నిదె ప్రీతుఁడ నైతిన్ । గొను మిచ్చెద నీకు నేను గోటిధనంబుల్.' 205

ప్రతిపదార్థం: ననున్= నన్ను; ఎల్ల, జనులకంటెను= అందరు మనుజులకంటెను; ఘనుఁడు+అని= గొప్పవాడు అని; కొనియాడితి+ఈవు= నీవు పొగిడావు; కడు, నిజముగన్= మిక్కిలిసత్యంగా; కావునన్= కాబట్టి; ఇదె= ఇప్పు డీసమయంలో; ప్రీతుఁడన్+ఐతిన్= సంతోషించాను; ఏను= నేను; నీకున్= నీకు; కోటిధనంబుల్= కోటిద్రవ్యాలు; ఇచ్చెదన్= ఇస్తాను; కొనుము= స్వీకరించుము.

తాత్పర్యం: నీవు నన్ను అందరికంటెను గొప్పవాడ వని పొగిడావు; నాకు మిక్కిలి సంతోష మైనది. కావున నీకు కోటి ధనాలను దానంగా ఇస్తాను; దయచేసి స్వీకరించుము.

క. **అని యిష్టధనము లిచ్చినఁ । గొని వచ్చి మునీశ్వరుండు గొడుకులకుఁ బ్రియం**
బునఁ బంచి యిచ్చి యిమ్ములఁ । జనియె వనంబునకు ధర్మసంహితబుద్ధిన్. **206**

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; ఇష్ట, ధనములు+ఇచ్చినన్= కోరినద్రవ్యాలు ఇవ్వగా; కొనివచ్చి= తీసికొనివచ్చి; ముని+ఈశ్వరుండు= ఋషులలో శ్రేష్ఠుడైన (అత్రి); కొడుకులకున్= పుత్రులకు; ప్రియంబునన్= ప్రేమతో; పంచి+ఇచ్చి= భాగాలు చేసి ఒసంగి; ధర్మ, సంహిత, బుద్ధిన్= ధర్మం నెరవేర్చ వలె ననే కోరికతో కూడిన ఆలోచనతో; వనంబునకున్= అడవికి; ఇమ్ములన్= ప్రీతితో; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అని చెప్పి, వైన్యమహారాజు తనకు ఇచ్చిన ధనాలనుగైకొని ఇంటికి పోయి, అత్రి మహాముని వాటిని కొడుకులకు పంచిపెట్టి ధర్మంతో కూడిన ఆలోచనతో తాను అడవికి వెళ్ళాడు.

వ. **అని చెప్పి మార్కండేయుండు పాండవేయునితో నిట్లను; సరస్వతీగీత యను నితిహాసంబు సెప్పెద; నందు విశిష్టధర్మంబు లెఱుఁగ నగుఁ; దొల్లి తార్క్ష్యుండను మునివరుండు భారతి నారాధించిన నద్దేవి ప్రత్యక్షం బగుటయు ని ట్లని యడిగె.** **207**

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; మార్కండేయుండు= మృకండుమహాముని కుమారుడైన మార్కండేయుడు; పాండవేయునితోన్= పాండురాజుకొడు కైన (ధర్మరాజుతో); ఇట్లు+అనున్= ఈవిధంగా చెప్పాడు; సరస్వతీ, గీత+అను= సరస్వతీ గీత అనే పేరు కల; ఇతిహాసంబు= జరిగిన కథ; చెప్పెదన్= వినిపిస్తాను; అందున్= (ఆ ఇతిహాసంలో); విశిష్ట, ధర్మంబులు= విశేషంగా పేర్కొనదగిన ధర్మాలు అనగా ధర్మసూక్ష్మాలు; ఎఱుఁగన్+అగున్= తెలిసికొనటానికి వీలౌతుంది; తొల్లి= పూర్వకాలంలో; తార్క్ష్యుండు+అను= తార్క్ష్యుడు అనే పేరుకల; ముని, వరుండు= ఋషులలో గొప్పవాడు; భారతిన్+ఆరాధించినన్= సరస్వతీదేవిని ప్రార్థించగా; ఆ+దేవి; ప్రత్యక్షంబు+అగుటయున్= తనయెదుట కన్పించగా; ఇట్లు+అని+అడిగెన్= ఈ విధంగా ప్రార్థించాడు.

తాత్పర్యం: ఆవిధంగా వైన్యుడిచరితాన్ని చెప్పి, పిమ్మట ధర్మరాజుతో మార్కండేయమహర్షి ఈవిధంగా అన్నాడు. 'నీకు ఇప్పుడు సరస్వతీగీత అనే ఇతిహాసం వినిపిస్తాను. అందులో పెక్కు ధర్మసూక్ష్మాలు ఉన్నవి. నీవు వాటిని గ్రహించటం అవసరం. పూర్వకాలంలో తార్క్ష్యుడు అనే ఒక గొప్పఋషి ఉన్నాడు. అతడు సరస్వతీదేవినిగూర్చి తపస్సు చేయగా, ఆ దేవి అతడికి ప్రత్యక్ష మయింది. అతడు ఆ సరస్వతీదేవిని ఈవిధంగా అడిగాడు.

క. **'పురుషున కెయ్యది ధర్మువు? । పురుషుం డెద్దానఁ బరమపుణ్యాత్మకుఁ డై**
చిరపుణ్యగతులు వడయును? । దిరముగ నిది యానతిమ్ము దేవీ! నాకున్.' **208**

ప్రతిపదార్థం: దేవీ!= ఓ సరస్వతీదేవీ!; పురుషునకున్= మానవుడికి (ఇచట జనులకు అనిభావం); ఏ+అది= ఏది; ధర్మువు= ధర్మం; పురుషుండు= పురుషుడు; ఏ+దానన్= దేనివలన; పరమ, పుణ్య+ఆత్మకుఁడు+ఐ= శ్రేష్ఠమైన పుణ్యాలతో కూడుకొన్న అంతరంగం కలవాడై; చిర, పుణ్య, గతులు= శాశ్వతమైన పుణ్యంతో కూడిన మార్గాలు; పడయును?= పొందుతాడు?; నాకున్= నాకు; ఇది= ఈవిషయం; తిరముగన్= గట్టిగా నాటుకొని ఉండేటట్లుగా; ఆనతి+ఇమ్ము= దయతో చెప్పుము.

తాత్పర్యం: 'ఓసరస్వతీ దేవీ! దయతో ఈప్రశ్నలకు నీవు సరైన సమాధానాలను నాకు సెలవిమ్ము. మనుజుడు పాటించవలసిన ధర్మం ఏది? మనుజుడు ఏవిధంగా పుణ్యగతులు సంపాదించగలుగుతాడు? ఆపుణ్యం ఎట్లా శాశ్వతంగా ఉంటుంది? నీవు చెప్పే సమాధానాలు నా మనస్సుకు సదా అంటిపెట్టుకొని ఉండేటట్లు సెలవిమ్ము.'

వ. అనిన వానికి నప్పరమేశ్వరి యి ట్లనియె. 209

తాత్పర్యం: అని అడుగగా, ఆ సరస్వతీదేవి అతడికి ఈవిధంగా సమాధానం చెప్పింది.

మ. 'ధృతి వేదంబులు నాలుగుం జదివి భూదేవుండు నానాధ్వర
వ్రతుఁ డై యుండెడునట్టిపుణ్యుఁ డమరావాసంబునం దుండు ను
న్నతవృత్తస్తనభారమంథర మరున్నారీపరీరంభ సం
భృత రోమాంచ సమంచితాంగుఁ డగుచుం బెక్కేండ్లు సంప్రీతితోన్. 210

ప్రతిపదార్థం: ధృతిన్= ధైర్యంతో (అనగా దీక్షతో); వేదంబులు, నాలుగున్, చదివి= నాలుగువేదాలను పఠించి; భూ, దేవుండు= బ్రాహ్మణుడు; నానా+అధ్వర, వ్రతుఁడు+ఐ+ఉండెడు+అట్టి+పుణ్యుఁడు= పెక్కు యజ్ఞాలను చేసే పూనికతో మెలగి పుణ్యాన్ని ఆర్జించినవాడు; అమర+ఆవాసంబునందున్= దేవతలు నివసించే స్వర్గలోకంలో; ఉన్నత, వృత్త, స్తన, భార, మంథర, మరుత్+నారీ, పరీరంభ, సంభృత, రోమాంచ, సమ్+అంచిత+అంగుఁడు+అగుచున్= ఎత్తయిన, గుండ్రని గబ్బిగుబ్బలతో తిరుగాడే దేవలోకపు స్త్రీల కౌగిలింతలవలన ఏర్పడిన గగురుపాటుతో కూడిన శరీరం కలవాడౌతూ; పెక్కు+ఏండ్లు= అనేక సంవత్సరాలు; సంప్రీతితోన్= మిక్కుట మైన సంతోషంతో; ఉండున్= నివసిస్తాడు.

తాత్పర్యం: 'దీక్షతో నాలుగువేదాలు పఠించి, పెక్కు యాగాలు చేసి పుణ్యాన్ని ఆర్జించిన బ్రాహ్మణుడు మరణించిన పిమ్మట స్వర్గలోకానికి పోతాడు. అక్కడ గబ్బిగుబ్బలతో నడయాడే అప్సరసల కౌగిలింతలవలన ఏర్పడిన గగుర్పాటు గల దేహంతో అతడు పెక్కు సంవత్సరాలు మిక్కిలి సంతోషంతో గడపుతాడు.

సీ. మేలగు క్రేపుతోఁ బాలు సాలఁగ గల్గి । లాలితం బగు తొలిచూలు మొదవుఁ
బాత్రభూతుం డైన శ్రోత్రియునకు నిచ్చు । సదమలచరితుఁ డమ్మొదవు మేన
నెన్నిరోమము లుండు నన్ని వేలేఁడులు । సురలోకసౌఖ్యవిస్ఫురణ నొందు;
భారంబునకుఁ జాలి భూరిసత్త్వాఢ్య మై । బిరుదైన యెద్దు భూసురున కిచ్చి

ఆ. నరుఁడు ధేనుదశక మిరవొంద నిచ్చిన । ఫలము వడయు; మఱియు వలువ లొసఁగి
చంద్రలోకమునకు సంప్రీతుఁడై చనుఁ; । గనక మిచ్చి నాకమునకు నరుగు. 211

ప్రతిపదార్థం: మేలు+అగు= మేలగు= మంచిదైన; క్రేపుతోన్= దూడతో; పాలు= క్షీరం; చాలఁగన్+కల్గి= ఎక్కువగా ఉండి; లాలితంబు+అగు= ఒప్పారునట్టి; తొలి, చూలుమొదవున్= మొదటి కానుపు కన్న ఆవును; పాత్రభూతుండు+ఐన= యోగ్యత

కలిగినట్టి; శ్రోత్రియునకున్= సదాచారం పాటించే బ్రాహ్మణుడికి; ఇచ్చు= ఒసగునట్టి; సత్+అమల, చరితుఁడు= మంచిదైన నిర్మలమైన సత్ప్రవర్తన కలిగినవాడు; ఆ+మొదవు, మేనన్= ఆ ఆవుయొక్క దేహంలో; ఎన్నిరోమములు+ఉండున్= ఎన్ని వెంట్రుకలు ఉంటాయో; అన్ని, వేల+ఏఁడులు= అన్నివేల సంవత్సరాలు; సురలోక, సౌఖ్య, విస్ఫురణన్= స్వర్గ లోకంలో అనుభవించే సౌఖ్యాన్ని; ఒందున్= పొందుతాడు; భారంబునకున్+చాలి= బరువు మోసే బలం కలిగి; భూరి, సత్త్వ+ఆఢ్యము+ఐ= గొప్పశక్తితో కూడి ఉన్నదై; బిరుదు+ఐన+ఎద్దున్= మెచ్చదగిన ఎద్దును; భూసురునకున్= బ్రాహ్మణుడికి; ఇచ్చి= ఒసగి; నరుఁడు= మనుజుడు; ధేను, దశకమున్= పది ఆవులను; ఇరవు+ఒందన్= ఒప్పారేటట్లుగా; ఇచ్చిన= ఒసగిన; ఫలము= ఫలితం (పుణ్యం); పడయున్= పొందుతాడు; మఱియున్= ఇంకను; వలువలు+ఒసఁగి= బట్టలు ఇచ్చి; సంప్రీతుఁడు+ఐ= మిక్కిలి సంతోషం చెందినవాడై; చంద్రలోకమునకున్= చంద్రుడి లోకానికి; చనున్= వెళ్ళుతాడు; కనకమున్+ఇచ్చి= బంగారాన్ని ఒసగి; నాకమునకున్= స్వర్గలోకానికి; అరుగున్= వెళ్ళుతాడు.

తాత్పర్యం: మంచిదూడతో ఉండి, ఎక్కువ పాల నిస్తున్న మొదటి చూలు ఆవును యోగ్యుడైన శ్రోత్రియ బ్రాహ్మణుడికి దానమిచ్చిన పుణ్యాత్ముడు (మరణానంతరం) స్వర్గలోకానికి చేరుతాడు. ఆ ఆవుదేహంమీద ఎన్నివెంట్రుకలు ఉంటాయో అన్ని వేల సంవత్సరాలు ఆదాత స్వర్గలోకంలో ఉంటాడు. బరువు మోయగల బలం కలిగిన కోడెయెద్దును బ్రాహ్మణుడికి దానం చేసినవాడు పది ఆవులను దానం చేసిన పుణ్యఫలాన్ని ఆర్జిస్తాడు. మరియు, వస్త్రదానం చేస్తే చంద్రలోకానికి పోతాడు. బంగారాన్ని దాన మిస్తే స్వర్గలోకం పొందుతాడు.

క. కృతమతి యై యేడేఁడులు । హుతవహు ఘృతమునను బ్రీతి నొందించిన సు
వ్రతుఁ డీరేడుతరంబుల । పితరులఁ గొని దివికి నేఁగుఁ బెంపెసలారన్. 212

ప్రతిపదార్థం: కృతమతి+ఐ= దీక్షతో కూడిన బుద్ధికలవాడై; ఏడు+ఏఁడులు= ఏడు సంవత్సరాలు; హుతవహున్= అగ్నిహోత్రుడిని; ఘృతమునను= నేతిని వేల్చుట చేత; ప్రీతిన్+ఒందించిన= తృప్తి చెందేటట్లుగా చేసిన; సు, వ్రతుఁడు= మంచి నోమును నోచిన వాడు; ఈరేడు తరంబుల= పదునాలుగు పురుషాంతరాల తరబడి; పితరులన్= పితృదేవతలను; కొని= వెంటబెట్టుకొని; పెంపు+ఎసలు+ఆరన్= గొప్పదనం ఒప్పారేటట్లుగా; దివికిన్+ఏఁగున్= స్వర్గానికి వెళ్ళుతాడు.

తాత్పర్యం: దీక్షతో ఏడుసంవత్సరాలు అగ్నిహోత్రుడిని నేతితో వేల్చి సంతృప్తి చెందించిన నైష్ఠికుడు పదునాలుగు తరాలకు చెందిన పితృదేవతలను తనతోపాటు తీసికొని గొప్పదనం ఒప్పారేటట్లుగా స్వర్గలోకానికి వెళ్ళుతాడు.

క. సతతంబును శుచియై దే । వతలఁ బ్రదీప్తాగ్నియందు వదలక సంత
ర్పితులుగఁ జేసి పడయు నం । చితముగ గోలోకవాస చిరసౌఖ్యంబుల్. 213

ప్రతిపదార్థం: సతతంబును= ఎల్లప్పుడును; శుచి+ఐ= పవిత్రుడై ఉండి; వదలక= విడువక; ప్రదీప్త+అగ్ని+అందున్= మండుతుండే అగ్నిలో; దేవతలను= వేల్పులను; సంతర్పితులుగన్+చేసి= తృప్తి చెందిన వారినిగా చేసి; అంచితముగన్= ఒప్పునట్లుగా; గోలోక, వాస, చిర, సౌఖ్యంబుల్= గోలోకంలో నివసించే శాశ్వతమైన సుఖాన్ని; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: ఎల్లప్పుడును పవిత్రతను పాటించి, అగ్నిహోత్రంలో నిరంతరాయంగా హవిస్సులు వేల్చి దేవతలను తృప్తి పొందించేవాడు చాలకాలం గోలోకంలో నివసించి సౌఖ్యాలను అనుభవిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అగ్నిహోత్రం బస్మదాత్మకం బని యెఱుంగుము; సకలయజ్ఞంబులందుఁ గల్గింపఁ బడు విశిష్టద్రవ్యంబు లన్నియు మదీయంబు; లేను మహనీయం బైన యగ్నిహోత్రముఖంబునం బ్రభవింతు; నాత్మజ్ఞు లగు మహాత్ములకు నఖిలసంశయచ్ఛేదంబు సేయుదు; ననవరత స్వాధ్యాయ దానవ్రత పరాయణులైన తపోధను లెందేని వీతశోకులై వసియింతు; రట్టిది మామకంబైన పరమపదంబు; వినుము! ప్రచుర మధుక్షీరతోయంబులును శర్కరాసైకతంబులును మాంసాపూపప్రకరతీరంబులును బాయసకర్దమంబులు నైన యేఱు లనేకంబు లుత్పాదించి యింద్రాగ్ని ప్రముఖు లైన దివిజులకుఁ దృప్తి సేసి యజనశీలురు మత్పదంబుం బ్రాపింతు' రని చెప్పినఁ దార్క్ష్యుండు కృతాంజలియై. 214

ప్రతిపదార్థం: అగ్నిహోత్రంబు= అగ్ని; అస్మత్+ఆత్మకంబు= నా స్వరూపమే అయినట్టిది; అని; ఎఱుంగుము= తెలిసికొనుము; సకల, యజ్ఞంబులందున్= అన్ని జన్నాలలో; కల్గింపఁబడు= వాడబడే; విశిష్ట ద్రవ్యంబులు= విశేష పదార్థాలు; అన్నియున్= సమస్తాలున్నూ; మదీయంబులు= నావే; ఏను= నేను; మహనీయంబు+ఐన= గొప్ప దైన; అగ్నిహోత్ర, ముఖంబునన్= అగ్నియొక్క మొగంలో; ప్రభవింతున్= పుట్టుతాను; ఆత్మజ్ఞులు+అగు= ఆత్మనుగూర్చిన జ్ఞానాన్ని ఎఱిగినట్టి; మహా+ఆత్ములకున్= గొప్పవారికి; అఖిల, సంశయ+ఛేదంబు, చేయుదున్= అన్నిసందేహాలను త్రుంచివేస్తాను; అనవరత, స్వాధ్యాయ, దాన, వ్రత, పరాయణులు+ఐన= ఎల్లప్పుడు వేదాలను వల్లెవేసే, ఇతరులకు (తమకున్నవాటిని) దానంచేసే దీక్షతో నోములు నోచే; తపస్+ధనులు= తపోధనులు= తపస్సునే ధనంగా కలవారు; ఎందున్+ఏని= ఎచ్చోటనైనా; వీతశోకులు+ఐ= పోయినదుఃఖం కలవారై (దుఃఖం లేనివారై); వసియింతురు= నివసిస్తారు; అట్టిది= అటువంటిది; మామకంబు+ఐన= నాదైన; పరమపదంబు= గొప్పస్థానం; వినుము= ఆలకించుము; ప్రచుర, మధు, క్షీర, తోయంబులును= అధికమైన తేనెయే, అధికమైన పాలే నీళ్ళుగా గలవై; శర్కరా, సైకతంబులును= చక్కెర అనే ఇసుకతిన్నెలు కలిగినవై; మాంస+అపూప+ప్రకర, తీరంబులును= మాంసం, పిండివంటకాలు మున్నగునవి అనే గట్టులు కలిగినవియును అయి; పాయస, కర్దమంబులును+ఐన= పాయసాలు అనే బురదలు కలిగినవి అయిన; ఏఱులు+అనేకంబులు= పెక్కునదులు; ఉత్పాదించి= పుట్టించి; ఇంద్ర+అగ్ని, ప్రముఖులు+ఐన= ఇంద్రుడు అగ్ని మున్నగువారైన; దివిజులకున్= దేవతలకు; తృప్తిచేసి= సంతుష్టిని కల్గించి; యజనశీలురు= యజ్ఞాలు చేసేవారు; మత్+పదంబున్= నాదైన స్థానాన్ని; ప్రాపింతురు= పొందుతారు; అని చెప్పినన్= అని వచించగా; తార్క్ష్యుండు; కృత+అంజలి+ఐ= ఘటించిన కైమోడ్పు కలవాడై-అనగా నమస్కరించినవాడై.

తాత్పర్యం: అగ్నిహోత్రం నా స్వరూపానికి సంబంధించిందని తెలిసికొనుము; అన్ని యజ్ఞాలలోనూ సమకూర్చబడే వస్తువులు అన్నియు నాకు సంబంధించినవే. నేను అగ్నిహోత్రుడి ముఖంలోనుండి పుట్టుతాను. ఆత్మనుగూర్చిన పరిజ్ఞానం గల విద్వాంసులు అందరకు సమస్త సందేహాలను తీర్చగలను; ఎల్లప్పుడు వేద వేదాంగ పారాయణ చేస్తూ, దానధర్మాలు చేసి దుఃఖాతీతులై బ్రదికే మహాత్ములు ఉండేచోటు నా విశిష్టస్థానం. తేనె పాలు చక్కెర మాంసం పిండివంటలు పుష్కలంగా వెచ్చించి (తేనె, పాలు అనే నీళ్ళతో, చక్కెరలనే ఇసుక తిన్నెలతో, మాంసం పిండివంటలు అనే తీరాలతో, పాయసాలనే బురదలతో అనేక నదులను కల్పించి) యజ్ఞాలు చేసి దేవతలకు సంప్రీతి చేకూర్చే నైష్ఠికులు మరణానంతరం నా లోకానికి చేరగలరు' అని సరస్వతీదేవి ఆనతిచ్చింది. అంత ఆమెకు తార్క్ష్యుడు భక్తితో నమస్కరించి ఆమెను ఇట్లా ప్రార్థించాడు.

విశేషం: ఇచట అలంకారం రూపకం. యజ్ఞాలలో యజమానులు పెక్కు ఏఱులు ఉత్పాదిస్తా రట. నదులలోని నీరు - మధుక్షీరాలు, శర్కరలు - సైకతాలు, మాంసాపూప ప్రకరాలు తీరాలు; పాయసాలు కర్దమాలు. ఇట ఉపమానోపమేయాలకు అభేదాధ్యవసాయం కల్పించబడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. అంబ! నవాంబుజోజ్జ్వలకరాంబుజ। శారదచంద్రచంద్రికా
డంబరచారుమూర్తి! ప్రకట స్ఫుట భూషణ రత్న రోచిరా
చుంబితదిగ్విభాగ! శ్రుతిసూక్తవివిక్తనిజప్రభావ! భా
వాంబరవీథివిశ్రుతవిహారి! ననుం గృపఁ జూడు భారతీ! 215

ప్రతిపదార్థం: భారతీ!= ఓ సరస్వతీ!; అంబ!= మాతృమూర్తి అయిన దేవీ!; నవ+అంబుజ+ఉజ్జ్వల, కర+అంబుజ!= క్రొత్తపద్మాలవలె వెలుగొందే చేతులు అనే పద్మాలు కలదానా!; శారద, చంద్ర, చంద్రికా+ఆడంబర, చారు, మూర్తి!= శరత్కాలంలోని చంద్రుడి వెన్నెల యొక్క దర్పంవంటి దర్పంతో మనోహరమైన ఆకృతి కలదానా!; ప్రకట, స్ఫుట, భూషణ, రత్న, రోచిస్+ఆచుంబిత, దిశ్+విభాగ!= పైకి బాగా కనుపించే ఆభరణాలకు చెందిన రత్నాలయొక్క కాంతులచేత బాగుగా స్పృశించిన (ముద్దుపెట్టబడిన) దిక్కులయొక్క భాగాలు కలదానా!; శ్రుతి, సూక్త, వివిక్త, నిజ, ప్రభావ!= వేదాలలోని సూక్తాలలో (సూక్తులలో) బాగా వెల్లడించబడిన సొంతమహిమ కలదానా!; భావ+అంబర, వీథి, విశ్రుత, విహారి!= ఆలోచనలు అనే ఆకాశపుదారులలో ప్రసిద్ధమైన విహారం కలదానా!; ననున్= నన్ను; కృపన్+చూడు= దయతో చూడుము.

తాత్పర్యం: అమ్మా! సరస్వతీ దేవీ! క్రొత్తపద్మాలవలె ధగధగలాడే చేతులు కలదానా! శరత్కాలంలోని వెన్నెలవెలుగువలె మిలమిలలాడే మనోహరాకారం కలదానా! దిగ్దిగంతాలవరకు కాంతులు వెల్లివిరియజేసే రత్నభూషలు కలదానా! వేదాలలోని సూక్తాలలో వెల్లడించబడిన స్వీయమహిమ కలిగినదానా! ఆలోచనల ఆకాశపు దారుల్లో ప్రశస్తరీతిలో విహరించేదానా! నన్ను దయతో మన్నించుము.

విశేషం: ఈ పద్యం తెలుగువారి నాలుకలపై చాటువువలె చిరకాలంనుండి నాట్య మాడుతున్నది. చాలామందికి ఈపద్యం వ్రాసిన కవి ఎఱ్ఱన అని తెలియదు. పోతన భాగవతంలోని అవతారికలో ఈపద్యం కన్పించటంచేత పలువురు ఇది పోతనకవికృత మనిన్నీ, భాగవతంలోని పద్యం అనిన్నీ భ్రమించటం కద్దు. అనుప్రాసాలంకార ప్రియుడైన పోతనమహాకవి ఈ పద్యాన్ని తన భాగవత అవతారికలో ఒజ్జబంతిగా స్వీకరించి చేర్చె నని భావించవచ్చును. అలం : రూపకం. (కరాంబుజ) అనుప్రాసం. బిందుపూర్వక బకారప్రయోగ పౌనఃపున్యం, అట్లే చంద్ర చంద్రికా, సూక్త, వివిక్త - విహారి, భారతీ !

వ. అని వినుతించి కృతార్థుం డయ్యె' ననిన విని మృకండుపుత్త్రునకుఁ బాండుపుత్త్రుం డి ట్లనియె 'మునీంద్రా! వైవస్వతమను వెత్తెఱంగునం బ్రభావసంపన్నుం డయ్యెఁ జెప్పవే' యనిన మార్కండేయుం డి ట్లనియె.216

ప్రతిపదార్థం: అని వినుతించి= అని పొగడి; కృత+అర్థుండు+అయ్యెన్= ధన్యుడు అయినాడు; అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; మృకండుపుత్త్రునకున్= మార్కండేయుడికి; పాండుపుత్త్రుండు= పాండురాజుకొడుకు-ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు; ముని+ఇంద్రా!= మునులలో ఇంద్రుడివంటివాడా!; వైవస్వత మనువు= వైవస్వతుడు అనే మనువు; ఏ+తెఱంగునన్= ఏవిధంగా; ప్రభావ, సంపన్నుండు+అయ్యెన్= గొప్పదనంతో కూడినవాడు అయినాడు?; చెప్పవే= వచించ బూనుకొనుము; అనినన్= అని చెప్పగా; మార్కండేయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆవిధంగా ప్రశంసించి, ధన్యుడయినాడు' అని చెప్పగా విని, మార్కండేయుడితో ధర్మరాజు ఈవిధంగా పలికాడు - 'మునీంద్రా! వైవస్వతమనువు ఏరీతిగా గొప్పమహిమను సంపాదించగలిగాడు? దయచేసి చెప్పండి' అని అడుగగా, మార్కండేయమహర్షి ఈ విధంగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'విను చాక్షుషమన్వంతర । మున వైవస్వతుఁడు పరమపుణ్యుండు దపం
బొనరించె నిరాహారత । ననుపమధైర్యుండు దశసహస్రాబ్దంబుల్. 217

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; చాక్షుష, మన్వంతరమునన్= చాక్షుషుడు అనే మనువుకాలంలో; పరమ, పుణ్యుండు= మిక్కిలి సుకృతం కలవాడు; అనుపమధైర్యుండు= సాటిలేని ధైర్యం కలవాడు; వైవస్వతుఁడు= వైవస్వతుడు అనేవాడు; నిర్+ఆహారతన్= తిండి లేకుండా; దశ, సహస్ర+అబ్దంబుల్= పదివేలసంవత్సరాలు; తపంబు+ఒనరించెన్= తపస్సు చేశాడు.

తాత్పర్యం: ఆలకింపుము. పుణ్యాత్ముడు, సాటిలేని ధైర్యం కలవాడు అయిన వైవస్వతుడు చాక్షుషమన్వంతరంలో ఆహారం తీసికొనకుండ పదివేలసంవత్సరాలు తీవ్రతపస్సు చేశాడు.

విశేషం: మనువు - ప్రాచీనభారతీయసంస్కృతి పదునాల్గురు మనువులను పేర్కొంటున్నది.

"స్వాయంభువో మను స్తాత స్స్వారోచిషస్తథా
ఉత్తమస్తామసశ్చైవ రైవతశ్చాక్షుష స్తథా
వైవస్వతశ్చ కౌరవ్య సాంప్రతో మను రుచ్యతే
సావర్ణిశ్చ మనుస్తాత భౌచ్యో రౌచ్యస్తథైవ చ
తథైవ మేరుసావర్ణాశ్చత్వారో మనవః స్మృతాః." హరివంశమ్, 1-7-4

మన్వంతరం అనగా, డెబ్బదియొక్క దివ్యయుగాలకాలం. ప్రస్తుతం జరుగుచున్నది ఏడవ మనువు వైవస్వత మన్వంతరం. మన్వంతరం:- కృతయుగం-17,28,000 మానవ వత్సరాలు; త్రేతాయుగం-12,96,000 మానవ వత్సరాలు; ద్వాపరయుగం - 8, 64,000 మానవ వత్సరాలు; కలియుగం- 4,32,000 మానవ వత్సరాలు. ఈ నాలుగు యుగాలు కలిసినకాలం ఒక మహాయుగం. వేయి మహాయుగాలు గడిస్తే బ్రహ్మకు ఒక పగలు. అట్లే బ్రహ్మకు ఒక రాత్రి. ఒక బ్రహ్మదివసంలో పదునాల్గురు మనువులు పరిపాలిస్తారు. అనగా 337, 142, 658 సంవత్సరాలు ఒక మన్వంతరం. ఇంతవరకు స్వాయంభువు, స్వారోచిషుడు, ఉత్తముడు, తామసుడు, రైవతుడు, చాక్షుషుడు అనే మనువుల ఏలుబడి గడిచింది. ప్రస్తుతం గడుస్తున్నది వైవస్వత మన్వంతరం -అందులో ప్రస్తుతం కలియుగం ఇరువది ఎనిమిదవ ఆవృత్తం.

ఆ. అనఘుఁ డూర్ధ్వబాహుఁ డై యేకపాదంబు । నందు నిలిచి బదరికాశ్రమమునఁ
జలిపె మఱియుఁ బెక్కుసంవత్సరంబులు । తపము సకలజనులుఁ దను నుతింప. 218

ప్రతిపదార్థం: అనఘుఁడు= (పాపరహితుడైన) పుణ్యాత్ముడు (వైవస్వతుడు); ఊర్ధ్వబాహుఁడు+ఐ= పైకి చాచి నమస్కరిస్తున్న చేతులు కలవాడై; ఏకపాదంబునందున్= ఒంటికాలిమీద; నిలిచి= నిలబడి ఉండి; బదరికా+ఆశ్రమమునన్= బదరిక అనే పేరు కల ఆశ్రమంలో; సకల, జనులున్= ప్రజలందరూ; తనున్= తనను; నుతింపన్= పొగడగా; పెక్కు, సంవత్సరంబులు= అనేక సంవత్సరాలు; తపము= తపస్సు; చలిపెన్= చేశాడు.

తాత్పర్యం: ఆ వైవస్వతుడు చేతులు పైకి ఎత్తి నమస్కరిస్తూ ఒంటికాలిపై సదా నిలబడి ఉండి బదరికాశ్రమంలో ఎన్నో ఏండ్లు, సర్వజనులు తనను పొగడేటట్లుగా తపస్సు చేశాడు.

విశేషం: బదరికాశ్రమం హిమాలయపర్వతశ్రేణులమధ్య సముద్రపు నీటిమట్టానికి సుమారు 13 వేల అడుగుల ఎత్తున అలకనందా నదీతీరంలో గల పుణ్యక్షేత్రం. బదరిక అనగా రేగుచెట్టు. ఈ వనంలో నరనారాయణులు తపస్సుచేసినట్లు పురాణకథనం. ఇచ్చట బ్రహ్మకపాలం, ఉష్ణకుండం ఉన్నవి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మార్కండేయుండు ధర్మరాజునకు వైవస్వతు వృత్తాంతంబును చెప్పుట (సం. 3-185-1)

వ. ఆ వైవస్వతుం డొక్కనాఁడు గృతస్నానుం డయి జలాశయతీరంబున నున్నయెడ నొక్కమత్స్యంబు జలంబుల దరికిం జనుదెంచి యి ట్లనియె; 'నయ్యా! యేను గడు నల్పమత్స్యంబ నగుటం జేసి బలవంతంబు లగు జలచరంబులవలన నాకుఁ దద్దయు భయంబు గలిగియుండు; నిమ్మడువు మహామత్స్యసంకులంబు గావున నపాయంబు వొందకుండ నన్నుద్ధరించి, యొండెడం బెట్టవే! యేను నీకుఁ బ్రత్యుపకారంబు సేయనోపుదు' ననిన విస్మితుండై యతం డమ్మీను నెత్తికొని పోయి యొక్కనూతియందు విడిచి దానిం బలుమాఱు నరసికొని యుండె; నదియును గ్రమంబున వర్ధిల్లి యొక్కనాఁ డమ్మనువున కి ట్లనియె. 219

ప్రతిపదార్థం: ఆ వైవస్వతుండు; ఒక్క, నాఁడు= ఒక రోజున; కృతస్నానుండు+అయి= చేయబడిన స్నానం కలవాడై (స్నానం చేసినవాడై); జల+ఆశయ, తీరంబునన్= చెరువు గట్టుపైః ఉన్న+ఎడన్= ఉన్న తరుణంలో; ఒక్కమత్స్యంబు= ఒక చేప; జలంబులదరికిన్+చనుదెంచి= నీటిఒడ్డు సమీపానికి వచ్చి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికింది; అయ్యా!= అయ్యా!; ఏను= నేను; కడున్= మిక్కిలి; అల్ప, మత్స్యంబను= చిన్నిచేపను; అగుటన్+చేసి= కావటంచేత; బలవంతంబులు+అగు= బలంగలిగిఉన్న; జల, చరంబులవలనన్= నీటిలో చరించే జంతువులవలన; నాకున్= నాకు; తద్దయున్= మిక్కిలి; భయంబు+కలిగి+ఉండున్= భీతి ఉంటున్నది; ఈ+మడువు= ఈ చెరువు; మహా, మత్స్య, సంకులంబు= గొప్పగొప్పచేపలచేత దట్టమైనది; కావునన్= కాబట్టి; అపాయంబు+పొందకుండన్= ప్రమాదంవాటిల్లకుండ; నన్నున్+ఉద్ధరించి= నన్ను పైకి తీసి; ఒండు+ఎడన్= వేరొకచోట; పెట్టవే?= ఉంచవా? అని ప్రార్థిస్తున్నాను; ఏను= నేను; నీకున్; ప్రతి+ఉపకారంబు= చేసిన మేలుకు తిరిగి చేసేమేలు; చేయన్+ఓపుదున్= చేయజాలుతాను; అనినన్= అనిచెప్పగా; విస్మితుండు+ఐ= అచ్చెరువు చెందినవాడై; అతండు= అతడు (వైవస్వతుడు); ఆ+మీనున్= ఆచేపను; ఎత్తికొని పోయి= (ఆ చెఱువునుండి) తీసికొనిపోయి; ఒక్కనూతియందున్= ఒక చేదుడు బావిలో; విడిచి= వదలిపెట్టి; దానిన్= దానిని (ఆచేపను); పలుమాఱున్= చాల సార్లు; అరసికొని= చూచికొని; ఉండెన్; అదియును= ఆ చేపకూడా; క్రమంబునన్= వరుసగా; వర్ధిల్లి= పెంపుచెంది; ఒక్కనాఁడు= ఒక రోజున; ఆ+మనువునకున్= ఆవైవస్వతుడితో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పింది.

తాత్పర్యం: ఆ వైవస్వతుఁడు ఒకనాడు స్నానంచేసి చెఱువుగట్టున ఉండగా, ఒకచేప నీటిఒడ్డుదగ్గరికి వచ్చి అతడితో ఈవిధంగా అన్నది- 'అయ్యా! నేను మిక్కిలి చిన్న చేపను. ఈ చెరువులో పెద్దపెద్ద జలచరాలు ఎన్నెన్నో ఉన్నాయి. అవి నన్ను సులువుగా కబళించి వేయవచ్చును. అందుచేత పెద్దచేపలంటే నాకు మిక్కిలి భయం ఏర్పడింది. ఎట్టి ప్రమాదం నాకు సంభవించకుండగా, నాయందు కరుణ కలిగి, నన్ను కాపాడాలని నిన్ను ప్రార్థిస్తున్నాను. దయచేసి వేరొకచోటికి తరలించి నన్ను రక్షించుము. నీకు ప్రత్యుపకారం చేస్తాను'. ఆ చేపమాటలకు వైవస్వతుడు ఆశ్చర్యం చెంది, ఆ చేపను తీసికొనివెళ్లి ఒకనూతిలో పడవేసి, అప్పుడప్పుడు దాని యోగక్షేమాలను చూస్తూ ఉండేవాడు. కాలక్రమాన ఆ చేప బాగా పెంపొంది పెద్దగా ఎదిగి ఆ వైవస్వతుడితో ఇట్లా అన్నది.

ఆ. 'అనఘ! నీ ప్రయత్నమున నా శరీరంబు । పొదలె; నాకు నిందు మెదల నెడము
సాల; దట్లుగాన మేలగు నొండొక । యెడకుఁ గొంచుఁ బొమ్ము కడఁగి నన్ను. 220

ప్రతిపదార్థం: అనఘ!= పాపంలేనివాడా, పుణ్యాత్ముడా!; నీ ప్రయత్నమునన్= నీవు చేసిన కృషివలన; నా,శరీరంబు= నా దేహం; పొదలెన్= పెంపు చెందింది; నాకున్= నాకు; ఇందున్= (ఈనూతిలో); మెదలన్= తిరుగాడటానికి; ఎడము=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తగినచోటు; చాలదు= సరిపోవటం లేదు; అట్లు+కాన= అందుచేత; మేలు+అగు= శుభము ఒనగూడునట్టి, ఒండొక+ఎడకున్= వేరొకచోటికి; కడఁగి= పూని; నన్నున్= నన్ను; కొంచున్+పొమ్ము= తీసికొని పొమ్ము.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! నీవు చేసిన ఉపకారం వలన, నాశరీరం పెరిగి పెద్దదైంది. ఈ నూతిలోని స్థలం నాకు తిరగటానికి సరిపోవటం లేదు. కాబట్టి అనువైన వేరొకచోటికి నన్ను తిరిగి తీసికొని పొమ్ము.'

వ. అనిన నతం డాజలచరంబుఁ గొని చని యొక్క బావియందు విడిచిన, నది యెప్పటియట్ల యక్కజంబుగాఁ బొదలి, తనకు బావియందు నవకాశంబు పర్యాప్తం బగుటం జెప్పి, యతనిచేత గంగమడువున విడువంబడి, కాలక్రమంబున నచ్చోటఁ దిరుగం బట్టు చాలకున్న నమ్మనువున కెఱింగించిన, నతం డెత్తికొనిపోయి సముద్రంబునం బెట్టిన, నది వాని కి ట్లనియె. 221

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; అతండు= అతడు (వైవస్వతుడు); ఆ, జలచరంబున్+కొని చని= ఆచేపను తీసికొని వెళ్లి; ఒక్కబావి+అందున్= ఒకపెద్దనూతిలో; విడిచినన్= వదలిపెట్టగా; అది= (ఆచేప); ఎప్పటి+అట్ల= ఇదివరకు మాదిరిగానే; అక్కజంబుగాన్= ఆశ్చర్యకరంగా; పొదలి= పెరిగి పెద్దదై; తనకున్= తనకు (ఆచేపకు); బావి+అందున్= పెద్దనూతిలో; అవకాశంబు= తెఱపి; పర్యాప్తంబు+అగుటన్= చాలకపోవటాన్ని; చెప్పి= వచించి (తెలిపి); అతనిచేతన్= (ఆ వైవస్వతుడిచేత); గంగమడువునన్= గంగయందు లోతైనచోటున; విడువన్+పడి= వదలిపెట్టబడి; కాల, క్రమంబునన్= కాలక్రమంగా; అచ్చోటన్= ఆ ప్రదేశంలో; తిరుగన్= అటూ ఇటూ తిరగటానికి; పట్టు= ఎడం; చాలక+ఉన్నన్= సరిపోకపోవటంచేత; ఆ+మనువునకున్; ఎఱింగించినన్= తెలుపగా; అతండు= అతడు (ఆ మనువు); ఎత్తికొనిపోయి= తీసికొని వెళ్ళి; సముద్రంబునన్= సముద్రంలో; పెట్టినన్= ఉంచగా; అది= (ఆచేప); వానికిన్= అతడితో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పింది.

తాత్పర్యం: ఆ చేపమాటలు విన్నపిదప, వైవస్వతుడు ఆ చేపను ఆ చిన్ననూతిలోనుండి తీసికొనివెళ్ళి ఒక పెద్దబావిలో పడవైచి దానిని రక్షిస్తూ ఉన్నాడు. ఆ చేప ఆ బావిలో దినదినాభివృద్ధి చెంది, పెరిగి పెద్దదై, తనకు ఇంక అక్కడ ఉండటానికి తగిన అవకాశం లేదని చెప్పింది. అంతట ఆతడు ఆచేపను అక్కడనుండి తరలించి గంగమడువులో విడిచిపెట్టాడు. ఆ చేపపెరుగుదలకు గంగమడువు కూడ సరిపోలేదు. అంతట ఆ వైవస్వతుడు ఆ చేపను ఎత్తికొనిపోయి సముద్రంలో విడిచిపెట్టాడు.

క. 'ఉపకారం బొనరించితి । కృపతో నా కిట్లు నీవుఁ గృతమతి వై; ప్ర
త్యుపకారం బొనరించెద । విపులగుణాభరణ! తెలియ విను నా పలుకుల్. 222

ప్రతిపదార్థం: విపుల, గుణ+ఆభరణ!= గొప్ప గుణగణాలు అనే భూషణాలు కలవాడా!; తెలియన్= తెలిసేటట్లుగా; నా, పలుకులు= నా మాటలు; విను= ఆలకింపుము; నీవున్= నీవు; కృతమతివి+ఐ= పరిణతి చెందిన బుద్ధి కలవాడవై- అనగా మంచి మనస్సు కలవాడవై; నాకున్+ఇట్లు= నాకు ఈరీతిగా; కృపతోన్= దయతో; ఉపకారంబు= మేలు; ఒనరించితి(వి)= చేశావు; ప్రతి+ఉపకారంబు= ప్రత్యుపకారంబు= చేసిన మేలుకు జోడగుమేలు; ఒనరించెదన్= (నీకు) చేస్తాను.

తాత్పర్యం: 'గొప్పగుణగణాలు గల మహానుభావా! నీవు కరుణ గలవాడవు; మంచి నిశ్చయంతోకూడిన మనస్సుతో నీవు నాకు మేలు చేశావు. తిరిగి నీకు నేను మేలు చేస్తాను. ఇప్పుడు నేను చెప్పుతున్న మాటలు దయచేసి సావధానంగా వినుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. తడవు లే దింక; నిఖిలభూతములుఁ బ్రళయ । మొందనున్నవి యిప్పు; డొండొండ పొంగి
కలయఁబాఱుఁ బయోధు లుగ్రముగఁ బుణ్య । చరిత! యిదియ మన్వంతరసంధి యండ్రు. 223

ప్రతిపదార్థం: పుణ్యచరిత!= పుణ్యమైన ప్రవర్తన కలవాడా!; తడవు= వ్యవధి; లేదు= లేదు; ఇంకన్= ఇక మీదట; నిఖిల, భూతములున్= అన్ని సజీవ నిర్జీవపదార్థాలున్నూ; ప్రళయము+ఒందన్+ఉన్నవి= సర్వనాశనం కానున్నవి; ఇప్పుడు= ఈ సమయంలో; పయోధులు= సముద్రాలు; ఒండు+ఒండ, పొంగి= ఒక్కొకటే క్రమంగా పొంగి; ఉగ్రముగన్= భయంకరంగా; కలయన్+పాఱున్= కలిసిపోయి అంతటా ప్రవహిస్తాయి; ఇది+అ= ఇదియే; మన్వంతర సంధి= ఒక మన్వంతరానికి, మరియొక మన్వంతరానికి మధ్య కాలం; అండ్రు= అని అంటారు; (మన్వంతరం= ఒకమనువు ఏలుబడికాలం - యుగాల సమాహారం.)

తాత్పర్యం: ఓ పుణ్యచరితుడా! ఇక వ్యవధానం లేకుండా ప్రళయం దాపురించబోతున్నది. ఇప్పుడు ఈ సృష్టిలో ఉన్న సజీవ నిర్జీవ పదార్థాలన్నీ సర్వనాశనం కానున్నవి. సముద్రాలన్నీ పొంగిపొరలి కలిసిపోయి ప్రవహించగలవు. దీనిని పెద్దలు మన్వంతరసంధి అని అభివర్ణిస్తారు.

వ. కావున నీవు దృఢరజ్జుబంధురంబును సకలధాన్యతండుల కలితంబునుంగా నొక్క పేరోడ గావించి, సప్తముని సహితుండ వై దాని నెక్కి సముద్రంబు దరియందు నన్నుం దలంచునది; యేనును ఘనశృంగశోభితంబయిన రూపంబునఁ బొడసూపి మీకు మేలొనరించెద' నని యమ్మత్స్యంబు చనియెఁ; వైవస్వతుండును దదుక్తప్రకారంబున నోడ నిర్మించి సప్తమునిసహితంబుగాఁ గృతారోహణుండై పయోధిఁ దఱియం దొడంగెఁ; నంత. 224

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఈవు= (ఓవైవస్వతుడా) నీవు; దృఢ, రజ్జు, బంధురంబును= గట్టిగా పేనబడిన బలం గల త్రాటిచేత దృఢంగా కట్టబడినదిన్నీ; సకల; ధాన్య, తండుల, కలితంబునున్+కాన్= అన్ని విధాలయిన ధాన్యాల విత్తనపు గింజలతో కూడినట్టిదిగా; ఒక్క, పేరు+ఓడ= ఒకపెద్దనావను; కావించి= నిర్మించి; సప్త, ముని, సహితుండవు+ఐ= ఏడుగురు ఋషులతో కూడినవాడ వై; దానిన్= ఆ ఓడను; ఎక్కి= ఆరోహించి; సముద్రంబుదరియందున్= కడలియొడ్డుదగ్గర; నన్నున్= నన్ను; తలంచునది= స్మరించవలసింది; ఏనును= నేనును; ఘన, శృంగ, శోభితంబు+అయిన= పెద్దకొమ్ముతో ఒప్పారేదైన; రూపంబునన్= ఆకారంతో; పొడసూపి= కన్పించి; మీకున్; మేలు+ఒనరించెదన్= ఉపకారం చేయగలను; అని= అని చెప్పి; ఆ+మత్స్యంబు= ఆ చేప; చనియెన్= వెళ్ళిపోయింది; వైవస్వతుండును; తద్+ఉక్త, ప్రకారంబునన్= ఆ(చేపచేత) చెప్పబడిన రీతిగా; ఓడ= నౌక; నిర్మించి= నిర్మాణంచేసి; సప్త, ముని, సహితంబుగాన్= ఏడుగురు ఋషులతోపాటు; కృత+ఆరోహణుండు+ఐ= ఎక్కినవాడై; పయోధిన్= సముద్రాన్ని; తఱియన్+తొడంగెన్= చేరబోయాడు; అంతన్= అటుపిమ్మట.

తాత్పర్యం: ప్రళయకాలం సమీపిస్తున్నది కాబట్టి నీవు ఒక పెద్ద ఓడను నిర్మించుము. ఆ ఓడ దృఢమైన గొప్ప త్రాటితో బాగుగా కట్టబడి చాలకాలంవరకు మను నట్టిదిగా ఉండాలి. అందులో వివిధ ధాన్యాల విత్తనపు గింజలను సమృద్ధిగా సేకరించి పెట్టాలి. నీవు సప్తమునులతోపాటు ఆ ఓడ నెక్కి సముద్రం చేరేటప్పుడు నన్ను స్మరించునది. నేను పెద్ద కొమ్ము కల పెనుచేప ఆకారంతో కన్పించి మీకు ఉపకారం చేస్తాను' అని ఆ చేప చెప్పింది. అంతట ఆ వైవస్వతుడు ఆ చేప చెప్పినరీతిగా పెద్ద ఓడను నిర్మించి, సప్తర్షులతోపాటు ఆ నౌక నెక్కి సముద్రాన్ని చేరబోయాడు. అంతలో.

మ. మతి వైవస్వతుచేఁ దలంపఁబడి యమ్మత్స్యంబు దోఁతెంచె నా
యతశృంగోన్నతమూర్తి; నాతఁడుఁ దదాజ్ఞాయత్తుఁ డై తచ్ఛిరో
గతశృంగాగ్రమునం దగిల్చె నతిదీర్ఘం బైన పాశంబు; న
ద్భుతవేగంబున నోడ నీడ్చె నది యంభోరాశిమధ్యంబునన్. 225

ప్రతిపదార్థం: వైవస్వతుచేన్= వైవస్వతుడిచేత; మతిన్= బుద్ధిలో; తలంపఁబడి= స్మరించబడి; ఆ+మత్స్యంబు= ఆ చేప; ఆయత, శృంగ+ఉన్నత, మూర్తిన్= పొడుగైన కొమ్ముచేత ఎత్తుగా ఉన్న ఆకృతితో; తోఁతెంచెన్= ప్రత్యక్షమయింది; తద్+ఆజ్ఞా+ఆయత్తుఁడు+ఐ= ఆ(చేప); ఆనతిచేత సంసిద్ధుడై; ఆతఁడు= అతడు (వైవస్వతుడు); తద్+శిరోగత, శృంగ+అగ్రమునన్= ఆ(చేపయొక్క) తలయందున్న కొమ్ము చివరిభాగానికి; అతి, దీర్ఘంబు+ఐన= మిక్కిలి పొడవైన; పాశంబున్= ఆ గొప్ప త్రాటిని; తగిల్చెన్= తగిలించాడు; అది= (ఆచేప); అద్భుత, వేగంబునన్= అచ్చెరువును కలిగించే వేగంతో; అంభస్+రాశి, మధ్యంబునన్= సముద్రపు మధ్యభాగాన; ఓడన్= ఆ నౌకను; ఈడ్చెన్= లాగింది.

తాత్పర్యం: వైవస్వతుడిచేత స్మరించబడిన చేప వెంటనే వచ్చింది; పొడుగైన కొమ్ము గలిగి, మిక్కిలి ఎత్తయిన ఆకృతితో ఉన్న ఆ చేపయొక్క అనుమతి పొంది, అతడు ఆ చేప తలపై ఉన్న పెద్దకొమ్ముకొసకు మిక్కిలి పొడుగైన ఆ త్రాటిని తగిల్చాడు. అంతట అచ్చెరువు గొల్పే వేగంతో ఆచేప ఓడను సముద్రమధ్యంలో ఈడ్చుకొని పోయింది.

వ. తదనంతరంబ. 226

తాత్పర్యం: ఆ తరువాత.

సీ. గరుసులు గడవంగఁ గదలి యల్లల్లన । యొత్తుచు నెడముల నుత్తరించి,
వేడుకఁ జేతులు విచ్చి యాడెడునట్లు । లోలోర్మిపంక్తులఁ గ్రాలి క్రాలి,
ప్రచురహాసస్ఫూర్తి పచరించు చాడ్పున । నురుఫేనరోచులఁ దెరలు గవిసి,
యురువడి వర్ధిల్లుచున్న జలంబుచేఁ । బొంగారి దెసలెల్ల మ్రింగికొనుచుఁ,

ఆ. బ్రబలవిలయకాలపటురయబహుళ స । మీరణౌఘదుర్నివార మగుచు
నుగ్రభంగిగాఁ బయోనిధు లొక్కటఁ । బెల్లు రేఁగి జగము లెల్ల ముంచె. 227

ప్రతిపదార్థం: పయస్+నిధులు= సముద్రాలు; గరుసులు= అవధులు; కడవంగన్= మీరేటట్లుగా; కదలి= సంచరించి; అల్ల+అల్లన= క్రమక్రమంగా; ఒత్తుచున్= నొక్కుచు; ఎడములన్= మధ్యభాగాలను; ఉత్తరించి= దాటి; వేడుకన్= వినోదంతో; చేతులు= హస్తాలు; విచ్చి= విప్పి; ఆడెడు+అట్లు= ఇటుఅటుత్రిప్పేటట్లు; లోల+ఊర్మి, పంక్తులన్= చలించే కెరటాల వరుసలతో; క్రాలి, క్రాలి= మెరసి మెరసి; ప్రచుర, హాస, స్ఫూర్తి= అధికమైన నగవులతోడి ప్రకాశాన్ని; పచరించు చాడ్పునన్= వ్యాపింపచేస్తున్నట్లుగా; ఉరు, ఫేనరోచులన్= గొప్పవైన నురుగుల వెలుగులతో; తెరలు, కవిసి= క్రిందికి పైకి లేస్తూ; ఉరువడిన్= మిక్కిలివేగంగా; వర్ధిల్లుచున్+ఉన్న= పొంగారుతున్న; జలంబుచేన్= నీటిచేత; పొంగు+ఆరి= పై కుబికి; దెసలు+ఎల్లన్= దిక్కు లన్నింటిని; మ్రింగికొనుచున్= కబళిస్తూ; ప్రబల, విలయ, కాల, పటు, రయ, బహుళ, సమీరణ+ఓఘ, దుస్+నివారము+అగుచున్= మిక్కుటమైన ప్రళయ సమయంలోనిదై, ఎక్కువ వేగంగా పలురీతుల వీచే పెనుగాలి ప్రవాహంచేత అడ్డగించటానికి అనువు గాని విధంగా; ఉగ్ర, భంగిగాన్= భయంకరమైన విధంగా; ఒక్కటన్= ఒకేసమయంలో; పెల్లు రేఁగి= మిక్కిలి అతిశయించి; జగములు+ఎల్లన్= ప్రపంచాల నన్నింటిని; ముంచెన్= (నీటిలో) మునిగేటట్లు చేశాయి.

తాత్పర్యం: వైవస్వతుడు, సప్తర్షులు ఆవిధంగా ఓడపై ఎక్కి, సముద్రమధ్యభాగాన్ని చేరినపిమ్మట సముద్రాలన్నీ పొంగులువారి ఒకేసమయంలో మహాభయంకరంగా విజృంభించి జగా లన్నిటిని ముంచివేశాయి. చెలియలికట్టలను త్రెంచుకొని సముద్రజలాలు మిట్టపల్లాలను ఏకం చేస్తూ, వినోదంకొఱకై చేతులు విచ్చి ఆడుతున్నట్లున్న పెనుకెరటాలతో పొంగి, నవ్వులాటలు ఆడుతున్నట్లున్న నురుగులతో త్రుళ్లింతలాడుతూ పై కుబుకుతున్న నీటితో దిక్కు లన్నిటిని ఆక్రమించి సముద్రాలన్నీ లోకాలనన్నింటిని ముంచివేశాయి.

విశేషం: ఈ సీసపద్యం ఎఱ్ఱనకవితాశిల్పానికి నిదర్శనప్రాయం. ఇందులో ఎఱ్ఱన తన కాలంలోని ఉప్పెనను ప్రళయ జలంగా వర్ణించి ఉంటాడు. ఎఱ్ఱన ఆరణ్యపర్వ శేషాన్ని నన్నయపేరు మీదనే, నన్నయకవితాశిల్పాన్ని అనుకరించి 'తద్రచనయకా' వ్రాయబూనాడు. అయినను ఎఱ్ఱన స్వీయకవితాముద్ర అచ్చటచ్చట గోచరిస్తూనే ఉన్నది. ఎఱ్ఱనకు సమకాలీనులు ప్రసాదించిన బిరుదం- 'ప్రబంధపరమేశ్వరుడు. ప్రబంధశైలికి అంతరాత్మ వర్ణనాప్రియత్వం. ఈ సీసపద్యంలో ఎఱ్ఱనమహాకవికి కల వర్ణనాభిరుచి సుస్పష్టంగా స్వయంవ్యక్తమౌతున్నది.

వ. ఇట్లు లోకంబెల్ల నేకార్ణవం బైన నమ్మత్స్యంబు దజ్జలాంతరంబున ననేకసహస్రవర్షంబు లయ్యోడం దిగుచుచుఁ బదంపడి యప్పెనువెల్లి యల్లనఁ దిగిచి పోవందొడంగునెడం దుహినగిరిశృంగసమీపంబున నయ్యోడ నిలిపి వారలతోడ. 228

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; లోకంబు+ఎల్లన్= ప్రపంచం అంతయును; ఏక+అర్ణవంబు+ఐనన్= ఒకేఒక సముద్రం కాగా; ఆ+మత్స్యంబు= ఆ చేప; తత్+జల+అంతరంబునన్= ఆనీటిమధ్యభాగంలో; అనేక, సహస్ర, వర్షంబులు= పెక్కువేలేండ్లు; ఆ+ఓడన్+తిగుచుచున్= ఆనౌకను ఇటునటు నడుపుతూ; పదంపడి= పిమ్మట; ఆ+పెను, వెల్లి= ఆ పెద్దవరద; అల్లనన్= క్రమంగా; తిగిచిపోవన్+తొడంగు+ఎడన్= తగ్గిపోవటానికి పూనుకొనే అదనులో; తుహిన, గిరి, శృంగ, సమీపంబునన్= మంచుకొండయొక్క శిఖరందగ్గరలో; ఆ+ఓడన్= ఆ ఓడను; నిలిపి= ఆపి; వారలతోడన్= ఆ వైవస్వతుడితో, సప్తర్షులతో.

తాత్పర్యం: ఈ విధంగా ప్రపంచమంతా ఒకే ఒక సముద్రంగా మారిపోయింది. అప్పుడు ఆ చేప ఆ నీటి మధ్యభాగంలో పెక్కువేల సంవత్సరాలు ఆ ఓడను లాగింది, పిమ్మట ఆ వరద తగ్గుమొగం పట్టిన పిదప, ఆ ఓడను హిమాలయపర్వతశిఖరం దరికి చేర్చి ఆ చేప వైవస్వతుడితో, సప్త ఋషులతో ఈ విధంగా అన్నది.

తే. 'ఈ నగంబుశృంగంబున నిపుడు మీరు । గట్టుఁ డియ్యోడ' ననిన నక్షణమ వారు
నట్ల చేసిరి; విను, మమ్మహాద్రిశృంగ । మనఘ! నౌబంధనం బన నవనిఁ బరఁగె. 229

ప్రతిపదార్థం: ఈ నగంబు శృంగంబునన్= ఈ పర్వతపు శిఖరానికి; ఇపుడు= ఇప్పుడు; మీరు; ఈ+ఓడన్= ఈ ఓడను; కట్టుఁడు= బంధించండి; అనినన్= అని చెప్పగా; ఆ+క్షణము+అ= ఆ త్రుటికాలంలోనే; వారు (వైవస్వతుడును సప్తర్షులును); అట్లు+అ= ఆ విధంగానే; చేసిరి= చేశారు; అనఘ!= ఓపుణ్యాత్ముడా!; వినుము= ఆలకించుము; ఆ+మహా+అద్రిశృంగము= ఆపెద్దకొండ శిఖరం; నౌబంధనంబు= నౌకను కట్టినచోటు; అనన్= అనే పేరుతో; అవనిన్= భూలోకంలో; పరఁగెన్= ఒప్పారింది.

తాత్పర్యం: 'ఓ వైవస్వతా! సప్తర్షులారా! ఈ పర్వతశిఖరాన ఈ ఓడను కట్టండి' అని ఆ చేప చెప్పగా, వారు ఆక్షణంలోనే ఆవిధంగా చేశారు. అందుచేత అప్పటినుండి ఆ కొండకొమ్ముకు 'నౌబంధనం' అనే పేరు ఏర్పడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మనుసహితు లైన మునులం। గనుఁగొని, యమ్మీను గరము గారవమున ని
ట్లనుఁ, 'బ్రళయంబున కీడునఁ। జనకుండఁగ మీకు రక్ష సలిపితిఁ గరుణన్. 230

ప్రతిపదార్థం: మను సహితులు+ఐన= మనువుతో కూడుకొనిన; మునులన్+కనుఁగొని= ఋషులను చూచి; ఆ+మీను= ఆ చేప; కరము, గారవమునన్= మిక్కుటమైన పూజ్యభావంతో, ఇట్లు+అనున్= ఈవిధంగా పలికింది; ప్రళయంబునన్= సర్వం నాశనమయ్యే సమయాన; కీడునన్+చనకుండఁగన్= అపాయం చెందకుండగా; మీకున్; కరుణన్= దయతో; రక్ష సలిపితిన్= కాపాడాను.

తాత్పర్యం: ఆ చేప వైవస్వతమనువుతోపాటు కూడికొని ఉన్న సప్తర్షులతో ఈ విధంగా పలికింది; 'ఈ ప్రళయకాలంలో ప్రమాదం రాకుండ దయతో మిమ్మల్ని కాపాడాను.

క. మునులార! యేను విశ్వం। బునకుఁ బరమకర్త యగు ప్రభుఁడ; వాత్సల్యం
బున మత్స్య మైన రూపం। బున నిమ్మెయి నిన్ని చందములఁ జనవలసెన్. 231

ప్రతిపదార్థం: మునులార!= ఓఋషులార!; ఏను= నేను; విశ్వంబునకున్= జగత్తుకు; పరమ, కర్త+అగు= ఏకైకసృష్టికర్త అయిన; ప్రభుఁడన్= పరిపాలకుడను; వాత్సల్యంబునన్= అనురాగంతో కూడిన దయతో; మత్స్యము+ఐన, రూపంబునన్= చేప అయిన ఆకారంతో; ఈ+మెయిన్= ఈవిధంగా; ఇన్ని, చందములన్= ఇన్ని విధాలుగా; చనన్‌వలసెన్= చరించవలసి వచ్చింది.

తాత్పర్యం: ఓ మహర్షులారా! నేను ఈ సమస్తవిశ్వాన్ని సృష్టించి పరిపాలిస్తున్న ఏకైకప్రభుడను. కేవలం మీమీద నాకు ఏర్పడిన వాత్సల్యంవలన నేను మత్స్యమైన రూపంతో ఇన్నివిధాల చరించవలసివచ్చింది.

వ. మీరు నిర్భయు లై చరియించునది; మఱియు నిమ్మనువును, దేవాసురమానుషం బైన జగం బఖిలంబును సృజియించు; మత్ప్రసాదంబున నతనికిఁ బరమజ్ఞానోదయం బగు' నని చెప్పి యయ్యాదిమత్స్యం బదృశ్యం బయ్యెఁ; వైవస్వతుండును మఱియు నధికతపంబు సేసి సకలచరాచరభూతంబుల సృజియించె. 232

ప్రతిపదార్థం: మీరు; నిర్భయులు+ఐ= భయం లేనివారై; చరియించునది= సంచరించండి; మఱియున్= ఇదికాక; ఈమనువును; దేవ+అసుర, మానుషంబు+ఐన= దేవతలకు, రాక్షసులకు మనుజులకు సంబంధించిన; జగంబు+అఖిలంబును= ప్రపంచం సమస్తాన్నీ; సృజియించున్= నిర్మిస్తాడు; మత్+ప్రసాదంబునన్= నాదయవలన; అతనికిన్= (ఆమనువుకు); పరమ+జ్ఞాన+ఉదయంబు+అగున్= గొప్పతెలివిడి పుట్టుతుంది; అని, చెప్పి= అని పలికి; ఆ+ఆది, మత్స్యంబు= ఆ మొదటిచేప; అదృశ్యంబు+అయ్యెన్= కన్పించకుండ మాయ మయింది; వైవస్వతుండును; మఱియున్= అటుపిమ్మట; అధిక, తపంబు, చేసి= ఎక్కువ తపస్సు చేసి; సకల, చర+అచర, భూతంబులన్= కదలునట్టి కదలనట్టి సమస్తమైన పదార్థాలను అన్నింటిని; సృజియించెన్= నిర్మించాడు.

తాత్పర్యం: మీరు ఎట్టిభయం లేకుండ సంచరించండి. ఈ వైవస్వతమనువు ఇక చరాచరజగత్తును సృష్టించగలడు; నా దయవలన అతనికి పరమజ్ఞానం లభించగలదు' అని చెప్పి ఆ చేప మాయమయింది. అంతట వైవస్వతుడు గొప్పతపస్సు చేసి దేవతలకు రాక్షసులకు మనుజులకు సంబంధించిన జగత్తులను సృష్టించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పరమం బగు వైవస్వతు । చరితం బతిభక్తి వినినఁ జదివినను మహా
దురితంబు లడఁగు జనులకు । నిరవుగ సిద్ధించు ననఘ । యిహపరసుఖముల్.' 233

ప్రతిపదార్థం: అనఘ!= ఓపుణ్యాత్ముడా!; పరమంబు+అగు= మిక్కిలిగొప్పది అయిన; వైవస్వతు చరితంబు= వైవస్వతుడియొక్క నిజ, కథ; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; వినినన్= ఆలకించినా; చదివినను= పఠించినా; జనులకున్= ప్రజలకు; మహా, దురితంబులు= మిక్కుటాలైన పాపాలు; అడఁగున్= నశిస్తాయి; ఇహ, పర, సుఖముల్= భూలోకస్వర్గలోక సౌఖ్యాలు; ఇరవుగన్= సరిపడేటట్లుగా; సిద్ధించున్= లభిస్తాయి.

తాత్పర్యం: ఈ వైవస్వతుడి కథ జీవితగాథలలో మిక్కిలి విశిష్టమైనది. పరమమైన విజ్ఞానం కలిగించేది. దీనిని భక్తితో వినినవారికీ, చదివినవారికీ, సర్వపాపాలు నశిస్తాయి, ఇహపరసౌఖ్యాలు లభిస్తాయి.'

విశేషం: ఈ వైవస్వతచరితం చివర ప్రత్యేకమైన ఫలశ్రుతి కన్పిస్తున్నది. అందుచేత మహాభారతంలో చేరినట్టి ప్రాచీన గాథలలో ఇది ఒకటి అని విమర్శకుల అభిప్రాయం. ప్రపంచంలో ప్రాచీనవాఙ్మయాలలో పలుతావుల జలప్రళయం సంభవించటం, అప్పుడు మానవులు కొందరు మాత్రం ముఖ్యమైన జంతుజాలంతో పాటు ఒక నౌకలో చిరప్రయాణం చేయటం గూర్చిన గాథలు కన్పిస్తున్నవి. మహాభారతంలోని జలప్రళయంలో తప్పించుకొని, నౌకలో చేరినది వైవస్వతమనువు, సప్తర్షులు. బైబిలులో నోవా, నోవాతోపాటు కొన్ని జంతువులు ఒక నౌకలో జలప్రళయంనుండి తప్పించుకొని బ్రదికినగాథ సుప్రసిద్ధం.

వ. అనిన నమ్మేదినీశ్వరుం డమ్మునీశ్వరునకుఁ బ్రణతుండై యి ట్లనియె. 234

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+మేదినీ+ఈశ్వరుండు= భూమికి అధిపతి అయిన ఆరాజు (ధర్మరాజు); ఆ+ముని+ఈశ్వరునకున్= ఆ మునులకు అధినేత అయిన (మార్కండేయుడికి); ప్రణతుండు+ఐ= నమస్కరించినవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా ధర్మరాజు మార్కండేయుడితో ఇట్లా అన్నాడు.

క. 'పరమేష్ఠికల్పుఁడవు ని । ర్భరభూరితపఃప్రభావపరిపూర్ణుఁడ వ
చ్చెరువు భవన్మాహాత్మ్యము । సురమునిలోకప్రణామశోభితచరణా! 235

ప్రతిపదార్థం: సురముని, లోక, ప్రణామ, శోభిత, చరణా!= దేవతల, ఋషుల సముదాయాలయొక్క నమస్కారాలచేత ఒప్పారిన పాదాలు కలవాడా!; పరమేష్ఠి, కల్పుఁడవు= బ్రహ్మతో సరిసమానుడవు; నిర్భర, భూరి, తపస్+ప్రభావ, పరిపూర్ణుఁడవు= గాఢమూ, గొప్పదీ అయిన తపస్సుయొక్క మహిమచేత నిండైన వాడవు; భవత్+మాహాత్మ్యము= నీదైన గొప్పతనం; అచ్చెరువు= ఆశ్చర్యం కలిగించేది.

తాత్పర్యం: దేవతల, ఋషుల సమూహాలు చేసే నమస్కారాలచేత ఒప్పారే పాదాలు గల మార్కండేయ మహర్షీ! నీవు బ్రహ్మదేవుడితో సమానమైనవాడివి; నీ తపస్సుయొక్క మహిమ మిక్కిలి కీర్తించదగింది. నీ మహిమ ఆశ్చర్యకరమైనది.

క. అడరి నిఖిలాండకోటియుఁ । జెడునప్పుడుఁ జెడక నీవు జీవించెద; వే
ర్పడ జగములు గ్రమ్మఱఁ గలి । గెడునప్పుడు సూచెదవు వికృతిరహితుఁడ వై. 236

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అడరి= కలతచెంది; నిఖిల+అండ+కోటియున్= సమస్తమైన జగత్తుల గోళముల సముదాయాలున్నూ; చెడున్+అప్పుడున్= నశించేటప్పుడు; నీవు; చెడక= చెడిపోవక, నశించక; జీవించెదవు= బ్రదికిఉంటావు; క్రమ్మఱన్= తిరిగి; జగములు= లోకాలు; ఏర్పడన్= స్పష్టములై; కలిగెడు+అప్పుడు= వ్యక్తమై, పుట్టేటప్పుడు; వికృతి, రహితుఁడవు+ఐ= ఎట్టి మార్పును లేనట్టివాడవై; చూచెదవు= (సాక్షివై) చూస్తూ ఉంటావు.

తాత్పర్యం: ఈ సృష్టిలోని గ్రహతారకాగోళాలతోడి లోకాలన్నీ నశించిపోయే ప్రళయకాలంలో కూడ, నీవు నశించకుండా బ్రదికి ఉంటావు. ప్రళయానికి పిమ్మట మరల సమస్తలోకాలు పుట్టినప్పుడు కూడ నీవు కేవలం సాక్షీభూతుడవై చూస్తూ ఉంటావు.

విశేషం: అండం అనగా గ్రుడ్డు. ఇచట నిఖిలాండకోటి అనే ప్రయోగంలో అండం అనగా గుండ్రంగా ఉండే గ్రహతారకా గోళ, లోకాలయొక్క సముదాయం అని అర్థం ఏర్పడుతున్నది. భగవంతుడిని గూర్చి వేదాంతులు తరచు వాడే సంబోధనం- అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా!; అఖిలాండాలతో ఏర్పడినట్టిది బ్రహ్మాండం.

చ. **తొడరి చరాచరప్రతతితో జగమంతయు వార్ధిఁదొట్టి న**
ప్పుడు లలితాబ్జపీఠమునఁ బొల్చు చతుర్ముఖుఁ బద్మగర్భుఁ బెం
పడర భజించి తీవు; జగదాదిజుఁ డైన ప్రభుండు నీయెడం
గడు ననురక్తుఁడై యొసఁగెఁ గాదె మునీశ్వర! యీ ప్రభావమున్. **237**

ప్రతిపదార్థం: ముని+ఈశ్వర!= ఋషులకు అధిపతి అయినవాడా!; తొడరి= పూని; చర+అచర, ప్రతతితోన్= కదలునట్టి, కదలనట్టి, పదార్థసముదాయంతో; జగము+అంతయున్= ప్రపంచం అంతయును; వార్ధిన్= సముద్రంలో; తొట్టిన+అప్పుడు= మునిగిన సమయంలో; లలిత+అబ్జ, పీఠమునన్= మనోహరమైన తామరపువ్వు అనే పీఠంమీద; పొల్చు= ఒప్పారెడి; చతుర్ముఖున్= నాలుగుమోములు కల బ్రహ్మదేవుడిని; పద్మగర్భున్= పద్మం జన్మస్థానంగా గలవాడు- బ్రహ్మను; పెంపు+అడరన్= గొప్పతనం అతిశయింపగా; ఈవు= నీవు; భజించితి(వి)= ఆరాధించావు; ఈప్రభావమున్= ఈగొప్పతనాన్ని; జగత్+ఆదిజుఁడు+ఐన= ప్రపంచానికి మొట్టమొదటివాడైన; ప్రభుండు= పరిపాలకుడు; నీ+ఎడన్= నీయందు; కడు= మిక్కిలి; అనురక్తుఁడు+ఐ= ప్రేమకలవాడై; ఒసఁగెన్+కాదె= ఇచ్చి ఉన్నాడు కదా.

తాత్పర్యం: మునీశ్వరా! ఈ సృష్టి సమస్తం చరాచరప్రకృతితో సముద్రంలో మునిగిపోయినపుడు మనోహరమైన పద్మపీఠాన చెలువారు బ్రహ్మదేవుడిని ఆరాధించిన పుణ్యాత్ముడవు నీవు; సృష్టికి ఆధారభూతుడైన ప్రభువు నీయందు అనుగ్రహం కలిగినవాడై నీకు ఇట్టి గొప్పతనాన్ని ప్రసాదించాడు కదా!

క. **జగముల నెల్లను మ్రింగెడు । జగదంతకు మౌళి వామచరణం బిడి పె**
ల్లగు రోగజరాభరముం । దిగ విడువఁగఁ జెల్లె నీకుఁ ద్రిభువనవినుతా! **238**

ప్రతిపదార్థం: త్రి, భువన, వినుతా!= మూడులోకాలచేత పొగడబడినవాడా!; జగములన్+ఎల్లను= లోకాలను అన్నింటిని; మ్రింగెడు= కబళించెడు; జగత్+అంతకు, మౌళిన్= జగత్తును సంహరించే యముడియొక్క శిరస్సునందు; వామ, చరణంబు+ఇడి= ఎడమపాదం పెట్టి (తన్ని); పెల్లు+అగు= మిక్కుటమైన; రోగ, జరా, భరమున్= వ్యాధివలన ముసలితనంవలన ఏర్పడే బరువును (దుఃఖాన్ని); దిగవిడువఁగన్= క్రిందికి త్రోసివేయుటకు; నీకున్= నీకు; చెల్లెన్= సాధ్యమైనది.

తాత్పర్యం: మూడులోకాలచేత పొగడబడిన ఓ మార్కండేయమహర్షీ! జగత్తులను అన్నిటిని అంత మొందించే యముడిశిరస్సును నీ యెడమకాలితో తన్ని, మిక్కుటమైన భారాన్ని కల్గించే ముసలితనంనుండి వ్యాధులనుండి విముక్తుడవు కాగలిగావు. ఇట్టి గొప్పతనం నీకు మాత్రమే సాధ్యమైనది.

వ. సకలచరాచరోత్పత్తిస్థితివిలయప్రకారంబులు నీకుం బెక్కుమాఱులు ప్రత్యక్షంబు లయి కానంబడి యుండుఁ గావున ని న్నడిగెద; లోకంబులు విలయకాలంబున నెట్టిభంగి యగు? నెఱింగింపు' మనిన మార్కండేయుం డి ట్లనియె. 239

ప్రతిపదార్థం: సకల, చర+అచర+ఉత్పత్తి, స్థితి, విలయ, ప్రకారంబులు= సమస్తమైన కదలునట్టి కదలనట్టి భూతాల యొక్క పుట్టుట, ఉండుట, నశించుట యొక్క పద్ధతులు; నీకున్= నీకు; పెక్కుమాఱులు= ఎన్నోసారులు; ప్రత్యక్షంబులు+అయి= ఎదురుగా గోచరించినవై; కానంబడి= కన్పించి; ఉండున్= ఉంటాయి; కావునన్= కాబట్టి; నిన్నున్+అడిగెదన్= నిన్ను ప్రశ్నిస్తాను; లోకంబులు= జగత్తులు; విలయ, కాలంబునన్= ప్రళయ సమయంలో; ఎట్టి, భంగి= ఏరీతి; అగున్?= ఔతాయి?; ఎఱింగింపుము= తెలియజేయుము; అనినన్= అని చెప్పగా; మార్కండేయుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ సకల చరాచరసృష్టిస్థితిలయాల ప్రకారాలు పలుమారులు ఆవృత్తాలుగా నీవు చూచావు. ఇవి పుట్టటం, ఉండటం, గిట్టటం నీకు అనుభవామ్రేడితాలుకదా. కాబట్టి నిన్నే ఈ ప్రశ్నలు అడుగవలసివచ్చింది. లోకాలు ప్రళయకాలంలో ఏరీతిగా ఉండునో దయచేసి వివరించి తెల్పుము' అని అడుగగా, మార్కండేయమహర్షి ఈ విధంగా చెప్పాడు.

మార్కండేయుఁడు ధర్మరాజునకుఁ బ్రళయప్రకారంబు సెప్పుట (సం. 3-186-13)

సీ. 'శాశ్వతు నఖిలభూతేశ్వరు నవ్యయు । నాదిదేవుని జగదాదిజన్ము
నాదిమధ్యాంతవిచ్ఛేదవిదూరు నా । శ్చర్యకారణకర్మధుర్యు నజరు
నీ కిష్టసఖుఁడును నీకుఁ బ్రెగ్గడయు నై । వెలుఁగొందుచున్న యీ యలఘుపుణ్యు
లాలితదీర్ఘవిశాలసితేక్షణుఁ । గనకవర్ణాంబరు వనజనాభు

ఆ. నింద్రనీలవర్ణు నింద్రాదిసురగణ । వినుతుఁ గృష్ణుఁ గరము వినయ మొప్పఁ
దలఁచి, యతని యాజ్ఞఁ దలకొని యెఱిఁగింతు । వినుము వరుసతోడ మనుజనాథ! 240

ప్రతిపదార్థం: శాశ్వతున్= ఎల్లకాలం ఉండేవాడిని; అఖిల, భూత+ఈశ్వరున్= సర్వచేతనాచేతనపదార్థాలకు అధిపతి అయిన వాడిని; అవ్యయున్= నాశరహితుడైనవాడిని; ఆదిదేవునిన్= దేవతలలో మొదటి దేవుడైనవాడిని; జగత్+ఆది, జన్మున్= సృష్టిలో మొట్టమొదట పుట్టినవాడిని; ఆది, మధ్య+అంత, విచ్ఛేదవిదూరున్= మొదలు, మధ్య, తుది అనే విభాగాలకు అతీతుడైనవాడిని; ఆశ్చర్యకారణకర్మధుర్యున్= అచ్చెరువుకు హేతువైన పనులను చేయునట్టి మహిమ కలవాడిని; అజరున్= ముసలితనం లేనట్టివాడిని; నీకున్+ఇష్ట, సఖుఁడును= నీకు అభిమానపాత్రుడైన మిత్రుడును; నీకున్+ప్రెగ్గడయున్+ఐ= నీకు మంత్రి అయినవాడు నై; వెలుఁగొందుచున్+ఉన్న= ప్రకాశిస్తున్న; ఈ అలఘు, పుణ్యున్= ఈ గొప్పపుణ్యం కలవాడిని; లాలిత, దీర్ఘ, విశాల, సిత+ఈక్షణున్= మనోహర మైన పొడుగైనటువంటి, విరివియైనటువంటి, తెల్లనై నటువంటి చూపులు కలవాడిని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కనక, వర్ణ+అంబరున్= పసిడి రంగుబట్టలు కలవాడిని; వనజనాభున్= పద్మం నాభియందు కలవాడిని, శ్రీ విష్ణుదేవుడిని; ఇంద్ర, నీల, వర్ణున్= ఇంద్రనీలమణివంటి నల్లనిరంగు గల (శరీరం) కలవాడిని; ఇంద్ర+ఆది, సుర, గణ, వినుతున్= ఇంద్రుడు మొదలైన వేల్పులగుంపుల చేత ప్రస్తుతించబడేవాడిని; కృష్ణున్= శ్రీకృష్ణుడిని; కరమున్= మిక్కిలి; వినయము+ఒప్పన్= నమ్రత ఒప్పేటట్లుగా; తలంచి= స్మరించి; అతని+ఆజ్ఞన్, తలకొని= అతడి ఆనతి వహించి; వరుసతోడన్= క్రమంగా; ఎఱిఁగింతున్= తెలుపుతాను; మనుజనాథ!= ఓరాజా (ధర్మరాజా)!; వినుము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! నీవు అడిగిన ప్రశ్నలకు సమాధానం మహానుభావుడు అవతారమూర్తి అయిన శ్రీకృష్ణుడి ఆనతిచొప్పున తెలుపగలను వినుము. శ్రీకృష్ణుడు నీకు ప్రియమిత్రుడు మాత్రమే కాదు. అతడు నీకు మంత్రి మాత్రమే కాడు. అతడు నాశరహితుడు. ఎల్లప్పుడు ఉండునట్టివాడు. అఖిల భూతాలకు ఈశ్వరుడు. ఆదిదేవుడు. ముసలితనం లేనివాడు. మొదలు, మధ్య, తుది అనే విభాగాలకు అతీతుడు. ఆశ్చర్యం కలిగించే కార్యాలను నెరవేర్చగలవాడు. ఇంద్రుడు మొదలైన వేల్పులచేత ఆరాధించబడేవాడు పీతాంబరధారి అయి సువిశాలనేత్రాలతో విలసిల్లే ఈ కృష్ణుడు పద్మాన్ని నాభియందు తాల్చే ఆ విష్ణుమూర్తి అవతారమే.

వ. కృత త్రేతా ద్వాపర కలినామంబు లయిన యుగంబులు నాలుగును బండ్రెండువేల దివ్యవర్షంబులం బర్యవసితంబులగునియ్యుగంబులు నాలుగు నొక్కమహాయుగం బనం బరఁగు; మహాయుగసహస్రపర్యంతం బైనకాలంబు బ్రహ్మకు దివసంబ నాఁబరఁగుఁ; దద్దివసావసానంబునందు శతవార్షికంబైన యనావృష్టిదోషంబు ప్రవర్తిల్లు నప్పుడు. 241

ప్రతిపదార్థం: కృత, త్రేతా, ద్వాపర, కలి, నామంబులు+అయిన= కృతం, త్రేత, ద్వాపరం, కలి- అనే పేళ్ళు కలిగినవయిన; యుగంబులు= పెక్కుసంవత్సరాల పరిమాణం గల కాలమానాలు; నాలుగును= నాలుగున్నూ; పండ్రెండు వేల దివ్యవర్షంబులన్= పండ్రెండువేల వేల్పుటేండ్లు (దేవమానంలో పండ్రెండువేల ఏండ్లు); పర్యవసితంబులు+అగున్= ముగుస్తాయి; ఈ+యుగంబులు నాలుగున్= ఈ నాలుగు యుగాలు అనగా కృతత్రేతాద్వాపరకలియుగాలు నాలుగు వెరసి; ఒకమహాయుగంబు= ఒకమహాయుగం; అనన్+పరఁగున్= అనేనామంతో వ్యవహరించబడుతుంది; మహాయుగ; సహస్ర, పర్యంతంబు+ఐన, కాలంబు= వేయిమహాయుగాలు గడచునట్టి కాలం; బ్రహ్మకున్= బ్రహ్మదేవునికి; దివసంబు+అ, నాన్+పరఁగున్= పగలు అనగా ఒప్పుతుంది; తద్+ దివస+అవసానంబునందున్= ఆ పగలు గడచిన పిమ్మట; శతవార్షికంబు+అయిన= నూరేండ్లు పట్టునట్టి; అనావృష్టి, దోషంబు= వాన కురియకపోవటం అనే కీడు; ప్రవర్తిల్లున్= ఏర్పడుతుంది; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: కృత త్రేతా ద్వాపర కలియుగాలనే నాలుగు యుగాలు పండ్రెండువేల దివ్యసంవత్సరాల సమాహారం. పై నాలుగు యుగాలు కలిస్తే ఒక మహాయుగం ఔతుంది. ఒక వేయి మహాయుగాలు కలిస్తే బ్రహ్మదేవుడికి ఒక పగలు (బ్రహ్మదివసం) ఔతుంది. ఆ బ్రహ్మదివసపు చివర నూరు సంవత్సరాలు అనావృష్టి ఏర్పడుతుంది. అప్పుడు.

ఆ. సప్తహయుఁడు మూర్తిసప్తకంబు ధరించి । కరము వేఁడి మిగులు కరము లొప్ప
నదనదీజలములు నుదధిజలంబులుఁ । బీల్చి జగము లెల్లఁ బ్రేల్చుఁ గడఁగి. 242

ప్రతిపదార్థం: సప్తహయుఁడు= ఏడుగుర్రాలు కలవాడు అనగా సూర్యుడు; మూర్తిసప్తకంబు= ఏడు ఆకారాలు; ధరించి= తాల్చి; కరము= మిక్కిలి; వేఁడి= ఉష్ణం; మిగులు= అతిశయించే; కరములు+ఒప్పన్= కిరణాలు శోభించగా; నద, నదీ,

జలములున్= నదములయొక్క నదులయొక్క నీళ్ళు; ఉదధిజలంబులున్= సముద్రంలోని నీళ్లు; పీల్చి= త్రాగి; కడఁగి= పూని; జగములు+ఎల్లన్= అన్నిలోకాలను; ప్రేల్చున్= మండజేస్తాడు.

తాత్పర్యం: ఆకాలంలో, సూర్యుడు ఏడాకారాలు ధరించి మిక్కిలి తీక్ష్ణాలైన కిరణాలతో ప్రకాశించి, నదులలోని నదాలలోని నీళ్ళు, సముద్రాలలోని నీళ్ళు త్రాగి లోకాల నన్నింటిని మండింపజేస్తాడు.

విశేషం: సూర్యుడు ప్రాచీన భారతీయ వాఙ్మయంలో 'సప్తహయుడు' గా ప్రసిద్ధుడు. సూర్యకిరణాల వ్యాపృతిచేత ఏర్పడే ఇంద్రధనుస్సును- సప్తవర్ణశబలితం, VIBGYOR అని నవీనశాస్త్రజ్ఞులు నిరూపించిఉన్నారు. దీనినే మన ప్రాచీనులు అర్థవాదరూపాన చెప్పారు. నది= ఏరు- పశ్చిమం నుండి తూర్పుకు ప్రవహించే ఏరు. నదము= తూర్పునుండి పడమరకు ప్రవహించే ఏరు.

చ. **దినకరతిగ్మతేజము ప్రదీప్తహుతాశనుఁ డై యుగాంతసం**
జనిత మహాసమీరణవశంబునఁ బేర్చి నగవ్రజంబుతో
మనుజులతోడ నిర్జరసమాజముతోడ భుజంగపంక్తితో
దనుజులతో జగత్త్రయముఁ దత్క్షణమాత్ర నొనర్చు నీఱుగన్. **243**

ప్రతిపదార్థం: దినకర తిగ్మతేజము= సూర్యుడియొక్క తీక్ష్ణమైన దీప్తి; ప్రదీప్త హుతాశనుఁడు+ఐ= బాగా మండే అగ్నిహోత్రుడై; యుగ+అంత, సంజనిత, మహా, సమీరణవశంబునన్= యుగాల చివరికాలంలో అనగా ప్రళయకాలంలో పుట్టే, గొప్ప గాలికి లోబడిందై; పేర్చి= అతిశయించి; నగ, వ్రజంబుతోన్= కొండల గుంపులతో; మనుజులతోన్= మనుష్యులతో; నిర్జరసమాజముతోడన్= దేవతలసముదాయంతో; భుజంగ, పంక్తితోన్= పాముల వరుసతో (భుజంగులనేవారు దేవతలలో ఒకతెగ); దనుజులతోన్= రాక్షసులతో; జగత్+త్రయమున్= మూడులోకాలను; తద్+క్షణమాత్రన్= ఒక త్రుటిమాత్రంలోనే; నీఱుగన్= బుగ్గిగా; ఒనర్చున్= చేస్తాడు.

తాత్పర్యం: సూర్యుడియొక్క వేడిమి ప్రళయకాలంలో వీచే గాలితోపాటు చెలరేగి ఈ మూడులోకాలను - పర్వత సమూహాలను, దేవతల, మనుష్యుల, భుజంగాల, రాక్షసుల సమూహాలను ఒక్కక్షణంలోనే బూడిద అయ్యేటట్లు నిర్మూలించగలదు.

వ. **తదనంతరంబ.** **244**

తాత్పర్యం: అటు పిమ్మట.

మ. **సితపీతారుణనీలపింగరుచులై స్నిగ్ధంబులై యుద్యతా**
యతవిద్యుల్లలితంబు లై ఘనగిరీంద్రాకారఘోరంబు లై
తతనిర్ఘాతనిపాతభీమభిదురధ్వానంబు లై సంతతో
ద్ధతసంవర్తవలాహకంబులు వెసం దోఁతెంచు దిగ్భిత్తులన్. **245**

ప్రతిపదార్థం: సిత, పీత+అరుణ, నీల, పింగ, రుచులు+ఐ= తెలుపు, పసుపు, ఇంచుకెరుపు, నలుపు, గోరోచనపురంగు, వెలుగులు కలవై; స్నిగ్ధంబులు+ఐ= దట్టమైనవై; ఉద్యత్+ఆయత, విద్యుత్+లలితంబులు+ఐ= పైకెత్తబడి నిడివిగా ఉండే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మెఱుపుతీగెలతో కూడి మనోహరా లైనవై; ఘన, గిరి+ఇంద్ర+ఆకార, ఘోరంబులు+ఐ= పెద్దవి నిడివికలవి అయిన శ్రేష్ఠములైన కొండలవంటి ఆకారాలచేత భయంకరాలుగా కన్పించునట్టివై; తత నిర్ఘాత నిపాత భీమ భిదుర ధ్వానంబులు+ఐ= విస్తారంగా పిడుగులు పడటంచేత భయంకరమైన వజ్రపాతంయొక్క ధ్వనివంటి ధ్వనులు కలవై; సంతత+ఉద్ధత, సంవర్త, వలాహకంబులు= ఎల్లప్పుడూ అతిశయించి ఉండే సంవర్తం, వలాహకం అనే పేరులు గల (ప్రలయకాల) మేఘాలు; దిక్+భిత్తులన్= దిక్కులనెడి గోడలపై; వెసన్= శీఘ్రంగా; తోఁతెంచున్= గోచరిస్తాయి.

తాత్పర్యం: ఎల్లప్పుడు క్షణక్షణం అతిశయించేవైన ప్రళయకాలమేఘాలు, తెలుపు, పసుపు, ఎరుపు, నలుపు, గోరోచనం రంగుల కాంతులు కలిగినవై, మిరుమిట్లు గొలుపే మెఱుపుతీగెలతో మనోహరాలై, గొప్పనిడివి గల కొండల ఆకారాలు భీతి గొల్పుతూ, విస్తారంగా పిడుగులు కురిపిస్తూ, వజ్రాయుధం వంటి భయంకరాలైన నినాదాలు చేస్తూ వేగంగా దిక్కులు పిక్కటిల్లేటట్లు దట్టంగా ఆవరిస్తాయి.

విశేషం: ప్రళయకాలంలో ఆవరించే మేఘాలకు సంవర్తం అని, వలాహకం అని పేర్లు.

ఉ. **పెల్లునఁ గూలు తజ్జలము పెక్కువ నొక్కట నమ్మహానలం**
బెల్లను నాఱిపోవుఁ బృథివీశ్వర! యేఱులు నబ్ధులున్ వెసం
దొల్లిటి యట్ల నిండుఁ; బటుతోయదసంఘము లంతఁ బోక గ
ర్జిల్లుచు వెండియుం గురియుఁ జిత్రముగాఁగ ననేకకాలముల్. **246**

ప్రతిపదార్థం: పృథివీ+ఈశ్వర!= భూమికి అధిపతియైనవాడా!; పెల్లునన్= మిక్కుటంగా; కూలు= క్రిందికిపడే; తద్+జలము, పెక్కువన్= ఆ మేఘాలనుండి అమితంగా పడేటటువంటి నీటియొక్క ఆధిక్యంచేత; ఆ+మహా+అనలంబు+ఎల్లను= ఆ గొప్పఅగ్నిహోత్రం అంతయును; ఆఱిపోవున్= చల్లారిపోతుంది; ఏఱులు= నదులు; అబ్ధులున్= సముద్రాలును; వెసన్= శీఘ్రంగా; తొల్లిటి+అట్లు+అ= పూర్వం మాదిరిగానే; నిండున్=(నీటితో) నిండుతాయి; అంతన్= అటుపిమ్మట; తోయద సంఘములు= మేఘాల సముదాయాలు; పోక= వెడలిపోక; గర్జిల్లుచున్= పెద్దధ్వని చేస్తూ; వెండియున్= మరల; చిత్రము+కాఁగన్= అచ్చెరువు కొలిపేటట్లుగా; అనేకకాలముల్= పెక్కునాళ్ళు; కురియున్= వర్షిస్తాయి.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! మిక్కుటంగా కురిసిన ఆ వాననీటిచేత, ఆ మహాగ్ని అంతా ఆరిపోతుంది. అంతట పూర్వంమాదిరిగానే ఏరులు, సముద్రాలు నీటితో నిండి ప్రవహిస్తాయి. ఇంకను ఆ మేఘాలు చెదరిపోకుండా ఆకసంలోనే నిలిచి, గర్జిల్లుతూ చాలాకాలం వర్షిస్తూనే ఉంటాయి.

శా. **ధారాపాతనితాంతవేగమున నిద్ధాత్రీతలం బాహతం**
బై రూపేది మునుంగుఁ దోయములలో నత్యంతగంభీరవాః
పూరం బంతయు ముంచి మించుటయు దిగ్భూమీనభోభాగముల్
వే రూపింపఁగ రాకయుండఁ దమముల్ వేష్టించుఁ ద్రైలోక్యమున్. **247**

ప్రతిపదార్థం: ధారాపాతనితాంతవేగమునన్= ఎల్లప్పుడు ఎడతెగకుండగా కురుస్తున్న వాననీటిచాలుయొక్క వడిచేత; ఈ+ధాత్రీ, తలంబు= ఈ భూమిపైభాగం; ఆహతంబు+ఐ= బాగుగా కొట్టబడినట్టిదై; రూపు+ఏది= ఆకృతిని కోలుపోయి; తోయములలోన్= నీటిలో; మునుంగున్= మునిగిపోతుంది; అత్యంత, గంభీర, వార్+పూరంబు+అంతయున్= మిక్కుటమగు లోతుగల

నీటిసముదాయం అంతయు; ముంచి= కప్పివేసి; మించుటయున్= అతిశయించటంచేత; దిక్+భూమీ, నభస్+భాగముల్= దిక్కులయొక్కయు, భూమి యొక్కయు, ఆకసంయొక్కయు ప్రదేశాలు; వేరూపింపఁగన్, రాక+ఉండన్= వేగంగా వేరు చేసి చూపించటానికి వీలులేకుండా ఉండగా; త్రైలోక్యమున్= మూడులోకాలను; తమముల్= చీకట్లు; వేష్టించున్= చుట్టుముట్టుతాయి.

తాత్పర్యం: ఎల్లప్పుడూ ఎడతెగక కురిసే వర్షాలచేత భూగోళమంతా బాగుగా కొట్టబడి, రూపాన్ని కోల్పోయి నీటిచేత పూర్తిగా ఆవరించబడుతుంది. మిక్కిలి లోతైన నీరు ముంచెత్తటంచేత దిక్కులు ఇవి, ఇవి భూభాగాలు, ఇది ఆకాశం అని వేర్పరచటానికి వీలుండదు. పెనుచీకట్లు దట్టంగా మూడులోకాలను ఆవరిస్తాయి.

తే. **అంతఁ బరమేష్ఠిచోదిత మైన యొక్క। మారుతము నలి రేఁగి దుర్వారభంగి**
విలయకాలవిశృంఖలవిపులవారి । ధరచయంబుల నెల్లను విరియ నడఁచు. **248**

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; పరమేష్ఠి, చోదితము+ఐన= బ్రహ్మచేత ఆజ్ఞాపించబడిన; ఒక్క, మారుతము= ఒక్కగాలి; నలి రేఁగి= మిగుల విజృంభించి; దుర్వారభంగిన్= వారించటానికి వీలులేనిరీతిగా; విలయ, కాల, విశృంఖల, విపులవారిధరచయంబులన్+ఎల్లను= ప్రళయసమయంలో స్వేచ్ఛగా విస్తరించిన మేఘాలసముదాయాలను అన్నింటిని; విరియన్+అడఁచున్= విచ్చిపోయేటట్లుగా అణచివేస్తుంది.

తాత్పర్యం: అంతట, బ్రహ్మదేవుడిచేత ఆజ్ఞాపించబడిన ఒక పెనుగాలి విజృంభించి,వారించటానికి వీలులేని విధంగా వీస్తుంది. అది అంతవరకు స్వేచ్ఛగా విస్తరించి ఉన్న మేఘాలనన్నింటిని చెదరగొట్టి అణచివేస్తుంది.

క. **ఆ మారుతంబు గ్రోలి పి । తామహుఁ డెంతయును ఘోరతర మగు సలిల**
స్తోమంబునందు నడుమం । దామరపై నిదురవోవుఁ దద్దయు నెమ్మిన్. **249**

ప్రతిపదార్థం: ఆ మారుతంబున్= ఆగాలిని; క్రోలి= ఆస్వాదించి; పితామహుఁడు= బ్రహ్మదేవుడు; ఎంతయును ఘోరతరము+అగు= మిక్కిలి భయంకరమైన; సలిల, స్తోమంబునందు= నీటిసముదాయంలో; నడుమన్= మధ్యభాగాన; తామరపైన్= పద్మంపై; తద్దయు, నెమ్మిన్= మిక్కిలిప్రీతితో; నిదుర+పోవున్= నిద్రపోతాడు.

తాత్పర్యం: ఆ గాలిని పీల్చి, బ్రహ్మదేవుడు ఆభయంకరమైన వరదనీటిమధ్య పద్మంపై మిక్కిలిప్రీతితో నిద్రిస్తాడు.

వ. **ఇట్టి కల్పాంతంబు లనేకంబులు సనియె; నింకఁ గానున్నవి యనేకంబులు; విను; మతీతకల్పాంత సమయంబున నేను బ్రబలాంధకారంబున నేదెసయుం గానక యొక్కండన యత్యంతభయాతురుండ నగుచుం బెద్దకాలంబు పరిభ్రమించుచుండ నొక్కతఱి నయ్యుదకమధ్యంబున నత్యున్నతం బయిన వటభూరుహంబు గానంబడియె; మఱియుఁ దదీయ పర్ణపర్యంకంబునందు.** **250**

ప్రతిపదార్థం: ఇట్టి కల్పాంతంబులు= ఇటువంటి బ్రహ్మదినాల అంత్యభాగాలు; అనేకంబులు= పెక్కులు; చనియెన్= నడచినవి; ఇంకన్= ఇకమీదట; అనేకంబులు= (పెక్కులు); కానున్నవి= కడవనున్నవి; వినుము= ఆలకింపుము; అతీత, కల్ప+అంత, సమయంబునన్= కడచిన కల్పానికి చివరికాలంలో; ఏను= నేను; ప్రబల+అంధకారంబునన్= పెనుచీకటిలో; ఏదెసయున్+కానక= ఏదిక్కును చూడలేక; ఒక్కండను+అ= ఒక్కడనే ఏకాంతంగా; అత్యంతభయ+ఆతురుండను+అగుచున్= మిక్కిలి వెఱపు చెందినవాడను ఔతూ; పెద్ద కాలంబు= చాలకాలం; పరిభ్రమించుచుండన్= తిరుగాడుతుండగా; ఒక్క,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తఱిన్= ఒక అదనులో; ఆ+ఉదక, మధ్యంబునన్= ఆనీటినడుమ; అతి+ఉన్నతంబు+అయిన= మిక్కిలి ఎత్తుగా ఉన్న; వట, భూరుహంబు= మఱ్ఱిచెట్టు; కానంబడియెన్= కన్పించింది; మఱియున్= అంతియకాక; తదీయ, పర్ణ, పర్యంకంబునందున్= ఆ ఆకు పాన్పుపై.

తాత్పర్యం: ఈవిధమైన కల్పాంతాలు ఎన్నో గడచాయి; ఇకమీద ఎన్నో కల్పాంతాలు గడవనున్నవి; ఆలకింపుము; జరిగిన కల్పాంతకాలాలలో దట్టంగా విస్తరించిన పెనుచీకటిమధ్య, దిక్కుతోచక ఏకాంతంగా నేను చాలాకాలం తిరుగాడవలసివచ్చింది. ఒక తఱి, ఆపెనువరదనీటి నడుమ నాకు ఒక పెద్దమఱ్ఱిచెట్టు కన్పించింది. ఆ మఱ్ఱిచెట్టు ఆకు పాన్పుమీద.

విశేషం: కల్పాంతం అనగా కల్పం చివర దాపురించే ప్రళయం, కల్పం అనగా బ్రహ్మదినం. మనుష్యమానంలో కృతత్రేతాద్వాపర కలియుగాలు నాలుగున్నూ వేయిమారులు తిరిగివస్తే బ్రహ్మకు ఒక పగలు ఔతుంది. బ్రహ్మయొక్క దివాభాగంలో జగత్తు చేష్టాయుక్త మౌతుంది. అతడి రాత్రిభాగంలో జగత్తు నిశ్చేష్టమై ఉంటుంది.

క. **కమనీయజలదవర్ణుని, । హిమకరబింబాస్యు, నుద్యదినతేజుఁ బ్రమో**
దమునఁ బవళించువానిం । గుమారు నొక్కరునిఁ గుసుమకోమలుఁ గంటిన్. **251**

ప్రతిపదార్థం: కమనీయజలదవర్ణునిన్= అందమైన మేఘంవంటి రంగు కలవాడిని; హిమకరబింబ+ఆస్యున్= చంద్రబింబంవంటి మొగం కలవాడిని; ఉద్యత్+ఇన, తేజున్= ప్రకాశిస్తున్న సూర్యుడివంటి వెలుగు కలవాడిని; ప్రమోదమునన్= సంతోషంతో; పవళించువానిన్= శయనించేవాడిని; కుసుమకోమలున్= పువ్వువంటి సౌకుమార్యంకలవాడిని; కుమారున్+ఒక్కరునిన్= ఒక చిన్నబాలకుడిని; కంటిన్= చూచాను.

తాత్పర్యం: నీలమేఘశ్యాములుడై, చంద్రబింబంవంటి మొగం కలవాడై, ప్రకాశిస్తున్న సూర్యుడివంటి తేజస్సుకలవాడై సంతోషంతో శయనించిఉన్న ఒక చిన్నిబాలకుడిని చూచాను. ఆ బాలకుడు పువ్వువంటి సౌకుమార్యం కలవాడు.

వ. **కని, విస్మితుండనై యాత్మగతంబున.** **252**

తాత్పర్యం: ఆ బాలకుడిని చూచి, మిక్కిలి ఆశ్చర్యం కలవాడనై నాలో నేను (ఈవిధంగా ఆలోచించాను).

క. **లోకంబులు దెగటారఁగ । నేకార్ణవమైన యిచట నిబ్బాలుఁ డొకం**
డేకతమున నిద్రించుచు । నేకతమున నున్నవాఁడొ? యెవ్వాఁ డగునో! **253**

ప్రతిపదార్థం: లోకంబులు= ప్రపంచాలు; తెగటారఁగన్= నశించిపోగా; ఏక+అర్ణవము+ఐన+ఇచటన్= ఒకే ఒక సముద్రంగా మారిన ఈస్థలంలో; ఈ+బాలుఁడు+ఒకండు= ఈ చిన్నికుమారుడు ఒక్కడు; ఏకతమునన్= ఒంటరిగా; నిద్రించుచున్= నిదురపోతూ; ఏ, కతమునన్= ఏకారణంచేత; ఉన్నవాఁడు+ఒ= ఉన్న వాడగునో; ఏ+వాఁడు+అగునో= అతడు ఎవడై ఉంటాడో?

తాత్పర్యం: ఈ సృష్టిలోని లోకాలు అన్నీ నాశం చెంది, ఒకే ఒక సముద్రంగా మారిన ఈస్థలంలో ఈచిన్ని బాలకుడు ఒంటరిగా ఏకారణంవలన నిదురిస్తూ ఉన్నాడో? ఈతడు ఎవ్వడు అయి ఉంటాడో?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **అని తలంచుచు నల్లన యక్కు మారుఁ। జేరఁబోయిన నాతండు సితసరోజ**

రేఖ దలకొనఁగా నలరించెఁ గన్ను। లవధరించెను నను లోచనాంచలముల. 254

ప్రతిపదార్థం: అని తలంచుచున్= అని ఆలోచిస్తూ; అల్లన= మెల్లమెల్లగా; ఆ+కుమారున్= ఆ బాలకుడిని; చేరన్+పోయినన్= సమీపించగా; ఆతండు= ఆకుమారుడు; సిత, సరోజ, రేఖ= తెల్లని పద్మంయొక్క సౌందర్యం, తలకొనఁగాన్= విస్తరించగా; కన్నులు; అలరించెన్= వికసింపజేశాడు; ననున్= నన్ను; లోచన+అంచలములన్= కనుగొలకులతో; అవధరించెను= దయ జాలువార చూచాడు.

తాత్పర్యం: అని యోచిస్తూ మెల్లమెల్లగా నేను ఆ బాలకుడిని చేరబోయాను. ఆ బాలకుడు తెల్లని కనుదమ్ములు విప్పారగా నాపై ఓరచూపులు సారించాడు.

వ. **తదనంతరంబ గంభీరమధురస్వరంబున ని ట్లనియె, 'నయ్యా! నిన్ను నతిశ్రాంతుంగా నెఱింగితిఁ; గొండొకసేపు విశ్రమింప వలతేని నవకాశం బిచ్చెద; నాశరీరంబు ప్రవేశించి సుఖంబున శయనింపు' మని తనవదనంబు వివృతంబుగాఁ జేసిన, నేనును బలాత్కార క్షిప్తుండునుం బోలెఁ బరవశుండ నై తన్మార్గంబున నతని యుదరంబుఁ బ్రవేశించి, యందు. 255**

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట, వెనువెంటనే; గంభీర, మధుర, స్వరంబునన్= లోతైన, తియ్యనైన కంఠధ్వనితో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు; అయ్యా!= ఆర్యా!; నిన్నున్= నిన్ను; అతిశ్రాంతుంగాన్= మిక్కిలి బడలిక చెందిన వాడినిగా; ఎఱింగితిన్= తెలిసికొన్నాను; కొండొకసేపు= కొంతకాలం మేర; విశ్రమింపవలతు(వు)+ఏనిన్= విశ్రాంతిని తీసికొన కోరుతున్నయెడల; అవకాశం+ఇచ్చెదన్= అదను కల్పిస్తాను; నా శరీరంబు= నాదేహం; ప్రవేశించి= చొరబడి; సుఖంబునన్= సుఖంగా; శయనింపుము= పవ్వళించుము; అని= అని చెప్పి; తన వదనంబు= తన నోరు; వివృతంబుగాన్+చేసినన్= తెరవబడినట్టిదిగా చేయగా; ఏనును= నేను కూడా; బలాత్కార, క్షిప్తుండునున్+పోలెన్= బలవంతంగా నెట్టివేయబడినవాడి రీతిగా; పరవశుండను+ఐ= తన్మయత్వం చెందినవాడనై; తద్+మార్గంబునన్= ఆదారివెంట; అతని= ఆ బాలకుడి; ఉదరంబున్= కడుపులోనికి; ప్రవేశించి= చొరబడి; అందున్= దానిలో.

తాత్పర్యం: అటుపిమ్మట వెనువెంటనే లోతైనతియ్యని కంఠధ్వనితో ఆ బాలకుడు ఇట్లా అన్నాడు: 'అయ్యా! నీవు మిక్కిలి డస్సి ఉన్నట్లు తోస్తున్నది. నీకు విశ్రాంతి తీసుకొనాలనే కోరిక ఉన్నట్లయితే అటువంటి అదను నీకు కల్పిస్తాను, నాదేహంలోకి ప్రవేశించి, సుఖంగా పవళించుము' అని చెప్తూతూ అతడు తన నోరు విప్పాడు. అంతట బలవంతంగా నెట్టివేయబడినట్లుగా నేను ఆ బాలకుడి నోటిదారివెంట, అతని కడుపులోకి ప్రవేశించాను. అందులో.

సీ. **గంగాదినదులతోఁ గనకశైలాదిభూ। ధరములతో సముద్రములతోడ**

వివిధపట్టణనవద్వీపవర్షములతో। బహుకర్మరతు లైన ప్రజలతోడఁ

బక్షిమృగవ్యాళపశుసంఘములతోడఁ। దద్దయు నొప్పారు ధాత్రిఁ గంటి;

సూర్యేందుతారకాజ్యోతిరుజ్జ్వల మైన। గగనంబుఁ బవనమార్గములుఁ గంటి;

తే. **శక్రయమవరుణాది నిర్జరసమేత। మైన నాకంబు గంటి; మహాహియక్ష**

రాక్షసాసురవిద్యాధర ప్రముఖులఁ। గంటి; వేయేల సకలలోకములుఁ గంటి. 256

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: గంగా+ఆది, నదులతోన్= గంగమొదలైన ఏరులతోను; కనకశైల+ఆది, భూధరములతోన్= బంగారుకొండ (మేరుపర్వతం) మున్నగు పర్వతాలతోను; సముద్రములతోడన్= సాగరాలతోను; వివిధ, పట్టణ, నవద్వీప, వర్షములతోన్= పెక్కునగరాలతోనుక్రొత్తదీవుల భూఖండాలతోను; బహు, కర్మ, రతులు+ఐన, ప్రజలతోడన్= పెక్కుపనులు చేయటంలో ఆసక్తులై ఉన్న జనులతోనూ; పక్షి, మృగ, వ్యాళ, పశు, సంఘములతోడన్= పిట్టలు, జంతువులు, పాములు, నాలుగుకాళ్ల జంతువుల సమూహాలతోనూ, తద్దయున్= మిక్కుటంగా; ఒప్పారు= శోభిల్లే; ధాత్రిన్= భూమిని; కంటిన్= చూచాను; సూర్య+ఇందు, తారకా, జ్యోతిస్+ఉజ్జ్వలము+ఐన= సూర్యుడితో, చంద్రుడితో, నక్షత్రాల కాంతులతో ధగధగలాడుతున్న; గగనంబున్= ఆకాశాన్ని; పవన, మార్గములున్= వాయువు సంచరించే తెరువులను; కంటిన్= చూచాను; శక్ర, యమ, వరుణ+ఆది, నిర్జర, సమేతము+ఐన= ఇంద్రుడితో, యముడితో, వరుణుడు మున్నగు దేవతలతో కూడిఉన్న; నాకంబున్= స్వర్గలోకాన్ని; కంటిన్= చూచాను; మహా+అహి, యక్ష, రాక్షస+అసుర, విద్యాధర, ప్రముఖులన్= గొప్పపాములు (భుజంగులు) యక్షులు రాక్షసులు, అసురులు, విద్యాధరులు మున్నగువారిని; కంటిన్= చూచాను; వేయి+ఏల= వేయిమాటలు ఎందుకు?; సకల, లోకములున్= అన్నిజగత్తులు; కంటిన్= చూచాను.

తాత్పర్యం: గంగ మొదలైన నదులతో, మేరుపర్వతం మున్నగు పర్వతాలతో, సముద్రాలతో, పెక్కునగరాలతో, పెక్కుదీవులతో, భూఖండాలతో వివిధ వ్యాపారాలను చేసికొనటంలో నిమగ్నులైఉన్న ప్రజానీకాలతో, పక్షులు, మృగాలు, పాములు, పశువులు తిరుగాడుతున్న ప్రదేశాలతో ఒప్పారే సువిశాలభూభాగాలను చూచాను. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ప్రకాశిస్తున్న ఆకసాన్ని చూచాను, వాయువులు చరించే మార్గాలను చూచాను. ఇంద్రుడు, వరుణుడు, యముడు మున్నగు దేవతలు నివసించేలోకాలను చూచాను. భుజంగులు, యక్షులు, రాక్షసులు, అసురులు, విద్యాధరులు మున్నగువారు నివసించేలోకాలను చూచాను. వేయిమాటలతో విస్తరించి అభివర్ణించ నక్కరలేదు. ఒక్క ముక్కలో చెప్పవలె ననిన, నేను సమస్తలోకాలూ ఆ బాలకుడి కడుపులో ఉండటం చూచాను.

చ. **అరుదుగ నమ్మహాత్ముని మహాజఠరాంతరభూమి నూఱువ**
త్సరముల యంతకాలము వసం బఱి త్రిమ్మరితిం గడంగి య
ప్పరుసున నెందుఁ గాల్గొనఁగఁ బట్టదు చిత్తము భీతిమీఱఁ ద
త్పరమతి నంత నక్కపటబాలు పదంబులు సంస్మరించితిన్. **257**

ప్రతిపదార్థం: అరుదుగన్= అచ్చెరువుగా; ఆ+మహా+ఆత్మునిన్= గొప్ప ఆత్మ గల ఆమహానుభావుడి; మహా, జఠర+అంతర, భూమిన్= గొప్పకడుపు అనే భూప్రదేశంలో; నూఱు, వత్సరముల+అంత, కాలము= వందయేండ్లకు సరిపడే కాలం; వసంబు+అఱి= స్వాధీనత తప్పి; త్రిమ్మరితిన్= తిరుగాడాను; కడంగి= పూని; ఆ+పరుసునన్= ఆవిధంగా; ఎందున్= ఎచటను; కాల్+కొనఁగన్= కాలూనటానికి; నిలవటానికి; పట్టదు= ఏర్పడదు; చిత్తము= మనస్సు; భీతిమీఱన్= భయం అతిశయించగా; తద్ +పరమతిన్= తదేకధ్యానంతో; అంతన్= అటుపిమ్మట; ఆ కపటబాలు పదంబులు= ఆ మాయబాలకుడి యొక్క పాదాలు; సంస్మరించితిన్= ధ్యానించాను.

తాత్పర్యం: ఆ మహాత్ముడి కడుపులో ఉన్న భూప్రదేశంలో నూరుసంవత్సరాలు ఆశ్చర్యంతో తిరుగాడాను గాని ఎచ్చటను సుస్థిరంగా నిలవలేకపోయాను. మనస్సు భీతిచేత ఆవరించబడింది. అంతట మాయావిగా తోచిన ఆ బాలకుడి పాదాలనే ధ్యానించసాగాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు శరణ్యవరేణ్యుం డైన కారుణ్యనిధి నద్దేవుం దలంచుచుండ నతండు నన్నుం దనవదనానిలవేగంబునం జేసి వెలువరించె; నంత నెప్పటియ ట్లమ్మహావటవిటపిశయనుం డైన యబ్బాలు నాలోకించితి; నంత. 258

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; శరణ్య, వరేణ్యుండు+ఐన= శరణు పొందదగిన వారిలో గొప్పవాడు అయిన; కారుణ్యనిధిన్= దయకు పెద్ద నెలవు అయినవాడు; ఆ+దేవున్= ఆ దేవుడిని; తలంచుచుండన్= ధ్యానిస్తూ ఉండగా; అతండు= ఆబాలకుడు; నన్నున్; తనవదన+అనిల, వేగంబునన్+చేసి= తన నోటిగాలియొక్క వడిచేత; వెలువరించెన్= వెలికి వచ్చేటట్లుగా చేశాడు; అంతన్= అటు పిమ్మట; ఎప్పటి+అట్లు+అ= ఇంతకు ముందు ఉన్నరీతిగనే; ఆ+మహావట విటపిశయనుండు+ఐన= ఆగొప్పమర్రిచెట్టుపై పవళించి ఉన్నవాడైన; ఆ+బాలున్= ఆ కుర్రవాడిని; ఆలోకించితిన్= చూచాను; అంతన్= అటుపిమ్మట.

తాత్పర్యం: దయానిధి అయినవాడు, ఆశ్రయించదగిన వారిలో శ్రేష్ఠుడైనవాడు అయిన ఆదేవుడిని నేను సంస్మరిస్తూ ఉండగా, ఆ దేవుడు తన నోటినుండి వెలువడిన గాలివేగంచొప్పున నన్ను వెలువరించాడు. అంత యథాప్రకారం ఆ మర్రిచెట్టు(ఆకు)పై పవళించిఉన్న ఆ బాలకుడిని చూచాను. అంత.

క. ననుఁ గనుఁగొని యెలనవ్వునఁ । దనవదనము వింతచెన్ను దలకొనఁగా ని
ట్లను నబ్బాలుఁడు 'విశ్రమ । మొనరించితె యనఘ! యస్మదుదరములోనన్?' 259

ప్రతిపదార్థం: ననున్= నన్ను; కనుఁగొని= చూచి; ఎలనవ్వునన్= చిరునవ్వుతో; తనవదనము= తనమొగం; వింతచెన్ను= అచ్చెరు వొనరించే సొగసు; తలకొనఁగాన్= వహింపగా; ఆ+బాలుఁడు; ఇట్లు+అనున్= ఈవిధంగా పలికాడు; అనఘ!= పాపరహితుడా!; అస్మత్+ఉదరములోనన్= నా పొట్టలో; విశ్రమము+ఒనరించితి(వి)+ఎ?= విశ్రమించావా?

తాత్పర్యం: నన్ను చూచి చిరునవ్వు తనమొగానకు అచ్చెరువుగొలిపే సొగసు చేకూర్చగా ఆబాలకుడు ఈవిధంగా పలికాడు. 'పుణ్యాత్ముడా! నా పొట్టలో నీవు విశ్రాంతి తీసికొన్నావా?'

వ. అనిన నేనును సంభ్రమంబున నతనిం జేరనరిగికెందామరరేకులందెగడు నంగుళంబులు గలిగి తరుణకిసలయ సుకుమారంబు లయిన తచ్చరణకమలంబులు శిరంబునం జేర్చి 'దేవా! దేవరప్రసాదంబున నత్యాశ్చర్యకారణం బైన సకలచరాచరభూత ప్రపంచంబుఁ జూచితి; భవదీయమాయాప్రభావంబు భావింప నేరకున్నవాఁడ. 260

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఏనును= నేనును; సంభ్రమంబునన్= తొట్రుపాటుచొప్పున; అతనిన్+చేరన్+అరిగి= అతడిదగ్గరకు చేరేటట్లుగా వెళ్లి; కెందామరరేకులన్ (కెంపు+తామరరేకులన్)= ఎర్రనితామరపువ్వుల రేకులను; తెగడు= నిరసించే; అంగుళంబులు, కలిగి= చేతివ్రేళ్లు కలిగి; తరుణ, కిసలయ, సుకుమారంబులు+అయిన= లేతచిగురుటాకులవలె మెత్త నైన; తద్+చరణ, కమలంబులు= ఆ(బాలకుడి) పాదపద్మాలు; శిరంబునన్+చేర్చి= తలమీద హత్తుకొని; దేవా= ఈశ్వరా!; దేవర, ప్రసాదంబునన్= దేవరవారిదయవలన; అతి+ఆశ్చర్య, కారణంబు+ఐన= మిక్కిలి అచ్చెరువు కొలుపుటకు హేతువైన; సకల, చర+అచర, భూత, ప్రపంచంబున్= సమస్తమైన కదలునట్టి కదలనట్టి పదార్థాలు కల జగత్తును; చూచితిన్= దర్శించాను; భవదీయ, మాయా, ప్రభావంబు= నీదైన భ్రమను కూర్చునట్టి మహిమ; భావింపనేరక+ఉన్నవాఁడ(న్)= ఆలోచించి అర్థం చేసికొనజాలకున్నాను.

తాత్పర్యం: అని చెప్పినపుడు, నేను తొట్రుపాటుచొప్పున ఆ బాలకుడిదగ్గరకు చేరబోయాను. ఆ బాలకుడిచేతివ్రేళ్ళు ఎఱ్ఱతామరపువ్వుయొక్క రేకులకంటె సొగసైనవి, అతడి పాదపద్మాలు లేతచిగురుటాకులకంటె సుకుమారాలుగా ఉన్నాయి. ఆతడి చరణాలను నాశిరస్సున తాల్చి. 'దేవా! నీదయవలన, మిక్కుటమైన అచ్చెరువు కలిగించే సకల చరాచరసృష్టిని నీపొట్టలో చూచాను; నీమాయాప్రభావాన్ని ఎంత యోచించినా నేను అర్థం చేసికొనలేకున్నాను.

శా. **ఈ యేకార్ణవ మీ వటక్షితిరుహం బీ పర్ణపర్యంక మి**
ట్లై యొప్పారుచునుండఁగా నుదరభాగైకప్రదేశంబునం
దీ యూరేడుజగంబులున్ మెలఁగఁగా నిట్లున్న బాలత్వ మే
నేయందంబున నిశ్చయించి సుఖి నై యేపారుదుం జెప్పవే! 261

ప్రతిపదార్థం: ఈ+ఏక+అర్ణవము= ఒకే ఒక్కటిగా ఏర్పడిన ఈసముద్రం; ఈ, వట, క్షితిరుహంబు= ఈమఱ్ఱిచెట్టు; ఈ. పర్ణ, పర్యంకము= ఈ ఆకు శయ్య; ఇట్లు+ఐ= ఈవిధంగా నుండినదై; ఒప్పారుచున్+ఉండఁగాన్= విలసిల్లుతూఉండగా; ఉదర, భాగ+ఏక, ప్రదేశంబునందున్= పొట్టలోపలి భాగంలోనే ఇమిడి ఉన్న స్థలంలో; ఈ+ఈరు+ఏడు, జగంబులున్= ఈపదునాలుగు లోకాలును; మెలఁగఁగాన్= వర్తిల్లగా; ఇట్లు+ఉన్న= ఈ రీతిగా ఉన్న; బాలత్వము= పసిపిల్లవాడి తనం; ఏన్= నేను; ఏఅందంబునన్= ఏవిధంగా; నిశ్చయించి= నిర్ణయించి; సుఖిని+ఐ= సౌఖ్యాన్ని పొందే వాడనై; ఏపారుదున్= ఒప్పారుతాను; చెప్పవే= చెప్పగోరుతాను.

తాత్పర్యం: దేవా! స్థూలదృష్టికి నీవు ఒకపసిబాలకుడివిగా భాసిస్తున్నావు. సూక్ష్మదృష్టితో ఎంత తరచి చూచినప్పటికీ నీ మహిమ నా ఊహలను దాటిపోతున్నది. ఇది ఎటు చూచినా అంతు దరి చిక్కని ఒకేఒక పెనుకడలి. దీనిని ఏమనవలె? మరి ఈ పెను మఱ్ఱి చెట్టు, ఆకు శయ్య ఏమిటి? నీపొట్టలో పదునాలుగు లోకాలు పెట్టుకొని పసిపాపడి వలె పవ్వళించటం ఏమిది? ఈ పసిబిడ్డడి సొగసు ఎట్టి దని నిర్వచించగలను? నిశ్చయించగలను? ఆ ఆనందసౌఖ్యం నాకు ఏవిధంగా చేకూరునో దయచేసి నీవే చెప్పాలి.

క. **నాదైన యాశ్రితత్వము । నీదగు చిత్తమునఁ గలిమి నియతమ యేనిన్**
సాదరఫణితుల నన్నవ । సాదితసమ్మోహుఁగాఁ బ్రసాదింపఁదగున్.' 262

ప్రతిపదార్థం: నాదు+ఐన, ఆశ్రితత్వము= నేను నిన్ను ఆశ్రయించటం; నీదు+అగు, చిత్తమునన్= నీదైన మనస్సులో, కలిమి= కలిగి ఉండటం; నియతము+అ+ఏనిన్= నిత్యమైనదే అయితే; స+ఆదర, ఫణితులన్= ఆదరంతో కూడిన తీరుతెన్నులతో; నన్నున్= నన్ను; అవసాదిత సమ్మోహున్+కాన్= పోగొట్టబడిన భ్రాంతి కలవాడినిగా; ప్రసాదింపన్+తగున్= అనుగ్రహించదగును.

తాత్పర్యం: దేవా! నేను నీకు నిజమైన ఆశ్రితుడను. ఆ సంగతి నీ మనస్సులో ఎల్లప్పుడూ పాయక నిల్చేదే అయితే, నన్ను ఆదరించి నీవు నా భ్రాంతిని దయచేసి తొలగించి, నన్ను రక్షించుము.'

నారాయణుఁడు మార్కండేయునకుఁ దన ప్రభావంబు సెప్పుట : (సం. 3-187-1)

క. **అని యేను వేఁడికొనుటయు । ఘనతరకరుణారసానుకలితహృదయుఁ డై**
తన దివ్యమహిమ యిట్లని । వనజాక్షుఁడు సెప్పె గారవంబున నాకున్. 263

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని= అట్లు పలికి; ఏను= నేను; వేడికొనుటయున్= ప్రార్థించటమున్నూ; వనజ+అక్షుఁడు= పద్మాలవంటి కన్నులు కలవాడు- విష్ణుమూర్తి; ఘనతర, కరుణా, రస+అనుకలిత, హృదయుఁడు+ఐ= మిక్కిలి గొప్ప దైన దయ అనెడి రసం చేత కూడిన డెందం కలవాడై; తన, దివ్య, మహిమ= తనయొక్క దేవతాసంబంధమైన గొప్పతనం; ఇట్లు+అని= ఈ విధంగా వివరించి; గారవంబునన్= గౌరవభావంతో; నాకున్= నాకు; చెప్పెన్= వచించాడు.

తాత్పర్యం: ఆ విధంగా నేను ప్రార్థించటంచేత, పద్మాలవంటి కన్నులు కల విష్ణుదేవుఁడు నాయందు గొప్పదైన దయకలవాడై, మిక్కుటమైన వాత్సల్యంతో తన దివ్యమహిమను నాకు ఈ విధంగా వివరించి చెప్పాడు.

ఆ. 'అనఘ! దేవతలును మునులును నాదైన । మహిమఁ దెలియ లేరు, మహితబుద్ధి
నతులపుణ్యమతివి పితృభక్తుఁడవు గాన । యెలమి నీకుఁ జెప్పవలసెఁ దెలియ. 264

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! (ఓమార్కండేయమహర్షీ); నాదు+ఐన, మహిమ= నాకు సంబంధించిన గొప్పతనం; దేవతలును= వేల్పులును; మునులును= ఋషులును; తెలియన్‌లేరు= గ్రహించనేరరు; మహితబుద్ధిన్= గొప్ప దైన మతిచేత; అతుల, పుణ్యమతివి= సాటిలేని సుకృతంతో కూడిన బుద్ధి కలవాడవు; పితృభక్తుఁడవు= తండ్రియందు పూజ్యభావం కలవాడివి; కాన= కావున; ఎలమిన్= సంతసంతో; నీకున్= నీకు; తెలియన్= తెలిసేటట్లుగా; చెప్పవలసెన్= వచించవలసి వచ్చింది.

తాత్పర్యం: 'ఓపుణ్యాత్ముడా! వేల్పులు ఋషులు కూడ నామహిమ తెలియ నేరరు; నీవు గొప్పమేధావివి; సాటిలేని సుకృతం ఆర్జించినవాడవు; తండ్రిని ఆరాధించేవాడవు. కావున సంతసంతో నీకు తెలిసేటట్లుగా నామహిమ వివరించి చెప్పవలసి వచ్చింది.

క. నారము లందురు జలముల; । నారయ నారములు నాకు నయనం బగుటన్
నారాయణుఁ డను పేర, న । పారనిగమఫణితులందుఁ బరఁగుదుఁ బేర్మిన్. 265

ప్రతిపదార్థం: జలములన్= నీళ్ళను; నారములు+అందురు= 'నారములు' అని అంటారు; ఆరయన్= విచారించి చూడగా; నారములు= జలములు; నాకున్+అయనంబు+అగుటన్= నాకు స్థానం కావటంచేత; నారాయణుఁడు= నార+అయనుఁడు= నారములు అయనముగా అనగా స్థానంగా కలవాడు; అను పేరన్= అనే పేరుమీద; అపార= పారం లేని అనగా అంతు కనరాని; నిగమఫణితులందున్= వేదపద్ధతులలో; పేర్మిన్= పెంపారేటట్లుగా; పరఁగుదున్= ఒప్పారుతూ ఉంటాను.

తాత్పర్యం: ఓ మార్కండేయ మహర్షీ! జలాలకు పర్యాయపదం నారములు. నాకు జలాలు స్థానం. అందుచేత నాకు 'నారాయణుడు' (నారములు స్థానంగా కలవాడు) అనే సార్థకనామధేయం ఏర్పడింది.

తే. అట్టి నారాయణాఖ్యుండ నైన నేను । శాశ్వతుండ నై ప్రభుఁడనై సకలజగము
లోలిఁ బుట్టింతుఁ బాలింతు నుచితవేళ । సంహరింతుఁ జిదానందశాలి నగుచు. 266

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; నారాయణ+ఆఖ్యుండను+ఐన= నారాయణుడు అనే పేరుకలిగినవాడనైన; నేను; శాశ్వతుండను+ఐ= ఎల్లప్పుడు ఉండేవాడనై; ప్రభుఁడను+ఐ= పరిపాలించేవాడనై; చిత్+ఆనందశాలిన్+అగుచున్= జ్ఞానంతో కూడిన ఆనందం కలవాడను ఔతూ; సకల జగములు= లోకాలను అన్నింటిని; ఓలిన్= క్రమంగా; పుట్టింతున్= ఉద్భవింపచేస్తాను; పాలింతున్= ఏలుకొంటాను; ఉచిత వేళన్= తగిన సమయంలో; సంహరింతున్= నశింపజేస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆవిధంగా 'నారాయణుఁడు' అనే పేరు కల నేను ఎల్లప్పుడూ ఉండేవాడిని, పాలించేవాడిని. జ్ఞానంతో కూడిన ఆనందం కలవాడినౌతూ, వెల్లివిరిసే ఈ లోకాలనన్నిటిని క్రమంగా నేను సృష్టిస్తాను. నేనే ఏలుకొంటాను. తగిన సమయంలో వాటిని లయంచేస్తాను.

మత్తకోకిలము.

అంబుజాసనుఁ డింద్రుఁ డీశ్వరుఁ డంతకుండు ధనేశ్వరుం
డంబుధీశుఁడు లోనుగా సుర లస్మదాకృతు; లుర్వి పా
దంబు, లగ్ని ముఖంబు, సూర్యసుధాకరుల్ నయనంబు, లీ
యంబరంబు శిరంబుగా నిటు లద్భుతాకృతి నుండుదున్. **267**

ప్రతిపదార్థం: అంబుజ+ఆసనుఁడు= పద్మం ఆసనంగా కలవాడు- బ్రహ్మదేవుడు; ఇంద్రుఁడు= వేల్పులదొర అయిన ఇంద్రుడు; ఈశ్వరుఁడు= శివుడు; అంతకుండు= యముడు; ధన+ఈశ్వరుండు= ధనానికి అధిపతి అయిన కుబేరుడు; అంబుధి+ఈశుఁడు= సముద్రాలకు ప్రభువు- వరుణుడు; లోనుగాన్, సురలు= మొదలుగాగల దేవతలు; అస్మత్+ఆకృతులు= నా ప్రతిరూపాలు ధరించిన వారే; ఉర్వి= భూమి (నాకు); పాదంబులు= కాళ్ళు; అగ్ని= అగ్ని; ముఖంబు= (నా)మొగం; సూర్య, సుధాకరుల్= సూర్యుడూ చంద్రుడూ; (నా) నయనంబులు=(నా) కన్నులు; ఈ+అంబరంబు= ఈ ఆకాశం; శిరంబు+కాన్= తలఅయి; ఇటులు= ఈవిధంగా, అద్భుత+ఆకృతిన్= అచ్చెరువు గొలిపే ఆకారంతో; ఉండుదున్= ఉంటాను.

తాత్పర్యం: పద్మం పీఠంగా గల బ్రహ్మదేవుడున్నూ, వేల్పులను పాలించే ఇంద్రుడున్నూ, ధనానికి అధిపతి అయిన కుబేరుడున్నూ, సముద్రాలకు అధిపతి అయిన వరుణుడున్నూ, మిగిలిన వారందరున్నూ, నా అంశను పంచుకొన్న నా ప్రతినిధులే సుమా! భూమి నాయొక్క పాదాలు, అగ్నిహోత్రుడు నా ముఖం, సూర్యచంద్రులు నా నేత్రాలు, ఈ ఆకాశం నా శిరస్సు, ఈ విధమైన అద్భుతాకారం ధరించి నేను విలసిల్లుతాను.

విశేషం: 1. ఇట విష్ణుపారమ్యం ప్రతిపాదించబడింది. శ్రీమన్మహావిష్ణువే సృష్టిస్థితిలయకారు డైన పరమాత్మగా ఇట అభివర్ణితం. మహాభారతకథలో శ్రీకృష్ణుడు నిర్వహించిన విశిష్టపాత్ర అందరికీ తెలిసిందే. ఆ కృష్ణుడు సమకాలీనులచేత విష్ణుమూర్తి అవతారంగా అగ్గింపబడటం మహాభారతంలోనే సుస్పష్టంగా ఉన్నది. విష్ణు తత్త్వాన్ని వేదవ్యాసమహర్షి ప్రతిపాదించాడనిన్నీ దానిని వైశంపాయనుడు విస్తరించి వర్ణించాడనిన్నీ, శ్రీ వైద్య మొదలైన విమర్శకుల అభిప్రాయం, వైశంపాయనమహర్షి జనమేజయుడి సత్రయాగంలో తన భారతం వినిపించాడు. భారతం మహాభారతమైనది. ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులకు విన్పించింది సత్రయాగసమయంలోనే. ఇతడే విష్ణు పారమ్యం, శివపారమ్యం, బహుదేవతా పారమ్యాలను ప్రబోధించే పలుగాథలను అభివర్ణించి శివకేశవాద్వైతతత్త్వాన్ని సైంధవవధఘట్టంలో ప్రతిపాదించిన సమన్వయ సంధాత. మహాభారతంలో మొట్టమొదట ద్రౌపదీ స్వయంవరఘట్టంలో ఎట్టి పూర్వపరిచయం లేకుండానే శ్రీకృష్ణపాత్ర ప్రవేశపెట్టబడటం గమనించదగింది.

2. మత్తకోకిలలోని ప్రతిపాదంలోనూ ర,స,జ,జ,భ,ర - అనే గణాలు వరుసగా ఉంటాయి. 11వ అక్షరం యతి స్థానం. ప్రాసనియమం ఉన్నది.

చ. **అతులితదక్షిణాన్వితమహాధ్వరసంఘము లే నొనర్చితిం;**
జతురమనీషితాప్రచురసౌఖ్యులు భూసురముఖ్యు లంచిత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్రతులు మహీపతుల్ సుగుణవంతులు వైశ్యులు భక్తి నన్ను సం
తతమును గొల్తు రీక్షితి నుదాత్తమహాక్రతు కర్మశీలురై. 268

ప్రతిపదార్థం: అతులిత, దక్షిణా+అన్విత, మహా+అధ్వర, సంఘములు= సాటిలేని, దక్షిణలతో కూడిన గొప్పయజ్ఞాలు పెక్కులు; ఏను= నేను; ఒనర్చితిన్= చేశాను; చతుర, మనీషితా, ప్రచుర, సౌఖ్యులు= ఎప్పటి కప్పుడు వికసించే బుద్ధిచేత విస్తరించే సౌఖ్యాలు కలవారు (అగు); భూసుర, ముఖ్యులు= బ్రాహ్మణశ్రేష్ఠులు; అంచితవ్రతులు= గొప్ప వ్రతాలు గల; మహీపతుల్= రాజులును; సుగుణవంతులు వైశ్యులు= మంచిలక్షణాలు కల కోమటులును; నన్నున్; సంతతమును= ఎల్లప్పుడూ; భక్తిన్= పూజ్యభావంతో; ఈ క్షితిన్= ఈ భూమిమీద; ఉదాత్త, మహాక్రతు, కర్మ శీలురు+ఐ= దానాలతో కూడిన గొప్పయజ్ఞాలు చేసే స్వభావం కలవారై; కొల్తురు= పూజిస్తారు.

తాత్పర్యం: నేను ఎన్నో యజ్ఞాలను సాటిలేని దక్షిణలతో చేసి ఉన్నాను. మేధావులై నిరతం సుఖించే బ్రాహ్మణోత్తములున్నూ, మెచ్చుకొనదగిన దీక్షాదక్షతలు కల ప్రభువులున్నూ, సద్గుణాలు కల వైశ్యులున్నూ దానధర్మాలతో కూడిన యజ్ఞాలు చేసే స్వభావం కలవారై నన్ను భక్తితో ఆరాధిస్తారు.

చ. విలయపయోధిమగ్న మగు విశ్వమహీవలయంబుఁ దొల్లి యే
నలఘువరాహవిగ్రహుఁడ నై వెస నెత్తితి, శేషమూర్తి నై
లలితఫణాసహస్రకము లావునఁ దాల్తు నశేషధాత్రియున్
జలనిధి నిమ్నగా నగ లసన్నగరీ వనమండలంబుతోన్. 269

ప్రతిపదార్థం: విలయ, పయోధిమగ్నము+అగు= ప్రళయకాల సముద్రంలో మునిగిపోయిందైన; విశ్వ, మహీ, వలయంబున్= సమస్తమైన భూగోళాన్ని; తొల్లి= పురాతనకాలంలో; ఏన్= నేను; అలఘువరాహవిగ్రహుఁడను+ఐ= గొప్ప పంది ఆకారం కలవాడ నై; వెసన్= శీఘ్రంగా; ఎత్తితిన్= ఉద్ధరించాను; శేషమూర్తిన్+ఐ= ఆదిశేషుడి ఆకారం కలవాడనై; లలిత, ఫణా, సహస్రకము, లావునన్= సుకుమారమైన వేయిపడగలయొక్క శక్తిచొప్పున; అశేషధాత్రియున్= సమస్తభూమిని; జలనిధి, నిమ్నగా, నగ, లసత్‌నగరీ, వన, మండలంబుతోన్= సముద్రాల, నదుల, పర్వతాల, ఒప్పారే నగరాల, అడవులతోడి సమూహంతో; తాల్తున్= ధరిస్తాను.

తాత్పర్యం: ప్రళయకాలంలో సముద్రంలో మునిగిపోయిన సమస్త భూగోళాన్ని వరాహరూపం ధరించి ఉద్ధరించింది నేనే. సముద్రాలతో నదులతో పర్వతాలతో పట్టణాలతో అడవులతో ఒప్పారే ఈ సమస్త భూమండలాన్నీ మనోజ్ఞమైన వేయిపడగలపై ఆదిశేషుడిరూపంతో ధరిస్తున్నవాడను నేనే సుమా!

క. బాడబదహనుఁడనై వడి । నేడు సముద్రముల జలము లేఁ గ్రోలుదు నీ
రేడుజగంబులు విలయముఁ । గూడెడు నెడఁ దజ్జలంబు గొనకొని విడుతున్. 270

ప్రతిపదార్థం: బాడబదహనుఁడను+ఐ= బడబాగ్నినై; వడిన్= వేగంగా; ఏడుసముద్రములజలములు= ఏడుసముద్రాలలోని నీళ్ళు; ఏన్= నేను; క్రోలుదున్= త్రాగుదును; ఈరేడు, జగంబులు= పదునాలుగు లోకాలు; విలయమున్+కూడెడు+ఎడన్= ప్రళయంతో కూడే సమయంలో అనగా- ప్రళయకాలంలో; తత్+జలంబు= ఆ నీరు; గొనకొని= పూని; విడుతున్= విడిచిపెట్టుతాను.

తాత్పర్యం: బాడబమనే అగ్నినయి ఏడుసముద్రాల నీళ్లను నేను త్రాగుతాను, ఆ నీళ్లను ప్రళయకాలంలో నేను విడిచిపెట్టుతాను.

విశేషం: బడబ అనగా ఆడుగుర్రం యొక్క ఆకృతిలో సముద్రగర్భంలో ఉండే అగ్ని.

చ. **వదనభుజోరుపాదముల వర్ణచతుష్టయమున్ యుగాదియం**
దొదవ సృజింతు; ఋగ్యజుషసూక్తులు సామము నయ్యథర్వమున్
విదితముగా మదీయముఖవీథుల నుద్భవమొందు; నన్నియుం
దుదిఁ బరివర్తనక్రమవిధూతము లై ననుఁ జేరుఁ గ్రమ్మఱన్. **271**

ప్రతిపదార్థం: వదన, భుజా+ఊరు, పాదములన్= ముఖం, భుజాలు, తొడలు, కాళ్ళనుండి; వర్ణచతుష్టయమున్= నాలుగువర్ణాలను; యుగ+ఆదియందున్= యుగాలకు ముందుగా; ఒదవన్= కలిగేటట్లుగా; సృజింతున్= సృష్టిచేస్తాను; ఋక్+యజుష, సూక్తులు= ఋగ్వేదానికి యజుర్వేదానికి సంబంధించిన మంచిమాటలు; సామమును= సామవేదాన్ని; ఆ+అథర్వమున్= ఆ అథర్వవేదాన్ని; విదితముగాన్= తెల్లమయ్యేటట్లుగా; మదీయ, ముఖ, వీథులన్= నాముొగం అనెడి తెరువులందు; ఉద్భవము+ఒందున్= పుట్టుతాయి; అన్నియున్= (పైన చెప్పబడిన వన్నీ) అన్నియును; పరివర్తన, క్రమ, విధూతములు+ఐ= మార్పుచెందేవరుసపద్ధతిచేత చెదరగొట్టబడినవై; క్రమ్మఱన్= మరల; ననున్+చేరున్= నన్ను పొందుతాయి.

తాత్పర్యం: సృష్టి ఆరంభించే సమయంలో నా నోటినుండి, భుజాల నుండి, తొడలనుండి, పాదాలనుండి నాలుగు వర్ణాలను సృష్టిస్తాను. అట్లే నాలుగువేదాలు- ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం నాముఖాలనుండి ఉద్భవిస్తాయి. ఇవి అన్నీ తుట్టతుదకు ప్రళయకాలంలో అవశ్యంగా చెందేమార్పుకు లోనై తిరిగి నన్నే చేరుతాయి.

క. **అనహంకృతు లక్రోధను । లనసూయులు సంగరహితు లధ్యాత్మవిదుల్**
ఘనసత్యాత్మకులు మహా । మునులు ననుం గొల్తు రెపుడు మోక్షాపేక్షన్. **272**

ప్రతిపదార్థం: అనహంకృతులు= అహంభావం లేనివారు; అక్రోధనులు= కోపం లేనివారు; అనసూయులు= అసూయ లేనివారు; సంగరహితులు= మమత్వం లేనివారు; అధ్యాత్మవిదుల్= విజ్ఞానవేత్తలు; ఘనసత్య+ఆత్మకులు= గొప్పదైన సత్యంలో నిష్ఠ కలవారు; మహామునులు= గొప్పఋషులు; మోక్ష+అపేక్షన్= ముక్తిమీది ఆసక్తిచేత; ఎపుడున్= ఎల్లప్పుడు; ననున్= నన్ను; కొల్తురు= ఆరాధిస్తారు.

తాత్పర్యం: అహంభావం లేనివారు, కోపం లేనివారు, అసూయ లేనివారు, మమకారం లేనివారు, ఆత్మజ్ఞానం ఎరిగినవారు, సత్యమునందు నిష్ఠకలవారూ అయిన మహర్షులు ముక్తికొరకై సదా నన్ను ఆరాధిస్తారు.

తే. **అఖిలనక్షత్రతారాగ్రహములు గగన । పవనదిశలును మత్స్వరూపములు వినవె!**
సకలరత్నాకరంబులు శయ్యగాఁగ । నిత్యసుఖలీలమై శయనింతు నేను. **273**

ప్రతిపదార్థం: అఖిల, నక్షత్ర, తారా, గ్రహములు= సమస్త మైన చుక్కలు, తారలు (సూర్యాది) గ్రహాలు; గగన, పవన, దిశలును= ఆకసం, వాయువు, దిక్కులున్నూ; మత్+స్వరూపములు= నా ఆకృతులే అని; వినవె= తెలిసికొనుము; సకల, రత్న+ఆకరంబులు= సమస్త సముద్రాలు; శయ్య, కాఁగన్= శయనం కాగా; ఏను= నేను; నిత్య, సుఖ, లీలమైన్= ఎల్లప్పుడు సంతోషించే స్వభావం కలవాడనై; శయనింతున్= పవ్వళిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సమస్తమైన నక్షత్రాలు, తారలు, గ్రహాలు, ఆకసం, వాయువులు, దిక్కులు అన్నీ నా ఆకృతులే. సమస్త సముద్రాలు పర్యంకంగా నేను నిత్యసంతోషినై పవళించి ఉంటాను- అని తెలిసికో.

విశేషం: ఇట 'నక్షత్రతారా' ప్రయోగం స్థూలదృష్టికి పునరుక్తిగా తోచవచ్చును. అయినా-నక్షత్రాలు అనగా అశ్వినీభరణ్యాది నక్షత్రాలు అనిన్నీ, తారలు అనగా తదితర నక్షత్రాలనిన్నీ కవిహృదయంగా తెలిసికోవాలి. అశ్విన్యాది నక్షత్రాలేకాక, గగనంలో లెక్కకు మిక్కిలి చుక్కలు కనబడతాయి కదా! రత్నాకరం-అనగా రత్నాలకు నెలవైనది-అనగా సముద్రం అని రూఢ్యర్థం.

క. దానము సత్యంబు తపో । జ్ఞానాహింస లనఁబరఁగు సాత్త్వికగుణసం
తానముఁ గామక్రోధా । జ్ఞానంబులు మన్మయములు సంయమివర్యా! 274

ప్రతిపదార్థం: సంయమి, వర్యా= ఓబుషిశ్రేష్ఠుడా!; దానము= ఈవి (తనకు కలదానిని నిర్వ్యాజంగా పరోపకారార్థం ఇవ్వటం); సత్యంబు= నిజం (పలకటం); తపస్+జ్ఞాన+అహింసలు= తపస్=తపం; జ్ఞాన= (శాస్త్ర) మోక్ష విషయకమైన తెలివిడి; అహింసలు= హింస చేయకపోవటం; అనన్+పరఁగు= అనిపిలువబడెడి; సాత్త్విక, గుణ, సంతానమున్= సౌమ్యమైన లక్షణాల సముదాయం; కామ, క్రోధ+అజ్ఞానంబులు= కోరికలు, కోపం, తెలియకపోవటాలు; మత్+మయములు= నాయందు నిండినట్టివే.

తాత్పర్యం: ఓబుషిశ్రేష్ఠుడా! ఈవి, నిజం పలకటం, తపస్సు, తెలివిడి, అహింసలు అనబడే సాధుసౌమ్యలక్షణాలున్నూ, కోరికలు, కోపతాపాలు, అజ్ఞానం అనే తామసగుణాలున్నూ నా యందు నిండినవే.

విశేషం: ఆధ్యాత్మికవికాసానికి దానం, సత్యం, తపం, జ్ఞానం, అహింస విశిష్టలక్ష్యాలుగా వివరించబడినవి. "అహింసా పరమో ధర్మః!" "సత్యం వద" మున్నగునవి సుప్రసిద్ధాలు. అన్నిమతాలున్నూ 'దానము' యొక్క విశిష్టతను నొక్కివక్కాణించాయి. షోడశదానాలు: గోదానం, భూదానం, తిలదానం, హిరణ్యదానం, రత్నదానం, విద్యాదానం, కన్యాదానం, దాసీదానం, శయ్యాదానం, గృహదానం, అగ్రహారదానం, రథదానం, గజదానం, అశ్వదానం, ఛాగ(మేక)దానం, మహిషీదానం. ఇచ్చట సద్గుణాలు మాత్రమే కాక కామక్రోధాదులు కూడ 'మన్మయములు' అనే నారాయణప్రవచనం గమనించతగింది.

క. విను మింకఁ బెక్కుమాటలఁ । బని యేటికి? జగమునందుఁ బ్రకటితముగఁ గ
ల్గినయదియు నేన, లేనిది । యును నేన; సునిశ్చితముగ నూహింపు మెదన్. 275

ప్రతిపదార్థం: వినుము= ఆలకింపుము; ఇంకన్= ఇకమీద; పెక్కు, మాటలన్= పలుమాటలచేత; పని+ఏటికి?= అవసర; మేమికలదు? జగమునందున్= లోకంలో; ప్రకటితముగన్+కల్గిన+అదియున్= సుస్పష్టంగా ఉండి ఉన్నదియును; ఏను+అ= ఏన= నేనే; లేనిదియును= అవ్యక్తమైనది అంతయునుకూడ; నేను+అ= నేనే; ఎదన్= (నీ) హృదయంలో; సునిశ్చితముగన్= ఎట్టిసందేహానికి తావు లేకుండా ఉండే సత్యంగా; ఊహింపుము= భావించుము.

తాత్పర్యం: ఇక నేను చెప్పేది సావధానంగా ఆలకించుము. ఈ జగత్తులో సుస్పష్టంగా వ్యక్తమై కన్పిస్తున్నది అంతా నేనే! ఈ జగత్తులో అవ్యక్తమై లేనిదిగా తట్టేది అంతా నేనే! ఈ సంగతి నీవు ఎట్టి సందేహాలకు తావు లేకుండా సత్యంగా తెలిసికొమ్ము.

ఉ. ఎప్పుడు ధర్మహాని యగు, నెప్పు డధర్మము మీఱుఁ, గ్రూరు లై
యెప్పుడు దైత్యు లుబ్బుదురు, హీనతఁ బొందుదు రెప్డు వేల్పు లే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నప్పుడు సత్కులీనుల గృహంబుల నుద్భవ మొంది లీలమై
నెప్పటియట్ల నిల్పుదు సురేంద్రుల నంచితధర్మపద్ధతిన్. 276

ప్రతిపదార్థం: ఎప్పుడు= ఏసమయంలో; ధర్మ, హాని+అగున్= ధర్మానికి కీడు మూడుతుందో; ఎప్పుడు; అధర్మము మీఱున్= అధర్మం అతిశయిస్తుందో; ఎప్పుడు; దైత్యులు= రాక్షసులు; క్రూరులు+ఐ= ఇతరులకు హాని కలిగించేవారై; ఉబ్బుదురు= విజృంభిస్తారో; వేల్పులు= దేవతలు; హీనతన్+పొందుదురు= అణగారిపోతారో; అప్పుడు= ఆసమయంలో; (నేను) సత్+కులీనుల గృహంబులన్= మంచికులాలకు చెందినవారి ఇండ్లలో; ఉద్భవము+ఒంది= పుట్టి; లీలమైన్= విలాసంతో, మహిమతో; సురేంద్రులన్= దేవతలను, దేవేంద్రుడిని; అంచిత, ధర్మ, పద్ధతిన్= ఒప్పిదమైన ధర్మమార్గంలో; ఎప్పటి+అట్లు+అ= యథాప్రకారం; నిల్పుదున్= నిలబెట్టుతాను.

తాత్పర్యం: లోకంలో ఎప్పుడు ధర్మానికి కీడు ఏర్పడుతుందో, ఎప్పుడు అధర్మం విజృంభిస్తుందో, ఎప్పుడు రాక్షసులు క్రూరులై అతిశయిస్తారో, ఎప్పుడు వేల్పులు హీనస్థితికి దిగజారుతారో, అప్పుడు మంచికులానికి సంబంధించిన వారి ఇండ్లలో జన్మించి, దేవతలను, దేవేంద్రుడిని కాపాడి యథాప్రకారం ధర్మమార్గంలో నిలబెట్టుతాను.

విశేషం: ఈఘట్టం భగవద్గీతలోని శ్రీకృష్ణప్రవచనాన్ని స్మరణకు తెస్తున్నది.

యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత । అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం । ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

భగవద్గీత : 4-7,8

క. సితరక్తనీలపీత । ద్యుతి విలసితరూపములఁ జతుర్యుగముల నే
నతిధృతిఁజరియించి సమం । చితధర్మస్థాపనంబు సేయుదు ననఘా! 277

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; సితరక్తనీలపీతద్యుతివిలసితరూపములన్= తెల్లని ఎర్రని నల్లని పసుపురంగుల కాంతులతో విలసిల్లే ఆకృతులలో; చతుర్+యుగములన్= నాలుగుయుగాలలో; ఏన్= నేను; అతిధృతిన్= మిక్కిలిధైర్యంతో; చరియించి= ప్రవర్తించి; సమ్+అంచిత= మిక్కిలి పూజించదగిన; ధర్మస్థాపనంబు= ధర్మాన్ని నెలకొల్పటం; చేయుదున్= చేస్తాను.

తాత్పర్యం: ఓపుణ్యాత్ముడా! కృతయుగంలో తెల్లని ఆకృతితో, త్రేతాయుగంలో ఎర్రనిరూపంతో, ద్వాపరయుగంలో నల్లనిదేహంతో, కలియుగంలో పసుపుపచ్చని ఆకృతితో విలసిల్లుతూ నాలుగుయుగాలలో నేను ఆరాధించదగిన ధర్మాన్ని నెలకొల్పుతాను.

మత్తకోకిలము.

కాలచక్రము నిర్వికల్పము గాఁగ నేన నయింతు ను
న్మీలితక్రమవిక్రమైకమృద్ధినై; లయవిక్రియా
వేళ నింతయు సంహరింతుఁ బ్రవృద్ధయోగబలోల్లస
త్కాలరూపము దాల్చి దుర్వహగర్వనిర్వహబుద్ధి నై. 278

ప్రతిపదార్థం: కాలచక్రము= కాలం అనే చక్రం; నిర్వికల్పము= వికల్పం లేనట్టిది, నిర్ణీతక్రమాన్ని ఎన్నడున్నూ తప్పనట్టిది; కాఁగన్= అయ్యేటట్లుగా; ఉత్+మీలిత, క్రమ, విక్రమ+ఏక, సమృద్ధిన్+ఐ= వికసించే పద్ధతిచొప్పున ప్రసరించే పరాక్రమంయొక్క అతిశయంకలవాడనై; ఏను+అ= ఏన= నేనే; నయింతున్= నడపుతాను; లయ, విక్రియా,వేళన్= ప్రళయం వచ్చిన సమయంలో; ప్రవృద్ధ,యోగ, బల+ఉల్లసత్, కాల రూపము= కొనసాగి పెంపొందిన శక్తిచేత ఒప్పారే యముడి ఆకృతిని; తాల్చి= ధరించి; దుర్వహ, గర్వ, నిర్వహ, బుద్ధిన్+ఐ= వహించ శక్యంగాని మదాన్ని పూనే మతికలవాడనై; ఇంతయున్= దీనిని ఇంతటిని, ఈ సమస్తసృష్టిని; సంహరింతున్= నాశ మొనరిస్తాను.

తాత్పర్యం: క్రమపరిణామవికాసం చెందే నాపరాక్రమంచేత కాలచక్రాన్ని నిర్ణీతక్రమాన్ని ఎన్నడూ తప్పనట్టిదిగా నేనే నడుపుతాను. ప్రళయకాలంలో, పెంపొందే శక్తిచేత విలసిల్లే యముడిరూపం ధరించి ఈ సృష్టిని అంతటిని దురంత గర్వాతిరేకంతో నేనే సంహరిస్తాను.

విశేషం: వృత్త లక్షణానికి ఆరణ్యపర్వం 4.267 విశేషం చూడండి.

క. **నా తెఱఁగంతయు నిప్పుడు । చేతోముద మొదవ నీకుఁ జెప్పితిఁ ద్రిజగ**
ద్ధాత యగు పితామహుఁడు సు । జాతుఁడు నాయెడలఁ జక్క సగబాలు సుమీ! **279**

ప్రతిపదార్థం: నాతెఱఁగు+అంతయున్= నావిధాన్ని అంతటిని; ఇప్పుడు= ఈ సమయంలో; నీకున్= నీకు; చేతస్+ముదము+ ఒదవన్= మనస్సుకు సంతోషం కలిగేటట్లుగా; చెప్పితిన్= వచించాను; త్రిజగత్ ధాత+అగు= మూడులోకాలు సృజించేవాడైన; పితామహుఁడు= బ్రహ్మదేవుడు; సుజాతుఁడు= గొప్పపుట్టుక కలవాడు; నాయెడలన్= నాకు సంబంధించినమేరకు; చక్క= చక్కగా; సగము+పాలు, సుమీ= సగంవంతు, సుమా!

తాత్పర్యం: నా వృత్తాంతాన్ని అంతా నీ మనస్సుకు ఆహ్లాదకరంగా వివరించి చెప్పాను. మూడులోకాలను సృష్టించే బ్రహ్మదేవుడు కూడ నాలో సగం అంశం మాత్రమే అని గ్రహించుము.

వ. **నారాయణాభిధానుండ నైన యేను బాలరూపంబున శంఖచక్రగదాధరుండ నై యేకార్ణవంబునందు మహాయుగసహస్రసమయంబయిన కాలంబున యోగనిద్రాపరవశుండనై యుండుదు; నిట్టి దారుణకల్పాంతంబు సూచి నీవు భీతుండ వగు టెఱింగి, నీవలని యనుగ్రహంబున నాత్మగుప్తంబు లైన సకలలోకంబులు గనునట్టి తెఱంగుఁ గావించితి; నీ వింక నిశ్శంకహృదయుండ వయి వలసినయెడం జరియింపుము; మదీయనాభికమలకర్ణికాశయనుం డయి యున్న చతురాననుండు మేల్కని సృజియించు లోకంబు లేర్పడం జూచెద' వని యానతిచ్చి యద్దేవుం డచ్చోటన యంతర్హితుం డయ్యె; నత్యంత విచిత్రం బైన యీవృత్తాంతంబు నాకు ననుభవగోచరం బైనయది.** **280**

ప్రతిపదార్థం: నారాయణ+అభిధానుండను+ఐన= నారాయణుడు అనే పేరు కలవాడను అయిన; ఏను=నేను; బాల, రూపంబునన్= పసిబిడ్డని ఆకృతిలో; శంఖచక్రగదాధరుండను+ఐ= శంఖ చక్ర గదలను ధరించినవాడనై; ఏక+అర్ణవంబునందున్= ఒకేఒకటిగా మారిన సముద్రంలో; మహా, యుగ, సహస్ర, సమయంబు+అయిన= వేయిమహాయుగాలకు సరిసమానమైన; కాలంబునన్= సమయంలో; యోగ, నిద్రా, పరవశుండను+ఐ= యోగానికి సంబంధించిన నిదుర చొప్పున మైకం చెందినవాడనై; ఉండుదును= ఉంటాను; ఇట్టి= ఇటువంటి; దారుణ, కల్ప+అంతంబు= ఘోరమైనది, కల్పం చివర దాపురించేది అయిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రళయం; చూచి= అరసి; నీవు; భీతుండవు+అగుట= భయపడినవాడవు కావటం; ఎఱింగి= తెలిసికొని; నీవలని, అనుగ్రహంబునన్= నీమీది దయచేత; ఆత్మ, గుప్తంబులు+ఐన= నాలో దాచబడిన; సకల, లోకంబులు= అన్ని జగత్తులు; కను+అట్టి= చూచునట్టి; తెఱంగున్= మార్గాన్ని; కావించితిని= కల్పించాను; నీవు+ఇంకన్= నీవు ఇకమీద; నిస్+శంకహృదయుండవు+అయి= ఎట్టి సందేహాలు లేని హృదయం కలవాడవై; వలసిన+ఎడన్= ఇచ్ఛవచ్చినచోట; చరియింపుము= సంచరించుము; మదీయ, నాభి, కమల, కర్ణికా, శయనుండు+అయి= నాబొడ్డులో ఉన్నట్టి పద్మము యొక్క దుద్దునందు పవ్వళించి ఉన్న వాడయి; ఉన్న= ఉన్నట్టి; చతురాననుండు= (చతుర్+ఆననుండు) బ్రహ్మదేవుడు (నాలుగుమోములుకలవాడు); మేల్కని= (యోగనిద్రనుండి) లేచి; సృజియించు= నిర్మించే; లోకంబులు= జగత్తులు; ఏర్పడన్+చూచెదవు= రూపుకట్టటం చూస్తావు; అని+ఆనతి+ఇచ్చి= అని దయతో చెప్పి; ఆ+దేవుండు= (ఆ బాలకుడు); ఆ+చోటన్+అ= ఆస్థలంలోనే; అంతర్హితుండు+ అయ్యెన్= మాయమైనాడు; అత్యంత, విచిత్రంబు+అయిన= మిక్కిలి ఆశ్చర్యకరమైన; ఈవృత్తాంతంబు= ఈసంఘటన; నాకున్; అనుభవ, గోచరంబు+ఐన+ అది= నాకు ప్రత్యక్షంగా కనుపించినట్టిది.

తాత్పర్యం: నారాయణుడు అనే పేరు కల నేను వేయిమహాయుగాలమేర బాలరూపం ధరించి, వటపత్రశాయినై ప్రపంచాన్ని అంతటిని ఆవరించిన ఒకే ఒక సముద్రంపై యోగనిద్రలో మునిగి ఉంటాను. కల్పాంతసమయాలలో దాపురించే భయంకరప్రళయాన్ని చూచి నీవు భయపడి ఉండటం తెలిసికొని, నీమీది వాత్సల్యంచొప్పున నీకు నా పొట్టలో దాచిఉంచిన ప్రపంచాలను చూపించాను. ఇక నీవు యథేచ్ఛగా నీకు తోచిన చోటికి పోవచ్చును. ఇక నాబొడ్డుతామరలో నిదురిస్తున్న బ్రహ్మదేవుడు మేల్కొని సృష్టించే జగత్తులను నీవు చూడగలవు' అని దయతో సెలవిచ్చి ఆ బాలదేవుడు అక్కడనే మాయమైనాడు, మిక్కిలి ఆశ్చర్యకరమైన ఈసంఘటనను నేను ప్రత్యక్షమైన అనుభవంచేత తెలిసికొన్నాను.

విశేషం: నిద్ర వేరు, యోగనిద్ర వేరు. నిద్ర యథేచ్ఛగా వచ్చేది కాదుకదా. యోగంవలన వచ్చే నిద్ర యోగనిద్ర. ఇది యథేచ్ఛా ప్రవర్తితం. యోగిసంకల్ప శక్తివలన ఏర్పడేది. అనుభవగోచరం అయిన జ్ఞానం తెలివిడి వేరు, శాస్త్రపఠనంవలన వచ్చే తెలివిడి వేరు. మొదటిది ప్రత్యక్షపరిజ్ఞానం, రెండవది శాస్త్రజన్యమైన పరోక్షపరిజ్ఞానం.

శా. **నా కమ్మైఁ బొడసూపెఁ దాను గృపతో నా కందు; నేఁ డియ్యెడన్**
నీకున్ గాదిలిచుట్టమై సచివుఁడై నెయ్యంబుమై నున్న పు
ణ్యాకారుం గమలాయతాక్షుఁ గరుణైకాయత్తు నత్యుత్తమ
శ్లోకుం గృష్ణునిఁ గంటి; నా సుకృతముల్ శోభిల్లెఁ బక్వంబు లై. **281**

ప్రతిపదార్థం: ఆ కందు= ఆ చిన్ని బాలుఁడు; తాను; కృపతోన్= దయతో; నాకు+అమ్మైన్= నాకు ఆవిధంగా; పొడసూపెన్= కన్పించాడు; నేఁడు ఇయ్యెడన్= ఈనాడు ఈచోటనే; నీకున్= నీకు; గాదిలి, చుట్టము+ఐ= ప్రియమైన బంధువై; సచివుఁడు+ఐ= మంత్రిఅయి; నెయ్యంబు, మైన్+ఉన్న= స్నేహంతో ఉన్న; పుణ్య+ఆకారున్= సుకృతం మూర్తీభవించినవాడిని; కమల+ఆయత+ అక్షున్= తామరపువ్వులవలె నునుసోగకన్నులు కలవాడిని; కరుణా+ఏక+ఆయత్తున్= దయతో నిండుగా కూడినట్టివాడిని; అతి+ఉత్తమశ్లోకున్= మిక్కిలి పూజనీయు డైన వాడిని; కంటిన్= చూచాను; నా, సుకృతముల్= నాపుణ్యాలు; పక్వంబులు+ఐ= పండినవై; శోభిల్లెన్= విలసిల్లాయి.

తాత్పర్యం: శ్రీమన్నారాయణమూర్తి వాత్సల్యంతో నాకు ఆవిధంగా దర్శనం అనుగ్రహించాడు నాడు! ఆ బాలదేవుడే నేడు నీకు అనుగుబంధువుగా, మంత్రిగా, స్నేహంతో ఉన్నాడు. ఆ పుణ్యమూర్తిని, కరుణార్ద్రహృదయుడిని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కమలాలవంటి నునుసోగ కన్నులు కలవాడిని, పరమపూజనీయుడిని శ్రీకృష్ణుడిని ప్రత్యక్షంగా సందర్శించే భాగ్యం నాకు అబ్బింది. నా పుణ్యాలు ఫలించాయి.

క. ఈ దేవదేవుకరుణం । గాదే కురునాథ! నిర్వికారుఁడనై నిః
ఖేదుఁడ నై యుండుదు దే । వాదివివిధభూతవిలయ మయ్యెడునపుడున్. 282

ప్రతిపదార్థం: కురునాథ!= కురువంశానికి అధిపతి వైన ధర్మరాజా!; ఈదేవదేవు కరుణన్+కాదే= ఈ పరమదేవుడి దయవలన మాత్రమే కదా; దేవ+ఆది, వివిధ, భూత, విలయము+అయ్యెడున్+అపుడున్= దేవతలు మొదలుగాగల పెక్కు పదార్థాల యొక్క సర్వనాశనం అయ్యే సమయంలో కూడా; నిస్+వికారుఁడను+ఐ= ఎట్టి మార్పును లేనట్టివాడనై; నిస్+ఖేదుఁడను+ఐ= దుఖం లేనివాడ నై; ఉండుదున్= ఉంటాను.

తాత్పర్యం: ధర్మజా! దేవదేవుడైన ఈశ్రీకృష్ణుడి దయవలననే కదా నేను ప్రళయకాలంలో సయితం దేవతలు మొదలైన సకలభూతాలు లయమందేటప్పుడుకూడ, దుఃఖరహితుడనుగా, నిర్వికారుడనుగా మనగల్గాను.

తే. అనఘ! యిద్దేవుసన్నిధి యగుటఁ గాదె! నాకుఁ బూర్వవర్తనకథనంబునందు
బోధ మిప్పుడు గలిగె; నిప్పుణ్యుఁ బరమ । పురుషుఁ బ్రభవిష్ణుఁ గృష్ణుని శరణు సొరుము.' 283

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓధర్మరాజా!; ఈ+దేవు సన్నిధి+అగుటన్+కాదె= ఈదేవుడి (శ్రీకృష్ణుడి) దర్శనం అగుట చేతనే కదా!; పూర్వ, వర్తన, కథనంబునందున్= ఎప్పుడో వెనుక జరిగిన దానిని చెప్పటంలో; బోధము= జ్ఞానం; నాకున్= నాకు; ఇప్పుడు= ఈసమయంలో; కలిగెన్= కలిగింది; ఈ పుణ్యున్= గొప్పమహిమ కల వాడిని; పరమపురుషున్= పరమాత్మను; ప్రభవిష్ణున్= విష్ణువును; కృష్ణునిన్= శ్రీకృష్ణుడిని; శరణు+చొరుము= కాపాడుమనే ప్రార్థనతో చేరుము.

తాత్పర్యం: పుణ్యాత్ముడ వైన ఓ ధర్మరాజా! దేవదేవు డైన శ్రీకృష్ణుడి దర్శనభాగ్యం నా కిప్పుడు కలగటంచేతనేకదా, నాకు పూర్వసంఘటనలను జ్ఞాపకం చేసికొని చెప్పగలశక్తి చేకూరింది. గొప్పప్రభావం కలిగిన ఈ పుణ్యపురుషుడిని శ్రీకృష్ణపరమాత్మను శరణు పొందుము.

మార్కండేయుఁడు ధర్మరాజునకుఁ గలియుగధర్మంబులు సెప్పుట (సం. 3-188-5)

వ. అనిన విని ధర్మనందనుం డనుజసహితుం డై కృష్ణునిం బ్రశంసావచనంబుల నభినందించి, మార్కండేయుం జూచి, 'మునీంద్రా! భవత్ప్రసాదంబున నత్యద్భుతకథాశ్రవణపరితోషితుల మైతిమి; కలియుగంబున సకలధర్మలోపం బగు నని చెప్పుదురు; తత్ప్రకారం బెఱింగింపవే!' యనిన నతం డతని కి ట్లనియె. 284

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని; ధర్మనందనుండు= ధర్మరాజు; అనుజసహితుండు+ఐ= తమ్ములతో కూడుకొనిన వాడై; కృష్ణునిన్= శ్రీకృష్ణుడిని; ప్రశంసా, వచనంబులన్= పొగడ్తతో కూడిన మాటలతో; అభినందించి= సంతోషింపచేసి; మార్కండేయున్+చూచి; ముని+ఇంద్రా!= ఋషులలో శ్రేష్ఠుడ వైన వాడా!; భవత్+ప్రసాదంబునన్= నీదైన అనుగ్రహంవలన; అతి+అద్భుత, కథా, శ్రవణ, పరితోషితులము+ఐతిమి= మిక్కిలి అచ్చెరువు నొందించే కథలను వినటంచేత సంతోషం చెందినవారం అయినాం; కలియుగంబునన్= కలియుగంలో; సకల, ధర్మ, లోపంబు+అగును+అని= అన్నిధర్మాలు తక్కువ అయిపోవటం జరుగుతుంది అని; చెప్పుదురు= అంటారు; తద్+ప్రకారంబు= ఆ తెఱగు; ఎఱింగింపవే= తెలుప వేడికోలు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనినన్= అని అడుగగా; అతండు= (మార్కండేయుడు); అతనికిన్= (ధర్మరాజుకు); ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆవిధంగా మార్కండేయుడు 'శ్రీకృష్ణుడు శ్రీమన్నారాయణుడి అవతారం' అని చెప్పగా విని, ధర్మరాజు తనతమ్ములతోపాటు శ్రీకృష్ణుడిని ప్రశంసించాడు. పిమ్మట ధర్మరాజు మార్కండేయుడిని ఇట్లా అడిగాడు: 'మునీంద్రా! మేము నీదయవలన మిక్కిలి ఆశ్చర్యకర మైన కథలను వినటంచేత ఆనందపూరితులం అయినాం. కలియుగంలో సర్వధర్మాలు క్షీణిస్తాయని పెద్దలు చెప్పుతారు; ఆ విషయాన్ని దయచేసి వివరించి చెప్ప ప్రార్థన' - అని అనగా మార్కండేయుడు ధర్మరాజుకు ఈవిధంగా చెప్పాడు.

క. 'కృతయుగమునందు ధర్మువు। చతురంశంబులను బరఁగఁ జను; నది త్రేతన్
బ్రితయమున నొక్కఁ డొకఁడుగఁ। బ్రతియుగమునఁ దఱుఁగఁ దొడఁగుఁ బాళులు వరుసన్. 285

ప్రతిపదార్థం: కృతయుగమునందున్= కృతయుగంలో; ధర్మువు= ధర్మం; చతుర్+అంశంబులను= నాలుగు అంశాలలోనూ, (నాలుగు పాదాలలోనూ అనగా పరిపూర్ణంగా); పరఁగన్+చనున్= ఒప్పారుతుంది; అది= (ఆధర్మం); త్రేతన్= త్రేతాయుగంలో; త్రితయమునన్= మూడు భాగాలలో (ఉంటుంది); ఒక్కఁడు+ఒకఁడుగన్= ఒకటి ఒకటిగా; ప్రతియుగమునన్= ప్రతియుగంలోనూ; పాళులు= అంశాలు; వరుసన్= క్రమంగా; తఱుఁగన్, తొడఁగున్= తగ్గిపోతాయి.

తాత్పర్యం: 'కృతయుగంలో ధర్మం నాలుగుపాదాలతో సంపూర్ణంగా విలసిల్లుతుంది. త్రేతాయుగంలో మూడుపాళ్ళతో వర్ధిల్లుతుంది. వరుసగా, యుగానికి ఒక్కొక్కపాలు తగ్గి, ద్వాపరయుగంలో రెండు పాళ్ళున్నా, కలియుగంలో ఒకపాలు మాత్రమే వర్ధిల్లుతాయి.

వ. అట్లగుటంజేసి ధర్మంబు కలియుగంబునఁ గరంబు దుర్లభం బయి పాదమాత్రావశిష్టంబయి యుండు; దత్ప్రవర్తనం బాకర్ణింపుము. 286

ప్రతిపదార్థం: అట్లు= ఆవిధంగా; అగుటన్+చేసి= జరగటంవలన; ధర్మంబు= ధర్మం; కలియుగంబునన్= కలియుగంలో; కరంబు= మిక్కిలి; దుర్లభంబు= లభించరానిది; పాద, మాత్ర+అవశిష్టంబు+అయి= ఒకపాదం మాత్రంగానే మిగిలి; ఉండున్= ఉంటుంది; తత్+ప్రవర్తనంబు= ఆ జరిగే విధం; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆవిధంగా కావటంచేత, కలియుగంలో ధర్మం క్షీణించి, ఒకపాదంమాత్రమే మిగిలిఉంటుంది. ఆవిషయాన్ని విశదీకరిస్తాను. వినుము.

సీ. సత్యంబు నరులకు సంక్షిప్త మగు; సత్య। హాని నాయువు గడు నఱిగిపోవు;
నాయువు దఱిఁగిన నల్పంబు లగు విద్య;। లల్పవిద్యలను మోహంబు మిగులు;
మోహంబువలనఁ బై ముసురు లోభంబు; లో। భావేశమునఁ గామ మగ్గలించుఁ;
గామంబుపెంపునఁ గడఁగుఁ గ్రోధంబు; క్రో। ధనంబున వైర మెంతయును బెరుఁగు;

ఆ. వైరమున నశేషవర్ణులు నన్యోన్య। పీడ సేయుచును విభిన్నబుద్ధి
నొక్కఁడొకని మేర నుండక వర్ణ సం। కరము సేయఁగలరు కలియుగమున. 287

ప్రతిపదార్థం: సత్యంబు= సత్యం; నరులకున్= మానవులలో; సంక్షిప్తము+అగున్= క్షీణిస్తుంది; సత్య,హానిన్= నిజానికి ఏర్పడిన కీడువలన; ఆయువు= ఆయుర్దాయం; కడున్= మిక్కుటంగా; అఱిగిపోవున్= తగ్గిపోతుంది; ఆయువు= ఆయుస్సు; తఱఁగినన్= క్షీణించగా; విద్యలు= చదువులు; అల్పంబులు+అగున్= తక్కువ ఔతాయి; అల్పవిద్యలను= తగ్గిన విద్యలచేత; మోహంబు= భ్రాంతి మూలకమైన అజ్ఞానం; మిగులున్= అతిశయిస్తుంది; మోహంబువలనన్= భ్రాంతిమూలక మైన అజ్ఞానంచేత; లోభంబు= అత్యాసక్తి; పైమిసురున్= పైనక్రమ్ముకొంటుంది; లోభ+ఆవేశమునన్= అత్యాసక్తి విజృంభించటం మూలంగా; కామము= కోరిక; అగ్గలించున్= విజృంభిస్తుంది; కామంబు పెంపునన్= కామం అతిశయించటంచేత; క్రోధంబు= కోపం; కడఁ గున్= ఒదవును; క్రోధంబునన్= కోపంవలననే; వైరము= పగ; ఎంతయున్= మిక్కుటంగా; పెరుఁగున్= అతిశయిస్తుంది; వైరమునన్= శత్రుత్వంవలన; అశేష, వర్ణులున్= అన్నివర్ణాలవారు; అన్యోన్య,పీడ+చేయుచును= ఒకరి నొకరు హింసించుకొంటూ; విభిన్నబుద్ధిన్= భేదభావంతో; ఒక్కఁడు ఒకని మేరన్+ఉండక= ఎవరిహద్దులలో వారు ఉండక; కలియుగమునన్= కలియుగంలో; వర్ణ సంకరము+చేయఁగలరు= కులాల మిశ్రమాలను చేస్తారు.

తాత్పర్యం: మనుజులలో సత్యం తరిగిపోతుంది. సత్యహానిమూలంగా ఆయుర్దాయం తగ్గుతుంది. ఆయుస్సు క్షీణించటంవలన చదువులు తరిగిపోతాయి. అల్పవిద్యలవలన మోహం ప్రబలుతుంది. మోహం ప్రబలటంవలన లోభం పైగ్రమ్ముతుంది. లోభం విజృంభించటంచేత కామం అధికమవుతుంది. కామం వలన కోపం ఏర్పడుతుంది. క్రోధం అతిశయించటం వలన పగ ఏర్పడుతుంది. పగ ఏర్పడటం వలన భిన్నకులాలవారు అన్యోన్యహింసకు పాల్పడతారు. ఈవిధంగా ఎవరిహద్దులలో వారు ఇముడకపోవటంచేత వర్ణసాంకర్యం ఏర్పడుతుంది.

క. జపనియమస్వాధ్యాయ । ప్రపంచములు విడువఁగలరు బ్రాహ్మణులు, జనా
ధిప! శూద్రులు విపుల తపః । క్షపితులు గాఁగలరు, వినవె! కలికాలమునన్. 288

ప్రతిపదార్థం: జన+అధిప!= జనులకు అధిపతివైన ఓ ధర్మరాజా!; కలికాలమునన్= కలియుగంలో; జప, నియమ, స్వాధ్యాయ, ప్రపంచములు= మంత్రాదుల ఆవృత్తి, అనుష్ఠానం, వేదాధ్యయనం వీటిని; బ్రాహ్మణులు= విప్రులు; విడువఁగలరు= వదలిపెట్టుతారు; శూద్రులు= (నాల్గవజాతివారైన) శూద్రులు; విపుల, తపస్+క్షపితులు= గొప్పతపస్సుచేత క్లేశమునొందినవారు; కాఁగలరు= ఔతారు; వినవె= అవధానతతో ఆలకించుము.

తాత్పర్యం: జనులకు ప్రభు వైన ఓధర్మరాజా! కలికాలంలో బ్రాహ్మణులు మంత్రాలను వల్లెవేయటం మానేస్తారు, నిగ్రహాన్ని కోల్పోతారు, వేదాధ్యయనాన్ని వీడుతారు; శూద్రులు తపస్సు నాచరిస్తారు. ఈ విషయాలను సావధానంగా ఆలకించుము.

విశేషం: నియమం అనగా కేవలనిగ్రహం మాత్రమే కాదు. పతంజలి అష్టాంగయోగంలో నియమాన్ని ఈవిధంగా ప్రస్తావించాడు. నియమం= బాహ్యాభ్యంతరశౌచం+సంతోషం+తపస్సు+స్వాధ్యాయం+ఈశ్వరప్రణిధానం.

మ. వివిధవ్యాఘ్రమృగోరగాకులము లై విస్తీర్ణశూన్యాటవీ
నివహాభీలము లై యరాజకములై నిర్మూలధర్మంబులై
ద్రవిళాభీరతురుష్కబర్బరపుళిందవ్యాప్తిదుష్టంబు లై
భువిలో నెల్లెడఁ బాడగున్ జనపదంబుల్ దద్యుగాంతంబునన్. 289

ప్రతిపదార్థం: తద్+యుగ+అంతంబునన్= ఆయుగంలోపలిభాగంలో; వివిధ, వ్యాఘ్ర, మృగ+ఉరగ+ఆకులములు+ఐ= పెక్కు పెద్దపులుల చేతను, జంతువులచేతను, పాములచేతను కలతనొందించబడినట్టివై; విస్తీర్ణ, శూన్య+అటవీ, నివహ+ ఆభీలములు+ఐ= విస్తరించిన, పాడుపడినట్టి అడవుల సముదాయంచేత భయంకరాలై; అరాజకములు+ఐ= ప్రభువుల ఆధిపత్యం చెల్లనట్టివై; నిర్మూల, ధర్మంబులు+ఐ= నశింపజేయబడిన ధర్మాలు కలవై; ద్రవిళ+ఆభీర, తురుష్క, బర్బర, పుళింద, వ్యాప్తిదుష్టంబులు+ఐ= ద్రవిళులు, ఆభీరులు, తురుష్కులు, బర్బరులు, పుళిందులు (అయిన అనాగరకజాతులవారి) విజృంభణచేత చెడినట్టివై; భువిలోన్= పుడమిలో; ఎల్ల+ఎడన్= అన్నిచోటులలో; జనపదంబుల్= మనుజులు నివసించే పల్లెపట్టులు; పాడు+అగున్= చెడిపోతాయి.

తాత్పర్యం: కలియుగంలో, భూమిమీద అన్నిచోటులలో ప్రజలు నివసించే పల్లెలు పాడయిపోతాయి. పెక్కు పెద్దపులులకు జంతువులకు పాములకు నెలవై భయంకరాలౌతాయి. అడవులు విస్తరించి పల్లెలను భయంకరంగా క్రమ్ముతాయి. అవి అరాజకాలౌతాయి. ప్రభుత్వాధికారం నశిస్తుంది. ధర్మాలు నిర్మూలించబడతాయి. దుష్టులైన ద్రవిళులు, ఆభీరులు, తురుష్కులు, బర్బరులు, పుళిందులు విజృంభిస్తారు. జనపదాలు సర్వనాశన మౌతాయి.

విశేషం: ఎఱ్ఱన కలియుగవర్ణన సూక్ష్మదృష్టితో అనుశీలించదగింది. ఎఱ్ఱన కలికాలవర్ణనలో సంస్కృతభారతమూలాన్ని అచ్చటచట అతిక్రమించాడు. ఈపద్యంలోని 'తురుష్క' శబ్దప్రయోగం అట్టిదే. ఎఱ్ఱన మహాకవి తుఘ్లక్ చక్రవర్తికి సమకాలీనుడు. ఓరుగల్లు తురుష్కాక్రాంత మయ్యేనాటికి ఎఱ్ఱన మహాకవి బహుశః నూనూగుమీసాలనూత్నయౌవనంలో ఉండిఉంటాడు.

క. క్షత్త్రియజాతులు శూద్రచ। రిత్త్రంబున శౌర్యమును సిరియుఁ దేజంబున్
మైత్త్రియును లేక చెదరి ధ। రిత్త్రీశ్వర! శూన్యు లై చరించెదరు ధరన్. 290

ప్రతిపదార్థం: క్షత్త్రియజాతులు= రాచకొలంవారు; శూద్రచరిత్త్రంబునన్= శూద్రులప్రవర్తనతో; శౌర్యమును= పరాక్రమాన్ని; సిరియున్= సంపదను; తేజంబున్= దీప్తిని; మైత్త్రియును= నెయ్యమును; లేక= ఉండక; చెదరి= ఒకచోట ఉండక ఇటు అటు పోయి; ధరిత్త్రీ+ఈశ్వర!= ఓరాజా!; ధరన్= భూమిపై; శూన్యులై= దిగజారినవారై; చరించెదరు= తిరుగాడుతారు.

తాత్పర్యం: ఓధర్మరాజా! పరాక్రమ ప్రాభవంచేత రాజ్యంలోని ప్రజలను రక్షించి పరిపాలించవలసిన రాచకొలంవారు శౌర్యం, సంపద, తేజస్సు, మైత్రి లేకుండ, దిగజారిపోయి సేవకవృత్తిని అవలంబించే శూద్రులవలె భూలోకంలో తిరుగాడుతారు.

క. రసగంధద్రవ్యంబులు। పసచెడు, సస్యంబు లల్పఫలము లగు, మహిం
బసిపాఁడి దఱుఁగుఁ, దరువులఁ। గుసుమఫలంబులును గరముఁ గొంచెంబు లగున్. 291

ప్రతిపదార్థం: రసగంధద్రవ్యంబులు= ద్రవాలుగా ఉండేవి, వాసనగలవి అయిన పదార్థాలు; పస చెడున్= సారాన్ని కోల్పోతాయి; సస్యంబులు= పంటలు; అల్ప, ఫలములు+అగున్= తక్కువ దిగుబడి కలవి ఔతాయి; మహిన్= భూమియందు; పసిపాఁడి= ఆవులపాలు; తఱుఁగున్= తగ్గిపోతాయి; తరువులన్= చెట్లయందు; కుసుమ, ఫలంబులును= పూలున్నూ పండ్లున్నూ; కరమున్= మిక్కుటంగా; కొంచెంబులు+అగున్= క్షీణిస్తాయి.

తాత్పర్యం: భూలోకంలో ద్రావకాలు, సువాసనద్రవ్యాలు సారాన్ని కోల్పోతాయి. పంటలదిగుబడి తగ్గిపోతుంది. ఆవులపాలు తరిగిపోతాయి. వృక్షాలవలన పువ్వులు పండ్లు మిక్కిలి కొంచెంగా లభిస్తాయి.

క. **అరులు మిగులఁ గొని రాజులు । నరులకు నెంతయును భయ మొనర్తురు; ధరణీ**
సురులు గడఁగి వాణిజ్యముఁ । గరిసనమును జేయఁగలరు కలియుగవేళన్. **292**

ప్రతిపదార్థం: కలియుగవేళన్= కలియుగసమయంలో; రాజులు= ప్రభువులు; అరులు= పన్నులు; మిగులన్+కొని= మిక్కుటంగా తీసికొని; నరులకున్= మనుజులకు; ఎంతయును= ఎంతయో ఎక్కువగా; భయము+ఒనర్తురు= భయాన్ని కలిగిస్తారు; ధరణీసురులు= బ్రాహ్మణులు; కడఁగి= పూని; వాణిజ్యమున్= వర్తకవ్యాపారాన్ని; కరిసనమును= సేద్యాన్ని; చేయఁగలరు= చేస్తారు.

తాత్పర్యం: కలియుగసమయంలో ప్రభువులు పన్నులు మిక్కుటంగా విధించి వసూలుచేసి మనుజులను పీడించి భయపెట్టుతారు. బ్రాహ్మణులు వర్తకవ్యాపారానికి దిగుతారు, సేద్యాన్ని చేస్తారు.

సీ. **పాషండదర్శనబహుళంబు లయ్యెడు । వర్ణాశ్రమంబులు వసుమతీశ!**
తవిలి శరీరంబుఁ దద్దయుఁ బ్రోతురు । పుణ్యఫలంబులు బొంకు లనుచుఁ;
గాలంబుతోఁ గూడఁ గలుగవు వానలు; । పొల్లులై బీజముల్ వొలిసిపోవుఁ;
గ్రయవిక్రయంబులఁ గపటంబు దఱచగుఁ; గడఁగి యిల్లడసొమ్ము లడఁచికొండ్రు;

ఆ. **సాధుచరితు లైన జనులు దుర్గతుల రో । గములఁ దెగుదు; రల్పకాలమునన**
పాపపరులు లగ్గుఁ బరమాయువును నరో । గతయు సిరియుఁ బొందఁగాంతు రెందు. **293**

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= భూమికి పరిపాలకుడైన ఓరాజా!; వర్ణ+ఆశ్రమంబులు= కులాలు, ఆశ్రమాలు (బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్న్యాసం); పాషండ, దర్శన, బహుళంబులు+అయ్యెడున్= నాస్తికులకు చెందిన తత్త్వాలుగా పరిణమిస్తాయి; పుణ్య, ఫలంబులు= సుకృతాలు చేయటంవలన కలిగే ఫలితాలు; బొంకులు= అసత్యాలు; అనుచున్= అని తలస్తూ; తవిలి= పూని; శరీరంబున్= దేహాన్ని; తద్దయున్= మిక్కుటంగా; ప్రోతురు= పోషించి రక్షిస్తారు; కాలంబుతోన్+కూడన్=ఋతువులకు అనుగుణంగా; వానలు= వర్షాలు; కలుగవు= ఉండవు, కురియవు; బీజముల్= గింజలు (విత్తనాలు); పొల్లులు+ఐ= పస లేనివై; పొలిసిపోవున్= వ్యర్థాలౌతాయి; క్రయవిక్రయంబులన్= కొనటాల్లో అమ్మకాలలో; కపటంబు= మోసం; తఱచు+అగున్= ఎక్కువ ఔతుంది; కడఁగి= పూని; ఇల్లడ సొమ్ములు= తాకట్టుగా పెట్టబడిన ఆభరణాలు; అడఁచికొండ్రు= దాచివేస్తారు; సాధుచరితులు+ఐన= మంచినడవడి కలిగిన; జనులు= మనుజులు; దుర్గతులన్= చెడ్డస్థితులచేత; రోగములన్= వ్యాధులచేత; అల్పకాలమునన్+అ= కొద్దిసమయంలోనే; తెగుదురు= చనిపోతారు. పాపపరులు= పాపాత్ములు; లగ్గున్= శుభాన్ని; పరమ+ఆయువును= గొప్పఆయుస్సును; అరోగతయున్= ఆరోగ్యాన్ని; సిరియున్= సంపదను; ఎందున్= అన్నిచోటులలో; పొందన్+కాంతురు= పొందగలుగుతారు!

తాత్పర్యం: ఓధర్మరాజా! కలియుగంలో వర్ణాశ్రమాలు నాస్తికవేదాంతంతో ప్రబలుతాయి. పుణ్యాపాపఫలాలు అసత్యాలని నిరసిస్తూ మనుజులు దేహాన్నే ముఖ్యంగా భావించి దేహసంరక్షణకే పూనుకొంటారు. సకాలంలో వర్షాలు కురియవు. విత్తనాలు సారంలేనివై పొల్లుగా పరిణమిస్తాయి. క్రయవిక్రయవ్యాపారాలలో మోసం అధికమౌతుంది. తాకట్టుగా తమ వద్ద పెట్టిన ఆభరణాలను అన్యాయంగా దాచివేస్తారు. సాధుజనులు అష్టకష్టాలు అనుభవిస్తారు, రోగాలతో బాధపడి అల్పాయుష్కులై మరణిస్తారు. పాపులు దీర్ఘాయువులై విలసిల్లి శుభాలు అనుభవిస్తారు, సిరిసంపదలతో తులదూగుతారు!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పాషండులు నాస్తికులు, దేవుడులేడనీ, వేదాలు ప్రామాణికాలు కావనీ చెప్పేవారు. పాషండులలో చార్వాకులు సుప్రసిద్ధులు. 'ఋణం కృత్వా ఘృతం పిబేత్' 'అప్పుచేసి నేయి త్రాగుము' అనేది వారి వేదాంతం. దర్శనం అంటే తాత్త్విక సిద్ధాంతసంపుటం.

క. ఉఱవగు నారికెపంటలు, । గొఱియల పాఁడియును దఱచగుం, బురుషులకుం
దెఱవలు సుట్టము లయ్యెద, । రెఱచియు భుజియింతు రర్థి నెల్ల జనంబుల్. 294

ప్రతిపదార్థం: ఆరికెపంటలు= 'ఆరికె' సస్యం; ఉఱవు+అగున్= అధికం ఔతుంది. (ఆరికె= ఒక పంటవిశేషం); గొఱియల, పాఁడియును= గొర్రెలపాలదిగుబడియున్నూ; తఱచు+అగున్= అభివృద్ధి ఔతుంది; పురుషులకున్= మగవారలకు; తెఱవలు= స్త్రీలు; చుట్టములు= వివాహేతరబంధం గలవారు; అయ్యెదరు= కాగలరు; ఎల్ల, జనంబుల్= మనుజులు అందరును; ఎఱచియున్= మాంసాన్ని; అర్థిన్= కోరికతో; భుజియింతురు= తింటారు.

తాత్పర్యం: ఆరికె మొక్కల సేద్యం ఎక్కువ ఔతుంది. గొర్రెలపాడి అభివృద్ధి చెందుతుంది. మగవారికి స్త్రీలు ఉంపుడుకత్తెలవుతారు. మనుజులు అందరు ప్రీతితో మాంసాన్ని తింటారు.

విశేషం: ఈ పద్యంలోని 'పురుషులకుం దెఱవలు సుట్టము లయ్యెదరు' అనే ప్రయోగం అనుశీలించ దగింది. చుట్టము అనగా బంధువు అనేది నిఘంటువులలోని అర్థం. చుట్టరికం అంటే జారత్వ సంబంధం అనే అర్థం ఇచ్చే ప్రయోగం మనుచరిత్రలో ఉన్నది. 'కులములో వన్నె తక్కువ యయ్యెనే గాధిపట్టికి మేనక చుట్టరికము' - మనుచరిత్ర 2-73. ఎఱ్ఱనకవిహృదయం కలియుగంలో మగవారికి ఆడువారు భార్యలు కాక, జారత్వబంధం కల చుట్టాలు మాత్రమే ఔతారు- అని చెప్పవచ్చును. ఇప్పట్టున సంస్కృత మహాభారత మూలం. 'భార్యా మిత్రాశ్చ పురుషా భవిష్యంతి యుగక్షయే' (11-193-30).

క. పితృదైవతకార్యంబుల । నితరేతరభోక్తలగుదు రెల్లయెడలఁ గు
త్సితదేశకాలపాత్ర । ప్రతతియ వర్తించు దైవపైతృకవిధులన్. 295

ప్రతిపదార్థం: ఎల్లఎడలన్= అంతటను; పితృ, దైవత, కార్యంబులన్= పితృదేవతలకు చేసే శ్రాద్ధకర్మలలో; ఇతర+ఇతర, భోక్తలు+అగుదురు= ఒకరికి ఇంకొకరు తినెడివారలు ఔతారు; దైవపైతృకవిధులన్= దేవాలయాలలో జరిగే పూజలలోను శ్రాద్ధకర్మలలోను; కుత్సిత, దేశ, కాల, పాత్ర, ప్రతతి+అ= రోతగలిగించే ప్రదేశం, సమయం, వ్యక్తుల సమూహం మాత్రమే; వర్తించున్= కలుగుతాయి.

తాత్పర్యం: అన్నిచోట్లా పితృదేవతలకు చేసే శ్రాద్ధకర్మలలో, ఒకరికొరకు వేయబడిన పిండప్రదానాలను ఇంకొకరు తింటారు. దేవకార్యాలలోనూ, పితరులకై చేసే శ్రాద్ధకర్మలలోనూ ప్రదేశంకాని, సమయంకాని, వ్యక్తులుకాని, రోతగొలిపేటట్లుగానే ఉంటాయి. అంటే దైవపైతృకకార్యాలు ఎక్కడ కూడా దేశకాలపాత్రాలకు అనుగుణంగా జరుగవు.

క. హేతుప్రత్యయవాదవి । చేతసులై వేదనింద సేయుచును మఖ
వ్రాతంబులు వ్రతములుఁ బెడఁ । బాతురు దుర్మార్గకర్మపరు లై విప్రుల్. 296

ప్రతిపదార్థం: విప్రుల్= బ్రాహ్మణులు; దుర్మార్గ,కర్మపరులు+ఐ= చెడుదారులు పట్టినవారై; హేతు, ప్రత్యయ, వాద విచేతసులు+ఐ= హేతువునందు నమ్మకంతో కూడినవాదంలో పరిపూర్ణంగా నిండిన మనస్సు కలవారై; వేద, నింద చేయుచును=

వేదాలను తూలనాడుతూ; మఖ, వ్రాతంబులు= యజ్ఞాల సముదాయాలను; వ్రతములున్= నోములను; పెడఁబాతురు= విడనాడుతారు.

తాత్పర్యం: బ్రాహ్మణులు హేతువాదంలో విపరీతమైన విశ్వాసం కలవారై, చెడుత్రోవలు పట్టినవారై, వేదాలను నిందిస్తూ వ్రతాలు యజ్ఞయాగాదులు విడనాడుతారు.

మ. వనితాదుర్బలదీనబంధుజనసర్వస్వాపహారుల్ సుహృ
జ్జనమాతాపితృపుత్త్రహంతలు యదృచ్ఛాకర్మశీలుర్ ధరన్
జనసంపూజితు లై చరింతురు; వినష్టశ్రీకు లై విప్రు లా
జనులం జేరి పరిగ్రహించెద రవజ్ఞాపూర్వదుర్విత్తముల్. 297

ప్రతిపదార్థం: వనితా, దుర్బల, దీన, బంధు, జన, సర్వస్వ+అపహారుల్= ఆడువారి, బలంలేనివారి, దరిద్రుల, బంధుజనుల సమస్తాన్ని అపహరించేవారున్నూ; సుహృత్+జన, మాతా, పితృ, పుత్త్రహంతలు= మిత్రులైన జనులను, తలిదండ్రులను, కన్నబిడ్డలను చంపేవారున్నూ; యదృచ్ఛాకర్మశీలుర్= ఇచ్ఛవచ్చినచొప్పున ప్రవర్తించే వారున్నూ; ధరన్= భువిపై; జన, సంపూజితులు+ఐ= జనులచేత ఆరాధించబడిన వారై; చరింతురు= తిరుగాడుతారు; విప్రులు= బ్రాహ్మణులు; వినష్టశ్రీకులు+ఐ= పోగొట్టుకొనబడిన సంపద కలవారై-దరిద్రులై; ఆజనులన్+చేరి= అట్టి మనుజులచెంత చేరి; అవజ్ఞాపూర్వదుర్విత్తముల్= అవమానంతో కూడిన ఆ చెడ్డ ద్రవ్యాలను; పరిగ్రహించెదరు= పుచ్చుకొంటూ ఉంటారు.

తాత్పర్యం: ఆడువారి, బలహీనుల, దీనులైనవారి, బందుగుల సర్వస్వం అపహరించే దుష్టులు, తలిదండ్రులను కన్న బిడ్డలను మిత్రులను చంపేవారు, ఇచ్ఛవచ్చినచొప్పున ప్రవర్తించే స్వైరవిహారులు భూలోకంలో ప్రజలచేత పూజించబడుతూ సంచరిస్తారు. బ్రాహ్మణులు అట్టి దుర్మార్గుల దరి చేరి, పరమదరిద్రులై వారిచ్చే ద్రవ్యాలను సిగ్గు, అవమానాలు దిగమ్రింగి పుచ్చుకొంటారు.

మ. ధరణీరక్షణ మాచరింపక నృపుల్ దర్పంబునం బశ్యతో
హరులై సాధుల దోఁచి చేకుఱు తదీయ స్త్రీధన క్షేత్రముల్
హరియింపంగలవారు; దారుణతరం బై పెల్లు చెల్లుం బర
స్పరవైరంబు ధరాతలేంద్రులకు విశ్వప్రాణి నాశంబుగన్. 298

ప్రతిపదార్థం: నృపుల్= ప్రజలను పరిపాలించేరాజులు; ధరణీ, రక్షణము+ఆచరింపక= భూమిని కాపాడక (అనగా భూప్రజలను రక్షించక); దర్పంబునన్= గర్వంతో; పశ్యతోహరులు+ఐ= బహిరంగంగా దొంగతనం చేసే బందిపోటు దొంగలై; సాధులన్= సౌమ్యంగా బ్రదికే సజ్జనులను; దోఁచి= దోపిడిచేసి; చేకుఱు= లభించునట్టి; తదీయస్త్రీధనక్షేత్రముల్= వారివైన స్త్రీలను సంపదలను పొలములను; హరియింపంగలవారు= దోచుకొనగలవారు; ధరాతల+ఇంద్రులకున్= భూమిని పరిపాలించే ప్రభువులకు; దారుణతరంబు+ఐ= మిక్కిలి భయంకరమై; పరస్పర, వైరంబు= ఒకరితో మరి ఒకరికి కయ్యం; విశ్వ, ప్రాణి, నాశంబుగన్= ప్రపంచంలోని ప్రాణులు నశించేటట్లుగా; పెల్లు= అధికంగా; చెల్లున్= ప్రవర్తిస్తుంది.

తాత్పర్యం: భూమిని పరిపాలించే రాజులు ప్రజలను రక్షించటానికి బదులు, బహిరంగంగా దోపిడిచేసే దొంగలై ప్రవర్తిస్తారు. వారు సాధువులను దోచి వారి స్త్రీధనక్షేత్రాలను హరిస్తారు. భూమి నేలే రాజులకు ఒండొరులతో గొప్పయుద్ధాలు జరుగుతాయి. ప్రపంచంలోని ప్రాణికోటి సర్వనాశనమౌతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. సుతుఁ డవమానించు జనకుఁ; । బతి నవమానించు భార్య; పడఁతులుఁ బతులున్
మతి నొండొరువుల మెచ్చక । సతతముఁ జరియింతు రిష్టసంచారములన్. 299

ప్రతిపదార్థం: సుతుఁడు= కొడుకు; జనకున్= తండ్రిని; అవమానించున్= కించపరుస్తాడు; భార్య= పెండ్లాం; పతిన్= భర్తను; అవమానించున్= కించపరుస్తుంది; మతిన్= మనసులో; ఒండొరువులన్= ఒకరినొకరు; మెచ్చక= లక్ష్యపెట్టక; సతతమున్= ఎల్లప్పుడు; ఇష్టసంచారములన్= ఇచ్చవచ్చినరీతిగా; చరియింతురు= ప్రవర్తిస్తారు.

తాత్పర్యం: కుమారుడు తండ్రిని అవమానిస్తాడు. భార్య భర్తను కించపరుస్తుంది. భార్యాభర్తలు ఒకరినొకరు లక్ష్యపెట్టక, ఇచ్చవచ్చినట్లు సంచరిస్తారు.

క. నడవవు దేవపితృక్రియ, । లుడుగును వేదార్థసమ్యగుపదేశంబుల్,
గడఁగు మహామోహతమము, । పుడమి సమస్తంబుఁ గుజనభూయిష్ఠ మగున్. 300

ప్రతిపదార్థం: దేవపితృక్రియలు= దేవుడికి పితృదేవతలకు జరపవలసిన పనులు, అనగా దేవపూజలు శ్రాద్ధక్రియలు; నడవవు= జరగవు; వేద+అర్థ, సమ్యక్+ఉపదేశంబుల్= వేదాలలోని భావాలకు సంబంధించిన సముచితమైన బోధనలు; ఉడుగును= అంతరిస్తాయి; మహా+మోహ, తమము= గొప్ప అజ్ఞానం అనెడి చిమ్మచీకటి; కడఁగున్= క్రమ్ముతుంది; పుడమి= భూమి; సమస్తంబున్= సర్వమును; కుజన, భూయిష్ఠము+అగున్= దుష్టులైన జనులతో నిండిపోతుంది.

తాత్పర్యం: దేవాలయాలలో పూజలు, పితృదేవతలకు శ్రాద్ధదినవారక్రియలు జరుగవు. వేదవేదాంత వేదాంగ ప్రబోధం అంతరిస్తుంది. అజ్ఞానం అనే చిమ్మచీకటి దట్టంగా గుబురుకొంటుంది. భూలోకమంతా దుష్టులతో క్రిక్కిరిసిపోతుంది.

సీ. పదియాఱువర్షముల్ పరమాయు వయ్యెడు । ధరణీశ! కలియుగాంతమున వినవె;
యేడును నెనిమిదియేండ్ల ప్రాయంబునఁ । బ్రజ లుద్భవింతురు భామినులకు;
ద్రవ్యవిహీనులై దాత యొక్కఁడు లేక । యన్యోన్యతస్కరు లగుదు రెందు;
నెఱిఁగెడువారును నెంతయుఁ గ్రూరు లై । చెనసి పాపంబు సేసెదరు సూవె!

తె. యన్నవిక్రయ మొనరింతు రఖిలజనులు, । వేదవిక్రయు లగుదురు విప్రవరులు,
పణ్యయోనుల యగుదురు పద్మముఖులు । గష్టతర మైన యక్కలికాలవేళ. 301

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= భూమికి ప్రభువైన ఓధర్మరాజా!; వినవె= అవధానంతో ఆలకించుము; కష్టతరము+ఐన= మిక్కుటమైన దుఃఖంతో కూడిన; ఆ కలికాలవేళన్= ఆ కలియుగ సమయంలో; పది+ఆఱు, వర్షముల్= పది ఆరేండ్లు; కలియుగ+అంతమునన్= కలియుగం లోపల; పరమ+ఆయువు+అయ్యెడున్= గొప్ప ఆయుర్దాయం ఔతుంది; ఏడునున్+ఎనిమిది +ఏండ్ల ప్రాయమునన్= ఏడుసంవత్సరాలు, లేక ఎనిమిది వత్సరాల వయస్సు వచ్చినప్పుడు; భామినులకున్= స్త్రీలకు; ప్రజలు+ఉద్భవింతురు= సంతానం కలుగుతుంది; ఎందున్= ఎచ్చటెచ్చటను; ద్రవ్యవిహీనులు+ఐ= దరిద్రులై; దాత= దానం చేసేవాడు; ఒక్కఁడు లేక= ఒకవ్యక్తి కూడా లేకపోయి; అన్యోన్య, తస్కరులు+అగుదురు= ఒకరిసొత్తు మరొకరు దొంగలించేవారు ఔతారు; ఎఱిఁగెడువారును= తెలిసిన జ్ఞానులు సయితం; ఎంతయున్= మిక్కిలి; క్రూరులు+ఐ= దుష్టులై; చెనసి= కడగి; పాపంబు+చేసెదరు+చూవె= చెడ్డపనులను చేస్తారు సుమా!; అఖిలజనులు= అందరు; అన్నవిక్రయము+ఒనరింతురు= అన్నాన్ని ధనం కోరి అమ్ముతారు; విప్రవరులు= బ్రాహ్మణోత్తములు; వేదవిక్రయులు= వేదాలను అమ్మేవారు అనగా జ్ఞానాన్ని

ధనం కొరకై అమ్మేవారు; అగుదురు= ఔతారు; పద్మముఖులు= పద్మంవంటి ముఖం కలవారు- స్త్రీలు; పణ్యయోనులు+అ= ధనం కొఱకే మానాన్ని అమ్ముకొనేవారు; అగుదురు= ఔతారు.

తాత్పర్యం: ఓధర్మరాజా! కలియుగంలో ప్రజల ఆయుఃప్రమాణం పదియారేండ్లకు మించదు. ఏడెనిమిది సంవత్సరాల వయస్సు వచ్చే సరికే ఆడపిల్లలు సంతానవతులు ఔతారు. దానం చేసేదాతలు కరవై, ప్రజలు ఒకరిసొత్తు నొకరు అపహరిస్తారు. తెలిసిన జ్ఞానులు సయితం మిక్కిలి దుష్టులై, వెనుకాడక పాపకృత్యాలు చేస్తారు. అంతేకాక, పరమదుఃఖంతో నిండిన ఆ కలికాలంలో అందరును అన్నాన్ని ధనం కొరకై అమ్ముతారు. బ్రాహ్మణోత్తములు జ్ఞానాన్ని అమ్ముకుంటారు. అందమైన ఆడవారు తమ మానాలను ధనం కొరకై అమ్ముకొంటారు.

తరువోజ.

ఉక్కున శూద్రు లత్యుగ్రు లై కవిసి । యొండొండ పెక్కండ్ర నుఱక చంపుటయు
దిక్కెవ్వరును లేక దీనులై వసుమ । తీసురుల్ నాలుగు దెసలఁ బాటెదరు;
మ్రుక్కడిచోరులు ముట్టి నిశ్శేష । ముగ ధనావలిఁ గొని మొగి వధియింప
స్రుక్కి కాకులయట్లు శూన్యులై చెదరి । సొంపఱి యడవులు సొత్తురు జనులు. 302

ప్రతిపదార్థం: ఉక్కునన్= దర్పంతో; శూద్రులు= నాలుగవ జాతివారు; అతి+ఉగ్రులు+ఐ= మిక్కిలి భయంకరులై; కవిసి= విజృంభించి; ఒండు+ఒండ= ఒక్కరొక్కరే క్రమంగా; పెక్కండ్రన్= పలువురిని; ఉఱక= లక్ష్యపెట్టక (నిర్దాక్షిణ్యంగా); చంపుటయున్= సంహరించటం; దిక్కు+ఎవ్వరును, లేక= కాపాడేవారెవ్వరున్నూ లేక; దీనులు+ఐ= దుఃఖం పొందేవారై; వసుమతీ, సురుల్= బ్రాహ్మణులు; నాలుగుదెసలన్= నాలుగుదిక్కులకు; పాటెదరు= పారిపోతారు; మ్రుక్కడిచోరులు= నీచులు అయిన దొంగలు; ముట్టి= చేరి; నిస్+శేషముగన్= శేషం లేకుండా, అనగా పూర్తిగా; ధన+ఆవలిన్= సంపదలను; కొని= గ్రహించి; మొగి= కడగి; వధియింపన్= సంహరించగా; స్రుక్కి= వెతచెంది; కాకుల+అట్లు+అ= కాకులవలె; శూన్యులు+ఐ= ఏమియులేనట్టి వారై; జనులు= ప్రజలు; సొంపు+అఱి= శోభ నశించి; అడవులు+చొత్తురు= అరణ్యాలలోకి చేరతారు.

తాత్పర్యం: నాల్గవజాతివారైన శూద్రులు మిక్కిలిభయంకరమైన పరాక్రమంతో విజృంభించి ఒకరొకరే వరుసగా పలువురు ప్రజలను సంహరిస్తారు. బ్రాహ్మణులు తమను రక్షించేవారు ఎవ్వరూ లేక, నాలుగుదిక్కులా చెల్లాచెదరై పారిపోతారు. దుష్టు లైన దొంగలు చెలరేగి ద్రవ్యాన్ని హరించటంమాత్రమే కాక ప్రాణాలను కూడా హరిస్తారు. ఆ బాధలతో అలమటించి, ప్రజలు దరిద్రులై కాకులవలె అడవులలో తలదాచుకుంటారు.

విశేషం: ద్విపద పాదద్వయం ఒక తరువోజ పాదం. మూడు ఇంద్ర గణాలమీద ఒక సూర్యగణం, మరల మూడింద్ర గణాల మీద ఒక సూర్యగణం ప్రతిపాదంలోనూ ఉంటాయి. రెండేసి గణాల మీద పాదంలో మూడు యతులుంటాయి. ప్రాస నియమం ఉంది. అన్ని పాదాలూ మొదటి పాదాన్ని అనుసరించి గుర్వాదులో, లఘ్వాదులో కావాలి.

క. శ్రుతిధర్మంబులు శూద్రులు । ప్రతిభం జెప్పంగ వినుచు బ్రాహ్మణజాతుల్
ధృతి సెడి తత్సేవకు లై । యతినిందితకర్మకారు లయ్యెద రధిపా! 303

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధర్మరాజా!, శ్రుతిధర్మంబులు= వేదాలకు సంబంధించిన ధర్మాలు; శూద్రులు= శూద్రులు; ప్రతిభన్+చెప్పంగన్= ప్రతిభతో వివరించి చెప్పగా; బ్రాహ్మణజాతుల్= విప్రులలోని పెక్కు తెగలవారు; ధృతి+చెడి= ధైర్యం

కోలుపోయి; వినుచున్= ఆలకిస్తూ; తద్+సేవకులు+ఐ= వారికి దాసులై; అతి, నిందిత, కర్మకారులు+అయ్యెదరు= మిక్కుటంగా నిందించబడిన పనులు చేసేవారు ఔతారు.

తాత్పర్యం: వేదాలకు సంబంధించిన ధర్మాలనుగూర్చి శూద్రులు వివరించి చెప్పగా, బ్రాహ్మణులలోని పెక్కు తెగలవారు వీను లొగ్గి వింటారు. అంతేకాక, ధైర్యం కోలుపోయి వారు ఆ శూద్రులకు సేవకులౌతారు. మిక్కిలి నిందించదగిన పనులు చేసేవారు ఔతారు.

మత్తకోకిలము.

దేవతాయతనంబులున్ జగతీసురావసథంబులుం
బావనాశ్రమభూములుం జెడి పాడగున్ శుభవృక్ష వ
ల్లీవనంబులు నాశ మొందుఁ గలిప్రచారమునందు దు
స్త్రీవిహారము మద్యపానముఁ జెల్లుఁ బెల్లుగ నెల్లెడన్. **304**

ప్రతిపదార్థం: కలిప్రచారమునందున్= కలియుగం నడుస్తున్నప్పుడు; దేవతా+ఆయతనంబులున్= దేవతల కోవెలలు; జగతీసుర+అవసథంబులున్= బ్రాహ్మణుల ఇండ్లును; పావన+ఆశ్రమ, భూములున్= పవిత్రాలైన ఆశ్రమప్రదేశాలును; చెడి, పాడు+అగున్= చెడిపోయి పాడుపడతాయి; శుభ, వృక్ష, వల్లీ, వనంబులు= మంచి చెట్లు, తీగెలు, తోటలు; నాశము+ఒందున్= నశిస్తాయి; దుస్+స్త్రీవిహారము= చెడిపోయిన స్త్రీల విజృంభణం; మద్యపానమున్= కల్లు (మొదలైన) మత్తు కలిగించే పానీయాలు త్రాగటం; ఎల్ల+ఎడన్= అన్ని చోట్ల; పెల్లుగన్= మిక్కుటంగా; చెల్లున్= ప్రవర్తిల్లుతాయి.

తాత్పర్యం: కలియుగం నడచేటప్పుడు దేవాలయాలున్నూ, బ్రాహ్మణుల గృహాలున్నూ, పవిత్రమైన ఆశ్రమాలున్నూ పాడయిపోతాయి; మంచి చెట్లు, తీగెలు, అడవులు ధ్వంసం అయిపోతాయి. దుష్టస్త్రీల విజృంభణం, మద్యపానం మిక్కుటంగా ప్రవర్తిల్లుతాయి.

విశేషం: వృత్తలక్షణానికి చూడు: ఆరణ్యపర్వం 4.267 పద్య విశేషవ్యాఖ్య.

క. **గురుఁ గొనియాడఁడు శిష్యుఁడు; । గురుఁడును శిష్యునెడ వంచకుం డగు; మది నొం**
డొరువుల నొల్లరు బంధులు; । పొరిఁబొరి గలవు లగుఁ బ్రజకుఁ బొడమును భయముల్. **305**

ప్రతిపదార్థం: శిష్యుఁడు= విద్యార్థి; గురువున్= గురువును; కొనియాడఁడు= మెచ్చుకొనడు; గురుఁడును= అధ్యాపకుడుకూడ; శిష్య+ఎడన్= తనదగ్గర చదువుకొనే విద్యార్థియెడ; వంచకుండు+అగున్= మోసగాడు ఔతాడు; బంధులు; మదిన్=మనస్సులో; ఒండు+ఒరువులన్= ఒకరినొకరు; ఒల్లరు= అంగీకరించరు; పొరిన్+పొరిన్= మాటిమాటికి; కలవులు+అగున్= కాటకాలు ఏర్పడుతాయి; ప్రజకున్= జనులకు; భయముల్= భీతులు; పొడమును= కలుగుతాయి.

తాత్పర్యం: కలియుగంలో శిష్యుడు గురువును మెచ్చడు. గురువు శిష్యుడిని మోసగిస్తాడు. బంధువులు ఒకరి నొకరు అనురాగంతో చూడరు. మాటిమాటికి కరవులు ఏర్పడతాయి. ప్రజలకు భయాందోళనలు అధికమౌతాయి.

తే. **ఇవ్విధంబున ధర్మంబు లెల్ల నపగ । తమునఁ బడ జనులెల్లను దల్లడిల్ల**
బహువిధోత్పాతములు పుట్టుఁ బార్థివేంద్ర! । కడఁగి తత్కలికాల సంక్షయమునందు. **306**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పార్థివ+ఇంద్ర!= రాజులలో ఇంద్రుడి వంటివాడా!; తద్+కలి, కాలసంక్షయమునందున్= ఆ కలియుగంలో దాపురించే వినాశంలో; ఈ+విధమునన్; ధర్మంబులు+ఎల్లన్= అన్ని ధర్మాలున్నూ; అపగతమునన్+పడన్= నాశనం చెందగా; జనులు+ఎల్లను= ప్రజలు అందరును; తల్లడిల్లన్= అట్టుడికి పోగా; కడఁగి= ఒదవి; బహు, విధ,+ఉత్పాతములు= పెక్కురకాలైన భయంకర అపశకునాలు; పుట్టున్= పుట్టుతాయి.

తాత్పర్యం: రాజులలో శ్రేష్ఠుడ వైన ఓధర్మరాజా! ఆ కలియుగంలో ఏర్పడే వినాశంలో ఈవిధంగా అన్నిధర్మాలూ తలక్రిందులౌతాయి. ప్రజాసమూహం తల్లడిల్లుతుంది. భయంకరమైన దుశ్శకునాలు దాపురిస్తాయి.

క. క్రమమున రాష్ట్రములును నగ । రములును నాశంబు నొందు; రక్షాచ్యుతులై
భ్రమియింతురు జను లతి దు । ర్గమ గిరిసరిదంతికములఁ గడునాతురు లై. 307

ప్రతిపదార్థం: క్రమమునన్= వరుసగా; రాష్ట్రములును= ప్రదేశాలున్నూ; నగరములును= పట్టణాలున్నూ; నాశంబున్+ఒందున్= నాశనం చెందుతాయి; జనులు= ప్రజలు; కడున్= మిక్కుటంగా; ఆతురులు+ఐ= కష్టాలకు లోనవటంచేత ఆవేదన చెందినవారై; అతిదుర్గమ గిరి సరిత్+అంతికములన్= నడవటానికి మిక్కిలి కష్టమైన పర్వతాల, నదుల ప్రాంతాలలో; రక్షా, చ్యుతులు+ఐ= భద్రతలేనివారై; భ్రమియింతురు= తిరుగాడుతారు.

తాత్పర్యం: వరుసగా ప్రదేశాలు, పట్టణాలు నాశనమౌతాయి. ప్రజలు శాంతి భద్రతలు కోలుపోయి, మిక్కిలి దైన్యంతో దాటశక్యంగాని కొండలలో, ప్రవాహాల ప్రదేశాల్లో ఇటు నటు తిరుగాడుతారు.

కలియుగంబున విష్ణుండు గల్కిరూపంబున ధర్మంబు ప్రతిష్ఠించుట (సం. 3-188-89)

వ. అంతఁ గలియుగాంతంబునందు భువనవిదితం బయిన శంబళ గ్రామంబున కల్క్యాత్మకుం డైన విష్ణుయశుం డను బ్రాహ్మణుండు జనియించి, సంస్మరణమాత్రన వేదశాస్త్రంబులును సమస్త శస్త్రాస్త్రవిశేషంబులు నధిగమించి సార్వభౌముండయి. 308

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; కలి, యుగ+అంతంబునందున్= కలియుగంయొక్క కడపటిభాగంలో; భువన, విదితంబు+అయిన= లోకానికి అంతటికి తెలిసినట్టి; శంబళగ్రామంబునన్= శంబళ అనే పల్లెటూరిలో; కల్కి+ఆత్మకుండు+ఐన= కల్కిరూపుండైన; విష్ణుయశుండు+అను+బ్రాహ్మణుండు= 'విష్ణుయశుడు' అనే పేరు కల విప్రుడు; జనియించి= పుట్టి; సంస్మరణమాత్రన్+అ= జ్ఞాపకం చేసికొనటం మాత్రంచేతనే; వేద, శాస్త్రంబులును, సమస్త, శస్త్ర+అస్త్ర, విశేషంబులును= వేదాలను. శాస్త్రాలను, అన్నిఆయుధాలను, మంత్రబాణాలలో గొప్పవైనవాటిని; అధిగమించి= పొంది; సార్వభౌముండు+అయి= రారాజు అయి.

తాత్పర్యం: అంతట ఆ కలియుగంకడపటిభాగంలో, ప్రపంచంలో అందరికి తెలిసినట్టి; శంబళగ్రామంలో కల్కి అవతార మైన విప్రుడు - విష్ణుయశుడు అనే పేరు గలవాడు పుట్టుతాడు. అతడికి కేవలం స్మరణమాత్రంచేతనే చదువనక్కరలేకుండానే వేదాలు శాస్త్రాలు అవగత మౌతాయి. అతడు ఆయుధాలను అన్నిటిని, శస్త్రాస్త్రవిశేషాలను, సులువుగా సంపాదించి సార్వభౌము డౌతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మధ్యాక్కర.

అసదృశతేజుఁడు బ్రాహ్మణానీకసహితుఁ డై కడఁగి
వసుమతియందు నధర్మవర్తు లై యున్న మ్లేచ్ఛులను
మసలక నిజశక్తిఁ జేసి మడియించి ధర్మంబు నిలిపి
వసునిభుం డొనరించుఁ బేర్మి వాజిమేధము నిష్ఠ యొప్ప. 309

ప్రతిపదార్థం: అసదృశతేజుఁడు= సాటిలేని తేజంకలవాడు; బ్రాహ్మణ+అనీక, సహితుఁడు+ఐ= విప్రులసమూహంతో కూడినవాడై; కడఁగి= పూని; వసుమతి+అందున్= భూమియందు; అధర్మ, వర్తులు+ఐ+ఉన్న, మ్లేచ్ఛులను= ధర్మాన్ని అనుసరించని అనాగరకు లైన తెగలవారిని; మసలక= విడువక; నిజ, శక్తిన్+చేసి= తనదైన బలంచేత; మడియించి= సంహరించి; ధర్మంబు= ధర్మాన్ని; నిలిపి= ప్రతిష్ఠించి; వసు, నిభుండు= వసువుతో సమానుడైనవాడు (విష్ణుయశుడు); వాజిమేధము= అశ్వమేధయాగాన్ని; నిష్ఠ+ఒప్పన్= దీక్షతో; పేర్మిన్= అతిశయంతో; ఒనరించున్= చేస్తాడు.

తాత్పర్యం: సాటిలేనితేజస్సు కలవాడైన విష్ణుయశుడు బ్రాహ్మణబృందాలతో కూడి, పూనికతో అధర్మవర్తనులయిన మ్లేచ్ఛులను సంహరించి, ధర్మాన్ని తిరిగి నెలకొల్పుతాడు. తదుపరి, వసునిభుడైన ఆతడు దీక్షతో అశ్వమేధయాగం చేస్తాడు.

విశేషం: మధ్యాక్కరలోని ప్రతిపాదంలోనూ వరుసగా రెండు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం, రెండు ఇంద్రగణాలు, ఒక సూర్య గణం ఉంటాయి. నాలుగో గణం మొదటి అక్షరం యతిస్థానం. ప్రాస నియతి ఉన్నది.

క. **ఘనుఁ డిలయెల్లను బ్రాహ్మణ । ధనముగ భాగించి యిచ్చి ధర్మయశోవ**
ర్ధనుఁ డై వార్ధకమున న । త్యనఘుండు దపోవనంబునందు వసించున్. 310

ప్రతిపదార్థం: ఘనుఁడు= గొప్పవాడు (విష్ణుయశుడు); ఇల+ఎల్లను= భూమిని అంతటిని; బ్రాహ్మణధనముగన్= విప్రుల సొత్తుగా; భాగించి+ఇచ్చి= పంచిఇచ్చి; ధర్మ, యశస్+వర్ధనుఁడు+ఐ= ధర్మాన్నీ, కీర్తినీ పెంపొందించేవాడై; వార్ధకమునన్= ముసలితనంలో; అతి+అనఘుండు= మిక్కిలి పుణ్యంకలవాడు; తపస్+వనంబునందున్= తపస్సు చేసికొనే అడవిలో; వసించున్= నివసిస్తాడు.

తాత్పర్యం: ఘనుడై, మిక్కిలి పుణ్యం ఆర్జించినవాడై విష్ణుయశుడు భూమినంతటిని విప్రులకు చెందిన సొత్తుగా భావించి, దానిని వారికి భాగించి పంచిపెట్టి, ముసలితనంలో తాను తపోవనంలో నివసిస్తాడు.

వ. **అతనిచేతం బ్రతిష్ఠితం బైన ధర్మంబు ననుసరించి బ్రాహ్మణాదివర్ణంబులు సమర్యాదంబులై వర్తింపంగలయవి; దాననచేసి కృతయుగంబు సంప్రాప్తం బగు; నందు. 311**

ప్రతిపదార్థం: అతనిచేతన్+ప్రతిష్ఠితంబు+ఐన= ఆవిష్ణుయశుడిచేత నెలకొల్పబడిన; ధర్మంబున్= ధర్మాన్ని; అనుసరించి= అనుగుణంగా నడచుకొని; బ్రాహ్మణ+ఆది+వర్ణంబులు= బ్రాహ్మణులు మొదలైన కులాలు; సమర్యాదంబులు+ఐ= మర్యాదలతో (హద్దులతో) కూడినవై; వర్తింపంగలయవి= నడచుకొనగలవు; దానన్+అ+చేసి= అందుచేతనే; కృతయుగంబు; సంప్రాప్తంబు+ అగున్= తిరిగి సంభవిస్తుంది; అందున్= ఆ కృతయుగంలో;

తాత్పర్యం: అతనిచేత స్థాపించబడిన ధర్మాన్ని అనుసరించి బ్రాహ్మణులు మొదలైన వర్ణాలవారు వారి వారి మర్యాదలను పాటించేవారై వర్తిస్తారు. దానివలన తరువాతియుగమైన కృతయుగం ప్రవర్తిల్లుతుంది. అందులో.

శా. ఆరామవ్రజచైత్యసద్మవనదేవాగారసౌమ్యంబులై
భూరి బ్రహ్మతపస్వి సంకులములై పుణ్యాధ్వరారంభ సం
భారోదారములై నితాంతఫలిత భ్రాజిష్ణుసస్యంబులై
యారూఢస్థితి నెల్లదేశములు నొప్పారుం బ్రకాశంబులై. 312

ప్రతిపదార్థం: ఆరామ, వ్రజ, చైత్య, సద్మ, వన, దేవ+అగార, సౌమ్యంబులు+ఐ= తోటల సమూహాలతో, గుడులతో, ఇండ్లతో, ఉద్యానాలతో, దేవాలయాలతో, ప్రశాంతంగా ఉండేవై; భూరి, బ్రహ్మ తపస్వి, సంకులములు+ఐ= గొప్పవారైన బ్రహ్మర్షులచేత క్రిక్కిరిసినవై; పుణ్య+అధ్వర+ఆరంభ, సంభార+ఉదారములు+ఐ= సుకృతం కల్పించే యజ్ఞాలు మొదలు పెట్టటానికి ఉద్దేశించబడిన వస్తుసామగ్రిచేత దట్టములైనవై; నితాంత, ఫలిత, భ్రాజిష్ణు సస్యంబులు+ఐ= ఎల్లప్పుడు మంచి దిగుబడితో దేదీప్యమానమైన పంటలు కలిగినవై; ఆరూఢస్థితిన్= ఒప్పారునవిగా ఉండేవై; ఎల్లదేశములున్= అన్ని ప్రదేశాలున్నూ; ప్రకాశంబులు+ఐ= విలసిల్లేవై; ఒప్పారున్= వర్ధిల్లుతాయి.

తాత్పర్యం: ఇంక కృతయుగం తిరిగి ఆరంభించటంచేత ధర్మం నాలుగుపాదాలతో పరిపూర్ణమై వికసిస్తుంది. అన్ని దేశాలున్నూ ఆదర్శప్రాయంగా ఒప్పారుతాయి. తోటలు, ఉద్యానవనాలు గుడులు, దేవాలయాలతో వర్ధిల్లే దేశాలు బ్రహ్మర్షిసమూహాలతో క్రిక్కిరిసి పుణ్యయజ్ఞాలు చేయటంకొరకు ఉద్దేశించబడిన వస్తుసామగ్రితో ఒప్పారుతాయి. ఆ విష్ణుయశుడిచేత నెలకొల్పబడిన ధర్మాన్ని అనుసరించి, బ్రాహ్మణులు మొదలైన కులాలవారు సంప్రదాయాలను అనుసరించి ప్రవర్తించగలరు.

క. సమయముతోడఁ గురియు వ । ర్షములు, గరము తేజ మెక్కి చరియించు నవ
క్రములై గ్రహంబు, లారో । గ్యము సౌఖ్యము సమధికముగఁ గలుగు నరులకున్. 313

ప్రతిపదార్థం: సమయముతోడన్= సకాలంలో; వర్షములు= వానలు; కురియున్= కురుస్తాయి; గ్రహంబులు= గ్రహాలు (కుజుడు, బుధుడు మున్నగు గ్రహాలు); అవక్రములు+ఐ= వంకరటింకర కాని నడకతో; తేజము+ఎక్కి= మిక్కుటమైన కాంతిని పొంది; చరియించున్= తిరుగుతాయి; నరులకున్= మనుజులకు; ఆరోగ్యము= స్వాస్థ్యం, రోగాలు లేని సుఖస్థితి; సౌఖ్యము= సుఖం; సమ్+అధికముగన్+కలుగున్= మిక్కిలి ఎక్కువగా ఏర్పడుతుంది.

తాత్పర్యం: వానలు సకాలంలో కురుస్తాయి. గ్రహాలు వక్రగమనం లేకుండగా మిక్కుటమైన కాంతితో తిరుగుతాయి. మనుజులకు ఆయురారోగ్యాలు కలుగుతాయి.

వ. ఇది కృతయుగప్రవర్తనంబు; త్రేతాద్వాపర యుగంబులందుఁ ద్రితయ ద్వయపాదంబుల ధర్మంబ వర్తిల్లు; నిట్టి తెఱంగునం గాలగతు లనేకంబులు నాకుం బ్రత్యక్షసిద్ధంబు లయ్యె; నీ వడిగిన యతీతానాగతంబు లయిన విశేషంబు లెఱింగించితి; నింక నొక్క హితోపదేశంబు సేసెద; నాకర్ణింపుము. 314

ప్రతిపదార్థం: ఇది= ఇది; కృత, యుగ, ప్రవర్తనంబు= కృతయుగం నడిచే తెరగు; త్రేతా, ద్వాపర, యుగంబులందున్= త్రేతాయుగంలోనూ, ద్వాపరయుగంలోనూ; త్రితయ, ద్వయపాదంబులన్= మూడు, రెండు పాదాలతో; ధర్మంబు+అ=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మమే; వర్తిల్లున్= విలసిల్లుతుంది; ఇట్టి+తెఱంగునన్= ఈవిధంగా; కాల, గతులు= కాలపు నడకలు; అనేకంబులు= పెక్కురీతులు; నాకున్+ప్రత్యక్షసిద్ధంబులు+అయ్యెన్= నాకు స్వానుభవపూర్వకంగా కన్పడినవి; నీవు+అడిగిన= నీవు ప్రశ్నించిన; అతీత+అనాగతంబులు+అయిన= భూతకాలంలో జరిగినవి, భవిష్యత్కాలంలో జరుగబోయేవి అయిన; విశేషంబులు= ముఖ్యంగా పేర్కొనదగిన సంగతులు; ఎఱింగించితిన్= తెలిపితిని; ఇంకన్= ఇకమీద; ఒక్క= ఒక; హిత+ఉపదేశంబు+చేసెదన్= నీ మేలు కోరి చెప్పేమాట వినిపిస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇంతవరకు నేను నీకు చెప్పింది కృతయుగంలో జరిగే తీరుతెన్నులు. త్రేతాయుగంలో మూడు పాదాలతో, ద్వాపరయుగంలో రెండుపాదాలతో ధర్మం వర్తిల్లుతుంది. ఈవిధంగా కాలచక్రం పలుమారులు తిరుగుతూ ఉంటుంది. ఆ విషయం నాకు స్వానుభవపూర్వకమైనది. జరిగిన సంగతులతో పాటు రాబోయే కాలంలో జరిగేవికూడ జోడించి వివరించి చెప్పాను. ఇక నీకు ఒక ముఖ్యమైన ఉపదేశం నీ మేలుకోరి చెపుతాను. సావధానంగా వినుము.

క. **ధరణీసురులకు నెప్పుడుఁ । గర మిష్టము సేయుమయ్య కౌరవవంశో**
త్తర! విప్రులు సంతుష్టిం । బొరసినఁ జేకుఱు నశేషపుణ్యఫలంబుల్. **315**

ప్రతిపదార్థం: కౌరవ వంశ+ఉత్తర!= కౌరవ వంశంలో శ్రేష్ఠుడవు అయినవాడా!; ధరణీసురులకున్= బ్రాహ్మణులకు; ఎప్పుడున్= ఎల్లవేళలలో; కరము= మిక్కిలి; ఇష్టము+చేయుము+అయ్య= కోరినదానిని నెరవేర్చు మయ్య; విప్రులు= బ్రాహ్మణులు; సంతుష్టిన్+పొరసినన్= సంతృప్తి చెందితే; అశేష పుణ్యఫలంబుల్= పెక్కు సుకృత్యాల ఫలితాలు; చేకుఱున్= కలుగుతాయి.

తాత్పర్యం: కౌరవవంశంలో శ్రేష్ఠుడ వైన ఓ ధర్మరాజా! నీవు ఎల్లప్పుడూ బ్రాహ్మణులకు ఇష్టమైనదానిని చేయుము; ఎందుచేత నంటే, బ్రాహ్మణులు సంతృప్తి చెందితే సమస్తపుణ్యాలు కలుగుతాయికాబట్టి.

సీ. **సకలభూతములందు సదయాత్ముఁడవు గమ్ము; । పాలింపు ప్రజల నీ ప్రజలఁ బోలె;**
విశదవృద్ధాచారవేదివై ధర్మంబు । సలుపుము దురితవర్జనము గాఁగ;
నెఱుఁగమిఁ బాప మొక్కించుక దొడరినఁ । జయ్యన ప్రతికారశాలి వగుము;
గర్వంబు విడువుము, గరము ప్రియంబును । నిజమునుగా వచోనియతి నడపు;

తే. **కాలగతు లెల్ల నెఱిఁగి యస్ఖలితబోధ । యుక్తుఁడవు గమ్ము; భరతవంశోద్భవుఁడవు**
నీవు గావున నత్యంతనిర్మలుఁడవు । ప్రాజ్ఞుఁడవు; నీకు వేఱ చెప్పంగ నేల? **316**

ప్రతిపదార్థం: సకల+భూతములందున్= అన్ని ప్రాణులపట్ల; సదయ+ఆత్ముఁడవు+కమ్ము= జాలితో కూడిన ఆత్మ కలవాడవు అగుము; ప్రజలన్= (నీరాజ్యంలోని) జనులను; నీ, ప్రజలన్+పోలెన్= నీసంతానంవలెనే; పాలింపు(ము)= ఏలుకొనుము; విశదవృద్ధ+ఆచార, వేదివి+ఐ= తెల్లముగా ముసలివారి ప్రవర్తనను తెలిసికొనే వాడివై; దురిత, వర్జనము+కాఁగన్= పాపాలు వదలివేయబడినవి అగునట్లుగా; ధర్మంబు= ధర్మాన్ని; చలుపుము= ఆచరించుము; ఎఱుఁగమిన్= అజ్ఞానంచొప్పున; పాపము+ ఒక్కించుక= కొంచెం పాపం; తొడరినన్= ఏర్పడితే; చయ్యన= వెనువెంటనే; ప్రతికారశాలివి+అగుము= మారుచేత చేసే వాడివి అగుము; గర్వంబు= గర్వాన్ని (అహంకారాన్ని); విడువుము= వదలి పెట్టుము; కరము= మిక్కిలి అయిన; ప్రియంబును= ఇష్టమును; వచస్+నియతి= మాటలాడే నియమం; నిజమును, కాన్= సత్యంతో కూడిందిగా; నడపు(ము)= నిర్వహించుము; కాల, గతులు+ఎల్లన్+ఎఱిఁగి= కాలం ఏయే రీతులుగా నడచునో వాటిని అన్నింటిని తెలిసికొని; అస్ఖలిత, బోధ, యుక్తుఁడవు, కమ్ము= జారనట్టి జ్ఞానంతో కూడినవాడవు అగుము; నీవు; భరత, వంశ+ఉద్భవుఁడవు= భరతవంశంలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పుట్టినవాడవు; కావునన్= కాబట్టి; అతి+అంత, నిర్మలుఁడవు= మిక్కిలి స్వచ్ఛమైన శీలం కలవాడవు; ప్రాజ్ఞుఁడవు= బాగా అన్నివిషయాలను తెలిసికొనినవాడవు; నీకున్= నీకు; వేఱు+అ= వేరుగా, ప్రత్యేకించి; చెప్పంగన్+ఏల= చెప్పటం ఎందుకు? (అంటే) చెప్పనవసరం లేదు.

తాత్పర్యం: ఈ సృష్టిలో ఉన్న చరాచర మైన సమస్తభూతాలపట్ల జాలిగలిగినవాడవు కమ్ము. నీరాజ్యంలోని పౌరులను నీ కన్నబిడ్డలవలెనే పరిపాలించుము. ధర్మాన్ని నిర్ణయించుకొనేటప్పుడు, లోగడ జ్ఞానవృద్ధులైన మహానుభావులు ఏవిధంగా ఆచరించారో పరిశీలించి, ఆవిధంగా ప్రవర్తించుము. తెలియక కొంచెం పాప మేర్పడినా వెంటనే దానికి ప్రాయశ్చిత్తము చేసుకొనుము. అహంభావాన్ని విడిచిపెట్టుము; సత్యాన్ని ప్రియాన్ని మాటాడుము; కాలాన్ని అనుసరించి జ్ఞానం పరిణతి చెందుతుందనే విషయాన్ని మరవకుండటంచేత, నీ తెలివితేటలు జారిపడకుండుగాక! నీవు భరతవంశంలో పుట్టినవాడవుకాబట్టి మిక్కిలి పవిత్రుడవు. కల్మషం లేనివాడవు. సర్వవిషయాలు బాగా ఎరిగిన ప్రాజ్ఞుడవు. నీకు ఇంతకంటె విస్తరించి చెప్పనవసరం లేదు.

విశేషం: మహాభారతంలో పలుతావుల 'కాలగతి'ని గూర్చిన ప్రస్తావన వస్తుంది. కాలగతులు తెలియకపోతే బోధ స్ఖలితం కావచ్చు ననే హెచ్చరిక ఇట గమనించతగింది.

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'మునీంద్రా! నీయానతిచ్చిన వాక్యంబు లన్నియు నవహితుండ నై వింటి; నింతకుమున్ను నా యోపిన తెఱంగున లోభమాత్సర్యాది దుర్గుణంబులు పరిహరింతు; నింకను భవదుక్తం బైన ధర్మశాసనంబును బ్రయత్నంబునం బాలించెద'నని యతనికిఁబ్రణమిల్లి మఱియును బ్రాహ్మణప్రభావంబు వినువాఁ డై యతనిం బ్రార్థించినఁ, దద్విషయం బైన యితిహాసం బతనికి నమ్మహాముని యిట్లని చెప్పె.317

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ముని+ఇంద్రా!= మునులలో ఇంద్రుడి వంటి వాడా!; నీ+ఆనతి+ఇచ్చిన= నీవు సెలవిచ్చిన; వాక్యంబులు+అన్నియున్= మాటలు అన్నింటిని; అవహితుండను+ఐ= శ్రద్ధతో కూడినవాడనై; వింటిన్= ఆలకించాను; ఇంతకున్, మున్ను= ఇదివరకు; నా+ఓపిన, తెఱంగునన్= నాకు శక్తి వంచన లేని తీరుగా; లోభ, మాత్సర్య+ఆది, దుర్గుణంబులు= అత్యాశ, అసూయ మొదలైన చెడులక్షణాలు; పరిహరింతున్= లేకుండేటట్లుగా చేస్తూ ఉన్నాను; ఇంకను= మరియును; భవత్+ఉక్తంబు+ఐన= నీచేత చెప్పబడిందైన; ధర్మ, శాసనంబును= ధర్మంతో కూడిన ఆనతిని; ప్రయత్నంబునన్= సాధనంచేత; పాలించెదన్= అనుసరిస్తాను; అని= అనిచెప్పి; అతనికిన్= (మార్కండేయమహర్షికి); ప్రణమిల్లి= నమస్కారంచేసి; మఱియును= ఇంకను; బ్రాహ్మణ, ప్రభావంబు= విప్రులయొక్క మహిమ; వినువాఁడు+ఐ= ఆలకించటానికి కుతూహలం కలవాడై; అతనిన్= (ఆమార్కండేయమహర్షిని); ప్రార్థించినన్= వేడగా; తద్+విషయంబు+ఐన= ఆ బ్రాహ్మణమహిమకు సంబంధించిన; ఇతిహాసంబు= పూర్వకాలంలో జరిగిన కథ; అతనికిన్= (ఆధర్మరాజుకు); ఆ+మహాముని= ఆమహర్షి అయిన మార్కండేయుడు; ఇట్లు+అని= ఈవిధంగా; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని ధర్మరాజు ఇట్లా అన్నాడు: 'మహామునీ! మీరు సెలవిచ్చిన మాటలన్నీ శ్రద్ధతో విన్నాను. ఇదివరకే నా శక్తివంచన లేకుండా అత్యాశ, అసూయ మొదలైన చెడుగుణాలను పరిహరిస్తూ ఉన్నాను. ఇప్పుడు మీచేత బోధించబడిన ఈ ధర్మశాసనాన్ని ప్రయత్నపూర్వకంగా ఆచరిస్తాను'- అని అంటూ మార్కండేయ మహర్షికి నమస్కరించి, బ్రాహ్మణప్రభావాన్ని గురించి తెలియజెప్పుమని ప్రార్థించాడు. ఆ మహాముని ఆ అంశానికి సంబంధించిన ఒక ఇతిహాసాన్ని ఈవిధంగా చెప్పాడు.

మార్కండేయుండు ధర్మరాజునకు బ్రాహ్మణప్రభావంబు సెప్పుట (సం. 3-190-1)

చ. ఘనుఁడు పరిక్షితుం డనఁ బ్రకాశితుఁ డైన మహీవిభుండు భా
నునిభుఁడు భానువంశ్యుఁడు వినూతనకీర్తి యయోధ్య యేలువాఁ
డనుపముఁ డొక్కనాఁడు మృగయారతుఁడై చరియించెఁ గానన
మ్మున నొకరుండ యిమ్ముల నపూర్వజవోగ్రహయాధిరూఢుఁడై. 318

ప్రతిపదార్థం: ఘనుఁడు= గొప్పవాడు; పరిక్షితుండు+అనన్= పరిక్షితుడు అనేపేరుతో; ప్రకాశితుఁడు+ఐన= వెలుగొందిన; మహీ, విభుండు= భూమికి భర్త అయిన రాజు; భాను, నిభుఁడు= సూర్యుడితో సమానుడైనవాడు; భానువంశ్యుఁడు= సూర్యవంశానికి చెందినవాడు; వినూతనకీర్తి= మిక్కిలి క్రొత్తదైన యశస్సు గల వాడు; అయోధ్య+ఏలువాఁడు= అయోధ్య అనే పట్టణం రాజధానిగా కల రాజ్యం ఏలే వాడు; అనుపముఁడు= సాటిలేని వాడు; ఒక్కనాఁడు= ఒకానొక దినమున; కాననమ్మునన్= అడవిలోపల; ఒకరుండు+అ= ఒంటరిగా; ఇమ్ములన్= ప్రీతితో; అపూర్వజవ+ఉగ్ర, హయ+అధిరూఢుఁడు+ఐ= క్రొంగ్రొత్తదైనది, వేగంచేత భయంకరమైనది అయిన గుర్రాన్ని ఎక్కినవాడై; మృగయా, రతుఁడు+ఐ= వేటలో మిక్కిలితమకం కలవాడై; చరియించెన్= తిరుగాడాడు.

తాత్పర్యం: పూర్వకాలంలో అయోధ్యను పరిపాలించే ప్రభువు, సూర్యుడితో సమానమైన తేజస్సు కలవాడు, సూర్యవంశంలో పుట్టినవాడు, ముందెవ్వరును ఆర్జించనంత యశస్సు నార్జించినవాడు, సాటిలేని పరాక్రమ ప్రాభవాలు కలవాడు అయిన పరిక్షితు డనే మహారాజు ఒకానొకనాడు అడవికి వెళ్ళి, సంప్రీతితో మిక్కిలి వేగంతో పరుగెత్తగల గుర్రాన్ని ఎక్కి వేటయందలి తమకంతో తిరుగాడజొచ్చాడు.

వ. ఇవ్విధంబునం బెక్కుమృగంబుల వధియించుచుఁ గ్రుమ్మరువాఁ డొక్కయెడ. 319

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; పెక్కుమృగంబులన్= అనేకజంతువులను; వధియించుచున్= చంపుతూ; క్రుమ్మరువాఁడు= తిరిగేవాడు; ఒక్క+ఎడన్= ఒకచోటున.

తాత్పర్యం: ఆవిధంగా పెక్కుమృగాలను వేటాడుతూ ఆ అడవిలో ఒకచోట.

ఆ. మదగజాభిరామ మృదులయానం బొప్ప । నల్లఁ బొలయుచును లతాంతరములఁ
గరములీలఁ గమ్మవిరులు గోయుచునున్న । పువ్వుఁబోఁడి నొక్క పొలఁతిఁ గనియె. 320

ప్రతిపదార్థం: మదగజ+అభిరామ, మృదుల, యానంబు+ఒప్పన్= మదించిన ఏనుగువలె అందమైన మృదువైన నడక ఒప్పారగా; అల్లన్= మెల్లమెల్లగా; పొలయుచును= తిరుగాడుతూ; లతా+అంతరములన్= తీగలమధ్య; కరములీలన్= మిక్కుటమైన హొయలుతో; కమ్మవిరులు= అందమైన పూవులు; కోయుచున్+ఉన్న= త్రుంచుతున్న; పువ్వుబోఁడిన్= పరిమళించే పువ్వువంటి మేను కలదానిని; ఒక్కపొలఁతిన్= ఒక స్త్రీని; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: ఆమహారాజు ఒక అందగత్తెను చూచాడు. ఆమె మదించిన ఏనుగునడకవంటి నడక కల సొగసరి. మెల్లమెల్లగా నడయాడుతూ, పువ్వువంటి సుకుమారసుందరమైన దేహం కల ఆ జవరాలు తీగలమధ్యకు చొరబడి, పరిమళపుష్పాలను కోస్తూ తిరుగుతున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కని యంతఁ గదిసి యా కా। మిని యొప్పులఁ జూడ్కి దగుల మీఱిన తమకం
బున ననిమిషలోచనుఁ డై। జననాథుఁడు మదనబాణసంహతిఁ దూలెన్. 321

ప్రతిపదార్థం: కని= చూచి; అంతన్= అంతట; కదిసి= సమీపించి; ఆ, కామిని+ఒప్పులన్= ఆజవ్వనిసొగసులయందు; చూడ్కి= చూపు; తగులన్= తగులుకొనటంవలన; మీఱిన= అతిశయించిన; తమకంబునన్= మోహంతో; అనిమిష, లోచనుఁడు+ఐ= మూతపడని కన్నులు కలవాడై; జననాథుఁడు= రాజు (పరిక్షితుడు); మదన, బాణ, సంహతిన్= మన్మథుడి తూపులతాకిడిచేత; తూలెన్= ఇటునటు చలించెను.

తాత్పర్యం: ఆ ఒప్పులకుప్ప అయిన అందగత్తెను చూచి, ఆ మహారాజు ఆమెదగ్గరకు వెళ్లి, కనురెప్పలు మూయకుండ ఆమెను చూడసాగాడు. అంతట అతడు మన్మథుడి తూపులచేత కొట్టబడి తూలిపోయాడు.

వ. అదియును నతిసుందరం బైన తదీయమూర్తివిభవంబునకు మెచ్చి సాభిప్రాయంబుగా నవలోకించె; నంత నమ్మహీకాంతుం డక్కాంత కి ట్లనియె. 322

ప్రతిపదార్థం: అదియునున్= ఆమెయును; అతిసుందరంబు+ఐన= మిక్కిలి అందమైనట్టి; తదీయ, మూర్తి, విభవంబునకున్= ఆతడియొక్క ఆకారసంపదకు; మెచ్చి= గొప్పగా ఎంచి; స+అభిప్రాయంబుగాన్= (వలపుతో కూడిన) ఆలోచనతో కూడినట్టిదిగా; అవలోకించెన్= చూచింది; అంతన్= పిదప; ఆ+మహీ, కాంతుండు= భూమికిభర్త అయిన ఆ రాజు; ఆ+కాంతకున్= ఆ సౌందర్యవతితో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: తనవైపు వలపుచూపులు సారించిన రాజుగారి సుందరాకృతికి సంతోషించి, ఆ సుందరాంగికూడ ఆతడిపై నర్మగర్భ మైన ఓరచూపులు ప్రసరింపజేసింది. అప్పుడు ఆమహారాజు ఆసౌందర్యవతితో ఇట్లా పలికాడు.

ఉ. 'ఎవ్వరి దాన వంబుజదళేక్షణ! యేకత మిట్టు లేల నీ
వివ్వనభూమియందుఁ జరియించెదు?' నావుడుఁ 'దండ్రిపంపునం
దివ్వనభూమియందుఁ జరియించెద సద్వరుఁ గోరి; కన్య; నే
నెవ్వరిదానఁ గావలయు నేర్పడఁ జెప్పుము రాజనందనా!' 323

ప్రతిపదార్థం: అంబుజ, దళ+ఈక్షణ!= తామరపువ్వురేకులవంటి కన్నులు కలదానా!; ఎవ్వరిదానవు= నీవు ఎవరికి చెందినదానవు; ఏకతము+ఇట్టులు= ఒంటరిగా ఈరీతిగా; ఏల= ఎందుకొరకు; నీవు; ఈ+వనభూమియందున్= ఈ అడవిసీమలో; చరియించెదు= తిరుగాడుతున్నావు? నావుడున్= అని అడుగగా; రాజనందనా!= ఓ రాజకుమారా! తండ్రిపంపునందున్= మానాన్నగారి ఆనతి చొప్పున; ఈ+వనభూమియందున్= ఈ అడవిలో; సత్+వరున్+కోరి= మంచిభర్తను పడయ నెంచి; చరియించెదన్= తిరుగుతున్నదానను; కన్యను= పెండ్లికాని దానను; ఏన్= నేను; ఎవ్వరిదానన్+కావలయున్= నేను ఎవరికి చెందినదానను కావలయునో; ఏర్పడన్+చెప్పుము= (నీవే యోచించి) నిర్ధారణ చేసి తెలుపుము.

తాత్పర్యం: 'పద్మపత్రాలవంటి అందమైన కన్నులు గల ఓచిన్నదానా! నీవు ఎవ్వరిదానవు? ఇక్కడ, ఈ అడవిలో ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు? ' అని ఆ మహారాజు ఆమెను ప్రశ్నించాడు. అంతట ఆమె, 'ఓరాజకుమారా! నేను పెండ్లికాని జవరాలను. తండ్రి ఆనతిచొప్పున ఈ అడవిలో మంచిపెండ్లికొడుకును అన్వేషిస్తూ తిరుగుతున్నాను. ఇప్పుడు ఆలోచించి చెప్పుము. ఇక నేను ఎవ్వరిదానను కావలయునో'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ పద్యంలోని సంభాషణచారిమ గమనించదగింది. 'అంబుజదళేక్షణ' అనే సంబోధనలోని స్వారస్యం సుస్పష్టం. అంతేకాక, రాజుమాటలు నర్మగర్భాలు. ఆమె సమాధానం రాజు చాతుర్యానికి తీసిపోలేదు. 'రాజనందనా' అనే సంబోధనం మాత్రమేకాక - 'ఏను కన్యను, సద్వరుఁ గోరి ఈ అడవిలో గ్రుమ్మరుచుంటిని - నేను ఎవ్వరి దానఁ గావలయును - ఏర్పడఁజెప్పుము' అనే మాటలోని సద్యఃస్ఫూర్తి స్వారస్యం గమనించతగింది. ఈ పద్యం ప్రబంధకవులకు ఒజ్జబంతి అయింది. మనుచరిత్రలో పెద్దన వ్రాసిన సుప్రసిద్ధపద్యం - 'ఎవ్వతె వీవు భీతహరిణేక్షణ! యొంటిఁ జరించె దోట లే కివ్వనభూమి' - అనేది - ద్విరుక్తవకార ప్రాసతో భాషలోను, భావంలోను, ఛందస్సులోను ఎఱ్ఱనపద్యానికి మనోహరమైన ప్రతికృతి అని చెప్పవచ్చును. ఎఱ్ఱనమహాకవి కూడ ఈ పద్యం తదుపరి వ్రాసిన వచనంలో 'దాని ప్రగల్భవచనంబులకు' అని ఈ పద్యంలోని సంభాషణచారిమను సూచించాడు.

వ. అనిన దానిప్రగల్భవచనంబులకు నధికవిలోలుం డై భూపాలుండు దనయభిలాషం బెఱింగించిన నమ్మగువ 'నన్నెన్నండును జలవిహారంబునకుఁ జొనుపకుండు నది; యట్లయిన నిన్ను వరియించెద' ననిన వాఁడును దత్సమయంబున కొడంబడి దానిం దోడ్కొని పురంబునకుఁ జనుదెంచి యిష్టసుఖతత్పరుం డయి యుండె; నంత నొక్క శరత్సమయంబునందు. 324

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; దాని= ఆమెయొక్క; ప్రగల్భ, వచనంబులకున్= తెలివితేటలతో కూడిఉన్న మాటలకు; అధిక, విలోలుండు+ఐ= ఎక్కువగా చలించినవాడై; భూపాలుండు= రాజు (ఆ పరిక్షితుడు); తన+అభిలాషంబు= తనకోరిక; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+మగువ= ఆవనిత; నన్నున్+ఎన్నండును= నన్ను, ఎప్పుడుకూడా; జల, విహారంబునకున్= నీటిలో విహరించటానికి; చొనుపక+ఉండునది= నియమించకుండ ఉండవలె; అట్లు+అయినన్= ఆవిధంగా అయితే; నిన్నున్; వరియించెదన్= (వలపుతో) ఎన్నుకొంటాను; అనినన్= అని చెప్పగా; వాఁడును= (ఆపరిక్షితుడును); తద్+సమయంబునకున్= ఆమె పెట్టిన ఒప్పందానికి; ఒడంబడి= అంగీకరించి; దానిన్= ఆమెను; తోడ్కొని= వెంటనిడుకొని; పురంబునకున్= (రాజధాని) పట్టణానికి; చనుదెంచి= వెళ్ళి; ఇష్ట, సుఖ, తత్+పరుండు+అయి+ఉండెన్= తనకు నచ్చిన సౌఖ్యాలను అనుభవించటంలో ఏకాగ్రత కలవాడై, ఉన్నాడు; అంతన్= అటుపిమ్మట; ఒక్క= ఒక; శరద్సమయంబునందున్= శరదృతువులో.

తాత్పర్యం: రాజు ఆమెసమాధానవచనాలలోని తెలివితేటలు గుర్తించాడు. అంతకుముందే ఆరాజు ఆమె రూపసౌందర్యానికి ముగ్ధుడైనాడు. ఇప్పుడు ఆమె వాక్చాతుర్యంవలన, మరింత ముగ్ధుడయ్యాడు. ఇంక అతడు ఆమెకు తనవలపు తలపు వెల్లడించాడు. ఆమె తన సమ్మతి తెలుపుతూ ఒక ఒడంబడిక సూచించింది - ఆతడు తనను ఎప్పుడూ జలవిహారానికి నియోగించరాదని. ఆతడు ఆ ఏర్పాటుకు అంగీకరించి ఆమెను తనతోపాటు వెంటబెట్టుకొని తనరాజధాని నగరానికి చేరాడు. అతడు అటు కొంతకాలం తాను కోరిన సుఖాలను అనుభవిస్తుండగా శరదృతువు వచ్చింది.

విశేషం: ఇట - 'అధికవిలోలుండై' అనే ప్రయోగంలోని స్వారస్యం గమనించదగింది. రాజు తొలుదొల్త ఆమె స్వరూపసౌందర్యానికి - 'విలోలుడు'. తదుపరి ఆమె 'ప్రగల్భవచనాలకు' ఇప్పుడు - 'అధిక' విలోలుడు.

చ. అతులితపుష్పపల్లవ ఫలాన్వితభూరుహభూరివల్లరీ
వితతముఁ జారుకైరవనవీనసరోరుహషండమండలా
యతసరసీమనోహరము నైన పురోపవనంబునన్ సము
న్నతవిభవుండు వాసభవనంబు లొనర్పఁగఁ బంచి యిమ్ములన్. 325

ప్రతిపదార్థం: అతులిత, పుష్ప, పల్లవ, ఫల+అన్విత, భూరుహ, భూరి, వల్లరీ, వితతమున్= సాటి లేని పువ్వులు, చిగురుటాకులు, పండ్లతో కూడిన చెట్లయొక్కయు, గొప్పతీగెలయొక్కయు సముదాయాలు కలిగినదిన్నీ; చారు, కైరవ, నవీన, సరోరుహ, షండ, మండల+ఆయత, సరసీ, మనస్+హరమును= సుందరమైన తెల్లకలువల, క్రొంగ్రొత్తపద్మాలగుంపుల గుండ్రని ఆవరణలుకల నిడువైన సరస్సులచేత మనస్సును హరించేది; ఐన=ఐనట్టి; పుర+ఉపవనంబునన్= నగరమందలి= ఉద్యానవనంలో; ఇమ్ములన్= ప్రీతితో; సమ్+ఉన్నత, విభవుండు= మిక్కిలి ఎత్తయిన సంపద కలవాడు - ఆ మహారాజు; వాసభవనంబులు= ఉండటానికి అనువైన మందిరాలు; ఒనర్పఁగన్= నిర్మించటానికి; పంచి= ఆజ్ఞాపించి.

తాత్పర్యం: ఆ పరిక్షితమహారాజు ప్రీతితో తనరాజధానిలోని ఉద్యానవనంలో క్రీడించటానికి అనువైన భవనాలను నిర్మించటానికి ఆజ్ఞాపించాడు. ఆ ఉద్యానవనం మిక్కిలి సుందరమైనది. అందులో సాటిలేని పుష్పాలతో చిగురుటాకులతో విలసిల్లే గొప్పచెట్లు, లతలు ఉన్నాయి. ఆ ఉద్యానవనంలోని సరస్సులు, గొప్పవైశాల్యం కలవి. అందులో తెల్లకలువలు, పద్మసంతతులు మనోహరాలై వికసిస్తూ ఉంటాయి.

విశేషం: నన్నయ వృత్తాలు సుకుమారసుందర సంస్కృత సమాసాలతో - 'అక్షర రమ్యత' తొలుకాడుతూ ఉంటాయి. ఈపద్యం వ్రాసినది ఎఱ్ఱనమహాకవి అయినను, ఇందు నన్నయ శయ్య గుబాళిస్తున్నది. ఎఱ్ఱనయే తాను 'తద్రచనయకా' నన్నయను అనుకరించినట్లు ఆరణ్యపర్వం చివర ప్రకటించాడు కదా!

క. **దేవీసహితంబుగఁ బృ । థ్వీవరుఁ డవ్వనమునందు విహరించె ఘనాం**
తావసరవాసరంబుల । భావితపద్మవనపవనపరిచితుఁ డగుచున్. **326**

ప్రతిపదార్థం: దేవీ, సహితంబుగన్= భార్యతోపాటుగా; పృథ్వీ; వరుఁడు= రాజు (పరిక్షితుడు); ఆ+వనమునందున్= ఆ అడవిలో; ఘన+అంత+అవసరవాసరంబులన్= వర్షాకాలం పూర్తిఅయిన పిమ్మట వచ్చే శరదృతువులోని రోజులలో; భావిత, పద్మవన, పవన, పరిచితుఁడు+అగుచున్= తామరపూవులతోటనుండి వెలువడే గాలియొక్క పరిమళంతో నెయ్యంకలవాడై; విహరించెన్= ప్రీతితో తిరుగాడాడు.

తాత్పర్యం: ఆ పరిక్షిన్మహారాజు ఆ శరదృతువులోని దినాలలో తామరపువ్వులతోటలనుండి ప్రసరించే పరిమళంతో కూడిన గాలులు పీలుస్తూ, తనదేవేరితో కలిసి ఆ అడవిలో విహరించాడు.

వ. **అంత నొక్కనాఁడు నితాంతఘర్మజలకణకలితశరీరుండై ప్రియాసమేతంబుగా వాసగృహంబు వెలువడి తత్సమీపంబున నతిమనోహరం బయిన కమలాకరంబుఁ గని దాని తీరంబున నయ్యుగ్మలి నునిచి తాను గృతావగాహుం డై.** **327**

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట; ఒక్కనాఁడు= ఒకానొక దినమున; నితాంత, ఘర్మజల, కణ, కలిత, శరీరుండు+ఐ= ఎడతెగని చెమ్మటనీటి బొట్టులచేత కూడిన మేను కలవాడై; ప్రియా సమేతంబుగాన్= వలపుగత్తెతో పాటుగా; వాస, గృహంబు= నివసించే ఇల్లు; వెలువడి= బయటకు వచ్చి; తత్+సమీపంబునన్= ఆచోటికి దగ్గరగా ఉన్న; అతి, మనస్+హరంబు+ఐన= మిక్కిలి సుందరమైన (మనస్సును మిక్కుటంగా ఆకర్షించే దైన); కమల+ఆకరంబున్= సరస్సును; కని= చూచి, దాని, తీరంబునన్= దాని (ఆకొలనియొక్క) ఒడ్డున; ఆ+ఉగ్మలిన్= ఆ పొలతిని; ఉనిచి= ఉంచి; తాను= (ఆ పరిక్షితుడు); కృత+అవగాహుండు+ఐ= నీటిలోకి దిగినవాడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అంతట, ఒకానొక దినమున ఆ పరిక్షిన్మహారాజు చెమటబిందువులచేత తడిసిన దేహం కలవాడై ప్రియురాలితోపాటు తనవిడిదిఇల్లును వెలువడివచ్చి, ఎదుట మనోహరమైన ఒక కొలనును, తామరపువ్వులతో కళకళలాడుతున్న దానిని చూచాడు. అతడు తనప్రేయసిని ఆకొలనుగట్టున ఉంచి, తాను ఆ నీటిలోకి దిగాడు.

క. 'మే లై యున్నది జలము వి। శాలనయన! చెమట వోవఁ జయ్యన దేహ
క్షాళన మొనరింపు' మనిన। నా లేమ దరస్మితాననాంబుజ యగుచున్. 328

ప్రతిపదార్థం: విశాలనయన!= నిడివిఅయిన కన్నులు కలదానా!; జలము= నీరు; మేలు+ఐ+ఉన్నది= చాల బాగా ఉన్నది; చెమట+పోవన్= స్వేదజలం పోయేటట్లుగా; చయ్యన= వేగంగా; దేహ, క్షాళనము= మేను కడుగుకొనటం, స్నానం చేయటం; ఒనరింపుము= చేయుము; అనినన్= అని చెప్పగా; ఆ, లేమ= ఆ వనిత; దరస్మిత+ఆనన+అంబుజ+అగుచున్= చిరునవ్వుతో కూడిన ముఖపద్మం కలదై.

తాత్పర్యం: 'నిడివిఅయిన కన్నులు గల ఓచిన్నదానా! ఈ సరోవరంలోని నీరు మిక్కిలి నిర్మలంగా ఉన్నది. నీవుకూడా, నీశరీరంలోని చెమట పోగొట్టుకొనటానికై సంప్రీతితో రివ్వున ఈ కొలనులో దిగి స్నానం చేయుము' అని ఆ రాజు చెప్పగా విని ఆమె తనముఖపద్మంలో చిరునవ్వు వెల్లివిరిసేటట్లుగా. (తరువాతిపద్యంతో అన్వయం)

ఆ. మడుఁగు సొచ్చి మునిఁగి మాయ మై పోయిన। నద్భుతాత్ముఁ డగుచు నవనివిభుఁడు
మడుఁగు గలయ వెదకి మానినిఁ గానక। జలము లెల్ల వెడలఁ జల్లె గడఁగి. 329

ప్రతిపదార్థం: మడుఁగు+చొచ్చి= సరోవరంలోకి ప్రవేశించి; మునిఁగి= నీటిలో అణగి; మాయము+ఐ+పోయినన్= కనుపించకుండ అంతర్ధానమై పోగా; అవని విభుఁడు= భూమికి భర్తఐనరాజు; అద్భుత+ఆత్ముఁడు+అగుచున్= అచ్చెరువుతో నిండిన ఆత్మకలవాడు ఔతూ; మడుఁగు= కొలను; కలయవెదకి= పూర్తిగా గాలించి; మానినిన్= మగువను; కానక= అరయక; కడఁగి= పూని; జలములు+ఎల్లన్= నీళ్ళుఅంతటిని; వెడలన్+చల్లెన్= బయటకు పోయేటట్లు చిమ్మివేశాడు.

తాత్పర్యం: ఆసరోవరంలోకి ప్రవేశించి ఆమె అదృశ్యమయిపోయింది. అంతట రాజు మిక్కుట మైన ఆశ్చర్యం పొంది, ఆకొలను అంతటిని గాలించాడు. ఎంత వెదకినా ఆమె కన్పించలేదు. అందుచేత ఆ రాజు ఆ కొలనిలోని నీటి నంతటిని వెలికి చిమ్మివేశాడు.

వ. ఇట్లు సల్లి యందు మండూకంబు లనేకంబు లున్నం జూచి 'యివి మత్ప్రియాంగనను మ్రింగినవి గా కేమి' యని కలుషించి యనుచరులం బిలిచి 'నాకుఁబ్రియంబు సేయవలసినవారు గలిగినం బుడమిం గల కప్పల నెల్లం బొడవడంగించునది' యని పంచిన నలుదిక్కులకుం జని తదీయ కింకరవర్గంబు. 330

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా, చల్లి= (నీటిని) విరజిమ్మి; అందున్= (ఆకొలనునందు); మండూకంబులు= కప్పలు; అనేకంబులు= పెక్కు; ఉన్నన్+చూచి= ఉండటం తిలకించి; ఇవి= (ఈ కప్పలు); మత్+ప్రియా+అంగనను= నాయొక్క వలపుకత్తెను; మ్రింగినవి= భక్షించినవి; కాక+ఏమి= ఇదికాక ఇంక వేరుగా ఏమి జరిగిఉంటుంది?; అని= అని; కలుషించి= కోపంచెంది; అనుచరులన్+పిలిచి= సేవకులను రావించి; నాకున్= నాకు; ప్రియంబు+చేయవలసినవారు= ప్రీతిని ఘటించవలసినవారు; కలిగినన్= ఉన్నచో; పుడమిన్+కల= భూమిపై ఉన్నట్టి; కప్పలన్+ఎల్లన్= కప్పలను అన్నింటిని; పొడవు+అడంగించునది= చంపేది; అని; పంచినన్= ఆజ్ఞాపించగా; తదీయ కింకరవర్గంబు= ఆతడి సేవకుల సమూహం; నలుదిక్కులకున్+చని= నాలుగు వైపులకు వెళ్ళి.

తాత్పర్యం: ఈవిధంగా ఆ కొలనులోని నీటినంతా బయటికి చిమ్మి. అందులో పెక్కు కప్పలు ఉండటం రాజు చూచాడు. అతడు ఆ కప్పలే తన ప్రేయసిని మ్రింగాయని తలపోసి, తనసేవకులను పిలిచి ఈ విధంగా ఆజ్ఞాపించాడు; 'నాకు ప్రీతి ఘటించవలె నని తలపు మీకు ఉన్నట్లయితే ఈ భూలోకంలో ఉన్న కప్పల నన్నిటిని సంహరించండి'. అంత ఆరాజభటులు నలుదిక్కులకు వెళ్ళారు.

చ. **కొలఁకుల వాగులన్ నదులఁ గ్రోవుల బావుల నిర్ఘ రంబులం**
గలయఁగ రోసి రోసి వడిఁ గప్పలఁ గుప్పలుగా వధించుచో
నలుగుల మందు భేకనివహంబు గనుంగొని భేకనాయకుం
డలఘుతపస్విరూపమున నా నృపుపాలికి వచ్చి యిట్లనున్. **331**

ప్రతిపదార్థం: కొలఁకులన్= మడుగులను; వాగులన్= చిన్నఏరులను; నదులన్= పెద్దఏరులను; క్రోవులను= నీళ్ళు పారే ప్రదేశాలను; బావులన్= నూతులను; నిర్ఘరంబులన్= సెలయేఱులను; కలయఁగన్= పూర్తిగా; రోసి, రోసి= వెదకి వెదకి; వడిన్= వేగంగా; కప్పలన్= కప్పలను; కుప్పలుగాన్= మేటలు పడేటట్లుగా; వధించుచోన్= సంహరించటంచేత; అలుగులము+ అందు= వెతచెందే; భేక, నివహంబు= కప్పలసముదాయాన్ని; కనుంగొని= చూచి; భేక, నాయకుండు= కప్పల అధినేత; అలఘుతపస్విరూపమునన్= గొప్పఋషి ఆకారంతో; ఆ నృపుపాలికిన్= ఆ రాజు దగ్గరకు; వచ్చి= ఏగుదెంచి; ఇట్లు+అనున్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ రాజభటులు నీరుండే తావులు అన్నిటిని-చెరువులు, మడువులు, సెలయేరులు, వాగులు, నదులు, వాననీరు పోవటానికై త్రవ్విన కాలువలు అన్నిటిని వెదకి వెదకి కప్పలను చంపసాగారు. అంతట ఆకులత చెందిన కప్పలను చూచి, కప్పలనాయకుడు ఒక మహర్షిరూపం ధరించి రాజుకడకు అరుదెంచి, ఈవిధంగా అన్నాడు.

ఉ. **'అక్కట! లోకమెల్ల నగ నాఱడి కప్పలఁ జంప నేల ? యిం**
దెక్కడి పెంపు గల్గుఁ బృథివీశ్వర! కోపము డింపు; కప్పలం
జక్కని చూడ్కిఁ జూడు; మిది చాల నధర్మము' నావుడున్ విభుం
'డెక్కడి మాట? నాసతికి నెగ్గొనరించెఁ గడంగి భేకముల్.' **332**

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; లోకము+ఎల్లన్= లోకంలోని జనులందరూ; నగన్= నవ్వగా; ఆఱడి= వ్యర్థంగా; కప్పలన్= కప్పలను, చంపన్+ఏల= వధించటం ఎందుకు?; ఇందున్= (ఈవిధంగా సంహరించేపనిలో); ఎక్కడి పెంపు+కల్గున్= ఎక్కడినుండి గొప్పతనం లభిస్తుంది?; పృథివీ+ఈశ్వర!= భూమికి అధిపతి వైన ఓమహారాజా!; కోపమున్= ఆగ్రహాన్ని; డింపు= క్రిందకు నెట్టుము అనగా తగ్గించుకొనుము; కప్పలన్= కప్పలను; చక్కని, చూడ్కిన్+చూడుము= మంచి చూపులతో చూడుము; ఇది= (ఈవిధంగా కప్పలను చంపటం); చాలన్+అధర్మము= మిక్కిలి అన్యాయం; నావుడున్= అని చెప్పగా; విభుండు= రాజు; ఎక్కడిమాట= ఏ తీరుతెన్ను కల పలుకు?; నాసతికిన్= నా భార్యకు; భేకముల్= కప్పలు; కడంగి= పూని; ఎగ్గు= కీడు; ఒనరించెన్= చేశాయి.

తాత్పర్యం: 'ఇది ఎంత ఆశ్చర్యం! మహారాజా! నీవు ఆలోచించావా? కప్పలను ఈవిధంగా సంహరించటం అన్యాయం. లోకమంతా ఈ నికృష్టచర్యను చూచి నవ్వుతున్నది సుమా! దీనివలన నీకు ఏవిధమైన గొప్పదనం కూడా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాదు కదా! మహారాజా! నీఆగ్రహాన్ని తగ్గించుకొనుము. కప్పలపై జాలిచూపు సారించుము' అని మహర్షిరూపంలో ఉన్న భేకనాయకుడు అడిగాడు. అంతట రాజు 'ఏమయ్యా! నీవు ఈవిధంగా తగవు చెప్పుతున్నావు; ఈకప్పలు నా ప్రేయసికి కీడు చేశాయి కాబట్టే నేను కసిదీర్చుకొంటున్నాను. ఇది న్యాయమే' అని సమాధానమిచ్చాడు.

క. 'నా యిష్టవనిత మ్రింగిన । మాయపుఁబుర్వు లివి వీని మడియింతు మునీం
ద్రా! యుడుగుము నీ' వనుటయు । నాయన యత్యంతదుఃఖితాత్ముం డగుచున్. 333

ప్రతిపదార్థం: నా+ఇష్టవనితన్= నాకు ప్రీతికరమైన వనితను, నాప్రేయసిని; మ్రింగిన= భక్షించిన; మాయపున్+పుర్వులు+ఇవి= దొంగ కీటకాలు ఇవి; వీనిన్= వీటిని; మడియింతున్= చంపుతాను; ముని+ఇంద్రా!= మునులలో శ్రేష్ఠుడా!; ఉడుగుము= మానుము; నీవు; అనుటయున్= అనిచెప్పుటయున్నూ; ఆయన= (ఆముని); అతి+అంత, దుఃఖిత+ఆత్ముండు+ అగుచున్= మిక్కిలి వెతచెందిన ఆత్మ కలవాడు ఔతూ.

తాత్పర్యం: 'నా ప్రేయసిని మ్రింగిన దొంగ పురుగులు ఈ కప్పలు; వీటిని సంహరిస్తాను. ఓమునీంద్రా! నీప్రయత్నాన్ని ఇంక విరమించుము' అని ఆ రాజు సమాధానం చెప్పాడు. రాజు మాటలు వినిన ఆ మునివరేణ్యుడు మిక్కుటంగా వెత చెందాడు.

వ. 'ఏను మండూకనాయకుఁడ; నాయు వనువాఁడ; నమ్మగువ నా కూతురు సుశోభన యనునది; దానిచేత ననేకులుబేలువడిరి; నీవెంతవాఁడ?' వనిన నప్పరిక్షితుం 'డట్లేని నాకు నమ్మెలఁతుకఁదెచ్చి యొప్పింపవలయు' నని ప్రార్థించిన నతండు నవ్వుచు నవ్వామనయనం దలంపున రావించి యారాజునకు నిచ్చి, దానిం జూచి కోపించి 'నీవు గడుం జెట్టవు; ప్రసిద్ధు లగు రాజులం బెక్కండ్రం జిక్కులం బెట్టితివి గావున నీకుం బుట్టెడు కొడుకులు కపటవర్తను లయ్యెడు' మని కూఁతు శపియించి, మండూకరాజు నిజేచ్ఛం జనియెఁ; బరిక్షితుండును సంప్రాప్తమనోరథుండయి సుశోభనయందుఁగ్రమంబున శలుండును నలుండును వలుండును నను ముర్వురు గొడుకులం బడసి, యం దగ్రజుండయిన శలు నభిషిక్తుం జేసి తపోవనంబున కరిగె; నంత. 334

ప్రతిపదార్థం: ఏను= నేను; మండూక, నాయకుఁడన్= కప్పలకు రాజును; ఆయువు అనువాఁడన్= ఆయువు అనే పేరుగలవాడను; ఆ+మగువ= ఆ వనిత; నా, కూఁతురు= నా పుత్రిక; సుశోభన+అను+అది= సుశోభన అనే పేరు కలది; దానిచేతన్= ఆమెచేత; అనేకులు= పెక్కుమంది; బేలు+పడిరి= మోసపోయారు; నీవు+ఎంతవాఁడవు= నీవు ఏమాత్రపువాడివి? (అనగా ఆ అందరి కంటె నీవు ఏమాత్రం తెలివికలవాడవు కావు అని భావం); అనినన్= అని చెప్పగా; ఆ+పరిక్షితుండు; అట్లు+ఏనిన్= ఆవిధం నిజమే అయితే; నాకున్= నాకు, ఆ మెలఁతుకన్= ఆ పొలతిని; తెచ్చి= తీసికొనివచ్చి; ఒప్పింపవలయున్= సమ్మతింపచేయవలెను; అని, ప్రార్థించినన్= వేడికొనగా; అతండు= (ఆ కప్పలదొర); నవ్వుచున్= నవ్వుతూ; ఆ+వామనయనన్= ఆ అందమైన కన్నులు కలదానిని; తలంపునన్= స్మరణమాత్రం చేతనే; రావించి= వచ్చేటట్లుచేసి; ఆరాజునకున్= ఆప్రభువుకు; ఇచ్చి= ఆమెను ఇచ్చి; దానిన్+చూచి= ఆమెను చూచి; కోపించి= ఆగ్రహం చెంది; నీవు; కడున్+చెట్టవు= మిక్కిలి చెడ్డదానవు; ప్రసిద్ధులు+అగు= పేరుకెక్కిన; రాజులన్= ప్రభువులను; పెక్కండ్రన్= పలువురను; చిక్కులన్+పెట్టితివి= కష్టాల పాలు చేశావు; కావునన్= కాబట్టి; నీకున్+పుట్టెడు, కొడుకులు= నీకు పుట్టే పుత్రులు; కపట, వర్తనులు+అయ్యెడున్= మోసంతో నిండిన ప్రవర్తన కలవారు ఔతారు; అని; కూఁతున్= పుత్రికను; శపియించి= శాపం పెట్టి; మండూకరాజు= కప్పలదొర;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిజ+ఇచ్ఛన్= తన కోరిక ప్రకారం; చనియెన్= వెళ్ళాడు; పరిక్షితుండును= పరిక్షితుడు అనే ఆ రాజున్నూ; సంప్రాప్త మనోరథుండు+ఐ= ఒడగూడిన కోరిక కలవాడై; సుశోభనఅందున్= సుశోభన అనే దేవియందు; క్రమంబునన్= వరుసగా; శలుండును; నలుండును; వలుండును; అను= అనే పేర్లుకల; మువ్వురు, కొడుకులన్= ముగ్గురుపుత్రులను; పడసి= పొంది; అందున్= (ఆకొడుకులలో); అగ్రజుండు+అయిన= మొదట పుట్టిన వా డయిన; శలున్= శలుడిని; అభిషిక్తున్+చేసి= రాజ్యం ఏలుటకు పట్టం కట్టి; తపస్+వనంబునకున్= తపస్సుచేసికొనే అడవికి; అరిగెన్= వెళ్ళాడు; అంతన్= పిమ్మట.

తాత్పర్యం: 'ఓమహారాజా! నేను ఋషివరేణ్యుడను కాను. నేను కప్పలదొరను. నాపేరు ఆయువు. నీప్రేయసి నాకూతురే. ఆమె ఎందరినో మోసగించింది. నీవు ఆమెకు ఒక లెక్కా? నీవు మంచివాడవుగా కనిపిస్తున్నావు' అని అతడు అన్నాడు. అంతట ఆ రాజు 'అయితే దయచేసి నీవు నాప్రేయసిని రప్పించి నా కప్పగించు' అని ప్రార్థించాడు. ఆ కప్పలదొర స్మరణమాత్రంచేతనే తన కూతురును అక్కడ ప్రత్యక్షం కావించి, ఆమెతో ఇట్లా చెప్పాడు- 'నీవు మిక్కిలి చెడ్డదానవు. నీవు పలువురు రాజులను లోగడ ఇట్లే మోసగించి ఉన్నావు. నిన్ను శపిస్తున్నాను. నీకు పుట్టే కొడుకులు మోసగాండ్రు అయ్యెదరుగాక'. పిదప కప్పలదొర తనకు తోచిన చోటికి వెళ్ళిపోయాడు. అంత పరిక్షిన్మహారాజు ఈడేరిన కోరికగల వాడై ఆ సుశోభనయందు శలుడు, నలుడు, వలుడు అనే ముగ్గురు కొడుకులను పడసి, వారిలో పెద్దవాడయిన శలుడికి పట్టంకట్టి తాను తపోవనానికి పోయాడు.

క. శలుఁ డొక్కనాఁడు కనకో। జ్జ్వల మగు రథ మెక్కి వేఁట సని పెక్కుమృగం
బులఁ జంపఁగ నొక్క మృగం। బలఘుతరశరాగ్రవిద్ధమై వెసఁ బఱచెన్. 335

ప్రతిపదార్థం: శలుఁడు= (శలు డనే ఆ రాజకుమారుడు); ఒక్కనాఁడు= ఒకానొక దినమున; కనక+ఉజ్జ్వలము+అగు= బంగారంవలె ధగధగ వెలుగొందుతున్న; రథమున్= తేరును; ఎక్కి; వేఁట+చని= వేటకై వెళ్ళి; పెక్కు మృగంబులన్= పలుజంతువులను; చంపఁగన్= సంహరించగా; ఒక్క, మృగంబు= ఒక జంతువు; అలఘు, తర, శర+అగ్ర, విద్ధము+ఐ= మిక్కిలి గొప్పదైన బాణపు చివరిభాగంచేత కొట్టబడినదై; వెసన్= శీఘ్రంగా; పఱచెన్= పారిపోయింది.

తాత్పర్యం: రాజకుమారు డైన శలుడు ఒకానొక దినం బంగారుకాంతులతో వెలుగొందే తేరు నెక్కి అడవికి వేటకు పోయాడు. అతడు వేటాడి ఎన్నో జంతువులను సంహరించాడు. అందులో ఒకజంతువు మిక్కిలి వాడియైన బాణం గ్రుచ్చుకొనికూడ, తప్పించుకొని పారిపోయింది.

ఆ. ఇట్లు పఱచుటయును నెంతయు రయమున। నమ్మృగంబువెనుక నరిగి యరిగి
యెయిద లేక ధారుణీశుండు సారథిఁ। బదరి 'తేరు వేగ పఱపు' మనియె. 336

ప్రతిపదార్థం: ఇట్లు= ఈరీతిగా; పఱచుటయునున్= (మృగం) పారిపోవటంతో; ఎంతయున్= ఎంతయో (మిక్కిలి); రయమునన్= వేగంతో; ఆ+మృగంబు, వెనుకన్= ఆ జంతువు వెనుక; అరిగి+అరిగి= వెళ్ళి, వెళ్ళి; ఎయిద లేక= వెంబడించనేరక; ధారుణీ+ఈశుండు= భూమికి భర్త ఐన రాజు (శలుండు); సారథిన్= తేరు తోలేవాడిని; పదరి= కోపించి; తేరు= రథం; వేగ= రయంగా; పఱపుము+అనియెన్= నడపుము అని ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: దెబ్బతిన్నమృగం తప్పించుకొని పారిపోవటంచేత మిక్కిలి వేగంగా ఆ శలుడు తన తేరు పోనిచ్చాడు. కాని, ఆతడు ఆ మృగాన్ని తరమటంలో వెనుకపడిపోయాడు. అందుచేత ఆతడు తన సారథిని కోపంతో హెచ్చరించి 'రథాన్ని మరింత వేగంగా పోని'మ్మని ఆజ్ఞాపించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **అనవుడు సూతుఁ డిట్లను 'దేవ! మన మెంత । దఱిమిన మృగము దద్దయు జవంబు**
గలదు; రథ్యంబులు గడుకొని కూడంగఁ । జాలవు; వలవని జాలి యేల?
మన తేరిహరులు వామ్యము లైన నమ్మృగ । మగపడు; లేకున్న నలవి గాదు'
నా విని' వామ్యముల్ నాఁగ నెవ్వని హయం । బులు సెప్పు' మనియె నబ్భూవిభుండు;

తే. **వామదేవమహామునివరుని హరులు । వామ్యములు నాఁగఁ జను' నని వాఁడు సెప్పె;**
'నతని యాశ్రమ మెచ్చట? నచటి కిపుడ । తేరు వోవ ని' మ్మనియె ధాత్రీవిభుండు. 337

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; సూతుఁడు= రథసారథి; ఇట్లు+అనున్= ఈవిధంగా అన్నాడు; దేవ!= ఓప్రభూ!; మనము+ఎంత+తఱిమినన్= మనం ఎంతగా ముందుకు పరుగెత్తటానికి హెచ్చరించినప్పటికినీ; మృగము= జంతువు (లేడి); తద్దయున్= మిక్కిలిగా; జవంబు+కలదు= శక్తికలదు; రథ్యంబులు= గుఱ్ఱాలు; కడుకొని= ఉత్సహించి; కూడంగన్+చాలవు= (ఆ మృగాన్ని) చేరలేవు; వలవని= సాధ్యంకాని దానికై పడే; జాలి+ఏల= వేదన ఎందుకు?; మనతేరిహరులు= మన రథానికి పూన్చిన గుఱ్ఱాలు; వామ్యములు+అయినన్= సవ్యజాతికి చెందినవి అయితే; ఆ+మృగము= ఆ జంతువు; అగపడున్= కన్పిస్తుంది; లేక+ఉన్నన్= లేకపోతే; అలవికాదు= సాధ్యంకాదు; నాన్+విని= అనగా విని; వామ్యముల్= సవ్యజాతికి చెందినవి; నాఁగన్= అనగా; ఎవ్వని, హయంబులు= ఎవడికి చెందిన గుఱ్ఱాలు; చెప్పుము= వచింపుమని; ఆ+భూవిభుండు= ఆరాజు; అనియెన్= అన్నాడు; వామదేవ, మహామునివరుని, హయములు= వామదేవుడు అనే పేరుకల మహర్షిశ్రేష్ఠుడియొక్క గుఱ్ఱాలు; వామ్యములు= సవ్యజాతికి చెందినవి; నాఁగన్= అనగా; చనును= చెల్లుతాయి; అని; వాఁడు= (రథసారథి); చెప్పెన్= చెప్పాడు; ధాత్రీవిభుండు= భూమికి భర్త అయిన రాజు; అతని+ఆశ్రమము= (ఆ వామదేవుడియొక్క ఆశ్రమం); ఎచ్చటన్= ఎచట ఉన్నదో; అచటికిన్= ఆ స్థలానికి; ఇపుడు+అ= ఇప్పుడే; తేరు= రథం; పోవనిమ్ము+అనియెన్= పోయేటట్లుగా చేయుము (అనగా తోలుము అని భావం).

తాత్పర్యం: ఆవిధంగా రాజుగారు ఆజ్ఞాపించగా, రథసారథి ఇట్లా చెప్పాడు: 'ప్రభూ! మనం రథాన్ని ఎంత వేగంగా తోలినప్పటికి ఆమృగాన్ని చేరలేం; ఆమృగం మిక్కిలిశక్తిమంతమై వేగంగా పరుగెత్తగలిగింది; మనగుఱ్ఱాలు అంతవడిగా పరుగెత్తలేవు; సాధ్యంకాని దానికై ఈ మనోవేదన ఎందుకు? మన తేరిగుఱ్ఱాలు 'వామ్య' జాతికి చెందిన వైతే ఆమృగం వశమౌతుంది.' అంత ఆ రాజు 'వామ్య'జాతికి చెందిన అశ్వాలు ఎచ్చట ఉన్నాయి? అవి ఎవరివి?' అని ప్రశ్నించాడు. 'వామ్యహయాలు వామదేవుడు అనే మహర్షి దగ్గర ఉన్నాయి' అని సారథి సమాధానం చెప్పాడు. రాజు తత్క్షణమే రథాన్ని వామదేవమహర్షి ఆశ్రమానికి పోనిమ్మని ఆజ్ఞాపించాడు.

విశేషం: 'వలవని జాలియేల?' - అనే పాఠానికి 'వలవని జోలి యేల' - అనే పాఠాంతరం ఉన్నది.

వ. **వాఁడును రథంబు సత్వరంబుగా వామదేవునాశ్రమంబునకుం బఱపినం జని, యాతం డాతపోనిధిం గని నమస్కరించి, 'మునీంద్రా! నాచేత నేటువడి యొక్కమృగంబు రయంబునం బఱచె; నమ్మృగంబు వధియింపవలయు; భవదీయహయంబుల నీవలయు' ననిన నతండు' నీవు కృతకార్యుండవై మా హయంబులం దడయక యొప్పింపవలయు, నట్లేనిం గొనిపొ' మ్మనిన వల్లె యని వామ్యంబులం గొని రథయుక్తంబులం గావించి తదీయజవంబునకు మెచ్చుచు ముహూర్తమాత్రంబునఁ గూడముట్టి మృగంబు సమయించి మగిడి నిజపురంబునకు వచ్చి.** 338

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వాఁడును= (ఆ రథసారథియును); రథంబున్= తేరును; సత్వరంబుగాన్= వేగంగా; వామదేవు+ఆశ్రమంబునకున్= వామదేవుడియొక్క తోటవిడిదికి; పఱపినన్= తోలుకొనిపోనివ్వగా; చని= వెళ్లి; అతండు= (ఆ పరిక్షితుడు); ఆతపస్+నిధిన్= తపస్సునకు నెలవు అయిన వాడిని; కని= చూచి; నమస్కరించి= వందనంచేసి; ముని+ఇంద్రా!= మునులలో ఇంద్రుడివంటివాడా!; నాచేతన్, ఏటు, పడి= నాచేత దెబ్బతిని; ఒక్క, మృగంబు= ఒకజంతువు; రయంబునన్= వేగంగా; పఱచెన్= పారిపోయింది; ఆ+మృగంబున్= ఆజంతువును; వధియింపన్వలయున్= చంపాలి; భవదీయహయంబులన్= నీయొక్కగుర్రాలను; ఈఁవలయున్= ఇవ్వాలి; అనినన్= అని అడుగగా; అతండు= (ఆ వామదేవుడు); నీవు; కృతకార్యుండవు+ఐ= నెరవేరిన పని కలవాడ వై; మా, హయంబులన్= మాగుర్రాలను; తడయక= ఆలసించక; ఒప్పింపవలయును= అప్పగించవలె; అట్లు+ఏనిన్= ఆవిధంగా చేయటానికి ఇష్టమైతే; కొనిపొమ్ము= తీసికొని వెళ్ళుము; అనినన్= అని చెప్పగా; వల్లె+అని= సరే అని చెప్పి; వామ్యంబులన్+కొని= సవ్యజాతి గుర్రాలను తీసికొని; రథ, యుక్తంబులన్+కావించి= తేరుకు కూడినట్టివాటినిగా చేసి; తదీయ, జవంబునకున్= (ఆగుర్రాలయొక్క) వేగానికి; మెచ్చుచున్= సంతోషిస్తూ; ముహూర్తమాత్రంబునన్= క్షణకాలంలోనే; కూడ, ముట్టి= సమీపించి, చేరి; మృగంబున్= లేడిని; సమయించి= చంపి; మగిడి= తిరిగి; నిజపురంబునకున్= తనపట్టణానికి; వచ్చి= చేరి.

తాత్పర్యం: ఆ రథసారథి తేరును వేగంగా వామదేవుడి ఆశ్రమానికి తోలాడు. పరిక్షితుడు ఆమహర్షిని సందర్శించి నమస్కరించి, 'మునులలో శ్రేష్ఠుడవైనవాడా! నాచేత ఒకమృగం దెబ్బతిని తప్పించుకొని పారిపోయింది. దానిని సంహరించాలి. దయచేసి నీ గుర్రాలను ఇమ్ము' అని ప్రార్థించాడు. ఆ మహర్షి, 'మహారాజా! నీ పని పూర్తిఅయిన పిమ్మట తిరిగి నాగుర్రాలను నాకు ఇవ్వాలి. అందుకు సమ్మతిస్తే, నీవు నా గుర్రాలను తీసికొనుము' అని చెప్పాడు. రాజు అందుకు అంగీకరించాడు. అంతట, రథసారథి వామ్యజాతికి చెందిన ఆగుర్రాలను తేరునకు పూన్చాడు. రాజు ఆగుర్రాల వేగాన్ని మెచ్చుకొన్నాడు. క్షణకాలంలో ఆరథం దెబ్బతిన్న మృగాన్ని చేరుకొన్నది. రాజు ఆజంతువును వేటాడి చంపి, రాజధానినగరానికి తిరిగి వెళ్ళాడు.

మత్తకోకిలము.

'రాజయోగ్యము లైన యీ హయరత్నముల్ జవసత్త్వ వి
భ్రాజితంబులు వాని కేటికిఁ బాఱువానికి' నంచు నా
రాజు రాజసబుద్ధి నంతిపురంబునం దిడఁ బంచె న
వ్వాజియుగ్మము; వేడ్క నూనినవాఁడు దోస మెఱుంగునే? 339

ప్రతిపదార్థం: రాజ, యోగ్యములు+ఐన= రాజులకు మాత్రమే తగినవి అయిన; ఈ, హయరత్నముల్= ఈగొప్పగుఱ్ఱాలు; జవ, సత్త్వ, విభ్రాజితంబులు= వేగంచేత బలంచేత విలసిల్లేవి; వానికిన్+ఏటికిన్+పాఱువానికిన్= బ్రాహ్మణుడైన వాడికెందుకు?; అంచున్= అని ఆలోచిస్తూ; ఆ రాజు= ఆ ప్రభువు; రాజసబుద్ధిన్= అహంభావపూరిత మైన బుద్ధితో; అంతిపురంబునందున్= అంతఃపురంలో- రాజుగారిలోపలి నగరిలో; ఆ+వాజి, యుగ్మమున్= ఆ గుర్రాల జతను; ఇడన్= ఉంచటానికి; పంచెన్= ఆజ్ఞాపించాడు; వేడ్కన్+ఊనినవాఁడు= వ్యామోహంతో కూడిన కోరికను పూనినవాడు; దోసము= తప్పు; ఎఱుంగును+ఏ= తెలియునా?

తాత్పర్యం: 'ఈ గొప్పగుర్రాలు రాజులకు మాత్రమే యోగ్యా లైనవి. ఇంత గొప్ప బలం, వేగం కల గుర్రాలు పేదబాపనికి ఎందుకు?' అని ఆలోచించి దురహంకారంతో వాటిని అంతిపురంలో ఉంచుమని ఆజ్ఞాపించాడు. వేడుక పూనినవాడు తప్పును గమనించగలడా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: హయరత్నములు= అనగా గుఱ్ఱాలలో శ్రేష్ఠములైనవి. 'రత్నహారీ తు పార్థివః' - అనే న్యాయం చొప్పున శ్రేష్ఠాలైన వాటిని గైకొనే హక్కు రాజులకు ఉంటుంది. అలం: అర్థాంతరన్యాసం. వృత్త లక్షణానికి చూడు: ఆరణ్యపర్వము 4.267 విశేషం.

వ. అట వామదేవుండును దనయశ్వంబుల శలుండు గొనిపోయి మగుడ నొప్పింపక తడయుటకాత్మగతంబున.340

ప్రతిపదార్థం: అటన్= అచట, (ఆశ్రమంలో); వామదేవుండును= వామదేవుడుకూడ; తన+అశ్వంబులన్= తనగుఱ్ఱాలను; శలుండు= శలుడు (అనేరాజు); కొనిపోయి= తీసికొనివెళ్లి; మగుడన్= తిరిగి; ఒప్పింపక= అప్పగించక; తడయుటకున్= ఆలస్యం చేయటానికి; ఆత్మ, గతంబునన్= తన లోలోపల (ఆలోచించాడు).

తాత్పర్యం: ఇట శలుడు అంతఃపురం చేరిన పిదప, అట ఆశ్రమంలో వామదేవమహర్షి శలుడు గుఱ్ఱాలను తనకు తిరిగి ఇవ్వకపోవటాన్నిగూర్చి తనలో తానే ఈవిధంగా యోచించాడు.

తే. 'రాజపుత్త్రుండు బలియుండు రాజసుండుఁ । గొండి; కాతండు వేడుకఁ గొనుచు నరిగె
నశ్వములఁ గ్రమ్మఱఁగ నిత్తు నను విచార । మెవ్విధంబున నతనికి నేల కలుగు?' 341

ప్రతిపదార్థం: రాజపుత్త్రుండు= రాకొమరుడు, (శలుడు); బలియుండు= బలం కలవాడు; రాజసుండున్= అహంకారం కలవాడు; కొండిక= బాలుడు; ఆతండు= అతడు (చిన్నవాడయిన రాజకుమారుడు); అశ్వములన్= గుఱ్ఱాలను; వేడుకన్+కొనుచున్+అరిగెన్= సంబరంతో కూడిన కోరికతో తీసికొని వెళ్ళాడు; అతనికిన్= (ఆశలుడికి); క్రమ్మఱఁగన్= మరల; ఇత్తున్= ఇస్తాను; అను= అనునట్టి; విచారము= ఆలోచన; ఏ+విధంబునన్= ఏరీతిగా; ఏల= ఎందులకు; కలుగున్= ఏర్పడుతుంది?

తాత్పర్యం: 'శలుడు వయస్సులో చిన్నవాడు, రాజపుత్రుడు, బలవంతుడు, అహంకారం గర్వం దర్పం కలవాడు. గుఱ్ఱాలను తిరిగి ఇచ్చివేయవలె ననే ఆలోచన అతడికి ఏరీతిగానైనా ఎందుకు కలుగుతుంది?'

వ. అని శంకించి నిజశిష్యునాత్రేయుండనువానింజూచి' శలుండు మన వామ్యంబులం గొనిపోయి యొక్కమాసం బరుగుదెంచె; వాఁడును దనయంతఁ దెచ్చుట గలుగనేరదు; నీ వరిగి మనతురంగరత్నంబులం గొని ర'మ్మని పంచిన, నప్పుడ కదలి యయోధ్యానగరంబునకుం జని. 342

ప్రతిపదార్థం: అని= ఆరీతిగా; శంకించి= సందేహించి; నిజ, శిష్యున్= తనదగ్గర చదువుకొనే వాడిని; ఆత్రేయుండు+అనువానిన్= ఆత్రేయుడు అనే పేరు కలవాడిని; చూచి= అరసి; శలుండు= శలుడు; మన, వామ్యంబులన్= సవ్యజాతికి చెందిన మన గుఱ్ఱాలను; కొనిపోయి= తీసికొనివెడలి; ఒక్క, మాసంబు= ఒకనెల; అరుగుదెంచెన్= కడచింది; వాఁడును= (ఆ శలుడును); తన అంతన్= తనంతట తానై; తెచ్చుట= (ఆ గుఱ్ఱాలను తిరిగి) తీసికొనివచ్చి ఇవ్వటం; కలుగనేరదు= జరుగదు; నీవు+అరిగి= నీవు (అచటికి) వెళ్లి; మన, తురంగ, రత్నంబులన్= శ్రేష్ఠాలైన మనగుఱ్ఱాలను; కొనిరమ్ము= తీసికొనిరమ్ము; అని పంచినన్= అని ఆజ్ఞాపించగా; అప్పుడు+అ= అప్పుడే; కదలి= బయలుదేరి; అయోధ్యా, నగరంబునకున్= అయోధ్య అనే పట్టణానికి; చని= వెళ్ళి.

తాత్పర్యం: అని లోలోపల శంక ఏర్పడగా వామదేవుడు తనశిష్యుడైన ఆత్రేయుడిని పిలిచి ఈవిధంగా చెప్పాడు: 'శలమహారాజు శ్రేష్ఠాలైన మన గుఱ్ఱాలను తీసికొనివెళ్లి ఒకనెలరోజులు అయింది. ఆతడు తనంతట తాను గుఱ్ఱాలను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనకు తిరిగిఇచ్చేటట్లు కన్పించటం లేదు. కావున, నీవు వెళ్ళి మన గుఱ్ఱాలను అడిగి వెనుకకు తీసికొనిరమ్ము.' గురువుగారి ఆజ్ఞను అనుసరించి ఆత్రేయుడు వెంటనే బయలుదేరి అయోధ్యానగరానికి వెళ్ళాడు.

క. మనుజపతిఁ గాంచి యాతఁడు । 'మునిపతి పుత్తేర నధిపముఖ్య! యిచటి కేఁ
జనుదెంచితి మా హయముల । నెనసిన నెయ్యంబుతోడ నిమ్మని యడిగెన్. 343

ప్రతిపదార్థం: ఆతఁడు= (ఆత్రేయుడు); మనుజపతిన్= రాజును; కాంచి= చూచి; అధిపముఖ్య!= ఓ రాజశ్రేష్ఠుడా!; మునిపతి= మునులలో శ్రేష్ఠుడు (వామదేవుడు) పుత్తేరన్= పంపగా; ఇచటికిన్= ఇచ్చటికి (అయోధ్యకు); ఏన్= నేను; చనుదెంచితిన్= వచ్చాను; ఎనసిన= సరిపోలిన; నెయ్యంబుతోడన్= స్నేహంతో; మా, హయములన్= మా గుఱ్ఱాలను; ఇమ్ము+అని= ఇవ్వవలసింది అని; అడిగెన్= కోరాడు.

తాత్పర్యం: ఆత్రేయుడు రాజును సందర్శించాడు. 'రాజులలో శ్రేష్ఠుడ వైన ఓ మహారాజా! మునులలో శ్రేష్ఠుడైన వామదేవుడు పంపగా నేను ఈ అయోధ్యానగరానికి వచ్చాను. నీవు లోగడ తీసికొనిన మా గుఱ్ఱాలను దయచేసి స్నేహపూర్వకంగా తిరిగి మాకు ఇవ్వవలసింది' అని అడిగాడు.

విశేషం: ఇచట 'ఎనసిన నెయ్యంబుతోడ' అనే ప్రయోగంలో స్వారస్యం అరయదగింది. మునిశిష్యుడు ఆత్రేయుడు 'ఓమహారాజా మేము మిక్కుటమైన స్నేహభావంతో అడగగానే మా గుఱ్ఱాలను నీకు ఇచ్చాం. నీవు సయితం అట్టి స్నేహభావాన్నే మాయెడ చూపవలసి ఉన్నది కదా! ఇప్పటికే ఆలస్యమైనది. ఇకనైన కర్తవ్యం గుర్తించవలెను సుమా!' అనే హెచ్చరిక ఇందులో ఇమిడి ఉన్నది. ఇది మిక్కిలి సౌమ్యమైన హెచ్చరిక.

క. అనవుడు శలుఁ డిట్లనియెం । 'జను నినుఁ బుత్తేర నతఁడు, సాలుదు వీవుం
గొనిపోవఁ దురంగంబులఁ, । జనుమీ! దుర్భాషణములు సైఁపవు మాకున్.' 344

ప్రతిపదార్థం: అనవుడున్= అని పలుకగా; శలుఁడు; ఇట్లు+అనియెన్; అతఁడు= (వామదేవుడు); నినున్+పుత్తేరన్= నిన్నుపంపటం; చనున్= సరిపోయింది; ఈవున్= నీవును; తురంగంబులన్= గుఱ్ఱాలను; కొనిపోవన్= తీసికొనిపోవటానికి; చాలుదువు= సరిపోతావు; మాకున్= మాకు; దుర్భాషణములు= చెడుమాటలు; సైఁపవు= రుచించవు; చనుమీ!= వెళ్ళిపోవయ్యా!

తాత్పర్యం: ఆత్రేయుడు ఆవిధంగా చెప్పగా, శలుడు ఈవిధంగా సమాధానం చెప్పాడు: 'ఆయన పంపటం, గుఱ్ఱాలను తీసికొనిపోవటానికి నీవు రావటం బాగుంది! 'పోవయ్యా!పోపో! మేము మహారాజులం. ఇంతకు మించి దురుసు మాటలాడటం మాకు ఇష్టంలేదు! అంతరం గుర్తించకుండ నీవు నోటికి వచ్చినట్లు మాట్లాడటం మేము సహించలేం; జాగ్రత్త'.

విశేషం: ఇందు 'దుర్భాషణములు సైఁపవు మాకున్' అనే ప్రయోగంలోని అంతరార్థం గుర్తించదగింది. 'మాకున్' అనే బహువచనప్రయోగం రాజదర్పసూచకం. 'అసలు రాజుగారి దగ్గరకు రావలసింది అడుగవలసింది, మీ గురువుగారు కాగా, కుఱ్ఱకుంక వయిన నిన్నా ఇక్కడకు పంపేది? ఇంతకంటె దురుసు మాటలు మాకు రావని రాజసంగా మందలించాడు. 'ఎనసిన నెయ్యంబుతోడ' అనేమాట సమస్కంధులమధ్య చెల్లుతుంది కాని, రాజుగారితో ఒక బ్రాహ్మణబాలకుడు అనదగింది కాదు' అని శలుడి మాటలలోని అంతరార్థం.

వ. అనిన నమ్మునికుమారుండు గ్రమ్మఱి చని గురునకు నవ్విధం బెఱింగించిన, వామదేవుండు క్రోధపరీతచేతస్కుం డై శలునిపాలి కరిగి యి ట్లనియె. 345

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+మునికుమారుండు= ఆ మునిపుత్రుడు; క్రమ్మఱి, చని= తిరిగివెళ్లి; గురునకున్= ఒజ్జకు; ఆ+విధంబున్= ఆ తీరును; ఎఱింగించినన్= తెలుపగా; వామదేవుండు; క్రోధ, పరీత, చేతస్కుండు+ఐ= కోపంచేత చుట్టుకొనబడిన మనస్సు కలవాడై; శలునిపాలికిన్= శలుడిదగ్గరకు; అరిగి= వెళ్ళి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆత్రేయుడు తిరిగి వెళ్ళి, రాజు చెప్పిన మాటలను గురువుగారికి నివేదించాడు. రాజుగారి సమాధానం వినిన వామదేవుడికి మిక్కుటమైన కోపం వచ్చింది. అతడు ఆగ్రహంచేత చుట్టబడిన మనస్సు కలవాడై శలుడి దగ్గరకు వెళ్ళి ఈవిధంగా పలికాడు.

క. 'ఇమ్ము నరేశ్వర! మా తుర । గమ్ముల; నీ కార్య మయ్యెఁగాదే; కడులో
భమ్మున నొండుల సొమ్ములు । రమ్మనినన్ వచ్చునే? యెరవు సతత మగునే? 346

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= ఓరాజా!; మా తురగమ్ములన్= మా గుర్రాలను; ఇమ్ము= ఇచ్చివేయుము; నీకార్యము= నీపని; అయ్యెన్+కాదే= నెరవేరిందికదా; కడున్= మిక్కిలి; లోభమ్మునన్= దురాశచేత; ఒండులసొమ్ములు= ఇతరుల ద్రవ్యాలు; రమ్ము+అనినన్= రావలెను అని కోరితే; వచ్చును+ఏ= వస్తాయా?; ఎరవు= ఇల్లడ- తిరిగి ఇచ్చే ఒడంబడికతో తీసికొన్నది; సతము+అగునే= శాశ్వతం అవుతుందా?

తాత్పర్యం: 'ఓరాజా! మా గుర్రాలను మాకు ఇమ్ము. నీ పని నెరవేరింది కదా! మిక్కుటమైన దురాశచొప్పున పరుల ద్రవ్యాలను కాంక్షించినంతమాత్రాన అవి చేకూరుతాయా? ఎరవుగా పుచ్చుకొన్నది ఎల్లకాలం ఉంచుకొనటానికి వీలౌతుందా?

క. పరధనహరణము దురితము । పరికింపుము; వరుణుచేతిపాశంబుల ని
ష్ఠురముగఁ గట్టువడకు; ని । ర్భరనరకకృశాను శిఖలఁ బడకుము మీఁదన్.' 347

ప్రతిపదార్థం: పరికింపుము= ఆలోచించి చూడుము; పర, ధన, హరణము= ఇతరులసొత్తు అపహరించటం; దురితము= పాపం; వరుణుచేతి పాశంబులన్= వరుణుడియొక్క చేతిలో ఉండే త్రాళ్లచేత; నిష్ఠురముగన్= కఠినంగా; కట్టు+పడకు= బంధించబడకుము; మీఁదన్= అటుపిమ్మట (పరలోకం చేరినపిదప); నిర్భర, నరక, కృశాను, శిఖలన్= భరించశక్యంగాని నరకలోకంలోని అగ్నిజ్వాలలలో; పడకుము= కూలవద్దు.

తాత్పర్యం: ఆలోచన చేసి చూడుము. ఇతరులసొత్తును అపహరించటం పాపం. అట్టిపాపం చేసినవారు వరుణపాశాలచేత కఠినంగా బంధించబడతారు. పిదప భరించరాని నరకలోకంలోని అగ్నిజ్వాలలలో పడిపోతారు.'

విశేషం: ఇట పరధనాన్ని హరించింది రాజు. అందుచేత అతడికి రాజదండన భయం లేదు కదా. ఇక వామదేవుడు పెట్టిన భయం 'మీఁదన్.' ఇహదండన తప్పినప్పటికీ పరదండనమాత్రం తప్పదు అని హెచ్చరిక.

చ. అనుటయు నాతఁ డిట్లనియె 'నాఱడివిప్రుల కేల యశ్వముల్?
ఘనతరసత్త్వమూర్తు లనఁ గాఁ దగు నెద్దను రెంటి నిచ్చెదన్;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విను మటుగాక బల్లిదపువేసడముల్ వలతేని నిత్తుఁ గై
కొనుము తగంగ; వామ్యములఁ గోరక పొ; మ్మడియాస లేటికిన్?' 348

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పినపిదప; ఆతఁడు= (శలుడు); ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు; అశ్వముల్= గుఱ్ఱాలు; ఆఱడి= వ్యర్థంగా; విప్రులకున్+ఏల= బ్రాహ్మణులకు ఎందుకు?; ఘన, తర, సత్త్వమూర్తులు= మిక్కుటమైన గొప్పబలం గల రూపాలు కలవి; అనఁగాన్+తగు= అని చెప్పదగిన; ఎడ్లను= ఎద్దులను; రెంటిని; ఇచ్చెదన్= ఇస్తాను; వినుము= ఆలకించుము; అటు+కాక= ఆవిధం నచ్చకపోతే; బల్లిదము+వేసడముల్= మిక్కిలి బలంకలిగిన కంచరగాడిదలు; వలతు+ఏనిన్= కోరితే; ఇత్తున్= ఇస్తాను; కైకొనుము= స్వీకరించుము; తగంగన్= తగునట్లుగా; వామ్యములన్= సవ్యజాతి గుఱ్ఱాలను; కోరక= కాంక్షించక; పొమ్ము= వెళ్ళుము; అడి+ఆసలు= అడియాసలు= వ్యర్థమైన కోరికలు; ఏటికిన్= ఎందుకు?

తాత్పర్యం: అంతట ఆ రాజు ఇట్లా పలికాడు. 'గుఱ్ఱాలు బ్రాహ్మణులకు ఎందుకు? అవి వారికి నిరుపయోగాలు కదా! మంచిబలం గల రెండు ఎద్దులను ఇస్తాను. వినుము. ఒకవేళ నీకు అవి నచ్చకపోతే, నీకు ఇష్టమైనయెడల గొప్ప బలంగల కంచరగాడిదలను ఇస్తాను; స్వీకరించుము. సవ్యజాతికి చెందిన గుఱ్ఱాలను నీవు కోరటం అనుచితం. వ్యర్థమైనకోరికలు కోరక తిరిగి పొమ్ము.'

క. అనిన 'నివి యేటి మాటలు? । వినువారలు నవ్వ నకట! విప్రులధనముల్
గొని వేఱ యొంటి నిచ్చెద । నను టిది యేనాఁటిచంద?' మని ముని పలికెన్. 349

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; వినువారలు, నవ్వన్= వినేవారు నవ్వేటట్లుగా; ఇవి, ఏటి, మాటలు?= ఇవి ఏవిధమైన మాటలు?; అకట!= అయ్యో!; విప్రుల, ధనముల్= బ్రాహ్మణుల సొత్తులు; కొని= తీసుకొని; వేఱు+అ+ఒంటిన్= మరొకటి, ఇంకొకటి; ఇచ్చెదన్ అనుట= ఇస్తాననటం; ఇది= ఈ రీతిది; ఏనాఁటి చందము= ఏకాలానికి చెందినతీరు; అని; ముని= ఋషి (వామదేవుడు); పలికెన్= అన్నాడు.

తాత్పర్యం: రాజు చెప్పిన మాటలకు వామదేవముని ఇట్లా బదులు పలికాడు: 'మహారాజా! నీవు చెప్పే సమాధానం వినినవారు నవ్వుతారు. అకటా! బ్రాహ్మణులసొత్తు అపహరించటమే ఒక మహాపాపం. అంతేకాక దానికి బదులు మఱేదో ఒకటి ఇస్తా నని చెప్పటం హాస్యాస్పదం. ఇది ఏకాలానికి చెందిన న్యాయమయ్యా? నాకు ఆశ్చర్యంగా ఉన్నది'.

క. పలుకుటయు నలిగి శలుఁ 'డి । ప్పలుగుఁ దపసి నంటఁ గట్టి పటుశూలములం
బొలియింపుఁ' డనుచు భీకర । బలుల నియోగించెఁ దనదు పార్శ్వజనములన్. 350

ప్రతిపదార్థం: పలుకుటయున్= మాటాడగా; అలిగి= కోపించి; శలుఁడు=(రాజు); ఈ+పలుగు+తపసిన్= దుష్టుడైన ఈ మునిని; అంటన్+కట్టి= బంధించి; పటుశూలములన్= గొప్పవైన బల్లేలతో; పొలియింపుఁడు= చంపండి; అనుచున్= అని చెప్పుతూ; భీకరబలులన్= భయంకరులైన బలంకలవారిని; తనదు, పార్శ్వజనములన్= తనచుట్టుప్రక్కల ఉండే వారిని; వినియోగించెన్= ఏర్పరిచాడు.

తాత్పర్యం: వామదేవుడిమాటలకు రాజైన శలుడికి కోపం వచ్చింది. 'దుష్టుడైన ఈ మునిని పట్టి బంధించి శూలాలతో పొడిచి చంపండి' అని తన చుట్టూఉన్న బలిష్ఠులైన భటులను ఆజ్ఞాపించాడు.

వ. అంతయుం జూచి వామదేవుండు ఘనరోషభీషణ ప్రహాసదుర్నిరీక్ష్యముఖుం డగుటయు, నాక్షణంబ ఘోరాకారు లగు రాక్షసు లనేకులు పుట్టి నిశాతశూలంబుల నా భూపాలుంబొడిచి కాలగోచరుం జేసిరి; మునీంద్రుఁడు నిజేచ్ఛం జనియెఁ; దదనంతరంబ శలానుజుండు నలుం డనువాఁడు నిజరాజ్యపట్టభద్రుండై సుఖంబుండఁ గొండొకకాలంబునకు వామదేవుండు సనుదెంచివానింగని' 'మహాత్మా! నీవు ధర్మపరుండవు; ధర్మువుదప్పనోడుదేని, మా హయంబుల ని' మ్మనుటయు, నలుం డలిగి నిజసమీపంబున నున్న సారథిం జూచి యిట్లనియె. 351

ప్రతిపదార్థం: అంతయున్+చూచి= (జరిగింది) అంతా గమనించి; వామదేవుండు= వామదేవుడనే ముని; ఘనరోషభీషణప్రహాస+దుస్+నిరీక్ష్యముఖుండు+అగుటయున్= గొప్పదైన కోపంచేత భయంకరంగా ఏర్పడిన వెగటునవ్వుచేత చూడటానికి వీలులేని మొగం కలవాడు కాగా; ఆ క్షణంబు+అ= త్రుటికాలంలోనే; ఘోర+ఆకారులు+అగు= భయంకరమైన రూపంగల; రాక్షసులు+అనేకులు= రక్కసులు పలువురు; పుట్టి= ఉద్భవించి; నిశాత, శూలంబులన్= వాడి అయిన బల్లేలతో; ఆ, భూపాలున్= ఆ రాజును; పొడిచి= గ్రుచ్చి; కాలగోచరున్+చేసిరి= సంహరించారు; ముని+ఇంద్రుండు= మునులలో ఇంద్రుడివంటివాడు (వామదేవుడు); నిజ+ఇచ్ఛన్= తన ఇచ్చచొప్పున; చనియెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= అటుమీదట; శల+అనుజుండు= శలుడియొక్క తమ్ముడు; నలుండు+అనువాఁడు; నిజరాజ్యపట్టభద్రుండు+ఐ= తనయొక్క రాజ్యానికి పట్టంకట్టబడినవాడై; సుఖంబు+ఉండన్= సుఖంగా ఉండగా; కొండొక, కాలంబునకున్= కొంతకాలానికి; వామదేవుండు; చనుదెంచి= వచ్చి; వానిన్= అతడిని (నలుడిని); కని= చూచి; మహా+ఆత్మా!= గొప్పఆత్మకలవాడా!; నీవు; ధర్మపరుండవు= ధర్మాన్ని ఆచరించేవాడవు; ధర్మువు, తప్పన్+ఓడుదు(వు)+ఏని= ధర్మాన్ని అతిక్రమించటానికి జంకేవాడవు అయితే; మా, హయంబులన్= మా గుర్రాలను; ఇమ్ము= ఇచ్చునది; అనుటయున్= అని చెప్పగా; నలుండు; అలిగి= కోపించి; నిజ, సమీపంబునన్+ఉన్న= తనకు దగ్గరలో ఉన్న; సారథిన్+చూచి= రథం నడిపేవాడిని చూచి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: జరిగినదంతా చూచిన వామదేవుడిముఖం కోపంతో భయంకరంగా కన్పడింది. ఆ క్షణంలోనే పెక్కండ్రు రక్కసులు ఉద్భవించి ఆ రాజును శూలాలతో పొడిచి చంపేశారు. పిదప వామదేవుడు తన ఇచ్చవచ్చినచోటికి వెడలిపోయాడు. అటుపిమ్మట, శలుడితమ్ముడైన నలుడు సింహాసనాన్ని అధిష్ఠించాడు. అతడు కొంతకాలం సుఖంగా రాజ్యాన్ని పరిపాలించాడు. ఒకానొకనాడు వామదేవుడు అచటికి వచ్చి, 'మహానుభావుడవైన ఓ మహారాజా! నీవు ధర్మాన్ని అనుసరించేవాడవు. ధర్మువు తప్పి చరించటానికి జంకేవాడివైతే, మా గుర్రాలను మాకిమ్ము' అని అడిగాడు. ఆ మునిమాటలకు రాజు కోపించి తనకు దగ్గరగా ఉన్న సారథిని చూచి ఇట్లా పలికాడు.

**సీ. 'కడుఁ గ్రొవ్వి తేఁకువ సెడియె నీ పాఱుండు । వీఁకమై నిప్పుడు వీని ఱొమ్ము
వ్రయ్యంగ నేసెదఁ జయ్యన విషదిగ్ధ । సాయకమును శరాసనముఁ దెమ్ము'
నావుడు నమ్మహాదేవుండు నగుచు ని । ట్లనియె; 'న న్నేయఁ దెమ్మనిన విశిఖ
మంతఃపురంబున సంతసంబున నున్న । యనఘు భవత్సుతుఁ దునుముఁగాక!'**

**తే. యనఁగఁ దదనంతరంబ ఘోరాస్త్రనిహతుఁ । డైన బాలునిఁ గొనుచు హాహారవంబు
లెసఁగ నంతిపురంబువా రెల్ల వచ్చి; । రది ధ్రువంబుగఁ గనియును నవ్విభుండు. 352**

ప్రతిపదార్థం: కడున్+క్రొవ్వి= మిక్కుటంగా చెడబలిసి; ఈ పాఱుండు= ఈ బ్రాహ్మణుడు; తేఁకువ+చెడియెన్= మంచి చెడుగులను వివక్షించే తెలివితేటలను కోల్పోయాడు; వీఁకమైన్= పరాక్రమంతో; ఇప్పుడు= ఈ సమయంలో; వీనిఱొమ్మున్=

వీడివక్షాన్ని; వ్రయ్యంగన్+ఏసెదన్= ముక్కలు అయ్యేటట్లుగా కొట్టుతాను; చయ్యనన్= శీఘ్రంగా; విషదిగ్ధసాయకమును= విషంతో పూయబడిన బాణాన్ని; శరాసనమున్= విల్లును; తెమ్ము= తీసికొని రమ్ము; నావుడున్= అని చెప్పగా; ఆ+మహీదేవుండు= ఆబ్రాహ్మణుడు (వామదేవుడు); నగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు; నన్నున్+ఏయన్= నన్ను కొట్టటానికి; తెమ్ము+అనిన= తీసికొని రమ్మనిన; విశిఖము= బాణం; అంతఃపురంబునన్= లోపలిరాచనగరిలో; సంతసంబునన్+ఉన్న= సంతోషంతో ఉన్న; అనఘున్= పాపరహితుడైన; భవత్+సుతున్= నీకొడుకును; తునుమున్+కాక= సంహరిస్తుందిగాక; అనఁగన్= అని వచించగా; తద్+అనంతరంబు+అ= అటుపిమ్మటవెంటనే; ఘోర+అస్త్ర+నిహతుఁడు+ఐన= భీతిని కలిగించే మంత్రబాణంచేత చంపబడినవాడైన; బాలునిన్+కొనుచున్= పిల్లవాడిని తెస్తూ; హాహా, రవంబులు+ఎసఁగన్= ఏడుపురొదలు విస్తరించగా; అంతిపురంబువారు+ఎల్లన్= లోపలిరాచనగరులోనివారందరున్నూ; వచ్చిరి= అరుగుదెంచారు; అది= (ఆవిధంగా జరిగినదానిని) ధ్రువంబుగన్= సత్యమైన సంఘటనగా; కనియును= చూచికూడా; ఆ+విభుండు= ఆరాజు.

తాత్పర్యం: 'కండకావరంచేత ఈ బ్రాహ్మణుడు యుక్తాయుక్తపరిజ్ఞానాన్ని కోలుపోయాడు. ఇతడి వక్షాన్నిపరాక్రమంతో ఛేదిస్తాను. విషం పూసిన అమ్ముతో పాటు విల్లును నాకు తెచ్చిఇమ్ము' అని ఆరాజు పలికాడు. ఆ మాటలకు వామదేవుడు నవ్వి, 'రాజా! నన్ను సంహరించటానికై నీవు ఉద్దేశించిన బాణం, అంతఃపురంలో ఉన్న అమాయకుడైన నీకొడుకునే పరిమార్చగలదు. జాగ్రత్త' అని హెచ్చరించాడు. అటుపిమ్మట, ఘోరమైన అస్త్రంచేత చంపబడిన బాలకుడి మృతదేహాన్ని మోసికొంటూ అంతిపురంలోని వారు ఏడ్పురొదలతో అచ్చటికి వచ్చారు. జరిగినసంగతి కనులార చూచినప్పటికి, బుద్ధిలేక రాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. కోపావేశఘూర్ణమాన విగ్రహుం డగుచుఁ దన దురాగ్రహంబు విడువక సమీపవర్తులం జూచి. 353

ప్రతిపదార్థం: కోప+ఆవేశ, ఘూర్ణమాన, విగ్రహుండు+అగుచున్= కినుకవలన ఏర్పడిన ఒళ్ళెరుగని తమకంచేత తిరుగుడుపడిన దేహంకలవాడై; తన దుస్+ఆగ్రహంబు= తన చెడుకోపం; విడువక= వదలక; సమీపవర్తులన్ చూచి= దగ్గరగా ఉన్నవారిని చూచి.

తాత్పర్యం: కినుకవలన ఒడలు తెలియని తమకంతో తల్లడిల్లిన ఆకారం కలవాడై ఆవేశాన్ని అణచుకొనజాలక, ఆ రాజు తన సమీపంలో ఉన్నవారిని చూచి.

మ. 'వినుఁడీ సర్వజనంబులుం గడఁగి యీ విప్రున్ దురాలాపు దు
ర్జనునిం దున్మెద నస్మదీయసుమహచ్చాపోగ్రనిర్ముక్త బా
ణనిపాతచ్ఛిదురాంగరక్తజలశోణక్షోణిసంగస్థుఁగాఁ
గనుఁడీ యీ దురితాత్ము' నంచు నతి శీఘ్రప్రాప్తకోదండుఁ డై. 354

ప్రతిపదార్థం: సర్వజనంబులున్= ప్రజలందరును; వినుఁడు+ఈ= సావధానంగా ఆలకించండి; కడఁగి= పూని; ఈవిప్రున్= ఈ బ్రాహ్మణుడిని; దుస్+ఆలాపున్= చెడుమాటలు ప్రేలేవాడిని; దుస్+జనునిన్= చెడ్డవాడిని; తున్మెదన్= సంహరిస్తాను; అస్మదీయ, సు, మహత్+చాప+ఉగ్ర, నిస్+ముక్తబాణ, నిపాత, ఛిదుర+అంగ, రక్త, జల, శోణ, క్షోణి, సంగస్థున్+కాన్= నాదైన మిక్కిలి గొప్పదైన వింటినుండి భయంకరంగా వెడలిన అమ్ములచేత కొట్టబడి ముక్కలుగా చేయబడిన దేహంయొక్క నెత్తురునీరుచేత ఎర్రనైన నేలయొక్క పొత్తునం దున్న వాడినిగా; ఈదురిత+ఆత్మున్= ఈపాపంతో కూడిన ఆత్మ కలవాడిని; కనుఁడు+ఈ= చూడండి; అంచున్= అంటూ; అతిశీఘ్రప్రాప్త కోదండుఁడు+ఐ= మిక్కిలి వేగంగా పొందబడిన విల్లు కలవాడై.

తాత్పర్యం: 'అందరూ నాప్రతిజ్ఞ సావధానంగా ఆలకించండి. నోటికి వచ్చినట్లు ప్రేలెడి ఈదురాత్ముడైన బ్రాహ్మణుడిని నేను సంహరిస్తాను. క్షణంలో నావింటినుండి వెలువడిన బాణంచేత నెత్తురుకారుతున్న ఈతనిదేహం నేలపై పొరలాడటం మీరందరూ సావధానంగా చూస్తారు గాక' అని పలుకుతూ మిక్కుటమైన వేగంతో వింటిని చేతబూనాడు.

క. శర మరిం బోయుటయును ద । త్కరయుగ్మము బాణకార్ముకంబులతోఁ జె
చ్చెర సంస్తంభము నొందుడు । నరనాథుఁడు విస్మయోపనతమానసుఁడై. 355

ప్రతిపదార్థం: శరము= బాణం; అరిన్+పోయుటయును= అల్లెత్రాటితో కూర్చేసరికి; తద్+కర, యుగ్మము= అతడియొక్క చేతులజంట; బాణ, కార్ముకంబులతోన్= అమ్ముతోను వింటితోను; చెచ్చెరన్= శీఘ్రంగా; సంస్తంభమున్+ఒందుడున్= కదలలేక పోగా, నరనాథుఁడు= రాజు; విస్మయ+ఉపనత, మానసుఁడు+ఐ= ఆశ్చర్యం పొందిన మనస్సు కలవాడై.

తాత్పర్యం: బాణాన్ని అల్లెత్రాటితో కూరుస్తున్నంతలోనే ఆరాజు రెండుచేతులున్నూ అమ్ముతోపాటు, వింటితోపాటు స్తంభించిపోయాయి. అందుచేత ఆ రాజు ఆశ్చర్యచకితచిత్తుడైనాడు.

విశేషం: ఉ.వి.ఆం.మ.భా సంశోధిత ప్రతిలో 'విస్మయావనత మానసుఁడై'- అనే పాఠమున్నది. దానికంటే వావిళ్ళ ప్రతిలోని 'విస్మయోపనత మానసుఁడై' అనే పాఠం సార్థకం.

క. పుల్లవడి చలము రోషముఁ । బొల్లయు నై చనఁగఁ గొంతప్రొద్దు మొగమునన్
వెల్లఁదనము గదుర నిలిచి । యెల్లజనులు వినఁగ మఱియు నిట్లని పలికెన్. 356

ప్రతిపదార్థం: పుల్ల+పడి= భయపడి; చలమున్ రోషమున్= మాత్సర్యమూ, కోపమూ; పొల్లయున్+ఐ, చనఁగన్= వ్యర్థమై పోవగా; కొంత, ప్రొద్దు= కొంతసమయం; మొగమునన్= ముఖంలో; వెల్లఁదనము= వెలవెలపాటు; కదురన్= క్రమ్ముకొనగా; నిలిచి= స్తంభించిపోయి; ఎల్లజనులున్= అందరు ప్రజలు; వినఁగన్= ఆలకింపగా; మఱియున్= వెండియు; ఇట్లు+అని పలికెన్= ఈవిధంగా వచించాడు;

తాత్పర్యం: ఆ రాజు భయపడి స్తంభించిపోయాడు. అసూయ, రోషంకూడ వ్యర్థమై పోయాయి. అతడు కొంతతడవు మొగం వెలవెలబోయి నిలిచి, తదుపరి అందరూ వింటూఉండగా ఈవిధంగా పలికాడు.

ఉ. 'ఆడితిఁ బెక్కుమాట; లవి యెల్లను వమ్మయి పోయె; నస్త్రసం
తాడనశక్తి గీడ్పడియెఁ; దథ్యము బ్రాహ్మణశక్తి యెక్కు; డే
నోడితి వామదేవునకు; నో జనసంఘములార! సజ్జనా
మ్రేడితకీర్తి నిమ్ముని నమిత్రనిషూదను నాశ్రయించెదన్'. 357

ప్రతిపదార్థం: ఓ జనసంఘములు+ఆర!= ఓప్రజల సమూహములారా!; పెక్కు, మాటలు= ఎన్నోమాటలు; ఆడితిన్= అన్నాను; అవి+ఎల్లను= (ఆమాటలు అన్నీకూడా); వమ్ము+అయి, పోయెన్= వ్యర్థమైపోయాయి; అస్త్ర, సంతాడన, శక్తి= మంత్ర, పురస్సరమైన ఆయుధాలశక్తి; కీడ్పడియెన్= నశించిపోయింది; బ్రాహ్మణశక్తి= విప్రులయొక్క మహిమ; ఎక్కుడు= అధికమైనది; తథ్యము= నిజం; వామదేవునకున్; ఏన్= నేను; ఓడితిన్= పరాజయం పొందాను; ఈ+మునిన్(వామదేవుడిని); సత్+ జన+ ఆమ్రేడిత, కీర్తిన్= మంచివారలచేత పలుమారులు పొగడబడిన యశస్సు కలవాడిని; అమిత్రనిషూదనున్= శత్రువులను చంపేవాడిని; ఆశ్రయించెదన్= శరణు వేడుతాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ప్రజలారా! నేను ఎంతో అధికప్రసంగం చేశాను. అంతా వ్యర్థమైపోయింది. ఇప్పుడు పశ్చాత్తాపం చెందాను. నా ఆయుధాల పస చెడింది. బ్రాహ్మణులశక్తిగొప్పది. ఇది సత్యం అని స్వానుభవంచేత తెలిసికోగలిగాను. నేను ఓడిపోయాను. వామదేవమహర్షి గెలుపొందాడు! ఆతడు శత్రువులను నిర్జించేశక్తికల మహానుభావుడు. సజ్జనులచేత పలుమారులు పొగడబడే ఆ మునీంద్రుడినే నేను శరణువేడుతాను.'

వ. అని యివ్విధంబున నతం డేపు దప్పి జోహారు వెట్టుటయుఁ, దదీయ బంధుమిత్త్ర జనంబులు భయసంభ్రమంబులతో నమ్మునినాథు శరణు సొచ్చి యనునయించినఁ, బ్రసన్నుండై యమ్మహాత్ముండు దత్కరయుగస్తంభనంబు మాన ననుగ్రహించి, తదీయనందను ప్రాణంబు లొసంగె; నంత నమ్మహీకాంతుండు భార్యాసహితంబుగా నతనికిఁ బ్రణమిల్లి హయంబులఁ దెచ్చి యొప్పించినం గైకొని వామదేవుఁ డరిగె; 'నిట్టిది బ్రాహ్మణప్రభావం' బని చెప్పిన విని. 358

ప్రతిపదార్థం: అని= అని పలికి; ఈ+విధంబునన్= ఈ తీరుగా; అతండు= (ఆ రాజు); ఏపు+తప్పి= గర్వం వీడి; జోహారు+పెట్టుటయున్= నమస్కరించుటయున్నూ; తదీయబంధుమిత్రజనంబులు= అతడి యొక్క చుట్టాలున్నూ, స్నేహితులున్నూ అయినవారు; భయసంభ్రమంబులతోన్= వెఱపు, తొట్రుపాటులతో; అమ్మునినాథు, శరణు+చొచ్చి= మునులలో శ్రేష్ఠుడైన ఆతడిని శరణుకోరుతూ చేరి; అనునయించినన్= బతిమాలగా; ప్రసన్నుండు+ఐ= శాంతించినవాడై; ఆ, మహా+ఆత్ముండు= ఆ గొప్ప ఆత్మకలవాడు (వామదేవుడు); తద్+కర, యుగ, స్తంభనంబు= ఆతడియొక్క చేతులజంట మ్రాన్పడిపోయిఉండటం; మానన్= నయమయ్యేటట్లు; అనుగ్రహించి= దయచేసి; తదీయ, నందను, ప్రాణంబులు= ఆతడి కొడుకుయొక్క అసువులు; ఒసంగెన్= ఇచ్చాడు; అంతన్= పిదప; ఆ+మహీకాంతుండు= భూమికిభర్తఅయిన ఆ రాజు; భార్యాసహితంబుగాన్= పెండ్లాంతోపాటు; అతనికిన్= (వామదేవుడికి); ప్రణమిల్లి= నమస్కరించి; హయంబులన్= గుర్రాలను; తెచ్చి= తీసికొనివచ్చి; ఒప్పించినన్= ఒప్పగించగా; కైకొని= స్వీకరించి; వామదేవుఁడు= వామదేవుడు; అరిగెన్= వెళ్ళాడు; ఇట్టిది= ఇటువంటిది; బ్రాహ్మణ, ప్రభావంబు= విప్రులయొక్క మహిమ; అని, చెప్పినన్, విని.

తాత్పర్యం: అని ఈ విధంగా ఆరాజు గర్వాన్ని వదలి ఆమునికి నమస్కరించాడు. అంతట ఆ రాజు చుట్టాలున్నూ మిత్రులున్నూ వామదేవుడిని శరణు వేడారు. పిదప, అతడు ప్రసన్నుడై, రాజు రెండు చేతులు మ్రాన్పడటం తొలగించాడు, రాజుకొడుకును తిరిగి బ్రదికించాడు. రాజు అంతఃపురంనుండి ఆ గొప్పగుర్రాలను తెప్పించి మునీశ్వరుడికి సమర్పించాడు. ఆమేలి గుర్రాలను తీసికొని వామదేవుడు వెళ్ళాడు. 'ఇటువంటిది బ్రాహ్మణప్రభావం' - అని మార్కండేయమహర్షి సోదాహరణంగా ధర్మరాజుకు వివరించి చెప్పాడు.

క. మునిపతికి మ్రొక్కి కుంతీ । తనయుఁడు 'మీకంటె వృద్ధతముఁ డగు పురుషుం
డనఘా! కలఁడె జగమ్మున?' । నని యడిగిన నాతఁ డిట్లులని యెఱిఁగించెన్. 359

ప్రతిపదార్థం: కుంతీతనయుఁడు= కుంతికొడుకు (ధర్మరాజు); మునిపతికిన్= మునిరాజుకు (మార్కండేయుడికి); మ్రొక్కి= నమస్కరించి; అనఘా!= పుణ్యాత్ముడా!; జగమ్మునన్= లోకంలో; మీకంటెన్; వృద్ధ, తముఁడు+అగు= వయస్సులో మిక్కిలి పెద్దవాడైన పురుషుండు= మగవాడు; కలఁడు+ఎ= ఉన్నాడా?; అని అడిగినన్= అని ప్రశ్నించగా, ఆతఁడు= (మార్కండేయుడు); ఇట్టులు+అని+ఎఱిఁగించెన్= ఈవిధంగా తెలియజెప్పాడు;

తాత్పర్యం: ధర్మరాజు మార్కండేయమహర్షికి నమస్కరించి ఈవిధంగా ప్రశ్నించాడు. 'పుణ్యపురుషా! ఈ లోకంలో మీకంటె కూడ వయస్సులో మిక్కిలి వృద్ధుడైన పురుషుడు ఉన్నాడా?' ఆప్రశ్నకు సమాధానంగా ఆ మహర్షి ఈ విధంగా చెప్పాడు.

విశేషం: వృద్ధతముఁడు= అందరికంటె ముసలివాడు. 'తర-తమ' ప్రత్యయాలు ఉత్తరోత్తరాధిక్యసూచకాలు.

మార్కండేయుఁడు ధర్మరాజునకు నింద్రద్యుమ్నుని కథ సెప్పుట (సం. 3-191-2)

క. ఘనుఁ డింద్రద్యుమ్నుం డను। జనపతి గలఁ; డాతఁ డింద్రసదనమున ముదం
బున నుండఁగ బహుకాలం। బున కాతని కీర్తి లోకమున మాయుటయున్. 360

ప్రతిపదార్థం: ఘనుఁడు= గొప్పవాడు; ఇంద్రద్యుమ్నుండు+అను, జనపతి, కలఁడు= ఇంద్రద్యుమ్నుడు అనే పేరు కల రాజు ఉండేవాడు; ఆతఁడు= అతడు (ఇంద్రద్యుమ్నుడు); ఇంద్రసదనమునన్= ఇంద్రుడి ఇంటిలో (స్వర్గలోకంలో); ముదంబునన్+ఉండఁగన్= సంతసంతో నివసించగా; బహుకాలంబునకున్= చాలకాలానికి; ఆతని కీర్తి= ఇంద్రద్యుమ్నుడి యశస్సు; లోకమునన్= జగత్తులో; మాయుటయున్= క్షీణించిపోవటంచేత.

తాత్పర్యం: ఇంద్రద్యుమ్నుడు అనే ఒక గొప్పమహారాజు ఉండేవాడు. అతడు చిరకాలం స్వర్గలోకంలో సంతసంతో నివసించాడు. చాలకాలానికి లోకంలో ఆతని కీర్తి మాయమై పోవటంచేత. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అమరు 'లిచ్చోట నుండలే వరుగు' మనుచు। నుర్విఁ ద్రోచిన నతఁడు నా యున్నకడకు
నర్థిఁ జనుదెంచి యిట్లను 'ననఘ! నన్ను। నిద్ధపుణ్యు నింద్రద్యుమ్ను నెఱుఁగు దయ్య?' 361

ప్రతిపదార్థం: అమరులు= దేవతలు; 'ఇచ్చోటన్= ఈస్థలంలో; ఉండలేవు= నివసించజాలవు; అరుగుము= వెళ్ళుము;' అనుచున్= అనిచెప్పుతూ; ఉర్విన్= భూమికి; త్రోచినన్= నెట్టగా; అతఁడు= (ఆ ఇంద్రద్యుమ్నుడు); నా+ఉన్న, కడకున్= నేను ఉన్నచోటికి; అర్థిన్+చనుదెంచి= కోరికతో వచ్చి; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; అనఘ!= పాపరహితుడా; ఇద్ధపుణ్యున్= ప్రకాశించే పుణ్యం కలవాడిని; నన్నున్= నన్ను; ఇంద్రద్యుమ్నున్= ఇంద్రద్యుమ్నుడిని; ఎఱుఁగుదు+అయ్య= ఎఱుగుదువా?'

తాత్పర్యం: దేవతలు ఆ ఇంద్రద్యుమ్నుడిని 'ఇక నీవు స్వర్గంలో ఉండజాలవు; నీ పుణ్యం తరిగిపోయింది' అని చెప్పి, అతడిని భూలోకానికి నెట్టారు. అంతట ఆ ఇంద్రద్యుమ్నుడు నే నున్నచోటికి వచ్చి ఈవిధంగా పలికాడు. 'ఓ పుణ్యాత్ముడా! ప్రకాశించే పుణ్యాలు కల ఇంద్రద్యుమ్నుడను నేను. అయ్యా! నన్ను నీవు ఎరుగుదువా?'

సీ. అనుడు నే నిట్లంటి నయ్య! ని న్నెఱుఁగంగఁ। జాలనయ్యెద; హిమశైలశృంగ
వాసియై యుండు ప్రావారకర్ణుం డను। పేరి ఘూకము గడు పెద్ద; యదియు
నాకంటె నిన్ను నిర్ణయముగ నెఱుఁగుఁ బొ। మ్మనుటయు; నన్ను రమ్మనియె నతఁడు;
ఘనరసాయనఘుటికాప్రయోగంబున। దేహతాపంబు వర్ధిల్లె నందుఁ

తే. గదలి రాఁజాల నే నంటిఁ; గడఁగి యన్న। రేంద్రుఁ డశ్వమై ననుఁ బ్రీతి నెత్తికొనుచు
నయ్యులూకముపాలికి నరిగి నన్ను। నడిగినట్టుల దానిని నడుగుటయును. 362

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనుడున్= అని పలుకగా; ఏన్= నేను; ఇట్లు+అంటిన్= ఈవిధంగా అన్నాను; అయ్య= ఆర్యా!; నిన్నున్+ఎఱుంగంగన్+చాలను+అయ్యెదన్= నిన్ను తెలియజాలకున్నాను; హిమ, శైల, శృంగ, వాసి+ఐ+ఉండు= మంచుకొండ శిఖరంమీద నివసించే వాడై ఉన్న; ప్రావారకర్ణుండు+అను, పేరి= ప్రావారకర్ణుడు అనే పేరు కలిగిన; ఘూకము= గ్రుడ్లగూబ; కడు, పెద్ద= మిక్కిలి పెద్దది (వయస్సులో); అదియున్= ఆ గుడ్లగూబయు; నాకంటెన్= నన్నుమించి; నిన్నున్= నిన్ను; నిర్ణయముగన్= నిశ్చయంగా; ఎఱుఁగున్= తెలియును; పొమ్ము= వెళ్ళుము; అనుటయున్= అని అనగా; నన్నున్= నన్ను; అతఁడు= అతడు (ఇంద్రద్యుమ్నుడు); రమ్ము+అనియెన్= (తనతోకూడ) రమ్ము అని అడిగాడు; ఘన, రసాయన; ఘుటికాప్రయోగంబునన్= గొప్పదైన రసౌషధానికి సంబంధించిన మాత్రను వాడటంచేత, దేహతాపంబు= శరీరంయొక్కబాధ; వర్ధిల్లెన్= వృద్ధిచెందింది. అందున్= అచ్చటికి; ఏను= నేను రాన్+చాలను+అంటిన్= రావటానికి శక్తి సరిపోదు అని చెప్పాను; కడఁగి= పూనుకొని ఆ, నర+ఇంద్రుఁడు= ఆరాజు (నరులలో ఇంద్రుడివంటివాడు); అశ్వము+ఐ= గుర్రం రూపం ధరించి; ననున్= నన్ను; ప్రీతిన్= అనురాగంతో; ఎత్తికొనుచున్= మీదపెట్టుకొంటూ; ఆ+ఉలూకము, పాలికిన్= ఆ గుడ్లగూబ ఉన్నచోటికి; అరిగి= వెళ్ళి; నన్నున్= నన్ను; అడిగిన+అట్టులు+అ= ప్రశ్నించినరీతిగానే; దానినిన్= (ఆగ్రుడ్లగూబను); అడుగుటయును= ప్రశ్నించగా.

తాత్పర్యం: అప్పుడు నేను ఈవిధంగా పలికాను: 'అయ్యా! నేను నిన్ను తెలిసికొనలేకపోయాను, కాని, హిమాలయపర్వతశిఖరంకడ నివసించే ప్రావారకర్ణుడు అనే పేరుకల గ్రుడ్లగూబ వయస్సులో మిక్కిలి పెద్దది; అందుచేత అతడు నాకంటె నిన్నుగూర్చి నిశ్చయంగా తెలియగలడు; అతడి దగ్గరికి పొమ్ము'. అంతట ఆ ఇంద్రద్యుమ్నుడు తనతోపాటు నన్ను కూడ రమ్మన్నాడు! 'అయ్యా!ముసలితనంలో శక్తినొసగే మాత్రను సేవించి యున్నాను. అందువలన కలిగిన దేహతాపం కారణంగా కదలలేకుండా ఉన్నాను' అని చెప్పాను. అప్పుడు ఆ ఇంద్రద్యుమ్నుడు గుర్రపురూపం ధరించి నన్ను తన వీపుపై ఉంచుకొని ఆ గుడ్లగూబ ఉన్నచోటికి వెళ్ళి, నన్ను అడిగినట్లే అతడు ఆ గుడ్లగూబను అడిగాడు.

విశేషం: ప్రాచీనభారతీయసాహిత్యంలో జంతుపాత్రలు బహుళాలు. అవి మానవచిత్తప్రవృత్తులకు ప్రతీకలే. ఆ జంతువుల పేర్లు సార్థకాలు. ప్రావారకర్ణుడు= ఉత్తరీయాలవంటి చెవులు కలవాడు అనగా భుజాలపై వ్రాలునట్టి నిడివిఅయిన చెవులుకలవాడని అర్థం.

వ. **అదియునుం గొండొకసేపు దలపోసి చూచి 'యేను నిన్ను నిక్కువంబుగా నెఱుంగనేర; నింద్రద్యుమ్నం బను కొలనియందు నాళీకజంఘుం డనుపేరి బకవల్లభుండు వసియించు; నవ్విహంగంబు నాకుఁ బెద్ద; నిన్నెఱుంగు నరుగు' మనిన నమ్మనుజపతి నాతోడఁగూడ నయ్యులూకంబు మోచికొని నాళీకజంఘునొద్దకుం జని తనపేరు సెప్పి 'నన్నెఱుంగుదే?' యనిన నదియు 'నే నిన్నెఱుంగంజాల నాకంటెఁ జిరకాలజీవి యైన యకూపారుండను కచ్ఛపంబు గల; దదియును నిక్కొలన నుండు నజ్జలచరము నిన్నెఱుంగంబోలు; నడిగి చూతముగాక' యని యక్కమఠంబుఁబేర్కొని' యొక్క సందేహంబు నిర్ణయించుట కయి యీయార్యజనంబులు నిన్ను గుఱించి వచ్చినవారు; నీవు సనుదేరవలయు' నని పలుకుటయును. 363**

ప్రతిపదార్థం: అదియునున్= (ఆగ్రుడ్లగూబకూడ); కొండొకసేపు= కొంతసమయం; తలపోసి= యోచించి; చూచి= అరసి; ఏను= నేను; నిక్కువంబుగాన్= నిజంగా; ఎఱుంగనేరను= తెలియజాలను; ఇంద్రద్యుమ్నంబు+అను, కొలనిఅందున్= ఇంద్రద్యుమ్నం అనే పేరుకల సరస్సులో; నాళీకజంఘుండు+అను, పేరి= నాళీకజంఘుడు అనే పేరు కల; బక వల్లభుండు=

కొంగలరేడు; వసియించున్= నివసిస్తాడు; ఆ+విహంగంబు= ఆపక్షి; నాకున్+పెద్ద= నాకంటె వయస్సులో పెద్దది; నిన్నున్+ ఎఱుంగున్= నిన్ను తెలియును; అరుగుము= వెళ్ళుము; అనినన్= అని చెప్పగా; ఆ+మనుజపతి= ఆరాజు; నాతోడన్+కూడ= నాతోపాటుగా; ఆ+ఉలూకంబున్= ఆగ్రుడ్లగూబను; మోచికొని= వహించి; నాళీకజంఘునొద్దకున్+చని= నాళీకజంఘుడివద్దకు వెళ్ళి; తనపేరు+చెప్పి; నన్నున్+ఎఱుంగుదు+ఏ+అనినన్= నన్ను తెలియుదువా నీవు- అని అడుగగా; అదియున్= (ఆకొంగకూడ); ఏన్= నేను; నిన్నున్+ఎఱుంగన్+చాలన్= నిన్నుతెలియజాలను; నాకంటెన్= నన్ను మించి; చిర, కాల, జీవి+ఐన= చాలకాలం బ్రదికిన వాడైన; అకూపారుండు+అను= అకూపారుడు అనేపేరు కల; కచ్ఛపంబు= తాబేలు; కలదు= ఉన్నది; అదియునున్= అదిన్నీ; ఈ+కొలనన్+ఉండున్= ఈసరస్సులో నివసిస్తూ ఉంటుంది; ఆ+జలచరము= నీటిలో తిరిగే ఆ జంతువు (తాబేలు); నిన్నున్+ఎఱుంగన్+పోలున్= నిన్ను తెలిసిఉండవచ్చును; అడిగి= ప్రశ్నించి; చూతము, కాక= చూస్తాం గాక; అని= అని చెప్పి; ఆ+కమఠంబున్= ఆతాబేలును; పేర్కొని= పేరుపెట్టి పిలిచి; ఒక్కసందేహంబు= ఒక అనుమానం; నిర్ణయించుటకున్+అయి= నిశ్చయించటంకొరకై; ఈ+ఆర్యజనంబులు= ఈ పెద్దలు; నిన్నున్+గుఱించి= నీకొరకై; వచ్చినవారు= వచ్చారు; నీవు; చనుదేరవలయున్= రావలెను; అని పలుకుటయును= అని అనటమున్నూ.

తాత్పర్యం: ఆ గుడ్లగూబ కొంతసేపు యోచించి, 'నాకు నీవు ఎవరవో తెలియరాలేదు. ఇంద్రద్యుమ్నం అనే పేరుకల ఒకసరోవరం ఉన్నట్లు నాకు తెలియును. ఆ సరస్సులో నాళీకజంఘుడు అనే పేరుకల గొప్పకొంగ ఉన్నది. ఆ కొంగ వయస్సులో నాకంటెను పెద్దది. నిన్నుగూర్చి ఆకొంగకు తెలియును. అక్కడకు వెళ్ళుము' అని చెప్పింది. అంత ఆ ఇంద్రద్యుమ్నుడు నాతోపాటు ఆ గుడ్లగూబను సయితం తనవీపుపైన ఎక్కించుకొని ఆకొంగ దగ్గరకు వెళ్ళాడు. అతడు, తనపేరు చెప్పి ఆ కొంగ తన్నెరుంగునేమో అని ప్రశ్నించాడు. ఆ కొంగ, తాను ఇంద్రద్యుమ్నుడిని ఎరుగను కాని, ఆకొలనులో ఒకతాబేలు కలదనిన్నీ, ఆ తాబేలు అచటి జలచరాలలో ఎక్కువ వయస్సు కలదు అనిన్నీ, ఆ తాబేలుకు తెలిసివుండవచ్చును అని చెప్పి చూతము గాక' అని ఆ తాబేలును పేరెత్తి పిలిచి ఇట్లా పలికింది- 'ఒక సందేహం తీర్చుకొనటానికై పెద్దలు నీకడకు వచ్చారు. నీవు దయచేసి ఇటు రమ్ము.'

తే. **కొలను వెలువడి చనుదెంచెఁ గూర్మవిభుఁడు; । వార లడిగి 'రింద్రద్యుమ్నధారుణీశు**
నెఱుఁగుదే?' యన నదియు నొక్కింతతడవు । దలఁచికొని కన్నుఁగవ నశ్రుజలము లొలుక. 364

ప్రతిపదార్థం: కూర్మవిభుఁడు= తాబేటిరేడు; కొలను= సరోవరం; వెలువడి= బయటికి వచ్చి; చనుదెంచెన్= అరుగుదెంచాడు; వారలు= (నాళీకజంఘుడు, ప్రావారకర్ణుడు); అడిగిరి= (ఇట్లా) ప్రశ్నించారు; ఇంద్రద్యుమ్న, ధారుణీ+ఈశున్= ఇంద్రద్యుమ్నుడు అనెడి రాజును; ఎఱుఁగుదు+ఏ= తెలియుదువా; అనన్= అని అడుగగా; అదియున్= (ఆతాబేలును); ఒక్కింతతడవు= ఒక కొంతసేపు; తలఁచికొని= జ్ఞాపకం తెచ్చికొని; కన్ను+కవన్= కనులజంటయందు; అశ్రు, జలములు+ఒలుకన్= కన్నీరు కారగా.

తాత్పర్యం: తాబేలు ఆ సరస్సునుండి బయలువెడలి కనిపించింది. 'ఇంద్రద్యుమ్నమహారాజును నీవు ఎరుగుదువా?' అని వారు ప్రశ్నించారు. అంత, ఆ తాబేలు కొంచెంసేపు జ్ఞాపకం తెచ్చుకొని, కన్నీరు కనులనుండి కారుతుండగా,

విశేషం: 'ఒక్కింతతడవు తలఁచికొనుట' - 'కన్నుఁగవ నశ్రుజలము లొలుకుట' - 'ఎలుగు రాలుపడుట' మున్నగునవి మానుషవిభావాలే కదా! ఈ పద్యం తిక్కన మహాకవి ఆంగికసాత్త్వికాభినయవర్ణనను తలపిస్తుంది. ఎఱ్ఱనపై - నన్నయ ప్రభావముద్రమాత్రమే గాక తిక్కన కవితాశిల్పప్రభావమున్నూ గోచరిస్తుంది.

వ. **ఎలుంగు రాలుపడ వారలం గనుంగొని యి ట్లనియె. 365**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఎలుంగు= కంఠస్వరం; రాలుపడన్= బొంగురుపోగా; వారలన్= ఇంద్రద్యుమ్నుడిని, నాళీకజంఘుడిని, ప్రావారకర్ణుడిని; కనుంగొని= చూచి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: గద్గదస్వరంతో వారిని చూచి ఈవిధంగా పలికింది.

ఉ. **'అక్కట! నే నెఱుంగనె మహాగుణభూషణు నమ్మహాత్ము న**
న్నిక్కడఁ బెక్కుమాఱులు ననేకభయంబులఁ బొందకుండఁగా
నక్కటికంబుతోడఁ దగ నాతఁడు గైకొని కాచెఁ గాదె! పెం
పెక్కిన యన్నరోత్తముని నెన్నఁటికిన్ మఱవంగవచ్చునే? **366**

ప్రతిపదార్థం: అక్కట= (ఇది ఆశ్చర్యార్థకం - జాలితో కూడిన అచ్చెరువును దెలిపేది); మహా, గుణ, భూషణున్= గొప్పగుణాలు ఆభరణాలుగా కల వాడిని; ఆ+మహా+ఆత్మున్= ఆమహాత్ముడిని; నేను+ఎఱుంగను+ఎ= నేను తెలియనా?; నన్నున్; ఇక్కడన్; పెక్కు, మాఱులు= అనేకపర్యాయాలు; అనేక, భయంబులన్= పెక్కుఆపదలను; పొందకుండఁగాన్= పడయకుండ; అక్కటికంబుతోడన్= దయతో; తగన్= ఒప్పేటట్లుగా; ఆతఁడు= ఆ యింద్రద్యుమ్నుడు; కైకొని= స్వీకరించి; కాచెన్+కాదె= కాపాడాడు కదా; పెంపు+ఎక్కిన= గొప్పతనాన్ని సంపాదించిన; ఆ+నర+ఉత్తమునిన్= ఆ జనులలో శ్రేష్ఠుడు అయినవాడిని; ఎన్నఁటికిన్= ఎప్పటికైనను; మఱవంగన్‌వచ్చును+ఏ= విస్మరించటానికి వీలు ఉన్నదా?

తాత్పర్యం: 'అయ్యో! ఎంతమాట! ఆ ఇంద్రద్యుమ్న మహారాజునా నేను మరచిపోవటం ! ఆతడు మహాత్ముడు, గొప్పగుణాలచేత అలంకరించబడినవాడు. పెక్కుమారులు ఆ మహనీయుడు నన్ను పెక్కు ఆపదలనుండి కాపాడాడు. జనులలో శ్రేష్ఠుడై ఎంతో గొప్పతనాన్ని ఆర్జించిన ఆ ఇంద్రద్యుమ్నుడిని నేను సదా కృతజ్ఞతతో స్మరించవలసి ఉన్నది.

తే. **అమ్మహాత్ముండు బహువిధయజ్ఞదక్షి । ణార్థముగ విప్రవరులకు నర్థి నిచ్చు**
గోగణంబుల గొరిజల గ్రొచ్చియయ్యెఁ । గాదె యీ సరోవరము జగన్నుతముగ.' **367**

ప్రతిపదార్థం: ఆ+మహా+ఆత్ముండు= ఆ గొప్ప ఆత్మకలవాడు; బహు, విధ, యజ్ఞ, దక్షిణా+అర్థముగన్= పెక్కురకాలైన యజ్ఞాలలో దానాలకు ఇచ్చే ధనంగా; విప్రవరులకున్= బ్రాహ్మణులకు; అర్థిన్= ప్రీతితో; ఇచ్చు= ఒసగు; గోగణంబుల= ఆవుల సమూహాలయొక్క; గొరిజలన్= గిట్టలచేత; జగత్+నుతముగన్= లోకం పొగడేటట్లుగా; ఈ సరోవరము= ఈ మడుగు; గ్రొచ్చి= త్రవ్వబడి; అయ్యెన్+కాదె= ఏర్పడినది గదా!

తాత్పర్యం: మహానుభావుడైన ఆ ఇంద్రద్యుమ్న మహారాజు ఎన్నో యజ్ఞాలు చేసి, దక్షిణగా అనేకగోవులను బ్రాహ్మణులకు దానంచేశాడు. ఆ మహాత్ముడు దానం చేసిన వేనకువేల ఆవుల గిట్టల రాపిడే కదా! లోకం పొగడే ఈ మడుగు ఏర్పడటానికి కారణం.

వ. **అనిన యనంతరంబ దేవదూతలు విమానంబు గొనుచుఁ జనుదెంచి యింద్రద్యుమ్నుం గని 'మహాత్మా! నీ కీర్తి జగంబునందు శాశ్వతంబై నిలిచె; నీకుఁ ద్రిదివనివాసంబు సుస్థిరం బయ్యె; నరుగుదెమ్ము; విమానం బెక్కు' మని, వెండియు.** **368**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనిన+అనంతరంబు+అ= అని పలికిన వెంటనే; దేవదూతలు= స్వర్గలోకానికి చెందిన ప్రతినిధులు; విమానంబు, కొనుచున్= ఆకసంలో చరించే వాహనాన్ని తీసికొనివస్తూ; చనుదెంచి= అరుగుదెంచి; ఇంద్రద్యుమ్నున్+కని= ఇంద్రద్యుమ్నుడిని చూచి; మహా+ఆత్మా!= గొప్పఆత్మకలవాడా!; నీకీర్తి= నీయశస్సు; జగంబునందున్= లోకంలో; శాశ్వతంబు+ఐ= ఎల్లకాలం ఉండునట్టిదై; నిలిచెన్= నిలబడింది; నీకున్= నీకు; త్రిదివ+నివాసంబు= స్వర్గలోకంలో నివసించటం; సు, స్థిరంబు+అయ్యెన్= బాగా ఎల్లప్పుడు ఉండునట్టిది అయింది; అరుగుదెమ్ము= రమ్ము; విమానంబు= విమానం; ఎక్కుము= అధిరోహించుము; అని= అని చెప్పి; వెండియున్= మఱియును.

తాత్పర్యం: తాబేలు ఆ మాటలు చెప్పగానే దేవతల ప్రతినిధులు విమానాన్ని గైకొనివచ్చి ఇంద్రద్యుమ్నుడితో ఇట్లా పలికారు: 'మహాత్మా! నీ యశస్సు లోకంలో ఎల్లప్పుడు ఉంటుంది. నీకు శాశ్వతస్వర్గసౌఖ్యం లభిస్తుంది. దయచేసి ఈ విమానం ఎక్కి స్వర్గలోకానికి రమ్ము' అని, ఇంకా ఇట్లా అన్నారు.

క. 'తన కీర్తి యెంతకాలము । వినఁబడు నిజ్జగమునందు వెలయఁగ నందాఁ
కను బుణ్యలోకసౌఖ్యం । బున నెంతయు నుల్లసిల్లుఁ బురుషుం డనఘా!' 369

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! ఓఇంద్రద్యుమ్నమహారాజా!; తన, కీర్తి= తనయశస్సు, ఈ+జగమునందున్= ఈలోకంలో; ఎంతకాలము= ఎంతసమయం; వినఁబడున్= (ప్రజలచేత) ఆలకించబడునో; వెలయఁగన్= విలసిల్లేటట్లుగా; అందాఁకను= అంతవరకును; పురుషుండు= నరుడు; పుణ్య, లోక, సౌఖ్యంబునన్= సుకృతం చేసికొనటంవలన లభించే లోకంలోని సుఖంతో; ఎంతయున్= మిక్కుటంగా; ఉల్లసిల్లున్= సంతసిస్తాడు.

తాత్పర్యం: 'పాపరహితుడా! ఈలోకంలో తనయశస్సు ఎంతకాలం విలసిల్లుతూ వినబడునో అంతకాలం నరుడు స్వర్గలోకసౌఖ్యాలను అనుభవిస్తాడు.'

విశేషం: ఈప్రకరణంలో భగవద్గీతలోని ఈ క్రింది శ్లోకం స్మరించదగింది. "తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం । క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" ॥ 9-21.॥

వ. అనిన నమ్మహీకాంతుండు దివిజకింకరులంజూచి 'యిమ్ముదుసలి తాపసుని, వృద్ధవిహంగంబును గార్యార్థంబు సహాయులుగాఁదెచ్చితి; వీరిని నిజస్థానంబుల నునిచివచ్చెద; నించుకనిలువుం' డని వారిచేత ననుజ్ఞాతుండై నన్నును నులూకంబును నెప్పటి నెలవులం బెట్టి తానును దేవయానంబున దివంబున కరిగె' నని చెప్పినఁ బ్రీతుఁడై పృథానందనుండు. 370

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; ఆ+మహీకాంతుండు= భూమికి భర్త అయిన ఆ రాజు; దివిజకింకరులన్= దేవ సేవకులను; చూచి= అరసి; ఈ+ముదుసలితాపసునిన్= వృద్ధుడైన ఈ తపసిని; వృద్ధ, విహంగంబును= ముసలిదైన పక్షిని; కార్య+అర్థంబు= పని నెరవేరటం కొరకై; సహాయులుగాన్= తోడ్పడేవారలుగా; తెచ్చితిన్= తీసికొనివచ్చాను; వీరిని= (మార్కండేయుడిని, ప్రావారకర్ణుడిని, నాళీకజంఘుడిని) నిజస్థానంబులన్= తమతమ నెలవులలో; ఉనిచి= పెట్టి; వచ్చెదన్= వస్తాను; ఇంచుక= కొంచెం సేపు; నిలువుండు+అని= నిలిచి ఉండండి అని చెప్పి; వారిచేతన్= (ఆదేవదూతలచేత); అనుజ్ఞాతుండు+ఐ= అనుమతి పొందిన వాడై; నన్నునున్= నన్ను (మార్కండేయుడిని); ఉలూకంబునున్= గుడ్లగూబనూ (ప్రావారకర్ణుడిని); ఎప్పటి నెలవులన్+పెట్టి= లోగడ ఉన్నచోటులందే ఉంచి; తానును= ఇంద్రద్యుమ్నుడును); దేవయానంబునన్= దేవతల విమానంలో; దివంబునకున్= స్వర్గలోకానికి; అరిగెన్= వెళ్ళాడు; అనిచెప్పినన్= అని వచించగా; ప్రీతుఁడు+ఐ= సంతుష్టి చెందినవాడై; పృథానందనుండు= కుంతీదేవికొడుకు (ధర్మరాజు).

తాత్పర్యం: అని దేవతలు చెప్పగా విని, ఇంద్రద్యుమ్నుడు దేవదూతలతో ఇట్లా బదులు పలికాడు: 'నాపనిమీద ఈ ముదుసలి మహర్షిని, ఈ ముసలిపక్షిని వారిసాయాన్ని కోరి ఇప్పుడు తోడ్కొనివచ్చాను. వీరిని వారివారినెలవులలో దింపి తిరిగిరాగలను. కొంచెం తాళండి'. అని చెప్పి దేవదూతలచేత అనుమతించబడినవాడై యథాస్థానాలలో వారిని దిగబెట్టి, తదుపరి తాను వేల్పులవిమానం ఎక్కి స్వర్గలోకానికి వెళ్ళాడు. ఆ కథ వినిన కుంతీపుత్రుడైన ధర్మరాజు మిక్కిలి ప్రీతిచెందాడు.

విశేషం: ఇంద్రద్యుమ్నోపాఖ్యానంలో ఈక్రింది అంశాలు అనుశీలించదగినవి - 1. ఇది ఒక స్వయంసంపూర్ణమైన మనోహరగాథ. 2. ఇది భగవద్గీతలోని ఒకభావానికి సోదాహరణ వివరణం. పుణ్యకార్యాలు చేసిన స్వర్గసౌఖ్యాలు లభిస్తాయి. నరుడు పుణ్యక్షయం కాగానే భూలోకానికి దిగిపోవలసిందే. పుణ్యకార్యాలకీర్తి ఎంతకాలం నిలుచునో అంతకాలం పురుషుడు స్వర్గసౌఖ్యాలను అనుభవిస్తాడు. 3. దీర్ఘాయుర్దాయం- మనుజులలో అరుదు. దీనికి అపవాదంగా - ఏమార్కండేయమహర్షియో కనబడతాడు. గుడ్లగూబ, కొంగ, తాబేలు ఎక్కువ కాలం బ్రదుకు నని ఈ ఉపాఖ్యానం చెప్పుతున్నది. ఈ విషయాలపై జీవశాస్త్రజ్ఞులు ఇంకను పరిశోధనలు చేయదగును. 4. ఈ ఉపాఖ్యానంలో గల 'కొసమెరుపు' గుర్తించదగింది. ఇంద్రద్యుమ్నుడు ఎంతోకష్టపడి తనకు సాక్ష్యానికి పనికివచ్చే చిరంజీవులను అన్వేషించటం, తుదకు- దేవతలు అతనిపుణ్యం అక్షయమైన దని అతడిని తిరిగి స్వర్గానికి ఆహ్వానించినప్పుడు స్వార్థబుద్ధితో ఆతడు తనకు సాయంచేసినవారిని వదలిపెట్టక, వారిని యథాస్థానాలలో దిగబెట్టి తదుపరి వేల్పులవిమానం ఎక్కటం విశేషం.

క. **'నీకంటె వృద్ధతముని గు । ణాకర! యెఱిఁగించి; తిది మహాద్భుత!' మని సు**
శ్లోకుఁడు మునివరునకుఁ బు । ణ్యాకృతికిఁ గృతప్రణాముఁడై కడుభక్తిన్. **371**

ప్రతిపదార్థం: గుణ+ఆకర!= మంచిలక్షణాలకు నెలవైనవాడా!; నీకంటెన్, వృద్ధతమునిన్= నిన్ను వయస్సులో మించినవాడిని; ఎఱిఁగించితి(వి)= తెలిపితివి; ఇది; మహా+అద్భుతము= ఇది గొప్ప అచ్చెరువును కలిగించేది; అని= అని చెప్పి; సుశ్లోకుఁడు= కీర్తిమంతుడు (ధర్మరాజు); పుణ్య+ఆకృతికిన్= మూర్తీభవించిన పుణ్యానికి (పుణ్యమే ఆకృతిగా గల వాడికి); ముని, వరునకున్= మునులలో శ్రేష్ఠుడైనవాడికి, (మార్కండేయుడికి); కృత, ప్రణాముఁడు+ఐ= చేయబడిన నమస్కారం కలవాడై (నమస్కరించి); కడున్= మిక్కుటమైన; భక్తిన్= భక్తితో.

తాత్పర్యం: 'మంచిగుణాలకు నెలవైన ఓ మార్కండేయమహర్షీ ! నీకంటెకూడ వయస్సులో మించినవాడినిగూర్చి వివరించావు. ఇది మిక్కిలి ఆశ్చర్యం కలిగించే విషయం' అని పలికి పూజ్యుడైన ధర్మరాజు మార్కండేయమహర్షికి మిక్కిలిభక్తితో నమస్కరించాడు.

విశేషం: ఆరణ్యపర్వం బృహద్గ్రంథం కావటానికి ముఖ్యకారణం స్వయంసంపూర్ణాలైన పలుగాథలు ఇందులో చేరటమే. ఈ కథాహారానికి, ఏకవాక్యతను చేకూర్చింది ధర్మరాజుశీలంలోని జిజ్ఞాస.

మార్కండేయుఁడు ధర్మరాజునకుఁ గువలాశ్వచరిత్రము సెప్పుట (సం. 3-192-4)

వ. **'మునీంద్రా! యిక్ష్వాకువంశోద్భవుండైన కువలాశ్వునకు ధుంధుమారుం డను పేరెట్లు గలిగెఁ జెప్పవే!' యని యడిగిన నతం డి ట్లనియె.** **372**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= మునులలో ఇంద్రుడివంటివాడా!; ఇక్ష్వాకు, వంశ+ఉద్భవుండు+ఐన= ఇక్ష్వాకువంశంలో పుట్టిన; కువలాశ్వునకున్; ధుంధుమారుండు+అను, పేరు; ఎట్లు+కలిగెన్= ఏవిధంగా ఏర్పడింది; చెప్పవు+ఏ= వచింపవా; అని అడిగినన్= అని ప్రశ్నించగా; అతండు= (మార్కండేయుడు); ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'మునులలో శ్రేష్ఠుడవైన ఓ మార్కండేయమహాముని ! ఇక్ష్వాకువంశంలో జన్మించిన కువలాశ్వుడికి ధుంధుమారుడు అనే పేరు ఏరీతిగా ఏర్పడిందో దయచేసి చెప్పవా' అని అడుగగా ధర్మరాజునకు మార్కండేయమహర్షి ఈ విధంగా చెప్పాడు.

ఉ. **'శంకరసన్నిభుండు జనశంకరుఁడున్ గరుణాకరుం డనా**
తంకుఁ డుదంకుఁ డన్ముని వ్రతస్థితుఁ డై మరుభూమియందు ని
శ్శంకమతిన్ వసించి యనిశంబును నవ్యయు నచ్యుతున్ మనః
పంకజవేదిపై నిడి తపం బొనరించె ననేకవర్షముల్. **373**

ప్రతిపదార్థం: శంకర, సన్నిభుండు= శివుడితో సమానుడు; జన, శంకరుఁడున్= ప్రజలకు శుభాలు కలిగించేవాడును; కరుణా+ఆకరుండు= దయకు నెలవైనవాడు; అనాతంకుఁడు= ఎదురుఅడ్డాలు సరకుపెట్టనివాడు అగు; ఉదంకుఁడు+అన్, ముని= ఉదంకుడు అనే నామంగల ఋషి; వ్రతస్థితుఁడు+ఐ= దీక్షను పూనినవాడై; మరుభూమియందున్= ఎడారి బంజరుభూమియందు; నిశ్శంక, మతిన్= సందేహాలు లేని నిశ్చలమనస్సుతో; వసించి= ఉండి; అనిశంబును= ఎల్లప్పుడును; అవ్యయున్= అక్షరుడైన భగవంతుడిని; అచ్యుతున్= పతనం లేని భగవంతుడిని - అనగా ఆ విష్ణుదేవుడిని; మనస్+పంకజ, వేదిపైన్= మనస్సు అనే తామరపూవుతిన్నెపై; ఇడి= స్థాపించి; అనేకవర్షముల్= పెక్కుసంవత్సరాలు; తపంబు+ఒనరించెన్= తపస్సు చేశాడు.

తాత్పర్యం: శివుడితో సమానుడైనవాడున్నూ, ప్రజలకు శుభాలు చేకూర్చేవాడున్నూ, దయామయుడున్నూ, ఎదురు లేనివాడున్నూ, అగు ఉదంకుడనే ఋషి దీక్షతో ఎడారిబంజరుభూమిలో నివసించి, ఎల్లప్పుడును నాశంలేనివాడున్నూ, జారనట్టి స్థితి గలవాడున్నూ అయిన విష్ణుదేవుడిని తనమనస్సు అనెడి తమ్మిపూవుతిన్నెపై నిడి పెక్కుసంవత్సరాలు తపస్సు చేశాడు.

తే. **అతనిభక్తికిఁ బ్రియమంది యాదిదేవుఁ। డంబుజాక్షుఁ డధోక్షజుఁ డక్షరుండు**
గరుణఁ బ్రత్యక్ష మగుటయుఁ గని యతండు। ప్రణతి యొనరించి యిట్లని ప్రస్తుతించె. **374**

ప్రతిపదార్థం: అతని భక్తికిన్= (ఆ ఉదంకుడి); భక్తికి; ప్రియము+అంది= ప్రీతిని చెంది; ఆదిదేవుఁడు= మొదటిదేవుడు; అంబుజ+అక్షుఁడు= పద్మాలవంటి కన్నులు కలవాడు; అధోక్షజుఁడు= జితేంద్రియులకు ప్రత్యక్షమయ్యేవాడు; అక్షరుండు= నాశం లేని వాడు అగు విష్ణువు; కరుణన్= దయతో; ప్రత్యక్షము+అగుటయున్= సాక్షాత్కరించటమున్నూ; కని= చూచి; అతండు= (ఉదంకుడు); ప్రణతి+ఒనరించి= నమస్కారం చేసి; ఇట్లు+అని= ఈ విధంగా పలికి; ప్రస్తుతించెన్= పొగడాడు.

తాత్పర్యం: ఉదంకుడి భక్తికి సంతసిల్లి, అతడి దీక్షకు మెచ్చి నాశంలేనివాడున్నూ, తమ్మిపువ్వువంటి కన్నులు కలవాడున్నూ అయిన శ్రీమన్మహావిష్ణువు సాక్షాత్కరించాడు. ఉదంకుడు విష్ణుమూర్తికి నమస్కరించి, అతడిని ఈవిధంగా ప్రస్తుతించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మత్తకోకిలము.

'దేవదేవ! శ్రుతిప్రమాణవిధేయ! మాధవ! జంగమ
స్థావరాత్మకమైన లోకము సర్వమున్ భవదీయమా
యావిధేయము విశ్వరూపుఁడ వవ్యయుండవు నీవ స
ద్భావసుస్థితి ని న్నెఱింగినఁ బాయుఁ బాపము లచ్యుతా! 375

ప్రతిపదార్థం: దేవదేవ!= దేవులకు దేవుడవైనవాడా!; అచ్యుతా!= ఓవిష్ణుమూర్తీ!; శ్రుతి, ప్రమాణ, విధేయ!= వేదాలలో నెలకొల్పబడిన సత్యానికి లోబడినవాడా!; మాధవ!= లక్ష్మీదేవికి భర్తవయినవాడా!; జంగమ, స్థావర+ఆత్మకము+ఐన= కదలునది, కదలక స్థిరంగా ఉండునది అయిన; లోకము= జగత్తు; సర్వమున్= అంతయున్నూ; భవదీయ, మాయా, విధేయము= నీదైన మాయకు లోబడి ఉన్నది; విశ్వరూపుఁడవు= సృష్టిసమస్తమున్నూ రూపంగా కలిగినవాడవు; అవ్యయుండవు= నాశం లేనివాడవు; నీవు+అ= నీవు మాత్రమే; సత్+భావస్థితిన్= సత్యమైన యోచన యొక్క ఉనికితో; నిన్నున్+ఎఱింగినన్= నిన్ను తెలిసికొంటే; పాపములు= దోషాలు; పాయున్= తొలగిపోతాయి.

తాత్పర్యం: విష్ణుమూర్తీ! దేవతలకు దేవుడవైన వాడా! వేదాలు నెలకొల్పిన సత్యానికి నెలవైనవాడా! ఈ చరాచరసృష్టి అంతయు నీమాయకు లోబడినట్టిదే, ఈ సృష్టి అంతయు నీరూపమే. నీవు క్షయం లేనివాడవు. చ్యుతిలేనివాడవు. సరిఅయిన భావంతో నిన్ను ధ్యానిస్తే పాపాలన్నీ పటాపంచలై తొలగిపోగలవు.

విశేషం: వృత్తలక్షణానికి చూడు: ఆరణ్యపర్వము: 4.267 విశేషం.

చ. అనిమిషసిద్ధసంయమివిహంగభుజంగమముఖ్యు లెల్ల ని
న్ననిశముఁ గొల్చి నీ దయఁ గృతార్థతఁ బొందుదు; రెందు నీవు నె
మ్మనమున సంతసిల్లుదు సమస్తజగంబులు శాంతిఁ బొందు; నీ
కినుకకు మాఱు లేదు శివకీర్తిత! యీ భువనత్రయంబునన్. 376

ప్రతిపదార్థం: శివకీర్తిత!= శివుడిచేత పొగడబడినవాడా!; అనిమిష, సిద్ధ, సంయమి, విహంగ, భుజంగమ, ముఖ్యులు+ఎల్లన్= వేల్పులలో, ముక్తులలో, యోగులలో, ఆకసంలో సంచరించేవారిలో, పన్నగులలో గొప్పవారుఅందరున్నూ; నిన్నున్=నిన్ను; అనిశమున్= ఎల్లప్పుడును; కొల్చి= ఆరాధించి; నీదయన్= నీ కరుణచేత; కృతార్థతన్= ధన్యత్వాన్ని; పొందుదురు= లభింపజేసికొంటారు; ఎందున్= ఎక్కడైనా; ఈవు= నీవు; నెఱ+మనమునన్= నిండుమనస్సున; సంతసిల్లుదు(వు)= సంతోషింతువో; సమస్త, జగంబులున్= అన్నిలోకాలున్నూ; శాంతిన్+పొందున్= శాంతిని అనుభవిస్తాయి; నీ కినుకకున్= నీ కోపానికి; ఈ భువన, త్రయంబునన్= ఈ మూడు లోకాలలో; మాఱు లేదు= ఎదురు లేదు.

తాత్పర్యం: శివుడిచేత ప్రస్తుతించబడినవాడా! దేవతలలో, ముక్తులలో, యోగులలో, విహంగులలో, పన్నగులలో గొప్పవారలు అందరున్నూ ఎల్లప్పుడు నిన్ను ఆరాధించి నీ దయచేతనే ధన్యత్వం పొందుతారు. నీవు నిండు మనస్సుతో సంతసిస్తే అన్ని లోకాలున్నూ శాంతిని పొందుతాయి. నీవు ఆగ్రహిస్తే దానికి ఇక ప్రతిక్రియ లేనే లేదు.

మత్తకోకిలము.

విక్రమత్రయలీల నోలిన విష్టపత్రితయంబుఁ బె
ల్లాక్రమించితి, క్రూరులైన సురారివీరులఁ బ్రస్ఫుర

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ్చక్రవిక్రమకేళిఁ ద్రుంచితి, సర్వయజ్ఞ ఫలావహ
ప్రక్రియాత్ముఁడ వీవు నిశ్చలభక్తిగమ్య ! జనార్దనా! **377**

ప్రతిపదార్థం: నిశ్చల, భక్తిగమ్య= చలించని భక్తికి అందుబాటులో ఉండేవాడా!; జనార్దనా!= ఓ విష్ణుదేవా!; విక్రమత్రయలీలన్= మూడుపాదాలతో ఆడినఆటతో; ఓలిన్+అ= వరుసగా; విష్టపత్రితయంబున్= మూడులోకాలను; పెల్లు+ఆక్రమించితి(వి)= బాగాకైవసం చేసికొన్నావు; క్రూరులు+ఐన= బాధ కలిగించే ప్రవర్తన కలవారైన; సుర+అరి, వీరులన్= దేవతలకు శత్రువులైన రాక్షసవీరులను; ప్రస్ఫురత్+చక్ర, విక్రమకేళిన్= ప్రకాశించే చక్రంయొక్క విజృంభణ మనే విలాసంచేత; త్రుంచితి(వి)= సంహరించావు; ఈవు= నీవు; సర్వ,యజ్ఞ, ఫల+ఆవహ, ప్రక్రియా+ఆత్ముఁడవు= అన్నియజ్ఞాలు చేయటం వలన ఏర్పడే ఫలితాల నొసగే వివిధ కర్మలకు అంతస్సారమైన వాడవు.

తాత్పర్యం: చలించని భక్తిచేత పొందదగిన ఓవిష్ణుమూర్తీ! నీవు మూడుపాదాల హొయలుతో మూడులోకాలను ఆక్రమించినవాడవు. క్రూరులై దేవతలకు శత్రువులైన రాక్షసులను నీ చక్రంతో సంహరించావు. సర్వయజ్ఞాలకు, ఫలాలను ఒసగే సర్వప్రక్రియలకు (సమస్తకార్యవిధానములకు) నీవే అంతస్సారమైనవాడివి.

విశేషం: 'విక్రమత్రయలీల' - మూడుపాదాలతో ముల్లోకాలను ఆక్రమించినకథ - వామనావతారగాథ భాగవతంలో సుప్రసిద్ధం. వామనరూపాన వదాన్యుడైన బలిచక్రవర్తిని మూడుఅడుగులమేర అర్థించి, పడసి, పిదప 'త్రివిక్రముడై' ముల్లోకాల నాక్రమించి, అతడిని పాతాళానికి బోనణచాడు. వృత్తలక్షణానికి చూడు: ఆరణ్యపర్వము: 4.267 విశేషం.

వ. **అనిమఱియుంబెక్కుభంగులంబ్రస్తుతించినం గరుణించిపాంచజన్యధరుండు వరంబడుగు మనిన నుదంకుండు 'దేవా! భవదీయదివ్యరూపంబుఁ బ్రత్యక్షంబుగాఁ గంటి; నింతకంటెవరం బెయ్యది గల? దైనను నామనంబు నిత్యంబును సత్యధర్మశమంబులయందు సుస్థిరంబై నీయందు దృఢభక్తికంబు గావలయు; నిదియ నాకు వరం' బనుటయు నద్దేవుండు 'నీకోరినయట్ల యిచ్చితి; మత్ప్రసాదంబున నీకుం బరమజ్ఞాన యోగంబును సిద్ధించుఁ;ద్రిలోకహితం బైన కార్యం బొక్కటి నీచేత సాధితం బయ్యెడు; నది యెయ్యది యనిన వినుము; ధుంధుండను దానవుండు జగంబుల కుపద్రవంబు సేయంగలవాఁడు; తద్వధార్థం బై నీవు బృహదశ్వసూనుం డైన కువలాశ్వు నుద్యుక్తుంజేసెద; వన్నరేంద్రుండు మత్ప్రసాదలబ్ధం బైన యోగబలంబునం జేసి భవన్నియోగంబున నయ్యసురం బరిమార్పసమర్థుండగు; నవ్విశేషంబునకు నీవలన నఖిలలోకంబులు సంతసిల్లెడు' నని పలికి విష్ణుదేవుం డంతర్హితుండయ్యె; నుదంకుండును బూర్వప్రకారంబునం దపంబు సేయుచుండె; మఱియును.** **378**

ప్రతిపదార్థం: అని= ఆవిధంగా పలికి; మఱియున్= ఇంకా; పెక్కు, భంగులన్= అనేకరీతులుగా; ప్రస్తుతించినన్= పొగడుతూ వర్ణించగా; కరుణించి= దయగలిగి; పాంచజన్యధరుండు= పాంచజన్యం అనే పేరుగల శంఖాన్ని వహించేవాడు-విష్ణువు; వరంబు+అడుగుము+అనినన్= కావలసిన కోరిక కోరుకొమ్ము అని అనగా; ఉదంకుండు; దేవా!= భగవానుడా!; భవదీయ, దివ్య, రూపంబున్= నీదైన దివ్యమైన ఆకృతిని; ప్రత్యక్షంబుగాన్+కంటిన్= కనులముందు సాక్షాత్కరించగా చూచాను; ఇంతకంటెన్= దీనికంటె; వరంబు= వలసినకోరిక; ఏ+అది= ఏది; కలదు?= ఉన్నది?; ఐనను= అయినప్పటికిని; నామనంబు= నా మనస్సు; నిత్యంబును= ఎల్లప్పుడును; సత్య, ధర్మ, శమంబులయందున్= నిజమునందు, ధర్మమునందు, ఇంద్రియ నిగ్రహమునందును; సుస్థిరంబు+ఐ= బాగా నిలిచి చలించనిదై; నీయందున్; దృఢ, భక్తికంబు, కావలయున్= గాఢమైనభక్తితో

కూడినదిగా ఉండాలి; ఇది+అ= ఇదిమాత్రమే; నాకున్= నాకు; వరంబు= వలసినకోరిక; అనుటయున్= అని చెప్పుటయున్నూ; ఆ+దేవుండు= ఆ దేవుడు (శ్రీవిష్ణువు); నీ, కోరిన, అట్ల+ఇచ్చితిన్= నీవు కోరిన ప్రకారమే ఇచ్చాను; మత్+ప్రసాదంబునన్= నా అనుగ్రహంవలన; నీకున్= నీకు; పరమ, జ్ఞాన, యోగంబును= గొప్పదైన పరిపూర్ణజ్ఞానంయొక్క తీరుతీయం, సిద్ధించున్= లభిస్తుంది; త్రిలోకహితంబు+ఐన= మూడులోకాలకు మేలు చేకూర్చే; కార్యంబు+ఒక్కటి= పని ఒకటి; నీచేతన్= నీమూలాన; సాధితంబు+అయ్యెడున్= సాధింపబడేది అగుగాక; అది= (ఆత్రిలోకహితకార్యం); ఏ+అది= ఏది; అనినన్= అని అడిగితే; వినుము; ధుంధుండు+అను, దానవుండు= ధుంధుండు అనే పేరుగల రాక్షసుడు; జగంబులకున్= లోకాలకు; ఉపద్రవంబు= ప్రమాదం; చేయంగలవాఁడు= చేయగలఁడు; తద్+వధ+అర్థంబు+ఐ= ఆతడిని సంహరించటం కొరకై; నీవు; బృహదశ్వ సూనుండు+ఐన= బృహదశ్వుడి కుమారుడైన; కువలాశ్వున్= కువలాశ్వుడిని; ఉద్యుక్తున్+చేసెదవు= ఆయత్తపడేవాడినిగా చేస్తావు; ఆ+నర+ఇంద్రుండు= నరులలో ఇంద్రుడివంటివా డయిన ఆరాజు; మత్+ప్రసాద, లబ్ధంబు+ఐన= నా అనుగ్రహంవలన సిద్ధించింది అయిన; యోగబలంబునన్+చేసి= యోగంయొక్క శక్తివలన; భవత్+నియోగంబునన్= నీపనుపువలన; ఆ+అసురన్= ఆరాక్షసుడిని; పరిమార్పన్= సంహరించటానికి; సమర్థుండు+అగున్= శక్తికలిగినవాడు ఔతాడు; ఆ+విశేషంబునకున్= పేర్కొనదగిన ఆ సంఘటనకు; నీవలనన్= నీమూలాన; అఖిల, లోకంబులు= అన్ని జగాలు; సంతసిల్లెడున్= సంతోషించగలవు; అని, పలికి= అని చెప్పి; విష్ణుదేవుండు= విష్ణువు; అంతర్హితుండు+అయ్యెన్= మాయమైనాడు; ఉదంకుండును; పూర్వప్రకారంబునన్= వెనుకటి మాదిరిగానే; తపంబు= తపస్సు; చేయుచుండెన్= సల్పుతున్నాడు; మఱియును= ఇంకను.

తాత్పర్యం: అని ఇంకను పెక్కురీతుల నుతిచేయగా, పాంచజన్యాన్ని ధరించే విష్ణుదేవుడు కరుణించి ఉదంకుడిని వరం కోరుకొనుమన్నాడు. అప్పుడు ఉదంకుడు ఇట్లా ప్రార్థించాడు: 'దేవా! నీవు నాకు సాక్షాత్కరించటమేచాలు. ఇంతకంటె నేను కోరదగిన వరం ఏముంటుంది? అయినను, నీ ఆజ్ఞచొప్పున నా వేడికోలు వినిపించెద. నామనస్సు ఎల్లప్పుడు సత్యంపై, ధర్మంపై ఇంద్రియనిగ్రహంపై ప్రసరించి సదా నీయందు భక్తితో లగ్నమై ఉండుగాక' విష్ణుమూర్తి అతడు కోరిన వరాన్ని అనుగ్రహించటం మాత్రమేగాక తనదయవలన అతడికి గొప్పజ్ఞానంగూడ సిద్ధించగలదని చెప్పాడు. అంతేకాక, మూడులోకాలకు శుభం చేకూర్చే కర్తవ్యాన్ని ఉదంకుడు నెరవేర్చవలెనని నిర్దేశించాడు. ఆ త్రిలోకహితకార్యం ఎట్టిదో, దానిని విష్ణుమూర్తి ఇట్లా వివరించాడు. 'ధుంధుడు' అనే రాక్షసుడు లోకాలకు విపత్తు కల్పించగలడు. ఆతడిని సంహరించటానికై నీవు బృహదశ్వుడి కుమారుడైన కువలాశ్వుడిని ఆయత్తం చేయాలి; ఆ రాజు నా అనుగ్రహంవలన లభించిన శక్తిచేతను, నీ నియోగంవలనను ఆ రాక్షసుడిని వధించే శక్తిని ఆర్జించగలడు. చరిత్రాత్మకమైన ఆ సంఘటనవలన అన్నిలోకాలు సంతసించగలవు' అని పలికి విష్ణుమూర్తి అంతర్ధానం చెందాడు. ఉదంకుడు వెనుకటివలెనే తిరిగి తపస్సు చేయసాగాడు.

విశేషం: 1. ఉదంకుడు కోరుకొనినవరం 'విష్ణుదేవుడియెడ దృఢభక్తి'. విష్ణుదేవుడు అతనికి భక్తితోపాటు - 'పరమజ్ఞానయోగాన్ని' గూడ ప్రసాదించాడు. ఉదంకునకు చివరకు లభించినవి- సత్యం, ధర్మం, ఇంద్రియనిగ్రహం, జ్ఞానం. అనగా ఇది కర్మ, భక్తి, జ్ఞానయోగాల సంపుటం.

సీ. **అనఘుఁ డిక్ష్వాకుఁ డీ యఖిలభూచక్రంబు । నేలి నాకమునకు నేఁగుటయును**
నతని నందనుఁడు శశాదుండు రాజయ్యె; । వాఁడు కకుత్స్థుఁ డన్వానిఁ గనియెఁ
నతఁ డనేనసుఁ డను నాత్మజుఁ బడసె నా । పృథివీపతికిఁబుట్టెఁ బృథుఁడనంగఁ
బృథుఁడు విష్వగుఁ డనుపేరి పుత్త్రకుఁ గాంచె; । నతనికి జనియించె నార్ద్రుఁ డనఁగ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. నార్ద్రునకుఁ బుట్టె యువనాశ్వుఁడను తనూజుఁ; । డాతనికిఁ బుట్టె శ్రావస్తుఁ డను విభుండు;
దత్సుతుఁడు బృహదశ్వుఁ డా ధరణిపతికి । నుగ్రతేజుండు గువలాశ్వుఁ డుదితుఁ డయ్యె. 379

ప్రతిపదార్థం: అనఘుఁడు= పాపరహితుడు; ఇక్ష్వాకుఁడు; ఈ అఖిలభూచక్రంబున్= సమస్తమైన ఈ భూమండలం అంతటిని; ఏలి= పరిపాలించి; నాకమునకున్= స్వర్గలోకానికి; ఏఁగుటయునున్= వెళ్ళుటయున్నూ; అతనినందనుఁడు= అతని కుమారుడు; శశాదుండు; రాజు+అయ్యెన్= రాజు అయినాడు; వాఁడు= (ఆ శశాదుడు); కకుత్స్థుఁడు+అన్‌వానిన్= కకుత్స్థుడు అనేవాడిని; కనియెన్= కన్నాడు; అతఁడు= (ఆ కకుత్స్థుడు); అనేనసుఁడు+అను, ఆత్మజున్+పడసెన్= అనేనసుడు అనేకొడుకును పొందాడు; ఆ పృథివీ, పతికిన్= ఆ రాజుకు; పృథుఁడు+అనంగన్= పృథుడు అనే పేరు కలవాడు; పుట్టెన్= జన్మించాడు. పృథుఁడు; విష్వగుఁడు+అనుపేరి; పుత్త్రకున్= కుమారుడిని; కాంచెన్= పొందాడు; అతనికిన్= (ఆ విష్వగుడికి); ఆర్ద్రుఁడు+అనఁగన్= ఆర్ద్రుడు అనేవాడు; జనియించెన్= పుట్టాడు; ఆర్ద్రునకున్; యువనాశ్వుఁడు+అను; తనూజుఁడు= కొడుకు; పుట్టెన్; ఆతనికిన్= ఆయువనాశ్వునకు; శ్రావస్తుఁడు+అను, విభుండు= శ్రావస్తుడు అనే రాజు; పుట్టెన్; తద్+సుతుఁడు= ఆతడి కొడుకు; బృహదశ్వుఁడు; ఆధరణీపతికిన్= ఆరాజునకు; ఉగ్రతేజుండు= భయంకరమైన తేజస్సుకలవాడు; కువలాశ్వుఁడు; ఉదితుఁడు+అయ్యెన్= పుట్టాడు.

తాత్పర్యం: పుణ్యాత్ముడైన ఇక్ష్వాకు డీ భూమండలాన్ని ఏలి స్వర్గలోకానికి వెళ్ళాడు. అతడి వంశవృక్షం ఈవిధంగా ఉన్నది. ఇక్ష్వాకుడు; అతడి కొడుకు శశాదుడు; అతడికొడుకు కకుత్స్థుడు; అతడి కొడుకు అనేనసుడు; అతడి కొడుకు పృథుడు; అతడి కొడుకు విష్వగుడు; అతడి కొడుకు ఆర్ద్రుడు; అతడి కొడుకు యువనాశ్వుడు; అతడి కొడుకు శ్రావస్తుడు; అతడి కొడుకు బృహదశ్వుడు; అతడికొడుకు కువలాశ్వుడు.

వ. అక్కువలాశ్వునకు నఖిలాస్త్రశస్త్రవిద్యావిశారదులనధికసత్త్వసంపన్నులు నైన పుత్త్రు లేకవింశతి సహస్రంబులు పుట్టి; రంత బృహదశ్వుండు నిజపుత్త్రుం గువలాశ్వుం బ్రాప్తసంతాను నత్యంతధర్మాన్వితు నఖిల మహీరాజ్యభార ధౌరేయుంగా నభిషేకించి, తపోవనంబునకుం బోవ సమకట్టి, యయోధ్యానగరంబు వెలువడు నవసరంబున నవ్వార్త విని యుదంకుండు సనుదెంచి బృహదశ్వున కిట్లనియె. 380

ప్రతిపదార్థం: ఆ+కువలాశ్వునకున్; అఖిల+అస్త్ర+శస్త్ర, విద్యా, విశారదులు= అన్నిమంత్రబాణాలకు, ఆయుధాలకు సంబంధించిన చదువులలో నేర్పరులు; అధిక, సత్త్వ, సంపన్నులు+ఐన= గొప్పబలం అనెడి సంపద కలవారలును అయిన; పుత్త్రులు= కొడుకులు; ఏకవింశతి సహస్రంబులు= ఇరువదియొక్క వేలమంది; పుట్టిరి= జన్మించారు; అంతన్= పిదప; బృహదశ్వుండు; తనపుత్త్రున్= తనకొడుకును; కువలాశ్వున్= కువలాశ్వుడిని; ప్రాప్తసంతానున్= పొందిన బిడ్డలు కలవాడిని; అత్యంతధర్మ+అన్వితున్= మిక్కిలి గొప్పదైన ధర్మంతో కూడినవాడిని; అఖిల, మహీ, రాజ్య, భార, ధౌరేయున్+కాన్= సమస్తమైన భూమిని పరిపాలించే బరువును మోసే వాడినిగా; అభిషేకించి= పట్టంగట్టి; తపస్+వనంబునకున్= తపస్సు చేసికొనే అడవికి; పోవన్, సమకట్టి= వెళ్ళటానికి ఉద్యమించి; అయోధ్యా, నగరంబు= అయోధ్యఅనేపట్టణం; వెలువడు, అవసరంబునన్= బయలువెడలే సమయంలో; ఆ+వార్త= ఆసమాచారం; విని= ఆలకించి; ఉదంకుండు; చనుదెంచి= వచ్చి, బృహదశ్వునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ కువలాశ్వ మహారాజుకు ఇరువదియొక్కవేలమంది కొడుకులు పుట్టారు. వారు అందరు మిక్కిలి బలం కలవారు. అస్త్ర శస్త్రాలకు సంబంధించిన విద్యలలో ఆరితేరినవారు, సంతానవంతుడు, మిక్కిలి ధర్మాత్ముడు అయిన కువలాశ్వుడికి పట్టంగట్టి, సమస్తభూమండల సామ్రాజ్యాన్ని పరిపాలించేబరువు బాధ్యతలను ఆతడిపై

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మోపి, అతడితండ్రి అయిన బృహదశ్వుడు తపోవనానికి పోవటానికి ఉత్సహించాడు. ఆ సమాచారం తెలిసికొని అయోధ్యానగరానికి వచ్చి, ఉదంకుడు ఆ మహారాజుతో ఇట్లా పలికాడు.

ఉ. 'నీవు ప్రజాభిరక్షణము నెమ్మి నొనర్పు; మరణ్య భూమికిం
బోవఁగ నేల? రాజులకు భూప్రజఁ గాచుటఁ బోలు; ధర్మువుల్
భూవర! కల్గునే యడవిఁ బోయి వసించినఁ గాని కాదె? ర
క్షావిధిఁ గాదె సద్గతులు గాంచిరి తొల్లిటి రాజముఖ్యులున్. 381

ప్రతిపదార్థం: భూవర!= భూమికి భర్తవైన ఓరాజా!; ప్రజా+అభిరక్షణము= ప్రజలను బాగా కాపాడటం; నెమ్మిన్= ప్రీతితో; ఒనర్పుము= చేయుము; అరణ్య, భూమికిన్= అడవినేలకు; పోవఁగన్+ఏల= పోవటం ఎందుకు; రాజులకున్= ప్రభువులకు; భూ, ప్రజన్= భూమిపై నివసించే జనులను; కాచుటన్+పోలు= కాపాడటంతో సమానమైన; ధర్మువుల్= ధర్మాలు; కల్గును+ఏ= ఉండునా; అడవిన్+పోయి= అడవిలోకి వెళ్ళి; వసించినన్+కాని= నివసించినగాని; కాదు+ఎ?= సరిపడదా?; తొల్లిటి= పూర్వకాలంలోని; రాజముఖ్యులున్= ప్రభువులలో ఎన్నదగినవారలును; రక్షా, విధిన్+కాదు+ఎ= (ప్రజలను) కాపాడే కర్తవ్యాన్ని నెరవేర్చుటచేతనే కదా; సత్+గతులు= మంచిపుణ్యాన్ని కలిగించే తెన్నులు; కాంచిరి= పొందారు.

తాత్పర్యం: 'ఓ బృహదశ్వమహారాజా! నీవు ప్రీతితో నీరాజ్యంలోని ప్రజలను రక్షించుము. అడవికి పోయి తపస్సు చేయటంవలననే పుణ్యం వస్తుందా? రాజుల కర్తవ్యం ప్రజలను కాపాడటమే. అదే వారి పరమధర్మం. ఆ ధర్మాన్ని నెరవేర్చటం అడవిలో ఒనగూడుతుందా? పూర్వకాలంలో గొప్పరాజులు ప్రజలను రక్షించే ధర్మాన్ని నెరవేర్చటం వలననే కదా పుణ్యాన్ని ఆర్జించారు.

క. నీ రక్షణంబుకతమున । ధారుణి మముబోఁటి సాధుతపసులు నిత్య
ప్రారంభధర్మకర్మో । ద్ధారు లగుట; యదియు నీదు ధర్మువు గాదే! 382

ప్రతిపదార్థం: నీ రక్షణంబు కతమునన్= నీవు కాపాడుతూ ఉండటం మూలంగా; ధారుణిన్= భూమిపై; మముబోఁటి= మావంటి; సాధు, తపసులు= సౌమ్యశీలం గలిగి తపస్సు చేసికొనేవారు. నిత్య, ప్రారంభ, ధర్మ, కర్మ, ఉద్ధారులు+అగుట= ప్రతి దినము మొదలుపెట్టి చేసే ధర్మంతో కూడియున్నకర్మలునెరవేర్చేవారు కావటం; అదియున్= ఆవిధంగా జరగటమున్నూ; నీదు, ధర్మువు= నీయొక్క ధర్మం; కాదు+ఏ= కదా!

తాత్పర్యం: నీవు కాపాడుతూ ఉండటంచేతనే సాధువులైన మావంటితపస్వులు నిత్యంభూమిమీద తమ తమ ధర్మకర్మలు యథావిధిగా నెరవేర్చగలుగుతున్నారు. ఇదికూడా నీ కర్తవ్యమే కదా.

వ. విను మొక్కయద్భుతంబు సెప్పెదఁ; దొల్లి మధుకైటభు లనం బ్రఖ్యాతు లైన యసురులతనయుండు ధుంధుం డనువాఁడు మహాబలపరాక్రమ సంపన్నుండు నిజతపోబలంబునం బితామహువలన వరంబు వడసి, దేవదానవ గంధర్వాదులకు నజయ్యుం డై చరియించుచుండు; నయ్యసుర యిపుడు మదీయాశ్రమ సమీపంబున బహుయోజనవిస్తీర్ణం బగు సముద్రవాలుకాపులినతలంబునందు మహావివరంబు గావించుకొని సుఖంబున నిద్రించుచున్నవాఁడు; వాలుకాంతరితశరీరుండైన వాని నిశ్వాసపవనంబు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధూమదహనజ్వాలాభీలం బయి సంవత్సరంబున కొక్కమాటు వెలువడి భూనభోంతరంబెల్లను నిరంతరసికతారజఃపటలంబుమాఁటుకొనంజేయుఁ; దదీయ వేగంబునఁ దత్సమీప భూమి శైలకాననంబు లేడు దినంబులదాఁకఁ గంపించుచుండు; నిట్టి దారుణత్వంబుకతంబున మాకు మా యాశ్రమంబున నుండుట సంకటంబు; గావున నద్దురాత్ము వధియించి మాకును లోకంబులకును హితంబు సేసి కృతకృత్యుండవై మఱి తపోవనంబున కరుగుము. 383

ప్రతిపదార్థం: వినుము= ఆలకింపుము; ఒక్క= ఒక్క; అద్భుతంబు= అచ్చెరువు; చెప్పెదన్= చెప్పుతాను; తొల్లి= పూర్వకాలంలో; మధు, కైటభులు+అనన్= మధువు కైటభుడు అనే పేర్లమీద; ప్రఖ్యాతులు+ఐన= పేరుకెక్కిన; అసురుల= రాక్షసుల యొక్క; తనయుండు= కొడుకు; ధుంధుండు+అనువాఁడు= ధుంధుడు అనేపేరు కలవాడు; మహా, బల, పరాక్రమ, సంపన్నుండు= గొప్పదైన బలం శౌర్యం అనే సంపద కలవాడు; నిజ, తపస్+బలంబునన్= తనయొక్క తపస్సు యొక్క శక్తిచొప్పున; పితామహువలనన్= బ్రహ్మదేవుడివలన; వరంబు= వలసినకోరిక; పడసి= సంపాదించి; దేవ, దానవ, గంధర్వ+ఆదులకున్= దేవతలు, రాక్షసులు, గంధర్వులు మున్నగువారలకు; అజయ్యుండు+ఐ= జయింప నలవిగానివాడై; చరియించుచుండున్= తిరుగుతుంటాడు; ఆ+అసుర= ఆరాక్షసుడు; ఇపుడు; మదీయ+ఆశ్రమ, సమీపంబునన్= నా ఆశ్రమానికి దగ్గరగా; బహుయోజనవిస్తీర్ణంబు+అగు= పెక్కు ఆమడల వైశాల్యంగల; సముద్రవాలుకాపులినతలంబునందున్= కడలిగట్టున ఉండే ఇసుకతిన్నెల చోటులందు; మహా, వివరంబు= గొప్పదైన సొరంగాన్ని; కావించుకొని= నిర్మించుకొని; సుఖంబునన్= హాయిగా; నిద్రించుచున్నవాఁడు= నిదురపోతున్నాడు; వాలుకా+అంతరిత, శరీరుండు+ఐన= ఇసుకతిన్నెలో దూరిఉన్న శరీరము కలవాడైన; వాని నిశ్వాసపవనంబు= వాడు పీల్చిన పిమ్మట మరల బయటికి విడిచేగాలి; ధూమదహనజ్వాలా+ఆభీలంబు+అయి= పొగతోకూడిన అగ్నిశిఖలచే భయంకరమైనదై; సంవత్సరంబునకున్+ ఒక్కమాటు= ఏటేట ఒకసారి; వెలువడి= బయటికి వ్యాపించి; భూ, నభస్+ అంతరంబు+ఎల్లన్= భూమికి ఆకసానికి నడుమ ఉండే అవకాశమంతటికిని; నిరంతర, సికతా, రజస్+పటలంబు= ఎల్లప్పుడున్నూ ఇసుకధూళి; మాఁటుకొనన్+చేయున్= కప్పేటట్లు చేయును; తదీయవేగంబునన్= ఆ(ఇసుకదుమ్ము) తీవ్రతకు; తద్+సమీప, భూమి, శైల, కాననంబులు= అక్కడికి చేరువగా ఉన్ననేల, కొండలు, అడవులు; ఏడుదినంబుల దాఁకన్= ఏడురోజులవరకును; కంపించుచుండున్= వణకిపోతూ ఉంటాయి; ఇట్టి= ఇటువంటి; దారుణత్వంబుకతంబునన్= భయంకరమైన సంఘటనవలన; మాకున్= మాకు; మా+ఆశ్రమంబునన్= మా ఆశ్రమంలో; ఉండుట= నివసించటం; సంకటంబు= కష్టం; కావునన్= కాబట్టి; ఆ+దురాత్మున్= ఆ దుష్టుడిని; వధియించి= చంపి; మాకును= (నాకును, మా ఆశ్రమవాసులకును); లోకంబులకును= జగత్తులకును; హితంబు+చేసి= మేలు ఒనగూర్చి; కృతకృత్యుండవు+ఐ= చేయవలసిన పనిని చేసినవాడవై; మఱి= తదుపరి; తపస్+వనంబునకున్= తపస్సు చేసికొనే అడవికి; అరుగుము= వెడలుము.

తాత్పర్యం: అచ్చెరువును గూర్చు ఒకవింతను వివరించి చెప్పుతాను వినుము. పూర్వకాలంలో మధుకైటభులు అనేపేర్లతో ప్రసిద్ధికెక్కిన రాక్షసుల కుమారుడు ధుంధుడు అనేవాడు గొప్పబలం కలవాడు. గొప్పశౌర్యంగలవాడు. అతడు గొప్పతపస్సుచేసి బ్రహ్మదేవుడిని మెప్పించి వరం సంపాదించాడు. అందుచేత అతడు దేవతలను రాక్షసులను గంధర్వులను లెక్కపెట్టక విహరించాడు. అతడిని ఎవరూ గెలువలేకపోయారు. ఆ రాక్షసుడు ఇప్పుడు మాఆశ్రమానికి దగ్గరగా, మిక్కిలి విశాలాలైన కడలి ఇసుకమేటలలో ఒక పెద్ద సొరంగం ఏర్పరచుకొని హాయిగా నిదురిస్తున్నాడు. ఇసుకతిన్నెలలో ఉన్న అతడి శరీరం నుండి అతడు పీల్చిన పిమ్మట బయటకు వదిలే పెనుగాలి, పొగతో గూడిన అగ్నిశిఖలచే భయంకరంగా సంవత్సరానికి ఒకసారి వెలువడి దగ్గరగా ఉన్న కొండలు అడవులు ఇసుకదుమ్ముచేత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మాటువడేటట్లు చేస్తూ ఉంటుంది. అట్లా ఏడురోజులు ఎడతెగక ఆ దారుణవాయువులు చెలరేగుతుంటాయి. అందుచేత మాకూ, మాఆశ్రమంలో ఉన్నవారికీ మిక్కిలి కష్టంగా ఉన్నది. కాబట్టి నీవు ఆ దుర్మార్గుడిని సంహరించి మాకే కాక ఇతరులకుగూడ మేలు చేసి, ధన్యాత్ముడవై పిదప తపోవనానికి వెళ్ళుము.

తే. **'ఎవ్వఁ డమ్మహాసురు వధియించు పనికిఁ । బూను నతనికి నాత్మీయభూరిశక్తి**
యిచ్చి జయ మిత్తు' నని యానతిచ్చె నధిప! యాదరంబున నాకుఁ జక్రాయుధుండు. **384**

ప్రతిపదార్థం: అధిప!= ఓరాజా!; ఎవ్వఁడు; ఆ+మహాసురున్= ఆ గొప్ప రక్కసుడిని; వధియించుపనికిన్+పూనున్= సంహరించే కార్యానికి పూనుకొంటాడో; అతనికిన్= అట్టివాడికి; ఆత్మీయభూరిశక్తి= నాదైన గొప్పబలం; ఇచ్చి= ఒసగి; జయము= గెలుపు; ఇత్తును= ఇస్తాను; అని= అని పలికి; చక్ర+ఆయుధుండు= చక్రం ఆయుధంగా గల విష్ణుదేవుడు; ఆదరంబునన్= అభిమానం చూపుతూ; నాకున్= నాకు; ఆనతి+ఇచ్చెన్= ఆజ్ఞ ఇచ్చాడు.

తాత్పర్యం: ఓ మహారాజా! 'ఆ గొప్ప రాక్షసుడైన ధుంధువును వధించే పనికి ఎవ్వడు పూనుకొంటాడో, అట్టివాడికి నాశక్తిసామర్థ్యాలనిచ్చి అతడికి విజయం చేకూర్చగల' నని, మిక్కిలి అభిమానంతో విష్ణుదేవుఁడు నాకు సెలవిచ్చాడు.

వ. **కావున.** **385**

తాత్పర్యం: కాబట్టి.

చ. **'అతులితవిష్ణుశక్తిసముపాహితమూర్తివి గమ్ము లెమ్ము! సం**
తతభుజశక్తి నిట్టి యవధాన మొనర్పఁగ నీవ కాని యీ
క్షితి నితరుండు లేఁ; డధికకీర్తియుఁ బుణ్యముఁ జేరు నిన్నుఁ; నూ
ర్జితగుణ! యింతవట్టుఁ దగఁ జేయుము; గావుము లోక మంతయున్.' **386**

ప్రతిపదార్థం: ఊర్జితగుణ!= గొప్పవైన మంచిలక్షణాలు కలవాడా!; అతులిత విష్ణుశక్తి సముపాహితమూర్తివి+కమ్ము= సాటిలేనట్టి విష్ణువుయొక్క బలంచేత ఆరోపించబడిన ఆకృతి కలవాడవు అగుము; లెమ్ము= మేలుకొనుము; సంతతభుజశక్తిన్= ఎల్లప్పుడు ఉండే పరాక్రమంచేత; ఇట్టి= ఇటువంటి; అవధానము+ఒనర్పఁగన్= ఏకాగ్రతతో కూడిన ఘనకార్యం చేయటానికి; ఈక్షితిన్= ఈభూమిపై; ఈవు+అ+కాని= నీవే తప్ప; ఇతరుండు= మఱిఒకడు; లేఁడు= ఉండడు; అధిక, కీర్తియున్= మిక్కుటమైన కీర్తియు; పుణ్యమున్= సుకృతమూ; నిన్నున్+చేరున్= నిన్ను పొందుతాయి; లోకము+అంతయున్= జగత్తునంతటిని; కావుము= రక్షించుము; ఇంత+పట్టున్= ఈ మేరకైన పనిని; తగన్= ఒప్పునట్లుగా; చేయుము= ఆచరించుము.

తాత్పర్యం: 'గొప్పవైన మంచి లక్షణాలతో విలసిల్లే ఓ బృహదశ్వమహారాజా! నీవు మేలుకొనుము; విష్ణువుయొక్క బలం సాటిలేనిది, అట్టిశక్తి నిన్ను ఆవహిస్తుంది; ఎల్లప్పుడు ప్రజ్వలించే శౌర్యసాహసాలతో కూడిన ఇట్టి ఘనకార్యం ఈభూలోకంలో నీవు తప్ప ఇంకెవ్వరు నెరవేర్చగలరు? కాబట్టి ఈ లోకాన్నంతటిని కాపాడుము. నీకు గొప్పపుణ్యం చేకూరగలదు. నీకు నిరుపమానమైన యశస్సు లభిస్తుంది.'

వ. **అనినం గృతాంజలి యై యుదంకునకు బృహదశ్వుం డి ట్లనియె.** **387**

తాత్పర్యం: అని అనగా బృహదశ్వుడు చేతులుజోడించి ఉదంకుడితో ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'విమలమతి నస్త్రసన్న్యా । సము సేసితిఁ, దప మొనర్ప సమకట్టితి, నిం
క మునీంద్ర! తపోవనగమ । నము దప్పదు నాకు; వినుము నా విన్నపమున్. 388

ప్రతిపదార్థం: ముని+ఇంద్ర!= మునులలో ఇంద్రుడివంటివాడా!; విమల, మతిన్= కల్మషం లేని బుద్ధితో; అస్త్రసన్న్యాసము+ చేసితిన్= మంత్రబాణాలను వదలిపెట్టాను; తపము+ఒనర్పన్, సమకట్టితిన్= తపస్సు చేయటానికై పూనుకొన్నాను; ఇంకన్= ఇంకమీద; తపస్+వన, గమనము= తపస్సు కొరకు అడవికి వెడలటం; నాకున్; తప్పదు= తప్పించుకొనరానిది; నావిన్నపమున్= నావిజ్ఞప్తిని; వినుము.

తాత్పర్యం: 'మునులలో శ్రేష్ఠుడవైన ఓ ఉదంకమహర్షీ! నా విన్నపం వినుమని ప్రార్థిస్తున్నాను. ఎట్టి కాలుష్యం లేని మంచి మనసుతో నేను అస్త్రసన్న్యాసం చేసి ఉన్నాను. ఇంక ఆయుధాలను ముట్టను. తపస్సు చేయటానికై వ్రతాన్ని పూనాను. ఇక తపోవనానికి వెడలటం నాకు తప్పనిసరి అయింది.

చ. అనఘుఁడు మత్సుతుండు గువలాశ్వుఁడు వీఁడె మహాబలుండు స
జ్జనహితకారి ధైర్యనిధి సంభృతకీర్తి భవత్ప్రియార్థ మై
జననుత! యమ్మహాసురునిఁ జంపుట కోపు నవార్యశౌర్యవ
ర్ధనులగుచున్న పుత్త్రులును దాను నభేద్యభుజావిభూతితోన్. 389

ప్రతిపదార్థం: జననుత= ప్రజలచేత పొగడబడినవాడా!; అనఘుఁడు= పాపరహితుడు; మత్+సుతుండు= నాకొడుకు; కువలాశ్వుఁడు; వీఁడు+ఎ= ఇదిగోవీడే; మహా, బలుండు= గొప్ప బలం కలవాడు; సత్+జన, హితకారి= మంచివారలకు మేలు చేసేవాడు; ధైర్య, నిధి= దీమసం ప్రోగైన నెలవు; సంభృతకీర్తి= నిండైన కీర్తి కలవాడు; భవత్+ప్రియ+అర్థము+ఐ= నీకు ఇష్టం కలిగించటంకొరకై; తానును= కువలాశ్వుడును; అవార్య, శౌర్య, వర్ధనులు+అగుచున్న= వారించటానికి వీలు లేకుండగా విలసిల్లే శూరత్వంతో పెంపొందుతున్న; పుత్త్రులును= కొడుకులును; (కువలాశ్వుడి పుత్రులును); అభేద్య, భుజా, విభూతితోన్= భేదింపరాని, పరాక్రమసంపదతో; ఆ+మహా+అసురునిన్= ఆ గొప్పరక్కసుడిని; చంపుటకున్= సంహరించటానికి; ఓపున్= చాలును.

తాత్పర్యం: జనులచేత పొగడబడిన ఓ ఉదంకమహర్షీ! నాకుమారుడు కువలాశ్వుడు పుణ్యాత్ముడు, గొప్పబలవంతుడు. చూడుము. ఒక్కడే చాలు. మంచివారలకు మేలొనగూర్చేవాడు. ఇతడు ధైర్యసాహసాలు గలవాడు. గొప్ప పేరు ప్రతిష్ఠలు ఆర్జించినవాడు. ఇతని పుత్రులు మొక్కవోని శౌర్యసంపద గలవారు. కువలాశ్వుడును, అతని కొడుకులును అప్రతిహతశౌర్యంతో ఆ రక్కసుడిని వధించి నీఅభీష్టం నెరవేర్చగలరు.

వ. నాకుం దపంబున కనుజ్ఞ యీవలయు' నని పలికి యక్కార్యంబునకుఁ బుత్త్రు సమర్పించి యమ్మునిచేత నభినందితుండై బృహదశ్వుండు దపోవనంబునకరిగె' ననిన విని ధర్మనందనుండు, మార్కండేయుతో 'ధుంధుండు మధుకైటభులపుత్త్రుండని చెప్పితి; రమ్మధుకైటభు లెక్కాలంబువా? రేమి యై?' రని యడిగిన నతం డి ట్లనియె. 390

ప్రతిపదార్థం: నాకున్= నాకు; తపంబునకున్= తపస్సుకు; అనుజ్ఞ= అనుమతి; ఈవలయున్= ఇయ్యవలెను; అని పలికి= అని చెప్పి; ఆ+కార్యంబునకున్= ఆ పనికి; పుత్త్రున్= కొడుకును; సమర్పించి= ఒసగి (నియోగించి), ఉదంకునకు ఒప్పగించి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ మునిచేతన్= ఆ ఉదంకమహర్షిచేత; అభినందితుండు+ఐ= పొగడబడినవాడై; బృహదశ్వుండు; తపస్+వనంబునకున్= తపస్సు చేసికొనే అడవికి; అరిగెన్= వెళ్ళాడు; అనినన్= అనిచెప్పగా; విని= ఆలకించి; ధర్మనందనుండు= ధర్మరాజు; మార్కండేయునితో; ధుంధుండు; మధుకైటభుల పుత్త్రుండు+అని= మధుకైటభులయొక్క కొడుకు అని; చెప్పితిరి; ఆ మధుకైటభులు; ఏ+కాలంబు, వారు= ఏకాలానికి చెందినవారు; వారు+ఏమి+ఐరి= వారు ఏవిధంగా పరిణమించారు; అని అడిగినన్= అని ప్రశ్నించగా; అతండు= మార్కండేయుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: నాకు తపస్సు చేసికొనటానికి దయచేసి అనుమతి ప్రసాదింపుము. మీరు కోరిన పనికి నాకుమారుడిని నియోగించి మీకు ఒప్పగించాను' అని బృహదశ్వుడు చెప్పాడు. ఉదంకుడు సంతోషించి బృహదశ్వుడిని అభినందించాడు. అతడు తపోవనానికి వెళ్ళాడు. ఆవృత్తాంతం విని ధర్మరాజు 'ధుంధుడు మధుకైటభుల కుమారుడని తాము చెప్పియుంటిరికదా! వారు ఏకాలానికి చెందినవారు? వారిగతి చివర కేమైనది?' అని ప్రశ్నించగా, మార్కండేయ మహాముని ఈవిధంగా చెప్పాడు.

మార్కండేయుఁడు ధర్మరాజునకు మధుకైటభుల చరిత్రము సెప్పుట (సం. 3-194-13)

సీ. **'అధిప! తొల్లి జగత్త్రయంబు నేకార్ణవ । మై యుండఁగా నప్డు హరి యొకండ**
భాసుర భోగీంద్రపర్యంకమున భవ్య । యోగనిద్రాసుఖయుక్తి నలర
నతిదీర్ఘమగు కాల మరిగెఁ; బదంపడి । దైత్యు లిద్దఱు మహోదాత్తబలులు
మధుకైటభులు నాఁగ మథితశాత్రవు లేఁగు । దెంచి యప్పరమాత్ము దివ్యనాభి

ఆ. **కమలమున వెలుంగు కమలాసనునిఁ గని । దర్పదోషనిహతిఁ దలర వ్రేయ,**
నతఁడు భీతి నొంది యాక్రోశ మొనరించె । 'నాదిపురుష! నన్ను నరయు' మనుచు. 391

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ధర్మరాజా!); తొల్లి= పూర్వకాలంలో; జగత్+త్రయంబున్= జగత్తులు మూడును; ఏక+అర్ణవము+ఐ+ఉండఁగాన్= ఒకే సముద్రమై ఉండగా; అప్డు= అప్పుడు; హరి= విష్ణువు; ఒకండు+అ= ఒక్కడే; భాసుర, భోగి+ఇంద్ర, పర్యంకమునన్= ప్రకాశించే పాములరేడు శయ్యగా ఉండగా; భవ్య, యోగ, నిద్రా, సుఖ, యుక్తిన్= శుభమైన యోగంవలన చేకూరినట్టిది అయిన నిద్రవలన ఏర్పడిన సౌఖ్యంతో కూడి; అలరన్= ఒప్పగా; అతి, దీర్ఘము+అగు= చాల నిడివి గల; కాలము+అరిగెన్= కాలం కడచింది; పదంపడి= పిమ్మట; దైత్యులు= రాక్షసులు; ఇద్దరు= ఇరువురు; మహా+ఉదాత్త, బలులు= మిక్కిలిగొప్పదైన శక్తికలవారు; మధుకైటభులు; నాఁగన్= మధుకైటభులు అనగా; మథితశాత్రవులు= మథించబడిన శత్రువులుకలవారు; ఏఁగుదెంచి= వచ్చి; ఆ+పరమ+ఆత్ము= ఆ దేవదేవుడియొక్క; దివ్యనాభికమలమునన్= దివ్యమైన బొడ్డుతామరలో; వెలుంగు= ప్రకాశించే; కమల+ఆసనునిన్= బ్రహ్మదేవుడిని, (తామరపువ్వు ఆసనంగా కలవాడిని); కని= చూచి; దర్పదోషనిహతిన్= గర్వం వలన ఏర్పడిన తప్పుయొక్క తాకిడితో; తలరన్= కలుగునట్లుగా; వ్రేయన్= కొట్టగా; అతఁడు= (బ్రహ్మదేవుడు); భీతిన్+ఒంది= భయంచెంది; ఆదిపురుష!= మొదటి పురుషుడా! - ఓ పరమాత్మా!; నన్నున్= నన్ను (బ్రహ్మదేవుడిని); అరయుము= చూడుము; అనుచున్= అని పలుకుతూ; ఆక్రోశము+ఒనరించెన్= పెద్దపెట్టున ఏడ్చాడు;

తాత్పర్యం: 'ఓధర్మరాజా! పూర్వకాలంలో మూడులోకాలున్నూ ఒకేఒక మహాసముద్రంగా ఏర్పడి ఉండగా, అప్పుడు ఆ విష్ణుమూర్తి ఒక్కడే ఆదిశేషుడిమీద పవ్వళించి యోగనిద్రాముద్రలో సౌఖ్యతన్మయుడై ఉండగా చాలాకాలం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గడచింది. పిదప, మధుకైటభులు అనే పేర్లుగల ఇద్దరు రాక్షసులు మిక్కిలి గొప్ప బలంగలవారై, ఎందరో శత్రువులను నిర్మూలించినవారై వచ్చి, విష్ణుమూర్తినాభిలో విలసిల్లే కమలంలో ఉన్న బ్రహ్మదేవుడిని గర్వంతో కొట్ట నారంభించారు. అప్పుడు బ్రహ్మ 'ఓ ఆదిదేవా! రక్షించు' మంటూ పెద్దపెట్టున ఏడ్చాడు.

ఉ. ఆ తెఱఁ గాత్మఁ గాంచి కమలాక్షుఁడు మేల్కని ఘోరవిక్రమో
పేతుల దైత్యసింహుల నపేతభయాత్ములఁ జూచి 'మీర లి
ట్లీతని నుక్కునం బఱుప నేల? భవద్బలశౌర్యయుక్తికిం
బ్రీతుఁడ నైతిఁ; జెచ్చెర నభీష్టవరంబులు వేఁడుఁ డిచ్చెదన్.' 392

ప్రతిపదార్థం: ఆ, తెఱఁగు= ఆ రీతిని; ఆత్మన్+కాంచి= తనమనస్సులో గ్రహించి; కమల+అక్షుఁడు= పద్మాలవంటి కన్నులు కలవాడు- విష్ణుమూర్తి; మేల్కని= నిద్రనుండి లేచి; ఘోర, విక్రమ+ఉపేతులన్= భయంకరమైన పరాక్రమంతో కూడినవారిని; దైత్యసింహులన్= రాక్షసులలో సింహాలవంటివారిని; అపేత, భయ+ఆత్ములన్= పోయినట్టి భయంగల ఆత్మలు కలవారిని; చూచి; మీరలు= మీరు(మధుకైటభులు); ఇట్లు= ఈవిధంగా; ఈతనిన్= (ఈ బ్రహ్మదేవుడిని); ఉక్కునన్= శౌర్యంతో; పఱుపన్+ఏల= బాధించటం ఎందుకు; భవత్+బల, శౌర్య, యుక్తికిన్= మీ శక్తిపరాక్రమాల కూడికకు; ప్రీతుఁడన్+ఐతిన్= సంతోషించినవాడను అయినాను; చెచ్చెరన్= శీఘ్రంగా; అభీష్టవరంబులు= ఇష్టమైన కోరికలు; వేఁడుఁడు= కోరుకొనండి; ఇచ్చెదన్= ఇస్తాను.

తాత్పర్యం: మధుకైటభుల అత్యాచారం ఆత్మలో గ్రహించి విష్ణుమూర్తి యోగనిద్రనుండి మేలుకొన్నాడు. దారుణమైన పరాక్రమంచేత భయం లేకుండా విద్రవీగుతున్న రాక్షసులు సింహసదృశులు విష్ణుమూర్తికి కన్పించారు. అంతట విష్ణుదేవుడు వారలతో, 'నేను మీ ధైర్యసాహసాలకు శౌర్యానికి సంతోషించాను. మీరు కోరిన వరాలు ఇవ్వగలను; శీఘ్రంగా వేడండి' అని అన్నాడు.

తే. అనినఁ గలకల నవ్వి యయ్యసురవరులు। 'నీవు మా కేమి యిచ్చెదు? నీకు నేము
వరము లిచ్చెద మడుగుము వలచితేని'। ననిన వారల కిట్లను నవ్విభుండు. 393

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+అసురవరులు= ఆ రాక్షసశ్రేష్ఠులు; నీవు= నీవు (ఓవిష్ణుదేవా); మాకున్+ఏమి+ఇచ్చెదు= (మాకు ఏమి ఇస్తావు); నీకున్ (విష్ణుదేవుడికి); ఏము= (మధుకైటభులం); వరములు+ఇచ్చెదము= వలసిన కోరికలు ఇస్తాము; వలచితి+ఏనిన్= ఇష్టపడితే; అడుగుము= కోరుకొనుము; అనినన్= అని చెప్పగా; ఆ+విభుండు= ఆ ప్రభువు (విష్ణుదేవుడు); వారలకున్= (మధుకైటభులకు); ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: విష్ణుదేవుడిమాటలు విని మధుకైటభులు కలకలనవ్వి ఇట్లా చెప్పారు 'ఓ విష్ణుదేవా! నీవా మాకు వరాలు ఇచ్చేవాడివి? నీ వరాలు మా కేమీ వద్దు. నీకే మేము వరం ఇవ్వగలం. కావలసివస్తే అడుగుము'. అంతట విష్ణుదేవుడు ఇట్లా బదులు పలికాడు.

క. 'సత్యవ్రతులార! వరం। బత్యంతప్రీతి మిమ్ము నడిగెద లోక
ప్రీత్యర్థముగా నాచే। మృత్యువునం బొందుఁ డిపుడ మీర లిరువురున్.' 394

ప్రతిపదార్థం: సత్యవ్రతులార!= సత్యాన్ని దీక్షతోపాటించే అసురులారా!; వరంబు= వలసినకోరిక; అతి+అంత, ప్రీతిన్= మిక్కిలివేడుకతో; మిమ్మున్ అడిగెదన్= మిమ్మల్ని అడుగుతాను; మీరలు ఇరువురున్= మీరు ఇద్దరున్నూ; లోక, ప్రీతి+అర్థముగాన్= లోకంలోని ప్రజలందరికి సంతసం కలగటం కొరకై; ఇపుడు+అ= ఈక్షణంలోనే; నాచేన్= నాచేతను; మృత్యువునన్+ పొందుఁడు= మరణించుడు.

తాత్పర్యం: 'ఆడినమాట తప్పక దీక్షతో పాటించే మధుకైటభులారా! మిక్కిలి వేడుకతో మిమ్మల్ని నేనే ఒక వరం కోరుతాను. లోకానికి మేలు కలగటం కొరకై మీరు ఇరువురున్నూ ఇప్పుడే నాచేత మరణించండి'.

వ. అనిన వార లొండొరువుల మొగంబులు చూచికొని యా చక్రధరున కిట్లనిరి. 395

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; వారలు; ఒండు+ఒరువుల, మొగంబులు= వారలు (మధుకైటభులు) ఒకరి మొగాన్ని ఒకరు చూచికొని; ఆ చక్రధరునకున్= చక్రం ధరించే ఆ విష్ణువుకు; ఇట్లు+అనిరి= ఈవిధంగా అన్నారు.

తాత్పర్యం: అని విష్ణుదేవుడు ఆడిన మాటలు విని ఆ మధుకైటభులు ఇరువురూ ఒకరిమొగం ఒకరు చూచికొని ఆ విష్ణుదేవుడితో ఇట్లా బదులు పలికారు.

చ. 'నగి నగి యేనియున్ విను జనార్దన! యెన్నఁడు బొంకు పల్కు; మ
త్యగణిత విక్రమోరుబలధైర్యసమగ్రుల; మెల్ల భంగిఁ గా
లగతి దొలంగఁ ద్రోవఁగఁ దలం బగునే? ; యగుఁ గాక! నీకు మె
చ్చుగ నిదె ప్రాణ మిచ్చెదము; స్రుక్కము చావున కాత్మ నేమియున్. 396

ప్రతిపదార్థం: జనార్దన!= ఓవిష్ణుమూర్తీ!; విను; నగి= నగి+ఏనియున్= నవ్వులాట కొరకుకూడ; ఎన్నడున్= ఎన్నడున్నూ; బొంకు= అసత్యం; పల్కుము= మాటాడం; అతి+అగణిత, విక్రమ+ఉరు, బల, ధైర్య, సమగ్రులము= మిక్కుటంగా లెక్క పెట్టజాలని శౌర్యంచేత గొప్పదైన శక్తితో దీమసంతో పరిపూర్ణుల మైన వారలం; ఎల్లభంగిన్= ఎన్ని విధాలనైనను; కాలగతిన్= కాలంయొక్క నడకను; తొలంగన్, త్రోవఁగన్= తొలగేటట్లుగా; త్రోసివేయటానికి; తలంబు+అగునే= శక్యం ఔతుందా; అగున్+కాక= నీకోరికనెరవేరుగాక!; నీకున్, మెచ్చుగన్= నీవు అభినందించేటట్లుగా; ప్రాణము+ఇచ్చెదము= ప్రాణం ఇస్తాం; చావునకున్= మరణానికి; ఆత్మన్+ఏమియున్= మనస్సునందు ఏమీ; స్రుక్కము= బాధపడం.

తాత్పర్యం: 'ఓ విష్ణుదేవా! మా ప్రతిన ఆలకింపుము. మేము నవ్వులాటకొరకైనా ఆడినమాట తప్పేవారం కాము. వర్ణనాతీతమైన గొప్పపరాక్రమం గలవారం. ధైర్యసాహసాలు గలవారం. ఎట్టివారికిని కాలగతిని మార్పుచేయటం శక్యమైన పనికాదు. ఆ మాటకేమి గాని, ఇప్పుడు నీకు ప్రీతి కలిగించేటట్లు మాప్రాణం ఇవ్వటానికి సంసిద్ధులం. మేము మనస్సులో కూడ ఎట్టి దుఃఖాన్ని పొందటం లేదుసుమా!

ఆ. చంపెదేని మమ్ము జలములు లేని దే। శమునఁ జంపవలయుఁ గమలనాభ!
నిక్కమింత వట్టు; నీచేత మడియంగఁ। దగుదు' మనిన నగుచు నగధరుండు. 397

ప్రతిపదార్థం: కమలనాభ!= తామరపువ్వు బొడ్డులో కలవాడా!, (ఓవిష్ణుదేవా!); మమ్మున్= (మా ఇరువురను- మధుకైటభులను); చంపెదు+ఏనిన్= సంహరిస్తే; జలములు= నీళ్ళు; లేనిదేశమునన్= లేనిచోటున; చంపవలయున్= సంహరించాలిసుమా;

నీచేతన్= నీచేత; మడియంగన్= చావగా; తగుదుము= ఒప్పుతాం; నిక్కము= నిజం; ఇంతవట్టు= ఇంతమేర; అనినన్= అని చెప్పగా; నగ ధరుండు= (కొండను ధరించినవాడు) విష్ణుదేవుడు; నగుచున్= పరిహసిస్తూ, నవ్వుతూ.

తాత్పర్యం: ఓవిష్ణుదేవా! నీవు మమ్మ్ చంపదలిస్తే నీరు లేనిచోట చంపాలి. ఇది మేము నిజంగా ఏర్పరచుకొన్న నియమం. నీవు ఈ నియమానికి లోబడితే నీచేత మేము చావటానికి సంసిద్ధంగా ఉన్నాం' -అని మధుకైటభులు అనగా, విష్ణుదేవుడు నవ్వుతూ.

వ. త్రైలోక్యంబును జలమయం బగుట నాలోకించి. 398

ప్రతిపదార్థం: త్రైలోక్యంబును= మూడు లోకముల మేరయును; జలమయంబు= నీటితో నిండటం; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: మూడులోకాలున్నూ నీళ్లతో నిండిపోయి ఉండటం చూచి (గమనించి).

క. పరమేశుఁడు దన యూరులు । పరపుగ నొనరించి వానిపైఁ దచ్ఛిరముల్
పరుషతరశితసుదర్శన । ఖరధారానిహతిఁ జేసి గ్రక్కునఁ దునిమెన్. 399

ప్రతిపదార్థం: పరమ+ఈశుఁడు= దేవదేవుడైన విష్ణుమూర్తి; తన, ఊరులు= తనతొడలు; పరపుగన్= శయ్యగా; ఒనరించి= చేసి; వానిపైన్= (ఆ తొడలపై); తద్+శిరముల్= వారితలలు; పరుషతర, శిత, సుదర్శన, ఖర, ధారానిహతిన్+చేసి= మిక్కిలి కఠినమైన, వాడిఅయిన సుదర్శన మనే చక్రాయుధంయొక్క కరకుఅంచుల దెబ్బచేత; గ్రక్కునన్= వేగంగా; తునిమెన్= ఖండించాడు.

తాత్పర్యం: విష్ణుమూర్తి తన తొడలనే వేదికగా చేసి వారి తలలను వాటిపై ఉంచి, పరుషమైనదీ, వాడి అయినదీ అయిన సుదర్శన చక్రధారతో తెగనరికాడు.

తే. పరఁగ నమ్మధుకైటభాసురులసుతుఁడు । సువ్వె ధరణీశ! ధుంధుఁడన్ శూరవరుఁడు
వాఁడు వరగర్వమునఁ జేసి వాఁడి మిగిలి । యమరపతిఁ దొట్టి వేల్పుల నభిభవించె'. 400

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= ఓరాజా, ధర్మరాజా!; ధుంధుఁడు+అన్, శూర, వరుఁడు= ధుంధుఁడు అనేపేరు గల వీరశ్రేష్ఠుడు; పరఁగన్= ఒప్పునట్లుగా; ఆ+మధుకైటభ+అసురుల, సుతుఁడు= ఆ మధుకైటభులు అనే రక్కసుల కుమారుడు; సువ్వె= సుమా; వాఁడు= (ఆధుంధుడు); వర, గర్వమునన్+చేసి= వరం పొందటంవలన ఏర్పడిన అహంకారంచేత; వాఁడి, మిగిలి= శౌర్యం అతిశయించి; అమరపతిన్+తొట్టి= దేవేంద్రుడు మొదలుకొని; వేల్పులన్= దేవతలను; అభిభవించెన్= అవమానించాడు.

తాత్పర్యం: 'ఓధర్మరాజా! ఆ మధుకైటభుల కొడుకే ధుంధుడు అనేశూరశ్రేష్ఠుడు. వరలాభంవలన ఏర్పడిన అహంభావంచేత శౌర్యం అతిశయించి, దేవేంద్రుడు మొదలైన దేవతల నందరినీ అవమానించాడు.'

వ. అని చెప్పి యమ్మునీంద్రుం డి ట్లనియె: నట్లు బృహదశ్వుచేత ననుజ్ఞాతుండై కువలాశ్వుండు శుభదినంబున నుదంకపురస్సరంబుగాఁ గృతప్రస్థానుం డై. 401

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; ఆ+ముని+ఇంద్రుండు= మునులలో శ్రేష్ఠుడైనవాడు మార్కండేయుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు; అట్లు= ఆవిధంగా; బృహదశ్వుచేతన్= బృహదశ్వుడిచేత; అనుజ్ఞాతుండు+ఐ= ఆజ్ఞాపించబడినవాడై;

కువలాశ్వుండు= కువలాశ్వుడు; శుభ, దినంబునన్= మంచి రోజున; ఉదంకపురస్సరంబుగాన్= ఉదంకుడిని ముందు నిడుకొని; కృత, ప్రస్థానుండు+ఐ= చేయబడిన ప్రస్థానం కలవాడై అనగా దండయాత్రకు ఉపక్రమించి.

తాత్పర్యం: మార్కండేయమహర్షి ఇంకా ఈవిధంగా చెప్పాడు- ఆవిధంగా బృహదశ్వుడిచేత ఆజ్ఞాపించబడి అతడిపుత్రుడు కువలాశ్వుడు ఒకానొక శుభముహూర్తాన ఉదంకమహామునిని మార్గదర్శకుడిగా ముందు ఉంచుకొని దండయాత్రకు తరలి వెళ్ళాడు.

తరలము.

దనుజనిర్మథనైకతత్పరతావిజృంభణ మొప్ప స
ద్వినుతతేజుఁడు ఘోరసంగరవిక్రమోత్సవలీలమై
ఘనభుజాబలభూరిదుర్వహగర్వసంగ్రహు లైన నం
దను లనేకసహస్రసంఖ్యులు దన్నుఁ గొల్వ నుదగ్రుఁడై. 402

ప్రతిపదార్థం: సత్+వినుత, తేజుఁడు= మంచివారలచేత పొగడబడినప్రతాపం కలవాడు, కువలాశ్వుడు; దనుజ నిర్మథన+ఏక, తద్+పరతా, విజృంభణము+ఒప్పన్= రాక్షసులను ధ్వంసం చేయటంలో మాత్రమే కేంద్రీకరించబడి నిమగ్నమైన మోహరింపు విలసిల్లగా; ఘోర, సంగర, విక్రమ+ఉత్సవ, లీలమైన్= భయంకరమైన యుద్ధానికి సంబంధించిన శౌర్యంయొక్క ఆట మాదిరిగా; ఘన భుజాబల భూరి దుర్వహ గర్వ సంగ్రహులు+ఐన= గొప్పదైన బాహువులశక్తికి సంబంధించిన మిక్కుటమైన భరించటానికి శక్యంగాని అహంభావాన్ని చేర్చుకొనిన వారు ఐన - అనగా మిక్కుటమైన ధైర్యశౌర్యసాహసాలు కలవారైన; నందనులు= కొడుకులు; అనేక, సహస్ర, సంఖ్యులు= పెక్కువేలమంది; తన్నున్= తనను; కొల్వన్= ఆరాధించగా; ఉదగ్రుఁడు+ఐ= అతిశయించినవాడై.

తాత్పర్యం: మంచివారిచేత ప్రస్తుతించబడిన తేజస్సు కలవాడైన కువలాశ్వుడు, రాక్షసులను సంహరించవలెననే కుతూహలంతో దీక్షతో విజృంభించి, దారుణయుద్ధాన్ని పండుగవేడుకగా నిర్వహించే సంకల్పంతో, ధైర్యశౌర్యసాహసోపేతులైన కొడుకులు వెన్నంటి వస్తూ ఉండగా, దండయాత్రకు బయలుదేరాడు.

విశేషం: తరలవృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, భ, ర, స, జ, జ, గ - అనే గణాలు ఉంటాయి. 12వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది.

మ. చతురంగధ్వజినీపదప్రవిహతిన్ సర్వంసహాచక్ర మా
తతకంపంబుగ నేఁగె; నప్పుడు దగం దైత్యారి యారాజునం
దతులం బైన నిజాంశశక్తి సొనిపెన్; హర్షించి రింద్రాది దే
వతలున్ సన్మునిముఖ్యులున్ నృపతి కైశ్వర్యోన్నతిం జేయుచున్. 403

ప్రతిపదార్థం: చతురంగ, ధ్వజినీ, పద ప్రవిహతిన్= నాలుగు అంగాలతో కూడిన సేనయందలి భటులయొక్క పాదాలతాకిడిచేత; సర్వం సహాచక్రము= సమస్తమైన భూమండలం, ఆతత, కంపంబుగన్= మిక్కుటంగా చలించేదిగా; (కువలాశ్వుడు) ఏఁగెన్= వెళ్ళాడు; అప్పుడు= ఆసమయంలో; తగన్= ఒప్పునట్లుగా; దైత్య+అరి= రాక్షసులకు శత్రు వైన విష్ణుమూర్తి; ఆ రాజునందున్= ఆ కువలాశ్వుడిలో; అతులంబు+ఐన= సాటిలేని; నిజ+అంశ, శక్తి= తనలో ఒకభాగమైన బలాన్ని; చొనిపెన్= చొప్పించాడు;

ఇం(ద్ర+ఆది, దేవతలున్= ఇం(ద్రుడు మొదలగు వేల్పులున్నూ; సత్+ముని, ముఖ్యులున్= గొప్పఋషులలో (ప్రధానులైన వారలున్నూ; నృపతికిన్= రాజుకు - కువలాశ్వుడికి; ఐశ్వర్య+ఉన్నతిన్+చేయుచున్= సంపద పెంపొందేటట్లుగా చేస్తూ; హర్షించిరి= సంతోషించారు.

తాత్పర్యం: రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలాలు అనే నాలుగు అంగాలతో కూడిన సేనతో భూమండలం కంపించేటట్లుగా కువలాశ్వుడు దండు వెడలాడు. అప్పుడు రాక్షసులకు శత్రువైన విష్ణుదేవుడు తనశక్తిని కొంత ఆ రాజులో ప్రవేశపెట్టాడు. అందుకు దేవేంద్రుడు మున్నగు దేవతలున్నూ మునిశ్రేష్ఠులున్నూ సంతోషించారు. వారి ఆశీస్సులచేత కువలాశ్వుడు అభ్యున్నతి చెంది వెలుగొందాడు.

ఆ. మొరసి దివ్యతూర్యములు నందనద్రుమ । సురభికుసుమవృష్టి గురిసెఁ గలయ
సప్రతీపభంగి యగు మందపవనవి । చేష్టితంబు గర మభీష్ట మయ్యె. 404

(ప్రతిపదార్థం: దివ్య, తూర్యములు= స్వర్గలోకంలోని మంగళవాద్యాలు; మొరసెన్= నినదించాయి; నందన, (ద్రుమ, సురభి, కుసుమ, వృష్టి= నందనం, అనేపేరు గల ఉద్యానంలోని చెట్లయొక్క సువాసనతో కూడిన పూలవాన; కురిసెన్= వర్షించింది; కలయన్= చుట్టుపట్టుల వ్యాపించేటట్లుగా; అ(ప్రతీపభంగి+అగు= అనుకూలంగా ఉన్న; మందపవన విచేష్టితంబు= మెలమెల్లగా వీచే పిల్లగాలుల (ప్రసారం; కరము= మిక్కిలి; అభీష్టము+అయ్యెన్= ఇంపుగొలుపునట్టిది అయింది.

తాత్పర్యం: స్వర్గలోకంలోని మంగళవాద్యాలు నినదించాయి. నందనోద్యానంలోని చెట్లకు సంబంధించిన పూలవాన కురిసింది. అనుకూలమయిన పిల్లతెమ్మెరలు వీస్తూ ఇంపుగొలిపాయి.

క. గగనమున సురవిమానము । లగణితముగఁ గ్రందుకొనియె; ననుకూలము లై
మృగపక్షిగతులు శోభన । మగు టేర్పడఁ జెప్పె నజ్జనాధిపుయాత్రన్. 405

(ప్రతిపదార్థం: ఆ+జన+అధిపు, యా(త్రన్= ఆ రాజుయొక్క దండయా(త్రలో; సుర, విమానములు= వేల్పుల విమానాలు; గగనమునన్= ఆకసంలో; అగణితముగన్= లెక్కకుమిక్కిలై; (క్రందుకొనియెన్= గుమిగూడాయి. అనుకూలములు+ఐ= తగినవియై మృగపక్షిగతులు= జంతువులు పక్షులు సంచరించే విధానాలు; శోభనము+అగుట= మేలు చేకూరటాన్ని; ఏర్పడన్+చెప్పెన్= తేటతెల్లమయ్యేటట్లు సూచించాయి.

తాత్పర్యం: ఆరాజు దండయా(త్రకు ఉప(క్రమించినప్పుడు పెక్కుశుభశకునాలు తారసిల్లాయి. ఆకసంలో వేలుపుల విమానాలు గుమిగూడి కన్పించాయి. జంతువుల, పక్షుల సంచారం శుభం జరుగగలదనే సూచనలను తేటతెల్లం చేసింది.

వ. ఇట్లు చని కువలాశ్వుండు సముద్రతీరంబున విడిసి నిజపుత్త్రుల నానాస్త్రశస్త్రజ్ఞుల ననేకసహస్ర సంఖ్యలగు వారల నవారితజవసత్త్వుల నవ్వాలుకాపులినఖననంబు సేయ నియోగించిన. 406

(ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; చని= వెడలి; కువలాశ్వుండు; సము(ద్రతీరంబునన్= కడలిఒడ్డున; విడిసి= తాత్కాలికంగా ఆగి; నిజపు(త్త్రులన్= తనకొడుకులను; నానా+అస్త్ర, శ(స్త్రజ్ఞులన్= పెక్కురకాలైనమం(త్రాయుధాలను, ఆయుధాలను ఎఱిగినవారలను; అనేక, సహ(స, సంఖ్యలు+అగు, వారలన్= పెక్కువేలసంఖ్యకలవారిని; అవారిత, జవ, సత్త్వులన్= వారించటానికి వీలులేని

వేగం బలం కలవారిని; ఆ+వాలుకా, పులిన, ఖననంబు+చేయన్= ఆ ఇసుకతిన్నెలను త్రవ్వపనిచేయటానికి; నియోగించినన్= ఏర్పాటుచేయగా.

తాత్పర్యం: ఈవిధంగా దండు వెడలిన కువలాశ్వుడు సముద్రతీరం చేరి, అక్కడ తాత్కాలికమైన శిబిరాలు నెలకొల్పాడు. పెక్కు అస్త్రాలు శస్త్రాలు ప్రయోగించటంలో నిపుణులైన తనపుత్రులను పెక్కువేలమందిని, ఆ కడలితీరంలో ఇసుకతిన్నెలను త్రవ్వటం కొరకై నియోగించాడు.

మ. **నరనాథోత్తము నందనుల్ గడఁగి నానా శూలకుద్దాల ము**
ద్గర కాష్ఠాదుల నయ్యుదగ్రసికతౌఘంబంతయున్ సప్త వా
సరముల్ వాయక పాయ గ్రొచ్చి నడుమన్ సంసుప్తుఁడై యున్న యా
సురవైరిం గని రుగ్రనిశ్వసననిష్ఠ్యూతాగ్ని కీలావృతున్. **407**

ప్రతిపదార్థం: నరనాథ+ఉత్తము, నందనుల్= రాజులలో శ్రేష్ఠుడు అయిన కువలాశ్వుడియొక్క కొడుకులు; కడఁగి= పూని; నానాశూల కుద్దాల, ముద్గర, కాష్ఠ+ఆదులన్= పెక్కుబల్లాలు, గడ్డపారలు, సమ్మెటలు, కొయ్యమేకులు మున్నగు పరికరాలతో; ఆ+ఉదగ్ర+సికతా+ఓఘంబు+అంతయున్= దట్టమైన ఆ ఇసుక సముదాయాన్ని అంతటిని; సప్తవాసరముల్= ఏడునాళ్ళు, పాయక= విడువక; పాయగ్రొచ్చి= సొరంగంగా లోతుగా త్రవ్వి; నడుమన్= మధ్యభాగంలో; సంసుప్తుఁడు+ఐ+ఉన్న= నిదురపోయినవాడుగా ఉన్న- అనగా నిదురిస్తున్న; ఉగ్ర, నిశ్వసన, నిష్ఠ్యూత+అగ్ని, కీలా+ఆవృతున్= భయంకరమైన నిట్టూర్పులచేత వెలిగ్రక్కబడిన నిప్పులమంటలచే చుట్టుకొనబడిన వాడైన; ఆ, సుర, వైరిన్= ఆ రక్కసుడిని; కనిరి= చూచారు.

తాత్పర్యం: కువలాశ్వుడి కొడుకులు బల్లేలు, గునపాలు, సమ్మెటలు, కొయ్యమేకులు మున్నగు పరికరాలతో ఆ ఇసుకతిన్నెలను సొరంగంగా ఏడురోజులపాటు త్రవ్వారు. అక్కడ నిదురిస్తున్న రక్కసుడిని చూచారు. ఆ రాక్షసుడి ముఖంనుండి వేడినిట్టూరుపుగాలులు అగ్నిజ్వాలలతో కలిసి వెలువడి ఆ ప్రాంతాన్ని క్రమ్ముకొన్నాయి.

చ. **అడరి నిశాతపట్టిస గదాసి పరశ్వధశూలహస్తు లై**
తడయక వార లందఱును దానవుదేహము వీఁక వ్రేసియుం
బొడిచియు నొంప నెంతయును బ్రొద్దున కయ్యసురాధముండు బి
ట్టొడలు గదల్చి నీల్గి వివృతోగ్రముఖుం డయి యావులించినన్. **408**

ప్రతిపదార్థం: అడరి= విజృంభించి; నిశాత, పట్టిస, గదా+అసి, పరశ్వధ, శూల, హస్తులు+ఐ= వాడిమి గల పట్టిసాలనే ఆయుధాలు, గదలు, కత్తులు, గండ్రగొడ్డళ్ళు, బల్లేలు చేతులలో పూని; తడయక= ఆలసించక; వారలు+అందఱును= వారందరూ (కువలాశ్వుడి కొడుకులు); దానవుదేహము= రక్కసుడిశరీరం; వీఁకన్= పరాక్రమంతో; వ్రేసియున్= కొట్టియును; పొడిచియున్= గ్రుచ్చియు; నొంపన్= బాధించగా; ఎంతయును ప్రొద్దునకున్= ఎంతో సేపటికి; ఆ+అసుర+అధముండు= రాక్షసులలో నీచుడైనవాడు; బిట్టు+ఒడలు, కదల్చి= ఎక్కువగా శరీరాన్ని కంపింపజేసి; నీల్గి= ఒళ్ళు విరిచికొని; వివృత+ఉగ్ర, ముఖుండు+అయి= తెరవబడింది భయంకరమైనది అయిన మొగం (నోరు) కలవాడై; ఆవులించినన్= ఆవులించగా.

తాత్పర్యం: కువలాశ్వుడి కుమారులు పెక్కు ఆయుధాలు పట్టిసాలు, గదలు, కత్తులు, గండ్రగొడ్డళ్ళు, బల్లేలు చేతులలో పూనినవారై ఆ రక్కసుడిని చుట్టుముట్టారు. ఆ ఆయుధాలతో వారు ఆ రక్కసుడిని చాలసేపు మోదగా మోదగా, అతడు శరీరాన్ని కదల్చి, నోరు భయంకరంగా తెరిచి ఆవులించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. భోరున విస్ఫులింగములు వొడ్మఁగఁ దన్ముఖనేత్రనాసికా
ద్వారములందు వెల్వడియె దారుణవహ్ని శిఖాకలాపముల్
వారక యందు గ్రుంది రనివార్యులు రాజకుమారు లందఱున్
ఘోరత సాగరుల్ గపిలుకోపమునన్ నశియించు చాడ్పునన్. 409

ప్రతిపదార్థం: భోరునన్= శీఘ్రంగా; విస్ఫులింగములు= అగ్నికణాలు; పొడమ్మఁగన్= ఉద్భవించగా; తద్+ముఖ, నేత్ర, నాసికా, ద్వారములందున్= ఆతడియొక్క మొగం, కన్నులు, ముక్కు వీటి రంధ్రాలనుండి; దారుణ, వహ్ని, శిఖా, కలాపముల్= ఘోరమైన అగ్నిజ్వాలల సముదాయాలు; వెల్వడియెన్= బయటికి వ్యాపించాయి; వారక= ఉడుగక; అందున్= అగ్నిలో; రాజకుమారులు+అందఱున్= రాచకొడుకులు అందరున్నూ; అనివార్యులు= వారించటానికి అలవిగానివారు; ఘోరతన్= భయంకరంగా; సాగరుల్= సగరునిపుత్రులు; కపిలుకోపమునన్= కపిలమహర్షియొక్క కినుకచేత; నశియించుచాడ్పునన్= ధ్వంసమైన రీతిగా; గ్రుందిరి= ధ్వంసమయ్యారు.

తాత్పర్యం: ఆ రక్కసుడి నోటి నుండి, కన్నుల నుండి, ముక్కునుండి అగ్నికణాలతో జ్వాలలు బయలుదేరాయి. ఆ ఘోరమైన అగ్నిజ్వాలలలో తప్పించుకొనటానికి వీలులేక అలనాడు సగరుని కొడుకులందరూ కపిలమహర్షి కోపానికి ఆహుతి అయినట్లుగా, కువలాశ్వుడి కుమారులు అందరూ నశించారు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు దృఢాశ్వ కపిలాశ్వ భద్రాశ్వులు దక్కం దక్కిన కొడుకులందఱుఁ బొడవడంగినఁ గడంగి కినుకం గువలాశ్వుండు సంహారసమయ సప్తాశ్వుండునుం బోలె నుజ్జ్వలుం డయి కదియుటయు, నద్దానవుండు క్రోధసంరంభంబున సముత్థితుండై యొక్కశూలంబెత్తికొని కవిసె నప్పుడమ్మహీవిభుండు తదీయదేహజనితం బై మండుచున్న యనలం బాత్మీయయోగవిద్యాప్రభవం బగు జలప్రవాహంబునం బ్రశాంతంబు గావించి బ్రహ్మాస్త్రంబు ప్రయోగించిన. 410

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; దృఢాశ్వ, కపిలాశ్వ, భద్రాశ్వులు+తక్కన్= దృఢాశ్వుడు కపిలాశ్వుడు భద్రాశ్వుడు అనేవారు తప్ప; తక్కిన= మిగిలిన; కొడుకులు+అందఱున్; పొడవు+అడంగినన్= రూపుమాయగా; కడంగి= పూని; కినుకన్= కోపంతో; కువలాశ్వుండు; సంహార, సమయ, సప్తాశ్వుండునున్+పోలెన్= ప్రళయకాలంలోని సూర్యుడిని పోలుతూ; ఉజ్జ్వలుండు (ఉత్+జ్వలుండు)+అయి= మిక్కుటంగా ప్రకాశించేవాడై; కదియుటయున్= చుట్టుముట్టుటయున్నూ; ఆ+దానవుండు= ఆరాక్షసుడు; క్రోధసంరంభంబునన్= కినుకవలన ఏర్పడిన వేగిరపాటుతో; సముత్థితుండు+ఐ= లేచి విలువబడి; ఒక్కశూలంబు= ఒక బల్లెం; ఎత్తికొని= తీసికొని; కవిసెన్= ఎదిరించాడు; అప్పుడు; ఆ+మహీవిభుండు= భూమికి భర్తయైన ఆ రాజు (కువలాశ్వుడు); తదీయ, దేహ, జనితంబు+ఐ= ఆ (రాక్షసుడియొక్క) శరీరంనుండి పుట్టినది అయిన; మండుచున్న= జ్వలిస్తున్న; అనలంబు= అగ్ని; ఆత్మీయ, యోగ, విద్యా, ప్రభవంబు+అగు= తనదైన యోగవిద్యయొక్క నేర్పువలన జనించినది అయిన; జల, ప్రవాహంబునన్= నీటిపారుదలచేత; ప్రశాంతంబు, కావించి= అణగారిపోయేటట్లుగా చేసి; బ్రహ్మ+అస్త్రంబు= బ్రహ్మకు సంబంధించిన మంత్రబాణం; ప్రయోగించినన్= నాటేటట్లు విడిచిపెట్టగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా కువలాశ్వుడి కొడుకులు దృఢాశ్వుడు, కపిలాశ్వుడు, భద్రాశ్వుడు అనే ముప్పురుతప్ప అందరూ మరణించారు. అంతట కోపంతో ప్రళయకాలంలోని సూర్యుడివలె విజృంభించి, కువలాశ్వుడు ఆ రాక్షసుడిని చుట్టుముట్టి యుద్ధం చేశాడు. ఆ రాక్షసుడు లేచి నిల్చొని ఒక్కబల్లెం చేతబట్టి కువలాశ్వుడిని ఎదుర్కొన్నాడు. అంతట రాజు తన యోగశక్తివలన ఉద్భవించిన జలప్రవాహంచేత ఆ రాక్షసుడి దేహంనుండి మండుతున్న అగ్నిజ్వాలలను ఆర్పివేసి, ఆతడిపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **ఆ దివ్యాస్త్ర జ్వలనము । భూదిగ్గగనములు వెలుఁగఁ బొదివి మహోగ్రం**
బై దానవేంద్రుదేహము । బూదిగ నొనరించెఁ జిత్రముగ నొకమాత్రన్. **411**

ప్రతిపదార్థం: ఆ దివ్య+అస్త్ర, జ్వలనము= ఆ వేలుపుబాణంయొక్క మంట; భూ, దిక్+గగనములు= పుడమి, దిక్కులు, ఆకాశమున్నూ; వెలుఁగన్+పొదివి= దీప్తులు వ్యాపించ క్రమ్ముకొని; మహా+ఉగ్రంబు+ఐ= మిక్కిలి భయంకరమై; దానవ+ఇంద్రుదేహము= ఆ గొప్ప రాక్షసుడియొక్క శరీరం; చిత్రముగన్= అచ్చెరువు ఒనగూర్చునట్లుగా; ఒకమాత్రన్= ఒకత్రుటి కాలంలో; బూదిగన్= బుగ్గిగా; ఒనరించెన్= చేసింది.

తాత్పర్యం: దివ్యశక్తిగల ఆ బ్రహ్మాస్త్రం భూమినీ ఆకాశాన్నీ దిక్కులనూ మిరుమిట్లు గొలిపేటట్లుగా వెలిగించి, ఒక్క త్రుటికాలంలో ఆ రక్కసుడి శరీరాన్ని బుగ్గిగా చేసింది.

విశేషం: రాక్షస+ఇంద్రుఁడు= రాక్షసులలో ఇంద్రుడు అనగా గొప్పరాక్షసుడు, ఇంద్రశబ్దం శ్రేష్ఠవాచకం. ఇట్లే కవీంద్రుడు మున్నగు ప్రయోగాలు.

వ. **అంత.** **412**

తాత్పర్యం: పిదప,

క. **'సురశత్రుఁడైన ధుంధునిఁ । బరిమార్చితి వీవు జగదభయకారివి భూ**
వర! ధుంధుమారుఁ డనఁగాఁ । బరఁగు' మనిరి సురలు మునులు పార్థివముఖ్యా! **413**

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= రాజులలో శ్రేష్ఠుడవైనవాడా! ధర్మరాజా!; సుర, శత్రుఁడు+ఐన= వేల్పులకు విరోధి అయిన; ధుంధునిన్= ధుంధుడు (అను పేరు గల రక్కసుడిని); పరిమార్చితివి= సంహరించావు; ఈవు= నీవు; జగత్+అభయ, కారివి= లోకానికి భయం పోగొట్టి శాంతిని అనుగ్రహించిన వాడవు; భూవర!= భూమికి భర్తవైన ఓరాజా!; ధుంధుమారుఁడు+అనఁగాన్= ధుంధుమారుడు అనే పేరుతో; పరఁగుము= ఒప్పుము (అని); సురలు= దేవతలు; మునులు= ఋషులు; అనిరి= (అని) చెప్పారు.

తాత్పర్యం: రాజులలో పేర్కొనదగిన ఓ ధర్మరాజా! ఆ రక్కసుడిని సంహరించిన కువలాశ్వుడిని దేవతలు ఋషులు ఇట్లా అభినందించారు- 'రాజులలో శ్రేష్ఠుడవైన ఓకువలాశ్వా! నీవు దేవతలకు విరోధి అయిన ధుంధుని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంహరించి లోకానికి అభయప్రదానం చేసిన మహావీరుడవు. ఇప్పటినుండి లోకవ్యవహారంలో నీవు 'ధుంధుమారుడు' అనే బిరుదుపేరుతో విలసిల్లుము'.

వ. ఇట్లు ప్రసన్నులై యింద్రాదిదేవతలు నుదంకప్రముఖ సంయమి వరులును నమ్మహీవరు నభినందించి 'నీ కెయ్యది యిష్టంబు వేఁడు' మనిన, నతండు బ్రాహ్మణభక్తియు ననవరతదానశీలతయు విష్ణునితోడి సఖ్యంబును వరంబులుగాఁ దనకుఁ గోరిన, నట్ల యొసంగి, వారలందఱు నిజనివాసంబుల కరిగిరి; కువలాశ్వుండును విజయోల్లాసభాసితుండై పురంబున కరిగి, సముజ్జ్వల సామ్రాజ్యసౌఖ్యంబులంబరఁగెనని మార్కండేయుండు ధర్మరాజునకుఁ గువలాశ్వుండు ధుంధుమారుం డైన విధంబు సెప్పె నని వైశంపాయనుండు జనమేజయున కెఱింగించిన తెఱంగు. 414

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; ప్రసన్నులు+ఐ= సంప్రీతిని చెందినవారై; ఇంద్ర+ఆది, దేవతలు= ఇంద్రుడు మున్నగు వేల్పులు; ఉదంక, ప్రముఖ, సంయమి, వరులును= ఉదంకుడు మున్నగు ఋషివరేణ్యులును; ఆ+మహీవరున్= రాజులలో శ్రేష్ఠుడైన ఆతడిని; అభినందించి= సంతసంతో మెచ్చికొని; నీకు+ఏ+అది, ఇష్టంబు= నీకు ఏది ప్రీతిని చేకూరుస్తుందో అది; వేడుము= కోరుకొనుము; అనినన్= అని వచించగా; అతండు= (కువలాశ్వుడు); బ్రాహ్మణభక్తియున్= విప్రులయెడ పూజ్యభావమున్నూ; అనవరత, దాన, శీలతయున్= ఎల్లప్పుడు పరోపకృతికై తన సొత్తు నిచ్చే స్వభావాన్నీ; విష్ణుని తోడి సఖ్యంబును= విష్ణుమూర్తితో స్నేహాన్నీ; వరంబులుగాన్= వలసిన కోరికలుగా; తనకున్= తనకు(కువలాశ్వుడికి); కోరినన్= కోరగా; అట్లు+అ= అట్లే; ఒసంగి=ఇచ్చి; వారలు+అందఱు= వారు అందరును (ఇంద్రాదిదేవతలు); నిజ, నివాసంబులకున్= తాము నివసించే స్థానాలకు; అరిగిరి= వెళ్ళారు; కువలాశ్వుండును; విజయ+ఉత్+లాస, భాసితుండు+ఐ= గెలుపుచేత ఏర్పడిన గొప్పఉత్సాహంచేత వెలుగొందినవాడై; పురంబునకున్= (తన రాజధాని) నగరానికి; అరిగి= వెళ్ళి; సముజ్జ్వల, సామ్రాజ్యసౌఖ్యంబులన్= మిక్కిలిగా శోభించే గొప్పరాజ్యాన్ని ఏలేటప్పుడు లభించే సుఖాలతో; పరఁగెను= విలసిల్లాడు; అని; మార్కండేయుండు; ధర్మరాజునకు; కువలాశ్వుండు; ధుంధుమారుండు+ఐన, విధంబు= ధుంధుమారుడు అయిన (అనే పేరుమీద పరగిన) రీతిని; చెప్పెన్= చెప్పెను; అని; వైశంపాయనుండు; జనమేజయునకున్; ఎఱింగించిన= తెల్పిన; తెఱంగు= విధం.

తాత్పర్యం: ఈవిధంగా, సంప్రీతిని చెందిన దేవతలు ఇంద్రుడు మున్నగువారున్నూ, ఉదంకుడు నాయకుడుగా గల ఋషివరేణ్యులున్నూ ఆ కువలాశ్వమహీపతిని అభినందించి, 'నీకు ఇష్టమైన వరాన్ని కోరుకొమ్ము' అన్నారు. ఆ మహారాజు తనకు విప్రులయెడ పూజ్యభావాన్నీ, తాను ఎల్లప్పుడు పరోపకారబుద్ధితో ఇతరులకు దానాలు చేసేస్వభావం కలిగిఉండేటట్లుగానూ; విష్ణుభక్తినీ వరాలుగా ఇమ్మని అర్థించాడు. వారు అతడికి ఆ వరాలు ప్రసాదించి తమతమ నెలవులకు వెళ్ళారు. కువలాశ్వుడు గెలుపువలన ఏర్పడిన సంతోషంతో తన రాజధానీనగరానికి తిరిగి వెళ్ళి, గొప్పగా వెలుగొంది విలసిల్లెడి సామ్రాజ్యసౌఖ్యాలను అనుభవిస్తూఉన్నాడని మార్కండేయమహర్షి ధర్మరాజునకు కువలాశ్వుడు ధుంధుమారుడనే బిరుదుపేరు పడసిన తీరును వివరించి చెప్పాడు. ఆ కథను సర్పయాగసమయంలో జనమేజయమహారాజుకు, వైశంపాయనమహర్షి వినిపించాడు.

విశేషం: ఈకథ చదివే వారికి సహజంగా పుట్టే సందేహం ఒకటి. కువలాశ్వుడు విజయం సంపాదించిన సంతోషం సహజమైనదే కాని, వేలకువేలమంది కొడుకులు మరణించిరిగదా. అది విషాదదాయకం కాదా? కొన్ని ప్రతులలో - 'ఉదంకుని నిజాశ్రమంబున

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కనిచి, కుమారసహస్రంబులతో నిజపురంబున కరిగి వారాంగనానృత్యగాన విశేషంబు లాలోకించుచు' అనే పాఠంకూడా ఉన్నది. అంతకు ముందుగా, కువలాశ్వుడు 'దనుజునివలన మృతులైన తనసుతులు గలుగను వరంబు గోరిన' - 'రాక్షసనిహతులైన యతని పుత్త్రులం బునర్జీవితులుగా బ్రసాదించి వార లేగి' రనియున్నూ కలదు. సంస్కృతమూలంలో ఇది లేదు. అందుచేత ఈ భాగం తెలుగులో ప్రక్షిప్తంగా భావించే విమర్శకులు ఉన్నారు. 'వారాంగనా' ప్రసక్తి వలన ఆర్వాచీనుడు ఎవ్వడో తెలుగులో ఈ యధికపాఠాన్ని పాఠకుల సందేహనివృత్తికై చేర్చియుండవచ్చును.

ఆశ్వాసాంతము

క. చరమయుగచరిత ధర్మ। స్థిరీకరణచతురచరిత! ధీగుణలీలా
పరికరపరిచితనయ। విస్తర! వితరణ వివరణైక దానవినోదా! 415

ప్రతిపదార్థం: చరమ, యుగ, చరిత, ధర్మ, స్థిరీకరణచతురచరిత!= చివరియుగం అనగా, కలియుగచరిత్రలో ధర్మాన్ని స్థాపించటంలో నేర్పుకలచరిత్రకలవాడా!; ధీ, గుణ, లీలా, పరికర, పరిచిత, నయ, విస్తర!= బుద్ధిబలంయొక్క లక్షణంచేత ఆటపనిముట్టుగా ఏర్పడిన విలసిల్లిన సౌమ్యరాజనీతి వ్యాపింపజేసేవాడా!; వితరణ, వివరణ+ఏక, దానవినోదా!= త్యాగానికి వ్యాఖ్యానప్రాయమే అనే రీతిగా పరోపకారంకొరకు తన సొత్తును ఇతరులకు ఇచ్చివేయటం అనే వినోదం కలవాడా!

తాత్పర్యం: కలియుగంలో ధర్మం క్షీణిస్తున్నప్పటికీ, తిరిగి ఆ కలియుగంలోనే ధర్మాన్ని నిశ్చలంగా నిలిచేటట్లు ప్రతిష్ఠించే నేర్పుకలవాడా! శేముషీ వైభవంచేత పరిపాలనలో శాంతిభద్రతలు విలసిల్లునట్టి సౌమ్యరాజనీతి కలవాడా! త్యాగం అనే మాటకు, నిదర్శనప్రాయం అని చెప్పి చూపగలిగేటట్లుగా, పరోపకారార్థమై నిజసంపదను ఇతరులకు ఉచితంగా ఇచ్చివేయటం అనే వినోదం కలవాడా!

విశేషం: ఇది ఆశ్వాసాంతపద్యాలలో మొదటిది. ఈ సంబోధనలు కృతిపతి అయిన రాజరాజనరేంద్రుడికి అన్వయించేవి. రాజరాజనరేంద్రుడు కలియుగంలో ధర్మసంస్థాపకుడు, రాజనీతిచతురుడు, పరిపాలనాదక్షుడు, ఆదర్శదాత అని- ఈ సంబోధనల సారాంశం.

మాలిని.
కరివరకిరికూర్మక్ష్మాధరాధీశ తుల్యో। ద్ధరణగుణధురీణోద్దండబాహార్గళాగ్ర
స్ఫురిత నిఖిలగోత్రాభోగ భాగైక భోగా! తరుణ రుచిరమూర్తీ! ధర్మతంత్రానువర్తీ! 416

ప్రతిపదార్థం: కరివర, కిరి, కూర్మ, క్ష్మాధరాధీశ, తుల్య+ఉద్ధరణ, గుణ, ధురీణ+ఉద్దండ, బాహా+అర్గళ+అగ్ర, స్ఫురిత, నిఖిల, గోత్ర+ఆభోగ, భాగ+ఏకభోగా!= శ్రేష్ఠమైన ఏనుగులు అనగా దిగ్గజాలు, వరాహం, తాబేలు, కొండలరేడుతో సమానమైనఉద్ధరించే లక్షణాన్ని వహించే గడియవంటి గొప్పవైన చేతుల చివరిభాగంవలన సూచించబడే సమస్త భూమి సామ్రాజ్య భాగాన్ని ముఖ్యంగా అనుభవించేవాడా!; తరుణ, రుచిర, మూర్తీ!= యౌవనంతో ప్రకాశించే ఆకృతి గలవాడా!; ధర్మ, తంత్ర+అనువర్తీ!= ధర్మంతో కూడినప్రణాళికను అనుసరించేవాడా!

తాత్పర్యం: దిగ్గజాలతో, ఆదివరాహంతో, ఆదికూర్మంతో, కులపర్వతాలతో సమానమైన భుజశక్తితో సమస్తమైన భూమిని ఏకభోగంగా భరించే సార్వభౌమా! రాజరాజా! యౌవనతేజస్సు గల ఆకృతి కలవాడా! ధర్మాన్నే రాజనీతిగా చేసి అనుసరించేవాడా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మాలినీ వృత్తంలో ప్రతిపాదానికీ 15 అక్షరాలుంటాయి. న,న,మ,య,య అనే గణాలు పాదంలో వరుసగా నిలుస్తాయి. 9వ అక్షరం యతిమైత్రి స్థానం. ప్రాసనియమం ఉన్నది. పురాణ సారస్వతంలో భూమిని భరించేశక్తిగలవి - దిగ్గజాలు, ఆదివరాహం, ఆదికూర్మం, క్ష్మాధరం అనగా పర్వతం. కులపర్వతాలు భూమిని భరించేవి. "మహేంద్రోమలయస్సహ్యశ్శుక్తిమాన్ గంధమాదనః । వింధ్యశ్చ పారియాత్రశ్చ సప్తైతే కులపర్వతాః."

గద్యము.

ఇది సకల సుకవిజన వినుత నన్నయభట్ట ప్రణీతంబైన శ్రీమహాభారతంబునం దారణ్యపర్వంబున యక్ష యుద్ధంబును, గుబేరదర్శనంబును, నర్జునాగమనంబును, బాండవులకడకు నింద్రుండు సనుదెంచుటయు, నర్జునుండు నివాతకవచ కాలకేయ పౌలోమ వధ ప్రకారం బెఱింగించుటయు, నాజగరంబును, బాండవులు గామ్యకవనంబునకు వచ్చుటయుఁ; గృష్ణమార్కండేయాగమనంబును, బ్రాహ్మణప్రభావంబును, సరస్వతీగీతయు, వైవస్వతు చరితంబును,గల్పాంతప్రకారంబును, యుగధర్మకీర్తనంబును, వామ్యాశ్వహరణంబును, నింద్రద్యుమ్నోపాఖ్యానంబును, ధుంధుమారచరితంబును నన్నది చతుర్థాశ్వాసము.417

ప్రతిపదార్థం: ఇది= (ఈ గ్రంథం-ఆరణ్యపర్వం చతుర్థాశ్వాసం); సకల సుకవిజనవినుత నన్నయభట్ట ప్రణీతంబు+ఐన= అందరు మంచికవుల సముదాయంచేత స్తుతించబడిన నన్నయభట్టుచేత వ్రాయబడిన, శ్రీమహాభారతంబునందున్= శ్రీమహాభారతంలో; ఆరణ్యపర్వంబునన్= ఆరణ్యపర్వంలో; యక్షయుద్ధంబును= యక్షులతోడిపోరున్నూ; కుబేరదర్శనంబునున్= కుబేరుడిని చూచుటయున్నూ; అర్జున+ఆగమనంబును= అర్జునుడు వచ్చుటయున్నూ; పాండవులకడకున్= పాండవులు ఉన్నచోటికి; ఇంద్రుండు= ఇంద్రుడు; చనుదెంచుటయున్= వచ్చుటయున్నూ; అర్జునుడు; నివాతకవచ, కాలకేయ, పౌలోమ, వధప్రకారంబు= నివాతకవచులయొక్కయు, కాలకేయులయొక్కయు, పౌలోముల యొక్కయు సంహార విధం; ఎఱింగించుటయున్= తెలియజేయుటయున్నూ; అజగరంబును= కొండచిలువకు సంబంధించిన వృత్తాంతమున్నూ; పాండవులు= పాండురాజు కొడుకులు; కామ్యకవనంబునకున్= కామ్యకం అనే పేరుగల అడవికి; వచ్చుటయున్= రాకయూ; కృష్ణ మార్కండేయ+ ఆగమనంబును= కృష్ణుడు, మార్కండేయుడు వచ్చుటయున్నూ; బ్రాహ్మణ, ప్రభావంబును= విప్రులయొక్క మహిమయున్నూ; సరస్వతీగీతయున్= సరస్వతీ గీతయు; వైవస్వతు, చరితంబును= వైవస్వతుడి కథయున్నూ; కల్ప+అంత, ప్రకారంబును= కల్పంచివర దాపురించే ప్రళయం జరిగే తీరున్నూ,యుగధర్మకీర్తనంబును= యుగాలకు సంబంధించిన లక్షణాలను గూర్చిన వర్ణనయున్నూ; వామ్య+అశ్వ, హరణంబును= వామ్యజాతిగుర్రాల అపహరణం; ఇంద్రద్యుమ్న+ఉపాఖ్యానంబును= ఇంద్రద్యుమ్నుడినిగూర్చిన కథయున్నూ; ధుంధుమారచరితంబునున్= ధుంధుమారుడి కథయూ; అన్నది= అనునట్టిది; చతుర్థ+ఆశ్వాసము= నాలుగవ ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది అందరు కవులచేత పొగడబడిన నన్నయభట్టు వ్రాసిన శ్రీమదాంధ్రమహాభారతంలో ఆరణ్యపర్వంలోని నాలుగవ ఆశ్వాసం. ఇందలి విషయానుక్రమణిక ఇది. యక్షయుద్ధం, కుబేరదర్శనం, అర్జునాగమనం, పాండవులకడకు ఇంద్రుడు రావటం, అర్జునుడు నివాతకవచులను కాలకేయులను పౌలోములను సంహరించినతీరు, కొండచిలువ వృత్తాంతం, పాండవులు కామ్యకవనానికి రావటం, కృష్ణమార్కండేయులరాక, విప్రులమహిమ, సరస్వతీగీత, వైవస్వతమనువుగాథ, ప్రళయప్రకారం, యుగధర్మవర్ణనం, వామ్యాశ్వాలను అపహరించటం, ఇంద్రద్యుమ్నుడికథ, ధుంధుమారచరితం.

విశేషం: ఆరణ్యపర్వం నాలుగవ ఆశ్వాసంలో 141 పద్యముల వరకు వ్రాసినది నన్నయభట్టు. తరువాత అనగా 142వ పద్యమునుండి ఆరణ్యపర్వంలోని ఏడవ ఆశ్వాసం తుదవరకు వ్రాసింది ఎఱ్ఱన. అయినను, ఆశ్వాసాంతంలో ఎఱ్ఱన - 'నన్నయభట్ట ప్రణీతంబు' అని వ్రాయటమే గాక - ఆశ్వాసాంతపద్యాలను నన్నయకు ఆశ్రయప్రదాత అయిన రాజరాజనరేంద్రుడి సంబోధనలుగానే కూర్చాడు. తెలుగుదేశంలో లభించిన ఆంధ్రమహాభారతం వ్రాతప్రతులు అన్నిటిలో 142 పద్యమునుండి-ఎఱ్ఱాప్రెగ్గడ కవిత్వారంభము - అనియే కలదు. ఎఱ్ఱనయే ఆరణ్యపర్వం చిట్టచివర ఏడవ ఆశ్వాసాంతపద్యాలలో తాను నన్నయభట్ట కవితారీతియు తోచేటట్లు ఆరణ్యపర్వాన్ని పూరించా నని స్పష్టంగా వ్రాశాడు.

ఆరణ్యపర్వంలో చతుర్థాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము -పంచమాశ్వాసము

శ్రీయువతీప్రియ! నృప నా । రాయణ బిరుదాంక భీమ! రమణీయ గుణ
శ్రీయుత! నిర్మలధర్మప । రాయణ! రవితేజ! రాజరాజనరేంద్రా! 1

ప్రతిపదార్థం: శ్రీ, యువతీ, ప్రియ!= సిరిజవరాలికి ఇష్టుడ వైనవాడా!; నృప, నారాయణ, బిరుద+అంక, భీమ!= రాజులలో విష్ణుమూర్తి అనెడి బిరుదు ఉండుటచేత భయాన్ని కలిగించేవాడా!; రమణీయ, గుణ, శ్రీ, యుత!= అందమైన మంచి లక్షణాలనెడి సంపదతో కూడి ఉన్నవాడా!; నిర్మల, ధర్మ, పరాయణ!= కల్మషం లేక స్వచ్ఛమైన ధర్మం నెరపటంలో పూనిక కలిగిన వాడా!; రవి, తేజ!= సూర్యుడి వంటి వర్చస్సు కలవాడా!; రాజరాజనరేంద్రా!= రాజరాజనరేంద్రుడు అనే నామధేయం కలవాడా!

తాత్పర్యం: యౌవనంలో ఉన్న లక్ష్మీదేవికి ఇష్టమైనవాడా! రాజులలో విష్ణుమూర్తి అనే బిరుదు కలిగి శత్రువులకు భయాన్ని కలిగించేవాడా! మనోహరమైన సద్గుణాలు కలవాడా! స్వచ్ఛమైన ధర్మాన్ని ఆచరించే దీక్ష పూనినవాడా! సూర్యుడి తేజస్సు వంటి తేజస్సు గలవాడా! ఓ రాజరాజనరేంద్రా!

విశేషం: (i) ఇది ఆశ్వాసారంభ పద్యం. ఈ పంచమాశ్వాసాన్ని రచించినది ఎఱ్ఱన మహాకవి. ఈ పద్యరచన నాటికి సుమారు రెండువందల సంవత్సరాలకు పూర్వమే కీర్తిశేషుడైన రాజరాజనరేంద్రుడి సంబోధనం ఇది. - నన్నయ వాడిన భావాలనే గుదిగ్రుచ్చి ఎఱ్ఱన మరల ప్రయోగించాడు. (ii) చాళుక్య ప్రభువులు రాజనారాయణ బిరుదాంకితులు.

ధర్మరాజునకు మార్కండేయుఁడు పుత్త్రున కుండఁదగు గుణంబులం దెల్పుట (సం. 3-196-1)

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె నట్లు బహుభంగుల మార్కండేయుండు వివరింపం బుణ్యకథావిశేషంబులు విని సంతుష్టహృదయుం డై కౌంతేయపూర్వజుండు మఱియు నమ్మునీంద్రున కి ట్లనియె. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= ఆ కథను చెప్పే సూతుడు; శౌనక+ఆది, మహా, మునులకున్+చెప్పెన్= శౌనకుడు మున్నగు గొప్ప ఋషులకు వచించాడు; అట్లు= ఆవిధంగా; మార్కండేయుండు; బహుభంగులన్= పెక్కు రీతులుగా; వివరింపన్= విస్తరించి చెప్పగా; కౌంతేయ, పూర్వజుండు= కుంతీ కుమారులలో ముందు జన్మించినవాడు - ధర్మరాజు; పుణ్య కథా, విశేషంబులు= సుకృతాన్ని కలిగించే గాథలలోని గొప్ప విషయాలు; విని= ఆలకించి; సంతుష్ట, హృదయుండు+ఐ= మిక్కుటంగా తృప్తిచెందిన గుండె కలవాడై; మఱియున్= ఇంకా; ఆ+ముని+ఇంద్రునకున్= ఋషులలో శ్రేష్ఠుడైన ఆ మార్కండేయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ విధంగా శౌనకుడు మున్నగు మహర్షులకు సూతుడు నైమిశారణ్యంలో సత్రయాగసందర్భంగా మహాభారతకథ వినిపించాడు. మార్కండేయ మహర్షి ఎన్నో పుణ్యకథలను చెప్పగా విని, మిక్కిలి సంతృప్తి చెందిన ధర్మరాజు మరల ఆ మహర్షితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: మార్కండేయమహర్షి చెప్పిన పుణ్యకథలు పెక్కు ఆరణ్యపర్వంలో ఉన్నాయి. మహాభారతానికి పూర్వం ఇట్టి కథలు లోకంలో బహుళప్రచారంలో ఉన్నాయనిన్నీ వాటిని సూతుడు సంగ్రహించి ఆరణ్యపర్వంలో చేర్చాడనిన్నీ నవీన విమర్శకుల అభిప్రాయం.

సీ. **'సమధిక దర్పదుర్జయములై నిగిడెడు । నింద్రియంబులఁ గుదియించి తెచ్చి**
మనసు పొందున నిడి మన సహంకారంబు । పజ్జకుఁ బాపి సద్భక్తియుక్తి
నెరయంగ ననిశంబు నిజభర్తృ శుశ్రూష । యందు సమాహిత యైన వనిత
యఖిలలోకోత్కృష్ట యని యెప్డు నూహింతు;। నరయఁ బతివ్రత లైన వారి

తే. **చరిత మత్యంతధర్మసూక్ష్మంబుఁ గరము । దుష్కరము గాదె తలఁప నిర్ధూత దురిత!**
యట్లు గావున విన వేడ్క యయ్యెఁ జెప్ప । వయ్య ! పుణ్యసతీ ప్రభావంబు నాకు. **3**

ప్రతిపదార్థం: నిర్ధూత, దురిత!= విసరివేయబడిన పాపాలు కలవాడా!; సమధిక, దర్ప, దుర్జయములు+ఐ= మిక్కిలి ఎక్కువ అయిన గర్వం కలిగిఉండటంచేత గెలువరానట్టివై; నిగిడెడు= విజృంభించెడు; ఇంద్రియంబులన్= జ్ఞానకర్మేంద్రియాలను; కుదియించి; తెచ్చి= అణగారేటట్లుగా చేసిపెట్టి; మనసు, పొందునన్+ఇడి= మనస్సుకు లోబడేటట్లుగా చేసి; మనసు+ అహంకారంబు, పజ్జకున్+పాపి= మనస్సును-నేను నాది అనే భావం దగ్గరనుండి వేరు చేసి; సత్+భక్తి, యుక్తి= మంచి భక్తితో కూడికొని ఉండటం; నెరయంగన్= ఒప్పునట్లుగా; అనిశంబున్= ఎల్లప్పుడును; నిజ, భర్తృ, శుశ్రూషయందున్= తనయొక్క పెనిమిటికి పరిచర్య ఒనరించటంలో; సమాహిత+ఐన= కూడిఉన్నట్టిదైన; వనిత= స్త్రీ; అఖిల, లోక+ఉత్కృష్ట= సమస్త జగాలలో గొప్పది; అని; ఎప్డున్= ఎల్లప్పుడును; ఊహింతున్= భావన చేస్తాను; అరయన్= చూడగా; పతివ్రతలు+ఐన వారి, చరితము= భర్తను భక్తితో సేవించటంలోనే నిమగ్నురాం డ్రయిన భార్యల నడవడి; అత్యంత, ధర్మ, సూక్ష్మంబున్= మిక్కిలిలోతుగా పరిశీలిస్తేగాని తెలియనట్టి ధర్మంతో కూడినట్టిదిన్నీ; కరము= మిక్కిలి; దుష్కరము= ఆచరించేందుకు కష్టం అయినట్టిదిన్నీ; కాదె= అవుతుందికదా; తలఁపన్= ఆలోచించగా; నాకున్, పుణ్య, సతీ, ప్రభావంబు= గొప్ప పతివ్రతల మహిమ; వినన్= వినటానికి; వేడ్క+అయ్యెన్= సంబరమైనది. అట్లు+కావునన్= ఆ విధంగా ఉన్నది కాబట్టి; చెప్పవయ్య= దయచేసి చెప్పుము.

తాత్పర్యం: పాపాలను పటాపంచలు చేయగలిగిన ఓ మార్కండేయ మహర్షీ! గొప్ప పతివ్రతల మాహాత్మ్యాలను గూర్చిన కథలు వినవలెనని నాకు మిక్కిలి వేడుకగా ఉన్నది. దయచేసి అట్టి కథలు నాకు వినిపించ వేడికోలు. అరికట్టటానికి వీలు లేని ఇంద్రియాలను అరికట్టి, వాటిని మనస్సుకు లోబడేటట్లుగా చేసి, ఆ మనస్సును అహంకారానికి లోను గాకుండగా చేసి, తన పెనిమిటికి ఎల్లప్పుడు సేవ చేసే వనిత - అన్ని జగాలలో గొప్పది అని నా అభిప్రాయం. అట్టి పతివ్రతల నడవడిలో ధర్మ సూక్ష్మాలు ఇమిడే ఉంటాయి. కావున అట్టి పుణ్యకథలు వినిపింపుము.

విశేషం: 'ధర్మసూక్ష్మము' అనే ప్రయోగంలోని స్వారస్యం అరయ దగింది. ధర్మం తెలియటం కష్టం. స్థూలదృష్టికి 'ధర్మము'గా గోచరించినట్టిది - తరచి విచారించినప్పుడు అనగా సూక్ష్మ దృష్టితో పరికించినపుడు అధర్మం కావచ్చును. రాబోయే ధర్మవ్యాధుడి కథలో పెక్కు 'ధర్మ సూక్ష్మములు' వివరించబడినవి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియుఁ దల్లిదండ్రు లిరువురయందును బుత్త్రనిమిత్తం బైన యాయాసం బెవ్వరి కెక్కుడు? వారలయెడం బుత్త్రుం డెట్టివాఁడు గావలయు? హీనయోని జాతుం డైన పురుషుం డేమి తెఱంగు నడవడిం బరమధార్మికుల లోకంబులు వడయు? నివి యన్నియు వివరింప నీవ యర్హుండ' వనిన నమ్మహాముని యమ్మహీపతి కి ట్లనియె. 4

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; తల్లిదండ్రులు= మాతా పితలు; ఇరువురయందును= ఇద్దరియందును; పుత్త్ర నిమిత్తంబు+ఐన= కొడుకునుగూర్చిన; ఆయాసంబు= శ్రమ; ఎవ్వరికిన్+ఎక్కుడు= ఎవరికి మిక్కుటంగా ఉంటుంది; వారలయెడన్= ఆ తల్లిదండ్రుల పట్ల; పుత్త్రుండు= కొడుకు; ఎట్టివాఁడు, కావలయున్= ఏ విధంగా ప్రవర్తించదగినవాడు అయిఉండాలి; హీనయోని జాతుండు+ఐన= తక్కువ కులంలో పుట్టినట్టి; పురుషుండు= మనుజుడు; ఏమి తెఱంగు, నడవడిన్= ఏ విధమైన ప్రవర్తనవలన; పరమ, ధార్మికుల, లోకంబులు= గొప్ప పుణ్యాత్ములు పొందే లోకాలు - స్వర్గాలు; పడయున్= పొందుతాడు; ఇవి+అన్నియున్= ఇట్టి విషయాలు అన్నిటిని; వివరింపన్= వెల్లడించటానికి; నీవు+అ= నీవ=నీవు మాత్రమే; అర్హుండవు= తగిన వాడవు; అనినన్= అని చెప్పగా; ఆ+మహాముని= గొప్పవాడయిన ఆ ఋషి; ఆ+మహీపతికిన్= ఆ రాజుకు (ధర్మరాజుకు); ఇట్లు+అనియెన్= ఆ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విషయాలే గాక, మఱికొన్నిటిని గూర్చి కూడ తాము దయచేసి వివరించ వేడికోలు. సంతాన విషయాన, తలిదండ్రులు ఇరువురూ పడే శ్రమలో ఎవరిది అధికం అని చెప్పవచ్చును? తలిదండ్రుల విషయంలో పుత్రుడు ఎట్టి నడవడి కలవాడై ఉండదగును? తక్కువ కులంలో జన్మించిన మనుజుడు గొప్ప ధర్మాత్ముడు పొందే లోకాలను ఏవిధంగా పొందగలడు? ఈ ప్రశ్నలకు సరిఅయిన సమాధానం చెప్పగల అర్హత నీయందు మాత్రమే ఉన్నది' అని ధర్మరాజు పలుకగా మార్కండేయమహర్షి ఈ విధంగా ప్రత్యుత్తరం ఇచ్చాడు.

సీ. 'జతనంబు మిగుల మాసములు దొమ్మిది యుద । రంబునం గరము భరంబుతోడ
భరియించి పదపడి ప్రాణసంశయ దశ । నొంది పుత్త్రునిఁ గాంచు నెందుఁ దల్లి;
తపములు యజ్ఞముల్ దానముల్ వ్రతములు । దేవతా సజ్జన సేవనములుఁ
గావించుఁ బుత్త్రునిఁ గామించి జనకుఁ; డి । ట్లిరువుర పాటును సరియె తలఁపఁ;

సీ. దనయుఁ గని తల్లిదండ్రులు దమకు నతఁడు । భక్తుఁ డగుటకు ధర్మానురక్తుఁ డగుట
కాసపడుదురు; విను మట్టియాస సిద్ధిఁ । బొందఁ జేయు నతఁడ చువ్వె నందనుండు. 5

ప్రతిపదార్థం: ఎందున్= ఏ పరిస్థితుల్లో అయినా; తల్లి= మాత; పుత్త్రునిన్= కొడుకును; ఉదరంబునన్= కడుపులోపల; మాసములు= నెలలు; తొమ్మిది; జతనంబు= యత్నము; మిగులన్= ఎక్కువ అగునట్లుగా; కరము= మిక్కిలి; భరంబుతోడన్= బరువుతో; భరియించి= మోసి; పదపడి= పిదప; ప్రాణ, సంశయ, దశన్+ఒంది= అసువులు కోల్పోవునేమో అనే సందేహ స్థితిని పొంది; కాంచున్= కంటుంది, జనకుడు= తండ్రి; పుత్త్రునిన్= కొడుకును; కామించి= కోరి; తపములు= శరీరక్లేశాన్ని కలిగించే ఉపవాసాది వ్రతాలు; యజ్ఞముల్= క్రతువులు; దానముల్= తన ద్రవ్యాన్ని ఇతరులకు సమర్పణ చేయటాలు; వ్రతములు= నోములు; దేవతా, సత్+జన, సేవనములున్= దేవతలను, మంచి మనుష్యులను అర్చించటాలు; కావించున్= చేస్తాడు; ఇట్లు= ఈ రీతిగా; ఇరువుర పాటును= ఇద్దరూ పడే శ్రమకూడా; తలఁపన్= ఆలోచించగా; సరియె= సమానాలైనవే; తల్లిదండ్రులు= మాతయు పితయును; తనయున్= కొడుకును; కని= పొంది; తమకున్= తమకు (తల్లిదండ్రులకు); అతఁడు= ఆ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కొమరుడు; భక్తుఁడు+అగుటకున్= అర్చించేవాడు కావటానికి; ధర్మ+అనురక్తుఁడు= ధర్మంలో ఎక్కువ ఇష్టం కలవాడు కావటానికి; ఆస, పడుదురు= కోరుకొంటారు; వినుము= ఆలకింపుము; అట్టి+ఆస= అటువంటి కోరిక; సిద్ధిన్+పొందన్+చేయు+ అతఁడు+అ= నెరవేరేటట్లుగా ఒనరించే అతడు మాత్రమే; నందనుండు= కొడుకు; చువ్వె= చుమ్ము+ఎ= సుమా. (నిశ్చయార్థకం).

తాత్పర్యం: 'కొడుకును తల్లి - తొమ్మిది నెలలు తన కడుపులో మోసి, మిక్కిలి ప్రయత్నంతో మిక్కుటమైన శ్రమకు ఓర్చి, ఆస్థితిలో అసువులు కోల్పోతానేమో అనే సందేహ స్థితికి వచ్చి ప్రసవిస్తుంది. తండ్రి - కొడుకు పుట్టవలెననే కోరికతో ఉపవాసాది వ్రతాలు చేసి, క్రతువులు నిర్వహించి, దాన ధర్మ కార్యాలు సలిపి, నోములు నోచి, దేవతలను సజ్జనులను పూజిస్తాడు. ఈ విధంగా సంతానానికై పడే శ్రమ తలిదండ్రులు ఇరువురకూ సమానమైనదే అని చెప్పవచ్చును. తలిదండ్రులు - కొడుకు పుట్టిన పిదప ఆతడు తమయెడ ప్రేమ కలిగి తమను ఆరాధించాలనీ ధర్మాచరణలో ఆసక్తికలవాడు కావాలనీ కోరుకొంటారు. అందుచేత, తలిదండ్రుల కోరిక తీడేర్చేవాడే నిజమైన పుత్రుడు అని చెప్పాలికదా!

విశేషం: నందనుడు అనే శబ్దానికి అర్థం - 'సంతోషింప చేసేవాడు'. తలిదండ్రులను సంతసింపజేసేవాడే నిజమైన నందనుడు. ఇట్టి నందన శబ్ద ప్రయోగంలోని స్వారస్యం గుర్తించ తగింది.

క. **జననియు జనకుఁడు నెవ్వని । యనువర్తనమునఁ బ్రియంబు నందుదు రెదఁ ద**
త్తనయుఁడు ధర్మముఁ గీర్తియు । ననూనముగఁ బడయుఁ బొందు నక్షయగతులన్. 6

ప్రతిపదార్థం: జననియున్= తల్లియును; జనకుఁడున్= తండ్రియును; ఎవ్వని+అనువర్తనమునన్= ఏ(కుమారుడి) నడవడి వలన; ఎదన్= హృదయంలో; ప్రియంబున్+అందుదురు= సంతోషం పొందుతారో; తత్+తనయుఁడు. ఆ కొడుకు; ధర్మమున్= ధర్మాన్ని; కీర్తియున్= యశస్సునూ; అనూనముగన్= ఎక్కువగా; పడయున్= పొందుతాడు; అక్షయ, గతులన్= నాశనం పొందని స్థితులను అనగా గొప్ప పుణ్యలోకాలను; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: ఏ కుమారుడు తనను కన్న తలిదండ్రులకు తన నడవడికవలన మిక్కుటమైన సంతోషాన్ని కలిగిస్తాడో ఆ కొమరుడే ధర్మాన్ని, కీర్తిని గొప్పగా సంపాదిస్తాడు. అట్టివాడే శాశ్వతమైన పుణ్యలోకాలను ఆర్జిస్తాడు.

మార్కండేయుఁడు ధర్మజునకుఁ బతివ్రతా మాహాత్మ్యంబు సెప్పుట (సం. 3-196-20)

వ. **మఱియు నిజభర్తృ శుశ్రూషయందు నిత్యాసక్తయయిన పతివ్రతకు నఖిలయజ్ఞదానతపఃఫలంబులు సులభంబు లగు; నొక్కయితిహాసంబు సెప్పెద; నందు నీ యడిగిన యర్థంబు లన్నియుఁ దేటపడు నాకర్ణింపుము; కౌశికుం డను బ్రాహ్మణుండు ధర్మతపశ్శీలుండు సంతతాధ్యయనతత్పరుం డయి యొక్క విశిష్టగ్రామంబున నుండు; నతం డొక్కనాఁడు గ్రామసమీపంబునం దొక్కవృక్షమూలంబున నాసీనుండై వేదంబులు గుణియించుచుండం దదీయ శాఖాగతం బైన యొక్క కొక్కెర యాతనిపై రెట్ట వెట్టిన, నమ్మహాద్విజుం డలిగి చూచుటయు నది యప్పుడ నిశ్చేతనం బై నేలంబడినం గనుంగొని యతండు.** 7

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; నిజ, భర్తృ, శుశ్రూషఅందున్= తనయొక్క పెనిమిటియొక్క పరిచర్యలో; నిత్య+ఆసక్త+ అయిన= ఎల్లప్పుడు ఇష్టం కలిగినట్టిది అయిన; పతివ్రతకున్= సాధ్వికి; అఖిల, యజ్ఞ, దాన, తపస్+ఫలంబులు= అన్ని

క్రతువులు, దానాలు, కఠిన వ్రతాలు చేస్తే సంక్రమించే పుణ్యాలు; సులభంబులు+అగున్= సులువుగా లభిస్తాయి; ఒక్క+ఇతిహాసంబు+చెప్పెదన్= ఒక యథార్థ గాథ వినిపిస్తాను; అందున్= ఆ ఇతిహాసంలో; నీ+అడిగిన= నీవు ప్రశ్నించిన; అర్థంబులు+అన్నియున్= భావాలు అన్నియును; తేటపడున్= వెల్లడి ఔతాయి; ఆకర్ణింపుము= వినుము; కౌశికుండు+అను, బ్రాహ్మణుండు= కౌశికుడు అనే పేరుకల విప్రుడు; ధర్మ, తపస్+శీలుండు= ధర్మాన్ని, తపస్సును ఆచరించే స్వభావం కలవాడు; సంతత+అధ్యయన, తత్పరుండు+అయి= ఎల్లప్పుడు వేదాలు చదువుకొనటంలోనే నిమగ్నుడైనవాడయి; ఒక్క, విశిష్ట, గ్రామంబునన్= పేర్కొనదగిన ఒకపల్లెటూరిలో; ఉండున్= నివసించేవాడు; అతండు= ఆ బ్రాహ్మణుడు; ఒక్క, నాఁడు= ఒక్క రోజున; గ్రామసమీపమునందున్= ఆ ఊరికి దగ్గరలో; ఒక్క, వృక్ష, మూలంబునన్= ఒక చెట్టు మొదట; ఆసీనుండు+ఐ= కూర్చున్నవాడై; వేదంబులు= వేదాలు; గుణియించుచుండన్= వల్లెవేస్తుండగా; తదీయ, శాఖాగతంబు+ఐన= ఆ చెట్టు కొమ్మమీద ఉన్న; ఒక్క, కొక్కెర= ఒక కొంగ; ఆతనిపైన్= ఆ కౌశికుడిమీద; రెట్ట+పెట్టినన్= మలవిసర్జనం చేయగా; ఆ+మహా, ద్విజుండు= ఆ గొప్ప బ్రాహ్మణుడు; అలిగి, చూచుటయున్= కోపించి, చూడటంచేత; అది= ఆ కొక్కెర; అప్పుడు+అ= అప్పటికప్పుడే; నిస్+చేతనంబు+ఐ= పోయిన ప్రాణాలు కలదై - అనగా చనిపోయి; నేలన్+పడినన్= భూమిమీద పడగా; కనుంగొని= చూచి; అతండు= ఆ కౌశికుడు.

తాత్పర్యం: అంతేకాదు; తన పెనిమిటికి సేవ చేయటంలో ఎల్లప్పుడూ ఇష్టం గల పతివ్రతకు సమస్త యజ్ఞాలు, దానాలు, తపస్సులు చేసిన పుణ్యాలు లభిస్తాయి. ఈ విషయాన్ని రూఢి చేసే ఒక యథార్థగాథను నిదర్శనంగా నీకు వినిపిస్తాను. ఆ ఇతిహాసంలో నీవు అడిగిన ప్రశ్నలకు అన్నిటికిని సరైన సమాధానం లభిస్తుంది. పూర్వం కౌశికుడు అనే బ్రాహ్మణుడు ఒకానొక పల్లెటూరులో నివసిస్తూ ఉండేవాడు. ఆతడు ధర్మాత్ముడు. తపస్వి. ఎల్లప్పుడూ వేదాలను వల్లె వేసేవాడు. ఒకనాఁడు అతడు ఒకచెట్టు మొదట కూర్చొని వేదాలు వల్లెవేస్తుండగా, ఆ చెట్టుకొమ్మపై వాలిఉన్న ఒకకొంగ అతడిపై రెట్ట వేసింది. అంతట ఆ కౌశికుడికి మిక్కుట మైన కోపం వచ్చింది. అతడు ఆగ్రహంతో ఆ పక్షిని చూచాడు. వెంటనే ఆ పక్షి ప్రాణాలు కోల్పోయి నేలపై పడిపోయింది. అప్పుడు అతడు (పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు.)

క. 'అక్కట! నాహృదయము గడు । నక్కటికము లేనిదయ్యె; ననిమిత్తమ యీ
కొక్కెర నిటు సేసితి; నా । కెక్కడి శాంతి?' యని వికలహృదయుం డగుచున్. 8

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; నాహృదయము= నాగుండె; కడున్= మిక్కిలి; అక్కటికము= దయ; లేనిది+అయ్యెన్= లేనట్టిది అయింది; అనిమిత్తము+అ= ఎటువంటి కారణం లేకుండానే; ఈ కొక్కెరన్= ఈ కొంగను; ఇటు+చేసితిన్= ఈవిధంగా చేశాను అనగా ఈ రీతిగా చంపాను; నాకున్+ఎక్కడి, శాంతి+అని= నాకు ఏవిధంగా శాంతి లభిస్తుంది అని; వికల, హృదయుండు+అగుచున్= కలత చెందిన ఎడద గలిగినవాడు ఔతూ;

తాత్పర్యం: 'అయ్యో! నా గుండె దయలేనిది అయింది కదా! నిష్కారణంగా నావలన ఈ కొంగ ప్రాణాలు పోగొట్టుకుంది. నేను ఘోరపాపానికి ఒడిగట్టాను, ఇక నాకు ఏవిధంగా శాంతి లభించగలదు?' అని వాపోతూ ఆ కౌశికుడు కలత చెందిన ఎడద కలవా డయ్యాడు.

వ. పెక్కుభంగుల వగచి, మధ్యాహ్నం బగుటయుఁ గృతాహ్నికవిధానుండై గ్రామంబున కరిగి, యందు శుచు లైన విప్రగృహంబుల కరిగి భిక్షాచరణంబు సేయుచు, నం దొక్క పుణ్యగృహంబువాకిట నిలిచి 'భిక్షాం దేహి' యనుటయు, నా యింటియవ్వయు నతిసంభ్రమంబున భిక్ష యిడుటకుం బాత్రశోధనంబు సేయు నెడ. 9

ప్రతిపదార్థం: పెక్కు, భంగులన్= పలురీతుల; వగచి= విచారించి; మధ్య+అహ్నంబు+అగుటయున్= పట్టపగలు నడిమిప్రొద్దు కావటంచేత (మధ్యాహ్నం పండ్రెండుగంటలు-నేటి భాషలో); కృత+ఆహ్నిక, విధానుండు+ఐ= పగలు నెరవేర్చవలసిన కృత్యాలు కలవాడై అనగా పగలు నడిప్రొద్దున చేయదగు విధులు చేసినవాడై; గ్రామంబునకున్+అరిగి= పల్లెటూరికి వెళ్లి; అందున్= ఆ గ్రామంలో; శుచులు+ఐన= పవిత్రులు, అయిన; విప్ర, గృహంబులకున్= బ్రాహ్మణుల ఇండ్లకు; అరిగి= వెళ్లి; భిక్షా+ఆచరణంబు= బిచ్చమెత్తుకొనటం; చేయుచున్= చేస్తూ; అందు+ఒక్క= (ఆ గృహాలలో ఒక); పుణ్య, గృహంబు, వాకిటన్= సుకృతం ఆర్జించిన వారు నివసించే ఇంటి గడప ముందు; నిలిచి= నిలబడి; 'భిక్షాందేహి'= బిచ్చాన్ని ఇమ్ము; అనుటయున్= అని అనటమున్నూ; ఆ+ఇంటి+అవ్వయున్= ఆ ఇంటిఇల్లాలును; అతిసంభ్రమంబునన్= మిక్కిలి వేగిరపాటుతో; భిక్ష+ఇడుటకున్= బిచ్చం వేయటానికి; పాత్ర, శోధనంబు= పాత్రను శుద్ధిచేయటం; చేయు+ఎడన్= చేసే తరుణంలో.

తాత్పర్యం: పలురీతుల విచారించి, అప్పుడు మిట్టమధ్యాహ్నసమయం కావటంచేత, ఏతత్కాలకృత్యాలైన సంధ్యావందనాదికాలు నిర్వర్తించి, సమీపగ్రామానికి వెళ్లి, పరిశుభ్రత, పవిత్రత కల బ్రాహ్మణ గృహాలకు పోయి, "భిక్షాం దేహి" అన్నాడు. అట్లా అంటూ ఒక పుణ్యగృహంముందు నిలిచి భిక్షను కోరాడు. అంతట- ఆ ఇంటి ఇల్లాలు మిక్కిలి వేగిరపాటుతో ఆ బ్రాహ్మణయోగికి భిక్ష సమర్పించటానికై పాత్రను కడుగసాగింది. ఆ సమయంలో.

ఉ. **ఆ యెలనాఁగభర్త కడు నాఁకటఁ దూలుచు వచ్చె; వచ్చినం**
దోయజనేత్ర సంభ్రమముతోఁ దగుపీఠము వెట్టి పాద్యముం
బాయక మజ్జనక్రియయు భక్తి నొనర్చి ప్రియోక్తు లొప్పఁగా
నాయనఁ బ్రీతుఁ జేసె రుచిరాన్నరసంబులఁ జేసి చెచ్చెరన్. **10**

ప్రతిపదార్థం: ఆ+ఎలనాఁగ, భర్త= ఆ మగువ పెనిమిటి; కడున్= మిక్కిలి; ఆఁకటన్= ఆకలిచేత; తూలుచున్= తొట్రుపడుతూ; వచ్చెన్= వచ్చాడు; వచ్చినన్= అట్లా రాగా; తోయజనేత్ర= పద్మాలవంటి కన్నులు కల ఆ మగువ; సంభ్రమముతోన్= వేగిరపాటుతోడ; తగు= తగిన; పీఠము, పెట్టి= కూర్చుండే ఆసనం ఉంచి; పాద్యమున్= కాళ్లు కడుగుకొనటానికి నీటిని (ఇచ్చి); పాయక మజ్జన, క్రియయున్= వదలక తలనిండా స్నానం చేయించుటయున్నూ; భక్తిన్= పూజ్యభావంతో; ఒనర్చి= చేసి; ప్రియ+ఉక్తులు+ఒప్పఁగాన్= మనస్సుకు ఇష్టాలైన మాటలు విలసిల్లేటట్లుగా; రుచిర+అన్న, రసంబులన్+చేసి= కమ్మని అన్నాన్ని వడ్డించి పానీయాలు సమర్పించటం చేత; చెచ్చెరన్= వేగంగా; ఆయనన్= అతడిని, తన భర్తను; ప్రీతున్+చేసెన్= సంతృప్తి చెందిన వాడినిగా చేసింది.

తాత్పర్యం: అంతలో, ఆ ఇల్లాలి పెనిమిటి ఆకలితో తూలుతూ ఇల్లు చేరాడు. భర్తను చూడటంతోనే ఆమె కన్నులు తామర పువ్వులవలె వికసించాయి. ఆమె వేగిరపాటుతో భర్తకు ఎదురేగి కాళ్లు కడుగుకొనటానికి నీటిని అందించింది. పూనికతో అతడికి తలఅంటి స్నానం చేయించింది. అనురాగంతో మంచి మాటలు చెప్తూతూ అతడికి అన్నం వడ్డించింది. పానీయాలు అందించింది. భర్తకు సంపూర్ణ సంతుష్టి కల్పించింది.

చ. **కుడిచినపిమ్మటం గుసుమకోమలి విస్తృతసంస్తరంబుగా**
నొడికపు సెజ్జ చేసి ప్రియుఁ డొయ్యన యందు శయింపఁ దమ్ములం
బిడి చరణంబు లొత్తి మదిరేక్షణ యంతటిలోఁ దలంచె ము
న్నడరఁగ భిక్షకై నిలిచినట్టి మహీసురముఖ్యు నాత్మలోన్. **11**

ప్రతిపదార్థం: కుడిచినపిమ్మటన్= (భర్త) భోజనం చేసిన పిదప; కుసుమకోమలి= పువ్వువలె మృదువైనది; విస్తృత, సంస్తరంబుగాన్= విశాలంగా పరచిన పరుపు కలదిగా; ఒడికము+సెజ్జ, చేసి= మనోహరమైన మెత్తని శయ్యను ఏర్పరచి; ప్రియుఁడు= భర్త; అందున్= ఆ శయ్యపై; ఒయ్యన= తిన్నగా; శయింపన్= పండుకొనగా; తమ్ములంబు+ఇడి= తాంబూలం అందించి; చరణంబులు+ఒత్తి= కాళ్లు పిసికి; మదిరా+ఈక్షణ= మత్తెక్కించే కన్నులు కలది, మగువ; అంతటిలోన్= ఆ సమయంలో; మున్ను= అంతకు ముందు; అడరఁగన్= పూనికతో; భిక్షకై= బిచ్చానికై; నిలిచినట్టి= వాకిట నిలబడినట్టి; మహీసుర, ముఖ్యున్= బ్రాహ్మణులలో శ్రేష్ఠుడైన వాడిని; ఆత్మలోన్= మనస్సులో; తలంచెన్= స్మరించింది. జ్ఞాపకం చేసికొన్నది.

తాత్పర్యం: ఆమెభర్త సంతృప్తిగా భోజనం చేసిన పిదప, ఆ పూబోడి అతనికి మెత్తని శయ్యను ఏర్పరచింది. భర్త ఆ పరుపుపై హాయిగా పవళించిన పిమ్మట అతడికి ఆమె తాంబూల మిచ్చింది. కాళ్లు పిసికింది. భర్తకు సమస్తపరిచర్యలు చేసిన పిదప, అంతకుముందు తన వాకిలివద్ద భిక్షకొరకు నిలిచిన బ్రాహ్మణశ్రేష్ఠుడిని స్మరించింది.

విశేషం: మదిరేక్షణ అనే పదానికి కాటుకపిట్ట వంటి కన్నులు గలది (స్త్రీ) అని కూడా అర్థం చెప్పవచ్చు.

వ. **ఇట్లు దలంచి భిక్ష గొనుచుం జనుదెంచిన నమ్మగువం జూచి కౌశికుండు రోషరంజితలోచనుం డగుచు ని**
ట్లనియె. **12**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; తలంచి= యోచించి; భిక్షన్+కొనుచున్+చనుదెంచినన్= బిచ్చం (ఇవ్వటానికి అన్నాన్ని) తీసికొనిరాగా; ఆ+మగువన్+చూచి= ఆ వనితను చూచి; కౌశికుండు= కౌశికుడు; రోష, రంజిత, లోచనుండు+అగుచున్= కోపంచేత, ఎఱ్ఱబడిన కన్నులు కలవాడు ఔతూ; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ రీతిగా ఆలోచించి, ఆ బ్రాహ్మణ బ్రహ్మచారికి బిచ్చం పెట్టటానికై పాత్రలో అన్నం నింపికొని వచ్చిన ఆ ఇల్లాలిని చూచి కౌశికుడు, కోపంచేత ఎఱ్ఱబడిన కన్నులు కలవాడై ఇట్లా అన్నాడు.

క. **'అడిగినయప్పుడ చెచ్చెరఁ । గడపినఁ బో నవ్వ! యేను గడుదుర్మతి వై**
పడఁతి! నను నిలిపి భిక్షం । బిడక కడు నవజ్ఞ సేసి తేల మదమునన్?' **13**

ప్రతిపదార్థం: అవ్వ!= అమ్మా!; అడిగిన+అప్పుడు+అ= నేను బిచ్చం వేడిన వెనువెంటనే; చెచ్చెరన్= శీఘ్రంగా; కడపినన్= వెడలు మని అంటే; ఏను= నేను; పోను+అ= పోన= వెళ్లిపోయి ఉండేవాడను కదా; కడున్= మిక్కిలి, దుర్మతివి+ఐ= చెడుబుద్ధి కలిగిన దానివై; పడతి!= ఓవనితా!; ననున్= నన్ను; నిలిపి= ఆపి; భిక్షంబు+ఇడక= బిచ్చం వేయక; మదమునన్= గర్వంతో; కడున్= మిక్కిలి; అవజ్ఞ= అవమానం; చేసితి+ఏల= ఎందుకు చేశావు?

తాత్పర్యం: అమ్మా! అడిగినప్పుడు వెంటనే పొమ్మని అంటే నేను పోయి ఉందునుగదా! మిక్కిలి దుర్బుద్ధి గలదానివై గర్వంతో నన్నిట్లా నిలబెట్టి భిక్షం పెట్టకుండా మిక్కిలి అవమానం ఎందుకు చేసినావమ్మా?

చ. **అనినఁ బతివ్రతాతిలక మాతని కిట్లను 'నయ్య! మత్ప్రియుం**
దనుపమితక్షుధాకలితుఁడై చనుదెంచిన భక్తి నమ్మహా
త్మునకు సపర్యసేయుచు మిమున్ మదిలోనఁ దలంపఁజాల నై
తి; నిదియుఁ దప్పుగాఁ గొనక ధీరత యొప్ప సహింపఁగాఁ దగున్.' **14**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; పతివ్రతాతిలకము= పతివ్రతలలో శ్రేష్ఠురాలైన ఆమె; ఆతనికిన్= ఆ కౌశికుడికి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది; అయ్య!= ఆర్యా!; మత్+ప్రియుండు= నా మగడు; అనుపమితక్షుధా+కలితుఁడు+ఐ= సాటిలేని అనగా మిక్కిలి ఎక్కువైన ఆకలిచేత కూడినవాడై; చనుదెంచినన్= రాగా; భక్తిన్= పూజ్యభావంతో; ఆ+మహా+ఆత్మునకున్= ఆ గొప్పఆత్మ గల మహనీయుడికి; సపర్య+చేయుచున్= సేవలు సల్పుతూ; మిమున్= మిమ్ము; మదిలోనన్= మనస్సులో; తలంపన్+చాలను+ఐతిన్= స్మరించ లేక పోయితిని; ఇదియున్= ఈ విధంగా మిమ్ము స్మరించకపోవటం; తప్పుగాన్+కొనక= అపరాధంగా గ్రహించక; ధీరత+ఒప్పన్= సహనం విలసిల్లేటట్లుగా; సహింపఁగాన్+తగున్= ఓర్చుకొనటం మంచిది.

తాత్పర్యం: ఆ కౌశికుని అధిక్షేపణకు సవినయంగా ఆ ఇల్లాలు ఇట్లా బదులు పలికింది. 'అయ్యా! నా పెనిమిటి మిక్కిలి ఆకలితో ఇంటికి వచ్చాడు. అందుచేత భక్తితో ఆ మహాత్ముడికి సేవలు చేస్తూ మిమ్ము స్మరింపజాలక పోయాను. దీనిని మీరు అపరాధంగా గ్రహించరాదు. సహనంతో ఓర్చుకొనదగును.

వ. అనిన నమ్మహీదేవుం డప్పతివ్రత కి ట్లనియె. 15

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+మహీదేవుండు= ఆ బ్రాహ్మణుడు; ఆ+పతివ్రతకున్= ఆ సాధ్వికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా ఆ బ్రాహ్మణుడు ఆ పతివ్రతకు ఈవిధంగా బదులు పలికాడు.

ఉ. 'నీ మగఁ డంత యెక్కుడె? మనీషులు భూసురు లింత తక్కువే?
కోమలి! యేల యిట్లు గడుఁ గ్రొవ్వునఁ గానవు లోకవంద్యులన్?
భూమిసురేంద్రులన్ దివిజపుంగవుఁ డాదిగ భక్తిఁ గొల్చుచో
నేమిట నొక్కొవారు గడు నెల్లిద మై రిటు నీకు నిచ్చటన్. 16

ప్రతిపదార్థం: కోమలి!= ఓ వనితా!; నీ మగఁడు= నీ భర్త; అంత+ఎక్కుడు+ఎ= అంత గొప్పతనం కలవాడా?; మనీషులు= గొప్పమేధ కలిగినవారు, విద్వాంసులు; భూసురులు= బ్రాహ్మణులు; ఇంత, తక్కువ+ఏ?= ఇంత హీనత కలవారా?; ఏల= ఎందులకు; ఇట్లు= ఈవిధంగా; లోక, వంద్యులన్= లోకంలోని ప్రజలచేత నమస్కరించ తగినవారిని; కడున్= మిక్కిలి; క్రొవ్వునన్= మదంతో; కానవు= చూడవు; భూమిసుర+ఇంద్రులన్= బ్రాహ్మణశ్రేష్ఠులను; దివిజపుంగవుఁడు+ఆదిగన్= వేల్పులలో శ్రేష్ఠుడైన ఇంద్రుడు మున్నగువారు; భక్తిన్= పూజ్యభావంతో; కొల్చుచోన్= ఆరాధిస్తుంటే; వారు= ఆ బ్రాహ్మణులు; నీకున్; ఇచ్చటన్= ఇచ్చట; ఇటు= ఈవిధంగా; కడున్= మిక్కిలి; ఏమిటన్+ఒక్కొ= ఎందుకో మఱి; ఎల్లిదము+ఐరి= చులకన అయినారు?

తాత్పర్యం: 'ఏమమ్మా! నీ భర్తయే అంత గొప్పవాడని తలపోస్తున్నావా? నీ ఉద్దేశంలో విజ్ఞానులైన విప్రులు అంత తక్కువవా రయినారా? బ్రాహ్మణులు జగత్సంపూజ్యులు. దేవేంద్రుడు సయితం బ్రాహ్మణులను భక్తితో ఆరాధిస్తాడుకదా! నీవు మాత్రం గర్వంతో అట్టివారిని చులకనగా చూడటం నాకు మిక్కిలి ఆశ్చర్యకరంగా ఉన్నది.

క. అవమానితు లై ధరణీ। దివిజులు గ్రోధాగ్నిశిఖల దీపించి మహా
ద్రి వనద్వీపంబులతో। నవని నయినఁ బొడవడంతు రప్రతికారుల్. 17

ప్రతిపదార్థం: ధరణీ, దివిజులు= బ్రాహ్మణులు (పుడమివేల్పులు); అవమానితులు+ఐ= అగౌరవింపబడినవారై; క్రోధ+అగ్ని, శిఖలన్= కోపం అనే అగ్నిజ్వాలలచేత; దీపించి= మండిపోయి; అప్రతికారుల్= తిరుగు లేనివారు; మహా+అద్రి, వన, ద్వీపంబులతోన్= గొప్పకొండలతో అడవులతో దీవులతో పాటుగా; అవనిన్+అయినన్= భూమిని సయితం; పొడవు+అడంతురు= నాశనం చేయగలరు.

తాత్పర్యం: బ్రాహ్మణులు అవమానించబడితే వారి కోపం అగ్నిజ్వాలలవలె ఎగసి, ఈ పుడమిని సమస్తాన్నీ కొండలతో, అడవులతో, దీవులతో పాటుగా దహించివేస్తుంది. వారి మహిమ తిరుగు లేనిది సుమా!

వ. నీ వింత నెఱుంగ నొల్ల వైతివి గాకేమి' యనిన నయ్యంగన యి ట్లనియె. 18

ప్రతిపదార్థం: నీవు= నీవు; ఇంతన్= ఈ విషయం, ఎఱుంగన్+ఒల్లవు+ఐతివి+కాక+ఏమి= తెలియలేకపోయావు గదా; అనినన్= అని అనగా; ఆ+అంగన= ఆ వనిత; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: నీవు ఈ విషయం తెలుసుకోలేకపోయావు అని చెప్పగా ఆ పతివ్రత ఇట్లా బదులు పలికింది.

సీ. 'దేవతాసములు భూదేవతావరు లౌట । యేను దన్మాహాత్మ్య మెఱుఁగ నయ్య!
యొక విప్రుఁ డలిగి పయోనిధిజలము ల । పేయముల్ గాఁగ శపింపఁ డెట్లు;
దండకవిషయంబు దగ్ధంబు సేయండె । యలుకమై నొక్క మహాద్విజుండు;
వాతాపి యను దైత్యవరు మ్రింగి యఱిగించు । కొనఁడె భూదేవుఁ డొక్కరుఁడు గినిసి;

తే. ధరణి మఱియును బెక్కు విధంబులందు । బ్రహ్మవిదు లైన బ్రాహ్మణప్రభుల మహిమ
వినమె! యెఱిఁగి యెఱింగి సద్వినుత చరిత! కొఱవి గొని వెఱ్ఱినే తలఁ గోఁకి కొనఁగ? 19

ప్రతిపదార్థం: సత్+వినుత, చరిత!= మంచివారలచేత పొగడబడిన ప్రవర్తన కలవాడా!; భూ, దేవతావరులు= పుడమివేల్పు లైన విప్రులు, దేవతాసములు+ఔట= వేల్పులతో సమానులు; అగుట; ఏను= నేను; తత్+మాహాత్మ్యము= వారి మహిమ; ఎఱుఁగన్+అయ్య!= తెలియనిదాననా?; ఒక, విప్రుఁడు= ఒక బ్రాహ్మణుఁడు; అలిగి= కోపించి; పయస్+నిధి, జలంబులు= సముద్రంలోని నీళ్ళు; అపేయముల్+కాఁగన్= త్రాగకూడనివయ్యేటట్లుగా; శపింపఁడు+ఎట్లు= శాపం ఇవ్వలేదా?; ఒక్క, మహా, ద్విజుండు= ఒక గొప్ప బ్రాహ్మణుడు; దండక, విషయంబు= దండకం అనే పేరు గల అరణ్య ప్రదేశం; అలుకమైన్= కోపంతో; దగ్ధంబు+చేయండు+ఎ= తగులబడేటట్లుగా చేయడా?; భూదేవుఁడు+ఒక్కరుఁడు= ఒకానొక విప్రుడు; కినిసి= కోపించి; వాతాపి+అను, దైత్యవరున్= వాతాపి అనే పేరుగల రాక్షస శ్రేష్ఠుడిని; మ్రింగి= భక్షించి; అఱిగించుకొనఁడు+ఎ= జీర్ణంచేసికొనడా?; ధరణిన్= భూమిలో; మఱియును= ఇంకను; పెక్కు, విధంబులందున్= పలురీతులలో; బ్రహ్మవిదులు+ఐన= బ్రహ్మజ్ఞానం తెలిసిన; బ్రాహ్మణ, ప్రభుల మహిమ= విప్రులలో శ్రేష్ఠులైన వారి గొప్పదనం; వినమె= ఆలకించమా?; ఎఱిఁగి, ఎఱింగి= తెలిసి తెలిసి; కొఱవిన్+కొని= మండేకట్టెను తీసికొని; తలన్= శిరస్సును; గోఁకికొనఁగన్= బరుకుకొనటానికి, వెఱ్ఱినే= పిచ్చిదాననా?

తాత్పర్యం: 'పుడమివేల్పులైన బ్రాహ్మణులు దేవతలతో సమానులే. నాకు వారి గొప్పతనం తెలియదా? ఒక బ్రాహ్మణుడు కోపించి సముద్ర జలాలు త్రాగకూడనివయ్యేటట్లుగా శపించలేదా? మరొక బ్రాహ్మణోత్తముడు దండక ప్రదేశం తగులబడిపోయేటట్లుగా చేయలేదా? ఒక విప్రుడు వాతాపి అనే గొప్ప రక్కసిని, తిని జీర్ణించుకొనలేదా? అంతేకాక, భూలోకంలో బ్రాహ్మణోత్తములమహిమ వినమా? మంచివారలచేత పొగడబడిన నడవడి గల ఓ విప్రోత్తమా! తెలిసి తెలిసి నేను బ్రాహ్మణులను అవమానించి కొరవితో తలగోకుకొనే పిచ్చిదాననా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: సముద్ర జలాలను త్రాగగూడనివిగా శపించిన విప్రుడు దుర్వాసుడు; దండకారణ్యాన్ని కోపంతో దహింపజేసిన విప్రుడు శుక్రాచార్యుడు; వాతాపిని జీర్ణించుకొన్న బ్రాహ్మణుడు అగస్త్యుడు.

వ. నా తెఱంగు సెప్పెద నాకర్ణింపుము. 20

తాత్పర్యం: నేను అనుసరించే మార్గాన్ని వివరించి చెప్తుతాను; దయచేసి వినుము.

తే. పతియచూవె నాపాలికిఁ బరమదైవ; । మేను వాఙ్మనఃక్రియలఁ దద్ధితమ యెపుడుఁ
గోరి యొనరింతు; దీని మిగులఁగ నొండు । ధర్మువులు గాన నెందును దలఁచి చూచి. 21

ప్రతిపదార్థం: పతి+అ= పతియ, చూవె= భర్త మాత్రమే కదా; నాపాలికిన్= నాయెడల; పరమదైవము= గొప్పదేవుడు - పరమాత్మ, ఏను= నేను; వాక్+మనస్+క్రియలన్= మాటలచేత, మనస్సుచేత, పనులచేతను; తత్+హితము+అ= ఆతడియొక్క శ్రేయాన్నే; ఎపుడున్= ఎల్లప్పుడున్నూ; కోరి= అభిలషించి; ఒనరింతున్= చేస్తాను; దీని మిగులఁగన్= దీనిని మినహాయించి; ఒండుధర్మువులు= వేరైన ధర్మాలు; తలఁచి, చూచి= ఆలోచించి చూచి; ఎందును= ఎక్కడకూడా కానన్= చూడను.

తాత్పర్యం: నా దృష్టిలో నా పాలికి గొప్ప దేవుడు నా భర్తమాత్రమే. నేను త్రికరణశుద్ధిగా, మనస్సుచేత, మాటలచేత, కర్మలచేత నా పతి శ్రేయస్సునే కాంక్షిస్తాను. ఆ విధంగానే నా ఆచరణను తీర్చిదిద్దుకొంటాను. ఎంత ఆలోచించి తరచి చూచినా, ఇంతకంటె గొప్ప ధర్మాలు నాకు కనుపించటం లేదు సుమా!

వ. నీ వతిక్రోధనుండ వగుటయు నెఱుంగుదు; నీకోపంబున నొక్కకొక్కెర నిహతం బయ్యెం గాదె! యిది మదీయపాతివ్రత్యమహిమం జేసి కాంచితిం; గాన క్రోధంబు గొనియాడుట లగ్గు గా' దని యి ట్లనియె.22

ప్రతిపదార్థం: నీవు= ఓ కౌశికా!; అతిక్రోధనుండవు= మిక్కిలి కోపంతో కూడిన స్వభావం కలవాడివి; అగుటయున్= అగుటయును; ఎఱుంగుదున్= తెలిసినదానను; నీకోపంబునన్= నీ ఆగ్రహంవలన; ఒక్క, కొక్కెర= ఒక కొంగ; నిహతంబు+ అయ్యెన్+కాదె= చచ్చిపోయిందికదా; ఇది= ఈ విషయం (కొంగ చనిపోవటం); మదీయ, పాతివ్రత్య, మహిమన్+చేసి= నాయొక్క పాతివ్రత్య ప్రభావంచేత; కాంచితిన్= చూచాను; కాన= కావున; క్రోధంబు= కోపాన్ని; కొని+ఆడుట= ఆదరించటం; లగ్గు, కాదు= మేలు కాదు; అని= అని పలికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: నీవు తీవ్ర కోపంతో కూడిన స్వభావం కలవాడ వని నాకు తెలియును. నీ కోపంవలన ఒకకొంగ చనిపోయింది కదా! ఈ విషయం నా పాతివ్రత్య మహిమవలన నేను తెలిసికొన్నాను. కావున కోపాన్ని వహించటం మంచిది కాదు సుమా!' అని చెప్పి, మఱియు ఆమె ఇట్లా అన్నది.

తే. 'క్రోధ మోహ నామకు లైన ఘోరశత్రు । లిరువు రెరియించుచుండుదు రెపుడు నంత
రంగ మయ్యుభయంబు నడంగకున్నఁ । గలదె యూరక బ్రాహ్మణ్యగౌరవంబు? 23

ప్రతిపదార్థం: క్రోధ, మోహ, నామకులు+ఐన= కోపం, మోహం అనే పేర్లు గలవారైన, ఘోర, శత్రులు= భయంకరమైన విరోధులు; ఇరువురు= ఇద్దరు, ఎపుడున్= ఎల్లప్పుడు; అంతరంగమున్= హృదయాన్ని; ఎరియించుచున్+ఉండుదురు= తగులబెట్టుతుంటారు; ఆ+ఉభయంబున్= ఆ రెండున్నూ; అడంగక+ఉన్నన్= నశించకపోతే; బ్రాహ్మణ్య= బ్రాహ్మణులకు సంబంధించిన, గౌరవంబు= గొప్పతనం; ఊరక కలదె?= నిష్కారణంగా ఏర్పడుతుందా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మానవుల హృదయాలలో, కోపం మోహం అనేపేర్లు కల శత్రువులు ఇద్దరు మిక్కిలి భయంకరమైన వారు నివసిస్తుంటారు. వారిని ఇద్దరను అణచివేయకపోతే, బ్రాహ్మణులకు నిజమైన గొప్పతనం ఎట్లా ఏర్పడుతుంది?

సీ. ఎవ్వఁడు సత్యంబ యెప్పుడుఁ బల్కు హిం । సావిదూరుఁడు గురుజనహితార్థి
యింద్రియంబుల నోర్చి యెల్లవారలఁ దన । యట్ల కాఁ జూచు ధర్మాభిరతుఁడు
గామంబు దగులండు కర్మంబు లాఱును । సముచిత సంప్రయోజ్యత నొనర్చు
నట్టి పుణ్యాత్ముని ననఘు బ్రాహ్మణుఁడని । యనిశంబుఁ గీర్తింతు రమరవర్యు;

ఆ. లార్జవంబు శమము నధ్యయనంబును । బరమధనము సువ్వె బ్రాహ్మణునకు
ధర్మగతికి నివియ తగు సాధనంబులు । వేదవిహితముఖ్యవిధులు నివియ. 24

ప్రతిపదార్థం: ఎవ్వఁడు= ఎవడు; సత్యంబు+అ= నిజాన్ని మాత్రమే; ఎప్పుడున్= సతతం; పల్కున్= మాటాడుతాడో; హింసా, విదూరుండు= ఎవరికిని ఎట్టిపీడ చేయనివాడో; గురు, జన, హిత+అర్థి= గురువులు అయిన వారల మేలు కోరే వాడో; ఇంద్రియంబులన్+ఓర్చి= ఇంద్రియాలను నిర్జించి; ఎల్లవారలన్= అందరను; తన+అట్ల, కాన్+చూచు= తనవంటివారలనుగానే చూచే; ధర్మ+అభిరతుఁడు= ధర్మంలో మిక్కిలి ఇష్టం కలవాడో; కామంబు= కోరికయందు; తగులండు= చిక్కుకొనడో; కర్మంబులు+ఆఱును= ఆరుపనులను (షట్ కర్మములను); సముచిత, సంప్రయోజ్యతన్+ఒనర్చున్= తగిన పద్ధతిలో ఆచరించునో అట్టి= పైనచెప్పబడినట్టి విధంగా ఉన్న వాడిని; పుణ్య+ఆత్మునిన్= సుకృతాలు ఆర్జించే మహానుభావుడిని; అనఘున్= పాపరహితుడైనవాడిని; అమరవర్యులు= వేల్పులలో శ్రేష్ఠులు; బ్రాహ్మణుఁడు+అని= బ్రహ్మజ్ఞానం కలవాడని; అనిశంబున్= ఎల్లప్పుడును; కీర్తింతురు= పొగడుతారు; బ్రాహ్మణునకున్= బ్రహ్మజ్ఞానంగలవిప్రుడికి; ఆర్జవము= తిన్ననైన ప్రవర్తన; శమమున్= అంతరింద్రియనిగ్రహం; అధ్యయనంబును= వేదాలను చదవటం; పరమ, ధనము+చువ్వె= ధనాలలో గొప్పధనం సుమా; ఇవి+అ= ఇవియే (అనగా పూర్వోక్తాలైన గొప్పగుణగణాలు మాత్రమే); ధర్మగతికిన్= ధర్మమార్గానికి; తగు= ఉచితమైన; సాధనంబులు= ఉపకరణాలు; ఇవి+అ= ఇవియే; వేద, విహిత, ముఖ్య, విధులు= వేదాలచేత నిర్ణయించబడిన కర్తవ్యాలు.

తాత్పర్యం: ఎవడు బ్రాహ్మణుడు? ఎవడికి బ్రాహ్మణ్యగౌరవం చెందదగింది? ఎవడు ఎల్లప్పుడును సత్యాన్నే పలుకుతాడో; ఎవడు ఎప్పుడును ఎవరినీ పీడించడో, ఎవడు తల్లితండ్రులు ఒజ్జలు మొదలైన గురువులకు మేలు తలుస్తాడో, ఎవడు సర్వభూతాల యెడ సానుభూతి కలిగి ఉంటాడో, ఎవడు కోరికలను విసర్జిస్తాడో, ఎవడు షట్కర్మలను తగినట్లుగా ఆచరించే అనుష్ఠానవేదాంతియో, అట్టి పుణ్యాత్ముడే, అట్టి మహాత్ముడే బ్రాహ్మణుడు. అట్టి మహానుభావుడినే అచ్చమైన బ్రాహ్మణుడిగా దేవతలు ప్రస్తుతిస్తారు. ఆర్జవ, ఇంద్రియనిగ్రహ, వేదాధ్యయనాలే బ్రాహ్మణుడికి గొప్పధనాలు. ధర్మపథానికి ఇట్టి సద్గుణగణాలే సాధనాలు. ఇవియే వేదాలచేత ఆదేశించబడిన కర్తవ్యాలు.

విశేషం: (i) గురుజనులు:- తండ్రి, మేనమామ, అన్నగారు, చదువు చెప్పిన ఉపాధ్యాయుడు, మంత్రమును ఉపదేశించినవాడు మున్నగువారు గురుజనాలుగా పరిగణించబడతారు. (ii) షట్కర్మలు:- 1. యజనం 2. యాజనం 3. అధ్యయనం 4. అధ్యాపనం 5. దానం 6. ప్రతిగ్రహం.(iii) ధమ్మపదంలో 'ఎవడు బ్రాహ్మణుడు' అని ఒక ప్రత్యేక ప్రశ్న పరంపర ఉన్నది. అందును ఎన్నో సద్గుణగణాలు కలవాడే బ్రాహ్మణుడని చెప్పబడింది. మహాభారతంలోను, వైదికవాఙ్మయంలోను బ్రహ్మజ్ఞానం,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సౌశీల్యం, సద్గుణగణసంచయాలే బ్రాహ్మణత్వ లక్షణాలుగా పలుమారులు నొక్కి వక్కాణించబడ్డాయి. జన్మచేత బ్రాహ్మణత్వాన్ని ఎన్నటం అర్వాచీన లౌకిక సంప్రదాయమే.

వ. ధర్మంబు బహుమార్గదృష్టంబయి సూక్ష్మంబయియుండు; నీవు కేవల స్వాధ్యాయపరుండవు గాని ధర్మ సూక్ష్మత యెఱుంగవు; గావునం దడయక మిథిలానగరంబున కరుగు; మందు జితేంద్రియుండును సత్యవాదియు మాతాపితృభక్తుండును నయినవాఁడు ధర్మవ్యాధుం డను కిరాతుండు నీకు నఖిలధర్మంబులు నెఱింగించి, సంశయచ్ఛేదంబు సేయు; నాదెసం బ్రసన్నుండ వగునది; వనితలకుం బరిజ్ఞానంబు లేదు గావున వా రెట్టి యపరాధంబు సేసినను సహింపవలయుఁ గదా!' యనినఁ గౌశికుం డి ట్లనియె. 25

ప్రతిపదార్థం: ధర్మంబు= ధర్మం; బహు, మార్గ దృష్టంబు+అయి= పెక్కు తెరువులలో తిరుగాడేదిగా కన్పించేది అయి; ఉండున్= ఉంటుంది; ఈవు= నీవు; కేవల, స్వాధ్యాయ, పరుండవు= వేదాలు వల్లెవేయటంలో మాత్రమే నిష్ఠ కలిగినవాడవు; కాని= అంతేకాని; ధర్మ, సూక్ష్మత= ధర్మాధర్మవిచక్షణతలోని ఆంతర్యం; ఎఱుంగవు= తెలియనివాడవు; కావునన్= కాబట్టి; తడయక= ఆలస్యం చేయక; మిథిలా, నగరంబునకున్= మిథిల అనే పేరు కల పట్టణానికి; అరుగుము= వెళ్లుము; అందున్= ఆ మిథిలలో; జిత+ఇంద్రియుండును= జయించబడిన ఇంద్రియాలు కలవాడును- విషయలోలత్వాన్ని అతిక్రమించిన వాడును; సత్యవాదియున్= నిజాన్ని భాషించేవాడును; మాతాపితృభక్తుండునున్= తల్లిదండ్రులయెడ పూజ్యభావం కలవాడును; అయినవాఁడు; ధర్మవ్యాధుండు+అను, కిరాతుండు= ధర్మవ్యాధుఁడు అనే నామం పొందిన బోయవాడు; నీకున్; అఖిల ధర్మంబులున్= సమస్త ధర్మాలూ, ఎఱింగించి= తెలిపి; సంశయచ్ఛేదంబు+చేయున్= సందేహాలను తెగగొట్టివేస్తాడు; నాదెసన్= నాయెడల; ప్రసన్నుండవు+అగుము= అనుగ్రహం కలవాడవు కమ్ము; వనితలకున్= ఆడువారికి; పరిజ్ఞానంబు= ఎక్కువ తెలివిడి; లేదు= ఉండదు; కావునన్= కాబట్టి; వారు= ఆడువారు; ఎట్టి= ఏవిధమైన; అపరాధంబు= నేరం; చేసినను= చేసినప్పటికీ; సహింపవలయున్+కదా= ఓర్చుకొనవలసిందే కదా!; అనినన్= అని చెప్పగా; కౌశికుండు= కౌశికుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మం మిక్కిలి క్లిష్టమైనది. స్థూలదృష్టికి ఒక విధంగా, సూక్ష్మదృష్టికి మరొక తీరుగా కన్పిస్తుంది. ధర్మంయొక్క తీరుతీయాలు పెక్కు తెరగులు. నీవు వేదాలను వల్లెవేయటంలో మాత్రమే ఎక్కువనిష్ఠ కలవాడవు గాని ధర్మసూక్ష్మత గుర్తించగలిగిన విచక్షణ ఉన్నవాడవు కావు. కావున నీవు మిథిలానగరానికి వెళ్లి, ఆ పట్టణంలో 'ధర్మవ్యాధుడు' అనే పేరుతో పిలిచే బోయవాడిని సందర్శించు. అతడు జితేంద్రియుడు. మాతాపితృభక్తుడు. ధర్మసూక్ష్మవేత్త. అతడు నీసంశయాల నన్నింటిని పోగొట్టి నీకు విచక్షణాజ్ఞానం ప్రసాదించగలడు. నాయెడ అనుగ్రహం చూపుము. ఆడువారికి విజ్ఞానం ఉండదుకదా! అజ్ఞానంలో పడి కొట్టుకొనే నాబోటి ఆడువారు ఎటువంటినేరం చేసినా క్షమించవలెను కదా' అని ఆమె చెప్పిన మాటలు విని కౌశికుడు ఈవిధంగా బదులు పలికాడు.

**క. 'నిను దూఱఁదగదు నీకత । మున నాచిత్తము ప్రశాంతిఁ బొరసెఁ బురంధ్రీ
జన వినుత! పోయి వచ్చెద । ననుపమశోభనసమృద్ధు లయ్యెడు నీకున్.' 26**

ప్రతిపదార్థం: పురంధ్రీ, జన, వినుత= మగడు బిడ్డలుగల అనగా ఇల్లాండ్రసముదాయంచేత పొగడబడినదానా!; నినున్= నిన్ను; దూఱన్+తగదు= నిందించరాదు; నీ, కతమునన్= నీకారణాన; నా చిత్తము= నా మనస్సు; ప్రశాంతిన్= మిక్కిలి శాంతిని; పొరసెన్= పొందింది; పోయివచ్చెదన్= వెళ్ళివస్తాను (మిథిలానగరానికి నీఆదేశం ప్రకారం వెళ్ళుతాను); నీకున్= నీకు; అనుపమ, శోభన, సమృద్ధులు= సాటిలేనటువంటి శుభాల పెంపు; అయ్యెడున్= కలిగెడుగాక.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'అమ్మా! నీవు కేవలం ఒక ఆడుదానివి కావు. మేటి ఇల్లాండ్రకు మేలుబంతివై కర్మయోగిని వైన నీ మూలాన నాకు జ్ఞానోదయం అయింది. నా మనస్సుకు ప్రశాంతి లభించింది. నీ ఆదేశం ప్రకారం నేను మిథిలానగరానికి వెళ్ళుతాను. నీకు మేలు కలుగుగాక!'

కౌశికుం డను బ్రాహ్మణుండు ధర్మవ్యాధుని యొద్దకుఁ బోవుట (సం. 3-197-1)

వ. అని యా క్షణంబ యమ్మహాద్విజుండు ధర్మవ్యాధ దర్శనలాలసుండై కదలి పతివ్రతయెఱుకకు విస్మయం బందుచు దన్నుం గృతాపరాధునింగాఁ దలంచుచు ననేకనగర గ్రామంబు లతిక్రమించి చని, యనుపమానశోభాసనాథం బయిన మిథిలానగరంబు సొచ్చి, రాజమార్గంబు దఱిసి, యచ్చటి జనంబుల ధర్మవ్యాధుం డున్నయెడ నడిగి, వా రెఱింగింప నట యేఁగి ముందట నల్పమృగమాంసఖండంబు లంగడిం బచరించి యమ్ముచున్నవాని, ననవరత విక్రయాగత జనసమావృతు నక్కిరాతుం గని, యతిజుగుప్సితం బయిన సూనాపణంబు సేర నొల్లక తొలంగి యొక్కయెడ నుండె; నంత. 27

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; ఆ క్షణంబు+అ= ఆ క్షణంలోనే; ఆ+మహా, ద్విజుండు= ఆ గొప్పబ్రాహ్మణుడు; ధర్మవ్యాధ, దర్శన, లాలసుండు+ఐ= ధర్మవ్యాధుడిని చూడవలె ననే కోరిక కలవాడై; కదలి= అచ్చటి నుండి వెడలి; పతివ్రత, ఎఱుకకున్= పతివ్రతయొక్క తెలివిడికి; విస్మయంబు+అందుచున్= ఆశ్చర్యం చెందుతూ; తన్నున్= తనను; కృత+అపరాధునిన్+కాన్= దోషం చేసిన వాడినిగా; తలంచుచున్= మనసులో ఎన్నుకొంటూ; అనేక, నగర, గ్రామంబులు= పెక్కు పట్టణాలు, పల్లెటూళ్లు; అతిక్రమించి= దాటి; చని= వెళ్లి; అనుపమాన, శోభా, సనాథంబు+అయిన= సాటిలేని వైభవంతో కూడినట్టి; మిథిలా, నగరంబు+చొచ్చి= మిథిల అనే పట్టణాన్ని చేరి; రాజమార్గంబు= రాజుగారు ఊరేగేతెరువు; తఱిసి= సమీపించి; అచ్చటి= అక్కడున్న; జనంబులన్= ప్రజలను; ధర్మవ్యాధుండు+ఉన్న+ఎడన్= ధర్మవ్యాధుడు నివసించే చోటును; అడిగి= ప్రశ్నించి; వారు= (ఆజనులు); ఎఱింగింపన్= తెలుపగా; అట+ఏగి= ఆ చోటికి వెళ్లి; ముందటన్ ఎదురుగా; అల్ప, మృగ, మాంస, ఖండంబులు= చిన్న చిన్న ముక్కలుగా చేయబడిన లేడి మాంసాలు; (లేక జంతువుల మాంసపు ముక్కలు); అంగడిన్= దుకాణంలో; పచరించి= ఏర్పరచి పెట్టి; అమ్ముచున్నవానిన్= విక్రయిస్తున్న వాడిని; అనవరత, విక్రయ+ఆగతజన, సమావృతున్= ఎడతెగకుండా కొనటానికై వస్తున్న ప్రజలచేత చుట్టుకొనబడినవాడిని; ఆ+కిరాతున్= ఆ బోయవాడిని; కని= చూచి; అతిజుగుప్సితంబు+అయిన= మిక్కిలి రోతపుట్టించేది అయిన; సూన+ఆపణంబు= జంతువులను చంపి వాటి మాంసాన్ని అమ్మే అంగడి; చేరన్+ఒల్లక= సమీపించటానికి ఇష్టపడక; తొలంగి= దూరంగా నిలిచి; ఒక్క+ఎడన్= ఒకచోట; ఉండెన్; అంతన్= పిమ్మట.

తాత్పర్యం: అంతట కౌశికుడు ఆ గృహిణిని వీడ్కొని వెళ్ళాడు. అతడు ఆ పతివ్రత జ్ఞానానికి ఆశ్చర్యపోయాడు. తాను తప్పుచేసినవాడుగా లోలోపల పశ్చాత్తాపం పొందాడు. అట్లే- అతడు ఎన్నో పల్లెలు, పట్టణాలు దాటి పయనించి ఎట్టకేలకు మిథిలానగరం చేరి, ఆ రాజధానిశోభను తిలకించి, రాజమార్గంలోని పౌరులను అడిగి, ధర్మవ్యాధుడు ఉండేచోటు తెలిసికొన్నాడు. అక్కడికి కౌశికుడు చేరినప్పుడు, ధర్మవ్యాధుడు తన అంగడిలో మాంసాన్ని ముక్కలుచేసి అమ్ముతున్నాడు. మాంసాన్ని కొనుగోలు చేసే జనులచేత ఆ అంగడి క్రిక్కిరిసి ఉండింది. రోత పుట్టించే ఆ దృశ్యాన్ని చూడలేక ఆ బ్రాహ్మణుడు ప్రక్కకు ఒదిగి ఒకచోట నిలబడి ఉన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. వాఁడు నతనిరాక పోఁడిగ నిజబుద్ధి । నెఱిఁగి యతనియున్నయెడకు వచ్చి
పరమభక్తిమ్రొక్కి ధరణీసురేశ్వరుఁ । గుశల మడిగి ప్రియము గొనలు నిగుడ. 28

ప్రతిపదార్థం: వాఁడున్= (ఆ ధర్మవ్యాధుఁడును); అతనిరాక= ఆ కౌశికుడు రావటం; పోఁడిగన్= ఒప్పుగా; నిజ, బుద్ధిన్= తనమనస్సుచేత; ఎఱిఁగి= తెలిసికొని; అతని+ఉన్న+ఎడకున్= అతడు ఉన్న చోటికి; వచ్చి= చేరి; పరమ, భక్తిన్= మిక్కిలి పూజ్యభావంతో; మ్రొక్కి= నమస్కరించి; ధరణీ, సుర+ఈశ్వరున్= బ్రాహ్మణోత్తముడిని; కుశలము= యోగక్షేమాలను; అడిగి= ప్రశ్నించి తెలిసికొని; ప్రియము= సంతోషం; కొనలు నిగుడన్= విస్తరించగా.

తాత్పర్యం: ఆ ధర్మవ్యాధుడు కౌశికుడు తనవద్దకు ఆ రీతిగా రావటం తన మనశ్శక్తిచేత తెలిసికొని, ఆ విప్రుడు నిలిచిఉన్న చోటికి చేరి అభివాదం చేసి, మిక్కిలి ప్రీతితో అతడిని సంభావించాడు.

విశేషం: అతిథులు అభ్యాగతులు తమవద్దకు వచ్చినపుడు వారి యోగక్షేమాలు అడగటం స్వాగతమర్యాదలో అంతర్భాగం.

చ. 'అనఘ! నితంబినీతిలక మైన పతివ్రత నా తెఱంగు సె
ప్పినఁ జనుదెంచి తీవు ననుఁ బ్రీతిఁ గనుంగొన; నీమనోరథం
బును మదిలో నెఱుంగుదుఁ; బ్రమోదముఁ బొందితి; రమ్ము మద్గృహం
బున' కని పల్కి తోడుకొనిపోయె నతండు మహీసురోత్తమున్. 29

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా!; నితంబినీ, తిలకము+ఐన= ఆడువారిలో ఉత్తమురాలు అని చెప్పదగిన; పతివ్రత= భర్తను సేవించే గొప్ప ఇల్లాలు; నాతెఱంగు= నా తీరుతెన్నులు; చెప్పినన్= వచించగా; ఈవు= నీవు; ననున్= నన్ను; ప్రీతిన్= ప్రేమతో; కనుంగొనన్= చూడటానికి; చనుదెంచితి= వచ్చావు; నీ, మనో, రథంబును= నీ కోరికను; మదిలోన్= మనస్సులో; ఎఱుంగుదున్= తెలిసికొంటిని; ప్రమోదమున్= సంతోషాన్ని; పొందితిన్= చెందితిని; మత్+గృహంబునకున్= నా యింటికి; రమ్ము+అ= రమ్ము; అని పల్కి= అని వచించి; అతండు= (ఆ ధర్మవ్యాధుడు); మహీసుర+ఉత్తమున్= బ్రాహ్మణులలో గొప్పవాడయిన ఆ కౌశికుడిని; తోడుకొని పోయెన్= తనవెంట తీసికొని వెళ్ళాడు.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! నీకు నన్నుగూర్చి ఆ పతివ్రత చెప్పింది గదా! అందుచేత నీవు నన్ను చూడవలెననే కోరికతో నా దగ్గరకు విచ్చేశావు. ఈ విషయాన్ని నేను నా మనస్సుచేత తెలిసికొనగలిగాను. ఎంతో సంతోషం పొందాను. దయచేసి నాయింటికి రమ్ము' అని సగౌరవంగా స్వాగతం చెప్పి, ధర్మవ్యాధుడు బ్రాహ్మణోత్తము డైన కౌశికుడిని తన యింటికి తీసికొని వెళ్ళాడు.

వ. కౌశికుండును ధర్మవ్యాధునెఱుక కచ్చెరు వంది పతివ్రతయెఱుకయుం దలంచి 'యిది రెండవు నాశ్చర్యంబు గంటి పా' మ్మని తలంచుచుఁదదీయభవనంబున కరిగి వానిచేతంబూజితుం డయి యిష్టకథాప్రసంగంబున నుండి యతని కి ట్లనియె. 30

ప్రతిపదార్థం: కౌశికుండును= కౌశికుడనబడే ఆ బ్రాహ్మణుడును; ధర్మవ్యాధు+ఎఱుకకున్= ధర్మవ్యాధుడి తెలివిడికి; అచ్చెరువు+అంది= ఆశ్చర్యం పొంది; ఇది= (పతివ్రత తనను మిథిలకు వెళ్ళి ధర్మవ్యాధుడిని సందర్శించు మని చెప్పిన విషయం ఆవ్యాధుడికి తెలియటం); రెండు+అవు+ఆశ్చర్యంబు= రెండవది అయిన వింత; (మొదటి వింత కొక్కెర

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చనిపోయిన సంగతి పతివ్రతకు తెలియటం); కంటిన్ పొమ్ము+అని= చూచాను గదా అని; తలంచుచున్= అని ఆలోచిస్తూ; తదీయభవనంబునకున్= ఆతడి యొక్క అనగా ధర్మవ్యాధుడియొక్క ఇంటికి; అరిగి= వెళ్ళి; వానిచేతన్= అతడి చేత; పూజితుండు+అయి= ఆరాధించబడినవాడై; ఇష్ట, కథా, ప్రసంగంబునన్= నచ్చినట్టి కథలను గూర్చిన సంభాషణలలో; ఉండి= కడపి; అతనికిన్= ఆ ధర్మవ్యాధుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: కౌశికుడికి ధర్మవ్యాధుడి మాటలు రెండవ వింతగా తోచాయి. అతడికి మొట్టమొదట వింతగొలిపినవి పతివ్రత మాటలు. ఈ రెండు వింతలనుగూర్చి ఆలోచిస్తూ కౌశికుడు ధర్మవ్యాధుడి ఇంటికి వెళ్లి, అచటి అతిథి సత్కారాలను పొంది, ఉచిత సంభాషణలు సలిపి, అతడితో ఈ విధంగా పలికాడు.

విశేషం: (i)కౌశికుడు ఎదుర్కొనినవి రెండు వింతలు. మొట్టమొదట అరణ్యంలో తాను ఏకాంతంగా వేదాధ్యయనం చేసేటప్పుడు తన ఆగ్రహానికి లోనయి చెట్టుమీది కొంగ కాలిపోయి నేలమీద పడటాన్ని పతివ్రత తెలిసికొనటం. (ii) రెండవ వింత: తాను సుదూరంగా ఎక్కడో ఆనాడు పతివ్రతతో నెరపిన సంభాషణ - మిథిలానగరంలో ఉన్న ధర్మవ్యాధుడికి ఇక్కడ తెలియటం.

తే. **'నీవు గడు ధర్మవిదుఁడవు జీవహింస । జీవనంబుగ నడచుట శిష్టపథమె?**
యకట! యీ ఘోరకర్మంబునకు మదీయ । బుద్ధి దద్దయు దుఃఖంబు వొందె నిపుడు. **31**

ప్రతిపదార్థం: నీవు= నీవు; కడున్= మిక్కిలి; ధర్మవిదుఁడవు= ధర్మాన్ని తెలిసినవాడవు; జీవహింస= ప్రాణులకు పీడ కలిగించటం; జీవనంబుగన్= బ్రదుకుతెరువుగా; నడచుట= వర్తించటం; శిష్ట, పథము+ఎ?= మంచి మార్గం కాగలదా?; అకట!= అయ్యో!; ఈఘోర, కర్మంబునకున్= ఈ భయంకరమైనపనికి; మదీయ, బుద్ధి= నామనస్సు; తద్దయున్= మిక్కుటంగా; ఇపుడు= ఈసమయంలో; దుఃఖంబు+పొందెన్= విషాదాన్ని పొందింది.

తాత్పర్యం: 'ఓమహానుభావా! నీవు ధర్మమార్గం అనగా ఎట్టిదో బాగా తెలిసినవాడవు కదా! 'జీవహింస'ను బ్రదుకుతెరువుగా గైకొని ప్రవర్తించటం న్యాయమా? నీవు చేస్తున్న భయంకరమైన ఈ పాపకృత్యంవలన నా మనస్సు మిక్కిలి పరితపిస్తున్నది.

వ. **అనుటయు లుబ్ధకుం డి ట్లనియె; 'బ్రాహ్మణులకుఁ దపస్స్వాధ్యాయ సత్యశౌచబ్రహ్మచర్యంబులును, రాజులకు దండనీతియు, వైశ్యులకుఁ గృషిపశుపాలనవాణిజ్యంబులును, శూద్రులకు శుశ్రూషయు నెట్లు పరమధర్మం బయి చెల్లు; నట్ల మాకును మృగమాంసోపజీవనంబు పరమధర్మంబు; విశేషించి యిది వంశక్రమాగతం బయిన యాచారంబు; విను; మదియునుం గాక యీ దేశంబునకు రాజైన జనకుండు రాజధర్మతత్పరుండయి సకలవర్ణధర్మరక్షణంబు వదలకుండు; నట్లుగాన యాత్మకర్మంబులు విడుచువానిం దనపుత్త్రునైనను దండితుం జేయుఁ గావున నేనును నిజకర్మపరిత్యాగంబు సేయ నోడుదు; నీదృశప్రవర్తనుండ నయ్యును.** **32**

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పటంతో; లుబ్ధకుండు+ఇట్లు+అనియెన్= వ్యాధుడు(ధర్మవ్యాధుడు) ఈవిధంగా అన్నాడు; బ్రాహ్మణులకున్= విప్రులకు; తపస్+స్వాధ్యాయ, సత్య, శౌచ, బ్రహ్మచర్యంబులును= తపస్సుచేయటం, వేదాలను వల్లెవేయటం, నిజం చెప్పటం, పరిశుభ్రతను పాటించటం, ఇంద్రియనిగ్రహంతో కూడిన జ్ఞానాన్ని ఆర్జించటం; రాజులకున్= క్షత్రియు లైన పాలకులకు; దండనీతియున్= దుష్టులను శిక్షించటం శిష్టులను రక్షించటంతో కూడిన పాలన; వైశ్యులకున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కోమట్లకు; కృషి= వ్యవసాయం; పశుపాలన= పశురక్షణ; వాణిజ్యంబులును= వర్తకమున్నూ; శూద్రులకున్= నాలవజాతివారికి; శుశ్రూషయున్= సేవయును; ఎట్లు= ఏవిధంగా; పరమ, ధర్మంబు+అయి= మిక్కిలి గొప్పది అయిన ధర్మం ఔతూ; చెల్లున్= తగును; అట్లు+అ= అదే విధంగా; మాకును= మాబోటి వారలకును; మృగ, మాంస+ఉపజీవనంబు= జంతువుల మాంసంపై ఆధారపడి బ్రతకటం; పరమ, ధర్మంబు= గొప్పదైన ధర్మం; విశేషించి= విశదీకరించి వివరిస్తే; ఇది= మృగమాంసోపజీవనం; వంశ, క్రమ+ఆగతంబు+అయిన= కుటుంబంలో వరుసగా వస్తున్న; ఆచారంబు= సంప్రదాయం; వినుము; అదియునున్+కాక= అంతకంటె మిక్కుటంగా ఎన్నదగింది; ఈదేశంబునకున్= ఈ(మిథిలా) రాజ్యానికి; రాజు+అయిన= ప్రభువు అయిన; జనకుండు; రాజ, ధర్మ, తత్, పరుండు+అయి= ప్రభుత్వం నిర్వహించే విధులను నిష్ఠతో ఆచరించే వాడయి; సకల, వర్ణ, ధర్మ రక్షణంబు= అన్ని కులాలవారు నెరవేర్చవలసిన ధర్మాలను రక్షించటాన్ని; వదలక+ఉండున్= మీరకుండ కాపాడుతుంటాడు; అట్లు+కాన= ఆవిధంగా చేస్తాడు కాబట్టి; ఆత్మ, కర్మంబులు= తాను చేయవలసిన కర్మలను; విడుచువానిన్= త్యజించే వాడిని; తన పుత్త్రున్+ఐనను= తన కొడుకును అయినప్పటికిని; దండితున్+చేయున్= శిక్షను అనుభవించేవాడినిగా చేస్తాడు; కావునన్= కాబట్టి; ఏనును= నేను సయితం; నిజ, కర్మ, పరిత్యాగంబు= నాదైన పనులను వదలటం; చేయన్+ఓడుదున్= చేయటానికి జంకుతాను; ఈ, దృశ్యప్రవర్తనుండన్+అయ్యునున్= ఈ విధంగా కనిపించే నడవడి కలవాడ నైనప్పటికిని.

తాత్పర్యం: అంతట, ధర్మవ్యాధుడు కౌశికుడితో ఇట్లా చెప్పాడు. 'ఎవరికి అనువైన ధర్మాలు వారు ఆచరించవలసి ఉన్నది. బ్రాహ్మణులు నిర్వహించవలసిన ధర్మాలు - తపస్సు, వేదాలను చదవటం, పరిశుభ్రత పాటించటం, ఇంద్రియనిగ్రహంతో కూడి జ్ఞానసముపార్జనం చేయటం; క్షత్రియప్రభువులు పాటించవలసినధర్మం శిష్టరక్షణం దుష్టశిక్షణంతో గూడిన పరిపాలన; వైశ్యులు ఆచరించవలసిన ధర్మాలు - వ్యవసాయం, వర్తకం, పాడిపంటలు అభివృద్ధిచేయటం; శూద్రులకు విహితమైన ధర్మం పరిచర్య. అట్లే, వ్యాధులు నెరవేర్చదగిన ధర్మం మాంసవిక్రయం. మాంసోపజీవనం మాకు వంశక్రమంగా సంక్రమించిన ఆచారం. అంతేకాక, ఇది మిథిలారాజ్యం. ఈ దేశానికి ప్రభువు జనకమహారాజు ఎవరివంశవృత్తులు వారు నిర్వహించవలె నని శాసించేవాడు. ఆ శాసనం మీరేవాడు తన కొడుకైనాసరే దండన విధిస్తుంటాడు. ఇన్ని కారణాలచేత నేను నా స్వధర్మ మైన మాంసవిక్రయాన్ని వీడజాలకున్నాను. స్థూలదృష్టికి నా ప్రవర్తన ఈ రీతిగా కన్పించవచ్చును. కానీ.....

తే. **జీవహింస యెన్నండును జేయ ననఘ! యొరులు సంపి తెచ్చిన మాంస మొనర విలిచి**
తగిన వెల కమ్మి బ్రదుకుదుఁ; దద్ధనమున । నమలమానసశాంతి నా యర్థ మెందు. 33

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా! ఓకౌశికమహర్షీ!; జీవహింస= ప్రాణులను పీడించటం; ఎన్నండును= ఎప్పుడు కూడా; చేయన్= చేయను; ఒరులు= ఇతరులు; చంపి= సంహరించి; తెచ్చిన= తీసికొనివచ్చిఇచ్చిన; మాంసము= మాంసం; ఒనరన్= ఒప్పేటట్లుగా; విలిచి= కొని; తగినవెలకున్= సరియైన ధరకు; అమ్మి= విక్రయించి; తత్+ధనమునన్= ఆ విధంగా సంక్రమించిన డబ్బువలన; బ్రదుకుదున్= జీవిస్తాను; అమల, మానస, శాంతి= స్వచ్ఛమైన మనస్సుకు సంబంధించిన తృప్తి; ఎందున్= అన్ని విధాలుగా; నా, అర్థము= నా సంపద, అనగా జీవిత పురుషార్థమని భావం!

తాత్పర్యం: నా అంతట నేను ఎప్పుడూ ఎట్టి జీవహింసకూ పాల్పడను. ఇతరులు మృగాలను చంపి తెచ్చి ఇచ్చిన మాంసాన్ని నేను కొని, కొద్ది లాభాన్ని మాత్రమే చూచికొని సరిఅయిన ధరకు విక్రయిస్తాను. ఆ విధంగా లభించిన ధనంవలన జీవిస్తాను. నా ధనంవలన నాకు మనశ్శాంతికూడ కలుగుతుంది. అదే నా పరమార్థం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: బ్రతకటానికి కావలసిన ధనం - న్యాయార్జితమైనదానిని, అధికలాభానికి దురాశకు పాల్పడక సంపాదిస్తాననీ, దానివలన తనకు తృప్తి కలుగుతుందనీ ధర్మవ్యాధుడు నొక్కి వక్కాణించాడు. 'జీవించుటకొరకు మాత్రమే ధనం- గాని ధనం కొరకే జీవించటం కూడదు' అని అతడి సందేశం.

చ. వినయము విస్తరిల్ల గురువృద్ధజనాతిథి విప్ర దేవతా
ర్చన లొనరింతు, సత్యమును శౌచము నేమఱ, నీగి మన్ననం
దనుపుదు భృత్యబంధుతతిఁ, దాల్మి వహింతు, నసూయఁ జేయ, నెం
దును మదిఁ దృష్ణ సొన్పఁ, బరదోషకథావిముఖుండ నెప్పుడున్. 34

ప్రతిపదార్థం: వినయము= అణకువతో కూడిన ప్రవర్తన; విస్తరిల్లన్= వర్ధిల్లేటట్లుగా; గురు, వృద్ధ, జన+అతిథి, విప్ర, దేవతా+ అర్చనలు= ఒజ్జలకు ముసలివారికి అతిథులకు బ్రాహ్మణులకు దేవతలకు పూజలు; ఒనరింతున్= చేస్తాను; సత్యమును= నిజం పలుకటం; శౌచమున్= పరిశుభ్రత పాటించటం; ఏమఱను= మరచిపోను; ఈగి= దానంచేత; మన్ననన్= మర్యాదలు చేయటం చేతను; భృత్యబంధుతతిన్= సేవకులను, చుట్టాలను; తనుపుదున్= తృప్తి చెందిస్తాను; తాల్మిన్= ఓర్పును; వహింతున్= వహిస్తాను; అసూయన్+చేయన్= మాత్సర్యాన్ని చెందను; ఎందును= ఎట్టి విషయంలోనైనా; మదిన్= మనసులో; తృష్ణ+చొన్పన్= దాహాన్ని (ఎక్కువ అభిలాషను) ప్రవేశపెట్టను; ఎప్పుడున్= ఏ సమయంలోనైనా; పర, దోష, కథా, విముఖుండన్= ఇతరుల తప్పులను గూర్చిన ప్రసంగాలను ఎన్నబోను.

తాత్పర్యం: నేను మిక్కిలి అణకువతో కూడిన ప్రవర్తనతో గురువులను, పెద్దలను, అతిథులను, బ్రాహ్మణులను, దేవతలను పూజిస్తాను. సత్యవ్రతాన్ని పాటిస్తాను. పరిశుభ్రతను ఎన్నడూ మరవను. సేవకులకు దానా లిస్తాను. బంధువులను మర్యాదలు చేసి మన్నిస్తాను. ఓర్పును వహిస్తాను. అసూయ చెందను. ఎట్టి విషయాలలోను మిక్కుటమైన కోరికలను పెంచుకోను. ఎప్పుడూ ఇతరుల దోషాలను గూర్చిన ప్రసంగాలను వినను.

క. సతతోపవాసనియమ । వ్రతములఁ జరియింతు నేకవనితాప్రియుఁడన్
ఋతుకాలరతుఁడ నిందా । స్తుతులందు మనంబు నాకుఁ దుల్యత నుండున్. 35

ప్రతిపదార్థం: సతత+ఉపవాస, నియమ, వ్రతములన్= ఆహారాన్ని గైకొనకుండే నిబంధనలతో, నోములతో ఎల్లప్పుడును; చరియింతున్= నడుస్తాను, (ఆచరిస్తానని భావం); ఏక, వనితా, ప్రియుఁడన్= ఒకే స్త్రీయందు ప్రీతికలవాడను - ఏకపత్నీవ్రతం పాటించేవాడిని; ఋతు, కాల, రతుఁడన్= కాలానుగుణమైన సమయాలలోనే సంభోగించటంలో ఇష్టం కలవాడను; నిందా, స్తుతులందున్= తెగడ్తలలో, పొగడ్తలలో; మనంబు= మనస్సు; నాకున్; తుల్యతన్= సమభావంతో; ఉండున్= ఉంటుంది.

తాత్పర్యం: నేను ఎల్లప్పుడున్నూ ఆహార విహారాలలో నిష్ఠ, నియమాలను పాటిస్తాను. ఉపవాస వ్రతాలను పాటిస్తాను. ఏకపత్నీవ్రతుడను. ఋతుకాలాలను అనుసరించి సంభోగిస్తాను. నామనస్సులో పొగడ్తకు ఉబ్బను. తెగడ్తకు వెతచెందను.

వ. అట్లగుటం జేసి హీనయోనిజుండ నయ్యును నిర్మలుండ నైతిం; బ్రసంగవశంబున నింత సెప్పవలసె; నీవు ధర్మబోధార్థంబు నాయున్నయెడకుం జనుదెంచితి గావున నీకు ధర్మవిశేషంబు లెఱింగించెద; నవధానతత్పరుండ వయి యాకర్ణింపుము. 36

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అట్లు+అగుటన్+చేసి= ఆవిధంగా జరగటంవలన; హీన, యోనిజుండన్+అయ్యును= తక్కువకులంలో పుట్టిన వాడను అయినప్పటికిన్నీ; నిర్మలుండన్+ఐతిన్= స్వచ్ఛమైన శీలం కలవాడను అయినాను; ప్రసంగ, వశంబునన్= సంభాషణ ధోరణినిబట్టి; ఇంత+చెప్పవలసెన్= ఇంతమేర ఈ విధంగా చెప్పవలసి వచ్చింది; నీవు; ధర్మ, బోధ+అర్థంబు= ధర్మాన్ని తెలిసికొనటానికై; నా+ఉన్న+ఎడకున్= నేను ఉన్నచోటికి; చనుదెంచితి(వి)= వచ్చావు; కావునన్= కాబట్టి; నీకున్; ధర్మ, విశేషంబులు= ధర్మాలలోని ప్రత్యేకవిభాగాలు- ధర్మసూక్ష్మాలు; ఎఱింగించెదన్= తెలియపరుస్తాను; అవధాన, తత్, పరుండవు+అయి= ఏకాగ్రతలో నిష్ఠ కలవాడవై; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అందుచేత, నేను తక్కువకులంలో పుట్టినప్పటికిన్నీ, మంచిశీలం ఏర్పరచుకొన గలిగాను; ఇది నీకు చెప్పటం నాగొప్పదనం చాటుకొనటానికి కాదు. సంభాషణ చేయవలసివచ్చింది కాబట్టి చెప్పక తప్పింది కాదు. నీవు నా దగ్గరకు వచ్చింది ధర్మసూక్ష్మాలను తెలిసికొనటానికే కదా. నీకు ధర్మాలలోని ప్రత్యేకభేదాలను తెలుపుతాను. శ్రద్ధతో జాగరూకుడ వై వినుము.

విశేషం: ఇచట ధర్మవ్యాధుడు తననుగూర్చి తాను కొంత చెప్పుకొనవలసివచ్చింది. అది ఆత్మస్తుతిగా భాసించటానికి కొంత సావకాశమున్నది. అందుచేత ధర్మవ్యాధుడు సంకోచించి, - 'ఇంత' చెప్పవలసె అని క్షమాపణ చెప్పుకొన్నాడు. ఇచట 'ఇంత' అను సార్థకప్రయోగంలోని స్వారస్యం గమనించ తగింది.

ధర్మవ్యాధుఁడు కౌశికునకు ధర్మవిశేషంబు లెఱిఁగించుట (సం. 3-198-19)

క. **తనకులధర్మము విడువక । మనుట పరమధర్మ మండ్రు మాన్యులు; చిత్తం**
బునఁ గృప గలుగుట ముఖ్యపుఁ । బని; సైరణ వలయు నఖిలభావములందున్. **37**

ప్రతిపదార్థం: మాన్యులు= గొప్పవారు; తనకులధర్మము= తనకులానికి చెందిన ధర్మం; విడువక= వదలక; మనుట= జీవించటం; పరమ, ధర్మము+అండ్రు= గొప్ప దైన ధర్మం అని అంటారు; చిత్తంబునన్= మనస్సులో; కృప= దయ; కలుగుట= ఉండటం; ముఖ్యము+పని= ప్రధాన మైన సంగతి; అఖిల, భావములందున్= అన్నిఅభిప్రాయాలలోను; సైరణ= ఓర్పు; వలయున్= ఉండాలి.

తాత్పర్యం: పెద్దలు చెప్పే గొప్పమాట ఏమంటే - తన కులానికి చెందిన ధర్మాన్ని విడువకుండా ఆచరించటం మంచిది. అసలు మనస్సులో దయ అనేభావం ఉండాలి. దయాగుణమే అన్నిటికంటె గొప్పది. ఈ ప్రపంచంలో విభిన్నభావాలు ఎన్నో ఉండవచ్చును. తన అభిప్రాయమే మంచిది. ఇతరుల భావాలు చెడ్డవి అనే భావం మంచిది కాదు. అన్నిభావాలయెడ సహనం ఉండాలి.

విశేషం: ఈ పద్యంలో రెండు గొప్ప గుణాలు (i) దయ (ii) సహనం శీలానికి గీటురాళ్లుగా పేర్కొనబడినవి. తాను బ్రాహ్మణుడు కావచ్చును. అహింసావ్రతాన్ని తాను పాటిస్తున్నట్లు తలపోయవచ్చును. కాని, మాంసవిక్రయం అధర్మమనే శీఘ్రనిర్ణయానికి పాల్పడరాదు. భిన్నభావాలయెడ సైరణ లేకపోతే ధర్మసూక్ష్మాన్ని ఎఱుగరాదుగదా!- 'సైరణ వలయు నఖిలభావములందున్' అనునది మహాభారతం అందించిన సందేశాలలో మేల్తరంగా ఎన్నదగింది.

ఆ. **విడువవలయు విషయవిషమవాంఛల నెద । విడుపుఁబోలు గుణము వెదకి యెందుఁ**
గానరైరి బుధులు గలదె పరిత్యాగ । శీలునకు నసాధ్యసిద్ధి యెందు. **38**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఎదన్= హృదయంలో; విషయ, వాంఛలన్= శబ్దస్పర్శాదులకు సంబంధించిన వంకరటింకర కోరికలను; విడువవలయున్= వదలిపెట్టాలి; బుధులు= పెద్దలు; వెదకి= అన్వేషణంచేసి; విడుపున్+పోలు, గుణము= వదలిపెట్టుట (త్యాగం) అనే దానితో సమానమైన లక్షణాన్ని; ఎందున్= ఎచటను; కానరు+ఐరి= చూడలేక పోయారు; ఎందున్= ఎచట నైనను; పరిత్యాగశీలునకున్= వదలిపెట్టే స్వభావం కలవాడికి; అసాధ్యసిద్ధి= సాధించలేనట్టి ప్రయోజనం; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: ఇంద్రియసుఖాలపై గల కోరిక హృదయపూర్వకంగా వీడాలి. త్యాగంతో సరిసమానమైన లక్షణం ఎక్కడా కనపడదని అనుభవపూర్వకంగా అన్వేషించి పెద్దలు చెప్పిన తీర్పుమాట. - త్యాగంచేసే స్వభావం గలవాడికి ఎచటనైన అసాధ్యమైన దెక్కడైనా ఉన్నదా?

విశేషం: ప్రాచీనభారతీయసంస్కృతి - 'త్యాగము'ను వేనోళ్ల ప్రస్తుతించింది. సిద్ధార్థుడు బుద్ధుడైనది - రాముడు దేవుడైనది భారతభూమిలో త్యాగమాహాత్మ్యంవలననే. 'న కర్మణా న ప్రజయా, న ధనేన త్యాగే నై కే, అమృతత్వ మానశుః' - ఇది వేదవచనం.

సీ. **సత్యహితాలాప చతురత యర్హంబు, । సంతత సుజన పూజనము వలయు,**
విను కామసంరంభవిద్వేషములఁ జేసి । మతి గలంగినను ధర్మంబు దప్పఁ
ద్రొక్కక నడచు టత్యుత్తమసరణి; య । ప్రియములయందును బ్రియములందు
దైన్యహర్షంబులఁ దగులక యున్నట్టి । కల్యాణవర్తనకాంక్ష లెస్స;

తే. **యెగ్గు సేసినవారికి హితము సేఁత । యార్యజనములు గీర్తింతు; రన్యదోష**
కారి దనపాపమునఁ దాన కాలిపోవు; । వేఱ వానికిఁ గీడు గావింప నేల? 39

ప్రతిపదార్థం: సత్య, హిత+ఆలాప, చతురత= నిజాన్ని వచించటం, మేలుకలిగించే దానిని పలకటంలో నేర్పు; అర్హంబు= తగినట్టిది; సంతత, సుజన, పూజనము= ఎల్లప్పుడు మంచివారలను ఆరాధించటం; వలయున్= చేయతగినది; విను= వినుము; కామ, సంరంభ, విద్వేషములన్+చేసి= కోరికల త్రొక్కిసలాటచేత ఏర్పడే పగబూనుటలవలన; మతి+కలంగినను= బుద్ధి చెడిపోయినను; ధర్మంబు+తప్పన్+త్రొక్కక= ధర్మమార్గాన్ని విడిపోవకుండగ; నడచుట= ప్రవర్తించటం; అతి+ఉత్తమ+సరణి= మిక్కిలి మంచిదైన పద్ధతి; అప్రియముల+అందును= తనకు ఇష్టం కాని సంగతులలోనూ; ప్రియములందున్= ఇష్టాలైన సంగతులలోనూ; దైన్య, హర్షంబులన్= క్రుంగిపోవటంలో గాని, ఉబ్బిపోవటంలోగాని; తగులక= చిక్కుకొనక; ఉన్నట్టి= ఉండునట్టి; కల్యాణ, వర్తన, కాంక్ష= మేలినడవడి పెంపొందించుకొనే కోరిక; లెస్స= మేలు; ఎగ్గుచేసినవారికిన్= అపకారం చేసిన వారికి; హితము+చేఁత= మేలుచేయటం; ఆర్యజనములు= పూజించదగినవారు; కీర్తింతురు= పొగడుతారు; అన్య, దోషకారి= ఇతరులకు చెడు చేసేవాడు; తనపాపమునన్= తాను చేసిన దోషం (పాపం) వలన; తాను+అ= తానే; కాలిపోవున్= మండిపోతాడు; వేఱు+అ= భిన్నంగా, (అనగా అంతకంటె అదనంగా); వానికిన్= (అట్టి పాపికి); కీడు= హాని; కావింపన్+ఏల= ఎందుకు చేయాలి? (అనగా చేయ నవసరం లేదు).

తాత్పర్యం: ఎల్లప్పుడూ మంచివారిని పూజించాలి. సావధానంగా ఆలకించుము: ఒక్కొక్కవేళ కోరికలు సందడి కలిగించినప్పటికిని ధర్మమార్గాన్ని తప్పకుండగా తన నడవడి తీర్చి దిద్దుకొనాలి. ఇది మిక్కిలి మంచి పద్ధతి. తనకు శుభం కలిగినా, అశుభం ప్రాప్తించినా పొంగిపోరాదు. క్రుంగిపోకూడదు. అపకారం చేసినవారికి సయితం ఉపకారం చేయటమే ఆర్యులు పొగడే పద్ధతి. అపకారం చేసిన పాపాత్ముడు తనపాపంచేత తానే కాలిపోతాడు కదా! ఇక అట్టి పాపాత్ముడికి వేరే హాని చేయటం అనవసరం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ధార్మికులు సలుపు నుత్తమ । కర్మముఁ జెడనాడు నాస్తికజనము; వినుమీ
దుర్మతుల తెఱఁగు గైకొని । ధర్మమునెడఁ బ్రీతి వదలఁ దగదు బుధునకున్. 40

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; నాస్తికజనము= వేదప్రామాణ్యాన్ని అంగీకరించక దేవుడు లేడు అని వాదించే వారలకూటమి; ధార్మికులు= ధర్మాత్ములు; చలుపు= చేసే; ఉత్తమ, కర్మమున్= మంచిపనిని; చెడనాడున్= తెగడుతుంది; ఆ, దుర్మతుల తెఱఁగు= ఆ చెడ్డబుద్ధి కలవారల పద్ధతిని; కైకొని= అంగీకరించి, స్వీకరించి; బుధునకున్= మంచివాడికి; ధర్మము+ఎడన్= ధర్మంపట్ల; ప్రీతి= అభిమానం; వదలన్+తగదు= వీడటం మంచిది కాదు.

తాత్పర్యం: వేదప్రామాణ్యాన్ని అంగీకరించక దేవుడు లేడు అని వాదించేవారు, ధర్మాత్ములు చేసే మంచిపనులను నిందిస్తారు. అట్టి దురాత్ముల పద్ధతిని అంగీకరించి, బుధుడు ధర్మంపట్ల అభిమానాన్ని వీడకూడదు.

విశేషం: నాస్తికుడు - అనేమాటకు లేదు అని ఎంచేవాడు అని అర్థం. వేదములందు, భగవంతుడియందు, పరలోకములందు నమ్మకం లేనివాడు అనే అర్థంలో నాస్తికశబ్దం బహుళంగా ప్రయోగించబడింది.

క. మది మఱపునఁ బాపము దన । కొదవుటయును బిదప వగచి యొక సగమును నే
నిది సేయ నింక ననియెడు । మదిఁ బెఱసగమును నరుండు మలుఁగు నఘంబున్. 41

ప్రతిపదార్థం: మది, మఱపునన్= మనస్సు ఏమరుపాటులో ఉన్నపుడు (అనాలోచితంగా); పాపము= దురితం; తనకున్+ ఒదవుటయును= తనకు సంప్రాప్తంకావటమున్నూ; పిదపన్= పిమ్మట; వగచి= దుఃఖించి; ఒక, సగమును= ఒక సగభాగాన్ని; ఏన్+ఇది+చేయన్+ఇంకన్= నేను ఇట్టిపనిని ఇక మీద చేయను; అనియెడు, మదిన్= అని తలపోసే మనస్సువలన; పెఱ, సగమును= ఇంకొక సగభాగాన్ని; అఘంబున్= పాపమును; నరుండు= మనుజుడు; మలుఁగున్= తొలగించుకొంటాడు.

తాత్పర్యం: ఆలోచించకుండ తనకు పాపం సంప్రాప్తమయినపుడు తాను చిత్తశుద్ధితో పశ్చాత్తాపం చెందితే చేసిన పాపంలో సగభాగాన్నీ, ఇక అట్టి పాపాన్ని తాను చేయనని అనుకొనటంవలన మిగిలిన సగభాగం పాపాన్నీ నరుడు తొలగించుకొనవచ్చును.

తే. పాపముల కెల్ల నెక్కుడు పాతకములు । సువ్వె క్రోధలోభంబులు సువ్రతాత్మ!
వాని రెంటి జయించినవాఁడు గాని । యెందుఁ బరమధార్మికుఁ డని యెన్నఁబడఁడు. 42

ప్రతిపదార్థం: సువ్రత+ఆత్మ!= మంచిదీక్ష కల ఆత్మను కలవాడా! (ఒకౌశికమహర్షీ); పాపములకున్+ఎల్లన్+ఎక్కుడు, పాతకములు= దురితాలలో అన్నిటికంటె అధికమైన దురితాలు; క్రోధ, లోభంబులు+చువ్వె= కోపం; పిసినితనం కదా; వాని రెంటిన్= ఆ రెంటిని (అనగా కోపలోభాలను); జయించిన వాఁడు, కాని= నిగ్రహించిన మనుజుడు గాని; ఎందున్= ఎచటనైనను; పరమ, ధార్మికుఁడు+అని= గొప్ప ధర్మాత్ముడు అని; ఎన్నన్+పడఁడు= ఎంచబడడు.

తాత్పర్యం: ఓ మహర్షీ! అన్ని పాపాలలో మిక్కిలి చెడ్డవైన పాపాలు కోపం, లోభం. కోపలోభాలను జయించనివాడిని ధర్మాత్ములలో గొప్పవాడు అని ఎచటను ఎవరును ఎంచరు సుమా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. శిష్టచరితంబులుగాని మార్గంబులుగొన్ని తృణసంవృతంబులైన కూపంబులుం బోలెఁగపట ధర్మ సంవృతంబులై యుండు; వాని దవ్వులన పరిత్యజించి శిష్టాచారంబుల నడపుట ధర్మలక్షణం' బనినం గౌశికుండు 'శిష్టాచారంబు లెయ్యవి? యెఱింగింపు' మనుటయు ధర్మవ్యాధుం డి ట్లనియె. 43

ప్రతిపదార్థం: శిష్ట, చరితంబులు+కాని, మార్గంబులు= సజ్జనులచే ఆచరింపబడని పద్ధతులు కొన్ని; తృణ, సంవృతంబులు+ అయిన= గడ్డిచేత కప్పబడినవి అయిన; కూపంబులున్+పోలెన్= నూతులు వలెనే; కపట, ధర్మ, సంవృతంబులు+ఐ= తప్పుడుధర్మాలచేత కూడినవి అయి; ఉండున్= ఉంటాయి; వానిన్= వాటిని; దవ్వులన్+అ= దూరంనుండే; పరిత్యజించి= వదలిపెట్టి; శిష్ట+ఆచారంబులన్= సజ్జనుల సదాచారాలను; నడపుట= ఆచరించటం; ధర్మ, లక్షణంబు= ధర్మంయొక్క ప్రత్యేకస్వభావం; అనినన్= అని చెప్పగా; కౌశికుండు; శిష్ట+ఆచారంబులు= మంచివారి ప్రవర్తనలు (మంచి ప్రవర్తనలు); ఏ+అవి= ఎయ్యవి; ఎఱింగింపుము= తెలియజేయుము; అనుటయున్= అని చెప్పటమున్నూ; ధర్మవ్యాధుండు= ధర్మవ్యాధుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: సజ్జనులు పాటింపని కొన్ని మార్గాలు పైకి ధర్మాలుగా కన్పించవచ్చును. దట్టంగా మొలచిన గడ్డిచేత కప్పబడిన నూతులు పైకి నేలమాదిరిగానే గన్పించినా లోపల లోతైన గోతులుగానే ఉండి తెరువరులకు భ్రాంతి కల్పించవచ్చును. అందుచేత, దూరంనుండే కపటధర్మాలను పరిత్యజించాలి. శిష్టాచారాలను స్వీకరించి ఆచరించటం ధర్మలక్షణం' అని ధర్మవ్యాధుడు చెప్పగా విని, కౌశికుడు, 'మహాత్మా! శిష్టాచారాలు ఏవి?; తెలుపుము' అని ప్రార్థించాడు. అంతట, ధర్మవ్యాధుడు కౌశికుడికి ఇట్లా బదులు చెప్పాడు.

సీ. 'దానంబు, సత్యంబుఁ, దపము, యజ్ఞము, నార్జ । వముఁ, గామలోభాది వర్జనంబు
గురుజన శుశ్రూష, క్రోధ రాహిత్యంబు । దమము, సంతోష, మధ్యయన నిరతి,
దాంభికత్వము లేమి, దైన్యంబు వొరయమి । యనసూయ, యనహంక్రియాభియుక్తి,
దలఁపంగ నాద్యమై తనరు ధర్మమ యెప్డుఁ । గొనియాట, నాస్తికగోష్ఠిఁ జనమి,

తే. శీలసంరక్ష, తీర్థసంసేవ, శౌచ, । మఖిలభూతంబులందు దయార్ద్రుఁ డగుట,
మితహితోక్తులు, సంశ్రితమిత్త్రగుప్తి । యిన్నియును శిష్టచరితంబు లిద్ధచరిత! 44

ప్రతిపదార్థం: ఇద్ధచరిత!= వెలుగొందే గొప్ప ప్రవర్తన కలవాడా!; దానంబు= పరోపకారార్థం తన ధనాన్ని ఇతరులకు ఇవ్వటం; సత్యంబున్= నిజం పలకటం; తపము= మనస్సును ఇంద్రియాలను నిగ్రహించటం; యజ్ఞమున్= క్రతువులను నిర్వహించటం; ఆర్జవమున్= ఋజుత్వం - పరులను మోసపుచ్చని నడవడిక; కామ, లోభ+ఆది, వర్జనంబు= కోరికలను, దురాశలను మున్నగు వాటిని వీడటం; గురు, జన, శుశ్రూష= గురువులకు సేవ చేయుటం; క్రోధ, రాహిత్యంబు= కోపం లేకపోవటం; దమము= బహిరింద్రియ నిగ్రహం; సంతోషము= తృప్తితో కూడిన ఆనందం; అధ్యయన నిరతి= వేదాలను చదవటంలోని దీక్ష; దాంభికత్వము లేమి= పటాటోపం లేకపోవటం; దైన్యంబు+పొరయమి= హీనతను పొందకుండటం; అనసూయ= అసూయ లేకపోవటం; అనహంక్రియా+అభియుక్తి= అహంకారంతో కూడి ఉండకపోవటం; తలఁపంగన్= యోచించగా; ఆద్యము+ఐ= మొట్టమొదటిదై; తనరు= ఒప్పునట్టి; ధర్మము+అ= ధర్మమే; ఎప్డున్= ఎల్లప్పుడును; కొనియాట= ఆదరించటం; నాస్తిక, గోష్ఠిన్‌చనమి= నాస్తికుల కూటమిలోకి వెళ్ళకుండటం; శీల, సంరక్ష= ప్రవర్తనను కాపాడుకొనటం; తీర్థ, సంసేవ= పుణ్యక్షేత్రాలను సేవించటం; శౌచము= పరిశుభ్రత పాటించటం; అఖిల, భూతములందున్= అన్ని జీవరాసులలో; దయా+ ఆర్ద్రుఁడు+అగుట= దయచేత తడిసిన చిత్తంకలవాడు కావటం; మిత, హిత+ఉక్తులు= తక్కువగా మాట్లాడటం, శ్రేయస్కర

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మైన పలుకులు పలకటం; సంశ్రిత, మిత్ర, గుప్తి= ఆశ్రయించిన స్నేహితులను కాపాడటం; ఇన్నియును= ఇన్ని లక్షణాలు అన్నియును కలిసి; శిష్ట చరితంబులు= మంచివారి ప్రవర్తనలు.

తాత్పర్యం: మహానుభావా! ఎన్నియో గొప్పగుణాలు కలిసినగాని శిష్టాచారం సిద్ధించదు. శిష్టాచారాన్ని వింగడిస్తే ఈ క్రింది గుణాలను ఎన్నవచ్చును. ఉపకారార్థం తన ద్రవ్యాన్ని ఇవ్వటం, ఎల్లప్పుడును నిజమే మాట్లాడటం; ఇంద్రియాలను మనస్సును నిగ్రహించటం, క్రతువులను నిర్వహించి విశ్వశ్రేయం ఒనగూర్చటం, ఇతరులను మోసగించ నట్టి నిర్మల శీలం అలవరచుకొనటం, కామం కోపం మున్నగు గుణాలను అనగా కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను ఉజ్జగించటం, తల్లి తండ్రి విద్యాదానం చేసిన ఉపాధ్యాయుడు మున్నగు వారిని సదా మన్నించటం, కోపం లేని శాంతస్వభావాన్ని ఆర్జించటం, ఇంద్రియనిగ్రహం దీక్షతో సాధించటం, ఎల్లప్పుడు సంతోషంతో సంతృప్తితో ఉండటం, వేదాధ్యయన తత్పరత్వం, పటాటోపం ప్రదర్శించక సదా వినయం గలిగి ఉండటం, ఎన్నడును నీచత్వానికి దిగజారి పోవకుండటం, నాస్తికుల కూటమిలో చేరకుండటం, శీలాన్ని కాపాడుకొనటం, తీర్థయాత్రలు చేయుటం, అఖిల భూతాలపట్ల దయకలిగిన ఎడద గలిగిఉండటం, మితభాషణం చేయటం, హితభాషణం చేయటం, ఆశ్రయించిన స్నేహితులను కాపాడటం.

విశేషం: ఈ పద్యంలో ఇంచుమించుగా సనాతన భారతీయ సంస్కృతి అంతయు వివరించబడి ఉన్నది. దానం అనగా త్యాగంతో కూడిన ఈవి. దశదానాలు కలవు. షోడశ దానాలు ఉన్నవి. ఇచట సందర్భాన్ని బట్టి త్యాగపూరితమై పరోపకారార్థం ఇచ్చే ద్రవ్యం అనే అర్థమే చెప్పుకోవాలి. (చతురుపాయాలలో దానం ఉన్నది కాని అది ఇచట వర్తించదు.) యజ్ఞం అనగా పూజ, యజ్ఞయాగాలు బహుళాలు. పంచమహాయజ్ఞాలు పేర్కొన దగినవి. 1. బ్రహ్మయజ్ఞం, 2. దేవయజ్ఞం, 3. పితృయజ్ఞం, 4. భూతయజ్ఞం, 5. మనుష్యయజ్ఞం. (ధర్మవ్యాధుడు చేసిన మాతాపితృ శుశ్రూష యజ్ఞంగానే పేర్కొనదగింది.)

క. విను శిష్టచరిత గైకొని । యనసూయత నడవ నడవ నంతఃకరణం
బునఁ బొదలు నట్టి సమ్మద । మనఘా! దుర్లభము సూవె యన్యపథములన్. 45

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడ వైన ఓపుణ్యాత్ముడా!; విను= ఆలకింపుము; శిష్టచరిత= మంచి ప్రవర్తన; కైకొని= అవలంబించి= అనసూయతన్, నడవన్ నడవన్= అసూయ లేని ప్రవర్తన తీర్చిదిద్దుకొనగా; అంతఃకరణంబునన్= లోపలి మనస్సులో; పొదలునట్టి= ఏర్పడే; సమ్మదము= సంతోషం; అన్యపథములన్= ఇతర మార్గాలలో; దుర్లభము+చూవె= లభించటం మిక్కిలి కష్టం సుమా.

తాత్పర్యం: పుణ్యాత్ముడ వైన ఓ కౌశికమునీ! ఆలకింపుము. సత్ప్రవర్తనతోకూడి, అసూయను విడనాడి ప్రవర్తిస్తే లభించే సంతోషం ఇతర మార్గాలను అనుసరిస్తే అంత సులభంగా దొరకదు సుమా.

విశేషం: 'వ్యాధగీత' అని ప్రసిద్ధి నార్జించిన ధర్మవ్యాధోపాఖ్యానం అందించే సందేశం సుస్పష్టం. కర్మయోగం వ్యాధగీతకు అంతరాత్మ. ఇందు ముఖ్యపాత్రలుగా ఎన్నదగిన పతివ్రత కర్మయోగిని. అట్లే ధర్మవ్యాధుడును కర్మయోగియే. భర్తృశుశ్రూషచేత ఇల్లాలు తరించింది. మాతాపితృసేవచేత, కులధర్మం మాంసవిక్రయంచేత వ్యాధుడు 'ధర్మ' వ్యాధుడయ్యాడు. అందుచేత 'శిష్టచరిత' వలన లభించే సమ్మదం ఇతర పథాలలో అంత సులువుగా దొరకదని ధర్మవ్యాధుడు చాటిచెప్పగలిగాడు. అయిన ఆ 'ఇతర పథములు' ఏవి? అవి భక్తి జ్ఞానాదులు. ధర్మవ్యాధుడు జ్ఞాని కాకపోలేదు. అయినను అతని నిష్ఠ కర్మయోగంలోనే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉంది. ఇచట ధర్మవ్యాధుడు కర్మయోగి తదుపరి జ్ఞానయోగి. తలిదండ్రుల సేవ ఉజ్జగించిన కౌశికుడు 'కేవల స్వాధ్యాయ నిరతుడు'. అందుచేత ధర్మవ్యాధుడు కౌశికుడితో, 'నీవు చేసిన యకార్యం బొక్కటి గలదు' - అది మాతాపితృ సేవ విడనాడటం అని నొక్కి వక్కాణించవలసి వచ్చింది.

వ. కావున శిష్టాచారనియతిం జేసి గురుశుశ్రూష సలిపి కృతాధ్యయనుండ వై పరమజ్ఞానపరిపక్వం బైన చిత్తంబుతోడం గామక్రోధ మహామకరసంకీర్ణయు విషయజలపరిపూర్ణయు నైన మోహజలధి నస్ఖలితధైర్యం బను తెప్పం జేసి యశ్రమంబున నిస్తరించి కృతార్థుండ వగు' మని మఱియు నిట్లనియె. 46

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; శిష్ట+ఆచార, నియతిన్+చేసి= మంచి నడవడికలోని దీక్షచేత; గురు, శుశ్రూష, సలిపి= గురువులైనవారలకు సేవ చేసి; కృత+అధ్యయనుండవు+ఐ= వేదాలను చదివినవాడవై; పరమ, జ్ఞాన, పరిపక్వంబు+ఐన= గొప్పతెలివిడిచేత పండినది అయిన; చిత్తంబుతోడన్= మనస్సుతో; కామ, క్రోధ, మహా, మకర, సంకీర్ణయున్= కోరికలు కోపం అనే గొప్ప మొసళ్లతో నిండినదియున్నూ; విషయ జలపరిపూర్ణయును= ఇంద్రియార్థములనే నీళ్లతో నిండినదియున్నూ; ఐన= ఐనట్టి; మోహ, జలధిన్= భ్రాంతి అనెడి సముద్రాన్ని; అస్ఖలిత, ధైర్యంబు+అను= జారనట్టి గంభీరత అనెడి; తెప్పన్+చేసి= పడవచేత; అశ్రమంబునన్= సులువుగా; నిస్తరించి= దాటి; కృత+అర్థుండవు+అగుము= ధన్యుడవు కమ్ము; అని= అని చెప్పి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: కాబట్టి నీవు శిష్టాచారంచొప్పున నీప్రవర్తన తీర్చిదిద్దుకొని, గురుజను లైనవారి పరిచర్య చేయునది. తదుపరి సంక్రమించే జ్ఞానంచేత పండిన మనస్సు కలవాడవై మోహసముద్రాన్ని దాటునది. ఆ మోహసముద్రం కామక్రోధా లనెడి మొసళ్లతో కూడి, ఇంద్రియార్థములనెడి నీటితో నిండిన గొప్పసముద్రం. ఆ సముద్రాన్ని దాటటానికి ధైర్యం అనెడి పడవ అవసరం. అప్పుడు నీవు ధన్యుడవు కాగలవు' అని చెప్పి, మఱియు ఇట్లు పలికాడు.

విశేషం: అలం: రూపకం. మోహజలధి అనుటకు మోహ మహానది అనే పాఠాంతరం ఉన్నది.

క. 'క్రమమున శిష్టాచార । క్రమ మెఱుఁగఁగ ధర్మమునకుఁ గడు వాటం బై
విమలం బగుఁ జిత్తము స । త్యమును నహింసయును దనకుఁ దావలములుగన్. 47

ప్రతిపదార్థం: చిత్తము= మనస్సు; క్రమమునన్= వరుసగా; శిష్ట+ఆచార, క్రమము= మంచి నడవడిక విధానం; ఎఱుఁగఁగన్= తెలియగా; ధర్మమునకున్; కడున్= మిక్కిలి; వాటంబు+ఐ= అనువు అయినదై; సత్యమును= నిజాన్ని; అహింసయును= ఏప్రాణికి పీడచేయక పోవుటయున్నూ; తనకున్= తనకు; తావలములుగన్= ఉనికిపట్టులుగా; విమలంబు+అగున్= నిర్మలం కాగలదు.

తాత్పర్యం: మంచి నడవడికయొక్క వరుస తెలిసినప్పుడు ఆచరించినప్పుడు, ధర్మానికి మిక్కిలి అనువైనదై, అహింస సత్యం తనకు ఉనికిపట్టులు కాగా, మనస్సు స్వచ్ఛత సంపాదించుకొంటుంది. అనగా - చిత్తం నిర్మల మై ధర్మానికి నెలవు కావటానికి కావలసిన అంశం అహింసతో సత్యంతో జతగూడిన శిష్టాచారం.

ఆ. విను మహింస ధర్మవితతి కెల్లను మేటి; । యదియు సత్యయుక్త మైన వెలయు
ననఘ! శిష్టచరితలందు సత్యమ కడు । నధిక మనిరి శ్రుతుల నరసి బుధులు. 48

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనఘ!= పాపంలేనివాడా! ఓపుణ్యాత్ముడా!; వినుము= ఆలకింపుము; ధర్మ, వితతికిన్+ఎల్లను= వివిధ ధర్మాలలోను; అహింస= ఏప్రాణికీ ఎట్టిపీడ కలిగించకుండటం; మేటి= గొప్పది; అదియున్= అదియే (ఆ అహింసయే); సత్యయుక్తము+ఐనన్= నిజంతో జతకూడిన యెడల; వెలయున్= వెలుగొందుతుంది; శిష్టచరితలందున్= మంచి ప్రవర్తనలందు; సత్యము+అ= నిజమే; బుధులు= పండితులు; శ్రుతులన్= వేదాలను; అరసి= చూచి; కడున్= మిక్కిలి; అధికము= గొప్పది; అనిరి= అన్నారు.

తాత్పర్యం: పుణ్యాత్ముడ వైన ఓకౌశికమునీ! ఆలకింపుము. అన్నిధర్మాలలోను అహింస గొప్పది. ఆ అహింస సత్యంతో కూడిన యెడల వెలుగొందుతుంది. శిష్టాచారంలో సత్యమే గొప్పదైనదని పెద్దల ప్రవచనం.

తే. వేద విహితంబులును శాస్త్రవిహితములును। శిష్టచరితంబులును నన౯ జెప్ప నొప్పి
ధర్మములు మూ౯డువిధముల౯ దనరుచుండు౯। గడ౯గి యిన్నియు సద్గతికారణములు. 49

ప్రతిపదార్థం: వేద, విహితంబులును= వేదాలచేత కూర్చబడినవిన్నీ; శాస్త్ర, విహితములును= శాస్త్రాలచేత కూర్చబడినవిన్నీ; శిష్ట, చరితంబులును= మంచి నడవడికలును; (మంచివారి ప్రవర్తనలును); అనన్+చెప్పన్+ఒప్పి= అని వర్ణించటానికి అనువై; ధర్మములు; మూడు, విధములన్= మూడురీతులుగా; తనరుచుండున్= ఒప్పుతూ ఉంటాయి. కడ౯గి= పూని; ఇన్నియున్= ఇవి అన్నియును; సత్+గతి, కారణములు= ఉత్తమ మార్గానికి (మోక్షానికి) హేతువులు.

తాత్పర్యం: ధర్మాలు మూడు తెరగులు. ఒకటి వేదాలచేత విధించబడినట్టివి. రెండు-శాస్త్రాలచేత నిర్దేశించబడినట్టివి. మూడు-పెద్దల మంచినడవడికలు. పైమూడుపద్ధతులున్నూ సద్గతికి హేతువులే.

మ. అనయంబున్ శ్రుతవంతు౯డై వినుతశిష్టాచారమార్గంబులం
జను పుణ్యాత్ముడు దుర్గముల్ గడచి ప్రజ్ఞాహర్మ్యసంరూఢు౯డై
కనుచుండుం బటు మోహపంకజలమగ్నం బైన లోకంబు వీ౯
క నధోభాగమునందు డింది కడుదుఃఖం బొంద౯గా నవ్వుచున్.' 50

ప్రతిపదార్థం: అనయంబున్= ఎల్లప్పుడును; శ్రుతవంతు౯డు+ఐ= వేదాలలో పరిపూర్ణమైన జ్ఞానం కలవాడై; వినుత, శిష్ట+ఆచార, మార్గంబులన్= పొగడబడిన మంచినడవడికలయొక్క తెరువులలో; చను= వెడలే; పుణ్య+ఆత్ము౯డు= సుకృతం చేసికొన్నవాడు, దుర్గముల్= దాటటానికి వీలులేని కోటలను; కడచి= అతిక్రమించి; ప్రజ్ఞా, హర్మ్య, సంరూఢు౯డు+ఐ= సామర్థ్యంతో కూడినబుద్ధి అనే మేడపై అధివసించెడివాడై; పటు, మోహ, పంక, జల, మగ్నంబు+ఐన= మిక్కిలి భ్రాంతి అనెడి బురదనీటిలో మునిగి ఉండినట్టి; లోకంబు= లోకము; అధోభాగము+అందున్+డింది= క్రింది భాగంలో పడి; వీ౯కన్= దైన్యంతో; కడు దుఃఖంబు= మిక్కిలి విచారము; ఒంద౯గాన్= పొందగా; నవ్వుచున్= హసించుచు; కనుచున్+ఉండున్= చూస్తూ ఉంటాడు.

తాత్పర్యం: ఎల్లప్పుడును వేదాలలో పరిపూర్ణజ్ఞానం కలిగిన విద్వాంసుడు ప్రజ్ఞ అనెడి మేడను అధివసించి, క్రింద ఉన్న మోహమనే బురదనీటిలో కూరుకుపోయి దైన్యంతో మిక్కిలి దుఃఖించే లోకాన్ని చూచి నవ్వుకొంటాడు.

విశేషం: అలం: రూపకం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మవ్యాధుఁడు కౌశికున కహింసాస్వరూపంబు సెప్పుట (సం. 3-199-1)

వ. అని పలికి ధర్మవ్యాధుండు మఱియు నిట్లనియె; 'నయ్యా! నీవు దొలుత నావర్తనంబు గనుంగొని యిది హింసా బహుళంబు గాదె? యని పలికితివి; దాని కేను దగు తెఱంగు సెప్పితి; నది య ట్లుండెఁ; హింస యిట్టిది యహింస యిట్టి దని విభాగింప నెవ్వరికి నేర నగు? 51

ప్రతిపదార్థం: అని, పలికి= అని చెప్పి; ధర్మవ్యాధుండు= ధర్మవ్యాధుడు; మఱియున్= ఇంకను; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు; అయ్యా!= ఆర్యా!; నీవు; తొలుతన్= మొదట; నావర్తనంబు= నా నడవడికను; కనుంగొని= అరసి; ఇది= (ఈనాప్రవర్తన); హింసాబహుళంబు+కాదు+ఎ= ప్రాణులకు పీడ కలిగించే క్రియలతో కూడినట్టిది కాదా; అని, పలికితివి= అని అన్నావు; దానికిన్= (ఆ విమర్శకు); ఏను= నేను; తగుతెఱంగు+చెప్పితిన్= సముచిత సమాధానం పలికితిని; అది+అట్లు+ఉండెన్= ఆ విమర్శ అట్లాగే ఉండుగాక; హింస= ప్రాణులను పీడించే క్రియ; ఇట్టిది= ఇటువంటిది; అహింస= ప్రాణులను పీడించనట్టి క్రియ; ఇట్టిది+అని= ఇటువంటిది, అని; విభాగింపన్= వింగడించటం; ఏ+వారికిన్= ఏ మనుజులకు; నేరన్+అగు= వీలు అవుతుంది?

తాత్పర్యం: అని చెప్పి, ధర్మవ్యాధుఁడు ఇంకనూ ఇట్లా అన్నాడు: 'ఆర్యా, నీవు మొదట నాకొక ప్రశ్న వేశావు. నేను చేస్తున్న మాంసవిక్రయం హింసాయుతమైన కార్యం గదా? అని అప్పుడు అడిగావు. ఆ ప్రశ్నకు అప్పుడే నేను నాకు తోచిన ప్రత్యుత్తరం ఇచ్చాను. అది అప్పటికి సరిఅయిన సమాధానమే. ఇప్పుడు - ఆ విషయాన్నే సూక్ష్మంగా విమర్శించి చెప్పదలచాను. ఇది - 'హింస,' ఇది - 'అహింస' అని ఎవ్వరు సుస్పష్టంగా నిర్వచించగలరు? అట్టి నిర్వచనం సాధ్యం కాదని నా అభిప్రాయం.

క. మును తన చేసిన కర్మం । బునఁ జూవె నశించు భూతములు సంపెడు వాఁ
డు నిమిత్తమాత్ర మింతయె । యని చెప్పఁగ వినమె యంచితాచారులచేన్. 52

ప్రతిపదార్థం: మును= పూర్వకాలంలో (ఈజన్మంలో వెనుకటిజన్మంలో); తన చేసిన కర్మంబునన్= తాను ఒనరించిన కర్మవలన; చూవె= సుమ్మ; భూతములు= ప్రాణులు; నశించున్= నశిస్తాయి; చంపెడువాఁడు= సంహరించేవాడు; నిమిత్తమాత్రము= ఉపకరణంమాత్రమే; ఇంత+ఎ= ఇది ఇట్టిదే; అని చెప్పఁగన్= అని పలుకగా, అంచిత+ఆచారులచేన్= ఒప్పారే పనులు చేసెడి పెద్దలవలన; వినము+ఎ= ఆలకింపమా?

తాత్పర్యం: పెద్దలు చెప్పడిమాట, జనశ్రుతిలో తరచు వినబడుతున్నది, మనకు అందరికి తెలిసింది ఉన్నదికదా. ప్రాణులు క్షయం పొందటానికి మూలకారణం ఆ యాప్రాణులు చేసిఉన్న కర్మయే. చంపేవాడు కేవలం ఒక వ్యాజం మాత్రమే సుమా.

వ. అదియునుం గాక. 53

తాత్పర్యం: అదీ కాకుండ.

క. ఫలమూలౌషధిశాకం । బులుఁ బశుమృగతతులు భక్ష్యములుగా భూతం
బుల కజుఁడు సేసె నని య । స్ఖలితంబుగ మ్రోయు శ్రుతులఁ గాదన వశమే! 54

ప్రతిపదార్థం: ఫల, మూల, ఓషధి, శాకంబులున్= పండ్లున్నూ, వేళ్లున్నూ, సస్యములూ, కూరగాయాలూ; పశు, మృగతతులు= జంతువులు మున్నగునవి; భూతంబులకున్= ప్రాణులకు; భక్ష్యములుగాన్= ఆహారపదార్థాలుగా; అజుఁడు= బ్రహ్మదేవుడు; చేసెన్= ఏర్పరిచాడు; అని; అస్ఖలితంబుగన్= సుస్పష్టంగా (జారకుండా); మ్రోయు= నినదించు (గట్టిగా వక్కాణించు); శ్రుతులన్= వేదాలను; కాదు+అనన్, వశమే= కాదు అని తిరస్కరించటానికి వీలు ఉన్నదా?

తాత్పర్యం: మఱియును, పండ్లు, వేళ్లు, ధాన్యాలు, కూరలు వివిధ జంతు సంతతులు ప్రాణులకు ఆహారంగా బ్రహ్మదేవుడు ఏర్పరచినట్లు వేదాలు నొక్కివక్కాణిస్తున్నాయి కదా! ఇక అట్టి వేదప్రామాణ్యాన్ని ఎట్లా తిరస్కరించ గలం?

సీ. **అనఘ! యౌశీనరుం డగు శిబి నిజగాత్ర । హింస నింద్రాగ్నుల కిడఁడె మాంస;**
మతనికి లేదయ్యె నయ్య యుత్తమ గతి? రంతిదేవుం డనురాజు తొల్లి
యనుదినంబును గోసహస్రద్వయంబుఁ దా । వధియింపఁడే వేయి వత్సరములు;
దురిత మమ్మహితాత్ముఁ దొడరెనే? వేదార్థ । నిరతులై యత్యంత నియతు లైన

తే. **ధారుణీసురముఖ్యు లధ్వరములందుఁ । బశువరింపరే పశువులఁ; బరమపుణ్య**
గతులు గలుగవె వారికిఁ? గడఁగి యగ్ను । లధికమాంసార్థు లని శ్రుతులందు వినమె! **55**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! ఔశీనరుండు+అగు, శిబి= ఉశీనరుని కుమారు డైన శిబి; నిజ, గాత్ర, హింసన్= తన దైన దేహాన్ని పీడించి; ఇంద్ర+అగ్నులకున్= ఇంద్రుడికీ, అగ్నికిన్నీ; మాంసము= మాంసము (తన దేహంనుండి కత్తితో కోసి తీసిన మాంసాన్ని); ఇడఁడె= ఇవ్వలేదా; ఉత్తమ, గతి= మంచి మార్గం (అనగా పుణ్యపదవి); అతనికిన్= (ఆ శిబికి); లేదు+అయ్యెన్+అయ్య?= అయ్యా! కలుగక పోయిందా?; తొల్లి= పూర్వకాలంలో; రంతిదేవుండు+అను, రాజు= రంతిదేవుడు అనేపేరు గల ప్రభువు; అనుదినంబును= ప్రతిరోజు; గో, సహస్ర, ద్వయంబున్= రెండువేల ఆవులను; తాన్= తాను; వేయి, వత్సరములు= వేయిఏండ్లు; వధియింపఁడే= సంహరించలేదా; దురితము= పాపం; ఆ+మహిత+ఆత్మున్= ఆ గొప్ప ఆత్మకలవాడిని; తొడరెనే= పొందిందా?; వేద+అర్థ, నిరతులు+ఐ= వేదాలలోని భావాలను బాగా ఎరిగిన వారై; అతి+అంత, నియతులు+ఐన= మిక్కిలి గొప్ప దీక్షకలిగిన వారైన; ధారుణీ సుర ముఖ్యులు= బ్రాహ్మణులలో ఉత్తములు; అధ్వరములందున్= యజ్ఞాలలో; పశువులన్= జంతువులను; పశువరింపరే= బలిఇవ్వలేదా?; వారికిన్= (అట్టి బ్రాహ్మణోత్తములకు); పరమ, పుణ్య, గతులు+కలుగవు+ఎ= గొప్పవైన పుణ్యస్థానాలు లభించలేదా?; అగ్నులు= నిప్పులు; కడఁగి= పూని; అధిక, మాంస+అర్థులు+అని= మిక్కుటంగా మాంసాన్ని కోరుకొనేవి అని; శ్రుతులందున్= వేదాలలో; వినమె!= ఆలకించమా!

తాత్పర్యం: పుణ్యాత్ముడ వైన ఓ కౌశికమునీ! ఉశీనరుడి పుత్రుడైన శిబిచక్రవర్తి తన శరీరంలోని మాంసాన్నే కోసి ఇంద్రుడికీ అగ్నిహోత్రుడికీ ఇవ్వలేదా? ఆ శిబిచక్రవర్తికి పుణ్యం లభించలేదా? రంతిదేవుడు అనే మహారాజు పూర్వకాలంలో వేయి సంవత్సరాలపాటు ప్రతిదినం రెండువేల ఆవులను వధించి సంతర్పణం చేయలేదా? ఆ మహానుభావుడికి పాపం చుట్టుకొన్నదా? వేదవేదాంగ పారంగతు లైన బ్రాహ్మణోత్తములు యజ్ఞయాగాదులలో పశువులను సంహరించలేదా? వారికి పుణ్యలోకాలు సమకూరలేదా? అగ్నులు మాంసాహారాన్ని మిక్కుటంగా కోరేవి అని వేదాలు ఘోషించటం లేదా? అందుచేత మాంసాహారం కేవలహింసగా పరిగణించటానికి వీలు లేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పితృదైవత కార్యములం । దతిభక్తిని మాంస మిడుట యర్హమనియుఁ ద
త్పితృదైవశేషములు స । మ్మతి భోజ్యము లనియు మునులమతములు గావే. 56

ప్రతిపదార్థం: పితృ, దైవత, కార్యములందున్= శ్రాద్ధక్రియలలోను, దేవతలకు బలినివేదన చేసే క్రియలలోనూ; అతిభక్తిని= మిక్కుటమైన పూజ్యభావంతో; మాంసము+ఇడుట= మాంసంపెట్టటం; అర్హము+అనియున్= సరైన పద్ధతే అనిన్నీ; తద్+పితృ, దైవశేషములు= ఆ విధంగా శ్రాద్ధాలలో పితరులకు నైవేద్యం చేయగా మిగిలినవి, దేవతలకు నైవేద్యం చేయగా మిగిలినవి (అయినమాంసాలు); సమ్మతిన్= మంచిబుద్ధితో; భోజ్యములు= భుజించదగినవి; అనియున్= అనిన్నీ; మునుల, మతములు+కావే= ఋషీశ్వరుల అభిప్రాయాలే కదా.

తాత్పర్యం: పితృదేవతలకు శ్రాద్ధక్రియలలో నైవేద్యంగా మాంసం సమర్పించటం సరైన పద్ధతి అనిన్నీ, ఆ శ్రాద్ధాలలో నివేదించబడిన పిమ్మట మిగిలిన మాంసం ఆహారంగా స్వీకరించదగింది అన్నీ పెద్దలైన ఋషుల అభిప్రాయమే కదా.

మ. హలికుం డెంతయు నోజతో దునఁగ సీరాగ్రంబునం జోఁకి ప్రా
ణు లనేకంబులు సచ్చు, హింస యది యౌనో కాదొ! వేయేల? మ
ర్త్యులు నేలం జరియించుచోఁ బదములం ద్రొక్కంబడుం బెక్కు జం
తులు హింసావిధి గాదనంగ వశమే దోషజ్ఞ! యూహింపుమా! 57

ప్రతిపదార్థం: దోషజ్ఞ!= ఓ పండితుడా!; హలికుండు= వ్యవసాయదారుడు; ఎంతయున్= మిక్కుటమైన; ఓజతోన్= ఉత్సాహంతో; దునఁగన్= దున్నగా; సీర+అగ్రంబునన్+చోఁకి= నాగలికర్రు తాకి; ప్రాణులు+అనేకంబులు= పెక్కుజీవాలు; చచ్చున్= మరణిస్తాయి; అది= (ఆవిధంగా నాగలిక్రిందబడి జీవాలు చావటం); హింస= ప్రాణిపీడ; ఔనో, కాదొ= అవునా? కాదా? అనేది చర్చించవలసిన విషయమేకదా; వేయి+ఏల= వేయిమాటలు ఎందుకు పలుకవలె?; మర్త్యులు= మనుజులు; నేలన్+చరియించుచోన్= నేలమీద నడచేటప్పుడు; పెక్కు, జంతులు= అనేక జీవాలు; పదములన్= పాదాలతో త్రొక్కన్+పడున్= త్రొక్కివేయబడతాయి; హింసావిధి= ప్రాణిపీడనంజరిగేపద్ధతి; కాదు+అనంగన్, వశమే= (అది) కాదు అని చెప్పటానికి వీలు ఉన్నదా?; ఊహింపుమా= యోచన చేయుము.

తాత్పర్యం: ఓ పండితోత్తమా! నాగలితో రైతు భూమిని దున్నేటప్పుడు, ఆ నాగలికర్రును తాకి ఎన్ని జీవాలు చచ్చిపోవటం లేదు? అది హింస కాదని వాదించటానికి వీలున్నదా? తర్జన భర్జనలు అనవసరం. మనుజులు నేలపై నడచేటప్పుడు కూడ వేలకొలది ప్రాణులు చనిపోతున్నాయి. అది హింస కాదని వాదించటానికి వీలు లేదు కదా! ఈ విషయాన్ని దయచేసి నీవే ఆలోచించి తేల్చుకొనుము.

విశేషం: ఇచట ధర్మవ్యాధుడు కౌశికుడిని, 'దోషజ్ఞ' అని సంబోధించాడు. దోషజ్ఞ అనే శబ్దానికి 'పండితుడు' అని రూఢ్యర్థం. వాచ్యార్థం - దోషాలను ఎరిగినవాడు. ఈ ప్రకరణంలో దోషజ్ఞ శబ్ద ప్రయోగంలోని స్వారస్యం గమనించదగింది. కౌశికుడు ధర్మవ్యాధుడిని మాంసవిక్రయాన్ని దోషంగా ఎన్నిఉన్నాడు గదా!

చ. సలిలము లుర్వి యాకసము సర్వము జంతుమయంబు గావునం
గలుగు నవశ్యమున్ సకలకర్మములందును హింస, హింసకుం

దొలఁగిన దేహయాత్రయును దుర్ఘట మైనటు లుండు; నింతయుం
దలఁపరు హింస సేయ మని తారు తలంతురు గొంద ఱిమ్మహిన్. 58

ప్రతిపదార్థం: సలిలములు= నీళ్లు; ఉర్వి= భూమి; ఆకసము= ఆకాశం; సర్వము= అంతయున్నూ; జంతుమయంబు= ప్రాణులతో కూడిఉన్నట్టిది; కావునన్= కాబట్టి; సకల, కర్మములందును= అన్ని పనులలోను; హింస= ప్రాణిపీడనం; అవశ్యమున్+కలుగున్= తప్పక ఏర్పడుతుంది; హింసకున్+తొలఁగినన్= ప్రాణిపీడనానికి దూర మైతే; దేహయాత్రయును= జీవితం నడపటం కూడ; దుర్ఘటము+ఐన+అటులు+ఉండున్= సాధ్యం కానట్లు తోస్తుంది; ఇమ్మహిన్= ఈ భూమిలో; కొందఱు= కొంతమంది మనుషులు; ఇంతయున్+తలఁపరు= దీనిని ఆలోచించరు; హింస+చేయము+అని= ప్రాణిపీడన చేయము అని; తారు= తాము; తలంతురు= తలపోస్తారు.

తాత్పర్యం: జలాలు, భూమి, ఆకాశం, అన్నీ ప్రాణుల సమూహాలతో నిండిఉన్నవి. కాబట్టి, అన్ని పనులలోను ఏదో కొంత హింస జరుగక తప్పదు. హింస అసలే చేయకుండ మానవజీవితం సాగించటం సాధ్యం కాదు. కొందరు ఈ విషయాన్ని గుర్తించక తాము ఎప్పుడూ ఎట్టి హింస చేయమని అహింసావ్రతుల మని అనుకొని భ్రమిస్తుంటారు.

విశేషం: పాశ్చాత్యశాస్త్రజ్ఞులు ఇటీవలనే గాలిలో నీళ్లలో ఆకాశంలోను, వేలకువేలు సూక్ష్మజీవులు కలవని కనుగొన్నారు. ఈ విషయం నిష్కర్షగా నిర్వచించబడింది.

క. **పనివడి యహింస వ్రతముగఁ । గొని వనమున నున్న మునులకుం దొడరదె హిం**
సనము తరుమూల ఫలశా । కనిపీడన మదియు హింస గాదొకొ తలఁపన్. 59

ప్రతిపదార్థం: పని+పడి= పూని; అహింస= ప్రాణులకు ఎట్టి పీడను చేయక పోవటం; వ్రతముగన్+కొని= దీక్షగా పాటించటానికి పూనుకొని; వనమునన్+ఉన్న= అడవిలో నివసిస్తున్న; మునులకున్= ఋషులకు; హింసనము= ప్రాణులను హింసించటం; తొడరదె?= కలుగదా?; తలఁపన్= యోచనచేయగా; తరు, మూల, ఫల, శాక, నిపీడనము+అదియున్= చెట్లు, వేళ్లు, పండ్లు, ఆకుకూరలు గట్టిగా తరగటం కోయటం అనేవి కూడ; హింస+కాదొకొ?= ప్రాణులను హింసించటం కాదా?

తాత్పర్యం: తాము కేవలం అహింసావ్రతాన్నే పాటిస్తూ అరణ్యాలలో నివసిస్తున్నవారం అనుకొని కందమూల ఫలాలను ఆహారంగా స్వీకరించే మునులుకూడ నిజానికి అహింసావ్రతులు కాజాలరు. ఏలన, కందమూలఫలాలలో కూడ ప్రాణం ఉన్నది. అదికూడా జీవహింసయే అని యోచన చేస్తే తేటతెల్లం అవుతుంది.

తే. **హింస సేయనివాఁడు లేఁ డిజ్జగమున । నొక్కఁడైనను, దమతమ, యోపినట్లు**
హింసతెరువున కెడఁగల్గి యేఁగవలయు । నదియ చూవె యహింసనా నతిశయిల్లు. 60

ప్రతిపదార్థం: ఈ+జగమునన్= ఈలోకంలో; హింస+చేయనివాఁడు= ప్రాణిపీడ చేయనివాడు; ఒక్కఁడు+ఐనను= ఒకడు కూడ; లేఁడు= లేడు; తమతమ+ఓపినట్లు= తమకు తామకు వీలు అయినట్లుగా; హింస తెరువునకున్+ఎడన్+కల్గి= ప్రాణిపీడ చేసే మార్గానికి దూరంగా ఉండి; ఏఁగవలయున్= నడవాలి; అది+అ+చూవె= అట్టిదే సుమా; అహింస+నాన్= అహింస అనగా; అతిశయిల్లున్= శోభిల్లుతుంది.

తాత్పర్యం: ఈలోకంలో హింస చేయనివాడు ఒకడైనా ఉండడు. అయినప్పటికిని తమకు వీలైనంతమేరకు హింస చేయకయే జీవయాత్ర సాగించాలి. ఆవిధంగా యథాశక్తి ప్రాణిపీడన చేయకపోవటమే 'అహింస' అని చెప్పనొప్పును.

వ. ధర్మంబు బహుప్రకారం బై యుండుఁ; దదీయసూక్ష్మగతి దురవబోధంబు; గావున శ్రుతిప్రమాణంబువలనను వృద్ధాచారనిదర్శనంబులను నెఱింగికొనునది. 61

ప్రతిపదార్థం: ధర్మంబు= ధర్మం (లోకమును మంచిస్థితిలో నిలబెట్టేది); బహుప్రకారంబు+ఐ+ఉండున్= ఎన్నో రీతులలో ఉంటుంది; తదీయ, సూక్ష్మ, గతి= ఆ(ధర్మంయొక్క) అగోచరమైనంత అల్పరూపత్వంయొక్క నడక; దురవబోధంబు= తెలియజాలనట్టిది; కావునన్= కాబట్టి; శ్రుతి, ప్రమాణంబువలనను= వేదాలయొక్క నిరూపణంమూలంగానూ; వృద్ధ+ఆచార, నిదర్శనంబులనున్= పెద్దల నడవడికలవలన ఏర్పడిన ఉదాహరణలవలననూ; ఎఱింగి కొనునది= తెలియునది.

తాత్పర్యం: ధర్మాన్ని తెలియటం కష్టం. ధర్మం పెక్కురకాలుగా ప్రవర్తిల్లుతుంది. ధర్మసూక్ష్మత తెలియరానట్టిది. కాబట్టి ధర్మాన్ని తెలియటానికి వేదాల ప్రమాణం, పెద్దల నడవడిక, ఆధారాలుగా గ్రహించదగును.

విశేషం: ఇచట - 'వేదప్రమాణము' అనే ప్రయోగం మిక్కిలి అర్థవంతమైనది. చార్వాకులు మున్నగు నాస్తికులు హేతువాదులు ప్రత్యక్ష ప్రమాణాన్ని మాత్రమే అంగీకరిస్తారు. వేదప్రమాణాన్ని అంగీకరించరు. ప్రాచీనులు తార్కికులు సత్యనిరూపణానికి కొన్ని ప్రమాణాలను నిర్వచించారు. అందులో ముఖ్యమైనవి: 1. ప్రత్యక్షం, 2. అనుమానం, 3. ఉపమానం, 4. శబ్దం, 5. అర్థాపత్తి, 6. అనుపలబ్ధి, 7. సంభవం, 8. ఐతిహ్యం. ఇందు మొదటి నాలుగింటిని తార్కికులు, ఆరింటిని వేదాంతులు, ఎనిమిదింటిని పౌరాణికులు అంగీకరిస్తారు. శబ్దప్రమాణం అనగా శ్రుతిప్రమాణం.

ఉ. భూతహితంబుగాఁ బలుకు బొంకును సత్యఫలంబు నిచ్చుఁ; ద
ద్భూతభయాస్పదం బగు ప్రభూతపుసత్యము బొంకు నట్ల; ప్రా
ణాతురుఁ డైనచోఁ, బరిణయంబునయందును బల్కు బొంకు స
త్యాతిశయంబ యండ్రు; మహితాత్మక! యిట్టివి ధర్మసూక్ష్ముముల్.' 62

ప్రతిపదార్థం: మహిత+ఆత్మక!= గొప్పఆత్మకలవాడా!; భూత, హితంబుగాన్= జీవులకు మేలుకలిగించేటట్లుగా; పలుకు= మాట్లాడే; బొంకును= అసత్యం కూడ; సత్యఫలంబున్+ఇచ్చున్= నిజం పలికిన ఫలితాన్నే ఇస్తుంది; తద్+భూత, భయ+ఆస్పదంబు+అగు= ఆ జీవులకు భీతికి నెలవైన; ప్రభూతము+సత్యము= ప్రభూతపు సత్యము= గొప్ప దైన నిజం; బొంకు+అట్ల+అ= అసత్యం వంటిదే; ప్రాణ+ఆతురుఁడు+ఐనచోన్= ప్రాణం పోవునేమో అనే భయం కలిగి నప్పుడు; పరిణయంబునఅందున్= పెండ్లిలోనూ; పల్కు= వచించే; బొంకు= అసత్యం; సత్య+అతిశయంబు+అ= సత్యంకంటె గొప్పదే; అండ్రు= అంటారు; ధర్మసూక్ష్మముల్= ధర్మాన్ని ప్రస్తరించేటప్పుడు ఏర్పడే అగోచరా లైన ముఖ్యమైన చిన్న అంశాలు; ఇట్టివి= ఇటువంటివి.

తాత్పర్యం: ఓ మహానుభావా! ధర్మాన్ని ప్రస్తరిస్తే అగోచరా లైనను ముఖ్యమైన చిన్న అంశాలుగా విడివడుతుంది. ప్రాణికోటికి మేలు జరగటానికై చెప్పబడిన అసత్యం సత్యం కంటె కూడ గొప్పది. ప్రాణికోటికి కీడు గలిగించే సత్యం అసత్యంతో సమానం. ప్రాణరక్షణకూ వివాహం జరిపించటానికీ ఆడిన అసత్యం సత్యం కంటె ఘనమైనది. ఇవి ధర్మ సూక్ష్మాలు సుమా!

విశేషం: భాగవతంలో శుక్రప్రోక్తమైన సుప్రసిద్ధపద్యం ఇప్పట్టున స్మరింపదగింది - "వారిజాక్షులందు వైవాహికములందు । ప్రాణవిత్తమాన భంగమందు చకిత గోకులాగ్రజన్మరక్షణయందు । బొంకవచ్చు నఘము వొంద దధిప!" భాగవతంలోని ఈ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యం వామన చరిత్రఘట్టంలోనిది. భారత పద్యంలో చెప్పబడిన తాత్పర్యంలో పరోపకారపారీణతతో కూడిన విశ్వశ్రేయం, స్వార్థరహితమైన త్యాగం జీవనాడి.

వ. అని తెలిపి మఱియు నతండు. 63

ప్రతిపదార్థం: అని తెలిపి= అని వివరించి చెప్పి; మఱియున్= వెండియును; అతండు= (ఆ ధర్మవ్యాధుడు).

తాత్పర్యం: అని తెలియజెప్పి ధర్మవ్యాధుడు ఇంకా (ఇట్లా అన్నాడు).

క. 'ఒప్పెడునది యైనను గడు । నొప్పనియది యైన నిజకులోచితపథముం
దప్పఁ దగదండ్రు ధార్మికు । లప్పని నిజభాగ్యవిహిత మని యుండఁదగున్. 64

ప్రతిపదార్థం: ధార్మికులు= ధర్మంతోకూడిన నడవడి కలవారు; ఒప్పెడున్+అది+ఐనను= సరిపడునట్టిది అయినను; కడున్= మిక్కిలి; ఒప్పని+అది+ఐనన్= సరిపడనట్టిదే అయినను; నిజ, కుల+ఉచిత, పథమున్= తనకులానికి తగినట్టి మార్గాన్ని; తప్పన్+తగదు+అండ్రు= తప్పరాదు అని చెప్పుతారు; ఆ+పని= ఆకార్యం (అనగా కులవృత్తి); నిజ, భాగ్య, విహితము= తనఅదృష్టంచేత ఏర్పడింది; అని= అని తలపోసి; ఉండన్+తగున్= ఉండదగును.

తాత్పర్యం: తన కులవృత్తి సరిపడేది కావచ్చును; సరిపడనిది కావచ్చును. ఎట్లయినా అట్టికులవృత్తిని వీడరా దని ధార్మికులు చెప్పుతారు. అట్టి కులవృత్తి తనకు దైవంచేత ఏర్పరచబడినట్లుగనే భావించుకొనాలి.

క. విను, పూర్వకర్మఫలములు । దనకు వశము గాక పొందుఁ దఱితో వానిం;
గనుఁగొననేరక మూఢుఁడు । దన కాపద యైనచోట దైవము దూఱున్. 65

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; పూర్వ, కర్మఫలములు= లోగడ చేసిన కర్మలవలన ఏర్పడిన ఫలాలు; తనకున్ వశము+కాక= తనకు శక్యంగాకుండగా; తఱితోన్= తగిన సమయంలో; పొందున్= అనుభవిస్తాడు; మూఢుఁడు= అవివేకి; వానిన్= అట్టివాటిని అనగా అట్టి పూర్వకర్మఫలాలను; కనుఁగొననేరక= అరయజాలక; తనకున్+ఆపద+ఐన, చోటన్= తనకు విపత్తు ఏర్పడిన చోట; దైవమున్= దేవుడిని; దూఱున్= నిందిస్తాడు.

తాత్పర్యం: ఎవడు చేసిన కర్మలఫలితం వాడు అనుభవించక తప్పదు. వాటిని ఆపటానికి ఎవరికీ శక్యం కాదు. ఆయా వేళల అవి సంప్రాప్తిస్తాయి. ఆ సంగతి తెలియని మూఢుడు తనకు ఆపదవచ్చినప్పుడు దేవుడిని దూషిస్తాడు.

విశేషం: కర్మ సిద్ధాంతంలో భగవంతుడు కేవలం సాక్షిమాత్రుడే. ప్రతిజీవి తాను చేసిన కర్మలనుబట్టి ఫలితాలను అనుభవించక తప్పదు.

తే. కార్యఫలములయెడఁ దాన కర్త ననుట । కడు నెఱుంగమిఁ జువ్వె! తాఁ గర్తయేని
తగిలి తనదైన కార్యజాతంబు నెల్లఁ । జెడక ఫలియించునట్లుగాఁ జేయరాదె! 66

ప్రతిపదార్థం: కార్యఫలముల+ఎడన్= చేసిన పనులయొక్క ఫలితాలను పొందటంలో; తాను+అ= తానే; కర్తన్+అనుట= చేసే సామర్థ్యం కలవాడను; అనుట= అని భావించటం; కడున్= మిక్కిలి; ఎఱుఁగమిన్+చువ్వె= అజ్ఞానంచేత సుమా!; తాన్= తాను; కర్త+ఏని= తానే పనులను నిర్వహించే సమర్థుడు అయితే; తగిలి= పూని; తనదు+ఐన= తాను చేయునట్టివైన; కార్య,

జాతంబున్+ఎల్లన్= అనేక రకాల పనులు అన్నియున్నూ; చెడక= వ్యర్థం కాకుండగా; ఫలియించున్+అట్లుగాన్+చేయన్‌రాదె= విజయం పొందునట్లుగనే చూడరాదా?

తాత్పర్యం: తాను చేసే పనులు కొన్ని ఫలిస్తాయి; కొన్ని ఫలించవు; కాబట్టి తాను చేసే పనులయొక్క జయాపజయాలు తన సామర్థ్యంమీదనే ఆధారపడి ఉంటాయి అని భావించటం అజ్ఞానం కదా! అట్లుగాక, తాను చేసేపనులకు తానే సర్వసమర్థుడైన యెడల, అన్ని పనులలో విజయాన్నే సాధించవచ్చును కదా!

వ. అది యెట్లంటేని. 67

తాత్పర్యం: అది ఏవిధంగా జరుగుతుంది అని నీ వడిగితివా (సమాధానం ఇదిగో).

సీ. నీతిమంతులు ధర్మనిరతులు దక్షులు। నగువారు సేయు కార్యములు గొన్ని
సిద్ధిఁ బొందవు, దుష్టచిత్తులు క్రూరు లై। చేయఁ గొన్ని విశేషసిద్ధిఁ బొందు;
నూరక యుండంగ నొందుఁ గొందఱ విపు। లార్థముల్; గొంద ఱాయాస పడియు
నిష్ఫలారంభు లై నిలుతురు; గొందఱు। పేదవారికిఁ బ్రజ పెల్లు వొడము

తే. నర్థవంతులు గొందఱ కర్థి నధిక। దానములు ధర్మములు సువ్రతములుఁ జేయఁ
బ్రజలు వుట్టరు; విను మిట్టిభంగి సుమ్ము। కర్మఫల మాత్మతంత్రంబు గాక యుండు. 68

ప్రతిపదార్థం: నీతిమంతులు= న్యాయమైన నడవడిక కలవారు (యథోచిత మైన తత్త్వాన్ని ఎఱిగి పాటించేవారు); ధర్మనిరతులు= ధర్మంలో దీక్ష కలవారు; దక్షులున్+అగువారు= సామర్థ్యం కలవారు; చేయు, కార్యములు= చేసే పనులు; కొన్ని= కొన్ని(పనులు); సిద్ధిన్+పొందవు= జయప్రదాలు కావు; దుష్ట చిత్తులు= చెడ్డ మనస్సుకలవారు; క్రూరులు+ఐ= హింసతో కూడినట్టి భయంకర మైన కృత్యాలు చేసేవారును ఐ; చేయన్= ఆచరించగా; కొన్ని= కొన్ని(పనులు); విశేషసిద్ధిన్+పొందున్= గొప్ప విజయం పొందుతాయి; ఊరక+ఉండంగన్= ఏపని చేయకుండ ఉన్నా; కొందఱన్= కొంతమందిని; విపుల+అర్థముల్= గొప్ప ధనాలు (విజయాలు); ఒందున్= పొందుతాయి; కొందఱు= కొంతమంది; ఆయాసపడియున్= శ్రమ పడికూడా; నిష్ఫల+ఆరంభులు+ఐ= ఫలం శూన్యం అయిన ప్రయత్నాలు కలవారై; నిలుతురు= ఉంటారు; కొందఱు= కొంతమంది; పేదవారికిన్= దరిద్రులకు; ప్రజ= సంతానం; పెల్లు+పొడమున్= అధికంగా కలుగుతుంది; అర్థవంతులు కొందఱకున్= ధనవంతు లైన కొంతమందికి; అర్థిన్= కోరికతో; అధిక, దానములు, ధర్మములు, సువ్రతములున్+చేయన్= ఎక్కువగా తమ ద్రవ్యాలను ఇతరులకు ఉచితంగా పంచిపెట్టి పలువురకు ఉపయోగపడే మంచిపనులు; మంచినోములు చేసినను; ప్రజలు+పుట్టరు= సంతానం కలుగదు; వినుము; కర్మఫలము= లోగడ చేసిన కర్మలవలన ఏర్పడేఫలితం; ఇట్టిది+సుమ్ము= ఇటువంటిది సుమా; (కర్మఫలము) ఆత్మతంత్రంబు= తన ఇష్టానుసారంగా నడచేది; కాక+ఉండున్= కానట్టిది.

తాత్పర్యం: 'ఆ కర్మఫలకర్తృత్వం ఎటువంటిది?' అని నీవు అడిగితే నా సమాధానం వినుము. ఈ ప్రపంచంలో అన్నివిషయాలు ఏ యే రీతులలో జరుగుతాయో ఆ యా పద్ధతులను న్యాయాన్ని తెలిసి ప్రవర్తించేవారున్నూ, ధర్మాత్ములున్నూ, సామర్థ్యంకలవారున్నూ చేసే పనులు కొన్ని జయప్రదాలు కాకపోవచ్చును. దుర్మార్గులు, క్రూరులు, అవివేకులు అయిన వారు చేసే పనులు కొన్ని విజయవంతాలు కావచ్చును. కొందరు, ఏపనీ చేయక ఊరకే కూర్చొనిఉన్నప్పటికీ, వారికి ఐశ్వర్యవిజయాలు లభించవచ్చును. కొందరు ఎంతో కష్టించి, గొప్ప పరిశ్రమ చేసినా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వారికి జయం లభించదు. నిరుపేదలకు మిక్కుటంగా సంతానం కలుగుతుంది. ధనవంతులైన కొందరికి దానధర్మాలు యజ్ఞయాగాలు ఎన్ని చేసినా, సంతానం కలుగదు. ఇది కర్మవిపరిపాకం. తన అభీష్టానుసారంగా కర్మఫలం లభించదు.

క. పురుషుఁడు కర్మాధీనత । నరుగక తనవశమ యనిన నాపదలు రుజల్
మరణంబును నివి యేమియుఁ । బొరయక యుండంగ బ్రదుకఁబోలదె చెపుమా! 69

ప్రతిపదార్థం: పురుషుఁడు= మనుజుడు; కర్మ+అధీనతన్= లోగడ చేసిన కర్మలవలన ఏర్పడే పరిపాకానికి లోబడి; అరుగక= ప్రవర్తింపక; తన, వశము+అ+అనినన్= అంతయు తన అధీనంలోనే ఉన్నది అనినట్లయితే; ఆపదలు= విపత్తులు; రుజల్= రోగాలు; మరణంబును= చావును; ఇవి= (పైన చెప్పబడినవి); ఏమియున్+పొరయక+ఉండంగన్= ఏవియు సంప్రాప్తించకుండగా, బ్రదుకన్+పోలదె= జీవించరాదా; చెపుమా= వచించవయ్యా.

తాత్పర్యం: మనుజుడు కర్మాధీనుడు కాకుండగా, తన ఇష్టప్రకారమే అంతా తీర్చిదిద్దుకోగలిగితే - తనకు ఇక్కట్లులు, రోగాలు, చావు మున్నగునవి ఏవీ సంప్రాప్తించకుండానే జీవితాన్ని గడపవచ్చునుగదా? నీవే చెప్పుము.

ఆ. కర్మవశతఁ జూవె కలుగు దేహము; దేహ । వర్తనంబు కర్మవశతఁ బుట్టు;
దేహపాత మైన దేహస్థుఁ డగు జీవుఁ । డరుగుఁ గర్మవిహిత మైన యెడకు'. 70

ప్రతిపదార్థం: దేహము= శరీరం; కర్మవశతన్+చూవె= లోగడ చేసిన కర్మలవలన ఏర్పడే పరిపాకంచొప్పుననే; కలుగున్= ఏర్పడుతుంది; దేహవర్తనంబు= శరీరపు నడవడిక; కర్మవశతన్+పుట్టున్= కర్మకు లోబడి ఏర్పడుతుంది; దేహపాతము+ఐనన్= దేహంపడిపోయినప్పుడు అనగా మరణించినప్పుడు; దేహస్థుఁడు+అగు, జీవుఁడు= దేహంలో ఉన్న ఆత్మ; కర్మ, విహితము+ఐన+ ఎడకున్= కర్మంచేత ఏర్పడిన చోటుకు; అరుగున్= వెళ్ళుతాడు.

తాత్పర్యం: పూర్వం చేసిన కర్మవిపరిపాకంచేతనే మానవశరీరం ఏర్పడుతుంది. శరీర ప్రవర్తనకూడా కర్మపరిపాకాన్ని బట్టియే ఏర్పడుతుంది. మరణించిన పిదప జీవుడూ తన కర్మపరిపాకం నిర్దేశించిన చోటికే వెళ్ళుతాడు.

విశేషం: పూర్వజన్మలో చేసిన కర్మలను బట్టియే మనుజులకు మరుజన్మ కలుగుతుంది. ఆ జన్మలో మనుజుడి ప్రవర్తనకు పూర్వజన్మకర్మపరిపాకమే మూలం. 'బుద్ధిః కర్మానుసారిణీ!'

వ. అనినం గౌశికుండు 'జీవుం డెట్టివాఁ?' డని యడిగిన లుబ్ధకుం డి ట్లనియె. 71

ప్రతిపదార్థం: లుబ్ధకుండు= బోయవాడు;

తాత్పర్యం: అని ధర్మవ్యాధుడు చెప్పగా, కౌశికుడు 'జీవుడు ఎటువంటివాడు?' అని ప్రశ్నించాడు. తిరిగి ధర్మవ్యాధుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

ధర్మవ్యాధుఁడు కౌశికునకు జీవలక్షణంబులు సెప్పుట (సం. 3-200-26)

క. 'విను జీవుండు సనాతనుఁ । డనఘుఁడు నిజకర్మవశత నధ్రువదేహం
బునఁ బొందు దేహపాతం । బున నెప్పుడుఁ జెడఁ డతండు భూసురవర్యా! 72

ప్రతిపదార్థం: భూసురవర్యా!= ఓ బ్రాహ్మణోత్తమా!; విను; జీవుండు= జీవుడు; సనాతనుఁడు= శాశ్వతంగా ఉండేవాడు; అనఘుఁడు= పాపంలేనివాడు; నిజ, కర్మ, వశతన్= తనకర్మకు లోబడి; అధ్రువ, దేహంబునన్+పొందున్= శాశ్వతంగాని అనగా నశించే శరీరాన్ని పొందుతాడు; దేహ, పాతంబునన్= మరణించినప్పుడు; ఎప్పుడున్= ఎప్పుడున్నూ; అతండు= (ఆ జీవుడు) చెడఁడు= నశించడు.

తాత్పర్యం: 'బ్రాహ్మణులలో ఉత్తముడవైన ఓ కౌశికమహర్షీ! వినుము. జీవుడు శాశ్వతంగా ఉండేవాడు. పాపరహితుడు. అతడు తన కర్మవశాన అశాశ్వతమై నశించే శరీరాన్ని తాలుస్తాడు. దేహం మరణసమయాన నశిస్తుంది కాని శాశ్వతు డైన ఆ జీవుడు నశించడు సుమా!

క. **ఈ యొడలు విడిచి వేఱొక । కాయముఁ గైకొని శరీరి కర్మవశగతిం**
బోయి సుఖదుఃఖములు గనుఁ; । బాయక వెండియును దేహబంధముఁ బొందున్.' **73**

ప్రతిపదార్థం: ఈ+ఒడలు= ఈ దేహం; విడిచి= వదలిపెట్టి; వేఱు+ఒక, కాయమున్= ఇంకొక శరీరాన్ని; కైకొని= స్వీకరించి; శరీరి= శరీరం ధరించిన జీవుడు; కర్మ, వశ, గతిన్= కర్మకు లోబడిన తెరువున; పోయి= వెడలి; సుఖ, దుఃఖములు+కనున్= సౌఖ్యాన్నీ, శోకాన్నీ పొందుతాడు; పాయక= విడువక; వెండియును= మరల మరల; దేహ బంధమున్= పునర్జన్మను; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: ఈ శరీరాన్ని విడిచి, జీవుడు తాను చేసిన కర్మకు అనురూప మైన ఇంకొక జన్మలో సుఖదుఃఖాలను అనుభవిస్తాడు. అట్లే అతడు ఎన్నో జన్మలు పొందుతాడు.'

వ. **అనిన విని బ్రాహ్మణుండు లుబ్ధకునితోడం 'బుణ్యపాపానురూపంబు లయిన దేహబంధంబు లెట్టి?' వనిన వాఁ డి ట్లనియె.** **74**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; బ్రాహ్మణుండు= (కౌశికుడు); విని; లుబ్ధకునితోడన్= వ్యాధుడితో; పుణ్య, పాప+అనురూపంబులు+అయిన= పుణ్యానికీ, పాపానికీ తగినవి అయిన, దేహబంధంబులు= జన్మలు; ఎట్టివి?= ఏవిధాలైనవి?; అనినన్= అని అడుగగా; వాఁడు= (ధర్మవ్యాధుడు); ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అని ధర్మవ్యాధుడు చెప్పాడు. ఆ మాటలు విని, కౌశికుడు ధర్మవ్యాధుడిని మరల ఈ విధంగా ప్రశ్నించాడు. 'పుణ్యకర్మలవలన ఎట్టి పునర్జన్మ ఏర్పడుతుంది? పాపకర్మలవలన ఏర్పడే మరు జన్మ ఎటువంటిది?' అని. ధర్మవ్యాధుడు ఆ ప్రశ్నకు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

చ. **'స్థిరమగు పుణ్యకర్మమున దేవభవం బగుఁ, బుణ్యపాప సం**
కరమున మానుషత్వ మగుఁ, గల్మషముల్ పశుకీట భావముం
బొరయఁగఁ జేయు; నిప్పగిదిఁ బుట్టుచుఁ జచ్చుచు మోహవార్ధిలోఁ
దిరుగుచునుండుఁ గాని యొకతీరము సేరఁడు జీవుఁ డెన్నఁడున్. **75**

ప్రతిపదార్థం: స్థిరము+అగు, పుణ్య, కర్మమునన్= శాశ్వతమైన పుణ్యం కలిగించే పనులవలన; దేవభవంబు+అగున్= దేవతా జన్మ ఏర్పడుతుంది; పుణ్య, పాప, సంకరమునన్= పుణ్యపాపాలతో మిశ్రితమైన కర్మవలన; మానుషత్వము+అగున్=

మనుజులకు సంబంధించిన (జన్మ) కలుగుతుంది; కల్మషముల్= పాపాలు; పశు, కీట, భావమున్= జంతువులకు పురుగులకు సంబంధించిన జన్మలను; పొరయఁగన్+చేయున్= సంభవింపజేస్తాయి; ఈ+పగిదిన్= ఈరీతిగా; పుట్టుచున్, చచ్చుచున్, మోహ, వార్థిలోన్= భ్రాంతి అనే సముద్రంలో; తిరుగుచున్+ఉండున్+కాని= పరిభ్రమిస్తుంటాడే కాని; జీవుఁడు; ఎన్నఁడున్= ఎప్పటికిని; ఒక, తీరము+చేరఁడు= ఒక గట్టుకు చేరుకొనడు. అనగా జన్మరాహిత్యాన్ని పొందలేడని భావం.

తాత్పర్యం: శాశ్వత మైన పుణ్యకార్యాలు చేస్తే దేవలోకంలో జన్మ లభిస్తుంది. పుణ్యాలు పాపాలు కలగలిపి చేస్తే మనుజజన్మ కలుగుతుంది. కేవలం పాపాలే చేస్తే, జంతువులుగా పురుగులుగా పుట్టుతారు. ఈ విధంగా జీవుడు పుట్టుతూ చస్తూ సదా సంసారమనే భ్రాంతిసాగరంలో తిరుగాడుతాడే కాని ఎన్నటికిని ఒక ఒడ్డు చేరుకొనలేడు.

చ. ఇది సకలంబుఁ గాంచి బుధుఁ డెన్నఁడుఁ బాపము పొంతఁ బోక ని
ర్మదనిరహంక్రియాత్మ్ముఁడును మత్సరదూరుఁడు నై చరించుఁ బెం
పొదవఁగ ధర్మమార్గమున నొయ్యన ధర్మము తీ పెఱింగి తా
వదలఁడు సత్క్రియావిధము వారక యెక్కు డొనర్చు ధర్మముల్. 76

ప్రతిపదార్థం: బుధుఁడు= పండితుడు; ఇది= దీనిని (జీవుడు మోహసముద్రంలో పడి చావుపుట్టుకల చక్రంలో తిరుగుతూ ఉండటాన్ని); సకలంబున్= అంతటిని; కాంచి= చూచి, గమనించి; ఎన్నఁడున్= ఏనాడుకూడా, ఎప్పుడుకూడా; పాపము, పొంతన్= దోషమైన పని దగ్గరకు; పోక= పోకుండా; నిర్మద, నిరహంక్రియా+ఆత్మ్ముఁడును= పొగరులేని, అన్నింటికీ నేనేకర్తననే అహంకారంలేని, చిత్తంకలవాడున్నూ; మత్సర, దూరుఁడును+ఐ= అసూయ లేనివాడున్నూఅయి; పెంపు+ఒదవఁగన్= అభివృద్ధి కలిగేటట్లు; ధర్మమార్గమునన్= ధర్మం తప్పనిబాటలో; చరించున్= నడుస్తాడు; ఒయ్యన= క్రమంగా; ధర్మము, తీపు+ఎఱింగి= ధర్మంలోని రుచి మరిగి; సత్+క్రియా, విధమున్= మంచిపనులు చేసే పద్ధతిని; తా(న్)= తాను; వదలఁడు= వదలిపెట్టడు; వారక= ఆపకుండా; ఎల్లప్పుడూ, ధర్మముల్= విధివిధానంగా ఉండే పనులు; ఎక్కుడు= అధికంగా; ఒనర్చున్= చేస్తాడు.

తాత్పర్యం: జీవుడు మోహసముద్రంలో పడి చావుపుట్టుకల చక్రంలో తిరుగుతూ ఉంటాడన్న సంగతి నంతా పండితుడైనవాడు బాగా గమనించి ఎప్పుడూ పాపపు పనులజోలికి పోకుండా, పొగరు అహంకారంలేని మనస్సుతో, అసూయను వదలిపెట్టి ధర్మమార్గంలో నడుస్తూ పెంపును పొందుతాడు. అట్లా ధర్మాన్ని ఎల్లప్పుడూ ఆచరించటం వలన దానిలోని రుచిని మరుగుతాడు. దానివలన మంచిపనులు సదా చేస్తుంటాడు. ధర్మకార్యాలను ఎక్కువగా చేస్తుంటాడు.

చ. చిరముగ ధర్మముల్ నడపఁ జిత్తము దేఱుఁ బ్రసన్నచిత్తుఁ డై
పరువడి నింద్రియార్థముల భంగులు రిత్తలుగా నెఱింగి చె
చ్చెర నవి యంతవట్టు నిరసించి తపో దమ సత్యశీలతం
బరిణతి నొందుఁ బొందుఁ బిదపం బరమార్థపదప్రభావమున్.' 77

ప్రతిపదార్థం: చిరముగన్= చాలకాలం; ధర్మముల్= లోకాన్ని మంచి స్థితిలో నిలబెట్టే పనులను; నడపన్= ఆచరించగా; చిత్తము= మనస్సు; తేఱున్= నిర్మలమౌతుంది; ప్రసన్న చిత్తుఁడు+ఐ= తేరుకొనిన మనస్సు కలవాడై; పరువడిన్= శ్రద్ధతో; ఇంద్రియ+అర్థముల భంగులు= విషయసుఖాలకు సంబంధించిన భావాల రీతులు; రిత్తలుగాన్= వ్యర్థాలైనవిగా; ఎఱింగి= తెలిసికొని; చెచ్చెరన్= శీఘ్రంగా; అవి= (ఆ ఇంద్రియార్థాలు); అంత+పట్టు= అంతమేరకు; నిరసించి= త్యజించి; తపస్+దమ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సత్య, శీలతన్= చిత్తప్రసాదాన్నిగలిగించే శరీరక్లేశం మున్నగు పనులచేత, ఇంద్రియనిగ్రహంచేత, నిజాన్ని సదా భాషించే స్వభావంచేత; పరిణతిన్+ఒందున్= గొప్పవికాసాన్ని పొందుతాడు; పిదపన్= తదుపరి; పరమ+అర్థ, పద, ప్రభావమున్= మిక్కిలిగొప్పదైన ఆధ్యాత్మికమైన ఉన్నతి యొక్క మహిమను; పొందున్= ఏర్పరచుకొంటాడు.

తాత్పర్యం: చిరకాలం ధర్మాలను ఆచరించటంవలన మనస్సు నిర్మల మౌతుంది. చిత్తం ప్రశాంతిని బొందటంచేత, ఇంద్రియ సౌఖ్యాలు వ్యర్థాలైనవి అని తెలుస్తుంది. అట్టి జ్ఞానం లభించిన వెంటనే వాటిని విడనాడి తపస్సు, ఇంద్రియనిగ్రహం, సత్యవ్రతం, మున్నగు సద్గుణాల చేత ఆధ్యాత్మికమైన ఉన్నతస్థితి మహిమ గోచరిస్తుంది. అదియే గొప్ప పరిణత స్థితి.'

వ. అనిన నమ్మహాద్విజుండు ధర్మవ్యాధున కి ట్లనియె. 78

తాత్పర్యం: అనగా ఆ ఉత్తమబ్రాహ్మణుడైన కౌశికుడు ధర్మవ్యాధుడితో ఈవిధంగా అన్నాడు.

ఆ. 'ఇంద్రియంబు లనఁగ నెయ్యవి? యవి నిగ్ర। హింపకున్నఁ బాప మేమి దొడరు?
వాని నిగ్రహించువానికి నగు ఫలం। బెట్టి?' దనిన నాతఁ డిట్టు లనియె. 79

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు+అనఁగన్+ఎయ్యవి?= ఇంద్రియాలు అనగా ఏవి?; అవి= (ఇంద్రియాలు); నిగ్రహింపకున్నన్= అదుపులో పెట్టకుంటే; పాపము+ఏమి+తొడరున్= ఎట్టి దురితం సంక్రమిస్తుంది; వానిన్= (ఇంద్రియాలను); నిగ్రహించువానికిన్= లోబరచుకొనే వాడికి; అగు ఫలంబు= లభించే ఫలం; ఎట్టిది= ఏవిధమై నట్టిది; అనినన్= అనగా (అని కౌశికుడు అడుగగా); ఆతఁడు= (ధర్మవ్యాధుడు); ఇట్టులు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'ఇంద్రియాలు అనగా ఏవి? ఇంద్రియాలను అదుపులో పెట్టకపోతే కలిగే పాప మేమి? వాటిని నిగ్రహించేవాడికి కలిగే లాభ మేమి?' అని అడిగిన కౌశికుడి ప్రశ్నలకు ధర్మవ్యాధుడు ఈవిధంగా సమాధానం ఇచ్చాడు.

విశేషం: ఇంద్రియాలు అయిదు+అయిదు= పది. జ్ఞానేంద్రియాలు అయిదు; త్వక్కు, చక్షువు, శ్రోత్రం, జిహ్వ, ఘ్రాణం, కర్మేంద్రియాలు అయిదు: వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ. మనస్సుతో కూడి ఏకాదశేంద్రియాలుగా ప్రాచుర్యం.

క. 'విను విషయజ్ఞానమునకు। ననయంబును మనసు మూల; మది కామక్రో
ధనిరూఢ మగుచుఁ బురుషుని। ననిశము నెలయించు నింద్రియార్థక్రియలన్. 80

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; విషయ, జ్ఞానమునకున్= ఇంద్రియార్థాల తెలివిడికి; అనయంబును= ఎల్లప్పుడును; మనసు= చిత్తం; మూలము= ఆధారం; అది= (ఆ మనస్సు); కామ, క్రోధ, నిరూఢము+అగుచున్= కోరికలతో, కోపతాపాలతో కూడుకొన్నది కావటంచేత; ఇంద్రియ+అర్థ, క్రియలన్= ఇంద్రియభోగాలకు సంబంధించిన పనులలో; పురుషునిన్= మనుజుడిని; అనిశమున్= ఎల్లప్పుడు; ఎలయించున్= ప్రవేశపెడుతుంది.

తాత్పర్యం: 'ఇంద్రియార్థాల తెలివిడికి ఆధారమైనది మనస్సు. అది కోరికలతో, కోపతాపాలతో కూడితే మనుజుడిని విషయభోగాలవైపు తరలిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇంద్రియార్థాలు అయిదు. శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం.

సీ. **ఇంద్రియార్థంబుల కెలసిన పురుషుండు । గాఢరాగంబునఁ గరఁగుచుండు;**
రాగంబువలనఁ దిరంబగు లోభంబు । లోభియై కరుణకు లోనుగాఁడు;
మఱి సముద్ధతవృత్తి మరగుఁ బాపక్రియఁ । దగువారు సెప్పెడి తగవు వినఁడు;
కుజనుల దెసఁ బ్రీతి గొఱలుఁ; దుల్యంబులు । గాకుండు వాఙ్మనఃకర్మభంగు;

ఆ. **లిహమునందుఁ బుణ్యహీనుఁడై చెడిపోవుఁ । బరమునందు దుఃఖభరము నొందుఁ;**
గాన యింద్రియార్థగతిఁ బోక సాధుసం । సర్గఁ జేసి సుగతిఁ జనుట యొప్పు. **81**

ప్రతిపదార్థం: ఇంద్రియ+అర్థంబులకున్= విషయసుఖాలకు; ఎలసిన= లోనైన; పురుషుండు= మనుజుడు; గాఢ, రాగంబునన్= మిక్కుట మైన కామం చేత; కరఁగుచుండున్= ద్రవిస్తూ ఉంటాడు; రాగంబువలనన్= కామంవలన; లోభంబు= పిసినారితనం; తిరంబు+అగున్= ఎక్కువ కాలం నిలుస్తుంది; లోభి+ఐ= లోభం కలవాడై; కరుణకున్= దయకు; లోను+కాఁడు= లోబడడు; మఱి= అదనంగా; సమ్+ఉద్ధతి, వృత్తి= ఎక్కువ గర్వంతో కూడిన భావంచేత; పాపక్రియన్= దురితంతో కూడిన పనియందు; మరగున్= అభిలాష పెంచుకొంటాడు; తగువారు= యోగ్యులు; చెప్పెడి= వచించెడి; తగవు= ధర్మం; వినఁడు= ఆలకించడు. కుజనుల+దెసన్= చెడ్డవారి యెడల; ప్రీతి= అభిమానం; కొఱలున్= అతిశయిస్తుంది; వాక్+మనస్+కర్మ, భంగులు= మాట, మనస్సు, క్రియల రీతులు; తుల్యంబులు= సమమైనవి; కాక+ఉండున్= కావు; ఇహమునందున్= ఈ లోకంలో; పుణ్య, హీనుఁడు+ఐ= సుకృతం లేనివాడై; చెడిపోవున్= నశిస్తాడు; పరమునందున్= ఇంకొకలోకంలో; దుఃఖ, భరమున్= శోకపు బరువును; ఒందున్= పొందుతాడు; కాన= కాబట్టి; ఇంద్రియ+అర్థ, గతిన్= విషయ సుఖాల మార్గంవైపు; పోక= వెడలక; సాధు, సంసర్గన్+చేసి= మంచివారలతోడి కలయిక చేత; సుగతిన్= మంచి మార్గంలో; చనుట= వెడలటం; ఒప్పు= మంచిది.

తాత్పర్యం: విషయసుఖాలకు చిక్కిన మనుజుడు మిక్కుటమైన కామప్రవృత్తికి లోనౌతాడు. మిక్కుటమైన కామ ప్రవృత్తికి లోనుకావటంవలన చాలకాలం నిలిచే లోభం ఏర్పడుతుంది. లోభి కావటంవలన దయకు దూరమైనవా డౌతాడు. గర్వానికి లోనౌతాడు, పాపకార్యాలకు పాల్పడతాడు; యోగ్యులైన వారు చెప్పే ధర్మాన్ని ఆలకించడు. చెడ్డవారి స్నేహం చేస్తాడు. వాక్కుకు, మనస్సుకు, చేతలకు బొత్తిగా పొంతన కుదురదు. ఆ విధంగా అతడు ఈలోకంలో చెడిపోతాడు. పరం దక్కక అతడు దుఃఖమగ్నుడౌతాడు. కాబట్టి విషయభోగాలలో మనస్సును చిక్కనీయక, సాధుజనుల సహవాసం చేసి సుగతికి పోవటం మంచిది.

వ. **ఇంద్రియంబు లన నెయ్యవి యనియు, నింద్రియ జయసిద్ధియు నీవు నన్నడిగితివి; తత్ప్రకారంబు బ్రహ్మవిద్యావిషయంబు మాబోఁటివారికి నవాచ్యం బై యుండు; నైనను నీవు బ్రాహ్మణప్రవరుండవు గావున సద్బ్రాహ్మణ ప్రియం బవశ్యకర్తవ్యంబు; పరమబ్రహ్మవిదు లైన బ్రాహ్మణవరులకు నమస్కరించి, బ్రహ్మవిద్యాప్రపంచం బెఱింగించెద; నవధాన పరుండ వై యాకర్ణింపుము.** **82**

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు+అనన్+ఎయ్యవి= ఇంద్రియాలు అనగా ఏవి; అనియున్= అనియున్నూ; ఇంద్రియ, జయ, సిద్ధియున్= ఇంద్రియాలపై గెలుపు ఎట్లా సిద్ధిస్తుంది అనిన్నీ; నీవు= నీవు; నన్నున్= నన్ను; అడిగితివి= ప్రశ్నించావు; తత్+ప్రకారంబు= ఆవిధం; బ్రహ్మ, విద్యా, విషయంబు= ఆధ్యాత్మికజ్ఞానానికి సంబంధించిన సంగతి; మాబోఁటివారికిన్= నా వంటి వారలకు; అవాచ్యంబు+ఐ+ఉండున్= చెప్ప నలవి కానట్టిదిగా ఉంటుంది. ఐనను= అయినప్పటికిని; ఈవు= నీవు;

బ్రాహ్మణ, ప్రవరుండవు= విప్రులలో ఉత్తముడవు; కావునన్= కాబట్టి; సత్+బ్రాహ్మణ, ప్రియంబు= మంచి విప్రులకు ఇష్టమైనది; అవశ్య కర్తవ్యంబు= తప్పనిసరిగా చేయవలసినట్టిది; పరమ బ్రహ్మవిదులు+ఐన= ఆధ్యాత్మిక తత్త్వాన్ని లెస్సగా తెలిసినవారైన; బ్రాహ్మణ వరులకున్= విప్రులలో శ్రేష్ఠు లైన వారికి; నమస్కరించి= వందనం చేసి; బ్రహ్మ, విద్యా ప్రపంచంబు= ఆధ్యాత్మిక తత్త్వం యొక్క విస్తారం అంతటిని; ఎఱింగించెదన్= తెలుపుతాను; అవధానపరుండవు+ఐ= ఏకాగ్రతతో కూడిన నిష్ఠ కలవాడవై; ఆకర్ణింపుము= ఆలకింపుము.

తాత్పర్యం: ఇంద్రియాలు అనగా ఏవి? ఇంద్రియనిగ్రహం ఎట్లా లభిస్తుంది? అని నీవు నన్ను ప్రశ్నించావు. అది ఆధ్యాత్మికతత్త్వం. అది నాబోటి వారు చెప్పటానికి అలవి కానిది; అయినను నీవు బ్రాహ్మణోత్తముడవు. జిజ్ఞాసువవు; తెలిసికొనటానికి యోగ్యత యున్నవాడవు. మంచి విప్రులకోరిక ఈడేర్చటం తప్పనిసరిగా చేయవలసినపని. కాబట్టి, మహానుభావులు ఆధ్యాత్మిక తత్త్వకోవిదులు అయిన బ్రాహ్మణోత్తములను ధ్యానించి, వారికి సవినయంగా నమస్కరించి, బ్రహ్మజ్ఞానాన్నిగూర్చి నీకు సవిస్తరంగా తెలుపగలను. ఏకాగ్రతతో కూడిన నిష్ఠతో ఆలకించుము.

ధర్మవ్యాధుఁడు కౌశికునకు బ్రహ్మవిద్యాప్రపంచం బెఱింగించుట (సం. 3-201-16)

తే. అంబరము వాయు వగ్ని దోయమ్ము ధరణి । భూతపంచక మిది; క్రమంబున మహాత్మ!
శబ్ద సంస్పర్శ రూప రసములు గంధ । సంయుతంబుగ భూతపంచక గుణములు. 83

ప్రతిపదార్థం: మహా+ఆత్మ!= గొప్ప ఆత్మ కలవాడా!; అంబరము= ఆకాశం; వాయువు= గాలి; అగ్ని= నిప్పు; తోయమ్ము= నీరు; ధరణి= నేల; ఇది; క్రమంబునన్= వరుసగా; భూతపంచకము= పంచభూతాల సంపుటి(అవి); శబ్ద, సంస్పర్శ, రూప రసములు= నాదం, తాకుడు, ఆకృతి, ద్రవం; గంధ సంయుతంబుగన్= వాసనతో కూడినవై ఉండటం; భూత పంచకగుణములు= పంచభూతాల గుణాలు.

తాత్పర్యం: గొప్పఆత్మ గల ఓ కౌశికమహర్షీ! ఆకాశం, గాలి, నిప్పు, నీరు, నేల అనేవి పంచభూతాలు. వీటి గుణాలు వరుసగా నాదం, స్పర్శ, ఆకృతి, ద్రవం, వాసనలు. అనగా: ఆకాశ గుణం శబ్దం; వాయు గుణం స్పర్శం; అగ్ని గుణం రూపం; నీటి గుణం రసం; భూమి గుణం గంధం.

క. ఒనరఁగ నాకస మాదిగ । ననులోమముతోడ నిమ్మహాభూతము లే
నును బుట్టు నొకటి కొక్కటి । యనయముఁ బ్రతిలోమగతి లయంబునఁ బొందున్. 84

ప్రతిపదార్థం: ఒనరఁగన్= వరుసగా; ఆకసము+ఆదిగన్= ఆకాశం మొదలుగా; అనులోమముతోడన్= క్రిందివరుసగా; ఈ+మహాభూతములు+ఏనును= ఈ గొప్పభూతాలు అయిదున్నూ; పుట్టున్= ఉద్భవిస్తాయి; ఒకటికిన్+ఒక్కటి= ఒకదానివరుస ఒకటి; అనయమున్= ఎల్లప్పుడును; ప్రతిలోమగతిన్= పైవరుస క్రమాన; లయంబునన్= వినాశాన్ని; పొందున్= పొందుతాయి.

తాత్పర్యం: ఆకసం మొదలుగా పంచభూతాలు వరుసగా అనులోమ క్రమంలో పుట్టుతాయి. అవి ప్రతిలోమ క్రమంలో లయమౌతాయి. (అనగా ఆకాశంనుండి వాయువు; వాయువునుండి అగ్ని, అగ్నినుండి నీరు, నీటినుండి భూమి పుట్టుతాయి. ఇది అనులోమ క్రమం. ఇక ప్రతిలోమ క్రమాన ప్రళయకాలంలో భూమి నీటిలో, నీరు అగ్నిలో, అగ్ని వాయువులో, వాయువు ఆకాశంలో లయిస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. శ్రోత్రంబును ద్వక్కును జక్షువును జిహ్వయు ఘ్రాణంబును నను నియ్యేనగు నింద్రియంబులు శబ్ద స్పర్శ రూపరసగంధంబు లింద్రియ విషయంబు లై యుండు; నింద్రియపంచకంబునకు షష్ఠం బై మనస్సుప్రకాశిల్లు; సప్తమాష్టమంబు లై బుద్ధియు నహంకారంబును వర్తిల్లు; సత్త్వంబును రజస్సును దమస్సును గుణంబు లై యుండు; నీ చెప్పంబడిన మహాభూతప్రముఖ ప్రపంచంబంతయు నవ్యక్తం బను తత్త్వంబునం దావిర్భావతిరోభావంబులం బొందుచుండు. 85

ప్రతిపదార్థం: శ్రోత్రంబును= చెవియున్నూ; త్వక్కును= చర్మమున్నూ; చక్షువును= కన్నున్నూ; జిహ్వయున్= నాలుకయున్నూ; ఘ్రాణంబునున్= ముక్కున్నూ; అను+ఈ+ఏను+అగు= అనబడే ఈ అయిదు అయిన; ఇంద్రియంబులు= ఇంద్రియాలు; శబ్ద, స్పర్శ, రూప, రస, గంధంబులు= నాదం, తాకుడు, ఆకృతి, ద్రవం, వాసనలు; ఇంద్రియవిషయంబులు+ఐ+ఉండున్= ఇంద్రియార్థాలు అయి ఉంటాయి (వీటికి తన్మాత్రలు అని పేరు); ఇంద్రియ పంచకంబునకున్= అయిదు ఇంద్రియాలకు; షష్ఠంబు+ఐ= ఆరవది అయి; మనస్సు= చిత్తం; ప్రకాశిల్లున్= వెలుగొందుతుంది; సప్తమ+అష్టమంబులు+ఐ= ఏడవది ఎనిమిదవది అయినవి; బుద్ధియున్+అహంకారంబును= తెలివియున్నూ, నేను అనెడి అభిమాన భావమున్నూ; వర్తిల్లున్= ఉంటాయి; సత్త్వంబును= సాధువులకుండే మంచితనం అనేగుణం; రజస్సును= భూలోకవాసులలో సర్వసాధారణంగా ఉండే అహంభావపూరితమైన లక్షణం; తమస్సును= కోపతాపాలలో కూడిన మూఢత్వం (త్రిగుణములు= సత్త్వరజస్తమోగుణాలు); గుణంబులు+ఐ+ఉండున్= గుణాలు అయి ఉంటాయి; ఈ చెప్పంబడిన= ఈ విధంగా వివరించబడిన; మహా, భూత, ప్రముఖ, ప్రపంచంబు+అంతయున్= గొప్ప భూతాలతో కూడుకొనిన లోకం అంతయున్నూ; అవ్యక్తంబు+అను, తత్త్వంబునందున్= వ్యక్తం కానట్టి అనగా అగోచరమైనది అనే తత్త్వంలో; ఆవిర్భావ, తిరస్+భావంబులన్= పుట్టుక మరలిపోవటాలను; పొందుచుండున్= పొందుతూ ఉంటాయి.

తాత్పర్యం: చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు - ఇవి ఐదు ఇంద్రియాలు. శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం - ఇవి ఐదు ఇంద్రియార్థాలు: వీటికి పంచతన్మాత్రలు అని వ్యపదేశం. ఇంద్రియపంచకానికి తోడు ఆరవది మనస్సు. బుద్ధి ఏడవది. అహంకారం ఎనిమిదవది. సత్త్వం, రజస్సు, తమస్సు - ఇవి మూడున్నూ త్రిగుణాలు. ఈ భూతప్రపంచం సర్వమున్నూ 'అవ్యక్తం' అనే తత్త్వంలో ఉదయిస్తుంది. తిరిగి అందులోనే లయిస్తుంది.

విశేషం: ప్రపంచం : అనగా విస్తారం : విరివి. పెక్కు విధాలు గలిగిన విస్తరణ. బ్రహ్మవిద్యా ప్రపంచం అనగా వేదాంతజ్ఞాన విస్తారం. ఇందు 'తత్త్వమునందు ఆవిర్భావ తిరోభావంబులందు' అనే వాక్యం సృష్టినిగూర్చి ప్రళయాన్నిగూర్చి తెలుపుతుంది. సృష్టికి ఆద్యప్రకృతి అయిన మూలపదార్థాన్నిగూర్చి వివిధమతాలు వేరు వేరు సిద్ధాంతాలను నెలకొల్పినవి.

మతాలు	తత్త్వాలు
బౌద్ధం	శూన్యం
చార్వాకులు	పంచభూతాలు
అర్హతులు	జీవం - అజీవం
అర్హతులు (కొందరు)	జీవం - ఆకాశం - ధర్మం - అధర్మం - పుద్గలం.
సాంఖ్యులు	పంచభూతాలు 5, పంచతన్మాత్రలు 5, ఏకాదశేంద్రియాలు 11, అవ్యక్తం 1, బుద్ధి 1, అహంకారం 1, ఆత్మ 1 = మొత్తం 25.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యోగులు	సాంఖ్యులు 25+ఈశ్వరుడు
ద్వైతులు	స్వతంత్రం+అస్వతంత్రం
విశిష్టాద్వైతులు	తత్త్వత్రయం = చిత్తు+అచిత్తు+ఈశ్వరుడు
అద్వైతులు	బ్రహ్మం.

క. అవ్యక్త తత్త్వ మరయఁగ । నవ్యక్తం బయ్యు నిట్టి దై లక్ష్య మగున్
సువ్యక్తేంద్రియ భూతా । ది వ్యవహారార్థ లింగదృష్టాకృతి యై. 86

ప్రతిపదార్థం: అరయఁగన్= పరిశీలించగా; అవ్యక్త, తత్త్వము= వ్యక్తం కాకుండ అగోచరంగా ఉండే యాథార్థ్యం; అవ్యక్తంబు+అయ్యున్= వ్యక్తం కానట్టిదే అయినప్పటికిని; ఇట్టిది+ఐ= ఈ విధంగా ఏర్పడేదై; సువ్యక్త+ఇంద్రియ, భూత+ఆది, వ్యవహార+అర్థ, లింగ, దృష్ట+ఆకృతి+ఐ= బాగా గోచరించునట్టిదై ఇంద్రియాలలో భూతములు మున్నగునట్టి వానితో కూడి లౌకికమైన వాడుకలు, భావప్రతీతి, లింగ, భేదంతో కన్పించే రూపం కలదై; లక్ష్యము+అగున్= గ్రహించదగినట్టిది ఔతుంది.

తాత్పర్యం: అవ్యక్తమై అగోచరమయ్యే తత్త్వం - అవాఙ్మానస గోచరం అనిర్వచనీయం అనుభవైకవేద్యం అయినదే అయినను, లోకవ్యవహారంలో, ఇంద్రియాలకు భూతాలకు అనువయిన భావనలో లింగభేదంతో కూడిన రూపంతో కన్పించవచ్చును. ఆవిధంగానే అవ్యక్తతత్త్వాన్ని లౌకికులైన మానవులు గ్రహించ వీలు కల్గుతుంది. అనగా అవ్యక్త తత్త్వం వ్యవహారంలో సాకారం కావచ్చును. అసలు అది నిరాకారం. అవ్యక్తం.

వ. అని చెప్పి మఱియు ని ట్లనియె. 87

తాత్పర్యం: అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

తే. అనఘ! శబ్దాది విషయంబులందుఁ దగిలి । యిచ్చఁ జరియించు నెప్పుడు నింద్రియములు;
బుధుఁడు దత్త్వభావముఁ దనబుద్ధి నెఱిఁగి । యేమఱక వానిఁ దగఁ గుదియింప వలయు. 88

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా!; శబ్ద+ఆది, విషయంబులందున్= శబ్దం మొదలైనవాటిలో; తగిలి= చిక్కుకొని; ఎప్పుడున్= ఎల్లప్పుడును; ఇంద్రియములు= భోగసాధనాలు; ఇచ్చన్= ఇష్టం వచ్చినట్లుగా; చరియించున్= తిరుగుతాయి; బుధుఁడు= తెలివిగలవాడు; తత్త్వభావమున్= వేదాంతాన్ని, యాథార్థ్యజ్ఞానాన్ని; తన బుద్ధిన్= తన తెలివితో; ఎఱిఁగి= తెలిసికొని; ఏమఱక= అవధానం పోగొట్టుకొనక; వానిన్= (ఆ ఇంద్రియాలను); కుదియింపవలయున్= నిగ్రహించాలి.

తాత్పర్యం: ఓ పుణ్యాత్ముడా! ఇంద్రియాలు శబ్దం మొదలైన భోగసాధనాలలో చిక్కుకొని, ఇష్టానుసారంగా నడుస్తూ ఉంటాయి. బుద్ధిమంతుడు ఏమఱుపాటు చెందక జ్ఞానాన్ని ఆర్జించి ఇంద్రియాలను నిగ్రహించాలి.

ఉ. ధీరుఁడు నిర్జితేంద్రియుఁడు దెల్లముగాఁ దనుఁ గాంచు భూత వి
స్తారనిగూఢ మైన పరతత్త్వముగాఁ, దనయందు భూత వి
స్తారము నెల్లఁ గాంచు సతతస్ఫుటదర్శనుఁ డై సమగ్ర వి
స్ఫారతఁ బొంది నిర్మలతపంబులయందుఁ జరింప కెన్నఁడున్. 89

ప్రతిపదార్థం: ధీరుఁడు= నిలుకడ కల చిత్తం కలవాడు; నిర్జిత+ఇంద్రియుఁడు= నిగ్రహించబడిన ఇంద్రియాలు కలవాడు-ఇంద్రియాలను జయించినవాడు; సతత, స్ఫుటదర్శనుఁడు+ఐ= ఎల్లప్పుడును బాగా కన్పించే చూపు కలవాడై సమగ్ర, విస్ఫారతన్+పొంది= పూర్ణమైన వికాసాన్ని పొందిన వాడై; నిర్మల, తపంబుల+అందున్= స్వచ్ఛమైన తపస్సులు చేయటంలో; ఎన్నడున్= ఎప్పుడును; చలింపక= వణకక; తెల్లముగాన్= విశదంగా, స్పష్టంగా; భూత, విస్తార, నిగూఢము+ఐన= అన్ని పదార్థాలలో వ్యాపించి రహస్యంగా ఉన్నట్టి; పరతత్త్వముగాన్= పరబ్రహ్మంగా; తనున్+కాంచున్= తనను తెలిసికొంటాడు; తనయందున్= తనలోపల; భూత, విస్తారమున్+ఎల్లన్= ప్రపంచంలో విస్తరించిన పదార్థాల నన్నిటిని, కాంచున్= తెలిసికొంటాడు.

తాత్పర్యం: స్వచ్ఛమైన తపస్సులు చేసి జ్ఞానాన్ని ఆర్జించిన మహనీయుడు సర్వభూతాలలో తనను తెలిసికొంటాడు; తనయందు సర్వభూతాలను తెలిసికొంటాడు.

విశేషం: 'ఏకమ్ సత్ విప్రాః బహుధా వదంతి.' 'ఏక మేవాఽద్వితీయమ్' - మున్నగు ఉపనిషద్వాక్యాలకు అనురూప మైనది ఈ పద్యం. భిన్ననామరూపభేదాత్మక మైన ప్రపంచంలో అంతర్లీనంగా ఉన్న ఆత్మపదార్థాన్ని తపస్విఅయినవాడు ఇంద్రియనిగ్రహంతో గుర్తించగలడు.

క. తప మనఁగ సకల విషయ । వ్యపేత మగు నట్టి బుద్ధివైభవము సుమీ!
తపమున సుస్థిరుఁ డగు యో । గపరునకుం గలవె యొండు కర్తవ్యంబుల్. 90

ప్రతిపదార్థం: తపము+అనఁగన్= తపస్సు అనగా; సకల, విషయ, వ్యపేతము+అగు+అట్టి= అన్ని విషయాలనుండి వెనుకకు మరల నట్టి; బుద్ధి, వైభవము, సుమీ= జ్ఞానంయొక్క గొప్పదనం సుమా; తపమునన్= తపస్సులో; సుస్థిరుఁడు+అగు= నిలుకడ చెందిన వాడగు; యోగపరునకున్= యోగాసక్తునకు; ఒండు= వేరే; కర్తవ్యంబుల్= నెరవేర్చవలసిన పనులు; కలవె= ఉన్నవా? (లేవు).

తాత్పర్యం: తపస్సు అనగా అన్ని విషయాలనుండి వెనుకకు మరలిన మనస్సుతో కూడిన వైరాగ్యమే కదా! తపస్సులో నిలుకడ కనిన యోగికి ఇక చేయవలసిన పనులు వేరేమీ ఉండవు.

క. స్వర్గనరకంబు లింద్రియ । వర్గ సమాచరణమునన వచ్చును వినవే!
స్వర్గ మగుఁ దన్నివారణ । దుర్గతి యగుఁ దన్నిరోధ దుర్బలతమెయిన్. 91

ప్రతిపదార్థం: స్వర్గనరకంబులు= స్వర్గమున్నూ నరకమున్నూ; ఇంద్రియ, వర్గ, సమాచరణమునన్+అ= ఇంద్రియ సమూహాల యొక్క ప్రవర్తన వలన; వచ్చును= సంక్రమిస్తుంది; వినవే!= వినలేదా!; తద్+నివారణన్= ఆ (ఇంద్రియాలను) నిగ్రహించటంచేత; స్వర్గము+అగున్= స్వర్గం ప్రాప్తిస్తుంది; తత్+నిరోధ, దుర్బలత, మెయిన్= ఆ ఇంద్రియాలను నిగ్రహించటంలో ఏర్పడిన బలహీనతచేతనే; దుర్గతి= దుర్గతి, నరకం; అగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఇంద్రియాలను నిగ్రహించటం వలన స్వర్గం లభిస్తుంది. ఆ ఇంద్రియాలను నిగ్రహించజాలని బలహీనత వలననే నరకం ప్రాప్తిస్తుంది.

విశేషం: పాపాలు చేసినవారికి యమలోకం ప్రాప్తిస్తుందనిన్నీ, పుణ్యాలు చేసిన వారికి స్వర్గం లభిస్తుందనిన్నీ - పురాణ సాహిత్యంలో చెప్పబడిన అంశం. అర్థవాదరూపంగా గ్రహించనగునని భారత సందేశం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

"న మోక్షో నభసః పృష్ఠే । న పాతాళే న భూతలే ।
సర్వాశాసంక్షయే చేతః । క్షయో మోక్ష ఇతీర్యతే". 70 అన్నపూర్ణ అధర్వవేదం

మోక్షం అనేది ఆకాశం వెనుకగాని పాతాళంలో గాని భూమిమీద గాని ఉండే చోటు గాదు. ఆశాపరివృత మైన చిత్తవృత్తి నశించటమే నిజమైన మోక్షం - అన్న వేదవాక్య మిక్కడ అనుసంధించదగింది.

చ. అరదము దేహ, మింద్రియము లశ్వము, లాత్ముఁడు సూతుఁ డమ్మహా
తురగచయంబు ధైర్య మను తోరపుఁ బగ్గములన్ దృఢంబుగా
నురవడిఁ బోక యుండ వెర వొప్పఁగఁ బట్టినవాఁడు సేమపుం
దెరువున నేఁగు నప్పరమధీరుఁడు సువ్వె యుదారుఁ డెయ్యెడన్. 92

ప్రతిపదార్థం: దేహము= శరీరం; అరదము= రథం; ఇంద్రియములు= భోగానుభవ స్థానాలు; అశ్వములు= గుఱ్ఱాలు; ఆత్ముఁడు= ఆత్మ అనే పురుషుడు; సూతుఁడు= సారథి; ఆ+మహాతురగచయంబు= ఆగొప్పగుఱ్ఱాల సమూహం; ధైర్యము+అను, తోరపున్+పగ్గములన్, తోరపున్+పగ్గములన్= నిలుకడ కలిగిన చిత్తం అనే గొప్పపగ్గాలతో; దృఢంబుగాన్= గట్టిగా; ఉరవడిన్= వేగంగా; పోకయుండన్= పారిపోవకుండేటట్లుగా; వెరవు+ఒప్పఁగన్= ఉపాయం భాసించేటట్లుగా; పట్టినవాఁడు= చేతిలో నిగ్రహించి పూనినవాడు; సేమము+తెరువునన్= క్షేమంగల మార్గాన; ఏఁగున్= వెళ్ళుతాడు; ఆ+పరమధీరుఁడు+చువ్వె= ఆశ్రేష్ఠుడైన, ధీరుడే సుమా; ఏ+ఎడన్= ఎక్కడైనా; ఉదారుఁడు= గొప్పవాడు.

తాత్పర్యం: ఈ దేహమే ఒక రథం. ఇంద్రియాలు ఈ రథానికి పూన్చిన గుఱ్ఱాలు - అని చెప్పవచ్చును. ఆత్మయే ఈ రథాన్ని నడిపే సారథి. చలించని చిత్తం అనే పగ్గాలను చేతబూని ఉపాయంతో ఎవడు ఈ గుఱ్ఱాలను తన అదుపులో పెట్టి నడపగలడో అట్టివాడే ధీరుడు. అట్టివాడే క్షేమమార్గాన పోయేవాడు.

విశేషం: ఈ దేహం ఒక రథం. ఇంద్రియాలు అనునవి గుఱ్ఱాలు. ఆ గుఱ్ఱాలను అదుపులో పెట్టి నడిపించవలసిన గొప్పసారథి - ఆత్మ. అనుభవం మిక్కిలి ప్రాచీనమైనది. "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథ మేవ తు" - ఇత్యాదులు, మరియు "యస్తువిజ్ఞానవాన్ భవతి । యుక్తేన మనసా సదా । తస్యేంద్రియాణి వశ్యాని । సదశ్వా ఇవ సారథేః" అనే ఉపనిషద్వాక్యాలు ఇట స్మరించదగినవి.

తే. ఇంద్రియంబులు దివిచిన యెడక పాఱు । చుండు మన సెప్డుఁ; దద్వేగ ముడుపకున్న
నెడలి చెడిపోవు బుద్ధి యుదీర్ణపవన । హతిఁ బయోనిధిలోఁ గల మవియు నట్లు. 93

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు= శరీరంలో భోగస్థానా లైన అవయవాలు; తివిచిన+ఎడకు+అ= ఆకర్షించిన (లాగిన) చోటికే; మనసు= మనస్సు; ఎప్డున్= ఎపుడును; పాఱుచుండున్= ప్రవహిస్తూ ఉంటుంది; తద్+వేగము= ఆ ఇంద్రియాల శీఘ్రగమనం; ఉడుపక+ఉన్నన్= ఆపకపోతే; ఉదీర్ణ, పవన, హతిన్= పెనుగాలి తాకిడికి; పయస్+నిధిలోన్= సముద్రంలో; కలము= పడవ; అవియున్+అట్లు= నశించిపోయేటట్లుగా; బుద్ధి= తెలివి; ఎడలి= వికలం అయి; చెడిపోవున్= పాడయిపోతుంది.

తాత్పర్యం: ఇంద్రియాలు ఆకర్షించిన చోటికే మనస్సు సదా ప్రసరిస్తూ ఉంటుంది. ఆ ప్రసార వేగాన్ని అదుపులో పెట్టకపోతే సముద్రంలో పెనుగాలి తాకిడికి పగిలి నశించే పడవవలె, బుద్ధి పాడైపోతుంది.

క. ఏనింద్రియములు మనసును । బూని తనవశంబ యైన బురుషుండు గదా
ధ్యానసమాధిసమగ్రుఁడు । వానిం గీర్తింతు రమరవరులున్ మునులున్.' 94

ప్రతిపదార్థం: ఏను+ఇంద్రియములు= అయిదు ఇంద్రియాలు= 1. త్వక్కు, 2. చక్షువు, 3. శ్రోత్రం, 4. జిహ్వ, 5. ఘ్రాణం; మనసును= చిత్తమున్నూ; పూని= దీక్షతో; తన, వశంబు+అ+ఐన= స్వాధీనమైన; పురుషుండు= మనిషి; కదా= సుమా; ధ్యాన, సమాధి, సమగ్రుఁడు= చిత్తచాంచల్యం లేక ఏకాగ్రంగా తలపోయటంలో సంపూర్ణమైన నిష్ఠ కలవాడు; అమరవరులున్= వేల్పులలో ఉత్తములు; మునులున్= ఋషులును; వానిన్= (అట్టి ధ్యానయోగిని); కీర్తింతురు= పొగడుతారు.

తాత్పర్యం: ఐదు ఇంద్రియాలను తన వశం చేసికొనినవాడే కదా ధ్యానయోగి; అట్టివాడినే గదా దేవతలు, ఋషులు పొగడుతారు.'

వ. అనిన నవ్విప్రుండు సత్త్వరజస్తమోగుణంబులతెఱం గెఱింగింపు మనిన నెఱు కి ట్లనియె. 95

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పినపిదప; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; సత్త్వ, రజః+తమః+గుణంబులతెఱంగు= సత్త్వము, రజస్సు, తమస్సు అనే గుణాల విధం; ఎఱింగింపుము= తెలుపుము; అనినన్= చెప్పగా; ఎఱుక= బోయవాడు (ధర్మవ్యాధుడు); ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పిన కౌశికమునితో ధర్మవ్యాధుడు ఇట్లా పలికాడు.

ధర్మవ్యాధుఁడు కౌశికునకు సత్త్వరజస్తమోగుణంబుల తెఱం గెఱింగించుట (సం. 3-203-3)

క. అతినిందితము తమోగుణ । మతిబోధమయంబు సత్త్వ మనయంబుఁ బ్రకా
శత నొప్పు; నుభయగుణమి । శ్రతఁ బరఁగు రజోగుణంబు సన్నుతచరితా! 96

ప్రతిపదార్థం: సత్+నుత, చరితా!= మంచివారిచేత ప్రశంసించబడిన శీలం కలవాడా! ఓ కౌశికమునీ!; తమస్+గుణము= తమోగుణము= తమస్సు అనే చెడుగుణం; అతినిందితము= మిక్కిలి గర్హించతగింది; సత్త్వము= సత్త్వం అనే మంచిగుణం; అతిబోధమయంబు= మిక్కుటమైన జ్ఞానంతో కూడినట్టిది; అనయంబున్= ఎల్లప్పుడును; ప్రకాశతన్+ఒప్పున్= వెలుగొందుతుంది; రజస్+గుణము= రజోగుణము= రజస్సు అనే గుణం; ఉభయ గుణమిశ్రతన్+పరఁగున్= రెండింటియొక్క కలయికచేత అనగా తమోగుణ సత్త్వగుణాల రెండిటియొక్క సమ్మేళనంవలన ఏర్పడుతుంది.

తాత్పర్యం: పొగడబడినశీలం కల ఓ కౌశికమునీ! తమోగుణం మిక్కిలి హేయమైనది. సత్త్వగుణం జ్ఞానంతో కూడి వెలుగొందేది. ఇక రజోగుణమా, తమోగుణ సత్త్వగుణాల రెంటి యొక్క సమ్మేళనం.

మ. అసుఖాకారత నిద్ర దైన్యము విమోహం బక్షమత్వంబుఁ దా
మసభావంబులు; రాగలోభజడతామానంబు లూహింప రా
జసవృత్తంబులు; ధైర్యశాంతికరుణాసంతోషవిద్యాదు లిం
పెసఁగన్ సాత్త్విక చేష్టితంబులు; నిజం బి ట్లాత్మఁ గ న్నిన్నియున్. 97

ప్రతిపదార్థం: అసుఖ+ఆకారత= తృప్తి లేని రూపం; నిద్ర= కూర్కుచెందటం; దైన్యం= దురవస్థ; విమోహంబు= మిక్కుటమైన భ్రాంతి; అక్షమత్వంబున్= సహనం కోల్పోవటం; తామసభావంబులు= తమోగుణానికి చెందిన లక్షణాలు; ఊహింపన్= ఆలోచించగా; రాగ, లోభ, జడతా, మానంబులు= కోరికలు, పిసినారితనం, కదలిక లేకపోవటం, అహంకారం అనేవి; రాజసవృత్తంబులు= రజోగుణానికి సంబంధించిన అంశాలు; ధైర్య, శాంతి, కరుణా, సంతోష, విద్యా+ఆదులు= నిలుకడ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కలిగిన చిత్తం, మనస్తృప్తి, దయ, ఆనందం, జ్ఞానం మొదలైనవి; ఇంపు+ఎసఁగన్= ప్రియం ఏపారేటట్లుగా; సాత్త్విక, చేష్టితంబులు= సత్త్వగుణానికి సంబంధించిన లక్షణాలు; నిజంబు= ఇది సత్యము; ఇట్లు= ఈ రీతిగా; ఆత్మన్= నీలోలోపల; ఇన్నియున్= వీటిని ఇన్నింటిని; కన్ము= కనుము; అరయుము= తెలిసికొనుము.

తాత్పర్యం: సంతృప్తిలేని రూపం, నిద్దురమత్తులో ఉండటం, హీనత్వం, మిక్కుటమైన భ్రాంతి, సహనం లేకపోవటం అనేవి తమోగుణాన్ని సూచించే లక్షణాలు. దురాశ, పిసినిగొట్టుతనం, జడత్వం, దురహంకారం, రజోగుణాన్ని సూచించే లక్షణాలు. ఆపద దాపురించినప్పటికీ చలించని చిత్తవృత్తి, మానసిక సంతృప్తి, జాలి, సంతోషం, తెలివితేటలు మొదలైనవి సత్త్వగుణాన్ని సూచించే లక్షణాలు. ఇది నిజం. ఇదంతా నీ మనస్సులో గ్రహించుము.

చ. అనఘుఁడు సాత్త్వికుం డగు మహాత్ముఁడు బోధనిరూఢి సర్వముం
గనికొని లోకవృత్తములు గావని రోసి సమస్తసంగభం
గనిరతుఁ డై తొరంగు మమకారవికార మహంక్రియాచ్యుతిం
బనుపడి సంయమప్రకట భావన నుత్తమశాంతిఁగైకొనున్. 98

ప్రతిపదార్థం: అనఘుఁడు= పాపం చేయనివాడు; సాత్త్వికుండు= సత్త్వగుణం కలవాడు; అగు= అయినట్టి; మహా+ ఆత్ముఁడు= గొప్ప ఆత్మ గలవాడు; బోధ, నిరూఢిన్= జ్ఞానం స్థిరపడటంవలన; సర్వమున్= అంతటిని; కనికొని= అరసి తెలిసికొని; లోక, వృత్తములు= ఐహికానికి చెందిన అంశాలు; కావు+అని, రోసి= సరిఅయినవి కావు అని అసహ్యాన్ని చెంది; సమస్త, సంగ, భంగ, నిరతుఁడు+ఐ= అన్ని కలయికలను విడవటంలో ఆసక్తిగలవాడై; మమకార వికారము= ఇది నాది అనే భావాన్ని; (అహంకారాన్ని); తొఱంగున్= విడిచిపెట్టుతాడు; అహంక్రియాచ్యుతిన్= అహంకారం జారిపోవటంచేత; సంయమ, ప్రకట, భావన= ఇంద్రియనిగ్రహంతో గూడిన వైరాగ్యం విరిసిన ఆలోచన; పనుపడి= కుదురుకొనేటట్లుగా చేసి; ఉత్తమ శాంతిన్= గొప్పదైన ఆనందాన్ని; కైకొనున్= స్వీకరిస్తాడు.

తాత్పర్యం: పాపరహితు డైన మహానుభావుడు జ్ఞానాన్ని ఆర్జించి, ఐహికంలోని విషయాలు అన్నీ సరిఅయినవి కావని తెలిసికొని, వైరాగ్యభావాన్ని పెంపొందించుకొని, సంగమును త్యజించి, అహంకారాన్ని నిర్మూలించుకొంటాడు. అహంకారం జారిపోవటంచేత ఇంద్రియనిగ్రహం ఏర్పడినట్టి యోగీశ్వరుడు గొప్పశాంతిని అనుభవిస్తాడు.

వ. సత్త్వగుణనిబద్ధుం డగునేని శూద్రుం డైనను జన్మాంతరంబున వైశ్యత్వంబు నొంది క్రమంబున రాజభూసురభావంబులు భజించి భవవిముక్తుం డగు' నని చెప్పిన నమ్మహీదేవుం డమ్మహానుభావు నభినందించి. 99

ప్రతిపదార్థం: సత్త్వ, గుణ, నిబద్ధుండు+అగున్+ఏని= సత్త్వగుణాలతో కూడినవాడు అయి ఉంటే; శూద్రుండు+ఐనను= శూద్రుడుగా (ఈజన్మలో) పుట్టి ఉన్నప్పటికిని; జన్మ+అంతరంబునన్= మరియొక పుట్టుకలో; వైశ్యత్వంబున్+ఒంది= వైశ్యుడుగా పుట్టుకను పొంది; క్రమంబునన్= వరుసగా; రాజ, భూసుర, భావంబులు= క్షత్రియుడుగా, బ్రాహ్మణుడుగా పుట్టటం; భజించి= పొంది; భవ, విముక్తుండు అగున్+అని= జన్మరాహిత్యం పొందుతాడని; చెప్పినన్= వచించగా; ఆ+మహీ, దేవుండు= ఆ బ్రాహ్మణుడు- కౌశికుడు; ఆ+మహా+అనుభావున్= ఆ మహాత్ముడిని - ధర్మవ్యాధుడిని; అభినందించి= సంతోషంతో ప్రస్తుతించి.

తాత్పర్యం: సత్త్వగుణాలు కలవాడు ఈ జన్మలో శూద్రుడై పుట్టి ఉన్నప్పటికిన్నీ, మరుజన్మలో వైశ్యుడై పుట్టుతాడు. అట్లే వరుసగా - తదుపరి జన్మలలో క్షత్రియుడై, బ్రాహ్మణుడై పుట్టుతాడు. అప్పుడు జన్మరాహిత్యాన్ని పొందగలడు' - అని చెప్పగా, కౌశికుడు ధర్మవ్యాధుడిని అభినందించాడు.

తే. **'దేహమున ధాతు సంశ్రయదీప్తుఁ డగుచు । వహ్ని యెట్లుండు? శారీరవాయువులకు**
నెలవు లెయ్యవి? యవి నాకు నిశ్చయముగఁ । జెప్పు' మనుటయు నిట్లని చెప్పె నతఁడు. **100**

ప్రతిపదార్థం: దేహమునన్= శరీరంలో; ధాతు, సంశ్రయ, దీప్తుఁడు+అగుచున్= ధాతువులయొక్క ఆధారంచేత ప్రజ్వలించినవాడయి; వహ్ని= అగ్నిహోత్రుడు; ఎట్లు+ఉండున్= ఏ విధంగా మనుతుంటాడు? శారీరవాయువులకున్= దేహంలో ఉండే గాలులకు; నెలవులు= ఉండేచోటులు; ఏ+అవి= ఏవి?; అవి= ఆ విషయాలను; నాకున్; నిశ్చయముగన్= సందేహాలకు తావులేకుండ, ఖండితంగా; చెప్పుము= తెలుపుము; అనుటయున్= అని పలికినపిమ్మట; ఇట్లు+అని= ఈరీతిగా; అతఁడు= (ఆ ధర్మవ్యాధుఁడు); చెప్పెన్= పలికాడు.

తాత్పర్యం: మానవశరీరంలో ధాతువుల ఆశ్రయంచేత అగ్ని ఎట్లా ప్రజ్వలిస్తుంది? శరీరంలోని వాయువులకు ఆటపట్టులు ఏవి? ఈ విషయాలను దయచేసి నాకు సందేహాలకు ఆస్కారం లేని రీతిగా-వివరించి తెలుప వేడికోలు.

విశేషం: దేహం - అనేకధాతువులతో ఏర్పడేది. ధాతువు అనగా ఆధారభూతమైన పదార్థం అని అర్థం. ధాతువులు ఏడు : 1. వస, 2. అసృక్కు, 3. మాంసం, 4. మేదస్సు, 5. అస్థి, 6. మజ్జ, 7. శుక్రం, పక్షాంతరంలో మఱి కొందరు ధాతువు లనగా: 1. రోమం, 2. త్వక్కు, 3. మాంసం, 4. అస్థి, 5. స్నాయువు, 6. మజ్జ, 7. ప్రాణం. అందుచేత సంఖ్యాశాస్త్రంలో ధాతువుకు సప్త సంఖ్యాపరిగణనం ఏర్పడింది.

సీ. **మూర్ధదేశమునకు వర్ధితం బై పర్వు । నాత్మాగ్ని; నాభి దదాశ్రయంబు;**
శిరమునఁ బావకాంతరమునఁ జరియించుఁ । బ్రాణుండు భూతాత్మభావుఁ డతఁడు;
వరుసఁ బ్రాణాపాను లిరువురు నయ్యగ్ని । వెలిగింతు రనపేతవృత్తు లగుచు;
గుదవస్తితలము లాస్పదములుగా వహ్ని । పరిగతుం డగుచు నపానుఁ డుండు;

తే. **గడఁగి విణ్మూత్రనిర్గమకారి యతఁడు; । కర్మబలయత్నకారి యై కంఠతలము**
నం దుదానుండు వర్తించు; నఖిలదేహ । సంధులందును వ్యానుండు సంచరించు. **101**

ప్రతిపదార్థం: ఆత్మ+అగ్ని= ఆత్మ అనబడే అగ్ని; మూర్ధదేశమునకున్= తల ఉన్న చోటికి; వర్ధితంబు+ఐ= ఎదిగి, వ్యాపించినట్టిదై; పర్వున్= విలసిల్లుతుంది; నాభి= బొడ్డు; తద్+ఆశ్రయంబు= ఆ(ఆత్మాగ్నికి) ఆధారం; ప్రాణుండు= ప్రాణమనే పేరు గల వాయువు; శిరమునన్= తలలో; పావకాంతరమునన్= నిప్పుమధ్య; చరియించున్= తిరుగాడుతుంది; అతఁడు= ఆ ప్రాణుడు; భూత+ఆత్మ, భావుఁడు= సకలజీవులకు ఆత్మవంటివాడు; ప్రాణ+అపానులు+ఇరువురున్= ప్రాణుడు, అపానుడు అనే వాయువులు రెండున్నూ; వరుసన్= క్రమంగా; ఆ+అగ్నిన్= ఆ అగ్నిని; అనపేతవృత్తులు+అగుచున్= ఎల్లప్పుడును తొలగని చేష్టలు కలవారౌతూ; వెలిగింతురు= జ్వలింపచేస్తారు; అపానుఁడు= అపానం అనే పేరు గల వాయువు; గుద, వస్తితలములు= మూడి, పొత్తికడుపులు అనేచోటులు; ఆస్పదములు+కాన్= నెలవులుగా; వహ్నిపరిగతుండు+అగుచున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అగ్ని చేత చుట్టుకొనబడినవాడై; ఉండున్= నివసిస్తాడు. అతఁడు= వాడు; కడఁగి= పూని; విట్+మూత్ర, నిర్గమకారి= మలమున్నూ, మూత్రమున్నూ బయటికి పోయేటట్లు చేసేవాడు; ఉదానుండు= ఉదానుడు అనే పేరు గల వాయువు; కర్మ, బల, యత్నకారి+ఐ= కర్మయొక్క శక్తిని అనుసరించి ప్రయత్నంచేసే వాడై; కంఠతలమునందున్= మెడచోటునందు; వర్తించున్= పనిచేయును; వ్యానుండు= వ్యానుడు అనే పేరుగల వాయువు; అఖిలదేహసంధులందున్= అన్ని అవయవాలు ఒకదానితో మరిఒకటి కలిసే చోటులందు; సంచరించున్= తిరుగాడుతాడు.

తాత్పర్యం: ఆత్మాగ్ని నాభినుండి శిరస్సువరకు వ్యాపిస్తూంటుంది. ప్రాణుడు అనే వాయువు, ఆ అగ్నిమధ్యగా శిరస్సులో చరిస్తూంటుంది. అతడు సర్వభూతాలకు జీవత్వాన్ని ప్రసాదించేవాడు. ప్రాణుడికి తోడుగా అపానుడు ఎల్లప్పుడు ఆ అగ్నిని జ్వలింప చేస్తుంటాడు. అపానుడు ముడ్డి, పొత్తికడుపు మధ్య అగ్నిచేత పరివేష్టితుడై ఉంటాడు. అతడే మలమూత్రాలను విసర్జించేటట్లుగా చేస్తాడు. ఉదానుడు అనేవాయువు కంఠంలో నివసిస్తాడు. కర్మతంత్రాన్ని నడుపుతాడు. వ్యానుడు అనేవాయువు శరీరంలోని వివిధాలైన అవయవాలు ఒకదానితో మరియొకటి కలిసేచోటులలో ఉంటుంది.

విశేషం: పంచప్రాణాలు : 1. ప్రాణం, 2. అపానం, 3. ఉదానం, 4. వ్యానం, 5. సమానం - అనే పేరులు గల వాయువులు. ఈ పద్యంలో నాలుగు ప్రాణవాయువులను గూర్చి చెప్పబడింది. రాబోయే పద్యంలో సమానవాయువును గూర్చి వ్రాయబడింది.

క. **విను, ప్రాణాపానులు న । య్యనలుఁడుఁ బ్రాపుగ సమానుఁ డన్నరసవిపా**
చనుఁ డగుచు నాభిదేశం । బున నుండును సకలధాతుపోషకవృత్తిన్. **102**

ప్రతిపదార్థం: విను= ఆలకింపుము; ప్రాణ+అపానులు= ప్రాణం అపానం అనేవాయువులు; ఆ+అనలుఁడున్+ప్రాపుగన్= ఆ అగ్నినాశ్రయించి సమానుడు అనే వాయువు; అన్న, రస, విపాచనుఁడు+అగుచున్= ఆహారపానీయాలను జీర్ణం చేసేవాడు ఔతూ; సకల, ధాతు, పోషక, వృత్తిన్= శరీరంలోని మూల పదార్థాల నన్నింటిని పెంపొందించే పనితో; నాభిదేశంబునన్= బొడ్డులో; ఉండును= నివసిస్తాడు.

తాత్పర్యం: సమానుడు అనేపేరు గల వాయువు నాభిప్రదేశంలో ఉండి, ఆహార పానీయాలను జీర్ణింపచేసి, శరీరంలోని ధాతువులు పెంపొందేటట్లుగా చేస్తుంది. సమానుడు ఆత్మాగ్నికి ప్రాణాపానులకు తోడై సహకరిస్తాడు.

క. **ఇది పరమయోగదర్శన । విదితం; బిప్పాటఁ బవనవిదు లైన మునుల్**
వదలక యభ్యాసవిధిన్ । ముదమున ధరియింతు రాత్మమూర్ధతలమునన్. **103**

ప్రతిపదార్థం: ఇది= (ఈ పంచప్రాణాల విషయం); పరమ, యోగ, దర్శనవిదితంబు= శ్రేష్ఠమైన యోగశాస్త్రం చేత తెలియబడునది; ఈ+పాటన్= ఈరీతిగా; పవన, విదులు+ఐన, మునుల్= వాయువులను గూర్చి తెలిసికొనిన ఋషులు; వదలక= విడువక; అభ్యాసవిధిన్= నిరంతరం ఆచరించటంవలన; ముదమునన్= సంతసంతో; ఆత్మన్= ఆత్మను (ఆత్మాగ్నిని); మూర్ధతలమునన్= తలయందు; ధరియింతురు= వహిస్తారు.

తాత్పర్యం: పంచప్రాణాలను గూర్చినట్టి, ఆత్మాగ్నిని గూర్చినట్టి, ఈ పరిజ్ఞానం గొప్పయోగదర్శనం వలన మాత్రమే తెలియదగింది. అభ్యాసంవలన నిష్ణాతు లైన ఋషులు ఆత్మను మూర్ధప్రదేశంలో ధరిస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'యోగదర్శనము' - అనే ప్రయోగం మిక్కిలి అర్థవంతమైనది. దర్శనం అనగా క్రోడీకరించబడిన జ్ఞానం. 'షడ్దర్శనములు' - 'సర్వదర్శనసార సంగ్రహము' - మున్నగు శీర్షికలు అనుశీలించ దగినవి.

వ. ప్రాణాపానసమాహితుండై సకలదేహంబులందును జరియించుచున్న పావకుండు జీవాత్ముండుగా నెఱుంగు; మతండు జలంబుల నున్న కమలపత్త్రంబునుంబోలె దేహంబునం దుండియు నిర్లేపస్వరూప దీపితుం డయి వెలుంగుచుండు; నిట్టి జీవాత్ముండ కదా పరమాత్ముండు. 104

ప్రతిపదార్థం: ప్రాణ+అపాన, సమాహితుండు+ఐ= ప్రాణుడు అపానుడు అనేవాయువులతో చుట్టుకొనబడినవాడై; సకల, దేహంబులందును= అన్ని శరీరాలలో; చరియించుచున్న= తిరుగాడుతున్న; పావకుండు= అగ్ని; జీవ+ఆత్ముండుగాన్= జీవాత్మగా; ఎఱుంగుము= తెలిసికొనుము; అతండు= (ఆజీవాత్ముడు); జలంబులన్+ఉన్న= నీళ్లలోఉన్న; కమల, పత్త్రంబునున్+పోలెన్= తామరాకు వలె; దేహంబునందున్+ఉండియున్= శరీరంలో ఉన్నప్పటికిని; నిర్లేప, స్వరూప, దీపితుండు+అయి= పూయబడని ఆకృతిచేత వెలుగొందుతూ (అనగా నీటిచేత తడువని తామరాకువలె); వెలుంగుచున్+ఉండున్= ప్రకాశిస్తుంటాడు; ఇట్టి= ఈవిధమైన; జీవ+ఆత్ముండు+అ, కదా= జీవాత్ముడు మాత్రమే కదా; పరమ+ఆత్ముఁడు= పరబ్రహ్మం (భగవంతుడు).

తాత్పర్యం: ప్రాణుడు అపానుడు అనబడే వాయువులతో కలసిమెలసి అన్ని శరీరాలలో నడయాడే అగ్నియే జీవాత్మ అని తెలిసికొనుము. నీటిలో తడిసిపోకుండగా ఉండే తామరాకువలె ఆ జీవాత్మ దేహంలో నిర్లిప్తుడై ఉంటాడు. ఆ జీవాత్మయే పరమాత్మ.

క. చేతన రహితక్షేత్రముఁ । జేతనముం బొరయఁ జేయు జీవాత్మ దశో
పేతుఁడు పరమాత్ముఁడు వి । ఖ్యాతుఁడు త్రైలోక్యసంప్రకల్పనుఁ డనఘా! 105

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడ వైన ఓ కౌశికమునీ!; చేతన, రహితక్షేత్రమున్= కదలిక లేనట్టి శరీరం; చేతనమున్+పొరయన్+చేయు= కదలేటట్లుగా చేసేవాడు; జీవ+ఆత్మ, దశ+ఉపేతుఁడు= జీవాత్మ అనెడి అవస్థతో కూడినవాడు; పరమ+ఆత్ముఁడు= పరబ్రహ్మం - భగవంతుడు; విఖ్యాతుఁడు= కీర్తికెక్కినవాడు; త్రైలోక్య, సంప్రకల్పనుఁడు= మూడులోకాలను సృష్టించగల శక్తి కలవాడు.

తాత్పర్యం: అచేతనమైన దేహాన్ని చేతనంగా చేసేవాడు. 'జీవాత్మ'గా భాసించే ఆ పరమాత్మయే. అతడు సుప్రసిద్ధుడు. మూడు లోకాలను సృష్టించగల శక్తి కలవాడు.

క. భూతములయందు వెలిఁగెడు । భూతాత్ముని నెఱుఁగుదురు ప్రబుద్ధులు నిత్య
జ్యోతిర్మయు నవ్యయు న । ద్వైతం బగు బుద్ధి సూక్ష్మధర్మువలనన్. 106

ప్రతిపదార్థం: భూతముల+అందున్= పదార్థాల అన్నిటిలో; వెలిఁగెడు= ప్రకాశించే; భూత+ఆత్మునిన్= భూతాలకు ఆత్మఅయినవాడిని; జ్యోతిర్మయున్= ప్రకాశంతో నిండినవాడిని; అవ్యయున్= శాశ్వతుడిని; అద్వైతంబు+అగు= ఒకటియే అయిన; బుద్ధిన్= తెలివితో; సూక్ష్మ, ధర్మమువలనన్= వింగడించిన ధర్మాన్ని తెలియటంవలన; ప్రబుద్ధులు= గొప్పబుద్ధిగలవారు= జ్ఞానులు; ఎఱుఁగుదురు= తెలిసికొంటారు.

తాత్పర్యం: స్థూలదృష్టికి భిన్ననామరూపభేదాలచేత సాక్షాత్కరించే జగత్తులో అంతర్లీనంగా ఉన్న ఏకత్వాన్ని సూక్ష్మదృష్టితో గ్రహించగల జ్ఞానులు అద్వైతయోగం వలన జ్యోతిర్మయుడైన, శాశ్వతుడైన భూతాత్మునిగా గుర్తిస్తారు'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఎఱ్ఱాప్రెగడకు శంకరాచార్యులవారు ప్రతిపాదించిన 'అద్వైత' సిద్ధాంతంపై గల మక్కువ ఇక్కడ వ్యక్తమౌతున్నది.

వ. అని మఱియుఁ గౌశికునకు ధర్మవ్యాధుండు బ్రహ్మవిద్యా ప్రభావంబు తెఱంగు సంప్రయోగరహస్యంబు తెలియ ని ట్లనియె. 107

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; ధర్మవ్యాధుండు; మఱియున్= ఇంకను; కౌశికునకున్= (జిజ్ఞాసువుగా తనవద్దకు వచ్చిన ఆ విప్రుడికి); బ్రహ్మ, విద్యా, ప్రభావంబు, తెఱంగు= ఆధ్యాత్మికమైన జ్ఞానానికి సంబంధించిన మహిమయొక్క విధానం; సంప్రయోగ రహస్యంబు= కార్యాచరణలో స్వయంవ్యక్తమయ్యే దాపరికం; తెలియన్= తెల్లమయ్యేటట్లుగా; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి అంతటితో ఆగకుండా, ధర్మవ్యాధుడు వేదాంతజ్ఞానంయొక్క మహిమ ఆచరణలో ఎట్లా వెలువడుతుందో కౌశికుడికి ఇట్లా తెలియచెప్పాడు.

విశేషం: ఇట - 'సంప్రయోగరహస్యంబు తెలియన్' - అనే ప్రయోగం అనుశీలించదగింది. సిద్ధాంతం వేరు. దానిని అనుభూతిలోకి తెచ్చుకొని ఆచరణలోకి అనువదించటం వేరు. సిద్ధాంతం అందరకూ తెలిసినదే కావచ్చును. దాని ఆచరణలోకి దానిని అనువదించటానికి- 'సంప్రయోగ రహస్యములు' - తెలియవలెను. అవి నిగూఢ విషయాలు. ఆ రహస్యాలను వెల్లడించేది తరువాతి పద్యం. అనగా ధర్మవ్యాధుడు కౌశికుడికి కేవలసిద్ధాంతజ్ఞానాన్ని మాత్రమే తెలిపి ఊరకొనక, సంప్రయోగ రహస్యాలను కూడ వివరించాడు.

సీ. 'తెలివి నొందిన బుద్ధిగల మహాత్ముండు శు । భాశుభ కర్మములందుఁ జొరఁడు;
క్రమమున సౌఖ్యదుఃఖము లాదిగా నశే । షద్వంద్వములయందు సమత నుండు;
విను, మట్టిపుణ్యున కొనరింపవలయు కా । ర్యం బెఱింగించెద ననుదినంబు
నియతాశియును జితేంద్రియుఁడు నై పూర్వరా । త్రమ్మున నపరరాత్రమ్మునందు

తే. యోగధారణనిరతుఁడై యుండవలయు; నపుడు బోధదీపంబున నాత్ము నాత్మ
యందుఁ గనుచు నివాతదీపానుకారి । యై వెలుంగుచు నమృతమయత్వ మొందు. 108

ప్రతిపదార్థం: తెలివిన్+ఒందిన= జ్ఞానాన్ని ఆర్జించిన; బుద్ధి, కల, మహాత్ముండు= మేధావి అయిన గొప్పవాడు; శుభ+అశుభ, కర్మములందున్= మేలుకలుగునట్టి లేక, కీడు కలుగునట్టి పనులలో; చొరఁడు= ప్రవేశించడు; క్రమమునన్= వరుసగా; సౌఖ్య, దుఃఖములు= సుఖం, బాధ; ఆదిగాన్= మొదలైన; అశేష, ద్వంద్వముల+అందున్= అన్ని జంటలలో; సమతన్+ఉండున్= సమభావంతో ఉంటాడు; వినుము; అట్టి; పుణ్యునకున్= పుణ్యాన్ని ఆర్జించేవాడికి; ఒనరింపవలయు, కార్యంబు= చేయవలసిన పని, కర్తవ్యం; ఎఱింగించెదన్= తెలుపుతాను; వినుము; అనుదినంబున్= ప్రతిదినమున్నూ; నియత+అశియును= మితముగా భుజించువాడున్నూ; జిత+ఇంద్రియుఁడును+ఐ= ఇంద్రియాలను నిగ్రహించిన వాడును అయి; పూర్వరాత్రమ్మునన్+అపర రాత్రమ్మునందున్= రాత్రికి ముందు వేళలలో, రాత్రి అయిన తరువాతి వేళలో అనగా అన్నివేళలలో; యోగధారణ నిరతుఁడు+ఐ= యోగసాధనలో పూనిక కలవాడై; ఉండవలయున్; అపుడు= ఆసమయంలో - అనగా యోగసాధన వేళలో; బోధ దీపంబునన్= జ్ఞాన మనెడి దీపంవలన; ఆత్మున్= పరమాత్మను; ఆత్మ+అందున్= తన ఆత్మలో; కనుచున్= చూస్తూ; నివాత, దీప+అనుకారి+ఐ= గాలి లేనిచోట వెలుగొందే దీపాన్ని అనుకరించేవాడై; వెలుంగుచున్= ప్రకాశిస్తూ; అమృతమయత్వము= చావులేని స్థితప్రజ్ఞత్వస్థితిని, అమరత్వాన్ని; ఒందున్= పొందుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'జ్ఞానాన్ని ఆర్జించిన మహానుభావుడు మంచిపనులలో గాని చెడు పనులలోగాని నిర్లిప్తుడుగా ఉంటాడు. అట్టివాడు - సుఖ దుఃఖాలు మొదలైన ద్వంద్వాలకు అతీతుడు. అన్నిటియెడల ఆతడు సమభావాన్ని పెంపొందించుకొంటాడు. అట్టి పుణ్యాత్ముడు చేయవలసిన కర్తవ్యాలను వివరిస్తాను వినుము. ప్రతిదినం, ఎల్లవేళల అతడు యోగసాధన చేస్తూ మితాహారియై ఇంద్రియాలను నిగ్రహించాలి. ఇంద్రియాలను నిగ్రహించిన యోగి ఆత్మలో పరమాత్మను దర్శించి, గాలి లేనిచోట వెలుగొందే దీపంవలె నిశ్చలుడై ప్రకాశిస్తాడు. అమృతమయుడు ఔతాడు.

విశేషం: (i) "తమసో మా జ్యోతిర్గమయ, అసతో మా సద్గమయ,
మృత్యోర్మా అమృతం గమయ" - అనే వేదమంత్రాన్ని ఇక్కడ అనుసంధించుకోవాలి.

(ii) ద్వంద్వాతీతుడు అయిన స్థితప్రజ్ఞుడిని గూర్చి విపులంగా భగవద్గీత రెండవ అధ్యాయంలో వివరించబడింది.

క. **కామంబును గ్రోధంబును। నేమఱక జయింపవలయు నెల్ల విధములన్**
ధీమహిత! యిదియ సతత। క్షేమంకర మైన పథము గృతబుద్ధులకున్. **109**

ప్రతిపదార్థం: ధీమహిత!= బుద్ధిచేత గొప్పవాడయినవాడా, మేధావి వయిన ఓ కౌశికా!; కామంబును= కోరికలను పెంచుకొనటమున్నూ; క్రోధంబును= కోపమును; ఏమఱక= మరపులేకుండ; జయింపవలయున్= గెలువవలెను; ఎల్ల, విధములన్= అన్నిరీతులలోను; ఇది+అ= ఇదిమాత్రమే అనగా కామక్రోధాలను అణచివేయటమే; కృతబుద్ధులకున్= పరిపక్వం అయిన మనస్సు కలవారలకు; సతత, క్షేమంకరము+ఐన, పథము= ఎల్లప్పుడును మేలును ఒనగూర్చెడి మార్గం.

తాత్పర్యం: మేధావి అయిన ఓ కౌశికమహర్షీ! ఎల్లప్పుడును ఏమరక కామక్రోధాలను అణచిపెట్టాలి. మనస్సు పరిపక్వమైనవారలకు ఇది ఒక్కటి మాత్రమే శుభాన్ని చేకూర్చే ఉత్తమమార్గం.

క. **నిత్యముఁ గర్మియుఁ గర్మఫ। లత్యాగియు నగుట లెస్స లౌల్యవియోగం**
బత్యుత్తమ యోగము ద। త్ప్రత్యయలక్ష్యుండు సూవె బ్రాహ్మణుఁడు మహిన్. **110**

ప్రతిపదార్థం: నిత్యమున్= అనుదినం, ఎల్లప్పుడును; కర్మియున్= పనులు చేసేవాడును; కర్మ, ఫల, త్యాగియున్= చేసిన పనుల వలన సంక్రమించే ఫలితాన్ని విడిచేవాడును; అగుట; లెస్స= మంచిది; లౌల్య, వియోగంబు= కోరికలనుండి విడివడటం; అతి+ఉత్తమ, యోగము= మిక్కిలి మంచిదైన యోగం; బ్రాహ్మణుఁడు= విప్రుడు (జ్ఞానాన్ని ఆర్జించిన వాడు); మహిన్= భూమిపై; (భూలోకంలో); తత్+ప్రత్యయ, లక్ష్యుండు+చూవె= ఆ ఆశయానికి తగిన ఉదాహరణం సుమా!

తాత్పర్యం: మనుజుడు ఎల్లప్పుడు కర్మను ఆచరిస్తూనే ఉండవలెను; కాని, ఆ కర్మలవలన కలిగే ఫలాన్ని మాత్రం విడనాడాలి. తాను చేసే పనులలోనే మునిగి తేలుతుండటం మంచిది కాదు. కర్మఫలితాలను విడనాడటమే మిక్కిలి మంచిదైన యోగం. నిజానికి జ్ఞానాన్ని ఆర్జించిన బ్రాహ్మణుడు ఈ ఆశయానికి నిదర్శనప్రాయుడుగా అనుష్ఠాన వేదాంతిగా బ్రదుకదగును.

చ. **అరయుఁగ జీవితంబు గడునస్థిర; మింత యెఱింగి యాత్మ నె**
వ్వరిదెసఁ గీడురోయక ధ్రువం బగు మైత్రి భజించి సత్కృపా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిరతుఁడు నిష్పరిగ్రహుఁడు నిత్యతపస్వియు నిత్యతృప్తుఁడుం
బరమశమాన్వితుండు నగు బ్రాహ్మణుఁ డొందు సనాతన స్థితిన్. 111

ప్రతిపదార్థం: అరయఁగన్= యోచించగా; జీవితంబు= బ్రదుకు; కడున్= మిక్కిలి; అస్థిరము= నిలుకడలేనట్టిది; ఇంత+ఎఱింగి= ఈ విషయాన్ని అంతటిని సంపూర్ణంగా గ్రహించి; ఆత్మన్= మనస్సులో; ఎవ్వరిదెసన్= ఎవరియెడలను; కీడు= చెడుగును; రోయక= తలపోయక; ధ్రువంబు+అగు= నిజమైన; మైత్రి= స్నేహం; భజించి= నెరపి; సత్+కృపా+నిరతుఁడు= మంచిదయ కలిగినవాడు; నిష్పరిగ్రహుఁడు= ఎవరి దగ్గరనుండియు ఏమియు అడిగి పుచ్చుకొననివాడు; నిత్య, తపస్వియున్= ఎల్లప్పుడు తపస్సు చేసికొనే వాడును; నిత్య, తృప్తుఁడున్= ఎల్లప్పుడును తనివిచెందిఉండే వాడును; పరమ, శమ+అన్వితుండున్= మిక్కిలి గొప్ప దైన శాంతం కలవాడును; అగు= అయినట్టి; బ్రాహ్మణుఁడు= జ్ఞానాన్ని ఆర్జించిన విప్రుఁడు; సనాతన, స్థితిన్= శాశ్వతంగా ఆనందమయమైన స్థితిని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: ఆలోచన చేస్తే మానవుల బ్రతుకులు బొత్తిగా నిలుకడ లేనట్టివి. ఈ విషయాన్ని అనుభవపూర్వకంగా తనలో తెలిసికొనినవాడు ఎవరికిని ఎట్టి అపకారాన్ని తలపోయడు. అందరియెడ ప్రేమపూర్వక మైన స్నేహభావాన్నే పెంపొందించుకొంటాడు. అట్టి జ్ఞాని ఎల్లప్పుడు జాలితో నిండిన గుండె కలవాడై, ఎల్లప్పుడు తపస్సు చేసికొంటూ ఎవరినీ యాచించడు. ఎవరిదగ్గరనుండి ఏమీ తీసుకొనడు. అతడు నిత్యసంతృప్తుడు. ఆ విధంగా గొప్పఇంద్రియనిగ్రహం సాధించిన బ్రాహ్మణుడు, శాశ్వతమైన ఆనందస్థితిని పొందగలడు.

వ. నీవడిగిన యఖిలధర్మంబులు సంక్షేపరూపంబున నెఱింగించితి; నింక నెయ్యది వినవల' తనినం గౌశికుండు' 'మహాత్మా! వినవలయునవి యెల్లను విశదంబుగా వింటిం; బ్రబుద్ధుండ నైతి; నీవు సర్వజ్ఞుండ వగుట దెల్లం బయ్యె' ననిన ధర్మవ్యాధుం డతని కి ట్లనియె. 112

ప్రతిపదార్థం: నీవు+అడిగిన= నీవు ప్రశ్నించిన; అఖిల, ధర్మంబులు= అన్ని ధర్మాలు; సంక్షేపరూపంబునన్= కుదించి; ఎఱింగించితిన్= తెలియజేశాను; ఇంకన్= ఇకమీదట; ఏ+అది= ఏది; వినవలతు(వు)= ఆలకించకోరుతున్నావు; అనినన్; కౌశికుండు; మహాత్మా!= గొప్పఆత్మ కల ఓ ధర్మవ్యాధుడా!; వినవలయునవి= వినవలసినవి; ఎల్లను= అన్నియున్నూ; విశదంబుగాన్= తేటతెల్లంగా; వింటిన్= ఆలకించాను; ప్రబుద్ధుండను+ఐతిన్= మిక్కుటంగా విజ్ఞానంచేత మేలుకొలుపబడిన వాడను అయినాను; నీవు= నీవు; సర్వజ్ఞుండవు+అగుట= అన్ని విషయాలు క్షుణ్ణంగా తెలిసినవాడవు కావటం; తెల్లంబు+అయ్యెన్= స్పష్టంగా తెలిసింది; అనినన్= అనిచెప్పగా; ధర్మవ్యాధుండు; అతనికిన్= ఆకౌశికుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: నీవు ప్రశ్నించిన విషయాలు అన్నిటిని గూర్చి నేను నాకు తెలిసినంతమేర కుదించి నీకు తెలియజేసి ఉన్నాను. ఇక, నీవు మఱియేవిషయాలనుగూర్చి తెలియగోరుతున్నావు?'- అని ధర్మవ్యాధుడు కౌశికుడిని అడిగాడు. అంతట కౌశికుడు, 'మహానుభావా! వినవలసిన విషయాలను అన్నింటిని నీవు విశదంగా వివరించి చెప్పగా విన్నాను. నీవు చెప్పిన విషయాలవలన నేను ఆధ్యాత్మికంగా మేలుకొనగలిగాను. నీవు అన్ని విషయాలు తెలిసిన సర్వజ్ఞుడవు అని నేను గుర్తించగలిగాను' అని ధర్మవ్యాధుడికి ధన్యవాదాలు సమర్పించాడు. అప్పుడు కౌశికుడితో ధర్మవ్యాధుడు ఈవిధంగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మవ్యాధుఁడు కౌశికునిఁ దన జననీజనకులయొద్దకుఁ దోడ్కొని పోవుట (సం. 3-204-3)

క. 'ఏ నిమ్మెయి నుత్తమ వి । జ్ఞానోన్నతి వడయుటకు నిజం బగు మూలం
బైనది గల దొక ధర్మము । భూనుత! యది నీకు దృష్టముగ నెఱిఁగింతున్. 113

ప్రతిపదార్థం: భూనుత!= భూమియందలి ప్రజలచేత పొగడబడిన ఓ కౌశికమునీ!; ఏను= నేను; ఈ+మెయిన్= ఈ రీతిగా; ఉత్తమ, విజ్ఞాన+ఉన్నతి= మంచి దైన గొప్ప జ్ఞానంలోని ఆధిక్యం; పడయుటకున్= పొందటానికి; నిజంబు+అగు= సత్యమైన; మూలంబు+ఐనది= ఆధారం అయినది; ఒక ధర్మము= ఒక ధర్మం (మంచిపనులు చేయటానికి మూలమైన ఆశయానికి ధర్మం అని వ్యపదేశం); కలదు= ఉంది; అది= ఆధర్మం; నీకు; దృష్టముగన్= కంటికి కనిపించేటట్లుగా, ప్రత్యక్షంగా; ఎఱిఁగింతున్= తెలుపగలను. (ఈపద్యానికి ఆయువుపట్టు అని చెప్పదగిన శబ్దం - 'దృష్టముగ'.)

తాత్పర్యం: ఓ కౌశిక మహర్షీ!, నీవు నన్ను సర్వజ్ఞుడ వంటూ ప్రస్తుతించావు. ఈ రీతిగా, నాకు ఇంతటి విజ్ఞానం సంక్రమించడానికి మూల మైన ధర్మం ఒకటి ఉన్నది. ఆ ధర్మాన్ని నీకు కంటికి కనుపించేటట్లుగా ఎరిగించగలను.

విశేషం: (i) ధర్మం అనేది ఒక ఆశయం. విశ్వశ్రేయానికి ఆధారభూతమైన ఆదర్శం - 'ధర్మము'. ఆ ధర్మం కంటికి కనబడేది కాదు గదా! అయినను - ధర్మవ్యాధుఁడు తనకు ఆధారమైన ఆ ధర్మాన్ని ప్రత్యక్షంగా కౌశికుడికి చూపించగలనని చెప్పుతున్నాడు! జననీ జనకులే తనకు ప్రత్యక్ష దైవాలు అనిన్నీ, మాతాపితలసేవ తన ఆదర్శం అనిన్నీ ధర్మవ్యాధుడు చెప్పి - కౌశికుడికి తన తలిదండ్రులను చూపించాడు.

(ii) ధర్మం అనిర్వచనీయం. సుప్రసిద్ధమైనది - పెద్దల నిర్వచనం ఈ క్రింది శ్లోకంలో కానవచ్చును.

శ్లో॥ ధృతి క్షమా దమోఽస్తేయం । శౌచ మింద్రియనిగ్రహః
ధీ ర్విద్యా సత్య మక్రోధో । దశకం ధర్మలక్షణమ్. ॥ - మనుస్మృతి 6-92.

వ. అభ్యంతరగృహంబునకురఁ' మ్మని యతనిం దోడ్కొని చని మనోహరంబై చతుశ్శాలంబై వివిధసౌరభసంవాసితం బైన హర్మ్యంబునందు మహితాసనాసీను లైన వారిం దన జననీ జనకుల నభిమతాహారపరితోషితులఁ బరమాంబరాభరణ గంధమాల్యాలంకృతమూర్తుల నతనికిం జూపి, తానును దత్పాదప్రణామంబు సేసి, వారలఁ గుశలం బడిగిన, నయ్యిరువురుం బుత్త్రున కి ట్లనిరి. 114

ప్రతిపదార్థం: అభ్యంతర, గృహంబునకున్= లోపలఉన్న గదిలోకి; రమ్ము+అని= దయచేయుము అని ఆహ్వానించి; తోడ్కొని= వెంటపెట్టుకొని; చని= వెళ్లి; మనస్+హరంబై= మనస్సును ఆకర్షించేదై - అందమైనది అయి; చతుః+శాలంబు+ఐ= నాలుగు వైపులను వాకిళ్లు కలిగినదై; వివిధ, సౌరభ, సంవాసితంబు+ఐన= పెక్కు పరిమళాలచేత గుబాళించేదైన; హర్మ్యంబునందున్= మేడపై; మహిత+ఆసన+ఆసీనులు+ఐన+వారిన్= గొప్ప గద్దెలపై కూర్చొనిఉన్నవారలను; తన, జననీ, జనకులను= తన తల్లిని తండ్రిని; అభిమత+ఆహార, పరితోషితులన్= వారికి ఇష్టమైన ఆహారంతినటంచేత సంతృప్తిచెంది ఉన్నట్టి వారలను; పరమ+అంబర+ఆభరణ, గంధ, మాల్య+అలంకృతమూర్తులన్= గొప్ప వైన వస్త్రాలు, సొమ్ములు, పరిమళద్రవ్యాలు, పువ్వులతో అలంకరించబడిన దేహాలు కలవారలను; అతనికిన్+చూపి= (ఆ కౌశికుడికి చూపించి); తానును= (ధర్మవ్యాధుడును); తత్+పాద, ప్రణామంబు+చేసి= ఆ తలిదండ్రుల కాళ్లకు మ్రొక్కి; వారలన్= వారిని; కుశలంబు= క్షేమంగా ఉన్నారా అని; అడిగినన్= ప్రశ్నించగా; ఆ+ఇరువురున్= ఆతలిదండ్రులు ఇద్దరున్నూ; పుత్త్రునకున్= కొడుకుతో (ధర్మవ్యాధుడితో); ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అంతట ధర్మవ్యాధుడు కౌశికమహర్షిని సగౌరవంగా ఆహ్వానించి, తన ఇంటిలో ఉన్న ఒక గదిలోకి తీసికొనివెళ్ళాడు; అది మిక్కిలి అందమైనది. ఆ అభ్యంతర గృహానికి నలువైపుల సావిడులు ఉన్నాయి. మంచి గాలి వెలుతురు అక్కడకు చేరుతున్నాయి. అది ఒక పెద్దమేడ. ఆ మేడపై పెక్కు పరిమళాలు గుబాళిస్తాయి. అందు, గొప్ప ఆసనాలమీద ధర్మవ్యాధుడి తలిదండ్రులు కూర్చొని ఉన్నారు. కోరిన ఆహారాన్ని వారు గైకొని, సంతృప్తిగా సేదతీరుతున్నారు. వారిదేహాలపై క్రొంగ్రొత్తపువ్వులు, ధగధగలాడే నగలు ఒప్పారుతున్నాయి. ధర్మవ్యాధుడు తన తలిదండ్రులను కౌశికుడికి పరిచయం చేసి, తాను వారలిరువురి పాదాలకు మ్రొక్కి, వారి యోగక్షేమాలను గూర్చి అడిగి తెలిసికొన్నాడు. అప్పుడు ధర్మవ్యాధుడి తలిదండ్రులు తమ తనయుడితో ఇట్లా పలికారు.

సీ. **'అన్న! కుమార! నీయట్టి సత్పుత్త్రుండు । గలుగ మా కేమిటఁ గడమ సెపుమ!**
నీ చేయు ధర్మంబ నీకుఁ దోడయ్యెడుఁ । బరమాయు రర్థసంపదలుఁ గనుము;
నీ చరిత్రంబున నిఖిలవంశముఁ బవి । త్రిత మయ్యె మానుషదేహ మేల
ధరియించితో కాని తత్త్వమారయఁ బర । దేవత వీవు; సందియము వలదు;

తే. **వాఙ్మనఃకర్మములఁ బితృవత్సలత్వ । మొక్కరూపుగఁ జలుపుచు నున్నయట్టి**
సద్గుణాకరు నిన్నెన్ని జామదగ్న్యు । నొకని నెన్నంగఁ దగుఁ గాక యొరులు గలరె!' **115**

ప్రతిపదార్థం: అన్న!= ప్రియమైనవాడా!; కుమార!= కొడుకా; నీ+అట్టి= నీవంటి; సత్+పుత్త్రుండు= మంచి కొడుకు; కలుగన్= ఉండగా; మాకున్+ఏమిటన్= మాకు ఎందులో; కడమ+చెపుమ= కొదువ కలదో చెప్పుము అనగా మాకు ఎట్టి లోటును లేదు అన్నమాట; నీచేయుధర్మంబు+అ= నీవు ఆచరించే ధర్మమే; నీకున్; తోడు+అయ్యెడున్= సాయం ఔతుంది; పరమ+ఆయుః +అర్థ, సంపదలున్+కనుము= గొప్పదైన ఆయుర్దాయం (చిరకాలం బ్రతకటం), ధనం, ఐశ్వర్యాలు పొందుము; నీచరిత్రంబునన్= నీ ప్రవర్తన వలన; నిఖిల, వంశమున్= మన వంశం అంతయు; పవిత్రతము+అయ్యెన్= పావనం అయింది; (నీవు) మానుష, దేహము= మనుజుడిగా పుట్టి మనుజుడి శరీరాన్ని; ఏల= ఎందుకు; ధరియించితి+ఓ, కాని= వహించావో కాని; తత్త్వము= నిజం; ఆరయన్= పరిశీలించగా; పరదేవతవు+ఈవు= నీవు దేవతలలో కెల్ల గొప్ప దేవతవు; సందియము, వలదు= ఎట్టి అనుమానానికి ఆస్కారం లేదు; వాక్+మనస్+కర్మములన్= త్రికరణశుద్ధిగా - వాక్కుతోడ, మనస్సుతోడ, ఆచరణయందును; పితృ, వత్సలత్వము= తలిదండ్రులపై ప్రేముడి; ఒక్కరూపుగన్= ఎడతెగకుండగ ఒకేమాదిరిగా; చలుపుచున్+ఉన్న+అట్టి= కొనసాగిస్తూన్న; సత్+గుణ+ఆకరున్= మంచి లక్షణాలకు నెలవైన వాడిని; నిన్నున్+ఎన్ని= నిన్ను పరిగణనం చేసి; జామదగ్న్యున్= జమదగ్ని కొడుకు అయిన పరశురాముడిని; ఒకనిన్= మరియొకడిని; ఎన్నంగన్+తగున్+కాక= లెక్కించటం; తగునే కాని; ఒరులు= ఇతరులు; కలరె= ఉన్నారా? (లేరు అని భావం).

తాత్పర్యం: 'ప్రియమైన కుమారా! ధర్మవ్యాధా! నీ వంటి మంచికొడుకు మాకు ఉండగా, ఇక మా కేమి లోటు? నీవు ధర్మమూర్తివి. నీవు రక్షిస్తున్న ధర్మమే నిన్ను రక్షించగలదు. నీవు చిరకాలం జీవించి ధనధాన్యసంపదలతో తులతూగుదువు గాక, నీ ప్రవర్తన వలన మన వంశం పావనమైనది. నీవు కారణజన్ముడవు. నీవు దేవతలలో దేవతవు గాని మనుష్యమాత్రుడవు గావు. అసలు ఈ భూలోకంలో నీవు ఎందుకు ఈ మానవదేహాన్ని ధరించి అవతరించావో మాకు తెలియదు. నీవు త్రికరణశుద్ధితో తలిదండ్రులను ఆరాధిస్తున్నావు. ఇందుకు ఎంతమాత్రం సందియం లేదు. నీదీక్ష నిరుపమానం. తలిదండ్రులను ఆరాధించటంలో నిన్ను ముందు చెప్పి, తదుపరి పరశురాముడిని చెప్పాలి. మరి ఎవ్వరును నీకు సాటి రారు'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పరశురాముడి కథ సుప్రసిద్ధం. ఆతడు పితృవాక్యపరిపాలనకై తల్లిని వధించి తదుపరి సంప్రీతుడైన తండ్రిచేత తల్లిని తిరిగి బ్రతికేటట్లు వరం సాధించాడు.

వ. అని పలికి; రప్పుడు ధర్మవ్యాధుండు వారికిం గౌశికుం జూపి, 'యిమ్మహాత్ముండు మనలఁ జూచువేడ్కనిటవచ్చె' నని చెప్పిన నావృద్ధు లతనికి నర్ఘసత్కారంబులు గావించినం, గైకొని, యతండు వారలఁగుశలం బడిగె; నంత నవ్విప్రునకు లుబ్ధకుం డి ట్లనియె. 116

ప్రతిపదార్థం: అని పలికిరి= అని అన్నారు; అప్పుడు= ఆసమయంలో; ధర్మవ్యాధుండు; వారికిన్= (తన తలిదండ్రులకు); కౌశికున్+చూపి= కౌశికుడిని చూపించి; ఈ మహా+ఆత్ముండు= ఈ గొప్ప ఆత్మ కలవాడైన బ్రాహ్మణుడు; మనలన్; చూచువేడ్కన్= దర్శించ వలె ననే కుతూహలంతో; ఇట+వచ్చెన్= ఇచటికి వచ్చాడు; అని చెప్పినన్; ఆవృద్ధులు= ఆముదుసలులు; అతనికిన్= ఆ కౌశికుడికి; అర్ఘసత్కారంబులు= తగిన గౌరవమర్యాదలు; కావించినన్= చేయగా; కైకొని= స్వీకరించి; అతండును= అతడును(కౌశికుడును); వారలన్= వారలను అనగా ఆ వృద్ధులను; కుశలంబు+అడిగెన్= యోగక్షేమాలనుగూర్చి ప్రశ్నించాడు; అంతన్= తదుపరి; లుబ్ధకుండు= వ్యాధుడు; ఆ+విప్రునకున్= ఆ బ్రాహ్మణుడితో (కౌశికునకు); ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పిన పిమ్మట ధర్మవ్యాధుడు తన తలిదండ్రులకు కౌశికుడిని చూపించి, 'ఈ మహానుభావుడు మనలను చూడవలె నని పూనికతో ఇక్కడికి వచ్చాడు' అని అన్నాడు. ఆ వృద్ధులు కౌశికుడికి స్వాగతమర్యాదలు చేశారు. కౌశికుడు వారి యోగక్షేమాలనుగూర్చి ప్రశ్నించాడు. అంతట ధర్మవ్యాధుడు కౌశికుడికి ఇట్లా చెప్పాడు.

సీ. 'జననుత! వీరు నా జననియు జనకుండుఁ। జూవె! వీరలకు శుశ్రూష సేసి,
యిట్టి పరిజ్ఞాన మేనుఁ బ్రాపించితి। నమరులఁ బూజింతు రర్థి నెల్ల
వారును; నొండు దైవంబుల నెఱుఁగ; నీ వృద్ధుల నాపాలి వేల్పు లనఘ!
కమనీయ ఫలపుష్పగంధభూషణవస్త్ర। ములు మనోహరభక్ష్యభోజ్యములును

తే. వీరి కెపుడు నివేదింతు, వేడ్కఁ బుత్త్ర। దారసహితుండ నై నియతముగ సేవ
యాచరింతును; వేదముల్ యజ్ఞములు వ్ర। తంబులును వీర నా కను తలఁపు దృఢము. 117

ప్రతిపదార్థం: జననుత!= ప్రజలచేత కీర్తించబడినవాడా! కౌశికమునీ; వీరు= ఈ పెద్దలు; నా జననియున్, జనకుండున్= నా తల్లిగారు తండ్రిగారు; చూవె= సుమ్ము; వీరలకున్= వీరికి; శుశ్రూష= పరిచర్య; చేసి= సలిపి; ఇట్టి= ఈ విధమైన; పరిజ్ఞానము= గొప్పజ్ఞానం; ఏనున్= నేనును; ప్రాపించితిన్= పొందాను; ఎల్లవారును= అందరును; అర్థిన్= కోరికతో; అమరులన్= దేవతలను; పూజింతురు= అర్చిస్తారు; ఒండుదైవములన్= వేరే దేవతలను; ఎఱుఁగన్= నేనెరుగను; ఈ వృద్ధులు+అ= ఈ ముదుసలివారే; నా పాలి వేల్పులు= నాకు లభించిన దేవతలు; అనఘ!= పాపం చేయనట్టి ఓ పుణ్యాత్ముడా!; కమనీయ, ఫల పుష్ప, గంధ, భూషణ, వస్త్రములున్= కమ్మని పండ్లు, పూలు, పరిమళద్రవ్యాలు, నగలు, బట్టలు; మనస్+హర, భక్ష్య, భోజ్యములును= మనస్సుకు అనువైన తినుబండారాలున్నూ; వీరికిన్; ఎపుడున్= ఎల్లప్పుడును; నివేదింతున్= సమర్పిస్తాను; వేడ్కన్= కుతూహలంతో; పుత్త్ర, దార, సహితుండను+ఐ= కొడుకులతో, భార్యతో కూడిన వాడనై; నియతముగన్= దీక్షతో; సేవ= పరిచర్య; ఆచరింతును= చేస్తాను; వేదముల్= వేదాలు; యజ్ఞముల్= క్రతువులు; వ్రతంబులును= నోములును; నాకున్= నాకు; వీరు+అ= వీరే; అను, తలఁపు= అనే ఆలోచన; దృఢము= గట్టిది.

తాత్పర్యం: 'ప్రజలచేత కీర్తించబడినవాడా! నాతలిదండ్రులు వీరే. వీరికి పరిచర్య చేయటంచేతనే నాకు ఈ పరిజ్ఞానం లభించింది. అందరూ వేడుకతో తమకోరికలు ఈడేరటానికై దేవతలను పూజిస్తారు. నాకు నాతలిదండ్రులే ప్రత్యక్షదేవతలు. వేరే దేవతలను నేను ఎఱుగను. ఈ ముదుసలులే నాపాలిటి వేల్పులు. వీరలను చందనచర్చతో, పండ్లతో, పూవులతో వారలకు కావలసిన తినుబండారాలతో అర్చిస్తాను. నా శ్రీమతితో నా బిడ్డలతో కలిసి వీరికి సేవ చేస్తాను. వారి సేవయే నేను చేసే యజ్ఞం. అదియే వేదాలు, నోములు - అనే భావమే నాలో లోతుగా నాటుకొని ఉన్నది.

తే. జనని జనకుఁడు సద్గురుఁ డనలుఁ డాత్ముఁ । డనఁగ నియ్యేవురును నే గృహస్థుచేత
సుగతివాంఛఁ బ్రసాదితు లగుదు రట్టి । వాఁడ సూవె ధర్మాత్ముండు వసుధమీఁద'. 118

ప్రతిపదార్థం: జనని=తల్లి; జనకుండు= తండ్రి; సత్+గురుఁడు= మంచిఒజ్జ; అనలుఁడు= అగ్ని; ఆత్ముఁడు= ఆత్మ; అనఁగన్= అని చెప్పబడెడి; ఈ+ఏవురునున్= ఈ అయిదుగురున్నూ; ఏగృహస్థుచేతన్= ఏ ఇంటియజమానిచేత; సుగతివాంఛన్= పుణ్యం లభించవలె ననే కోరికతో; ప్రసాదితులు+అగుదురు= సంతోషం పొందించబడిన వారు అగుదురో; అట్టివాఁడు+అ+చూవె= అట్టివాడే సుమా; వసుధమీఁదన్= భూమిపై; ధర్మ+ఆత్ముండు= ధర్మంతో కూడిన ఆత్మకలవాడు - సుకృతుడు.

తాత్పర్యం: పుణ్యంకోరే గృహమేధి-తల్లి, తండ్రి, గురువు, అగ్ని, ఆత్మ అనే అయిదుగురిని అర్చించి సంతోషపరచాలి. భూమిపై అట్టి గృహస్థుడే ధర్మాత్ముడు.'

వ. అని చెప్పి యిట్లనియెఁ; 'బతివ్రత పనుపునం జేసి నీవు ధర్మజ్ఞానార్థంబు నాయున్నయెడకుం జనుదెంచిన నప్పతివ్రతవలని యనుగ్రహంబున నీకు నెల్లవియు నెఱింగించితిఁ గాని, నీదెస నాదు చిత్తంబు ప్రియంపడియుండదు; నీచేసిన యకార్యం బొక్కటి గల దది యెయ్యది యనిన; 119

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు; పతివ్రతపనుపునన్+చేసి= గొప్పఇల్లాలు యొక్క నియోగంవలన; నీవు; ధర్మ, జ్ఞాన+అర్థంబు= ధర్మాన్నిగూర్చిన జ్ఞానాన్ని పొందటానికై; నా+ఉన్న+ఎడకున్= నేను ఉన్నచోటికి; చనుదెంచినన్= రాగా; ఆ+పతివ్రతవలని, అనుగ్రహంబునన్= ఆ మంచి ఇల్లాలి యొక్క దయవలన; నీకున్= నీకు; ఎల్లవియున్= సర్వమును; ఎఱింగించితిన్= తెలిపాను; కాని= అంతేకాని; నీదెసన్= నీయెడ; నా+చిత్తము= నాదు, మనస్సు; ప్రియంపడి, ఉండదు= ప్రీతిని చెందియుండ లేదు; నీ చేసిన= నీవు ఒనర్చిన; అకార్యంబు= చెడ్డపని; ఒక్కటి కలదు= ఒకటి ఉన్నది; అది+ఎయ్యది+అనినన్= ఆ (అకార్యం) ఏది అని అడిగితే.

తాత్పర్యం: అని చెప్పి ధర్మవ్యాధుడు ఇట్లు పలికాడు: ' ఆ పతివ్రత అనుగ్రహంతో నిన్ను పంపింది కాబట్టి, ఆమెపై నాకు గల గౌరవప్రపత్తి చేతను, నీవు జిజ్ఞాసువుగా నే నున్న చోటికే వచ్చి అడిగావు కాబట్టి నాకు తెలిసినమేరకు అంతయు నీకు తెలియజెప్పాను. కాని, నీయందు నాకు ప్రీతి యేర్పడ లేదు. దానికి ఒక మూలకారణం ఉన్నది. నీవు చేసినది ఒక చెడ్డపని ఉన్నది. ఆ చెడ్డపని ఏది అని అడిగితే.

ఉ. ఎంతయు వృద్ధు లై తమకు నీ వొకరుండవ తెప్ప గాఁగ న
త్యంతముదంబునన్ బ్రదుకు తల్లిని దండ్రిని నుజ్జగించి ని

శ్చింతుఁడ వై సదాధ్యయనశీలత వారియనుజ్ఞ లేక యే
కాంతము యెమ్మెయిన్ వెడలి తక్కట! నీవు గరంబు క్రూరతన్. 120

ప్రతిపదార్థం: ఎంతయున్, వృద్ధులు+ఐ= మిక్కిలి ముసలివారై; తమకున్; నీవు+ఒకరుండవు+అ= నీవు ఒక్కడవు మాత్రమే; తెప్పకాఁగన్= ఆధారం కాగా; (తెప్ప= నదిని దాటే ఉడుపం); అత్యంత ముదంబునన్= మిక్కిలి సంతోషంతో; బ్రదుకు= జీవించే; తల్లినిన్ తండ్రినిన్= తల్లిని తండ్రిని; ఉజ్జగించి= వదలిపెట్టి; అక్కట= అయ్యో!; నిశ్చింతుఁడవు+ఐ= విచారం లేనట్టివాడవై; సదా+అధ్యయన, శీలతన్= ఎల్లప్పుడును వేదాలను వల్లెవేసే స్వభావం చొప్పున; వారి+అనుజ్ఞ, లేక= ఆ తలిదండ్రులయొక్క అనుమతి లేకుండా; ఏకాంతము+అ= ఒంటరిగా; ఏ+మెయిన్= ఏరీతిగా; నీవు; కరంబు= మిక్కిలి; క్రూరతన్= కఠినత్వంతో; వెడలితి= వెళ్ళావు.

తాత్పర్యం: నీ తలిదండ్రులు మిక్కిలి ముసలివారు. వారికి నీవు ఒకడవే ఆధారం. నీమీదనే తమ ప్రేముడిని అంతయు పెట్టుకొని బ్రదుకుతున్న నీతలిదండ్రులను వదలిపెట్టావు. వారిని వదలివచ్చేటప్పుడు నీవు వారి అనుమతిని తీసికొన లేదు. నీవు వేదాధ్యయనం చేసి జ్ఞానాన్ని ఆర్జించి, తరింప నెంచావు. కాని, నీతలిదండ్రులగతి ఏమవుతుందో అని ఆలోచించలేదు. కఠినమైన నీ ప్రవర్తన నాకు నచ్చ లేదు.

ఆ. నీక వగచి వగచి నిర్భిన్నహృదయు లై । విగతచక్షు లైరి వినవె? వార;
లరిగి యింక నైన నమ్ముదుసళ్ల యు । దగ్రశోకవహ్ని నార్పవయ్య! 121

ప్రతిపదార్థం: నీకున్+అ= నీకోసమే; వగచి వగచి= మిక్కిలిదుఃఖించి; నిర్భిన్నహృదయులు+ఐ= పగిలిన గుండెలు కలవారై; వారు= (నీతలిదండ్రులు); విగతచక్షులు+ఐరి= పోయిన కన్నులు కలవారు అయ్యారు - గ్రుడ్డివార లయ్యారు. వినవె= ఆలకించవా?; అరిగి= వెడలి; ఇంకన్+ఐనన్= ఇకమీదట నైన; ఆ+ముదుసళ్ల+ఉదగ్ర, శోక, వహ్నిన్= ఆ వృద్ధులయొక్కగొప్ప దైన దుఃఖం అనెడి అగ్నిని; ఆర్పవయ్య= ఉపశమింప చేయుము.

తాత్పర్యం: నీకోసమే మిక్కుటంగా గుండెలు పగిలేటట్లు నీ తలిదండ్రులు ఏడ్చి యేడ్చి గ్రుడ్డివారయ్యారు. ఆ సంగతి నీవు ఆలకించ లేదా? ఇకమీదట నైనా, నీవు వారిదగ్గరకు పోయి, ఆ ముదుసలుల శోకాగ్నిని ఆర్పవలెను సుమా!

క. నీయధ్యయనమ్మును సుకృ । తాయాసము నిష్ఫలంబు లై చను గురుసే
వాయుక్తి లేక తక్కినఁ । జేయుము నాపలుకు; మేలు సేకుఱు నీకున్.' 122

ప్రతిపదార్థం: నీ+అధ్యయనమ్మును= నీ చదువున్నూ; సుకృత+ఆయాసమున్= పుణ్యాన్ని ఆర్జించటానికై పడెడి శ్రమయున్నూ; గురు, సేవా, యుక్తి, లేక తక్కినన్= తలిదండ్రుల పరిచర్య లేకపోతే; నిష్ఫలంబులు+ఐ= ఫలం లేనట్టివి అయి అనగా వ్యర్థాలై; చనున్= పోతాయి; నాపలుకు చేయుము= నేను చెప్పిన చొప్పున నడచుకొనుము; నీకున్= నీకు; మేలు= శుభం; చేకుఱున్= కలుగుతుంది.

తాత్పర్యం: నీ చదువు గాని, పుణ్యాన్ని ఆర్జించటానికై నీవు పడెడి శ్రమగాని, తలిదండ్రులకు పరిచర్య చేయకపోతే వ్యర్థా లౌతాయి సుమా! నేను చెప్పిన విధంగా నడచుకొనుము. నీకు మేలు కలుగుతుంది'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: గురుశబ్దానికి విశాల మైన అర్థం ఉన్నది. గురువులు= తలిదండ్రులు, మాతామహి పితామహులు, పినతండ్రి,అన్న, మేనమామ, ఉపాధ్యాయుఁడు, విద్య చెప్పినవాడు, మంత్రోపదేశం చేసినవాడు, గురుపరిచర్య - లేకుంటే జ్ఞానం కలుగదు అని సనాతన సంప్రదాయం.

వ. అనినఁ గౌశికుం డతని కిట్లనియె. 123

తాత్పర్యం: అనగా విని కౌశికుడు ఆ ధర్మవ్యాధుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'ఇది యట్టిద నీ చెప్పిన । సదమలహితవాక్యభంగి సకలము వింటిన్;
వదలక యిమ్మెయిన చరిం । చెద గురుజనములకుఁ బ్రీతిఁ జేసెద ననఘా! 124

ప్రతిపదార్థం: అనఘా!= పాపం లేనట్టివాడా!(ఓ ధర్మవ్యాధుడా!); ఇది= (నీవు చెప్పింది); అట్టిది+అ= అటువంటిదే, నిజమే; నీ, చెప్పిన= నీవు చెప్పిన; సత్+అమల, హిత, వాక్య, భంగి= మంచివి, స్వచ్ఛమైనవి, మేలుచేకూర్చేవి అయిన మాటలతీరు; సకలమున్= అంతయును; వింటిన్= ఆలకించాను; వదలక= విడిచిపెట్టక; ఈ+మెయిన్+అ= ఈవిధంగానే; చరించెదన్= నడచుకొంటాను; గురుజనములకున్= పెద్దలయిన తలిదండ్రులకు; ప్రీతిన్= సంతోషాన్ని; చేసెదన్= కల్గిస్తాను.

తాత్పర్యం: అని చెప్పిన ధర్మవ్యాధుడితో కౌశికుడు ఇట్లా పలికాడు: 'పుణ్యాత్ముఁడ వైన ఓ ధర్మవ్యాధుడా! నీవు చెప్పినమాటలు సరిఅయినవే. స్వచ్ఛమైనవే. నాకు మేలు చేకూర్చేవే. వాటిని సావధానంగా విన్నాను. నీవు చెప్పిన విధంగా నడచుకొంటాను. నా తలిదండ్రులకు పరిచర్య చేసి నా జన్మ ధన్యం చేసికొంటాను.

క. నాదైన భాగ్యవశమునఁ ।గాదే నీతోడి చెలిమి గలిగెం, బరమా
హ్లాదమనస్కుఁడ నైతి, శు । భోదయముల కెల్ల నింక యుక్తుఁడ నైతిన్. 125

ప్రతిపదార్థం: నాదు+ఐన= నాకు సంక్రమించిన; భాగ్య, వశమునన్+కాదు+ఏ= అదృష్టంచొప్పున కదా; నీతోడి, చెలిమి= నీతో స్నేహం; కలిగెన్= ఏర్పడింది; పరమ+ఆహ్లాద, మనస్కుఁడన్+ఐతిన్= మిక్కుటమైన సంతోషంతో నిండిన మనస్సు కలవాడను అయినాను; శుభ+ఉదయములకున్+ఎల్లన్= మేలు కలిగించే వాటి కన్నిటికిని; యుక్తుఁడను+ఐతిన్= యోగ్యుడిని అయినాను.

తాత్పర్యం: నీతో స్నేహం కలగటం నా అదృష్టం. నా మనస్సు అమితమైన సంతోషంతో నిండింది. నాకు కలుగబోయే శుభాల కన్నిటికిని ఇది సూచకం.

క. పాపకృతం బగు దుర్గతి । మోపుఁ గనకయుండ ననుఁ బ్రబోధాత్మక లీ
లాపరిణతుఁ గావించితి; । నాపాలిటి వేల్ప వీవ నరనుతచరితా! 126

ప్రతిపదార్థం: నర, నుత, చరితా!= జనులచేత పొగడబడిన ప్రవర్తన కలవాడా!; ఓ ధర్మవ్యాధుడా!; పాపకృతంబు+అగు= పాపం చేయటంచేత ఏర్పడిన; దుర్గతి= చెడుమార్గం; మోపున్+కనక+ఉండన్= బరువు కాంచక ఉండేటట్లుగా; ననున్= నన్ను; ప్రబోధ+ఆత్మక, లీలా, పరిణతున్+కావించితి(వి)= జ్ఞానంవలన కలిగే మహిమతో గొప్పవాడిగా వికసించేటట్లుగా చేశావు; ఈవు+అ= నీవే; నాపాలిటి= నాకు సంబంధించిన; వేల్పవు= దేవతవు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: జనులచేత పొగడబడే ప్రవర్తన కలవాడా, ఓ ధర్మవ్యాధా! పాపం చేయటంచేత దుర్గతి ప్రాప్తించి ఆ బరువు మోస్తూ బ్రదుకకుండ నీవు నన్ను ఉద్ధరించి, నాకు జ్ఞానం గలిగించి, గొప్పవాడినిగా నేను వికసించేటట్లు చేశావు. నీవే నా పాలిటి దేవుడవు.

చ. **అనుపమ మెట్టివారలకు నందదు ధర్మపథంబు ధాత్రిలోఁ;**
విను, పదివేవురం దొకఁడు విశ్రుతధర్మపరాయణుండు గ
ల్గునొ కలుగండొ సందియము; గోరి సనాతనధర్మ మూఁది యె
వ్వనికిని నీకుఁ బోలె బుధవత్సల! యిట్లు చరింపవచ్చునే. **127**

ప్రతిపదార్థం: బుధవత్సల!= జ్ఞానులచేత ఆదరించబడెడివాడా!; విను= ఆలకింపుము; ధాత్రిలోన్= లోకములో; ధర్మ, పథంబు= ధర్మంతో గూడిన మార్గం; అనుపమము= సాటి లేనిది; ఎట్టివారలకున్= ఎటువంటి మనుజులకు ఐనను; అందదు= దొరకదు; పదివేవురందున్+ఒకఁడు= పదివేలమందిమనుజులలో ఒక్కడు; విశ్రుత, ధర్మ, పరాయణుండు= కీర్తికి ఎక్కిన ధర్మవ్రతుడు అనగా ధర్మాన్నే ఎల్లప్పుడు పాటించేవాడు అనే పేరు ప్రతిష్ఠలు ఆర్జించినవాడు; కల్గును+ఒ= కలుగునా?; కలుగండు+ఒ= కలుగడా?; సందియము= సంశయించవలసింది; కోరి= పూనికతో; సనాతనధర్మము+ఊఁది= ప్రాచీనకాలంనుండి అనుస్యూతంగా ఆచరించబడుతున్న ధర్మాన్ని తెలిసి గ్రహించి; ఇట్లు= ఈవిధంగా; ఎవ్వనికిని= ఏమనుజుడికి ఐనను; నీకున్+పోలెన్= నీవు ఆచరిస్తున్న విధాన్ని పోలి; చరింపన్‌వచ్చున్+ఏ?= నడవడిక తీర్చిదిద్దుకొనటానికి వీలు ఉన్నదా?

తాత్పర్యం: జ్ఞానులచేత ఆరాధింపబడెడి ఓ ధర్మవ్యాధుడా!; ధర్మమార్గం మిక్కిలి సూక్ష్మమైనది. సాటి లేనిది, ఎట్టివారలకును అది అందుబాటులో ఉండనట్టిది. ఈ భూప్రజలలో పదివేలమంది జనులలో ఒకడైనను అచ్చమైన ధర్మాన్ని ఆచరిస్తున్నట్లు పేరుప్రతిష్ఠలు ఆర్జించినవాడు ఉన్నాడా? ఉన్నట్లు ఖండితంగా చెప్పలేం. సనాతనధర్మాన్ని నీవలె గ్రహించిన అనుష్ఠానవేదాంతి మరియొకడు లేడు.

చ. **నిను నొక శూద్రుఁగాఁ దలఁపనేర గుణాకర; నీ చరిత్రముం**
గన మది నద్భుతం బొలసెఁ; గావున నెయ్యది కారణంబుగా
నొనరఁగ నిట్టి జన్మమును నొందితి చెప్పుము; భూత భావివ
ర్తనములయందు నీకు విదితంబులు గానివి గల్గ వెమ్మెయిన్'. **128**

ప్రతిపదార్థం: గుణ+ఆకర!= మంచి లక్షణాలకు నెలవైన వాడా! ఓ ధర్మవ్యాధుడా!; నినున్= నిన్ను; ఒక, శూద్రున్+కాన్= ఏదో ఒక శూద్రవంశంలో పుట్టిన సామాన్య మనుజుడిగా; తలఁపనేరన్= ఎంచలేను; నీచరిత్రమున్+కనన్= నీశీలమును అరయుగా; మదిన్= మనసునందున; అద్భుతంబు+ఒలసెన్= వింత గలిగింది; కావునన్= కాబట్టి; ఏ+అది= ఏది; కారణంబు+కాన్= హేతువుగా; ఒనరఁగన్= పొసగేటట్లుగా; ఇట్టి= ఈవిధమైన; జన్మమును= పుట్టుకను; ఒందితి(వి)= పొందావో; చెప్పుము= వివరించుము; భూత, భావి, వర్తనములయందున్= లోగడ జరిగినట్టి ఘటనలలోగాని, ఇక ముందుకాలంలో జరుగబోయే ఘటనలలోగాని; నీకున్, విదితంబులు+కానివి= నీకు తెలియనట్టివి; ఏ+మెయిన్= ఏరీతిగా నైనను; కల్గవు= ఉండవు.

తాత్పర్యం: మంచి గుణాలకు నెలవైన ఓ ధర్మవ్యాధుడా! నీవు ఒక శూద్రుడవు మాత్రమే అని భావించలేను; నీ శీలాన్ని అనుశీలించగా నామనస్సులోఇది మిక్కిలి వింతగా ఉన్నది. నీవు ఏకారణంవలన శూద్రజన్మను పొందావో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దయచేసి చెప్పుము. నీవు త్రికాలజ్ఞుడవు. నీకు తెలియని అంశాలు గతానికి సంబంధించినవి గాని భవిష్యత్తుకు సంబంధించినవి గాని లేవు.'

వ. అనిన నతనికి ధర్మవ్యాధుం డిట్లనియె. 129

తాత్పర్యం: అని కౌశికుడు పల్కగా, ధర్మవ్యాధుడు అతడికి ఈవిధంగా బదులు పలికాడు.

ధర్మవ్యాధుఁడు కౌశికునకుఁ దన పూర్వజన్మ వృత్తాంతంబు సెప్పుట (సం. 3-205-21)

క. 'జననుత! నీ వెయ్యది యడి । గినఁ దెలుపుట నా కవశ్యకృత్యము గాదే!
విను చెప్పెదఁ; బూర్వభవం । బున నే నొక బ్రాహ్మణుండఁ బుణ్యచరితుఁడన్. 130

ప్రతిపదార్థం: జన, నుత!= ప్రజలచేత కీర్తించబడినవాడా!; నీవు+ఏ+అది+అడిగినన్= నీవు దేనిని గూర్చి ప్రశ్నించినా; తెలుపుట= వివరించి చెప్పటం; నాకున్+అవశ్య, కృత్యము+కాదు+ఏ= నాకు తప్పనిసరిగా నెరవేర్చవలసిన పనియే సుమా; విను, చెప్పెదన్; పూర్వ, భవంబునన్= లోగడ పుట్టువునందు; ఏన్= నేను; ఒక, బ్రాహ్మణుండన్= ఒక విప్రుడను; పుణ్య చరితుఁడన్= సుకృతంతో కూడిన ప్రవర్తన కలవాడను.

తాత్పర్యం: ప్రజలచేత కీర్తించబడిన ఓ కౌశికమునీ! నీవు ఏ ప్రశ్నలు వేసినా వాటికి అన్నింటికి సమాధానాలు చెప్పటం నా కర్తవ్యంగా భావిస్తున్నాను. గతజన్మలో నేను ఒక బ్రాహ్మణుడను. సుకృతాన్ని ఆర్జించే ప్రవర్తన గలవాడిని.

వ. వేదవేదాంగపారంగతుండ నై యుండుదు; నాకుం బ్రియసఖుం డైన యొక్క రాజపుత్త్రుతోడి సంగతిం జేసి ధనుర్వేదంబును నభ్యసించితి; నొక్కనాఁ డమ్మహీపతి వేఁట వోయిన నేనును నతనితోడన చని వనంబునం బెక్కు మృగంబుల నేయుచుండ నం దొక్కబాణంబు దృణలతాంతరితదేహుండైన మునివరు నొక్కరుం దాఁకిన నతఁడు హా! యనుచుం బడియె; నంత నేనును. 131

ప్రతిపదార్థం: వేద, వేదాంగ, (వేద+అంగ) పారంగతుండను+ఐ= వేదాలయొక్క, వేదాంగాలయొక్క అవ్వలిఒడ్డును చేరినవాడనై, (అనగా సంపూర్ణంగా తెలిసిన వాడనై); ఉండుదున్= ఉండేవాడను; నాకున్+ప్రియ, సఖుండు+ఐన= నాకు మిక్కిలి ఇష్టుడైన మిత్రుడు అయిన; ఒక్క, రాజపుత్త్రుతోడి= ఒకానొక రాచకొడుకుతోడి; సంగతిన్+చేసి= కూడిక (స్నేహం) వలన; ధనుః +వేదంబును= విలువిద్యను; అభ్యసించితిన్= నేర్చుకొన్నాను; ఒక్కనాఁడు= ఒకానొకరోజున; ఆ+మహీ, పతి= ఆ రాజు; వేఁట+పోయినన్= వేటాడడానికై పోగా; నేనునున్= నేనుకూడ; అతనితోడన్+అ= ఆతడివెనువెంటనే; చని= వెళ్లి; వనంబునన్ అడవిలో; పెక్కు, మృగంబులన్= అనేకజంతువులను; ఏయుచున్+ఉండన్= బాణాలతో కొట్టుతుండగా; అందున్+ఒక్క, బాణంబు= ఆ బాణాలలో ఒకబాణం; తృణ, లతా+అంతరిత, దేహుండు+ఐన= గడ్డిచేతను తీగలచేతను చుట్టుకొనబడిన శరీరం కలవా డయిన; మునివరున్+ఒక్కరున్= ఋషులలో శ్రేష్ఠుడు అయిన ఒకరిని; తాఁకినన్= తగులగా; అతఁడు= (ఆమునివరుడు); హా+అనుచున్+పడియెన్= హా అనే (బాధతోకూడినశోకము) ధ్వనితో పడిపోయాడు; అంతన్= పిమ్మట; ఏనును= నేనును.

తాత్పర్యం: పూర్వజన్మంలో నేను వేదాలను, వేదాంగాలను క్షుణ్ణంగా చదివినవాడినే. కాని, నాకు ఒక రాకుమారుడితో స్నేహం ఏర్పడటంచేత విలువిద్యను నేర్చాను. ఒకానొకరోజున ఆ మహారాజుతో నేనుగూడ అడవికి వేటకు పోయి

పెక్కు జంతువులను సంహరించాను. అంతలో నాబాణ మొకటి, గడ్డిచేతను తీగెలచేతను కప్పబడిన ఒక మునివరుడి శరీరానికి తాకింది. వెంటనే ఆతడు హాహాకారం చేస్తూ బాధతో నేలపై ఒరిగిపోయాడు. అప్పుడు నేను.

విశేషం: వేదములు నాలుగు. 1.ఋగ్వేదం, 2.యజుర్వేదం, 3. సామవేదం, 4. అధర్వణవేదం. వేదాంగం అంటే వేదానికి అవయవం. వేదము యొక్క సరియైన అర్థాన్నీ, మంత్రోపయోగం మొదలైన వాటిని తెలిపేది. వేదాంగాలు ఆరు 1.శిక్ష, 2.వ్యాకరణం 3. ఛందస్సు 4. నిరుక్తం 5. జ్యోతిషం 6. కల్పం.

ఆ. డాయఁబోయి తీవ్రసాయకవిద్ధుఁ డై । పొరలుచున్న విప్రవరునిఁ జూచి
తలఁకి యనునయంపుఁ బలుకులు పలికినఁ । గినిసి యిట్టు లనియె మునివరుండు. 132

ప్రతిపదార్థం: డాయన్+పోయి= సమీపించి; తీవ్రసాయకవిద్ధుఁడు+ఐ= వాడి అయిన బాణాలచేత కొట్టబడినవాడై; పొరలుచున్+ఉన్న= ఇటు అటూ బాధతో మెలికలు తిరుగుతున్నటువంటి; విప్రవరునిన్+చూచి= బ్రాహ్మణులలో ఉత్తముడైనవాడిని సందర్శించి; తలఁకి= భయపడి; అనునయంపు+న్+పలుకులు= ఓదార్పుమాటలు; పలికినన్= పలుకగా; ముని, వరుండు= ఋషులలో శ్రేష్ఠుడైనవాడు; కినిసి= కోపించి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అంతట నేను బ్రాహ్మణోత్తముడిని సమీపించాను. అతడు నాబాణంచేత ఛేదించబడిన శరీరం కలవాడై బాధచేత ఇటూఅటూ పొరలాడుతున్నాడు. ఆ దృశ్యాన్ని చూచి చలించినవాడనై నేను ఓదార్పుమాటలను పలుకగా, ఆవిప్రుడు మిక్కిలి ఆగ్రహించి ఈవిధంగా అన్నాడు.

ఆ. 'బ్రాహ్మణుండవయ్యుఁ బాపప్రవృత్తివై । శూద్రకర్మమునకుఁ జొచ్చి తీవు
గాన నిక్కువము మృగవ్యాధజన్ముండ । వగుము మీఁద' ననియె; ననిన నేను. 133

ప్రతిపదార్థం: ఈవు= నీవు; బ్రాహ్మణుండవు+అయ్యున్= విప్రుడవై పుట్టికూడా; పాపప్రవృత్తివి+ఐ= చెడ్డపనులు చేసే స్వభావం కలవాడవై; శూద్ర, కర్మమునకున్= శూద్రులు చేసే పనికి; చొచ్చితి(వి)= చొరబడ్డావు; కానన్= కావున; మీఁదన్= తదుపరి (అనగా రాబోయే జన్మలో); మృగ, వ్యాధ, జన్ముండవు= జంతువులను హింసించి జీవించే బ్రతుకుతెరువు కలవాడవు; అగుము= కమ్ము; నిక్కువము= యథార్థం; అనియెన్= అని అన్నాడు (శపించాడు); అనినన్= అట్లా అనగా; ఏను= నేను;

తాత్పర్యం: 'నీవు పుట్టింది బ్రాహ్మణకులంలో. కాని, చెడ్డ వైన హింసాకృత్యాలు చేయటానికి పూనుకొన్నావు. హింస శూద్రుల కను వైనది కాని బ్రాహ్మణులకు తగినపని కాదు. కావున, నీవు రాబోయేజన్మలో శూద్రుడవుగా జన్మించి మృగవ్యాధవృత్తితో బ్రతుకగలవు. ఇది తథ్యం' అని శపించాడు. అపుడు నేను ఆ బ్రాహ్మణోత్తముడితో ఈ విధంగా నివేదించుకొన్నాను..

చ. 'ఎఱుఁగక తప్పు సేసితి సహింపఁగదే! కడుదుర్భవంబునం
బఱుపకుమయ్య!' నావుడుఁ గృపన్ మునినాథుఁడు 'దప్ప దివ్విధం;
బెఱుకుకులంబునందు జనియించియు ధర్మువు లెల్ల నిమ్ముగా
నెఱిఁగెదు, తల్లిదండ్రులకు నెంతయుఁ బ్రీతి యొనర్తు భక్తితోన్. 134

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఎఱుఁగక= తెలియకపోవటంచేత; తప్పు= నేరం; చేసితిన్= చేశాను; సహింపన్‌కదే= క్షమించవలసినవాడవుకదా!; కడున్= మిక్కిలి; దుర్భవంబునన్= చెడ్డజన్మంలో; పఱుపకుమయ్య!= నియోగించకండి; నావుడున్= అని చెప్పగా; మునినాథుఁడు= ఋషులలో శ్రేష్ఠుడు; కృపన్= దయతో; ఈ+విధంబు= ఈరీతి; తప్పదు= జరుగక తీరదు; ఎఱుకు, కులంబునందున్= వ్యాధకులంలో; జనియించియున్= పుట్టినప్పటికిని; ధర్మువులు+ఎల్లన్= అన్నిధర్మాలను; ఇమ్ముగాన్= సంప్రీతితో; ఎఱిఁగెదు= తెలిసికొంటావు; భక్తితోన్= పూజ్యభావంతో; తలిదండ్రులకున్= మాతాపితలకు; ఎంతయున్= ఎక్కువగా; ప్రీతి= తృప్తిని; ఒనర్తు(వు)= చేయగలవు.

తాత్పర్యం: 'అజ్ఞానంచేత ఇట్టి అపరాధం చేశాను, క్షమించ వేడికోలు. నన్ను చెడుజన్మం పొందేటట్టుగా చేయకుమా మహానుభావా!' అని నేను ప్రార్థించాను. అప్పుడు ఆ మునిశ్రేష్ఠుడు నాపై దయకలిగి 'నాశాపానికి తిరుగు లేదు. నీవు ఎఱుకవై జన్మించినప్పటికిన్నీ, ధర్మాధర్మపరిజ్ఞానం కలవాడవు కాగలవు. అంతేకాక, తల్లిదండ్రులకు భక్తితో శుశ్రూష చేసి తరించగలవు.

వ. గురుశుశ్రూషం జేసి నీకుఁ బరమశోభనం బగు; జాతిస్మరత్వంబునుం గలుగు; నపరజన్మంబునఁ బరమబ్రాహ్మణుండ వయ్యెద' వని యనుగ్రహించిన, నవ్విప్రుని దేహంబునందు నాటిన బాణంబు మెత్తన పెఱికి, యతనిం దదీయాశ్రమంబునకుం జేర్చితి; నా చేసినపుణ్యంబున నమ్మహాత్ముండు నపాయంబు వొందం డయ్యెఁ; నాకు నిట్టిజన్మంబు నొంద వలసె' నని చెప్పినం గౌశికుం డిట్లనియె. 135

ప్రతిపదార్థం: గురు, శుశ్రూషన్+చేసి= పెద్దలకు పరిచర్య చేయటంవలన; నీకున్= నీకు; పరమ, శోభనంబు+అగున్= మిక్కుటమైన మేలు చేకూరగలదు; జాతిస్మరత్వంబునున్+కలుగున్= పూర్వజన్మయొక్కజ్ఞాపకం లభిస్తుంది; అపర, జన్మంబునన్= తదుపరిపుట్టువులో; పరమ, బ్రాహ్మణుండవు= గొప్పవిప్రుడవు; అయ్యెదవు= కాగలవు; అని= అని చెప్పి; అనుగ్రహించినన్= దయచూపగా; ఆ+విప్రుని= ఆ బ్రాహ్మణుడి; దేహంబునందున్= శరీరంలో; నాటిన= గ్రుచ్చుకొనిన; బాణంబు= అమ్ము; మెత్తన= మృదువుగా; పెఱికి= బయటకు లాగి; అతనిన్= ఆ బ్రాహ్మణుడిని; తదీయ+ఆశ్రమంబునకున్= అతనియొక్క తపోవనానికి; చేర్చితిన్= చేర్చాను; నా, చేసిన= నేను చేసిన; పుణ్యంబునన్= సుకృతంవలన; ఆ+మహా+ఆత్ముండున్= ఆ గొప్ప ఆత్మ గలవాడును, ఆ మహానుభావుడును; అపాయంబు+పొందండయ్యెన్= ప్రమాదానికి లోనుకాలేదు; నాకున్+ఇట్టి, జన్మంబు= నాకు ఈవిధమైన పుట్టుక; ఒందవలసెన్= పొందవలసివచ్చింది; అని చెప్పినన్= అని వచించిన పిదప; కౌశికుండు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'పెద్దలకు (తలిదండ్రులకు) సేవ చేయటంవలన నీకు మిక్కుటమైన మేలు కలుగగలదు. అపుడు నీకు పూర్వజన్మపరిజ్ఞానంగూడ ఉంటుంది. తదుపరి జన్మలో మరల నీవు బ్రాహ్మణుడ వై పుట్టగలవు' అని ఆతడు దయతో పలికాడు. అంతట నేను ఆ బ్రాహ్మణోత్తముడి శరీరంలో గ్రుచ్చుకొనిన బాణాన్ని మృదువుగా పెరికి, బయటకు తీశాను. పిమ్మట ఆతడిని ఆతడి ఆశ్రమానికి చేర్చాను. నా పుణ్యంవలన ఆతడికి మృత్యుప్రమాదం తప్పింది. కాని, నాకు ఈ శూద్రజన్మ తారసిల్లింది' అని చెప్పిన ధర్మవ్యాధుడితో కౌశికుడు ఈవిధంగా అన్నాడు.

తే. 'జన్మ మిట్టిది, చరితంబు చంద మిట్టి । దెన్నఁడును నిట్టిచోద్య మే నెందుఁ జూడ;
నింక జన్మాంతరముదాఁక నేల? యిపుడ । పుణ్యచరిత మై నీవు విప్రుఁడవ కావె! 136

ప్రతిపదార్థం: జన్మము+ఇట్టిది= నీపుట్టుక ఇటువంటిది; చరితంబు చందము+ఇట్టిది= ప్రవర్తనతీరు ఇటువంటిది; ఎన్నఁడును= ఎప్పుడును; ఇట్టి= ఇటువంటి; చోద్యము= వింత; ఏన్= నేను; ఎందున్+చూడన్= ఎచటను చూడలేదు; ఇంకన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇకమీద; జన్మ+అంతరముదాఁకన్+ఏల= వేరొకజన్మ ఏర్పడేవరకూ ఆగవలెనా?; ఇపుడు+అ= ఇప్పుడే; పుణ్య, చరితమైన్= సుకృతంతో కూడిన ప్రవర్తనవలన; నీవు; విప్రుఁడవు+అకావె!= బ్రాహ్మణుడవే కదా!

తాత్పర్యం: 'ప్రస్తుతం నీ జన్మ చూస్తే శూద్రజన్మం. కానీ, ప్రవర్తనతీరు అనుశీలిస్తే ఇది ఒక వింత. ఇట్టి వింత ఇంతవరకు నేను ఎన్నడూ చూచి ఉండలేదు. నీవు మరుజన్మం వరకు ఆగవలెనా? ఈ జన్మంలోనే పుణ్యచరిత్రుడ వయిన నీవు నిజంగా బ్రాహ్మణుడవే సుమా!

ఆ. పాపవర్తనుండు బ్రాహ్మణుం డయ్యును । నిజము శూద్రుకంటె నీచతముఁడు;
సత్యశౌచధర్మశాలి శూద్రుం డయ్యు, । నతఁడు సద్ద్విజుండ యనిరి మునులు. 137

ప్రతిపదార్థం: పాపవర్తనుండు= చెడునడవడి కలవాడు; బ్రాహ్మణుండు+అయ్యును= బ్రాహ్మణకులంలో పుట్టినవాడు అయినాకూడ; శూద్రుకంటెన్= శూద్రుని కన్ననూ; నీచతముఁడు= మిక్కిలి నికృష్టు డైన తుచ్ఛుడు; నిజము= సత్యమే(ఈమాట ముమ్మాటికి నిజం అనిభావం); సత్య, శౌచ, ధర్మశాలి= ఎల్లప్పుడు నిజాన్ని మాట్లాడేవాడున్నూ, పరిశుభ్రతను పాటించేవాడున్నూ, ధర్మాన్నే ఆచరించేవాడున్నూ; శూద్రుండు+అయ్యున్= శూద్రకులంలో పుట్టినవాడైనప్పటికిని; అతఁడు= వాడు; సత్+ద్విజుండు+అ= మంచిబ్రాహ్మణుడేఅని; మునులు= ఋషులు; అనిరి= పేర్కొన్నారు.

తాత్పర్యం: చెడుప్రవర్తన కలవాడు బ్రాహ్మణకులంలో పుట్టినప్పటికినీ శూద్రుడికంటె అధముడే. ఇది నిజం, పరిశుభ్రత పాటించి సత్యాన్నే పలికే ధర్మాత్ముడు శూద్రకులంలో జన్మించినప్పటికిన్నీ అతడు సద్బ్రాహ్మణుడే అని మునులు తీర్పుచెప్పారు.

విశేషం: 1) ద్విజుఁడు= రెండు జన్మలు కలవాడు. అనగా శారీరకమైన పుట్టువు ఒకజన్మం, జ్ఞానార్జన తదుపరి ఎత్తేది మరియొక జన్మం. జ్ఞానోదయమైతే తప్ప బ్రాహ్మణకుటుంబంలో పుట్టినవాడైనా నిజమైన ద్విజుడు (బ్రాహ్మణుడు) కాఁజాలడు. 2) 'ఎవడు బ్రాహ్మణుడు? - ఈప్రశ్నను సనాతనవైదికమతానుయాయులే గాక బౌద్ధులు పాషండులుకూడ పలుసారులు వేసిఉన్నారు. మహాభారతం నిష్కర్షగా ఎవడును జన్మచేత బ్రాహ్మణుడు కాజాల డనిన్నీ 'సత్యశౌచధర్మశాలి' మాత్రమే నిజమైన బ్రాహ్మణుడనిన్నీ నిర్ణయించింది. అందుచేత ఈ పద్యం మిక్కిలి విలువ కలది, అంతేకాక, ఒకవేళ 'సత్యశౌచధర్మశాలి' శూద్రకులంలో జన్మించి ఉన్నప్పటికీ, ఆతడు నిజంగా బ్రాహ్మణుడే అని ఖండితంగా నొక్కివక్కాణించింది. ఇచ్చట- 'అనిరి మునులు' అనే ప్రయోగం అనుశీలించదగింది. లోకవ్యవహారంలో జన్మ 'కులమును'- నిర్ణయించవచ్చును గాని ఆర్షదృష్టిలో లేదు. మునులదృష్టిలో- 'సత్యశౌచధర్మశాలి' శూద్రకులంలో పుట్టినప్పటికీ బ్రాహ్మణుడే. కౌశికుడి దృష్టిలో ఈజన్మంలోనే శూద్రకులంలో పుట్టిన ధర్మవ్యాధుడు బ్రాహ్మణుడే.

క. అనయంబు నాత్మకర్మం । బున నతినీచ మగు భవముఁ బొందవలసెనే
యని నీవు నిరంతరమును । మనమున దుఃఖింపవలదు మహితచరిత్రా! 138

ప్రతిపదార్థం: మహిత చరిత్రా!= గొప్ప ప్రవర్తన కలవాడా! ఓధర్మవ్యాధా!; అనయంబున్= ఎల్లప్పుడును; ఆత్మకర్మంబునన్= తాను చేసిన కర్మవలన; అతినీచము+అగు= మిక్కిలి నికృష్టమైన; భవమున్= జన్మను; పొందవలసెనే= పొందవలసివచ్చింది కదా; అని; నీవు; నిరంతరమును= ఎల్లప్పుడును; మనమునన్= మనస్సులో; దుఃఖింపన్‌వలదు= విచారించబోకుము.

తాత్పర్యం: గొప్పదైన నడవడిగల ఓమహానుభావా! ధర్మవ్యాధుడా! పూర్వజన్మలో చేసిన కర్మయొక్క విపరిపాకంవలన ఈ జన్మలో నీచమైన జన్మం ఏర్పడింది కదా అని నీవు మనస్సులో సదా విచారించ వలదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. నిజగుణదోషకర్మముల నెట్టన మేలును గీడు వచ్చుఁ; ద
త్ప్రజనితసౌఖ్యదుఃఖములఁ బ్రాజ్ఞులు దుల్యమనస్కులై మనో
రుజలును దేహజంబు లగు రోగములున్ హితధర్మకర్మభే
షజములఁ జేసి పాపుదురు సర్వము సాత్త్వికదృష్టిఁ జూచుచున్. 139

ప్రతిపదార్థం: నిజ, గుణ, దోష, కర్మములన్= తనదైన మంచిచెడుపనులవలన; నెట్టన= అవశ్యం, తప్పనిసరిగా; మేలును= శుభమున్నూ; కీడున్= చెడుగున్నూ; వచ్చున్= దాపురిస్తాయి; తద్+ప్రజనిత, సౌఖ్య, దుఃఖములన్= ఆవిధంగా ఏర్పడిన సుఖదుఃఖాలయందు; ప్రాజ్ఞులు= పండితులు; తుల్య, మనస్కులు+ఐ= సమమైన చిత్తం కలవారలై; మనస్+రుజలును= మానసికంగా ఏర్పడే రోగాలును; దేహజంబులు+అగు= దేహంనుండి పుట్టిన; రోగములున్= వ్యాధులును; హిత, ధర్మ, కర్మ, భేషజములన్+చేసి= అనుకూలమైన ధర్మంతో కూడిన పనులు అనే వైద్యాలను చేసి; సర్వము= అంతటిని; సాత్త్విక, దృష్టిన్+చూచుచున్= మంచితనంతో కూడిన చూపులతో చూస్తూ; పాపుదురు= తొలగద్రోస్తారు.

తాత్పర్యం: తాము లోగడ మంచిపనులను చేస్తే తదుపరి మేలు కలుగుతుంది. అట్లే చెడుపనులను చేసిఉంటే కీడు కలుగుతుంది. ఆవిధంగా ఏర్పడే సుఖదుఃఖాలను పండితులు సమబుద్ధితో అనుభవిస్తారు. అట్టిసాధుజనులు అన్నిటిని సాత్త్వికదృష్టితోనే చూస్తూ, తమకు ఏర్పడే మానసికవ్యాధులను, శారీరకవ్యాధులను అనువైన ధర్మకర్మలు చేయటంద్వారా పాపుకొంటారు.

క. ప్రియములు వాయుటయును న । ప్రియములు వెసఁ బొందుటయును బెల్లుగ నగుఁ ద
త్క్రియలందు మూఢమతికి హృ । దయతాపము పాయ దెపుడు దరికొనుచుండున్. 140

ప్రతిపదార్థం: ప్రియములు+పాయుటయును= ఇష్టాలైనవి ఎడబాయటమున్నూ; అప్రియములు= ఇష్టం కానివి; వెసన్= వేగంగా; పొందుటయును= లభించటమున్నూ; పెల్లుగన్+అగున్= ఎక్కువగా జరుగుతుంటాయి; తత్+క్రియలందున్= ఆ పనులలో; మూఢమతికిన్= అవివేకికి; హృదయతాపము= గుండెయందు ఏర్పడేవేదన; ఎపుడున్= ఎప్పుడును; పాయదు= పోదు; దరికొనుచుండున్= మండుతూ ఉంటుంది.

తాత్పర్యం: శుభాలు దూరం కావటం, అశుభాలు దాపురించటం ఎక్కువగా ఏర్పడేటప్పుడు మూఢుడు మిక్కుటమైన హృదయపరితాపానికి లోనౌతూ ఉంటాడు. అందుమూలాన ఆ తాపం తగ్గదు సరిగదా, సదా మండుతూ ఉంటుంది.

తే. వగతుమన్న నెవ్వారికి వగవఁ జనదు । చిత్తమున నేమిటికి సంతసింపరాదు
కాన గతమునందును ననాగతమునందు । వగవ రార్యులు సంతోషవంతు లగుచు. 141

ప్రతిపదార్థం: వగతుము+అన్నన్= దుఃఖించవలసివచ్చింది అని చెప్పినప్పటికి; ఎవ్వారికిన్= ఎవరికైనను; వగవన్+చనదు= శోకించకూడదు; చిత్తమునన్= మనస్సులో; ఏమిటికిన్= ఎందులకైనను; సంతసింపరాదు= ఉబ్బరాదు; కాన= కాబట్టి; గతమునందునున్= జరిగిపోయినకాలాన్ని గూర్చియున్నూ; అనాగతమునందున్= రానట్టి అనగా భవిష్యత్కాలాన్ని గూర్చియున్నూ; ఆర్యులు= పూజ్యులు; సంతోషవంతులు+అగుచున్= సంప్రీతిని చెందిన వారై; వగవరు= శోకించరు.

తాత్పర్యం: ఎంతటి కష్టాలు దాపురించినా దుఃఖించరాదు. అట్లే, ఎప్పుడును సంతోషించరాదు. ఆర్యులు జరిగిన కాలాన్ని గూర్చి గాని భవిష్యత్కాలాన్నిగూర్చిగాని శోకించక- సదా సంతృప్తులై ఉంటారు.

క. **వగపునఁ దేజోహీనుం । డగు నాత్మహితక్రియలకు నక్షముఁ డగు న**
వ్వగపు దొఱఁగి యుద్యోగము । దగఁ జేయఁగఁ గలుగు నంచితము లగు శుభముల్. 142

ప్రతిపదార్థం: వగపునన్= దుఃఖంవలన; తేజస్+హీనుండు+అగున్= కాంతి గోలుపోయినవాడు కాగలడు; ఆత్మహిత, క్రియలకున్= తనకు మేలు చేకూర్చే పనులకు; అక్షముఁడు+అగున్= సామర్థ్యం లేనివాడు కాగలడు; ఆ+వగపు+తొఱఁగి= ఆ దుఃఖం వదలి; ఉద్యోగము= ప్రయత్నం; తగన్+చేయఁగన్= సరిపడేటట్లుగాచేస్తే; అంచితములు+అగు= ఒప్పారునట్టి; శుభముల్= మేళ్లు; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: దుఃఖంవలన కాంతి కోలుపోవటం సంభవిస్తుంది; దుఃఖంవలన, తనకు మేలు కలిగించేపనులు నిర్వహించే సామర్థ్యం కొరవడుతుంది. దుఃఖాన్ని వీడి, సరిఅయిన ప్రయత్నాలను చేస్తే మంచిగా శుభాలు కలుగుతాయి.

వ. **కావున భూతంబుల సదసత్ప్రకారంబులు గనికొని ధీరుండ వై యుండు' మనిన ధర్మవ్యాధుండు 'మహాత్మా! నీ చెప్పినయంతవట్టు నిదర్శనంబులుగాఁగొని యేను నిఃఖేదుండ నై యున్నవాఁడ; భవిష్యత్కాలసద్భావంబునందు సమాహితుండ నై యుండువాఁడ' ననియె; నంత నా భూదేవుండు. 143**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; భూతంబుల, సత్+అసత్+ప్రకారంబులు= పదార్థాల ఆంతర్యాలకు సంబంధించిన సత్యం, అసత్యంయొక్క రీతులను; కనికొని= అరసి; ధీరుండవు+ఐ= స్థైర్యంకలవాడవై; ఉండుము= బ్రతుకుము; అనినన్= అని చెప్పగా; ధర్మవ్యాధుండు; మహా+ఆత్మ!= గొప్ప ఆత్మ కలవాడా!; (మహానుభావా); నీ చెప్పిన+అంత+పట్టు= నీవు చెప్పిన మేరకు; నిదర్శనంబులు+కాన్= ఉదాహరణాలు అయ్యేటట్లుగా; కొని= కడగి; ఏను= నేను; నిః+ఖేదుండను+ఐ= దుఃఖంలేని వాడనై అనగా పూర్ణసంతృప్తి కలవాడనై; ఉన్నవాఁడన్= ఉన్నాను; భవిష్యత్+కాల+సత్+భావంబునందున్= రాబోయే సమయంలో మంచిజరుగుతుందనే ఆలోచనలో; సమాహితుండను+ఐ= నిష్ఠకలవాడనై; ఉండువాఁడన్= ఉన్నాను; అనియెన్= అని చెప్పాడు; అంతన్= పిమ్మట; ఆ భూదేవుండు= ఆ బ్రాహ్మణుడు (కౌశికుడు).

తాత్పర్యం: కాబట్టి సర్వపదార్థాల ఆంతర్యంలోని సత్యాసత్యసమీక్ష చేసి స్థైర్యంతో బ్రదుకుము అని కౌశికముని చెప్పాడు. అంతట ధర్మవ్యాధుడు 'మహానుభావా! నీవు చెప్పిన ఆదర్శాలకు ఉదాహరణప్రాయంగానే నేను నా బ్రతుకును తీర్చిదిద్దుకొంటున్నాను. నేను నిత్యసంతృప్తుడను. భవిష్యత్కాలంలో నాకు శుభం చేకూరగల దని నానమ్మకం' అని అన్నాడు. అంతట కౌశికముని ఈ విధంగా బదులుపలికాడు.

చ. **'అతులిత పుణ్యమూర్తివి, కృతాత్ముఁడ వెందును నీవు ధర్మ మూ**
ర్జితముగ నెప్పు డేమఱక చేయుచు నుండుము, నిత్యశోభన
స్థితి వెలుఁగొందు; మేను భవదీయసమాగతిఁ జేసి ధర్మ సు
స్థితమతి నైతి న న్ననుమతింపు గుణాకర! పోయి వచ్చెదన్.' 144

ప్రతిపదార్థం: గుణ+ఆకర!= మంచిలక్షణాలకు నెలవైనవాడా, ఓధర్మవ్యాధా!; నీవు= నీవు; అతులిత పుణ్యమూర్తివి= సాటిలేని సుకృతాలు ఆకృతి తాల్చినవాడవు; కృత+ఆత్ముఁడవు= సిద్ధిపొందిన ఆత్మకలవాడవు అనగా ధన్యుడవు; ఎందును= ఎచ్చటను; నీవు= నీవు; ధర్మము= ధర్మమును; ఊర్జితముగన్= సదా వికసించేటట్లుగా; ఎప్పుడున్= ఎల్లవేళల; ఏమఱక= ఎట్టి మరపు లేకుండ; చేయుచున్+ఉండుము= ఆచరిస్తూ ఉండుము; నిత్య, శోభన, స్థితిన్= ఎల్లప్పుడూ శుభాలు ఏర్పడేటట్లుగా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వెలుగొందుము= ప్రకాశించుము; ఏను= నేను; భవదీయ, సమాగతిన్+చేసి= నీ కలయికవలన; ధర్మ, సు, స్థిత, మతిన్+ఐతిన్= ధర్మం ఎల్లప్పుడు పాదుకొని ఉండే బుద్ధికలవాడను అయినాను; నన్నున్+అనుమతింపుము= నాకు సెలవు దయచేయునది; పోయి వచ్చెదన్= నీదగ్గర వీడ్కోలు గైకొని వెళ్ళగలవాడను.

తాత్పర్యం: 'మంచిగుణాలకు నెలవైన ఓ ధర్మవ్యాధుడా! నీవు పున్నెములప్రోవవు. నీజీవితం ధన్యమైనది. సదా ధర్మాన్నే ఆచరించేవాడవై నీ బ్రతుకును తీర్చిదిద్దుకొనుము; నీ చరిత్రలవలన ధర్మం విస్తరించి వెలుగొందగలదు. నీకు ఎల్లప్పుడు మేలు కలుగు గాక. నిన్ను కలిసికొనటంచేత నా జన్మం ధన్యమైనదిగా భావిస్తున్నాను. నీవలన నేను ధర్మసూక్ష్మాలను తెలిసికొన గలిగాను. నీమూలాన నాకు జ్ఞానోదయమైనది. ఇక దయచేసి నాకు సెలవును అనుగ్రహించుము. నిన్ను వీడ్కొని నేను పోయి వస్తాను.'

వ. అని వానికిం బ్రదక్షిణంబు సేసి వీడ్కొని చని కౌశికుండు నిజజననీజనకుల కతిభక్తి శుశ్రూష చేసి కృతార్థుం డయ్యెం; బాండవోత్తమా! నీయడిగిన తెఱంగునం బతివ్రతామాహాత్మ్యంబును బితృశుశ్రూషావిశేషంబును హీనవర్ణుం డైనవాఁడు ధర్మంబు సలుపు నుపాయంబును జెప్పితి' ననిన విని ధర్మతనయుండు సంతసిలి మఱియు మార్కండేయు నిట్లని యడిగె. 145

ప్రతిపదార్థం: అని= ఆరీతిగా పలికి; వానికిన్+ప్రదక్షిణంబు+చేసి= (ధర్మవ్యాధుడికి) కుడివైపుగా చుట్టుదిరిగి (నమస్కరించి); వీడ్కొని= సెలవుగైకొని; చని= వెళ్ళి (మిథిలానగరినుండి స్వస్థలానికి వెళ్లి); నిజ, జననీజనకులకున్= తనతల్లికిని తండ్రికిని; అతిభక్తిన్= మిక్కుటమైన పూజ్యభావంతో; శుశ్రూష, చేసి= సేవ ఒనరించి; కృతార్థుండు+అయ్యెన్= ధన్యుడు అయ్యాడు (కౌశికుడు); పాండవ+ఉత్తమా!= పాండురాజు కొడుకులలో శ్రేష్ఠుడవు అయినవాడా! (ఓధర్మరాజా!); నీ+అడిగిన= నీవు ప్రశ్నించిన; తెఱంగునన్= పద్ధతిచొప్పున; పతివ్రతా, మాహాత్మ్యంబును= పతిసేవ చేసే సతుల గొప్పతనాన్ని; పితృ, శుశ్రూషా, విశేషంబును= (తలి)దండ్రులకు సేవచేయుటంలోని గొప్పతనాన్ని; హీనవర్ణుండు+ఐనవాఁడు= తక్కువకులంలో పుట్టినట్టివాడు; ధర్మంబు= ధర్మాన్ని; సలుపు= చేసే; ఉపాయంబును= తెరువును; చెప్పితిన్= వచించాను; అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ధర్మతనయుండు= ధర్మరాజు; సంతసిలి= సంతోషించి; మఱియున్= ఇంకా; మార్కండేయున్= మృకండుడి కొడుకు అయిన మార్కండేయుడిని; ఇట్లు+అని= ఈ విధంగా; అడిగెన్= ప్రశ్నించాడు.

తాత్పర్యం: అంతట కౌశికముని ధర్మవ్యాధుడికి ప్రదక్షిణనమస్కారం చేసి అతడివీడ్కోలు గైకొని తన స్వస్థానానికి వెళ్ళాడు. అచట ఆతడు తన తలిదండ్రులకు సేవచేసి తరించాడు. ఓ ధర్మరాజా! ఇంతకుముందు నీవడిగిన ప్రశ్నలు 1) భర్తకు శుశ్రూష చేసి ధన్యత్వం చెందిన పతివ్రతలమహిమ, 2) తలిదండ్రులకు పరిచర్య చేయటంలోని విశేషం 3) తక్కువకులంలో పుట్టినవాడు ధర్మాత్ముడై వెలుగొందే విధానం గూర్చి నీకు సోదాహరణంగా వివరించిఉన్నాను'- అని మార్కండేయ మహర్షి ధర్మరాజుతో అన్నాడు. ధర్మరాజు మిక్కిలి సంతోషించి మఱియు ఇట్లా పలికాడు.

తే. 'అగ్నిదేవుండు తొల్లి మహాతపంబు । సేసె నని విందు; నది యేల చేసె ననఘ!
యంగిరసుఁ డేమి కతమున నగ్ని యయ్యె? । నగ్ను లెన్ని విధంబుల నతిశయిల్లు? 146

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడ వైన ఓ మార్కండేయ మహర్షీ!; తొల్లి= పూర్వకాలంలో; అగ్ని దేవుండు= అగ్ని దేవుడు; మహా+తపము= గొప్ప తపస్సు; చేసెన్; అని; విందున్= వింటాను; అది= (అట్టి తపస్సు); ఏల= ఎందుకు; చేసెన్= చేశాడు?;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంగిరసుఁడు= అంగిరసుడు (అనే పేరుగల ముని); ఏమి, కతమునన్= ఏ కారణం వలన; అగ్ని+అయ్యెన్?= అగ్ని అయినాడు?; అగ్నులు= నిప్పులు; ఎన్ని విధంబులన్= ఎన్ని రీతుల; అతిశయిల్లున్?= ఒప్పారుతాయి?

తాత్పర్యం: 'మహానుభావా! అగ్నిదేవుడు పూర్వకాలంలో గొప్ప తపస్సు చేసి ఉన్నట్లు విని ఉన్నాను. ఆ విధంగా అగ్ని దేవుడు గొప్ప తపస్సు చేయటానికి గల కారణ మేమి? అంగిరసుడు అగ్నిగా మారినట్లు విన్నాను. దానికి కారణం ఏమిటి? అగ్నులు ఎన్ని విధాలు?

మార్కండేయుఁడు ధర్మరాజునకు నంగిరసుం డగ్నియైన తెఱంగు సెప్పుట (సం. 3-207-5)

వ. **ఇంతయు వినవలతు' ననిన, నమ్మహాముని యిట్లని చెప్పె; 'నగ్నిదేవుండు దేవతలతోడి యలుకం జేసి హవ్యంబులు వహింప నొల్లక వనంబునకుం జని బహుకాలంబు ఘోరతపంబు సేయుచు నత్యంతకృశుం డై యాత్మ గతంబున.** **147**

ప్రతిపదార్థం: ఇంతయున్= దీనినంతటిని; వినవలతున్= ఆలకింప కోరుతున్నాను; అనినన్= అని చెప్పగా; ఆ+మహా+ముని= ఆ గొప్ప ఋషి; ఇట్లు+అని, చెప్పెన్= ఈ విధంగా వచించాడు; అగ్ని దేవుండు= అగ్ని దేవుడు; దేవతలతోడి అలుకన్+చేసి= దేవతలమీదికోపంచేత; హవ్యంబులు= యజ్ఞాలలో వేల్చబడే హోమ ద్రవ్యాలు; వహింపన్+ఒల్లక= మోయటానికి ఇష్టపడక; వనంబునకున్+చని= అడవికి వెళ్లి; బహుకాలంబు= పెక్కు నాళ్లు; ఘోర, తపంబు= మిక్కిలి భయంకరమైన తపస్సు; చేయుచున్= చేస్తూ; అత్యంత, కృశుండు+ఐ= మిక్కిలి చిక్కిపోయిన శరీరం కలవాడై; ఆత్మ గతంబునన్= తనలో తాను.

తాత్పర్యం: ఈ విషయాన్ని సవిస్తరంగా వినగోరుతున్నాను' అని ధర్మరాజు అడిగాడు. అంతట మార్కండేయ మహర్షి ఇట్లా బదులు పలికాడు: 'అగ్ని దేవుడు దేవతలపై కోపించి హోమద్రవ్యాలు మోయటానికి ఇష్టపడక, అడవికి పోయి మిక్కిలి కఠోర మైన తపస్సు చేయటానికి పూనుకొన్నాడు. నిరంతర తపస్సువలన అతడి శరీరం మిక్కిలి చిక్కిపోయింది. అప్పుడు అగ్నిదేవుడు ఈ విధంగా చింతించాడు.

విశేషం: సనాతన సంస్కృతిలో అగ్ని హవ్యవాహనుడుగా సుప్రసిద్ధుడు. యజ్ఞాలలో హోమద్రవ్యాలను అగ్నిలో వేలుస్తారు. అగ్ని వాటిని కొనిపోయి దేవతలకు అర్పిస్తాడని పురాణకథనం.

చ. **'అలుకమెయిం దొలంగి విపినాంతరభూమికి వచ్చి యిట్లు నే**
వెలుఁగక యున్నచో భువనవృత్తము సర్వము నిల్చు, నిల్చినన్
జలరుహసూతి వేఱొకనిఁ జయ్యన నగ్ని పదంబునందుఁ దా
నిలుపక యున్నె? నే నిచట నిల్చుట పోలదు పోయెదన్ వెసన్'. **148**

ప్రతిపదార్థం: అలుకమెయిన్= కోపవశాన; తొలంగి= ఉన్నచోటు విడిచి; విపిన+అంతర, భూమికిన్= అడవి మధ్య భాగానికి; వచ్చి= చేరి; ఇట్లు= ఈ విధంగా; నేన్= నేను; వెలుఁగక+ఉన్నచోన్= మండకుండా ఉంటే; భువన వృత్తము= లోక వ్యవహారం; సర్వమున్= అంతా; నిల్చున్= ఆగిపోతుంది; నిల్చినన్= ఆగిపోయిన యెడల; జలరుహసూతి= పద్మంలో పుట్టినవాడు-బ్రహ్మదేవుడు; వేఱు+ఒకనిన్= ఇంకొకరిని; చయ్యనన్= శీఘ్రంగా; అగ్ని పదంబునందున్= అగ్ని యొక్క పదవియందు;

తాన్= తాను; నిలుపక+ఉన్నె= నిలబెట్టి ఉంచడా? నేన్= నేను; ఇచటన్= (అడవిలో); నిల్చుట= ఉండటం; పోలదు= ఉచితం కాదు; వెసన్= శీఘ్రంగా; పోయెదన్= తిరిగిపోతాను, అనగా అడవినుండి మరలి స్వస్థలానికి చేరగలను అని భావం.

తాత్పర్యం: దేవతలపై కోపించి నేను ఈ విధంగా ఈ అడవికి వచ్చి ఉన్నాను. నేను మండక పోతే లోక వ్యవహారం అంతా నిలిచి స్తంభించి పోతుంది కదా! అందుచేత సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు ఈ కర్తవ్యం నిర్వహించటానికై నాస్థానంలో మరియొకడిని నియమించడా? అందుచేత నేను ఇక్కడ చిరకాలం జాగు చేయటం మంచిది కాదు. కాబట్టి నేను ఇక్కడినుండి తిరిగి నా స్వస్థానానికి శీఘ్రమే మరలి పోతాను.

వ. **అని తలంచి తపంబు సాలించి నిజపదంబున కున్ముఖుండై చని చని, యంతకు మున్న బ్రహ్మనియోగంబునం ద్రిలోకంబులకు నగ్నియై వెలుంగుచున్నవాని నధికతపో విజృంభితు నంగిరసుం గని, భయంపడి, యెప్పటి యట్ల మగిడిపోవు నెడ నంగిరసుం డతనిపాలికిం జనుదెంచి, యిట్లనియె.** **149**

ప్రతిపదార్థం: అని, తలంచి= అంటూ ఆలోచించి; తపంబు= తపస్సు; చాలించి= విడిచి పెట్టి; నిజ, పదంబునకున్= తన పదవికి; ఉన్ముఖుండు+ఐ= ఇష్టపడినవాడై; చని, చని= వెళ్లి వెళ్లి (అడవి నుండి బహుదూర ప్రయాణం చేసి అని అర్థం); అంతకున్, మున్న+అ= అంతకు పూర్వమే; బ్రహ్మ, నియోగంబునన్= బ్రహ్మదేవుడి ఏర్పాటు వలన; త్రిలోకంబులకున్= మూడు లోకాలకున్నూ; అగ్ని+ఐ= నిప్పు అయి; వెలుంగుచున్నవానిన్= ప్రకాశిస్తున్నవాడిని; అధిక, తపస్+విజృంభితున్= మిక్కుటమైన తపస్సుచేత అతిశయించి ఉన్నవాడిని; అంగిరసున్+కని= అంగిరసుడు (అనే వాడిని) చూచి; భయము+పడి= భీతిచెంది; ఎప్పటి+అట్లు+అ= యథా ప్రకారం (అనగా లోగడ ఉన్నట్లుగనే); మగిడిపోవు+ఎడన్= తిరిగి పోయేటప్పుడు; అంగిరసుండు; అతని పాలికిన్+చనుదెంచి= అగ్నిదేవుడి దగ్గరకు వచ్చి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అగ్నిదేవుడు తనలో తాను ఆవిధంగా ఆలోచించుకొని, తన తపస్సు విరమించి, తిరిగి తన పదవిని అధిష్ఠించదలచి అడవిని వీడి తరలి వెళ్ళాడు. కాని అగ్నిదేవుడు స్వస్థానాన్ని చేరటానికి ముందే బ్రహ్మదేవుడు అగ్నిదేవుడి పదవిలో అంగిరసుడు అనే మునీశ్వరుడిని నియోగించి ఉన్నాడు. అంగిరసుడు త్రిలోకాలకు అగ్నిహోత్రుడై గొప్ప తేజస్సుతో ప్రకాశించి విజృంభించాడు. మహాతేజస్వి అయిన అంగిరసుడిని చూచి భయపడి అగ్నిదేవుడు మరలి పోసాగాడు. అంతట అంగిరసుడు అగ్నిదేవుడిని గుర్తించి, అతడి కడకు వెళ్లి ఇట్లా అన్నాడు.

చ. **'అనఘ! జగత్త్రయార్చితుఁడవై తిమిరాపహరుండవై తగన్**
వనరుహగర్భుచేఁ బ్రథమవహ్నిపదంబునఁ గల్పితుండ వై
తనరుదు; రమ్ము! నీ దగు పదంబున నే నిటులుండ నోడుదున్;
ఘనముగ నీవు నీ పదము గైకొనవే! యవికల్పభావనన్'. **150**

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా! (ఓ అగ్ని దేవుడా); జగత్+త్రయ+అర్చితుఁడవు+ఐ= మూడులోకాల చేత పూజించబడిన వాడవై; తగన్= ఒప్పేటట్లుగా; వనరుహ గర్భుచేన్= బ్రహ్మదేవుడిచేత; ప్రథమ, వహ్ని, పదంబునన్= మొట్టమొదటి అగ్ని పదవిలో; కల్పితుండవు+ఐ= నియమించబడిన వాడవై; తనరుదు= విరాజిల్లుతావు; రమ్ము; నీదు+అగు, పదంబునన్= నీకు సంక్రమించిన పదవిలో; ఏన్= నేను; ఇటులు+ఉండన్+ఓడుదున్= ఉండటానికి జంకుతున్నాను; ఘనముగన్= గొప్పగా; ఈవు= నీవు; అవికల్ప, భావనన్= తిరుగు లేని ఆలోచనతో; నీ పదము= నీ పదవిని; కైకొనవే!= స్వీకరించుమయ్యా!.

తాత్పర్యం: పాపరహితుడ వైన ఓ అగ్నిదేవుడా! నీవు మూడులోకాలచేత పూజించబడినవాడవు; మొట్టమొదట బ్రహ్మదేవుడిచేత అగ్నిహోత్రపదవిలో నెలకొల్పబడినవాడవు. నీ పదవిని తిరిగి నీవే చేపట్టటం ధర్మం. నేను నీ పదవిలో ఉండటానికి సరిపోను. నీవు తిరిగి నీ పదవిని గొప్పగా అలంకరించుము. నీకు ఎట్టి జంకు గొంకులు అవసరం లేదు సుమా! ఇది నేను చిత్తశుద్ధితో నీకు చేసే విన్నపం.

వ. అనిన నగ్నిదేవుం డిట్లనియె. 151

తాత్పర్యం: అనగా అగ్నిదేవుడు ఈ విధంగా అన్నాడు.

క. 'విను నా కీర్తి జగంబులఁ । బొనుఁగు పడియె; నీవు భువనపూజితవృత్తిం
బనుపడితి గానఁ దగు నీ । యనలపదము నీక; నాకు నలవడ దింకన్. 152

ప్రతిపదార్థం: విను(ము)= ఆలకింపుము; నా కీర్తి= నాయొక్క యశస్సు; జగంబులన్= లోకాలలో; పొనుఁగు పడియెన్= నిస్తేజమై పోయింది; ఈవు= నీవు; భువన, పూజిత, వృత్తిన్= లోకాలచేత ఆరాధించబడిన క్రియకు; పనుపడితివి= పూనుకొన్నావు; కానన్= కాబట్టి; ఈ అనలపదము= ఈ అగ్నిహోత్రుడి పదవి; నీకున్+అ= నీకే; తగున్= ఒప్పుతుంది; ఇంకన్= ఇకమీద; నాకున్= నాకు; అలవడదు= ఒప్పదు.

తాత్పర్యం: అని చెప్పిన పిదప, అగ్నిహోత్రుడు ఈవిధంగా బదులు పలికాడు. 'మహాశయా!, నా విన్నపం అవధరింప వేడికోలు. నా కీర్తి లోకంలో మరుగుపడింది. నీవా ఇప్పుడు జగజ్జేగీయమానంగా వెలుగొందుతున్నావు. లోకాలు నిన్ను ఆరాధిస్తున్నవి. అందుచేత అగ్నిహోత్రపదవి నీకు మాత్రమే ఒప్పుతున్నది. ఆ పదవి నాకు ఇక సరిపడదు.

వ. 'నీవు ప్రథమాగ్నివైయుండు; మేను ద్వితీయంబగు ప్రాజాపత్యవహ్నినైవర్తించెద' ననిన నంగిరసుండు 'దేవా! యి ట్లానతీ వలదు; ప్రథమాగ్నిత్వంబు నీవ కైకొని, నన్ను నీకుం బ్రథమపుత్త్రుంగా నాదరింపు' మనినం. బావకుండు దాని కొడంబడియె; నివ్విధంబున నంగిరసుం డగ్నికి నగ్రతనయుం డై యగ్నిసారూప్యంబునం దేజరిల్లె; నయ్యంగిరసునకు శివ యను దానికి బృహత్కీర్తియు, బృహజ్జ్యోతియు, బృహద్బ్రహ్మయు, బృహన్మనసుండును, బృహన్మంత్రుండును, బృహద్భానుండును, బృహస్పతియు నన నేడ్వురు గొడుకులు, మఱియు భానుమతియును, రాగయు, సినీవాలియుఁ, గుహువు, నర్చిష్మతియు, మహిష్మతియు, మహామతియు నన నేడ్వురు గూఁతులుం బుట్టిరి. 153

ప్రతిపదార్థం: నీవు= నీవు; ప్రథమ+అగ్నివి+ఐ+ఉండుము= మొదటి అగ్నివి అయి ఉండునది; ఏను= నేను; ద్వితీయంబు+అగు= రెండవది అయిన; ప్రాజాపత్య, వహ్నిని+ఐ= ప్రాజాపత్యం అనే పేరుగల నిప్పునై; వర్తించెదన్= మెలగుతాను; అనినన్= అని చెప్పగా; అంగిరసుండు; దేవా; ఇట్లు+ఆనతి+ఈవలదు= ఈవిధంగా శాసించవలదు; ప్రథమ+అగ్నిత్వంబు= మొదటి అగ్నిగా ఉండే పదవి; నీవు+అ= నీవు మాత్రమే; కైకొని= స్వీకరించి; నన్నున్; నీకున్+ప్రథమ, పుత్త్రున్+కాన్= నీ మొదటి కొడుకు వలె; ఆదరింపుము= కరుణతో కాపాడుము; అనినన్= అని చెప్పగా; పావకుండు= అగ్ని; దానికిన్= (ఆమాటకు); ఒడంబడియెన్= సమ్మతించాడు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; అంగిరసుండు; అగ్నికిన్; అగ్రతనయుండు+ఐ= మొదట కొడుకై; అగ్ని, సారూప్యంబునన్= అగ్నితో సమానమైన ఆకారంతో; తేజరిల్లెన్= వెలుగొందాడు; ఆ+అంగిరసునకున్; శివ+అనుదానికిన్=

"శివ'' అనే పేరు గల ఆమెకు; బృహత్కీర్తియున్; బృహత్+జ్యోతియున్; బృహత్+బ్రహ్మయున్; బృహత్+మనసుండును; బృహత్+మంత్రుండును; బృహత్+భానుండును; బృహస్పతియున్; అనన్= అనే పేరులు గల వారలు; ఏడ్వురు, కొడుకులు= ఏడుగురు పుత్రులును; మఱియున్= అదనంగా; భానుమతియును; రాగయున్; సినీవాలియున్; కుహువున్; అర్చిష్మతియున్; మహిష్మతియున్; మహా మతియున్; అనన్= అని పిలువబడే; ఏడ్వురు+కూఁతులున్= ఏడుగురు పుత్రికలు; పుట్టిరి= జన్మించారు.

తాత్పర్యం: 'నీవు మొదటి అగ్నిపదవిలో ఉండుము. నేను ప్రాజాపత్యం అనే పేరు గల ద్వితీయ మైన అగ్ని పదవిలో ఉండగలను'. అని అగ్నిహోత్రుడు పలుకగా, అంగిరసుడు ఇట్లు బదులు పలికాడు. 'దేవా! నీవే ప్రథమాగ్ని హోత్ర పదవి గైకొని, నన్ను నీ అనుగు పుత్రుడిగా ఆదరించుము.' ఆ సూచనను అగ్ని ఆమోదించాడు. ఈ విధంగా అంగిరసుడు అగ్నిహోత్రుడికి మొదటి కొడుకు అయ్యాడు. అంగిరసుడికి శివ అనే భార్య వలన ఏడుగురు కొడుకులు- 1. బృహత్కీర్తి 2. బృహజ్జ్యోతి 3. బృహద్బ్రహ్మ 4. బృహన్మనసుడు 5. బృహన్మంత్రుడు 6. బృహద్భానుడు 7. బృహస్పతి పుట్టారు. అంతేకాక ఏడుగురు పుత్రికలు జన్మించారు. వారి పేర్లు వరుసగా ఇవి- 1. భానుమతి 2. రాగ 3. సినీవాలి 4. కుహువు 5. అర్చిష్మతి 6. మహిష్మతి 7. మహామతి.

విశేషం: అగ్నులు మూడు విధాలు 1. గార్హపత్యం 2. దక్షిణం 3. ఆహవనీయం. ఇందు ప్రాజాపత్యం అనే అగ్ని గార్హపత్యానికి సంబంధించింది. ప్రాజాపత్యము= (మీరిరువురు కూడి ధర్మం చేయండని వరుడితో సంభాషించి కన్యాదానం చేసే వివాహవిధికి ప్రాజాపత్యం అని అర్థం.)

క. తనయుఁడు బృహస్పతికి న । త్యనఘుఁడు శంయుండు పుట్టి యాగంబులలో
మునుమును హవిషాజ్యము దాఁ । గొనియెడు వాఁ డయ్యె నధికగుణయుక్తి మెయిన్. 154

ప్రతిపదార్థం: బృహస్పతికిన్= బృహస్పతి అనే కుమారుడికి; తనయుఁడు;= కొడుకు; అతి+అనఘుఁడు= పాపం ఏ మాత్రమున్నూ లేని మహానుభావుడు; శంయుండు; పుట్టి; యాగంబులలోన్= యజ్ఞాలలో; మును మును= ముందుగా; హవిష+ఆజ్యము= హోమద్రవ్యంగా అగ్నిలో వేసే నేతిని; అధిక, గుణయుక్తిమెయిన్= హెచ్చిన మంచి గుణాలతో కూడి ఉండటం చేత; తాన్= తాను; కొనియెడువాఁడు+అయ్యెన్= స్వీకరించేవాడు అయ్యాడు.

తాత్పర్యం: అంగిరసుడి కుమారులలో బృహస్పతికి శంయుడు జన్మించాడు. ఆ శంయుడు మహానుభావుడు. గొప్ప గుణాలు కలవాడు. క్రతువులు జరిగేటప్పుడు హోమంలో వేల్చే నేతిని మొట్టమొదట శంయుడికి సమర్పించేవారు. అనగా- క్రతువులలో అతడికి మొదటి పీట వేసి, పూజించేవారు.

వ. ఆ శంయునకు ధర్మపత్ని యైన సత్యకు భరద్వాజుండును భరతుండును నా నిరువురు కొడుకులు పుట్టి; రందు భరతునకు భారతుం డను కొడుకును, భారతి యను కూఁతురుం బుట్టిరి; భరద్వాజునకు వీర యను దానికి వీరుండు పుట్టె. 155

తాత్పర్యం: ఆ శంయునకున్నూ ఆతని భార్య యైన సత్యకున్నూ భరద్వాజుడు భరతుడు అనే పేరులు గల ఇరువురు కొడుకులు జన్మించారు. ఆ భరతుడికి భారతుఁడు, అనే ఒక కొడుకు భారతి అనే ఒక కూతురు కలిగారు. భరద్వాజునకు అతడి భార్య వీర అనే ఆమెకును వీరుడు అనేవాడు జన్మించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వానికి సరయువునకుఁ బటు। భానుం డై పుట్టె సుతుఁడు భానుఁ డనఁగ; నా
భానునకు నిశ్చ్యవనుఁ డనఁ। గా నాత్మజుఁ డుద్భవించెఁ గడు నుజ్జ్వలుఁ డై. 156

ప్రతిపదార్థం: వానికిన్= ఆ వీరుడికి; సరయువునకున్= సరయువు అనే పేరు గల ఆతని భార్యకు; పటు భానుండు+ఐ= మిక్కిలిగా వెలుగొందువాడై; భానుఁడు+అనఁగన్= భానుడు అనే పేరు కలవాడుగా; సుతుఁడు= కొడుకు; పుట్టెన్= జన్మించాడు; ఆ భానునకున్; నిశ్చ్యవనుఁడు+అనఁగాన్= నిశ్చ్యవనుడు అనే పేరుకలవాడుగా; ఆత్మజుఁడు= కొడుకు; కడున్= మిక్కిలి; ఉత్+జ్వలుఁడు+ఐ= ప్రకాశించేవాడై; ఉద్భవించెన్= జన్మించాడు.

తాత్పర్యం: వీరుడు అనువాడికి తేజస్వి అయిన భానుడు పుట్టాడు. భానుడికి నిశ్చ్యవనుఁడు జన్మించాడు.

చ. అతనికిఁ బుట్టెఁ బుత్త్రుఁడు నిరంతరతేజుఁ డుదారకీర్తి ని
ష్కృతి యను పేరివాఁడు విను కిల్బిషభాజను లైన మానవుల్
సతతము నా కృశాను నతిసక్తమనస్స్థితిఁ గొల్చి దోష ని
ష్కృతిఁ దగఁ గాంతు; రట్లగుట గీర్తిత మయ్యెఁ దదాఖ్య వానికిన్. 157

ప్రతిపదార్థం: అతనికిన్= (ఆ నిశ్చ్యవనుడికి); పుత్త్రుడు= కొడుకు; నిరంతర, తేజుఁడు= ఎల్లప్పుడు కాంతితో వెలుగొందేవాడు; ఉదార, కీర్తి= గొప్ప యశస్సు కలవాడు; నిష్కృతి+అను, పేరివాఁడు= 'నిష్కృతి' అనే నామం కలవాడు; పుట్టెన్; విను; కల్బిష భాజనులు+ఐన= పాపానికి పాత్రు లైన; మానవుల్= జనులు; సతతమున్= ఎల్లప్పుడును; ఆ కృశానున్= ఆ అగ్నిని; అతి, సక్త, మనస్,+స్థితిన్= మిక్కుటంగా లగ్నమైన చిత్తంతో; కొల్చి= ఆరాధించి; దోష, నిష్కృతిన్= పాపాల నుండి విడుదలను; తగన్= ఒప్పిదముగా, కాంతురు= పొందుతారు; అట్లు+అగుటన్= ఆ విధంగా జరగటం చేత; వానికిన్= ఆ నిష్కృతి అనే పేరు గల వాడికి; తత్+ఆఖ్య= ఆ పేరు; కీర్తితము+అయ్యెన్= పొగడ్తకెక్కినది అయింది.

తాత్పర్యం: ఆ నిశ్చ్యవనుడికి మిక్కిలి తేజస్వి అయిన నిష్కృతి అనే పేరు కలవాడు జన్మించాడు. అతడు సార్థక నామధేయుడు. నిష్కృతి అనగా విడుదల. ఆ అగ్నిని ఆరాధించే మానవులకు సమస్త పాపాల నుండి విడుదల లభిస్తూ ఉంటుంది కాబట్టి ఆతడికి అట్టి పేరుప్రతిష్ఠలు ఏర్పడ్డాయి.

క. ఘనుఁడు రుజస్కరుఁ డనఁగా। జనియించెను నాతనికి; రుజస్కరునకు న
త్యనుపమకాంతిపరుం డై। జనియించెం గ్రోధుఁ డనఁగ జనవరతిలకా! 158

ప్రతిపదార్థం: జనవర తిలకా!= రాజ శ్రేష్ఠుడా!; ఆతనికిన్= (ఆ నిష్కృతికి); ఘనుఁడు= గొప్పవాడు; రుజస్కరుఁడు+అనఁ గాన్= రుజస్కరుడు అనే పేరు కలవాడు; జనియించెను= పుట్టాడు; రుజస్కరునకున్; అతి+అనుపమ, కాంతి పరుండు+ఐ= మిక్కుటంగా ఉండి, సాటిలేనట్టిదైన వెలుగుతో వెలుగొందేవాడై; క్రోధుఁడు+అనఁగన్= క్రోధుడు అనే పేరు కలవాడు; జనియించెన్= పుట్టాడు.

తాత్పర్యం: రాజులలో గొప్పవాడ వయిన ఓ ధర్మరాజా! గొప్పవాడయిన ఆ నిష్కృతికి రుజస్కరుడు జన్మించాడు. ఆ రుజస్కరుడికి క్రోధుఁడు అనేవాడు ఉద్భవించాడు. అతడు అపరిమిత కాంతిమంతుడు.

వ. ఆ క్రోధునకు రసుండు పుట్టె; రసునకు స్వాహా యను కన్యకయుం గాముం డను కొడుకునుం బుట్టిరి; కామునకు నమోఘుండు పుట్టె; నమోఘునకు నుక్థుండు పుట్టె; మఱియుం గాశ్యపుండును వాసిష్ఠుండును

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బ్రాణుండును నాంగిరసుండును జ్యవనుండును నను వా రేవురు తేజస్వి యైన కొడుకుం బడయుదు మని యనేక వర్షంబులు ఘోర తపంబు సేసి మహావ్యాహృతిస్మరణంబు సేయుచున్నంత. 159

తాత్పర్యం: క్రోధుడికి రసుడు, రసుడికి స్వాహా అనే కన్యక, కాముడనే కొడుకు పుట్టారు. కాముడికి అమోఘుడు పుట్టాడు. అమోఘుడికి ఉక్థుండు పుట్టాడు. అంతియేకాక-కాశ్యపుడు వాసిష్ఠుడు ప్రాణుడు ఆంగిరసుడు చ్యవనుడు-అనే ఐదుగురున్నూ తేజస్వి అయిన కొడుకును పొందటానికి పెక్కేళ్ళు కఠోరమైన తపస్సు చేసి మహావ్యాహృతిమంత్రాన్ని జపిస్తూ ఉన్నారు.

విశేషం: 'వ్యాహృతి'= సంధ్యావందనం చేసే వేళలలో బ్రాహ్మణులు ఉచ్చరించే ఊర్ధ్వలోక నామ సంకీర్తన రూపమైన మంత్ర విశేషం.

చ. అనలము చాయ మస్తకము, నర్కనిభం బగు బాహుయుగ్మముం,
గనకసముజ్జ్వలంబు లగు కన్నులుఁ, జర్మము కృష్ణవర్ణతం
దనరిన జంఘలుం గల యుదాత్తపు దేహము దేజరిల్లఁగాఁ
దనయుఁడు పుట్టె వారలకుఁ దద్దయు నద్భుత మంద లోకముల్. 160

ప్రతిపదార్థం: అనలము= నిప్పు; చాయ= రంగు; మస్తకము= శిరస్సు; అర్క, నిభంబు+అగు= సూర్యుడితో సరిపోలునట్టి; బాహు, యుగ్మమున్= చేతుల జంటయును; కనక, సమ్, ఉత్+జ్వలంబులు+అగు= బంగరువలె మెరసిపోయే; కన్నులున్= నేత్రాలును; చర్మము= తోలు; కృష్ణవర్ణతన్= నల్లని రంగుతో; తనరిన= ఒప్పిన; జంఘలున్= కాలి పిక్కలును; కల= ఉన్న; ఉదాత్తపు దేహము= గొప్ప దైన శరీరం; తేజరిల్లఁగాన్= ప్రకాశించగా; వారలకున్= వారికి (ఆ యేవురకును); లోకముల్= భువనాలు; తద్దయున్= మిక్కుటంగా; అద్భుతము+అందన్= అచ్చెరువు పొందేటట్లుగా; తనయుఁడు= కొడుకు; పుట్టెన్= జన్మించాడు.

తాత్పర్యం: ఆ యేవురకును జగములు అచ్చెరువు పొందేటట్లుగా ఒక కొడుకు జన్మించాడు. ఆ పుత్రుడి దేహం మిక్కిలి ఉదాత్తమైనది. ఆతడి శిరస్సు నిప్పురంగు కలది. రెండు చేతులు సూర్యుడి వలె మిరుమిట్లు కొల్పుతూ వెలుగొందు నట్టివి. కన్నులు బంగరు వన్నె ధగధగలు కలవి. అతడి శరీరం నల్లనిది. బలమైన పిక్కలు అతనికి ఉన్నాయి.

వ. ఇట్లు పుట్టిన యప్పావకుండు పంచజనకప్రభవుండు గావునం బాంచజన్యుం డను పేరం బ్రసిద్ధుం డై దశ సహస్రవర్షంబులు దపంబు సేసి నిజమస్తకంబున బృహద్రథంతరులనువారలను, వదనంబున హరిని, నాభియందు శివుని, బలంబున నింద్రునిం, బ్రాణముల వాయ్వగ్నులను, బాహుయుగదంతపుటంబుల విశ్వభూతంబుల సృజియించె మఱియును. 161

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పుట్టిన= జన్మించిన; ఆ పావకుండు= ఆ అగ్ని; పంచ, జనక, ప్రభవుండు= ఐదుగురు తండ్రులకు పుట్టిన వాడు; పాంచజన్యుండు= పాంచజన్యుడు (అయిదుగురకు పుట్టినవాడు); అను, పేరన్= అనే పేరు మీద; ప్రసిద్ధుండు+ఐ= కీర్తి కెక్కిన వాడై; దశ, సహస్ర, వర్షంబులు= పది వేల ఏండ్లు; తపంబు+చేసి= తపస్సు ఆచరించి; నిజ, మస్తకంబునన్= తనదైన శిరస్సునందు; బృహద్రథంతరులు+అను, వారలను= బృహద్రథంతరులు అనే వారలను; వదనంబునన్=

మొగము నందు; హరిని= విష్ణువును; నాభియందున్= బొడ్డునందు; శివునిన్= ఈశ్వరుడిని; బలంబునన్= శుక్లం వలన; ఇంద్రునిన్= వేల్పుల దొర అయిన ఇంద్రుడిని; ప్రాణములన్= అసువులనుండి; వాయు+అగ్నులను= గాలిని నిప్పును; బాహు, యుగ, దంత, పుటంబులన్= చేతుల జంటలోను పళ్ళ దొప్పలలోను; విశ్వ, భూతంబులన్= సమస్త పదార్థాలను; సృజియించెన్= నిర్మించాడు; మఱియును= ఇంకను.

తాత్పర్యం: ఈ రీతిగా జన్మించిన ఆ అగ్నిదేవుడు అయిదుగురుతండ్రులకు పుట్టినవాడు కావున 'పాంచజన్యుడు' అనే పేరుమీద విలసిల్లాడు. అతడు పదివేలసంవత్సరాలు తపస్సు చేశాడు. అతడిశిరస్సునుండి బృహద్రథంతరులు పుట్టారు. ఆతడి మొగంనుండి విష్ణువు ఉద్భవించాడు. నాభినుండి శివుడు పుట్టాడు. వీర్యం నుండి ఇంద్రుడు జన్మించాడు. ప్రాణాలనుండి వాయువు అగ్ని జన్మించారు. చేతులజంటనుండి దంతాల నుండి సమస్త భూతాలు ఆవిర్భవించాయి. అంతియ కాక.

విశేషం: 'నిజ మస్తకంబున బృహదంతరు లను వారలను' అని పెక్కు తెలుగు వ్రాత ప్రతులలో ఉన్నది. కాని సంస్కృతమూలంలో "బృహద్రథంతరం మూర్ధ్నో వక్త్రా ద్వాతరసా హరౌ" అని ఉన్నది. (చిత్రశాలా ప్రతి. 3-220-7).

క. తపుఁ డను వహ్ని నిరంతర । తపోనిరూఢుఁ డయి పంచదశపుత్త్రుల న
త్యపరిమిత ఘోర తేజో । విపులాత్ములఁ గనియెఁ గపటవృత్తినిపుణులన్. 162

ప్రతిపదార్థం: తపుఁడు+అను, వహ్ని= తపుడు అనే పేరు కల అగ్ని; నిరంతర, తపస్+నిరూఢుఁడు+అయి= ఎల్లప్పుడును తపస్సు చేయటంలోనే మిక్కుటమైన దీక్షకలవాడు అయి; అతి+అపరిమితమైన ఘోర, తేజస్+విపుల+ఆత్ములన్= మిక్కుటమైన దారుణమైన ప్రకాశంతో ఎక్కువగా కూడుకొని ఉన్నట్టి వారలను అనగా మిక్కిలి భయంకరమయిన తేజస్సుతో వెలుగొందే వారలను; కపట, వృత్తి, నిపుణులన్= మోసం చేయటంలో మిక్కిలి సామర్థ్యం కలవారిని; పంచ, దశ పుత్త్రులన్= పదునైదుమంది కొడుకులను; కనియెన్= (కొడుకులుగా) పొందాడు.

తాత్పర్యం: 'తపుడు'- అనే పేరు గల ఆ అగ్నిహోత్రుడు భయంకరమైన తేజస్సుతో జాజ్వల్యమానంగా వెలుగొందే కొడుకులు పదునైదుగురిని కన్నాడు. ఆ పుత్రులు మోసం చేయటంలో మిక్కిలి సామర్థ్యం కలవారు.

వ. ఆ పదియేవురు సుభీముండు, నతిభీముండును భీముండును భీమబలుండును నతిబలుండు నను వారొక్క మొగియును, సుమిత్త్రుండును మిత్త్రవంతుఁడును మిత్త్రజ్ఞుండును మిత్త్ర వర్ధనుండును మిత్త్రధర్ముండును నను వా రొక్క మొగియును, సురప్రవీరుండును వీరుండును సువేషుండును సువర్చసుండును సురహంతయు నను వారొక్క మొగియునుగానిట్లు మూఁడుమొత్తంబు లై యజమానుల యజ్ఞఫలంబు లపహరించు చుండుదురు; తత్ప్రశాంత్యర్థంబై యాగంబులందు నగ్నిచయనంబు సేయునది. 163

ప్రతిపదార్థం: ఆ పది+ఏవురు= ఆ పదునైదు మంది; సుభీముండును; అతి భీముండును; భీముండును; భీమబలుండును; అతిబలుండు అనువారు; ఒక్క, మొగియును= ఒక పక్షంలోనూ; సుమిత్రుండును, మిత్రవంతుండును, మిత్రజ్ఞుండును, మిత్రవర్ధనుండును మిత్రధర్ముండును అనువారు; ఒక్క మొగియును= ఒక పక్షంలోను; సురప్రవీరుండును, వీరుండును, సువేషుండును, సువర్చసుండును, సురహంతయును; అనువారు; ఒక్క, మొగియును= ఒక పక్షమున్నూ; కాన్= ఒక వర్గం లోని వారలు అగునట్లుగా; ఇట్లు= ఈ రీతిగా; మూఁడు, మొత్తంబులు+ఐ= మూడు కక్ష్యలుగా చీలి; యజమానుల యజ్ఞ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఫలంబులు= యజ్ఞాలు చేసేవారి యజ్ఞఫలాలు; అపహరించు చుండుదురు= దొంగలిస్తూ ఉంటారు; తత్+ప్రశాంతి+అర్థంబు+ఐ= వారలను అదుపులో పెట్టేదానికై; యాగంబులందున్= క్రతువులలో; అగ్ని, చయనంబు= అగ్నిని సంస్కరించటం; చేయునది= చేయాలి.

తాత్పర్యం: తపుడికి పదునైదుగురు పుత్రులు పుట్టి, మూడువర్గాలుగా చీలి పోయారు. ఒక వర్గంలో ఉన్నవారు. 1. సుభీముడు 2. అతిభీముడు 3. భీముడు 4. భీమబలుడు 5. అతిబలుడు. మరియొక వర్గంలోని వారు 1. సుమిత్రుడు 2. మిత్రవంతుడు 3. మిత్రజ్ఞుడు 4. మిత్రవర్ధనుడు 5. మిత్రధర్ముడు. మూడవవర్గంలోని వారు. 1. సురప్రవీరుడు 2. వీరుడు 3. సువేషుడు 4. సువర్చసుడు 5. సురహంత. పై మూడు వర్గాలలోని పదునైదుగురు యజ్ఞాలను చేసేవారిని బాధించి వారినుండి యజ్ఞఫలాలను దొంగిలిస్తూ ఉన్నారు. వారిని అదుపులో పెట్టటానికి అగ్నికి సంస్కారం చేయటం అవసరమైనది.

తే. **అధిప! విహగాకృతుల నొప్పు నగ్ని చయన । ముల యుదగ్రపక్షాఘాతములను విప్ర**
వరుల మంత్రఘోషములను వారు నిహతు । లై భయంపడి చేరరు యజ్ఞభూమి. **164**

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ఓ ధర్మరాజా!); విహగ+ఆకృతులన్= పక్షుల ఆకారాలచేత; ఒప్పు= విలసిల్లే; అగ్ని, చయనములన్= అగ్నులను పేర్చటం చేత; ఉదగ్ర, పక్ష, ఆఘాతములను= గొప్పవైన రెక్కల తాకిడి చేతను; విప్ర వరుల, మంత్ర, ఘోషములను= బ్రాహ్మణోత్తములు మంత్రాలను పెద్దగా చదవటం చేతను; వారు= ఆ పదునేవురు యజ్ఞఫల హర్తలు; నిహతులు+ఐ= కొట్టబడిన వారై; భయము,పడి; భయంపడి= భీతిచెంది; యజ్ఞభూమిన్= యజ్ఞం జరిగే ప్రదేశాన్ని; చేరరు= సమీపించరు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆ పదునేవురిని విప్రులు భయపెట్టి యజ్ఞశాలను చేర నివ్వరు. బ్రాహ్మణోత్తములు మంత్రాలను ఉచ్చరించటంచేతనున్నూ, అగ్నులను పక్షులఆకారంతో పేర్చటంచేతనున్నూ, వారు రెక్కలచేత కొట్టబడి యజ్ఞశాలను చేరరు.

వ. **తపుండు మఱియు సకలయజ్ఞభాగభుజు లైన పుత్త్రుల నేవురం గనియె; నం దగ్రజుండు.** **165**

తాత్పర్యం: తపుడు సమస్త యజ్ఞభాగాలనూ భుజించేవారైన అయిదుగురు కొడుకులను కన్నాడు. వారిలో పెద్దవాడు.

సీ. **వైశ్వానరుం డను వహ్ని చాతుర్మాస్య । విధులందు భూసురవితతిచేతఁ**
బర్జన్యసహితుఁ డై పరమార్చనముఁ గాంచు । నధిప!; రెండగు నాతఁ డఖిలమునకుఁ
బ్రభుఁడు దానై విశ్వపతి యన విలసిల్లు; । వినుము! మూఁడగు వాఁడు విశ్వమునకు
నాత్ముఁడై విశ్వకుం డన నొప్పు; నాలవు । నతఁడు భూతముల యాహార వితతి

తే. **వెలయఁ బక్వము సేయుట విశ్వభుక్కు । నాఁగఁ బెంపొందు; గోపతి నామధేయుఁ**
డై సమస్తధర్మక్రియలందు హేతు । వై ప్రశస్తి వహించు నేనగు నతండు. **166**

ప్రతిపదార్థం: అధిప= ఓ రాజా!; వినుము; వైశ్వానరుండు+అను, వహ్ని= వైశ్వానరుడు అనే పేరు గల అగ్ని; చాతుర్మాస్య, విధులందున్= నాలుగు నెలల దీక్షకు సంబంధించిన నోములలో; భూసుర వితతిచేతన్= బ్రాహ్మణుల సముదాయంచేత;

పర్జన్య సహితుఁడు+ఐ= మేఘుడితో కూడుకొన్న వాడై; పరమ+అర్చనమున్+కాంచున్= గొప్ప పూజను పొందుతాడు; రెండు+అగు+ఆతఁడు= రెండవ వాడు; అఖిలమునకున్= అంతటికిని; ప్రభుండు= పాలకుడు; తాను+ఐ= తానే అయి; విశ్వపతి+అనన్= విశ్వపతి అనే పేరున; విలసిల్లున్= ఒప్పారును; మూఁడు+అగు, వాఁడు= మూడవవాడు; విశ్వమునకున్= ప్రపంచానికి; ఆత్ముఁడు+ఐ= అంతర్యామి అయి; విశ్వకుండు+అనన్+ఒప్పున్= విశ్వకుడు అనే పేరుతో విలసిల్లుతాడు; నాలవు+అతఁడు= నాలుగవ వాడు; భూతముల= జీవులయొక్క; ఆహార వితతి= తినుబండారాల సముదాయాన్ని; వెలయన్= ఒప్పిదంగా; పక్వము+చేయుట= మ్రగ్గేటట్లుగా చేయటం వలన; విశ్వభుక్కు, నాఁగన్= విశ్వభుక్కు అనే పేరుతో; పెంపొందున్= విస్తరిస్తాడు; గోపతి నామధేయుఁడు+ఐ= గోపతి అనే పేరు కలవాడై; ఏను+అగు+అతండు= ఐదవ వాడు; సమస్త, ధర్మ, క్రియలందున్= అన్ని విధాలైన ధర్మకార్యాలలో హేతువు+ఐ= కారణభూతుడై; ప్రశస్తి, వహించున్= కీర్తిని పొందుతాడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! తపుడు (యజ్ఞఫలహర్తలైన ఆ పదిహేనుమంది పుత్రులను మాత్రమే గాక) యజ్ఞభాగభోక్తలైన కొడుకుల నైదుగురను కన్నాడు. వారిలో మొదట పుట్టినవాడు 'వైశ్వానరుడు' . ఆ వైశ్వానరుడు- బ్రాహ్మణులచేత మేఘుడితో పాటు పూజించబడేవాడు. నాలుగునెలల నోములలో అతడు అర్చించబడేవాడు. ఓ ధర్మరాజా! రెండవవాడి పేరు - విశ్వపతి. సార్థక నామధేయుడు. అతడు సమస్తసృష్టికి ప్రభువు. మూడవవాడి పేరు 'విశ్వకుడు' అతడు విశ్వానికి అంతర్యామి. నాలుగవవాడి పేరు 'విశ్వభుక్కు'. అతడు భూతాల తినుబండారాలను పక్వం చేసేవాడు. అయిదవవాని పేరు 'గోపతి'. అతడు సర్వధర్మక్రియలకు హేతుభూతుడు.

వ. మఱియు భానుం డను వహ్నికి సోమపుత్త్రియైన బృహద్భాసయందు బలదుండును మన్యుమంతుండును ధృతిమంతుండును నాగ్రయణుండును నగ్నియు సోముండును నన నార్వురు గొడుకులు నిశ యను కూఁతురుం బుట్టిరి; సకలతపఃఫలంబులు నిర్వహించుట కయి పురందరుండు మను నామ ధేయుం డైన కొడుకుం బడసె; నమ్మనువు భానుపుత్త్రియైన నిశాకన్యం బెండ్లియై, ప్రాజాపత్యుం డను పేరఁ బరఁగి పరమబ్రాహ్మణులచేత నర్చితుం డయ్యె; నివ్విధంబున ననేక వహ్నులు సకలధర్మ క్రియాసాధకు లై వెలింగిరి; దక్షిణాగ్ని ప్రముఖంబు లైన వహ్నులు వాయుహతిం జేసి యన్యోన్య సంస్పృష్టంబు లయ్యె నేనియు, రజస్వలాది సంకరంబులం బొరసె నేనియు, మృతక జాతకాది సంస్పర్శనంబునం బొందెనేనియుఁ, దత్ప్రాయశ్చిత్తార్థం బై యష్టాకపాలేష్టి సేయ వలయు' నని చెప్పి మఱియు మార్కండేయుం డిట్లనియె.167

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; భానుండు+అను, వహ్నికిన్= భానుడు అనే పేరు కల అగ్నికి; సోమపుత్త్రి+ఐన= సోముడి కూతురు అయిన; బృహద్భాసఅందున్; బలదుండును; మన్యుమంతుండును; ధృతిమంతుండును; ఆగ్రయణుండును; అగ్నియున్; సోముండును; అనన్= అనగా; ఆర్వురు కొడుకులు= ఆరుగురు కుమారులు; నిశ+అను, కూఁతురున్= నిశ అనే పేరు కల పుత్త్రికయు; పుట్టిరి= జన్మించారు; సకల, తపస్+ఫలంబులు= అన్ని తపస్సులయొక్క ఫలితాలను; నిర్వహించుటకున్+ అయి= సాధించటం కొరకు; పురందరుండు= పురందరుడు అనేవాడు; మను నామ ధేయుండు+అయిన= మనువు అనే పేరు కలిగినట్టి; కొడుకున్+పడసెన్= పుత్రుడిని కన్నాడు; ఆ+మనువు; భానుపుత్త్రి+ఐన= భానుడు అనే వాడి కూతురు అయిన; నిశా కన్యన్= రాత్రి అనే కన్నెను; పెండ్లి+ఐ= వివాహ మాడి; ప్రాజాపత్యుండు; అను, పేరన్+పరఁగి= అనే నామంతో విలసిల్లి; పరమ, బ్రాహ్మణులచేతన్= గొప్ప విప్రుల చేత; అర్చితుండు+అయ్యెన్= పూజించబడ్డాడు; ఈ+విధంబునన్= ఈ విధంగా; అనేక వహ్నులు= పెక్కు అగ్నిహోత్రులు; సకల, ధర్మ, క్రియా, సాధకులు+ఐ= అన్ని ధర్మ కార్యాలను సాధించే వారయి; వెలింగిరి= ప్రకాశించారు; దక్షిణ+అగ్ని, ప్రముఖంబులు+ఐన= దక్షిణాగ్ని మున్నగు నట్టివి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అయిన; వహ్నులు= నిప్పులు; వాయు, హతిన్+చేసి= గాలిచేత కొట్టబడటంచేత; అన్యోన్య, సంస్పృష్టంబులు= ఒక దానితో మరియొకటి కలయిక చెంది నట్టివి; అయ్యెన్+ఏనియున్= అయినప్పటికిని; రజస్వల+ఆది, సంకరంబులన్= ముట్టు అయిన ఆడువారిమైల సోకటం, పొరిసెన్+ఏనియున్= పొందినప్పటికిని; మృతక, జాతక+ఆది, సంస్పర్శనంబునన్+పొందెను+ఏనియున్= చావు, పుట్టుక మొదలైన వాటిచేత కలిగే మైల సోకటం వలన దోషం కలిగినప్పటికి; తత్+ప్రాయశ్చిత్త+అర్థంబు+ఐ= ఆ దోష నిష్కృతి కొరకై; అష్టా కపాల+ఇష్టి= ఎనిమిది మట్టి పాత్రలచేత సంస్కరించబడెడి క్రతువు; చేయన్‌వలయున్= చేయాలి; అని; చెప్పి; మఱియున్; మార్కండేయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'భానుడు అనే వహ్నికి అతడి భార్య (సోమపుత్రి) అయిన బృహద్భాస యందు బుధుడు, మన్యుమంతుడు, ధృతిమంతుడు, ఆగ్రయణుడు, అగ్ని, సోముడు అనే ఆర్గురు కొడుకులున్నూ, నిశ అనే కూతురున్నూ కలిగారు. పురందరుడు సర్వతపస్సులఫలాలు పొందటానికై మనువు అనే పేరు గల కొడుకును కన్నాడు. ఆ మనువు భానువహ్నిపుత్రిక అయిన నిశ అనే వధువును పెండ్లాడాడు. ఆ మనువుకే ప్రాజాపత్యుడు అనే గౌరవ నామధేయం ఏర్పడింది. అతడిని బ్రాహ్మణోత్తములు పూజించారు. ఈ విధంగా పెక్కు వహ్నులు ధర్మక్రియలకు హేతుభూతులు అయ్యారు. దక్షిణాగ్ని మొదలైనవి గాలి తాకిడికి ఒకదానితో ఒకటి కలిసి పోయినప్పుడున్నూ; ముట్టయిన స్త్రీలు తాకుట చేతనున్నూ ఏర్పడిన దోషాలను పరిహరించటానికి, పురుడువలన మరణంవలన ఏర్పడే మైలచేత కలిగే దోషాలను పరిహరించటానికి 'అష్టాకపాలేష్టి' ఎనిమిది మట్టి పాత్రలలో అగ్నికి సంస్కారం చేసి చేసే క్రతువు చేయవలసి వస్తుంది' అని చెప్పి, మరల మార్కండేయమహర్షి ఈ విధంగా చెప్పాడు.

విశేషం: సోమపుత్రి అను నెడ సోముడి కూతురు అని అర్థం చెప్పుకొనటమే ఉత్తమ పద్ధతి. సోముడు అనగా చంద్రుడు, శివుడు, వాయువు, పితృదేవతలలో ఒకడు, వసువులలో ఒకడు, కుబేరుడు, యముడు, సుగ్రీవుడు అనే వివిధార్థాలు ఉన్నాయి. అట్లే మనువు, భానుడు మున్నగు చోట్ల అవి నామధేయాలుగానే స్వీకరించాలి.

క. 'ఆపుఁ డను వహ్ని యతులిత । రూప యయిన ముదిత యను తరుణియందు జగ
ద్దీపకు నపారతేజు మ । హాపూజ్యుం గనియె నగ్ని నద్భుతనామున్. 168

ప్రతిపదార్థం: ఆపుఁడు+అను, వహ్ని= 'ఆపుడు' అనే పేరు కల అగ్ని; అతులిత, రూప+అయిన= సాటి లేని అందం గల; ముదిత+అను, తరుణి+అందున్= ముదిత అనే పేరుకల జవ్వనియందు; జగత్+దీపకున్= లోకాలను వెలుగొంద జేసే వాడిని; అపార తేజున్= మిక్కిలి ఎక్కువ అయిన కాంతి కలవాడిని; మహా, పూజ్యున్= గొప్పగా ఆరాధించబడే వాడిని; అద్భుత నామున్= అచ్చెరువు కొలిపే పేరు కల వాడిని; అగ్నిన్= అగ్నిని; కనియెన్= కన్నాడు (పుత్రుడుగా పడశాడు).

తాత్పర్యం: ఆపుడు అనే వహ్నికిని, అతిలోక సౌందర్యవతి అయిన ముదితకు అచ్చెరువు గొలిపే పేరు కల 'అగ్ని' ముద్దుబిడ్డ అయి జన్మించాడు.

విశేషం: మానవచరిత్రలో నాగరకతా క్రమపరిణామ వికాసంలో 'అగ్ని' నిర్వహించిన భూమిక ఉగ్గడించ దగినది. అగ్ని బహుముఖ ప్రయోజనాలను నిర్వహించింది. నిత్యాగ్నిహోత్రతత్పరులు- అగ్నిసంప్రదాయాన్ని నిలబెట్టి యున్నారు. అర్థవాద రూపాన ఈ అగ్నిహోత్రాలను నిర్వహించిన కుటుంబాల వివరణాన్ని ఈ ప్రకరణంలో మహాభారతం వివరించినట్లు ఎంచవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **అతఁడు త్రిలోకతంత్రము నిరంతర మై చన నిర్వహించుచున్**
శతమఖుఁ డాది యైన సురసంతతికిం బ్రియ మొప్ప హవ్యముల్
సతతము మోచి యిచ్చుచు భృశం బగు తద్భర మోర్వలేక సు
వ్రత నిరతుం డధర్వుఁ డనువానికి నిట్లను నాదరంబుతోన్. **169**

ప్రతిపదార్థం: అతఁడు= (ఆ అగ్ని); త్రిలోక తంత్రము= మూడు భువనాల వ్యవహారం; నిరంతరము+ఐ+చనన్= ఎల్లప్పుడును కొనసాగేదిగా జరుగగా; నిర్వహించుచున్= నెరపుతూ; శతమఖుఁడు+ఆది+ఐన= దేవేంద్రుడు మొదలైన; సుర సంతతికిన్= వేల్పుల సముదాయానికి; ప్రియము+ఒప్పన్= ప్రీతి విలసిల్లేటట్లుగా; హవ్యముల్= హోమంలో వేల్చే ద్రవ్యాలు; సతతమున్= ఎల్లప్పుడు; మోచి+ఇచ్చుచున్= బరువును భరించి ఇస్తూ; భృశంబు+అగు= మిక్కుటమైన; తత్+భరమున్= ఆ బరువును; ఓర్వలేక= భరించలేక; సువ్రత, నిరతుండు= మంచి నోమును దీక్షతో నెరవేర్చునట్టి (ఆ అగ్ని); అధర్వుఁడు+అను వానికిన్ అధర్వుడు అనే పేరు గలవానికి; ఆదరంబుతోన్= మన్ననతో; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: మూడులోకాల వ్యవహారాలను ఎడతెగనిదీక్షతో అగ్ని నిర్వహిస్తున్నాడు. దేవేంద్రుడు మున్నగు వేల్పులకు యజ్ఞాలలో సమర్పించబడే హోమద్రవ్యాలను తాను మోచి సంప్రీతితో వారికి సమర్పిస్తూ ఉన్నాడు. ఈ నిరంతరభారాన్ని చాలాకాలం నిర్వహించిన పిదప, డస్సి, అగ్ని- అధర్వుడు అనే వాడిని చేరి గౌరవంతో కూడిన అభిమానంతో ఇట్లా పలికాడు.

వ. **'ఏను దుర్బలుండ నైతి; నీవు దేవతలకు హవ్యంబులు మోచి యి' మ్మని వానిం బంచి, తాను సముద్రంబు సొచ్చి యందు దాఁగుటయు, దేవత లద్దేవముఖుం డున్న యెడ రోయం దొడంగిన నబ్ధిచరంబు లైన మత్స్యంబులు సురలకు నగ్నిదేవుండు జలధి నుండుట సెప్పుటయుం గనలి యనలుండు మీలం జూచి' జనంబులు మిమ్ము నిర్దయు లై వధియింతురు గావుత' మని శాపం బిచ్చె; నప్పుడు.** **170**

ప్రతిపదార్థం: ఏను= నేను (అనగా అగ్ని); దుర్బలుండన్+ఐతి(ని)= బలం లేనివాడను అయినాను; నీవు= నీవు; దేవతలకున్= వేల్పులకు; హవ్యంబులు= హోమంలో వేల్చబడిన ద్రవ్యాలు; మోచి+ఇమ్ము+అని= వహించి ఇమ్ము అని; వానిన్= అధర్వుడిని; పంచి= నియమించి; తాను= అగ్ని; సముద్రంబు= సముద్రంలో; చొచ్చి= ప్రవేశించి; అందున్= ఆ సముద్రంలో; దాఁగుటయున్= రహస్యంగా నివసించటమున్నూ; దేవతలు= వేల్పులు; ఆ+దేవముఖుండు= ఆ అగ్ని; ఉన్న+ఎడన్= ఉన్నచోటు; రోయన్+తొడంగినన్= వెదకటానికి పూనుకొనగా; అబ్ధిచరంబులు+ఐన= సముద్రంలో తిరుగాడునట్టి; మత్స్యంబులు= చేపలు; సురలకున్= దేవతలకు; అగ్ని దేవుండు; జలధిన్+ఉండుట+చెప్పుటయున్= సముద్రంలో (దాగి) ఉండటాన్ని చెప్పగా; కనలి= కోపగించి; అనలుండు= అగ్నిహోత్రుడు; మీలన్+చూచి= చేపలను చూచి; జనంబులు= ప్రజలు; మిమ్మున్= మిమ్ము (చేపలను); నిర్దయులు+ఐ= జాలి లేని వారై; వధియింతురు+కావుతన్= చంపుదురు గాక!; అని; శాపంబు+ఇచ్చెన్= శాపం ఇచ్చాడు; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: 'నేను ఇంక బలంలేనివాడను అయినాను. ఓ అధర్వుడా! నీవు దేవతలకు హోమద్రవ్యాలను మోచికొనిపోయి అందించునది' అని పలికి అతడిని అందుకు నియమించి, అగ్నిహోత్రుడు సముద్రంలో ప్రవేశించి దాగాడు. అంతట వేల్పులు అగ్నిదేవుడు ఎచట దాగాడో తెలియటానికై వెదక సాగారు. సముద్రంలో చరించే చేపలు అగ్నిదేవుడి ఉనికి దేవతలకు తెలియ చెప్పాయి. అప్పుడు చేపలపై ఆగ్రహించి అగ్నిదేవుడు 'జనులు జాలి లేకుండగా మిమ్ము చంపగలరు' అని శాప మిచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: శాపం:- భవిష్యత్కాలంలో అవశ్యంగా జరుగ గలదు అనే విధి వాక్యం. ఇందులో మూడు అంగాలు ఉంటాయి. 1. భవిష్యదర్థకం ఇది. 2. శపించేవాడు గొప్ప మహిమ కలవాడై ఉంటాడు. 3. ఇది కోపహేతువు. ఫలము ఏదో ఒక కీడు.

ఆ. హవ్య వహనమునకు నమరోత్తములు దన్ను। వేయువిధుల నొలసి వేడుకొనిన
నెట్లు నియ్యకొనక యెంతయు విసిగి స। మీరసఖుఁడు దనదుమేను విడిచె. 171

ప్రతిపదార్థం: హవ్య వహనమునకున్= హోమంలో వేల్చిన ద్రవ్యాలను మోయటానికి; అమర+ఉత్తములు= వేల్పులలో గొప్పవారు; తన్నున్= తనను (అగ్నిని); వేయు విధులన్= అనేక విధాలుగా; ఒలసి= పూని; వేడుకొనినన్= ప్రార్థించగా; ఎట్లున్= ఏ రీతిగా; ఇయ్యకొనక= అంగీకరించక; ఎంతయున్= మిక్కిలి; విసిగి= అలసి పోయి; సమీరసఖుఁడు= గాలి నెచ్చెలి - అగ్ని; తనదు మేను= తన శరీరం; విడిచెన్= వదిలాడు.

తాత్పర్యం: దేవతలలో శ్రేష్ఠులు అగ్నిహోత్రుడిని మరల హోమద్రవ్యాలను మోచి తమకు అందించాలని వేయి విధాల ప్రార్థించారు. కాని, అగ్ని అందులకు సమ్మతించలేదు. అంతే కాక, అతడు విసిగి వేసారి తనదేహాన్ని త్యజించాడు.

వ. ఇట్లు సంత్యక్తశరీరుం డై ధరాతలంబు ప్రవేశించుటయు, నతనిచేత విడువంబడిన దేహంబువలనం బూయంబున గంధకంబు, నస్థుల దేవదారువును, శ్లేష్మంబున స్ఫటికంబును, బిత్తంబున మరకతంబును, వాతంబునఁగృష్ణశిలయు, నఖంబుల నభ్రకంబును, స్నాయుసంచయంబునం బ్రవాళంబునుం బుట్టె; నతండు భూగర్భస్థితుండై ఘోరతపంబుసేయుచున్నంత భృగ్వంగిరఃప్రముఖులైన మహామునులు నిజతపోబలంబున నతనికి నాప్యాయనంబు సేయుటయుఁ దేజస్వి యై ధరణి వెలువడి వచ్చి యమ్మహాత్ముం డమ్మహామునులం జూచి తదీయతేజంబు దనకు దుస్సహం బగుటయు భయంపడి క్రమ్మఱ నంబుధి సొచ్చి యడంగిన. 172

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; సంత్యక్త శరీరుండు+ఐ= వదలి పెట్టబడిన దేహం కలవాడై - అనగా దేహాన్ని త్యజించిన వాడై; ధరాతలంబు= భూమి ప్రదేశాన్ని; ప్రవేశించుటయున్= చొరబడటమున్నూ; అతని చేతన్; విడువన్+పడిన= వదలిపెట్టబడిన దేహంబువలనన్= శరీరంలోని; పూయంబునన్= చీము రసినుండి; గంధకంబున్= గంధకము (ఉపధాతు విశేషమైన మందు దినుసు) (దీపావళి 'రోలు రోకలి' ప్రేలుడు పదార్థాలలో ఒకటి); అస్థులన్= ఎముకల నుండి; దేవదారువును= దేవదారు చెట్టును; శ్లేష్మంబునన్= కఫం నుండి; స్ఫటికంబును= కర్పూరమును; పిత్తంబునన్= పిత్తమనే దేహ ధాతువు నుండి; మరకతంబును= నవరత్నాలలో ఒకటి అయిన; 'పచ్చ'ను; వాతంబునన్= దేహధాతువులలో ఒకటి అయిన గాలి నుండి; కృష్ణ శిలయున్= పాషాణాన్ని (నల్లరాయిని); నఖంబులన్= గోళ్ల నుండి; అభ్రకంబును= బేగడను (కాకిబంగారము); స్నాయు సంచయంబునన్= నరాల, రక్త నాళాల సముదాయం నుండి; ప్రవాళంబునున్= పగడమును; పుట్టెన్= ఆవిర్భవించాయి; అతండు= (ఆ అగ్నిహోత్రుడు); భూగర్భ స్థితుండు+ఐ= భూమిలోపలి భాగంలో ఉన్నవాడై; ఘోరతపంబు= కఠిన మైన తపస్సు; చేయుచున్+ ఉన్నంతన్= సలుపుతూఉండగా; భృగు+అంగిరస్+ప్రముఖులు+ఐన= భృగువు అంగిరసుడు మున్నగు; మహా+మునులు= గొప్ప ఋషులు; నిజ, తపస్+బలంబునన్= తమ దైన తపస్సు యొక్క గొప్ప శక్తి వలన; అతనికిన్= (అగ్ని హోత్రుడికి); ఆప్యాయనంబు+చేయుటయున్= తృప్తి కల్గించగా; తేజస్వి+ఐ= కాంతి కలవాడై; ధరణిన్= భూమినుండి; వెలువడి వచ్చి= బయటకు వచ్చి; ఆ+మహా+ఆత్ముండు= ఆ గొప్పవాడు (అగ్ని హోత్రుడు); ఆ+మహా+మునులన్= ఆ గొప్ప ఋషులను; చూచి= కాంచి; తదీయ, తేజంబు= వారల యొక్క కాంతి; తనకున్= (అగ్నిహోత్రుడికి); దుస్సహంబు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సహించటానికి అలవికానిది; అగుటయున్; భయంపడి= భీతిచెంది; క్రమ్మఱన్= మరల; అంబుధి+చొచ్చి= సముద్రంలో ప్రవేశించి; అడంగినన్= దాగి ఉండగా.

తాత్పర్యం: ఈ విధంగా, శరీరాన్ని విడిచిపెట్టినవాడై అగ్నిదేవుడు భూమిలోకి ప్రవేశించాడు. అట్లా అగ్ని చేత విడువబడిన కళేబరంనుండి ఎన్నియో పదార్థాలు ఆవిర్భవించాయి. చీమురసినుండి గంధకం ఏర్పడింది. ఎముకలనుండి దేవదారు చెట్లు పుట్టాయి. కఫంనుండి కర్పూర మేర్పడింది. పిత్తంనుండి నవరత్న విశేషమైన 'పచ్చ' జనించింది. వాతంనుండి పాషాణశిల రూపొందింది. గోళ్ల నుండి కాకిబంగారం ఉద్భవించింది. నరాల, రక్త, నాళాల నుండి పగడ మేర్పడింది. అగ్నిహోత్రు డాపైన భూగర్భంలోనే ఉండి కఠోరతపస్సు చేశాడు. భృగుడు మున్నగు మహర్షులు అతడి తపస్సును మెచ్చి అతడిని ఆశీర్వదించారు. అగ్నిహోత్రు డంతట తృప్తి చెంది, భూగర్భం నుండి బయటకు వచ్చాడు కాని, అతడు ఆ మహర్షుల తేజస్సును చూచి భయపడి మరల సముద్రంలోకి పోయి దాక్కొన్నాడు.

క. **విను జననాయక! సంయమి । జనములు వహ్నిపని యంతఁ జాలించి ప్రియం**
బున నంచితవిధి సంగ్రహ । మునకై పూజించి రధికపుణ్యు నధర్వున్. **173**

ప్రతిపదార్థం: జననాయక!= ప్రజలకు నేత వయిన ఓ ధర్మరాజా!; విను= వినుము; సంయమిజనములు= ఋషుల సమూహాలు; వహ్ని పని= అగ్ని కార్యం; అంతన్= అంతట; చాలించి= ఆపి; ప్రియంబునన్= ప్రీతితో; అంచితవిధి సంగ్రహమునకై= చేయవలసిన క్రియలను చేయటానికై; అధికపుణ్యున్= గొప్ప పుణ్యం కలవాడిని; అధర్వున్= అధర్వుడిని; పూజించిరి= అర్చించారు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆలకించుము. అంతట మునిగణాలు అగ్నిని వదలి పెట్టి, తాము చేయవలసిన విధ్యుక్త ధర్మాలను నిర్వహించటానికై అధర్వుడిని అర్చించ సాగారు.

వ. **అయ్యధర్వాగ్ని తేజంబును నమ్మును లతనికిం జేయు బహుమానంబునుం దన్ముఖంబున నమరులు దృప్తు లగుచునికియుం జూచి సహింపక పావకుండు సకలభూతంబులుఁ జూచుచుండ నంబుధి వెలువడి వచ్చి నిఖిలలోకహితార్థంబుగా నెప్పటియట్ల హవ్యవహత్వంబు నంగీకరించె; ని ట్లనేకశాఖం బయిన యగ్ని వంశంబు ప్రశంసాభాజనం బయ్యెఁ; నగ్ను లెంద ఱైనను దదాత్మ యైన తేజం బొక్కటి' యని చెప్పిన విని సంతసిల్లి యమ్మహామునికి ధర్మతనయుం డి ట్లనియె.** **174**

ప్రతిపదార్థం: ఆ+అధర్వ+అగ్ని, తేజంబునున్= అధర్వుడు అనే ఆ అగ్నియొక్క కాంతిని; ఆ+మునులు; అతనికిన్+చేయు= (అధర్వుడికి) ఒనరించే; బహుమానంబునున్= గౌరవమర్యాదను; తద్+ముఖంబునన్= ఆతని మొగం నుండి; అమరులు= దేవతలు; తృప్తులు+అగుచున్+ఉనికియున్= తనివి చెందటమున్నూ; చూచి= అరసి; సహింపక= ఓర్వజాలక; పావకుండు= అగ్నిహోత్రుడు; సకల భూతంబులున్= అన్ని భూతాలున్నూ; చూచుచున్= చూస్తూ ఉండగా; అంబుధి= సముద్రంనుండి; వెలువడి= బయటకు వచ్చి; నిఖిలలోక, హిత+అర్థంబుగాన్= అన్ని లోకాలకు మేలు చేకూరేటట్లుగా; ఎప్పటి+అట్లు+అ= యథా ప్రకారం; హవ్య వహత్వంబున్= హోమంలో వేల్చబడే ద్రవ్యాలను తాల్చటాన్ని; అంగీకరించెన్= సమ్మతించాడు; ఇట్లు= ఈ విధంగా; అనేక, శాఖంబు+అయిన= పెక్కు కొమ్మలుగా ఏర్పడిన; అగ్ని వంశంబు= అగ్ని యొక్క కుటుంబం; ప్రశంసా, భాజనంబు+అయ్యెన్= కీర్తించ తగింది అయింది; అగ్నులు= వహ్నులు; ఎందఱు+ఐనను= ఎందరు అయినప్పటికి; తద్+ఆత్మ+ఐన= వారి అందరికి ఆత్మ, లేక సారభూతం అని చెప్ప దగిన; తేజంబు= కాంతి; ఒక్కటి= ఒక్కటే; అని=

అంటూ; చెప్పినన్= పలుకగా; విని= ఆలకించి; సంతసిల్లి= సంతోషించి; ఆ+మహామునికిన్= ఆ గొప్ప ఋషికి; ధర్మతనయుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: అధర్వుడు అనే పేరు గల ఆ అగ్ని యొక్క కాంతిని, ఆ ఋషులు అతడికి చేసే గౌరవమర్యాదలను చూచి, ఆతడిద్వారా వేల్పులు తనివి పొందటాన్ని గ్రహించి, ఓర్వజాలక అగ్నిహోత్రుడు అన్ని భూతాలు చూస్తూ ఉండగా సముద్రగర్భంనుండి బయటకు వచ్చి యథాప్రకారం తాను హోమద్రవ్యాలను వహించటానికి సమ్మతించాడు. అఖిలలోకాలకు ఆవిధంగా శ్రేయస్సు కల్గించాడు. ఈ రీతిగా అగ్నివంశంలో ఎందరెందరో ఉగ్గడించదగిన వారు విలసిల్లారు. అగ్నులలో ఎందరెందరో వేరు వేరు వారలు విలసిల్లినప్పటికిన్నీ, అందరిలో వెలుగొందిన తేజం ఒక్కటే' అని మార్కండేయమహర్షి ధర్మరాజుకు వివరించి చెప్పాడు. అంతట ధర్మరాజు ఈ విధంగా పలికాడు.

క. 'మునినాథ! మహాసేనుం । డనలునకుం గృత్తికలకు హరునకు సుతుఁడై
న నిమిత్త మేమి తెలఁ గే । వినవలతుం జెప్పవే! సవిస్తరఫణితిన్'. 175

ప్రతిపదార్థం: మునినాథ!= ఋషులకు వల్లభుడవైనవాడా! అనగా మునులలో శ్రేష్ఠుడవైన ఓ మార్కండేయుడా!; మహాసేనుండు= కుమారస్వామి; అనలునకున్= అగ్నిహోత్రుడికి; కృత్తికలకున్= కృత్తికలు అనే చుక్కలకు; హరునకున్= శివుడికి; సుతుఁడు+ఐన= కొడు కైన; నిమిత్తము= కారణం; ఏమి తెలఁగు= ఎటువంటిది; ఏన్= నేను; విన వలతున్= విన గోరుతున్నాను; సవిస్తర, ఫణితిన్= విపుల మైన పద్ధతిలో; చెప్పవే= చెప్పవా? (చెప్పుము).

తాత్పర్యం: 'ఓ మార్కండేయమహామునీ! కుమారస్వామి ఏవిధంగా అగ్నిహోత్రుడికి, కృత్తికలకు, శివుడికి పుత్రుడయ్యాడో విన గోరుతున్నాను. దయచేసి నాకు సంపూర్ణంగా వివరించి చెప్పుము'.

వ. అనిన మార్కండేయుం డతని కిట్లని చెప్పెఁ; దొల్లి దైత్యులతోడ రణంబు సేసి యోటువడి దేవగణసహితుం డై దేవేంద్రుండు దొలంగిపోయి దానవుల నోర్వనోపునట్టి మహాసత్త్వుం డగు సేనాపతి నెందుఁ బడయుదు నొకో! యని యొక్కనాఁడు మానసం బను శైలంబునకుం జని యం దొక్కయెడ నొక్కరుండ కార్యచింతాపరుం డై యున్న యెడ. 176

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; మార్కండేయుండు; అతనికిన్= (ధర్మరాజునకు); ఇట్లు+అని చెప్పెన్= ఈ విధంగా పలికాడు; తొల్లి= పూర్వకాలంలో; దైత్యుల తోడన్= రాక్షసులతో; రణంబు+చేసి= యుద్ధంచేసి; ఓటువడి= ఓడిపోయి; దేవగణ సహితుండు+ఐ= వేల్పుల సముదాయంతో కూడిన వాడై; దేవేంద్రుండు= వేల్పుల దొర; తొలంగిపోయి= (యుద్ధం నుండి) ఆవలికి పోయి; దానవులన్= రాక్షసులను; ఓర్వన్+ఓపునట్టి= జయించజాలునట్టి; మహాసత్త్వుండు+అగు= గొప్ప బలం కలవాడైన; సేనాపతిన్= సేనకు నాయకుని; ఎందున్= ఎచ్చట; పడయుదున్+ఒకో+అని= పొందగలనో అని; ఒక్కనాఁడు= ఒకానొకరోజున; మానసంబు+అను, శైలంబునకున్+చని= మానసం అనే పేరు కల కొండవద్దకు వెళ్లి; అందున్= (ఆ కొండ మీద); ఒక్క+ఎడన్= ఒకచోట; ఒక్కరుండు+అ= ఏకాంతంగా ఉండి; కార్య, చింతా, పరుండు+ఐ= చేయవలసిన పనిని గూర్చి యోచించేవాడై; ఉన్న+ఎడన్= ఉండగా.

తాత్పర్యం: అనిన, మార్కండేయుడు ధర్మరాజుకు ఈ విధంగా చెప్పాడు: పూర్వకాలంలో రాక్షసులతో యుద్ధం చేసి దేవేంద్రుడు ఓడిపోయాడు. వేల్పుల సముదాయం ఎంతగా పోరాడినా వారికి విజయం లభించలేదు. ఇక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాక్షసులపై గెలుపు ఏ విధంగా లభిస్తుందా! అని దేవేంద్రుడు ఏకాంతంగా యోచింపసాగాడు. అతడు మానసం అనే పేరుగల కొండపైకి వెళ్ళి ఒకచోట ఆలోచన చేస్తున్నాడు. అప్పుడు.

తే. **'ఒక్క దనుజాధముండు మొఱ్ఱో యనంగ । నన్నుఁ జెఱగొని పోయెడు నన్నలార!**
యెవ్వ రిట విడిపింపరే యింత వట్టు । పుణ్యమునఁ బోవరయ్య! కారుణ్యబుద్ధి'. **177**

ప్రతిపదార్థం: అన్నలార!= అయ్యలారా!; నన్నున్= నన్ను; ఒక్క= ఒక; దనుజ+అధముండు= రాక్షసులలో నీచుడు; మొఱ్ఱో+అనంగన్= (ఆపదలో ఉన్నట్లు) 'కేక' వేయగా; చెఱ+కొని పోయెడున్= నిర్బంధించి తీసికొని పోతున్నాడు; ఇటన్= ఇచట; ఎవ్వరు= ఎవరు? విడిపింపరే= చెరనుండి బయట పడ వేయరా; ఇంత+పట్టు= ఈ మాత్రం; కారుణ్య బుద్ధిన్= జాలిగల మనస్సుతో; పుణ్యమునన్+పోవరు+అయ్య= పుణ్యమార్గాన ప్రవర్తింపరా!.

తాత్పర్యం: సోదరులారా! ఒక నీచరాక్షసుడు నన్ను చెఱపట్టి బలాత్కారంగా తీసికొని పోతున్నాడు; ఇక్కడ నన్ను ఈ రాక్షసుడిబారినుండి కాపాడేవారు ఎవ్వరూ లేరా? నా మొఱ ఆలకించి పుణ్యం కట్టుకొనే వారు ఎవ్వరూ లేరా?

వ. **అని యిట్లు సువ్యక్తం బైన వనితావిలాపంబు వీతెంచినం బురందరుండు నిజాంతరంగంబు గరుణాతరంగితం బగుటయు 'నోడ కోడకు మిదె యేను వచ్చితి' ననుచు నద్దిక్కునకు నడచి ముందట నతిభయంకరాకారుం బటుగదాహస్తు నప్రచలితవిద్యుల్లతారుచిరమూర్తి యైనదాని నొక్క కన్నియం గొని గగనతలంబునం బఱచువానిం బ్రబలవలాహకవినీలదేహుఁ గేశి యను దానవుం గని సరభసుం డై.** **178**

ప్రతిపదార్థం: అని; ఇట్లు; సువ్యక్తంబు+ఐన= స్పష్టంగా వినిపిస్తున్న; వనితా, విలాపంబు= ఆడుదాని ఆర్తధ్వని; వీతెంచినన్= రాగా; పురందరుండు= దేవేంద్రుడు; నిజ+అంతరంగంబు= తన హృదయం; కరుణా, తరంగితంబు+అగుటయున్= దయఅనే అలలతో నిండినది కావటం చేత; ఓడకుము+ఓడకుము= భయపడకుము భయపడకుము; ఇదె= ఇదుగో ఇప్పుడే; ఏను= నేను; వచ్చితిన్= (నిన్ను ఆదుకోటానికి) వచ్చాను; అనుచున్= అని పలుకుతూ; ఆ+దిక్కునకున్= ఆ ఆర్తనాదం వెడలిన వైపునకు నడచి; ముందటన్= ఎదురుగా; అతిభయంకర+ఆకారున్= మిక్కిలి వెరపు గొలిపే రూపం కలవాడిని; పటు గదా హస్తున్= గొప్ప గదను పూనిన చేయి కలవాడిని; అప్రచలిత, విద్యుత్+లతా, రుచిర, మూర్తి+ఐన దానిన్= కదలకుండా ఉన్నట్టి మెరపుతీగ వలె వెలుగొందే రూపం కల దానిని; ఒక్క కన్నియన్= ఒక కన్యకను; కొని= పట్టుకొని; గగన, తలంబునన్= ఆకాశస్థలాన; పఱచువానిన్= పరుగెత్తేవాడిని; ప్రబల, వలాహక, వినీల, దేహున్= గొప్ప మబ్బువంటి నల్లని శరీరం కలవాడిని; కేశి+అను, దానవున్= కేశి అనే పేరు కల రాక్షసుడిని; కని= చూచి; సరభసుండు+ఐ= వేగంతో కూడినవాడై.

తాత్పర్యం: అట్లా ఒక స్త్రీయొక్క ఆర్తనాదం వినిపించింది. దేవేంద్రుడు వెంటనే తన హృదయం జాలిచేత కరగి పోవటం చేత 'భయపడకుమమ్మా! ఇదుగో నేను ఇక్కడనే ఉన్నాను; ఇప్పుడే వచ్చి నిన్ను కాపాడగలను' అని గట్టిగా పలుకుతూ ఆ యేడ్పు వచ్చిన వైపునకు తరలి వెళ్ళాడు. అంతట అక్కడ ఒక రాక్షసుడు మిక్కిలి వెరపు గొలిపే రూపం కలవాడు, నల్లనిమబ్బును పోలిన దేహం కలవాడు, గొప్ప గదను చేత ధరించిన వాడు కన్పించాడు. అతడు స్థిరమైనసౌదామని వంటి శరీరసౌందర్యం గల ఒక కన్యకను చెఱబట్టి ఆకాశంలో పరుగెత్తుతున్నాడు. కేశి అనే ఆ రాక్షసుడిని చూచి దేవేంద్రుడు మిక్కుటమైన వేగంతో (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇంద్రుఁడు కేశి యను రాక్షసునిఁ బాఱఁదోలుట (సం. 3-213-10)

ఉ. 'ఓరి దురాత్మ! యీ యబల నోడక యేటికిఁ బట్టినాడ వం
భోరుహనేత్ర విడ్వు; మెట వోయినఁ బ్రాణము గొందు నింకఁ బ్ర
స్ఫారమహీధరప్రకరభంగవిహారధురీణ ముగ్ర దై
త్యారుణరంజితోగ్ర కులిశాస్త్రము సు మ్మిదె' యంచు డాసినన్. 179

ప్రతిపదార్థం: ఓరి, దురాత్మ!= ఓరీ పాపహృదయం కలవాడా! చెడ్డ ఆత్మకల రాక్షసుడా!; ఈ+అబలన్= ఈ ఆడుదానిని; ఓడక= వెనుదీయక; ఏటికిన్= ఎందుకు; పట్టినాఁడవు= చెఱగొన్నావు; అంభస్+రుహ+నేత్ర= పద్మాల వంటి కన్నులు కల ఆడుదానిని; విడ్వుము= వదలి పెట్టుము; ఎట+పోయినన్= నీవు ఎక్కడికి వెళ్లి నప్పటికిని; ఇంకన్= ఇక; ప్రాణమున్+కొందున్= (నీ) అసువులను తీస్తాను- అనగా నిన్ను చంపుతాను; ప్రస్ఫార, మహీధర, ప్రకర, భంగ, విహార, ధురీణము= నిడివి ఐన కొండల సముదాయాన్ని ముక్కలుగా చేస్తూ తిరుగాడటంలో సామర్థ్యం కలది; ఉగ్ర, దైత్య+అరుణ, రంజిత+ఉగ్ర+కులిశ+అస్త్రము= భయం కలిగించే రాక్షసులను చంపటంచేత వారి నెత్తుటిచే ఎర్రనైన వజ్ర మంత్రాయుధం; సుమ్మ= సుమా; ఇదె= ఇదిగో; అంచున్= అంటూ; డాసినన్= సమీపించగా.

తాత్పర్యం: 'ఓ నీచ రాక్షసుడా! ఈ ఆడుదానిని ఎట్టి శంక లేకుండ, ఎందుకు చెరబట్టినావురా? పద్మాల వంటి కన్నులు కల ఈ అబలను వెంటనే విడిచిపెట్టుము. నీవు ఎటు పారిపోయినా నిన్ను నేను విడువను. నీ అసువులు తీయగలను. ఇదిగో! నావద్ద వజ్రాయుధం ఉన్నది. దీనితో నేను లోగడ ఎందరినో రాక్షసులను వధించిఉన్నాను. వారి నెత్తురుతో ఎర్రబడినట్టిది సుమా ఈ వజ్రాయుధం. ఎన్నో కొండలను కూల్చినట్టిది నా వజ్రాయుధం' అంటూ దేవేంద్రుడు ఆ రాక్షసుడిని సమీపించాడు.

మత్తకోకిలము

ఘోరవిక్రముఁడైన కేశియుఁ గ్రోధఘూర్ణితచిత్తుఁ డై
ధీరుఁ డుక్కున నిల్చి యగ్గదఁ ద్రిప్పి వాసవు వైచె; న
వ్వీరుఁడున్ గద చూర్ణితంబుగ వ్రేసె నాసుర భంగిఁ బొం
గారి దారుణవజ్రపాతరయంబునం బటుహస్తుఁడై. 180

ప్రతిపదార్థం: ఘోర, విక్రముఁడు+ఐన= భయంకర మైన పరాక్రమం కలవాడైన; కేశియున్= కేశి అనే దానవుడుకూడ; క్రోధ, ఘూర్ణిత, చిత్తుఁడు+ఐ= కోపం చేత తిరుగుడు పడిన మనస్సు గలవాడై; ధీరుఁడు= ధైర్యం గలవాడు; ఉక్కునన్= బలంతో; నిల్చి= నిలువబడి; ఆ+గదన్= ఆగదను; త్రిప్పి= గిరగిర వేగంగా త్రిప్పి; వాసవున్+వైచెన్= దేవేంద్రుడిపై ప్రయోగించాడు; ఆ+వీరుఁడున్= ఆ శూరుడుకూడ; గద= గద; చూర్ణితంబుగన్= పొడి అయ్యేటట్లుగా; ఆసుర భంగిన్= రాక్షసుడి మాదిరిగనే (అనగా) ఆ కేశిదానవుడు (ప్రయోగించినట్లుగానే); పొంగారి= ఉత్సహించి; పటు హస్తుఁడు+ఐ= గొప్ప బాహువు కలవాడై; దారుణ, వజ్ర, పాత, రయంబునన్= భయాన్ని కొలిపే వజ్రపుదెబ్బయొక్క వేగంతో; వ్రేసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: వెఱపు కొలిపే పరాక్రమం కల ఆ కేశి రాక్షసుడు, కోపంచేత తిరుగుడు పడిన మనస్సు గలవాడు ఔతూ దేవేంద్రుడిని ఎదిరించి ఆతడిపై తన గదను గిరగిర త్రిప్పి ప్రయోగించాడు. దేవేంద్రుడున్నూ ఆ దానవుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రయోగించినట్లుగనే బలం గల బాహువుతో వేగంగా తన వజ్రాయుధాన్ని ప్రయోగించి ఆ గదను ముక్కలు ముక్కలుగా చేశాడు.

విశేషం: వృత్త లక్షణానికి చూడు: ఆరణ్య. 4.267 విశేషం.

ఆ. అసుర వీఁక నొక మహాచలశృంగంబు । విఱిచి వైచె నమరవిభునిమీఁద
గోత్రవైరి ఘోరకులిశాభిహతి వ్రయ్య । నడిచె దానిఁ జదల నదరు లెగయ. 181

ప్రతిపదార్థం: అసుర= రాక్షసుడు; వీఁకన్= ఉత్సాహంతో; ఒక= ఒక; మహా+అచల, శృంగంబు= గొప్ప కొండ శిఖరాన్ని; విఱిచి= విరగగొట్టి; అమర, విభుని మీఁదన్= దేవతల ప్రభువు మీద; వైచెన్= ప్రయోగించాడు; గోత్రవైరి= (పర్వతాలకు శత్రువు అయిన) ఇంద్రుడు; దానిన్= ఆ కొండ శిఖరాన్ని; ఘోర, కులిశ+అభిహతిన్= భయంకరమైన వజ్రం యొక్క దెబ్బ చేత; చదలన్= ఆకసంలో; అదరులు= నిప్పు కణాలు; ఎగయన్= వ్యాపించగా; వ్రయ్యన్+అడిచెన్= ముక్కలు ముక్కలుగా అయ్యేటట్లు కొట్టాడు.

తాత్పర్యం: రాక్షసుడు ఉత్సాహంతో ఒక కొండశిఖరం పెల్లగించి దేవేంద్రుడిపై ప్రయోగించాడు. అంతట దేవేంద్రుడు తన వజ్రాయుధాన్ని ప్రయోగించి ఆ కొండ శిఖరాన్ని ముక్కలు ముక్కలు చేసి వేశాడు. అప్పుడు ఆ గిరిశిఖర వజ్రాయుధాల రాపిడికి ఆకసాన నిప్పుకణాలు వ్యాపించాయి.

వ. ఇట్లు దన సాధనంబులు విఫలంబు లైనం దలంకి దానవుం డక్కన్నియ దిగవిడిచి పఱచిన, నింద్రుండు దానిం జేరంజని 'నీ వెవ్వరిదాన? వీ రక్కసుచేత నెట్లు పట్టువడి?' తనిన నది యతని కిట్లనియె 'నయ్యా! యే నరిష్టనేమి యను ప్రజాపతి కూఁతుర, దేవసేనయనుదాన, దైత్యసేన చెలియల; నేనును మాయప్పయుం గేళికౌతుకంబునఁ దండ్రియనుమతంబు వడసి సఖీజన సహితంబుగా వెడలి యిమ్మానసనగంబు సాను దేశంబులం గ్రుమ్మరుచుండం గేశి నామధేయుం డైన యీ యసురాధముండు. 182

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; తన, సాధనంబులు= తన పరికరాలు; విఫలంబులు+ఐనన్= వ్యర్థాలు కాగా; తలంకి= భయపడి; దానవుండు= రాక్షసుడు; ఆ+కన్నియన్= ఆ కన్యను; దిగవిడిచి= అచ్చట వదలిపెట్టి; పఱచినన్= పారిపోగా; ఇంద్రుండు; దానిన్+చేరన్+చని= ఆమె దగ్గరకు వెళ్లి; నీవు+ఎవ్వరి దానవు= నీవు ఎవ్వరి అమ్మాయివి; ఈరక్కసుచేతన్= ఈ రాక్షసుడిచేత; ఎట్లు= ఏ రీతిగా; పట్టు+పడితి= చెఱపెట్టబడిన దానవు అయినావు; అనినన్= అని అడుగగా; అది= ఆమె; అతనికిన్= దేవేంద్రుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది; అయ్యా= ఆర్యా; ఏను=నేను; అరిష్టనేమి+అను= అరిష్ట నేమి అనే పేరుకల; ప్రజాపతి కూఁతురన్= ప్రజాపతి యొక్క పుత్రికను; దేవసేన+అనుదానన్= దేవసేన అనే పేరు గల దానిని; దైత్యసేన, చెలియలన్= దైత్యసేన అనే పేరుగల ఆమె సహోదరిని; ఏనును= నేనున్నూ; మా+అప్పయున్= మా అక్కయున్నూ; కేళి కౌతుకంబునన్= విహరించుటయెడ గల ప్రీతి చొప్పున; తండ్రి+అనుమతంబు+పడసి= తండ్రి యొక్క అనుజ్ఞను పొంది; సఖీజనసహితంబుగాన్= చెలికత్తియలతో కలసి; వెడలి= వెళ్లి; ఈ+మానస, నగంబు= ఈ మానస పర్వతం (యొక్క); సాను దేశంబులన్= చరియల యందు; క్రుమ్మరుచున్+ఉండన్= విహరిస్తూ ఉండగా; కేశి నామధేయుండు+ఐన= కేశి అనే పేరు కల; ఈ+అసుర+అధముండు= రాక్షసులలో నీచుడు అయిన ఈతడు.

తాత్పర్యం: ఈ విధంగా తన ఆయుధాలు వమ్మయి పోగా, భయపడి ఆ రాక్షసుడు ఆ కన్యను వదలి పారిపోయాడు. అంతట ఇంద్రుడు ఆ కన్యకను చేరి, ఓదార్చి, 'నీవు ఎవ్వరిదానవు? ఈ రాక్షసుడికి ఎట్లా చిక్కావు?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అని అడిగాడు. ఆమె, 'ఆర్యమహాశయా! నేను అరిష్టనేమి అనే ప్రజాపతి కూతురిని. నా పేరు దేవసేన. మా అక్క పేరు దైత్యసేన. నేనున్నూ మా అక్కయున్నూ తండ్రిగారి అనుమతి పొంది, చెలికత్తెలతో కలిసి ఈ మానస పర్వతం యొక్క చరియలలో విహరిస్తూ ఉన్నాం. అంతట కేశి అనే పేరు కల ఈ నీచరాక్షసుడు ఈ అత్యాచారానికి ఒడిగట్టాడు.

క. **పలుమాఱు వచ్చి తన దు । ర్విలసితములు మాకుఁ జూపు వేడుక దోఁపన్**
బలుకును మేలమునఁ జెనకఁ । దలఁచుఁ గదియు మదనకదనదళితహృదయుఁ డై. **183**

ప్రతిపదార్థం: పలుమాఱు= చాల పర్యాయాలు; వచ్చి; తన దుర్విలసితములు= తనయొక్క చెడు హొయలు; మాకున్+చూపున్= మాకు (నాకున్నూ మా అక్కకున్నూ) ప్రదర్శిస్తాడు; వేడుక తోఁపన్+పలుకును= తన కుతూహలం బయలు పడేటట్లుగా మాటలాడుతాడు; మేలమునన్= పరిహాసంతో; చెనకన్+తలఁచున్= నొప్పించ తలుస్తాడు; మదన, కదన, దళిత, హృదయుఁడు+ఐ= మన్మథుడికి సంబంధించిన యుద్ధంకొరకై (రతిక్రీడ కొరకై) వికసించిన డెందం కలవాడై; కదియున్= సమీపిస్తాడు.

తాత్పర్యం: కేశి రాక్షసుడు ఎన్నో మారులు మా దగ్గరకు చేరి, అతడి యొక్క హొయలు ప్రదర్శిస్తూ ఉండేవాడు. వేళాకోళం చేస్తూ ఉండేవాడు. మన్మథక్రీడకు సంబంధించిన కోర్కెలు ప్రదర్శిస్తూ సమీపిస్తూ ఉండేవాడు.

తే. **వాని చేష్టలన్నియు దైత్యసేన కభిమ । తంబు లై యుండు; నాకు నెంతయును దుస్స**
హములు; వినవె! యిమ్మెయిన యక్కమలనయనఁ । గోరి దానవుఁ డెలయించి కొంచుఁ జనియె. **184**

ప్రతిపదార్థం: వినవె= (శ్రద్ధతో) వినవయ్యా!; వాని చేష్టలు+అన్నియున్= ఆ రాక్షసుడి యొక్క పనులు అన్నీ; దైత్యసేనకున్= దైత్యసేనకు (మా అక్కకు); అభిమతంబులు+ఐ+ఉండున్= ఇష్టమై ఉండేవి; నాకున్+ఎంతయును, దుస్సహములు+అ= నాకు మాత్రం ఎంత మాత్రమూ సహించరానివిగా ఉండేవి; ఇమ్మెయిన్+అ= ఈ రీతిగానే; ఆ+కమలనయనన్= ఆ అమ్మాయిని (పద్మాల వంటి కనులు కలదానిని); కోరి= వరించి; దానవుఁడు= రాక్షసుడు; ఎలయించి కొంచున్= తన వశం చేసికొంటూ; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: శ్రద్ధతో వినుము. అతడి చేష్టలన్నీ దైత్యసేనకు ఇష్టమై ఉండేవి. నాకు మాత్రం సహించరానివిగా ఉండేవి. దానితో ఆ రాక్షసుడు ఆమెను వశం చేసికొని తీసికొని వెళ్ళాడు.

తే. **అంతఁ బోక వెండియు వచ్చి యింత సేసె । నద్దురాత్ముఁడు నన్ను; మీ దైన కరుణఁ**
దొడరి దుఃఖసాగరమునఁ బడుట దప్పె' । ననిన నయ్యింద్రుఁ డనియె నయ్యతివఁ జూచి. **185**

ప్రతిపదార్థం: ఆ+దురాత్ముఁడు= ఆ చెడ్డవాడు; అంతన్+పోక= ఆ విధంగా చేసి- వెడలక; వెండియున్ వచ్చి= మరల వచ్చి; నన్నున్= నన్ను; ఇంత+చేసెన్= ఇంత (ఇంతటి ఆగడం) ఒనరించాడు; మీదైన, కరుణన్= మీ యొక్క దయవలన; తొడరి= పూని; దుఃఖ, సాగరమునన్+పడుట= శోకం అనే సముద్రంలో పడిపోవటం; తప్పెన్= తప్పింది; అనిన్= అని చెప్పగా; ఆ ఇంద్రుఁడు= ఆ+దేవేంద్రుడు; ఆ+అతివన్+చూచి= ఆ వనితను చూచి; అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: మా అక్కను ఆకర్షించి లేవదీసికొని పోవటంతో ఆగక, ఆ దుర్మార్గుడు మరల నా దగ్గరికి వచ్చి ఇంతటి ఆఘాయిత్యం చేశాడు. మీ దయవలన నేను ఇట్టి దుఃఖసాగరంలో పడిపోకుండ తప్పించుకోగలిగాను' అని దేవసేన పలుకగా, ఇంద్రుడు ఆమెతో ఇట్లా బదులు పలికాడు.

క. 'విను, దక్షతనూజలు మా । జననియు మీ తల్లియును; నిజంబుగ మా కీ
వనుజ వయితి; వనజానన! యొనరంగా వేఁడు నీకు నొక వర మిత్తున్'. 186

ప్రతిపదార్థం: వనజ+ఆనన!= పద్మం వంటి మొగం కలదానా!; విను= ఆలకించుము; మా జననియున్= మా తల్లియున్నూ; మీ తల్లియును= మీ జననియున్నూ; దక్షతనూజలు= దక్షుడి యొక్క పుత్రికలు; నిజంబుగన్= యథార్థంగా; మాకున్= నాకు; ఈవు= నీవు; అనుజవు+అయితి(వి)= సహోదరివి అయినావు; ఒనరంగాన్= ఒప్పిదమౌనట్లుగా; వేడుము= కోరుకొనుము; నీకున్= నీకు; ఒక వరము= ఒక కోరిక; ఇత్తున్= అనుగ్రహిస్తాను.

తాత్పర్యం: పద్మం వంటి మొగం కల సుందరీ!; వినుము; నీవు నాకు చెల్లెలి వౌతావు. మీ అమ్మగారు మా అమ్మగారు దక్షుడి పుత్రికలే. అందుచేత కోరుకో. ఇష్టమైన వరాన్ని నీకు నేను ప్రసాదిస్తాను.

విశేషం: శాపానికి ప్రతియోగ కల్పన - వరం. కోరినవరం ప్రసాదించే మహిమ మహానుభావులకు ఉంటుంది.

వ. అనిన దేవసేన దేవేంద్రున కి ట్లనియె. 187

తాత్పర్యం: అని అనగా దేవసేన దేవేంద్రుడితో ఇట్లా అన్నది.

తే. 'అనఘ! మాతండ్రి యొక్కనాఁ డతిముదమున । నన్ను నుపలాలనము సేసి 'నాతి! నీవు
ప్రథిత పౌరుషుఁ డగు భర్తఁ బడయు' దనియె; । నట్టి వానిని నీవు నా కరయవలయు. 188

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా (ఓ దేవేంద్రుడా!); మా తండ్రి= మా నాన్న; ఒక్కనాఁడు= ఒక రోజున; అతి, ముదమునన్= మిక్కిలి సంతోషంతో; నన్నున్; ఉపలాలనము+చేసి= గారాబం చేసి; నాతి!= ఓ అమ్మాయీ!; నీవు; ప్రథిత పౌరుషుఁడు+అగు= గొప్ప పేరు కెక్కిన పరాక్రమశాలి అయినట్టి; భర్తన్= పెనిమిటిని; పడయుదు(వు)= పొందుతావు; అనియెన్= అని చెప్పాడు; అట్టివానినిన్= (మా తండ్రిగారు చెప్పినట్లు గొప్పపరాక్రమవంతుడిని); నీవు= నీవు; నాకున్= నాకు; అరయ వలయున్= వెదకవలెను (నాకు భర్తగా సమకూర్చాలి).

తాత్పర్యం: అని చెప్పిన పిమ్మట, దేవసేన దేవేంద్రుడిని ఈ విధంగా అడిగింది: 'పాపరహితుడ వైన ఓ మహానుభావా! మా జనకుడు చిన్నప్పుడు నన్ను గారాబం చేసి, 'అమ్మా! నీకు గొప్ప పేరుప్రతిష్ఠలు ఆర్జించిన మహాపరాక్రమశాలి భర్త కాగలడు' అని చెప్పాడు. ఆయనమాటలు నిజం చేయటమే నేను నీనుండి కోరుకొనే వరం.

చ. అనిమిష దానవేంద్రులకు నైన నజయ్యుఁడు, నుగ్రవైరిభం
జనుఁడు, త్రిలోకరక్షణవశంవదుఁడున్, భవదిష్టమిత్రుఁడున్
ఘనగుణకీర్తనుండు నగు కాంతునిఁ గోరెద; నా మనోరథం
బు నెరయ సంఘటించి సురపుంగవ! నన్నుఁ గృతార్థఁ జేయవే!' 189

ప్రతిపదార్థం: సురపుంగవ!= దేవతలలో శ్రేష్ఠుడవైన వాడా!; అనిమిష, దానవ+ఇంద్రులకున్+ఐనన్= దేవతలలో రాక్షసులలో శ్రేష్ఠులు అయిన వారికి కూడ; అజయ్యుఁడు= గెలువ శక్యం కానివాడు; ఉగ్ర, వైరి, భంజనుఁడు= భయంకరులైన శత్రువులను చంపేవాడు; త్రి, లోక, రక్షణ, వశంవదుఁడున్= మూడు లోకాలను రక్షించటం తనకు స్వాధీనమై ఉన్నవాడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భవత్+ఇష్ట, మిత్రుఁడున్= నీకు అనుగు నెచ్చెలి అయిన వాడు; ఘన, గుణ కీర్తనుండును+అగు= గొప్ప గుణాలు కలిగి ఉండటంచేత కొనియాడబడేవాడు అయిన; కాంతునిన్= భర్తను; కోరెదన్= వాంఛిస్తాను; నా మనోరథంబు= నా కోరిక; నెరయన్= సిద్ధించేటట్లుగా; సంఘటించి= ఒనగూర్చి; నన్నున్= నన్ను; కృతార్థన్+చేయవే= ధన్యురాలిని చేయవా?.

తాత్పర్యం: దేవతలలో శ్రేష్ఠుడవైన ఓ దేవేంద్రుడా!; నీవు అనుగ్రహించిన మేరకు నేను వరం కోరుకొంటున్నాను. దేవతలలో రాక్షసులలో శ్రేష్ఠులకు కూడ గెలువ శక్యం కానివాడు. భయంకరులైన శత్రువులను పరిమార్చేవాడు, మూడులోకాల రక్షణం తనకు వశమైనవాడు, నీకు ఆప్తమిత్రుడు అయినవాడు, నాకు భర్త కావలెనని కోరుకొంటున్నాను. నా కోరిక ఈడేర్చి నన్ను ధన్యురాలినిగా చేయ వేడికోలు'.

వ. అనిన నింద్రుండు దీనికిం బతి యెవ్వం డగు నొకో! యని కొండొక విచారించు నెడ, నమ్ముహూర్తంబు రౌద్ర నామకంబయి సోమ సూర్యసంగమ కారణం బయిన యమావాస్యాముఖం బై యుండం, బూర్వసంధ్యారాగ రక్తాంబుద ప్రతిబింబ పటల పాటలితోదకం బయిన జలనిధి సమీపంబున నమరాసుర సమర సంకులంబుగా నరుణకిరణుం డుదయించుచుండఁ దత్కాలంబున భృగ్వంగిరఃప్రముఖు లైన మునులు వేల్చు హవ్యంబులు మోచికొని హవ్యవహనుండు సూర్యమండలంబు ప్రవేశించుచుండం గనుంగొని, యిది సూర్యసోమాగ్ని సమాగమం బయిన రౌద్ర నామక ముహూర్తంబు గావున సూర్యసోమాగ్ని తేజంబున జనియించిన వాఁడు దీనికిఁ బ్రియుండు గావలయు నని మనంబున నిశ్చయించి, యతం డా క్షణంబ.190

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; ఇంద్రుండు= వేలుపుదొర; దీనికిన్= ఈమెకు (దేవసేనకు); పతి= భర్త; ఎవ్వండు+అగున్+ఒకో= ఎవ్వడు కాగలడో; అని; కొండొక విచారించు+ఎడన్= కొంతసేపు ఆలోచించే టప్పుడు; ఆ+ముహూర్తంబు= ఆ లగ్నం; రౌద్ర, నామకంబు+అయి= రౌద్రం అనే పేరు కలిగినదై; సోమ, సూర్య, సంగమ, కారణంబు+అయిన= సూర్యుడున్నూ చంద్రుడున్నూ కలియటానికి హేతువైన; అమావాస్యా, ముఖంబు+ఐ= కృష్ణపక్షంలోని కడపటి తిథియొక్క ఆరంభం కలదై; ఉండన్= ఉండటం చేత; పూర్వ, సంధ్యా, రాగ, రక్త+అంబుద, ప్రతిబింబ, పటల, పాటలిత+ఉదకంబు+అయిన= ఉదయసంధ్యా కాలంలోని ఎర్రని వెలుగులతో ఎర్రబడిన మబ్బుల ప్రతిబింబ సముదాయంచేత ఎర్రబడినట్లున్న నీరు గల; జలనిధి, సమీపంబునన్= సముద్రం దగ్గర; అమర+అసుర, సమర, సంకులంబుగాన్= దేవతలు రాక్షసులు చేసే యుద్ధ సంక్షోభంవలె; అరుణ కిరణుండు= సూర్యుడు, ఎఱ్ఱని కిరణాలు కలవాడు; ఉదయించుచున్+ఉండన్= పొడుస్తూ ఉండగా; తద్+కాలంబునన్= ఆ సమయంలో; భృగు+అంగిరస్+ప్రముఖులు+ఐన= భృగువు, అంగిరసుడు మున్నగునట్టి; మునులు= ఋషులు; వేల్చు, హవ్యంబులు= యజ్ఞకుండాలలో వేసే హోమద్రవ్యాలు; మోచికొని= వహించి; హవ్యవహనుండు= అగ్నిహోత్రుడు; సూర్య, సోమ+అగ్ని, సమాగమంబు+అయిన= సూర్యుడున్నూ, చంద్రుడున్నూ, అగ్నిహోత్రుడున్నూ, కలిసేది అయిన; రౌద్ర, నామక, ముహూర్తంబు= రౌద్రం అనే పేరు కల లగ్న సమయం; కావునన్= కాబట్టి; సూర్య, సోమ+అగ్ని తేజంబునన్= సూర్యుడి యొక్కయు, చంద్రుడి యొక్కయు, అగ్నిహోత్రుడి యొక్కయు కాంతితో; జనియించినవాఁడు= పుట్టినవాడు; దీనికిన్= ఈమెకు (దేవసేనకు); ప్రియుండు= భర్త; కావలయున్= కావాలి; అని= అంటూ; మనంబునన్= మనసులో; నిశ్చయించి= నిర్ణయించి; అతండు= దేవేంద్రుడు; ఆ+క్షణంబు+అ= ఆ త్రుటిలోనే.

తాత్పర్యం: దేవసేన వేడిన వరం వినినంతనే దేవేంద్రుడు ఈ విధంగా యోచించాడు. 'ఈమెకు భర్త ఎవ్వడౌతాడు? ఈ ముహూర్తం రౌద్రం అనే పేరు కలది గదా! ఈనాడు తిథి అమావాస్య. అమావాస్యనాడు సూర్యుడు చంద్రుడు ఏకరాశిలో కలిసి ఉంటారు. అంతేకాక- ఇది సూర్యోదయ సమయం. ఈ ప్రభాతకాలంలో సూర్యుడి ఎర్రని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కిరణాలచేత ఎర్రనైన మబ్బులు ప్రతిబింబించటంచేత, సముద్రం కూడ ఎరుపురంగుకలదై కన్పిస్తున్నది. దేవదానవ యుద్ధాన్ని తలపింపజేస్తూ సముద్రం సంక్షుభితమై ఉన్నది. బాలభానుడు ఉదయిస్తున్న ఈ లగ్నంలో భృగువు, అంగిరసుడు మున్నగు మహర్షులు యజ్ఞకుండాలలో వేల్చిన హోమద్రవ్యాలను వహించి అగ్నిహోత్రుడు సూర్య మండలం ప్రవేశిస్తున్నాడు. ఇది సూర్యుడు, చంద్రుడు, అగ్నిహోత్రుడు కలిసిన రౌద్రముహూర్తం. కాబట్టి సూర్య చంద్రాగ్నిహోత్రుల తేజస్సులో జన్మించినవాడు ఈ దేవసేనకు భర్త కాగలడు' అని నిర్ణయించుకొన్నాడు.

విశేషం: అమావాస్య-కృష్ణపక్షంలోని కడపటి దివసం. ఆనాడు సూర్యుడు చంద్రుడు ఆకసంలో ఒకేచోట ఉంటారు. కాని, చంద్రుడు చర్మచక్షువులకు అమావాస్యనాడు కన్పించడు గదా! భారతీయుల జ్యోతిష పరిజ్ఞానం పేర్కొనదగింది. దుర్భిణీ యంత్రాలు లేని ప్రాచీనకాలంలో పాశ్చాత్యులకు తెలియని అంశాలు ఎన్నో ఆనాడు ప్రాచీనభారతీయులకు సుగమాలు. దేవసేన- వరం కోరిన ముహూర్తాన్ని బట్టి దేవేంద్రుడు ఆమెకు ఎటువంటి భర్త- భవిష్యత్కాలంలో లభిస్తాడో జ్యోతిషగణితాన్ని అన్వయించి తెలిసికొనగలిగాడు.

క. బాలం దోడ్కొని యబ్జజు । పాలికిఁజని మ్రొక్కి త్రిదశపాలుఁడు 'దేవా!
యీ లలనకుఁ దగు వరునిఁ గృ । పాలుఁడవై యొసఁగు' మనినఁ బద్మజుఁ డనియెన్. 191

ప్రతిపదార్థం: త్రిదశ పాలుఁడు= వేల్పుల దొర అయిన ఇంద్రుడు; బాలన్+తోడ్కొని= కన్యకను తన వెంటపెట్టుకొని; అబ్జజు పాలికిన్+చని= బ్రహ్మదేవుడి కడ కేగి; మ్రొక్కి= నమస్కరించి; దేవా!= ఓ బ్రహ్మదేవా!; ఈ, లలనకున్= ఈ అమ్మాయికి; తగువరునిన్= యోగ్యుడైన భర్తను; కృపాలుఁడవు+ఐ= దయ కలిగినవాడవై; ఒసఁగుము= ఇమ్ము; అనినన్= అని చెప్పగా; పద్మజుఁడు= తామరపువ్వులో పుట్టిన వాడైన బ్రహ్మ; అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దేవేంద్రుడు ఆ కన్యకను తన వెంట పెట్టుకొని బ్రహ్మదేవుడి కడకు వెళ్ళి నమస్కరించి ఇట్లా పలికాడు; 'దేవా! ఈమెకు యోగ్యుడైన భర్తను ప్రసాదించుము. నీవు దయామయుడవు' అనగా, బ్రహ్మదేవుడు ఇట్లా బదులు పలికాడు.

విశేషం: త్రిదశపాలుఁడు అనగా దేవతలను పాలించేవాడు. త్రిదశులు - అనగా దేవతలు - ఎల్లప్పుడు ముప్పదేండ్ల వయసుతో ఉండే నిత్య యౌవనులు అన్నమాట.

ఉ. 'దీపితవిక్రమాస్పదుఁడు దీనికి వల్లభుఁ డయ్యెడుం ద్రిలో
కీపరిరక్షణక్షముఁడు గీర్తితమూర్తి యొకండు; వాఁడ మీ
యాపదలెల్లఁ బాపుటకునై ధృతిఁ బూను నశేష దేవసే
నాపతి భావమున్ విబుధనాయక! శీఘ్రము భావ్య మింతయున్.' 192

ప్రతిపదార్థం: విబుధ నాయక!= వేల్పులకు నేతవైన దేవేంద్రా!; దీపిత, విక్రమ+ఆస్పదుఁడు= ప్రజ్వలించబడిన పరాక్రమానికి నెలవు అయినవాడు; త్రిలోకీ పరిరక్షణ క్షముఁడు= మూఁడులోకాలను కాపాడ గల సామర్థ్యం కలవాడు; కీర్తిత మూర్తి= పేరు ప్రతిష్ఠలను ఆర్జించిన ఆకారం కలవాడు; ఒకండు= ఒకడు; దీనికిన్= ఈమెకు (ఈ దేవసేనకు); వల్లభుఁడు= భర్త; అయ్యెడున్= కాగలడు; వాఁడు+అ= అతడే; మీ ఆపదలు+ఎల్లన్= మీకు దాపురించే కష్టాలను అన్నింటిని; పాపుటకున్+ఐ=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పోగొట్టుట కొరకై; అశేష, దేవ సేనాపతి భావమున్= సమస్త మైన దేవతల సేనలకు ఆధిపత్యాన్ని; ధృతిన్+పూనున్= స్థైర్యశౌర్యాలతో వహిస్తాడు. ఇంతయున్= ఇది అంతయు; శీఘ్రము+అ= మిక్కిలి వేగంగానే; భావ్యము= జరుగుతుంది.

తాత్పర్యం: ఓ దేవేంద్రా!, ఈ దేవసేనకు గొప్ప వీరుడు భర్త కాగలడు. ఆతడు మూడులోకాలను కాపాడగల సామర్థ్యం కలవాడౌతాడు. ఆతడే మీ ఆపదలను పారద్రోలి మిమ్ములను రక్షించగలడు. దేవసైన్యాల కన్నింటికి ఆతడు సేనాపతి కాగలడు. ఇది అంతా సమీప భవిష్యత్కాలంలోనే జరుగుతుంది సుమా!

విశేషం: ఈ దేవసేన భర్త 'అశేష దేవసేనాపతి' కాగలడు అనటంలో సుకుమార సుందర మైన వ్యంగ్యం ఉన్నది. దేవసేనాపతి= దేవసేన యనే కన్యకు భర్త అని సుస్పష్టమైన అర్థం సుగమం. అశేష దేవసేనాపతి భావము-అంటే దేవతల సర్వసేనా నాయకుడు (సేనా నాయకత్వము) అనేది మరొక అర్థం. దేవసేన భర్త, దేవసేన అనుకన్యకకు భర్తయేగాక, దేవతల సర్వసేనలకు నాయకుడు కూడ కాగలడని బ్రహ్మ వచించాడు. దేవసేన సార్థక నామధేయురాలు కావటం ఇక్కడ చమత్కారం.

వ. అనినం బ్రీతుం డై పితామహు వీడ్కొని యింద్రుండు సనియెఁ; దదనంతరంబ వసిష్ఠ ప్రముఖులైన సప్త మహామును లమావాస్యాహోమంబు సేయ సమకట్టిన, నమరు లందఱు నందుల హవిర్భాగంబులు గొనుటకు నాసన్ను లగుటయు. 193

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన; ప్రీతుండు+ఐ= సంతృప్తిచెందిన వాడై; పితామహున్= బ్రహ్మదేవుడిని; వీడ్కొని= సెలవుగైకొని; ఇంద్రుండు; చనియెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట; వసిష్ఠ, ప్రముఖులు+ఐన= వసిష్ఠుడు మున్నగువారైన; సప్త, మహామునులు= ఏడుగురు ఋషులు; అమావాస్యా, హోమంబు+చేయన్, సమకట్టినన్= అమావాస్యనాడు అగ్నికుండాలలో హోమాలు చేయటానికి పూనగా; అమరులు+అందఱున్= వేల్పులు ఎల్లరు; అందులన్, హవిస్+భాగంబులు= ఆ హోమద్రవ్యాలలో తమ తమ వంతులు; కొనుటకున్= స్వీకరించటానికి; ఆసన్నులు+అగుటయున్= చేరగా.

తాత్పర్యం: అనగా సంతృప్తి చెంది ఇంద్రుడు బ్రహ్మదేవుడికడ సెలవు గైకొని వెడలిపోయాడు. ఆ తరువాత, వసిష్ఠుఁడు మున్నగు మహర్షులు ఏడుగురు అమావాస్యా హోమం చేయటానికి ఉద్యమించారు. దేవతలు అందరు తమ తమ హవిస్సుల వంతులు తీసికొనటానికి సంసిద్ధులై సమీపించారు.

క. ఆహవనీయ ముఖంబున । నాహూతుం డై హుతాశుఁ డమ్మును లిడఁగా
నాహుతులు గొని దివిజ సం । దోహమునకు వరుస నొసఁగఁ దొడఁగెం బ్రీతిన్. 194

ప్రతిపదార్థం: ఆహవనీయ, ముఖంబునన్= త్రేతాగ్నులలో మొదటిదైన ఆహవనీయం అనే పేరుగల అగ్ని పేరున; ఆ హూతుండు+ఐ= పిలువబడినవాడై; హుతాశుఁడు= అగ్నిహోత్రుడు; ఆ+మునులు= ఆ ఋషులు; ఆహుతులు= దేవతల నుద్దేశించి మంత్రపురస్సరంగా వేల్చబడిన హోమద్రవ్యాలు; ఇడఁగాన్= సమర్పించగా; కొని= గ్రహించి; దివిజ, సందోహమునకున్= వేల్పుల గుంపులకు; వరుసన్= క్రమంగా; ప్రీతిన్= సంతసంతో; ఒసఁగన్+తొడఁగెన్= ఇవ్వసాగాడు.

తాత్పర్యం: సప్తర్షులు ఆహవనీయ మనే పేరున తనను ఆహ్వానించగా, అగ్నిహోత్రుడు ఆ మునులు సమర్పించిన హోమద్రవ్యాలను గైకొని వాటిని దేవతలకు క్రమానుక్రమణిక చొప్పున సంతసంతో అందించసాగాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అగ్నిదేవుండు మునిపత్నులం గామించుట (సం. 3-213-42)

సీ. ఆ సమయంబున నమ్మునీంద్రుల భార్య। లందఱు సుస్నాన మొందఁ జేసి
రమణీయ మాల్యాంబర విభూషణాద్యలం। కారంబు లొనరించి గారవమునఁ
జనుదెంచి పతులకు సన్మతిం బరిచర్య। సేయుచు మెలఁగంగ వాయుసఖుఁడు
మెలఁతల వాలిక మెఱుఁగుఁ గన్నుల యొప్పుఁ। దెలినవ్వుమొగముల విలసనములు

తే. నడబెడంగులు నన్నువనడుములందు। వెలయు వళులభావంబులు వలుఁదచన్నుఁ
గవల నిక్కును నేర్పడఁ గని, కరంగి। మదనమార్గణ విదళిత హృదయుఁడయ్యె. 195

ప్రతిపదార్థం: ఆ, సమయంబునన్= ఆ కాలంలో; ఆ+ముని+ఇంద్రుల, భార్యలు= ఆ గొప్ప ఋషుల పెండ్లాలు; అందఱున్= అందరును; సుస్నానము= మంచి అభ్యంగన స్నానం; ఒందన్= ఇంపారగా; చేసి= ఆచరించి; రమణీయ, మాల్య+అంబర, విభూషణ+ఆది+అలంకారంబులు= అందమైన పువ్వులు, బట్టలు, నగలు మొదలైన సింగారింపులు; ఒనరించి= చేసికొని; గారవమునన్= మన్ననతో; చనుదెంచి= వచ్చి; పతులకున్= భర్తలకు; సత్+మతిన్= మంచి బుద్ధితో; పరిచర్య+ చేయుచున్= సేవచేస్తు; మెలఁగంగన్= తిరుగాడగా; వాయుసఖుఁడు= అగ్నిహోత్రుడు; మెలఁతల, వాలిక, మెఱుఁగు+కన్నుల+ఒప్పున్= వనితల నిడివి అయిన వెలుగొందే నేత్రాల అందాన్ని; తెలినవ్వు మొగముల విలసనములు= తేట వైన ముఖాలలో విస్తరిల్లే నవ్వుల సింగారాలను; నడ బెడంగులు= నడకల ఒయ్యారాలు; అన్నువ నడుములందున్= సన్నని నడుములలో; వెలయు= ఒప్పారు; వళుల భావంబులు= మడతల పొందికలు; వలుఁద, చన్నుఁ గవల నిక్కును= గబ్బిగుబ్బల పొటమరింతలను; ఏర్పడన్+కని= స్పష్టంగా చూచి; కరంగి= ద్రవించి; మదన, మార్గణ విదళిత, హృదయుఁడు+అయ్యెన్= మన్మథుడియొక్క బాణాలచేత చీల్చబడిన గుండె కలవాడయ్యాడు.

తాత్పర్యం: అమావాస్యా హోమం చేస్తున్న సమయంలో సప్తర్షుల భార్యలు అందరున్నూ చక్కగా స్నానం చేసి అందమైన పువ్వులు ముడుచుకొని, క్రొత్త బట్టలు కట్టుకొని, ఆభరణాలు ధరించి, సహధర్మచారిణులై తమ తమ భర్తలకు గౌరవంతో శుశ్రూష చేస్తూ ఉన్నారు. వాయుసఖుడైన అగ్నిహోత్రుడు సప్తర్షుల భార్యల సౌందర్యాన్ని చూచి, కనువేదురుతో భ్రమందసాగాడు. ఆ అంగనల వాలుచూపులు, నునుసోగనేత్రాలు, మందహాసాలు చిందే వదనాలు, నడకలలోని ఒయ్యారాలు, సన్నని నడుములలోని ముడతలు, గబ్బిగుబ్బల పొటమరింతలు చూచి కరగి అగ్నిహోత్రుడు మన్మథబాణాలకు గురి అయి చలించిన హృదయం కలవాడయ్యాడు.

వ. ఇట్లు వికలేంద్రియుండై వైశ్వానరుం డమ్మునిపత్నులయందుఁ దగిలిన డెందంబు మగిడింప నేరక వారలం గదియ నప్పళించి గార్హపత్యకుండంబునం దావేశించి. 196

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; వికల+ఇంద్రియుండు+ఐ= వశం తప్పిన ఇంద్రియాలు కలవాడై; వైశ్వానరుండు= అగ్ని దేవుడు; ఆ+ముని, పత్నుల యందున్= ఆ ఋషుల భార్యల యందు; తగిలిన= అంటిన; డెందంబు= హృదయం; మగిడింపన్, నేరక= త్రిప్పజాలక; వారలన్= (ఆ మునుల భార్యలను); కదియన్+అప్పళించి= దగ్గరగా ఉండి స్పృశింపగోరి; గార్హపత్య కుండంబునందున్= గృహస్థులు గార్హపత్యమనే పేరుగల అగ్నిని వెలిగించే కుండంలో; ఆవహించి= చేరి.

తాత్పర్యం: ఈ విధంగా అగ్నిహోత్రుడు ఇంద్రియనిగ్రహాన్ని కోల్పోయినవాడై, ఆ ఋషులభార్యలయందు తగుల్కొనిన తన హృదయాన్ని మరలించ జాలకపోయాడు. ఆ మునీంద్రుల భార్యలను సమీపంలో ఉండి తాకగోరినవాడై, అతడు గార్హపత్య కుండంలో చేరాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అగ్నులు మూడుతెరగులు 1) ఆహవనీయం 2) గార్హపత్యం 3) దక్షిణం. యజ్ఞానికి అనువైనది ఆహవనీయం. గృహస్థులకు అనువైనది గార్హపత్యం. దక్షిణం త్రేతాగ్నులలో అగ్రగణ్యం. ఇది శ్రోత్రియ బ్రహ్మచారులకు అనువైనది.

చ. **అతివలు దన్నుఁ జేరుటకు నాసపడుం, బొరిఁ జేరుచోట నా**
యత విలసచ్ఛిఖాగ్రముల నల్లన వారల నంటుఁ, గౌతుకం
బతిశయమై తదంగలత లాదటఁ గౌఁగిటఁ జేర్పఁ గోరుఁ, గం
పిత ధృతి యై కలంగుఁ, గడుఁబెల్లగు రాగరసంబు ముంపఁగన్. **197**

ప్రతిపదార్థం: అతివలు= అంగనలు (ఆ మునిభార్యలు); తన్నున్= తనను (అగ్నిహోత్రుడిని); చేరుటకున్= దగ్గరకు రావటానికి; ఆసపడున్= ఆశిస్తాడు; పొరిన్= క్రమంగా; చేరుచోటన్= కలిసిన స్థలంలో; ఆయత, విలసత్+శిఖా+అగ్రములన్= నిడివి అయి ఒప్పారే జ్వాలలయొక్క కొసల భాగాలచేత; అల్లన= మృదువుగా; వారలన్= (ఆ ముని భార్యలను); అంటున్= తాకుతాడు. కౌతుకంబు+అతిశయము+ఐ= వేడుక మిక్కుటమై; తద్+అంగ, లతలు= వారల శరీరాలు అనే తీగలను; ఆదటన్= ఆసక్తితో; కౌఁగిటన్+చేర్పన్+కోరున్= ఆలింగనం చేసుకో గోరుతాడు; కంపిత, ధృతి+ఐ= చలించిన స్థైర్యం కలవాడై; కడున్= మిక్కిలి, పెల్లు+అగు= ఎక్కువ అయిన; రాగ, రసంబు, ముంపఁగన్= వలపు ప్రవాహం ముంచెత్తగా; కలంగున్= బాధ పడతాడు.

తాత్పర్యం: అగ్నిదేవుడు ఆ మునిభార్యలు తన దరికి చేరవలెనని పరితపించసాగాడు. తన దరికి చేరినప్పుడు, వరుసగా వారిని తన జ్వాలలచేత మృదువుగా తాకి స్పర్శసుఖం అనుభవించాడు. సుకుమార మైన లతలను బోలు వారి శరీరాలను తాక గోరాడు. వారిని తన కౌగిలిలో బంధించ తలపోశాడు. ఈ విధంగా ఆతడు తన స్థైర్యాన్ని కోలుపోయి మన్మథ వికారానికి లోనై బాధపడసాగాడు.

విశేషం: ఇందులో మన్మథావస్థలు మనోహరంగా వర్ణించబడ్డాయి. ఈ కాముకచేష్టలు నిసర్గరమణీయాలు. అలం: స్వభావోక్తి.

వ. **అంత నమ్మునీంద్రుల హోమవిధి సమాప్తం బగుటయు, జాతవేదుండు మదనవేదనాభరంబు సహింప నోపక నిర్జనం బయిన వనంబునకుం జని మునిపత్నీసమాగమంబు దుర్లభంబుగా వగచి వెగడంది శరీరంబు దిగ విడువ సమకట్టు నెడ, తదీయవల్లభ యైన స్వాహాదేవి తత్ప్రకారం బంతయు నెఱింగి, యతనికిం బ్రియంబు సేయునది యై సప్తమునులలో నంగిరసుభార్య శివ యను దాని రూపంబు గైకొని చని, యేకతంబ యున్న హుతాశనుం గనుంగొని యిట్లనియె.** **198**

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; ఆ+ముని+ఇంద్రుల, హోమ, విధి= ఆ ఋషులలో శ్రేష్ఠులైన వారల యొక్క యజ్ఞం; సమాప్తంబు+అగుటయున్= పూర్తి కావటం చేత; జాతవేదుండు= అగ్ని హోత్రుడు; మదన వేదనాభరంబు= మన్మథ బాధ యొక్క బరువు; సహింపన్+ఓపక= ఓర్వజాలక; నిర్జనంబు+అయిన= జనులు లేనట్టి; వనంబునకున్+చని= అడవికి వెళ్ళి; ముని, పత్నీ, సమాగమంబు= ఋషుల భార్యల యొక్క కలయిక; దుర్లభంబుగాన్= పొందరానిదిగా; వగచి= విచారించి; వెగడు+అంది= దిగులుతో నిస్పృహ చెంది; శరీరంబు= దేహం; దిగవిడువన్, సమకట్టున్+ఎడన్= త్యజించటానికి పూనుకొని ఉండగా; తదీయ, వల్లభ+ఐన= ఆతడి భార్య అయిన; స్వాహాదేవి= స్వాహా అనే పేరు గల శ్రీమతి; తద్+ప్రకారంబు+అంతయున్+ఎఱింగి= ఆ తీరు నంతటిని తెలిసికొని; అతనికిన్= (అగ్ని దేవుడికి); ప్రియంబు= ప్రీతిని; చేయునది+ఐ= కలిగించేదై; సప్త, మునులలోన్= ఏడుగురు ఋషులలో; అంగిరసు, భార్య= అంగిరసుడు అనే మునియొక్క పెండ్లం;

శివ+అను దాని రూపంబు= శివ అనే పేరు గల ఆమెయొక్క ఆకారాన్ని; కైకొని= స్వీకరించి; చని= వెళ్లి; ఏకతంబు+అ+ఉన్న= ఒంటరిగానే ఉన్న; హుతాశనున్= అగ్నిహోత్రుడిని; కనుంగొని= దర్శించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఆ తరువాత సప్తర్షులు ప్రారంభించిన అమావాస్యా హోమం ముగిసింది. ఇక ఆతడికి సప్తర్షుల భార్యలు కనిపించరుగదా! అందువలన అగ్నిహోత్రుడు విరహబాధ చేత తపించి, మన్మథ తాపం ఓర్వజాలక, చింతతో జనం లేని అరణ్యంలోకి పోయి, తన దేహం పరిత్యజించ సమకట్టాడు. అప్పుడు అగ్నిహోత్రుడిభార్య స్వాహాదేవి ఆ వృత్తాంతాన్ని పసికట్టి తనభర్తకు ప్రీతి కలిగించటానికై తాను సప్తర్షులలో నొకడైన అంగిరసుడి భార్య శివ అనే ఆమె రూపాన్ని ధరించి, అడవికి వెళ్లి అక్కడ ఒంటరిగా ఉన్న అగ్నిహోత్రుడిని చేరి ఇట్లా పలికింది.

తే. **'అంగిరసుభార్య నేను శివాభిధాన; । ననఘ! నాకును నాతోడి యంగనలకు**
ననుదినంబును నతిమనోహర విలాస । మైన నీమూర్తిపైఁ గోర్కి యడరియుండు. **199**

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా! ఏను= నేను; అంగిరసు, భార్యన్= అంగిరసుడు అనే మునియొక్క భార్యను; శివా+అభిధానన్= శివ అనే పేరు గలదానిని; నాకును; నాతోడి+అంగనలకున్= నాతోపాటు కల వనితలకును (అనగా సహవ్రతులైన సప్తర్షుల భార్యలకును); అనుదినంబును= ప్రతి దినం కూడా; అతి మనస్+హర, విలాసము+ఐన= మిక్కిలిగా మనస్సును ఆకర్షించే హొయలు కలది అయిన; నీ మూర్తిపైన్= నీ ఆకారంపై; కోర్కి= అభిలాష; అడరి+ఉండున్= అతిశయమై ఉంటుంది.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! నేను అంగిరసుడు అనే మునీశ్వరుడి భార్యను. నా పేరు శివ. నాకున్నూ, నాతోడి వారలయిన సప్తర్షుల భార్యలకున్నూ నీమీద వలపు ఏర్పడింది. నిత్యం మనోహర మైన నీ ఆకారంపై మేము అందరం మరులుగొన్నాం.

ఉ. **నీ మదిచంద మిట్టి దని నిక్క మెఱుంగక మే మజస్రముం**
గామశరాహతిం గలఁగి కాఱియ వొందుదు మాత్మలందు; నీ
కామము మాదెసం గలిమి కౌతుకచేష్టలయం దెఱింగి యు
ద్దామ మనోరథప్రచలితస్థితి నందఱముం గ్రమంబునన్. **200**

ప్రతిపదార్థం: నీ మది చందము= నీ మనస్సు యొక్క విధం; ఇట్టిది+అని= ఇటువంటిది అని; నిక్కము= నిజం; ఎఱుంగక= తెలియ జాలక; మేము= మేము (సప్తర్షుల భార్యలం); అజస్రమున్= ఎల్లప్పుడున్నూ; కామ, శర+ఆహతిన్= మన్మథుడి బాణాలతో కొట్టబడటంచేత; ఆత్మలందున్= మా మనస్సులలో; కలఁగి= వెత చెంది; కాఱియ+పొందుదుము= బాధపడుతుంటాం; నీ కామము= నీ కోరిక; మా దెసన్+కలిమి= మా యందు ఉండటం; కౌతుక, చేష్టల+అందున్= వేడుక చూపే పనులలో (హావభావాలలో); ఎఱింగి= తెలిసికొని; ఉద్దామ, మనోరథ, ప్రచలిత, స్థితిన్= మిక్కిలియైన కోరికచే సడలిన మానసిక పరిస్థితి గలిగి; అందఱమున్= (సప్తర్షుల భార్యలం అందరమున్నూ); క్రమంబునన్= వరుసగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: నీ మనస్సు ఏ రీతిగా ఉన్నదో మాకు తెలియక మేము సదా మన్మథతాపానికి చిక్కి వెత చెందాం. కాని, నీకు కూడ మాయందు వలపు ఉన్నదని నీ వేడుకచేష్టలతో గూడిన హావభావాలవలన తెలిసికొన్నాం. ఇక, మేమందరమున్నూ మిక్కుటమైన కోరికచేత చలించని మనోనిబ్బరం కలవారమై, క్రమంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

**చ. నినుఁ గవయందలంచి యిట నెమ్మిమెయిం జనుదెంచినార మిం
పునఁ జెలు లెల్లఁ; దొల్త ననుఁ బొమ్మని పంచిన వచ్చితిన్; మనం
బనవరతానురాగమున నంగజకేళి భజింపు మింక నొం
డని యెడ సేసితేనిఁ గుసుమాస్త్రుఁడు సైఁపఁడు నన్నుఁ బావకా!' 201**

ప్రతిపదార్థం: పావకా!= అగ్నిహోత్రుడా!; నిన్నున్; కవయన్+తలంచి= పొందగోరి; ఇటన్= ఇక్కడకు; నెమ్మి మెయిన్= ప్రీతితో; ఇంపునన్= ఇష్టంతో; చెలులు+ఎల్లన్= సఖులం అందరం; చనుదెంచినారము= వచ్చాం; తొల్తన్= మొదట; ననున్= నన్ను; పొమ్ము+అని, పంచినన్= వెళ్లుము అని నియోగించగా; వచ్చితిన్= వచ్చాను; మనంబు= మనస్సు; అనవరత+ అనురాగమునన్= ఎల్లప్పుడును వలపుతో ఉండేటట్లుగా; అంగజ కేళి= మన్మథ క్రీడ- సంభోగం; భజింపుము= అనుభవించుము; ఇంకన్= ఇకమీద; ఒండు+అని= వే రొక మాట చెప్పి; ఎడ+చేసితి+ఏనిన్= దూరం చేశావా; కుసుమ+అస్త్రుఁడు= పూవులు మంత్ర బాణాలుగా కలవాడు - మన్మథుడు; నన్నున్= నన్ను; సైపఁడు= ఓర్వడు.

తాత్పర్యం: ఓ అగ్నిదేవుడా! నీ మీద వలపు చొప్పున, నిన్ను పొందాలి- అనే తమకంతో మే మందరం వచ్చాం. సఖులు అందరూ నన్ను ముందుగా నీ దగ్గరికి వెళ్లాలని నిర్ణయించి ఇటకు పంపారు. అందుచేత నేను నీదరికి వచ్చాను. నీవు మనసార నన్ను మన్మథ క్రీడలో తనుపుము. కాక, మరొక రకంగా పలికి నన్ను నిరాకరించావా, నన్ను మన్మథుడు సైపడు సుమా!'

వ. అనిన సంతసిల్లి యగ్నిదేవుండు దానిం గైకొనియె; నదియును నతని నభిమత భోగంబులం బ్రీతునిం జేసి, తదీయ తేజోధాతువు ధరియించి యచ్చోటు వాసి యాక్షణంబ గరుడి యై గగనంబునకు నెగసి యతిత్వరిత గమనంబున శ్వేతపర్వతంబునకుం జని యందొక్కయెడ శరవణస్తంబ సంవృతం బైన కాంచనకుండంబు నందు నిజభర్తశుక్లంబు సంగ్రహించి, మఱియును. 202

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; సంతసిల్లి= సంతోషించి; అగ్నిదేవుండు= అగ్నిహోత్రుడు; దానిన్+కైకొనియెన్= దానిని స్వీకరించాడు (ఆమెను అంగీకరించాడు); అదియును= ఆమెయును (స్వాహా దేవియు); అతనిన్= అగ్నిహోత్రుడిని; అభిమత, భోగంబులన్= ఇష్టమైన సౌఖ్యాలచేత; ప్రీతునిన్+చేసి= సంతృప్తి చెందిన వాడిగా చేసి; తదీయ, తేజస్+ధాతువు= ఆతడి యొక్క శుక్లాన్ని; ధరియించి= వహించి; ఆ+చోటు+పాసి= ఆ స్థలం వదలిపెట్టి; ఆ, క్షణంబు+అ= ఆ ముహూర్తంలోనే, వెనువెంటనే; గరుడి+ఐ= ఆడ గరుడపక్షి అయి; గగనంబునకున్+ఎగసి= ఆకసానికి ఎగిరి; అతి, త్వరిత, గమనంబునన్= మిక్కిలి వేగం కల పయనంతో; శ్వేత పర్వతంబునకున్+చని= తెల్లకొండకు వెళ్లి; అందున్+ఒక్క+ఎడన్= ఆ శ్వేతపర్వతంలో ఒక చోట; శరవణస్తంబ సంవృతంబు+ఐన= రెల్లుగడ్డికాడలచేత చుట్టుకొనబడిఉన్న; కాంచన, కుండంబునందున్= బంగారు కుండలో; నిజ భర్త శుక్లంబు= తన పెనిమిటి వీర్యాన్ని; సంగ్రహించి= నిక్షిప్తం చేసి, కూర్చిపెట్టి; మఱియును ఇంకను.

తాత్పర్యం: ఆ మాటలకు అగ్నిహోత్రుడు సంతోషించాడు. అంతట ఆమె అగ్నిహోత్రుడిని శృంగారభోగంలో తేల్చి, ఆతని వీర్యాన్ని వహించి, ఆచోటు విడిచి ఆడగరుడపక్షి అయి ఆకాశానికి ఎగిరి, మిక్కిలి వేగంగా పయనించి శ్వేతపర్వతానికి చేరింది. అక్కడ ఒక చోట రెల్లుగడ్డికాడలచేత చుట్టుకొనబడిఉన్న ఒక బంగారు కుండలో తనభర్త శుక్లాన్ని కూర్చిపెట్టింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మునిపత్నులరూపులు గై। కొని యిట్టుల వరుసఁ బుష్పకోమలి ప్రియుఁ బ్రీ
తునిఁ జేయుచు రేతస్కం। దన మొనరించుచును వచ్చెఁ దత్కలశమునన్. 203

ప్రతిపదార్థం: మునిపత్నుల రూపులు= ఋషుల భార్యల ఆకారాలు; కైకొని= స్వీకరించి; ఇట్టులన్= ఈ విధంగానే; వరుసన్= క్రమంగా; పుష్పకోమలి= పువ్వు వంటి సౌకుమార్యం కలది (స్వాహాదేవి); ప్రియున్= భర్తను (అగ్నిహోత్రుడిని); ప్రీతునిన్+చేయుచున్= సంతృప్తి చెందినట్టివాడిని చేస్తూ; తద్+కలశమునన్= ఆ కుండలో; రేతస్కందనము= శుక్లాన్ని ప్రోగు చేయటం; ఒనరించుచును వచ్చెన్= చేయసాగింది.

తాత్పర్యం: పూవుబోడి అయిన స్వాహాదేవి క్రమంగా మునులభార్యల రూపాలు గైకొని, వరుసగా అగ్నిహోత్రుడి కడ కేగి, ఆతడిని సంతుష్టుడిని చేసింది. ఈ రీతిగా ప్రతి పర్యాయమున్నూ ఆమె తన భర్త శుక్లాన్ని రెల్లుగడ్డి నడుమన ఉన్న కలశంలో నిక్షిప్తం చేసింది.

తే. విను, పతివ్రతాతిలక మై వెలయునట్టి। యయ్యరుంధతి రూపంబు నలవరింప
నెట్లు నేరద కాని యయ్యింతి యున్న। యువిద లార్వుర రూపులు నొనరఁ దాల్చె. 204

ప్రతిపదార్థం: విను= వినుము; ఆ+ఇంతి= ఆ వనిత (స్వాహాదేవి); పతివ్రతా, తిలకము+ఐ= పతివ్రతలలో శ్రేష్ఠురాలు అయి; వెలయు+అట్టి= ఒప్పారే; ఆ+అరుంధతి రూపంబున్= ఆ అరుంధతి యొక్క ఆకృతిని; అలవరింపన్+ఎట్లు+నేరదు+అ+కాని= తాల్చటానికి ఏ విధంగానూ అనువు లభింపనిదైనది కాని; ఉన్న= తక్కిన; ఉవిదలు+ఆర్వుర, రూపులు= వనితలు ఆర్గురి ఆకారాలు; ఒనరన్+తాల్చెన్= ఒప్పేటట్లుగా ధరించింది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఈ విషయాన్ని అవధానంతో ఆలకించుము. స్వాహాదేవి ఆర్గురుఋషులభార్యల రూపాలు ధరించి అగ్నిదేవుడిని తృప్తి పొందించగలిగింది కాని, పతివ్రతలలో శ్రేష్ఠురాలైన 'అరుంధతి' రూపాన్ని మాత్రం ధరించలేకపోయింది. (అరుంధతి వసిష్ఠ మహర్షి భార్య.)

వ. ఇవ్విధంబున నాఱుమాఱులు ప్రస్కందితం బైన యగ్నితేజంబున. 205

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ఆఱుమాఱులు= ఆరు సారులు; ప్రస్కందితంబు+అయిన= స్రవింపజేయబడిన; అగ్ని, తేజంబు= అగ్నిహోత్రుడి వీర్యం.

తాత్పర్యం: ఈ విధంగా ఆరుమారులు స్రవింపజేయటం ద్వారా సేకరించబడిన అగ్నియొక్క వీర్యంనుండి.

కుమారస్వామి యవతారము (సం. 3-211-17)

క. ఆదిత్యనిభుఁడు విపుల। ద్వాదశబాహుండు షడ్వదనుఁ డఖిలదిశా
రోదోంతరంబు వెలుఁగ మ। హోదారుండై కుమారుఁ డుదయం బయ్యెన్. 206

ప్రతిపదార్థం: ఆదిత్య, నిభుఁడు= సూర్యుడితో సమానుడు; విపుల; ద్వాదశ, బాహుండు= నిడివి అయిన పంద్రెండు చేతులు కలవాడు; షట్+వదనుఁడు= ఆరు మొగాలు కలవాడు; అఖిల, దిశా, రోదస్+అంతరంబు= అన్ని దిక్కుల మధ్యభాగం; వెలుఁగన్= ప్రకాశించగా; మహా+ఉదారుండు+ఐ= మిక్కిలి గొప్పవాడయి; కుమారుఁడు= (కుమార స్వామి); ఉదయంబు+అయ్యెన్= ఉద్భవించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సూర్యసమానుడు, నిడివిఅయిన పన్నెండు బాహువులు కలవాడు, ఆరు ముఖాలు కలవాడు; సర్వదిశలలో ఆకసానికి భూమికి మధ్య గల ప్రదేశమంతా వెలుగొందేటట్లుగా, మిక్కిలి గొప్పవాడయిన కుమారస్వామి జన్మించాడు.

వ. ఇట్లు శుక్లపక్షంబునం బాడ్యమియందు వీర్యనిషేకంబును, విదియయందు గర్భవ్యక్తియుఁ, దదియయందు శరీరమాత్రావిర్భావంబునుం, జతుర్థియందు సకలావయవ సంపూర్ణతయు నై యుదయించిన కుమారుండు పంచమి యందు సముత్థితాకారుండై, పేర్చిత్రిపురదహన సాధనం బైన హరకార్ముకం బమ్మహీధరంబునందు నిక్షిప్తంబై యున్న దానిం బుచ్చుకొని గుణధ్వని సేసిన, నమ్మహాధ్వని విని కలుషించి యైరావత సుప్రతీకంబులను దిగ్గజంబు లయ్యగ్ని భవుమీఁదం బఱతెంచిన నమ్మహాభుజుండా రెంటినిం బెనఁచిపట్టి రెండుచేతుల ధరియించి, తన సహజం బైన శక్తి యొక్క కేలం, గ్రీడార్థ కలితం బైన కుక్కుటం బొక్కకేలను, బరిపూర్యమాణనినదం బైన శంఖంబు గరద్వయంబునం దాల్చి, హస్తయుగళంబున గగనంబు వ్రేయుచుం బాణియుగ్మంబు వక్త్రంబుల నిడికొని బాల్యోచితంబులైన యంగుళి చర్వణంబులు పొరిఁబొరి నొనరించుచు, నిశిత సాయకంబునం గ్రౌంచపర్వత విభేదనంబు సేసి, పటుశక్తిపాతంబున శ్వేతశైలశృంగభంగంబు గావించి చెలంగి యాఱు ముఖంబుల నొక్కపెట్ట యార్చినం, బ్రళయభైరవారావభీషణం బైన తదాఘోషణంబున.207

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; శుక్లపక్షంబునన్= శుక్లపక్షంలో; పాడ్యమి అందున్= మొదటి తిథియందు; వీర్యనిషేకంబును= శుక్లాన్ని ఉంచటమున్నూ; విదియ+అందున్= రెండవ తిథియందు; గర్భవ్యక్తియున్= కడుపు కనుపించటమున్నూ; తదియయందున్= మూడవ తిథియందు; శరీర మాత్ర+ఆవిర్భావంబునున్= దేహం మాత్రం ఉదయించటమున్నూ; చతుర్థియందున్= నాలుగవ తిథియందు; సకల+అవయవ, సంపూర్ణతయున్+ఐ, ఉదయించిన= అన్ని అంగాలు నిండి పుట్టిన; కుమారుండు= కుమారస్వామి; పంచమి యందున్= ఐదవ తిథియందు; సముత్థిత+ఆకారుండు+ఐ= బాగా లేచి నిలబడే రూపం కలవాడు అయి; పేర్చి= అతిశయించి; త్రిపుర దహన సాధనంబు+అయిన= మూడు నగరాలను కాల్చి వేయటానికి ఉపకరణం అయిన; హరు, కార్ముకంబు= శివుడి యొక్క విల్లు; ఆ+మహీధరంబు నందున్= ఆ కొండయందు; నిక్షిప్తంబు+ఐ= ఉంచబడినదై; ఉన్నదానిన్= ఉన్నటువంటి దానిని; పుచ్చుకొని= గ్రహించి; గుణ, ధ్వని, చేసినన్= అల్లెత్రాటిని మ్రోగించగా; ఆ+మహా, ధ్వని= ఆ గొప్ప శబ్దం; విని= ఆలకించి; కలుషించి= ఆగ్రహం చెంది; ఐరావత సుప్రతీకంబులు+అను= ఐరావతం, సుప్రతీకం అనే పేళ్ళు కల; దిక్+గజంబులు= దిగ్గజాలు- దిక్కులలో ఉండే ఏనుగులు; ఆ+అగ్నిభవుమీఁదన్= ఆ అగ్నియొక్క కుమారుడి మీద; పరతెంచినన్= ఎదుర్కొనటానికి రాగా; ఆ+మహాభుజుండు= గొప్ప భుజాలు కలవాడు అనగా ఆ మహాపరాక్రమశాలి; ఆ రెంటినిన్= (ఆ ఐరావత సుప్రతీకాలను రెండింటిని); పెనఁచిపట్టి= కదలకుండగా బిగియబట్టి; రెండు, చేతులన్= రెండు హస్తాలతో; ధరియించి= తాల్చి; తన, సహజంబు+ఐన= తనకు నైసర్గికంగా సంక్రమించిన; శక్తి= శక్తి అనే ఆయుధాన్ని; ఒక్క కేలన్= ఒక చేతిలో; క్రీడా+అర్థ, కలితంబు+ఐన= వినోదం కొరకై కూడుకొని ఉన్న; కుక్కుటంబున్= కోడిని; ఒక్కకేలను= ఒక చేతితోనూ; పరిపూర్యమాణ నినదంబు+ఐన= బాగా పూరింపబడి నినదించేదైనట్టి; శంఖంబు= సంకువు; కరద్వయంబునన్= రెండు చేతులతోను; తాల్చి= ధరించి; హస్త, యుగళంబునన్= రెండు చేతులతో; గగనంబు వ్రేయుచున్= ఆకసాన్ని చరుస్తూ; పాణి యుగ్మంబు= రెండు చేతులు; వక్త్రంబులన్= నోళ్ళలో; ఇడికొని= ఉంచి; బాల్య+ఉచితంబులు+అయిన= శిశువుకు తగినవైన; అంగుళి చర్వణంబులు= బొటన వ్రేళ్ళను చప్పరించటం; పొరిన్+పొరిన్+ఒనరించుచున్= మాటిమాటికి చేస్తూ; నిశిత, సాయకంబునన్= గొప్పదైన 'శక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించటంచేత; శ్వేత, శైల, భంగంబు, కావించి= తెల్లకొండ శిఖరాన్ని క్రిందకు పడగొట్టి; చెలంగి= అతిశయించి; ఆఱు ముఖంబులన్= ఆరు మోములతో; ఒక్కపెట్ట= ఒకేసారి; ఆర్చినన్= గొప్ప కేకవేయగా; ప్రళయ, భైరవ+ఆరావ, భీషణంబు+ఐన= ప్రళయకాలంలోని శివగణాధిపుడు చేసే భయంకరనాదంవలె భీతి కలిగించేది అయిన; తద్+ఆఘోషణంబునన్= ఆతడియొక్క (కుమారస్వామి చేసిన) పెద్ద అరుపు వలన.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా కుమారస్వామి ఆవిర్భవించి, దినదినాభివృద్ధి పొందాడు. శుక్లపక్షంలో పాడ్యమినాడు వీర్యనిషేకం, రెండవ తిథి విదియనాటికే గర్భం కన్పించటం, మూడవ తిథి తదియనాటికి దేహం మాత్రం ఆవిర్భవించటం జరిగి, నాలుగవ తిథి చతుర్థి నాటికి సాంగోపాంగంగా సంపూర్ణమైన ఆకృతి ఆతనికి లభించింది. పంచమి నాడు లేచి నిల్చినవాడై కుమారుడు ఆ కొండలో దాచబడి ఉన్నట్టి వింటిని - పరమశివుడు త్రిపురాలను కాల్చినట్టి కోదండాన్ని - పుచ్చుకొని, అల్లెత్రాటిని మ్రోగించాడు. ఆ మహాధ్వనికి అలిగి, ఐరావత సుప్రతీకాలు అనే రెండు దిగ్గజాలు ఆ కుమారుడిపైకి విజృంభించాయి. అంతట ఆ మహావీరుడు ఆ రెండు దిగ్గజాలను తన రెండు చేతులతో నణచి పెట్టాడు. ఒక చేతిలో తనకు పుట్టుకతోడనే సంక్రమించిన 'శక్తి' అనే ఆయుధాన్ని ధరించాడు. ఒక్క చేతితో వినోదార్థం ఒక కోడిని పట్టుకొన్నాడు. రెండు చేతులతో పట్టి శంఖాన్ని పూరించాడు. రెండు చేతులతో ఆకసాన్ని చరచాడు; రెండు చేతులు నోళ్ళలో ఉంచుకొని, శిశుసహజంగా బొటన వేళ్ళను లీలగా చప్పరించాడు. ఒక వాడిబాణాన్ని ప్రయోగించి క్రౌంచపర్వతాన్ని బ్రద్దలు కొట్టాడు. తన గొప్ప ఆయుధమైన 'శక్తి'ని ప్రయోగించి శ్వేతశైలశృంగాన్ని విరుగ గొట్టాడు. తదుపరి తన ఆరు మొగాలతో ఆ కుమారుడు సింహనాదం చేశాడు. కుమారస్వామి కావించిన ఆ ధ్వని ప్రళయకాలంలో శివగణాధిపుడైన భైరవుడు చేసే భయంకరనాదం వలె పిక్కటిల్లింది.

విశేషం: 1. శివుడు రాక్షసులకు ఆవాసాలైన మూడుపురాలను నాశనంచేశాడు- అందువల్లే అతడు త్రిపురాంతకు డయ్యాడు. ఇది పురాణగాథ. 2. దిగ్గజాలు:- దిగ్గజాలు ఎనిమిది. 1. ఐరావతం 2. పుండరీకం 3. వామనం 4. కుముదం. 5. అంజనం 6. పుష్పదంతం 7. సార్వభౌమం. 8. సుప్రతీకం. ఇవి ఎనిమిది దిక్కులలో భూమిని మోస్తాయని సాహితీసమయం. ప్రళయం:- జగత్తు అంతా నశించే కాలం. అప్పుడు లయకారుడైన శివుడు ప్రళయతాండవం చేస్తాడు. భైరవుడు అనగా శివుడు అని అర్థం. శివగణాధిపులలో భైరవుడు సుప్రసిద్ధుడు. ఈ ప్రకరణంలో భైరవశబ్దానికి శివగణనేత అని అర్థం చెప్పటం సమంజసం.

మ. **కులశైలంబులు గ్రక్కునం గదలె; దిక్కుల్ వ్రయ్య లయ్యెన్; మహీ**
వలయం బంతయు దిర్దిరం దిరిగె; దేవవ్రాతముల్ సాధ్వసా
కులతం బొందెఁ; బయోధు లన్నియును సంక్షోభించె; సప్తాశ్వస
ప్తులు బిట్టుల్కి రథంబు నల్దెసలకుం బో నీడ్చె సంభ్రాంతమై. **208**

ప్రతిపదార్థం: కుల శైలంబులు= కుల పర్వతాలు; గ్రక్కునన్+కదలెన్= వేగంగా చలించాయి; దిక్కుల్= దిక్కులు; వ్రయ్యలు+అయ్యెన్= పగిలాయి; మహీ, వలయంబు+అంతయున్= భూమండలం సమస్తమున్నూ; దిర్దిరన్+తిరిగెన్= గుండ్రంగా గిరగిర తిరిగింది; దేవ వ్రాతముల్= వేల్పుల సముదాయాలు; సాధ్వస+ఆకులతన్+పొందెన్= భయంతో కూడిన సంచలనానికి లోనయ్యాయి; పయోధులు= సముద్రాలు; అన్నియును; సంక్షోభించెన్= ఆకులతను పొందాయి; సప్త+అశ్వ, సప్తులు= సూర్యుడి యొక్క గుర్రాలు; బిట్టు= మిక్కిలి; ఉల్కి= భయపడి; సంభ్రాంతము+ఐ= ఎక్కువ మోహానికి లోనై తిరుగుడు పడి; రథంబు= తేరును; నల్ దెసలకున్= నాలుగు దిక్కులకు; పోన్+ఈడ్చెన్= పోయేటట్లుగా లాగాయి.

తాత్పర్యం: కులపర్వతాలు వేగంగా చలించాయి, దిక్కులు బ్రద్దలయ్యాయి. భూమండలం గిరగిర తిరుగసాగింది, వేల్పుల సమూహాలు తొట్రుపాటుతో సంచలించాయి. సముద్రాలు పొంగులు వారాయి, సూర్యుడి గుర్రాలు మిగుల భ్రమ చెంది రథాన్ని ఇటు నటు నాలుగుదెసలకు ఈడ్వసాగాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) కులపర్వతాలు ఏడు. "మహేంద్రో మలయ స్సహ్య శ్శుక్తిమాన్ గంధమాదనః, వింధ్యశ్చ పారియాత్ర శ్చ సప్తైతే కులపర్వతాః". ఈ ఏడు కులపర్వతాలున్నూ భూమిని భరించేవి- అని పురాణకథనం. అందుచేత 'మహీధరము'- భూమిని మోసేది అనగా పర్వతం అనే అర్థ మేర్పడింది. (2) సప్తాశ్వుడు అనగా సూర్యుడు. సూర్యుడి రథానికి ఏడు గుఱ్ఱాలు అని ప్రాచీన సాహిత్యసమయం.

క. **ఇట్టిమహోత్పాతంబులు । పుట్టినఁ గని మునులు లోకములకు శుభముగా**
నెట్టన శాంతికవిధు ల । ప్పట్టున నొనరించి రాత్మభావనపరులై. **209**

ప్రతిపదార్థం: ఇట్టి= ఈ విధమయిన; మహా+ఉత్పాతంబులు= గొప్పవైన భూతవికారాలు (ఉపద్రవాలు); పుట్టినన్= కలుగగా; కని= చూచి; మునులు= ఋషులు; లోకములకున్= జగాలకు; శుభముగాన్= మేలు కలిగేటట్లుగా; నెట్టన్= బాగుగా; శాంతిక విధులు= ఉపద్రవాలు తొలగించటానికై చేసే జపహోమాలు మున్నగు క్రియలు; ఆత్మ భావన పరులు+ఐ= బ్రహ్మజ్ఞానంలో నిల్పిన బుద్ధి కలవారై; ఆ+పట్టునన్= ఆ వేళ; ఒనరించిరి= చేశారు.

తాత్పర్యం: ఈ విధంగా ఏర్పడిన భూతవికారాలను కాంచి, ఆ ఉపద్రవాలు ఉపశమించి లోకకల్యాణం కలుగటానికై జ్ఞానులు అయిన ఋషులు శాంతికవిధులగు జపహోమాదిక్రియలను ఆ సమయంలో నెరవేర్చారు.

విశేషం: ఉత్పాతాలు - శుభాన్ని అశుభాన్ని సూచించే ప్రకృతివికారాలు. ఇవి మూడు విధాలు :- 1. దివ్యం:- సూర్యగ్రహణం చంద్రగ్రహణం మొదలైనవి. 2. అంతరిక్షం :- ఉల్కాపాతం మున్నగునవి. 3. భౌమము:- భూకంపాలు ఉప్పెనలు మున్నగునవి.

వ. **ఆ సమయంబునం జైత్రరథ వననివాసు లైన జనులందఱుం గూడి 'యంగిరః ప్రముఖ మునీంద్రుల భార్యలకు నగ్నిదేవువలనం బుట్టిన బాలుండు లోకంబులకు నిట్టి యనర్థంబు సేయం దొడంగె' నని యాక్రోశించిన, నయ్యపవాదంబునకు రోసి యా సప్తమునులలోన వసిష్ఠుండు దక్కఁ దక్కిన యార్వురుఁ దమ వనితలం బరిత్యజించిరి; మఱియును గొందఱు జనులు 'వీ రేమి సేయుదు? రన్నిపోకలం బోయినది వహ్ని భార్యయ కాక' యని పలుకం జొచ్చి; రంత నమ్మహామునులపాలికిఁ బావకాంగన సనుదెంచి యిట్లనియె.** **210**

ప్రతిపదార్థం: ఆ, సమయంబునన్= ఆ వేళను; చైత్ర రథ, వన, నివాసులు+ఐన= 'చైత్ర రథం'- అనే పేరుగల అడవిలో ఉండునట్టి; జనులు+అందఱున్+కూడి= ప్రజలు అందరున్నూ కలిసి; అంగిరస్+ప్రముఖ, ముని+ఇంద్రుల, భార్యలకున్= అంగిరసుడు మున్నగు ఋషివరేణ్యుల పెండ్లాలకు; అగ్నిదేవువలనన్+పుట్టిన= అగ్నిదేవుడివలన జన్మించిన; బాలుండు= పిల్లవాడు; లోకంబులకున్= జగములకు; ఇట్టి= ఈ విధమైన; అనర్థంబు= ఉపద్రవం; చేయన్+తొడంగెన్= చేయడానికి ఉపక్రమించాడు; అని= అంటూ; ఆక్రోశించినన్= ఎలుగెత్తి దుఃఖంతో ప్రకటించగా; ఆ+అపవాదంబునకున్= ఆ నిందకు; రోసి= వెత చెంది; ఆ సప్తమునులలోనన్= ఆ ఏడుగురి ఋషులలో; వసిష్ఠుండు+తక్కన్= వసిష్ఠుడు మినహాయించి; తక్కిన+ఆర్వురున్= మిగిలిన ఆరుమంది ఋషులున్నూ; తమ, వనితలన్= తమ భార్యలను; పరిత్యజించిరి= వదలి పెట్టారు; మఱియును+కొందఱు జనులు= మరికొందరు ప్రజలు; వీరు+ఏమి+చేయుదురు= (ఈ ఋషుల భార్యలు) ఏమి చేయగలరు; ఇన్ని+పోకలన్+పోయినది= ఇన్ని విధాలైన పద్ధతులలో వెళ్లింది; వహ్నిభార్య+అ, కాక= అగ్ని దేవుడి ఇల్లాలు మాత్రమే కదా అని, పలుకన్+చొచ్చిరి= అని చెప్పసాగారు; అంతన్= అటుపిమ్మట; ఆ+మహా, మునుల, పాలికిన్= ఆ గొప్ప ఋషుల దగ్గరకు; పావక+అంగన= అగ్ని దేవుడి ఇల్లాలు; చనుదెంచి= వచ్చి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: ఆ సమయంలో 'చైత్రరథం' అనే పేరు గల అడవిలో నివసించే జనులందరు కూడి, 'ఈ ఉపద్రవం కలిగించింది ఋషులభార్యలకు అగ్నిదేవుడివలన జన్మించిన బాలకుడు' అని ఘోషించారు. ఆ నిందకు తాళజాలక, వసిష్ఠుడు తప్ప తక్కిన ఋషులు ఆర్గురూ తమ భార్యలను వదలి వేశారు. కాని, కొందరు ప్రజలు 'పాపం ఈ ఋషులభార్యలు చేసిన తప్పు ఏమున్నది? ఈ నాటకం అంతటిని ఆడింది అగ్నిదేవుడి భార్యయే కదా' అని పలికారు. అంతట అగ్నిదేవుడిభార్య ఆ మునుల దగ్గరకు వెళ్లి ఈ విధంగా చెప్పింది.

క. 'వినుఁ డేను వహ్నివలనం। గనిన కుమారుండు వాఁడు; గడు నిజ మిది; మీ
వనితలకుం బని గా; దిటు। సనునే కులసతుల విడువ సత్పురుషులకున్?' 211

ప్రతిపదార్థం: వినుఁడు= ఆలకించండి; ఏను= నేను; వహ్నివలనన్= అగ్నిదేవుడి వలన; కనిన= కన్నట్టి; కుమారుండు= కొడుకు; వాఁడు= (ఆ బాలుడు); కడున్, నిజము+ఇది= ఇది అచ్చమైన సత్యం; మీ వనితలకున్+పని+కాదు= (ఇది) మీ భార్యలవలన జరిగిన కార్యం కాదు; ఇటు= ఈ రీతిగా; సత్+పురుషులకున్= మంచి మగలకు; కులసతులన్= పతివ్రతలైన భార్యలను; విడువన్+చనునే= విడిచిపెట్టటం మంచిదా? (కాదని భావం).

తాత్పర్యం: 'అయ్యలారా!, నా మనవి ఆలకించ వేడికోలు. ఈ బాలుడు నాకును నా భర్త అయిన అగ్నిదేవుడికిని జన్మించినవాడు. ఇది మీ భార్యలవలన జరిగిన పని కాదు. సజ్జనులు పతివ్రతలైన భార్యలను విడనాడటం న్యాయం కాదు గదా!'

వ. అని యెంత సెప్పిన వారొడంబడ రైరి; తదనంతరంబ విశ్వామిత్రుండు గుమారు కడ కరిగి యద్దేవు శరణంబు సొచ్చి వివిధ వాక్యంబులం బ్రస్తుతించి, తదాదేశంబున నతనికి జాతకర్మాదివిధు లొనరించిన, నదియంతయు నెఱింగి యమరు లెల్ల నమరేంద్రుం గానఁ జని యిట్లనిరి. 212

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; ఎంత+చెప్పినన్= ఏ విధంగా చెప్పినప్పటికి; వారు= (ఆ ఆర్గురు మునులు); ఒడంబడరు+ఐరి= సమ్మతించని వారు అయ్యారు- అంగీకరించలేదు; తద్+అనంతరంబు+అ= అటుపిమ్మటనే; విశ్వామిత్రుండు= విశ్వామిత్రుడు అనే ఋషి; కుమారు కడకున్+అరిగి= (ఆ) బాలకుడి దగ్గరకు వెళ్లి; ఆ+దేవున్= ఆ వేల్పును; శరణంబు+చొచ్చి= ఆశ్రయించి; వివిధ, వాక్యంబులన్= పలుతెరగుల మాటలచేత; ప్రస్తుతించి= పొగడి; తద్+ఆదేశంబునన్= ఆతడి యొక్క ఆజ్ఞ మేరకు; అతనికిన్= (ఆ బాలుడికి); జాత, కర్మ+ఆది, విధులు= పుట్టినపుడు చేయవలసిన జప హోమాలు, వ్రతాలు మున్నగు క్రియలు; ఒనరించినన్= చేయగా; అమరులు+ఎల్లన్= వేల్పులు అందరున్నూ; అది+అంతయున్+ఎఱింగి= ఆ విషయాన్నంతా తెలిసికొని; అమర+ఇంద్రున్+కానన్+చని= దేవేంద్రుడిని చూడటానికి వెళ్లి; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: ఆ విధంగా అగ్నిభార్య చెప్పింది. కాని ఆ ఋషులు సమ్మతించలేదు. అటు పిమ్మట విశ్వామిత్రుడు అనే ఋషి ఆ బాలకుడివద్దకు వెళ్లి ఆతడిని శరణువేడుకొని, ఆతడి అనుమతిప్రకారం ఆతడికి జాతకర్మాదులను నెరవేర్చాడు. ఆ విషయాన్ని అంతా తెలిసికొని దేవతలు దేవేంద్రుడి వద్దకు వెళ్లి ఈ విధంగా పలికారు.

విశేషం: జాతకర్మం= బిడ్డ పుట్టినప్పుడు జరిగే మంత్ర తంత్ర కర్మకాండం. పుట్టినప్పటినుండి గిట్టేవరకు జరిగేవి షోడశ కర్మలు. అందులో జాతకర్మం ఒకటి. వీటికి సంస్కారాలు అని పేరు. షోడశకర్మలు. 1. గర్భాధానం 2. పుంసవనం 3.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీమంతం 4. జాతకర్మం 5. నామకరణం 6. అన్నప్రాశం 7. చౌలం 8. ఉపనయనం 9. ప్రాజాపత్యం 10. సౌమ్యం 11. ఆగ్నేయం 12. వైశ్వదేవం 13. గోదానం 14. సమావర్తనం 15. వివాహం 16. అంత్యసంస్కారం.

ఉ. 'దారుణశౌర్యధుర్యుఁ డతిదర్పిత చిత్తుఁడు వహ్నిసూనుఁ డ
న్వీరుఁడు నిన్నుఁ గైకొనక వీఁకమెయిం జనుదెంచు నిప్డు దు
ర్వారత నీ పదంబు గొనువాంఛ నవశ్యముఁ; గాన యింతలో
నీరస మెత్తి వాని వధియింపుము చెచ్చెర విక్రమోద్ధతిన్. 213

ప్రతిపదార్థం: దారుణ, శౌర్య, ధుర్యుఁడు= ఘోరమైన పరాక్రమం వహించేవాడు; అతి, దర్పిత, చిత్తుఁడు= మిక్కిలి గర్వం కల మనస్సు గలవాడు; వహ్ని సూనుఁడు+అన్+వీరుఁడు= అగ్నిదేవుడి కొడుకు అనే వీరుడు; నిన్నున్+కైకొనక= ఇంద్రుడవైన నిన్నుసైతం లెక్కపెట్టక; వీఁక మెయిన్= ఉత్సాహంతో; ఇప్డు= ఇప్పుడు; దుర్వారతన్= అడ్డగించటానికి అనువు కాకుండగ; నీ పదంబున్= నీ పదవిని; కొను వాంఛన్= గ్రహించే కోరికతో; అవశ్యమున్= తప్పనిసరిగా; చనుదెంచున్= వస్తాడు; కాన= కావున; ఇంతలోన్= ఈ లోపుగా; ఈరసము+ఎత్తి= ఆగ్రహించి; చెచ్చెరన్= వేగంగా; విక్రమ+ఉద్ధతిన్= పరాక్రమం యొక్క ఆధిక్యం చొప్పున; వానిన్= ఆ బాలుడిని; వధియింపుము= చంపుము.

తాత్పర్యం: అగ్నికుమారుడు మిక్కుటమైన పరాక్రమం కలవాడు. మిక్కిలి గర్వం కలవాడు. నిన్ను కూడ సరకు గొనడు; నీ పదవిని ఆక్రమించవలె ననెడి దురుద్దేశంతో ఉత్సాహం చొప్పున తప్పక నీ పయి దండెత్తి రాగలడు. కావున, నీవు ఈ లోపుగనే ఆగ్రహించి ఆతడిని వేగంగా సంహరించుము.

వ. అట్లయిన నీకు నింద్రత్వంబు శాశ్వతం బగు; నేమును బ్రదుకుదుము; లోకంబు లవ్యాకులంబు లగు' ననినం బురందరుం డప్పుడ సప్తమాతృకలం బిలిచి 'మీరు సని వహ్నిసంభవుం డైన కుమారు సమయించి, నాకుఁ బ్రియంబు సేయుం' డని పంచినం, బనిపూని వారు ఘోరంబుగా నతనిపై నడరి తదీయ తేజోవిశేషంబునకు భయంబంది. యతని శరణంబు సొచ్చి, 'యేము లోకమాతలము; మాయందు నీవు మాతృభావంబు సేయ నర్హుండ' వనినం గుమారుండు వారి నభినందించి చేకొనియె; నంత నగ్నియు నిజపుత్త్రుపాలికి వచ్చి, యతని చేతంబూజితుం డయి తదీయ రక్షాపరత్వంబున నిలిచె; మాతృగణంబు క్రోధంబునం బుట్టినయది లోహితాస్య యను భామిని కుమారునకు దాదియై యుపలాలనంబు సేయుచుండె; నఖిలభూతగణంబులుం బఱతెంచి క్రౌంచారిం బరివేష్టించె; నది యంతయు విని కలుషించి. 214

ప్రతిపదార్థం: అట్లు+అయినన్= ఆ విధంగా జరిగితే; నీకున్= నీకు; ఇంద్రత్వంబు= ఇంద్రపదవి; శాశ్వతంబు+అగున్= ఎల్లప్పుడు ఉండేది కాగలదు; ఏమును= మేము కూడా; బ్రదుకుదుము= (హాయిగా) జీవించ గలం; లోకంబులు= జగాలు; అవ్యాకులంబులు+అగున్= కలత చెందినట్టివి కాగలవు; అనినన్= అని చెప్పగా; పురందరుండు= దేవేంద్రుడు; అప్పుడు+అ= వెనువెంటనే; సప్తమాతృకలన్+పిలిచి= ఏడుగురు తల్లులను ఆహ్వానించి; మీరు= మీరు (సప్త మాతృకలు); చని= వెళ్ళి; వహ్ని, సంభవుండు+ఐన= అగ్ని దేవుడికి పుట్టినట్టి; కుమారున్= బాలకుడిని; సమయించి= చంపి; నాకున్= నాకు; ప్రియంబు+ చేయుండు= సంతృప్తి సంఘటించండి; అని= అని చెప్పి; పంచినన్= ఆజ్ఞాపించి పంపగా; వారు= (ఆ సప్త మాతృకలు); పని, పూని= ఆ కార్యం నెరవేర్చ వలెననే దీక్షను వహించి; ఘోరంబుగాన్= క్రూరంగా; అతనిపైన్= ఆ బాలకుడిపై; అడరి= విజృంభించి; తదీయ, తేజస్+విశేషంబునకున్= ఆతని యొక్క దేదీప్యమానమైన వెలుగుకు; భయంబు+అంది= వెరపు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెంది; అతనిన్, శరణంబు+చొచ్చి= అతడికి లొంగిపోయి, అతడిని కాపాడుమని వేడుకొని; ఏము= మేము; లోక మాతలము= జగాలకు తల్లులం; మా అందున్= మా యెడల; నీవు= నీవు; మాతృ భావంబు+చేయన్+అర్హుండవు= తల్లి యెడల చూపే ప్రేమను చూపతగినవాడవు; అనినన్= అని పలుకగా; కుమారుండు= బాలుడు; వారినిన్= వారిని (సప్త మాతృకలను); అభినందించి= గౌరవించి; చేకొనియెన్= మన్నించి ఆదరించాడు; అంతన్= అటు పిమ్మట; అగ్నియున్= అగ్ని హోత్రుడున్నూ; నిజపుత్రుపాలికిన్= తన కొడుకు దగ్గరికి; వచ్చి= అరుదెంచి; అతని చేతన్= (కుమారుడిచేత); పూజితుండు+అయి= అర్చించబడినవాడై; తదీయ, రక్షా, పరత్వంబునన్= ఆతడి యొక్క సంరక్షణలో ఉన్నవాడై; నిలిచెన్= ఉన్నాడు; మాతృగణంబు క్రోధంబునన్= తల్లుల సముదాయం యొక్క కోపం వలన; పుట్టిన+అది= జన్మించినట్టిది; లోహితాస్య+అను, భామిని= లోహితాస్య అనే పేరు కల స్త్రీ (ఎర్రని మొగం కలది లోహితాస్య); కుమారునకున్= బాలుడికి; దాది+ఐ= పరిచర్యలు చేసేదై (మాతృస్థానీయ అయి); ఉపలాలనంబు+చేయుచున్+ఉండెన్= ప్రేమతో సేవలు చేస్తూ ఉన్నది; అఖిల, భూత గణంబులున్= సమస్తమైన భూతాల సముదాయాలు; పఱతెంచి= అరుగుదెంచి; క్రౌంచారిన్= (క్రౌంచ+అరిన్) కుమారుడిని; పరివేష్టించెన్= చుట్టును చేరి కొలుస్తూ ఉన్నారు; అది+అంతయున్+విని= ఆ విషయాన్ని అంతా ఆలకించి; కలుషించి= ఆగ్రహం చెంది

తాత్పర్యం: ఆ విధంగా నీవు ఆ బాలకుడిని సంహరిస్తే నీకు ఇంద్రపదవి శాశ్వతంగా దక్కగలదు; మేముకూడా హాయిగా జీవించగలం' అని చెప్పగా విని, దేవేంద్రుడు వెంటనే సప్తమాతృకలను పిలిచి 'మీరు అగ్నిహోత్రుడి కుమారుడిని చంపండి' అని ఆజ్ఞాపించాడు. ఆ సప్తమాతృకలు దేవేంద్రుడి పనుపు చేయటానికి ఉద్యమించి, కుమారుడి దగ్గరకు వెళ్ళారు. కాని, కుమారుడి దేదీప్యమానమైన తేజస్సును చూచి, భయపడి, అతడిని శరణువేడి, అతడికి పాదాక్రాంతలు అయి ఇట్లా అన్నారు. 'మేము లోకమాతలం; నీవు మమ్మల్ని తల్లులవలెనే చూడదగును.' అనగా కుమారుడు తనను శరణు చొచ్చిన ఆ సప్తమాతృకలను అభినందించి మన్నించాడు. అంతట అగ్నిహోత్రుడుకూడ తన తనయుడి కడకు వచ్చి, అతడిని సంరక్షించే పనిలో ఉండి, అతడిచేత పూజించబడుతూ ఉన్నాడు. సప్తమాతృకలకోపం నుండి ఉద్భవించిన లోహితాస్య అనే స్త్రీ, కుమారుడికి మాతృస్థానీయ యైన దాదిఅయి గారాబంగా అతడిని పెంచుతూ ఉండింది. అఖిల భూతగణాలు స్వచ్ఛందంగా వచ్చి కుమారుడి చుట్టూ చేరారు. ఆ విషయాన్నంతా తెలిసికొనిన దేవేంద్రుడు కోపించాడు.

విశేషం: సప్తమాతృకలు= ఏడ్గురు తల్లులు 1. బ్రాహ్మి 2. మాహేశ్వరి 3. కౌమారి 4. వైష్ణవి 5. వారాహి 6. ఇంద్రాణి 7. చాముండ.

ఇంద్రుఁడు కుమారస్వామిపై నెత్తివచ్చుట (సం. 3-216-3)

ఉ. **స్కందునిమీఁద నెత్తి బలగర్వితుఁడై నడతెంచె నుద్భట**
స్యందన సామజాశ్వభట సంకుల సైన్య సమగ్ర దేవతా
బృంద సమేతుఁడై భువనభీకరసంగరకాంక్ష నింద్రుఁ డ
స్పందితశౌర్యుఁ డగ్నికణజాత భయంకరవజ్రహస్తుఁడై. **215**

ప్రతిపదార్థం: అస్పందిత శౌర్యుఁడు= చలించని పరాక్రమం కలవాడు ఇంద్రుడు; బలగర్వితుఁడు+ఐ= బలంచేత గర్వించినవాడై; ఉత్+భట, స్యందన, సామజ+అశ్వ, భట, సంకుల, సైన్య, సమగ్ర, దేవతా, బృంద, సమేతుఁడు+ఐ= అతిశయించిన, రథాలతో, ఏనుగులతో, గుర్రాలతో, సైనికులతో, క్రిక్కిరిసిన సేనఅందున్న వేల్పుల సముదాయంతో కూడినట్టివాడై; భువన, భీకర, సంగర, కాంక్షన్= లోకభయంకరమైన యుద్ధంమీది కోరికతో; అగ్ని కణ, జాత, భయంకర, వజ్ర హస్తుఁడు+ఐ= నిప్పు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కణాలు విరజిమ్మటం చేత వెరపు గొలిపే వజ్రాయుధాన్ని చేతియందు ధరించినవాడై; స్కందుని మీఁదన్= కుమారస్వామి పైకి; ఎత్తి= దండెత్తి; నడతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: తన శక్తిసామర్థ్యాలమీది నమ్మకంచేత ఏర్పడిన గర్వంతో, ఉత్సాహంతో ఉరకలు వేస్తున్న రథాలు ఏనుగులు భటులతో కూడిన అపార దేవతాసైన్యంతో లోకభయంకరమైన యుద్ధం చేయటానికి ఉత్సహించిన వాడై, నిప్పులు చెరగుతున్న వజ్రాయుధాన్ని చేతపట్టినవాడై దేవేంద్రుడు కుమారుస్వామిపై దండెత్తి వచ్చాడు.

వ. అంత. 216

తాత్పర్యం: అప్పుడు.

తరలము.

తరళదీధితిపుంజనిర్భరదారుణాయుధపాణు లై
తెరలఁ ద్రోచి దివౌకసుల్ పఱతెంచి యార్చుచుఁ దాఁకి రా
శరవణోద్భవు; నాతఁడుం దగ సంభ్రమస్ఫుటరోష వి
స్ఫురితనిష్ఠురహాసజృంభణమున్ వహించినఁ జెచ్చెరన్. 217

ప్రతిపదార్థం: దివౌకసుల్= దేవతలు; తరళ, దీధితి, పుంజ, నిర్భర, దారుణ+ఆయుధ, పాణులు+ఐ= ప్రకాశించే కాంతుల సముదాయంచేత చుట్టుకొనబడి భయంకరంగా కనిపించే ఆయుధాలు కల చేతులు కలవారై; తెరలన్+త్రోచి= ఉప్పొంగి వచ్చి; పఱతెంచి= వేగంగా అరుగుదెంచి; ఆర్చుచున్= కేకలు వేస్తూ; ఆ శరవణ+ఉద్భవున్= రెల్లుగడ్డి గుంపులో జన్మించిన ఆ కుమారస్వామిని; తాఁకిరి= ఎదుర్కొన్నారు; ఆతఁడున్= ఆ కుమారుడుకూడా; తగన్= అనువుగా, సంభ్రమ, స్ఫుట, రోష, విస్ఫురిత, నిష్ఠుర, హాస, జృంభణమున్= వేగిరిపాటుతో వ్యక్తమైన కోపంచేత వ్యాపించిన కఠోరమైన అతిశయించిన నగవును; వహించినన్= పొందగా; చెచ్చెరన్= వేగంగా.

తాత్పర్యం: అటు పిమ్మట దేవతలు తళతళ వెలుగొందుతున్న భయంకర మైన ఆయుధాలు చేతులలో ధరించినవారై ఉత్సాహం ఉప్పొంగేటట్లుగా కేకలు వేస్తూ కుమారస్వామిపై దండెత్తి వచ్చారు. అప్పుడు ఆ కుమారస్వామి వేగిరపాటుతో కూడిన కోపంవలన ఏర్పడిన కఠోరమైన నవ్వు తన పెదవులపై విరియగా, వేగంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: వృత్తలక్షణానికి చూడు: ఆరణ్య. 4.402 విశేషం.

తే. అతని ముఖగహ్వరంబుల నద్భుతముగ । నుగ్రదహనశిఖావళు లుద్భవించి
వేల్పుమూఁకల నరికట్టి వేల్వఁ దొడఁగె; । నంత నెంతయు సంభ్రాంతు లగుచు సురలు. 218

ప్రతిపదార్థం: అతని, ముఖ, గహ్వరంబులన్= ఆ కుమారస్వామి మొగాలు అనే గుహలనుండి; అద్భుతముగన్= అచ్చెరువు కొలుపుతూ; ఉగ్ర, దహన, శిఖా+ఆవళులు= భయంకరమైన అగ్ని జ్వాలల సముదాయాలు; ఉద్భవించి= పుట్టి; వేల్పు మూఁకలన్= దేవతల గుంపులను; అరికట్టి= అణచివేసి; వేల్వన్+తొడఁగెన్= కాల్చివేయసాగాయి; అంతన్= అటు పిమ్మట; సురలు= దేవతలు; ఎంతయున్; సంభ్రాంతులు+అగుచున్= మనస్సు చెదరినవారు ఔతూ.

తాత్పర్యం: ఆ కుమారస్వామి ముఖాలనే గుహలనుండి ఆశ్చర్యకరంగా అగ్నిజ్వాలల సముదాయాలు వెలువడి, దేవతల గుంపులను అణచివేసి కాల్చసాగాయి. అంతట దేవతలు మనస్సు చెదరినవారు ఔతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'నీ కింకరులము మమ్ముం । జేకొని కృపఁ గావు' మనుచు శిఖినందను న
స్తోకబలు శరణు వేఁడినఁ । జేకొని దాహభయ ముడుగఁ జేసె నతండున్. 219

ప్రతిపదార్థం: నీ, కింకరులము= నీ యొక్క సేవకులం; మమ్మున్= మమ్ము; చేకొని= స్వీకరించి; కృపన్+కావుము= దయతో కాపాడుము; అనుచున్= అని పలుకుతూ; అస్తోక, బలున్= ఎక్కువ శక్తి కలవాడిని; శిఖినందనున్= అగ్నిహోత్రుడి పుత్రుడైన కుమారస్వామిని; శరణు వేడినన్= అభయాన్ని ప్రార్థించగా; అతండున్= ఆ కుమారస్వామియును; చేకొని= స్వీకరించి; దాహ, భయము= అగ్నివలన ఏర్పడిన వెరపును; ఉడుగన్+చేసెన్= తొలగిపోయేటట్లుగా చేశాడు.

తాత్పర్యం: అంతట దేవతలు, 'ఓ మహానుభావా! మేము నీకు భృత్యులం; మమ్మ నీ దాసులుగా స్వీకరించి దయతో కాపాడునది' అంటూ కుమారస్వామిని ప్రార్థించారు. కుమారస్వామి వారిపై జాలికలిగి, శరణార్థులైన ఆ దేవతలను అగ్నిభయంనుండి తప్పించి, వారికి అభయం ఇచ్చాడు.

వ. ఇట్లు దేవతలు గుమారు నాశ్రయించినం జూచి బలసూదనుండు క్రోధఘూర్ణితనయనుండై యతనిమీఁద వజ్రంబు వైచిన, నది తదీయ దక్షిణపార్శ్వంబుఁ దాఁకిన, నం దొక్క పురుషుండు గాంచనవర్ణుండును శక్తి ధరుండును మేషవదనుండును నై విశాఖుం డను పేరం బ్రభవించె; మఱియునుం గన్యాకుమార గణంబు లనేకంబులు వుట్టె; నది యెల్లనుం గని జనితభయుం డై హరిహయుం డగ్నిసంభవు నభయం బని కొలిచె; నంత నమరులు సంతసిల్లి సింహనాదంబులు సెలంగ షణ్ముఖ శతమఖులం బరివేష్టించి' రని చెప్పి వెండియు మార్కండేయుం డి ట్లనియె. 220

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దేవతలు= వేల్పులు; కుమారున్+ఆశ్రయించినన్= కుమారస్వామిని శరణు వేడగా; చూచి= అరసి; బలసూదనుండు= దేవేంద్రుడు; క్రోధ, ఘూర్ణిత, నయనుండు+ఐ= కోపం చేత తిరుగుడు పడిన కన్నులు కలవాడై; అతని మీఁదన్= (ఆ కుమారస్వామిపై); వజ్రంబు= వజ్ర మనే ఆయుధాన్ని; వైచినన్= వేయగా; అది= (ఆ వజ్రాయుధం); తదీయ, దక్షిణ పార్శ్వంబున్= ఆ (కుమారస్వామియొక్క) కుడివైపు దేహభాగాన్ని; తాఁకినన్= స్పృశించగా; అందున్= (ఆ కుడి పార్శ్వంలో); ఒక్క, పురుషుండు= ఒక మగవాడు; కాంచన వర్ణుండును= బంగరు మిసిమిరంగు కలవాడున్నూ; శక్తి ధరుండును= శక్తి అనే ఆయుధాన్ని తాల్చిన వాడున్నూ; మేష వదనుండునున్= మేక మొగం కలవాడున్నూ; ఐ= అగుచు; విశాఖుండు+అనుపేరన్= విశాఖుడు అనే పేరు కలవాడై; ప్రభవించెన్= పుట్టాడు; మఱియునున్= ఇంకను; కన్యా, కుమార, గణంబులు+అనేకంబులు= పెక్కుమంది బాల బాలికల గుంపులు; పుట్టెను= ఉద్భవించాయి; అది+ఎల్లనున్+కని= ఆ సంఘటనను అంతటిని చూచి; జనిత, భయుండు+ఐ= పుట్టిన భయం కలవాడై - అనగా భయపడి; హరిహయుండు= దేవేంద్రుడు; అగ్ని సంభవున్= అగ్నిహోత్రుడికొడుకైన కుమారస్వామిని; అభయంబు+అని, కొలిచెన్= శరణు వేడుకొనెను; అంతన్= పిమ్మట; అమరులు= దేవతలు; సంతసిల్లి= సంతోషించి; సింహ నాదంబులు+చెలంగన్= సింహ గర్జనలు ధ్వనించగా; షట్+ముఖ, శతమఖులన్= ఆరు మొగాల దేవర అయిన కుమారస్వామిని, నూరు జన్నముల దేవర అయిన దేవేంద్రుడిని; పరివేష్టించిరి= చుట్టును చేరి కూర్చొన్నారు; అని చెప్పి= అని పలికి; వెండియున్= తిరిగి; మార్కండేయుండు= మార్కండేయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా, దేవతలు కుమారస్వామిని శరణువేడటంచేత దేవేంద్రుడు ఆగ్రహోదగ్రు డయ్యాడు. అతడు కుమారస్వామిపై తన వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. ఆ వజ్రాయుధం కుమారస్వామి శరీరంలోని కుడి భాగాన తాకింది. అప్పుడు ఆ భాగంనుండి ఒక పురుషుడు బంగరుమిసిమిరంగు కల శరీరంతో, మేక మొగంతో జన్మించాడు. ఆ పురుషుడు శక్తి అనే ఆయుధాన్ని ధరించాడు. అతడిపేరు విశాఖుడు. అతడితో పాటు లెక్కకు మిక్కిలి బాల బాలికలు ఉద్భవించారు. ఆ వింతసన్నివేశాన్ని చూచి భయపడి దేవేంద్రుడు తాను కూడ కుమారస్వామిని శరణు వేడాడు. అక్కడ ఉన్న దేవతలందరు సంతోషింతో సింహనాదాలు చేస్తూ కుమారస్వామి దేవేంద్రుల చుట్టూ చేరి నిల్చారు' అని చెప్పి మార్కండేయమహర్షి మరియు ఈ విధంగా తెలిపాడు.

సీ. అయ్యగ్నిసంభవు నాయతోన్నతబాహు, । నాముక్తకవచుఁ, దేజోమహిష్ఠు,
నాలోహితాంబరు, హారికుండలకర్ణుఁ, । గనకరత్నోజ్జ్వల ఘనకిరీటు,
సంపూర్ణయౌవను, సర్వలక్షణయుక్తుఁ । గని, యనురాగిల్లి కమలనిలయ
సాకార యై వచ్చి యఖిలంబుఁ జూడంగ । సితపద్మహస్త యై యతనిఁ బొందె;

ఆ. శ్రీసమేతుఁడై విశేషకాంతిస్ఫూర్తి । నొలసి పూర్ణచంద్రుచెలువు దాల్చి
యున్నవానిఁ జూచి రుత్ఫుల్లలోచన । కుముదు లగుచు మునులు నమరవరులు. 221

ప్రతిపదార్థం: కమల నిలయ= పద్మ నివాసిని అయిన లక్ష్మీదేవి; ఆ+అగ్ని, సంభవున్= అగ్నిహోత్రుడి కుమారుడైన ఆ కుమారస్వామిని; ఆయత+ఉన్నత, బాహున్= నిడివి అయిన మరియు ఎత్తైన భుజాలు కలవాడిని; ఆ ముక్త కవచున్= ధరించబడిన కవచం కలవాడిని- అనగా కవచం ధరించిన వాడిని; తేజస్+మహిష్ఠున్= దేదీప్యమాన మైన వెలుగు చేత గొప్ప వాడైన వాడిని; ఆలోహిత+అంబరున్= మిక్కిలి ఎర్ర నైన వస్త్రాలు కలవాడిని; హారి, కుండల, కర్ణున్= అందమైన దుద్దులు గల చెవులు కలవాడిని; కనక, రత్న+ఉజ్జ్వల, ఘన, కిరీటున్= బంగారంతో మణులతో ప్రకాశించే గొప్ప కిరీటం కలవాడిని; సంపూర్ణ, యౌవనున్= నిండు జవ్వనంతో తొణికిసలాడుతున్న వాడిని; సర్వ, లక్షణ, యుక్తున్= అన్ని మంచి గుణాలతో కూడిఉన్న వాడిని; కని= చూచి; అనురాగిల్లి= ప్రేమించి; స+ఆకార+ఐ, వచ్చి= శరీర ధారిణి అయి అరుగుదెంచి; అఖిలంబున్+చూడంగన్= సమస్తం (సర్వభూతాలును) చూస్తూఉండగా; సిత, పద్మ, హస్త+ఐ= తెల్లని తామరపువ్వులను రెండు చేతుల్లో ధరించినదై; అతనిన్= ఆకుమారస్వామిని; పొందెన్= చేరింది; మునులున్= ఋషులును; అమర, వరులున్= దేవతలలో శ్రేష్ఠులును; శ్రీ, సమేతుఁడు+ఐ= లక్ష్మీదేవితో కూడిన వాడై; విశేష, కాంతి, స్ఫూర్తిన్+ఒలసి= గొప్పదైన వెలుగు యొక్క వ్యాప్తిచేత ఒప్పారి; పూర్ణ, చంద్రు, చెలువు+తాల్చి= నిండు చందురుడి పోలుపు ధరించి; ఉన్నవానిన్= ఉన్న వాడిని, కుమారస్వామిని; ఉత్+ఫుల్ల, లోచన, కుముదులు+అగుచున్= బాగా వికసించిన తెల్లకలువలవంటి కన్నులు కలవారు ఔతూ; చూచిరి= తిలకించారు.

తాత్పర్యం: అగ్నిహోత్రుడి పుత్రుడైన ఆ కుమారస్వామి నిడివి అయి ఎత్తైనభుజాలు కలవాడు. కవచాన్ని ధరించిన వాడు. దేదీప్యమానమైన వెలుగు వెల్లి విరిసిన ముఖం కలవాడు. మిక్కిలి ఎర్రనైన వస్త్రాలు ధరించినవాడు. మణులు పొదిగిన బంగారు కిరీటం ధరించిన వాడు. నిండు జవ్వనం తొణికిసలాడుతున్నవాడు. సర్వ సద్గుణ విరాజితుడు. అట్టి అతడిని చూచి ప్రేమించి, లక్ష్మీదేవి శరీరధారిణి అయి వచ్చి అతడిని చేరింది. ఆమె చేతిలో శృంగారకమలం విరిసి ఉంది. ఆ రీతిగా లక్ష్మీయుక్తుడై దేదీప్యమానంగా వెలుగొందుతున్న కుమారస్వామిని పూర్ణచంద్రుడివలె సౌందర్యంతో ఒప్పారేవాడిని ఋషులు వేల్పులు ఆనందంతో ఆశ్చర్యంతో తిలకించారు.

వ. అంత షష్ఠదివసంబు సంప్రాప్తం బయ్యె; నందు మహామునులందఱు మహాసేను నతిభక్తిం బూజించి, కృతాంజలులై యిట్లనిరి. 222

ప్రతిపదార్థం: అంతటన్= అటు పిమ్మట; షష్ఠ దివసంబు= ఆరవ రోజు; సంప్రాప్తంబు+అయ్యెన్= వచ్చింది; అందున్= అక్కడ; మహా, మునులు+అందఱున్= గొప్ప ఋషులు అందరున్నూ; మహాసేనున్= కుమారస్వామిని; అతిభక్తిన్= మిక్కిలి పూజ్యభావంతో; పూజించి= ఆరాధన చేసి; కృత+అంజలులు+ఐ= ఘటించిన కైమోడుపులు కలవారలై- నమస్కరించిన వారై; ఇట్లు+అనిరి= ఈ విధంగా పలికారు.

తాత్పర్యం: ఆ పిమ్మట ఆరవదినం వచ్చింది. అచట ఉన్న గొప్ప ఋషులు కుమారస్వామిని భక్తితో ఆరాధించి, నమస్కారాలు చేసి ఈ విధంగా పలికారు.

ఉ. 'పుట్టిన యాఱునాళులకుఁ బొంపిరివోయి జగంబు లన్నియున్
దట్టుఁడ వై జయించితి ముదంబుగ నీదు మహత్త్వ మెంతయుం
జిట్టలు గాదె! యిట్టి యవిజేయుఁడ వింద్రపదంబు నీక కాఁ
బట్టము గట్టి యేలుము కృపన్ మము నెల్లను వహ్నిసంభవా!' 223

ప్రతిపదార్థం: వహ్నిసంభవా!= అగ్నిహోత్రుడి కొడుకు వయిన ఓ కుమారస్వామీ!; పుట్టిన= జన్మించిన; ఆఱు, నాళులకున్= ఆరు రోజులకు; పొంపిరి+పోయి= అతిశయించి; జగంబులు+అన్నియున్= లోకాలు అన్నింటిని; దట్టుఁడవు+ఐ= ధీరుడవై; ముదంబునన్= సంతోషంతో; జయించితి(వి)= గెలిచావు; నీదు, మహత్త్వము= నీ యొక్క గొప్పదనం; ఎంతయున్= మిక్కుటంగా; చిట్టలు+కాదె= అచ్చెరువు కొల్పేది కదా; ఇట్టి+అవిజేయుఁడవు= ఈ విధంగా ఓటమి చెందని వీరుడవు; ఇంద్ర పదంబు= ఇంద్రుడి యొక్క పదవి; నీకున్+అ+కాన్= నీకు మాత్రమే ఉండేటట్లుగా; పట్టము+కట్టి= పట్టాభిషేకం చేసి; మమున్+ఎల్లను= మమ్ముల నందరిని; కృపన్= దయతో; ఏలుము= పరిపాలించుము.

తాత్పర్యం: 'అగ్నిదేవుడి పుత్రుడవైన కుమారస్వామీ! నీ మహిమ మిగుల ఆశ్చర్యకరమైనది. నీవు పుట్టిన ఆరురోజులకే అవలీలగా జగాలనన్నింటిని జయించావు కదా! నీవు అజేయుడవైన మహావీరుడవు. కాబట్టి ఇంద్రపదవిని అధిష్ఠించి, దయతో నీవు మమ్ములను అందరిని పరిపాలించుము'.

వ. అనినం గ్రౌంచారి వారలం జూచి' యింద్రపదవి నుండువారి కెయ్యది కరణీయం?' బని యడుగుటయు వా రిట్లనిరి. 224

తాత్పర్యం: అని పలుకగా, కుమారస్వామి అక్కడ ఉన్నవారిని చూచి 'ఇంద్రపదవిలో ఉండేవారు నెరవేర్చవలసిన పని ఏది?' అని ప్రశ్నించగా, వారు ఇట్లా బదులు పలికారు.

మ. 'బలముం దేజము నించి లోకముఁ గృపం బాలించు టర్కేందు భూ
జల తేజః పవనాంబరంబులకు నస్థైర్యంబు గాకుండ ని
శ్చలశక్తిస్థితి నీఁగి శిష్టజనరక్షాదుష్టశిక్షాసమా
కలనం బింద్రపదస్థుఁ డౌ నతనికిం గర్తవ్యముల్ షణ్ముఖా!' 225

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: షట్+ముఖా!= ఆరు మోముల దేవరా!; ఇంద్ర పదస్థుఁడు+ఔ= ఇంద్రుడి యొక్క పదవిలో ఉండే; అతనికిన్= అతడికి; బలమున్= శక్తిని; తేజమున్= వెలుగును; నించి= నింపి; లోకమున్= జగత్తును; కృపన్= దయతో; పాలించుట= ఏలుట; అర్క+ఇందు, భూ, జల, తేజస్+పవన+అంబరంబులకున్= సూర్యుడికి, చంద్రుడికి, భూమికి, నీటికి, అగ్నికి, గాలికి, ఆకసానికిన్నీ; అస్థైర్యంబు+కాకుండన్= చలనం లేకుండా, అనగా తిరంగా ఉండటానికై; నిశ్చల, శక్తి, స్థితిన్+ఈఁగి= చలించని సామర్థ్యం ఒసగి; శిష్ట, జన రక్షా, దుష్ట, శిక్షా, సమ్+ఆకలనంబు= మంచివారిని రక్షించటం చెడ్డవారిని శిక్షించటం జరుపుతుండటం; కర్తవ్యముల్= చేయవలసిన పనులు.

తాత్పర్యం: 'ఆరుమోములదేవరా! ఓ కుమారస్వామీ! స్వీయసామర్థ్యం తేజస్సు లోకంలో నిలిపి, దుష్టులను శిక్షించటం శిష్టులను రక్షించటం మూలంగా పరిపాలన చేయటం, పంచభూతాలు సూర్యచంద్రులు తిరంగా ఉండేటట్లు చూడటం ఇంద్రపదవి నధిష్ఠించేవాడు చేయదగిన పనులు.

చ. **అనునెడ నింద్రుఁ డిట్లనియె, 'నట్లయినం గడులెస్స; దేవ! నీ**
వనిమిషనాయకత్వమునయం దభిషిక్తుఁడవై ముదంబుతో
ననుఁ బని గొమ్ము నీదు కరుణన్ దొసఁ గెల్లను దీఁటి యుండెదన్;
ఘనతర శౌర్యసారుఁడవు గావున నర్హుఁడ వింద్రలక్ష్మికిన్. **226**

ప్రతిపదార్థం: అను+ఎడన్= అని చెప్పేటప్పుడు; ఇంద్రుఁడు= వేలుపుదొర; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అట్లు+అయినన్= ఆ విధంగా జరిగితే (అనిన దేవతల ప్రార్థన మేరకు కుమారస్వామి ఇంద్రపదవిని స్వీకరిస్తే); కడు= మిక్కిలి; లెస్స= మంచిది; దేవ!= ఓ కుమారస్వామీ!; నీవు; అనిమిష నాయకత్వమున+అందున్= దేవతల యొక్క నాయకత్వంలో; అభిషిక్తుఁడవు+ఐ= అభిషేకించబడిన వాడవు అయి (అభిషేకం ప్రభుత్వ లాంఛనం); ముదంబుతోన్= సంతోషంతో; ననున్= నన్ను; పని+కొమ్ము= పనులను చేయటానికై నియోగించుము; నీదు కరుణన్= నీ యొక్క దయవలన; దొసఁగు+ఎల్లను+తీఁటి+ఉండెదన్= దోషాలు అన్నిటిని దాటిన వాడనై ఉండగలను; ఘనతర శౌర్యసారుఁడవు= గొప్పదైన పరాక్రమం యొక్క సారాన్ని పొందిన వాడవు; కావునన్; ఇంద్ర లక్ష్మికిన్= ఇంద్రపదవి యొక్క ఐశ్వర్యానికి; అర్హుఁడవు= తగిన వాడవు, యోగ్యుడవు.

తాత్పర్యం: అనగా, ఇంద్రుడు ఈ విధంగా చెప్పాడు: 'దేవతలు చెప్పిన మాటలు బాగా ఉన్నవి. ఓ కుమారస్వామీ! నీవు దేవేంద్రపదవిలో అభిషిక్తుడవై నన్ను నీ భృత్యుడిగా ఏలుకొనుము. నేను నీ ఆజ్ఞప్రకారం నడచుకొనగలను. నాకంటె పరాక్రమంలో నీవు అధికుడవు కాబట్టి ఇంద్రపదవికి నీవే యోగ్యుడవు.

వ. **ఏను దేవేంద్రపదవి నుండ నోడుదు; నెట్లనిన భవదీయ తేజోవిశేషంబులు సూచి విస్మితులై కొందఱు నీకు నింద్రపదవియందు వేడ్కపుట్టునట్లుగా నే మేనింజెప్పి నావలనం గొఱగామి కల్పించి, నీకును నాకును భేదంబు సేయం జూతురు; దానం జేసి నీవు కుపితుండవై నాయెడం గృపదప్పిన నెవ్వారికి వారింప నలవిగాదు; లోకభయంకరంబైన విగ్రహంబు ప్రవర్తిల్లుఁ గావున నవశ్యంబును దివిజరాజ్యంబు నీక యొప్పించితి; మమ్మెల్ల నేలి కొ' మ్మనినఁ గుమారుండు నవ్వుచు ని ట్లనియె.** **227**

ప్రతిపదార్థం: ఏను= నేను; దేవ+ఇంద్ర, పదవిన్= వేల్పులకు ప్రభువు అయిన ఇంద్రుని పదవిలో; ఉండన్+ఓడుదున్= ఉండుటకు జంకెదను; ఎట్లు+అనినన్= అందుకు కారణం ఏమి అని అడిగితే; భవదీయ, తేజస్+విశేషంబులు= నీయొక్క

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దేదీప్యమైన గొప్పకాంతి ముప్పగునవి; చూచి= అరసి; విస్మితులు+ఐ= అచ్చెరువు పొందిన వారై; కొందఱు= కొంతమంది; నీకున్; ఇంద్ర, పదవి+అందున్= వేల్పులకు ప్రభువుగా ఉండే పదవిలో; వేడ్క= ఆసక్తి; పుట్టునట్లుగాన్= కలుగునట్లుగా; ఏమి+ఏనిన్+చెప్పి= ఏదో ఒకటి కల్పించి పలికి; నా వలనన్= నాయందు; కొఱగామి కల్పించి= లోటుపాటు నిరూపించి; నీకును, నాకును= నీకును నాకును మధ్య; భేదంబు+చేయన్+చూతురు= శత్రుత్వం ఏర్పడేటట్లు ప్రయత్నాలు చేయగలరు; దానన్+చేసి= అందువలన; నీవు; కుపితుండవు+ఐ= కోపం చెందిన వాడవై; నా+ఎడన్= నా యెడల; కృపన్+తప్పినన్= దయమాలితే, ఆగ్రహిస్తే; ఏ+వారికిన్= ఎట్టి వారికినైనను; వారింపన్= ఆపుటకు; అలవి+కాదు= శక్యం కాదు; లోక, భయంకరంబు+ఐన= లోకానికి అంతటికీ భయం కలిగించేది అయిన; విగ్రహంబు= కయ్యం; ప్రవర్తిల్లున్= ఏర్పడుతుంది; కావునన్= కాబట్టి; అవశ్యంబును= తప్పనిసరిగా; దివిజ రాజ్యంబు= దేవతల ఏలుబడి; నీకున్+అ= నీకు ఒక్కడికే; ఒప్పించితిన్= సమర్పించాను; మమ్మున్+ఎల్లన్= మమ్మలిని అందరిని (వేల్పుల నందరిని); ఏలి కొమ్ము= పరిపాలించుకొమ్ము; అనినన్= అని చెప్పగా; కుమారుండు= కుమారస్వామి; నవ్వుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'నేను దేవేంద్రపదవిని ఇక అధిష్ఠింప జాలను. ఎందుకంటే దేదీప్యమానమైన నీ తేజస్సు చూచి, అచ్చెరువు పొందిన కొంతమంది నీవే దేవతలకు తగిన ప్రభుడవు అని చెప్పి, నీకు దేవేంద్రపదవిపై అభిలాష కలిగేటట్లు చూడగలరు. అప్పుడు నామీద నీకు ఆగ్రహం ఏర్పడవచ్చును. అప్పుడు నీవు నాపై పరాక్రమించిన, నిన్ను ఆపగల వార లెవరు? మనమధ్య ఏర్పడే శత్రుత్వం జగత్తుకు వినాశకరం. అందుచేత నీకును, నాకును, లోకానికి మేలు కలుగ వలెననే మంచిఉద్దేశంతో ఈ దేవలోక రాజ్యాన్ని నీకు సమర్పించటానికి ఉద్యమించాను. నన్ను, నాతోడి వేల్పులను దయతో పరిపాలించుము' అని దేవేంద్రుడు అభ్యర్థించాడు. ఆ మాటలు విని ఆదరాభిమానాలు సూచించే నవ్వుతో కుమారస్వామి ఇట్లా బదులు పలికాడు.

ఉ. **'అట్టివి యేల పుట్టు? నమరాధిప! నీవ జగత్ప్రభుండ వై**
యిట్టల మైన తేజము వహించి సుఖంబున నుండు; మేను నీ
చుట్టమనై భుజాబలము సొంపున నీ కెలసంబు దీర్చెదం;
జట్టన నన్నుఁ బంపుము భృశంబుగ నెయ్యది కార్య మిత్తఱిన్?' **228**

ప్రతిపదార్థం: అమర+అధిప!= ఓ దేవేంద్రుడా!; అట్టివి= అటువంటివి - అనగా చెప్పుడుమాటలవలన మనమధ్య ఏర్పడే విభేదాలు; ఏల= ఎందువలన; పుట్టున్?= కలుగుతాయి; నీవు+అ= నీవు మాత్రమే; జగత్+ప్రభుండవు+ఐ= లోకాలను పరిపాలించే రాజువుఅయి; ఇట్టలము+ఐన= హెచ్చు అయిన; తేజము= దేదీప్యమానమైన కాంతి; వహించి= ధరించి; సుఖంబునన్+ఉండుము= సౌఖ్యాన్ని అనుభవించుము; ఏను= నేను; నీ చుట్టమను+ఐ= నీ యొక్క బంధువును ఐ; భుజా, బలము, సొంపునన్= పరాక్రమం యొక్క సొగసుచేత; నీ కెలసంబు= నీ యొక్క పని; తీర్చెదన్= నెరవేరుస్తాను; చట్టనన్= శీఘ్రంగా; నన్నున్= నన్ను; పంపుము= నియోగించుము; ఈ+తఱిన్= ఈ సందర్భాన; భృశంబుగన్= వేగంగా; కార్యము= నెరవేర్చవలసిన పని; ఎయ్యది= ఏది?

తాత్పర్యం: 'ఓ దేవేంద్రా! చెప్పుడుమాటలవలన నీకును నాకును మధ్య శత్రుత్వం ఎన్నటికిని ఏర్పడదు. నీవు మనస్సులో ఎట్టి సంకోచాన్ని పెట్టుకొనవలదు. నీవు గొప్ప తేజస్సు కలవాడవు. అనుభవజ్ఞుడవు. పరిపాలనలో సామర్థ్యం ఉన్నవాడివి. నీవే దేవలోకాన్ని నిశ్చితంగా ఏలుకొనుము. నేను నీకు బంధువుగా నీ అండ నిలిచి నా పరాక్రమం ప్రదర్శించి నీ పనులను నిర్వహించగలను. ఇప్పుడు అవశ్యం నెరవేర్చదగిన కర్తవ్యాన్ని సూచింపుము. వెంటనే నెరవేర్చగలను'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. అనవుడు సంతసిల్లి యతఁ డాతని కిట్లను 'నట్టు లైన నీ
పనుపున నేను సత్యహితభాషణ! యింద్రపదంబునందు ని
ల్చి నెగడువాఁడ నైతి; సురసేనల కెల్లను నాయకుండ వై
ఘనభుజ! నీవు సత్కృప జగద్భయమోచన మాచరింపవే!' 229

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; అతఁడు= (దేవేంద్రుడు); సంతసిల్లి= సంతోషించి; ఆతనికిన్= (కుమారస్వామికి); ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; సత్యహిత భాషణ!= నిజంగా మేలొనగూర్చునట్టి దానిని వచించేవాడా, ఓ కుమార స్వామీ!; అట్టులు+ఐనన్= ఆ విధంగా అయితే; (అనగా నీవు చెప్పినట్లుగా నీవు నాకు బంధువుగా ఉండి, నాకు అండగా నిలిస్తే); నీ పనుపునన్= నీ అనుమతి చొప్పున; ఏను= నేను; ఇంద్ర, పదంబు నందున్= దేవేంద్ర పదవిలో; నిల్చి= ఉండి; నెగడువాఁడన్+ఐతిన్= ఒప్పునట్టివాడను అయినాను; ఘన, భుజ!= గొప్ప బాహువులు కలవాడా! మిక్కుటమైన పరాక్రమం కలవీరుడా!; సుర, సేనలకున్+ఎల్లను= సమస్తమైన వేల్పుల భటులకు; నాయకుండవు+ఐ= నేతవు అయి-సేనాధిపతివై; నీవు; సత్+కృపన్= మంచి దయతో; జగత్+భయ, మోచనము= లోకానికి ఏర్పడిన భీతిని తొలగించటం; ఆచరింపవే!= చేయవా! (చేయుము).

తాత్పర్యం: అని కుమారస్వామి చెప్పాడు. ఆ మాటలు విని దేవేంద్రుడు మిక్కిలి సంతసించాడు. అంతట దేవేంద్రుడు కుమారస్వామితో ఈ విధంగా అన్నాడు: 'సత్యాన్ని వచించేవాడా! నామేలు కోరి వచించేవాడా! నీ మాటలు విశ్వసించి నీ అనుమతి చొప్పును నేను ఈ దేవేంద్రపదవిలో ఉండటానికి అంగీకరిస్తున్నాను; గొప్ప పరాక్రమంగల మహాబాహుడా! నీవు దేవతా సైన్యానికి నాయకుడవై, సర్వసేనాపతివై పరాక్రమ ప్రాభవంతో లోకంలో ఏర్పడి ఉన్న భయాన్ని తొలగించటానికి దయతో పూనుకొనుము'.

వ. అనినఁ గుమారుండు మరుత్పతి కిట్లనియె. 230

తాత్పర్యం: అనగా కుమారస్వామి దేవేంద్రుడితో ఇట్లా అన్నాడు.

ఉ. 'నీకుఁ బ్రియంబుగా భవదనీకినికిం బతి నయ్యెదన్ భుజో
త్సేకపటుప్రభావము లజేయములై పెనుపొందఁ బేర్చి ఘో
రాకృతు లైన నీ రిపుల నందఱఁ దున్మెద సర్వలోక ర
క్షాకరణైకవృత్తి నవికల్పుఁడ నయ్యెదఁ; గట్టు పట్టమున్'. 231

ప్రతిపదార్థం: నీకున్+ప్రియంబుగాన్= నీకు సంతోషం కలిగేటట్లుగా; భవత్+అనీకినికిన్= నీ సైన్యానికి; పతిన్= భర్తను; అయ్యెదన్= ఔతాను; భుజ+ఉత్సేక, పటు, ప్రభావములు= భుజ పరాక్రమంయొక్క గొప్ప మహిమలు; అజేయములు+ఐ= గెలవటానికి వీలు లేనివై; పెనుపు+ఒందన్= అతిశయించగా; పేర్చి= విజృంభించి; ఘోర+ఆకృతులు+ఐన= వెఱపు గొలుపే రూపాలు కలవారైన; నీ, రిపులన్+అందఱన్= నీ యొక్క శత్రువులను అందరను; తున్మెదన్= సంహరిస్తాను; సర్వ, లోక, రక్షా, కరణ+ఏక, వృత్తిన్= సమస్తమైన జగత్తును కాపాడే కార్యంలో మాత్రమే దీక్ష కలవాడనై; అవికల్పుఁడన్+అయ్యెదన్= సందేహం లేనివాడను కాగలను; పట్టమున్= (సర్వసేనాపతి పదవికి) అధికారాన్ని; కట్టు(ము)= నిబంధించునది.

తాత్పర్యం: అని ఇంద్రుడు పలుకగా, కుమారస్వామి ఇట్లా సమాధానం చెప్పాడు: 'నీకు సంతుష్టి కలిగేటట్లుగా నేను నీ సర్వసైన్యాధిపత్యాన్ని వహించగలను; గొప్పపరాక్రమం ప్రదర్శించి వెఱపు గొలిపే నీ శత్రువుల నందరిని సంహరించగలను; నిస్సంశయంగా విశ్వశ్రేయాన్ని ఒనగూర్చగలను. దీనికి తిరుగు లేదు. ఇక, నీ సర్వసేనాపతిగా నాకు పట్టం గట్టుము'.

వ. అనిన నతిప్రీతుం డగుచుఁ బురుహూతుండు సకలసురమునిగణసమేతుండై తత్క్షణంబ కుమారునకు నఖిలదేవసేనాధిపత్యంబునం దభిషేకం బొనరించె; మునివరుల జయజయ శబ్దంబులు నమరుల సింహ నాదంబులుం గిన్నర గంధర్వగానంబులు మంగళతూర్యరావంబులు నప్సరో నర్తనంబులుఁ గల్పతరు కుసుమ వర్షంబులు సమకాలప్రవృత్తంబు లయ్యెం; బరార్థ్యభూషణమణిప్రభాలంకృతంబైన కుమారు మౌళిభాగంబున నుజ్జ్వలంబైన ధవళాతపత్రంబు సురగిరిశిఖరోపరిగతం బగు శరచ్చంద్ర బింబంబు ననుకరించు చుండె; నట్టియెడ. 232

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అతి ప్రీతుండు+అగుచున్= మిక్కిలి సంతుష్టిని చెందినవాడు ఔతూ; పురుహూతుండు= దేవేంద్రుడు; సకల, సుర, ముని, గణ, సమేతుండు+ఐ= సమస్తమైన వేల్పులయొక్క మునుల యొక్క సమూహాలతో కూడిన వాడై; తద్+క్షణంబు+అ= ఆ క్షణంలోనే - వెను వెంటనే; కుమారునకున్= కుమారస్వామికి; అఖిల, దేవ, సేనా+ఆధిపత్యంబు నందున్= సమస్తమైన వేల్పులయొక్క సర్వసేనాపతి పదవిలో; అభిషేకంబు+ఒనరించెన్= లాంఛనమైన స్నానాన్ని చేయించాడు; మునివరుల జయజయ శబ్దంబులున్= ఋషులలో శ్రేష్ఠులైనవారు పలికిన ఆశీర్వాదాన్ని సూచించే జయం జయం అనే మాటలును; అమరుల, సింహనాదంబులున్= వేల్పులు సంతోషంతో చేసిన సింహగర్జనలవంటి కేకలును; కిన్నర, గంధర్వ గానంబులు= కిన్నరులు, గంధర్వులు పాడిన పాటలును; మంగళ, తూర్య, రావంబులున్= శుభాన్ని సూచించే వాద్యధ్వనులును; అప్సరస్+నర్తనంబులున్= దేవవేశ్యలు చేసిన నాట్యాలున్ను; కల్ప, తరు, కుసుమ వర్షంబులున్= వేలుపు చెట్లనుండి కురిసిన పూలజల్లులున్ను; సమకాల ప్రవృత్తంబులు+అయ్యెన్= ఒకే సమయంలో ఏర్పడ్డాయి; పరార్థ్య, భూషణ, మణి, ప్రభా+ అలంకృతంబు+ఐన= శ్రేష్ఠాలైన నగల యందలి మణులయొక్క కాంతులచేత అలంకరించబడిన; కుమారు, మౌళి, భాగంబునన్= కుమారస్వామియొక్క శిరస్సుపైభాగాన; ఉత్+జ్వలంబు+ఐన= మిక్కుటంగా వెలుగొందుతున్న; ధవళ+ఆతపత్రంబు= తెల్లని గొడుగు; సుర, గిరి, శిఖర+ఉపరి, గతంబు+అగు= వేల్పుకొండ యొక్క పై భాగానికి చేరిన; శరత్+చంద్ర, బింబంబున్= శరత్కాలంలో కనబడే చంద్రమండలాన్ని; అనుకరించుచున్+ఉండెన్= సరిపోలుతున్నది; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ మాటలు విని దేవేంద్రుడు మిక్కిలి ఆనందించాడు. అతడు వెనువెంటనే వేల్పులతో మహర్షులతో కూడి కుమారస్వామిని సర్వసైన్యాధిపతిగా నియమించి అభిషేకించాడు. దేవర్షులు జయజయధ్వానాలతో కుమారస్వామిని ఆశీర్వదించారు. వేల్పులు సింహనాదాలు చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కిన్నరులు, గంధర్వులు పాటలు పాడారు. దేవకన్యకలు నాట్యం చేశారు. కల్పవృక్షాలు పువ్వులను వర్షించాయి. ఇవి అన్నీ ఏకకాలంలోనే జరిగాయి. అప్పుడు కుమారస్వామిశిరస్సుమీద నవరత్నాలతో పొదుగబడిన విలువైన ఆభరణాలు వెలుగొందాయి. ఆతడి శిరస్సుపై ప్రకాశించే తెల్లనిగొడుగు శరత్కాలంలో మేరుపర్వతశిఖరంమీద ఉదయించిన చంద్రబింబంవలె ప్రకాశించింది. ఆ సమయంలో.

విశేషం: కిన్నరులు= అశ్వముఖాలు నరశరీరాలూ కలవారు. దేవతలలో ఒక తెగ. గంధర్వులు= వేల్పులలో ఒక తెగ. గాయకులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈశ్వరుండు గుమారస్వామియొద్దకు వచ్చుట (సం. 3-218-25)

శా. నానాసిద్ధగణంబు గొల్వఁ బరమానందంబునం జంద్ర రే
ఖా నవ్యాంచితమౌళి భూరిభుజగాకల్పోజ్జ్వలాకారుఁ డీ
శానుం డానతశంకరుండు గిరిజాసంయుక్తుఁడై వచ్చెఁ ద
త్సేనానిం బ్రియాసూను షణ్ముఖుని వీక్షింపం గడుం బ్రేమతోన్. 233

ప్రతిపదార్థం: చంద్ర, రేఖా, నవ్య+అంచిత, మౌళి= చంద్రవంకచేత క్రొత్తగా ఒప్పారు నట్టి శిరం కలవాడు- శివుడు; ఈశానుండు= శివుడు; ఆనత శంకరుండు= వినయంతో నమస్కరించువారలకు శుభం కలిగించేవాడు; నానా, సిద్ధ, గణంబు= పెక్కుమంది సిద్ధుల సముదాయం; కొల్వన్= సేవించగా; పరమ+ఆనందంబునన్= గొప్పదైన సంతోష తన్మయత్వంతో; భూరి, భుజగ+ఆకల్ప+ఉత్+జ్వల+ఆకారుఁడు= గొప్పవైన పాములచేత అలంకరించబడి మిక్కిలి ప్రకాశించే ఆకారం కలవాడు- అనగా భుజగభూషణుడైన శివుడు; గిరిజా+సంయుక్తుఁడు+ఐ= పార్వతీదేవితో కూడిన వాడై; తద్+సేనానిన్= ఆ సేనాధిపతి అయిన కుమారస్వామిని; ప్రియ, సూనున్= అనుగు కొడుకును; షట్+ముఖునిన్= ఆరుముఖాలు కలవాడిని; వీక్షింపన్= చూడటం కొరకై; కడున్= మిక్కిలి; ప్రేమతోన్= అనురాగంతో; వచ్చెన్= అరుదెంచాడు.

తాత్పర్యం: బాలచంద్రధరుడు భక్తులకు శుభం కలిగించేవాడు, నాగభూషణుడు అయిన ఈశ్వరుడు సిద్ధగణాలు తనను సేవిస్తూ ఉండగా, పార్వతీసమేతుడై తన కుమారుడైన షణ్ముఖుడిని చూడటానికై ప్రేమతో అరుదెంచాడు.

విశేషం: (1) సిద్ధులు = అణిమాదులైన అష్ట సిద్ధులు కలిగిన దివ్యపురుషులు. (2) కుమారస్వామి శివుడి పుత్రుడైన కథ. పార్వతీ పరమేశ్వరులు శృంగారమందిరంలో ఉండగా అగ్నిదేవుడు 'బల్లి' రూపంలో గోడపై నక్కిఉన్నాడు. ఆ బల్లిని చూచి పార్వతీదేవి ఇంచుక సంచలించినపుడు శివుడికి రేతఃస్ఖలన మైనది. అప్పుడు శివు డాగ్రహించి ఆ రేతస్సును ఆ బల్లి నోటిలో పోశాడు. అగ్నిహోత్రుడు ఆ వీర్యాన్ని భరించజాలక ఆవేదనపడుతూ తదుపరి మునిపత్నులను వలచాడు. స్వాహాదేవి సంగ్రహించిన రేతస్సుకు మాతృక శివుడే, ఈ విధంగా షణ్ముఖుడు ఈశ్వరుడికి ప్రియపుత్రుడు.

వ. ఇట్లు వచ్చి మహాదేవుండు మహాసేనుం గౌఁగిలించుకొని యతనికి విశ్వకర్మ నిర్మితంబును హేమమయంబును నయిన పుష్పమాలిక యొసంగె' నని చెప్పిన విని ధర్మజుండు 'కుమారుఁడు రుద్రాంశజుఁ డని చెప్పుదు; రదియె?' ట్లనిన మార్కండేయుండు పాండవేయున కిట్లనియె; 'వినుము; రుద్రుండు మున్ను వీర్యంబు వహ్నియందు సంగ్రహించినఁ దత్తేజోవిశేషంబునం జేసి పావకుండు గుమారు నుత్పాదించె; నదియునుం గాక, యగ్ని రుద్రుం డని వేదవిదు లైన విప్రులవలన వినంబడు; నట్లగుటం గుమారుండు వహ్నిసంభవుండును, రుద్రసూనుండును నని చెప్పంబడియె; నగ్నిభామిని గృత్తికాఖ్యలైన మునిపత్ను లార్వుర రూపంబులు గైకొని, ప్రియ సమాగమంబు సలిపి శ్వేతశైలంబున రేతస్స్కందంబు సేయుటం బ్రభవించినవాఁడు గావునఁ గార్తికేయ స్కంద నామంబులం బరఁగె' నని చెప్పి యిట్లనియె. 234

ప్రతిపదార్థం: మహాదేవుండు= పరమశివుడు; ఇట్లు= ఈ రీతిగా; వచ్చి= అరుగుదెంచి; మహాసేనున్= కుమారస్వామిని; కౌఁగిలించుకొని= ఆశ్లేషణం చేసి; అతనికిన్= ఆ కుమారస్వామికి; విశ్వకర్మ, నిర్మితంబును= విశ్వకర్మచేత చేయబడినట్టిదియును; హేమ, మయంబును= బంగారంతో కూడినట్టిది; అయిన= అయినట్టి; పుష్ప, మాలిక= పూలదండ; ఒసంగెన్= ఇచ్చాడు; అని చెప్పినన్; విని; ధర్మజుండు; కుమారుఁడు= కుమారస్వామి; రుద్ర+అంశజుఁడు= రుద్రుడి యొక్క అంశతో జన్మించినవాడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అని చెప్పుదురు= అంటూ (పెద్దలు) వచిస్తారు; అది+ఎట్లు+అనినన్= అది ఏ విధంగా చెల్లును అని అడుగగా; మార్కండేయుండు= మార్కండేయుడు అనే ఋషి; పాండవేయునకున్= పాండురాజు కొడుకైన ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; వినుము= ఆలకింపుము; మున్ను= పూర్వం; రుద్రుండు= శివుడు; వీర్యంబు= (తన) శుక్లం; వహ్ని+అందున్= అగ్ని లోపల; సంగ్రహించినన్= నిక్షేపించగా; తద్+తేజస్+విశేషంబునన్+చేసి= ఆ గొప్ప శుక్లం వలన; పావకుండు= అగ్నిహోత్రుడు; కుమారున్= కుమారస్వామిని; ఉత్పాదించెన్= పుట్టించాడు; అదియున్+కాక= అంతమాత్రమే కాక; అగ్ని= అగ్నిహోత్రుడు; రుద్రుండు+అని= శివుడు అని; వేద విదులు+ఐన= వేదాల అర్థం తెలిసిన వారైన; విప్రుల వలనన్= బ్రాహ్మణుల నుండి; వినంబడున్= తెలుస్తున్నది; అట్లు+అగుటన్= కాబట్టి; కుమారుండు= కుమారస్వామి; వహ్ని, సంభవుండును= అగ్నిహోత్రుడివలన పుట్టినట్టివాడున్నూ; రుద్ర సూనుండును= శివుడి యొక్క కొడుకున్నూ; అని చెప్పంబడియెన్= అంటూ చెప్పబడింది; అగ్నిభామిని= అగ్నిహోత్రుడి భార్య; కృతికా+ఆఖ్యలు+ఐన= కృత్తికలు అనే పేర్లు కల వారైన; ముని, పత్నులు= ఋషుల భార్యలు; ఆర్వుర, రూపంబులు= ఆరుగురి ఆకారాలు; కైకొని= స్వీకరించి; ప్రియ, సమాగమంబు+సలిపి= భర్త పొందును అనుభవించి; శ్వేత శైలంబునన్= శ్వేతశైలం (తెల్లని కొండ) అనే పేరుగల కొండపై; రేతస్+స్కందంబు= శుక్లాన్ని సంగ్రహించటం; చేయుటన్= చేయటంవలన; ప్రభవించినవాఁడు= జన్మించినవాడు; కావునన్= కాబట్టి; కార్త్తికేయ, స్కంద, నామంబులన్= కార్త్తికేయుడు, స్కందుడు- అనే పేరులతో; పరఁగెన్= ఒప్పారినాడు; అని చెప్పి= అని వచించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా తెలిపాడు.

తాత్పర్యం: ఈ విధంగా పరమశివుడు వచ్చి మహాసేనుడైన షణ్ముఖుడిని కౌగిలించుకొని అతడికి విశ్వకర్మచేత చేయబడిన బంగారు పూలదండను బహూకరించాడు. మార్కండేయుడు ఆ కథ వినిపించగా, ధర్మరాజు మరొక ప్రశ్నవేశాడు. 'మార్కండేయ మహామునీ! కుమారస్వామి రుద్రుడితేజస్సువలన పుట్టినవాడని పెద్దలు చెప్తుతారుకదా! మీరు చెప్పిన గాథవలన అతడు అగ్నిహోత్రుడి పుత్రుడని తేలింది. దీనిని సమన్వయించటం ఎట్లా?' అని. అప్పుడు మార్కండేయ మహర్షి ధర్మరాజుకు ఈ విధంగా సమాధానం చెప్పాడు. 'వినుము. పూర్వం శివుడు తన వీర్యాన్ని అగ్నిహోత్రుడియందు నిక్షేపించాడు. ఆ శివశుక్లంవలన అగ్నిహోత్రుడు కుమారస్వామిని కన్నాడు. అంత మాత్రమే కాక వేదాల అంతరార్థం తెలిసిన బ్రాహ్మణ పండితోత్తములు అగ్నిని రుద్రుడని కూడా చెప్తుతారు. అందుచేత కుమారస్వామి అగ్నిహోత్రుడి పుత్రుడు; శివుడి కుమారుడు అని చెప్పవచ్చును. అగ్నిహోత్రుడి భార్య స్వాహాదేవి కృత్తికలు అనే పేరులు కల ఋషిపత్నుల రూపాలు ధరించి, భర్తృవాల్లభ్యాన్ని అనుభవించి కన్నపుత్రుడు కనుక, కుమారస్వామికి కార్త్తికేయుడు అనే పేరు సార్థకమైనది. అగ్నిభార్య తన పతియొక్క రేతస్సును స్కందం చేయటం వలన ఉద్భవించిన కుమారుడు కనుక అతడికి స్కందుడు అనే' మరియొక పేరు ఏర్పడింది.

విశేషం: (1) కుమారస్వామి శివుడికుమారుడు అనటానికి ఆధారమైన గాథ 233 పద్యం చివర విశేషాంశ వివరణలో అనుశీలించేది. (2) కార్త్తికేయుఁడు= కృత్తికలకు పుట్టినవాడు. ఇందు జ్యోతిష విశేషం ఉల్లేఖించబడింది. ప్రస్తుతం ప్రచారంలో ఉన్నది అశ్విన్యాది నక్షత్ర పరిగణనం. విషువత్తు సంచలనంవలన ఒకానొకప్పుడు కృత్తికాది నక్షత్ర పరిగణనం ఏర్పడింది. భారతంలోని కుమారస్వామిగాథను పరిశీలిస్తే ప్రాచీనభారతీయులు సాధించిన లోకోత్తరజ్యోతిషపరిజ్ఞానం స్వయంవ్యక్తం కాగలదు.

తే. **అప్పు డింద్రుండు మున్ను దా నబ్జభవు ని । యోగమున సురక్షితముగ నునిచినట్టి**
దేవసేనకుఁ గన్యకాతిలకమునకుఁ । జెలువముగ నలంకారంబు సేయఁ బనిచి. **235**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఇంద్రుండు= దేవేంద్రుడు; మున్ను= లోగడ; తాన్= తాను; అబ్జభవు, నియోగమునన్= బ్రహ్మదేవుడి ఆనతి చొప్పున, సురక్షితముగన్= క్షేమంగా; ఉనిచినట్టి= ఉంచినటువంటి; దేవసేనకున్= దేవసేన (అనెడి); కన్యకా, తిలకమునకున్= కన్నెలలో ఉత్తమోత్తమురాలు అయిన దానికి; చెలువముగన్= అందచందాలు ఒనగూడేటట్లుగా; అలంకారంబు= ఆభరణాలతో ఆహార్యం; చేయన్+పనిచి= చేయటానికి ఆజ్ఞాపించి.

తాత్పర్యం: ఆ సమయంలో, అది మంచి అవకాశమని భావించి, ఇంద్రుడు లోగడ తాను, బ్రహ్మదేవుడి ఆనతిచొప్పున సురక్షితంగా సాకుతున్న దేవసేన అనే కన్యారత్నాన్ని అలంకరించి తీసికొని రమ్మని ఆజ్ఞాపించాడు.

వ. సముచిత ప్రకారంబున నచ్చటికిఁ దెప్పించి కుమారుం జూచి 'యిక్కన్నియ భవదర్థం బై పరమేష్ఠిచేత సృజియింపంబడియెం గావున నివ్వరవర్ణినిం బరిగ్రహింపు' మనిన న ప్పార్వతీనందనుండు మందస్మిత సుందర వదనారవిందుం డయి యమ్ముహూర్తంబునందు. 236

ప్రతిపదార్థం: సముచిత ప్రకారంబునన్= తగిన మర్యాద చొప్పున; అచ్చటికిన్= ఆచోటికి; తెప్పించి= వచ్చునట్లుగా చేసి; కుమారున్+చూచి; కుమారస్వామిని చూచి; ఈ+కన్నియ; భవత్+అర్థంబు+ఐ= నీ కొరకై; పరిమేష్ఠిచేతన్= బ్రహ్మదేవుడిచేత; సృజియింపంబడియెన్= సృష్టించబడింది; కావునన్= కాబట్టి; ఈ+వరవర్ణినిన్= ఈ అన్నులమిన్నను (ఈ అమ్మాయిని); పరిగ్రహింపుము= పెండ్లాడుము; అనినన్= అని చెప్పగా; ఆ+పార్వతీ నందనుండు= కుమారస్వామి; మందస్మిత, సుందర, వదన+అరవిందుండు+అయి= చిరునవ్వుచేత అందం చేకూర్చబడిన పద్మం వంటి ముఖం గలవాడై; ఆ ముహూర్తంబు నందున్= ఆ లగ్నంలో.

తాత్పర్యం: దేవేంద్రుడు ఆ సమయానికి తగిన మర్యాదతో సాలంకృత అయిన దేవసేనను అచటికి తెప్పించి కుమారస్వామితో ఇట్లన్నాడు: 'ఈ సుందరిని ప్రత్యేకంగా నీ కోసమే బ్రహ్మదేవుడు సృష్టించాడు. కాబట్టి నీవు లోకోత్తర సౌందర్యవతి అయిన ఈ కన్యకను వివాహమాడుము.' అంతట చిరునవ్వులు వెల్లివిరిసిన మొగంతో పార్వతీనందనుడైన కుమారస్వామి ఆ శుభలగ్నంలో

ఉ. మానిత విక్రమోజ్జ్వలుఁడు మంగళతూర్యనినాద మొప్పఁ దే
జోనిధి వహ్నిసాక్షిగ విశుద్ధవిధిజ్ఞుఁడు దేవమంత్రి మం
త్రానుగమం బొనర్పఁగఁ బ్రియం బెసలార వరించెఁ జారుప
ద్మానన దేవసేనఁ గరియానఁ గరగ్రహణ ప్రయుక్తితోన్. 237

ప్రతిపదార్థం: మానిత, విక్రమ+ఉత్+జ్వలుఁడు= కొనియాడబడిన శౌర్యం చేత మిక్కిలి వెలుగొందేవాడు; తేజోనిధి= (తేజస్+నిధి) దేదీప్యమానమైన కాంతికి నెలవైన వాడు; మంగళ, తూర్య, నినాదము+ఒప్పన్= శుభాన్ని ప్రకటించే వాద్యాల ధ్వనులు విలసిల్లగా; విశుద్ధ, విధిజ్ఞుఁడు= నిర్మల మైన శాస్త్ర సూత్ర విధానం తెలిసినవాడు; దేవమంత్రి= దేవతలకు మంత్రి అయినవాడు (బృహస్పతి); మంత్ర+అనుగమంబు+ఒనర్పఁగన్= వేద ఋక్కులు వల్లించబడుతుండగా; చారు పద్మ+ఆననన్= అందమైన పద్మం వంటి మొగం కలదానిని; కరియానన్= ఏనుగు నడక వంటి నడక కలదానిని; దేవసేనన్= దేవసేనను; వహ్ని సాక్షిగన్= అగ్ని సాక్షిగా; కర, గ్రహణ, ప్రయుక్తితోన్= చేతిని చేతితో పట్టుకొనే చక్కని విధానంతో; ప్రియంబు+ఎసలారన్= సంతసం పొంగులు వారగా; వరించెన్= పెండ్లాడాడు.

తాత్పర్యం: గొప్ప శౌర్యం కలవాడు. దేదీప్యమానమైన కాంతికి ఆకరమైనవాడు, శాస్త్రసూత్రాలు విధించిన పద్ధతి నెరిగినవాడు, అగ్ని సాక్షిగా, వైదిక మంత్రాలు చదువబడుతుండగా, కుమారస్వామి సంతోషం తన మనసులో ఉప్పొంగుతుండగా లోకోత్తరసౌందర్యరాశి అయిన దేవసేనను పాణిగ్రహణం చేసికొన్నాడు.

విశేషం: ఈ పద్యంలో రెండు ముఖ్యాంశాలు ఉన్నవి. (1) వివాహ సంప్రదాయం: వహ్నిసాక్షికం మంత్ర పూతం, శాస్త్ర విధ్యుక్తం అని ఎఱ్ఱన పేర్కొనటం (2) పాణి గ్రహణం= వివాహం; వైవాహిక విధికి పాణిగ్రహణానికి అవినాభావ సంబంధం ఇచ్చట సుస్పష్టంగా పేర్కొనబడింది.

ఆ. గుహుఁడు దేవసేనఁ గోరి పెండిలి యైన । యాదినంబు షష్ఠి యగుటఁ జేసి
యర్చనీయ మయ్యె నాదివసంబు లో । కముల నెల్ల వెలసె గారవమున. 238

ప్రతిపదార్థం: గుహుఁడు= కుమారస్వామి; దేవసేనన్= దేవసేన (అనే కన్యక)ను; కోరి= అభిలషించి; పెండిలి+ఐన= వివాహమాడిన; ఆ దినంబు= ఆ రోజు; షష్ఠి= (ఆరవతిథి); అగుటన్+చేసి= కావటం వలన; ఆ దివసంబు= ఆ రోజు; అర్చనీయము+అయ్యెన్= పూజించదగింది అయింది; లోకములన్+ఎల్లన్= అన్ని లోకాలలో; గారవమునన్= గొప్పతనంతో; వెలసెన్= ఒప్పారింది.

తాత్పర్యం: కుమారస్వామి అనురాగంతో దేవసేనను వరించి, పెండ్లాడిన దివసం షష్ఠి కావటం చేత లోకంలో ఆ రోజు (షష్ఠి) పూజించదగిన రోజు అయింది.

విశేషం: నేటికిని భారతదేశంలో స్కందషష్ఠి - లేదా- సుబ్రహ్మణ్య షష్ఠి పండుగగా జరుపబడుతున్నది.

క. ఏ దినమునందు షణ్ముఖు । శ్రీదేవి వరించెఁ గమలచిహ్నితకర యై
యా దివసము పంచమి లో । కాదరణీయంబు లక్ష్మి కాస్పద మయ్యెన్. 239

ప్రతిపదార్థం: ఏ దినము నందున్= ఏ రోజున; శ్రీదేవి= లక్ష్మీదేవి; కమల, చిహ్నిత, కర+ఐ= పద్మాలను పూనిన చేతులుగలదై; షట్+ముఖున్= ఆరు మొగాల దేవరను- కుమారస్వామిని; వరించెన్= అనురాగంతో స్వీకరించిందో; ఆ దివసము= ఆ రోజు; పంచమి= (అయిదవ తిథి); లోక+ఆదరణీయము= లోకాలచేత ఆదరించ దగింది; లక్ష్మికిన్= శ్రీదేవికి; ఆస్పదము+అయ్యెన్= నెలవు అయింది.

తాత్పర్యం: ఏ రోజున లక్ష్మీదేవి చేతులలో కమలాలను ధరించి కుమారస్వామిని వరించిందో ఆ రోజు పంచమి, ఆ తిథి లోకాలన్నింటికి ఆదరించదగినదైంది. లక్ష్మికి నెలవు అయింది.

వ. ఇట్లు విహితమంగళాచారుం డయిన కుమారు పాలికిం జనుదెంచి నిజభర్తలచేతం బరిత్యక్తలైన ముని భార్యలార్వురు నధికదైన్యవివర్ణవదన లై యిట్లనిరి. 240

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; విహిత, మంగళ+ఆచారుండు+అయిన= శాస్త్రంచేత చెప్పబడిన శుభసంప్రదాయం నెరవేర్చిన వాడయిన; కుమారు పాలికిన్= కుమారస్వామి సన్నిధికి; చనుదెంచి= వచ్చి; నిజభర్తలచేతన్= తమ పెనిమిటులచేత; పరిత్యక్తలు+ఐన= విడువబడినట్టివారైన; ముని భార్యలు= ఋషుల పెండ్లాలు; ఆర్వురు= ఆరుగురు; అధిక, దైన్య, వివర్ణ, వదనలు+ఐ= మిక్కిలి దుఃఖం చేత పాలిపోయిన మొగాలు కలవారై; చనుదెంచి= వచ్చి; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా, శాస్త్ర చోదిత మైన పద్ధతిలో వివాహవిధిని నిర్వర్తించిన కుమారస్వామిసన్నిధికి, తమ భర్తలచేత విడనాడబడిన ఆర్గురు మునుల భార్యలు వచ్చి, దుఃఖంచేత పాలిపోయిన మొగాలు కలవారై ఈ విధంగా పలికారు.

చ. 'కనుకనిఁ గూడి దుర్జనులు గానక చూడక యేము హవ్యవా
హనునకు నిన్నుఁ గంటి మని యాడిన నిందకు నోడి మమ్ముఁ జ
య్యనఁ బతు లుజ్జగించిరి ప్రియంబున నింకిట నీవు మాకు నం
దనుఁడవు మమ్ముఁ బ్రోవ విహితంబు గుమారక! నీ కవశ్యమున్. 241

ప్రతిపదార్థం: కనుకనిన్= జాగరూకతతో; కూడి= కలిసి; కానక= అరయక; చూడక= వివక్షచేయక; దుర్జనులు= చెడ్డవారు; ఏము= మేము (ఋషుల భార్యలం); హవ్యవాహనునకున్= అగ్నిహోత్రునకు; నిన్నున్= నిన్ను (కుమారస్వామిని); కంటిమి= ప్రసవించాం; అని+ఆడిన, నిందకున్+ఓడి= అని పల్కిన అపవాదానికి జంకి; మమ్మున్= మమ్ము; చయ్యనన్= శీఘ్రంగా; పతులు= భర్తలు; ఉజ్జగించిరి= విడనాడారు; కుమారక!= కుమారస్వామీ! (క-అల్పార్థం); ప్రియంబునన్= ప్రీతితో; ఇంకన్+ఇట= ఇక ఇచట; నీవు; మాకున్ (ఋషుల భార్యలకు); నందనుఁడవు= పుత్రుడవు; మమ్మున్= మమ్ము; ప్రోవన్= కాపాడటం; నీకున్; అవశ్యమున్= తప్పనిసరిగా; విహితంబు= నెరవేర్చవలసిన పని.

తాత్పర్యం: 'దుర్జనులు మంచి చెడుగులు లోతుగా వివక్ష చేయక, ఋషిపత్నుల మైన మేము అగ్నిహోత్రుడితో వ్యభిచరించి నిన్ను కన్నామని ఒక నీలాపనిందను ప్రచారం చేశారు. అందుచేత మా భర్తలు మమ్ము విడనాడారు. ఇక నీవే మాకు పుత్రనిర్విశేషుడవు. మమ్ము కాపాడటం నీకు ఇప్పుడు అవశ్యకర్తవ్యం.

తే. పుణ్యలోకంబులకుఁ బాసి పొక్కుచున్న। మమ్ముఁ జేకొని కరుణాసమగ్రబుద్ధిఁ
బుణ్యగతియందు నిల్పుము పుత్త్రభావ। దృష్టి వెలయ మా యలమట దీర్పవయ్య! 242

ప్రతిపదార్థం: పుణ్య, లోకంబులకున్+పాసి= సుకృతం వలన పొందే జగత్తులను కోల్పోయి; పొక్కుచున్న= తపిస్తున్న; మమ్మున్= మునిభార్యలమైనమమ్ము; చేకొని= ఆదరించి; కరుణా, సమగ్ర, బుద్ధిన్= దయనిండిన మనస్సుతో; పుణ్యగతి+అందున్= సుకృతం కలిగే మార్గంలో; నిల్పుము= స్థాపించుము; పుత్ర, భావ, దృష్టి= కొడుకుకు ఉండే ఆలోచన సూచించే చూపు; వెలయన్= విలసిల్లేటట్లుగా; మా+అలమట= మా దైన్యం; తీర్పవు+అయ్య!= పోగొట్టవా! (పోగొట్టుమని భావం).

తాత్పర్యం: మేము సుకృత లోకాలను పోగొట్టుకొని మిక్కుట మైన బాధను అనుభవిస్తున్నాం. నీవు మమ్ము దయతో నిండిన మనస్సుతో ఆదరించి అభిమానాన్ని చూపాలి. ఇక నీవే మా పుత్రుడవు. తల్లిని చూచేటట్లు నీవు మమ్ము చూడాలి'.

క. అనినఁ గుమారుఁడు వినయం। బున నిట్లను నేను మీకుఁ బుత్త్రుఁడ; మీరల్
ననుఁ గన్న తల్లులరు వినుఁ;। డనుమానం బేల మీ ప్రియం బొనరింతున్. 243

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; కుమారుఁడు= కుమారస్వామి; వినయంబునన్= అణకువతో; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; ఏను= నేను; మీకున్= మీకు; పుత్రుఁడన్= కొడుకును; మీరల్= మీరు (ఋషిపత్నులు); ననున్+కన్న,

తల్లులరు= నన్ను కన్న మాతలు; వినుఁడు= ఆలకింపుడు; అనుమానంబు= సందియం; ఏల= ఎందుకు?; మీ ప్రియంబు= మీకు ప్రీతిని; ఒనరింతున్= చేస్తాను.

తాత్పర్యం: అని చెప్పగా, కుమారస్వామి ఈ విధంగా సమాధానం చెప్పాడు: 'నేను మీకు కొడుకును. మీరు నా కన్న తల్లులు. ఈ విషయంలో సందేహానికి తావు లేదు. మీకు నేను సంతుష్టిని చేకూర్చగలను.

సీ. **అనుచుఁ జేరువ నున్న యనిమిషపతిఁ జూచి । 'వీరికిఁ దగుపదం బారయంగ**
వలయు' నావుడు బలవైరి యిట్లనుఁ 'జంద్ర । సతులైన యా దక్షసుతలలోన
రోహిణి పొరువున రుచి నొప్పు నభిజిత్తు । నా నొక్కచుక్క దాఁ బూని యిప్పు
డందఱకంటె నత్యంతవల్లభ నేన । యగుదుఁ జంద్రున కని వగచి యర్థిఁ

ఆ. **దపము సేయ నరిగెఁ; దత్పదం బది రిత్త । యున్న యదియు; వీరి నునుపు మచట'**
ననిన వారిఁ బ్రీతి నతఁడు వీడ్కొలిపినఁ । గడఁగి వారు సనిరి గగనమునకు. **244**

ప్రతిపదార్థం: అనుచున్= అని చెప్పుచు; చేరువన్+ఉన్న= సమీపంలో ఉన్న; అనిమిష, పతిన్+చూచి= దేవేంద్రుడిని చూచి; వీరికిన్= కృత్తికలకు; తగు= తగినట్టి; పదంబు= పదవి (గొప్ప స్థానం); ఆరయంగన్ వలయున్= చూడవలయును; నావుడున్= అని చెప్పగా; బల, వైరి= దేవేంద్రుఁడు; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికాడు; చంద్ర, సతులు+ఐన= చంద్రుడి భార్యలు అయిన; ఆ దక్షసుతలలోనన్= ఆ దక్షప్రజాపతి పుత్రికలలో; రోహిణి పొరువునన్= రోహిణీ నక్షత్రానికి చేరువగా; రుచిన్+ఒప్పు= వెలుగొందు; అభిజిత్తు= అభిజిత్తు; నాన్= అనగా; ఒక్క, చుక్క= ఒక నక్షత్రం; తాన్+పూని= తాను కడగి; ఇప్డు= ఈ సమయంలో; ఏను+అ= నేనే; చంద్రునకున్; అందఱకంటెన్= అన్ని నక్షత్రాల కంటె; అత్యంత వల్లభన్= మిక్కుటమైన కూర్మి పేర్మిగల భార్యను; అగుదున్= కాగలను; అని, వగచి= తలపోసి; అర్థిన్= అభిలాషతో; తపము+ చేయన్+అరిగెన్= తపస్సు చేయటానికై వెళ్ళింది; తద్+పదంబు+అది, రిత్త= ఆ స్థానం ఇప్పుడు శూన్యంగా; ఉన్న+అదియున్= ఉన్నది; వీరిన్= ఈ కృత్తికలను; అచటన్= ఆ స్థానంలో; ఉనుపుము= ఉంచుము; అనినన్= అని చెప్పిన; వారిన్= ఆ కృత్తికలను; ప్రీతిన్= ప్రేముడితో; అతండు= ఆ కుమారస్వామి; వీడ్కొనినన్= సాదరంగా సాగనంపగా; కడఁగి= పూని; వారు= ఆ కృత్తికలు; గగనమునకున్= ఆకసానికి; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: అని పలుకుతూ కుమారస్వామి తనకు సమీపాన ఉన్న దేవేంద్రుడితో ఈ విధంగా చెప్పాడు: 'ఈ కృత్తికలు నాకు మాతృనిర్విశేషలు. వీరికి తగిన గౌరవస్థానం చూపటం నా కర్తవ్యం'. అంతట దేవేంద్రుడు ఇట్లు సమాధానం చెప్పాడు. 'దక్షప్రజాపతికి పుట్టిన పుత్రికలు పలువురు చంద్రుడికి భార్యలైరి. ఆ తారకలలో రోహిణి ప్రక్కన దీప్తి వహించి 'అభిజిత్తు' అనే నక్షత్రం మిడిసిపాటుతో తానే సవతులందరను మించి చంద్రుడికి ప్రియవల్లభ కాగోరి తపస్సు చేసికొనటానికై వెళ్లింది. ఇప్పుడు ఆమె స్థానం (రోహిణి పొరువున నున్నచోటు) ఖాళీగా ఉన్నది. ఆ చోట ఈ కృత్తికలను నిల్పటం సమంజసం'. ఆ మాటల నాలకించిన కుమారస్వామి కృత్తికలకు సాదరమైన వీడ్కోలు ఇచ్చాడు. ఆ కృత్తికలు సంప్రీతితో అరిగి గగనంలో రోహిణిపొరువున నిల్చారు.

విశేషం: మహాభారతంలోని ఈ పద్యం భారతీయ జ్యోతిష శాస్త్ర చరిత్రలో మిక్కిలి ప్రాముఖ్యం వహిస్తున్నది. సూర్యుడు మున్నగు గ్రహాలు గగనమండలాన సంచరించే మార్గానికి - జ్యోతిష శాస్త్రంలో - 'క్రాంతి వలయం' అని పేరు. అందు అశ్విని మున్నగు నక్షత్రాలు ఉన్నవి. భూగోళం యొక్క ఇరుసు ఊహారేఖ పొడిగించబడితే ఎచట క్రాంతి వలయాన్ని తాకునో అది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జ్యోతిర్వలయానికి ఆదిమస్థానం. సంప్రదాయ సిద్ధంగా అది అశ్విని. కాని, ప్రతి సంవత్సరం ఆ బిందువు కొంత చలిస్తుంది. దానికి విషువత్తు అని పేరు. ఈ విషువత్తు యొక్క చలనాన్ని పూర్వీకులు భారతీయులు, యవనులు గ్రహించారు గాని, నిష్కర్షగా నిగణించలేకపోయారు. ఇప్పుడు ఆ బిందువు అశ్వినికి వెనుక సుమారు $23^{1/2^0}$ దూరంలో ఉన్నట్లు నవీనఖగోళశాస్త్రవేత్తలు నిర్ధారణ చేసి ఉన్నారు. కుమారస్వామి గాథ అర్థవాదరూపాన ఈ విషువత్తు చలనబిందువు కృత్తికయందు ఉన్న సమయాన్ని సూచిస్తున్నది.

వ. నాఁటంగోలెఁ గృత్తిక లార్వురు నగ్ని దైవత్యం బనంబరఁగు నక్షత్రం బై దివంబున వెలింగిరి; తదనంతరంబ స్వాహాదేవి యేతెంచి కుమారుం గని 'నీవు మత్పుత్త్రుండవు నిత్యంబును నీపాల వసియింపవలతు' ననినం బ్రీతుండై యాతం 'డట్ల కాక నీవు మత్సమీపంబున నుండి యేనును నీ కోడలుం గొనియాడం బ్రియంబున నుండు' మనియె, నప్పుడు కుమారమాతృకలు హవిషయుఁ గాళియుఁ గౌశికయు నుద్ధతయు శారికయు నార్యయు వైధాత్రియు ననువార లేడ్వురుం గుమారుముందట నిలిచి యిట్లనిరి. 245

ప్రతిపదార్థం: నాఁటం+గోలెన్= ఆ రోజునుండి; కృత్తికలు+ఆర్వురును= కృత్తికలు అనే నక్షత్రాలు ఆరును; అగ్ని దైవత్యంబు+ అనన్+పరఁగు= అగ్నిని దేవతగా కలిగినట్టిది అనబడెడి; నక్షత్రంబు+ఐ= తారలయి; దివంబునన్= ఆకసంలో; వెలింగిరి= వెలుగొందారు; తద్+అనంతరంబు+అ= అటు పిమ్మటనే; స్వాహాదేవి= స్వాహా అనే పేరు కల దేవి, అగ్నిహోత్రుడి భార్య; ఏ తెంచి= వచ్చి; కుమారున్+కని= కుమారస్వామిని చూచి; నీవు= నీవు; మత్+పుత్త్రుండవు= నా యొక్క కొడుకువు; నిత్యంబును= ఎల్లప్పుడును; నీపాలన్= నీ దగ్గర; వసియింపన్ వలతున్= ఉండవలె నని కోరుకొంటాను; అనినన్= అని చెప్పగా; ప్రీతుండు+ఐ= సంతోషించిన వాడై; ఆతండు= ఆ కుమారస్వామి; అట్లు+అ+కాక= అట్లే జరుగుతుంది గాక; నీవు= (ఓ స్వాహాదేవీ); మత్+సమీపంబునన్+ఉండి= నా దగ్గరే ఉండి; ఏనును= నేనును; నీ కోడలున్= నీ కుమారుడి భార్యయు; కొనియాడన్= ప్రశంసించి సేవ చేస్తూ ఉండగా; ప్రియంబునన్+ఉండుము+అనియెన్= ప్రీతితో ఉండుమని వచించాడు; అప్పుడు= ఆ సమయంలో; కుమార మాతృకలు= కుమార మాతృకలు అనేవారు; హవిషయున్, కాళియున్, కౌశికయున్, ఉద్ధతయున్, శారికయున్, ఆర్యయున్, వైధాత్రియున్+అనువారలు= హవిష, కాళి, కౌశిక, ఉద్ధత, శారిక, ఆర్య, వైధాత్రి అనేవారు; ఏడ్వురున్= ఏడుగురును; కుమారు ముందటన్= కుమారస్వామి ఎదుట; నిలిచి= నిలబడి; ఇట్లు+అనిరి= ఈ విధంగా పలికారు.

తాత్పర్యం: ఆ దినంనుండి కృత్తికలు ఆర్వురు నక్షత్రకూటమిగా ఏర్పడి ఆకసంలో వెలుగొందారు. కృత్తిక అగ్నిని అధిదేవతగా కలిగినట్టిదిగా సుప్రసిద్ధమైనది. తదుపరి స్వాహాదేవి అరుగుదెంచి, కుమారస్వామిని చూచి ఇట్లా పలికింది: 'కుమారా! నీవు నా కొడుకువు. నేను ఎల్లప్పుడును నీ దగ్గరే ఉండవలె నని కోరుకొంటున్నాను.' ఆమె మాట విని కుమారస్వామి ఇట్లా బదులు పలికాడు. 'అమ్మా! సంతోషం. నీవు ఎల్లప్పుడూ నా దగ్గరే ఉండి నీ కుమారుడనైన నేనున్నూ, నా భార్య అయిన నీ కోడలున్నూ చేసే సపర్యలచేత సంప్రీతిని చెందుము'. అంతట కుమార మాతృకలు ఏడుగురు- హవిష, కాళి, కౌశిక, ఉద్ధత, శారిక, ఆర్య, వైధాత్రి అనేవారు కుమారస్వామివద్దకు వచ్చి ఈ విధంగా పలికారు.

విశేషం: (1) కుమారస్వామి మాతృగర్భంనుండి పుట్టినవాడు కాడు. మహాభారతంలో ద్రోణుడు గూడ 'కలశజుడు'. లోకోత్తర శక్తియుక్తులతో మాతృగర్భంలో కాక శోధననాళికలలో అప్రాకృత సంతానం ఉద్భవింప చేయటానికి ఆధునిక జీవశాస్త్రజ్ఞులు కృషి సలుపుతున్నారు. భవిష్యత్కాలంలో ఇట్టికృషి ఫలించే సూచనలు కన్పిస్తున్నవి. ఇట్టి కృషి సఫలీకృతమైన గాథ- మహాభారతంలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పేర్కొనబడినట్టిది - కుమారస్వామి జనన ఘట్టం. (2) కుమారస్వామి - మాతృగర్భజుడు కాకపోయినప్పటికి ఆతడిని కథాక్రమంలో పుత్రుడిగా సంభావించిన వారు- పార్వతీ పరమేశ్వరులు, అగ్నిదేవుడు స్వాహాదేవి, కృత్తికలు. వారితోపాటు ఆనుషంగికంగా కుమారుడికొరకు వచ్చిన ఉపమాతలు కుమార మాతృకలు ఏడుగురు! వీరు బాలారిష్ట చిహ్నికలు. అసలు తల్లులకంటె, బాలబాలికలను సాకవలసింది వీరే కదా! కాని, ఈ కుమారమాతృకల గాథ మూలసంస్కృతమహాభారతంలో పలుప్రతులలో కానబడటం లేదు. అందుచేత ఈ గాథ ప్రక్షిప్తమని కొందరు విమర్శకులు భావిస్తున్నారు.

ఉ. 'మమ్ము జగత్త్రయంబునకు మాతలఁగా నొనరింపు మిప్డు; ము
న్నిమ్ముల నొప్పు మాతృకల కెక్కుడు గావుత మేము; సర్వలో
కమ్ములఁ దొంటి మాతృకలఁ గైకొనకుండుటయుం బ్రియంబుతో
మ మ్మనిశంబుఁ గొల్చుటయు మాకు వరంబుగ నిమ్ము షణ్ముఖా!' 246

ప్రతిపదార్థం: షట్+ముఖా!= ఆరు మోములుగల దేవరా!; కుమారస్వామీ!; మమ్మున్= (కుమార మాతృకలను); ఇప్డు= ఇప్పుడు; జగత్+త్రయంబునకున్= మూడు లోకాలకు; మాతలన్+కాన్= తల్లులు అయ్యేటట్లుగా; ఒనరింపుము= చేయుము; ఏము= మేము; మున్ను= పూర్వం, ఇంతకుముందు; ఇమ్ములన్+ఒప్పు= ప్రీతితో ఒప్పారెడు; మాతృకలకున్= తల్లులకు; ఎక్కుడు+కావుతన్= హెచ్చు అయినవారలం అగుదుముగాక; సర్వలోకమ్ములన్= అన్ని జగత్తులలోనూ; తొంటి, మాతృకలన్= పూర్వపు మాతృకా దేవతలైన బ్రాహ్మి, మాహేశ్వరి మున్నగు ఏడుగురిని; కైకొనక+ఉండుటయున్= స్వీకరించక ఉండటమున్నూ; మమ్మున్= ఇప్పటి సప్తమాతృకలమైన మమ్మల్ని; అనిశంబున్= ఎల్లప్పుడును; ప్రియంబుతోన్= ప్రేమతో; కొల్చుటయున్= ఆరాధించటమున్నూ; మాకున్= (సప్త మాతృకలమైన మాకు); వరంబుగన్= ఈడేరెడి కోరికగా; ఇమ్ము= ఒసంగుము.

తాత్పర్యం: ఆరుమొగాలదేవర వైన ఓ కుమారస్వామీ! సప్తమాతృకలమైన మమ్ము మూడులోకాలకు మాతృకా దేవతలనుగా నియమించుము. సర్వలోకాలలోనూ మునుపటి మాతృకలు (బ్రాహ్మి, మాహేశ్వరి మున్నగువారు) దేవతలుగా పరిగణించబడకుందురుగాక! అందరు మమ్ము త్రిజగన్మాతలుగా ఆరాధిస్తారు గాక! మాకు ఈ కోరిక ఈడేరేటట్లుగా దయతో వరాన్ని అనుగ్రహించుము.

కుమారస్వామి సప్తమాతృకల బాలగ్రహంబులఁ జేయుట (సం. 3-219-18)

ఆ. అనిన నగుచు నాతఁ 'డట్లేల వారల। పేర్మి మాన్పఁ దగవె? ప్రీతి నొండు
వరము వేఁడుఁ డిత్తు వదలక' యనుడు నా। స్కందమాత లనిరి గారవమున. 247

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; నగుచున్= నవ్వుతూ; ఆతఁడు= (ఆ కుమారస్వామి); అట్లు+ఏల= ఆ విధంగా ఎందుకు; వారల, పేర్మి= వారల యొక్క ఆధిక్యం; మాన్పన్= పోగొట్టటం; తగవె?= ధర్మ మౌతుందా?; ప్రీతిన్= సంతుష్టితో; ఒండు= ఇంకొక, వరము= ఈడేరే కోరిక; వేఁడుఁడు= ప్రార్థించుడు; వదలక+ఇత్తున్= తప్పక ఇస్తాను; అనుడున్= అని చెప్పగా; ఆ స్కంద మాతలు= ఆ కుమారస్వామి తల్లులు; గారవమునన్= గొప్పతనంతో; అనిరి= పలికారు.

తాత్పర్యం: ఆ మాటలకు కుమారస్వామి నవ్వాడు. 'మునుపటి మాతృకల పేరిమి మాన్పటానికి మీ రెందుకు కోరుకొంటున్నారు? మీకు మేలు కలిగేటట్లుగా వేరొక వరాన్ని కోరుకొనండి. తప్పక ఇస్తాను' అని కుమారస్వామి పలుకగా, స్కందమాతలు ఇట్లా సమాధానం చెప్పారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **'అగుఁగాక యట్ల; యే మీ । జగములఁ గల శిశువులకు నజస్రముఁ బీడల్**
దగ నొనరించుచు నీ కృప । నెగడెద; మివ్వరము మాకు నీ వొసఁగఁ దగున్.' 248

ప్రతిపదార్థం: అగున్+కాక+అట్లు+అ= ఆ విధంగానే జరుగుగాక- అనగా మేము కోరిన వరాన్నే ఒసంగుము; ఏము= మేము; ఈ జగములన్+కల= ఈ లోకాలలో ఉన్నట్టి; శిశువులకున్= బిడ్డలకు; అజస్రమున్= ఎల్లప్పుడును; పీడల్= వ్యథలు; తగన్= అనువుగా; ఒనరించుచున్= చేస్తూ; నీకృపన్= నీ దయచేత; నెగడెదము= వర్ధిల్లెదం; ఈ+వరము= ఈ కోరిక; మాకున్= మాకు (సప్త మాతృకలమైన మాకు); నీవు; ఒసఁగన్+తగున్= ఇవ్వదగును.

తాత్పర్యం: 'మేము కోరిన వరాన్నిమాత్రమే మాకు అనుగ్రహించుము. మేము ఈ లోకాలలోని పసిబిడ్డలకు ఎల్లప్పుడూ బాధలను కలిగిస్తాం. నీ దయవలన వర్ధిల్లుతాం. ఈ వరాన్ని నీవు మాకు ఇవ్వాలి.'

వ. **అనినం గార్తికేయుం డి ట్లనియె.** 249

తాత్పర్యం: అనగా కుమారస్వామి ఇట్లా అన్నాడు.

క. **'అక్కట! కీడు దలంచితి; । రిక్కార్యము దగవె? యైన నిచ్చితి; మీకున్**
మ్రొక్కినఁ గొల్చిన వేఁడిన । నక్కటికముతోడఁ గావుఁడమ్మ శిశువులన్. 250

ప్రతిపదార్థం: అక్కట= అయ్యో; కీడున్+తలంచితిరి= హానిని చేయటానికి ఆలోచించారు; ఈ కార్యము= ఈ పని; తగవె?= న్యాయమైనదా? (న్యాయమైనది కాదు); ఐనన్= అయినప్పటికిని - న్యాయం కానిది అయినప్పటికిని; ఇచ్చితిన్= ఒసంగితిని (అనగా మీరు కోరిన వరం న్యాయం కానిది అయినప్పటికి అనుగ్రహించాను); మీకున్= సప్త మాతృకలయిన మీకు; మ్రొక్కినన్= నమస్కరించినా; కొల్చినన్= ఆరాధించినా; వేఁడినన్= ప్రార్థించినా; అక్కటికముతోడన్= దయతో; శిశువులన్= పసి బిడ్డలను, కావుఁడు+అమ్మ= కాపాడండి అమ్మలారా!

తాత్పర్యం: అని సప్తమాతృకలు చెప్పగా కృత్తికలకు జన్మించిన కుమారస్వామి ఇట్లా బదులు పలికాడు. 'అయ్యో!, మీరు పసిబిడ్డలకు హాని చేయటానికి తలపోశారు. ఇది న్యాయమైన ఆలోచన కాదు కదా. మీరు ఈ కోరిక మాత్రమే ఈడేరాలని కోరారు. కాబట్టి మీకు ఈ వరాన్ని అనుగ్రహిస్తున్నాను. కాని, మిమ్ములను ఆరాధిస్తే, మీకు నమస్కరిస్తే, మిమ్మల్ని ప్రార్థిస్తే మాత్రం మీరు పసిబిడ్డలకు కీడు చేయక ఉంటారుగాక! దయ చూపెదరు గాక! అని అమ్మలారా! మిమ్ము అర్థిస్తున్నాను.

క. **పాయక పదియాఱేఁడుల । ప్రాయమునందాఁక నరుల బాధింపుఁడు మీ**
రాయత మదంశజనితు న । జేయు నొకని మీకు రక్షఁ జేయం బనుతున్. 251

ప్రతిపదార్థం: మీరు= మీరు (ఓ సప్తమాతృకలారా); పాయక= వదలి పెట్టక; పది+ఆఱు+ఏఁడుల, ప్రాయము నందాఁకన్= పది ఆరేండ్ల వయసు నిండే వరకు; నరులన్= మనుషులను; బాధింపుఁడు= వ్యథల పాలు చేయండి; ఆయత, మత్+అంశ, జనితున్= విస్తారమైన నా అంశలో పుట్టినవాడిని; అజేయున్= గెలవటానికి అలవికాని వాడిని; ఒకనిన్= ఒక పురుషుడిని; మీకున్= (సప్త మాతృకలైన మీకు); రక్షన్+చేయన్+పనుతున్= కాపాడటానికై నియమించగలను.

తాత్పర్యం: ఓ సప్త మాతృకలారా! పదునారేండ్ల వయసు నిండేవరకు మీరు, బాలబాలికలను ఆవహించి బాధించండి. నా గొప్ప అంశతో జన్మించినట్టి ఒక మహాపురుషుడిని మిమ్ము కాపాడటానికై నియమిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి యమ్మహాసేనుండు నిజదేహంబునం గాంచనవర్ణుండైన పురుషు నొక్కరు నుత్పాదించిన వాఁడునుం, బుట్టి నప్పుడ యాఁకలి గదిరి తిరిగి నేలంబడి మూర్ఛితుం డైనం, గుమారుండు వానికిఁ జైతన్యం బొసంగె; నతండును స్కందాపస్మారం బను పేరి గ్రహం బై మాతృకాగణరక్షకుం డయ్యెఁ; మఱియు శకుని మాత యైన వినతయు, దైత్యమాత యైన దితియు, గోమాత యైన సురభియు, శునకమాత యైన సరమయు, వృక్షమాత యైన కరంజయు, సర్పమాత యైన కద్రువయుఁ, గుమారుదాది యైన లోహితాస్యయు మాతృగణ సమన్వితలై గర్భపీడనంబును, శిశుపీడనంబునుం జేయుచు, మనుష్యులవలన బలిమంత్రోపహారదాన తర్పణంబులఁదృప్తిం బొంది బాలురకు నాయురారోగ్యసుఖంబుల నొసంగుదురు; షోడశ వర్షంబుల మీఁదఁ గొన్నిగ్రహంబులు గలవు చెప్పెద; వినుము. 252

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఆ+మహాసేనుండు= ఆ కుమారస్వామి; నిజ, దేహంబునన్= తన శరీరం నుండి; కాంచన వర్ణుండు+ఐన= బంగారు మిసిమిరంగు కలవాడైన; పురుషున్+ఒక్కరున్= ఒక మగవాడిని; ఉత్పాదించినన్= పుట్టించగా; వాఁడును= ఆ పురుషుడును; పుట్టినప్పుడు+అ= పుట్టిన వెనువెంటనే; ఆఁకలి గదిరి= క్షుద్బాధచేత పీడించబడి; తిరిగి= మరల; నేలన్+పడి= భూమి మీద పడిపోయి; మూర్ఛితుండు+ఐనన్= స్పృహదప్పి పడిపోయిన వాడు కాగా; కుమారుండు= కుమారస్వామి; వానికిన్= ఆ మూర్ఛితుడికి; చైతన్యంబు+ఒసంగెన్= కదలిక ప్రసాదించాడు; అతండును= ఆ మూర్ఛితు డైన పురుషుడును; స్కంద+అపస్మారంబు+అను+పేరి= కుమారస్వామికి సంబంధించిన మూర్ఛ అనే పేరు కలిగినట్టి; గ్రహంబు= పట్టి పీడించే పిశాచం; ఐ= అయి; మాతృకా, గణ, రక్షకుండు+అయ్యెన్= మాతృకల గుంపును కాపాడే వాడు అయ్యాడు; మఱియున్= ఇంకను; శకునిమాత+ఐన= పక్షుల తల్లి అయిన; వినతయున్= వినత యనే ఆమెయున్నూ; దైత్య, మాత= రాక్షసులతల్లి; ఐన= అయిన; దితియున్= దితియున్నూ; గోమాత+ఐన= గోవులకు తల్లి అయిన; సురభియున్= సురభి అనే పేరు కలదియు; శునక, మాత+ఐన= కుక్కలకు తల్లి అయిన; సరమయున్= సరమ అనే పేరు కలదియున్నూ; వృక్ష, మాత+ఐన= చెట్లకు తల్లి అయిన; కరంజయున్= కరంజయున్నూ (కానుగుచెట్టు); సర్ప, మాత+ఐన= పాములకు తల్లి అయిన; కద్రువయున్= కద్రువయున్నూ; కుమారు దాది+ఐన= కుమారస్వామికి మాతృస్థానీయ అయి పెంచిన దాది అయిన; లోహితాస్యయున్= లోహితాస్య అనే పేరు కలిగిన ఆమెయున్నూ; మాతృ, గణ, సమన్వితలు+ఐ= మాతృకలతో కూడిన వారై; గర్భపీడనంబును= గర్భాలకు చేటుచేయుటయున్నూ; శిశు, పీడనంబునున్= పసిపాపలకు బాధ గలిగించటమున్నూ; చేయుచున్= సల్పుతూ; మనుష్యుల వలనన్= నరుల వలన; బలి, మంత్ర, ఉపహార, దానతర్పణంబులన్= నైవేద్యాలు, జపాలు, కానుకలు, దానాలు, తృప్తి చెందించటానికై ఒసగబడే నీళ్లు-అనువాటివలన; తృప్తిన్+పొంది= సంతుష్టి చెంది; బాలురకున్= పసిబిడ్డలకు; ఆయున్+ఆరోగ్య, సుఖంబులన్= చాలాకాలం బ్రతకటం, జబ్బులు లేకుండ ఉండటం, తదితర సౌఖ్యాలను; ఒసంగుదురు= ఇస్తారు; షోడశ వర్షంబుల మీఁదన్= పదునారేండ్ల వయసు నిండిన పిదప; కొన్ని, గ్రహంబులు= పట్టి పీడించే పిశాచాలు కొన్ని; కలవు= ఉన్నాయి; చెప్పెదన్= వివరించి పలుకుతాను; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: కుమారస్వామి ఆ విధంగా చెప్పి, తన శరీరంనుండి బంగారుచాయ గల ఒక మగవాడిని ఉద్భవింపజేశాడు. ఆ పసిడిమిసిమి మగవాడు పుట్టిన వెంటనే ఆకలిబాధచేత తలతిరిగి నేలమీద పడిపోయాడు. ఆ విధంగా మూర్ఛపోయినట్టి ఆతడికి కుమారస్వామి చైతన్యం ప్రసాదించాడు. అతడు స్కందాపస్మారం అనే పేరు కలిగిన పిశాచంగా రూపొంది మాతృకలను కాపాడే అంగరక్షకు డయ్యాడు. ఇంకను, శకునితల్లి వినత, రాక్షసులతల్లి దితి, ఆవులతల్లి సురభి, కుక్కలతల్లి సరమ, చెట్లతల్లి కరంజ, పాములతల్లి కద్రువ, కుమారస్వామి దాది లోహితాస్య, మాతృకలతో కలిసి గర్భాలకు పీడనూ, శిశువులకు బాధలు కలిగి ఉంటారు. కాని, మనుజులు వారిని శాంతింప

చేయటానికై జపాలు, బలులు, కానుకలు, ముడుపులు, తర్పణాలు చెల్లించినప్పుడు తృప్తి చెంది పసిపాపలకు ఆయువు, ఆరోగ్యం, సుఖం కలిగిస్తుంటారు. ఇక పదునారేండ్ల వయసు నిండిన పిదప కూడ మనుష్యులను పట్టి పీడించే పిశాచాలు కొన్ని ఉన్నాయి. చెప్పుతాను సావధానుడ వై ఆలకింపుము.

సీ. నిద్రించుతఱి నొండె నెఱయ మేల్కని యున్న । తఱి నొండె సురసముదయముఁ గాంచి
బ్రమసి పల్వలుకులు పలుకు మానవుఁ జోఁకు । నదియ దేవగ్రహ మని యెఱుంగు
నది శయానుం డయ్యు నాసీనుఁ డయ్యుఁ బి । తృశ్రేణిఁ గని యున్మదించె నేని
నది పితృ గ్రహము భ్రాంతాత్ముఁ డై నరుఁడు గం । ధర్వులఁ గనిన గాంధర్వ మనియుఁ

తే. బరఁగు గ్రహము చోఁ కది కాలపర్యయమునఁ । గదిరి భ్రమియించె నేని యక్షగ్రహంబు
వాత పైత్యాది వికృతుల వలన బుద్ధి । దప్పుటయు నొక్క గ్రహవైకృతంబ యండ్రు. 253

ప్రతిపదార్థం: నిద్రించు తఱిన్+ఒండెన్= నిదుర పోయే సమయంలో కాని; నెఱయన్, మేల్, కని+ఉన్న, తఱిన్+ఒండెన్= పూర్తిగా మేల్కొని ఉన్న సమయంలో కాని; సుర సముదయమున్+కాంచి= వేల్పుల గుంపును చూచి; బ్రమసి= భ్రాంతిపొంది; పల్+పలుకులు= పెక్కు మాటలు; పలుకు= మాటాడు; మానవున్= మనుజుడిని; చోఁకున్+అది+అ= పట్టు నట్టిదియే; దేవ, గ్రహము= వేల్పులకు సంబంధించిన పిశాచం; అని+ఎఱుంగునది= తెలిసికొనునది; శయానుండు+అయ్యున్= పండుకొని ఉన్నట్టి వాడైనను; ఆసీనుఁడు+అయ్యున్= కూరుచున్న వాడయినను; పితృ శ్రేణిన్+కని= ప్రేతలను (చనిపోయిన వారి రూపాలను) చూచి; ఉత్+మదించెన్+ఏని= వెఱ్ఱితనపు లక్షణం ఆవహించుకొంటే; అది= అటువంటిది; పితృ గ్రహము= పితరులకు సంబంధించినట్టి పిశాచం; భ్రాంత+ఆత్ముఁడు+ఐ= బ్రమసినట్టి వాడై; నరుఁడు= మనుష్యుడు; గంధర్వులన్+కనిన= పాటలు పాడే వేల్పులను చూస్తే; గాంధర్వము+అనియున్= (అది) గంధర్వులకు చెందిన గ్రహం అనిన్నీ; పరఁగు= ఒప్పు; గ్రహము, చోఁకు= పిశాచం యొక్క పీడ (గ్రహం ఆవహించటం); అది= అది; కాలపర్యయమునన్= కాలం యొక్క మార్పు వలన; కదిరి= అతిశయించి; భ్రమియించెన్+ఏని= భ్రాంతిని చెందినట్లయితే; యక్షగ్రహంబు= యక్షులకు సంబంధించిన పిశాచం; వాత, పైత్య+ఆది, వికృతుల వలనన్= వాతం, పైత్యం మున్నగు వికారాలవలన; బుద్ధి= మనస్సు; తప్పుటయున్= చలించటం; ఒక్క, గ్రహ, వైకృతంబు+అ= ఏదో ఒక పిశాచం వలన దాపురించిన పీడ; అండ్రు= అని చెప్పుతారు.

తాత్పర్యం: నిద్రలో మైమరచి ఉన్నపుడు కాని, మేల్కొని ఉన్నపుడు కాని వేల్పుల గుంపులను చూస్తే అది దేవతాపిశాచం పట్టి పీడించటం అని తెలియాలి. అప్పుడు నరుడు వివశుడై ప్రేలాపన చేస్తాడు. కూరుచున్నప్పుడు కాని పండుకొనినపుడు కాని పితృదేవతలను కాంచి మనస్సు చలిస్తే అది పితృగ్రహబాధ అని తెలియాలి. నరుడు, భ్రాంతిలో మునిగి వేల్పులు పాడే పాటలను విని కలత చెందితే అది గంధర్వగ్రహంవలన కలిగిన పీడ అని తెలియాలి. కాలం తెచ్చే మార్పులవలన కలత చెంది భ్రమిస్తే అది యక్షగ్రహ మని గుర్తించాలి. వాత పైత్య ప్రకోపంచేత వెర్రి తలకెక్కితే అదికూడ ఏదో ఒకగ్రహంవలన సంభవించిన పీడ అని తెలియాలి.

విశేషం: ఈ పద్యంలో చెప్పబడిన వన్నీ ప్రాయికంగా మానసిక రోగాలు. పూర్వకాలంలో మానసికరోగాలకు కారణాలు గ్రహ బాధలుగా భావిస్తుండేవారు. ఈ పద్యంలో 'అండ్రు' (అని చెప్పుతారు) అనే ప్రయోగం గమనించదగింది. లోకంలో ప్రచారంలో ఉన్న భావం ఇందు పొందుపరచబడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విను డెబ్బది యేఁడుల దాఁ । కను మానవులకు గ్రహోపఘాతంబులు గ
ల్గు; ననంతరంబ గ్రహముల । పని వలవదు; ముదిమి యెల్ల పనులకుఁ జాలున్. 254

ప్రతిపదార్థం: విను= ఆలకింపుము; డెబ్బది+ఏఁడుల, దాఁకను= డెబ్బది సంవత్సరాల వయస్సు వరకు; మానవులకున్= మనుజులకు; గ్రహ+ఉపఘాతంబులు= పట్టి పీడించే పిశాచాలవలన ఏర్పడే జాడ్యాలు; కల్గున్= ఏర్పడతాయి; అనంతరంబు+అ= పిమ్మట; గ్రహముల, పని= పిశాచాలు చేసే కార్యం; వలవదు= అవసరం లేదు; ముదిమి= ముసలితనం; ఎల్ల పనులకున్= అన్నిగ్రహాల ప్రభావాలకూ (జాడ్యములకు); చాలున్= సరిపోతుంది.

తాత్పర్యం: సావధానంగా వినుము. మానవులకు డెబ్బది సంవత్సరాల వయస్సు వచ్చే వరకును గ్రహాలవలన సంక్రమించే జాడ్యాలు ఏవేవో పీడిస్తాయి. ఆ పైన గ్రహాలు పీడించే అవసరం లేదు. ఎందుకంటే ముసలితనమే అన్ని జాడ్యాలను సంక్రమింపచేస్తుంది కదా!

క. నియతి గలిగి యింద్రియముల । జయించి శుచులైన శాంతిసంపన్నులకున్
భయ మొనరింపఁగ లే వ । వ్యయ పుణ్యా! గ్రహము లే యవస్థల యందున్. 255

ప్రతిపదార్థం: అవ్యయ పుణ్యా!= తరుగని సుకృతం కలవాడా, ఓ ధర్మరాజా!; నియతి+కలిగి= నిష్ఠతో కూడిన నియమాలు పాటించటం కలిగి ఉండి; ఇంద్రియములన్ జయించి= ఇంద్రియాలను గెలిచి; శుచులు+ఐన= మాలిన్యం లేని పరిశుద్ధులు అయిన; శాంతి సంపన్నులకున్= శాంతియే సంపదగా కల వారలకు; గ్రహములు= పట్టి పీడించే పిశాచాలు; ఏ+అవస్థల యందున్= ఎట్టి పరిస్థితులలోను; భయము= భీతి; ఒనరింపఁగన్‌లేవు+అ= కలుగజేయజాలవు సుమా.

తాత్పర్యం: గొప్పపుణ్యాన్ని ఆర్జించిన ఓ ధర్మరాజా! ఇందులో ఒక కిటుకు ఉన్నది. ఈ గ్రహబాధలు పిశాచ పీడలు దుర్బలమనస్కులకు హాని చేయగలవే కాని, నీతినియమ నిష్ఠలు కలిగి ఇంద్రియాలను గెలువ గలిగిన వారికి ఎట్టిభీతిని కలిగించ నేరవు.

విశేషం: (1) కడచిన పద్యాలలో గ్రహపీడలను గూర్చి చెప్పబడింది. ఈ పద్యం చెప్పిన తీరునుబట్టి తెలిసే దేమంటే 'మనస్సు నిబ్బరంగా లేని వారలకు అన్ని పిశాచపీడలు వర్తిస్తాయి. మనోనిగ్రహం కలవారికి ఎట్టిభయాలు లేవు. (2) గ్రహపీడలు మానసిక రుగ్మతలు. మనస్సును నిగ్రహించినవారికి ఇంద్రియవిజేతలకు ఎట్టి గ్రహపీడలు ఉండవు. పతంజలి యోగనిర్వచనం ఈ సందర్భంలో స్మరించతగింది. "యోగః చిత్తవృత్తినిరోధః".

వ. మఱియు నొక్కటి సెప్పెద. 256

తాత్పర్యం: మరి ఇంకొకటి వినిపిస్తాను.

ఆ. ఆదిదేవుఁడగు మహాదేవుమీఁద నె । వ్వాని మనసు భక్తివైభవమున
నుల్లసిల్లు నతని నెల్లకార్యముల డ । గ్గఱదు సూవె గ్రహవికారవితతి.' 257

ప్రతిపదార్థం: ఆది, దేవుఁడు+అగు= మొట్టమొదటి వేలుపు అయిన; మహాదేవు మీఁదన్= పరమశివుడిమీద; ఎవ్వాని మనసు= ఎవడి బుద్ధి; భక్తి, వైభవమునన్= ఆరాధన యొక్క మహత్త్వంతో; ఉల్లసిల్లున్= విలసిల్లుతుందో; అతనిన్= అట్టివాడిని; ఎల్ల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కార్యములన్= అన్ని పనులలో; గ్రహ, వికార, వితతి= పట్టి పీడించే పిశాచాల పీడల గుంపు; డగ్గఱదు+చూవె= సమీపించదు సుమా.

తాత్పర్యం: ఇంకొక విశేషాన్ని వివరిస్తాను సావధానంగా ఆలకింపుము. గ్రహపీడలకు ఇంద్రియనిగ్రహం మాత్రమే విరుగుడు అని తలపోయకుము. పరమశివుడియందు గాఢమైన భక్తి విలసిల్లితే చాలు. శివభక్తి అన్నిరకాల పిశాచ పీడలకు సులువైన విరుగుడు సుమా!'

వ. అని చెప్పి మార్కండేయుం డిట్లనియె; 'నట్లు గుహుండు గ్రహంబుల నియోగించు నెడ నగ్నివల్లభ యల్లన నతనిం జేర నరిగి యి ట్లనియె; 258

ప్రతిపదార్థం: అని, చెప్పి= అంటూ పలికి; మార్కండేయుండున్; ఇట్లు+అనియెన్; అట్లు= ఆ రీతిగా; గుహుండు= కుమార స్వామి; గ్రహంబులన్= గ్రహాలను; నియోగించు+ఎడన్= ఏర్పరచే సమయంలో; అగ్ని, వల్లభ= అగ్నిహోత్రుడి భార్య; స్వాహాదేవి; అల్లనన్= మెల్లమెల్లగా; అతనిన్= (కుమారస్వామిని); చేరన్+అరిగి= సమీపించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఆ విధంగా మార్కండేయమహర్షి ధర్మరాజుతో చెప్పి, మరియు ఈ విధంగా అన్నాడు: 'ఆ రీతిగా కుమారస్వామి గ్రహాలను నియమించే సమయంలో అగ్నిదేవుడిభార్య అయిన స్వాహాదేవి కుమారస్వామిని సమీపించి ఈ విధంగా పలికింది.

తే. 'పుత్త్ర! విను మేను దక్షునిపుత్త్రి; నన్నుఁ । బావకుని కిచ్చె మా తండ్రి బాల్యముననుఁ;
నన్ను నతఁ డొల్లఁ డెంతయు; నాకుఁ బతికి । నెపుడు నెడ లేని పొందుగా నీ వొనర్పు.' 259

ప్రతిపదార్థం: పుత్త్ర!= ఓ కొడుకా! (కుమారస్వామీ!); వినుము= ఆలకింపుము; ఏను= నేను; దక్షుని, పుత్త్రిన్= దక్షుని (ప్రజాపతి) కూతురిని; నన్నున్= నన్ను; మా తండ్రి= (మా తండ్రి అయిన దక్షుడు); బాల్యముననుు= చిన్నతనంలోనే; పావకునికిన్= అగ్నిహోత్రుడికి; ఇచ్చెన్= (పెండ్లిచేశాడు); నన్నున్= నన్ను; అతఁడు= (ఆ అగ్నిహోత్రుడు); ఎంతయున్= ఏ మాత్రంకూడా; ఒల్లఁడు= ఇష్టపడడు; నాకున్= నాకును; పతికిన్= నా భర్తకును; ఎపుడున్= ఎల్లప్పుడూ; ఎడలేని, పొందుగాన్= విడిపోనట్టి అన్యోన్య బంధంతో కూడిన పొత్తుగా; నీవు+ఒనర్పుము= నీవు చేయునది.

తాత్పర్యం: 'పుత్త్రుడ వైన ఓ కుమారస్వామీ!, నేను దక్షప్రజాపతి కూతురిని. మా తండ్రి నన్ను నా చిన్నతనంలో అగ్నిహోత్రుడికి ఇచ్చి పెండ్లి చేశాడు. కాని, అగ్నిహోత్రుడికి నాయందు ఏ మాత్రం కూడా అనురాగం లేదు. నాకు నా భర్తతో ఎడబాటు ఇష్టం లేదు. కాబట్టి నీవు నాకూ నా భర్తకూ ఎప్పుడూ ఎడబాటు లేని అవినాభావ బంధాన్ని కూర్చవలెనని నా కోరిక.

వ. అనిన నగ్నిభవుండు 'మహాద్విజులు వహ్నియందు హవ్యంబులు స్వాహాకార కలితంబు లైన మంత్రంబుల నొసంగువారు; దానంజేసి నీకుఁ బ్రియునితోడి నిత్యసహవాసంబు సిద్ధించు' ననియె; నప్పుడు సకల మునిగణ సమేతుండై చనుదెంచి కమలాసనుండు మహాసేను నభినందించి, యంతకు మున్న సన్నిహితుండై యున్న మహాదేవు దెసఁ జూచి, యతని కి ట్లనియె. 260

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; అగ్నిభవుండు= అగ్నిహోత్రునికి పుట్టిన కుమారస్వామి; మహాద్విజులు= బ్రాహ్మణోత్తములు; వహ్నియందున్= అగ్నిలో; హవ్యంబులు= హోమ ద్రవ్యాలు; స్వాహా, కార కలితంబులు+ఐన= స్వాహా అనే శబ్దంతో కూడిన; మంత్రంబులన్= దివ్యాక్షరాల ఉచ్చారణతో; ఒసంగువారు= వేల్చగలరు; దానన్+చేసి= అందుచేత; నీకున్= నీకు (ఓ స్వాహాదేవీ నీకు); ప్రియుని తోడి= భర్తతోడి; నిత్య, సహవాసంబు= ఎల్లప్పుడును కలిసి మెలసి ఉండటం; సిద్ధించున్= లభిస్తుంది; అనియెన్= అని చెప్పాడు; అప్పుడు= ఆ సమయంలో; సకల, ముని, గణ, సమేతుండు+ఐ= పెక్కు ఋషుల సముదాయంతో కూడిన వాడై; కమల+ఆసనుండు= పద్మం ఆసనంగా కల బ్రహ్మదేవుడు; చనుదెంచి= వచ్చి; మహాసేనున్= కుమారస్వామిని; అభినందించి= మెచ్చుకొని; అంతకుమున్ను+అ= అంతకు పూర్వమే; సన్నిహితుండు+ఐ+ఉన్న= సమీపానికి చేరి ఉన్న; మహా దేవుదెసన్= పరమశివుడు ఉన్న దిక్కు చూచి; అతనికిన్= ఆ పరమశివుడికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చెప్పగా, కుమారస్వామి ఇట్లా పలికాడు: 'అమ్మా! స్వాహాదేవీ! యజ్ఞయాగాదులు చేసేటప్పుడు బ్రాహ్మణోత్తములు హవ్యాలను అగ్నిలో వేల్చేటపుడు స్వాహా శబ్దోత్తర పదవిశిష్టంగా మంత్రాలను ఉచ్చరిస్తారు గాక! ఆ విధంగా నీకును నీ భర్త అయిన అగ్నిహోత్రుడికిని అవినాభావ సంబంధం ఏర్పడగలదు.' ఆ సమయానికి అక్కడికి ఋషులతో కలిసి బ్రహ్మదేవుడు విచ్చేసి, కుమారస్వామిని అభినందించాడు. అంతకు ముందే అక్కడ ప్రత్యక్షమై నిలిచిన పరమశివుడిని గాంచి, బ్రహ్మదేవుడు ఈ విధంగా కుమారస్వామితో చెప్పాడు.

ఆ. 'అనఘ! యితఁడె త్రిపురహరుఁడు త్రిలోచనుం; డిదె త్రిలోక మాత హిమనగేంద్ర
తనయ; వీరు నీకుఁ దల్లియుఁ దండ్రియుఁ। జువ్వె! వీరిఁ గొల్వు సుచిరభక్తి. 261

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడ వైనవాడా!, ఓ కుమారస్వామీ! ఇతఁడు+ఎ= ఈయనయే సుమా; త్రిపుర, హరుఁడు= మూడు (రాక్షస) నగరాలను నాశనం చేసినవాడు; త్రి, లోచనుండు= మూడు కన్నులు కలవాడు; ఇది+ఎ= ఈ మెయే సుమా; త్రిలోక, మాత= మూడు జగాలకు తల్లి; హిమ, నగ+ఇంద్ర, తనయ= మంచుకొండల ఱేని యొక్క కూతురు, పార్వతీ దేవి; వీరు= ఈ పార్వతీపరమేశ్వరులు; నీకున్= కుమారస్వామివైన నీకు; తల్లియున్+తండ్రియున్= మాతాపితలు; చువ్వె= సుమా; సుచిర భక్తిన్= చాలాకాలం వరకు ఉండే (స్థిరమగు) పూజ్యభావంతో; వీరిన్= పార్వతీ పరమేశ్వరులను; కొల్వు(ము)= అర్చించుము.

తాత్పర్యం: 'పుణ్యాత్ముడ వైన ఓ కుమారస్వామీ! ఈ మహానుభావుడే పరమశివుడు. మూడు కన్నుల దేవర. మూడు పట్టణాలను నాశనం చేసిన పరాక్రమశాలి. ఈమెయే హిమాలయ పర్వతరాజపుత్రి పార్వతీదేవి. ఈ పార్వతీపరమేశ్వరులే నీ తలిదండ్రులు సుమా. నీ తలిదండ్రులైన పార్వతీ పరమేశ్వరులను తరుగని భక్తితో ఆరాధించటం నీ పవిత్రకర్తవ్యం.

వ. అగ్నిదేవునియందును దదీయ భార్యయందును దారు నిజయోగబలంబునం జేసి యావేశించి, యా దంపతులు లోకహితార్థంబుగా నిన్నుం గని' రని చెప్పినఁ, బార్వతీ నందనుండు సానందహృదయుం డయి, సకలలోక గురువు లైన పార్వతీ పరమేశ్వరులం బూజించి, సంస్తుతించె; నంత నింద్రుండు కార్తికేయునకు నైరావణ భూషణం బైన ఘంటాద్వయంబు నొసంగిన, నం దొక్కటి కుమారుండు గైకొని యొక్కటి విశాఖున కిచ్చెం; బదంపడి. 262

ప్రతిపదార్థం: తారు= వారు =పార్వతీ పరమేశ్వరులు; నిజ యోగ బలంబునన్+చేసి= తమ యోగశక్తి యొక్క పటుత్వం వలన; అగ్నిదేవుని+అందును= అగ్నిహోత్రుడి అందున్నూ; తదీయ, భార్య+అందును= ఆతడి యొక్క పెండ్లము నందున్నూ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆవేశించి= ఆధ్యాత్మికంగా చొరబడి; ఆ దంపతులు= ఆ భార్యాభర్తలు; లోక, హిత+అర్థంబుగాన్= విశ్వ కల్యాణం కొరకై; నిన్నున్+కనిరి= నిన్ను (పుత్రుడిగా) కన్నారు; అని చెప్పినన్= అంటూ పలుకగా; పార్వతీ నందనుండు= పార్వతీదేవి కొడుకైన కుమారస్వామి; స+ఆనంద, హృదయుండు+అయి= ఆనందంతో కూడిన డెందం కలవాడై; సకల, లోక, గురువులు+ ఐన= సమస్త జగత్తులకు తలిదండ్రులు అయిన; పార్వతీ పరమ+ఈశ్వరులన్= పార్వతిని, పరమశివుడిని; పూజించి= అర్చించి; సంస్తుతించెన్= కొనియాడినాడు; అంతన్= అంతట; ఇంద్రుండు= వేలుపు దొర; కార్తికేయునకున్= కుమార స్వామికి; ఐరావణ భూషణంబు+ఐన= ఐరావతం అనే పేరుకల వెల్లయేనుగుకు అలంకారాలైన; ఘంటాద్వయంబున్= రెండు గంటలు; ఒసంగినన్= బహూకరించగా; అందున్+ఒక్కటి= ఆరెండు గంటలలో ఒక గంట; కుమారుండు= కుమారస్వామి; కైకొని= స్వీకరించి; ఒక్కటి= ఒక గంట; విశాఖునకున్; ఇచ్చెన్= బహూకరించాడు; పదంపడి= పిమ్మట.

తాత్పర్యం: అగ్నిహోత్రుడిలోనూ ఆతడి సతిలోనూ పార్వతీ పరమేశ్వరులు తమ యోగశక్తిపాటవంచొప్పున ఆవేశించి, నిన్ను పుత్రుడిగా కన్నారు. సమస్త జగత్తులకు తల్లిదండ్రు లైన పార్వతీపరమేశ్వరులు విశ్వకల్యాణం కొరకై నిన్ను పుత్రుడిగా పొందారు' అని బ్రహ్మదేవుడు కుమారస్వామితో చెప్పాడు. బ్రహ్మదేవుడి మాటలకు కుమారస్వామి డెందం ఉప్పొంగింది. అతడు ఆనందపరవశు డయ్యాడు. సర్వలోకాలకు మాతాపితలు అయిన పార్వతీపరమేశ్వరులను కుమారస్వామి పూజించి ప్రశంసించాడు. అంతట దేవేంద్రుడు తన వాహనమైన వెల్లయేనుగు ఐరావతానికి భూషణాలైన రెండు గంటలను కుమారస్వామికి బహూకరించాడు. కుమారస్వామి ఒక గంటను తాను స్వీకరించి, మరొక గంటను విశాఖుడికి సమర్పించాడు. ఆ తరువాత.

విశేషం: (1) 'యోగబలమునంజేసి ఆవేశించుట.' యోగ సాధన వలన పెక్కు మహిమలు అతిలోకాలైనవి, ఇంద్రియాతీతాలైనవి, ఒనగూడుతాయని పెద్దలు చెప్పుతారు. ఇంద్రియాలలోని దైన కంటిచూపు వేరు; యోగదృష్టి వేరు; అట్లే శరీరబలం వేరు; యోగబలం వేరు. పార్వతీపరమేశ్వరులు యోగబలంవలన అగ్నిహోత్రుడిని అతడి భార్యను ఆవేశించినట్లు ఈ గాథ అభివర్ణిస్తున్నది. (2) ఐరావతం స్వర్గలోకంలో దేవేంద్రుడియొక్క వాహన మైన పట్టపుటేనుగు. లోకంలోని ఏనుగులు నల్లగా ఉంటాయి. ఐరావతం తెల్లని ఏనుగు అని సాహితీసమయం.

ఈశ్వరుండు కుమారసహితుండై భద్రవటంబు సేరుట (సం. 3-221-1)

మ. **తనయుం గౌఁగిటఁ జేర్చుచున్ వరుస మూర్ధఘ్రాణముం జేయుచున్**
జనితానంద మనస్కుఁడై గిరిసుతాసంయుక్తుఁ డీశానుఁ డ
య్యనఘుం దోడ్కొని బద్ధకేసరి సహస్రస్యందనారూఢుఁ డై
చనియెన్ భద్రవటస్థలంబునకు నైశ్వర్యం బవార్యంబుగన్. **263**

ప్రతిపదార్థం: గిరి, సుతా, సంయుక్తుఁడు= పార్వతీదేవితో కూడినట్టివాడు; ఈశానుఁడు= శివుడు; తనయున్= కొడుకును (కుమారస్వామిని); కౌఁగిటన్+చేర్చుచున్= కౌగిలించుకొంటూ; వరుసన్= మాటికి; మూర్ధ, ఘ్రాణమున్+చేయుచున్= శిరస్సును వాసన చూస్తూ (మూర్కొంటూ); జనిత+ఆనంద, మనస్కుఁడు+ఐ= కలిగిన సంతోషంతో కూడిన మనస్సు కలవాడై; ఆ+అనఘున్= ఆ పుణ్యాత్ముడిని (కుమారస్వామిని); తోడ్కొని= వెంటబెట్టుకొని; బద్ధ, కేసరి, సహస్ర, స్యందన+ ఆరూఢుఁడు+ఐ= వేయి సింహాలు పూన్చబడిన రథం కలవాడై; భద్ర, వట, స్థలంబునకున్= 'భద్రవటం' అనే పేరు కల చోటికి (భద్రవటం అనగా ఏపుగా, విశాలంగా ఎదిగి క్షేమంగా ఉన్న మఱ్ఱిచెట్టు గల స్థానం); ఐశ్వర్యంబు= విభూతి; అవార్యంబుగన్= వారించటానికి వీలు లేకుండగా అతిశయించి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: పార్వతీసమేతుఁడైన పరమేశ్వరుడు తన కుమారుడైన కుమారస్వామిని కౌగిలించుకొని పలుమారులు తల నిమిరి వాసన చూచి వాత్సల్యంతో లాలించాడు. తదుపరి కుమారస్వామిని తోడ్కొని వేయిసింహాలు పూన్చిన తన రథాన్ని ఎక్కి, ఐశ్వర్యప్రకర్షతో ఆనందతన్మయత్వంతో భద్రవటం అనే పేరు కల పుణ్యక్షేత్రానికి చేరాడు.

విశేషం: ఈశ్వరుడి యొక్క భావం- 'ఐశ్వర్యం'. ఐశ్వర్యం అంటే సంపద. 'విభూతి' - పరమేశ్వర లాంఛనం. విభూతి ఎనిమిది విధాలు. ఇవి దివ్యాలు అతిలోకాలు అయిన శక్తులు. 1. అణిమ 2. మహిమ 3. గరిమ 4. లఘిమ 5. ప్రాప్తి 6. ప్రాకామ్యం 7. ఈశిత్వం 8. వశిత్వం.

వ. అమ్మహాదేవు ముందట ననేక యక్షగణ పరివృతుండును బుష్పకాధిరూఢుండును కుబేరుండును, వెనుక దెస నమరగణ సమన్వితుండును నైరావతారోహణోల్లాసియునై వాసవుండును, దక్షిణపక్షంబునం బ్రబల రక్షోయక్ష రక్షితుండై యమోఘ నామ ధేయుండైన యక్షోత్తముండును, గృతపరికరులైన వసు రుద్రాదిత్యులును, దాపలి పక్షంబున నతిభయంకర వ్యాధి మృత్యు పరివేష్టితుండై పితృపతియును, వివిధయాదోనివహ సనాథుం డయిన వరుణుండును నడచిరి; మఱియు మూర్తిమంతంబు లై శూల పట్టిస గదా ముసలాదికంబులైన యద్దేవు నాయుధంబులుఁగమండలు ప్రముఖోపకరణంబులుం జనియె; నయ్యాదిదేవునకు నా సన్నుండయి చంద్రుండును ధవళాతపత్రంబు ధరియించె; ననిలాగ్నులు చామరహస్తులై కొల్చిరి; విద్యయు, సావిత్రియు, గాంధారియుఁ గేశినియు నను దేవాంగనలు దాక్షాయణిం గొల్చి చనిరి; త్రిలోచనసఖుం డైన పింగళుం డను యక్షుండు వృషభకేతనంబు దాల్చె; నివ్విధంబున నభిరామ విభవోదారుండై కుమార గురుండు భద్రవటంబు సేర నరిగి, యచ్చటఁ గుమారుం జూచి యిట్లనియె.264

ప్రతిపదార్థం: ఆ+మహా+దేవు, ముందటన్= ఆ పరమశివుడికి ముందుగా; అనేక, యక్ష, గణ, పరివృతుండును= పెక్కు మంది యక్షుల చేత చుట్టుకొనబడి ఉన్నవాడున్నూ; పుష్పక+అధిరూఢుండును= పుష్పకం అనే విమానంపైకి ఎక్కి ఉన్నవాడున్నూ అయిన; కుబేరుండును= కుబేరుడున్నూ; వెనుక దెసన్= (ఆ ఊరేగింపులో శివుడి రథానికి) వెనుక భాగంలో; అమర, గణ, సమన్వితుండును= దేవతల సముదాయంతో కూడినవాడును; ఐరావత+ఆరోహణ+ఉల్లాసియును+ఐ= ఐరావతం అనే పేరు కల తెల్లని ఏనుగును అధిరోహించటం వలన గోచరించే సంతోషం కలవాడును అయి; వాసవుండును= దేవేంద్రుడున్నూ; దక్షిణ పక్షంబునన్= కుడివైపున; ప్రబల, రక్షస్+యక్ష, రక్షితుండు+ఐ= మిక్కుటమైన బలం కల రాక్షసులచేతను యక్షులనే వేల్పుల తెగవారిచేతను కాపాడబడెడి వాడై; అమోఘ నామధేయుండు+ఐన= అమోఘుడు అనే పేరు కలిగిన; యక్ష+ఉత్తముండును= యక్షులలో శ్రేష్ఠుడును; కృత పరికరులు+ఐన= ఆయుధాలను చేబూనిన; వసు, రుద్ర+ఆదిత్యులును= వసువులు, రుద్రులు, సూర్యులును; దాపలి పక్షంబునన్= ఎడమ వైపున; అతి, భయంకర, వ్యాధి, మృత్యు, పరివేష్టితుండు+ఐ= మిక్కిలి వెరపు గొలిపే రోగాలచేత మరణం చేత చుట్టుకొనబడి ఉండిన వాడైన; పితృ పతియును= ప్రేతాలకు అధినేత అయిన యముడును; వివిధ, యాదః+నివహ, సనాథుండు+అయిన= పెక్కు జలజంతువుల సముదాయంతో కూడిన వాడయిన; వరుణుండును= వరుణుడును (దిక్పాలకులలో ఒకడు); నడచిరి= నడచి వెళ్ళారు; మఱియున్= ఇంకను; మూర్తి మంతంబులు+ఐ= ప్రత్యక్షంగా కన్పించే ఆకారాలు కలవి అయి; శూల, పట్టిస, గదా, ముసల+ఆదికంబులు+ఐన= బల్లెం; ఇనుపరేకు వంటి ఆయుధం (పట్టాకత్తి), గద, రోకలి, మున్నగునవి అయిన; ఆ+దేవు+ఆయుధంబులున్= ఆ దేవుడి (శివుని) ఆయుధాలును; కమండలు, ప్రముఖ+ఉపకరణంబులున్= పానపాత్రికమున్నగు పనిముట్లును; చనియెన్= వెళ్ళాయి; ఆ+ఆది దేవునకున్= ఆ పరమశివుడికి; ఆసన్నుండు+అయి= దగ్గరగా ఉన్నవాడై; చంద్రుండును; ధవళ+ఆతపత్రంబు= వెల్ల గొడుగు; ధరియించెన్= మోశాడు; అనిల+అగ్నులు= వాయువు, నిప్పు; చామర హస్తులు+ఐ= చమరీ మృగం వెంట్రుకలలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తయారయిన వీవనలను చేతులలో ధరించిన వారై; కొల్చిరి= సేవించారు; విద్యయున్, సావిత్రియున్, గాంధారియున్+ కేశినియున్+అను= విద్య, సావిత్రి, గాంధారి, కేశిని అనే పేరులు కల; దేవ+అంగనలు= దేవతాస్త్రీలు; దాక్షాయణిన్= పార్వతీదేవిని; కొల్చి= సేవిస్తూ; చనిరి= వెళ్ళారు. త్రిలోచన, సఖుండు+ఐన= ముక్కంటి అయిన శివుడికి మిత్రుడు అయిన; పింగళుండు+అను, యక్షుండు= పింగళుడు అనే యక్షుడు; వృషభ కేతనంబు+తాల్చెన్= ఎద్దు బొమ్మ గల జెండాను పట్టుకొన్నాడు; ఈ+విధంబునన్= ఈ విధంగా; అభిరామ, విభవ+ఉదారుండు+ఐ= అందమైన సంపదతో గూడిన గొప్పతనం కలవాడై; కుమార, గురుండు= కుమారస్వామి యొక్క తండ్రి అయిన పరమశివుడు; భద్రవటంబు+చేరన్+అరిగి= భద్రవటం అనే క్షేత్రాన్ని చేరి; అచ్చటన్= అక్కడ; కుమారున్+చూచి= కుమారస్వామిని చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: భద్రవటక్షేత్రాన్ని చేరేటప్పుడు పరమశివుడి ఊరేగింపు వర్ణించబడింది. వేయిసింహాలు పూన్చిన రథంమీద పరమశివుడు దేదీప్యమానంగా వైభవోపేతంగా ఆసీనుడై ఉన్నాడు. శివుడికి ముందట - పెక్కుమంది యక్షుల పరివారాలతో కూడినవాడున్నూ, సుప్రసిద్ధమైన పుష్పకం అనే విమానాన్ని అధిష్ఠించినవాడున్నూ అయిన కుబేరుడు సాగాడు. వెనుకభాగంలో దేవేంద్రుడు ఐరావతం అనే తెల్లయేనుగుపై వైభవంతో అధిష్ఠించి ఉన్నాడు. కుడివైపున అమోఘుడు అనే పేరు కల గొప్ప యక్షనాయకుడు నడిచాడు. వసువులు, రుద్రులు, ఆదిత్యులు తమ తమ ఆయుధాలతో అందులో పాల్గొన్నారు. ఎడమభాగంలో భీకరవ్యాధులచేత మృత్యుదేవతచేత చుట్టుకొనబడిన యముడు సాగాడు. వివిధ సముద్రాలతో కూడిన వరుణుడు అచట నిలిచాడు. ఇంకను, శూల పట్టిస గదా ముసలాదికాలైన పరమేశ్వరుడి ఆయుధాలు ప్రత్యక్షంగా కన్పించే ఆకారాలను ధరించి వెలుగొందుతూ నడిచాయి. అట్లాగే, కమండలువు మున్నగు శివుని పనిముట్లుకూడ అట్లే ఆ ఊరేగింపులో పాల్గొన్నాయి. పరమశివుడికి సమీపంలో నిలిచి, చంద్రుడు వెల్ల గొడుగు పట్టుకొన్నాడు. వాయుదేవుడు అగ్నిహోత్రుడు చామరాలతో వీస్తూ ఉన్నారు. విద్య, సావిత్రి, గాంధారి, కేశిని యనే దేవతావనితలు పార్వతీదేవిని సేవిస్తూ సాగారు. ముక్కంటికి అనుగునెచ్చెలి అయిన పింగళుడు అనే యక్షుడు ఎద్దుబొమ్మ కల జెండాను ఎత్తిపట్టి ముందు నడిచాడు. ఈ విధంగా కన్నుల పండువుగా ఊరేగుతూ కుమారస్వామితండ్రి అయిన శివుడు భద్రవటక్షేత్రాన్ని చేరాడు. భద్రవటాన్ని చేరిన పిదప, పరమశివుడు తన పుత్రుడైన కుమారస్వామితో ఇట్లా పలికాడు.

విశేషం: (1) పుష్పకం :- కుబేరుడి విమానం. ఇందులో ఎందరు ఎక్కినా, ఇంకొకరికి చోటు ఉంటుందట! 'పుష్పకం' - రామాయణ పఠితలకు చిరపరిచితమైనదే. రావణుడు కుబేరుడిని జయించి పుష్పకవిమానాన్ని తనస్వాధీనం చేసికొన్నాడు. రావణ వధానంతరం పుష్పకంలో అయోధ్యకు చేరి రాముడు దానిని తిరిగి కుబేరుడికి పంపించాడు. (2) దాక్షాయణి అనగా దక్షప్రజాపతికూతురు, సతీదేవి. ఆమె ఆహ్వానం లేకపోయినప్పటికి తండ్రిచేసే యజ్ఞానికి వెళ్లి, అవమానించబడి, అగ్నికుండం (యోగాగ్ని) సృష్టించుకొని దగ్ధమైపోయి, మరుజన్మలో పార్వతిగా పుట్టింది. ఇక్కడ దాక్షాయణి అనగా ప్రకరణానుబద్ధంగా పార్వతి అనే అర్థం సిద్ధించింది. (3) ఈ ఊరేగింపు అంతయు మహారాజవైభవస్ఫోరకం. ఎట్టిన సమకాలీన చక్రవర్తుల వైభవం ఈ వర్ణనలో ప్రతిబింబితం (4) ద్వాదశాదిత్యులు:- పండ్రెండు మంది సూర్యులు. ధాతా మిత్రోర్యమా రుద్రో వరుణ స్సూర్య ఏవచ । భగో వివస్వాన్ పూషా చ సవితా దశమః స్మృతః; ఏకాదశ స్తథా త్వష్టా విష్ణు ర్ద్వాదశ ఉచ్యతే॥ 1. ధాత 2. మిత్రుడు 3. అర్యముడు 4. రుద్రుడు 5. వరుణుడు 6. సూర్యుడు 7. భగుడు 8. వివస్వంతుడు 9. పూష 10. సవితృడు 11. త్వష్ట 12. విష్ణువు (5) రుద్రులు :- ఏకాదశ రుద్రులు. 1. అజుడు 2. ఏకపాదుఁడు 3. అహిర్బుధ్నుడు 4. విరూపాక్షుడు 5. సురేశ్వరుడు 6. జయంతుడు 7. బహురూపుడు 8. త్ర్యంబకుడు 9. అపరాజితుడు 10. వైవస్వతుడు 11. హరుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **'సప్తమం బైన మారుత స్కంధమునకుఁ । బతివి గమ్ము కుమార! దేవతల కెపుడుఁ**
గార్య మొదవినఁ జేకొని కడఁకఁ దీర్పు; । మనిశమును మత్పదధ్యానఘనుఁడ వగుము. **265**

ప్రతిపదార్థం: ఓ కుమారస్వామీ!; సప్తమంబు+ఐన= ఏడవదియగు; మారుత స్కంధమునకున్= మరుత్తులకు సంబంధించిన సేనా విభాగానికి; పతివి+కమ్ము= అధినేతవు అగుము; దేవతలకున్= వేల్పులకు; ఎపుడున్= ఏ సమయంలో నైనా; కార్యము+ఒదవినన్= పని ఏర్పడితే; చేకొని= పూనుకొని; కడఁకన్+తీర్పుము= పూనికతో నిర్వహించుము; అనిశమును= ఎల్లప్పుడును; మత్+పద, ధ్యాన, ఘనుఁడవు+అగుము= నా పాదాలను ధ్యానించటంచేత గొప్పవాడవు అగుము.

తాత్పర్యం: కుమారస్వామీ! ఏడవది అయిన మారుత సేనావిభాగానికి నాయకుడవు కమ్ము. దేవతలకు పని కలిగినపుడు పూనికతో వారిని కాపాడుము. ఎల్లప్పుడు నాయందు భక్తి కలిగి ఉండుము.

విశేషం: రాజ్యాంగం సప్తాంగాలతో కూడినది. 1. స్వామి 2. అమాత్యుడు 3. సుహృత్తు 4. కోశం 5. రాష్ట్రం 6. దుర్గం 7. బలం. ఇచ్చట 'మరుత్తులు' ఏడవ రాజ్యాంగంలోని బలం. మరుత్తులు అనగా గాలులు.

కుమారస్వామి మహిషాసురుం జంపుట (సం. 3-221-29)

క. **చనుము శుభంబుల నొందుము । తనూజ!' యని కౌఁగిలించి తద్దయుఁ బ్రేమం**
బున నతని వీడుకొలుపఁగ । ననఘ! మహోత్పాతములు రయంబునఁ బొడమెన్. **266**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! పుణ్యాత్ముడా, ఓ ధర్మరాజా!; తనూజ!= కుమార! కుమారస్వామీ!; చనుము= వెళ్లుము; శుభంబులన్= శుభములను; ఒందుము= పొందుము; అని= పలికి; కౌఁగిలించి= ఆశ్లేషించి; తద్దయున్= మిక్కిలి; ప్రేమంబునన్= అనురాగంతో; అతనిన్= కుమారస్వామిని; వీడుకొలుపగన్= ఆమంత్రణంచేయగా; మహా+ఉత్పాతములు= గొప్ప భూత వికారాలు; రయంబునన్= శీఘ్రంగా; పొడమెన్= కన్పించాయి.

తాత్పర్యం: పుణ్యాత్ముడవైన ఓ ధర్మరాజా! వినుము. అంతట పరమశివుడు తన కుమారుడైన కుమారస్వామిని కౌగిలించుకొని శుభంబులు పొందుమని ఆశీర్వదించి వీడ్కొలిపాడు. అప్పుడు వెంటనే గొప్ప ఉత్పాతాలు పొడసూపాయి.

విశేషం: ఉత్పాతాలు శుభాశుభసూచకమైన భూతవికారాలు. అవి మూడు రకాలు. (1) దివ్యం:- సూర్యగ్రహణం, చంద్ర గ్రహణం మున్నగునవి. (2) అంతరిక్షం :- ఉల్కాపాతం మున్నగునని (3) భౌమం :- భూకంపం మున్నగునవి.

ఆ. **దెసలు మండె, ధరణి దిర్దిరఁ దిరిగె, న । భ్రంబు మ్రోసె, వడఁకెఁ బర్వతములు,**
జగము ఘోరతిమిర సంవృతమయ్యె, ని । ర్జరులమనము లెల్ల సంభ్రమించె. **267**

ప్రతిపదార్థం: దెసలు= దిక్కులు; మండెన్= అగ్నిజ్వాలలతో జ్వలించాయి; ధరణి= భూమండలం; దిర్దిరన్+తిరిగెన్= గిరగిర తిరిగింది; అభ్రంబు= ఆకసం; మ్రోసెన్= ధ్వనించింది; పర్వతములు= కొండలు; వడఁకెన్= కంపించాయి; జగము= లోకం; ఘోర, తిమిర, సంవృతము+అయ్యెన్= భయంకర మైన చిమ్మచీకట్లతో క్రమ్ముకొన్నది అయింది. నిర్జరుల మనములు+ఎల్లన్= (ముసలితనం లేని) దేవతల మనస్సులు అన్నీ; సంభ్రమించెన్= తిరుగుడు పడ్డాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దిక్కులలో అగ్నిజ్వాలలు వ్యాపించాయి. భూగోళం గిరగిర తిరిగింది. ఆకసం ధ్వనించింది. కొండలు వణికాయి. ప్రపంచమంతా భయంకరమైన చిమ్మచీకటులు క్రమ్ముకొన్నాయి. దేవతల గుండెలు దద్దరిల్లాయి.

వ. తదనంతరంబు 268

తాత్పర్యం: ఆ తరువాత.

మ. ఘనశస్త్రాస్త్ర మహోజ్జ్వలంబు చతురంగ వ్యాప్త భూమండలం
బు నితాంతోద్ధత ఘోరఘోష బధిరీభూతాఖిలాశాముఖం
బనిరోధోద్గత వేగ ముగ్ర దనుజేంద్రానీక మేతెంచె నీ
సున నీశానముఖామరప్రతతిపై శుంభద్భుజారంభమై. 269

ప్రతిపదార్థం: ఘన, శస్త్ర+అస్త్ర, మహా+ఉత్+జ్వలంబు= గొప్పవైన ఆయుధాల చేతను, మంత్రపూతమైన ఆయుధాల చేతను దేదీప్యమానంగా ప్రకాశించేదిన్నీ; చతురంగ వ్యాప్త భూమండలంబు= నాలుగు అంగాలు గల సేనచేత విస్తరించిన భూమండలం కలిగినదిన్నీ; నితాంత+ఉద్ధత, ఘోర, ఘోష, బధిరీభూత+అఖిల+ఆశా ముఖంబు= ఎల్లప్పుడూ గర్వంతో భయంకరమైన నాదంతో దిగ్దిగంతాలకు చెవుడు కల్పించేదిన్నీ; అ నిరోధ+ఉత్+గత, వేగము= ఆటంకం లేక పైకి ఉరికే వేగం కలిగినదిన్నీ అయిన; ఉగ్ర, దనుజ+ఇంద్ర+అనీకము= భయంకరమైన రాక్షసనాయకుడి సేన; ఈసునన్= రోషంతో; ఈశాన ముఖ,+అమర, ప్రతతిపైన్= శివుడు మొదలుగాగల వేల్పుల గుంపుపై; శుంభత్+భుజ+ఆరంభము+ఐ= ప్రకాశించే పరాక్రమం యొక్క ఎత్తికోలు కల్గినదై; ఏతెంచెన్= దండెత్తి వచ్చింది.

తాత్పర్యం: తదుపరి, శివుడు మున్నగు నాయకులతో కూడిన దేవతలపైకి రాక్షసులసైన్యం మహాపరాక్రమ ప్రాభవంతో కూడిన పటాటోపంతో దండెత్తి వచ్చింది. ఆ రాక్షస సైన్యం- గొప్ప అస్త్రాలతో శస్త్రాలతో దేదీప్యమానంగా వెలుగొందింది. భూమండలాన్ని అంతటిని ఆక్రమించిన చతురంగబలం కలిగినట్టిది, దిగ్దిగంతాలు మారుమ్రోగుతూ వినేవారి చెవులు చిల్లులు పడేటట్లు శబ్దాలు చేసేది. ఆపలేని వేగం గలది.

విశేషం: చతురంగ బలం: 1. రథాలు 2. గుర్రాలు 3. ఏనుగులు 4. భటులు.

వ. ఇట్లు మహిషాసుర సంరక్షితం బయిన దానవసైన్యంబు పఱతెంచి చుట్టుముట్టి యసంఖ్యసాయకంబులు గదాఖడ్గ ముసల పరిఘశతఘ్ని ప్రముఖానేక ప్రహరణంబులు ప్రయోగించి, నిమిషమాత్రంబున ననిమిష సైన్యంబునం బ్రచుర మాతంగ తురంగ రథిక పదాతి ప్రకరంబులం బరిమార్చినం గార్చిచ్చు పొదివినం జెదరి పఱచు మృగంబులుం బోలె నమరులు సమరవిముఖులై తొలంగం బాఱినం జూచి నముచిసూదనుండు సింహనాదంబు సేయుచు నెలుంగెత్తి సురగణంబుల కిట్లనియె. 270

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; మహిష+అసుర సంరక్షితంబు+అయిన= మహిషుడు అనే రాక్షసుడిచేత కాపాడబడిన; దానవ, సైన్యంబు= రాక్షసుల సేన; పఱతెంచి= దండెత్తి వచ్చి; చుట్టు ముట్టి= చుట్టును ముట్టడించి; అసంఖ్య సాయకంబులు= లెక్కకు మిక్కిలి బాణాలు; గదా, ఖడ్గ, ముసల, పరిఘ, శతఘ్ని ప్రముఖ+అనేక, ప్రహరణంబులు= గద, కత్తి, రోకలి, ఇనుపగుదియ, నూరుమందిని ఒకేసారి చంపగల యంత్రాయుధం మున్నగు పెక్కు ఆయుధాలు; ప్రయోగించి= ఉపయోగించి; నిమిష మాత్రంబునన్= క్షణమాత్రంలో; అనిమిష సైన్యంబునన్= దేవతలసేనలోని; ప్రచుర, మాతంగ, తురంగ, రథిక,

పదాతి, ప్రకరంబులన్= దట్టంగా ఉన్న ఏనుగులు, గుర్రాలు, రథవీరులను, కాల్బలపు గుంపులను; పరిమార్చినన్= నాశనం చేయగా; కార్చిచ్చు= దావాగ్ని; పొదివినన్= అలముకొన్న; చెదరి= కకావికలై; పఱచు= పారిపోయే; మృగంబులున్+పోలెన్= లేళ్ల వలె; అమరులు= దేవతలు; సమర, విముఖులు+ఐ= యుద్ధం చేయటానికి తొలగినవారై; తొలంగన్+పాఱినన్+చూచి= చెదరి పారిపోవటం చూచి; నముచి సూదనుండు= దేవేంద్రుడు (నముచి అనే రాక్షసుడిని సంహరించినవాడు); సింహ నాదంబు+చేయుచున్= సింహగర్జన వంటి ధ్వనిని చేస్తూ; ఎలుంగు+ఎత్తి= కంఠస్వరం ఎత్తి (బిగ్గరగా మాటలు వినిపించేటట్లు); సుర, గణంబులకున్= వేల్పుల గుంపులకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా రాక్షసుల సైన్యం దేవతలపైకి దండెత్తి వచ్చింది. ఆ రాక్షస సేనలకు నాయకుడు మహిషుడు అనే రాక్షసుడు. ఆ రాక్షససేనలు దేవతలను చుట్టుముట్టి లెక్కకు మిక్కిలి బాణాలను, గదలు, కత్తులు, రోకళ్లు, ఇనుప గుదియలు, శతఘ్నులు మున్నగు ఆయుధ విశేషాలను ఉపయోగించి, క్షణంలోనే దేవతల సైన్యంలోని ఏనుగులను, గుర్రాలను, రథాలను, రథికులను, కాల్బలాలను నాశనం చేశాయి. అప్పుడు కార్చిచ్చుకు భయపడి పరుగెత్తే లేళ్లవలె దేవతలు యుద్ధం చేయటానికి భయపడి వెనుదిరిగి పారిపోయారు. అట్లా భీతితో పారిపోయే దేవతలను చూచి, దేవేంద్రుడు సింహనాదం చేస్తూ ఇట్లా పలికాడు.

చ. **'వలవదు సంభ్రమంబు, గరువంబుగ నియ్యెడ నెల్లవారు నే**
ర్వలవడ వాహనంబులు మహాస్త్రములున్ సమకట్టి క్రమ్మఱుం;
దలవునఁ దున్మివైవుఁడు దురాత్ముల దైత్యుల; నేను గల్గఁగాఁ
దలరఁగ నేల మీకు? ధృతిఁ దాల్పుఁడు నిల్వుఁడు గెల్వుఁ డుక్కునన్'. **271**

ప్రతిపదార్థం: సంభ్రమంబు= భయంతో కూడిన తొట్రుపాటు; వలవదు= వద్దు; గరువంబుగన్= ఠీవితో; ఈ+ఎడన్= ఈ తరుణంలో; ఎల్లవారున్= అందరు; నేర్పు+అలవడన్= సామర్థ్యం పెంపొందించుకొని; వాహనంబులు= యానములు; మహా+అస్త్రములున్= గొప్పవి మంత్రపూతాలు అయినవి అయిన ఆయుధాలు; సమకట్టి= ఆయత్తం చేసికొని; క్రమ్మఱుండు= మరలి రండి; అలవునన్= శక్తి సామర్థ్యంతో; దురాత్ములన్= చెడ్డవారలను; దైత్యులన్= రాక్షసులను; తున్మివైవుఁడు= సంహరించండి; నేను+కల్గఁగాన్= నేను ఉండగా; మీకున్= మీకు; తలరఁగన్+ఏల= ఆరాటం చెందనేల?; ధృతిన్+ తాల్పుఁడు= ధైర్యం వహించండి; నిల్వుఁడు= ఆగండి; ఉక్కునన్= పరాక్రమంతో; గెల్వుఁడు= జయించండి.

తాత్పర్యం: (ఈ పద్యం దేవేంద్రుడు తన పల్కుల ద్వారా దేవతలను ప్రోత్సహించిన విధాన్ని వివరిస్తున్నది). ఓ దేవతలారా! మీరు భయపడి పారిపోవద్దు. ఈ తొట్రుపాటు మంచిది కాదు. నేను మీతో కలిసి యుద్ధం చేయగలను. నే నుండగా మీకు భయం ఎందుకు? ఆత్మగౌరవంతో మీరందరు తిరిగి వచ్చి మీ శక్తి సామర్థ్యాన్ని చూపండి. వాహనాలు మహాస్త్రాలు సరిదిద్దుకొని దుర్మార్గులైన రాక్షసులను సంహరించండి. ధైర్యం వహించండి. రణరంగంలో స్థిరభావంతో నిల్వండి. మీకు విజయం సిద్ధించటం తథ్యం.

ఆ. **అనినఁ బోక నిల్చి యాహవోత్సాహులై। సకలవాహనాస్త్రశస్త్రచయము**
లలవరించి పేర్చి యార్చి తాఁకిరి వసు। రుద్ర సాధ్యముఖ మరుత్ప్రవరులు. **272**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; పోక= వెనుదిరిగి పారిపోకుండగా; నిల్చి= నిలిచి; ఆహవ+ఉత్సాహులు+ఐ= యుద్ధం చేయటంలో ఉత్సాహం కలవారై; సకల, వాహన+అస్త్ర, శస్త్ర, చయములు+అలవరించి= సమస్తమైన వాహనాలు, మంత్రపూతాలైన

ఆయుధాలు, యుద్ధ పరికరాల సముదాయాలను సంతరించుకొని; పేర్చి= అతిశయించి; ఆర్చి= సింహనాదాలు చేసి; వసు, రుద్ర, సాధ్య, ముఖ, మరుత్+ప్రవరులు= వసువులు, రుద్రులు, సాధ్యులు మున్నగు వేల్పు వీరులు; తాఁకిరి= (శత్రువులతో) తలపడ్డారు.

తాత్పర్యం: దేవేంద్రుడు ఆ విధంగా ప్రోత్సాహక వాక్యాలు పలుకగా, దేవతలు పారిపోకుండా నిలిచి, ఉత్సాహంతో వాహనాలు అస్త్రాలు అలవరించుకొని సింహనాదాలతో శత్రువులను తాకారు. వసువులు రుద్రులు మున్నగు దేవతలు ఆ విధంగా మరల రణరంగంలో చేరి యుద్ధం సాగించారు.

మ. **అమరానీక విసృజ్యమాన బహుశస్త్రాస్త్రాహతిన్ భిన్నదే**
హములై ఘోరమదేభముల్ బహులరక్తాంగంబులై తూలెఁ దీ
వ్రమహావాత నిపాత జాత రభస వ్యాధూత సంధ్యారుణా
భ్రములో నా నవశంబులై యొఱలుచుం బ్రత్యర్థి సైన్యంబులన్. **273**

ప్రతిపదార్థం: ప్రత్యర్థి, సైన్యంబులన్= విరోధుల సైన్యాలలో; అమర+అనీక, విసృజ్యమాన, బహు, శస్త్ర+అస్త్ర+ఆహతిన్= దేవతల సైన్యాలచేత విడువబడుతున్న పెక్కు ఆయుధాల యొక్క, మంత్ర బాణాల యొక్క తాకిడి చేత; ఘోర, మద+ఇభముల్= భయంకరాలైన మదించిన ఏనుగులు; భిన్న దేహములు+ఐ= చీల్చబడిన శరీరాలు గలిగినట్టివి అయి; బహుల, రక్త+అంగంబులు+ఐ= మిక్కుటంగా నెత్తురుతో కూడిన అవయవాలతో గూడినట్టివై; తీవ్ర, మహా, వాత, నిపాత, జాత, రభస, వ్యాధూత, సంధ్యా+అరుణ+అభ్రములో+నాన్= అధికమైన, గొప్పదైన గాలిచేత కొట్టబడటం వలన ఏర్పడిన సంక్షోభం కారణంగా చెల్లాచెదరుగా నైన, సంజవేళలో ఎర్రనిమబ్బులో అనునట్లుగా; అవశంబులు+ఐ= అదుపుతప్పినవై; ఒఱలుచున్= కలతచెంది ఆర్చుచు; తూలెన్= చెల్లాచెదరై పడిపోయాయి.

తాత్పర్యం: శత్రుసైన్యాలలోని మదపుటేనుగులు దేవతల సైన్యాలచేత ప్రయోగించబడిన పెక్కు శస్త్రాలచేతను అస్త్రాలచేతను కొట్టబడి చీల్చబడిన దేహాలు కలిగి, నెత్తురు కారెడి అవయవాలతో కూడినవై, అధికమైన గాలిచేత కొట్టబడి సంక్షోభాన్ని చెంది చెల్లాచెదరయ్యే సంధ్యాసమయంలోని మబ్బులో అనునట్లుగా, చెల్లాచెదరైపోయాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

మ. **పురుహూతాగ్రసరప్రభూత బలసంభూతాస్త్ర నిర్ధూత మై**
తిరిగెన్ బెంపఱి దైత్యవాహినుల నుద్వృత్తాశ్వికశ్రేణి వి
స్ఫురితోత్పాత సమీరవేగ విముఖీభూతాకృతిం దూలు భీ
కరరత్నాకరజాత సంతతతరంగవ్రాతముం బోలుచున్. **274**

ప్రతిపదార్థం: పురుహూత+అగ్రసర, ప్రభూత, బల, సంభూత+అస్త్ర, నిర్ధూతము+ఐ= దేవేంద్రుడు నాయకుడై ముందున్న గొప్ప సేననుండి పుట్టిన మంత్రయుక్తాలైన ఆయుధాలచేత చెదరగొట్టబడినదై; పెంపు+అఱి= అతిశయం నశించి; దైత్యవాహినులన్= రాక్షస సేనలలో; ఉత్+వృత్త+ఆశ్విక, శ్రేణి= గర్వించిన గుర్రపు సైనికుల గుంపు; విస్ఫురిత+ఉత్+పాత, సమీర, వేగ, విముఖీ భూత+ఆకృతిన్= ప్రకటంగా ఉవ్వెత్తుగ పైకెగసి ఎదురుగా వీస్తున్న పెనుగాలి దెబ్బలయొక్క వేగం చేత వెనుకకు మరలించబడిన ఆకారంతో; తూలు= చెదరిపోయే; భీకర, రత్నాకర, (రత్న+ఆకర) జాత, సంతత, తరంగ,

వ్రాతమున్= భయంకరమయిన సముద్రంలో పుట్టి ఎల్లప్పుడూ నడయాడే కెరటాల గుంపును; పోలుచున్= సమానం ఔతూ; తిరిగెన్= ఇటునటూ చెదరిపోయింది.

తాత్పర్యం: దేవేంద్రుడి నాయకత్వంలో విజృంభించిన సైన్యం ప్రయోగించిన శస్త్రాలచేత, అస్త్రాలచేత, రాక్షస సైన్యంలోని ఆశ్వికదళం పెనుగాలిచేత వెనుకకు నెట్టబడి విరిగిపడే కడలి కెరటాల వలె చెదరి వెనుకకు పారిపోయింది.

విశేషం: అలం: ఉపమ.

చ. అడరుచు దేవసైన్యవిశిఖాగ్ని శిఖావలి చుట్టుముట్టినం
గడువడి దానవధ్వజినిఁ గల్గు రథప్రకరంబు లన్నియుం
బొడిపొడి యయ్యె నుగ్రతర భూరిదవానల మెల్లదిక్కులం
బొడమిన వంటకట్టియల ప్రోవులు రూపఱుమాడ్కిఁ దోఁపఁగన్. **275**

ప్రతిపదార్థం: అడరుచున్= అతిశయిస్తూ; దేవ, సైన్య, విశిఖ+అగ్ని= వేల్పుల సైన్యానికి సంబంధించిన బాణాల అగ్నియొక్క; శిఖా+ఆవలి= మంటల సమూహం; చుట్టు ముట్టినన్= నలువైపులా ఆవరించగా; కడువడిన్= మిక్కిలి వేగంతో; దానవ, ధ్వజినిన్= రాక్షసుల సైన్యంలో; కల్గు= ఉండే; రథ, ప్రకరంబులు= తేరుల గుంపులు; అన్నియున్= సమస్తమున్నూ; ఉగ్ర, తర, భూరిదవ+అనలము= మిక్కిలి భయంకరమున్నూ, మిక్కుటమున్నూ అయిన కార్చిచ్చు; ఎల్ల, దిక్కులన్= అన్ని దెసలను; పొడమిన= ఆక్రమించిన; వంట కట్టియల ప్రోవులు= వంట కొఱకు ఉపయోగించే కఱ్ఱముక్కల గుంపులు; రూపు+అఱు, మాడ్కిన్+తోఁపఁగన్= నశించే విధంగా కనబడుతూ ఉండగా; పొడిపొడి+అయ్యెన్= బూడిదగా మారిపోయాయి.

తాత్పర్యం: ఉత్సాహంతో దేవతల సైన్యం విజృంభించింది. వేల్పులు ప్రయోగించిన బాణాగ్నిజ్వాలలు వేగంగా నలుదెసల క్రమ్ముకొన్నాయి. రాక్షసులసేనలలోని రథాలు అన్నియు కార్చిచ్చు క్రమ్ముకొనినపుడు కాలిపోయే వంట కట్టెల వలె బూడిద బుగ్గి అయిపోయాయి.

విశేషం: అలం: ఉపమ.

శా. గీర్వాణప్రవిముక్తబాణపటలక్రీడావిలూనంబు లై
గర్వోన్మత్తసురారిశీర్షములు వేఁకన్ డొల్లెఁ గల్పచ్ఛిదా
నిర్విద్ధాంబుదమండలోద్గత మహానిర్ఘాతపాతావధూ
తోర్వీభృద్ఘనగండశైలములతో నూహింపఁ దుల్యంబులై. **276**

ప్రతిపదార్థం: గీర్వాణ, ప్రవిముక్త, బాణ, పటల, క్రీడా, విలూనంబులు+ఐ= దేవతలచేత విడువబడిన అమ్ముల గుంపుల చేత (ఆటలోవలె) అలవోకగా ఛేదించబడినవై; గర్వ+ఉత్+మత్త, సుర+అరి, శీర్షములు= గర్వంచేత మిగుల మదించిన రాక్షసుల యొక్క తలకాయలు; వేఁకన్= బాగా; కల్ప+ఛిదా, నిర్విద్ధ+అంబుద, మండల+ఉత్+గత, మహా, నిర్ఘాత, పాత+అవధూత+ ఉర్వీభృత్+ఘన, గండ, శైలములతోన్= కల్పంయొక్క చివరిభాగంలో అనగా ప్రళయకాలంలో బాగా క్రమ్ముకొనిన, మేఘముల సమూహం నుండి వెల్వడుతున్న పిడుగుపాటులవలన చెల్లాచెదరైన కొండలనుండి రాలిపడుతున్న పెద్ద పెద్ద రాళ్ళతో; ఊహింపన్+తుల్యంబులు+ఐ= భావించటానికి సమానాలై; డొల్లెన్= రాలి క్రింద పడ్డాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: గర్వంచేత మదించిన రాక్షసుల తలకాయలు వేల్పుల బాణాలచేత కొట్టబడి, ప్రళయకాలంలో మేఘమండలంనుండి పడే పిడుగులచే కొట్టబడి ముక్కలు చెక్కలై పడే కొండలనుండి ఎగిరిపడుతూ వున్న గొప్పరాళ్ళవలె రాలి క్రింద బడ్డాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఉపమేయం రాక్షసుల బాణాలచేత కొట్టబడి నేలపై పడినట్టి దేవతల తలలు. ఉపమానం ప్రళయ కాలంలో పిడుగులపాటువలన కొట్టబడి నేలపై కూలే కొండల రాళ్లు. ఇచట 'ఊహింప' తుల్యంబులు - అనే ప్రయోగం అనుశీలించదగును. ఉపమానం (పోలిక) స్పష్టంగా వెల్లడియైతే అది ఉపమ అలంకారం. అది ఊహించవలసివస్తే ఉత్ప్రేక్ష.

వ. ఇట్లు నిహన్యమానంబు లగుచు దైత్యసైన్యంబులు దైన్యంబు నొంది నిలువ నోపక నలుదెసలం జెదరిన నొదరి యందఱి నదల్చి మహిషాసురుం డొక్కమహాశైలంబు వెఱికి యిరుగేల నమర్చికొని యమరులమీఁదం గవిసినం గని, జనితోత్సాహం బైన యసురానీకం బతనిం గూడుకొని భేరీ నిస్సాణ పణవాది తూర్య రవంబులు సింహనాదంబులుఁ జెలంగం గడంగిన, నింద్రాది సురులును బెలుచ సంగరోన్ముఖులై నిలిచిన.277

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నిహన్య మానంబులు+అగుచున్= చంపబడుతున్నవి ఔతూ; దైత్య సైన్యంబులు= రాక్షస సేనలు; దైన్యంబున్+ఒంది= దీనత్వం పొంది; నిలువన్+ఓపక= స్థిరంగా ఉండలేక; నలు, దెసలన్+చెదరినన్= నాలుగు దిక్కులకు పారిపోగా; ఒదరి= పూని; అందఱిన్+అదల్చి= అందరిని అరికట్టి; మహిష+అసురుండు= మహిషుడు అనెడి రాక్షసుడు; ఒక్క, మహా, శైలంబు= ఒక పెద్ద కొండను; పెఱికి= కూరుకొని ఉన్న దానిని పైకి పెకలించి; ఇరు+కేలన్= రెండు చేతులలో; అమర్చి కొని= పొదివి పట్టుకొని; అమరులమీఁదన్= వేల్పుల మీద; కవిసినన్= పోరాటానికి పూనుకొనగా; కని= చూచి; జనిత+ఉత్సాహంబు+ఐన= ఉత్సాహం కలిగినదైన; అసుర+అనీకంబు= రాక్షసుల సేన; అతనిన్+కూడుకొని= (ఆ మహిషాసురుడితో కలిసి); భేరీ, నిస్సాణ, పణవ+ఆది, తూర్యరవంబులు= భేరి, నిస్సాణం, పణవం మున్నగునవి యుద్ధంలో సైనికులకు ఉత్సాహం కలిగించటానికై మ్రోగింపబడే వాద్య విశేషాలు. అవి చేసేనాదాలతో; సింహనాదంబులు= సింహగర్జనను అనుకరిస్తూ రణరంగంలో వీరులు చేసిన అరుపులు; చెలంగన్= అతిశయించగా; కడంగినన్= పూనుకొనగా; ఇంద్ర+ఆది, సురులును= ఇంద్రుడు మొదలైన దేవతలును; పెలుచన్= ఆటోపంతో; సంగర+ఉత్+ముఖులు+ఐ= యుద్ధం చేయటంలో అభిరుచి కలవారై; నిలిచినన్= నిలబడగా.

తాత్పర్యం: ఈ విధంగా రాక్షసులు రణరంగంలో మరణిస్తూ దైన్యం చెంది నిలువజాలక నలుదిక్కులకు పారిపోసాగారు. అంతట, మహిషాసురుడు పారిపోయే రాక్షసభటులకు ప్రోత్సాహం కలిగించి వారిని కూడగట్టుకొని వచ్చి, ఒక పెద్ద కొండను పెకలించి తన రెండు చేతులతో పట్టుకొని దేవతలపైకి విజృంభించాడు. అంతట ఉద్రేకంతో ధైర్యం తెచ్చుకొనిన రాక్షస సైనికులు మహిషాసురుడితో కలిసి, భేరులు మున్నగు వాద్యాలను మ్రోగించి సింహనాదాలు చేస్తూ దేవతలను ముట్టడించారు. అప్పుడు ఇంద్రుడు మున్నగు దేవతలు రాక్షసులను రణరంగంలో అరికట్టడానికై నిలబడ్డారు.

విశేషం: ప్రాచీన భారతదేశంలో యుద్ధరంగంలో సైనికులను పురికొల్పటానికై భేరులు, తప్పెటలు మున్నగు వాద్యాలను ఉపయోగించేవారు. భేరి= ఢక్క, పెద్దడోలు. నిస్సాణము= ఇదికూడా చర్మవాద్య విశేషం, తప్పెటవంటిది; పణవము= ఏనుగు తోలుతో చేయబడిన వాద్యం. తూర్యము= ఢక్క మొదలైన ఒక వాద్య విశేషం.

క. మహిషుఁడు బల మేర్పడ న । మ్మహిధరమున్ వైచె నయ్యమరసైన్యముపై
మహి సంచలింపఁగా దశ । సహస్ర యోధవరు లపుడు సమసిరి దానన్. 278

ప్రతిపదార్థం: మహిషుఁడు; బలము+ఏర్పడన్= శక్తి విలసిల్లేటట్లుగా; ఆ+మహిధరమున్= ఆ కొండను; ఆ+అమర సైన్యముపైన్= ఆ దేవతల సేనపై; మహి= భూమి; సంచలింపఁగాన్= కంపించేటట్లుగా; వైచెన్= విసిరాడు; దానన్= ఆ కొండ వలన; అపుడు= ఆ సమయంలో; దశ, సహస్ర, యోధ, వరులు= పదివేల మంది గొప్ప వీరులు; సమసిరి= చచ్చారు.

తాత్పర్యం: మహిషాసురుడు ఆ కొండను దేవతల సేనపై విసిరాడు. ఆ కొండతాకిడికి దేవతలసేనలలో పదివేల మంది గొప్పయోధులు మరణించారు.

ఉ. అంతయుఁ జూచి యెంతయు భయంబున నింద్రునిఁదొట్టి నిర్జరుల్
భ్రాంతమనస్కులై తిరుగఁబడ్డ మదాంచితఘోరమూర్తి యై
యంతకశౌర్యుఁ డా దనుజుఁ డంత దిగంతము దూలఁ గిట్టి కా
లాంతకుఁ డైన రుద్రుని రథాగ్రము చెచ్చెరఁ బట్టె నుద్ధతిన్. 279

ప్రతిపదార్థం: అంతయున్+చూచి= జరిగింది సమస్తమున్నూ గమనించి; ఎంతయున్, భయంబునన్= కొలదికి మీరిన వెరపుతో; ఇంద్రునిన్+తొట్టి, నిర్జరుల్= ఇంద్రుడు మొదలుగా గల దేవతలు; భ్రాంత మనస్కులు+ఐ= మోహం చేత కలవర పడిన మనస్సులు కలవారై; తిరుగన్+పడ్డన్= తిరుగు ముఖాలతో మరలినవారు కాగా; మద+అంచిత, ఘోర, మూర్తి+ఐ= గర్వంతో కూడిన భయంకరమైన ఆకృతి కలవాడై; అంతక శౌర్యుఁడు= యముడి వంటి పరాక్రమం కలవాడు; ఆ దనుజుఁడు= ఆ రాక్షసుడు (ఆ మహిషుఁడు); అంతన్= ఆ సమయంలో; దిక్+అంతము= దిక్కుల చివరి భాగం; తూలన్= చలించగా; కిట్టి= సమీపించి; కాల+అంతకుఁడు+ఐన= కాలాన్ని రూపుమాపేవాడైన; రుద్రుని= శివుని; రథ+అగ్రము= తేరుకొనభాగాన్ని; చెచ్చెరన్= వేగంగా; ఉద్ధతిన్= రోషంతో; పట్టెన్= పట్టుకొన్నాడు.

తాత్పర్యం: ఆ సన్నివేశాల నన్నిటిని తిలకించి, మిక్కిలి వెరపుతో ఇంద్రుడు మొదలగు దేవతలు కలవరపడి మరలినారు. అప్పుడు యముడితో సమానమైన పరాక్రమం గల ఆ మహిషాసురుడు దిక్కులు సంచలించేటట్లుగా విజృంభించి, గర్వంతో కూడిన భయంకరమూర్తి అయి, కాలాంతకుడైన శివుడి తేరుకొనభాగాన్ని రోషంతో శీఘ్రంగా పట్టుకొన్నాడు.

చ. 'హరుఁ డదె చిక్కె; నింక నసురాధిపుచేఁ దెగు' నంచుఁ బొంగి భీ
కరముగ దైత్యు లార్వఁగ జగత్త్రితయంబును గంప మొందఁగాఁ
దెరలి మునీశ్వరుల్ గరము దీనతఁ బొందఁగ మందహాస భా
సురముఖుఁ డై పురారి నిజసూనుఁ గుమారునిఁ జూచి యిట్లనున్. 280

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు; అది+ఎ= అదే= అదిగో; చిక్కెన్= వశం అయ్యాడు; ఇంకన్= ఇకమీదట; అసుర+అధిపుచేన్= రాక్షసుల ప్రభువు చేత (మహిషుడిచేత); తెగున్= చచ్చును; అంచున్= అని పలుకుతూ; దైత్యులు= రాక్షసులు; పొంగి= ఉత్సహించి; భీకరముగన్= భయంకరంగా; ఆర్వఁగన్= పెద్ద పెట్టున అరువగా; జగత్+త్రితయంబును= మూడు లోకాలున్నూ; కంపము+ఒందఁగాన్= భయంతో సంచలించగా; తెరలి= తిరుగుడుపడి; ముని+ఈశ్వరుల్= ఋషిశ్రేష్ఠులు; కరము=

మిక్కిలి; దీనతన్+పొందఁగన్= దైన్యం చెందగా; మంద, హాస, భాసుర, ముఖుఁడు+ఐ= చిరునవ్వుచేత వెలుగొందిన మొగం కలవాడై; పుర+అరి= శివుడు; నిజ, సూనున్= తన కొడుకును; కుమారునిన్+చూచి= కుమారస్వామిని కనుగొని; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అంతట రాక్షసభటులు 'ఇదిగో శివుడు చిక్కాడు; ఇక అతడు మహిషాసురుడిచేత చస్తాడు' అని భయంకరంగా అరిచారు. దానితో మూడులోకాలున్నూ కంపించిపోయాయి. ఋషివరేణ్యులు చిన్నవోయారు. కాని, పరమశివుడు మాత్రం చిరునవ్వులు చిందే మొగంతో తన కుమారుడైన కుమారస్వామితో ఈ విధంగా అన్నాడు.

ఉ. **'చూచితె వీని సాహసము శూరత మద్రథరోధి యయ్యె; ని**
న్నీచుఁ గృతాపరాధు నవినీతు గతాయువు మృత్యుదేవికిన్
గోచరుఁ జేయు మీవు రణకోవిద!' నావుడు షణ్ముఖుండు గో
త్రాచలసన్నిభుండు మదనాంతకుమాటకుఁ బొంగి యుక్కునన్. **281**

ప్రతిపదార్థం: రణ, కోవిద!= యుద్ధం చేయటంలో ప్రావీణ్యం కలవాడా, ఓ కుమారస్వామీ!; ఈవు= నీవు; వీని= ఈ మహిషుడి యొక్క; సాహసమున్; తెగువను; చూచితి(వి)+ఎ= సందర్శించావు కదా; శూరతన్= పరాక్రమం చొప్పున; మత్+రథ, రోధి+అయ్యెన్= నా తేరుకు ఆటంకం కల్పించిన వాడు అయ్యాడు; ఈ+నీచున్= ఈ నీచుడిని; కృత+అపరాధున్= చేసిన నేరం కలవాడిని; అవినీతున్= నీతి లేనివాడిని; గత+ఆయువున్= పోయిన ఆయుర్దాయం కలవాడిని; మృత్యు, దేవికిన్+గోచరున్+చేయుము= మృత్యుదేవతకు కనిపించేవాడినిగా ఒనరించుము; నావుడున్= అని చెప్పగా; గోత్ర+అచల, సన్నిభుండు= కుల పర్వతాలతో సమానమైన వాడగు; షణ్ముఖుండు= ఆరుమొగాల దేవర అయిన కుమారస్వామి; మదన+అంతకు, మాటకున్= మన్మథుడిని సంహరించిన శివుడియొక్క పలుకులకు; పొంగి= ఉత్సాహం చెంది; ఉక్కునన్= బలంతో.

తాత్పర్యం: 'యుద్ధం చేయటంలో ఆరితేరిన ఓ కుమారుడా!; చూచినావు కదా ఈ మహిషుడి సాహసం! వీడు నారథాన్నే అడ్డగించగలిగాడు. ఈ నీచుడికి ఆయువు తీరింది. ఇక వీడు మృత్యువువాత పడటం తప్పదు. ఈ దురహంకారిని నీవు శీఘ్రంగా సంహరించుము' అని శివుడు ఆజ్ఞాపించాడు. అప్పుడు కులపర్వతాల వంటి స్థైర్యం గలవాడైన కుమారస్వామి శివుడి మాటలకు ఉప్పొంగినవాడయ్యాడు.

విశేషం: స్థైర్యాన్ని పర్వతంతో పోల్చటం పరిపాటి. పర్వతాలలో శ్రేష్ఠాలు భూమిని మోసే 'కుల' పర్వతాలు. 1. మహేంద్రం 2. మలయం 3. సహ్యం 4. శుక్తిమంతం 5. గంధమాదనం 6. వింధ్యం 7. పారియాత్రం అనే ఏడున్నూ కులపర్వతాలు.

ఉ. **లోహితరత్నభూషణుఁడు లోహితమాల్యధరుండు విస్ఫుర**
ల్లోహితలోచనుండు నవలోహితవస్త్రుఁడు లోహితాస్యుఁ డై
యాహవకేళికిం గడఁగునప్పుడు సూడఁగ నొప్పె లోకని
ర్దాహసమిద్ధ నూతనపతంగుఁడ పోలె రథాధిరూఢుఁ డై. **282**

ప్రతిపదార్థం: లోహిత, రత్న, భూషణుఁడు= ఎర్రని మణులతో చేయబడిన ఆభరణాలను తాల్చినవాడు; లోహిత మాల్యధరుండు= ఎర్రని పూలమాలలు ధరించినవాడు; విస్ఫురత్+లోహిత, లోచనుండు= ప్రకాశించే (కోపంతో) ఎర్రబడిన కన్నులు కలవాడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నవ, లోహిత, వస్త్రుఁడు= క్రొత్తవి అయిన ఎఱ్ఱని బట్టలు ధరించినవాడు; లోహిత+ఆస్యుఁడు+ఐ= (కోపంతో) ఎఱ్ఱబడిన మొగం కలవాడయి; ఆహవ, కేళికిన్+కడఁగు+అప్పుడు= యుద్ధం అనే ఆటకు పూనుకొనే సమయంలో; లోక, నిర్దాహ, సమ్+ఇద్ధ, నూతన, పతంగుఁడు+అ, పోలెన్= జగత్తును తగులబెట్టేటట్లు దేదీప్యమానంగా ప్రకాశించే క్రొత్త సూర్యుడితో సరిపోలుతున్నవాడయి; రథ+అధిరూఢుఁడు+ఐ= తేరిపై ఎక్కినవాడయి; చూడఁగన్= చూడటానికి; ఒప్పెన్= విలసిల్లాడు.

తాత్పర్యం: యుద్ధం చేయటానికి ఉపక్రమించిన కుమారస్వామి రథారూఢుడై, ప్రళయకాలంలో లోకాలను మాడ్చి వేయటానికి సమర్థుడై - దేదీప్యమానమైన తేజస్సు గలిగి ఉదయించే సూర్యుడివలె వెలుగొందాడు. ఆ సమయంలో కుమారస్వామి ఎఱ్ఱని మణులు పొదిగిన ఆభరణాలను ధరించి ఉన్నాడు. ఎఱ్ఱని క్రొత్త ఉడుపులను తాల్చి ఉన్నాడు. మిరుమిట్లుగొలిపే ఎఱ్ఱని కన్నులు కలవాడైనాడు. ఆతడి ముఖం క్రోధంతో ఎఱ్ఱబారింది.

విశేషం: ఎరుపు కోపానికి చిహ్నం. శౌర్యాన్ని సూచించే కవిసమయం. కుమారస్వామి లోహితాంబరుఁడుగా సుప్రసిద్ధుఁడు.

ఉ. **ఆతని నుగ్రతేజు నిటలాక్షతనూభవుఁ జూచి నిర్జర**
వ్రాతము భీతిఁ బోవిడిచి వారక ధీరత నిల్చె; నంత ని
ర్ధూతవిరోధివైరివధ దోహలియై వడివైచెఁ దీవ్ర ని
ర్ఘాతము తోడఁబుట్టు వనఁగాఁ దగు నుజ్జ్వలశక్తి దైత్యుపైన్. **283**

ప్రతిపదార్థం: ఆతనిన్= ఆ కుమారస్వామిని; ఉగ్రతేజున్= భయంకరమైన తేజస్సు కలవాడిని; నిటల+అక్ష, తనూ భవున్= ఫాలనేత్రుడైన పరమశివుడి కుమారుడిని; చూచి= అరసి; నిర్జర, వ్రాతము= దేవతల సమూహం; భీతిన్+పోన్; విడిచి= భయాన్ని వదలిపెట్టి; వారక= మానక; ధీరతన్= ధైర్యంతో; నిల్చెన్= నిలబడింది; అంత= అప్పుడు; నిర్ధూత, విరోధి= శత్రువులను చెదరగొట్టే కుమారస్వామి; వైరి, వధ, దోహలి+ఐ= శత్రువులను సంహరించే ఉత్సాహం కలవాడై; వడిన్= వేగంగా; తీవ్ర, నిర్ఘాతము, తోడన్+పుట్టువు+అనఁగాన్+తగు= గాఢమైన పిడుగుకు సహోదరమైనది అని చెప్పదగు; ఉత్+జ్వల, శక్తిన్= మిక్కిలిగా వెలుగొందే శక్తి అనే ఆయుధాన్ని; దైత్యుపైన్= రాక్షసుడిపై= మహిషుడిపై; వైచెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: గొప్పతేజస్సుతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ముక్కంటి పట్టిని కుమారస్వామిని చూచి దేవతలు భయాన్ని వీడి ఉత్సాహంతో రణరంగంలో ధైర్యంగా నిలబడ్డారు. అంతట శత్రువును సంహరించే కోరికతో ఉత్సాహం వెల్లివిరిసి కుమారస్వామి ఆ రాక్షసుడైన మహిషుడిపై పిడుగునకు తోబుట్టువు అని చెప్పదగిన గొప్ప ఆయుధమైన శక్తిని ప్రయోగించాడు.

క. **దారుణకల్పాంతాగ్ని స । మారంభము దోఁప నమ్మహాశక్తి రయం**
బారంగ నడరి దివిజేం । ద్రారాతిం బొదివి భస్మితాంగునిఁ జేసెన్. **284**

ప్రతిపదార్థం: ఆ+మహా, శక్తి= ఆ గొప్ప శక్తి అనే ఆయుధం; కల్ప+అంత, అగ్ని, సమ్+ఆరంభము, తోఁపన్= ప్రళయకాలమందలి అగ్నియొక్క ఆటోపారంభం స్ఫురించేటట్లుగా; రయంబు+ఆరంగన్+అడరి= శీఘ్రచర్యతో విజృంభించి; దివిజ+ ఇంద్ర+ అరాతిన్+పొదివి= దేవతలయొక్క అధిపతి అయిన ఇంద్రుడి శత్రువును (మహిషుడిని) చేరి; భస్మిత+అంగునిన్+ చేసెన్= బూడిదగా మారిన శరీరం కలవాడినిగా చేసింది.

తాత్పర్యం: 'శక్తి' అనే ఆయుధవిశేషం, ప్రళయకాలమందలి అగ్నియొక్క ప్రారంభాన్ని తలపించేటట్లుగా మహిషాసురుడిని చేరి ఆతడి శరీరాన్ని బూడిదబుగ్గి అయ్యేటట్లు తగులబెట్టింది.

వ. ఇవ్విధంబున మహిషాసురుం బరిమార్చి కుమారుండు మఱియు నమ్మహాశక్తిం బునః పునః ప్రయోగంబు గావించుచు ననేకదైత్యదానవ శతసహస్రంబుల వధియించె; నద్దేవుని పారిషదగణంబుం గవిసి యసురులం దునిమి తూఁటాడి తదీయరక్తపాన మాంసఖాదనంబులు సేసి మత్తిల్లి యాడుచుం బాడుచు నతనిఁ గొనియాడుచు విహరించె; నిట్లు వైరులం బొలియించి తిమిరంబు విరియించిన తిమిర వైరియుం బోలె వెలుంగుచున్న కార్తికేయు నజేయుం జేర నరుగుదెంచి దేవేంద్రుం డతనిం గౌఁగిటం జేర్చి యిట్లనియె.285

ప్రతిపదార్థం: ఇవ్విధంబునన్= ఈ రీతిగా; కుమారుండు= కుమారస్వామి; మహిష+అసురున్= మహిషుడు అనే రాక్షసుడిని; పరిమార్చి= సంహరించి; మఱియున్= ఇంకను; ఆ+మహాశక్తిన్= ఆ గొప్ప శక్తి అనే ఆయుధ విశేషాన్ని; పునః, పునః, ప్రయోగంబు= తిరిగి తిరిగి వాడటం; కావించుచున్= చేస్తూ; అనేక, దైత్య, దానవ, శత, సహస్రంబులన్= పెక్కు వేల మంది దైత్యులను (దితివంశజులను), దానవులను (దనువు వంశజులను); వధియించెన్= సంహరించాడు; ఆ+దేవుని= ఆ కుమారస్వామి యొక్క; పారిషద గణంబున్= కొలువు కూటానికి సంబంధించిన భటుల గుంపుకూడ; కవిసి= ముట్టడించి; అసురులన్= రాక్షసులను; తునిమి తూఁటాడి= ముక్క చెక్కలు చేసి; తదీయ, రక్త, పాన మాంస, ఖాదనంబులు+చేసి= వారల యొక్క నెత్తురులు త్రాగి మాంసాలు తిని; మత్తిల్లి= మదించి; ఆడుచున్+పాడుచున్= ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ; అతనిన్= కుమారస్వామిని; కొనియాడుచున్= ప్రశంసిస్తూ; విహరించెన్= స్వేచ్ఛగా తిరిగాయి; ఇట్లు= ఈ రీతిగా; వైరులన్= శత్రువులను; పొలియించి= సంహరించి; తిమిరంబు, విరియించిన= చీకటిని పారద్రోలిన; తిమిర వైరియున్+పోలెన్= సూర్యుడివలె; వెలుంగుచున్న= ప్రకాశిస్తున్న; కార్తికేయున్= కుమారస్వామిని; అజేయున్= జయించ నలవికానివాడిని; చేరన్+అరుగుదెంచి= సమీపానికి వచ్చి; దేవేంద్రుండు= దేవతలకు ప్రభువు అయిన ఇంద్రుడు; అతనిన్+ ఆ కుమార స్వామిని; కౌఁగిటన్+చేర్చి= కౌగిలించుకొని; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా పలికాడు.

తాత్పర్యం: ఈ రీతిగా కుమారస్వామి మహిషుడు అనే రాక్షసుడిని సంహరించాడు. పిదప కుమారస్వామి శక్తి అనే ఆ గొప్ప ఆయుధాన్ని రాక్షసులపై పలుమారులు ప్రయోగించాడు. అందువలన ఆ రక్కసులు అందరు చనిపోయారు. అంతట కుమారస్వామిపరివారానికి చెందిన భటగణములు ఆ రాక్షసులను చీల్చి చెండాడి వారల నెత్తురులు త్రాగి, మాంసాలను భక్షించి మత్తెక్కి, ఆడుతూ పాడుతూ కుమారస్వామిని కొనియాడారు. ఈ విధంగా, చిమ్మచీకట్లను పారద్రోలి దేదీప్యమానంగా ప్రకాశించే సూర్యుడివలె తేజరిల్లిన కుమారస్వామిదగ్గరకు వచ్చి, దేవేంద్రుడు ఆతడిని కౌగిలించుకొని ఈ రీతిగా పలికాడు.

చ. 'కమలభవప్రదత్తవరగర్వితుఁడై మముఁ జీరికిం గొనం
దమితపరాక్రముండు దనుజాధిపుఁ డీతఁడు నీ మహోగ్ర కో
పమను దవాగ్నియందు శలభంబును బోలె నశించె; వీనికిన్
సములగువారు వెండియును జచ్చిరి నూర్వురు దైత్యు లీ యనిన్. 286

ప్రతిపదార్థం: అమిత పరాక్రముండు= గొప్ప శౌర్యం కలవాడు; దనుజ+అధిపుఁడు= రాక్షసులయొక్క రాజు; ఈతఁడు= (ఈ మహిషుడు); కమల, భవ, ప్రదత్త, వర, గర్వితుఁడు+ఐ= బ్రహ్మదేవుడిచేత ఈయబడిన వరంచేత మదించినవాడై;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మమున్= మమ్మలను (దేవతలను); చీరికిన్+కొనండు= లెక్క చేయడు; నీ, మహా+ఉగ్ర కోపము+అను, దవ+అగ్ని+అందున్= నీదైన మిక్కిలి భయంకరమైన ఆగ్రహం అనే కార్చిచ్చులో; శలభంబును+పోలెన్= మిడుతవలె; నశించెన్= నాశనమయ్యాడు; వెండియును= మఱియును; వీనికిన్ సములు+అగువారు= వీడితో (మహిషుడితో) సమానమైనవారు; నూర్వురు, దైత్యులు= వందమంది రాక్షసులు; ఈ+అనిన్= ఈ యుద్ధంలో; చచ్చిరి= మరణించారు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడివలన పొందిన వరంచేత మదించిన ఈ మహిషాసురుడు దేవతలమైన మమ్మల్ని సరకు చేయలేదు; ఈతడు గొప్ప శౌర్యవంతుడు, రాక్షసులకు ప్రభువు. కాని, వీడు నీ గొప్పకోపం అనెడి కార్చిచ్చులో పడి మిడుతవలె మాడిపోయాడు. అంతేకాక, ఈ యుద్ధంలో ఈ మహిషుడితో సమానులు అనదగిన వందమంది రాక్షసవీరులు సైతం మరణించారు. ఇది అంతా నీ పరాక్రమంచేతనే సాధించబడింది.

క. లోక త్రయంబు నందును । నీ కీర్తి వెలింగె నమరనికరము నేనున్
నీ కింకరులము గుణర । త్నాకర! రక్షింపు మమ్ము ననిశము కృపతోన్.' 287

ప్రతిపదార్థం: గుణరత్న+ఆకర!= మంచి గుణాలు అనే రత్నాలకు సముద్రం వంటివాడా!; నీ కీర్తి= నీ యశస్సు; లోక త్రయంబు నందును= మూడు లోకాలలోను; వెలింగెన్= ప్రకాశించింది; అమర, నికరమున్= వేల్పుల సముదాయమున్నూ; నేనున్= నేనున్నూ (ఇంద్రుడనైన నేనున్నూ); నీ కింకరులము= నీకు సేవకులము; అనిశము= ఎల్లప్పుడు; కృపతోన్= దయతో; మమ్మున్= మమ్మలను అనగా దేవతలను; రక్షింపు(ము)= కాపాడుము.

తాత్పర్యం: మంచి గుణాలకు సముద్రం వంటివాడా! ఓ కుమారస్వామీ! నీ యశస్సు మూడులోకాలలో వెల్లివిరిసింది. నేనున్నూ, వేల్పులం అందరమున్నూ నీ యొక్క సేవకులం. దయతో నీవు మమ్మల్ని ఎల్లప్పుడూ కాపాడుము.'

వ. అని పలికె; నప్పుడు పార్వతీసుందరుండు నిజనందనుఁ బునఃపునరాలింగనంబుల నభినందించి, పురందర ప్రముఖులం జూచి, 'యిక్కుమారునందు నాయందు దెట్లట్ల సభక్తికచిత్తులరై వర్తిల్లుం' డని యాజ్ఞాపించి, యనంతరంబ భద్రవటంబునకుం జనియె; నమరులు ప్రమదంబునం దమ తమ నివాసంబులకుం జని; రి వ్విధంబున. 288

ప్రతిపదార్థం: అని పలికెన్= అని చెప్పాడు; అప్పుడు= ఆ సమయంలో; పార్వతీ సుందరుఁడు= పార్వతీదేవికి భర్త అయిన శివుడు; నిజ, నందనున్= తన కుమారుడైన కుమారస్వామిని; పునః, పునః+ఆలింగనంబులన్= మరల మరల కౌగిలించుకొనటం చేత; అభినందించి= సంతోషింపజేసి; పురందర, ప్రముఖులన్+చూచి= దేవేంద్రుడు మున్నగు నాయకులను అరసి; ఈ+కుమారునందున్= ఈ కుమారస్వామి పట్ల; నాయందున్+ఎట్లు+అట్లు+అ= నా యందు ఏ విధంగా ఉంటారో, అట్లే; సభక్తిక, చిత్తులరు+ఐ= పూజ్యభావంతో కూడిన అనురాగం కల మనస్సు కలవారై; వర్తిల్లుండు= ప్రవర్తించండి; అని= అని చెప్పి; ఆజ్ఞాపించి= ఆనతి ఇచ్చి; అనంతరంబు+అ= అటు పిమ్మట; భద్రవటంబునకున్= భద్రవటం అనే చోటికి; చనియెన్= వెళ్లాడు; అమరులు= దేవతలు; ప్రమదంబునన్= సంతోషంతో; తమతమ నివాసంబులకున్= తాము తాము నివసించే స్థలాలకు; చనిరి= వెళ్ళారు; ఈ+విధంబునన్= ఈ రీతిగా.

తాత్పర్యం: అని చెప్పాడు. అంతట శివుడు తన కుమారుడైన కుమారస్వామిని పలుమారులు కౌగిలించుకొని అభినందించాడు. పిదప శివుడు దేవేంద్రుడు మున్నగు నాయకులతో 'మీరు నన్ను ఏ విధంగా పూజ్యభావంతో

కూడిన అనురాగంతో చూస్తున్నారో అట్లే ఈ కుమారస్వామిని కూడ మన్నించండి' అని ఆజ్ఞాపించి, తాను భద్రవటానికి వెళ్ళాడు. పిమ్మట దేవతలు తమ తమ నివాసస్థానాలకు వెళ్ళిపోయారు. ఈ రీతిగా.

ఉ. ఒక్కదినంబునందు బలియుండు సురారుల నెల్లఁ దున్మి పెం
పెక్కి దయార్ద్రుఁ డై యభయ మిచ్చె జగంబుల కెల్ల షణ్ముఖుం;
డిక్కథ భక్తితో వినిన నెప్పుడుఁ గీర్తన సేసినన్ జనుల్
నిక్కము సర్వదోషముల నీఁగి భజింతురు భవ్య భద్రముల్. 289

ప్రతిపదార్థం: బలియుండు= బలం కలవాడు; షట్+ముఖుండు= ఆరుమోముల దేవర అయిన కుమారస్వామి; ఒక్క దినంబునందున్= ఒక రోజులోనే; సుర+అరులన్+ఎల్లన్+తున్మి= దేవతలయొక్క శత్రువులయిన రాక్షసులను అందరిని సంహరించి; పెంపు+ఎక్కి= అతిశయించి; దయా+ఆర్ద్రుఁడు+ఐ= కరుణచేత తడిసినవాడై; జగంబులకున్+ఎల్లన్= సమస్త లోకాలకు; అభయము+ఇచ్చెన్= రక్షణ కల్పించటానికి హామీ ఇచ్చాడు; జనుల్= ప్రజలు; ఈ+కథన్= ఈ కథను; భక్తితోన్= పూజ్యభావంతో; వినినన్= ఆలకిస్తే; ఎప్పుడున్= ఏ సమయంలో; కీర్తన+చేసినన్= చదివితే; సర్వ, దోషములన్+ఈఁగి= అన్ని పాపాలనుండి విముక్తి చెంది; భవ్య భద్రముల్= శ్రేష్ఠమైన శుభములను; భజింతురు= పొందుతారు; నిక్కము= నిజం.

తాత్పర్యం: బలవంతుడైన ఆరుమోములదేవర కుమారస్వామి దేవతలకు శత్రువులైన రాక్షసుల నందరిని ఒక్కరోజులోనే సంహరించి, మూడులోకాలలోని ప్రజలకు అభయం ప్రసాదించాడు. ఈ కథను మనుజులు ఎవ్వరైనా ఎప్పుడైనా, వినినా, చదివినా, సమస్తదురితాలు తొలగి, ఉత్కృష్టములైన శుభాలను పొందగలరు. ఇది ముమ్మాటికి నిజం.

వ. అని మార్కండేయుండు సెప్పినఁ బాండవులు సంతుష్టహృదయు లై యమ్మహాత్మునిం బ్రశంసించిరి; వా రివ్విధంబున నభీష్టకథాగోష్ఠిం బ్రవర్తిల్లు నెడఁ గృష్ణవల్లభ యైన సత్యభామయుఁ బాంచాలియు నేకతంబ యొక్క యెడఁ బ్రియసల్లాపసంసక్తలై యుండి; రప్పుడు సత్యభామ ద్రౌపది కి ట్లనియె. 290

ప్రతిపదార్థం: అని మార్కండేయుండు; చెప్పినన్= చెప్పగా; పాండవులు; సంతుష్ట హృదయులు+ఐ= మిక్కిలి తృప్తి చెందిన హృదయాలు కలవారై; ఆ+మహా+ఆత్మునిన్= ఆ మహానుభావుడిని; ప్రశంసించిరి= పొగడారు; వారు= ఆ పాండవులు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; అభీష్ట, కథా, గోష్ఠిన్+ప్రవర్తిల్లు+ఎడన్= ఇష్టమైన కథలను పలువురు కలిసి శ్రద్ధతో వింటున్న సమయంలో; కృష్ణ, వల్లభ+ఐన= శ్రీకృష్ణుడి భార్య అయిన; సత్యభామయున్, పాంచాలియున్= ద్రౌపదియు; ఏకతంబు+అ= రహస్యంగా, ఏకాంతంగా; ఒక్క+ఎడన్= ఒక చోట; ప్రియ సల్లాప సంసక్తలు+ఐ+ఉండిరి= తమకు ఇష్టమైన సంభాషణ జరపటంలో ఆసక్తలై ఉన్నారు; అప్పుడు= ఆ సమయంలో; సత్యభామ; ద్రౌపదికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ విధంగా మహిషాసుర సంహార గాథను, కుమారస్వామి పరాక్రమప్రాభవాలను మార్కండేయమహర్షి పాండవులకు వినిపించాడు. ఈ రీతిగా పాండవులు మిక్కుటమైన శ్రద్ధతో, భక్తితో పెక్కు కథలను మార్కండేయ మహర్షివలన విని, సంతృప్తి చెంది ఆ మహర్షిని పూజించి అభినందించారు. ఆ సమయంలో శ్రీకృష్ణుడి భార్య అయిన సత్యభామ, పాండవ ధర్మపత్ని అయిన ద్రౌపది ఇష్టసల్లాపాలలో నిమగ్నలై ఉన్నారు. అప్పుడు సత్యభామ పాంచాలితో ఒంటరిగా ఇట్లు పలికింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పాండవులు అరణ్యావాసం చేస్తున్నప్పుడు మార్కండేయమహర్షి వచ్చి, వారికి ఎన్నో కథలను వివరించి చెప్పాడు. మార్కండేయ మహర్షి వచ్చినప్పుడే శ్రీకృష్ణుడుకూడ తన ధర్మపత్నిఅయిన సత్యభామతోపాటు వచ్చి ఆ పురాణకథాగోష్ఠిలో పాల్గొన్నాడు. సత్యభామ ప్రాగల్భ్యవతిగా, స్వాభిమానవతిగా ప్రసిద్ధికెక్కిన పౌరాణిక పాత్ర. ద్రౌపది వినయవతి. ఇరువురి ఆంతరంగిక సంభాషణ అనుశీలించతగింది.

సత్యా ద్రౌపదీ సంవాదము (సం. 3-222-1)

సీ. **'నీ ప్రియభర్తల నిర్మలచరితులఁ । బ్రకటతేజుల లోకపాలనిభులఁ**
బార్థుల నీ వొకభంగిన వదలక । చెలువ! యెబ్భంగి భజింతు దగిలి?
యొక్క రొక్కనికంటె నువిద! నీ కేవురు । ననురక్తు లగుట యత్యద్భుతంబు;
నగుమొగంబుల కాని నలినాక్షి! నీ దెసఁ బతులకుఁ గింకిరిపాటు లేదు;

తే. **వ్రతము పెంపొ? మంత్రౌషధ వైభవంబొ? । సరస నైపథ్యకర్మ కౌశలమొ? చతుర**
విభ్రమోల్లాస రేఖయొ? వెలఁది! నీ వి । శేష సౌభాగ్య హేతువు సెపుము నాకు. **291**

ప్రతిపదార్థం: చెలువ= అందమైనదానా! (ఓ ద్రౌపదీ); నీ ప్రియ భర్తలన్= నీకు ప్రీతిపాత్రులైన పెనిమిటులను; నిర్మల చరితులన్= కళంకం లేని పరిశుద్ధమైన శీలాలు కలవారిని; ప్రకట తేజులన్= దేదీప్యమానమైన వెలుగుతో భాసించేవారిని; లోకపాలనిభులన్= దిక్పాలకులతో సమానమైన వారిని; పార్థులన్= కుంతీకుమారులను, పాండవులను; నీవు; వదలక= వదలిపెట్టకుండ; ఒక భంగిన్+అ= ఒకే విధంగా (అందరను సమానంగా); ఏ+భంగిన్= ఏ రీతిగా; తగిలి= ఆసక్తి గలిగి; భజింతు(వు)= ఆరాధిస్తావు?; ఉవిద!= ఓ వనితా! ద్రౌపదీ!; ఒక్కరు+ఒక్కని కంటెన్= ఒకరిని మించి మరి ఒకరు; నీకున్= నీకు; ఏవురు= అయిదుగురు; అనురక్తులు+అగుట= ప్రేముడి కలవారు కావటం; అతి+అద్భుతంబు= మిక్కిలి అచ్చెరువు కలిగించే అంశం; నలిన+అక్షి!= పద్మాల వంటి కన్నులు గలదానా!; నగు, మొగంబుల కాని= నవ్వుతో కూడిన ముఖాలతో తప్ప; నీ దెసన్= నీ యెడల; పతులకున్= భర్తలకు; కింకిరిపాటు, లేదు= కోపంతో గూడిన ఏవగింపు ఉండదు; నీ విశేష, సౌభాగ్య హేతువు= నీ యొక్క గొప్పదైన భర్తృవాల్లభ్యానికి (భర్తచేత నీవు పొందుతున్న మిక్కిలి అనురాగానికి) కారణం; వ్రతము+పెంపు+ఒ= నోములు నోయటం వలన కలిగిన అతిశయమా?; మంత్ర+ఔషధ, వైభవంబు+ఒ= మంత్రాలయొక్క, మందులయొక్క గొప్పతనమా?; సరస నైపథ్య కర్మ కౌశలము+ఒ= చక్కని వస్త్రాద్యలంకార విశేషంలో నీకు గల నేర్పరి తనమా?; చతుర, విభ్రమ+ఉల్లాస, రేఖ+ఒ= తెలివితేటలయొక్క చురుకుదనపు ఒరపా?; నాకున్= నాకు (సత్యభామ అయిన నాకు); చెపుము= వివరించి తెలుపుము.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కల ఓ ద్రౌపదీ! నీ భర్తలు అయిదుగురును నీయందు మిక్కుటమైన అనురాగం కలవారు. ఒకరిని మించి మరొకరు నీ మీద ప్రేముడి ప్రదర్శిస్తుంటారు. వారందరి యెడల నీవు సమానమైన ఆసక్తి గలిగి మసలుకొంటూ వుంటావు. వారు అందరు దేదీప్యమానమైన తేజస్సు కలవారు, పరిశుద్ధమైన శీలం కలవారలు, దిక్పాలకులతో సమానమైన ప్రాభవం కలవారు. అటువంటి వారు అందరును నీయెడ ఎల్లప్పుడు మురిపెంతో ముసిముసినవ్వులు ప్రసరింపచేయటం వింతలలో వింత. ఇట్టి అద్భుత మహిమ నీకు ఏ విధంగా చేకూరింది? ఏవైనా గొప్ప నోములు నోచావా? మంత్రతంత్రాలు అభ్యసించావా? మందులు మాకులు ప్రయోగించావా? వస్త్రాద్యలంకారంలో తెలివితేటలు కారణమా? చురుకుదనాలు ఒయ్యారాలు ఒలికించగల నేర్పు ఏదైనా నీకు ఉన్నదా? భర్తల అనురాగాన్ని ఈ విధంగా నీవు చూరగొనటానికి గల కారణం నాకు చెప్పగోరుతున్నాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **ఏనును నీవలన నిజము । గా నిది యంతయును నెఱిఁగి కమలదళాక్షుం**
బూని వశగతునిఁ జేసి య । నూనస్నేహానుభోగయుక్తిఁ దలిర్తున్.' **292**

ప్రతిపదార్థం: ఏనును= (సత్యభామ నయిన) నేనును; నీవలనన్= నీ దగ్గర నుండి; నిజముగాన్= సత్యంగా; ఇది+ అంతయునున్+ఎఱిఁగి= దీనిని అంతటిని తెలిసికొని; కమల దళ+అక్షున్= తామరరేకులవంటి కన్నులు కలవాడిని (శ్రీకృష్ణుడిని); పూని= ప్రయత్నించి; వశగతునిన్+చేసి= లోబరచుకొని; అనూన, స్నేహ+అనుభోగయుక్తిన్= మిక్కుటమైన సౌఖ్యానుభవంతో కలిసి యుండటంతో; తలిర్తున్= విలసిల్లుతాను.

తాత్పర్యం: ద్రౌపదీ! నీవ్యక్తిత్వం అసాధారణ మైనది. నీవు ఏ విధంగా నీ భర్తల అనురాగాన్ని చూరకొనగలిగావో ఆ కిటుకును, ఆ లోగుట్టును నాకు నిజంగా తెలిపితే నేను కూడా ఆ విధంగానే నా భర్త అయిన శ్రీకృష్ణుడి ప్రేముడిని చూరగొంటాను.'

క. **అని యడిగిన మది నించుక । గినుక వొడమ నడఁచుకొనుచుఁ గృష్ణ మృదులహా**
సిని యగుచుఁ గృష్ణభామినిఁ । గనుఁగొని యి ట్లనియె నిర్వికారాకృతియై. **293**

ప్రతిపదార్థం: అని, అడిగినన్= అని ప్రశ్నించగా; మదిన్= మనస్సులో; ఇంచుక, కినుక+పొడమన్= కొంచెం కోపం ఏర్పడగా; అడఁచు కొనుచున్= అణచివేసికొంటూ; కృష్ణ= ద్రౌపది; మృదుల, హాసిని+అగుచున్= చిరునవ్వుతో కూడింది ఔతూ; కృష్ణ భామినిన్+కనుఁగొని= శ్రీకృష్ణుడి భార్యను (సత్యభామను) పరికించి; నిర్వికార+ఆకృతి+ఐ= ఏవిధమగు మానసిక భారం పైకి కనిపించనీయని ఆకారం కలదియై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: సత్యభామ ఆ విధమైన ప్రశ్నలు వేయటంచేత ద్రౌపదికి తన మనస్సులో కొంచెం కోపం వచ్చింది. తాను భర్తలప్రేమ చూరగొనటానికి మంత్రాలు, మందులు, మాకులు, అలంకరణంలో నేర్పరితనం-ఇట్టివానిని హేతువులుగా పేర్కొనటం సత్యభామకు ఉచితమగు ప్రవర్తనకాదు కదా! అందుచేత ద్రౌపదికి కోపం వచ్చింది. అయినను, ద్రౌపది తన కోపాన్ని అణచుకొన్నది. (కోపాన్ని అణచుకొనటం ఉత్తమలక్షణం). తదుపరి శ్రీకృష్ణుడి భార్యఐన సత్యభామతో ద్రౌపది ఈ విధంగా పలికింది.

క. **'నను నిట్లు దుష్టవనితా । జనమునటులుగాఁ దలంపఁ జనునే నీకున్?**
మన సొప్పదు పురుషోత్తము । వనితవుగాఁ దగవు నీవు వనరుహనయనా!' **294**

ప్రతిపదార్థం: వనరుహ, నయనా!= పద్మాల వంటి కన్నులు కలదానా!; (ఓ సత్యభామా!); ననున్= నన్ను (ద్రౌపది నైన నన్ను); ఇట్లు= ఈ విధంగా; దుష్ట, వనితా జనము+అటులుగాన్= చెడ్డ స్త్రీల మాదిరిగా; నీకున్= నీకు; తలంపన్+చనునే= భావించవచ్చునా; మనసు+ఒప్పదు= (నీవు ఇట్టి మాటలు పల్కుతావని) మనస్సు అంగీకరించదు; నీవు= నీవు; పురుష+ఉత్తము, వనితవు+కాన్+తగవు= మగవారలలో శ్రేష్ఠుడు అయిన శ్రీకృష్ణుడికి ఇల్లాలివి కాదగినదానవు కావు.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కలదానా! సత్యభామా! నీవు ఎంతటి అందకత్తెవైనను, నన్ను తక్కువస్థాయిలోని ఆడువారితో జమకట్టి ఇటువంటి మాటలు మాటలాడవచ్చునా? అసలు నీవు ఇటువంటి మాటలు పలుకుతావనే విషయాన్ని నా మనస్సు అంగీకరించటం లేదు. పురుషోత్తముడైన శ్రీకృష్ణుడికి భార్యగా ఉండదగిన యోగ్యత నీకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లేదు సుమా' అని మెత్తమెత్తగా చీవాట్లు పెట్టింది ద్రౌపది - సత్యభామతో సరససల్లాపాలు చేస్తున్న మాదిరిగా పైకి కనపడుతూనే.

విశేషం: ఈ కందపద్యంలో ఎఱ్ఱనపై తిక్కన కవితాశిల్పప్రభావం కనపడుతున్నది. పురుషోత్తమ శబ్దం సార్థకం.

వ. అని మేలంపుఁ జందంబున దాని వివేకవిహీనత యెఱుక పడ నాడి, పాంచాలి మఱియు ని ట్లనియె.295

ప్రతిపదార్థం: అని= అని పలికి; మేలంపున్+చందంబునన్= సరసపు పలుకులు పలికినట్లుగా; దాని= (సత్యభామయొక్క); వివేక, విహీనత= వివేకం లేకపోవటాన్ని (విచక్షణజ్ఞానం లోపించటాన్ని); ఎఱుక+పడన్= తేటతెల్లం అయ్యేటట్లుగా; ఆడి= పలికి; పాంచాలి= ద్రౌపది; మఱియున్= ఇంకను; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: ద్రౌపది ఆ విధంగా హాస్యగర్భితమైన మాటలలో సత్యభామకు ఆమె తెలివితక్కువతనాన్ని తేటతెల్లం చేసి ఇంకను ఈ రీతిగా పలికింది.

చ. 'అలయక మంత్ర తంత్ర వివిధౌషధ భంగులఁ జేసి యెంతయున్
వలతురు నాథు లంట మగువా! కడుబేలతనంబు; దాన మున్
గలిగిన ప్రేమయుం బొలియుఁ గాని యొకండును సిద్ధిఁబొందు; ద
ప్పాలఁతుక తోడి మన్కి యహిపొత్తుగఁ జూచు విభుం డెఱింగినన్. 296

ప్రతిపదార్థం: మగువా!= వనితా! (= ఓ సత్యభామా!); అలయక= డస్సిపోక - అనగా పూనికతో; మంత్ర, తంత్ర, వివిధ+ఔషధ, భంగులన్+చేసి= దివ్యాక్షరాలను జపించటం, వశీకరణ ప్రక్రియలను చేయటం, పెక్కు మందులను వాడటం మున్నగు పద్ధతులవలన; ఎంతయున్= ఎక్కువగా; నాథులు= భర్తలు; వలతురు= అనురాగం చూపుతారు; అంట= అనటం, అనుకోవటం; కడు= మిక్కిలి; బేలతనంబు= తెలివితక్కువతనం; దానన్= దాని వలన; మున్= అంతకుముందు; కలిగిన= ఏర్పడిన; ప్రేమయున్= అనురాగంకూడా; పొలియున్+కాని= నశిస్తుందేకాని; ఒకండును= ఒక్కటియున్నూ; సిద్ధిన్+పొందదు= ఫలించదు; ఆ+పొలఁతుకతోడి మన్కి= ఆ వనితతో కలిసి ఉండటం; విభుండు= మగడు; ఎఱింగినన్= తెలిసికొంటే మాత్రం (మందులు, మంత్ర, తంత్రాల ప్రయోగం చేస్తున్నట్లు పసికట్టితే); అహి, పొత్తుగన్= పాముతో చెలిమి చేస్తున్న మాదిరిగనే; చూచున్= చూస్తాడు.

తాత్పర్యం: 'ఓ సత్యభామా! మంత్రతంత్రాలతో మందులుమాకులతో భర్త వశుడౌతాడని అనుకొనటం తెలివి తక్కువతనం మాత్రమే. దానివలన, భార్యపై భర్తకు అంతకుముందు ఏర్పడిన అనురాగం కూడ నశిస్తుంది. ఎట్టి లాభం కలుగదు. అట్టి భార్యతో కాపురం చేయటం, పాముతో చెలిమి చేయటం వంటిదే అని భర్త భావిస్తాడు.

చ. మగువ యొనర్చు వశ్యవిధి మందులు మాఁకులు నొండుచందమై
మగనికిఁ దెచ్చు రోగములు, మానక మూకజడాదిభావముల్
మొగి నొనరించు, నద్దురితముల్ దన చేసిన చేత లై తుదిన్
జగమున కెక్కి నిందయును సద్గతిహానియు వచ్చు నింతికిన్. 297

ప్రతిపదార్థం: మగువ= ఆడుది; ఒనర్చు= చేసే; వశ్యవిధి= (భర్తను) లోబరచుకొనటానికై చేసే ప్రక్రియ; మందులు, మాఁకులు= ఔషధాలు, ఔషధాలను పోలినవి; ఒండు చందము+ఐ= వేరు విధంగా ప్రవర్తిల్లి; మగనికిన్= భర్తకు; రోగములు=

జబ్బులు; మానక= తగ్గక; మూక, జడ+ఆది, భావముల్= మూగతనం, మొద్దుబారటం, మున్నగు స్థితిగతులు; తెచ్చున్= సంక్రమింపజేస్తాయి; మొగిన్= పూనికతో వరుసగా; ఒనరించు= చేసెడి; ఆ+దురితముల్= ఆ పాపాలు; తన చేసిన చేతలు+ఐ= తాను స్వయంగా చేసిన పనులై (స్వయంకృతమైన అపరాధాలై); తుదిన్= చివరకు; జగమునకున్+ఎక్కి= లోకానికి అంతటికీ తెలిసి; ఇంతికిన్= ఆడుదానికి (భార్యకు); నిందయును= అపవాదాన్నీ; సత్+గతి, హానియున్= ఉత్తమ గతులకు కీడు కలుగటయున్నూ; వచ్చున్= ఏర్పడుతుంది.

తాత్పర్యం: భర్త తనకు లోబడి ఉండాలనే ఆరాటం చొప్పున భార్య వశీకరణ తంత్రాలు, మందులు, మాకులు ప్రయోగిస్తే, అవి బెడిసికొట్టి అనుకొనని విధంగా భర్తకు మూగతనం, మనస్సు, శరీరం మొద్దుబారటం మున్నగు జబ్బులు కొని తెచ్చి పెట్టుతాయి. ఆమెకు లోకంలో అపకీర్తి వస్తుంది. అది అంతయు ఆమె స్వయంకృతాపరాధమే కాబట్టి, ఆమెకు ప్రాప్తించేది తుదకు నరకయాతన మాత్రమే.

క. కావునఁ బతులకు నెప్పుడుఁ। గావింపం దగదు కపటకర్మంబులు; ద
ద్భావ మెఱిఁగి యనువర్తిని। యై వనిత చరింప, నదియ యగు నెల్లవియున్. 298

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; పతులకున్= భర్తలకు; ఎప్పుడున్= ఏ సమయంలో కూడా; కపట కర్మంబులు= మోసపు పనులు; కావింపన్+తగదు= చేయరాదు; తద్+భావమున్+ఎఱింగి= ఆ (భర్త యొక్క) అభిప్రాయాన్ని తెలిసికొని; అనువర్తిని+ఐ= అనుకూలమైన ప్రవర్తన కలదై; వనిత= మగువ (భార్య); చరింపన్= ప్రవర్తించటం చేత; అది+అ= అదియే; ఎల్లవియున్= సమస్తమును (భర్తను ఆకర్షించే ఉత్తమ పద్ధతులన్నీ); అగున్= ఔతుంది.

తాత్పర్యం: కాబట్టి భార్యలు ఎప్పుడును భర్తలయెడ మోసపు పనులు చేయరాదు. భర్త అభిప్రాయాలు తెలిసికొని, వాటికి అనుకూలంగా భార్య ప్రవర్తించాలి. అట్టి అనుకూల దాంపత్యమే సకల రీతుల భర్తను ఆకట్టుకొనే ఉత్తమ విధానమని గ్రహించాలి.

వ. పాండవులయెడ నే నెట్టిదాన నై యిట్టిసౌభాగ్యంబు నందితి; నది నీకు నెఱింగించెద నేర్పడ వినుము. 299

ప్రతిపదార్థం: పాండవుల+ఎడన్= పాండురాజు కొడుకుల పట్ల (నా భర్తల యెడ); నేను= నేను; ఎట్టి దానను+ఐ= ఎటువంటి దానినై; ఇట్టి= ఈ విధమైన (నీవు గుర్తించినట్టి); సౌభాగ్యంబున్= భర్తృ ప్రేమ అనెడి సంపదను; అందితిన్= పొందానో; అది= (ఆ సంగతి); నీకున్= నీకు; ఎఱింగించెదన్= తెలియపరుస్తాను; ఏర్పడన్+వినుము= సావధానంగా ఆకర్ణింపుము.

తాత్పర్యం: పాండవుల పట్ల నేనెటువంటి దానినై వ్యవహరించి, ఇట్లాంటి పతివాల్లభ్యాన్ని (పతుల అనురాగాన్ని) పొందగలిగానో, దాన్ని నీకు తెలియపరుస్తాను. విశదంగా వినుము.

సీ. పతు లాత్మ నొండొక్క పడఁతులఁ। గలసిన నలుగ, నెయ్యెడల నహంకరింప;
మదముఁ బ్రమాదంబు మాని వారికిఁ జిత్త। మేకముఖంబుగ నెల్లప్రొద్దు
భక్తి సేయుదుఁ; జూపుఁ బలుకును గోర్కియుఁ। జెయ్వులు వింతగాఁ జేయ నెపుడు;
నమర గంధర్వ యక్షాదులం దైనను। బురుషు నన్యునిఁ దృణంబుగఁ దలంతు;

తే. స్నాన భోజన శయనాది సంప్రయోగ। మర్థిఁ బతులకు మున్నెందు నాచరింపఁ;
బతులు వచ్చిన నాసన పాద్య విధుల। భక్తితో నేన కావింతుఁ బనుప నొరుల. 300

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పతులు= భర్తలు; ఆత్మన్= మనస్సుతో; ఒండు+ఒక్క, పడఁతులన్= వేరొక స్త్రీలను; కలసినన్= కూడినప్పటికీ; అలుగన్= కోపగించుకోను; ఏ+ఎడలన్= ఏ సందర్భాలలోను; అహంకరింపన్= అహంకారాన్ని ప్రదర్శించను; మదమున్= గర్వాన్ని; ప్రమాదంబున్= పొరపాటును; మాని= ఉజ్జగించి; వారికిన్= భర్తలకు; చిత్తము+ఏక, ముఖంబుగన్= మనస్సును ఏకాగ్రంగా నిలిపి; ఎల్లప్రొద్దున్= ఎల్లవేళల; భక్తి+చేయుదున్= ఆరాధిస్తాను; చూపున్= వీక్షణం; పలుకును= మాటయును; కోర్కియున్= వాంఛయు; చెయ్వులు= చేష్టలు; వింతగాన్= అసాధారణంగా అచ్చెరువు గొలిపేటట్లుగా; ఎప్పుడున్= ఎపుడును; చేయను= ఒనరించను; అమర, గంధర్వ, యక్ష, ఆదులందున్+ఐనను= దేవతలు, గంధర్వులు, యక్షులు మున్నగు దివ్యజాతులకు చెందినవారయినను; పురుషున్= మగవాడిని; అన్యునిన్= ఇతరుడిని; తృణంబుగన్= గడ్డిపోచగా; తలంతున్= ఎంచుతాను; స్నాన, భోజన, శయన+ఆది, సంప్రయోగము= జలకమాడటం, ఆహారం తినటం, పడుకోవటం మున్నగు పనులలో కూడా; అర్థిన్= పూనికతో (మనసార కోరికతో); పతులకున్= భర్తలకు; మున్న= ముందుగా; ఎందున్= ఎచటను; ఆచరింపన్= చేయను; పతులు= భర్తలు; వచ్చినన్= వస్తే; ఆసన, పాద్యవిధులన్= కూర్చుండటానికై పీట వేయటం, కాళ్ళుకడుగు కొనటానికి నీళ్ళుఇవ్వటం మున్నగు పనులు; భక్తితోన్= పూజ్యభావంతో; కావింతున్= చేస్తాను; ఒరులన్= ఇతరులను; పనుపన్= నియమించను.

తాత్పర్యం: భర్తలు అన్యకాంతలయెడ అనురక్తులయి వారిని కూడినప్పటికీ నేను కోపం చెందను; ఎప్పుడును స్వాతిశయం చూపక, ఎల్లప్పుడును భర్తలయెడ వినయంతో పూజ్యభావంతో వారికి పరిచర్య చేస్తాను. వింత పనులను చేయను. వింతమాటలు పలుకను. పరపురుషులు దేవతలైనా సరే, యక్షులైనా సరే, పరపురుషులైన వారిని గడ్డిపోచతో సమంగా చూస్తాను. స్నానం, భోజనం, శయనం మున్నగు సౌకర్యాలను భర్తలకు ముందుగా ఏర్పరచి, తదుపరి నేను అనుభవిస్తాను. భర్తలు ఇంటికి విచ్చేసినపుడు, వారికి కాళ్లు కడుగుకొనటానికి నీరు, కూర్చొనటానికి ఆసనాలు నేనే స్వయంగా ఏర్పాటుచేస్తాను కాని, ఆ పనులు చేయటానికై సేవకులను నియోగించను.

చ. తగియెడు వేళలందు నియతంబుగ మజ్జన భోజన క్రియల్
దగ నొడఁగూర్తు భర్తలకు; ధాన్యధనంబులు రిత్తమై వ్యయం
బగుటకు నోర్వ నెప్పడు, గృహస్థలభాండ విశోధనంబు లి
మ్ముగ నొకనాఁడు నేమఱఁ, బ్రమోదము సల్పుదు బంధుకోటికిన్. 301

ప్రతిపదార్థం: భర్తలకున్= పతులకు; తగియెడు వేళలందున్= ఆయా సమయాలలో; మజ్జన భోజన, క్రియల్= స్నానం ఆహారం పెట్టటం అనెడి పనులు; నియతంబుగన్= ముందుగా నిర్ణయించబడిన పద్ధతి మీరకుండగా; తగన్= ఒప్పిదంగా, ఆయా పనులకు అనువైన రీతిగా; ఒడఁగూర్తున్= ఏర్పాటు చేస్తాను; ధాన్య, ధనంబులు= ధాన్యాలు ద్రవ్యాలు; రిత్తమైన్= అనవసరంగా, వ్యర్థంగా; వ్యయంబు+అగుటకున్= ఖర్చు కావటానికి; ఓర్వన్= సమ్మతించను; ఎప్పుడున్= అన్ని సమయాలలో; గృహ, స్థల, భాండ, విశోధనంబులు= ఇల్లు వాకిళులు చిమ్మటం, పాత్రలు తోమికడగటం; ఇమ్ముగన్= చక్కగా; ఒకనాఁడున్= ఒక రోజు కూడ; ఏమఱన్= మరచి వదలిపెట్టను; బంధు కోటికిన్= చుట్టాల సముదాయాలకు; ప్రమోదము= సంతోషం; సల్పుదున్= కలిగిస్తాను.

తాత్పర్యం: నా పతులకు ఆయా సమయాలలో నిర్ణీతపద్ధతి తప్పకుండా స్నానం, ఆహారం మున్నగు సదుపాయాలను సమకూరుస్తాను. ధాన్యం కాని ధనం కాని వ్యర్థం కానీయను, అనవసరంగా వెచ్చింపను; ఇల్లు వాకిళులు పాత్రలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉండేటట్లుగా, మరపు ఏమరుపాటు లేకుండా సదా కాచుకొని చూచుకొంటాను. చుట్టాలందరికి సదా సంతోషం కలిగిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పలుమాఱుం దలవాకిట । మెలఁగుట, యసతీజనైకమిత్రత, కలహం
బుల కెలయుట, నగుపలుకులఁ । బెలుచ నగుట నాకుఁ గానిపేరివి మగువా! 302

ప్రతిపదార్థం: మగువా!= వనితా, ఓ సత్యభామా!; పలుమాఱున్= ఎక్కువ సారులుగా; తల వాకిటన్= ఇంటి ముంగిట; మెలఁగుట= తిరుగుతుండటం; అసతీ జన+ఏక, మిత్రత= సతులుకాని ఆడువారలతో ఎక్కువగా స్నేహం చేయటం; కలహంబులకున్+ ఎలయుట= విరోధాలకు పాల్పడటం; నగు పలుకులన్= హాస్యపు మాటలతో; పెలుచన్+నగుట= ఎక్కువగా నవ్వటం, నాకున్=నాకు, కానిపేరివి= నాకు సంబంధించినట్టివి కావు.

తాత్పర్యం: పలుమారులు ఇంటిగుమ్మందగ్గర, ముంగిలిట్లో తిరుగుతూ ఉండటం, చెడ్డ ఆడువారితో ముఖ్యంగా స్నేహం చేయటం, వాదులాడటం, హాస్యపు మాటలతో మితిమీరి నవ్వటం మున్నగునవి నాకు ఇష్టం కలిగించేవి కావు. అట్టి పనుల జోలికి నేను ఎన్నడూ పోను.

క. పతు లిచ్చమెయిఁ బ్రవాస । స్థితులైనం బుష్పగంధ దీప్తాభరణ
ప్రతతి ధరియింపఁ దద్గత । మతి నగుచుఁ దదాగమంబ మదిఁ గాంక్షింతున్. 303

ప్రతిపదార్థం: పతులు= భర్తలు; ఇచ్ఛమెయిన్= తమతమ అభీష్టానుసారంగా; ప్రవాస స్థితులు+ఐనన్= గ్రామాంతరాలకు వెళ్లి ఉన్నట్లయితే; పుష్ప, గంధ, దీప్త+ఆభరణ, ప్రతతిన్= పూవులు, పరిమళ ద్రవ్యాలు, ప్రకాశించే అలంకారాల సముదాయాన్ని; ధరియింపన్= తాల్చను; తద్+గత, మతిన్+అగుచున్= వారియందే (ఆ భర్తల యందే) నిలుపబడిన మనస్సు కల దానను ఔతూ; తద్+ఆగమంబు+అ= వారి (ఆ భర్తల యొక్క) రాకను మాత్రమే; మదిన్= మనస్సులో; కాంక్షింతున్= కోరుకొంటూ ఉంటాను.

తాత్పర్యం: భర్తలు వారి వారి కోరిక మేరకు వేరుచోటులకు వెళ్లితే, నేను పువ్వులు ముడువను. పరిమళపు మై పూతలు పూసికొనను. మిరుమిట్లు గొలుపుతూ వెలుగొందే ఆభరణాలను ధరించను. భర్తలపట్లనే మనస్సు లగ్నం చేసికొని వారు ఎప్పుడు తిరిగి ఇంటికి చేరుతారా అని యెదురుతెన్నులు చూస్తూ వారి రాకకై నిరీక్షిస్తుంటాను.

ఉ. అత్తకు భక్తి గల్గి మది నాయమ సెప్పిన మాడ్కి జీవికా
వృత్తము లావహింతు; గురువిప్రజనాతిథి పూజనంబు ల
త్యుత్తమభక్తి నేన తగ నోపి యొనర్తుఁ; బ్రియంబుఁ దాల్మియున్
మెత్తఁదనంబు సన్మతియు మేలుగఁ దాల్తు సమస్తభంగులన్. 304

ప్రతిపదార్థం: అత్తకున్= భర్తయొక్క తల్లియెడ; భక్తి= పూజ్యభావం; కల్గి= ఉండి; మదిన్= మనస్సులో; ఆయమ= ఆమె (అత్తగారు); చెప్పిన మాడ్కిన్= సెలవిచ్చిన రీతిగా; జీవికావృత్తములు= నిత్య జీవితానికి సంబంధించిన ఆచరణలు; ఆవహింతున్= నెరవేరుస్తాను; గురు, విప్ర, జన+అతిథి, పూజనంబులు= గురుజనులు, విప్రజనులు, అతిథిజనులయొక్క సపర్యలు; అతి+ఉత్తమ, భక్తిన్= మిక్కిలి ఎక్కువైన పూజ్యభావంతో; ఏను+అ= నేనే స్వయంగా; తగన్=చక్కగా; ఓపి= సహించి; ఒనర్తున్= చేస్తాను; సమస్త భంగులన్= అన్ని పద్ధతులలో ఎల్లప్పుడును ఎల్ల రీతులలో; ప్రియంబున్= సంప్రీతిని; తాల్మియున్= ఓర్పును; మెత్తఁదనంబున్= మృదుత్వాన్ని; సత్+మతియున్= మంచితనాన్ని; మేలుగన్= శుభంగా; తాల్తున్= ధరిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అత్తగారియెడ పూజ్యభావం కలిగి, ఆమె చెప్పిన రీతిగనే నా దినచర్యను తీర్చిదిద్దుకొంటాను. పెద్దలు బ్రాహ్మణులు అతిథులు విచ్చేసినపుడు, వారి సేవకు అనుచరులను నియోగించక, పూజ్యభావంతో వారికి సపర్యలు నేను చేస్తాను; సంప్రీతి, క్షమ, వినయం, మంచితనం అనే శుభగుణాలను ఎల్లప్పుడును విడనాడక సదా ప్రవర్తిస్తాను.

విశేషం: పెద్దలకు చేయవలసిన సేవలు చేయటంలో గమనించవలసిన ముఖ్యాంశాలు (1) సేవకులకు ఆ పనులు ఒప్పగించక తానే చేయటం (2) ఆ సేవ హృదయపూర్వకంగా భక్తిభావంతో చేయటం.

క. **కడు మృదువు లనుచుఁ దేఁకువ । సెడి యెపుడుఁ జరింప భరతసింహులు గోపం**
బడరిన నాశీవిషముల । వడువునఁ గ్రూరు లని వెఱపు వదలక కొల్తున్. **305**

ప్రతిపదార్థం: భరత, సింహులు= భరతుడి వంశంలో పుట్టినవారిలో శ్రేష్ఠులు (సింహాలవంటివారు) అయిన పాండవులు; కడు, మృదువులు+అనుచున్= చాల మెత్తని (స్వభావంకల) వారని అనుకొంటూ; ఎపుడున్= ఏ సమయంలో కూడా; తేఁకువ+చెడి= భయంలేకుండా; చరింపన్= ప్రవర్తించను; కోపంబు+అడరినన్= కోపం కలిగితే (వస్తే); ఆశీవిషముల, వడువునన్= పాముల వలె; క్రూరులు+అని= కఠినమైనవారని, నొప్పించేవారని, భయంకరులని; వెఱపు= భయం; వదలక= వీడకుండా (భయంతో అని భావం); కొల్తున్= సేవిస్తాను.

తాత్పర్యం: భరతవంశంవారిలో శ్రేష్ఠులైన పాండవులు ఎంత మెత్తటివారో అంత కఠినులు. వారు మనసుమెత్తనివారని తెలిసినా ఎప్పుడూ వారిపట్ల భయం లేకుండా నిర్లక్ష్యంగా ప్రవర్తించను. వారికే కోపంవస్తే పాముల్లాగా భయంకరులు, మనసు గట్టిపడి బాధిస్తారుకూడా. అందువలన వారికి ఎప్పుడూ భయంతోనే సేవలు చేస్తుంటాను.

సీ. **మాయత్తఁ బృథ్వీసమానఁ బృథాదేవిఁ । గుంతిభోజాత్మజఁ గోమలాంగి**
సతతంబు భోజనస్నానాదికములయం । దిమ్ముగఁ బరిచర్య యేన చేసి
సంప్రీతఁ జేయుదు; జనవంద్యుఁ డగు ధర్మ । తనయునిబంతి నిత్యంబుఁ బసిఁడి
పళ్ళెరంబులఁ గుడ్చు బ్రాహ్మణు లతిపుణ్యు । లెనిమిదివేలు సమిద్ధమతులు

తే. **యతులు పదివేలు; వారల కనుదినంబు । నన్నపానంబు లర్హసహాయ నగుచు**
నొడికముగ నేన కావింతు నుచిత వస్త్ర । భూషణాదులఁ బరితోషముగ నొనర్తు. **306**

ప్రతిపదార్థం: పృథాదేవిన్= పృథ అనే పేరు కల దేవిని; పృథ్వీ, సమానన్= భూదేవితో సమానమైన (అనగా మిక్కిలి ఓర్పు గల) దానిని; కుంతిభోజ+ఆత్మజన్= కుంతిభోజుడు అనే రాజుగారి కూతురును; కోమల+అంగిన్= మెత్తని శరీరం కలదానిని; మా+అత్తన్= మా అత్తగారిని; సతతంబు= ఎల్లప్పుడును; భోజన, స్నాన+ఆదికములలందున్= ఆహారం, స్నానం మున్నగు క్రియల అందు; ఇమ్ముగన్= ప్రీతితో; పరిచర్య= సేవ; ఏను+అ= నేనే; చేసి= ఒనరించి; సంప్రీతన్+చేయుదున్= మిక్కిలి సంతృప్తి చెందినట్టి దానినిగా చేస్తాను; జనవంద్యుఁడు= జనులచేత నమస్కరించ దగినవా డయిన; ధర్మతనయుని, బంతిన్= ధర్మరాజుయొక్క వరుసలో (సహపంక్తిని); నిత్యంబున్= ప్రతి దినమున్నూ; పసిఁడి, పళ్ళెరములన్= బంగారు కంచాలలో; కుడ్చు= తినునట్టి; బ్రాహ్మణులు= విప్రులు; అతి పుణ్యులు= మిక్కిలి సుకృతాలు ఒనరించినట్టివారు; ఎనిమిది, వేలు= ఎనిమిదివేల మంది; సమ్+ఇద్ధ మతులు= గొప్ప వెలుగొందే బుద్ధికలవారు; యతులు= సన్న్యాసులు; పదివేలు= పదివేలమంది; వారలకున్= వారికి; అను దినంబున్= ప్రతిరోజున్నూ; అన్నపానంబులు= తిండియును త్రాగు నీరును; అర్హ సహాయన్+అగుచున్= తగినట్లుగా సాయం చేసే దానను ఔతూ; ఒడికముగన్= తెలివితేటలు చూపుతూ ఒప్పిదంగా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏను+అ= నేనే; కావింతున్= చేస్తాను; ఉచిత, వస్త్ర, భూషణ+ఆదులన్+తగినట్టి బట్టలు ఆభరణాలు మున్నగు వాటిని; పరితోషముగన్= సంతోషంగా; ఒనర్తున్= చేస్తాను.

తాత్పర్యం: మా అత్తగారు కుంతీదేవి కుంతిభోజుడు అనే మహారాజుగారికూతురు. ఓర్పులో భూదేవితో పోల్చదగింది. సుకుమారి. ఆమెకు స్నానం, ఆహారం మున్నగు సదుపాయాలను స్వయంగా నేనే సమకూరుస్తుంటాను. ప్రజలచేత ఆరాధించబడే ధర్మరాజు ప్రతిదినం భోజనసమయాన తన సహపంక్తిని ఎనిమిదివేలమంది బ్రాహ్మణులకు బంగారుకంచాలలో అన్నసంతర్పణ చేస్తాడు. అట్లే సన్న్యాసులు పదివేల మందికి భోజనం పెడతాడు. వారికి అందరికి నేనే స్వయంగా వడ్డన వార్పులు సరిచూచి, వారికి తగిన బట్టలు, ఆభరణాలు సమకూరుస్తుంటాను. అందరికీ సంతోషం సమకూర్చటం నా కర్తవ్యంగా పరిగణిస్తాను.

వ. **మఱియు ధర్మరాజునగరియందుఁ గనకమణిమయ భూషణాలంకృతు లయిన పరిచారకులు నూఱువేలు రేయును బగలును బాత్రహస్తులై యభ్యాగత భోజనంబు లొడఁగూర్చువారు నందఱ గలరు; వీ రెల్ల నిట్టిట్టిమెలఁకువ మెలంగుదు రని తత్కృతాకృతంబు లేన యెఱుంగుదు; నిరంతర మదధారా తరంగిత కపోలంబు లయిన భద్రగజశతసహస్రంబులుఁ బ్రభూతజవసత్త్వసన్నుతంబు లయిన యుత్తమాశ్వ శతసహస్రంబులుం గలవు; వానికి నన్నింటికి నిత్యోచితంబు లయిన ఖాద్యంబు లొనరింపను బాలింపను దగినవారి నేన నియమింతు; నఖండభాండాగారపూరితంబు లయిన యగణ్యమణి కనకాదివస్తువులను బ్రతిదినవిహితంబు లయిన యాయ వ్యయంబులు నా యెఱుంగని యవియు లేవు; గోపాల జనంబులు దుదిగాఁ గల సకల భృత్య జనంబుల జీవితంబుల నరసి యేన నడపుదుం; బరమయశోధను లగు పాండునందనులు నిజకుటుంబభారంబు సర్వంబు నాయంద సమర్పించి తారు నిర్భరులై యిష్టవిహారంబుల నుండుదు; రే నెల్ల వెంటల నప్రమత్త నై వర్తింతు.** **307**

ప్రతిపదార్థం: ॥మఱియున్= ఇంకను; ధర్మరాజు నగరియందున్= ధర్మరాజు యొక్క అంతఃపురంలో; కనక, మణిమయ, భూషణ+అలంకృతులు+అయిన= బంగారంతో, రత్నాలతో కూడిన నగలచేత అలంకరించబడిన వారయిన; పరిచారకులు= సేవకులు; నూఱువేలు= లక్షమంది; రేయును= రాత్రియును; పగలును= పగలును; పాత్రహస్తులు+ఐ= పాత్రలను పూనిన చేతులు కలవారై; అభ్యాగత, భోజనంబులు= పిలువక పోయినా వచ్చిన అతిథులకు ఆహారాలు; ఒడగూర్చువారు= సమకూర్చే వారు; అందఱు+అ+కలరు= (సేవకులు) అంతమందే ఉన్నారు; వీరు+ఎల్లన్= వీరందరును; ఇట్టి+ఇట్టి= ఇటువంటి ఇటువంటి; మెలఁకువన్= తెలివి తేటలతో కూడిన దీక్షతో; మెలంగుదురు= ప్రవర్తిస్తారు; అని= అని; తద్+కృత+అకృతంబులు= వారిచేత చేయబడినవి చేయబడనివి; ఏను+అ= నేనే; ఎఱుంగుదున్= తెలిసికొంటాను; నిరంతర, మద, ధారా, తరంగిత, కపోలంబులు+అయిన= ఎల్లప్పుడు కారుతున్న మదజలాల ధారల అలలచేత ఆవరించబడిన చెక్కిళ్లు కలవి అయిన; భద్ర, గజ, శత సహస్రంబులున్= పట్టపుటేన్గులు లక్షలును; ప్రభూత, జవ, సత్త్వ, సన్నుతంబులు+అయిన= అతిశయించిన వేగంతో శక్తితో పొగడబడినట్టివి అయిన; ఉత్తమ+అశ్వ, శత సహస్రంబులున్= మంచి గుర్రాలు లక్షలు; కలవు= ఉన్నవి; వానికిన్+అన్నింటికిన్= ఆ ఏనుగులు గుర్రాలు అన్నిటికిని; నిత్య+ఉచితంబులు+అయిన= ప్రతి దినానికి తగినట్టివి అయిన; ఖాద్యంబులు= ఆహారాలు; ఒనరింపను= ఏర్పాటు చేయుటకున్నూ; పాలింపను= సరిచూచుటకున్నూ; తగిన వారిన్= సమర్థులను; ఏను+ అ= నేనే; నియమింతున్= ఏర్పాటు చేస్తాను; అఖండ, భాండ+ఆగార, పూరితంబులు+అయిన= పూర్తిగా భాండాగారములలో నింపబడిన; అగణ్య, మణి, కనక+ఆది, వస్తువులను= లెక్కకు మించిన రత్నాలు బంగారాలు మొదలగు పదార్థాలను; ప్రతి, దిన, విహితంబులు= ప్రతిరోజూ ఏర్పాటుగా జరిగేవి; అయిన= అయినట్టి; ఆయ, వ్యయంబులును= రాబడి ఖర్చులున్నూ; నా+ఎఱుంగనివి= నాకు తెలియనివి; లేవు= ఉండవు; గోపాల జనంబులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గొల్లవారు; తుదిగాన్= చివరి వారుగా; కల= ఉన్న; సకల, భృత్య, జనంబుల జీవితంబులన్= అందరు సేవకుల సముదాయం యొక్క జీతభత్యాలను; అరసి= పరిశీలించి చూచి; ఏను+అ= నేనే; నడపుదున్= ప్రవర్తింప చేస్తాను; పరమ, యశస్+ధనులు+ అగు= గొప్ప కీర్తినే సంపదగా కల; పాండు నందనులు= పాండవులు; నిజ, కుటుంబ భారంబున్= తమదైన సంసారపు బరువు నంతటిని; నాయందున్+అ= నామీదనే; సమర్పించి= ఉంచి; తారు= తాము; నిర్భరులు+ఐ= బరువు లేనివారై; ఇష్ట, విహారంబులన్= తమకు నచ్చిన నడవడికలతో; ఉండుదురు= ప్రవర్తిల్లుతారు; ఏను= నేను; ఎల్ల వెంటన్= అన్ని ఎడలను; అప్రమత్తను+ఐ= అజాగ్రత్త లేని దాననై; వర్తింతున్= మెలగుతాను.

తాత్పర్యం: ఇంకను చెప్పుతాను. సావధానంగా వినుము. ధర్మరాజు దినచర్య విశిష్టవైభవోపేత మైనది. ఆయన అంతఃపురంలో నూరువేలమంది సేవకులు పవలు రాత్రి అనక సేవ చేస్తూంటారు. ఆ సేవకులు రత్నాలతో పొదుగబడిన బంగారు ఆభరణాలు ధరించేవారు. వారు చేతులలో ఎల్లప్పుడు పాత్రలను పూని అతిథులకు అభ్యాగతులకు ఆహారపానీయాలు సమకూరుస్తుంటారు. వారందరు ఎట్టి జాగరూకతతో ఉన్నారో ఏ ఉపచారాలు చేస్తున్నారో ఏ అపచారాలు చేస్తున్నారో అని నేను ఎల్లప్పుడూ కనిపెట్టుతుంటాను. ఎల్లప్పుడు మదజలం స్రవించే పట్టపుటేనుగులు లక్షలు; గొప్ప బలం వేగం కల గుర్రాలు లక్షలు ఉన్నవి. వాటికి అన్నింటికి సరిఅయిన ఆహారాన్ని సమకూర్చటానికి, వాటిని అదుపులో పెట్టి క్రమశిక్షణలో నిర్వహించటానికి తగినవారిని నేనే నియమిస్తుంటాను. బొక్కసంలో ఉండే రత్నరాసులు బంగారు వస్తువులు నిత్యం జరిగే ఆదాయ వ్యయాలు అన్నీ నాకు తెలియును. నాకు తెలియని అంశం ఒక్కటి కూడా లేదు. సేవకులలో చివరిశ్రేణికి చెందిన గొల్లవారలకు, తదితరులకు ఇచ్చే జీతభత్యాలు నేనే సరిచూస్తుంటాను. సుగృహీత నామధేయు లైన పాండవులు తమ సంసారపు బరువును నామీద మోపి, హాయిగా తమకు ఇష్టమైనతావులలో విహరిస్తుంటారు. కుటుంబాన్ని అంతటిని ఈదే దానిని నేనే. అన్నివిషయాలను నేనే చూచుకొంటాను. అన్నివైపులా జాగరూకత వహిస్తాను.

ఆ. వేగ జాము గలుగ వెడనిద్రఁ బొందుదుఁ । గాని రాజ్యభారకార్యయుక్తి
నబ్జనయన! నాకు నాహార నిద్రల । కెడయు లేదు సువ్వె యెల్లప్రొద్దు. 308

ప్రతిపదార్థం: అబ్జనయన!= పద్మాల వంటి కన్నులు కలదానా, ఓ సత్యభామా!; వేగన్= తెలవారటానికి; జాము= ఏడున్నర గడియల కాలం; కలుగన్= ఉండగా; వెడ నిద్రన్= కలత నిద్దురను; పొందుదున్= అనుభవిస్తాను; కాని= అయినను; రాజ్య, భార, కార్య, యుక్తిన్= పరిపాలనయొక్క బరువుకు సంబంధించిన పనుల కూటమి చేత; నాకున్; ఎల్ల ప్రొద్దున్= ఎల్లప్పుడును; ఆహార నిద్రలకున్= తిండి తినటానికీ, నిద్దుర పోవటానికీ; ఎడయు లేదు, చువ్వె!= విరామంకూడా లేదు సుమా!

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు కల ఓ సత్యభామా! తెలవారుటకు ఇంకా ఒక జాము ప్రొద్దు మాత్రమే ఉన్నప్పుడు నాకు కొంత నిదుర పోవటానికి అవకాశం లభిస్తుంది. ఎల్లప్పుడు నాకు కడుపునిండ తిండి తినటానికి కనుల నిండ నిదురపోవటానికి సరిఅయిన తీరికే ఉండదు.

ఆ. ఇట్టి వర్తనముల నెపుడుఁ బాండవులకుఁ । దగిలి ప్రియము సేయఁ దగితిఁ గాని
మగువ! నీవు సెప్పు మందులు మాఁకులు । నింద్రజాలములును నే నెఱుఁగ.' 309

ప్రతిపదార్థం: మగువ!= వనితా, ఓ సత్యభామా!; ఇట్టి= ఇటువంటి (అనగా పతివ్రతా చర్యల వలననే); వర్తనములన్= చర్యల వలన; ఎపుడున్= ఎల్లప్పుడు; పాండవులకున్= పాండునందనులకు; తగిలి= పూని; ప్రియము+చేయన్+తగితిన్+కాని=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంప్రీతి కలిగించటానికి చాలినాను గాని; నీవు+చెప్పు= నీవు చెప్పే; మందులు మాఁకులు= ఔషధాలు (మున్నగునవి) ఔషధాల వంటివి; ఇంద్రజాలములును= కనుకట్టులును; నేన్= నేను; ఎఱుంగన్= తెలియజాలను.

తాత్పర్యం: ఓ సత్యభామా! నేను నుడివిన పతివ్రతాచర్యలవల్లనే నా భర్తల అనురాగాన్ని చూరగొనగల్గితిని; పాండవులకు ప్రియం చేయటం మాత్రమే నే నెరిగిన ధర్మం. నీవు చెప్పిన మందులు మాకులను గూర్చి నా కేమీ తెలియదు. ఇంద్రజాలవిద్యలు నాకు తెలియవు.'

విశేషం: ఇంద్రజాలం అనగా లేనిది ఉన్నట్లు నయనభ్రాంతిని కల్పించే హస్తలాఘవం.

వ. అనిన విని లజ్జాకలితచిత్త యగుచు సత్యభామ పాండవభామిని కిట్లనియె. 310

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని; లజ్జా, కలిత చిత్త+అగుచున్= సిగ్గుచేత కూడిన మనస్సు కలది ఔతూ; సత్యభామ; పాండవ, భామినికిన్= పాండవుల సతి (అయిన ద్రౌపదికి); ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: అనగా విని సత్యభామ సిగ్గుతో కూడిన మనస్సుతో ద్రౌపదితో ఇట్లా అన్నది.

క. 'ఏ నెఱుఁగమి ని ట్లడిగితి; । నా నేరమి సైఁప వలయు; నగవుగఁ గొనుమీ
మానిని! నా పలుకులు; స । న్మానితము భవచ్చరిత్రమహిమ ధరిత్రిన్.' 311

ప్రతిపదార్థం: మానిని!= మగువా, ఓ ద్రౌపదీ!; ఏను= నేను; ఎఱుఁగమిన్= అజ్ఞానం చొప్పున; ఇట్లు+అడిగితిన్= ఈ విధంగా ప్రశ్నించాను; నా నేరమి= నా యొక్క అజ్ఞానాన్ని; సైఁపన్‌వలయున్= క్షమించవలెను; నా పలుకులు= నా మాటలు; నగవుగన్+కొనుము+ఈ= పరిహాసంగా స్వీకరించుము; భవత్+చరిత్ర, మహిమ= నీప్రవర్తన యొక్క గొప్పదనం; ధరిత్రిన్= భూమిపై; సత్+మానితము= మంచి పేరు ప్రతిష్ఠల నార్జించింది.

తాత్పర్యం: ద్రౌపది చెప్పిన మాటలు ఆలకించి సత్యభామ సిగ్గుచేత తలవంచుకొనవలసి వచ్చింది. అందుచేత ఆమె ద్రౌపదికి క్షమాపణ చెప్పుకొన్నది. 'అభిమానవతివైన ఓ ద్రౌపదీ! నేను కేవలం అజ్ఞానం చొప్పున 'మందులు మాకులు' వశీకరణవిద్యలనుగూర్చి ప్రస్తావించాను. వాటిని దయతో' పరిహాస ప్రసంగాలుగా స్వీకరించి నన్ను మన్నించుము. నీ సౌశీల్యం నీకు ప్రపంచంలో పేరుప్రతిష్ఠలను ఆర్జించింది.'

వ. అనినం బాంచాలి మందస్మితానన యగుచు 'నది యట్ల కాక' యని పలికి మఱియు నిట్లనియె. 312

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా (అని సత్యభామ పలుకగా); పాంచాలి= పాంచాల రాజపుత్రి అయిన ద్రౌపది; మంద, స్మిత+ఆనన+అగుచున్= చిరునవ్వుతో కూడిన మొగం కలది ఔతూ; అది= (నీవు మందులు మాకులు గూర్చి చేసిన ప్రసంగం) అట్లు+అ= ఆ విధంగానే (అనగా కేవలం నవ్వుటాల కొరకు అనిన మాటలుగానే); కాక= అగుగాక; అని పలికి= అని చెప్పి; మఱియున్= ఇంకను; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: అని సత్యభామ క్షమాపణ కోరగా, ద్రౌపది చిరునవ్వులు చిందే మొగంతో సమాధానాన్ని ఇట్లా చెప్పింది. 'నీవు మందులు మాకులు గూర్చి చేసిన ప్రస్తావన, కేవలం నవ్వుటాలకు మాత్రమే జరిపినట్లుగా అనుకొందాంఅని.' మరల ద్రౌపది సత్యభామతో ఈ విధంగా పలికింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) ఈ పద్యాలు వ్రాసిన మహాకవి కవిత్రయంలో మూడవవాడయిన ఎఱ్ఱాప్రెగ్గడ. కాని తాను 'ఇది నన్నయ భట్ట ప్రణీతమైనది' అని తాను నన్నయను అనుకరిస్తున్నట్లుగా ప్రకటించాడు. నన్నయ కవితాశిల్పంలో ఎన్నదగినది 'ప్రసన్న కథా కవితార్థయుక్తి'. తిక్కన కవితాశిల్పంలో ఎన్నదగిన అంశము- "సంభాషణ చతురత. సత్యాద్రౌపదీ సంవాదంలోని 'సంభాషణ చాతురి' కు ఎఱ్ఱన మహాకవికి ఒజ్జబంతి ప్రసాదించిన మహనీయుడు తిక్కనయే. అంతేకాక 'మందస్మితానన' అయిన పాంచాలి లజ్జాకలితచిత్త అయిన సత్యభామ.... ఈ సాత్త్వికాభినయ వర్ణన తిక్కన ప్రభావమని చెప్పవచ్చును. పూర్వోక్తమైన వచనం (307 సంఖ్య)లో నన్నయ శైలి కన్పిస్తున్నది. నన్నయ తిక్కన మహాకవు లిరువురి కవితాశిల్పాలు ఎఱ్ఱన రచనలో గంగాయమునలవలె సంగమించిన వని చెప్పదగును.

ద్రౌపది సత్యభామకుఁ బతివ్రతాధర్మంబులు సెప్పుట (సం. 3-223-1)

క. 'పతిమనసు నాఁచికొనియెడు । చతురోపాయంబు నీకుఁ జపలాక్షి! సుని
శ్చిత మతిఁ జెప్పెద విను మూ । ర్జితమును ధర్మాన్వితము సుశీలంబునుగన్. 313

ప్రతిపదార్థం: చపల+అక్షి!= చలించే కన్నులు కలదానా!; (ఓ సత్యభామా); పతి మనసున్= భర్త యొక్క మనస్సును; ఆఁ చికొనియెడు= ఆకర్షించి కట్టుకొనే; చతుర+ఉపాయము= తెలివి తేటలతో కూడిన వెరవు; నీకున్; నిశ్చితమతిన్= సందేహం లేకుండా ఖండితంగా; ఊర్జితమును= గొప్పది అయినట్టిదిన్నీ; ధర్మ+అన్వితమున్= ధర్మంతో కూడినట్టిది; సుశీలంబుగన్= మంచి నడవడితో కూడినట్టిదిగా; చెప్పెదన్; వినుము;

తాత్పర్యం: 'చంచలమైన కన్నులు కల ఓ సత్యభామా!, భర్తయొక్క మనస్సుకు ఆకర్షించి పట్టుకొనే ఉపాయం నీకు చెప్పగలను. సావధానంగా ఆకర్ణించుము. ఆ ఉపాయం అచ్చమైన తెలివితేటలతో కూడింది; గొప్పతనాన్ని చేకూర్చేది. ధర్మంతో కూడింది. మంచినడవడి సమకూర్చేది సుమా! (మందులకు మాకులకు వశీకరణలకు తంత్రాలకు ఇంద్రజాలానికి సంబంధించింది కాదు అనే హెచ్చరిక అంతర్గర్భితం).

చ. పతిఁ గడవంగ దైవతము భామల కెందును లేదు; ప్రీతుఁడై
పతి గరుణించెనేనిఁ గలభాషిణి! భాసురభూషణాంబరా
న్విత ధనధాన్యగౌరవము విశ్రుతసంతతియున్ యశంబు స
ద్గతియును గల్గు; నొండుమెయిఁ గల్గనె యెన్నితెఱంగు లారయన్? 314

ప్రతిపదార్థం: కలభాషిణి!= అవ్యక్తమధుర మైన మాటలు మాటాడుదానా, ఓ సత్యభామా!; భామలకున్= మగువలకు; పతిన్= భర్తను; కడవంగన్= మించునట్టి; దైవతము= దైవం; ఎందును లేదు= ఎచ్చటను లేదు. పతి= భర్త; ప్రీతుఁడు+ఐ= తృప్తి చెందిన వాడయి; కరుణించెన్+ఏనిన్= దయ చూపితే; భాసుర, భూషణ+అంబర+అన్విత, ధన, ధాన్య గౌరవమున్= ప్రకాశించే ఆభరణాలతో వస్త్రాలతో కూడిన, సంపద, తిండి గింజలు అనువాని గొప్పతనం; విశ్రుత, సంతతియున్= పేరు కెక్కిన సంతానమున్నూ; యశంబున్= కీర్తి; సత్+గతియును= పుణ్య పదమున్నూ; కల్గున్= ఏర్పడతాయి, ఒండు మెయిన్= వేరొక రీతిగా; ఎన్ని, తెఱంగులు= ఎన్ని మార్గాలు; అరయన్= పరిశీలించినప్పటికి; కల్గును+ఎ= ఏర్పడునా? (= ఏర్పడవు).

తాత్పర్యం: అవ్యక్తమధురవాక్యాలు పలుకునట్టి ఓ సత్యభామా! భర్తను మించిన దైవం భార్యకు మరొకరు లేరు. భర్త దయచూపితే భార్యకు ఆభరణాలు లభిస్తాయి, ధన ధాన్య సంపదలు కలుగుతాయి, మంచి సంతానం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏర్పడుతుంది, కీర్తి లభిస్తుంది, పుణ్యం సంప్రాప్తిస్తుంది. ఆలోచించి చూస్తే భర్తవలనకాక వేరువిధంగా భార్యకు అభ్యుదయ పరంపరలు సంప్రాప్తించవుకదా!

విశేషం: చపలాక్షి, కలభాషిణి అనే సంబోధనలలో సత్యభామపట్ల ద్రౌపది 'ఎత్తిపొడుపు' ధ్వనిస్తుంది.

ఆ. కరము దుఃఖపడినఁ గాని యొక్కింత సౌ । ఖ్యంబు ధర్మగతియుఁ గలుగ దెందుఁ,
జూడు మబల! భర్తృశుశ్రూష ఫలము సం । తత శుభంబు గలదు, ధర్మ మొదవు. 315

ప్రతిపదార్థం: అబల= మగువ, ఓ సత్యభామా!; కరము= మిక్కుటంగా; దుఃఖపడినన్+కాని= కష్టాన్ని అనుభవించిన గాని; ఒక్క+ఇంత= కొంత, కొంచెం; సౌఖ్యంబు= సుఖం; ధర్మగతియున్= ధర్మంతో గూడిన పదం; ఎందున్= ఎచటను; కలుగదు= ఏర్పడదు; చూడుము= గమనించుము; భర్తృ శుశ్రూష ఫలము= పతికి చేసిన సేవ యొక్క ఫలితం; సంతత, శుభంబు= ఎల్లప్పుడు కలిగే మేలు; కలదు= ఉంటుంది; ధర్మమువు= ధర్మం; ఒదవున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఓ సత్యభామా! ఎంతో శ్రమిస్తే కాని కొంచెం సుఖం కలుగదు. పుణ్యం లభించటానికి మిక్కిలి శ్రమించవలసి ఉంటుంది. భర్తకు పరిచర్య చేస్తే సులువుగా పుణ్యం లభిస్తుంది. శీఘ్రంగా ఎల్లప్పుడూ మేలు కలుగుతుంది. దానివలన ధర్మం కూడా ప్రాప్తిస్తుంది.

క. కావున నిత్యము సమ్య । గ్భావము ప్రేమంబు వెరవు భక్తియుఁ బ్రియముం
గావింపుము నీ ప్రియునెడ । భావముఁ దా నెఱిఁగి భర్త బాగుగ మరగున్. 316

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నిత్యమున్= ప్రతి దినం; సమ్యక్+భావము= సరియైన యోచనం (ఆలోచన); ప్రేమంబు= ప్రేముడి; వెరవు= ఉపాయం; భక్తియున్= పూజ్యభావనను; ప్రియమున్= సంప్రీతిని; నీ ప్రియు+ఎడన్= నీ భర్తయెడల; కావింపుము= ఒనరించుము; భావమున్= అనురాగ పూరితమైన యోచనం; తాన్= తాను(భర్త); ఎఱిఁగి= తెలిసికొని; భర్త= పెనిమిటి; బాగుగన్= మంచిగా; మరగున్= వలపుతో కూడి ప్రవర్తిస్తాడు.

తాత్పర్యం: ఓ సత్యభామా! నీకు ప్రియుడైన నీ భర్తయెడ ప్రతిదినం సరైన ఆలోచన, ప్రేముడి, ఉపాయం, ఆరాధనాభావం, సంప్రీతి ప్రసరింప జేయుము. నీ ప్రేముడి గుర్తించి నీభర్త నీయెడ అనురాగంతో ప్రవర్తిస్తాడు.

మ. వనజాక్షుండు గడంగి నీ దగు గృహద్వారంబు సేరంగ వ
చ్చెననంగా విని లెమ్ము సంభ్రమముతోఁ జెన్నొందు నభ్యంతరం
బునకున్ వచ్చిన నాసనాదికరణంబుల్ దీర్పఁ దత్తజ్జనం
బు నియోగించితి నంచు నుండక ప్రియంబుల్ సేయు మీవుం దగన్. 317

ప్రతిపదార్థం: వనజ+అక్షుండు= పద్మాలవంటి కన్నులు కలవాడు (శ్రీకృష్ణుడు); నీది+అగు= నీదగు, నీ యొక్క; గృహద్వారంబు+చేరంగన్, వచ్చెన్+అనంగాన్= ఇంటి గుమ్మందగ్గరికి వచ్చాడనే మాట ఆలకించినంతనే; విని; సంభ్రమముతోన్= తొట్రుపాటుతో; లెమ్ము= లేచి నిల్చుండుము; చెన్ను+ఒందు= అందమైన; అభ్యంతరంబునకున్= అంతఃపురం లోకి; వచ్చినన్= వస్తే; ఆసన+ఆది, కరణంబుల్= కూర్చొనటానికి చేసే సదుపాయాలు; తీర్పన్= సమకూర్చుటకు; తద్+తద్+ జనంబున్= ఆయా మనుజులను; నియోగించితిని= ఏర్పాటు చేశాను; అంచున్= అని తలపోస్తూ; ఉండక= ఊరుకొనక; ఈవున్= నీవును; తగన్= ఒప్పిదంగా; ప్రియంబుల్+చేయుము= ప్రీతి కలిగించే వాటిని ఒనరించుము.

తాత్పర్యం: నీ భర్త అయిన శ్రీకృష్ణుడు పద్మాలవంటి కన్నులు కలవాడు. ఆతడు నీ ఇంటి గుమ్మం దగ్గరికి చేరగానే నీవు తొట్రుపాటుతో శీఘ్రంగా ఎదురేగి స్వాగతం పలుకుము. అతడే చెచ్చెర నీ అంతఃపురంలో ప్రవేశిస్తే, అతడికి కూర్చొనటానికి సదుపాయాలు చేయటానికై సేవకులను పలువురిని నియమించాను కదా అని నీవు ఉపేక్ష చేయరాదు. నీవే స్వయంగా ఎదురేగి ఆతడిని మన్నించి ఆతని అనురాగాన్ని చూరగొనుము.

చ. **తివిరి మురారి నీకుఁ గడు తీపుగఁ జెప్పిన పల్కు గల్గినం**
గువలయనేత్ర! నీ మనసు గూడినవారికి నైన నెప్డుఁ జె
ప్పవలదు; దాన నొండొక నెపంబు ఘటింతు రెఱింగి రేని నీ
సవతులు కృష్ణుబుద్ధి విరసంబగు నీదెసఁ దత్ప్రయుక్తిచేన్. **318**

ప్రతిపదార్థం: కువలయ నేత్ర!= నల్లగలువల వంటి కన్నులు కలదానా, ఓ సత్యభామా!; తివిరి= కడగి; ముర+అరి= ముర అనెడి రాక్షసుడికి శత్రువైన శ్రీకృష్ణుఁడు; నీకున్= నీకు; కడున్= మిక్కిలి; తీపుగన్= తీయగా; చెప్పిన పల్కు= చెప్పినమాట; కల్గినన్= ఉంటే; నీ మనసు+కూడిన వారికిన్+ఐనన్= నీ మనస్సుకు నచ్చిన నెచ్చెలులకైన; ఎప్డున్= ఎపుడుకూడా; చెప్పన్‌వలదు= చెప్పరాదు; దానన్= అందు వలన; నీ సవతులు= నీతోపాటు నీ భర్త పెండ్లి ఆడిన మగువలు; ఎఱింగిరి+ఏనిన్= (సంగతిని) తెలిసికొంటే; ఒండు+ఒక, నెపంబు= వేరొక మిష; ఘటింతురు= కల్పిస్తారు; తద్+ప్రయుక్తిచేన్= ఆ ప్రయోగం వలన; నీ దెసన్= నీ యెడల; కృష్ణు, బుద్ధి= శ్రీకృష్ణుడి మనస్సు; విరసంబు= రసం లేనిది, ప్రేముడి లేనిది; అగున్= కాగలదు.

తాత్పర్యం: నల్లకలువలవంటి కన్నులు కల ఓ సత్యభామా! నీయందు మిక్కుటమైన మక్కువ చూపి, శ్రీకృష్ణుడు నీకు సరససల్లాపప్రసంగవశాన ఏదైన రహస్యం చెప్పితే, దానిని నీవు నీ అనుగు నెచ్చెలులకు కూడ చెప్ప కూడదు. ఒకవేళ ఆ సంగతి నీ సవతులకు తెలిస్తే నీమీద నింద మోపి ఆ రహస్యాన్ని బట్టబయలు చేయగలరు. అప్పుడు నీ మీద గల ప్రేమాభిమానాలు శ్రీకృష్ణుడి మనస్సులో సన్నగిల్లుతాయి; జాగ్రత్త.

చ. **పతికి ననుంగు లైన తగు బంధుల మిత్త్రుల భోజనాది స**
త్కృతముల నాదరించుచు నకృత్రిమభక్తినియుక్తి సంతతో
త్థితమతివై చరింపుము; తదీయ హితేతరవృత్తు లైన వా
రతివ! భవత్సుహృజ్జనము లైనను గైకొనకుండు మెప్పుడున్. **319**

ప్రతిపదార్థం: అతివ!= ఓ మగువా, ఓ సత్యభామా!; పతికిన్= భర్తకు; అనుంగులు+ఐన= ఇష్టులు అయిన; తగు బంధులన్, మిత్త్రులన్= తగిన చుట్టాలను స్నేహితులను; భోజన+ఆది, సత్+కృతములన్= ఆహారం మున్నగు మంచి సదుపాయాలొనరించటంలో; ఆదరించుచున్= మన్నిస్తూ; అకృత్రిమ భక్తి నియుక్తిన్= స్వచ్ఛమైన పూజ్యభావం కలిగిఉండటంచేత; సంతత+ఉత్థిత, మతివి+ఐ= ఎల్లప్పుడును మేలుకొన్నబుద్ధిగలదానివై; చరింపుము= ప్రవర్తించుము; తదీయ, హిత+ఇతర, వృత్తులు+ఐనవారు= ఆతడి యొక్క మేలుకు వ్యతిరేకమైన ప్రవర్తన కలవారలను; భవత్+సుహృత్+జనములు+ఐనను= నీ యొక్క మిత్రములైనవారు అయినప్పటికిని; ఎప్పుడున్= ఎన్నడును; కైకొనక+ఉండుము= ఆదరించకుము.

తాత్పర్యం: ఓ సత్యభామా!, భర్తకు ప్రీతిపాత్రులైన చుట్టాలకు, మిత్రులకు ఆహారపానీయాలు మొదలైన సదుపాయాలను సమకూర్చటంలో నీవు ప్రత్యేకమైన జాగ్రత్త వహించుము. వారిని పూజ్యభావంతో గౌరవించుము. భర్త మేలు కోరక అతడికి వ్యతిరేకమైన చర్యలు చేసేవారు, నీకు మిత్రములైనప్పటికి వారిని ఆదరించకుము.

క. వినుఁ, ప్రద్యుమ్నాది భవ । త్తనయులయెడ నైన నేకతంబున నేకా
సనమున నుండుట దూష్యం । బని యెఱుఁగుము; సతులచరిత లతిదుష్కరముల్. 320

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; ప్రద్యుమ్న+ఆది, భవత్+తనయుల+ఎడన్+ఐనన్= ప్రద్యుమ్నుడు మున్నగు నీ కుమారుల యెడ నైనప్పటికి; ఏకతంబునన్= రహస్యంగా; ఏక+ఆసనమునన్= ఒకే వేదికపై; ఉండుట= (కూర్చొని) ఉండటం; దూష్యంబు+ అని= మంచిది కాదు అని; ఎఱుంగుము= తెలిసికొనుము; సతుల చరితలు= ఆడువారి నడవడులు; అతి, దుష్కరముల్= మిక్కిలి కష్టంతో చేయదగినవి.

తాత్పర్యం: సత్యభామా! శ్రద్ధతో ఆలకింపుము. ఆడువారి నడవడి మిక్కిలి కష్టంతో జాగరూకతతో తీర్చిదిద్దుకొన వలసి నట్టిది. ప్రద్యుమ్నాదులు నీకు పుత్ర నిర్విశేషులే. అయినప్పటికిని అట్టివారితో కూడి ఏకాంతంగా, ఒకే వేదికపై ఉండరాదు.

విశేషం: ప్రద్యుమ్నుడు రుక్మిణికి శ్రీకృష్ణుడికి పుట్టిన కొడుకు.

క. కులవతులును సతులును ని । ర్మల మతులును నయిన యట్టి మగువలతోడం
జెలిమి యొనరించునది; దు । ర్విలసిత వనితాభియుక్తి విడువుము తరుణీ! 321

ప్రతిపదార్థం: తరుణీ!= జవ్వనీ! ఓ సత్యభామా!; కులవతులును= ఆభిజాత్యవతులున్నూ (మంచి కుటుంబంలో జన్మించిన వారున్నూ); సతులును= పతివ్రతలున్నూ; నిర్మల మతులునున్= స్వచ్ఛమైన బుద్ధి కలవారున్నూ; అయిన+అట్టి= అయినట్టి; మగువలతోడన్= స్త్రీలతో; చెలిమి= స్నేహం; ఒనరించునది= చేయాలి; దుర్విలసిత, వనితా+అభియుక్తి= చెడ్డ హొయలు పోయే మగువలతో కలసి మెలసిఉండటం; విడువుము= వదలి పెట్టుము.

తాత్పర్యం: జవ్వని వైన ఓ సత్యభామా! మంచికుటుంబానికి చెంది మంచిబుద్ధి గల పతివ్రతలతో మాత్రమే నీవు స్నేహం చేయుము. వన్నెలవిసనకర్రలై విర్రవీగే వనితలతో ఎన్నడూ కలసి మెలసి తిరుగవద్దు.

వ. ఇది నీకుఁ బరమసౌభాగ్యమూలం బయిన యుపాయం' బనినం బ్రీతచిత్తయై సత్యభామ యిట్లనియె.322

ప్రతిపదార్థం: ఇది= (నేను చెప్పిన ఈ మాట); నీకున్; పరమ, సౌభాగ్య, మూలంబు+అయిన= భర్తయొక్క అధికమైన అభిమానాన్ని చూరగొనటానికి కారణమయిన; ఉపాయంబు= వెరవు; అనినన్= అని చెప్పగా; సత్యభామ= సత్యభామ; ప్రీత, చిత్త+ఐ= సంతృప్తిచెందిన మనస్సు కలదై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: నేను చెప్పిన ఈ మాటలు నీవు నీభర్తఅభిమానాన్ని అమితంగా చూరగొనటానికి ఆధారాలు ఔతాయి' అని ద్రౌపది చెప్పింది. సత్యభామ సంతృప్తి చెంది, ద్రౌపదితో ఇట్లా పలికింది.

సీ. 'నీవు ధర్మజ్ఞవు, దేవసన్నిభులు నీ । భర్తలు మహనీయ కీర్తిధనులు
ధైర్యతేజోబలశౌర్యసంపన్నులు । గావున వీరికి నే విధమున
ధారుణీరాజ్యంబు సేరెడుఁ దడయక । మీ కెగ్గు సేసిన లోకనింద్య
చరితుండు గౌరవధరణీశువనితలు । దిక్కులే కలమటఁ బొక్కుచుండఁ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. గని ముదంబునఁ బొందెదు వనిత! నీవు । సుతుల నత్యంతనిర్మలమతుల శౌర్య
యుతులఁ గాంచిన సద్గుణాన్వితవు వగపు । వలదు చిత్తంబులో నీకు జలజనయన! 323

ప్రతిపదార్థం: జలజనయన!= పద్మాల వంటి కన్నులు కలదానా, ఓ ద్రౌపదీ! నీవు= (ఓ ద్రౌపదీ) నీవు; ధర్మజ్ఞవు= ధర్మాన్ని ఎఱిగిన దానివి; నీ భర్తలు= నీ పతులు (పాండవులు); దేవ సన్నిభులు= దేవతలతో సమానులు; మహనీయ, కీర్తి, ధనులు= గొప్ప దైన యశస్సు అనే సంపద కలవారు; ధైర్య, తేజస్+బల, శౌర్య, సంపన్నులు= మనస్సు కలగని గంభీరత, దేదీప్యమాన మైన వెలుగు, శక్తి, పరాక్రమం అనే సంపద కలవారు; కావునన్= కాబట్టి; వీరికిన్= నీ భర్త లైన పాండవులకు; ఏవిధమునన్= ఎట్లయినను, తడయక= శీఘ్రంగా; ధారుణీ రాజ్యంబు= భూమిని పరిపాలించటం, భూమిపై ప్రభుత్వం; చేరెడున్= సంక్రమిస్తుంది; మీకున్+ఎగ్గు+చేసిన= మీకు అపకారం చేసిన; లోక, నింద్య, చరితుండు= జగత్తున గర్హింప దగిన ప్రవర్తనగలవాడు; కౌరవ, ధరణీ+ఈశు; వనితలు= కురువంశానికి చెందిన రాజు(దుర్యోధనుడి) యొక్క స్త్రీలు; దిక్కులేక= సాయం లేక; అలమటన్= కష్టాలలో; పొక్కుచుండన్= వెత చెందుతుండగా; కని= చూచి; ముదంబునన్+పొందెదు= సంతోషాన్ని అనుభవిస్తావు; వనిత!= మగువా!; నీవు= నీవు (= ఓ ద్రౌపదీ); సుతులన్= కొడుకులను; అతి+అంత నిర్మల, మతులన్= మిక్కిలి స్వచ్ఛమైన బుద్ధి కలవారిని; శౌర్య యుతులన్= పరాక్రమంకలవారిని; కాంచిన= పొందిన; సత్+గుణ+అన్వితవు= మంచి లక్షణాలతో కూడిన దానవు; నీకున్, చిత్తంబులోన్= మనస్సులో; వగపు వలదు= దుఃఖం ఉండరాదు.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కలదానా!, ద్రౌపదీ! నీవు ధర్మం తెలిసిన దానవు; నీ భర్తలు దేవతలతో సమానులు; లోకంలో పేరుప్రతిష్ఠలను ఆర్జించిన గొప్పవారు; దేదీప్యమాన మైన తేజస్సుతో బలంతో పరాక్రమంతో వెలుగొందేవారు. ఏ విధంగానైనా అట్టి వీరులకు భూరాజ్యం సంక్రమించటం తథ్యం. మీకు అపకారం చేసిన దుష్టుడు లోకులచేత గర్హింపబడిన దుర్యోధనుడి భార్యలు దిక్కులేక కష్టాలు అనుభవించవలసి వస్తుంది. అప్పుడు నీ మనస్సుకు సంతృప్తి కల్గుతుంది. నీవు వీరపత్నివి మాత్రమే కాదు. నీ కొడుకులు అతిలోక పరాక్రమ వంతులు. నీవు వీరమాతవు, సద్గుణరాశివి. నీకు మనస్సులో పరితాపం ఉండరాదు సుమా!

వ. ప్రతివింధ్యాదు లైన నీ పుత్త్రు లేవురు నిప్పుడు వచ్చి యదుపురంబున నున్నవారు; వారికి నొక్కటం గొఱంత లేదు; రుక్మిణియు సుభద్రయుఁ దక్కినవారలు నక్కుమారుల యెడం దమ కొడుకుల కంటె గారవంబు సేయుదురు; వారి దెస నిశ్చింతవు గ' మ్మనియె; నయ్యవసరంబునం గృష్ణుండు పాండవుల వీడ్కొని మార్కండేయాది విప్రజనంబు నామంత్రణంబు సేసి గమనోన్ముఖుం డగుటయు, సత్యభామ యాజ్ఞసేనిం గౌఁగిలించుకొని సగౌరవంబుగా వీడ్కొనియె; నంత వాసుదేవుండును బ్రియాసహితంబుగా రథారూఢుం డై ద్వారవతీపురంబున కరిగె; మార్కండేయుండును బాండవేయుల నాశ్వాసించి నిజాశ్రమంబునకుం జనియె; నని చెప్పిన వైశంపాయనునకు జనమేజయుం డి ట్లనియె. 324

ప్రతిపదార్థం: ప్రతివింధ్య+ఆదులు+ఐన= ప్రతివింధ్యుడు మొదలుగా గల; నీ పుత్త్రులు= నీ కొడుకులు; ఏవురున్= అయిదుగురును; ఇప్పుడు= ఈ సమయంలో; వచ్చి= అరుగుదెంచి; యదుపురంబునన్= ద్వారకానగరంలో; ఉన్నవారు= ఉన్నారు; వారికిన్= నీ పుత్రులకు; ఒక్కటన్+కొఱంత లేదు= ఏ ఒక్క అంశంలోనూ లోటు లేదు; రుక్మిణియున్= ఆ కృష్ణుడి మొదటి భార్య; సుభద్రయున్= శ్రీకృష్ణుడి చెల్లెలును; తక్కిన వారలున్= మిగిలిన వారును; ఆ+కుమారుల+ఎడన్= ప్రతివింధ్యుడు మున్నగు వారిపట్ల; తమ కొడుకుల కంటెన్= తమయొక్క పుత్రులకంటెగూడ; గారవంబు+చేయుదురు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మన్నన, మర్యాద చూపిస్తారు; వారి దెసన్= ఆ ప్రతివింధ్యాదుల విషయమై; నిశ్చింతవు+కమ్ము+అనియెన్= దుఃఖం లేని దానవు అగుము అని చెప్పింది. ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; కృష్ణుండు; పాండవులన్; వీడ్కొని= వెళ్ళటానికి మర్యాదపూర్వకంగా అనుమతి తీసికొని; మార్కండేయ+ఆది, విప్ర, జనంబున్= మార్కండేయుడు మున్నగు బ్రాహ్మణుల సముదాయాన్ని; ఆమంత్రణంబు+చేసి= వీడ్కొని; గమన+ఉత్+ముఖుండు+అగుటయున్= ప్రయాణానికి ఉద్యుక్తుడు కాగా; సత్యభామ= శ్రీకృష్ణుని భార్య; యాజ్ఞసేనిన్= ద్రౌపదిని; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; సగౌరవంబుగాన్= మన్నన చొప్పున; వీడ్కొనియెన్= ఆమంత్రణం చేసింది; అంతన్= పిదప; వాసుదేవుండు= వసుదేవుడి కుమారుడైన శ్రీకృష్ణుడు; ప్రియా, సహితంబుగాన్= ప్రియురాలు అయిన సత్యభామతో పాటుగా; రథ+ఆరూఢుండు+ఐ= తేరుపై ఎక్కిన వాడై; ద్వారవతీ పురంబునకున్= ద్వారకా నగరానికి; అరిగెన్= వెళ్లాడు; మార్కండేయుండును; పాండవేయులన్; ఆశ్వాసించి= ఓదార్పు మాటలు చెప్పి, ఊరడించి; నిజ+ఆశ్రమంబునకున్= తన యొక్క ఆశ్రమానికి; చనియెన్= వెళ్ళాడు; అని చెప్పినన్= అని వచింపగా; వైశంపాయనునకున్= భారత కథ చెప్పిన ఋషికి; జనమేజయుండు భారత కథను సర్పయాగసందర్భాన ప్రధానశ్రోత అయిన రాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఓ ద్రౌపదీ! నీ కొడుకులు ప్రతివింధ్యుడు మున్నగువారు అయిదుగురు ఈ సమయంలో ద్వారకానగరంలో ఉన్నారు. వారికి అక్కడ ఎట్టి లోటు లేకుండా, రుక్మిణి సుభద్ర తక్కినవారూ కలిసి చూస్తున్నారు. వారు నీ కొడుకులను తమకొడుకులకంటె మిన్నగా అభిమానంతో మన్నించి లాలిస్తున్నారు. అందుచేత నీవు సంతృప్తితో సంతోషంతో ఇచట సుఖంగా ఉండుము' అని చెప్పింది. అంతట శ్రీకృష్ణుడు పాండవులను వీడ్కొని, మార్కండేయుడు మున్నగు బ్రాహ్మణఋషులకు నమస్కరించి ప్రయాణానికి వారి అనుమతి తీసికొన్నాడు. అప్పుడు సత్యభామ ద్రౌపదిని కౌగిలించుకొని మన్నన తెలిపి మర్యాదగా తాను శ్రీకృష్ణుడితోపాటు వెళ్ళటానికి ఆమె అనుమతి పొందింది. అంత శ్రీకృష్ణుడు సత్యభామతోపాటు తేరుపై ఎక్కి ద్వారకానగరానికి వెళ్ళాడు. మార్కండేయమహర్షికూడ పాండవులకు ఓదార్పుమాటలు చెప్పి ఊరడించి తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు - అని వైశంపాయనుడు సర్పయాగశాలలో జనమేజయుడికి భారతకథ వినిపించాడు.

విశేషం: (1) వైశంపాయనుడు - వేదవ్యాసమహర్షి శిష్యులలో ఒకడు. జనమేజయుడు- సర్పయాగం చేసిన మహారాజు, పరీక్షితుడి కొడుకు. పరీక్షితుడు అభిమన్యుడి పుత్రుడు. అభిమన్యుడు అర్జునుడి కొడుకు. పాండవులకు ద్రౌపది యందు వరుసగా జన్మించినవారు - ఉపపాండవులు: ప్రతివింధ్య, శ్రుతసోమ, శ్రుతకీర్తి, శతానీక, శ్రుతసేనులు.

క. 'వనముల ని ట్లనిశంబును । ఘనతర దుఃఖానుభవ వికల్పితు లగుచున్
మనుజోత్తము లప్పార్థులు । జననుత! యటమీఁద నెట్లు చరియించి రొకో!' 325

ప్రతిపదార్థం: జననుత!= జనులచేత పొగడబడినవాడా! ఓ వైశంపాయన మహర్షీ!! వనములన్= అడవులలో; ఇట్లు= ఈ రీతిగా; అనిశంబును= ఎల్లప్పుడున్నూ; ఘన, తర, దుఃఖ+అనుభవ,వికల్పితులు+అగుచున్= మిక్కిలి ఎక్కువైన శోకాన్ని అనుభవించినవారు ఔతూ; మనుజ+ఉత్తములు= నరులలో శ్రేష్ఠులు; ఆ+పార్థులు= పృథ యొక్క కొడుకులు అయిన పాండవులు; అట మీఁదన్= ఆ పిమ్మట; ఎట్లు= ఏ విధంగా; చరియించిరి+ఒకో!= నడచిరో కదా!

తాత్పర్యం: ఓ వైశంపాయన మహర్షీ! మనుజులలో శ్రేష్ఠులు కుంతీకుమారులైన పాండవులు ఆ విధంగా అడవులలో నివసిస్తూ పెక్కుకష్టాలు పడుతూ బ్రదికిరికదా! పిదప వారు ఏ విధంగా తమ నడవడికలు తీర్చి దిద్దుకొన్నారో తెలుప వేడికోలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన నమ్మునీశ్వరుం డిట్లని చెప్పెఁ; 'గృష్ణుండు సనిన యనంతరంబ పాండవులు గామ్యకవన నివాసంబు పరిత్యజించి, యనేక వన శైల నదనదీ విశేషంబు లాలోకించుచు ద్వైతవనంబునకుం జని, యం దున్న యెడం గరిపురంబున నుండి యొక్క బ్రాహ్మణుండు సరసకథాకథనకుశలుండు సనుదెంచి, కౌంతేయులం గని, యుచితసల్లాపంబు సేసి, మగిడి ధృతరాష్ట్రుపాలికిం జనిన, నమ్మహీపాలుండు పాండవుల కుశలం బడుగుటయు, నవ్విప్రుండు వా రేవురు ననవరతశీతవాతాతపకర్శితాంగులై బహుదుఃఖసాగరంబున మునింగియున్న వా రనియు, వీరనాథ యయ్యును ననాథయుం బోలెఁ బాంచాలి పరమశోకార్తయై యున్నది యనియుం జెప్పిన విని, వైచిత్రవీర్యుండు విషణ్ణహృదయుండై కన్నీరు దొరుఁగం గొండొకసేపు వలుక కుండి, పదంపడి నిట్టూర్పు నిగిడించి గద్గదకంఠుం డగుచు నిట్లనియె. 326

ప్రతిపదార్థం: అనినన్= అని జయమేజయుడు అడుగగా; ఆ+ముని+ఈశ్వరుండు= ఆ ఋషులలో శ్రేష్ఠుడైనవాడు (వైశంపాయనుడు); ఇట్లు+అని, చెప్పెన్= ఈ విధంగా పలికాడు; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; చనిన+అనంతరంబు+అ= వెడలిన వెంటనే; పాండవులు= పాండునందనులు; కామ్యక, వన నివాసంబు= కామ్యకం అనే పేరు గల అడవిలో ఉండటం; పరిత్యజించి= వదలిపెట్టి; అనేక, వన, శైల, నద, నదీ, విశేషంబులు= పెక్కు అడవులు పర్వతాలు తూరుపునుండి పశ్చిమానికి పారే ఏరులు; పశ్చిమంనుండి తూరుపునకు పారే ఏరులు, అందు ముఖ్యము లైనవి; ఆలోకించుచున్= చూస్తూ; ద్వైత వనంబునకున్+చని= ద్వైతం అనే పేరు కల అడవికి వెళ్ళి; అందున్= అక్కడ; ఉన్న+ఎడన్= నివసిస్తున్నప్పుడు; కరిపురంబున నుండి= హస్తినాపురం నుండి; ఒక్క బ్రాహ్మణుండు= ఒక విప్రుడు; సరస, కథా, కథన, కుశలుండు= చక్కటి కథలను చెప్పటంలో నేర్పరి; చనుదెంచి= వచ్చి; కౌంతేయులన్+కని= కుంతీకుమారులను, పాండవులను సందర్శించి; ఉచిత, సల్లాపంబు+చేసి= తగిన మర్యాదలతో కూడిన మాటలాడి; మగిడి= తిరిగి; ధృతరాష్ట్ర పాలికిన్+చనినన్= ధృతరాష్ట్రుడి కడకు వెళ్ళగా; ఆ+మహీ, పాలుండు= ఆ భూభర్త అయిన మహారాజు; పాండవుల కుశలంబు= పాండునందనుల యొక్క యోగ క్షేమాల్ని; అడుగుటయున్= ప్రశ్నించగా; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; వారు+ఏవురున్= వారు అయిదుగురూ-పంచపాండవులు; అనవరత, శీత, వాత+ఆతప, కర్శిత+అంగులు+ఐ= ఎల్లప్పుడును చలిగాలులచేత ఎండలచేత కృశించిన శరీరం కల వారలై; బహు, దుఃఖ, సాగరంబునన్= పెక్కు కష్టాలనెడి సముద్రంలో; మునింగి+ఉన్నవారు+అనియున్= నిమగ్నులై ఉన్నవారలు అనియున్నూ; వీరనాథ+అయ్యును= వీరు లైన భర్తలు కలది అయినప్పటికిన్నీ; అనాథయున్+పోలెన్= కాపాడేవారు లేక దిక్కు లేని స్త్రీ వలె; పాంచాలి= పాంచాలదేశ ప్రభువు యొక్క పుత్రిక అయిన ద్రౌపది; పరమ, శోక+ఆర్త+ఐ= మిక్కుటమైన దుఃఖంచేత దీనురాలు అయి; ఉన్నది; అనియున్+చెప్పినన్; విని; వైచిత్రవీర్యుండు= విచిత్రవీర్యుడి కొడుకు అయిన ధృతరాష్ట్రుడు; విషణ్ణ, హృదయుండు+ఐ= కలత చెందిన మనసు కలవాడై; కన్నీరు; తొరుఁగన్= జారుతుండగా; కొండొక సేపు= కొంత తడవు; పలుకక+ఉండి= మాటాడకుండి; పదంపడి= పిదప; నిడు+ఊరుపు= దీర్ఘ నిశ్వాసం; నిగిడించి= బయటకు వదలి; గద్గద కంఠుండు అగుచున్= డగ్గుత్తిక బడిన గొంతుక కలవాడవుతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అంతట వైశంపాయనమహర్షి జనమేజయుడికి ఈ విధంగా ప్రత్యుత్తర మిచ్చాడు. శ్రీకృష్ణుడు ద్వారకానగరానికి వెళ్ళిన తరువాత పాండవులు కామ్యకవనంలో నివసించటం మాని, ద్వైతవనానికి తమ ఆవాసాన్ని మార్చారు. మార్గమధ్యాన వారు పెక్కు అడవులను పర్వతాలను నదులను నదాలను ఆయా విశేషాలను చూచారు. అప్పుడు హస్తినానగర నివాసియు, చక్కని కథలను చెప్పటంలో నేర్పరి అయిన ఒక బ్రాహ్మణుడు ద్వైతవనానికి వచ్చి, పాండవులను సందర్శించి మాట్లాడి, తిరిగి హస్తినాపురానికి చేరాడు. ధృతరాష్ట్రుడు పాండవుల యోగక్షేమాలను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గూర్చి ఆవిప్రుడిని ప్రశ్నించాడు. ఆ బ్రాహ్మణుడు - పాండవులు అడవులలో పెక్కు ఇడుమలు పడుతున్నారు అనిన్నీ, ఎండలకు మాడి, చలికి వణకి, వానలకు తడిసి దుఃఖసాగరంలో మునిగి ఉన్నారు అనిన్నీ, వీరులను భర్తగా పడసినప్పటికినీ, కాపాడేవారు లేని దీనురాలివలె పాంచాలరాజపుత్రిక అయిన ద్రౌపది వెతలతో అల్లాడుతున్నది అనిన్నీ చెప్పాడు. ధృతరాష్ట్రుడు పాండవులు పడుతున్న పాట్లు విని కొంతసేపు మిన్నకుండి, ఆపైన దుఃఖంచేత వేడినిట్టూర్పులు విడిచి డగ్గుత్తిక పడిన గొంతుకతో ఈ విధంగా పలికాడు.

విశేషం: ధృతరాష్ట్రుడి వర్ణనం ఆంగికాభివర్ణనం. ఇది మూలసంస్కృతమహాభారతంలో కానరాదు. నాటకీయమైన ఈ ఆంగికాభివర్ణన తిక్కన మహాకవి కవితాశిల్పంలోని విశేషం. ఇప్పట్టున ఎఱ్ఱనమహాకవి తిక్కనకవితాశిల్పాన్ని అనుకరించాడని చెప్పవచ్చును. 'సరస కథా కథన కుశలుండు'- 'అనవరత శీత వాతాతప కర్శితాంగులు' మున్నగు పదగుంఫనలు నన్నయ్య 'ప్రసన్న కథా కవితార్థ యుక్తి'ని తలపింప జేస్తాయి.

ధృతరాష్ట్రుండు పాండవుల వనవాసక్లేశంబునకు దుఃఖించుట (సం. 3-225-8)

క. **'నా చేసిన కీడునఁ గడు । నీచుం డగు నా తనూజునేరమి నిమ్మై**
నోచెల్ల పార్థులకుఁ బు । ణ్యాచారుల కెందు లేని యాపద వచ్చెన్. 327

ప్రతిపదార్థం: ఓచెల్ల= అయ్యో! ఎంతటి అనర్థం జరిగింది; నా చేసిన= నేను ఒనరించిన; కీడునన్= అపకారం వలన; కడున్= మిక్కిలి; నీచుండు+అగు= దుష్టుడు అయిన; నా తనూజు నేరమిన్= నా కొడుకు యొక్క అజ్ఞానం వలన; ఈ+మైన్= ఈ రీతిగా; పార్థులకున్= పృథయొక్క కొడుకులకు, పాండవులకు; పుణ్య+ఆచారులకున్= సుకృతం కలిగించే నడవడిక కలవారలకు; ఎందున్, లేని= ఎచటను ఉండని; ఆపద= గొప్ప కష్టం; వచ్చెన్= దాపురించింది.

తాత్పర్యం: 'అయ్యో! ఎంతటి అనర్థం దాపురించింది పాండవులకు? ఇది అంతయు దుర్మార్గుడైన నా కొడుకు దుర్యోధనుడి అజ్ఞానంవలన జరిగిన దురంతమే కదా! ఇది నేను చేసిన అపకారమే. పాండవులు పుణ్యప్రదమైన ప్రవర్తన కలవారు. వారికి ఎంతటి ఇక్కట్లు దాపురించాయి!

క. **నా పెద్దకొడుకు ధర్మజుఁ । గాపురుషవిదూరు ధీరుఁ గౌరవకుల సం**
దీపకు నివ్విధమున సం । తాపితుఁగాఁ జేసెనే విధాతృఁ డదయుఁడై. 328

ప్రతిపదార్థం: నా పెద్ద కొడుకు= మొదటి కుమారుడు; ధర్మజున్= ధర్మరాజును; కాపురుష, విదూరున్= చెడ్డవారికి దూరంగా ఉండేవాడిని, మంచివాడిని; ధీరున్= మనస్సును నిగ్రహించినవాడిని; కౌరవ, కుల, సందీపకున్= కౌరవుల వంశాన్ని ప్రకాశవంతం చేసేవాడిని; ఈ+విధమునన్= ఈ రీతిగా; విధాతృఁడు= బ్రహ్మదేవుడు; అదయుఁడు+ఐ= జాలిమాలినవాడై; సంతాపితుఁ గాన్= మిక్కిలి కష్టపడేవాడినిగా; చేసెనే= ఒనరించాడు సుమా!

తాత్పర్యం: నేను నా పెద్దకొడుకుగా భావించే ధర్మరాజు, దుష్టులకు దూరంగా ఉండే ధర్మాత్ముడు. మంచివాడు. కౌరవ వంశాన్ని వెలుగొందచేసేవాడు. అట్టివాడికి బ్రహ్మదేవుడు ఇటువంటి ఇక్కట్టులను దాపురింపచేశాడే!

చ. **అమలనివాతసౌధములయందు మనోజ్ఞమరాళతూల త**
ల్పముల శయించి రేపులు శుభస్థితి మాగధసూతగీతనా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దములఁ బ్రబోధముం బొరయు ధర్మసుతుండు కఠోరభూమిభా
గమున శయించి మేల్కను సృగాలనినాదవికీర్ణకర్ణుఁడై. **329**

ప్రతిపదార్థం: అమల, నివాత, సౌధముల అందున్= స్వచ్ఛమైనట్టివి, పెనుగాలిపాటు లేనట్టివి అయిన మేడల యందు; మనోజ్ఞ, మరాళ, తూల, తల్పములన్= మనోహరమైన హంసతూలికాశయ్యల; శయించి= పండుకొని; రేపులు= తెల్లవారువేళల; శుభస్థితిన్= మంచిగా; మాగధ, సూత, గీత, నాదములన్= వేకువవేళ పాటలయొక్క సవ్వడులచేత; ప్రబోధమున్+పొరయు= నిద్దుర మైకంనుండి మేల్కొనే; ధర్మసుతుండు= ధర్మరాజు; కఠోర, భూమి, భాగమునన్= శరీరానికి నొప్పికలిగించే గట్టి నేలపై; శయించి= పవ్వళించి; సృగాల, నినాద, వికీర్ణ, కర్ణుఁడు+ఐ= నక్కల కూతలచేత బ్రద్దలయిన చెవులు కలవాడై; మేల్కనున్= నిదురనుండి లేస్తాడు.

తాత్పర్యం: ఈదురుగాలిపాటు లేక ప్రశాంతమై స్వచ్ఛంగా ఉండే మేడలపై మనోహరమైన హంసతూలికా తల్పాలపై నిదురించే ఆగర్భశ్రీమంతుడైన మహారాజకుమారుడు ధర్మనందనుడు. వేకువవేళలో అతడిని మాగధులు సుప్రభాతగీతికలు ఆలపించి మంగళతూర్యరావాలతో మేలుకొల్పేవారు. అక్కటా! అట్టి రాజకుమారుడు విధివైపరీత్యంచేత నేడు కఠినభూభాగాన పవ్వళించి కర్ణకఠోరాలైన నక్కలకూతలకు నిద్దుర మేలుకొంటున్నాడు కదా!

విశేషం: ప్రాచీనకాలంలో ప్రభాతకాలాన రాజులను రాజకుమారులను మేలుకొల్పటానికై, మాగధులు, వందులు వైతాళిక గీతికలు ఆలపించేవారు. సూతులు పౌరాణికులు సుప్రసిద్ధశ్లోకాలను కర్తవ్యప్రబోధగీతికలను వినిపించేవారు. అవి రాజమర్యాదలు.

క. **నాగాయుతసత్త్వుఁడు ది । గ్నాగాయతహస్తుఁ డనిలనందనుఁడు మహో**
ద్వేగాత్ముఁ డగుచు డస్సిన । నాగము క్రియ నుండకున్నె నవసి వనమునన్. **330**

ప్రతిపదార్థం: నాగ+అయుత, సత్త్వుఁడు= పదివేల ఏనుగులయొక్క గొప్ప బలం కలవాడు; దిక్+నాగ+ఆయత హస్తుఁడు= దిగ్గజపు తొండం వంటి పొడవైన హస్తాలు కలవాడు; అనిల నందనుఁడు= వాయు పుత్రుడు-భీముడు; మహా+ఉద్వేగ+ ఆత్ముఁడు+అగుచున్= గొప్ప ఆవేశంతో కూడిన ఆత్మ కలవాడు అవుతూ; డస్సిన= శ్రమించిన; నాగము, క్రియన్= ఏనుగు వలె; నవసి= తపించి; వనమునన్= అడవిలో; ఉండక+ఉన్నె= ఉండడా?

తాత్పర్యం: వాయుపుత్రుడైన భీముడు పదివేల ఏనుగుల గొప్పబలం కలవాడు. ఆజానుబాహుడు, దిగ్గజపు తొండం వంటి హస్తాలు కలవాడు. అతడికి గొప్ప ఆవేశం వస్తే ఆపటానికి ఎవరి తరం? ఆతడు పరితాపం చెంది అలసిన ఏనుగువలె అడవిలో తపిస్తూ ఉండడా?

విశేషం: దిగ్గజాలు ఎనిమిది. 1. ఐరావతం 2. పుండరీకం 3. వామనం 4. కుముదం 5. అంజనం 6. పుష్పదంతం 7. సార్వభౌమం 8. సుప్రతీకం.

ఉ. **అన్నలుఁ దమ్ములున్ సతియు నార్తిమెయిన్ బహుదుఃఖమగ్నులై**
యున్నతెఱంగు సూచి విజయుండు యుధిష్ఠిరవాక్యబద్ధుఁ డై
సన్నుతుఁ డుగ్రపన్నగము చాడ్పున రోఁజుచుఁ గ్రోధశోక వే
గోన్నతి నాత్మ నేమనుచునుండునొ నా సుతుతప్పు లెన్నుచున్. **331**

ప్రతిపదార్థం: అన్నలున్= అగ్రజులును (ధర్మరాజును, భీముడును); తమ్ములున్= (అనుజులు - నకుల సహదేవులు; సతియున్= భార్యయు (ద్రౌపదియును); ఆర్తిమెయిన్= దైన్యం చొప్పున; బహు, దుఃఖ, మగ్నులు+ఐ= పెక్కు కష్టాలలో మునిగినవారై; ఉన్న, తెఱంగు= ఉన్న విధం; చూచి= అరసి; విజయుండు= అర్జునుడు; యుధిష్ఠిర వాక్య బద్ధుఁడు+ఐ= ధర్మరాజుయొక్క మాటకు కట్టుపడినవాడై; సత్+నుతుఁడు= పేరు ప్రతిష్ఠలను ఆర్జించినవాడు; ఉగ్ర పన్నగము చాడ్పునన్= భయంకరమైన పాము మాదిరిగా; రోఁజుచున్= బుసకొట్టుతూ; క్రోధ, శోక వేగ+ఉన్నతిన్= కోపం యొక్కయు, దుఃఖం యొక్కయు తీవ్రగమనంయొక్క అతిశయంచేత; నాసుతు, తప్పులు= నా కుమారు డైన దుర్యోధనుడి దోషాలను; ఎన్నుచున్= గణిస్తూ; ఆత్మన్= మనస్సులో; ఏమి+అనుచున్+ఉండును+ఒ= ఏ విధంగా ఆలోచిస్తుంటాడో కదా!

తాత్పర్యం: ఈ పద్యంలో ధృతరాష్ట్రుడు అర్జునుడి భావాలను గూర్చి అనుశీలిస్తున్నాడు. 'అర్జునుడు మహావీరుడు. తన అన్నలైన ధర్మరాజు, భీముడున్నూ, తమ్ములు అయిన నకుల సహదేవులున్నూ దైన్యంతో పెక్కు ఇక్కట్లు పడుతూ అడవిలో ఉండటం చూచి అతిలోక పరాక్రమవంతుడైన ఆతడు తాత్కాలికంగా అన్నగారి మాటకు కట్టుపడి ఉన్నప్పటికినీ మనస్సులోపల పగబట్టిన త్రాచుపామువలె దుర్యోధనుడు చేసిన దోషాలను ఎన్నుతూ కోప దుఃఖాల వేగంచేత రోజుతూ రొప్పుతూ కాలం గడుపుతున్నాడు కాబోలు' అని ధృతరాష్ట్రుడు వాపోయాడు.

విశేషం: ధృతరాష్ట్రుడికి భీముడి బలమన్నా, అర్జునుడి పరాక్రమమన్నా మిక్కిలి భయం. అతడికి పాండవుల సౌశీల్యం దుర్యోధనాదుల దుశ్చర్యలు, శకుని కర్ణుల దురాగతాలు అన్నీ తెలుసు. ధృతరాష్ట్రుడు తెలియని మూర్ఖుడు కాడు; తెలిసిన మూర్ఖుడు. ఈ విషయం పూర్వోక్త పద్యాలవలన, ముందు చెప్పబోయే పద్యాలవలన తేటతెల్లం కాగలదు.

క. అక్కట! మృదుగాత్రులు గడుఁ । జిక్కని మనసులు గుమారసింహులు గవ లిం
పెక్కిన సుఖముల కర్హులు; । స్రుక్కి నవయ నోర్చియునికి చోద్యం బరయన్' 332

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యోపాపం! (జాలితో కూడిన ఆశ్చర్యార్థకం); మృదు, గాత్రులు= సుకుమారమైన శరీరాలు కలవారు; కడున్= మిక్కిలి; చిక్కని మనసులు= సాంద్రమైన హృదయాలు కలవారు; కుమార సింహులు= బాలసింహాల వంటివారు; (సింహకిశోరాలు); కవలు= జంటగా పుట్టినవారు నకుల సహదేవులు; ఇంపు+ఎక్కిన, సుఖములకున్+అర్హులు= భోగాలతో కూడిన సౌఖ్యాలను పొందటానికి యోగ్యత కలవారు; స్రుక్కి= తపించి; నవయన్+ఓర్చి= కష్టపడటానికి ఓర్పు కలిగి; ఉనికి= ఉండటం; అరయన్= చూడగా; చోద్యంబు= ఆశ్చర్యం.

తాత్పర్యం: అయ్యోపాపం! సుకుమారశరీరాలు కలవారు నకులసహదేవులు; కవలబిడ్డలు, కొదమసింగాల వంటివారు. అట్టివారు భోగభాగ్యాలతో సమస్తసౌఖ్యాలను అనుభవించ తగినవారే కాని అడవిలో పెక్కు ఇక్కట్లు ఓర్పుతో భరించటం ఆశ్చర్యకరమైన విషయం'.

వ. అని పలికి, వెండియు. 333

తాత్పర్యం: అని చెప్పి, మఱియు (ధృతరాష్ట్రుడు) ఈ విధంగా పలికాడు.

చ. 'అనుపమతేజుఁ డున్నతభుజాగ్రుఁ డుదగ్రుఁడు వైరినిగ్రహం
దనఘుఁడు వాయుసూనుఁడు నిజాగ్రజు చేసిన సత్యపాశబం
ధనమునఁ జిక్కి తత్సమయతత్పరుఁడై యిటు ఘోరదుఃఖ వే
దనములు సైఁచెఁ గాక మది తద్దయుఁ గ్రోధమయంబు వానికిన్. 334

ప్రతిపదార్థం: అనుపమ తేజుఁడు= సాటిలేని గొప్పతేజస్సు కలవాడు; ఉన్నత, భుజ+అగ్రుఁడు= ఎత్తయిన భుజాల కొనలు కలవాడు; వైరి నిగ్రహుండు= శత్రువులతో పోరాడేవాడు; అనఘుఁడు= పుణ్యాత్ముడు; వాయు సూనుఁడు= వాయువుకు పుత్రుడైన భీముడు; నిజ+అగ్రజు, చేసిన= తనయొక్క అన్నగారు ఒనరించిన; సత్య, పాశ, బంధనమునన్= సత్యం అనెడి త్రాళ్లచేత కట్టుబడటంచేత; చిక్కి= లోబడి; తద్, సమయ, తత్పరుఁడు+ఐ= ఆతడి యొక్క ఒడబాటుకు కట్టుబడినవాడై; ఇటు= ఈవిధంగా (అడవిలో ఇడుములు పొందుతూ ఉండటం); ఘోర, దుఃఖ, వేదనములు= భయంకరమైన కష్టపరితాపాలు; సైఁచెన్+కాక= ఓర్పుతో భరించెనే కాని; వానికిన్= ఆ భీముడికి; మది= మనస్సు; తద్దయున్= మిక్కిలి; క్రోధ, మయంబు= కోపంతో నిండి నట్టిది.

తాత్పర్యం: వాయుపుత్రుడైన ఆ భీముడు ఉన్నాడే, వాడు సాటిలేని తేజస్సు కలవాడు. గొప్ప భుజాగ్రాలుకలవాడు; కయ్యానికి కాలుదువ్వేవాడు, అసాధారణ బలవంతుడు. అతడి అన్నగారు సత్యసంధుడు కావున, అన్నగారు అంగీకరించిన నియమాలను తాను ఉల్లంఘించ నేరడుకాబట్టి ఈ రీతిగా అడవులపాలయి ఘోరకష్టనష్టాలను అనుభవిస్తున్నాడు కాని వాడిమనస్సు ఉద్రిక్తమైనది, కోపమయమైనది సుమా!

విశేషం: సత్యపాశ - సత్యమనెడి పాశము - అలంకారం రూపకం.

సీ. **శకుని కైతవము, దుశ్శాసను చేసిన । దుష్కర్మమును, గర్ణు తులువతనము**
దుర్యోధనుని దైన దుర్ణయంబును, జిత్త । మునఁ గిరిశల్యముల్ వోలె నలఁప
దావాగ్ని తెఱఁగున దరికొని క్రోధంబు । వనవాస మనియెడు వాయుగతుల
నంతకంతకుఁ బేర్చి యవయవంబుల నెల్ల । మండంగ నెప్పుడు మధ్యముండు

ఆ. **మొగము జేవురింప ముడివడు బొమలతో । నవుడు గఱచుచును భయంకరముగ**
నున్నరూపు వాయకుండు నామది వాఁడ । మిత్తి నాదు పుత్త్రమిత్త్రతతికి. **335**

ప్రతిపదార్థం: శకుని, కైతవము= శకునియొక్క మోసం; దుశ్శాసను చేసిన= దుశ్శాసనుడు చేసిన; దుష్కర్మమును= చెడ్డపనియును; కర్ణు తులువ తనము= కర్ణుడి యొక్క నీచత్వం; దుర్యోధనునిది+ఐన= దుర్యోధనుడి యొక్క; దుర్ణయంబును= చెడు నీతిని; చిత్తమునన్= మనస్సునందు; కిరి శల్యముల్+పోలెన్= ఏదు పంది ఎముకలవలె- ముండ్లవలె; నలఁపన్= పీడించగా; దావ+అగ్ని, తెఱఁగునన్= కారుచిచ్చువలె; దరికొని= వ్యాపించి; క్రోధంబు= కోపం; వనవాసము= అరణ్యంలో నివసించటం; అనియెడు= అనునట్టి; వాయుగతులన్= గాలి సంచలనం చేత; అంతకున్+అంతకున్= క్రమ క్రమంగా; పేర్చి= అతిశయించి; అవయవంబులన్+ఎల్లన్= శరీరభాగాలు అన్నిటిని; మండంగన్= దహించగా; మధ్యముండు= మధ్యపుట్టినవాడు (కుంతీదేవికి పుట్టిన వారిలో నడిపివాడు) భీముడు; మొగము= ముఖం; జేవురింపన్= ఎర్రబడగా; ముడివడు బొమలతోన్= ముడులు వారిన కనుబొమలతో; అవుడు+కఱచుచును= పెదవి కొరుకుతూ; భయంకరముగన్= ఉగ్రంగా; ఉన్న రూపు= ఉండే ఆకారం; నామదిన్= నా మనస్సును; పాయక+ఉండున్= విడువక నిలిచి ఉంటుంది; వాఁడు+అ= వాడే (భీముడే); నాదు= నా యొక్క; పుత్త్ర, మిత్ర తతికిన్= కొడుకుల సముదాయానికి స్నేహితుల సముదాయానికి; మిత్తి= మృత్యువు.

తాత్పర్యం: శకుని మాయాద్యూతంలో చేసిన మోసం, దుశ్శాసనుడు నిండుసభలో చేసిన చెడ్డపని (ద్రౌపదీ వస్త్రాపహరణం), కర్ణుడి నీచత్వం (కౌరవులను సమర్థించటం), దుర్యోధనుడి చెడ్డ నాయకత్వం (జూదం మిష

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కల్పించి పాండవుల రాజ్యం అపహరించటం మున్నగు కార్యాలు) మనస్సులో ఏదుపంది ముండ్లవలె గ్రుచ్చుకొన్నట్లు బాధించటంచేత కోపం అతడిలో కార్చిచ్చువలె వ్యాపించింది. భీముడికోప మనే అగ్నిహోత్రుడికి అడవిలో పడుతున్న ఇక్కట్లు అనే వాయువు తోడ్పడి, అగ్నిని ప్రజ్వలింపజేసి అతడి అవయవాలను అన్నింటిని క్రమక్రమంగా దహిస్తుంది. అందుచేత కుంతీకుమారులలో మధ్యముడైన ఆ భీముడి ఆకారం, జేవురించిన మొగం, ముడుతలు పడిన కనుబొమలు, పెదవి కరచెడి దంతాలు, ఆ భీకరాకృతి నా మనస్సులో ఎల్లప్పుడు సాక్షాత్కరిస్తూ ఉంటుంది. ఆ భీముడే నా పుత్రులకు మిత్రులకు అందరకు మృత్యువు.

విశేషం: అలం: ఉపమ; రూపకం.

క. **అంతకసుతు హృదయంబున । నంత గలుగ నేర దలుక, యర్జును మదిలో**
నంత గలుగ; దమ్మారుతి । యంతకనిభుఁ డధికరోషుఁ డనవరతంబున్. **336**

ప్రతిపదార్థం: అంతక సుతు హృదయంబునన్= యముడి కుమారుడి (ధర్మరాజు) మనసులో; అలుక= కోపం; అంత కలుగన్ నేరదు= అంత (యెక్కువ) ఉండ జాలదు; అర్జును మదిలోన్= అర్జునుడి యొక్క మనస్సులో; అంత= భీముని హృదయంలో ఉన్నంత కోపం; కలుగదు= ఏర్పడదు; ఆ, మారుతి= ఆ వాయునందను డైన భీముడు; అంతక, నిభుఁడు= యముడితో సమానుడు; అనవరతంబున్= ఎల్లప్పుడును; అధిక రోషుఁడు= మిక్కుటమైన కోపం కలవాడు.

తాత్పర్యం: భీముడు యముడితో సమానుడు సుమా! ఆతడి యెదలోని కోపం మెండైనది. ఎల్లప్పుడు అతడు రోషంతో రుసరుసలాడుతూ ఉంటాడు. భీముడికి ఉన్న కోపతాపాలు ధర్మరాజుకు లేవు. అర్జునుడిలో కానరావు.

తే. **అర్జునానిలప్రేరితం బగుచుఁ బేర్చి, । వాయుతనయ దవాగ్ని దుర్వారభంగిఁ**
గర్ణసౌబల సహితముగా మదీయ । పుత్త్రశత కాననము వెసఁ బొదువ కున్నె. **337**

ప్రతిపదార్థం: వాయు, తనయ దవ+అగ్ని= భీముడు అనే కారుచిచ్చు; అర్జున+అనిల, ప్రేరితంబు+అగుచున్= అర్జునుడు అనే వాయువుచేత ప్రేరేపించబడినది ఔతూ; పేర్చి= అతిశయించి, దుర్వార, భంగిన్= అడ్డుకొనటానికి వీలు లేనివిధంగా; కర్ణ, సౌబల, సహితముగాన్= కర్ణుడితో శకునితోపాటుగా; మదీయ పుత్త్రశతకాననమున్= నా నూరుగురు కొడుకులు అనే అడవిని; వెసన్= వేగంగా; పొదువక+ఉన్నె= నాశనం చేయక ఉంటుందా.

తాత్పర్యం: భీముడు అనే కార్చిచ్చు అర్జునుడు అనే వాయువుచేత ప్రేరేపించబడి, అతిశయించి, కర్ణశకునులతోపాటు నా పుత్రులు అనే అడవిని వేగంగా దహించి వేయదా?

విశేషం: అలం: సమగ్రమైన రూపకం.

క. **అగుఁగాక కర్మఫలములు; । దగఁ గుడువక పోవ వశమె దైవకృతంబుల్**
మగుడునె; కౌరవ్యులకుం । దెగుకాలం బయ్యె; వగపు తెరు విం కేలా? **338**

ప్రతిపదార్థం: కర్మఫలములు= చేసిన క్రియలకు కలిగే ఫలితాలు; అగున్+కాక= జరిగి తీరుతాయి కదా; తగన్= సరిపడేటట్లుగా; కుడువక పోవన్ వశము+ఎ= అనుభవించక తప్పునా; దైవకృతంబుల్= విధి విపరిపాకాలు; మగుడునె= వ్యర్థంగా వెనుకకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిరిగి పోతాయా; కౌరవ్యులకున్= కౌరవులకు (దుర్యోధనుడు మున్నగు వారికి); తెగు కాలంబు= మరణించే సమయం; అయ్యెన్= దాపురించింది; వగపు తెరువు= విచారించే మార్గం; ఇంకన్+ఏలా= ఇక ఎందుకు?

తాత్పర్యం: చేసినకర్మకు తగినఫలం అనుభవించక తప్పదు కదా! ఇది విధి విపరిపాకం. అనుభవించక తప్పదు. దుర్యోధనుడు మున్నగువారికి మరణకాలం ఆసన్నమైంది. ఇది అవశ్యభవితవ్యం. ఇక విచారించి ప్రయోజనం లేదు.

క. ఏను వలదన్న జూదము । మానఁడ, సుతుదుర్ణయంబు మగిడింపక దు
ర్మానమునఁ గులక్షయ సం । ధానమునకుఁ దొడఁగితిని విధాతృని చెయిదిన్. 339

ప్రతిపదార్థం: ఏను= నేను (ధృతరాష్ట్రుడు); వలదు+అన్నన్ జూదము= వద్దు అనిన జూదం; మానఁడు+అ= వదలి పెట్టడు (దుర్యోధనుడు); సుతు దుర్ణయము= కొడుకు యొక్క చెడు నడవడి; మగిడింపక= మరలించక; దుర్మానమునన్= చెడ్డ స్వాతిశయం చొప్పున; కుల, క్షయ, సంధానమునకున్= వంశం నశించే పనికి; విధాతృని చెయిదిన్= బ్రహ్మదేవుడి చర్యవలన; తొడగితిని= సమకట్టాను.

తాత్పర్యం: నా కుమారుడైన దుర్యోధనుడు నేను వలదు అని వారించినప్పటికి, నా మాట వినక, జూదానికి ఒడిగట్టాడు. ఆతడి చెడునడవడికను నేను మరలించ లేకపోయాను. దుష్టమైన నా అహంకారంవలన వంశం నశించే మార్గం ఏర్పడింది. అది ఎవరు తప్పించగలరు? అది బ్రహ్మదేవుడి చర్య.

తే. రాత్రి తెగుదల దిన మేల రాకయుండు? । దినము తెగుదల రాత్రి యేతేర కున్నె?
పరఁగ సుఖదుఃఖములు గాల పర్యయమున । నెందు మనుజులఁ బొందక యేల యుడుగు? 340

ప్రతిపదార్థం: రాత్రి తెగుదలన్= రేయి చిట్టచివర; దినము= పగలు; ఏల= ఎందుకు; రాక+ఉండున్= రాకుండును; దినము తెగుదల= పగటి చిట్టచివర; రాత్రి= రేయి; ఏతేరక+ఉన్నె= రాక ఉంటుందా?; పరఁగన్= ఒప్పిదంగా; సుఖ, దుఃఖములు= సౌఖ్యాలున్నూ కష్టాలున్నూ; కాల పర్యయమునన్= కాలంయొక్క మార్పువలన; ఎందున్= ఎచటను; మనుజులన్= మనుష్యులను; పొందక= తాకక; ఏల= ఎందుకు; ఉడుగున్= మానును.

తాత్పర్యం: రాత్రి ముగిస్తే పగలు ఏర్పడుతుంది. పగలు గడిస్తే రాత్రి వస్తుందికదా. అట్లే సుఖాలు దుఃఖాలు క్రమక్రమంగా మనుజులకు కల్గుతుంటాయి. అది కాలాన్నిబట్టి సహజంగా సంక్రమించే మార్పుసుమా!

ఉ. మేలున సంతసిల్లు నెడ మేకొని యాపద లొందు, నాపదల్
దూలఁగ భూరిసౌఖ్యములు దోఁచుఁ; గృతంబులు తప్ప వెమ్మెయిం;
బోలఁగ నింతయుం గని ప్రబుద్ధమనస్కులు ఖేదమోదని
ర్గాళితధైర్యసాగరులు గాక సుఖింతురు సర్వకాలమున్. 341

ప్రతిపదార్థం: మేలునన్= శుభాలు ప్రాప్తించేటప్పుడు; సంతసిల్లు+ఎడన్= సంతోషించేపట్టున; మేకొని= కూడి; ఆపదలు= కీడులు; ఒందున్= కలుగుతాయి; ఆపదల్= కష్టాలు; తూలఁగన్= తొలగగా; భూరి సౌఖ్యములు= గొప్ప సుఖాలు; తోఁచున్= ఉదయిస్తాయి; ఏ+మెయిన్= ఏ విధంగానైనా సరే; కృతంబులు= చేసిన కర్మలు; తప్పవు= జరిగి తీరతాయి; పోలఁగన్= సరి అయ్యేటట్లుగా, అమరేటట్లుగా; ఇంతయున్= ఈ రీతిగా జరిగిన దానిని అంతటిని; కని= చూచి; ప్రబుద్ధ మనస్కులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మేల్కొన్న మనస్సు కలవారు- జ్ఞానులు; ఖేద, మోద, నిర్గాళిత, ధైర్య సాగరులు కాక= దుఃఖం సంతోషం అనెడి వాటిచేత జారిన ధీరత్వం అనే సముద్రం కలవారు కాకుండగా; సర్వకాలమున్= ఎల్లప్పుడును; సుఖింతురు= సౌఖ్యాన్ని అనుభవిస్తారు.

తాత్పర్యం: శుభాలు ప్రాప్తించిన వని సంతోషించేటప్పుడే ఆపదలు సంభవిస్తాయి; ఆపదలు వచ్చినపుడు గొప్ప సౌఖ్యాలు ఒనగూడుతాయి. పూర్వజన్మలో చేసిన కర్మలు అనుభవించక తప్పదు. ఈ కర్మవిపరిపాకం సిద్ధించటం తెలిసిన జ్ఞానులు సుఖానికీ, దుఃఖానికీ అతీతులుగా ఉండే ధైర్యసాగరులు. ఎల్లప్పుడు వారు నిర్వికల్పంగా సుఖాన్నే అనుభవించగలరు.

చ. సిరికిఁ దొలంగి కానల వసించి కృశించిన పార్థుఁ డట్టె ని
ర్జరుల వరంబునం బరమ సమ్మద లీల మహాస్త్ర లాభ వి
స్ఫురణముఁ బొంది యద్దివికిఁ బోయి శరీరముతోన క్రమ్మఱన్
ధరణికి వచ్చె; నిట్టివి గదా! వివిధాద్భుత కర్మపాకముల్. 342

ప్రతిపదార్థం: సిరికిన్= సంపదకు; తొలంగి= దూరమయి; కానలన్= అడవులలో, వసించి= ఉండి; కృశించిన= చిక్కిపోయిన (క్షీణించిన); పార్థుఁడు+అట్టె, కుంతీకుమారుడు అర్జునుడా; నిర్జరుల వరంబునన్= వేల్పులు ఇచ్చిన వరం వలన; పరమ, సమ్మద లీలన్= మిక్కుటమైన సంతోషంతో కూడిన ఆటగా; మహా+అస్త్ర, లాభ, విస్ఫురణమున్= గొప్ప మంత్రాయుధాలు ప్రాప్తించటం వలన వికాసం; పొంది= చెంది; ఆ+దివికిన్= ఆ స్వర్గానికి; పోయి= వెళ్లి; శరీరముతోన= దేహంతోనే; క్రమ్మఱన్= తిరిగి; ధరణికిన్= భూమికి; వచ్చెన్= అరుదెంచాడు; వివిధ+అద్భుత, కర్మపాకముల్= అచ్చెరువు కలిగించే పెక్కు కర్మల యొక్క పరిణతులు; ఇట్టివి+కదా= ఇటువంటివేకదా!

తాత్పర్యం: చూడుము. ఆలోచిస్తే ఇది ఎంతటి అద్భుతమైన వృత్తాంతమో! సంపదలను కోల్పోయిన అర్జునుడు అడవులలో నివసిస్తూ, చిక్కి శల్యమైపోయాడు కదా! అంతలో ఆతడు దేవతలనుండి వరాలు సాధించి గొప్పవైన అస్త్రాలను ఆర్జించగలిగాడుకదా! అంతేకాక ఆతడు బొందితో దేవలోకానికి పోయి తిరిగి బొందితో క్షేమంగా భూలోకానికి విచ్చేశాడు. ఇది ఎంత అద్భుతం! ఇది ఏ జన్మలో చేసిన కర్మకు లభించిన ఫలమో కదా!

క. గాండీవము విల్లటె, యా । ఖండల నందనుఁడు విల్లు గలవాఁడటె, త
త్కాండంబులు దివ్యము లటె, । యొండేటికి వారిధనమ యుర్విము సిరియున్.' 343

ప్రతిపదార్థం: గాండీవము= గాండీవము అనునది (అర్జునుడి ధనుస్సు); విల్లు+అటె= ధనువు అట (అట+ఎ=అటె); ఆఖండల, నందనుఁడు= దేవేంద్రుడి కొడుకు అర్జునుడు; విల్లు కలవాఁడు= ధానుష్కుడు; అట+ఎ= అటె= అట; (ఆశ్చర్యార్థకం); తద్+కాండంబులు= ఆ వింటి యొక్క బాణాలు; దివ్యములు+అట+ఎ= దేవతా మహిమ కలవి అట; ఒండు+ఏటికి= వేరు (మాటలు) ఎందుకు; ఉర్వియున్= భూమియు; సిరియున్= సంపదయును; వారి ధనము+అ= వారికి మాత్రమే చెందిన సొత్తుకదా!

తాత్పర్యం: గాండీవం విల్లట! అది అతిలోకమహిమ కలది. అనన్యసాధారణమైనది. ఆ విల్లును ధరించేవాడు కూడ లోకోత్తరవీరుడైన అర్జునుడట. అతడు దేవేంద్రుడి కొడుకు. ఆ వింటిబాణాలు దేవతామహిమ కలవి. ఇక చెప్పే దేముంది? ఈ భూమండలమంతా ఈ లోకంలోని సంపద అంతా ఇక ఆ పాండవులకు మాత్రమే చెందే సొత్తు కదా!'

విశేషం: గాండీవం- అర్జునుడి విల్లు. లోకోత్తరమైన ఈ ధనుస్సును అగ్నిహోత్రుడు అర్జునుడికి ఖాండవవనదహన సమయంలో బహూకరించాడు. గాండీవంతోపాటు అగ్ని అర్జునుడికి అక్షయతూణీరాన్ని (తరుగని అమ్ములు కల పొదిని) బహూకరించాడు.

వ. అని ధృతరాష్ట్రుండు బహువిధంబు లగు వలుకులు వలుక విని, దుర్యోధనుండు శకునిం జూచి 'యీ రా జేల యింత భీతుం డయ్యె?' ననుచు నతండునుం దానును గర్ణసహితుండై యొక్క వివిక్తప్రదేశంబునకుం జని కార్యాలోచనంబున నున్న యెడం గర్ణుం డి ట్లనియె. 344

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; బహు విధంబులు+అగు= పెక్కు రీతులు అయిన; పలుకులు= మాటలు; పలుకన్= వచింపగా; విని= ఆలకించి; దుర్యోధనుండు; శకునిన్+చూచి; ఈ రాజు= ఈ ప్రభువు (ధృతరాష్ట్రుడు); ఏల= ఎందుకు; ఇంత= ఈ విధంగా మిక్కుటంగా; భీతుండు+అయ్యెన్= భయం పొందినవాడు అయ్యాడు; అనుచున్= అని అంటూ; అతండునున్+తానును= శకునియు, దుర్యోధనుడును; కర్ణ సహితుండు+ఐ= కర్ణుడితో కూడినవాడై; ఒక్క= ఒక; వివిక్త ప్రదేశంబునకున్= రహస్యంగా ఉండే చోటుకు; చని= వెళ్ళి; కార్య+ఆలోచనంబునన్= చేయవలసిన పనిని గూర్చి యోచన చేస్తూ; ఉన్న+ఎడన్= ఉన్నప్పుడు; కర్ణుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు దుర్యోధనుడికి చెప్పాడు. అంతట దుర్యోధనుడు శకునితో 'ఎందుకు ఈ రాజు ఇట్లా పిరికిమాటలు పలుకుతున్నాడు? ఈయనకు ఇంతటిభయం ఎందుకు కల్గింది?' అని అన్నాడు. పిదప దుర్యోధనుడు శకునికర్ణులతో కలిసి, ఏకాంతప్రదేశానికి చేరి మంత్రాలోచనకు పూనుకొన్నాడు. అప్పుడు కర్ణుడు ఈ విధంగా పలికాడు.

సీ. 'పాలితశౌర్యులు పాండవేయులు దుఃఖ । శీలురై యడవులపాలు వడిరి;
ధరణీశ! తొల్లి యింద్ర ప్రస్థపురమున । ధర్మనందను పాలఁ బేర్మితోడ
శోభిల్లుచున్న విశ్రుతలక్ష్మి నీ బుద్ధి । బలమున నిన్నుఁ బెంపొలయఁ బొందెఁ;
బరువడి దక్షిణ పశ్చిమోత్తర పూర్వ । దేశస్థులయిన మహీశులెల్ల

తే. నీక యరిగాపులై; రిప్డు నిఖిలజలధి । శైలకాననద్వీపవిశాల మైన
మహి సమస్తంబు నేలుము మహిమ యెసఁగ । లీల నింద్రుండు సురలోక మేలు నట్లు. 345

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= ఓ రాజా (దుర్యోధన మహారాజా!) పాలిత శౌర్యులు= గొప్ప శౌర్యవంతులు; పాండవేయులు= పాండవులు; దుఃఖ శీలురు+ఐ= కష్టాలను అనుభవించే స్వభావం కలవారై; అడవుల పాలు+పడిరి= అరణ్యాలలో నివసించ వలసి వచ్చింది; తొల్లి= పూర్వం; ఇంద్రప్రస్థపురమునన్= ఇంద్రప్రస్థం అనే నగరంలో; ధర్మనందనుపాలన్= ధర్మపుత్రుని సమక్షంలో; పేర్మితోడన్= అతిశయం తోడ; శోభిల్లుచున్న= విలసిల్లుతున్న; విశ్రుత లక్ష్మి= కీర్తికెక్కిన సంపద; నీ బుద్ధి బలమునన్= నీ యొక్క తెలివితేటలవలన; నిన్నున్= నిన్ను; పెంపు+ఒలయన్= గొప్పతనం ఏర్పడేటట్లుగా; పొందెన్= చెందింది; పరువడిన్= క్రమంగా; దక్షిణ, పశ్చిమ+ఉత్తర+పూర్వ దేశస్థులు+అయిన= దక్షిణం, పడమర, ఉత్తరం, తూర్పు దేశాలలో ఉన్న; మహీ+ఈశులు= రాజులు; ఎల్లన్= అందరును; నీకున్+అ= నీకే; అరిగాపులు+ఐరి= సామంతులు (కప్పం చెల్లించే తాబేదారులు) అయ్యారు; ఇప్డు= ఇపుడు; నిఖిల, జలధి, శైల, కానన, ద్వీప, విశాలము+ఐ= సమస్తమైన సముద్రాలు, పర్వతాలు, అడవులు, దీవులతో విరివి అయిన; మహి సమస్తంబున్= భూమిని అంతటిని; మహిమ+ఎసఁగన్= గొప్పతనం విలసిల్లేటట్లుగా; లీలన్= ఆటగా; ఇంద్రుండు= వేల్పుల దొర; సురలోకమున్= స్వర్గసీమను; ఏలునట్లు= పరిపాలించేటట్లు; ఏలుము= పరిపాలించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఓ దుర్యోధన మహారాజా! పరాక్రమ ప్రాభవాలు చూపినట్టి పాండవులు తమ శౌర్యాన్ని అదుపులో పెట్టుకొని కష్టాలను అనుభవిస్తూ అడవులలో వసిస్తున్నారు. అలనాడు ఇంద్రప్రస్థపురంలో ధర్మనందనుడి సమక్షంలో వెల్లివిరిసిన సుప్రసిద్ధ సంపద నేడు నీ తెలివితేటలవలన నిన్ను వరించింది. నేల నాలుగుచెరగులలోని రాజులు ఉత్తరం, దక్షిణం, తూర్పు, పడమర, దిక్కులలో ఉండే రాజులు నీకు కప్పం చెల్లించి నీ ఆధిపత్యాన్ని అంగీకరించే సామంతులుగా ఉన్నారు. విస్తారమైన సముద్రంతో పర్వతాలతో అడవులతో దీవులతో సువిశాలమైన ఈభూమండల మంతటిని దేవేంద్రుడు స్వర్గలోకాన్ని ఏలుకొనేటట్లు సార్వభౌముడవై పరిపాలించుము.

కర్ణ శకుని దుర్యోధనులు మంతనంబు సేయుట (సం. 3-226-9)

ఉ. **జానపదుల్ పురీజనులు సంతతముం బ్రమదం బెలర్ప నీ**
దైన శుభోదయంబ హృదయంబులఁ గోరుచునున్నవారు; స
మ్మానము నొంది కౌరవసమాజము నిన్ను భజింప భూరితే
జోనిధి వై వెలింగెదవు సూర్యుని చాడ్పున నీవ యిమ్మహిన్. **346**

ప్రతిపదార్థం: జానపదుల్= జనపదాలలో అనగా పల్లెటూళ్ళలో నివసించే ప్రజలు; పురీజనులు= పట్టణాలలో నివసించే ప్రజలు; సంతతమున్= ఎల్లప్పుడును; ప్రమదంబు+ఎలర్పన్= సంతోషం అతిశయించేటట్లుగా; నీది+ఐన= నీ యొక్క; శుభ+ఉదయంబు+అ= మేలుకలగటాన్నే; హృదయంబులన్= మనసులలో; కోరుచున్+ఉన్నవారు= కాంక్షిస్తున్నారు; సమ్మానమున్+ఒంది= గౌరవాన్ని పొంది; కౌరవ, సమాజము= కౌరవ వంశంలోనివారు; నిన్నున్; భజింపన్= ఆరాధించగా; భూరి, తేజస్+నిధివి+ఐ= గొప్పదైన వెలుగుకు నెలవైనవాడవై; సూర్యుని చాడ్పునన్= సూర్యుడి మాదిరిగా; నీవు+అ= నీవే; ఈ+మహిన్= ఈ భూలోకంలో; వెలింగెదవు= ప్రకాశిస్తావు.

తాత్పర్యం: నీ పరిపాలన పట్టణాలలో ఉండేవారికి మాత్రమే కాక పల్లెటూళ్లలో ఉండే ప్రజలకు కూడ నచ్చింది. అన్నివర్గాలకూ చెందిన అశేషప్రజానీకం నీ యొక్క అభ్యుదయాన్నే కోరుతున్నారు. ఈ విధంగా సమస్త ప్రజల అభిమానాన్నీ చూరగొని గౌరవానికి పాత్రుడవైన నీవు దేవేంద్రుడు స్వర్గలోకాన్ని ఏలుకొనేటట్లుగా ఈ భూమండలాన్ని సార్వభౌముడవై పరిపాలించుము. కౌరవవంశానికి చెందినవారందరు నిన్ను ఆరాధించగలరు. నీవు దేదీప్యమానంగా ఆకసాన ప్రకాశించే సూర్యుడివలె భూమండలంలో వెలుగొందగలవు.

విశేషం: అలం: ఉపమ.

వ. **పాండవు లిప్పుడు పరమదుఃఖార్తు లగుచు ద్వైతవన సరోవర సమీపంబున నున్నవా రని వింటిమి; నీవు సకల సామ్రాజ్యవిభవంబు మెఱసి చని, యందు నీ తేజంబు ఘర్మసమయంబునాఁటి తపనుతేజంబై పగతుర కన్నులు గమర, నతిదుస్సహం బగు నట్లుగాఁజేయుము; దొల్లి నహుషపుత్త్రుం డయిన యయాతియుం బోలె నుజ్జ్వలుండ వై యున్న నిన్నుం జూచి, పాండవులు హృదయఖేదంబుగా వగచెదరు; మిత్త్రజన మోదంబును శత్త్రుజన ఖేదంబునుం గదా సంపదలకుం దగియెడు ఫలంబు.** **347**

ప్రతిపదార్థం: ఇప్పుడు= ఈ సమయంలో పాండవులు= పాండురాజ నందనులు; పరమ, దుఃఖ+ఆర్తులు+అగుచున్= మిక్కుటమైన కష్టాలచేత దైన్యాన్ని చెందినవారు ఔతూ; ద్వైత, వన, సరోవర, సమీపంబునన్= ద్వైతం అనే పేరు కల అడవిలో

ఉన్న కొలను దగ్గర; ఉన్నవారు+అని= నివసిస్తున్నారు అని; వింటిమి= విన్నాం; నీవు సకల, సామ్రాజ్య, విభవంబు= సమస్త మైన గొప్ప ప్రభుత్వ సంపద; మెఱసి= ప్రకాశింపజేసి; చని= వెళ్ళి; అందున్= అచట (ఆ ద్వైతవనంలో); నీ తేజంబు= దేదీప్యమాన మైన నీ వెలుగు; ఘర్మ సమయంబు నాఁటి= వేసవికాలంలోని; తపను తేజంబు+ఐ= సూర్యుడి యొక్క గొప్ప కాంతి అయి; పగతుర కన్నులు= శత్రువుల నేత్రాలు; కమరన్= మాడిపోయేటట్లుగా; అతి దుస్సహంబు+అగునట్లుగాన్= మిక్కుటమై భరించ శక్యం కానట్టిదిగా; చేయుము; తొల్లి= పూర్వం; నహుష పుత్త్రుండు+అయిన= నహుషుడి కొడుకు అయిన; యయాతియున్+పోలెన్= యయాతివలె; ఉత్+జ్వలుండవు+ఐ= గొప్పగా ప్రకాశించేవాడవై; ఉన్న= ఉండిన; నిన్నున్+ చూచి; పాండవులు; హృదయ ఖేదంబుగాన్= మనస్సుకు దుఃఖం కలిగేటట్లుగా; వగచెదరు= దుఃఖిస్తారు; మిత్ర, జన, మోదంబును= స్నేహితులకు సంతోషం; శత్రు, జన ఖేదంబును= విరోధులకు దుఃఖం; కదా= (కలిగించటమే సుమా); సంపదలకున్= ఐశ్వర్యానికి; తగియెడు= తగినట్టి; ఫలంబు= ప్రయోజనం.

తాత్పర్యం: ఈ సమయంలో పాండవులు మిక్కిలి కష్టాలను అనుభవిస్తూ దైన్యంతో ద్వైతవనంలో ఒక కొలను దగ్గర నివసిస్తున్నారు అని విన్నాం. నీవు ఇప్పుడు సార్వభౌముడవై గొప్ప సామ్రాజ్యాన్ని ఏలుకొంటూ భోగభాగ్యాలతో తులదూగుతున్నావు. ఇప్పుడు నీవు అక్కడికి సపరివారంగా వెళ్ళి, మండువేసవిలో ప్రకాశించే సూర్యుడిమాదిరిగా వారికి నీతేజస్సు చాటి చూపుము. అలనాడు నహుషచక్రవర్తి కుమారుడైన యయాతివలె దేదీప్యమానంగా వెలుగొందే నిన్ను చూచి పాండవులు హృదయాలలో మిక్కిలి దుఃఖిస్తారు. మిత్రులను సంతోషపెట్టటం, శత్రువులను పరితపింపచేయటమే కదా సంపదలు కలిగినందుకు ఫలం.

విశేషం: అలం: ఉపమ, రూపకం.

క. **ధన ధాన్య పుత్త్ర బాంధవ । జనలాభంబులును దలఁప సరిగావు సుఖం**
బునఁ దాను దనరి శత్త్రులు । ఘనతర దుఃఖముల నుండఁ గని యలరుటకున్. **348**

ప్రతిపదార్థం: తలఁపన్= ఆలోచన చేసి పరిశీలించగా; ధన, ధాన్య, పుత్త్ర, బాంధవ, జన లాభంబులును= ధనం, పంటగింజలు, కొడుకులు, చుట్టాలు సమృద్ధిగా ప్రాప్తించటమున్నూ; తాను= తను; సుఖంబునన్= సౌఖ్యంగా; తనరి= విలసిల్లి; శత్రులు= విరోధులు; ఘన, తర, దుఃఖములన్= మిక్కిలి ఎక్కువైన కష్టాలలో; ఉండన్= ఉండగా; కని= చూచి; అలరుటకున్= సంతసించటానికి; సరిగావు= సమానం కావు.

తాత్పర్యం: తనకు ధనం ఉండవచ్చును. ధాన్యాలు ఉండవచ్చును. బంధువులు తనతో సహకరించవచ్చును. ఇది గొప్ప సంతోష యోగం కాదు. తాను సౌఖ్యాలతో విలసిల్లుతున్నప్పుడు తన విరోధులు మిక్కుటమైన వెతలను అనుభవించగా చూడటమే అచ్చమైన సంతోషయోగం. తనకు కలిగే మేలుకంటె శత్రువులకు కలిగే కీడు మాత్రమే అచ్చమైన ఆనందాన్ని కల్గిస్తుంది.

ఉ. **నారలు గట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులో విప**
ద్భారము నొంది వందురిన ఫల్గును నుజ్జ్వలరాజ్యవైభవో
దారులమై కనుంగొని ముదంబునఁ బొందఁగఁ గాంచుకంటె నిం
పారఁగ నొండు గల్గునె కృతార్థత యెందును గౌరవేశ్వరా! **349**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= కౌరవకులానికి అధిపతివి అయినవాడా, దుర్యోధనా!; నారలు= పీచుతో అల్లబడిన వస్త్రాలు; కట్టి= ధరించి; కూరలు= శాకాలు; అశనంబుగన్= తిండిగా; ఉగ్రవనంబులోన్= భయంకరమైన అడవిలో; విపత్+భారమున్= ఆపదల యొక్క బరువును; ఒంది= అనుభవించి; వందురిన= దుఃఖించిన; ఫల్గునున్= అర్జునుడిని; ఉత్+జ్వల, రాజ్య, వైభవ+ఉదారులము+ఐ= మిక్కిలి వెలుగొందే ప్రభుత్వ సంపదచేత గొప్ప వారలమయి; కనుంగొని= చూచి; ముదంబునన్= సంతోషాన్ని; పొందఁగన్, కాంచు కంటెన్= పొందేటట్లు చూడటంకంటె; ఇంపు+ఆరఁగన్= సంప్రీతిని చెందేటట్లుగా; ఒండు= వేరొకటి; కృతార్థత= ధన్యత్వం; ఎందును= ఎచట నైనను; కల్గును+ఎ= ఉంటుందా?

తాత్పర్యం: కౌరవులకు అధినేత వయిన ఓ దుర్యోధన సార్వభౌమా! సుకుమారసుందర మైన జిలుగు పట్టుపుట్టాలు కాక, ముదుక నారచీరలు ధరించి భయంకరమైన అడవిలో నివసిస్తూ, కందమూలఫలాలు భక్షిస్తూ నికృష్ట జీవితాన్ని గడుపుతున్నాడు అర్జునుడు. ఇక మనమా, దేదీప్యమానంగా వెలుగొందే భోగభాగ్యాలను అనుభవిస్తున్నవారం. మనం ఇప్పుడు అర్జునుడి దైన్యాన్ని కనులారా చూడటం కంటె మన జీవితాలకు ఇంకొక ధన్యత్వం కల్గుతుందా?

తే. **అతుల సౌభాగ్య పుణ్య సమగ్ర గరిమ । నొప్పుచున్న నీ దేవుల యొప్పు సూచి**
ధృతి దఱఁగి తన్నుఁ దాన నిందించు కొనుచు । హృదయమునఁ బాండవాంగన యెరియ వలదె!' 350

ప్రతిపదార్థం: పాండవ+అంగన= పాండవుల భార్య అయిన ద్రౌపది; అతుల, సౌభాగ్య, పుణ్య, సమగ్ర, గరిమన్= సాటిలేని సంపదయొక్కయు సుకృతంయొక్కయు సంపూర్ణమైన గొప్పతనంచేతను; ఒప్పుచున్న= విలసిల్లుతున్న; నీ దేవుల+ఒప్పు= నీ రాణుల శోభ; చూచి; ధృతి+తఱఁగి= ధైర్యం కోలుపోయి; తన్నున్+తాన్+అ= తనను తానే; నిందించుకొనుచున్= తిట్టుకొంటూ; హృదయమునన్= డెందంలో; ఎరియన్ వలదె?= కుమిలి పోవలదా?

తాత్పర్యం: నీ రాణులు సాటిలేని సంపదలతో భోగభాగ్యాలతో అలరారుతుండటం చూచి, ధైర్యాన్ని కోలుపోయి తనను తాను నిందించుకొంటూ పాండవుల భార్య అయిన ద్రౌపది తన దురవస్థకు మనసులో లోలోన (దుఃఖిస్తూ) కుమిలిపోవాలి సుమా!'

వ. **అనిన నిది వోలు నని నాగకేతనుండు సంప్రీతుం డై కొండొక విచారించి, రాధేయుం జూచి యిట్లనియె.351**

ప్రతిపదార్థం: అనినన్= అని కర్ణు డనగా; నాగకేతనుండు= సర్పము ధ్వజ చిహ్నంగా గలవాడు- దుర్యోధనుడు; ఇది= ఈ నీమాట; పోలున్+అని= తగునని; సంప్రీతుండు+ఐ= మిక్కిలి సంతృప్తి చెందినవాడై; కొండొక= ఇంచుక; విచారించి= ఆలోచించి; రాధేయున్= కర్ణుడిని; చూచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని కర్ణుడు చెప్పాడు. ఆ మాటలు విని నాగకేతను డైన దుర్యోధనుడు మిక్కిలి సంతృప్తి చెందిన వాడై, కొంత ఆలోచించి, కర్ణుడికి ఈ విధంగా ప్రత్యుత్తరం చెప్పాడు.

క. **'నా తలఁపును నిట్టిది; నీ । వేతెఱఁ గెఱిఁగించి తది యభీష్టము; మన మా**
ద్వైతవనంబున కరుగుట । భూతలపతి యనుమతింపఁ బోలదు మదిలోన్. 352

ప్రతిపదార్థం: నా తలఁపునున్= నా ఆలోచన కూడా; ఇట్టిది= ఇటువంటిదే; నీవు= నీవు; ఏతెఱఁగు= ఏ మార్గం; (ఎటువంటి అనువైన ఉపాయం); ఎఱిఁగించితి= తెలిపావో; అది= (మన ఐశ్వర్య ప్రదర్శనం); అభీష్టము= మిక్కిలి ఇష్టమైనది; మనము;

ఆ ద్వైత వనంబునకున్= ఆ ద్వైతం అనే పేరు గల అడవికి; అరుగుట= వెడలుట; భూతలపతి= రాజు (ధృతరాష్ట్ర ప్రభువు); మదిలోన్= మనస్సులో; అనుమతింపన్+పోలదు= అంగీకరించటానికి వీలు కాదు (అంగీకరించడు).

తాత్పర్యం: నా అభిప్రాయం కూడా ఇటువంటిదే సుమా! నీవు సరి అయిన ఉపాయాన్ని సూచించావు. నీవు చెప్పిన మాటలు నాకు మిక్కిలి ఇష్టము లైనవి. కాని, మనం ద్వైతవనానికి వెళ్ళటానికి ప్రభువైన ధృతరాష్ట్రుడు అంగీకరించజాలడు.

తే. **అందుఁ బాండవు లుండుట యాంబికేయుఁ । డెఱుఁగు; మన మవ్వనంబున కేఁగుటయును**

గడఁగి పార్థులతోడి విగ్రహము కొఱక । యని యవశ్యంబు వారించు నతఁడు మనల. **353**

ప్రతిపదార్థం: అందున్= దానిలో, ఆద్వైతవనంలో; పాండవులు+ఉండుట= పాండురాజు నందనులు నివసించటం; ఆంబికేయుఁడు = అంబిక కొడుకు - ధృతరాష్ట్రుడు; ఎఱుఁగున్= తెలియును; మనము= మనం; ఆ+వనంబునకున్= ఆ అడవికి (ద్వైత వనానికి); ఏగుటయును= వెళ్లటమున్నూ; కడఁగి= పూని; పార్థులతోడి= కుంతీకుమారులతోడి; విగ్రహము కొఱకున్+అ= కయ్యానికి మాత్రమే; అని= అని చెప్పి; అవశ్యంబున్= తప్పకుండా; అతఁడు= (ఆ ధృతరాష్ట్రుడు); మనలన్= మనలను, వారించున్= అడ్డగిస్తాడు.

తాత్పర్యం: ఆ ద్వైతవనంలో పాండవులు ప్రస్తుతం నివసిస్తున్న సంగతి, మహారాజు ధృతరాష్ట్రుడికి తెలియును. ఇప్పుడు మనం ఆ ద్వైతవనానికి విహారయాత్రకు వెళ్ళటం, పాండవులతో కయ్యానికి కాలు దువ్వటమే ఔతుందని ఆయన తలపోసి మనలను అక్కడకు వెళ్ళటానికి అనుమతించడు అని నా భయం.

వ. **అదియునుం గాక.** **354**

తాత్పర్యం: అంతేకాక.

ఉ. **ఉరుతరవిక్రమాఢ్యు లనియున్ మహనీయతపోవిశేష సు**

స్థిరు లనియుం బృథాసుతుల దిక్కునఁ దద్దయు భీతుఁ డై నిరం

తరమును మానవేంద్రుఁ డెదఁ దాపము నొందుచునుండు; వింటె? యి

క్కురువిభుఁ డింతసేపు గడుఁ గూర్చి విలాపము సేసె వారికిన్. **355**

ప్రతిపదార్థం: ఉరుతర, విక్రమ+ఆఢ్యులు+అనియున్= మిక్కిలి గొప్ప దైన శౌర్యం కలవారు అనిన్నీ; మహనీయ, తపస్+విశేష, సుస్థిరులు+అనియున్= గొప్పది సాటిలేనిది అయిన తపస్సు చేయటం చేత లభించిన నిలుకడ కలవారు అనిన్నీ; పృథా, సుతుల, దిక్కునన్= కుంతీకుమారుల యెడ; తద్దయున్= మిక్కిలి; భీతుఁడు+ఐ= భయపడినవాడై; నిరంతరమును= ఎల్లప్పుడున్నూ; మానవ+ఇంద్రుఁడు= మనుజులలో ఇంద్రుడు అనగా ప్రభువు ధృతరాష్ట్రుడు; ఎదన్= హృదయంలో; తాపమున్= కష్టం; ఒందుచున్+ఉండున్= అనుభవిస్తుంటాడు; వింటె? (వింటి+ఎ?)= విన్నావా?; ఈ+కురు విభుఁడు= ఈ కురువంశానికి చెందిన రాజు ధృతరాష్ట్రుడు; ఇంత సేపు= ఇంత సమయం; వారికిన్= వారి యెడల; పాండవుల యెడ; కడున్+కూర్చి= మిక్కిలి అనుసంధించి; విలాపము+చేసెన్= దుఃఖించాడు.

తాత్పర్యం: అంతమాత్రమేకాక, ధృతరాష్ట్రుడికి పాండవులన్న మిక్కిలి భయం ఏర్పడింది. పాండవులు సాటిలేని శౌర్యం కలవారనీ, గొప్పదైన తపస్సు చేసి, మిక్కుటమైన స్థైర్యాన్ని ఆర్జించారనిన్నీ ఎల్లప్పుడు కౌరవవంశ నేత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అయిన ధృతరాష్ట్ర మహారాజు తన డెందంలో దుఃఖిస్తూ ఉంటాడు. వినలేదా? ఇంతసేపటివరకు ఆయన పాండవుల శౌర్యధైర్యాలనుగూర్చి ఉగ్గడిస్తూనే ఉన్నాడు గదా!

వ. అతనియొద్ద నుండి విదురుండును వారిన పెట్టుచోటు గానక పొగడుచుండు; జూదంబు నాఁట నుండియు విదురుండు పాండవపక్షపాతి యగుట దెల్లం బయ్యె; మన విచారించిన యిక్కార్యంబు చిన్నసన్న యెఱింగె నేనియు నాతం డెల్లభంగుల విఘ్నంబు సేయుం గావున నిది యంతయు రహస్యంబుగా నొనరించుకొని, ధృతరాష్ట్రుండు దీని కనుమతించు తెఱం గెయ్యది యట్టి యుపాయంబు నీవును శకునియు నూహించు నది; మనము రేపకడ వచ్చి కురుపితామహుం డైన భీష్మునిఁ గురువంశోత్తముం డయిన ధృతరాష్ట్రుని నొడంబఱిచి, వెడలుద' మని వారి వీడ్కొలిపి దుర్యోధనుం డభ్యంతరగృహంబున కరిగి, యా రాత్రి సముచిత ప్రకారంబునఁ గడపెఁ; బ్రభాతం బగుటయుఁ గర్ణుండు దుర్యోధనుకడకుం జని యిట్లనియె. 356

ప్రతిపదార్థం: విదురుండును= విదురుడును; అతని యొద్దన్+ఉండి= (ఆ ధృతరాష్ట్రుడి కడ ఉండి); పెట్టుచోటు+కానక= తనకు కూడుపెట్టే చోటని కూడా గమనించకుండా; వారిన్+అ= వారినే, ఆ పాండవులనే; పొగడుచుండున్= ప్రశంసిస్తూ ఉంటాడు; జూదంబు, నాఁటన్+ఉండియున్= జూదం జరిగినరోజునుండి; విదురుండు; పాండవ, పక్షపాతి+అగుట= పాండవుల యందు ఎక్కువ ప్రీతి కలవాడు కావటం; తెల్లంబు+అయ్యెన్= స్పష్టం అయింది; మన విచారించిన= మనం ఆలోచించిన; ఈ+కార్యంబు= ఈ పని; చిన్న సన్న= చిన్న గుర్తు; ఎఱింగెన్+ఏనియున్= తెలిసికొన్నప్పటికి; ఆతండు= ఆ విదురుడు; ఎల్లభంగులన్= ఎల్ల విధాల; విఘ్నంబు+చేయున్= ఆటంకం కల్పిస్తాడు; కావునన్= కాబట్టి, ఇది+అంతయున్= మన ఆలోచన అంతా; రహస్యంబుగాన్= ఎవరికి తెలియకుండా ఉండేటట్లుగా; ఒనరించుకొని= ఏర్పరచుకొని; ధృతరాష్ట్రుండు; దీనికిన్= మనం ఏర్పరచుకొన్న కార్యానికి; అనుమతించు తెఱంగు= అంగీకరించే మార్గం; ఎయ్యది= ఏదో; అట్టి= అటువంటి; ఉపాయంబు= వెరవు; నీవును= ఓ కర్ణా నీవును; శకునియున్= శకునియు; ఊహించునది= యోచన చేయండి; మనము= మనం (నేను నీవు శకునియున్నూ); రేప కడ= ఉదయాన్నే; వచ్చి= అరుదెంచి (కొలువు కూటానికి ఏగుదెంచి); కురు పితామహుండు+అయిన, భీష్మునిన్= కురు వంశానికి తాతగారు అయిన భీష్ముడిని; కురు, వంశ+ఉత్తముండు+అయిన= కురువంశంలో శ్రేష్ఠుడు, ప్రభువు అయిన; ధృతరాష్ట్రుని; ఒడంబఱిచి= అంగీకరింపజేసి; వెదలుదము= వెళ్ళుదాము; అని= అని వచించి; వారిన్= కర్ణశకునులను; వీడ్కొలిపి= సాగనంపి; దుర్యోధనుండు= సుయోధనుడు; అభ్యంతర గృహంబునకున్= అంతఃపురంలోకి; అరిగి= వెళ్ళి; ఆ+రాత్రి= ఆరేయి; సముచిత ప్రకారంబునన్= తగిన రీతిని; కడపెన్= వెళ్ళబుచ్చాడు; ప్రభాతంబు+అగుటయున్= తెల్లవారుటయున్నూ; కర్ణుండు; దుర్యోధను కడకున్+చని= సుయోధనుని దగ్గరకు వెళ్ళి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడికి పాండవులంటే భయం. ఆ మహారాజు కడ మంత్రిగా ఉన్న విదురుడు కుడిచే కూడు కౌరవులది. కాని, అతడి అభిమానం మాత్రం పాండవులపై ఉంటుంది. విదురుడి పాండవ పక్షపాతం జూదం జరిగిన రోజునే ఎల్లరకు తేటతెల్ల మయింది. అతడు ఎల్లప్పుడును పాండవులను ప్రశంసిస్తూనే ఉంటాడు. ఆతడికి మన ఆలోచన ఏ మాత్రం పొక్కినప్పటికిన్నీ ఇక మనకు ఆతడు ఆటంకాలు కల్పించటం తథ్యం. అందుచేత మనం రహస్యంగా మనపని నెరవేర్చుకొనవలసి ఉన్నది. ధృతరాష్ట్రుడు మన ఆలోచనకు ఏ రీతిగా సమ్మతిస్తాడా? అని ఆలోచించి దానికి తగిన ఉపాయం కనిపెట్టాలి. అట్టి వెరవును నీవును శకునియు ఆలోచించండి. మనము రేపు ఉదయం తిరిగి కొలువుకూటానికి చేరి కురువంశపితామహుడు అయిన భీష్ముడిని, కురువంశ శ్రేష్ఠుడైన ధృతరాష్ట్రుడిని, అంగీకరింపజేసి, ద్వైతవనవిహారయాత్రకు వెడలుదాము' అని చెప్పి దుర్యోధనుడు అంతఃపురానికి అరిగి ఆ రేయి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యథోచితకృత్యాలతో గడిపాడు. మరునాడు తెల్లవారిన పిమ్మట కర్ణుడు దుర్యోధనుడి కడకు వెళ్ళి ఈ విధంగా పలికాడు.

ఉ. ‘భూతలనాథ! యే నొకటి పోల నుపాయము గంటి; నిప్పు డా
ద్వైతవనంబునందు విదితంబుగ నున్నవి గో కదంబముల్;
ప్రీతిగఁ దద్విలోకనము పేరఁ జనం దగు; ధారుణీశ్వరుం
డీతెఱఁ గైనఁ బొమ్మను; నభీష్టముఁ జేకుఱు నెల్లభంగులన్’. 357

ప్రతిపదార్థం: భూతలనాథ!= భూమికి భర్తైన ఓ రాజా! ఓ సుయోధనా!; ఏను= నేను; ఒకటి= ఒకటి; పోలన్+ఉపాయము= సరిపడే వెరవును; కంటిన్= కనుగొన్నాను; ఇప్పుడు= ఈ సమయంలో; ఆ ద్వైత వనంబునందున్= ద్వైతం అనే పేరు కల ఆ అడవిలో; గో, కదంబముల్= ఆవుల మందలు; విదితంబుగన్= విస్పష్టంగా; ఉన్నవి= ఉన్నాయి; ప్రీతిగన్= సంతృప్తిగా; తద్+విలోకనము, పేరన్= వాటిని (ఆ ఆవుల మందలను) చూడటం అనే నెపం చొప్పున; చనన్+తగున్= వెళ్లవచ్చును; ధారుణీ+ఈశ్వరుండు= భూమికి భర్తఅయిన - ధృతరాష్ట్రుడు; ఈ తెఱఁగు+ఐనన్= ఈ విధం అయితే; పొమ్ము+అనున్= మనం పోవటానికి అనుమతిస్తాడు; అభీష్టము= (మన) కోరిక; ఎల్ల భంగులన్= అన్ని విధాలా; చేకుఱున్= నెరవేరుతుంది.

తాత్పర్యం: ‘ఓ సుయోధన మహారాజా! నాకు సరైన ఒక మంచి ఉపాయం స్ఫురించింది. ఈ సమయంలో ఆ ద్వైతవనంలో మన ఆవులమందలు ఉన్న సంగతి అందరికీ తెలిసిన విషయమే కదా. ఆ ఆవులమందలను చూడటం కొరకై మనం ద్వైతవన విహారయాత్రకు వెళ్ళుతున్నట్లు ప్రకటిస్తే ధృతరాష్ట్ర మహారాజు అంగీకరించగలడు. ఎవ్వరూ అనుమానించటానికి ఎట్టి ఆస్కారమూ ఉండదు. ఈ విధంగా మన కోరిక ఈడేర గలదు.’

క. నా విని సుబల తనూజుఁడు । ‘దేవా! నీ యాన, యేను దెల్లంబుగ రే
యీా వెఱవె నెమ్మనమ్మున । భావించితి’ ననియె; నంతఁ బ్రహసితముఖులై. 358

ప్రతిపదార్థం: నాన్= అని చెప్పగా; విని= ఆలకించి; సుబల తనూజుఁడు= సుబలుడి కొడుకు (శకుని); దేవా!= ఓ దుర్యోధన మహారాజా! ; నీ+ఆన= నీ మీద ఒట్టు సుమా; ఏను= నేను; తెల్లంబుగన్= స్పష్టంగా; రే= రాతిరి; ఈ వెఱవు+ఎ= ఈ ఉపాయాన్నే; నెమ్మనమునన్= నిండు మనస్సులో; భావించితిన్= తలపోశాను; అనియెన్= అని చెప్పాడు. అంతన్= పిదప; ప్రహసిత ముఖులు+ఐ= నవ్వు మొగాలు కలవారై.

తాత్పర్యం: అని కర్ణుడు చెప్పగా ఆలకించి సుబలుడి కొడుకైన శకుని ఉప్పొంగిన సంతోషంతో, ‘ఓ దుర్యోధన మహారాజా! నీ మీద ఒట్టుపెట్టి చెప్పుతున్నాను. కర్ణుడు ఇప్పుడు చెప్పిన ఉపాయమే ఈ రాత్రి నాకు తట్టింది. నిండుమనసుతో నేను కర్ణుడి ఆలోచనతో ఏకీభవిస్తున్నాను’ అని వచించాడు. అంతట నవ్వులు చిందుతున్న ముఖాలతో వారు. (తరువాతి వచనంలో అన్వయం).

వ. ఒండొరుల చెయి సఱచి నవ్వుచు నమ్మువ్వురుం దత్‌క్షణంబ సమంగ నామధేయుం డయిన గోపాలకు నొక్కనిం గఱపికొని ధృతరాష్ట్రుపాలికిం దోడ్కొని సముచిత ప్రసంగ సేవా విశేషంబుల నమ్మహీవిభు సుముఖుం జేసి యనంతరంబ ‘దేవా! ద్వైతవనంబు నందుల కీలారంబుననుండి వీఁడె యొక్క గోపకుండు వచ్చె’ ననిన, నతండును వాని కభిముఖుండై పసుల సేమం బడుగుటయు వాఁ డిట్లనియె. 359

ప్రతిపదార్థం: ఒండు+ఒరులు= ఒకరినొకరు; చెయి+చఱచి= చేతులు కలిపి ధ్వనిని చేసి; నవ్వుచున్= నవ్వుతూ; ఆ+మువ్వురున్= ఆ ముగ్గురును (దుర్యోధనుడు, శకుని, కర్ణుడును); తద్+క్షణంబు+అ= ఆ క్షణంలోనే; సమంగ, నామధేయుండు+అయిన= 'సమంగుడు' అనే పేరు కలిగినట్టివాడిని; గోపాలకున్= గొల్లవాడిని; ఒక్కనిన్= ఒకడిని; కఱపికొని= ప్రబోధం చేసి (ఏ విధంగా ప్రవర్తించవలెనో చెప్పి చూపి); ధృతరాష్ట్రుపాలికిన్= ధృతరాష్ట్రుడి కడకు; తోడ్కొని= తీసికొని వెళ్లి; సముచిత, ప్రసంగ, సేవా, విశేషంబులన్= అప్పటికి సరిపడే సంభాషణలతో రాచమర్యాదలచేత; ఆ+మహీ విభున్= ఆ రాజును (ధృతరాష్ట్రుడిని); సుముఖున్+చేసి= (తమకు) అనుకూలుడిగా చేసికొని; అనంతరంబు+అ= అటు పిమ్మటనే; దేవా!= ఓ మహారాజా! ధృతరాష్ట్ర ప్రభూ! ద్వైతవనంబు, నందుల, కీలారంబున నుండి= ద్వైతం అనెడి అడవిలోని గొల్లల ఆలమంద నుండి; వీఁడు+ఎ= సమంగుడు అనే పేరుగల; ఒక్క= ఒక; గోపకుండు= గొల్లవాడు; వచ్చెన్= అరుగుదెంచాడు; అనినన్= అని చెప్పగా; అతండును= ఆ ధృతరాష్ట్రుడును; వానికిన్= ఆ గొల్లవాడికి; అభిముఖుండు+ఐ= ఎదురుగా మొగాన్ని పెట్టినవాడై; పసుల సేమంబు= పశువుల (ఆవుల) క్షేమాన్ని; అడుగుటయున్= ప్రశ్నించటమున్నూ; వాఁడు= ఆ గోపాలుడు (సమంగుడు); ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: కర్ణుడు సూచించిన ఉపాయం దుర్యోధనుడికీ శకునికీ నచ్చింది. అంతట సంతోషంతో వారు ముగ్గురును ఉప్పొంగిన సంతోషంతో అన్యోన్యకరచాలనాలు చేసికొన్నారు. వెనువెంటనే వారు సమంగుడు అనే పేరు కల ఒక గొల్లవాడిని కలిసికొని వాడికి ధృతరాష్ట్రుడి కడ ఏ విధంగా మాటాడవలెనో ఏ విధంగా నటించవలెనో చక్కగా నేర్పి కొలువుకూటానికి తోడ్కొనిపోయారు. అక్కడ మొదట ఈ విషయాన్ని ప్రస్తావించక, తగిన రీతిని సంభాషించి, రాచమర్యాదలు నెరపి, ధృతరాష్ట్రుడిని ప్రసన్నుడిని కావించుకొని, తదుపరి 'మహాప్రభూ! ద్వైతవనంలో ఉన్న మన ఆవులమందనుండి ఒక గొల్లవాడు దేవర దర్శనార్థం వచ్చాడు. ఇడుగో! ఇతడే, అవధరించండి' అని చెప్పారు. అంతట- ధృతరాష్ట్రుడు ఆ గోపాలకుడి దిక్కు మొగం పెట్టి, ఆవులక్షేమాన్నిగూర్చి ప్రశ్నించాడు. అంతట ఆ గోపాలకుడు ఈ విధంగా చెప్పాడు.

విశేషం: సమంగు డనే గొల్లవాడు అసలు ద్వైతవనంలోని పసులమంద కాపరులలో ఒకడు కాడు. అతడికి కొలువుకూటంలో ధృతరాష్ట్రుడి సమక్షంలో ఎట్లా నటించవలెనో నేర్పారు దుర్యోధనుడు కర్ణుడు శకుని.

కర్ణ సౌబలులు ధృతరాష్ట్రుచేత ఘోషయాత్ర కనుజ్ఞ గొనుట (సం. 3-227-2)

ఉ. **'ద్వైతవనంబునట్టి సుఖవాసము గోవుల కెందు లేదు; ధా**
త్రీతలనాథ! యిప్పుడు ప్రదీప్తములై సతతంబుఁ బేర్చి గో
వ్రాతభయంకరంబు లగు వాలుమృగంబులు సంచరించు; మీ
కా తెఱఁగెల్లఁ జెప్పుటకునై యిట వచ్చితి నేను జెచ్చెరన్.' **360**

ప్రతిపదార్థం: ధాత్రీతల నాథ!= ఓ మహారాజా! (ధృతరాష్ట్ర ప్రభూ!); ద్వైతవనంబు+అట్టి= ద్వైతమనే పేరు గల అడవి వంటి; సుఖవాసము= సౌఖ్యంతో కూడిన నివాసం; గోవులకున్= ఆవులకు; ఎందున్= ఎచటను (మరి ఏ వనంలోను); లేదు= ఉండదు; ఇప్పుడు= ఈ సమయంలో; ప్రదీప్తములు+ఐ= విజృంభించి నట్టివై; సతతంబున్= ఎల్లప్పుడును; పేర్చి= చెలరేగి; గో, వ్రాత, భయంకరంబులు+అగు= ఆవుల సముదాయానికి భయాన్ని కలిగించేవి అయిన; వాలు మృగంబులు= పులి మొదలయిన క్రూర జంతువులు; సంచరించున్= తిరుగాడుతున్నాయి; మీకున్= (ఓ ధృతరాష్ట్ర ప్రభూ!) తమకు; ఆ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తెలఁగు+ఎల్లన్= ఆ విషయ మంతటిని; చెప్పుటకున్+ఐ= విశదంగా వచించటానికై; ఏను= నేను; చెచ్చెరన్= శీఘ్రంగా; ఇట వచ్చితిన్= ఇక్కడకు వచ్చాను.

తాత్పర్యం: 'భూమిని అంతటిని పరిపాలించే ఓ ధృతరాష్ట్ర మహారాజా! ద్వైతవనంలో ఆవులు ఇంతవరకు సుఖంగా ఉన్నవి. అది ఆవులకు హాయి కల్గించే అడవి. కాని, ఇప్పుడు పరిస్థితి తారుమారయింది. అక్కడ ఇప్పుడు క్రూర జంతువులు విజృంభించి విచ్చలవిడిగా తిరుగాడుతూ, ఆవులకు భయం కలిగించి హాని చేస్తున్నవి. మీకు ఆ విషయాన్ని వివరించి విన్నవించుకొనటానికి నేను ఇక్కడికి వచ్చాను. ఇక ఆలస్యం కాకుండా ఆవులను కాపాడటానికై తాము సత్వరచర్య గైకొన వేడికోలు'.

వ. అనిన యనంతరంబ కర్ణసౌబలులు ధృతరాష్ట్రుతోడ 'దేవా! యట్లయినం దడయక దుష్టమృగనాశనంబును, గోగణ సంరక్షణంబును జేయుటకు భవత్సూను దుర్యోధను నియోగింపు' మనిన నతండు గొండొకవిచారించి యి ట్లనియె. 361

ప్రతిపదార్థం: అనిన+అనంతరంబు+అ= అని చెప్పిన పిమ్మటనే; కర్ణసౌబలులు= కర్ణుడు శకుని; ధృతరాష్ట్రుతోడన్= ధృతరాష్ట్రుడితో; దేవా!= ఓ మహాప్రభూ!; అట్లు+అయినన్= ఆ విధంగా జరిగితే; దుష్ట, మృగ, నాశనంబును= చెడ్డ జంతువుల యొక్క సంహారాన్ని; గోగణ సంరక్షణంబును= ఆవుల మందలకు గట్టి భద్రతను కల్పించటాన్ని; చేయుటకు; భవత్+సూనున్= నీ యొక్క కొడుకును; దుర్యోధనున్= సుయోధనుడిని; నియమింపుము= నియోగింపుము; అనినన్= అని చెప్పగా; అతండు= అతడు (ధృతరాష్ట్రుడు); కొండొక విచారించి= కొంతసేపు ఆలోచించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: గోపాలుడు ఆ విధంగా నివేదించిన వెనువెంటనే కర్ణుడును, సుబలుడి సుతుడైన శకునియు ధృతరాష్ట్రుడితో సమయానికి అతికేటట్లుగా ఇట్లా అన్నారు. 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! గోపాలుడు చెప్పిన మాటలు నిజాలే అని తలపోస్తున్నాం. కావున, గోవులను కాపాడటానికీ, క్రూరమృగాలను సంహరించటానికీ నీ కొడుకు దుర్యోధనుడిని నియోగించుము.' ఆ మాటలు వినిన పిదప ధృతరాష్ట్రుడు కొంత తడవు ఆలోచించి ఈ విధంగా అన్నాడు.

మ. 'తగు గోరక్ష యొనర్ప, దుష్టమృగ విధ్వంసంబుఁ గావింప మే
లగు; నైనన్ వినుఁ డవ్వనాంతరమునం దాసక్తిమై నున్న వా
రు గరిష్ఠాత్ములు పాండురాజుతనయుల్, రూఢప్రతాపాఢ్యు; ల
ట్లగుటన్ మీ గమనంబు నామదిఁ బ్రియంబై తోఁప దెబ్బంగులన్. 362

ప్రతిపదార్థం: గో, రక్ష+ఒనర్పన్= గోవులను కాపాడటం; తగున్= మంచిది; దుష్ట, మృగ, విధ్వంసంబున్= క్రూరజంతువుల వినాశం; కావింపన్= చేయటంవలన; మేలు+అగున్= శుభం కలుగుతుంది; ఐనన్= అయినప్పటికిని; వినుఁడు= ఆలకించండి; ఆ+వన+అంతరము నందున్= ఆ అడవి మధ్యలో; ఆసక్తిమైన్= అభిలాషతో; పాండురాజు తనయుల్= పాండవులు; గరిష్ఠ+ఆత్ములు= గొప్ప అంతరంగాలు గల మహానుభావులు; రూఢ, ప్రతాప+ఆఢ్యులు= ప్రసిద్ధికెక్కిన శౌర్యంతో కూడినవారు; ఉన్నవారు= ఉన్నారు; అట్లు+అగుటన్= అందుచేత (పాండవులు ఆ అడవిలో ఉండటం వలన); మీ గమనంబు= మీరు వెళ్ళటం (మీరు ఆ ద్వైతవనానికి వెళ్లటం); ఎబ్బంగులన్(ఏ+అంగులన్)= ఎన్ని విధాలుగా చూచినా; నామదిన్= నా మనస్సుకు; ప్రియంబు+ఐ= ఇష్టమై; తోఁపదు= కన్పించదు.

తాత్పర్యం: గోరక్షణం చేయటం మంచిదే. అది రాజులకు ముఖ్యమైన కర్తవ్యమే. క్రూరమృగాలను సంహరిస్తే తప్ప గోవులను కాపాడటానికి వీలు కాదు. ఆ మాట కూడా నిజమే. కాని, ఆ ద్వైతవనంలోనే పాండవులు అభిలాషతో నివసిస్తున్నారు. వారు మహానుభావులు. వారి శౌర్యం సుప్రసిద్ధమైనది, జగద్విదితమైనది, అనేక పరీక్షలలో విజయం సాధించినట్టిది. అందుచేత మీరు ఆ ద్వైతవనానికి వెళ్ళటం ఎన్నిరీతుల ఆలోచించినా నా మనస్సుకు ఏ మాత్రం నచ్చటం లేదు.

విశేషం: ఉ.వి. మహాభారత సంశోధిత ప్రతిలో 'దుష్టమృగ విధ్వసంబు నూహింప మేలగు' అనే పాఠం ఉన్నది. దానికంటె "విధ్వంసంబుఁగావింప మేలగు" అనే పాఠాంతరమే మేలని భావించి ఇక్కడ స్వీకరించటమైనది.

చ. **వనమున కేఁగి వందురిన వా రని వారల మీ రవశ్యముం**
జెనకఁ దలంతు; రప్పురుషసింహులు భూరితపోనిధుల్ మనం
బునఁ గలుషించిరేనియుఁ దపోమహిమన్ మిము నిర్దహింతు రొం
డె నతులితాస్త్ర శక్తిని వడిం దునుమాడుదు రాజి నందఱన్. **363**

ప్రతిపదార్థం: వనమునకున్= అడవికి; ఏఁగి= వెడలి; వందురిన వారు= దైన్యం పొందినవారు; అని= అని తలపోసి; వారలన్= ఆ పాండవులను; మీరు= మీరు (దుర్యోధనుడు కర్ణుడు శకుని ప్రభృతులు); అవశ్యమున్= తప్పకుండా; చెనకన్+తలంతురు= కీడు చేయ తలపోస్తారు; ఆ+పురుష సింహులు= మగవారిలో సింగాల వంటివారు (పాండవులు); భూరి, తపస్+నిధుల్= మిక్కుటమైన తపస్సుకు గనుల వంటివారు; మనంబునన్= మనస్సులో; కలుషించిరి+ఏనియున్= కోపాన్ని పూనితే; తపస్+మహిమన్= తపస్సుయొక్క గొప్పతనంచేత; మిమున్= మిమ్ము (దుర్యోధన ప్రభృతులైన మిమ్ము); నిర్దహింతురు= కాల్చివేస్తారు; ఒండెన్= లేదా; అతులిత+అస్త్ర, శక్తిని= సాటిలేని మంత్రపూరితమైన ఆయుధాలచేత; వడిన్= శీఘ్రంగా; ఆజిన్= యుద్ధంలో; అందఱన్= ఎల్లరను; తునుమాడుదురు= ముక్కలు ముక్కలుగా ఖండిస్తారు.

తాత్పర్యం: అడవులకు వెళ్ళి దైన్యంతో బ్రదుకుతున్నవారినిగా భావించి మీరు పాండవులను అవమానించటానికి పూనుకొంటారు. ఇక ఆ పాండవులన్ననో పురుషసింహులు, తపోనిధులు. వారికి కోపం వస్తే తమ తపోబలం వలన మిమ్మల్ని దహించి వేస్తారు. లేదా యుద్ధంలో మిమ్మల్ని అందరిని ముక్కలు ముక్కలుగా ఖండించి వేస్తారు.

క. **మున్నును మీచేతఁ గడున్ । బన్నము వడి నొచ్చినారు పార్థులు; మిమ్మున్**
గన్నంత నలుగకుండునె । పన్నగరిపుసన్నిభుండు పవనజుఁ డాత్మన్. **364**

ప్రతిపదార్థం: మున్నును= మునుపు, పూర్వం; పార్థులు= కుంతీ కుమారులైన పాండవులు; మీ చేతన్= మీ వలన; కడున్= మిక్కిలి; బన్నము+పడి= పరాభవం పొంది; నొచ్చినారు= కష్టాలు అనుభవించి ఉన్నారు; మిమ్మున్= మిమ్మల్ని; కన్నంతన్= చూడగానే; పన్నగ, రిపు, సన్నిభుండు= పాములకు శత్రువైన గరుత్మంతుడితో సమానమైనవాడు; పవనజుఁడు= వాయుపుత్రుడైన భీముడు; ఆత్మన్= మనస్సులో; అలుగక+ఉండును+ఎ?= ఆగ్రహించక ఉంటాడా?

తాత్పర్యం: పాండవులు మునుపు మీ చేత అవమానించబడి మిక్కిలి నొచ్చి ఉన్నవారు కదా! ఇపుడు మిమ్మల్ని చూచినంతనే పాములకు శత్రువైన గరుత్మంతుడితో సమానమైన బలం కలవాడైన భీముడు మనస్సులో కోపించక ఊరుకొంటాడా? మిమ్మల్ని చూచినతోడనే పాండవులకు మీపై ఆగ్రహం కలగటం తథ్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అదియునుం గాక. 365

తాత్పర్యం: అంతే కాక.

చ. ఒకరుఁడ ధాత్రి యంతయును నోర్చెఁ గృతాస్త్రుఁడు గాక యుండియుం
బ్రకటితబాహువిక్రముఁడు ఫల్గునుఁ డిప్డు మహేంద్రుపాల న
త్యకుటిల దివ్యబాణవిదుఁడై యెలమిం జనుదెంచె నట్టి వా
నికి నెదురంగ శక్యమగునే రణభూముల నింక నేరికిన్? 366

ప్రతిపదార్థం: ఫల్గునుఁడు= అర్జునుడు; కృత+అస్త్రుఁడు= మంత్రపూరితమైన బాణవిద్యలో ఆరితేరినవాడు; కాక+ఉండియున్= కానప్పుడే; ఒకరుఁడు+అ= ఒక్కడు మాత్రమే (ఏకైక వీరుడై); ధాత్రి+అంతయును= భూమి సమస్తాన్నీ; ఓర్చెన్= జయించాడు; ఇప్డు= ఇపుడు; మహేంద్రుపాలన్= దేవేంద్రుడి సమక్షంలో; అతి+అకుటిల, దివ్య, బాణ, విదుఁడు+ఐ= మిక్కిలి స్వచ్ఛమైనవి, దేవతా మహిమ కలిగినవి అయిన బాణాలను తెలిసినవాడై; ఎలమిన్= ప్రీతితో; చనుదెంచెన్= వచ్చాడు; అట్టి వానికిన్= అట్టి గొప్ప అస్త్రాలు సంపాదించిన అర్జునుడిని; రణభూములన్= యుద్ధరంగాలలో; ఎదురంగన్= ఎదుర్కొనటానికి; ఏరికిన్= ఎవరికైనను; శక్యము అగును+ఏ?= సాధ్యం అవుతుందా?

తాత్పర్యం: మఱియును అర్జునుడు సాధారణమైన వీరుడు కాడు. అతడు దివ్యాస్త్రాలను ఆర్జించక ముందే, ఏకైకవీరుడై దిగ్విజయయాత్ర చేసి భూమిని సమస్తాన్నీ జయించగల్గాడు. ఇక, ఇపుడు ఆతడు దేవేంద్రుడి సమక్షంలో దేవతామహిమ గల గొప్పఅస్త్రాలను సంపాదించి, తిరిగివచ్చాడు. అట్టి అర్జునుడిని ఇక రణరంగంలో ఎదుర్కొని పోరాడటం ఎవరికీ సాధ్యం కాదు.

తే. చెనకి మీరు వారికిఁ గీడు సేయుటయును । వారు మీ కెగ్గుసేఁతయు వగవ మేలు
గాదు; వలసిన ఘోషరక్షణ మొనర్పఁ । దగినవారలఁ బుత్తము దడయ కందు.' 367

ప్రతిపదార్థం: మీరు= మీరు (దుర్యోధన ప్రభృతులు); వారికిన్= పాండవులకు; చెనకి= దుష్టబుద్ధితో పూని; కీడు= అపకారం; చేయుటయును= చేయటమున్నూ; వారు= ఆ పాండవులు; మీకున్= దుర్యోధన ప్రభృతులైన మీకు; ఎగ్గు= అపకారం; చేఁతయున్= చేయుట మున్నూ; వగవన్= ఆలోచించగా; మేలు+కాదు= శుభం కాదు; తడయక= ఆలసించక; అందున్= అచటికి (ద్వైతవనానికి); ఘోష, రక్షణము= ఆవుల మందలను కాపాడటం; ఒనర్పన్= చేయటానికి; తగిన వారలన్= యోగ్యులైన వారలను; పుత్తము= నియోగిద్దాం.

తాత్పర్యం: దుష్టబుద్ధితో మీరు ఆ పాండవులకు కీడు చేయటం, వారు మీకు తిరిగి కీడు చేయటం అనేదాన్ని ఆలోచించి చూస్తే శ్రేయస్కరమైన పద్ధతి కాదు. ఆవులమందలను కాపాడటానికై ఆలస్యం చేయకుండా సమర్థులు అయినవారలను ఎన్నుకొని నియోగిద్దాం.'

వ. అని యొడంబడకున్న నయ్యాంబికేయునకు శకుని యిట్లనియె. 368

తాత్పర్యం: అని అంగీకరించని ఆ ధృతరాష్ట్రుడితో శకుని ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. 'పాలితవిక్రమోన్నతులు పాండుతనూజులు; వారి కప్రియం
బేల యొనర్తు మే మధిప! యే మటు సేసితిమేనియుం బ్రతి
జ్ఞాలపితుండు ధర్మజుఁడు సత్యము దప్పునె? తమ్ము లేల త
చ్ఛీల మతిక్రమింతు? రిది సిద్ధము; నమ్ముము నెమ్మనంబునన్. 369

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! ఓ ధృతరాష్ట్ర ప్రభూ!; పాండు, తనూజులు= పాండురాజు కొడుకులు; పాలిత విక్రమ+ఉన్నతులు= క్రమశిక్షణతో కూడిన శౌర్యంతో గొప్పవారైన వారు; వారికిన్= పాండవులకు; ఏము= మేము (దుర్యోధన ప్రభృతులం); ఏల= ఎందుకు; అప్రియంబు= కీడు; ఒనర్తుము?= చేస్తాము?; ఏము= మేము; అటు+చేసితిమి+ఏనియున్= ఆ విధంగా (పాండవులకు కీడు) చేసినప్పటికిని; ధర్మజుఁడు= ధర్మపుత్రుడు; ప్రతిజ్ఞాలపితుండు= శపథం యొక్క మాటకు కట్టుబడిన వాడు; సత్యము= నిజం; తప్పును+ఎ?= అతిక్రమిస్తాడా?; తమ్ములు= సోదరులు (భీముడు అర్జునుడు నకులుడు సహదేవుడు); ఏల= ఎందుకు; తద్+శీలము= తచ్ఛీలము= ఆతని యొక్క నడవడికను; అతిక్రమింతురు= దాటుతారు; ఇది= మేము వారికి కీడు చేయకపోవటం, చేసినను సత్యసంధుడైన ధర్మరాజు అతడి తమ్ములు ప్రతిజ్ఞను అతిక్రమించక పోవటం; సిద్ధము= ఈడేరేది; నెమ్మనంబునన్ (నెఱ+మనంబునన్)= నిండు మనస్సుతో; నమ్ముము= విశ్వసించుము.

తాత్పర్యం: పాండవులు క్రమశిక్షణతో కూడిన శౌర్యం కలవారు. వారికి మేము కీడు చేయ తలపోయం. ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఒకవేళ మేము పాండవులకు కీడు చేసినప్పటికీ, అజాతశత్రువు, సత్యసంధుడు అయిన ధర్మరాజు తాను చేసిన ప్రతిజ్ఞను అతిక్రమించడు. అట్లే అతడి తమ్ములు భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, అన్నగారి ఆజ్ఞ జవదాటరు. ఇది నిక్కం. నిండు మనస్సుతో మా మాట విశ్వసించుము.

క. మాకును జిత్తంబుల మృగ। యాకౌతుక మతిశయిల్లినది; గోగణర
క్షాకరణము గార్యం బటె;। యేకీడును నేల పొందు నిందు మహీశా!' 370

ప్రతిపదార్థం: మహీ+ఈశా!= (ఓ ధృతరాష్ట్ర) రాజా!; మాకును= దుర్యోధన ప్రభృతులమైన మాకును; చిత్తంబులన్= మనస్సులలో; మృగయా, కౌతుకము= వేటపట్ల తమకం; అతిశయిల్లినది= హెచ్చింది; గో, గణ, రక్షా, కరణము= ఆవుల మందలను కాపాడే పని; కార్యంబు+అటె= కర్తవ్యం అట కదా; ఇందున్= ఈ గోరక్షణ కార్యంలో; ఏ కీడునున్= ఏ హానియున్నూ; ఏల= ఎందుకు; పొందున్?= ఏర్పడుతుంది?

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! మా మనస్సులలో వేటపట్ల తమకం అతిశయిస్తున్నది. ఆవులను రక్షించటం మంచి పని. ఇట్టి ఉత్తమ కార్యం చేసేటప్పుడు ఏ విధంగా కీడు కలుగుతుంది?[9]

క. అనిన నతఁడు గొండొకవడి। మనమున నూహించి 'బుద్ధిమంతుల రై గో
ధనము నరసి తడయక రం'। డని వారికి నెట్టకేల కనుమతి యిచ్చెన్. 371

ప్రతిపదార్థం: అనినన్= అని(శకునియు కర్ణుడును) చెప్పగా; అతఁడు= (ధృతరాష్ట్రుడు); కొండొక వడి= కొంతసేపు; మనమునన్= మనస్సులో; ఊహించి= తలపోసి; బుద్ధిమంతులరు+ఐ= మంచిబుద్ధి కలవారై; గోధనమున్= ఆవులు అనే సంపదను; అరసి= చూచి, రక్షించి; తడయక= ఆలస్యం చేయక; రండు= తిరిగి రండి; అని= అని చెప్పి; ఎట్టకేలకున్= తుట్టతుదకు; అనుమతి= అంగీకారం; ఇచ్చెన్= ఇచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కర్ణుడును శకునియు కలసి ఆ విధంగా నివేదించగా ధృతరాష్ట్రుడు కొంతసేపు ఆలోచించి- 'సరే, సద్బుద్ధి కలవారై గోవులను కాపాడి ఆలస్యం చేయకుండ తిరిగి రండి' అని చెప్పి వారలకు ఘోషయాత్రకు అనుమతి ఇచ్చాడు.

ఆ. ఆ క్షణంబ కౌతుకాతిశయ వ్యగ్ర। హృదయుఁడైన ఫణధరేంద్రకేతు
నాజ్ఞఁ గరిపురంబునం దెల్ల ఘోషింపఁ। బడియె ఘోషయాత్ర ప్రకటలీల. 372

ప్రతిపదార్థం: ఆ క్షణంబు+అ= ఆ నిమిషంలోనే, వెనువెంటనే; కౌతుక+అతిశయ, వ్యగ్ర, హృదయుఁడు+ఐన= సంతోషం ఉప్పొంగటంచేత తొట్రుపాటుతో కూడిన డెందం కలవాడైన; ఫణ, ధర+ఇంద్ర, కేతు+ఆజ్ఞన్= పడగను ధరించే శ్రేష్ఠమైన పాముగుర్తుగల కల జెండా కలవాడియొక్క - అనగా దుర్యోధనుడియొక్క; ఆజ్ఞన్= ఆజ్ఞవలన; కరిపురంబునందున్= హస్తినాపురిలో; ఘోషయాత్ర= ఆవుల మందలను కాపాడటానికైన ప్రయాణం; ప్రకట లీలన్= అందరకు తెలిసే విధంగా; ఘోషింపన్+పడియెన్= చాటించబడింది.

తాత్పర్యం: ధృతరాష్ట్రమహారాజు అనుమతి ఇచ్చిన వెనువెంటనే ఎటువంటి ఆలస్యం చేయకుండా నాగకేతను డైన దుర్యోధనుడి ఆజ్ఞచేత హస్తినాపురంలో అందరకు తెలిసేటట్లు ఘోషయాత్ర చాటింపబడింది. 'ఘోషయాత్ర' కు ధృతరాష్ట్రమహారాజు అనుమతించటం చేత దుర్యోధనుడి మనస్సు సంతోషంతో ఉప్పొంగిపోయింది.

విశేషం: పూర్వకాలంలో ప్రధానంగా మహాభారతయుగంలో వీరులు తమకు నచ్చిన లాంఛనాన్ని తమతమ పతాకాలపై ముద్రించుకొనేవారు. ఆ చిహ్నం ఆ యా రథికులను రణరంగంలో గుర్తించటానికి ఉపయుక్తంగా ఉండేది.

దుర్యోధనుఁడు ఘోషయాత్రవోవుట (సం. 3-228-23)

సీ. అంతఁ బ్రహృష్టాత్ముఁడై లలితాంబరా। భరణాంగరాగవిస్ఫురితమూర్తి
నొప్పారి విభుఁడు సహోదరులును గర్ణ। గాంధారులును బ్రియబాంధవులును
సముచిత వాహన సైన్య సమేతులై। కొలువంగ వెడలె నుజ్జ్వలవిభూతి
నాందోళికాది వాహనములఁ దత్ప్రియ। ప్రమదలు బహుసహస్రములు సనిరి

ఆ. కడఁగి పౌరు లెల్లఁ గైసేసి పడఁతులుఁ। దారు నడచి రతిముదంబుతోడఁ
బ్రకట శకట వైశ్య పణ్యాంగనాది సం। కులత నుల్లసిల్లె ఘోషయాత్ర. 373

ప్రతిపదార్థం: అంతన్= అంతట; విభుఁడు= రాజు (దుర్యోధనుడు) ప్రహృష్ట+ఆత్ముఁడు+ఐ= మిక్కుటంగా ఆనందించిన డెందం కలవాడై; లలిత+అంబర+అంగరాగ, విస్ఫురిత, మూర్తిన్= మనోహరాలు అయిన వస్త్రాలతో, భూషణాలతో, మైపూతలతో విలసిల్లే దేహం కలవాడై; ఒప్పారి= శోభిల్లి; సహోదరులును= తోడబుట్టిన తమ్ములును; కర్ణ, గాంధారులుకు= కర్ణుడు గాంధార రాజపుత్రుడైన శకునియు; ప్రియ, బాంధవులును= అనుగు చుట్టాలున్నూ; సముచిత, వాహన, సైన్య, సమేతులు+ఐ= తగిన యానసదుపాయాలతో భటులగుంపులతో కూడినవారై; కొలువంగన్= తనను సేవించగా; వెడలెన్= బయలుదేరాడు; ఉత్+జ్వల విభూతిన్= మిక్కుటంగా వెలుగొందే సంపదతో; ఆందోళికా+ఆది, వాహనములన్= పల్లకీలు మున్నగు వాహనాలలో; తద్+ప్రియ, ప్రమదలు= ఆ దుర్యోధనుడియొక్క అనుగు పడతులు; బహు సహస్రములు= పెక్కు వేలమంది; చనిరి=

వెళ్ళారు; కడఁగి= పూనిక వహించి; పౌరులు+ఎల్లన్= హస్తినలో వసించేవారు అందరున్నూ; కైసేసి= అలంకరించుకొని; పడఁతులు= వనితలు; తారు= తాము; అతిముదంబుతోడన్= మిక్కుటమైన సంతోషంతో; నడచిరి= పయనించారు; ఘోషయాత్ర= ఆలమందలకడ కేగే ప్రయాణం; ప్రకట, శకట, వైశ్య, పణ్య+అంగనా+ఆది, సంకులతన్= బాగా కనుపించిన బండ్లు, వర్తకులు, వెలయాండ్రు మున్నగువారల కోలాహలంతో; ఉల్లసిల్లెన్= శోభిల్లింది.

తాత్పర్యం: అంతట దుర్యోధనుడు ఆనందంతో ఉప్పొంగిన హృదయం కలవాడై మనోహరాలైన బట్టలు, భూషణములు, మైపూతలతో విలసిల్లే దేహం కలవాడై, తానును తన తమ్ములును కర్ణుడు గాంధార రాజపుత్రుడు శకుని అనుగుచుట్టాలును వారి వారికి తగిన వాహనాలతో సపరివారంగా అనుసరించగా ఘోషయాత్రకు ఉపక్రమించాడు. అతని రాణులు ప్రియమైన అంగనలు పల్లకీ మున్నగు వాహనాలను అధిరోహించి వేలమంది వెంబడించారు. హస్తినాపురంలోని ప్రముఖపౌరులు తమప్రియభామినులతోపాటు ముందు నడిచారు. సింగారించబడిన శకటాలలో వర్తకులు వెలయాండ్రు మున్నగువారు పయనించారు. ఆ ఘోషయాత్ర మిక్కిలి కోలాహలంగా కొనసాగింది.

విశేషం: (1) ఈ సీసపద్యంలోని అభివర్ణనకు సంస్కృత మహాభారతంలో మాతృక లేదు. అందుచేత ఈ వర్ణనం ఎఱ్ఱన మహాకవి సమకాలీన సమాజంలో మహారాజుల విహార యాత్రలను ప్రతిబింబిస్తున్నట్లు భావించవచ్చును. (2) ఎఱ్ఱన వర్ణనా ప్రియుడు. అతడికి సమకాలీనులు ఒసంగిన 'ప్రబంధ పరమేశ్వర' బిరుదం సార్థకమైనది. చూడండి - 375 సంఖ్య సీసపద్యంలోని ఆవులమంద వర్ణనం.

వ. మఱియు నమ్మహీపతి పయనంబున కనురూపంబుగా నెనిమిదివేలు రథంబులు, ముప్పది వే లేనుంగులుఁ, దొంబది వేలు గుఱ్ఱంబులు, శతసహస్రసంఖ్య కాల్వురుం గల మహాసైన్యంబుతోడ నడిచె; మృగయాకుశలు లైన మృగయులును, విట విదూషక వంది వైతాళికాది జను లనేకు లనుగమించి; రిట్లు గవ్యూతిమాత్రం బగు నేల యరిగి, యచ్చట విడిసి యద్దినశేషంబును రాత్రియుం గడపి, మఱునాఁడు వివిధ గిరిగహనంబు లతిక్రమించి ఘోషంబు లున్న వనంబు సొచ్చి, యం దొక్క రమణీయప్రదేశంబున శిబిరంబు గావించి యమ్మనుజేంద్రుండు. 374

ప్రతిపదార్థం: మఱియున్= వెండియు; ఆ+మహీపతి= ఆ రాజు (దుర్యోధనుడు); పయనంబునకున్= ప్రయాణానికి; అనురూపంబుగాన్= తగినట్లుగా; ఎనిమిది వేలు రథంబులు; ముప్పది వేలు ఏనుంగులు; తొంబది వేలు గుఱ్ఱములు; శత సహస్ర సంఖ్య= ఒక లక్ష; కాల్వురున్= కాల్బలం, పదాతులు; కల= ఉన్న; మహా, సైన్యంబు తోడన్= గొప్ప సేనతో; నడిచెన్= సాగాడు; మృగయా, కుశలులు+ఐన= వేటలో నేర్పరులు అయిన; మృగయులును= వేటకాండ్రను; విట, విదూషక, వంది, వైతాళిక+ఆది, జనులు= శృంగార ప్రియులు, హాస్యగాండ్రు, స్తోత్ర పాఠకులు, మేలుకొలుపులు పాడేవారు మున్నగు జనులు; అనేకులు= పెక్కుమంది; అనుగమించిరి= సహయాత్రికులై పయనించారు; ఇట్లు= ఈ రీతిగా; గవ్యూతి మాత్రంబు+అగు, నేల+అరిగి= రెండు కోసుల దూరం కల భూమిని పయనించి; అచ్చటన్= ఆ చోట; ఆ స్థలంలో; విడిసి= తాత్కాలికంగా పయనం ఆపి నివసించి; ఆ+దిన, శేషంబును= ఆ దివసంలో (పయనింపగా) మిగిలిన పగలును, రాత్రియున్= రేయిని; కడపి= పుచ్చి; మఱునాఁడు= మరుసటిరోజున; వివిధ, గిరి గహనంబులు= పెక్కు పర్వతాలు, అడవులు; అతిక్రమించి= దాటి; ఘోషంబులు+ఉన్న= ఆలమందలు కల; వనంబు+చొచ్చి= అడవిలో ప్రవేశించి; అందున్= ఆ అడవిలో; ఒక్క= ఒక; రమణీయ ప్రదేశంబునన్= అందమైన స్థలంలో; శిబిరంబు+కావించి= స్కంధావారం నెలకొల్పి; ఆ మనుజ+ఇంద్రుండు= ఆ రాజు, దుర్యోధనుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అంతేకాక. దుర్యోధనుడి ఘోషయాత్రకు అనుగుణంగా ఎనిమిదివేల రథాలూ, ముప్పైవేల ఏనుగులు, తొంభైవేల గుర్రాలు, నూరువేలమంది (లక్షమంది) భటులు ఉన్న పెద్దసైన్యం ఆతడి వెంట నడిచింది. వేటలో నేర్పరులైన వేటగాండ్రున్నూ, విటులు, విదూషకులు, వందులు, వైతాళికులు మొదలైనవారు అనేకమంది అతడి వెంట వెళ్ళారు. అందరూ కలిసి రెండుకోసుల దూరం వెళ్ళారు. అక్కడ ఆ మిగిలిన పగటి వేళను, రాత్రివేళను గడిపారు. మరురోజు మరల బయలుదేరి పెక్కు కొండలు గుట్టలు దాటి ఆవుల మందలున్న అడవిలో ప్రవేశించారు. ఆ వనంలో ఒక అందమైన చోట శిబిరాలను ఏర్పరచుకొన్నారు. అప్పుడు దుర్యోధనమహారాజు.

సీ. **నానా సహస్ర సంఖ్యానంబులై సంత । తానంద విగతభయత్వ లీల**
నక్కాననమున నే దిక్కు సూచిన నతి । సంకులంబుగఁ గుంద శంఖ చంద్ర
హార నీహార డిండీర పటీర ము । క్తాహార హీర సంకాశములును
గాదంబ కాలేయ కాదంబినీ నీల । జాల తమాలికా సన్నిభములు

తే. **ప్రౌఢబంధూకపల్లవ భాసితములు । వికచ కాంచన చంపక విస్ఫుటములు**
నైన వర్ణంబు లొప్ప నేత్రాభిరామ । భంగి నలరారు గోకదంబములఁ గనియె. **375**

ప్రతిపదార్థం: నానా, సహస్ర, సంఖ్యానంబులు+ఐ= పెక్కు వేల సంఖ్యగలవై, సంతత+ఆనంద, విగత, భయత్వ, లీలన్= ఎల్లప్పుడు గొప్ప హర్షంవలన పోయిన భయం గలవై, ఆ+కాననమునన్= ఆ అడవిలో; ఏ దిక్కు+చూచినన్= ఏ వైపు చూచినా; అతి సంకులంబుగన్= మిక్కిలి దట్టంగా; కుంద, శంఖ, చంద్రహార, నీహార, డిండీర, పటీర, ముక్తాహార, హీర, సంకాశములును= మల్లెపువ్వులతో, శంఖాలతో, చంద్రహారాలతో; మంచుతో, నురుగుతో, చందనంతో, ముత్యాలపేరులతో, వజ్రాలతో సరిసమానాలైనవి; కాదంబ, కాలేయ కాదంబినీ, నీల జాల తమాలికా, సన్నిభములు= నీలమణుల సమూహాలు, ధూమ్రవర్ణాలైన ముక్కు కాళ్లు రెక్కలు కల హంసలతో, వర్షాకాలానికి సంబంధించిన మబ్బులగములతో, నల్లని కాంతుల, చీకటి చెట్లతో సమానాలైనవి; ప్రౌఢ బంధూక, పల్లవ, భాసితములు= ముదిరిన మంకెనపువ్వులయొక్క చిగుళ్లవలె విలసిల్లేవి; వికచ, కాంచన, చంపక, విస్ఫుటములు= వికసించిన బంగారు సంపంగి పువ్వులవలె శోభిల్లేవి; ఐ= అయినట్టి; వర్ణంబులు= రంగులు; ఒప్పన్= విలసిల్లగా; నేత్ర+అభిరామ, భంగిన్= కనుల పండువుగా; అలరారు= ఒప్పారే; గో, కదంబములన్= ఆవుల మందలను; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఆ అడవిలో రంగు రంగుల ఆవుల మందలను సందర్శించాడు. అచట లెక్కపెట్టలేనన్ని పెక్కువేలకొలది ఆవులు స్వేచ్ఛగా ఎల్లప్పుడు ఆనందంతో తిరుగాడుతున్నాయి. ఏ వైపు చూచినా ఆవులే. వాటిలో కొన్ని తెల్లని రంగు కలవి. ఆ తెలుపులో కూడ ఎంచదగిన ఛాయా భేదాలు పొడగట్టుతాయి. కొన్ని ఆవులు మల్లెపూలను, కొన్ని శంఖాలను, కొన్ని చంద్రహారాలను, కొన్ని మంచుగడ్డలను; కొన్ని నురుగును; కొన్ని చందనాన్ని, కొన్ని ముత్యాల పేరులను, కొన్ని వజ్రాలను పోలి తెల్లగా ఉన్నాయి. మరికొన్ని ఆవులు నల్లగా ఉన్నాయి. ఆ నలుపులో కూడ ఛాయాభేదాలు ఎన్నదగినవే. నల్లని ముక్కు నల్లని కాళ్ల నల్లని రెక్కలు కల హంసలవలె కొన్ని ఆవులున్నాయి. మరికొన్ని వర్షాకాలపు మబ్బుల దొంతరలను పోలుతున్నాయి. కొన్ని నల్లని వన్నెగల చీకటిచెట్లరంగులో ఉన్నాయి. కొన్ని ఎఱుపు రంగు కలవి. మంకెన పూల చిగురుటాకుల రంగులు కలవి కొన్ని ఆవులు. కొన్ని పసిడి చంపకాల వలె మిలమిలలాడుతున్నాయి. కనులపండువుగా తిరుగాడుతున్న ఆవులమందలను దుర్యోధనుడు అక్కడ సందర్శించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: సంస్కృత మహాభారతంలో దుర్యోధనుడు ఆవులను చూచినట్లు ఉన్నది. తెలుగులోని ఈ సీసపద్యం ఎఱ్ఱన మహాకవి స్వకపోలకల్పితం. ఎఱ్ఱన కవితా శిల్పానికి వర్ణనాభిరుచికి ఈ సీసపద్యం మచ్చుతునక అని చెప్పవచ్చును.

వ. కని తదీయసమృద్ధికి సంతసిల్లుచు గోపాలజనంబులు సవినయంబుగాఁ దన్నుం గాంచిన నాదరించి వారు దనకు నగ్గోవులపేళ్ళును లక్షణంబులు నేర్పడి నెఱింగించుచుండఁ బేరువేఱ వత్సంబులు వత్సతరంబులు మహోక్షంబులు ధేనువులు దర్ణకంబులు మొదలైన గోవిశేషంబుల నాలోకించుచు నయ్యైవిధంబులఁ బసికిం దగిన రక్షణంబు గావింప నర్హ జనంబుల సవిశేషంబుగా నియోగించి, మఱియును. 376

ప్రతిపదార్థం: కని= చూచి; తదీయ సమృద్ధికిన్= ఆ (గోవుల యొక్క) అభివృద్ధికి; సంతసిల్లుచున్= ఆనందిస్తూ; గోపాల జనంబులు= గొల్లవారు; సవినయంబుగాన్= నమ్రతతో కూడినవారై; తన్నున్= తనను (దుర్యోధనుడిని); కాంచినన్= చూడగా; ఆదరించి= అభిమానం చూపి; వారు= (ఆ గోపాలురు); తనకున్= తనకు (దుర్యోధనుడికి); ఆ+గోవుల= ఆ ఆవుల; పేళ్ళును= నామాలను; లక్షణంబులున్= గుణాలును; ఏర్పడన్= స్పష్టంగా; ఎఱింగించుచుండన్= తెలుపుతుండగా; పేరు వేఱ= పేర్లలోని భేదాలుకల; వత్సంబులు= దూడలు; వత్స తరంబులు= మోయటానికి, దున్నటానికి పంపదగిన వయసు కల కోడెదూడలు; మహా+ఉక్షంబులు= ఆఁబోతులు; ధేనువులు= పాడి ఆవులు; తర్ణకంబులు= అప్పుడే పుట్టిన లేగదూడలు; మొదలు+ఐన= మున్నగు; గో విశేషంబులన్= గోవులలోని ముఖ్యభేదాలను; ఆలోకించుచున్= చూస్తూ; అయ్యై విధంబులన్= ఆయా రీతుల; పసికిన్= పశువులకు; తగిన= సరిఅయిన; రక్షణంబు, కావింపన్= కాపాడటంకొరకై; అర్హజనంబులన్= యోగ్యులైనవారిని; సవిశేషంబుగాన్= గొప్పతనం భాసించేటట్లుగా; నియోగించి= ఏర్పాటు చేసి; మఱియును= వెండియును.

తాత్పర్యం: దుర్యోధనుడు అక్కడి ఆవులను పరిశీలించి చూచి, వాటి సమృద్ధికి సంతోషించి, గొల్లవారిని అభినందించాడు. గొల్లలు దుర్యోధనుడికి వినయంతో గోవులలోని విశేషాలను వివరించి చెప్పి చూపించారు. అందులో ఆవుదూడలు కొన్ని. కొన్ని ఆఁబోతులు. కొన్ని పాడిఆవులు. కొన్ని దున్నే వయసు వచ్చిన కోడెదూడలు. కొన్ని అప్పుడే పుట్టిన లేగదూడలు. దుర్యోధనుడు ఆ గోవులను అన్నింటిని సంరక్షించటానికి యోగ్యత నేర్పు కలవారిని ఎన్నుకొని నియోగించాడు.

క. గోపాలసమన్వితుఁ డై । యా పాలమునఁ దిరిగి గోరసాస్వాదనలీ
లా పరితృప్తిఁ దలిర్చె మ । హీపాలుఁడు నెమ్మితోడ నిష్టులుఁ దానున్. 377

ప్రతిపదార్థం: మహీపాలుఁడు= రాజు (దుర్యోధనుడు); నెమ్మితోడన్= ప్రీతితో; ఇష్టులున్= మిత్రులును, తానున్= తానున్నూ (కూడి); గోపాల సమన్వితుఁడు+ఐ= గొల్లవారితో కూడినవాడై; ఆ పాలమునన్= ఆ క్షేత్రంలో; తిరిగి= నడయాడి; గో, రస+ఆస్వాదన, లీలా, పరితృప్తిన్= పాలను త్రాగటం అనే క్రీడలోని సంతృప్తితో; తలిర్చెన్= ఒప్పాడు.

తాత్పర్యం: దుర్యోధన మహారాజు తాను తన మిత్రులతో కలిసి ఆ అడవిలో గొల్లవారితో కూడి విహరించి పాలు త్రాగి మిక్కుటమైన సంతృప్తి చెంది సంతసించాడు.

వ. తదనంతరంబ గాయక నర్తకాదులు వంది మాగధ జనంబులుం గనిన నాదరించి, వారికి నభిమతధనంబు లొసంగి, మృగయావినోదంబునకుం దొడంగి. 378

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట; గాయక, నర్తక+ఆదులు= పాటలు పాడేవారు, నాట్యం చేసేవారు మున్నగువారు; వంది, మాగధ, జనంబులు= స్తోత్ర పాఠకులు; కనినన్= సందర్శించగా; ఆదరించి= అభిమానం చూపి; వారికిన్= వారికి; అభిమత ధనంబులు= కోరిన డబ్బులు; ఒసంగి= ఇచ్చి; మృగయా, వినోదంబునకున్= వేట వేడుకకు; తొడంగి= పూని.

తాత్పర్యం: గోవులను సందర్శించి గోరక్షణకు తగిన ఏర్పాటులు చేసిన పిమ్మటనే, దుర్యోధనుడు పాటలు పాడేవారికి నాట్యం చేసేవారికి, స్తోత్రాలు చేసేవారికి దర్శనమిచ్చి, వారిని మన్నించి వారికి కోరిన ధనమిచ్చి సత్కరించాడు. తరువాత. వేట వేడుకకు ఉపక్రమించాడు.

మ. హరిణవ్రాతములం గలంచుచు నుదగ్రానేకపశ్రేణిఁ జె
చ్చెర బంధించుచు నుగ్రసింహనివహచ్ఛేదైక సక్రోధబం
ధురతం బేర్చుచుఁ బ్రస్ఫురన్మహిషశార్దూలోద్ధతక్రోడ ని
ర్భరపాతంబు లొనర్చుచుం దిరిగె భూపశ్రేష్ఠుఁ డక్కానలోన్. 379

ప్రతిపదార్థం: భూప, శ్రేష్ఠుఁడు= దుర్యోధన సార్వభౌముఁడు; ఆ+కానలోన్= ఆ అడవిలో; హరిణవ్రాతములన్= లేడిగుంపులను; కలంచుచున్= కలవరపెట్టుతూ; ఉదగ్ర+అనేకప, శ్రేణిన్= భయంకరాలైన ఏనుగుల సమూహాలను; చెచ్చెరన్= వేగంగా; బంధించుచున్= కట్టివైచుచు; ఉగ్ర, సింహనివహ+ఛేద+ఏక, సక్రోధ, బంధురతన్= భయంకరాలైన సింహాల గుంపులను ఖండించటమునందు మిక్కుటమైన కోపంతో కూడి ఉండటం చేత; పేర్చుచున్= అతిశయిస్తూ; ప్రస్ఫురత్+మహిష, శార్దూల+ఉద్ధత క్రోడ, నిర్భర, పాతంబులు= ప్రకాశించే దున్నపోతులు పెద్దపులులు మదించిన అడవిపందులు మిక్కుటంగా నేలపై కూల్చడాలు; ఒనర్చుచున్= సలుపుతూ; తిరిగెన్= చరించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఆ అడవిలో వేటాడుతూ లేడిగుంపులను కలత పెట్టాడు. మదించిన ఏనుగులను శీఘ్రంగా చెర పట్టాడు. సింహాలను కోపంతో ఖండించాడు. అట్లే అడవిపందులను చంపాడు. దున్నపోతులు పెద్దపులులు గుట్టలు గుట్టలుగా నేలపై కొరిగేటట్లుగా వేటాడాడు.

విశేషం: ఎఱ్ఱన 'ప్రబంధ పరమేశ్వర' బిరుదాన్ని సార్థకం చేసే పద్యాలలో ఇది ఒకటి. ఈ పద్యంలో దుర్యోధనుడి వేట వర్ణించబడింది. ప్రబంధాలలో ఉండవలె నని నిర్దేశించిన అష్టాదశవర్ణనలలో వేట ఒకటి.

వ. మఱియు ననవరతసురభిసరసీరుహప్రకరకీర్ణంబు లగు జలాశయంబు లాలోకించుచు, నతిమనోహర ప్రసూనఫలభరితపాదప వనాభ్యంతరంబుల విహరించుచు, మన్మథ మయూర మధుకర కీర కోకిలాలాప కోలాహలంబు లాకర్ణించుచుఁ; గ్రమంబునం బరిజనసమన్వితుండై ధార్తరాష్ట్రుండు ద్వైతవన సరోవరంబు సేరం జనియె; నంత నట ధర్మతనయుండు తత్సమీపంబున మునిజనసహాయుండై వన్యంబు లగు మూల ఫలవిశేషంబులు సాధనంబులుగా సద్యస్కందం బను యజ్ఞంబు సేయుచుండె; నప్పుడు దుర్యోధనుండు నిజభృత్యజనుల నక్కొలనిదరిం గ్రీడాగృహంబులు నిర్మింప నియోగించిన. 380

ప్రతిపదార్థం: మఱియున్= వెండియు; అనవరత, సురభి, సరసీరుహ, ప్రకర కీర్ణంబులు+అగు= ఎల్లప్పుడు పరిమళాలు వెదజల్లే పద్మాల సముదాయాలచేత కప్పబడినవి అయిన; జలాశయంబులు= చెరువులు; ఆలోకించుచున్= చూస్తూ; అతి,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనోహర, ప్రసూన, ఫల, భరిత, పాదప, వన+అభ్యంతరంబులన్= మిక్కిలి ఆహ్లాదకరమైన పువ్వులు, పండ్లు కల చెట్లతో కూడిన అడవులలోపల; విహరించుచున్= సరదాగా తిరుగాడుతూ; మన్మథ, మయూర, మధుకర, కీర, కోకిల+ఆలాప, కోలాహలంబులు= మనస్సును మథించే నెమళ్లయొక్క; తేనెటీగలయొక్క, చిలుకలయొక్క, కోకిలలయొక్క గానాల కలకల నాదాలు; ఆకర్ణించుచున్= వింటూ; క్రమంబునన్= వరుసగా; పరిజన, సమన్వితుండు+ఐ= సేవకులతో కూడినవాడై; ధార్తరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడి కొడుకు అయిన దుర్యోధనుడు; ద్వైత వన సరోవరంబు= ద్వైత వనంలోని కొలను; చేరన్+చనియెన్= సమీపించాడు; అంతన్= అంతట; అట= అచట; ధర్మతనయుండు= ధర్మపుత్రుడు; తత్+సమీపంబునన్= ఆ కొలను దగ్గర; ముని, జన, సహాయుండు+ఐ= ఋషుల సముదాయంతో కూడినవాడై; వన్యంబులు+అగు= అడవికి సంబంధించినవి అయిన; ఫల విశేషంబులు= పేర్కొనదగిన పండ్లు; సాధనంబులుగాన్= పరికరాలుగా; సద్యస్కందంబు+అను= సద్యస్కందం-అనే పేరు కల; యజ్ఞంబు= క్రతువు; చేయుచుండెన్= చేస్తూ ఉన్నాడు; అప్పుడు= ఆ సమయంలో; దుర్యోధనుండు; నిజ, భృత్య, జనులన్= తన యొక్క సేవకుల బృందాన్ని; ఆ+కొలని దరిన్= ఆ సరోవరందగ్గర; క్రీడా గృహంబులు= వినోదం కొరకై కట్టే ఇండ్లు; నిర్మింపన్= కట్టటానికి; నియోగించినన్= ఏర్పాటు చేయగా.

తాత్పర్యం: అంతేకాక దుర్యోధనుడు ఆ అడవిలో విహరించాడు. ఆతడు అక్కడ ఎల్లప్పుడును పరిమళాలు వెదచల్లే పద్మాలతో తామర తంపరలతో కప్పబడిన చెరువులను చూచాడు. మిక్కుటంగా హృదయాలకు ఆహ్లాదం కలిగించేవి, పండ్లతో నిండినవి అయిన చెట్లతో కళకళలాడే వనాలలో విహరించాడు. మనస్సును మథించే స్వరాలను, కోకిలల కూజితాలు తేనెటీగల సవ్వడులు నెమిళ్ల నృత్య నినాదాలు చిలుకల పాటలు కలరుతాలు ఆలకించాడు. పిదప, సేవకులచేత పరివేష్టించబడినవాడై ధృతరాష్ట్రుడి కొడుకైన దుర్యోధనుడు ద్వైతవనంలోని సరస్సు దరి చేరాడు. అక్కడ ధర్మరాజు సద్యస్కందం అనే పేరు కల ఒక క్రతువు చేస్తూ ఉన్నాడు. ఆ క్రతువులోని విశేష మేమంటే - అది అడవిలో దొరికే పండ్లతో శాకాలతో మాత్రమే జరుపబడుతుండటం. ఋషులు పలువురు- ఆ క్రతువులో ధర్మరాజుకు సాయంచేస్తూ ఉన్నారు. అప్పుడు దుర్యోధనుడు తన సేవకులకు ఆసమీపంలో వినోదంకొరకై క్రీడాగృహాలను నిర్మించటానికి ఆజ్ఞాపించాడు.

క. **వారును సంభ్రమమున న । వ్వారిరుహాకరముపొంత వదలక క్రీడా**
గారములు గట్టఁ దొడఁగుడు । వారించుచు బాఱుతెంచి వడి గంధర్వుల్. **381**

ప్రతిపదార్థం: వారును= దుర్యోధనుడి సేవకులును; సంభ్రమమునన్= వేగంతో కూడిన తొట్రుపాటుతో; ఆ+వారిరుహ+ ఆకరము పొంతన్= ఆ సరోవరం కడ (పద్మాలకు ఆకరం అయిన సరోవరం వద్ద); వదలక= విడువక; క్రీడా+ఆగారములు= వినోదం కొరకై నిర్మించే గృహాలు; కట్టన్+తొడఁగుడున్= నిర్మించటానికి ఉపక్రమించగా; గంధర్వుల్= గంధర్వులు, (వేల్పుల లో ఒకజాతివారు); వడిన్= శీఘ్రంగా; వారించుచున్= అడ్డగిస్తూ; పాఱుతెంచి= వచ్చి.

తాత్పర్యం: దుర్యోధనుడి సేవకులు సంరంభంతో ఆ సరోవరం దగ్గర క్రీడాగృహాలు నిర్మించసాగారు. అంతలో ఆ భటులను అడ్డగిస్తూ గంధర్వులు అచటికి వచ్చి చేరారు.

వ. **'ఇది చిత్రసేనుం డను గంధర్వపతికిం గ్రీడార్థంబు కల్పితం బైనది గావున మీ రిక్కొలను సేరక తొలంగి పోవునది' యనిన వారు మగుడం జని, దుర్యోధనునకుఁ జెప్పుటయు, నతండు రణదుర్మదు లైన సైనికులం గొందఱం బంచిన, నరిగి వారలు గంధర్వుల కిట్లనిరి.** **382**

ప్రతిపదార్థం: ఇది= ఈ సరోవరం; చిత్రసేనుండు+అను= చిత్రసేనుడు అనే పేరు కల; గంధర్వ పతికిన్= గంధర్వుల రాజుకు; క్రీడా+అర్థంబు= వినోదం కొరకు; కల్పితంబు+ఐనది= నిర్మించబడింది. కావునన్= కాబట్టి; మీరు= దుర్యోధన సేవకులైన మీరు; ఈ+కొలను= ఈ సరోవరం; చేరక= సమీపించక; తొలంగి పోవునది= దూరంగా వెడలిపొండి; అనినన్= అని చెప్పగా; వారు= ఆ దుర్యోధనుడి సేవకులు; చేరక= సమీపించక; తొలంగి పోవునది= దూరంగా వెడలిపొండి; అనినన్= అని చెప్పగా; వారు= ఆ దుర్యోధనుడి సేవకులు; మగుడన్+చని= తిరిగి వెళ్లి; దుర్యోధనునకున్, చెప్పుటయున్; అతండు; రణ దుర్మదులు+ఐన= యుద్ధం చేయటంలో ఇచ్ఛగలిగి మదించినవారు అయిన; సైనికులన్= భటులను; కొందఱన్= కొంతమందిని; పంచినన్= నియోగించగా; అరిగి= వెడలి (కొలనుకడ ఉన్న గంధర్వులవద్దకు వెళ్లి); వారలు= ఆ భటులు; గంధర్వులకున్; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: 'ఈ సరోవరం చిత్రసేనుడు అనే గంధర్వులరాజు ప్రత్యేకంగా విహరించటం కొరకు నిర్మించబడింది కావున, మీరు ఈ కొలనుదరికి చేరరాదు. వేగమే తిరిగి పొండు' అని గంధర్వులు దుర్యోధనుడి సేవకులతో చెప్పారు. అంతట ఆ మాటలు దుర్యోధనుడి సేవకులు దుర్యోధనుడిదగ్గర కేగి చెప్పారు. దుర్యోధనుడు యుద్ధం చేయటానికై మదించి ఉన్న భటులను కొందరను ఏరి, అక్కడికి పంపగా, వారు కొలనువద్దకు వెళ్లి గంధర్వులతో ఈ విధంగా పలికారు.

మ. **'బలియుం డా ధృతరాష్ట్రసూనుఁడు మహాబాహుండు దుర్యోధనుం**
డలఘుం డీ కమలాకరంబునకుఁ గ్రీడార్థంబు గౌతూహలం
బెలయంగాఁ బ్రియకామినీసహితుఁడై యేతెంచుచున్నాఁడు మీ
ర్వల దిందుండఁ, దొలంగి పొం' డనవుడున్ వారుద్ధతక్రోధులై. **383**

ప్రతిపదార్థం: బలియుండు= బలం కలవాడు; ఆ ధృతరాష్ట్ర సూనుఁడు= ధృతరాష్ట్రుడి కొడుకు అయిన దుర్యోధనుడు, మహాబాహుండు= గొప్ప చేతులు కలవాడు, పరాక్రమవంతుడు; దుర్యోధనుండు; అలఘుండు= గొప్పవాడు; ఈ కమల+ఆకరంబునకున్= పద్మాలకు నెలవైన ఈ సరోవరానికి; క్రీడా+అర్థంబు= వినోదం కొరకు; కౌతూహలంబు= వేడుక; ఎలయంగాన్= అతిశయించగా; ప్రియకామినీ సహితుఁడు+ఐ= ఇష్టం కల వలపుకత్తెలతో కూడుకొని; ఏతెంచుచున్నాఁడు= వస్తున్నాడు; మీర్+వలదు+ఇందున్+ఉండన్= మీ రిక్కడ ఉండరాదు; తొలంగిపొండు= ఈ చోటు విడిచి దూరంగా వెళ్లండి; అనవుడున్= అని చెప్పగా; వారు= గంధర్వులు; ఉద్ధత క్రోధులు+ఐ= అతిశయించిన ఆగ్రహం కలవారై.

తాత్పర్యం: 'ఓ గంధర్వులారా! మహాబలవంతుడైన దుర్యోధనసార్వభౌముడు ధృతరాష్ట్రుడికొడుకు, పరాక్రమశాలి, వీరాధివీరుడు ఈ సరోవరతీరంలో తన వలపుకత్తెలతో కలిసి జలక్రీడ లాడాలనే వేడుకతో విచ్చేశాడు. అందుచేత మీరు ఇక్కడ ఉండకూడదు. దూరంగా పొండు' అని కౌరవభటులు చెప్పారు. గంధర్వులు అమితంగా ఆగ్రహించారు.

వ. **ఒండొరువుల మొగంబులు సూచి పెలుచ నవ్వి వారల కిట్లనిరి.** **384**

ప్రతిపదార్థం: ఒండొరువుల మొగంబులు= ఒకరి మొగాలు ఒకరు; చూచి= అరసి; పెలుచ నవ్వి= అట్టహాసం సలిపి; వారలకున్= దుర్యోధనుడి భటులకు; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: దుర్యోధనుడిభటుల ప్రగల్భవచనాలను ఈసడిస్తూ గంధర్వులు ఒకరిమొగాలు ఒకరు చూచి అట్టహాసం చేసి ఇట్లా పలికారు.

క. 'ఎదిరిం దన్ను నెఱుంగఁడు । మదమునఁ బ్రాణంబుఁ దనదుమానముఁ గోల్పో
మదిఁ దలఁచినాఁడు మీనృపుఁ । డిది యేటికిఁ జెనఁటిచెయ్వు లిన్నియు నిచటన్. 385

ప్రతిపదార్థం: మీ నృపుఁడు= మీ రాజు, దుర్యోధనుడు; ఎదిరిన్= ఎదుటివారిని; తన్నున్= తనను; ఎఱుంగఁడు= తెలియజాలడు; మదమునన్= గర్వం చొప్పున; ప్రాణంబున్= అసువులు; తనదు మానమున్= తనయొక్క గౌరవాన్ని; కోల్పోన్= పోగొట్టు కొనటానికి; మదిన్= మనస్సులో; తలఁచినాఁడు= తలపోశాడు; ఇది= ఈ పని అంతయు; చెనఁటి చెయ్వులు= చెడ్డ పనులు; ఇన్నియున్= ఇన్ని (పెక్కులు); ఇచటన్= ఇచట; ఈ సరోవరతీరాన; ఏటికిన్= ఎందుకు?

తాత్పర్యం: 'ఓ దుర్యోధన భటులారా! మీ రాజుకు తన శక్తి తెలియదు; ఎదుటివారి శక్తి అంతకంటె తెలియదు. మీ రాజు గర్వాతిరేకంచొప్పున తన గౌరవాన్నే కాదు, చివరకు తన ప్రాణాన్ని కోలుపోవలసి వస్తుంది. పాపం మీ ప్రభువుకు ఈ విషయం తెలిసినట్లు కన్పించదు. గంధర్వులస్థావర మైన ఈ సరోవరతీరాన మీ రాజు ఇట్టి దుస్సాహసాలకు ఒడిగట్టటం తగదు. జాగ్రత్త!

వ. బుద్ధిమంతుల రై యూరక చనుట లెస్స యనుం' డనినం గ్రమ్మఱి చని వారు కురుపతికిం దద్వచనంబుల తెఱం గంతయుం జెప్పుటయు, నతండు రోషావేశవివశుం డై తమ్ముల దొరలం జూచి, 'మీ రిందఱు మీ మీ సైన్యంబులతోడం గూడి కడంగి, దుర్వినీతు లైన గంధర్వులగర్వంబు మాన్పి సరోవరం బాక్రమించునది; వారికి సహాయుం డయి సురగణసమేతంబుగ నింద్రుండు సనుదెంచె నేనియు నవలీల జయించునది' యని నియోగించిన. 386

ప్రతిపదార్థం: బుద్ధిమంతులరు+ఐ= బుద్ధికలవారై, వివేకవంతులై; ఊరక= ఏమీ చేయకుండ ఉండి; చనుట= వెడలిపోవటం; లెస్స= మంచిది; అనుండు= అని చెప్పండి; అనినన్= అని గంధర్వులు చెప్పగా; వారు= కౌరవభటులు; క్రమ్మఱి= వెనుతిరిగి, చని= వెడలి; కురుపతికిన్= కురువంశానికి నాయకుడైన దుర్యోధనుడికి; తత్+వచనంబుల తెఱంగు= వారియొక్క (గంధర్వుల యొక్క) మాటల తీరు తెన్ను; అంతయున్= సమస్తమున్నూ; చెప్పుటయున్= చెప్పగా; అతండు= అతడు (దుర్యోధనుడు); రోష+ఆవేశ, వివశుండు+ఐ= కోపం యొక్క ప్రజ్వలనం చేత వశం తాను తప్పినవాడై; తమ్ములన్= సోదరులను; దొరలన్= సామంత ప్రభువులను; చూచి= మీరు+ఇందఱున్; మీ మీ సైన్యంబులతోడన్= మీ మీ ఆధిపత్యానికి లోబడి ఉన్న సేనలతో; కూడి= కలిసి; కడంగి= పూని; దుర్వినీతులు+ఐన= మర్యాద అణకువ లేనట్టి; గంధర్వుల గర్వంబు= గంధర్వుల యొక్క అహంకారం; మాన్పి= పోగొట్టి; సరోవరంబు= కొలనును; ఆక్రమించునది= అధీనంలోకి తెచ్చేది; సురగణ సమేతంబుగన్= వేల్పుల సమూహంతో కూడినవాడై; వారికిన్= ఆ గంధర్వులకు; సహాయుండు+అయి= తోడ్పడేవాడై; ఇంద్రుండు= వేల్పుల దొర; చనుదెంచెన్+ఏనియున్= వచ్చినప్పటికిని; అవలీలన్= సులువుగా, లెక్క చేయకుండా; జయించునది= ఓడించాలి (నెగ్గునది); అని= అని పలికి; నియోగించినన్= నియమించగా.

తాత్పర్యం: 'తెలివితేటలు కలవారై వివేకంతో ఊరక వెడలటం మంచిది అని మీ రాజుకు చెప్పండి' అని గంధర్వులు పలుకగా దుర్యోధనుడిభటులు వెనుకకు మరలి వెళ్ళి ఆతడికి గంధర్వులు చెప్పిన మాటల తీరు తెన్నులు వివరించి చెప్పారు. అంతట దుర్యోధనుడు ఆగ్రహంతో తన వశం తప్పినవాడై, తన సోదరులను సామంతప్రభువులను చూచి, 'మీరు ఇంతమంది మీమీ సేనలతో దండెత్తి వెళ్ళి దురహంకారంతో విర్రవీగుతున్న గంధర్వులమదం మాన్పి సరోవరాన్ని ఆక్రమించండి. వారికి దేవేంద్రుడు దేవతలతోపాటు సాయం చేయటానికి వచ్చినాసరే వారిని జయించండి' అని ఆజ్ఞాపించాడు.

క. అతులచతురంగసేనా । న్వితు లయి ధృతరాష్ట్రసుతులు నిరతిశయ రయో
ద్ధతసింహానాదబధిరీ । కృదిఙ్ముఖు లగుచుఁ జనిరి గినుక యెలర్పన్. 387

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర సుతులు= ధృతరాష్ట్రుడి కుమారులు; అతుల, చతురంగ సేనా+అన్వితులు+అయి= సాటిలేని నాలుగు దళాల సైన్యంతో కూడిన వారయి; నిరతిశయ, రయ+ఉద్ధత= అతిక్రమించటానికి వీలు కాని వేగంతో ఏర్పడిన గర్వంతో; సింహనాద బధిరీకృత, దిక్+ముఖులు+ఐ= సింహనాదాలచేత చెవుడుపడిన దిక్కులయొక్క మొగాలు కలవారై (అనగా సింహగర్జనలవంటి కేకలచేత దిక్కులు చిల్లులు పడేటట్లుగా చేసిన వారై); కినుక+ఎలర్పన్= కోపం అతిశయించగా; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి కొడుకులు ఆగ్రహావేశపరవశు లయి సాటిలేని చతురంగబలాలు కల సేనలతో గంధర్వులపై దండెత్తి వెళ్ళారు. వారు సాటిలేనివేగంతో గర్వంతో సింహనాదాలు చేస్తూ వెళ్ళారు. ఆ సింహనాదాలకు దిక్కులు పిక్కటిల్లాయి.

వ. ఇట్లు సనుదెంచు కురువీరుల కడ్డంబు వచ్చి కొందఱు గంధర్వులు ప్రియపూర్వకంబుగా 'నిట యేల వచ్చెదరు? మీకు మాతోడి విద్వేషం బేటికి? నిలువుం' డనినం బెలుచ నార్చి సేనాగ్రచరులు వారలమీఁదం బ్రచురశస్త్రాస్త్ర పాతంబు సేయం దొడంగినం, దొలంగి చని, యా గంధర్వు లాక్షణంబ చిత్రసేనునకు నంతయుఁ జెప్పి పుచ్చినం, బ్రబలరోషరంజితాననుండై యతండు. 388

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; చనుదెంచు= అరుగుదెంచే; కురువీరులకున్= కురువంశానికి చెందిన యోధులకు; అడ్డంబు వచ్చి= ఎదురుగా చనుదెంచి నిల్చి; కొందఱు గంధర్వులు= కొంతమంది గంధర్వులు; ప్రియపూర్వకంబుగాన్= సామవచనాలతో; ఇట+ఏల, వచ్చెదరు= ఇక్కడికి ఎందుకు వస్తారు; మీకున్= కౌరవభటులైన మీకు; మాతోడి= గంధర్వులమైన మాతో; విద్వేషంబు= కయ్యం; ఏటికిన్= ఎందుకు?; నిలువుండు= ఆగుడు; అనినన్= అని పలుకగా; పెలుచన్+ఆర్చి= పెద్ద కేకలు పెట్టి; సేనా+అగ్రచరులు= సైన్యంలో ముందు నడిచేవారు; వారల మీఁదన్= ఆ గంధర్వులపై; ప్రచుర, శస్త్ర+అస్త్ర, పాతంబు= ప్రసిద్ధమైన బాణాలను మంత్రమహిమతో కూడిన బాణాలను ప్రయోగించటం; చేయన్+తొడంగినన్= సలుపుటకు పూనగా; తొలంగి= ఆ చోటు వీడి; చని= వెళ్ళి; గంధర్వులు; ఆ క్షణంబు+అ= ఆ నిమిషంలోనే; చిత్రసేనునకున్= (గంధర్వ ప్రభువు అయిన) చిత్రసేనుడికి; అంతయున్= సమస్తాన్నీ; చెప్పి పుచ్చినన్= నివేదించగా; ప్రబల, రోష, రంజిత+ఆననుండు+ఐ= మిక్కుటమైన కోపంచేత ఎర్రబడిన ముఖం కలవాడై; అతండు= చిత్రసేనుడు.

తాత్పర్యం: ఈ విధంగా దండెత్తివస్తున్న కౌరవయోధులకు అడ్డం వచ్చి కొందరుగంధర్వులు సామవాక్యాలతో ఇట్లా అన్నారు- 'ఓ దుర్యోధనభటులారా! కౌరవనేతలారా! మీరెందుకు దండెత్తి వస్తున్నారు? మీకూ మాకూ కయ్యం ఎందుకు? ఆగండి అని. కాని, ఆ సాంత్వనవాక్యాలను కౌరవులు లెక్కచేయక సింహనాదాలు చేశారు. సైన్యానికి ముందు నడిచే భటులు గంధర్వులపై శస్త్రాలు అస్త్రాలు ప్రయోగించారు. అంతట గంధర్వులు తప్పుకొని, వెళ్ళి తమప్రభువైన చిత్రసేనుడికి జరిగిన సంగతి నివేదించారు. చిత్రసేనుడి మొగం కోపంతో ఎర్రబడింది.

క. 'చనుఁడు రయంబున నా దు । ర్జనులం గౌరవులఁ బొదివి సమయింపుఁడు మీ'
రని బహుసహస్ర సంఖ్యులఁ । బనిచెను గంధర్వవరులఁ బ్రకటితబలులన్. 389

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మీరు= ఓ గంధర్వులారా; రయంబునన్= వేగంగా; చనుఁడు= వెళ్ళండి; మీరు! ఆ దుర్జనులన్= ఆ చెడ్డవారిని; కౌరవులన్= కురువంశస్థులను; పొదివి= చుట్టుముట్టి; సమయింపుఁడు= సంహరించండి; అని= అని (ఆజ్ఞాపించి); బహు, సహస్ర, సంఖ్యులన్= పెక్కు వేల మందిని; గంధర్వ వరులన్= గంధర్వులలో శ్రేష్ఠులైనవారిని; ప్రకటితబలులన్= సుప్రసిద్ధమైన బలం కలవారిని; పనిచెను= నియమించాడు.

తాత్పర్యం: 'ఓ గంధర్వులారా, మీరు వేగంగా దండెత్తి పొండి. చెడ్డవారైన ఆ కౌరవులను చుట్టుముట్టి సంహరించండి' అని చెప్పి, చిత్రసేనుడు యుద్ధంలో ఆరితేరిన వీరులైన పెక్కు వేలమంది గంధర్వభటులకు ఆజ్ఞ నిచ్చాడు.

వ. ఇట్లు పనిచిన. 390

తాత్పర్యం: ఈ విధంగా చిత్రసేనుడు తన సైనికులను ఆజ్ఞాపించగా.

ఉ. ఆయత కుంత కార్ముక గదాసి పరశ్వధ శూల పట్టిసా
ద్యాయుధ ఘోరహస్తులు గులాచలతుంగతనుల్ ప్రచండతే
జోయుతు లా వియచ్చరులు శూరతమై నడతెంచి బల్విడిం
గో యని తాఁకి రుగ్రరణకోవిదులై కురురాజసైన్యమున్. 391

ప్రతిపదార్థం: ఆయత, కుంత, కార్ముక, గదా+అసి, పరశ్వధ, శూల, పట్టిస+ఆది+ఆయుధ, ఘోర, హస్తులు= నిడుపైన బల్లెం, విల్లు, గద, కత్తి, గండ్ర గొడ్డలి, కొఱ్ఱు, అడ్డకత్తి మున్నగు పోటుముట్టులతో భయంకరమైన చేతులు కలవారు; కుల+అచల, తుంగ, తనుల్= కుల పర్వతాలవలె ఎత్తు అయిన శరీరాలు కలవారు; ప్రచండ, తేజస్+యుతులు= భయంకరమైన కాంతితో కూడినవారు; ఆ వియత్+చరులు= ఆ (ఆకసంలో చరించేవారు) గంధర్వులు; శూరత మైన్= పరాక్రమం చొప్పున; నడతెంచి= వచ్చి; బల్విడిన్= బలంతో; 'కో' యని= కో అనే సవ్వడి చేస్తూ; ఉగ్ర, రణ, కోవిదులు+ఐ= భయంకరమైన యుద్ధం చేయటంలో నేర్పు గలవారై; కురు, రాజ, సైన్యమున్= కురువంశానికి చెందిన రాజుయొక్క (దుర్యోధనుడి యొక్క) సేనను; తాకిరి= ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: నిడుపైన బల్లెము, విల్లు, గుదియ, కత్తి, గండ్ర గొడ్డలి, కొఱ్ఱు, అడ్డకత్తి మున్నగు పోటుముట్లను ధరించిన భయంకరమైన చేతులు కలవారు, కులపర్వతాలవలె ఎత్తైన శరీరాలు కలవారు, దేదీప్యమానమైన వర్చస్సుతో వెలుగొందేవారు, ఆకాశంలో సంచరించగల శక్తి గలిగిన గంధర్వులు పరాక్రమంతో దండెత్తి వచ్చి సింహనాదాలు చేస్తూ దుర్యోధనుడి సేనలను ఢీకొన్నారు.

వ. ఇవ్విధంబున గంధర్వులు బెట్టిదంబుగాఁ గిట్టి నొప్పింపం దొడంగినం గలంగి దుశ్శాసనాది కౌరవులు ససైన్యంబుగాఁ దెరలి దుర్యోధను చేరువకుం బఱచినఁ, గర్ణుం డొక్కరుండ సుస్థిరుం డయి నిలిచి గంధర్వుల నిలువరించి భల్లార్ధచంద్ర ప్రముఖ బహులబాణపాతంబులం దదీయదేహంబులు ఖండించుచు నిమిష మాత్రంబునఁ జిత్రసేను సైనికశతంబుల రూపుమాపుటయు, మఱియుం బైపై గంధర్వులు శతసహస్ర సంఖ్యులు తోఁతెంచినం బృథివి యెల్లను గంధర్వమయం బై నట్లుండె నప్పుడు. 392

ప్రతిపదార్థం: ఇవ్విధంబునన్= ఈ రీతిగా; గంధర్వులు= వేలుపుజాతివారు; బెట్టిదంబుగాన్= ప్రగాఢంగా, మిక్కుటంగా; కిట్టి= ఎదిరించి, ఢీకొని; నొప్పింపన్= బాధింపగా; తొడంగినన్= సమకట్టగా; కలంగి= కలతచెంది; దుశ్శాసన+ఆది, కౌరవులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుశ్శాసనుడు మున్నగు కురువంశస్థులు; ససైన్యంబుగాన్= తమ సేనలతోపాటు; తెరలి= వెనుకకు మరలి; దుర్యోధను చేరువకున్= దుర్యోధనుడి దగ్గరకు; పఱచినన్= పారిపోగా; కర్ణుండు+ఒక్కరుండు+అ= కర్ణుడు ఒకడు మాత్రమే (ఏకైక వీరుడై); సుస్థిరుండు+అయి= కదలకుండ నిలిచినవాడై; నిలిచి= ఆగి; గంధర్వులన్= గంధర్వులను; నిలువరించి= ఆపి; భల్ల+అర్ధచంద్ర ప్రముఖ బహుల బాణపాతంబులన్= ఈటె, చంద్రవంక మున్నగు అనేకమైన అమ్ములు ప్రయోగించటం చేత; తదీయ దేహంబులు= వారియొక్క (గంధర్వులయొక్క) శరీరాలు; ఖండించుచున్= ముక్కలు ముక్కలుగా చేస్తూ; నిమిషమాత్రంబునన్= క్షణకాలంలో; చిత్రసేను సైనిక శతంబులన్= చిత్రసేనుడియొక్క భటులను వందలకొలది; రూపు మాపుటయున్= సంహరించటమున్నూ; మఱియున్= వెండియు; పైపైన్= అదనంగా; గంధర్వులు; శతసహస్ర సంఖ్యులు= లెక్కకు లక్షల మంది; తోఁతెంచినన్= రాగా; పృథివి+ఎల్లను= భూమి అంతయు; గంధర్వ, మయంబు+ఐనట్లు= గంధర్వులతో నిండింది అయినట్లు; ఉండెన్= ఉండింది; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా గంధర్వులు కౌరవసేనలను చుట్టుముట్టి నొప్పించసాగారు. దుశ్శాసనుడు మొదలైన కౌరవులు గంధర్వులధాటికి తాళజాలక రణరంగం వీడి దుర్యోధనుడి సమక్షానికి పారిపోయి చేరారు. కాని, కర్ణుడు ఒక్కడే యుద్ధభూమిలో స్థైర్యంతో నిలిచి బల్లెములతో అర్ధచంద్రబాణాలతో గంధర్వులశరీరాలు ఖండించి నిమిషమాత్రములో చిత్రసేను సైనికులను వందలకొలది సంహరించాడు. ఎంతమంది రణరంగంలో కూలుతున్నా, ఆగక గంధర్వులు లక్షలకొలది వచ్చి కర్ణుడిపై పడసాగారు. భూమిఅంతా అపుడు గంధర్వులతో నిండి ఉన్నట్లు కన్పించింది. అప్పుడు.

చ. శకునియుఁ దమ్ములుం బ్రబలసైన్యముతో నడతేర నాహవో
త్సుకమతి యై సుయోధనుఁడు సూతతనూభవుఁ డున్నచోటికిం
బ్రకటభుజోగ్రతం గడఁగి బల్విడిఁ దద్రిపుకోటిఁ దాఁకినన్
సకలజగద్భయంకరలసత్సమరోత్సవ మయ్యె నయ్యెడన్. 393

ప్రతిపదార్థం: సుయోధనుఁడు= దుర్యోధనుడు; శకునియున్= సౌబలుడు; తమ్ములున్= అనుజ సోదరులును; ప్రబల సైన్యముతోన్= మిక్కుటమైన సేనతో; నడతేరన్= తరలి రాగా; ఆహవ+ఉత్సుక, మతి+ఐ= యుద్ధం చేయటంలో ఉత్సాహం కల మనస్సు కలవాడై; సూత, తనూభవుఁడు= సూతుడి పుత్రుడైన కర్ణుడు; ఉన్న చోటికిన్= ఉన్న స్థలానికి; ప్రకట, భుజ+ఉగ్రతన్= సుస్పష్టంగా వెల్లడి అయిన పరాక్రమం యొక్క భయంకరత్వం చొప్పున; కడఁగి= పూని; బల్విడి= బలం చూపి; తద్+రిపుకోటిన్= ఆ శత్రు సమూహాన్ని; తాఁకినన్= తలపడగా; ఆ+ఎడన్= ఆ సమయంలో, అచట; సకల, జగత్+భయంకర, లసత్, సమర+ఉత్సవము= సమస్తమైన జగత్తుకు వెరపు గొలుపేది ప్రకాశించేది అయిన యుద్ధమనే పండుగ; అయ్యెన్= జరిగింది.

తాత్పర్యం: దుర్యోధనుడు తనవెంట శకునీ, తమ్ములూ ససైన్యులై రాగా, ప్రబలసేనలతో కూడి యుద్ధం చేసే ఉత్సాహంతో కర్ణుడున్న స్థలానికి పరాక్రమాటోపంతో చేరి గంధర్వులను చుట్టుముట్టాడు. అప్పుడు జగద్భయంకరమైన ఘోరయుద్ధం కౌరవులకూ గంధర్వులకూ జరిగింది.

క. కొండొకసేపునకు మహో । ద్దండనృపానేకఘోరతరవిశిఖవ్రా
ఖండిత శరీరులై ధృతి । ఖండితముగఁ బల్లటిలిరి గంధర్వు లనిన్. 394

ప్రతిపదార్థం: కొండొక సేపునకున్= కొంత తడవునకు; గంధర్వులు; మహా+ఉద్దండ, నృప+అనేక, ఘోరతర, విశిఖ, వ్యాఖండిత, శరీరులు+ఐ= గండరగండలు అయిన ప్రభువులచేత విడువబడిన భయంకరమైన బాణాలచేత ముక్కలుగా చేయబడిన దేహాలు కలవారై; ధృతి, ఖండితముగన్= ధైర్యం కత్తిరించబడినదికాగా; అనిన్= యుద్ధంలో; గంధర్వులు= పల్లటిలిరి= చలించారు.

తాత్పర్యం: శకునితో తమ్ములతో కలసి దుర్యోధనుడు కొంతసేపు యుద్ధం చేయబూనగా, ఉద్దండులైనవారు విడిచిన భయంకర బాణాలచేత ఖండించబడిన దేహాలు కలవారై గంధర్వులు తల్లడిల్లిపోయారు.

చిత్రసేనుం డను గంధర్వరాజు దుర్యోధనునితో యుద్ధము సేయుట (సం. 3-230-21)

క. గంధర్వులు దెరలుట విని । గంధర్వవిభుండు క్రోధకలుషితమతి యై
గంధగజము చందమున, మ । దాంధగతిం గవిసెఁ గౌరవానీకముపై. 395

ప్రతిపదార్థం: గంధర్వులు; తెరలుటన్= వెనుబడటం; చావటం; విని= ఆలకించి; గంధర్వ విభుండు= గంధర్వుల రాజు, చిత్రసేనుఁడు; క్రోధ, కలుషిత, మతి+ఐ= కోపంచేత కలత చెందిన బుద్ధి కలవాడై; కౌరవ+అనీకముపైన్= కౌరవుల సేనపై; గంధ, గజము, చందమునన్= మదించిన యేనుగు మాదిరిగా; మద+అంధ, గతిన్= మదంచేత కన్ను గాననివాడై; కవిసెన్= ముట్టడించాడు.

తాత్పర్యం: గంధర్వులు యుద్ధంలో ఓడిపోయిన వృత్తాంతాన్ని ఆలకించి, గంధర్వప్రభువైన చిత్రసేనుడు మదపుటేనుగు మాదిరిగా, మదంచేత గ్రుడ్డితనం ఏర్పడినరీతిగా కౌరవసైన్యాన్ని ఎదుర్కొన్నాడు.

వ. ఇట్లు గవిసి చిత్రసేనుండు. 396

తాత్పర్యం: ఈ విధంగా ముట్టడించి చిత్రసేనుడు.

శా. మాయాసంగరకోవిదుండు వికసన్మాయాస్త్రజాలంబులన్
వాయువ్యాప్తి యడంగ నర్కకిరణవ్రాతంబు రుద్ధంబుగాఁ
జేయం జొచ్చినఁ, ద్రెళ్ళెఁ దేరులు, కరుల్ శీర్ణంబు లయ్యెన్, దళ
త్కాయం బయ్యె హయాలి, గూలిరి భటుల్ కౌరవ్యసైన్యంబునన్. 397

ప్రతిపదార్థం: మాయా, సంగర, కోవిదుండు= మోసంతో కూడిన యుద్ధంలో నేర్పరితనం కలవాడు, చిత్రసేనుడు; వికసత్+ మాయా+అస్త్ర, జాలంబులన్= శోభిల్లేవి, మాయతో కూడినవి అయిన మంత్రమహిమతో కూడిన ఆయుధ సముదాయాలచేత; వాయు, వ్యాప్తి+అడంగన్= గాలి వీవటం (వ్యాపించటం) లేకుండేటట్లుగా; అర్క, కిరణ, వ్రాతంబు= సూర్యుడి రశ్మల సముదాయం (సూర్యకాంతి); రుద్ధంబుకాన్= అడ్డగించబడేటట్లు; చేయన్+చొచ్చినన్= చేయసాగగా; కౌరవ్య సైన్యంబునన్= కౌరవుల సైన్యంలో; తేరులు= రథాలు; త్రెళ్లెన్= కూలిపోయాయి; కరుల్= ఏనుగులు; శీర్ణంబులు+అయ్యెన్= ఖండించ బడ్డాయి; హయ+ఆలి= గుర్రాల గుంపులు; దళత్+కాయంబు+అయ్యెన్= ఖండించబడిన శరీరాలు కలవి అయ్యాయి; భటుల్= సైనికులు; కూలిరి= నేల కొరిగారు.

తాత్పర్యం: ఈ విధంగా చిత్రసేనుడు యుద్ధం చేయటానికి ఉపక్రమించినపుడు కౌరవసేన చిందరవందర అయిపోయింది. చిత్రసేనుడు మాయాయుద్ధం నేర్చినవాడు. అతడు మాయతో కూడిన మంత్రబాణాలను ప్రయోగించాడు. అందుచేత గాలి ఆడటం ఆగిపోయింది. సూర్యకిరణాలకాంతి అడ్డగించబడింది. రథాలు విరిగి పోయాయి. ఏనుగులు ఖండించబడ్డాయి. గుర్రాలశరీరాలు తుత్తునియలయ్యాయి. భటులు నేల కూలారు.

క. పొదలి యొకని కొక్కనికిని। బదుగురు పదుగురుగఁ గవిసి పౌరవసేనం
బొదివి సమయింపఁ దొడఁగిరి। వదలక గంధర్వు లని నవార్యోద్ధతులై. 398

ప్రతిపదార్థం: గంధర్వులు; అవార్య+ఉద్ధతులు+ఐ= వారించరాని అతిశయం కలవారయి; పొదలి= విజృంభించి; ఒకనికిన్+ ఒక్కనికిని= ఒకడికి ఒక్కొక్కడికిన్నీ (ఒక్కొక్క కౌరవభటుడికి); పదుగురు, పదుగురుగన్= పదిమంది పదిమందిగా; కవిసి= చుట్టుముట్టి; పౌరవసేనన్= కౌరవులసేనను; పొదివి= అలముకొని; సమయింపన్= సంహరించటానికి; వదలక= విడువక; తొడఁ గిరి= పూనుకొన్నారు.

తాత్పర్యం: కౌరవసేనలోని ఒకభటుడి చుట్టు పదిమంది గంధర్వభటులు చుట్టుముట్టి, కేవలం సంఖ్యాబలం చొప్పున వారించటానికి వీలులేనివారై, గంధర్వులు కౌరవుల భటులను సంహరించటానికి సిద్ధపడ్డారు.

వ. అవ్వియచ్చరుల విక్రమంబునకు నోర్వక బెదరి చెదరి కురురాజసైన్యంబు ధర్మనందనుం డున్న కందువకుఁ బాఱందొడంగె; నప్పుడు రాధేయుం డజేయుండై కులశైలంబునుం బోలెఁ దరలక నిలిచి గంధర్వులు గురియు శరవర్షంబున మునుఁగుచుఁ దన యోపినంత పెనంగుచుండె; సోదర సౌబల సహాయుండై దుర్యోధనుండు గర్ణసాహాయ్యంబు వదలక నిలిచె; నంత ననంతసత్త్వు లైన గంధర్వు లనేకులు సుట్టుముట్టి. 399

ప్రతిపదార్థం: కురు, రాజ, సైన్యంబు= కౌరవుల రాజుయొక్క (దుర్యోధనుడి) భట సమూహం; ఆ+వియత్+చరుల= ఆకసంలో తిరిగే వారైన ఆ గంధర్వులయొక్క; విక్రమంబునకున్= శౌర్యానికి; ఓర్వక= తాళజాలక; బెదరి= భయపడి; చెదరి= ఇటు అటు పారి; ధర్మనందనుండు= ధర్మపుత్రుడు; ఉన్న కందువకున్= ఉన్నచోటికి; పారన్+తొడంగెన్= పరుగెత్తి పోవటానికి మొదలుపెట్టారు; అప్పుడు= ఆ సమయంలో; రాధేయుండు= రాధ కుమారుడైన కర్ణుడు; అజేయుండు+ఐ= జయించ శక్యంకానివాడై; కులశైలంబునున్+పోలెన్= కుల పర్వతంవలె; తరలక= వెనుదిరుగక; నిలిచి= నిలబడి; గంధర్వులు= వేలుపుజాతివారు; కురియు= వర్షించే; శర వర్షంబునన్= బాణాలనెడి వానలో; మునుఁగుచున్= మునిగిపోతూ; తన+ ఓపికన+ అంత= తన శక్తి మేరకు; పెనంగుచుండెన్= పోరాడుతూ ఉన్నాడు; సోదర సౌబల సహాయుండు+ఐ= తమ్ములును శకునియు సాయంగా కలవాడై; దుర్యోధనుండు= సుయోధనుడు; కర్ణ సాహాయ్యంబు= కర్ణుడికి తోడ్పడుతుండటం; వదలక= విడువక; నిలిచెన్= నిలబడెను; అంతన్= పిదప; అనంత, సత్త్వులు+ఐన= తుది లేని బలంగలవారైన; గంధర్వులు; అనేకులు= పెక్కుమంది; చుట్టుముట్టి= పొదివి.

తాత్పర్యం: ఆ గంధర్వుల పరాక్రమానికి సహించలేక వికావికలై, దుర్యోధనుడి సైన్యం ధర్మరాజున్న చోటికి పరుగెత్తసాగింది; అప్పుడు కర్ణుడు వెనుదిరగక, కులపర్వతంవలె స్థిరంగా నిలిచి గంధర్వులు గుప్పించే బాణాల వర్షంలో మునుగుతూ కూడా తాను శక్తివంచన లేకుండా యుద్ధం చేస్తూ ఉన్నాడు. సోదరులూ, శకునీ తనకు సహాయం చేస్తూ ఉండగా దుర్యోధనుడు కర్ణుడికి ఆసటబాసటగా నిలిచాడు. అప్పుడు అమితబలులైన గంధర్వులు అనేకమంది వారిని చుట్టుముట్టారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. కొందఱు సూతు, నశ్వములఁ గొందఱు, కొందరు చాపదండముం
గొందఱు చక్రయుగ్మకముఁ, గొందఱు విస్ఫురితాతపత్రముం
గొందఱు కూబరంబు, మఱి కొందఱు కేతువుఁ, గొంద ఱక్షమున్
దందడిఁ దున్మివైచి విరథత్వ మొనర్చిరి సూతసూతికిన్. 400

ప్రతిపదార్థం: కొందఱు= కొంతమంది (గంధర్వులు); సూతున్= సారథిని; కొందఱు= కొంతమంది; అశ్వములన్= గుర్రాలను; కొందఱు= కొంతమంది; చాప దండమున్= విల్లుయొక్క కాండాన్ని; కొందఱు= కొంతమంది; చక్ర, యుగ్మకమున్= (రథం యొక్క) చక్రాల జంటను; కొందఱు= కొంతమంది; విస్ఫురిత+ఆతపత్రమున్= ప్రకాశించే గొడుగును; కొందఱు= కొంతమంది; కూబరంబు= రథం యొక్క నొగలును; మఱి కొందఱు= ఇంకా కొంతమంది; కేతువున్= పతాకాన్ని; కొందఱు= కొంతమంది; అక్షమున్= రథం యొక్క ఇరుసును; దందడిన్= తరచైన వరుసలో; తున్మివైచి= ఖండించి; సూతసూతికిన్= సూతుడి కొడుకైన కర్ణుడికి; విరథత్వము+ఒనర్చిరి= తేరు లేనితనాన్ని కలిగించారు (రథాన్ని ధ్వంసం చేశారు).

తాత్పర్యం: గంధర్వభటులలో కొంతమంది సారథిని, కొంతమంది గుర్రాలను, కొంతమంది వింటిబద్దను, కొంతమంది రెండుచక్రాలను; కొందరు వెలుగొందుతున్న గొడుగును; కొందరు నొగలును; మరికొంతమంది జెండాను; కొందరు ఇరుసును ఖండించి సంరంభంతో కర్ణుడిరథాన్ని ముక్కలు ముక్కలు చేశారు.

వ. ఇట్లు విరథుం డయి కర్ణుండు వికర్ణురథం బెక్కిరణభూమికిం దొలంగి చనియె; దుర్యోధనుండు విముఖుండు గాక పరబలంబు మార్కొని పెనంగం దొడంగినం గినిసి చిత్రసేనుండు వానిం దలపడి తదీయస్యందనంబు రాధేయురథంబు నట్లు భగ్నంబుగాఁ జేయుంచి, విరథుం డగు నమ్మహీవిభుం గేశాకర్షణంబున నేలం బడవైచి పెడకేలు గట్టి సింహనాదంబు సేసినం, దక్కిన గంధర్వులుం గనుకనిం బేర్చి యతని వనితా జనంబులను, దత్సోదరు లగు దుశ్శాసన దుర్విషహ దుర్ముఖ వివింశతి చిత్రసేన విందానువిందులను, దత్తనూభవులను, దదీయమంత్రులను బట్టి బంధించి చిత్రసేనున కొప్పించి; రంతఁ బెఱకౌరవులును బౌరులు నమాత్యులుం జెదరి యాక్రోశించుచుం బఱచి, ధర్మపుత్త్రు శరణు సొచ్చి యి ట్లనిరి. 401

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; విరథుండు+అయి= తేరును కోలుపోయినవాడయి; కర్ణుండు= కర్ణుడు; వికర్ణు, రథంబున్+ ఎక్కి= వికర్ణుడియొక్క తేరును ఎక్కి (వికర్ణుడు దుర్యోధనుడి తమ్ముడు); రణ, భూమికిన్= యుద్ధం చేసే స్థలానికి; తొలంగి= వదలి దూరంగా; చనియెన్= వెళ్లాడు; దుర్యోధనుండు= సుయోధనుడు; విముఖుండు+కాక= (యుద్ధభూమికి) వెనుదిరిగిన మొగం కలవాడు కాక; పరబలంబున్= శత్రు సేనను; మార్కొని= ఎదిరించి; పెనంగన్+తొడంగినన్= పోరాడటం సాగించగా; కినిసి= కోపించి; చిత్రసేనుండు= గంధర్వ రాజు; వానిన్= దుర్యోధనుడిని; తలపడి= చుట్టుముట్టి; తదీయ, స్యందనంబు= ఆతడి యొక్క (దుర్యోధనుడి యొక్క) రథాన్ని; రాధేయు రథంబు+అట్ల= కర్ణుడి తేరు వలెనే; భగ్నంబుగాన్= ముక్కలు అయ్యేటట్లుగా, చేయించి= ఒనర్చి; విరథుండు+అగు= తేరును కోలు పోయినవాడు అయిన; ఆ+మహీవిభున్= ఆ రాజును (దుర్యోధనుడిని); కేశ+ఆకర్షణంబునన్= జుట్టు పట్టుకొని; నేలన్= భూమిమీద; పడన్వైచి= పడేటట్లుగా త్రోచి; పెడకేలు+కట్టి= చేతులు వెనుకకువిరిచి బంధించి; సింహనాదంబు+చేసినన్= (విజయ సూచకమైన) సింహం చేసే గర్జన వంటి శబ్దం చేయగా; తక్కిన= మిగిలిన; గంధర్వులున్; కనుకనిన్= సంభ్రమంతో; పేర్చి= అతిశయించి; అతని= దుర్యోధనుడి యొక్క; వనితా జనంబులను= స్త్రీల సమూహాలను; తద్+సోదరులు+అగు= ఆతని తోడబుట్టువులు అయిన; దుశ్శాసన, దుర్విషహ, దుర్ముఖ, వివింశతి, చిత్రసేన, వింద+అను విందులను= దుశ్శాసనుడు, దుర్విషహుడు; దుర్ముఖుడు; వివింశతి,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చిత్రసేనుడు, విందుడు, అనువిందుడు అనే పేర్లు కల వారలను; తద్+తనూభవులను= ఆతడి యొక్క (దుర్యోధనుడి) కొడుకులను; తదీయ, మంత్రులను= ఆతడి యొక్క సచివులను; పట్టి= పట్టుకొని; బంధించి= చెఱపట్టి; చిత్రసేనునకున్= చిత్రసేనుడికి; ఒప్పించిరి= అప్పగించారు; అంతన్= పిదప; పెఱ కౌరవులును= తక్కిన కౌరవ వంశస్థులును; పౌరులును= (హస్తినా)పుర వాసులును; అమాత్యులున్= మంత్రులును; చెదరి= చెల్లాచెదరై; ఆక్రోశించుచున్= రోదనం చేస్తూ; పఱచి= పరుగెత్తి; ధర్మపుత్త్రున్= ధర్మరాజును; శరణు+చొచ్చి= రక్షణ ఇమ్మని ఆశ్రయించి; ఇట్లు+అనిరి= ఈ విధంగా పలికారు.

తాత్పర్యం: ఈ విధంగా కర్ణుడు రథాన్ని కోలుపోయినవాడై, దుర్యోధనుడి తమ్ముడైన వికర్ణుడిరథం ఎక్కి యుద్ధభూమిని వీడి వెళ్లాడు. (అంతకుముందు కర్ణుడు ఏకైకవీరుడై చాలసేపు గంధర్వులతో పోరాడి వారిని నిలువరించి ఉన్నాడు). దుర్యోధనుడు యుద్ధభూమిని వీడక నిలబడి శత్రుసేనలను ఎదిరించి పోరాటం కొనసాగించటం చూచి గంధర్వరాజు అయిన చిత్రసేనుడు కోపించి, దుర్యోధనుడితో తలపడి, ఆతడి రథాన్నిగూడ కర్ణుడిరథంవలెనే భగ్న మొనరించాడు. పిదప, రథాన్ని కోలుపోయిన దుర్యోధనుడిని చిత్రసేనుడు జుట్టుపట్టుకొని యీడ్చి నేలమీద పడవైచి, ఆతని చేతులు వెనుకకు విరిచి కట్టి, విజయసూచకంగా సింహనాదం చేశాడు. ఆ దృశ్యాన్ని చూచి, సంభ్రమంతో మిగిలిన గంధర్వులు విజృంభించి దుర్యోధనుడి భార్యలను, తమ్ములైన దుశ్శాసనుడు, దుర్విషహుడు, దుర్ముఖుడు, వివింశతి, చిత్రసేనుడు, విందుడు, అనువిందుడు అనే వారిని, దుర్యోధనుడి కుమారులను, దుర్యోధనుడి మంత్రులను పట్టి బంధించి చిత్రసేనుడికి అప్పగించారు. అంతట మిగిలిన కౌరవులు, హస్తినాపుర జనులు, మంత్రులు రోదిస్తూ పారిపోయి ధర్మపుత్రుడిని శరణు వేడి ఇట్లా పలికారు.

విశేషం: ప్రాచీనభారతదేశంలో శరణువేడటం అనే సంప్రదాయం పేర్కొన తగింది. శరణు వేడటం అంటే దిక్కులేని దీనులు గొప్పవారిని రక్షణకై ప్రార్థించటం. శరణు వేడినచో శత్రువుల నైనను కాపాడటం అలనాటి వీరమర్యాద, క్షాత్రధర్మం.

మ. **'ఘనబాహాబలదుర్నివారమహిమన్ గంధర్వవీరుల్ సుయో**
ధనుఁ దత్కాంతలఁ దత్సహోదరుల బంధప్రాప్తులం జేసి కై
కొని వేపోవుచు నున్న వా రదె; రిపుక్షోభంబు గావించి, నీ
యనుజవ్రాతముఁ గావవే కరుణ నిండారంగ రాజోత్తమా!' **402**

ప్రతిపదార్థం: రాజ+ఉత్తమా!= ప్రభువులలో శ్రేష్ఠుడవైన వాడా! ఓ ధర్మరాజా!; ఘన, బాహా, బల, దుర్నివార, మహిమన్= గొప్ప పరాక్రమ శక్తి కలగటం వలన వారించటానికి వీలులేని గొప్పతనం వలన; గంధర్వ వీరుల్= వేలుపుజాతివారైన శూరులు; సుయోధనున్= దుర్యోధనుడిని; తద్+కాంతలన్= ఆతడి యొక్క వనితలను; తద్+సహోదరులన్= ఆతడి యొక్క తమ్ములను; బంధప్రాప్తులన్+చేసి= సంకెళ్లతో బంధించి; కైకొని= తీసుకొని; వే= వేగంగా; పోవుచున్+ఉన్నవారు+అదె= వెళ్ళుతున్నారు అరుగో; రిపు, క్షోభంబు+కావించి= శత్రువులకు కలత కలుగజేసి; నీ అనుజ, వ్రాతమున్= నీ సహోదరుల సమూహాన్ని; కరుణ= దయ; నిండు+ఆరంగన్= పరిపూర్ణం కాగా, కావవే!= రక్షించవే! (కాపాడుము).

తాత్పర్యం: 'రాజులలో శ్రేష్ఠుడ వైన ఓ ధర్మరాజా! గంధర్వయోధులు సాటిలేని శౌర్యం ప్రదర్శించి వారించటానికి వీలులేని మహిమతో దుర్యోధనుడిని, అతని కాంతలను, సహోదరులను చెఱబట్టి తీసికొని పోతున్నారు. శత్రువులను జయించి, నీవు ఇప్పుడు నీ సోదరులను కాపాడవలెనని మా ప్రార్థన. ఇట్టి దయ చూపుట నీకే తగును.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని కృతాంజలులై పలుకుచున్న వారిం జూచి భీమసేనుండు ప్రహసితాననుం డగుచు ధర్మపుత్త్రున కి ట్లనియె.403

ప్రతిపదార్థం: అని= అని పలికి; కృత+అంజలులు+ఐ= ఘటించిన నమస్కృతి కలవారై, (కైమోడ్చి); పలుకుచున్న వారిన్+చూచి= మాటలాడుతున్న వారిని గమనించి; భీమసేనుండు= భీముడు; ప్రహసిత+ఆననుండు+అగుచున్= బాగా నవ్విన మొగం కలవాడు ఔతూ; ధర్మపుత్త్రునకున్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అంటూ అంజలి ఘటించి ప్రార్థిస్తున్న దుర్యోధనుడి మంత్రులను చూచి, భీమసేనుడు సంతోషంతో నవ్వుదొంతరులు వెల్లివిరిసిన ముఖంతో ధర్మపుత్రుడితో ఇట్లా అన్నాడు.

క. 'మనకుఁ జులుకనయ్యెఁ; మన చేయుపనియ గం । ధర్వవరులు గూడి తగ నొనర్చి;
రింత లెస్స యగునె! యే భారమును లేక । యూరకుండ మనల నొందె జయము. 404

ప్రతిపదార్థం: మనకున్+మనకు; చులుకన+అయ్యెన్= సులువు అయింది; మన చేయుపని+అ= మనం నిర్వహించవలసిన కార్యమే; గంధర్వ వరులు= గంధర్వులలో శ్రేష్ఠులు; కూడి= కలిసి; తగన్= ఒప్పిదముగా; ఒనర్చిరి= చేశారు; ఇంత= ఈ పాటిదైన; లెస్స+అగునె= మంచిపని జరిగింది కదా; ఏ భారమును= ఎట్టి బరువు బాధ్యతలును; లేక= లేకుండగనే; ఊరక+ఉండన్= మిన్నకుండగా; మనలన్= మనలను; జయము= గెలుపు; ఒందెన్= పొందింది.

తాత్పర్యం: 'ఆహా! ఎంత మంచిపని జరిగింది! అసలు మనం చేయవలసిన కర్తవ్యాన్ని మనకు ఎట్టి భారం లేకుండగానే, మనం ఎట్టి కష్టం పడకుండగానే గంధర్వ శ్రేష్ఠులు నెరవేర్చి మనకు గొప్ప ఉపకారం చేశారు. మనకు విజయం సులువుగా లభించింది గదా!

విశేషం: తెలుగులో సుప్రసిద్ధమైన సామెత "కాగల కార్యం గంధర్వులు తీర్చారు" అనేది ఈ కథనుబట్టె ఏర్పడింది.

తే. పుట్టుగల్లరియై పాపములకు నెల్ల । దిట్టయై లోకములచేతఁ దిట్టు వడిన
కట్టిఁడికి నిట్టి కష్టంబుగా నొనర్చి । తగ విధాతృఁడు చతురుఁ డై నెగడె నేఁడు. 405

ప్రతిపదార్థం: పుట్టు+కల్లరి+ఐ= జన్మం చేతనే (అనగా పుట్టినప్పటి నుండియు) అబద్ధాలాడేవాడై; పాపములకున్= దురితాలకు; ఎల్లన్= అన్నిటికిని; దిట్ట+ఐ= సమర్థుడు అయి; లోకములచేతన్= జగత్తులలోని ప్రజలు అందరి చేతను; తిట్టు+పడిన= తెగడ్తలు పొందిన; కట్టిఁడికిన్= దుర్మార్గుడికి; ఇట్టి కష్టంబుకాన్= ఇటువంటి కష్టం (గంధర్వుల చేత చెఱవడటం) కలిగేటట్లు; ఒనర్చి= చేసి; తగన్= సరిపోలునట్లు; విధాతృఁడు= బ్రహ్మదేవుడు; నేఁడు= ఈ రోజున; చతురుఁడు+ఐ= తెలివితేటలు కలవాడయి; నెగడెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: పుట్టుకచేతనే అసత్యవాది అయి, అన్నిపాపాలు చేయటంలో నేర్పరి అయి, లోకాలచేత నిందించబడిన దుర్మార్గుడికి చివరకు ఈ విధంగా గంధర్వులచేత పరాభవం కల్పించి తగిన న్యాయం చేకూర్చిన బ్రహ్మదేవుడు తెలివిగలవా డని నేటికి ఋజువయింది కదా!

మ. విపరీతస్థితి నొంది ఘోరవిపినోర్వీవాసులై నిత్యదుః
ఖపరాధీనతఁ దూలి రంచు మనలన్ గర్వోద్ధతస్వాంతుఁ డై

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యపలాపింపఁగ వచ్చి దుర్ణయపరుం డా ధార్తరాష్ట్రుండు దో
షపరీతాత్ముఁడు దత్ఫలంబు గుడిచెన్ సత్యంబు సామాత్యుఁడై. 406

ప్రతిపదార్థం: విపరీతస్థితిన్+ఒంది= తారుమారైన గతి పొంది; ఘోర, విపిన+ఉర్వీ, వాసులు+ఐ= భయంకరమైన అడవిలో నివసించేవారు అయి; నిత్య, దుఃఖ పరాధీనతన్= ఎల్లప్పుడును కష్టాలకు లోనయి ఉండటంచేత; తూలిరి+అంచున్= పడిపోయారు అంటూ; మనలన్= మనలను; ఆ, ధార్తరాష్ట్రుండు= ఆ ధృతరాష్ట్రుడి కొడుకు దుర్యోధనుఁడు; గర్వ+ఉద్ధత, స్వాంతుఁడు+ఐ= మదంచేత మత్తెక్కిన మనస్సు కలవాడై; అపలాపింపఁగన్= అవమానించగా; వచ్చి= అరుగుదెంచి; దుర్ణయపరుండు= చెడు నడవడిక కలవాడు; దోష, పరీత+ఆత్ముఁడు= నేరాలతో కూడిన ఆత్మ కలవాడు- దుష్టుడు; స+అమాత్యుఁడు+ఐ= మంత్రులతో కూడిన వాడయి; తత్+ఫలంబు= తన చెడు నడవడికకు తగిన ఫలితాన్ని; కుడిచెన్= అనుభవించాడు; సత్యంబు= ఇది నిజం.

తాత్పర్యం: స్థితిగతులు తారుమారై, అడవులలో ఇడుమలు గుడుచుచు మిక్కుటమైన దైన్యానికి లోబడి పతనం చెందిన వారని తలపోసి మనలను గర్వంచేత మదించిన చిత్తం కలవాడై అవమానించటానికి వచ్చిన ధృతరాష్ట్రుడికొడుకు దుష్టాత్ముడు దుర్యోధనుడు అమాత్యులతో కలిసి తగిన శాస్తిని అనుభవించాడు. ఇది నిజం.

వ. వానిదెసం గృప సేయ వల' దనిన ననుజునకు నగ్రజుం డిట్లనియె. 407

ప్రతిపదార్థం: వాని, దెసన్= వాని పట్ల, దుర్యోధనుడి యెడ; కృప+చేయన్+వలదు= దయచూప వద్దు; అనినన్= అని చెప్పగా; అగ్రజుండు= అన్నగారు (ధర్మరాజు); అనుజునకున్= తమ్ముడికి; (భీముడితో); ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడియెడ దయ చూపరాదు సుమా' అనిన భీమసేనుడితో ధర్మరాజు ఇట్లా పలికాడు.

క. 'అకట! యిది పరుషవాక్యము । లకు సమయమె? శరణు సొచ్చి లఘుభావముతో
వికలగతి నున్న కౌరవ । నికరమునకుఁ గరుణ సేయ నీకుం దగదే! 408

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; ఇది= ఈ పట్టు; పరుష, వాక్యములకున్= కఠినమైన మాటలకు; సమయమె?= వేళ? (కాదు); శరణు+చొచ్చి= శరణు వేడుకొని; లఘుభావముతోన్= అభిమానాన్ని కోల్పోయిన తేలికతనంతో; వికలగతిన్+ఉన్న= కలతచెంది ఉన్న; కౌరవ నికరమునకున్= కౌరవుల సముదాయానికి; కరుణ+చేయన్= దయచూపటం; నీకున్= నీకు (బలవంతుడ వైన ఓ భీమసేనా! నీకు); తగదే= తగదా (తగును).

తాత్పర్యం: 'అయ్యో, భీమసేనా! నీవు బలవంతుడవుకదా! శరణు చొచ్చిన వారిపై నీవంటివారు జాలి చూపవలెనే కాని కఠినమైన మాటలు మాటాడరాదు. కలత చెంది శరణు వేడిన కౌరవులపై నీవు దయచూపాలి సుమా. ఇది క్షాత్రధర్మం.

వ. ఏ కాన్వయజాతు లైన వారికి నర్థనిమిత్తం బైన భేదం బొక్కొకమాటు ప్రవర్తిల్లు; నంతన చేసి సహజస్నేహంబు దప్పనేరదు; జ్ఞాతిజనంబులు దమలో నెట్టివారైన నొప్పం గాని, యన్యులవలనం బరిభవంబు దొడరినప్పుడు దా రొం డొరులఁ జేకొన కునికి లోక నింద్యంబు; దుర్యోధనుండు దుర్వినీతుం డైనను సభార్యుం డయి పరులచేతం బట్టు వడియె; దీని నుపేక్షించిన మనకుం గులహాని యగు; నదియునుం గాక శరణాగత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రక్షణంబు రాజమాత్రుం డగు వాని కెల్ల ధర్మంబు; నీయట్టి బాహుబలసంపన్నునకు నిట్టి సుకర్మంబు కర్తవ్యం బని వేఱు చెప్పనేల? లెమ్ము! నీవును తమ్ములు నిమ్ముల రథంబు లెక్కిసర్వాయుధసన్నద్ధులై చని సుయోధను చెఱ దలఁగుం' డనినఁ బవననందనుండు ధర్మనందనున కి ట్లనియె. **409**

ప్రతిపదార్థం: ఏక+అన్వయ, జాతులు+అయిన వారికిన్= ఒకే వంశంలో పుట్టినవారికి; అర్థనిమిత్తంబు+ఐన= ధనానికి సంబంధించిన; భేదంబు= కలహం; ఒక్కొకమాటు= ఒకానొక పర్యాయం; ప్రవర్తిల్లున్= సంభవిస్తుంది; అంతన+చేసి= అంత మాత్రం చేతనే; సహజ స్నేహంబు= ప్రకృతిసిద్ధంగా ఉండే నెయ్యం; తప్ప నేరదు= విడిపోదు; జ్ఞాతి జనంబులు= ఏక కుటుంబాన పుట్టిన వారలు; తమలోన్= తమలో తాము; ఎట్టివారు+ఐనన్= ఎటువంటివారు ఐనను; ఒప్పున్= సరిపోతుంది; కాని= కాని; అన్యుల వలనన్= పరుల మూలంగా; పరిభవంబు= పరాభవం; తొడరినప్పుడు= ఏర్పడినప్పుడు; తారు= తాము; ఒండొరులన్= ఒకరినొకరు; చేకొనక+ఉనికి= తోడ్పడకుండటం; లోక, నింద్యంబు= ప్రజలచేత గర్హించబడతగింది; దుర్యోధనుండు= సుయోధనుడు; దుర్వినీతుండు+అయినను= చెడ్డ నడవడిక కలవాడు అయినను; సభార్యుండు+అయి= భార్యలతో కూడినవాడై; పరులచేతన్= ఇతరుల చేత; పట్టువడియెన్= బంధించబడ్డాడు; దీనిన్= ఈ విషయాన్ని; ఉపేక్షించినన్= లెక్కచేయకపోతే; మనకున్= మనకు; కులహాని+అగున్= కుటుంబానికి కీడు కలుగుతుంది; అదియున్+కాక= అంతమాత్రమే కాక; శరణ+ఆగత, రక్షణంబు= రక్షణకై ప్రార్థించ వచ్చినవారిని కాపాడటం; రాజ మాత్రుండు+అగు వానికిన్+ఎల్లన్= కేవలం రాజు అయిన వాడికి; ధర్మంబు= ధర్మం; నీ+అట్టి, బాహు, బల, సంపన్ననకున్= నీ వలె పరాక్రమమే సంపదగా కల వాడికి; ఇట్టి= ఇటువంటి; సుకర్మంబు= మంచి పని; కర్తవ్యంబు= అవశ్యం ఆచరించవలసిన కృత్యం; అని= అని; వేఱు= ప్రత్యేకంగా; చెప్పన్+ఏల= చెప్పటెందుకు; లెమ్ము= లేచి నిలబడుము, వెళ్ళటానికి సంసిద్ధం కమ్ము; నీవును; నీ తమ్ములున్= నీ సహోదరులును; ఇమ్ములన్= సంప్రీతితో; రథంబులు+ఎక్కి= తేరులను అధిరోహించి; సర్వ+ఆయుధ సన్నద్ధులు+ఐ= సమస్తమైన పోటుముట్లు సమకూర్చుకొనిన వారై; చని= వెడలి; సుయోధను+చెఱ= దుర్యోధనుడి బంధం; తలఁగుండు= పోగొట్టండి; అనినన్= అని చెప్పగా; పవన నందనుండు= వాయుపుత్రుడైన భీముడు; ధర్మనందననకున్= ధర్మపుత్రుడికి; ఇట్లు అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఒకేవంశంలో పుట్టినవారికి ధనానికి సంబంధించిన కలహాలు అప్పుడప్పుడు ఏర్పడవచ్చును. అంతమాత్రంచేత ప్రకృతిసిద్ధమైన ప్రేమ తప్పిపోరాదు. ఒకే కుటుంబానికి చెందినవారు తమలో తాము ఏ విధంగా ప్రవర్తించినా సరిపోతుంది కాని, ఇతరులవలన అవమానం కలిగితే ఒకరికొకరు సాయం చేసికొనకపోతే లోకులచేత గర్హించబడతారు. దుర్యోధనుడు చెడునడవడి కలవాడే కావచ్చును. అతడు మనజ్ఞాతి. అతడు తన భార్యలతోపాటు ఇతరులచేత బంధించబడ్డాడు. దీనిని మనం లెక్కపెట్టకపోతే అది మన కుటుంబానికి సయితం అవమానమౌతుందికదా! అంతేకాక, రాజవంశంలో పుట్టినవాడు బలహీనుడైనప్పటికి శరణాగతులను కాపాడవలెను. ఇది రాజవంశ మర్యాద. బలహీనుడికే శరణాగత రక్షణం కర్తవ్యమైనప్పుడు నీ వంటి బలము గలవానికి అది అవశ్యకర్తవ్యం అని వేరుగా చెప్పవలెనా? ఇక వాదాలు మాని నీ కర్తవ్యాన్ని నిర్వహించటానికి వేగంగా పూనుకొనుము. నీవూ నీ సోదరులూ హృదయపూర్వకంగా రథాల నెక్కి, మీ మీ ఆయుధాలు ధరించి, దండెత్తి వెళ్లి దుర్యోధనుడిని చెఱ విడిపించండి' అని చెప్పగా ధర్మపుత్రుడికి భీమసేనుడు ఇట్లా బదులు పలికాడు.

సీ. **'అనుమాన మొక్కింతయును లేక యలిగి జ । లంబులఁ ద్రోచె, విషంబు వెట్టె**
గృహదాహ మొనరించె, విహితదురోదర । కపటుఁడై రాజ్యంబు నపహరించె,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జనులెల్లఁ జూడంగ వనజాక్షిఁ బాంచాలిఁ । దలవట్టి యీడ్పించె, వలువ లొలువఁ
బనిచెఁ; బుట్టినకోలె మనకు నక్కట! సుయో । ధనుఁ డెగ్గు సేయని దినము కలదె?

తే. వానిచేఁత లొకటి యేనియుఁ దలఁపవు; నీవు మనుజనాథ! కేవలంపుఁ
గరుణ పూని యుండు దరయ నెప్పుడు; నిట్టు । లైన మనకుఁ గార్యహాని గాదె?' **410**

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా! ఓ ధర్మరాజా!; అనుమానము= సందేహం; ఒక్క+ఇంతయును= ఏ మాత్రమున్నూ; లేక= లేకుండా; అలిగి= ఆగ్రహించి; జలంబులన్= నీళ్లలో; త్రోచెన్= నన్ను పడవేశాడు; విషంబు= విషం; పెట్టెన్= తినిపించాడు; గృహదాహము= ఇల్లు తగులబెట్టటం (లక్క ఇల్లు); ఒనరించెన్= చేశాడు; విహిత, దురోదర, కపటుఁడు+ఐ= ఏర్పరచిన జూదంలో మోసగాడై; రాజ్యంబున్= రాజ్యాన్ని; అపహరించెన్= అన్యాయంగా కాజేశాడు; జనులు+ఎల్లన్= ప్రజలు అందరు; చూడంగన్= చూస్తుండగా; వనజ+అక్షిన్= పద్మాల వంటి కన్నులు కలదానిని; పాంచాలిన్= ద్రౌపదిని; తల+పట్టి= శిరస్సును (శిరోజాలు) పట్టి; ఈడ్పించెన్= లాగించాడు; వలువలు= వస్త్రాలు; ఒలువన్= తొలగించటానికి; పనిచెన్= నియోగించాడు; పుట్టిన కోలెన్= జన్మించినప్పటి నుండి; మనకున్= మనకు (పాండవులకు); అక్కట!= అయ్యో; సుయోధనుఁ డు= దుర్యోధనుడు; ఎగ్గు= కీడు; చేయని= చేయనట్టి; దినము= రోజు; కలదె= ఉన్నదా (లేదని భావం); వాని చేఁతలు= దుర్యోధనుడి యొక్క పనులు; ఒకటి+ఏనియున్= ఒక్కటయినను; తలఁపవు= స్మరించవు; నీవు; కేవలము+కరుణ+పూని= అచ్చమైన దయ వహించి; ఉండుదు(వు)= ఉంటావు; అరయన్= పరిశీలించగా; ఎప్పుడున్= ఎల్లయెడల; ఇట్టులు+ఐనన్= ఈ విధంగానే జరిగితే; మనకున్= మనకు (పాండవులకు); కార్య హాని+కాదె?= పనులకు కీడు కలుగదా?

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఆ దుర్యోధనుడు మనకు చేసిన అపకారాలను నీవు స్మరించటం లేదు. అతడు సందేహించకుండ నన్ను గంగమడుగులోనికి త్రోయించాడు, అన్నంలో విషం పెట్టి చంపింప తలపోశాడు. లక్కయింటిలో పెట్టి మనలను దహించాలని చూచాడు. జూదమనే పన్నాగంతో మోసం చేసి రాజ్యాన్ని అపహరించాడు. పద్మాల వంటి కన్నులు కలదానిని - పాంచాల రాజపుత్రిని, ద్రౌపదిని నిండుసభలో వస్త్రాపహరణం చేయించాడు. పుట్టినప్పటి నుండీ ఈ దుర్యోధనుడు అనుదినం మనకు అపకారాలు చేస్తూనే ఉన్నాడు కదా! నీవు కేవలం దయామయుడవై అతడి తప్పులు అన్నింటిని మన్నిస్తే అది మనపనులకు హానికరమవుతుందికదా!.

వ. అని పూర్వవైరస్మరణకలుషితుండై పలికిన నతనికి నజాతశత్రుండు సాంత్వనపూర్వకంబుగా ని ట్లనియె. **411**

ప్రతిపదార్థం: అని= అని; పూర్వ, వైర, స్మరణ, కలుషితుండు+ఐ= కడచిన కాలంలోని శత్రుత్వాన్ని జ్ఞాపకం చేసికొనటం చేత, కలత చెందిన వాడై; పలికినన్= మాట్లాడగా; అతనికిన్= ఆ భీమసేనుడికి; అజాత శత్రుండు= పుట్టని శత్రువులు కలవాడు- అనగా ఎవరినీ విరోధులుగా పరిగణించని మహానుభావు డైన సాత్త్వికస్వభావుడు ధర్మజుడు; సాంత్వన పూర్వకంబుగాన్= ఓదార్పుమాటలతో; ఇట్లు అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని, పూర్వ శత్రుత్వాన్ని జ్ఞాపకం చేసికొనటంచేత కలతచెందిన భీముడితో, అజాతశత్రువు అయిన ధర్మరాజు ఈ విధంగా చెప్పాడు.

విశేషం: ఈ ఘట్టం ధర్మరాజుకు ఏర్పడిన 'అజాతశత్రువు' అనే బిరుదాన్ని సార్థకం చేస్తున్నది.

ఆ. 'కావరయ్య యనినఁ గరము దుర్బలుఁ డైనఁ । జెనసి యోపినంత సేయు నినిన,
నూరకుండునయ్య? యుత్తమశూరుండు । దీనజనుల యున్నతెఱఁగు సూచి. **412**

ప్రతిపదార్థం: కావరు+అయ్య+అనినన్= కాపాడండి అయ్యా! అని అడిగితే; కరమున్= మిక్కిలి; దుర్బలుఁడు+ఐనన్= బలహీనుడే అయినప్పటికి; చెనసి= పూని; ఓపినంత= చేతనైనంత మేర; చేయున్= ఒనరిస్తాడు; అనినన్= అనగా; ఉత్తమ శూరుండు= మంచి వీరుడు; దీనజనుల, ఉన్న, తెఱఁగు= కష్టంలో ఉండి ధైర్యం కోలుపోయిన వారు ఉన్న విధం; చూచి= అరసి; ఊరక+ఉండునయ్య?= ఉపేక్ష వహించి ఏమీ చేయక మిన్నకుంటాడా?

తాత్పర్యం: దయచేసి మీరు నన్ను కాపాడరా అని దీనంగా ప్రార్థిస్తే, బలహీనుడైనా సరే సాయం చేస్తాడు కదా! మరి, నీవంటి గొప్పవీరుడు దీనజనుల వెత చూచి ఏ సాయం చేయక మిన్నక ఉంటాడా?

క. శరణం బని వచ్చిన భీ । కరశత్రువు నయినఁ బ్రీతిఁ గావఁగ వలయుం
గరుణాపరుల తెఱం గిది; । యిరవుగ సరిగావు దీని కే ధర్మంబుల్. 413

ప్రతిపదార్థం: శరణంబు+అని= నాకు దిక్కు లేదు కాపాడుము నిన్ను ప్రార్థిస్తున్నాను; అని; వచ్చిన= అరుదెంచిన; భీకర, శత్రువున్+అయినన్= భయంకరమైన విరోధిని సయితము; ప్రీతిన్= ప్రేమతో; కావఁగన్ వలయున్= రక్షించవలెను; ఇది= శరణాగతులను కాపాడటం; కరుణా పరుల, తెఱంగు= దయ కలిగిన వారి పద్ధతి. దీనికిన్= ఈ శరణాగత రక్షణకు; ఇరవుగన్= సరిపోలగా; ఏ ధర్మంబుల్= మరి ఏ ఇతర ధర్మాలున్నూ; సరికావు= సమానమైనవి కావు.

తాత్పర్యం: శరణు వేడితే భయంకరమైన శత్రువును సయితం ప్రేమతో రక్షించాలి. ఇది దయార్ద్రహృదయుల పద్ధతి. ఈ శరణాగతసంరక్షణతో సాటి అయిన ధర్మాలు వేరేవీ లేవు. ఇది పరమధర్మం.

విశేషం: ప్రాచీన భారతీయ సంస్కృతికి ఈ పద్యం మణిదర్పణం. దయ, క్షమ, ఔదార్యం - ఆత్మాభిమానం పెనగొని ప్రాచీన క్షాత్రధర్మం - 'శరణాగత రక్షణ' పరమధర్మంగా ప్రతిష్ఠించింది. భారతీయసాహిత్యంలో మాత్రమేకాక భారతదేశచరిత్రలో కూడ భారతీయుల శరణాగతరక్షణ పరాయణత్వానికి పెక్కు ఉదాహరణలు ఉన్నాయి. శరణాగత త్రాణం కొరకై ఆత్మబలిదానం ఒనర్చిన మహావీరులచరిత్రలు రాజస్థాన కథావళిలో (రచయిత: కర్నలు టాడ్ దొర: తెలుగు సేత: కీర్తి శేషులు చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు) కాన వస్తాయి. ఈ రాజనీతి సిద్ధాంతం భారతీయుల బలం, మరియు బలహీనత అనే నవీన విమర్శకులు ఉన్నారు.

వ. ధృతరాష్ట్రసూనుండు భవదీయ బలశౌర్యంబులపేర్మి యెఱుంగుం గావునఁ దన్ను నవశ్యంబును విడిపింతు రని మనదెస బద్ధాశుం డై యుండు; నిది మనకుఁ బుణ్యంబును గీర్తియుం జేకొను సమయంబు; ని న్నింత నిర్బంధింప వలవ; దేన యరుగుదు; నిప్పుడు యజ్ఞదీక్షితుండ నై యున్నవాఁడఁగావున నాకుం జనరాదు; మీరు వేగఁ జని గంధర్వులం బ్రియపూర్వకంబుగా ననునయించి సుయోధను విడిపించునది; సామవచనంబులం దీరకున్నఁ బరాక్రమంబుననైనం బ్రతివీరుల నోర్చి కార్యంబు దీర్చునది; నా చేయు జన్నంబు సఫలంబు సేయుం' డనిన భీముం డెట్టకేనియు నియ్యకొనియె; నర్జునుండును ధర్మరాజు పనుపు గైకొని కురురాజుచెఱ దలఁగఁ బ్రతిజ్ఞసేసె; నకుల సహదేవులు నుత్సాహసమేతు లయి; రన్నలువురు నాముక్త కవచులు, నాబద్ధ తూణీరులు, నాకలిత కార్ముకులు, నారూఢ రథులు నయి, యగ్రజు వీడ్కొని, యతిత్వరితగతి నడచినం గౌరవసైన్యం బంతయు వారిం గూడుకొని సింహనాదంబులు సెలంగం జనియె; ని ట్లరిగి వారలు గంధమాదనంబున కయిచనుచున్న యవ్వియచ్చరానీకంబుం గూడ ముట్టిన. 414

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రసూనుండు= ధృతరాష్ట్రుడి కొడుకు-దుర్యోధనుడు; భవదీయ, బల, శౌర్యంబుల, పేర్మి= నీ యొక్క శక్తి, పరాక్రమాల యొక్క అతిశయం; ఎఱుంగున్+కావునన్= తెలియును కాబట్టి; తన్నున్= తనను (దుర్యోధనుడిని); అవశ్యంబును= తప్పకుండగా; విడిపింతురు+అని= విడిపించగల రని; మన దెసన్= మన యెడ; బద్ధ+ఆశుండు+ఐ= గట్టిగా నాటుకొనిన కోరిక కలవాడై; ఉండున్= ఉంటాడు; ఇది= ఈ కాలం; మనకున్= మనకు (పాండవులకు); పుణ్యంబును= సుకృతాన్ని; కీర్తియున్= యశస్సును; చేకొను= స్వీకరించదగిన; సమయంబు= అనువైన కాలం; నిన్నున్+ఇంత= నిన్ను ఇంతమేరకు; నిర్బంధింపన్ వలవదు= బలవంతపెట్టరాదు; ఏను+అ= నేనే; అరుగుదున్= వెళ్ళుతాను; (కాని) ఇప్పుడు= ఈ సమయంలో; యజ్ఞ, దీక్షితుండను+ఐ= క్రతువులో తాత్పర్యం కలవాడనై; ఉన్నవాడన్= ఉన్నాను; కావునన్= కాబట్టి; నాకున్+చన్‌రాదు= నాకు వెళ్ళటానికి వీలు లేదు; మీరు= (నీవును, అర్జునుడును, నకులుడును, సహదేవుడును); వేగన్= శీఘ్రంగా; చని= వెళ్లి; గంధర్వులన్= గంధర్వులను; ప్రియపూర్వకంబుగాన్= ప్రియం ముందుండేటట్లుగా (ప్రేమతో); అనునయించి= బుజ్జగించి, మీ వైపునకు త్రిప్పుకొని; సుయోధనున్= దుర్యోధనుడిని; విడిపించునది= బంధవిముక్తుడిని చేయండి; సామవచనంబులన్= సాత్త్వికమైన మాటలచేత; తీరక+ఉన్నన్= పని నెరవేరకుంటే; పరాక్రమంబునన్+ఐనన్= శౌర్యాన్ని ప్రదర్శించటంచేతనైనా; ప్రతి వీరులన్= శత్రు యోధులను; ఓర్చి= జయించి; కార్యంబు= కర్తవ్యాన్ని; తీర్చునది= నెరవేర్చండి; నా చేయు= నేను చేసే; జన్నంబు= యజ్ఞం; సఫలంబు+చేయుండు= ఫలితాన్ని ఇచ్చేదిగా ఒనరించండి; అనినన్= అని (ధర్మరాజు) చెప్పగా; భీముండు; ఎట్టకేనియున్= తుట్టతుదకు; ఇయ్యకొనియెన్= అంగీకరించాడు; అర్జునుండును= అర్జునుడు సయితం; ధర్మరాజు పనుపు= ధర్మరాజు నియోగం; కైకొని= స్వీకరించి; కురురాజు చెఱ= కురువంశపు రాజు అయిన దుర్యోధనుడి నిర్బంధం; తలఁగన్= తొలగించటానికి; ప్రతిజ్ఞ= శపథం; చేసెన్= చేశాడు; నకుల సహదేవులు= నకులుడును సహదేవుడును; ఉత్సాహ సమేతులు= లోకోత్తర కార్యాన్ని నెరవేర్చటానికైన స్థిర సంకల్పంతో కూడినవారు; ఐరి= అయినారు; ఆ+నలువురు= భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు; ఆముక్త కవచులు= ధరించబడిన కవచాలు కలవారు; ఆ బద్ధ తూణీరులు= అమ్ములపొదులు ధరించినవారు; ఆకలిత కార్ముకులు= ధనుస్సులతో కూడినవారు; ఆ రూఢ రథులు= తేరులను ఎక్కినవారు; అయి; అగ్రజున్= అన్నవద్ద; వీడ్కొని= అన్న వద్ద సెలవు గైకొని; అతి త్వరిత గతిన్= మిక్కిలి శీఘ్రమైన గమనంతో; నడచినన్= వెడలగా; కౌరవ సైన్యంబు+అంతయున్= కౌరవుల సేన సమస్తమున్నూ; వారిన్= వారిని (భీమార్జున నకుల సహదేవులను); కూడుకొని= కలిసి; సింహనాదంబులు+చెలంగన్= సింహగర్జనల వంటివి సమరోత్సాహ సూచకములును అయిన శబ్దాలు ఒప్పారేటట్లుగా; చనియెన్= వెడలింది; ఇట్లు+అరిగి= ఈ విధంగా వెడలి; వారలు= భీముడు-అర్జునుడు-నకులుడు-సహదేవుడు; గంధమాదనంబునకు+అయి= గంధమాదనం అనే పర్వతం చేరటం కొరకై; చనుచున్+ఉన్న= పయనిస్తున్న; ఆ+వియత్+చర+అనీకంబున్= ఆకాశంలో చరించే గంధర్వులయొక్క సైన్యాన్ని; కూడ ముట్టినన్= చేరగా.

తాత్పర్యం: 'ధృతరాష్ట్రుడి కుమారుడైన దుర్యోధనుడికి మీ యొక్క బల పరాక్రమ ప్రాభవాలు తెలియును; మనం అతడికి జ్ఞాతులం; ఏకకుటుంబానికి చెందినవారం కాబట్టి తప్పకుండగా మనం తనను బంధవిముక్తుడిని కావించగలమని మనమీద పెద్ద ఆస పెట్టుకొని ఉంటాడు. ఇది పుణ్యకార్యం. ఈ పుణ్యకార్యం చేయుటంవలన మనకు కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. ఈ సదవకాశాన్ని మనం జారవిడుచుకొనరాదు సుమా! నేను ప్రస్తుతం ఈ యజ్ఞం నిర్వహించటంలో నిమగ్నుడనై ఉన్నాను. ఈ పవిత్రకార్యాన్ని మధ్యలో విడిచిపెట్టకూడదు. అసలు నేనే వెళ్ళి దుర్యోధనుడిని విడిపించవలసింది. నిన్ను బలవంతం చేయటం భావ్యం కాదు కాని నేను యజ్ఞదీక్షలో ఉండటంచేత కదలటానికి వీలు లేదు కనుక ఇంతగా నిన్ను వేడుకొనవలసి వచ్చింది. మీరు శీఘ్రంగా వెళ్లి, ముందు సామవాక్యాలతో గంధర్వులను ప్రార్థించి సుయోధనాదులను విడిపించాలి. ఒకవేళ సాంత్వనవాక్యాలను గంధర్వులు లెక్కచేయకపోతే మీరు శౌర్యసాహసాలు ప్రదర్శించి అయినా సుయోధనుడిని విడిపించాలి. అట్లాచేసి నే చేసే యజ్ఞం సఫలం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేయండి' అని ధర్మరాజు ప్రబోధించగా ఎట్టకేలకు భీముడు అంగీకరించాడు. అర్జునుడు ధర్మరాజు ఆజ్ఞను సంతోషంతో స్వీకరించి దుర్యోధనుడిని బంధముక్తుడిని చేస్తానని శపథం చేశాడు. నకులసహదేవులును లోకోత్తరకార్యనిర్వహణంలోని స్థిరసంకల్పంతో అర్జునుడిని అనుసరించారు. భీముడు అర్జునుడు నకులుడు సహదేవుడు కవచాలు ధరించారు. అమ్ములపొదులను సంతరించుకొన్నారు. ధనుస్సులను సమకూర్చుకొన్నారు. రథాలను అధిరోహించారు. వారు ధర్మరాజును వీడ్కొని వేగంగా వెడలి, గంధమాదనపర్వతాన్ని చేర పయనిస్తున్న గంధర్వసైన్యాన్ని సమీపించారు. కౌరవసైన్యం భీమార్జున నకులసహదేవుల నాయకత్వంలో పురోగమించి గంధర్వసేనను చేరగానే ఉత్సాహంతో సింహనాదాలు చేశారు.

విశేషం: గంధమాదనం కులపర్వతాలలో ఒకటి. అది దేవతలకు నివాసయోగ్యం.

భీమార్జున నకులసహదేవులు గంధర్వులతో యుద్ధంబు సేయుట (సం. 3-233-5)

క. **కని గంధర్వులు గ్రమ్మఱి । ఘనులం బాండవుల నగ్నికల్పులఁ దేజో**
ధనుల నమరేంద్రసదృశుల । ననఘుల మార్కొనిరి ప్రకటితాటోపమునన్. **415**

ప్రతిపదార్థం: గంధర్వులు; కని= చూచి; క్రమ్మఱి= వెనుతిరిగి; పాండవులన్= పాండు నందనులను; ఘనులన్= గొప్పవారిని; అగ్నికల్పులన్= అగ్నితో సమానులు అయినవారిని; తేజస్+ధనులన్= వర్చస్సు అనే ధనం కలవారిని; అమర+ఇంద్ర, సదృశులన్= దేవేంద్రుడితో సమానులు అయినవారిని; అనఘులన్= పాపరహితులను; ప్రకటిత+ఆటోపమునన్= బాగా వెల్లడి అయిన విజృంభణతో; మార్కొనిరి= ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: గంధర్వులు తమను తాకుటకై వచ్చిన సేనను చూచారు. వారు గంధమాదనానికి పోవటం మాని, వెనుకకు తిరిగి - గొప్పవారు, అగ్ని సమానులు, దేదీప్యమానమైన కాంతితో వెలుగొందేవారు, దేవేంద్రుడితో సమానులు, పుణ్యాత్ములు అయిన పాండవులను తమ శక్తిసామర్థ్యాలు ప్రకటమయ్యేటట్లుగా ఎదుర్కొన్నారు.

ఉ. **అగ్రజువాక్యముల్ దలఁచి యర్జునుఁ డప్పుడు వారితోడ న**
త్యుగ్రత దక్కి యెంతయుఁ బ్రియోక్తుల నిట్లను 'మీకు మాయెడన్
విగ్రహ మేల? నెయ్యమున విడ్వుఁడు కౌరవరాజుఁ; బార్థివ
ప్రాగ్రసరుండు ధర్మసుతు ప న్నిది; మీకు నలంఘ్య మిత్తఱిన్.' **416**

ప్రతిపదార్థం: అర్జునుఁడు= అర్జునుడు; అప్పుడు= ఆ సమయంలో; అగ్రజు వాక్యమున్= అన్నగారి (ధర్మరాజు యొక్క) మాటలను, తలఁచి= స్మరించి; వారితోడన్= గంధర్వులతో; అతి+ఉగ్రత= మిక్కుటమైన తీక్ష్ణత; దక్కి= వదలి; ఎంతయున్= మిక్కుటంగా; ప్రియ+ఉక్తులన్= ప్రీతితో కూడిన మాటలతో; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికాడు; మీకున్= ఓ గంధర్వులారా! మీకు; మా+ఎడన్= మా పట్ల, పాండవుల యెడ; విగ్రహము+ఏల= విరోధం ఎందుకు?; కౌరవ రాజున్= కురు ప్రభువు అయిన దుర్యోధనుడిని; నెయ్యమునన్= స్నేహంతో; విడ్వుఁడు= వదలిపెట్టండి; పార్థివ ప్రాగ్రసరుండు= రాజులలో మొట్టమొదట లెక్కించదగినవాడు, సార్వభౌముడు; ధర్మసుతు, పన్ను+ఇది= ఇది ధర్మపుత్రుడి ఆజ్ఞ; ఈ తఱిన్= ఈ సందర్భంలో; (ఇది); మీకున్= మీకు (గంధర్వులకు); అలంఘ్యము= దాటటానికి వీలుకానిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అప్పుడు అన్నగారైన ధర్మరాజు చెప్పిన హితోపదేశాన్ని స్మరించి, అర్జునుడు ఆ గంధర్వులకు ఈ విధంగా హెచ్చరిక చేశాడు: 'ఓ గంధర్వులారా! మీకు మాతో విరోధం ఎందుకు? మేం దుర్యోధనుడిని విడిపించటానికై వచ్చాం. మీరు స్నేహపురస్సరంగా ఆతడిని విడిచి పెట్టండి. ఇది రాజులలో అగ్రేసరుడైన ధర్మరాజు గారి ఆజ్ఞ. ఈ ఆజ్ఞ మీరు జవదాటరానిదిగా గ్రహించండి'

విశేషం: ధర్మరాజు సత్త్వమూర్తి. అందుచేత సామవాక్యాలతో పని సాధించవలె నని తమ్ములకు సూచించాడు. అర్జునుడికి అన్నగారి మీద గౌరవమున్నది కాని ఆతడు అన్నగా రంత సాత్త్వికుడు కాడు. మొదట సామవాక్యాలు పలికినను చివరకు అర్జునుడు చేర్చిన హెచ్చరికలో కొంత అహంకారపూరితమైన ఆత్మప్రత్యయం అంతర్గర్భితంగా ఇమిడి ఉన్నది. అర్జునుడికి అసలు కావలసింది - తన శక్తి సామర్థ్యాలు ప్రదర్శించటం. గంధర్వులతో నెయ్యం, దుర్యోధన బంధవిముక్తి అర్జునుడిదృష్టిలో ఆనుషంగికాలే. ధర్మరాజు ఆజ్ఞ గంధర్వులు జవదాటటానికి వీలు లేదు - అనేమాటలోని యెత్తిపొడుపు గంధర్వులు గ్రహించక పోలే దని వారి ప్రత్యుత్తరమే సాక్ష్యమిస్తున్నది.

వ. అనిన నతనికి గంధర్వు లిట్లనిరి. 417

తాత్పర్యం: అనగా అర్జునుడితో గంధర్వులు ఈ విధంగా అన్నారు.

తే. 'ధర్మజుఁడు మాకుఁ బ్రభుఁడె? యా ధర్మతనయు । నాజ్ఞ నే మేల యొనరింతు? మనిమిషేంద్రుఁ
డొక్కరుఁడ మమ్ము శాసింప నొడయఁ; డన్యు । లెందు నెవ్వరైనను భయ మేమి మాకు?' 418

ప్రతిపదార్థం: ధర్మజుఁడు= ధర్మరాజు; మాకున్, ప్రభుఁడె?= మాకు పరిపాలకుడా?; ఆ ధర్మతనయు+ఆజ్ఞన్= ఆ ధర్మరాజు యొక్క ఆనతిని; ఏము= మేము; ఏల+ఒనరింతుము?= ఎందుకు ఆచరిస్తాం?; అనిమిష+ఇంద్రుఁడు= దేవేంద్రుడు; ఒక్కరుఁడు+అ= ఒకడు మాత్రమే; మమ్మున్= మమ్మల్ని (గంధర్వులను); శాసింపన్= ఆజ్ఞాపించటానికి; ఒడయుఁడు= ఏలిక; అన్యులు= ఇతరులు; ఎందున్= ఎచటనైనా; ఎవ్వరు+ఐనను= ఎవరైనను; మాకున్= మాకు (గంధర్వులకు); భయము+ఏమి?= ఏమి భయం?

తాత్పర్యం: ధర్మరాజు మాకు ప్రభువు కాడు కదా. ఆ ధర్మరాజు ఆనతిని మే మెందుకు పాటించాలి? దేవేంద్రుడు ఒక్కడే మమ్మల్ని ఆజ్ఞాపించదగిన ఏలిక. ఇతరులు ఎంతటివారైనా మాకు భయం లేదు.

వ. అనిన వివ్వచ్చుం డవ్వియచ్చరుల నుపలక్షించి, 'మునుమున్న తెగువకుం జొర నేల? యని ప్రియంబును ధర్మంబునుంగాఁ బలికితి; నెట్లును మీరు సామసాధ్యులరు గాకునికి దోఁచుచున్నయది గావున నుగ్రంబయిన విగ్రహంబున దుర్యోధను విడిపింతు' నని వారలమీఁద నిశితవిశిఖప్రకరంబులు ప్రయోగించె; నా గంధర్వులు నతనిపైఁ బటుబాణవర్షంబులు గురిసి; రి ట్లా నలువురకు ననేకగంధర్వశతసహస్రంబులతో నతిఘోరసమరం బయ్యె; నందు. 419

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన; వివ్వచ్చుండు= అర్జునుడు; ఆ+వియత్+చరులన్= ఆ గంధర్వులను (ఆకాశంలో చరించే వారిని); ఉపలక్షించి= చూచి; మునుమున్ను+అ= మొట్టమొదటనే; తెగువకున్= సాహసానికి; చొరన్+ఏల= చొచ్చుకొని పోనేల; అని= తలచి; ప్రియంబును= ఇంపైనదియును; ధర్మంబునున్+కాన్= ధర్మమును అయ్యేటట్లుగా; పలికితిన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వచించాను; ఎట్లును= ఏ రీతిగానైనా; మీరు= గంధర్వులైన మీరు; సామ సాధ్యులరు= సామంతో లొంగేవారు; కాక+ఉనికి= కానట్లుగా; తోఁచుచున్నఅది= తలపునకు తట్టుతున్నది; కావునన్= కాబట్టి; ఉగ్రంబు+అయిన= భయంకరమైన; విగ్రహంబునన్= యుద్ధంలో; దుర్యోధనున్= దుర్యోధనుడిని; విడిపింతున్= బంధముక్తుడిని కావిస్తాను; అని= అని పలికి; వారలమీఁదన్= గంధర్వులపై; నిశిత విశిఖ ప్రకరంబులు= వాడిఅయిన బాణాల సముదాయాలు; ప్రయోగించెన్= వేశాడు; ఆ గంధర్వులున్= ఆ గంధర్వులున్నూ; అతనిపైన్= అర్జునుడి మీద; పటు, బాణ, వర్షంబులు= అధికమైన అమ్ముల వానలు; కురిసిరి= వర్షించారు; ఇట్లు= ఈ విధంగా; ఆ నలువురకున్= ఆ నలుగురికి (అర్జునుడు, భీముడు, నకులుడు, సహదేవుడు అనే వారికి); అనేక, గంధర్వ, శత సహస్రంబులతోన్= పెక్కు లక్షల మంది గంధర్వులతో; అతిఘోర సమరంబు+అయ్యెన్= మిక్కిలి భయంకరమైన యుద్ధం జరిగింది; అందున్= ఆ యుద్ధంలో.

తాత్పర్యం: అని గంధర్వులు బదులుపలికారు. అంతట అర్జునుడు గంధర్వుల నుద్దేశించి ఇట్లా పలికాడు: 'మొట్టమొదటనే సాహసానికి దిగటం మంచిది కాదని సామవాక్యాలతో ప్రియంగా ధర్మంగా వివరించి పలికాను. కాని, మీరు సామానికి లొంగేవారు కారని తెల్లమైనది. కాబట్టి, భయంకరమైన యుద్ధంలో దుర్యోధనుడిని బంధ ముక్తుడిని చేస్తాను' అని అర్జునుడు గంధర్వులపై వాడిఅయిన బాణాలను ప్రయోగించాడు. గంధర్వులున్నూ అర్జునుడిపై బాణాలవర్షం కురిపించారు. ఈ విధంగా భీముడికి అర్జునుడికి నకులుడికి సహదేవుడికిన్ని లక్షల కొలది గంధర్వులతో మిక్కిలి భయంకరమైన పోరాటం కొనసాగింది. ఆ యుద్ధంలో.

తరలము.

> **కదిసి యర్జునుతేరు భగ్నముగా నొనర్పఁ దలంచి పె**
> **ల్లొదవి ఖేచరకోటి గ్రమ్ముటయుం బురందర నందనుం**
> **డదయుఁడై పదిలక్షలం బ్రళయాగ్నికల్పుల దివ్యులం**
> **గదనశూరుల నిర్దహించెఁ బ్రకాండదివ్యశరార్చులన్.** **420**

ప్రతిపదార్థం: కదిసి= దగ్గరకు చేరి; అర్జును తేరు= అర్జునుడి యొక్క రథం; భగ్నముకాన్+ఒనర్పన్+తలంచి= విరుగ గొట్టటానికి ఊహించి; పెల్లు+ఒదవి= మిక్కిలి పుట్టి; ఖేచరకోటి= ఆకసంలో సంచరించేవారి సముదాయం, గంధర్వులు; క్రమ్ముటయున్= చుట్టుముట్టటమున్నూ; పురందర నందనుండు= దేవేంద్రుడి కొడుకు, అర్జునుఁడు; అదయుఁడు+ఐ= జాలి లేనివాడై; ప్రళయ+అగ్ని, కల్పులన్= ప్రళయ కాలంలోని అగ్నితో సమానులను; దివ్యులన్= వేల్పులను; పది లక్షలన్= పది లక్షల మందిని (10,00,000); కదన శూరులన్= యుద్ధ వీరులను; ప్రకాండ, శర+అర్చులన్= శ్రేష్ఠాలున్నూ దేవతా సంబంధమైన మహిమకలవియున్నూ అయిన బాణాలయొక్క అగ్నిజ్వాలలచేత; నిర్దహించెన్= కాల్చివేశాడు.

తాత్పర్యం: గంధర్వులు, అర్జునుడి రథాన్ని చేరి, చుట్టుముట్టి దానిని భగ్నం చేయటానికి పూనుకొన్నారు కాని అర్జునుడు కఠినచిత్తుడై ఆ గంధర్వులను ప్రళయకాలంలోని అగ్నితో సమానులైనవారిని, యుద్ధంలో గొప్ప శక్తి సామర్థ్యాలు కలవారిని పదిలక్షలమందిని తనయొక్క శ్రేష్ఠమైన మంత్రబాణాల అగ్నిజ్వాలలలో దగ్ధమయ్యేటట్లు చేశాడు.

విశేషం: వృత్త లక్షణానికి చూడు. ఆర. 4.402 విశేషం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మహాస్రగ్ధర.

> **ఘనకోదండోగ్రమౌర్వీ । క్వణ మఖిలనభో । గహ్వరాభోగభాగం**
> **బున నాపూర్ణంబుగా ను । బ్బునఁ గవలు మరు । త్పుత్త్రుడుం దీవ్రనారా**
> **చ నితాంతాపాతలీలా । సరభసగతులై । శత్రువీరవ్రజంబుం**
> **దునుమం దచ్ఛోణితంబుల్ । దొరిఁగి మడువులై । తొట్టె నయ్యుద్ధభూమిన్.** **421**

ప్రతిపదార్థం: ఘన, కోదండ+ఉగ్ర, మౌర్వీ, క్వణము= గొప్పవైన ధనుస్సునుండి వెలువడిన భయంకరమైన అల్లెత్రాటి ధ్వని; అఖిల, నభస్, గహ్వర+ఆభోగ, భాగంబునన్= సమస్తమైన ఆకాశమనే గుహలోని విశాలమైన స్థలాన్నంతటిని; ఆ పూర్ణంబున్+కాన్= నిండినదికాగా; ఉబ్బునన్= ఉత్సాహంతో; కవలు= జంటబిడ్డలు (నకుల సహదేవులు); మరుత్+పుత్త్రుడున్= వాయునందనుడును (భీముడును); తీవ్ర, నారాచ, నితాంత, ఆపాత, లీలా, సరభస గతులు+ఐ= తీక్ష్ణాలైన బాణాలను ఎల్లప్పుడు ప్రయోగించట మనే ఆటలో సంభ్రమంతో కూడిన నడవడిక కలవారై; శత్రు వీరవ్రజంబున్= విరోధి యోధుల సముదాయాన్ని; తునుమన్= ఖండించగా; తద్+శోణితంబుల్= వారియొక్క అనగా శత్రువీరులయొక్క నెత్తురులు; ఆ+యుద్ధభూమిన్= ఆ రణరంగంలో; తొరిఁగి= స్రవించి; మడువులు+ఐ= కాలువలు అయి; తొట్టెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: గొప్పదైన వింటినుండి వెలువడిన భయంకరమైన అల్లెత్రాటిచప్పుడు ఆకాశం అనెడి విశాలమైన గుహలో పరిపూర్ణంగా నిండగా, భీముడును నకులసహదేవులును ఉత్సాహంతో విజృంభించి తీవ్రములైన బాణాలను ప్రయోగించే ఆటలో సంభ్రమంతో కూడిన నడవడిక కలవారలై విరోధియోధుల సమూహాలను ఖండించారు. ఆ యోధులశరీరాలనుండి కారిన నెత్తురుటేరులు ఆ రణరంగంలో ప్రవహించాయి.

విశేషం: మహాస్రగ్ధరలోని ప్రతిపాదానికి 22 అక్షరాలుంటాయి. ప్రతిపాదంలోనూ వరుసగా -స, త, త, న, స, ర, ర, గ - అనే గణాలుంటాయి. 9, 16వ అక్షరాలతో యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది. శార్దూల వృత్తపాదంలోని మొదటి గురువును రెండు లఘువులుగా మారిస్తే మత్తేభ వృత్తమైనట్లే, స్రగ్ధరాపాదంలోని మొదటి గురువును రెండు లఘువులుగా మారిస్తే మహాస్రగ్ధర పాదమౌతుంది.

వ. **ఇట్లు కౌంతేయులచేతం బీడితులై గంధర్వులు దుర్యోధనాదుల చెఱ లేమఱక గొనుచు గగనంబునకు నెగసి త్రోచిపోవ నుంకించిన నెఱింగి సవ్యసాచి రయంబున నతినిబిడబాణజాలంబులం జేసి దిఙ్నభోమార్గంబులు నీ రంధ్రంబులుగాఁ గప్పిన నగ్గగనచరులు వలలోనం జిక్కిన పులుఁగులుం బోలెఁ బోవ నేరక శరపంజరంబునం జిక్కియు నుక్కుసెడక యన్నలువురమీఁద వివిధాయుధప్రకరంబులు ప్రయోగించిన.** **422**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; గంధర్వులు; కౌంతేయుల చేతన్= కుంతీకుమారుల చేత; పీడితులు+ఐ= బాధించబడిన వారై; దుర్యోధన+ఆదుల చెఱలు= దుర్యోధనుడు మున్నగువారియొక్క బంధాలు; ఏమఱక= మరపు లేకుండ; కొనుచున్= పట్టుకొంటూ; గగనంబునకున్= ఆకసానికి; ఎగసి= ఎగిరి; త్రోచిపోవన్= తప్పించుకొని పోవటానికి; ఉంకించినన్= ప్రయత్నించగా; ఎఱింగి= తెలిసికొని; సవ్యసాచి= కవ్వడి (రెండు చేతులతో బాణాలు ప్రయోగించే నేర్పరి అర్జునుడు); రయంబునన్= వేగంగా; అతి, నిబిడ, బాణ జాలంబులన్+చేసి= మిక్కిలి దట్టమైన బాణాల సముదాయాలతో; దిఙ్నభో మార్గంబులు= దిక్+నభస్+మార్గంబులు= దిక్కులు ఆకాశం అనెడి తెరువులు; నీరంధ్రములుగాన్= రంధ్రాలు లేనట్టివిగా - అనగా మిక్కిలిదట్టంగా; కప్పినన్= మూయగా; ఆ+గగన చరులు= ఆకాశాన చరించే ఆ గంధర్వులు; వలలోనన్= వలలోపల;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చిక్కిన= చిక్కుకొనిన; పులుఁగులున్+పోలెన్= పక్షుల వలె; పోవన్‌నేరక= తప్పించుకొని పోలేక; శర పంజరంబునన్= బాణాలతో నిర్మించబడిన గూటిలో; చిక్కియున్= బంధించబడియు; ఉక్కు+చెడక= బలం నశించక; ఆ+నలువుర మీఁదన్= ఆ నలుగురిపై (భీమ అర్జున నకుల సహదేవులపై); వివిధ+ఆయుధ, ప్రకరంబులు= పలురకాలైన పోటుముట్ల సముదాయాలు; ప్రయోగించినన్= ఉపయోగించగా.

తాత్పర్యం: ఈ విధంగా పాండవులచేత బాధించబడినవారై గంధర్వులు దుర్యోధనాదులబంధాలను సడలించకుండా గట్టిగా పట్టుకొంటూ ఆకసానికి ఎగిరి తప్పించుకొని పారిపోవటానికి ప్రయత్నించటాన్ని అర్జునుడు తెలివితేటలతో గుర్తించాడు. అంతట సవ్యసాచి అయిన అర్జునుడు మిక్కిలి దట్టములైన బాణపరంపరలను ప్రయోగించి ఆ గగనచారులైన గంధర్వులు తప్పించుకొని ఆకసంలో ఎగిరిపోకుండా దిక్కులను మూసివేశాడు. ఇంక గంధర్వులు వలలో చిక్కిన పక్షులవలె చిక్కుపడినప్పటికిని, బలము కోలుపోక పాండవులపై పెక్కురకాలైన పోటుముట్లను ప్రయోగించారు.

మ. అవి యెల్లం దునుమాడి క్రీడి ఘనరోషాభీలుఁడై శాతభ
ల్లవితానం బడరించినం దలలు డొల్లం గాయముల్ మింట నుం
డి వడిం గుంభినిఁ గూలఁగా రుధిరవృష్టిం గాలువల్ పాఱఁగా
దివి గంధర్వుల క్రం దడంగె జగ ముద్వేగంబునం బొందఁగన్. 423

ప్రతిపదార్థం: అవి+ఎల్లన్= గంధర్వులు ప్రయోగించిన పోటుముట్లను అన్నింటిని; తునుమాడి= ఖండించి; క్రీడి= అర్జునుఁడు; ఘన, రోష+ఆభీలుఁడు+ఐ= గొప్ప కోపంతో భయంకరుడై; శాత, భల్ల, వితానంబు= పదనైన భల్లాస్త్రాల సముదాయం (బల్లెముల పరంపరలను ఉద్భవింపజేసే అస్త్రాలు భల్లాస్త్రాలు); అడరించినన్= ప్రయోగించగా; తలలు= శీర్షాలు; డొల్లన్= దొరలి క్రింద పడగా; కాయముల్= శరీరాలు; మింటనుండి= ఆకసం నుండి; వడిన్= వేగంగా; కుంభినిన్= భూమిపై; కూలఁగాన్= క్రిందికి పడగా; రుధిర, వృష్టిన్= నెత్తురు వానచేత; కాలువల్= కాలువలు (ప్రవాహాలు); పాఱఁగాన్= ప్రవహించగా; దివిన్= ఆకసంలో; గంధర్వుల క్రందు= గంధర్వుల యొక్క సమ్మర్దం; జగము= లోకం; ఉద్వేగంబునన్+పొందఁగన్= వ్యాకులతను చెందేటట్లుగా; అడంగెన్= తగ్గింది.

తాత్పర్యం: గంధర్వులు ప్రయోగించిన ఆయుధాల నన్నిటిని, అర్జునుడు కోపంచేత భయంకరుడై భల్లాస్త్రం ప్రయోగించి ఖండించాడు. అంతట గంధర్వుల తలలు డొల్లినాయి. ఆకసంనుండి వారిదేహాలు ఖండించబడి వేగంగా భూమిపై పడ్డాయి. నెత్తురువాన కురిసి, రణరంగంలో కాలువలు ప్రవహించాయి. జగత్తు వ్యాకులత చెందింది. ఇంక ఆకసంలో గంధర్వుల సమ్మర్దం అణగింది.

వ. మఱియును నర్జునప్రయుక్తం బైన ఆగ్నేయాస్త్రంబు దావాగ్ని నీరసవిపినంబు దహించు తెఱంగున గంధర్వ నివహంబు నీఱు సేయం దొడంగినం గినిసి చిత్రసేనుండు భీమసేనానుజుమీఁదం బటు గదాదండంబు వైచిన నతండు దాని నేడు తునియలుగా సేయుటయు, గంధర్వరాజు మాయాబలంబున నంతర్హితుం డై. 424

ప్రతిపదార్థం: మఱియును= ఇంకను; అర్జున ప్రయుక్తంబు+అయిన= అర్జునుడిచేత ప్రయోగించబడిన; ఆగ్నేయ+అస్త్రంబు= అగ్నికి సంబంధించిన మంత్రాయుధం; దావ+అగ్ని= కార్చిచ్చు; నీరస విపినంబున్= ఎండిన అడవిని; దహించు తెఱంగునన్= కాల్చివేసే రీతిగా; గంధర్వ నివహంబున్= గంధర్వుల సముదాయాన్ని; నీఱు+చేయన్+తొడంగినన్= బుగ్గిగా మార్చి వేయసాగగా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చిత్రసేనుండు= గంధర్వరాజు; కినిసి= కోపగించి; భీమసేన+అనుజు మీఁదన్= భీముడి తమ్ముడిమీద - అర్జునుడిపై; పటు, గదా, దండంబు= గొప్ప నిడివియైన గదాయుధాన్ని; వైచినన్= వేయగా; అతండు= అర్జునుడు; దానిన్= ఆ గదను; ఏడు తునియలుగా= ఏడుముక్కలుగా; చేయుటయును= ఖండించుటయున్నూ; గంధర్వరాజు= చిత్రసేనుడు; మాయాబలంబునన్= వంచనతో కూడిన శక్తిచేత; అంతర్హితుండు+ఐ= కనుపించకుండాపోయి.

తాత్పర్యం: అంతేగాక అర్జునుడు ప్రయోగించిన ఆగ్నేయాస్త్రం - ఎండిపోయిన అడవిని అగ్ని దహించే రీతిగా-గంధర్వసేనను తగులబెట్టింది. తన సేనలు బుగ్గి కావటంచేత కోపగించి గంధర్వరాజైన చిత్రసేనుడు అర్జునుడిపై గొప్ప గదాదండాన్ని విసిరాడు. అర్జునుడు ఆ గదను ఏడు తునియలుగా ఖండించాడు. ఇక చేసేది లేక మాయావి అయిన చిత్రసేనుడు కనుపించకుండా మాయమై.

క. నలువురు పార్థుల నత్యు । జ్జ్వల శరవర్షముల ముంచి జలధరముక్రియం
బెలుచన గర్జిల్లుచు మొ । క్కలుఁడయి తన విక్రమంబుఁ గడఁకయుఁ జూపెన్. 425

ప్రతిపదార్థం: (ఆ చిత్రసేనుడు); నలువురు పార్థులన్= నలుగురు కుంతీకుమారులను; అతి+ఉత్+జ్వల, శర, వర్షములన్= ఎంతగానో ప్రకాశించే అమ్ములవానలలో; ముంచి= తడిపి; జలధరము క్రియన్= మేఘంవలె; పెలుచన= గట్టిగా; గర్జిల్లుచున్= పెను ధ్వని చేస్తూ; మొక్కలుఁడు+అయి= మిడిసిపడే వాడయి; తన, విక్రమంబు= తనయొక్క శౌర్యం; కడఁకయున్= పట్టుదలను; చూపెన్= ప్రదర్శించాడు.

తాత్పర్యం: చిత్రసేనుడు భీమార్జుననకులసహదేవులపై తీవ్రమైన అమ్ములవాన కురిపించి, మేఘంవలె గర్జిస్తూ తనపరాక్రమాన్ని పట్టుదలను ప్రదర్శించాడు.

ఆ. దాని నుఱక యింద్రసూనుండు గాండీవి । శబ్దభేదు లయిన సాయకములఁ
జిత్రసేను సర్వగాత్రంబు భేదించి । యొక్క మాత్రలోన నుడిపెఁ గడఁక. 426

ప్రతిపదార్థం: దానిన్+ఉఱక= దానిని లక్ష్యపెట్టక; ఇంద్రసూనుండు= ఇంద్రుడి కొడుకు; గాండీవి= గాండీవాన్ని ధరించేవాడు-అర్జునుడు; శబ్ద భేదులు+అయిన= శబ్దాన్ని బట్టి లక్ష్యాన్ని తునుమాడేవైన; సాయకములన్= బాణాలచేత; చిత్రసేను, సర్వ, గాత్రంబున్= చిత్రసేనుడి శరీరాన్నంతటిని, భేదించి= బ్రద్దలు కొట్టి; ఒక్క మాత్రలోనన్= ఒక త్రుటి కాలంలోనే; కడఁకన్= పూనికను; ఉడిపెన్= పోగొట్టాడు.

తాత్పర్యం: కన్నులకు కనుపించకుండ మరుగై, మేఘంవలె గర్జిస్తూ బాణాలు ప్రయోగిస్తున్న చిత్రసేనుడి మాయ వ్యర్థం అయ్యేటట్లుగా, శబ్దాన్ని బట్టి లక్ష్యాన్ని భేదించే అమ్ములచేత అర్జునుడు చిత్రసేనుడి శరీరాన్ని తూట్లు పడేటట్లు చేసి ఆతడి పూనికను వమ్ము చేశాడు.

విశేషం: ఒకనాటిరాత్రి అర్జునుఁడు బాల్యంలో భోజనం చేస్తుండగా దీపం ఆరిపోయింది. అయినను అతడు అభ్యాసవశాన తినగలిగాడు. అంతట, అట్లే కంటికి కన్పింపక పోయినా, అభ్యాసవశాన అమ్ములతో లక్ష్యాన్ని భేదించవచ్చు నని ఆలోచించి బహుళసాధన చేసి శబ్దభేదిసాయకవిద్యను నేర్చాడు. ఈ కథ మహాభారతం ఆదిపర్వంలో ఉన్నది.

వ. ఇట్లు నొచ్చి గంధర్వనాయకుండు రణసంరంభంబు విడిచి యర్జునుంజేరంజని తనపొడ సూపి నిలిచిన, నవ్వీరుండును నాత్మసఖుం డయిన ఖేచరపతి తెఱంగు సూచి సంహృతాస్త్రుం డయ్యెః వృకోదరాదులును

సమరవిరామంబు నొందిరి; వారలందఱుఁ దమ తమ రథంబుల మీఁదన యుండి యొండొరులఁ గుశలంబు లడిగి; రప్పు డర్జునుండు చిత్రసేనున కి ట్లనియె. **427**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నొచ్చి= వెత చెంది; గంధర్వ నాయకుండు= గంధర్వుల నేత, చిత్రసేనుడు; రణ సంరంభంబు= యుద్ధ సన్నాహం; విడిచి= వదలిపెట్టి; అర్జునున్= అర్జునుడిని; చేరన్+చని= సమీపించి; తన పొడ చూపి= తనరూపు కన్పించి; నిలిచినన్= నిలబడగా; ఆ+వీరుండును= ఆ అర్జునుడు కూడా; ఆత్మ, సఖుండు, అయిన= తన యొక్క చెలికాడు అయిన; ఖేచరపతి తెఱంగు= గంధర్వరాజు తీరు; చూచి= గమనించి; సంహృత+అస్త్రుండు+అయ్యెన్= ఉపసంహారం చేసిన మంత్రాయుధాలు కలవాడయ్యాడు (ఆయుధాలను ప్రయోగించటం విరమించాడు); వృకోదర+ఆదులును= భీముడు మున్నగువారును; సమర విరామంబున్+ఒందిరి= యుద్ధాన్ని ఆపారు; వారలు+అందఱున్= వారు అందరు (చిత్రసేనుడును పాండవులును); తమ తమ రథంబుల మీఁదన= తమ తేరులపైననే; ఉండి; ఒండొరులన్= ఒకరినొకరు; కుశలంబులు= యోగక్షేమాలు; అడిగిరి= ప్రశ్నించారు; అప్పుడు= ఆ సమయంలో; అర్జునుండు; చిత్రసేనునకున్= చిత్రసేనుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా నొచ్చి, గంధర్వరాజు చిత్రసేనుడు మాయాసంగరాన్ని విరమించి అర్జునుడిదగ్గరికి వచ్చి నిజరూపంతో కన్పించాడు. అర్జునుడును అనుగునెచ్చెలిఅయిన చిత్రసేనుడి దుస్థితికి వగచి, అస్త్రప్రయోగాన్ని ఉజ్జగించాడు. భీమసేనుడు మున్నగువారుకూడా యుద్ధాన్ని విరమించారు. అంతట చిత్రసేనుడును పాండవులును తమ తమ రథాలపైననే ఉండి, ఒకరి నొకరు యోగ క్షేమాలు విచారించుకొన్నారు. అర్జునుడు అపుడు చిత్రసేనుడితో ఇట్లా అన్నాడు.

క. **'వీరోత్తమ! నీ కిమ్మెయి । వైరము దగునయ్య? కౌరవప్రకరముతోఁ**
గౌరవపతి విడువుము త । ద్దారానుజసుత సమన్వితంబుగ నెమ్మిన్.' **428**

ప్రతిపదార్థం: వీర+ఉత్తమ!= శూరులలో శ్రేష్ఠుడవైనవాడా, ఓ చిత్రసేనా!; నీకున్; ఈ+మెయిన్= ఈ రీతిగా; కౌరవ, ప్రకరముతోన్= కౌరవ సమూహంతో; వైరము= శత్రుత్వం; తగునయ్య?= ఉచితం అగునా?; కౌరవపతిన్= కురురాజును దుర్యోధనుడిని; తద్+దార+అనుజ, సుత, సమన్వితముగన్= ఆతడి యొక్క భార్యలతో, తమ్ములతో, పుత్రులతో సహితంగా; నెమ్మిన్= ప్రీతితో; విడువుము= వదలిపెట్టుము.

తాత్పర్యం: 'శూరులలో శ్రేష్ఠుడవైన ఓ చిత్రసేనా! నీకు ఈ రీతిగా కౌరవులసముదాయంతో శత్రుత్వం తగునా? కౌరవరాజు అయిన దుర్యోధనుడిని విడిచిపెట్టుము. ఆతనితోపాటుగా, ఆతడి భార్యలను, సహోదరులను సంప్రీతితో బంధముక్తులను చేయుము!'

వ. **అనిన నతం డర్జునున కిట్లనియె.** **429**

ప్రతిపదార్థం: అనినన్= అని అర్జునుడు చెప్పగా; అతండు= చిత్రసేనుడు; అర్జుననకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని అర్జునుడు చిత్రసేనుడికి చెప్పాడు. అంతట చిత్రసేనుడు అర్జునుడితో ఇట్లా బదులు పలికాడు.

సీ. **'ఈ దురాత్ముఁడు మిమ్ము నిప్పనంబున నితాం । తాయాసపీడితు లైనవారిఁ**
బరమధర్మాత్ముల భార్యాసమేతుల । నపహసింపఁ దలంచి యరుగుదెంచె;

నింతయు నెఱిఁగి సురేంద్రుండు గలుషించి । యనుజవధూసహాయాన్వితముగఁ
బాపవర్తను వీనిఁ బట్టి తెమ్మని నన్నుఁ । బనిచిన వచ్చితిఁ బార్థ! వినవె;

తే. **శక్రుపాలికి నిదె కొని చనుచున్న । వాఁడ; నీ వింక నొం డన వలదు వినుము !**
మత్సఖుండవు గావున మత్సరంబు । నలుకయును లేదు నీదెస ననఘ! నాకు'. **430**

ప్రతిపదార్థం: పార్థ!= ఓ అర్జునా! వినవె= వినుము, వినుచుంటివి గదా!; ఈ దురాత్ముఁడు= ఈ దుష్టుడు దుర్యోధనుడు; మిమ్మున్= మిమ్ములను (పాండవులను); ఈ+వనంబునన్= ఈ అడవిలో; నితాంత+ఆయాస, పీడితులు+ ఐనవారిన్= ఎల్లప్పుడు శ్రమచేత వెతచెందినవారిని; పరమ, ధర్మ+ఆత్ములన్= గొప్ప ధార్మికులను; భార్యా, సమేతులన్= పెండ్లంతో కలిపి ఉన్న వారిని; అపహసింపన్+తలంచి= వెక్కిరించ తలపోసి; అరుగుదెంచెన్= వచ్చాడు; ఇంతయున్+ఎఱిఁగి= ఈ విషయాన్నంతటిని గ్రహించి; సుర+ఇంద్రుండు= దేవేంద్రుడు; కలుషించి= ఆగ్రహించి; అనుజ, వధూ, సహాయ+అన్వితముగన్= సోదరులు భార్యలు సాయం చేసేవారితో సహా; పాపవర్తనున్= పాపంతో కూడిన నడవడిక కలవాడిని; వీనిన్= దుర్యోధనుడిని; పట్టి తెమ్ము+అని= బంధించి తీసికొని రమ్ము అని ఆజ్ఞాపించి; నన్నున్= నన్ను; పనిచినన్= నియోగించగా; వచ్చితిన్= అరుగుదెంచాను; ఇది+ఎ= ఇదిగో; శక్రు పాలికిన్= దేవేంద్రుడి సమక్షానికి; కొని= బంధించి; చనుచున్+ఉన్నవాఁడన్= వెళ్ళుతున్నాను; ఈవు+ఇంకన్= నీవు ఇకమీద; ఒండు= వేరొకటి; అనన్‌వలదు= చెప్పవద్దు; వినుము= నేను చెప్పిన మాటకు అంగీకరించుము; అనఘ!= పాపరహితుడా! మత్+సఖుండవు= నా చెలికాడవు; కావునన్= కాబట్టి; నీ దెసన్= నీ యెడల; నాకున్= నాకు; మత్సరంబు= అసూయ; అలుకయును= కోపమును; లేదు= ఉండదు.

తాత్పర్యం: నీకు తెలియని విషయాన్ని తెలుపుతున్నాను. సావధానంగా వింటే నీకే తెలుస్తుంది. నీమీద నాకు ఎట్టి కోపంగాని అసూయ కాని లేదు. నీవు నాకు ప్రియమిత్రుడవు. ఈ దుర్యోధనుడు దురాత్ముడు. మీరు ఈ అడవిలో పలుపాట్లు పడుతుండగా మిమ్ము ఎగతాళి చేయటానికి ఈ ఘోషయాత్ర అనే మిష పెట్టి ఇక్కడికి వచ్చాడు. మీరు పరమధర్మాత్ములు. ఈ అడవిలో మీ భార్యతోపాటు కలసి ఉన్న మిమ్ము వెక్కిరించ తలపోయవచ్చునా? ఈ సంగతి నంతయు గ్రహించిన దేవేంద్రుడు ఈ దురాత్ముడిని, ఈ దురాత్ముడి పరివారాన్ని బంధించి తెమ్మని నన్ను ఆజ్ఞాపించాడు. నీవు వేరుమాట చెప్పవద్దు. ఈతడిని దేవేంద్రుడి సమక్షంలో నిలుపవలసి ఉన్నది.

తే. **అనిన నర్జునుఁ డతని కిట్లనియె 'నీ సు । యోధనుఁడు మాకు వినుము సహోదరుండు**
గాన యీతని విడుచుట కర్జ; మిదియ । ధర్మజున కెంతయును ప్రమోదంబు సేఁత. **431**

ప్రతిపదార్థం: అనినన్= అని చిత్రసేనుడు పలుకగా; అర్జునుఁడు; అతనికిన్= చిత్రసేనునకు; ఇట్లు+అనియెన్; వినుము= ఆలకింపుము; ఈ సుయోధనుండు; మాకున్= మాకు (మా పాండవులకు); సహోదరుండు= సోదరుఁడు; కాన= కావున; ఈతనిన్= ఈ దుర్యోధనుడిని; విడుచుట= వదలటం; కర్జము= చేయదగిన పని; ఇది+అ=ఇదియే; ధర్మజునకున్= ధర్మరాజుకు; ప్రమోదంబు+చేఁత= ఆనందం చేకూర్చటం.

తాత్పర్యం: అర్జునుడు చిత్రసేనుడితో ఈ విధంగా వచించాడు: 'ఈ దుర్యోధనుడు ఎటువంటి వాడైనను ఇతడు మాకు సోదరుఁడు'. ఆలకింపుము. ఇతడిని నీవు విడిచిపెట్టటమే చేయదగిన పని. ఏలన, అదియే ధర్మరాజుకు ఆనందాయకమైన పని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. అమరవరేణ్యు పన్పయిన, నావల యెయ్యది యైన, నిప్డు ధ
ర్మమహితుఁడైన ధర్మజుసమక్షమునం దెఱిఁగించి, యాతఁ డే
క్రమమున నెద్ది సెప్పె నది గైకొని చేయుము; నీవు మత్ప్రియా
ర్థము చనుదెమ్ము' నావుడును దాని కొడంబడి చిత్రసేనుఁడున్. 432

ప్రతిపదార్థం: అమర వరేణ్యు పన్పు+అయినన్= దేవతలలో శ్రేష్ఠుడు అయిన ఇంద్రుడి ఆజ్ఞ అయినప్పటికి; ఆవల= తదుపరి; ఏ+అది= ఏది; ఐనన్= అయినను; ఇప్డు= ఈ సమయంలో; ధర్మ, మహితుఁడు+ఐన= ధర్మంచేత గొప్పవాడయిన; ధర్మజు సమక్షమునందున్= ధర్మరాజు మ్రోల; ఎఱిఁగించి= తెలిపి; ఆతఁడు= ధర్మరాజు; ఏ క్రమమునన్= ఏ వరుసలో; ఎద్ది= ఏది; చెప్పెన్= చెప్పినాడో; అది= దానిని; కైకొని= అంగీకరించి; నీవు= నీవు; చేయుము= ఆచరింపుము; మత్+ప్రియ+అర్థము= నా ప్రీతి కొరకై; చనుదెమ్ము= రమ్ము; నావుడును= అని చెప్పగా; దానికిన్= ఆ మాటకు; ఒడంబడి= అంగీకరించి; చిత్రసేనుఁడున్= చిత్రసేనుడుకూడా.

తాత్పర్యం: అది దేవేంద్రుడి ఆజ్ఞయే కావచ్చును. తరువాత ఏదైనా కావచ్చును. ముందుగా ఇపుడు చేయవలసిన పని- మనం ధర్మరాజువద్దకు వెళ్ళి, ఆయనకు అంతయు చెప్పి, ఆయన ఎట్లా నిర్ణయిస్తే ఆ విధంగా నడచుకొనవలెను. ముందు నీవు నా ప్రీతికొరకు ధర్మరాజుకడకు రమ్ము' అని అర్జునుడు పలికాడు. అందుకు చిత్రసేనుడు సమ్మతించాడు.

చిత్రసేనుఁడు ధర్మరాజునొద్దకు వచ్చి దుర్యోధను విడిచిపెట్టి పోవుట (సం. 3-235-11)

వ. వారలుం దాను ధర్మజుకడకుం జనిన, నయ్యజాతశత్రుండు చిత్రసేను నతిప్రియంబునం బూజించి, 'మహాత్మా! యీ సుయోధనుండు సానుజామాత్యుం డయి మీచేత వధియింపం బడకునికి మేలయ్యె; మీ కారణంబున మా వంశంబునకు కొండొకహాని వొంద దయ్యె; వీఁ డెట్టి యపరాధంబు సేసినను, నదియంతయు సహించి మాకుంగా వీని విడువవలయు' నని ప్రార్థించిన, నతం 'డట్ల కాక' యని దుర్యోధనాదుల నందఱ విడిచి పాండుపుత్త్రుల నామంత్రణంబు సేసి, దివంబున కరిగి తత్ప్రకారంబు సకలంబును నింద్రునకు నివేదించిన, నింద్రుండును సమరనిహతు లయిన గంధర్వుల నమృతవృష్టిం జేసి బ్రదికించె; నిట యుధిష్ఠిరుండును ధార్త రాష్ట్రునకు బంధమోక్షణంబు గావించి వాని కిట్లనియె. 433

ప్రతిపదార్థం: వారలున్= వారూ (భీమార్జున నకుల సహదేవులును); తానున్= చిత్రసేనుడును; ధర్మజు కడకున్= ధర్మరాజు సమక్షానికి; చనినన్= వెడలగా; ఆ+అజాత శత్రుండు= శత్రువులు లేనట్టివాడు ఆ ధర్మరాజు; చిత్రసేనున్= చిత్రసేనుడిని; అతి ప్రియంబునన్= మిక్కిలి ప్రీతితో; పూజించి= అర్చించి; మహా+ఆత్మా!= మహానుభావుడ వైన ఓ చిత్రసేనా!; ఈ సుయోధనుండు= ఈ దుర్యోధనుడు; స+అనుజ+అమాత్యుండు+అయి= తమ్ములతోడను మంత్రులతోడను కూడినవాడై; మీచేతన్= గంధర్వుల చేత; వధియింపంబడకునికి= సంహరింపబడకపోవడంవలన; మేలు+అయ్యెన్= శుభం జరిగింది; మీ కారణంబునన్= మీ మూలాన; మా వంశంబునకున్= మా కుటుంబ కూటమికి; కొండొక హాని= ఒక కీడు; పొందదు+అయ్యెన్= పొందలేదు; వీఁడు= ఈ దుర్యోధనుడు; ఎట్టి= ఎటువంటి; అపరాధంబు= నేరం; చేసినను= ఒనరించినప్పటికీ; అది+అంతయున్= అది సమస్తం; సహించి= ఓర్చి; మాకున్+కాన్= మా కొరకుగా; వీనిన్= దుర్యోధనుడిని; విడువ వలయును= విడిచి పెట్టనగును; అని= చెప్పి; ప్రార్థించినన్= వేడుకొనగా; అతండు= అతడు (చిత్రసేనుడు); అట్లు+అ+కాక= ఆ విధంగానే

జరుగుగాక; అని= అని చెప్పి; దుర్యోధన+ఆదులన్= దుర్యోధనుడు మున్నగువారలను; అందఱన్= అందరిని; విడిచి= వదలిపెట్టి; పాండుపుత్రులన్= పాండునందనులను; ఆమంత్రణంబు+చేసి= వీడ్కొని; దివంబునకున్= స్వర్గానికి; అరిగి= వెడలి; తద్+ప్రకారంబు= ఆ విధమును; సకలంబున్= అంతటిని; ఇంద్రునకున్= వేలుపుల దొరకు; నివేదించినన్= విన్నవించగా; ఇంద్రుండును= దేవేంద్రుడును; సమర, నిహతులు+అయిన= యుద్ధంలో చంపబడిన; గంధర్వులన్= గంధర్వులను; అమృతవృష్టిన్+చేసి= అమృతపు వాన కురిపించటం చేత; బ్రదికించెన్= పునర్జీవితులను చేశాడు; ఇట= ఇచట; యుధిష్ఠిరుండును= ధర్మరాజును; ధార్తరాష్ట్రునకున్= ధృతరాష్ట్రుడి కొడుకగు దుర్యోధనుడికి; బంధ మోక్షణంబు+కావించి= కట్లువిప్పించి; వానికిన్= దుర్యోధనునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: పాండవులు చిత్రసేనుడు కలిసి ధర్మనందనుడి దగ్గరకు వెళ్ళారు. ఆ అజాతశత్రుడు చిత్రసేనుడిని స్వాగతమర్యాదలతో మన్నించి 'మహానుభావా! ఈ దుర్యోధనుడు మాకు సోదరుడు. మా అదృష్టంవలన ఈతడు, ఈతని భార్యలు, తమ్ములు, అమాత్యులు, మీచేత సంహరించబడక సజీవులై ఉన్నారు. మీరు దయ చూపుటచేత మాకుటుంబానికి కీడు కలుగలేదు. మీకు మా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మీకు ఈతడు ఎట్టి అపచారం చేసినా మన్నించి, మాయందు దయచూపి ఈతడిని విడిచిపెట్ట వేడికోలు' అని అన్నాడు. ధర్మరాజు మాటలు కాదనలేక చిత్రసేనుడు దుర్యోధనాదులను విడిచిపెట్టి పాండునందనుల వీడ్కొని స్వర్గానికి పోయి, జరిగిన వృత్తాంతం అంతటిని దేవేంద్రుడికి విన్నవించాడు. ఇంద్రుడు అమృతవర్షం కురిపించి యుద్ధంలో మరణించిన గంధర్వులను బ్రదికించాడు. ఇట ద్వైతవనంలో ధృతరాష్ట్రసూనుడైన దుర్యోధనుడికి బంధమోక్షణం చేసి, ధర్మరాజు అతడితో ఇట్లు పలికాడు.

ఉ. **'ఎన్నఁడు నిట్టి సాహసము లింక నొనర్పకు మయ్య! దుర్జనుం**
దన్నున సాహసక్రియలయందుఁ గడంగి నశించుఁ; గావునం
గ్రన్నన తమ్ములన్ దొరలఁ గైకొని యిమ్ములఁ బొమ్ము వీటికిన్;
సన్నుత! దీని కొండొకవిషాదముఁ బొందకుమీ మనంబునన్.' **434**

ప్రతిపదార్థం: ఎన్నఁడున్= ఎపుడును; ఇట్టి= ఇటువంటి (ఇంతటి పరాభవానికి దారితీసే); సాహసములు= తెగువలు; ఇంకన్= ఇక మీద (ఏదో తెలియక దురహంకారంతో ఈ పని చేశావు; ఇకమీద భవిష్యత్కాలంలోమాత్రం జాగరూకత వహించేది. బుద్ధి తెచ్చుకొనేది); ఒనర్పకుమయ్యా= నాయనా చేయకుము; దుర్జనుండు= చెడ్డవాడు; అన్నునన్= ఒడలెరుగక; సాహస క్రియల అందున్= తెగువతో కన్నుమిన్ను కానని పనులందు; కడంగి= పూనిక వహించి; నశించున్= నాశనం చెందుతాడు; కావునన్= కాబట్టి; క్రన్నన= శీఘ్రంగా; తమ్ములన్= అనుజులను; దొరలన్= సామంత ప్రభువులను; కైకొని= వెంట నిడుకొని; ఇమ్ములన్= సంప్రీతితో; వీటికిన్= (రాజధాని) నగరానికి; పొమ్ము; సన్నుత= సత్+నుత!= మంచివారిచేత పొగడబడినవాడా! ఓ దుర్యోధనా!; దీనికిన్= ఇపుడు ఈ విధంగా జరిగిన అవమానంవలనకలిగే; ఒండొక విషాదమున్= ఒకానొక (గాఢమైన) దుఃఖం; మనంబునన్= మనస్సులో; పొందకుము= అనుభవించకుము.

తాత్పర్యం: నాయనా! దుర్యోధనా! ఎప్పుడైనాసరే ఇటువంటి పరాభవాన్ని చేకూర్చే సాహసకృత్యాలకు ఒడిగట్టకుము. ఇపుడు జరిగిందేదో జరిగిపోయింది. ఇకమీద భవిష్యత్కాలంలోనైనా బుద్ధి కలిగి ప్రవర్తించుము. దుర్జనుడు దురభిమానంతో తన అంతరం ఎదిరి గొప్పతనం తెలియక కన్నుమిన్నుకానక సాహసానికి కడంగి నశిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జాగ్రత్త సుమా! ఇక శీఘ్రంగా తమ్ములను దొరలను గైకొని నీ రాజధాని నగరానికి వెడలుము. మంచివారిచేత పొగడబడినవాడా! ఇట్టి అవమానం జరిగినందుకు, ఎటువంటి దుఃఖాన్ని నీ మనస్సులో అనుభవించవద్దు.

విశేషం: ఎఱ్ఱన మహాకవి వ్రాసిన పద్యాలలో ఇది తలమానికం. ఎఱ్ఱాప్రెగ్గడ కవితాశిల్పానికి ఈ పద్యం సమ్యగుదాహరణంగా ఎన్నదగింది. "రమణీయార్థ ప్రతిపాదకః శబ్దః కావ్యమ్" అని రసగంగాధరకర్త శ్రీ జగన్నాథ పండితరాయల నిర్వచనం చొప్పున ఈ పద్య మొక్కటే ఒక మహాకావ్యసదృశం. ఇందు నన్నయ్యను దలపించే ప్రసన్నకథా కవితార్థ యుక్తి, అక్షర రమ్యత, నానారుచిరార్థ సూక్తులు ఉన్నవి. తిక్కన మహాకవిని తలపింపచేసే "సంభాషణ చారిమ" సజీవ పాత్ర చిత్రణమున్నూ ఉన్నాయి." వాక్యం రసాత్మకం కావ్యమ్" అన్నట్లు రసభావ నిరంతరాలైన వాక్యాల సంపుటం ఈ పద్యం. "అల్పాక్షరముల అనల్పార్థ రచన"కు ఈ పద్యం ఉత్తమోత్తమోదాహరణం. ప్రతివాక్యంలో వెల్లివిరిసే మనోహర భావగుంఫనమే కాక వాక్యాంతరాలలో జాలువారే వ్యంగ్య వైభవం- అర్థాంతర స్ఫూర్తి సహృదయ హృదయైక వేద్యం. ఈ పద్యంలో వ్యంగ్యగర్భితంగా స్ఫురించే అంతరార్థాంతరాలు హృదయంగమాలు.

(1) ఎన్నడూ ఇట్టి సాహసాలు ఇకపై ఒనర్పకు మయ్యు. ఇకమీద ఇట్టి దుస్సాహసాలు చేయకుము- అనగా ఇంతకుపూర్వం దుర్యోధనుడు ఎన్నో చేసినట్లే కదా! అయితే ఇప్పుడు పాపం బ్రద్దలైంది.

(2) ఇట్టి సాహసములు- ఇటువంటి సాహసాలు. వీటికే అతడు సద్యఃఫలం అనుభవించాడు. దుర్యోధనుడిచేత అద్దం పెట్టాడు "మెత్తని పులి" ధర్మరాజు. ఆతడు తన మొగం అందులో చూచుకొనవచ్చును. అల మతి విస్తరేణ.

(3) దుర్జనుడు సాహసక్రియలయందు నశిస్తాడని ధర్మరాజు చేసిన హెచ్చరిక దుర్యోధనుడికి అనుభవ సద్యః సిద్ధం.

(4) 'క్రన్నన తమ్ములం దొరలఁగైకొని యిమ్ములఁ బొమ్ము వీటికిన్.' 'నాయనా దుర్యోధనా! ఇక్కడ నీవు పొందిన అవమానం నీ రాజధానిలోని వారలకు తెలియదు కదా. ఈ పరాభవాన్ని దులుపుకొని, ఏమియు జరుగనట్లుగా తిరిగి పొమ్ము' అన్నాడు ధర్మరాజు. అనగా, 'ఏమి మొగం పెట్టుకొని తిరిగి నీవు రాజధానికి పోగలవు?' అనే ఎత్తిపొడుపు ఇందులో అంతర్గర్భితం.

(5) 'సన్నుత' అనే సంబోధనం నెత్తిమీదసుత్తితో మొత్తిన ఎత్తిపొడుపు.

(6) ఇంత అవమానం జరిగింది కావున 'కొండొక' విషాదం పొందకుమీ మనంబునన్. ఇది దుర్యోధనుడికి విషాద సన్నివేశంగాక మరేమి. అది "కొండొక" విషాదమా? నిలువెల్ల దహించే దుర్భరమైన అవమానాగ్ని కాదా? ధర్మరాజు చిచ్చరపిడుగు కాదు చలిపిడుగు. గంధర్వుల బాణాలకు ధర్మరాజు మెత్తనిపలుకుల కున్న పదను ఉన్నదా? ధర్మరాజు పెట్టిన సున్నితమైన చీవాట్లు దుర్యోధనుడిని ఆపాదమస్తకం దహించి వేసినవి. శీఘ్రంగా దుర్యోధనుడు రాజధానికి తరలిపోలేకపోయాడు. ధర్మరాజు చేసిన హెచ్చరిక దుర్యోధనుడికి ప్రాయోపవేశానికి పూర్వరంగాన్ని తీర్చిదిద్దిన నాటకీయ ప్రస్తావనయే. గంధర్వులు చేసింది ఏమున్నది? దుర్యోధనుడిని ఓడించి బంధించారు. అర్జునుడి చేతిలో ఓడిపోయి దుర్యోధనుడిని వదలిపెట్టిపోయారు. ధర్మరాజు చేసింది మహోపకారం ఏమున్నది? ధర్మరాజు సుకుమార సుందరంగా చేసిన పని దుర్యోధన తేజోవధ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని బుద్ధి సెప్పి వీడ్కొలిపిన, నతండును దీనాననుం డగుచుం జనియె; ననుజసహితుండయిన ధర్మతనయు ధార్మికత్వంబు ధౌమ్యాది భూసురులును దదాశ్రమవాసు లయిన మహామునులును బహువిధంబులం బ్రస్తుతించి రని వైశంపాయనవర్ణితం బయిన కథావిశేషంబు సవిస్తరంబుగా. 435

ప్రతిపదార్థం: అని= అని పలికి; బుద్ధి+చెప్పి= హితోపదేశం చేసి; వీడ్కొలిపినన్= ఆ మంత్రణం చేసి పంపగా; అతండును= దుర్యోధనుడును; దీన+ఆననుండు+అగుచున్= దర్పం తరిగిన మొగం కలవాడై; చనియెన్= వెళ్లాడు; అనుజ సహితుండు= తమ్ములతో కూడినవాడు; అయిన= ఐన; ధర్మతనయు, ధార్మికత్వంబు= ధర్మనందనుడి యొక్క ధర్మశీలాన్ని; ధౌమ్య+ఆది, భూసురులును= ధౌమ్యుడు మున్నగు విప్రులును; తద్+ఆశ్రమ వాసులు+అయిన= పాండవుల యొక్క ఆశ్రమంలో నివసించే; మహా, మునులును= గొప్ప ఋషులును; బహు విధంబులన్= పెక్కు భంగుల; ప్రస్తుతించిరి= పొగడారు; అని= అని చెప్పి; వైశంపాయన, వర్ణితంబు+అయిన= వైశంపాయనుడిచేత వర్ణించబడినట్టి; కథావిశేషంబు= పేర్కొనదగిన కథ; సవిస్తరంబుగాన్= విరివి అయిన అంశాలలో కూడినట్టిదిగా.

తాత్పర్యం: దుర్యోధనుడిని ఆ విధంగా మందలించి హితోపదేశం చేసి ధర్మనందనుడు వీడ్కొలిపాడు. దుర్యోధనుడు దర్పం తరిగి తేజోహీనుడై మొగం వంచుకొని వెడలిపోయాడు. ధౌమ్యుడు మున్నగు విప్రులున్నూ ఆశ్రమంలో నివసించే మహర్షులున్నూ ధర్మనందనుడియొక్కయు అతడి తమ్ములయొక్కయు ధర్మశీలాన్ని ప్రశంసించారు. అది వైశంపాయనమహర్షి వర్ణించి చెప్పిన కథావిశేషం. విరివి అయిన అంశాలతో కూడింది.

క. రాజకులతిలక! భువన వి । రాజిత సితకీర్తి! దివిజరాజవిభవ! ని
ర్వ్యాజ పరాక్రమ! సకల ధ । రాజన సంపూజ్య! ధర్మరక్షణ దక్షా! 436

ప్రతిపదార్థం: రాజ, కుల, తిలక!= రాజులవంశంలో శ్రేష్ఠుడవైనవాడా!; భువన, విరాజిత, సిత, కీర్తి!= లోకంలో వెలుగొందిన తెల్లని యశస్సు కలవాడా!; దివిజ, రాజ, విభవ!= దేవేంద్రుడివంటి ఐశ్వర్యం కలవాడా!; నిర్వ్యాజ, పరాక్రమ!= కారణం లేని అనగా సహజసిద్ధమైన శౌర్యంకలవాడా!; సకల, ధరా, జన, సంపూజ్య!= అందరు భూప్రజలచేత అర్చించబడేవాడా!; ధర్మ, రక్షణ, దక్షా!= ధర్మాన్ని కాపాడే శక్తి కలవాడా!

తాత్పర్యం: రాజులలో శ్రేష్ఠుడైనవాడా! లోకంలో వెలుగొందిన తెల్లని యశస్సు కలవాడా! దేవేంద్రుడితో సమానమైన ఐశ్వర్యం కలవాడా! సహజమైన పరాక్రమం కలవీరుడా! సమస్తభూప్రజలచేత అర్చించబడేవాడా! ధర్మాన్ని కాపాడటంలో సామర్థ్యం కలవాడా! ఓ రాజరాజనరేంద్రా!

విశేషం: (1) ఈ పద్యం ఆశ్వాసాంతంలోని సంబోధనం. ఇందులోని సంబోధనలు అన్నియు కృతిపతి అయిన రాజరాజ నరేంద్రుడికి అన్వయించేవి. (2) నన్నయ్య మహాకవి తన ఆంధ్రమహాభారతాన్ని శ్రీ రాజరాజ నరేంద్రుడికి అంకితమిచ్చాడు. (3) ఈ ఆశ్వాసాన్ని ఈ ఆశ్వాసాంత పద్యాలను వ్రాసింది ఎఱ్ఱన. అయినప్పటికి తాను ఆరణ్యపర్వశేషాన్ని నన్నయ్యపేరుమీదనే పూరించాడు కాబట్టి ఆశ్వాసాంతసంబోధనలను కృతిపతి అయిన రాజరాజనరేంద్రుడినే ఉద్దేశించి వ్రాశాడు.

స్రగ్విణి.

సర్వలోకాశ్రయా! సౌమ్యభావోదయా! నిర్వికారాకృతీ! నిత్యసత్యోన్నతీ!
గర్వితోద్యద్భుజాకల్ప! కల్లోల్లస । త్సర్వసర్వంసహాచక్ర! చక్రాయుధా! 437

ప్రతిపదార్థం: సర్వ,లోక+ఆశ్రయా!= సమస్త లోకాలకు అండ అయినవాడా!; సౌమ్య, భావ+ఉదయా!= సాత్త్వికమైన ఆలోచనల ఆరంభం కలవాడా!; నిర్వికార+ఆకృతీ!= నిర్వికారమైన ఆకారం కలవాడా!; నిత్య, సత్య+ఉన్నతీ!= ఎల్లప్పుడును నిజాన్ని పాటించే గొప్పతనం కలవాడా!; గర్విత+ఉద్యత్+భుజ+ఆకల్ప!= మదించినవారికి ప్రకాశించే పరాక్రమాన్ని పన్నెడివాడా!; గర్వితులను అణచే పరాక్రమప్రకర్ష కలవాడా!; కల్ప+ఉల్లసత్+సర్వ, సర్వంసహాచక్ర!= న్యాయ ప్రకారం వెలుగొందే సమస్తభూమండలం కలవాడా!; చక్ర+ఆయుధా!= నారాయణమూర్తీ!

తాత్పర్యం: సర్వలోకాలకు అండ అయినవాడా! ప్రశాంతమైన గంభీరమైన ఆకారం కలవాడా! ఎల్లప్పుడున్నూ నిజాన్ని పాటించటంచేత ఏర్పడిన గొప్పతనం గలవాడా! మదించినవారిని అణచగలిగిన పరాక్రమప్రాభవం కలవాడా!; న్యాయం ప్రకారం యావద్భూమండలాన్ని పరిపాలించేవాడా!; విష్ణుమూర్తీ! ఓ రాజరాజనరేంద్రా!

విశేషం: (1) చాళుక్యులు, శ్రీ రాజరాజనరేంద్రుడి వంశస్థులు "లోకాశ్రయ" - "జనాశ్రయ" బిరుదాంకితులు. "రాజనారాయణ" బిరుదాంకితులు. ఈ పద్యంలోని సర్వలోకాశ్రయా - చక్రాయుధా సంబోధనలు బిరుదనామ సూచకాలు. (2) స్రగ్విణీ వృత్తంలోని ప్రతిపాదంలో వరుసగా నాలుగు రగణాలుంటాయి. 7వ అక్షరం యతిమైత్రి స్థానం. ప్రాస నియమం ఉన్నది.

గద్యము.

ఇది సకలసుకవిజనవినుత నన్నయ్యభట్ట ప్రణీతం బైన శ్రీ మహాభారతంబునం దారణ్యపర్వంబునఁ బతివ్రతా చరిత్రంబును, ధర్మవ్యాధుండు గౌశికునకుఁ బరమధర్మం బెఱింగించుటయు, నగ్నివంశానుకీర్తనంబును, గుమారోత్పత్తియు, సత్యాద్రౌపదీ సంవాదంబును, బాండవులు ద్వైతవనంబునకుం జనుటయు, ధృతరాష్ట్ర వాక్యంబులును, దుర్యోధనాదుల దుర్మంత్రంబున ఘోషయాత్రయుఁ, గౌరవ గంధర్వ యుద్ధంబును, దుర్యోధనాదులు గంధర్వులచేతం బట్టువడుటయు, నర్జునుండు వారల విడిపించుటయు నన్నది పంచమాశ్వాసము. **438**

తాత్పర్యం: ఇది ఉత్తమ కవులందరిచేత కీర్తించబడిన నన్నయభట్టుచేత రచించబడిన శ్రీ మహాభారతంలోని ఆరణ్యపర్వంలో పతివ్రతా చరిత్రమున్నూ, ధర్మవ్యాధుడు కౌశికుడికి ఉత్తమధర్మాన్ని బోధించటమున్నూ, అగ్నివంశాన్ని కీర్తించటమున్నూ, కుమారస్వామి పుట్టుకయున్నూ, సత్యాద్రౌపదీ సంవాదమున్నూ, పాండవులు ద్వైతవనానికి వెళ్లటమున్నూ, ధృతరాష్ట్రుడి వాక్యాలున్నూ, దుర్యోధనుడు మొదలైనవారి దురాలోచనమున్నూ, ఘోషయాత్రయున్నూ, కౌరవ గంధర్వ యుద్ధమున్నూ, దుర్యోధనుడు మొదలైనవారు గంధర్వులచేత యుద్ధంలో పట్టుబడటమున్నూ, అర్జునుడు వారిని విడిపించటమున్నూ అనే అంశాలతో కూడిన అయిదవ ఆశ్వాసం.

-:ఆరణ్యపర్వంలో పంచమాశ్వాసం సమాప్తం :-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము -షష్ఠాశ్వాసము

శ్రీలలితమూర్తి ! సుమహ ! చ్ఛాళుక్యవరేణ్య ! పుణ్యచారిత్ర ! విచి
త్రాలంకారోజ్జ్వల కవి। తాలాపకలాప ! సంతతానందమతీ! 1

ప్రతిపదార్థం: శ్రీ, లలితమూర్తి!= సిరిసంపదలచేత మనోహరమైన ఆకృతికలవాడా!; సుమహత్+చాళుక్య, వరేణ్య!= మిక్కిలి గొప్పదైన చాళుక్య వంశంలో శ్రేష్ఠుడవైనవాడా!; పుణ్యచారిత్ర!= పవిత్రమైన ప్రవర్తన కలవాడా!; విచిత్ర+అలంకార+ఉత్+జ్వల, కవితా+ఆలాప, కలాప!= మిక్కిలి అచ్చెరువు కలిగించే అలంకారాలచేత వెలుగొందే కవిత్వ భాషణమనెడి భూషణం కలవాడా!; సంతత+ఆనంద, మతీ!= ఎల్లప్పుడూ సంతోషంతో కూడిన బుద్ధి కలవాడా!; ఓ రాజరాజనరేంద్రా!

తాత్పర్యం: సిరిచేత తులదూగే మనోహరమైన రూపం కలవాడా!; ఓ రాజరాజనరేంద్రా! చాళుక్యరాజులలో శ్రేష్ఠుడా! పవిత్రమైన నడవడి కలవాడా! చిత్రవిచిత్రాలైన అలంకారాలతో వెలుగొందే కవిత్వ భాషణమనెడి భూషణం కలవాడా! నిత్యసంతుష్టమతీ!

విశేషం: 1. ఎప్పుడో ఎఱ్ఱనకు సుమారు రెండువందల సంవత్సరాలకు ముందు వేంగీమండలాన్ని ఏలినవాడు రాజరాజ నరేంద్రుడు. అతడు శ్రీమదాంధ్రమహాభారత కృతిపతి. ఆనాడు కృతికర్త నన్నయభట్టు. ఈనాడు ఈకృతికర్త ఎఱ్ఱాప్రెగ్గడ. అయినను ఎఱ్ఱన శ్రీ రాజరాజనరేంద్రుడినే కృతిపతిగా మన్నించి తాను ఆరణ్యపర్వశేషాన్ని నన్నయపేరుమీదనే వ్రాసి ప్రకటించటం ఇందలి విశేషం. ఈ సంబోధనలు అన్నీ అలనాటి ఆరాజరాజనరేంద్రుడికే అన్వయిస్తాయి. కృతిపతి కావ్యానికి ప్రథమ ప్రధానశ్రోత అనే సాహితీసంప్రదాయాన్ని నన్నయనుండి నేటివరకును తెలుగుకవులు పాటిస్తున్నారు.

దుర్యోధనుని విషాదము (సం. 3-236-1)

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె; నట్లతిమానుషంబైన యర్జునుపరాక్రమంబును, నత్యంతదైన్యాస్పదం బగు దుర్యోధనుపరాభవంబును, ధర్మజుదయయు నాకర్ణించి, విస్మయ జుగుప్సాకలితమానసుం డగుచు జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= ఆ కథకుడు (పౌరాణికుడు అయిన ఉగ్రశ్రవసుడు); శౌనక+ఆది+మహామునులకున్= శౌనకుడు, మున్నగుగొప్ప మునులకు; చెప్పెన్= వచించాడు; అట్లు= ఆ రీతిగా; అతిమానుషంబు+ఐన= మనుజులశక్తికి మించింది అయిన; అర్జును, పరాక్రమంబును= అర్జునుడియొక్క శౌర్యాన్ని; అతి+అంత+దైన్య+ఆస్పదంబు+అగు= మిక్కుటమైన దర్పాన్ని కోలుపోయినట్టిస్థితికి నెలవైన; దుర్యోధను, పరాభవంబును= దుర్యోధనుడియొక్క అవమానాన్ని; ధర్మరాజు దయయున్= ధర్మరాజు చూపిన జాలియు; ఆకర్ణించి= విని; విస్మయ, జుగుప్సా+కలిత మానసుండు+అగుచున్= అచ్చెరువు, రోత కలిసిన మనస్సు కలవాడు ఔతూ; జనమేజయుండు= జనమేజయమహారాజు; వైశంపాయనునకున్; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మహాభారతకథను ఉగ్రశ్రవసుడు శౌనకుడు మున్నగు మహామునులకు చెప్పాడు. ఆ విధంగా మనుజులశక్తిని అతిక్రమించిన అర్జునుడియొక్కశౌర్యం, మిక్కిలిదైన్యంతో కూడిన దుర్యోధనుడి అవమానం, ధర్మరాజు ప్రదర్శించిన జాలినిగురించి ఆకర్ణించి, జనమేజయుడు అచ్చెరువు రోత పెనగొన్న చిత్తంతో వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 1. షష్ఠాశ్వాసం మొదట గల ఈవాక్యం పంచమాశ్వాసంలోని తుదిపదంతో - 'సవిస్తరముగా' అనే దానితో అన్వయిస్తున్నది. 2. మహాభారతకథను వైశంపాయనుడు జనమేజయుడికి సర్పయాగసందర్భంలో వినిపించాడు. జనమేజయుడు అర్జునుడి కుమారుడైన అభిమన్యుడికి పౌత్రుడు. పరీక్షిత్తుకు కొడుకు. 3. జనమేజయుడికి 'విస్మయము' - 'జుగుప్స' కలిగాయి. జుగుప్స బీభత్సరసానికి స్థాయిభావం. విస్మయం= అద్భుతం - నవరసాలలో ఒకటి. అర్జునుడి పరాక్రమానికి విస్మయం, దుర్యోధనుడి పరాభవానికి జుగుప్స. అవిక్రమం.

చ. **'అనిశముఁ బాండుపుత్త్రులకు నప్రియకార్యము రోయునట్టి దు**
ర్జనుఁడు సుయోధనుం డటులు శత్రులచే నవమానితుండుఁ బే
ర్చినకృప నొప్పుచున్న కురుసింహులచేత విమోక్షితుండు నై
మనమున లజ్జ లేక మునిమండన! యెమ్మెయి నేఁగె వీటికిన్? **3**

ప్రతిపదార్థం: మునిమండన!= ఋషులకు అలంకారంగా ఉండేవాడా! ఓవైశంపాయనా!; అనిశమున్= ఎల్లప్పుడున్నూ; పాండుపుత్త్రులకున్= పాండునందనులకు; అప్రియకార్యము= హితవుకాని పనిని, కీడును; రోయునట్టి= వెదకునట్టి; దుర్జనుఁడు= చెడ్డమనుజుడు; సుయోధనుండు= దుర్యోధనుడు; అటులు= ఆ విధంగా; శత్రులచేన్= విరోధులచేత; అవమానితుండున్= అవమానించబడినవాడును; పేర్చిన= అతిశయించిన; కృపన్= దయతో; ఒప్పుచున్న= శోభిల్లుతున్న; కురుసింహులచేతన్= కురువంశంలో సింహాలవంటి వారైన పాండవులచేత; విమోక్షితుండును+ఐ= విడిపించబడిన వాడై; మనమునన్= చిత్తంలో; లజ్జ లేక= సిగ్గు లేకుండా; వీటికిన్= (తన) పట్టణానికి; ఏ+మెయిన్= ఏరీతిగా; ఏఁగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'ఋషులలో శ్రేష్ఠుడవైన ఓవైశంపాయనా! ఎల్లప్పుడూ పాండవులకు కీడు చేయటానికే అవకాశాల కొరకు వెదకే దుర్జనుడు దుర్యోధనుడు. అతడు ఆవిధంగా శత్రువులచేత అవమానించబడటం మాత్రమే కాక కురువంశాన సింహాలవంటి పాండవుల పరాక్రమంచేత బంధమోక్షణం పొంది సిగ్గుపడకుండ ఏరీతిగా తన రాజధానికి తరలి వెళ్ళాడు?

విశేషం: 1. దుర్యోధనుడు శత్రువులైన గంధర్వులచేత ఓడించబడటం ఒకపరాభవం. తాను ఎల్లప్పుడూ అపకారంచేసిన పాండవుల దయవలన బంధమోక్షణం పొందటం ఇంకొక పరాభవం. 2. ఇక్కడ పాండవులు 'కురుసింహులు' గా పేర్కొనబడ్డారు. దుర్యోధనాదులు కౌరవులు. పాండురాజపుత్రులు పాండవులు. ఉభయులూ కౌరవులేకదా! వివక్షకొరకు కౌరవపాండవ వ్యపదేశం ఏర్పడింది. దీనికే కురుపాండవన్యాయం అని పేరు.

మత్తకోకిలము.

మేనఁ బ్రాణముఁ దాల్చి భంగము ఋంగి యెప్పటిచాడ్పునన్
మానవేంద్రుఁడ నేను దద్దయు మానినన్ దలఁ పాత్మలోఁ
బూను టాతని కెట్లు గల్గఁగఁ బోలు నారయ నద్భుతం
బైన తచ్చరితంబు సెప్పుమ యంతయుం బరిపాటితోన్.' **4**

ప్రతిపదార్థం: మేనన్= దేహంలో; ప్రాణమున్+తాల్చి= అసువులు ధరించి; భంగమున్ మ్రింగి= పరాభవాన్ని దిగమ్రింగి; ఎప్పటిచాడ్పునన్= యథాప్రకారం, లోగడ ఉన్నట్లుగనే; మానవ+ఇంద్రుఁడన్= మనుజులలో శ్రేష్ఠుడను, రాజును; నేను= నేను; తద్దయున్= మిక్కిలి; మానిన్= అభిమానం కలవాడిని; అన్= అనెడి; తలఁపు= ఆలోచన; ఆత్మలోన్= మనస్సులో; పూనుట= వహించటం; ఆతనికిన్= దుర్యోధనుడికి; ఎట్లు= ఏవిధంగా; కల్గఁగన్+పోలున్= కలగటానికి సరిపడుతుంది; ఆరయన్= పరిశీలించగా; అద్భుతంబు+ఐన= ఆశ్చర్యకరమైన; తత్+చరితంబు= ఆతడి ప్రవర్తన; అంతయున్= అంతటిని; పరిపాటితోన్= వరుసగా; చెప్పుమ= చెప్పుము.

తాత్పర్యం: దుర్యోధనుడు స్వాభిమానధురంధరుడని వింటాం. అంతటి పరాభవం పొందిన తరువాత అతడు - 'నేను ఒక మహారాజును, అభిమానవంతుడిని, నాకు ప్రాణాలు, మానాభిమానాలు ఉన్నవి. ఇటువంటి పరాభవాన్ని ఎట్లా దిగమ్రింగగలను?' అనే ఆలోచన అతడికి కలుగకుండా ఎట్లా ఉంటుంది? పరిశీలించగా ఇది ఒక అద్భుతవృత్తాంతం. ఆపైన దుర్యోధనుడు ఏవిధంగా ప్రవర్తించాడో దయచేసి సవిస్తరంగా తెలపండి. నాకు విన కుతూహలంగా ఉన్నది.'

విశేషం: వృత్తలక్షణానికి చూడు- ఆరణ్య. 4.267 విశేషాంశం.

వ. **అని యడిగిన నమ్మహాముని యిట్లను; నట్లు కౌంతేయులచేత బంధమోక్షితుం డై దుర్యోధనుండు లజ్జా కజ్జలితహృదయుం డగుచుఁ జెదరిన సేనలం గూర్చుకొని కొంత దవ్వరిగి యొక్కసమతలంబునం బటమందిరవిరచనంబు నిర్వర్తించి, యభ్యంతరమందిరమ్మున నొక్కరుండును దల్పంబుపయిం బడి చింతాపరవశత్వంబు నొంది, రాహుకబళనకలుషితుం డైన రోహిణీపతియునుంబోలె విషాదవివర్ణుం డయి యున్నయెడఁ గర్ణుండు వచ్చి, సముచితంబుగాఁ గని యన్నరేంద్రున కిట్లనియె.** **5**

ప్రతిపదార్థం: అని అడిగినన్= అని (జనమేజయుడు) ప్రశ్నించగా; ఆ+మహాముని= ఆ గొప్పఋషి; ఇట్లు అనున్; అట్లు; కౌంతేయులచేతన్= పాండవులచేత; బంధమోక్షితుండు+ఐ= చెఱవిడిపించబడినవాడై; దుర్యోధనుండు= సుయోధనుడు; లజ్జా, కజ్జలిత, హృదయుండు= సిగ్గుచేత మలినమైన డెందం కలవాడు (అనగా అవమానఖిన్నుడు); అగుచున్= ఔతూ; చెదరిన సేనలన్+కూర్చుకొని= నలువైపులకు పారిపోయిన సైన్యాలను ఒకచోటికి చేర్చుకొని; కొంత దవ్వు= కొంత దూరం; అరిగి= పయనించి; ఒక్క= ఒక; సమతలంబునన్= మిట్టపల్లాలు లేని స్థలంలో; పట, మందిర, విరచనంబు= వస్త్రాలచేత ఏర్పరచెడి గృహ నిర్మాణం; నిర్వర్తించి= చేసి; అభ్యంతర మందిరమ్మునన్= లోపలి గదిలో; ఒక్కరుండును= ఒకడు మాత్రమే; తల్పంబు పయిన్+పడి= మంచంమీద శయనించి; చింతాపరవశత్వంబున్+ఒంది= విషాదపూరితమైన ఆలోచనలో మునిగి; రాహు, కబళన, కలుషితుండు+ఐన= రాహువు మ్రింగటంచేత మాలిన్యం పొందిన; రోహిణీపతియునున్+పోలెన్= చంద్రుడివలె; విషాద వివర్ణుండు+అయి= దుఃఖంచేత పాలిపోయినవాడయి; ఉన్న+ఎడన్= ఉన్నప్పుడు; కర్ణుండు= కర్ణుడు; వచ్చి= అరుగుదెంచి; సముచితంబుగాన్+కని= తగిన మర్యాదలు పాటించి, చూచి; ఆ+నర+ఇంద్రునకున్= ఆరాజుతో, దుర్యోధనుడితో; ఇట్లు+అనియెన్= ఈ ప్రకారం చెప్పాడు.

తాత్పర్యం: అని జనమేజయుడు ప్రశ్నించగా వైశంపాయనమహర్షి ఈ విధంగా బదులు పలికాడు: ఆ విధంగా దుర్యోధనుడు పాండవులచేత చెరవిడిపించబడినవాడై అవమాన ఖేదంతో అలమటించే హృదయంతో చెల్లాచెదరైన సేనలను చేర్చుకొని కొంతదూరం ప్రయాణంచేసి మిట్టపల్లాలు లేని ఒకస్థలంలో పటకుటీరాలు నిర్మించుకొని విడిది చేశాడు. కాని, తన మనస్సుకు శాంతి లేకపోవటంచేత లోపలిగదిలో ఏకాంతంగా మంచంపై పవళించి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరితపించసాగాడు. పరాభవఖిన్నుడైన దుర్యోధనుడు రాహువుచేత మ్రింగబడిన చంద్రుడివలె కాంతి దొరగి పాలిపోయాడు. అప్పుడు కర్ణుడు అక్కడికి వచ్చి రాజమర్యాదలు నిర్వర్తించి దుర్యోధనుడిని సందర్శించి, ఇట్లా పలికాడు.

చ. **'మనుజవరేణ్య! చూడ నతిమానుష మమ్మెయిఁ గయ్య మెందుఁ గ**
ల్గునె? పటువిక్రమాన్వితులఁ గ్రోధనిబద్ధులఁ గామరూపులం
జెనయఁగ వచ్చునే ఖచరసింహుల నేరికి?; నట్టివారి నే
పునఁ దునుమాడి గెల్చితి విభూతి యెలర్పఁగ నీవుఁ దమ్ములున్. 6

ప్రతిపదార్థం: మనుజవరేణ్య!= మనుజులలో శ్రేష్ఠుడవైనవాడా! దుర్యోధన మహారాజా!; చూడన్= అరయగా; అతిమానుషము= మానవులకు సాధ్యంకాని పని అది; ఆ+మెయిన్= ఆ రీతిగా; కయ్యము= పోరాటం; ఎందున్= ఎక్కడైనా; కల్గునె= ఉండునా? ఉండదు; పటు, విక్రమ+అన్వితులన్= మిక్కుటమైన శౌర్యం కలవారలను; క్రోధ నిబద్ధులన్= ఆగ్రహంచేత కట్టబడిన వారిని; కామరూపులన్= తాము కోరిన రూపాలు ధరించ గల్గిన శక్తికలవారిని; ఖచరసింహులన్= ఆకసంలో చరించే గంధర్వులలో సింహాలవంటివారిని; ఏరికిన్= ఎవరికైనను; చెనయఁగన్ వచ్చునే= ఎదుర్కొన వచ్చునా?; అట్టివారిన్= అటువంటి వారిని (ఆ గంధర్వులను); ఏపునన్= అతిశయంతో; తునుమాడి= సంహరించి; నీవున్= నీవున్నూ; తమ్ములున్= నీ సోదరులున్నూ; విభూతి+ఎలర్పఁగన్= బలం శోభిల్లగా; గెల్చితి(వి)= జయించావు.

తాత్పర్యం: 'మనుజులలో శ్రేష్ఠుడవైన ఓ దుర్యోధనమహారాజా! మానవులకు సాధ్యంకాని ఘనకార్యాన్ని నీవు సాధించావు. అటువంటి యుద్ధం ఎక్కడా కానరాదు. వారు గంధర్వులలో సింహాలవంటివారు, మిక్కుటమైన శౌర్యం కలవారు, కోపంతో విజృంభించినవారు, కోరిన రూపాలను ధరించగల మాయావులు. అట్టివారిని మానవమాత్రులు ఎట్లా ఎదుర్కొనగలరు? నీవూ నీతమ్ములూ అటువంటి గంధర్వులను నిర్మూలించి గెలుపొందటం పేర్కొనదగింది సుమా!

ఉ. **అప్పుడు నీవు సూడఁగ ననంతములై ఖచరేంద్రసైన్యముల్**
గప్పె ననేకసాయకనికాయములన్ వడి నన్ను; నేనునుం
గుప్పలు గూల నేసి రిపుకోటి వధించితి; నంతలోన న
న్నొప్పరికించె సైన్యతతి; యొక్కఁడ నై రణభూమి నొచ్చితిన్. 7

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; నీవు+చూడఁగన్= నీవు చూస్తుండగా; అనంతములు+ఐ= అంతులేనివై; ఖచర+ఇంద్ర, సైన్యముల్= గంధర్వపతి సేనలు; అనేక, సాయక, నికాయములన్= పెక్కుబాణాల సముదాయాలను; వడిన్= రయంగా; నన్నున్= నన్ను; కప్పెన్= చుట్టుముట్టాయి; నేనునున్= నేను సయితం; రిపుకోటిన్= శత్రుసమూహాన్ని; కుప్పలుకూలన్+ఏసి= గుట్టలు గుట్టలుగా పడేటట్లు బాణాలు ప్రయోగించి; వధించితిన్= సంహరించాను; అంతలోనన్= ఆ విధంగా జరుగుతున్న సమయంలో; సైన్యతతి= సేనలగుంపులు; నన్నున్= నన్ను; ఒప్పరికించెన్= ఉపేక్షించాయి; రణభూమిన్= యుద్ధరంగంలో; ఒక్కఁడన్+ఐ= ఒంటరివాడినై; నొచ్చితిన్= బాధపడ్డాను.

తాత్పర్యం: ఆసమయంలో, నీవు చూస్తుంటివికదా! గంధర్వపతిభటులు పెక్కుబాణాలసమూహాలతో నన్ను ఆచ్ఛాదించారు. కాని, నేను లెక్కకు మించిన శత్రుబలాలతో పోరాడి వారిని కుప్పలు కుప్పలుగా కూల్చివేశాను. మనసేనలు నాకు తోడ్పడజాలక పోయినవి. నేను ఒక్కడనై రణరంగంలో బాధపడ్డాను.

వ. ఆలోనన విరథుండ నై వికర్ణురథం బెక్కిన నది సమర ప్రదేశంబునకుఁ దొలంగఁ బఱచె; దేవా! నీవు బలవిక్రమాతిశయంబులం బ్రతివీరుల నోర్చి యక్షతుండ వై యుండుటఁ గనుంగొని గృతార్థుండ నైతి; నిట్టి పరాక్రమంబు సేసిన వా రిజ్జగంబున నెవ్వరు గల? రిది యత్యద్భుతం' బనినం గౌరవేశ్వరుం డాత్మగతంబున 'నీతండు మత్ప్రకారం బెఱుంగక యిట్లు వలికెం గాకేమి?' యని లజ్జితుం డగుచు రాధేయున కి ట్లనియె.8

ప్రతిపదార్థం: ఆలోనన్+అ= ఆసమయంలోపలనే; విరథుండన్+ఐ= రథాన్ని కోల్పోయిన వాడినై; వికర్ణురథంబు= వికర్ణుడియొక్క తేరు; ఎక్కినన్= అధిరోహించగా; అది= (ఆరథం); సమర, ప్రదేశంబునకున్= యుద్ధభూమికి; తొలంగన్= దూరం అయ్యేటట్లుగా; పఱచెన్= పరుగెత్తి పోయింది; దేవా= ఓప్రభూ; నీవు= నీవు; బలవిక్రమ+అతిశయంబులన్= బలశౌర్యాలయొక్క పెంపుచేత; ప్రతివీరులన్= శత్రుపక్షంలోని శూరులను; ఓర్చి= ఓడించి; అక్షతుండవు+ఐ= గాయాలు పొందని వాడవై; ఉండుటన్+కనుంగొని= ఉండటం చూచి; కృత+అర్థుండన్+ఐతిన్= ధన్యుడను అయినాను; ఇట్టి= ఇటువంటి; పరాక్రమంబు+చేసినవారు= శౌర్యం ప్రదర్శించినవారు; ఈ+జగంబునన్= ఈలోకంలో; ఎవ్వరు+కలరు? ఎవరు ఉన్నారు? (ఎవరూ లేరు); ఇది= ఈ పరాక్రమ ప్రదర్శనం; అతి+అద్భుతంబు= మిక్కిలి అచ్చెరువు కలిగించేది; అనినన్= అని (కర్ణుడు)పలుకగా; కౌరవ+ఈశ్వరుండు= కౌరవులప్రభువు, దుర్యోధనుడు; ఆత్మగతంబునన్= తన మనస్సులో; ఈతండు= ఈతడు (కర్ణుడు); మత్+ప్రకారంబు= నాదైన చందం; ఎఱుంగక= తెలియక; ఇట్లు= ఈ రీతిగా; పలికెన్= మాట్లాడాడు; కాక+ఏమి= అంతేగాని వేరువిధం ఏమీ కాదు; అని= అని తలచి; లజ్జితుండు+అగుచున్= సిగ్గు చెందిన వా డౌతూ; రాధేయునకున్= రాధకొడుకు అయిన కర్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అంతలోనే నారథం విరిగిపోయింది. నేను రథం లేనివాడినై వికర్ణుడిరథం ఎక్కాను. అది యుద్ధభూమి నుండి దూరంగా తొలగిపోయింది. ప్రభూ! నీవు బలపరాక్రమాలు అతిశయించగా శత్రువులను జయించి గాయాలు లేకుండా ఉండటం చూచి నేను ధన్యుడినయ్యాను. ఇటువంటి పరాక్రమాన్ని ప్రదర్శించినవారు ఈ లోకంలో ఎవరున్నారు? ఇది మిక్కిలి ఆశ్చర్యకరం' - అని కర్ణుడు అన్నాడు. ఆమాటలు దుర్యోధనుడు విని లోలోన 'ఇతడికి నాకు జరిగిన సంగతి తెలిసినట్లు లేదు కాబోలు' అని సిగ్గుపడుతూ కర్ణుడితో ఇట్లా అన్నాడు.

సీ. 'అనఘ! తమ్ములు నేను నంబరచరకోటిఁ । దలపడి పోరంగ బలయుగంబుఁ
జచ్చియు నొచ్చియుఁ జలమునఁ బెనఁగెఁ; నా । సమయమ్మునందు విక్రమ మెలర్ప
గంధర్వపతితోడఁ గలిగెఁ గయ్యము నాకు; । నాతని శరములచేత నాజి
నేను నొచ్చితి; వేయు నేల? భార్యానుజ । సుతమిత్త్రజనసమన్వితము గాఁగ

తే. నన్నుఁ జెఱగొని గంధర్వనాయకుండు । నెగసె దివమున; కప్పుడు బెగడి చెదరి
పఱచి మనవార లెల్లను బాండుసుతుల । శరణు సొచ్చిరి దైన్యసంభరితు లగుచు. 9

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైనవాడా!; తమ్ములున్; ఏనున్; అంబర, చర, కోటిన్= గంధర్వుల సమూహంతో; తలపడి= మార్కొని; పోరంగన్= యుద్ధంచేయగా; బలయుగంబున్= రెండు సేనలున్నూ; చచ్చియున్= మరణించికూడా; నొచ్చియున్= వెతచెందికూడా; చలమునన్= పౌరుషంతో; పెనఁగెన్= పోరాడాయి; ఆసమయమ్మునందున్= అప్పుడు; గంధర్వ, పతితోడన్= గంధర్వులకు రాజు అయిన చిత్రసేనుడితో; విక్రమము+ఎలర్పన్= శౌర్యం శోభిల్లేటట్లుగా; నాకున్= నాకు; కయ్యము= యుద్ధం; కలిగెన్+ఏర్పడింది; ఆతని శరములచేతన్= ఆ చిత్రసేనుడియొక్క బాణాలచేత; ఆజిన్= యుద్ధంలో; ఏను= నేను; నొచ్చితిన్= వెతచెందాను; వేయున్+ఏల= వేయిమాటలు ఎందుకు; భార్యా+అనుజ, సుత, మిత్త్ర, జన,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సమన్వితముగాఁగన్= పెండ్లాము, తమ్ములు, కొడుకులు, స్నేహితుల సముదాయంతోపాటుగా; నన్నున్= నన్ను; చెఱ+కొని= బంధించి; గంధర్వ నాయకుండు= గంధర్వులకు అధినేత చిత్రసేనుఁడు; దివమునకున్= ఆకసానికి; ఎగసెన్= ఎగిరాడు; అప్పుడు= ఆసమయంలో; బెగడి= భయపడి; చెదరి= నలువైపులకు పారిపోయి; మనవారలు= మనవారు; ఎల్లను= అందరు; పఱచి= పరుగెత్తి; దైన్యసంభరితులు+అగుచున్= దీనత్వంతో కూడినవారు ఔతూ; పాండుసుతులన్= పాండవులను; శరణు+చొచ్చిరి= అభయాన్ని కోరారు.

తాత్పర్యం: 'పాపరహితుడ వైన ఓకర్ణా! నేనూ తమ్ములూ గంధర్వుల నెదిరించి పోరాటం సలిపాం; ఉభయసేనలలో పలువురు మరణించారు, గాయపడ్డారు; అయినా పోరాటం పౌరుషంతో కొనసాగింది. అప్పుడు గంధర్వపతి చిత్రసేనుడికిన్నీ నాకున్నూ ద్వంద్వయుద్ధం జరిగింది. ఆతడు నన్ను ఓడించి నన్నూ, నాభార్యలనూ, తమ్ములనూ, స్నేహితులనూ, కొడుకులనూ, అందరినీ బంధించి, ఆకసానికి ఎగశాడు. అంతట మనవారు హాహాకారాలు చేస్తూ దీనులై పాండవులవద్దకు పరుగెత్తి వారిని శరణువేడారు.

ఉ. **వారలయార్తిఁ జూచి జనవంద్యుఁడు ధర్మసుతుండు దమ్ములన్**
భూరిబలాఢ్యులం బరమపుణ్యుఁడు నన్ విడిపింపఁ బంచె; న
వ్వీరులు నుక్కునం గవిసి వీఁకున ఖేచరకోటిఁ దొల్త నిం
పారఁ బ్రియోక్తులం దెలఁచి; రంతటఁ దీరద కార్య మెమ్మెయిన్. **10**

ప్రతిపదార్థం: వారల+ఆర్తిన్+చూచి= (కౌరవభటులయొక్క) వేదన గమనించి; పరమపుణ్యుఁడు= గొప్ప సుకృతం చేసినవాడు; జనవంద్యుఁడు= ప్రజలచేత నమస్కరించదగినవాడు; ధర్మసుతుండు= ధర్మనందనుడు; భూరి, బల+ఆఢ్యులన్= గొప్పబలంతో కూడినవారలను; పరమ పుణ్యుఁడు= గొప్ప సుకృతం చేసిన ధర్మజుడు; తమ్ములన్= అనుజులను; నన్= నన్ను; విడిపింపన్= బంధముక్తుడిని చేయటానికి; పంచెన్= నియోగించాడు; ఆ+వీరులు= ఆ శూరులు; ఉక్కునన్= బలంతో; వీఁకునన్= ఉత్సాహంతో; కవిసి= మార్కొని; ఖేచరకోటిన్= గంధర్వులను; తొల్తన్= (తొలుతన్); మొదట; ఇంపు+ఆరన్= ప్రీతితో; ప్రియోక్తులన్ (ప్రియ+ఉక్తులన్)= మంచి మాటలతో; తెలఁచిరి= ప్రార్థించారు; అంతటన్= దానితో ఆపిదప; కార్యము= పని; ఏ+మెయిన్= ఏరీతిగానూ; తీరదు+అ= నెరవేరలేదు.

తాత్పర్యం: మన కౌరవభటుల ఆవేదన గమనించి, జనులచేత పూజింపబడే ధర్మరాజు, పుణ్యాత్ముడు నన్ను బంధవిముక్తిడిని చేయించటంకొరకై గొప్పబలవంతులు మహాశూరులు అయిన తమ్ములను నియోగించగా, వారు ఉత్సాహంతో గంధర్వులను ఎదుర్కొన్నారు; మొట్టమొదట పాండవులు గంధర్వులను సామవాక్యాలతో నన్ను బంధవిముక్తుడిని చేయండని ప్రార్థించారు. కాని, గంధర్వులు అందుకు సమ్మతించలేదు.

ఆ. **అంతఁ దెగువసేసి యంతకాకారు లై । భీమపార్థయములు భీమబలులు**
ఖచరతతులమీఁదఁ బ్రచురబాణౌఘముల్ । గురిసి రాహవమున ఘోరభంగి. **11**

ప్రతిపదార్థం: అంతన్= పిదప; తెగువ+చేసి= సాహసించి; అంతక+ఆకారులు+ఐ= యముడివంటి రూపాలు కలవారై; భీమబలులు= భయంకర మైన శక్తి కలవారు; భీమ, పార్థ, యములు= భీముడు, అర్జునుడు, కవలును (నకులసహదేవులును); ఖచర, తతుల, మీఁదన్= గంధర్వులపై; ప్రచుర, బాణ+ఓఘముల్= పెక్కుఅమ్ములప్రవాహాలు; ఆహవమునన్= యుద్ధంలో; ఘోరభంగిన్= భయంకరరీతిలో; కురిసిరి= వర్షించారు.

తాత్పర్యం: అంతట సాహసించి, భీముడు అర్జునుడు నకులసహదేవులు యముడివలె భయంకరాకారాలతో విజృంభించి, గంధర్వులపై భీకరయుద్ధం చేసి పెక్కుబాణాలను వర్షించారు.

వ. తదీయబాణపాతంబుల నొచ్చి గంధర్వులు మమ్ముం గొనుచు గగనంబునం బఱచిన, నర్జునుండు వారికిం బోవరాకుండ నతినిబిడబాణజాలంబుల నంబరమార్గంబు నిరోధించినం, జిత్రసేనుండు దనప్రియసఖుండైన శతమఖసుతుం జేరనరిగి కుశలం బడిగిన, నర్జునుండునుం బ్రీతుండై వాని ననునయించి, 'యీ దుర్యోధనుండు మాతోడంబుట్టువు గావున నితని విడువవలయు' ననిన నాగంధర్వనాయకుండు. 12

ప్రతిపదార్థం: తదీయ, బాణ, పాతంబులన్= వారియొక్క (పాండవులయొక్క) అమ్ములతాకిడికి; నొచ్చి= వెతచెంది; గంధర్వులు; మమ్మున్+కొనుచున్= మమ్మల్ని బందీలుగా వెంటపెట్టుకొని తీసికొనిపోతూ; గగనంబునకున్= ఆకసానికి; పఱచినన్= పారిపోగా; అర్జునుండు; వారికిన్; పోవరాకుండన్= వెళ్ళటానికి వీలులేకుండా; అతినిబిడబాణజాలంబులన్= మిక్కిలి దట్టమైన అమ్ముల సముదాయంచేత; అంబర, మార్గంబు= ఆకాశపథం; నిరోధించినన్= అడ్డగించగా; చిత్రసేనుండు; తన, ప్రియ, సఖుండు+ఐన= తనకు అనుగుచెలికాడు అయిన; శతమఖ, సుతున్= దేవేంద్రుడికొడుకును, అర్జునుడిని; చేరన్+అరిగి= సమీపించి; కుశలంబు= యోగక్షేమాలు; అడిగినన్= ప్రశ్నించగా; అర్జునుండునున్; ప్రీతుండు+ఐ= సంతృప్తి చెందినవాడై; వానిన్= చిత్రసేనుడిని; అనునయించి= ఓదార్చి; ఈ దుర్యోధనుండు; మాతోడన్+పుట్టువు= మా సోదరుడు; కావునన్= కాబట్టి; ఇతనిన్= ఈ దుర్యోధనుడిని; విడువవలయున్= వదలిపెట్టవలెను; అనినన్= అని చెప్పగా; ఆ గంధర్వనాయకుండు= గంధర్వులకు నేత అయిన ఆ చిత్రసేనుఁడు.

తాత్పర్యం: పాండవులు ప్రయోగించిన బాణాలకు నొచ్చి గంధర్వులు మమ్మల్ని పట్టుకొని ఆకాశమార్గాన పారిపోవటానికై ఎగసినారు. కాని, అర్జునుడు ఆకాశాన్ని అమ్ముల సముదాయంతో నింపి వారిపన్నాగాన్ని భగ్నంచేశాడు. అంత చేసేది లేక చిత్రసేనుడు తన బాల్యసఖుడైన అర్జునుడిని సమీపించి యోగక్షేమాలను అడిగి అతడిని ప్రసన్నుడిని చేశాడు. అర్జునుడు ప్రీతిచెంది, 'ఈ దుర్యోధనుడు మాకు సహోదరుడు. ఇతడిని విడువవలె' నని చిత్రసేనుడిని అర్థించాడు. అంతట గంధర్వనాయకుఁ డైన చిత్రసేనుడు.

చ. మనదుర్మంత్రిత మంతయు । ఘనుఁ డప్పార్థునకుఁ జెప్పి 'ఘనభుజ! యిది యిం
ద్రుని పను పగుట నవశ్యం । బును నీతని విడువ' ననియె భూరిబలుం డై. 13

ప్రతిపదార్థం: భూరిబలుండు+ఐ= గొప్ప బలం కలవాడై; మన, దుర్మంత్రితము= మన చెడు ఆలోచన; అంతయున్= సమస్తం; ఘనుఁడు= గొప్పవాడైన; ఆ+పార్థునకున్= ఆ అర్జునుడికి; చెప్పి= విన్పించి; ఘనభుజ!= గొప్పభుజాలు కలవాడా! ఓ అర్జునా!; ఇది= ఈపని - దుర్యోధనాదులను బంధించటం; ఇంద్రుని పనుపు+అగుటన్= ఇంద్రుడి నియోగం కావటంచేత; అవశ్యంబునున్= తప్పనిసరిగా; ఈతనిన్= ఇతడిని(దుర్యోధనుడిని); విడువన్+అనియెన్= వదలను అని చెప్పాడు.

తాత్పర్యం: మనం పన్నిన చెడుపన్నాగా న్నంతటిని గొప్పవాడైన ఆ అర్జునుడికి వివరించి చెప్పి, 'మహాశూరుడ వైన ఓ అర్జునా! ఈపని (దుర్యోధనాదులను బంధించటం) మా అంతట మేము చేసింది కాదు. ఇది ఇంద్రుడి ఆజ్ఞవలన తప్పనిసరిగా చేయవలసి వచ్చింది. కనుక విడువను అని పరాక్రమించి పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కడు లజ్జయు దైన్యంబును । నడరి ముసుఁగు వడఁగ నాకు నాత్మగతమునం
బుడమి వివరంబు లేదే । యడఁగెద నన్నట్టి దయ్యె నప్పుడు కర్ణా! 14

ప్రతిపదార్థం: కర్ణా!= ఓకర్ణా!; కడున్= మిక్కుటమైన; లజ్జయున్= సిగ్గున్నూ; దైన్యంబును= హీనస్థితియున్నూ; అడరి= ప్రజ్వలించి; ముసుఁగు+పడఁగన్= కప్పివేయగా; నాకున్; ఆత్మగతమునన్= మనస్సులో; అప్పుడు= ఆ సమయంలో; పుడమిన్= భూమిలో; వివరంబు= రంధ్రం; లేదే= లేదుగదా; అడఁగెదన్= అణగి లోపలికి దూరిపోతానుగాక; అన్నట్టిది+అయ్యెన్= అనిపించింది.

తాత్పర్యం: మిక్కుటమైన సిగ్గూ, హీనస్థితీ నన్ను కప్పివేశాయి. నామనస్సులో 'అయ్యో! ఇప్పుడు భూమిలో పెద్దబెజ్జం పడితే ఎంత బాగుండేది. నేను దానిలోనికి దూకి నశించి ఉండేవాడినికదా! ఇట్టి అవమానం తప్పిఉండేది' అని అనిపించింది.

వ. అంతం గౌంతేయులు గంధర్వులం దోడ్కొని ధర్మరాజుపాలికిం జని, మనదుర్మంత్రంబుకతంబున బంధగోచరుండ నయిన నన్ను నయ్యజాతశత్రుముందట నివేదించిన, నతండు విడిచి పుత్తెంచె నిది మదీయ వృత్తాంతంబు. 15

ప్రతిపదార్థం: అంతన్= ఆ మీదట; కౌంతేయులు= కుంతీకుమారులు(భీమార్జునకులసహదేవులు); గంధర్వులన్= గంధర్వులను; తోడ్కొని= వెంటబెట్టుకొని; ధర్మరాజు పాలికిన్= ధర్మరాజు దగ్గరికి; చని= వెడలి; మనదుర్మంత్రంబుకతంబునన్= మన చెడ్డఆలోచనవలన; బంధగోచరుండన్+అయిన, నన్నున్= చెరపెట్టబడిన నన్ను; ఆ+అజాతశత్రుముందటన్= ఆ ధర్మరాజు ఎదుట; నివేదించినన్= సమర్పించగా; అతండు= అతడు (ఆ అజాతశత్రుడు); విడిచి పుత్తెంచెన్= విడిపించి పంపాడు; ఇది, మదీయ వృత్తాంతంబు= ఇది నాకు సంబంధించిన సంగతి.

తాత్పర్యం: అంతట, భీముడు అర్జునుడు నకులుడు సహదేవుడు గంధర్వులను తమవెంటబెట్టుకొని ధర్మరాజు సమక్షానికి వెళ్ళారు. మనచెడ్డపన్నాగం బెడిసికొట్టటంచేత చెరపెట్టబడిన నన్ను ఆ అజాతశత్రుండు అయిన ధర్మరాజుముందట నిల్పారు. ఆ అజాతశత్రుడు నన్ను విడిచి పుచ్చాడు. ఇది నా జరిగిన కథ.

క. ఒవ్వనివారల యెదురన । యివ్విధమున భంగపడితి నే; నింక జనుల్
నవ్వఁగ నేటి బ్రదుకుగా । నివ్వసుమతి యేలువాఁడ? నెట్లు చరింతున్? 16

ప్రతిపదార్థం: ఏను= నేను; ఒవ్వనివారల+ఎదురన్+అ= శత్రువుల యొక్క సమక్షంలోనే; ఈ+విధమునన్= ఈ రీతిగా; భంగపడితిన్= అవమానం పొందాను; ఇంకన్= ఇకమీద; జనుల్= ప్రజలు; నవ్వఁగన్= వేళాకోళంచేయగా; ఏటి; బ్రదుకు+కాన్= ఎటువంటి జీవితంగా; ఈ+వసుమతి= ఈ భూమిని; ఏలువాఁడన్?= పరిపాలించగలను?; ఎట్లు= ఏవిధంగా; చరింతున్?= ప్రవర్తించగలను?.

తాత్పర్యం: శత్రువుల సమక్షంలో ఈవిధంగా మిక్కిలి పరాభవం పొందానుగదా! ఇక ప్రజలు అందరు నన్ను వెక్కిరించరా! ఇటువంటి బ్రదుకు నాకిక ఎందుకు? ఈ భూమిని నేను ఇక ఎట్లా పరిపాలించగలను?; ఇకమీద ఏమొగం పెట్టుకొని తిరుగాడగలను?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఒవ్వు= గిట్టు, సరిపడు అని ఈక్రియకు అర్థం. అయితే - ఈధాతువుకు - వ్యతిరేకార్థంలో మాత్రమే 'ఒవ్వని' - అని ప్రయోగాలు కన్పిస్తున్నాయి.

ఉ. **అక్కట! యమ్మహారణమునందు వియచ్చరకోటితోడఁ బే**
రుక్కునఁ బోరి యేను మృతి నొందఁగ నేరన; యట్టు లైన నీ
తక్కువపాటు లేక ప్రమదంబున దేవపదంబు నొందుదున్;
మిక్కిలి యైన కీర్తియును మేదినియందు వెలుంగు నిత్యమై. **17**

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో! (ఎంతటి దురవస్థప్రాప్తించింది); ఆ+మహారణమునందున్= ఆ గొప్ప యుద్ధంలో; వియత్+చరకోటితోడన్= గంధర్వుల సమూహంతో; పేరు+ఉక్కునన్= గొప్ప పరాక్రమంతో; పోరి= యుద్ధంచేసి; ఏను= నేను; మృతిన్+ఒందఁగన్+నేరను+అ= నేను మరణించి ఉండలేకపోయాను కదా! (చనిపోయిఉంటే ఎంత బాగా ఉండేది); అట్టులు+ఐనన్= ఆవిధంగా జరిగిఉన్నట్లయితే - (అంటే వీరమరణం పొంది ఉంటే); ఈ తక్కువపాటు= ఈపరాభవం; లేక= ఉండకుండా; ప్రమదంబునన్= సంతోషంతో; దేవపదంబున్= స్వర్గలోకాన్ని; ఒందుదున్= అనుభవిస్తాను; మిక్కిలి+ఐన= మిక్కుటమైన; కీర్తియును= యశస్సుకూడా; మేదినిఅందున్= భూలోకంలో; నిత్యము+ఐ= శాశ్వతమైనదై; వెలుంగున్= ప్రకాశిస్తుంది.

తాత్పర్యం: అయ్యో! నాకు ఎంతటి దురవస్థ ప్రాప్తించింది ! ఆ యుద్ధంలో గంధర్వసమూహాలతో పరాక్రమం ప్రదర్శించి పోరాడి వీరమరణం పొందజాలక పోయాను. ఆ విధంగా వీరమరణం పొంది ఉన్నట్లయితే నాకు ఈ పరాభవం ఉండేదికాదు, స్వర్గంలోకం ప్రాప్తించేది. గొప్పదైనకీర్తి భూమిపై శాశ్వతంగా వెలుగొందేది.

దుర్యోధనుండు ప్రాయోపవేశంబు సేయఁబూనుట (సం. 3-238-10)

వ. **కావున నిట్టి దురవస్థపాలైతి; నేను ప్రాయోపవేశంబునఁ బ్రాణపరిత్యాగంబుఁ జేసెద; మీరందఱు దుశ్శాసనుం బురస్కరించుకొని పురంబున కరుగునది; మిత్రులకుఁబ్రమోదంబును శత్రులకు నిర్వేదనంబునుం జేయుచు మను నట్టియేను నేఁడు పోఁడిమిసెడి, పగతురచేత శిరస్తాడనంబు సేయంబడి సిగ్గువడక బంధు జనంబులలోని కేమని యరుగుదు? నాంబికేయుం గని యే మని పలుకుదుఁ? గురువృద్ధు లైన భీష్మబాహ్లికులయు నాచార్యులయిన కృప ద్రోణులయు సమ్ముఖంబున నెట్లు నిలుతుఁ? బరిజనులుం బౌరులుం బురోహితులు నన్నుం గనిన నేమని సంభాషింతు? నిది యాత్మదోషంబున నైన యపాయంబు, నా కవశ్యభోక్తవ్యంబు.** **18**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఇట్టి= ఇటువంటి; దురవస్థ= చెడుస్థితి; పాలు+ఐతి= పొందాను; ఏను= నేను; ప్రాయోపవేశంబునన్= ఆహారం తీసికొనకుండా ఆమరణ ఉపవాస దీక్షతో (నిరశన వ్రతం అవలంబించి); ప్రాణ, పరిత్యాగంబున్= అసువులను విడవటం, మరణించటం; చేసెదన్= చేస్తాను; మీరు+అందఱున్= మీరు (శకుని కర్ణాదులు) అందరును; దుశ్శాసనున్= దుశ్శాసనుడిని; పురస్కరించుకొని= ముందిడుకొని, నాయకుడిగా పరిగ్రహించి; పురంబునకున్= నగరానికి (హస్తినాపురికి); అరుగునది= వెళ్లండి; మిత్రులకున్= స్నేహితులకు; ప్రమోదంబును= సంతోషాన్ని; శత్రులకున్= విరోధులకు; నిర్వేదనంబునున్= దైన్యాన్ని; చేయుచున్= చేస్తూ; మనునట్టి= బ్రతుకునట్టి; ఏను= నేను; నేఁడు= ఈనాడు; పోఁడిమి+చెడి= సొగసు కోల్పోయి; పగతురచేతన్= శత్రువులచేత; శిరస్+తాడనంబు= తలతన్నబడటం; చేయంబడి=

ఒనరించబడి; సిగ్గు+పడక= లజ్జ చెందకుండ; బంధుజనంబులలోనికిన్= చుట్టపక్కాలలోకి; ఏమని= ఏమి అని - ఏమొగంపెట్టుకొని; అరుగుదున్?= వెళ్లగలను?; ఆంబికేయున్+కని= అంబిక పుత్రుడు అయిన ధృతరాష్ట్రుడిని చూచి; ఏమి+అని= ఏవిధంగా; పలుకుదున్?= మాటలాడగలను?; కురు, వృద్ధులు+ఐన= కురువంశంలో పెద్దలు అయిన; భీష్మ, బాహ్లికులయున్= భీష్ముడి యొక్కయు, బాహ్లికుడియొక్కయు; ఆచార్యులు+అయిన= గురువులు అయిన; కృప, ద్రోణులయున్= కృపాచార్యుడియొక్క, ద్రోణుడి యొక్కయు; సమ్ముఖంబునన్= ఎదుట; ఎట్లు= ఏరీతిగా; నిలుతున్?= నిలబడగలను?; పరిజనులున్= సేవకులును, పౌరులున్= పురజనులును పురోహితులు= పురోహితులు; నన్నున్= నన్ను; కనినన్= చూడగా; ఏమి+అని= ఏ రీతిగా; సంభాషింతున్= మాట్లాడగలను?; ఇది= ఈ పరాభవం; ఆత్మదోషంబునన్= నాఅంతట నేను చేసికొన్న తప్పువలన (స్వయంకృతాపరాధం చొప్పున); ఐన= జరిగిన; అపాయంబు= కీడు; (కావున); నాకున్; అవశ్య, భోక్తవ్యంబు= తప్పనిసరిగా అనుభవించదగింది.

తాత్పర్యం: కాబట్టి, ఇటువంటి దీనస్థితి నాకు దాపురించింది. నేను నిరశనవ్రతం పూని మరణిస్తాను. నాకు గత్యంతరం లేదు. మీరు అందరు దుశ్శాసనుడిని నాయకుడిగా పరిగ్రహించి హస్తినాపురానికి పొండి, మిత్రులకు సంతోషాన్ని, శత్రువులకు దుఃఖాన్నీ కలిగిస్తూ తిరిగిన నేను ఈనాడు శత్రువులచేత పరాభవించబడి పరువు పోగొట్టుకొని తలవంచుకొని తిరగలేను. శత్రువులచేత తన్నబడిన శిరస్సుతో నేను చుట్టపక్కాలనడుమ ఏమొగం పెట్టుకొని పోగలను? ధృతరాష్ట్రుడితో ఎట్లా సంభాషించగలను? ఏమని మాట్లాడగలను? కురువంశంలో పెద్దలైన భీష్మ, బాహ్లికులతో ఎట్లా ఎదుటనిల్చి మాటాడగలను? గురువులైన కృపాచార్య, ద్రోణాచార్యులవారి సమక్షంలో, ఎట్లా నిలిచి మాటాడగలను? సేవకులకు ఆజ్ఞ లెట్లా ఇవ్వగలను? పురజనులూ, పురోహితులూ నన్ను సందర్శించవస్తే వారి నేవిధంగా పలకరించగలను? ఇది అంతా నా స్వయంకృతాపరాధం. పశ్చాత్తాపంతో ప్రాయశ్చిత్తానికి పూనుకొన్నాను. ఈ కర్మవిపరిపాకం నేను అనుభవించక తప్పదు.

క. **విను దుర్వినయాత్మకుఁ డగు । జనుఁ డుజ్జ్వల మైన సిరియు సద్విద్యయుఁ గ**
ల్గిన నందు మెలఁగనేరక । చెనఁటి తెఱంగునకుఁ జొచ్చి చెడిపోవుఁ దుదిన్. **19**

ప్రతిపదార్థం: విను(ము)= ఆలకించుము; దుర్వినయ+ఆత్మకుఁడు+అగు, జనుఁడు= చెడ్డ అహంకారం కల వ్యక్తి; ఉత్+జ్వలము+ఐన= మిక్కుటంగా ప్రకాశించే; సిరియున్= సంపదయున్నూ; సత్+విద్యయున్= మంచి చదువును; కల్గినన్= లభించగా; అందున్ (సిరియందును, చదువులందును); మెలఁగన్‌నేరక= ప్రవర్తింపజాలక; చెనఁటి, తెఱంగునకున్= మూర్ఖుని పద్ధతిలో; చొచ్చి= చేరి; తుదిన్= చివరకు; చెడిపోవున్= నశిస్తాడు.

తాత్పర్యం: ఆలకించుము. చెడ్డ అహంకారం కలవాడు సిరిసంపదలతో తులతూగవచ్చును, మంచిచదువు చదువ వచ్చును. కాని, వాటిని సవ్యంగా ఉపయోగించుకొననేరక మూర్ఖులు పోయే దారిని చేరి తుట్టతుదకు చెడిపోతాడు.

క. **అకటకట యిట్టికష్టము । నకు వచ్చితి నయ్య యేను; నన్నటె వైరి**
ప్రకరము లనిఁ బట్టినఁ గృప । నొకరుఁడు విడిపించె దైవ మోపదె యెట్లున్. **20**

ప్రతిపదార్థం: అకట+అకట= అయ్యో! అయ్యో!; ఏను= నేను; ఇట్టి, కష్టమునకున్ వచ్చితినయ్య= ఇటువంటి దీనస్థితికి దిగజారవలసి వచ్చింది; నన్నున్+అటె= నా అంతటివాడిని సయితం; వైరి, ప్రకరములు శత్రు సమూహాలు; అనిన్= యుద్ధంలో; పట్టినన్= బంధించగా; కృపన్= జాలితో; ఒకరుఁడు= ఎవడో మరొకడు; విడిపించెన్= బంధవిముక్తుడిని చేశాడు; ఎట్లున్= ఏరీతిగా అయినా; (ఏది ఎట్లా జరగాలన్నా); దైవము= అదృష్టశక్తి; ఓపదె= శక్తికలదు కాదా? (శక్తికలదని భావం).

తాత్పర్యం: అయ్యో! అయ్యో! నాకు ఎంతటి దురవస్థ కలిగింది. నా అంతటివాడిని శత్రువులు యుద్ధంలో ఓడించి చెఱబట్టటమా! జాలితో ఒకడెవడో వచ్చి నన్ను బంధవిముక్తుడిని చేయటమా! ఏవిధంగా జరిపించటానికైనా దైవానికి శక్తి ఉన్నది. ఎంతటి బలవంతులైనా విధిచేతిలో కీలుబొమ్మలే కదా!

క. మానము సెడియును నిమ్మై । మేనం బ్రాణంబు లెట్లు మేకొని తాల్తుం?
గాన యిది నిశ్చయముగాఁ । బూనితి నాతెగువ మాన్పఁ బోల దొరులకున్.' 21

ప్రతిపదార్థం: మానము+చెడియునున్= ఆత్మాభిమానం పాడైపోయినప్పటికిని; ఇమ్మైన్= ఈ రీతిగా; మేనన్= శరీరంలో; ప్రాణంబులు= అసువులు; మేకొని= అంగీకరించి; ఎట్లు= ఏవిధంగా; తాల్తున్= ధరించగలను? కాన= కావున; ఇది= ఈ నిరశనవ్రతం; నిశ్చయముగాన్= దృఢమైన ఉద్దేశంతో; పూనితిన్= వహించాను; నాతెగువ= నా సాహసం; ఒరులకున్= ఇతరులకు; మాన్పన్+పోలదు= ఆపటానికి వీలు లేదు.

తాత్పర్యం: 'ఆత్మాభిమానం పాడయిపోయి, ఈ విధంగా ఈ శరీరంలో అసువులను నేను ఎట్లా భరించగలను? మానం కంటె ప్రాణం గొప్పది కాదు. ఇది నా దృఢమైన అభిప్రాయం, నేను ప్రాయోపవేశదీక్ష పూని ప్రాణాలను విడనాడదలచాను. దీనికి తిరుగు లేదు. ఎవరూ నా సాహసాన్ని మాన్పలేరు' అని దుర్యోధనుడు పలికాడు.

వ. అని పలికి సమీపగతుం డయిన దుశ్శాసను నాలోకించి యమ్మహీపాలుం డి ట్లనియె. 22

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; సమీపగతుండు+అయిన= దగ్గరకు వచ్చి నిలచిఉన్న; దుశ్శాసనున్= దుస్సేనుడిని; ఆలోకించి= చూచి; ఆ+మహీపాలుండు= ఆ రాజు, ఆదుర్యోధనుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: అంత - ఆతనిదరికి వచ్చి నిలబడిన దుశ్శాసనుడిని చూచి దుర్యోధనుడు ఇట్లా అన్నాడు.

సీ. 'అన్న! దుశ్శాసన! నిన్ను రాజ్యమునకుఁ । బట్టంబు గట్టెదఁ బతివి గమ్ము;
శకునికర్ణులు దీర్పఁ బ్రకటవసుంధరా । వలయమంతయు మహోజ్జ్వలత నేలు;
భ్రాతృవర్గమునకుఁ బ్రీతి సేయుము; బంధుఁ । జనుల బోషింపుము; సద్ద్విజులకు
నుత్తమంబుగఁ దగువృత్తులు సెల్లింపు; । గురుజనంబుల భక్తిఁ గొలువు మెపుడు;

తే. నింద్రుఁ డమరగణంబుల నేలునట్లు । ధరణి పతుల నేలుము; బాహుదర్ప మొప్పఁ
బగఱ నుక్కడఁగింపుము; పరమమిత్త్రు । లైన శూరులఁ గొనియాడు మర్థభంగి'. 23

ప్రతిపదార్థం: అన్న, దుశ్శాసన!= నాయనా, దుశ్శాసనా!; నిన్నున్; రాజ్యమునకున్= ప్రభుత్వానికి; పట్టంబు+కట్టెదన్= పట్టాభిషిక్తుడిని చేస్తాను; పతివి+కమ్ము= రాజువు అగుము; శకుని, కర్ణులు, తీర్పన్= శకుని, కర్ణుడు అమర్చగా; ప్రకట, వసుంధరా, వలయమున్= కనుపించునట్టి భూమండలాన్ని; అంతయున్= సమస్తం; మహా+ఉత్+జ్వలతన్= గొప్పగా ప్రకాశించేటట్లుగా; ఏలు(ము)= పరిపాలించుము; భ్రాతృవర్గమునకున్= సోదరసముహానికి; ప్రీతి+చేయుము= సంతుష్టిని కల్గించుము; సత్+ద్విజులకున్= మంచి బ్రాహ్మణులకు; ఉత్తమంబుగన్= శ్రేష్ఠంగా; తగు వృత్తులు= ఉచితమైన ఈనాములు; చెల్లింపు(ము)= ఇమ్ము; ఎపుడున్= ఎల్లప్పుడును; గురుజనంబులన్= పెద్దలైన వారిని; భక్తిన్= పూజ్యభావంతో; కొలువుము= ఆరాధించుము; ఇంద్రుఁడు= వేలుపుదొర; అమర, గణంబులన్= వేల్పుల సముదాయాలను; ఏలునట్లు= పరిపాలించేటట్లుగా; ధరణిపతులన్= రాజులను; ఏలుము= పరిపాలించుము; పగఱన్= శత్రువులను; బాహుదర్పము+ఒప్పన్= పరాక్రమం శోభిల్లేటట్లుగా; ఉక్కు+అడఁ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గింపుము= మదాన్ని అణచివేయుము; పరమమిత్త్రులు+ఐన= మిక్కిలి స్నేహితులు అయిన; శూరులన్= వీరులను; అర్హభంగిన్= ఉచితమైన పద్ధతిలో; కొనియాడుము= కీర్తించుము.

తాత్పర్యం: 'నాయనా! దుశ్శాసనా! నీకు పట్టం కట్టుతాను, నీవే రాజువు కమ్ము; శకుని కర్ణుడు నీకు సర్వాన్నీ అమర్చి పెట్టగలరు. ఈ భూమండలమంతటిని దేదీప్యమానుడవై పరిపాలించుము. సోదరసమూహానికి సంతృప్తి కలిగించుము. చుట్టపక్కాలను పోషించుము. బ్రాహ్మణోత్తములకు అగ్రహారాలను దానంచేయుము. పెద్దలను పూజించుము. పరాక్రమంతో శత్రువులను నాశనం చేయుము. శూరులైన మిత్రులను సముచితంగా సమ్మానించుము.

వ. అనిన నమ్మాట దనహృదయంబునకు నిశితశూలంబయిన, నతండు నిలువ నోపక యగ్రజు పాదంబులపయిం బడి, 'దేవా! యిట్లానతీఁ దగదు; నాకుం బ్రసన్నుండ వగు' మని నిజనేత్రజలంబులం దదీయ చరణయుగళం బభిషేకించుచు నిట్లనియె. 24

ప్రతిపదార్థం: అనినన్= అని దుర్యోధనుడు చెప్పగా; ఆ+మాట= ఆ పలుకు; తన, హృదయంబునకున్= తన డెందానికి; నిశిత శూలంబు+అయినన్= వాడి బల్లెంవలె తగులగా; అతండు= దుశ్శాసనుడు; నిలువన్+ఓపక= ఆగజాలక; అగ్రజు= అన్నయొక్క; పాదంబులపయిన్+పడి= కాళ్లమీద వ్రాలి; దేవా!= ప్రభూ! (ఓదుర్యోధనసార్వభౌమా!); ఇట్లు= ఈ రీతిగా; ఆనతి+ఈన్+తగదు= ఆజ్ఞాపించరాదు; నాకున్+ప్రసన్నుండవు+అగుము= నాపట్ల అనుగ్రహం కలవాడవు కమ్ము; అని= అని చెప్పి; నిజనేత్ర, జలంబులన్= తన కన్నీళ్లతో; తదీయ, చరణ, యుగళంబు= అతడి పాదాలజంటను; అభిషేకించుచున్= తడుపుతూ; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: అని దుర్యోధనుడు చెప్పాడు. దుర్యోధనుడిమాటలు దుశ్శాసనుడి హృదయానికి వాడిబల్లేలమాదిరి గ్రుచ్చుకొన్నాయి. అంతట దుశ్శాసనుడు నిలువజాలక అన్న అయిన దుర్యోధనుడి కాళ్లమీద పడి, తన కన్నీళ్లతో ఆతడికాళ్లు తడిపి ఇట్లా పలికాడు.

చ. 'అవని విదీర్ణ మైనను, హిమాద్రి చలించుట గల్గినన్, మహా
ర్ణవ మది యింకినన్, దివసనాథుఁడుఁ జంద్రుఁడు దేజ మేదినం,
గువలయనాథ! నీకు నొక కుత్సితభావముఁ గల్గ నేర్చునే!
భవదుపయోగ్య మైన నృపభారము నాకు వహింప శక్యమే? 25

ప్రతిపదార్థం: కువలయనాథ!= భూమికి భర్తవైన రాజా! (ఓ దుర్యోధన సార్వభౌమా!); అవని= భూమి; విదీర్ణము+ఐనను= బ్రద్దలయిప్పటికి; హిమ+అద్రి= మంచుకొండ; చలించుట= కదలటం; కల్గినన్= ఏర్పడినప్పటికి; మహా+అర్ణవము= గొప్పసముద్రం; అది= అది(అంతటిది); ఇంకినన్= ఎండిపోయినప్పటికి; దివసనాథుఁడున్= సూర్యుడున్నూ (పగటికిభర్త); చంద్రుఁడున్= చందమామయున్నూ; తేజము= వెలుగు; ఏదినన్= కోలుపోయినప్పటికీ; నీకున్= నీకు; ఒక= ఒక; కుత్సితభావమున్= నికృష్ట మైన ఆలోచన; కల్గన్‌నేర్చునే?= కలుగ గలదా?; భవత్+ఉపయోగ్యము+ఐన= నీకు ఉపయోగపడ దగిన; నృపభారము= రాజునకు సంబంధించిన బరువు, బాధ్యత; నాకున్= నాకు; వహింపన్= మోయటానికి; శక్యము+ఏ?= సాధ్యం అగునా?

తాత్పర్యం: ఓ దుర్యోధన సార్వభౌమా! రాజ్యభారం వహించవలసిన వాడవు నీవే. నీకొరకే ఈ రాజ్యం ఏర్పడింది. ఈపృథివి ముక్క చెక్కలు అగు గాక. సముద్రం ఇంకిపోవుగాక! సూర్యచంద్రులు తమతేజాలు కోలుపోతారుకాక. నీలో ఎట్టి నికృష్టభావాలు పొడసూపకుండునుగాక! నేను నీవు వహింపదగిన రాజ్యభారాన్ని మోయజాలను సుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. హితు లైనవారిఁ బ్రోచుచు । సతతంబును రిపుల నెల్లఁ జమరుచు నిఖిల
క్షితితలము నీవ యేలుము । శతసంవత్సరము లధిప! జయశీలుఁడవై.' 26

ప్రతిపదార్థం: అధిప!= ఓమహారాజా!; హితులు+ఐనవారిన్= మిత్రులు అయిన వారిని; ప్రోచుచున్= కాపాడుతూ; సతతంబును= ఎల్లప్పుడును; రిపులన్+ఎల్లన్= శత్రువులనందరిని; చమరుచున్= నాశనం చేస్తూ; నిఖిలక్షితితలమున్= సమస్తమైన భూమండలాన్ని; నీవు+అ= నీవే; శతసంవత్సరములు= నూరు ఏండ్లు; జయశీలుఁడవు+ఐ= విజయం సాధించే స్వభావం కలవాడవై; ఏలుము= పరిపాలించుము.

తాత్పర్యం: మహారాజా! మిత్రులను కాపాడుతూ, శత్రువులను నశింపజేస్తూ నీవు ఈ భూమండలం సమస్తం విజయపరంపరలను సాధిస్తూ నూరుసంవత్సరాలు పరిపాలింపుము.'

వ. అనుచునయ్యువరాజు దుఃఖాతిభారవిహ్వలుండై యెలుంగెత్తి యేడ్చిన, నయ్యన్నయుంగన్నీరొలుక నూరకుండె; నప్పుడు కర్ణుండు వారలంజూచి' యిట్లేల బాలిశులుంబోలెనేడ్చెదరు? ధైర్యంబులు ధరియించి శోకవ్యసనంబులు విడువుండు; శోకశీలురం జూచి పగతురు సంతసిల్లుదురు; శోకశీలురకుఁ బైపై శోకంబులు వొందు' నని దుర్యోధనుం బేర్కొని యిట్లనియె. 27

ప్రతిపదార్థం: అనుచున్= అనిపలుకుతూ; ఆ+యువరాజు= ఆ దుశ్శాసనుడు; దుఃఖ+అతిభార, విహ్వలుండు+ఐ= వగపుబరువుచేత క్షోభించి అవయవాల పట్టు తప్పినవాడై; ఎలుంగు+ఎత్తి= కంఠస్వరాన్ని ఎక్కువ చేసి; ఏడ్చినన్= శోకించగా; ఆ+అన్నయున్= ఆ అగ్రజుడు అయిన దుర్యోధనుడు కూడా; కన్నీరు+ఒలుకన్= కంటినీరు కారగా; ఊరకుండెన్= మిన్నకున్నాడు; అప్పుడు= ఆ సమయంలో; కర్ణుండు= కర్ణుడు; వారలన్+చూచి= వారలను (దుర్యోధన దుశ్శాసనులను) కాంచి; ఇట్లు+ఏల= ఈవిధంగా ఎందుకు; బాలిశులున్+పోలెన్= పసిబిడ్డలవలె, మూర్ఖులవలె; ఏడ్చెదరు= శోకిస్తారు; ధైర్యంబులు= చిత్తవైకల్యం లేని మనోనిగ్రహాలు; ధరియించి= వహించి; శోకవ్యసనంబులు= దుఃఖం కష్టాలు; విడువుండు= వదలిపెట్టండి; శోకశీలురన్+చూచి= ఏడుపుగొట్టువారిని కాంచి; పగతురు= శత్రువులు; సంతసిల్లుదురు= ప్రమోదం చెందుతారు; శోకశీలురకున్= దుఃఖవివశులయ్యే స్వభావం కలవారికి; పైపైన్= క్రమంగా; శోకంబులు= దుఃఖాలు; పొందును= కలుగుతాయి; అని= అని చెప్పి; దుర్యోధనున్+పేర్కొని= దుర్యోధనుడిని సంబోధించి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: అని చెప్పి, యువరాజు అయిన దుశ్శాసనుడు సంక్షోభించిన హృదయంతో వశం తప్పిన అవయవాలు కలవాడై బిగ్గరగా ఏడ్చాడు. అన్నగారైన దుర్యోధనుడు కంటినీరు కారుస్తూ మిన్నకున్నాడు. అపుడు కర్ణుడు వారిని చూచి, 'ఈవిధంగా మీరు ఇరువురూ పసిబిడ్డలవలె ఎందుకు ఏడుస్తున్నారు? మీరు ధైర్యంగా ఉండవలసినవారు. దుఃఖం మంచిది గాదు. ఏడ్చేవారిని చూచి శత్రువులు సంతోషిస్తారు. అంతేకాక, దుఃఖించే వారికి మరికొన్ని కష్టాలు క్రమంగా దాపురించి పైనబడుతుండటం కద్దు' అని చెప్పి, దుర్యోధనుడిని సంబోధించి ఈవిధంగా పలికాడు.

ఉ. 'ఒకయల్పమనుజు క్రియ సో । మకులోత్తమ! నీకు నిట్లు మహనీయసుఖ
ప్రకృతి యగు నిజశరీరం । బకట! విడువఁ దలఁపనగునె? యవిహితబుద్ధిన్. 28

ప్రతిపదార్థం: సోమ, కుల+ఉత్తమ!= చంద్రవంశంలో పుట్టినవారిలో శ్రేష్ఠుడవైనవాడా!; ఒక+అల్ప, మనుజు, క్రియన్= ఒకనీచమానవుడి వలె; నీకున్= నీకు; ఇట్లు= ఈ రీతిగా; అవిహితబుద్ధిన్= క్రమశిక్షణ లేని మనస్సులో; మహనీయ, సుఖ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రకృతి+అగు= గొప్ప సౌఖ్యాలను అనుభవించే స్వభావం కలది అయిన; నిజ శరీరంబు= స్వీయదేహం; అకట!= అయ్యో!; విడువన్= విడిచిపెట్టటానికి; తలఁపన్+అగునె= ఆలోచించవచ్చునా (ఆలోచించరాదు).

తాత్పర్యం: చంద్రవంశంలో జన్మించిన వారిలో శ్రేష్ఠుడవైన ఓసుయోధనమహారాజా! ఒక నీచమానవమాత్రుడి మాదిరిగా నీవు దుఃఖించతగునా? గొప్ప భోగభాగ్యాలు అనుభవించతగిన నీశరీరాన్ని విడిచిపెట్టటానికై అయ్యో! ఆత్మహత్యకు పూనతగునా? అట్టిపని క్రమశిక్షణ లేని దుర్బలమనస్కులు మాత్రమే చేస్తారు కాని నీవంటివారికి అది తగినపని కాదుసుమా!

తే. **శోకమగ్నుండ వగు నిన్నుఁ జూచి బెగడి । యధిప! నీతమ్ములును నేను నధికదుఃఖ**
వహ్ని పాల్పడ మయ్య! మావలనఁ గరుణ । గలిగి తీర్పవె యిందఱఁ గౌరవేంద్ర! **29**

ప్రతిపదార్థం: అధిప= రాజా! (దుర్యోధనమహారాజా!)!; శోకమగ్నుండవు+అగు= దుఃఖంలో మునిగిన వాడవయిన; నిన్నున్= నిన్ను; చూచి= అరసి; బెగడి= ధైర్యంవీడి; నీ తమ్ములును= నీ అనుజులును; నేను= నేను (కర్ణుడును); అధిక, దుఃఖ, వహ్ని= గొప్పశోకం అనెడి అగ్నికి; పాల్పడము+అయ్య= వశమైనవారలముకామా? (దుఃఖమనెడి అగ్నికి చిక్కుతాము); కౌరవ+ఇంద్ర!= కౌరవులకు ప్రభువైనవాడా! దుర్యోధనసార్వభౌమా!; మా వలనన్= మా యందు; కరుణ= దయ; కలిగి= ఉండి; ఇందఱన్+ ఇంతమందిని; తీర్చవె?= సంతృప్తిని పొందింపవా?

తాత్పర్యం: కౌరవులకు ప్రభు వయిన ఓ దుర్యోధన సార్వభౌమా! నీవు మాకు అధిపతివి. నీవు దుఃఖంలో మునిగితే నిన్ను చూచి, దుశ్శాసనుడు మున్నగు నీతమ్ములున్నూ, నేనున్నూ మిక్కుటమైన దుఃఖం అనే అగ్నికి ఆహుతి అయిపోతాంకదా! నీవు మాపట్ల జాలి గలిగి ఇంతమందిని సంతృప్తి పరచటానికైనా నీ నిరశనవ్రతం విరమించదగును.

విశేషం: 1. దుఃఖవహ్ని= దుఃఖం అనే అగ్ని. అలం : రూపకం. 2. ప్రాయోపవేశం దుర్యోధనుడి ఆత్మహత్యకు దారితీయటం మాత్రమేగాక- పలువుర మరణాలకు కారణం ఔతుందని కర్ణుడి హెచ్చరిక.

వ. **పాండవులచేత విముక్తుండ నైతి నని వగచె; దంతియకాని నీకుం గార్యగతియందు వివేకంబు సాల; దది యెట్లనిన, నేరాజు రాజ్యంబున నిశ్చింతు లయిన జనులు తమతమ జీవనంబుల వర్తింతు రారాజునకు నట్టిజనులుబంట్లు; గావునఁదా రమ్మహీపతికిం దీఱమిగల్గిన చోట్ల నెల్లనుందమపౌరుషంబులు నెఱపవలయుఁ; గౌంతేయులు నీదేశంబున నుండి నీయాజ్ఞవలనం గృతారంభులై యున్న వా రగుటంజేసి వారు నీకింకరులు; నీకునైన యక్కఱ దీర్చుట వారి కర్తృ కృత్యంబు; దీని కింత వనర నేల?; యదియునుంగాక పాండవులు జూదంబునాఁడ నీకు దాసు లైరి; తదీయంబు లైన మణికనకాదివస్తువులును భవదధీనంబులై యున్నయవి; వారు నిన్నుం గొలిచియుండుట లేకుండెనేనియు నింతటి కెలసంబు దీర్ప నేనియు వలదే; యిది యంతయు నూహించి వలవనివగలం బొగులక లెమ్ము! పురంబునకు నడువుము; నామాట వినక నిర్బంధపరుండ వైతేనియు ని న్నేమనవచ్చు; నిందఱము నీపోయిన గతిన పోవంగలవారము; నీవు లోకంబు చేత నగుఁబాటును బొందెద; వింతియ' యని కర్ణుండు సెప్పిన విని దుర్యోధనుండు వెండియుం బ్రాయోపవేశంబునందు నిశ్చయంబు వదలకున్నం గనుంగొని శకుని యి ట్లనియె.** **30**

ప్రతిపదార్థం: పాండవులచేతన్; విముక్తుండన్+ఐతిన్= బంధమోక్షణం చేయబడినవాడను అయినాను; అని= అంటూ; వగచెదు= దుఃఖిస్తావు; అంతియకాని= అంతేకాని; నీకున్; కార్యగతియందున్= చేయవలసిన పనిని జరపటంలో; వివేకంబు=విచారణచేసి భిన్నవస్తువులందు గల సూక్ష్మభేదాన్ని గుర్తించే తెలివి; చాలదు= సరిగా లేదు; అది= (వివేకంలేకపోవటం); ఎట్లు+అనినన్= ఎటువంటిది అంటే; ఏరాజు రాజ్యంబునన్= ఏప్రభువు ఏలుతున్న సీమలో; నిశ్చింతులు= దుఃఖం లేనివారు; అయినజనులు; తమ, తమ, జీవనంబులన్= తమతమత బ్రదుకుతెరువులలో; వర్తింతురు= (సుఖంగా) మెలగుతారో; ఆరాజునకున్= ఆప్రభువుకు; అట్టి జనులు= ఆవిధంగా (సుఖజీవితం గడిపే) ప్రజలు; బంట్లు= సేవకులు; కావునన్= కాబట్టి; తారు= తాము; ఆ+మహీపతికిన్= ఆరాజుకు; తీఱమి+కల్గిన, చోట్లన్+ఎల్లనున్= ఆపద (అక్కర) ఏర్పడిన అన్నితావుల్లో; తమపౌరుషంబులు= తమపరాక్రమాలు; నెఱపన్‌వలయున్= ప్రదర్శించాలి; కౌంతేయులు= కుంతీదేవి కుమారులు అయిన పాండవులు; నీదేశంబునన్+ఉండి= నీవు పరిపాలించే రాజ్యంలో నివసించి; నీ+ఆజ్ఞవలనన్= నీ ఆనతిచొప్పున; కృత+ఆరంభులు+ఐ+ఉన్నవారు= చేయబడిన ప్రయత్నాలు కలవారు (నెరవేరిన పనులు కలవారు); అగుటన్+చేసి= అగుటచేత; వారు= ఆ పాండవులు; నీకింకరులు= నీసేవకులు; నీకున్+ఐన= నీకు ఏర్పడిన; అక్కఱ= అవసరాన్ని; తీర్చుట= నెరవేర్చుట; వారికిన్= ఆ పాండవులకు; అర్హకృత్యంబు= తగినపని; దీనికిన్= ఈవిధంగా జరిగినదానికి; ఇంత= ఇంత ఎక్కువగా, ఈవిధంగా; వనరన్+ఏల?= దుఃఖించటం ఎందుకు?; అదియునున్+కాక= అంత మాత్రమే కాక (పై చెప్పబడిన హేతువుకు అదనంగా); పాండవులు= పాండునందనులు; జూదంబునాఁడు+అ= ద్యూతం ఆడిన రోజే; నీకున్; దాసులు; ఐరి; తదీయంబులు+అయిన= వారి వైన; మణి, కనక+ఆది, వస్తువులును= రత్నాలు, బంగారాలు మున్నగు పదార్థాలు సయితం; భవత్+అధీనంబులు+ఐ= నీకు లోబడినవి అయి; ఉన్న+అవి= ఉన్నవి; వారు= ఆ పాండవులు; నిన్నున్, కొలచి+ఉండుట+ లేకుండెన్+ఏనియున్= నిన్ను నీ కొలువుకూటంలో సేవించి ఉండటం చేయకపోయినా; ఇంతటి= ఈవిధంగా ఉన్నటువంటి; కెలసంబు= పని; తీర్పన్+ఏనియున్, వలదే= చేయవద్దా (చేసి తీరవలెను); ఇది+అంతయున్= ఈవిషయాన్ని అంతటిని; ఊహించి= ఆలోచించి; వలవని= కూడని; వగలన్= దుఃఖాలలో, పొగులక= వెతచెందక; లెమ్ము= లేచి నిలబడుము (అనగా అజ్ఞానం వీడి మేలుకొని అనంతరం కర్తవ్యం నిర్వహించటానికి సంసిద్ధుడవు కమ్ము); పురంబునకున్= నగరానికి (హస్తినాపట్టణానికి); నడువుము= బయలుదేరుము; నామాటన్= నేను చెప్పిన పలుకులను; వినన్= ఆలకించక (అంగీకరించక); నిర్బంధ పరుండవు+ ఐతి+ ఏనియున్= బంధంలో చిక్కుకొన్నవాడవు అయితే; నిన్నున్= నిన్ను; ఏమి+అనన్‌వచ్చున్= ఏమనగలము?; ఇందరము= ఇంతమందిమి; నీపోయినగతిన్+అ= నీవు వెళ్లే మార్గంలోనే; పోవన్+కలవారము= వెడలగలవారం; నీవు= నీవు, ఓదుర్యోధనమహారాజా!; లోకంబుచేతన్= లోకంలోని అందరుప్రజలచేత; నగుఁబాటును, పొందెదవు= నవ్వుల పాలవుతావు; ఇంతియ= ఇంతే సుమా!; అని; కర్ణుండున్ చెప్పినన్; విని= ఆలకించి వెండియున్= మరల; ప్రాయోపవేశంబునందున్= నిరశనవ్రతదీక్షను పూనటంలోని; నిశ్చయంబు= నిర్ణయాన్ని; వదలక+ఉన్నన్= వీడక ఉండగా; కనుంగొని= గమనించి; శకుని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'నేను గంధర్వులచేత జయించబడటం ఒకవిధమైన పరాభవం. అంతకంటె శోచనీయమైనది నాశత్రువులు అయిన పాండవులచేత చెఱనుండి విడుదల చేయబడటం. ఇది ఇమ్మడి పరాభవం' అని అభిమానధనుడ వైన నీవు దుఃఖించటం ఆలోచిస్తే స్థూలదృష్టికి సరిఅయినదే కాని, సూక్ష్మదృష్టికి సరి అయినది కాదు. జ్ఞానానికి మూలం విచక్షణ. అసలు పాండవులు ఎవరు? వారు నీరాజ్యంలో సుఖంగా జీవిస్తున్న పౌరులు కదా! రాజుకు ఆపదవచ్చినప్పుడు తమప్రాణాలొడ్డి అయినా పౌరులు రాజుకు సేవ చేయాలికదా! పాండవులు నీసేవకులు. నీవు పాండవులకు ఏలిక అయిన సార్వభౌముడవు. పాండవులు నీరాజ్యంలో శాంతిభద్రతలను అనుభవిస్తూ నివసిస్తున్న సేవకులు. సేవకుల ధర్మం రాజరక్షణ. కాబట్టి వారు తమ ప్రభు ఋణం దీర్చుకొనటానికి నిన్ను విడిపించారు. ఇది వారికి అవశ్యకర్తవ్యం. అంతేగాక - జూదంలో నీకు ఓడిపోయిననాడే పాండవులు నీకు దాసులు. వారి ధనధాన్యసంపదలు పౌరుషప్రాభవాలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అన్నియు నీసొత్తుకదా! అసలు పాండవులు నీకొలువుకూటంలోనే ఉండి నిత్యమూ నీకు సేవలు చేయవలసిన వారే. ఏదో అక్కర యేర్పడినపుడు ముందుకు వచ్చి నీకు సేవ చేసి తమస్వామిభక్తిని ప్రకటించి ధన్యులైనారు. ఈవిధంగా, సూక్ష్మదృష్టితో విచక్షణ చేసి నీప్రాయోపవేశ దీక్షను విరమించి, మునుముందు నిర్వహించవలసిన పనికి పూనుకొనుము. లేదేని లోకులు నిన్ను పరిహసిస్తారు' అని కర్ణుడు దుర్యోధనుడికి హితబోధ చేశాడు. కాని, దుర్యోధనుడు తన పట్టుదల వదలక, నిరశనవ్రతదీక్షను పూనటంలోనే స్థిరసంకల్పం కలవాడయ్యాడు. అప్పుడు శకుని దుర్యోధనుడితో ఈ విధంగా చెప్పాడు.

క. 'కర్ణుని యాడిన మాటలు । నిర్ణయమున కింత యొప్పునే! యిప్పలుకుల్
కర్ణంబులఁ జొనుపుము; దుః । ఖార్ణవపారంబుఁ బొందు మవనీనాథా ! 31

ప్రతిపదార్థం: అవనీనాథా!= భూమికి భర్తవైన రాజా! (ఓదుర్యోధనా!); కర్ణుని+ఆడినమాటలు= కర్ణుడు చెప్పిన పలుకులు; నిర్ణయమునకున్= కర్తవ్యాన్ని నిశ్చయించటానికి; ఇంత= ఈవిధంగా, ఇంతచక్కగా; ఒప్పునే!= సరిపడునా!; ఈ+పలుకుల్= ఈమాటలు; కర్ణంబులన్= చెవులలోకి; చొనుపుము= దూర్చుము; దుఃఖ+అర్ణవ, పారంబున్= శోకం అనెడి సముద్రపు అవ్వలిగట్టును; పొందుము= పడయుము, చేరుము.

తాత్పర్యం: ఓ దుర్యోధనమహారాజా ! కర్ణుడు చక్కని చిక్కని హితబోధ నీకు చేశాడు. ఆతని మాటలు సందర్భశుద్ధి కలవి. విచక్షణ విజ్ఞానంతో కూడినట్టివి. ఆతడు చెప్పినట్లుగా ప్రవర్తించి, నీకు దాపురించిన దుఃఖ సముద్రంనుండి బయటపడు.

విశేషం: దుఃఖార్ణవము= దుఃఖం అనెడి అర్ణవము అలం: రూపకం.

తరలము.

కడఁగి బుద్ధిబలంబునంద యకంటకంబుగఁ జేసి యేఁ
బుడమిరాజ్యము సర్వముం దగఁ బుచ్చి యిచ్చిన నిమ్ములం
గుడువ నేరక దీని నిచ్చటఁ గూలఁ దన్ని శరీరమున్
విడుతుఁ గా కని నిశ్చయించెదు వెఱ్ఱి వైతె నరేశ్వరా! 32

ప్రతిపదార్థం: నర+ఈశ్వరా!= ప్రజలకు అధిపతి వైన ఓరాజా! దుర్యోధనా!; కడఁగి= పూని; బుద్ధిబలంబునందున్+అ= కేవలం తెలివితేటల మహిమచేత మాత్రమే; ఏన్= నేను; పుడమి రాజ్యమున్= భూమిరాజ్యాన్ని అకంటకంబుగన్+చేసి= శత్రువులులేని దానినిగా ఒనర్చి, సర్వమున్= సమస్తం (సర్వరాజ్యం); తగన్= ఒప్పునట్లుగా; పుచ్చి యిచ్చినన్= తీసి ఇవ్వగా; ఇమ్ములన్= సంప్రీతితో; కుడువన్‌నేరక= అనుభవించజాలక; దీనిన్; ఇచ్చటన్; కూలన్+తన్ని= పతనమయ్యేటట్లుగా కాలితో తాడించి; శరీరమున్= దేహాన్ని; విడుతున్+కాక+అని= విడిచిపెట్టుతాను సుమా అని; నిశ్చయించెదు= నిర్ణయిస్తున్నావు; వెఱ్ఱివి+ఐతి+ఎ= పిచ్చివాడవు అయినావా?.

తాత్పర్యం: ఓ దుర్యోధనా ! నీవు సాధారణమానవుడవు కావు; సార్వభౌముడవు. నీకర్తవ్యాన్ని గూర్చి జాగరూకతతో యోచించుము. నీకు ఈ భూమిరాజ్యాన్ని సమస్తాన్నీ కేవలం నాబుద్ధిబలంచేత (అనగా మాయాద్యూతమహిమచేత)

నీకు సంపాదించి ఇచ్చాను. నీవు నీబాహుబలంచేత సంపాదించింది కాదుకదా ఈ రాజ్యం. నీవు ఆర్జించినచో దానిని నీవు త్యజింప వచ్చునుగాని, నేను నీకు సంపాదించి ఇచ్చిన దానిని నీవు త్యజిస్తే నామనస్సు ఖేదపడుతుందికదా. నీవు కష్టపడి సంపాదించ నక్కరలేకుండా, సంక్రమించిన రాజ్యాన్ని హాయిగా అనుభవించకుండ ప్రాయోపవేశదీక్షతో ఆత్మహత్యకు పూనుకొనటం అవివేకం. నీకు పిచ్చి ఎక్కిందా ఏమిటి?

విశేషం: వృత్త లక్షణానికి చూడు. 4.402 విశేషాంశం.

ఆ. నీకు వృద్ధసేవ లేకున్కి యిప్పుడు । నాకుఁ దెల్లమయ్యెఁ బ్రాకటముగఁ
గోపమును మనోనుతాపంబుఁ బొందుచో । ధీరుఁ డపుడ యడఁప నేరవలదె. 33

ప్రతిపదార్థం: నీకున్= (ఓదుర్యోధనా) నీకు; వృద్ధసేవ= పెద్దలసేవ (పెద్దలకు పరిచర్యచేయటం); లేక+ఉన్కి= లేకపోవటం; నాకున్= నాకు; ప్రాకటముగన్= సుస్పష్టంగా; తెల్లము+అయ్యెన్= తెలిసింది; ధీరుఁడు= ధైర్యం కలవాడు (జంకుగొంకులు లేక ఆపదలలో కలతచెందని మనస్సు కలిగి నిలువగలవాడు); కోపమును= ఆగ్రహాన్ని; మనస్+అనుతాపంబున్= చిత్తంలో ఏర్పడిన వ్యాకులతను; పొందుచోన్= అనుభవించేటప్పుడు; అపుడు+అ= అప్పుడే; అడఁపన్ నేరవలదె= అణచివేయవలదా (అణచివేయాలి సుమా).

తాత్పర్యం: నీలోని లోపాన్ని నేను కనిపెట్టాను. నీవు యువరాజుగా పుట్టి పెరిగిన ఆగర్భశ్రీమంతుడవు. నీవు పెద్దలకు పరిచర్య చేయలేదు. పెద్దలకు పరిచర్య చేయటంచేత లభించే వ్యావహారికజ్ఞానం వేరు. సిద్ధాంతాలను గూర్చిన శ్రుతపాండిత్యం వేరు. అప్పుడప్పుడు - కోపం రావచ్చును. మానసిక వ్యాకులత ఏర్పడవచ్చును. ధీరుడైనవాడు అట్టి వికారాలను వెనువెంటనే త్రుంచివేయాలి కాని వాటి వలన విహ్వాలుడు కాగూడదు.

విశేషం: గ్రాంథిక జ్ఞానం చాలదు. "చదువు - అనుభవమ్మునాటి గాదు". శ్రుతులు స్మృతులు భిన్నభిన్నమార్గాలు సూచిస్తాయి. ఎచ్చటను ఏకైకప్రమాణం కానరాదు. ఇక కర్తవ్యం నిర్ణయించడం ఎట్లా? పెద్దలు నడిచిన మార్గమే శరణ్యం. ఇది ప్రాచీనసంస్కృతిమర్యాద. "ధర్మము బహుమార్గ దృష్టంబు". మహాభారతంలో ధర్మవ్యాధుడి గాథలోని ప్రవచనం. ధర్మం గ్రాంథిక జ్ఞానంవలన తెలియనగును గాని 'ధర్మసూక్ష్మములు' - పెద్దల ప్రవర్తనల వల్లనే తేటతెల్లం ఔతాయి. మహాభారతం పంచమవేదం. ధర్మతత్త్వజ్ఞుల దృష్టిలో పలుతావులలో ధర్మశాస్త్రం. మహాభారతంలో పలుతావులలో సూక్ష్మప్రస్తావన ఉన్నది. దయ్యాలు వేదాలను వల్లెవేయవచ్చును. శకుని - మాయాద్యూతకారుడు. ధర్మపన్నాలను ఉదాహరించటానికి జంకలేదు.

తే. పిఱికితనము నేమఱుటయు నొఱువతనము । మెత్తఁబాటును గార్యంబు నత్తెఱంగు
నేరమియు విషయంబులఁ గూరుటయును । గలుగు పతికి నుండదు సిరి దొలఁగి పోవు. 34

ప్రతిపదార్థం: పిఱికితనమున్= భయపడే స్వభావమూ, ఏమఱుటయున్= మరపూ; ప్రమత్తతా; ఒఱువతనము= వికారత్వమున్నూ, మెత్తఁబాటును= మృదు స్వభావమున్నూ; కార్యంబు+ఆ+తెఱంగు, నేరమియున్= చేయవలసిన పనిని ఏవిధంగా చేయవలెనో ఆవిధం తెలియక పోవుటయున్నూ; విషయంబులన్= ఇంద్రియసుఖాలలో; కూరుటయును= తగులుకొనుటయును; కలుగు= ఉండే; పతికిన్= రాజుకు; సిరి= లక్ష్మి; తొలఁగిపోవున్= దూరమైపోతుంది.

తాత్పర్యం: భయపడేస్వభావం, ప్రమత్తత, వికారత్వం, మరీ మెత్తదనం, కర్తవ్యాలను నిర్వహించటంలో విచక్షణ లేకపోవటం మొదలైన లక్షణాలు కల రాజుకు సిరి తొలగిపోతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. కావునఁ గార్యజ్ఞుండ వగుము; కార్యజ్ఞానం బెట్టి దనిన. 35

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; కార్యజ్ఞుండవు+అగుము= చేయవలసిన పనిని ఏవిధంగా చేయనగునో తెలిసినవాడవు కమ్ము; కార్యజ్ఞానంబు= కర్తవ్యాన్ని గూర్చిన తెలివిడి; ఎట్టిది+అనినన్= ఎటువంటిదంటే.

తాత్పర్యం: కావున నీవు చేయవలసిన పనిని ఏవిధంగా చేయవలెనో తెలిసికొన్న వాడవు కమ్ము. కర్తవ్యాన్ని గూర్చిన జ్ఞానం ఎటువంటిదంటే.

ఉ. కౌరవనాథ! నీకు నుపకారము సేసిరి పాండవేయు ల
వ్వీరులయందు నెయ్యమును వేడ్కయు నొప్పఁగ నీ వభీష్టస
త్కారముసేఁత యుక్తమగుఁ గాక ప్రియంపడ నర్హమైనచో
దారుణశోకవహ్నిపరితాపముఁ బొందుట యిప్డు ధర్మువే? 36

ప్రతిపదార్థం: కౌరవనాథ!= కౌరవులకు ప్రభువైనవాడా- ఓదుర్యోధనసార్వభౌమా!; పాండవేయులు= పాండురాజు కొడుకులు; నీకున్; ఉపకారము+చేసిరి= సాయం చేశారు; ఆ+వీరులయందున్= ఆ శూరులతో; నెయ్యమును= మైత్రియును; వేడ్కయున్= ఆనందమును; ఒప్పఁగన్= విలసిల్లగా; నీవు; అభీష్టసత్కారము+చేఁత= మిక్కిలిఇష్టమైన సమ్మానం చేయటం; యుక్తము+అగున్+కాక= సరిపోలుతుంది గాక; ప్రియంపడన్= ఇష్టపడటానికి; అర్హము+ఐనచోన్= యోగ్యమైనచోట; దారుణ, శోక, వహ్ని, పరితాపమున్= భయంకరమైన దుఃఖం అనే అగ్నిలో పడిన ఆవేదనను; పొందుట= అనుభవించటం; ఇప్డు= ఇపుడు, ఈసమయంలో; ధర్మువే= ధర్మమా,- ధర్మం కాదుసుమా.

తాత్పర్యం: ఓ దుర్యోధనమహారాజా! పాండునందనులు నీకు ఉపకారం చేసినమాట నిజం. నీవు వారికి ప్రత్యుపకారం చేయటం పాడి. వారిని సత్కరించుము. ప్రేమతో వారియెడ మైత్రి నెరపుము. అంతేకాని, సంతోషింపవలసినచోట నీవు ఘోరమైన దుఃఖమనే అగ్నిలో పడి వెతచెందటం సరైనపని కాదు సుమా!

చ. కృతముఁ దలంచి చిత్తమునఁ గిల్బిషమంతయు నుజ్జగించి స
న్మతులఁ బృథాతనూజుల నమానుషతేజులఁ బిల్వఁ బంచి, త
త్పితృధన మైన రాజ్యము నభీష్టముగాఁ దగ నిమ్ము; నీకు నీ
క్షితివలయంబునం బరమకీర్తియుఁ బుణ్యముఁ గల్గు భూవరా! 37

ప్రతిపదార్థం: భూవరా!= భూమికి భర్త అయిన రాజా, - దుర్యోధనా! చిత్తమునన్= మనస్సులోపల; కృతమున్+తలంచి= పాండవులు నీకొనర్చిన ఉపకారమును స్మరించి; కిల్బిషము+అంతయున్= పాపం సర్వమూ; ఉజ్జగించి= వదలిపెట్టి; సత్+మతులన్= మంచిబుద్ధి కలవారిని; పృథాతనూజులన్= కుంతియొక్క కొడుకులను, పాండవులను; అమానుష, తేజులన్= మనుజులకు అతీతమైన దివ్యమైన వర్చస్సు కలవారిని; పిల్వన్+పంచి= ఆహ్వానించటానికి ఆజ్ఞ నొసగి; తత్+పితృధనము+ఐన= వారల తండ్రికి సంబంధించిన సొత్తు అయిన; రాజ్యమున్= (పరిపాలనకు లోబడిన) దేశాన్ని; అభీష్టముగాన్= సంప్రీతితో; తగన్+ఇమ్ము= ఒప్పునట్లుగా ఒసంగుము; నీకున్= నీకు; ఈ క్షితివలయంబునన్= ఈ భూమండలంలో; కీర్తియున్= యశస్సు; పుణ్యమున్= సుకృతం; కల్గున్= లభిస్తుంది.

తాత్పర్యం: పాండవులు నీకు చేసిన మేలును గుర్తించి, నీమనస్సులో ఉన్న పాపాన్ని అంతటిని తుడిచి వేసి, వారిని ఆహ్వానించుము. కుంతీకుమారులు సజ్జనులు, లోకోత్తర పరాక్రమవంతులు, దివ్యతేజస్సు కలవారు, పాండవులకు పైతృకమైన రాజ్యాన్ని ఇచ్చి, సంప్రీతితో సమ్మానించుము. అప్పుడు నీకు ఈ భూమండలాలలో సాటిలేని కీర్తి, పుణ్యం లభించగలవు.

క. వారలు నీతోఁబుట్టువు; । లీరాజ్యము మీరు వారు నేకం బై పెం
పారఁగ నేలుఁడు; దీనం । గౌరవకులనాథ ! సౌఖ్యగౌరవ మొందున్.' 38

ప్రతిపదార్థం: కౌరవకులనాథ!= కౌరవవంశానికి అధినేత వైన ఓ దుర్యోధనా! వారలు= వారు (ఆపాండవులు); నీతోఁబుట్టువులు= నీ సహోదరులు; ఈరాజ్యము= మీ పరిపాలనకు లోబడిన ఈ దేశం; మీరున్, వారున్= మీరున్నూ, వారున్నూ (కౌరవులు, పాండవులు); ఏకంబు+ఐ= ఐకమత్యంతో కూడినవారై; పెంపు+ఆరఁగన్= అభ్యుదయం కలిగేటట్లుగా; ఏలుఁడు= పరిపాలించుడు; దీనన్= దీనివలన (కౌరవపాండవులు) ఏకం కావటంచేత; సౌఖ్యగౌరవము+ఒందున్= అధిక సుఖం ఏర్పడుతుంది.

తాత్పర్యం: కౌరవవంశానికి అధినేత వైన ఓ దుర్యోధనా! పాండవులు నీకు తోడబుట్టినవారు. మీరూ పాండవులూ ఐకమత్యం కలిగి ఈ రాజ్యాన్ని పరిపాలించండి. ఆ విధంగా చేస్తే మీ ఉభయులకూ సౌఖ్యం గొప్పతనం చేకూరుతాయి.

వ. అని శకుని చెప్పుచుండ నగ్గాంధారీనందనుండు నిజచరణసమీపంబునం బడి యున్న దుశ్శాసనుం గ్రుచ్చి యెత్తి మూర్ధాఘ్రాణంబు సేసి కర్ణసౌబలులం జూచి 'మీ రేల నన్నుఁగారించెదరు? ధర్మైశ్వర్యధనభోగంబులందు నా కభిలాషంబు లేదు; ప్రాయోపవేశంబునందుఁ గృతనిశ్చయుండ నైతి; మీ రింక నొండు విఘ్నంబులు సేయక యూరక మీ వలయునెడకుం బొం' డనిన వారలు 'దేవా! నీవిధం బిట్టిద యయ్యె నేని మే మెందుఁ జేరెదము? నీతోడివారము కాక' యని; రంతం గమలహితుండు పశ్చిమాచల సమీపగతుం డగుటయు నన్నరనాథుండు సురలోకగమనకుతూహలి యై శుచిస్నానంబు సేసి వల్కలంబులు ధరియించి, సంధ్యాసమయ సముచితంబులగు కరణీయంబులు నిర్వర్తించి, వివిక్తదేశంబునందు దర్భాస్తరణంబున నాసీనుండై వాఙ్నియతుండై. 39

ప్రతిపదార్థం: అని= అనుచు; శకుని; చెప్పుచున్+ఉండన్= వచిస్తూ ఉండగా; ఆ+గాంధారీనందనుండు= గాంధారి కొడుకు దుర్యోధనుడు; నిజ, చరణ, సమీపంబునన్= తనఅడుగులదగ్గర; పడి+ఉన్న= వ్రాలిఉన్న; దుశ్శాసనున్; గ్రుచ్చి+ఎత్తి= కౌగిలించుకొని లేవదీసి; మూర్ధ+ఆఘ్రాణంబు+చేసి= తలను వాసన చూచి; కర్ణసౌబలులన్= కర్ణుడిని మరియు శకునిని; చూచి= అరసి; మీరు= మీరు; ఏల= ఎందులకు; నన్నున్= నన్ను; కారించెదరు?= బాధిస్తారు?; ధర్మ+ఐశ్వర్య, ధన, భోగంబులందున్= ధర్మంలో సంపదలో ద్రవ్యంలో సౌఖ్యాలను అనుభవించటంలో; నాకున్ అభిలాషంబు= కోరిక; లేదు; ప్రాయోపవేశంబు నందున్= ఆహారం తీసికొనకుండా మరణించటంలో; కృత, నిశ్చయుండన్+ఐతిన్= చేయబడిన నిర్ణయం కలవాడను అయినాను (నిరాహారదీక్షపూనటానికి దృఢసంకల్పం వహించాను); మీరు= కర్ణ శకుని దుశ్శాసనాదులు ఇంకన్= ఇక, ఒండు= వేరు; విఘ్నంబులు= ఆటంకాలు; చేయక= సలుపక, ఊరక= మిన్నక; మీవలయు+ఎడకున్= మీకు ఇష్టమైన

చోటికి; పొండు= వెళ్లండి; అనినన్= అని చెప్పగా; వారలు= వారు (కర్ణశకుని దుశ్శాసనులు); దేవా!= ప్రభూ!; నీవిధంబు= నీ పద్ధతి; ఇట్టిది+అ= ఇది మాత్రమే (ప్రాయోపవేశమే); అయ్యేన్+ఏని= అయితే; మేము= మేము (కర్ణశకుని దుశ్శాసనాదులము); ఎందున్= ఎక్కడికి; చేరెదము= వెళ్ళుతాం; నీతోడివారము+అ, కాక= నీతోడనే సహగమనం చేసే వారం సుమా; అనిరి= అనిచెప్పారు; అంతన్= అంతట; కమలహితుండు= పద్మమిత్రుడు సూర్యుడు; పశ్చిమ+అచల, సమీప, గతుండు+అగుటయున్= పడమటికొండ దగ్గరకు వెళ్ళినవాడు కావటమున్నూ (అస్తమించుటయున్నూ); ఆ+నరనాథుండు= ఆరాజు- సుయోధనుడు; సురలోక గమన, కుతూహలి+ఐ= స్వర్గలోకానికి పోవటంలో వేడుకగలవాడై, (మరణించటానికి ఉద్యుక్తుడై); శుచిస్నానంబు+చేసి= పరిశుద్ధస్నానంచేసి; వల్కలంబులు= నారబట్టలు; ధరియించి= తాల్చి; సంధ్యా, సమయ, సముచితంబులు+అగు= సంజవేళల చేయదగినవి అయిన; కరణీయంబులు= విధులు; నిర్వర్తించి= చేసి; వివిక్త, దేశంబునందున్= ఏకాంతమైన స్థలంలో; దర్భ+ఆస్తరణంబునన్= దర్భలతో చేయబడిన చాపమీద; ఆసీనుండు+ఐ= కూర్చున్నవాడయి; వాక్+నియతుండు+ఐ= మౌనవ్రతం పూనినవాడై.

తాత్పర్యం: ఆవిధంగా శకుని అభిప్రాయం వివరించాడు. అంతట దుర్యోధనుడు తన పాదాలదగ్గర వ్రాలి కన్నీరు కారుస్తున్న తమ్ముడు దుశ్శాసనుడిని కౌగిట చేర్చి ఎత్తి శిరస్సును నిమిరి వాసన చూచి, కర్ణుడితో శకునితో, 'ఎందుకు మీరు నన్ను బాధిస్తున్నారు? నాకు ధర్మంపై కాని, సంపదపైకాని, ధనధాన్యాలపై కాని ఇష్టం లేదు. నిరాహారదీక్ష పూనుటకే నేను నిశ్చయించుకొన్నాను. ఇది నా దృఢసంకల్పం సుమా! నన్ను వారించకండి; మీరు మీఇష్టం వచ్చిన చోటికి పొండి' అని చెప్పాడు. అంతట వారు 'ప్రభూ! మేము నిన్ను విడిచి వేరేచోటికి పోజాలం. నీతోపాటు సహగమనం చేయగలం' అని బదులు పలికారు. అప్పుడు సూర్యుడు అస్తమించే వేళ అయింది. దుర్యోధనుడు స్వర్గలోకానికి వెళ్లటానికి నిశ్చయించుకొని స్నానం చేసి పవిత్రమైన దర్భలచాపమీద కూర్చొని, సంధ్యాసమయంలో చేయదగిన పనులు చేసి ఏకాంతప్రదేశంలో మౌనవ్రతం అవలంబించినవాడై.

క. క్రమమున బాహ్యేంద్రియక । ర్మము లెల్లను వదల విడిచి మహిత సమాధి
క్రమదశ నుండె నివాత । స్తిమితంబై వెలుఁగుచున్న దీపము పోలెన్. 40

ప్రతిపదార్థం: క్రమమునన్= వరుసగా; బాహ్య+ఇంద్రియ, కర్మములు+ఎల్లను= పైకి కనిపించే ఇంద్రియాలు చేసే పనులు అన్నిటిని; వదలన్ విడిచి= వీడునట్లుగా త్యజించి; మహిత, సమాధి క్రమదశన్= గొప్ప సమాధి స్థితిలో; నివాతస్తిమితంబు+ఐ= గాలి లేమిచే కదలకుండ ఉండునట్టిదై; వెలుఁగుచున్న= ప్రకాశిస్తున్న; దీపము, పోలెన్= జ్యోతివలె; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: నిరాహారదీక్షను పూనిన దుర్యోధనుడు క్రమక్రమంగా బాహ్యా లైన ఇంద్రియాలు చేసే క్రియలను ఉజ్జగించ గలిగాడు. గొప్ప 'సమాధి' స్థితిలో గాలి లేని చోట నిశ్చలంగా ప్రకాశిస్తున్న దీపంవలె వెలుగొందాడు.

విశేషం: 1. అలం : "ఉపమ". 2. బాహ్యేంద్రియాలు ఇవి పది. జ్ఞానేంద్రియాలు అయిదు- చక్షువు, త్వక్కు, శ్రోత్రం, జిహ్వ, ఘ్రాణం. కర్మేంద్రియాలు అయిదు- వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ. అంతరింద్రియం - మనస్సు. 3. సమాధి. యోగప్రస్థానంలో సమాధి చిట్టచివరి దశ. పతంజలి యోగసాధనను- అష్టాంగ మార్గంగా ప్రస్తరించాడు. 1. యమం. 2. నియమం 3. ఆసనం 4. ప్రాణాయామం 5. ప్రత్యాహారం 6. ధారణ 7. ధ్యానం 8. సమాధి. చిత్తవృత్తి నిరోధం యోగం. చిత్తం బహుధాచంచలం. సమాధిలో చిత్తచాంచల్యం నశించి బుద్ధి స్థిరసౌదామని వలె భాసిస్తుంది. అది అలలు లేని కడలి. స్తిమిత మైన దీపకళిక.

ప్రాయోపవిష్టుండైన దుర్యోధనునిఁ గృత్య పాతాళంబునకుఁ గొనిపోవుట (సం. 3-239-18)

సీ. **ఆ సమయమున ము న్నమరేంద్ర విజితు లై । యహిలోకమున నున్న యసురవరులు**
ధృతరాష్ట్రనందను తెగువ యెఱింగి యా । త్మీయపక్షక్షయస్థితికి వగచి
యాతనిఁ బిలిపింప నప్పుడు శుక్రాదు । లైన భూసుర సమూహములచేత
వేల్మి వెట్టించిన వేగంబ యొక కృత్య । వెలువడి భీషణవికృతమూర్తి

శా. **'యేమి పనులు గలిగె నెఱిఁగింపుఁ' డనిన, వా । 'రిచటి కిపుడు కౌరవేంద్రు ననఘు**
నుజ్జ్వలాంగు నా సుయోధనుఁ దెమ్ము, ప్రా । యోపవేశవృత్తి నున్నవాని. **41**

ప్రతిపదార్థం: ఆసమయమునన్= ఆకాలంలో, మున్ను= అంతకుపూర్వం; అమర+ఇంద్ర, విజితులు+ఐ= వేల్పుల దొర అయిన ఇంద్రుడిచేత ఓడించబడిన వారయి; అహిలోకమునన్+ఉన్న= పాతాళలోకంలో ఉన్న; అసుర, వరులు= రాక్షసశ్రేష్ఠులు; ధృతరాష్ట్రనందను, తెగువ= ధృతరాష్ట్రుడి కొడుకు (దుర్యోధనుడి) యొక్క సాహసాన్ని; ఎఱింగి= తెలిసికొని; ఆత్మీయ, పక్ష, క్షయస్థితికిన్= తమవర్గం యొక్క నాశనం ఏర్పడటానికి; వగచి= దుఃఖించి; ఆతనిన్= ఆతడిని (దుర్యోధనుడిని); పిలిపింపన్= ఆహ్వానించి రప్పించటం కొరకై; అప్పుడు= ఆ సమయంలో; శుక్ర+ఆదులు+ఐన= శుక్రుడు మొదలుగా గల; భూసుర, సమూహములచేతన్= బ్రాహ్మణుల సముదాయం చేత; వేల్మి+పెట్టించినన్= హోమం చేయించగా; వేగంబు+అ= శీఘ్రంగా; ఒక కృత్య= అభిచారక్రియవలన పుట్టిన భీషణ వికృతమూర్తి విశేషం; భీషణ మూర్తి= భయంకరమైన అంగవికారంతో కూడిన రూపంకల్గినది (కృత్య); వెలువడి= బయటపడి; ఏమి= ఎటువంటి; పనులు+కలిగెన్= కార్యాలు ఏర్పడ్డాయి; ఎఱిఁగింపుఁడు= తెలుపుడు; అనినన్= అని అడుగగా; వారు= ఆ రాక్షస నాయకులు; ఇచటికిన్= ఇక్కడకు (పాతాళలోకానికి); అనఘున్= పాపరహితుడైనవాడిని; కౌరవ+ఇంద్రున్= కౌరవులలో శ్రేష్ఠుడయిన వాడిని; ఉత్+జ్వల+అంగున్= ప్రకాశించే దేహం కలవాడిని; ఆ+సుయోధనున్= ఆ దుర్యోధనుడిని; ప్రాయోపవేశ వృత్తిన్+ఉన్నవానిన్= మృతినొందేదాకా నిరాహార వ్రతాన్ని పూనినవాడిని; తెమ్ము= తీసికొని రమ్ము.

తాత్పర్యం: దేవేంద్రుడిచేత ఓడించబడినవారై ఆ సమయంలో పాతాళలోకంలో ఉన్న రాక్షసనాయకులు ధృతరాష్ట్రుడి కొడుకు అయిన దుర్యోధనుడు సాహసించి నిరాహారదీక్షను పూనిన సంగతి తెలిసికొని తమ వర్గం క్షయం చెందుతున్నదని దుఃఖించారు. అంతట వారు పాతాళహోమాన్ని చేయసంకల్పించి, శుక్రుడు మున్నగువారిచేత 'వేల్మి' పెట్టించారు. ఆ అభిచారహోమకుండం నుండి 'కృత్య' - భయంకర స్వరూపంతో ఆవిర్భవించి, 'నేను చేయవలసిన పనిని తెలపండి' అని అర్థించింది. అంతట రాక్షసశ్రేష్ఠులు- ఆమరణ నిరాహారదీక్షను పూనిన దుర్యోధనుడిని పాతాళలోకానికి తెమ్మని ఆ కృత్యను నియోగించారు.

వ. **అని పనిచినం గృత్యయు నాక్షణంబ చని ప్రాయోపవిష్టుండై యున్న దుర్యోధను గ్రుచ్చి యెత్తికొని రసాతలంబునకుం దెచ్చి, దైత్యులకు సమర్పించినం, బ్రీతులై వారు వానిం గౌఁగిలించుకొని కుశలం బడిగి, యిట్లనిరి: 'అయ్యా! నీవు శూరుండవు. శూరజన రక్షితుండవు, భరతకులోద్వహుండ; విట్టి సాహసం బేల చేసితివి? మఱి యాత్మఘాతుకునకు లోకంబున నిందయు, హీనతయు, దుర్గతియుం బ్రాపించు; లోకవిరుద్ధంబు లై మూల ఘాతంబు లైన కార్యంబులయందు నీయట్టి బుద్ధిమంతులు ప్రవర్తిల్లుదురే? యట్లుగావున, నీ వఖిల ధర్మార్థయశోభోగనాశం బైన యీదుర్విచారంబు విడువుము; ధైర్యంబును బ్రతాపంబును బాటింపుము;**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శత్రుజనభంజనంబు సేయుము; నీవు మనుష్యమాత్రుండవు గావు; నీపూర్వజన్మప్రకారంబు సెప్పెద; మాకర్ణింపుము. 42

ప్రతిపదార్థం: అని పనిచినన్= అని నియోగించగా; కృత్యయున్= కృత్యయును; ఆ క్షణంబు+అ= ఆ నిమేషమందే; చని= వెడలి; ప్రాయోపవిష్టుండు+ఐ+ఉన్న= నిరాహారదీక్షను వహించి ఉన్న; దుర్యోధనున్= సుయోధనుడిని; గ్రుచ్చి+ఎత్తికొని= కౌగిలించుకొని పైకెత్తి పట్టుకొని; రసాతలంబునకున్= పాతాళలోకానికి; తెచ్చి= తీసికొనివచ్చి; దైత్యులకున్= రాక్షసులకు; సమర్పించినన్= సాదరంగా ఇవ్వగా; ప్రీతులు+ఐ= సంతుష్టిచెందిన వారయి; వారు= ఆరాక్షసులు; వానిన్= దుర్యోధనుడిని; కౌఁగిలించుకొని= అక్కున చేర్చి; కుశలంబు+అడిగి= యోగక్షేమాలనుగూర్చి ప్రశ్నించి; ఇట్లు+అనిరి= ఈవిధంగా అన్నారు; అయ్యా!= ఆర్యా! (పూజించతగినవాడా!); నీవు; శూరుండవు= వీరుడవు; శూర, జన, రక్షితుండవు= వీరులైన వారిచేత కాపాడబడేవాడవు; భరత, కుల+ఉత్+వహుండవు= భరతవంశాన్ని ఉద్ధరించేవాడవు; ఇట్టి= ఇటువంటి; సాహసంబు= తెగువ; ఏల= ఎందుకు; చేసితివి= ఒనరించావు; మఱి= అంతియకాక; ఆత్మ, ఘాతుకునకున్= తనను తాను చంపుకొనేవాడికి; లోకంబునన్= ప్రపంచంలో; నిందయున్= అపవాదున్నూ; హీనతయున్= కొంచెపాటున్నూ; దుర్గతియున్= చెడ్డతెరువును; ప్రాపించున్= సంభవిస్తాయి; లోకవిరుద్ధంబులు+ఐ= ప్రపంచానికి వ్యతిరేకాలు అయి; మూల ఘాతంబులు+ఐన= ఆధారాలకే నష్టంవాటిల్లచేసేవి అయిన; కార్యంబుల+అందున్= పనులలో; నీ+అట్టి, బుద్ధిమంతులు= నీవంటి ఆలోచనపరులు ప్రవర్తిల్లుదురే= నడచెదరా; అట్లు+కావునన్= అందుచేత; నీవు; అఖిల, ధర్మ+అర్థ, యశస్+భోగ, నాశంబు+ఐన= సమస్తమైన ధర్మాలకు, సంపదలకు, కీర్తికి, సౌఖ్యానుభూతులకు నష్టం వాటిల్లచేసేది అయిన; ఈ, దుర్+విచారంబున్= ఈ చెడుయోచనను; విడువుము= వదలిపెట్టుము; ధైర్యంబును= స్థిరమైన చిత్తానికి సంబంధించిన నిలుకడయును; ప్రతాపంబును= శౌర్యాన్ని; పాటింపుము= అనుసరించుము; శత్రు, జన, భంజనంబు+చేయుము= విరోధులైన వారిని ఓడించుము; నీవు= నీవు (ఓ దుర్యోధనా నీవు); మనుష్యమాత్రుండవు= కేవలం మనుజుడవుమాత్రం; కావు; నీపూర్వజన్మప్రకారంబు= నీవెనుకటి పుట్టుకకు సంబంధించిన వృత్తాంతం; చెప్పెదము= వచిస్తాం; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని చెప్పి రాక్షసులు కృత్యను నియోగించారు. కృత్య ఆక్షణమే బయలుదేరి భూలోకానికి పోయి అక్కడ నిరాహారదీక్షలో ఉన్న దుర్యోధనుడిని కౌగిలించుకొని ఎత్తికొని మరల పాతాళలోకానికి వచ్చి రాక్షసులకు ఆతడిని సమర్పించింది. అంతట ఆ రాక్షసులు సంతసించి, ప్రీతిపూర్వకంగా దుర్యోధనుడిని మన్నించి ఆతడి యోగక్షేమాల నడిగి తెలిసికొని ఇట్లా పలికారు. 'అయ్యా! దుర్యోధనా! నీవు వీరుడవు. మహావీరులచేత కొలువబడుతున్నవాడవు; భరతవంశాన్ని ఉద్ధరించటానికి పుట్టినవాడివి. నీవు ఇటువంటి సాహసం ఎందుకు చేశావు? పిరికితనంతో ఆత్మహత్యకు పూనుకొన్నావు. ఆత్మహత్య చేసికొనేవాడికి ఈ ప్రపంచంలో అపకీర్తి దాపురిస్తుంది. దుర్గతి ప్రాప్తిస్తుంది. అతడిని అందరు హీనుడిగా పరిగణిస్తారు. నీవంటి మేధావులు లోకంలో అసహజంగా ఎంచబడే ప్రవర్తనకు లోనౌతారా? ధర్మాన్ని అర్థాన్ని సర్వసౌఖ్యానుభూతులను నాశం చేసే ఈ చెడుయోచన నీకు ఎట్లా కలిగింది? ఈ దురాలోచన వదలిపెట్టుము. ధైర్యంతో, శౌర్యంతో విజృంభించి శత్రువులను నాశనంచేయుము. నీవు సాధారణమనుష్యుడవు కావు. నీపూర్వజన్మవృత్తాంతం వివరించి చెప్తుతాం. వినుము. నీవు ఎంతటి గొప్పవాడవో నీకే తెలుస్తుంది.

ఉ. **ఏము తపంబు సేసి పరమేశ్వరు నీశ్వరుఁ బార్వతీమనః**
కాముకుఁ గామవైరి నవికారుఁ బురాంతకుఁ బ్రీతుఁ జేసినం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గామితదాయి యైన శితికంఠుఁడు నిన్ను సృజించి యిచ్చె ను
ద్దామదయావిధేయుఁడు ముదంబున మాకు నధీశ్వరుండుగన్. 43

ప్రతిపదార్థం: ఏము= మేము (రాక్షసులం); తపంబు+చేసి= తపస్సు ఒనర్చి; పరమ+ఈశ్వరున్= మహాదేవుడిని; ఈశ్వరున్= శివుడిని; పార్వతీ, మనస్+కాముకున్= పార్వతీదేవియొక్క మనస్సును చూరగొనినవాడిని; కామ వైరిన్= మన్మథుడికి శత్రువును- శివుడిని; అవికారున్= మార్పు లేని వాడిని- పుర+అంతకున్= త్రిపురాలను నాశనం చేసినవాడిని; ప్రీతున్+చేసినన్= సంతృప్తి చెందిన వాడినిగా ఒనరించగా; కామితదాయి+ఐన= కోరికలను ఇచ్చేవాడైన; శితికంఠుఁడు= నల్లని కంఠం కలవాడు- శివుడు; నిన్నున్= దుర్యోధనా! నిన్ను; ఉద్దామ, దయా, విధేయుఁడు= గొప్ప దైన కరుణకు లోబడిన వాడు- శివుడు; ముదంబునన్= సంతోషంతో; మాకున్= రాక్షసులమైన మాకు; అధీశ్వరుండుగన్= అధినేతగా; సృజించి= సృష్టించి; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: ఓ దుర్యోధనా! రాక్షసుల మైన మేము పరమేశ్వరుడినిగూర్చి గొప్పతపస్సు చేశాం. ఆ పరమశివుడు పార్వతీదేవిమనస్సును చూరగొనిన మహానుభావుడు, మన్మథుడిని దహించిన మహిమాన్వితుడు, త్రిపురాలను భస్మం చేసిన వీరుడు, కోరినవరాలను ఒసగు నట్టి దేవదేవుడు ఆ మహాదేవుడు. మా తపస్సును మెచ్చుకొని, మిక్కుటమైన కరుణతో నిన్ను సృష్టించి మాకు అధినేతగా ప్రసాదించాడు.

విశేషం: 1. శివుడు పార్వతిని పెండ్లాడటం 2. శివుడు మన్మథుడిని దహించటం 3. శివుడు త్రిపురాలను భస్మం చేయటం సుప్రసిద్ధ పౌరాణిక గాథలు.

ఉ. నీదగు పూర్వదేహము వినిర్మలవజ్రశిలావిశేష సం
పాదిత మస్త్రశస్త్రపరిపాటనభేద్యము గాదు, నిత్యనిః
ఖేదము పుష్పకోమలము ఖేచర భూచరకామినీమనో
హ్లాదన; మిట్లుగా నభవుఁ డర్థి నొనర్చె నుమాసమేతుఁడై. 44

ప్రతిపదార్థం: నీదగు= నీది+అగు; నీయొక్క; పూర్వదేహము= శరీరంలోని మొదటిభాగం (శిరస్సునుండి బొడ్డువరకు ఉన్నభాగం); వినిర్మల, వజ్ర, శిలా, విశేష, సంపాదితము= స్వచ్ఛ మైన వజ్రాలతో, గొప్పపాషాణాలతో సమకూర్చబడింది; అస్త్ర, శస్త్ర, పరిపాటనభేద్యముకాదు= మంత్రమహిమ గల ఆయుధాలతోను, ఆయుధాలతో ఖండింప శక్యమైనది కాదు; నిత్యనిః +ఖేదము= ఎల్లప్పుడును ఆనందతన్మయత్వంతో కూడి ఉండేది; పుష్పకోమలము= పూలవలె సుకుమార మైనది; ఖేచర; భూచరకామినీ, మనోహ్లాదనము= (ఖే,చర, భూ, చర, కామినీ, మనస్+హ్లాదనము)= ఆకాశంలో చరించే దేవతాస్త్రీలకు భూమిలోని స్త్రీలకు మనస్సుకు సంతోషం కలిగించేది; ఇట్లు+కాన్= ఈవిధంగా ఉండేటట్లుగా; అభవుఁడు= శివుడు; ఉమాసమేతుఁ డు+ఐ= పార్వతీదేవితో కూడినవాడై; అర్థిన్= ప్రీతితో; ఒనర్చెన్= చేశాడు.

తాత్పర్యం: నీశరీరం అమానుషం. పరమశివుడు పార్వతీదేవితో కూడిన వాడై నీశరీరాన్ని ప్రత్యేకలక్షణాలతో నిర్మించాడు. నీ శరీరంలోని పూర్వభాగం స్వచ్ఛమైన వజ్రశిలతో ఏర్పరచబడింది. అస్త్రాలు గాని శస్త్రాలుగాని నీశరీరాన్ని ఖండించలేవు. నీ శరీరం నిత్యసమ్మోదంతో దేవతాస్త్రీలకు, మానవవనితలకు మానసికోల్లాసం కల్గించేది; పుష్పసౌకుమార్యం కలది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. **నీవు ధరిత్రిఁ బుట్టుటయు నీకు సహాయము చేయఁ గోరి నా**
నావిధ దైత్యదానవగణంబులు రాజకులంబులందు స
ద్భావన నుద్భవించెఁ బటుబాహులు దివ్యమహాస్త్రకోవిదుల్
ద్రావితవైరు లుర్వి భగదత్తపురస్సరు లైన వీరులై. 45

ప్రతిపదార్థం: నీవు= ఓదుర్యోధనా! నీవు; ధరిత్రిన్= భూమిలో; పుట్టుటయున్= జన్మించగా; నీకున్; సహాయము= సాయం; చేయన్+కోరి= చేయతలపోసి; నానా, విధ, దైత్య, దానవ, గణంబులు= పెక్కురకాలైన రాక్షససమూహాలు; రాజకులంబులందున్= క్షత్రియవంశాలలో; సత్+భావనన్= మంచి ఆలోచనతో; పటుబాహులు= గొప్ప పరాక్రమం కలవారు; దివ్య, మహా+అస్త్ర, కోవిదుల్= దేవతామహిమ కల గొప్ప మంత్రపూరితమైన ఆయుధాలను ఎరిగినవారు; ద్రావిత, వైరులు= తరుమగొట్టబడిన శత్రువులు కలవారు (శత్రువులను ఓడించగలవారు); భగదత్త, పురస్సరులు+ఐన వీరులు+ఐ= భగదత్తుడు మొదలుగా గల శూరులు అయి; ఉర్విన్= భూమిపై; ఉద్భవించెన్= జన్మించారు.

తాత్పర్యం: నీవు కారణజన్ముడ వై భూలోకంలో అవతరించటంతోడనే, నీకు సాయం చేయటానికి రాక్షసులు పెక్కు తెగలకు చెందినవారు అందరు క్షత్రియవంశాలలో జన్మించారు. ఆ రాక్షస వీరులు గొప్ప పరాక్రమవంతులు. దివ్యాలైన అస్త్రాలు శస్త్రాలు ప్రయోగించే నేర్పరులు. శత్రువులను పారద్రోలగలిగినవారు. వారే భగదత్తుడు మున్నగువారు.

విశేషం: దైత్యులు= దితిసంతతివారు. దానవులు= దనువుసంతతివారు.

వ. **భీష్మద్రోణకృపాదులు గొందఱు దేవాంశసంభవులైనను దదీయభావంబులు రాక్షసావేశంబు నొందెడు; దానంజేసి వారు నిర్దయులై విమూఢులుంబోలె నన్యోన్య పరుషంబులు వలుకుచు నలుక మిగులం బుత్త్ర పౌత్త్రమిత్త్రభ్రాతృ శిష్యగురుబాలవృద్ధజనభేదంబులు విచారింపక సమరంబు సేసి దివ్యంబులు మానుషంబులు నైన వివిధాస్త్ర శస్త్రంబులఁ బాండవపక్షక్షయంబు గావింపం గలవారు; పాండవులు బంధుస్నేహంబు విడిచి తెగువకుం జొచ్చి నీచేత నిహతు లగుదురు; నీమనంబున బీభత్సువలని భయంబు గొంత గలదు; దాని నెఱింగి యేమునుం దగు నుపాయంబు దలంచితి; మది యెట్లనినఁ గృష్ణుచేతం జచ్చిన నరకాసురునంశంబు గర్ణు నావేశింపం గల యది; తత్కారణంబునం గృష్ణార్జునులతోడ బద్ధవైరుండై యవ్వీరుండు నిజదివ్యాస్త్రంబులం గృష్ణుల నిద్దఱ నిర్దహించు; నివ్విధం బెఱింగి యింద్రుండు పాండవ రక్షణార్థంబు వచ్చి కర్ణుకవచకుండలంబులు గపట రూపంబున నపహరింపం గలవాఁడు; మఱియును.** 46

ప్రతిపదార్థం: భీష్మ, ద్రోణ, కృప+ఆదులు= భీష్ముడు ద్రోణుడు కృపుడు మొదలైన; కొందఱు= కొంతమంది; దేవ+అంశ, సంభవులు+ఐనను= దేవతలయొక్క మహిమలో పాలు పంచుకొని పుట్టినవారే అయినను; తదీయ భావంబులు= వారియొక్క అభిప్రాయాలు; రాక్షస+ఆవేశంబున్= రక్కసులయొక్క వేగిరపాటును; ఒందెడున్= పొందుతాయి; దానన్+చేసి= అది కారణంగా; వారు; నిర్దయులు+ఐ= దయలేనివారై; అన్యోన్య పరుషంబులు= ఒకరినిగూర్చి ఇంకొకరు కఠినపదాలు; పలుకుచున్= మాటాడుతూ; అలుక, మిగులన్= కోపం అతిశయించగా; పుత్త్ర, పౌత్త్ర, మిత్త్ర, భ్రాతృ, శిష్య, గురు, బాల, వృద్ధజన, భేదంబులు= కొడుకులు, మనుమలు, స్నేహితులు, సోదరులు, తమదగ్గర చదువుకొనేవారు, ఉపాధ్యాయులు, బాలురు, ముసలివారు అనే తేడాలను; విచారింపక= ఆలోచించక; సమరంబు+చేసి= యుద్ధంచేసి; దివ్యంబులు= దేవతామహిమ

కలవియున్నా; మానుషంబులును+ఐన= మనుజులశక్తికి అనువైనవీ అయిన; వివిధ+అస్త్ర, శస్త్రంబులన్= పెక్కు మంత్రాయుధాలచేత, ఆయుధాలచేత; పాండవ, పక్ష, క్షయంబు= పాండవవర్గంవారి నాశనాన్ని; కావింపన్+కలవారు= చేస్తారు; పాండవులు; బంధు స్నేహంబు= చుట్టాలపై ఉండే నెయ్యం; విడిచి= వదలిపెట్టి; తెగువకున్+చొచ్చి= సాహసానికి పూని; నీచేతన్= ఓదుర్యోధనా! నీచేత; నిహతులు+అగుదురు= చంపబడతారు; నీమనంబునన్= నీచిత్తంలో; బీభత్సువలనిభయంబు= అర్జునుడిని గూర్చిన వెరపు; కొంత= కొంచెం; కలదు= ఉన్నది; దానిన్; ఎఱింగి= తెలిసికొని; ఏమునున్= మేముకూడా; తగు= సరిపడెడి; ఉపాయంబు= వెరవు; తలంచితిమి= ఆలోచించాం; అది= ఆ ఉపాయం; ఎట్లు+అనినన్= ఏవిధమైనది, అంటే; కృష్ణుచేతన్+చచ్చిన= శ్రీకృష్ణుడిచేత సంహరించబడిన; నరక+అసురు+అంశంబు= నరకుడు అనే రాక్షసుడి వ్యక్తిత్వమహిమ; కర్ణున్= కర్ణుడిని; ఆవేశింపన్+కల+అది= పూనగలదు; తత్+కారణంబునన్= ఆ హేతువువలన; కృష్ణ+అర్జునులతోడన్; బద్ధవైరుండు+ఐ= గాఢంగా ఏర్పడిన శత్రుత్వం కలవాడై; ఆ+వీరుండు= ఆశూరుడు; నిజ, దివ్య+అస్త్రంబులన్= తన వైన దేవతామహిమ గల ఆయుధాలచేత; కృష్ణులన్+ఇద్దఱన్= ఇరువురు కృష్ణులను (శ్రీకృష్ణుడిని అర్జునుడిని); నిర్దహించున్= కాల్చివేస్తాడు; ఈ+విధంబున్= ఈ తీరును; ఎఱింగి= తెలిసికొని; ఇంద్రుండు; పాండవ రక్షణ+అర్థంబు= ఆ పాండునందనులను కాపాడటంకొరకై; కర్ణుకవచకుండలంబులు= కర్ణుడియొక్క మైమరువును, కుండలాలను; కపటరూపంబునన్= మాయావియై; అపహరింపన్+కలవాఁడు= వంచనతో సంపాదించగలడు; మఱియును= ఇంకను.

తాత్పర్యం: భీష్ముడు ద్రోణుడు కృపుడు మున్నగువారు దేవతలమహిమలు పంచుకొని జన్మించిన మహానుభావులే కాని వారి చిత్తవృత్తులపై రాక్షసులప్రభావం ప్రసరించటంచేత వారు క్రూరులై ఒకరినొకరు నిందించికొంటూ బుద్ధిహీనులవలె ప్రవర్తించి, కొడుకులు మనుమలు స్నేహితులు సోదరులు శిష్యులు గురువులు, పిన్నలు, పెద్దలు అనే విచక్షణ లేకుండా యుద్ధంచేసి పాండవపక్షంపై దేవతామహిమ గల ఆయుధాలు ప్రయోగించి వారి సేనలను నాశనం చేస్తారు. పాండవులు చుట్టరికం మరచి దుస్సాహసంతో నీపై యుద్ధం చేసి మరణిస్తారు. నీ చిత్తంలో అర్జునుడిపై కొంతభీతి ఉన్నది. ఆవిషయం మాకు తెలుసు. దానికి ఒక మంచి విరుగుడు ఆలోచించాం. శ్రీకృష్ణుడిచేత నరకాసురుడు సంహరించబడ్డాడు గదా. ఆ నరకుడి అంశ కర్ణుడి ఆత్మీయతలో ప్రవేశించగలదు. అప్పుడు కర్ణుడు ఇనుమడించిన మహిమతో ఇద్దరు కృష్ణులను (శ్రీకృష్ణుడిని అర్జునుడిని) దహించగలడు. ఇంద్రుడు పాండవులను కాపాడటం కొరకై కర్ణుడిని మోసగించి, అతడి సహజ కవచకుండలాలను అపహరించగలడు. దీనివలన తనకొడుకు అయిన అర్జునుడు కర్ణుడికి తీసికట్టు అని దేవేంద్రుడు భయపడినట్లే తెలుతున్నదిగదా! ఇంకను మేము వివరించి చెప్పేది సావధానంగా వినుము.

క. క్షితి సంశప్తకు లనఁగా । శతలక్షసహస్రసంఖ్య జనియించిరి ద
ర్పితులై దనుజులు దద్బల । తతిచే సమరమున నింద్రతనయుఁడు సిక్కున్. 47

ప్రతిపదార్థం: దనుజులు= రాక్షసులు; క్షితిన్= భూమిపై; సంశప్తకులు+అనఁగాన్= ప్రతిజ్ఞ చేసి యుద్ధంనుండి మరలక విజయమో వీరస్వర్గమో చూరగొనెడి వీరులు అని పేరొందగా; శతలక్షసహస్రసంఖ్యన్= వందలక్షలవేల లెక్కలో; దర్పితులు+ఐ= గర్వం కలవారై; జనియించిరి= పుట్టారు; తత్+బల, తతిచేన్= ఆ సేనల సముదాయంచేత; సమరమునన్= యుద్ధంలో; ఇంద్రతనయుఁడు= ఇంద్రుడి కొడుకు, అర్జునుడు; చిక్కున్= దొరికిపోతాడు.

తాత్పర్యం: భూలోకంలో లక్షలు కోట్లకొలది వీరులు రాక్షసులు సంశప్తకులు అనే పేరుకలవారు జన్మించారు. వారు గొప్ప గర్వం కలవారు. వారు రణరంగంలో వెనుకంజవేయని వీరులు. 'విజయమో వీరస్వర్గమో' చూరగొనటానికై శపథంచేసి పోరాడే ధీరులు వారు. ఆ సంశప్తకులచేత అర్జునుడు ఓడించబడతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తరలము.

నిహతకంటక మైన యిద్ధరణీతలం బఖిలంబు నీ
మహితశాసనగోచరం బగు మానవేంద్ర! ప్రసన్నతా
మహిమ నొందుము, నీవ తేపవు మాకు నందఱకుం; గురూ
ద్వహ! విషాదము వొందఁ బాడియె దైత్యపక్షభయంబుగన్? 48

ప్రతిపదార్థం: మానవ+ఇంద్ర!= మనుజులలో ఇంద్రుడివంటి వాడవయిన ఓరాజా! దుర్యోధనా!; నిహత కంటకము+ఐన= చంపబడిన శత్రువులు కలది అయిన; ఈ+ధరణీతలంబు= ఈభూమండలం; అఖిలంబున్= సమస్తం; నీ మహిత శాసనగోచరంబు+అగున్= నీయొక్క గొప్ప దైన పరిపాలనకు లోబడుతుంది; ప్రసన్నతా, మహిమన్+ఒందుము= గొప్ప అనుగ్రహం కలవాడవు అగుము; నీవు+అ= నీవే; మాకున్+అందఱకున్= మా అందరికిన్నీ; తేపవు= తెప్పవు- అవ్వలిదరి చేర్చే పడవవు; కురు+ఉద్వహ!= కురువంశాన్ని ఉద్ధరించేవాడా, ఓదుర్యోధనా!; దైత్య, పక్ష, భయంబుగన్= రాక్షసులవర్గం భీతిచెందేటట్లుగా; విషాదము= దుఃఖం; పొందన్= అనుభవించగా; పాడియే?= న్యాయమా? (న్యాయం కాదు).

తాత్పర్యం: కురువంశాన్ని ఉద్ధరించే ఓ దుర్యోధనమహారాజా! ఎట్టి ఆటంకాలున్నూ లేని ఈభూమండలం సమస్తం నీ పరిపాలనలోకి వస్తుంది. నీవు ఏకచ్ఛత్రాధిపతి వై ఏలుకొనుము. మాయందు దయ చూపుము. నీవే మాకందరకు తెప్పవంటి వాడివి. రాక్షసులపక్షం దైన్యం చెందేటట్లుగా నీవు దుఃఖించటం న్యాయం కాదు.

విశేషం: వృత్తలక్షణానికి చూడు- 4.402 విశేషాంశం.

మ. **చను; మిం కొండు దలంపు మాను' మని యాశ్వాసించి వానిం బునః**
పునరాలింగన మాచరించి యెలమిం బూజించి, దైత్యోత్తముల్
జననాథోత్తము వీడు కొల్పిరి; తదాజ్ఞం జేసి యాకృత్యయున్
మును దాఁ దెచ్చిన చోటఁ బెట్టె నధిపున్ మోదంబు సంధిల్లఁగన్. 49

ప్రతిపదార్థం: చనుము= వెళ్లుము; ఇంకన్+ఒండు= వేరొక; తలంపు= ఆలోచన; మానుము= వదలుము; అని= అని చెప్పి; ఆశ్వాసించి= ఊరడించి; వానిన్= వానిని (దుర్యోధనుడిని); పునః+పునః+ఆలింగనము= మాటికి మాటికీ కౌగిలించుకొనుట; ఆచరించి= చేసి; ఎలమిన్= సంతోషంతో; పూజించి= ఆరాధించి; దైత్య+ఉత్తముల్= రాక్షసులలో శ్రేష్ఠులు; జన, నాథ+ఉత్తమున్= రాజులలో శ్రేష్ఠుడు అయిన వాడిని (దుర్యోధనుడిని); వీడుకొల్పిరి= మర్యాదపూర్వకంగా సెలవిచ్చి పంపారు; తత్+ఆజ్ఞన్+చేసి= వారి యొక్క (రాక్షసులయొక్క) ఆనతిచొప్పున; ఆ+కృత్యయున్= కృత్యకూడా; మును= లోగడ; తాన్= తాను; తెచ్చినచోటన్= (ఎచటినుండి దుర్యోధనుడినితెచ్చిందో) ఆస్థలంలోనే; మోదంబు= సంతోషం; సంధిల్లఁగన్= విలసిల్లేటట్లు; అధిపున్= రాజును (దుర్యోధనమహారాజును); పెట్టెన్= ఉంచింది

తాత్పర్యం: ఆ రాక్షసనాయకులు దుర్యోధనుడిని సమ్మానించి పలుమారులు కౌగిలించుకొని ఆదరంతో, 'ఓదుర్యోధన మహారాజా! నీవు వేరొక ఆలోచన నీమనస్సులోనికి రానీయవద్దు. నీకు విజయం సిద్ధిస్తుంది' అని ఊరడించి పలికి, అతడిని వీడ్కొలిపారు. ఆ రాక్షసులఆజ్ఞచొప్పున ఆ కృత్య దుర్యోధనమహారాజును తాను తెచ్చిన స్థలానికి గొంపోయి సంతోషం కలిగేటట్లు విడిచిపెట్టింది.

ఉ. అంత సుయోధనుండు హృదయంబున విస్మయ మంది యంత వృ
త్తాంతము స్వప్నవృత్తము క్రియం దలపోసి నిజంబ కాఁగ న
త్యంతము నిశ్చయించుచుఁ బృథాసుతులన్ సమరంబులోన ని
ర్జింతున కాక యంచు వికసిల్లె దురాశయ భగ్నబుద్ధియై. 50

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట; సుయోధనుండు= దుర్యోధనుడు; హృదయంబునన్= డెందంలో; విస్మయము+అంది= అచ్చెరువునంది; అంత, వృత్తాంతము= జరిగింది అంతయు; స్వప్న, వృత్తము క్రియన్= కలలో జరిగిన సంగతివలె; తలపోసి= తలచి; నిజంబు+అ+కాఁగన్= సత్యంగా జరిగినట్లుగనే; అత్యంతమున్= మిక్కుటంగా; నిశ్చయించుచున్= నిర్ణయిస్తూ; సమరంబులోనన్= యుద్ధంలో; పృథాసుతులన్= కుంతి కొడుకులను- పాండవులను; నిర్జింతును+కాక+అంచున్= జయిస్తాను సుమా అని తలపోస్తూ; దురాశయ, భగ్న, బుద్ధి+ఐ= చెడుకోరికచేత ఖండించబడిన మనస్సు కలవాడై; వికసిల్లెన్= ఒప్పారాడు.

తాత్పర్యం: పిమ్మట దుర్యోధనుడు మనసులో ఆశ్చర్యపడ్డాడు. జరిగినదంతా కలయా నిజమా అని తర్కించుకొని, మొదట కల అనుకొని తుదకు నిజమే అనుకొని నిర్ణయించుకొన్నాడు. దురాశచేత భగ్నమైన చిత్తంచొప్పున దుర్యోధనుడు యుద్ధంలో పాండవులను సంహరించగలనని ఉవ్విళులూరాడు.

క. విను, జనమేజయ! పౌరవ । జనవిభుఁ డబ్భంగి రాత్రిచరితం బగు న
ద్దనుజ సమాభాషణ మె । వ్వనికిని నెఱిఁగింపకుండువాఁ డయ్యె మదిన్. 51

ప్రతిపదార్థం: జనమేజయ!= ఓ జనమేజయమహారాజా!; విను= ఆలకించుము; పౌరవ, జనవిభుఁడు= పురువంశానికి చెందినరాజు, సుయోధనుడు; ఆ+భంగిన్= ఆ రీతిగా; రాత్రిచరితంబు+అగు= రేయి జరిగింది అయిన; ఆ+ దనుజసమాభాషణము= రాక్షసులు జరిపిన సంభాషణం; మదిన్= మనస్సులో ఉంచుకొని; ఎవ్వనికిని= ఏమనుజుడికిని; ఎఱిఁగింపక+ఉండువాఁడు+అయ్యెన్= తెలుపకుండటానికి నిశ్చయించుకొన్నాడు.

తాత్పర్యం: ఓ జనమేజయమహారాజా! భారతకథను ఆలకింపుము. పౌరవవంశంలోనివాడై దుర్యోధనుడు ఆరాత్రి జరిగిన వృత్తాంతాన్ని ఎవరికిని తెలుపరాదని తన మనస్సులో నిశ్చయించుకొన్నాడు.

వ. అంతఁబ్రభాతం బగుటయు రాధేయుండు సుయోధనుపాలికిం జని హేతుమద్వాక్యంబుల నతని కి ట్లనియె.52

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; ప్రభాతంబు+అగుటయున్= తెల్లవారుటయు; రాధేయుండు= రాధకొడుకు కర్ణుడు; సుయోధనుపాలికిన్+చని= దుర్యోధనుడికడకు వెళ్లి; హేతుమత్+వాక్యంబులన్= కార్యకారణాలు పొసగునట్టి మాటలతో; అతనికిన్= దుర్యోధనుడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అంతట తెల్లవారింది. కర్ణుడు దుర్యోధనుడివద్దకు వెళ్లి, కార్యకారణాలు ఏర్పడేటట్లుగా ఈవిధంగా చెప్పాడు.

ఉ. 'చచ్చిన పిమ్మటం గడిఁదిశత్రుల నోర్వఁగవచ్చునే? శుభం
బిచ్చునె చావు లెందును నరేశ్వర! యాఱడి చత్తు నంట దా
మెచ్చగునయ్య యేరికిని? మేనికి జీవము గల్గుచోన పెం
పచ్చుగ సిద్ధిఁ బొందు విజయార్థసుఖంబులు మర్త్యకోటికిన్. 53

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= రాజా! దుర్యోధనా!; చచ్చిన పిమ్మటన్= మరణించిన తరువాత; కడిఁది శత్రులన్= గొప్ప విరోధులను; ఓర్వఁగన్+వచ్చునే= జయించనగునా (గెలువరాదు); చావులు= మరణాలు; ఎందును= ఎచట నైనను; శుభంబు+ఇచ్చునే?= మేలును కలిగిస్తాయా?; ఆఱడి= వ్యర్థంగా; చత్తును= మరణిస్తాను; అంట= అని పలకటం; ఏరికిన్= ఎవరికైనను; మెచ్చు+అగునయ్య?= మెచ్చికోలు సంపాదిస్తుందా? మేనికిన్= శరీరానికి; జీవము= ప్రాణం; కల్గుచోన్+అ= ఉన్నప్పుడు మాత్రమే; మర్త్యకోటికిన్= మనుజుల సముదాయానికి; పెంపు= అతిశయం; అచ్చుగన్= ఉట్టిపడేటట్లుగా; విజయ+అర్థ, సుఖంబులు= గెలుపువలన కలిగే సౌఖ్యాలు; సిద్ధిన్+పొందున్= ఫలిస్తాయి.

తాత్పర్యం: ఓ దుర్యోధన మహారాజా! చచ్చిన తరువాత బలవంతులైన విరోధులను జయించగలమా? చావు లెక్కడయినా శుభాలను చేకూర్చగలవా? వ్యర్థంగా చస్తానంటే అది ఎవ్వరికైనా మెప్పు కలిగిస్తుందా? శరీరంలో ప్రాణాలున్నప్పుడే మానవకోటి గెలుపు వలన లభించే సౌఖ్యాలను అధికంగా పొందగలరు.

ఉ. కావున శోకదైన్యముల కాలము గా దిది; లెమ్ము విక్రమ
శ్రీవిలసిల్లు' మంచుఁ గురుసింహుని సింహసమానుఁ జారుశ
య్యావివశాంగు నంగపతి యాదటఁ దా నిరుగేల గ్రుచ్చి సం
భావన నెత్తుచుం బ్రణయభాషల వెండియు వాని కి ట్లనున్. 54

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; శోక, దైన్యముల, కాలము= దుఃఖానికి లేమిడికి తగిన సమయం; కాదు+ఇది= ఇది కాదు; లెమ్ము= లేచి నిలబడుము (కర్తవ్యానికి పూనుకొనుము); విక్రమశ్రీ= పరాక్రమసంపదతో; విలసిల్లుము= శోభిల్లుము; అంచున్= అని పలుకుతూ; కురుసింహునిన్= కురువంశంలో సింహంవంటి వాడిని (దుర్యోధనుడిని); సింహసమానున్= సింహంతో సరిపోలేవాడిని; చారు శయ్యా, వివశ+అంగున్= మనోహరమైన పరుపుపై వశంతప్పిన (పండుకొన్న) శరీరం కలవాడిని, (దుర్యోధనుడిని); అంగపతి= అంగదేశానికి ప్రభువు (కర్ణుడు); ఆదటన్= ఆదరంతో; తాన్= తాను (కర్ణుడు); ఇరుకేలన్= రెండు చేతులతో; గ్రుచ్చి= పొదివి; సంభావనన్= గౌరవంతో; ఎత్తుచున్= కౌగిలించి లేపుతూ; ప్రణయ, భాషలన్= ప్రీతితో కూడిన మాటలతో; వెండియున్= ఇంకా; వానికిన్= దుర్యోధనుడికి; ఇట్లు+అనున్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: కాబట్టి ఇది దుఃఖంచెందవలసిన సమయం కాదు. నిర్వేదం పొందదగిన కాలంకూడా కాదు. నీవు పరాక్రమ ప్రాభవాలతో శోభిల్లవలసిన అదను ఇది' అని కర్ణుడు ప్రోత్సాహవాక్యాలు పలుకుతూ సింహంవంటి కౌరవశ్రేష్ఠుడైన దుర్యోధనుడిని ప్రేముడితో కౌగిలించుకొని పర్యంకంనుండి లేపి సంభావించి ఇంకను ప్రీతి పూర్వకమైన మాటలతో ఈవిధంగా పలికాడు.

క. 'మది నర్జునుఁ జూచి భయం । బొదవినయది నీకు; వాని నుగ్రరణమునం
బదునాలవయేఁడు జయిం । చెద; నాయుధ మంటి ప్రతిన సేసితి నధిపా!' 55

ప్రతిపదార్థం: అధిపా!= ఓరాజా! దుర్యోధనా!; నీకున్= (ఓదుర్యోధనా!) నీకు; మదిన్= మనస్సులో; అర్జునున్+చూచి= అర్జునుడిని చూచి (తలచి); భయంబు= భీతి; ఒదవిన+అది= ఏర్పడింది; వానిన్= అతడిని (అర్జునుడిని); ఉగ్ర, రణమునన్= ఘోరయుద్ధంలో; పదునాలవ+ఏఁడు= పదునాలుగవ సంవత్సరం; జయించెదన్= గెలుస్తాను; ఆయుధము+అంటి= పోటుముట్టును (శస్త్రాన్ని) స్పృశించి; ప్రతిన+చేసితిన్= శపథం చేస్తున్నాను.

తాత్పర్యం: 'ఓ దుర్యోధనమహారాజా! నీ మనస్సులో అర్జునుడంటే భయం దాగి ఉన్నది. కాని, ఇదుగో ఇప్పుడు ఆయుధాన్ని ముట్టుకొని శపథం చేస్తున్నాను. బాగా వినుము. పదునాల్గవయేట భయంకర యుద్ధంలో అర్జునుడిని సంహరిస్తాను.'

విశేషం: పూర్వకాలంలో వీరులు అయుధంపట్టుకొని ఒట్టుపెట్టి ప్రతిజ్ఞ చేస్తే వారు ప్రాణాలను ఒడ్డి అయినాసరే ఆ ప్రతిజ్ఞను నెరవేర్చేవారు.

దుర్యోధనుఁడు ప్రాయోపవేశము మాని కరిపురంబునకుఁ బోవుట (సం. 3-240-40)

చ. **అనవుడుఁ దత్ప్రతిజ్ఞయు సురారులవాక్యములుం దలంచి య**
జ్జనపతి గాఢనిశ్చయవశంవదుఁ డై శయనంబు డిగ్గి చ
య్యనఁ 'బయనంబు సేయుఁ' డని యప్పు డమాత్యులఁ బంచి యిమ్ములన్
దినముఖకృత్యముల్ సలిపి దీపితుఁడై వెడలెం బ్రియంబుతోన్. **56**

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా (అని కర్ణుడు శపథంచేయగా); తత్+ప్రతిజ్ఞయున్= ఆతని శపథాన్నీ; సుర+అరుల, వాక్యములన్= దేవతలకు విరోధులయిన రాక్షసుల మాటలను; తలంచి= స్మరించి; ఆ+జనపతి= ఆ రాజు (ఆ దుర్యోధనుడు); గాఢనిశ్చయవశంవదుఁడు+ఐ= తీవ్రమైన నిర్ణయానికి లోబడిన వాడై-కృతనిశ్చయుడై; శయనంబు= మంచం; డగ్గి= దిగి; చయ్యనన్= వేగంగా; పయనంబు= ప్రయాణం; చేయుఁడు= సాగనివ్వండి; అని= అని చెప్పి; అప్పుడు= ఆ సమయంలో; అమాత్యులన్= మంత్రులను; పంచి= ఆజ్ఞాపించి; ఇమ్ములన్= ప్రీతితో; దిన, ముఖ, కృత్యముల్= ప్రొద్దుపొడుపువేళ చేయదగిన పనులను; సలిపి= చేసి; ప్రియంబుతోన్= ప్రీతితో; దీపితుఁడు+ఐ= ప్రకాశిస్తున్నవాడై; వెడలెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఇటు కర్ణుడు చేసిన శపథం, అటు రేయి రాక్షసులు పలికిన ప్రోత్సాహకవాక్యాలు స్మరించుకొని, ప్రాయోపవేశాన్ని మానటానికి కృతనిశ్చయుడై శయ్య దిగి, దుర్యోధనుడు మంత్రులను పిలిచి ప్రయాణసన్నాహాలు చేయటానికి ఆజ్ఞాపించి, తాను కాలకృత్యాలు తీర్చి ప్రకాశిస్తున్నవాడై వెళ్ళాడు.

వ. **అయ్యవసరంబున.** **57**

తాత్పర్యం: ఆ సమయంలో.

చ. **రయవిచలత్తురంగమ తరంగములన్ మదనాగనక్రసం**
చయములఁ జంచలచ్చటుల సైనికమత్స్యములన్ మహోన్నతం
బయి కురురాజచంద్రు నుదయంబునఁ దద్దయుఁ బొంగెఁ బ్రస్ఫుర
ద్ధయదమనోహరప్రకటభంగులఁ దద్భటవార్ధి యుద్ధతిన్. **58**

ప్రతిపదార్థం: తత్+భట, వార్ధి= ఆ సైనికులు అనే సముద్రం; కురురాజచంద్రు+ఉదయంబునన్= కురువంశానికి చెందిన రాజు (దుర్యోధనుడు) అనే చంద్రుడి పొడుపుచేత; రయ, విచలత్+తురంగమ, తరంగములన్= వేగంగా కదలుతున్న గుర్రాలు అనే కెరటాలతో; మద, నాగ, నక్ర, సంచయములన్= మదించిన ఏనుగులు అనే మొసళ్లగుంపులతో; చంచలత్+చటుల, సైనిక, మత్స్యములన్= మిక్కుటంగా ఇటునటు కదలాడే భటులు అనే చేపలతో; మహా+ఉన్నతంబు+అయి= మిక్కిలి గొప్పది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అయి; ప్రస్ఫురత్+భయద, మనస్+హర, ప్రకట, భంగులన్= మిక్కుటంగా భీతిని కలిగించే మనస్సును హరించే సౌందర్యాన్ని వెల్లడించే రీతులతో (రమణీయ భయానక మయి); ఉద్ధతిన్= అతిశయంతో; తద్దయున్= మిక్కుటంగా; పొంగెన్= విజృంభించింది.

తాత్పర్యం: వేగంగా కదిలేగుఱ్ఱాలు అనే కెరటాలతో; మదించిన ఏనుగులు అనే మొసళ్ళగుంపులతో, మిక్కుటంగా కదలాడే సైనికులనే చేపలతో వెల్లివిరిసి కౌరవరాజు దుర్యోధనుడనే చంద్రుడి సందర్శనంతో ఆ సైన్యం అనెడి సముద్రం ఉత్సాహంతో రమణీయభయానకంగా విజృంభించింది.

విశేషం: 1.అలం: పరిణామం. కొందరు ఆలంకారికుల మతంలో పరిణామాలంకారం రూపకప్రభేదమే. 2. ఈపద్యం వ్రాసింది - ఎఱ్ఱన. అరణ్యపర్వంలో ఎఱ్ఱన నన్నయపేరుమీదనే 'తత్కవితారీతియు కొంత దోప' పూరించినట్లు చెప్పుకొన్నాడు. కాబట్టి ఈ పద్యంలో నన్నయకవితారీతి కొంతమాత్రమేకాక సొంతంగా కనపడుతుంది. ఎఱ్ఱన వ్రాసిన ఈపద్యానికి శిశుపాలవధ ఘట్టంలో నన్నయ వ్రాసిన ఈక్రిందిపద్యానికి జన్యజనకభావం సుస్పష్టం.

'రయవిచలత్తురంగమ తరంగములన్ మదనాగనక్రసం
చయములఁ జంచలచ్చటుల సైనికమత్స్యములన్ భయంకరం
బయి యదువృష్ణిభోజకుకురాంధకవాహినియుం గలంగె ని
ర్దయతరరోషమారుత నితాంతసమీరిత మై క్షణంబునన్.' (సభాపర్వం - 2.33)

చ. చామరపుండరీకవిలసత్సితచారుపతాకలం గురు
గ్రామణియాత్ర నెంతయును గాంతి వహించె నభంబు శారదో
ద్దామమరాళమండలసితస్ఫుటపద్మవనీపరిస్ఫుర
త్తామరసాకరంబున విధంబున భూచరనేత్రపర్వమై. 59

ప్రతిపదార్థం: భూ, చర, నేత్ర, పర్వము+ఐ= పుడమిపై చరించే మానవుల కన్నులకు పండువు అయి; నభంబు= ఆకసం; చామర, పుండరీక, విలసత్+సిత, చారు, పతాకలన్= వింజామరలతో వెల్లగొడుగులతో శోభిల్లుతున్న తెల్లని అందమైన జెండాలతో; కురు, గ్రామణి, యాత్రన్= కురువంశంలో శ్రేష్ఠుడైన దుర్యోధనుడి ప్రయాణంలో; శారద+ఉద్దామ, మరాళ, మండల, సిత, స్ఫుట, పద్మ, వనీ, పరిస్ఫురత్+తామరస+ఆకరంబున, విధంబున= శరత్కాలంలోని గొప్ప హంసల గుంపులతోనూ, తెల్లగా వికసించిన పద్మాలగుంపులతోనూ ప్రకాశించే తామరకొలను మాదిరిగా; ఎంతయును= మిక్కుటంగా; కాంతివహించెన్= వెలుగొందింది.

తాత్పర్యం: దుర్యోధనుడి ప్రయాణంలో ఆకాశం కనులపండువుగా శోభిల్లింది. అప్పుడు వింజామరలతో ఆకసాన్ని నింపుతూ దుర్యోధనుడి సేనలు పయనించాయి. అప్పుడు శరత్కాలంలో గొప్పహంసలగుంపులతో, వికసించిన పద్మాలతో కళకళలాడుతున్న తామరకొలనువలె ఆకసం శోభించింది.

విశేషం: అలం: ఉపమ. 2. చామరం= చమరీమృగపు వెంట్రుకలచేత తయారు చేయబడిన వీవన. చామరం వెల్లగొడుగు రాజలాంఛనాలు. 3. వృత్తరచనలో నన్నయకు ఒకవిశిష్టశయ్య ఉన్నది. నన్నయ మాటలలో చెప్పవలెనంటే అది 'అక్షరరమ్యత' సుదీర్ఘ సంస్కృత సమాస సంఘటన నన్నయశైలికి గీటురాయి. స్థూలదృష్టికి ఈపద్యం నన్నయయే వ్రాశాడు అని అనిపించేటట్లు ఎఱ్ఱన వ్రాయగలిగాడు. ఛందోభంగిమలోకూడ నన్నయ ఒడుపు ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ఇట్లు దుర్యోధనుండు గర్ణసౌబలసమేతుండై దుశ్శాసనాద్యనుజ గణంబునుం దక్కిన యమాత్యులుం గొలువఁ జెలువు మిగులం జని కరిపురంబు ప్రవేశించి సముచిత వ్యాపారంబుల నుండునంత, నొక్కనాఁడు మంత్రి జన పరివేష్టితుండై యున్న రాజునకు భీష్ముం డిట్లనియె. 60

ప్రతిపదార్థం: ఇట్లు= ఈరీతిగా; దుర్యోధనుండు= సుయోధనుడు; కర్ణసౌబల సమేతుండు+ఐ= కర్ణుడితో, శకునితో కూడినవాడై; దుశ్శాసన+ఆది+అనుజ, గణంబునున్= దుశ్శాసనుడు మున్నగు తమ్ముల సముదాయమున్నూ; తక్కిన= మిగిలిన; అమాత్యులున్= మంత్రులున్నూ; కొలువన్= సేవించగా; చెలువుమిగులన్= అందం అతిశయించేటట్లుగా; చని= వెళ్లి; కరిపురంబు= హస్తినాపట్టణం; ప్రవేశించి= చేరిచొరబడి; సముచిత వ్యాపారంబులన్= తగిన పనులలో; ఉండు+అంతన్= ఉన్నంతలో; ఒక్కనాఁడు= ఒకరోజున; మంత్రిజన పరివేష్టితుండు+ఐ+ఉన్న= అమాత్యులచేత చుట్టుకొనబడియున్న; రాజునకున్= ప్రభువునకు (దుర్యోధనుడికి); భీష్ముండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా దుర్యోధనుడు శకునితో కర్ణుడితో దుశ్శాసనుడు మున్నగు తమ్ములతో మంత్రులతో కలిసి హస్తినాపురం చేరి రాచఠీవితో కొలువుదీర్చి ఉండగా, ఒకనాడు భీష్ముడు దుర్యోధనుడితో ఈ విధంగా పలికాడు.

మ. 'హితులై పెద్దలు బుద్ధిసెప్పఁగఁ గ్రియాహీనుండవై త్రోచి పో
యితి దుష్టాత్ములఁ గూడి; దానికి ఫలం బెట్లయ్యెనో చూచితే!
గతవిద్వేషుఁడు ధర్మనందనుఁడు గల్గంబట్టి యప్పాట దు
ర్గతికిం దప్పితిగాక చిక్కితిగదా గంధర్వుచే నాజిలోన్. 61

ప్రతిపదార్థం: పెద్దలు= వయస్సు ముదిరి అనుభవం సంపాదించినవారు; హితులు+ఐ= (నీ) శ్రేయోభిలాషులు అయి; బుద్ధి+చెప్పఁగన్= హితవుబోధించగా; క్రియా, హీనుండవు+ఐ= కొరమాలిన వాడవై; త్రోచి= ప్రక్కకు నెట్టి; దుష్ట+ ఆత్ములన్+కూడి= దుర్జనులతోచేరి; పోయితి(వి)= వెళ్ళావు; దానికిన్= ఆవిధంగా వెళ్లినదానికి; ఫలంబు= ఫలితం, పర్యవసానం; ఎట్లు= ఏరీతిగా; అయ్యెనో= పరిణమించిందో; చూచితి+ఏ= చూచావు (అనుభవించావు) కదా!; గత విద్వేషుఁడు= పోయిన శత్రుత్వం కలవాడు, పగలేనివాడు; ధర్మనందనుఁడు= ధర్మజుడు; కల్గన్+పట్టి= ఉండటంచేత; ఆ+పాటన్= ఆ విధంగా; దుర్గతికిన్= చెడ్డ అవస్థకు; తప్పితి(వి)+కాక= తప్పించుకొన్నావు కాని; ఆజిలోన్= యుద్ధంలో; గంధర్వుచేన్= గంధర్వుడు అయిన చిత్రసేనుడి చేతిలో; చిక్కితి(వి)+కదా= లొంగిపోయావు కదా! (బందీవి అయ్యావుకదా!).

తాత్పర్యం: 'అనుభవజ్ఞులు గౌరవింపదగిన పెద్దలు నీకు హితవు బోధించి, ఘోషయాత్రకు వెడలవద్దని చెప్పి ఉన్నారు. వారు చేసిన హెచ్చరికను నీవు సరకుచేయక గర్వంతో చెడ్డవారి చెప్పుడుమాటలకు చెవియొగ్గి బయలుదేరావు. ఈ దుస్సాహసం ఏరీతిగా పరిణమించిందో నీకే తెలిసింది కదా! అజాతశత్రుడు, మహానుభావుడు అయిన ధర్మరాజు ఉండటంచేత నీవు బ్రదికి బయటపడ్డావు. లేకపోతే గంధర్వు డైన చిత్రసేనుడి చెరసాలలో మ్రగ్గుతూ ఉండేవాడవు గదా.

ఉ. నీవును దమ్ములున్ సతులు నెయ్యురు వైరులచే గృహీతులై
పోవఁగఁ బాఱిపోయెఁ గడుఁ బొల్లఁదనంబున సూతపుత్త్రుఁ డీ

కావరుఁ గష్టచిత్తు నధికంబుగ నమ్ముదు నీవు వీని బా

హావిభవంబు గయ్యమున నక్కడఁ జూచితె కన్నులారఁగన్. 62

ప్రతిపదార్థం: నీవును= ఓదుర్యోధనా! నీవున్నూ; తమ్ములున్= అనుజులున్నూ; సతులు= కులపాలికలైన స్త్రీలున్నూ; నెయ్యురు= మిత్రులున్నూ; వైరులచేన్= శత్రువులచేత; గృహీతులు+ఐ= చెరపట్టబడినవారై; పోవఁగన్= వెడలగా; సూతపుత్త్రుఁడు= సూతుని కొడుకు (కర్ణుడు); కడున్= మిక్కిలి; పొల్లఁదనంబునన్= వ్యర్థత్వమున, - ఎందుకు పనికిరానితనంతో; పాఱిపోయెన్= పిరికితనంతో పరుగెత్తిపోయాడు; నీవు; ఈ కావరున్= ఈ దుర్మదుడిని; కష్టచిత్తున్= వెతకు లోనైన మనస్సు కలవాడిని అనగా స్థైర్యం లేనివాడిని; అధికంబుగన్= ఎక్కువగా; నమ్ముదు(వు)= విశ్వసిస్తావు; వీని= ఈతని (కర్ణుడియొక్క); బాహావిభవంబు= భుజ పరాక్రమం; అక్కడన్= అచట; కయ్యమునన్= యుద్ధంలో; కన్నులు+ఆరఁగన్= కనుల నిండుచూపుతో; చూచితి(వి)+ఎ= అరసితివి కదా.

తాత్పర్యం: దుర్యోధనా! నీకు సూతుడికొడుకైన కర్ణుడంటే మిక్కిలి అభిమానం కదా! కానీ, నీవే స్వయంగా నీ కన్నులతో చూచావు ఆతడి పరాక్రమం. నీ తమ్ములు, స్త్రీలు, ప్రియమిత్రులు అందరు గంధర్వులచేతికి చిక్కినపుడు నీవు మహావీరుడు అని అనుకొన్న కర్ణుడు పిరికిపందవలె మిమ్మందరను వదలిపెట్టి పారిపోయాడుకదా. నీ ప్రాణమిత్రుడు కర్ణుడు స్థైర్యం లేనివాడని గంధర్వులతో ఏర్పడిన కయ్యం ఋజువు చేసింది.

ఉ. ఆయతబాహు లుగ్రబలు లార్యులు పార్థులు వారిభూరిశౌ

ర్యాయుధ నైపుణక్రియలయందుఁ బదాఱవపాలుఁ బోలఁ డీ

వాయపురజ్జులాఁ డధిప! వారలచందము వీని చందమున్

నీయెడ నిక్కమై తెలిసెనే ఖచరేంద్రుల పోరిలోపలన్. 63

ప్రతిపదార్థం: అధిప!= రాజా! ఓ దుర్యోధనమహారాజా!; పార్థులు= కుంతికొడుకులు(పాండవులు); ఆయతబాహులు= నిడివిఅయిన చేతులు కలవారు- పరాక్రమవంతులు; ఉగ్రబలులు= భయంకర మైన శక్తి కలవారు; ఆర్యులు= పూజించతగినవారు; వారి= వారియొక్క (పాండవులయొక్క); శౌర్య+ఆయుధ, నైపుణ, క్రియలఅందున్= పరాక్రమంతో శస్త్రాలను ప్రయోగించే నేర్పరితనాలలో; ఈ వాయపు, రజ్జులాఁడు= వ్యర్థంగా కలహించేవాడు (నోటి దురుసు కలవాడు కర్ణుఁడు); పదాఱవపాలున్= పదునారవభాగం (1/16 వ వంతు); పోలఁడు= సరిగాడు; వారల చందమున్= ఆ పాండవుల విధము; వీని చందమున్= ఈ కర్ణుడి విధం; ఖచర+ఇంద్రులు= గంధర్వశ్రేష్ఠులయొక్క; పోరిలోపలన్= యుద్ధంలో; నీ+ఎడన్= నీకు సంబంధించినమేరకు; నిక్కము+ఐ= నిజము అయి, నిజంగా; తెలిసెన్+ఏ= తెల్లం అయిందా? లేదా? (తేటతెల్లం అయింది కదా).

తాత్పర్యం: ఓదుర్యోధన మహారాజా! పాండవులు పరాక్రమం కలవారు. భయంకర మైన శక్తి కలవారు. బలంతో పాటు పూజించతగిన మంచితనం కలవారు. వారి పరాక్రమంలోగాని, వారికి ఆయుధాలు ప్రయోగించటంలో కల నేర్పరితనంలో కాని పదునారవపాలుగూడ లేనివాడు ఈ కర్ణుడు వ్యర్థంగా కయ్యానికి కాలుదువ్వే స్వభావంగల వాక్శూరుడు. ఈమధ్య గంధర్వులతో జరిగిన పోరాటంలో నీవే నీకన్నులతో అటు పాండవుల పరాక్రమప్రాభవాలను ఇటు కర్ణుడి పారుబోతుతనాన్నీ తెలిసికొన్నావు.

క. కులమును సిరియును జెఱుపక । యలఘుస్థితి నింకనైన నప్పాండవులం

గలసి మనవయ్య! నాదగు । పలుకు వినఁగదయ్య! హితము పథ్యము సుమ్మీ!' 64

ప్రతిపదార్థం: కులమును= వంశాన్ని; సిరియును= ఐశ్వర్యాన్నీ; చెఱుపక= పాడు చేయక; అలఘుస్థితిన్= గొప్పతనంతో; ఇంకన్+ఐనన్= ఇకమీదట నైనా; ఆ+పాండవులన్= ఆ పాండునందనులతో; కలసి= కూడుకొని; మనవయ్య= బ్రదుకవయ్య; నాది+అగు= నాయొక్క; పలుకు= మాట; వినఁగదయ్య= విని పాటించవయ్యా! హితము= (ఇది నీకు) శ్రేయస్సు కూర్చేది; పథ్యము= మేలు (ఒనగూర్చేది); సుమ్మీ= సుమా.

తాత్పర్యం: నీవంశాన్ని పాడు చేయకుము, నీసంపద పోగొట్టుకొనకుము, ఇకమీదనైనా, ఆ పాండునందనులతో నెయ్యం నెరపి సుఖశాంతులతో బ్రదుకుము. ఇది నేను నీకు చేస్తున్న హితబోధ. ఇది నేను నీమేలు కోరి చెప్పుతున్నాను సుమా!'

వ. అనిన భీష్మువచనంబుల దెస ననాదరంబు సేసి, దుర్యోధనుండు గర్ణసౌబలులం జూచి నవ్వుచు, వారలుం దమ్ములుం దోడన చన నక్కడ వాసి చనియె; భీష్ముండును లజ్జితుం డై నిజగృహంబున కరిగె; నంతఁ గౌరవేశ్వరుండు గ్రమ్మఱి యెప్పటిచోటికిం జనుదెంచి మంత్రులతోడ మంతనం బుండి 'మన కెయ్యది కర్తవ్యం? బెయ్యది సేసినఁ దేజోలాభంబు లగు?' నని యడిగినఁ గర్ణుండు 'దేవా! నీ కింక నే విచారమ్ములు నేల? నిష్కంటకంబైన యీ పృథివి సకలంబునుం బాలించుచు మహేంద్రమహిమతోడ నఖిలసుఖంబులు ననుభవింతుగా' కనినం బ్రీతుండై యతండు వాని కి ట్లనియె. 65

ప్రతిపదార్థం: అనినన్= అని పలికిన; భీష్మువచనంబుల దెసన్= భీష్ముడియొక్క పలుకులపట్ల; అనాదరంబు+చేసి= తిరస్కారం చూపి; దుర్యోధనుండు= సుయోధనుడు; కర్ణ, సౌబలులన్+చూచి= కర్ణుడిని, శకునిని అరసి; నవ్వుచున్= హసిస్తూ; వారలున్= కర్ణుడు, శకుని; తమ్ములున్= సహోదరులును; తోడనచనన్= అతనివెంట వెళ్ళగా; అక్కర+పాసి= ఆస్థలం విడిచి; చనియెన్= వెళ్ళాడు; భీష్ముండును= భీష్ముడుకూడా; లజ్జితుండు+ఐ= సిగ్గుపడినవాడై; నిజగృహంబునకున్= తనయొక్క ఇంటికి; అరిగెన్= వెళ్ళాడు; అంతన్= అటుపిమ్మట; కౌరవ+ఈశ్వరుండు= దుర్యోధనుడు; క్రమ్మఱి= మరలి; ఎప్పటిచోటికిన్= మునుపుఉన్నస్థలానికి; చనుదెంచి= వచ్చి; మంత్రులతోడన్= అమాత్యులతో; మంతనంబు+ఉండి= యోచనచేసి, సంప్రదించి; మనకున్; ఎయ్యది= ఏది; కర్తవ్యంబు?= చేయదగినపని?; ఎయ్యది= ఏది; చేసినన్= చేస్తే; తేజస్+లాభంబులు= వర్చస్సు అధికంకావటం, అభ్యుదయం చేకూరటం; అగును= ఏర్పడుతాయి; అని అడిగినన్= అని ప్రశ్నించగా; కర్ణుండు= కర్ణుడు; దేవా!= ప్రభూ, (ఓదుర్యోధనమహారాజా!); నీకున్; ఇంకన్= ఇకమీద; ఏవిచారమ్ములు= ఏ ఆలోచనలు; ఏల= ఎందులకు; నిష్కంటకంబు+ఐన= శత్రువులు లేనటువంటి; ఈపృథివి= ఈభూమి; సకలంబునున్= సమస్తం; పాలించుచున్= ఏలుకొంటూ; మహా+ఇంద్ర, మహిమతోడన్= దేవేంద్రుడి గొప్పశక్తివంటి శక్తితో; అఖిల సుఖంబులు= అన్నిసౌఖ్యాలు; అనుభవింతు(వు)+కాక= పొందెదవుగాక; అనినన్= అని చెప్పగా; ప్రీతుండు+ఐ= సంతసంచెందినవాడై; అతఁడు= దుర్యోధనుడు; వానికిన్= అతడికి (కర్ణుడికి); ఇట్లు+అనియెన్;

తాత్పర్యం: ఆ విధంగా పలికిన భీష్ముడి మాటలపట్ల గౌరవం చూపకుండా దుర్యోధనుడు కర్ణుడినీ, శకునినీ చూచి నవ్వుకొంటూ, వారూ తమ్ములూ కలిసి తన వెంటరాగా అక్కడినుండి తొలగివెళ్ళిపోయాడు. భీష్ముడుకూడా సిగ్గుపడి స్వగృహానికి వెళ్ళాడు. ఆ తరువాత దుర్యోధనుడు తిరిగి మునుపున్నప్రదేశానికి వచ్చి మంత్రులతో మంతనాలు మొదలుపెట్టాడు. 'ఇప్పుడు మనం ఏమి చెయ్యాలి? ఏది చేస్తే వర్చస్సు అధికమౌతుంది?' అని అడిగాడు. దానికి కర్ణుడిట్లా అన్నాడు. 'ప్రభూ! నీ వింక ఎటువంటి చింతలు లేకుండా ఈ నేలనంతా దేవేంద్ర మహిమతో ఏలుతూ అఖిల సుఖాలను అనుభవించుము' - అనగా సంతోషించి దుర్యోధనుడు కర్ణుడితో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'నీయట్టివీరవరుఁడు స । హాయుం డటె, పడయరాని యదియుం గలదే?
ధీయుత! నా కెయ్యదియును । బాయక విను మింక నొక్క పని దెల్లముగన్. 66

ప్రతిపదార్థం: ధీయుత!= బుద్ధిమంతుడా!, ఓకర్ణా!; నీ+అట్టి= నీ వంటి; వీర, వరుఁడు= శూరులలో శ్రేష్ఠుడైనవాడు; సహాయుండు+అటె= సాయం చేసేవాడు కాగా; నాకున్; ఎయ్యదియును= ఏది అయినను; పడయరాని+అదియున్+కలదే= పొందరానిది ఉన్నదా; పాయక= వదలక; ఇంకన్= ఇకమీదట; ఒక్కపని= ఒకకార్యం; తెల్లముగన్= తెలిసేటట్లుగా; వినుము= ఆలకింపుము.

తాత్పర్యం: 'మేధావి వైన ఓ కర్ణా! సావధానంగా ఆకర్ణించుము. నీవంటి మహావీరుడు నాకు సాయం చేయటానికి ఉండగా, నేను పొందరానిదేదీ ఉండదు. నాకు ఒక కర్తవ్యం నెరవేర్చవలె నని మిక్కిలి వేడుకగా ఉన్నది.

తే. ధర్మజుఁడు రాజసూయంబుఁ బేర్మిఁ జేసి । నంతనుండియు నమ్మహితాధ్వరమున
యం దభిప్రాయమై యుండు; నొంద నాకు । నమ్మఖంబు సేయింపవే యనఘ! నన్ను.' 67

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడ వైనవాడా, ఓకర్ణా!; ధర్మజుఁడు= ధర్మపుత్రుడు; రాజసూయంబున్= రాజసూయమనే యజ్ఞాన్ని; పేర్మిన్= గౌరవంతో; చేసినంతనుండియున్= ఒనరించినప్పటినుండియున్నూ; ఆ+మహిత+అధ్వరమున అందున్= అ గొప్పయజ్ఞంలో; అభిప్రాయము+ఐ+ఉండున్= కోరిక అయి ఉన్నది; నాకున్; ఆ+మఖంబు= ఆ యజ్ఞం (ఆరాజసూయయాగం); ఒందన్= పొందేటట్లుగా; నన్నున్+చేయింపవే= నాచేత చేయింపవా.

తాత్పర్యం: ధర్మరాజు రాజసూయయాగాన్ని చేసిన నాటినుండి నేనుకూడా ఆరాజసూయయాగాన్ని చేయాలని మనస్సులో గాఢంగా అభిలషిస్తున్నాను. మహావీరుడవైన ఓకర్ణా! నీవు నాచేత ఆ మహాయాగాన్ని చేయించి పుణ్యం కట్టుకొనుము' అని దుర్యోధనుడు ప్రార్థించాడు.

వ. అనినం గర్ణుండు గౌరవపతి కి ట్లనియె. 68

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; కర్ణుండు; కౌరవపతికిన్= దుర్యోధనుడికి (కౌరవులరాజుకు); ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: కర్ణుడు దుర్యోధనుడితో ఈవిధంగా బదులు పలికాడు.

క. 'అగుఁగాక యేమి యిప్పుడు । జగతిం గల నృపతు లెల్ల జనవర! నీ కి
మ్ముగ వశవర్తుల కావునఁ । దగ నుద్యోగింపు మిపుడు తత్క్రతు విధికిన్. 69

ప్రతిపదార్థం: అగున్+కాక= ఆవిధంగా జరుగుగాక (సరే ధర్మరాజు గొప్పగా రాజసూయం చేసి ఉండవచ్చును గాక); ఏమి= ఏమి (ఎందుకు); ఇప్పుడు= ఈ సమయంలో; జగతిన్+కల= లోకంలో ఉన్న; నృపతులు+ఎల్లన్= రాజులు అందరు; జనవర= ఓరాజా! దుర్యోధనా!; నీకున్; ఇమ్ముగన్= సంప్రీతితో; వశవర్తులు+అ= లోబడిఉన్నవారే; కావునన్= కాబట్టి; తగన్= సరిపడునట్లుగా; తత్క్రతువిధికిన్= ఆ యజ్ఞవిధానానికి; ఇపుడు= ఈసమయంలో; ఉద్యోగింపుము= ప్రయత్నించుము.

తాత్పర్యం: 'ఓ దుర్యోధన సార్వభౌమా! పూర్వం ధర్మరాజు రాజసూయయాగం చేసి ఉండవచ్చును. అదేమి గొప్ప! ఇపుడు నీవుమాత్రం చేయనేరవా? ఏమి ? ఇప్పుడు, ఈ లోకంలోగల రాజులు అందరున్నూ నీకు సామంతులేకదా! నీకు ఆ యాగంపై అంతమక్కువ ఉంటే, ఇపుడు ప్రారంభించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. రాజులఁ బిల్వఁ బంపుము, ధరాసురసంఘము నామతింపు, పే
రోజ నుదాత్తయజ్ఞగృహయూపతతుల్ సమకట్టఁ బంపు, వి
భ్రాజితభక్ష్యభోజ్యవిధి భవ్యపదార్థము లానయింపు, మ
వ్యాజ విభూతిమై నమరవల్లభుచాడ్పునఁ జేయు జన్నమున్. 70

ప్రతిపదార్థం: రాజులన్= ప్రభువులను; పిల్వన్+పంపుము= పిలిపించు; ధరా, సుర, సంఘమున్= బ్రాహ్మణుల సముదాయాన్ని; ఆమతింపు(ము)= ఆహ్వానించుము; పేరోజన్= (పేరు+ఓజన్=) మిక్కుటమైన ఉత్సాహంతో; ఉదాత్త, యజ్ఞగృహ, యూప, తతుల్= గొప్పవైన యాగశాలలు యాగపశువులను కట్టే కంబాల సముదాయాలను; సమకట్టన్= సమకూర్చటంకొరకు; పంపు(ము)= నియోగించుము; విభ్రాజిత, భక్ష్యభోజ్యవిధి= శోభిల్లే తినుబండారాలు పిండివంటలు సమకూర్చే క్రమంలో; భవ్యపదార్థములు= యోగ్యమైన వస్తువులు; ఆనయింపుము= తెప్పించుము; అవ్యాజ విభూతిమైన్= సహజమైనసంపదతో (ఏప్రయోజనాన్ని అభిలషించని ఐశ్వర్యం చొప్పున); అమర, వల్లభు, చాడ్పునన్= దేవేంద్రుడి మాదిరిగా; జన్నమున్= యజ్ఞాన్ని; చేయు(ము)= ఒనరింపుము.

తాత్పర్యం: రాజులను అందరను ఆహ్వానించటానికై దూతలను పంపుము. బ్రాహ్మణులను ఆహ్వానించుము; గొప్ప ఉత్సాహం వెల్లివిరిసేటట్లుగా యాగశాలలు నిర్మించుము. యూపస్తంభాలను సమకూర్చుకొనుము. అన్నసంతర్పణ చేయటానికై తినుబండారాలు పిండివంటలు సమకూర్చటానికి యోగ్యమైన పదార్థాలు తెప్పించుము. ఏప్రయోజనానికి ఎట్టి ప్రతిఫలం ఆశించకుండగా దేవేంద్రుడి మాదిరిగా గొప్ప యజ్ఞాన్ని చేయుము.

వ. అనిన సంతోసిల్లి కురుపతి యప్పుడు పురోహితునిం బిలిపించి, 'రాజసూయ యజ్ఞంబు సంపూర్ణ దక్షిణంబుగాఁ జేయవలయుఁ; దత్ప్రయోగ విశేషంబులకు మీరు సాలియుండునది' యనినం బురోహితుండు దగిన విద్వజ్జనంబులతోడ విచారించి దుర్యోధనున కి ట్లనియె. 71

ప్రతిపదార్థం: అనినన్= అని (కర్ణుడు) చెప్పగా; సంతోసిల్లి= సంతోషించి; కురుపతి= దుర్యోధనుడు; అప్పుడు+అ= ఆసమయంలో; పురోహితునిన్= వైదికకర్మకాండను నిర్వహించే విప్రుడిని; పిలిపించి= ఆహ్వానించి, రప్పించుకొని; రాజసూయయజ్ఞంబు= రాజసూయం అనే క్రతువు; సంపూర్ణ దక్షిణంబుగాన్= సాంతంగా, చివర ఇచ్చే దక్షిణతో పాటుగ; చేయవలయున్= నిర్వహించవలెను; తత్+ప్రయోగ, విశేషంబులకున్= ఆ క్రతువును నిర్వహించటంలో పేర్కొనదగిన అంశాలకు; మీరు= (వైదికవిప్రులయిన) మీరు; చాలి+ఉండునది= సరిపోయేటట్లుగా ఉద్యుక్తులు కండి; అనినన్= అని (దుర్యోధనుడు) చెప్పగా; పురోహితుండు= వైదికవిప్రుడు; తగిన= యోగ్యులు అయిన; విద్వత్+జనంబులతోడన్= పండితులైన వారలతో; విచారించి= సంప్రదించి; దుర్యోధనునకున్= సుయోధనుడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: కర్ణుడిమాటలకు దుర్యోధనుడు సంతసించాడు. పిదప దుర్యోధనుడు పురోహితుడిని పిలిపించి రాజసూయయజ్ఞాన్ని యథావిధిగా, నిండైన దక్షిణలతో చేయవలయు నని ప్రార్థించాడు. పురోహితుడు పండితులైన వైదికవిప్రులతో సంప్రదించి దుర్యోధనుడికి ఇట్లా తెలిపాడు.

విశేషం: పురస్+హితుడు= పురోహితుడు. పురోహితుడు వైదికవైదుష్యం కలవాడు మాత్రమే కాక, యజమానుని శ్రేయోభిలాషి అయిఉండాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. 'జనవర! నీకుఁ బాండవులు శత్రులు గావున వారి నాజి నో
ర్చిన మఱి కాక మున్న యిటు సేయఁగ శక్యమె రాజసూయమున్?
వినుము దగంగ నిప్పటికి వేఱొక యజ్ఞము సేయు మిమ్ములం;
బనుపుము తత్క్రియావివిధభంగులకుం దగువారి వేగమై. 72

ప్రతిపదార్థం: జనవర!= ఓ దుర్యోధనామహారాజ!; నీకున్= నీకు; పాండవులు; శత్రులు= విరోధులు; కావునన్= కాబట్టి; వారిన్= వారిని (పాండవులను); ఆజిన్= యుద్ధంలో; మఱి= ఇంక; ఓర్చినన్= జయించినసే; కాక= తప్ప; మున్ను+అ= అంతకు ముందే; రాజసూయమున్; ఇటు= ఈ విధంగా; చేయఁగన్= సలుపగా; శక్యమె= సాధ్యం అవుతుందా?; వినుము= ఆలకించుము; తగంగన్= తగునట్లుగా; ఇప్పటికిన్= ఇప్పటి స్థితిగతులకు అనువుగా; ఇమ్ములన్= సంప్రీతితో; వేఱు+ఒక, యజ్ఞము= ఇంకొక యాగం; చేయుము= సలుపుము; వేగమైన్= శీఘ్రంగా; తత్+క్రియా, వివిధ, భంగులకున్= ఆ పనులలోని పెక్కురీతులకు; తగువారిన్= యోగ్యులైనవారిని; పనుపుము= నియోగించుము.

తాత్పర్యం: 'ఓదుర్యోధన మహారాజా! నీకు పాండవులు శత్రువులు కదా! శత్రురాజులను అందరను నిశ్శేషంగా జయించిన పిమ్మటనే కాని రాజసూయయాగం చేయటం శాస్త్రసమ్మతం కాదు. పాండవులను యుద్ధంలో జయించిన పిమ్మట మాత్రమే నీకు ఆ యజ్ఞం చేసే అర్హత సంక్రమిస్తుంది. అందుచేత ప్రస్తుతం నీవు ఇంకొకయజ్ఞం చేయటానికి ఉపక్రమించటం మంచిది. ఇక శీఘ్రంగా అట్టి యాగాన్ని నిర్వహించటానికి యోగ్యత కలవారిని ఎన్నుకొనుము.

తే. రాజసూయంబు నట్టిద రాజవర్య! । వైష్ణవం బను యాగంబు; వాసుదేవుఁ
డిమ్మఖము సేసెఁ దొల్లి; యభీష్ట మిదియు; । చేయు నిర్విఘ్నముగ నిది సెల్లు నీకు'. 73

ప్రతిపదార్థం: రాజవర్య!= రాజులలో శ్రేష్ఠుడవైన వాడా!; ఓదుర్యోధనమహారాజా!; వైష్ణవంబు+అను యాగంబు= వైష్ణవం అనే పేరు గల యజ్ఞం; రాజసూయంబు+అట్టిది+అ= రాజసూయం వంటిదే; ఈ+మఖము= ఈ యజ్ఞాన్ని; వాసుదేవుఁడు= వసుదేవుడి కొడుకు, శ్రీకృష్ణుడు; తొల్లి= పూర్వం; చేసెన్= సలిపాడు; అభీష్టము+ఇది+అ= కోరదగింది ఇదే; నిర్విఘ్నముగన్= ఆటంకాలు లేకుండా; చేయు(ము)= నిర్వహింపుము. నీకున్; ఇది= వైష్ణవ యాగం; చెల్లున్= తగును.

తాత్పర్యం: ఓ దుర్యోధన మహారాజా! రాజసూయయాగంవంటిదే వైష్ణవయాగం. దానిని మునుపు వాసుదేవుడు చేశాడు. ఇది అభిలషించతగింది. ఈ యాగాన్ని ఎట్టి ఆటంకాలు లేకుండా చేసేది. ఇది నీకు తగిన యజ్ఞంసుమా!'.

క. అనిన నిది వోలు నని య । జ్జననాథుఁడు సూతతనయసౌబలులు ప్రియం
బున ననుమతింప నభిమత । వినుతాధ్వరసంప్రయోగవిహితోద్యముఁ డై. 74

ప్రతిపదార్థం: అనినన్= అని (పురోహితుడు) చెప్పగా; ఇది+పోలున్+అని= ఇది బాగా ఉన్న దని; ఆ+జననాథుఁడు= ఆరాజు (దుర్యోధనుడు); సూతతనయ, సౌబలులు= కర్ణుడును, శకునియు; ప్రియంబునన్= ప్రీతితో; అనుమతింపన్= అంగీకరించగా; అభిమత, వినుత+అధ్వర, సంప్రయోగ, విహిత+ఉద్యముఁడు+ఐ= కోరినట్టిది ప్రశంసించబడినట్టిది అయిన యజ్ఞాన్ని నిర్వహించటంలో అభిరుచితో కూడిన ప్రయత్నం కలవాడై.

తాత్పర్యం: పురోహితుడు చెప్పినమాటలు సముచితంగా ఉన్నవని దుర్యోధనుడు తలపోశాడు. సంతసంతో కర్ణుడు, శకుని అట్లే అని సమ్మతించారు. అంతటు దుర్యోధనుడు యజ్ఞాన్ని చేయటానికి వలసిన సన్నాహాలలో నిమగ్నుడయ్యాడు.

క. తనయుద్యోగము జననీ । జనకులకును ద్రోణవిదురశాంతనవ కృపా
ది నిఖిలమాన్యజనమ్ముల । కును దగ నెఱిఁగించి భరతకుంజరుఁ డెలమిన్. 75

ప్రతిపదార్థం: భరత, కుంజరుఁడు= భరతవంశంలో ఏనుగువంటివాడు (శ్రేష్ఠుడు), దుర్యోధనుడు; ఎలమిన్= సంతోషంతో; తన+ఉద్యోగము= తనప్రయత్నం; జననీజనకులకును= తలిదండ్రులకును, (గాంధారికి ధృతరాష్ట్రుడికిని); ద్రోణ, విదుర, శాంతనవ, కృప+ఆది, నిఖిల, మాన్యజనమ్ములకును= ద్రోణుడు, విదురుడు, శంతనుని పుత్రుడు భీష్ముడు, కృపుడు మున్నగుసమస్తమైన పూజనీయు లైన వారికిని; తగన్= ఒప్పిదంగా; ఎఱిఁగించి= తెలిపి.

తాత్పర్యం: దుర్యోధనుడు జన్నమొనర్చే తనసన్నాహాన్నిగూర్చి తల్లిదండ్రులు అయిన గాంధారికిని ధృతరాష్ట్రుడికి, పెద్దలు అయిన ద్రోణుడు విదురుడు భీష్ముడు కృపుడు మున్నగువారికి తెలిపి, తాను సంతోషంతో. (తదుపరి పద్యంతో అన్వయం).

దుర్యోధనుఁడు వైష్ణవం బను యజ్ఞంబు సేయుట (సం. 3-242-1)

వ. వారిచేత ననుజ్ఞాతుం డయి నగరసమీపంబున నొక్క పుణ్యస్థలంబునం దఖిలయజ్ఞగృహంబులు నతిరమణీయంబులుగాఁజేయించి యజ్ఞోపకరణంబులును సమస్తవస్తువిశేషంబులును సమకట్ట నియోగించి శుభదినంబునం బరమబ్రాహ్మణసహాయుం డై నియతదీక్షాశోభనంబు వహించె నంత. 76

ప్రతిపదార్థం: వారిచేతన్= తలిదండ్రులచేత, పెద్దలచేత; అనుజ్ఞాతుండు+ఐ= అనుమతించబడినవాడై; నగర సమీపంబునన్= హస్తినాపురం దగ్గరగా ఉన్న స్థలంలో; ఒక్క, పుణ్య, స్థలంబునందున్= సుకృతం కలిగించే ఒకచోట; అఖిల యజ్ఞ, గృహంబులున్= జన్నం చేయటానికి ఉపకరించే ఇండ్లను అన్నిటిని; అతిరమణీయంబులుగాన్= మిక్కిలి అందంగా; చేయించి= నిర్మించి; యజ్ఞ+ఉపకరణంబులును= జన్నం చేయటానికి కావలసిన కొరముట్లు; సమస్త వస్తు విశేషంబులును= అన్నిపదార్థాలను; సమకట్టన్= సమకూర్చటంకొరకు; నియోగించి= ఆజ్ఞాపించి; శుభదినంబునన్= మంచిరోజున; పరమ, బ్రాహ్మణ, సహాయుండు+ఐ= గొప్పవిప్రులు సాయంగా కలవాడై; నియత, దీక్షాశోభనంబు= శాస్త్రాలలో విధించబడిన క్రమశిక్షణ పాటించటంవల్ల, ఏర్పడే మంగళమును; వహించెన్= పొందాడు; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తలిదండ్రులచేతను పెద్దలచేతను అనుమతించబడినవాడై యజ్ఞసన్నాహాలు చేశాడు. హస్తినాపురానికి దగ్గరగా ఒకపుణ్యస్థలం ఎన్నికచేసి, అచట యజ్ఞానికై పెక్కు ఇండ్లు అందచందాలు ఒప్పార నిర్మింపజేశాడు. యజ్ఞానికి కావలసిన వస్తుసామగ్రిని అంతటిని ఉపకరణాల నన్నింటిని సమకూర్పజేశాడు. ఒకశుభ ముహూర్తంలో బ్రాహ్మణోత్తముల సాయంతో శాస్త్రాలలో విధించబడిన క్రమశిక్షణ పాటించటంవలన ఏర్పడే దీప్తితో కూడిన సౌందర్యం పొందాడు.

ఆ. అఖిలదేశవాసు లైన రాజులను బ । విత్రచరితు లైన విప్రవరుల
నర్థిఁ బిలువ దూత లరిగిరి కౌరవే । శ్వరుని యాజ్ఞఁజేసి సమ్మదమున. 77

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరుని+ఆజ్ఞన్+చేసి= దుర్యోధనుడి ఆనతి చొప్పున; అఖిల, దేశ, వాసులు+ఐన= అన్ని రాజ్యాలలో నివసిస్తూఉండేవారైన; రాజులను= ప్రభువులను; పవిత్రచరితులు+ఐన= పావనమైన ప్రవర్తన గల; విప్రవరులన్= బ్రాహ్మణోత్తములను; అర్థిన్= ప్రీతితో; పిలువన్= ఆహ్వానించటంకొరకై; దూతలు= రాయబారులు; సమ్మదమునన్= సంతోషంతో; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: అన్నిదేశాలలో నివసించే రాజులను, పవిత్రమైన ప్రవర్తన గల బ్రాహ్మణోత్తములను ఆహ్వానించటంకొరకై రాయబారులు దుర్యోధనుడి ఆజ్ఞచొప్పున సంతోషంతో బయలుదేరి వెళ్ళారు.

వ. అందొక్క దూతం బిలిచి దుశ్శాసనుండు 'నీవు ద్వైతవనంబునకుం జని పాండవులను దదాశ్రమవాసు లైన భూసురులను గౌరవేశ్వరు నధ్వరంబునకుఁబిలువు' మని పనిచిన, వాఁడునుంజని ధర్మరాజుం గని యిట్లనియె. 78

ప్రతిపదార్థం: దుశ్శాసనుండు; అందున్+ఒక్కదూతన్= ఆదూతలలో ఒక రాయబారిని; పిలిచి= ఆహ్వానించి; నీవు= (ఓ దూతా) నీవు; ద్వైతవనంబునకున్+చని= ద్వైతవనానికి పోయి; పాండవులను= పాండునందనులను; తత్+ఆశ్రమవాసులు+ఐన= వారియొక్క ఆశ్రమంలో నివసించేవారు అయిన; భూసురులను= విప్రులను; కౌరవ+ఈశ్వరు+అధ్వరంబునకున్= దుర్యోధనుడి యజ్ఞానికి; పిలువుము= ఆహ్వానించుము; అని పనిచినన్= అని ఆజ్ఞాపించగా; వాఁడునున్= ఆ దూతయు; చని= వెడలి; ధర్మరాజున్+కని= ధర్మపుత్రుడిని చూచి; ఇట్లు+అనియెన్= ఈరీతిగా అన్నాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు దూతలలో ఒకడిని పిలిచి 'నీవు ద్వైతవనానికి పోయి పాండవులను, పాండవుల ఆశ్రమంలో నివసించే బ్రాహ్మణులను యజ్ఞానికి రమ్మని ఆహ్వానించుము' అని చెప్పాడు. ఆ దూత ద్వైతవనానికి పోయి ధర్మరాజును సందర్శించి ఈ విధంగా పలికాడు.

ఉ. 'వీరుఁడు గౌరవుండు నిజవిక్రమలబ్ధ సమున్నతార్థ సం
భారములన్ మహాధ్వర మపారబలుం డొనరించుచుండి పెం
పారఁగ నిన్నుఁ దమ్ముల మహాద్విజులం బిలువంగఁ బంచె ధా
త్రీరమణేశ! నెమ్మిఁ జనుదెమ్ము తదధ్వరముం గనుంగొనన్.' 79

ప్రతిపదార్థం: ధాత్రీ, రమణ+ఈశ!= రాజులలో శ్రేష్ఠుడ వైనవాడా, ఓధర్మరాజా!; వీరుఁడు= పరాక్రమవంతుడు; కౌరవుండు= దుర్యోధనుడు; నిజ, విక్రమ, లబ్ధ, సమున్నత+అర్థ, సంభారములన్= తనయొక్క శౌర్యంచేత పొందబడిన మిక్కిలి గొప్ప వైన పదార్థాల సముదాయంచేత; మహా+అధ్వరము= గొప్పజన్నం; అపారబలుండు= అంతులేని శక్తి కలవాడు (దుర్యోధనుడు); ఒనరించుచున్+ఉండి= చేస్తూ ఉన్నవాడై; పెంపు+ఆరఁగన్= అతిశయం శోభిల్లేటట్లుగా; నిన్నున్= (ఓధర్మరాజా) నిన్నును; తమ్ములన్= (నీ) అనుజులను; మహా, ద్విజులన్= బ్రాహ్మణోత్తములను; పిలువంగన్= ఆహ్వానించగా; పంచెన్= (నన్ను) నియోగించాడు; తద్+అధ్వరమున్= ఆ యజ్ఞాన్ని; నెమ్మిన్= ప్రీతితో; కనుంగొనన్= చూడటంకొరకై; చనుదెమ్ము= రమ్ము.

తాత్పర్యం: రాజులలో శ్రేష్ఠుడ వైన ఓ ధర్మరాజా! కౌరవులలో వీరుడైన దుర్యోధనుడు తన శౌర్యానికి, ప్రాభవానికి అనురూపమైన గొప్పయజ్ఞాన్ని చేయటానికి పూనుకొన్నాడు. ఆ మహాక్రతువుకై అంతులేని సంభారాలు సమస్త వస్తుసామగ్రి సమకూర్చబడినవి. ఇట్టి గొప్పయజ్ఞాన్ని తిలకించటానికై నిన్నును, నీ తమ్ములను, నీతోఉన్న

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బ్రాహ్మణోత్తములను ఆహ్వానించటానికై, దుర్యోధనసార్వభౌముడు ప్రత్యేకంగా మీవద్దకు నన్ను దూతగా నియోగించి పంపాడు. దయచేసి యజ్ఞానికి రమ్ము.

విశేషం: "అనాహూతోఽధ్వరం గచ్ఛేత్" - "ఆహ్వానం లేకుండానే యజ్ఞానికి వెళ్ళవలెను" అనే ప్రాచీనసంప్రదాయం. అయినను పాండవులకు ప్రత్యేకదూత వచ్చి ఆహ్వానం సయితం అందించాడుగదా. ఇక పాండవులు యజ్ఞానికి వెళ్లటం విధ్యుక్త కర్తవ్యం అని రాయబారి సూచన. అయినను - ఈ ఆహ్వానంలో అంతర్గర్భితంగా దుర్యోధనుడి ఐశ్వర్యప్రాభవం - పరాక్రమప్రకర్ష ఇమిడి ఉన్నవి. దానిని పాండవులు గుర్తించక పోలేదు.

వ. అనిన ధర్మజుండు వాని కిట్లనియె. 80

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు ఆ దూతతో ఇట్లా అన్నాడు.

చ. 'అనఘుఁడు ధార్తరాష్ట్రుఁడు మహాధ్వరకర్మధురీణుఁ డయ్యె నా
విని ప్రియమందెఁ జిత్తము; పవిత్రిత మయ్యెఁ గులంబు; వింటె! యై
నను దగ మేము పూనిన ఘనంబగు పూనికి దీర్ప కెవ్విధం
బున నట రా నొడంబడము? భూవరుతో నిది సెప్పు మేర్పడన్.' 81

ప్రతిపదార్థం: అనఘుఁడు= పాపరహితుడు; ధార్తరాష్ట్రుఁడు= ధృతరాష్ట్రుడికొడుకు (దుర్యోధనుడు); మహా+అధ్వర, కర్మ, ధురీణుఁడు+అయ్యెన్= గొప్పయజ్ఞాన్ని నిర్వహించే పనిని చేపట్టినవాడు అయినాడు; నాన్= అనగా; విని= ఆలకించి; చిత్తము= మనస్సు; ప్రియము+అందెన్= ప్రీతి చెందింది; కులంబు= వంశం (మా కురువంశం); పవిత్రితము+అయ్యెన్= పావనం అయింది; వింటి+ఎ= సావధానంగా ఆలకించావుకదా; ఐనను= అయినప్పటికిని; తగన్= ఒప్పిదంగా; మేము= మేము (పాండవులమైన మేము); పూనిన= చేపట్టిన; ఘనంబు+అగు= గొప్పది అయిన; పూనికి= దీక్ష; తీర్పక= నెరవేర్చక; ఏ+విధంబునన్= ఏరీతిగా; అట= అచటికి (ఆ యజ్ఞానికి) రాన్= రావటానికి; ఒడంబడము?= సమ్మతించగలం; భూవరుతోన్= భూమికి భర్తఅయిన రాజుతో (దుర్యోధనుడితో); ఇది= ఈవిషయం; ఏర్పడన్= విశదంగా; చెప్పుము= వచింపుము.

తాత్పర్యం: 'మహానుభావుడు దుర్యోధనుడు గొప్పయజ్ఞాన్ని చేయటానికి పూనుకొని, అంతటి సన్నాహాలు చేసి మమ్మల్ని ఆహ్వానించినందుకు సంతోషం. ఈ యజ్ఞంవలన మాకురువంశం పావనమౌతుంది. కాని, మా సమాధానం సావధానంగా వినుము. మేం చేసిన శపథాన్ని నెరవేర్చటానికి ముందే - అంటే, అరణ్యవాసం, అజ్ఞాతవాసం ముగించటానికి ముందుగానే - మేము యజ్ఞాన్ని సందర్శించటం ఏవిధంగా సముచితం ఔతుంది? ఈ విషయాన్ని దయచేసి మీరాజుతో వివరించి తెలుప వేడికోలు.'

విశేషం: ఈ సమాధానంలో ధర్మరాజుశీలం సాత్త్వికసంపద తెలివితేటలు మంచితనం స్వయంవ్యక్తమౌతున్నాయి.

వ. అనియె; నప్పుడు భీమసేనుం డాదూతం జూచి, 'యోరి! వినుము! పదుమూఁడగునేఁటి కడపటఁ బాండవాగ్రజుండు దీప్తం బగుశస్త్రాస్త్రదహనంబునందు ధార్తరాష్ట్రసుతశతకంబును బశువరించివేల్చి రణసత్త్రంబు సేయుటకునై వచ్చుం గాని యందాఁకం జనుదెంచుట గలుగ దని యాదుర్యోధను నెదురన వాయోడక చెప్పు' మనిన, వాఁడును మగిడి చని ధర్మనందను ప్రియవచనంబులను వృకోదరు నిష్ఠురోక్తులను ధార్తరాష్ట్రుల కెఱింగించెఁ; దదనంతరంబ. 82

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనియెన్= అని ధర్మరాజు పలికాడు; అప్పుడు= ఆ సమయంలో; భీమసేనుండు= భీముడు; ఆదూతన్= ఆ రాయబారిని; చూచి; 'ఓరి!= (ఓదూతా!); వినుము= ఆలకింపుము; పదుమూఁడు+అగు= పదమూడవది అయిన; ఏఁటి, కడపటన్= సంవత్సరంచివర; పాండవ+అగ్రజుండు= పాండవులలో మొదట పుట్టినవాడు, ధర్మరాజు; దీప్తంబు+అగు= ప్రజ్వలిస్తున్నది అయిన; శస్త్ర+అస్త్ర, దహనంబునందున్= బాణాలవలన, మంత్రమహిమగల బాణాలవలన ఏర్పడే అగ్నిలో; ధార్తరాష్ట్ర, సుత, శతకంబును= ధృతరాష్ట్రుడియొక్క నూరుమంది కొడుకులను; పశువరించి= బలి అయ్యే జంతువులనుగా చేసి; వేల్చి= హోమంలో పడవేసి; రణసత్త్రంబు= యుద్ధం అనెడి యజ్ఞం; చేయుటకున్+ఐ= చేయటానికై; వచ్చున్+కాని= వస్తాడు కాని; అందాఁకన్= అంతవరకు; చనుదెంచుట= రావటం; కలుగదు= జరుగదు; అని= అనిచెప్పి; ఆదుర్యోధను +ఎదురన్+అ= ఆ సుయోధనుడిఎదుటనే; వాయి+ఒడక= నోరువిప్పటానికి జంకక; చెప్పుము= వచింపుము; అనినన్= అని చెప్పగా; వాఁడును= దూతయును; మగిడిచని= తిరిగి వెళ్ళి; ధర్మనందను ప్రియ, వచనంబులను= ధర్మరాజు చెప్పిన ఇంపైన మాటలను; వృక+ఉదరు= భీముడియొక్క; నిష్ఠుర+ఉక్తులను= కఠినమైన మాటలను; ధార్తరాష్ట్రులకున్= ధృతరాష్ట్రుడి కుమారులకు; ఎఱింగించెన్= తెలిపాడు; తద్+అనంతరంబు+అ= అటు పిమ్మటనే.

తాత్పర్యం: అని ధర్మరాజు చెప్పాడు. ఆ సమయంలో జోక్యం కల్పించుకొని, భీమసేనుడు ఆ దూతతో 'ఓరీ దూతా! సావధానంగా నేను చెప్పేమాటలను వినుము. నేటికి పదమూడవసంవత్సరం ముగిసిన పిమ్మట - మా అరణ్యవాసం, అజ్ఞాతవాసం ముగిసిన తరువాత - పాండవుల అన్నగారు ధర్మనందనుడు పిలువకుండానే తాను కావించే యుద్ధయజ్ఞంలో ధృతరాష్ట్రుడి నూరుమంది కొడుకులను యజ్ఞపశువులను చేసి తన శస్త్రాస్త్రాలనే అగ్నిలో వేల్చడానికి వస్తాడు. ఆ యుద్ధ యజ్ఞం జరిగేటప్పుడే మేం రాగలం. అంతవరకు ఊరక అచటికి రాజాలమని నీవు జంకకుండా సుస్పష్టంగా దుర్యోధనుడితో చెప్పుము' అని గర్జించాడు. ఆ దూత తిరిగి వెళ్ళి, ధర్మరాజు పలికిన సామవాక్యాలను, భీముడి పరుషమైన మాటలను ధృతరాష్ట్రుడికొడుకులకు వివరించి చెప్పాడు. అటు పిమ్మట.

క. చనుదెంచిరి కౌరవశా। సనమున ధరణిఁ గల నిఖిల జనపతులును స
న్మునులును సమస్తజనులును। ఘనభుజుజన్నంబుఁ జూడఁ గరిపురమునకున్. 83

ప్రతిపదార్థం: కౌరవశాసనమునన్= కురువంశంలోనివాడైన దుర్యోధనుడి ఆజ్ఞ మేరకు; ధరణిన్+కల= భూమిపై ఉన్న; నిఖిల జనపతులును= అందరు రాజులును; సత్+మునులును= ఉత్తములైన ఋషులున్నూ; సమస్త, జనులును= అందరు ప్రజలున్నూ; కరిపురమునకున్= హస్తినాపురికి; ఘనభుజు జన్నంబున్= గొప్పపరాక్రమం కలవాడైన దుర్యోధనుడి యజ్ఞాన్ని; చూడన్= సందర్శించటం కొరకై; చనుదెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: దుర్యోధనుడిశాసనంమేరకు, భూమిలోని రాజులు అందరు, ప్రజలు అందరు, గొప్పఋషులు అతడు చేస్తున్న యజ్ఞాన్ని సందర్శించటానికై వచ్చారు.

వ. వారి కెల్లను దగిన సత్కారంబులు సేయను బాత్రదానంబులు గావింపను ధృతరాష్ట్రుండు విదురుం బనిచె; నివ్విధంబునఁ బ్రసిద్ధ దక్షిణాన్వితంబై ప్రభూతాన్నపానసంతర్పిత సకలజనంబై యభిమతాంబరాభరణ పరిపూజిత భూసురప్రకరంబై యథాకాలవిహితకర్మకలాపంబై యథాశాస్త్రీయంబై వైష్ణవయాగంబు నిర్విఘ్నంబుగఁ బరిసమాప్తం బగుటయు. 84

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వారికిన్+ఎల్లను= యాగానికి వచ్చినవారందరికీ; తగిన, సత్కారంబులు+చేయను= ఉచితమైనమర్యాదలను కావించటానికి; పాత్రదానంబులు= అర్హతనుపట్టి దానాలు; కావింపను= చేయటానికి; ధృతరాష్ట్రుండు; విదురున్= విదురుడిని; పనిచెన్= నియోగించాడు; ఈ+విధంబునన్= ఈరీతిగా; ప్రసిద్ధ, దక్షిణ+అన్వితంబు+ఐ= కీర్తికి ఎక్కిన దక్షిణలతో కూడింది అయి (దక్షిణ= పండితులైన బ్రాహ్మణులకు బహుమానంగా సమర్పించబడే ధనం); ప్రభూత+అన్న, పాన, సంతర్పిత, సకల, జనంబు+ఐ= విరివిగా అన్నపానీయాలు సమకూర్చబడటంచేత సంతృప్తిచెందిన ప్రజలు కలదై; అభిమత+అంబర+ఆభరణ, పరిపూజిత, భూసుర, ప్రకరంబు+ఐ= కోరిన వస్త్రాలచేత, భూషణాలచేత బాగుగా సమ్మానించబడిన బ్రాహ్మణుల సముదాయం కలదై; యథా, కాల, విహిత, కర్మ కలాపంబు+ఐ= ఏసమయానికి ఏయేపనులు జరుగవలెనని శాస్త్రాలు నిర్దేశించాయో అట్లే జరిగిన అన్ని పనులు కలదై; యథాశాస్త్రీయంబు+ఐ= శాస్త్రం నిర్దేశించిన విధులను అనుసరించినది అయి; వైష్ణవయాగంబు= వైష్ణవయజ్ఞం; నిర్విఘ్నంబుగాన్= ఎట్టి ఆటంకాలు లేకుండా; పరిసమాప్తంబు+అగుటయున్= పూర్తిగా ముగిసినది కాగా.

తాత్పర్యం: ఆ యజ్ఞానికి విచ్చేసినవారికి సమ్మానంచేయటానికి, అర్హతలను బట్టి దానాలు ఇవ్వటానికి ధృతరాష్ట్రుడు విదురుడిని నియోగించాడు. ఈవిధంగా ఆ యాగానికి గొప్పపేరుప్రతిష్ఠలు కలిగాయి. అందులో బ్రాహ్మణులకు పుష్కలంగా దక్షిణలు లభించాయి. గొప్ప అన్నదానం జరిగింది. ప్రజలకు అందరికి అన్నపానాలు లభించటంచేత వారికి సంతృప్తి కలిగింది. బ్రాహ్మణులకు అందరకు సంతృప్తికరంగా వస్త్రాలు ఆభరణాలు లభించాయి. శాస్త్రంలో చెప్పబడిన విధులు అన్నియు సక్రమంగా సకాలంలో జరిగాయి. కర్మకాండలలో ఎట్టిలోపాలు జరుగలేదు. శాస్త్రవిధ్యుక్త ప్రకారం జరిగిన ఆ వైష్ణవయాగం ఎట్టి ఆటంకాలు లేక ప్రాయశ్చిత్తానికి అక్కరలేకుండా ముగిసింది.

క. అవభృథశోభితుఁడై కౌ । రవముఖ్యుఁడు భూరికనకరత్నతతుల భూ
దివిజులఁ బూజించి నృపుల । వివిధ విధుల సత్కరించి వీడ్కొలిపెఁ దగన్. 85

ప్రతిపదార్థం: కౌరవముఖ్యుఁడు= దుర్యోధనుడు; అవభృథశోభితుఁడు+ఐ= యజ్ఞం ముగిసిన పిదప చేసే పవిత్రస్నానంచేత శోభిల్లుతున్నవాడై; భూరి, కనక, రత్న, తతులన్= మిక్కుటమైన బంగారంచేత, రత్నసముదాయాలచేత; భూదివిజులన్= బ్రాహ్మణులను; పూజించి= ఆరాధించి; నృపులన్= రాజులను; వివిధ, విధులన్= పెక్కుతెరగులైన మర్యాదలతో; సత్కరించి= గౌరవించి; తగన్= ఒప్పిదముగా; వీడ్కొలిపెన్= ఆమంత్రణం చేసి, సగౌరవంగా పంపాడు.

తాత్పర్యం: యజ్ఞం పూర్తిఅయిన పిదప చేసే పవిత్రస్నానంచేత శోభిల్లినవాడై కౌరవనాయకు డైన దుర్యోధనుడు బ్రాహ్మణులకు పసిడినాణేలను రత్నమాణిక్యాలను పెక్కు బహూకరించి పూజించాడు. యజ్ఞానికి విచ్చేసిన రాజులను అందరను సమ్మానించి అనేకమర్యాదలు చేసి వారివారిదేశాలకు సగౌరవంగా సాగనంపాడు.

వ. అట్టియెడ నధ్వరోత్సవాగతు లైన జను లనేకులు ధృతరాష్ట్రనందను సమ్ముఖంబున ని ట్లనిరి. 86

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆసమయంలో; అధ్వర+ఉత్సవ+ఆగతులు+ఐన= యజ్ఞమనేపండుగను చూడటానికై వచ్చినవారైన; జనులు= ప్రజలు; అనేకులు= పలువురు; ధృతరాష్ట్రనందను సమ్ముఖంబునన్= ధృతరాష్ట్రుడి కొడుకైన దుర్యోధనుడి ఎదుట; ఇట్లు+అనిరి= ఈ విధంగా పలికారు.

తాత్పర్యం: ఆసమయంలో యజ్ఞాన్ని సందర్శించటానికి ఏతెంచిన ప్రజలు పలువురు ధృతరాష్ట్రుడికుమారు డైన దుర్యోధనుడిని ఈవిధంగా అభినందించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'జనపతు లెవ్వరు నివ్విధ । మున నిర్విఘ్నముగ నఖిలభూజనసమ్మో
దనముగఁ జేసిరె సత్క్రతు । వనఘ! భవత్పుణ్యమహిమ లాశ్చర్య మిలన్. 87

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడైనవాడా, ఓదుర్యోధనా!; జనపతులు+ఎవ్వరున్= రాజులు ఎవ్వరు గాని; ఈ+విధమునన్= ఈరీతిగా; నిర్విఘ్నముగన్= ఎట్టి ఆటంకాలు లేకుండగా; అఖిల, భూ, జన, సమ్మోదనముగన్= భూమియందలి ప్రజలు అందరికిని సంప్రీతి కలిగేటట్లుగా; సత్+క్రతువు= మంచి జన్నం; చేసిరి+ఎ= సలిపి ఉండిరా; భవత్+పుణ్య, మహిమలు= నీయొక్క సుకృతానికి సంబంధించిన గొప్పప్రభావాలు; ఇలన్= భూమియందు; ఆశ్చర్యము= అచ్చెరువు కలిగిస్తున్నవి.

తాత్పర్యం: 'ఓదుర్యోధనా! నీవు గొప్పపుణ్యాత్ముడవు; ఎట్టి లోటుపాటులు లేకుండా, ఎట్టి దొసగులు దొరలకుండా భూమియందలి ప్రజలందరు సంతోషించేటట్లుగా ఇంతగొప్ప జన్నాన్ని ఇంత ఘనంగా మున్ను ఎవరును చేసి ఉండలేదు. నీ పుణ్యమహిమలు అచ్చెరువు కలిగిస్తున్నవి.

శా. సారోదారవిభూతిమై మును హరిశ్చంద్రుం డొనర్చెం గ్రియా
పారీణుండయి రాజసూయ; మది సెప్పన్ వింటి; మయ్యజ్ఞముం
గౌరవ్యోత్తముఁ డైన ధర్మసుతుఁడుం గావింపగాఁ గంటి; మే
మా రెండున్ సరిగావు నీమఖముతో నత్యున్నతిన్ భూవరా! 88

ప్రతిపదార్థం: భూవరా!= రాజా, దుర్యోధనా!; మును= పూర్వకాలంలో; హరిశ్చంద్రుండు= హరిశ్చంద్రుడు; సార+ఉదార, విభూతిమైన్= దట్టమైన గొప్పదైన ఐశ్వర్యంచొప్పున; క్రియాపారీణుండు+అయి= అనుష్ఠానంలో నేర్పు కలవాడై; రాజసూయము= రాజసూయం (అనేయాగం); ఒనర్చెన్= చేశాడు; అది+చెప్పన్= దానినిగూర్చి పలుకగా; వింటిమి= విన్నాం; ఆ+యజ్ఞమున్= ఆ జన్నమున్నూ; కౌరవ్య+ఉత్తముఁడు+ఐన= కౌరవవంశానికి చెందినవారిలో గొప్పవాడైన; ధర్మసుతుఁడున్= ధర్మనందనుడు కూడ; కావింపఁగాన్= చేయగా; కంటిమి= చూచాం; ఏము= మేము; ఆ రెండున్= ఆరెండును (హరిశ్చంద్రుడు చేసిన రాజసూయయాగం ధర్మరాజు చేసిన రాజసూయం); నీమఖముతోన్= నీవు చేసిన జన్నంతో (వైష్ణవయాగంతో); అతి+ఉన్నతిన్= మిక్కిలి గొప్పతనంలో; సరి, కావు= సమానం కావు.

తాత్పర్యం: ఓ దుర్యోధనమహారాజా! ఎప్పుడో పూర్వకాలంలో అష్టైశ్వర్యాలతో తులతూగే హరిశ్చంద్రుడు అనుష్ఠానవేదాంతిఅయి రాజసూయయాగాన్ని వైభవోపేతంగా నిర్వహించాడని విని ఉన్నాం. ఈ మధ్య కౌరవకులీనుడైన ధర్మనందనుడు ఆ రాజసూయయాగాన్ని సల్పటం కనులార చూచి ఉన్నాం. కాని, వైభవంలో ఆరెండు యజ్ఞాలున్నూ నీవు చేసిన వైష్ణవయాగానికి సాటిరావు.

క. ఈ జన్న మొనర్చియకా । దే జగదావర్తకీర్తి దీపితులై య
వ్యాజసురలోకసుఖముల । భ్రాజిల్లిరి రఘు యయాతి భరతాది నృపుల్'. 89

ప్రతిపదార్థం: రఘు, యయాతి, భరత+ఆది, నృపుల్= రఘువు, యయాతి, భరతుడు మున్నగురాజులు; ఈ జన్నము= ఈ యాగం; ఒనర్చి+అ+కాదే= చేయటంచేత మాత్రమే కదా; జగత్+ఆవర్త, కీర్తి, దీపితులు+ఐ= లోకంలో సుడితిరిగిన యశస్సుచేత వెలుగొందినవారై; అవ్యాజ, సురలోక సుఖములన్= సహజమైన స్వర్గలోకసౌఖ్యాలతో; భ్రాజిల్లిరి= శోభిల్లారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పూర్వం ఈయజ్ఞం చేయటంవల్లనే కదా రఘువు, యయాతి, భరతుడు మున్నగు రాజులు లోకాలచుట్టూ వ్యాపించిన గొప్పయశస్సుచేత వెలుగొందారు. అందుచేతనే కదా వారికి శాశ్వత మైన స్వర్గలోకసౌఖ్యాలు సంప్రాప్తించాయి.

తే. అని నుతింపంగ మఱియును నంద కొంద । ఱయ్యుధిష్ఠిరు రాజసూయంబు చిదుర
పాలుఁ బోల దీమఖము వైభవసమృద్ధి । నని తలంచిరి నిజహృదయంబులందు. 90

ప్రతిపదార్థం: అని= అంటూ; నుతింపంగన్= ప్రస్తుతించగా; మఱియును= వెండియును; అందున్+అ= అందే (వారిలోనే); కొందఱు= కొంతమంది; వైభవ, సమృద్ధిన్= సంపదయొక్క అతిశయంలో; ఈ మఖము= ఈ యజ్ఞం (దుర్యోధనుడు చేసిన వైష్ణవయాగం); ఆ+యుధిష్ఠిరు= ఆ ధర్మరాజుయొక్క; రాజసూయంబు= రాజసూయంయొక్క; చిదురపాలున్= సూక్ష్మఖండం అయిన భాగాన్ని; పోలదు= సరికాదు; అని= అంటూ; నిజహృదయంబులందున్= తమడెందాలలో; తలంచిరి= భావించారు.

తాత్పర్యం: అని కొందరు ప్రస్తుతించారు. కాని వారిలో మఱికొందరుమాత్రం - ధర్మరాజు చేసిన రాజసూయయాగంతో పోలిస్తే ఐశ్వర్యాతిశయంలో దుర్యోధనుడు చేసిన ఈ యజ్ఞం ఒక అణువుతో గూడ సరిపోలదు- అని తమ హృదయాలలో తలపోశారు.

వ. అనంతరంబ నిరంతరానందమందమందాయమానమానసుం డగుచు మానవేశ్వరుండు దమ్ములు దొరలు బంధుజనంబులుం బరివేష్టింపఁ బౌరజనదత్తాశీర్వాద జయజయశబ్ద శబ్దాయమాన దిగ్విభాగుం డగుచుఁ బుణ్యాంగనా కరకలిత లలితాక్షతవిక్షేపంబులును, బటువందిమాగధ సంకీర్తనంబులును గైకొనుచుఁ బురప్రవేశంబు సేసి, రాజమందిరగతుండై ధృతరాష్ట్రునకు గాంధారికిఁ గృపద్రోణభీష్ములకుం బ్రణమిల్లి యుల్లంబు వికసిల్లఁ గనకాసనాసీనుండయ్యెఁ; నప్పుడు కర్ణుం డతని కి ట్లనియె. 91

ప్రతిపదార్థం: అనంతరంబు+అ= తరువాతనే; మానవ+ఈశ్వరుండు= రాజు(దుర్యోధనుడు); నిరంతర+ఆనంద, మంద, మందాయ మాన మానసుండు+అగుచున్= ఎడతెగని సంతోషంచేత మెత్తమెత్తనైన మనస్సు కలవాడౌతూ; తమ్ములు= అనుజులు; దొరలు= సామంతులు, బంధు జనంబులున్= పలువురు చుట్టాలును; పరివేష్టింపన్= చుట్టూ చేరి కొలువ; పౌరజనదత్త+ఆశీర్వాద, జయ, జయ, శబ్ద, శబ్దాయమాన, దిక్+విభాగుండు+అగుచున్= పురంలో నివసించే పలువురు ప్రజలచేత ఇవ్వబడిన దీవనలు, జయజయ అనే నాదాలచేత నినదిస్తున్న దిక్కులయొక్క విభాగాలు కలవాడు ఔతూ; పుణ్య+అంగనా, కర, కలిత, లలిత+అక్షత, విక్షేపంబులును= ముత్తయిదువులయొక్క చేతులలోకూడిన మనోహరాలైన సేసల జల్లులను; పటు, వంది, మాగధ, సంకీర్తనంబులును= ప్రశస్తమైన వందులు మాగధులు గానంచేసే పాటలును; కైకొనుచున్= గ్రహిస్తూ; పురప్రవేశంబు+చేసి= నగరంలో చొచ్చి; రాజ, మందిర, గతుండు+ఐ= రాజు నివసించే భవనానికి వెళ్లినవాడై; ధృతరాష్ట్రునకున్ (తండ్రికి); గాంధారికిన్= (తల్లికి); కృప, ద్రోణ, భీష్ములకున్= కృపుడికి, ద్రోణుడికి, భీష్మునకు; ప్రణమిల్లి= నమస్కరించి; ఉల్లంబు= మనస్సు; వికసిల్లన్= వికసించగా; కనక+ఆసన+ఆసీనుండు+అయ్యెన్= పసిడిగద్దియపై కూర్చొన్నాడు; అపుడు= ఆసమయంలో; కర్ణుండు; అతనికిన్= దుర్యోధనుడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: పిమ్మట సంతోషంచేత స్నిగ్ధమయిన చిత్తంతో దుర్యోధనుడు తమ్ములు దొరలు చుట్టాలు పలువురు తనచుట్టూ చేరి కొలువ, హస్తినాపురాన్ని రాచఠీవితో ప్రవేశించాడు. పౌరుల జయజయనినాదాలతో దిక్కులు మారుమ్రోగాయి. పుణ్యవనితలు తమ సుకుమారహస్తాలతో సేసలు చల్లారు. వందిమాగధులు ప్రశంసలు చదివి కీర్తించారు. దుర్యోధనుడు రాజప్రాసాదాన్ని చేరి తలిదండ్రులైన గాంధారికి ధృతరాష్ట్రుడికి నమస్కరించాడు. గురువులైన

కృపాచార్యులకు ద్రోణాచార్యులకు అభివాదం చేశాడు. పితామహుడైన భీష్ముడికి వందన మాచరించాడు. ఆవిధంగా సంతోష తన్మయత్వంతో పసిడిగద్దియపై ఆసీనుడయిన దుర్యోధనుడితో కర్ణుడు ఈవిధంగా పలికాడు.

ఉ. 'భాగ్యము గాదె కౌరవనృపాల! భవన్మఖ మిష్టసత్క్రియా
యోగ్యత నిర్వికల్పముగ నొందె సమాప్తి; నశేషధాత్రియున్
భోగ్యమ నీకు; నింక రణభూమిఁ బృథాసుతులన్ జయించి స
మ్యగ్యమశాలివై భువనమాన్య! యొనర్పుము రాజసూయమున్. 92

ప్రతిపదార్థం: కౌరవనృపాల!= కురవంశానికి చెందినరాజా! దుర్యోధనా!; భాగ్యము+కాదే= ఎంతటి అదృష్టమో కదా; భవత్+మఖము= నీయొక్కయజ్ఞం; ఇష్ట+సత్+క్రియా; యోగ్యతన్= ఇంపైన మంచిపనుల కలయికచేత; నిర్వికల్పముగన్= ఎట్టిఅవరోధాలు లేకుండా; సమాప్తిన్+ఒందెన్= ముగిసింది; నీకున్; అశేషధాత్రియున్= సమస్తభూమియును; భోగ్యము+అ= అనుభవించ దగిందే సుమా; ఇంకన్= ఇకమీద; భువనమాన్య!= లోకంచేత ఆరాధింపదగినవాడా, ఓదుర్యోధన మహారాజా! రణభూమిన్= యుద్ధరంగంలో; పృథాసుతులన్= కుంతికొడుకులను (పాండవులను); జయించి= గెలిచి; సమ్యక్+యమశాలివి+ఐ= సముచితమైన నియమము కలవాడవు అయి; రాజసూయమున్= రాజసూయం (అనేయజ్ఞాన్ని); ఒనర్పుము= చేయుము.

తాత్పర్యం: 'ఓ దుర్యోధనమహారాజా! నీవు వైష్ణవయాగాన్ని అనుకొన్నరీతిగా, శాస్త్రోక్తంగా ఎట్టి ప్రాయశ్చిత్తాలూ అక్కరలేకుండా జగజ్జేగీయమానంగా నిర్వహించావు. ఆహా! నీవు ఎంతటి అదృష్టవంతుడివి! ఇక యుద్ధరంగంలో పాండునందనులను జయించి భువనమాన్యుడవై రాజసూయయాగాన్ని నియమంతో చేయుము.

విశేషం: 1. సమ్యగ్యమశాలి: సముచితమైన - 'యమము' కలవాడు. 'యమం' అష్టాంగాలలో ఒకటి. 1. యమం 2. నియమం 3. ప్రాణాయామం 4. ప్రత్యాహారం 5. ధ్యానం 6. ధారణ 7. మననం 8. సమాధి. యమం దశవిధం : 1. సత్యం 2. దయ 3. క్షమ 4. ధృతి 5. మితాహారం 6. ఆర్జవం 7. బ్రహ్మచర్యం 8. అస్తేయం 9. అహింస 10. శౌచం.

క. అది యెమ్మెయి నగునో యని । మదిలో వగవంగవలదు; మఘవతనూజుం
గదనంబునఁ జంపక యే । పదనఖధావన మొనర్పఁ బార్థివముఖ్యా!' 93

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= రాజులలో శ్రేష్ఠుడవైనవాడా! ఓదుర్యోధనమహారాజా!; అది= పాండవులను యుద్ధంలో జయించటం; ఏ+మెయిన్= ఏరీతిగా; అగునో+అని= జరుగునో అని; మదిలోన్= మనస్సులో; వగవంగన్‌వలదు= విచారించవద్దు; మఘవతనూజున్= ఇంద్రుడికుమారుడిని- అర్జునుడిని; కదనంబునన్= యుద్ధంలో; చంపక= సంహరించకుండా; ఏన్= నేను; పద, నఖ, ధావనమున్= కాళ్లకు ఉన్నగోళ్లయొక్క శుద్ధిని, ఒనర్పన్= చేయను.

తాత్పర్యం: రాజరాజు వయిన ఓదుర్యోధనసార్వభౌమా! యుద్ధంలో పాండవులను జయించటం ఏవిధంగా జరుగుతుందో అని నీవు నీమనస్సులో చింతించబోకుము. నేను రణరంగంలో దేవేంద్రుడికొడుకు అయిన అర్జునుని సంహరించగలను. అంతవరకు, నేను నాకాళ్ళగోళ్లు కడుగుకొన నని శపథం చేస్తున్నాను.'

విశేషం: 'గదనమున నే జయింపన్' - అనే పాఠాంతరం కొన్ని ప్రతులలో కానవస్తున్నది.

తే. అనినఁ గర్ణుఁ గౌఁగిటఁ జేర్చి యన్నరేంద్ర । నందనుఁడు 'నీ సహాయత నాకుఁ గలుగఁ
బాండవుల నోర్చు టెంతటి పని మహాత్మ!' । యని సహోదరసహితుఁడై హర్ష మొందె. 94

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అని కర్ణుడు ప్రతిజ్ఞ చేయగా; ఆ+నర+ఇంద్ర, నందనుఁడు= ఆ రాజపుత్రుడు (దుర్యోధనుడు); కర్ణున్= కర్ణుడిని; కౌఁగిటన్+చేర్చి= ఆలింగనంచేసి; నీసహాయత= (ఓ కర్ణా) నీయొక్క సాయం; నాకున్= నాకు (దుర్యోధనుడికి); కలుగన్= ఉండగా; పాండవులన్= పాండునందనులను; ఓర్చుట= జయించటం; ఎంతటి పని?= ఎంత పని - మహా+ఆత్మ!= ఓ మహానుభావుడా, కర్ణ! అంటే మిక్కిలి సులువైన కార్యం సుమా; అని= అని చెప్పి; సహోదర, సహితుఁడు+ఐ= సోదరులతో పాటుగ; హర్షమున్+ఒందెన్= సంతోషించాడు.

తాత్పర్యం: అని కర్ణుడు ప్రతిజ్ఞ చేశాడు. అంతట దుర్యోధనుడు కర్ణుడిని ఆలింగనం చేసికొని 'మహాత్ముడవైన ఓ కర్ణా! నాకు నీ సాయం ఉండగా పాండవులను జయించటం ఏమంత కష్టమైన కార్యం కాదు సుమా' అని చెప్పి సోదరులతో పాటు సంతోషించాడు.

వ. అట ధర్మతనయుండు సూతతనయు ప్రతిజ్ఞ విని వాని బలశౌర్యవిభవంబును నభేద్యకవచ ప్రభావంబును దలంచి విషణ్ణహృదయుం డై రేయెల్లను గన్ను మూయుట లేక వగచుచుండె; నిట దుర్యోధనుండునుం గర్ణసౌబలప్రవర్తిత కార్యఖడ్గుం డై భీష్మద్రోణకృపాదులకును మహనీయు లైన మహీసురులకు ననుదినంబును బ్రియ సత్కారంబులు సలుపుచు ధనంబు దత్తభుక్తఫలంబుగా వగచి, నిరంతర త్యాగ భోగంబుల ననురాగంబు నొందుచుండె ననిన' వైశంపాయనునకు జనమేజయుం డిట్లనియె. 95

ప్రతిపదార్థం: అటన్= అచట (ద్వైతవనంలో); ధర్మతనయుండు= ధర్మసుతుడు; సూతతనయు ప్రతిజ్ఞ= సూతునికొడుకు (కర్ణుడి) యొక్క శపథం; విని= ఆలకించి; వాని= అతడియొక్క - కర్ణుడి యొక్క; బలశౌర్యవిభవంబును= బలం పరాక్రమం అనే సంపదను; అభేద్య, కవచ, ప్రభావంబును= భేదించుటకు వీలుగాని తనుత్రాణంయొక్క మహిమను; తలంచి= స్మరించి; విషణ్ణ, హృదయుండు+ఐ= దుఃఖంతో నిండిన డెందం కలవాడై; రే+ఎల్లను= రాత్రి అంతయును; కన్ను= నేత్రం; మూయుట= నిమీలించటం; లేక= లేకుండగా; (నిదురమాని); వగచుచుండెన్= దుఃఖిస్తూ ఉన్నాడు; ఇటన్= ఇచట (హస్తినాపురంలో); దుర్యోధనుండునున్= సుయోధనుడును; కర్ణ, సౌబల, ప్రవర్తిత, కార్య, ఖడ్గుండు+ఐ= కర్ణుడిచేత శకునిచేత నడపబడిన కార్యం, ఖడ్గం కలవాడై (సంధివిగ్రహాలు కలవాడై); భీష్మ, ద్రోణ, కృప+ఆదులకును= భీష్ముడు కృపుడు ద్రోణుడు మున్నగు వారలకును; మహనీయులు+ఐన= మహానుభావులు అయిన, మహీసురులకున్= బ్రాహ్మణులకు; అనుదినంబును= నిత్యమున్నూ; ప్రియ, సత్కారంబులు= ఇష్టమైన సమ్మానాలు; సలుపుచున్= చేస్తూ; ధనంబు= డబ్బు; దత్తభుక్తఫలంబు+కాన్= ఇచ్చుట తినుట ప్రయోజనలుగా గలది యని; వగచి= యోచించి; నిరంతర, త్యాగభోగంబులన్= ఎల్లప్పుడును ఇతరులకు ఇవ్వటం తాను అనుభవించటంలో; అనురాగంబున్= ప్రేముడిని; ఒందుచుండెన్= సంపాదిస్తూ ఉన్నాడు; అనినన్= అని చెప్పగా; వైశంపాయనునకున్; జనమేజయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అక్కడ - ద్వైతవనంలో ధర్మరాజు కర్ణుడి ప్రతిజ్ఞ విని భయపడ్డాడు. కర్ణుడి సహజకవచకుండలాలను అభేద్యకవచాన్ని, అతడి పరాక్రమాన్నీ స్మరించి ధర్మరాజు నిదురించలేకపోయాడు. ఇక్కడ - హస్తినాపురంలో దుర్యోధనుడు కర్ణశకునుల మాటలు వింటూ, వారు చెప్పిన విధంగా రాజకార్యాలను సంధివిగ్రహాలను నెరపుతున్నాడు. అంతేకాక, దుర్యోధనుడు భీష్మద్రోణకృపాదులయెడల, బ్రాహ్మణోత్తములయెడ భక్తి ప్రపత్తులు చూపుతున్నాడు. తనకు సంక్రమించిన ఐశ్వర్యాన్ని దొరికిన పండును అనుభవిస్తున్నట్లుగా భావించి, తాను భోగాలను అనుభవిస్తూ, సహచరులకు తనసంపద పంచిపెట్టుతూ, త్యాగం భోగం మేళవించి బ్రదుకుతూ, అందరి అనురాగాన్నీ పొందుతున్నాడని గడచినకథ వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు సర్పయాగ సందర్భంలో వివరించి చెప్పాడు. అంతట జనమేజయుడు ఈ విధంగా వైశంపాయనుడిని ప్రశ్నించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'కార్యఖడ్గములు' - ఈపద గుంఫనం తిక్కననాడు మిక్కిలి ప్రచారంలో ఉన్నట్టిది. రాజనీతిలోని - సామదానభేదదండోపాయాలలో కార్యం అంటే సామం. ఖడ్గమంటే దండం. నన్నయయుగంనుండి తిక్కన యుగం వరకు మంత్రులు - దండనాథులుగా కూడా ఉన్నారు. 'సంధివిగ్రహపాత్రుడు' - అనే అధికారి ఆ యుగాలలో ప్రాముఖ్యం వహించినటుల సమకాలీన శాసనాలు తెలుపుతున్నవి. తిక్కనకు సమకాలీను డైన గణపతిదేవ చక్రవర్తి కార్యఖడ్గనిపుణుడు, ఖడ్గతిక్కన - గంటం తిక్కన సోదరులు. కవితిక్కన, ఖడ్గతిక్కన ఇరువురును కార్యఖడ్గ నిపుణులే. ఎర్రన మహాకవికి అనుగుమిత్రుడయిన మల్లారెడ్డి ఖడ్గప్రియుడుమాత్రమే కాదు, కవితాప్రియుడుకూడ. ఈ సంప్రదాయం తెలుగునేలపై చిరకాలం వర్ధిల్లింది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో పరాకాష్ఠ నందింది. శ్రీకృష్ణదేవరాయలు కవికాలికి గండపెండేరం (వీరుడికి తొడిగేది అందె; గండడు= వీరుడు) తొడిగాడు; శ్రీకృష్ణదేవరాయలు కార్యఖడ్గనిపుణులలో మేరుపూస. తాను 'సాహితీ సమరాంగణ సార్వభౌముడను' అని చాటుకొన్నాడు. కలం, కత్తి తెలుగు సంస్కృతిని చిరకాలం 'పడుగు' - 'పేక' పేనినవి.

క. **'దుర్యోధను చెఱఁ దలిఁగి య। వార్యపరాక్రములు పాండవప్రభులు మహా**
శ్చర్యచరితు లవ్వనమున। నార్యులు మఱి యెట్టివార లైరి మునీంద్రా!' **96**

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= ఋషులలో శ్రేష్ఠుడవైన వాడా! ఓ వైశంపాయనమునీ!; దుర్యోధను చెఱన్= దుర్యోధనుడియొక్క బంధాన్ని; తలిఁగి= పోగొట్టి; అవార్యపరాక్రములు= వారించటానికి శక్యంగాని శౌర్యం కలవారు; మహా+ఆశ్చర్య, చరితులు= మిక్కిలి అచ్చెరువు కొలిపే నడవడి కలవారు; ఆర్యులు= పూజించదగినవారు; పాండవ ప్రభులు= రాజులు అయిన పాండవులు; ఆ+వనమునన్= ఆ అడవిలో; మఱి= వెండియు; ఎట్టివారలు= ఎటువంటి వారు; ఐరి= అయినారు.

తాత్పర్యం: 'ఓ వైశంపాయన మహర్షీ! పాండవులు ఎదురులేని పరాక్రమం కలవారు. వారు దుర్యోధనుడికి బంధమోక్షం చేసిన పిదప ఆ అడవిలో ఏవిధంగా ప్రవర్తించారు. వారు మాననీయులు. వారిచరిత్ర ఆశ్చర్యకరమైనది. ఇంకను వారు ఏవిధంగా తమ జీవితాలను తీర్చిదిద్దుకొన్నారో వినవలెనని కుతూహలంగా ఉన్నది. దయచేసి వినిపించుము.

ద్వైతవనంబునందలి మృగసమూహము ధర్మజు స్వప్నంబునందు వచ్చి తమదుఃఖంబు సెప్పుట (సం. 3-244-2)

వ. **అని యడిగిన నమ్మహాముని యమ్మహీపతి కి ట్లనియె.** **97**

తాత్పర్యం: అని అడుగగా ఆ గొప్పఋషి అయిన వైశంపాయనుడు రాజైన జనమేజయుడితో ఈవిధంగా అన్నాడు.

సీ. **'ద్వైతవనంబున ధర్మజుం డొకనాఁడు। నిద్రింపఁగాఁ దద్వనేచరంబు**
లగునట్టి మృగజాతు లన్నియుఁ గలలోన। వచ్చి కన్నుల నశ్రువారి దొరుఁగఁ
ద మ్మెఱింగించి యాతనితోడ నిట్లను। 'ధర్మాత్మ! మీరు నిత్యంబుఁ గడఁగి
చంపఁగఁ జంపంగ సమసి యల్పావశి। ష్టము లయ్యె నిప్పు డస్మత్కులంబు

తే. **లేము బీజమాత్రమ దక్కి యిట్లు వనరు। చున్నవారము; మీ రింక నొండు గడకు**
నరిగి, మముఁ గావరే కరుణార్ద్రబుద్ధి'। ననిన నట్లకా కని వాని కభయ మిచ్చి. **98**

ప్రతిపదార్థం: ధర్మజుండు; ద్వైతవనంబునన్= ద్వైతమనే పేరు గల అడవిలో; ఒకనాఁడు; నిద్రింపఁగాన్= నిద్రపోగా; తద్+ వనేచరంబులు= ఆ అడవిలో తిరుగాడే జంతువులు; అగునట్టి= అయినట్టి; మృగజాతులు+అన్నియున్= జంతువిశేషాలు అన్నియును; కలలోన వచ్చి= స్వప్నంలో వచ్చి; కన్నులన్= నేత్రాలలో; అశ్రువారి= కన్నీరు; తొరుఁగన్= జారగా; తమ్మున్+ఎఱింగించి= తమను తెలియ చెప్పుకొని; ఆతనితోడన్= ధర్మరాజుతో; ఇట్లు+అనున్= ఈవిధంగా పలికాయి; ధర్మ+ఆత్మ!= మీరు= మీరు (పాండవులు); నిత్యంబున్= ప్రతిదినం; కడఁగి= పూని; చంపంగన్+చంపంగన్= పలుమారులు చంపగా; సమసి= చచ్చి; అల్ప+అవశిష్టములు+అయ్యెన్= కొద్దిగా మాత్రమే మిగిలినట్టివి అయినవి; ఇప్పుడు= ఈ సమయంలో; అస్మత్+ కులంబులు= మా జాతులు; ఏము= మేము; బీజమాత్రమ+తక్కె= విత్తనానికి మాత్రం మిగిలిఉండి; ఇట్లు= ఈ రీతిగా; వనరుచున్నవారము= వెతచెందుతున్నాం; మీరు= పాండవులైనమీరు; ఇంకన్= ఇకమీద; ఒండు+కడకున్= వేరొకచోటికి; అరిగి= వెడలి; మమున్= మమ్ము; కరుణా+ఆర్ద్ర, బుద్ధిన్= దయతో తడిసిన చిత్తంతో; కావరే?= రక్షించరా?; అనినన్= అని చెప్పగా; అట్లు+అ, కాక+అని= సరే ఆ విధంగానే జరుగుగాక అనిచెప్పి; వానికిన్= ఆ జంతువులకు; అభయము+ఇచ్చి= కాపాడటానికి మాట ఇచ్చి.

తాత్పర్యం: అని జనమేజయుడు ప్రశ్నించాడు. అంతట వైశంపాయనమహర్షి ఇట్లా జనమేజయుడికి బదులు పలికాడు. ద్వైతవనంలో ఒకనాడు ధర్మనందనుడు నిద్రిస్తూ ఉండగా ఆతడికి స్వప్నంలో ఆ అడవిలో నివసించే జంతుజాలాలు కన్పించి, 'పుణ్యాత్మా! మీరు నిత్యం వేటాడి మమ్ములను చంపటంచేత మా సంఖ్య నానాటికి క్షీణించింది. ఇప్పుడు మా జాతులు బీజప్రాయంగా మాత్రమే మిగిలిఉన్నాయి. మీరు జాలిగుండె కలవారుకదా! మా వంశాలు అంతరించిపోవకముందే మీరు వేరొకచోటికి పోతే మేము బ్రదుకగలం' అని విన్నవించాయి. ధర్మరాజు ఆ మృగసంతతిపై కరుణపూని వాటికి అభయమిచ్చాడు.

క. జనపతి మేల్కొని యంతయు । ననుజుల కెఱిఁగించి యిట్టు లను 'నబ్దముపై
నెనిమిది నెల లుండితి మి । వ్వనమునఁ; దగు నింక నొండువలనికిఁ బోవన్. 99

ప్రతిపదార్థం: జనపతి= రాజు (ధర్మరాజు); మేల్కొని= నిద్రనుండి లేచి; అంతయున్= (తనస్వప్నవృత్తాంతాన్ని) అంతటిని; అనుజులకున్= తమ్ములకు; ఎఱిఁగించి= తెలిపి; ఇట్టులు+అనున్= ఈ విధంగా పలికాడు; అబ్దముపైన్= సంవత్సరంపై; ఎనిమిది నెలలు= అష్టమాసాలు; ఈ+వనమునన్= ఈఅడవిలో; ఉండితిమి= (ఈ ద్వైతవనంలో) నివసించాం; ఇంకన్= ఇకమీద; ఒండువలనికిన్= వేరొక చోటికి; పోవన్= వెళ్ళటం; తగున్= ఉచితమౌతుంది.

తాత్పర్యం: ధర్మరాజు నిదురమేల్కొని తనతమ్ములతో ఈ విధంగా చెప్పాడు; 'మనం ఈద్వైతవనానికి వచ్చి ఒకసంవత్సరంమీద ఎనిమిది నెలలు గడిచాయి. ఇంకొకచోటికి పోవటం ఉచితం.

వ. ఇప్పుడు కామ్యక వనంబు బహుమృగాకీర్ణంబై సరసఫలభరిత భూరుహప్రకరంబై విమలకమలాకరాభిరామంబై యున్న యది యని వింటిమి గ్రమ్మఱ గావునం నందులకుం జని తృణబిందునాశ్రమంబున వసియించుటలెస్స' యనినం దమ్ములు 'దేవా! నీ వెట్లు నిశ్చయించితి మాకు నదియ యిష్టం' బని వలికిరి; తదనంతరంబ. 100

ప్రతిపదార్థం: ఇప్పుడు= ఈసమయంలో; కామ్యకవనంబు= కామ్యకం అనే పేరు కల అడవి; బహు, మృగ+ఆకీర్ణంబు+ఐ= పెక్కు జంతువులతో దట్టమైనదై; సరస, ఫల, భరిత, భూరుహ, ప్రకరంబు+ఐ= మంచి పండ్లతో నిండిన చెట్లసముదాయం

కలదై; విమల, కమల+ఆకర+అభిరామంబు+ఐ= స్వచ్ఛమైన సరోవరాలచేత అందమైనదై; ఉన్న+అది= ఉన్నది; అని= అంటూ; వింటిమి= ఆలకించాం; కావునన్= కాబట్టి; క్రమ్మఱన్= తిరిగి; అందులకున్= ఆ అడవికి; చని= వెడలి; తృణబిందు+ఆశ్రమంబునన్= తృణబిందుమహామునియొక్క ఆశ్రమంలో; వసియించుట= ఉండటం; లెస్స= మంచిది; అనినన్= అని (ధర్మరాజు) చెప్పగా; తమ్ములు= అనుజులు; దేవా!= ప్రభూ!; నీవు+ఎట్లు= నీవు ఏవిధంగా; నిశ్చయించితి(వి)= నిర్ణయించావో; మాకున్; అది+అ= అదియే; ఇష్టంబు= ఇంపైనది; అని+పలికిరి= అని వచించారు; అనంతరంబు+అ= అటు పిమ్మట.

తాత్పర్యం: ఈ సమయంలో కామ్యకవనం పెక్కు జంతువులకు నిలయమై ఉన్నది. ఆ వనంలో మంచిపండ్లతో నిండిన చెట్లు పెక్కు ఉన్నాయి. ఆ అడవిలో పలు సరోవరాలు ఉండటంచేత అది మనోహరంగా కన్పిస్తుందని విన్నాను. కావున మనం ఆ అడవికి వెళ్లి అందు కల తృణబిందుమహర్షి ఆశ్రమంలో ఉండటం మంచిది అనిపిస్తున్నది' అని ధర్మరాజు పలికాడు. అంతట అతడి తమ్ములు; 'దేవా! నీ నిర్ణయమే మా నిర్ణయం' అని పలికారు. పిమ్మట.

క. అనుజన్ములుఁ బాంచాలియు । నను చరవర్గంబు బ్రాహ్మణావలియును దోఁ
జనుదేరఁగ సమ్మదమున । ఘనతేజుఁడు సనియెఁ గామ్యకవనంబునకున్. 101

ప్రతిపదార్థం: ఘనతేజుఁడు= గొప్పవర్చస్సు కలవాడు- ధర్మరాజు; కామ్యకవనంబునకున్= కామ్యకం అనే పేరుగల అడవికి; అనుజన్ములున్= తమ్ములున్నూ; పాంచాలియున్= ద్రౌపదియున్నూ; అనుచర, వర్గంబున్= పరివారమున్నూ; బ్రాహ్మణ+ఆవలియును= విప్రుల సముదాయమున్నూ; తోన్+చనుదేరఁగన్= తోడుగా రాగా; సమ్మదమునన్= సంతోషంతో; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: గొప్పవర్చస్సు కల ధర్మరాజు తనతమ్ములు, ద్రౌపది, సేవకుల సముదాయం బ్రాహ్మణులు పలువురున్నూ తోడుగా బయలుదేరగా కామ్యకవనానికి వెళ్లాడు.

వ. ఇట్లరిగి యందుఁగృతనివాసులై యవ్వీరులు శాకఫలమూలంబులంజేసి దేహయాత్రలు నడపుచు నొండొరుల యలజడి సూచి యత్యంతదుఃఖపరవశు లగుచు, జూదంబునాఁడు దమపడినపాట్లు దలంచి కలంగుచుఁ గ్రోధశోకంబులు దమలోన నుపశమించుకొనుచు వర్తిల్లం, బదునొక్కండగు నేఁడు సనిన నందఱుం గాలంబు గడగాంచినవారలై వెడవెడ వికసిల్లిన చిత్తంబులతో నుచితవృత్తంబుల నుండునంత.102

ప్రతిపదార్థం: ఆ+వీరులు; ఇట్లు+అరిగి= ఈవిధంగా వెడలి; అందున్= ఆ కామ్యకవనంలో; కృతనివాసులు+ఐ= ఏర్పరచుకొన్న నివాసాలు కలవారై; శాక, ఫల, మూలంబులన్+చేసి= కాయగూరలు, పండ్లు, వేళ్ళచేత; దేహయాత్రలు= బ్రదుకులు; నడపుచున్= నెరపుతూ; ఒండు+ఒరుల+అలజడి= ఒకరి వెతలు ఇంకొకరు; చూచి= అరసి; అతి+అంత, దుఃఖ, పర, వశులు+అగుచున్= మిక్కుటమైన శోకానికి లోనయ్యేవారు ఔతూ; జూదంబునాఁడు= ద్యూతం ఆడినరోజున; తమపడినపాట్లు= తాము అనుభవించిన దురవస్థలు; తలంచి= జ్ఞాపకంచేసికొని; కలంగుచున్= కలతచెందుతూ; క్రోధ శోకంబులు= కోపాన్నీ, దుఃఖాన్నీ; తమలోన్+అ= తమయందే; ఉపశమించుకొనుచున్= అణచుకొంటూ; వర్తిల్లన్= నడచుకొంటూ ఉండగా; పదునొక్కండు+అగు+ఏఁడు= పదునొకండవ సంవత్సరం; చనినన్= గడవగా; అందఱున్= అందరును (పాండవులుఎల్లరు); కాలంబు+కడ+కాంచినవారలు+ఐ= సమయంయొక్క తుదిని పొందినవారై; వెడవెడ= ఇంచుక ఇంచుక; వికసిల్లిన= విప్పారిన; చిత్తంబులతోన్= మనస్సులతో; ఉచిత, వృత్తంబులన్= తగిన నడవడికలలో; ఉండు+అంతన్= ఉంటూండగా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈవిధంగా పాండవులు కామ్యకవనానికి వెడలి అందులో నివాసాలను ఏర్పరచుకొన్నారు. ఆ వీరులు అక్కడ కాయగూరలు పండ్లు వేరులు మున్నగువాటిని తింటూ శరీరపోషణకు చాలిన ఆహారం మాత్రమే స్వీకరిస్తూ ఉన్నారు. ఒకరు అనుభవిస్తున్న వెతలను ఇంకొకరు గమనించి మిక్కిలి దుఃఖానికి లోనౌతూ ఉన్నారు. జూదం జరిగిననాడు తాము పడిన బాధలు స్మరించి కలతచెందుతూ పదకొండవ సంవత్సరం గడిపి, వనవాసకాలం చివరకు రావటంతో ఇంచుక ఇంచుక వికసించిన మనస్సులతో సమయోచితమైన నడవడికలు నెరపుతున్నారు.

శా. **ప్రీతుండై చనుదెంచె నాశ్రితజనాభీష్టక్రియాశీలుఁ డు**
ద్గీతామ్నాయుఁడు నిర్విధూతదురితక్లేశుండు యోగామృత
స్పీతస్వాంతుఁ డనంతసంతతసమావిర్భూతకారుణ్యధా
రాతోయస్నపనైకశీలుఁ డగు పారాశర్యుఁ డచ్చోటికిన్. **103**

ప్రతిపదార్థం: ఆ+చోటికిన్= ఆస్థలానికి (కామ్యకవనానికి); ప్రీతుండు+ఐ= సంతృప్తి చెందినవాడై; ఆశ్రిత, జన+అభీష్ట, క్రియా, శీలుఁడు= ఆశ్రయించినవారికి ఇష్టాలైన పనులను చేసే స్వభావం కలవాడు; ఉత్+గీత+ఆమ్నాయుఁడు= బాగా పలుకబడిన వేదాలు కలవాడు; నిర్విధూత, దురిత, క్లేశుండు= దూరంగా విసరివేయబడిన పాపాలవలనవగు దుఃఖాలు కలవాడు; యోగ+అమృత, స్ఫీత, స్వాంతుఁడు= యోగ మనే అమృతాన్ని సేవించటంచేత విస్తరించిన మనస్సు కలవాడు; అనంతసంతతసమ్+ఆవిర్భూత, కారుణ్యధారా, తోయ, స్నపన+ఏక, శీలుఁడు+అగు= అంతం లేనట్టిదిన్నీ, ఎల్లప్పుడూ ఉండేదిన్నీ, లెస్సగా పుట్టేదిన్నీ అయిన దయ అనెడి ప్రవాహ రూపమైన నీటిలో స్నానం చేయించే స్వభావం కలవాడు-సంతతదయామయుడు; అగు పారాశర్యుఁడు= పరాశరుడిపుత్రుడు అయిన వ్యాసుడు; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఆ కామ్యకవనానికి పరాశరమహర్షిపుత్రుడైన వేదవ్యాసమహర్షి విచ్చేశాడు. శ్రీవేదవ్యాసమహర్షి పాండవులయెడ ప్రీతి కలవాడు, ఆశ్రితుల కోరికలు ఈడేర్చే స్వభావంకల మహానుభావుడు. వేదాల స్వరూపాన్ని నిర్ణయించి లెస్సగా గానం చేసినవాడు. పాపదుఃఖాలను దూరంగా విసరివేయగలిగిన మహాత్ముడు. యోగామృతాన్ని క్రోలటంచేత వికసించిన మనస్సు కల మహర్షి. నిర్మలకారుణ్య జలధారలచేత ఎదుటివారిని స్నానమాడించే మహనీయుడు.

విశేషం: వేదవ్యాసమహర్షి మహాభారత రచయిత. తెలుగులో మహాభారతాన్ని నిర్మించిన కవిత్రయం వారు వేదవ్యాసమహర్షిని ఉప్పొంగిన డెందంతో అభివర్ణించారు. వ్యాసుడియెడ కవిత్రయానికి గల భక్తిప్రపత్తులు వారు వ్రాసిన పద్యాలలో తొణికిసలాడుతుంటాయి. నన్నయభట్టు పారాశర్యుడిని అభివర్ణించిన పద్యం. 'నీలగిరీంద్రశృంగమున నిర్మల మైన సువర్ణవల్లరీ। జాలమువోని పింగళ విశాలజటాచయ మొప్పగా వచ। శ్శీలలితుండు వచ్చి నిలిచెన్ హరినీలవినీలవిగ్రహా! రాళరుచుల్ వెలుంగఁగఁ బరాశరసూనుఁడు తల్లిముంగటన్'. నన్నయభట్టు-వేరొకచోట వేదవ్యాసుడిని గూర్చి వ్రాసిన పద్యం-తిక్కనకు ఒజ్జబంతి అయింది. 'విద్వత్సంస్తవనీయభవ్యకవితావేశుండు విజ్ఞాన సంపద్విఖ్యాతుఁడు సంయమిప్రకరసంభావ్యానుభావుండు కృష్ణద్వైపాయనుఁ డర్థి లోకహితనిష్ఠం బూని కావించె ధ। ర్మాద్వైతస్థితి భారతాఖ్య మగు లేఖ్యం బైన యామ్నాయమున్'-తిక్కన వేదవ్యాసుడినిగూర్చి వ్రాసిన పద్యం ఇది.

క. **మునిపతి దోదవ్వులఁ గని। జనపతి దమ్ములును దాను సంప్రీతి నెదు**
ర్కొని యర్ఘ్యాది విశేషా। ర్చనలం బరితుష్టుఁ జేసె సంభృతభక్తిన్. **104**

ప్రతిపదార్థం: జనపతి= రాజు = (ధర్మరాజు); మునిపతిన్= ఋషులలో శ్రేష్ఠుడు వ్యాసుడిని; దోదవ్వులన్= దూరదూరంలోనే; కని= చూచి; తాను= తానున్నూ; తమ్ములును= అనుజులును; సంప్రీతిన్= మిక్కులిసంతుష్టితో; ఎదుర్కొని= ఎదురేగి

స్వాగతంచెప్పి; అర్ఘ్య+ఆది, విశేష+అర్చనలన్= స్వాగతం చెప్పడానికై చేతికి అందించే నీరు మున్నగు ప్రత్యేకమైన పూజలతో; సంభృతభక్తిన్= నిండిన పూజ్యభావంతో; (వ్యాసుడిని); పరితుష్టున్+చేసెన్= మిక్కిలి తృప్తిచెందినవాడినిగా చేశాడు.

తాత్పర్యం: ధర్మరాజు వేదవ్యాసమహర్షిని దూరంలోనే చూచి, తానును తమ్ములును ఎదురేగి స్వాగతం చెప్పి ప్రీతితో ఆ మహర్షికి అర్ఘ్యపాద్యాల నిచ్చి, పూజించి సమ్మానించారు.

వ. **కృష్ణద్వైపాయనుండును ననవరతవనవాసాయాస కృశదేహుల నధికదుఃఖాయమాన హృదయులం దన మనుమలం జూచి వగచి, ధర్మపుత్త్రున కి ట్లనియె.** **105**

ప్రతిపదార్థం: కృష్ణద్వైపాయనుండును= వేదవ్యాసుడును; అనవరత, వన, వాస+ఆయాస, కృశ, దేహులన్= ఎల్లప్పుడును అడవిలో నివసించటం అనే శ్రమచేత కృశించిన శరీరాలు కలవారిని; అధిక, దుఃఖాయమానహృదయులన్= మిక్కుటంగా శోకిస్తున్న హృదయాలు కలవారిని; తనమనుమలన్= తన మనుమల్ని; చూచి; వగచి= దుఃఖించి; ధర్మపుత్త్రునకున్= ధర్మనందనుడికి; ఇట్లు+అనియెన్= ఈరీతిగా పలికాడు.

తాత్పర్యం: ఎల్లప్పుడును అడవిలో నివసించటంచేత ఆ శ్రమకు తట్టుకొనలేక శుష్కించిన శరీరాలు కలవారలను మిక్కుటమైన శోకంచేత పీడించబడిన హృదయాలు కల తన మనుమలను పాండవులను చూచి, వేదవ్యాసమహర్షి మిక్కిలి పరితపించి ధర్మరాజుతో ఈవిధంగా చెప్పాడు.

విశేషం: 1. వ్యాసుడు పరాశరమహర్షి కొడుకుకాన పారాశర్యుడు కృష్ణద్వైపాయనుడు. (పరాశరునకు, సత్యవతికి) ద్వీపంలో జన్మించినవాడు కాబట్టి ఈయనకు - 'ద్వైపాయనుఁడు' అనే నామధేయం సిద్ధించింది. నల్లనిదేహం కలవాడు కావున కృష్ణద్వైపాయనుడు. వేదాలను ప్రస్తరింపజేసినవాడు కావున వేదవ్యాసుడు.

ఉ. **'కాలవిపర్యయంబున సుఖంబును దుఃఖము వచ్చుచుండు; నె**
క్కాలము నేరికిన్ ధ్రువము గాదు సుఖంబును దుఃఖమున్ మహీ
పాల! బుధుండు దద్వివిధభంగు లెఱింగి ప్రమోద ఖేదసం
శీలుఁడు గాఁడు రెంటను బ్రసిద్ధపథంబున నప్రమత్తుఁడై. **106**

ప్రతిపదార్థం: మహీపాల!= ఓరాజా! ధర్మనందనా!; కాలవిపర్యయంబునన్= సమయం తారుమారు కావటంవలన; సుఖంబును= సౌఖ్యం; దుఃఖమున్= శోకం; వచ్చుచుండున్= కలుగుతుంటాయి; ఏ+కాలమున్= ఏసమయంలోనూ; ఏరికిన్= ఎవరికిని; సుఖంబును= సౌఖ్యం; దుఃఖమున్= ఆవేదన; ధ్రువంబు+కాదు= స్థిరమైనది కాదు; బుధుండు= తెలివికలవాడు; తద్+వివిధ, భంగులు+ఎఱింగి= దానియొక్క (కాలవిపర్యంయొక్క) పెక్కురీతులు తెలిసికొని; ప్రసిద్ధపథంబునన్= బాగా తెలిసిన మార్గంలో; అప్రమత్తుఁడు+ఐ= జాగ్రత్తకలవాడై. రెంటను= రెండింటిలోనూ (మోదఖేదాలు రెండింటిలో); ప్రమోద, ఖేద, సంశీలుఁడు+ కాఁడు= సంతోషం గాని, ఆవేదన గాని పొందే స్వభావంకలవాడు కాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! కాలం తారుమారు కావటంవలన ఒకప్పుడు సౌఖ్యం మరియొక సమయంలో దుఃఖం దాపురిస్తూ ఉంటాయి. ఎవరికైనను సుఖదుఃఖాలు స్థిరంగా ఉండవు. తెలివికలవాడు కాలంతెచ్చిపెట్టే పెక్కురీతులను తెలిసికొని సంతోషం చెందడు, ఆవేదన పొందడు. సుఖదుఃఖాలయెడ జాగరూకుడై ఉండి పేరొందుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విను నీవును నాపదలకు । మనమున నొక్కింత యోర్చి మహనీయముగా
నొనరింపుము తపము; దపం । బునన కదా సకలసౌఖ్యములు సిద్ధించున్. 107

ప్రతిపదార్థం: విను= ఆలకింపుము; నీవును= ఓ ధర్మరాజా నీవు సయితం; ఆపదలకున్= ఇడుమలకు; మనమునన్= మనస్సులో; ఒక్క+ఇంత= కొంచెం; ఓర్చి= సహించి; మహనీయముగాన్= గొప్పగా; తపము= తపస్సు (తదేకదీక్షతో కష్టాలను సరకు చేయక చిత్తాన్ని ఏకాగ్రతకు నిలయంచేసి సలిపే సాధన); ఒనరింపుము= చేయుము; తపంబునన+ కదా=తపస్సుచేతనే కదా; సకల సౌఖ్యములు= సమస్త సుఖాలు; సిద్ధించున్= లభిస్తాయి.

తాత్పర్యం: ధర్మరాజా! నాహితోపదేశాన్ని సావధానంగా ఆలకించుము. మనస్సులో ఆపదలను లెక్కసేయకుము. కొంచెం ఓర్మి వహించుము. అన్నిటికంటె తపస్సు గొప్పది. తపస్సువలననే సర్వసౌఖ్యాలును లభిస్తాయి. కావున నీవు తపస్సు చేయుము.

క. క్షమయు నహింసయు సత్యము । సమతయు నింద్రియజయంబు శమముఁ బరిత్యా
గమును దపోలక్షణములు । గ్రమమున నిన్నియును నూర్ధ్వగతికారణముల్. 108

ప్రతిపదార్థం: క్షమయున్= ఓర్పును; అహింసయున్= జీవకోటికి ఎట్టి హానిని చేయకుండటమున్నూ; సత్యమున్= నిజం పలకటం; సమతయున్= సర్వభూతాలు సమానాలే అనే జ్ఞానానుభూతియున్నూ; ఇంద్రియ జయంబున్= విషయసుఖాలను జయించటమున్నూ; శమమున్= అంతరింద్రియ నిగ్రహమున్నూ; పరిత్యాగమును= స్వార్థమును ఉజ్జగించి, దానంచేయుటమున్నూ; తపస్+లక్షణములు= తపస్సును సూచించే చిహ్నాలు; క్రమమునన్= వరుసగా; ఇన్నియును= ఈలక్షణాలు ఇన్నియును; ఊర్ధ్వగతి= ఉత్తమపదానికి; కారణముల్= హేతువులు.

తాత్పర్యం: ఓర్పు, అహింస, సత్యం, సమత్వం, ఇంద్రియ నిగ్రహం, శమం, స్వార్థత్యాగంతో కూడిన దానం అనేవి తపస్సుయొక్క చిహ్నాలు.

తే. ఇందుఁ జేసిన పుణ్యంబ యందుఁ గుడుచు । మీఁది జన్మంబునకు నది మేలుఁ జేయుఁ
గాన తనశక్తితోఁ గూడ దానధర్మ । చిరపరోపకారంబులు సేయవలయు'. 109

ప్రతిపదార్థం: ఇందున్= ఇచట (ఈలోకంలో); చేసిన= ఒనర్చిన; పుణ్యంబు+అ= సుకృతమే; అందున్= అక్కడ (పరలోకంలో); (జీవుడు- తపస్సు చేసినవాడు); కుడుచున్= అనుభవిస్తాడు; మీఁది జన్మంబునకున్= రాబోయే పుట్టుకకు; అది= ఆ పుణ్యం; మేలున్+చేయున్= శుభం కలిగిస్తుంది; కాన= కాబట్టి; తనశక్తితోన్+కూడన్= యథాశక్తి, శక్తివంచన లేకుండగా; దాన, ధర్మ, చిర, పర+ఉపకారములు= దానం, ధర్మం, ఎల్లప్పుడు ఇతరులకు మేలు; చేయవలయున్= చేయాలి.

తాత్పర్యం: ఇహంలో చేసిన సుకృతం మాత్రమే జీవి పరంలో అనుభవిస్తాడు. ఆ పుణ్యమే రాబోయే జన్మంలోకూడ శుభం చేకూరుస్తుంది. కావున శక్తివంచనలేకుండా దానధర్మాలు చేయతగును. పరోపకారం చేయాలి.'

విశేషం: 1. దానం అనగా తనధనాన్నిగాని ద్రవ్యాలను గాని ప్రతిఫలాపేక్ష లేకుండా దీనులకు ఇవ్వటం. 2. 'ధర్మము' అనే పదానికి సువిశాలమైన అర్థం ఉన్నది. అందులో స్వార్థత్యాగం మాత్రమే కాక, పరోపకారం మాత్రమే కాక విశ్వశ్రేయస్సు కూడ ఇమిడి ఉన్నది. లోకాన్ని మంచిస్థితిలో నెలకొల్పేది - ధర్మం. మనుస్మృతిలోని ధర్మలక్షణ నిర్వచనం సుప్రసిద్ధమైనది. "ధృతిః క్షమా దమోఽస్తేయం శౌచ మింద్రియనిగ్రహః ధీ ర్విద్యా సత్య మక్రోధో దశకం ధర్మలక్షణమ్'.(6.92)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. **అనినం బాండవాగ్రజుండు 'దానతపంబులలో దుష్కరం బెయ్యది? యెద్దాన నధికఫలం బగు?' నని యడిగిన వేదవ్యాసుం డి ట్లనియె.** **110**

ప్రతిపదార్థం: అనినన్= అని (వ్యాసమహర్షి) చెప్పగా; పాండవ+అగ్రజుండు= పాండవులలో మొదట పుట్టినవాడు (ధర్మరాజు); దానతపంబులలోన్= దానం తపస్సు- ఈ రెండింటిలో; ఎయ్యది= ఏది; దుష్కరంబు= చేయటానికి కష్టమైనది; ఏ+దానన్= దేనివలన; అధిక, ఫలంబు+అగున్= ఎక్కువ ఫలితం లభిస్తుంది; అని+అడిగినన్= అని అడుగగా; వేదవ్యాసుడు= వ్యాసమహర్షి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా తెలిపాడు.

తాత్పర్యం: అని వ్యాసమహర్షి ప్రవచించాడు. అంతట ధర్మరాజు ప్రత్యుత్తరంగా ఒక ప్రశ్న వేశాడు. 'దానం గొప్పదే. తపస్సు గొప్పదే. అయితే దానంకంటె తపస్సు గొప్పదా? తపస్సుకంటె దానం గొప్పదా?' అని. ఆ ప్రశ్నలకు వేదవ్యాసమహర్షి ఈవిధంగా ప్రత్యుత్తరం ఇచ్చాడు.

సీ. **'దాన మూర్జితఫలదం బర్థసాధ్య మై । పరఁగుటఁ గరము దుష్కరము నదియ;**
నరులకు నధిప! ప్రాణంబులకంటెను । రూపింప నర్థంబు తీపు వినవె
యుగ్రంబు లైన యాయుధముల మొనలపై । నుఱుకుట యంభోధి దఱిసి చనుట
కృషి పాశుపాల్యసంక్లేశంబు నొందుట । యడవులఁ గొండల నిడుమ వడుట

ఆ. **నవసి పొవసి యనుదినముఁ బరప్రేష్యులై । యునికిఁ దలఁప నర్థమునకు చూవె!**
యట్టి దుఃఖలబ్ధ మైన యయ్యర్థంబు । విడుచు టెవ్విధమునఁ గడిఁది గాదె? **111**

ప్రతిపదార్థం: అధిప!= రాజా, ఓధర్మరాజా!; దానము= ఈవి; ఊర్జిత, ఫలదంబు= గొప్పఫలితాన్ని ఇస్తుంది; అర్థ, సాధ్యము+ఐ= ధనంచేత సాధించతగింది ఔతూ; పరఁగుటన్= ఒప్పుటచేత; కరమున్= మిక్కిలి; దుష్కరము= కష్టసాధ్యం; అది+అ= అదే ధనం మాత్రమే; నరులకున్= మనుజులకు; ప్రాణంబుల కంటెను= అసువుల కంటెకూడా; రూపింపన్= ఏర్పరచగా; అర్థంబు= ధనం; తీపు= మధురమైనదిఅని; వినవె= వినలేదా; ఉగ్రంబులు+ఐన= భయంకరాలు అయిన; ఆయుధముల మొనలపైన్= శస్త్రాలయొక్క కొనలపైకి; ఉఱుకుట= దుముకుట; అంభోధి= అంభస్+ధిన్= సముద్రమును; తఱిసి= దాటి; చనుట= వెళ్లటం; కృషి= వ్యవసాయం; పాశుపాల్యసంక్లేశంబున్= పశువులను పెంచటంచేత పొందే శ్రమ; ఒందుట= పొందటం; అడవులన్= అరణ్యాలలో; కొండలన్= పర్వతాలలో; ఇడుమ+పడుట= కష్టపడటం; నవసి= కృశించి; పొవసి= లోపల కుమిలి; అనుదినమున్= ప్రతిరోజూ (అన్నిరోజులూ); పరప్రేష్యులు+ఐ= ఇతరులచే పంపదగినవారై; ఉనికిన్= ఉండటమున్నూ; తలఁపన్= ఆలోచించగా; అర్థమునకున్ చూవె= ధనం కొరకే కదా; అట్టి= ఆ విధమైన; దుఃఖ, లబ్ధము+ఐన= ఆవేదనచేత పొందబడినట్టి; ఆ+అర్థంబు= ఆ ధనం; విడుచుట= త్యాగం చేయటం; ఏ+విధమునన్= ఏతీరుగానైనా; కడిఁది+కాదె= గొప్పది కాదా (ధనాన్ని విడిచి చేసే దానం గొప్పదే సుమా).

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! దానం అంటే ధనాన్ని విడనాడటమే కదా! అందుచేత అది గొప్పఫలాన్ని చేకూర్చేది. ధనాన్ని త్యాగంచేయటం మిక్కిలి కష్టమైన పని. ఏలన, మనుజులకు ప్రాణాలమీది తీపికంటే ధనంపైగల తీపి అధికం. ఆయుధాల కొసలపై ఉరికి యుద్ధం చేయటం, సముద్రాన్ని దాటి దూరదేశాలకు పోవటం, వ్యవసాయం పశుపాలనం చేసి కష్టాలు అనుభవించటం. అడవులలో కొండలలో ఇడుమలు పొందటం, ఇతరులకు భృత్యులై చెమటోడ్చి శ్రమించటం కేవలం ధనంకొరకే కదా! ఆ విధంగా ఎన్నో కష్టాల నోర్చి సంపాదించటానికి మనుజులు పూనుకొనే ధనాన్ని త్యాగం చేయటం గొప్పవిషయమే అని అంగీకరించక తప్పదు.

శా. **అన్యాయార్జిత మైన విత్తమునఁ జేయం బూను దానంబు మూ**
ర్ఖన్యాయం బది; దానఁజేసి ఫలపాకం బేమియున్ లేదు; యు
క్తన్యాయార్జిత మించుకంత యయినం గాలంబు దేశంబు స
మ్మాన్యంబై తగఁ బాత్రయోగమున సౌమ్యంబై ఫలించుం దుదిన్. **112**

ప్రతిపదార్థం: అన్యాయ+ఆర్జితము+ఐన= పాడి తప్పి సంపాదించిన; విత్తమునన్= ధనంతో (న్యాయమార్గంలో కాకుండ సంపాదించబడిన ధనం); చేయన్+పూను, దానంబు= చేయటానికి దొరకొనిన; ఈవి; మూర్ఖన్యాయంబు= బుద్ధిలేని వారి పరిపాటి; అది; దానన్+చేసి= దానివలన; ఫలపాకంబు+ఏమియున్= ఫలితంయొక్క పూర్ణత్వం, ఏమియును; లేదు= ఉండదు; యుక్త, న్యాయ+ఆర్జితము= సరియైన పద్ధతిలో పాడిదప్పక సంపాదించబడింది; ఇంచుక+అంత+అయినన్= కొంచెం మాత్రమే అయినప్పటికి; కాలంబు= సమయం; దేశంబు= సీమ; సత్+మాన్యంబు+ఐ= మిక్కుటంగా గౌరవం చెందినదై; తగన్= సముచితంగా; పాత్రయోగమునన్= సరిఅయిన వాటితో కలియటంవలన; తుదిన్= చివరకు; సౌమ్యంబు+ఐ= మంచిదై; ఫలించున్= మంచిఫలితాన్ని ఇస్తుంది.

తాత్పర్యం: పాడితప్పి సంపాదించిన ధనాన్ని దానంచేయటం బుద్ధిహీనుల పరిపాటి. అట్టి దానంవలన పుణ్యఫలం సిద్ధించదు. సరియైనపద్ధతిలో పాడి తప్పక ఆర్జించిన ధనాన్ని కొంచెంగా నైన దానం చేయటంవలన గొప్ప సుకృతం సిద్ధిస్తుంది. దానం మంచిఫలితాల నివ్వటానికి చూడవలసినవి మూడు ముఖ్యాంశాలు. 1. దానం సకాలంలో ఇవ్వబడాలి. 2. దానం సరియైన ప్రదేశంలో ఇవ్వబడాలి. 3. దానం పాత్రుడికి, యోగ్యుడికి చెందాలి.

వ. **తొల్లి ముద్గలుం డను మహాద్విజుండు సన్మార్గోపార్జితం బైన వ్రీహిద్రోణంబు సత్పాత్రంబున వినియోగించి కాదె పరమసిద్ధిం బొందె' ననిన విని ధర్మనందనుండు 'మునీంద్రా! ముద్గలుండు వ్రీహిద్రోణం బెబ్భంగి నుపార్జించె? నెట్టి పాత్రంబునఁ బ్రతిపాదించె?; వినవలతుం జెప్పవే!' యనిన నతం డిట్లనియె.** **113**

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వకాలంలో; ముద్గలుండు+అను= ముద్గలుడు అనే పేరు గల; మహా, ద్విజుండు= గొప్ప బ్రాహ్మణుడు; సత్+మార్గ+ఉప+ఆర్జితంబు+ఐన= మంచి పద్ధతిలో సంపాదించబడింది అయిన; వ్రీహిద్రోణంబు= వరిగింజలు పోసి నింపిన కలశం; సత్+పాత్రంబునన్= యోగ్యుడైన మనుజుడియందు; వినియోగించి+కాదె= ఉపయోగించటంచేతనేకదా; పరమసిద్ధిన్+పొందెన్= కైవల్యాన్ని పొందాడు; అనినన్= అని (వ్యాసుడు) చెప్పగా; విని= ఆలకించి; ధర్మనందనుండు= ధర్మసుతుడు, ధర్మరాజు; ముని+ఇంద్రా!= మునులలో శ్రేష్ఠుడ వయినవాడా, ఓవ్యాసమహర్షీ! ముద్గలుండు= ముద్గలుడు; వ్రీహిద్రోణంబు= వరిగింజలు నింపిన కలశాన్ని; ఏ+భంగిన్= ఏరీతిగా; ఉపార్జించెన్= సంపాదించాడో; ఎట్టి= ఎటువంటి; పాత్రంబునన్= యోగ్యుడైన వ్యక్తియందు; ప్రతిపాదించెన్= వినియోగించాడో; వినవలతున్= వినవలె నని ఉన్నది; చెప్పవే= వచించవా - వచించుము; అనినన్= అని చెప్పగా; అతండు= అతడు (వేదవ్యాసమహర్షి); ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: పూర్వకాలం ముద్గలుడు అనే బ్రాహ్మణోత్తముడు మంచిమార్గాన్ని అనుసరించి సంపాదించిన వరిగింజలు నింపిన కలశాన్ని యోగ్యుడైన వ్యక్తికి దానం చేయటంచేతనే కదా కైవల్యపదాన్ని పొందాడు' అని వ్యాసమహర్షి చెప్పాడు. అంతట ధర్మరాజు, 'ఓ వ్యాసమహామునీ! బ్రాహ్మణోత్తము డైన ముద్గలమహర్షి వ్రీహిద్రోణాన్ని (వరిగింజలు నింపిన కలశాన్ని) ఏ విధంగా సంపాదించి యోగ్యతగలవ్యక్తి అయిన ఎవరికి దానిని ఏవిధంగా దానంచేశాడు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వినవలెనని ఉన్నది. దయచేసి నాకు ఆ వృత్తాంతం వివరించుము' అని అడిగాడు. వ్యాసమహర్షి ఈ విధంగా బదులు పలికాడు.

వ్యాసుఁడు ధర్మజునకు వ్రీహిద్రోణాఖ్యానంబు సెప్పుట (సం. 3-246-3)

క. 'అతిథిప్రియుఁడు విశిష్ట। వ్రతుఁడు విమత్సరుఁడు సత్యవచనుండు విని
ర్జిత విషయేంద్రియుఁడు సము। న్నత పుణ్యుఁడు ముద్గలుఁడు ఘనస్థిరబుద్ధిన్. 114

ప్రతిపదార్థం: అతిథి,ప్రియుఁడు= అన్నపానీయాదిసౌకర్యాలకొరకై వచ్చినవారియెడ ఇష్టం కలవాడు; విశిష్ట, వ్రతుఁడు= గొప్పదీక్షతో కూడిన నియమాలు పాటించేవాడు; వి, మత్సరుఁడు= మాత్సర్యం లేనివాడు- ఓర్వలేనితనం లేనివాడు; సత్యవచనుండు= నిజం మాటాడేవాడు; వినిర్జిత, విషయ+ఇంద్రియుఁడు= బాగా జయించబడిన ఇంద్రియార్థాలు ఇంద్రియాలు కలవాడు; సమ్+ఉన్నత, పుణ్యుఁడు= మిక్కిలి గొప్ప సుకృతాన్ని ఆర్జించినవాడు; ముద్గలుఁడు= ముద్గలుడు అనే పేరు కల ముని; ఘన, స్థిర, బుద్ధిన్= గొప్పది చలింపక నిలకడగా ఉండేది అయిన తెలివితో.

తాత్పర్యం: ముద్గలుడు మహానుభావుడు. అన్నపానాదిసౌకర్యాలతో తనగృహానికి వచ్చేవారిని ఆదరించేవాడు, అతిథులను అభ్యాగతులను గొప్పదీక్షతో ప్రీతితో సేవించేవాడు, నిత్యసత్యవచనుడు, వైరాగ్యం కలవాడు, ఇంద్రియాలను జయించినవాడు, గొప్ప సుకృతాన్ని సంపాదించినవాడు, నిలకడ గల గొప్పతెలివితేటలతో (తరువాతి గద్యంతో అన్వయం).

వ. పుత్త్రదారసహితంబుగాఁ గురుక్షేత్రంబున వసియించి యుంఛవృత్తిపరాయణుండై పాడ్యమిం దొడంగి పదునాలుగు దివసంబు లొక్కొక్కగింజయకా నేరి తూమెఁడు వడ్లు సమకూర్చి పర్వదినంబునఁ బాకంబు సేయించి దేవపితృపూజనంబు లొనరించి యతిథుల కన్నంబు వెట్టి మిగిలిన యన్నంబునఁ దాను బుత్త్ర కళత్రంబులును దేహయాత్ర నడపుచు నివ్విధంబునఁ బక్షోపవాసవ్రతంబున వర్తిల్లుచున్నయెడ నొక్క పర్వదినంబునందు. 115

ప్రతిపదార్థం: పుత్త్ర, దార, సహితంబుగాన్= కొడుకులతో భార్యతో కూడినవాడై; కురుక్షేత్రంబునన్= కురుక్షేత్రం అనేప్రదేశంలో; వసియించి= నివసించి; ఉంఛ, వృత్తి, పరాయణుండు+ఐ= పొలాలలో రాలిన గింజలను ఏఱికొని బ్రదుకుటయే జీవనోపాధిగా కలవాడయి; పాడ్యమిన్+తొడంగి= అమావాస్య, పౌర్ణమి తదుపరి మొదటితిథి మొదలుకొని; పదునాలుగు దివసంబులు= పదునాల్గు రోజులు; ఒక్కొక్క= (ఒక్క+ఒక్క) ఒక్కటి ఒకటి; గింజ+అ+కాన్= విత్తునుగా; ఏరి= సేకరించి; తూమెఁడు= (తూము+ఎఁడు) నాలుగుకుంచాలతో సరిఅయిన ద్రోణం నిండునటువంటి; వడ్లు= వరిగింజలు; సమకూర్చి= సంపాదించి; పర్వదినంబునన్= పండుగ నాఁడు (పూర్ణిమ లేదా అమావాస్య తిథులలో); పాకంబు+చేయించి= వంటచేయించి; దేవ, పితృ, పూజనంబులు= దేవతలకు, పితరులకు ఆరాధనలు; ఒనరించి= చేసి; అతిథులకున్= అన్నపానాదులకై వచ్చేవారికి; అన్నంబు+పెట్టి= అన్నం వడ్డించి; మిగిలిన+అన్నంబునన్= శేషించిన అన్నంతో; తానును= తానూ (ముద్గలుడున్నూ); పుత్త్ర, కళత్రంబులును= పిల్లలు పెండ్లమున్నూ; దేహయాత్ర= శరీరపు యాత్ర; నడపుచున్= ప్రవర్తింపజేస్తూ; ఈ+విధంబునన్= ఈ రీతిగా; పక్ష+ఉపవాసవ్రతంబునన్= పదునైదు రోజుల నిరాహారదీక్షతో; వర్తిల్లుచున్న+ఎడన్= నడపుతున్నపుడు; ఒక్క= ఒక్క; పర్వదినంబునందున్= పండుగనాడు (అమావాస్య లేదా పూర్ణిమనాడు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పుత్రులతో భార్యతో కలిసి కురుక్షేత్రంలో నివసించి 'ఉంఛవృత్తి' (పొలాలలో రాలిన ధాన్యాన్ని ఏరుకొనటం) జీవనోపాధిగా చేసికొని బ్రదుకుతూ, పదునైదు రోజులు నిరాహారదీక్షతో గడుపుతున్నాడు. అనగా పాడ్యమితిథినాడు మొదలిడి చతుర్దశి వరకు వారు వడ్లగింజలను ఏరటం మొదలుపెట్టేవారు. ఆ ఉంఛవృత్తిలో ఒక్కొక్క వరిగింజచొప్పున ఏరి తూమెడు (అనగా నాలుగు కుంచాల) ధాన్యం ప్రోగు చేసేవారు. ఆ పదునాలుగురోజులు ఉపవాసముండి పర్వదినంనాడు (అమావాస్యనాడు, పూర్ణిమనాడు) వంట చేయించేవారు. అట్లా వండిన అన్నంలో దేవతలకు, పితరులకు నివేదనం చేసి, అతిథులకు పెట్టి, మిగిలినదానిని ముద్గలుడూ, పిల్లలూ, పెండ్లామున్నూ భుజించేవారు. ఈవిధంగా శరీరధారణకుమాత్రమే వారు ఆహారం స్వీకరిస్తూ పక్షోపవాసవ్రతాన్ని నిర్వహిస్తున్న సమయంలో ఒక పర్వదినాన.

మ. **మతి నత్యంత జుగుప్సితం బయిన యున్మత్త స్వరూపంబుతో**
గతవస్త్రుండును ముక్తకేశుఁడు బహుగ్రామ్యోక్తిశీలుండు నై
హితపుణ్యుండు మునీశ్వరుం డతిథి యై యేతెంచె దుర్వాసుఁడన్
యతి యమ్ముద్గలుపాలికిం బటుబుభుక్షాయత్తతం దూలుచున్. **116**

ప్రతిపదార్థం: మతిన్= బుద్ధికి; అత్యంతజుగుప్సితంబు+అయిన= మిక్కుటంగా రోతను పుట్టించేటటువంటి; ఉన్మత్త స్వరూపంబుతోన్= పిచ్చివాడి ఆకారంతో; గతవస్త్రుండును= చినిగిపోయిన బట్టలు కలవాడును; ముక్తకేశుఁడున్= విరబోసికొన్న జుట్టు కలవాడున్నూ; బహుగ్రామ్య+ఉక్తి, శీలుండున్+ఐ= పల్లెటూరి అనాగరకపు మాటల స్వభావం కలవాడున్నూ అయి; హితపుణ్యుండు= ప్రియ మైన సుకృతం పేర్చినవాడున్నూ; ముని+ఈశ్వరుండు= ఋషులలో శ్రేష్ఠుడు అయినవాడు; దుర్వాసుఁడు+అన్+యతి= దుర్వాసుడనే ఋషి; అతిథి+ఐ= ఆగంతకు డై; ఆ+ముద్గలు పాలికిన్= ఆ ముద్గలుడి సన్నిధికి; పటు, బుభుక్షా+ఆయత్తతన్= మిక్కుటమైన ఆకలితో కూడినవాడై; తూలుచున్= ఇటునటు వాలుతూ; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: దుర్వాసుడు ముద్గలుడిసన్నిధికి విచ్చేశాడు. అప్పుడు దుర్వాసుడి ఆకారం పిచ్చివాడివేషంవలె ఉన్నది. వస్త్రాలు చినిగిపోయినవి, జుట్టు విరబోసికొన్నాడు. అతడు పల్లెటూరికి చెందిన అనాగరికుడివలె నోటికి వచ్చినట్లు మాటలాడసాగాడు. అయినను అతడు పుణ్యమూర్తి అయిన మహర్షి. అతిథిగా ఆకలి అంటూ ఆర్తుడై వచ్చాడు.

క. **అతనిఁ గని యించుకంతయు । మతి ననుమానంబు లేక మానుగఁ బ్రత్యు**
ద్గతుఁడై యర్ఘ్యముఁ బాద్యము । నతిభక్తి నొనర్చి మునికులాగ్రణి నెమ్మిన్. **117**

ప్రతిపదార్థం: ముని, కుల+అగ్రణి= ఋషుల సముదాయంలో శ్రేష్ఠుడైన ముద్గలుడు. నెమ్మిన్= ప్రీతితో; అతనిన్= అతనిని (దుర్వాసుడనే మహర్షిని); కని= చూచి; మతిన్= బుద్ధియందు; ఇంచుక+అంతయున్= కొంచెంకూడ; అనుమానంబు+ లేక= సందేహంలేకుండా; మానుఁగన్= ఒప్పునట్లుగా; ప్రత్యుద్గతుఁడు+ఐ= సగౌరవంగా ఎదురేగినవాడై; అర్ఘ్యమున్= పూజాద్రవ్యమును; పాద్యమున్= కాళ్లు కడుగుకొనుటానికై ఇచ్చే నీరును; అతిభక్తిన్= మిక్కుటమైన పూజ్యభావంతో; ఒనర్చి= చేసి;

తాత్పర్యం: ఆ దుర్వాసమహర్షిని చూచి, కొంచెమయినను సందేహించక సగౌరవంగా లేచి ఎదురేగితోడ్తెచ్చి ముద్గల మహర్షి అతడికి అర్ఘ్యపాద్యాదులు సమర్పించి, మిక్కిలి పూజ్యభావంతో అతిథిసత్కారం నిర్వహించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **అన్నంబు వెట్టె నతఁడు త । దన్నంబంతయును గుడిచి యాత్మఁ దనిసి, శే**
షాన్నంబు మేన నిండఁగ । సన్నుతుఁ డలఁదికొని మగుడఁ జనియె నిజేచ్ఛన్. 118

ప్రతిపదార్థం: అన్నంబు+పెట్టెన్= అన్నం పెట్టాడు; అతఁడు= ఆ దుర్వాసుడు; తత్+అన్నంబు+అంతయును= ఆ అన్నం అంతటిని; కుడిచి= ఆరగించి; ఆత్మన్= మనస్సులో; తనిసి= తృప్తిచెంది; శేష+అన్నంబున్= మిగిలిన అన్నమును; మేనన్= శరీరమునందు; నిండఁగన్= నిండేటట్లుగా; సన్నుతుఁడు= మంచివారలచేత పొగడబడినవాడు; అలఁదికొని= పూసికొని; నిజ+ఇచ్ఛన్= తనఇష్ట ప్రకారం; మగుడన్+చనియెన్= తిరిగి వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: ముద్గలమహాముని దుర్వాసుడికి భోజనం పెట్టాడు. దుర్వాసుడు ఆ అన్నాన్ని ఆరగించి మిగిలిన అన్నాన్ని తనశరీరం నిండా పూసికొని, తనఇష్టం వచ్చినచోటికి తిరిగి వెళ్ళిపోయాడు.

విశేషం: 'మగిడి చనియె' - అనే పాఠాంతరం కొన్ని ప్రతులలో ఉన్నది.

క. **మునిపతి పర్వము పర్వం । బున మఱియును నరుగుదెంచు; ముద్గలుఁడును దా**
ననశనుఁడై యుండియు న । మ్మునివరునకు నొసఁగు నన్నముం బ్రియ మెసఁగన్. 119

ప్రతిపదార్థం: మునిపతి= మునులకు భర్త, మునులలో శ్రేష్ఠుడు, (దుర్వాసుడు); పర్వము పర్వంబునన్= పండుగ పండుగకు అనగా అమావాస్య, పూర్ణిమ తిథులలో; మఱియును= వెండియును; అరుగుదెంచున్= వస్తాడు; ముద్గలుడును= ముద్గలమహర్షియు; తాన్= తాను; అనశనుఁడు+ఐ, ఉండియున్= తిండి లేనివాడై ఉన్నప్పటికిని; ఆ+మునివరునకున్= ఆ మునిశ్రేష్ఠుడికి (దుర్వాసుడికి); అన్నమున్; ప్రియము+ఎసఁగన్= ప్రీతిపెంపారగా; ఒసఁగున్= ఇస్తాడు.

తాత్పర్యం: దుర్వాసుడు పర్వపర్వానికి-అమావాస్య, పూర్ణిమతిథులు-వదలకుండ మరల మరల వస్తూనే ఉన్నాడు. ముద్గలమహర్షి తాను నిరాహారుడై ఉండికూడ దుర్వాసుడికి అతిథిమర్యాదలతో సగౌరవంగా సంప్రీతితో అన్నం పెట్టుతూనే ఉన్నాడు.

వ. **ఇవ్విధంబున నాఱుపర్వంబులు గుడిచి దుర్వాసుండు వాని చిత్తంబున నొక్కకొఱంతయుం గానక యద్భుతప్రమోదమగ్నమానసుండై వాని కిట్లనియె.** 120

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈతీరున; ఆఱుపర్వంబులు= ఆరుపండుగలు; కుడిచి= ఆహారం ఆరగించి; దుర్వాసుండు; వాని చిత్తంబునన్= ముద్గలమహర్షి మనస్సున; ఒక్క= ఒక్క; కొఱంతయున్= లోపమును; కానక= చూడక; అద్భుత, ప్రమోద, మగ్న, మానసుండు+ఐ= ఆశ్చర్యకరమైన సంతోషంతో మునిగిన చిత్తం కలవాడై; వానికిన్= ముద్గలుడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా ఆరుపర్వదినాలలో ఆహారాన్ని స్వీకరించి దుర్వాసుడు ముద్గలుడిని పరీక్షించాడు. కాని, ముద్గలుడి మనస్సులో లేశమైనా లోపం కన్పించలేదు. అందుచేత దుర్వాసుడు అచ్చెరువుతోకూడిన సంతోషంలో మునిగి ముద్గలుడితో ఇట్లా పలికాడు.

క. **'నీయట్టి దానశీలుని । నీ యఖిలమునందుఁ గాన నెన్నండును స**
త్త్వాయత్తమతివి సాధువి । ధేయుండవు నీవు పుణ్యతేజుఁడ వనఘా! 121

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడ వైన ఓ ముద్గలమహర్షీ!; నీ+అట్టి= నీవంటి; దానశీలునిన్= దానంచేసే స్వభావం కలవాడిని; ఈ+అఖిలమునందున్= ఈ సమస్తంలో (ఈసమస్త భూమిలో); ఎన్నండును= ఎప్పుడును; కానన్= చూడలేదు; సత్త్వ+ఆయత్త; మతివి= సత్త్వగుణ నిబద్ధమైన బుద్ధి కలవాడవు; సాధువిధేయుండవు= సౌమ్యులు, సజ్జనులు అయినవారికి లోబడి ఉండేవాడవు; నీవు= నీవు; పుణ్యతేజుఁడవు= సుకృతంవలన ఏర్పడే వర్చస్సు కలవాడవు.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ ముద్గలమహామునీ!; నీతో సరిపోలే దానశీలుడిని నేను ఈ పృథివిలో ఎన్నడూ చూడలేదు సుమా! నీవు సత్త్వగుణుడవు. సుకృతం చేయటంవలన ఏర్పడే గొప్పవర్చస్సు కలవాడవు నీవు.

చ. **మనమున నేవగింప, కవమానము సేయక, యించుకంతయున్**
గినియక, యోలమందక, యకృత్రిమభక్తి నొనర్చి తీవు స
జ్జననుత! యన్నదానము; ప్రసాదము సత్యము ధైర్యమున్ దమం
బును నపరిగ్రహత్వమును బొల్పుగ నీధనమయ్యె నియ్యెడన్. **122**

ప్రతిపదార్థం: సత్+జన+నుత!= మంచివారిచేత పొగడబడినవాడా! (ఓముద్గలమహర్షీ); ఈవు= నీవు; మనమునన్= చిత్తమున; ఏవగింపక= అసహ్యపడక; అవమానము+చేయక= అగౌరవం చూపక; ఇంచుక+అంతయున్= కొంచెమైనను; కినియక= కోపించక; ఓలము+అందక= మరుగుపడక; అకృత్రిమ, భక్తిన్= కపటములేని భక్తితో; అన్నదానము= అన్నాన్ని దానం చేయటం; ఒనర్చితి= చేశావు. ఈ+ఎడన్= ఈతరుణంలో; ప్రసాదము= ప్రసన్నత; అనుగ్రహంతో కూడిన చిత్త నిర్మలత్వం; సత్యము= నిజం; ధైర్యమున్= ప్రతికూలస్థితిలో కూడ చలించని నిబ్బరం; దమంబును= ఇంద్రియనిగ్రహం; అపరిగ్రహత్వమును= ఒరులసొత్తును గైకొనకుండటం; పొల్పుగన్= అందంగా; నీధనము= నీసంపద; అయ్యెన్= అయినాయి.

తాత్పర్యం: మంచివారలచేత ప్రశంసించబడే ఓ ముద్గలమహర్షీ! నీవు మహానుభావుడవు. అన్నదానం చేయటంలో నీకు గల నిష్ఠ సాటిలేనిది. నీమనస్సు పరమపవిత్రమైనది. అన్నదానం చేసేటప్పుడు ఇంచుక కూడ నీమనస్సులో ఏవగింపు కానరాలేదు; కోపతాపాలు కన్పించలేదు; మరుగు లేదు. నీవు అతిథులను అవమానించకుండా, అతిథిపూజను స్వచ్ఛమైన భక్తితో నిర్వర్తించావు. ప్రసన్నత, సత్యం, ధైర్యం, బహిరింద్రియ నిగ్రహం, ఇతరుల సొత్తుపై ఈషణ్మాత్రం కోరికలేకపోవటం అనేవి నీకు సంపదలు.

చ. **చవులకుఁ బ్రేముడించు ననిశంబును నాలుక, దాల్మిపెంపు ధ**
ర్మువును శమంబుఁ ద్రెక్కొను సముద్ధతి నాఁకలి; వీని రెంటనుం
దవులవు జీవితస్థితివిధాయక మన్నము నీవు జీవితే
చ్ఛ విడిచి; తిప్పు డేమని ప్రశంస యొనర్తు నినుం దపోనిధీ! **123**

ప్రతిపదార్థం: తపోనిధీ!= తపస్+నిధీ!= తపస్సుకు నెలవు అయినవాడా, ఓ ముద్గలమహర్షీ!; నాలుక= జిహ్వ; అనిశంబును= ఎల్లప్పుడును; చవులకున్= రుచులకు; ప్రేముడించున్= ప్రియపడుతుంది; ఆఁకలి= ఆహారంకొరకైన వేగిరపాటు, తాల్మి, పెంపున్= ఓర్పుయొక్క అతిశయాన్ని; ధర్మువును= ధర్మాన్ని, శమంబున్= శాంతినీ; సముద్ధతిన్= మిక్కుటమైన పోటరింపుతో; త్రెక్కొనున్= చెరచును; వీని రెంటనున్= ఈరెండింటియందును (నాలుకను+ఆకలిని); తవులవు= ఆసక్తిచూపవు; అన్నము= ఆహారము జీవిత, స్థితివిధాయకము= బ్రదుకుతెన్నును నిర్ణయించేది; నీవు= నీవు; జీవిత+ఇచ్ఛన్= బ్రదుకునందలి కోరికను; విడిచితి(వి)= వదలిపెట్టావు; ఇప్పుడు= ఈస్థితిలో; నినున్= నిన్ను; ఏమి+అని= ఏవిధంగా; ప్రశంస+ఒనర్తున్= పొగడగలను? (ఎంతపొగడినా తక్కువే అని భావం).

తాత్పర్యం: తపస్సుకు నిలయమైనవాడా! ఓముద్గలమహర్షీ! నాలుక ఎల్లప్పుడు రుచులను అనుభవించటానికి ఉవ్విళ్ళూరుతుంటుంది. ఓర్పును ధర్మాన్ని ఇంద్రియనిగ్రహాన్ని ఆకలి నాశనం చేయగలదు. పై రెండింటియందు నీవు ఆసక్తుడవుకావు. నీవు బ్రదుకుతెన్నును తీర్చిదిద్దే అన్నాన్ని, బ్రదుకవలెననే కోరికను కూడ విడనాడితివి. నిన్ను ఎంతని పొగడగలను? నీగొప్పతనం మాటలలో వర్ణించలేనట్టిదిసుమా!

విశేషం: వ్యక్తుల జీవితాలపై ప్రపంచచరిత్రపై 1. నాలుక 2. ఆకలి వేసే ప్రభావం సుప్రసిద్ధం. వ్యాసమహర్షి ఆకలి తట్టుకొనలేక కాశిని శపించాడు. విశ్వామిత్రుడు శునకమాంసం దొంగిలించాడు. నాలుక ప్రేరేపించే రుచులు మరగి - పాశ్చాత్యులు సుగంధద్రవ్యాల వ్యాపారంనిమిత్తం ప్రాచ్యప్రపంచచరిత్రనే మార్చారు. ప్రపంచచరిత్రలో ఆకలి అనేకవిప్లవాలను రేకెత్తించింది. మహాభారతం ఈ సత్యాన్ని ఏనాడో గుర్తించింది.

క. మనమున నింద్రియముల వ । ర్తనమును సరిగా నొనర్చు ధర్మంబు దపం
బని చెప్పుదు; రట్టి తపం । బనఘా! నీయంద కలిగె నభినవభంగిన్. 124

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా, ఓముద్గలమునీ!; మనమునన్= చిత్తమునందు; ఇంద్రియముల వర్తనమును= ఇంద్రియాలయొక్క నడవడికను; సరిగాన్= సముచితంగా; ఒనర్చు= చేయు; ధర్మంబు= ధర్మము; తపంబు= తపస్సు; అని చెప్పుదురు= అని వచిస్తారు; అట్టి, తపంబు= అటువంటి తపస్సు (పైన చెప్పబడిన నిర్వచనానికి అనువైన తపస్సు); అభినవ, భంగిన్= కొంగ్రొత్త తీరుతెన్నులలో; నీ+అందున్+అ= నీలో మాత్రమే; కలిగెన్= ఏర్పడింది.

తాత్పర్యం: చిత్తాన్ని ఇంద్రియాల నడవడిని సరిగా ఉండేటట్లు చేసే ధర్మమే తపస్సు అని పెద్దల నిర్వచనం. ఓముద్గలమునీ! ఆ నిర్వచనానికి అనువైన తపస్సు నీయందు మాత్రమే కొంగ్రొత్తగా వ్యక్తమైనది.

విశేషం: 1. ఆంధ్రమహాభారతంలో అర్థవంతాలైన కందపద్యాలు - అల్పాక్షరముల అనల్పార్థరచనకు ఉదాహరణప్రాయాలైనవి కొన్ని ఉన్నాయి. ఈపద్యం అట్టి విశిష్ట రచన. ఇందులో తపస్సు అనే పదానికి చక్కని చిక్కని నిర్వచనం ఉన్నది. తపస్సు అంటే శరీరాన్ని తపింపచేసికొనటం కాదుగదా! 'ధర్మంబు' - ఇచట 'ముఖ్యలక్షణము' అనే అర్థంలో ప్రయోగించబడింది. 2. ఈపద్యంలో - 'అభినవభంగిన్' అనే ప్రయోగం అనుశీలించ తగింది. పెద్దలు తపస్సుకు ఇచ్చిన నిర్వచనం కొంగ్రొత్త తీరుతెన్నులలో" - ఇతఃపూర్వం మరి ఎచట కన్పించనట్టి విధంగా ముద్గలమహర్షిలో గోచరించింది. 3. ఈవాక్యాలు చెప్పింది అంతర్ముఖుడైన దుర్వాసుడు తనలోను ఇతర ఋషులలోను లేని మనోధర్మాన్ని దుర్వాసుడు ముద్గలుడిలో దర్శించి తన్మయుడయ్యాడు. ఉన్మీలనం కల్పించింది. దుర్వాసుడు నైసర్గికంగా శీఘ్రకోపనుడే అయినప్పటికి, క్రాంతిదర్శి అయిన తపస్వి కాబట్టి ముద్గలుడిలోని విశిష్ట తపశ్శక్తిని గుర్తించి ప్రశంసించగలిగాడు.

ఉ. ప్రీతుఁడ నైతి నీవలనఁ; బేర్చిన పుణ్యఫలంబు లెల్ల నీ
చేతివ యయ్యెఁ; నీ దగు ప్రసిద్ధతపోవిభవంబు నిర్జర
వ్రాతము లిప్డు సాటెఁ; ద్రిదివంబున కీవును మేనితోడ వి
ఖ్యాతిగ దేవయానమున గ్రక్కున నేఁగెదు సంయమీశ్వరా!' 125

ప్రతిపదార్థం: సంయమి+ఈశ్వరా!= సంయమం కలిగిన మునులలో శ్రేష్ఠుడా - ఓముద్గలమహర్షీ!; నీవలనన్= నీయందు; ప్రీతుఁడన్+ఐతిన్= సంతృప్తి పొందినవాడను అయినాను; పేర్చిన= కుప్పలుగా కూర్చిన; పుణ్య, ఫలంబులు+ఎల్లన్= సుకృతాల

యొక్క ఫలితాలు అన్నియు; నీచేతివి+అ+అయ్యెన్= నీహస్తంలోనివే అయినవి- అనగా నీయందే ఉన్నవి; నీది+అగు= నీయొక్క; ప్రసిద్ధ, తపస్+విభవంబు= పేరుప్రతిష్ఠలు కాంచిన తపస్సు అనే సంపద; నిర్జరవ్రాతములు= దేవతల సముదాయాలు; ఇప్డు= ఇపుడు; చాటెన్= ప్రచారంచేశాయి; ఈవును= నీవును; మేనితోడన్= శరీరంతోనే; త్రిదివంబునకున్= స్వర్గలోకానికి; దేవయానమునన్= దేవతలు తిరిగే విమానంలో; విఖ్యాతిగన్= యశస్సుపొందుతూ; గ్రక్కునన్= శీఘ్రంగా; ఏఁగెదు= వెళ్లగలవు.

తాత్పర్యం: ఇంద్రియనిగ్రహాన్ని సాధించిన ఋషులలో శ్రేష్ఠుడ వైన ఓ ముద్గలమహామునీ! నీవలన నేను మిక్కిలి సంతృప్తి చెందాను. ఇతఃపూర్వం ఏర్పడిన పుణ్యాలు అన్నీ నీకు కరతలామలకాలే. అన్ని సిద్ధులును నీకు లభించినవే. దేవతలు నీ తపోవైభవాన్ని కీర్తిస్తున్నారు. గొప్పకీర్తితో స్వర్గలోకానికి నీవు ఈశరీరంతోనే దేవవిమానంలో వెళ్ళగలవు'

వ. అని పలికి దుర్వాసుం డరిగెఁ; దదనంతరంబ హంససారస యుక్తంబును గింకిణీమాలికా మనోహరంబును గామగమనంబును నయిన విమానంబు గొనుచు దేవదూత ముద్గలుకడకుం జనుదెంచి యి ట్లనియె.126

ప్రతిపదార్థం: అని పలికి= అని పలికి; దుర్వాసుండు; అరిగెన్= వెళ్ళాడు; తత్+అనంతరంబు+అ= అటు పిమ్మట; హంస, సారస, యుక్తంబును= అంచలతో బెగ్గురుపక్షులతో కూడుకొన్నదియున్నూ; కింకిణీ, మాలికా, మనోహరంబును= చిరుగంటల వరుసలచేత అందంగా ఉండి మనస్సుకు ఆహ్లాదం కలిగించేదియున్నూ; కామగమనంబును= కోరినచోటికి పోగలిగినట్టిదియున్నూ; అయిన= అయినట్టి; విమానంబున్= విమానాన్ని; కొనుచున్= తీసికొనివస్తూ; దేవదూత= దేవతల రాయబారి; ముద్గలుకడకున్= ముద్గలుడి దగ్గరికి; చనుదెంచి= వచ్చి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి దుర్వాసుడు వెళ్లిపోయాడు. పిదప, దేవదూత ముద్గలుడివద్దకు విమానం తెచ్చాడు. ఆ విమానంలో హంసలు బెగ్గురుపక్షులు ఉన్నాయి. చిరుగంటల వరుసలచేత ఆవిమానం కనుల కింపుగా గోచరించింది. ఆ విమానం కోరినచోటికి పోగలిగినమహిమ కలది.

క. 'అనఘ! భవత్సుకృతంబున । ననిమిషలోకాభిగమ మవాప్తం బయ్యెం;
జనుదెమ్ము విమానము చ । య్యన నెక్కుము చిత్తమునఁ బ్రహర్షం బెసఁగన్' 127

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! ఓముద్గలమహామునీ!; భవత్+సుకృతంబునన్= నీపుణ్యంవలన; అనిమిష, లోక+అభిగమము= స్వర్గలోకాన్ని పొందటం; అవాప్తంబు+అయ్యెన్= ప్రాప్తించింది అయింది; చిత్తమునన్= మనస్సునందు; ప్రహర్షంబు= మిక్కుటమైన ఆనందం; ఎసఁగన్= విలసిల్లగా; చనుదెమ్ము= రమ్ము; విమానము= విమానమును; చయ్యనన్= శీఘ్రంగా; ఎక్కుము= అధివసించుము.

తాత్పర్యం: మహానుభావుడ వయిన ఓ ముద్గలమునీ! నీవు చేసిన పుణ్యకర్మవలన స్వర్గలోకం సిద్ధించింది. దయచేసి రమ్ము; ఆకాశాన పయనించగల విమానం ఇదిగో. దీనిని శీఘ్రంగా ఎక్కుము; మనస్సులో ఆనందాన్ని నింపుకొనుము.

విశేషం: ఆకాశయానంచేయగల విమానాలను గూర్చి పలుతావుల భారతంలో కలదు. ఇక్కడ వర్ణించబడిన విమానానికి సారథి సంకల్పమే గమ్యానికి చేర్చగలదు. 'కామగమనం' కల విమానం ఇది.

వ. అనిన దేవదూతం జూచి ముద్గలుండు 'మహాత్మా! దివిజలోకం బెట్టిది? వినవలతు; నందుల గుణదోషంబు లెఱింగింపవలయు; సత్పురుషులతోడి మైత్రి సాప్తపదీనం బని చెప్పుదురు గావున మైత్త్రిం బురస్కరించి ని న్నడిగెద' ననిన నతం డమ్మునీంద్రున కి ట్లనియె. 128

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ముద్గలుండు; దేవదూతన్= దేవతల రాయబారిని; చూచి మహా+ఆత్మా!= గొప్ప ఆత్మకలవాడా!, ఓ దేవదూత!; దివిజలోకంబు= స్వర్గలోకం; ఎట్టిది= ఎటువంటిది; వినన్ వలతున్= వినాలని కోరుతున్నాను; అందులగుణదోషంబులు= ఆ స్వర్గలోకంలోని మంచిలక్షణాలూ లోపాలూ; ఎఱింగింపవలయున్= తెలుప వలెను; సత్+పురుషులతోడిమైత్రి= మంచివారితోడి స్నేహం; సాప్తపదీనంబు+అని= ఏడుఅడుగులకు (లేదా ఏడుమాటలకు) సంబంధించింది అని (పెద్దలు); చెప్పుదురు= వచిస్తారు; కావునన్= కాబట్టి; మైత్రిన్= స్నేహాన్ని; పురస్కరించి= ముందుపెట్టుకొని; నిన్నున్+అడిగెదన్; అనినన్; అతండు= ఆ దేవదూత ఆ+ముని+ఇంద్రునకున్= ఆ ఋషిశ్రేష్ఠుడికి (ముద్గలుడికి); ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దేవదూతతో ముద్గలమహాముని ఇట్లా చెప్పాడు: 'మహాత్మా! స్వర్గలోకం ఎటువంటిది? దానినిగురించి వినాలని కోరుకొంటున్నాను. అందలి మంచిచెడులనుగురించి దయచేసి నాకు వివరించండి. మంచివారలతో మైత్రి 'సాప్తపదీనం' అని పెద్దలు చెప్పుతారుకదా! మన ఉభయులకు స్నేహం ఏర్పడింది కాబట్టి చనువు పెంచుకొని నిన్ను ఈ విధంగా ప్రశ్నిస్తున్నాను, అనగా, దేవదూత ముద్గలుడికి ఈవిధంగా బదులు పలికాడు.

విశేషం: స్నేహం సాప్తపదీనం అని సనాతన సంప్రదాయం. పదం అంటే రెండు అర్థాలు ఉన్నాయి. ఒకటి మాట, ఇంకొకటి అడుగు. ఏడు అడుగులు కలిసి నడిచినా ఏడుమాటలు కలిసి మాట్లాడినా సఖ్యం ఏర్పడుతుందని అర్థం. ఇక్కడ దేవదూతా ముద్గలుడూ ఏడుపదాలు కలిసి సంభాషించారు. కాబట్టి సఖ్యం ఏర్పడినట్లే.

ముద్గలునకు దేవదూత పుణ్యలోకంబుతెఱంగు సెప్పుట (సం. 3-247-2)

క. 'ఈ లోకమునకు మీఁదై। చాలఁగ వెలుఁగొందుచుండు స్వర్లోకము నా
నాలంకారయుతము ది। వ్యాలోకము దేవయాన మది మునినాథా! 129

ప్రతిపదార్థం: మునినాథా!= మునులకు ప్రభువైనవాడా! (ఓముద్గలమహామునీ!); ఈలోకమునకున్= ఈ లోకానికి; మీఁదు+ఐ= పైన ఉండేదయి; చాలఁగన్= మిక్కుటంగా; స్వర్లోకము= (స్వర్+లోకము=) స్వర్గలోకం; వెలుఁగొందుచున్+ఉండున్= ప్రకాశిస్తుంటుంది; నానా+అలంకార, యుతము= అనేక రకాలుగా అందాన్ని ఇనుమడింపచేసే భూషణాలతో కూడింది; అది= ఆ స్వర్గలోకం; దివ్య+ఆలోకము= దేవతామహిమగల చూపు కలది; దేవయానము= దేవతలు నడయాడేది;

తాత్పర్యం: మునులలో శ్రేష్ఠుడవైన ఓ ముద్గలా! స్వర్గలోకం భూలోకానికి పైన ఉంటుంది. నిత్యం ప్రకాశిస్తూ ఉంటుంది. అందులో ఎన్నో అందమైన భూషణాలు ఉంటాయి. దివ్యుల యొక్క దృష్టి గలిగి ఉంటుంది. దేవతలు నడయాడే స్థలం అది స్వర్గలోకం.

చ. అమలతపోనివాసులు మహాధ్వరశీలురు సత్యసంధు లు
త్తములు జితేంద్రియుల్ సములు దానపరుల్ రణశూరు లందు హ
ర్షమున వసింతు; రచ్చరలు సాధ్యులు దేవమునుల్ మరుద్వసు
ప్రముఖులు వేఱువేఱ తగుపట్టుల నుండుదు రంద యిమ్ములన్. 130

ప్రతిపదార్థం: అమల, తపస్+నివాసులు= స్వచ్ఛ మైన తపస్సులో నివసించేవారు; మహా+అధ్వర, శీలురు= గొప్పయజ్ఞాలను చేసే స్వభావం కలవారు; సత్యసంధులు= సత్యాన్ని పాటించటానికి శపథం చేసినవారు; ఉత్తములు= మంచివారు; జిత+

ఇంద్రియుల్= జయించిన ఇంద్రియాలు కలవారు; సములు= సమబుద్ధిని ఆర్జించినవారు; దానపరుల్= దానాన్ని వ్రతంగా పాటించేవారు; రణశూరులు= యుద్ధంలో పరాక్రమం ప్రదర్శించేవారు; అందున్= ఆ స్వర్గంలో; హర్షమునన్= సంతోషంతో; వసింతురు= నివసిస్తారు; అచ్చరలు= అప్సరసలు; సాధ్యులు= విశిష్టులైన దేవతలు; దేవమునుల్= దేవర్షులు; మరుత్+వసు, ప్రముఖులు= మరుత్తులు వసువులు మున్నగువారు; వేఱువేఱ= ప్రత్యేకంగా; తగు= సముచితమైన; పట్టులన్= స్థలాలలో; ఇమ్ములన్= సంప్రీతితో; ఉందురు= నివసిస్తారు.

తాత్పర్యం: స్వచ్ఛమైన తపస్సులో సిద్ధిపొందిన మహర్షులు, గొప్పయజ్ఞాలను చేసినవారు, సత్యాన్ని పాటించటానికై ప్రతిజ్ఞచేసి కృతకృత్యులైనవారు, దానధర్మాలు చేసినవారు, యుద్ధాలలో గొప్పపరాక్రమం ప్రదర్శించినవారు స్వర్గలోకంలో సంతోషాన్ని అనుభవిస్తూ నివసిస్తారు. అందులో అప్సరసలు, సాధ్యులు, దేవర్షులు, మరుత్తులు, వసువులు ప్రీతితో ఆయాస్థలాలలో నివసిస్తూ ఉంటారు.

విశేషం: సాధ్యులు= దేవతలలో ఒకగణానికి చెందినవారు. మనువు, హనుమంతుడు, విష్ణువు, ధర్ముడు మున్నగువారు. వసువులు= దేవతలలో ఒక గణానికి చెందినవారు. అష్టవసువులు. 1. ఆపుడు 2. ధ్రువుడు 3. సోముడు 4. అథర్వుడు 5. అనిలుడు 6. ప్రత్యూషుడు 7. అనలుడు 8. ప్రభాసుడు. మరుత్తులు= వాయుదేవతలు. వేదవాఙ్మయంలో వీరు మిక్కుటమైన ప్రభావం గల దేవతలుగా వర్ణించబడ్డారు.

వ. **మఱియు ముప్పదిమూఁడు వేల యోజనంబుల విస్తృతంబైన మేరుశిఖరంబునందు నందనప్రముఖంబు లైన దేవోద్యానంబులు పుణ్యపరులకుం గ్రీడాస్థానంబులై విలసిల్లు; నయ్యెడల నాఁకలియు నీరువట్టును శీతోష్ణభయంబులును జరారోగవికృతులును బుట్ట; వెయ్యెడలం జూచిన నతిమనోహరంబై సకలేంద్రియ తర్పణం బై యుండు; నిట్టి పుణ్యలోకంబునకు నర్హు లైన పుణ్యపురుషులు విధినియోగ పక్వంబు లయిన మానుషశరీరంబులు విడిచి తేజోమయంబు లగు దివ్యదేహంబులు ధరియించి వివిధాంబరాభరణ భూషితులును నమ్లానకుసుమమాలికా మనోహరులునై కనకవిమానంబులందు దేవదూతలచేతం గొనిపోవంబడి యందు శోకభ్రమశ్రమాయాసవిరహితు లై వివిధసుఖంబు లనుభవించుచుందుదురు.** **131**

ప్రతిపదార్థం: మఱియున్; ముప్పదిమూఁడువేలయోజనంబుల= ముప్పదిమూడువేలామడల; విస్తృతంబు+అయిన= వైశాల్యంగల; మేరుశిఖరంబునందున్= మేరువు అనెడి పర్వతంయొక్క కొనభాగంలో; నందన ప్రముఖంబులు+ఐన= నందనం మున్నగునవి అయిన; దేవ+ఉద్యానంబులు= వేలుపులయొక్క తోటలు; పుణ్యపరులకున్= సుకృతాన్ని ఆర్జించినవారికి; క్రీడాస్థానంబులు+ఐ= ఆటలకు అనువైన చోటులై; విలసిల్లున్= శోభిల్లుతాయి; ఆ+ఎడలన్= ఆ చోటులలో; ఆఁకలియున్= ఆహారం తినవలెననే కోరికయున్నూ; నీరువట్టును= దప్పికయున్నూ; శీత+ఉష్ణ, భయంబులును= చలివలన వేడి వలన కలిగే వెరపులున్నూ; జరా, రోగ, వికృతులును= ముసలితనానికి, జబ్బులకు సంబంధించిన దురవస్థలున్నూ; పుట్టవు= కలుగవు; ఏ+ఎడలన్= ఏచోట్లలో; చూచినన్= దర్శించినా; అతిమనోహరంబు+ఐ= మిక్కిలి సొగసుగా ఉండి మనస్సుకు ఆహ్లాదం కలిగించేదై; సకల+ఇంద్రియ, తర్పణంబు+ఐ+ఉండున్= అన్ని ఇంద్రియాలకు సంతుష్టి చేకూర్చేదై ఉంటుంది; ఇట్టి= ఇటువంటి; పుణ్యలోకంబునకున్= సుకృతంచేత సిద్ధించే లోకానికి; అర్హులు+ఐన= యోగ్యులు అయిన; పుణ్యపురుషులు= సుకృతం ఆర్జించినవారు; విధినియోగపక్వంబులు+అయిన= అదృష్టంతోకూడి పండినటువంటి; మానుష శరీరంబులు= మనుజ జన్మకు సంబంధించిన దేహాలు; విడిచి= వదలిపెట్టి; తేజస్+మయంబులు+అగు= వర్చస్సుతో కూడిన; దివ్యదేహంబులు= దివ్య శరీరాలు; ధరియించి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వహించి; వివిధ+అంబర+ఆభరణ, భూషితులును= పెక్కు రకాలైనవస్త్రాలచేత, భూషణాలచేత అలంకరించబడిన వారై; అమ్లాన, కుసుమ, మాలికా, మనస్+హరులును= వాడనటువంటి పూలదండలచేత అందమైన వారున్నూ; ఐ= ఔతూ; కనక, విమానంబులందున్= బంగారంతో చేయబడిన విమానాలలో; దేవదూతలచేతన్= దేవతల ప్రతినిధులచేత; కొనిపోవంబడి= తీసికొనివెళ్లబడి; అందున్= ఆ స్వర్గంలో; శోక, భ్రమ, శ్రమ+ఆయాస, విరహితులు+ఐ= దుఃఖం, మోహం, కష్టమైనపని చేయటంవలన కలిగే అలసట లేనివారై; వివిధ సుఖంబులు= పెక్కువిధాలైన భోగాలు; అనుభవించుచున్+ఉండుదురు= పొందుతూ ఉంటారు.

తాత్పర్యం: స్వర్గలోకంలో ముప్పదిమూడువేల ఆమడల వైశాల్యంగల మేరుపర్వత శిఖరం ఉన్నది. అక్కడ వేలుపుల పెంపుడుతోట నందనోద్యానం ఉన్నది. దాహం లేదు. చలివలన వేడివలన కలిగే పీడలు ఉండవు. ముసలితనం లేదు. వ్యాధులు లేవు. ఎటుచూచినా, మనోహరాలైన దృశ్యాలే. అది సకలేంద్రియాలకు సంపూర్ణసంతృప్తి ఘటించే లోకం. అట్టి స్వర్గలోకానికి పోవటానికి అర్హులైన పుణ్యాత్ములు ఆయుస్సు తీరినపిదప రాలిపడిపోయే మనుజదేహాలను విడనాడి, తేజోమయశరీరాలను ధరించగలరు. వారు కోరిన వస్త్రాలు, అలంకారాలు, ఆభరణాలు, వాడిపోని పూలదండలు, మనోహరాలైన పసిడివిమానాలు సమకూర్చబడి దేవదూతలచేత స్వర్గానికి కొనిపోబడతారు. ఆ స్వర్గలోకంలో ఉన్నప్పుడు వారికి ఇక ఎట్టి దుఃఖాలు ఉండవు. కష్టపడి పనిచేయడంవలన కలిగే అలసట ఉండదు. వారు నిరంతర సౌఖ్యాలు అనుభవిస్తూ ఆనందంలో ఓలలాడుతారు.

ఆ. అనఘ! యింద్రలోకమునకంటె మీఁద ని। శ్శోక మగుచు బ్రహ్మలోక మమరు;
నది యనన్యదీప్తసదన మై తన దైన। వెలుఁగునను జగంబు వెలుఁగఁ జేయు. 132

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా! ఓముద్గలమహామునీ!; ఇంద్రలోకమునకంటెన్= స్వర్గలోకంకంటె కూడ; మీఁదన్= పైన; నిశ్శోకము+అగుచున్= దుఃఖం లేనిది ఔతూ; బ్రహ్మలోకము= బ్రహ్మయొక్క భువనం (సత్యలోకం); అమరున్= ఉంటుంది; అది= ఆ బ్రహ్మలోకం; అనన్య, దీప్త, సదనము+ఐ= సాటిలేకుండ వెలిగే నివాసం అయి; తనది+ఐన= తనయొక్క; వెలుఁగునను= దీప్తిచేతనే; జగంబున్= లోకాన్ని; వెలుఁగన్+చేయున్= ప్రకాశించేటట్లు చేస్తుంది.

తాత్పర్యం: పుణ్యాత్ముడ వైన ఓ ముద్గల మహామునీ! స్వర్గలోకంపైన ఇంకొక గొప్పలోకం - బ్రహ్మలోకం ఉన్నది. అది దుఃఖరహిత మైనది. స్వయంప్రకాశమానమై సాటిలేకుండ వెలుగొందేది. ఆ బ్రహ్మలోక ప్రదీప్తిచేతనే జగత్తు ప్రకాశిస్తుంది.

చ. మనువులు ధాతలున్ మునులు మానుగ నుండుదు; రందు లోభముం
గినుకయుఁ గిల్బిషంబు నపకీర్తియు దుఃఖము జన్మవైకృతం
బును జనియింప; వీభువనముల్ దెగునప్పుడు నాశమొంద ద
వ్వినుతపదంబు; దానియెడ వేడుక సేయుదు రింద్రముఖ్యులున్. 133

ప్రతిపదార్థం: మనువులు= మనువులు అనే దేవతలు; ధాతలున్= బ్రహ్మలు; మునులున్= ఋషులు; మానుగన్= ఒప్పిదంగా; అందున్= ఆ బ్రహ్మలోకంలో; ఉండుదురు= ఉంటారు; లోభమున్= పిసినిగొట్టుతనం; కినుకయున్= కోపం; కిల్బిషంబు= పాపం; అపకీర్తి= చెడుపేరు; దుఃఖము= ఆవేదన; జన్మ; వైకృతంబును= పుట్టుకమార్పు; జనియింపవు= పుట్టవు, కలుగవు; ఈ భువనముల్= ఈ లోకాలు; తెగునప్పుడు= నశించేటప్పుడు, (ప్రళయకాలంలో); ఆ+వినుతపదంబు=

ఆప్రశంసనీయమైన లోకం; నాశము+ఒందదు= నశించదు; దాని+ఎడన్= ఆ బ్రహ్మలోకంపట్ల; ఇంద్రముఖ్యులున్= ఇంద్రుడు మొదలైనవారు; వేడుక+చేయుదురు= కోరుకొంటారు.

తాత్పర్యం: మనువులు, బ్రహ్మలు, ఋషులు బ్రహ్మలోకంలో ఉంటారు. అక్కడ లోభం, కోపం, పాపం, దుర్యశం, ఆవేదన, పునర్జన్మలు ఉండవు. లోకాలన్నీ ప్రళయకాలంలో నాశనమౌతాయి కాని సత్యలోకం శాశ్వతంగా ఉంటుంది. ఆ పదం అందుకోడానికై ఇంద్రుడు మున్నగువారు సయితం కోరుకొంటారు.

విశేషం: 1. ప్రాచీన భారతీయుల కాలమానం విశిష్టమైనది. 4,320,000 సంవత్సరాలు ఒక మహాయుగం. అట్టివి 1000 మహాయుగాలు బ్రహ్మదేవుడికి ఒక పగలు. బ్రహ్మదేవుడికి ఒక పగలు, ఒకరాత్రి అట్టివి కలిస్తే ఒక దినం. 14 మనువులు బ్రహ్మదేవుడి ఒక దినంలో పరిపాలిస్తారు. మనువు పరిపాలనకు మన్వంతరం అని పేరు. మన్వంతరంలో 337, 142,657 1/2 మానవదినాలు ఉంటాయి. మనువులు పదునలుగురు. 1. స్వాయంభువుడు 2. స్వారోచిషుడు 3. ఉత్తముడు 4. తామసుడు 5. రైవతుడు 6. చాక్షుషుడు 7. వైవస్వతుడు 8. సూర్యసావర్ణి 9. దక్షసావర్ణి 10. బ్రహ్మసావర్ణి 11. ధర్మసావర్ణి 12. రుద్రసావర్ణి 13. రౌచ్యుడు 14. భౌచ్యుఁడు.

వ. స్వర్గంబునం గల గుణంబు లెఱింగించితిఁ దదీయదోషంబులు సెప్పెద వినుము. 134

తాత్పర్యం: స్వర్గలోకంలో ఉండే గుణాలు చెప్పాను. ఇక దానిలోని దోషాలను చెప్పుతాను వినుము.

తే. ఇందుఁ జేసినపుణ్యంబు లెల్ల నందుఁ । గుడుచుఁ గాని మర్త్యున కందుఁ గడఁగి పుణ్య
మాచరింపంగఁ గాదు; పుణ్యావసాన । మగుడు భూమిక త్రోతురు మగుడ నతని. 135

ప్రతిపదార్థం: ఇందున్= ఈ (భూ) లోకంలో; చేసిన= ఒనర్చిన; పుణ్యంబులు+ఎల్లన్= సుకృతాలు అన్నియును; అందున్= స్వర్గలోకంలో; కుడుచున్= అనుభవిస్తాడు; కాని= కాని; మర్త్యునకున్= మనుజుడికి; అందున్= స్వర్గలోకంలో; కడఁగి= పూని; పుణ్యము= సుకృతం; ఆచరింపంగన్= చేయటానికి; కాదు= వీలులేదు; పుణ్య+అవసానము+అగుడున్= సుకృతం క్షీణించినపిదప; భూమికిన్+అ= భూలోకానికే; మగుడన్= తిరిగి; అతనిన్= ఆ మనుజుని; త్రోతురు= క్రిందికి పడవేస్తారు.

తాత్పర్యం: ఈ భూలోకంలో చేసినట్టి పుణ్యఫలాలను ఆ స్వర్గలోకంలో మనుజుడు అనుభవించగలడు. కాని, స్వర్గలోకంలో మనుజుడు ఎట్టి పుణ్యాన్ని ఆర్జించటానికి వీలు లేదు. మనుజుడు చేసిన పుణ్యం అనుభవించిన పిమ్మట అతడు స్వర్గలోకంలో ఉండటానికి వీలులేదు. అతడిని తిరిగి భూలోకంలోనికి త్రోసివేస్తారు.

క. కడు మరగిన సౌఖ్యంబులు । విడుచుటఁ జిత్తంబు దుఃఖవివశముగ మహిం
బడుఁ జూవె; పుణ్యలోకం । బెడలిన మనుజుండు దేజ మేది యబలుఁ డై. 136

ప్రతిపదార్థం: పుణ్యలోకంబు+ఎడలిన= స్వర్గలోకం విడనాడిన; మనుజుండు= మనుష్యుడు; తేజము+ఏది= వర్చస్సు తరిగిపోయి; అబలుఁడు+ఐ= శక్తికోలుపోయినవాడై; కడున్= మిక్కుటంగా; మరగిన, సౌఖ్యంబులు= అనుభవించటానికి అలవాటుపడిన భోగాలు; విడుచుటన్= వదలిపెట్టుటవలన; చిత్తంబు= మనస్సు; దుఃఖ, వివశముగన్= ఆవేదనకు మిక్కుటంగా లోనై; మహిన్= భూమిమీద; పడున్+చూవె= పడతాడుసుమా.

తాత్పర్యం: స్వర్గంనుండి తేజమును కోల్పోయి పుణ్యహీనుడై భూమిపై తిరిగి పడిన మనుజుడు మనస్సులో ఆవేదన పొందుతాడు. ఏలన భోగాలు అనుభవించటానికి అలవాటుపడినవాడు వాటిని విడనాడటం అంటే ఆవేదన పొందటమే కదా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పుణ్యం తరిగిపోయిన పిమ్మట మనుజుడి ఆత్మ స్వర్గలోకంనుండి భూలోకం చేరి పునర్జన్మ మెత్తుతుంది. ఈవిషయం భగవద్గీతలో చెప్పబడింది. "తే పుణ్య మాసాద్య సురేంద్రలోకం । అశ్నంతి దివ్యా న్దివి దేవభోగాన్ । తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం । క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి".

క. తన తక్కువయునికియు న । న్యుని యున్నతశీలతయుఁ గనుంగొని చిత్తం
బున నెరియుచునికి గలుగును । జననుత! సురలోకవాస జనులకు నెల్లన్. 137

ప్రతిపదార్థం: జన, నుత!= ప్రజలచేత ప్రశంసించబడినవాడా! ఓముద్గలమహామునీ!; తన, తక్కువ+ఉనికియును= తాను తక్కువ స్థితిలో ఉండటమున్నూ; అన్యుని+ఉన్నత శీలతయున్= ఇతరుడియొక్క ఎక్కువస్థితిని; కనుంగొని= అరసి; చిత్తంబునన్= మనుస్సులో; ఎరియుచున్+ఉనికి= పరితపిస్తూ ఉండటం; సుర, లోక, వాస, జనులకున్= స్వర్గలోకంలో నివసించే ప్రజలకు; ఎల్లన్= అందరకును; కలుగును= ఉంటుంది.

తాత్పర్యం: స్వర్గలోకంలో నివసించే జనులు సయితం తమమనస్సులలో పరితాపం చెందుతారు. తాను హీనస్థితిలో ఉండటం. ఇంకొకడు హెచ్చుస్థాయిలో ఉండటం అరసినపుడు వారికి మనస్తాపం కలుగుతుంది.

వ. బ్రహ్మలోకంబునం దక్కఁదక్కిన పుణ్యలోకంబులం దెల్ల నిదియ మేరయై చెల్లు; మఱియుఁ బుణ్యలోకపరిభ్రష్టుండ మర్త్యలోకంబున సుఖశీలుం డయి పుట్టు; నీలోకంబు గర్మభూమియు నాలోకంబు ఫలభూమియు నని యెఱుంగుము; నీవలని యాదరంబునంజేసి యింతయుం జెప్పితి; నీ వింకఁ దడయ నేల? చనుదె' మ్మనిన ముద్గలుండు గొండొక విచారించి దేవదూతం జూచి యిట్లనియె. 138

ప్రతిపదార్థం: బ్రహ్మలోకంబునన్+తక్కన్= బ్రహ్మలోకంలో తప్ప; తక్కిన= మిగిలిన; పుణ్యలోకంబులందున్+ఎల్లన్= సుకృతంవలన పొందగల భువనాలయందు అన్నిచోటులలో; ఇది+అ= ఇది మాత్రమే; ఈవిధమైన మనస్తాపం చెందటమే; మేర+ఐ= అవధి అయి; చెల్లున్= ప్రవర్తిల్లుతుంది; మఱియున్= ఇంకను; పుణ్యలోక, పరిభ్రష్టుండు+అ= పుణ్యాన్ని ఆర్జించటంచేత పొందిన భువనాలనుండి త్రోయబడినవాడే; మర్త్యలోకంబునన్= చావునకు లోనయ్యే మనుజులు ఉండే భూలోకంలో; సుఖశీలుండు+అయి= భోగాలను అనుభవించేవాడై; పుట్టున్= జన్మిస్తాడు; ఈలోకంబు= ఈ(భూ) లోకం; కర్మ, భూమియున్= కర్మలు చేసే సీమ (కర్మచేసి పుణ్య పాపాలను ఆర్జించేచోటు); ఆ లోకంబు= ఆస్వర్గసీమ; ఫలభూమియున్= భూలోకంలో చేసిన కర్మకు అనువైన ఫలితాన్ని అనుభవించే సీమ; అని+ఎఱుంగుము= అని తెలిసికొనుము; నీవలని+ఆదరంబునన్+చేసి= నీయందు నాకు కల అభిమానం చొప్పున; ఇంతయున్= ఇంతమేర (ఈ స్వర్గలోకవృత్తం); చెప్పితిన్= వచించాను; నీవు= నీవు, ఇంకన్= ఇక మీదట; తడయన్+ఏల?= ఆలసించటం ఎందుకు? చనుదెమ్ము= స్వర్గానికి దయసేయుము; అనినన్= అని పలుకగా; ముద్గలుండు= ముద్గలుడు; కొండొక, విచారించి= కొంత తడవు ఆలోచించి; దేవదూతన్+చూచి= దేవతల ప్రతినిధిని కాంచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: బ్రహ్మలోకానికి తక్కిన పుణ్యలోకాలకు మధ్య నున్న తారతమ్యం ఇదే. పుణ్యం క్షీణించిన పిదప స్వర్గలోకంనుండి త్రోసివేయబడిన వాడే తిరిగి భూలోకంలో సౌఖ్యాలను అనుభవించే స్వభావం కలవాడుగా జన్మిస్తాడు. భూలోకం 'కర్మభూమి'. భూలోకంలో చేసిన కర్మవలన పుణ్యపాపాలు సిద్ధిస్తాయి. స్వర్గసీమ ఫలభూమి. స్వర్గలోకంలో జీవి భూలోకంలో చేసిన కర్మల కనువైన పుణ్యానికి తగిన స్వర్గభోగాలను తత్ఫలితంగా అనుభవిస్తాడు. నీయందు గల అభిమానంచొప్పున నేను నీకు ఈ విషయాలు వివరించి చెప్పాను. ఇక ఆలస్యం ఎందుకు? నీవు స్వర్గలోకానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విచ్చేయుము' అని దేవదూత చెప్పిన మాటలు విని ముద్గలుడు కొంతతడవు ఆలోచించి ఈ విధంగా సమాధానం చెప్పాడు.

ఆ. **'ఇట్టి దివ్యసుఖము లే నొల్లఁ; బదివేలు । వచ్చె నాకు; నమరవర్గమునక**
యుండనిమ్ము వాని నో యన్న! విచ్చేయు । మిష్టమైన యెడకు నిపుడ నీవు. **139**

ప్రతిపదార్థం: ఓ+అన్న!= ఓయన్న, ఓదేవదూతా!; ఇట్టి= ఇటువంటి; దివ్యసుఖములు= స్వర్గలోకానికి సంబంధించిన భోగాలు; ఏన్= నేను; ఒల్లన్= అనుభవించటానికి సమ్మతించను; నాకున్ పదివేలు వచ్చెన్ = నాకు పదివేల (భోగాలు) వచ్చినట్లుగనే భావిస్తున్నాను; వానిన్= ఆభోగాలను; అమరవర్గమునకున్+అ= వేల్పులసముదాయానికే; ఉండన్+ఇమ్ము= ఉండనిమ్ము!; ఇపుడు+అ= ఇప్పుడే; నీవు= (ఓ దేవదూతా!) నీవు; ఇష్టము+ఐన+ఎడకున్= కోరిన చోటికి; విచ్చేయుము= వెళ్ళుము.

తాత్పర్యం: ప్రియమైన ఓదేవదూతా! నాకు స్వర్గభోగాలు అవసరంలేదు.అట్టివి పదివేలు నాకు కలిగినట్లే భావించుకొంటున్నాను. ఆ భోగాలను అన్నింటిని వేల్పులే అనుభవిస్తారుగాక! ఇక నీవు ఈ క్షణంలోనే నీకు నచ్చిన చోటికి వెడలిపొమ్ము.

క. **ఎయ్యెడకుఁ జనినఁ బురుషుం । డియ్యెడకును మగుడకుండు నెక్కాలము నే**
నయ్యుత్తమపదవికినై । యెయ్యనువున నైన నుత్సహించెద బుద్ధిన్.' **140**

ప్రతిపదార్థం: ఏ+ఎడకున్= ఏచోటికి; చనినన్= వెడలినప్పుడు; పురుషుండు= మనుజుడు, జీవుడు; ఈ+ఎడకును= ఈచోటికి (భూలోకానికి); ఏ+కాలమున్= ఏ సమయంలోను; మగుడక+ఉండున్= తిరిగిరాక ఉంటాడో; ఏన్= నేను ఆ+ఉత్తమ, పదవికిన్+ఐ= అట్టి మంచిస్థాయికి; ఏ+అనువునన్+ఐనన్= ఏ ఉపాయంచేత నయినా; బుద్ధిన్= మనసులో; ఉత్సహించెదన్= ఉత్సాహంతో ప్రయత్నిస్తాను.

తాత్పర్యం: ఏచోటికి చేరితే జీవుడు తిరిగి ఈ భూలోకానికి రాకుండా శాశ్వతంగా ఉండగలడో, అట్టి గొప్పస్థాయికి చేరటానికై నేను ఏమార్గంలోనైనా చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా ప్రయత్నం చేయగలను.

విశేషం: 1. స్వర్గలోకాన్ని చేరటానికి నిరసించిన ఉదాత్తపాత్ర ముద్గలుడు. 2. ముద్గలుడి గాథకు సమాంతరమైనది సక్తుప్రస్థుని కథ. భారతంలోని అశ్వమేధపర్వం చూడండి.

వ. **అని దేవదూత వీడ్కొలిపి ముద్గలుండు శిలోంఛవృత్తి విడిచి, పరమశాంతిం గైకొని, నిర్వికల్పం బైన జ్ఞానయోగంబునం జేసి తుల్యనిందాస్తుతియును సమలోష్టాశ్మకాంచనుండును నై పరమసిద్ధిం బొందెఁ; బాండవోత్తమా! నీవును రాజ్యరహితుండనైతి నని వగవక తపంబు సేయుము; తపంబునంజేసి శుభంబులు సేకుఱుఁ; బదుమూఁడవునేఁటి కడపటఁ బితృపైతామహంబైన రాజ్యంబు నిన్నుం బ్రాపించు' నని యిట్లు సాత్యవతేయుండు గౌంతేయుల నాశ్వాసించి నిజాశ్రమంబునకుం జనియె; నంత.** **141**

ప్రతిపదార్థం: అని= వచించి; దేవదూతన్= దేవతలప్రతినిధిని; వీడ్కొలిపి= పంపి; ముద్గలుండు; శిలా+ఉంఛవృత్తి= పండినచేలలో నేలరాలిన వరిగింజలను ఏరుకొని బ్రదుకు తెరువు సాగించటం; విడిచి= వదలిపెట్టి; పరమశాంతిన్= గొప్పదైన నిర్వికార చిత్తవృత్తిని; కైకొని= గ్రహించి; నిర్వికల్పంబు+ఐన= మార్పు లేని; జ్ఞానయోగంబునన్+చేసి= జ్ఞానయోగంచేత; తుల్య, నిందా,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్తుతియును= పొగడ్తలపట్ల, తెగడ్తలపట్ల సమాన మైన భావం కలిగి ఉండేవాడున్నూ; సమలోష్ట+అశ్మకాంచనుండును= మట్టిగడ్డ, రాయి, బంగారం అనే వాటిని సమభావంతో చూచువాడున్నూ; ఐ= అయి; పరమసిద్ధిన్= గొప్పకైవల్యస్థాయిని; పొందెన్= పొందాడు; పాండవ+ఉత్తమా!= పాండవులలో శ్రేష్ఠుడా, ఓధర్మరాజా!; నీవును= నీవుసయితమూ; రాజ్య, రహితుండను= రాజ్యంలేనివాడను; ఐతిన్+అని= అయినాను అని; వగవక= దుఃఖించక; తపంబు+చేయుము= తపస్సు చేయుము; తపంబునన్+చేసి= తపస్సుచేయడంచేత; శుభంబులు+చేకుఱున్= మంగళాలు ప్రాప్తిస్తాయి; పదుమూఁడవు+ఏఁటి, కడపటన్= పదమూడవ సంవత్సరం చివర; పితృపైతామహంబు+ఐన= తండ్రికి తాతకు సంబంధించిన; రాజ్యంబు= పరిపాలించే దేశం; నిన్నున్= నిన్ను; ప్రాపించున్= పొందుతుంది; అని= అని చెప్పి; ఇట్లు= ఈరీతిగా; సాత్యవతేయుండు= సత్యవతికొడుకు (వేదవ్యాసమహర్షి); కౌంతేయులన్= కుంతీకుమారులను-పాండవులను; ఆశ్వాసించి= ఓదార్చి; నిజ+ఆశ్రమంబునకున్= తనయొక్క ఆశ్రమానికి; చనియెన్= వెళ్ళాడు; అంతన్= పిదప.

తాత్పర్యం: అని చెప్పి, దేవదూతను గౌరవమర్యాదలతో వీడుకొల్పి, ముద్గలుడు ఉంఛవృత్తిని విడిచి గొప్ప నిర్వికారచిత్తప్రశాంతిని పొంది గొప్పజ్ఞానయోగి అయ్యాడు. అప్పుడు అతడికి పొగడ్తల తెగడ్తలపట్ల సమభావం ఏర్పడింది. మట్టిపెళ్ళ, రాయి, బంగారం అతడి దృష్టిలో భేదం లేనట్టివే. ఆవిధంగా అతడు జీవన్ముక్తుడు అయ్యాడు. పాండవులలో పెద్దవాడవు అయిన ఓ ధర్మరాజా! నీవు నీరాజ్యాన్ని గోలుపోయినందుకు దుఃఖించకుము. కర్మయోగంచేతనే కాక జ్ఞానయోగంవలనగూడ చరితార్థత సిద్ధిస్తుంది. నీవు తపస్సు చేయుము. తపస్సువలన సమస్త శుభాలును చేకూరగలవు. పదమూడు సంవత్సరాలు గడిచినపిదప నీకు నీ తండ్రితాతలకు సంబంధించిన రాజ్యం చేకూరగలదు' అని సత్యవతికొడుకు అయిన వేదవ్యాసమహర్షి కుంతీకుమారు లైన పాండవులను ఓదార్చి తనఆశ్రమానికి వెళ్ళాడు. అంతట.

విశేషం: 1. భగవద్గీత మహాభారతానికి గుండెకాయ వంటిది అని పెద్దల అభిభాషణం. మహాభారతంలోని ఉపాఖ్యానాలన్నియు భగవద్గీతలో చెప్పబడిన సిద్ధాంతాలకు వ్యాఖ్యానప్రాయాలైన ఉదాహరణలే అని పెద్దల ప్రవచనం. అందుకు ముద్గలుడి గాథ చక్కని నిదర్శనం. 'తుల్యనిందాస్తుతియును' - 'సమలోష్టాశ్మకాంచనుడు' ఈ పదగుంఫనాలు భగవద్గీతలోనివే. ఈ ప్రకరణంలో భగవద్గీతలోని యీక్రింది శ్లోకాలు అనుస్మరించదగినవి. "జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః । శీతోష్ణసుఖదుఃఖేషు తథా మానావమానయోః॥' 6-1; "జ్ఞానవిజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః । యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మ కాంచనః॥" 6-8.

మ. **వితతానేకమృగాకులంబును సదావిర్భూత నానాతరు**
ప్రతతీపుష్పసుగంధబంధురశుభావాసంబు బ్రహ్మర్షిసం
శ్రితపుణ్యాశ్రమమండలంబు నగుచుం జెల్వొందు నక్కానలో
ధృతపుణ్యుల్ విహరించి రేవురును గుంతీపుత్త్రు లిచ్ఛాగతిన్. **142**

ప్రతిపదార్థం: వితత+అనేక, మృగ+ఆకులంబును= విస్తరించిన పెక్కుజంతువులచేత నిండినది; సదా+ఆవిర్భూత, నానా, తరు, ప్రతతీ, పుష్ప, సుగంధబంధురశుభ+ఆవాసంబున్= ఎల్లప్పుడు పుట్టుతున్న పెక్కు చెట్లగుంపులకు సంబంధించిన పూల పరిమళంతో కూడి మంగళకరమై నివాసయోగ్య మైన స్థలం; బ్రహ్మ+ఋషి, సంశ్రిత, పుణ్య+ఆశ్రమ మండలంబును+అగుచున్= బ్రహ్మజ్ఞానాన్ని ఆర్జించిన మునులచేత ఆశ్రయించబడినట్టి పుణ్యప్రద మైన ఆశ్రమాల సమూహాలు కలిగినది ఔతూ; చెల్వొందు= శోభిల్లే; ఆ+కానలోన్= ఆ అడవిలో; ధృతపుణ్యుల్= ధరించిన పుణ్యంకలవారు, పుణ్యాత్ములు; కుంతీపుత్త్రులు= కుంతీకుమారులు; ఏవురును= ఐదుగురును; ఇచ్ఛాగతిన్= ఇచ్చవచ్చినట్లు; విహరించిరి= వినోదంగా తిరిగారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కుంతీపుత్త్రు లైన పాండవులు అయిదుగురును స్వేచ్ఛగా వినోదంగా ఆ అడవిలో సంచరించారు. పాండవులు పుణ్యాన్ని ఆర్జించినవారు. ఆ అడవిలో బ్రహ్మజ్ఞానాన్ని ఆర్జించిన ఋషివరేణ్యులు నివసించే ఆశ్రమాలు పెక్కు ఉన్నాయి. పెక్కుమృగాలు విస్తారమైన ఆ అరణ్యంలో క్రుమ్మరుతూ ఉన్నాయి. ఆ అడవిలో పెక్కుచెట్లు ఉన్నాయి. ఆ చెట్లలో ఎప్పటికప్పుడు వికసించే పూవులయొక్కపరిమళం ఆ అడవిలో వ్యాపించి సుఖశుభనివాసానికి తోడ్పడుతున్నది.

విశేషం: కవిత్రయం పలుతావులలో - పాండవులను కుంతీపుత్త్రులుగానే అభివర్ణించటం కద్దు. ఈ పద్యంలో సుస్పష్టంగా ఎఱ్ఱన 'కుంతీపుత్త్రులేవురును' అని ప్రయోగించాడు. కుంతికి పుత్రులు ముగ్గురు. నకులసహదేవులు మాద్రికొడుకులు. ధర్మశాస్త్ర ప్రకారం భర్తకొడుకులు, భార్యకు సయితం పుత్రులే. అర్జునుడిని పేర్కొంటూ తిక్కనవిరాటపర్వంలో - వచ్చెం గుంతీసుతమధ్యముండు అని ప్రయోగించాడు.

వ. **ఒక్కనాఁడమ్మహారథులు దృణబిందు నాశ్రమంబున ధౌమ్యసహితంబుగాఁబాంచాలి నునిచి యేవురు నొక్కట మృగయార్థంబు నలుదిక్కులకుం జనిన యనంతరంబ.** **143**

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు= ఒకరోజున; ఆ+మహా, రథులు= గొప్పరథాలు కలవారు అనగా గొప్పవీరులు; తృణబిందు+ ఆశ్రమంబునన్= తృణబిందు మహామునియొక్క ఆశ్రమంలో; ధౌమ్య, సహితంబుగాన్= ధౌమ్యుడితో పాటుగ; పాంచాలిన్+ఉనిచి= ద్రౌపదిని ఉంచి; ఏవురున్= అయిదుగురును (ధర్మజ భీమార్జున నకుల సహదేవులు); ఒక్కటన్= ఒకేతరి; మృగయా+అర్థంబు= వేట కొరకై; నలు, దిక్కులకున్= నాలుగు దిక్కులకును; చనిన+అనంతరంబు+అ= వెళ్లిన పిదపనే.

తాత్పర్యం: ఒకానొకరోజున మహావీరులైన పాండవులు అయిదుగురు తృణబిందు మహాముని ఆశ్రమంలో పురోహితు డైన ధౌమ్యుడిని, ద్రౌపదిని ఉంచి తాము ఒకేసారి వేటాడటంకొరకై నలుదిక్కులకు వెళ్ళారు. వారు వెళ్లిన తరువాత వెంటనే

సైంధవుఁడు ద్రౌపదిం జూచి మోహించుట (సం. 3-248-6)

చ. **వీరుఁడు సైంధవుండు జనవిశ్రుతశౌర్యుఁడు సాల్వకన్య నిం**
పారఁగఁ బెండ్లియాడుటకునై నిజవైభవ ముల్లసిల్ల వి
స్ఫార చతుర్విధోరుబలసంగతుఁడై చనుచుండి యాశ్రమ
ద్వారమునందుఁ గాంచె ద్రుపదక్షితిపాలతనూజ నచ్చటన్. **144**

ప్రతిపదార్థం: వీరుఁడు= పరాక్రమవంతుడు; సైంధవుండు= సింధుదేశానికి ప్రభువు; జనవిశ్రుతశౌర్యుఁడు= ప్రజలలో పేరుకెక్కిన పరాక్రమవంతుడు; ఇంపు+ఆరఁగన్= సంప్రీతితో; సాల్వకన్యన్= సాల్వ రాజుయొక్క కుమార్తెను; పెండ్లి+ఆడుటకునై= వివాహం చేసికొనటానికై; నిజవైభవము= తన సంపద; ఉల్లసిల్లన్= శోభించగా; వి, స్ఫార, చతుః+విధ+ఉరు, బల, సంగతుఁడు+ఐ= బాగా వ్యాపించిన నాలుగు అంశాలకు సంబంధించిన గొప్పసేనతో కూడిన వాడై; (అంటే రథగజతురగభటులతో కూడిన సైన్యంతో); చనుచున్+ఉండి= పయనిస్తూ+ఉండి; ఆశ్రమద్వారమునందున్= ఆశ్రమంయొక్క వాకిటిలో; అచ్చటన్= ఆ అరణ్యంలో; - ద్రుపద, క్షితిపాల, తనూజన్= ద్రుపదరాజుకూతురును; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: సింధుదేశాన్ని పాలించేవీరుడు, పరాక్రమవంతుడుగా గొప్ప పేరుప్రతిష్ఠల నార్జించిన వాడైన సైంధవుడు (జయద్రథుడు) సాల్వరాజ పుత్రికను వివాహమాడటానికై చతురంగ బలసమేతుడై దర్పంతో పయనిస్తూ మార్గమధ్యంలో ఆ కామ్యకవనంలో తృణబిందుమహామునియొక్క ఆశ్రమద్వారం వద్ద నిలిచి ఉన్న ద్రౌపదిని చూచాడు.

విశేషం: సైంధవుడు సింధుదేశపు ప్రభువు. అతడిపేరు జయద్రథుడు. తెలుగుదేశంలో సైంధవుడనే పేరుకు విశేషప్రచారం ఉన్నది కాని భారతదేశంలోని ఇతరప్రాంతాలలో - జయద్రథుడనే పేరు ఎక్కువ ప్రచారంలో ఉన్నది.

ఉ. **నీలపయోదమండలము నిశ్చలలీల వెలుంగఁజేయుచుం**
గ్రాలెడు వాలుఁ గ్రొమ్మెఱుఁగు కైవడిఁ దద్వనభూమి నెంతయున్
లాలితదేహకాంతిపటలంబునఁ జేసి వెలుంగఁజేయు న
బ్బాల వినీలకుంతలవిభాసినిఁ జూచి సవిస్మయాత్ముఁడై. **145**

ప్రతిపదార్థం: నీల, పయోద (పయస్+ద) మండలము= నల్లని మేఘాల గుంపు; నిశ్చల, లీలన్= కదలకుండా ఉన్న రీతిగా; వెలుంగన్+చేయుచున్= ప్రకాశింపజేస్తు; క్రాలెడు= దేదీప్యమానంగా వెలుగొందే; వాలు+క్రొత్త+మెఱుఁగు, కైవడిన్= పొడుగైన క్రొత్త విద్యుల్లత మాదిరిగా; తత్+వనభూమిన్= ఆ అరణ్యసీమను; ఎంతయున్= మిక్కుటంగా; లాలిత, దేహ, కాంతి, పటలంబునన్+చేసి= సుకుమారమైన శరీరముయొక్క ప్రభారాశి చేత; వెలుంగన్+చేయు= ప్రకాశింపజేసే; ఆ+బాలన్= ఆ లేతజవరాలిని; వినీల కుంతల, విభాసినిన్= మిక్కిలి నల్లనైన ముంగురులచేత వెలుగొందే దానిని - ద్రౌపదిని; చూచి; స, విస్మయ+ఆత్ముఁడు+ఐ= అచ్చెరువుతో కూడినమనస్సు కలవాడై. (క్రింది పద్యంతో అన్వయం).

తాత్పర్యం: నల్లని మబ్బులగుంపును దేదీప్యమానంగా వెలుగొందజేసే క్రొత్తవిద్యుల్లతవలె, ఆ అడవినంతటిని తన శరీరప్రభలచేత ప్రకాశింపజేస్తున్న లేజవరాలు నల్లని ముంగురులు గల ద్రౌపదిని చూచి సైంధవుడు మనస్సులో మిక్కిలి ఆశ్చర్యపడ్డాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. **మగువఁదగిలిన చూడ్కుల మగుడఁ దిగువ । నేర్పు సాలక యతఁడు కందర్పదర్ప**
గోచరాత్ముఁ డై నిజసఖుఁ గోటికాస్యుఁ । డను నృపాత్మజుఁ జూచి యి ట్లనియెఁ బ్రీతి. **146**

ప్రతిపదార్థం: మగువన్+తగిలిన= వనితయందు మగ్నమైన (ద్రౌపదియందు లగ్నమైన); చూడ్కులన్= చూపులను; మగుడన్= వెనుకకు; తిగువన్= మరలించటానికి; నేర్పు+చాలక= సామర్థ్యం సరిపోవక; అతఁడు= సైంధవుడు; కందర్ప, దర్ప, గోచర+ఆత్ముఁడు+ఐ= మన్మథుడియొక్క గర్వానికి లోబడిన ఆత్మకలవాడై; కోటికాస్యుఁడు+అను= కోటికాస్యుడు అనే పేరుకల; నృపాత్మజున్= (నృప+ఆత్మజున్) రాజపుత్రుడిని; నిజ, సఖున్= తనమిత్రుడిని; చూచి; ప్రీతిన్= సంతోషంతో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: ద్రౌపదియందు లగ్నమైన చూపులను వెనుకకు మరలింపజాలక, మన్మథుడిబారికి చిక్కిన ఆ జయద్రథుడు (సింధుదేశప్రభువు) తన ప్రాణమిత్రుడు అయిన కోటికాస్యుడను రాజకుమారుని సంబోధించి ఈ విధంగా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. 'ఇన్నలినాక్షి యెవ్వతియొ? యివ్విపినంబున నేకతంబ యి
ట్లున్న నిమిత్త మేమియొ? సురోత్తమకన్యయొ, యక్షకాంతయో,
పన్నగభామయో, మనుజభామిని గామి నిజంబ; యిట్టి చె
ల్వున్నదియే మహీతలము నుగ్మలు లెవ్వరియందు నారయన్. 147

ప్రతిపదార్థం: ఈ, నలిన+అక్షి= పద్మాలవంటి కన్నులు కల ఈమె; ఎవ్వతి+ఒ= ఎవరికి సంబంధించినదో; ఈ+విపినంబునన్= ఈఅరణ్యంలో; ఏకతంబు+అ= ఒంటరిగా; ఇట్లు+ఉన్న= ఈ విధంగా ఉన్న; నిమిత్తము= కారణం; ఏమి+ఒ= ఏమిటో; సుర+ఉత్తమ, కన్య+ఒ= దేవతా స్త్రీయో; యక్ష, కాంత+ఓ= యక్షజాతికి చెందిన ఆమెయో; పన్నగ, భామ+ఓ= సర్పజాతికి చెందిన సుందరియో; మనుజ, భామిని+కామి= మానవవనిత కాకపోవటం; నిజంబు+అ= సత్యంసుమా; ఆరయన్= పరిశీలించి చూడగా; మహీతలము+ఉగ్మలులు+ఎవ్వరియందున్= భూలోకానికి చెందినవనితలలో ఎవ్వరియందుకూడా; ఇట్టి= ఇటువంటి (లోకోత్తరమైన); చెల్వు= సొగసు; ఉన్నది+ఏ?= ఉన్నదా? (లేదు లేదు సుమా).

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు కల ఈ సుందరాంగి ఎవరు? ఒంటరిగా ఈ అరణ్యంలో ఈ విధంగా నివసించటానికి గల కారణ మేమిటి? ఈ లోకోత్తరసౌందర్యవతి దేవతా స్త్రీయా, యక్షజాతికి చెందిన కన్యయా? పన్నగ భామినియా? ఈమె భూలోకంలోని మానవజాతి స్త్రీమాత్రం కాజాలదు. ఎందుకంటే - ఈ అందచందాలు మానవవనితలలో ఎక్కడా లేవు కదా!

విశేషం: అలం: ఉల్లేఖం.

ఉ. లీల యెలర్పఁగా నబల లేఁజిగురాకును బోలె నొప్పు కెం
గేలు కదంబశాఖతుదిఁ గీల్కొనఁ జేసి వసంతవిభ్రమో
న్మీలిత బాలవల్లిక్రియ మేలగుచూడ్కుల మించి పావక
జ్వాలయ పోలెఁ జిత్తము నిజం బెరియింపఁ దొడంగెఁ జూచితే. 148

ప్రతిపదార్థం: అబల= స్త్రీ (ద్రౌపది); లీల+ఎలర్పఁగాన్= విలాసం అతిశయించగా; లేత+చిగురు+ఆకును+పోలెన్= లేత చిగురుటాకు వలె; ఒప్పు= శోభిల్లు; కెంగేలు= (కెంపు+కేలు) ఎఱ్ఱని చేయి; కదంబ, శాఖ, తుదిన్= కడిమిచెట్టు కొమ్మచివరను; కీల్కొనన్+చేసి= తగిలించి; వసంత, విభ్రమ+ఉన్మీలత, బాల, వల్లి, క్రియన్= ఆమనియొక్క విజృంభణచేత బాగా శోభిల్లిన లేతలతవలె; మేలు+అగు= సొగసైన; చూడ్కులన్= చూపులచేత; మించి= రాణించి; పావక, జ్వాల+అ+పోలెన్= అగ్నిశిఖవలె; చిత్తమున్= నా మనస్సును; ఎరియింపన్+తొడంగెన్= మండింపసాగింది; నిజంబు= సత్యం; చూచితి+ఏ= చూచావు కదా.

తాత్పర్యం: ప్రియమిత్రుడవైన ఓ కోటికాస్యుడా! చూచావుకదా ఆ మనోహర దృశ్యం. ఆ సుందరాంగి కడిమిచెట్టు కొమ్మను తనచేతితో పట్టుకొని నిల్చిందికదా! ఆమెచేయి లేతచిగురుటాకువలె ఎర్రగా సుకుమారంగా ఉన్నది. ఆమని పొంగులువారు అందచందాలతో శోభిల్లే లేత లతవలె అలరారుతూ ఆ కదంబవృక్షం కడ కన్పిస్తున్నది. అందమైన చూపులతో అతిశయించే ఆ సుందరి అగ్నిశిఖవలె నామనస్సును నిజంగా దహిస్తున్నది సుమా.

విశేషం: ఈ పద్యం ఎఱ్ఱనకు సమకాలీనులు ప్రసాదించిన ప్రబంధపరమేశ్వర బిరుదాన్ని సార్థకం చేస్తున్నది. అది పూలచెట్లు లతలు అల్లిబిల్లిగా అల్లుకొనిన అరణ్యంలోని ఆశ్రమం. ఆ ఆశ్రమం గడప నానుకొని ఉన్న ఒక కడిమిచెట్టు. ఆ కడిమిచెట్టు

గుత్తులుగుత్తులుగా ఎఱ్ఱని పూలను పూస్తుంది. ఆకడిమి చెట్టు కొమ్మను తనకెంగేలితో అంటిపట్టుకొని వసంతవిభ్రమోన్మీలిత మైన లేతలత వలె ద్రౌపది ఆశ్రమద్వారం దగ్గర నిలిచి వాలుచూపులు ప్రసరిస్తున్నది. ఆమె అగ్నిశిఖవలె సైంధవుడి చిత్తాన్ని దహించింది. కదంబ పుష్పాలు ఎఱుపు. కదంబవృక్షాన్ని నవీనులు - 'అరణ్యదావాగ్నిజ్వాల' అని అభివర్ణించటం కద్దు. అలం: ఉపమ.

ఉ. ఈ కమలాక్షి నాకు హృదయేశ్వరి యైనఁ ద్రిలోకరాజ్యముం
జేకుఱ నేలినట్లు విలసిల్లనె! దర్పకవీరు బంటుఁగాఁ
గైకొని సర్వభోగములుఁ గాంతు; నొడంబడఁ బల్కి దీనికిన్
నాకును బొందొనర్చి కరుణం జరితార్థునిఁ జేయవే ననున్.' 149

ప్రతిపదార్థం: ఈ, కమల+అక్షి= పద్మాలవంటి కన్నులు కల ఈమె; నాకున్; హృదయ+ఈశ్వరి= హృదయానికి ఈశ్వరి, వలపుకత్తె; ఐనన్= అయితే; త్రిలోకరాజ్యమున్= మూడులోకాల ప్రభుత్వం; చేకుఱన్= లభించగా; ఏలినట్లు= పరిపాలించినట్లు; విలసిల్లనె= శోభిల్లనా; దర్పకవీరున్= వీరు డైన మన్మథుడిని; బంటున్+కాన్= సేవకుడిగా; కైకొని= స్వీకరించి; సర్వభోగములున్= సకలసౌఖ్యములును; కాంతున్= అనుభవిస్తాను; ఒడంబడన్+పల్కి= అంగీకరించేటట్లుగా చేసి; దీనికిన్= ఈమెకూ; నాకును= నాకూ; పొందు+ఒనర్చి= సంయోగం కల్పించి; కరుణన్= దయతో; ననున్= నన్ను; చరిత+అర్థునిన్= ధన్యుడిని; చేయవే= చేయవా (దయచేసి చేయుము).

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు గల ఈమనోహరాంగి నాకు వలపుకత్తె అయితే మూడులోకాలను పరిపాలించే సార్వభౌముడివలె మన్మథవీరుడిని నాభృత్యుడిగా చేసుకొని సర్వసౌఖ్యాలను అనుభవించగలను. ప్రియమిత్రమా! నీవు పూనుకొని ఈమెను అంగీకరింపజేసి, ఈమెకూ, నాకూ సంయోగం కూర్చి దయతో నాజన్మ ధన్యం చేయాలి సుమా!'

వ. అని పనిచినం గోటికాస్యుండు గ్రక్కునం బాంచాలిపాలికిం జని ప్రణయసుభగంబుగా నమ్మగువ కి ట్లనియె. 150

ప్రతిపదార్థం: అని పనిచినన్= అని (సైంధవుడు); నియోగించగా; కోటికాస్యుండు; గ్రక్కునన్= శీఘ్రంగా; పాంచాలి పాలికిన్= పాంచాలదేశరాజుపుత్రిక (ద్రౌపది) వద్దకు; చని= వెళ్లి; ప్రణయసుభగంబుగాన్= ప్రేమమాధుర్యం ఉట్టిపడేటట్లుగా; ఆ+మగువకున్= ఆ వెలదికి (ద్రౌపదికి); ఇట్లు+అనియెన్;

తాత్పర్యం: అని సైంధవుడు నియోగించగా అతడిమిత్రు డైన కోటికాస్యుడు వేగంగా ద్రౌపది ఉన్నచోటికి వెళ్లి ప్రేమమాధుర్యాలు ఉట్టిపడేటట్లుగా ఈవిధంగా పలికాడు.

సీ. 'మృగనేత్ర! దారుణమృగసమాకుల మైన । యువ్వనాంతరమున నేకతంబ
యిట్లు నీ యున్కికి నెయ్యది మూల? మి । వ్వన దేవతవొ, సురేశ్వరునితోడ
నలిగి ధరిత్రికి నరుగుదెంచిన శచీ । లలనవో, హరియురస్థ్సలి దొరంగి
కేలిఁ గ్రుమ్మరు పద్మగేహవో భవదీయ । జనకత్వమున సముజ్జ్వలితుఁ డైన

తే. పుణ్యుఁ డేవంశమునవాఁడు పొలఁతి! నీదు । జీవితేశ్వరుఁ డగు సుఖజీవితాత్ముఁ
డెవ్వఁ డబల! నీనామమ్మె యింపు మిగులు । శబ్ద మెయ్యది? నాకు నిజంబు సెప్పుము. 151

ప్రతిపదార్థం: మృగనేత్ర!= లేడిచూపులవంటి చూపులు కలదానా!; దారుణ, మృగ, సమ్+ఆకులము+ఐన= భయంకరా లైన జంతువులతో క్రిక్కిరిసిన; ఈ, వన+అంతరమునన్= ఈ అరణ్యంమధ్య; ఏకతంబు+అ= ఒంటరిగా; ఇట్లు= ఈరీతిగా; నీ+ఉన్కికిన్= నీవు ఉండటానికి; మూలము= హేతువు; ఎయ్యది= (ఏ+అది) ఏది; ఈ, వన, దేవతవొ= ఈ వన దేవతవా; సుర+ఈశ్వరునితోడన్= దేవేంద్రుడితో; అలిగి= కోపగించి; ధరిత్రికిన్= భూమికి; అరుగుదెంచిన= వచ్చిన; శచీ, లలనవొ= దేవేంద్రుడి భార్య అయిన శచీదేవివా; (లలన= స్త్రీ); హరి+ఉరస్+స్థలిన్+తొరంగి= విష్ణుదేవుడి వక్షఃస్థలం వీడి; కేలిన్= లీలకొరకై; క్రుమ్మరు= విహరించే; పద్మగేహవొ= లక్ష్మీదేవివో (పద్మం గృహంగా కలదానవో); పొలఁతి!= ఓసుందరీ!; భవదీయ జనకత్వమునన్= నీకు తండ్రిగా ఉండటంచేత; సమ్+ఉత్+జ్వలితుఁడు= మిక్కుటంగా ప్రకాశించేవాడు; ఐన= ఐనట్టి; పుణ్యుఁడు= సుకృతి; ఏవంశమునవాఁడు?= ఏ వంశానికి చెందినవాడు?; నీదు= నీయొక్క; జీవిత+ఈశ్వరుఁడు+అగు= భర్త అయిన; సుఖ, జీవిత+ఆత్ముఁడు= సౌఖ్యంతో కూడిన బ్రదుకు కలవాడు; ఎవ్వఁడు?= ఎవడు?; అబల!= ఇంతి, సుకుమారీ!; నీనామము+ఐ= నీపేరు అయినదై; ఇంపుమిగులు= సొంపారే; శబ్దము= పదం; ఏ+అది?= ఏది?; నాకున్; నిజంబు= సత్యం; చెపుము+అ= పలుకుము.

తాత్పర్యం: లేడిచూపులవంటి చూపులు కలదానా! భయంకర జంతువులతో కలతచెందిన ఈ అరణ్యం మధ్య ఒంటరిగా ఏల నివసిస్తున్నావు? ఇక్కడ నీవు ఉండటానికి కారణ మేమిటి? నీవు మూర్తీభవించిన వనదేవతవా? దేవేంద్రుడితో కలహించి దివినుండి భువికి దిగివచ్చిన శచీదేవివా? విష్ణుమూర్తి వక్షఃస్థలం వీడి వినోదంగా ఈ విపినంలో విహరించటానికి వచ్చిన లక్ష్మీదేవివా? నిన్ను కన్న ఆ అదృష్టవంతుడు ఎవరు? అతని దే వంశం? నీ ప్రేమకు పాత్రు డైన నీభర్త ఆ గొప్ప సుఖభోగి ఎవ్వరు? నీపేరులో పొసగటంవలన ఇంపారే ఆ శబ్దం ఏది? దయచేసి నాకు సత్యం చెప్పుము.

విశేషం: 1. ఈపద్యంలోని పోకడలు, పదగుంఫనలు, ఒడుపులు, విరుపులు, మెరుపులు తరువాతి ప్రబంధకర్తలకు ఒజ్జబంతులైనవి. ఇందలి సంభాషణచాతురి అనుశీలించ తగింది. 2. లోకోత్తరమైన నీ సౌందర్యం మమ్ము ఆకర్షించింది సుమా! అని చెప్పడం ఇందలి ఆంతర్యం.

క. **కరిరాజగమన! మాతెఱఁ। గరయఁ దలఁచితేని వినవె యధికబలుఁడ నే**
సురథుఁ డను రాజుపుత్త్రుఁడ। నరిమథనుఁడఁ గోటికాస్యుఁ డనఁ జనువాఁడన్. **152**

ప్రతిపదార్థం: కరిరాజగమన!= మదపుటేనుగునడకవంటి నడక కలదానా!; మాతెఱఁగు= మాతీరు; అరయన్+తలఁచితి+ఏని= తెలిసికొనదలిస్తే; వినవె= ఆలకించుమా; ఏన్= నేను; అధిక, బలుఁడన్= మిక్కిలి శక్తి కలవాడిని; సురథుఁడు+అను, రాజుపుత్త్రుఁడన్= సురథుడు అనేపేరు కల రాజుకొడుకును; అరి, మథనుఁడన్= శత్రువులను బాధించే వాడిని; కోటికాస్యుఁడు+ అనన్+చనువాఁడన్= కోటికాస్యుడు అనే పేరుచేత పిలువబడేవాడిని.

తాత్పర్యం: మత్తేభ మందగంభీరగమనం కలదానా! నీకు మావిషయం సవిస్తరంగా తెలిసికొనటానికి వివరిస్తాను. వినుము. నేను మిక్కిలి బలం కలవాడను. సురథుఁడు అనే మహారాజు కొడుకును. శత్రుసంహారం చేసే సామర్థ్యం కలవాడను. కోటికాస్యుడు అని నన్ను పిలుస్తారు.

తే. **అల్ల కాంచన రథముపై నలరువాఁడు। ఘనుఁడు క్షేమంకరుండు త్రిగర్తవిభుఁడు;**
మఱియు నినుఁ జూచుచున్నాఁడు మగువ! వాఁడె। దీప్తభుజుఁ డైన కాళింగదేశవిభుఁడు.' **153**

ప్రతిపదార్థం: మగువ!= ఓ వనితా!; అల్ల= అదుగో (కనిపిస్తున్న అనతిదూరంలో); కాంచనరథముపైన్= బంగారంతో నిర్మించబడిన తేరిపై; అలరువాఁడు= శోభిల్లేవాడు; ఘనుఁడు= గొప్పవాడు; క్షేమంకరుండు= క్షేమంకరుడు అనేవాడు; త్రిగర్త, విభుఁడు= త్రిగర్తదేశానికి ప్రభువు; మఱియున్= ఇంకను (ఆ త్రిగర్తవిభుడుగాక); నినున్= నిన్ను; చూచుచున్నాఁడు= చూస్తున్నాఁడు (అంటే కోరుతున్నాడనిభావం); వాఁడు+ఎ= వాడే; దీప్తభుజుఁడు+ఐన= ప్రకాశించే భుజాలు కలవాడైన, పరాక్రమవంతుడైన; కాళింగ, దేశ, విభుఁడు= కళింగదేశానికి ప్రభువు.

తాత్పర్యం: సుందరీ! అడుగో మనకు కనిపిస్తున్న ఆ బంగారు రథంమీద శోభిల్లేవాడు త్రిగర్తదేశానికి రాజు, క్షేమంకరుడు. కోరికతో కూడుకొన్న చూపులు ప్రసరిస్తున్నాడే, ఆ మహాపరాక్రమశాలి, కళింగదేశానికి అధిపతి.

తే. **ఉల్ల పద్మాకరము పొంతనుండి నిన్ను । మెచ్చి కనుఁగొనుచున్న యున్మీలితాక్షుఁ**
డుత్పలాక్షి! యిక్ష్వాకువంశోద్భవుండు । సుబలభూపతిపుత్త్రుండు సుభగుఁ డతఁడు. 154

ప్రతిపదార్థం: ఉత్పల+అక్షి!= కలువలవంటి కన్నులు కలదానా!; ఉల్ల= ఇంచుక దూరంలో; పద్మ+ఆకరముపొంతన్+ఉండి= తామరలకు నిలయమైన సరోవరం సమీపంలో ఉండి; నిన్నున్= నిన్ను (ద్రౌపదిని); మెచ్చి, కనుఁగొనుచున్+ఉన్న= ప్రశంసించి చూస్తూ ఉన్న; ఉత్+మీలిత+అక్షుఁడు= బాగా విప్పారిన కన్నులు కలవాడు; ఇక్ష్వాకు, వంశ+ఉద్భవుండు= ఇక్ష్వాకు మహారాజు వంశంలో పుట్టినవాడు; సుబలభూపతి, పుత్త్రుండు= సుబలుడు అనే రాజు యొక్క కొడుకు; అతఁడు= ఆతడు; సుభగుఁడు= మనోహరుడు, భాగ్యవంతుడు.

తాత్పర్యం: కలువలవంటి కన్నులు కలదానా! అల్లంతదూరంలో తామరకొలను వద్ద నిలువబడి నిన్ను మెచ్చి చూస్తూ ఉన్న ఆ విప్పారిన కన్నులవాడున్నాడే ఆతడు ఇక్ష్వాకువంశంలో పుట్టినవాడు, సుబలుడనే రాజు కుమారుడు. అతడు మనోహరుడైన భాగ్యవంతుడు.

విశేషం: అంతటి ఉత్తమవంశజుడు, అంతటి సుక్షత్రియుడు, అంతటి మనోహరుడు సైతం నిన్ను మెచ్చుకొని కనులు విచ్చుకొని చూస్తున్నాడని చెప్పటంవలన ద్రౌపది హృదయంలో సైంధవునిపట్ల ఉన్ముఖీకరణం జరగాలని మాటనేర్పరితనం ప్రకటించాడు కోటికాస్యుడు.

వ. **అరుణాశ్వయుక్తంబు లయిన రథంబులయందు రత్నమయభూషణు లయి సమిద్ధవహ్నులుం బోలె వెలుంగుచున్న యా సౌవీరకుమారులు పన్నిద్దఱుం దన్నుం జేరి కొలువ ననేకసహస్రకరితురగరథపదాతి పరివృతుండై మహాగజంబుపై శోభిల్లుచున్న యవ్వీరుండు సింధుసౌవీరనాథుం డైన జయద్రథుం; దమ్మను జేశ్వరుం డిప్పుడు నీతెఱం గెఱుంగఁ దివిరి, నన్ను నిట పుత్తెంచె' ననినఁ బాండవపత్ని మృదుసంభ్రమంబునం గదంబశాఖ విడిచి యుత్తరీయంబు సంగతంబు గావించుకొని కోటికాస్యున కి ట్లనియె.** 155

ప్రతిపదార్థం: అరుణ+అశ్వ, యుక్తంబులు+అయిన= ఎఱ్ఱని గుఱ్ఱాలు పూన్చబడినవి అయిన; రథంబుల+అందున్= తేరులలో; రత్నమయభూషణులు+అయి= మణులతో నిండిన ఆభరణాలు ధరించిన వారయి; సమ్+ఇద్ధ, వహ్నులున్+పోలెన్= మిక్కుటంగా ప్రజ్వలిస్తున్న అగ్నులవలె; వెలుంగుచున్+ఉన్న= ప్రకాశిస్తున్న; ఆ సౌవీరకుమారులు= ఆ సౌవీర దేశానికి చెందిన రాచబిడ్డలు; పన్నిద్దఱున్= పండ్రెండు మంది; తన్నున్+చేరి= తనకు సహాయంగా ఉండి; కొలువన్= సేవించగా; అనేక, సహస్ర, కరి, తురగ, రథ, పదాతి పరివృతుండు+ఐ= పెక్కువేల ఏనుగులు గుఱ్ఱాలు తేరులు కాల్బలాలచేత చుట్టబడినవాడై; మహా,

గజంబుపైన్= గొప్ప ఏనుగుపై; శోభిల్లుచున్+ఉన్న= ఒప్పారుతున్న; ఆ+వీరుండు; సింధూసౌవీరనాథుండు+ఐన= సింధుదేశానికి సౌవీరదేశానికి ప్రభువు అయిన; జయద్రథుండు= జయద్రథుడు; ఆ+మనుజేశ్వరుండు= ఆరాజు; ఇప్పుడు= ఈ సమయంలో; నీ తెఱంగు= నీతీరు; ఎఱుంగన్= తెలిసికొనటానికి; తివిరి= పూని; నన్నున్= నన్ను; ఇట= ఇక్కడికి; పుత్తెంచెన్= నియోగించాడు; అనినన్= అని (కోటికాస్యుడు) చెప్పగా; పాండవపత్ని= పాండవుల భార్య - ద్రౌపది; మృదు సంభ్రమంబునన్= సున్నితమైన తత్తరపాటుతో; కదంబ, శాఖన్= కడిమిచెట్టుకొమ్మను; విడిచి= వదలిపెట్టి; ఉత్తరీయంబు= పైన కప్పుకొనే వస్త్రం; సంగతంబు+కావించుకొని= సవ్యంగా ఉండేటట్లు సవరించుకొని; కోటికాస్యునకున్= కోటికాస్యుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: 'అదుగో! ఎర్రని గుర్రాలు పూన్చబడిన ఆ రథాలమీద మణులు పొదిగిన ఆభరణాలు ధరించి ప్రజ్వలించే అగ్నులవలె ప్రకాశిస్తున్న సౌవీరరాజపుత్రులు పన్నెండుమంది సేవించగా వెలుగొందుతున్న జయద్రథుడు నీతీరుతెన్నులను అరసిరమ్మని నన్ను నియోగించాడు. ఆ జయద్రథమహారాజు వైభవం తిలకించుము. పెక్కువేల చతురంగబలాలు, రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలాలు అతడిని పరివేష్టించి ఉన్నవి కదా! ఆ మహాసేనలమధ్య మత్తేభంమీద అధివసించి ఉన్నవాడే సింధుసౌవీరదేశాలకు అధినేత అయిన జయద్రథుడు'- అని వివరించి కోటికాస్యుడు చెప్పాడు. ఆ మాటలు విన్న ద్రౌపది మెత్తని తత్తరపాటుతో తన ఉత్తరీయాన్ని సవ్యంగా అమర్చుకొని కడిమిచెట్టు కొమ్మను వదలి కోటికాస్యుడితో ఇట్లా చెప్పింది.

తే. **'అన్న! యిచ్చట నే నొంటి నున్నదాన;। నీ వచటి కేఁగుదెంచుట నియతి యగునె?**
సుతవతిని ధర్మవతి నన్ను నితరకాంత। గాఁ దలంచి పెక్కులు వల్కఁ గాదు నీకు. **156**

ప్రతిపదార్థం: అన్న!; ఇచ్చటన్= ఈచోట (ఈ ఆశ్రమంలో); ఏన్= నేను; ఒంటిన్= ఒంటరిగా; ఉన్నదానన్= ఉన్న ఆడుదానిని; నీవు= నీవు; ఇచటికిన్= ఈ చోటికి; ఏఁగుదెంచుట= రావటం; నియతి+అగును+ఎ= మర్యాద ఔతుందా?= (కాదని భావం); సుతవతిని= కొడుకులు కలదానిని నేను; ధర్మవతిన్= పాడి పాటించే దానను; నన్నున్; ఇతర కాంతగాన్= ఇంకొక విధమైన ఆడుదానిగా; తలంచి= ఊహించి; పెక్కులు+పల్కన్= అధికప్రసంగం చేయటం; నీకున్+కాదు= నీకు తగదు సుమా.

తాత్పర్యం: అన్నా! ఓ కోటికాస్యా! ఇక్కడ ఈ అరణ్యంలో ఈ ఆశ్రమంలో నేను ఒంటరిగా ఉన్నాను కదా! నీవు నాదగ్గరకు రావడం సమంజసం కాదు. నేను కొడుకులు గలదానను. ధర్మాన్ని అనుసరిస్తున్నదానిని. నన్ను తదితర సామాన్య స్త్రీగా ఊహించి నీవు పలుమాటలాడటం పాడిగాదు.

వ. **నీవు శిబివంశోద్భవుం డయిన సురథపుత్త్రుండ వగు టే నెఱుంగుదు; నస్మత్ప్రకారంబు సెప్పెద విను; మేను బాంచాలపతి యైన ద్రుపదుకూఁతురఁ, గృష్ణ యనుదానం; బాండునందను లగు యుధిష్ఠిరభీమార్జున నకుల సహదేవులకు ధర్మపత్ని; నవ్వీరు లిప్పుడు నన్ను నివ్వనంబున నునిచి.** **157**

ప్రతిపదార్థం: నీవు= నీవు (ఓకోటికాస్యా!); శిబి, వంశ+ఉద్భవుండు+అయిన= శిబియొక్క వంశంలో జన్మించిన; సురథు, పుత్త్రుండవు+అగుట= సురథుడి కొడుకువు కావటం; ఏను+ఎఱుంగుదున్= నాకు తెలుసు; అస్మత్+ప్రకారంబు= నాసంగతి; చెప్పెదన్= వచించగలను; వినుము= ఆలకించుము; ఏను= నేను; పాంచాలపతి+ఐన= పాంచాలదేశ ప్రభువు అయిన; ద్రుపదు కూఁతురన్= ద్రుపదుడియొక్క పుత్త్రికను; కృష్ణ+అనుదానన్= కృష్ణ అనే పేరు కలదానను; పాండునందనులు+అగు=

పాండురాజుయొక్క కొడుకులు అయిన; యుధిష్ఠిర, భీమ+అర్జున, నకుల సహదేవులకున్= ధర్మరాజుకు, భీముడికి, అర్జునుడికి, నకులుడికి, సహదేవుడికి; ధర్మపత్నిన్= అగ్నిసాక్షిగా వివాహం అయిన భార్యను; ఆ+వీరులు= పరాక్రమవంతులైన ఆ పాండవులు; ఇప్పుడు= ఈసమయంలో; నన్నున్; ఈ వనంబునన్= ఈ అడవిలో; ఉనిచి= ఉంచి.

తాత్పర్యం: ఓకోటికాస్యుడా! దానవీరుడుగా సుప్రసిద్ధుడైన శిబిచక్రవర్తివంశంలో జన్మించిన సురథుడికొడుకువు నీవు. ఆ సంగతి నాకు తెలుసు. ఇక నావిషయం చెపుతాను వినుము. నేను పాంచాలప్రభువు అయిన ద్రుపదుడియొక్క పుత్రికను. నన్ను కృష్ణ అని పిలుస్తారు. పాండురాజుకొడుకులు అయిన ధర్మరాజుకు భీముడికి అర్జునుడికి నకుల సహదేవులకు నేను ధర్మపత్నిని. వీరులైన పాండవులు ఇప్పుడు నన్ను ఈ అరణ్యంలో ఉంచి.

విశేషం: 1. శిబి - ప్రాచీన భారతీయవాఙ్మయంలో దానవీరుడుగా సుప్రసిద్ధి గాంచిన చక్రవర్తి. పావురాన్ని తరుముకొని వచ్చిన డేగ., పావురం శిబి శరణువేడటం, డేగకు తన శరీరం కోసి పావురం బరువు మాంసం ఇవ్వడానికి పూనుకోవటం, చివరకు తానే పావురానికి బదులు డేగకు ఆహారం కావటానికి సిద్ధపడటం (ఈకథ మహాభారతంలో ఆరణ్యపర్వంలోనే ఏడవఆశ్వాసంలో ఉన్నది). బౌద్ధవాఙ్మయంలో పరోపకారార్థం ఆత్మబలిదానం చేసికొనిన బోధిసత్త్వుడుగా శిబి వర్ణించబడ్డాడు.

తే. **ధర్మజుఁడు దూర్పు, భీముఁడు దక్షిణంబు, । నర్జునుఁడు పడమర, గవ లర్థి నుత్త**
రంబుగా వేఁట వోయిరి రాజముఖ్యు; । లనఘు లింతకు వత్తురు వినుతబలులు. **158**

ప్రతిపదార్థం: ధర్మజుఁడు= ధర్మరాజు; తూర్పు= తూరుపుదిక్కుకు; భీముఁడు= భీముడు; దక్షిణంబు= దక్షిణదిక్కుకు; అర్జునుఁడు= అర్జునుడు; పడమర= పశ్చిమానికీ; కవలు= జంటబిడ్డలు (నకులసహదేవులు); అర్థిన్= ప్రీతితో; ఉత్తరంబుగాన్= ఉత్తరదిశకు; వేఁట+పోయిరి= వేటాడటానికై వెళ్ళారు; రాజముఖ్యులు= రాజులలో శ్రేష్ఠులు; అనఘులు= పాపరహితులు అయిన మహానుభావులు; వినుత, బలులు= ప్రశంసించబడిన పరాక్రమం కలవారు (పాండవులు); ఇంతకున్= ఈ లోపలనే, కొద్దిసేపటిలోనే; వత్తురు= రాగలరు.

తాత్పర్యం: ధర్మరాజు తూరుపు దిక్కుకూ, భీముడు దక్షిణదిక్కుకూ, అర్జునుడు పడమటిదిశకూ, నకుల సహదేవులు ఉత్తరదిశకూ వేటకు వెళ్ళారు. రాజులలో శ్రేష్ఠులు, పుణ్యాత్ములు, పరాక్రమోపేతులు అయిన పాండవులు కొద్దిసేపటిలో ఇక్కడికి తిరిగి రాగలరు.

వ. **మీ రమ్మహాత్ములకు మాననీయులరు గావున నార్యజనమిత్త్రులగు నక్కురుకులపవిత్త్రులు సేయు సత్కారంబులు గైకొనిపోవుదురు గాని యొక్కింతతడ వియ్యాశ్రమసమీపంబున నిలువుం' డని పలికి యల్లన యవ్వరవర్ణిని భయంబునం బర్ణగృహంబు సొచ్చినం, గోటికాస్యుండును గ్రమ్మఱి చని, జయద్రథునితోడ నబ్భామిని పాంచాలకన్యక యనియును, బాండవపత్ని యనియునుం జెప్పిన, నద్దురాత్ముండు మదనకంపితహృదయుం డగుచు, నమ్ముగువ నపహరింపం దివిరి కతిపయజనసమేతంబుగా నరిగి, సింహాగారంబు సొచ్చు వృకంబునుంబోలెఁ బాండవ నివాసంబు సొత్తెంచి, పాంచాలిం గని దాని కిట్లనియె.159**

ప్రతిపదార్థం: మీరు= మీరు; ఆ+మహా+ఆత్ములకున్= ఆ మహానుభావులకు; మాననీయులరు= ఆరాధించ తగినవారు; కావునన్= కాబట్టి; ఆర్య, జన, మిత్త్రులు+అగు= పూజించతగిన పెద్దలకు స్నేహితులు అయిన; ఆ+కురు, కుల, పవిత్రులు= కురువంశాన్ని పావనంచేసేవారైన-ఆ పాండవులు; చేయు= ఆచరించే; సత్కారంబులు= మర్యాదలు, మన్ననలు; కైకొని=

స్వీకరించి; పోవుదురు+కాని= వెళ్లెదరుగాక; ఒక్కింత, తడవు= కొంచెంసేపు; ఈ+ఆశ్రమసమీపంబునన్= ఈ ఆశ్రమానికి దగ్గరగా; నిలువుండు= ఆగుడు; అని పలికి= అని వచించి; ఆ+వరవర్ణిని= శ్రేష్ఠమైన శరీరకాంతి కల ఆ సుందరి ద్రౌపది; భయంబునన్= భీతిచేత; అల్లన= మెల్లగా; పర్ణగృహంబు+చొచ్చినన్= ఆకులతో నిర్మించబడిన కుటీరంలో ప్రవేశించగా; కోటికాస్యుండును= కోటికాస్యుడు అనే వాడుకూడ; క్రమ్మఱి= మరలి; చని= వెళ్ళి; జయద్రథునితోడన్= సైంధవుడితో; ఆ+భామిని= ఆ వనిత; పాంచాలకన్యక+అనియును= పాంచాలదేశప్రభువుయొక్క కూతురు అనిన్నీ; పాండవపత్ని+అనియునున్= పాండునందనుల భార్య అనిన్నీ; చెప్పినన్= తెల్పగా; ఆ, దురాత్ముండు= ఆ చెడుబుద్ధి గలవాడు (జయద్రథుడు); మదన, కంపిత, హృదయుండు+అగుచున్= మన్మథుడిచేత చలింపజేయబడిన డెందం కలవాడు ఔతూ; ఆ+మగువన్= ఆ వనితను; అపహరింపన్+తివిరి= బలాత్కారంగా పట్టుకొని పోవటానికి పూనుకొని; కతిపయ జనసమేతంబుగాన్= కొంతమందితో కూడుకొని; అరిగి= వెడలి; సింహ+అగారంబు= సింహం ఉండే నెలవును; చొచ్చు= ప్రవేశించే; వృకంబునున్+పోలెన్= తోడేలువలె; పాండవనివాసంబు= పాండవులు నివసించే గృహం; చొత్తెంచి= చేరి; పాంచాలిన్+కని= ద్రౌపదిని చూచి; దానికిన్= ఆమెతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: మీరు మహాత్ములైన పాండవులచేత అతిథిమర్యాదలు పొంద తగినవారు. పాండవులు పూజ్యులకు మర్యాదలు మన్ననలు చేసి తమకురువంశాన్ని పావనం చేసికొనేవారు. కాబట్టి మీరు కొంతసేపు ఈ ఆశ్రమ సమీపంలో నిలవండి' అని పలికి, భీతితో ఆ వరవర్ణిని, పర్ణకుటీరంలోకి పోయింది. కోటికాస్యుడు మరలివెళ్లి, జయద్రథుడితో ఆ సుందరాంగి ద్రుపదమహారాజుకూతురనీ, పాండవుల ధర్మపత్ని అనీ తెలియచెప్పాడు. కాని, దురాత్ముడైన సైంధవుడు ద్రౌపదిని బలాత్కారంగా తీసికొని పోవ తలపెట్టి, కొంతమంది భృత్యులను వెంటపెట్టుకొని, మన్మథావేశంతో, కంపించే డెందంతో సింహ ముండే నెలవును సమీపించే తోడేలువలె పాండవులు నివసించే పర్ణకుటీరాన్ని చేరి, ద్రౌపదిని చూచి ఈ విధంగా పలికాడు.

క. 'వామాక్షి! నీకుఁ గుశలమె? । నీమన సెవ్వారియందు నిత్యప్రేమం
బై మెఱయు నట్టి సొబగులు । నీమగ లేవురకు నిపుడు నెమ్మదియె మదిన్?' 160

ప్రతిపదార్థం: వామ+అక్షి!= అందమైన కన్నులు కలదానా, ద్రౌపదీ!; నీకున్; కుశలమె= క్షేమంకదా; నీమనసు= నీచిత్తం; ఏ+వారియందున్= ఎవరియందు; నిత్య, ప్రేమంబు+ఐ= ఎల్లప్పుడూ అనురాగంతో కూడి ఉండి; మెఱయున్= శోభిల్లుతుందో; అట్టి= అటువంటి; సొబగులు= సౌందర్యవంతులు; నీ మగలు= నీ భర్తలు; ఏవురకున్= ఐదుగురికిన్నీ; ఇపుడు= ఈవేళ; మదిన్= మనస్సులో; నెమ్మదియె= సంప్రీతియే కదా.

తాత్పర్యం: అందమైన కన్నులు కలదానా! ద్రౌపదీ! నీకు కుశలమే కదా! నీ అనురాగానికి ఎల్లప్పుడూ నోచుకొన్న నీ భర్తలు, అదృష్టవంతులైన అందగాండ్రు, పాండవులు క్షేమంగా ఉన్నారుగదా!

విశేషం: వామాక్షి - వరవర్ణిని - మానవతి అనే ప్రయోగాలు కేవలం స్త్రీవాచకాలుమాత్రమే కాక - సందర్భాన్నిబట్టి సార్థకంగా ఎన్నదగినవి. అట్లే. రాజముఖ్యులు, వినుతబలులు, అనఘులు మున్నగు ప్రయోగాలు స్వీకరించదగినవి.

వ. అనిన వానికి నమ్మానవతి యి ట్లనియె. 161

తాత్పర్యం: అని అడుగగా జయద్రథుడితో ద్రౌపది ఈవిధంగా పలికింది.

చ. 'స్థిరమతు లైన పార్థులకు సేమమ, నీకు ననామయంబె భూ
వర! తగ విందవైతి కురువర్యుల యింటికి; నట్లు గావునం
బరువడి నాసనక్రియయుఁ బాద్యముఁ గైకొను మాదరంబుతో
సరసకురంగమాంసములఁ జల్పుము భోజనకృత్య మిత్తఱిన్. 162

ప్రతిపదార్థం: భూవర!= రాజా! ఓ జయద్రథా!; స్థిర, మతులు+ఐన= ధైర్యంగల; పార్థులకున్= కుంతీపుత్రులకు, (పాండవులకు); సేమము+అ= కుశలమే; నీకున్= ఓ జయద్రథా! నీకు; అనామయంబు+ఎ= రోగం లేకుండా ఉన్నదికదా, ఆరోగ్యమే కదా!; కురు, వర్యుల+ఇంటికిన్= కురువంశంలో శ్రేష్ఠులు అయిన (పాండవుల) గృహానికి; తగన్= ఒప్పినట్లుగా విందవు+ఐతి(వి)= అతిథివి అయినావు; అట్లు+కావునన్= ఆ విధంగా అతిథివి అయినావు కాబట్టి; పరువడిన్= సముచితంగా; ఆసనక్రియయున్= సుఖంగా కూర్చుండటం; పాద్యమున్= స్వాగత చిహ్నంగా ఇచ్చే నీరును; ఆదరంబుతోన్= అభిమానంతో; కైకొనుము= స్వీకరించుము; సరసకురంగమాంసములన్= రుచికర మైన లేడిమాంసాలతో (కూడిన); భోజనకృత్యము= ఆహారాన్ని స్వీకరించటం; ఈ+తఱిన్= ఈ అదనులో; చల్పుము= చేయుము.

తాత్పర్యం: 'పాండవులు స్థిరచిత్తులు. వారు కుశలంగా ఉన్నారు. వారిమాట కేమి కాని నీవు ఆరోగ్యంగా ఉన్నావు కదా. ఓ రాజా, జయద్రథా! కురువంశంలోశ్రేష్ఠులు అయిన పాండవులకు నీవు ఇప్పుడు అతిథివి అయినావు. కావున సంప్రదాయసిద్ధ మైన మర్యాదలకు మన్ననలకు నీవు అర్హుడివి. దయచేసి ఉచితాసనాన్ని స్వీకరించుము. స్వాగతచిహ్నమైన పాద్యాన్ని గ్రహించుము. రుచికరాలైన లేడిమాంసాలతో విందుభోజనం ఆరగించుము.

ఆ. వేఁట వోయినారు విభు లిప్డు వత్తురు। వారు వచ్చి నీకు వలయునట్టి
ప్రియము లాచరింపఁ బ్రీతుండ వై మఱి। యిష్టజనులు నీవు నేఁగు మనఘ!' 163

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; విభులు= భర్తలు; (పాండవులు); వేఁట+పోయినారు= వేటకు వెళ్ళారు; ఇప్డు= ఇంతలోనే; వత్తురు= రాగలరు; వారు; వచ్చి; నీకున్; వలయు+అట్టి= కావలసిన; ప్రియములు= ప్రీతికరా లైనవి (మర్యాదలు మున్నగునవి); ఆచరింపన్= చేయగా; ప్రీతుండవు+ఐ= సంతుష్టి చెందినవాడవు అయి; మఱి= తిరిగి; ఇష్టజనులు= హితులును; నీవున్= నీవును; ఏఁగుము= వెళ్ళుము.

తాత్పర్యం: పుణ్యాత్ముడవైన ఓ జయద్రథా! నా భర్తలు పాండవులు వేటకు వెళ్ళి ఉన్నారు. వారు వచ్చేవేళ అయింది. వారు వచ్చినపిమ్మట నీకు తగిన మర్యాదలు చేయగలరు. ఆ సత్కారాలను గ్రహించిన పిమ్మట నీవు నీపరివారంతో వెళ్ళవచ్చును.

చ. అనవుడు సైంధవుం డనియె; 'నంబుజలోచన! నీవు మాకుఁ జే
యు నతిథిపూజ లన్నియును నొక్కట నైనఁ గొఱంతలేక వ
చ్చినవియ; మన్మథాస్త్రముల చిక్కునఁ గాఱియ వొందె డెంద; మిం
క ననుఁ గృతార్థుఁ జేయుము దగన్; రథ మెక్కుము లెమ్ము నెమ్మితోన్. 164

ప్రతిపదార్థం: అనవుడున్= అని (ద్రౌపది) పలుకగా; సైంధవుండు= జయద్రథుడు; అనియెన్= చెప్పాడు; అంబుజలోచన!= పద్మాలవంటి కన్నులు కలదానా, ద్రౌపదీ!; నీవు; మాకున్; చేయు= ఒనర్చు; అతిథిపూజలు+అన్నియునున్= అతిథి సత్కారాలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అన్నియున్నా; ఒక్కటన్+ఐనన్= ఒకదానియందు అయినను; కొఱంత, లేక= లోపం లేకుండా; వచ్చినవి+అ= చేకూరినవి సుమా; మన్మథ+అస్త్రముల= మన్మథుడియొక్క మంత్రబాణాలయొక్క; చిక్కునన్= ఇరుకుకొనినముడిలో; డెందము= హృదయం; కాఁటియ+పొందెన్= వెత చెందింది; ఇంకన్= ఇకమీద; ననున్= నన్ను; కృత+అర్థున్= ధన్యుడిగా; చేయుము= ఒనర్పుము; తగన్= ఒప్పిదంగా; నెమ్మితోన్= సంప్రీతితో; లెమ్ము= లేచి రమ్ము; రథము+ఎక్కుము= తేరుపై ఎక్కుము.

తాత్పర్యం: అని ద్రౌపది చెప్పింది. జయద్రథుడు ఈ విధంగా బదులు పలికాడు. 'పద్మాలవంటి కన్నులు కల ద్రౌపదీ! నీవు మాకు చేయదలచిన అతిథిమర్యాదలు అన్నిటిని పొందాను. ఏలోపం రాలేదు. కాని, మన్మథుడి మంత్రబాణాలచేత నాహృదయం తూట్లు పడింది. ఇంక నీవు నన్ను ధన్యుడిని చేయాలి. ఇక మారుమాట చెప్పక సమ్మతించి దయచేసి లేచిరమ్ము. ప్రీతితో రథాన్ని ఎక్కుము.

మ. **ధరణీరాజ్యము గోలుపోయి ఘనకాంతారస్థలీవాసులై**
సరివా రెల్లను నవ్వఁ గుత్సితదశాసంప్రాప్తిమై నున్న ము
ష్కరులం బార్థులఁ గొల్చినం గలదె సౌఖ్యం? బెంతయున్ బేలవై
తరవిందానన! శ్రీవిహీనులఁ గరం బర్థింతురే కామినుల్? **165**

ప్రతిపదార్థం: అరవింద+ఆనన!= పద్మమువంటి మొగం కలదానా, ఓ ద్రౌపదీ!; ధరణీ, రాజ్యము= భూ ప్రభుత్వాన్ని; కోలుపోయి= పోగొట్టుకొని; ఘన, కాంతార, స్థలీ, వాసులు+ఐ= గొప్ప అరణ్యప్రదేశంలో నివసించేవారై; సరివారు= తోడివారు; ఎల్లను= అందరును; నవ్వన్= వెక్కిరించగా; కుత్సిత, దశా, సంప్రాప్తిమైన్= చెడుకాలం దాపరించటంచేత; ఉన్న= జీవిస్తున్న; ముష్కరులన్= దీనులను; పార్థులన్= కుంతీపుత్రులైన పాండవులను; కొల్చినన్= సేవిస్తే; సౌఖ్యంబు= సుఖం; కలదు+ఎ= లభిస్తుందా (లభించదుసుమా); ఎంతయున్= ఎంతగానో; బేలవు+ఐతి(వి)= తెలివిలేనిదానివి అయినావు; కామినుల్= ఆడువారు; శ్రీవిహీనులన్= ధనం లేని వారిని; కరంబు= మిక్కుటంగా; అర్థింతురు+ఏ= కోరుకొంటారా (కోరరుగదా).

తాత్పర్యం: పద్మంవంటి మొగం కల సుందరీ! ద్రౌపదీ! రాజ్యాన్ని పోగొట్టుకొని, తోడివారలు అందరు వెక్కిరిస్తూ ఉండగా అడవులలో ఇడుమల పొందుతున్నవారుకదా పాండవులు. అట్టి దీనులను సేవించటం నీతెలివితక్కువ తనం సుమా! దానివలన నీకు సుఖమేమీ కలుగదు. ధనం లేని దరిద్రులను ఆడవారు కోరుకొనరుకదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం

ఆ. **చిగురుబోఁడి! నిఖిలసింధుసౌవీరభూ । వలయరాజ్యగౌరవంబుతోన**
నన్ను నేలికొని మనఃప్రియభోగైక । యోగ్య వగుము ; విడువు మొండుదలఁపు'. **166**

ప్రతిపదార్థం: చిగురుబోఁడి!= తలిరుటాకువలె సుకుమారమైన దేహం కలదానా! ద్రౌపదీ!; నిఖిల, సింధు, సౌవీర, భూ, వలయ, రాజ్య గౌరవంబుతోన్+అ= సమస్తమైన సింధు సౌవీరదేశాలకు చెందిన భూమండల ప్రభుత్వ మహిమతో సంపూర్ణంగా కూడి; నన్నున్= నన్ను (జయద్రథుడిని); ఏలికొని= వలచి పరిపాలించి; మనస్+ప్రియ, భోగ+ఏక, యోగ్యవు+అగుము= చిత్తానికి ఇంపైన సౌఖ్యం అనుభవించటానికి తగినదానివి కమ్ము; ఒండు తలఁపున్= వేరొక ఊహను; విడువుము= వదలిపెట్టుము.

తాత్పర్యం: తలిరుటాకులవంటి సౌకుమార్యంతో ఇంపెసలారే శరీరం కల ద్రౌపదీ! నేను సమస్తమైన సింధు సౌవీరరాజ్యాలను ఏలుకొనే మహారాజును; నన్ను నీవు ఏలుకొనుము; మనస్సుకు ఆనందాన్ని చేకూర్చే భోగాలను అన్నింటిని హాయిగా అనుభవించుము. వేరే ఊహ వదలిపెట్టుము.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనినం బాంచాలి ప్రకంపితచిత్త యగుచుఁగొండొక దొలంగి, వానిదెస ననాదరదృష్టిం జూచుచుఁ దనపతుల రాకయ కోరుచుం బ్రతివాక్యంబులఁ గొంతకాలక్షేపంబు సేయుటకై వాని కి ట్లనియె. 167

ప్రతిపదార్థం: అనినన్= అని (జయద్రథుడు) చెప్పగా; పాంచాలి= ద్రౌపది; కొండొక, తొలంగి= ఇంచుక తప్పుకొని; ప్ర, కంపిత, చిత్త+అగుచున్= మిక్కిలి వణకునట్టి మనస్సు కలిగినట్టిదై; వానిదెసన్= ఆ జయద్రథుడివైపు; అనాదర, దృష్టిన్= గౌరవం లేని చూపుతో; చూచుచున్= అరయుచు; తన, పతుల= తన భర్తల; రాక+అ= రావటాన్నిమాత్రమే; కోరుచున్= వాంఛిస్తూ; ప్రతివాక్యంబులన్= సమాధానపూర్వకాలయిన మాటలచేత; కొంత= కొంతమేర; కాలక్షేపంబు+చేయుటకై= కాలంగడపటంకొరకై; వానికిన్ జయద్రథుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: జయద్రథుడిమాటలకు భయపడి ద్రౌపది హృదయం కంపించింది. ఆమె కొంతతొలగి దూరంగా జరిగి నిలబడింది. ఆతడివైపు గౌరవంలేని చూడ్కులు నిగుడించింది. మనస్సులో తన భర్తలు ఎప్పుడు వస్తారా అని ఎదురుతెన్నులు చూడసాగింది. వారు వచ్చేవరకు, సమాధానం చేప్పేమిషతో కొంతసేపు కాలం గడపటానికి సంకల్పించి, ద్రౌపది జయద్రథుడితో ఇట్లా పలికింది.

తే. 'తలఁపఁ బాండవధార్తరాష్ట్రులకుఁ జెలియ । లైన యా దుస్సలకుఁ బతి వనఘ! నీవు;
నాకుఁ దోఁబుట్టువవు గావె? నీకుఁ జనునె । పాడి దప్పిన మాటలు వలుక నిచట? 168

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా!; తలఁపన్= ఆలోచించగా; పాండవ, ధార్తరాష్ట్రులకున్= పాండునందనులకున్నూ, ధృతరాష్ట్రనందనులకున్నూ; చెలియలు= సహోదరి; ఐన= అయినట్టి; ఆ దుస్సలకున్= ఆ దుస్సలకు (దుస్సల ధృతరాష్ట్రుడి కూతురు); నీవు= జయద్రథా! నీవు; పతివి= భర్తవు; నాకున్= నాకు; తోన్+పుట్టువవు+కావె= సహోదరుడవే కావా?; పాడి+తప్పిన= న్యాయాన్ని అతిక్రమించిన మాటలు; ఇచటన్= ఈచోట; పలుకన్= మాటలాడటం; నీకున్; చనునె?= తగునా?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడికూతురు దుస్సల పాండునందనులకున్నూ, ధృతరాష్ట్రుడి కుమారులకున్నూ వరుసనుబట్టి ఆలోచించగా సోదరియే కదా! ఆమెకు నీవు భర్తవు. కాబట్టి నీవు నాకు సహోదరుడవే ఔతావు. ఇప్పుడు ఇక్కడ నీవు ఈ విధంగా న్యాయాన్ని అతిక్రమించిన మాటలు పలకటం తగునా?

క. నయమును ధర్మము గల య । న్వయమున జనియించినాఁడ; వక్కట! ధర్మ
క్రియ యెఱుఁగంగా వలదె? యు । భయలోకవిరుద్ధ మైన పథ మేమిటికిన్?' 169

ప్రతిపదార్థం: నయమును= నీతియున్నూ; ధర్మము= న్యాయమున్నూ; కల= ఉన్న; అన్వయమునన్= వంశంలో; జనియించినాఁడవు= పుట్టావు; అక్కట!= అయ్యో!; ధర్మక్రియ= ధర్మపుతీరు; ఎఱుఁగంగాన్‌వలదె= తెలియవద్దా?; ఉభయ, లోక, విరుద్ధము+ఐన= రెండులోకాలకు వ్యతిరేకం అయిన (ఇహం+పరం= ఉభయలోకాలు); పథము= మార్గం; ఏమిటికిన్= ఎందుకు?

తాత్పర్యం: నీవు నీతి ధర్మం ఉన్న వంశంలో పుట్టినవాడవు. అయ్యో! ధర్మాన్ని ఏవిధంగా అనుష్ఠించవలెనో నీవు తెలిసికొనవద్దా? ఇహపరాలకు వ్యతిరేక మైన ఈ మార్గంలో పోవటం ఎందుకు?'

విశేషం: 1. 'నీతి' - ఈలోకానికి, అంటే ఇహలోకానికి సంబంధించింది. లోకసంగ్రహార్థం ఏర్పడింది నీతి. ఇక - 'ధర్మం' పరలోకానికి, మరణానంతరం జీవుడు వెళ్ళే లోకానికి సంబంధించింది. ఇహపరాలకు - ఉభయలోకాలకు సమన్వయం సాధించటమే మానవజన్మకు పరమార్థం అని మహాభారతసందేశం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అనిన నద్దురాత్ముండు దరస్మితాననుం డగుచు ని ట్లనియె. 170

ప్రతిపదార్థం: అనినన్= ద్రౌపది అట్లా చెప్పగా; ఆ+దుర్+ఆత్ముండు= ఆ చెడుబుద్ధి గలవాడు (సైంధవుడు); దర, స్మిత+ఆననుండు+అగుచున్= చిరునవ్వుతో కూడిన ముఖం కలవాడవుతూ; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని అనగా ఆ దుర్మార్గుడు చిరునవ్వుతో వికసించిన మొగం కలవాడౌతూ ఇట్లా అన్నాడు.

క. 'వనజాక్షి! రాజధర్మము। వినవే యెన్నఁడును మనుజవిభులకుఁ బ్రమదా

జనులయెడ వావి వెదకం। జనదు; వలసినట్ల వేడ్క సలుపఁగఁ జెల్లున్. 171

ప్రతిపదార్థం: వనజ+అక్షి!= పద్మాలవంటి కన్నులు కలదానా- ద్రౌపదీ! రాజధర్మము= ప్రభువుల ధర్మం; వినవే= ఆలకించవా; ఎన్నఁడును= ఎప్పుడును; మనుజవిభులకున్= రాజులకు; ప్రమదాజనుల+ఎడన్= ఆడువారి యెడల; వావి= వరుస; వెదకన్+చనదు= అన్వేషించరాదు; వలసినట్ల= కావలసిన రీతిగా; వేడ్క= వినోదం; సలుపఁగన్= ఆచరించగా; చెల్లున్= తగును.

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు కల ద్రౌపదీ! సాధారణమనుజధర్మం వేరు, రాజధర్మం వేరు సుమా! రాజులకు స్వేచ్ఛ ఉన్నది. రాజులు ఆడువారియెడల బంధుత్వంలోనితారతమ్యాలను వావి వరుసలను అన్వేషించ నవసరం లేదు. అవసరమయిన పట్టులలో యథేచ్ఛగా వినోదం సలుపవచ్చు.

క. విను మదియుఁగాక జగమున। వనితారత్నంబు లెల్లవారికి భోగం

బునయెడ సాధారణము; లొ। కనిధన మని గరుసు గలదె కరినిభగమనా! 172

ప్రతిపదార్థం: కరి, నిభ, గమనా!= ఏనుగుతో సాటి అయిన నడక కలదానా, ద్రౌపదీ!; వినుము= ఆలకించుము; అదియున్+కాక= మఱియును; జగమునన్= లోకంలో; వనితా, రత్నంబులు= అన్నులమిన్నలు; ఎల్లవారికిన్= అందరికిని; భోగంబున+ఎడన్= అనుభవించటంలో; సాధారణములు= అందరికీచెందే వారు; ఒకని ధనము+అని= ప్రత్యేకం ఒకడి సొత్తు అని; గరుసు+కలదె= మర్యాద ఉన్నదా? (లేదు).

తాత్పర్యం: ఏనుగు వలె మందగంభీరంగా నడిచేదానా, ద్రౌపదీ! ఆలకింపుము. ఒకవిశేష విధి ఉన్నది. లోకంలో అన్నులమిన్నలు అందరు అనుభవించదగిన వారలే గాని ప్రత్యేకంగా ఒకరి సొత్తు అని చెప్పరాదు. అసలు ఆడువారు ఒకరికి మాత్రమే చెందిన సొత్తు అనటానికి ఏదైన హద్దు ఉన్నదా? లేదు కదా.'

విశేషం: ఉ.వి. ఆంధ్రమహాభారత సంశోధిత ప్రతిలో 'ఒకని ధనమని గురుతుగలదె' అనే పాఠం స్వీకరించబడింది. పెక్కు ప్రతులలో 'గురుతు'కు బదులు 'గరుసు' అనే పాఠాంతరం ఉన్నట్లు అధస్సూచికలో తెల్పబడింది. గరుసు అంటే మర్యాద. గురుతు అనేపదంలో శకటరేఫం ఉండాలి. అప్పుడా పదానికి ఈ వస్తువు ఫలానివారిది అని తెలిపే ఒక గుర్తు అనే అర్థం ఏర్పడుతుంది. డబ్బు సంచీలకు లక్కగుర్తులు వేసి పేర్లు వ్రాసిపెట్టటం లోకంలో పరిపాటి. అట్లాగే స్త్రీ అనే ధనానికి ప్రత్యేకించి ఫలానివారికి చెందుతుందనే లక్కగుర్తులవంటి, లేదా నామ పత్రాలవంటి భౌతికమైన గుర్తులుంటాయా? అనే భావం ఏర్పడుతుంది. దీనికంటె పెక్కుప్రతులలో ఉన్న 'గరుసు'= మర్యాద - అనే పాఠమే ఔచిత్యవంతంగా ఉంటుందని భావించి ఈ ప్రతిలో పాఠంగా గ్రహించటమైనది. గురుదు, గురుసు- అనే పాఠాంతరాలు కూడా ఉన్నాయి. అన్నిటికంటె 'గరుసు' పాఠం సముచితం (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిననయ్యంగన క్రోధకలుషితాంతరంగయై 'యిప్పాపాత్ముండు ప్రియ వచనంబులం బోవండు; బెట్టిదంబులం గాని చక్కంబడఁ' డని తలంచి యిట్లనియె. 173

ప్రతిపదార్థం: అనినన్= అని (జయద్రథుడు) చెప్పగా; ఆ+అంగన= ద్రౌపది; క్రోధ, కలుషిత+అంతరంగ+ఐ= కోపంచేత కలతచెందిన చిత్తం కలదిఅయి; ఈ+పాప+ఆత్ముండు= ఈ దురాత్ముడు; ప్రియవచనంబులన్= మంచి మాటలతో; పోవండు= పోడు; బెట్టిదంబులన్+కాని= కరకు మాటలతోకాని; చక్కంబడఁడు= దారికిరాడు (సరిపడడు); అని; తలంచి= భావించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: అని జయద్రథుడు పలికాడు. ఆ మాటలు విని ద్రౌపది కోపంచేత కలతపడిన మనస్సు కలదై, 'ఈ దుష్టుడు మంచిమాటలతో దారికి రాడు. ఈతడిపట్ల కఠినత్వం చూపక తప్పదు' అని ఆలోచించి ఈ విధంగా చెప్పింది.

ద్రౌపది సైంధవునితో నిష్ఠురోక్తులు వలుకుట (సం. 3-252-1)

చ. 'ప్రకటితశౌర్యసారుల నభగ్నపరాక్రమ నిర్జితాహిత
ప్రకరులఁ బాండునందనులఁ బాండుయశస్కుల నాత్మలోఁ దలం
పక నను ధిక్కరించెదు నృపాలకులాధమ! నీదుగర్వదు
ర్వికసన మింతఁ బోదు; తుది వ్రేఁగగుఁ; దక్కుము దుష్ప్రలాపముల్. 174

ప్రతిపదార్థం: నృపాల, కుల+అధమ!= రాజుల వంశంలో పుట్టిన నీచుడా, ఓ జయద్రథా!; ప్రకటితశౌర్యసారులన్= వెల్లడిచేయబడిన పరాక్రమం యొక్క నిగ్గు కలవారిని అనగా తమపరాక్రమాలను ఋజువు చేసికొన్నవారిని; అభగ్నపరాక్రమ, నిర్జిత+అహిత, ప్రకరులన్= మొక్కవోని (తమ) శౌర్యంచేత జయించబడిన శత్రుసమూహాలు కలవారిని; పాండు యశస్కులన్= తెల్లని కీర్తి కలవారిని; పాండు నందనులన్= పాండురాజు కొడుకులను; ఆత్మలోన్= మనస్సులో; తలంపక= స్మరించక; ననున్= నన్ను; ధిక్కరించెదు= అవమానిస్తున్నావు; నీదు= నీయొక్క; గర్వదుర్వికసనము= నీ అహంకారపు చెడువిజృంభణం; ఇంతన్= ఇంతటితో; పోదు= ఆగదు. తుదిన్= చివరకు; వ్రేఁగు+అగున్= భరింపజాలనిది ఔతుంది, దుష్ఫలితాన్ని ఇస్తుంది; దుష్ప్రలాపముల్= చెడ్డవైనవి అహంకార పూరితాలైనవి అయిన మాటలు; తక్కుము= మానుము.

తాత్పర్యం: రాజులవంశంలో జన్మించిన ఓ నీచుడా, జయద్రథా! పాండవులు గొప్పపరాక్రమవంతు లైన సంగతి ప్రపంచానికి ఈవరకే ఋజువైన విషయం. మొక్కవోని శౌర్యంతో పాండవులు శత్రుసమూహాలను నిర్జించి ఉన్నారు. నిష్కళంకయశస్సును ఆర్జించిన పాండవులను లెక్కచేయక నీవు నన్ను అవమానిస్తున్నావు. ఇక నీ అహంకార పూరిత మైన ప్రేలాపన కట్టిపెట్టుము. ఇంతటితో ఆగకపోతే చివరకు నీవు దుర్భరమైన ఫలితాన్ని చవిచూడవలసి వస్తుంది.

మ. హిమవత్పాదవనాంతకేళిరతిమై నేపారి కోపారుణ
క్రమనేత్రాంచలమై ప్రభూతమదరేఖం బైన గంధద్విపేం
ద్రము డాయం జని సిల్లు సూపుట సుమీ ధర్మాత్ము నత్యుగ్రవి
క్రముఁ గౌంతేయవరిష్ఠు నీవు దొడరంగాఁ జూచు టూహింపఁగన్. 175

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధర్మ+ఆత్మున్= ధర్మాన్ని ఆచరించేవాడిని; అతి+ఉగ్ర, విక్రమున్= మిక్కిలి భయంకర మైన శౌర్యం కలవాడిని; కౌంతేయ వరిష్ఠున్= కుంతీకుమారులలో శ్రేష్ఠుడిని- ధర్మరాజును; నీవు= నీవు; తొడరంగాన్+చూచుట= ఎదిరించ తలపోయటం; ఊహింపఁగన్= ఆలోచించగా; హిమవత్+పాద, వన+అంత, కేళి, రతిమైన్= హిమాలయాల అడుగుల సమీపంలో కల అరణ్యంమధ్య వినోద విహారంలో నిమగ్నమై; ఏపారి= అతిశయించి; కోప+అరుణ, నేత్ర+అంచలము+ఐ= క్రోధం వలన ఎర్రవారిన కనుగొలకులు కలది అయి; ప్రభూత, మద రేఖంబు+ఐన= అధికమైన గర్వచ్ఛాయ కలది అయిన; గంధద్విప+ఇంద్రమున్= మదించిన గొప్ప ఏనుగును; డాయన్+చని= సమీపించి; సిళ్ల+చూపుట, సుమీ= ఏనుగును పొడిచే అంకుశాన్ని ప్రదర్శించటం సుమా.

తాత్పర్యం: హిమాలయపర్వతసానువులందు మధ్యగా ఉన్న అరణ్యాలలో వినోదిస్తూ, క్రోధంచేత ఎర్రనైన కనుచూపులతో విహరించే మత్తేభాన్ని సమీపించి, అంకుశం చూపించటం ఎటువంటిదో, కుంతీకుమారులలో శ్రేష్ఠుడు, ధర్మాత్ముడు, మిక్కిలి భయంకర మైన పరాక్రమం కలిగినవాడైన యుధిష్ఠిరుడిని నీవు ఎదిరంచబూనటం అటువంటిదే సుమా! జాగ్రత్త.

విశేషం: మదించిన ఏనుగును సమీపించి ఎవరైనా అంకుశాన్ని చూపితే అది అతడిని వధిస్తుంది. అట్లాగే జయద్రథుడు ద్రౌపదిని కోరి ధర్మజుడితో వైరం కొని తెచ్చుకొన్నట్లే. అంకుశాన్ని సహించని మదేభంవలెనే ధర్మరాజు తన నవమానించే జయద్రథుడిని బ్రతుకనీయడని ఇందులో హెచ్చరిక. పాండవులలో ఒక్కొక్కరిని ఒక్కొక్క బలిష్ఠమైన వనజంతువుతో పోల్చి చెప్పటం ఇందులోని అలంకార సార్థక్యం. అలం: రూపకం.

ఉ. శాతనఖాగ్రఖండిత లసన్మదకుంజర కుంభముక్త ము
క్తాతతశైలకందర గుహాంతర సుప్త మృగేంద్రకేసర
వ్రాతము వేడ్క నూఁచికొన వారక చేరుటగాదె క్రోధని
ర్ఘాతమహోగ్రు భీముఁ జెనకం దలపోయుట నీకు నెమ్మెయిన్. 176

ప్రతిపదార్థం: నీకున్= నీకు (ఓజయద్రథా! నీకు); ఏ+మెయిన్= ఏ విధంగా అయినను; క్రోధ, నిర్ఘాత, మహా+ఉగ్రున్= కోపముచే పిడుగులపాటువలె మిక్కిలి భయంకరుడు అయిన; భీమున్= భీముడిని; చెనకన్= ఎదిరించటానికి; తలపోయుట= ఆలోచించటం; శాత, నఖ+అగ్ర; ఖండిత, లసత్+మద, కుంజర, కుంభ, ముక్త, ముక్తా+ఆతత, శైల, కందర, గుహా+అంతర, సుప్త, మృగ+ఇంద్ర, కేసర, వ్రాతమున్= వాడియైన గోళ్లకొనల భాగాలచేత ముక్కలు చేయబడినవై ప్రకాశించే మదపుటేనుగుల కుంభస్థలాలనుండి జారిన ముత్యాలచేత విరివి అయిన కొండకనుమలలోని గుహలమధ్యలో నిద్రించే సింహంయొక్క జూలులోని వెండ్రుకలగుంపును; వేడ్కన్= వినోదం కొరకు; ఊఁచికొనన్= ఊగించటానికి; వారక= ఆగక; చేరుట+కాదె= చొరబడటంకాదా.

తాత్పర్యం: ఓ జయద్రథా! నీవు భీమసేనుడిని ఎదిరించబూనటం ఏవిధంగా చూచినా కూడని పని. కోపంతో వాడిఅయిన గోళ్లకొనలతో మదించిన ఏనుగుల కుంభస్థలాలనుండి వెలువడిన ముత్యాలతో విరివి అయిన కొండకనులమధ్య నున్న గుహలలో నిదురించే సింహంయొక్క జూలులోని వెంట్రుకలను పట్టి ఊగించటానికి చేసే సాహసంవంటిదే సుమా. జాగ్రత్త. కాబట్టి ఇట్టి సాహసానికి ఒడిగట్టకు. నీకు చేటు మూడుతుంది.

విశేషం: ధర్మరాజును మదేభమని చెప్పి భీమసేనుడిని సింహమని పేర్కొనటం విశేషం. నిద్రిస్తున్న సింహం జూలును వినోదంకోసం లాగినా అది ప్రాణాంతకమే అవుతుంది. ద్రౌపదిని కోరటం భీమసింహపుజూలును లాగటంవంటిది. మదేభకుంభస్థలాలను బ్రద్దలు చేసిన భీమసింహానికి జూలులాగే (ఎలుకవంటి బలహీనుల) ప్రయత్నం కోపకారణ మౌతుందని హెచ్చిరిక. అలం. రూపకం

మ. **చలజిహ్వాగ్రవిలీఢవిస్ఫురిత దంష్ట్రాభీషణం బైన బె**
బ్బులిఁ గోలం గొని వ్రేసి త్రోసి తొలఁగం బోవచ్చినన్ వచ్చుఁ గా
క లసత్క్రూరశరాగ్నిదుస్సహుని నగ్గాండీవి నల్గించి యె
వ్వలనన్ మానధనాఢ్యులై బ్రతికిపోవన్ వచ్చునే యేరికిన్. **177**

ప్రతిపదార్థం: చల, జిహ్వా+అగ్ర, విలీఢ, విస్ఫురిత, దంష్ట్రా+భీషణంబు+ఐన= కదలే నాలుకకొనచేత నాకబడుతూ బాగా కనిపించే కోరపండ్లచేత భయంకరమైన; బెబ్బులిన్= పెద్దపులిని; కోలన్+కొని= కఱ్ఱ చేత బూని; వ్రేసి= కొట్టి; త్రోసి= నెట్టి; తొలఁగన్= ప్రక్కకు తప్పుకొని; పోవచ్చినన్+వచ్చున్+కాక= వెడలి పోవచ్చు నేమో కాని; లసత్+క్రూర, శర+అగ్ని, దుః +సహునిన్= నొప్పించేవి అయిన బాణాలనే నిప్పులు విరజిమ్మటంచేత భరించలేని వాడిని; ఆ+గాండీవిన్= గాండీవం అనే విల్లు ధరించే అర్జునుడిని; అల్గించి= కోపించేటట్లు చేసి; ఏ+వలనన్= ఏరీతిగా నైనను; ఏరికిన్= ఎవరికైనను; మానధన+ఆఢ్యులు+ ఐ= మానం అనే ధనం కలవారై, చిత్తౌన్నత్యం కలవారై; బ్రతికి= జీవించి; పోవన్+వచ్చునే= పోవటానికి వీలు కలదా? (బ్రదికి తప్పించుకొని పోవటానికి వీలులేదు).

తాత్పర్యం: గాండీవం అనే గొప్ప విల్లును ధరించే వాడు అర్జునుడు. అతడికి కోపం తెప్పించేవారు చావు తప్పించుకొని బ్రదికి బట్టకట్టటం సాధ్యంకాదు. నాలుక కొన కదుపుచు నోరు తెరచి కోరపళ్ళతో భయంకరంగా మీదికి ఉరికే పెద్దపులిని చేతికఱ్ఱతో కొట్టి ప్రక్కకు నెట్టి; తప్పించుకొని పోవచ్చునేమో కాని క్రూరమైన బాణాలనే అగ్ని గుప్పించే అర్జునుడిబారినుండి ఎవరు తప్పించుకొని పోగలరు? మాన ప్రాణాలను ఎవరు రక్షించుకోగలరు?

విశేషం: అర్జునుడిని బెబ్బులితో పోల్చటం సార్థకం. అవమానిస్తే పగపట్టి ప్రాణం తీసే క్రూరమృగం బెబ్బులి. ద్రౌపదిని కామించి అర్జునుడి బారి నుండి తప్పించుకొనటం జయద్రథునికి అసాధ్యమని ఇందులో హెచ్చరిక!

ఉ. **బోరన విస్ఫులింగములు వొడ్మఁగ నుగ్రవిషంబు గ్రక్కుచుం**
గ్రూరవిచేష్టనాలుకలు గ్రోయు మహోరగరాజయుగ్మముం
జేరి పదాహతిం గినియఁ జేయఁ దలంచుట గా నెఱుంగు దు
ర్వారులు మాద్రిపుత్త్రుల కవజ్ఞ యొనర్పఁ దలంచు టేర్పడన్. **178**

ప్రతిపదార్థం: దుర్వారులు= అడ్డగించటానికి సాధ్యంకానివారు; అగు మాద్రి పుత్త్రులకున్= మాద్రికొడుకులకు, (నకులసహదేవులకు); అవజ్ఞ= అవమానం; ఒనర్పన్= చేయటానికి; తలంచుట= ఆలోచించటం; బోరనన్= శీఘ్రంగా; విస్ఫులింగములు= నిప్పురవ్వలు; పొడ్మఁగన్= పుట్టగా; ఉగ్ర, విషంబు= భయంకర మైన గరళాన్ని; క్రక్కుచున్= బయటికి వదులుతూ; క్రూర, విచేష్టన్= నొప్పిజేసే వ్యాపారంచేత; నాలుకలు= జిహ్వలు; క్రోయు= విషమంగా చాచు; మహా+ఉరగ, రాజ, యుగ్మమున్= మిక్కిలి గొప్ప వైన పాములజంటను; చేరి= సమీపించి; పద+ఆహతిన్= పదాల తాకిడిచేత; కినియన్+చేయన్= కోపగింప చేయాలని; తలంచుట+కాన్= ఆలోచించటంవలె; ఏర్పడన్= సుస్పష్టంగా; ఎఱుంగు= తెలిసికొనుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వారించశక్యంగాని పరాక్రమం కలిగిన నకులసహదేవులకు అవమానం చేయటానికి ఆలోచించటం ఎటువంటిదో సుస్పష్టంగా తెలిసికొనుము. శీఘ్రంగా అగ్నికణాలను వ్యాపింపజేస్తూ భయంకరమైన గరళాన్ని క్రక్కుతూ కాటువేయటానికై నాలుకలు చాస్తూ మీదకు ఉరికే గొప్పపాములజంటను పాదాలతో త్రొక్కి కోపింపచేయటం వంటిదే. జాగ్రత్త సుమా.

విశేషం: నకుల సహదేవులు కవలలు కాబట్టి భయంకర విషసర్పాలజంటగా పోల్చటం సార్థకం. అలం: ఉపమ.

ఉ. **ఆలములోన వీఁక నమరాసురకోటికి నైన దుర్జయుల్**
వాలినవీరు లవ్విభులు; వారికి నెగ్గొనరించి పోయి పా
తాళము సొచ్చి డాఁగినను దప్పదు మృత్యువు నీకు నక్కటా!
కాలము నిండె; నీవశము గాదు విధాతృని చెయ్వి త్రోవఁగన్. **179**

ప్రతిపదార్థం: ఆ+విభులు= ఆ రాజులు- పాండవులు; ఆలములోనన్= యుద్ధంలో; వీఁకన్= పరాక్రమంలో; అమర+అసుర, కోటికిన్+ఐనన్= దేవతల, రాక్షసుల సమూహాలకైనా; దుర్జయుల్= జయింప శక్యం కానివారు; వాలిన, వీరులు= గడిదేరిన పరాక్రమం కలవారు; వారికిన్= వారలకు (ఆ పాండవులకు); ఎగ్గు+ఒనరించి= కీడు చేసి; పోయి= వెడలి; పాతాళము+చొచ్చి= భూమికి క్రిందనున్న లోకం చేరి; డాఁగినను= దాగినప్పటికి; మృత్యువు= మరణం; తప్పదు; అక్కటా!= అయ్యో! ఎంత చేటు వచ్చింది; నీకున్= నీకు (ఓ జయద్రథా); కాలము నిండెన్= ఆయువు తీరింది; విధాతృనిచెయ్వి= బ్రహ్మదేవుడి చేష్ట; త్రోవఁగన్= తప్పించగా; నీవశము+కాదు= నీకు సాధ్యం కాదు.

తాత్పర్యం: ఓ జయద్రథా! నీకు ఆయువు తీరింది. నీకింక చావు తప్పదు. ఈ విధివిపరిపాకాన్ని తప్పించుకొనటం నీకు సాధ్యంకాదు. నీవు పాతాళలోకంలో చేరి దాగినా నీవు మరణించటం తథ్యం. యుద్ధంలో పరాక్రమంలో పాండవులు రాక్షసులకు కాని, వేల్పులకు కాని జయించ నలవిగాని గొప్పవీరులు. వారికి కీడు తలపెట్టటం అవివేకం. జాగ్రత్త.

క. **తేలును గర్కటియును దెగు । కాలమునకుఁ జూలుదాల్చుగతిఁ బార్థుల యి**
ల్లాల నయిన నాదెస దు । శ్శీలుఁడవై తిది వినాశచిహ్నము గాదే!' **180**

ప్రతిపదార్థం: తేలును= వృశ్చికమున్నూ; కర్కటియును= ఎండ్రియున్నూ; తెగు, కాలమునకున్= చనిపోయే సమయానికి; చూలు= గర్భం; తాల్చు= ధరించే; గతిన్= రీతిగా; పార్థుల+ఇల్లాలన్+అయిన= పాండవుల భార్యను అయిన; నాదెసన్= నాయెడ; దుశ్శీలుఁడవు= చెడు నడవడిక కలవాడవు; ఐతి(వి)= అయినావు; ఇది= ఇది (నాయెడ చెడునడవడిక కలవాడవు కావటం); వినాశ, చిహ్నము= నాశనాన్ని దెలిపేగుర్తు; కాదే?= కాదా?

తాత్పర్యం: తేలు, ఎండ్రి, ఆయువు తీరిన సమయాననే గర్భం ధరిస్తాయి. ఆ రీతిగా నీకు ఆయువు ముగిసే కాలం దాపురించటం చేతనే పాండవుల ధర్మపత్నినైన నాయెడ చెడుస్వభావం ప్రదర్శించావు. ఇది నీ వినాశ కాలానికి చిహ్నం.'

విశేషం: 1. అలం: ఉపమ. 2. తేలు, ఎండ్రి గర్భము ధరించి చూలునిండిన పిమ్మట పిల్లలు తల్లి దేహాన్ని చీల్చి బయటకు వస్తాయి. మహాభారతం జీవశాస్త్రవిషయమై ప్రదర్శించిన నిశితదృష్టికి ఈపద్యం నిదర్శనప్రాయం.

వ. అనిన జయద్రథుండు నవ్వుచు నవ్వేలంది కి ట్లనియె. 181

తాత్పర్యం: అనగా, సైంధవుడు నవ్వుతూ ద్రౌపదితో ఇట్లా అన్నాడు.

ఉ. 'వారిజనేత్ర! పాండుసుతవర్గము నేఁ డిఁట మాకు వింతయే?
భీరులఁ బోలె నేల వెఱపించెదు మాటల మమ్ము? వింటె! సౌ
వీరకులప్రసూతులము వీరుల మే; మితర క్షితీశ సా
ధారణబుద్ధి సేయకు ముదాత్తచరిత్రుల మైన మాదెసన్. 182

ప్రతిపదార్థం: వారిజనేత్ర!= పద్మాలవంటి కన్నులు కలదానా ద్రౌపదీ!; పాండు, సుత, వర్గము= పాండురాజు కొడుకుల సముదాయం; నేఁడు= ఈరోజున; ఇట= ఇచ్చట; మాకున్; వింత+ఏ= అచ్చెరువు గాదు సుమా; మమ్మున్= మమ్మల్ని; భీరులన్+పోలెన్= పిరికివారిని వలె; మాటలన్= వట్టి బడాయి మాటలతో; ఏల= ఎందుకు; వెఱపించెదు= భయపెట్టుతున్నావు; వింటె= ఆలకింపుము; సౌవీరకుల ప్రసూతులము= సౌవీరులవంశంలో జన్మించిన వారలం; ఏము, వీరులము= మేం పరాక్రమవంతులం; ఉదాత్త చరిత్రులము+ఐన= గొప్ప స్వభావం కలవారము అయిన; మా+దెసన్= మాపట్ల; ఇతర, క్షితి+ఈశ, సాధారణబుద్ధి+చేయకుము= పెర రాజులతో సామ్యాన్ని తెచ్చే ఆలోచన చేయకుము.

తాత్పర్యం: 'ఓ ద్రౌపదీ! పద్మాలవంటి కన్నులుగల సుందరీ! పాండవుల సంగతి మాకు చిరకాలంనుండి బాగా తెలుసు. ఇప్పుడు ఇచట నీవు వారి పరాక్రమాతిశయాలనుగూర్చి అతిశయోక్తులతో అభివర్ణించి మమ్మ్ము భయపెట్ట నవసరం లేదు. మేము పిరికిపందలం కాము. సౌవీరులవంశంలో జన్మించిన పరాక్రమవంతులం. ఇతరరాజులవంటి వారముకాము సుమా! గొప్ప స్వభావం కల మమ్ము సామాన్యుల సాటిగా ఎంచకుము.

వ. వలవని మాటలం దేర్చినం దీరదు; వేగంబ యల్ల కనకరథం బొండె నల్లమహాగజంబు నొండె నెక్కుము; బీరంపుమాట లాడక ప్రియవచనంబుల నస్మత్ప్రసాదభాజనంబ వగు' మనిన విని యాజ్ఞసేని వాని కిట్లనియె. 183

ప్రతిపదార్థం: వలవనిమాటలన్= అనవసర మయిన పలుకులతో; తేర్చినన్= ఊరడిస్తే; తీరదు= చక్కబడదు; వేగంబు+అ= శీఘ్రమే; అల్ల= అదుగో దగ్గరగా ఉన్న; కనకరథంబు+ఒండెన్= పసిడితేరు కాని; అల్ల= అదుగో దగ్గరగా ఉన్న; మహా, గజంబున్,+ఒండెన్= గొప్ప ఏనుగును కాని; ఎక్కుము; బీరంపు మాటలు+ఆడక= ఆత్మప్రశంసలతో కూడిన మాటలు పలుకక; ప్రియవచనంబులన్= మంచి మాటలతో; అస్మత్+ప్రసాద, భాజనంబవు+అగుము= నా అనుగ్రహానికి యోగ్యమైనదానవు కమ్ము; అనినన్= అని జయద్రథుఁడు చెప్పగా; విని= ఆలకించి; యాజ్ఞసేని= ద్రౌపది; వానికిన్= జయద్రథుడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పింది.

తాత్పర్యం: 'అనవసరమైన మాటలు మాట్లాడి ఊరడింపచూస్తే ఇది చక్కబడే పని కాదు. అదుగో అది నా పసిడితేరు. వేగమే దానిని ఎక్కుము. లేదా అల్లదిగో ఆ గొప్పయేనుగు కన్పిస్తున్నదికదా. దానిని ఎక్కుము. ఆత్మప్రశంసలు మానుము. మంచిమాటలతో నా అనుగ్రహానికి పాత్రురాలవు కమ్ము' అని జయద్రథుడు పలికిన ఆమాటలు విని ద్రౌపది ఇట్లా బదులు పలికింది.

ఆ. 'వీరపత్ని నయ్యు వీరసహోదరి । నయ్యు నీకుఁ జూడ ననదవోలె
నున్నదాన; నెట్టు లున్నను నాకు నిన్ । దెలుప నేల పలుకు తియ్యు మేల? 184

ప్రతిపదార్థం: వీరపత్నిన్+అయ్యున్= పరాక్రమవంతుల భార్యను అయినా; వీరసహోదరిన్+అయ్యున్= వీరులయొక్క చెల్లెలిని అయినప్పటికిన్నీ; నీకున్= నీకు (ఓ సైంధవా నీకు); చూడన్= చూడగా; అనద+పోలెన్= దీనురాలివలె; ఉన్నదానన్= ఉన్నాను; ఎట్టులు+ఉన్నను= ఏవిధంగా నీకు కనిపిస్తున్నప్పటికి; నాకున్= నాకు; నిన్+తెలుపన్+ఏల= నావిషయాన్ని నీకు నచ్చేటట్లుగా తెలుపటం ఎందుకు; పలుకుతియ్యము+ఏల= నీతో ప్రియవచనాలు పలకటమెందుకు?

తాత్పర్యం: 'ఓజయద్రథా! నేను వీరులయొక్క ధర్మపత్నిని. వీరుల ఇంటి ఆడపడుచును. నీదృష్టిలో నేను దీనురాలినిగా కన్పించవచ్చును. నీకు నేను ఏ విధంగానైనా కనిపించవచ్చును. నీకు బోధించవలసిన అవసరం నాకు లేదు. నీతో ప్రియముగా నేను పలకవలసింది లేదు.

చ. **అతులితవృష్ణి కేకయబలావళితోఁ బటుశంఖఘోష భీ**
షితభువనత్రయుం డగుచు శీఘ్రతురంగరథాధిరూఢుఁ డై
జితదనుజాన్వయుండు యదుసింహుఁడు వెన్నుఁడు ముట్టి నిన్ బరి
క్షతబలుఁ జేయు నాకు దెసగల్గు టెఱింగెదు గాక యత్తఱిన్. **185**

ప్రతిపదార్థం: అ, తులిత, వృష్ణి, కేకయ, బల+ఆవళితోన్= సాటిలేనట్టి వృష్ణుల, కేకయుల సేనల సమూహాలతో; పటు, శంఖ, ఘోష, భీషిత, భువన, త్రయుండు+అగుచున్= గొప్పదగు పాంచజన్యమనేశంఖ నాదాలచేత వెరగొందే టట్లు చేయబడిన మూడులోకాలు కలవాడు ఔతూ; శీఘ్ర, తురంగ, రథ+అధిరూఢుఁడు+ఐ= వేగంగా పరుగెత్తగల గుఱ్ఱాలను పూన్చిన తేరుకలవాడు ఔతూ; జిత, దనుజ+అన్వయుండు= జయించబడిన రాక్షసవంశం కలవాడు; యదు, సింహుఁడు= యదువులలో సింహంవంటివాడు; వెన్నుఁడు= శ్రీకృష్ణుడు; నిన్= నిన్ను; ముట్టి= తాకి; పరిక్షతబలున్+చేయున్= బాగా క్షీణించిన శక్తి కలవాడినిగా ఒనర్చును; ఆ+తఱిన్= ఆ తరుణంలో; నాకున్; దెస= దిక్కు; కల్గుట= ఉండటం; ఎఱింగెదు గాక= తెలిసికొంటావు సుమా!.

తాత్పర్యం: సైంధవా! యదుసింహుడైన శ్రీకృష్ణుడు నా సహోదరుడు. సాటిలేని వృష్ణికేకయ సేనాసముహంతో, పాంచజన్యమనే తన శంఖధ్వనికి ముల్లోకాలు దద్దరిల్లగా వడిగల గుఱ్ఱాలు పూన్చిన రథమెక్కవస్తారు. రాక్షసకుల విధ్వంసకుడైన మా అన్న నిన్నెదిర్చి నీబలపౌరుషాలను నిర్మూలించినప్పుడుగాని నాకు దిక్కున్నదో లేదో తెలియ గలదు.

విశేషం: 1. సైంధవుడిని జయించటానికి పాండవులు చాలరా? ద్రౌపది శ్రీకృష్ణుడిని గూర్చి ఇక్కడ ప్రసంగించటం. ఎందుకు? అనే ప్రశ్న రావచ్చును. ద్రౌపది - పాండవులు వచ్చేవరకు ఏదో మాటలాడి కొంత కాలక్షేపం చేయవలసి ఉన్నది. ఈ విషయం 167 సంఖ్యగల గద్యంలో ద్రౌపదియే స్పష్టంగా వివరించి ఉన్నది. కాలక్షేప వాక్యాలలో కూడా పాండవులకు శ్రీకృష్ణుడి అండదండలున్నవన్న వాస్తవాన్ని చెప్పి సైంధవుడిని బెదిరించి అతని దుష్ప్రవర్తనను మాన్పటానికి ద్రౌపది యత్నించింది.

సీ. **గాండీవరేఖ యాఖండలు చాపంబు । కరణిగాఁ, దద్గుణక్వణము ఘోర**
గర్జగా, నవిరళగంభీరవీరర । సాపూర్ణమై సంతతావలిప్త
శత్రుప్రతాపోష్ణ సమయంబు శమితంబు । గా, మిత్రబర్హికేకారవంబు
లెసఁగంగఁ దోఁతెంచి యింద్రనందన మహా । జలధరం బాయతసాయకోరు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. **వృష్టి ముంచుటయును వెరఁగంది నిలువంగ । నలవిగాక పఱచు నప్పు డైన**
నాత్మదోషవృత్తికై మనంబున వగ । చెదవు గాక! యిపుడు సెప్ప నేల? **186**

ప్రతిపదార్థం: గాండీవ, రేఖ= గాండీవం రూపురేక; అఖండలు, చాపంబు, కరణి+కాన్= ఇంద్రధనుస్సు మాదిరిగా ఏర్పడగా; తత్+గుణ, క్వణము= ఆ గాండీవంయొక్క అల్లెత్రాడు మ్రోగించగా విన్పించే నాదం; ఘోరగర్జగాన్= భయంకరమైన (మేఘ) గర్జనగా; అవిరళ, గంభీర, వీర, రస+ఆపూర్ణము+ఐ= ఎడతెగనిది, లోతైనది అయిన శౌర్యం అనెడి నీటితో నిండింది అయి; సంతత+అవలిప్త, శత్రు, ప్రతాప+ఉష్ణ, సమయంబు= ఎల్లప్పుడును గర్వించిన శత్రువులయొక్క పరాక్రమం అనెడి వేడిప్రొద్దు; శమితంబు+కాన్= తగ్గిపోవగా; మిత్ర, బర్హి, కేకా+ఆరవంబులు= స్నేహితులు అనే నెమిళ్ళయొక్క కూతల సవ్వడులు; ఎసఁగంగన్= అతిశయించగా; తోఁతెంచి= సాక్షాత్కరించి; ఇంద్ర, నందన, మహా, జలధరంబు= ఇంద్రనందనుడు (అర్జునుడు) అనే గొప్పమేఘం; ఆయత, సాయక+ఉరు, వృష్టి= ఎడతెగని బాణాలు అనే గొప్పవానలో; ముంచుటయును= మునిగేటట్లుగా తడపటంచేత; వెరఁగు+అంది= భీతిల్లి; నిలువంగన్= నిలబడటానికి; అలవి+కాక= శక్యం కాక; పఱచునప్పుడు= పారిపోయేటప్పుడు; ఐనన్= అయినను; ఆత్మ, దోష, వృత్తికిన్+ఐ= జరిగిన నీ తప్పుల కొరకై; మనంబునన్= చిత్తంలో; వగచెదవు+కాక= దుఃఖించగలవుసుమా; ఇపుడు= ఈసమయంలో; చెప్పన్+ఏల= చెప్పటం ఎందుకు?

తాత్పర్యం: నీవు చేసిన తప్పులకు నీవు పశ్చాత్తాపం చెందే తరుణం శీఘ్రంగా సమీపిస్తున్నది. ఇప్పుడే నేను నీకు చెప్పటం అనవసరం. చూడు. అర్జునుడు వేగంగా రాగలడు. అతడి ధనువైన - గాండీవం ఇంద్రధనుస్సువలె భాసించగలదు. గాండీవము యొక్క అల్లెత్రాటిమ్రోత మేఘగర్జనవలె విస్తరించగలదు. శత్రువుల ప్రతాపమనే ఎండ వేడి చల్లారగలదు. అర్జునుడు అనే మేఘం వాడిబాణపరంపరలు అనే వర్షాన్ని వర్షించగలదు. స్నేహితులనే నెమిళ్లు అపుడు సంతసిల్లి కేకలు వేస్తాయి. అట్టి అర్జునుడి బాణవర్షపాతంలో మునిగి ఉక్కిరిబిక్కిరై నీవు ప్రాణభయంతో పారిపోతావు సుమా!

విశేషం: అలం: రూపకం. ఉపమేయ ఉపమానాల వరుస- అర్జునుడు - మేఘం; గాండీవం- ఇంద్రధనుస్సు; అల్లెత్రాటిమ్రోత - మేఘగర్జన; బాణపరంపర - వర్షధార. ఇట సంపూర్ణంగా ఉపమానోపమేయాలకు అభేదాధ్యవసాయం సిద్ధించింది.

ఉ. **ఘోరగదావిదారణ విఘూర్ణితశాత్రవకుంభికుంభముల్**
చీరుచు మౌక్తికంపుతతిచే రణభూమి నలంకరించు కే
లీరసలోలుఁ డై సమదలీల బకాంతకుఁ డేఁగుదేరఁ గ
న్నారఁగఁ జూచి కాక యిటు లంతకు నీమది త్రుళ్ళడంగునే? **187**

ప్రతిపదార్థం: ఘోర, గదా, విదారణ, విఘూర్ణిత శాత్రవ కుంభికుంభముల్= భయంకరమైన గదచేత తాడింపబడి తలక్రిందులుగా త్రెళ్లినవైన శత్రువులకు చెందిన ఏనుగులతలకట్లు; చీరుచున్= చీలికలు చేస్తూ; మౌక్తికంపుతతిచేన్= ముత్యాల సముదాయంతో; రణభూమిన్= యుద్ధరంగాన్ని; అలంకరించు= సింగారించు; కేళీరసలోలుఁడు+ఐ= వినోదార్థం తన్మయత్వం చెందినవాడై; సమదలీలన్= గర్వ విలాసంతో; బక+అంతకుఁడు= బకుడు అనే రాక్షసుడిని సంహరించినవాడు, భీమసేనుడు; ఏఁగుదేరన్= రాగా; కన్ను+ఆరఁగన్= కన్నులు వికసించేటట్లుగా; చూచి+కాక= కాంచినప్పుడు గాని; ఇటులు= ఈరీతిగా; అంతకున్= అంతవరకు; నీమదిత్రుళ్లు= నీచిత్తము యొక్క మిడిసిపాటు; అడంగునే= అణగునా; అణగదు.

తాత్పర్యం: భీమసేనుడు రావటం కన్నులార చూచినప్పుడుగాని నీ చిత్తంలోని మిడిసిపాటు తగ్గదు. భీమసేనుడి పరాక్రమం ఎట్టిదో నీకు తెలియునా? భయంకరమైన గదతో అతడు శత్రువుల మత్తేభయూధాల కుంభస్థలాలను బ్రద్దలు కొట్టి, అందుండి జారిన ముత్యాలచేత రణరంగాన్ని సింగారించగలడు.

విశేషం: 1. ముత్యాలతో ముగ్గులు పెట్టటం ఆగర్భశ్రీమంతుల అలంకార విశేషం. 2. ముత్యాలు లభించే స్థలాలు 1. సముద్రం 2. వెదురుబొంగులు 3. ఏనుగు కుంభస్థలాలు. ఏనుగు కుంభస్థలాలు చీలినపుడు ముత్యాలు రాలటం కవిసమయం.

క. ననుఁ బెఱవనితల చందం । బున నవమానింప నీకుఁ బోలదు మత్పా
వనపాతివ్రత్యమహిమ । ననిశము నేకీడు నెందు నందదు నన్నున్.' 188

ప్రతిపదార్థం: ననున్= నన్ను; పెఱ, వనితల, చందంబునన్= ఇతర స్త్రీలమాదిరిగా; అవమానింపన్= అగౌరవానికి లోనుచేయగా; నీకున్= ఓజయద్రథా నీకు; పోలదు= తగదు; మత్+పావన, పాతివ్రత్య, మహిమన్= నాయొక్కపవిత్రమైన పాతివ్రత్యంయొక్క గొప్పతనంవలన; నన్నున్= నన్ను; అనిశమున్= ఎల్లప్పుడును; ఏకీడున్= ఎట్టిముప్పును; ఎందున్= ఎచటను; అందదు= చెందదు.

తాత్పర్యం: ఇతర వనితలవలె నీవు నన్ను అవమానించటానికి వీలులేదు. పరమపవిత్ర మైన నా పాతివ్రత్యమహిమ నన్ను ఎల్లప్పుడును కాపాడగలదు'.

వ. అని పలికి ద్రౌపది యద్దురాత్ముండు దన్నుఁ బట్ట సమకట్టు క న్నెఱింగి తమపురోహితు ధౌమ్యునిం బేర్కొని యాక్రోశించిన, నతం డతిరయంబునఁ జనుదెంచు నాలోన. 189

ప్రతిపదార్థం: అని పలికి= అని వచించి; ద్రౌపది= పాంచాలి; ఆ+దురాత్ముండు= ఆ దుష్టమైన ఆత్మ కలవాడు (సైంధవుడు); తన్నున్= తనను (దౌపదిని); పట్టన్= బంధింప; సమకట్టు= పూనుకొనే; కన్ను+ఎఱింగి= జాడ తెలిసికొని; తమపురోహితున్= తమయొక్క వైదికవిప్రుడిని; ధౌమ్యునిన్= ధౌమ్యుడిని; పేర్కొని= పేరెత్తి పిలిచి; ఆక్రోశించినన్= బిగ్గరగా ఏడ్చిన; అతండు= ధౌమ్యుడు; అతి, రయంబునన్= మిక్కుటమైన వేగంతో; చనుదెంచు= వచ్చే; అలోనన్= లోపలనే.

తాత్పర్యం: అని చెప్పింది ద్రౌపది. కాని, దురాత్ము డైన సైంధవుడిచూపులో ఆతడు తనను బలాత్కరించటానికి సిద్ధంగా ఉన్నట్లు గ్రహించి, ఆమె తమపురోహితుడైన ధౌమ్యుడిని పేరెత్తి పిలిచి బిగ్గరగా ఏడ్వటం మొదలు పెట్టింది. ధౌమ్యుడు ద్రౌపది ఆర్తనాదం విని మిక్కిలి వేగంతో పరుగెత్తుకొని రాసాగాడు. కాని ఆతడు వచ్చేటంతలోనే.

సైంధవుఁడు ద్రౌపదిని బలాత్కారముగా నెత్తికొని పోవుట (సం. 3-252-23)

చ. పాపవినిశ్చయుండు సతిపయ్యెదకొంగు గడంగి పట్టినం
గోపముతో నుదల్చికొని కోమలియున్ వెస వాని ద్రేయుడుం
బోపడి వాఁడు చిత్రముగ భూమితలంబునఁ ద్రెళ్ళె మారుత
క్షేపవిభగ్నమూల మయి చెచ్చెరఁ ద్రెళ్ళు మహీరుహంబునాన్. 190

ప్రతిపదార్థం: పాప, వినిశ్చయుండు= దుష్కృతం చేయటానికి నిర్ణయించుకొన్న వాఁడు, జయద్రథుడు; సతి, పయ్యెదకొంగు= పతివ్రతయొక్క పైట కొంగును; కడంగి= పూనికతో; పట్టినన్= గ్రహించగా; కోమలియున్= సుకుమారి అయిన ద్రౌపదియును;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కోపముతోన్= ఆగ్రహంతో; ఉదల్చికొని= విదిల్చివేసి; వెసన్= శీఘ్రంగా; వానిన్= అతనిని (జయద్రథుడు); వ్రేయుడున్= కొట్టగా; పోపడి= త్రోయబడినట్లుయి తూలి; వాఁడు= జయద్రథుడు; మారుత, క్షేప, విభగ్నమూలము+అయి= గాలిచేత కొట్టబడి భగ్నమైన వ్రేళ్ళు కలది అయి; చెచ్చెరన్= శీఘ్రంగా; త్రెళ్లు= పడిపోయే; మహీరుహంబు= వృక్షం; నాన్= అనగా; చిత్రముగన్= ఆశ్చర్యం కలిగేటట్లుగా; భూమితలంబునన్= భూమిపైభాగంమీద; త్రెళ్లెన్= పడిపోయాడు.

తాత్పర్యం: చెడ్డపని చేయటానికి కృతనిశ్చయుడైన ఆ పాపాత్ముడు జయద్రథుడు పతివ్రత అయిన ద్రౌపది పయ్యెద కొంగును పట్టి లాగాడు. సుకుమారి అయిన పాంచాలికూడా వేగంగా వాడిని ప్రక్కకు నెట్టి కోపంతో కొట్టగా ఆ జయద్రథుడు పెనుగాలికి కూకటివేళ్లతో పెల్లగిలిపడిన వృక్షమో అన్నట్లు ఆశ్చర్యకరంగా నేలపై పడిపోయాడు.

వ. ఇట్లు నేలంబడి తడయక యెగసి జయద్రథుండు మగువం దిగిచి రథంబుపై నిడికొని సపరివారుం డయి యరుగం దొడంగె; నప్పు డప్పొలఁతి పురోహితునకు మ్రొక్కిన నమ్మహాత్ముండు సైంధవుం బేర్కొని యిట్లనియె. 191

ప్రతిపదార్థం: జయద్రథుండు= సైంధవుడు; ఇట్లు= ఈరీతిగా; నేలన్= భూమిమీద; పడి= వ్రాలి; తడయక= ఆలస్యం కాకుండా, ఎగసి= పైకి లేచి నిలబడి; మగువన్= వనితను (ద్రౌపదిని); తిగిచి= లాగిపట్టి, ఆకర్షించి; రథంబుపైన్= తేరిమీద; ఇడికొని= పెట్టుకొని; సపరివారుండు+అయి= (తన) అనుచరులతో పాటుగా; అరుగన్+తొడంగెన్= వెడలసాగాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+పొలఁతి= ఆ మగువ- ద్రౌపది; పురోహితునకున్= వైదికవిప్రుడికి; మ్రొక్కినన్= నమస్కరించగా; ఆ+మహా+ఆత్ముండు= ఆ మహనీయుడు (ధౌమ్యుడు); సైంధవున్= జయద్రథుడిని; పేర్కొని= పేరుతో పిలిచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఈవిధంగా నేలమీద పడిన జయద్రథుడు వేగంగా లేచి నిలబడి త్వరపడి ద్రౌపదిని బంధించి పట్టి తేరుపై పెట్టుకొని, తన అనుచరులు వెంబడించగా వెడలసాగాడు. అప్పుడు ద్రౌపది పురోహితు డైన ధౌమ్యుడికి నమస్కరించింది. ఆ మహానుభావుడు సైంధవుడిని సంబోధించి ఈ విధంగా అన్నాడు.

మ. 'తగునే రాజకులప్రసూతులకు నత్యంతంబు నేతాదృశం
బగు దుష్కర్మము? నాదుపల్కు వినుు; మీ యబ్జాక్షి పుణ్యాత్మ, యి
మ్మగువన్ వే విడు ; పాండునందనులు నీమానంబుఁ బ్రాణంబు నే
పగిదిం గొందురు గాని పోవిడువ; రీపాపంబు నిన్ ద్రెక్కొనున్'. 192

ప్రతిపదార్థం: రాజ, కుల, ప్రసూతులకున్= రాజులవంశంలో పుట్టినవారికి; ఏతాదృశంబు+అగు= ఇటువంటిది అయిన; దుష్కర్మము= చెడుపని; అత్యంతంబు= మిక్కుటంగా; తగునే= భావ్యమా?; నాదు, పల్కు= నామాట; వినుము= ఆలకించవయ్యా; ఈ+అబ్జ+అక్షి= ఈపద్మాలవంటి కన్నులు కలది; పుణ్య+ఆత్మ= సుకృతంతో కూడిన ఆత్మకలది, మంచిఇల్లాలు; ఈ+మగువన్= ఈ వనితను, ద్రౌపదిని; వేవిడు= శీఘ్రంగా వదలిపెట్టుము; పాండు నందనులు= పాండురాజపుత్రులు; నీ మానంబు= నీ మానాన్ని; ప్రాణంబున్= ప్రాణాన్ని; ఏపగిదిన్= ఏరీతిగానైనను; కొందురు= తీస్తారు; కాని= కాని; పో విడువరు= పోవ నివ్వరు; ఈ పాపంబు= ఈదుష్కృతం; నిన్= నిన్ను; త్రెక్కొనున్= చెరుస్తుంది.

తాత్పర్యం: ఇటువంటి పాపపుపని నీవంటి రాజవంశంలో జన్మించినవారికి తగునా? నాయనా! నామాట వినుము. ఈ ద్రౌపది పుణ్యాత్మురాలు. పతివ్రతా శిరోమణి. వేగంగా ఈమెను విడిచిపెట్టుము. పాండవులు ఎట్లాగయినా నీ మానాన్ని, ప్రాణాన్నీ తీస్తారు. ఈపాపం నిన్ను కట్టి కుడుపుతుందిసుమా!

వ. అని యాక్రోశించుచు నమ్మహీసురవరుండు వానిపిఱుందన చనియె; నిట పాండవులు నవ్వనంబున ననేక మృగంబుల వధియించి యందఱు నొక్కయెడం గూడంబడి యాశ్రమాభిముఖులై వచ్చునెడఁ దమ్ములం జూచి ధర్మజుం డిట్లనియె. 193

ప్రతిపదార్థం: అని+ఆక్రోశించుచున్= అని బిగ్గరగా అరుస్తూ; ఆ+మహీసురవరుండు= ఆ బ్రాహ్మణోత్తముడు; వాని పిఱుందన= జయద్రథుడి వెనుకనే; చనియెన్= వెళ్ళాడు; ఇట= ఇక్కడ; పాండవులు; ఆ+వనంబునన్= ఆ అడవిలో; అనేక, మృగంబులన్= పెక్కుజంతువులను; వధియించి= చంపి; అందఱున్= అందరును; ఒక్క+ఎడన్= ఒకచోట; కూడన్+పడి= కలిసికొని; ఆశ్రమ+అభిముఖులు+ఐ= ఆశ్రమానికి ఎదురుగా ఉండే ముఖాలు కలవారై; వచ్చు+ఎడన్= అరుగుదెంచే సమయంలో; ధర్మరాజు; తమ్ములన్+చూచి= ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని బిగ్గరగా అరుస్తూ బ్రాహ్మణోత్తముడైన ధౌమ్యుడు జయద్రథుడి రథంవెంబడి వెళ్ళాడు. ఇట-పాండునందనులు ఆ అడవిలో పెక్కు జంతువులను వేటాడి అందరు ఒకచోట కలిసికొని ఆశ్రమందెసగా వస్తున్నారు. అప్పుడు ధర్మరాజు తమ్ములతో ఇట్లా పలికాడు.

సీ. 'ఇనుఁ డున్న దెసనుండి యెలుఁగింపఁ దొడఁగెఁ బ । క్షులు మృగంబులు నతిఘోరరుతుల;
మగిడెడు నిప్పుడు మనకు దాపలి దెస । నతిభీషణాకృతి నఱచె వఱడు;
పగఱచే నవమానపాటును గయ్యంబుఁ । గలుగు నీశకునప్రకార మరయఁ;
గడుకొని చెయి వెట్టి కలఁచినట్లయ్యెడుఁ । జిత్తంబుఁ, దనువు నిశ్చేష్ట మయ్యెఁ;

ఆ. నరుగుదెండు వేగ యాశ్రమంబునఁ గృష్ణ । నునిచి వచ్చినార మొంటి నకట!
తలఁపఁ గ్రూరమతులు ధార్తరాష్ట్రులు గడు । నెగ్గు సేయఁజూతు రెడరు వేచి. 194

ప్రతిపదార్థం: ఇనుఁడు= సూర్యుడు; ఉన్న, దెసనుండి= ఉన్నదిక్కు నుండి; పక్షులు= పిట్టలు; ఎలుఁగింపన్+తొడఁగెన్= కూయసాగినవి; మృగంబులున్= జంతువులును; అతిఘోర, రుతులన్= మిక్కిలి భయంకరమైన స్వరాలతో; మగిడెడున్= తిరిగి పోతున్నవి; ఇప్పుడు= ఈ సమయంలో; మనకున్ దాపలిదెసన్= మనకుఎడమవైపు; వఱడు= ముసలినక్క; అతిభీషణ+ఆకృతిన్= మిక్కిలి భయంకరమైన ఆకారంతో; అఱచెన్= బిగ్గరగా అరిచింది; ఈశకున, ప్రకారము= ఈ శకునాల చొప్పు; అరయన్= పరిశీలించగా; పగఱచేన్= శత్రువులచేత; అవమానపాటును= పరాభవం; కయ్యంబున్= యుద్ధం; కలుగున్= సంభవిస్తాయి; చిత్తంబు= మనస్సు; కడుకొని= పూని; చెయి+పెట్టి= హస్తం పెట్టి; కలఁచినట్లు= కలగుండు పరిచినట్లు; అయ్యెడున్= ఔతున్నది; తనువు= శరీరం; నిశ్చేష్టము+అయ్యెన్= కదలిక మెదలిక లేకుండ స్తంభించి పోతున్నది; వేగ= శీఘ్రంగా; అరుగుదెండు= రండు; ఆశ్రమంబునన్= ఆశ్రమంలో; కృష్ణన్= ద్రౌపదిని; ఒంటిన్= ఒంటరిగా; ఉనిచి= ఉంచి; వచ్చినారము, అకట!= అయ్యో!; తలఁపన్= యోచింపగా; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుడి కుమారులు, కౌరవులు; క్రూరమతులు= కరుకుదనంగల బుద్ధికలవారు; ఎడరువేచి= సమయం చూచి; ఎగ్గు= కీడు; చేయన్+చూతురు= చేయటానికి ప్రయత్నిస్తారు.

తాత్పర్యం: 'సోదరులారా! ఇప్పుడు మనకు ఎన్నో అపశకునాలు ఎదురైనవి. పక్షులు సూర్యుడు ఉన్న దిక్కునుండి బిగ్గరగా కూస్తున్నవి. జంతువులు భయంకర నినాదాలతో మరలుతున్నవి. ఇప్పుడు మనకు ఎడమవైపుగా ముసలినక్క భయంకరమైన ఆకృతితో అరుస్తూ పోయింది. ఈ అపశకునాలను పట్టి చూస్తే మనకు ప్రస్తుతం శత్రువులవలన అవమానం కలగటం, యుద్ధం జరిగే సూచనలు కన్పిస్తున్నవి. మనస్సు చేయిపెట్టి కలచినట్లుగా క్షోభిస్తున్నది; శరీరం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేష్టలు దక్కి స్తంభిస్తున్నది; ఆలోచనలు పరిపరివిధాల పోతున్నవి. ధృతరాష్ట్రుడి కొడుకులు దుష్టబుద్ధి కలవారు. మనం ద్రౌపదిని ఒంటరిగా విడిచిపెట్టి వచ్చాం. సమయం కొరకై వారు నిరీక్షిస్తూ ఉంటారు. ఏమి ముప్పు మూడనున్నదో. వేగంగా కదలండి, ఆశ్రమానికి ఆలస్యం చేయకుండా చేరుకొందాం.

ఆ. కమలహీన మైన కమలాకరము వోలెఁ । రాజహీనమైన రాత్రి వోలెఁ
జూడఁ గామ్యకంబు శూన్యమై యున్నట్లు । దోఁచె; నేమి కీడు దొడరునొక్కొ!' **195**

ప్రతిపదార్థం: కమలహీనము+ఐన= పద్మాలు లేని; కమల+ఆకరము+పోలెన్= సరోవరంవలె; రాజహీనము+ఐన= చందమామ లేని; రాత్రి+పోలెన్= రాతిరివలె; చూడన్= చూడగా; కామ్యకంబు= కామ్యకం అనే ఈ అడవి; శూన్యము+ఐ+ఉన్నట్లు= ఏమియు లేనిదిగా ఉన్నట్లు; తోఁచెన్= మనస్సుకు తట్టింది; ఏమి కీడు= ఎటువంటి ఆపద; తొడరున్+ఒక్కొ!= కలుగునో కదా!.

తాత్పర్యం: ఈ కామ్యకవనం శూన్యమై, పద్మాలు లేని సరోవరంవలె, జాబిల్లి లేని రేయి వలె శోభావిహీనమై మనస్సుకు క్షోభ కలిగిస్తున్నది. ఎట్టి ఆపద ప్రాప్తించనున్నదో కదా!'

విశేషం: అలం: ఉపమ.

వ. అనియె ని ట్లయ్యేవురు నరదంబులు సత్వరంబుగాఁ దోలుకొని యాశ్రమంబునకు వచ్చునెడఁ బాంచాలి పరిచారిక ధాత్రేయిక యనునది యతికరుణంబుగా నేడ్చుచున్నం గని, ధర్మతనయుసారథి యైన యింద్రసేనుండు రథంబు డిగ్గ నుఱికి చని 'ఇది యేల నేలంబడి పొరలుచు నేడ్చెదవు? నీ కపకారంబు సేసినవా రెవ్వ?' రనిన నది వానిం జూచి 'సైంధవుచేతం బాంచాలి చెఱపోయె' నని పలుకుచుఁ బెల్లేడ్చిన నింద్రసేనుం డి ట్లనియె. **196**

ప్రతిపదార్థం: అనియెన్= అని (ధర్మరాజు) చెప్పాడు; ఇట్లు= ఈరీతిగా; ఆ+ఏవురును= ఆ అయిదుగురును (పంచపాండవులు); అరదంబులు= రథంబులు; సత్వరంబుగాన్= వేగంగా; తోలుకొని= నడిపించుకొని; ఆశ్రమంబునకున్= ఆశ్రమానికి; వచ్చు+ఎడన్= అరుగుదెంచే సమయంలో; పాంచాలి, పరిచారిక= ద్రౌపది యొక్క దాసి; ధాత్రేయిక+అనునది= ధాత్రేయిక అనే పేరుకలది; అతి, కరుణంబుగాన్= మిక్కిలి జాలి పుట్టేటట్లుగా; ఏడ్చుచున్నన్= ఆక్రోశిస్తుండగా; కని= అరసి; ధర్మతనయు, సారథి+ఐన= ధర్మరాజు తేరు నడిపేవాడు అయిన; ఇంద్రసేనుండు= ఇంద్రసేనుడు అనే వాడు; రథంబు తేరు నుండి; డిగ్గన్+ఉఱికి= క్రిందికి దుమికి; చని= వెడలి; ఇది ఏల= ఇట్లు ఎందుకు; నేలన్+పడి= భూమిపై పడి; పొరలుచున్= ఇటూ అటు దొర్లుతూ; ఏడ్చెదవు= విలపిస్తావు?; నీకున్; అపకారంబు+చేసినవారు= కీడు ఒనరించినవారు; ఎవ్వరు?= ఎవరు? అనినన్= అని ప్రశ్నించగా; అది= ఆమె (ధాత్రేయిక); వానిన్+చూచి= అతడిని (ఇంద్రసేనుడిని); చూచి; సైంధవుచేతన్= జయద్రథుడిచేత; పాంచాలి= ద్రౌపది; చెఱపోయెన్= బంధించబడింది; అని+పలుకుచున్= అని చెప్పుతూ; పెల్లు+ఏడ్చినన్= మిక్కిలి; ఆక్రోశించగా; ఇంద్రసేనుండు= ఇంద్రసేనుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: అని ధర్మరాజు పలికాడు. వెంటనే పంచపాండవులు తమతమ రథాలను వేగంగా తోలుకొని ఆశ్రమానికి తిరిగి వచ్చారు. ఆశ్రమంలో ద్రౌపది దాసి ధాత్రేయిక భూమిపై పొర్లాడుతూ బిగ్గరగా ఏడుస్తూ ఉండటం చూచి, ధర్మరాజురథసారథి ఇంద్రసేనుడు రథంనుండి దూకి ఆమెవద్ద కేగి 'ఎందుకు ఈరీతిగా ఆక్రోశిస్తున్నావు? నీకెవరు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అపకారం చేశారు?' అని అడిగాడు. సైంధవుడు ద్రౌపదిని బలాత్కారంగా రథంమీద తీసికొని పోయాడని చెప్పి ఆమె మరింత బిగ్గరగా ఏడ్వసాగింది. అప్పుడు ఇంద్రసేనుడు ఇట్లా పలికాడు.

సీ. **'పాండుపుత్త్రుల బహిఃప్రాణంబు నుత్తమ । శీలసమగ్రఁ బాంచాలతనయఁ**
గొనిపోవునంతటి గుండెఁ గల్గెనె విమో । హాంధమానసుఁ డైన సైంధవునకు?
నేఁగుఁ గా కేమి మహీతలగతుఁ డైన । గగనంబునకు వేగ యెగసి చనినఁ
బోనిత్తురే పారివుత్తురు గాక యు । ద్ధురవృత్తిఁ బార్థు లా దురితచరితు;

ఆ. **వీరవరుల ఘోరవివిధాస్త్ర కౌశలం । బెఱుఁగఁ డయ్యెఁ గాక యేమి వాఁడు;**
వగవకుండు మబల! వైరి నుగ్రతఁ దున్మి । మగువఁ దెత్తు రిపుడ మనుజవిభులు'. **197**

ప్రతిపదార్థం: అబల= ఓవనితా! ఓ ధాత్రేయిక!; వగవక+ఉండుము= దుఃఖించకుము; పాండుపుత్త్రుల, బహిఃప్రాణంబున్= పాండునందనులయొక్క బయటికి కనుపించే ప్రాణం ద్రౌపదిని. (అనగా ద్రౌపది పాండవులకు ప్రియతమ అని భావం); ఉత్తమశీలసమగ్రన్= మంచి స్వభావం కలదానిని; పాంచాలతనయన్= పాంచాల రాజు కూతురిని; కొనిపోవు+అంతటి= బలాత్కారంగా తీసుకుపోయేటంతటి; గుండె= గుండెకాయ (ధైర్యసాహసాలు); విమోహ+అంధ, మానసుఁడు+ఐన= మిక్కుటమైన భ్రాంతి అనెడి చీకటితో నిండిన చిత్తం కలవాడైన; సైంధవునకున్= జయద్రథుడికి; కల్గెను+ఎ= ఉన్నదా?; ఏఁగున్+కాక+ఏమి= అతడా ద్రౌపదిని చెఱపట్టి తనవెంట గొనిపోయిన పోవుగాక, ఇంతలో ఏమైనది; మహీ, తల, గతుఁడు+ఐనన్= భూమిపైన ఉన్నవాడయినను; గగనంబునకున్= ఆకాశానికి; వేగ= వేగంగా; ఎగసి చనినన్= ఎగిరి వెళ్ళినప్పటికీ; పార్థులు= పాండవులు; ఆ దురిత, చరితున్= ఆ పాపశీలుడిని; ఉద్ధురవృత్తిన్= కాఠిన్యంతో; పొరివుత్తురు+కాక= చంపుతారు కాని; పోనిత్తురే= వెడలనిస్తారా; వీర, వరుల= శూరులలో శ్రేష్ఠులైనవారి యొక్క, పాండవుల యొక్క; ఘోర, వివిధ+అస్త్ర, కౌశలంబు= భయంకరాలైన, పెక్కు ఆయుధాల నేర్పరితనం; వాఁడు= ఆ సైంధవుడు; ఎఱుఁగఁడు= తెలియనివాడు; అయ్యెన్+కాక+ఏమి= తెలియనివాడు అయినాడు గాక ఏమి? మనుజవిభులు= రాజులు (పాండవులు); వైరిన్= శత్రువును, జయద్రథుడిని; ఉగ్రతన్= భయంకరంగా; తున్మి= సంహరించి; మగువన్= వనితను (పాంచాలిని); ఇపుడు+అ= ఇప్పుడే; తెత్తురు= తీసికొని రాగలరు.

తాత్పర్యం: 'ద్రౌపది - పంచపాండవులకు ఆరవ ప్రాణం, మంచి నడవడిక కలది. అట్టి మహానుభావురాలిని బలాత్కారంగా ఎత్తుకొనిపోయేటంతటి ధైర్యసాహసాలు కలిగి ఉన్నాడా? మోహంచేత కన్నులు కనుపించని జయద్రథుడు! వాడు ఎక్కడికి పోగలడు? భూమిమీద ఉన్నా లేదా ఆకాశంలోకి ఎగిరిపోతున్నా వాడిని పోనిస్తారా? మహావీరులైన పాండవులు ఆ పాపాత్ముడిని పట్టి బంధించక వదులుతారా? ఆ అవివేకికి పాండవులయొక్క భయంకరాయుధాలనేర్పు తెలియదు. ఓ ధాత్రేయిక! నీవు అబలవు దుఃఖించకుము. మనుజులలో శ్రేష్ఠులైన పాండవులు జయద్రథుడిని సంహరించి, ద్రౌపదిని విడిపించుకొని వేగంగా తిరిగి రాగలరు. ఊరడిల్లుము'.

వ. **అనిన నయ్యంగన యపాంగతరంగితంబు లగు బాష్పజలంబు లల్లన కరపల్లవప్రమార్జనంబుల నపనయించుచు నతనిం గనుంగొని యిట్లనియె.** **198**

ప్రతిపదార్థం: అనినన్= అని (ఇంద్రసేనుడు) పలుకగా; ఆ+అంగన= ధాత్రేయిక; అపాంగ, తరంగితంబులు+అగు= కనుగొలకులనుండి కెరటాలవలె జాలువారిన; బాష్పజలంబులు= కన్నీళ్ళు; అల్లన= మృదువుగా; కర, పల్లవ, ప్రమార్జనంబులన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లేతచిగుళ్లవంటి చేతులతో తుడిచికొనటంచేత; అపనయించుచున్= తొలగించుకొంటూ; అతనిన్+కనుంగొని= ఇంద్రసేనుడిని చూచి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: అని చెప్పి ఇంద్రసేనుడు ధాత్రేయికను ఓదార్చాడు. అంతట ఆమె తనకనుగొలకులనుండి కెరటాలుగా కారుతున్న కన్నీళ్ళను తన మృదుహస్తాలతో తుడుచుకొంటూ, ఇంద్రసేనుడితో ఇట్లా చెప్పింది.

ఆ. 'ఇంద్రకల్పు లైన యేవురు నృపతుల। నాత్మఁ గొనక యుఱక యంబుజాక్షి
నపహరించి నపుడ యద్దురాత్మునకును। జేటుమూఁడె వేఱ చెప్ప నేల? 199

ప్రతిపదార్థం: ఇంద్రకల్పులు+ఐన= వేల్పులదొర అయిన ఇంద్రుడితో సమానులు అయిన; ఏవురునృపతులన్= అయిదుగురు రాజులను (పంచపాండవులను); ఆత్మన్+కొనక= తనమనస్సులో పరిగణించక; ఉఱక= లక్ష్యపెట్టక; అంబుజ+అక్షిన్= పద్మాలవంటి కనులు కలదానిని, ద్రౌపదిని; అపహరించిన+అపుడు+అ= బలాత్కారంగా కొనిపోయినప్పుడే; ఆ, దురాత్మునకును= ఆ దుష్టుడికి, సైంధవుడికి; చేటు= కీడు; మూఁడెన్= దాపురించింది; వేఱు+అ= వేరుగా ఇక; చెప్పన్+ఏల?= చెప్పటం ఎందుకు?

తాత్పర్యం: దేవేంద్రుడితో సరిసమానులైన పంచపాండవులను ధిక్కరించి, సౌందర్యవతి అయిన ద్రౌపదిని అపహరించినపుడే దురాత్ముడైన జయద్రథుడికి కీడు మూడింది. ఇక వేరుగా ఎందుకు చెప్పటం?

ఉ. ఇంతకు మున్న వాఁడు సనియెం; గడు దవ్వుగఁ బోవకుండ న
త్యంతరయంబునం బటురథావళి యొప్పఁగ నేఁగుఁ డుగ్రులై
సంతనకట్టుఁ డస్త్రములు శస్త్రములుం, దొడుగుండు వర్మముల్,
సంతతదివ్యబాణముల శాత్రవుఁ దున్మఁడు దెండు నెచ్చెలిన్. 200

ప్రతిపదార్థం: ఇంతకుమున్ను+అ= ఇంతకు పూర్వమే; వాఁడు= జయద్రథుఁడు; చనియెన్= వెళ్లాడు; కడున్= మిక్కిలి; దవ్వుగన్= దూరంగా; పోవకుండన్= అరుగకుండా; అత్యంతరయంబునన్= మిక్కిలి వేగంగా; పటురథ+ఆవళి= గొప్పఅరదాలసముదాయం; ఒప్పఁగన్= శోభిల్లగా; ఏఁగుడు= వెడలండి; ఉగ్రులు+ఐ= భయంకరులై; అస్త్రములు శస్త్రములున్= మంత్రమహిమకల ఆయుధాలు, ఆయుధాలు; సంతనకట్టుఁడు= ఆయత్తం చేయండి; వర్మముల్= కవచాలు; తొడుగుండు= ధరించండి; సంతత దివ్యబాణములన్= ఎడతెగక ప్రయోగించే అస్త్రాలచేత; శాత్రవున్= విరోధిని; తన్మఁడు= చంపండి; నెచ్చెలిన్ (నెఱ+చెలిన్)= ప్రియసఖిని, (ద్రౌపదిని); తెండు= తీసికొనిరండు.

తాత్పర్యం: ఓ ఇంద్రసేనా! జయద్రథుడు ఇప్పుడిపుడే కొన్నినిమిషాలకు ముందే వెడలిఉన్నాడు. అతడు దూరంగా పోకుండానే మిక్కిలి వేగంగా మీరు రథాల నెక్కి సమరసన్నాహంతో పొండి. అస్త్రశస్త్రాలను సమకూర్చుకొని ప్రయోగానికి సిద్ధంగా పెట్టుకొనండి. కవచాలను ధరించండి. ఎడతెగని దివ్యబాణాలను ప్రయోగించి శత్రువును సంహరించండి. అనుగుసఖి ద్రౌపదిని చెఱవిడిపించుకొని తెండి.

సీ. బూదిలోఁ దొరఁగిన పూర్ణాహుతియుఁ బోలెఁ, । కుక్కతో ల్తిత్తిలోఁ గూరినట్టి
రాజితకపిలగోరసధారయును బోలె, । మసనంబులోఁ బడ్డ మహిత పుష్ప

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మాలికయునుబోలె మదిరాక్షి దుర్జను । కతమున దూషిత గాక మున్న
చనరయ్య! వేగంబ; చనునె సన్మంత్రవి । శ్రుతపురోడాశంబు శునకమునకుఁ?
తే. జనునె కమలసుగంధికాసారకేళి । కలుషశవఖాది యైన సృగాలమునకుఁ?
జనునె తన్వంగి సౌందర్యచతురభావ । భంగి యాదుష్టచరితుని పాలు వడఁగ?' 201

ప్రతిపదార్థం: బూదిలోన్= బూడిదలో; తొరఁగిన= పడిన; పూర్ణ+ఆహుతియున్+పోలెన్= నిండుహోమద్రవ్యంవలె; కుక్కతోల్+తిత్తిలోన్= కుక్కచర్మంతో చేయబడిన సంచిలో; కూరిన+అట్టి= నింపినట్టి; రాజిత, కపిల, గో, రస, ధారయునుబోలెన్= వెలుగొందే కపిల గోవు యొక్క పాలచాలువలె; మసనంబులోన్+పడ్డ= వల్లకాటిలో పడినట్టి; మహిత, పుష్ప, మాలికయునుపోలెన్= గొప్పపూలదండవలె; మదిర+అక్షి= మత్తెక్కించు కన్నులుగలది (స్త్రీ) ద్రౌపది; దుర్జనుకతమునన్= దుష్టుడిమూలాన; దూషిత= దోషంతో కూడినది; కాకమున్న= కాకముందే; వేగంబు+అ= శీఘ్రముగా; చనరయ్య= దయచేసి వెడలుడు; సత్+మంత్ర, విశ్రుత, పురోడాశంబు= మంచి వేదబుక్కులచేత వేల్చబడి పేరుకెక్కినయజ్ఞంలో హోమం చేయటానికై ప్రత్యేకంగా తయారుచేసిన పిండివంటకం; శునకమునకున్= కుక్కకు; చనునె= యోగ్యం అగునా? కమల, సుగంధి, కాసార, కేళి= పద్మాల యొక్క పరిమళంలో కూడిన సరోవరంలో వినోదంగా విహరించటం; కలుష, శవ, ఖాది+ఐన= క్రుళ్లిన పీనుగులను తినేది అయిన; సృగాలమునకున్= నక్కకు; చనునె?= సరియగునా?; తన్వంగి= సన్నని తనువుగల సుందరి - ద్రౌపదియొక్క; సౌందర్య, చతుర, భావ, భంగి= అందచందాలతో అలరారే భావాలతీరు; ఆ దుష్టచరితుని, పాలు,+వడఁగన్= ఆ దుర్మార్గస్వభావంకల జయద్రథుడి వశం కావటం; చనునె= భావ్యమా? (కాదనిభావం).

తాత్పర్యం: బూడిదలో పోసిన నిండుహోమద్రవ్యంవలె, కుక్కతోలుతిత్తిలో నింపిన కపిలగోవుయొక్క పాలవలె, శ్మశానంలో పడిన పూలదండవలె, మదిరాక్షియైన ద్రౌపది ఆ దుర్జను డైన జయద్రథుడిచేత అపవిత్రం కాకముందుగానే మీరు వేగంగా వెళ్ళి ఆమెను కాపాడండి. మంచివేదబుక్కులచేత పవిత్రం చేయబడిన యజ్ఞంలో హోమం చేయటకై తయారుచేయబడిన అపూపము కుక్కకు తగునా? పద్మాల పరిమళంచేత గుబాళించే సరోవరంలో క్రీడించటం క్రుళ్లినశవాలను తినే నక్కకు సరిఔతుందా? సౌందర్య చతుర భావభంగిమ గల ద్రౌపది ఆ దుర్జనుడైన జయద్రథుని బారిని పడటం తగునా?'

విశేషం: అలం: ఉపమ, నిదర్శన.

పాండవు లేవురు సైంధవుపై యుద్ధమునకుఁ బోవుట (సం. 3-253-21)

వ. **అని పలుకుచున్న ధాత్రేయిక పలుకులు విని దాని నాశ్వాసించి, యక్కురువీరు లేవురు నాక్షణంబ సన్నద్ధులై క్రోధావేశంబునంజేసి మహోరగంబులుం బోలె రోఁజుచు జయద్రథు వెన్నడిదాడివెట్టి, కూడముట్టి, తత్సైన్యంబు పిఱుంద నాక్రోశ వచనవిహ్వలుండై పోవుచున్న ధౌమ్యుం గని నమస్కరించి, 'మీ రింక విగతఖేదుల రై యొయ్యన రం' డని యామిషంబునకుం గవియు డేగలుం బోలె సైంధవసేనపయిం గవిసి, సింహనాదంబులు సేసి; రప్పుడు పాండుపుత్త్రుల రథంబులు నడియాలంబులు సూచి సైంధవుండు ద్రౌపది కిట్లనియె.** 202

ప్రతిపదార్థం: అని పలుకుచున్న= అని వచిస్తున్న; ధాత్రేయిక పలుకులు= ధాత్రేయి యొక్కమాటలు; విని= ఆలకించి; దానిన్= ఆ ధాత్రేయికను; ఆశ్వాసించి= ఓదార్చి; ఆ కురువీరులు= కురువంశానికి చెందిన ఆ శూరులు; ఏవురున్=

అయిదుగురున్నూ; ఆక్షణంబు+అ= ఆ నిమిషంలోనే; సన్నద్ధులు+ఐ= సన్నాహాలు గలవారై; క్రోధ+ఆవేశంబునన్+చేసి= కోపవిజృంభణచేత; మహా+ఉరగంబులున్+పోలెన్= గొప్పపాములవలె; రోఁజుచున్= నిట్టూరుపులు నిగుడిస్తూ; జయద్రథున్= సైంధవుడిని; వెన్నడి= వెనుక వెడలి; దాడి+పెట్టి= దండెత్తి; కూడన్ముట్టి= తఱిమి సమీపించి; తత్+సైన్యంబు, పిఱుందన్= ఆతడియొక్క సేనవెనుక; ఆక్రోశ వచన విప్లాలుండు+ఐ= ఎలుగెత్తి ఏడ్పు మాటలాడటం చేత శోషించిన వాడై; పోవుచున్న= అరగుచున్న; ధౌమ్యున్+కని= ధౌమ్యుడిని చూచి; నమస్కరించి= వందనం చేసి; మీరు= ఓ ధౌమ్యమహామునీ మీరు; ఇంకన్= ఇకమీద; విగత, ఖేదులరు+ఐ= పోయిన దుఃఖం కలవారు అయి; ఒయ్యనన్= మెల్లగా; రండు= రండి; అని= అని చెప్పి; ఆమిషంబునకున్= మాంసంకొరకై; కవియు= మూగు; డేగలున్+పోలెన్= గ్రద్దలవలె; సైంధవ, సేనపయిన్= జయద్రథుడి సైన్యంమీద; కవిసి= వేగంగా వ్రాలి; సింహనాదంబులు, చేసిరి= సింహగర్జనలవంటి కేకలు పెట్టారు; అప్పుడు= ఆ సమయంలో; పాండుపుత్త్రుల రథంబులున్= పాండవులయొక్క తేరులును; అడియాలంబులు= చిహ్నంబులు; చూచి= అరసి; సైంధవుండు= జయద్రథుడు; ద్రౌపదికిన్= పాంచాలికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ధాత్రేయిక మాటలు విని, పాండవు లైదుగురూ ఆమెను ఓదార్చారు. వెంటనే యుద్ధానికి సిద్ధమై తీవ్రమైన కోపంతో మహాసర్పాలవలె బుసలుకొట్టుతూ జయద్రథుడిని వెంబడించి, దాడిచేసి, తరుముకుంటూ సమీపించారు. ఆతడి సైన్యం వెంట ఎలుగెత్తి శోకిస్తూ కేకలువేస్తూ అలసిపోయిన ధౌమ్యుడిని చూచి నమస్కరించారు. 'మీరింక విచారించక నెమ్మదిగానే రండి' అని చెప్పారు. మాంసంకోసం వేగంగా దూసుకొనిపోయే డేగలవలె సైంధవుడి సైన్యంమీద పాండవులు వాలారు. సింహనాదాలు చేశారు. అప్పుడు పాండవుల రథాలను టెక్కాలపై గుర్తులను గమనించి సైంధవుడు ద్రౌపదితో ఇట్లా అన్నాడు.

విశేషం: 1. పాండవులు ధౌమ్యుడిని మీరు అని బహువచనంలో సంబోధించటం గౌరవసూచకం. 2. అడియాలము-ప్రాచీనకాలంలో సమరవీరులు తమ ప్రత్యేక వ్యక్తిత్వాలను సూచించటానికై ధరించిన చిహ్నాలు, గొడుగులు, పతాకలు మున్నగునవి.

క. 'ఈ వచ్చురథంబుల వా । రేవురు నీమగలె యంబుజేక్షణ! వీరిన్
భావించి యెవ్వఁ డెవ్వం । డేవిధమునవాఁడు సెపుమ! యెఱుఁగఁగ వలయున్!' 203

ప్రతిపదార్థం: అంబుజ+ఈక్షణ!= పద్మాలవంటి కన్నులు కలదానా, ద్రౌపదీ!; ఈవచ్చు రథంబులవారు= ఈవిధంగా ఇటు వస్తున్న అరదాల మీద ఉన్నవారు; ఏవురు= అయిదుగురు; నీమగలె!= నీభర్తలా? వీరిన్= పాండవులను; భావించి= వివేచించి; ఎవ్వఁడు+ఎవ్వండు= ఎవడు ఎవడో; ఏవిధమునవాఁడు= ఏరీతిగా ఉండేవాడో; ఎఱుఁగఁగవలయున్= తెలియటం అవసరం; చెపుము+అ= దయచేసి చెప్పుము.

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు కల ద్రౌపదీ! రథాలపై వస్తున్న అయిదుగురున్నూ నీ భర్తలే కదా! వీరిలో ఎవడు ఎవడో ప్రత్యేకించి నాకు తెలుపుము. వీరి స్వరూపస్వభావాలు తెలియటం అవసరం'.

విశేషం: జయద్రథుడు ఏదో ఒకమిష పెట్టి ద్రౌపదితో సంభాషణకు ఉపక్రమించ దలచటం సహజం. లోగడ తాను పాండవులనుగూర్చి క్షుణ్ణంగా తెలిసినవాడ నని ద్రౌపదితో ప్రగల్భాలు పలికాడు. (చూడు: 192సంఖ్యపద్యం). ఇక ద్రౌపది సైంధవుడి కెందుకు సమాధానం చెప్పవలె? (చూడు: 205 సంఖ్య పద్యం).

వ. అనిన నప్పాంచాలి యనాదరక్రోధఘూర్ణిత యగుచు నతని కిట్లనియె. 204

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= సైంధవుడు అట్లా చెప్పగా; ఆ+పాంచాలి= ఆ ద్రౌపది; అనాదర, క్రోధ, ఘూర్ణిత+అగుచున్= ఆదరము లేమి చేతను, కోపముచేతను, తిరుగుడు పడిన మనస్సు గలది అవుతూ; అతనికిన్= ఆ సైంధవునితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: జయద్రథుడి మాటలు విని ద్రౌపది వెగటుతో కూడిన కోపంతో నిలువెల్ల కంపిస్తూ అతడితో ఇట్లా పలికింది.

ఆ. **'ఇంక వీరి నెఱిఁగి తేనియు నెఱుఁగక । యుండితేనిఁ జేయ నొండు గలదె?**
దుర్మదమునఁ గరము దుశ్చరిత్రమునకుఁ । జొచ్చి నీకుఁ జేటుఁ దెచ్చికొంటి. **205**

ప్రతిపదార్థం: ఇంకన్= ఇకమీదట; వీరిన్= వీరిని-పాండవులను; ఎఱిఁగితి(వి)+ఏనియున్= తెలిసికొన్నప్పటికీ; ఎఱుఁగక+ఉండితి+ఏనిన్= తెలియక ఉండి పోయినప్పటికీ; చేయన్= చేయటానికి; ఒండు= ఇంకొకటి (వేరొకచొప్పు); కలదె?= ఉన్నదా?; దుర్మదమునన్= పెద్దగర్వంచేత; కరము= మిక్కిలి; దుశ్చరితమునకున్= చెడుప్రవర్తనకు; చొచ్చి= చేరి; నీకున్= నీకు; చేటున్= ముప్పును; తెచ్చికొంటి(వి)= తెచ్చుకొన్నావు.

తాత్పర్యం: ఇక పాండవులనుగూర్చి నీవు తెలిసికొన్నా తెలిసికొనక పోయినా ఇప్పుడు నీకు గత్యంతర మేమైనా ఉన్నదా? దురహంకారంతో నీవు చెడునడవడికకు ఒడిగట్టి ఈప్రమాదానికి గురిఅయినావు. ఇది నీ స్వయంకృతాపరాధం. తగిన శిక్ష అనుభవించక తప్పదు.

వ. **'అయినను నన్నడిగితివి గావునం జెప్పెద; నింతియ కాని నీవలని భయ మించుకంతయు నాకుఁ గలుగదు; సోదరసహితుం డైన ధర్మనందనుం గంటి; నింకఁ గుశలంబ' యని పలికి యిట్లనియె.** **206**

ప్రతిపదార్థం: అయినను= అయినప్పటికిని; నన్నున్; అడిగితివి= ప్రార్థించావు; కావునన్= కాబట్టి; చెప్పెదను= వచిస్తాను; ఇంతియకాని= ఇంతమాత్రమే కాని; నీవలని భయంబు= నీ వలన ఏర్పడిన భీతి; నాకున్; ఇంచుక+అంతయున్= లేశమాత్రం కూడా; కలుగదు= ఏర్పడదు; సోదరసహితుండు+అయిన= తమ్ములతో కూడిన; ధర్మనందనున్+కంటిన్= ధర్మపుత్రుడిని చూచాను; ఇంకన్= ఇకమీద; కుశలంబు+అ= (నాకు) పూర్తిగా క్షేమమే; అని, పలికి= అని వచించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: కాని, నీవు ప్రార్థించావు కాబట్టి చెప్పుతున్నాను. అంతే కాని, నిన్ను చూచి భయపడి నీకు సమాధానం చెప్పటం లేదు. తమ్ములతో విచ్చేసిన ధర్మరాజును చూచాను. ఇక నాయోగక్షేమాలనుగూర్చి నాకు ఎట్టి భయమూ లేదు' అని చెప్పి ఇంకా ఈ విధంగా అన్నది.

విశేషం: సైంధవుడికి తాను ఎందుకు సమాధానం చెప్పటానికి పూనుకొన్నదో ద్రౌపది చెప్పింది. చెప్పనికారణంకూడ ఉండవచ్చునుకదా! సైంధవుడికి పిరికిమందు పోయటానికి ద్రౌపదికి అవకాశం చిక్కింది.

మ. **'తనువృత్తాంగుఁడు శుద్ధకాంచనసముద్యద్వర్ణుఁ డభ్యుల్లస**
ద్వనజాతాయతచారులోచనుఁడు దీవ్యద్భూరితేజోఘనుం
డనఘుం డల్ల రథంబుపై వెలుఁగు పుణ్యాత్ముండు ధర్మాత్మజుం
డనిరోధప్రతిభాప్రభావనిధి యత్యాశ్చర్యశౌర్యుం డనిన్. **207**

ప్రతిపదార్థం: అల్ల= అదిగో అనతిదూరంలో; రథంబుపైన్= తేరిపై; వెలుఁగు= ప్రకాశించే; పుణ్య+ఆత్ముండు= పుణ్యంతో కూడినవాడు, మహానుభావుడు; ధర్మ+ఆత్మజుండు= ధర్మనందనుడు; తను, వృత్త+అంగుఁడు= సన్నని గుండ్రని దేహం కలవాడు; శుద్ధ, కాంచన, సమ్+ఉద్యత్+వర్ణుఁడు= స్వచ్ఛమైన బంగారు రంగుతో వెలిగే మేనిచాయ గలవాడు; అభి+ఉత్+లసత్, వనజాత+ఆయత; చారు, లోచనుఁడు= వికసించిన పద్మాలవంటి అందమైన నిడివిగల కన్నులు కలవాడు; దీవ్యత్+భూరి, తేజస్+ఘనుండు= దేదీప్యమానమైన గొప్పతేజస్సుతో వెలుగొందే మహనీయుడు; అనఘుండు= పాప మెరుగని పుణ్యాత్ముడు; అనిరోధ, ప్రతిభా, ప్రభావ, నిధి= అడ్డగించటానికి వీలులేని లోకోత్తర ప్రజ్ఞకు మహిమకు నెలవు అయినవాడు; అనిన్= యుద్ధంలో; అతి+ఆశ్చర్య, శౌర్యుండు= మిక్కిలి అచ్చెరువు కొలిపే పరాక్రమం కలవాడు.

తాత్పర్యం: అడుగో! అనతిదూరంలో కన్పిస్తున్న రథంపై వెలుగొందుతున్నవాడు ధర్మనందనుడు. సన్నని గుండ్రని శరీరం కలవాడు. అచ్చమైన బంగారు రంగుతో మిలమిలలాడే దేహకాంతి కలవాడు. అప్పటికప్పుడే వికసించిన పద్మాలవలె అందమైన వాలుగన్నులు కలవాడు. దేదీప్యమాన మైన వర్చస్సుతో వెలుగొందేవాడు. పుణ్యశీలంకల మహానుభావుడు. యుద్ధంలో అప్రతిహత మైన పరాక్రమం కలవాడు. అతిలోకప్రతిభను, మహిమలను ప్రదర్శించే యుధిష్ఠిరుడు అతడే.

చ. **కురుకులశేఖరుం డతఁడు ఘోరరణంబుల నెట్టి శత్రులున్**
శరణని సొచ్చిరేని విలసత్కరుణామతిఁ గాచు; నీవు చె
చ్చెరఁ జెడిపోక, నా పనుపు సేసి వినీతి యెలర్ప నమ్మహా
పురుషుని నాశ్రయింపుము; విభుండును నీదగు తప్పు లోఁ గొనున్. **208**

ప్రతిపదార్థం: అతఁడు= ఆ ధర్మరాజు; కురు, కుల, శేఖరుండు= కురువంశంలో శ్రేష్ఠుడు; ఘోర, రణంబులన్= భయంకర మైన యుద్ధాలలో; ఎట్టి, శత్రులున్= ఎటువంటి విరోధులైనా; శరణు+అని= మీరు దయ చూపుడు మీకు విధేయులం అని; చొచ్చిరి+ఏని= చేరితే; విలసత్+కరుణా, మతిన్= శోభిల్లే దయతో కూడిన బుద్ధితో; కాచున్= కాపాడుతాడు; నీవు= ఓ జయద్రథా! నీవు; చెడిపోక= పాడయిపోవక; చెచ్చెరన్= వెంటనే; నాపనుపు+చేసి= నా మాట విని; వినీతి+ఎలర్పన్= వినయం శోభిల్లేటట్లుగా; ఆ+మహాపురుషునిన్= ఆ మహానుభావుడిని; ఆశ్రయింపుము= శరణువేడుము; విభుండును= రాజును (ధర్మరాజును); నీదు+అగు= నీయొక్క; తప్పు= దోషం; లోన్+కొనున్= క్షమించగలడు.

తాత్పర్యం: ధర్మరాజు కురువంశంలో శ్రేష్ఠుడు. అతడు అజాతశత్రువు. ఎట్టిభయంకర యుద్ధంలోకాని ఎట్టి శత్రువే కాని, తనను ఆశ్రయించి శరణువేడితే దయామయుడై ఆ శత్రువును కాపాడగల స్వభావం కలవాడు. ఓజయద్రథా! ఇప్పటికిని మించి పోయింది లేదు. నామాట విని నీవు ఆ మహానుభావుడిని వెంటనే శరణువేడుము. మహాత్ము డైన ధర్మరాజు నీతప్పు క్షమించగలడు. ఇది నీకు తుది అవకాశం సుమా!

చ. **ఘనజవసత్త్వచారుతురగంబులఁ బూన్చిన యల్ల విస్ఫుర**
త్కనకరథంబుపై నుదితకాయుఁడు సాలమహీరుహంబు చా
డ్పునఁ దనరారుచున్ వెలయు భ్రూకుటియున్ దశనోష్ఠపీడనం
బును నయి యున్నవాఁ డనిలపుత్త్రుఁడు భీముఁడు; భీముఁ డాజులన్. **209**

ప్రతిపదార్థం: ఘన, జవ, సత్త్వ,చారు, తురగంబులన్= గొప్పవేగం బలం కలిగి అందంగా కనిపించే గుఱ్ఱాలను; పూన్చిన= కట్టిన; అల్ల= అల్లదిగో అనతి దూరంలో ఉన్న; వి, స్ఫురత్+కనక, రథంబుపైన్= ప్రకాశించే బంగారు తేరుపై; ఉదితకాయుఁడు= ఉదయించిన దేహం కలవాడు; సాల, మహీరుహంబుచాడ్పునన్= మద్దిచెట్టువలె; తనరారుచున్= శోభిల్లుతూ; వెలయు= ప్రకాశించే; భ్రూకుటియున్= బొమముడియును; దశన+ఓష్ఠ, పీడనంబును= పండ్లచేత పెదవిని కొరకుచుండటమున్నూ; అయి ఉన్నవాడు= కలిగినట్టివాడుగా ఉన్నవాడు; అనిలపుత్త్రుఁడు= వాయునందనుడు; భీముఁడు= భీమసేనుడు అనేవాడు; ఆజులన్= యుద్ధాలలో; భీముఁడు= భయంకరుడు అయినవాడు.

తాత్పర్యం: అదుగో ఆ రథాన్ని చూడు. అల్లదే గొప్పవేగం బలం గల గుఱ్ఱాలను పూన్చిన తేరది. ఆ రథంపై కనిపించే శరీరం కలవాడు, ఏపుగా ఎదిగిన సాలవృక్షంవలె కన్పించేవాడు, స్పష్టమైన బొమముడితో, పెదవిని కొరుకుతున్న దంతాలతో భయంకరంగా కనుపించేవాడు వాయుపుత్త్రు డైన భీమసేనుడు. ఆతడు యుద్ధాలలో భయంకరుడు అయిన సార్థకనాముడు.

ఉ. ఈతని పౌరుషం బరయ నెందు నమానుషకృత్య మప్రతీ
ఘాత మనేక మద్భుతము; గర్వితు లౌ ధరణీశ్వరుల్ నిజం
బీతని నాజిలోఁ జెనయ నెవ్వరు నోడుదు; రిమ్మహాభుజుం
డాతతరోషుఁడైన బ్రళయానలు నట్టిఁడ; యాఱఁ డేమిటన్. 210

ప్రతిపదార్థం: ఈతని పౌరుషంబు= ఈ భీముడియొక్క పరాక్రమం; అరయన్= చూడగా; ఎందున్= ఎచటనైనను; అ, మానుషకృత్యము= మానవులకు అతీతమైన పని; అ, ప్రతీఘాతము= ఎదిరించ వీలుగానిది; న+ఏకము= బహుముఖమైనది; అద్భుతము= అచ్చెరువు కలిగించేది; నిజంబు= సత్యం; గర్వితులు+ఔ= మదించిన వారయిన; ధరణీ+ఈశ్వరుల్= భూమిని పరిపాలించే రాజులు; ఈతనిన్= ఇతడిని; ఆజిలోన్= యుద్ధంలో; ఎవ్వరున్= ఎవరైనను; చెనయన్+ఓడుదురు= ఎదిరించటానికి జంకుతారు; ఈ, మహా, భుజుండు= గొప్పపరాక్రమం కల ఈ భీముడు; ఆతత రోషుఁడు+ఐనన్= విస్తరించిన ఆగ్రహం పూనినవాడు అయితే; ప్రళయ+అనలు+అట్టిఁడు+అ= ప్రళయకాలంలోని అగ్నిహోత్రుడితో సమానుడే సుమా; ఏమిటన్= ఏవిధంగానైనను; ఆఱఁడు= ఉపశమించడు.

తాత్పర్యం: ఈ భీమసేనుడి పరాక్రమం మానవులకు సాధ్యం కానిది. అతడికి ఎక్కడా ఎదురు లేదు. అతడికి ఆతడే సాటి. అతడి శౌర్యం బహుముఖ మైనది. అచ్చెరువు కలిగించేది. గర్వంచేత మదించిన రాజులు భీమసేనుడిని యుద్ధంలో ఎదిరించటానికి జంకుతారు. ఆ మహావీరుడికి కోపంవచ్చిందా, ఇక అతడు ప్రళయకాలంలోని అగ్నిహోత్రుడే ఔతాడు, ఏవిధంగానూ చల్లారడు.

ఉ. ధర్మజు కూర్మితమ్ముఁడును దత్ప్రియశిష్యుఁడు నైనవాఁడు స
త్కర్ముఁడు వాఁడె చూడుము ప్రగాఢవికీర్ణి జితేంద్రియుండు దు
ష్కర్ములఁ గన్న సైపఁడు నికామభయంకర విక్రమక్రియా
నిర్మథితారి ఫల్గునుఁడు నిర్మలతేజుఁ డజేయుఁ డెరికిన్. 211

ప్రతిపదార్థం: ఫల్గునుఁడు= అర్జునుడు; ధర్మజు, కూర్మి, తమ్ముఁడును= ధర్మరాజుయొక్క అనుంగుతమ్ముడున్నూ; తత్+ప్రియ, శిష్యుఁడున్= ఆతనియొక్క కూరిమిశిష్యుడున్నూ; ఐనవాఁడు= అయినవాడు; సత్+కర్ముఁడు= మంచి ప్రవర్తన

కలవాడు; వాడు+ఎ= అడుగో వాడే; చూడుము= కనుగొనుము; ప్రగాఢ, వికీర్ణి= గొప్పదాత; జిత+ఇంద్రియుండు= ఇంద్రియాలను జయించినవాడు; దుష్కర్ములన్= చెడుపనులచేసేవారిని; కన్నన్= చూస్తే; సైపఁడు= సహించడు; నికామ, భయంకర, విక్రమ, క్రియా, నిర్మథిత+అరి= మిక్కిలి భీకరమైన శౌర్యంచేత చలింపచేయబడిన శత్రువులు కలవాడు; నిర్మలతేజుఁడు= స్వచ్ఛమైన వర్చస్సు కలవాడు; ఏరికిన్= ఎవరికైనను; అజేయుఁడు= జయించ రానివాడు.

తాత్పర్యం: ధర్మరాజుకు ప్రియమైన తమ్ముడు, ఆతడికి అనువైన శిష్యుడు, మంచిప్రవర్తన కలవాడు అడుగో చూడుము. అతడే సుమా! అర్జునుడు! అతడు మహావదాన్యుడు, ఇంద్రియనిగ్రహం కలవాడు, భయంకరమైన పరాక్రమంచేత శత్రువులను తపింప చేయగలవాడు, స్వచ్ఛమైన వర్చస్సు కలవాడు, ఎవరికిని జయింప శక్యంకానివాడు.

క. **అవశగతిఁ గామరోషా । ది వికారము లొందినను మదిని ధర్మపథ**
ప్రవిహతి గానీఁ; డతఁ డా । దివిజేంద్రతనూజుఁ డద్వితీయుఁడు పేర్మిన్. **212**

ప్రతిపదార్థం: ఆ, దివిజ+ఇంద్ర, తనూజుఁడు= ఆ దేవేంద్రుడి కొడుకు; అవశగతిన్= అదుపు తప్పిన రీతిలో; కామ, రోష+ఆది, వికారములు= కోరికలు, కోపతాపాలు మున్నగు చిత్తవికృతులు; ఒందినను= పొందినప్పటికి; మదిని= మనస్సును; ధర్మ, పథ, ప్రవిహతి, కానీఁడు= ధర్మమార్గానికి దెబ్బతగిలేటట్లు చేయడు; అతఁడు; పేర్మిన్= గొప్పతనంలో; అ, ద్వితీయుఁడు= (రెండవ) సాటి లేనివాడు.

తాత్పర్యం: అతడు దేవేంద్రుడి కొడుకైన అర్జునుడు; గొప్పతనంలో సాటిలేని మేటి. కోరికలు, కోపతాపాలు అదుపుతప్పిన రీతిలో మనసున కలిగినప్పటికీ, వాటిని ధర్మమార్గాన్ని ధ్వంసం చేసేటట్లు ప్రవర్తింపచేయడు.

చ. **అయనయసంగ్రహుండు వినయవ్యవసాయి భయార్తలోకసం**
శ్రయుఁడు గృతాస్త్రుఁ డాహవవిశారదశౌర్యుఁడు శిష్టబాంధవ
ప్రియుఁ డసమానసుందరగభీరశుభాకృతి యల్ల పుణ్యుఁ డా
రయ నకులుండు పాండుసుతరత్నము భాసురకీర్తి యిమ్మహిన్. **213**

ప్రతిపదార్థం: నకులుండు= నకులుడు; అయనయసంగ్రహుండు= మేలు చేసెడి నీతి విధానం బాగా తెలిసినవాడు; వినయవ్యవసాయి= నమ్రతను అలవరుచుకొనటానికి కృషిచేసినవాడు; భయ+ఆర్త, లోక, సంశ్రయుఁడు= భీతిచేత దీనులైన జనులకు ఆధారం అయ్యేవాడు; కృత+అస్త్రుఁడు= మంత్రమహిమ కల ఆయుధాలు ప్రయోగించటంలో సిద్ధహస్తుడు; ఆహవ, విశారద, శౌర్యుఁడు= యుద్ధం చేయటంలో కౌశలంతోకూడిన పరాక్రమం కలవాడు; శిష్ట, బాంధవ, ప్రియుఁడు= మంచివారైన బంధువులకు ఇష్టుడు; అసమాన, సుందర, గభీర, శుభ+ఆకృతి= సాటిలేనట్టి అందమైన లోతైన మంచిదైన ఆకారం కలవాడు (సాటిలేని సుందరుడు, లోతైన మనస్సు కలవాడు, శుభమైన ఆకారం కలవాడు); అల్ల= అదిగో చూడుము; పుణ్యుఁడు= సుకృతం చేసినవాడు; ఆరయన్= చూడగా; పాండుసుత రత్నము= పాండురాజు కొడుకులలో రత్నం (శ్రేష్ఠుడు); ఈ+మహిన్= ఈ లోకంలో; భాసురకీర్తి= ప్రకాశించే యశస్సు కలవాడు.

తాత్పర్యం: లోకానికి శ్రేయస్సు కలిగించే నీతి విధానం తెలిసిన వాడున్నూ, విజ్ఞానంవలన ఏర్పడిన వినయం కలవాడున్నూ, భయంచేత దీనులు అయిన ప్రజలను కాపాడి ధైర్యం చేకూర్చేవాడున్నూ, యుద్ధంచేయటంలో గడుసుదనం చూపగల పరాక్రమవంతుడున్నూ, మంచివారైన బంధువులకు సంప్రీతి ఘటించేవాడున్నూ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సాటిలేనిసౌందర్యం కలిగిన ప్రియదర్శనుడున్నూ, పరోపకారపారీణుడున్నూ అయిన అడుగో అతడే పుణ్యాత్ముడు నకులుడు. పాండవులలో రత్నం. భూలోకంలో పేరుప్రతిష్ఠలను ఆర్జించినవాడు.

ఉ. వీరుఁడు చిత్రయోధి దృఢవేధి కృతాస్త్రుఁడు భూరిబుద్ధి వి
స్ఫారుఁడు వాగ్విశారదుఁడు పార్థులకూరిమితమ్ముఁ డుజ్జ్వలా
కారుఁడు ధర్మదక్షుఁ డవికారుఁడు ప్రౌఢపతంగతేజుఁ డ
ద్ధీరుఁడు పాండవుండు సహదేవుఁడు దేవనిభుండు పెంపునన్. 214

ప్రతిపదార్థం: సహదేవుఁడు= సహదేవుడు; వీరుఁడు= గొప్పపరాక్రమం కలవాడు; చిత్రయోధి= అచ్చెరువుకొలిపే యుద్ధం చేయగలవాడు; దృఢవేధి= గురిచూచి గట్టిగా తగిలేటట్లు ఆయుధాలు ప్రయోగించగలవాడు; కృత+అస్త్రుఁడు= మంత్రమహిమ గల ఆయుధాలను వాడటంలో సిద్ధహస్తుడు; భూరిబుద్ధివిస్ఫారుఁడు= గొప్ప తెలివి తేటలు విస్తరించిన మేధావి; వాక్+విశారదుఁడు= మాటలలో నేర్పరి; ధర్మదక్షుఁడు= ధర్మం నిర్వహించటంలో సమర్థత కలవాడు; పార్థుల కూరిమి తమ్ముఁడు= పాండవులకు ప్రియమైన కడగొట్టు తమ్ముడు; ఉత్+జ్వల+ఆకారుఁడు= గొప్పగా ప్రకాశించే రూపం కలవాడు, తేజస్వి; అవికారుఁడు= చిత్తవికారాలు లేనివాడు; ప్రౌఢపతంగతేజుఁడు= చండమార్తాండుడివంటి ప్రకాశం కలవాడు; ఆ+ధీరుఁడు= చిత్తస్థైర్యం కలవాడు; పాండవుండు= పాండురాజుయొక్క కొడుకు; పెంపునన్= గొప్పతనంలో; దేవ, నిభుండు= దేవతలతో సమానుడు;

తాత్పర్యం: సహదేవుడు మానవమాత్రుడు కాడు సుమా! అతిలోక తేజస్వి అయిన అతడు దేవతలతో సమానుడు. గొప్పపరాక్రమం కలిగినవాడు. ఆశ్చర్యం గొలిపేవిధంగా యుద్ధంచేయగలవాడు. గురిచూచి గాటంగా నాటేటట్లు ఆయుధాలు ప్రయోగించే లక్ష్యశుద్ధి కలవాడు. బుద్ధికుశలత కల మేటి మేధావి. పొంకంగా తూచితూచి మాటలు కూర్చగల వక్త. పాండవులు అనురాగంతో లాలించే కట్టకడపటి తమ్ముడు. దేదీప్యమాన మైన తేజస్సు కలవాడు, ధర్మనిర్వహణ సమర్థుడు, చండమార్తాండుడివలె వెలుగొందేవాడు. చిత్తవికారాలు లేని ధైర్యశాలి. గొప్పతనంలో దేవతలతో సమానుడు. అడుగో అతడే సహదేవుడు. చూడుము.

తే. కొడుకులం దెల్లఁ గడుఁగూర్చు గొంతి యితని; । కిమ్మహాత్ముఁడు మహి చలియించె నేని
నగ్ని చల్లన యయ్యె నే నాత్మఁ దాను । ధర్మనిష్ఠుఁ డై సత్యంబు దప్పఁ డెపుడు. 215

ప్రతిపదార్థం: గొంతి= కుంతీదేవి; ఇతనికిన్= ఇతనిపై (ఈ సహదేవుడిని); కొడుకులందున్+ఎల్లన్= అందరి కుమారులలో; కడున్ మిక్కుటంగా; కూర్చున్= వాత్సల్యం చూపుతుంది; ఈ+మహా+ఆత్ముఁడు= ఈ మహానుభావుడు; మహి= భూమి; చలియించెన్+ఏనిన్= కంపించినప్పటికిన్నీ; అగ్ని= నిప్పు; చల్లన+అయ్యెన్+ఏని= చల్లబడినప్పటికిన్నీ; తాను= తాను (సహదేవుడు); ఆత్మన్= మనస్సులో; ధర్మనిష్ఠుఁడు+ఐ= ధర్మంలోనే ఏకాగ్రత కలవాడై; ఎపుడున్= ఏ సమయంలోనూ; సత్యంబున్= నిజాన్ని; తప్పఁడు= వీడడు.

తాత్పర్యం: కుంతీదేవికి తన కొడుకులు అందరిపై కంటె ఈ సహదేవుడిమీదనే వాత్సల్యం మెండు. ఈ మహాత్ముడు సంతత సత్యసంధుడు. భూమి కంపించవచ్చును, అగ్గి చల్లబడవచ్చును కాని సహదేవుడు మాత్రం ధర్మనిష్ఠ వదలిపెట్టడు, బొంకు పలుకడు.

వ. వీ రేవురు నత్యంతదుర్వారులు; వీరి బారిం బడిన వారాశినడుమ నుగ్రమకరాహతంబై యవియు పేరోడయుం బోలె నీసైన్యంబు వికలం బగు; నీవునుం బ్రాణం బొండె మానం బొండెఁ గోల్పోక మెయిమెయిం

బో నేర్చెదవే?' యనియె; నప్పుడు కౌంతేయులు సైంధవసేనం దలపడి దిఙ్ముఖంబున నెల్లం జీఁకట్లు గవియునట్లుగా బాణపటలంబులు పఱఁగింపం దొడంగిన. **216**

ప్రతిపదార్థం: వీరు+ఏవురున్= వీరు అయిదుగురు - పంచపాండవులు; అతి+అంత, దుర్వారులు= వారించుటకు శక్యంగాని వీరులు; వీరి= పాండవులయొక్క; బారిన్+పడిన= హింసకు గురియైతే; వారాశినడుమన్= సముద్రమధ్యంలో; ఉగ్ర, మకర+ఆహతంబు+ఐ= భయంకరమైన మొసళ్ల చేత కొట్టబడినట్టిదై; అవియు= పగులు; పేరు+ఓడయున్+పోలెన్= పెద్ద నావవలె; నీసైన్యంబు= నీసేన; వికలంబు+అగున్= చెదరుతుంది; నీవునున్= నీవు సయితం; ప్రాణంబు+ఒండెన్= ప్రాణంకాని; మానంబు+ఒండెన్= గౌరవంకాని; కోల్పోక= పోగొట్టుకొనక; మెయిమెయిన్= అనాయాసంగా; పో, నేర్చెదవే?= పోగలవా?; అనియెన్= అని చెప్పింది; అప్పుడు= ఆ సమయంలో; కౌంతేయులు= కుంతీపుత్రులు- పాండవులు; సైంధవసేనన్= జయద్రథుడి సైన్యాన్ని; తలపడి= తాకి; దిక్+ముఖంబునన్= దిక్కుల పురోభాగంలో; ఎల్లన్= పూర్తిగా; చీకట్లు= అంధకారాలు; కవియునట్లుగాన్= ముసిరేటట్లుగా; బాణ పటలంబులు= అమ్ముల సముదాయాలు; పఱఁగింపన్+తొడంగినన్= ప్రయోగించ సాగగా.

తాత్పర్యం: పంచపాండవులు జయించ నలవిగానివారు సుమా. ఎవరును వీరిబారినుండి తప్పించుకొనలేరు. సముద్రమధ్యంలో మొసళ్లకు చిక్కి బ్రద్దలయ్యే పెద్దనౌకవలె నీసైన్యం పాండవులకు చిక్కి వికలం కాగలదు. ఇక నీవు సయితం ప్రాణాన్ని కోల్పోతావు లేదా గౌరవాన్ని కోల్పోతావు' అని ద్రౌపది సైంధవుడిని హెచ్చరించింది. అంతలో పాండవులు సైంధవుడి సేనలను చుట్టుముట్టి ఆకసాన్ని చీకట్లు క్రమ్మేటట్లుగా అమ్ములసముదాయాలను ప్రయోగించారు.

క. 'తొలఁగకుఁడు పొదువుఁ డేయుఁడు । నిలువుఁడు వడిఁ బొడువుఁ' డనుచు నిజయోధులఁ దాఁ గలయఁ బురికొల్పి సైంధవుఁ । డలఘు పరాక్రముఁడు నిలిచె నాహవభూమిన్. **217**

ప్రతిపదార్థం: తొలఁగకుఁడు= కదలిపోకండి; పొదువుఁడు= చుట్టుముట్టండి; ఏయుఁడు= కొట్టండి; నిలువుఁడు= పారిపోకుండా ఆగండి; వడిన్= వేగంగా; పొడువుఁడు= గ్రుచ్చండి; అనుచున్= అని పలుకుతూ; నిజ, యోధులన్= తనభటులను; తాన్= తాను (సైంధవుడు); కలయన్= కలిసి పోరాటం సలిపేటట్లుగా; పురికొల్పి= ప్రోత్సహించి; అ, లఘు, పరాక్రముఁడు= గొప్ప శౌర్యం కలవాడు; సైంధవుఁడు= జయద్రథుడు; ఆహవభూమిన్= యుద్ధంలో; నిలిచెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: ప్రక్కకు కదలకండి, చుట్టుముట్టండి, కొట్టండి, ధైర్యంతో నిలబడండి, వేగంగా గ్రుచ్చండి' అంటూ తన సైనికులను ఐకమత్యంతో నిలిచి పోరాడం డని ప్రోత్సాహిస్తూ జయద్రథుడు గొప్పపరాక్రమం ప్రదర్శించేవాడై రణరంగంలో నిలబడ్డాడు.

వ. ఇట్లు, త్రిగర్తశిబిసింధుసైన్యంబులతో ననేకనరపతిపరివృతుండై నిలిచిన జయద్రథుం జూచి, భీమసేనుండు క్రోధారుణలోచనుం డై, రథంబు డిగ్గి హేమబంధ బంధురంబును నయోమయంబును నగు గదాదండంబు ద్రిప్పుచు వానిపయిం గవిసిన నడ్డపడి కోటికాస్యుండు నిజసైన్యసంఘంబుతో నమ్మహావీరుం బొదువుటయు నతండు. **218**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈరీతిగా; త్రిగర్తశిబి సింధుసైన్యంబులతోన్= త్రిగర్తులకు శిబికి సింధుదేశానికి సంబంధించిన సేనలతో; అనేక, నరపతి పరివృతుండు+ఐ= పెక్కురురాజులచేత చుట్టకొనబడినవాడై; నిలిచిన= నిలబడిన; జయద్రథున్+చూచి=

సైంధవుడిని అరసి; భీమసేనుండు= భీముడు; క్రోధ+అరుణ, లోచనుండు+ఐ= కోపంచేత ఎర్రవారిన నేత్రాలు కలవాడై; రథంబు+డిగ్గి= తేరు దిగి; హేమ, బంధ, బంధురంబును= బంగారు పిడిచేత పొదుగబడినదియున్నూ; అయస్+మయంబును= ఇనుముతో కూడినదియున్నూ; అగు= అయిన; గదాదండంబు= గదను; త్రిప్పుచున్= ఇటు నటు సంచలింపజేస్తూ; వానిపయిన్= అతడిపై, జయద్రథుడిపై; కవిసినన్= ఉఱకగా; కోటికాస్యుండు= కోటికాస్యుడు; అడ్డపడి= అడ్డంవచ్చి; నిజ, సైన్య, సంఘంబుతోన్= తనయొక్క సేనల సముదాయంతో; ఆ+మహావీరున్= ఆగొప్పయోధుడిని; పొదువుటయును= చుట్టుముట్టుటమున్నూ.

తాత్పర్యం: ఈవిధంగా త్రిగర్తశిబిసింధుసేనలు పెక్కురు రాజులు తన చుట్టు చేరిఉండగా రణరంగంలో నిలిచిన సైంధవుడిని చూచి భీముడు కోపంచేత ఎర్రబడిన కన్నులతో తనరథం దిగి, బంగారుపిడి గల ఇనుపగదను త్రిప్పుతూ అతడిపైకి ఉరికాడు. అంతట కోటికాస్యుడు భీముడికి అడ్డుపడి తనసేనలతో కలిసి ఆ మహావీరుడిని ఎదుర్కొన్నాడు.

క. మదగజముల రథయోధులఁ । బదాతులను దురగములను బలువిడిఁ గలయం
జదుపుచు దుర్వారగతిన్ । విదితబలుఁడు ఘనగదాప్రవీణత మెఱసెన్. 219

ప్రతిపదార్థం: మదగజములన్= మదించిన ఏనుగులను; రథయోధులన్= రథికులను; పదాతులను= కాల్బలాలను; తురగములను= గుర్రాలను; బలువిడిన్= ఉత్సాహంతో; కలయన్+చదుపుచున్= కలసిపోవునట్లుగా నేలమట్టంచేస్తూ; దుర్వారగతిన్= వారించటానికి వీలులేని విధంగా; విదితబలుఁడు= తేటతెల్లమైన బలం కలవాడు అయిన భీముడు; ఘన, గదా, ప్రవీణతన్= గొప్పదైన గదయందు గల నేర్పును; మెఱసెన్= ప్రకాశింపచేశాడు.

తాత్పర్యం: భీముడు మత్తేభాలను, రథాలతో కూడిన రథికులను, గుర్రాలను, కాల్బలాలను కలతచెందించి నేలమట్టంచేసి, తన గదాప్రయోగకౌశలాన్ని ప్రకాశింపచేశాడు.

వ. ఇట్లు విహరించి యహితసైన్యంబు నిహతం బగుటయుఁ జెలంగి సింహనాదంబు సేసి, యతండు సారథి సముపనీతం బైన రథంబు సాదరంబుగా నెక్కి గృహీతశరాసనుండై విక్రమించె; మఱియును. 220

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; విహరించి= యథేచ్ఛగా తిరిగి; అహిత సైన్యంబు= విరోధి సేన; నిహతంబు+అగుటయున్= చచ్చుటయున్నూ; చెలంగి= ఉత్సహించి; సింహనాదంబు+చేసి= సింహగర్జన వంటి కేక పెట్టి; అతండు= అతడు, భీముడు; సారథి, సముపనీతంబు+ఐన= సారథిచేత దగ్గరకు తీసికొనిరాబడిన; రథంబు= అరదం; సాదరంబుగాన్= అభిమాన పురస్సరంగా; ఎక్కి= ఆరోహించి; గృహీత, శరాసనుండు+ఐ= పట్టిన ధనుస్సు కలవాడై; విక్రమించెన్= పరాక్రమించాడు; మఱియును= వెండియును.

తాత్పర్యం: ఈ విధంగా భీముడు రణరంగంలో యథేచ్ఛగా తిరిగి శత్రుసేనలను రూపుమాపి సింహనాదం చేశాడు. తదుపరి సారథి తనకడకు తీసికొని వచ్చిన రథాన్ని అధిరోహించి, విల్లు చేపట్టి అమ్ములతో మరల యుద్ధం చేయసాగాడు.

క. అలిగి యుధిష్ఠిరుఁడును న । గ్గలికం బ్రతివీరు లదరఁ గార్ముక విద్యా
విలసనము మిగుల సావీ । రుల నూర్వుర రథికవరుల రూ పడఁగించెన్. 221

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: యుధిష్ఠిరుఁడును= ధర్మరాజును; అలిగి= కోపించి; అగ్గలికన్= పూనికతో; ప్రతివీరులు+అడరన్= శత్రువీరులు భయపడేటట్లుగా; కార్ముక, విద్యా, విలసనము= విలువిద్య యొక్క విలాసం; మిగులన్= అతిశయించగా; సౌవీరులన్= సౌవీరజాతికి చెందిన; నూర్వుర రథికవరులన్= వందమంది రథయోధులలో శ్రేష్ఠులను; రూపు+అడఁగించెన్= సంహరించాడు.

తాత్పర్యం: ధర్మరాజు కోపించి పూనికతో యుద్ధంచేసి శత్రువీరులు వెరపు చెందేటట్లుగా విలువిద్య ప్రకాశింప జేసి నూరుమంది సౌవీర రథయోధులను చంపాడు.

క. నకులుఁడు నిశాతసాయక । నికరంబుల సమర ధారుణీతల మెల్లం
బ్రకట పరవీరవరమ । స్తక బంధురముగ నొనర్చె దారుణభంగిన్. 222

ప్రతిపదార్థం: నకులుఁడు= నకులుడు; నిశాత సాయక నికరంబులన్= వాడియైన అమ్ముల సముదాయాలచేత; సమర ధారుణీతలము+ఎల్లన్= యుద్ధభూమిని అంతటినీ; దారుణభంగిన్= ఘోరమైన విధంగా; ప్రకట పరవీరవరమస్తక బంధురముగన్= స్పష్టముగా శత్రువీరశ్రేష్ఠుల యొక్క తలకాయలతో నిండినదిగా; ఒనర్చెన్= చేశాడు.

తాత్పర్యం: నకులుడు వాడిఅమ్ములను ప్రయోగించి యుద్ధభూమంతా శత్రువీరుల తలకాయలతో నిండిపోయి భయంకరంగా కనబడేటట్లు చేశాడు.

క. నారాచపాతముల దు । ర్వారుఁడు సహదేవుఁ డాహవ ముఖంబున న
శ్వారోహకులం గూల్చుచు । వీరవిహారంబు సలిపె వేడ్క యెలర్పన్. 223

ప్రతిపదార్థం: దుర్వారుఁడు= వారించుటకు వీలులేనివాడు; సహదేవుఁడు; నారాచపాతములన్= బాణాలను వర్షించటంచేత; ఆహవ, ముఖంబునన్= యుద్ధరంగపు ముందుభాగంలో; అశ్వ+ఆరోహకులన్= రౌతులను; కూల్చుచున్= సంహరిస్తూ; వేడ్క= వినోదం; ఎలర్పన్= శోభిల్లగా; వీరవిహారంబు= వీరుడు చేసే స్వేచ్ఛాయానం; సలిపెన్= చేశాడు.

తాత్పర్యం: బాణాలను ప్రయోగించి సహదేవుడు యుద్ధరంగంలో అనిమొనలోని అశ్వికులను సంహరించి వీరవిహారం చేశాడు.

ఆ. సింధురాజసైన్య సింధుపూరమునందు । మహిత ఫల్గునాఖ్య మంథనగము
దిరిగి కలఁపఁదొడఁగెఁ బరనృపాలక మహా । జలచరవ్రజంబు సంచలింప. 224

ప్రతిపదార్థం: మహిత, ఫల్గున+ఆఖ్య, మంథనగము= అర్జునుఁడు అనే పేరుగల గొప్ప మందర పర్వతం; సింధు రాజ సైన్య సింధుపూరమునందున్= సింధురాజుయొక్క సేన అనెడి ముద్రజలసమూహంలో; తిరిగి= పరిభ్రమించి; పర, నృపాలక, మహా, జలచర, వ్రజంబున్= శత్రురాజులు అనెడి జలజంతువుల సముదాయం; సంచలింపన్= క్షోభించేటట్లుగా; కలఁపన్+తొడఁగెన్= కదిపి కుదిపి వేయసాగాడు.

తాత్పర్యం: సింధురాజుయొక్క సైన్యం అనెడి సముద్రజలాలలో అర్జునుడు అనే గొప్ప మందరపర్వతం కలయదిరిగి శత్రురాజులు అనే జలచర సముదాయాన్ని క్షోభింపజేస్తూ కదిపి కుదిపివేసింది.

విశేషం: (1)అలం: రూపకం. (2) క్షీరసాగర మథనం-దేవదానవులు మందరగిరిని కవ్వంచేసి పాలకడలిని చిలకడం, సుప్రసిద్ధ పౌరాణికగాథ,

సీ. వారణకోటి దదారోహకులతోన । వివశమై యొఱలుచు నవనిఁ ద్రెళ్లెఁ;
సూతహయధ్వజపాతపూర్వకముగ । రథములు దుమురయ్యె రథులతోన;
వెస రావుతులతోన వసమతి హయములు । గెడసి యెల్లెడలను బుడమిఁ గప్పెఁ;
దండడిఁ దెరలుచు సందడి పెల్లుగాఁ । గాలుబలంబులు గూలెఁ గలయఁ

ఆ. దుములు మధిక మయ్యె సమరతలంబున । ఘోరరుధిరవారిపూర మెసఁగెఁ;
జితవిరోధిబలుఁడు శతమఖసూనుండు । చాపనైపుణంబు సూపునపుడు. 225

ప్రతిపదార్థం: జిత, విరోధి, బలుఁడు= జయించబడిన శత్రువుల సైన్యం కలవాడు; శతమఖ, సూనుండు= ఇంద్రుడికొడుకు; చాపనైపుణంబు= వింటినేర్పు; చూపునపుడు= ప్రదర్శించేటప్పుడు; వారణకోటి= ఏనుగుల సముదాయం; తత్+ ఆరోహకులతోన్+అ= ఆ ఏనుగులను ఎక్కిన వీరులతో పాటుగా; వివశము+ఐ= వశం తప్పి; ఒఱలుచున్= వ్రాలుతూ; అవనిన్= భూమిపై; త్రెళ్లెన్= పడిపోయింది; సూత, హయ, ధ్వజ, పాత, పూర్వకముగన్= సారథి గుఱ్రాలు జెండాలు ముందు పడునటువంటివి కాగా; రథములు= అరదాలు; రథులతోడన్= రథయోధులతో పాటుగ; తుమురు+అయ్యెన్= ముక్కలు అయ్యాయి; వెసన్= శీఘ్రంగా; రావుతులతోన= ఆశ్వికులతోపాటు; వసమతి= అదుపు తప్పి; హయములు= గుఱ్రాలు; కెడసి= చచ్చి; ఎల్ల+ఎడలను= అన్నిచోట్లలో; పుడమిన్= భూమిని; కప్పెన్= ఆవరించాయి; దండడిన్= దట్టంగా; తెరలుచున్= పొరలుచు; సందడి= సమ్మర్దం; పెల్లుగాన్= అతిశయించగా; కాలు బలంబులు= కాల్బలాలు, పదాతులు; కలయన్+కూలెన్= కుప్పకూలాయి; తుములము= సందడి కయ్యం; అధికము+అయ్యెన్= హెచ్చింది; సమర తలంబునన్= రణరంగంలో; ఘోర, రుధిర, వారి పూరము= భయంకర మైన నెత్తురు ప్రవాహం; ఎసఁగెన్= అధికమయింది.

తాత్పర్యం: అర్జునుడు తన విలువిద్యను ప్రదర్శించేటప్పుడు భయంకరమైన నెత్తురు ప్రవాహాలు ఏర్పడ్డాయి. అతడు శత్రువులసేనలు సంహరించే సామర్థ్యం కలవాడు. ఏనుగుల సమూహాలు వాటిపై ఎక్కి యుద్ధం చేస్తున్న వీరులతో పాటు వశంతప్పి భూమిపై వ్రాలిపడి పోయాయి. రథాలు రథికులతో, గుఱ్రాలతో జెండాలతోపాటు ముక్కలు చెక్కలై రణరంగాన్ని కప్పివేశాయి. గుఱ్రాలు రౌతులతోపాటు అధీనం తప్పి యుద్ధభూమిపై కూలిపోయాయి. కాల్బలాలు దొమ్మియుద్ధం చేస్తూ కుప్పలు కుప్పలుగా రణరంగంలో ఒరిగిపోయాయి. యుద్ధభూమి బీభత్సంగా కన్పించింది.

తే. సవ్యకరమునందును నపసవ్యకరము । నందుఁ బర్యాయ సంగత మగుచుఁ జూడఁ
గొఱవి ద్రిప్పిన యొప్పన మెఱసెఁ బార్థు । గాండివము వాలుఁదూపులగని యనంగ. 226

ప్రతిపదార్థం: పార్థు గాండివము= గాండివం అనే పేరు కల్గిన అర్జునుడివిల్లు; సవ్యకరము నందున్= ఎడమచేతిలోనూ; అపసవ్య, కరమునందున్= కుడి చేతిలోనూ; పర్యాయ సంగతము+అగుచున్= ఒకమారు అటు ఒకమారు ఇటు సమకూర్చబడినదై; చూడన్= అరయగా; కొఱవి= మండెడు కఱ్ఱ; త్రిప్పిన+ఒప్పునన్= త్రిప్పిన విధంగా; వాలు+తూపుల గని= వాడి అమ్ములగని; అనంగన్= అనేటట్లుగా; మెఱసెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: అర్జునుడు కవ్వడి. (కవ+వడి) రెండు వడులు కలవాడు; సవ్యసాచి= రెండు చేతులతో బాణాలు ప్రయోగించేవాడు. అర్జునుడు గాండీవం చేతబట్టి ఒకసారి కుడిచేతితో మరొకమారు ఎడమచేతితో బాణాలు ప్రయోగించాడు. అప్పుడు గాండీవం అమ్ములగనివలె కన్పించింది. త్రిప్పుతున్న కొరవివలె ప్రకాశించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అర్జునుడు గాండీవం అమ్ములగని వలె కన్పించటానికి మూలహేతువు అది అక్షయ తూణీరంతో కూడిఉండటం కావటమే. అగ్నిదేవుడు ఖాండవదహనసమయంలో అర్జునుడికి అక్షయతూణీరం (తరుగని అమ్ములపొది), ఇతరులు నరుకలేని ధనుస్సు అయిన గాండీవాన్ని బహూకరించాడు.

వ. అట్టియెడం ద్రిగర్తపతి యైన సుధన్వుండు గదాహస్తుండై రథంబు డిగ్గి చని ధర్మతనయు రథ్యంబులఁ గూలనేసిన, నతండు నిశితసాయకంబున వానియురంబు వ్రచ్చి విగతజీవుం గావించి, సత్వరంబుగాఁ జని సహదేవు నరదం బెక్కె; మఱియును ద్రిగర్తులలోన మహాముఖ క్షేమంకరు లనువారు నకులుం బొదివి ఘనశరాసారంబు గురిసి జలధరంబులుం బోలె గర్జిల్లిన, నమ్మాద్రీసూనుండు వారి నిద్దఱఁ బెక్కమ్ముల నొప్పించె; నంతఁ దదీయాగ్రజుం డగు సురథుండు. 227

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ తరుణంలో; త్రిగర్తపతి+ఐన= త్రిగర్త దేశానికి ప్రభువు అయిన; సుధన్వుండు= సుధన్వుడు అనే వాడు; గదా, హస్తుండు+ఐ= గద చేతపూనిన వాడై; రథంబు, డిగ్గి= తేరు దిగి; చని= వెడలి; ధర్మతనయు, రథ్యంబులన్ ధర్మనందనుడియొక్క గుర్రాలను; కూలన్+ఏసినన్= సంహరించగా; అతండు= ఆ ధర్మరాజు; నిశిత, సాయకంబునన్= వాడిబాణంచేత; వాని= ఆ సుధన్వుడియొక్క; ఉరంబు= వక్షం; వ్రచ్చి= చీల్చి; విగతజీవున్+కావించి= చంపి; సత్వరంబుగాన్= వేగంగా; చని= వెడలి; సహదేవు+అరదంబు+ఎక్కెన్= సహదేవుడియొక్క తేరును అధిరోహించాడు; మఱియును= వెండియు; త్రిగర్తులలోనన్= త్రిగర్తులలో; మహాముఖ, క్షేమంకరులు+అనువారు= మహాముఖుడు క్షేమంకరుడు అనేవారు; నకులున్+పొదివి= నకులుడిని చుట్టుముట్టి; ఘనశర+ఆసారంబు= పెద్ద అమ్ములవాన; కురిసి= వర్షించి; జలధరంబులున్+పోలెన్= మేఘాలవలె; గర్జిల్లినన్= ఉరుమగా; ఆ+మాద్రీ, సూనుండు= ఆ మాద్రికొడుకు; వారిన్+ఇద్దఱన్= వారిరువురిని- మహాముఖ క్షేమంకరులను; పెక్కు+అమ్ములన్= అనేక బాణాలు ప్రయోగించి; నొప్పించెన్= బాధించాడు; అంతన్= అంతట; తదీయ+అగ్రజుండు+అగు= వారి యొక్క అన్న అయిన; సురథుండు= సురథుడు.

తాత్పర్యం: ఆ తరుణంలో త్రిగర్తదేశప్రభువు అగు సుధన్వుడు తనచేత గద ధరించి తేరు డిగ్గి ధర్మరాజుపై విజృంభించి అతడి రథానికి పూన్చిన గుర్రాలను చంపాడు. ధర్మరాజు ఒక వాడి బాణంతో ఆ సుధన్వుడివక్షం చీల్చి ఆతడిని సంహరించి, తాను సహదేవుడి రథంపై ఎక్కాడు. అంతట త్రిగర్తులలోని వీరులు మహాముఖుడును, క్షేమంకరుడును నకులుడిని చుట్టూ క్రమ్ముకొని, మేఘాలవలె గర్జిస్తూ అమ్ములజడివాన అతనిపై వర్షించారు. నకులుడు ఆ ఇరువురితో యుద్ధంచేసి, పెక్కుబాణాలు ప్రయోగించి వారిరువురిని బాధించాడు. అంతట వారి అన్న సురథుఁడు.

చ. కరినికరంబుతోఁ దొడరి గర్వితుఁడై తనవారణేంద్రు న
క్కురుకులవీరుమీఁద నెసఁగొల్పినఁ దద్రథఘోటకంబులం
బరుషతఁ జంపు నగ్గజము వాయక వాఁ డసిచర్మహస్తుఁడై
ధరణికి దాఁటుచో నది మదంబున వెండియుఁ బైఁ గడంగినన్. 228

ప్రతిపదార్థం: కరి, నికరంబుతోన్= ఏనుగుల సముదాయం తోడుగా పెట్టుకొని; తొడరి= పూని; గర్వితుఁడు+ఐ= మదించిన వాడై; తన, వారణ+ఇంద్రున్= తన యొక్క శ్రేష్ఠమైన ఏనుగును; ఆ+కురుకుల వీరుమీఁదన్= నకులుడిపై; ఎసఁగొల్పినన్= ఎదుర్కొనుటకు ప్రోత్సహించగా; తత్+రథ, ఘోటకంబులన్= ఆ నకులుడి తేరుయొక్క గుర్రాలను; పరుషతన్= కఠినంగా; చంపు= చంపే; ఆ+గజమున్= ఆ ఏనుగును; వాయక= వదలక (అంతటితో ఆగకుండా); వాఁడు= నకులుడు; అసిచర్మ

హస్తుఁడు+ఐ= కత్తిని డాలును చేతులలో ధరించినవాడై; ధరణికిన్= భూమికి; దాఁటుచోన్= ఉరికేటప్పుడు; అది= ఆ యేనుగు; వెండియున్= మరల; పైన్+కడంగినన్= నకులుడి మీదకు వచ్చి పడటంచేత.

తాత్పర్యం: సురథుడు తన ఏనుగులతండాన్ని తన వెంటపెట్టుకొని తన గజరాజాన్ని నకులుడిపై పురికొల్పాడు. ఆ యేనుగు విజృంభించి నకులుడి రథాశ్వాలను చంపింది. నకులుడు అంతట రథంపై నుండి కత్తిని డాలును చేబూని భూమిపై దూకినప్పుడు ఆ ఏనుగు మదించి ఆతనిపై విజృంభించింది.

చ. తొలఁగక యమ్మహాబలుఁడు దోర్బల మొప్పఁ గృపాణపాతభం
గులఁ గరినాథు కేలు నిరుగొమ్ములతో బెరయంగఁ ద్రుంప బె
ట్టిలకు విచేష్టమై నొఱగు నేనుఁగుపై నతిమాత్రభీతి వి
హ్వలుఁ డగు శత్రు నుద్ధతిఁ గృతాంత విధేయునిఁ జేసె వ్రేల్మిడిన్. 229

ప్రతిపదార్థం: ఆ+మహాబలుఁడు= ఆ గొప్ప బలవంతుడు- నకులుడు; తొలఁగక= (తాను విరథుడు అయినప్పటికీ యుద్ధభూమి) వీడక; దోర్బలము= భుజ శక్తి; ఒప్పన్= శోభిల్లగా; కృపాణ, పాత, భంగులన్= కత్తి వేటుల రీతులలో; కరినాథుకేలున్= ఆ గొప్ప ఏనుగు తుండాన్ని; ఇరు+కొమ్ములతోన్= రెండు దంతాలతో; బెరయంగన్= కలిసి ఒకటి అయ్యేటట్లుగా; త్రుంపన్= ఖండించగా; బెట్టు= మిక్కుటంగా; ఇలకున్= భూమికి; విచేష్టము+ఐ= చేష్టదక్కి, కదలిక లేనిదై; ఒఱగు= వ్రాలే; ఏనుఁగుపైన్= ఏనుగుమీదనే; అతి మాత్ర భీతి, విహ్వలుఁడు+అగు= కొలదికి మించిన భయంచేత చేష్టలుడిగినవాడు అయిన; శత్రున్= శత్రువును; ఉద్ధతిన్= గర్వంతో; వ్రేల్మిడిన్= శీఘ్రంగా; కృతాంత, విధేయునిన్ +చేసెన్= యముడికి అధీనుడిగా చేశాడు అంటే సంహరించాడు.

తాత్పర్యం: తాను విరథుడు అయినప్పటికీ, యుద్ధం విరమించక గొప్పబలం గల ఆ నకులుడు ఆ మత్తేభాన్ని తన కత్తితో ఎదుర్కొని దాని తుండాన్ని దంతాలను ఖండించాడు. ఆ యేనుగు చేష్ట దక్కి భూమిపై కూలిపోయింది. ఆ మత్తేభంమీద నున్న వీరుడు సురథుడు ఆ దృశ్యాన్ని చూచి మిక్కిలిభయంతో చేష్టలుడిగాడు. అంతట అతడిని నకులుడు యమలోకానికి పంపాడు.

క. వైరులు దలఁకఁగ నిమ్మై । దారుణపౌరుషవిశేషదక్షుం డై య
వ్వీరుఁడు రయమున నరిగి స । మీరతనయునరద మెక్కి మెఱసెం బోరన్. 230

ప్రతిపదార్థం: ఆ+వీరుఁడు= నకులుడు; వైరులు= శత్రువులు; తలఁకఁగన్= భయపడగా; ఇమ్మైన్= ఈ రీతిగా; దారుణ, పౌరుష, విశేష దక్షుండు+ఐ= భయంకరమున్నూ పేర్కొనదగినట్టిదియున్నూ అయిన పరాక్రమం చూపటంలో నేర్పరి అయి; రయమునన్= వేగంగా; అరిగి= వెళ్లి; సమీరతనయు+అరదము+ఎక్కి= వాయుపుత్రుడు అయిన భీమసేనుడి రథాన్ని ఎక్కి; పోరన్= యుద్ధంలో; మెఱసెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: శత్రువులు భయపడేటట్లుగా ఆ రీతిగా సాటిలేని శౌర్యసాహసాలు ప్రదర్శించినవాడయి, సమర్థుడు అయిన ఆ వీరుడు నకులుడు వేగంగా వాయుపుత్రుడైన భీముడి రథాన్ని ఎక్కి, యుద్ధంలో ప్రకాశించాడు.

చ. ఘనుఁడు వృకోదరుండు దనుఁ గట్టలుకం దలపడ్డ కోటికా
స్యుని తురగంబులం దునిమి సూతునికంఠముఁ ద్రుంచి వైచి తీ

ప్రనిశిత మైన ప్రాసమున వాని యురంబు వగిల్చి చంపినం

గనుకనిఁ బాఱె భీతి యెసఁగంగఁ దదీయ చమూసమూహముల్. **231**

ప్రతిపదార్థం: ఘనుఁడు= గొప్పవాడు; వృక+ఉదరుండు= (తోడేలు పొట్ట వంటి కడుపు గలవాడు) భీముడు; తనున్= తనను; కట్టలుకన్ (కడు+అలుకన్)= మిక్కిలి కోపంతో; తలపడ్డ= ఎదుర్కొన్న; కోటికాస్యునిన్= కోటికాస్యుడనే వాడియొక్క; తురగంబులన్= అశ్వాలను; తునిమి= చంపి; సూతుని కంఠమున్= సారథి కుత్తుకను; త్రుంచి వైచి= నరికివేసి; తీవ్ర, నిశితము+ఐన= మిక్కిలి వాడి అయిన; ప్రాసమునన్= ఈటె చేత; వాని+ఉరంబు= కోటికాస్యుడి వక్షం; పగిల్చి= పగులగొట్టి; చంపినన్= సంహరించగా; కనుకనిన్= సంభ్రమంతో; తదీయ, చమూ, సమూహముల్= ఆతడియొక్క (కోటికాస్యుని యొక్క) సేనలగుంపులు; భీతి+ఎసఁగంగన్= భయం అతిశయించగా; పాఱెన్= పారిపోయాయి.

తాత్పర్యం: గొప్పవీరుడైన భీమసేనుడు తనపై మిక్కుటమైన కోపంతో దాడిచేసిన కోటికాస్యుడియొక్క రథాశ్వాలను చంపి, ఆతడి సారథి కుత్తుక నుత్తరించి వాడి అయిన ఈటెతో ఆతడి వక్షాన్ని చీల్చి చంపాడు. కోటికాస్యుడి మరణానంతరం ఆతడిసేనలు భయపడి చెల్లాచెదరై పారిపోయాయి.

అర్జునుఁడు సౌవీరకుమారులం బన్నిద్దఱఁ జంపుట (సం. 3-255-27)

వ. **అంత నంగారకుండును, గుంజరుండును, సృంజయుండును, సుప్తకుండును, శత్రుంజయుండును, సుప్రబుద్ధుండును, శుభంకరుండును, భ్రమంకరుండును, శూరుండును, రథియును, గుహకుండును, బలాఢ్యుండును నను సౌవీరకుమారులు పన్నిరువురు నిక్ష్వాకు శిబి సైంధవ త్రిగర్త సైన్యంబులం గూడి క్రీడి మార్కొని పటుబాణజాలంబులం గప్పిన.** **232**

ప్రతిపదార్థం: అంతన్= అంతట; అంగారకుండును; కుంజరుండును, సృంజయుండును, సుప్తకుండును, శత్రుంజయుండును, సుప్రబుద్ధుండును, శుభంకరుండును, భ్రమంకరుండును, శూరుండును, రథియును, గుహకుండును, బలాఢ్యుండును; అను= అను పేర్లుగల; సౌవీర కుమారులు= సౌవీరదేశానికి చెందిన యువకులు; పన్నిరువురున్= పండ్రెండుమంది; ఇక్ష్వాకు, శిబి, సైంధవ, త్రిగర్త సైన్యంబులన్+కూడి= ఇక్ష్వాకులకు, శిబికి, సింధుదేశానికి, త్రిగర్తదేశానికి సంబంధించిన సేనలతోచేరి; క్రీడిన్= అర్జునుడిని; మార్కొని= ఎదిరించి; పటు బాణ జాలంబులన్= బలమైన అమ్ముల సముదాయాలతో; కప్పినన్= ఆవరించగా.

తాత్పర్యం: అంత అంగారకుడు, కుంజరుడు, సృంజయుడు, సుప్తకుడు, శత్రుంజయుడు, సుప్రబుద్ధుడు, శుభంకరుడు, భ్రమంకరుడు, శూరుడు, రథి, గుహకుడు, బలాఢ్యుడు అనే పేర్లుగల పన్నెండుమంది సౌవీరయువకులు, ఇక్ష్వాకు, శిబి, సైంధవ, త్రిగర్త సేనలు కూడిరాగా అర్జునుడిని ఎదుర్కొని అమ్ముల సముదాయాలు గుప్పించారు.

మ. **అతులక్రోధ విఘూర్ణమానహృదయుండై చండ గాండీవ ని**

ర్గత భల్లౌఘములం దదస్త్రవితతుల్ ఖండించి సౌవీరసం

తతిఁ బన్నిద్దఱవిండ్లులం దునిమి దోర్దర్పంబు మీఱంగ స

స్మితుఁడై యాతఁడు దచ్ఛిరఃప్రకర విచ్ఛేదంబు సేసెన్ వెసన్. **233**

ప్రతిపదార్థం: అతుల, క్రోధ, విఘూర్ణమాన, హృదయుండు+ఐ= సాటిలేని కోపంచేత మిక్కుటంగా కలత చెందిన డెందం కలవాడై; చండ, గాండీవ, నిర్గతభల్ల+ఓఘములన్= భయంకర మైన గాండీవమనే వింటినుండి వెలువడిన బల్లేల సమూహాలచేత; తత్+అస్త్ర, వితతుల్= వారియొక్క అస్త్రాలసముదాయాలను; ఖండించి= ముక్కలు చేసి; సౌవీర సంతతిన్, పన్నిద్దర, విండ్లులన్= సౌవీరకుమారులు పన్నెండుమంది కార్ముకాలను; తునిమి= ఖండించి; దోర్దర్పంబు= భుజ పరాక్రమాటోపం; మీఱంగన్= అతిశయించగా; సస్మితుఁడు+ఐ= నవ్వుతో కూడినవాడై; ఆతఁడు= అర్జునుడు; వెసన్= శీఘ్రంగా; తత్+శిరః ప్రకర, విచ్ఛేదంబు= వారియొక్క తలల సముదాయంయొక్క ఖండనం; వెసన్= శీఘ్రంగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: అర్జునుడు కోపంతో నిండిన హృదయం కలవాడై తన గాండీవం నుండి వెలువడిన బల్లేల పరంపరలతో ఆ సౌవీరకుమారుల కార్ముకాలను విరిచి, పిదప వారల శిరస్సులను అలవోకగా ఖండించాడు.

క. ఆకులముగ శైబ్యుల ని। క్ష్వాకుల, సైంధవులనుం ద్రిగర్తులనుం బో
నీక పొదివి రయమున న। స్తోకపరాక్రముఁడు దునిమి తూఁటాడె వడిన్. 234

ప్రతిపదార్థం: అస్తోక పరాక్రముఁడు= తక్కువకాని అనగా గొప్పపరాక్రమం కలవాడు - అర్జునుడు; వడిన్= శీఘ్రంగా; ఆకులముగన్= కలతచెందేటట్లు; శైబ్యులన్= శిబి వంశానికి చెందినవారిని; సైంధవులనున్= సింధుదేశానికి సంబంధించినవారిని; త్రిగర్తులనున్= త్రిగర్తదేశీయులను; పోనీక= తప్పించుకొని పోకుండా; పొదివి= ఆక్రమించి; రయమునన్= వేగంగా; తునిమి తూఁటాడెన్= ముక్కలు ముక్కలుగా ఖండించాడు.

తాత్పర్యం: గొప్పవీరుడైన అర్జునుడు గుంపులు గుంపులుగా పోరాడుతున్న వారందరిని కలచివైచి, శిబివంశానికి చెందిన వారిని, ఇక్ష్వాకులను, సింధుదేశానికి సంబంధించిన వారిని, త్రిగర్తదేశీయులను తప్పించుకొని పోకుండా చుట్టుముట్టి అదిమిపట్టి శీఘ్రంగా తుత్తునియలు చేశాడు.

వ. అప్పుడు రణభూమి యంతయు శవమయం బయ్యె, నంబరం బంతయుం గబంధమయం బయ్యెఁ; జారు కేయూర వీరాంకవిభూషితంబులైన బహుచరణచ్ఛేదంబులును, గార్ముకతూణీరకాండఖండంబులు, నక్షకూబర రథాంగకేతనత్రివేణుకశకలంబులును, బుండరీకవ్యజనచామర భంగంబులుం, గరవాలపరిఘ శక్తిగదా ముసలపట్టిసప్రాస లేశంబులు, నెక్కడఁ జూచిన రాసులై యుండెఁ; గీలాల పూరంబును మాంసపంకంబును గేశ శైవాలంబును నైన యపూర్వనదీప్రవాహంబునందు బహువిధక్రవ్యాదగణంబు లవగాహంబు సేయుచుఁ బ్రకటకోలాహలవ్యాకులం బగుచుండె; నివ్విధంబున. 235

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; రణభూమి+అంతయున్= యుద్ధ ప్రదేశమంతా; శవమయంబు+అయ్యెన్= పీనుగులతో నిండిపోయింది; అంబరంబు+అంతయున్= ఆకసం అంతయును; కబంధ, మయంబు+అయ్యెన్= మొండెములతో నిండింది; చారు, కేయూర, వీర+అంక, విభూషితంబులు+ఐన= అందమయిన భుజకీర్తులతో, వీర లాంఛనాలతో అలంకరించబడిన; బాహు, చరణ+ఛేదంబులును= చేతుల యొక్క, కాళ్ల యొక్క తునుకలున్నూ; కార్ముక, తూణీర కాండ ఖండంబులును= విండ్లు, అమ్ములపొదుల సమూహాల తునుకలు; అక్ష, కూబర, రథాంగ, కేతన, త్రివేణుక, శకలంబులును= ఇరుసులు, నొగలు, చక్రాలు, జెండాలు, మూడు ముల్లులు కల పరిగోలలయొక్క ముక్కలున్నూ; పుండరీక వ్యజన చామర భంగంబులును= తెల్లగొడుగులు విసనకర్రలు, చమరీమృగపు వెంట్రుకలతో చేయబడిన వీవనలయొక్క తునియలున్నూ; కరవాల, పరిఘ, శక్తి గదా ముసల పట్టిస ప్రాస లేశంబులును= కత్తులు, ఇనుపకట్ల గుదియలు, చిల్లకోలలు, గుదియలు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రోకళ్లు, అడ్డకత్తులు, ఈటెల యొక్క చిరుముక్కలు; ఎక్కడన్= ఎచటను; చూచినన్= అరసినప్పటికిన్నీ; రాసులు+ఐ= ప్రోగులు అయి; ఉండెన్= ఉన్నాయి; కీలాల పూరంబును= నెత్తురు ప్రవాహమున్నూ; మాంస పంకంబును= మాంసం అనెడి బురదయున్నూ; కేశ శైవాలంబును= వెంట్రుకలు అనే నాచున్నూ; ఐన= అయిన; అపూర్వ నదీ ప్రవాహంబునందున్= విచిత్రమైన నదియొక్క వెల్లువలో; బహువిధ, క్రవ్యాద గణంబులు= పెక్కు రీతులయిన రాక్షసుల తండాలు; అవగాహంబు+ చేయుచున్= మునుగుతూ; ప్రకట, కోలాహల, వ్యాకులంబు+అగుచుండెన్= వెల్లడి అయిన కలకల ధ్వనితో కలత చెందింది; ఇవ్విధంబునన్= ఈ రీతిగా.

తాత్పర్యం: ఆ సమయంలో యుద్ధప్రదేశమంతయు పీనుగుపెంటలతో నిండింది. ఆకసం మొండెములతో నిండింది. అందమైన భుజకీర్తులతో, రాజలాంఛనాలైన ఆభరణాలతో కూడిన చేతుల కాళ్ళ ముక్కలు, ధనుస్సుల అమ్ములపొదుల ముక్కలు, ఇరుసులు, నొగలు, చక్రాలు, జెండాలు, మూడు ముల్లులు కల అంకుశాల యొక్క ఖండాలు, వెల్లగొడుగులు, చామరాలు మున్నగువాటి ముక్కలు, కత్తులు, ఇనుపకట్ల గుదియలు, చిల్లకోలలు, గుదియలు, రోకళ్లు, అడ్డకత్తులు, ఈటెలు మున్నగు ఆయుధవిశేషాల ఖండికలును ఎక్కడ చూచినా ప్రోగులు ప్రోగులుగా పడి ఉన్నాయి. నెత్తురు అనే నీటివెల్లువతో మాంసమనే బురదతో వెంట్రుకలు అనే నాచుతో ఒక విచిత్రనది ఏర్పడింది. ఆ నెత్తురుటేటిలో పలురకాలైన రాక్షసపిశాచగణాలు మునుగుతున్నాయి. అక్కడ ఏర్పడిన వింత సమ్మర్దం కలకలం వర్ణనాతీతం. ఈ విధంగా.

విశేషం: (1) యుద్ధ బీభత్సాన్ని కనులార చూచినవాడు ఎఱ్ఱాప్రెగ్గడ. తిక్కనకూడ ప్రత్యక్షయుద్ధపరిచయం కల మహాకవియే. కాని, ఎఱ్ఱనకాలంలో జరిగిన యుద్ధబీభత్సం సైనికులనే గాక ప్రజానీకాన్ని అంతటిని ఆవరించినట్టిది. (2) అలంకారం రూపకం.

క. **గాండివపవనప్రేరిత । చండాంబకఘోరశిఖల శతమఖతనయో**
ద్దండదహనుఁ డొకమాత్ర న । ఖండితసౌవీరసైన్యకానన మేర్చెన్. **236**

ప్రతిపదార్థం: శతమఖ, తనయ+ఉద్దండ, దహనుఁడు= అర్జునుడు అనే (దేవేంద్రుడి సుతుడు) అగ్నిహోత్రుడు; గాండివ, పవన ప్రేరిత, చండ+అంబక, ఘోర శిఖలన్= గాండీవ ధనువు అనే వాయువుచేత ప్రజ్వలించజేయబడిన భయంకర మైన బాణాలు అనెడి దారుణమైన అగ్నిజ్వాలలచేత; ఒక మాత్రన్= ఒక క్షణం లోపల మాత్రమే; అఖండిత, సౌవీర, సైన్య, కాననమున్= సమస్త మైన సౌవీరుల సేన అనే అడవిని; ఏర్చెన్= తగులబెట్టాడు.

తాత్పర్యం: దేవేంద్రసుతుడు అయిన అర్జునుడు అనే అగ్నిహోత్రుడు గాండివం అనే గాలిచేత ప్రేరేపించబడి, వాడిబాణాలు అనే జ్వాలలతో సౌవీరసైన్యం అనే అడవిని ఒక క్షణకాలంలో దహించి వేశాడు.

విశేషం: అలం: రూపకం.

వ. **అట్టి క్రందున జయద్రథుండు ద్రౌపదిని దిగ విడిచి రథంబు దోలుకొని పఱచె; నంత ధర్మజుండు ధౌమ్య సమన్వితయై యున్న పాంచాలిం గని నిజరథంబుపై నిడికొనియె; సైంధవు పలాయనం బెఱింగి యర్జునుండు శత్రుసేనాహననసంరంభంబున నున్న భీమసేనున కిట్లనియె.** **237**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; క్రందునన్= యుద్ధ సమ్మర్దంలో; జయద్రథుండు= సైంధవుడు; ద్రౌపదిని= పాంచాలిని; దిగవిడిచి= దిగబెట్టి(తేరునుండి క్రిందికి దింపి విడిచిపెట్టి); రథంబున్= తేరును; తోలుకొని= ముందుకు నడిపించుకొని; పఱచెన్= పారిపోయాడు; అంతన్= అంతట; ధర్మజుండు= ధర్మరాజు; ధౌమ్య+సమన్విత= ధౌమ్యుడితో కూడినదై; ఉన్న= ఉన్నటువంటి; పాంచాలిన్+కని= ద్రౌపదిని చూచి; నిజరథంబుపైన్= తన తేరు మీద; ఇడికొనియెన్= ఉంచుకొన్నాడు; అర్జునుండు; సైంధవు, పలాయనంబు= జయద్రథుడు పారిపోవటం; ఎఱింగి= తెలిసికొని; శత్రు, సేనా, హనన, సంరంభంబునన్= విరోధి సేనను చంపే ఉద్రేకంలో; ఉన్న; భీమసేనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అర్జునుడు సౌవీరసైన్యాన్ని చెండాడే సంరంభంలో మునిగి ఉండగా, జయద్రథుడు ద్రౌపదిని తన రథంనుండి క్రిందికి దింపి, తాను వేగంగా తేరు తోలుకొని పారిపోయాడు. అంతట ధర్మరాజు ధౌమ్యుడితో కూడి ఉన్న ద్రౌపదిని తనరథంపైకి ఎక్కించుకొన్నాడు. అర్జునుడు సైంధవుడు పారిపోయిన సంగతి తెలిసికొని, ఇంకను సైనికులను ఉద్రేకంతో వధిస్తున్న భీమసేనుడికడ కరిగి ఇట్లా అన్నాడు.

తే. **'వీతలజ్జుఁడై పఱచె సౌవీరవిభుఁడు పాసుఁగుప్రజ నేల యాఱడిఁ దునిమి వైవ**
నద్దురాత్ముని వెనుకొని యసువు లిపుడు । గొనఁగవలయు, లే లెమ్ము సద్వినుతశౌర్య! **238**

ప్రతిపదార్థం: సత్+వినుత, శౌర్య!= మంచివారిచేత ప్రశంసించబడిన పరాక్రమం కలవాడా!; భీమసేనా!; వీత లజ్జుఁడు+ఐ= పోయిన సిగ్గు కలవాడై, సిగ్గు లేనివాడై; సౌవీరవిభుఁడు= సౌవీరులయొక్క రాజు- జయద్రథుఁడు; పఱచెన్= పారిపోయాడు; పాసుఁగు ప్రజన్= తేజోవిహీనమైన జనమును; ఆఱడిన్= వ్యర్థంగా; తునిమివైవన్= సంహరించటం; ఏల= ఎందుకు; ఆ, దురాత్మునిన్= దుర్మార్గుడైన ఆ జయద్రథుడిని; వెనుకొని= వెంబడించి; ఇపుడు= ఈ సమయంలో; అసువులు= ప్రాణాలు; కొనఁగన్వలయున్= తీయాలి; లేలెమ్ము (లెమ్ము+లెమ్ము)= లెమ్ము; అనంతర కర్తవ్యాన్ని నిర్వహించటానికై తత్క్షణమే పూనుకొమ్ము.

తాత్పర్యం: 'మంచివారిచేత పొగడబడే పరాక్రమం కల ఓ భీమసేనా! వ్యర్థంగా అమాయకులు, దీనులు అయిన ఈ భటులను ఇక సంహరించటం మానుము. ఈ సౌవీరులరాజు జయద్రథుడు సిగ్గుమాలి యుద్ధాన్ని విడిచి పారిపోయాడు. ఇక మనం ఆతడినే వెంబడించి వాడిప్రాణాలు తీయాలి'.

వ. **అనిన నతండు గయ్యంబు సాలించి ధర్మతనయుం జూచి.** **239**

తాత్పర్యం: అని అర్జునుడు ప్రబోధించగా యుద్ధాన్ని విరమించి ధర్మరాజువైపు చూచి.

క. **'జననాథ! ద్రుపదసుతఁ దో । డ్కొని ధౌమ్యుఁడు నీవుఁ గవలు గుఱుకొని మగుడం**
జనుఁ డాశ్రమంబునకు నే । ముని సైంధవువెనుకఁ గూడ ముట్టెదము వెసన్. **240**

ప్రతిపదార్థం: జననాథ!= రాజా, ఓ ధర్మరాజా!; ద్రుపదసుతన్= ద్రౌపదిని; తోడ్కొని= వెంట నిడుకొని; ధౌమ్యుఁడున్= ధౌమ్యుడును; నీవున్= నీవును; కవలు= నకుల సహదేవులు; గుఱుకొని= పూని (బుద్ధి పూర్వకంగా); ఆశ్రమంబునకున్= విడిదితోటకు; మగుడన్+చనుఁడు= మరలి వెళ్ళండి; ఏమును= మేము (నేను, అర్జునుడును); వెసన్= శీఘ్రంగా; సైంధవు వెనుకన్= జయద్రథుడి యొక్క వెనుకభాగంలో; కూడ ముట్టెదము= వెంబడిస్తాం.

తాత్పర్యం: 'ధర్మరాజా! ద్రౌపదిని తీసికొని మీరున్నూ, ధౌమ్యుడున్నూ, నకులసహదేవులున్నూ నిశ్చింతగా ఆశ్రమానికి తిరిగిపొండి. నేనూ అర్జునుడూ కలిసి శీఘ్రంగా వెళ్ళి జయద్రథుడిని వెంబడించి ముట్టడిస్తాం.

క. అతలంబునఁ గ్రుంగిన న । ద్భుతముగ దివమునకు నెగసి పోయినఁ బగతున్
హతుఁ జేయక మగుడము; విని । హతుఁడుగఁ జేయుదుము దివిజు లడ్డం బైనన్'. 241

ప్రతిపదార్థం: అతలంబునన్+క్రుంగినన్= భూమిక్రింద ఉండే పాతాళలోకానికి దిగినప్పటికీ; అద్భుతముగన్= అచ్చెరువు కలిగించేటట్లుగా; దివమునకున్= ఆకాశానికి; ఎగసి, పోయినన్= ఎగిరిపోయినప్పటికీ; పగతున్= శత్రువును (జయద్రథుడిని); హతున్+చేయక= సంహరించకుండ; మగుడము= తిరిగి రాము; దివిజులు= దేవతలు; అడ్డంబు+ఐనన్= అడ్డుపడినప్పటికిని; వి, నిహతుఁడుగన్+చేయుదుము= సంహరించితీరుతాం.

తాత్పర్యం: పాతాళానికి దిగినా, ఆకాశంపైకి ఎగిరి పారిపోయినా శత్రువైన జయద్రథుడిని సంహరించగలం. దేవతలు అడ్డుపడినా ఆతడిని చంపకుండ విడిచిపెట్టం'.

విశేషం: (1) అతలం సప్తపాతాళాలలో ఒకలోకం. భూమిక్రింద అట్టివి ఏడులోకాలు కలవని పురాణకథనం. 1. అతలం 2. వితలం 3. సుతలం 4. తలాతలం 5. మహాతలం 6. రసాతలం 7. పాతాళం.

తే. అనిన ధర్మజుఁ డిట్లను నద్దురాత్ముఁ । బొలియఁ జేయుట దగదు దుస్సలఁ దలంచి;
వాని నొకతప్పునకు సైఁప వలదె? యాంబి । కేయమహిషికి ఖేదంబు సేయఁ దగునె?' 242

ప్రతిపదార్థం: అనినన్= అని(భీముడు) పలుకగా; ధర్మజుఁడు= ధర్మనందనుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; దుస్సలన్= దుస్సలను (ధృతరాష్ట్రుడి కూతురిని); తలంచి= స్మరించి; ఆ, దురాత్మున్= ఆ దుష్టుడిని, జయద్రథుడిని; పొలియన్+చేయుట= సంహరించటం; తగదు= కూడదు. వానిన్= అతడిని (జయద్రథుడిని), ఒక తప్పునకున్= ఒకనేరానికి; సైఁపన్ వలదె?= సైరింపరాదా?; ఆంబికేయ మహిషికిన్= అంబికాతనయుడైన ధృతరాష్ట్రుడి రాణికి (గాంధారికి); ఖేదంబు+చేయన్+తగునె?= దుఃఖం కలిగించవచ్చునా?

తాత్పర్యం: అని భీముడు పలుకగా ధర్మరాజు ఇట్లా అన్నాడు- 'జయద్రథుడు ఎంతటి దురాత్ముడైనా ఆతడిని సంహరించటం కూడదు. అతడు ధృతరాష్ట్రుడి కూతురైన దుస్సలకు భర్త. మనం దుస్సలను చూచి అతడు చేసిన మొదటి నేరాన్ని క్షమించవలయును. ధృతరాష్ట్రుడి రాణి గాంధారి బాధపడుతుందనే మాట మనం మఱచి పోరానిదికదా!'

వ. అనినం బాంచాలి భీమార్జునులతోడ 'నప్పాపాత్ముని దెసం గృప సేయ వలవ; దవశ్యంబును వాని వధియించి, నాకుం బ్రియంబు గావించునది; యట్టి ద్రోహి యెల్ల భంగుల వధ్యుం' డనియెఁ; దదనంతరంబ ధర్మనందనుండు ధౌమ్య ద్రౌపదీ నకుల సహదేవ సహితుండై, మగిడి నిజాశ్రమంబునకుం జనియె; నిట భీమ విజయులు రథంబులు రయంబునం దోలుకొని చని, క్రోశమాత్రాంతరంబున సైంధవుం గని; రప్పుడు కిరీటి దూరాపాత విశిఖంబుల జయద్రథురథ్యంబులం బడనేసిన. 243

ప్రతిపదార్థం: అనినన్= అని (ధర్మనందనుడు) చెప్పగా; పాంచాలి= ద్రౌపది; భీమ+అర్జునులతోడన్= భీముడితోడను; అర్జునుడితోడను; ఆ+పాప+ఆత్ముని, దెసన్= ఆ దుష్టుడిపట్ల; కృప+చేయన్, వలవదు= జాలి చూపవద్దు; అవశ్యంబును=

తప్పకుండ; వానిన్= అతడిని (జయద్రథుడిని); వధియించి= సంహరించి; నాకున్= నాకు; ప్రియంబు= ప్రీతి; కావించునది= చేయవలయును; అట్టి= అటువంటి; ద్రోహి= మోసం చేసినవాడు; ఎల్ల, భంగులన్= అన్ని విధాల: వధ్యుండు= చంపదగినవాడు; అనియెన్= అని చెప్పింది; తత్+అనంతరంబు+అ= అటు పిమ్మట; ధర్మనందనుండు= ధర్మరాజు; ధౌమ్య, ద్రౌపదీ, నకుల, సహదేవ, సహితుండు+ఐ= ధౌమ్యుడితో, పాంచాలితో, నకులుడితో, సహదేవుడితో కూడినవాడై; మగిడి= తిరిగి; నిజ+ ఆశ్రమంబునకున్= తన ఆశ్రమానికి; చనియెన్= వెళ్ళాడు; ఇట= ఇక్కడ, (ఈ కథలో); భీమ, విజయులు= భీముడు అర్జునుడు; రథంబులు= తేరులు; రయంబునన్= వేగంగా; తోలుకొని= ముందుకు నడిపించుకొని; చని= పయనించి; క్రోశమాత్ర+అంతరంబునన్= కూత వినిపించే దూరం లోపల; సైంధవున్= జయద్రథుడిని; కనిరి= చూచారు; అప్పుడు= ఆ సమయంలో; కిరీటి= అర్జునుడు; దూర+ఆపాత, విశిఖంబులన్= దూరంలో ఆకస్మికంగా పడే బాణాలచేత; జయద్రథురథ్యంబులన్= సైంధవుడి గుర్రాలను; పడవేసినన్= సంహరించగా.

తాత్పర్యం: ధర్మజుడు అట్లా చెప్పగా, ద్రౌపది భీమార్జునులతో ఈ రీతిగా పలికింది: 'పాపాత్ముడైన జయద్రథుడిపట్ల జాలి చూప తగదు. వాడు సంహరించదగినవాడు. అతడిని వధించి నాకు మీరు ప్రీతి చేయండి' అని. పిమ్మట, ధర్మరాజు ధౌమ్యుడితో, ద్రౌపదితో, నకులసహదేవులతో కలిసి తన ఆశ్రమానికి వెళ్లాడు. ఇక్కడ భీమార్జునులు తమతమ రథాలను వడిగా తోలుకొని కేక వినిపించే దూరం లోపలనే జయద్రథుడిని సమీపించారు. అంతట అర్జునుడు దూరంలో ఆకస్మికంగా పడే బాణాలను ప్రయోగించి, జయద్రథుడి రథానికి పూన్చిన గుర్రాలను కూలనేశాడు.

క. తల్లడ పడి యరదము డిగి । విల్లును నమ్ములును విడిచి వెల్ల నగుచు మే
నెల్లఁ జెమర్పఁగ నూర్పులు । పెల్లుగ నమ్మనుజపశువు పెలుచం బఱచెన్. 244

ప్రతిపదార్థం: ఆ+మనుజ పశువు= మనుజులలో జంతువు- ఆ జయద్రథుఁడు; తల్లడపడి= ఆందోళన చెంది; అరదమున్= రథం; డిగి= దిగి; విల్లును= ధనుస్సును; అమ్ములును= బాణాలను; విడిచి= వదలిపెట్టి; వెల్లన్+అగుచు= తెల్లబోతూ; మేను+ఎల్లన్= శరీర మంతా; చెమర్పఁగన్= చెమట పట్టగా; ఊర్పులు= నిశ్వాసాలు; పెల్లుగన్= అధికం కాగా; పెలుచన్= శీఘ్రంగా; పఱచెన్= పారిపోయాడు.

తాత్పర్యం: కలత చెంది ఉద్వేగంతో రథంనుండి క్రిందికి ఉరికి, ధనువును బాణాలను విడిచిపెట్టి వెలవెల బోయిన వాడై, శరీర మంతా చెమటపట్టగా వేడినిట్టూరుపులు వెదజల్లుతూ ఆ మనుజపశువు శీఘ్రంగా పారిపోయాడు.

ఆ. వానిఁ జూచి నగుచు వార 'ఓరోరి! యిం । కెందుఁ బోవ వచ్చుఁ బంద! నిలువు;
మిట్టికడిమి నమ్మియే ప్రల్లదంబులు । సేయఁ దొడఁగి' తనుచు డాయుటయును. 245

ప్రతిపదార్థం: వారలు= భీముడును, అర్జునుడును; వానిన్= అతడిని (ఆ జయద్రథుడిని); చూచి= కాంచి; నగుచున్= నవ్వుతూ; ఓరోరి (ఓరి+ఓరి)= ఒరే ఒరే అని సంబోధిస్తూ; ఇంకన్+ఎందున్+పోవన్‌వచ్చున్= ఇంక ఎక్కడికి వెళ్ళుతావు?; పంద= పిరికివాడా, ఓ జయద్రథా!; నిలువుము= ఆగుము; ఇట్టి= ఇటువంటి; కడిమి= పరాక్రమాన్ని నమ్మియే= నమ్ముకొనేనా; ప్రల్లదంబులు= ఔద్ధత్యం; చేయన్+తొడగితి(వి)= చేయటానికి పూనుకొన్నావు; అనుచున్= అని పలుకుతూ; డాయుటయును= సమీపించగా.

తాత్పర్యం: జయద్రథుడిని చూచి నవ్వుతూ భీముడును అర్జునుడును- 'ఇక ఎక్కడికి పోగలవురా!, ఓ పిరికిపందా!, ఆగరా, నీకున్న ఇటువంటి పరాక్రమాన్ని నమ్ముకొనేనా అటువంటి దర్పపుకూతలు కూశావు' అంటూ అతడిని సమీపించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మరలి చూచి వాఁ డొక్క గుల్మమధ్యంబుఁ దూఱుటయుఁ గని భీమసేనుండు రోషసందష్టాధరుం డగుచు రథంబు డిగ్గ నుఱికి. 246

ప్రతిపదార్థం: వాఁడు= జయద్రథుఁడు; మరలి చూచి= వెనుకకు తిరిగి చూచి; ఒక్క= ఒక; గుల్మ మధ్యంబున్= పొదమధ్యలోకి; తూఱుటయున్= చొరబడి (దాగుకొనగా); కని= చూచి; భీమసేనుండు= భీముడు; రోష, సందష్ట+ అధరుండు+ అగుచున్= తీవ్రమైన కోపంతో పెదవి గరచినవాడై; రథంబు= తేరు; డిగ్గన్+ఉఱికి= క్రిందికి దూకి.

తాత్పర్యం: భీమార్జునులు వచ్చి మీద పడుతుండగా, జయద్రథుడు మరలిచూచి భయపడి ఒక పొదలోకి దూరి దాక్కొన్నాడు. అతడిని చూచి భీమసేనుడు ఆగ్రహావేశంతో పండ్లు పటపట కొరుకుతూ రథం మీదినుండి దూకి.

క. ఒడిసి తలవట్టి నేలం। బడఁ దిగిచిన, వాఁడు పెనఁగఁ బడుటయుఁ జిక్కన్
మెడఁ ద్రొక్కి గాఢముష్టిం। బొడిచె మొగం బవియ రక్తపూరము దొరుఁగన్. 247

ప్రతిపదార్థం: ఒడిసి= గడుసుదనం ప్రదర్శించి; తల పట్టి= శిరస్సును గ్రహించి; నేలన్+పడన్= భూమిపై పొరలేటట్లుగా; తిగిచినన్= దగ్గరగా లాగగా; వాఁడు= అతడు (ఆ జయద్రథుఁడు); పెనఁగన్+పడుటయున్= గుంజులాడుటయును; చిక్కన్= లొంగగా; మెడన్= కంఠాన్ని; త్రొక్కి= కాలితో అదిమిపట్టి; మొగంబు= ముఖం; అవియన్= బద్దలయ్యేటట్లుగా; రక్తపూరము= నెత్తురు వెల్లువ; తొరఁగన్= స్రవించేటట్లు; గాఢముష్టిన్= కఠినమైన పిడికిలితో; పొడిచెన్= పొడిచాడు (గుద్దాడు).

తాత్పర్యం: భీముడు తెలివితేటలతో, ఒడుపుగా జయద్రథుడిని తల పట్టి భూమిపై పడేటట్లు లాగి త్రోశాడు. సైంధవుడు పెనగులాడాడుగాని చివరకు భీముడికి లొంగిపోయాడు. భీముడు అతడి మెడపై తనకాలు మోపి అదిమిపట్టి అతడిని తన పిడికిలితో పొడిచాడు. జయద్రథుడి మొగం గంట్లువారిపోయింది. ముక్కునుండి నెత్తురు వెల్లువగా కారింది.

క. ఒడలెల్లఁ బిండికూడుగఁ। బొడిచి యెగయ నెత్తి త్రిప్పి భూస్థలి మీఁదన్
బడవైచి యురము మొగమును। నడిచెను వడముడి తలప్రహారకుశలుఁడై. 248

ప్రతిపదార్థం: ఒడలు+ఎల్లన్= శరీరమంతా; పిండి కూడుగన్= పిండిచేత చేయబడిన ఆహారపదార్థంవలె ముద్ద అయ్యేటట్లు; పొడిచి= గుద్ది; ఎగయన్+ఎత్తి= పైకి లేచేటట్లుగా ఎత్తి; త్రిప్పి= గిరగిర మలిపి; భూస్థలిన్= భూమిపై; పడన్వైచి= పడేటట్లుగా విసిరివేసి; వడముడి= భీమసేనుడు (శత్రువులకు తాపం కలిగించేవాడు); తల ప్రహార కుశలుఁడు+ఐ= అరచేతితో కొట్టే దెబ్బలలో నేర్పరి అయి; ఉరము= వక్షాన్ని; మొగమును= ముఖాన్ని; అడిచెను= కొట్టాడు.

తాత్పర్యం: భీముడు జయద్రథుడిని లొంగదీసి, శరీరాన్నంతటిని మెత్తగా అయ్యేటట్లు దెబ్బలు కొట్టి, పైకిలేవ నెత్తి, గిరగిర త్రిప్పి, తిరిగి భూమిపై పడవేసి, అరచేతితో వక్షాన్నీ, ముఖాన్నీ మోదాడు.

వ. ఇట్లు బెట్టుగా నడఁచినఁ బగతుండు వివశుం డగుటయుం జూచి యర్జునుం 'డోహో! యింత సాలు; నింక నొచ్చినం బ్రాణ విముక్తుం డగుం గావున నజాత శత్రువచనంబులు దలంచి, వీనిఁ గరుణింపు' మనిన నతండు గవ్వడి దెసఁ గనుంగొని, 'ధర్మనందనుం డెప్పుడుఁ గరుణయకాని కార్యంబు చేటుపాటు విచారింపఁ జొరండు; నీవును నతనిభంగిన బేలవై; తిద్దురాత్ము నెట్లు సైఁప వచ్చు?' నని పలికె; ననంతరంబ. 249

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; బెట్టుగాన్= మిక్కుటంగా; అడచినన్= బాదగా; పగతుండు= శత్రువు; వి, వశుండు+ అగుటయున్= స్పృహ కోలుపోగా; చూచి= అరసి; అర్జునుండు; ఓహో= అయ్యో; ఇంత+చాలు= ఇంత మేరకు దెబ్బలు కొట్టింది చాలు; ఇంకన్= ఇంకమీద; నొచ్చినన్= వీడు బాధపడితే; ప్రాణ, విముక్తుండు+అగున్= అసువులు కోలుపోయేవాడు ఔతాడు; కావునన్= కాబట్టి; అజాతశత్రు వచనంబులు= (పుట్టుకచేత శత్రువులు లేనివాడయిన) ధర్మరాజుయొక్క మాటలు; తలంచి= స్మరించి; వీనిన్= వీడిని (జయద్రథుడిని); కరుణింపుము= దయచూపుము; అనినన్= అని (అర్జునుడు) పలుకగా; అతండు= అతడు (భీముడు); కవ్వడి (కవ+వడి) దెసన్= అర్జునుడివైపు; కనుంగొని= చూచి; ధర్మనందనుండు= ధర్మ తనయుడు; ఎప్పుడున్= ఏ సమయంలో అయినా; కరుణ+అ, కాని= దయ చూపటం మాత్రమే కాని; కార్యంబు, చేటు, పాటు= పనియొక్క మంచిచెడ్డలు; విచారింపన్+చొరండు= ఆలోచించటానికి పూనుకొనడు; నీవును= ఓ అర్జునా, నీవు కూడా; అతని భంగిన్+అ= ఆయన మాదిరిగానే; బేలవు+ఐతి= తెలివితక్కువవాడవు అయినావు; ఈ+దురాత్మున్= ఈ దుష్టుడిని; ఎట్లు= ఏ రీతిగా; సైపన్‌వచ్చున్= క్షమించవచ్చును; అని పలికెన్= అని అన్నాడు; అనంతరంబు+అ= అటుపిమ్మట.

తాత్పర్యం: ఈ రీతిగా గట్టిగా దెబ్బలు కొట్టటంచేత జయద్రథుడు స్పృహతప్పటం చూచి, అర్జునుడు భీముడితో ఇట్లా అన్నాడు. 'అయ్యో! ఇంత శిక్షించింది చాలు. ఇతడిపై జాలి చూపుము. ఇకమీద కొట్టితే ఈ జయద్రథుడు మరణిస్తాడు. అజాతశత్రువు అయిన ధర్మనందనుడి మాటలు స్మరించి, వీడిని కరుణించు'. అంతట భీముడు ఇట్లా అర్జునుడికి సమాధానం చెప్పాడు. 'ధర్మరాజు ఎల్లప్పుడూ జాలి చూపుమనే చెప్పుతుంటాడు. ఆయనకు లౌక్యం తెలియదు. అట్లా జాలిచూపటంవలన ఎన్నో అనర్థాలు దాపురిల్లి కార్యహాని కలుగుతుందని ఆలోచించడు. నీవుకూడా ధర్మరాజు వంటివాడవే సుమా! ఈ జయద్రథుడిని క్షమించరాదు' అన్నాడు. అటు పిమ్మట.

భీముఁడు సైంధవుం బట్టికొని పరిభవించుట (సం. 3-256-9)

ఆ. **వాఁడియైన కత్తి వాతి యమ్మునఁ గొని । పగతుశిరము చెక్క లెగయ గొఱిగి**
నరుల కెల్లఁ జూడ నవ్వగునట్లుగాఁ । గలయ నైదు గూఁకటుల నొనర్చె. **250**

ప్రతిపదార్థం: వాడి+ఐన కత్తి వాతి+అమ్మునన్+కొని= పదనైన అంచుతో ఉన్న బాణాన్ని గ్రహించి; పగతు, శిరమున్= శత్రువు (జయద్రథుడి) యొక్క తలను; చెక్కలు+ఎగయన్= పీతోలు పైకి లేచిపోయేటట్లుగా; గొఱిగి= వెంట్రుకలు ఉత్తరించి; చూడన్= చూస్తే; నరులకున్+ఎల్లన్= ప్రజలందరికీ; నవ్వు+అగునట్లుగాన్= నవ్వు జనించేటట్లుగా; కలయన్= కూర్చి; ఐదు కూకటులన్= ఐదు పిలకలను; ఒనర్చెన్= కావించాడు.

తాత్పర్యం: పదను గల కత్తిఅంచు గల బాణంతో భీముడు జయద్రథుడితల పీతోలు లేచిపోయేటట్లుగా, వెంట్రుకలు గొఱిగి, చూచేవారు అపహసించేటట్లుగా ఐదు శిఖలుగా నిలిపాడు.

వ. **ఇట్లు రాజవేషంబు వికల్పితంబు సేసి యమ్మహాభుజుండు వాని కిట్లను 'నోరీ! బ్రదుకవలతేని నేఁడు మొదలుగా నెల్ల సభలయందును 'బాండవదాసుండ' నని పలుకునది' యనిన వాఁడును దండాఘాతభయంబున 'నట్లచేయుదు' ననియె; నంత నయ్యిరువురు నతనిం బెడకేలు గట్టి రథంబుపై నిడికొని నిజాశ్రమంబునకుం జని ధర్మపుత్త్రునకు నివేదించి, 'వీఁడె పాండవ దాసుం' డనిన, నతం 'డట్లేని వీని విడువుం' డనియెఁ; బాంచాలియు జయద్రథుం జూచి నవ్వుచు 'నిప్పాపాత్ముండు భవదీయ దాసుం డయ్యెం గావున వీనిం బో**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విడువుం' డని విడిపించె; నా సైంధవుండును ధర్మజునకుఁ దత్సభా గతులైన మునులకు మ్రొక్కిన, నజాత శత్రుం డి ట్లనియె. 251

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; రాజవేషంబు, వికల్పితంబు+చేసి= రాజు ధరించే ఆహార్యం లేకుండగా చేసి; ఆ+మహాభుజుండు= ఆ గొప్ప పరాక్రమం కలవాడు; వానికిన్= అతడితో - జయద్రథునితో; ఇట్లు+అనున్= ఈ రీతిగా అన్నాడు; 'ఓరీ!= నీచుడ వైన ఓ జయద్రథా!; బ్రదుకన్ వలతు(వు)+ఏని= నీవు బ్రదుక తలిస్తే; నేఁడు= ఈ రోజు; మొదలుగాన్= మొదలుకొని; ఎల్ల, సభలయందును= పెద్దల సమావేశాలు అన్నింటిలోనూ; పాండవ దాసుండన్= పాండవుల సేవకుడను; అని, పలుకునది= అని పేర్కొనాలి; అనినన్= అని (భీముడు) చెప్పగా; వాఁడును= అతడును (ఆ జయద్రథుఁడు కూడా); దండ+ఆ ఘాత, భయంబునన్= కఱ్ఱ దెబ్బవలని భీతితో; అట్లు+అ= ఆ విధంగానే; చేయుదున్+అనియెన్= చేస్తాను అన్నాడు; అంతన్= పిదప; ఆ+ఇరువురును= ఆ ఇద్దరున్నూ, భీముడును అర్జునుడును; అతనిన్= వాడిని (ఆ జయద్రథుడిని); పెడకేలు+కట్టి= చేతులు వెనుకకు విరిచి బంధించి; రథంబుపైన్+ఇడికొని= తేరుపై పెట్టుకొని; నిజ+ఆశ్రమంబునకున్+చని= తమ ఆశ్రమానికి వెళ్లి; ధర్మపుత్త్రునకున్= ధర్మనందనుడికి; నివేదించి= విన్నవించి; వీఁడె= ఇతడే; పాండవ దాసుండు+అనినన్= పాండునందనుల సేవకుడు అని వచించగా; అతండు= ధర్మనందనుడు; అట్లు+ఏని= అటులే అయితే (ఈ జయద్రథుడు పాండవుల కింకరుడే అయితే); వీనిన్; విడువుండు= వదలిపెట్టండి; అనియెన్= అని అన్నాడు; పాంచాలియున్= ద్రౌపదియును; జయద్రథున్+చూచి= సైంధవుడిని చూచి; నవ్వుచున్= పరిహసిస్తూ; ఈ+పాప+ఆత్ముండు= ఆ పాపి- జయద్రథుడు; భవదీయ దాసుండు= మీ యొక్క సేవకుడు; అయ్యెన్+కావునన్= అయినాడు కాబట్టి; వీనిన్= వీడిని (సైంధవుడిని); పో విడువుండు= యథేచ్ఛగా పొమ్మని విడిచిపెట్టండి; అని= అని చెప్పి; విడిపించెన్= బంధముక్తుడిని చేయించింది; ఆ సైంధవుండును= ఆ జయద్రథుండును; ధర్మజునకున్= ధర్మనందనుడికి; తత్+సభా+గతులు+ఐన= ఆతని యొక్క సభలో ఉన్న వారు అయిన; మునులకున్= ఋషులకు; మ్రొక్కినన్= నమస్కరించగా; అజాతశత్రుండు= శత్రువులు లేనివాడు (పుట్టని శత్రువులు కలవాడు) ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: భీముడు సైంధవుడికి రాజవేషం తొలగించి అతనితో ఇట్లా అన్నాడు: 'ఓరీ! నీచుడవైన జయద్రథా! నీవు బ్రదుక దలిస్తే ఈనాడు మొదలుగా నీవు అన్నిసభలలో పాండవదాసుడిని అని ప్రకటించుకొనుము- అని శాసించాడు. దెబ్బలకు జడిసి జయద్రథుడు అందుకు సమ్మతించాడు. అంతట భీమార్జునులు ఆ సైంధవుడిని చేతులు వెనుకకు విరిచి కట్టి తమరథంమీద పెట్టి తెచ్చి, ధర్మరాజుసమక్షంలో ఉంచి 'ఇతడే జయద్రథుడు; పాండవ దాసుడు' అని నివేదించారు. ధర్మరాజు 'ఇతడు పాండవదాసుడు అయినాడు కనుక ఇక చంపదగినవాడు కాడు. కావున విడిచి పెట్టండి' అని ఆజ్ఞాపించాడు. ద్రౌపదికూడా జయద్రథుడిని పరిహసిస్తూ 'ఈ పాపాత్ముడు మీకు కింకరుడైనాడు కాబట్టి బంధవిముక్తుడిని చేయండి' అని చెప్పింది. పాండవులు సైంధవుడిని విడిచిపెట్టారు. ఆతడు ధర్మరాజుకు ఆతడి ఆశ్రమసభకు విచ్చేసిన మునులకు నమస్కరించగా, అజాతశత్రువు సైంధవుడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'ఎట్టి కష్టుఁ డైన నిట్టిపాపము సేయ । నెత్తికొనునె! ధరణి నీవు దక్క
నరుగు మింక; నేమి యందుము నిన్ను నిం । ద్రియవిలోలు నల్పు ధృతివిహీను. 252

ప్రతిపదార్థం: ధరణిన్= భూమిలో; నీవు= నీవు; తక్కన్= తప్ప; ఎట్టి= ఎటువంటి; కష్టుఁడు+ఐనన్= దుష్టుడు అయినప్పటికిని; ఇట్టి= ఇటువంటి; పాపము= కిల్బిషం (పరదారాపహరణం); చేయన్= చేయటానికి; ఎత్తికొనునె= పూనుకొంటాడా?; అరుగుము=

(యథేచ్ఛగా) వెళ్ళు; నిన్నున్; ఇంద్రియలోలున్= ఇంద్రియాలకు వశం అయినవాడిని; అల్పున్= నీచుడిని; ధృతి, విహీనున్= ధైర్యం లేనివాడిని; ఇంకన్= ఇంతకంటె; ఏమి+అందుము?= ఏ మని నిందించగలం?

తాత్పర్యం: ఎట్టి దుష్టుడు అయినా ఇటువంటి నీచపుపనికి (పరదారను అపహరించటానికి) పూనుకొంటాడా? నీ వంటి అల్పుడు మాత్రమే అట్టి నీచకృత్యానికి ఒడిగట్టుతాడు. నీ వంటి అల్పుడిని, నీ వంటి ఇంద్రియ వివశుడిని, నీ వంటి ధైర్యవిహీనుడిని, ఇంక ఏమని నిందించగలం? ఇక నీవు నీ ఇచ్చవచ్చినట్లు పొమ్ము.

విశేషం: ధర్మజుని మాటనేర్పరితనానికి, వాడితనానికీ ఈ కందం చక్కని ఉదాహరణం. 'ఎట్టి' 'ఇట్టి' అనే విశేషణాలతో అవాచ్యమైన అంశాలను చెప్పని ఔచిత్యం పాటించాడు. 'ధరణి నీవు దక్క' అని పేర్కొని భూమిజనుల్లో సైంధవునంతటి నీచుడు మరొకడు లేడని వ్యంగ్యం చేశాడు. ఈ ఉదంతంలో సైంధవునిలో కానబడే గుణాలు మూడు. 1. ఇంద్రియ లోలత్వం. 2. చెల్లెలివరుసను కూడా పాటించక ద్రౌపదిని హరించిన నైచ్యం. 3. ప్రగల్భాలు పలికి చివరకు పారిపోయే భీరుత్వం. ఈ మూడింటినీ చెప్పి 'ఇంక ఏమి అంటాం' అన్నాడు ధర్మజుడు. భీముని ప్రహారాలు సైంధవుడి దేహాన్ని పిండిపిండి చేశాయి. ధర్మజునిమాటలు మనస్సును తూట్లుపొడిచాయి.

వ. **ఇంక నెవ్వారికి నిట్టి కొఱగాములు సేయక బుద్ధిమంతుఁడవై యుండు' మనిన నతండు లజ్జావనత వదనుం డగుచు నచ్చోటు వాసి, గంగాద్వారంబున కరిగి యందు.** **253**

ప్రతిపదార్థం: ఇంకన్= ఇకమీద; ఏ+వారికిన్= ఎవరికినీ; ఇట్టి= ఇటువంటి; కొఱగాములు= చెడ్డపనులు; చేయక; బుద్ధిమంతుఁడవు+ఐ= మంచిబుద్ధి కలవాడవు అయి; ఉండుము= జీవించుము; అనినన్= అని (ధర్మరాజు) చెప్పగా; అతండు= (జయద్రథుడు); లజ్జా+అవనత, వదనుండు+అగుచున్= సిగ్గుచేత వాల్చబడిన మొగం కలవాడు ఔతూ; ఆ+చోటు+పాసి= ఆ స్థలం విడిచి; గంగా ద్వారంబునకున్= గంగా నది సముద్రాన్ని కలిసే స్థలానికి వెడలి; అందున్= అచట.

తాత్పర్యం: ఇక మీదట నీవు ఎవ్వరియెడలను ఇట్టి చెడుపనులు చేయకుము. మంచిబుద్ధితో మెలగుము అని ధర్మరాజు మందలించాడు. సైంధవుడు అంతట సిగ్గుచేత తలవంచుకొని ఆ చోటు నుండి బయలుదేరి గంగానది సముద్రాన్ని కలిసే పుణ్యస్థలంవద్దకు వెళ్ళాడు.

విశేషం: సైంధవుడికి దాపురించింది కేవలం యుద్ధంలో కలిగిన ఓటమిమాత్రమే కాదు. పాండవులు అతడి తేజోవధ చేశారు. మానసికంగా ఆధ్యాత్మికంగా జయద్రథుడు దీనుడైనాడు. అతడు కోలుకొనటానికి పుణ్యక్షేత్రానికి పోవటం అవసరమైంది.

శా. **ఆదిత్యార్చితపాదపద్ము జగదేకాధీశు నీశుం ద్రిలో**
కాదిం గామవిభేదిఁ బర్వతసుతాహ్లాదైకసంపాది నిః
ఖేదుం దై శివు నాత్మలో నిలిపి యక్షీణవ్రతారూఢతం
బాదాంగుష్ఠము నేల మోపి తప మొప్పం జేసె సద్భక్తిమైన్. **254**

ప్రతిపదార్థం: ఆదిత్య+అర్చిత, పాదపద్మున్= సూర్యుడిచేత ఆరాధించబడిన పద్మాలవంటి చరణాలు కలవాడినీ; జగత్+ఏక+అధీశున్= సృష్టికి అంతటికిని తా నొకడే ఆధిపత్యం వహించినవాడిని; ఈశున్= ఈశ్వరుడిని; త్రిలోక+ఆదిన్= మూడు భువనాలకు మూలం అయిన వాడిని; కామ విభేదిన్= మన్మథుడియొక్క విరోధిని; పర్వత, సుతా+హ్లాద+ఏక, సంపాదిన్= హిమవంతుని పుత్రియైన గౌరీదేవికి ఆనందాతిశయం కలిగించే వాడు ఐన; శివున్= ఈశ్వరుడిని; నిః,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఖేదుండు+ఐ= దుఃఖంలేనివాడై (అవమానంవలన కలిగిన బాధ మరచిన వాడై జయద్రథుడు); ఆత్మలోన్= మనస్సులో; నిలిపి= ధ్యానించి; అ, క్షీణ, వ్రత+ఆరూఢతన్= గొప్ప దీక్షతో కూడినవాడై; పాద+అంగుష్ఠము= కాలియొక్క బొటనవ్రేలు (మాత్రమే); నేలన్+మోపి= భూమిని తాకేటట్లుగా ఉంచి; సత్+భక్తి, మైన్= మంచి భక్తితో; తపము= తపస్సు; ఒప్పన్+చేసెన్= శోభిల్లేటట్లుగా చేశాడు.

తాత్పర్యం: జయద్రథుడు పరమశివుడినిగూర్చి నిష్ఠతో గొప్పతపస్సు చేశాడు. ఆ తపస్సు కఠోరదీక్షతో కూడింది. జయద్రథుడు తనపాదంబొటనవ్రేలును మాత్రమే భూమిపై నిలిపి పార్వతీపతిని, మన్మథవిరోధిని, సూర్యుడిచేత అర్చించబడిన పాదపద్మాలు కలవాడిని, సృష్టిసమస్తానికి అధిపతి అయినవాడిని, మూడు లోకాలు ఏర్పడటానికి మూలమైనవాడిని దృఢభక్తితో మనస్సులో ధ్యానిస్తూ ఘోర తపం చేశాడు.

విశేషం: కామవిలోలుడైన జయద్రథుడు కామవిభేదినిగూర్చి తపస్సు చేయటం సముచితం.

ఉ. **వానికి నమ్మహేశ్వరుఁడు వత్సలుఁ డై పొడసూపి, 'యీప్సితం**
బైనది వేఁడు' మన్న, నతఁ డానతుఁడై 'పరమేశ! విక్రమా
హీనులఁ బాండునందనుల నేవుర సైన్యయుతంబుగా ననిం
బూని జయించు నట్టి వరముం గృపసేయుము నాకు' నావుడున్. **255**

ప్రతిపదార్థం: ఆ+మహా+ఈశ్వరుఁడు= ఆ పరమశివుడు; వత్సలుఁడు+ఐ= అనురాగం కలవాడయి; వానికిన్= అతడికి (ఆ జయద్రథుడికి); పొడ+చూపి= సాక్షాత్కరించి; ఈప్సితంబు+ఐనది= ఇష్టం అయినది; వేఁడుము= కోరుకొమ్ము; అన్నన్= అని (శివుడు) చెప్పగా; అతఁడు= వాడు- జయద్రథుఁడు; ఆనతుఁడు+ఐ= నమస్కరించినవాడై; పరమ+ఈశ!= ఓ పరమ శివా!; విక్రమ+అహీనులన్= పరాక్రమంచే తక్కువకానివారిని; పాండు, నందనులన్= పాండవులను; ఏవురన్= అయిదుగురినీ; అనిన్= యుద్ధంలో; సైన్య, యుతంబుగాన్= సేనలతోపాటుగా; పూని= కడగి; జయించు+అట్టి= గెలుచునట్టి; వరమున్= కోరికను; నాకున్= నాకు; కృప+చేయుము= అనుగ్రహించుము; నావుడున్= అని చెప్పగా.

తాత్పర్యం: జయద్రథుడి తపస్సుకు మెచ్చి పరమశివుడు అతడికి ప్రత్యక్షమయ్యాడు. శివుడాతడిని ఇష్టమైన వరాన్ని వేడుకొనుమన్నాడు. జయద్రథుడు శివుడికి నమస్కరించి, 'దేవా, శౌర్యవంతులైన పంచపాండవులను వారి సేనలతోకూడ నేను యుద్ధంలో జయించే వరాన్ని అనుగ్రహించుము' అని కోరుకొన్నాడు.

క. **'ఇది పొసఁగదు పాండవులం । గదనమున జయింప నలవిగా దింద్రాది**
త్రిదశులకు; వినవె! యైనను । వదలక నీకోర్కి దీర్పవలయున యెట్లున్. **256**

ప్రతిపదార్థం: ఇది+పొసఁగదు= (నీవు పంచపాండవులను యుద్ధంలో సైన్యసమేతంగా గెలవటం సాధ్యం కాదు); కదనమునన్= యుద్ధంలో; పాండవులన్= పాండునందనులను; జయింపన్= గెలవటానికి; ఇంద్ర+ఆది, త్రిదశులకున్= ఇంద్రుడు మున్నగు దేవతలకు; అలవి+కాదు= సాధ్యం కాదు; వినవె?= విన లేదా?; ఐనను= అయినప్పటికీ; వదలక= విడువక; ఎట్లున్= ఎట్లాగైనా; నీ కోర్కి= నీ అభీష్టం; తీర్పవలయున్+అ= నెరవేర్పవలసిందే సుమా.

తాత్పర్యం: 'ఓ జయద్రథా! నీవు పంచపాండవులను వారిసైన్యంతోపాటుగా యుద్ధంలో జయించవలెనని కోరి ఉన్నావు. ఇది సాధ్యం కాని కోరిక. ఎందుకంటే, దేవేంద్రుడు మున్నగుదేవతలుకూడ యుద్ధంలో పాండవులను

జయించలేరు. ఇక నీ వనగా ఎంత? అయినను నీవు గొప్పతపస్సు చేసి నన్ను మెప్పించావు కాబట్టి నీకోరిక నేను తీర్చవలసిందే. ఏదో విధంగా నీకోరిక తీరుస్తానుగాక!

విశేషం: శివుడు 'బోలా శంకరుడు' గానూ, భక్తసులభుడుగానూ సుప్రసిద్ధుడు. సైంధవుడు కోరినవరం అసాధ్యమైనది. అంతేకాక పాండవులలో ఒకడైన అర్జునుడు సైంధవుడు తపస్సు చేయటానికి ముందే తపస్సు చేసి శివుడివలన వరాలను పొంది ఉన్నాడు. అందుచేత ఇపుడు లోగడ తాను అర్జునుడికి ఒసగిన వరాలకు భంగం కాని విధంగానే శివుడు సైంధవుడికి అనుగ్రహం చూపదగును గదా. ఆ విషయమే శివుడు తరువాతి పద్యంలో వివరించి తెలిపాడు.

చ. **విజయుఁ డొకండు తక్క నతివీరులఁ బార్థుల నున్న నల్వురన్**
నిజ మొకనాఁటి కయ్యమున నీవు జయింపుము; ఫల్గునుండు స
ర్వజగదజయ్యు విక్రముఁడు; వాని నెదుర్కొని నాకు నైనఁ బో
ర జితునిఁ జేయు టెంతయు భరం బగు; నిక్కము పల్కితిం జుమీ! **257**

ప్రతిపదార్థం: విజయుఁడు= అర్జునుడు; ఒకండు= ఒకడు; తక్కన్= తప్ప; అతివీరులన్= గొప్పపరాక్రమం కలవారిని; పార్థులన్+ఉన్న= పాండవులలో మిగిలిన; నల్వురన్= నలువురను; ఒకనాటి కయ్యమునన్= ఒక రోజున జరిగే యుద్ధంలో; నీవు= నీవు (ఓ జయద్రథా- నీవు); జయింపుము= గెలువుము; నిజము= నిక్కం; ఫల్గునుండు= అర్జునుడు; సర్వజగత్+అజయ్యు, విక్రముఁడు= సమస్తలోకాలచేతను జయించటానికి సాధ్యంకాని పరాక్రమం కలవాడు; వానిన్= అతడిని (అర్జునుడిని); ఎదుర్కొని= ఎదిరించి; పోరన్= యుద్ధంలో; జితునిన్+చేయుట= ఓడించబడినవాడినిగా చేయటం; నాకున్+ఐనన్= నాకు గూడ; ఎంతయున్= మిక్కిలి; భరంబు+అగున్= కష్టం ఔతుంది; నిక్కము= నిజం; పల్కితిన్, చుమీ!= వచించాను సుమా!

తాత్పర్యం: అర్జునుడు తప్ప, మిగిలిన పాండవులను యుద్ధంలో ఒకనాఁడుమాత్రమే జయించేటట్లు నీకు వరం ప్రసాదిస్తున్నాను. పాండవులు గొప్పవీరులు. అందులో నలుగురను జయించగలవు. అది చాలును నీకు. ఇది నిజం. ఇక అర్జునుడంటావా! అతడిని సర్వలోకాలు ఒక్కటై ఎదిరించినా జయింప జాలవు. అట్టి పరాక్రమం కలవాడు అతడు. నిజానికి నేనే యుద్ధంలో అతడిని ఎదుర్కొన్నా అతడిని జయించటం సులువు కాదు. నేను సత్యాన్ని చెప్పాను. ఇందులోని ఆంతర్యాన్ని గ్రహించుము.

విశేషం: ఫల్గునుఁడు= అర్జునుడు (ఫల్గుని నక్షత్రంలో జన్మించినవాడు).

వ. **అస్మత్ప్రసాదవిశేషంబునం జేసి వాని కిట్టి ప్రభావంబు గలిగె; నదియునుం గాక.** **258**

తాత్పర్యం: నా అనుగ్రహవిశేషంచేత అర్జునుడికి ఇటువంటి మహిమ కలిగింది. అంతే కాక.

క. **నిఖిలాస్త్రశస్త్రవిద్యా । సఖుఁ డపరాజితయశోవిశాలుఁడు విష్ణుం**
డఖిలేశ్వరుఁ డతనికిఁ బ్రియ । సఖుఁ డటె! యవ్వీరు గెల్వ శక్యమె నీకున్?' **259**

ప్రతిపదార్థం: నిఖిల+అస్త్ర, శస్త్ర, విద్యా సఖుఁడు= సమస్త మంత్ర మహిమలతో కూడిన ఆయుధాలయొక్కయు, శస్త్రాల యొక్కయు జ్ఞానంతో కూడినవాడు; అ, పరాజిత, యశస్+విశాలుఁడు= ఓటమి లేని కీర్తిచేత విస్తరించినవాడు; విష్ణుండు= శ్రీమన్నారాయణమూర్తి; అఖిల+ఈశ్వరుఁడు= అంతటికిని అధిపతి; అతనికిన్= ఆ అర్జునుడికి; ప్రియ, సఖుండు+అటె= కూరిమి మిత్రుడు కదా; ఆ+వీరున్= అటువంటి అర్జునుడిని, నీకున్= నీకు; గెల్వన్+శక్యమె= జయించ సాధ్యం ఔతుందా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అతడికి ప్రియసఖుడు విష్ణుమూర్తి అవతారమైన శ్రీకృష్ణుడు. సమస్త శస్త్రాల అస్త్రాల ఆంతర్యాల పరిజ్ఞానం గల అర్జునుడిని గెలవటం ఎవ్వరికీ సాధ్యం కాదు.

విశేషం: తిక్కనకాలంనాటికే శైవ వైష్ణవాలు తెలుగుసమాజంలో ప్రాధాన్యంకొరకై పోటీపడుతుండేవి. తిక్కన సమన్వయ సంధాత అయి హరిహరనాథోపాసనకు ఉపక్రమించాడు. ఎఱ్ఱనగూడ సమన్వయ సంధాతయే. ఆతడు నృసింహపురాణకర్త. అయినా అతడు శైవుడే. ఈ పద్యంలో పరమశివుడినోట ఎఱ్ఱనమహాకవి 'విష్ణుం డఖిలేశ్వరుండు' అని పలికించటం గమనించదగిన అంశం.

వ. **అని పలికి యీశ్వరుం డంతర్హితుం డయ్యె; సింధుపతియు నిజదేశంబునకుం జనియె' ననిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె.** **260**

ప్రతిపదార్థం: అని పలికి= అని వచించి; ఈశ్వరుండు= పరమశివుడు; అంతర్హితుండు+అయ్యెన్= మాయమయ్యాడు; సింధుపతియున్= సింధుదేశపురాజు కూడ, జయద్రథుడు; నిజదేశంబునకున్= తన (సింధుదేశానికి); చనియెన్= వెళ్లాడు; అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; జనమేజయుండు; వైశంపాయనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చెప్పి పరమశివుడు మాయమయ్యాడు. సింధుదేశప్రభువు జయద్రథుడు స్వదేశానికి వెళ్ళాడు'. అని వైశంపాయన మహర్షి భారతకథను జనమేజయమహారాజుకు వినిపించాడు. అప్పుడు జనమేజయుడు వైశంపాయనుడిని ఈ విధంగా ప్రశ్నించాడు.

విశేషం: (1) జయద్రథుడు సింధుదేశంనుండి అసలు సాళ్వరాజకన్యకను వివాహం చేసికొనటానికై బయలుదేరాడు. మార్గమధ్యాన కామ్యకవనంలో అతడికి ఈ పరాభవం జరిగింది. పిమ్మట ఆతడు గంగాద్వారానికి పోయి తపస్సుచేశాడు. సింధుదేశం పశ్చిమ దిక్కున ఉన్నది. గంగానదీ ముఖద్వారం వంగదేశాన తూరుపుసముద్ర తీరాన ఉన్నది. అటనుండి జయద్రథుడు స్వదేశమైన సింధురాష్ట్రానికి వెళ్ళాడు. మరి- సాళ్వరాజపుత్రిని ఆతడు వివాహ మాడకుండానే స్వదేశానికి తిరిగి వెళ్ళాడని ఊహించవలసి వస్తున్నది.

తే. **'ధర్మపత్నీసమేతులై తద్వనంబు । నం దపారదుఃఖాతురు లగుచు నున్న**
రాజముఖ్యులు సత్యైకరతులు పాండు । సుతులు మఱి యేమి సేసిరి సూరిముఖ్య!' **261**

ప్రతిపదార్థం: సూరి ముఖ్య!= విబుధులలో శ్రేష్ఠుడ వైనవాడా- ఓ వైశంపాయన మహామునీ!; తత్+వనంబునందున్= ఆ కామ్యక వనంలో; ధర్మపత్నీ సమేతులు+ఐ= భార్యతో కూడినవారై, ద్రౌపదీ సహితులై; అపార, దుఃఖ+ఆతురులు+అగుచున్= మిక్కిలి ఆవేదనతో కలత చెందినవారు ఔతూ; ఉన్న= నివసిస్తున్న; రాజముఖ్యులు= రాజులలో శ్రేష్ఠులు; సత్య+ఏక, రతులు= సత్యంలో ముఖ్యమైన అభిరుచి కలవారు; పాండు, సుతులు= పాండు నందనులు; మఱి= ఇంక; ఏమి+చేసిరి= ఏ విధమైన కార్యాలను నెరవేర్చారు?

తాత్పర్యం: పండితులలో శ్రేష్ఠుడ వైనవాడా, ఓ వైశంపాయన మహర్షీ! ఆ అడవిలో అంతులేని దుఃఖాన్ని అనుభవిస్తూ, సత్యసంధులైన మహానుభావులు పాండవులు ధర్మపత్ని అయిన పాంచాలితో కూడి ఆ మీదట ఎట్టి కార్యాలు నెరవేర్చారు? దయచేసి వినిపించండి.

విశేషం: ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి సంశోధిత మహాభారతం అచ్చుప్రతిలో ఈ పద్యం మొదటిపాదం ఇట్లున్నది.- "ధర్మపత్నీ సమేతులై ద్వైతవనము'', ద్వైతవనానికి పాఠాంతరం "తద్వనంబు''గా పేర్కొనబడింది. అప్పుడు పాండవులు ఉన్నది - "ద్వైతవనము'' కాదు. 100 సంఖ్యగల గద్యం చూడండి. కాబట్టి తద్వనమ్ము- అనగా ఆ కామ్యకవనం అనే అర్థం ఇచ్చే పాఠమే సరియైనది కావున ఇట ఈ పాఠం స్వీకరించబడింది. 262 సంఖ్య గద్యంలో స్పష్టంగా "కామ్యక వనంబు'' అని చెప్పబడింది.

వ. అనిన నతం డిట్లనియె; నట్లు ద్రౌపదీమోక్షణం బొనరించిన పిదపం గామ్యకవననివాసుండై భూసుర నివహంబుతో నున్న ధర్మజుపాలికి మార్కండేయుం డరుగు దెంచిన, ననుజసహితంబుగాఁ బ్రత్యుద్గతుండై యమ్మునివరుం బ్రభూతసపర్యల సంతుష్టహృదయుం గావించి, యవ్విభుండు పాంచాలియెడ జయద్రథు చేసిన దుర్వ్యవసాయంబు వానిం బరిభవించుటకునై తమ పడిన యాయాసంబును నమ్మహాత్మున కెఱింగించి 'మహనీయ శౌర్యధైర్య ధర్మారంభ సమగ్రుల మైన మా కివ్విధంబున నఖిలసామ్రాజ్యభోగ వియోగంబై దుస్తరం బగు వనవాసంబు సంప్రాప్తం బయ్యెం గావున విధికృతం బెవ్వనికి నెబ్భంగుల నలంఘ్యం బని తలంచెద' నని పలికి మఱియు ని ట్లనియె. 262

ప్రతిపదార్థం: అనినన్= అని (జనమేజయుడు) చెప్పగా; అతండు= వైశంపాయనుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా వచించాడు; అట్లు= ఆ రీతిగా; ద్రౌపదీ మోక్షణంబు= పాంచాలి చెఱ విడిపించటం; ఒనరించిన పిదపన్= చేసిన పిమ్మట; కామ్యక, వన, నివాసుండు+ఐ= కామ్యకవనంలో జీవిస్తున్నవాడై; భూసుర, నివహంబుతోన్+ఉన్న= బ్రాహ్మణుల సమూహంతో కూడిఉన్న; ధర్మజు పాలికిన్= ధర్మనందనుడి కడకు; మార్కండేయుండు= మృకండు మహాముని పుత్రుడు; అరుగుదెంచినన్= రాగా; అనుజ సహితంబుగాన్= తమ్ములతో కూడినవాడై; ప్రత్యుద్గతుండు+ఐ= లేచి యెదురు వెళ్ళి స్వాగతం చెప్పినవాడై; ఆ+ముని, వరున్= ఆ ఋషులలో శ్రేష్ఠుడు అయినవాడిని; ప్రభూతసపర్యలన్= గొప్పవైన గౌరవంతో కూడిన సేవలతో; సంతుష్ట హృదయున్= సంతృప్తి చెందిన హృదయం కలవాడినిగా; కావించి= ఒనరించి; ఆ+విభుండు= ఆ రాజు (ధర్మనందనుడు); పాంచాలి+ఎడన్= ద్రౌపది పట్ల; జయద్రథు, చేసిన= సైంధవుడు చేసిన; దుర్వ్యవసాయంబు= చెడు కృత్యం; వానిన్= వాడిని జయద్రథుని; పరిభవించుటకున్+ఐ= అవమానించటం కొరకై; తమ పడిన= తాము అనుభవించిన; ఆయాసంబును= శ్రమయును; ఆ+మహా+ఆత్మునకున్= ఆ మహనీయుడికి (మార్కండేయుడికి); ఎఱింగించి= తెలిపి; మహనీయ, శౌర్య, ధైర్య, ధర్మ+ఆరంభ, సమగ్రులము+ఐన= గొప్ప పరాక్రమం చిత్త స్థైర్యం ధర్మమునే ఆచరించ వలెననే సంపూర్ణ వ్యక్తిత్వం కలవారలమైన; మాకున్= మాకు (పాండవులకు); ఈ+విధంబునన్= ఈరీతిగా; అఖిల, సామ్రాజ్య, భోగ, వియోగంబు+ఐ= సమస్తమైన గొప్పరాజ్యంవలన గలిగే సౌఖ్యాలకు ఎడబాటు కల్గి; దుస్తరంబు+అగు= దాటటానికి వీలు లేని; వన, వాసంబు= అడవిలో నివసించటం; సంప్రాప్తంబు+అయ్యెన్= దాపురించింది; కావునన్= కాబట్టి; విధి కృతంబు= దైవంచేత నిర్ణయించబడినట్టిది; ఎవ్వనికిన్= ఏ వ్యక్తికిని; ఏ+భంగులన్= ఏ రీతులలోనైనా; అలంఘ్యము= దాటరానిది; అని, తలంచెదన్= అని భావిస్తాను; అని పలికి= అని వచించి; మఱియున్= వెండియును; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అని జనమేజయుడు ప్రశ్నించగా, వైశంపాయనమహర్షి ఈ విధంగా సమాధానం చెప్పాడు: ఆ రీతిగా ద్రౌపదిని చెఱవిడిపించి కామ్యకవనంలో బ్రాహ్మణసమూహంతోపాటు నివసిస్తున్న ధర్మరాజుకడకు మార్కండేయ మహర్షి వచ్చాడు. ధర్మరాజు తాను తమ్ములును ఆ మునీశ్వరుడికి ఎదురేగి స్వాగతసత్కారాలు చేసి, జయద్రథుడు పాంచాలియెడ చేసిన అత్యాచారాన్ని వివరించి తెలిపాడు. అప్పుడు పాండవులు జయద్రథుడితో, ఆతని పరివారవర్గంతో యుద్ధం చేయటం, వాడిని పరాభవించటానికి వారు పడిన ప్రయాస ఆ మహానుభావుడికి తెలిపి, 'మహాత్మా! మేము

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మంచివారలం. పరాక్రమప్రాభవం కలవారలం. అయినను ఈ అడవిలో ఇట్టి ఇక్కట్లు అనుభవిస్తున్నాం. విధి విపరిపాకాన్ని ఎంతటి మంచివారైనా ఎంతటి పరాక్రమవంతులైనా తప్పించుకొనలేరని తలపోస్తున్నాను' అని నివేదించి మఱియు ఇట్లా పలికాడు.

తే. **'ద్రుపదనందనక్రియఁ గడుదుఃఖపడిన । నృపవధూటియు నాయట్ల నియతశోక**
వనధి నిర్మగ్నుఁ డైన భూవరసుతుండుఁ । గలఁడె వినఁ జూడ ననఘ! యెక్కాలముననుʔ' **263**

ప్రతిపదార్థం: అనఘ!= పాప రహితుడా! ఓ మార్కండేయ మహర్షీ!; ద్రుపదనందన, క్రియన్= ద్రౌపదివలె; కడున్= మిక్కిలిగా; దుఃఖపడిన= ఆవేదనాన్ని అనుభవించిన; నృప, వధూటియున్= రాజకాంతయున్నూ; నా+అట్లు+అ= నావలెనే; నియత, శోక, వనధి, నిర్మగ్నుఁడు+ఐన= నిత్య దుఃఖం అనే సముద్రంలో మునిగి ఉన్నవాడైన; భూవర సుతుండున్= రాజకుమారుడును; ఏ+కాలముననను= ఏ సమయంలోనైనా; వినన్= వినడానికి; చూడన్= చూడడానికి; కలఁడె?= ఉన్నాడా?.

తాత్పర్యం: 'పుణ్యాత్ముఁడ వైన ఓ మార్కండేయ మహామునీ! ద్రౌపదివలె మిక్కుటమైన ఆవేదనను అనుభవించిన రాజకుమారియున్నూ, నా వలె నిరంతర దుఃఖసముద్రంలో ఓలలాడిన రాజకుమారుడున్నూ ఎక్కడ నయినా ఉన్నాడా? ఏ కాలంలోను మాబోటివారు ఉన్నట్లుగా వినలేదు. చూడలేదు.'

వ. **అనిన నతనికి నత్తపోనిధి యి ట్లనియె.** **264**

తాత్పర్యం: అనిన ధర్మరాజుకు మహాతపశ్శాలి మార్కండేయుడు ఈ విధంగా చెప్పాడు.

క. **'కడు దుఃఖము నొందితి నని । యుడుగక యిటు వగచె దేల యుర్వీశ్వర! నీ**
పడు టేటిది? రఘురాముఁడు । గడఁగి యిడుమ వడఁడె! తొల్లి కాఱడవులలోన్. **265**

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ్వర!= ఓ ధర్మరాజా!; కడున్= మిక్కిలి; దుఃఖమున్= ఆవేదనను; ఒందితిన్+అని= అనుభవించానని; ఉడుగక= మానక; ఇటు= ఈ రీతిగా; వగచెదు+ఏల= ఎందుకు విచారిస్తావు; నీ పడుట+ఏటిది= నీవు పడిన (దుఃఖం) ఏపాటిది?; రఘురాముఁడు= రఘువంశానికి చెందిన శ్రీరాముడు; తొల్లి= పూర్వకాలంలో; కడఁగి= పూని; కాఱు+అడవులలోన్= దట్టమైన (నల్లని) అరణ్యాలలో; ఇడుమ+పడఁడె!= కష్టం అనుభవించ లేదా!.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! మిక్కుటమైన ఆవేదన అనుభవించానని మానక ఇంతగా ఏల విచారిస్తున్నావు? నీవు పడిన కష్టాలకంటె రఘువంశంలో జన్మించిన శ్రీరాముడు ఎక్కువకష్టాలను అనుభవించి ఉన్నాడు. కారడవులలో నివసించి పెక్కుఇడుమలు పొందాడు సుమా.

ఉ. **ఆ విభుకాంత గాదె జనకాత్మజ రావణుచే గృహీత యై**
పోవదె; వానరప్రకరముల్ వెసఁ దోడుగ నేఁగి యా ధరి
త్రీవిభుఁ డబ్ధిఁ గట్టఁడె, వధింపఁడె దివ్యశరంబులన్ దశ
గ్రీవునిఁ; గ్రమ్మఱం జని యకిల్బిషరాజ్యవిభూతి నొందఁడే? **266**

ప్రతిపదార్థం: జనక+ఆత్మజ= జానకి; ఆ విభుకాంత+కాదె= ఆ రాజుయొక్క భార్యయేకదా; రావణుచేన్= రావణుడు అనే రాక్షసుడిచేత; గృహీత+ఐ= గ్రహించబడినదై, అపహరించబడినది అయి; పోవదె= వెడలలేదా; వానర ప్రకరముల్= కోతుల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మూకలు; వెసన్= శీఘ్రంగా; తోడుగన్= సాయంరాగా; ఏఁగి= వెడలి; ఆ, ధరిత్రీ విభుఁడు= ఆ రాజు (రాముడు); అబ్ధిన్= సముద్రాన్ని; కట్టఁడె= బంధించడా?; దశగ్రీవునిన్= పదికంఠాలు కలవాడిని రావణుడిని; దివ్యశరంబులన్= దేవతా మహిమ గల బాణాలచేత; వధింపఁడె?= సంహరించడా?; క్రమ్మఱన్= తిరిగి; చని= వెడలి; అకిల్బిష, రాజ్య విభూతిన్= పాపం లేని పుణ్యరాజ్యసంపదను; ఒందఁడే?= పొందడా?.

తాత్పర్యం: ఆ రఘురాముడి భార్యయే జనకమహారాజుకూతురు, మహాపతివ్రతాశిరోమణి అయిన సీత. ఆమె రావణాసురుడిచేత అపహరించబడలేదా? కోతిమూకల సాయంతో శ్రీరాముడు సముద్రంపై వారధి కట్టి దివ్యాస్త్రాల చేత రావణుడిని సంహరించలేదా? తిరిగి తన రాజ్యసంపదలను అనుభవించలేదా?

విశేషం: ఇట్టి ప్రశ్ననే ధర్మరాజు వేసినపుడు బృహదశ్వ మహాముని నలోపాఖ్యానాన్ని చెప్పాడు. నలదమయంతులు పడినపాట్లు ద్రౌపది పాండవులు పడిన ఇడుములకంటె విషాద పూరితాలు. అట్లే సీతారాముల వనవాసగాథను మార్కండేయుడు ధర్మరాజుకు వివరించి చెప్పాడు.

ధర్మజునకు మార్కండేయుఁడు రామాయణకథ సెప్పుట (సం. 3-258-4)

వ. అనిన విని ధర్మజుండు 'మునీంద్రా! రాముఁ డెవ్వనివంశంబున వాఁడు? రావణుం డెవ్వని తనయుం? డేమి నిమిత్తంబున సీతాపహరణంబు సేసె? రామరావణులకు సంగ్రామం బెట్లు వర్తిల్లెం? జెప్పవే!' యని రామాయణ కథాశ్రవణకుతూహలియై యడిగిన నమ్మహాముని యి ట్లనియె. 267

ప్రతిపదార్థం: అనినన్= అని మార్కండేయుడు చెప్పగా; విని= ఆలకించి; ధర్మజుండు= ధర్మనందనుడు; ముని+ఇంద్రా!= మునులలో శ్రేష్ఠుడవైనవాడా, ఓ మార్కండేయ మహామునీ!; రాముండు= శ్రీరాముడు; ఎవ్వని వంశంబున వాఁడు?= ఎవరి కుటుంబానికి చెందినవాడు?; రావణుండు; ఎవ్వని, తనయుండు?= ఎవరి కుమారుడు?; ఏమి నిమిత్తంబునన్= ఏ కారణం వలన; సీతా+అపహరణంబు+చేసెన్= సీతను ఎత్తుకొని పోయాడు?; రామ రావణులకున్= రామునకును రావణునకును; సంగ్రామంబు= యుద్ధం; ఎట్లు= ఏ రీతిగా; ప్రవర్తిల్లెన్?= జరిగింది?; చెప్పవే= వినిపించవా; అని= అంటూ; రామయణ, కథా, శ్రవణ, కుతూహలి+ఐ= రామాయణ కథను వినటానికి ఆసక్తి కలవాడై; అడిగినన్= ప్రశ్నించగా; ఆ+మహా, ముని= మార్కండేయుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని మార్కండేయుడు చెప్పగా ఆలకించి ధర్మరాజు- 'ఓ మార్కండేయ మహామునీ! శ్రీరాముడు ఏ వంశానికి చెందినవాడు? రావణుడు ఎవరి కుమారుడు? ఏ కారణాన రావణుడు సీతాదేవిని అపహరించాడు? రాముడికీ రావణుడికీ యుద్ధం ఏ విధంగా జరిగింది? దయచేసి వివరించి చెప్పవా?' అని రామాయణకథను వినవలె ననే వేడుకతో ప్రశ్నించాడు. మార్కండేయమహర్షి ఈ విధంగా సమాధానం చెప్పాడు.

విశేషం: (1) ఇది మహాభారతంలో అంతర్గర్భితమైన రామాయణ కథ. ఎఱ్ఱన మహాకవి ప్రత్యేకంగా రామాయణాన్ని వ్రాశాడు. ఆ విషయంలో సందేహానికి ఎట్టి ఆస్కారమూ లేదు. కాని, దురదృష్టవశాన ఎఱ్ఱనరామాయణం నేడు ఉపలబ్ధం కాదు. ప్రాచీనాలంకారికులు ఎఱ్ఱన రామాయణంలోనివని ఉదాహరించిన పద్యాలు భారతాంతర్గతమైన ఈ రామాయణభాగంలో కన్పించవు. ఇక ఎఱ్ఱనరామాయణం ఏమైనట్లు? అది భవిష్యత్కాల పరిశోధకులు తేల్చవలసిన అంశం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(2) రామాయణం అనగా శ్రీరామునియాత్ర వనవాసగమనం. నలోపాఖ్యానంవలె రామాయణగాథ కూడ విషాదాత్మకం; భావితాంతఃకరణప్రవృత్తిని సహృదయులకు సంఘటించే వృత్తం. నవరసరుచిరం. పలువురు రామాయణ మహాభారత కథలను అనుసరించి తులనాత్మక పరిశోధనకు పూనుకోవటం కద్దు. కురుక్షేత్ర సంగ్రామం మహాభారతకథకు వెన్నెముక. రామరావణ సంగ్రామం గూడ యుద్ధవర్ణనలో ప్రపంచసారస్వతంలో పేర్కొనదగిన ఘట్టం.

(3) ప్రాచీనభారతీయవాఙ్మయాన వీరగాథలు, విషాదాత్మకగాథలు సుప్రసిద్ధాలు. యుగయుగాంతరాల సహృదయుల హృదయాలను ఉఱ్ఱూతలూగించిన నలోపాఖ్యానం, రామాయణ గాథ మహాభారతంకంటె మిక్కిలి ప్రాచీనాలనిన్నీ పృథగ్భూతాలైన ఆ ప్రాచీనతను వీరవిషాదగాథలు మహాభారతంలో తరువాత చేర్చబడినవనిన్నీ పాశ్చాత్యవిమర్శకులు పలువురి అభిప్రాయం. రామాయణగాథ మిక్కిలి ప్రాచీన మైన దనటానికి నిర్వికల్పనిదర్శనం నవీనశాస్త్రజ్ఞులు నరుడికి ప్రపితామహులుగా భావించే 'వానర' పాత్రలు అందులో కన్పించటం.

క. 'విను మిక్ష్వాకుకులంబున । జనియించె నజుండు నాఁ బ్రశస్తచరితుఁ డా
తని కొడుకు దశరథుఁడు; ముద । మున నాతఁడు పెండ్లియయ్యె మువ్వురు సతులన్. 268

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ఇక్ష్వాకు, కులంబునన్= ఇక్ష్వాకులయొక్క వంశంలో; అజుండు; నాన్= అనగా; ప్రశస్త, చరితుఁడు= మంచి స్వభావం కలవాడు; జనించెన్= పుట్టాడు; ఆతని కొడుకు= ఆతడి యొక్క (అజుడి యొక్క) పుత్రుడు; దశరథుఁడు= దశరథుడు అనేవాడు; ఆతఁడు= ఆ దశరథుడు; ముదమునన్= వేడుకతో; ముప్వురు= ముగ్గురు; సతులన్= పతివ్రతలను; పెండ్లి+అయ్యెన్= వివాహమాడాడు.

తాత్పర్యం: చెపుతున్నాను సావధానంగా వినుము. ఇక్ష్వాకువంశంలో అజుడు అనే మంచి నడవడిక కల రాజు జన్మించాడు. అతడికి దశరథుడు అనే కొడుకు పుట్టాడు. ఆ దశరథుడు వేడుకతో ముప్వురు సతులను పెండ్లాడాడు.

వ. అందుఁ గౌసల్య కురాముండును, గైకేయికి భరతుండును, సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్నులును జనియించి; రందు రామునకు విదేహరాజనందన యైన సీత ప్రియాంగన యయ్యె; నిఁక రావణుజన్మంబు సెప్పెద వినుము. 269

ప్రతిపదార్థం: అందున్= ఆ ముప్వురియందు; కౌసల్యకున్= కౌసల్యఅనే సతికి; రాముండును= రాముడు అనేవాడును; కైకేయికిన్; భరతుండును; సుమిత్రకున్; లక్ష్మణ; శత్రుఘ్నులును; జనియించిరి= పుట్టారు; అందున్= ఆ పుత్రులలో; రామునకున్; విదేహ, రాజ, నందన+ఐన= విదేహరాజుయొక్క కుమారి అయిన; సీత; ప్రియ+అంగన= ఇష్టమైన వనిత-భార్య; అయ్యెన్= అయింది; ఇఁకన్= ఇకమీద; రావణు జన్మంబు= రావణుడి పుట్టుకనుగురించి; చెప్పెదన్= వచిస్తాను; వినుము= ఆకర్ణించుము.

తాత్పర్యం: ఆ దశరథుడిభార్యలలో కౌసల్యకు రాముడు, కైకేయికి భరతుడు, సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్నులున్నూ జన్మించారు. వారిలో రాముడికి విదేహరాజకుమారి సీత అనుగు భార్య అయింది. ఇక రావణుడిపుట్టుకనుగూర్చి చెప్పుతాను. ఆలకించుము.

ఆ. అఖిలలోకకర్త యగు విరించికిఁ బుల । స్త్యుండు నాఁగ మానసుఁడు దనూజుఁ
డుద్భవించె; నతని కుదయించె వైశ్రవ । ణాభిధానుఁడైన యాత్మజుండు. 270

ప్రతిపదార్థం: అఖిల, లోక, కర్తృ+అగు= సమస్తలోకాలను సృష్టి చేసేవాడైన; విరించికిన్= బ్రహ్మదేవుడికి; పులస్త్యుండు; నాఁగన్= అనఁగా; మానసుఁడు= మనస్సుకు సంబంధించినవాడు; తనూజుఁడు= కొడుకు; ఉద్భవించెన్= జనించాడు; అతనికిన్= వాడికి (ఆ పులస్త్యుడికి); వైశ్రవణ+అభిధానుఁడు+ఐన= వైశ్రవణుడు అనే పేరు కల వాడైన; ఆత్మజుండు= కొడుకు; ఉదయించెన్= పుట్టాడు.

తాత్పర్యం: సమస్తలోకాలను సృజించే బ్రహ్మదేవుడికి 'మానస పుత్రుడై' పులస్త్యుడు అనేవాడు పుట్టాడు. ఆ పులస్త్యుడికి వైశ్రవణుడు అనే కుమారుడు జన్మించాడు.

విశేషం: కుమారుడు జన్మించటం అనగా వైవాహికధర్మాచరణలో భార్యాభర్తలకు సంతానం కలగటం. ఇట- పులస్త్యుడు సృష్టి కర్తకు ఆ విధంగా పుట్టిన కొడుకు కాడు. బ్రహ్మదేవుడి మనస్సునుండి పుట్టినవాడు. అనగా పులస్త్యుడు బ్రహ్మమానసపుత్రుడు.

వ. ఆ వైశ్రవణుండు దన తండ్రి యగు పులస్త్యుని విడిచి, తాత యగు చతుర్ముఖునకుం దపంబు సేసి నలకూబరుం డను కొడుకును లోకపాలకత్వంబును ధనేశ్వరత్వంబును లంక యను పురంబును శంకరుతోడి సఖ్యంబును వరంబులుగాఁ బడసి, మహావిభూతితో వర్తిల్లుచున్నంగని, యలిగి, పులస్త్యుండు నిజశరీరంబునం దర్ధంబున విశ్రవసుం డను వాని సృజియించి, యా వైశ్రవణున కహితంబు సేయు మని పనిచిన నెఱింగి, కిన్నరేశ్వరుండు విశ్రవసుపాలి కరుదెంచి 'మహాత్మా! యేను నీకుం బుత్త్రుండ నయ్యెద; నాకుం గరుణింపు' మని యతనిం బ్రసన్నునిం జేసి నృత్తగీతవిద్యావిశారద లయిన రాక్షసస్త్రీలం బుష్పోత్కటయు, మాలినియు, బకయు నను వారి ముగ్వుర నవ్విప్రవరునకుఁ బరిచారికలంగా నిచ్చిన.271

ప్రతిపదార్థం: ఆ వైశ్రవణుండు= ఆ వైశ్రవణుడు; తన తండ్రి+అగు= తన యొక్క జనకుడు అయిన; పులస్త్యుని విడిచి= పులస్త్యుడిని వదలిపెట్టి; తాత+అగు= పితామహుడు అయిన; చతుర్ముఖునకున్= నాలుగు మోములు కల బ్రహ్మదేవుడిని గూర్చి; తపంబు+చేసి= తపస్సు చేసి; నలకూబరుండు+అను, కొడుకును= నలకూబరుడు అనే పేరు కల పుత్రుడిని; లోక పాలకత్వంబును= లోకాన్ని పరిపాలించటమున్నూ; ధన+ఈశ్వరత్వంబును= ధనానికి ఆధిపత్యం వహించటమున్నూ; లంక+అను పురంబును= లంక అనే పేరు కల పట్టణమున్నూ; శంకరుతోడి సఖ్యంబును= శివుడితోడి మైత్రియున్నూ; వరంబులుగాన్= వరాలుగా; పడసి= పొంది; మహా, విభూతితోన్= గొప్ప సంపదతో; వర్తిల్లు చున్నన్= సాగుతూ ఉండగా; కని= చూచి; అలిగి= కోపం పొంది; పులస్త్యుండు= పులస్త్యుడు (బ్రహ్మమానసపుత్రుడు); నిజ, శరీరంబు నందున్= తన దేహంలో; అర్ధంబునన్= సగం భాగంతో; విశ్రవసుండు+అను వానిన్= విశ్రవసుడు అనే పేరు కల వాడిని; సృజియించి= పుట్టించి; ఆ వైశ్రవణునకున్; అహితంబు= కీడు; చేయుము+అని= సలుపుము అని; పనిచినన్= నియోగించగా; ఎఱింగి= తెలిసికొని; కిన్నర+ఈశ్వరుండు= కిన్నరులకు ప్రభువు; విశ్రవసుపాలికిన్!= విశ్రవసుడి దగ్గరకు; అరుదెంచి= వచ్చి; మహా+ఆత్మా= మహానుభావుడవైన ఓ విశ్రవసూ! ఏను= నేను; నీకున్= నీకు; పుత్త్రుండన్+అయ్యెదన్= కొడుకును కాగలను; నాకున్+కరుణింపుము= నాయెడ దయ చూపుము; అని= వచించి; అతనిన్= వాడిని- విశ్రవసుడిని; ప్రసన్నునిన్+చేసి= అనుకూలుడుగా చేసికొని; నృత్త, గీత, విద్యా, విశారదలు+అయిన= నాట్యంలోను, గానంలోను నేర్పుకలవారు అయిన; రాక్షస స్త్రీలన్= రాక్షస వనితలను; పుష్పోత్కటయు, మాలినియు, బకయున్+అనువారిన్= పుష్పోత్కట, మాలిని, బక అనే వారిని; ముగ్వురన్= ముగ్గురిని; ఆ+విప్ర, వరునకున్= ఆ బ్రాహ్మణోత్తముడికి; పరిచారికలుగాన్= సేవకురాండ్రుగా; ఇచ్చినన్= అర్పించగా.

తాత్పర్యం: ఆ వైశ్రవణుడు తన తండ్రి అయిన పులస్త్యుడిని సరకుగొనక, పితామహుడు అయిన బ్రహ్మదేవుడిని గూర్చి తపస్సు చేసి, నలకూబరుడు అనే కొడుకును, లోకపాలకత్వాన్నీ (కిన్నరలోక ప్రభుత్వాన్ని), ధనానికి ఆధిపత్యాన్నీ,

లంకాపట్టణాన్నీ, శివుడితో స్నేహాన్నీ వరాలుగా పొందాడు. ఆ వైశ్రవణుడి సంపద చూచి కోపగించుకొని పులస్త్యుడు తన శరీరపు సగంభాగంనుండి విశ్రవసుడు అనేవాడిని సృజించి, ఆ వైశ్రవణుడికి కీడు చేయు మని నియోగించాడు. వైశ్రవణుడు ఆ వృత్తాంతాన్ని, తెలిసికొని, విశ్రవసుడి కడ కేగి 'మహాత్మా! నేను నీకు కొడుకుగా ఉండగలను; నాయందు దయ చూపుము' అని ప్రార్థించి, అతడి అనుగ్రహాన్ని చూరగొని, నృత్తంలోనూ గానంలోనూ ప్రావీణ్యం గల ముప్పురు రాక్షసవనితలను- 'పుష్పోత్కట, మాలిని, బక' అనే పేరుకల వారలను ఆ బ్రాహ్మణోత్తముడికి సేవకురాండ్రుగా సమర్పించాడు.

విశేషం: (1) ప్రాచీన పురాణవాఙ్మయంలో వైశ్రవణుడికి 'కుబేరుడు' అనే నామాంతరం ఉన్నది. అతడు కిన్నరలోకపాలకుడు. కిన్నరులు అశ్వముఖం నరశరీరం కల వేల్పులు. కిన్నరులు సంగీతప్రియులు.

(2) విశ్రవసుడికి పరిచారికలు ముప్పురు. పుష్పోత్కట, మాలిని, బక. బకకు పాఠాంతరం కొన్ని ప్రతులలో "పాక"గా కనుపిస్తున్నది. ఇట "బక" పాఠమే గ్రహించబడింది. కారణం-273 సంఖ్య గల గద్యంలో ఎఱ్ఱన బకకు ఖరుండును శూర్పణఖ యను కన్యకయు- 'మిథునంబై' ప్రభవించినట్లు వ్రాశాడు. సంస్కృత మూలం దాక్షిణాత్యప్రతిలో "బకాయాం మిథునమ్ జజ్ఞే ఖరః శూర్పణఖా తథా' అని ఉన్నది. దీనినిబట్టి ఎఱ్ఱన దాక్షిణాత్యప్రతినే ప్రామాణికంగా ఎన్నినట్లు తలపవచ్చును. కావున ఖరుడికి శూర్పణఖకు తల్లి అయిన పరిచారిక పేరు "బక" అని నిర్ణయించవచ్చును. కొన్ని ఔత్తరాహప్రతులందు ఆమె పేరు "పాక" అని ఉన్నది.

క. పురుడున నయ్యువతులు నొం । డొరులం గడవంగ విలసదుపచారసమా
చరణప్రవీణభంగులఁ । బరితోషితుఁ జేసి రా తపస్విపరేణ్యున్. 272

ప్రతిపదార్థం: ఆ+యువతులు= ఆ జవరాండ్రు; పురుడునన్= పోలికలో (పోటీపడుతూ); ఒండు+ఒరులన్= ఒకరినొకరు; కడవంగన్= అతిక్రమించేటట్లుగా; విలసత్+ఉపచార, సమ్+ఆచరణ, ప్రవీణ భంగులన్= శోభిల్లే పరిచర్యలు బాగా చేసే సామర్థ్యంలోని రీతులలో; ఆ తపస్వి, వరేణ్యున్= ఆ మునులలో శ్రేష్ఠుడు అయినవాడిని; పరితోషితున్= మిక్కిలి సంతోషం చెందిన వాడినిగా; చేసిరి= ఒనరించారు.

తాత్పర్యం: సమానులయందుండే స్పర్ధతో ఆ జవ్వనులు ఆ మునిశ్రేష్ఠుడైన విశ్రవసుడికి పరిచర్య చేశారు. ఒకరి నొకరు మించవలెననే కోరికతో ఆతడిని మిక్కిలి సంతోషపెట్టారు.

వ. ఇట్లు ప్రీతుండై యతండు వారలకుఁ బుత్త్రదానంబు సేసిన నందుఁ బుష్పోత్కటకు రావణ కుంభకర్ణులును, మాలినికి విభీషణుండును, బకకు ఖరుండును శూర్పణఖ యను కన్యకయు మిథునంబై ప్రభవించి; రక్కుమారులకు నలువురకుఁ దజ్జనకుండు జాతకర్మాదిసంస్కారంబు లొనరించి సగౌరవంబుగాఁ బెనిచి యుపనీతులం జేసె; నందు. 273

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ప్రీతుండు+ఐ= సంతుష్టి చెందినవాడై; అతండు= అతడు- విశ్రవసుడు; వారలకున్= ఆ ముగ్గురు పరిచారికలకు; పుత్త్ర దానంబు+చేసినన్= సంతానాన్ని దానం చేయగా; అందున్= వారిలో; పుష్పోత్కటకున్= పుష్పోత్కట అనే ఆమెకు; రావణ, కుంభకర్ణులును= రావణుడు కుంభకర్ణుడు అనే వారున్నూ; మాలినికిన్= మాలిని అనే ఆమెకు; విభీషణుండును= విభీషణుడును; బకకున్= బక అనే ఆమెకు; ఖరుండును= ఖరుడును; శూర్పణఖ= శూర్పణఖ

అనే పేరు కల; కన్యకయున్= కన్నెయు; మిథునంబు+ఐ= జతగా, కవలై; ప్రభవించిరి= పుట్టారు; ఆ కుమారులకున్= ఆ బిడ్డలకు; నలువురకున్= నలుగురికి - రావణ కుంభకర్ణ విభీషణ ఖరులకు; తత్+జనకుండు= వారి తండ్రి విశ్రవసుడు; జాతకర్మ+ఆది, సంస్కారంబులు= పుట్టినప్పుడు చేసే కర్మలు మున్నగు క్రియలు; ఒనరించి= చేసి; స గౌరవంబుగాన్= మంచి మర్యాదలతో; పెనిచి= పెంచి; ఉపనీతులన్+చేసెన్= వడుగులు అయినవారిగా చేశాడు; అందున్= వారిలో.

తాత్పర్యం: ఈ విధంగా పరిచారికలయెడ ప్రీతి కలవాడై; విశ్రవసుడు వారలకు సంతానం ప్రసాదించాడు. పుష్పోత్కటకు రావణుడు కుంభకర్ణుడు జన్మించారు. మాలినికి విభీషణుడు పుట్టాడు. బకకు ఖరుడు శూర్పణఖ అనే ఆడ, మగజంట కవలబిడ్డలై ఉద్భవించారు. ఆ నలుగురు కుమారులకు తండ్రి అయిన విశ్రవసుడు జాత కర్మాది సంస్కారాలు చేసి వారలకు వడుగులు చేశాడు. వారిలో.

విశేషం: జాతకర్మలు పదునారు. జీవుడు పుట్టటానికి పూర్వంనుండి గిట్టేవరకు జరుగవలసిన వైదికసంస్కారాలు. 1. గర్భాదానం 2. పుంసవనం 3.సీమంతం 4. జాతకర్మం 5. నామకరణం 6. అన్నప్రాశనం 7. చౌలం 8. ఉపనయనం 9. ప్రాజాపత్యం 10. సౌమ్యం 11. ఆగ్నేయం 12. వైశ్వదేవం 13. గోదానం 14. సమావర్తం 15. వివాహం 16. అంత్యసంస్కారం.

ఉ. ఆతతతేజుఁ డున్నతభుజాగ్రుఁడు లోకభయంకరుండు వి
ఖ్యాతపరాక్రముండు దశకంఠుఁడు సంతతరోషమానసుం;
డాతనియట్లు దుర్మదమయాత్ముఁడు క్రూరుఁడు గుంభకర్ణుఁడున్;
భీతివిదూరుఁ డార్యుఁడు విభీషణుఁ డుత్తమచిత్తుఁ డారయన్. 274

ప్రతిపదార్థం: దశకంఠుఁడు= పదికంఠాలు కలవాడు- రావణుడు; ఆతత+తేజుఁడు= విస్తార మయిన ప్రకాశం కలవాడు; ఉన్నత, భుజ+అగ్రుఁడు= ఎత్తయిన బాహువుల కొనలు కలవాడు; లోక భయంకరుండు= జగత్తులకు భీతి కలిగించే వాడు; విఖ్యాత, పరాక్రముండు= పేరు ప్రతిష్ఠల నార్జించిన శౌర్యం కలవాడు; సంతత, రోష, మానసుండు= ఎల్లప్పుడూ ప్రజ్వలించిన క్రోధం కలవాడు; కుంభకర్ణుఁడున్= కుంభకర్ణుడు అనేవాడు కూడ; ఆతని+అట్లు+అ= ఆతని వంటివాడే (రావణుడివంటివాడే); దుర్మద, మయ+ఆత్ముఁడు= చెడు గర్వంతో కూడిన ఆత్మ కలవాడు; క్రూరుడు= కఠిన చిత్తుడు; భీతి విదూరుఁడు= భయం లేని వాడు; విభీషణుడు= విభీషణుడు అనేవాడు; ఆర్యుఁడు= మంచి లక్షణాలు కలిగి పూజించ తగినవాడు; ఆరయన్= పరిశీలించగా; ఉత్తమ, చిత్తుఁడు= మంచి మనస్సు కలవాడు.

తాత్పర్యం: వారిలో రావణుడు విస్తారమైన వర్చస్సు కలవాడు, ఎత్తయిన భుజాలు కలవాడు, పేరుప్రతిష్ఠలను ఆర్జించిన పరాక్రమం కలవాడు, పదితలలు కలవాడు, ఎల్లప్పుడు ప్రజ్వలించే క్రోధంతో ఉండేవాడు. ఆతడివంటివాడే కుంభకర్ణుడు కూడ. మిక్కిలి కఠినచిత్తం కలవాడు, చెడుగర్వంతో నిండిన హృదయం కలవాడు. కాని, విభీషణుడు మాత్రం నిర్భయుడు, మంచిగుణాలు కలిగి మన్నించతగినవాడు. పరిశీలించి చూస్తే గొప్పమనస్సు కలవాడు.

విశేషం: ఎత్తైన భుజాలు కలిగి ఉండటం శౌర్యలక్షణంగా సాముద్రికశాస్త్రవేత్తలు భావిస్తారు.

క. ఖరుఁడు ఖరతేజుఁ డవనీ । సుర పరిభవకారి మాంసశోణితభుజుఁ డు
ద్ధురచిత్తుఁడు శూర్పణఖయు । దురితచరిత ధర్మకర్మదూషిత యెపుడున్. 275

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఖరుఁడు= ఖరుడు అనే పేరు కలవాడు; ఖర తేజుఁడు= వాడిమి, వేడిమి కలవాడు; అవనీ సుర, పరిభవ, కారి= బ్రాహ్మణులకు అపకారం చేసేవాఁడు; మాంస శోణిత భుజుఁడు= మాంసం నెత్తురు భుజించేవాడు; ఉద్ధుర చిత్తుఁడు= కఠిన మైన మనస్సు కలవాడు; శూర్పణఖ యున్= శూర్పణఖ అనే పేరు కలదికూడ; దురిత చరిత= పాపం చేసే స్వభావం కలది; ఎపుడున్= ఎల్లప్పుడును; ధర్మ, కర్మ, దూషిత= ధర్మమైన పనులచే తిరస్కరించబడేది.

తాత్పర్యం: ఖరుడు అనేవాడు వాడిమి, వేడిమిగల వర్చస్సు కలవాడు. బ్రాహ్మణులను అవమానించేవాడు. మాంసాన్ని నెత్తురును ఆహారంగా స్వీకరించేవాడు. కఠినమైన మనస్సు కలవాడు. శూర్పణఖ పాపాత్మురాలు. ధర్మకర్మలను తిరస్కరించేస్వభావం కలది.

విశేషం: రామాయణపాత్రలకు ఆయాపేరులు సార్థకనామధేయాలుగా కన్పిస్తాయి. ఖరుడు వాడిమి వేడిమి కలవాడనే కాక గాడిదవంటివాడు అని అర్థం కూడ ఏర్పడుతుంది. శూర్ప+నఖ= శూర్పణఖ= చేటలవంటి గోళ్లు కలది. కుంభకర్ణుఁడు= కుండల వంటి చెవులు కలవాడు. రావణుడు= జగద్రావణం చేసేవాడు.

వ. ఆ రాక్షసకుమారులు దండ్రివలన నఖిలవేదవేదాంగ ధనుర్వేదపారగులై గంధమాదన గిరియందు సుఖం బుండి యొక్కనాఁ డతనికి మ్రొక్కవచ్చువాని నధికవిభవసమన్వితు వైశ్రవణుం జూచి తత్ప్రభావంబు తపోలబ్ధం బగుట విని జాతమత్సరు లయి తారును బితామహు నుద్దేశించి తపంబు సేయం దొడంగిరి; తత్ప్రకారంబు వినుము. 276

ప్రతిపదార్థం: ఆ రాక్షస కుమారులు= ఆ రక్కసుల బిడ్డలు; తండ్రివలనన్= జనకుడివలన; అఖిల వేద, వేద+అంగ, ధనుః +వేద, పారగులు+ఐ= సమస్త వేదాలు, వేదాలయొక్క అంగాలు, విలువిద్యలయొక్క అవ్వలిగట్టును చేరినవారై; గంధమాదన, గిరియందున్= గంధమాదనం అనే పర్వతంలో; సుఖంబు+ఉండి= సౌఖ్యంతో నివసించి ఉండి; ఒక్కనాఁడు= ఒకరోజున; అతనికిన్= విశ్రవసునికి; మ్రొక్కన్ వచ్చు వానిన్= నమస్కరించటానికై వచ్చిన వాడిని; అధిక, విభవ, సమన్వితున్= గొప్ప సంపదతో కూడిన వాడిని; వైశ్రవణున్+చూచి= కుబేరుడిని కాంచి; తత్+ప్రభావంబు= ఆతడియొక్క మహిమ; తపస్+ లబ్ధంబు+అగుట= తపస్సువలన సిద్ధించింది. అగుట; విని= ఆలకించి; జాత మత్సరులు+అయి= అసూయ కలవారయి; తారును= తాముకూడా; పితామహున్= బ్రహ్మదేవుడిని; ఉద్దేశించి= లక్ష్యంగా పెట్టుకొని; తపంబు+చేయన్+తొడంగిరి= తపస్సు చేయడానికి పూనుకొన్నారు; తత్+ప్రకారంబు= ఆ తపస్సు యొక్క వృత్తాంతం; వినుము= ఆలకింపుము.

తాత్పర్యం: ఆ రాక్షసకుమారులు జనకుడిదగ్గర వేదాలు వేదాంగాలు విలువిద్య అన్నింటిని క్షుణ్ణంగా అభ్యసించి, గంధమాదనపర్వతంలో సుఖంగా ప్రొద్దుపుచ్చుతూ ఉన్నారు. ఒకనాడు కుబేరుడు విశ్రవసుడికి అభివాదం చేయటానికై అచటికి వచ్చాడు. కుబేరుడివైభవం, మహిమలు, అతడికి తపస్సువలననే సంక్రమించినట్లు విని, అసూయ చెంది తాముకూడ బ్రహ్మదేవుడినిగూర్చి తపస్సు చేయటానికి పూనుకొన్నారు. వారి తపోవృత్తాంతం వివరిస్తాను. వినుము.

తే. మండు వేసవిఁబంచాగ్ని మధ్యమున, ఘ । నాగమంబున బయల, నత్యంత తుహిన
సమయమున నీరియందు, నిశ్చలత నిలిచి । దశముఖుఁడు వాయుభక్షుఁ డై తప మొనర్చె. 277

ప్రతిపదార్థం: దశముఖుఁడు= పది మొగాలు కలవాడు; వాయు భక్షుఁడు+ఐ= గాలినిమాత్రమే ఆహారంగా భుజించినవాడై; మండు వేసవిన్= ఎండలు చెండుతున్న వేసవి కాలంలో; పంచ+అగ్ని, మధ్యమునన్= అయిదు అగ్నుల మధ్యలో ఉండి;

ఘన+ఆగమంబునన్= వర్షాకాలంలో; బయలన్= బహిరంగ ప్రదేశంలో; అత్యంత, తుహిన, సమయమునన్= మిక్కుటంగా మంచు కురిసే కాలంలో; నీరియందున్= జలంలో; నిశ్చలతన్= చలించకుండా; నిలిచి= నిలబడిఉండి; తపము= తపస్సు; ఒనర్చెన్= చేశాడు.

తాత్పర్యం: పదిమొగాలు కల రావణుడు కఠినతపస్సు చేశాడు. వేసవి మండుటెండల సమయంలో అయిదు అగ్నులనడుమ నిలిచి తపస్సు చేసేవాడు. వానకాలంలో ఆరుబయట, మంచుకురిసేకాలంలో నీటిలోనూ నిష్ఠతో నిలబడి రావణుడు కేవలం గాలినిమాత్రమే ఆహారంగా గైకొని తపస్సు చేశాడు.

విశేషం: పంచాగ్నులు= పంచ+అగ్నులు= అయిదు అగ్నులు. 1. ఆహవనీయం 2. దక్షిణాగ్ని 3. గార్హపత్యం 4. సభ్యం 5. అవసథ్యం. వాటిని వరుసగా వేదికకు పూర్వ దక్షిణ పశ్చిమ-దిక్కులలోనూ, సభ్యం అవసథ్యం ఈశాన్యదిక్కునను నిలుపుతారు.

మ. నియతాహారుఁడు నిర్జితేంద్రియుఁడు నై నిష్కంపవృత్తిన్ మహీ
శయనుండై వ్రతముల్ చరించె నధికేచ్ఛం గుంభకర్ణుండు ధై
ర్యయుతుండై; ఘనుఁ డవ్విభీషణుఁడు పర్ణాహారవృత్తిన్ జపా
ధ్యయనాసక్తిఁ దపంబు సేసె మది నత్యంతంబు సంశుద్ధితోన్. 278

ప్రతిపదార్థం: కుంభకర్ణుండు; నియత+ఆహారుఁడు= కట్టడికి లోనై తిండి తినే వాడు; నిర్జిత+ఇంద్రియుఁడున్+ఐ= గెలువబడిన ఇంద్రియాలు కలవాడై, ఇంద్రియాలను అదుపులో పెట్టిన వాడై; నిష్కంపవృత్తిన్= చలించని వ్యాపారం కలవాడై; మహీ, శయనుండు+ఐ= నేలమీద పడుకొంటున్నవాడై; అధిక+ఇచ్ఛన్= మిక్కుటమైన కోరికతో, లక్ష్యసిద్ధియందు తదేకధ్యానం కలవాడై; వ్రతముల్= నోములు; చరించెన్= ఆచరించాడు; ఘనుఁడు= గొప్పవాడు; ధైర్యయుతుండు+ఐ= వికారాలు లేనట్టి స్థిర చిత్తం కలవాడై; ఆ+విభీషణుఁడు; పర్ణ+ఆహార, వృత్తిన్= ఆకులు మాత్రమే తిండిగా భుజిస్తూ; జప+అధ్యయన+ఆసక్తిన్= మంత్రాల ఆవృత్తి, వేదాల పారాయణంలోని కోరికచేత; మదిన్= చిత్తంలో; అత్యంతంబున్= మిక్కుటంగా; సంశుద్ధితోన్= స్వచ్ఛమైన పవిత్రతతో; తపంబు+చేసెన్= తపస్సు చేశాడు.

తాత్పర్యం: కుంభకర్ణుడు ఆహారనియమాలను పాటిస్తూ, ఇంద్రియాలను నిగ్రహించి చలించనిమనస్సు కలవాడై వ్రతాల నాచరించాడు. గొప్పవా డైన ఆ విభీషణుడు ఆకులుమాత్రమే ఆహారంగా భుజించినవాడౌతూ మంత్రాలను ఆవృత్తి చేస్తూ, వేదాలను వల్లెవేస్తూ మనస్సును నిర్మలంగా పవిత్రంగా ఒనరించుకొంటూ తపస్సు చేశాడు.

విశేషం: ఇంద్రియాలను నిగ్రహించటం తపస్సుకు అపరిహార్యమైన లక్షణం.

వ. ఖరుండును శూర్పణఖయు వారికిం దగిన పరిచర్యలు సేయుచుండి; రంత సహస్రవర్షంబులు నిండినం బంక్తివదనుండు దనమస్తకం బొక్కటి ఖండించి మండెడు నగ్నియందు వేల్చి మఱియు వేయేండ్ల కొక్కటిగాఁ దలలు తొమ్మిదియుం దఱిగి వేల్చిధైర్యంబు దఱుఁగక పదియగు తలయును ద్రెంప సమకట్టినఁ బితామహుండు ప్రత్యక్షంబై వారించి, వాని శిరంబు లెప్పటి యట్ల కలుగ నొసంగి 'యమరత్వంబు దక్కనొండు నీ కభిమతం బగునది యెయ్యది యైనను నడుగు' మనుటయు నన్నిశాచరుండు. 279

ప్రతిపదార్థం: ఖరుండును= ఖరుడును; శూర్పణఖయున్= శూర్పణఖయు; వారికిన్= (రావణ, కుంభకర్ణ, విభీషణులకు); తగిన= సరిపోయే; పరిచర్యలు= సేవలు; చేయుచున్+ఉండిరి; అంతన్= అంతట; సహస్ర వర్షంబులు= వేయిఏండ్లు; నిండినన్= పూర్తి అయిన పిమ్మట; పంక్తి వదనుండు= దశకంఠుడు - రావణుడు; తన మస్తకంబు= తన శిరము; ఒక్కటి= ఒక్కటి; ఖండించి= కత్తిరించి; మండెడు= జ్వలించే; అగ్నియందున్= నిప్పులో; వేల్చి= ఆహుతి చేసి; మఱియున్= ఇంకను; వేయేండ్లకున్= వేయి సంవత్సరాలకు; ఒక్కటిగాన్= ఒక శిరస్సుగా; తలలు= శిరములు; తొమ్మిదియున్= తొమ్మిదింటిని; తఱిగి= నరికి; వేల్చి= ఆహుతి చేసి; ధైర్యంబు= చిత్తంలోని దిటవుతనం; తఱుఁగక= తగ్గక; పది+అగు, తలయును= పదియవ శిరస్సును; త్రెంపన్= త్రుంచటానికి; సమకట్టినన్= పూనగా; పితామహుండు= బ్రహ్మదేవుడు; ప్రత్యక్షంబు+ఐ= సాక్షాత్కరించి; వారించి= ఆపి; వాని శిరంబులు= ఆతని తలలు- రావణుడి తలలు; ఎప్పటి+అట్ల= యథాప్రకారం; కలుగన్= ఏర్పడేటట్లు; ఒసంగి= వరం ఇచ్చి; అమరత్వంబు, తక్కన్= చావు లేకపోవటం తప్ప; ఒండు= ఇంకొకటి; నీకున్+అభిమతంబు+అగునది= నీకు ఇష్టం అయినది; ఎయ్యది+ఐనను= ఏది అయినప్పటికి; అడుగుము= కోరుము; అనుటయున్= అని చెప్పటమున్నూ; ఆ+నిశాచరుండు= ఆ రాక్షసుడు- రావణుడు.

తాత్పర్యం: ఖరుడును శూర్పణఖయు తమ అన్నగారలు అయిన రావణుడికి కుంభకర్ణుడికి విభీషణుడికి అవసరమైన సేవలు చేస్తూ ఉన్నారు. వేయి సంవత్సరాలు ఆ విధంగా తపస్సు చేసినను బ్రహ్మదేవుడు సాక్షాత్కరించలేదు. అయినను రావణుడు తనదీక్షను వీడక తన పదితలలలో ఒక తలను ఖండించి అగ్నిలో ఆహుతి చేశాడు. అట్లే రావణాసురుడు మరి తొమ్మిదివేల సంవత్సరాలు కఠోరతపస్సు చేసి తన వేయి సంవత్సరాల కొక శిరస్సువంతున ఆహుతి చేస్తూ, చివరకు తన పదవ శిరస్సును కూడ ఖండించి అగ్నిలో వేల్చటానికి సంసిద్ధుడైనపుడు బ్రహ్మదేవుడు సాక్షాత్కరించాడు. అప్పుడు పితామహుడు రావణుడి తలలు తొమ్మిది యథాప్రకారం మొలిచేటట్లు వరాన్ని ఇచ్చి 'అమరత్వం తప్ప మరి యేదైన ఇంకొక వరాన్ని కోరుకొను' మని చెప్పాడు. అంతట ఆ రావణుడు.

విశేషం: (1) రావణుడు చేసింది తామస తపస్సు. అహంకారంతో, స్వార్థబుద్ధితో తన శక్తిసామర్థ్యాలు పెంచుకొనటానికై చేసే తపస్సు ఒక యెత్తు. విశ్వశ్రేయాన్ని కాంక్షించే తపస్సు మరియొక యెత్తు. (2) రావణుడు పదివేల సంవత్సరాలు తపస్సు చేసినట్లు ఇందులో ఉన్నది. ఈ కాలమానం ఎట్టిది? ఈ విషయంపై పండితులలో ఏకాభిప్రాయం కుదరలేదు.

శా. **'దేవా! యేను సమస్త దేవ పితృదైతే యాహి గంధర్వ ర**
క్షో విద్యాధర యక్షజాతులకు నక్షోభ్యుండఁగాఁ బ్రీతితో
నీ విశ్వంబునఁ గామరూపగతి నాత్మేచ్ఛావిహారుండఁగా
నీవే' నావుడు వాని కవ్వర మజుం డిచ్చెం గృపాలోలతన్. **280**

ప్రతిపదార్థం: దేవా!= ఓ బ్రహ్మదేవుడా!; ఏను= నేను; సమస్త, దేవ, పితృ, దైతేయ+అహి, గంధర్వ, రక్షస్+విద్యాధర, యక్షజాతులకున్= వేల్పులు, పిశాచాలు, దితి సంతతివారైన రాక్షసులు, పన్నగులు, గంధర్వులు, రక్కసులు, విద్యాధరులు, యక్షులకు సంబంధించిన అందరకును; అక్షోభ్యుండన్+కాన్= కలత చెందనివాడనుగా; ప్రీతితోన్= వేడుకతో; ఈ విశ్వంబునన్= ఈ సృష్టిలో; కామ, రూప, గతిన్= ఇచ్చ వచ్చిన ఆకృతిని ధరించే తీరులో; ఆత్మ+ఇచ్ఛా, విహారుండన్+కాన్= స్వయం సంకల్పాన్ని బట్టి పయనం కొనసాగించ గలవాడిగా; (వరమును); ఈవే= ఇయ్యవా, ఇమ్ము; నావుడున్= అని (రావణుడు) అనగా; వానికిన్= అతడికి- రావణుడికి; ఆ+వరము= ఆ కోరిక; అజుండు= బ్రహ్మదేవుడు; కృపాలోలతన్= దయతో కూడిన ఆసక్తితో; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: 'ఓ బ్రహ్మదేవా! ఈ వరాలను నాకు అనుగ్రహించుము. దేవతలచేత, పితరులచేత, దితిసంతతిచేత, పన్నగులచేత, గంధర్వులచేత, రాక్షసులచేత, విద్యాధరులచేత, యక్షజాతులచేత నేను ఓడిపోరాదు. వేడుకగా ఈ సువిశాల సృష్టిలో ఎక్కడికైనా కోరిన రూపంతో సంచరించే శక్తి కలవాడను కావలెను' - అని రావణుడు ప్రార్థించగా, బ్రహ్మదేవుడు దయాతత్పరుఁడై ఆతడికి కోరినవరం ఇచ్చాడు.

బ్రహ్మ రావణ కుంభకర్ణ విభీషణులకు వరంబు లిచ్చుట (సం. 3-259-26)

వ. 'మనుష్యజాతి యొక్కండుదక్క నీ చెప్పిన యందఱవలనను నీకు మరణభయంబు లే' దని పలికి, పరమేష్ఠి గుంభకర్ణుం జూచి 'వరం బడుగు' మనిన వాఁడు దైవోపహతుండై తనకు నాత్యంతికం బయిన నిద్ర యడిగిన నట్ల యగు నని, విభీషణున కభిముఖుం డగుటయు నతండు కృతాంజలియై జలజాసనుఁ బ్రస్తుతించి. 281

ప్రతిపదార్థం: మనుష్యజాతి= మనుజులు అనే తెగ; ఒక్కండు= ఒకటి; తక్కన్= తప్ప; నీ చెప్పిన= నీవు వచించిన; అందఱవలనను= అందరి మూలంగా; నీకున్; మరణభయంబు= చావువలని భీతి; లేదు= కలుగదు; అని పలికి= అని చెప్పి; పరమేష్ఠి= బ్రహ్మదేవుడు; కుంభకర్ణున్= కుంభకర్ణుడిని; చూచి= కాంచి; వరంబు+అడుగుము= కోరికను కోరుకొనుము; అనినన్= అని చెప్పగా; వాఁడు= అతడు- కుంభకర్ణుడు; దైవ+ఉపహతుండు+ఐ= దైవంచేత కొట్టబడినవాడై; తనకున్= తనకు; ఆత్యంతికంబు+అయిన= మిక్కిలి అయిన; నిద్ర= నిద్దుర; అడిగినన్= కోరగా; అట్ల+అగున్+అని= నీవు కోరినట్లే నీకు నిద్ర ఒనగూడునుగాక అని చెప్పి; (బ్రహ్మ) విభీషణునకున్; అభిముఖుండు+అగుటయున్= ఎదురుగా మొగము పెట్టిన వాడు అగుటయును; ఆతండు= అతడు (విభీషణుడు); కృత+అంజలి+ఐ= ఘటించబడిన కైమోడ్పు కలవాడై; జలజ+ఆసనున్= పద్మం ఆసనంగా కలవాడిని- బ్రహ్మదేవుడిని; ప్రస్తుతించి= పొగడి.

తాత్పర్యం: 'మనుజులచేత తప్ప నీవు కోరినమేరకు ఇతరజాతులవారిచేత నీకు చావువలనిభయం లేదు' అని రావణుడితో పలికి బ్రహ్మదేవుడు కుంభకర్ణుడిని చూచి వరం కోరుకొనుమని పలికాడు. ఆ కుంభకర్ణుడు దురదృష్టానికి చిక్కి, తనకు మిక్కిలి ప్రీతిగల నిద్ర కావాలి అని కోరాడు. 'సరే అటులే నీ కోరిక ఈడేరుగాక' అని చెప్పి, బ్రహ్మదేవుడు విభీషణుడికి ఎదురు మొగం పెట్టి నిలిచాడు. అంతట విభీషణుడు బ్రహ్మకు నమస్కరించి అతడిని ప్రస్తుతించాడు.

క. 'పరమాపద యైనపుడును । దురితంబులు నా మనంబు దొడరమియును భా
సుర మగు బ్రహ్మాస్త్రమ్మును। గరుణింపవె' యనిన నిచ్చి కమలజుఁ డనియెన్. 282

ప్రతిపదార్థం: పరమ+ఆపద= గొప్పదైన కీడు; ఐనపుడును= వచ్చి నప్పటికిని; దురితంబులు= పాపాలు; నామనంబున్= నా చిత్తాన్ని; తొడరమియును= చొరబడకుండటమున్నూ; భాసురము+అగు= ప్రకాశించేటటువంటి; బ్రహ్మ+అస్త్రమ్మును= బ్రహ్మకు సంబంధించిన దివ్యమహిమగల ఆయుధాన్ని; కరుణింపవె= అనుగ్రహించవా; అనినన్= అని అడుగగా; ఇచ్చి= ఒసగి; కమలజుఁడు+అనియెన్= పద్మంలో పుట్టినవాడు- బ్రహ్మదేవుడు పలికాడు.

తాత్పర్యం: 'ఎంతటి కీడు దాపురించినా నా మనస్సు పాపానికి పూనకుండేటట్లుగా వరం ఇచ్చి నాకు బ్రహ్మాస్త్రం అనుగ్రహించుము' అని విభీషణుడు ప్రార్థించాడు. విభీషణుడు కోరిన వరా లిచ్చి, అతనితో బ్రహ్మదేవుడు ఇట్లా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **'నిరతము రాక్షసభవమును । బొరసియు నీ విట్లు ధర్మబుద్ధి వగుట య**
చ్చెరు విది గావున నీకును । దిరముగ నమరత్వ మిచ్చితిం గృప వత్సా! **283**

ప్రతిపదార్థం: వత్సా!= కుమారా!; నీవు= ఈవు; ఇట్లు= ఈ రీతిగా; రాక్షసభవమును= రక్కసి పుట్టుక; పొరసియున్= పొందినా; నిరతమున్= ఎల్లప్పుడు; ధర్మబుద్ధివి= ధర్మంతో కూడిన చిత్తం కలవాడవు; అగుట= అయి ఉండటం; అచ్చెరువు+ఇది= ఇది ఆశ్చర్యం; కావునన్= కాబట్టి; నీకును= నీకు మాత్రమే; తిరముగన్= స్థిరంగా; కృపన్= దయతో; అమరత్వము= చావు లేని స్థితి; ఇచ్చితిన్= ఇచ్చాను.

తాత్పర్యం: వత్సా, విభీషణా! 'నీవు రాక్షసవంశంలో జన్మించినప్పటికిని' ధర్మంలోనే బుద్ధి నిల్పటం ఆశ్చర్యకరం. అందుచేత నీకు అమరత్వం దయతో ఇస్తున్నాను'.

వ. **అని పలికి పితామహుం డంతర్హితుం డయ్యెఁ; దదనంతరంబ.** **284**

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; పితామహుండు= బ్రహ్మదేవుడు; అంతర్హితుండు+అయ్యెన్= మాయమయ్యాడు; తత్+అనంతరంబు+అ= అటు పిమ్మట.

తాత్పర్యం: అని పలికి బ్రహ్మదేవుడు అదృశ్యమయ్యాడు. అటు పిమ్మట.

మ. **వరగర్వోన్నతుఁ డై దశాననుఁడు దుర్వారోద్ధతిన్ దాడిమై**
నరిగెం గిన్నరనాథుపై; నతఁడు కార్యం బాత్మ నూహించి సం
గరసన్నద్ధుఁడు గాక కింపురుష యక్షశ్రేణితోఁ గూడఁ దా
నరిగెన్ లంకఁ బరిత్యజించి రభసోద్యత్పుష్పకారూఢుఁడై. **285**

ప్రతిపదార్థం: వర, గర్వ+ఉన్నతుఁడు+ఐ (బ్రహ్మదేవుడు ఇచ్చిన) వరంచేత వర్ధిల్లిన దర్పంచేత గొప్పవాడై; దశ+ ఆననుఁడు= పది మొగాలు కలవాడు- రావణుడు; దుః+వార+ఉద్ధతిన్= వారించటానికి శక్యంగాని అతిశయంతో; కిన్నరనాథుపైన్= కుబేరుడిపై; దాడిమైన్+అరిగెన్= దండెత్తివెళ్ళాడు; అతఁడు= కుబేరుడు; కార్యంబు+ఆత్మన్+ఊహించి= సామంతో జరుగదగిన కర్తవ్యాన్ని మనస్సులో ఊహించి; సంగర సన్నద్ధుఁడు+కాక= యుద్ధ సన్నాహాలను చేయక; కింపురుష, యక్ష, శ్రేణితోన్+కూడన్= కింపురుషుల యక్షుల సముదాయాలతోకూడుకొని; తాన్= తాను (కుబేరుడు); లంకన్= లంకను; పరిత్యజించి; రభస+ఉద్యత్+పుష్పక+ఆరూఢుఁడు+ఐ= సంభ్రమంతో, శోభిల్లే పుష్పకం అనే విమానంలో ఎక్కినవాడై; తాన్+అరిగెన్= తాను వెళ్ళాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడివలన తాను పొందిన వరాలచేత మిక్కుటమైన దర్పం కలవాడై రావణుడు వారించటానికి వీలుకాని పరాక్రమప్రాభవంతో కిన్నరపతి అయిన కుబేరుడిపై దండెత్తి వెళ్లాడు. కుబేరుడు ఇంక రావణుడిని ఎదిరించి యుద్ధం చేయటం లాభంలేదని గ్రహించి, తత్తరపాటుతో తన పుష్పకవిమానాన్ని అధిరోహించి లంకను వదలిపెట్టి పారిపోయాడు.

విశేషం: (1) లంక - నాలుగు వైపుల సముద్రం చేత ఆవరింపబడిన ద్వీపం. (2) కింపురుషుడు - అశ్వముఖాన్నీ నరశరీరాన్నీ కల వేల్పుతెగకు చెందినవాడు. (3) పుష్పకం - సంకల్పమాత్రంచేత గమ్యం తెలిసి చేరగల యథేచ్ఛాగమనం కొనసాగించగల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విమానం. (4) కార్యం - సామవిధానం అనుసరించే రాజనీతి. కార్యనీతి × ఖడ్గనీతి. కార్యం ఖడ్గనీతికి అనగా యుద్ధానికి వ్యతిరేకం.

వ. ఇ ట్లతండు గంధమాదనంబునకుం జనునెడ వెన్నడిం దగిలి దానవుండు వాని మానంబుతోన విమానంబు నపహరించినం గనలి యక్షేశ్వరుండు 'గురుండ నగు నన్ను నవమానించితివి గావున నివ్విమానంబు నీ పగతు పా లయ్యెడు' మని శపించె నంత. 286

ప్రతిపదార్థం: ఇట్లు+అతండు= ఈ విధంగా; అతండు= కుబేరుడు; గంధమాదనంబునకున్= గంధమాదనం అనే పర్వతానికి (వేల్పులు విహరించే కొండకు); చను+ఎడన్= వెడలేటప్పుడు; వెన్నడిన్+తగిలి= వెంబడించి; దానవుండు= రాక్షసుడు - రావణుడు; వాని మానంబుతోన= అతడి (కుబేరుడియొక్క) అభిమానం (పరువు)తోపాటే; విమానంబున్= అంతరిక్షవాహనం - పుష్పకం; అపహరించినన్= వంచించి తీసికొని పోవగా; కనలి= కలత చెంది; యక్ష+ఈశ్వరుండు= యక్షులకు ప్రభువు - కుబేరుడు; గురుండన్+అగు= పెద్దవాడను అయిన; నన్నున్= నన్ను; అవమానించితివి= అగౌరవించావు; కావునన్= కాబట్టి; ఈ+విమానము; నీ పగతుపాలు= నీ విరోధివశం; అయ్యెడున్+అని= ఔగాక అని; శపించెన్= శాపం ఇచ్చాడు; అంతన్= పిమ్మట.

తాత్పర్యం: ఈ విధంగా కుబేరుడు వేల్పులు విహరించే గంధమాదనపర్వతానికి పారిపోతూ ఉండగా, రావణుడు ఆతడిని వెంబడించి ఆతడి గౌరవాన్నేకాక పుష్పకవిమానాన్నికూడ అపహరించాడు. అంతట యక్షులకు రాజు అయిన కుబేరుడు ఆగ్రహించి, పెద్దవాడయిన తనను పరాభవించటంచేత ఆ విమానం శత్రువు పాలవుతుందని రావణుడిని శపించాడు.

విశేషం: శాపం - వరానికి వ్యతిరేకార్థకం.

క. రాక్షసలక్ష్మీమహిమకు । రక్షకుఁడుగఁ బంక్తిముఖుని రాక్షసమాయా
దక్షు నభిషిక్తుఁ జేసిరి । రాక్షసబేతాళవరులు రాగం బెసఁగన్. 287

ప్రతిపదార్థం: రాక్షస బేతాళ వరులు= రక్కసులలోని బేతాళులలోని నాయకులు; రాగంబు= ప్రేముడి; ఎసఁగన్= అతిశయించగా; రాక్షస లక్ష్మీమహిమకున్= రక్కసులయొక్క సంపద అనే గొప్పతనానికి; రక్షకుఁడుగన్= కాపాడేవాడుగా; రాక్షస, మాయా, దక్షున్= రక్కసుల మోసంలో నేర్పరిని; పంక్తిముఖునిన్= పదిమోములు కలవాడిని - రావణుడిని; అభిషిక్తున్+చేసిరి= పట్టం కట్టారు.

తాత్పర్యం: రాక్షస మాయలలో నేర్పరి అయిన రావణుడిని రాక్షససామ్రాజ్యాన్ని కాపాడే సార్వభౌముడిగా రక్కసుల బేతాళుల నాయకులు అనురాగంతో పట్టాభిషిక్తుడిని చేశారు.

విశేషం: (1) బేతాళులు - పిశాచులు. ఈ తెగ మాంసభక్షకులు, నెత్తురు త్రాగేవారు. మృతదేహపరాయణులుగా పురాణాలలో అభివర్ణించబడ్డారు. రాక్షసులకూ వీరికీ పొత్తు ఉన్నది.

వ. వాఁడును బలదర్పమోహితుండై కడంగి యింద్రాదిదేవతల నొడిచి తత్పదంబు లాక్రమించి, యాసు మిగిలి జగద్రావణంబు సేయుటం జేసి, రావణుం డను పేరం బ్రఖ్యాతి వహించి సకలభూత భయంకరుం డయ్యె;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నట్టియెడ దేవర్షులును, రాజర్షులునుం గూడి చని తత్ప్రకారం బగ్నిదేవునకుం జెప్పిన, నతండు వారిం దోడ్కొని వారిజాసనుపాలికిం జని యి ట్లనియె. 288

ప్రతిపదార్థం: వాఁడును= దశకంఠుడును; బల, దర్ప మోహితుండు+ఐ= పరాక్రమ ప్రాభవాలచేత భ్రాంతి పొందినవాడై; కడంగి= పూనిక వహించి; ఇంద్ర+ఆది, దేవతలన్= ఇంద్రుడు మున్నగు వేల్పులను; ఒడిచి= ఓడించి; తత్+పదంబులు= వారి స్థానాలు; ఆక్రమించి= తన అధీనం చేసికొని; ఈసు మిగిలి= అసూయతో అతిశయించి; జగత్+రావణంబు= లోకం అరచేటట్లు చేయుటయున్+చేసి= సలుపుట చేత; రావణుండు= రావణుడు; అను పేరన్= అను నామంతో; ప్రఖ్యాతి= కీర్తి; వహించి= ధరించి; సకల, భూత, భయంకరుండు+అయ్యెన్= సమస్తచేతనా చేతనాలకు వెఱపు గొలిపేవాడు అయ్యాడు; అట్టి +ఎడన్= అట్టి తరుణంలో; దేవ+ఋషులును, రాజ+ఋషులను= దేవతలలోని మునులును, రాజులలోని మునులును; కూడి= కలిసి; చని= వెడలి; తత్+ప్రకారంబు= ఆ విధాన్ని; అగ్నిదేవునకున్= అగ్నిహోత్రుడికి; చెప్పినన్= వచించగా; అతండు= అతడు (అగ్నిదేవుడు); వారిన్= వారిని (రాజర్షులను దేవర్షులను); తోడ్కొని= వెంటనిడుకొని; వారిజాసను, పాలికిన్= బ్రహ్మదేవుడి కడకు; చని= వెడలి ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: రావణుడు గర్వంతో విజృంభించి, దేవేంద్రుడు మున్నగువారి నోడించి వారిస్థానాలను ఆక్రమించి జగత్తు ఆక్రోశించేటట్లుగా చేయటంచేత 'రావణుడు' అనే సార్థకనామధేయుడై సర్వభూతములకు భీతి కలిగించాడు. ఆ తరుణంలో దేవతలలో ఋషులును రాజులయిన ఋషులును కలిసి వెళ్ళి ఆ ఉపద్రవాన్నిగూర్చి అగ్నిదేవుడికి తెలిపారు. ఆ అగ్నిదేవుడు వారిని తన వెంటబెట్టికొని, బ్రహ్మదేవుడిపాలికి వెళ్ళి, ఇట్లు విన్నవించాడు.

ఉ. 'భూరిభుజుండు విశ్రవసుపుత్త్రుఁడు పంక్తిముఖుండు దర్పదు
ర్వారుఁడు రాక్షసేంద్రుఁడు భవద్వరశక్తి నవధ్యుఁ డై మహా
ఘోరముగాఁ ద్రిలోకములకుం గడుఁ బీడ యొనర్పఁ జొచ్చె వృ
త్రారి పురోగమత్రిదశు లందఱుఁ గింకరు లైరి వానికిన్. 289

ప్రతిపదార్థం: భూరి భుజుండు= గొప్ప బాహువులు కలవాడు, మిక్కుటమైన పరాక్రమం కల వీరుడు; విశ్రవసు పుత్త్రుఁడు= విశ్రవసుడి కుమారుడు; పంక్తి, ముఖుండు= పది మొగాలు కలవాడు; దర్పదుర్వారుఁడు= పరాక్రమ ప్రకర్ష చేత వారించటానికి వీలుగానివాడు; రాక్షస+ఇంద్రుఁడు= రాక్షసులయొక్క ప్రభువు; భవత్+వర శక్తిన్= నీవు అనుగ్రహించిన వరాల బలంవలన; అవధ్యుఁడు+ఐ= చంపటానికి వీలులేనివాడై; మహా ఘోరముగాన్= మిక్కిలి దారుణంగా; త్రిలోకములకున్= మూఁడు లోకాలకున్నూ; కడున్= మిక్కుటంగా; పీడ= హింస; ఒనర్పన్+చొచ్చెన్= చేయటానికి పూనుకొన్నాడు; వృత్ర+అరి, పురోగమ, త్రిదశులు, అందఱున్= వృత్రుడికి విరోధి అయిన దేవేంద్రుడు మొదలుగాగల దేవతలు అందరును; వానికిన్= అతడికి - ఆ రావణుడికి; కింకరులు+ఐరి= సేవకులు అయ్యారు.

తాత్పర్యం: 'గొప్పపరాక్రమప్రాభవం గల వీరుడు, విశ్రవసుడికుమారుడు, దశముఖుడు, రాక్షససార్వభౌముడు అయిన రావణుడు తన బలదర్పంచేత విఱ్ఱవీగుతూ వృత్రుడిని జయించిన దేవేంద్రుడు మున్నగు దేవతలను అందరిని జయించాడు. వారు వేరే గతిలేక ఆ రావణుడికి సేవకులైపోయారు.

విశేషం: త్రిదశులు= ఎల్లప్పుడును ముప్పదేండ్లప్రాయంలోనే ఉండేవారు; దేవతలు.

ఉ. దానవుచేతఁ గష్టపడి దైన్యము నొందుట కోర్వలేక నీ
దైన పదాంబుజంబు లభయం బని చేరితి; మింక మమ్ము నె
ట్లైనఁ గృపార్ద్రమానసుఁడ వై తగఁ జేకొనవయ్య! మాకు ది
క్కైనను గాకయున్నఁ గమలాసన ! నీవ కదయ్య యెయ్యెడన్.' 290

ప్రతిపదార్థం: కమల+ఆసన!= పద్మం పీఠంగా కలవాడా, ఓ బ్రహ్మదేవుడా!; దానవు చేతన్= రాక్షసుడిచేత, రావణుడి చేత; కష్టపడి= బాధలను అనుభవించి; దైన్యమున్+ఒందుటకున్= హీనత్వాన్ని పొందటానికి; ఓర్వలేక= భరించలేక; నీదు+ఐన= నీ యొక్క; పద+అంబుజంబులు= పద్మాలవంటి చరణాలు; అభయంబు+అని= శరణం అని తలపోసి; చేరితిమి= వచ్చాము; ఇంకన్= ఇక మీదట; మమ్మున్= మమ్మల్ని; ఎట్లు+ఐనన్= ఏ రీతిగా అయినా; కృపా+ఆర్ద్ర, మానసుఁడవు+ఐ= దయతో తడిసిన (మెత్తనైన) చిత్తం కలవాడవై; తగన్= సరిపడేటట్లుగా; చేకొనవు+అయ్య= స్వీకరించవా దేవా; మాకున్; దిక్కు+ఐననున్= గతి అయినను; కాక, ఉన్నన్= గతికాక పోయినప్పటికి (అంటే రక్షించినా రక్షింపక పోయినా); ఏ+ఎడన్= ఏదిక్కైనా; నీవు+అ= నీవే; కద+అయ్య= కదా.

తాత్పర్యం: ఓ బ్రహ్మదేవా! రావణాసురుడిచేత పెక్కుకష్టాలు అనుభవించి, ఇక ఆ బాధలకు ఓర్వజాలక నీ చరణారవిందాలే శరణ్యాలని ఇక్కడకు చేరాం. రక్షించినా రక్షింపకపోయినా మాకు వేరే దిక్కు లేదు. నీవే అన్నింటా దిక్కువు. దయామయుడవై మమ్మల్ని మన్నించుము. మా విన్నపాలు ఆలకించుము'.

వ. అనినంబరమేష్ఠి వారల కిట్లను; నిక్కార్యంబునకు నేను మున్న తగిన యుపాయంబు నిశ్చయించి నారాయణుం బ్రార్థించితి; నద్దేవుండు మనుష్యభావంబున నవతరించి, యా రాక్షసు వధియించువాఁ డయ్యె; నింద్రాది సురులునుం దమ తమ యంశంబులంజేసి ఋక్షవానరజాతులయందు జనియింపఁగలవారు; మీకు భయంబు వలవ' దని యగ్నిప్రముఖు లైన యమ్మహామునుల సమ్ముఖంబున దుందుభి యను గంధర్వ కామినిం బిలిచి 'నీవు కుబ్జరూపంబున మంథర యను పేర భూలోకంబున నుద్భవించి నీ నేర్పు విధంబున దేవకార్యంబులు నిర్వహింపు' మని పనిచి వారి వీడ్కొలిపెఁ; బదంపడి దివిజుల యంశావతారంబులం. జేసె. 291

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; పరమేష్ఠి= బ్రహ్మదేవుడు; వారలకున్= (బ్రహ్మర్షి, రాజర్షి, అగ్ని, ప్రభృతులకు); ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పాడు; ఈ+కార్యంబునకున్= ఈ పనికి; ఏను= నేను; మున్న+అ= ఇంతకు ముందే; తగిన= సరి అయిన; ఉపాయంబు= వెరవు; నిశ్చయించి= నిర్ణయించి; నారాయణున్= విష్ణుదేవుడిని; ప్రార్థించితిన్= వేడుకొన్నాను; ఆ+దేవుండు= విష్ణువు; మనుష్య భావంబునన్= మనుజరూపంతో; అవతరించి= జన్మించి; ఆ రాక్షసున్= ఆ రక్కసుని (రావణుడిని); వధియించువాఁడు+అయ్యెన్= సంహరించగలవాడు అయ్యాడు; ఇంద్ర+ఆది, సురులునున్= ఇంద్రుడు మున్నగు వేల్పులును; తమ తమ పాళ్ల చేత; ఋక్ష, వానర, జాతులయందున్= ఎలుగుల, కోతుల తెగలలో; జనియింపన్+కలవారు= పుట్టగలరు; మీకున్= మీకు (అగ్ని ప్రభృతులకు); భయంబు= భీతి; వలవదు= అనవసరం; అని= అంటూ; అగ్ని ప్రముఖులు+ఐన= అగ్ని నాయకత్వాన వచ్చిన; ఆ+మహా, మునుల; సమ్ముఖంబునన్= సన్నిధిలో; దుందుభి+అను= దుందుభి అనే పేరు కల; గంధర్వ, కామినిన్= గంధర్వ జాతికి చెందిన కాంతను; పిలిచి= ఆహ్వానించి; నీవు= ఓ దుందుభీ! నీవు; కుబ్జ రూపంబునన్= మరుగుజ్జు ఆడదాని ఆకారాన; మంథర అను పేరన్= మంథర అనే నామంతో; భూలోకంబునన్= భూమిపై; ఉద్భవించి= జన్మించి; నీ నేర్పు విధంబునన్= నీ నేర్పును బట్టి; దేవ కార్యంబు= దేవతల పని; నిర్వహింపుము=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నెరవేర్చుము; అని పనిచి= అని నియోగించి; వారిన్= వారిని (అగ్ని ప్రభృతులను); వీడ్కొలిపెన్= సెలవు నిచ్చి పంపాడు; పదంపడి= పిదప; దివిజుల+అంశ+అవతారంబులన్+చేసి= దేవతలయొక్క పాళ్లను పంచుకొని జన్మించిన వారై;

తాత్పర్యం: అగ్ని మొదలైనవారలకు బ్రహ్మదేవుడు ఈ రీతిగా సమాధానం చెప్పాడు. ఈ సమస్యనుగూర్చి నేను ఇదివరకే ఆలోచించి ఒకనిర్ణయం తీసికొన్నాను. ఇంతకుముందే నేను ఈ విషయాన్ని శ్రీమన్నారాయణుడికి నివేదించి ఉన్నాను. ఆ దేవుడు భూలోకంలో మానవుడుగా అవతరించి రావణాసురుడిని సంహరించగలడు. ఇంద్రుడు మున్నగు దేవతలుకూడ, తమ తమ అంశాలతో వానరులుగా, ఎలుగులుగా అవతరించగలరు. ఇక మీకు భయం వద్దు. అంతేకాక, బ్రహ్మదేవుడు అగ్నిప్రభృతులసమక్షంలోనే, 'దుందుభి' అనే యక్షకాంతను పిలిచి, ఆమెను దేవకార్యం నిర్వహించటంకొరకై భూలోకంలో 'మంథర' అనే కుబ్జగా జన్మించుమనికూడా నియోగించాడు. ఆ తరువాత బ్రహ్మ అగ్నిప్రభృతులను వీడ్కొలిపి పంపాడు. పిదప దేవతల అంశలతో.

మ. గురుశైలోన్నతగాత్రు లుద్ధత భుజో గ్రుల్ వజ్రపాషాణ క
ర్కరు లర్కప్రతిమానతేజులు, గుణాకల్పుల్, మహాకల్పభీ
కరకాలాంతకకల్పు లాజినిపుణుల్ గర్వోన్నతుల్ ఋక్షవా
నర వీరుల్ జనియించి రెల్లయెడలన్ నాగాయుతప్రాణులై. 292

ప్రతిపదార్థం: గురు, శైల+ఉన్నత, గాత్రులు= పెద్దకొండలవలె ఎత్తైన శరీరాలు కలవారు; ఉద్ధత, భుజ+ఉగ్రుల్= దర్పంతో కూడిన భుజ పరాక్రమంతో అతిశయించిన వారు; వజ్ర, పాషాణ కర్కరులు= వజ్రాలవలె రాళ్లవలె కఠినాలైన దేహాలు కలవారు; అర్క, ప్రతిమాన, తేజులు= సూర్యుడితో సరిపోలే వర్చస్సు కలవారు; గుణ+ఆకల్పుల్= మంచిగుణాలు అనే భూషలు కలవారు; మహా, కల్ప, భీకర, కాల+అంతక, కల్పులు= గొప్ప ప్రళయసమయంలోని భయంకరమైన యముడితో సమానులు; ఆజి నిపుణుల్= యుద్ధంలో నేర్పరులు; గర్వ+ఉన్నతుల్= గొప్ప దర్పం కలవారు; ఋక్ష, వానర, వీరుల్= ఎలుగులకు కోతులకు సంబంధించిన శూరులు; నాగ+అయుత, ప్రాణులు+ఐ= పదివేల ఏనుగులకు ఉండే శక్తి కలవారై; ఎల్ల+ఎడలన్= అన్ని తావులలో; జనియించిరి= పుట్టారు.

తాత్పర్యం: పలుతావులలో ఎలుగులుగా కోతులుగా దేవతల అంశలు పంచుకొని వీరులు ఉద్భవించారు. ఆ వీరులు పెద్దకొండలవలె ఎత్తైనశరీరాలు కలవారు. దర్పంతో కూడిన పరాక్రమప్రాభవం కలవారు. వజ్రాల వలె, పాషాణాలవలె కఠినంగా ఉండే దృఢమైన దేహాలు కలవారు. సూర్యుడివంటి తేజస్సు కలవారు. మంచి గుణాలే ఆహార్యంగా కలవారు. ప్రళయకాలంలోని యముడితో సమానులు. యుద్ధంలో నేర్పరులు. పదివేల ఏనుగుల బలం కలవారు.

క. అన విని యుధిష్ఠిరుం డ। మ్మునివరుతో 'ననఘ! ధర్మమూర్తిని నా రా
ముని నేల యరణ్యంబున। కనిచెను దశరథుఁడు సెపుమ యక్కథ నెల్లన్'. 293

ప్రతిపదార్థం: అనన్ విని= అని చెప్పగా ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అమ్మునివరుతోన్= ఆ ఋషిశ్రేష్ఠుడితో (మార్కండేయుడితో); అనఘ!= పుణ్యాత్ముడా, మార్కండేయ మహర్షీ!; దశరథుఁడు; ధర్మమూర్తిని= ధర్మమే మానవాకృతి ధరించినవాడిని; ఆ రామునిన్= ఆ శ్రీరాముడిని; ఏల= ఎందుకు; అరణ్యంబునకున్= అడవికి; అనిచెను= పంపాడు; ఆ+కథను= ఆ గాథను; ఎల్లన్= సమస్తం; చెపుమ= వచింపుము.

తాత్పర్యం: ధర్మరాజు ఇట్లా పలికాడు: 'పుణ్యాత్ముడవైన ఓ మార్కండేయమహామునీ! "మూర్తీభవించిన ధర్మం' అని పేరు గాంచిన శ్రీరాముడిని దశరథమహారాజు ఏల అడవికి పంపాడు? దయచేసి, ఆ కథను తెలుపుము'.

విశేషం: రాముడు ధర్మమూర్తి. "రామో విగ్రహవాన్ ధర్మః" అని వాల్మీకి రామాయణంలో ఉన్నది.

వ. **అని యడుగుటయు మార్కండేయుం డిట్లనియె: 'దశరథుండు నిజ సుకృత పాకంబునం జేసి రామ ప్రముఖులయిన కొడుకుల నలువురం గని, త్రైలోక్యరాజ్యంబు సంప్రాప్తం బయినయట్లు సంతసిల్లె; నక్కుమారులు క్రమంబున నుపనీతులు నఖిలవేదవేదాంగవినీతులు, యథాక్రమ పరిణీతులు నై విలసిల్లి రంత.294**

ప్రతిపదార్థం: అని+అడుగుటయున్= అని ప్రశ్నించటమున్నూ; మార్కండేయుండు; ఇట్లు+అనియెన్; దశరథుండు; నిజ, సుకృత, పాకంబునన్+చేసి= తన పుణ్యం పండటంవలన; రామ, ప్రముఖులు+అయిన= రాముడు మున్నగువారు అయిన; కొడుకులన్= కుమారులను; నలువురన్= నలుగురను; కని= కాంచి; త్రైలోక్య, రాజ్యంబు= మూడులోకాలపై ప్రభుత్వం; సంప్రాప్తంబు+అయిన+అట్లు= లభించినట్లు; సంతసిల్లెన్= సంతోషించాడు; ఆ+కుమారులు= ఆ కొడుకులు, (రాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు); క్రమంబునన్= వరుసగా; ఉపనీతులున్= ఉపనయనం (వడుగు) చేయబడినవారలు; అఖిల, వేద, వేదాంగ (వేద+అంగ) వినీతులు= సమస్త మైన వేదాలు, వేదాంగాలు నేర్చినవారు; యథాక్రమ పరిణీతులును+ఐ= క్రమము ననుసరించి వివాహితులును అయి; విలసిల్లిరి= శోభిల్లారు; అంతన్= అటు పిమ్మట.

తాత్పర్యం: ధర్మరాజుకు మార్కండేయుడు ఈ విధంగా చెప్పాడు: 'దశరథమహారాజు తాను చేసికొనిన పుణ్యం పండి, శ్రీరాముడు మున్నగు కొడుకులను కన్నాడు. పుత్రలాభంవలన తనకు మూడులోకాల సార్వభౌమత్వం చేకూరినట్లు దశరథుడు సంతోషించాడు. దశరథకుమారులు పెరిగి కాలక్రమాన వటువు (వడుగు) లయ్యారు. వేద వేదాంగాలను చదివారు. మరికొంతకాలానికి వరుసగా వివాహితులు అయ్యారు. అంతట.

విశేషం: వేదాలు:- ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వవేదం. వేదాంగాలు:- శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం. ధనుర్వేదం మున్నగు ఉపవేదాలుకూడా వేదాలలో అంతర్భాగాలే.

సీ. **అభినవపద్మదళాక్షు నక్షీణవి । స్తృతవక్షు నాజానుదీర్ఘబాహు**
మధురస్మితానను మదగజగమను నా । రూఢయౌవను నభిరూపతేజు
శ్రీరమణీయుఁ బ్రసిద్ధయశోరమ్యు । నిఖిలవిద్యాగమనిపుణచిత్తు,
నింద్రసమాను జితేంద్రియు ధర్మజ్ఞుఁ । బౌరబాంధవజనప్రార్థనీయు

ఆ. **దుష్టనిగ్రహైకధుర్యు విశిష్టసం । రక్షణాభిలోలు రామభద్రుఁ**
గులపవిత్రుఁ బెద్దకొడుకుఁ గనుంగొని । రాజవరుఁడు గరము రాగ మెసఁగ. 295

ప్రతిపదార్థం: రాజ, వరుఁడు= రాజులలో శ్రేష్ఠుడు, దశరథుఁడు; అభినవ, పద్మ, దళ+అక్షున్= కొంగ్రొత్త తమ్మిపూరేకులవంటి కన్నులు కలవాడిని; అక్షీణ, విస్తృత, వక్షున్= విశాలమైన పెద్దవక్షం గలవాడిని; ఆజాను, దీర్ఘ, బాహున్= మోకాళ్లవరకు వ్రేలాడే పొడుగుపాటిచేతులు కలవాడిని; మధుర, స్మిత+ఆననున్= తియ్యనైన చిరునవ్వులతో కూడిన మొగం కలవాడిని; మద, గజ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గమనున్= మదించిన యేనుగునడకవంటి నడక కలవాడిని; ఆ రూఢ, యౌవనున్= వికసించిన జవ్వనంలో ఉన్నవాడిని; అభిరూపతేజున్= ఒప్పిదమగు కాంతిగలవాడిని; శ్రీ రమణీయున్= సిరికళతో అందమైనవాడిని; ప్రసిద్ధ, యశస్+రమ్యున్= వెల్లడి అయిన కీర్తితో సుందరుడు అయినవాడిని; నిఖిల, విద్యా, ఆగమ, నిపుణ, చిత్తున్= సమస్తమైన విద్యలలో వేదాలలో ప్రావీణ్యం సంపాదించిన మనస్సు కలవాడిని; ఇంద్ర సమానున్= దేవేంద్రుడితో సాటి వచ్చేవాడిని; జిత+ఇంద్రియున్= ఇంద్రియాలను జయించినవాడిని; ధర్మజ్ఞున్= ధర్మాన్ని ఎఱిగినవాడిని; పౌర, బాంధవ, జన ప్రార్థనీయున్= పౌరులచేత, చుట్టాలచేత ఆరాధించదగినవాడిని; దుష్ట, నిగ్రహ+ఏక, ధుర్యున్= దుర్జనులను శిక్షించటంలో పరిపూర్ణమైన శక్తి కలవాడిని; విశిష్ట, సంరక్షణ+అభిలోలున్= మంచివారిని కాపాడటంలో తత్పరత కలవాడిని; కుల, పవిత్రున్= వంశాన్ని పవిత్రం కావించినవాడిని; పెద్ద కొడుకున్= కుమారులలో పెద్దవాడిని; రామభద్రున్= శ్రీరాముడిని; కనుంగొని= చూచి; కరము= మిక్కిలి; రాగము= ప్రేమ; ఎసఁగన్= అతిశయిల్లగా.

తాత్పర్యం: అప్పటి కప్పుడే వికసించిన కొంగ్రొత్త తామరపువ్వురేకులవంటి కన్నులు కలవాడు. విశాలమైన వక్షం కలవాడు, ఆజానుబాహువయినవాడు, తియ్యనైన చిరునవ్వుదొంతరలు వెల్లివిరిసే ముఖం కలవాడు, మత్తేభంవంటి గంభీరగమనం కలవాడు, ఎలజవ్వనంలో ఉన్నవాడు, తన తనువునకు తగిన కాంతి గలిగి ప్రకాశిస్తున్నవాడు, తేజస్సు కలవాడు; సిరికళతో విలసిల్లుతున్నవాడు, పేరుప్రతిష్ఠలను ఆర్జించినవాడు, వివిధవిద్యలు వేదవేదాంగాలు క్షుణ్ణంగా చదివినవాడు, వేలుపుదొర అయిన దేవేంద్రుడికి సాటి వచ్చేవాడు, ఇంద్రియాలను జయించినవాడు, ధర్మం ఎఱిగినవాడు, పౌరులచేత బంధువులచేత ఆరాధించ దగినవాడు, దుష్టశిక్షణ శిష్టరక్షణ చేయగల ఆదర్శపరిపాలకుడు, రఘువంశాన్ని పావనం చేసేవాడు, తన పెద్దకుమారుడూ ఐన శ్రీరామచంద్రమూర్తిని దశరథమహారాజు ప్రేమ జాలువారగా కనుగొన్నాడు.

విశేషం: అభినవపద్మదళాక్షుఁడు - అనే పదగుంఫనంలో శ్రీరాముడు విష్ణుదేవుడి అవతారం అనే ధ్వని ఉన్నది. పద్మదళాక్షుడు అనేది విష్ణువుకు రూఢ్యర్థంలో పర్యాయపదం.

వ. యౌవరాజ్యపదంబునకు నతని నభిషేకం బాచరింపం గోరి యాప్తమంత్రిజనసమ్మతంబునఁ బురోహిత నిరూపితం బైన శుభదినంబున నక్కార్యంబునకు సమకట్టునెడ భరతు దాది మంథర యనునది యమంద గతిం గైకేయిపాలికిం జని యిట్లనియె. 296

ప్రతిపదార్థం: అతనిన్= శ్రీరాముడిని; యౌవ రాజ్య పదంబునకున్= యువరాజు పదవికి; అభిషేకంబు+ఆచరింపన్+కోరి= పట్టం కట్టటానికి (పవిత్రస్నానం చేయించటానికి); తలపోసి; ఆప్త, మంత్రి జన సమ్మతంబునన్= శ్రేయోభిలాషుల, మంత్రుల, ప్రజల అంగీకారం చొప్పున; పురోహిత నిరూపితంబు+ఐన= పురోహితులచేత ఏర్పరచబడిన; శుభ, దినంబునన్= మంచిరోజున; ఆ+కార్యంబునకున్= యౌవరాజ్య పట్టాభిషేకానికి; సమకట్టు+ఎడన్= పూనిన తరుణంలో; భరతు దాది= భరతుడిని పెంచిన సేవకురాలు; మంథర+అను+అది= మంథర అనే పేరు కలది; న+మంద, గతిన్= వేగం గల నడకతో; కైకేయి పాలికిన్+చని= కైక దగ్గరకు వెళ్లి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: యువరాజుపదవికి శ్రీరాముడిని పట్టాభిషిక్తుడిగా చేయదలచి దశరథమహారాజు శ్రేయోభిలాషులను, మంత్రులను, పౌరులను సంప్రదించి వారి అనుమతి పొందాడు. పురోహితుడిచేత శుభముహూర్తం నిర్ణయించబడింది. ఆ తరుణంలో భరతుడిని పెంచిన దాది మంథర అనే పేరు గల పరిచారిక, కైకదగ్గరకు వెళ్లి ఈ విధంగా చెప్పింది.

ఉ. 'అక్కట నీదెసం బతికి నాఁటి కూరిమి యయ్యెఁ; మాయపుం
జొక్కులు నీవు నిక్కముగఁ జూచి మనంబున మోసపోయి; తా
టక్కరి కోసలాత్మజయెడం బ్రియుఁడై యదె తత్తనూజు నిం
పెక్కఁగ యౌవరాజ్యమున నిప్పుడ పట్టము గట్టఁ బూనెడున్. 297

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; నీదెసన్= నీ యెడ; పతికిన్= భర్తకు- దశరథుడికి; ఆఁటి కూరిమి+అయ్యెన్= వ్యర్థమైన ప్రేమ అయింది; మాయము+చొక్కులు= కపటపు మోహాలు; నీవు= నీవు, (ఓ కైకా! నీవు); నిక్కముగన్+చూచి= నిజమనే భ్రాంతిలో పడి అరసి; మనంబునన్= చిత్తంలో; మోసపోయితి(వి)= వంచించబడ్డావు; ఆ టక్కరి= ఆ జిత్తులమారి; కోసల+ఆత్మజ+ఎడన్= కోసలరాజపుత్రిక అయిన కౌసల్యపట్ల; ప్రియుఁడు+ఐ= ప్రీతికలవాడై; అదె= అదిగో; తత్+తనూజున్= ఆమె కొడుకును; ఇంపు+ఎక్కఁగన్= ప్రీతి అతిశయించగా; యౌవరాజ్యమునన్= యువరాజు పదవియందు; ఇప్పుడు= ఈ వేళ; పట్టము= పట్టాభిషేకాన్ని; కట్టన్+పూనెడున్= కట్టటానికి సిద్ధపడ్డాడు.

తాత్పర్యం: 'అయ్యో! నీ భర్త అయిన దశరథుడికి నీపట్ల అచ్చమైన కూరిమి లేనట్లు తేలిపోయింది కదా. ఆహా! నీ యెడ ఎంతటి మోసపువలపును వెల్లడించాడు! ఆతడి నటనలు నీవు నిజాలని నమ్మి భ్రాంతిలో పడ్డావు. ఇదుగో ఇప్పుడు తెలిసింది కదా దశరథుడికి కోసలాత్మజ కౌసల్యపై గల అనురాగం. ఆమెకొడుకైన శ్రీరాముడికే నేడు యువరాజపట్టం కట్టుతున్నాడు. టక్కరికౌసల్య గెలిచింది. నీవు ఓటమి చెందావు.

ఆ. పుడమిఱేని మదికి నెడ యైతి నీ వింకఁ । నేమి సెప్పఁగలను వామనయన!
కడఁగి నిన్నుఁ గొడుకుఁ బెడవడ వైచి యా । సవతికొడుక యేలు నవని యింక'. 298

ప్రతిపదార్థం: వామనయన!= అందమైన కన్నులు కలదానా!, ఓ కైకేయీ!; నీవు= నీవు; పుడమి ఱేని మదికిన్= రాజుగారి చిత్తానికి; ఎడ+ఐతి(వి)= దూరం అయినావు; ఇంకన్= ఇకమీద; ఏమి+చెప్పన్‌కలను= ఏమని నీకు చెప్పేది?; కడఁగి= పూని; నిన్నున్= నిన్నును; కొడుకున్= నీ కొడుకు భరతుడిని; పెడవడవైచి= ప్రక్కకు నెట్టి, తొలగించి; ఆ, సవతి, కొడుకు+అ= ఆ సపత్ని అయిన కౌసల్య పుత్రుడు మాత్రమే; ఇంకన్= ఇక మీద; అవని= భూమి; ఏలున్= పరిపాలిస్తాడు.

తాత్పర్యం: అందమైన కన్నులు గల ఓ కైకేయీ! నీవు కన్నులు మూసికొని ఉన్నావు. ఇక నేను ఏమి చేయగలను? ఏమి చెప్పగలను? దశరథమహారాజు చిత్తానికి నీవు దూరమైనావు; నిన్నును నీ కొడుకు భరతుడిని దూరంగా నెట్టి తొలగించి, నీ సవతి కౌసల్యకొడుకు శ్రీరామచంద్రుడు భూరాజ్యాన్నంతటిని ఏలుకొంటాడు'.

క. అనిన నుదరిపడి కేకయ । తనూజ గడుసంభ్రమమునఁ దత్క్షణమ నరేం
ద్రునిపాలికిఁ జని యేకత । మున నిట్లనుఁ బ్రణయపూర్వముగ నాతనితోన్. 299

ప్రతిపదార్థం: అనినన్= అని (మంథర) చెప్పగా; ఉదరిపడి= వేగంగా కలత చెంది; కేకయ, తనూజ= కేకయ రాజు కూతురు, కైకేయి; కడు, సంభ్రమమునన్= మిక్కుటమైన తత్తరపాటుతో; తత్+క్షణము+అ= ఆ నిమేషంలోనే; నర+ఇంద్రుని, పాలికిన్= దశరథ మహారాజు వద్దకు; చని= వెడలి; ఏకతమునన్= ఒంటరిగా; ప్రణయ, పూర్వముగన్= అనురాగపురస్సరంగా; ఆతనితోన్= దశరథమహారాజుతో; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: మంథర చెప్పిన మాటలు విని కైకేయి అదరిపడి, తత్తరపాటుతో తత్క్షణమే బయలుదేరి దశరథ మహారాజువద్దకు వెళ్లి, ఒంటరిగా కలిసికొని, అనురాగం చిందే మాటలు చెప్పి, ఈ విధంగా పలికింది.

క. **'ధరణీశ! తొల్లి నాకుం । గరుణించిన వర మొకండు గల; దది మదిలోఁ**
బరికించి యిప్పు డొసఁగుము; । చిరముగ సత్యవ్రతంబు సెల్లింపు తగన్.' 300

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= భూమికి అధినేత వైనవాడా, ఓ దశరథ మహారాజా!; తొల్లి= పూర్వం; నాకున్= నాకు; కరుణించిన= అనుగ్రహించి ఇచ్చిన; వరము= శపథం ప్రకారం తీర్చుకోరిక; ఒకండు= ఒకటి; కలదు= ఉన్నది; అది= ఆ వరం; మదిలోన్= మనస్సులో; పరికించి= అరసి; ఇప్పుడు= ఈ సమయంలో; ఒసఁగుము= ఇమ్ము; చిరముగన్= శాశ్వతంగా; సత్యవ్రతంబు= నిజాన్ని పాలించే నోమును; తగన్= సముచితంగా; చెల్లింపు= ఆచరింపుము.

తాత్పర్యం: 'భూమికి అధిపతి వైన ఓ దశరథమహారాజా! తొల్లి నీవు నాకు ఒకవరాన్ని అనుగ్రహించి ఉన్నావు. జ్ఞాపకం ఉన్నది కదా! దానిని నీ మనస్సులో పరికించుము. ఇప్పుడు నేను ఆ వరాన్ని కోరుకొంటున్నాను. నీవు సత్యవాక్యపరిపాలకుడవు కదా! ఆ వరాన్ని దయచేసి ఇప్పుడు నాకు ప్రసాదించుము'.

విశేషం: (1) సంస్కృత మూలభారతంలోకూడా రామాయణ కథ సంగ్రహంగానే ఉన్నది. ఎఱ్ఱాప్రెగ్గడ తెలుగుభారతంలో ఆ కథను మరింత సంక్షేపించి వ్రాశాడు. ఆరణ్యపర్వంలోని రామాయణకథలో బాలకాండాన్ని అంతటిని రెండు మూడు పద్యాలలో ఎఱ్ఱన సంగ్రహీకరించాడు. శ్రీరాముడి యౌవరాజ్యపట్టాభిషేకంతో కథ ప్రారంభిస్తున్నది. సీతాకల్యాణాన్ని కూడా ఎఱ్ఱన వదలిపెట్టాడు. (2) కైకకు తొల్లి దశరథుడు ఎందుకు వరం ఇచ్చాడు? ఆ విషయాన్ని ఎఱ్ఱన వివరించలేదు. ఆతడి ప్రణాళిక ననుసరించి అది వివరించ నవసరం లేదు. ఈ విషయం పెక్కురామాయణాలలో పెక్కురకాలుగా కన్పిస్తున్నది. సుప్రసిద్ధమైన ఆ కథ సంక్షేపంగా ఇది: ఒకసారి దశరథుడు యుద్ధం చేస్తూ ఉండగా అతడి రథచక్రాని కున్న సీల విరిగి పడిపోయింది. భర్తతోపాటు రణరంగాని కేగిన కైక సీలకు బదులు తన వ్రేలిని నిలిపి దశరథుడిని అపాయంనుండి కాపాడింది. అందుకు దశరథుడు సంప్రీతుడై ఆమెకు రెండువరాలు ఇచ్చాడు. కైకేయి భర్తకు ధన్యవాదాలు తెలిపి యథోచితసమయంలో తా నా వరాల నుపయోగించుకొనగలనని తెలిపింది. ఇప్పుడు ఆమె కోరుకొన దలచింది.

వ. **అనిన నతం డయ్యతివం గనుంగొని 'యవధ్యుల వధియించుటయును, వధ్యులం గాచుటయును, బ్రాహ్మణ ధనంబులు దక్క నన్యులధనం బపహరించుటయును, నభీష్టధనంబు నిచ్చుటయును మొదలుగా నతి దుష్కరంబులైన వాని నైనను భవత్ప్రియార్థము సేసెద; నెయ్యది సెప్పు' మనిన ప్రీత యై భరతమాత యి ట్లనియె. 301**

ప్రతిపదార్థం: అనినన్= అని (కైకేయి) చెప్పగా; అతండు= అతడు= (దశరథుడు); ఆ+అతివన్= ఆ వనితను- కైకేయిని; కనుంగొని= చూచి; అవధ్యుల వధియించుటయును= చంపరానివారిని చంపటమున్నూ; వధ్యులన్= చంపదగిన వారిని; కాచుటయును= రక్షించటమున్నూ; బ్రాహ్మణ ధనంబులు= విప్రుల విత్తాలు; తక్కన్= తప్ప; అన్యుల ధనంబున్= ఇతరుల ద్రవ్యం; అపహరించుటయును= బలాత్కారంగా సంగ్రహించటమున్నూ; అభీష్ట, ధనంబున్= కోరిన డబ్బులు ఇచ్చుటయును= ఇవ్వటమున్నూ; మొదలుగాన్= మున్నగునవి; అతి, దుష్కరంబులు= చేయటానికి మిక్కిలి చెడ్డవి; వానిని ఐన+ఐనను= అట్టి పనులను సయితం; భవత్+ప్రియ+అర్థము= నీకు ప్రీతి ఘటించే కొరకు; చేసెదన్= చేస్తాను; ఏ+అది= ఏది; చెప్పుము; అనినన్; ప్రీత+ఐ= సంతుష్టి చెందినదై; భరతమాత= భరతుడి తల్లి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నది.

తాత్పర్యం: అని కైకేయి పలికింది. అంతట దశరథమహారాజు ఆమెకు ఇట్లా బదులు పలికాడు. 'చంపరానివారిని చంపటమున్నూ, చంపదగినవారిని కాపాడటమున్నూ, విప్రుల విత్తాల నపహరించటమున్నూ తప్ప, తక్కిన పనులు మిక్కిలి పాపకృత్యాలైనాసరే ఇతరుల ధనాన్ని హరించటం, కోరిన ధనాలను దానం చేయటం, మొదలైన చెడుపనులను సయితం నీ సంతృప్తికొరకై ఆచరించగలను. ఇక, నీకు ఇష్టమైనవరం వేడుకొనుము' అని అన్నాడు. అనగా భరతుడితల్లి కైక, దశరథుడితో ఇట్లా అన్నది.

తే. 'యౌవరాజ్యపదంబునయందు భరతు । నధిప! యభిషేక మొనరింపు; మడవిలోన
నొలసి పదునాల్గువర్షంబు లుండ నాన । తిమ్ము రాముని; నురువర మ్మిదియ నాకు'. 302

ప్రతిపదార్థం: అధిప!= రాజా, (ఓ దశరథ మహారాజా!); యౌవరాజ్య, పదంబున+అందున్= యువరాజుస్థానంలో; భరతున్= భరతుడిని; అభిషేకము+ఒనరింపుము= పట్టాభిషిక్తుడిని కావించుము; రామునిన్= శ్రీరాముడిని; అడవిలోనన్= అరణ్యంలో; ఒలసి= కడగి; పదునాల్గు వర్షంబులు= పదునాలుగు ఏండ్లు; ఉండన్= నివసించేటట్లుగా; ఆనతి+ఇమ్ము= ఆజ్ఞను ఒసంగుము; ఇది+అ= ఈ కోరిక తీర్చుటయే; నాకున్= నాకు; ఉరు, వరమ్ము= గొప్ప వరం.

తాత్పర్యం: 'ఓ దశరథమహారాజా! భరతుడికి యౌవరాజ్యపట్టాభిషేకం చేయుము. శ్రీరాముడిని పదునాలుగు సంవత్సరాలు అడవిలో నివసించు మని ఆనతిమ్ము. ఇదియే నేను కోరుకొనే గొప్పవరం.

క. అనవుడు వీనులు గొఱవిం । గొని చూఁడిన యట్టు లైనఁ గువలయపతి పె
ల్చన పిడు గడఁ చిన క్రియఁ జే । తనరహితుం డగుచు ధరణితలమునఁ బడియెన్. 303

ప్రతిపదార్థం: అనవుడున్= అని (కైక) వచించగా; కువలయపతి= భూమండలానికి అధినేత అయినవాడు, (దశరథమహారాజు); వీనులు= చెవులు; కొఱవిన్+కొని= మండుతున్న కొయ్యను గైకొని; చూఁడిన= కాల్చిన; అట్టులు+ఐనన్= అట్టి విధంగా కాగా; పెల్చన= అధికంగా; పిడుగు+అడఁచిన, క్రియన్= పిడుగు మీదపడి క్రిందకు నొక్కిన రీతిగా; చేతన రహితుండు+అగుచున్= కదలిక మెదలిక లేనివాడు ఔతూ, స్పృహ తప్పినవాడు ఔతూ; ధరణితలమునన్= నేలపై; పడియెన్= కూలాడు.

తాత్పర్యం: కైకేయి చెప్పిన మాటలు వినేసరికి, చెవులలో మండేకట్టె దూర్చినట్లుగా మిక్కుటమైన వెత చెంది, ఆకస్మికంగా పిడుగుపాటుకు గురిఅయినవాడివలె దశరథమహారాజు స్పృహ తప్పి నేలపై పడి మూర్ఛచెందాడు.

విశేషం: అలం: ఉపమలు. క్రియన్= వలె. క్రియ అనే మాటకు 'వలె' అనే అర్థం తెలుగులో మాత్రమే కనివస్తున్నది. క్రియ అనేది ఇక్కడ తద్భవం. సంస్కృతంలో ఈపదానికి ఈ అర్థం లేదు.

వ. అంతయు నెఱింగి రాఘవుండు నిజజనకుండు సత్యప్రతిజ్ఞుండు గావుత మని యాక్షణంబ సీతాసమేతుండయి వనంబునకు వెడలె; నతని పిఱుందన లక్ష్మణుండును జనియెఁ; దదనంతరంబ. 304

ప్రతిపదార్థం: అంతయున్= ఆ జరిగిన సమస్తాన్నీ; ఎఱింగి= తెలిసికొని; రాఘవుండు= (రఘువు మహారాజు వంశానికి చెందినవాడు) శ్రీరాముడు; నిజ, జనకుండు= తన తండ్రి; సత్య ప్రతిజ్ఞుండు= సత్యమైన ప్రతిజ్ఞ కలవాడు - అనగా తానుపల్కిన మాటను (వరాన్ని) నెరవేర్చినవాడు; కావుత మని(కావుతన్+అని)= అగు గాక అని తలపోసి; ఆ క్షణంబు+అ= ఆ త్రుటిలోనే, వెను వెంటనే; సీతా, సమేతుండు+అయి= సీతాదేవితో పాటుగ; వనంబునకున్= అరణ్యానికి; వెడలెన్=

వెళ్లాడు; అతని పిఱుందన్+అ= అతడి (శ్రీరాముడి) వెంబడే; లక్ష్మణుండునున్= లక్ష్మణుడున్నూ; చనియెన్= వెళ్లాడు; తత్+అనంతరంబు+అ= అటు పిమ్మటనే.

తాత్పర్యం: జరిగింది అంతా తెలిసికొని- అనగా కైకేయి వరం కోరటం, దశరథుడు మూర్ఛిల్లటం విని, శ్రీరాముడు తనతండ్రి అయిన దశరథుడు ఆడినమాట తప్పని సత్యసంధుడుగా ఉండుగాక అని తలపోసి, ఆ క్షణంలోనే బయలుదేరి సీతతో కలిసి అరణ్యవాసానికి వెళ్ళాడు. లక్ష్మణుడుకూడ ఆతడిని అనుసరించాడు. అటు పిమ్మట.

విశేషం: (1) రాఘవుడు అనగా రఘువంశానికి చెందినవాడు. వాచ్యార్థాన్నిబట్టి దశరథుడు, భరతుడు, లక్ష్మణుడు - ఆ కుటుంబంలోనివారు అందరూ రాఘవులే. అయినా, రూఢ్యర్థంలో రాఘవశబ్దం శ్రీరాముడిపరంగానే బహుళంగా వాడబడింది.

2) రాముడిని దేవుడిని చేసింది ఆతడి స్వచ్ఛంద స్వార్థత్యాగం. వ్యావహారికమైన కర్మజగత్తు స్వార్థపరాయణం. ఏ ఆదర్శంలోనైనా కొంత దివ్యత్వం ఇమిడి ఉంటుంది. త్యాగంలో లోకోత్తరమైన దివ్యత్వం మిక్కుటంగా ఉన్నది. 'న కర్మణా న ప్రజయా న ధనేన త్యాగే నైకే అమృతత్వ మానశుః" సత్క్రియలవలన కానీ, సత్సంతానంవలన కానీ, ధనంవలన కానీ అమృతత్వం లభించదు. అది త్యాగంవలన మాత్రమే సిద్ధిస్తుంది.

దశరథుఁడు రామవిశ్లేషముచే సురలోకగతుం డగుట (సం.3-261-29)

క. **రాముఁడు సనుట విని మహో । ద్దామం బగు శోకవహ్ని దరికొనఁగను హా**
రామ! గుణధామ! యని యని । భూమీశ్వరుఁ డసువియోగముం బ్రాపించెన్. **305**

ప్రతిపదార్థం: భూమి+ఈశ్వరుఁడు= పుడమికి అధిపతి, దశరథ మహారాజు; రాముఁడు+చనుట, విని= శ్రీరాముడు అరణ్యానికి వెళ్ళినవార్త విని; మహా+ఉద్దామంబు+అగు= మిక్కిలి ఎక్కువయింది అయిన; శోక వహ్ని= దుఃఖం అనే అగ్ని; దరికొనఁగను= అలముకొని మండగా; హా! రామ!= అయ్యో రామా! (నీవు వెడలి పోయావా?); గుణధామ!= మంచి గుణాలకు నెలవైన వాడా!; అని+అని= అని మాటిమాటికి పలవరిస్తూ; అసు, వి, యోగమున్= ప్రాణాలను విడవటం; ప్రాపించెన్= పొందాడు.

తాత్పర్యం: రాముడు అరణ్యవాసానికి వెడలిన వార్త విని, దశరథ మహారాజు మిక్కుటమైన ఆవేదనతో, 'హా రామా! సద్గుణాలకు నెలవైనవాడా! అతిలోకం, మహోన్నతం అయిన త్యాగం ప్రదర్శించి అడవులకు వెళ్ళావు; నీ గొప్పతనం ఋజువు అయింది. నిన్ను వదలి నే నెట్లా బ్రదుకగలను?' అని విలపించి విలపించి మరణించాడు.

వ. **ఇట్లు దశరథుండు సురలోకగతుం డగుటయుఁ, గైకేయి దనకొడుకు రావించి 'భూవల్లభుండు దేవభావంబు నొందె, రాముండును వనంబున కరిగె, నింక నర్హుండవు నీవ కావున నఖిలమహీరాజ్య రక్షణంబు సేయు' మనిన నక్కుమారుండు క్రోధశోకదందహ్యమానమానసుం డగుచుఁ దల్లి కి ట్లనియె.** **306**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; దశరథుండు; సుర, లోక, గతుండు+అగుటయున్= దేవతలలోకానికి వెళ్ళటమున్నూ- మరణించటమున్నూ; కైకేయి= కేకయ రాజపుత్రి; తన కొడుకున్= తన పుత్రుడిని, భరతుడిని; రావించి= రప్పించి; భూవల్లభుండు= పుడమిపతి, రాజు (దశరథుడు); దేవ భావంబున్+ఒందెన్= దేవత్వాన్ని పొందాడు, మరణించాడు; రాముండును= శ్రీరాముడుకూడా; వనంబునకున్= అడవికి; అరిగెన్= వెళ్ళాడు; ఇంకన్= ఇకమీద; అర్హుండవు= తగినవాడవు; నీవు+అ= నీవే; కావునన్= కాబట్టి; అఖిల, మహీ, రాజ్య రక్షణంబు= సమస్తమైన భూరాజ్యాన్ని కాపాడటం; చేయుము= సల్పుము; అనినన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అని చెప్పగా; ఆ+కుమారుండు= ఆ పుత్రుడు (భరతుడు); క్రోధ, శోక, దందహ్యమాన, మానసుండు+అగుచున్= కోపంచేతను దుఃఖం చేతను మిగుల దహించబడిన చిత్తం కలవాడు ఔతూ; తల్లికిన్= మాతకు (కైకేయికి); ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా దశరథుడు దివంగతు డయ్యాడు. శ్రీరాముడు వనవాసానికి వెళ్ళాడు. కైకేయి భరతుడిని రప్పించి, 'మహారాజు (దశరథుడు) స్వర్గస్థుడైనాడు; రాముడు వనవాసానికి వెళ్లాడు; కనుక అర్హుడవైన నీవు రాజ్య భారాన్ని వహించు' మని కోరింది. కాని, భరతుడు ఆగ్రహంతో దుఃఖంతో కూడిన మనస్సు కలవాడై తల్లికి ఇట్లా బదులు పలికాడు.

విశేషం: (1) భరతుడికి - క్రోధం కలగటానికి కారణం - తల్లి నిర్వహించిన భూమిక. (2) దుఃఖానికి రెండు కారణాలు ఉన్నాయి. తండ్రిమరణం, అన్న అయిన శ్రీరాముడి అరణ్యగమనం.

సీ. **'దురితంబు లెన్నండుఁ బొరయక వెలుఁగొందు । కమలాప్తకులమునఁ గసటు గలిపి,**
పరమధర్మాత్మకుఁ బురుహూతసన్నిభుఁ । బతి మ్రింగికొని, కృపఁ బాఱవైచి
యాయతబాహుఁ దేజోయుక్తు మాయన్నఁ । బటుధైర్యు నడవులపాలు వఱిచి,
జీవితహంత్రివై త్రోవంగరాని దు । ష్కీర్తి నా యౌదలఁ గీలుకొల్పి,

ఆ. **శ్రీకి నెడలి సకలలోకంబుచేతను । దిట్టు గుడిచి కోర్కి దీర్చుకొంటి**
పాపజాతురాల! యీ పాతకం బేమి । సేయ? దింక నేమి సేయువాఁడ?' **307**

ప్రతిపదార్థం: పాప జాతురాల= పాపం చేసిన వర్గానికి చెందిన దానా, పాపాత్మురాలా!; దురితంబులు= పాపాలు; ఎన్నండున్= ఎప్పుడును; పొరయక= సంక్రమించకుండా; వెలుఁగు+ఒందు= ప్రకాశించే; కమల+ఆప్త, కులమునన్= సూర్యవంశంలో; కసటు+కలిపి= మాలిన్యం కలిగించి; పరమ, ధర్మ+ఆత్మకున్= గొప్ప ధార్మికుడిని; పురుహూత, సన్నిభున్= దేవేంద్రుడివంటివాడిని; పతిన్= భర్తను; మ్రింగికొని= కబళించి; కృపన్= దయను (జాలి అనే మంచి గుణాన్ని); పాఱన్వైచి= దూరంగా విసరివేసి; ఆయత బాహున్= పొడుగైన చేతులు కలవాడిని (పరాక్రమవంతుడిని); తేజస్+యుక్తున్= వర్చస్సు కలవాడిని; మా+అన్నన్= మా అన్న అయిన శ్రీరాముడిని; పటుధైర్యున్= గొప్పదైన చిత్తబలం కలవాడిని; అడవుల, పాలు, పఱిచి= అరణ్యాలపాలు చేసి; జీవిత హంత్రివి+ఐ= బ్రదుకులను హరించే దానివయి; త్రోవంగన్‌రాని= వదలించి వేయటానికి (నివారించటానికి) వీలులేని; దుష్కీర్తి= చెడ్డ పేరు; నా ఔదలన్= నా నడినెత్తిమీద; కీలు కొల్పి= ప్రతిష్ఠించి; శ్రీకిన్+ఎడలి= శ్రీకి దూరమైన (శోభ, కాంతి మున్నగు లక్షణాలకు దూరమై); సకల లోకంబుచేతను= సమస్త జగత్తుచేతను; తిట్టు+కుడిచి= తిట్లు తిని, నిందించబడి; కోర్కి+తీర్చుకొంటి(వి)= నీ అభిలాషను నెరవేర్చుకొన్నావు; ఈ పాతకంబు+ఏమి+చేయదు?= ఈ పాపం ఇంక ఏమి చేయకుండా ఉంటుంది? (అన్ని అనర్థాలకు ఈ ఒక్క పాపం చాలు); ఇంకన్= ఇక; ఏమి+చేయువాఁడన్?= నేను ఏమిచేసేది? (చేసిన పాపానికి ఎటువంటి నిష్కృతి లేదు కాబట్టి నేను అయోమయంలో ఉన్నానని భావం).

తాత్పర్యం: 'పాపాలచేత మలినంగాని స్వచ్ఛమైన సూర్యవంశానికి మచ్చతెచ్చి, పరమధార్మికుడు దేవేంద్రుడితో సమానుడు అయిన భర్తను కబళించి, హృదయంలో ఇసుమంత జాలి లేకుండా దేదీప్యమానమైన వర్చస్సు కలవాడును, గొప్పపరాక్రమవంతుడును ఐన మా అన్న శ్రీరాముడిని అడవులలో ప్రవాసానికి పంపించి, జీవితాలను హరించేదానివై, నా నెత్తిమీద తొలగించ వీలుకాని అపకీర్తి బరువును మోపి, శ్రీకి ఎడబాటయి సమస్తలోకాలచేత నిందను పొంది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నీ కోరిక నెరవేర్చుకొన్నావు. ఓ పాపాత్ముౠరాలా!, ఇంతటి దురితానికి ఒడిగట్టావు; ఈ పాతకానికి ఏ నిష్కృతి అయినా ఉన్నదా? ఇక నే నేమి చేయగలను?'

వ. అని దుఃఖించి, భరతుండు దండ్రికి నుచితక్రియలు నిర్వర్తించి, యనంతరంబ సమస్త మంత్రి సామంత భూసుర పౌర జానపద సహితుండై కదలి, ముువ్వురు దల్లులను వసిష్ఠ వామదేవులనుం బురస్కరించుకొని తానును శత్రుఘ్నుండును రామానునయార్థంబు చిత్రకూటశైలంబున కరిగి యందు. 308

ప్రతిపదార్థం: అని దుఃఖించి= అనుచు పరితపించి; భరతుండు; తండ్రికిన్= జనకుడికి; ఉచిత క్రియలు= తగిన సంస్కారాలు (దినవార క్రియలు); నిర్వర్తించి= నిర్వహించి; అనంతరంబు+అ= ఆపైన వెంటనే; సమస్త, మంత్రి, సామంత, భూసుర, పౌర, జానపద సహితుండు+ఐ= అందరు అమాత్యులతో, కప్పం చెల్లించే రాజులతో, బ్రాహ్మణులతో, పట్టణవాసులతో, పల్లెలలో నివసించేవారలతో కూడుకొని; కదలి= పయనించి; ముువ్వురు= ముగ్గురు; తల్లులను= జననులను; వసిష్ఠ, వామదేవులనన్= వసిష్ఠుడు, వామదేవుడు అనే పురోహితులను; పురస్కరించుకొని= ముందు పెట్టుకొని; తానును= తానున్నూ (భరతుడును); శత్రుఘ్నుండును= (సౌమిత్రి అయిన తమ్ముడు శత్రుఘ్నుడును); రామ+అనునయ+అర్థంబు= రాముడిని ఊరడించటంకొరకై; చిత్రకూట శైలంబునకున్= చిత్రకూటం అనే పేరుకల కొండకు; అరిగి= వెడలి; అందున్= అక్కడ.

తాత్పర్యం: అని పరిపరివిధాల దుఃఖించి, భరతుడు తన తండ్రికి అంత్యక్రియలు నిర్వహించాడు. పిదప అందరు మంత్రులతో, కప్పం చెల్లించే సామంతరాజులతో, బ్రాహ్మణులతో, పట్టణంలో నివసించే పౌరులతో, పల్లెటూళ్లలో నివసించే జానపదులతో కలిసి, ముువ్వురు తల్లులైన కౌసల్య, సుమిత్ర, కైకేయి అనే రాణులతో, పురోహితులైన వసిష్ఠవామదేవులతో పాటు తానున్నూ, శత్రుఘ్నుడున్నూ శ్రీరాముడిని ప్రసన్నుడిని చేసికొనటానికై చిత్రకూటపర్వతానికి వెళ్లి అక్కడ.

మ. కనియెం గోమలనీలమేఘసుభగాకారున్, జటావల్కలా
జినధారున్, సితభూతిభూషితుని, రాజీవాక్షుఁ, గల్యాణ కీ
ర్తనుఁ, గాకుత్స్థకులప్రదీపకుని, సీతాలక్ష్మణోపేతు, స
న్మునిలోకార్చితు, సత్కృపాభరణు, రామున్, రాజచూడామణిన్. 309

ప్రతిపదార్థం: కోమల నీల మేఘ సుభగ+ఆకారున్= లలితమైన నల్లని మబ్బువంటి మనోహరమైన రూపం కలవాడిని; జటావల్కల+అజిన, ధారున్= జడలు, నారబట్టలు, జింకతోలు ధరించిన వాడిని; సిత భూతి భూషితునిన్= తెల్లని బూడిదను అలంకరించుకొన్నవాడిని; రాజీవ+అక్షున్= పద్మాలవంటి కనులు కలవాడిని; కల్యాణ కీర్తనున్= మంచి ప్రవర్తన కలవాడుగా ప్రశంసించబడే వాడిని; కాకుత్స్థ, కుల, ప్రదీపకునిన్= కకుత్స్థ వంశాన్ని వెలుగొంద జేసేవాడిని; సీతా, లక్ష్మణ+ఉపేతున్= సీతతో లక్ష్మణుడితో కూడుకొని ఉన్నవాడిని; సత్+ముని, లోక+అర్చితున్= ఉత్తములైన ఋషుల సముదాయంచేత పూజించ బడునట్టి వాడిని; సత్+కృపా+ఆభరణున్= మంచి దయ అనే ఆభరణంచేత అలంకరించబడిన వాడిని; రాజ చూడామణిన్= రాజులలో తలమానికంవంటివాడిని, రాజశ్రేష్ఠుడిని; (భరతుడు); రామున్= రాముణ్ణి; కాంచెన్= సందర్శించాడు.

తాత్పర్యం: భరతుడు శ్రీరాముడిని చిత్రకూటపర్వతంపై సందర్శించాడు. ఆ శ్రీరాముడు సుకుమారమైన నీలమేఘంవలె మనోహరంగా ఉన్నాడు. జడలు, నారబట్టలు, జింకతోలు ధరించాడు. తెల్లని విభూతి దేహానికి అందంగా పూసుకొన్నాడు. పద్మాలవంటి కనులు కలిగిఉన్నాడు. కకుత్స్థ వంశాన్ని వెలుగొంద జేసేవాడు, మహర్షుల చేత మన్నింపబడేవాడు, దయార్ద్రహృదయుడు, రాజులలో శ్రేష్ఠుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) రాముడు రాజీవాక్షుడు. సంస్కృత రామాయణంలో పలుతావుల వాల్మీకిమహర్షి శ్రీరాముడిని 'రామో రాజీవలోచనః' అని అభివర్ణించాడు. (2) కకుత్థ్సుడు సూర్యవంశంలో పుట్టిన వంశకర్త. వికుక్షిశశాదుల కుమారుడు. బ్రహ్మ విష్ణువుల ఆదేశంతో ఇంద్రుడిని వృషభ వాహనంగా చేసికొని దానవులపై దాడిచేసి వారిని సంహరించి దేవతలకు మేలు చేశాడు. కకుత్థ్సలంలో కూర్చుండి వెళ్ళి దానవులతో యుద్ధం చేశాడు కాబట్టి కకుత్థ్సుడని పేరు వచ్చింది. ఇంద్రవాహనుడనీ, పురంజయుడనీ అతడు ప్రసిద్ధుడు. అతని వంశానికి వన్నె తెచ్చినవాడు శ్రీరాముడు.

వ. కని యంతంత నాక్రందన పరుం డగుచుం జని తదీయచరణంబులపయిం బడి పితృమరణప్రకారం బంతయు నెఱింగించి, 'దేవా! సకలసామ్రాజ్యధురీణుండ వై మమ్ముందఱ ననుశాసింపవే!' యని యర్హజన సహితంబుగా నతనిం బ్రార్థించిన. 310

ప్రతిపదార్థం: కని= చూచి; అంతన్+అంతన్= సమీపానికి చేరుతూ వస్తుండగా; ఆక్రందన పరుండు+అగుచున్= ఏడుస్తున్నవాడై; చని= వెళ్లి; తదీయ చరణంబుల పయిన్+పడి= (ఆ శ్రీరాముడియొక్క) పాదాల మీద పడి; పితృ, మరణ, ప్రకారంబు+అంతయున్= తండ్రి చావునుగూర్చిన వివరాలను సంపూర్ణంగా; ఎఱింగించి= తెలిపి; దేవా!= ప్రభూ!; సకల, సామ్రాజ్య, ధురీణుండవు+ఐ= సమస్తమైన గొప్ప రాజ్యాన్ని భరించేవాడవు అయి; మమ్మున్+అందఱను; అనుశాసింపవే= ఏలుకొనవా; అని= అంటూ; అర్హజన సహితంబుగాన్= యోగ్యులైన వారందరినీ కలుపుకొని; అతనిన్= అతడిని (శ్రీరాముడిని); ప్రార్థించినన్= వేడుకొనగా.

తాత్పర్యం: భరతుడు శ్రీరాముడిని సమీపించటానికి మునుముందుగనే రోదించసాగాడు. సమీపించి పెద్దపెట్టున ఏడుస్తూ భరతుడు శ్రీరాముడిపాదాలపై పడి, తండ్రి దశరథుడి మరణవృత్తాంతం సాకల్యంగా తెలిపి, 'దేవా! నీవు అయోధ్యకు తిరిగివచ్చి సింహాసనం అధిష్ఠించి మమ్ముల నందరిని ఏలుకొమ్ము' అని ప్రార్థించాడు. అతడితో పాటు వచ్చిన పెద్దలందరు భరతుడివాక్యాలను బలపరచారు.

క. గురువాక్యరక్షణైకా । దరచిత్తుం డైన యయ్యుదాత్తచరితుఁ డె
ప్పరుసున నొడఁబడఁ డయ్యెను । సరసమహీరాజ్యసమనుశాసనమునకున్. 311

ప్రతిపదార్థం: గురు, వాక్య, రక్షణ+ఏక+ఆదరచిత్తుండు+ఐన= తండ్రి పలికిన మాటలను కాపాడటంలోనే అభిమానం కలిగిన మనస్సు కలవాడయిన; ఆ+ఉదాత్త, చరితుఁడు= ఆ గొప్ప శీలం కలవాడు (శ్రీరాముడు); సరస మహీరాజ్య సమనుశాసనమునకున్= మనోహరమైన భూరాజ్యాన్ని పరిపాలించటానికి; ఏ+పరుసునన్= ఏ విధంగాకూడా; ఒడంబడఁడు+అయ్యెను= సమ్మతించ జాలకపోయాడు.

తాత్పర్యం: పితృవాక్యపరిపాలనలోనే లగ్న మైన మనస్సు గలిగిన ఆ గొప్పశీలం కల శ్రీరాముడు ఎన్నివిధాల తనను బ్రతిమాలినప్పటికీ తిరిగి భూరాజ్యాన్ని పరిపాలించటానికి ఎంతమాత్రం సమ్మతించలేదు.

వ. భరతుండును రాముచేతఁ బ్రత్యాఖ్యాతుండై తదీయపాదుకంబులు గొని చని, వాని నర్చించుచు నంది గ్రామంబునందు వసియించి రాజ్యానుసంధానంబు సేయుచుండె; నిట రాఘవుం డయోధ్యాపుర సమీపం బగుటం జేసి క్రమ్మఱ భరతాగమనంబు శంకించి, చిత్రకూటంబు వాసి శరభంగుపాలికిం జని, యతని చేత సత్కృతుండై దండకారణ్యంబు సొచ్చి, యందు గోదావరీతీరంబున ననుజవధూసహితంబుగాఁగృత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నివాసుండై యున్నంత; దశగ్రీవుచెలియలు శూర్పణఖ సనుదెంచి, వారికి నపకారంబు సేయ మొనసినం గినిసి, యా రాజపుత్త్రులు దత్కర్ణనాసికావైకృతం బొనరించినం బదంపడి. 312

ప్రతిపదార్థం: భరతుండును; రామునిచేతన్= శ్రీరాముడిచేత; ప్రతి+ఆఖ్యాతుండు+ఐ= బదులు చెప్పబడి మరలించబడిన వాడై; తదీయ పాదుకంబులు= ఆతనియొక్క (శ్రీరాముడియొక్క) పాదుకలు; కొని= స్వీకరించి; చని= వెడలి; వానిన్= వాటిని, ఆ పాదుకలను; అర్చించుచున్= ఆరాధిస్తూ; నందిగ్రామంబునందున్= నందిగ్రామం అనే స్థలంలో; వసియించి= నివసించి; రాజ్య+అనుసంధానంబు= రాజ్య పరిపాలన; చేయుచున్+ఉండెన్= చేస్తున్నాడు; ఇట= ఇచట (రాముడు ఉండేచోట); రాఘవుండు= రఘువంశానికి చెందినవాడు - శ్రీరాముడు; అయోధ్యా, పుర, సమీపంబు+అగుటన్+చేసి= అయోధ్య పట్టణం దగ్గరగా ఉండటంచేత; క్రమ్మఱన్= మరల; భరత+ఆగమనంబున్= భరతుడియొక్క రాకను; శంకించి= అనుమానించి; చిత్రకూటంబు+పాసి= చిత్రకూటపర్వతాన్ని వదలిపెట్టి; శరభంగు పాలికిన్+చని= శరభంగుడు అనే ఋషిదగ్గరకు వెళ్ళి; అతనిచేతన్= (ఆ శరభంగుడిచేత); సత్కృతుండు+ఐ= సమ్మానించబడినవాడై; దండక+అరణ్యంబు= దండకం అనే పేరు కల అడవి; చొచ్చి= ప్రవేశించి; అందున్= ఆ దండకవనంలో; గోదావరీ తీరంబునన్= గోదావరి అనే నది ఒడ్డున; అనుజ, వధూ, సహితంబుగాన్= తమ్ముడితోడను, భార్యతోడను కూడినవాడై; కృత నివాసుండు+ఐ= నెలవు ఏర్పరచుకొనినవాడై; ఉన్న+అంతన్= నివసించినంతట; దశగ్రీవు, చెలియలు= రావణుడి సోదరి; శూర్పణఖ= శూర్పణఖ యనే పేరు కలది; చనుదెంచి; వచ్చి; వారికిన్= వారికి (సీతారామ లక్ష్మణులకు); అపకారంబు+చేయన్= కీడు చేయటానికి; మొనసినన్= సమకట్టగా; కినిసి= కోపగించి; ఆ, రాజ, పుత్త్రులు= ఆ రాచబిడ్డలు; తత్+కర్ణ, నాసికా, వైకృతంబు+ఒనరించినన్= ఆమె చెవులకూ, ముక్కుకూ వికారం కలిగించగా (ముక్కూ చెవులూ కోయగా); పదంపడి= పిమ్మట.

తాత్పర్యం: భరతుడు శ్రీరాముడిచేత బదులు చెప్పబడి మరలింపబడినవాడై, అన్నగారి పాదుకలను అర్థించి కైకొని అయోధ్యకు దగ్గరగా ఉన్న నందిగ్రామం చేరి అక్కడ రాముడిపాదుకలను నెలకొల్పి, తాను రాముడి ప్రతినిధిగా రాజ్యం చేయసాగాడు. ఇట శ్రీరాముడు తాను చిత్రకూటంలోనే ఉంటే భరతుడు తిరిగి వచ్చి తనను అయోధ్యకు రమ్మని మరల ప్రార్థించవచ్చుననే భయంతో అటనుండి కదలి శరభంగమహర్షియొక్క ఆశ్రమానికి చేరాడు. శరభంగుడు శ్రీరాముడికి స్వాగతం చెప్పి సమ్మానించాడు. తదుపరి శ్రీరాముడు దండకారణ్యంలో ప్రవేశించి, అందులో గోదావరీతీరంలో తమ్ముడితో తన భార్యతో పర్ణశాలను నిర్మించుకొని నివసించసాగాడు. అప్పుడు రావణుడిసహోదరి శూర్పణఖ అక్కడికి వచ్చి వారికి కీడు చేయబోగా వారు ఆగ్రహించి ఆమె ముక్కుచెవులు వికారం చేశారు. అంతట.

ఉ. శూర్పణఖానిమిత్తమున శూరు లనేకులు రక్కసుల్ మహో
త్సర్పితరోషులై బహుళ సైన్యయుతంబుగ నెత్తి వచ్చుడున్
దర్పితవైరిభంజనుఁ డుదారుఁడు రాఘవుఁ డస్త్రవిద్య నే
ర్పేర్పడఁ గేలిఁ బోలె సమయించె రణాంగణభూమి నందఱన్. 313

ప్రతిపదార్థం: శూర్పణఖా, నిమిత్తమునన్= శూర్పణఖ మూలాన, అంటే, శూర్పణఖకు జరిగిన పరాభవానికి ప్రతీకారంగా; శూరులు= వీరులు; అనేకులు= పెక్కుమంది; రక్కసుల్= రాక్షసులు; మహా+ఉత్+సర్పిత, రోషులు+ఐ= మిక్కుటంగా విజృంభించిన కోపం కలవారై; బహుళ, సైన్య, యుతంబుగన్= పెక్కు సంఖ్య గల భటులు గల సేనలతో కూడుకొని; ఎత్తి వచ్చుడున్= దండెత్తి యుద్ధం చేయటానికై అరుదెంచుటయును; దర్పిత, వైరి, భంజనుఁడు= గర్వించిన శత్రువులను నాశనం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేసేవాడు; ఉదారుఁడు= గొప్పవాడు; రాఘవుఁడు= రఘువంశంలో పుట్టినవాడు; అస్త్ర, విద్య, నేర్పు+ఏర్పడన్= మంత్రమహిమ గల బాణాలను ప్రయోగించటంలో తనకు లభించిన కౌశలంతో; కేలిన్+పోలెన్= ఆట మాదిరిగా; రణ+అంగణ భూమిన్= యుద్ధరంగంలో; అందఱన్= అందరిని (రాక్షసభటులను అందఱను); సమయించెన్= సంహరించాడు.

తాత్పర్యం: శూర్పణఖకు జరిగిన పరాభవానికి ప్రతీకారంగా పెక్కుమంది రక్కస వీరులు మిక్కిలి రోషంతో పెక్కు సేనలతో శ్రీరాముడిపై దండెత్తి వచ్చారు. మహా పరాక్రమోపేతుడు గొప్పవాడు శత్రుసంహారకుడు మంత్ర బాణాలను ప్రయోగించటంలో ఆరితేరినవాడు అయిన శ్రీరాముడు యుద్ధరంగంలో ఆ రక్కసిమూకలను సంహరించాడు.

వ. ఇట్లు ఖరదూషణాదులం గొట్టి పదునాలుగువేలరాక్షసులం జంపి దండకారణ్యంబు విగతకంటకంబు గావించె; నంత శూర్పణఖయు రయంబున రావణుపాలికిం జని తచ్చరణంబులపయిం బడి యేడ్చినం, జెలియలి కైన వైకృతం బేర్పడం జూచి యన్నిశాచరనాథుం డి ట్లనియె. 314

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ఖర, దూషణ+ఆదులన్+కొట్టి= ఖరుడు దూషణుడు మొదలుగా గల వారిని ఓడించి; పదు, నాలుగు వేల రాక్షసులన్= పదు నాలుగువేల మంది రక్కసులను; చంపి= సంహరించి; దండక+అరణ్యంబున్= దండకం అనే పేరు గల అడవిని; విగత కంటకంబు= పోగొట్టబడిన ముండ్లు (శత్రువులు) కలదిగా; కావించెన్= చేశాడు; అంతన్= అటు పిమ్మట; శూర్పణఖయున్; రయంబునన్= శీఘ్రంగా; రావణు పాలికిన్+చని= రావణుడివద్దకు వెళ్లి; తత్+చరణంబుల పయిన్+పడి= ఆతడియొక్క పాదాలమీద వ్రాలి; ఏడ్చినన్= బిగ్గరగా శోకించగా; చెలియలికిన్+ఐన= సహోదరికి జరిగిన; వైకృతంబు= వికారం; ఏర్పడన్+చూచి= స్పష్టంగా పరిశీలించి; ఆ+నిశాచర, నాథుండు= ఆ రాక్షసపతి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: రాముడు, ఈ విధంగా, ఖరుడు దూషణుడు అనే రాక్షసులను వారిభటులను ఓడించి, పదునాలుగు వేలమంది రక్కసులను సంహరించి, దండకారణ్యంలో రాక్షసబాధ లేకుండా చేశాడు. అంతట శూర్పణఖ శీఘ్రంగా తన అన్న అయిన రావణాసురుడిపాలికి వెళ్ళి, ఆతడి పాదాలపై పడి బిగ్గరగా శోకించింది. రావణాసురుడుకూడా తన సహోదరికి జరిగిన పరాభవాన్ని గుర్తించి ఆమెకైన అంగవికారాన్ని పరిశీలించి చూచి శూర్పణఖతో ఇట్లా పలికాడు.

సీ. 'ఎఱిఁగి యెఱింగి నేఁ డెవ్వాఁడు నిశిత వి । స్ఫారశూలాగ్రంబుపయికి నుఱికెఁ?
దలయంపియం దగ్గి దరికొల్పి యెవ్వండు । నేఁడు నెమ్మది శయనింపఁ జూచె?
నుగ్రవిషానలం బుమియుచున్న యహీంద్రుఁ । గడఁగి నేఁ డెవ్వండు గాలఁ దన్నె?
హుంకారఘోరమై యుదరు బెబ్బులి మీస । లుఱక యెవ్వాఁడు నేఁ డూఁచికొనియె?

ఆ. నిన్ను నెవ్వఁ డకట! నేఁ డిట్లు గడు భంగ । పఱిచెఁ జెపుము నాకుఁ బద్మనయన!
యాయువును సిరియును నవశంబు లయ్యె నేఁ । డెవ్వనికొ తలంప నిజ్జగమున.' 315

ప్రతిపదార్థం: పద్మనయన!= తామరపువ్వుల వంటి కన్నులు కలదానా!; ఎఱిఁగి+ఎఱింగి= తెలిసి- తెలిసి అంటే బాగా తెలిసి కూడ; నేఁడు= ఈవేళ; ఏ+వాఁడు= ఎవడు; నిశిత, విస్ఫార, శూల+అగ్రంబు, పయికిన్= వాడి అయిన విశాలమైన, బల్లెం మొనపైకి; ఉఱికెన్= దూకాడు?; ఎవ్వండు= ఎవడు; నేఁడు= ఈ వేళ; తలయంపియందున్= తలగడపై; అగ్గి= నిప్పు;

దరికొల్పి= ప్రజ్వలింపచేసి; నెఱ+మదిన్= నిండు మనస్సుతో (హాయిగా); శయనింపన్= నిదురించటానికి; చూచెన్= యత్నించాడు?; నేఁడు= ఈ వేళ; ఎవ్వండు= ఎవడు; ఉగ్ర, విష+అనలంబు= దారుణమైన విసం అనే అగ్ని; ఉమియుచున్న= నోటినుండి కక్కుతూ ఉన్న; అహి+ఇంద్రున్= పాములరేనిని; కడఁగి= పూని; కాలన్= కాలితో; తన్నెన్= మర్దించాడు? ఏ+వాఁడు= ఎవడు; నేఁడు= ఈ వేళ; హుంకార ఘోరము+ఐ= గాండ్రిస్తూ ఉండటంచేత భయంకరమై; ఉదరు బెబ్బులి= బెదరు గొలిపే పెద్దపులి (యొక్క); మీసలు= మూతిపై ఉండే వెండ్రుకలు; ఉఱక= లక్ష్యపెట్టక; ఊఁచి కొనియెన్?= లాగాడు?; అకట= ఔరా!; నేఁడు= ఈ వేళ; ఎవ్వఁడు= ఎవడు; నిన్నున్= నిన్ను, (ఓ శూర్పణఖా నిన్ను); ఇట్లు= ఈ రీతిగా; కడున్= మిక్కిలి; భంగపఱిచెన్= పరాభవించాడు; నాకున్= నాకు; చెపుము+అ= వచింపవే; ఈ+జగమునన్= ఈ లోకంలో; తలంపన్= ఆలోచించగా; ఎవ్వనికిన్+ఒ= ఎవడికో; ఆయువును= బ్రదికి ఉండే కాలం; సిరియును= ఐశ్వర్యం; అవశంబులు+అయ్యెన్= నశించాయి సుమా!

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కలదానా!, నా ప్రియసహోదరీ! శూర్పణఖా! నీకు ఈ రీతిగా పరాభవం చేసిన నీచుడు ఎవ్వడు? నేటితో వాడికి ఆయువు తీరిపోయింది. ఐశ్వర్యం అడుగంటింది సుమా! ఈ లోకంలో వాడిని నే నింక బ్రదుకనిస్తానా? ఎవడు వాడు? తెలిసి తెలిసి ఎవడు వాడిఅయిన బల్లెం మొనపయికి ఉరికాడు? ఎవడు వాడు తలగడపై నిప్పు రగిల్చి, హాయిగా నిదురపోవాలని యత్నిస్తున్నాడు? ఎవడు వాడు దారుణ మైన విషాగ్ని క్రక్కే సర్పరాజాన్ని కాలితో త్రొక్కేడు? ఎవడు వాడు గాండ్రిస్తున్న పెద్దపులి మీసాలను పట్టుకొని ఊగాడు? వా డెవడో చెప్పుము'.

క. అని పలుకునప్పు డాతని । ఘనతరముఖనేత్రనాసికాకర్ణములం
దనవరతరోషపావక । జనితశిఖావితతు లక్కజంబుగ వెడలెన్. 316

ప్రతిపదార్థం: అని పలుకునప్పుడు= అని మాటాడేసమయంలో; ఆతని= ఆ రావణుడి; ఘనతర, ముఖ, నేత్ర, నాసికా, కర్ణములందున్= మిక్కుటంగా పెద్దవిగా ఉన్న మొగాలనుండి, కన్నులనుండి, ముక్కులనుండి, చెవులనుండి; అనవరత, రోషపావక, జనిత, శిఖా, వితతులు= ఎడతెగక ప్రజ్వలించిన కోపం అనే అగ్నినుండి పుట్టిన జ్వాలల సముదాయాలు; అక్కజంబుగన్= ఆశ్చర్యకరంగా; వెడలెన్= వెలువడ్డాయి.

తాత్పర్యం: అని వచించేటప్పుడు పెద్దవి అయిన ఆ రావణాసురుడి మొగాలనుండి, కనులనుండి, ముక్కులనుండి, చెవులనుండి కోపం అనే అగ్నినుండి ఆవిర్భవించిన జ్వాలలు అచ్చెరువు కొలుపుతూ బయటకు వెలువడ్డాయి.

వ. శూర్పణఖయు నతనికి రాఘవు లున్న తెఱంగును, నిజపరిభవంబు దత్కృతం బగుటయు, ఖరదూషణాది రాక్షసవధయునుం జెప్పిన విని, ధనదానుజుం డాక్షణంబ పురసంరక్షణంబునం దాప్తజనంబుల నియోగించి, సన్నద్ధుండై యొక్కరుండ వెలువడి త్రికూటకాలపర్వతంబులు గడచి సముద్రతీరంబునఁ బరమేశ్వరనివాసం బైన గోకర్ణస్థానంబునకుం జని, యచ్చటం దొల్లి రామువలనం బ్రాప్తపరాభవుండై ప్రవ్రజనంబు నొంది తపంబు సేయుచున్నవానిం దనపూర్వామాత్యు మారీచుం గనిన, నతండును బ్రియసంభ్రమంబులతోడ నతనిం బూజించి కుశలం బడిగి, 'భవదాగమన నిమిత్తం బేమి?' యని యడిగిన నసురేశ్వరుం డి ట్లనియె.317

ప్రతిపదార్థం: శూర్పణఖయున్= శూర్పణఖయును; అతనికిన్= వాడికి (రావణుడికి); రాఘవులు= రఘువంశంలోనివారు (రాముడును లక్ష్మణుడును); ఉన్న, తెఱంగును= ఉన్న తీరును; నిజ పరిభవంబు= తనకు జరిగిన అవమానం; తత్+కృతంబు+

అగుటయున్= వారిచేత జరుపబడింది కావటమున్నూ; ఖర, దూషణ+ఆది, రాక్షస, వధయునున్= ఖరుడు దూషణుడు మున్నగు రక్కసులను సంహరించటమున్నూ; చెప్పినన్= వచించగా; విని= ఆలకించి; ధనద+అనుజుండు= కుబేరుడి తమ్ముడు; పురరక్షణంబునందున్= (లంకా) పట్టణాన్ని కాపాడటంకొరకై; ఆ క్షణంబు+అ= ఆ నిమిషంలోనే; ఆప్త జనంబులన్= తనకు కూరిమి కలవారిని; నియోగించి= ఏర్పాటు చేసి; సన్నద్ధుండు+ఐ= సన్నాహాలు అన్నీ చేసికొన్నవాడై; ఒక్కరుండు+అ= ఏకాకిగా; వెలువడి= బయలుదేరి; త్రికూట, కాల, పర్వతంబులు= త్రికూటం, కాలం అనే కొండలు; కడచి= దాటి; సముద్రతీరంబునన్= కడలిఒడ్డున; పరమ+ఈశ్వర, నివాసంబు+అయిన= పరమశివుడు ఉండేచోటు అయిన (శివుడికోవెల ఉన్నచోటు); గోకర్ణస్థానంబునకున్+చని= గోకర్ణం అనేపేరు కల స్థలానికి వెళ్ళి; అచ్చటన్= ఆ స్థలంలో; తొల్లి= పూర్వం; రామువలనన్= శ్రీరాముడిచేత; ప్రాప్తపరాభవుండు+ఐ= అవమానం చెందినవాడై; ప్రవ్రజనంబున్+ఒంది= సన్న్యాసాన్ని స్వీకరించి; తపంబు+చేయుచున్+ఉన్నవానిన్= తపస్సు చేస్తున్న వాడిని; తనపూర్వ+అమాత్యున్= తనకు అంతకుముందు మంత్రిగా వ్యవహరించి ఉన్నవాడిని; మారీచున్= మారీచుడు అనేవాడిని; కనినన్= చూడగా; అతండును= ఆ మారీచుడును; ప్రియ సంభ్రమంబుల తోడన్= ప్రీతితోను తత్తరపాటుతోను; అతనిన్= ఆ రావణుడిని; పూజించి= అర్చించి; కుశలంబు+అడిగి= యోగక్షేమాలు విచారించి; భవత్+ఆగమన, నిమిత్తంబు= నీరాకకు కారణం; ఏమి+అని, అడిగినన్= ఏమి అని ప్రశ్నించగా; అసుర+ఈశ్వరుండు= రాక్షసులకు ప్రభువు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శూర్పణఖ తన అన్నఅయిన రావణుడితో రామలక్ష్మణులు ఉన్న స్థలాన్ని, తనకు జరిగిన పరాభవాన్నీ, ఖరుడు దూషణుడు మున్నగు రాక్షసులను వారు సంహరించిన తీరును సవిస్తరంగా చెప్పి దుఃఖించింది. రావణుడు లంకాపట్టణాన్ని సంరక్షించటంకొరకై తనకు ఆప్తులైనవారిని నియోగించి, తాను సన్నాహాలు చేసికొని, ఒంటరిగా బయలుదేరి త్రికూటపర్వతాన్ని కాలపర్వతాన్ని అతిక్రమించి సముద్రతీరంలో ఉన్న గోకర్ణానికి వెళ్ళాడు. అక్కడ గోకర్ణేశ్వరాలయం ఉన్నది. శ్రీరాముడిచేత పరాభవం పొంది ఈశ్వరుడినిగూర్చి మారీచుడు అక్కడే తపస్సు చేస్తున్నాడు. ఆ మారీచుడు ఒకనాడు రావణాసురుడికి విశ్వాసపాత్రుడైన మంత్రిగా పనిచేసి ఉన్నవాడే. రావణుడి రాకను గమనించి మారీచుడు సంతోషించి అతడికి స్వాగతం చెప్పి, యోగక్షేమాలను గూర్చి ప్రశ్నించి, ఆతడిరాకకు గల కారణాన్ని తెలిసికొన గోరాడు. అప్పుడు, రావణుడు మారీచుడితో ఇట్లా అన్నాడు.

ఉత్సాహము.

'వినవె రాముఁ డనఁగ నొకఁడు విపులదర్పహృదయుఁ డై
మన ఖరుండు లోనుగా సమగ్రశౌర్యు లైన య
ద్దనుజవరులఁ దునిమి, యిపుడు దండకస్థలంబునం
దొనర నిర్భయత్వ మొప్ప నున్నవాఁడు మేటి యై. **318**

ప్రతిపదార్థం: వినవె?= వినలేదా?; రాముఁడు+అనఁగన్= రాముడు అనే పేరు కలవాడు; ఒకఁడు= ఒకవ్యక్తి; విపుల, దర్ప, హృదయుఁడు+ఐ= మిక్కుటమైన గర్వంతో కూడిన డెందం కలవాడై; మన ఖరుండు= మనవాడైన ఖరుడు; లోనుగాన్= మొదలైనట్టి; సమగ్ర, శౌర్యులు+ఐన= పరాక్రమంలో ఆరితేరినవారైన; ఆ+దనుజ, వరులన్= ఆ రాక్షస శ్రేష్ఠులను; తునిమి= సంహరించి; ఇపుడు= ఈ సమయంలో; దండకస్థలంబునన్= దండకం అనే పేరు కల ప్రదేశంలో; ఒనరన్= శోభిల్లేటట్లుగా; మేటి+ఐ= గొప్పవాడయి; నిర్భయత్వము= వెరపులేకుండటం; ఒప్పన్= శోభిల్లగా; ఉన్నవాఁడు= ఉన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఓ మారీచా! నీవు వినలేదా? శ్రీరాముడు అనే పేరు కలవాడు ఒకడు గర్వంతో విఱ్ఱవీగేవాడు మన రక్కసులను పరాక్రమవంతులను, ఖరుడు మున్నగు వారిని సంహరించి దండకం అనే ప్రదేశంలో జంకుగొంకులు లేక ధైర్యంగా ఉన్నాడు.

విశేషం: ఉత్సాహవృత్తంలోని ప్రతిపాదంలోనూ ఏడు సూర్యగణాలపై ఒక గురువు ఉంటుంది. అయిదవ గణం మొదటి అక్షరం యతి.

ఆ. **వానిఁ బరిభవింపవలయు నప్పనికి సా। హాయ్యకం బొనర్పు మనఘ! నాకు'**
ననిన నధికభయసమావిష్టహృదయుఁడై। యమరవైరి కిట్టు లనియె నతఁడు. **319**

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా, ఓమారీచా!; వానిన్= అతడిని (శ్రీరాముని); పరిభవింపన్‌వలయున్= అవమానించాలి; ఆ+పనికిన్= ఆ కార్యానికి; నాకున్= నాకు; సాహాయ్యకంబు= సాయం; ఒనర్పుము= చేయుము; అనినన్= అని (రావణుడు) అనగా; అతఁడు= మారీచుడు; అధిక, భయ, సమావిష్ట, హృదయుఁడు+ఐ= మిక్కిలి వెఱపుతో కూడిన డెందం కలవాడై; అమర, వైరికిన్= వేల్పులవిరోధికి (రావణుడికి); ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: 'ఆ రాముడిని అవమానించి అతడిపై పగతీర్చుకోవాలి. పుణ్యాత్ముడ వైన ఓమారీచా! ఆ పనిలో నీవు నాకు చిన్న సాయం చేయాలి' అని రావణాసురుడు పలుకగా, మిక్కిలి భయంతో గజగజవణికే గుండెతో మారీచుడు ఇట్లా బదులు పలికాడు.

చ. **'ఎఱుఁగవు గాక రాఘవు నుదీర్ణభుజాబలరూఢి నాజిలో**
నుఱక తదీయబాణరయ మోర్వ వశంబె పినాకికైన? ను
క్కఱ మఱి నీకు నిత్తెఱఁగు గాదన కే ఖలుఁ డొక్కొ బుద్ధిగాఁ
గఱపినవాఁడు సేటునకుఁ గాలము సేరెనొ గాక యిమ్మెయిన్. **320**

ప్రతిపదార్థం: ఎఱుఁగవు+కాక= నీవు తెలియనేరవు గాని; ఆజిలోన్= యుద్ధంలో; రాఘవు+ఉదీర్ణ; భుజా, బలరూఢిన్= శ్రీరాముడి యొక్క గొప్పదైన బాహువులయొక్క శక్తి సామర్థ్యాన్ని; పినాకికిన్+ఐనన్= పినాకం అనే ధనువును ధరించిన వాడికి, (శివుడికి) అయినను; తదీయ, బాణ, రయము= ఆతడియొక్క (శ్రీరాముడి) బాణాల యొక్క వేగం; ఉఱక= మాటలాడక; ఓర్వన్‌వశంబు+ఎ= సహించటానికి శక్యమా; ఉక్కు+అఱన్= బలం నశించగా; మఱి= వెండియు; నీకున్= ఓరావణా నీకు; ఈ+తెఱఁగు= ఈ మార్గం; కాదనక= వలదు అని చెప్పక; ఏ ఖలుఁడు+ఒక్కొ= ఏ దుర్మార్గుడో కదా; బుద్ధి+కాన్+కఱపిన వాఁడు= నీకు ఈ సంకల్పం కలిగేటట్లు చేసినవాడు; ఈ+మెయిన్= ఈరీతిగా; చేటునకున్= కీడునకు; కలము+చేరెనొ+కాక!= సమయం దాపురించిందేమో!

తాత్పర్యం: ఓ రావణా! నీకు శ్రీరాముడితో యుద్ధం చేయటం అంటే ఏమిటో తెలియదు. శ్రీరాముడు గొప్ప పరాక్రమవంతుడు. రామబాణం ఎటువంటిదో నీకు తెలియదు. పినాకపాణి అయిన ఆ పరమశివుడు సయితం రామబాణం ధాటికి ఓర్వజాలడు. ఈ ప్రయత్నం వ్యర్థం సుమా. మఱి ఏదుష్టుడు నీకు ఈ చెడుబుద్ధి కల్గించాడో కదా! నీకు వినాశకాలం దాపురించి ఈ విపరీతబుద్ధి పుట్టింది.

ఆ. రాముతోడఁ దొల్లి రణమునఁ గడు భంగ । మొంది కాదె దైన్యయుక్తి నిట్లు
దపసి నైతి; నేఁడు తగ దమ్మహాత్ముని । యందు వైరబుద్ధి యధిప! నీకు.' 321

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ఓ రావణా!); తొల్లి= పూర్వం; రాముతోడన్= శ్రీరాముడితో; రణమునన్= యుద్ధంలో; కడున్= మిక్కిలి; భంగము+ఒంది, కాదె= పరాభవం అనుభవించే కదా; ఇట్లు= ఈ విధంగా; దైన్య, యుక్తిన్= దీనత్వంతో కూడికొని; తపసిన్+ఐతిన్= సన్యాసిని అయినాను; నీకున్= నీకు; ఆ+మహా+ఆత్మునియందున్= ఆ గొప్ప ఆత్మకలవానియందు (ఆ శ్రీరాముడియందు); వైరబుద్ధి= శత్రుత్వం; నేఁడు= ఈసమయంలో; తగదు= కూడదు.

తాత్పర్యం: రాజా, రావణా! ఇంతకుముందు నేను శ్రీరామచంద్రుడిశౌర్యం యుద్ధంలో చవిచూచి ఉన్నాను. ఆతడిని జయించ శక్యం కాదని తెలిసికొనటంచేతనే కదా ఇపుడు ఇక్కడ నేను ఈ విధంగా సన్యాసం స్వీకరించి తపస్సు చేసికొంటూ ఉంటున్నాను. కానిచో, నేను ఇంతటి దీనస్థితికి దిగజారేవాడిని కాను. శ్రీరాముడితో శత్రుత్వం వహించటం నీకు ఎంతమాత్రం మంచిది కాదు.

వ. అనినం గలుషించి లంకేశ్వరుండు వానిం జూచి 'నా పనుపు సేయ వైతివేని నిన్నిప్పుడ కృతాంతగోచరుం జేయుదు' ననిన, వాఁడును దనమనంబున 'వీనిచేతం జచ్చుటకంటెను రాఘవకృతం బైన మరణంబు మే' లని తలపోసి, 'మహాత్మా! నీకు హితంబుఁగోరి చెప్పితి; నిది యిష్టంబు గాదేని భవదీయశాసనంబు గైకొని చేసెదం; బనుపు' మనినఁ బౌలస్త్యుం డిట్లను; 'నీవు రత్నమయతనూరుహం బగు కనకమృగంబ వై చని, జానకిం బ్రలోభింపవలయు; సీతాచోదితుండై రాముండు నిన్నుం బట్ట సమకట్టి నీ చేత నతిదూరంబు గొనిపోవంబడు; నప్పు డేను దద్భామిని నపహరించెదఁ; బ్రియావిరహదుర్మనస్కుండై యతండు చెడిపోవు' ననిన 'నట్ల కాక' యని మారీచుండు. 322

ప్రతిపదార్థం: అనినన్= అని(మారీచుడు) చెప్పగా; లంకా+ఈశ్వరుండు= లంకకు అధిపతి-రావణుడు; కలుషించి= కోపించి; వానిన్= అతడిని (మారీచుడిని); చూచి= కాంచి; నాపనుపు= నాయొక్క ఆజ్ఞ; చేయవైతివి+ఏని= నెరవేర్పకున్నచో; నిన్నున్= నిన్ను; ఇప్పుడు+అ= ఈ సమయంలోనే; కృతాంత, గోచరున్+చేయుదున్= యముడికి కన్పించే వాడినిగా చేస్తాను. సంహరించగలను; అనినన్= అని (రావణుడు) చెప్పగా; వాఁడును= మారీచుడును; తన, మనంబునన్= తన మనస్సులో; వీనిచేతన్= ఇతడిచేత (ఈ రావణుడిచేత); చచ్చుటకంటెను= మరణించటంకంటెను; రాఘవు, కృతంబు+ఐన= రాముడిచేత కావింపబడిన; మరణంబు= చావు; మేలు+అని= మంచిది అని; తలపోసి= ఆలోచించి; మహా+ఆత్మా!= మహానుభావుడవైన ఓరావణా!; నీకున్= నీకు; హితంబున్= శ్రేయం; కోరి= కాంక్షించి; చెప్పితిన్= వచించాను; ఇది= (శ్రీరాముడితో శత్రుత్వం మంచిది కాదు అని) నేనే చెప్పిన హితవు; ఇష్టంబు కాదు+ఏని= నీకు సమ్మతం కానిచో; భవదీయ శాసనంబు= నీయొక్క ఆజ్ఞను; కైకొని= స్వీకరించి; చేసెదన్= ఆచరిస్తాను; పనుపుము= నన్ను నియోగించుము; అనినన్= అని (మారీచుడు) చెప్పగా; పౌలస్త్యుండు= పులస్త్యుడి కొడుకు-రావణుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; నీవు= నీవు; రత్న, మయ, తనూ రుహంబు+అగు= మణులతో కూడిన వెంట్రుకలు కల; కనక, మృగంబవు+ఐ= బంగారులేడిని అయి; చని= వెళ్ళి; జానకిన్= జనకుడికూతురు అయిన సీతను; ప్రలోభింపన్‌వలయున్= దురాశకు లోనయినట్టి దానినిగా (ఆకర్షించబడిన దానినిగా) చేయాలి; సీతా చోదితుండు+ఐ= సీతచేత పురికొల్పబడినవాడై; రాముండు= శ్రీరాముడు; నిన్నున్= నిన్ను (బంగారులేడిరూపంలో విహరిస్తుండే నిన్ను); పట్టన్= బంధించటానికి; సమకట్టి= ప్రయత్నించి; నీచేతన్; అతిదూరంబు= మిక్కిలిదవ్వు; కొనిపోవన్+పడున్= తీసికొని పోబడతాడు; అప్పుడు= ఆ సమయంలో; ఏను= నేను; తత్+భామినిన్= ఆ శ్రీరాముడియొక్క భార్యయైన సీతను;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అపహరించెదన్= బలాత్కారంగా గైకొంటాను; ప్రియా, విరహ, దుర్మనస్కుండు+ఐ= ప్రియురాలియొక్క ఎడబాటుచేత పాడైన చిత్తం కలవాడై; అతండు= శ్రీరాముడు; చెడిపోవున్= పాడౌతాడు; అనినన్= అని (రావణుడు) చెప్పగా; అట్లు+అ, కాక= అటులే జరుగునుగాక; అని= అని చెప్పి; మారీచుండు= మారీచుడు.

తాత్పర్యం: మారీచుడు చెప్పినమాటలకు లంకాధిపతి అయిన రావణునకు కోపంవచ్చింది. 'ఓ మారీచా! నేను చెప్పినట్లు నీవు చేయకపోతే, నిన్ను ఇప్పుడే సంహరిస్తాను' అని కత్తి దూశాడు. అంతట మారీచుడు - 'ఇప్పు డిక్కడ ఈ రావణుడిచేత మరణించటం కంటె ఆ రాముడి చేతిలోనే చావటం మంచిది'- అని తన మనస్సులో ఆలోచించి, 'మహాత్మా! నీకు హితవు చెప్పాను. నీ కది ఇష్టంగానిచో, నీ ఆజ్ఞను నేను శిరసావహిస్తాను. ఆజ్ఞాపించుము' అని అన్నాడు. రావణుడు ఈవిధంగా బదులు పలికాడు. 'రాముడినియుద్ధంలో జయించటం వేరుమాట. ముందు' నీవు రత్నమయమైన వెంట్రుకలతో రాజిల్లే బంగారు లేడిగా కామరూపం ధరించి, సీతకు కన్పించి ఆమెను ఆకర్షించవలయును. అంతట సీతాదేవి తనకు బంగారులేడి కావలెనని రాముడిని కోరుతుంది. అప్పుడు రాముడు బంగారులేడి రూపంలో ఉన్న నిన్ను వెంబడిస్తాడు. నీవు ఆవిధంగా శ్రీరాముడిని దవుదవ్వులకు కొనిపోతే, నేను సీతాదేవిని అపహరిస్తాను. ప్రియురాలిని ఎడబాసిన దుఃఖం చేత రాముడు చెడిపోతాడు'. మారీచుడు అందుకు సమ్మతించాడు.

మారీచుండు మాయామృగంబై చనుదెంచుట (సం. 3-262-24)

క. కనకమృగరూపమునఁ జని । యినవంశ్యుఁడు సతియు నున్నయెడ మెలఁగుటయుం
గని జానకి కౌతూహల । మునఁ బ్రియుఁ బ్రార్థించె హరిణపుంగవుఁ బట్టన్. 323

ప్రతిపదార్థం: కనక, మృగరూపమునన్= బంగారులేడి ఆకారంలో; చని= వెళ్ళి; ఇనవంశ్యుఁడు= సూర్యవంశంలో పుట్టినవాడు, శ్రీరాముడు; సతియున్= భార్యయును; ఉన్న+ఎడన్= ఉన్నస్థలంలో; మెలఁగుటయున్= సంచరించటాన్ని; కని= చూచి; జానకి= జనకుడి కూతురు అయిన సీత; హరిణపుంగవున్+పట్టన్= లేళ్ళలో శ్రేష్ఠమైన దానిని (హరిణరాజాన్ని) పట్టటానికై; కౌతూహలమునన్= వేడుకతో; ప్రియున్= భర్తను; ప్రార్థించెన్= వేడింది.

తాత్పర్యం: మారీచుడు బంగరులేడిరూపం ధరించి, సూర్యవంశజుడైన రాముడు, సీత నివసిస్తున్న ప్రదేశానికి పోయి విహరించసాగాడు. జానకి ఆ బంగరులేడిని చూచి, వేడుకపడి తనకు దానిని తెచ్చిపెట్టుమని తనభర్త శ్రీరాముడిని ప్రార్థించింది.

ఆ. ధరణిసుతయు విధియుఁ దన్నుఁ బ్రేరేపంగ । వివశబుద్ధి యగుచు నవనివిభుఁడు
మృగముఁ బట్టఁ దివిరె మృగనేత్రఁ గావ స । ద్వినుతబలు సుమిత్రతనయు నునిచి. 324

ప్రతిపదార్థం: అవనివిభుఁడు= భూభర్త- శ్రీరాముడు; ధరణిసుతయున్= భూదేవికూతురు- సీతయును; విధియును= భాగధేయం, అదృష్టశక్తి; తన్నున్= తనను (రాముడిని); ప్రేరేపంగన్= ప్రేరేపణ చేయగా, ప్రోత్సహించగా; వి, వశ, బుద్ధి+అగుచున్= వశం తప్పిన మతి కలవాడు ఔతూ; మృగనేత్రన్= లేడికన్నుల వంటి కన్నుల కలదానిని - సీతను; కావన్= కాపాడటం కొరకై; సత్+వినుత, బలున్= మంచివారిచేత పొగడబడినపరాక్రమం కలవాడిని; సుమిత్రతనయున్= సుమిత్రయొక్క కొడుకును - లక్ష్మణుడిని; ఉనిచి= ఉంచి; మృగమున్= లేడిని; పట్టన్+తివిరెన్= బంధించటానికి పూనుకొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సీతాదేవి ప్రోత్సాహంతోమాత్రమేకాక విధివిలాసంవలన కూడ ఉచితజ్ఞుడు మేధావి అయిన శ్రీరాముడు వివశుడై లేడిని పట్టుకొనటానికై బయలుదేరాడు. సీతాదేవిని కాపాడటంకొరకై సుప్రసిద్ధపరాక్రమం గల లక్ష్మణుడిని నియోగించాడు.

విశేషం: బంగరులేడి వృత్తాంతం రామాయణగాథలో ఒక అద్భుత సన్నివేశం. ఇతివృత్తం ఇట ఒక మలుపు తిరిగింది. రామలక్ష్మణులు ప్రక్కనుండగా రావణుడు సీత నపహరించటం సాధ్యంకాదు. ఆ విషయం తెలిసినవాడు కనుకనే రావణుడు ఈ పన్నాగం పన్నాడు. సీత బంగరులేడిపై వ్యామోహం చెందటంలో వింత లేదు. రావణుడు ఆవిషయం ముందే ఊహించగలిగాడు కదా! ఇక-శ్రీరాముడు సీతమాట విని బంగరులేడిని వెంబడించటమా? శ్రీరాముడికి కామరూపు లైన రాక్షసుల మాయలు అనుభవామ్రేడితాలేకదా! అంతటి మేధావి బంగరులేడి వెంటపడటం వింతలలో వింత. అంతే కాదు. అతడు కేవలం భార్యావిధేయుడై, ఆమెకోరిక తీర్చటంకొరకు తన ఉచితజ్ఞతను, బుద్ధిసంపదను మంటకలిపాడా? రాముడు తాత్కాలికంగా విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయినట్లే. ఇది ఎట్లా జరిగింది? ఎందుకు జరిగింది? ఇది కేవలం సీతాదేవి కల్పించిన ప్రోత్సాహంమాత్రమే కాజాలదు. అది విధివిలాసం. ఇట్టి సన్నివేశాలు మానవజీవితంలో అప్పుడప్పుడు జరుగుతుంటాయి. అందుచేతనే 'మానవులు విధిచేతి కీలుబొమ్మలు' అనేవిశ్వాసం పలుతావుల రేకెత్తుతుంది.

క. అసదృశకార్ముకధరుఁడై । మసలక యామృగము వెనుక మర్దితరిపుఁ డే
పెసఁగంగ నరుగఁ దొడఁగెను । వెస రుద్రుఁడు యజ్ఞమృగము వెనుకొనుమాడ్కిన్. 325

ప్రతిపదార్థం: అసదృశ, కార్ముక, ధరుఁడు+ఐ= సాటిలేని కోదండమును ధరించినవాడై; మసలక= ఆలస్యం చేయక; ఆ, మృగము, వెనుకన్= ఆ లేడి వెంబడి; మర్దితరిపుఁడు= మర్దించబడిన శత్రువులు కలవాడు- శత్రుసంహారకుడు; ఏపు= అతిశయం; ఎసఁగంగన్= శోభిల్లేటట్లుగా; వెసన్= శీఘ్రంగా; రుద్రుఁడు= శివుడు; యజ్ఞమృగమున్= క్రతువుకు ఉద్దేశించబడిన పశువును; వెనుకొను మాడ్కిన్= వెంబడించిన మాదిరిగా; అరుగన్+తొడఁగెను= వెడలసాగాడు.

తాత్పర్యం: సాటిలేని కోదండమును ధరించిన వాడై శ్రీరాముడు తడయక ఆ లేడిని వెంబడిస్తూ అలనాడు పరమశివుడు యజ్ఞమృగాన్ని వెన్నాడినమాదిరిగా శీఘ్రంగా వెళ్ళాడు.

విశేషం: (1) అలం: ఉపమ. (2) శివుడు యజ్ఞమృగాన్ని వెంబడించిన సుప్రసిద్ధగాథ ఇక్కడ ఉదాహరించబడింది.

వ. అట్టి యవసరంబున. 326

తాత్పర్యం: అటువంటి సమయంలో.

విశేషం: 'అవసరము' అనే సంస్కృతపదం సంస్కృతవాఙ్మయంలోనూ, కవిత్రయకాలంలోనూ 'కాలము' 'సమయము' అనే అర్థంలో ప్రయోగించబడింది. అర్థవిపరిణామం చెంది నేడు- అక్కర, కావలసినట్టిది- అనే అర్థాల నిస్తున్నది. ఇది అనవసరం= ఇది అక్కరలేదు- అని నేటి వ్యవహారం.

మ. పఱచున్ దవ్వుగఁ, జేయలంతి నిలుచుం, బట్టీక యాసాసలం
బఱువోవుం, బొదలందు డిందుఁ, బొడమున్, బిట్టుల్కి వే దాఁటుఁ, గ్ర
మ్మఱి చూచుం, జెవి దార్చి నిల్చు, మలయున్, మట్టాడు, గోరాడు, నే
మఱినట్లుండుఁ దృణంబు మేయు నెలయున్ మాయామృగం బిమ్ములన్. 327

ప్రతిపదార్థం: మాయా, మృగంబు= మాయ బంగారులేడి; ఇమ్ములన్= ఇంపుగా; దవ్వుగన్= దూరంగా; పఱచున్= పరుగెత్తుతుంది; చే+అలంతి= చేతికి అందేటంత తక్కువ దూరంలో; నిలుచున్= నిలబడుతుంది; పట్టు+ఈక= పట్టుబడకుండు; ఆసాసలన్= ఆసలు ఆసలు రేకెత్తించి; పిఱుపోవున్= వెనుకకు పోతుంది; పొదలందున్= పొదరిళ్ళలో; డిందున్= కనపడకుండా మాయమౌతుంది; పొడమున్= కన్పిస్తుంది; బిట్టు+ఉల్కి= మిక్కుటంగా భయపడి; వేదాఁటున్= వేగంగా గెంతుతుంది; క్రమ్మఱి= మరలి వెనక్కు; చూచున్= చూస్తుంది; చెవి+తార్చి, నిల్చున్= చెవులు నిక్కబొడిచేటట్లుగా చేసి నిలబడుతుంది; మలయున్= ప్రక్కదారిబట్టుతుంది; మట్టాడున్= త్రొక్కుతుంది; కోరాడున్= దుమ్ము రేపుతుంది; ఏమఱినట్ల+ఉండున్= పరధ్యానంగా కన్పిస్తుంది; తృణంబు= పచ్చగడ్డి; మేయున్= తింటుంది; ఎలయున్= విజృంభిస్తుంది.

తాత్పర్యం: ఆ సమయంలో ఆ బంగరు మాయలేడి ఒకసారి దూరంగా పారిపోతుంది. ఒకతూరి చేతికి చిక్కినట్లుగా దగ్గరకు వస్తుంది. కాని, పట్టుబడదు. ఆసలు రేకెత్తిస్తూ వెనుకకు తగ్గుతుంది. పొదలలో అణగిపోతుంది. అవతల ప్రత్యక్షమవుతుంది. భీతి చెందినట్లు నిలబడిపోతుంది. అంతలో వేగంగా దాటుతూ పరుగెత్తుతుంది. మరలిచూచి చెవులు నిక్కించి నిలిచి చూస్తుంది. నేల త్రొక్కుతూ దుమ్మురేపుతుంది. కొమ్ములతో రాస్తుంది. పరాకుగా ఉన్నట్లు కన్పిస్తుంది. పచ్చగడ్డి మేస్తుంది. ఒక్కసారి పైకెగసి పారిపోతుంది.

విశేషం: అలం: స్వభావోక్తి. ఆంధ్రవాఙ్మయంలో హృదయంగమమైన స్వభావోక్తి అలంకారానికి ఈపద్యం చక్కని ఉదాహరణం. ఇది నన్నయభట్టుగారి ఒరవడికిగాక ఎఱ్ఱనగారి స్వకీయప్రతిభకే ఉదాహరణం. ఇది ఎఱ్ఱాప్రెగ్గడ ప్రబంధశైలికి నిదర్శనంగా ఎన్నదగింది.

వ. ఇ ట్లతిదూరంబుగా నెలయించి యలయించిన నది రాక్షసమాయగా నూహించి రాఘవుం డమోఘబాణంబు తొడిగి తడయక యమ్మృగంబు నేసిన. 328

ప్రతిపదార్థం: ఇట్లు= ఈరీతిగా; అతిదూరంబుగాన్= దవుదవ్వులుగా; ఎలయించి= ప్రేరేపించి; అలయించినన్= అలసిపోయేటట్లుగా చేయగా; అది= ఆ బంగరులేడి చర్యలు; రాక్షసమాయగాన్= రక్కసులు పన్నిన మోసంగా; ఊహించి= తలపోసి; రాఘవుండు= రఘువంశంలోనివాడు- శ్రీరాముడు; అ+మోఘ, బాణంబు= వ్యర్థం కాని అమ్ము; తొడిగి= సంధించి; తడయక= ఆలసించక; ఆ+మృగమును= ఆ లేడిని; ఏసినన్= కొట్టగా.

తాత్పర్యం: ఈ విధంగా ఆ బంగరులేడి రాముడిని మోసగించి దూరప్రదేశానికి కొనిపోయింది. అంతవరకు ఆ బంగరులేడిని ప్రాణాలతోనే పట్టుకొనాలని శ్రీరాముడి ఆలోచన. కాని, అది అంతా రాక్షసమాయ అని గుర్తించి వెనువెంటనే ఆ లేడిపై రాముడు తిరుగులేని బాణాన్ని ప్రయోగించాడు. రామబాణం వ్యర్థం కాని మహిమ కలది. ఆ బాణం ప్రయోగించటం అంటే బంగరులేడి మరణించటం తథ్యం. ఇక సీతకోరిక ఈడేరదు.

క. వాలమ్ము దాఁకి యొఱలుచు । నాలోనన రాము నెలుఁగునట్టి యెలుఁగు గా
'హా! లక్ష్మణ! సీతా!' యని । కూలి కపటమ్మృగము తన్నికొనుచుం జచ్చెన్. 329

ప్రతిపదార్థం: వాలు+అమ్ము= వాడిఅయిన (రామ) బాణం; తాఁకి= తగిలి; ఒఱలుచున్= అరుస్తూ; ఆ లోనన్+అ= ఆ లోపలనే; రాము+ఎలుఁగు+అట్టి+ఎలుఁగు+కాన్= శ్రీరాముడి కంఠస్వరాన్ని పోలిన కంఠస్వరంతో; హా లక్ష్మణ! = ఓ లక్ష్మణ!; సీతా= హా సీతా!; అని= అని అరుస్తూ; కూలి= నేలవ్రాలి; కపటమృగము= మాయలేడి; తన్నికొనుచున్= గిజగిజ అవయవాలు కంపింపచేస్తూ; చచ్చెన్= మరణించింది.

తాత్పర్యం: వాడిఅయిన రామబాణం తాకి, అరుస్తూ మాయలేడి నేలపై పడి, రాముడికంఠస్వరాన్ని పోలిన కంఠస్వరంతో 'హా లక్ష్మణా! హా సీతా!' అని బిగ్గరగా అరుస్తూ అవయవాలు కంపిస్తూండగా గిజగిజ తన్నుకొని చచ్చింది.

విశేషం: రామాయణగాథలో నాటకీయసన్నివేశాలలో ఇది ఒకటి. రాక్షస మాయామహిమ పరాకాష్ఠ చెందింది. 'రామబాణమహిమ మారీచుడికి అంతకుపూర్వం తెలిసిందే. కాని రావణుడికి రామబాణప్రభావం తెలియదు. రాముడికి మారీచుడి మాయామహిమ తెలియదు కాని రావణుడికి మాత్రం తెలియును. అందుచేతనే లంకనుండి రావణుడు గోకర్ణం చేరి మారీచుడి సాయం కోరాడు. జిత్తులమారి మారీచుడు మరణసమయంలో కూడ విడనాడని సద్యస్ఫూర్తితో శ్రీరాముడి కంఠస్వరాన్నిపోలిన కంఠస్వరంతో 'హా లక్ష్మణా హా సీతా' అని అరిచాడు. రామబాణం మారీచుడి ప్రాణాలను అపహరించగల్గింది. కాని, అతడి మోసపుతెలివితేటలు సీతాదేవినే అపహరింపజేశాయి.

తరువోజ.

ఆ యెలుఁ గేర్పడ నవనీతనూజ । యాలించి తల్లడం బడరు చిత్తమున
'నోయన్న! లక్ష్మణ! యొలసి మీయన్న । యుగ్రరాక్షసబాధ నొందంగఁ బోలు;
నాయతభుజ! వింటె యమ్మహాభాగుఁ । డత్యంతదుఃఖార్తుఁ డై నిన్నుఁ జీరె;
బోయి వే కావు విస్ఫురితపుణ్యైక । భూషణోదార! యప్పురుషరత్నంబు'. 330

ప్రతిపదార్థం: అవనీ, తనూజ= భూదేవి కూతురు- సీతాదేవి; ఆ+ఎలుఁగు+ఏర్పడన్= ఆ కంఠస్వరం సుస్పష్టంగా; ఆలించి= విని; తల్లడంబు+అడరు, చిత్తమునన్= తత్తరపాటుతో వ్యాకులమైన మనస్సుతో; ఓ+అన్న, లక్ష్మణ!= ఓ అన్నా! లక్ష్మణా!; ఒలసి= కోరి; మీ+అన్న= శ్రీరాముడు; ఉగ్ర, రాక్షస, బాధన్= భయంకరమైన రక్కసులు కల్పించిన ఆవేదనను, ఒందంగన్+పోలున్= చెందియుండ వచ్చును; ఆయత భుజ!= నిడివిఅయిన బుజాలు కలవాడా!; పరాక్రమవంతుఁడవు+ఐన ఓ లక్ష్మణా!; వింటి(వి)+ఎ= ఆలకించితివిగదా; ఆ+మహా, భాగుఁడు= ఆ మహానుభావుడు - శ్రీరాముడు; అతి+అంత, దుఃఖ+ ఆర్తుఁడు+ఐ= మిక్కుటమైన ఆవేదనకు లోనయినవాడై; నిన్నున్= నిన్ను; చీరెన్= పిలిచాడు; పోయి= వెళ్ళి; వి, స్ఫురిత, పుణ్య+ఏక, భూషణ+ఉదార!= బాగా ప్రకాశించే సుకృతం ముఖ్యమైన ఆభరణంగా కల గొప్పవాడా!; ఆ+పురుష, రత్నంబున్= మగవారలలో శ్రేష్ఠుడు అయిన శ్రీరాముడిని; వే కావు(ము)= వేగంగా రక్షించుము.

తాత్పర్యం: ఆ మాయలేడినుండి వెలువడిన కంఠస్వరం శ్రీరాముడి కంఠస్వరంగా సుస్పష్టంగా గుర్తించి, తత్తరపడిన చిత్తంతో సీతాదేవి లక్ష్మణుడితో ఇట్లా పలికింది. 'ఓ లక్ష్మణా! విన్నావుకదా మీఅన్నగారి ఆర్తనాదం. ఆయన రాక్షసులు పన్నిన బాధకు గురి అయినట్లు తెల్లమౌతున్నది. పరాక్రమవంతుడవైన లక్ష్మణా! మిక్కుటమైన దుఃఖంలో మునిగిఉన్న పురుషరత్నం మీఅన్న. అతడిని రక్షించటం నీకర్తవ్యం. దేదీప్యమాన మైన పుణ్యమే నీకు ఏకైకభూషణంకదా!'

విశేషం: వృత్త లక్షణానికి చూడు- 4.302 విశేషాంశం.

వ. అనిన నతం డా మానిని కి ట్లనియె. 331

తాత్పర్యం: అని సీత పల్కగా, ఆమెతో లక్ష్మణుడు ఈ విధంగా అన్నాడు.

ఆ. 'అబల! వెఱవకుండు; మఖిలలోకములను । రాఘవేశ్వరునకు రణములోన
నెదురఁ గలఁడె శూరుఁ డెవ్వాఁడు? నతనికి । నెట్టియెడల దురిత మేల పొందు? 332

ప్రతిపదార్థం: అబల= సీతా!; వెఱవక+ఉండుము= భయపడకుండా ఉండుము; అఖిలలోకములను= అన్నిభువనాలలోను; రాఘవ+ఈశ్వరునకున్= రఘుకులానికి చెందిన ప్రభువుకు, శ్రీరాముడికి; రణములోనన్= యుద్ధంలో; శూరుఁడు+ఎవ్వాఁడున్= ఎట్టివీరుడు అయినను; ఎదురన్+కలఁడు+ఎ= ఎదిరించి నెగ్గగలడా?; అతనికిన్= శ్రీరాముడికి; ఎట్టి+ఎడలన్= ఎట్టి పరిస్థితులలో కూడా; దురితము= పాపం, మిక్కుటమైనదుఃఖం; ఏల పొందున్?= ఎందుకు కలుగుతుంది? (కలుగదని భావం).

తాత్పర్యం: 'ఓ సీతా! భయపడకుము. రాఘవేశ్వరుడైన శ్రీరాముడిని యుద్ధంలో గెలువగల శూరుడు ఈ లోకంలోనే కాక ఏ లోకంలోనూ లేడు. శ్రీరాముడికి ఎక్కడైనాసరే ఎప్పుడైనా సరే ఎట్టి ఆపదా సంభవించదు.

క. ఇనవంశోత్తముఁ డిప్పుడ । చనుదెంచుఁ బ్రియంబు నొందు జలజానన!' నా
విని జానకి లక్ష్మణు నెడ । జనితాశంక యయి క్రోధసంభ్రాంతమతిన్. 333

ప్రతిపదార్థం: జలజ+ఆనన!= పద్మాలవంటి ముఖం కలదానా, సీతాదేవీ!; ఇన, వంశ+ఉత్తముఁడు= సూర్యవంశంలో శ్రేష్ఠుడు- శ్రీరాముడు; ఇప్పుడు+అ= ఇప్పుడే- ఇక కొన్నిక్షణాలలోనే; చనుదెంచున్= వస్తాడు; ప్రియంబున్+ఒందు(ము)= సంప్రీతిని చెందుము; నాన్= అనగా; విని= ఆలకించి; జానకి= జనకుడి కూతురు - సీత; జనిత+ఆశంక+అయి= పుట్టిన సందేహం కల్గినది అయి; క్రోధ, సంభ్రాంత, మతిన్= కోపంవలన తిరుగుడువడిన చిత్తంతో.

తాత్పర్యం: 'పద్మంవంటి ముఖం కలదానా! సీతాదేవీ! ఇప్పుడే ఇక కొన్నిక్షణాలలోపలనే సూర్యవంశంలో శ్రేష్ఠుడైన శ్రీరాముడు రాగలడు' అని లక్ష్మణుడు పలికాడు. సీతకు లక్ష్మణుడియెడ అనుమానం రేకెత్తింది. కోపం వచ్చింది. కోపం రావటంచేత ఏర్పడిన అపోహతో ఆమె ఇట్లా అన్నది.

విశేషం: సీత లక్ష్మణుడిని సందేహించవచ్చునా? ఈ ప్రశ్నకు పలువురు విమర్శకులు పలురీతుల సమాధానం చెప్తున్నారు. ఇట లక్ష్మణుడి సంబోధనం సీతనుగూర్చి- 'జలజానన!= పద్మంవంటి ముఖం కలదానా!' అనేది మాత్రం అందుకు హేతువు కాజాలదు. అట్టి పదాలు సర్వసాధారణంగా మర్యాదాసూచకాలు మాత్రమే. అబల, అంబుజేక్షణ, అరవిందలోచన, మానిని ఇత్యాదిశబ్దాలు అన్నీ స్త్రీసామాన్యవాచకాలే. నన్నయ భారతంలో గరుడుడు కన్నతల్లిని - 'పయోరుహాననా' అని సంబోధిస్తాడు. ఆపత్సమయంలో సీతకు మతిపోయి అట్లా పలికినట్లుగనే భావించనగును. తదుపరి ఆమె పశ్చాత్తాపం చెంది లక్ష్మణుడికి క్షమాపణ అందించింది (ఆంజనేయుడిద్వారా).

సీ. 'నీతలం పెఱుఁగుదు; నీ కేల వలవని । జాలి నీ కి ట్లేల సంభవించె?
నతిఘోరశస్త్రవిషాగ్నులయం దొంట । వేగంబ ప్రాణముల్ విడుతుఁగాక
యే నేల నిను వరియింతు? బెబ్బులికాంత । యక్కట! నక్కపాం దాస పడునె?'
యని యిట్లు సత్పురుషాగ్రణి సౌమిత్రిఁ । బడఁతి యప్రియములు వలుకుటయును,

ఆ. జెవులు మూసికొనుచుఁ జిత్తంబు గలఁగ ల । క్ష్మణుఁడు దత్క్షణంబ మహిత శౌర్యుఁ
డతులబాణచాపహస్తుఁడై తనయన్న । చనిన చొప్పునంద చనఁ దొడంగె. 334

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నీతలంపు= నీయొక్కయోచన; ఎఱుఁగుదున్= తెలియుదును; నీకున్+ఏల= నీకు ఎందుకు; వలవని= కూడని; జాలి= దయ; నీకున్= నీకు; ఇట్లు= ఈ విధంగా; ఏల= ఎందులకు; సంభవించెన్?= కలిగింది?; అతి, ఘోర, శస్త్ర, విష+అగ్నులయందున్= మిక్కిలిదారుణం అయిన ఆయుధాలు, విసం, నిప్పులలో; ఒంటన్= ఏదియో ఒకదానితో; వేగంబు+అ= శీఘ్రంగా; ప్రాణముల్= అసువులు; విడుతున్+కాక= విడుస్తానుగాని; ఏన్= నేను; ఏల= ఎందుకు; నినున్= నిన్ను; వరియింతున్?= వరిస్తాను?; అక్కట= అయ్యో; బెబ్బులికాంత= ఆడుపెద్దపులి; నక్కపొందు= జంబుకంతోడి కలయిక; ఆస+పడునె?= ఆశిస్తుందా? (ఆశించదు); అని= అని పలికి; యిట్లు= ఆ రీతిగా; సత్+పురుష+అగ్రణి= మంచి మగవారలలో శ్రేష్ఠుడైనవాడిని; సౌమిత్రిన్= సుమిత్రకొడుకును లక్ష్మణుడిని; పడఁతి= వనిత - సీత; అప్రియములు= కఠినవాక్యాలు; పలుకుటయును= పలకటమున్నూ; లక్ష్మణుఁడు; చిత్తంబు= మనస్సు; కలఁగన్= సంక్షోభించెందగా; చెవులు; మూసికొనుచున్= కప్పుకొంటూ; తత్+క్షణంబు+అ= ఆ త్రుటిలోనే; మహితశౌర్యుఁడు= గొప్పపరాక్రమం కలవాడు; అతుల, బాణ, చాప, హస్తుఁడు+ఐ= సాటిలేని విల్లును అమ్ములను చేతిలో పూనినవాడై; తన అన్న= తన అగ్రజుడు- శ్రీరాముడు; చనిన చొప్పనందున్+అ= వెడలిన మార్గంలోనే; చనన్+తొడంగెన్= వెడలసాగాడు.

తాత్పర్యం: 'ఓ లక్ష్మణా! నీ ఆంతర్యం నాకు ఇప్పటికి అర్థమైంది. నీకు ఎందుకు నామీద ఇంతజాలి కలిగిందో నాకు తెలుసు. నేను భయంకరమైన ఆయుధాలచేతనో, విషంచేతనో, అగ్నిచేతనో ఆత్మహత్యకు పాల్పడతానుగాని, నిన్ను ప్రేమించి నీకు లొంగను. శ్రీరాముడు లేకపోతే నేను నీకు దక్కుతా నని ఎంతమాత్రం భావించకుము. ఆడుపెద్దపులి గుంటనక్కపొందుకు సమ్మతిస్తుందా?' అని సత్పురుషులలో శ్రేష్ఠుడు అయిన లక్ష్మణుడితో సీత కఠోరవాక్యాలు పలికింది. ఆ మాటలు వినలేక సౌమిత్రి చెవులు మూసికొంటూ, ఆక్షణంలోనే విల్లు అమ్ములు ధరించి బయలుదేరి అంతకుముందు అన్నగారు శ్రీరాముడు వెళ్ళిన మార్గంలోనే తానును వెళ్ళాడు.

వ. అయ్యవసరంబున దశాననుండు. 335

ప్రతిపదార్థం: ఆ సమయంలో పదిమోములు కలవాడైన రావణుడు.

మ. కమనీయం బగు జన్నిదంబు శిఖయుం గౌపీనమున్ ధాతువ
స్త్రము దండంబును గుండియుం గుశపవిత్రంబుం గడున్ వృద్ధభా
వము సంధిల్లఁ ద్రిదండివేషధరుఁడై వచ్చెం బథిశ్రాంతి దే
హమునం దోఁపఁగ సీతయున్నెడకు మాయాదక్షుఁ డక్షీణతన్. 336

ప్రతిపదార్థం: కమనీయంబు+అగు= అందమైన; జన్నిదంబున్= జందెమున్నూ (యజ్ఞోపవీతం); శిఖయున్= జుత్తుముడియున్నూ; కౌపీనమున్= గోచిగుడ్డయున్నూ; ధాతువస్త్రమున్= దేహాన్ని కప్పుకోటానికి మాత్రమే సరిపోయే బట్టయున్నూ; దండంబును= (చేతి) కఱ్ఱయున్నూ; కుండియున్= కమండలమున్నూ; కుశ, పవిత్రంబున్= దర్భలతో చుట్టబడిన అంగుళీయకమున్నూ; కడున్= మిక్కిలి; వృద్ధభావము= ముసలితనం; సంధిల్లన్= ఏర్పడగా; త్రిదండివేషధరుఁడు+ఐ= ఏకదండంగా కట్టిన మూడు దండాలను తాల్చే సన్న్యాసి ఆహార్యం ధరించిన వాడై; పథిశ్రాంతి= మార్గాయాసం; దేహమునన్= శరీరంలో; తోఁపఁగన్= కన్పించగా; సీత+ఉన్న+ఎడకున్= సీత నివసించే చోటికి; మాయాదక్షుఁడు= మోసం చేయటంలో నేర్పరి అయినరావణుడు; అక్షీణతన్= గొప్పతనంతో; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఆ సమయంలో పదిమొగాలుకల రావణుడు మారువేషంతో సీతాదేవి ఉన్నచోటికి అరుగుదెంచాడు. మనోహరమైన యజ్ఞోపవీతం, చిన్నజుత్తుముడి, గోచిగుడ్డ, దేహాన్ని కప్పిన చిన్నబట్ట, చేతికర్ర, కమండలువు, దర్భలతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చుట్టబడిన ఉంగరం ధరించి, మిక్కిలిముసలితనం తోచేటట్లుగా త్రిదండి సన్యాసివేషం ధరించి మాయావి అయిన ఆ రావణుడు మార్గాయాసంచేత అలసిపోయినట్లుగా కనిపిస్తూ సీతవద్దకు వచ్చాడు.

విశేషం: (1) త్రిదండం- వాగ్దండ కర్మదండ మనోదండాల సమాహారం. మనస్సు-వాక్కు-కర్మ త్రికరణాలు. వీటిశుద్ధి ఏర్పడటం ఆధ్యాత్మికోన్నతికి పరాకాష్ఠ.

తే. **వాని నిక్కంపుమునియ కా వగచి రాము । వనిత గడుభక్తిఁ బూజించి వన్యఫలము**
లొసఁగుటయు వానిఁ జేకొననొల్ల కసుర । మదనవివశుఁడై యిట్లను మగువఁజూచి. **337**

ప్రతిపదార్థం: వానిన్= అతడిని (ఆ త్రిదండి సన్యాసివేషంలో) వచ్చిన రావణుడిని; నిక్కంపు, ముని+అ, కా= నిజమైన యతిగనే; వగచి= భావించి, రామువనిత= శ్రీరాముడిభార్య- సీత; కడు= మిక్కిలి; భక్తిన్= పూజ్యభావంచేత; పూజించి= ఆరాధించి; వన్యఫలములు= అడవిలో కాచినపండ్లు; ఒసఁగుటయున్= ఇచ్చుటయున్నూ; వానిన్= వాటిని (ఆ వన్యఫలాలను); చేకొనన్= స్వీకరించటానికి; ఒల్లక= ఇష్టపడక; అసుర= రాక్షసుడు-రావణుడు; మదన, వివశుఁడు+ఐ= మన్మథుడికి లొంగిపోయిన వాడై; మగువన్+చూచి= వనితను- సీతను చూచి; ఇట్లు+అనున్.

తాత్పర్యం: యతివేషంలో వచ్చిన రావణుడిని నిజమైన మునిగనే భావించి శ్రీరాముడిభార్య అయిన సీత అతడిని పూజ్యభావంతో ఆరాధించి అతిథిసత్కారాలు చేసి అడవిపండ్లను సమర్పించింది. రావణుడు కామవికారానికి లోనయి, ఆపండ్లను స్వీకరించనొల్లకుండా సీతనే చూస్తూ ఇట్లా పలికాడు.

మత్తకోకిలము.

'ఏను దానవనాయకుండ నహీనసత్త్వుఁడ రావణా
ఖ్యానిరూఢుఁడ లంక నాఁగ జగత్ప్రసిద్ధము మత్పురం
బానతాంగి! మదీయవల్లభ వై భజింపఁగ రాదె ది
వ్యానుభోగము లిష్టచేష్టితహారియౌవనలీలలన్. **338**

ప్రతిపదార్థం: ఆనత+అంగి!= వంగినదేహంకలదానా, సౌకుమార్యంగల సుందరీ!; ఏను= నేను; దానవ, నాయకుండన్= రాక్షసులకు అధినేతను; అహీనసత్త్వుఁడన్= గొప్పబలం కలవాడను; రావణ+ఆఖ్యా, నిరూఢుఁడన్= రావణుడు అనేపేరుతో ప్రసిద్ధుడను; మత్+పురంబు= నా రాజధాని; లంక= లంక; నాఁగన్= అనగా; జగత్+ప్రసిద్ధము= లోకంలో పేరు కెక్కింది; మదీయవల్లభవు+ఐ= నీవు నా ప్రేముడికి పాత్ర మైన భార్యవై; దివ్య+అనుభోగములు= స్వర్గసౌఖ్యాలు అనుభవించటాలు; ఇష్టచేష్టిత, హారి, యౌవనలీలలన్= కోరిన పనులతో మనోహరాలైన జవ్వనపు ఆటలను; భజింపఁగన్ రాదె= అనుభవించరాదా!

తాత్పర్యం: 'సౌకుమార్యం వెల్లివిరుస్తున్న సుందరీ!; నేను రాక్షసులకు సార్వభౌముడను, జగత్ప్రసిద్ధమైన లంకాపట్టణం నా రాజధాని. నాపేరు రావణుడు. నాకు ప్రేయసివై నీవు పడుచుదనపు కోరికలతో రంగరించబడిన ఆటలలో తేలియాడుతూ స్వర్గసౌఖ్యాలను అనుభవించుము.

విశేషం: వృత్త లక్షణానికి చూడు- 4.267 విశేషాంశం.

క. ఎక్కడి రాఘవుఁ డక్కట! । తక్కువ యగు పేదమనుజుఁ దగిలి వనమునం
బెక్కిడుమలఁ బడఁ దగునే! । తక్కుము మది నింక నొండుదలఁపులు తరుణీ!' 339

ప్రతిపదార్థం: తరుణీ!= జవరాలా, సీతా!; ఎక్కడి రాఘవుఁడు= రఘువంశంలో జనించిన శ్రీరాముడు ఎంతటివాడు; అక్కటా!= అయ్యో! (నీకు ఎంత లోటు ఏర్పడింది); తక్కువ+అగు= హీనుడు అయిన; పేదమనుజున్= దరిద్రుడు అయిన మానవుడిని; తగిలి= కూడుకొని; వనమునన్= అడవిలో; పెక్కు+ఇడుమలన్= అనేకాలైన కష్టాలను; పడన్+తగునే?= అనుభవించటం ఎందుకు?; మదిన్= (నీ)మనస్సులో; ఇంకన్= ఇకమీద; ఒండు, తలఁపులు= వేరేఆలోచనలు; తక్కుము= విడనాడుము.

తాత్పర్యం: పడుచుదనంలో ఉన్న సీతాదేవీ!; అయ్యో పాపం, నీకు ఎటువంటి కష్టం దాపురించింది! ఈ అడవులలో ఇన్ని కష్టాలు పడటం ఎందుకు? ఒక మనుజుడిని, ఒక దరిద్రుడిని పెళ్ళాడి అతడితో కలిసి ఉండటమా? నీ మనస్సులో వేరే ఆలోచనలు పెట్టుకోకుండా నన్ను చేరుము.

వ. అనిన విని వైదేహి భయకంపిత దేహ యగుచు నతని కి ట్లనియె. 340

తాత్పర్యం: అనగా విని భయంతో వణికే శరీరంతో సీత అతడితో ఇట్లా అన్నది.

సీ. 'ఇట్లాడ నర్హమే యే నేడ? నీ వేడ? నక్షత్రతారాగణంబుతోడ
నాకసం బంతయు నవనిపైఁ గూలిన । వసుమతి వ్రస్సిన, వనధు లెల్ల
నింకినఁ, జంద్రదినేశ్వరు లన్యోన్య । విపులతేజంబులు వీడుపడిన
నే నేల యన్యుని నెడలోనఁ గామింతుఁ? । గరిణి యేనాఁట సూకరముఁ గలయు?

ఆ. మహితకమలమధురమధురసాస్వాదన । పరవశాత్మ యైన భ్రమరకాంత
రిత్తబుద్ధి నకట! రేఁగుఁబువ్వుల రసం । బాను నెట్లు? బేలవైతి గాక.' 341

ప్రతిపదార్థం: ఇట్లు+ఆడన్= ఈ విధంగా మాట్లాడటం; అర్హమే= తగునా?; ఏన్+ఏడ= నేను ఎక్కడ?; నీవు+ఏడన్= నీవు ఎక్కడ?; నక్షత్ర, తారాగణంబుతోడన్= చుక్కలగుంపులతో; ఆకసంబు+అంతయున్= గగనం సర్వమున్నూ; అవనిపైన్= భూమిపై; కూలినన్= క్రిందకు పడినా; వనధులు= సముద్రాలు; ఎల్లన్= అన్నియును; ఇంకినన్= ఎండిపోయినా; వసుమతి= భూమి; వ్రస్సినన్= బ్రద్దలు అయినా; చంద్ర, దిన+ఈశ్వరులు= చంద్రుడున్నూ, సూర్యుడున్నూ; అన్యోన్య, విపుల, తేజంబులు= ఒకరికొకరికి సంబంధించి విస్తరించిన కాంతులు; వీడుపడినన్= ప్రసరించటం మానినప్పటికి; ఏన్= నేను; ఏల= ఎందుకు; ఎడలోనన్= హృదయంలో; అన్యునిన్= ఇతరుని; కామింతున్?= కోరుతాను?; కరిణి= ఆడుఏనుగు; ఏనాఁటన్= ఎక్కడైనా, ఎప్పుడైనా; సూకరమున్= పందిని; కలయున్= కూడునా?; మహిత, కమల, మధుర, మధు, రస+ఆస్వాదన, పర, వశ+ఆత్మ+ఐన= గొప్ప తమ్మిపువ్వులలోని తియ్యనైన తేనెద్రవాన్ని క్రోలుతూ తనను తాను ఒడలు మరచి ఆనందించే; భ్రమరకాంత= తుమ్మెద పడుచు; రిత్తబుద్ధిన్= మతిచెడి; అకట!= అయ్యో!; రేఁగు+పువ్వుల రసంబు= రేగుపూలలోని ద్రవాన్ని; ఎట్లు= ఏరీతిగా; ఆనున్?= ఆస్వాదిస్తుంది?; బేలవు+ఐతి(వి)+కాక= నీవు అవివేకివి అయినావు సుమా!

తాత్పర్యం: రావణుడిమాటలు ఆలకించి విదేహ రాజకుమారి అయిన సీత ఆతడితో ఇట్లా బదులు పలికింది. 'ఓరావణా! నీవు అవివేకివని తేలింది. నీపలుకులు ఎంతమాత్రం ఉచితాలు కావు సుమా! నేను ఎక్కడ? తులువ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వైన నీవు ఎక్కడ? తారతమ్యం గుర్తించక నీవు నీ నోటికి వచ్చినట్లు వాగుతున్నావు. సమస్తతారాగణంతో క్రాంతివలయంతోసహా ఆకాశం అంతా భూమిపై పడుగాక! భూమిఅంతా బ్రద్దలైపోనీగాక! సముద్రాలు అన్నీ ఎండిపోనీగాక! సూర్యచంద్రులు కాంతివిహీనులై గతులు తప్పనీగాక, నేను పరపురుషుడిని మనసులో కోరనే, కోరను. ఆడుఏనుగు ఎన్నడును పందిని కలయగోరునా? తమ్మిపువ్వులలోని తియ్యతేనెను గ్రోలి ఒడలు మరచి ఆనందించే ఆడుతుమ్మెద రేగుపువ్వులరసం ఆస్వాదించ కోరదు కదా! ఓరీ బుద్ధిహీనుడా! జాగ్రత్త. నన్ను ఎన్నడు నీవు కాంక్షించరాదు'.

విశేషం: (1) అలం: నిదర్శనం (2) నక్షత్రాలు అన్నా తారకలు అన్నా ఆకసంలో చుక్కలు అనియే అర్థం. నక్షత్రాలు-ఇరువదియేడు. అశ్విని, భరణి మున్నగునవి సూర్యుడిగతిలో గ్రహాలగతులలో ఉన్నట్టివి. అనగా, కాంతివలయంలో ఉన్నట్టివి. ఇక-తారలు అసంఖ్యాకా లైన నక్షత్రాలు - కాంతివలయానికి బయట ఉండే చుక్కలు అని చెప్పవచ్చును. ఈ విధంగా పునరుక్తిదోషాన్ని పరిహరించటం సులువు. కవిహృదయాన్ని స్వీకరించటం సహృదయలక్షణం.

రావణుఁడు సీత నెత్తికొని లంకకుఁ బోవుట (సం. 3-262-39)

వ. అని పలుకుచు నొయ్యనొయ్యన తొలంగం జనిన నద్దురాత్ముఁ డతిభయంకరంబుగా జంకించి యమ్మగువం బట్టికొని గగనంబున కెగసి లంకాపురాభిముఖుండై యరుగఁ దొడంగిన నయ్యింతి యెంతయుం దలరి యిట్లని విలాపంబు సేసె. 342

ప్రతిపదార్థం: అని పలుకుచున్= అని అంటూ; ఒయ్యన+ఒయ్యన= మెల్లగా మెల్లగా; తొలంగన్+చనినన్= దూరంగా పోగా; ఆ+దురాత్ముఁడు= ఆ చెడ్డవాడు (ఆ రావణుడు); అతిభయంకరంబుగాన్= మిక్కిలి భీతికలిగేటట్లుగా; జంకించి= బెదరేటట్లుగా చేసి; ఆ+మగువన్= ఆమెను(ఆసీతను); పట్టికొని= (బలాత్కారంగా) పట్టుకొని; గగనంబునకున్= ఆకసానికి; ఎగసి=ఎగిరి; లంకాపుర+అభిముఖుండు+ఐ= లంకానగరం వైపు మొగం కలవాడై; అరుగన్+తొడంగినన్= పోసాగగా; ఆ+ఇంతి= సీతాదేవి; ఎంతయున్= మిక్కుటంగా; తలరి= ఆవేదనచెంది; ఇట్లు+అని, ఈ విధంగా పలుకుతూ; విలాపంబు+చేసెన్= ఆక్రోశించింది.

తాత్పర్యం: ఆ విధంగా రావణుడిని అధిక్షేపిస్తూ సీతాదేవి అతడికి దూరంగా మెలమెల్లగా తొలగిపో సాగింది. అంతట రావణుడు ఆమెను బెదిరించి భయంకరంగా ఆమెను పట్టుకొని ఆకసానికి ఎగిరి లంకాపట్టణం వైపు పోసాగాడు. అప్పుడు సీతాదేవి మిక్కుటమైన ఆవేదనతో ఈ రీతిగా ఆక్రోశించింది.

ఉ. 'దేవతలార! యో ధరణిదేవతలార! జగత్త్రయోన్నతుం
డై వెలుఁగొందు రామునికులాంగన జానకి నేను; నన్ను మో
హావిలుఁ డొక్క రక్కసుఁ డనర్గళుఁడై కొనిపోయెడుం; గృపం
గావరె! పుణ్యమున్ యశముఁ గైకొనరే! యిదె మీకు మ్రొక్కెదన్'. 343

ప్రతిపదార్థం: దేవతలార!= ఓవేల్పులారా!; ఓధరణి, దేవతలార!= ఓపుడమివేల్పులారా- ఓబ్రాహ్మణులారా!; జగత్+ త్రయ+ ఉన్నతుండు+ఐ= మూడులోకాలలో గొప్పవాడై; వెలుఁగొందు= ప్రకాశించే; రామునికుల+అంగనన్= శ్రీరాముడిభార్యను; ఏను= నేను; జానకిన్= జనకరాజుకూతురను - సీతను; నన్నున్= నన్ను; మోహ+ఆవిలుఁడు= కామంచేత కలగినవాడు; ఒక్క రక్కసుఁడు= ఒక రాక్షసుడు; అనర్గళుఁడు+ఐ= అడ్డు లేనివాడై, స్వేచ్ఛతో కూడినవాడై; కొనిపోయెడున్= బలాత్కారంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తీసికొనిపోతున్నాడు; కృపన్= దయతో; కావరె= కాపాడరా? (కాపాడండి); పుణ్యమున్= సుకృతాన్ని; యశమున్= కీర్తిని; కైకొనరే= గ్రహింపరా (దయచేసి నన్ను రక్షించి పుణ్యాన్ని కీర్తిని ఆర్జించండి); ఇదె= ఇదుగో; మీకున్= మీకు; మ్రొక్కెదన్= నమస్కరిస్తున్నాను.

తాత్పర్యం: 'ఓ వేల్పులారా! ఓ బ్రాహ్మణులారా! మూడులోకాలలోనూ గొప్పవాడై వెలుగొందే శ్రీరాముడిభార్యను నేను. జనకుడి కూతురిని సీతను. కాముకుడైన ఒకరాక్షసుడు నన్ను బలాత్కారంగా పట్టుకొని ఈ విధంగా తీసికొని పోతున్నాడు చూడండి. ఇతడిని అడ్డగించేవారు లేరా? దయచేసి నన్ను కాపాడండి. దీనురాల నయిన నన్ను రక్షిస్తే మీకు పుణ్యం, కీర్తి లభిస్తాయి. ఇదుగో మీకు నమస్కరిస్తున్నాను.

క. అని యేడ్వఁగఁ దద్వచనము । లనఘుఁడు గిరిగహ్వరాంతరాలయగతుఁడై
విని యరుణసుతుఁడు తేజో । ఘనుఁడు జటాయు వను పక్షి కారుణ్యమునన్. 344

ప్రతిపదార్థం: అని+ఏడ్వఁగన్= అని (సీతాదేవి) విలపించగా; తత్+వచనములు= ఆ సీతయొక్క మాటలు; అనఘుఁడు= పాపంలేనివాడు, పుణ్యాత్ముడు; గిరి, గహ్వర+అంతర+ఆలయ, గతుఁడు+ఐ= కొండగుహలోపల నున్న ఆవాసంలో ఉన్నవాడై; తేజస్+ఘనుఁడు= దేదీప్యమాన మైన కాంతితో శోభిల్లే గొప్పవాడు; అరుణ, సుతుఁడు= అరుణుడికొడుకు; జటాయువు+అనుపక్షి= జటాయువు అనే పేరుగల పెద్దగ్రద్ద; విని= ఆలకించి; కారుణ్యమునన్= జాలితో.

తాత్పర్యం: ఆవిధంగా సీతాదేవి బిగ్గరగా ఆక్రోశించటం విని, అరుణుడికొడుకు అయిన జటాయువు అనే పక్షిరాజు- పుణ్యాత్ముడు, దేదీప్యమాన మైన కాంతితో ప్రకాశించేవాడు, కొండగుహ లోపల నివసించేవాడు జాలితో.

క. ఎఱకలు గల కులశైలము । తెఱఁగు మెయిన్ రయము మెఱయ దివికి నెగసి బె
ట్టుఱుము జలధరముక్రియ ను । క్కఱి భువనం బెల్ల నద్రువ నార్చుచుఁ గడిమిన్. 345

ప్రతిపదార్థం: ఎఱకలు+కల= రెక్కలుకల; కులశైలము, తెఱఁగు మెయిన్= కులపర్వతంవలె; రయము= వేగం; మెఱయన్= ప్రకాశించగా; దివికిన్= ఆకసానికి; ఎగసి= ఎగిరి; బెట్టు+ఉఱుము= మిక్కుటంగా గర్జన చేస్తూ; జలధరముక్రియన్= మేఘంవలె; ఉక్కు+అఱి= బలంచెడి; భువనంబు+ఎల్లన్= జగము అంతయును; అద్రువన్= అదరగా; ఆర్చుచున్= అరచుచు; కడిమిన్= శౌర్యంతో.

తాత్పర్యం: రెక్కలు గల కులపర్వతంవలె వేగంగా వెడలివచ్చి ఆకసానికి ఎగిరి వేఘంవలె గర్జిస్తూ, మిక్కుటమైన పౌరుషం ప్రకాశించేటట్లుగా, జగత్తంతా అదరేటట్లుగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: (1)అలం: ఉపమ. (2) కులపర్వతాలు ఏడు. అవి భూమిని భరించేవి అని సనాతనసంప్రదాయం. 1. మహేంద్రం, 2. మలయం, 3. శుక్తిమంతం, 4. గంధమాదనం, 5. వింధ్యం, 6. పారియాత్రం, 7. సహ్యం. (3) అద్రువ- III నగణం; ఇచట అ- గురువు కాదు; 'అ' తేల్చి పలకాలి. (4) జటాయువు- ఎఱకలు గల కులపర్వతంవలె వినువీధికి ఎగసినట్లు కవి వర్ణన. పర్వతానికి రెక్కలు ఉండవు. ఇక- కులపర్వతం రెక్కలు గలిగితే ఎట్లుంటుందో అట్లాఉన్నది జటాయువు- అని వర్ణన.

ఉ. 'ఓరి దురాత్మ! యీ యబల నోడక యేటికిఁ బట్టినాఁడ? వం
భోరుహనేత్ర విడ్వు; మెట వోయినఁ బ్రాణముఁ గొందు నింక; ను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గ్రారివిభేదివిక్రము జటాయు నెఱుంగవె?' యంచు దర్పదు
ర్వారుఁడు వీఁకఁ దాఁకె సురవర్గవిఘాతకు నద్దశాననున్. 346

ప్రతిపదార్థం: ఓరిదురాత్మ!= ఓరి దుష్టుడా (రావణా!); ఈ అబలన్= ఈ వనితను, బలంలేని ఆడుదానిని (సీతను); ఓడక= జంకక; ఏటికిన్= ఎందుకు; పట్టినాఁడవు= అపహరించావు; అంభోరుహనేత్రన్- అంభస్+రుహ, నేత్రన్= పద్మాలవంటి కన్నులు కలదానిని (ఈవనితను); విడ్వుము= విడువుము; ఎట+పోయినన్= నీవు ఎటు వెళ్ళినను; ప్రాణమున్+కొందున్= (నీ) అసువులను గైకొంటాను, నిన్నుచంపుతాను; ఇంకన్= ఇంతవరకును; ఉగ్ర+అరి, విభేది, విక్రమున్= భయంకరు లైన శత్రువులను సంహరించే పరాక్రమం కలవాడిని; జటాయువున్= జటాయువును; ఎఱుంగవె= తెలియవా; అంచున్= అని పలుకుతూ; దర్ప+దుర్వారుఁడు= గర్వంచేత వారించ నలవి కానివాడు; ఆ+దశ+ఆననున్= ఆ పదితలలు కల రావణుడిని; సుర, వర్గవిఘాతకున్= వేల్పుల సముదాయానికి మిక్కుటమైన హాని కలిగించేవాడిని రావణుడిని; వీఁకన్= ఉత్సాహంతో; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: 'ఓరీ, దుష్టుడా! ఈ ఆడుదానిని ఎందుకు చెరబట్టావురా? పద్మాలవంటి కన్నులు గల ఈమెను విడిచిపెట్టుము; నీవు నన్ను తప్పించుకొని పారిపోలేవు. నీవు ఎటుపోయినా నేను నిన్ను పట్టుకొని సంహరిస్తాను. భయంకరమైన శత్రువర్గాన్ని చీల్చిచెండాడే పరాక్రమంగల జటాయువును నేను; నన్ను నీవు ఎరుగవా?' అంటూ దర్పంతో చేరి వేలుపులకు హాని కలిగించే ఆ రావణుడిని ఉత్సాహంతో ఎదుర్కొన్నాడు.

మ. ఘనపక్షాహతులం బ్రకాండపరిఘాఘాతంబులం దీవ్రశా
తనఖోచ్ఛేదములం బ్రదీప్తశరవేధక్రీడలం గ్రూరచం
చునిపాతంబులఁ బ్రౌఢకుంతముఖవిస్ఫోటంబులం దత్ఖగేం
ద్రనిశాటేంద్రుల పోరు సాధనసమత్వస్ఫూర్తి నొప్పెం గడున్. 347

ప్రతిపదార్థం: ఘన, పక్ష+ఆహతులన్= గొప్పవైన రెక్కలదెబ్బలచేతను; ప్రకాండపరిఘ+ఆఘాతములన్= నిడివి అయిన ఇనుపకట్ల గుదియలతో కొట్టటంచేతను; తీవ్ర, శాత, నఖ+ఉత్+ఛేదములన్= గాఢమైన వాడిఅయిన గోళ్ళతో రక్కుటలచేతను; ప్రదీప్త, శరవేధక్రీడలన్= వాడియైన బాణాలచేత బాధించటం అనే ఆటలచేతను; క్రూరచంచునిపాతంబులన్= కఠినమైన ముక్కుతో పొడవటంచేతను; ప్రౌఢ, కుంత, ముఖవిస్ఫోటంబులన్= ముదురు మొనగలిగిన ఈటెపోటులచేతను; తత్, ఖగ+ఇంద్ర, నిశాట+ఇంద్రుల, పోరు= ఆ పక్షిరాజు (జటాయువు) రాక్షసరాజు (రావణుడు) ల యుద్ధం; సాధన, సమత్వ, స్ఫూర్తిన్= పరికరాల యొక్క సమానత్వం అగుపించటంలో; కడున్= మిక్కిలి; ఒప్పెన్= శోభిల్లింది.

తాత్పర్యం: పక్షులలో శ్రేష్ఠుడు అయిన జటాయువుకూ నిశాచరులలో శ్రేష్ఠుడు అయిన రావణాసురుడికీ జరిగిన భయంకరమైన యుద్ధంలో సాధనసమత్వం (ప్రయోగించిన పరికరాలలో సామ్యం) గోచరించింది. పక్షీంద్రుడు తనరెక్కలతో కొట్టాడు. రాక్షసేంద్రుడు ఇనుపకట్ల గుదియలు ప్రయోగించాడు. జటాయువు వాడియైన గోళ్లతో రక్కినాడు. రావణుడు వాడి అయిన బాణాలను ఉపయోగించాడు. పక్షి వెరపుగొలిపే ముక్కుతో చీరినాడు. రక్కసుడు నిడివిగల ఈటెను విసిరాడు.

చ. పటుతరపక్షిపక్షముఖపాదనఖప్రవిఘాతఖండిత
స్ఫుటితశరీరుఁడై బహుళశోణితధారలు మేనఁ గ్రమ్మఁగాఁ

దటసముపాంతనిర్గళితధాతురసారుణసాంద్రనిర్ఝ రో
త్కటకులశైలలీల దశకంఠుఁడు నిల్చె నకుంఠితస్థితిన్. **348**

ప్రతిపదార్థం: దశకంఠుఁడు= పదికంఠాలు కల రావణుడు; పటు, తర, పక్షి, పక్ష, ముఖ, పాద, నఖ, ప్ర, వి, ఘాత, ఖండిత, స్ఫుటిత, శరీరుఁడు+ఐ= మిక్కుటంగా పక్షియొక్కరెక్కలవలన, ముక్కువలన, పాదాలవలన, గోళ్ళవలన తగిన దెబ్బలుగలిగి బాగుగా నరుకబడి చిట్లిన దేహం కలవాడై; బహుళ, శోణితధారలు= పెక్కు నెత్తురుచారలు; మేనన్= దేహంలో, క్రమ్మగాన్= ఆవరించగా; తట, సముపాంత, నిర్గళిత, ధాతు, రస+అరుణ, సాంద్ర, నిర్ఝ ర+ఉత్కట, కులశైల, లీలన్= గట్టు సమీపంలో వెలికిజారిన మణిశిలలచేత ఎర్రనై దట్టమైన సెలయేళ్ళతో విరివిఅయిన కులపర్వతంవలె; అకుంఠిత, స్థితిన్= మొక్కవోని ధైర్యంతో; నిల్చెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: జటాయువుచేత మార్కొనబడిన రావణుడు కులపర్వతంవలె శోభిల్లాడు. జటాయువు తనరెక్కలచే, ముక్కుచే, పాదాలచే, గోళ్లచే, గీరి రావణుడిశరీరంనుండి నెత్తురు కారేటట్లు చేశాడు. తీరసమీపాన గల గైరికాదిధాతువులతో కలిసి ఎర్రబడిన నీళ్ళతో ప్రవహించే సెలయేళ్ళతో గూడిన కులపర్వతంవలె శోభిల్లుతూ రావణుడు ధీరుడై జటాయువును ఎదుర్కొన్నాడు.

విశేషం: అలం: ఉపమ. పూర్ణోపమ.

వ. **తదనంతరంబ.** **349**

తాత్పర్యం: అటు పిమ్మట.

క. **తెఱపి గని దానవేశ్వరుఁ । డుఱక కృపాణమున నాఖగోత్తము నెఱకల్**
నఱకినఁ గూలె నతం డిల । నఱవఱలై పవనహతమహాభ్రమ పోలెన్. **350**

ప్రతిపదార్థం: తెఱపి+కని= (పోరులో) కొంతవిరామాన్ని గమనించి; దానవ+ఈశ్వరుఁడు= రాక్షసప్రభువు; ఉఱక= లెక్కచేయక కృపాణమునన్= కత్తితో; ఆ ఖగ+ఉత్తము+ఎఱకల్= ఆ పక్షీంద్రుడిరెక్కలు; నఱకినన్= ఖండించగా; అతండు= ఆతడు (జటాయువు); పవనహతమహా+అభ్రము+అ, పోలెన్= గాలిచేత కొట్టబడిన పెద్దమేఘంవలె; అఱవఱలు+ఐ= తుత్తునియలు అయి; ఇలన్= భూమిపై; కూలెన్= పడిపోయాడు.

తాత్పర్యం: ఆ పోరాటంలో కొంత విరామాన్ని గమనించి, రాక్షసప్రభువు రావణుడు తన కత్తిని ఎత్తి సులువుగా ఆ పక్షిరాజు అయిన జటాయువుయొక్క రెక్కలను తుత్తునియలుగా ఖండించాడు. అప్పుడు ఆ జటాయువు గాలిచేత కొట్టబడిన గొప్పమేఘంవలె ముక్కలుముక్కలుగా చెదరి పడ్డాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. **ఇట్లు జటాయువుం గూల్చి రావణుం డధికరయంబున నరుగునెడ జానకి తనకు దిక్కెవ్వరు లేమిం జేసి నిరాశయై యొక్కశైలశృంగంబునందుఁ గొందఱు వానరులు మెలంగుచున్నంగని, తన కట్టిన పుట్టంబుకొంగు సించి భూషణంబులు ముడిచి తత్ప్రదేశంబున వైచెం; బంక్తివదనుండును లంకాపురంబునకుం జని యం**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దశోకవనమధ్యంబున నాసుమధ్య నునిచి, తదీయరక్షణార్థంబు రాక్షసీనివహంబు నియోగించె; నిట రాఘవుండు మాయామృగంబు వధియించి మగుడం జనుదెంచువాఁడు దన కెదురుగా వచ్చు లక్ష్మణుం గని 'రాక్షస గోచరం బైన వనంబున జానకి నొంటి యునిచి వచ్చి తప్పుసేసి' తని పలుకుటయు, సుమిత్రానందనుండు ధాత్రీతనయ తన్ను నవమానించి పలికిన తెఱంగు సెప్పిన. 351

ప్రతిపదార్థం: ఇట్లు= ఈరీతిగా; జటాయువున్+కూల్చి= జటాయువును సంహరించి; రావణుండు= రావణుడు; అధిక, రయంబునన్= మిక్కుటమైన వేగంతో; అరుగు+ఎడన్= వెడలుతున్నప్పుడు; జానకి= జనకుడికూతురు- సీత; తనకున్, దిక్కు= తనకు సాయం; ఎవ్వరున్= ఎవరును; లేమిన్+చేసి= లేకపోవటంచేత; నిరాశ+ఐ= ఆస లేనిది అయి; ఒక్క, శైలశృంగంబునందున్= ఒక పర్వతంయొక్క కొనభాగంలో; కొందఱు వానరులు= కొన్ని కోతులు; మెలంగుచున్నన్= సంచరిస్తూ ఉండటం; కని= చూచి; తనకట్టిన పుట్టంబు= తాను ధరించిన చీర; కొంగు+చించి= చివరిభాగం చింపి; భూషణంబులు= ఆభరణాలు; ముడిచి= కట్టకట్టి; తత్+ప్రదేశంబునన్= ఆ స్థలంలో; వైచెన్= పడవేసింది; పంక్తివదనుండును= పదితలలుకలవాడును- రావణుడును; లంకాపురంబునకున్= లంకాపట్టణానికి; చని= వెళ్లి; అందున్= (ఆలంకాపురంలో); అశోకవన మధ్యంబునన్= అశోకవృక్షాలతో నిండిన ఉద్యానవనంలో; ఆ సుమధ్యన్= అందమైన నడుము కలదానిని- సీతను; ఉనిచి= ఉంచి; తదీయరక్షణ+అర్థంబు= ఆమెనుకాపాడటం కొరకై; రాక్షసీ, నివహంబున్= ఆడురక్కసి గుంపులను; నియోగించెన్= ఏర్పాటు చేశాడు; ఇట= ఇక్కడ (ఈకథలో ఇచట అంటే దండకారణ్యంలో పర్ణశాలదరిని); రాఘవుండు= శ్రీరాముడు; మాయా, మృగంబు= మాయలేడిని; వధియించి= సంహరించి; మగుడన్+చనుదెంచువాఁడు= తిరిగి (ఆశ్రమానికి) వచ్చేవాడు; తనకున్+ఎదురుగాన్ వచ్చు= తనకు ఎదురుగా అరుగుదెంచే; లక్ష్మణున్+కని= లక్ష్మణుడిని చూచి; రాక్షస, గోచరంబు+అయిన= రక్కసులు నివసించేదైన; వనంబునన్= అడవిలో; జానకిన్= సీతను; ఒంటి+ఉనిచి= ఒంటరిగా విడిచిపెట్టి; వచ్చి= అరుగుదెంచి; తప్పు+చేసితి(వి)= దోషం చేశావు; అని పలుకుటయున్= అని (రాముడు) చెప్పటయు; సుమిత్రా, నందనుండు= సుమిత్రకొడుకు- లక్ష్మణుడు; ధాత్రీతనయ= భూదేవి కూతురు- సీత; తన్నున్= తనను (లక్ష్మణుడిని); అవమానించి= అగౌరవం చేసి; పలికిన తెఱంగు= మాటాడినతీరు; చెప్పినన్= వచించగా.

తాత్పర్యం: ఈవిధంగా జటాయువును సంహరించి రావణుడు మిక్కిలివేగంతో పోతూ ఉండగా, సీత తనకు ఇంక సాయం చేసేవారు ఎవరున్నూ లేరని నిరాశపడి, ఒక కొండశిఖరంపై కొంతమంది వానరులు విహరిస్తూ ఉండటం చూచి, ఆ శిఖరంమీద పడేటట్లుగా తన ఆభరణాలను చీరచెంగు చించి మూటకట్టి పడవేసింది. రావణుడు సీతను గైకొని లంకాపురానికి చేరి అందుగల అశోకవనంలో ఆమెను ఉంచాడు. ఆమెను సంరక్షించటానికై రాక్షసస్త్రీలను కొంతమందిని నియమించాడు. ఇట దండకారణ్యంలో శ్రీరాముడు మారీచుడిని సంహరించిన పిదప తమ పర్ణశాలకు వెళ్లుతున్నాడు. మార్గమధ్యంలో లక్ష్మణుడు ఎదురువచ్చాడు. అప్పుడు శ్రీరాముడు- 'రాక్షసులు నిండిఉండే దండకారణ్యంలో సీతను ఒంటరిగా విడిచిపెట్టి రావటం తప్పు సుమీ' అని హెచ్చరించాడు. లక్ష్మణుడు సీత తనను నిందించిన తీరు శ్రీరాముడికి చెప్పాడు. శ్రీరాముడి హృదయంలో ఆందోళన అధికమయింది.

మధురాక్కర

కనకమృగ మట్లు దను దవ్వుగాఁ ద్రిప్పి తెచ్చుటకు,
వనజముఖి నేకతమ శూన్యవనమునయం దునిచి
వెనుక ననుజుండు వచ్చిన విధమునకు, మదిలోన
ననఘుఁ డెంతయు వగచుచు నరిగె నాశ్రమమునకు. 352

ప్రతిపదార్థం: కనక, మృగము= బంగారులేడి; అట్లు= ఆరీతిగా; తనున్= తనను (శ్రీరాముడిని); దవ్వుగాన్= దూరంగా; త్రిప్పి= సంచరింపజేసి; తెచ్చుటకున్= తీసికొని రావటానికిన్నీ; వనజముఖిన్= పద్మంవంటి ముఖం కలదానిని- సీతను; ఏకతము+అ= ఒంటరిగా; శూన్యవనమునందున్= ఎవరున్నూ లేని (నరసంచారం లేని) అడవిలో; ఉనిచి= ఉంచి; వెనుకన్= (తాను వెళ్లిన మార్గం) వెంబడి; వచ్చిన= అరుదెంచిన; విధమునకున్= తీరుకు; మదిలోనన్= చిత్తంలో; అనఘుఁడు= పాపరహితుడు- శ్రీరాముడు; వగచుచున్= విచారిస్తూ; ఆశ్రమమునకున్= తాను నివసించే తోటవిడిదికి, పర్ణశాలకు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: బంగరులేడి తనను అడవిలో దవుదవ్వులకు కొనిపోయినందుకూ, పద్మంవంటిముఖంగల సీతను ఒంటరిగా నరసంచారం లేని ఆ అడవిలో విడిచిపెట్టి తన వద్దకు సోదరుడు లక్ష్మణుడు వచ్చినందుకూ అంతరంగంలో చింతిల్లుతూ పుణ్యాత్ముడైన శ్రీరాముడు తన ఆశ్రమానికి తిరిగి వచ్చాడు.

విశేషం: మధురాక్కర పాదంలో వరుసగా 1 సూర్యగణం 3 ఇంద్రగణాలు, 1 చంద్రగణం ఉంటాయి. నాల్గవ గణం మొదటి అక్షరం యతి. ప్రాస నియమం ఉన్నది.

వ. **అట్లు సని చేతనారహితం బైన శరీరంబునుంబోలె సీతావిహీనంబయి యున్న పర్ణగృహంబుం గనుంగొని రాఘవుండు మూర్ఛితుండై, లక్ష్మణ ప్రయత్నంబునఁ గొండొకవడికిఁ దెలివొందె; నంత నయ్యన్నయుం దమ్ముండును దత్ప్రదేశంబులయందు సుందరిం దడవుచుం జనువారు ముందట.** **353**

ప్రతిపదార్థం: అట్లు+చని= ఆ విధంగా నడచి; చేతనా, రహితంబు+ఐన= కదలిక మెదలిక లేనట్టి (అసువులు పాసిన); శరీరంబునున్+పోలెన్= దేహంవలె; సీతా విహీనంబు+అయి+ఉన్న= సీత లేనిది అయిఉన్న; పర్ణగృహంబున్= ఆకులతో నిర్మించిన ఇంటిని; కనుంగొని= చూచి; రాఘవుండు= రఘువంశంలో పుట్టినవాడైన రాముడు; మూర్ఛితుండు+ఐ= స్పృహ కోలుపోయినవాడు అయి; లక్ష్మణప్రయత్నంబునన్= లక్ష్మణుడు చేసిన కృషివలన; కొండొక వడికిన్= కొంతసేపటికి; తెలివి+ఒందెన్= తేరుకొన్నాడు; అంతన్= అటుమీద; ఆ+అన్నయున్, తమ్ముండును= ఆ అగ్రజుడును, లక్ష్మణుడును; తత్+ప్రదేశంబుల+అందున్= ఆయాచోటులలో; సుందరిన్= సౌందర్యవతిని- సీతను; తడవుచున్= వెదకుతూ; చనువారు= వెళ్ళేవారు; ముందటన్= ఎదుట.

తాత్పర్యం: రామలక్ష్మణులు ఆ విధంగా ఆందోళన చెందుతూ నడిచి సీత లేని పర్ణశాలను ప్రాణం లేని దేహంవలె నున్నదానిని చూచారు. రాముడు ఆ శూన్యపర్ణకుటీరాన్ని కాంచి మూర్ఛిల్లాడు. లక్ష్మణుడు శీతలోపచారాలు చేయగా కొంతతడవుకు శ్రీరాముడు తేరుకొన్నాడు. అంతట ఆ అన్నదమ్ములు ఇరువురును ఆయా ప్రదేశాలలో సీతాదేవిని వెదకుకొంటూ వెళ్ళుతున్నారు. ముందట....

విశేషం: అలం: ఉపమ.

తే. **కులిశపాతభంగుర మైన కులనగంబు । కరణిఁ బడియున్న గృధ్రంబుఁ గాంచి బుద్ధి**
నదియు రాక్షసమాయయౌ నని తలంచి । యేయ సమకట్టుటయు విహగేంద్రుఁ డెటిఁగి. **354**

ప్రతిపదార్థం: కులిశపాతభంగురము+ఐన= వజ్రం (దెబ్బ) పడటంచేత పగిలినది అయిన; కుల, నగంబు= కులపర్వతం; కరణిన్= వలె; పడి+ఉన్న= నేలపై కూలి ఉన్న; గృధ్రంబున్= గద్దను; కాంచి= చూచి; బుద్ధిన్= చిత్తంలో; అదియున్= (ఆ

గద్దయును); రాక్షసమాయ+ఔన్+అని= రక్కసుల మోసమే అని; తలంచి= భావించి; ఏయన్= బాణంతో కొట్టటానికి; సమకట్టుటయున్= పూనుకోగా; విహగ+ఇంద్రుఁడు= పక్షులలో శ్రేష్ఠుడు- జటాయువు; ఎఱిఁగి= తెలిసికొని.

తాత్పర్యం: వజ్రాయుధం యొక్క దెబ్బతో కుప్పకూలిన కులపర్వతంవలె నేలపై పడిఉన్న గొప్పగద్దను చూచి అదికూడా రక్కసులు కల్పించిన మోసంగా భావించి, రామలక్ష్మణులు బాణాలను ప్రయోగించటానికి ఉద్యుక్తులైనారు. అంతట ఆసంగతి గ్రహించి వారలతో ఆ జటాయువు ఇట్లా పలికాడు.

విశేషం: (1) అలం: ఉపమ (2) పురాణకథ : పూర్వకాలంలో పర్వతాలు రెక్కలు కలిగి విహరిస్తూ ఉండేవట. అవి ఎక్కడ వ్రాలితే అక్కడ జనపదాలు, పొలాలు, అడవులు నాశనమౌతూ ఉండటంవలన దేవేంద్రుడు తన వజ్రాయుధంతో సంధించి ఆ కొండల రెక్కలను ఖండించాడు.

క. 'ఓయయ్యలార! యేను జ। టాయు వనంబరఁగు పక్షి నరుణతనయుఁడన్
మీయయ్య దశరథక్షితి। నాయకునకుఁ బ్రియసఖుండ' నావుడు వారల్. 355

ప్రతిపదార్థం: ఓ+అయ్యలార!= ఓ ఆర్యులారా- ఓరామలక్ష్మణులారా!; ఏను= నేను; జటాయువు+అనన్+పరఁగు= జటాయువు అనే పేర పిలువబడే; పక్షిన్= పక్షిని; అరుణతనయుఁడన్= అరుణుడి పుత్రుడను; మీ+అయ్య= మీతండ్రి; దశరథ, క్షితి, నాయకునకున్= దశరథమహారాజుకు; ప్రియసఖుండన్= ఇష్టుడ నయిన మిత్రుడను; నావుడున్= అనవుడు, అని చెప్పగా; వారల్= వారు, శ్రీరామలక్ష్మణులు.

తాత్పర్యం: 'ఓ ఆర్యులారా! శ్రీరామలక్ష్మణులారా! నేను జటాయువు అనే పక్షిని. అరుణుడి కుమారుడను. మీ తండ్రి దశరథమహారాజుకు మిత్రుడను' అని చెప్పాడు. అంతట శ్రీరామలక్ష్మణులు.

విశేషం: అరుణుడు= అనూరుడు- సూర్యుడి సారథి, గరుత్మంతుడి అన్న.

వ. డాయ నరుగుదెంచుటయు నతండు వారితో రావణుండు వైదేహిం గొనిపోవుటయుఁ, దదర్థంబై తాను నద్దనుజుం దొడరి పెనంగుటయుం జెప్పి, యావల రావణుం డరిగినదెస నెఱింగించి విగతజీవుం డయ్యె; నయ్యిరువురు నప్పులుఁగుఱేనికి నతిగౌరవంబున నగ్నిసంస్కారాదికరణీయంబులు నిజజనక నిర్విశేషంబుగా నాచరించి దక్షిణాభిముఖులై చని చని. 356

ప్రతిపదార్థం: డాయన్+అరుగుదెంచుటయున్= సమీపంగా రావటమున్నూ; అతండు= అతడు (ఆ జటాయువు); వారితోన్= రామలక్ష్మణులతో; రావణుండు; వైదేహిన్= సీతను (విదేహరాజు కూతురును); కొనిపోవుటయున్= తీసికొని వెళ్ళటమున్నూ; తత్+అర్థంబు+ఐ= అందుకొరకై; తాను= తాను (జటాయువు); ఆ+దనుజున్= ఆ రాక్షసుడిని (రావణుడిని); తొడరి= పూని; పెనంగుటయున్= పోరాడటమున్నూ; చెప్పి= వచించి; ఆవలన్= ఆ పిదప; రావణుండు; అరిగిన= వెళ్ళిన; దెసన్= దిక్కును; ఎఱింగించి= తెలిపి; వి,గత, జీవుండు+అయ్యెన్= పోయిన జీవం కలవాడు అయ్యాడు, మరణించాడు; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరు- రామలక్ష్మణులు; ఆ+పులుగుఱేనికిన్= ఆ పక్షిరాజుకు (జటాయువుకు); అతి, గౌరవంబునన్= గొప్పభక్తితో; అగ్నిసంస్కార+ఆది, కరణీయంబులు= దహనం చేయటం మున్నగు (దినవార) క్రియలు: నిజ, జనక, నిర్విశేషంబుగాన్= తమయొక్క తండ్రితో సమానంగా; ఆచరించి= చేసి; దక్షిణ+అభిముఖులు+ఐ= దక్షిణదిక్కుగా మొగాలు కలవారై; చని, చని= వెళ్ళి వెళ్ళి.

తాత్పర్యం: రామలక్ష్మణులు జటాయువును సమీపించి నిలిచారు. అంతట ఆ పక్షిరాజు వారితో రావణుడు సీతను కొనిపోవటాన్నీ, తాను ఆ అత్యాచారాన్ని ఎదుర్కొని పోరాడి రెక్కలు కోల్పోయి నేలగూలటాన్నీ వివరించి చెప్పి, మరణించాడు. అంతట రామలక్ష్మణులు ఇరువురు తమ తండ్రితో సమానంగా భావించి జటాయువుకు అగ్నిసంస్కారాలు చేసి అంత్యక్రియలు నిర్వర్తించారు. జటాయువువలన రావణుడు దక్షిణదిక్కుకు పోయాడని తెలిసికొని తాముకూడ దక్షిణదిశగా పయనంచేయసాగారు.

ఉ. **ఉరమునయందుఁ గన్నులుఁ బృథూదరదేశమునందు నోరుఁ బ్ర**
స్ఫురితభుజద్వయంబుఁ గులభూమిధరోన్నతభావముం గరం
బరుదుగ నుగ్రమైన వికృతాకృతితోడ నశేషసత్త్వఘ
స్మరుఁ డగుచున్నవానిఁ బటుసత్త్వుఁ గబంధునిఁ గాంచి రచ్చటన్. **357**

ప్రతిపదార్థం: అచ్చటన్= ఆ ప్రదేశంలో; ఉరమునయందున్= వక్షంలో; కన్నులున్; పృథు+ఉదరదేశమునందున్= విస్తార మైన కడుపు ఉన్న చోటులో; నోరున్= నోరున్నూ; ప్రస్ఫురిత, భుజ, ద్వయంబున్= బాగా విస్తరించిన రెండు బాహువులున్నూ; కుల, భూమిధర+ఉన్నతభావమున్= కులపర్వతంవంటి ఔన్నత్యాన్నీ; కరంబు= మిక్కిలి; ఉగ్రము+ఐన= భయంకర మైన; వికృత+ఆకృతితోడన్= వికారమయిన రూపంతో; అశేష సత్త్వ ఘస్మరుఁడు= పెక్కుజంతువులను చంపి తినేవాడు; అగుచున్నవానిన్= అయినవాడిని; పటుసత్త్వున్= మిక్కుటమైన బలం కలవాడిని; కబంధునిన్= కబంధుడు అనేవాడిని; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: రామలక్ష్మణులు, అచట వికృతమైన రూపం గల కబంధుడిని చూచారు. ఆ కబంధుడికి కన్నులు వక్షంలో ఉన్నవి. పెద్దకడుపులో నోరు ఉన్నది. మిక్కిలి పొడవైన బాహువులతో కులపర్వతంవలె ఎత్తైన, మిగుల భీతిని గొల్పే వికార స్వరూపంతో ఉన్నాడు. అమిత బలంగల ఆ కబంధుడు పెక్కుజంతువులను చంపి పొట్టనింపుకొనే గొప్ప తిండిపోతు.

ఆ. **అక్కబంధుఁ డామిషార్థియై లక్ష్మణుఁ । బట్టికొనియె బాహుబల మెలర్ప;**
నతఁడు గడువిషణ్ణుఁడై 'యన్న! ననుఁ జూడు' । మనుచు రాముఁ జూచి యనియె మఱియు. **358**

ప్రతిపదార్థం: బాహుబలము+ఎలర్పన్= చేతులశక్తి శోభిల్లేటట్లుగా; ఆ+కబంధుఁడు; ఆమిష+అర్థి+ఐ= మాంసాన్ని కోరినవాడై; లక్ష్మణున్+పట్టికొనియెన్= లక్ష్మణుడిని పట్టుకొన్నాడు; అతఁడు= లక్ష్మణుడు; కడున్= మిక్కిలి; విషణ్ణుఁడు+ఐ= విచారంతో కూడినవాడై; అన్న!= అగ్రజా, శ్రీరామా!; ననున్= నన్ను; చూడుము= అరయుము; అనుచున్= అంటూ; రామున్= రాముడిని; చూచి; మఱియున్= రెండియు; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ కబంధుఁడు మాంసాహారం కొరకై అన్వేషిస్తూ యాదృచ్ఛికంగా లక్ష్మణుడిని పట్టుకొన్నాడు. లక్ష్మణుడు కబంధుడి బాహుబంధాన్ని విడిపించుకొనలేకపోయాడు. కబంధుడి బలం అట్టిది! అంత లక్ష్మణుడు విషాదంతో నిండిన చిత్తం కలవాడై 'అన్నా! శ్రీరామా! నన్ను చూడుము. నేను ఎట్టి దుఃస్థితిలో చిక్కానో!' అని చెప్పి, ఇంకా ఇట్లా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరాముఁడు కబంధుఁ డను రాక్షసుం జంపుట (సం. 3-263-27)

సీ. **'మహనీయసామ్రాజ్యమహిమ వాయుటయును, । బితృమరణంబు, నాభీలవిపిన**
భూములఁ గడుదుఃఖమునఁ జరించుటయు, వై । దేహిఁ గోల్పడి వగఁ దిరుగుటయును,
దుదిఁ బోయి యే నిట్టు దొడరి యీ దానవు । వాతఁ జిక్కుటయును వగవ నీకుఁ
బైపయిఁ బెక్కులాపద లయ్యె నక్కట! । ధరణీశ! నీవు నా ధరణిసుతయుఁ

ఆ. **గలసి పూజ్యరాజ్యగౌరవంబున వెలుఁ । గంగ నెలమిఁ జూడఁ గాన నైతి**
నేను దలఁప నెట్టి హీనభాగ్యుండనో!' । యనుచు ననుజుఁ డార్తి నడలుటయును. **359**

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= రాజా, శ్రీరామా!; మహనీయసామ్రాజ్యమహిమ= గొప్పదైనది, విస్తరించినది అయిన రాజ్యం యొక్క గౌరవం; పాయుటయును= వదలిపోవటమున్నూ; పితృ, మరణంబున్= తండ్రి చనిపోవటమున్నూ; ఆభీల, విపిన, భూములన్= భయంకరమైన అడవి ప్రదేశాలలో; కడున్= మిక్కుటమైన; దుఃఖమునన్= ఆవేదనతో; చరించుటయున్= తిరుగుటయున్నూ; వైదేహిన్= సీతను; కోల్పడి= పోగొట్టుకొని; వగన్= దుఃఖంతో; తిరుగుటయును= సంచరించటమున్నూ; తుదిన్+పోయి= చిట్టచివరకు; ఏన్= నేను; ఇట్టు= ఈరీతిగా; తొడరి= కడగి; ఈదానవువాతన్= ఈరాక్షసునినోటికి; చిక్కుటయును= వశం కావటమున్నూ; వగవన్= ఆలోచించగా; నీకున్= ఓరామా! నీకు; పై+పయిన్= ఒకదానిపై మరొకటి; పెక్కులు= అనేకాలైన; ఆపదలు+అయ్యెన్= కష్టాలు సంప్రాప్తాలయ్యాయి; అక్కట= అయ్యో! ఎంత దురవస్థ వాటిల్లింది; నీవున్= నీవును; ఆ ధరణిసుతయున్= భూమికి కూతురు అయిన సీతాదేవియున్నూ; కలసి= కూడి; పూజ్య, రాజ్య, గౌరవంబునన్= ఆరాధించదగిన రాజ్యమర్యాదలతో; వెలుగంగన్= ప్రకాశించగా; ఎలమిన్= సంతోషంతో; చూడన్+కానన్+ఐతిన్= దర్శింపజాలకపోయాను; నేను= నేను; తలఁపన్= యోచించగా; ఎట్టి= ఎటువంటి; హీనభాగ్యుండన్+ఓ= దురదృష్టవంతుడనో కదా; అనుచున్= అని అంటూ; అనుజుఁడు= తమ్ముడు (లక్ష్మణుడు); ఆర్తిన్= దుఃఖంతో; అడలుటయును= కలతచెందినవాడు కాగా.

తాత్పర్యం: 'అగ్రజా, శ్రీరామా! నీకు ఆపదలపై ఆపదలు దాపురించాయి. భోగభాగ్యాలతో తులతూగే రాజ్యం తొలగిపోయింది. తండ్రిగారు మరణించారు. భయంకరమైన అడవులలో తిరుగాడవలసి వచ్చింది. చిట్టచివరకు దురదృష్టదశకు పరాకాష్ఠగా- నేను ఈ రాక్షసుడికి చిక్కాను. ఇక ఈతడు నన్ను తన పొట్టనపెట్టుకొంటాడు. అయ్యో! శ్రీరామచంద్రా! నీవును నీదేవివియైన సీతాదేవియు పట్టాభిషేకం చేసికొని, రాజలాంఛనాలతో శోభిల్లే సుందరదృశ్యాన్ని కనులపండువుగా కాంచలేకపోయానుగదా! ఇక నావంటి దురదృష్టవంతుడు ఎవడైనా ఉన్నాడా?' అంటూ లక్ష్మణుడు విచారంతో కలతచెందాడు.

తే. **విగతసంభ్రముఁ డై రామవిభుఁడు గడఁగి । 'యన్న! లక్ష్మణ! యోడకు మన్న, యేను**
గలుగ నీ కేల యాపద గలుగనేర్చు? ననుచు గ్రక్కున నిశితమహాసి వెఱికి. **360**

ప్రతిపదార్థం: రామవిభుఁడు= రామరాజు; విగతసంభ్రముఁడు+ఐ= పోయిన తత్తరపాటు కలవాడై, ధైర్యం కలవాడై; కడఁగి= పూని; అన్న! లక్ష్మణ!= ప్రేమపాత్రుడ వైన లక్ష్మణా!; ఓడకుము+అన్న!= భయపడవద్దయ్యా!; ఏను= నేను; కలుగన్= ఉండగా; నీకున్= నీకు; ఆపద= కీడు; ఏల కలుగనేర్చున్= ఎందుకు ఏర్పడుతుంది; అనుచున్= అని అంటూ; గ్రక్కునన్= వేగంగా; నిశిత, మహా+అసి= వాడి అయిన గొప్పకత్తిని; వెఱికి= (ఒరనుండి) బయటకు లాగి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శ్రీరాముడు ఎట్టి తత్తరపాటు చెందకుండా ధీరుడై నిలిచి 'ప్రియమైన తమ్ముడా! లక్ష్మణా! నేను ఉండగా నీకు ఎట్టి కీడు వాటిల్లదు' అంటూ ఒరనుండి గొప్పదైన తన కత్తిని తీశాడు.

వ. ఆ రక్కసు డాచేయిఁ దునియ వ్రేసిన లబ్ధమోక్షుండయి లక్ష్మణుండు ప్రకటసైంహికేయ దంష్ట్రాయంత్ర విముక్తుండయిన తిగ్మభానుండునుంబోలెఁ బ్రదీప్తుండయి తీక్ష్ణకౌక్షేయకంబునఁ దదీయ దక్షిణబాహు ఖండనంబు సేసి పార్శ్వద్వయంబు భేదించిన నాక్షణంబ కబంధుఁడు దివ్యరూపధరుం డగుటయుం గని రాఘవుండు విస్మితుండై. 361

ప్రతిపదార్థం: ఆ, రక్కసు, డా, చేయిన్= ఆ రాక్షసుడియొక్క ఎడమచేతిని; తునియన్‌వ్రేసినన్= ఖండించగా; లబ్ధమోక్షుండు+అయి= పొందిన విముక్తి కలవాడు అయి (విముక్తి పొందినవాడై); లక్ష్మణుండు= లక్ష్మణుడు; ప్రకట, సైంహికేయదంష్ట్రా, యంత్ర, విముక్తుండు+అయిన= తేటతెల్లంగా కనుపించిన రాహువుయొక్క కోరలు అనే మరనుండి విడిచిపెట్టబడిన; తిగ్మ, భానుండునున్+పోలెన్= తీక్ష్ణమైన కిరణాలు కల సూర్యుడివలె; ప్రదీప్తుండు+అయి= వెలుగొంది; తీక్ష్ణ+కౌక్షేయకంబునన్= వాడి అయిన కత్తిచేత; తదీయ, దక్షిణ, బాహు, ఖండనంబు+చేసి= ఆతడియొక్క (ఆ కబంధుడియొక్క) కుడిచేతిని నరికి; పార్శ్వద్వయంబు= ప్రక్కలజంటను (కుడిప్రక్కగా, ఎడమప్రక్కగా ఉన్న ఉదరభాగాన్ని - అనగా చంకల క్రింది భాగాలను); భేదించినన్= చీల్చగా; ఆ, క్షణంబు+అ= ఆత్రుటిలోనే (వెంటనే); కబంధుఁడు; దివ్య, రూప, ధరుండు+అగుటయున్= దేవతలకు సంబంధించిన ఆకారం కలవాడు కావటం; కని= చూచి; రాఘవుండు= శ్రీరాముడు; విస్మితుండు+ఐ= అచ్చెరువును పొందినవాడై.

తాత్పర్యం: శ్రీరాముడు కబంధుడి ఎడమచేతిని తనకత్తితో ఖండించాడు. వెనువెంటనే కబంధుడిబారినుండి విముక్తుడైన లక్ష్మణుడు రాహువుయొక్క కోరలనుండి విడివడిన సూర్యుడివలె ప్రకాశిస్తూ వాడికత్తిని తీసి కబంధుడి కుడిచేతినికూడ ఖండించి, వాడిపొట్టను ఇరుప్రక్కల చీల్చాడు. ఆక్షణంలోనే ఆరాక్షసుడు దివ్యరూపం ధరించి నిల్చాడు. శ్రీరాముడు ఆశ్చర్యపోయాడు.

విశేషం: కౌక్షేయకం= కుక్షికిదగ్గరగా ధరించబడే కత్తి. సంశోధితప్రతిలో గౌక్షేయకంఅని ఉన్నది. అది అచ్చుపొరపాటు. పూర్వకాలంలో వీరులు తనపొట్టకు కత్తిని ఆత్మరక్షణకై ఉపయోగించేనిమిత్తం కట్టుకొంటూ ఉండేవారు.

క. 'ఈవనమునందు రాక్షస । భావంబున నున్న నీకుఁ బ్రకటితదివ్య
త్వావాప్తి యైన కారణ । మేవిధ?' మనుటయును నాతఁ డిట్లని చెప్పెన్. 362

ప్రతిపదార్థం: ఈవనమునందున్= ఈ అరణ్యంలో; రాక్షసభావంబునన్= రక్కసివై; ఉన్న= ఉన్నటువంటి; నీకున్= నీకు; ప్రకటిత దివ్యత్వ+అవాప్తి= తేటతెల్ల మైన దేవతాస్వరూపం పొందటానికి; ఐన, కారణము= అయిన హేతువు; ఏవిధము= ఏరీతిగా ఏర్పడింది అనుటయునున్= (అని రాముడు) ప్రశ్నించటమున్నూ!; ఆతఁడు= అతడు (దివ్యరూపం తాల్చిన కబంధుడు); ఇట్లు+అని= ఈరీతిగా; చెప్పెన్= వచించాడు.

తాత్పర్యం: 'ఓ దివ్యపురుషుడా! నీవు ఇంతవరకు ఈ అడవిలో రాక్షసరూపంలో రాక్షసజీవితాన్ని గడపి ఉన్నావుకదా! ఇప్పుడు నీకు ఈ దివ్యరూపం ఏవిధంగా సంప్రాప్తించింది?' అని శ్రీరాముడు ప్రశ్నించాడు. అంతట దివ్యరూపం తాల్చి నిల్చిన భూతపూర్వ కబంధుడు ఈ రీతిగా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఏను విశ్వావసుం డను గంధర్వుండ; బ్రహ్మశాపంబునం జేసి రాక్షసత్వంబు నొంది మీవలన శాపమోక్షంబు వడసితి; రావణుం డను రక్కసుండు జానకిం గొనిపోయి, లంకానగరంబున నునిచినవాఁడు; మీకు హితోపదేశంబు సేసెద; నిట పోవంబోవఁ బంపాభిధానం బయిన సరోవరంబు గలదు; దాని యావల ఋశ్యమూకం బనుశైలంబునందు వాలిసహోదరుండు సుగ్రీవుం డను వానరుండు సచివ చతుష్టయ సహితుండై యుండు; నతనితోడ సఖ్యంబు సేయుము; దానం జేసి నీకుఁ గార్యసిద్ధి యగు' నని పలికి గంధర్వుండు వారి వీడ్కొని నిజేచ్ఛం జనియెఁ; దదనంతరంబ యట చని చని. 363

ప్రతిపదార్థం: ఏను= నేను; విశ్వావసుండు+అను= విశ్వావసుడు అనే పేరుకల; గంధర్వుండన్= గంధర్వుడను; బ్రహ్మశాపంబునన్+చేసి= బ్రహ్మదేవుడియొక్క శాపంవలన; రాక్షసత్వంబున్= రాక్షసభావాన్ని; ఒంది= పొంది; మీవలనన్= (ఓ రామా! ఓలక్ష్మణా!) మీవలన; శాపమోక్షంబున్= శాపంనుండి విడుదల; పడసితిన్= పొందాను; రావణుండు+అను= రావణుడు అనేపేరు కల; రక్కసుండు= రాక్షసుడు; జానకిన్= సీతను; కొనిపోయి= అపహరించి; లంకానగరంబునన్= లంక అనే పట్టణంలో; ఉనిచినవాఁడు= ఉంచాడు; మీకున్= (రామలక్ష్మణులైన) మీకు; హిత+ఉపదేశంబు+చేసెదన్= మేలు కలిగించే మాటలను చెప్తుతాను; ఇట, పోవన్+పోవన్= ఇక్కడ నుండి వెళ్లగా వెళ్లగా, చాలాదూరం పయనించగా; పంపా+ అభిదానంబు+అయిన= పంప అనే పేరు కలిగిన; సరోవరంబు= సరస్సు; కలదు= ఉన్నది; దాని+ఆవలన్= ఆ పంపాసరోవరం దాటినపిదప; ఋశ్యమూకంబు+అను, శైలంబునందున్= ఋశ్యమూకం అనేపేరు గల కొండమీద; వాలిసహోదరుండు= వాలియొక్క తమ్ముడు; సుగ్రీవుండు+అను= సుగ్రీవుడు అనే పేరు గల; వానరుండు= కోతి; సచివచతుష్టయ, సహితుండు+ఐ= మంత్రులు నలుగురితో కూడినవాడు అయి; ఉండున్= నివసిస్తూ ఉంటాడు; అతనితోడన్= ఆ సుగ్రీవుడితో; సఖ్యంబు+ చేయుము= మైత్రి నెరపుము; దానన్+చేసి= దానివలన; నీకున్= నీకు; కార్యసిద్ధి+అగున్= కార్యం నెరవేరగలదు; అని పలికి= అని వచించి; వారిన్= వారిని (రామలక్ష్మణులను); వీడ్కొని= మర్యాదపూర్వకంగా సెలవు గైకొని; గంధర్వుండు= గంధర్వుడు; నిజ+ఇచ్ఛన్= తనయిచ్ఛ వచ్చిన చొప్పున; చనియెన్= వెళ్ళాడు; తత్+అనంతరంబు+అ= అటు పిమ్మట; చని చని= వెడలివెడలి (చాలదూరం ప్రయాణం చేసి).

తాత్పర్యం: 'నేను విశ్వావసుడు అనేపేరు గల గంధర్వుడను. బ్రహ్మదేవుడిశాపంవలన నాకు రాక్షసజన్మ వచ్చింది. నేడు మీమూలంగా నాకు శాపవిమోచనం కలిగింది. రావణుడు అనే రాక్షసుడు సీతను అపహరించి లంకాపట్టణానికి కొనిపోయాడు. మీమేలు కోరి నేను చెప్పే వాక్యాలు వినండి. ఇటనుండి బహుదూరం పయనించిన పిదప 'పంప' అనే పేరు గల సరోవరం చేరుతారు. ఆ సరస్సుకు కొంచెం దూరంలో ఋశ్యమూకం అనేపేరు గల పర్వతం ఉన్నది. ఆ పర్వతంమీద వాలితమ్ముడు సుగ్రీవుడు అనే వానరుడు నలుగురు మంత్రులతో కలిసి నివసిస్తున్నాడు. మీరు ఆ సుగ్రీవుడితో స్నేహం చేయండి. దానివలన మీపని నెరవేరగలదు' అని చెప్పి ఆ గంధర్వుడు రామలక్ష్మణులవద్ద మర్యాదగా సెలవుతీసికొని ఇచ్ఛవచ్చినచోటికి వెళ్ళాడు. పిమ్మట రామలక్ష్మణులు బహుదూరం పయనించి.

సీ. కమనీయకమలినీకహ్లారదళకేస । రాన్వితజలముల నర్ఘ్యవిధియుఁ,
దరళతరంగహస్తములఁ బాద్యంబు, ను । న్మద చక్రసారసమధుపహంస
రుతులఁ బ్రియోక్తులు, రుచిరవానీర ని । వేశనచ్ఛాయల విశ్రమంబు
మందసంచారితమారుతంబుల నురు । తాపనోదనమును దగిలి యెపుడు

ఆ. నాచరించుచును సమంచితాతిథి జన । సేవనమునఁ దనదుజీవనంబు
ఫలము నొంద నొప్పు పంపాసరోవరం । బెదురఁ గాంచి రన్నరేంద్రసుతులు. 364

ప్రతిపదార్థం: ఆ+నర+ఇంద్ర, సుతులు= ఆ రాజపుత్రులు (రామలక్ష్మణులు); కమనీయ, కమలినీ, కహ్లార, దళ, కేసర+అన్విత, జలములన్= మనోహరాలైన తామరతంపరలతో, ఇంచుక తెలుపు ఇంచుక ఎఱుపు రంగును గల సౌగంధికపుష్పాలయొక్క రేకులలోని కింజల్కాలతో కూడిననీళ్లతో; అర్ఘ్యవిధియున్= పూజాసత్కారానికి ఇచ్చే నీరును; తరళ, తరంగహస్తములన్= మెరుస్తున్న కెరటాలు అనేచేతులతో; పాద్యంబున్= పాదాలు కడుగుకొనటానికై స్వాగతపూర్వకంగా ఇచ్చే నీరును; ఉన్మద, చక్ర, సారస, మధుప, హంస, రుతులన్= బాగా మత్తిల్లిన చక్రవాకముల యొక్కయు, బెగ్గురుపక్షుల యొక్కయు, తుమ్మెదలయొక్కయు, అంచలయొక్కయు ధ్వనులచేత; ప్రియోక్తులు= ప్రియ+ఉక్తులు= (యోగక్షేమాల నడిగే) మంచిమాటలును; రుచిర, వానీర, నివేశన+ఛాయలన్= ప్రకాశించే నీటిప్రబ్బలిచెట్లు సమకూర్చే విడిదిఇండ్లనీడలలో; విశ్రమంబు= విశ్రాంతి; మంద, సంచారితమారుతంబులన్= మెలమెల్లగా వీచే గాలులచేత; ఉరు, తాపనోదనమును= మిక్కుటమైన ఎండను తొలగించుటయును; తగిలి= పూని; ఎపుడున్= ఎల్లప్పుడును; ఆచరించుచును= చేస్తూ; సమంచిత+అతిథి, జనసేవనమునన్= ఒప్పిద మయ్యేటట్లుగా అతిథిజనులకు పరిచర్యచేయటంలో; తనదు= తనయొక్క; జీవనంబు=(1) బ్రదుకు, (2)జలం; ఫలమున్+ఒందన్+ఒప్పు= ఫలించేటట్లుగా శోభిల్లు; పంపాసరోవరంబు= పంప అనే పేరు గల సరస్సును; ఎదురన్= తమముందర; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: రాజపుత్రులైన ఆ రామలక్ష్మణులు తమకట్టెదురుగా ఉన్న పంపాసరోవరాన్ని చూచారు. ఆ పంపాసరోవరం సతతం అతిథి సత్కారం చేస్తూ తనజీవనం ధన్యమయ్యేటట్లు చేసికొంటున్నట్లు ఒప్పుతున్నది. పంపాసరస్సు ఎల్లప్పుడూ అతిథులకు అర్ఘ్యం సమర్పిస్తూ ఉన్నది. ఆ అర్ఘ్యజలం మనోహరా లైన తామరలచేతను, ఇంచుక తెలుపు ఇంచుక ఎఱుపురంగు గల రేకులతో శోభిల్లే సౌగంధికపుష్పాల కింజల్కాలతో పుప్పొడులతో పరిమళిస్తూ ఉన్నది. ఇక, మెరసే కెరటాలు అనే చేతులతో అతిథులకు కాళ్ళుకడిగేనీటిని సమర్పిస్తూ ఉన్నది. అలాగే చక్రవాకములు, హంసలు మున్నగు జలపక్షుల ధ్వనులనే ప్రియోక్తులతో ఆదరిస్తూ ఉన్నది. తీరాలలోని పొదరిండ్ల నీడలనే విశ్రమస్థలాలను నిర్దేశిస్తున్నది. మందమారుతాలచే తాపశ్రమను తొలగిస్తూ ఉన్నది. ఈ రీతిగా ఈ అతిథిసేవయే తనజీవనానికి ధన్యత కలిగించేటట్లు భావించేదిగా పంపాసరోవరం వారికి గోచరించింది!

విశేషం: (1) అతిథిసేవాపరాయణత్వమే ఉత్తమసంస్కృతికి నికషాయమానం. 'అతిథిదేవోభవ'- సనాతన భారతీయసంప్రదాయాన్ని సూచించే ఉపనిషదుక్తి. (2) అలం: సంపూర్ణ రూపకం. పంపాసరోవరానికి ఆతిథేయునకు ఇట అభేదాధ్యవసాయం హృదయంగమంగా వర్ణించబడింది. (3) అలం: శ్లేష, జీవనం అనగా అర్థం బ్రదుకు. అర్థాంతరం నీరు. ఆతిథేయునిపట్ల బ్రదుకు, పంపాసరోవరంపట్ల నీరు అన్వర్థం. (4) ఈ సీసపద్యం ప్రబంధపరమేశ్వరుడైన ఎఱ్ఱనకు గల వర్ణనాభినివేశానికి ఉదాహరణం.

వ. ఆ సరోవరతీరంబునం గౌసల్యానందనుండు తత్తద్విషయవిశేషోల్లాసంబులవలనం గ్రొత్తయై చిత్తజానలంబు దరికొని చేతోవృత్తంబు నెరియింపం దొడంగినఁ దాల్మి దొఱంగి జానకిం బేర్కొని యాక్రందనవచనవివశుం డగుటయు, నతనికి లక్ష్మణుం డి ట్లనియె. 365

ప్రతిపదార్థం: ఆ, సరోవర, తీరంబునన్= ఆ (పంపా)సరస్సుయొక్క ఒడ్డునందు; కౌసల్యానందనుండు= కౌసల్యకొడుకు-శ్రీరాముడు; తత్+తత్+విషయ, విశేష+ఉల్లాసంబులవలనన్= ఆయా ఇంద్రియార్థములు విశేషమైన వికాసమును పొందినవగుట

వలన; క్రొత్త+ఐ= వినూతన మైనట్టిదై; చిత్తజ+అనలంబు= మన్మథుడికి సంబంధించిన అగ్ని- కామోద్రేకం; దరికొని= సంక్రమించి; చేతస్+వృత్తంబున్= మానసికవ్యాపారాన్ని; ఎరియింపన్+తొడంగినన్= కలత చెందింప సాగగా; తాల్మి= ఓర్పు; తొఱంగి= వీడి; జానకిన్+పేర్కొని= సీతను స్మరించి బిగ్గరగా పలవించి; ఆక్రందన, వచన, వివశుండు+అగుటయున్= ఏడుస్తూ వశంతప్పినవాడు కాగా; అతనికిన్= రాముడికి; లక్ష్మణుండు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా వచించాడు.

తాత్పర్యం: ఆ పంపాసరోవర తీరంలో ఉద్దీపనవిభావా లైన ఆయా మనోహరపరిసరాలను చూచిన శ్రీరాముడు మన్మథభావవివశుడై సీతాదేవిని స్మరిస్తూ బిగ్గరగా ఎలుగెత్తి ఆమెను పేర్కొంటూ ఆక్రోశింపసాగాడు. అంతట లక్ష్మణుడు రాముడితో ఇట్లా పలికాడు.

ఉ. 'పురుషవరేణ్య! యిట్లు మిముబోఁటులకుం జనునయ్య? యాపదల్
పొరసినచోఁ గలంగుట; ప్రభుత్వ మెలర్పఁగఁ దాల్మి యూఁది దు
స్తరతరమానసవ్యథలు దల్గుము; సంభృతపౌరుషుండ వై
యరయుము దేవి యున్నయెడ యారసి కార్యము దీర్పు నేర్పునన్. 366

ప్రతిపదార్థం: పురుష, వరేణ్య!= పురుషులలో శ్రేష్ఠుడవైనవాడా- శ్రీరామా!; ఆపదల్+పొరసినచోన్= ఇడుములు తారసిల్లినపుడు; కలంగుట= కలతచెందటం; మిము బోఁటులకున్= మీవంటివారికి (మీవంటి మహానుభావులకు); ఇట్లు= ఈ రీతిగా; చనున్+అయ్యా= తగునా?; ప్రభుత్వము+ఎలర్పఁగన్= పరిపాలన అతిశయించగా, అనగా నిగ్రహం శోభిల్లేటట్లుగా; తాల్మి+ ఊఁది= ఓర్పు వహించి; దుస్తర, తర, మానసవ్యథలు= దాటటానికి మిక్కిలి కష్టమైన మనస్సులోని బాధలు; తల్గుము= (తలుగుము)= వదలిపెట్టుము; సంభృత, పౌరుషుండవు+ఐ= పౌరుషంగలవాడవు అయి; దేవి+ఉన్న+ఎడ= (సీతా)దేవి ఉన్నచోటు; అరయుము= కనుగొనుము; ఆరసి= కనుగొని; నేర్పునన్= సామర్థ్యంతో; కార్యము+తీర్పుము= పనిని నెరవేర్చుము.

తాత్పర్యం: పురుషులలో శ్రేష్ఠుడవైన శ్రీరామా! ఇక్కట్టులు దాపురించినపుడు మీవంటి మహానుభావులు కలతచెందరాదు. ఓర్పు వహించి నిగ్రహంతో మనస్సులోని వెతలను పారద్రోలాలి. అదే పౌరుషం అనిపించుకొంటుంది. సీతాదేవి ఉన్నచోటు తెలిసికొనుము. తెలిసికొనినపిమ్మట నేర్పుతో కర్తవ్యం నెరవేర్చుము.

ఆ. అధిప! శిష్యుఁడను సహాయుండు భృత్యుండ । నైన యేను గల్గ నాత్మ నీకు
నేల వగవ?' నని మహీపతిచిత్తంబు । నలఁత డిందుపఱిచె నవరజుండు. 367

ప్రతిపదార్థం: అధిప!= ఓరాజా, శ్రీరామా!; శిష్యుఁడను= నీవు చెప్పిన చొప్పున నడచుకొంటూ నీకడ జ్ఞానం, శీలం నేర్చుకొనటానికి చేరినవాడిని; సహాయుండన్= నీకు తోడుపడే వాడిని; భృత్యుండన్= సేవకుడను; ఐన= ఐనట్టి; యేను= ఏను; కల్గన్= ఉండగా; నీకున్= నీకు; ఆత్మన్= మనస్సులోపల; వగవన్+ఏల?= విచారించటం ఎందుకు?; అని= అని చెప్పి; మహీపతి చిత్తంబు= రాజుయొక్క అనగా శ్రీరాముడియొక్క మనస్సులోని; అలఁత= వ్యాకులతను; అవరజుండు= తమ్ముడు- లక్ష్మణుడు; డిందుపఱిచెన్= తగ్గించాడు.

తాత్పర్యం: ఓరాజా! శ్రీరామా! నేను నీకు శిష్యుడిని, భక్తితో ఆరాధించేవాడిని, తోడుపడేవాడిని, పరిచారకుడను. నేను నీప్రక్కన ఉండగా మనస్సులో నీవు ఎందుకు విచారపడాలి?' అని ఊరడించి తమ్ముడైన లక్ష్మణుడు శ్రీరాముడి మనస్సులోని కలవరాన్ని ఉపశమింపజేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. తదనంతరంబ యయ్యిరువురుం బంపాసరోవరంబునం గృతస్నాను లయి దేవపితృతర్పణంబులు సేసి చని ముందట నతిబహుళబలాహకవ్యూహసన్నాహసమున్నతంబు లైన యభంగోత్తుంగ శృంగసముదయంబుల నఖిలగగన క్రోడపీడనంబు సేయుచున్న దాని ఋశ్యమూకశైలంబుఁ జేరి తదుపకంఠప్రదేశంబున విశ్రమించి యున్నంత. 368

ప్రతిపదార్థం: తత్+అనంతరంబు+అ= అటుపిమ్మట; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరును (రామలక్ష్మణులు); పంపాసరోవరంబునన్= పంప అనే సరస్సులో; కృతస్నానులు+అయి= చేయబడిన స్నానం కలవారై (స్నానం చేసినవారై); దేవపితృతర్పణంబులు+చేసి= దేవతలకును, చనిపోయిన తండ్రితాతలు మున్నగువారలు తరించటానికై ఇచ్చే నీళ్లను వదలటం ద్వారా శ్రాద్ధక్రియలు నిర్వహించి; చని= పయనం కొనసాగించి; ముందటన్= ఎదురుగా; అతి, బహుళ బలాహకవ్యూహసన్నాహసమున్నతంబులు+ఐన= తరచైన పెక్కు మేఘాల సముదాయాల చేరికగలవై, మిక్కిలి ఎత్తై ఉన్న; అభంగ+ఉత్తుంగ, శృంగసముదయంబులన్= వంకరటింకరలు లేకుండా నిటారుగా ఉన్న శిఖరాలయొక్క గుంపులచేత; అఖిల, గగన, క్రోడ, పీడనంబు= సమస్తమైన ఆకాశంయొక్క వక్షానికి ఒరిపిడి; చేయుచున్నదానిన్= సలుపుచున్న దానిని; ఋశ్యమూకశైలంబున్+చేరి= ఋశ్యమూకం అనేపేరుగల పర్వతాన్ని చేరి; తత్+ఉపకంఠ; ప్రదేశంబునన్= ఆ(కొండయొక్క) సమీపంలో ఉన్న స్థలంలో - ఆ కొండచరియపై; విశ్రమించి+ఉన్నంతన్= అలపు దీర్చుకొనే సమయంలో.

తాత్పర్యం: పిమ్మట, రామలక్ష్మణులు పంపాసరోవరాన్ని చేరి అందులో స్నానంచేసి వేల్పులకు, పితరులకు తర్పణాలు విడిచారు. పిదప ఆ సరోవరానికి ముందుగా ఉన్న ఋశ్యమూకపర్వతాన్ని చూచారు.ఎత్తైన ఆ పర్వతపు శిఖరాలు మిక్కిలి ఎత్తుగా, నిటారుగా ఉండి ఆకాశం యొక్క వక్షఃస్థలాన్ని రాచుకొంటున్నట్లుగా ఉన్నాయి. ఆ శిఖరాల మీద దట్టంగా మేఘాలు ఆవరించి ఉన్నాయి. వారు- ఇరువురు ఆ కొండను చేరి- ఆ కొండ సమీప ప్రదేశంలో అలపు తీర్చుకొనడానికి కూర్చున్నారు.

సీ. ఆ రాజపుత్త్రుల నారూఢతేజుల । వీరుల నున్నతోదారభుజులఁ
గనుఁగొని సుగ్రీవుఁ డనఘుఁ డగ్గిరిశృంగ । ముననుండి తానును దన సచివులుఁ
జింతించి వారివృత్తాంతము నెఱుఁగంగ । సంతతోత్సాహు ధీమంతు శౌర్య
వంతు నుత్తము హిమవంతునిఁబోని య । త్యంతసుస్థిరు హనుమంతుఁ బనిచె;

ఆ. నతఁడు నరిగి నృపతిసుతులతెఱం గెల్ల । నెఱిఁగి వనచరేంద్రు నెఱుఁగఁ జెప్పి
యుగ్రతేజుఁ డైన సుగ్రీవుతోఁ జెల్మి । యొనర సంఘటించె మనుజపతికి. 369

ప్రతిపదార్థం: ఆ రాజపుత్త్రులన్= ఆ రాచబిడ్డలను; ఆరూఢతేజులన్= దేదీప్యమాన మైన కాంతికల వారిని; వీరులన్= పరాక్రమవంతులను; ఉన్నత+ఉదార, భుజులన్= ఎత్తైనవి, గొప్పవి అయిన భుజాలు కలవారిని; అనఘుఁడు= పాపం లేనివాడు; సుగ్రీవుఁడు= సుగ్రీవుడు అనే వానరరాజు; ఆ+గిరి, శృంగమునన్+ఉండి= ఆ కొండకొమ్మున నిలిచి ఉండి; తానును= తానున్నూ; తనసచివులున్= తనమంత్రులున్నూ; కనుగొని= చూచి; చింతించి= ఆలోచించి; వారి, వృత్తాంతమున్= వారిసంగతిని; ఎఱుఁగంగన్= తెలియటానికి; సంతత+ఉత్సాహున్= ఎడతెగని ఉత్సాహం కలిగినవాడిని; ధీమంతున్= తెలివి తేటలు కలవాడిని; శౌర్యవంతున్= పరాక్రమం కలవాడిని; ఉత్తమున్= మంచివాడిని; హిమవంతునిన్+పోని= హిమవంతుని వలె; అత్యంత సుస్థిరున్= మిక్కిలి స్థైర్యం కలవాడిని; హనుమంతున్= హనుమంతుడిని; పనిచెన్= నియోగించాడు; అతఁడున్= ఆ హనుమంతుడును; అరిగి= వెళ్లి (రామలక్ష్మణుల దగ్గరికి వెళ్లి); నృపతి, సుతుల, తెఱంగు+ఎల్లన్= రాజపుత్రుల

(రామలక్ష్మణుల) తీరుతెన్నులన్నిటిని; ఎఱిఁగి= తెలిసికొని; వన, చర+ఇంద్రున్= అడవిలో సంచరించే కోతులకు ప్రభువును- సుగ్రీవుడిని; ఎఱుఁగన్+చెప్పి= తెలిసేటట్లుగా వివరించి చెప్పి; మనుజపతికిన్= మానవుల రాజుకు శ్రీరాముడికి; ఉగ్ర తేజుఁడు+ఐన= మిక్కుటమైన వర్చస్సు కలవాడు అయిన; సుగ్రీవుతోన్= సుగ్రీవుడితో; చెల్మి= మైత్రి; ఒనరన్= ఒప్పిదంగా; సంఘటించెన్= ఏర్పరిచాడు.

తాత్పర్యం: వానరులప్రభువూ పుణ్యాత్ముడూ అయిన సుగ్రీవుడు ఆ రాజపుత్రులైన శ్రీరాముడిని లక్ష్మణుడిని దేదీప్యమానమైన తేజస్సుతో వెలుగొందుతున్నవారిని ఎత్తైనభుజాలతో మహావీరులుగా కన్పిస్తున్నవారిని ఆ కొండకొమ్మనుండి చూచాడు. అంతట ఆ సుగ్రీవుడు తన మంత్రులతో చర్చించి, ఆ రాజపుత్రులవృత్తాంతం తెలిసికొనటానికై హనుమంతుడిని నియోగించాడు. హనుమంతుడు సుగ్రీవుడి సచివుడు, పురుషకార్యం నిర్వహించటంలో లోకోత్తరకార్యాలను సాధించటంలో స్థిరమైన సంకల్పం కలవాడు, మేధావి, పరాక్రమం కలవాడు. మంచివాడు. చలించనిచిత్తం కలవాడు, స్థైర్యంలో హిమాలయపర్వతంవంటివాడు ఆ హనుమంతుడు- సుగ్రీవుని దూతగా ఆ రాజపుత్రులవద్దకు వెళ్లి, వారి సమాచారం సేకరించి, తేజస్వి అయిన సుగ్రీవుడిని గూర్చి వారికి తెలిపి, సుగ్రీవుడికి శ్రీరాముడికి స్నేహం సంఘటించాడు.

విశేషం: (1) అలం: ఉపమ. ధైర్యం గల వీరుడిని చలించని కొండతో పోల్చటం పరిపాటి. హనుమంతుడు హిమవంతుడితో ఇట పోల్చబడ్డాడు. (2) పూర్వకాలంలో రాయబారిగా రాజకార్యాలను తీర్చు సచివుడికి ఉండవలసిన లక్షణాలు ఇట హనుమంతుడి పరంగా పేర్కొనబడ్డాయి.

వ. సుగ్రీవుండును మున్ను సీతాపరిత్యక్తంబై తమ ముందటం బడినం దారు గైకొని సంగ్రహించియున్న భూషణ నిచయంబు రామునకు నివేదించినంజూచి, యతండు సముత్సుకుండై వానికి వానరైశ్వర్యంబు ప్రతిశ్రుతంబు సేసి తదీయశత్రుం డైన వాలిం జంపఁ బ్రతిజ్ఞ సేసెఁ; గపీశ్వరుండును జానకిం దెచ్చుటకు సహాయంబుగా నొడంబడియె; నంతట నందఱుం గూడికొని వాలి నివాసం బైన కిష్కంధానగరంబున కరిగి; రప్పుడు భానుసూనుండును. 370

ప్రతిపదార్థం: సుగ్రీవుండును= సుగ్రీవుడుసయితం; మున్ను= అంతకుముందు; సీతా, పరిత్యక్తంబు+ఐ= సీతాదేవిచేత విడువబడినదై; తమ ముందటన్+పడినన్= తమ యెదుట పైనుండి క్రిందకు పడగా; తారు= తాము (సుగ్రీవాదివానరులు); కైకొని= స్వీకరించి; సంగ్రహించి+ఉన్న= దాచిఉంచిన; భూషణనిచయంబున్= ఆభరణాల సముదాయాన్ని, రామునకున్= శ్రీరాముడికి; నివేదించినన్= సమర్పించగా; అతండు= అతడు - శ్రీరాముడు; సముత్సుకుండు+ఐ= మిక్కుటమైన ఉద్వేగాన్ని పొందినవాడై; వానికిన్= అతడికి - సుగ్రీవుడికి; వానర+ఐశ్వర్యంబు= కోతులయొక్క ప్రభుత్వం; ప్రతిశ్రుతంబు చేసి= వాగ్దానం కావించి (సంపాదించిపెట్టటానికి అంగీకరించి); తదీయశత్రుండు+ఐన= ఆతడియొక్క (సుగ్రీవుడియొక్క) విరోధి అయిన; వాలిన్= వాలిని; చంపన్= సంహరించటానికై; ప్రతిజ్ఞ+చేసెన్= శపథం గైకొన్నాడు; కపి+ఈశ్వరుండును= కోతులరేడును-సుగ్రీవుడును; జానకిన్= సీతను; తెచ్చుటకున్= తీసికొనిరావటానికి (రావణుడి చెఱనుండి విడిపించి తేవటానికి); సహాయంబు+కాన్= సాయం చేయటానికి; ఒడంబడియెన్= సమ్మతించాడు; అంతట= అటుపిమ్మట; అందఱున్= అందరును (రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, అతని సచివులును); కూడికొని= కలిసి; వాలినివాసంబు+ఐన= వాలి నివసించే చోటు అయిన; కిష్కింధానగరంబునకున్= కిష్కింధ అనే పేరు కల పట్టణానికి; అరిగిరి= వెళ్ళారు; అప్పుడు= ఆసమయంలో; భానుసూనుండును= సూర్యుడికొడుకు- సుగ్రీవుడును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అప్పుడు సుగ్రీవుడు శ్రీరాముడికి సీతాదేవి ఆభరణాలమూటను సమర్పించాడు. సీత అంతకుముందు రావణుడిచేత కొనిపోబడేటప్పుడు తనసొమ్ములను మూట కట్టి వానరులు సంచరిస్తున్న ఋశ్యమూకపర్వతంమీద పడవేసింది గదా! శ్రీరాముడు సీతఆభరణాలను చూచి మిక్కుటమైన ఉద్వేగాన్ని చెంది ఆ మూటను దాచి తన కిచ్చిన సుగ్రీవుడికి ప్రత్యుపకారం చేయటానికి నిశ్చయించి, వానరరాజ్యాన్ని సుగ్రీవుడికి చెందేటట్లుగా చేయటానికి సుగ్రీవుడిశత్రువు అయిన వాలిని సంహరించటానికి శపథం చేశాడు. కోతులరేడు అయిన సుగ్రీవుడు సీతను రావణుడిచెరనుండి విడిపించే కార్యంలో సాయం చేయటానికి సమ్మతించాడు. అంతట వారందరూ కలిసి వాలిరాజధాని పట్టణమైన కిష్కింధకు వెళ్లారు. అప్పుడు రవిసుతుడైన సుగ్రీవుడు.

విశేషం: రామాయణగాథలో నవీనవిమర్శకుల దృష్టిని మిక్కుటంగా ఆకర్షించిన సన్నివేశం వాలిసంహారం. శ్రీరాముడి శీలానుశీలనంలో మిక్కిలిప్రాముఖ్యం వహించిన చర్చనీయాంశం కూడ వాలివధయే. శ్రీరాముడు వాలిని సంహరించటంలోని ఔచిత్యమేమిటి? శ్రీరాముడు తననుగురించి రామాయణంలోనే ఇతరులు ఏవిధంగా భావించినప్పటికి తానుమాత్రం దశరథుడిపుత్రుడు అయిన మానవమాత్రుడిగనే భావించుకొంటున్నట్లు వచించాడు. సీతావియోగభారంతో శ్రీరాముడు ఋశ్యమూకాన్ని చేరాడు. అప్పుడు అతడికి సుగ్రీవుడితో మైత్రి ఏర్పడింది. అది యాదృచ్ఛిక సంఘటన. మిత్రుడి శత్రువు తనకుగూడ శత్రువే అని భావించటం ఆదర్శమిత్రధర్మం.

క. **వాలిగృహద్వారంబున । వాలి మదం బెసఁగ నార్చి వారక బాహా**
స్ఫాలనము సేయుటయు విని । వాలి మహారోషదుర్నివారోద్ధతుఁ డై. 371

ప్రతిపదార్థం: వాలిగృహద్వారంబునన్= వాలియొక్క ఇంటికడపముందర; వాలి= క్రిందికి దిగి; మదంబు+ఎసఁగన్= గర్వం అతిశయించేటట్లుగా; ఆర్చి= పెనుకేక లిడి; వారక= ఉడుగక; బాహా+స్ఫాలనము+చేయుటయు= బుజాలపై చరచటం; విని= ఆలకించి; వాలి= వాలి; మహా, రోష, దుర్నివార+ఉద్ధతుఁడు+ఐ= గొప్పకోపం గలిగి, వారించటానికి వీలులేని గర్వంతో అతిశయించినవాడై.

తాత్పర్యం: సుగ్రీవుడు గర్వించినవాడై వాలి ఇంటికడపముందు నిలిచి, తన బాహువులను చేతులతో చరచి, చప్పుడుచేయటం విని, వాలి కోపంచేత, వారించటానికి వీలులేని పరాక్రమంచేత ఉప్పొంగినవాడై.

వ. **సమరసన్నాహం బమర వెలువడంబోయినఁ దదీయవల్లభ యగు తార యతని వారించి యిట్లను; 'నేఁటిచందంబు సూడ సుగ్రీవుండు బలవత్సహాయుండై వచ్చినవాఁ; డది యెట్లనిన దశరథనందనుం డైన రాముండు రావణుచేత నపహృతదారుం డయి, నిజసహోదరుం డగు లక్ష్మణుండును దానును సుగ్రీవ సహాయత్వం బపేక్షించి యతనికార్యంబు దీర్చంబూనె నని వింటి; నదియునుంగాక మహాబలు లైన మైందద్వివిదులు నతిలోకపౌరుషుం డయిన హనుమయు బ్రసిద్ధబుద్ధి యగు జాంబవంతుండును వానికి మంత్రులై యుండుదురు; గావున నీ విప్పుడు గయ్యంబునకుఁ బోక నా కిష్టంబు గా' దనిన, నవ్వుచు నవ్వనచరవీరుండు.** 372

ప్రతిపదార్థం: సమర సన్నాహంబు+అమరన్= యుద్ధానికి ముందుచేసే ప్రయత్నాలు శోభిల్లగా, కవచం మున్నగు ఆహార్యాలను అమర్చుకొని; వెలువడన్+పోయినన్= పో బోగా; తదీయ, వల్లభ+అగు= వాలియొక్క భార్య అయిన; తార= తార అనే ఆమె;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అతనిన్= వాలిని; వారించి= ఆపి; ఇట్లు+అనున్= ఈవిధంగా చెప్పింది; నేఁటి, చందంబు+చూడన్= ఈరోజు (సుగ్రీవుడి) వైఖరి గమనించగా; సుగ్రీవుండు= సుగ్రీవుడు; బలవత్+సహాయుండు+ఐ= సామర్థ్యం గలవారి తోడ్పాటు కలవాడై; వచ్చిన వాఁడు= వచ్చాడు; అది= (ఆ విషయం); ఎట్లు+అనినన్= ఏవిధంగా తెలుసు అని అడిగితే; దశరథనందనుండు= దశరథమహారాజు కొడుకు అయిన; రాముండు= రాముడు; రావణుచేతన్= రావణుడిచేత; అపహృతదారుండు+అయి= అపహరించబడిన భార్య కలవాడై; నిజ, సహోదరుండు+అగు= తనయొక్క తమ్ముడు అయిన లక్ష్మణుండును; తానును= తానును, శ్రీరాముడును; సుగ్రీవసహాయత్వంబు= సుగ్రీవుడియొక్క తోడ్పాటు; అపేక్షించి= కోరి; అతనికార్యంబున్= సుగ్రీవుడియొక్క పనిని; తీర్పన్= నెరవేర్చటానికి; పూనెను+అని= పట్టుపట్టాడు అని; వింటిన్= విన్నాను; అదియునున్+కాక= అంతేకాక; మహాబలులు+ఐన= గొప్పబలం కలవారు అయిన; మైంద ద్వివిదులును= మైందుడు, ద్వివిదుడును; అతిలోకపౌరుషుండు+అయిన= లోకాతీతమైన పరాక్రమం కలవాడు అయిన; హనుమయున్= హనుమంతుడును; ప్రసిద్ధబుద్ధి+అగు= గొప్పమేధావిగా కీర్తి వడసిన; జాంబవంతుండును; వానికిన్= సుగ్రీవుడికి; మంత్రులు+ఐ= సచివులు అయి; ఉండుదురు= ఉంటారు; కావునన్= కాబట్టి; నీవు+ఇప్పుడు= నీవు ఈ సమయంలో; కయ్యంబునకున్= యుద్ధానికి; పోక= వెళ్ళటం; నాకు+ఇష్టంబు+కాదు= నాకు సమ్మతం కాదు; అనినన్= అని (తార) వచించగా; ఆ+వనచర, వీరుండు= ఆ కోతులజాతికి చెందిన శూరుడు (వాలి); నవ్వుచున్= నవ్వుతూ.

తాత్పర్యం: వాలియుద్ధానికి పోయేటప్పుడు కావలసినయత్నాలను చేసి బయలుదేరటానికి చూస్తుండగా, అతడిభార్య అయిన తార, అతడిని ఆపి ఈ విధంగా అన్నది. 'సుగ్రీవుడి వైఖరి ఈనాడు వేరేవిధంగా కన్పిస్తున్నది. ఆతడికి వెనుక ఏదో గొప్ప బలం ప్రోత్సాహంగా ఉన్నట్లు తెలుతున్నది. నేను విన్నమాట ఒకటి ఉన్నది. దశరథమహారాజుకొడుకు శ్రీరామచంద్రుడు, అతడి తమ్ముడితో కలిసి వచ్చి సుగ్రీవుడితో స్నేహం చేశాడు. రావణుడు శ్రీరాముడి భార్యను అపహరించాడు, శ్రీరాముడికి సుగ్రీవుడు సాయంచేయటానికీ, సుగ్రీవుడికి శ్రీరాముడు తోడ్పడటానికీ పరస్పరమైత్రితో మెలగటానికీ వారలకు అంగీకారం కుదిరిందట. అంతేకాక, సుగ్రీవుడికి గొప్ప బలశాలులైన మైందుడు, ద్వివిదుడు, లోకోత్తరపరాక్రమశాలి అయిన హనుమంతుడు, మేధావులలో మేటి అయిన జాంబవంతుడును తోడ్పడగలరు. ఇప్పుడు నీవు సుగ్రీవుడితో యుద్ధంచేయటం నాకు సమ్మతం కాదు'. తారమాటలు విని వాలి నవ్వాడు.

క. **ఆ వనిత వచనములు సు । గ్రీవవిషయపక్షపాతకృత్రిమములుగా**
భావించి యాదరింపక । తా వెడలె ననూనబాహుదర్పం బెసఁగన్. **373**

ప్రతిపదార్థం: ఆ, వనిత, వచనములు= ఆ తారయొక్కమాటలు; సుగ్రీవ, విషయ, పక్షపాత, కృత్రిమములుగాన్= సుగ్రీవుడినిగూర్చిన ప్రస్తావనకు సంబంధించి అభిమానం చూపే కల్పితాంశాలుగా; భావించి= తలపోసి; ఆదరింపక= సరకు గొనక; అనూన, బాహుదర్పంబు= గొప్పదైన పరాక్రమగర్వం; ఎసఁగన్= అతిశయించగా; తాన్= తాను (వాలి); వెడలెన్= బయలుదేరాడు.

తాత్పర్యం: తార మాటాడినవాక్యాలు, ఆమె సుగ్రీవుడియెడ గల అభిమానం చొప్పున లేనిపోని ఊహలతో కల్పించినవి అని తలపోసి, ఆ వాలి పరాక్రమగర్వంతో ముందుకు సాగాడు.

వ. **ఇట్లు వెడలి కట్టెదుర నున్న సుగ్రీవుం జూచి యి ట్లనియె.** **374**

తాత్పర్యం: ఈవిధంగా, బయలుదేరి తనకు ఎదురుగా ఉన్న సుగ్రీవుడిని చూచి వాలి ఇట్లా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వాలిసుగ్రీవుల యుద్ధము (సం. 3-264-27)

తే. **'ఓరి దుష్టాత్మ! యే నిట్లు పోరఁ బెక్కు । మాఱు లెగువంగ సిగ్గఱి పాఱుచుండు**
నట్టి నీ కున్న యునికిన యిట్టలముగ । నిట్టి బీర మెక్కడనుండి పుట్టెఁ జెపుమ!' 375

ప్రతిపదార్థం: ఓరి దుష్ట+ఆత్మ!= ఓరీ నీచుడా!; ఏను= నేను; ఇట్లు= ఈరీతిగా; పోరన్= యుద్ధంలో; పెక్కుమాఱులు= అనేకపర్యాయాలు; ఎగువంగన్= తరిమి తరిమి కొట్టగా; సిగ్గు+అఱి= సిగ్గు నశించి (సిగ్గులేక); పాఱుచుండు+అట్టి= పారిపోతూఉండేటి; నీకున్= నీకు; ఉన్న+ఉనికిన= ఉన్నట్లుండి, ఆకస్మికంగా; ఇట్టలముగన్= అధికంగా; ఇట్టి= ఇటువంటి; బీరము= అహంకారంతో కూడిన ధైర్యం; ఎక్కడనుండి= ఏచోటినుండి; పుట్టెన్= పుట్టింది? చెపుము!= చెప్పరా!

తాత్పర్యం: 'ఓరీ నీచుడా! సుగ్రీవా! నేను ఎన్నోసారులు లోగడ నిన్ను యుద్ధంలో తఱిమి తఱిమి కొట్టానుకదా! నీవు అన్నిసారులు సిగ్గు లేక పారిపోయిన పిరికిపందవు. ఇప్పుడు ఉన్నట్లుండి ఒక్కమారు నన్ను ఈ విధంగా ఎదిరించే ధైర్యం నీకు ఏవిధంగా వచ్చిందిరా? చెప్పుము'.

వ. **అనినఁ బ్రహసితముఖుం డగుచు నబ్బలిముఖుం డి ట్లనియె.** 376

ప్రతిపదార్థం: అనినన్= అని వాలి వచించగా; ప్ర, హసిత, ముఖుండు+అగుచున్= పకపక నవ్విన వదనం కలవాడు ఔతూ; ఆ, బలి, ముఖుండు= ఆ కోతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని వాలి అధిక్షేపించగా, అతడితో సుగ్రీవుడు పకపకనవ్వుతూ ఈవిధంగా బదులు పలికాడు.

క. **'ఆలిని రాజ్యముఁ గోల్పడి । యాలంబునఁ దూలపోయి యక్కట బ్రదు కిం**
కేలా యని తెగువమెయిన్ । వాలి! రణము సేయ నమరి వచ్చితి నీతోన్. 377

ప్రతిపదార్థం: వాలి!= ఓవాలీ!; ఆలిని= భార్యను; రాజ్యమున్= ప్రభుత్వాన్ని; కోల్పడి= పోగొట్టుకొని; ఆలంబునన్= యుద్ధంలో; తూలపోయి= ఓడిపోయి; అక్కట= అయ్యో! (ఎంతటిదురవస్థదాపురించింది); బ్రదుకు= జీవితం; ఇంకన్= ఇకమీద; ఏలా+అని= ఎందుకు అని; తెగువ మెయిన్= సాహసంచొప్పున; నీతోన్= నీతోడ; రణము+చేయన్= యుద్ధం చేయటానికి; అమరి= సిద్ధపడి; వచ్చితిన్= అరుగుదెంచాను.

తాత్పర్యం: 'ఓవాలీ! నేను ఎందుకు ఇంతటి ధైర్యంతో ఏగుదెంచానో చెప్తుతాను వినుము. నేను నాభార్యను కోల్పోయాను. నా రాజ్యాన్ని కూడా పోగొట్టుకొన్నాను. అయ్యో! ఇంతటి దురవస్థ నాకు దాపురించింది. ఇక ఈ నిరర్థక మైన జీవితం గడిపి నేను బావుకొనేది ఏమున్నది? అందుచేత నాకు ధైర్యం వచ్చింది. నీతో యుద్ధానికి సిద్ధమై వచ్చాను.

తే. **చక్కఁ గమ్మింక ముందటి చంద మొందఁ । గలదె? తొంటి సుగ్రీవుండు గాఁడు నేఁడు;**
నిన్నుఁ బొరివుచ్చి కాని పోనేర్చు నెట్లు?' ననుచు నుగ్రుఁడై యవ్వీరు నార్చి కవిసె. 378

ప్రతిపదార్థం: చక్కన్+కమ్ము= నీవు సన్నద్ధుడవు కమ్ము; ఇంకన్= ఇక; ముందటిచందము= లోగడరీతి; ఒందన్+కలదు+ఎ= జరుగునా? (వెనుకటిమాదిరిగా ఇక జరుగదు సుమా); తొంటి, సుగ్రీవుండు= పూర్వపు సుగ్రీవుడు; నేఁడు= ఈదినం;

కాఁడు= కాడు; నిన్నున్= నిన్ను (ఓవాలీ నిన్ను); పొరి+పుచ్చికాని= నిన్ను సంహరించి కాని; ఎట్లు= ఏరీతిగా; పోనేర్చున్= పోగలడు? (నిన్నుసంహరించనిదే నేటి సుగ్రీవుడు పోజాలడు); అనుచున్= అని వచిస్తూ; ఉగ్రుఁడు+ఐ= భయంకరుడై; ఆ+వీరుని= ఆవాలిని; ఆర్చి= సింహనాదం చేసి, పెనుకేక పెట్టి; కవిసెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: ఓవాలీ! నీవు ఇంక సవ్యంగా యుద్ధానికి సన్నద్ధుడవు కమ్ము. వెనుకటి చరిత్ర వేరు. అలనాటి సుగ్రీవుడు వేరు. నేటి సుగ్రీవుడు వేరు. నేటి సుగ్రీవుడు నిన్ను యుద్ధంలో సంహరించకుండగా తిరిగిపోజాలడు సుమా' అంటూ భయంకరుడై సుగ్రీవుడు వాలిని ఎదుర్కొన్నాడు.

వ. ఇవ్విధంబున. 379

తాత్పర్యం: ఈ రీతిగా.

ఉ. భూవినుతప్రభావులు ప్రభూత బలోద్ధతు లుగ్రవైరితే
జోవిజయుల్ నిరంతరయశోజయకాంక్షులు భూరిభూరుహ
గ్రావనఖాయుధుల్ బలిముఖప్రవరుల్ గడుఁ బొంగి వాలిసు
గ్రీవులు దాఁకి రొండొరు లకృత్రిమరోషకషాయవక్త్రులై. 380

ప్రతిపదార్థం: భూవినుతప్రభావులు= భూమిచేత పొగడబడిన మహిమ కలవారు- అనగా భూలోకంలోని ప్రజలందరిచేత గుర్తించబడిన గొప్పతనం కలవారు; ప్రభూత, బల+ఉద్ధతులు= గొప్పబలం కలిగి ఉండటంచేత మదించినవారు; ఉగ్ర, వైరి, తేజస్+విజయుల్= భయంకరమైన శత్రువులయొక్క వర్చస్సును బాగా జయించ గలవారు; నిరంతర, యశస్+జయ, కాంక్షులు= ఎల్లప్పుడును కీర్తిని, గెలుపును కోరేవారు; భూరి, భూరుహ, గ్రావ, నఖ+ఆయుధుల్= గొప్పచెట్లు, రాళ్ళు, గోళ్ళు ఆయుధాలుగా కలవారు; బలిముఖ, ప్రవరుల్= కోతులలో శ్రేష్ఠులు; వాలి, సుగ్రీవులు= వాలియును, సుగ్రీవుడును; అకృత్రిమ, రోష, కషాయవక్త్రులు+ఐ= సహజమైనకోపంచేత ఎర్రబడిన మొగాలు కలవారై; కడున్= మిక్కిలి; పొంగి= ఉత్సహించి; ఒండు+ఒరులన్= ఒకరినొకరు; తాకిరి= మార్కొన్నారు.

తాత్పర్యం: ఈ రీతిగా, భూలోకంలోని ప్రజలందరిచేత పొగడబడిన గొప్పతనం గలవారు; శత్రువుల తేజస్సును హరించేవారు. ఎల్లప్పుడును కీర్తిని, గెలుపును కోరుకొనేవారు, గొప్ప చెట్లు, రాళ్ళు, గోళ్ళు ఆయుధాలుగా చేసికొని పోరాడేవారు అయిన వాలిసుగ్రీవులు మిక్కుటమైన ఉత్సాహంతో విజృంభించి ఒకరినొకరు తలపడ్డారు.

మ. తరుసంఘంబులు పూన్చి యొండొరుల నుద్యద్బాహులై వ్రేయ ని
ష్ఠురవక్షస్స్థలపాతవేగవిరళస్తోకంబులై పోయె న
త్తరుసంఘంబులు; వెండియుం గడఁగి యుద్యల్లీల నయ్యిద్దఱుం
బరుషానేకశిలాప్రయోగముల నొంపం జొచ్చి రన్యోన్యమున్. 381

ప్రతిపదార్థం: తరుసంఘంబులు= చెట్లసముదాయాలు; పూన్చి= సంధించి; ఉద్యత్+బాహులు+ఐ= ఎత్తిన చేతులు కలవారలై; (చేతులు పైకెత్తి); ఒండు+ఒరులన్= ఒకరినొకరు; వ్రేయన్= కొట్టగా; ఆ+తరు+సంఘంబులు= ఆ చెట్లసమూహాలు; నిష్ఠుర, వక్షః+స్థల, పాత, వేగ, విరళ, స్తోకంబులు+ఐ= కఠిన మైన రొమ్ములపై పడి వేగంగా తుత్తునియలై నశించినవై; పోయెన్;

వెండియున్= మరల; కడఁగి= పూని; ఆ+ఇద్దఱున్= ఆ వాలిసుగ్రీవులు; ఉద్యత్+లీలన్= ప్రకాశించే రీతిగా; పరుష+అనేక, శిలాప్రయోగములన్= కఠినా లైన పెక్కురాళ్ల విసరుకొనటంచేత; అన్యోన్యమున్= ఒండొరులను; నొంపన్+చొచ్చిరి= బాధించసాగారు.

తాత్పర్యం: ఆ వాలిసుగ్రీవులు ఇరువురును మొట్టమొదట చెట్లను పెరికి ఒకరిపై నొకరు విసరి యుద్ధంచేశారు. ఆ చెట్లు వారి కఠినమైన రొమ్ములను తాకి తుత్తునియలై నశించాయి. ఇక, చెట్లు నశించగానే వారు రాళ్ళను గైకొని ఒండొరులతో యుద్ధం చేశారు.

క. **అతులితశిలావితానం । బితరేతరతనునిపాతహేలా సంచూ**
ర్ణిత మగుటయు, వారలు పటు । గతిఁ గవిసిరి బాహుయుద్ధకౌతుకమతులై. **382**

ప్రతిపదార్థం: అతులిత, శిలావితానంబు= సాటిలేని రాళ్లసముదాయం; ఇతర+ఇతర, తను, నిపాత, హేలా, సంచూర్ణితము+ అగుటయున్= ఒండొరుల దేహాలపై విసరటం అనే ఆటలో పొడిపొడి అయిపోవటంచేత; వారలు= వాలిసుగ్రీవులు; బాహు, యుద్ధ, కౌతుకమతులు+ఐ= చేతులతోనే పోరాటం సాగించటంలో వేడుక కలిగిన చిత్తం కలవారు అయి; పటుగతిన్= సామర్థ్యంతో; కవిసిరి= మార్కొన్నారు.

తాత్పర్యం: చెట్లు పట్టుకొని పోరాటం సాగించారు. చెట్లు నశించాయి. ఇక, రాళ్ళనే ఆయుధాలుగా స్వీకరించి వాలిసుగ్రీవులు పోరాటం కొనసాగించారు. కాని, ఆ రాళ్ళుకూడా వారి ఇరువురి శరీరాలను తాకి పొడిపొడి అయిపోయాయి. ఇకచెట్లు, రాళ్ళు కానరాక, వారుఇద్దరును చేతులతోడనే ముష్టియుద్ధం చేయటానికి తారసిల్లారు.

ఉ. **ఒండొరుఁ బట్టుచుం దిగుచు చొండొరుఁ బాయుచు వ్రేయుచున్ మహో**
ద్దండత నొండొరుం దొలఁగఁ దాఁకుచు నీఁగుచు లోఁగుచుం జలం
బొండొరు మీఱు చొండొరుల యుద్ధతి సైఁపక వీఁకఁ బోరి రా
ఖండలభానుసూను లవిఖండిత చండభుజాప్రచండతన్. **383**

ప్రతిపదార్థం: ఆఖండల, భానుసూనులు= దేవేంద్రుడి కొడుకు- వాలియున్నూ, సూర్యుడి కొడుకు- సుగ్రీవుడున్నూ; ఒండు+ఒరున్= ఒకరిని ఒకరు; పట్టుచున్= పరిగ్రహిస్తూ; తిగుచుచున్= లాగుతూ; ఒండు+ఒరున్= ఒకరిని ఒకరు; పాయుచున్= దూరంగా జరుగుతూ (తొలగుతూ); వ్రేయుచున్= కొట్టుతూ; మహా+ఉద్దండతన్= మిక్కిలి భీకరంగా; ఒండు+ఒరున్= ఒకరినొకరు; తొలఁగన్+తాఁకుచున్= దూరంగా పోయేటట్లుగా, మార్కొంటూ; ఈఁగుచున్= తొలగిస్తూ; లోఁగుచు= లొంగుతూ, చలంబు= పట్టుదలతో; ఒండు+ఒరు= ఒకరిని ఒకరు; మీఱుచున్= అతిక్రమిస్తూ; ఒండు+ ఒరుల+ ఉద్ధతిన్= ఒకరియొక్క అతిశయాన్ని ఇంకొకరు; సైఁపక= ఓర్వక; వీఁకన్= ఉత్సాహంతో; అవి, ఖండిత, చండ, భుజా, ప్రచండతన్= పరిపూర్ణమైన పరాక్రమంయొక్క వేడిమితో; పోరిరి= పోరాడారు.

తాత్పర్యం: దేవేంద్రుడి కొడుకైన వాలియున్నూ సూర్యుడికొడుకైన సుగ్రీవుడున్నూ పరస్పరం భీకరంగా పోరాటం కొనసాగించారు. ఒకరినొకరు ఒకసారి పట్టుకొనేవారు. ఒకసారి ఒకరికొకరు లాగుకొనేవారు ఒకసారి తొలగిపోయేవారు, మరొకసారి కొట్టుకొనేవారు. ఒకసారి ఒకరినొకరు దూరంగా త్రోసివేసికొనేవారు. ఒకసారి ఒకరికొకరు లొంగిపోయేవారు,

మరొకసారి ప్రక్కకు నెట్టుకొనేవారు. ఈ రీతిగా ఒకరిని ఒకరు మీరుతూ ఉత్సాహంతో పరిపూర్ణపరాక్రమప్రాభవాలు ప్రదర్శిస్తూ ఒకరికొకరు ఏమాత్రం తీసిపోకుండా వాలిసుగ్రీవులు ఘోరయుద్ధం చేశారు.

శా. దేహోత్సాహ మెలర్ప నుద్ధతమదాంధీభూతులై యాహవో
త్సాహవ్యగ్రులు విగ్రహంబు మిగులన్ సంరంభశుంభద్గతిన్
బాహాబాహిఁ బెనంగ నప్పు డమరెం బ్రౌఢద్విపద్వంద్వహే
లాహస్తద్వయగాఢకర్షణరణోల్లాసంబు విస్పష్టమై. 384

ప్రతిపదార్థం: దేహ+ఉత్సాహము+ఎలర్పన్= శరీరాలలోని పొంగారేశక్తి అతిశయించగా; ఉద్ధత, మద+అంధీభూతులు+ఐ= గర్వంతో కూడిన మదంచేత కన్నులు కానరానివారై; ఆహవ+ఉత్సాహ, వ్యగ్రులు= పోరాటంలో పొంగులువారే శక్తితో తొందరపడే వారై; విగ్రహంబు= శత్రుత్వం; మిగులన్= అతిశయించగా; సంరంభ శుంభద్గతిన్= తొట్రుపాటుతో కూడిన వేగిరపాటుతో; బాహాబాహిన్= చేతులు చేతులతో కలిపి; పెనంగన్= పోరాటం సలుపగా; అప్పుడు= ఆ సమయంలో; ప్రౌఢ; ద్విప, ద్వంద్వ, హేలా, హస్త, ద్వయ, గాఢ, కర్షణ, రణ+ఉల్లాసంబు= ముదిరిన (మదించిన) ఏనుగులజంట వినోదంగా చేసే రెండు తొండాల తీవ్రమైన పెనగులాటవలె ఒప్పుతూఉన్న యుద్ధంలోని సంతోషశోభ; విస్పష్టము+ఐ= బాగా కనిపించేదై; అమరెన్= ఏర్పడింది.

తాత్పర్యం: వాలిసుగ్రీవులు ఇరువురు బలమైన దేహాలు కలవారు. వారిశరీరంలోని ఉత్సాహంతో వారు ఇరువురు కన్నుమిన్నుగానక యుద్ధంమీది అభిలాషతో ఏర్పడిన తొందరపాటుతో చేతులు చేతులు కలిపి ఘోరయుద్ధాన్ని చేశారు. వారిరువురి ద్వంద్వయుద్ధం రెండు మదించిన ఏనుగులు తొండం తొండం కలిపి గాఢంగా లాగుతూ పెనగుతూ పట్టువీడక చేసే పోరాటాన్ని స్ఫురింపచేసింది.

వ. మఱియు నన్యోన్యదంతనఖముఖవిఖండితశరీరులై హరివీరులు రుధిరధారలం దడిసి పుష్పితంబు లగు నశోకంబులుం బోలె నొప్పి చలంబులు మెఱయం బెనంగునెడం దుల్యబలరూపవిక్రములై యున్న యయ్యన్నదమ్ముల నిరువుర నేర్పడ లక్షింపనేరక లక్ష్మణాగ్రజుండు విలక్ష్యహృదయుండై వీక్షించుచున్న నాంజనేయుండు రాఘవునకు నభిజ్ఞానార్థంబుగా నొక్కపల్లవదామంబు సుగ్రీవునఱుతం బెట్టఁ దదనంతరంబ రాఘవుం డమోఘబాణంబు దొడిగి వాలియురంబు వగుల నేసినం, బడి యవ్వానరుండు దశరథనందను నిందించుచుఁ బ్రాణవియోగంబు నొందె; నిత్తెఱంగున. 385

ప్రతిపదార్థం: మఱియున్= వెండియు; హరివీరులు= వానరవీరులు; అన్యోన్య, దంత, నఖ, ముఖ, విఖండిత, శరీరులు+ఐ= ఒకరినొకరు దంతములయొక్క, గోళ్ళయొక్క మొనలచే బాగుగా చీరబడిన దేహాలు కలవారై; రుధిరధారలన్= నెత్తురు జాలులతో; తడిసి= ఆర్ద్రమయి; పుష్పితంబులు+అగు= పూచినట్టి, అశోకంబులున్+పోలెన్= అశోకవృక్షాలవలె; ఒప్పి= శోభిల్లి; చలంబులు= స్పర్ధలు; మెఱయన్= ప్రకాశించగా; పెనంగు+ఎడన్= పోరాడేటప్పుడు; తుల్య, బల, రూప, విక్రములు+ఐ= సమానమైన శక్తి, ఆకార, శౌర్యాలు కలవారు అయి; ఉన్న= ఉన్నటువంటి; ఆ+అన్నదమ్ములన్; ఇరువురన్= ఇద్దరియందు; ఏర్పడన్= భేదం తెలిసేటట్లు; లక్షింపనేరక= గురిపెట్టలేక; లక్ష్మణ+అగ్రజుండు= లక్ష్మణుడిఅన్న (శ్రీరాముడు); విలక్ష్యహృదయుండు+ఐ= చెదరిన గురిగల డెందం కలవాడై; వీక్షించుచున్+ఉన్నన్= చూస్తుండగా; ఆంజనేయుండు=

హనుమంతుడు; రాఘవునకున్= రాముడికి; అభిజ్ఞాన+అర్థంబుగాన్= గుర్తుగా ఉండటంకొరకై; ఒక్క= ఒక; పల్లవదామంబున్= చిగురుటాకులదండను; సుగ్రీవు+అఱుతన్+పెట్టన్= సుగ్రీవుడి మెడయందు వేయగా; తత్+అనంతరంబు+అ= అటు పిమ్మట వెంటనే; రాఘవుండు= రాముడు; అమోఘబాణంబు= మొక్కవోని అమ్ము; తొడిగి= వింట సంధించి; వాలి+ఉరంబు= వాలియొక్క రొమ్ము; పగులన్+ఏసినన్= బ్రద్దలయ్యేటట్లుగా కొట్టగా; పడి= నేలపైకూలి; ఆ+వానరుండు= ఆ కోతి - వాలి; దశరథనందనున్= దశరథుడి కుమారుడైన శ్రీరాముడిని; నిందించుచున్= అధిక్షేపిస్తూ; ప్రాణవియోగంబున్+ఒందెన్= అసువులు వీడాడు, మరణించాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా.

తాత్పర్యం: వెండియును ఆ కపివీరులు వాలిసుగ్రీవులు ఇరువురున్నూ ఒకరినొకరు పండ్లతో, గోళ్ళతో పీడించుకొంటూ నెత్తుటిజాలులతో తడిసి పూచిన అశోకవృక్షాలవలె శోభిల్లారు. ఆ విధంగా వారు స్పర్ధతో పోరాడుతుండగా, ఆ అన్నదమ్ములు సమానరూపాలతో, సమానపరాక్రమంతో ఉండటంచేత వారిద్దరిలో ఎవరెవరో భేదం తెలియటానికి వీలులేకపోయింది. అందుచేత శ్రీరాముడు బాణాన్ని గురిపెట్టి సంధించలేక, వారిరువురిపోరాటాన్ని తిలకిస్తూ ఉండిపోయాడు. రాముడి అవస్థ గుర్తించి ఆంజనేయుడు వడిగా ఒకచిగురుటాకులదండను సుగ్రీవుడికంఠంలో వేశాడు. వెనువెంటనే శ్రీరాముడు గురిపెట్టి అమోఘబాణాన్ని వింటినుండి విడిచాడు. ఆ బాణం వాలిరొమ్మును భేదించింది. వాలి నేలపై వ్రాలి, దశరథమహారాజుపుత్రు డైన శ్రీరాముడు అట్టి అకృత్యం చేయటం పాడిగాదని నిందిస్తూ అసువులు వదిలాడు. ఈ విధంగా.

విశేషం: అలం: ఉపమ. రుధిరధారలతో నొప్పారిన వాలిసుగ్రీవులు పూచిన అశోకవృక్షాలవలె శోభిల్లారు.

ఆ. వాలిఁ జంపి యతనివనిత సుగ్రీవుని । వశము సేసి నిఖిలవనచరేంద్ర
పదవియందు నెమ్మిఁ బట్టంబుఁ గట్టె వి । స్ఫారయశుఁడు రామభద్రుఁ డెలమి. 386

ప్రతిపదార్థం: వాలిన్= వాలిని; చంపి= సంహరించి; రామభద్రుఁడు= శ్రీరాముడు; వి, స్ఫార, యశుఁడు= బాగా విస్తరించిన కీర్తి కలవాడు; ఎలమిన్= సంతోషంతో; అతనివనితన్= వాలిభార్యను; సుగ్రీవునివశము+చేసి= సుగ్రీవుడి అధీనంకావించి; నిఖిల, వనచర+ఇంద్ర, పదవి+అందున్= సమస్తమైన కోతులకు రేడు అయిన పదవిలో; నెమ్మిన్= ప్రీతితో; పట్టంబున్+కట్టెన్= పట్టాభిషేకం చేశాడు.

తాత్పర్యం: శ్రీరాముడు వాలిని సంహరించి, సమస్త మైన కోతులకు రాజుగా సుగ్రీవుడికి పట్టాభిషేకం చేశాడు. ఆ విధంగా శ్రీరాముడు గొప్పకీర్తిని ఆర్జించాడు. మఱియును వాలిభార్యయైన తారను శ్రీరాముడు సుగ్రీవుడి వశం చేశాడు.

విశేషం: తార వాలిభార్య । ఒక యుద్ధంలో వాలి చచ్చిపోయాడని తలంచటంచేత సుగ్రీవుడు కిష్కింధకు రాజయినాడు. అప్పుడు తార సుగ్రీవుని చేరింది. వాలి సుగ్రీవుని జయించి తన భార్యయైన తారను తీసుకుపోయాడు. రాముడు వాలిని సంహరించిన పిమ్మట తార మరల సుగ్రీవుని చేరింది. రుమ సుగ్రీవుడు వివాహమాడిన భార్య.

వ. ఆ వనచరుండును రామునకుఁ గృతాంజలియై 'దేవా! యీఘర్మసమయశేషంబును ఘనసమయంబునుం గడపి మఱి సీతాన్వేషణంబునకు నుత్సహించుట లెస్స' యని యయ్యిరువురకును మాల్యవత్కూటంబున నివాసంబు గావించి తానును గిష్కింధాపురంబున నుండె; నంత. 387

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ వనచరుండును= ఆ వానరుడును, (ఆ సుగ్రీవుడును;) రామునకున్= శ్రీరాముడికి; కృత+అంజలి+ఐ= ఘటించిన అంజలికలవాడై, నమస్కరించినవాడు అయి; దేవా!= ప్రభూ!; ఈ ఘర్మసమయశేషంబును= ఈ వేసవికాలంలో మిగిలిన కాలాన్నీ; ఘనసమయంబునున్= వర్షాకాలాన్నీ; కడపి= పుచ్చి; మఱి= పిదప; సీతా+అన్వేషణంబునకున్= సీతను వెదకటానికి; ఉత్సహించుట= పూనటం; లెస్స= మంచిది; అని= అని వచించి; ఆ+ఇరువురకును= ఇద్దరకును, ఆరామలక్ష్మణులకు; మాల్యవత్+కూటంబునన్= మాల్యవంతం అనే కొండకొమ్మున(సమతలాన); నివాసంబు= ఉనికి; కావించి= ఏర్పరచి; తానును= సుగ్రీవుడును; కిష్కింధాపురంబునన్= కిష్కింధ అనే నగరంలో; ఉండెన్= నివసించాడు; అంతన్= అటు పిమ్మట.

తాత్పర్యం: ఆ వనచరు డైన సుగ్రీవుడు శ్రీరాముడికి నమస్కరించి ఇట్లన్నాడు - 'దేవా! ఈ మండువేసవికాలం మిగులు ఎంతయో లేదు. ఇక వచ్చేది వానకాలం. అది ప్రయాణానికి అనువైన సమయం కాదు. వర్షాకాలం గడచిన వెనువెంటనే కపులను సీతను వెదకటంకొర్కై పంపటం మంచిది' అని పల్కిన అనంతరం సుగ్రీవుడు రామలక్ష్మణులకు మాల్యవంతం మీద విడిది యేర్పరచి తాను రాజధానిఅయిన కిష్కింధానగరంలో నివసిస్తూ ఉన్నాడు. అంతట.

మ. **ఉరుఘర్మౌఘవిఘాతసంవిహితవిశ్వోల్లాసమై సంచల**
త్సరసాంభోదనినాదతూర్యరవమై చంచద్బలాకాగరు
ద్భరలీలానవచామరస్ఫురణమై పర్జన్యసామ్రాజ్యమొ
ప్పె రమామందిరమై యుదగ్రశిఖినీపింఛాతపత్రంబులన్. **388**

ప్రతిపదార్థం: పర్జన్యసామ్రాజ్యము= మేఘాలయొక్క విస్తారమైన ఏలుబడి; ఉరు, ఘర్మ+ఓఘ, విఘాత, సంవిహిత, విశ్వ+ఉల్లాసము+ఐ= మిక్కుటమైన చెమటవెల్లువలు లేకుండ చేయుటంచేత జగత్తుకు సంతోషం కలిగించేదై; సంచలత్+సరస+అంభస్+ద, నినాద, తూర్యరవము+ఐ= కదలేవి నీటితో కూడినవి అయిన మేఘాల గర్జనలనే బూరలధ్వనితో కూడినదై; చంచత్+బలాకా, గరుత్+భర, లీలా, నవ, చామర, స్ఫురణము+ఐ= విహరించే బెగ్గురుపక్షుల యొక్క అతిశయించిన రెక్కల విలాసముల వలన క్రొత్త చామరాలనే (చమరీమృగంయొక్క వెంట్రుకలతో చేయబడిన వీవనలను) తలపింప చేసేదై; ఉదగ్ర, శిఖినీపింఛ+ఆతపత్రంబులన్= గొప్పనెమలిపింఛాలనే గొడుగులతో; రమామందిరము+ఐ= లక్ష్మీనిలయమై; ఒప్పెన్= శోభిల్లింది.

తాత్పర్యం: మిక్కుటాలైన చెమటవెల్లువలను ఇంకింపచేయటంచేత జగత్తుకు సంతోషం కలిగించేదై, కదలాడే మేఘాలగర్జనలు అనే తూర్యనినాదాలు కలదై, బెగ్గురుపక్షుల రెక్కలు అనే చామరాలు కలదై, నెమలిపింఛా లనే గొడుగులు కలదై, లక్ష్మీనిలయమై పర్జన్యసామ్రాజ్యం శోభిల్లింది.

విశేషం: (1) అలం: రూపకం. (2) ఈ పద్యం ఎఱ్ఱన ప్రబంధపరమేశ్వరబిరుదాన్ని సార్థకం చేసే హృదయంగమకల్పన. ఇదివర్షాకాల వర్ణనం. వర్షఋతువులో కానవచ్చేవి కదలియాడే మబ్బులు; మేఘగర్జనలు బెగ్గురుపక్షులరెక్కల అతిశయం, పురివిప్పి ఆడే నెమళ్లు, జగత్తు ఆనందంలో ఓలలాడుతున్నట్లుగా సిరికళలతో శోభిల్లుతాయి. వర్షఋతువు పర్జన్యసామ్రాజ్యంగా వర్ణించబడింది. సామ్రాజ్యలాంఛనాలు విశ్వోల్లాసం, తూర్యరావాలు, ఛత్రచామరాలు- అన్నీ సమకూరాయి.

వ. **ఆ సమయంబున నక్కడ.** **389**

తాత్పర్యం: అదేకాలంలో లంకలోని అశోకవనంలో.

క. **దానవనాయకు చెఱఁ బడి। జానకి యురిఁ బడిన హరిణశాబమ పోలెన్**
మానిని సంతత భర్తృ। ధ్యానవివశ యగుచు నుండెఁ దాపం బెసఁగన్. 390

ప్రతిపదార్థం: జానకి= జనకుడి కూతురు (సీత); దానవనాయకుచెఱన్+పడి= రాక్షసనేత అయిన రావణుడిచేత బంధించబడి; ఉరిన్+పడిన= కంఠానికి అడ్డంగా తగుల్కొన్న ముడిలో పడిన (చావునకు ఆ విధంగా సుస్థిరమైన); హరిణశాబము+అ, పోలెన్= లేడిపిల్లవలెనే; మానిని= అభిమానం కల ఆడుది- సీత; సంతత, భర్తృ, ధ్యాన, వివశ+అగుచున్= ఎల్లప్పుడును భర్తను (శ్రీరాముడిని) గుర్చి ఆలోచించటంలోనే ఉండటంచేత వశంతప్పినదై; తాపంబు+ఎసఁగన్= బాధ అధికం కాగా; ఉండెన్= ఉన్నది.

తాత్పర్యం: సీతాదేవి రావణాసురుడిచెరలో ఉరిత్రాడుముడిలో చిక్కుకొన్న లేడిపిల్లవలె మిక్కిలి కష్టాలను అనుభవిస్తూ, ఎల్లప్పుడున్నూ తనపతి అయిన శ్రీరాముడిని స్మరించుకొంటూ తెలివితప్పి పడి ఉండింది.

విశేషం: అలం: ఉపమ.

వ. **అమ్మగువ కాపున్న దనుజాంగనలు త్ర్యక్షియు లలాటాక్షియుఁ ద్రిస్తనియు నేకపాదయు దీర్ఘజిహ్వాయు నజిహ్వాయుఁ ద్రిజటయు నేకలోచనయు మొదలయిన వారు పెక్కండ్రు వికృతాకారంబులతోడ నయ్యబలం బరివేష్టించి యహర్నిశంబును నుఱక యదల్చువారును బెలుచం దిట్టువారును ఖరోష్ట్రనిస్వనంబులు సెలంగ వెఱపించువారును ద్రిభువనాధిపతియైన మన దశగ్రీవునొల్లని యీ దుష్టమానుషిఁబట్టి చెండి కండలు దిందు మనువారునునై యున్న నయ్యుగ్మలి గళద్బాష్పయు గద్గదకంఠియు నగుచు నారాక్షసస్త్రీల కిట్లనియె.** 391

ప్రతిపదార్థం: ఆ+మగువ= ఆ ఆడుది(సీత); కాపు+ఉన్న= కావలి కాస్తున్న; దనుజ+అంగనలు= రాక్షసస్త్రీలు; త్ర్యక్షియున్= త్ర్యక్షిఅనే ఆమెయు; లలాట+అక్షియున్= లలాటాక్షి అనే ఆమెయు; త్రిస్తనియున్= త్రిస్తని యనే ఆమెయు; ఏకపాదయున్= ఏకపాద అనేదియు; దీర్ఘజిహ్వాయున్= దీర్ఘజిహ్వ అనేదియు; అజిహ్వాయున్= అజిహ్వాఅనేదియు; త్రిజటయున్= త్రిజట అనేదియును; ఏకలోచనయున్= ఏకలోచన అనేదియును; మొదలు+అయినవారు= మున్నగువారు; పెక్కండ్రు= పెక్కుమంది; వికృత+ఆకారంబులతోడన్= వికార మైన రూపాలతో; ఆ+అబలన్= ఆ వనితను - సీతాదేవిని; పరివేష్టించి= చుట్టుముట్టి; అహర్నిశంబును= పగలును రాత్రియును; ఉఱక= నిష్కారణంగా; అదల్చువారును= భయపెట్టేవారును; పెలుచన్= ఎక్కువగా; తిట్టువారును= దూషించేవారును; ఖర+ఉష్ట్ర నిస్వనంబులన్= గాడిదల యొక్కయు, ఒంటెలయొక్కయు, అరుపులు, చెలంగన్=ఒప్పేటట్లుగా, వెఱపించువారును= భయపెట్టేవారును, త్రి, భువన+అధిపతి+ఐన= మూడు లోకాలను ప్రభువు అయిన, మన, దశగ్రీవున్= దశకంఠుడిని,-రావణుడిని; ఒల్లని= అంగీకరించని; ఈ, దుష్ట, మానుషిన్= ఈ చెడుమనుజస్త్రీని, సీతను; పట్టి= పట్టుకొని; చెండి= ఖండించి; కండలు= శరీరంలోనిమాంసపు ముద్దలు, తిందుము= భుజిస్తాం; అనువారునున్, ఐ+ఉన్నన్= అయిఉండగా; ఆ+ఉగ్మలి= ఆ వనిత- ఆ సీత; గళత్+బాష్పయున్= జారునటువంటి కన్నీరు కలిగినట్టిదియును; గద్గద, కంఠియును= డగ్గుత్తిక పడిన గొంతుక కలదియు; అగుచున్= ఔతూ; ఆ, రాక్షసస్త్రీలకున్= ఆ రక్కసి మగువలకు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: వికృతాలైన రూపాలుకలవారు త్ర్యక్షి, లలాటాక్షి, త్రిస్తని, ఏకపాద, దీర్ఘజిహ్వ, అజిహ్వ, త్రిజట, ఏకలోచన మున్నగువారు, సార్థకనామధేయలు సీతాదేవికి కావలి కాస్తున్నారు. పగలు రేయి ఆమెను అదలిస్తున్నారు. నిష్కారణంగా బాధిస్తున్నారు. పలుసారులు సీతను తిట్టుతూ గాడిదలవలె లొట్టిపిట్టల(ఒంటెల) వలె అరుస్తూ ఆమెను భయపెట్టసాగారు. 'ఈ నీచురాలు ఈ మానవస్త్రీ మూడులోకాలకు ప్రభువైన రావణుడిని కాదన్నది. ఈమె శరీరంలోని మాంసపుముద్దలు ఖండించి భుజిస్తాం' అంటూ ఆమెను బెదిరించసాగారు. సీత డగ్గుత్తిక వడిన గొంతుకతో ఆ రక్కసి వనితలతో ఇట్లా పలికింది.

విశేషం: అశోకవనిలో సీతను చుట్టుముట్టి కావలి కాచిన రక్కసి మగువలపేర్లు అనుశీలించదగినవి. వారు వికృతాకారలు - కాబట్టి సార్థకనామధేయలు అని ఎంచవచ్చును; త్ర్యక్షి= మూడు కన్నులు కలది; లలాటాక్షి= నొసటియందు నేత్రం కలది; త్రిస్తని= మూడుగుబ్బలు గలది; ఏకపాద= ఒక కాలు కలది; దీర్ఘజిహ్వ= పొడుగుపాటి నాలుక కలది; అజిహ్వ= నాలుక లేనిది; త్రిజట= మూడు జడలు గలది; ఏకలోచన= ఒకేకన్ను కలది.

తే. **'అమ్మలార! మీవలసినయట్ల చేయుఁ । డింక నేటికిఁ దడయంగఁ? నేను రాముఁ**
దప్ప నొండొకపురుషుఁ జిత్తమునఁ దలఁప । నింత నిజము; నాకును జీవితేచ్ఛ లేదు'. **392**

ప్రతిపదార్థం: అమ్మలార!= ఓతల్లులార! (తల్లితో సమానలైనవారా!); మీవలసిన+అట్లు+చేయుఁడు= మీకు తోచినట్లు చేయండి; ఇంకన్+ఏటికిన్+తడయంగన్?= ఇక ఆలస్యం చేయటం ఎందుకు?; ఏను= నేను; రామున్+తప్పన్= రాముడిని తప్ప; ఒండు+ఒక, పురుషున్= మరొక మగవాడిని; చిత్తమునన్= మనస్సులో; తలఁపన్= స్మరించను; ఇంత= ఇది అంతయు; నిజము= సత్యం; నాకును= నాకు సయితం; జీవిత+ఇచ్ఛ= బ్రదుకు కోరిక; లేదు= లేదు.

తాత్పర్యం: 'ఓ తల్లులారా! మీకు నన్ను చంపవలెనని ఉన్నది. నాకుకూడ బ్రదుకవలెననే కోరిక లేదు. మీరు నన్ను మీకు తోచినట్లు చేయండి. నేను శ్రీరాముడిని తప్ప మనసులో వేరొకడిని కోరను'.

వ. **అనిన నజ్జానకితెగువ రావణున కెఱింగింపఁ గొందఱు సనిరి; మఱియు సంతతప్రియవాదినియు ధర్మజ్ఞయు నైన త్రిజట యను రక్కసి రామాంగనం జేరంజని యి ట్లనియె.** **393**

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; ఆ+జానకి= ఆసీత(యొక్క); తెగువ= సాహసం; రావణునకున్= రావణుడికి; ఎఱింగింపన్= తెలియచెప్పటానికి; కొందఱు= కొంతమంది (రాక్షస స్త్రీలు); చనిరి= వెళ్ళారు; మఱియున్= అంతేకాక; సంతతప్రియవాదినియున్= ఎల్లప్పుడును ప్రీతి కొలిపే మాటలు పలికేదిన్నీ; ధర్మజ్ఞయున్= ధర్మం తెలిసినదిన్నీ; ఐన= అయిన; త్రిజట, అను= త్రిజట అనే పేరు కల; రక్కసి= రాక్షసి; రామ+అంగనన్+చేరన్+చని= రాముడిభార్య అయిన సీత వద్దకు వెళ్ళి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: సీతాదేవి చావుకు తెగించిన సంగతి రావణుడికి తెలియచెప్పటానికి కొందరు రాక్షస స్త్రీలు అతడివద్దకు వెళ్ళారు. అంతట, ఎల్లప్పుడు మృదువైన మంచిమాటలు మాటాడే త్రిజట అనేరాక్షస స్త్రీ, శ్రీరాముడిభార్య అయిన సీతను సమీపించి ఇట్లా పలికింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

త్రిజట తన స్వప్నవృత్తాంతము సీతతోఁ జెప్పుట (సం. 3-264-53)

సీ. 'అమ్మ! నీ కెంతయు హర్షంబుగా నొక । వార్త నే నెఱిఁగింతు వనజవదన!
నామాట నిజముగా నమ్ముము వినవె! య । విన్ధ్యుఁడు నా నొక్కవృద్ధదైత్యుఁ
డనఘుండు రామహితాన్వేషి యై నీకు । నాశ్వాస మొనరింప నబల! నన్ను
బనిచెను; విను, నిన్నుఁ బాసిన పిదప ల । క్ష్మణుఁడును దాను సేమమునఁ గలసి

ఆ. యఖిలవానరేంద్రుఁ డైన సుగ్రీవుతోఁ । జెలిమి సేసి, యిపుడు శీఘ్రమునన
వీరవరుఁడు నిన్ను విడిపించు పనికినై । యొదవి యుత్సహించి యున్నవాఁడు. 394

ప్రతిపదార్థం: అమ్మ!= తల్లీ! (తల్లివంటిదానా); వనజ వదన!= పద్మంవంటి మొగం కలదానా, ఓ సీతాదేవీ!; నీకున్+ఎంతయున్, హర్షంబుగాన్= నీకు మిక్కిలి సంతసం కలిగించేటట్లు; ఒక వార్తన్= ఒక సమాచారాన్ని; ఏన్= నేను; ఎఱిఁగింతున్= తెలుపుతాను; నామాట= నాపలుకు; నిజముగాన్= సత్యం అని; నమ్ముము= విశ్వసించుము; వినవె= ఆలకించుము; అవిన్ధ్యుఁడు; నాన్= అనగా; ఒక్క, వృద్ధ, దైత్యుఁడు= ఒక ముసలి రక్కసుడు; అనఘుండు= పుణ్యాత్ముడు; రామ, హిత+అన్వేషి= శ్రీరాముడి మేలు కోరేవాడు; ఐ= అయి; అబల= ఓవనితా!- సీతా!; నీకున్= నీకు; ఆశ్వాసము+ఒనరింపన్= ఊరట కలిగించటానికై; నన్నున్= నన్ను; పనిచెను= నియోగించాడు; విను= ఆలకించుము; నిన్నున్+పాసిన, పిదపన్= నీ నుండి వేరుపడిన పిదప; లక్ష్మణుఁడును+తాను= లక్ష్మణుడును తానును (శ్రీరాముడును); సేమమునన్+కలసి= క్షేమంగా కూడుకొని; అఖిల, వానర+ఇంద్రుఁడు+ఐన= ఎల్ల కోతులకు రాజు అయిన; సుగ్రీవుతోన్= సుగ్రీవుడితో; చెలిమి+చేసి= స్నేహం ఏర్పరచుకొని; ఇపుడు= ఈ సమయంలో; శీఘ్రమునన్+అ= వేగంగా; వీర, వరుఁడు= శూరులలో శ్రేష్ఠుడు అయినవాడు- శ్రీరాముడు; నిన్నున్= ఓసీతా నిన్ను; విడిపించు పనికిన్+ఐ= రావణునిచెరనుండి విడిపించే కార్యంకొరకు; ఒదవి= పూని; ఉత్సహించి+ఉన్నవాఁడు= ఉద్యుక్తుడై ఉన్నాడు.

తాత్పర్యం: 'తల్లివంటిదానా! పద్మంవంటి ముఖం కల సీతాదేవీ! నేను నీకు ఒక శుభవార్త తెలుపుతాను. సావధానంగా వినుము. నాపలుకులు సత్యాలు. నామాట నమ్ముము. అవిన్ధ్యుడు అనే ఒక ముదుసలిరక్కసుడు శ్రీరాముడి మేలుగోరేవాడు నీతో ఈమాటలు చెప్పి నిన్ను ఊరడించుమని నన్ను వేడాడు. అలనాడు నిన్ను ఎడబాసిన పిమ్మట లక్ష్మణుడు శ్రీరాముడు క్షేమంగా కలిసికొన్నారు. పిదప వారు వానరరాజు అయిన సుగ్రీవుడితో స్నేహం చేశారు. ఇపుడు శీఘ్రంగా దండెత్తి ఇచటికి వచ్చి రావణుడిచెరనుండి నిన్ను విడిపించటానికై వస్తున్నారు.

వ. రావణునకు రంభానిమిత్తం బయిన నలకూబరు శాపంబుగలదు గావున నీయందు బలాత్కారంబు సేయరాదు; నీకు వీనివలని భయంబు వలదు; మఱి యిద్దురాత్మునకుం జేటు దెలుపునట్టి దుస్స్వప్నంబు గలిగె; నది యాకర్ణింపుము. 395

ప్రతిపదార్థం: రావణునకున్; రంభా, నిమిత్తంబు+అయిన= రంభకారణంగా కల; నలకూబరుశాపంబు= నలకూబరుడు ఇచ్చిన శాపం; కలదు= ఉన్నది; కావునన్= కాబట్టి; నీయందున్= నీ విషయంలో; బలాత్కారంబు= బలిమితో పీడించటం, భోగించటం; చేయరాదు= చేయజాలడు; నీకున్= నీకు; వీనివలన= ఇతడి వలన (రావణుడి వలన); భయంబు= భీతి; వలదు= పొందనక్కరలేదు; మఱి= ఇంక; ఈ+దురాత్మునకున్= ఈ చెడ్డ ఆత్మకలవాడికి (రావణుడికి); చేటు= కీడు; తెలుపు+అట్టి= సూచించేటి; దుస్స్వప్నము= చెడుకల; కలిగెన్= ఏర్పడింది; అది= ఆ కలను; ఆకర్ణింపుము= వినుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రావణుడు నిన్ను బలిమితో పీడించి సంభోగించనేరడు. దానికి ఒక కారణం ఉన్నది. రంభను బలాత్కరించి భోగించటంచేత నలకూబరుడు రావణుడిని శపించాడు. ఇక నీకు రావణుడి వలని భయం అనవసరం. ఇక ఆ దురాత్ముడైన రావణుడికి కీడు మూడింది. దానిని తెలిపే స్వప్నం నాకు వచ్చింది. ఆ కలను వివరించి చెప్పుతాను; వినుము.

విశేషం: 1. నలకూబరుడు కుబేరుడి కొడుకు. రంభ స్వర్గలోకంలో వేశ్య. నలకూబరుడి ప్రేయసి. ఒకసారి రావణుడు రంభను బలాత్కరించి సంభోగించాడు. నలకూబరుడు కోపించి, ఇకమీద రావణుడు ఏ వనితనైనా బలాత్కారంగా సంభోగిస్తే అతడి శిరస్సులు పగిలి చచ్చేటట్లు శాపం పెట్టాడు.

క. ఖరములఁ బూనిన రథమున । విరిసిన వెండ్రుకలు వెంట వ్రేలఁగ దశకం
ధరుఁడు బహుళతైలాప్లుత । శరీరుఁడై దక్షిణంబు సనఁ గలఁ గంటిన్. 396

ప్రతిపదార్థం: దశకంధరుఁడు= పదికంఠాలు కలవాడు - రావణుడు; ఖరములన్+పూనిన, రథమునన్= గాడిదలను పూన్చిన తేరుపై; విరిసిన= చెదరిన; వెండ్రుకలు= రోమాలు; వెంటన్= వెనుకగా; వ్రేలఁగన్= వ్రేలాడగా; బహుళ, తైల+ఆప్లుత, శరీరుఁడు+ఐ= మిక్కుటమైన నూనెతో ముంచబడిన దేహం కలవాడై; దక్షిణంబు+చనన్= దక్షిణపుదిక్కుగా ఏగుతున్నట్లు; కలన్+కంటిన్= స్వప్నాన్ని కన్నాను.

తాత్పర్యం: గాడిదలు లాగుతున్న అరదాన్ని ఎక్కి, జారుతున్న వెంట్రుకలతో, నూనెతో తడుపబడిన దేహం కలవాడై పదితలలు కల రావణుడు దక్షిణదిక్కువైపు వెళ్లుతున్నట్లు నాకు స్వప్నంలో కనబడ్డాడు.

విశేషం: 1. దక్షిణదిక్కుకు పాలకుడు యముడు. 2. గాడిదలు గుఱ్ఱాలకుబదులు రథాన్ని లాగటం అపశకునం.

తే. అతని చుట్టును గుంభకర్ణాదు లెల్ల । నరుణమాల్యానులేపనులై వికీర్ణ
పతితకేశులై నగ్నులై పరఁగఁ బ్రేత । పతిదిశకు నేఁగు గతి గానఁబడియె నాకు. 397

ప్రతిపదార్థం: అతని చుట్టును= రావణుడికి అన్నివైపులను; కుంభకర్ణ+ఆదులు+ఎల్లన్= కుంభకర్ణుడు మున్నగువారు అందరును; అరుణ, మాల్య+అనులేపనులు+ఐ= ఎఱ్ఱనిపూలదండలతో, ఎఱ్ఱనిమైపూతలతో కూడినవారై; వికీర్ణ, పతిత, కేశులు+ఐ= చెదరి క్రిందికి పడినజుట్టు కలవారయి; నగ్నులు+ఐ= దిగంబరులై; పరఁగన్= ఒప్పుగా; ప్రేతపతిదిశకున్= యముడి దిక్కునకు- దక్షిణదిశకు; ఏఁగు, గతిన్= వెడలుతున్న రీతి; నాకున్= నాకు; కానఁబడియెన్= గోచరించింది.

తాత్పర్యం: ఆ రావణుడి చుట్టూ, కుంభకర్ణుడు మొదలైన రాక్షసులు అందరును ఎఱ్ఱనిపువ్వులు ఎఱ్ఱనిమైపూతలు కలవారై, విరబోసిన జుట్టుముడులు జారిపోయి, వస్త్రాలు లేకుండ యముడిదిశకు వెడలుతున్నట్లు నాకు కన్పించారు.

చ. చారుసితోష్ణ వారణలసత్సితమాల్యసితాంగరాగుఁడై
ధీరగుణోత్తరుం డధికధీనిలయుండు విభీషణుండు వి
స్ఫారసితాద్రిశృంగమున భవ్యుఁడు మంత్రిచతుష్టయాన్వితుం
డై రమణీయలక్ష్మిఁ బొలుపారఁగ నేఁ గలగంటి నుగ్మలీ! 398

ప్రతిపదార్థం: ఉగ్మలీ!= ఓకాంతా! సీతాదేవీ! చారు, సిత+ఉష్ణ, వారణ, లసత్+సితమాల్య, సిత+అంగరాగుఁడు+ఐ= మనోజ్ఞమైన, తెల్లని ఛత్రమున్నూ, వెలుగొందే తెల్లనిపూలదండలున్నూ, తెల్లనిమైపూతలున్నూ కలవాడై; ధీర, గుణ+ఉత్తరుండు= చలించని ధైర్యము మున్నగుమంచిగుణాలచేత గొప్పవాడు అయి; అధిక, ధీ, నిలయుండు= మిక్కిలి తెలివితేటలకు నెలవు అయినవాడు; విభీషణుండు= విభీషణుడు (రావణుడి తమ్ముడు); భవ్యుఁడు= సాత్త్వికుడు; విస్ఫార, సిత+అద్రి, శృంగమునన్= ప్రకాశించే తెల్లనికొండకొమ్మునందు; మంత్రి; చతుష్టయ+అన్వితుండు+ఐ= మంత్రులు నలువురితో కూడిఉన్నవాడై; రమణీయలక్ష్మిన్= అందమైనశోభతో; పొలుపారఁగన్= విలసిల్లగా; నేన్= నేను; కల+కంటిన్= కల కన్నాను.

తాత్పర్యం: మనోజ్ఞమైన తెల్లని గొడుగును ధరించి, తెల్లనిపువ్వులను ముడిచి, తెల్లని మైపూత వహించి, ధైర్యంఅను మంచిగుణంతో గొప్పవాడై తెలివితేటలకు నెలవు అయిన విభీషణుడు తెల్లనికొండకొమ్మున తననలుగురు మంత్రులతోపాటు మిక్కుటమైనశోభతో విలసిల్లుతూండటం నేను స్వప్నంలో చూచాను.

విశేషం: తెలుపురంగు స్వచ్ఛతకు గుర్తు. రావణాదులు ఎర్రనిపూలు, ఎర్రనిమైపూతలు వహించటం, ప్రతియోగంగా విభీషణుడు తెలిపువ్వులు తెలుపుమైపూతలు వహించటం గమనించతగింది. పూర్వకాలంలో మరణదండన విధించబడినవారల మెడలో ఎర్రనిపూలదండలు వేయటం కద్దు.

చ. **తన సిత కీర్తి విశ్వవసుధా గగనాంతరపూరితంబుగా**
ఘనభుజుఁ డున్నతద్విరదకంధరసుస్థితుఁడై ముదంబుతో
ననుజుఁడు దాను రాఘవకులాగ్రణి సన్మధుసిక్తపాయసం
బొనర భుజింపఁ గంటి వికచోత్పలలోచన! నిక్కమింతయున్. **399**

ప్రతిపదార్థం: వికచ+ఉత్పల, లోచన!= వికసించిన కలువలవంటి కన్నులు కలదానా- ఓ సీతాదేవీ!; అనుజుఁడున్= తమ్ముడును; తాను= తాను; రాఘవ, కుల+అగ్రణి= రఘువుయొక్కకులంలో పుట్టినవారిలో శ్రేష్ఠుడు- శ్రీరాముడు; తన, సిత, కీర్తి= తనదైన తెల్లని యశస్సు; విశ్వవసుధా, గగన+అంతర, పూరితంబుగాన్= సమస్త మైన నేలకు, నింగికి కల మధ్యభాగాన్ని అంతటిని నింపుతుండగా; ఘనభుజుఁడు= గొప్పభుజాలు కలవాడు, అధికమైన శౌర్యంకలవాడు; ఉన్నత, ద్విరద, కంధర, సుస్థితుఁడు+ఐ= ఎత్తైన ఏనుగు మెడపై హాయిగా కూర్చున్నవాడై; ముదంబుతోన్= సంతోషంతో; సత్+మధు, సిక్త, పాయసంబు= మంచితేనెతో తడిసిన పరమాన్నం; ఒనరన్= ఒప్పిదంగా; భుజింపన్= తినుచుండటం; కంటిన్= చూచాను; ఇంతయున్= ఈ స్వప్న మంతయూ; నిక్కము= నిజం.

తాత్పర్యం: చెంగలువరేకులవంటి కనులు కల ఓ సీతాదేవీ! నాకు శ్రీరాముడు కలలో కన్పించాడు. తన తెల్లనియశస్సు భూమ్యాకాశాల మధ్యభాగాన్ని అంతటిని నింపగా, మహాపరాక్రమశాలి అయిన శ్రీరాముడు ఎత్తైన ఏనుగుమెడపై తమ్ముడు లక్ష్మణుడితో కలిసి కూర్చొని సంతోషంతో తేనెతో కూడిన పాయసాన్ని ఆరగిస్తున్నట్లు కల వచ్చింది. నాకు వచ్చిన కల నిజం (నిజమౌతుంది).

విశేషం: కీర్తి తెల్లగా ఉంటుంది. ఇది కవిసమయం.

క. **పులిచేత వ్రేటువడి మైఁ । గలయఁగ నెత్తురులు గ్రమ్మఁగా నేడ్చుచు ని**
మ్ముల నుత్తరాభిముఖి వై । కలుషితగతి నరుగ నిన్నుఁ గనుఁగొంటిఁ గలన్. **400**

ప్రతిపదార్థం: పులిచేతన్= వ్యాఘ్రంచేత; వ్రేటు+పడి= దెబ్బవేయబడి; మైన్+కలయఁగన్= శరీరంలో కలిసేటట్లుగా; నెత్తురులు= రక్తాలు; క్రమ్మఁగాన్= ఆవరించగా; ఏడ్చుచున్= ఆక్రోశిస్తూ; ఇమ్ములన్= యథేచ్ఛగా; ఉత్తర+అభిముఖివి+ఐ= ఉత్తరదిక్కుకు మొగం పెట్టినదానివై; కలుషితగతిన్= తొట్రుపడే నడకతో; అరుగు= వెడలే; నిన్నున్= ఓ సీతాదేవీ నిన్ను; కలన్= స్వప్నంలో; కనుఁగొంటిన్= చూచాను.

తాత్పర్యం: పెద్దపులిచేత కొట్టబడి శరీరంనిండా నెత్తురులు జాలువారుతుండగా శోకిస్తూ నీవు యథేచ్ఛగా ఉత్తరదిశవైపుకు తొట్రుపాటుతో కూడిన నడకతో పోవటం నేను నా స్వప్నంలో చూచాను.

క. నా కల నిక్కల యయ్యెడు । శోకింపకు మమ్మ యింక సుందరి! పుణ్య
శ్లోకు జితలోకు నతులవి । వేకుం బ్రియుఁ బొందఁగలుగు వేగమ నీకున్'. 401

ప్రతిపదార్థం: సుందరి!= (అందగత్తె వైన) ఓ సీతాదేవీ!; నా కల= నాకు వచ్చిన స్వప్నం; నిక్కల+అయ్యెడున్= నిజం అయ్యే కల కాగలదు (నిక్కము+కల= నిక్కల); శోకింపకుమమ్మ= దుఃఖించకుము; ఇంకన్= ఇకమీద; పుణ్యశ్లోకున్= పుణ్యం కలిగించే కీర్తికలవాడిని; జితలోకున్= జయించబడిన లోకం కలవాడిని (లోకవిజేతను); అ,తుల, వివేకున్= సాటిలేని విచక్షణాజ్ఞానం కలవాడిని; ప్రియున్= భర్తను; వేగము+అ= శీఘ్రంగా; నీకున్= నీకు; పొందన్+కలుగున్= పొందటానికి వీలు కలుగుతుంది.

తాత్పర్యం: అందగత్తె వైన ఓ సీతాదేవీ! నా కల నిజం కా గలదు. తల్లీ! ఇక దుఃఖించకుము. గొప్పయశస్సు నార్జించిన మహానుభావుడు, గొప్పపరాక్రమవంతుడు అయిన నీభర్తను నీవు శీఘ్రంగా పొందగలవు'.

ఆ. అనినఁ ద్రిజటపలుకు లవి నిక్కములు గాఁగ । వగచి సీత గొంత వనట దక్కి
యాసతోడ నుండె; నట దశవదనుండు । సీతఁ దలఁచి వివశచిత్తుఁ డగుచు. 402

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; త్రిజట పలుకులు= త్రిజట చెప్పిన మాటలు; అవి= అవి అన్నియును; నిక్కములు+కాఁగన్= నిజాలుగా; వగచి= భావించి; సీత= జానకి; కొంత= కొంచెం; వనట+తక్కి= విచారం మాని; ఆసతోడన్= ఆశతో; ఉండెన్= ఉండింది; అటన్= అక్కడ; దశవదనుండు= పదిమొగాలు కలవాడు, రావణుడు; సీతన్+తలఁచి= సీతను స్మరించి; వి, వశ, చిత్తుఁడు+అగుచున్= వశం తప్పిన మనస్సు కలవాడు ఔతూ.

తాత్పర్యం: త్రిజట చెప్పిన పలుకులు విని, అవి నిజాలు కావచ్చునని ఆశతో సీత కొంత ఊరటచెంది ఉండింది. అట రావణుడు సీతను స్మరించి వశం తప్పిన మనస్సుకలవా డయ్యాడు.

వ. తాను దేవదానవ గంధర్వాది భూతవర్గంబుల నెల్ల జయించియుం గందర్పదర్పంబు వారింప నోపక యాక్షణంబ దివ్యమాల్యాంబరాభరణ భూషితుండై సంచారశీలం బైన కల్పపాదపంబునుంబోలె నొప్పియుఁ దనయొప్పుఁ బితృవనంబునందలి వటభూరుహంబుసొంపునుంబోలె నతిభీషణం బగుచుండ నశోకవనమధ్యంబు సొత్తెంచి రోహిణీసమీపంబునకు వచ్చు శనైశ్చరుండునుంబోలె జానకిం జేరం జనుదెంచి ప్రణయపూర్వకంబుగా నిట్లనియె. 403

ప్రతిపదార్థం: తాను= తాను (రావణుడు); దేవ, దానవ, గంధర్వ+ఆది, భూత, వర్గంబులన్= వేల్పులు రాక్షసులు గంధర్వులు మున్నగునట్టి చేతనాచేతనజాతులను; ఎల్లన్= అన్నింటిని; జయించియున్= గెలిచియున్నా; కందర్ప, దర్పంబు= మన్మథుడియొక్క విజృంభణం; వారింపన్+ఓపక= అడ్డగింపజాలక; ఆ+క్షణంబు+అ= ఆ నిముసంలోనే; దివ్య, మాల్య+అంబర+ ఆభరణ, భూషితుండు+ఐ= దేవతామహిమగల పూవులు, వస్త్రాలు, భూషణాలచేత అలంకరించబడిన వాడై; సంచార శీలంబు+ఐన= నడచునట్టి స్వభావంగల; కల్ప, పాదపంబునున్+పోలెన్= కల్పవృక్షంవలె; ఒప్పియున్= శోభిల్లికూడ; తన+ఒప్పున్= తనశోభను, పితృవనంబు నందలి= శ్మశానంలోని; వటభూరుహంబు, సొంపునున్+పోలెన్= మర్రిచెట్టుయొక్క సొగసువలె; అతిభీషణంబు= మిక్కిలి భయంకరం; అగుచున్+ఉండన్= ఔతుండగా; అశోకవనమధ్యంబు+చొత్తెంచి= అశోకవనంయొక్క మధ్యభాగాన్ని చేరి; రోహిణీ, సమీపంబునకున్= రోహిణీనక్షత్రం దగ్గరకు; వచ్చు= అరుగుదెంచే; శనైశ్చరుండునున్+పోలెన్= శనిగ్రహం వలె; జానకిన్= సీతను; చేరన్+చనుదెంచి= చేరడానికి వచ్చి; ప్రణయ పూర్వకంబుగాన్= ప్రేమ తొణికిసలాడేటట్లుగా; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: రావణుడు వేల్పులు రాక్షసులు గంధర్వులు మున్నగు భూతజాతులను అన్నింటినీ గెలిచినవాడే అయినను మన్మథుడిని గెలువజాలకపోయాడు. ఇక సీతాదేవియొక్క అనురాగాన్ని చూరగొనటానికై రావణుడు దివ్యపుష్పాలు ముడిచి మంచివస్త్రాలను ఆభరణాలను ధరించి, నడుస్తున్న కల్పవృక్షంవలె అశోకవనానికి వచ్చాడు. కాని, ఆతడు శ్మశానంలో విస్తరించిన మర్రిచెట్టువలెనే భాసించి మిక్కిలి భయంకరంగా కన్పించాడు. రావణుడు అశోకవనంలో ఉన్న సీతాదేవివద్దకు రావటం రోహిణీనక్షత్రం సమీపానికి శనిగ్రహం చేరుతున్నట్లు కన్పించింది. ఆ రీతిగా రావణుడు సీతదరి చేరి అనురాగం తొణికిసలాడేటట్లుగా ఇట్లా పలికాడు.

విశేషం: 1. రావణుడు జంగమకల్పవృక్షంవలె చనుదెంచాడు అన్నప్పుడు. అలంకారం ఉత్ప్రేక్ష. కల్పవృక్షము- కదలునట్టిదికాదు. ఒకవేళ కదలితే ఎట్లుంటుందో అట్లా ఉన్నాడని ఊహించుకొనవలెను కాబట్టి ఉత్ప్రేక్ష. 2. కల్పవృక్షం స్వర్గంలో నందనవనంలోని చెట్టు. కోరిన కోరికల నిచ్చే మహిమ కలది. 3. వటవృక్షంవోలె అనుచో అలంకారం ఉపమ. 4. అట్లే శని రోహిణీ నక్షత్రాన్ని చేరినట్లు అనుచో అలంకారం ఉపమ. రోహిణీనక్షత్రాన్ని శనిగ్రహం చేరినప్పుడు లోకంలో పెక్కు అరిష్టాలు సంభవిస్తాయని జ్యోతిష్కులు చెప్పుతారు.

క. **'ఏల మదిరాక్షి! వలవని । జాలింబడి నవసెదవు లసద్భూషణ లీ**
లాలంకృతవై ననుఁ గృప । నేలికొనం గదవె వేయు నేటికి నింకన్. **404**

ప్రతిపదార్థం: మదిర+అక్షి!= మత్తెక్కించే నేత్రాలు కలదాన- ఓసీతాదేవీ! ఏల= ఎందుకు; వలవని= కూడని; జాలిన్+పడి= దుఃఖంలో పడి; నవసెదవు= వెతచెందుతావు; లసత్+భూషణ+అలంకృతవు+ఐ= ప్రకాశించే ఆభరణాలను సింగారించుకొనినదానివై; ననున్= నన్ను (రావణుడనైన నన్ను); కృపన్= దయతో; ఏలికొనన్+కదవె= పాలించుకొనవే; ఇంకన్= ఇక; వేయున్+ఏటికిన్?= వేలకొలది మాటలు ఎందుకు?

తాత్పర్యం: మత్తెక్కించే కన్నులు గల ఓ సీతాదేవీ! నీ కనుచూపులు చాలు. నేను మరులుగొని ఉన్నాను గదా! ఇటు నాపై దయచూపుము. ఎందుకు నీవు ఈరీతిగా కూడనిదుఃఖాన పడి కృశిస్తున్నావు? వెలుగొందే ఆభరణాలు ధరించి నన్ను దయతో ఏలుకొనుము. వేలకొలదిమాటలు మాటాడి నేను అధికప్రసంగం చేయదలచుకోలేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. అనిమిష యక్ష రాక్షస వియచ్చర కిన్నర పన్నగాసురాం
గనలఁ గరంబు చిత్తమునఁ గైకొన కే ననురాగలీలమై
నిను మది నాదరించు టిది నీదగుభాగ్యము గాదె? యింతయున్
వనిత! యెఱుంగ వైతి; గరువంపువిచారము లేల నీయెడన్. 405

ప్రతిపదార్థం: వనిత!= మగువా! ఓసీతాదేవీ!; అనిమిష, యక్ష, రాక్షస, వియత్+చర; కిన్నర, పన్నగ+అసుర+అంగనలన్= వేల్పులకు, యక్షులకు, కిన్నరులకు, పాములకు, అసురులకు చెందిన ఆడువారిని; కరంబు= మిక్కిలిగా; చిత్తమునన్= మనస్సులో; కైకొనక= స్వీకరించక; ఏన్= నేను; అనురాగలీలమైన్= ప్రేమతో నిండిన కేళిచొప్పున; నినున్= నిన్ను; మదిన్= మనస్సులో; ఆదరించుట= ప్రేమించటం; ఇది= ఇట్టి ప్రేమ; నీదు+అగు= నీది అయిన; భాగ్యము+కాదె= అదృష్టమే కదా?; ఇంతయున్= ఇది (అంతయు నీ అదృష్టయోగమే అని); ఎఱుంగవు+ఐతి= తెలిసికొనలేకపోయావు; గరువంపు విచారములు= గర్వంతో కూడిన ఆలోచనలు; ఈ+ఎడన్= ఈపట్టున; ఏల= ఎందుకు?

తాత్పర్యం: ఓ సీతాదేవీ! నేను దేవతలను యక్షులను గంధర్వులను కిన్నరులను పన్నగులను అందరను జయించినవాడను కదా! ఆయా జాతులలోని సుందరాంగులు ఎందరు లేరు? వారు అందరు నా అధీనంలో ఉన్నవారే అయినను వారిని ఎవ్వరిని వరించక నేను అనురాగంతో నిన్ను కోరటం నిజంగా నీకు పట్టిన గొప్ప అదృష్టయోగం సుమా! ఆ సంగతి నీవు గుర్తించలేదు. అనవసరమైన దుఃఖంలో మునిగి ఉన్నావు. గర్వంతో కూడిన ఆలోచనలు చేయటం ఈ పట్టున భావ్యం కాదు.

విశేషం: 1. కిన్నరులు - అశ్వముఖం నరశరీరంకల దేవజాతివారు. 2. అనిమిషులు - రెప్పపాటు లేనివారు- వేల్పులు. 3. రాక్షసులు, అసురులు దైత్యదానవులు. దితిసంతతి దనుసంతతి అని రక్కసులలో రెండు తెగలు. ఈ పద్యంలో రాక్షస అసుర పదాలు రెండూ వాడబడినవి.

ఉ. రాముఁ డనంగఁ బేర్మియును రాజ్యముఁ గోల్పడి కానలోన దుః
ఖామయ మగ్నుఁ డైన యొకయల్పమనుష్యుఁడు వానిపైఁ గడుం
బ్రేముడి సేయుచున్ వగపుపెల్లునఁ జిత్తము దల్లడిల్లఁగా
నీ మెయి నుండు నీయునికి యేసుఖ మండ్రు లతాంగి చెప్పుమా! 406

ప్రతిపదార్థం: లతా+అంగి!= తీగవంటి సుకుమార మైన శరీరం కలదానా!; ఓసీతాదేవీ!; రాముఁడు+అనంగన్= రాముడు అనగా; పేర్మియును= గొప్పతనాన్ని; రాజ్యమున్= రాజ్యపరిపాలనమును; కోల్పడి= పోగొట్టుకొని; కానలోనన్= అడవిలో; దుఃఖ+ఆమయ, మగ్నుఁడు+ఐన= ఆవేదన అనే రోగంలో మునిగినవాడు అయిన; ఒక= ఒకానొక; అల్పమనుష్యుఁడు= తక్కువ అయిన మానవుడు; వానిపైన్= అతనిపై, ఆ రాముడిపై; కడున్= మిక్కిలి; ప్రేముడి+చేయుచున్= అనురాగం చూపుతూ; వగపు పెల్లునన్= విచారంయొక్క అతిశయంతో, గొప్పదుఃఖంతో; చిత్తము= మనస్సు; తల్లడిల్లఁగాన్= ఆందోళన చెందగా; ఈ మెయిన్= ఈ రీతిగా; ఉండు= ఉన్నటువంటి; నీ+ఉనికి= నీ బ్రదుకు; ఏసుఖము= ఎట్టి సౌఖ్యంతో కూడింది; అండ్రు= అని చెప్పుతారు; చెప్పుమా= వచించుమా.

తాత్పర్యం: తీగవలె సుకుమారమైన శరీరంగల సీతాదేవీ! రాముడు ఎవడు? గొప్పతనమును, రాజ్యాన్ని గోలుపోయి అడవులలో తిరుగాడుతూ దుఃఖం అనే రోగంలో మునిగిన ఒక అల్పమానవుడు. అట్టి రాముడిపై నీవు ప్రేమ వహించి నీ మనస్సును దుఃఖంతో తల్లడిల్లేటట్లు చేస్తున్నావు. ఇది ఎటువంటి సుఖం? ఎవరు దీనిని సుఖమని చెప్పుతారు? నీవే చెప్పుము.

విశేషం: ఉ.వి. ఆంధ్రమహాభారత సంశోధిత ముద్రణ ప్రతిలో- "పేర్మియును రాజ్యము" అనే పాఠం ఉన్నది. (పేర్మియుమ- అనే అచ్చుతప్పుతో ఉన్న పాఠాన్ని సరిచేసుకోవాలి). "పేర్మి యువరాజ్యము' - అన్నది పాఠాంతరంగా గుర్తించబడింది. రాముడరణ్యవాసదీక్ష పూనే సమయంలో అతడు త్యాగంచేసింది యౌవరాజ్యాభిషేకమే కాబట్టి 'పేర్మి యువరాజ్యము' అనే పాఠాన్నే ఈ ప్రతిలో గ్రహించటమైనది.

వ. ఏను సకలలోకేశ్వరుండ; నాకుం గింకరులై పదునాలుగుకోట్లు నిశాచరభటులును, నిరువది యెనిమిదికోట్లు రాక్షసులును, నెనుబదియాఱుకోట్లు యక్షులును వర్తిల్లుదురు; నిఖిలధనాధ్యక్షుండయిన యక్షేశ్వరుండు నాయగ్రజుండు; బ్రహ్మసమానుం డగు విశ్రవసుండు మదీయజనకుండు; గుబేరునకు వినోదపాత్రంబు లైన గంధర్వాప్సరోగణంబులు నన్ను సేవించుఁ; బంచమలోకపాలుం డని నన్నుఁ ద్రిభువనంబులుఁ గీర్తించు; భక్ష్యభోజ్యాది వస్తువులును సురేశ్వరగృహంబునం దెట్లట్లనాగృహంబున నక్షయంబు; లిట్టినావిభవం బింతటికిని మదీయజీవితంబునకు నధీశ్వరివై సుఖంబున భోగింపు' మనిన విని, వైదేహి క్రోధశోకవ్యాకులహృదయ యగుచు వానిదెసం జూడక యొక్కతృణాంకురం బుపలక్షించి యి ట్లనియె.407

ప్రతిపదార్థం: ఏను= నేను; సకల, లోక+ఈశ్వరుండన్= సమస్తభువనాలకు అధినేతనైన పరిపాలకుడను; నాకున్= నాకు; కింకరులు+ఐ= సేవకులు అయి; పదునాలుగుకోట్లు నిశాచరభటులును= పదునాలుగుకోట్లమంది రాత్రించరులు- రాక్షసులును; ఇరువది+ఎనిమిదికోట్లు రాక్షసులును= ఇరువది ఎనిమిదికోట్లు రక్కసులును; ఎనుబది ఆఱుకోట్లు, యక్షులును= ఎనుబది ఆరుకోట్ల జక్కులును; వర్తిల్లుదురు= పనిచేస్తారు; నిఖిల, ధన+అధ్యక్షుండు+అయిన= సమస్తమైన ధనానికి అధిపతి అయిన; యక్షేశ్వరుండు= (యక్ష+ఈశ్వరుండు=) యక్షులయొక్క ప్రభువు- కుబేరుడు; నా+అగ్రజుండు= నా అన్న; బ్రహ్మసమానుండు+అగు= బ్రహ్మదేవుడితో తుల్యుడు అయిన; విశ్రవసుండు; మదీయ, జనకుండు= నా తండ్రి; కుబేరునకున్; వినోదపాత్రంబులు+ఐన= వేడుకను ఒనగూర్చేవి అయిన; గంధర్వ= గంధర్వుల కన్నెలు; అప్సరోగణంబులు= వేలుపుకన్నెల సముదాయాలు; నన్నున్= నన్ను; సేవించుచున్= కొలుస్తూ; పంచమ లోకపాలుండు+అని= అయిదవ లోకపాలకుడు అని; నన్నున్= నన్ను; త్రి, భువనంబులున్= మూడులోకాలున్నూ; కీర్తించున్= కొనియాడుతాయి; భక్ష్యభోజ్య+ఆది వస్తువులును= తినుబండారాలు మున్నగునవి; సుర+ఈశ్వర, గృహంబునందున్= దేవేంద్రుడి ఇంటిలో; ఎట్లు+అట్లు+అ= ఏయేవిధాలుగా ఉంటాయో అట్లా; నా గృహంబునన్= నా ఇంటిలో; అక్షయంబులు= తరుగనట్టివి; ఇట్టి= ఇటువంటి; నా విభవంబు= నా సంపద; ఇంతటికిని= సర్వస్వానికి; మదీయ, జీవితంబునకున్= నా బ్రదుకుకు; అధి+ఈశ్వరివి+ఐ= ఏలికసానివై; సుఖంబునన్= సౌఖ్యంతో; భోగింపుము= అనుభవించుము; అనినన్= అని (రావణుడు చెప్పగా); విని= ఆలకించి; వైదేహి= విదేహరాజుకూతురు సీతాదేవి; క్రోధ, శోక, వ్యాకుల, హృదయ,+అగుచున్= కోపంచేత, దుఃఖంచేత, కలత చెందిన డెందం కలది ఔతూ; వానిదెసన్= అతడి (రావణుడి) వైపు; చూడక= వీక్షించక; ఒక్క= ఒక; తృణ+అంకురంబు= గడ్డిపరక; ఉపలక్షించి= అన్యాపదేశంగా నిలిపి- అనగా రావణుడికి బదులుగా ఉద్దేశించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: 'నేను ఎవరో నీకు తెలియునా? నేను సకలభువనాలకు సార్వభౌముడిని. నాకు సేవకులుగా పదునాలుగుకోట్లమంది దైత్యులు, ఇరువదియెనిమిదికోట్లమంది దానవులు; ఎనుబదిఆరుకోట్లమంది యక్షులు ఉన్నారు. సమస్తమైన ధనానికి అధిపతి అయిన యక్షులప్రభువు కుబేరుడు నా అన్న. బ్రహ్మతో తుల్యుడు అయిన విశ్రవసుడు నా తండ్రి. కుబేరుడికి వినోదం కల్పించే గంధర్వకన్యలు అప్సరసలు నన్ను కొలుస్తూ ఉంటారు. మూడులోకాలు నన్ను 'పంచమలోకపాలకుడు' అని మన్నిస్తాయి. దేవేంద్రుడి ఇంటిలో ఉన్నట్లే నాగృహంలోనూ తినుబండారాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి నా సిరిసంపదలు. ఇట్టి నా ఐశ్వర్యానికే కాక నా జీవితానికి నీవు ఏలికసానివి కమ్ము. సమస్తసౌఖ్యాలు అనుభవించుము' అని రావణుడు చెప్పగా విని సీతాదేవి ఆతడి ముఖం చూడనొల్లక, మిక్కుటమైన కోపంచేత దుఃఖంచేత పీడించబడిన హృదయం కలదై, ఒక పచ్చగడ్డిపరకను రావణుడికి బదులుగా ఉద్దేశించి ఇట్లా పలికింది.

విశేషం: 1. భక్ష్యాలు= తినుబండారాలు. ఇవి 5 విధాలు. 1. భక్ష్యం 2. భోజ్యం 3. లేహ్యం 4. చోష్యం 5. పానీయం- ఉపలక్షణం ఇంకొక దానిని ఉద్దేశించి చెప్పింది. ఇచట తృణాంకురము (రావణుడి స్థానంలో) ఉపలక్షించబడింది.

సీ. **'అకట! పరాంగన, నబలఁ, బతివ్రతఁ, । బరికింపఁగా మర్త్యభామ నేను,**
రాక్షసుండవు నీవు; రాగంబు మది నించు । కయు లేని నాదు సంగమమునందుఁ
గలిగెడు నట్టి సౌఖ్యం బెంత? యదియును । గాక యాద్యుం డైన కమలగర్భు
పౌత్త్రుఁడ వని లోకపాలతుల్యుఁడ వని । హరసఖుం డైన ధనాధినాథు

ఆ. **భ్రాత వని భవత్ప్రభావంబు సెప్పితి; । విట్టి నీవు ధర్మ వెఱిఁగి దురిత**
వర్తనంబు విడువవలదె? సిగ్గేది యి । ప్పగిదిఁ బ్రల్లదములు వలుకఁ దగునె?' **408**

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; పర+అంగనన్= ఒరుని భార్యను; అబలన్= బలంలేనిదానను (కోమలిని అని భావం); పతివ్రతన్= భర్తయందే అనురక్తి కలిగినదానను; పరికింపఁగాన్= అరయగా; ఏను= నేను; మర్త్యభామను= మనుష్యస్త్రీని; నీవు= ఈవు; రాక్షసుండవు= రక్కసుడవు; మదిన్= చిత్తంలో; రాగంబు= ప్రేమ; ఇంచుకయున్ లేని= ఏమాత్రమున్నూ లేని; నాదు, సంగమము నందున్= నాపొందులో; కలిగెడు+అట్టి= ఏర్పడునట్టి; సౌఖ్యంబు= సుఖం; ఎంత= ఏమాత్రమైనది?; అదియును+కాక= అంతమాత్రమేగాక; ఆద్యుండు+ఐన= మొదటివాడు అయిన (సృష్టికి ఆద్యుడు అయిన); కమలగర్భు, పౌత్త్రుఁడన్= బ్రహ్మదేవుడి మనుమడిని; అని= అంటూ; లోకపాలతుల్యుఁడన్+అని= దిక్పాలకులతో సమానమైనవాడను అని; హరసఖుండు+ఐన= శివుడి మిత్రుడు అయిన; ధన+అధినాథు, భ్రాతన్= కుబేరుడిసోదరుడను; అని= అనుచూ; భవత్+ప్రతాపంబు= నీదైన మహిమ; చెప్పితివి= వచించావు; ఇట్టి నీవు= ఇటువంటి ప్రతాపం కల నీవు; ధర్మువు+ఎఱిఁగి= ధర్మాన్ని తెలిసికొని; దురిత, వర్తనంబు= చెడునడవడి; విడువన్+వలదె= వీడవలెను కదా; సిగ్గేది(సిగ్గు+ఏది)= సిగ్గువీడి; ఈరీతిగా; ప్రల్లదములు= పారుష్యాలు (కఠినమైన మాటలు); పలుకన్= తగునె?= వచించటం భావ్యమా? (భావ్యం కాదుకదా);

తాత్పర్యం: 'అయ్యో, రావణా! నాకు ఎంతటి దురవస్థ ఏర్పడింది. నేను ఒరుని భార్యను. కోమలిని, భర్తయందే అనురాగం కలిగి భర్తనే దైవంగా భావిస్తున్నదానను. నీవా రాక్షసుడవు. నీయందు ఏమాత్రం అనురాగం లేని నాపొందు నీకు ఏవిధంగానూ ఎట్టిసుఖం ఈయజాలదు కదా. అదియునుంగాక, నీవు బ్రహ్మదేవుడి మనుమడవు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అని, దిక్పాలకులతో సమానుడను అనీ, పరమశివుడిమిత్రుడు ధనపతి అయిన కుబేరుడిసోదరుడను అని గొప్పలు చెప్పుకొంటున్నావు. మఱి అంతటి గొప్పవాడికి ధర్మం తెలియాలి. చెడునడవడి వదలిపెట్టాలి. అంతే కాని ఈ రీతిగా నోటికి వచ్చినట్లు కండకావరంతో ప్రల్లదాలు ప్రేలవచ్చునా? నీ ప్రవర్తన ఎంతమాత్రం బాగా లేదు'.

విశేషం: కమలగర్భుఁడు= బ్రహ్మదేవుడు. విష్ణుమూర్తి నాభికమలంనుండి ఉద్భవించినగాథ సుప్రసిద్ధం.

వ. అని పలికి జానకి యుత్తరీయసంవృతవదనయై యతికరుణంబుగా నేడ్చిన నద్దురాత్ముండు వెండియుఁ గొన్ని దుర్వచనంబులు పచరించి యనంతరంబ యంతర్ధానంబు నొందె; నప్పాలఁతియు నెప్పటియట్ల రాక్షసీరక్షిత యై యుండె నని మార్కండేయుండు ధర్మరాజునకు నిర్దేశించిన తెఱఁగు వైశంపాయనోక్తంబైన యాఖ్యానంబు విఖ్యాతమాధుర్య మనోహరంబుగా. 409

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; జానకి= సీత; ఉత్తరీయ సంవృత వదన+ఐ= పైవస్త్రంచేత కప్పబడిన మొగం కలది అయి; అతి కరుణంబుగాన్= మిక్కిలి జాలిగా; ఏడ్చినన్= ఆక్రోశించగా; ఆ+దురాత్ముండు= ఆ చెడ్డ ఆత్మ కలవాడు- రావణుడు; వెండియున్= మఱియును; కొన్ని= కొన్ని; దుర్వచనంబులు= చెడు పలుకులు; పచరించి= పలికి; అనంతరంబు+అ= వెనువెంటనే; అంతర్ధానంబున్+ఒందెన్= కనుపించకుండా పోయాడు; ఆ+పాలఁతియున్= ఆ వనితయు- సీతాదేవియు; ఎప్పటి+అట్ల= యథాప్రకారంగా, ఇదివరకు వలెనే; రాక్షసీ రక్షిత+ఐ= రాక్షసస్త్రీలచేత కావలి కాయబడిందై; ఉండెన్= ఉండింది; అని= అని చెప్పి; మార్కండేయుండు; ధర్మరాజునకు; నిర్దేశించిన= తెలియచెప్పిన; తెఱఁగు= తీరు; వైశంపాయన+ఉక్తంబు+ఐన= వైశంపాయనుడిచేత చెప్పబడిన; ఆఖ్యానంబు= పెద్ద కథ; విఖ్యాత, మాధుర్య, మనస్+హరంబుగా= సుప్రసిద్ధమై, తియ్యనిదై, మనస్సును ఆహ్లాదపరిచేదిగా.

తాత్పర్యం: అని చెప్పి సీత ఉత్తరీయంతో ముఖం కప్పుకొని మిక్కిలి దీనంగా ఏడువగా, ఆ దుర్మార్గుడైన రావణుడు ఇంకా కొన్ని దుర్భాషలాడి వెళ్లిపోయాడు. సీత ఎప్పటివలెనే రాక్షస స్త్రీ రక్షితయై ఉన్నది అని మార్కండేయ మహర్షి ధర్మరాజుతో చెప్పినట్లు వైశంపాయనుడు విఖ్యాతంగానూ, మధురంగానూ, మనోహరంగానూ చెప్పాడు.

ఆశ్వాసాంతము

క. విమలక్షాత్ర గుణోన్నత! విమలాదిత్యాత్మజన్మ! విలసత్కమలా
రమణీ కరకమలోజ్జ్వల । విమలాంబుజరేణు రాగ విలసిత వక్షా! 410

ప్రతిపదార్థం: విమల, క్షాత్ర, గుణ+ఉన్నత!= స్వచ్ఛమైన క్షత్రియ లక్షణాలు కలిగి ఉండటంచేత గొప్పవాడా!, నిర్మలమైన పరాక్రమం, మంచి గుణాలు, కలిగిన గొప్పవాడా!, విమలాదిత్య+ఆత్మజన్మ!= విమలాదిత్యుడి కుమారా!; విలసత్, కమలా, రమణీ, కరకమల+ఉత్+జ్వల!= శోభిల్లునట్టి లక్ష్మీదేవియొక్క పద్మాలవంటి చేతులచేత ప్రకాశించేవాడా, లక్ష్మీప్రదమైన హస్తాలు కలవాడా!; విమల+అంబుజ రేణురాగ విలసితవక్షా!= స్వచ్ఛమైన తామరపువ్వొడియొక్క ఎఱుపు చేత శోభిల్లే వక్షం కలవాడా!

తాత్పర్యం: స్వచ్ఛమైన పరాక్రమం మంచిగుణాలతో శోభిల్లే శీలం కలవాడా! విమలాదిత్యుడి కుమారుడా! లక్ష్మీదేవియొక్క పద్మాలవంటి చేతులచేత ప్రకాశించేవాడా! స్వచ్ఛమైన తామరపువ్వొడి ఎఱుపుచేత శోభిల్లే వక్షం కలవాడా! ఓ రాజరాజనరేంద్రా! అవధరింపుము! ఈ ఆంధ్ర మహాభారత కృతిని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: విలసత్కమలాకర కమలోజ్జ్వలుఁడు - లక్ష్మీపాణిగ్రహణం చేసినవాడు విష్ణువు. అట్లే విమలాంబుజరేణురాగ విలసిత వక్షుఁడు విష్ణుమూర్తి. నావిష్ణుః పృథివీపతిః- రాజు విష్ణ్వంశసంభూతుడు. అందుచేత అర్థాంతర స్ఫూర్తిచేత రాజరాజనరేంద్రుడు విష్ణుదేవుడితో సమానుడు అని కవిహృదయం.

వనమయూరము.

> **భూసురకదంబ సురభూరుహ! వికాసో । ద్భాసిత కృపారసవిపాక! సుగుణైకో**
> **ల్లాస! హరహార మృగలాంఛన మృణాళీ । హాసినవకీర్తి విసరాకలితలోకా!** **411**

ప్రతిపదార్థం: భూసురకదంబసురభూరుహ!= బ్రాహ్మణుల సమూహాలకు కల్పవృక్షంవంటివాడా!; వికాస+ఉత్+భాసిత, కృపా, రసవిపాక!= వికసించటంచేత ప్రకాశించేటటువంటి - అనగా ఎప్పటికప్పుడు అతిశయించేటటువంటి దయారసంయొక్క పరిపక్వత కలవాడా!; సుగుణ+ఏక+ఉల్లాస! - మంచి గుణాలచేత ముఖ్యంగా సంతోషాన్ని కలిగించే వాడా!; హర,హార, మృగలాంఛన!, మృణాళీ, హాసి, నవకీర్తి విసర+ఆకలితలోకా= శివుడిని, ముత్యాల పేరును చంద్రుని తామరతూటిని పరిహసించే క్రొత్తకీర్తిరాశితో అంతటా నిండిన లోకం గలవాడా.

తాత్పర్యం: బ్రాహ్మణసమూహాలు కోరిన కోరికలు కల్పవృక్షంవలె తీర్చేవాడా! పరిపక్వమై ఎల్లప్పుడూ స్రవించే దయారసం కలవాడా! సద్గుణాలచేత ముఖ్యంగా సంతోషం కలిగించేవాడా!; శివుడిని, ముత్యాలపేరును, చంద్రుడిని, తామరతూండ్లను తెల్లదనంలో పరిహసించే స్వచ్ఛమైన కీర్తితో జగత్తును నింపినవాడా!

విశేషం: 1. కీర్తి తెల్లగా ఉంటుంది. ఇది కవిసమయం. అట్లే శివుడు, ముత్యాలసరం,చంద్రుడు, తామరతూడు తెలుపురంగులో భాసిస్తాయి. 2. కల్పవక్షం కోరిన కోరికలను తీరుస్తుంది. అది నందనవనవృక్షవిశేషం. కల్పవృక్షాలు అయిదు 1. మందారం 2. పారిజాతం 3. సంతానం 4. కల్పం 5. హరిచందనం 3. ఆశ్వాసాంత పద్యాలు- కృతిపతి అయిన రాజరాజనరేంద్రుడి సంబోధనలు. కాని, ఈ ఆరవ ఆశ్వాసం వ్రాసింది ఎఱ్ఱన మహాకవి అనే అంశం ఏడవ ఆశ్వాసం చివర సుస్పష్టంగా చెప్పబడింది. నాలుగవ ఆశ్వాసం 142వ పద్యంనుండి ఎఱ్ఱన వ్రాసినట్లు అన్ని తాళపత్రగ్రంథాలలోను సుస్పష్టంగా పేర్కొనబడింది. నన్నయ మరణించిన పిదప సుమారు రెండు శతాబ్దులు గడచిన పిమ్మట ఎఱ్ఱన మహాకవి ఆరణ్యపర్వశేషాన్ని నన్నయభట్టు పేరుమీదనే పూరించాడు. 3. ఈ వృత్త పాదంలో వరుసగా భ, జ, స, న, గగ- గణాలుంటాయి, 9వ అక్షరం యతి స్థానం, ప్రాసనియమం ఉన్నది.

గద్యము.

> **ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతంబైన శ్రీమహాభారతంబునం దారణ్యపర్వంబునందు దుర్యోధను ప్రాయోపవేశంబును, బాతాళగతు లయిన దానవు లతని నాశ్వాసించుటయు, వైష్ణవయాగ ప్రవర్తనంబును, బాండవులు గ్రమ్మఱఁ గామ్యకవనంబున కరుగుటయు, వ్రీహిద్రోణాఖ్యానంబును, ద్రౌపదీహరణంబును; జయద్రథు భంగంబును, రామాయణ కథా ప్రవృత్తియు, నందు రామరావణుల జననంబును, రాఘవవనప్రస్థానంబును, సీతాపహరణంబును, సుగ్రీవమిత్రత్వంబును, వాలివధయును, త్రిజటాస్వప్నకథనంబును, రావణ దుష్టవచనంబులు నన్నది షష్ఠాశ్వాసము.** **412**

తాత్పర్యం: ఇది- ఉత్తమకవులందరిచేత కీర్తించబడిన నన్నయభట్టారకుడిచేత రచించబడిన శ్రీమహాభారతంలోని ఆరణ్యపర్వంలోని షష్ఠాశ్వాసం. ఇందులో దుర్యోధనుడి ప్రాయోపవేశం, పాతాళంలోని రాక్షసులు దుర్యోధనుడిని ప్రోత్సహించటం, దుర్యోధనుడు వైష్ణవయాగం చేయటం, పాండవులు మరల కామ్యకవనానికి చేరటం, వ్రీహిద్రోణోపాఖ్యానం, ద్రౌపదిని చెరపట్టటం, జయద్రథుడి పరాభవం, రామాయణకథ, అందులో రామరావణుల జననవృత్తాంతం, శ్రీరాముడు అడవికి పోవటం, సీతను రావణుడు అపహరించటం, శ్రీరాముడు సుగ్రీవుడితో స్నేహం చేయటం, వాలిని శ్రీరాముడుసంహరించటం, త్రిజట తనస్వప్నాన్ని సీతాదేవికి చెప్పటం, రావణుడి పరుష వాక్యాలు- అనే అంశాలు ఉన్నాయి.

-: ఆరణ్యపర్వంలో ఆరవఆశ్వాసం సమాప్తం :-

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము -సప్తమాశ్వాసము

శ్రీకర సోమాన్వయ ర । త్నాకర హిమధామ! ధార్మికాంచిత వినయో

త్సేక! భువనైకవీర మ । హాకావ్యరస ప్రయోజనారూఢమతీ! 1

ప్రతిపదార్థం: శ్రీకర, సోమ+అన్వయ, రత్న+ఆకర, హిమధామ!= శోభాయమానమైన చంద్రవంశం అనే సముద్రానికి చంద్రుడివంటివాడా!; ధార్మిక+అంచిత, వినయ+ఉత్సేక!= ధర్మపరాయణులచేత పూజింపబడిన వినయాతిశయం కలవాడా!; భువన+ఏకవీర!= లోకంలో ముఖ్యమైన వీరుడా!; మహా, కావ్య, రసప్రయోజన+ఆరూఢ, మతీ!= గొప్ప సాహితీకృతులలోని రసాల ప్రయోజనమునందు ప్రసిద్ధమైన బుద్ధి గలవాడా!; అనగా మహాకావ్యాల ఉపరంజన ఉపదేశతత్త్వాన్ని ఆకళించుకొన్న సహృదయుడా! అని భావం.

తాత్పర్యం: శ్రీకరమైన చంద్రవంశం అనే సముద్రానికి చంద్రుడివంటివాడా! ధర్మాన్ని ఆచరించేవారి చేత ఆదరింపబడిన వినయాతిశయం కలవాడా! లోకంలో పేరెన్నిక కన్న మహావీరుడా! మహాకావ్యాలలోని రసాస్వాదనాన్ని, ఉపయోగాన్ని నెమ్మనంలో పొందుపరచుకొన్న మనస్సుగలవాడా! ఓ రాజరాజ నరేంద్రా!

విశేషం: (1) రాజరాజనరేంద్రుడు చాళుక్యరాజు. చాళుక్యులు చంద్రవంశజులు. చంద్రోదయానికి సముద్రం ఉప్పొంగుతుంది. అందుచేత రాజరాజనరేంద్రుడి ఉద్భవంచేత చాళుక్యవంశం ఉప్పొంగింది. (2) చాళుక్యవంశం రత్నాకరం. రత్నాలకు ఆకరమైనది సముద్రం. అనగా చాళుక్యవంశంలో రత్నాలవంటి రాజులు ఉద్భవించారని ధ్వని. (3) 'రసము' అనగా కావ్యపఠనంవలన సహృదయుడికి కలిగే ఆనందతన్మయత్వం. ఈ ఆనందం బ్రహ్మానంద సహోదరం, విగళితవేద్యాంతరం, సద్యఃపరనిర్వృతి అని ఆలంకారికులు అభివర్ణించారు. రాజరాజనరేంద్రుడు 'మహాకావ్య రస ప్రయోజనా రూఢమతి'. అనగా కావ్యశిల్పంలోని లోతుపాతులను సహృదయతతో అనుశీలించగల విద్వాంసుడు అని తాత్పర్యం. నన్నయభట్టుమహాకవి పేరుమీద ఈ సంబోధనలు కూర్చింది ఎఱ్ఱనమహాకవి. రాజరాజనరేంద్రుడికి సుమారు రెండువందల సంవత్సరాల పిదప వర్ధిల్లినవాడు. అనగా ఆంధ్రమహాభారత కృతిపతిగా రాజరాజనరేంద్రుడు సాహితీప్రపంచంలో అమరుడుగా మాననీయుడైన సహృదయసమ్రాట్టుగా ఎఱ్ఱనకాలంలోకూడా సుగృహీత నామధేయుడుగా ఉన్నాడన్నమాట.

రాముఁడు లక్ష్మణుని సుగ్రీవునొద్దకుఁ బంపుట (సం. 3-266-4)

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె; నట్లు పరమ తపోనిలయుండయిన మార్కండేయుండు పాండవులతో మఱియు నిట్లనియె; నంతమాల్యవత్కందరమందిరుండైన దశరథాగ్ర నందనుండు నవకందళిత సుందరంబులును జనకనందినీవియోగదుస్సహంబులు నగు ఘనసమయదివసంబుల నెట్టకేనియుం గడపి, నిరతిశయసాంద్రచంద్రాతప స్నపనశీతలసమీర వాహ్యమాన వినిద్రకుముదకేదారసౌరభ్య నిర్భరంబులు నతిదీర్ఘయామంబులు నైన శారదయామినులు సైఁపనోపక యొక్కనాఁడు దమ్మునిం జూచి యి ట్లనియె. 2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= ఆ కథను చెప్పేవాడు (ఉగ్రశ్రవసుడు అనే సూతుడు); శౌనక+ఆది, మహా, మునులకున్= శౌనకుడు మున్నగు గొప్ప ఋషులకు; చెప్పెన్= చెప్పాడు; అట్లు= ఆ రీతిగా; పరమ, తపస్+నిలయుండు+అయిన= గొప్ప తపస్సుకు నెలవు అయినవాడు అయిన; మార్కండేయుండు= మృకండుని కొడుకు; పాండవులతోన్= పాండునందనులతో; మఱియున్= వెండియు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అంతన్= అటు పిమ్మట; మాల్యవత్+కందర+మందిరుండు+ ఐన= మాల్యవంతం అనే పర్వతంయొక్క గుహను ఇల్లుగా చేసికొన్నవాడైన; దశరథ+అగ్ర, నందనుండు= దశరథుడి పెద్దకొడుకు- శ్రీరాముడు; నవ, కందళిత, సుందరంబులును= క్రొంగ్రొత్త మొలకలచేత అందంగా ఉన్నవియున్నూ; జనక, నందినీ, వియోగ, దుస్సహంబులున్= సీతాదేవినుండి కలిగిన యెడబాటుచేత ఓర్వజాలనివియునూ; అగు= అయిన; ఘనసమయ దివసంబులన్= వర్షాకాలపు దినాలను; ఎట్టకేనియున్+కడపి= ఏదోవిధంగా పుచ్చి; నిరతిశయ, సాంద్ర, చంద్ర+ఆతప, స్నపన, శీతల, సమీర వాహ్యమాన, వినిద్ర, కుముద, కేదార, సౌరభ్య, నిర్భరంబులును= మిక్కిలి దట్టమైన నెఱవెన్నెలలో స్నానం చేయించబడటం చేత చల్లనైన గాలులచేత మోయబడుచున్న వైన వికసించిన కలువపాదులనుండి వెలువడే పరిమళాలచేత నిండినవైన అతి దీర్ఘ, యామంబులున్+ఐన= మిక్కుటంగా పొడవైన జాములు కలిగిన; శారద యామినులు= శరత్కాలానికి చెందిన రాత్రులు; సైపన్+ఓపక= తాళజాలక; ఒక్కనాఁడు= ఒకరోజు; తమ్మునిన్+చూచి= తమ్ముడిని (లక్ష్మణుడిని) కాంచి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: మహాభారతకథను చెప్పే సూతుడు శ్రోతలైన శౌనకుడు మున్నగు మహర్షులకు చెప్పాడు: ఆవిధంగా మార్కండేయుడు మరలా మరలా ఇట్లా చెప్పాడు: మాల్యవత్ పర్వతగుహలో నివాసం ఏర్పరచుకొన్న శ్రీరాముడు వర్షాకాలాన్ని ఎంతో కష్టంతో ఏదోవిధంగా నెట్టాడు. వర్షఋతువులో రోజులు, జనకతనయ అయిన సీతాదేవి లేకపోవటంచేత భరించరానివే అయినా, క్రొంగ్రొత్త మొలకలు కన్నుల పండువుగా విస్తరిల్లటంచేత ఆ రాముడు ఎట్లో కాలక్షేపం చేయగలిగాడు. కాని, శరత్కాలంలో ఏర్పడిన రాత్రులను తాళలేకపోయాడు. శరదృతువులో రేలప్రొద్దులు ఎక్కువ. నెరవెన్నెలలు కాస్తాయి. ఆ నెరవెన్నెలలో స్నానం చేయించటంచేత చల్లనైన కలువ పుప్పొడితావులు గుబాళించే పిల్లగాలులు విహరిస్తూ ఉంటాయి. అందుచేత రాముడు సీతావిరహబాధను ఓర్వజాలక, తమ్ముడు అయిన లక్ష్మణుడితో ఇట్లా పలికాడు.

విశేషం: (1) అలం: అనుప్రాసం. బిందుపూర్వక దకారప్రయోగ పౌనఃపున్యం అనుశీలిందగింది. (2) చంద్రుడు కుముదబాంధవుడు. కలువలు వెన్నెలరేలలో శోభిల్లుతాయి. అందుకు శరదృతువులో కలువల శోభ, పరిమళాలు ఇంకను అధికం. నాయికానాయకులవిరహానికీ శరదృతువులోని నెఱవెన్నెలలకూ తెలుగుకవులు హృదయంగమమైన అవినాభావసంబంధాన్ని నెలకొల్పి అభివర్ణించారు.

సీ. **'చూచితే లక్ష్మణ! సుగ్రీవు కొఱగామి । యమ్మెయిఁ దనపగ యడఁచి మనము**
కపిరాజ్య మిచ్చినఁ గైకొని యింద్రియ । సుఖముల నెంతయుఁ జొక్కి నేఁడు
మనదిక్కుదలఁపఁడు; మనతోడఁ బల్కిన । సమయంబుఁ జెల్లింపఁ జనదె తనకు?
గడుఁ గృతఘ్నత సేసెఁ గపికులాధముఁడు; నీ । వనఘ! కిష్కింధకు నరుగు మిపుడ;

ఆ. **యద్దురాత్ముఁ గృపణు నాత్మీయ కార్య త । త్పరుని నధికరాగపరవశాత్ముఁ**
దొడరి వాలి చనిన త్రోవన యనిచి ర: । మ్మేల తడయ మనకు నింక నిచట? 3

ప్రతిపదార్థం: లక్ష్మణ!= ఓ లక్ష్మణా!; చూచితి+ఏ= అరసితివికదా; సుగ్రీవు= సుగ్రీవుని; కొఱగామి= పనికిరానితనం; ఆ+మెయిన్= ఆ రీతిగా; తన పగ= తన శత్రుత్వాన్ని; అడఁచి= నశింపజేసి; మనము= మనం (నీవును+నేనును); కపిరాజ్యము= కోతులపై ప్రభుత్వం; ఇచ్చినన్= ఇవ్వగా; కైకొని= తీసికొని; ఇంద్రియ సుఖములన్= విషయ భోగాలతో; ఎంతయున్= మిక్కుటంగా; చొక్కి= పరవశించి; నేఁడు= ఈ ప్రొద్దు; మనదిక్కు+తలఁపఁడు= మనవైపు చూడటం లేదు; మనతోడన్= మనతో; పల్కిన= వచించిన; సమయంబున్= ప్రతిజ్ఞను (ఒడంబడికను); తనకున్= తనకు (సుగ్రీవుడికి); చెల్లింపన్+చనదె= నెరవేర్చవలదా!; కపికుల+అధముండు= కోతుల జాతిలో తక్కువవాడు; కడున్= మిక్కిలి; కృతఘ్నుత+చేసెన్= చేసిన మేలును మరచినవాడు అయినాడు; అనఘ!= పాపం లేనివాడా!; నీవు= ఓ లక్ష్మణా!; ఇపుడు+అ= ఈ క్షణంలోనే; కిష్కింధకున్= (సుగ్రీవుడి రాజధాని అయిన) కిష్కింధకు; అరుగుము= పొమ్ము; ఆ+దురాత్మున్= ఆ చెడ్డ ఆత్మ కలవాడిని; కృపణున్= ఆ కుత్సితుడిని; ఆత్మీయ, కార్య, తత్పరునిన్= తన పనియందు మాత్రమే నిష్ఠ కలవాడిని, స్వార్థపరుడిని; అధికరాగ పరవశ+ఆత్మున్= మిక్కుటమైన కామంతో వశం తప్పిన మనస్సు కలవాడిని; తొడరి= పూని; వాలి చనిన త్రోవన్+అ= వాలి వెళ్లిన మార్గంలోనే; అనిచి, రమ్ము= పంపించి తిరిగి ఇచటకు వచ్చేది; ఇంకన్= ఇకమీద; మనకున్= మనకు; ఇచటన్= ఇక్కడ; తడయన్+ఏల?= ఆలసించటం ఎందుకు?

తాత్పర్యం: పుణ్యాత్ముడవైన ఓ లక్ష్మణా! చూచావు కదా ఆ సుగ్రీవు స్వభావం. వీడు ఎందుకూ పనికిరాని వాడుగా కనబడుతున్నాడు. ఈతడి శత్రువును సంహరించి మనం ఈతడిని కపిరాజ్యానికి అధిపతిని చేశాం. ఇతడు భోగలాలసుడై కాలం గడిపేస్తూ మనకు చేసిన వాగ్దానాలను మరిచిపోయాడు. ఇంతటి కృతఘ్నుతయా? నీవు ఇపుడే కిష్కింధకు బయలుదేరిపోయి, కోతిజాతిలో నీచుడైన ఆ సుగ్రీవుడిని అలనాడు వాలిని నేను సంహరించినట్లే సంహరించి తిరిగి రమ్ము. ఇంక ఇక్కడ ఆలస్యం చేయటం మనకు భావ్యం కాదు.

ఆ. **నీవు సనకమున్న నెఱితోడ మన కార్య । మునకుఁ దగిన యత్నములు ఘటించి**
యుండెనేని వాని నొండేమియుం జేయ । వలదు; తోడితె మ్మవార్యశౌర్య!' 4

ప్రతిపదార్థం: అవార్యశౌర్య!= వారించటానికి వీలులేని పరాక్రమం కలవాడా, లక్ష్మణా! నీవు+చనక, మున్ను+అ= నీవు (కిష్కంధకు) వెళ్ళటానికి ముందే; నెఱితోడన్= న్యాయంతో; మన, కార్యమునకున్= మన పనికి; తగిన= ఉచితమైన; యత్నములు= సన్నాహాలు; ఘటించి+ఉండెన్+ఏని= చేసి ఉన్నట్లయితే; వానిన్= (సుగ్రీవుడిని); అతడిని; ఒండు+ఏమియున్= ఇంకేమియును; చేయన్వలదు= చేయవద్దు; తోడితెమ్ము= నీ వెంట పెట్టుకొని తీసికొని రమ్ము.

తాత్పర్యం: అప్రతిహతమైన పరాక్రమం గల ఓ లక్ష్మణా! ఒకవేళ నీవు కిష్కింధకు వెళ్ళటానికి ముందే సుగ్రీవుడు మనకు చేసిన వాగ్దానాలమేరకు సీతాన్వేషణకై సన్నాహాలు చేసి ఉంటే అతడిజోలికి పోవద్దు. అతడిని నీ వెంట పెట్టుకొని ఇక్కడకు తీసికొని రమ్ము.'

చ. **అనుడుఁ దదాజ్ఞఁ బూని యతఁ డాతతకార్ముకహస్తుఁడై రయం**
బునఁ జనియెం గపీశ్వరునిప్రోలికి; వాఁడును సంభ్రమంబుతో
ననుఁగులుఁ దాను రాజసుతు నర్థి నెదుర్కొని మ్రొక్కి యర్ఘ్యపూ
జన మొనరించుడున్, విభునిశాసన మాతఁడు సెప్పె వానికిన్. 5

ప్రతిపదార్థం: అనుడున్= అని (శ్రీరాముడు) చెప్పగా; తద్+ఆజ్ఞన్+పూని= అతడి అనుశాసనాన్ని వహించి; అతఁడు= లక్ష్మణుడు; ఆతత, కార్ముక, హస్తుఁడు+ఐ= పెనువిల్లు చేతిలో ధరించినవాడై; కపి+ఈశ్వరుని ప్రోలికిన్= కోతులరాజైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సుగ్రీవుడి నగరానికి; రయంబునన్= వేగంగా; చనియెన్= వెళ్ళాడు; వాఁడును=అతడును= (సుగ్రీవుడును); సంభ్రమంబుతోన్= తత్తరపాటుతో; అనుఁగులున్+తానున్= ఆప్తులున్నూ, తానున్నూ; రాజసుతున్= రాచబిడ్డను (లక్ష్మణుడిని); అర్థిన్= ప్రీతితో; ఎదుర్కొని= స్వాగతం చెప్పి; మ్రొక్కి= నమస్కరించి; అర్ఘ్య, పూజనము= తగిన అర్చన; ఒనరించుడున్= చేయగా; ఆతఁడు= లక్ష్మణుడు; వానికిన్= అతడికి (సుగ్రీవుడికి); విభుని శాసనము= రాజుగారి ఆజ్ఞ (శ్రీరాముడి ఆనతి); చెప్పెన్= వినిపించాడు.

తాత్పర్యం: లక్ష్మణుడు శ్రీరాముడిఆజ్ఞమేరకు, అల్లెత్రాటిని అమర్చిన విల్లు చేతబూని వేగంగా కపిరాజధాని కిష్కింధకు వెళ్ళాడు. లక్ష్మణుడు ఎక్కుపెట్టటానికి సిద్ధం చేసిన ధనుస్సును చేతపట్టుకొని వచ్చే వార్తను విని, సుగ్రీవుడు, తొట్రుపాటుతో ఎదురేగి రాజపుత్రుడికి స్వాగతమర్యాదలు చేసి నమస్కరించాడు. లక్ష్మణుడు సార్వభౌముడైన శ్రీరాముడిఆజ్ఞను సుగ్రీవుడికి తెలిపాడు.

వ. **చెప్పిన విని భయకంపితగాత్రుం డగుచుఁ గమలమిత్త్రపుత్త్రుండు సుమిత్త్రాపుత్త్రున కిట్లనియె; 'నయ్యా! యే నేల కృతఘ్నుండ నగుదు? జానకి నన్వేషించుటకునై బలవంతులు బుద్ధిమంతులు నగువానరుల ననేకుల నలుదెసలకుం బనిచితి; వారును సకలవనశైలసాగరనగరగ్రామనదీసహితం బైన భూచక్రంబునం దెల్ల రోసి, యొక్కమాసంబులోనం గ్రమ్మఱివచ్చువారై సమయంబు సేసిపోయి; రింక నైదుదినంబులు గొఱంత; యింతియ; యటమీఁద వైదేహివార్త గొనుచు దేవరం గొలువవచ్చువాఁడనై యున్నవాఁడ' ననినం బ్రీతుండై లక్ష్మణుండు.** **6**

ప్రతిపదార్థం: చెప్పినన్, విని= (లక్ష్మణుడు) చెప్పగా విని; భయకంపితగాత్రుండు+అగుచున్= భీతిచేత గజగజలాడిన దేహం కలవాడు ఔతూ; కమలమిత్త్ర పుత్త్రుండు= సూర్యుడి కుమారుడు- సుగ్రీవుడు; సుమిత్త్రా పుత్త్రునకున్= లక్ష్మణుడికి (సుమిత్ర కొడుకుకు); ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అయ్యా!= ఆర్యా!; ఏను= నేను (సుగ్రీవుడను); ఏల= ఎందుకు; కృతఘ్నుండన్+అగుదున్= చేసిన మేలు మరచినవాడను ఔతాను? జానకిన్= సీతను; అన్వేషించుటకున్+ఐ= వెదకటానికై; బలవంతులు= శక్తి కలవారు; బుద్ధిమంతులు= తెలివితేటలు కలవారు, అగు= అయిన; వానరులన్+అనేకులన్= కోతులను పెక్కుమందిని; నలుదెసలకున్= నాలుగు దిక్కులకు; పనిచితిన్= పంపాను; వారును= వారు (ఆ కోతులును); సకల, వన, శైల, సాగర, నగర, గ్రామ, నదీ సహితంబు+ఐన= సమస్తమైన అడవులతో, కొండలతో, సముద్రాలతో, పట్టణాలతో, పల్లెలతో, ఏరులతో కూడుకొనిన; భూచక్రంబు+అందున్+ఎల్లన్= భూవలయంలో అన్నిచోటులలోను; రోసి= వెదకి; ఒక్క, మాసంబులోనన్= ఒక నెలలోపలనే; క్రమ్మఱి= తిరిగి; వచ్చువారు+ఐ= అరుదెంచేవారై; సమయంబు+చేసి+పోయిరి= ప్రతిజ్ఞ చేసి వెళ్ళారు; ఇంకన్= ఇకమీద; ఐదు దినంబులు= ఐదు రోజులు మాత్రమే; కొఱంత= మిగులు ఉన్నది; ఇంతియ= ఇంత మాత్రమే (గడువు మిగిలి ఉన్నది); అటమీఁదన్= ఆపైన; వైదేహి వార్త= సీత ఉనికిని గూర్చిన సమాచారం; కొనుచున్= గ్రహించుచూ; దేవరన్= అధినాథుడైన రాముడిని; కొలువన్‌వచ్చువాఁడను+ఐ= సేవించటానికి వచ్చేవాడినై; ఉన్నవాఁడన్= ఉన్నాను; అనినన్= అని చెప్పగా; లక్ష్మణుండు= లక్ష్మణుడు; ప్రీతుండు+ఐ= సంతృప్తి చెందినవాడై.

తాత్పర్యం: శ్రీరాముడి ఆదేశాన్ని లక్ష్మణుడినోటినుండి విని, భయంతో సుగ్రీవుడు గజగజ వణికాడు. అతడు లక్ష్మణుడితో 'అయ్యా! నేను చేసినమేలు మరచేటంతటి నీచుడను కాను. సీతాదేవిని వెదకటంకొరకై దేహబలం మాత్రమే గాక బుద్ధిబలంకూడ కలిగిన వానరులను ఏరి నాలుగు దిక్కులకు పంపించాను. వారు ఈ భూమండలాన్ని అంతటిని, అడవులు, కొండలు, సముద్రాలు, పట్టణాలు, పల్లెలు, నదులు అన్నింటిని గాలించి ఒకనెలలో తిరిగి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాగలమని ప్రతిజ్ఞ చేసి వెళ్ళారు. ఇంక ఆగడువు ముగియటానికి అయిదురోజులుమాత్రమే వ్యవధి ఉన్నది. ఇది ఇంతవరకు జరిగిన పని. నేను ప్రమత్తుడను కాను. సీతాదేవిఉనికినిగూర్చిన సమాచారం సేకరించిన పిదపనే దేవరవారి సందర్శనం చేయటం మంచిది అని ఇంతవరకు ఆగి ఉన్నాను' అని పలికాడు. సుగ్రీవుడు చెప్పిన సమాధానానికి లక్ష్మణుడు సంతృప్తి చెందాడు.

క. వానిం దోడ్కొని చని యా । భూనాథునిఁ గానుపించి పొందుగఁ దత్కా
ర్యానుష్ఠానవిశేషము । దా నెఱిఁగించుటయు విభుఁడు దద్దయు నలరెన్. 7

ప్రతిపదార్థం: వానిన్= అతడిని (సుగ్రీవుడిని); తోడ్కొని= వెంటపెట్టుకొని; (లక్ష్మణుడు); చని= వెళ్ళి; ఆ, భూనాథునిన్= ఆ రాజును, (ఆ శ్రీరాముడిని); కానుపించి= సందర్శనం చేయించి; పొందుగన్= తగినట్లుగా; తద్+కార్య+అనుష్ఠాన, విశేషము= అప్పుడు జరిగిన కర్తవ్యం ఏవిధంగా నెరవేర్పబడిందో ఆ విశేషం; తాన్=తాను; ఎఱిఁగించుటయున్= తెలుపగా; విభుఁడు= అధిపతి- శ్రీరాముడు; తద్దయున్= మిక్కుటంగా; అలరెన్= సంతోషించాడు.

తాత్పర్యం: లక్ష్మణుడు సుగ్రీవుడిని వెంటబెట్టుకొని వెడలి ఆ రామరాజుకు చూపించి, అప్పుడు కిష్కింధలో కర్తవ్యాలు నెరవేర్చబడినవిధాన్ని సవిస్తరంగా తెలిపాడు. శ్రీరాముడు మిక్కిలి సంతోషించాడు.

వ. పదంపడి కొన్ని దివసంబులకుఁ బూర్వపశ్చిమోత్తరదిక్కులకుం జనిన వనచరు లరుగుదెంచి రాఘవుం గని 'దేవా! సకలసాగరమేఖలావలయితం బైన భూవలయంబంతయు వెదకితిమి; దేవిం బొడగాన' మని చెప్పిన నతండు దుఃఖితుండయి, దక్షిణదిశకుఁబోయిన వానరులవలన వైదేహితెఱం గెఱుంగుదు నను నాసం జేసి ప్రాణంబులు ధరియించి యుండె; నంత వెండియు నొక్కమాసంబు సెల్లినఁ గొందఱువనచరులు పఱతెంచి సుగ్రీవుం గని యి ట్లనిరి. 8

ప్రతిపదార్థం: పదంపడి= అటు పిమ్మట; కొన్ని దివసంబులకున్= కొన్ని రోజులకు; పూర్వ, పశ్చిమ+ఉత్తర దిక్కులకున్= తూరుపు పడమర ఉత్తర దిశలకు; చనిన= వెళ్ళిన; వనచరులు= కోతులు; అరుదెంచి= వచ్చి; రాఘవున్+కని= శ్రీరాముడిని చూచి; దేవా!= ప్రభూ!; సకల, సాగర, మేఖలా, వలయితంబు+ఐన= సమస్తమైన సముద్రాలు అనే మొలనూలుతో చుట్టుకొనబడిన; భూ, వలయంబు+అంతయున్= భూమి చక్రాన్ని అంతటిని; వెదకితిమి= అన్వేషించాం; దేవిన్= (సీతా)దేవిని; పొడగానము= చూడలేదు; అని చెప్పినన్= అని నివేదించగా; అతండు= అతడు (శ్రీరాముడు); దుఃఖితుండు+అయి= ఆవేదన పొందిన వాడయి; దక్షిణదిశకున్= దక్షిణదిశకు; పోయిన= వెళ్ళిన; వానరులవలనన్= కోతులనుండి; వైదేహి, తెఱంగు= సీత ఉన్న తీరుతెన్నులు; ఎఱుంగుదున్= తెలిసికొనగలను; అను= అనే; ఆసన్+చేసి= ఆశతో; ప్రాణంబులు, ధరియించి= అసువులు వహించి; ఉండెన్= జీవించాడు; అంతన్= అటు పిదప; వెండియున్= మరల; ఒక్కమాసంబు+చెల్లినన్= నెలదినాలు గడవగా; కొందఱు, వనచరులు= కొంతమంది కోతులు; పఱతెంచి= అరుగుదెంచి; సుగ్రీవున్+కని= సుగ్రీవుడిని కాంచి; ఇట్లు+అనిరి= ఈ విధంగా వచించారు.

తాత్పర్యం: పిదప, కొన్నినాళ్ళకు తూరుపు పడమర ఉత్తర దిశలకు వెడలిన కోతులు తిరిగి వచ్చి, శ్రీరాముడిని సందర్శించి ఇట్లు పలికారు: 'దేవా సమస్తమైన సముద్రాలచేత చుట్టబడిన భూమండలాన్ని అంతటిని గాలించాం కాని ఎక్కడా సీతాదేవి మాకు కన్పించలేదు' అని నివేదించగా ఆ మాటలు విని శ్రీరాముడు మిక్కుటంగా దుఃఖించాడు. ఇక దక్షిణ దిక్కుకు ఏగిన కోతులవలన సీతనుగూర్చిన సమాచారం అందగల దనే ఆశతో అతడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బ్రదికి ఉన్నాడు. అంతట ఒక నెలరోజులు గడచిన పిమ్మట కొంతమంది వానరులు వచ్చి సుగ్రీవుడిని సందర్శించి ఈ విధంగా పలికారు.

సీ. 'నీవును వాలియు నేఁడును నాఁడునుఁ । బ్రియమునఁ బాటించు పెద్దతోఁట
మధువనం బదె నేఁడు మనయంగదుండును । హనుమంతుఁడును మొదలైనవారు
బలువిడిఁ జూఁడాడి ఫలము లానెదరు త । ద్రక్షకు లగు మమ్ము రయము మీఱ
భంగించి' రనవుడు భానునందనుఁ డాత్మ । 'నంగదప్రముఖులు యామ్యదిశకుఁ

తే. జనినవారలు గావున జనకపుత్త్రిఁ । గనిన యుబ్బిది గాఁబోలుఁ గాక; యిట్లు
సేయ వెఱవరె? పతికార్యసిద్ధి సలుపు । జనుల కీ చన వెందును జనున కాదె!' 9

ప్రతిపదార్థం: నీవును= ఓ సుగ్రీవా! నీవును; వాలియున్= వాలియు; నేఁడును= ఇప్పుడును; నాఁడును= అప్పుడును; ప్రియమునన్= ప్రీతితో; పాటించు= పరిపాలించే; పెద్దతోఁట= గొప్ప ఉద్యానవనం; మధువనంబు= 'మధువనం' అనే పేరు కలది; అది+ఎ= అదియె; నేఁడు= ఈప్రొద్దు; మన+అంగదుండును= మన అంగదుడు (వాలికొడుకు యువరాజు); హనుమంతుఁడును మొదలు+ఐనవారు= హనుమ మున్నగువారు; బలువిడిన్= బలంకొలది; చూఁడాడి= కొల్లగొట్టి; ఫలములు+ ఆనెదరు= పండ్లు తింటున్నారు; తత్+రక్షకులు= ఆ వనాన్ని కాపాడేవారలం; అగు= అయిన; మమ్మున్= మమ్ము; రయముమీఱన్= వేగం అతిశయించగా; భంగించిరి= అవమానించారు; అనవుడున్= అని చెప్పగా; భానునందనుఁడు= సుగ్రీవుడు; ఆత్మన్= మనస్సులో; అంగద ప్రముఖులు= అంగదుడు మున్నగువారు; యామ్యదిశకున్= దక్షిణదిక్కుకు; చనినవారలు= వెళ్లినవారు; కావునన్= కాబట్టి; జనకపుత్త్రిన్= సీతాదేవిని; కనిన+ఉబ్బు= చూచిన ఉత్సాహం; ఇది= (ఈ చేష్ట-మధువన విధ్వంసం); కాఁబోలున్= అయిఉండవచ్చును; కాక= అట్లుకాకపోతే; ఇట్లు+చేయన్+వెఱవరు+ఎ= ఈ విధంగా చేయటానికి భయపడరా?; పతి. కార్యసిద్ధి, సలుపు= రాజుగారి పనులను జయప్రదంగా నిర్వహించే; జనులకున్= మనుజులకు; ఈ చనవు= ఈ స్వాతంత్ర్యం; ఎందును+చనును+అ+కాదె!= ఎక్కడనైన చెల్లుబడి ఔతుంటుంది కదా!

తాత్పర్యం: ఓ సుగ్రీవమహారాజా! ఇప్పుడు నీవును, అప్పుడు వాలియు, మధువనం అనే ఉద్యానాన్ని మిక్కిలి ప్రీతితో పోషించి పెంచారు. అంతటి సుప్రసిద్ధమైన మన పెద్దతోటకు ఈనాడు ఎంతటిదుస్స్థితి దాపురించింది! యువరాజు అంగదుడు, హనుమంతుడు మున్నగువారు చేరి, స్వేచ్ఛగా విహరించి పండ్లు అన్నిటిని తెగదిన్నారు. ఆ తోటకాపరులమైన మేము అడ్డగించగా మమ్మల్ని అవమానించారు. వారి ఆనందాలకు అంతు లేదు' అని చెప్పారు. 'సీతను వెదకటానికై వారు దక్షిణదిక్కుకు వెళ్ళారు; వారు సీతాదేవిని సందర్శించి ఉంటారు. అందుచేతనే వీరికి ఈ మితిమీరిన ఉత్సాహం ఏర్పడింది. లేకపోతే ఈవిధంగా క్రమశిక్షణను ఉల్లంఘించి స్వేచ్ఛగా ప్రవర్తించి ఉండరు. రాజుగారు చేయుమనిన పనిని జయప్రదంగా నిర్వహించేవారికి ఇట్టి చనవు ఏర్పడటం సహజమే కదా!' అని సుగ్రీవుడు మనస్సులో భావించాడు.

విశేషం: (1) రామాయణంలో మధువనవిధ్వంసం ఒక మనోహర ఘట్టం. మనోధర్మవిశ్లేషణకు ఉపకరించే ముఖ్యసన్నివేశం. "సుగ్రీవాజ్ఞ" సుప్రసిద్ధ మైనది. సుగ్రీవుడు చండశాసనుడు. క్రమశిక్షణ ఉల్లంఘించటం ఎంతమాత్రం సైపడు. ఆ విషయం అంగదుడికి, హనుమంతుడు మున్నగువారికి తెలిసిందే. అయినా ఆ వానరులు మితిమీరి మధువనంలో అట్లా ప్రవర్తించటం ఎట్లా సంభవించింది? ఆ ప్రశ్నకు సమాధానం ఈ పద్యంలో ఉన్నది. రాజకార్యంలో అసాధారణవిజయం సాధించినవారికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అట్టి 'ఉబ్బు' కలుగుతుందని చండశాసనుడైన సుగ్రీవుడు గుర్తించాడు. మిక్కుటమైన క్రమశిక్షణలో బంధించబడి ఉండేవారికి తగినతరుణం లభిస్తే ఆటవిడుపుగా ఇటువంటి 'ఉబ్బు' ఏర్పడటం కద్దు.

వ. అని యూహించి తత్ప్రకారంబు రఘుపతికిం జెప్పె; నంత. 10

తాత్పర్యం: అని భావించి, తా నూహిస్తున్నపద్ధతిని రాముడికి నివేదించాడు. ఆపైన.

ఉ. తేనెలు గ్రోలి క్రోలి కడుఁదియ్యని కమ్మనిపండు లింపు సొం
పానఁగ నాని యాని పరపందిన నీడలు మెచ్చి మెచ్చి మం
దానిలశైత్యసౌరభసమగ్రతకుం గడుఁ జొక్కి చొక్కి యు
ద్యానమునందు మారుతసుతప్రముఖుల్ విహరించి తృప్తులై. 11

ప్రతిపదార్థం: మారుతసుత ప్రముఖుల్= వాయునందనుడైన హనుమంతుడు మున్నగువారు; తేనెలు= మధువులు; క్రోలిక్రోలి= మరీ మరీ ఆస్వాదించి; కడున్= మిక్కిలి; తియ్యని= మధురాలు అయిన; కమ్మని= రుచికరాలు అయిన; పండులు= ఫలాలు; ఇంపుసొంపు+ఆనఁగన్= కోరికలు సొగసులు శోభిల్లగా; ఆని+ఆని= ఆరగించి ఆరగించి; పరపు+అందిన= దట్టమైన; నీడలు= చాయలు; మెచ్చి+మెచ్చి= బాగా ఉన్నాయని పలుసారులు తలపోసి; మంద+అనిల, శైత్య, సౌరభ, సమగ్రతకున్= పిల్లగాలుల చల్లదనాల పరిమళాల నిండుదనానికి; కడున్= మిక్కిలిగ; చొక్కి+చొక్కి= సంతృప్తి చెంది చెంది; ఉద్యానము నందున్= పెంపుడు తోటలో; తృప్తులు+ఐ= సంతృప్తిని చెందినవారై; విహరించి= విచ్చలవిడిగా తిరుగాడి.

తాత్పర్యం: అట- వాయునందనుడైన హనుమంతుడు మున్నగువారు ఆ మధువనంలో విహరిస్తూ తేనెలు కడుపార త్రాగారు. తియ్యని కమ్మని ఫలాలు అమితంగా ఆరగించారు. దట్టమైన చెట్లనీడల్లో మెచ్చుకొంటూ విశ్రమించారు. పిల్లగాలుల చల్లదనాన్ని అనుభవించారు. పరిమళాలను ఆఘ్రాణించారు. ఆనందంలో తేలియాడారు.

విశేషం: (1) జీవితాలను పణంగా ఒడ్డి ఘనకార్యాన్ని - సీతాదేవి సందర్శనాన్ని - సాధించిన వానరులకు అది అవశ్యం అనుభవించదగిన ఆటవిడుపు. (2) సుగ్రీవుడు క్రమశిక్షణతో కూడుకొన్న పరిపాలనకు పేరువడినవాడు. పరిపాలనలోని ముఖ్యాంశాలు 1. క్రమశిక్షణ 2. పరేంగిత జ్ఞానం. 3. పట్టువిడుపులు. ఈ మూడున్నూ సుగ్రీవుడిశీలంలో కన్పిస్తున్నవి. మధువనంలో హద్దుమీరిన హనుమంతుడు మున్నగువారు కావలివారి దృష్టిలో దండనార్హులే. అయినా సుగ్రీవుడు పట్టువిడుపుల అదనెరిగిన పరిపాలనాదక్షుడు. కావున వారిని క్షమించాడు. పరేంగితజ్ఞానం పరిపాలనలోని ముఖ్యాంశం. ఇతరులమనస్సును గుర్తించే ఇంగితం పాలకులకు ఉండవలె. సుగ్రీవుడు వానరుల చర్యవలన వారు విజయం సాధించినవారని సీతాదేవి ఉనికిపట్టుల నెరిగి వచ్చారని వెంటనే గుర్తించగలిగాడు.

వ. అందఱుం గూడుకొని చని సుగ్రీవలక్ష్మణసహితుండై యున్న జననాథుం గని దండప్రణామంబులు సేసినం గాకుత్స్థకులప్రదీపకుండు వారల ముఖవర్ణవిశేషంబు లుపలక్షించి సీతం గనినవార కా నిశ్చయించె; నప్పు డత్యంతమతిమంతుం డయిన హనుమంతుండు రాఘవునకుఁ గృతాంజలి యై యిట్లనియె. 12

ప్రతిపదార్థం: అందఱున్= వానరులు అందరునూ; కూడుకొని= కలిసికొని; చని= వెడలి; సుగ్రీవ లక్ష్మణ సహితుండు+ఐ= సుగ్రీవుడితో లక్ష్మణుడితో కూడుకొని; ఉన్న= ఉన్నట్టి; జననాథున్= రాజును (శ్రీరాముడిని); కని= సందర్శించి; దండ, ప్రణామంబులు+చేసినన్= నేలమీదికి వాలి నమస్కృతులు చేయగా; కాకుత్స్థ, కుల, ప్రదీపకుండు= కాకుత్స్థ వంశాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రకాశింపజేసేవాడు శ్రీరాముడు; వారల, ముఖ, వర్ణ, విశేషంబులు+ఉపలక్షించి= ఆ వానరులయొక్క మొగాల రంగురూపురేకలు గమనించి; సీతన్= సీతను; కనినవారు+అ+కాన్= చూచినట్టివారలే అని; నిశ్చయించెన్= నిర్ణయించుకొన్నాడు; అప్పుడు= ఆ సమయంలో; అతి+అంత, మతిమంతుండు+అయిన= మిక్కిలి మేధ కలిగినవాడైన; హనుమంతుండు= ఆంజనేయుడు; రాఘవునకున్= శ్రీరాముడికి; కృత+అంజలి+ఐ= చేసిన నమస్కారం కలవాడై, నమస్కరించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: వానరు లందరు కలిసి మధువనం వీడి, సుగ్రీవుడితో, లక్ష్మణుడితో కూడిఉన్న శ్రీరాముడి సన్నిధానానికి వచ్చి, సవినయంగా నేలకొరిగి నమస్కరించి నిలిచారు. శ్రీరాముడు వానరులమొగాలలోని కవళికలుబట్టి వారు సీతాదేవిని సందర్శించారని నిశ్చయించాడు. అప్పుడు వానరు లందరిలో మేధావి అయిన హనుమంతుడు రాముడితో ఈ విధంగా చెప్పాడు.

విశేషం: వానరులు పెదవులు విప్పకుండగానే శ్రీరాముడు ఇంగితజ్ఞుడైన ఉత్తమ పరిపాలకుడు కాబట్టి, వారు సీతను సందర్శించారని మొగాలు చూచియే నిశ్చయించగలిగాడు.

క. **'దేవిఁ బొడగంటి నేను ధ । రావల్లభ! శైలసరిదరణ్యనగరపా**
రావారకలిత మగు వసు । ధా వలయము వెదకి వెదకి దక్షిణపుదిశన్. **13**

ప్రతిపదార్థం: ధరావల్లభ!= భూపతివైన ఓ శ్రీరామా!; ఏను= నేను; దేవిన్= సీతాదేవిని; శైల, సరిత్+అరణ్య, నగర, పారావార, కలితము+అగు= కొండలతో, నదులతో, అడవులతో, పట్టణాలతో, సముద్రాలతో కూడినది అయిన; వసుధావలయమున్= భూమండలాన్ని; వెదకి వెదకి= మరీ మరీ వెదకి; దక్షిణపుదిశన్= దక్షిణపు దిక్కున; పొడగంటిన్= చూచాను.

తాత్పర్యం: 'భూమికి అధిపతి వైన ఓ శ్రీరామప్రభూ! ఎట్టకేలకు నేను సీతాదేవిని సందర్శించాను. పెక్కు కొండలతో నదులతో అడవులతో పట్టణాలతో కూడిన ఈ సువిశాలభూమండలాన్ని అంతటిని అన్వేషించి అన్వేషించి, చివరకు దక్షిణదిక్కున దేవిని కాంచగల్గాను.

హనుమంతుఁడు రామునితో సీతం జూచిన వృత్తాంతంబు సెప్పుట (సం. 3-266-38)

తే. **అవధరింపుము దేవ! మే మందఱము న । నేకముఖమునఁ దొలి తొలి యిందు నందు**
నరయుచును బోయి యొక్కెడ నతివిశాల । మైన భూవివరముఁ గంటి మద్భుతముగ. **14**

ప్రతిపదార్థం: దేవ!= ప్రభూ!; అవధరింపుము= దయచేసి వీనులొగ్గి వినుము; మేము+అందఱమున్= మేము (వానరులం) అందరమున్నూ; అనేక ముఖమునన్= పెక్కుముఖాల అంటే (పెక్కు కండ్లు పెక్కు మొగాలు చేసికొని); తొలి తొలి= మొదట మొదట; ఇందున్+అందున్= ఇచట అచట అంటే అన్ని తావులలో; అరయుచును= చూస్తూ; పోయి= పయనించి; ఒక్క+యెడన్= ఒకానొక చోట; అతివిశాలము+ఐన= మిక్కిలి విస్తారం అయిన; భూవివరమున్= నేల సొరంగాన్ని; అద్భుతముగన్= అచ్చెరువు కలిగేటట్లుగా; కంటిమి= చూచాం.

తాత్పర్యం: ప్రభూ! శ్రీరామచంద్రా! దయచేసి నా మాటలు సావధానుడవై ఆలకింపుము. మేము పడిన శ్రమ నీకు విన్నవిస్తేకాని మాకు తృప్తి కలుగదుకదా! వానరులం మేము అందరం ఒడలెల్ల కళ్ళు చేసికొని ఇచట అచట అన్వేషిస్తూ పయనించి ఒకచోట అచ్చెరువు కలిగించే ఒకపెద్ద విస్తారమైన నేలసొరంగాన్ని చూచాం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. కని దానిం బ్రవేశించి, నిరంతరతిమిరసంవృతంబును, బహుకీటసంకులంబును నైన మార్గంబున ననేకయోజనంబులు సనునెడ ముందట నర్కప్రకాశం బైన పురంబు గానంబడియె; నందొక్కతాపసాంగన యుండి మమ్ము నాదరించి, తనపేరు ప్రభావతి యనియును, నప్పురంబు మయునిపురం బనియునుం జెప్పి, మధురంబు లయిన భక్ష్యభోజ్యంబు లొసంగినం దృప్తులమై తదుపదిష్టమార్గంబున మహీవివరంబు నిర్గమించి సహ్యదర్దురశైలంబులు గడచి మలయశైలశిఖరం బెక్కి. 15

ప్రతిపదార్థం: కని= చూచి; దానిన్= ఆ సొరంగాన్ని; ప్రవేశించి= చొచ్చి; నిరంతర, తిమిర, సంవృతంబును= ఎల్లప్పుడూ చీకటితో నిండినదిన్నీ; బహుకీట సంకులంబును+ఐన, మార్గంబునన్= పెక్కుపురుగులచేత దట్టంగా క్రిక్కిరిసిన త్రోవలో; అనేక యోజనంబులు= పెక్కు ఆమడలు; చను+ఎడన్= వెళ్లుతున్నపుడు; ముందటన్= కనులకు ఎదురుగా; అర్క, ప్రకాశంబు+ఐన= సూర్యరశ్మికలదానివలె వెలుగొందుతున్న; పురంబు= పట్టణం; కానంబడియెన్= కనుపించింది; అందున్= ఆ పురంలో; ఒక్క= ఒక; తాపస+అంగన= తపస్విని అయిన వనిత; ఉండి= నివసిస్తూ ఉండి; మమ్మున్= మమ్మల్ని (వానరులను); ఆదరించి= గౌరవించి; తనపేరు; ప్రభావతి+అనియును; ఆ+పురంబు= ఆపట్టణం: మయుని పురంబు= మయునియొక్క నగరం; అనియునున్= అనిన్నీ; చెప్పి; మధురంబులు+అయిన= తియ్యనివి అయిన; భక్ష్యభోజ్యంబులు= తినుబండములు పెక్కు రకాలు; ఒసంగినన్= ఇవ్వగా; తృప్తులము+ఐ= సంప్రీతి చెందినవారమై; తద్+ఉపదిష్ట, మార్గంబునన్= ఆమెచేత చెప్పబడిన మార్గంలో; మహీ, వివరంబు= నేల సొరంగం; నిర్గమించి= వెలువడి; సహ్యదర్దురశైలంబులు= సహ్యం దర్దురం అనే పర్వతాలను; కడచి= దాటి; మలయ, శైల, శిఖరంబున్= మలయపర్వతపు కొమ్మును; ఎక్కి= అధిరోహించి.

తాత్పర్యం: అచ్చెరువుగొలిపే ఆ నేలసొరంగాన్ని ప్రవేశించాం. అది చీకటితో నిండినట్టిది. పెక్కు క్రిమికీటకాలచేత క్రిక్కిరిసిన దారిలో పెక్కు ఆమడలు పయనించి, చివరకు ఒక నగరాన్ని చేరాం. ఆ నగరం సూర్యరశ్మి వలె ధగధగలాడుతున్నది. ఆ పట్టణంలో ఒక తాపసాంగన మాకు కన్పించింది. ఆమె మమ్మల్ని ఆదరించి తన పేరు ప్రభావతి అనిన్నీ, ఆపట్టణం మయుడిపట్టణమనిన్నీ చెప్పి మాకు తియ్యనితినుబండములు వడ్డించి మంచి విందు భోజనం సమకూర్చింది. మేము ఆమె పెట్టిన విందును ఆరగించి సంతృప్తి చెందినవారమై ఆమెసూచనలను పాటించి ఆ నేలసొరంగం దాటాం. పిదప సహ్యపర్వతాలను దర్దుర పర్వతశ్రేణులను దాటి చివరకు మలయపర్వతపు కొమ్ము చేరి నిలిచాం.

విశేషం: (I) మయుడు పురాణసుప్రసిద్ధుడైన శిల్పి. (ii) భక్ష్యాలు ఐదువిధాలు. 1. భక్ష్యం 2. భోజ్యం 3. లేహ్యం 4. చోష్యం 5. పానీయం (iii) సహ్యశైలం- పడమటిదిక్కున ఉండే కొండలు, పడమటి కనుమలు. మలయశైలం దక్షిణదిక్కున ఉండే పర్వతం. దక్షిణభారత ద్వీపకల్పంలో అటు పడమటి కనుమలు ఇటు తూర్పుకనుమలు దక్షిణాన ఒకచోట కలుస్తాయి. అక్కడ ఉన్న కొండలను మలయపర్వతశ్రేణులు అని ప్రాచీన భారతీయ సాహిత్యంలో నిర్దేశించబడింది.

స్రగ్ధర. లీలం గల్లోలమాలోల్లిఖితగగనమై, లీననానాకుళీర
వ్యాలోగ్రగ్రాహమీనావళుల నెసఁగి, దుర్వారవారోఘగంభీ
రాలంఘ్యప్రౌఢవేగం బగుచు బహుతరాయామవిస్తారమై బి
ట్టాలోకింపంగ నుగ్రం బగు జలనిధి నంతంతటం గంటి మంతన్. 16

ప్రతిపదార్థం: అంతన్= పిదప; అంత+అంతటన్= అల్లంత దూరంలో; లీలన్= హొయలుగా; కల్లోల, మాలా+ఉత్+లిఖిత గగనము+ఐ= కెరటాల వరుసలచేత స్పృశించబడినట్టి ఆకాశం కలదై (ఆకాశాన్ని అంటుతున్నట్లున్న ఎత్తయిన అలల

వరుసలు కలదై; లీన= మునిగిఉన్న; నానా, కుళీర, వ్యాళ+ఉగ్ర, గ్రాహ, మీన+ఆవళులన్= పెక్కు విధాలైన ఎండ్రులచేతను క్రూరమైనవి భయంకరమైనవి అయిన మొసళ్ళచేతను చేపలచేతను; ఎసఁగి= విజృంభించి; దుర్వార, వాః+ఓఘ, గంభీర+అలంఘ్య, ప్రౌఢ, వేగంబు+అగుచున్= వారించటానికి వీలులేని నీటిప్రవాహంచేత లోతై దాటటానికి శక్యంకానట్టిది, మిక్కిలి వేగం కలిగినది; బహుతర+ఆయామ, విస్తారము+ఐ= మిక్కిలి పొడవు వెడల్పు కలిగినట్టిదై; బిట్టు+ఆలోకింపంగన్= మిక్కిలి పరికించి చూడగా; ఉగ్రంబు+అగు= భయంకరం అయిన; జలనిధిన్= సముద్రాన్ని; కంటిమి= చూచాం.

తాత్పర్యం: అంతట, అల్లంత దూరాన సముద్రం మాకు కనిపించింది. ఆకడలికెరటాలు ఆకసాన్ని తాకుతున్నాయి. పెక్కు ఎండ్రకాయలు, భయంకరాలైన మొసళ్లు, చేపలు వేగంగా సుడులుతిరుగుతూ దాటటానికి శక్యంకాని ఆ సముద్రపు నీటివెల్లువలో లోతులోతులలో నివసిస్తున్నాయి. ఆ జలధి మిక్కిలి నిడివికలిగి దరిదాపులు లేకుండా భయంకరమై కన్పట్టింది.

విశేషం: స్రగ్ధరావృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా మ, ర, భ, న, య, య, య, అనే గణాలుంటాయి. 8, 15 అక్షరాలతో యతిమైత్రి, ప్రాస నియమం ఉన్నది.

క. **కని, యిది రత్నాకర; మి । వ్వననిధిసీమమునఁ గల్గు వసుమతిలోనన్**
జనకసుత వెదకి కానము; । చన దివ్వారాశి దాఁటి చన నెవ్వరికిన్. **17**

ప్రతిపదార్థం: కని= చూచి; ఇది= ఈ కనుపిస్తున్నది; రత్న+ఆకరము= రతనాలకు నెలవయింది- సముద్రం; ఈ+వననిధి, సీమమునన్= ఈ సముద్రానికి సంబంధించిన ప్రదేశంలో; కల్గు= ఉండే; వసుమతిలోనన్= భూమిలో; జనకసుత= జనకుడికూతురు సీతను; వెదకి= అన్వేషించి; కానము+అ= చూడలేకపోయాం; ఈ వారాశి= ఈ సముద్రాన్ని; దాఁటి= అతిక్రమించి; చనన్= వెళ్ళటానికి; ఎవ్వరికిన్= ఎవరికైనను; చనదు= వీలులేదు.

తాత్పర్యం: ఇది సముద్రం. ఈ సముద్రంలో ఉన్నప్రదేశాలను అన్నింటిని వెదికాం గాని సీతను చూడలేకపోయాము. ఇక ఈ సముద్రాన్ని దాటి వెళ్ళటానికి ఎవరికిని శక్యం కాదు.

ఉ. **'భూమితనూజఁ గాన మని పోయి రఘూద్వహుతోడఁ జెప్పి, య**
బ్భూమిపుచిత్త మాతురతఁ బొందఁగఁ జేయుటకంటెఁ, జూడఁగా
నీమెయిఁ జావు మేలు; మన కేల విచారము లింక?'నంచు నం
దేము గడంగి యందఱము నేకతమం బగు నిశ్చయంబుతోన్. **18**

ప్రతిపదార్థం: భూమితనూజన్= భూమికి కూతురు అయిన సీతాదేవిని; కానము+అని, = చూడలేము అని, పోయి= వెళ్లి; రఘు+ఉద్వహుతోడన్= రఘువుయొక్క వంశంలో పుట్టిన గొప్పవాడితో- శ్రీరాముడితో; చెప్పి; ఆ+భూమిపు, చిత్తము= ఆ రాజు మనస్సును, శ్రీరాముడి మనస్సును; ఆతురతన్+పొందఁగన్+చేయుకంటెన్= వేగిరపాటుతో కూడిన ఆవేదన చెందేటట్లుగా చేయటం కంటె; చూడఁగాన్= అరయగా; ఈమెయిన్= ఈ పార్శ్వమున-ఇక్కడ; చావు= మరణం; మేలు= మంచిది; మనకున్+ఏల, విచారములు+ఇంకన్+అంచున్= మనకు ఇంక వేరే ఆలోచనలు ఎందుకు అని తలపోస్తూ; అందున్= ఆ సముద్రతీరంలో; ఏము+అందఱమున్= మేం అందరమున్నూ; ఏకతమంబు+అగు= ఏకగ్రీవమైన; నిశ్చయంబుతోన్= నిర్ణయంతో; కడంగి= పూని.

తాత్పర్యం: 'సీతాదేవికొరకై వెదకి వెదకి వేసారాం. ఆమె ఎచట ఉన్నదో తెలిసికొనలేకపోయాం, అని చెప్పి రఘువంశశ్రేష్ఠుడైన శ్రీరామచంద్రమూర్తి మనస్సుకు వ్యాకులత కలిగించటంకంటె, మనమందరం ఇక్కడే గుమిగూడి మరణించటం మేలు' అనే నిర్ణయానికి ఏకగ్రీవంగా వచ్చాం. ఏమైనా మరణించటానికే నిశ్చయించుకున్నవారలం కాబట్టి ఇక తర్జనభర్జనలు మనకు అనవసరం.

వ. అనశనవ్రతంబు సంకల్పించి నియతచిత్తుల మై యుండి 'రాఘవుకార్యార్థంబై తెగిన జటాయువు గృతార్థుం డయ్యె; మనము నట్టి పుణ్యలోకంబు వడయుద' మని పలుకుచున్నయెడ. **19**

ప్రతిపదార్థం: అనశనవ్రతంబు= తిండిమాని మరణించే వ్రతదీక్ష; సంకల్పించి= మనస్సులో నిర్ణయించుకొని; నియతచిత్తులము+ఐ+ఉండి= నిగ్రహించబడిన మనస్సులు కలవారమై ఉండి; రాఘవుకార్య+అర్థంబు+ఐ= శ్రీరాముడి పనికొరకై; తెగిన= మరణించిన; జటాయువు= జటాయువు (అనే పేరుకల పక్షి); కృత+అర్థుండు= ధన్యుడు; అయ్యెన్= అయ్యాడు; మనమున్= మనంగూడ; అట్టి= ఆ జటాయువు చేరినట్టి; పుణ్యలోకంబు= స్వర్గం; పడయుదము= పొందుదాం; అని పలుకుచున్+ఉన్న+ఎడన్= అని మాట్లాడుతున్న సమయంలో. (మీది పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: అని ప్రాయోపవేశదీక్షతో మరణించటానికి మనస్సులలో నిర్ణయించుకొని, శ్రీరాముడిపనికొరకై జటాయువు చనిపోయి ధన్యుడయ్యాడుకదా! అట్లే మనంకూడ అట్టి పుణ్యాన్ని ఆర్జించి మరణానంతరం ఉత్తమగతికి పోదాం- అని మాట్లాడుతున్న సమయంలో.

క. గిరిశృంగతుంగవిగ్రహుఁ । డురుతరసత్త్వుఁడు విహంగమోత్తముఁ డం దొ
క్కరుఁ డొయ్యన మా యున్నెడ । కరుదుగఁ జనుదెంచి విగళితాశ్రుం డగుచున్. **20**

ప్రతిపదార్థం: గిరి, శృంగ, తుంగ విగ్రహుఁడు= కొండశిఖరంవలె ఎత్తయిన ఆకృతి కలవాడు; ఉరుతరసత్త్వుఁడు= మిక్కిలి గొప్పబలం కలవాడు; విహంగమ+ఉత్తముఁడు= పక్షులలో శ్రేష్ఠుడు; అందున్= అచట; ఒక్కరుఁడు= ఒంటరిగా ఒక్కడుగా ఉన్నవాడు; ఒయ్యనన్= తిన్నగా; మా+ఉన్న+ఎడకున్= మేము ఉన్నచోటికి; అరుదుగన్= ఆశ్చర్యకరముగా; చనుదెంచి= వచ్చి; విగళిత+అశ్రుండు+అగుచున్= జారిన కన్నీరు కలవాడు ఔతూ.

తాత్పర్యం: అప్పుడు పెద్దకొండశిఖరంవంటి రూపం కలవాడు మిక్కుటమైన బలం కలవాడు ఒకగొప్పపక్కిరేడు ఒంటరిగా ఆశ్చర్యకరముగా మేం ఉన్నచోటికి వచ్చి కన్నీరుకారుస్తూ, (ఇట్లా పలికాడు).

సీ. 'అయ్యలార! జటాయు వని పల్కెదరు మీర । లెవ్వరు? సెప్పరే! యేను వాని
కగ్రజుండ; ననూరునాత్మజన్ముల మేము; । సంపాతి నాపేరు; సమ్మదమున
నేనును దమ్ముఁడు నినమండలమునకుఁ । జనువేడ్క నొకనాఁడు చదల నెగసి
చనఁ జనఁ దీవ్రాంశుసంతాపమునఁ జేసి । కమరె నా ఱెక్కలు; గమర వయ్యె

తే. ననుజుపక్షమ్ము; లే నిమ్మహాచలమున । నాఁటఁగోలె నెచ్చటికిఁ జనంగ నేర
కున్నవాఁడ; నాతమ్ముఁ డెట్లున్నవాఁడొ? । యెఱుఁగ నెఱిఁగింపరే నాకు నిష్ట మెసఁగ.' **21**

ప్రతిపదార్థం: అయ్యలు+ఆర!= ఆర్యులారా!; జటాయువు+అని= జటాయువు అని; (మీరు); పల్కెదరు= అంటారు. మీరలు= మీరు; ఎవ్వరు?= ఎవ్వరు?; చెప్పరే?= తెలియచెప్పరా?; ఏను= నేను; వానికిన్= అతడికి (ఆ జటాయువుకు);

అగ్రజుండన్= ముందుపుట్టినవాడను, అన్నను; ఏము= మేము; అనూరు+ఆత్మజన్ముకులము= అనూరుడి కొడుకులం; నాపేరు= నా నామం; సంపాతి; సమ్మదమునన్= సంతోషంతో; ఏనును= నేనును; తమ్ముఁడున్= అనుజుడు అయిన జటాయువున్నూ; ఇనమండలమునకున్= సూర్యమండలానికి; చను, వేడ్కన్= వెళ్లాలనే సంబరంతో; ఒకనాఁడు= ఒకరోజు; చదలన్+ఎగసి= ఆకసానికి ఎగిరి; చనన్+చనన్= వెడలగా, వెడలగా; తీవ్ర+అంశు, సంతాపమునన్+చేసి= సూర్యుడియొక్క వేడిమివలన; నాఱెక్కలు= నాపక్షాలు; కమరెన్= మాడినవి; అనుజు, పక్షమ్ములు= నాతమ్ముడి రెక్కలు (జటాయువు రెక్కలు); కమరవు+అయ్యెన్= మాడిపోలేదు; ఏను= నేను; ఈ+మహా+అచలమునన్= ఈ పెద్దకొండమీద; నాఁటన్+కోలెన్= ఆనాటి నుండి; ఎచ్చటికిన్+చనంగన్నేరక+ఉన్నవాఁడన్= ఎగిరి ఎక్కడికీ వెళ్ళటానికి శక్తిలేనివాడనై ఉన్నాను; నాకున్+ఇష్టము+ఎసఁగన్= నాకు ప్రీతి అతిశయించేటట్లుగా; నాతమ్ముఁడు; ఎట్లు+ఉన్నవాఁడు+ఒ= ఏవిధంగా ఉన్నాడో; ఎఱిఁగింపరే= దయచేసి తెలుపరా?.

తాత్పర్యం: ఓ పూజ్యులారా! మీమాటలలో నాకు జటాయువు అనే పేరు విన్పించింది. మీరు ఎవరు? దయచేసి తెలపండి. నేను జటాయువుకు అన్నను. నేనూ జటాయువూ అనూరుడి కొడుకులం. నాపేరు 'సంపాతి'. ఒకనాడు మాచిన్నతనంలో నేనూ నాతమ్ముడూ వేడుకతో సూర్యమండలానికి వెళ్లవలెనని ఆకాశాన ఎత్తుగా ఎగురసాగాం. కొంతసేపటికి నా రెక్కలు సూర్యుడివేడిమికి మాడిపోయాయి. కాని, నాతమ్ముడు జటాయువు రెక్కలు మాత్రం మాడిపోలేదు. అతడిబలం అట్టిది. ఆనాటినుండి నేటివరకు, రెక్కలు లేని పక్షినై నేను ఈ కొండమీదనే పడిఉన్నాను. నాతమ్ముడైన జటాయువు యొక్క యోగక్షేమాలు దయచేసి మీరు నాకు తెలిపితే సంతసంతో వింటాను.

విశేషం: అనూరుడు సూర్యుడిసారథి. తొడలు లేనివాడు. గరుత్మంతుడి అన్న.

వ. అనిన నే మతనికి భవదీయవృత్తాంతంబును, రావణుండు దేవిం గొనిపోవుటయుఁ, దదర్థంబై రావణునితో జటాయువు సమరంబు సేసి యీల్గుటయుఁ జెప్పిన విని దుఃఖితుండై సంపాతి యస్మదీయ ప్రవర్తనం బేర్పడ నడిగి మా కిట్లనియె. **22**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఏము= మేము; అతనికిన్= ఆ సంపాతికి; భవదీయవృత్తాంతంబును= నీయొక్క సంగతిని; రావణుండు= రావణుడు; దేవిన్= (సీత)దేవిని; కొనిపోవుటయున్= అపహరించటమున్నూ; తద్+అర్థంబు+ఐ= ఆమెకొరకై; రావణునితోన్; జటాయువు; సమరంబు+చేసి= యుద్ధం చేసి; ఈల్గుటయున్= మరణించటమున్నూ; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; దుఃఖితుండు+ఐ= శోకించినవాడై; సంపాతి= జటాయువు అన్న; అస్మదీయ ప్రవర్తనంబు= మా నడవడి; ఏర్పడన్+అడిగి= తెలిసేటట్లుగా ప్రశ్నించి; మాకున్+ఇట్లు+అనియెన్= మాతో ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: అని సంపాతి మమ్మల్ని ప్రార్థించాడు. అంతట మేము అతడికి మీ సమాచారాన్ని, రావణుడు సీతాదేవిని అపహరించటమున్నూ, ఆ సీతకొరకై జటాయువు రావణుడితో యుద్ధం చేసి మరణించటమున్నూ చెప్పాం. ఆతడు తమ్ముడిమరణవార్త విని మిక్కుటంగా శోకించి, మావిషయాలనుగూర్చి ప్రశ్నించి తెలిసికొని ఈ విధంగా చెప్పాడు.

ఉ. 'రావణు నే నెఱుంగుదుఁ; బరాక్రమదుస్సహుఁ డన్నిశాచరుం;
దీవనరాశిమధ్యమున నిచ్చటికిన్ శతయోజనంబులన్

భూవిదితంబు లంక యను ప్రోలు తదీయనివాస; మచ్చటన్
భూవరుదేవిఁ గాన నగుఁ బొం; డరయుండు కృతప్రయత్నులై.' 23

ప్రతిపదార్థం: ఏన్= నేను; రావణున్= రావణుడిని; ఎఱుంగుదున్= తెలియుదును; ఆ+నిశాచరుండు= ఆ రాక్షసుడు; పరాక్రమదుస్సహుఁడు= శౌర్యంచేత సహించరానివాడు- గొప్పశౌర్యం కలవాడు; ఈవనరాశిమధ్యమునన్= ఈ సముద్ర మధ్యంలో; ఇచ్చటికిన్= ఈ స్థలానికి; శతయోజనంబులన్= నూరామడలదూరంలో; భూవిదితంబు= భూమిలో ప్రసిద్ధమైనది; లంక+అను, ప్రోలు= లంక అనే పట్టణం; తదీయనివాసము= ఆతనియొక్క నెలవు; అచ్చటన్= ఆస్థలంలో (ఆలంకలో); భూవరుదేవిన్= రాజుగారి భార్యను (సీతాదేవిని); కానన్+అగున్= చూడవచ్చును; పొండు= వెళ్ళండి; కృతప్రయత్నులు+ఐ= చేయబడిన యత్నం కలవారై (ప్రయత్నపరులై); అరయుండు= (సీతను) వెదకండి.

తాత్పర్యం: 'రావణుడిని నేను ఎఱుగుదును. ఆతడు గొప్పపరాక్రమం కలవాడు. అతడిని ఓడించటం సులభం కాదు. ఆ రాక్షసుడు ఈ సముద్రమధ్యంలో లంక అనే సుప్రసిద్ధపట్టణంలో నివసిస్తూ ఉంటాడు. మీరు ప్రయత్నం చేసి అక్కడికి వెళ్ళండి. అక్కడ శ్రీరాముడిభార్య సీత మీకు కనిపిస్తుంది'.

క. అని యతఁడు సనిన నందఱు । మును సాగరతరణకార్యమునకు నుపాయం
బొనరఁ దలపోయునెడ నే । నని యుత్సాహంబు సేయఁ డయ్యె నొకండున్. 24

ప్రతిపదార్థం: అని= అని వచించి; అతఁడు= సంపాతి; చనినన్= వెళ్ళగా; అందఱమును= (వానరులం) అందరమున్నూ; సాగర, తరణ, కార్యమునకున్= సముద్రాన్ని దాటటం అనే పనికి; ఉపాయంబు= వెరవు; ఒనరన్= ఒప్పిదంగా; తలపోయు+ఎడన్= ఆలోచించే సమయంలో; ఒకండున్= ఒక్కడు కూడ; ఏను+అని= నేను (చేస్తాను) అని; ఉత్సాహంబు+చేయఁడు+అయ్యెన్= ఉత్సహింపడయ్యెను, ముందుకు రాలేదని భావం.

తాత్పర్యం: లంకాపట్టణానికి పొమ్మని సంపాతి చెప్పాడు కాని, మావానరులలో ఒకడికి కూడ సముద్రం దాటే ఉపాయం తట్టలేదు. ఒక్కడును తాను ఆ పనికి పూనుకొనటానికి ఉత్సాహం చూపలేదు.

మ. జననాథోత్తమ! యేను బూని భవదాజ్ఞాలీల చెల్వంబు మ
జ్జనకుం డైన సమీరదేవుకృపయున్ సత్త్వోన్నతుం జేయఁగా
ఘనవాస్తుంగతరంగసంగతమహాగ్రాహోరగాత్యుగ్రద
ర్శనమై పేర్చు పయోధి దాఁటితి జనాశ్చర్యైకసంపాదినై. 25

ప్రతిపదార్థం: జననాథ+ఉత్తమ!= రాజులలో శ్రేష్ఠుడవైన వాడా (రామచంద్రా!); ఏను= నేను; పూని= కడగి; భవత్+ఆజ్ఞా, లీల, చెల్వంబున్= నీయొక్క ఆనతి అనే విలాసపు తీరు; మత్+జనకుండు+ఐన= నాతండ్రి అయిన; సమీర, దేవు, కృపయున్= వాయుదేవుడి దయయూ; సత్త్వ+ఉన్నతున్+చేయఁగాన్= బలంచేత గొప్పవాడినిగా చేయగా; ఘన, వాః+తుంగ, తరంగ, సంగత, మహా+గ్రాహ+ఉరగ+అతి+ఉగ్ర, దర్శనము+ఐ= అధికమయిన నీటిలోని ఎత్తైన కెరటాలచేత కూడి గొప్పవైన మొసళ్ళతో పాములతో కూడి భయంకరంగా కన్పించి; పేర్చు= అతిశయించే; పయోధిన్= సముద్రాన్ని; జన+ఆశ్చర్య+ ఏకసంపాదిన్+ఐ= ప్రజలకు పరమాశ్చర్యము కలిగించువాడనై; దాఁటితిన్= దాటాను.

తాత్పర్యం: రాజులలో గొప్పవాడ వైన రామా! నీ ఆజ్ఞ నెరవేర్చటంలోని సొగసు, నాతండ్రి అయిన వాయుదేవుడి దయ నాకు బలం చేకూర్చాయి. ఆ ప్రోత్సాహంతో పొంగారినశక్తితో, నేను ఎత్తయిన నీటికెరటాలతో కూడింది,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భయంకరమైన మొసళ్ళతోపాములతో చూడటానికి వెరపుకలిగించేది అయిన సముద్రాన్ని దాటాను. అది లోకులకు అచ్చెరువు గొలిపే సన్నివేశమే.

ఉ. ఆ లవణాబ్ధిమధ్యమునయందుఁ ద్రికూటనగంబుమీఁద ను
త్తాలవిశాలహేమమణిధామసముజ్జ్వల మైన లంక యన్
ప్రో లొగిఁ గంటి; నెంతయు నపూర్వము దద్విభవంబు; దేవ! య
చ్చో లలితాంగి నారయుచుఁ జొచ్చి యనేకవిధంబులం దగన్. 26

ప్రతిపదార్థం: దేవ!= ఓప్రభూ!; ఆ, లవణ+అబ్ధి, మధ్యమున+అందున్= ఆఉప్పుసముద్రంయొక్క నడిమిభాగంలో; త్రికూట, నగంబుమీఁదన్= త్రికూటంఅనే పేరు గల పర్వతంపై; ఉత్+తాల, విశాల, హేమ, మణి, ధామ, సమ్+ఉత్+జ్వలము+ఐన= మిక్కిలి ఎత్తైన, విస్తీర్ణంతో కూడిన, బంగారు మణులు చెక్కబడిన స్థలాలతో మిక్కుటంగా ప్రకాశించే; లంక+అన్+ప్రోలు= లంకఅనేపట్టణం; ఒగిన్= ఒప్పిదంగా; కంటిన్= చూచాను; తద్+విభవంబు= ఆపట్టణంయొక్క ఐశ్వర్యం; ఎంతయున్+ అపూర్వము= ఎంతయో గొప్పది; అచ్చోన్= ఆచోట; లలిత+అంగిన్= సుకుమార మైన దేహం కల దానిని-సీతను; ఆరయుచున్= వెదకుతూ; చొచ్చి= ప్రవేశించి; అనేకవిధంబులన్= పెక్కురీతులుగా; తగన్= సముచితంగా.

తాత్పర్యం: ఆఉప్పుసముద్రంమధ్య మూడుశిఖరాలతో ఒప్పారే ఒకపెద్దకొండమీద ఉన్న లంకాపట్టణాన్ని చూచాను. ఆ పట్టణపు సంపద ఇంక ఎక్కడా ఎప్పుడూ కానరానట్టిది. అక్కడ విశాలమైనవి కనకరత్నమయాలైనవి అయిన ఎత్తయినమేడలు విలసిల్లుతున్నాయి. ప్రభూ! వర్ణనాతీతం ఆ లంకాపురివైభవం. అచ్చట సీతాదేవిని వెదకుతూ పలుతావుల తిరుగాడాను.

వ. అరసి యొక్కెడ రావణాంతఃపురం బైన యశోకవనంబునందు. 27

తాత్పర్యం: వెదకి, ఒకచోట, రావణాసురుడి లోపలినగరిలో ఉన్న అశోకవనంలో.

సీ. కన్నీరు జడిగొని క్రమ్మఁ బ్రాఁ కెక్కిన । కమ్రకపోలభాగములు గలిగి
యవశమై యొఱఁగిన యంగవల్లిక పొంత । నున్న భూమీరుహం బూఁత గాఁగ
వెడలు నిట్టూర్పులవేఁడిమిఁ బగిలిన । యధరపల్లవము గారాకుఁ బోలఁ
దలఁపులసందడి దందడించిన తాల్మి । గదిరి శిరఃకంపగతుల బెరయ

ఆ. నున్న పుణ్యమూర్తి నుత్తమసౌందర్య । నవనతాస్య నార్త యైన దానిఁ
గని విదేహతనయఁ గా నెఱింగితి నేను । హా! రఘుప్రవీర! యనుచు నడల. 28

ప్రతిపదార్థం: కన్నీరు= కంటినీరు; జడి+కొని, క్రమ్మన్= వెల్లువగా స్రవించటంచేత; ప్రాఁకు+ఎక్కిన= పాచి పట్టిన; కమ్ర, కపోల, భాగములు= అందమైన చెక్కిళ్ళు; కలిగి; అవశము+ఐ= వశం తప్పినదై; ఒఱఁగిన= వాలిన; అంగవల్లిక= తీగవంటిదేహం; పొంతన్+ఉన్న= సమీపంలో కల; భూమీరుహంబు= చెట్టు; ఊఁత+కాఁగన్= ఆధారం కాగా; వెడలు= బయటకు వచ్చే; నిడు+ఊర్పుల, వేఁడిమిన్= నిడివి అయిన నిశ్వాసాల తాపంచేత; పగిలిన= బ్రద్దలైన; అధరపల్లవము= చిగురుటాకువంటి పెదవి; కారాకున్= కారు+ఆకున్+పోలన్= పండుటాకువలె ఉండగా; తలఁపులసందడి= ఆలోచనల సమ్మర్దంచేత; దందడించినతాల్మి= కలత చెందిన ఓర్పు; కదిరి= ఏర్పడి; శిరస్+కంప, గతులన్= తల అట్టిటు ఊచుతూ ఉండటంచేత;

బెరయన్= అలముకొనగా; ఉన్న+పుణ్యమూర్తిన్= పుణ్యం ఆకృతి ధరించినట్లుగా కనిపించినదానిని; ఉత్తమ, సౌందర్యన్= మంచి సొగసు కలదానిని; అవనత+ఆస్యన్= వంచిన మొగం కలదానిని (ముఖం వంచుకొని ఉన్నదానిని); ఆర్త+ఐనదానిన్= దీనురాలిని; కని= చూచి; ఏను= నేను; విదేహతనయన్+కాన్= విదేహరాజపుత్రి అయిన సీతగా; హా!రఘుప్రవీర!= అయ్యో, ఓ రఘువంశంలోని గొప్పవీరుడా!; అనుచున్= అని అంటూ; అడలన్= ఏడ్చుచుండటంచేత; ఎఱింగితిన్= తెలిసికొన్నాను.

తాత్పర్యం: వెదకి వెదకి రావణుడి అంతఃపురంలో ఉన్న అశోకవనం చేరాను. అక్కడ కన్నీరు కారటంచేత పాచిపట్టి మలినమైన చెక్కిళ్ళు కలదానిని, వశం తప్పిన దేహాన్ని సమీపంలో ఉన్న చెట్టుకు ఆసరాగా చేర్చినదానిని, వెడలుతున్న వేడినిట్టూర్పులవలన పగిలి పండుటాకునుబోలిన పెదవి కలదానిని, హృదయంలోని ఆవేదనచేత తరచు తల ఆడిస్తున్న దానిని. సహజమైన సౌందర్యం కలదానిని, శోకంచేత తలవంచుకొని ఉన్నదానిని, 'హా!రఘువీర!' అని దుఃఖిస్తున్న దానిని- వైదేహి అయిన సీతాదేవిగా గుర్తించాను.

క. వినయమున దేవిఁ జేరం । జని యభివాదనము సేసి 'జానకి రఘునం
దనుదూత నేను మారుత । తనయుఁడ వానరుఁడ నిన్నుఁ దడవ నిచటికిన్. 29

ప్రతిపదార్థం: వినయమునన్= అణకువతో; దేవిన్= (సీతా)దేవిని; చేరన్+చని= సమీపించి; అభివాదనము+చేసి= నమస్కరించి; జానకి!= జనకుని కూతురవు అయిన ఓసీతా! ఏను= నేను; రఘునందనుదూతన్= రాముడి రాయబారిని; మారుత, తనయుఁడన్= వాయుదేవుడి కొడకును; వానరుఁడన్= కోతిని; నిన్నున్= నిన్ను, తడవన్= అన్వేషించటంకొరకై; ఇచటికిన్= ఈస్థలానికి.

తాత్పర్యం: అణకువతో సీతాదేవిదగ్గరకు వెళ్లి, నమస్కారం చేసి, 'జనకమహారాజుకూతుర వైన ఓసీతా!', నేను శ్రీరాముడిదూతను వాయుపుత్రుడను, వానరుడను; నిన్ను వెదకటానికై (తరువాతి వచనంతో అన్వయం).

వ. అరుగుదెంచితి; రామలక్ష్మణు లత్యంతకుశలంబున నున్నవారు; వానరేశ్వరుం డయిన సుగ్రీవుండు వారితో సఖ్యంబు సేసి, తత్కార్యంబు దీర్పం బూనె; నింక మసలక నీహృదయేశ్వరుండు సనుదెంచు; నూఱడిల్లుము.30

ప్రతిపదార్థం: అరుగుదెంచితిన్= వచ్చాను; రామలక్ష్మణులు= రాముడును లక్ష్మణుడును; అత్యంతకుశలంబునన్+ఉన్నవారు= మిక్కిలి క్షేమంగా ఉన్నారు; వానర+ఈశ్వరుండు+అయిన= కోతులకు రాజు అయిన; సుగ్రీవుండు; వారితోన్= రామలక్ష్మణులతో; సఖ్యంబు+చేసి= మైత్రినెరపి; తద్+కార్యంబు= వారిపని; తీర్పన్+పూనెన్= నెరవేర్చటానికి పూనుకొన్నాడు; ఇంకన్= ఇకమీద; మసలక= తడయక; నీహృదయ+ఈశ్వరుండు= నీభర్త శ్రీరాముడు; చనుదెంచున్= వస్తాడు; ఊఱడిల్లుము= తేరుకొమ్ము.

తాత్పర్యం: వచ్చాను; రామలక్ష్మణులు క్షేమంగా ఉన్నారు. కోతులరాజయిన సుగ్రీవుడితో వారు మైత్రి చేశారు. సుగ్రీవుడు రామలక్ష్మణులకు సాయం చేయటానికీ, వారికార్యం నెరవేర్చటానికీ ప్రతిజ్ఞ చేశాడు. ఇంక జాగుచేయక నీభర్త అయిన శ్రీరాముడు రాగలడు. నీవు ఊరడిల్లుము.

క. 'రక్కసుఁడఁ గాను జుమ్మీ! । నిక్కము వానరుఁడ నేను; నీమదిలోనం
దక్కు మనుమాన' మనవుఁడు । నొక్కింత దలంచికొని సముత్సుక యగుచున్. 31

ప్రతిపదార్థం: రక్కసుఁడన్= రాక్షసుఁడను; కాను+చుమ్మీ= కానుసుమా; నిక్కము= సత్యం; ఏను= నేను; వానరుఁడన్= కోతిని; నీమదిలోనన్= నీమనస్సులో; అనుమానము= సందేహం; తక్కుము= వీడుము; అనవుడున్= అని చెప్పగా; ఒక్క+ఇంత= కొంచెం; తలంచికొని= యోచించి; (సీత); సముత్సుక+అగుచున్= మంచి ఉత్సాహంతో కూడినది అయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నేను రాక్షసుడను కాను సుమీ; నేను నిజంగా వానరుఁడను; నీమనస్సులో సందేహం పెట్టుకొనకుము' అని నేను విన్నవించాను. సీతాదేవి కొంత యోచన చేసి ఉత్సాహంతో కూడినది అయింది.

వ. అద్దేవి నా కిట్లనియె; 'నన్నా! ని న్నెఱింగితి; నది యెట్లనిన రామహితాన్వేషి యగువాఁ డవింధ్యుం డను వృద్ధరాక్షసుండు మున్న యింతయుం ద్రిజటచేత నా కెఱింగించె; నతని పలుకులు దప్పవు; రాఘవుండు సుగ్రీవసహాయుం డయి యునికి గలిగెం గావున నింకఁ దడయక యవ్వీరవరుం దోడ్కొని వచ్చి నాకుం బ్రియంబు సేయుము; నీకుఁ గార్యసిద్ధి యయ్యెడు; మరుగు' మని తనశిరోభూషణం బయిన యీ రత్నంబు మీకు నభిజ్ఞానార్థంబుగా నాచేతి కిచ్చి, మఱియుఁ జిత్రకూటచరితం బైన కృతకవాయసకథయునుం జెప్పి వీడ్కొల్పిన, నేను లంకాపురదాహంబుసేసి, యిట దేవర కింతయు విన్నవింపవచ్చితి' నని చెప్పి హనుమంతుండు జానకి హృదయంబు మూర్తిమంతం బైన పగిది నున్న యమ్మహామణి రాజచూడామణికి సమర్పించిన. 32

ప్రతిపదార్థం: ఆ+దేవి= సీతాదేవి; నాకున్+ఇట్లు+అనియెన్= నాతో ఈవిధంగా చెప్పింది; అన్నా!= ప్రియమైన సోదరా!; నిన్నున్+ఎఱింగితిన్= నిన్ను గుర్తించాను; అది; ఎట్లు+అనినన్; రామ, హిత+అన్వేషి+అగు, వాఁడు= శ్రీరాముడిమేలును వెదకేవాడు అయిన; అవింధ్యుండు+అను= అవింధ్యుడు అనేపేరు కల; వృద్ధరాక్షసుండు= ముసలివాడయిన రక్కసుండు; మున్ను+అ= ఇంతకు ముందే; ఇంతయున్= ఈ విషయం మొత్తం; త్రిజటచేతన్= త్రిజట అనేపేరుగల ఆమెచేత; నాకున్+ఎఱింగించెన్= నాకు తెలియజేశాడు; అతనిపలుకులు= ఆ అవింధ్యుని మాటలు; తప్పవు= అసత్యాలు కావు; రాఘవుండు= శ్రీరాముడు; సుగ్రీవసహాయుండు+అయి= సుగ్రీవుడియొక్క తోడ్పాటు కలవాడయి; ఉనికి+కలిగెన్+కావునన్= ఉండటం ఏర్పడింది కాబట్టి; ఇంకన్= ఇకపై; తడయక= ఆలసించక; ఆ+వీరవరున్= శూరులలో శ్రేష్ఠుడు అయిన శ్రీరాముడిని; తోడ్కొనివచ్చి= వెంటబెట్టుకొని ఏగుదెంచి; నాకున్= నాకు; ప్రియంబు+చేయుము= సంతృప్తి కలిగించుము; నీకున్= నీకు; కార్యసిద్ధి+అయ్యెడున్= పని జయప్రదం కాగలదు; అరుగుము= వెళ్ళుము; అని= అని పలికి; తనశిరస్+భూషణంబు+అయిన= తనతలకు ఆభరణంగా ఉన్న; ఈ రత్నంబు= ఇదిగో ఈ కనుపిస్తున్న ఈ మణి; మీకున్= మీకు; అభిజ్ఞాన+అర్థంబుగాన్ = గుర్తు కొరకై; నాచేతికిన్+ఇచ్చి= నా చేతికి ఒసగి; మఱియున్= ఇంకను; చిత్రకూటచరితంబు+ఐన= చిత్రకూటం కడ జరిగిన; కృతక, వాయస, కథయునున్+చెప్పి= మాయకాకి వృత్తాంతాన్ని కూడా వచించి; వీడ్కొల్పినన్= వెళ్ళటానికి సెలవు దయచేయగా; ఏను= నేను; లంకాపుర, దాహంబు+చేసి= లంకాపట్టణాన్ని కాల్చి; ఇట= ఇచట; దేవరకున్= ప్రభువుకు; ఇంతయు= ఈవిషయాన్ని సవిస్తరంగా; విన్నవింపన్వచ్చితిన్= నివేదించటానికి వచ్చాను; అని చెప్పి= అని వచించి; హనుమంతుండు= ఆంజనేయుడు; జానకిహృదయంబు= సీత మనసు; మూర్తిమంతంబు+ఐన, పగిదిన్+ఉన్న= రూపం గైకొని కన్పించినట్లుగా ఉన్న; ఆ+మహామణిన్= ఆ గొప్ప మాణిక్యాన్ని; రాజచూడామణికిన్= రాజులలో శ్రేష్ఠుడు అయినవాడికి, శ్రీరాముడికి (చూడామణి= శిరోరత్నం= శ్రేష్ఠవాచకం); సమర్పించినన్= వినయంతో ఇవ్వగా.

తాత్పర్యం: సీతాదేవి నాతో ఈ విధంగా చెప్పింది. 'ప్రియమైన అన్నా! నిన్ను గుర్తించాను. రాక్షసులు కామరూపులు. వానరవేషధారి అయి ఎవరో రాక్షసుడు ఈ విధంగా నన్ను మోసగించటానికే వచ్చినట్లు నేను భావించవచ్చును గాని నీవు రావటానికి ముందే, శ్రీరాముడిపై అభిమానం గల ఒకముసలిరక్కసుడు త్రిజటచేత శ్రీరాముడు సుగ్రీవుడితో మైత్రి నెరపినట్లు నాకు తెలియజేసిఉన్నాడు. అతడి మాటలు అబద్ధాలు కావు. ఇప్పుడు శ్రీరామదూతగా నీవు వచ్చావుకదా! ఆ మాట ఋజువు అయింది. ఇక ఆలస్యం కాకుండ సుగ్రీవుడి తోడ్పాటుతో వీరులలోశ్రేష్ఠుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అయిన శ్రీరాముడిని ఇటకు తోడ్కొని వచ్చి నాకు సంప్రీతిని కలిగించుము. నీకార్యం జయప్రదం కాగలదు. వెళ్ళుము' అని వచించి, గుర్తుకొరకై తన తలమీద ధరించే మాణిక్యాన్ని ఇదుగో దీనిని-నాచేతికి ఇచ్చింది. అంతేకాక, చిత్రకూటపర్వతంమీద మీరు ఉన్నప్పుడు జరిగిన మాయకాకి వృత్తాంతాన్ని కూడ నాకు చెప్పి నేను బయలుదేరటానికి సెలవు నిచ్చి దీవించి పంపింది. నేను లంకాపట్టణాన్ని కాల్చి, ఇట దేవరకు సీతాదేవి యోగక్షేమాలు చెప్పటానికై వచ్చాను' అని చెప్పి ఆంజనేయుడు ఆమణిని రాజశ్రేష్ఠు డైన శ్రీరాముడికి సమర్పించాడు. ఆ మణి కేవలం ఒకమణిగా మాత్రమే కాక సీతాదేవిహృదయమే ఆ మణిరూపం తాల్చిందా అన్నట్లు భాసించింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

ఆ. **అమ్మనోజ్ఞరత్న మక్కునఁ గదియించి । పులక లెగయఁ గొంతప్రొద్దు విభుఁడు**
జానకీకుచాగ్రసంగమసుప్తుఁ డై । నట్ల యుండె ముకుళితాక్షుఁ డగుచు. **33**

ప్రతిపదార్థం: విభుఁడు= రాజు- రాముడు; ఆ, మనోజ్ఞ, రత్నమున్= అందమైన ఆ రతనాన్ని; అక్కునన్= గుండెకు; కదియించి= చేర్చి; పులకలు+ఎగయన్= గగుర్పాటు విస్తరించగా; కొంతప్రొద్దు= కొంతసేపు; ముకుళిత+అక్షుఁడు+ఐ= మూసిన కనులు కలవాడై; జానకీ, కుచ+అగ్ర, సంగమసుప్తుఁడు+ఐనట్లు+అ= సీతాదేవి చనుమొనల కలయిక గలిగి నిదురించిన వాడు అయినట్లుగనే; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: మనోహరమైన ఆచూడామణిని గుండెకు హత్తుకొని శ్రీరాముడు కొంతసేపు కన్నులు మూసికొనినవాడై పులకరిస్తూ సీతాదేవి వక్షంపై సుఖంగా నిదురించినవాడు అయినట్లు ఉన్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. **ఇట్లు రాఘవుండు సీతావృత్తాంతంబు విని తత్సమాగమకుతూహలవ్యగ్రుండై, సుగ్రీవుం జూచి 'దండయాత్ర కాయితంబు సేయు' మనినఁ 'బ్రసాదం' బని యతండు నలుదిక్కులం గల వానరనాయకులం బిలువం బంచిన.** **34**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; రాఘవుండు= శ్రీరాముడు; సీతావృత్తాంతంబు, విని= సీతయొక్కసంగతి ఆలకించి; తద్+సమ్+ఆగమ, కుతూహల, వ్యగ్రుండు+ఐ= ఆమెయొక్క కలయికయందు ఏర్పడిన కోరికయందు ఆసక్తి గలవాడయి; సుగ్రీవున్+చూచి= సుగ్రీవుడిని కాంచి; దండయాత్రకున్= విరోధులపై సేనలను నడిపే పయనానికి; ఆయితంబు+ చేయుము+ అనినన్= సన్నాహాలు చేయుము అని చెప్పగా; ప్రసాదంబు+అని= తమదయచొప్పున ఇచ్చిన ఆజ్ఞప్రకారం నడుపుతాను అని పలికి; అతండు= సుగ్రీవుడు; నలుదిక్కులన్= నాలుగు దెసలలో; కల= ఉన్నట్టి; వానర, నాయకులన్= కోతినేతలను; పిలువన్+పంచినన్= రమ్మని పిలవటానికి ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఈ రీతిగా హనుమంతుడివలన శ్రీరాముడు సీతాదేవి వృత్తాంతాన్ని విని, ఆమెతోడి కలయిక కొరకై ఆతురత చెందే హృదయం కలవాడై, సుగ్రీవుడిని చూచి 'రావణుడిపై దండెత్తటానికి తగిన సన్నాహాలను చేయు' మని అన్నాడు. సుగ్రీవుడు రాముడిఆజ్ఞను శిరసావహించి, నాలుగుదిక్కులలో ఉన్న వానరనాయకులను కిష్కింధకు రావలెనని ఆజ్ఞాపిస్తూ భటులను పంపాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వానరవీరులు నానాదేశంబులనుండి సుగ్రీవునొద్దకు వచ్చుట (సం. 3-267-1)

క. శతకోటిద్వయహరిపరి । వృతులై చనుదెంచి రతులవీరులు ధీరో
ద్ధతులు గజుఁడు గవయుఁడు వి । శ్రుతముగ రఘుపతికిఁ దోడు సూపిరి గడఁకన్. 35

ప్రతిపదార్థం: అతుల, వీరులు= సాటిలేని పరాక్రమం కలవారు; చనుదెంచిరి= వచ్చారు; ధీర+ఉద్ధతులు= ధీరులు, ఔద్ధత్యం కలవారూ అయిన; గజుఁడు= గజుడు అనేపేరు కలవాడు; గవయుఁడు= గవయుడు అనే పేరుకలవాడు; విశ్రుతముగన్= అందరకు తెలిసేటట్లుగ; శత, కోటి, ద్వయ, హరి, పరివృతులు+ఐ= రెండువందలకోట్ల కోతులతో కూడుకొన్న వారయి; కడఁకన్= పూనికతో; రఘుపతికిన్= శ్రీరాముడికి; తోడు+చూపిరి= సహాయాన్ని ప్రకటించారు.

తాత్పర్యం: సాటిలేనివీరులు వచ్చారు. శత్రువులను దర్పంతో ఎదుర్కొనటానికి ఉత్సహించే శూరులు గజుడు గవయుడు అనేవారు; రెండువందలకోట్లమంది కోతులతో కూడినవారై శ్రీరాముడికి తోడుపడటానికై వచ్చారు.

క. అఱువదికోటులు గపివరు । లుఱక జగత్త్రయముఁ బెలుచ నువ్వెత్తు గొనం
దఱిగొన్నయట్లు నడవఁగ । నెఱసి కుముదుఁ డరుగుదెంచి నృపవరుఁ గనియెన్. 36

ప్రతిపదార్థం: కుముదుఁడు= కుముదుడు (అనే వానరవీరుడు); అఱువది, కోటులు, కపివరులు= అరువదికోట్లమంది శ్రేష్ఠులైన కోతులు; ఉఱక= లక్ష్యం లేకుండా; జగత్+త్రయమున్= మూడులోకాలను; పెలుచన్= మిక్కుటంగా; ఉవ్వెత్తుగొనన్= ఆక్రమించటానికి; తఱిగొన్న+అట్లు= అవకాశాన్ని పొందినట్లు; నడవగన్ నెఱసి= నడిపించటంలో నేర్పు కలిగి; అరుగుదెంచి= వచ్చి; నృపవరున్= రాజశ్రేష్ఠుడిని - శ్రీరాముడిని; కనియెన్= సందర్శించాడు.

తాత్పర్యం: కుముదుడు అనే వానరవీరుడు, అరువదికోట్లమంది కోతులతో మూడులోకాలు దద్దరిల్లిపోయేటట్లుగా దండువిడిసి శ్రీరామచంద్రుడిని సందర్శించాడు.

ఉ. కోటిసహస్రసేన తనుఁ గొల్వఁగ వానరకోటి కెల్లఁ దా
మేటి మహాబలుండు నిరమిత్త్రుఁడు మిత్త్రసహాయుఁడై తగన్
వీటికి నుబ్బుగాఁ జటులవేగసముచ్ఛ్రితపుచ్ఛగుచ్ఛవి
స్ఫోటితదిగ్విభాగుఁ డగుచుం జనుదెంచె సుషేణుఁ డత్తఱిన్. 37

ప్రతిపదార్థం: సుషేణుఁడు= సుషేణుడు (అనే పేరు కల వానరయోధుడు); ఆ+తఱిన్= ఆతరుణంలో; కోటి, సహస్ర, సేన= వేయికోట్లసైన్యం; తనున్= తనను; కొల్వఁగన్= ఆరాధించగా; వానరకోటికిన్+ఎల్లన్= కోతులగుంపులకు అన్నింటికి; తాన్= తాను; మేటి= అధికుడు; మహా, బలుండు= గొప్పబలం కలవాడు; నిరమిత్త్రుఁడు= శత్రువులు లేనివాడు; మిత్త్ర సహాయుఁడు+ఐ= స్నేహితుల సాయంతో కూడినవాడై, అనగా మిత్త్రులతో పాటుగా; తగన్= సముచితంగా; వీటికిన్= దండుకు; ఉబ్బుగాన్= ఉత్సాహం పొంగులు వారేటట్లుగా; చటుల, వేగ, సమ్+ఉత్+శ్రిత, పుచ్ఛ, గుచ్ఛ, విస్ఫోటిత, దిక్+విభాగుఁడు+అగుచున్= మిక్కుటమైన రయంతో బాగుగా ఎత్తబడిన తోకల సముదాయంతో ఛేదించబడిన దెసల విభాగాలు కలవాడు ఔతూ; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: వేయికోట్లమంది వానరభటులు తనను కొలువగా సుషేణుడు కిష్కింధానగరానికి విచ్చేశాడు. అతడు మహాబలవంతుడు. శత్రువులు లేనివాడు. మిత్రులతో గూడినవాడై వానరసేనకు ఉత్సాహజనకంగా వేగాతిశయంతో పైకెత్తిన తోకల తాకిడికి దిక్కుల విభాగాలను ఛేదిస్తూ వచ్చాడు.

క. గణుతింపరాని వానర । గణములతో దధిముఖుండు కాకుత్స్థకులా
గ్రణికిఁ బ్రియంబుగ వచ్చె ధ । రణి భాగము వాహినీచరణదళితముగన్. 38

ప్రతిపదార్థం: గణుతింపన్‌రాని= లెక్కకు మించిన; వానర గణములతోన్= కోతుల గుంపులతో; దధిముఖుండు= దధిముఖుడు (అనే పేరు కలవాడు); కాకుత్స్థ, కుల+అగ్రణికిన్= కకుత్స్థునివంశంలో శ్రేష్ఠుడు అయినవాడికి- శ్రీరాముడికి; ప్రియంబుగన్= ప్రీతి కలిగించేటట్లుగా; ధరణి భాగము= భూప్రదేశం; వాహినీ, చరణ, దళితముగన్= సేనలయొక్క కాళ్లచేత చీల్చబడినదికాగా; వచ్చెన్= అరుదెంచాడు.

తాత్పర్యం: లెక్కకు మించిన కోతులగుంపులతో దధిముఖుడు అనే వానరనేత, శ్రీరాముడికి ప్రీతి కలిగించేటట్లుగా భూమిభాగం దద్దరిల్లేటట్లు సేనల నడిపించుకొంటూ వచ్చి చేరాడు.

ఆ. శతసహస్రకోటిసంఖ్యల యెలువులు । గొలువ జలదనీలఘోరమూర్తి
జాంబవంతుఁ డతులసత్త్వుఁ డేతెంచె నా । భూపవరునికార్యమునకుఁ బూని. 39

ప్రతిపదార్థం: అతుల, సత్త్వుఁడు= సాటిలేని బలం కలవాడు; జలద, నీల, ఘోర, మూర్తి= మేఘం వలె నల్లని భయంకరమైన ఆకారం కలవాడు; జాంబవంతుఁడు= జాంబవంతుడు (అనే ఎలుగు రేడు); శత, సహస్ర, కోటి,+ఎలువులు= వందవేలకోటి భల్లూకాలు; కొలువన్= సేవిస్తుండగా; ఆ భూపవరుని కార్యమునకున్= ఆ రాజుయొక్క (శ్రీరాముడియొక్క) పనికి; పూని= పూనుకొని; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: జాంబవంతుడు ఎలుగురేడు, సాటిలేని బలం కలవాడు, నల్లనిమేఘంవలె భయంకరమైన రూపం కలవాడు; వందవేయికోట్లభల్లూకసేనతో శ్రీరాముడిపనిని నెరవేర్చటానికి వచ్చాడు.

వ. మఱియు, ననేకు లనేకసహస్రసంఖ్యల బలంబులతోడం జనుదెంచి; రిట్లు గూడిన కపివీరులు వివిధాకారు లపారబలశౌర్యసారు లతిఘోరంబుగాఁ బేర్చి నిగుడుచు, మగుడుచుం, దాఱుచుఁ బాఱుచుం, దిరుగుచు, సురుఁగుచు, మలయుచుఁ, బొలయుచు, మత్తిల్లి గిరిగుహాలయందును దరువనంబులయందును, సరి దుపాంతంబులయందును నానందంబున విహరించుచుండిరి; తదనంతరంబ. 40

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; అనేకులు= పెక్కుమంది; అనేక, సహస్ర, సంఖ్యల= పెక్కువేల లెక్కగల; బలంబులతోడన్= సేనలతో; చనుదెంచిరి= వచ్చారు; ఇట్లు= ఈ రీతిగా; కూడిన= చేరిన; కపి వీరులు= కోతుల యోధులు; వివిధ+ఆకారులు= పెక్కు ఆకృతులు కలవారు; అపార, బల, శౌర్యసారులు= మితిమీరిన శక్తియొక్క, పరాక్రమంయొక్క నిగ్గు కలవారు; అతిఘోరంబుగాన్= మిక్కిలి భయంకరంగా; పేర్చి= అతిశయించి; నిగుడుచున్= ముందుకుసాగుతూ; మగుడుచున్= వెనుకకు తిరుగుతూ; తాఱుచున్= సమీపిస్తూ; పాఱుచున్= పరుగెత్తుతూ; తిరుగుచున్= నడయాడుతూ; సురుఁగుచున్= అదృశ్యమౌతూ; మలయుచున్= మలుపులు తిరుగుతూ; పొలయుచున్= సంచరిస్తూ; మత్తిల్లి= గర్వించి; గిరి గుహలయందునన్= కొండబిలాలలోను; తరువనంబుల+అందును= చెట్లతోటల లోను; సరిత్+ఉపాంతంబుల+అందును= నదుల గట్టులమీదను; ఆనందంబునన్= సంతసంతో; విహరించుచున్+ఉండిరి= వేడుకతో తిరుగుతున్నారు; తత్+అనంతరంబు+అ= ఆ పిదప.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఇంకను వేనకువేలు కోతులగుంపులతో వానరనాయకులు పెక్కుమంది కిష్కింధకు వచ్చారు. ఆ విధంగా గుమిగూడిన కోతులు పెక్కు ఆకారాలు గల వీరులు; గొప్పపరాక్రమం కలవారు; భయంకరంగా విహరించారు. ఎటు చూచినా కోతులమూక. చెట్లతోటలలో కొండగుహలలో గంతులు వేస్తూ విచ్చలవిడిగా తిరుగాడుతూ విర్రవీగుతూ ఒండొరులను తారసిల్లుతూ మత్తిల్లి ఆ వానరవీరులు సంచరిస్తూ ఉన్నారు. అప్పుడు.

మ. **ప్రభ నొప్పారి యనుంగుఁదమ్ముఁడు మహాభాగుండు సౌమిత్రి వీ**
తభయుండై కొలువం గపీంద్రబలసంతానంబుతో నుద్ధతిన్
శుభలగ్నంబున రాఘవుండు గదలెన్ సుగ్రీవసాహాయ్యసం
ప్రభవోత్సాహ మెలర్ప దర్పితరిపుప్రాలేయతిగ్మాంశుఁ డై. **41**

ప్రతిపదార్థం: రాఘవుండు= శ్రీరాముడు; ప్రభన్= కాంతితో; ఒప్పారి= విలసిల్లి; అనుంగు+తమ్ముఁడు= ప్రియమైన అనుజుడు లక్ష్మణుడు; మహాభాగుండు= గొప్పవాడు; సౌమిత్రి=సుమిత్ర కొడుకు; వీత భయుండు+ఐ= పోయిన భయం కలవాడై; కొలువన్= సేవించగా; కపి+ఇంద్ర, బల, సంతానంబుతోన్= వానర శ్రేష్ఠులతో కూడిన సేనల సమూహాలతో; ఉద్ధతిన్= దర్పంతో; శుభలగ్నంబునన్= మంచి ముహూర్తంలో; సుగ్రీవ, సాహాయ్య సంప్రభవ+ఉత్సాహము= సుగ్రీవుడియొక్క తోడ్పాటు వలన ఉద్భవించిన ఉత్సాహం; ఎలర్పన్= అతిశయించగా; దర్పిత= గర్వించిన; రిపు, ప్రాలేయ తిగ్మ+అంశుఁడు+ఐ= శత్రువులు అనే మంచుకు చండకిరణాలు కల సూర్యుడివంటివాడై; కదలెన్= సాగాడు (దండయాత్రకు ఉపక్రమించాడు).

తాత్పర్యం: సుమిత్రకొడుకు అయిన లక్ష్మణుడు దేదీప్యమానంగా వెలుగొందుతూ తనను అనుసరించగా, సుగ్రీవుడి సాయం కల్గించిన ఉత్సాహంతో వానర సేనలతోపాటు దర్పంతో కూడినవాడయి శ్రీరాముడు శుభముహూర్తంలో దండయాత్రకు బయలుదేరాడు. అప్పుడు శ్రీరాముడు శత్రువు లనే మంచును సులువుగా ఛేదించగల సూర్యుడై భాసించాడు.

విశేషం: అలం: రూపకం. శత్రు విచ్ఛేదకుడైన శ్రీరాముడికీ, మంచును ఛేదించే సూర్యుడికీ అభేదాధ్యవసాయం కల్పించబడింది.

ఉ. **ఆ హరివీరవాహినుల కన్నిటికిన్ మొగమై మరుత్సుతుం**
డాహవదోహలుం డమరె నంగద నీల నలాది వీరు లు
త్సాహము మీఱ నయ్యయి దెసం దగు కావలి యై సమగ్ర స
న్నాహమహోగ్రతం జనిరి నాకవిరోధివధాభిలాషులై. **42**

ప్రతిపదార్థం: ఆ, హరి, వీర, వాహినులకున్+అన్నిటికిన్= ఆ కోతుల యోధుల సేనలు సమస్తానికి; మొగము+ఐ= ముందు ఉన్నవాడై; మరుత్+సుతుండు= వాయునందనుడు- హనుమంతుడు; ఆహవదోహలుండు= యుద్ధంలో ఉత్సాహం కలవాడు; అమరెన్= ఒప్పాడు; అంగద, నీల, నల+ఆది వీరులు= అంగదుడు, నీలుడు, నలుడు మున్నగు శూరులు; ఉత్సాహము మీఱన్= ఉత్సాహం అతిశయించగా; అయ్యయి దెసన్= ఆయా వైపుల; తగు= సముచితమైన; కావలి+ఐ= రక్షణకు అమరియుండిన వారై; సమగ్ర, సన్నాహ, మహా+ఉగ్రతన్= పరిపూర్ణమైన ప్రయత్నాలు చేసి మిక్కిలి భయంకరంగా; నాక, విరోధి, వధ+అభిలాషులు+ఐ= స్వర్గ శత్రువు అనగా రాక్షసుడైన (రావణాసురుడిని) సంహరించవలె ననే కోరిక కలవారై; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: యుద్ధం చేయటంలో మిక్కుటమైన ఉత్సాహం కలవాడైన వాయునందనుడు ఆ కోతుల సేనలకు అన్నిటికీ మార్గదర్శకుడై నాయకత్వం వహించి ముందున్నాడు. అంగదుడు నీలుడు నలుడు మున్నగు యోధులు ఆయావైపుల సేనలకు రక్షణ కల్పిస్తూ భయాన్ని కలిగించే రూపాలతో స్వర్గవిరోధి అయిన రావణాసురుడిని సంహరించే కోరికతో దండు వెడలారు.

వ. ఇట్లు నడచి యెడనెడం బ్రభూతవన్యఫలజలాశయంబు లగు ప్రదేశంబుల విడియుచుం గపిసైన్యంబు గతి పయదినంబులకు దక్షిణోదధితీరంబు సేరి రెండగు వారాశియుంబోలె ఘూర్ణిల్లుచుండె; నంత రాఘవుండు రవితనయుం జూచి యి ట్లనియె. 43

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నడచి= (దండెత్తి) వెళ్లి; ఎడన్+ఎడన్= అక్కడ అక్కడ; ప్రభూత, వన్య, ఫల, జల+ఆశయంబులు+అగు= గొప్ప అడవిపండ్లు, చెరువులు కల; ప్రదేశంబులన్= స్థలాలలో; విడియుచున్= తాత్కాలికంగా ఆగుతూ; కపిసైన్యంబు= కోతుల సేన; కతిపయ దినంబులకున్= కొన్ని రోజులకు; దక్షిణ+ఉదధి, తీరంబు= దక్షిణదిశలో ఉన్న సముద్రపు గట్టు; చేరి= సమీపించి రెండు+అగు= రెండవది అయిన; వారాశియున్+పోలెన్= సముద్రం వలె; ఘూర్ణిల్లుచుండెన్= తిరుగుళ్ళుపడుతూ గొప్ప ధ్వనిని చేస్తూ ఉండింది; అంతన్= పిదప; రాఘవుండు= శ్రీరాముడు; రవి తనయున్+చూచి= సుగ్రీవుడిని చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: కపిసైన్యం ఈ రీతిగా సాగి, అడవిపండ్లు, చెరువులు ఎక్కువగా గల స్థలంలో తాత్కాలికంగా ఆగుతూ కొన్నిదినాలకు దక్షిణసముద్రతీరాన్ని చేరి తిరుగుళ్ళుపడుతూ పెద్దధ్వని చేస్తూ, రెండవ సముద్రమా అన్నట్లు ఉండింది. అంతట, సేనలు ముందుకు వెళ్ళటానికి వీలు లేకుండటం చూచి శ్రీరాముడు సుగ్రీవుడితో ఇట్లా పలికాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. 'మనబలమును నతిబహుళము । వననిధియును దుస్తరంబు వానరవర! యి
వ్వననిధిఁ గడచు నుపాయము । మన కొక్కటి నిశ్చయింపుమా తగుభంగిన్.' 44

ప్రతిపదార్థం: వానరవర!= కోతులలో శ్రేష్ఠుడా!,; మన బలమునున్= మన సేనయూ; అతి బహుళము= మిక్కిలి విస్తృతమైనది; వననిధియును= ఇక సముద్రమందుమా; దుస్తరంబు= దాట రానిది; ఈ+వననిధిన్= ఈ సముద్రాన్ని; కడచు+ఉపాయము= దాటే మార్గం; మనకున్+ఒక్కటి= మనకున్ వీలైనది ఒకటి (ఒక ఉపాయం); తగు భంగిన్= సముచితంగా; నిశ్చయింపునూ= నిర్ణయించవలసినది.

తాత్పర్యం: 'కోతులలో శ్రేష్ఠుడ వైన ఓ సుగ్రీవా! మనసేన అపరిమితం. ఈ సముద్రమా దాటరానిది. ఈ సముద్రాన్ని దాటటానికి మనకు వీలు చాలు గల ఉపాయాన్ని నీవే నిర్ణయించవలసిఉన్నది.

తే. అని విచారించునెడ కొంద ఱధిపుఁ జూచి । 'జడధి బలితంపుఁ దెప్పలఁ గడత' మనిరి;
'ఘనపుఁ గలముల సమకట్టి గడత' మనిరి । కొంద; ఱంతయు విని రఘునందనుండు. 45

ప్రతిపదార్థం: అని= అని; విచారించు+ఎడన్= ఆలోచించేటప్పుడు; కొందఱు= కొంతమంది; అధిపున్+చూచి= శ్రీరాముడిని కాంచి; జడధిన్= సముద్రాన్ని; బలితంపు+తెప్పలన్= పెద్ద కట్టుమానులతో; కడతము= దాటుదాం; అనిరి= అని చెప్పారు;

కొందఱు= కొంతమంది; ఘనము+కలములన్= పెద్ద పడవలను; సమకట్టి= నిర్మించి; కడతము+అనిరి= దాటుదాం అని పలికారు; రఘునందనుండు= శ్రీరాముడు; అంతయున్= (వారు అందరు చెప్పింది) సర్వమును; విని= ఆలకించి.

తాత్పర్యం: అని ఆలోచించే సమయంలో శ్రీరాముడిని చూచి కొందరు 'తెప్పలు కట్టి సముద్రాన్ని దాటుదాం' అని చెప్పారు. మరికొందరు 'పడవలు నిర్మించి సముద్రాన్ని దాటుదాం' అని పల్కారు. అందరు చెప్పిన మాటలు విని శ్రీరాముడు.

సీ. అల్లన నగుచు నిట్లనియె: 'మీ చెప్పుటల్ । దగిన యుపాయంబు లగున; యయిన
నగణితం బైన యీ హరిసైన్యముల కెల్లఁ । గలములుఁ దెప్పలు వలయునన్ని
సమకట్టు టరయ నశక్యంబు; శతయోజ । నంబుల పరపైన యంబురాశిఁ
గలములఁ దెప్పలఁ గడచుచో రిపుకోటి । యెడరునఁ బైఁబడి పొడువకున్నె?

ఆ. యదియుఁగాక యల్పులగు వణిగ్జనముల । యోజ శూరతతికిఁ దేజ మగునె?
కాన నాదుమతము గా దివ్విధంబు; నా । మనసు నిశ్చయంబు వినుఁడు మీరు. 46

ప్రతిపదార్థం: అల్లన నగుచున్= మెల్లగా నవ్వుతూ-చిరునవ్వు నవ్వుతూ; ఇట్లు+అనియెన్; మీ చెప్పుటల్= మీరు చెప్పేమాటలు; తగిన= సరిపోయే; ఉపాయంబులు+అగును+అ= వెరవులు అయినవే; అయినన్= కాని; అగణితంబు+ఐన= లెక్కకు మీరిన; ఈ హరి సైన్యములకున్+ఎల్లన్= ఈ కోతులసేనలన్నింటికిని; కలములున్= పడవలు; తెప్పలు= కట్టుమ్రానులు; వలయు+అన్ని= కావలసినన్ని; సమకట్టుట= నిర్మించటం; అరయన్= యోచించగా; అశక్యంబు= సాధ్యం కానిది; శతయోజనంబుల= వంద ఆమడల; పరపు+ఐన= విస్తీర్ణం కల; అంబురాశిన్= సముద్రాన్ని; కలములన్= పడవలతో; తెప్పలన్= కట్టుమ్రానులతో; కడచుచోన్= దాటేటప్పుడు; రిపుకోటి= శత్రు సమూహం; ఎడరునన్= సందుచూచి; పైన్+పడి= మీద పడి; పొడువక+ఉన్నె?= హింసించదా?; అదియున్+కాక= అంత మాత్రమే కాక; అల్పులు+అగు= తక్కువవారైన; వణిక్+జనముల+ఓజ= వర్తకం చేసే ప్రజల మాదిరిగా ప్రవర్తించటం; శూర, తతికిన్= వీరుల సముదాయానికి; తేజము+అగునె= వర్చస్సు ఔతుందా? (అది ప్రకాశించే పద్ధతి కాదు); కానన్= కావున; నాదు, మతము= నా అభిప్రాయం; ఈ+విధంబు= (తెప్పలపై పడవలపై సముద్రాన్ని దాటటం); కాదు= కాదు; నా మనసు నిశ్చయంబు= నా హృదయంలోని నిర్ణయం; మీరు= (ఓ వానరులారా) మీరు; వినుఁడు= ఆలకించండి.

తాత్పర్యం: మందహాసం చేస్తూ శ్రీరాముడు ఈ విధంగా: 'మీరు చెప్పిన మాటలుకూడా తగిన ఉపాయాలే కాని అవి నాకు అంతగా ఇష్టాలు కావు. ఏలన, మన సైన్యమూ, లెక్కకు మించిది. ఇంతటి సేనకు సరిపోయే తెప్పలు, పడవలు సమకూర్చటం సాధ్యం కాదు. సముద్రమా వందఆమడలకు మించిన విస్తీర్ణం కలది. మనం పడవలమీద తెప్పలమీద ఇంత విస్తీర్ణం గల సముద్రాన్ని దాటుతున్నంతసేపు శత్రుసమూహాలు కనులు అప్పగించి ఊరక చూస్తూ ఉంటాయా? అవకాశంచూచి మనమీద పడి హింసించరా? అంతేకాక మనం వీరులం. సముద్రాన్ని దాటేది శత్రుసంహారానికి గాని వర్తకవ్యాపారం చేయటానికి కాదు. బలపరాక్రమాలు ప్రదర్శించి మనం వీరులుగా మెలగవలెను గాని వర్తకులమాదిరి ప్రవర్తించరాదు. నా మనసులోనిమాట చెప్తుతాను వినండి.

చ. వ్రతము ధరించి నిష్ఠ నుపవాసవిధిం గొలుతున్ సముద్రు; నా
కితఁడు ప్రసన్నుఁడై తెరువు నిచ్చుట యంతయుఁ గల్గెనేని మే;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లితరునిఁగా ననుం దలఁచెనేని నమానుషరోషవేగదీ

పితశరవహ్ని నిజ్జలముఁ బీల్చెదఁ బ్రేల్చెద నొక్క వ్రేల్మిడిన్.' 47

ప్రతిపదార్థం: వ్రతము ధరించి= నోము పట్టి; నిష్ఠన్= దీక్షతో; ఉపవాస విధిన్= ఆహారాన్ని విసర్జించే విధానంతో; సముద్రున్= సముద్రుడిని; కొలుతున్= ఆరాధిస్తాను; ఇతఁడు= ఈ సముద్రుడు; నాకున్= నాకు; ప్రసన్నుఁడు+ఐ= ఆదరం కలవాడై; తెరువున్+ఇచ్చుట+అంతయున్+కల్గెన్+ఏనిన్= దారిని ఇవ్వడం పూర్తిగా జరిగితే; మేలు= మంచిది; ననున్= నన్ను; ఇతరునిన్+కాన్= సామాన్య మానవునిగా (అనగా తనకు అభిమానపాత్రుడు కానివాడినిగా); తలంచెన్+ఏనిన్= తలపోస్తే; అమానుష, రోష, వేగ, దీపిత, శర, వహ్నిన్= మనుజులకు అతీతమైన కోపంయొక్క రయంచేత ప్రజ్వలింప చేయబడిన బాణాలు అనే అగ్నిచేత; ఈ+జలమున్= ఈ సముద్రజలాలను; పీల్చెదన్= ఇంకింప చేస్తాను; ఒక్క వ్రేల్మిడిన్= ఒక్క చిటికెలో; ప్రేల్చెదన్= సెగచేత ఉడికేటట్లు చేస్తాను.

తాత్పర్యం: నేను ఆహారం విసర్జించి ఉపవాసవ్రతంతో సముద్రుడిని ఆరాధిస్తాను. ఇది సౌమ్యపద్ధతి. సముద్రుడు సంతృప్తి చెంది నాకు ప్రసన్నుడై, దారి ఇస్తే శుభం. లేదా నాపై అభిమానం చూపకుంటే సాత్త్విక పద్ధతిని విడనాడి రాజసపద్ధతి వహించి నా బాణాగ్నితో జలాలను ఇంకింప జేస్తాను, సాగరుణ్ణి తుకతుక ఉడికింప జేస్తాను.

రాముఁడు దర్భశయనుండై సముద్రుం బ్రార్థించుట (సం. 3-267-30)

వ. అని పలికి దశరథాగ్రసూనుండు దానును దమ్ముండును నుపవసించి దర్భశయను లై జలధీంద్రు నుపాసించి యున్నంత సముద్రుండు సకలజలచరప్రకరపరివారుండై రాఘవునకుం బొడసూపి 'యయ్యా! నీవలనఁ బ్రీతుండ నైతి; నీ కెయ్యది ప్రియంబు సేయుదుఁ? జెప్పు 'మనిన నతండు' నాకు లంకపై నరుగం దెరు విచ్చునది; యీనినాఁడు సూర్యనిభంబులైన మదీయదివ్యాస్త్రంబుల నిన్ను శోషింపం జేయుదు' ననిన విని సరిత్పతి రఘుపతి కి ట్లనియె. 48

ప్రతిపదార్థం: అని పలికి= అని వచించి; దశరథ+అగ్ర సూనుండు= దశరథుడియొక్క పెద్దకొడుకు శ్రీరాముడు; తానును= తానున్నూ; తమ్ముండును= లక్ష్మణుడున్నూ; ఉపవసించి= నిరాహార దీక్షను పూని; దర్భశయనులు+ఐ= దర్భలమీద పండుకొనిన వారై; జలధి+ఇంద్రున్= సముద్రశ్రేష్ఠుడిని; ఉపాసించి+ఉన్నంతన్= ఆరాధన చేసి ఉన్నమీదట; సముద్రుండు= సముద్రుడు; సకల, జలచర, ప్రకర, పరివారుండు+ఐ= సమస్తమైన నీటిలో తిరుగాడు జంతువుల సముదాయాలను తనకు అనుచరులుగా చేసికొనినవాడై; రాఘవునకున్= శ్రీరాముడికి; పొడసూపి= కనుపించి; అయ్యా= ఆర్యా; నీ వలనన్= నీ యందు; ప్రీతుండన్+ఐతి= ప్రీతి కలిగినవాడను అయినాను; నీకున్+ఏ+అది= నీకున్ ఏది; ప్రియంబు= ఇష్టం; చేయుదున్= చేయగలను; చెప్పుము= వచించుము; అనినన్= అని వచించగా; అతండు= శ్రీరాముడు; నాకున్= నాకు; లంకపైన్+అరుగన్= లంకపై దండెత్తటానికి; తెరువు+ఇచ్చునది= దారి ఇమ్ము; ఈని నాఁడు= ఇవ్వని సమయంలో; సూర్య, నిభంబులు+ఐన= సూర్యుడితో సమానాలు అయిన; మదీయ, దివ్య+అస్త్రంబులన్= నావైన దేవతామహిమ గల ఆయుధాలచేత; నిన్నున్= (ఓ సముద్రుడా) నిన్ను; శోషింపన్+చేయుదున్= ఎండించగలను; అనినన్= అని (రాముడు) చెప్పగా; విని= ఆలకించి; సరిత్+పతి= నదులకు భర్త అయిన సముద్రుడు; రఘుపతికిన్= శ్రీరాముడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి, దశరథుడి పెద్దకొడుకు శ్రీరాముడును అతడి తమ్ముడు లక్ష్మణుడును నిరాహారదీక్ష పూని దర్భలపై పండుకొని సముద్రుడిని ఆరాధించారు. శ్రీరామలక్ష్మణులవ్రతమును మెచ్చి సముద్రుడు తన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జలచరపరివారంతో ప్రత్యక్షమై రామునితో ఇట్లా చెప్పాడు. 'ఆర్యా! నీవు నన్ను ప్రీతుడిని చేశావు. నీకు ఇష్టమైనది చెప్పుము చేయగలను' అని పల్కగా అంతట శ్రీరాముడు సముద్రుడితో తనకు లంకా పట్టణంపై దండెత్తటానికి దారి నిమ్మని అర్థించి, అట్లా దారిని ఇవ్వనిచో తాను సూర్యసమానా లయిన తన దివ్యాస్త్రాలను ప్రయోగించి సముద్రజలాల నింకింప జేస్తా నని చెప్పాడు. అంతట నదులకుభర్త అయిన సముద్రుడు రఘుపతి అయిన శ్రీరాముడితో ఇట్లా పలికాడు.

సీ. **'జననాథ! నీ కార్యమునకు నే విఘ్నంబు। గావింప నోడుదు నే విధమున;**
వినుము! నా వాక్యంబు; జను లెల్ల నెఱుఁగ నీ। కిత్తఱి నేఁ దెరు విత్తునేని
నిల నెల్లవాఁడును విలసిత దివ్యాస్త్ర। బలమున సాధింపఁ దలఁచు నన్ను;
మీయందుఁ గపివీరుఁ డాయతమతి విశ్వ। కర్మసూనుఁడు శిల్పికర్మవిదుఁడు

ఆ. **నలుఁడు నాఁగ నొకఁడు గలఁడు; వాఁ డొలసి నా। యందుఁ దరులు గిరులు నొంద వైవ**
నవి ధరింతు నేను; దివిరి నీ కది సేతు। వుగఁ గడంక నరిగి పగఱ గెలుము.' 49

ప్రతిపదార్థం: జననాథ!= ఓ రాజా, శ్రీరామా!; నీ కార్యమునకున్= నీ పనికి; ఏన్= నేను; ఏ విధమునన్= ఏ రీతిగా నయినా; విఘ్నంబున్= అడ్డు; కావింపన్= చేయటానికి; ఓడుదున్= జంకుతాను; నా వాక్యంబు= నా మాట; వినుము= ఆలకింపుము; జనులు+ఎల్లన్= ప్రజలందరు; ఎఱుఁగన్= తెలిసేటట్లుగా; నీకున్= నీకు; ఈ+తఱిన్= ఈ సమయంలో; ఏన్= నేను; తెరువున్= మార్గాన్ని; ఇత్తున్+ఏనిన్= ఇచ్చినట్లయితే; ఇలన్= భూమిమీద; ఎల్లవాఁడును= ప్రతి ఒక్కడున్నూ; విలసిత, దివ్య+అస్త్ర, బలమునన్= శోభిల్లునట్టి దేవతా మహిమ గల ఆయుధాలచేత; నన్నున్= నన్ను; సాధింపన్+తలఁచున్= లోబరచుకొనటానికి తలపోస్తాడు; మీ+అందున్= మీలో; కపివీరుఁడు= కోతులలో యోధుడు; ఆయతమతి= మేధావి; విశ్వకర్మ సూనుఁడు= విశ్వకర్మయొక్క కొడుకు; శిల్పి కర్మ విదుఁడు= రాతి కట్టడాలకు సంబంధించిన కళ తెలిసినవాడు; నలుఁడు, నాఁగన్= నలుడు అనగా; ఒకఁడు= ఒకడు; కలఁడు= ఉన్నాడు; వాఁడు= అతడు, ఆ నలుడు; ఒలసి= పూనుకొని; నాయందున్= నాలో (సముద్రంలో); తరులు= చెట్లు; గిరులు= పర్వతాలు; ఒందన్, వైవన్= పోలునట్లుగా వేసినచో; అవి= ఆ తరులు గిరులు; ఏను= నేను; ధరింతున్= వహిస్తాను; తివిరి= పూని; నీకున్= నీకు; అది= అయ్యది (ఆ తరువులు కొండలు); సేతువుగన్= వారధికాగా; కడంకన్= పూనికతో; అరిగి= వెళ్ళి; పగఱన్= శత్రువులను; గెలుము= జయించుము.

తాత్పర్యం: 'జనులకు ప్రభువైన ఓ శ్రీరామా! ఏ విధముగానూ నీ పనికి నేను అంతరాయం కలిగించజాలను సుమీ. అయినను - ముందు నా విన్నపాన్ని ఆలకించుము. ఈనాఁడు ప్రజలు అందరికి తెలిసేటట్లుగా, నీకు నేను దారిని ఇస్తే ఇక అందరు కూడా నన్ను దివ్యాస్త్రాలు ప్రయోగించి వశంచేసికొన చూస్తారు. అది మంచిది కాదు. అంతకంటె మంచి ఉపాయాన్ని మీకు సూచిస్తాను. మీ సేనలలో నలుడు అనే పేరు గల శిల్పకళావేత్త ఉన్నాడు. అతడు విశ్వకర్మయొక్క కొడుకు. అతడు నాయందు చెట్లు చేమలను కొండలను వేస్తే నేను వాటిని భరించగలను. అది మీకు వారధిగా ఉపకరించగలదు. అప్పుడు ఆ వారిధిపై మీరు పయనించి శత్రువులను గెలవండి'.

వ. **అని యతని నొడంబఱిచి సముద్రుండు సనుటయు, నమ్మహీపతి నలు రావించి సేతుబంధనంబు సేయ నియోగించిన, ననేకవానరసహస్రంబులు నలుదిక్కులకుఁ బఱచి గిరిశిఖరంబులుఁ దరునికరంబులు విఱిచి తెచ్చియిచ్చుచుండ నన్నలుండు మున్నీటి యందు శతయోజనాయామంబును దశయోజనవిస్తారంబునుంగా నతిదృఢం బగు సేతుబంధనంబు నిర్మించె నయ్యవసరంబున.** 50

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; అతనిన్= అతడిని, ఆ రాముడిని; ఒడంబఱిచి= అంగీకరింప జేసి; సముద్రుండు= సముద్రుడు; చనుటయున్= వెడలుటయున్నూ; ఆ+మహీపతి= ఆ రాజు - శ్రీరాముడు; నలున్= నలుడిని; రావించి= పిలిపించి; సేతుబంధనంబు+చేయన్= వారధి కట్టటానికి; నియోగించినన్= నియమించగా; అనేక, వానర, సహస్రంబులు= పెక్కువేల కోతులు; నలుదిక్కులకున్= నాలుగు దెసలకు; పఱచి= వేగంగా వెడలి; గిరి శిఖరంబులు= కొండల పై భాగాలు; తరునికరంబులు= చెట్ల సముదాయాలు; విఱిచి తెచ్చి= ముక్కలు చేసి తెచ్చి; ఇచ్చుచున్+ఉండన్= ఇస్తూ ఉండగా; ఆ+నలుండు; మున్నీటియందున్= సముద్రంలో; శతయోజన+ఆయామంబును= వంద ఆమడల పొడుగును; దశయోజన విస్తారంబునుంగాన్= పది ఆమడల వెడల్పును కలిగినదిగా; అతి దృఢంబు+అగు= మిక్కిలి గట్టిదైన; సేతుబంధనంబు= వారధి; నిర్మించెన్= కట్టాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అని రాముడిని అంగీకరింపజేసి సముద్రుడు వెళ్ళాడు. శ్రీరాముడు నలుడిని పిలిపించి వారధి కట్టటానికి నియమించాడు. పెక్కువేల కోతివీరులు నాలుగుదిక్కులకు వేగంగా వెళ్ళి పర్వతశిఖరాలను, చెట్ల సముదాయాలను తెచ్చి ఇస్తూ ఉండగా, నలుడు వంద ఆమడల పొడుగు, పది ఆమడల వెడల్పుగల గట్టిదైన వారధిని నిర్మించాడు. ఆ సమయంలో.

ఆ. అన్నతోడ నలిగి యాప్తులుఁ దాను వి । భీషణుండు వినయభూషణుండు
నెమ్మి నరుగుదెంచి నృపశిరోమణి రాము । శరణుఁ జొచ్చె భక్తిభరితుఁ డగుచు. 51

ప్రతిపదార్థం: వినయ భూషణుండు= అణకువయే ఆభరణంగా కలవాడు; విభీషణుండు; అన్నతోడన్+అలిగి= అగ్రజుడిపై (రావణుడిపై) కోపించి; ఆప్తులున్+తానున్= మిక్కిలి చేరువగా ఉండే మిత్రులున్నూ తాను; నెమ్మిన్= సంప్రీతితో; అరుగుదెంచి= వచ్చి; నృప, శిరస్+మణిన్= రాజులలో శ్రేష్ఠుడిని; రామున్= శ్రీరాముడిని; భక్తి, భరితుఁడు+అగుచున్= భక్తితో నిండినవాడు అగుచు; శరణున్+చొచ్చెన్= శరణువేడాడు, ఆశ్రయాన్ని అర్థించాడు.

తాత్పర్యం: వినయశీలుడైన విభీషణుడు అన్న అయిన రావణుడిపై ఆగ్రహించి, తన హృదయానికి సన్నిహితులైన మిత్రులతో పాటుగ సంప్రీతితో అరుదెంచి శ్రీరాముడిని శరణుజొచ్చాడు.

క. ఆ రాక్షసవృషభుని యా । కారము నింగితముఁ జూచి కాకుత్స్థకులో
ద్ధారుఁ డతని నతిధార్మికుఁ । గా రూపించి ముద మొప్పఁ గైకొనియెఁ దగన్. 52

ప్రతిపదార్థం: ఆ రాక్షస వృషభుని ఆకారమున్= ఆ రక్కసులలో శ్రేష్ఠుడు అయినవాని (విభీషణుడియొక్క) రూపం; ఇంగితమున్+చూచి= మనసులోని భావం తెలిపే ముఖరేఖలు మున్నగునవి గమనించి; కాకుత్స్థ, కుల+ఉద్ధారుఁడు= కాకుత్స్థవంశాన్ని ఉద్ధరించేవాడు, శ్రీరాముడు; అతనిన్= విభీషణుడిని; అతి ధార్మికుఁగాన్= మిక్కిలి ధర్మనిష్ఠుడిగా; రూపించి= నిర్ధారణ చేసి; తగన్= తగినవిధంగా; ముదము+ఒప్పన్= సంతోషం శోభిల్లేటట్లుగా; కైకొనియెన్= స్వీకరించాడు.

తాత్పర్యం: రాక్షసనాయకుడైన విభీషణుడి రూపరేఖాముఖవైఖరులను పరిశీలించి కాకుత్స్థవంశాన్ని ఉద్ధరించే శ్రీరాముడు అతడిని ధార్మికులలో గొప్పవా డని నిశ్చయించి అతడికి అభయప్రదానం చేశాడు.

విశేషం: (1) రాక్షసవృషభుఁడు - వృషభశబ్దం శ్రేష్ఠవాచకం. "కవివృషభులు మహాకావ్య మనియు"- అని నన్నయ ప్రయోగం- ఆదిపర్వ పీఠికలోనిది ఇట స్మరించాలి. (2) ఇంగితమును బట్టి- రూప రేఖా ముఖ విలాసాలను బట్టి శీలాన్ని నిర్ణయించేశక్తి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరిపాలకులకు ఉంటుంది. వాల్మీకి రామాయణంలో ఈ సన్నివేశం విపులంగా అభివర్ణితం, విభీషణుడు శత్రువర్గంలోని వాడు. అతడికి ఆశ్రయమివ్వటం మంచిది కాదని శ్రీరాముడికి ఆప్తులు చెప్పినట్లు మూలంలో ఉన్నది. ఎఱ్ఱన- నన్నయతిక్కనలవలెనే మూలాన్ని పలుతావుల సంక్షేపించాడు. అట్టితావులలో ఇది ఒకటి.

ఉ. వానికి దానవేంద్రువిభవంబు సమస్తము నిచ్చువాఁడు గాఁ
బూని ప్రతిజ్ఞ సేసి కృతపుణ్యుఁడు లక్ష్మణుతోడి చెల్మియున్
వానికి నిచ్చెఁజెచ్చెర నవారితవానరసైన్యయుక్తుఁడై
వానిఁ బురస్కరించుకొని వారిధి దాఁటె మహోగ్రలీలతోన్. 53

ప్రతిపదార్థం: వానికిన్= అతడికి (విభీషణుడికి); దానవ+ఇంద్రు, విభవంబు= రాక్షసరాజు (రావణుడియొక్క) సంపద; సమస్తమున్= అంతయున్నూ; ఇచ్చువాఁడు+కాన్= ఒసగునట్టివాడుగా; పూని= కడగి; (శ్రీరాముడు); ప్రతిజ్ఞ+చేసి= శపథం చేసి; కృతపుణ్యుఁడు= సుకృతం చేసినవాడు (ఆ శ్రీరాముడు); లక్ష్మణుతోడి చెల్మియున్= లక్ష్మణుడితోడి మైత్రిని; వానికిన్= అతడికి (విభీషణుడికి); చెచ్చెరన్= శీఘ్రంగా; ఇచ్చెన్= అనుగ్రహించాడు; అవారిత, వానర, సైన్యయుక్తుఁడు+ఐ= అడ్డగించటానికి వీలులేనట్టి కోతులసేనతో కూడినవాడయి (శ్రీరాముడు); వానిన్= అతడిని (విభీషణుడిని); పురస్కరించుకొని= ముందిడుకొని; మహా+ఉగ్ర, లీలన్= మిక్కుటమైన భయంకర రీతితో; వారిధిన్= సముద్రాన్ని; దాఁటెన్= తరించాడు.

తాత్పర్యం: శ్రీరాముడు విభీషణుడికి రావణుడిసామ్రాజ్యసంపద నంతటిని కట్టబెట్టుతానని పూనికతో శపథం చేశాడు. విభీషణుడికి లక్ష్మణుడికి మైత్రి కల్పించాడు. అప్రతిహతమైన వానరసేనలతోపాటు విభీషణుడిని మార్గ దర్శకుడిగా నిలిపి భయంకరయుద్ధసన్నాహాలతో సేతుమార్గాన సముద్రాన్ని దాటాడు.

వ. ఇట్లు సేతుమార్గంబున సాగరరోత్తరణం బాచరించి త్రికూటపర్వతం బెక్కిలంకానగరంబు చుట్టును శిబిరంబులు సంఘటింపం బంచిన. 54

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; సేతుమార్గంబునన్= వారధి తెరువున; సాగర+ఉత్తరణంబు= సముద్రాన్ని దాటటం; ఆచరించి= చేసి; త్రికూట పర్వతంబు= త్రికూటం అనే పేరుకల కొండను; ఎక్కి= అధిరోహించి; లంకానగరంబు చుట్టును= లంకాపట్టణానికి నలువైపులను; శిబిరంబులు= స్కంధావారాలు, భటుల విడిదులు; సంఘటింపన్+పంచినన్= నిర్మించటానికి ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఈ రీతిగా వారధిపై పయనించి సముద్రాన్ని దాటి త్రికూటపర్వతాన్ని అధిరోహించి శ్రీరాముడు లంకాపట్టణానికి నలువైపుల వానరసేనలకై స్కంధావారాలు నిర్మించటానికి ఆజ్ఞ ఇచ్చాడు.

క. తాలైలాగరు సాల ర। సాల తమాలామ్ర నింబ జంబూ జంబీ
రాలంకృత లంకావన। జాలంబుల విడిసె వృక్షచరసైన్యంబుల్. 55

ప్రతిపదార్థం: తాల+ఏలా+అగరు, సాల, రసాల, తమాల+ఆమ్ర, నింబ, జంబూ, జంబీర+అలంకృత, లంకా వనజాలంబులన్= తాడిచెట్లు, ఏలకిలతలు, చందనం వంటి ద్రవ్యాన్ని ఇచ్చే చెట్లు, మద్దిచెట్లు, తియ్యమామిడిచెట్లు, చీకటిచెట్లు, మామిడిచెట్లు, వేపచెట్లు; నేరేడుచెట్లు, నిమ్మచెట్లతో అలంకరించబడిన లంకాపట్టణం చుట్టూ ఉండే అడవుల సముదాయాలలో; వృక్షచర సైన్యంబుల్= వానర సేనలు; విడిసెన్= తాత్కాలిక నివాసాలను ఏర్పరచుకొన్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వానరసైన్యాలు లంకాపట్టణంచుట్టూ ఉన్న అడవులలో శిబిరాలను నిర్మించుకొన్నాయి. తాడిచెట్లు, ఏలకులతీగెలు, మద్దిచెట్లు, తియ్యమామిడిచెట్లు, చీకటిచెట్లు, మామిడిచెట్లు, వేపచెట్లు, నేరేడుచెట్లు, నిమ్మచెట్లు ఆ అడవులలో అందంగా ఎదిగిఉన్నాయి.

విశేషం: వానరులు 'వృక్షచరులు' కదా. లంకాపట్టణంచుట్టూ దట్టమైన చెట్లు పెరిగిన అడవులు ఉండటం వానరులకు సుఖదాయకం.

వ. తదనంతరంబ రావణచారులైన శుకసారణు లనువారలు వానరాకారంబులు దాల్చి శిబిరంబునఁ గ్రుమ్మరుచున్న నెఱింగి, విభీషణుం డా రాక్షసులం బట్టించి రామునకు సమర్పించిన, నతండు వారికి నిజసైన్యం బంతయుం జూప నియోగించి విడిచి పుచ్చినఁ, జని యయ్యిరువురు నమరవైరిం గని కపిసైన్యంబు దుర్జయం బనియును, రామలక్ష్మణుల తేజోమూర్తివిశేషంబులును నెఱింగించిన, నతండు దాని సరకు సేయక సమరంబునకు మోహరించి. 56

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట; రావణచారులు+ఐన= రావణుడి రహస్యదూతలు అయిన; శుక, సారణులు= శుకుడు, సారణుడు అనేవారు; వానర+ఆకారంబులు+తాల్చి= కోతుల రూపాలు ధరించి; శిబిరంబునన్= స్కంధావారంలో; క్రుమ్మరుచున్+ఉన్న= తిరుగాడుతుండగా; విభీషణుండు; ఎఱిఁగి= తెలిసికొని; ఆ రాక్షసులన్= ఆ రక్కసులను (గూఢచారులు అయిన శుక సారణులను); పట్టించి= బంధించి; రామునకున్= శ్రీరాముడికి; సమర్పించినన్= ఇవ్వగా; అతండు= అతడు- శ్రీరాముడు; వారికిన్= శుక సారణులకు; నిజసైన్యంబు= తమయొక్క సేనను; అంతయున్= సమస్తమున్నూ; చూపన్= చూపించటానికి; నియోగించి= ఏర్పాటుచేసి; విడిచి పుచ్చినన్= వదలిపెట్టగా; చని= వెడలి; ఆ+ఇరువురును= శుక సారణులు; అమరవైరిన్+కని= దేవతల విరోధిని రావణుడిని దర్శించి; కపిసైన్యంబు= కోతులసేన; దుర్జయంబు= గెలువరానిది; అనియును= అని వచించుటయును; రామలక్ష్మణుల తేజస్+మూర్తి, విశేషంబులును= రాముడియొక్కయు లక్ష్మణుడియొక్కయు వర్చస్సు ఆకారరేఖలయొక్క వివరాలను; ఎఱింగించినన్= తెలుపగా; అతండు= రావణుడు; దానిన్= దానిని (శుక సారణుల నివేదనను); సరకు+చేయక= లక్ష్యపెట్టక; సమరంబునకున్= యుద్ధానికి; మోహరించి= సన్నాహాలు చేసి.

తాత్పర్యం: శుకసారణులు అనే పేర్లు కల రావణుడిగూఢచారులు వానర సైన్య శిబిరంలో వానరాకారాలు తాల్చి తిరుగాడసాగారు. అది గుర్తించి విభీషణుడు వారిని రాముడికి అప్పగించాడు. రాముడు వారలకు తనసైన్యాన్ని చూపించటానికి నియోగించి, వారలను బంధముక్తులను చేసి పంపించాడు. శుకసారణులు రావణుడిని చేరి వానరసైన్యం జయించటానికి అలవికానిదనిన్నీ, రామలక్ష్మణులు అతిలోకవీరులు మహాతేజస్వులు అనిన్నీ చెప్పారు. కాని, ఆతడు వారలమాటలు సరకుచేయక యుద్ధసన్నాహాలలో నిమగ్నుడయ్యాడు.

**సీ. బద్ధశిలాయంత్రబహుళమై యుత్తాలి । తాట్టాలకాభీలమై యుదగ్ర
కేతుపతాకాప్రకీర్ణమై తోమర । ముద్గరాలాతక ముసల శూల
శర శతఘ్నీముఖ సాధనోపేతమై । యుగ్రవిగ్రహధీరయోధవీర
సంకులంబై హయస్యందనవేదండ । చండమై సముదిత సప్తసాల**

ఆ. మై యలంఘ్యపరిఖమై తృణకాష్ఠజ। లాది వస్తుభరిత మైన లంక
కధికరక్షఁ జేసి యప్రమాదంబున। నుండె రిపుజిగీష నుదితబలుఁడు. 57

ప్రతిపదార్థం: బద్ధ శిలాయంత్ర బహుళము+ఐ= ఏర్పరచబడిన రాళ్ల రువ్వేమరలు పెక్కులు కలిగినట్టిదై; ఉత్తాలిత+అట్టాలక+ఆ భీలము+ఐ= ఎత్తైన మేడలతో భయాన్ని కల్పించేదై; ఉదగ్ర, కేతు, పతాకా ప్రకీర్ణము+ఐ= పొడవైన టెక్కెములతో జెండాలతో వ్యాపించినదై; తోమర, ముద్గర+అలాతక, ముసల, శూల, శర, శతఘ్ని, ముఖ సాధన+ఉపేతము+ఐ= చిల్లకోలలు, సమ్మెటలు, కొరవులు, రోకళ్లు, ఈటెలు, బాణాలు, నూరుమందిని (పెక్కుమందిని) చంపు గుండ్లను ప్రసారంచేసే మరలు మున్నగు పరికరాలతో కూడినట్టిదై; ఉగ్ర, విగ్రహ, ధీర, యోధ, వీర సంకులంబు+ఐ= భయంకరమైన యుద్ధాలు చేయటంలో చిత్త స్థైర్యం కలిగినవారితో, భటులతో, పరాక్రమం కలిగినవారితో దట్టమైనదై; హయ, స్యందన, వేదండ, చండము+ఐ= గుర్రాలతో, రథాలతో, ఏనుగులతో భయంకరమై; సమ్+ఉదిత, సప్తసాలము+ఐ= బాగా ఏర్పడిన ఏడు ప్రాకారాలు కలదై; అలంఘ్య పరిఖము+ఐ= దాటటానికి శక్యంగాని అగడ్త కలదై; తృణ, కాష్ఠ, జల+ఆది, వస్తు, భరితము+ఐన= గడ్డి, కట్టెలు, నీరు మున్నగు వస్తువులతో నిండినట్టిదైన; లంకకున్= లంక అనే పట్టణానికి; అధిక రక్షన్+చేసి= మిక్కుటమైన కాపుదల కల్పించి; రిపు జిగీషన్= శత్రువులను గెలువవలె ననే కోరికతో; ఉదిత బలుఁడు= ఏర్పడిన బలం కలవాడు - రావణుడు; అ ప్రమాదంబునన్+ఉండెన్= ఏమరుపాటు లేకుండ ఉన్నాడు.

తాత్పర్యం: బలవంతుడైన రావణుడు లంకానగరానికి మిక్కుటమైన రక్షణ కల్పించి ఏమరుపాటు లేకుండా సర్వయుద్ధసన్నాహాలను జాగరూకతతో ఒనరించాడు. లంకాపట్టణంలో పెక్కుశిలాయంత్రాలు అమరి ఉన్నాయి. అది మిక్కిలి ఎత్తైన సౌధాలతో, జెండాలతో, జెండాలు అమర్చడానికి నిర్మించబడిన స్తంభాలతో కూడిఉండింది. వివిధాలైన ఆయుధాలు-చిల్లకోలలు, సమ్మెటలు, ఈటెలు, కొరవులు, బాణాలు, శతఘ్నులు మున్నగు పరికరాలతో కూడినట్టిది. యుద్ధంచేయటంలో భయంకరమైన శక్తిసామర్థ్యాలు కల భటులతో క్రిక్కిరిసినట్టిది, గుఱ్ఱాలు రథాలు ఏనుగులతో భయంకరమైనది, ఏడు ప్రాకారాలతో సురక్షితమైనది, దాటటానికి శక్యంగాని అగడ్త గలది. గడ్డి కట్టెలు నీరు మున్నగు వస్తువులు సమృద్ధంగా కలిగినట్టిది.

విశేషం: ఇది లంకాపట్టణ వర్ణనం. ఆ లంకాపురి ఏ త్రేతాయుగంనాటిదో కదా. అప్పుడు లంకాపట్టణం ఎట్లా ఉండెనో ఏమో కాని, ఈ పద్యంలోని అభివర్ణన- ఎట్టిన సమకాలీన దుర్గాలను మనస్సులో పెట్టుకొని వ్రాశాడని ఎంచవచ్చును. శిలాయంత్రాలు, సప్తప్రాకారాలు, చతురంగ బలాలు, శతఘ్నులు మొదలైన ఆయుధాలు తృణకాష్ఠ జలసమృద్ధి ఎట్టినకాలంనాటి తెలుగుకోటలకు సంబంధించినవే. తిక్కనగారి నిర్వచనోత్తర రామాయణంలోని అయోధ్యాపురవర్ణనం చూడండి. ఇందులో తిక్కనఅనుసరణ గమనించదగింది.

వ. ఇట రాఘవుండును సుగ్రీవసహితుండై యుండి యంగదుం జూచి 'నీవు రావణుపాలికిం జని యతనికిం దగినతెఱంగున బుద్ధిగాఁ జెప్పి, జానకి విడుచుట మే లని చెప్పు' మని పనిచినం బని పూని యవ్వీరుండు.58

ప్రతిపదార్థం: ఇట= ఇచట ఇంతవరకు లంకాపురం, రావణుడికి సంబంధించిన కథ చెప్పబడింది. ఇప్పుడు ఇచట రాముడి వృత్తాంతం చెప్పబడబోతున్నది; రాఘవుండును= శ్రీరాముడును; సుగ్రీవ సహితుండు+ఐ= సుగ్రీవుడితో కూడినట్టివాడై; ఉండి= ఉండి; అంగదున్+చూచి= అంగదుడిని చూచి; నీవు= ఓ అంగదా నీవు; రావణు, పాలికిన్+చని= రావణుడి కడకు వెళ్ళి; అతనికిన్; తగిన, తెఱంగునన్= ఉచితమైన రీతిలో; బుద్ధిగాన్+చెప్పి= హితవు వచించి; జానకిన్= సీతను; విడుచుట= వదలిపెట్టటం; మేలు+అని= మంచిది అని; చెప్పుము= వచించుము; అని= అని వచించి; పంచినన్= నియోగించగా; పని+పూని= కర్తవ్యం నిర్వహించటానికి పూనుకొని; ఆ+వీరుండు= (ఆ అంగదుడు).

తాత్పర్యం: అచట లంకాపురికి రావణుడు రక్షణ కల్పిస్తుండగా ఇచట, శ్రీరాముడు వారధికడ సుగ్రీవుడితో కూడి ఉండి, వానరయువరాజు అయిన అంగదుడిని పిలిచి 'ఓ అంగదా! నీవు రావణుడికడకు రాయబారివై వెళ్ళి, ఆతడికి, సీతను వదలిపెట్టటం మంచిది అని హితవు బోధించుము. సమయానుకూలంగా నీవు రావణుడితో మాటాడుము' అని చెప్పాడు. అంగదుడు రాముడిఆజ్ఞను నెరవేర్చదలచాడు.

శా. లంకాద్వారము దుర్నివార గమనోల్లాసంబునం జొచ్చి ని
శ్శంకుండై సురశత్రుసైనికసహస్రంబుల్ దనుం జూచి యా
శంకం బొందఁగ లీలమైఁ జని సుహృత్సంఘంబు గొల్వన్ నిరా
తంకుండై కొలు వున్న దైత్యుఁ గని యుద్యన్మూర్తియై యిట్లనున్. 59

ప్రతిపదార్థం: లంకాద్వారము= లంకాపట్టణంయొక్క వాకిలి; దుర్నివార, గమన+ఉల్లాసంబునన్= వారించటానికి శక్యంగాని ప్రయాణంయొక్క విజృంభణం చేత; చొచ్చి= ప్రవేశించి; నిశ్శంకుండు+ఐ= ఎట్టి జంకుగొంకులు లేనట్టివాడై; సుర, శత్రు, సైనిక, సహస్రంబుల్= దేవతలకు విరోధులైన రాక్షసభటులు వేనకు వేలమంది; తనున్+చూచి= తనను గాంచి; ఆశంకన్+పొందఁగన్= భయాన్ని చెందగా; లీలమైన్= వినోదంగా; చని= వెళ్లి; సుహృత్+సంఘంబు= మిత్రుల సముదాయం; కొల్వన్= సేవించగా; నిరాతంకుండు+ఐ= అడ్డు లేనివాడై; కొలువు+ఉన్న= సభను తీర్చిఉన్న; దైత్యున్= రాక్షసుడిని (రావణుడిని); కని= చూచి; ఉద్యత్+మూర్తి+ఐ= ప్రకాశిస్తున్న ఆకారం కలవాడై; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అంగదుడు - లంకాపట్టణంలో మిక్కుటమైన ఉత్సాహంతో ప్రవేశించాడు. దేదీప్యమానమైన ఆతడి తేజస్సు చూచి రాక్షసభటులు భయం పొందారు. అప్పుడు రావణుడు మిత్రులు తనను సేవించగా కొలువు తీర్చి ఉన్నాడు. అంగదుడు కొలువుకూటం చేరి రావణుడితో ధైర్యంగా ఇట్లా చెప్పాడు.

విశేషం: (1) అంగదుడిపాత్ర వాల్మీకిరామాయణంలో విశిష్టంగా చిత్రించబడింది. అంగదుడు వాలికొడుకు, యువరాజు, ఉత్సాహవంతుడు. ఎఱ్ఱన ఒక్కసమాసంలో 'ఉద్యన్మూర్తి' అని అంగదుడివ్యక్తిత్వాన్ని సంక్షేపంగా చిత్రించాడు. అంతేకాక-శ్రీరాముడు అతడికి యథోచితంగా మాటాడే అవకాశం ఇచ్చి ఉన్నాడు కాబట్టి అతడు సర్వతంత్రస్వతంత్రప్రతిపత్తి కల రాయబారి గాని కేవలం ఒక దూత కాదు.

అంగదు రాయబారము (సం. 3-267-54)

క. 'ఇనకులతిలకుఁడు బాణా । సనవిద్యాగురుఁడు రామచంద్రుఁడు నీతో
నను నిట్లను మని పనిచెను; వినుము తదీయోక్తిభంగి విస్పష్టముగన్. 60

ప్రతిపదార్థం: ఇన, కుల, తిలకుఁడు= సూర్యవంశంలో శ్రేష్ఠమైనవాడు; బాణ+ఆసన, విద్యా, గురుఁడు= విలువిద్యలో ఆరితేరి ఇతరులకు మేలుబంతి అయిన గొప్పవాడు; రామచంద్రుఁడు= శ్రీరాముడు; నీతోన్= (ఓ రావణా) నీతో; ననున్= నన్ను; ఇట్లు= ఈ రీతిగా; అనుము+అని= వచింపుము అని; పనిచెను= నియోగించాడు; తదీయ+ఉక్తి, భంగి= ఆతడియొక్క అనగా ఆ శ్రీరామచంద్రుడియొక్క మాటలవైఖరి; విస్పష్టముగన్= తేటతెల్లంగా; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: 'సూర్యవంశంలో జన్మించిన రాజులలో శ్రేష్ఠుడు, విలువిద్యలో ఘనుడు అయిన శ్రీరాముడు నీతో నన్ను ఈ మాటలు చెప్పుమని పుత్తెంచాడు. ఆ శ్రీరాముడిపలుకులు తేటతెల్లంగా నీకు చెప్పుతాను. సావధానంగా ఆలకించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. అనపరాధులఁ గాననాంతరమున నున్న। పేదతాపసులఁ జంపితి పలువుర
నమరుల యీలువుటాండ్రను జెఱవట్టి। యఖిలలోకములకు నలఁత సేసి;
తిదియెల్ల నొక తల; యేపుమీఱఁగ నన్నుఁ। జెనకుట యొక తల; సెప్ప నేల?
బలిమి యొప్పఁగ మంచి బంటవై వెడలుము। కయ్యంబునకు; నట్లు గాక యున్న

ఆ. శరణుఁ జొచ్చి నాకు జానకి నొప్పింపు; మొండు వెంట బ్రతికి యుండఁ దీఱ;
దస్మదీయశితశరాశీవిషంబుల। కెరయ నీదుప్రాణ మింత నిజము. 61

ప్రతిపదార్థం: అనపరాధులన్= నేరము లేవియు చేయని వారిని; కానన+అంతరమునన్+ఉన్న= అడవిలో ఉన్న; పేద తాపసులన్= సాధువులై తపస్సు చేసికొనే ఋషులను; పలువురన్= పెక్కుమందిని; చంపితి(వి)= సంహరించావు; అమరుల+ఈలువు+ఆండ్రను= దేవతలయొక్క పతివ్రత లైన స్త్రీలను; చెఱ+పట్టి= బంధించి; అఖిల లోకములకున్= అన్ని భువనాలకు; అలఁత+చేసితి= అపచారం చేశావు; ఇది+ఎల్లన్= ఇది అంతయున్నూ; ఒక, తల= ఒక యెత్తు; ఏపు మీఱఁ గన్= అతిశయించేటట్లుగా; నన్నున్= నన్ను (రాముడిని); చెనకుట= ఎదిరించటం; ఒక తల= ఒక యెత్తు; చెప్పన్+ఏల= వచించటం ఎందుకు; బలిమి+ఒప్పఁగన్= పరాక్రమం శోభిల్లేటట్లుగా; మంచి బంటవు+ఐ= గొప్ప వీరుడవు ఐ; కయ్యంబునకున్= యుద్ధానికి; వెడలుము= వెళ్ళుము (రమ్ము); అట్ల+కాక+ఉన్నన్= ఆ రీతిగా కాకపోతే; శరణున్+చొచ్చి= రక్షణ వేడుకొని, ఆశ్రయించి; నాకున్= నాకు (రాముడికి); జానకిన్= సీతను; ఒప్పింపుము= అప్పగించుము, ఒండు వెంటన్= ఇంకొక రీతిగా అయితే; బ్రతికి+ఉండన్+తీఱదు= జీవించిఉండటానికి (నీకు) ఆస్కారం లేదు; అస్మదీయ, శిత, శర+ఆశీ విషంబులకున్= నాయొక్క వాడిబాణాలు అనే పాములకు; నీదు, ప్రాణము= నీదైన అసువులు; ఎర+అ= బలి కావలసిందే; ఇంత= ఈ రీతిగా జరగటం; నిజము= సత్యం.

తాత్పర్యం: ఓ రావణా! నిర్దోషులు మహానుభావులు సాత్త్వికులు అయి ఆడవులలో తపస్సు చేసికొనే ఋషులను నీవు నిర్దాక్షిణ్యంగా సంహరించావు. పతివ్రతలైన దేవతాస్త్రీలను బంధించి అఖిలభువనాలకు అపచారం చేసి ఉన్నావు. నీవు చేసిన అపరాధాలు అన్నీ ఒక యెత్తు; నాయెడ చేసినతప్పు ఒక యెత్తు అని వేరుగా చెప్ప నవసరం లేదు. పరాక్రమం కలవాడవనే గర్వం నీ కుంటే నాతో యుద్ధానికి తలపడుము. లేదా నన్ను శరణు వేడుము, సీతను నాకు ఒప్పగించుము. మరొక విధంగా అయితే నీవు జీవించి ఉండటం కుదరదు. నా బాణాలు అనే త్రాచుపాములకు నీ ప్రాణాలు బలి కావలసిందే. జాగ్రత్త. ఇది నిజం.

క. మనుజుండ నైన నా తెఱఁ। గనుమానము వాయఁ జూడు మాహవభూమిన్;
విను, రాక్షసులను నామం। బును నడఁపక యేను రిత్త వోనిచ్చెదనే?' 62

ప్రతిపదార్థం: ఆహవ భూమిన్= రణరంగంలో; మనుజుండన్+ఐన= మనుష్యుడను అయిన; నా తెఱఁగు= నా రీతి; అనుమానము+పాయన్+చూడుము= సందేహం పోయేటట్లుగా అరయుము; విను= ఆలకింపుము; రాక్షసులు+అను= రక్కసులు అనెడి; నామంబును= పేరును; అడఁపక= నశింపజేయక; ఏను= నేను; రిత్త+పోనిచ్చెదనే?= వ్యర్థంగా వదలి పెట్టుతానా?

తాత్పర్యం: ఓ రావణా! నీకు మనుజజాతిపై తక్కువచూపు ఉన్నది. రణరంగంలో మనుజజాతికి చెందిన నాబలం ఎటువంటిదో సందేహానికి ఆస్కారం లేకుండా నీవు చూస్తావు సుమీ! నా ప్రతిజ్ఞ వినుము. రాక్షసులు అనే పేరును సయితం నేను నాశనం చేయకుండ వదలిపెట్టను. ఇవి రిత్తమాటలు కావు.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలుకుచున్న యంగదు పరుషభాషణంబులకు రోషించిన యసురపతి కన్నెఱింగి నలువురు రక్కసులు గ్రక్కున నవ్వాలి నందనుం బొదివి పట్టిన బిట్టెగసి హర్మ్యశిఖరంబు పైకి దాఁటుటయుఁ, దదాక్షేపవేగంబున నన్నిశాచరులు ధరణీతలంబున జర్జరిత శరీరు లై పడిరి; హరివీరుం డచ్చటినుండి శిబిర మధ్యంబునకు లంఘించి భూనాథునకుఁ దన పోయివచ్చిన తెఱంగు విన్నవించెం; దదనంతరంబ రాఘవు ననుమతంబున.63

ప్రతిపదార్థం: అని పలుకుచున్న= అని అంటున్న; అంగదు, పరుష, భాషణంబులకున్= అంగదుడి కఠినమైనమాటలకు; రోషించిన= కోపం చెందిన; అసురపతి, కన్ను+ఎఱింగి= రక్కసులప్రభువు అయిన రావణుడి అభిప్రాయం తెలిసి; నలువురు, రక్కసులు= నల్గురు రాక్షసులు; గ్రక్కునన్= శీఘ్రంగా; ఆ+వాలి, నందనున్= వాలికొడుకు అయిన ఆ అంగదుడిని; పొదివిపట్టినన్= క్రమ్ముకొని పట్టగా, (అంగదుడు); బిట్టు+ఎగసి= బాగా పైకెగిరి; హర్మ్యశిఖరంబుపైకిన్= మేడకొసభాగం పైకి; దాఁటుటయున్= కుప్పించుటయున్నూ; తద్+ఆక్షేప వేగంబునన్= ఆ త్రోపుడులో ఏర్పడిన రయంవలన; ఆ+నిశాచరులు= ఆ నలువురు రక్కసులు; ధరణీతలంబునన్= భూప్రదేశంపై; జర్జరిత శరీరులు+ఐ= ముక్కలుగా చీలిన దేహాలు కలవారై; పడిరి= నేలపై కూలారు; హరివీరుండు= కోతుల వీరుడు; అచ్చటినుండి= రావణుడి కొలువుకూటంనుండి; శిబిరమధ్యంబునకున్= (కోతులు నిర్మించిన) స్కంధావారాల నడిమి ప్రదేశానికి; లంఘించి= దూకి; భూనాథునకున్= రాజుకు (శ్రీరాముడికి); తన, పోయివచ్చిన, తెఱంగు= తాను వెళ్లి వచ్చిన రీతిని; విన్నవించెన్= నివేదించాడు; తత్+ అనంతరంబు+అ= అటుపిమ్మట; రాఘవు+అనుమతంబునన్= శ్రీరాముడి అనుజ్ఞచేత.

తాత్పర్యం: అంగదుడిమాటలకు రావణుడికి కోపం వచ్చింది. అతడి కన్ను లెఱ్ఱబారాయి. ఆ రావణుడి మనోభావాన్ని గుర్తించి నలుగురు రాక్షసభటులు అంగదుడిని చుట్టుముట్టి బంధించబోయారు. కాని, అంగదుడు మిక్కుటమైన వేగంతో ఒక్కసారి మేడచివరిభాగంపైకి ఎగిరిపోయాడు. ఆ త్రోపుడులో ఏర్పడిన వేగంచొప్పున ఆ నలుగురు రాక్షసభటులు చీలినదేహాలు కలవారై నేలమీద పడిపోయారు. అంగదుడు అంతట అచ్చటినుండి ఆకసంపైకి లంఘించి ఆ వానరశిబిరాలమధ్యకు దూకి, శ్రీరాముడికి తాను నిర్వహించిన రాయబారాన్నిగూర్చి నివేదించాడు. పిదప శ్రీరాముడి ఆజ్ఞచొప్పున.

మత్తకోకిలము.

తాలసాలశిలాగ్రహస్తు లుదగ్రగోత్రమహీధరో
త్తాలదేహు లనేకవర్ణులు దారితాఖిలదిఙ్ముఖా
భీలవాలశిఖాగ్రు లుగ్రగభీరసత్త్వులు వానరుల్
గాలకల్పులు పేర్చి సంతనకట్టి రాహవకేళికిన్. 64

ప్రతిపదార్థం: తాల, సాల, శిలా+అగ్ర, హస్తులు= తాడిచెట్లు, మద్దిచెట్లు, వాడియైన రాళ్లు చేతులలో పూనినవారు; ఉదగ్ర, గోత్ర, మహీధర+ఉత్తాల, దేహులు= భయంకరాలైన కులపర్వతాలవలె పొడుగైన శరీరాలు కలవారు; అనేక, వర్ణులు= పెక్కురంగులు కల దేహాలు కలవారు; దారిత+అఖిల, దిక్+ముఖ+ఆభీల, వాల, శిఖా+అగ్రులు= చీల్చబడిన అన్నిదిక్కుల మొగాలలో విస్తరిల్లిన తోకల కొసలు కలవారు; ఉగ్ర, గభీర, సత్త్వులు= భయంకరం గంభీరం అయిన బలం కలవారు; వానరుల్= కోతులు; కాల, కల్పులు= యముడితో సమానులు; పేర్చి= విజృంభించి; ఆహవకేళికిన్= యుద్ధం అనే ఆటకు; సంతనకట్టిరి= సన్నాహాలు చేశారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తాడిచెట్లు మద్దిచెట్లు పదునైనరాళ్లు చేతబూనిన వార్రై, కులపర్వతాలవలె ఎత్తైన శరీరాలతో భయంకరులై, పెక్కురంగులు కల దేహాలు కలవారై, అన్ని దిక్కులభాగాలను ఎత్తిన తమతోకలకుచ్చులతో ఆక్రమించినవారై, వెరపు కొలిపే బలపరాక్రమాలు కలవారై యముడితో సమానులు అయిన వానరులు యుద్ధం అనే ఆటకు సన్నాహాలను ఒనరించారు.

విశేషం: వృత్త లక్షణానికి చూడండి - ఆరణ్యపర్వం 4.267 విశేషాంశం.

క. పరువడి మొత్తములై బం । ధురఘోషం బెసఁగఁ బొంగి తోఁతెంచు హరీ
శ్వర బలమునందు ఘనసా । గరవీచి వికాసరేఖ గానఁగ నయ్యెన్. 65

ప్రతిపదార్థం: పరువడి మొత్తములు+ఐ= ఒక క్రమం ప్రకారంగా గుమిగూడినట్టివై; బంధురఘోషంబు= కలకల నినాదం; ఎసఁగన్= అతిశయించగా; పొంగి= ఉత్సాహించి; తోఁతెంచు= నడిచే; హరి+ఈశ్వర, బలమునందున్= వానరనాయకుల సైన్యంలో; ఘన, సాగర, వీచి వికాసరేఖ= గొప్ప సముద్రపుటలలయందు గోచరించు సౌందర్యం; కానఁగన్+అయ్యెన్= కన్పించింది.

తాత్పర్యం: ఆ వానరసేనలు ఒక క్రమపద్ధతిలో కూడిన వరుసలలో కదలుతూ, కలకల నినాదాలతో పొంగులు వారుతున్నప్పుడు, గొప్ప సముద్రంలోని అలల మాదిరిగా కన్పించాయి.

విశేషం: అలం: ఉపమ. ఉపమానం సాగరవీచివికాసరేఖ. ఉపమేయం హరీశ్వరబలం.

మత్తకోకిలము.

కోటఁ బన్నిన ఘోరదానవకోటిఁ జుల్కనఁ దోలి య
క్కోట నల్గడలన్ మహోగ్రతఁ గూలఁ ద్రోచి సమున్న మ
త్కూటతోరణయంత్ర కేతన గోపురాట్టకసంహతుల్
వీటతాటము సేసి రక్కపివీరు లొక్కట మాత్రలోన్. 66

ప్రతిపదార్థం: కోటన్= దుర్గంలో (లంకాదుర్గంలో); పన్నిన= యుద్ధానికి సంసిద్ధంగా ఉన్న; ఘోర దానవకోటిన్= భయంకరులు అయిన రక్కసుల సమూహాన్ని; చుల్కనన్= సులువుగా; తోలి= నెట్టివేసి; ఆ+కోటన్= ఆ దుర్గాన్ని; నల్గడలన్= నాలుగు దెసలను; మహా+ఉగ్రతన్= మిక్కిలి ఘోరంగా; కూలన్+త్రోచి= పడగొట్టి; సమ్+ఉన్నమత్, కూట, తోరణ, యంత్ర, కేతన, గోపుర+అట్టక, సంహతుల్= నిట్టనిటారుగా నిర్మించబడిన పురద్వారానికి ముందు అర్ధవలయాకారంలో ఏర్పరచబడిన కట్టడానికి సంబంధించిన మరలు, జెండాలు గోపురాలు మేడలు మున్నగునవి; ఆ+కపివీరులు= ఆ వానర వీరులు; ఒక్కటన్= ఒక్కుమ్మడిగా; మాత్రలోన్= త్రుటిలో; వీటతాటము+చేసిరి= తారుమారు చేశారు.

తాత్పర్యం: ఆ కపివీరులు లంకాపురంకోటముందు యుద్ధానికి సంసిద్ధంగా ఉన్న భయంకరులైన రాక్షసులను సులువుగా పారద్రోలారు. ఆ కోట నలువైపులను కూలద్రోశారు. అందులో మిక్కిలి ఎత్తుగా అమర్చబడిన పురద్వారతోరణం జెండాలు, గోపురాలు, మేడలు మున్నగువాటిని ఒక్కసారిగా త్రుటిమాత్రలో ధ్వంసంచేశారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: వృత్త లక్షణానికి చూడండి - అరణ్య 4-267 విశేషాంశం.

వ. **మఱియుఁ బ్రాకారంబుపై నున్న గదాపరిఘకుంత ప్రముఖంబులు గైకొని లంకామధ్యంబున వైవం దొడంగిన నాబాలవృద్ధం బగు పౌరలోకంబుహాహాకారవ్యాకులంబై కలంగంబడియె; నంత రావణచోదితు లైన దానవులు నానాకోటిసహస్రసంఖ్యు లరిగి యెక్క డెక్కడ యని తలపడి కపిసముదయంబులం దోలి యెప్పటియట్ల ప్రాకారంబుం గైకొని నిల్చి; రప్పుడు.** **67**

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; ప్రాకారంబుపైన+ఉన్న= చుట్టుగోడపై ఉన్న; గదా, పరిఘ, కుంత, ప్రముఖంబులు= గదలు, ఇనుపకట్ల గుదియలు, ఈటెలు మున్నగునవి; కైకొని= గ్రహించి; లంకామధ్యంబునన్= లంకాపట్టణం నడిమి ప్రదేశంలో; వైవన్+తొడంగినన్= విసరసాగగా; ఆబాల వృద్ధంబు+అగు= చిన్నపిల్లలనుండి పెద్దలవరకూ కల; పౌరలోకంబు= పురజనుల సమూహం; హాహాకారవ్యాకులంబు+ఐ= కుయ్యో మొర్రో అనే ఆర్తనాదాలతో కలతచెందినది అయి; కలంగన్+పడియెన్= కలతచెందింది; అంతన్= పిదప; రావణచోదితులు+ఐన= రావణుడిచేత ప్రేరేపించబడిన; దానవులు= రాక్షసులు; నానాకోటి సహస్రసంఖ్యులు= పెక్కుకోట్లవేలమంది; అరిగి= వెడలి; ఎక్కడ+ఎక్కడ, అని, తలపడి= (శత్రువులు) ఎక్కడ ఎక్కడ ఉన్నారు అని ముట్టడించి; కపి సముదయంబులన్= కోతుల మూకలను; తోలి= తరిమి; ఎప్పటి+అట్లు+అ= యథాప్రకారంగా; ప్రాకారంబున్= చుట్టుగోడను; కైకొని= ఆక్రమించి; నిల్చిరి= నిలబడ్డారు; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: వానరులు లంకాపట్టణప్రాకారంమీద నున్న ఆయుధాలు - గదలు, ఇనుపకట్ల గుదియలు, ఈటెలు మున్నగువాటిని సంగ్రహించి నగరంలోకి విసరసాగారు. అప్పుడు లంకాపౌరులు పిన్నలు పెద్దలు హాహాకారాలతో రోదించారు. ఆ హాహాకారాలను విని రావణుడు కోట్లకొలది రాక్షసభటులను పంపాడు. వారు ప్రాకారాన్ని చేరి, శత్రువులు ఎక్కడ ఎక్కడ ఉన్నా రని వెదకి వానరులను పారద్రోలారు. లంకాదుర్గప్రాకారాలు యథాపూర్వం రక్కసుల వశమయ్యాయి.

క. **మును మర్కటబలములచే । ననయంబును గపిలవర్ణమైనది మగుడన్**
దనుజబలసంవృతంబై । ఘనపటలచ్ఛాయఁ గోట కర మొప్పారెన్. **68**

ప్రతిపదార్థం: మును= అంతకుపూర్వం; మర్కటబలములచేన్= కోతులసేనలచేత; అనయంబును= మిక్కిలి; కపిలవర్ణము+ ఐనది= గోరోజనపు రంగుగా కన్పించినట్టి; కోట= (లంకాపుర) దుర్గం; మగుడన్= తిరిగి; దనుజబల సంవృతంబు+ఐ= రాక్షససేనలచేత చుట్టుకొనబడినట్టిదై; ఘనపటల+ఛాయన్= మబ్బుదొంతరల రంగుతో; కరమున్= మిక్కిలి; ఒప్పారెన్= శోభిల్లింది.

తాత్పర్యం: లంకాపురదుర్గం అంతకుముందు కోతులచేత ఆక్రమించబడిఉండి గోరోజనం వంటి రంగుతో భాసించింది. తదుపరి దానిని రాక్షససేనలు ఆక్రమించటంచేత మబ్బురంగుతో శోభిల్లింది.

క. **వనచరసేనలు దెరలిన । నినవంశోత్తములు నృపతు లిద్దఱుఁ గయ్య**
మ్మునకుఁ గడంగుటఁ గ్రమ్మఱ । గొనకొని కపిసేన యెల్లఁ గోటకుఁ గవిసెన్. **69**

ప్రతిపదార్థం: వనచర, సేనలు= కోతుల సైన్యాలు; తెరలినన్= వెనుకకు తిరిగిరాగా; ఇనవంశ+ఉత్తములు= సూర్యవంశానికి చెందిన శ్రేష్ఠులు; నృపతులు= రాజులు; ఇద్దఱున్= ఇరువురును; కయ్యమ్మునకున్= యుద్ధానికి; కడంగుటన్= పూనటంచేత;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క్రమ్మఱన్= మరల; గొనకొని= ఉద్యమించి; కపిసేన= కోతులసైన్యం; ఎల్లన్= అంతయును; కోటకున్= దుర్గాన్ని (లంకా దుర్గాన్ని); కవిసెన్= ముట్టడించింది.

తాత్పర్యం: వానరసేనలు వెనుదిరిగి రావటం చూచి, సూర్యవంశంలో ఉద్భవించిన గొప్పవీరులు రామలక్ష్మణులు ఇరువురున్నూ యుద్ధానికి ఉపక్రమించారు. అంతట వానరసేనలు మరల గుమికూడి లంకాదుర్గాన్ని ముట్టడించాయి.

వ. **ఇట్లు గవిసినం బ్రాకారరక్షకులైన రాక్షసవీరులు వారలం జేరనీక శిలాశూలపరశుతోమరాలాతశరకుంత ప్రముఖంబులు ప్రయోగించినం గయికొనక వనచరులు వృక్షశిలాప్రకరంబులు పఱఁగించుచుం గడంగి ప్రాకారంబుఁబ్రాఁకుటయు నయ్యిరుదెఱంగులవారికిం గేశాకేశి యగు సమరం బయ్యెఁ; బదంపడి రావణుండు వనుపఁ బర్వతుండును బ్రఘసుండును ఖరుండును గ్రోధవశుండును బ్రరుజుండును నను రాక్షసు లేవురు ననేకరాక్షసపిశాచసేనాపరివృతు లయి పురంబు వెలువడి మాయ గావించి యదృశ్యాకారులై కపిసైన్యంబు నొప్పింపం దొడంగినం గని.** **70**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కవిసినన్= దండెత్తగా; ప్రాకార, రక్షకులు+ఐన= చుట్టుగోడను కాపుగాస్తున్న; రాక్షసవీరులు= రక్కసులలో యోధులు; వారలన్= వారలను, కపివీరులను; చేరనీక= దరికి రానీక; శిలా, శూల, పరశు, తోమర+అలాత, శర, కుంత, ప్రముఖంబులు= రాళ్ళు, బల్లేలు, గండ్రగొడ్డళ్ళు, చిల్లకోలలు, కొరవులు, బాణాలు, ఈటెలు మున్నగునవి; ప్రయోగించినన్= వేయగా; కయికొనక= సరకుచేయక; వనచరులు= వానరులు; వృక్ష, శిలా, ప్రకరంబులు= చెట్ల రాళ్ల సముదయాలు; పఱఁగించుచున్= ప్రయోగిస్తూ; కడంగి= పూని; ప్రాకారంబున్= చుట్టుగోడను; ప్రాఁకుటయున్= ఎక్కుటయు (మెల్లగా కష్టంగా ఎక్కటం); ఆ+ఇరు+తెఱంగులవారికిన్= ఆ రెండు పక్షాలవారికి; కేశాకేశి, అగు సమరంబు+అయ్యెన్= జుట్టు జుట్టు పట్టుకొనే యుద్ధం జరిగింది (పోటాపోటీలుగా యుద్ధం జరిగిందని భావం); పదంపడి= పిమ్మట; రావణుండు+ పనుపన్= రావణుడు పంపగా; పర్వతుండును, ప్రఘసుండును, ఖరుండును, క్రోధవశుండును, ప్రరుజుండును; అను రాక్షసులు+ఏవురు= అనే రక్కసులు అయిదుగురు; అనేక, రాక్షస, పిశాచ, సేనా, పరివృతులు+అయి= పెక్కు రక్కసులయొక్కయు భూతాలయొక్కయు సేనలతో కూడుకొనినవారై; పురంబు= నగరం; వెలువడి= బయటకువచ్చి; మాయ+కావించి= మాయను ప్రయోగించి; అదృశ్య+ఆకారులై= కనిపించని దేహాలు కలవారై; కపిసైన్యంబున్= వానరసేనను; నొప్పింపన్+తొడంగినన్= బాధింపపూనుకోగా; కని= చూచి.

తాత్పర్యం: వానరవీరులు మరల విజృంభించి రక్కసులను చుట్టుముట్టారు. చుట్టుగోడను రక్షిస్తున్న రాక్షసవీరులు వానరసేనలను అడ్డగించి, వారిపై రాళ్లు రువ్వారు. బల్లేలు విసరారు. గండ్రగొడ్డళ్లు, చిల్లకోలలు, కొరవులు, బాణాలు, ఈటెలు మున్నగు ఆయుధాలను ప్రయోగించారు. కాని, వానరులు లెక్కసేయక, తాము చెట్లు, రాళ్లు రాక్షసులపై ప్రయోగించి, ప్రాకారం మీదికి ప్రాకసాగారు. ఇరుపక్షాలకు జుట్టు జుట్టు పట్టుకొని యుద్ధం చేసే అవకాశం ఏర్పడింది. అంతట రావణుడు- పర్వతుడు, ప్రఘసుడు, ఖరుడు, క్రోధవశుడు, ప్రరుజుడు అనే పేర్లు కల అయిదుగురు రాక్షసవీరులను పంపాడు. వారు లంకాపట్టణం బయటికి వచ్చి, పెక్కు రాక్షసులను భూతాలను తమతోపాటుగా యుద్ధానికి పురికొల్పి, వానరులతో మాయాయుద్ధానికి పూని వారిని బాధింపసాగారు. దానిని గమనించి.

ఉ. **దారుణవిక్రముండు రిపుదర్పవిభేది మహాస్త్రవేది మా**
యారణకోవిదుండు గడు నల్గి విభీషణుఁ దేఁగుదెంచి య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వీరుల మాయయుం జలము వ్రేల్మిడిలోఁ గుదియించి వీరకే
ళీరసికుండు వారి నవలీలమెయిం దునుమాడె నందఱన్. 71

ప్రతిపదార్థం: దారుణ విక్రముండు= భయంకరమైన శౌర్యం కలవాడు; రిపు, దర్పవిభేది= శత్రువుల గర్వాన్ని అణచేవాడు; మహా+అస్త్ర, వేది= మంత్రమహిమ కల గొప్ప ఆయుధాలను తెలిసిన వాడు; మాయా, రణ, కోవిదుండు= మాయాయుద్ధంలో విశారదుడు; వీరకేళీ రసికుండు= పరాక్రమ మనే ఆటలో అభిరుచి కలవాడు అయిన విభీషణుఁడు; కడున్= మిక్కిలి; అల్గి= కోపించి; ఏఁగుదెంచి= వచ్చి, (యుద్ధభూమికి వచ్చి); ఆ+వీరుల, మాయయున్= ఆ వీరుల మాయ (లేనిదిఉన్నట్లు భ్రాంతి గొలిపే మహిమ); చలము= మాత్సర్యం; వ్రేల్మిడిలోన్= క్షణమాత్రంలో; కుదియించి= అణచివేసి; వారిన్= వారిని (ఆ రాక్షసులను); అందఱన్= అంతమందిని; అవలీలమెయిన్= సులువుగా; తునుమాడెన్= సంహరించాడు.

తాత్పర్యం: భీకరమైన పరాక్రమం కలవాడు, శత్రువుల గర్వాన్ని భేదించేవాడు, మంత్రమహిమ గల ఆయుధాలను ప్రయోగించటంలో నేర్పు కలవాడు, మాయాయుద్ధం తెలిసినవాడు, ఆహవదోహలుడు అయిన విభీషణుడు కోపం వహించి ఆ రాక్షసవీరులను ఎదుర్కొని వారి మదాన్ని అణగించి, అంతమందినీ ఒక చిటికలో సంహరించాడు.

విశేషం: రాక్షసులు మాయాయుద్ధం చేయటంలో నేర్పరులు, వానరులు అట్టియుద్ధం చేయటంలో నేర్పరులు కారుగదా. విభీషణుడు రాక్షసుడే కాబట్టి - అతడు రాక్షసులను మాయాయుద్ధంలో గెలువగలిగాడు.

క. ఆతని శరపాతంబుల । చేతం గడు నొచ్చి దైత్యసేన సగము ధా
త్రీతలపతితం బయ్యెఁ; వి । భీతిఁ బఱచి పురము సొచ్చెఁ బెఱసగము వెసన్. 72

ప్రతిపదార్థం: ఆతని శరపాతంబుల చేతన్= ఆ విభీషణుడియొక్క బాణాలు పడటంచేత; కడున్= మిక్కుటంగా; నొచ్చి= బాధపొంది; దైత్యసేన= రక్కసులసైన్యం; సగము= అర్ధం; ధాత్రీ తల పతితంబు+అయ్యెన్= నేలమీదకు ఒరిగిపోయింది; పెఱసగము= మిగిలిన (సేన) అర్ధం; విభీతిన్+పఱచి= మిక్కిలి భయంతో పారిపోయి, వెసన్= శీఘ్రంగా; పురము+చొచ్చెన్= నగరంలోకి చేరింది.

తాత్పర్యం: విభీషణుడిబాణాలకు నొచ్చి, రాక్షససైన్యం సగభాగం నేలమీద ఒరిగిపోయింది. మిగిలిన సగం రాక్షససైన్యం భయంతో రణరంగం వీడి పారిపోయి లంకానగరంలోకి పోయి దాగింది.

క. అది యెల్ల విని దశాననుఁ । డుదితక్రోధుఁ డయి మంత్రియుతముగ వెడలెన్
మదగజ ఘోటక సైనిక । పదభర భగ్నావనీ విభాగుం డగుచున్. 73

ప్రతిపదార్థం: అది+ఎల్లన్= దానిని అంతా (సగంసేన రణరంగంలో కూలటం, పెరసగం పారిపోవటం); విని= ఆలకించి; దశ+ఆననుఁడు= పది తలలు కలవాడు- రావణుడు; ఉదితక్రోధుఁడు+అయి= జనించిన కోపం కలవా డయి; మద, గజ, ఘోటక, సైనిక, పద, భర, భగ్న+అవనీ, విభాగుండు+అగుచున్= మదించిన ఏనుగులయొక్కయు, గుర్రాలయొక్కయు, భటులయొక్కయు, అడుగుల బరువుచేత బ్రద్దలయిన భూప్రదేశం కలవాడు అయి; మంత్రియుతముగన్= మంత్రులతో కూడుకొని; వెడలెన్= బయలుదేరాడు.

తాత్పర్యం: రాక్షససేనలు చావగా మిగిలినవి రణరంగంనుండి పారిపోయిన విషయమంతా విని, రావణుడు మంత్రులతో కూడుకొని తనసేనల తాకిడికి, మదించిన ఏనుగుల గుర్రాల భటుల పాదాల బరువుకు భూమి బ్రద్దలుకాగా రణరంగానికి బయలుదేరాడు.

వ. ఇట్లు వెడలి, యభేద్యం బగు నౌశనసవ్యూహంబు సంఘటించి వనచరబలంబుపయి నడచినం గని, రాఘవుండును బార్హస్పత్యవ్యూహంబు దీర్చి పేర్చి యెదురుకొనియె; నా సేనలు రెండు నకాండక్షుభిత సాగరయుగళంబు తెఱంగు దోఁప నొండొంటిం గవిసె; నప్పుడు రాముండు రావణుం దలపడియె, లక్ష్మణుం డింద్రజిత్తును, సుగ్రీవుండు విరూపాక్షునిఁ, దారుండు నిఖర్వటుం దాకి; రిట్లిరువాఁగునకును దేవాసురులకుం బోలె నాభీలసమరం బయ్యెఁ; నందు. 74

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వెడలి= బయలుదేరి; అభేద్యంబు+అగు= భేదించటానికి శక్యంగాని, ఔశనసవ్యూహంబు= శుక్రుడికి సంబంధించిన మొగ్గరం; సంఘటించి= ఏర్పరచి; వనచరబలంబుపయిన్= కోతులమూకపయి; నడచినన్= దండెత్తగా; కని= ఆరసి; రాఘవుండును= శ్రీరాముడును; బార్హస్పత్య వ్యూహంబు= బృహస్పతికి సంబంధించిన మొగ్గరం; తీర్చి= సంఘటించి; పేర్చి= అతిశయించి; ఎదురుకొనియెన్= మార్కొన్నాడు; ఆ సేనలు రెండును= ఆ రెండు సైన్యాలున్నూ (రాక్షసవానరసేనలు); అకాండ, క్షుభిత, సాగర, యుగళంబు, తెఱంగు= అకాలంలో కలత చెందిన రెండు సముద్రాల రీతి; తోఁపన్= స్ఫురించగా; ఒండు+ఒంటిన్= ఒకదాని నొకటి; కవిసెన్= ఎదుర్కొన్నాయి; అప్పుడు= ఆసమయంలో; రాముండు= శ్రీరాముడు; రావణున్= రావణుడిని; తలపడియెన్= ఎదుర్కొన్నాడు; లక్ష్మణుండు; ఇంద్రజిత్తును; సుగ్రీవుండు, విరూపాక్షునిన్= విరూపాక్షుడు అనే రాక్షసుడిని (రావణుడి మంత్రిని); తారుండు; నిఖర్వటున్= నిఖర్వటుడిని; తాకిరి= ఎదుర్కొన్నారు; ఇట్లు= ఈ రీతిగా; ఇరు వాఁగునకును= రెండు పక్షాలకున్నూ; దేవ+అసురులకున్+పోలెన్= దేవతలకూ రాక్షసులకూ వలె; ఆభీల, సమరంబు+అయ్యెన్= భయంకరమైన యుద్ధం జరిగింది; అందున్= (ఆ యుద్ధంలో).

తాత్పర్యం: ఈ రీతిగా బయలుదేరి రావణుడు శుక్రుడిచేత చెప్పబడిన మొగ్గరాన్ని ఏర్పరచి వానరసేనలపైకి దండెత్తాడు. శ్రీరాముడు ఆ రాక్షససేనలను ఎదుర్కొనటానికి అనువుగా బృహస్పతిచేత చెప్పబడిన మొగ్గరాన్ని ఏర్పరచి ఎదుర్కొన్నాడు. ఆ రెండుసైన్యాలున్నూ (రాక్షస వానరసేనలు) సమయంగాని సమయంలో కలతచెందిన రెండుసముద్రాలవలె తోచి ఒకదాని నొకటి ఢీకొన్నాయి. ఆ యుద్ధంలో రాముడు రావణుడిని ఎదుర్కొన్నాడు. లక్ష్మణుడు ఇంద్రజిత్తును మార్కొన్నాడు. సుగ్రీవుడు విరూపాక్షుని, తారుడు నిఖర్వటుని ఎదుర్కొన్నారు. ఈ విధంగా రెండు పక్షాలకున్నూ వేల్పులకు రక్కసులకువలె భయంకరమైన యుద్ధం జరిగింది.

విశేషం: (1) అలం: ఉపమ. రామరావణ సేనలయుద్ధం దేవాసురసంగ్రామంతో పోల్చబడింది. (2) ఔశనస వ్యూహము: ఉశనుడు= శుక్రుడు. శుక్రుడు రాక్షసుల కులగురువు. శుక్రాచార్యుడు రూపొందించిన యుద్ధవ్యూహం. బార్హస్పత్యవ్యూహము - బృహస్పతికి సంబంధించినది. బృహస్పతి దేవతల కులగురువు. (3) సముద్రాలు ప్రళయకాలంలో క్షోభిస్తాయి. అకాలంలో చెలరేగిన సముద్రాలవలె రెండు సేనలు విజృంభించాయి. (4) ఇరుపక్షాలలోని వీరులు తమ తమ అంతస్తులకు తగిన ప్రతివీరులను ఎదుర్కొనటం సమస్కంధులయిన, వారిని మార్కొనటం గమనింపదగిన అంశం. (5) ఇంద్రజిత్తు: ఇంద్రుడిని జయించినవాడు కనుక అతడికి ఆ సార్థకనామం ఏర్పడింది. అతడు రావణుడి కొడుకు.

క. సౌమిత్రి నిశితవిశిఖ । స్తోమంబుల నసురపతిసుతుం బొదివిన సం
గ్రామమునకుఁ దొలఁగక యతఁ । డామనుజోత్తముని ముంచె నాశుగవృష్టిన్. 75

ప్రతిపదార్థం: సౌమిత్రి= సుమిత్రకొడుకు - లక్ష్మణుడు; నిశితవిశిఖ, స్తోమంబులన్= వాడి అయిన బాణాల సమూహంచేత; అసురపతిసుతున్= రాక్షసరాజుయొక్క కొడుకును ఇంద్రజిత్తును; పొదివినన్= ఆక్రమించగా; అతఁడు= ఆ ఇంద్రజిత్తు;

సంగ్రామమునకున్= యుద్ధాన్ని; తొలఁగక= వదలి వెళ్ళక; ఆ మనుజ+ఉత్తమునిన్= ఆ మనుష్యులలో శ్రేష్ఠుడిని, లక్ష్మణుడిని; ఆశుగ వృష్టిన్= అమ్ములవానలో; ముంచెన్= ముంచాడు.

తాత్పర్యం: లక్ష్మణుడు వాడిఅయిన బాణాలతో రావణుడికొడుకైన ఇంద్రజిత్తుని కప్పివేశాడు. ఇంద్రజిత్తు యుద్ధంనుండి తొలగక, లక్ష్మణుడిని అమ్ములవానలో ముంచాడు.

ఉత్సాహము

అమరవైరివిభుఁడు దశరథాగ్రసుతుఁడు నేపునన్
సమరసత్ప్రతాపకోప జాజ్వలచ్ఛరీరులై
తుములబాణపటలవృష్టిఁ దొప్పదోఁగి యిర్వురుం
దమక మేది తమక తమక తనిసి రాహవంబునన్. **76**

ప్రతిపదార్థం: అమరవైరివిభుఁడు= వేల్పులకు శత్రువైన రాక్షసులకు రాజు- రావణుడు; దశరథ+అగ్ర, సుతుఁడున్= దశరథుడియొక్క పెద్దకొడుకు- రాముడున్నూ; ఏపునన్= విజృంభణతో; సమర, సత్+ప్రతాప, కోప, జాజ్వలత్+శరీరులు+ఐ= యుద్ధంలో ఏర్పడే గొప్పపరాక్రమంవలన జనించే ఆగ్రహంచేత మండిపోయే దేహాలు కలవారై; తుముల బాణపటలవృష్టిన్= దట్టమైన అమ్ముల దొంతరల వానచేత; తొప్పదోఁగి= (నిండిన దొన్నెలై) బాగా తడసిపోయి; ఇర్వురున్= ఇద్దరును (రామ రావణులు); తమకము+ఏది= వేగం తగ్గిపోయి; తమక తమక= తమకు తామే; ఆహవంబునన్= యుద్ధంలో; తనిసిరి= తృప్తిపొందారు.

తాత్పర్యం: వేల్పులకు శత్రువులైన రాక్షసులకు రాజు రావణుడున్నూ, దశరథుడి పెద్దకొడుకు శ్రీరాముడున్నూ యుద్ధంలో ఏర్పడే పరాక్రమకోపంచేత మండేదేహాలు కలవారు ఔతూ దట్టమైన అమ్ములజడివానలో తడిసిపోయి, తమంతట తామే యుద్ధంలో తృప్తిపొందారు.

విశేషం: వృత్త లక్షణానికి చూడండి. అరణ్య 6.318 విశేషాంశం.

వ. **తదనంతరంబ.** **77**

తాత్పర్యం: అటు పిమ్మట.

క. **ఆ రావణుండు నిజదో। స్సారమునకు రాముబాహుసారం బతి దు**
ర్వారంబగు టేర్పడఁ గని। వీరారంభంబు కడఁక విడిచి రయమునన్. **78**

ప్రతిపదార్థం: ఆ రావణుండు= ఆ రావణుడు; నిజదోః+సారమునకున్= తనయొక్క బాహుబలానికి; రాముబాహుసారంబు= శ్రీరాముడియొక్క భుజపరాక్రమం; అతిదుర్వారంబు+అగుట= మిక్కుటంగా వారించ శక్యం కానిది కావటం; ఏర్పడన్+కని= స్పష్టంగా గమనించి; వీర+ఆరంభంబు+కడఁకన్= పరాక్రమంతో కూడిన ప్రయత్నం; విడిచి= వదలిపెట్టి; రయమునన్= వేగంగా.

తాత్పర్యం: అటు పిమ్మట ఆ రావణుడు తన బాహుబలంతో శ్రీరాముడిపరాక్రమం ఆపటం మిక్కిలి కష్టమని స్పష్టంగా తెలిసికొని, శౌర్యంతో కూడిన కృషిని వదలిపెట్టి, వేగంగా. (మీది పద్యంతో అన్వయం)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మగిడి నగరంబు సొచ్చిన । బెగడి నిశాచరబలంబు పెల్లగిలుటయున్
విగతభయుండు ప్రహస్తుఁడు । దగఁ గోల్తల సేసె నత్యుదగ్ర స్ఫురణన్. 79

ప్రతిపదార్థం: మగిడి= వెనుదిరిగి; నగరంబు= పట్టణం (లంకాపురి); చొచ్చినన్= ప్రవేశించగా; నిశాచరబలంబు= రాక్షసులసేన; బెగడి= ధైర్యం కోలుపోయి భీతినిచెంది; పెల్లగిలుటయున్= ఉన్నచోటు వీడి పారిపోగా; విగతభయుండు= పోయిన భీతి కలవాడు, భయంలేని వీరుడు; ప్రహస్తుఁడు= ప్రహస్తుడు (అనేరాక్షసుడు); తగన్= సముచితంగా; అతి+ఉదగ్ర, స్ఫురణన్= మిక్కిలి భయంకరమైన స్థితి తోచేటట్లుగా; కోల్తల+చేసెన్= యుద్ధంలో శత్రువు నెదిరించే సన్నాహం చేశాడు.

తాత్పర్యం: రావణుడు యుద్ధంలో శ్రీరాముడి ధాటికి ఓర్వలేక, రణరంగం వీడి లంకానగరంలోకి మగిడి వెళ్ళాడు. రాక్షససేనలు భీతితో ఉన్నచోటు వదలి పారిపోసాగాయి. అయినను, భయం చెందక వీరుడైన ప్రహస్తుడు మిక్కుటమైన భయంకరత్వం వెల్లివిరిసేటట్లుగా, తగినరీతిని యుద్ధంలో నిలిచి శత్రువును మార్కొనటానికి సన్నాహంచేశాడు.

ఉ. ఆతనిఁ గాంచి తద్బలము లన్నియుఁ గ్రమ్మఱ నాహవోత్సవ
స్ఫీతములై కడంగుటయుఁ బేర్చి విభీషణుఁ డుగ్రవానర
వ్రాతసమన్వితంబుగ నవారణ మార్కొనినన్ మహారణం
బాతతమయ్యె సైన్యనివహంబులు రెంటికి నద్భుతంబుగన్. 80

ప్రతిపదార్థం: ఆతనిన్= ఆతడిని (ఆ ప్రహస్తుడిని); కాంచి= చూచి; తత్+బలములు+అన్నియున్= ఆ సేనలు అన్నియున్నూ; క్రమ్మఱన్= మరల; ఆహవ+ఉత్సవ+స్ఫీతములు+ఐ= యుద్ధం అనే పండుగలో అతిశయించినట్టివై; కడంగుటయున్= పూనిక వహించుటయు; పేర్చి= అతిశయించి; విభీషణుఁడు; ఉగ్ర, వానర, వ్రాత, సమన్వితంబుగన్= భయంకరాలైన కోతులమూకలతో కూడిన వాడయి; అవారణ= అప్రతిహతంగా, అడ్డులేకుండా; మార్కొనినన్= కవియగా; మహారణంబు= గొప్పయుద్ధం; సైన్యనివహంబులు= సేనాసమూహాలు; రెంటికిన్= రెండుపక్షాలకు; అద్భుతంబుగన్= ఆశ్చర్యకరంగా; ఆతతము+అయ్యెన్= పొడిగించబడింది.

తాత్పర్యం: కోల్తల చేసిన ప్రహస్తుడిని కాంచి, ఆ రాక్షససేనలన్నీ తిరిగి యుద్ధం చేయటానికి ఉత్సాహంతో ఉపక్రమించాయి. అప్పుడు విభీషణుడు భయంకరమైన వానరసేనాసమూహాలను చేర్చుకొని ఆ రాక్షససేనలను అప్రతిహతంగా ఎదుర్కొన్నాడు. విభీషణ నాయకత్వంలో ఉన్న వానరసేనలకును ప్రహస్తుడినాయకత్వంలో ఉన్న రాక్షససేనలకును అద్భుతమైనపోరాటం చాలసేపు జరిగింది.

విశేషం: (1) రావణుడు రణరంగంనుండి నిష్క్రమించాడు. శ్రీరాము డిక ఏమి చేస్తూ ఉన్నాడు? అనే ప్రశ్న ఉదయించ వచ్చును. యుద్ధం చేసే వీరులు సమస్కంధులతోనే తలపడటం పరిపాటి. రావణుడు అలసి సొలసి యుద్ధం వీడవలసి వచ్చింది. శ్రీరాముడుకూడా అలసట చెంది ఉన్నాడు కదా. ఇక ప్రహస్తుడు కోల్తలసేయగా అతడిని ఎదుర్కొనటం విభీషణుడు తన కర్తవ్యంగా భావించి అతడితో మార్కొన్నాడు.

వ. అంత. 81

తాత్పర్యం: పిమ్మట.

ప్రహస్త ధూమ్రాక్షుల యుద్ధము (సం. 3-270-1)

మ. కృతహస్తుండు ప్రహస్తుఁ డాహవకళాకేళీవిదగ్ధుండు ద
ర్పితుఁడై తాఁకె విభీషణుం గడఁకమైఁ బెంపారి వారిద్దఱున్
శితశల్యోగ్రమయూరపత్త్రవిశిఖశ్రేణీశతచ్ఛన్నులై
ధృతి నొప్పారిరి చిత్రవారిధరపంక్తిచ్ఛన్న శైలాకృతిన్. 82

ప్రతిపదార్థం: కృతహస్తుండు= చేయి తిరిగినవాడు; ప్రహస్తుఁడు; ఆహవ, కళా, కేళీ, విదగ్ధుండు= యుద్ధ విద్యాక్రీడలో నేర్పరి; దర్పితుఁడు+ఐ= గర్వం చెందినవాడై; విభీషణున్= విభీషణుడిని; తాఁకెన్= మార్కొన్నాడు; కడఁకమైన్= పూనికతో; పెంపు+ఆరి= అతిశయం నిండి; వారు+ఇద్దఱున్= వారు ఇరువురునూ, ప్రహస్తుడును విభీషణుడును; శిత, శల్య+ఉగ్ర, మయూర, పత్త్ర, విశిఖ, శ్రేణీ, శత+ఛన్నులు+ఐ= వాడి అయిన ఎముకలవలె భయంకరాలై, నెమలి ఈకలతో పొదుగబడిన అమ్ముల వరుసలు వందలచే కప్పబడిన వారయి; చిత్ర, వారిధరపంక్తి+ఛన్న, శైల+ఆకృతిన్= పెక్కు రంగులు గల మబ్బులవరుసలతో కప్పబడిన కొండలరూపంలో; ధృతిన్= ధైర్యంతో; ఒప్పారిరి= శోభిల్లారు.

తాత్పర్యం: యుద్ధంచేయటం ఒక కళ. ఒక ఆట. ఆ కళాకేళిలో నేర్పు కలవాడు ఆరితేరినవాడు అయిన ప్రహస్తుడు పూనికతో విభీషణుడిని ఎదుర్కొన్నాడు. విభీషణుడూ ప్రహస్తుడూ ఒకరి నొకరు మించి మార్కొనుచూ వాడి అయిన ఎముకలవలె భయంకరాలై, నెమలి ఈకలతో పొదుగబడిన బాణాల పరంపరలచేత కప్పబడుతున్నవారై యుద్ధంచేశారు. ఆ యుద్ధంలో వారు ఇరువురూ ధైర్యంతో నిలిచి పోరాడుతూ రంగురంగుల మబ్బులచేత ఆవరించబడిన కొండలవలె భాసించారు.

విశేషం: అలం: ఉపమ.

చ. కదిసి ప్రహస్తుఁ డార్చి పరిఘంబు రయంబున నెత్తి భీకరో
న్మద కరిహస్త తాడనము మాడ్కి దలిర్పఁగ వ్రేసె నీసుమై
నదయత రావణానుజుని నాతఁడు వ్రేటున కించుకంతయుం
గదలక హేమకూటగిరికైవడి నిల్చి యుదీర్ణకోపుఁడై. 83

ప్రతిపదార్థం: కదిసి= కలియబడి; ప్రహస్తుఁడు; ఆర్చి= పెనుకేక పెట్టి (సింహనాదం చేసి); పరిఘంబు= ఇనుపకట్ల గుదియను; రయంబునన్= వేగంగా; ఎత్తి= పైకెత్తి పట్టుకొని; భీకర+ఉత్+మద, కరి, హస్త, తాడనము, మాడ్కిన్= భయంకర మైన ఏనుగు తొండంతో కొట్టేటట్లుగా; తలిర్పఁగన్= శోభిల్లగా; ఈసుమైన్= ఈర్ష్యతో; అదయతన్= నిష్ఠురంగా; రావణ+ అనుజునిన్= రావణుడితమ్ముడైన విభీషణుడిని; వ్రేసెన్= కొట్టాడు; ఆతఁడు= అతడు (విభీషణుడు); వ్రేటునకున్= దెబ్బకు; ఇంచుక+అంతయున్= ఏమాత్రమున్నూ; కదలక= చలించక; హేమకూటగిరి కైవడిన్= హేమకూట పర్వతంవలె; ఉదీర్ణ కోపుఁడు+ఐ= గొప్పదైన క్రోధంకలవాడై; నిల్చి= నిలబడి.

తాత్పర్యం: కలబడి ప్రహస్తుడు సింహనాదం చేసి ఇనుపకట్లగుదియను వేగంగా పైకెత్తి ఏనుగు తొండంతో కొట్టినట్లుగా ఈర్ష్యతో నిష్ఠురంగా విభీషణుడిపై విసరికొట్టాడు. విభీషణుడు ఆ దెబ్బకు ఎంతమాత్రమూ జంకక హేమకూటపర్వతంవలె ధైర్యంతో కదలక నిలబడి, గొప్పక్రోధం కలవాడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. శతఘంటాపరిభూషితంబును జగత్సంహారఘోరానలో
త్థిత కీలాసదృశంబునై మెఱయు శక్తిం బూన్చి మంత్రించి యు
ద్ధతతేజుండు ప్రహస్తు వైచిన వెసం దత్క్రూరసంపాత పా
టితవక్షుం డయి కూలె వాఁడు శతకోటిచ్ఛిన్నశైలాకృతిన్. 84

ప్రతిపదార్థం: శత, ఘంటా, పరిభూషితంబును= నూరుగంటలచేత అలంకరించబడినట్టిదియున్నూ; జగత్+సంహార+ఘోర+అనల+ఉత్థిత, కీలా, సదృశంబున్+ఐ= లోకాన్నంతటిని సంహరించే భయంకరమైన అగ్నియొక్క పైకిలేచిన జ్వాలలతో సమానమై; మెఱయు= వెలుగొందే; శక్తిన్= శక్తి అనే ఆయుధాన్ని; పూన్చి= సంధించి; మంత్రించి= మంత్రం జపించి; ఉద్ధతతేజుండు= గర్వంతో కూడిన వర్చస్సు కలవాడు- విభీషణుడు; ప్రహస్తున్= ప్రహస్తుడిని; వైచినన్= కొట్టగా; వెసన్= శీఘ్రంగా; తద్+క్రూర, సంపాత, పాటిత, వక్షుండు+అయి= ఆ నిష్ఠురమైన తాకిడిచేత బ్రద్దలుకొట్టబడిన రొమ్ము కలవాడుఅయి; శతకోటి+ఛిన్న, శైల+ఆకృతిన్= వజ్రాయుధంచేత ముక్కలు చేయబడిన కొండవలె; వాఁడు= ప్రహస్తుడు; కూలెన్= నేలపై పడ్డాడు.

తాత్పర్యం: విభీషణుడు నూరు చిరుగంటలతో అలంకరించబడినదిన్నీ, ప్రళయకాలంలో జగత్తును సంహరించే భయంకరమైన అగ్నిజ్వాలలతో సదృశమై వెలుగొందేదిన్నీ అయిన- 'శక్తి' అనే ఆయుధాన్ని మంత్రాలు జపించి ప్రహస్తునిపై ప్రయోగించాడు. ఆ దెబ్బకు రొమ్ము బ్రద్దలు కాగా ప్రహస్తుడు, వజ్రాయుధంచేత ముక్కలు చేయబడిన కొండవలె నేలపై ఒరిగాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు ప్రహస్తుండు పడినం దత్సైన్యంబులు విముఖంబు లగుటయు, ధూమ్రాక్షుండు రోషతామ్రాక్షుం డగుచు నతినిబిడబలాహకానీకభీకరంబై కాఱుకొనుచున్న నిశాచరచక్రంబుతో నురలం బఱతెంచినం జలించి బలీముఖబలంబులు దుర్బలంబులై తొలంగినం జూచి యాంజనేయుం డజయ్యుండై నిల్చినం బెల్చన యెప్పటియట్ల యూథపతులుం గూడుకొని; రప్పుడు. 85

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ప్రహస్తుండు; పడినన్= కూలిపోగా (చనిపోగా); తద్+సైన్యంబులు= అతడిసేనలు; విముఖంబులు+అగుటయున్= వెనుదిరిగి పారిపోవటమున్నూ; ధూమ్రాక్షుండు; రోష, తామ్ర+అక్షుండు+అగుచున్= కోపంచేత ఎఱ్ఱ నయిన కనులు కలవాడు ఔతూ; అతి, నిబిడ, బలాహక+అనీక, భీకరంబు+ఐ= మిక్కిలి దట్టమైన మబ్బుల సమూహంవలె భయంకరమై; కాఱుకొనుచున్న= దట్టంగా మూగికొనిన; నిశాచరచక్రంబుతోన్= రాక్షసులదండుతో; ఉరలన్= అతిశయించిన వేగంతో; పఱతెంచినన్= రాగా; చలించి= చెదరి; బలీముఖబలంబులు= వానరసేనలు; దుర్బలంబులు+ఐ= శక్తిని కోలుపోయినట్టివై; తొలంగినన్= తప్పుకొనగా; చూచి= గమనించి; ఆంజనేయుండు= హనుమంతుడు; అజయ్యుండు+ఐ= గెలువశక్యంకానివాడై; నిల్చినన్= నిలబడగా; పెల్చన= ఆటోపంతో; ఎప్పటి+అట్ల= యథాప్రకారం; యూథపతులున్= సేనాపతులును; కూడుకొనిరి= కలిసిరి; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా వీరుడైన ప్రహస్తుండు మరణించటంచేత ఆతడి సైన్యాలు వెనుదిరిగి పారిపోయాయి; అందుచేత ధూమ్రాక్షుడు కోపంతో జేవురించిన కన్నులు కలవాడు ఔతూ, దట్టమైనమబ్బుల సమూహాలవలె భయంకరంగా గుమిగూడుకొన్న రాక్షసులదండుతో పైకొన వచ్చాడు. అప్పుడు వానరసేనలు చలించి బలాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కోలుపోయి తారాడటం చూచి హనుమంతుడు గెలువశక్యం కాని పరాక్రమంతో ముందుకు వచ్చాడు. అంతట ఆటోపంతో యథాప్రకారం వానర సేనాపతులును కలుసుకొన్నారు. ఆ సమయంలో.

సీ. **అనిలతనూజ ధూమ్రాక్ష రక్షిత సైన్య । యుగ్మంబునకు నయ్యె నుగ్రసమర;**
మందు నిష్ఠురచరణాఘాతముల డొల్లు । నరదంబులును, శిలాహతులఁ దూలి
యొఱలు నేనుంగులు, నుత్తాలతరుహతిఁ । ద్రెళ్లు ఘోటకములు, దీవ్రనఖర
దంతక్షతంబుల దళితాంగులై నేలఁ । బడి తన్నికొను వీరభటులు నగుచు

ఆ. **నధిక శౌర్యసారులగు కపివీరుల । చేత నొచ్చి దైత్యసేన భీతిఁ**
బఱచెఁ గొంత, బెండువడి యుండెఁ గొంత, ధూ । మ్రాక్షువెనుక కొదిఁగె నంతఁ గొంత. **86**

ప్రతిపదార్థం: అనిలతనూజ, ధూమ్రాక్ష, రక్షిత, సైన్య, యుగ్మంబునకున్= వాయునందనుడు అయిన హనుమంతుడిచేతను, ధూమ్రాక్షుడిచేతను కాపాడబడే సేనలు రెండింటికిని; ఉగ్రసమరము= ఘోరయుద్ధం; అయ్యెన్= జరిగింది; అందున్= ఆ యుద్ధంలో; నిష్ఠుర, చరణ+ఆఘాతములన్= కఠినమైన కాళ్ల దెబ్బలచేత; డొల్లు= నేలమీద పొరలే; అరదంబులును= తేరులును; శిలా+ఆహతులన్= రాళ్లదెబ్బలచేత; తూలి= తూలిపోయి; ఒఱలు= ధ్వనిచేస్తూ పడిపోయే; ఏనుంగులున్= ఏనుగులును; ఉత్తాలతరుహతిన్= పొడుగుపాటి చెట్లదెబ్బలచేత; త్రెళ్లు= చనిపోయే; ఘోటకములున్= గుర్రాలు; తీవ్ర, నఖర, దంత, క్షతంబులన్= వాడియైన గోళ్లయొక్క పళ్లయొక్క కాట్లచేత; దళిత+అంగులు+ఐ= ఛేదించబడిన శరీరాలు కలవారై; నేలన్+పడి= భూమిమీదకు వ్రాలి; తన్నికొను= కంపించే; వీరభటులున్= పరాక్రమంగల యోధులను; అగుచున్= అగుచు; అధిక, శౌర్యసారులు+అగు= మిక్కుటమైన పరాక్రమంయొక్క నిగ్గు గల; కపివీరులచేతన్= వానరయోధులచేత; నొచ్చి= బాధించబడి; దైత్యసేన= రాక్షసులసైన్యం; కొంత= కొంతభాగం; భీతిన్= భయంతో; పఱచెన్= పారిపోయింది; కొంత= సేనలో కొంతభాగం; బెండు+పడి+ఉండెన్= నీరుగారిపోయి బలహీనమయింది; కొంత= సేనలో కొంతభాగం; ధూమ్రాక్షు వెనుకకున్= ధూమ్రాక్షుడి వెనుకకు; ఒదిఁగెన్= కుంచించుకుపోయి నక్కింది.

తాత్పర్యం: వాయునందనుడైన హనుమంతుడిసేనకున్నూ ధూమ్రాక్షుడి సైన్యానికిన్నీ ఘోరమైనసంగ్రామం జరిగింది. ఆ యుద్ధంలో వానరసేనదే పైచేయి అయింది. కోతిమూకలధాటికి రాక్షససేన తాళలేకపోయింది. వానరవీరుల బలమైన పాదాల దెబ్బలకు రాక్షసులసైన్యంలో రథాలు దొర్లాయి. రాళ్ల దెబ్బలకు ఏనుగులు బాధభరించలేక ఘీంకృతులతో నేలకు ఒరిగిపడ్డాయి. పొడుగాటి చెట్ల దెబ్బల చేత గుర్రాలు చచ్చాయి. వాడియైన గోళ్లతో రక్కి దంతాలతో కొరికి వానరులు రాక్షసులను బాధించగా వారు తన్నుకొంటూ భూమిపై బడి దొరలి మరణించారు. రాక్షససేనలో కొంతభాగం పారిపోయింది. కొంతభాగం సత్తువలేక నీరసించిపోయింది. కొంతభాగం భీతితో సేనాపతిఅయిన ధూమ్రాక్షుడి మరుగుచేరి నక్కిఉండింది.

మహాస్రగ్ధర

కని ధూమ్రాక్షుండు విశ్వ । గ్రసన రయలసత్కాల మేఘంబ పోలెన్
ఘన గర్జాఘోష మొప్పం । గడఁగి శరశతాకల్పితాసారదుర్ధ
ర్శన వీరారంభుఁడైనన్ । సకల హరిచమూసంఘమున్ విహ్వలంబై
చనెఁ దూలెం గూలె లావుం । జలమును జెదరన్ సంగడిన్ విచ్చె నొచ్చెన్. **87**

ప్రతిపదార్థం: కని= చూచి (రాక్షససేన దైన్యాన్ని గమనించి); ధూమ్రాక్షుండు; విశ్వగ్రసన రయలసత్+కాల, మేఘంబు+అ, పోలెన్= జగత్తును సంహరించే వేగంతో వెలుగొందే నల్లని మబ్బేయిది అనునట్లుగా; ఘనగర్జాఘోషము+ఒప్పన్= మేఘం చేసే గంభీరనాదం శోభిల్లగా; కడఁగి= పూని; శర, శత+ఆకల్పిత+ఆసార, దుర్దర్శన, వీర+ఆరంభుఁడు+ఐనన్= వందలకొలది బాణాలచేత ఏర్పరచబడిన జడివానచేత చూడశక్యంకాని పరాక్రమంయొక్క ప్రయత్నం కలవాడు కావటంచేత; సకల, హరి, చమూ, సంఘమున్= సమస్తమైన వానరసేనాసమూహం; విహ్వలంబు+ఐ= దైన్యం చెందినట్టిది అయి; చనెన్= పారిపోయింది; తూలెన్= నేలవ్రాలింది; కూలెన్= మరణించింది; లావున్= బలం; చలమును= మాత్సర్యమూ; చెదరన్= విడిపోగా, సంగడిన్విచ్చెన్= నెయ్యంవీడింది; నొచ్చెన్= బాధపడింది.

తాత్పర్యం: రాక్షససేనలు దైన్యంచెందటం గమనించి ధూమ్రాక్షుడు ప్రళయకాలంలోని నల్లని మేఘంవలె గర్జిస్తూ వేలకొలది బాణాలు ప్రయోగించి తేరిచూడరాని పరాక్రమం ప్రదర్శించటంచేత వానరసైన్యాలు దీనావస్థకు లోనయి నేలకూలాయి. మాత్సర్యం వీడి పారిపోయాయి. తోడివారి నెయ్యాన్ని వీడి చెదరిపోయాయి. నొచ్చాయి.

విశేషం: (1) ఇది మహాస్రగ్ధరావృత్తం. నాలుగుపాదాలతో ప్రతిపాదంలో - స,త,త,న,స,ర,ర,గ, గణాలు : ప్రాసనియతి ఉన్నది. 1,9,16 అక్షరాలకు యతి చెల్లుతుంది. ప్రాసయతి చెల్లదు. (2) అలం : ఉపమ.

తే. **అతనియుద్ధతి సైఁపక యనిలసూనుఁ । డనిలవేగుఁడై పఱతెంచి యార్చి తాఁకెఁ**
బ్రధన మయ్యిద్దఱకు నుగ్రభంగి నమర । పతికిఁ బ్రహ్లాదునకుఁ బోలెఁ బ్రకట మయ్యె. **88**

ప్రతిపదార్థం: అతని+ఉద్ధతిన్= అతడి విజృంభణం (ధూమ్రాక్షుడియొక్క అతిశయం); సైఁపక= సహించలేక; అనిల సూనుఁడు= వాయుపుత్రుండు- హనుమంతుడు; అనిలవేగుఁడు+ఐ= గాలివంటి శీఘ్రగమనం కలవాడై; పఱతెంచి= అరుగుదెంచి; ఆర్చి= (సింహనాదంచేసి) పెనుకేక పెట్టి; తాఁకెన్= కవిశాడు; ఆ+ఇద్దఱకును= ఆ ఇరువురికిని; అమరపతికిన్= దేవేంద్రుడికిని; ప్రహ్లాదునకున్+పోలెన్= ప్రహ్లాదుడికిని వలె; ప్రధనము= యుద్ధం; ఉగ్రభంగిన్= భయంకరమైన రీతిగా; ప్రకటము+అయ్యెన్= ప్రసిద్ధమయింది. (కన్పించింది).

తాత్పర్యం: ధూమ్రాక్షుడి విజృంభణాన్ని సైరించలేక, వాయుసుతు డైన హనుమంతుడు వాయువేగంతో వచ్చి అక్కడ వ్రాలాడు. సింహనాదం చేసి పయి కురికిన ఆంజనేయుడికిన్నీ, ధూమ్రాక్షుడికిన్నీ అలనాడు ప్రహ్లాదుడికీ, దేవేంద్రుడికీ జరిగినట్లుగా ఘోరయుద్ధం జరిగింది.

విశేషం: (1) ప్రహ్లాదుడు విష్ణుభక్తుడు. హిరణ్యకశిపుడు అనే రాక్షసుడికొడుకు. అతడు దేవేంద్రుడిని యుద్ధంలో ఓడించాడు. (2) అలం: ఉపమ.

క. **పరిఘంబులు గదలును బె । క్కరుదుగ రక్కసుఁడు వైచె నమ్మారుతిపై**
నురుగండశైలములు ఘన । తరువులు హరివరుఁడు గురిసె దానవుమీఁదన్. **89**

ప్రతిపదార్థం: రక్కసుఁడు= రాక్షసుడు, ధూమ్రాక్షుడు; ఆ+మారుతిపైన్= ఆ హనుమంతుడిపై; పరిఘంబులు= ఇనుపకట్లగుదియలు; గదలును= గుదియలును; పెక్కు= అనేకాలు; అరుదుగన్= ఆశ్చర్యకరంగా; వైచెన్= విసరాడు; హరివరుఁడు= వానరశ్రేష్ఠుడు- హనుమంతుడు; ఉరుగండశైలములు= గొప్పరాళ్లు గల పర్వతాలు; ఘనతరువులు= గొప్పవృక్షాలు; దానవుమీఁదన్= రాక్షసుడిపై, ధూమ్రాక్షుడిపై; కురిసెన్= వర్షించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఇనుపకట్లగుదియలు, గుదియలు పెక్కులు అచ్చెరువు గొలిపేటట్లుగా రాక్షసుడైన ధూమ్రాక్షుడు వాయునందను డైన హనుమంతుడిపై విసిరాడు. వానరశ్రేష్ఠు డైన ఆంజనేయుడు రాక్షసుడైన ధూమ్రాక్షుడిపై పెనుకొండలు, పెద్దపెద్దచెట్లను విసరాడు. ఈ విధంగా హనుమంతుడికి ధూమ్రాక్షుడికి మధ్య ద్వంద్వయుద్ధం కొంతసేపు జరిగింది.

విశేషం: రాక్షసుల ఆయుధాలు వానరుల పరికరాలకంటె నాగరకాలు.

ఉ. ఇబ్బంగిం బెనంకువ సెల్లుచుండఁ గొండొక సేపునకు. **90**

తాత్పర్యం: ఈ రీతిగా యుద్ధం సాగుతూ ఉండగా కొంతసేపటికి.

స్రగ్ధర.

లంకాలుంటాకుఁ డుద్య । ల్లఘుతరగమనోల్లాసియై డాసి వీఁకం
బొంకం బేపారఁ జంచ । ద్భుజరచిత మహాభూరుహం బెత్తి వైచెం
గింకన్ ధూమ్రాక్షు; వాఁడుం । గెడసెను వదనోద్గీర్ణకీలాలధారా
పంకప్రాగ్భాగమగ్నా । పఘనవిఘటితప్రాణుఁడై యాహవోర్విన్. **91**

ప్రతిపదార్థం: లంకాలుంటాకుఁడు= లంకను దోచుకొనేవాడు - హనుమంతుడు; ఉద్యత్+లఘుతర, గమన+ఉల్లాసి+ఐ= శోభిల్లుతున్న లగువైన నడకలో వేడుక కలవాడై; డాసి= సమీపించి; వీఁకన్= ఉత్సాహంతో; పొంకంబు+ఏపు+ఆరన్= నిండుతనం అతిశయించగా; చంచత్+భుజ, రచిత, మహా, భూరుహంబు= చలిస్తున్న భుజాలందు పెట్టబడిన గొప్పమ్రాను; కింకన్= కోపంచొప్పున; ధూమ్రాక్షున్= ధూమ్రాక్షుడిపైని; ఎత్తి వైచెన్= పైకెత్తి విసరాడు; వాడున్= అతడును - ఆ ధూమ్రాక్షుడున్నూ; వదన+ఉద్గీర్ణ, కీలాల, ధారా, పంక, ప్రాక్+భాగ, మగ్న+అపఘన, విఘటితప్రాణుఁడు+ఐ= మొగంనుండి ఉవ్వెత్తుగా స్రవించిన నెత్తురుధారలచేత ఏర్పడిన బురదలో మునుముందు మునిగిన శరీరం నుండి పోయినఅసువులు కలవాడై; ఆహవ+ఉర్విన్= యుద్ధభూమిలో; కెడసెను= మరణించాడు.

తాత్పర్యం: లంకను విధ్వంసం చేసిన హనుమంతుడు లాఘవమైన గమనంతో ధూమ్రాక్షుడిని సమీపించి తనవిశాలభుజస్కంధాలపై మోసికొని వచ్చిన పెద్దవృక్షాన్ని గురి చూచి నిండారినఉత్సాహంతో అతడిమీదకి విసరి వేశాడు. ఆ దెబ్బకు ఆ ధూమ్రాక్షుడు తట్టుకొనలేక మొగంనుండి నెత్తురు కారుతుండగా ఆ నెత్తుటి బురదలో ముందరి భాగం మునిగిపోయిన శరీరంనుండి ప్రాణాలు కోలుపోయి యుద్ధభూమిపై కూలాడు.

విశేషం: వృత్త లక్షణానికి చూడండి. ఆరణ్య. 7.16 విశేషాంశం.

వ. ఇత్తెఱంగున ధూమ్రాక్షుండు తెగినఁ గపిసైనికు లార్చి హనుమంతుని ననేకభంగులం బ్రస్తుతించుచు రజనిచరులం గనుకనిం దోలినం దూలి యందఱుం బఱచి పురంబు సొచ్చిదనుజేంద్రునకుం బ్రహస్తధూమ్రాక్షుల మరణప్రకారంబు లెఱింగించినఁ, బ్రకటబాష్పనిశ్వాసవివర్ణవదనుం డగుచుఁ బంక్తివదనుండు. **92**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇత్తెఱంగునన్= ఈ రీతిగా; ధూమ్రాక్షుండు; తెగినన్= మరణించగా; కపిసైనికులు= వానరభటులు; ఆర్చి= సింహనాదం చేసి (పెనుకేక వేసి); హనుమంతునిన్= ఆంజనేయుడిని; అనేకభంగులన్= అనేకరీతుల; ప్రస్తుతించుచున్= పొగడుతూ; రజనిచరులన్= రాక్షసులను; కనుకనిన్= సంభ్రమంతో; తోలినన్= చెదరగొట్టగా; తూలి= వంగపడి; అందఱున్= అందరును; పఱచి= పారిపోయి; పురంబు+చొచ్చి= (యుద్ధభూమిని వదలి) (లంకా) నగరం ప్రవేశించి; దనుజ+ఇంద్రునకున్= రాక్షసరాజుకు- రావణుడికి; ప్రహస్త, ధూమ్రాక్షుల మరణ ప్రకారంబులు= ప్రహస్త ధూమ్రాక్షుల చావునుగూర్చిన విధానాలను; ఎఱింగించినన్= తెలుపగా; ప్రకట, బాష్ప, నిశ్వాస, వివర్ణ, వదనుండు+అగుచున్= వెల్లడి అయిన కన్నీరు నిట్టూరుపులతో పాలిపోయిన మొగం కలవాడు ఔతూ; పంక్తివదనుండు= పదితలలు కల రావణుడు.

తాత్పర్యం: ఈ రీతిగా ధూమ్రాక్షుడు మరణించగా, వానరవీరులు సింహనాదాలు చేసి ఆంజనేయుడిని బహురీతుల పొగడి రాక్షసులను తోలారు. అంతట ఆ రాక్షసులు అందరు యుద్ధభూమిని వదలి, లంకాపురంలోకి వెళ్లి ప్రహస్తుడు ధూమ్రాక్షుడు మరణించిన వృత్తాంతాల నెరిగించారు. అప్పుడు రావణుడు కన్నీరు కారుస్తూ వేడినిట్టూరుపులు వదలాడు.

క. **'కలవా రెల్లను మడిసిరి; । కలిగియు లేఁడయ్యెఁ గుంభకర్ణుఁడు; వీనిం**
దెలుపుదునొ? యేను గొడుకుం । జల మెడపక రిపులతోడ సరిఁ బెనఁగుదుమో?' **93**

ప్రతిపదార్థం: కలవారు+ఎల్లన్= ఉన్నవారు అందరున్నూ; మడిసిరి= మరణించారు; కుంభకర్ణుఁడు; కలిగియున్= ఉండికూడా; లేఁడు+అయ్యెన్= లేనట్టివాడే అయినాడు; ఏనున్= నేనును; కొడుకున్= తనయుడును- ఇంద్రజిత్తును; చలము+ఎడపక= మాత్సర్యాన్ని వీడక; రిపులతోడన్= శత్రువులతోడ; సరిన్+పెనఁగుదుమో?= సమానంగా యుద్ధం చేసేమా? వీనిన్= కుంభకర్ణుడిని; తెలుపుదునా?= మేలుకొలిపేదా?

తాత్పర్యం: 'ఉన్నవారందరు మరణించారు; కుంభకర్ణుడు ఉండికూడ లేనట్టివాడే అయ్యాడు. వీడిని ఇప్పుడు మేలుకొలిపేదా? లేదా - నేనూ నా సుతుడైన ఇంద్రజిత్తున్నూ కలిసి శత్రువులను ఎదిరించి పోరాడుదుమా?'

వ. **అని వితర్కించి యప్పటికిఁ గుంభకర్ణప్రబోధంబు గార్యంబుగా నిశ్చయించి, తదీయశయ్యాగృహంబునకుం జని వానిం దెలుపం బరిజనంబులం బనిచిన.** **94**

ప్రతిపదార్థం: అని, వితర్కించి= అని తర్జనభర్జనలు చేసి యోచించి; అప్పటికిన్= ఆ సమయానికి; కుంభకర్ణ, ప్రబోధంబు= కుంభకర్ణుడిని మేలుకొల్పటం; కార్యంబుగాన్= కర్తవ్యంగా; నిశ్చయించి= నిర్ణయించి; తదీయశయ్యాగృహంబునకున్+చని= ఆతడియొక్క (కుంభకర్ణుడియొక్క) పడకటింటికి వెళ్లి; వానిన్+తెలుపన్= అతడిని మేలుకొలుపటానికై; పరిజనంబులన్= సేవకులను; పనిచినన్= నియోగించగా.

తాత్పర్యం: అని రావణుడు యోచించి, ఇక ఆ సమయానికి కుంభకర్ణుడిని మేలుకొల్పటమే కర్తవ్యమని నిశ్చయించి, కుంభకర్ణుడిపడకటింటికి వెళ్లి ఆతడిని మేలుకొల్పటానికై సేవకులను నియోగించాడు.

సీ. **భేరీమృదంగగంభీరనాదంబులుఁ । గాహళఘంటికాకలకలములు,**
దారుణసింహనాదంబులు నొనరింపఁ । గడుఁ బెద్దవడికి నంగము గదల్చి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యొదిఁగిలి కను విచ్చి హూ యని బిట్టావు । లించి కొండొక దేఱి లేచి నీల్గి

కలయఁ జూచుటయును గట్టెదురున యున్న । యన్న నవ్వుచుఁ దన యనుఁగుదమ్ముఁ

ఆ. **జూచి యనియె 'నిట్టి చోద్యంపునిద్రలుఁ । గలవె? యేరికిని జగంబులోన?**

నెవ్వ రేమి యైరొ యెఱుఁగవు, ధన్యుఁడ; । వీవు మనకు నైన యెడరు వినవె? **95**

ప్రతిపదార్థం: భేరీ, మృదంగ, గంభీర, నాదంబులు= దుందుభులు, మద్దెలలనుండి వెలువడే గంభీరమైన ధ్వనులు; కాహళ, ఘంటికా కలకలములు= బూరాలనుండి చిరుగంటలనుండి వెలువడే కలకలరావాలు; దారుణ సింహనాదంబులు= భయంకరాలైన సింహ గర్జనలను పోలిన ధ్వనులు; ఒనరింపన్= చేయగా; కడున్= మిక్కిలి; పెద్దవడికిన్= చాలసేపటికి; అంగము= శరీరం; కదల్చి= చలింపజేసి; ఒదిఁగిలి= ప్రక్కకు కొంచెం తిరిగి; కనువిచ్చి= కనులు తెఱచి; హూ+అని; బిట్టు+ఆవులించి= పెద్దపెట్టున ఆవులించి; కొండొక+తేఱి= కొంత తెలివి తెచ్చుకొని; లేచి= మేలుకొని; నీల్గి=ఒడలు విరుచుకొని; కలయన్+ చూచుటయును= చుట్టుపట్ల చూడగా; కడు+ఎదురున= ఎట్టయెదుట; ఉన్న= ఉన్నటువంటి; అన్న= అగ్రజుడు రావణుడు; నవ్వుచున్=హసిస్తూ; తన+అనుఁగు+తమ్మున్= తన ప్రియమైన అనుజుడిని; చూచి; అనియెన్; ఇట్టి= ఈ విధమైన; చోద్యంపు నిద్రలు= అచ్చెరువు కలిగించే నిద్దురలు; ఏరికిని= ఎవరికైనను; జగంబులోనన్= లోకంలో; కలవె= ఉన్నాయా; ఎవ్వరు= ఎవరు; ఏమి+ఐరొ= ఏమయిపోయారో; ఎఱుఁగవు= తెలియజాలవు; ధన్యుఁడవు= చరితార్థుడవు; ఈవు= నీవు; మనకున్+ఐన= మనకు దాపురించిన; ఎడరు= ఆపద; వినవె= ఆలకించవా?

తాత్పర్యం: కుంభకర్ణుడు గాఢనిద్రలో ఉన్నాడు. ఆతడిని నిద్రనుండి మేలుకొల్పటానికై దుందుభులు మ్రోగించారు, మద్దెలలు వాయించారు. బూరాలు ఊదారు. చిరుగంటల కలకలధ్వనులు వినిపించారు. భయంకరమైన సింహనాదాలు చేశారు. అంతట కొంతసేపటికి శరీరం కదల్చి కుంభకర్ణుడు ప్రక్కకు ఒదిగి, మెల్లమెల్లగా కనులు విప్పి, హూ- అని పెద్దపెట్టున ఆవులించి, కొంతవరకు మేలుకొని ఒడలు విరుచుకొని నలుప్రక్కలు చూచి, తన ఎట్టయెదుట నిలిచిఉన్న అన్న రావణుడిపై దృష్టి సారించాడు. అంతట రావణుడు తన అనుగుతమ్ముడితో ఇట్లా పలికాడు: 'ప్రియమైన తమ్ముడా! కుంభకర్ణా! లోకంలో ఇటువంటి వింతనిద్దుర లున్నాయా?! నీవు నిదురలో మునిగి ఉన్నావు, ఎవరికి ఏమి జరిగిందో నీవు పట్టించుకొనటం లేదు. ఒక విధంగా నీవు ధన్యుడవు, హాయిగా ఏ కష్టాలెరుగక గాఢనిద్రలో ఉన్నావు. మనకు దాపురించిన ఆపదగూర్చి నీకు ఏ మాత్రమైనా తెలియునా?'

వ. **దశరథ నందనుం డయిన రాముండు నాచేత నపహృతభార్యుండై కలుషించి యనేకవానరయూథంబులం గూర్చికొని వచ్చి వనధి బంధించి మనవీటిపై విడిసి, మమ్మెల్లను నేలకుం గోలకుం దెచ్చుచున్నవాఁడు; ప్రహస్తాది వీరులు వానిచేతం బెక్కండ్రు సిక్కిరి; నీవ కాక వాని జయింప నన్యుండు శక్తుండు గాఁడు; కావున లెమ్ము; గ్రక్కునం బగతుపై నడచి, పొడిచి, గెలువుము; దూషణానుజులు వజ్రవేగ ప్రమాథులు నీకుం దోడ్పడియెద' రనిన 'నట్ల కాక' యని కుంభకర్ణుండు విహితపరికరబంధుండై సమరసన్నద్ధులయిన పరిజనంబుల తోడం గూడి వెల్వడి నడతెంచిన.** **96**

ప్రతిపదార్థం: దశరథనందనుండు+అయిన= దశరథుడికొడుకు అయిన; రాముండు; నాచేతన్= నావలన; అపహృతభార్యుండు+ ఐ= అపహరించబడిన భార్య కలవాడై; కలుషించి= కోపించి; అనేక, వానర, యూథంబులన్= పెక్కుకోతుల మూకలను; కూర్చికొని= కలుపుకొని; వచ్చి= అరుగుదెంచి; వనధి, బంధించి= సముద్రాన్ని లోబరచుకొని (వారధి నిర్మించి దాటి);

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనవీటిపైన్= మన నగరంపై (లంకాపురిపై); విడిసి= శిబిరాలు నిర్మించి; మమ్మున్+ఎల్లను= మా అందరిని; నేలకున్+కోలకున్+ తెచ్చుచున్నవాఁడు= బాణాలకు గురి కావించి భూమిపాలు చేస్తున్నాడు; ప్రహస్త+ఆది, వీరులు= ప్రహస్తుడు మున్నగు యోధులు; పెక్కండ్రు= పలువురు; వానిచేతన్= అతడిచేత= శ్రీరాముడిచేత; చిక్కిరి= లోబడ్డారు (చనిపోయారు); నీవు+అ, కాక= నీవు మాత్రమే తప్ప; వానిన్= అతడిని- శ్రీరాముడిని; జయింపన్= గెలవటానికి; అన్యుండు= ఇతరుడు; శక్తుండు+కాఁడు= సమర్థుడు కాడు; కావునన్= కాబట్టి; లెమ్ము= నిలబడుము (బయలుదేరుటకు సంసిద్ధుడవు కమ్ము); గ్రక్కునన్= వేగంగా; పగతుపైన్= శత్రువుపై; నడచి= దండెత్తి; పొడిచి= పోరాడి; గెలువుము= జయింపుము; దూషణానుజులు= దూషణుడిసోదరులు; వజ్రవేగప్రమాథులు= వజ్రవేగుడు, ప్రమాథుడు అనేవారు; నీకున్= నీకు; తోడ్పడియెదరు= సాయం చేస్తారు; అనినన్= అని (రావణుడు) పలుకగా; అట్ల+ఆ+కాక+అని= అటులే జరుగుగాక అని చెప్పి; కుంభకర్ణుండు; విహితపరికరబంధుండు+ఐ= కావలసిన పనిముట్లను సమకూర్చుకొన్నవాడై; సమరసన్నద్ధులు+అయిన= యుద్ధప్రయత్నాలను చేసినవారైన, పరిజనంబులతోడన్= భటులతో; కూడి= కలసి; వెల్వడి= (శయనగృహం) నుండి బయలు దేరి; నడతెంచినన్= రాగా.

తాత్పర్యం: దశరథమహారాజుకొడుకైన శ్రీరాముడిభార్యను నేను అపహరించాను; శ్రీరాముడు ఆగ్రహించి పెక్కువానర సమూహాలను సమకూర్చుకొని పయనించి వచ్చి, వారధి నిర్మించి సముద్రం దాటి లంకాపురి చేరి ఇక్కడ శిబిరాలను నిర్మించి ఉన్నాడు. ఆతడితో యుద్ధానికి తలపడక తప్పలేదు. ప్రహస్తుడు మున్నగు యోధులు రణరంగంలో మరణించారు. ఇక నీవే మాకు శరణ్యం. ఇంకొకడు శ్రీరాముడిని గెలువజాలడు. కావున నీవు వేగంగా బయలుదేరుము. లేచి శత్రువుపై విజృంభించి పోరాడుము. దూషణుడి తమ్ములు - వజ్రవేగుడు ప్రమాథుడు నీకు బాసటగా నిలువగలరు' అని రావణుడు చెప్పాడు. కుంభకర్ణుడు అంతట కావలసిన ఆయుధాలను తీసికొని, యుద్ధానికి సంసిద్ధులై ఉన్న భటులతో కూడి రణరంగానికి బయలుదేరాడు.

కుంభకర్ణుండు యుద్ధము సేయుట (సం. 3-271-1)

లయగ్రాహి.

> **దారుణదవానల శిఖారుణ శిరోరుహు, గ । భీరఘనకర్బురశరీరుఁ, బటురోష**
> **క్రూరనయనాంతగళితోరుతరవహ్నికణ । ఘోరముఖు, దంతవలయారభసదంశో**
> **ద్గారి రుధిరాధరు, నుదారభుజసారణ వి । దూరితదిగంతుఁ, బదభారవినమద్భూ**
> **భారుఁ, ద్రిజగద్విజయభూరిబలు, నద్దనుజ । వీరుఁ గని రచ్చెరువు గూరఁ గపివీరుల్. 97**

ప్రతిపదార్థం: కపివీరుల్= వానరశ్రేష్ఠులు; దారుణ, దవ+అనల, శిఖా+అరుణ, (శిరస్+రుహు) శిరోరుహున్= భయంకరమైన కారుచిచ్చు జ్వాలలవలె ఎఱ్ఱవారిన తలవెంట్రుకలు కలవాడిని; గభీరఘన, కర్బుర, శరీరున్= దట్టమైన మబ్బురంగు గల దేహం కలవాడిని; పటు, రోష, క్రూర, నయన+అంత, గళిత+ఉరుతర, వహ్ని, కణ, ఘోర, ముఖున్= మిక్కుటమైన కోపంచేత నిష్ఠురమైన కన్నుల కొనలనుండి జారే పెద్దఅగ్గిరవ్వలు కల భయంకరమైన మొగం కలవాడిని; దంతవలయ+ఆరభస, దంశ+ఉద్గారి, రుధిర+అధరున్= పండ్లవరుసను పటపట వేగంగా కొరకటంచేత కారెడి నెత్తురుతో కూడిన పెదవులు కలవాడిని; ఉదార, భుజ, సారణ, విదూరిత, దిగంతున్= గొప్పభుజాలు చాపటంచేత మిక్కిలి దూరంగా చేయబడిన దెసలకొసలు కలవాడిని; పదభారవినమత్+భూభారున్= కాళ్లబరువుచేత వంగుచున్న భూమియొక్క బరువు కలవాడిని; త్రిజగత్+విజయ, భూరిబలున్= మూడులోకాలను గెలువగల గొప్పబలం కలవాడిని; ఆ+దనుజవీరున్= ఆ రాక్షసయోధుడిని; అచ్చెరువు+కూరన్= ఆశ్చర్యం ఒనగూడగా; కనిరి= చూచారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వానరశ్రేష్ఠులు రాక్షసయోధుడైన ఆ కుంభకర్ణుడిని చూచి మిక్కుటమైన అచ్చెరువు పొందారు. ఆ కుంభకర్ణుడు వికారమైన రూపం కలవాడు. ఆతడి తలవెండ్రుకలు కార్చిచ్చుశిఖలవలె ఎర్రగా ఉన్నాయి. ఆతడి శరీరం ముదురుమబ్బురంగుతో నిండిఉన్నది. మిక్కుటమైన కోపంచేత అగ్నివిస్ఫులింగాలు క్రక్కేకనులు కల మొగం అతడిది! పండ్లచుట్టుకట్టునుండి పటపటకొరకుటచేత కారే నెత్తురుతో గూడిన పెదవులు అతడివి. నిడివి అయిన చేతులు చాపి నడవటంచేత అతడు దెసలకొసలను దూరంచేస్తూ ఉన్నాడు. తన కాళ్లబరువుచేత క్రుంగిన భూమిపై నడిచేవాడు అతడు. మూడులోకాలను గెలువజాలిన బలంకలవాడుగా కుంభకర్ణుడు కోతిమూకలకు కన్పించాడు.

విశేషం: ఇది లయగ్రాహి వృత్తం. ప్రతిపాదంలోను, భ, జ, స, స, భ, జ, స, న, భ, య గణాలుంటాయి. మూడుచోట్ల ప్రాసయతి కన్పిస్తుంది. వేరువిధంగా ఈ పద్యాన్ని ప్రస్తరించవచ్చును. ప్రతిపాదాన్ని పంచమాత్రలతో గూడిన గణాలు ఏడు+గగము అనగా ఈ పద్యం మొత్తం పదునారు ఖండికలు చేసి (5+5) + (5+5)॥ + (5+5) +(5+5)॥ + (5+5) + (5+5)॥+(5+5) +2+2 మాత్రలు గల ఖండికలుగా విభజించి 16 ఖండికలకు ప్రాసంమాత్రం ఘటించిన ఝంపె తాళానికి అనువైనపాట కాగలదు. నన్నయ మూడు, తిక్కన నాలుగు లయగ్రాహివృత్తాలను రచించారు. ఎఱ్ఱాప్రెగ్గడ లయగ్రాహి నొక్కదానినే రచించాడు.

క. రక్కసుఁడును దనమదిలో । నక్కపివీరులను జీరికైనఁ గొనక పే
రుక్కున రఘుకులవీరుల । దిక్కునకుం గవియుదెంచెఁ దీవ్రస్ఫురణన్. 98

ప్రతిపదార్థం: రక్కసుఁడును= రాక్షసుడును- కుంభకర్ణుడును కూడ; తనమదిలోన్= తనచిత్తంలో; ఆ+కపివీరులను= ఆ వానరయోధులను; చీరికి+ఐనన్+కొనక= ఏమాత్రం లక్ష్యం చేయక; పేరు+ఉక్కున్= మిక్కుటమైన బలంతో; రఘుకులవీరుల, దిక్కునకున్= రఘువంశంలో జన్మించిన యోధులు (రామలక్ష్మణులు) ఉన్నదెసకు; తీవ్రస్ఫురణన్= మిక్కుటమైన వేగంతో; కవియుదెంచెన్= మార్కొనటానికి బయలుదేరాడు.

తాత్పర్యం: ఆ రాక్షసుడైన కుంభకర్ణుడు తన మనస్సులో వానరయోధులను ఎంతమాత్రం లక్ష్యపెట్టక, మిక్కుటమైన బలదర్పంతో రఘుకులవీరులైన శ్రీరామలక్ష్మణులు ఉన్నదెసగా అమితవేగంగా దూసుకొని పోసాగాడు.

విశేషం: పై పద్యాలలో ఎఱ్ఱన మహాకవి సహృదయుల మనోనేత్రాలకు సుస్పష్టంగా కన్పించేటట్లు కుంభకర్ణుడి రూపాన్ని చిత్రించాడు.

ఎఱ్ఱన కవితాశిల్పాన్ని $\frac{\text{నన్నయ} + \text{తిక్కన}}{2}$ +వర్ణనాభినివేశంగా ప్రస్తరించవచ్చును.

మ. వడి నడ్డం బరికట్టె నెట్టన హరివ్రాతంబు పెన్మ్రాఁకులం
బిడుగుల్పోని మహోద్ధతాశ్మముల నాభీలంబుగా దైత్యు బి
ట్టడువన్ వైవఁగఁజొచ్చెఁ గొందఱు బలంబారంగ వే డాసి దం
దడి తత్కాయము సించి రుగ్రనఖదంతన్యాససంక్రీడలన్. 99

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: హరివ్రాతంబు= కోతులమూక; వడిన్= వేగంగా; నెట్టన= వారించటానికి వీలులేకుండా; అడ్డంబు+అరికట్టెన్= అడ్డు కల్పించింది; దైత్యు= రాక్షసుడిని; బిట్టు+అడువన్= బాగా అణచటానికై; పెన్, మ్రాఁకులన్= పెద్ద వృక్షాలతో; పిడుగుల్+పోని పిడుగులను పోలునట్టి; మహా+ఉద్ధత+అశ్మములన్= మిక్కిలి భీకరాలైన రాళ్ళను; వైవఁగన్+చొచ్చెన్= వేయసాగింది; కొందఱు= కొంతమంది వానరులు; బలంబు+ఆరంగన్= శక్తి నిండారగా; వే డాసి= వేగంగా దరి చేరి; దందడి= తరుచుగా; ఉగ్ర, నఖ, దంతన్యాస, సంక్రీడలన్= భయంకరమైన గోళ్ళచేత బరకుట, పళ్ళతో కొరుకుట అనే ఆటలతో; తత్+కాయము= ఆతడి యొక్క (కుంభకర్ణుడియొక్క) దేహం; చించిరి= ఛేదించారు.

తాత్పర్యం: కోతులమూకలు కుంభకర్ణుడివేగాన్ని అడ్డగించి అరికట్టడానికై పెనుమ్రాకులను వేశారు. గొప్పవైన పెద్దరాళ్ళను ఆ రాక్షసుడిని అణచటానికై వేశారు. కొందరు వానరులు తమబలాన్నంతటిని వెచ్చించి గోళ్ళతో గీరి దంతాలతో కొరికి కుంభకర్ణుడిదేహాన్ని ఛేదించారు.

ఉ. కన్నుల నిద్ర దేఱఁగ నకంపితుఁ డై యతఁ డెంత సేసినం
దన్ను నెఱుంగ కొక్కమొగిఁ దత్కపిసైన్యచయంబుఁ బోర బే
రన్నన మ్రింగఁ జొచ్చె విలయాగమసంభృతదర్పరోషవే
గోన్నతలీలఁ గాలుఁడు జనోత్కరమున్ గ్రసియించుచాడ్పునన్. 100

ప్రతిపదార్థం: కన్నులన్= నేత్రాలలో; నిద్ర= నిద్దుర; తేఱఁగన్= తేలిపోవగా; అకంపితుఁడు+ఐ= చలించనివాడయి; అతఁడు= కుంభకర్ణుడు; ఎంత చేసినన్= (ఇతరులు) (కపివీరులు) ఎంత చేసినప్పటికీ, ఎంతటి అడ్డంకులు కల్పించినప్పటికీ; తన్నున్+ఎఱుంగక= తనకు ఏమాత్రం తెలియక అనగా తనకు జరిగిన దేమీ గణించక; ఒక్కమొగిన్= ఒక వరుసలో; తత్+కపి, సైన్య, చయంబున్= ఆ వానరసేనా సమూహాన్ని; పోరన్= యుద్ధంలో; పేరు+అన్ననన్= పెనుపారవశ్యంతో; విలయ+ఆగమ, సంభృత, దర్ప, రోష, వేగ+ఉన్నత, లీలన్= ప్రళయకాలంలో వచ్చి నిండిన గర్వం కోపంయొక్క వేగంచేత ఏర్పడిన రీతిలో; కాలుఁడు= యముడు; జన+ఉత్కరమున్= జీవుల సమూహాన్ని; గ్రసియించుచాడ్పునన్= తినేటట్లుగా; మ్రింగన్+చొచ్చెన్= కబళింపసాగాడు.

తాత్పర్యం: కుంభకర్ణుడి కన్నులు నిద్దుర తేరాయి. కపిసేనలు ఏమి చేసినా సరకుగొనక అతడు విజృంభించి యుద్ధంచేయసాగాడు. అతడు తనకు ఎదురైన కోతిమూకలను ప్రళయకాలంలో యముడు రోషంతో నిండిన గర్వంతో జీవుల సమూహాలను తినివేసేటట్లు మ్రింగివేయసాగాడు.

వ. ఇట్లు బల చండబల వజ్రబాహులు లోనుగాఁ బెక్కంద్ర యూథపతులను బహుసహస్రసంఖ్యల వానరయూథంబును మ్రింగియు గొదగొని వచ్చుచున్న యన్నిశాచరుని మార్కొన నోడి తారప్రముఖు లైన బలీముఖులు నలువంకలం జెదరి పఱచిన. 101

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; బల= బలుడు; చండబల= చండబలుడు; వజ్రబాహులు= వజ్రబాహుడు; లోనుగాన్= మొదలుగా; పెక్కంద్ర= పెక్కుమంది; యూథపతులను= సేనాధిపతులను; బహుసహస్రసంఖ్యల= పెక్కువేలమంది; వానర, యూథంబును= వానరసేనను; మ్రింగియున్= కబళించికూడా; గొదగొని వచ్చుచున్న= తరుగక పెరిగి పైపైకి వస్తూ ఉన్న; ఆ+నిశాచరునిన్= ఆ రాక్షసుడిని- ఆ కుంభకర్ణుడిని; మార్కొనన్+ఓడి= ఎదిరింపజాలక; తారప్రముఖులు+ఐన= తారుడు మున్నగునట్టి; బలీముఖులు= కోతులు; నలువంకలన్= నలువైపులకు; చెదరి= కలఁగి, ఉన్నచోటువదలి; పఱచినన్= పారిపోగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా బలుడు, చండబలుడు, వజ్రబాహుడు మున్నగు సేనాధిపతులను, పెక్కుమంది వేలకొలది వానరసైనికులను కుంభకర్ణుడు కబళించాడు. అంతమందిని పొట్టను పెట్టుకొని కూడ ఆగకుండా మీదకు వచ్చిపడుతున్న ఆ రాక్షసుడి ధాటికి ఓర్వజాలక తారుడు మున్నగు సేనాధిపతులు చెదరి నలుదిక్కులకు పారిపోయారు.

మ. **కని సుగ్రీవుఁడు బిట్టదల్చుచును వేగంబార దైత్యేంద్రు మా**
ర్కొని సాలంబున వాని యౌఁదలఁ గడున్ ఘోరంబుగాఁ బూన్చి వ్రే
సిన నా వ్రేటున నిద్రదేఱి కడఁకం జేదోయి సారించి య
మ్మనుజాశుండు గపీంద్రుఁ బట్టె రభసోన్మాదంబుమై నార్చుచున్. **102**

ప్రతిపదార్థం: కని= అరసి (వానరులను భక్షిస్తూ విజృంభించి వచ్చే కుంభకర్ణుడిని చూచి); సుగ్రీవుఁడు= సుగ్రీవుడు; బిట్టు+అదల్చుచును= మిక్కుటంగా బెదరిస్తూ; వేగంబు+ఆరన్= రయ మొప్పారగా; దైత్య+ఇంద్రున్= రాక్షసులలో శ్రేష్ఠుడిని, కుంభకర్ణుడిని; మార్కొని= ఎదిరించి; సాలంబునన్= మద్దిచెట్టుతో; వాని+ఔఁదలన్= వాడితలమీద; కడున్= మిక్కిలి; ఘోరంబుగాన్= భయంకరంగా; పూన్చి= గురిపెట్టి; వ్రేసినన్= కొట్టగా; ఆ వ్రేటునన్= ఆ దెబ్బకు; నిద్ర+తేఱి= నిదుర వీడి; కడఁకన్= పూనికతో; చేదోయి= చేతులజంట; సారించి= ముందుకు చాచి; ఆ+మనుజ+ఆశుండు= ఆ మానవభక్షకుడు; రభస+ఉన్మాదంబుమైన్= వేగంతో కూడిన పిచ్చి ఆవేశంతో; ఆర్చుచున్= పెనుకేక పెట్టుతూ, సింహనాదం చేస్తూ; కపి+ఇంద్రున్= వానరశ్రేష్ఠుడిని, సుగ్రీవుడిని; పట్టెన్= గ్రహించాడు.

తాత్పర్యం: వానరులను భక్షిస్తూ విజృంభించి వస్తున్న కుంభకర్ణుడిని చూచి, సుగ్రీవుడు ఒక పెద్దమద్దిచెట్టును పట్టుకొని గురిచూచి అతడి నెత్తిపై మోదాడు. ఆ దెబ్బకు నిద్దురమైకం తొలగి, రాక్షసుడైన ఆ కుంభకర్ణుడు రెండుచేతులు చాచి సింహనాదం చేస్తూ వానరరాజైన సుగ్రీవుడిని పట్టుకొన్నాడు.

క. **పట్టువడిన సుగ్రీవునిఁ । గట్టెదురం గాంచి యధికకలుషిత మతియై**
దట్టుఁడు లక్ష్మణుఁ డసురన్ । బిట్టేసెన్ బిడుగుఁ బోని పృథుబాణమునన్. **103**

ప్రతిపదార్థం: దట్టుఁడు= దిట్టతనం కలవాడు; లక్ష్మణుఁడు; పట్టు+పడిన= (కుంభకర్ణుడిచేత) గ్రహించబడిన; సుగ్రీవునిన్= సుగ్రీవుడిని; కడు+ఎదురన్= ఎదురుబొదురుగా; కాంచి= చూచి; అధిక, కలుషిత, మతి+ఐ= మిక్కుటంగా కోపించిన బుద్ధి కలవాడై; అసురన్= రక్కసుడిని, కుంభకర్ణుడిని; పిడుగున్+పోని= పిడుగును పోలెడి; పృథుబాణమునన్= గొప్ప అమ్ముతో; బిట్టు+ఏసెన్= గాటంగా కొట్టాడు.

తాత్పర్యం: కుంభకర్ణుడిచేత పట్టుబడిన సుగ్రీవుడిని, తన కనులతో చూచిన లక్ష్మణుడు కోపంతో కలతచెందిన మనస్సుకలవాడై, పిడుగును పోలెడి గొప్పబాణంతో కుంభకర్ణుడిని గట్టిగా కొట్టాడు.

విశేషం: అలం: ఉపమ.

సీ. **ఉరమాడి యాశరం బుచ్చిపోవుటయును, । గడు నొచ్చి యా కుంభకర్ణుఁ డలిగి,**
వెస వాలితమ్ముని విడిచి తోరపుశిలఁ । గొనుచు నుక్కున రాముకూర్మితమ్ము

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దెసఁ బాఱుతెంచిన, ధీరుండు సౌమిత్రి । భల్లయుగ్మమునఁ దద్బాహు యుగము
నఱక, మాయాబలోన్నతుఁడు దైత్యుఁడు చతు । ర్బాహుఁడై తోఁచిన, భానుకులుఁడు

ఆ. చేతు లెల్లఁ దునిమె శితభల్లముల; వాఁడు । మఱియనేకహస్తమస్తకాంఘ్రి
భాగుఁ డైనఁ గినిసి బ్రహ్మాస్త్ర మేసినఁ । గూలె నసుర కొండ గూలినట్లు. 104

ప్రతిపదార్థం: ఆ శరంబు= ఆ బాణం; ఉరము+ఆడి= వక్షాన్ని కొట్టి; ఉచ్చిపోవుటయును= వెలుపలికి వెడలిపోగా; కడున్= మిక్కిలి; నొచ్చి= బాధ చెంది; ఆ+కుంభకర్ణుఁడు; అలిగి= ఆగ్రహం చెంది; వెసన్= శీఘ్రంగా; వాలితమ్మునిన్= వాలిఅనుజుడిని సుగ్రీవుడిని; విడిచి= వదలి; తోరపుశిలన్= పెద్దరాతిని; కొనుచున్= తీసికొంటూ; ఉక్కునన్= బలంతో; రాము, కూర్మితమ్ముదెసన్= రాముడి అనుగుతమ్ముడి దిక్కుగా, లక్ష్మణుడి వైపుగా; పాఱుతెంచినన్= వడిగా రాగా; ధీరుండు= ధైర్యం కలవాడు; సౌమిత్రి= సుమిత్రకొడుకు- లక్ష్మణుడు; భల్లయుగ్మమునన్= రెండు అమ్ములతో; తత్+బాహుయుగమున్= ఆ కుంభకర్ణుడియొక్క రెండుచేతులను, నఱకన్= ఖండించగా; మాయా, బల+ఉన్నతుఁడు= మాయ శక్తిచేత గొప్పవాడు; దైత్యుఁడు= రాక్షసుడు- కుంభకర్ణుడు; చతుః+బాహుఁడు+ఐ= నాలుగుచేతులు కలవాడై; తోఁచినన్= కనుపించగా; భానుకులుఁడు= సూర్యవంశానికి చెందినవాడు, లక్ష్మణుడు; శిత, భల్లములన్= వాడిఅమ్ములతో; చేతులు+ఎల్లన్= చేతులనన్నిటిని; తునిమెన్= ఖండించాడు; వాఁడు= అతడు (ఆ కుంభకర్ణుడు); మఱి= వెండియును; అనేక హస్తమస్తక+అంఘ్రి భాగుఁడు+ఐనన్= పెక్కుచేతులు తలలు కాళ్లు కలవాడు కాగా; కినిసి= (లక్ష్మణుడు) కోపించి; బ్రహ్మ+అస్త్రము= బ్రహ్మకు సంబంధించిన మంత్రబాణం; ఏసినన్= ప్రయోగించగా; అసుర= రక్కసుడు (కుంభకర్ణుడు); కొండ= పర్వతం; కూలినట్లు= పడిపోయినట్లుగా; కూలెన్= పడిపోయాడు.

తాత్పర్యం: ఆ బాణం కుంభకర్ణుడివక్షాన్ని ఛేదించింది. అతడు మిక్కిలి బాధపడి, కోపించి, వెంటనే తాను పట్టుకొని ఉన్న సుగ్రీవుడిని వదలిపెట్టి, ఒక పెద్దబండరాతిని చేతబూని లక్ష్మణుడు ఉన్నవైపు పురోగమించాడు. ధీరుడైన లక్ష్మణుడు రెండు వాడిబాణాలు ప్రయోగించి కుంభకర్ణుడి రెండుచేతులను నరికాడు. కాని, మాయాబలం గల ఆ రక్కసుడు కుంభకర్ణుడు నాలుగుచేతులు కలవాడుగా కన్పించాడు. లక్ష్మణుడు ఆ నాలుగుచేతులను ఖండించాడు కాని మరల ఆ కుంభకర్ణుడు పెక్కుచేతులతో పెక్కుతలలతో పెక్కుకాళ్లతో కన్పించాడు. అంత లక్ష్మణుడు కోపించి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. కుంభకర్ణు డంతట కొండ కూలినట్లు నేలపై పడ్డాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు కుంభకర్ణుండు దెగటారినం జూచి దూషణానుజులు వజ్రవేగుండును, బ్రమాథియు రాఘవానుజుం దలపడి నిబిడబాణౌఘనిర్మగ్నుం జేయుటయు, నతండును వారి నతిబహుళశరజాలంబులం బొదివినఁ గయ్యం బొక్క ముహూర్తంబు చూపఱకు రోమహర్షణంబై చెల్లెఁ; దదనంతరంబ. 105

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; కుంభకర్ణుండు; తెగటారినన్= మరణించగా; చూచి; దూషణ+అనుజులు= దూషణుడి తమ్ములు; వజ్రవేగుండును; ప్రమాథియు; రాఘవ+అనుజున్= రాముడి తమ్ముడిని, లక్ష్మణుడిని; తలపడి= మార్కొని; నిబిడ, బాణ+ఓఘ, నిర్మగ్నున్+చేయుటయున్= దట్టమైన అమ్ములు అనే ప్రవాహంలో మునిగినవాడిగా ఒనరించటమున్నూ; అతండును= లక్ష్మణుడు కూడా; వారిన్= వారిని (వజ్రవేగుడిని, ప్రమాథిని); అతి బహుళశరజాలంబులన్= మిక్కిలి యెక్కువ బాణసమూహాలచేత; పొదివినన్= క్రమ్మగా; కయ్యంబు= యుద్ధం; ఒక్క ముహూర్తంబు= ఒక క్షణకాలం; చూపఱకున్= చూచేవారికి, రోమహర్షణము+ఐ= గగుర్పాటు కలిగించేదై; చెల్లెన్= జరిగింది; తత్+అనంతరంబు+అ= అటు పిమ్మట.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ రీతిగా కుంభకర్ణుడు మరణించటం చూచి, దూషణుడితమ్ములు వజ్రవేగుడు ప్రమాథి అనేవారు శ్రీరాముడి తమ్ముడైన లక్ష్మణుడిని ఎదుర్కొని, అతడిని దట్టమైన అమ్ములప్రవాహంలో ముంచివేశారు. లక్ష్మణుడుకూడా ఆ వజ్రవేగ ప్రమాథి సోదరులపై లెక్కకు మిక్కిలి బాణసమూహాలను ప్రయోగించాడు. అప్పుడు ఒకక్షణకాలం ఆ యుద్ధం చూచేవారికి గగురుపాటు కలిగించింది. అటు పిమ్మట.

చ. **అనిలసుతుండు నీలుఁడు రయం బెసఁగం బఱతెంచి యమ్మహా**
దనుజులమీఁద నేపున నుదగ్రనగాగ్రయుగంబుఁ బూన్చి వై
చినఁ గడు రూపఱం జదిసి చెప్పఁగఁ జూపఁగ లేక పోయి ర
ద్దనుజులు వానరోత్కరముఁ దద్దయు నుబ్బున నార్చె నత్తరిన్. **106**

ప్రతిపదార్థం: అనిలసుతుండు= వాయుపుత్రుడు హనుమంతుడు; నీలుఁడు= నీలుడు; రయంబు+ఎసఁగన్= వేగం అతిశయించగా; పఱతెంచి= అరుగుదెంచి; ఆ+మహాదనుజులమీఁదన్= ఆ గొప్పరాక్షసులపై; ఏపునన్= బలంకొలది; ఉదగ్ర, నగ+అగ్ర, యుగంబున్= గొప్పకొండ శిఖరాలను రెండింటిని; పూన్చి= పొసగి; వైచినన్= విసరగా; కడున్= మిక్కుటంగా; రూపు+అఱన్= ఆకృతి నశించేటట్లుగా; చదిసి= అణగారిపోయి; ఆ+దనుజులు= ఆ రాక్షసులు (వజ్రవేగుడును ప్రమాథియు); చెప్పఁగన్+చూపఁగన్+లేకపోయిరి= చెప్పటానికి కాని చూపటానికి గాని వీలుకాకపోయారు; వానర+ఉత్కరమున్= కోతులసమూహం; ఆ+తరిన్= ఆ సమయంలో; తద్దయున్= మిక్కిలి; ఉబ్బునన్= ఉత్సాహంతో; ఆర్చెన్= సింహనాదం చేసింది.

తాత్పర్యం: హనుమంతుడున్నూ నీలుడున్నూ వేగంగా అక్కడికి వచ్చి, ఆ వజ్రవేగుడిపై ప్రమాథిపై రెండు పెద్దకొండ శిఖరాలు విసరివైచారు. ఆ రాక్షసులు ఇద్దరు నామరూపాలు లేకుండా ఆ కొండశిఖరాలతాకిడికి అణగారిపోయారు. ఆ విధంగా ఆ రాక్షసులు హతమారటం చూచి కోతిమూకలు ఉత్సాహంతో సింహనాదాలు చేశాయి.

క. **ఆకులపడి నలుదెసలం। గాకులక్రియఁ జెదరి కడు వెగడుపడి రక్షో**
నీకములు లంక యెనిమిది। వాకిళ్లను దూఱెఁ బౌరవర్గము దలఁకన్. **107**

ప్రతిపదార్థం: ఆకులపడి= కలతచెంది; నలుదెసలన్= నాలుగుదిక్కులలో; కాకులక్రియన్= కాకులవలె; చెదరి= ఇటునటు పోయి; కడున్= మిక్కిలి; వెగడు, పడి= దైన్యం చెంది; రక్షస్+అనీకములు= (రక్షోనీకములు) రక్కసులసేనలు; లంక+ఎనిమిది, వాకిళ్ళను= లంకానగరంలో ఉన్న ఎనిమిది ద్వారాలను; పౌరవర్గము= పట్టణంలో నివసించేవారి సమూహాలు; తలఁకన్= భీతిచెందేటట్లుగా; తూఱెన్= తొందరగా ప్రవేశించాయి.

తాత్పర్యం: రాక్షసులసేనలు కలతచెంది నాలుగుదిక్కులకు కాకులవలె చెదరి పారిపోయాయి, లంకాపట్టణంలో ఎనిమిదిమూలల గల ద్వారాలలో దూరారు. ఆ విధంగా ఓడిపోయిన సేనలు చిందరవందరై యుద్ధభూమిని వదలి పట్టణంలోకి పారిపోయిరావటం కాంచి లంకాపట్టణవాసులు భీతిల్లారు.

క. **అంతఁ దనకూర్మితమ్ముం। డంతకుఁ గూడుటయు, దూషణానుజమృతి వృ**
త్తాంతంబును విని యెంతయు। వంతఁ దలరి యఱచెఁ బంక్తివదనుఁ డవశుఁడై. **108**

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట; పంక్తివదనుఁడు= పదితలలు కలవాడు రావణుడు; తన, కూర్మి, తమ్ముండు= తనకు ప్రియమైన అనుజుడు కుంభకర్ణుడు; అంతకున్+కూడుటయున్= యముడిని చేరుటయు, (మరణించుటయున్నూ) దూషణ+అనుజ, మృతి, వృత్తాంతంబును= దూషణుడితమ్ములయొక్క మరణాన్ని, గూర్చిన సంగతియును; విని; ఎంతయున్ వంతన్= మిక్కుటమైన దుఃఖంతో; తలరి= చలించి; అవశుఁడు+ఐ= తనమీద తనకు అదుపు తప్పినవాడై, దీనుడై; అఱచెన్= రోదించాడు.

తాత్పర్యం: అంతట తనతమ్ముడు, తనకు ప్రియమైనవాడు, మహాబలిశాలి అయిన కుంభకర్ణుడు యమలోకాన్ని చేరటమున్నూ, దూషణుడితమ్ములు నామరూపాలు లేకుండ రణరంగానికి బలికావటమున్నూ విని, రావణుడు మిక్కుటమైన దుఃఖంలో మునిగి బిగ్గరగా విలపించాడు.

వ. అయ్యవసరంబున నాముక్తకవచుండును, నాబద్ధతూణీరుండును, బ్రచండకోదండుండును, గృపాణబాణాసనాది వివిధ సాధనోపేత సన్నిహిత స్యందనుండును, బురందర హృదయ సాగర మందరుండును నైన మేఘనాదుండు తండ్రిం జేరం జనుదెంచి, వినయంబున నిట్లనియె. 109

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; ఆముక్త కవచుండును= ధరించిన తనుత్రాణం కలవాడున్నూ; ఆబద్ధ తూణీరుండును= అమరించబడిన అమ్ములపొది కలవాడున్నూ; ప్రచండకోదండుండును= మిక్కిలి తీవ్రమైన విల్లు కలవాడున్నూ; కృపాణ, బాణ+ఆసన+ఆది, వివిధ, సాధన+ఉపేత, సన్నిహిత, స్యందనుండును= కత్తులు, ధనుస్సులు మున్నగు వేరువేరు పరికరాలతో కూడిన దగ్గరగా ఉన్న రథం కలవాడున్నూ; పురందర, హృదయ, సాగర, మందరుండును= దేవేంద్రుడి మనస్సు అనే సముద్రాన్ని తరచునట్టి మందరపర్వతంవంటి వాడున్నూ; ఐన= ఐనట్టి; మేఘనాదుండు= ఇంద్రజిత్తు; తండ్రిన్= రావణుడిని; చేరన్+చనుదెంచి= చేరవచ్చి, సమీపించి; వినయంబునన్= వినయంతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ సమయంలో కవచాన్ని ధరించిన వాడున్నూ, అమ్ములపొది సమకూర్చుకొన్నవాడున్నూ, గొప్పవిల్లు చేబూనినవాడున్నూ, కత్తులు బాణాలు ధనుస్సులు పలురకా లైన పరికరాలతోకూడిన రథం దగ్గరగా ఉన్నవాడున్నూ, దేవేంద్రుడి హృదయ మనే సముద్రాన్ని మందరపర్వతంవలె మథించినవాడున్నూ అయిన మేఘనాదుడు తనతండ్రి అయిన రావణుడిని సమీపించి ఈ విధంగా పలికాడు.

చ. 'వగవఁగ నేల దైత్యకులవల్లభ! యేఁ గలుగంగ నెమ్మెయిన్
జగముల నీదుశత్రులకు శౌర్యము సెల్లునె? వృత్రవైరిలో
నగు సురకోటి యే పడఁచి యప్రతిమోన్నతి నున్న నీకుఁ గ్రోఁ
తి గముల నోర్చు టెంతపని దేవ! ననున్ గృపఁ బంపు మాజికిన్. 110

ప్రతిపదార్థం: దైత్యకులవల్లభ!= రాక్షసవంశానికి భర్త అయినవాడా, ఓ రావణా!; వగవఁగన్+ఏల= దుఃఖించటం ఎందుకు?; ఏ+మెయిన్= ఏ విధముగా నైనను; ఏన్= నేను; కలుగంగన్= ఉండగా; ఏ+మెయిన్= ఏవిధముగానైనను; జగములన్= లోకాలలో; నీదు+శత్రులకున్= నీయొక్క విరోధులకు; శౌర్యముచెల్లునె= పరాక్రమం రాణిస్తుందా; వృత్రవైరి= దేవేంద్రుడు (వృత్రాసురుడికి శత్రువు); లోనగు= మున్నగు; సురకోటి+ఏపు+అడఁచి= దేవతల సమూహాల విజృంభణం అణచి; అప్రతిమ+ఉన్నతిన్+ఉన్న= సాటిలేని గొప్పతనంతో భాసిస్తున్న; నీకున్= నీకు; క్రోతిగములన్= కోతిమూకలను; ఓర్చుట+ఎంత, పని?=

ఓడించటం ఎంతటి కార్యం? (సులువైన పని); దేవ= ప్రభూ!; ననున్= నన్ను; కృపన్= దయతో; ఆజికిన్= యుద్ధానికి; పంపుము= పుత్తెంచుము.

తాత్పర్యం: 'ఓ రాక్షసవంశవల్లభా! నీవు దుఃఖించ' నవసరం లేదు. నేను ఉండగా ఏ విధంగా కూడ లోకాలలో నీ విరోధుల పరాక్రమం రాణించదు. వృత్రుడిని చంపిన దేవేంద్రుడు మున్నగు వేల్పుల ఉక్కడగించి సాటిలేని శౌర్యంతో వెలుగొందుతున్న నీకు ఈ వానరసమూహాన్ని హతమార్చటం మిక్కిలి సులువైన పని. ప్రభూ! నన్ను దయతో రణరంగానికి పంపుము. నేను శత్రువులను జయించగలను.

ఉ. **కూడిన కొండమ్రుచ్చులను గ్రోఁతుల నుగ్రత ముట్టి కిన్కఁ జెం**
డాడెద; నుజ్జ్వలోగ్రవివిధాంబకచుంబితదిఙ్ముఖుండ నై
యాడెద వీరనృత్యము; రయంబునఁ బార్థివసూను లిద్దఅం
గ్రీడయపోలెఁ గిట్టి పెడకేలుగఁ గట్టెదఁ, బట్టి తెచ్చెదన్.' **111**

ప్రతిపదార్థం: కూడిన= చేరిన; కొండమ్రుచ్చులను= కొండలలో తిరుగాడే ముదురుకోతులను; క్రోఁతులన్= వానరులను; ఉగ్రతన్= భయంకరంగా; ముట్టి= కదిసి; కిన్కన్= కోపంతో, చెండాడెదన్= ఖండిస్తాను; ఉత్+జ్వల+ఉగ్ర, వివిధ+అంబక, చుంబిత, దిక్+ముఖుండను+ఐ= దేదీప్యమానంగా ప్రకాశించి భయంకరాలుగా కన్పట్టే పలురకాలైన బాణాలచేత ముద్దుపెట్టుకొనబడిన దిక్కులయొక్క మొగాలు కలవాడనై; వీరనృత్యము= వీరులు యుద్ధం చేస్తూ కావించే తాండవం; ఆడెదన్= చేస్తాను; రయంబునన్= వేగంగా; పార్థివసూనులు+ఇద్దఅన్= రాజపుత్రులు ఇరువురిని, రామలక్ష్మణులు ఇరువురిని; క్రీడ+అ, పోలెన్= ఆట ఆడే రీతిగానే (అవలీలగా); కిట్టి= సమీపించి; పెడకేలుగన్= చేతులు విరిచి, కుడిచేయి ఎడమభాగాన ఎడమచేయి కుడిభాగాన చేర్చి; కట్టెదన్= బంధిస్తాను; పట్టి= బంధించి; తెచ్చెదన్= తీసికొని వస్తాను.

తాత్పర్యం: చేరి గుమిగూడి వచ్చిన కోతులను కొండముచ్చులను భయంకరంగా కదిసి కోపంతో చీల్చి చెండాడుతాను; పెక్కురకాలైన బాణాల పరంపరలను అన్నిదిక్కులకు దేదీప్యమానంగా ప్రసరింపజేసే వీరవిహారం చేస్తాను; రాజకుమారుల నిద్దరను రామలక్ష్మణులను వినోదలీలావిలాసంగా యుద్ధంలో జయించి బంధించి పెడకేలు కట్టి నీముందర తెచ్చి పెట్టగలను. ఇది నా ప్రతిజ్ఞ.'

వ. **అనినఁ దెలివొంది మందోదరీసుందరుండు ప్రియనందనున కి ట్లనియె.** **112**

ప్రతిపదార్థం: అనినన్= అని (ఇంద్రజిత్తు వచించగా); తెలివి+ఒంది= తెలివొంది; తేరుకొని; మందోదరీ, సుందరుండు= మందోదరికి అందమైనవాడు, మందోదరి భర్త - రావణుడు; ప్రియనందనునకున్= అనుగుసుతునకు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా వచించాడు.

తాత్పర్యం: అని ఇంద్రజిత్తు ప్రోత్సాహవచనాలు చెప్పగా విని తెప్పరిలి ధైర్యం తెచ్చుకొనినవాడై, మండోదరిభర్త అయిన రావణుడు ప్రేమపాత్రుడైన తన తనయుడు ఇంద్రజిత్తుతో ఈ విధంగా పల్కాడు.

సీ. **'నీ పరాక్రమలీల నిక్కమే నెఱుఁగనే। పుత్త్ర! నీ భుజబలస్ఫురణమునన**
కాదె నా కిట్టి విఖ్యాతియు సిరియును। గలిగె; గీర్వాణసంఘంబుతోడఁ

గూడ నయ్యింద్రునిఁ గొనివచ్చి నా బంటుఁ । గా నొనరింపవే గర్వ మెసఁగ;
మాయావిదుండవు మహితదివ్యాస్త్రవి । శారదుండవు నీవు; సంగరమునఁ

ఆ. బగతు రెల్ల వెఱఁగుపడఁగ దృశ్యాదృశ్య । దుర్నిరూపభంగిఁ దొడరి చిక్కు
వఱుచు నీ మహోగ్రబాణ పాతంబులు । దశరథాత్మజులకుఁ దరమె యోర్వ? 113

ప్రతిపదార్థం: పుత్ర!= ఓ కుమార! ఇంద్రజిత్తూ!; నీ పరాక్రమలీల= నీయొక్క శౌర్యం అనే ఆట; నిక్కము= నిజం; ఏను= నేను; ఎఱుఁగన్+ఏ?= తెలియనా? (నాకు తెలియదా - తెలుసు అని భావం); నీ భుజ బలస్ఫురణమునన్+అ= నీ భుజశక్తి; ప్రకటనంవలననే; కాదు+ఎ= కాదా; ఇట్టి= ఇటువంటి; విఖ్యాతియున్= కీర్తియు; సిరియును= సంపదయున్నూ; కలిగెన్= నాకు లభించాయి; గర్వము+ఎసఁగన్= దర్పం అతిశయించగా; గీర్వాణ సంఘంబుతోడన్= వేల్పులసముదాయంతో, కూడన్= సయితంగా; ఆ+ఇంద్రునిన్; కొనివచ్చి= తీసికొనివచ్చి; నాబంటుగాన్= నా సేవకుడిగా; ఒనరింపవే= చేయలేదా; నీవు= నీవు; మాయావిదుండవు= మాయ (ఉన్నదానిని లేనట్లుగా, లేనిదానిని ఉన్నట్లుగా భ్రాంతిగొలిపే మహిమ) తెలిసినవాడవు; మహిత, దివ్య+అస్త్రవిశారదుండవు= గొప్పవైన మంత్రబాణాలనుగూర్చి తెలిసినవాడవు; సంగరమునన్= యుద్ధంలో; పగతురు+ఎల్లన్= శత్రువులు అందరు; వెఱఁగుపడఁగన్= భీతితో నిశ్చేష్టులుకాగా; దృశ్య+అదృశ్య, దుర్నిరూపభంగిన్= కనుపించి, కనుపించకుండగా (ఎక్కడున్నది) నిరూపించటానికి వీలులేని విధంగా; తొడరి= పూని; చిక్కు+పఱుచు= కష్టంకలిగించే; నీ, మహా+ఉగ్ర, బాణపాతంబులు= నీయొక్క గొప్పవైన భయంకరమైన అమ్ముల ప్రయోగాలు; దశరథ+ఆత్మజులకున్= దశరథుడి కుమారులకున్= రామలక్ష్మణులకు; ఓర్వన్+తరము+ఎ= సహించటానికి శక్యం ఔతుందా? (శక్యం కాదు).

తాత్పర్యం: ఓ కుమారా! నీవు ఎంతటి పరాక్రమవంతుడవో నే నెరుగుదును. నాకు వచ్చిన కీర్తిప్రఖ్యాతులకు నీవే కారణం. వేల్పుల సముదాయాన్ని, ఇంద్రుడిని, జయించి నీవు ఆతడిని నా సేవకుడిగా చేశావు. నీ దర్పం గొప్పది. నీవు మాయావిదుడవు. యుద్ధంలో శత్రువులను భ్రాంతిలో ముంచగలవు. కనుపిస్తూనే క్షణంలో అదృశ్యం కాగలవు. నీవు ఎచ్చట ఉన్నది శత్రువులు గుర్తించలేరు. భయంకరాలయిన నీ బాణప్రయోగాలకు దశరథుడి కుమారులు రామలక్ష్మణులు తట్టుకోలేరు.

ఆ. నిఖిలశత్రుచయము నిశ్శేషముగఁ జంపి । యనఘ! సమరనిహతు లైన యస్మ
దీయ జనులఋణము దీర్చుము; మసలక । పోయి రమ్ము; పోరఁ బొడిచి గెలుము'. 114

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! నిఖిలశత్రుచయమున్= సమస్తమైన శత్రువుల సమూహాన్ని; నిశ్శేషముగన్= మిగులకుండగా; చంపి= సంహరించి; సమరనిహతులు+ఐన= యుద్ధంలో చనిపోయిన; అస్మదీయజనుల ఋణము= నా వారలయొక్క అప్పు; తీర్పుము= చెల్లించుము; మసలక= తడయక; పోయిరమ్ము= వెళ్లిరమ్ము; పోరన్+పొడిచి= చొరవగా యుద్ధంచేసి; గెలుము= జయించుము.

తాత్పర్యం: ఓ పుణ్యాత్ముడా! శత్రువులలో ఒక్కరు మిగులకుండ అందరిని సంహరించి లోగడ యుద్ధంలో మరణించిన నావారిఋణం తీర్చుము నాయనా!. పోయిరమ్ము!, యుద్ధం చేసి శత్రువులను జయించుము.'

వ. అని కౌఁగిలించుకొని వీడుకొల్పిన నింద్రజిత్తు సత్వరుండై యరదం బెక్కి లంకాపురంబు వెలువడినం గని వనచరానీకంబు లార్చుచు నెదురు నడచుటయు, నతండు వారి నించుకయు సరకుగొనక కరతలం బెత్తి లక్ష్మణునిం బిలిచిన. 115

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసి; వీడుకొల్పినన్= మర్యాదగా సెలవు ఇచ్చి పంపగా; ఇంద్రజిత్తు= ఇంద్రజిత్తు; సత్వరుండు+ఐ= వేగం కలవాడై; అరదంబు+ఎక్కి= రథాన్ని అధిరోహించి; లంకాపురంబు= లంకానగరం; వెలువడినన్= వెలుపలికి రాగా; కని= అరసి; వనచర+అనీకంబులు= వానరసేనలు; ఆర్చుచున్= సింహనాదాలు చేస్తూ; ఎదురునడచుటయున్= మార్కొనుటయు; అతండు= అతడు - ఇంద్రజిత్తు; వారిన్= వారిని (క్రోతిమూకలను); ఇంచుకయున్= ఏ మాత్రమున్నా; సరకుకొనక= లక్ష్యపెట్టక; కరతలంబున్+ఎత్తి= చేయిని సాచి; లక్ష్మణునిన్= లక్ష్మణుడిని; పిలిచినన్= ఆహ్వానించగా.

తాత్పర్యం: అని చెప్పి, రావణుడు ఇంద్రజిత్తును వీడ్కొలిపాడు. ఇంద్రజిత్తు వేగంగా రథాన్ని అధిరోహించి, లంకాపట్టణంనుండి వెలువడి యుద్ధభూమిని చేరాడు. ఇంద్రజిత్తుఆగమనాన్ని కాంచి వానరసేనలు అతడిని మార్కొన్నాయి కాని, ఆతడు వారిని లెక్కసేయక, చేయెత్తి లక్ష్మణుడిని యుద్ధానికి ఆహ్వానించాడు.

ఇంద్రజిత్తు లక్ష్మణునితోడ యుద్ధము సేయుట (సం. 3-272-8)

క. **విని యాతండును మౌర్వీ । నినదంబున గగనధారుణీమధ్యం బె**
ల్లను మ్రోయ మత్తగజముం । గనిన మృగేంద్రుండపోలెఁ గడఁగెం బెలుచన్. **116**

ప్రతిపదార్థం: విని= ఆలకించి; ఆతండును= అతడుకూడా (లక్ష్మణుడుకూడా); మౌర్వీ, నినదంబునన్= వింటియొక్క అల్లెత్రాటిధ్వనిచేత; గగన, ధారుణీమధ్యంబు+ఎల్లను= ఆకసానికీ భూమికీ మధ్య నుండే ప్రదేశం అంతయు; మ్రోయన్= ప్రతిధ్వనించగా; మత్తగజమున్= మదించిన యేనుగును; కనిన= అరసిన; మృగ+ఇంద్రుండు+అ, పోలెన్= సింహమే అనేటట్లుగా; పెలుచన్= ఆటోపంతో; కడఁగెన్= విజృంభించాడు.

తాత్పర్యం: లక్ష్మణుడు ఇంద్రజిత్తు పిలుపును ఆలకించి, తన అల్లెత్రాటిమ్రోత భూమ్యాకాశాల మధ్య నున్న ప్రదేశమంతా ప్రతిధ్వనించేటట్లుగా చేస్తూ - మదించిన ఏనుగును చూచి లంఘించే సింహమే అన్నట్లు - ఆటోపంతో అతనిపై విజృంభించాడు.

వ. **అంత.** **117**

తాత్పర్యం: అప్పుడు.

ఉ. **జైత్రులు గోత్రభూమిధరసారులు సాగరధీరు లుల్లస**
చ్చిత్ర ధనుఃకళావిదు లజేయులు భూరిజయార్థు లప్పు సౌ
మిత్రియు మేఘనాదుఁడు నమిత్రవిభేదులు దాఁకి రార్చి లో
కత్రయ భీకరప్రధనకౌతుక వేగిత చిత్తవృత్తులై. **118**

ప్రతిపదార్థం: సౌమిత్రియున్= సుమిత్రకొడుకు లక్ష్మణుడును; మేఘనాదుఁడున్= ఇంద్రజిత్తూ; అమిత్రవిభేదులు= శత్రువులను చీల్చి చెండాడేవారు; జైత్రులు= జయశీలం కలవారు; గోత్రభూమిధరసారులు= కులపర్వతాలయొక్క నిగ్గు కలవారు; సాగరధీరులు= సముద్రం వంటి ధైర్యంకలవారు; ఉత్+లసత్+చిత్ర, ధనుస్+కళా, విదులు= ప్రకాశమానమైన ఆశ్చర్యకరమైన విలువిద్య నెరిగినవారు; అజేయులు= గెలువశక్యం కానివారు; భూరి, జయ+అర్థులు= గొప్పగెలుపును కోరేవారు; అప్డు=

అపుడు; లోక, త్రయ, భీకర, ప్రధన, కౌతుక వేగిత, చిత్తవృత్తులు+ఐ= మూడుజగత్తులకు భయంకరమైన యుద్ధం చేయటంలో వేడుకచే తొందరింపబడిన మనస్సులయొక్క వ్యాపారాలు కలవారై; ఆర్చి= సింహనాదాలు చేసి; తాఁకిరి= (ఒండొరులను) మార్కొన్నారు.

తాత్పర్యం: ఆ సమయంలో గెలుపుపొందే నేర్పుకలవారు, కులపర్వతాలయొక్క నిగ్గు గలవారు, సముద్ర ధీరులు, అచ్చెరువుకొలిపే, విలువిద్యలో ఆరితేరినవారు, గెలువశక్యం కానివారు, గొప్పవిజయాలను సాధింపకోరేవారు, శత్రుసంహారులు అయిన సుమిత్రకొడుకు లక్ష్మణుడున్నూ మేఘనాదుడు అయిన ఇంద్రజిత్తున్నూ మూడులోకాలు భీతి చెందే భయంకర యుద్ధంలో వేడుకతో కూడిన వేగం కల మనఃప్రవృత్తి కలవారై సింహనాదాలు చేస్తూ ఒండొరులను ఎదుర్కొన్నారు.

విశేషం: భూభారం వహించే కులపర్వతాలు ఏడు. అవి; 1. మహేంద్రం 2. మలయం 3. గంధమాదనం 4. వింధ్యం 5. సహ్యం 6. శుక్తిమంతం 7. పారియాత్రం.

క. మచ్చరము మీఱ నొండొరుఁ। జిచ్చఱ పిడుగులను బోని శితవిశిఖములం
జెచ్చెర నొంపఁగ విలు నే। ర్పచ్చటఁ దుల్యంబు లయ్యె నయ్యిరువురకున్. 119

ప్రతిపదార్థం: మచ్చరముమీఱన్= ఈసు అతిశయింపగా; ఒండొరున్= ఒకరినొకరు; చిచ్చు+అఱపిడుగులను+పోని= అగ్నిని వెదజల్లుతూ మండెడి పిడుగులను పోలిన; శితవిశిఖములన్= వాడి అయిన బాణాలచేత; చెచ్చెరన్= వేగంగా; నొంపఁగన్= నొచ్చేటట్లు చేయగా; ఆ+ఇరువురకున్= ఆఇద్దరికీ; విలునేర్పు= ధనువు నందలి కౌశలం; అచ్చటన్= ఆ యుద్ధభూమిలో; తుల్యంబులు= సమానాలు; అయ్యెన్= అయినది.

తాత్పర్యం: ఇంద్రజిత్తూ లక్ష్మణుడూ మాత్సర్యంతో ఒకరినొకరు చిచ్చుఅపిడుగులవంటి బాణాలతో వేగంమీర పోరాటం కొనసాగించగా; విలువిద్యలో వారు ఇరువురును సమస్కంధులుగా కన్పించారు.

విశేషం: తుల్యంబయయ్యె అని పాఠాంతరం.

క. తనకంటె నపుడు రావణ। తనయుం డని మీఱఁ జూచుఁ, దా నాతనికం
టెను మున్న రాఘవానుజుఁ। డనుపమశరలీల నతిశయంబుగ మెఱయున్. 120

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో; తనకంటెన్= తనకంటె (లక్ష్మణుడికంటె); రావణతనయుండు= రావణుడికుమారుడు, ఇంద్రజిత్తు; అనిన్= యుద్ధంలో; మీఱన్+చూచున్= అతిశయించటానికి యత్నిస్తాడు; తాన్= తాను (లక్ష్మణుడు); ఆతనికంటెను= ఇంద్రజిత్తుకంటెను; మున్ను+అ= ముందుగా; రాఘవ+అనుజుఁడు= లక్ష్మణుడు; అనుపమ, శర, లీలన్= సాటిలేని బాణప్రయోగం అనే క్రీడలో; అతిశయంబుగన్= మిక్కుటంగా; మెఱయున్= వెలుగొందుతాడు.

తాత్పర్యం: సాటిలేని బాణప్రయోగంలో లక్ష్మణుడికంటె ఇంద్రజిత్తు మించటానికి యత్నించేవాడు; ఇంద్రజిత్తుకంటె ముందే లక్ష్మణుడు అతిశయించి తనమేటితనాన్ని ప్రదర్శించేవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **అంతఁ బటుతోమరంబుల । నెంతయు వెస నృపతనూజు నింద్రజి వైవన్**
సంతతశరముల నన్నిటి । నింతింతలు శకలములుగ నేసె నతండున్. **121**

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; పటుతోమరంబులన్= గొప్పవైన చిల్లకోలలను; ఎంతయున్= మిక్కిలి; వెసన్= శీఘ్రంగా; నృపతనూజున్= రాజపుత్రుడిని - లక్ష్మణుడిని; ఇంద్రజి= ఇంద్రజిత్తు; వైవన్= వేయగా; అతండున్= అతడును (లక్ష్మణుడు); సంతతశరములన్= ఎడతెగని బాణాలచేత; అన్నిటిన్= అన్నిటిని (ఆ తోమరాలను అన్నిటిని); ఇంత+ఇంతలు= చిన్నిచిన్ని; శకలములుగన్= ముక్కలుముక్కలయ్యేటట్లుగా; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: అప్పుడు గొప్పవైన చిల్లకోలలను మిక్కుటమైన వేగంతో లక్ష్మణుడిపైకి ఇంద్రజిత్తు విసరాడు. లక్ష్మణుడు ఎడతెగని బాణపరంపరలు ప్రయోగించి ఆ తోమరాలను అన్నిటిని చిన్నచిన్న ముక్కలుముక్కలుగా ఖండించాడు.

వ. **అట్టియెడ నంగదుండు గడంగి లక్ష్మణునకుం దలకడచి యమందవేగంబున మందోదరీనందనుం గదిసి ఘనమహీరుహంబునఁ దన్మస్తకంబు వ్రేసినఁ, జలింపక నిలింపవైరి నిశితప్రాసంబు వాసవపౌత్త్రుం జంప నెత్తుటయు, లక్ష్మణుండు దానిం దునియ నేసిన, నయ్యసురయు గదాదండంబుఁదీర్చి యంగదువక్షంబు వ్రేసినం, దొలంగక చెలంగి వాలిసూనుండు సాలవృక్షంబున నా రాక్షసురథంబు రథ్యసారథి సహితంబుగాఁ జదియనడిచె; నట్లు విరథుండయి యచ్చోటన యంతర్ధానంబు నొంది గగనగతుండయ్యెఁ; బదంపడి.** **122**

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ తరుణంలో; అంగదుండు= వాలికొడుకు, వానరయువరాజు; కడంగి= పూని; లక్ష్మణునకున్; తలకడచి= లక్ష్మణుడిని అతిక్రమించి ఉరికి; అమంద, వేగంబునన్= మిక్కుటమైన వేగంతో; మందోదరీనందనున్= మందోదరికొడుకు - ఇంద్రజిత్తును; కదిసి= మార్కొని; ఘన, మహీరుహంబునన్= పెనుమ్రాకుతో; తత్+మస్తకంబున్= ఆతడియొక్క - ఇంద్రజిత్తుయొక్క శిరమును; వ్రేసినన్= కొట్టగా; చలింపక= కంపించక; నిలింపవైరి= వేల్పులవిరోధి - ఇంద్రజిత్తు; నిశిత, ప్రాసంబు= వాడిఅయినఈటెను; వాసవపౌత్త్రున్= అంగదుడిని (దేవేంద్రుడి మనుమడిని); చంపన్= సంహరించటానికి; ఎత్తుటయును= పూనుటయున్నూ; లక్ష్మణుండు; దానిన్= దానిని; తునియన్+ఏసినన్= బాణం ప్రయోగించి ఖండించగా; ఆ+అసురయున్= ఆ రాక్షసుడును, ఆ ఇంద్రజిత్తును; గదాదండంబున్= గుదియను; తీర్చి= సవరించి; అంగదువక్షంబు= అంగదుడియొక్క రొమ్ము; వ్రేసినన్= కొట్టగా; తొలంగక= తప్పుకొనక; చెలంగి= విజృంభించి; వాలిసూనుండు= అంగదుడు (వాలికొడుకు); సాల, వృక్షంబునన్= మద్దిచెట్టుతో; ఆ రాక్షసురథంబు= ఆ రక్కసుడియొక్క, ఇంద్రజిత్తుయొక్క అరదం; రథ్యసారథి సహితంబుగాన్= గుర్రాలు సూతుడితో సహా; చదియన్+అడిచెన్= పచ్చడి అయ్యేటట్లు కొట్టాడు; అట్లు= ఆ రీతిగా; విరథుండు+అయి= తేరు కోల్పోయినవాడు అయి; (ఇంద్రజిత్తు); ఆ చోటన్+అ= ఆస్థలంలోనే; అంతర్ధానంబున్+ ఒంది= అదృశ్యమై; గగన, గతుండు+అయ్యెన్= ఆకాశసీమకు వెళ్ళినవాడు అయినాడు.

తాత్పర్యం: ఆ సమయంలో వాలికొడుకు వానరయువరాజు అంగదుడు వేగంగా లక్ష్మణుడిని అతిక్రమించి దూకి మండోదరికొడుకు అయిన ఇంద్రజిత్తును మార్కొని, ఆతడితలను ఒకపెద్దమ్రానుతో కొట్టాడు. ఆ దెబ్బకు తట్టుకొని వేల్పులవిరోధి అయిన ఇంద్రజిత్తు ఒక వాడిఅయిన ఈటెతో అంగదుడిని సంహరించపూనుకొన్నాడు. అంతలో లక్ష్మణుడు ఆ ఈటెను తన బాణంతో ఖండించాడు. అప్పుడు ఇంద్రజిత్తు గదాదండంతో అంగదుడి రొమ్ముపై కొట్టాడు. అంగదుడును ఆ దెబ్బకు తట్టుకొని మద్దిచెట్టు గొని ఇంద్రజిత్తు రథాన్ని, సారథిని పచ్చడిఅయ్యేటట్లుగా మోదాడు. ఆ విధంగా రథాన్ని కోలుపోయిన ఇంద్రజిత్తు అచ్చటికచ్చటే అదృశ్యమై ఆకసానికి ఎగిరిపోయాడు. పిమ్మట.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'ఎవ్వలన నుఱుకునో యతఁ। డెవ్వరి నెటు సేయునొక్కొయిం' దనుచుఁ గడున్
నివ్వెఱపడి కపిసేనలు। గ్రొవ్వుసెడం బంక్తివదనుకొడు కుద్ధతుఁడై. 123

ప్రతిపదార్థం: ఏ+వలనన్= ఏవైపునకు; ఉఱుకును+ఓ= దూకునో; అతఁడు= వాడు, ఇంద్రజిత్తు; ఎవ్వరిన్= ఎవరిని; ఎటు+చేయున్+ఒక్కో= ఏమిచేయునో కదా; ఇందున్= ఇచట; అనుచున్= అని యోచిస్తూ; కడున్= మిక్కిలి; నివ్వెఱపడి= అచ్చెరువొంది; కపిసేనలు= వానరసైన్యాలు; క్రొవ్వు+చెడన్= దర్పం గోల్పడగా; పంక్తివదను, కొడుకు= పదితలల వాడి పుత్రుడు, రావణుడికొడుకు ఇంద్రిజిత్తు; ఉద్ధతుఁడు+ఐ= గర్వంతో విజృంభించిన వాడై.

తాత్పర్యం: 'అదృశ్యుడై ఆకాశానికి ఎగిరిన ఇంద్రజిత్తు ఎక్కడ ఏ వైపు దూకుతాడో! ఏవిధంగా ప్రవర్తిస్తాడో ఎవరిమీద పడతాడో' అని వానరసేనలు అచ్చెరువుతో భీతిల్లాయి. రావణుడికొడుకు ఇంద్రజిత్తు గర్వంతో విజృంభించినవాడై.

చ. ఉఱుముచు నంత్యకాలచలితోగ్రబలాహకలీల దోఁపఁగాఁ
దఱచగు ఘోరపుంబిడుగుతండము వోని శరప్రతాన ము
క్కఱఁ దొరఁగించుచుం గపిబలావళిఁ ద్రుంచి కలంచె నేపునన్
నెఱఁకులు నొంచి బాణమయనీరధి ముంచె రఘుప్రవీరులన్. 124

ప్రతిపదార్థం: ఉఱుముచున్= గర్జిస్తూ; అంత్య, కాల, చలిత+ఉగ్ర, బలాహక, లీల+తోఁపఁగాన్= ప్రళయసమయంలో తిరుగాడే భయంకరమైన మేఘంమాదిరి కన్పట్టగా; తఱచు+అగు= దట్టమైన; ఘోరము+పిడుగు, తండము+పోని= భయంకరాలైన పిడుగులసముదాయాన్ని పోలే; శరప్రతానమున్= బాణాల సమూహాన్ని; ఉక్కు+అఱన్= బలం అణగిపోయేటట్లుగా; తొరఁగించుచున్= వర్షిస్తూ; కపి, బల+ఆవళిన్= వానరసేనా సమూహాలను; త్రుంచి= ఖండించి; ఏపునన్= దర్పంతో; కలంచెన్= కలతచెందించాడు; రఘుప్రవీరులన్= రఘువంశంలో జనించిన గొప్పవీరులను; (రామలక్ష్మణులను); నెఱఁకులు+నొంచి= ఆయువుపట్టులు నొచ్చేటట్లుగా చేసి; బాణమయనీరధిన్= శర సముద్రంలో; ముంచెన్= మునిగేటట్లు చేశాడు.

తాత్పర్యం: ఇంద్రజిత్తు ప్రళయకాలంలోని భయంకరమేఘంమాదిరిగా గర్జిస్తూ చిచ్చుఱపిడుగుల సముదాయాలను పోలినబాణజాలాలను బలం జారిపోయేటట్లుగా కపిసేనలపై కురిపించి దర్పంతో కలత నొందించాడు. రామలక్ష్మణులను ఆయువుపట్టులు నొచ్చేటట్లుగా శర సముద్రంలో మునిగేటట్లు చేశాడు.

విశేషం: అలం: ఉపమ.

క. మాయాధికు నంతర్హిత। కాయుఁ బురందరవిరోధిఁ గాకుత్స్థులు క్రో
ధాయత్తు లగుచు నేసిరి। ధీయుక్తులు శబ్దభేదిదివ్యాస్త్రములన్. 125

ప్రతిపదార్థం: మాయ+అధికున్= కపటమహిమచేత గొప్పతనం కలవాడిని; అంతర్హితకాయున్= కనిపించని దేహం కలవాడిని; పురందరవిరోధిన్= దేవేంద్రుడి శత్రువును - ఇంద్రజిత్తును; ధీయుక్తులు= బుద్ధిబలంతో కూడినవారు; కాకుత్స్థులు= కకుత్స్థవంశంలో జన్మించినవారు, శ్రీరాముడును లక్ష్మణుడును; క్రోధ+ఆయత్తులు+అగుచున్= ఆగ్రహంతో సన్నద్ధులు ఔతూ; శబ్ద, భేది, దివ్య+అస్త్రములన్= శబ్దాన్ని అనుసరించి ఛేదించే దేవతామహిమ గల మంత్రబాణాలతో; ఏసిరి= కొట్టారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అదృశ్యమైన దేహం కలవాడు ఇంద్రజిత్తు. అతడు కపటయుద్ధంలో ఆరితేరినవాడు. ఇక అతడిని బాణాలతో కొట్టటం ఎట్లా? బుద్ధికుశలత కల కాకుత్స్థులు కంటికి కనుపించని ఇంద్రజిత్తును శబ్దభేదిబాణాలు ప్రయోగించి కొట్టారు.

విశేషం: శబ్దభేది బాణాలంటే - లక్ష్యం అదృశ్యమై ఉన్నప్పటికి కేవలం చప్పుడునుబట్టి లక్ష్యం ఉన్నతావు నెరిగి ప్రయోగించే అమ్ములు. ఇట్టిశక్తి మేటి విలుకాండ్రలో కొంతమందికి మాత్రమే ఉంటుంది. అట్టిశక్తి నార్జించిన భారతవీరులలో అర్జునుడు పేర్కొనదగినవాడు.

వ. వానికి నలిగి సుగ్రీవాది వానరులు వృక్షశిలాప్రకరంబులు గైకొని యాకసంబున కెగసిన నద్దానవుండు వారి నందఱ వెఱచఱవ నేయుటయుఁజేవ సెడి మగుడి పుడమి కెఱఁగిరి; వాఁడంత నిలువక వాఁడి తూపులు పఱపి రామలక్ష్మణులఁ గరంబు నొప్పించినం జెయ్వేది యయ్యన్నయుం దమ్ముండును గపిబలంబు లడల ధరణీతలంబునకు నొరగి విలయకాలపతితు లైన సూర్యేందుల చందంబున నున్నంగని సింహనాదంబుసేసి. 126

ప్రతిపదార్థం: వానికిన్= అతడికి (ఇంద్రజిత్తుకు); అలిగి= ఆగ్రహం చెంది; సుగ్రీవ+ఆది, వానరులు= సుగ్రీవుడు మొదలగు కోతులు; వృక్ష, శిలా, ప్రకరంబులు= చెట్లు, రాళ్ల సమూహాలు; కైకొని= చేతబట్టి; ఆకసంబునకున్= ఆ గగనానికి; ఎగసినన్= ఎగిరి వెళ్ళగా; ఆ, దానవుండు= ఆ రాక్షసుడు - ఇంద్రజిత్తు; వారిన్+అందఱన్= వారలను అందరిని - ఆ సుగ్రీవాదులను; వెఱచఱవన్= భయపడేట్టు; ఏయుటయున్= బాణాలతో కొట్టటమున్నూ; చేవ+చెడి= ఉక్కు తఱిగి; మగుడి= తిరిగి; పుడమికిన్= భూమికి, ఎఱఁగిరి= కూలిరి; వాఁడు= అతడు (ఇంద్రజిత్తు); అంతన్= అంతటితో; నిలువక= ఆలసించక; వాఁడితూపులు= వాడిఅయిన బాణాలు; పఱపి= ప్రయోగించి; రామలక్ష్మణులన్= శ్రీరాముడిని మరియు లక్ష్మణుడిని; కరంబు= మిక్కిలి; నొప్పించినన్= బాధించగా; చెయ్వేది= చేయ్వు+ఏది= చేష్టలు తొలగి; ఆ+అన్నయును, తమ్ముండును= (రామలక్ష్మణులు); కపిబలంబులు= వానరసేనలు; అడలన్= భయంచెందగా; ధరణీతలంబునకున్= భూమి భాగానికి; ఒరగి= వ్రాలి; విలయకాల పతితులు= ప్రళయసమయంలో (భూమిపై) పడిపోయిన; సూర్య+ఇందుల= సూర్యుడు చంద్రుడు; చందంబునన్= మాదిరిగా; ఉన్నన్= ఉండగా; (ఇంద్రజిత్తు); కని= అరసి; సింహనాదంబు+చేసి= సింహంవలె గర్జించి. (క్రిందిపద్యముతో అన్వయం)

తాత్పర్యం: ఇంద్రజిత్తుపై కోపించి, సుగ్రీవుడు మున్నగు వానరవీరులు పెద్దరాళ్ళ గుంపును, చెట్లసమూహాలను పట్టుకొని ఆకసానికి ఎగిరి వెళ్ళారుకాని ఆ రాక్షసుడు వారందరూ భయపడేటట్లుగా వాడిబాణాలను ప్రయోగించాడు. వారు అందరూ తిరిగి నేలపై కూలారు. అంతట ఇంద్రజిత్తు నిశితబాణాలు ప్రయోగించి శ్రీరాముడిని లక్ష్మణుడిని నొప్పించాడు. రామలక్ష్మణులు చేష్టలు దక్కి మూర్ఛిల్లి నేలపై వ్రాలారు. వానరసేనలు భీతిల్లి గజగజలాడాయి. అప్పుడు నేలపై బడిన రామలక్ష్మణులు ప్రళయకాలంలో భూమిపై పడిన సూర్యచంద్రులవలె భాసించారు. ఆ దృశ్యాన్ని కాంచి, విజయదర్పంచేత ఇంద్రజిత్తు సింహనాదం చేశాడు.

విశేషం: కవిత్రయంనాటి తెలుగుబాసకు నేటికాలపు తెలుగుబాసకు అక్కడక్కడ ఈషద్భేదాలు కానబడతాయి. ముఖ్యంగా-కారకంలో (విభక్తిప్రత్యయాల ప్రయోగంలో). 'వానికి నలిగి' అనేది ప్రాచీనప్రయోగం. నేడు మనం అతడిపై అలిగి, అతనిపై ఆగ్రహించి అని అంటాం.

మ. పరమోదాత్తులఁ బార్థివోత్తముల శుంభద్విక్రమారంభులన్
సురసంకాశులఁ గోసలప్రభుల నస్తోకప్రభోద్దాములన్
వరలాభోన్నతుఁ డన్నిశాచరుఁడు గర్వం బొప్ప దుర్వార ని
ర్భర' నాగాస్త్రములం దదాహవమహిన్ బంధించె నయ్యిద్దఱన్. 127

ప్రతిపదార్థం: వరలాభ+ఉన్నతుఁడు= వరాలను పొందటంచేత గొప్పతనం కలవాడు; ఆ+నిశాచరుఁడు= ఆ రక్కసుడు - ఆ ఇంద్రజిత్తు; గర్వంబు+ఒప్పన్= దర్పం శోభిల్లేటట్లుగా; పరమ+ఉదాత్తులన్= మిక్కిలి గొప్పవారిని; పార్థివ+ఉత్తములన్= రాజులలో శ్రేష్ఠులను; శుంభత్+విక్రమ+ఆరంభులన్= దేదీప్యమానమైన పరాక్రమంతో కూడిన పురుషకారం కలవారిని; సుర, సంకాశులన్= దేవతలతో సమానులను; కోసలప్రభులన్= కోసల రాజ్యానికి అధినేతలను; అస్తోక, ప్రభా+ఉద్దాములన్= మిక్కుటమైన తేజస్సుతో గంభీరమైన ఆకృతులు కలవారిని; ఆ+ఇద్దఱన్= ఆ ఇరువురను, శ్రీరాముడిని లక్ష్మణుడిని (రామలక్ష్మణులను); దుర్వార, నిర్భర, నాగ+అస్త్రములన్= వారించటానికి శక్యం కాని భరించటానికి వీలులేనంత తీవ్రా లైన పాములకు సంబంధించిన మంత్రబాణాలచేత; తత్+ఆహవమహిన్= ఆ యుద్ధభూమిలో; బంధించెన్= కట్టివేశాడు.

తాత్పర్యం: మిక్కిలిగొప్పవారు, రాజన్యులలో శ్రేష్ఠులు, దేదీప్యమానమైన శౌర్యం అనే తేజస్సుతో వెలుగొందేవారు, వేల్పులతో సమానులు, కోసలదేశానికి అధిపతులు, మిక్కుటమైన వర్చస్సుతో విరాజిల్లేవారు అగు రామలక్ష్మణులను, వరాలు పొందటంచేత మహిమను ఆర్జించినవాడు అయిన ఇంద్రజిత్తు ఆయుద్ధభూమిలో విజృంభించి, వారించటానికి వీలులేని 'నాగాస్త్రాలు' ప్రయోగించి బంధించాడు.

వ. తదవసరంబున సుగ్రీవసుషేణ జాంబవత్ప్రముఖు లైన కపివీరులు రామలక్ష్మణు లున్నయెడకుం జనుదెంచి, యెయ్యదియునుం జేయునది నేరక దుఃఖితు లగుచుండ నవ్విభీషణుండు వారి నాశ్వాసించి, బ్రహ్మాస్త్ర ప్రయోగంబున నారాజకుమారులకు బంధమోక్షంబు గావించె; సుగ్రీవుండు విశల్యకరణి యను నౌషధంబున వారల విశల్యదేహులఁ జేసె; నిట్లు ప్రబుద్ధులై రాఘవులు గ్రమ్మఱఁ గయ్యంబునకుం గడంగి; రప్పుడు రావణానుజుండు రామునకుఁ గృతాంజలి యై యి ట్లనియె. 128

ప్రతిపదార్థం: తత్+అవసరంబునన్= ఆ సమయంలో; సుగ్రీవ, సుషేణ, జాంబవత్+ప్రముఖులు+ఐన= సుగ్రీవుడు, సుషేణుడు, జాంబవంతుడు మున్నగునాయకులు అయిన; కపివీరులు= వానరయోధులు; రామలక్ష్మణులు= రాముడును లక్ష్మణుడును; ఉన్న+ఎడకున్= ఉన్నస్థలానికి; చనుదెంచి= వచ్చి; ఎయ్యదియునున్= ఏ+అదియునున్= దేనిని కూడా; చేయునది నేరక= చేయదగింది తెలియజాలక; దుఃఖితులు+అగుచుండన్= శోకిస్తున్నవారు ఔతూఉండగా, ఆ+విభీషణుండు; వారిన్= వారిని (ఆ కపివీరులను); ఆశ్వాసించి= ఓదార్చి; బ్రహ్మాస్త్ర (బ్రహ్మ+అస్త్ర) ప్రయోగంబునన్= బ్రహ్మకు సంబంధించిన మంత్రమహిమ కల బాణాన్ని ఉపయోగించి; ఆ రాజకుమారులకున్= ఆ రాజపుత్రులకు, రామలక్ష్మణులకు; బంధమోక్షంబు+కావించెన్= (నాగపాశాలయొక్క) బంధంనుండి విముక్తిని కల్పించాడు; సుగ్రీవుండు; విశల్యకరణి= విశల్యకరణి అనేపేరుకల; ఔషధంబునన్= మందుచేత; వారలన్= వారిని (రామలక్ష్మణులను); విశల్యదేహులన్= బాధకలిగించే పదార్థాలు తొలగిన శరీరాలు కలవారినిగా; చేసెన్= కావించాడు; ఇట్లు= ఈ రీతిగా; ప్రబుద్ధులు+ఐ= స్పృహను కాంచి, తెలివిని పొందినవారై; రాఘవులు= రఘువంశజులు రామలక్ష్మణులు; క్రమ్మఱన్= మరల; కయ్యంబునకున్= యుద్ధానికి; కడంగిరి= పూనుకొన్నారు; అప్పుడు= ఆ సమయంలో; రావణ+అనుజుండు= రావణుడితమ్ముడు విభీషణుడు; రామునకున్; కృత+అంజలి+ఐ= నమస్కరించినవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ సమయంలో సుగ్రీవుడు, సుషేణుడు, జాంబవంతుడు మున్నగు వానరనాయకులు మూర్ఛిల్లిన రామలక్ష్మణులవద్దకు వచ్చి చేసేదిలేక దుఃఖించసాగారు. అంత, విభీషణుడు అక్కడికి వచ్చి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి రామలక్ష్మణులను నాగపాశాలనుండి బంధవిముక్తులను కావించాడు. సుగ్రీవుడు విశల్యకరణి అనే ఔషధంతో రామలక్ష్మణుల దేహాలనుండి బాధ కలిగించే పదార్థాలను తొలగించాడు. ఈ విధంగా మూర్ఛనుండి తేరి, తెలివినొందిన రాముడును లక్ష్మణుడును మరల యుద్ధం చేయటానికి ఉద్యుక్తులయ్యారు. అప్పుడు రావణుడి తమ్ముడు అయిన విభీషణుడు శ్రీరాముడికి నమస్కరించి ఈ విధంగా అన్నాడు.

విశేషం: 'విశల్యకరణి'- ములుకులు తీసివేసేది. శల్యం అనగా శరీరాన్ని నొప్పించే ముల్లు వంటి పదార్థం. విశల్యకరణి- దేహంలోని రక్తాన్ని శుద్ధి చేసే ఔషధం. ఇది గుడూచి తిప్పతీగ అని కొందరు, దంతినేపాళం అని కొందరు చెప్పుతున్నారు. భారతదేశాన మిక్కిలి ప్రాచీనకాలంలో శరీరంలో నాటిన ములుకులను నెట్టి ఆగాయాలను మాన్చే ఔషధాలు ఉన్నట్లు మనకు వాఙ్మయసాక్ష్యం ఇట లభిస్తున్నది. కరణులు నాలుగు : 1. విశల్యకరణి 2. సంధానకరణి 3. సావర్ణ్యకరణి 4. సంజీవకరణి.

సీ. **'నరనాథ! కిన్నరనాథుని పనుపున । శ్వేతుండు నాఁగఁ బ్రసిద్ధుఁ డైన**
గుహ్యకుఁ డిదె మీకుఁ గొనివచ్చె దివ్యతో । యంబు; లీ జలముల నంబుజాక్ష!
నయనపద్మక్షాళనము సేయుఁ; డిప్పు డ । దృశ్యభూతము లెల్లఁ దెల్లముగను
గానఁగఁ బడు' నన్నఁ గైకొని రాఘవుం । డనుజసహాయసమన్వితముగ

ఆ. **నట్లు చేసి, కనియె నంబరమధ్య సం । చారుఁ గృతవిపక్షసంప్రహారు**
నింద్రజాలశీలు నింద్రవిద్రావణు । రావణాగ్రతనయు రహితవినయు. **129**

ప్రతిపదార్థం: నరనాథ!= రాజా, శ్రీరామా!; కిన్నరనాథుని పనుపునన్= కిన్నరుల రాజుయొక్క ఆజ్ఞచేత, కుబేరుడి ఆజ్ఞచొప్పున; శ్వేతుండు+నాఁగన్= శ్వేతుడు అనగా; ప్రసిద్ధుఁడు+ఐన= యశస్సు నార్జించినవాడు అయిన; గుహ్యకుఁడు= వేల్పుజాతివాడు; దివ్యతోయంబులు= దేవతామహిమ కల నీళ్ళు; మీకున్= మీకొరకు; కొనివచ్చెన్= తీసికొనివచ్చాడు; అంబుజ+అక్ష!= పద్మాలవంటి కన్నులు కలవాడా! శ్రీరామచంద్రా! ఇది+ఎ= (ఇదె) ఇదుగో; ఈ జలములన్= ఈ నీళ్లతో; నయనపద్మక్షాళనము= పద్మాలవంటి కన్నులను కడుగుకొనటం; చేయుఁడు= చేయండి; ఇప్పుడు= ఈ సమయంలో; అదృశ్యభూతములు+ఎల్లన్= కానుపించని జడపదార్థాలు అన్నియున్నూ; తెల్లముగను= సుస్పష్టంగా; కానఁగఁబడున్= కన్పిస్తాయి; అన్నన్= అని పలుకగా; రాఘవుండు= శ్రీరాముడు; కైకొని= (ఆ దివ్యజలాలను) స్వీకరించి; అనుజ, సహాయ, సమన్వితముగన్= తమ్ముని సహాయంతో సాయము చేసే సహవ్రతులతోపాటుగా; అట్లు+అ+చేసి= ఆ విధంగానే చేసి (నయనప్రక్షాళనం చేసి); అంబరమధ్యసంచారున్= ఆకసం మధ్య తిరుగుతున్న వాడిని; కృతవిపక్ష సంప్రహారున్= శత్రువులను సంహరించినవాడిని; ఇంద్రజాలశీలున్= కనికట్టుకళలో చేయి తిరిగినవాడిని; ఇంద్రవిద్రావణున్= దేవేంద్రుడిని నీరసింపచేసినవాడిని; రావణ+అగ్ర, తనయున్= రావణుడియొక్క పెద్దకొడుకును; రహితవినయున్= అణకువ లేనివాడిని, దర్పం కలవాడిని - ఇంద్రజిత్తును; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: 'శ్రీరామా! కుబేరుడు పంపగా శ్వేతుడనే దేవజాతివాడు మీకొరకు దివ్యజలాలను తెచ్చాడు. అంబుజాక్ష! వాటిని మీకనుదమ్ములకు రాసుకొంటే చాలు అదృశ్యంగా ఉండే సమస్త పదార్థాలుకూడా కంటికి సుస్పష్టంగా కనపడతాయి. కాబట్టి వాటిని స్వీకరించండి' అని విభీషణుడు అన్నాడు. శ్రీరాముడు తన తమ్ముడి సహాయంతో ఆవిధంగా ఆచరించాడు. దానితో ఆకాశం మధ్యలో తిరుగుతున్నవాడు, శత్రువులపై దెబ్బతీసే నిపుణుడు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మాయాజాలప్రవీణుడు, ఇంద్ర విజేత, వినయరహితుడు, రావణుని పెద్ద కొడుకు అయిన ఇంద్రజిత్తును స్పష్టంగా చూడగలిగాడు.

వ. ఆ రక్కసుండునుందన చేసిన పౌరుషంబు ప్రతిహతంబగుటకు విస్మయం బంది, మగుడి హోమకార్యంబునకుం బోవం దొడంగిన నెఱింగి, విభీషణుండు లక్ష్మణుం జూచి' యన్నీచునకు హోమసమాప్తి యయ్యె నేని నెవ్వరికిం గెలువ నశక్యంబు; వీని వెన్నడిం దగిలి తెగటార్పు' మనిన నతండు. 130

ప్రతిపదార్థం: ఆ, రక్కసుండునున్= ఆ రాక్షసుడున్నూ, (ఇంద్రజిత్తున్నూ); తన చేసిన= తాను ఒనర్చిన; పౌరుషంబు= పురుషకారం, పురుషయత్నం; ప్రతిహతంబు+అగుటకున్= వ్యర్థం కావటానికి; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; మగుడి= మరల; హోమకార్యంబునకున్= అభిచారహోమం సల్పటానికి; పోవన్+తొడంగినన్= వెడలటానికి ఉద్యమించగా; విభీషణుండు; ఎఱింగి= తెలిసికొని; లక్ష్మణున్+చూచి= లక్ష్మణుడినిచూచి; ఆ+నీచునకున్= ఆ దుష్టుడికి; హోమ, సమాప్తి+అయ్యెన్+ఏనిన్= వేల్పుట పూర్తి అయితే; ఎవ్వరికిన్= ఎవరికైనా; గెలువన్= జయించటం; అశక్యంబు= సాధ్యం కాదు; వీనిన్= ఇతడిని (ఇంద్రజిత్తును); వెన్నడిన్+తగిలి= వెంటబడి పూని (వెన్నడి వెన్నాడి రూపాంతరం); తెగటార్పుము= సంహరించుము; అనినన్= అని (విభీషణుడు) చెప్పగా; అతండు= లక్ష్మణుడు.

తాత్పర్యం: ఆ ఇంద్రజిత్తు తన పురుషకారమంతా వ్యర్థంకావటంచేత ఆశ్చర్యపడి తిరిగి అభిచారహోమం చేయటానికి ఉద్యమించాడు. ఆ విషయం తెలిసికొని, విభీషణుడు లక్ష్మణుడితో ఇట్లా చెప్పాడు. 'ఓ లక్ష్మణా! ఈ నీచుడైన ఇంద్రజిత్తు మరల అభిచారహోమాన్ని నెరవేరిస్తే ఇతడిని ఎవ్వరూ జయించనలవికాదు. కాబట్టి ఈతడిని వెన్నంటి సంహరించుము'- అని చెప్పగా అంతట లక్ష్మణుడు.

ఆ. ఆర్చి వెనుకఁ దగిలి యశనికల్పము లైన । శరము లేయుటయు, నిశాటవరుఁడు
గినిసి వడి నెదిర్చి కీలించె లక్ష్మణు । నంగకముల నుజ్జ్వలాంబకములు. 131

ప్రతిపదార్థం: ఆర్చి= పెద్దకేక వేసి, సింహనాదం చేసి; వెనుకన్+తగిలి= వెన్నంటి వెడలి; అశనికల్పములు+ఐన= పిడుగులతో సమానా లయిన; శరములు= బాణాలు; ఏయుటయున్= ప్రయోగించుటయున్నూ; నిశాటవరుఁడు= రాక్షసశ్రేష్ఠుడు, ఇంద్రజిత్తు; కినిసి= ఆగ్రహించి; వడిన్= వేగంగా; ఎదిర్చి= మార్కొని; లక్ష్మణు+అంగకములన్= లక్ష్మణుడి అవయవాలయందు; ఉత్+జ్వల+అంబకములు= వెలుగొందేబాణాలు; కీలించెన్= నాటెను.

తాత్పర్యం: లక్ష్మణుడు సింహనాదం చేసి ఇంద్రజిత్తును వెన్నాడి చిచ్చరపిడుగులను పోలిన బాణాలను ప్రయోగించాడు. ఆ రాక్షసుడైన ఇంద్రజిత్తు ఆగ్రహించి వేగంగా లక్ష్మణుడిని మార్కొని అతడి అవయవాలలో ప్రకాశమానాలైన బాణాలు నాటాడు.

వ. ఇట్లు దలపడి యవ్వీరు లిరువురు నిశాచరవనచరబలంబులు రణం బుడిగి వెఱఁగుపడి తమపోరు సూచుచుండ నుద్దండవేదండ యుగళంబు పోలిక నాభీలశార్దూలద్వయంబు కరణి నసహ్యసింహ యమళంబు కైవడి నతిఘోరయుద్ధంబు సేయం దొడంగి; రంత. 132

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా, తలపడి= మార్కొని; అవ్వీరులు= ఇరువురున్= ఇద్దరు (లక్ష్మణుడున్నూ, ఇంద్రజిత్తున్నూ); నిశాచర, వనచర, బలంబులు= రాక్షసులయొక్కయు వానరులయొక్కయు సేనలు; రణంబు+ఉడిగి= యుద్ధాన్ని విరమించి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వెఱఁగుపడి= ఆశ్చర్యంపొంది; తమపోరు= తమయుద్ధం; చూచుచుండన్= దర్శిస్తూ ఉండగా; ఉద్దండ, వేదండ యుగళంబు, పోలికన్= రెండు గొప్ప ఏనుగులవలె; ఆభీల, శార్దూల, ద్వయంబు, కరణిన్= భయంకరమైన రెండు పెద్దపులుల వలె; అసహ్య, సింహ, యమళంబు, కైవడిన్= సహింపరాని రెండు సింహాలవలె; అతిఘోరయుద్ధంబు= మిక్కిలి భయంకరమైన పోరాటం; చేయన్+తొడంగిరి= చేయసాగారు; అంతన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా మార్కొని ఆ ఇరువురు వీరులున్నూ (ఇంద్రజిత్తు, లక్ష్మణుడు) రాక్షససేనలు, వానరసేనలు పోరాటం చేయటం మాని తమయుద్ధాన్ని దర్శిస్తూండగా రెండు గొప్ప ఏనుగులవలె, రెండు భయంకరాలైన పెద్దపులులవలె, రెండు సహింపరాని సింహాలవలె మిక్కిలి భయంకరంగా పోరాడారు. అప్పుడు.

విశేషం: అలం: ఉపమ.

క. **వడి నొక్కపెట్ట లక్ష్మణుఁ । డడరించె నిశాతశరము లా రక్కసుపైఁ**
గడఁగి యతఁడు నాతనిపై । నెడపక నాటించెఁ గలయ నెనిమిది యమ్ముల్. **133**

ప్రతిపదార్థం: లక్ష్మణుఁడు; వడిన్= వేగంగా; ఒక్కపెట్టన్= ఒక్కసారిగా; నిశాతశరములు= వాడిబాణాలు; ఆ, రక్కసుపైన్= ఆ రాక్షసుడిమీద, ఇంద్రజిత్తుమీద; అడరించెన్= ప్రయోగించాడు; అతఁడు= ఇంద్రజిత్తు; కడఁగి= పూని; ఆతనిపైన్= అతనిమీద, లక్ష్మణుడిపై; ఎడపక= వ్యవధి లేకుండగా; ఎనిమిదిఅమ్ములన్= ఎనిమిదిబాణాలను; కలయన్= అంతటా బాగుగా; నాటించెన్= గ్రుచ్చుకొనేటట్లుగ చేశాడు.

తాత్పర్యం: లక్ష్మణుడు ఇంద్రజిత్తుపై వేగంగా ఒకేసారి వాడిఅమ్ములు పెక్కు ప్రయోగించాడు. ఆ ఇంద్రజిత్తు సయితం ఆ లక్ష్మణుడిపై ఎనిమిదిఅమ్ములను వ్యవధిలేకుండా శరీరమంతటా నాటేటట్లు ప్రయోగించాడు.

ఆ. **వాఁడితూపు లొడల వడి నాటుటయు నొచ్చి । తోన కలుషరోషధూమకేతుఁ**
డతిశయిల్ల రాఘవానుజుం డురుచాప । శింజినీరవంబు సెలఁగఁ గవిసి. **134**

ప్రతిపదార్థం: వాఁడితూపులు= వాడిగల బాణాలు; ఒడలన్= శరీరంలో; వడిన్= వేగంగా; నాటుటయున్= గ్రుచ్చుకొనటంచేత; నొచ్చి= బాధపడి; తోన= వెంటనే; కలుష, రోష, ధూమకేతుఁడు= కలకబారిన కోపం అనే అగ్ని; అతిశయిల్లన్= పెంపొంద; రాఘవ+అనుజుండు= శ్రీరాముడి తమ్ముడు; ఉరుచాపశింజినీరవంబు= గొప్పధనుస్సుయొక్క అల్లెత్రాటి ధ్వని; చెలఁగన్= అతిశయిల్లగా; కవిసి= మార్కొని.

తాత్పర్యం: ఇంద్రజిత్తు ప్రయోగించిన వాడిబాణాలు తనశరీరాన నాటుకొనటంచేత, నొచ్చి వెంటనే కలకబారిన కోపం అనే అగ్నితో కూడినవాడూ ఔతూ, విజృంభించి శ్రీరాముడితమ్ముడు లక్ష్మణుడు తన గొప్పధనుస్సుయొక్క అల్లెత్రాటి ధ్వని విస్తరించగా ఇంద్రజిత్తును మార్కొని.

ఇంద్రజిత్తు లక్ష్మణునిచేతఁ జచ్చుట (సం. 3-273-22)

మ. **శితభల్లద్వితయంబునం గడువెసం జేదోయి ఖండించి ఖం**
డితగోత్రాచలతుంగశృంగశతకోటిస్ఫారఘోరానల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్యుతిసాంద్రం బగు శాతభల్ల మొకటం ద్రుంచెం గనత్కుండలా

న్వితమై యొప్పు నిశాచరేంద్రుశిరమున్ వీరక్రియాదక్షుఁడై. **135**

ప్రతిపదార్థం: శితభల్లద్వితయంబునన్= వాడియైన రెండు అమ్ములతో; కడున్= మిక్కిలి; వెసన్= శీఘ్రంగా; చేదోయి= రెండుచేతులను (ఇంద్రజిత్తుయొక్క చేతులజంటను); ఖండించి= తునిమి; ఖండిత, గోత్ర+అచల, తుంగ, శృంగ, శతకోటి, స్ఫార, ఘోర+అనల, ద్యుతి, సాంద్రంబు+అగు= ఖండించబడిన కులపర్వతంయొక్క ఎత్తైనశిఖరం గల వజ్రాయుధంయొక్క వ్యాప్తిచెందిన భయంకరమైన అగ్నిజ్వాలల కాంతిచే దట్టమైనది అయిన; శాతభల్లము+ఒకటన్= ఒక వాడి అయిన యీటెఅమ్ముచేత; కనత్+కుండల+అన్వితము+ఐ ఒప్పు= ప్రకాశమానమైన (చెవి) దుద్దులతో కూడి శోభిల్లునట్టి; నిశాచర+ఇంద్రు, శిరమున్= రాక్షసశ్రేష్ఠుడైన ఇంద్రజిత్తుయొక్క తలను; వీర, క్రియా, దక్షుఁడు+ఐ= పరాక్రమం భాసించే కృత్యంలో నేర్పుకలవాడై; త్రుంచెన్= ఖండించాడు.

తాత్పర్యం: లక్ష్మణుడు వాడియైన రెండుభల్లాలు ప్రయోగించి మిక్కిలివేగంగా ఇంద్రజిత్తు రెండుచేతులను ఖండించాడు. వెనువెంటనే ఖండించబడిన కులపర్వతశిఖరం గల వజ్రాయుధంయొక్క, వ్యాప్తిచెందిన భయంకరమైన అగ్నిజ్వాలల వెలుగుతో నిగ్గుదేలిన వాడిభల్లం ప్రయోగించి ప్రకాశమానమైన కుండలాలతోశోభిల్లే ఇంద్రజిత్తు శిరస్సును పరాక్రమదక్షుడై లక్ష్మణుడు నరికాడు.

ఆ. **భగ్నశాఖ మైన పాదపంబును బోలె । నిట్లు సంగరమున నింద్రజిత్తు**

పడినఁ జూచి దైత్యబలములు భయమంది । పఱచెఁ; జెలఁగి యార్చెఁ బ్లవగబలము. **136**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా, ఇంద్రజిత్తు= మేఘనాదుడు; సంగరమునన్= యుద్ధంలో; భగ్నశాఖము+ఐన= ఖండించబడిన కొమ్మలు కలది అయిన; పాదపంబును+పోలెన్= చెట్టువలె; పడినన్= కూలగా; చూచి= కనుగొని; దైత్యబలములు= రాక్షసులసేనలు; భయము+అంది= భీతిల్లి; పఱచెన్= పారిపోయాయి; ప్లవగబలము= వానరసైన్యం; చెలఁగి= అతిశయించి; ఆర్చెన్= సింహనాదం చేసింది.

తాత్పర్యం: ఈ రీతిగా ఇంద్రజిత్తు యుద్ధభూమిపై కొమ్మలు నరుకబడిన వృక్షంవలె కూలగా, కనులార, కాంచిన రాక్షససేనలు భీతిల్లి పారిపోయాయి. వానరసైన్యాలు సింహనాదాలు చేశాయి.

విశేషం: అలం: ఉపమ.

క. **తనయునిమరణం బేర్పడ । విని దశకంధరుఁడు శోకవివశుం డై బో**

రన బాష్పము లొలుకఁగ హా! । యనుచుం బదినోళ్ళుఁ దెఱచి యఱచెం బెలుచన్. **137**

ప్రతిపదార్థం: దశకంధరుఁడు= పదికంఠాలు కలవాడు- రావణుడు; తనయుని మరణంబు= కొడుకుయొక్క చావు (ఇంద్రజిత్తుమరణవార్త); ఏర్పడన్ విని= వివరంగా ఆలకించి; శోకవివశుండు+ఐ= దుఃఖంచేత వశం తప్పినవాడై; బోరన= వేగంగా; బాష్పములు= కన్నీటిబిందువులు; ఒలుకఁగన్= కారగా; 'హా'+అనుచున్= అయ్యో యని దైన్యంతో; పదినోళ్ళు= పది నోరులు తెఱచి= విప్పి; పెలుచన్= గట్టిగా; అఱచెన్= విలపించాడు.

తాత్పర్యం: తనకొడుకుమృతివార్త వివరంగా విని, రావణుడు దుఃఖం పెల్లుబికి వశంతప్పినవాడై వేగంగా కన్నీటిబిందువులు కారగా దైన్యంతో హాహాకారాలు చేస్తూ పదినోళ్ల తెరచి బిగ్గరగా విలపించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: స్వభావోక్తి. కన్నులనుండి బాష్పబిందువులు వేగంగా స్రవించటం, శరీరం వశంతప్పటం, హాహాకారాలు చేయటం, 'పదినోళ్లు' తెరచి బిగ్గరగా ఏడవటం స్వభావసిద్ధాలు; సహజాలు.

క. శోకంబు సైఁప లేక య । శోకవనంబునకు నరిగి సురశత్రుఁడు రో
షాకులుఁడై జానకిఁ బు । ణ్యాకారం జంపఁ జంద్రహాసము వెఱికెన్. 138

ప్రతిపదార్థం: (రావణుడు); శోకంబు= దుఃఖం; సైఁపలేక= భరించజాలక; అశోకవనంబునకున్= అశోకవృక్షాలు ఎక్కువగా కల తోటకు; అరిగి= వెడలి; సురశత్రుఁడు= వేలుపుల విరోధి, రావణుడు; రోష+ఆకులుఁడు+ఐ= కోపంచేత కలత చెందినవాడై; పుణ్య+ఆకారన్= మూర్తీభవించిన సుకృతాన్ని అంటే పుణ్యమే మానవఆకారం తాల్చిందా అన్నట్లు ఉన్నదానిని; జానకిన్= జనకుడిపుత్రిక అయిన సీతను, చంపన్= సంహరించటంకొరకై; చంద్రహాసము= చంద్రహాసం అనే పేరు గల తన కత్తిని; వెఱికెన్= (ఒరనుండి) పైకి లాగాడు.

తాత్పర్యం: రావణుడు పుత్రశోకాన్ని భరింపలేక వెనువెంటనే అశోకవనానికి వెళ్ళాడు. పుణ్యమే మానవస్త్రీ శరీరాన్ని తాల్చి కనుపిస్తున్నదా అనునట్లు అక్కడ ఉన్న సీతను కోపంచేత కలతచెందిన మనస్సుకలవాడై రావణుడు సంహరింప తలపోసి, ఒరనుండి తనకత్తి అయిన చంద్రహాసాన్ని పైకి లాగాడు.

విశేషం: (1) రావణుడి కత్తిపేరు 'చంద్రహాసం'. (2) సీతపై ఏర్పడిన కసి రావణుడికి పుత్రశోకంచేత ఇనుమడించింది. అందుచేత ఆతడు సీతను సంహరింప తలపోశాడు. ఆడుదానిని చంపటం వీరమర్యాద కాదు. అయినను రావణుడు అపుడు క్షణికోద్రేకానికి లోనయ్యాడు.

వ. అప్పుడు వయోవినయవృద్ధుం డయిన యవిన్ధ్యుం డతని వారించి, యిట్లనియె. 139

తాత్పర్యం: అప్పుడు వయసులోను, వినయంలోను పెద్దవాడు, వినయపరుడు అయిన అవిన్ధ్యుడు రావణుడిని ఆ పనినుండి మాన్పించి ఇట్లా అన్నాడు.

చ. 'ఇది తగునే దశానన! మహేంద్రుఁడు లోనగు దేవతాతతిం
గదనములో జయించి త్రిజగంబులఁ బేర్కొనియున్న నీకు ని
మ్ముదిత వధింతు నంట గడుమోసము గాదొకొ! యోపుదేని నే
పాదవఁగ రాఘవున్ గెలువు; ముగ్ధలిఁ జంపినఁ బెంపు గల్గునే?' 140

ప్రతిపదార్థం: దశ+ఆనన!= పదిమొగాలు కలవాడా! ఓ రావణా!; ఇది= ఈ స్త్రీహత్యాప్రయత్నం; తగునే= నీకు భావ్యమైనట్టిదా; మహా+ఇంద్రుఁడు= దేవేంద్రుడు; లోనగు= మున్నగు; దేవతా+తతిన్= వేల్పులసముదాయాన్ని; కదనములోన్= యుద్ధంలో; జయించి= గెలిచి; త్రి, జగంబులన్= మూడులోకాలలోను; పేర్+కొని+ఉన్న, నీకున్= యశస్సు నార్జించి ఉన్న నీకున్; ఈ+ముదితన్= ఈ ఆడుదానిని- సీతను; వధింతున్+అంట= చంపెదను అనటం; కడున్= మిక్కిలి; మోసముకాదు+ఒకొ!= వంచనకాదా! (వంచన చేయుటమే అగును); ఓపుదు+ఏనిన్= సామర్థ్యం ఉంటే; ఏపు+ఒదవఁగన్= అతిశయం శోభిల్లేటట్లుగా; రాఘవున్= రఘువంశజుడైన శ్రీరాముడిని; గెలువుము; ఉగ్మలిన్= ఆడుదానిని; చంపినన్= చంపివేస్తే; పెంపు= గొప్పతనం; కల్గునే= ఏర్పడుతుందా? (ఏర్పడదు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'పదిమొగాలు కల రావణా! ఇట్టి స్త్రీహత్యాప్రయత్నం నీవంటి మహావీరుడికి తగిన కృత్యం కాదు; నీవు దేవేంద్రుడు మున్నగు వేల్పుల సముదాయాన్ని యుద్ధంలో జయించినవాడవు. గొప్పకీర్తి ఆర్జించినవాడవు. ఈ విధంగా ఆడుదానిని అబలను వధించటం వంచన అనిపించుకొంటుంది. నీకు శక్తిసామర్థ్యాలు ఉంటే రఘువంశజుడైన శ్రీరాముడిని జయించుము. ఆడుదానిని సంహరించినంతమాత్రాన నీకు అభ్యుదయం చేకూరదు సుమా!'

వ. అనినం దద్వచనంబుల నుపశమితకోధుండై దోషాచరేశ్వరుండు సమరసన్నాహం బమర రథం బెక్కిమిక్కిలి బీరంబు సొంపార నఖిలసేనాసహితంబుగాఁ బురంబు వెల్వడి నడతెంచె; నంత. 141

ప్రతిపదార్థం: అనినన్= అని అవింధ్యుడు చెప్పగా; తత్+వచనంబులన్= ఆతడియొక్క మాటలచేత; ఉపశమితక్రోధుండు+ఐ= చల్లారిన కోపం కలవాడై; దోషాచర+ఈశ్వరుండు= నిశాచరప్రభువు, రావణుడు; సమరసన్నాహంబుఅమరన్= యుద్ధంకొరకు చేసే ప్రయత్నం శోభిల్లగా; రథంబు+ఎక్కి= తేరును అధిరోహించి; మిక్కిలి= గొప్ప; బీరంబు, సొంపు+ఆరన్= దర్పంయొక్క శోభ విలసిల్లేటట్లుగా; అఖిలసేనా సహితంబుగాన్= సమస్తమైన సేనలతో కూడినవాడై; పురంబు= (లంకా) పట్టణం; వెల్వడి= వెలుపలకు వచ్చి; నడతెంచెన్= యుద్ధానికి వెళ్ళాడు; అంతన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అని అవింధ్యుడు పలుకగా ఆతని మాటలవలన రావణుడికోపం ఉపశమించింది. రావణుడు యుద్ధప్రయత్నాలు చేసి సాధనాలు సమకూర్చుకొని రథాన్ని ఎక్కి మిక్కుటమైన డాబు, దర్పం, శోభిల్లేటట్లుగా సమస్తసైన్య సమేతుడై లంకాపురంనుండి నిష్క్రమించి, యుద్ధరంగానికి వెళ్ళాడు. ఆ సమయంలో.

శా. సుగ్రీవాదిసమస్తవానరులుఁ బ్రస్ఫూర్జన్మహావిగ్రహ
వ్యగ్రాకారతఁ బేర్చి భూరుహశిలావ్రాతంబులం దాల్చి వా
లాగ్రవ్యాచలనంబు లొప్ప దశకంఠాగ్రేసరోదగ్ర దై
త్యగ్రామంబు నెదిర్చినన్ సమర మత్యంతోగ్ర మయ్యెన్ వడిన్. 142

ప్రతిపదార్థం: సుగ్రీవ+ఆది, సమస్తవానరులున్= సుగ్రీవుడు మున్నగు కోతులు అందరున్నూ; ప్ర, స్ఫూర్జత్+మహా, విగ్రహ, వ్యగ్ర+ఆకారతన్= మిక్కుటంగా వెలుగొందే గొప్ప యుద్ధమందు వేగిరపడే ఆకారాలతో; పేర్చి= అతిశయించి; భూరుహ, శిలా, వ్రాతంబులన్= చెట్ల రాళ్ల సముదాయాలను; తాల్చి= ధరించి; వాల+అగ్ర, వి+ఆ చలనంబులు= తోకల చివరిభాగాలను బాగా చలింపచేయటాలు; ఒప్పన్= శోభిల్లగా; దశకంఠ+అగ్రేసర+ఉదగ్ర, దైత్య, గ్రామంబున్= రావణుడికి ముందు నడతెంచే భయంకరరాక్షస సమూహాన్ని; ఎదిర్చినన్= మార్కొనగా; వడిన్= శీఘ్రంగా, సమరము= యుద్ధం; అత్యంత+ఉగ్రము+అయ్యెన్= మిక్కిలి భయంకరం అయింది.

తాత్పర్యం: సుగ్రీవుడు మున్నగు ఎల్లవానరులు గొప్పయుద్ధం కోసం వేగిరపడే ఆకారాలతో విజృంభించి చెట్లు రాళ్ళు పూని, తోకలు త్రిప్పుతూ రావణుడికి ముందు నడచి వచ్చిన రాక్షససేనలను ఎదుర్కొనగా సంగ్రామం మిక్కిలి భయంకరం అయింది.

వ. ఆ సమయంబున నఖిలమాయాకుశలుం డైన దశముఖుండు మాయ గావించిన. 143

తాత్పర్యం: అప్పుడు మాయలన్నింటిలో నిపుణుడైన రావణుడు మాయను ప్రదర్శించగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఆ రావణుదేహంబున । ఘోరగదాశక్తిఖడ్గ కోదండధరుల్
వీరులు సహస్రసంఖ్యల । వారలు జనియించి రసురవరు లుద్ధతులై. 144

ప్రతిపదార్థం: ఆ రావణుదేహంబునన్= ఆ రావణుడియొక్క శరీరంలో; ఘోర, గదా, శక్తి, ఖడ్గ, కోదండ, ధరుల్= భయంకరమైన గదలు, శక్తులు, కత్తులు, ధనుస్సులు ధరించినవారు; వీరులు= యోధులు; సహస్రసంఖ్యలవారలు= వేలకొలది; అసురవరులు= రాక్షసశ్రేష్ఠులు; ఉద్ధతులు+ఐ= గర్వించినవారై; జనియించిరి= ఉద్భవించారు.

తాత్పర్యం: ఆ రావణుడి శరీరనుండి వేనకువేలు రాక్షసయోధులు భయంకరమైన గదలు శక్తులు కత్తులు ధనుస్సులు మున్నగునవి చేతపట్టినవారై గర్వంతో అతిశయించినవారు ఉద్భవించారు.

వ. వారి నందఱఁ గౌసల్యానందనుండు సాంద్రశరజాలంబుల నవలీలం దునిమి తూఁటాడిన నమ్మేటి రక్కసుండు మఱియు నొక్కమాయ ప్రయోగించి రామలక్ష్మణ ప్రతిరూపంబు లనేకంబు లుత్పాదించుటయు, నయ్యన్నయుం దమ్ముండును వెఱఁగు పడియునుం జిడిముడివడక యమ్మాయారూపంబు లన్నియుం దునిమి, తదనంతరంబ. 145

ప్రతిపదార్థం: వారిన్అందఱన్= ఆ ఆయుధవిశేషధారులను అందరిని; కౌసల్యానందనుండు= కౌసల్యకొడుకు- శ్రీరాముడు; సాంద్రశరజాలంబులన్= దట్టమైన అమ్ములసముదాయాలచేత; అవలీలన్= సులువుగా; తునిమితూఁటాడినన్= ముక్కలు ముక్కలు చేయగా; ఆ+మేటి రక్కసుండు= ఆ గొప్ప రాక్షసుడు- రావణుడు; మఱియున్= వెండియును; ఒక్కమాయ= ఒక కాపట్యం; ప్రయోగించి= ఉపయోగించి; రామలక్ష్మణ ప్రతిరూపంబులు= రాముడిని లక్ష్మణుడిని పోలిన రూపాలను; అనేకములు= పెక్కు; ఉత్పాదించుటయున్= పుట్టించగా; ఆ+అన్నయున్= ఆ అన్నయును (రాముడును); తమ్ముండును= అనుజుడును (లక్ష్మణుడును); వెఱగుపడియునున్= అచ్చెరువు నందినప్పటికీ; చిడిముడిపడక= కలత చెందక; ఆ+మాయారూపంబులు+అన్నియున్= ఆ కృతకాలైన ఆకృతులను అన్నింటిని; తునిమి= ఖండించి; తత్+అనంతరంబు+అ= అటుపిమ్మట.

తాత్పర్యం: ఆ విధంగా ఆయుధవిశేషాలను ధరించి ఉద్భవించిన మాయారాక్షసులనందరిని కౌసల్యకొడుకు శ్రీరాముడు ముక్కలుముక్కలుగా చేయగా, ఆ గొప్పరాక్షసుడైన రావణుడు వెండియు ఒకమాయ కల్పించి, రామలక్ష్మణులవలెనే కన్పించే పెక్కుమందిని సృజించాడు. రామలక్ష్మణులు రావణుడి కాపట్యానికి అచ్చెరువునందినా కలతచెందక, ఆ మాయారూపాలను ఖండించారు. అటుపిమ్మట.

చ. అభినవభానుబింబరుచిరాకృతియున్ హరియుక్తమున్ మహా
రభసదురాసదంబును విరాజితకేతన వైజయంతికా
ప్రభయును నైన తేరు సురపాలకుపంపునఁ జేసి రాఘవ
ప్రభునకుఁ దెచ్చి మాతలి సభక్తికుఁడై ప్రియమొప్ప నిట్లనున్. 146

ప్రతిపదార్థం: అభినవ, భాను, బింబ, రుచిర+ఆకృతియున్= అప్పుడే ఉదయిస్తున్న సూర్యబింబంవలె వెలుగొందే రూపం కలిగినట్టిదియును; హరియుక్తమున్= గుర్రాలు పూన్చబడినట్టిదిన్నీ; మహా, రభస, దురాసదంబును= మిక్కుటమైన వేగంలో అతిక్రమించరానట్టిదిన్నీ; విరాజిత, కేతన, వైజయంతికా, ప్రభయునున్= వెలుగొందే జెండా- వైజయింతిక యొక్క కాంతులు

కలిగినట్టిదిన్నీ; ఐన= ఐనట్టి; తేరు= రథం; సుర, పాలకు, పంపునన్+చేసి= స్వర్గప్రభువు అయిన దేవేంద్రుడి ఆజ్ఞచొప్పున; మాతలి= దేవేంద్రుడి రథసారథి అయిన మాతలి అనే పేరు కలవాడు; రాఘవప్రభునకున్= రఘువంశానికి చెందిన రాజుకు-శ్రీరాముడికి; తెచ్చి= తీసికొనివచ్చి; సభక్తికుండు+ఐ= భక్తితో కూడినవాడై; ప్రియము+ఒప్పన్= ప్రీతిశోభిల్లేట్లుగా; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఉదయించే సూర్యబింబంవలె ధగద్ధగాయమానంగా వెలుగొందేదిగా, గుర్రాలు పూన్చబడిందీ, అన్నిరథాలకంటె వేగంగా పోగలిగిన శక్తి గలదీ; 'వైజయంతి' అనేపేరు కల పతాకకాంతులతో విరాజిల్లేదీ, అయిన ఆ రథాన్ని దేవేంద్రుడి ఆజ్ఞచొప్పున మాతలి తెచ్చి, శ్రీరాముడికి భక్తితో నమస్కరించి ఇట్లా పలికాడు.

విశేషం: (1) దేవేంద్రుడు శ్రీరామునికి తనరథాన్ని పంపించాడు. కారణం సుగమం. రావణుడు దేవేంద్రుడిశత్రువు. శత్రువుయొక్క శత్రువును పరమమిత్రుడిగా పరిగణించటం రాజనీతి. శ్రీరాముడి విజయంలో పాలుపంచుకోదగినవాడు దేవేంద్రుడు. (2) ఇంతకుముందు కుబేరుడు గుహ్యకుడిని తనదూతగా పంపి శ్రీరాముడికి 'దివ్యతోయములను' బహూకరించాడు. చూడుడు-పద్యసంఖ్య 129 సీసం. కుబేరుడికి రావణుడు శత్రువు. రావణుడికి శత్రువు అయిన శ్రీరాముడు కుబేరునికి మిత్రుడు కదా!.

మ. **'ధరణీనాథ! సురేంద్రుతే రిది; మహాదైత్యేంద్రులం దొల్లి యీ**
యరదం బెక్కి యనేకులం దునిమె జంభారాతి ఘోరాజి; నీ
యరదం బెక్కివధింపు నీవును మదీయస్ఫార సారథ్య ని
ర్భరభంగిన్ దశకంధరుం బ్రిభువనీభంగోన్నమత్కంధరున్.' **147**

ప్రతిపదార్థం: ధరణీనాథ!= రాజా, శ్రీరామచంద్రా!; ఇది= ఈ రథం; సుర+ఇంద్రు, తేరు= దేవేంద్రుడి అరదం; మహాదైత్య+ఇంద్రులన్= గొప్ప రాక్షసశ్రేష్ఠులను; తొల్లి= పూర్వకాలంలో; ఈ అరదంబు+ఎక్కి= ఈ రథాన్ని అధిరోహించి; అనేకులన్= పెక్కుమందిని; ఘోర+ఆజిన్= భయంకరమైన యుద్ధంలో; జంభ+అరాతి= (జంభుడు అనే రాక్షసుడికి విరోధి) దేవేంద్రుడు; తునిమెన్= ఖండించాడు; ఈ అరదంబు= ఈ రథాన్ని; ఎక్కి= అధిరోహించి; నీవును= ఓ రామా! నీవును; మదీయ, స్ఫార, సారథ్య, నిర్భర, భంగిన్= నాదైన విస్తరించిన రథంనడుపు నేర్పుయొక్క సమగ్రమైన రీతిచేత; దశకంధరున్= పదికంఠాలు కలవాడిని; త్రిభువనీభంగ+ఉన్నమత్+కంధరున్= మూడులోకాలయొక్క భంజనం చేత గర్వించిన కంఠాలు కలవాడిని; వధింపు= సంహరించుము.

తాత్పర్యం: 'రాజా! శ్రీరామా! ఇది దేవేంద్రుడి రథం. పూర్వకాలంలో ఈ రథాన్ని అధిరోహించి. భయంకరమైన ఈ యుద్ధంలో జంభుడి విరోధి అయిన దేవేంద్రుడు గొప్పరాక్షసవీరులను పెక్కుమందిని సంహరించాడు. నీవుకూడా దేవేంద్రుడి రథాన్ని అధిరోహించి నేను అప్రతిమానచాతుర్యంతో తేరునడపుతుండగా మూడులోకాలను ఓడించిన దర్పంచేత తలనెత్తుకొని తిరుగాడే రావణుడిని సంహరించుము.'

మ. **అనినన్ మాతలి నాదరించి యరదం బా రాఘవుం డెక్కియు**
క్కున మీఱెన్ రిపుకోటిమీఁద విలసత్కోదండమౌర్వీమహా
స్వనభిన్నాఖిలదిగ్విభాగుఁ డగుచున్ శాతాస్త్రధారాభిషే
చనపూతప్రతిపక్షసైన్యుఁ డగుచున్ సంరంభదుర్వారతన్. **148**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అని(మాతలి) చెప్పగా; ఆ రాఘవుండు= ఆ రాముడు; మాతలిన్= మాతలిని; ఆదరించి= గౌరవించి; అరదంబున్= రథాన్ని; ఎక్కి= అధిరోహించి; రిపుకోటిమీఁదన్= శత్రుసమూహంపై; విలసత్+కోదండ, మౌర్వీ, మహా, స్వన, భిన్న+అఖిల, దిక్+విభాగుఁడు+అగుచున్= శోభిల్లే వింటి అల్లెత్రాటియొక్క గొప్పశబ్దంచేత చీల్చబడిన అన్నిదెసల విభాగాలు కలవాడు ఔతూ, తనవింటిఅల్లెత్రాటిమ్రోతచే దిక్కులు అన్నిటిని చిల్లులు పడేటట్లు చేసినవా డౌతూ; శాత+అస్త్ర, ధారా+అభిషేచన, పూత, ప్రతిపక్ష, సైన్యుఁడు+అగుచున్= వాడి అయిన మంత్రబాణవర్షంయొక్క తడుపుచేత పవిత్రాలైన విరోధిసేనలు కలవాడు ఔతూ; సంరంభ, దుర్వారతన్= ఉద్రేకం యొక్క వారింప శక్యంగామిచేత; ఉక్కునన్ మీఱెన్= బలంతో విజృంభించాడు.

తాత్పర్యం: ఆ మాటలు విని శ్రీరాముడు మాతలిని అభినందించాడు. పిదప శ్రీరాముడు ఆ రథాన్ని అధిరోహించాడు. శత్రుసమూహాలపై విజృంభించి తనవింటి అల్లెత్రాటి మ్రోతతో దెసలకొసలు చిల్లులుపడేటట్లు చేశాడు. ఆపజాలని ఉద్రేకంతో శత్రుసైన్యాలపై శరపరంపరలు వర్షించి ఆ వర్షధారలచేత వారిని పవిత్రులు అయ్యేటట్లుగా చేశాడు.

ఉ. **అత్తఱి రావణుండు విలయానలదుస్సహమూర్తియై నరేం**
ద్రోత్తముమీఁదఁ దేరు గడు నుగ్రగతిం బఱపించి సంతతో
ద్వృత్తశరప్రవాహపరివీతదిశాముఖుఁ డైనఁ జూచి పే
రుత్తలమంది రాతనిసముద్ధతికిన్ దివినుండి నిర్జరుల్. **149**

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= ఆ తరుణంలో; రావణుండు; విలయ+అనల, దుస్సహ, మూర్తి+ఐ= ప్రళయకాలంలోని అగ్నివలె సహించటానికి శక్యంకాని ఆకారం కలవాడై; నర+ఇంద్ర+ఉత్తముమీఁదన్= నరులలో శ్రేష్ఠుడు ఐన శ్రీరాముడిపై; తేరు= రథం; కడున్= మిక్కిలి; ఉగ్రగతిన్= భయంకరంగా; పఱపించి= నడిపించి; సంతత+ఉత్+వృత్త, శర, ప్రవాహ, పరివీత, దిశా, ముఖుఁడు+ఐనన్= ఎల్లప్పుడు గర్వించిన అతిశయించిన అమ్ములవెల్లువచేత చుట్టబడిన దెసల మొగాలు కలవాడు కాగా; ఎగతెగని, అతిశయించిన అమ్ముల వెల్లువచే చుట్టబడిన దిఙ్ముఖాలు కలవాడుకాగా, చూచి= అరసి; దివినుండి= స్వర్గంనుండి; నిర్జరుల్= దేవతలు; ఆతని సమ్+ఉద్ధతికిన్= రావణుడియొక్క మిక్కుటమైన విజృంభణకు; పేరు+ఉత్తలము+అందిరి= గొప్పతత్తరపాటును చెందారు.

తాత్పర్యం: ఆ రణంలో రావణుడు విజృంభించాడు. అతడు ప్రళయకాలంలోని అగ్నివంటి ఆకారంతో తేజరిల్లాడు. తన రథాన్ని భయంకరవేగంతో నరోత్తము డైన శ్రీరాముడిపైకి నడిపించాడు. అతిశయించే పైకెగిరే వెల్లువవలె అమ్ముల పరంపరలు ప్రయోగించి దిఙ్ముఖాలను కప్పాడు. దివినుండి రావణుడి విజృంభణం గమనించిన దేవతలు మిక్కుటమైన ఆతురతను ఆవేదనను అనుభవించారు.

వ. **ఇట్లు దలపడి రామరావణు లతిఘోరంబుగాఁ బోరం దొడంగి; రంతఁ బంక్తివదనుండు నిబిడజ్వాలాకరాళం బగు శూలంబు రాఘవుమీఁదం బ్రయోగించిన, నతండును నడుమన దానిఁ దునియలు సేసిన, నీసునం బెఱిఁగి సురవైరి మఱియునుం దరతరంబ శతసహస్రసంఖ్యల శూలంబులు భిండివాలంబులుఁ దోమరంబులు శరంబులుం బఱఁగించి యంబరంబెల్ల నస్త్రమయంబుఁ గావించిన నఖిలభూతంబులును హాహాకారవ్యాకులంబు లయ్యె; నసురసైన్యంబున భేరీప్రముఖతూర్యనినదంబులు సింహనాదంబులు సెలంగెఁ; గొండొకసేపునకు రావణప్రయుక్తం బయిన శస్త్రాస్త్రదహనం బంతయు నిరంతరవిశిఖధారాసారంబునం గబళించి రామజలధరంబు గంభీరసారంబునం బొదలుటయు సకలప్లవంగసముదయంబును బ్రహర్ష కోలాహలబహుళం బయ్యెఁ; బదంపడి.** **150**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్లు= ఈరీతిగా; తలపడి= మార్కొని; రామరావణులు= రాముడును రావణుడును; అతిఘోరంబుగాన్= మిక్కిలి భయంకరంగా; పోరన్+తొడంగిరి= యుద్ధం చేయసాగారు; అంతన్= ఆ సమయంలో; పంక్తివదనుండు= రావణుడు; నిబిడ, జ్వాలా, కరాళంబు+అగు= దట్టమైన అగ్నిశిఖలచేత భయానకమైనది అయిన; శూలంబు= ఈటె; రాఘవుమీఁదన్= శ్రీరాముడిపయి; ప్రయోగించినన్= వేయగా; అతండును= శ్రీరాముడును; దానిన్= ఆ శూలాన్ని; నడుమన= మార్గమధ్యంలోనే; తునియలు, చేసినన్= ముక్కలుగా ఖండించగా; ఈసునన్= మాత్సర్యంతో; పెరిఁగి= అతిశయించి; సురవైరి= వేల్పులవిరోధి రావణుడు; మఱియునున్= వెండియును; తరతరంబు+అ= వరుసవరుసలుగా, పరంపరలుగా; శతసహస్రసంఖ్యలన్= వందలు వేలకొలదిగా, లెక్కకు మిక్కిలిగా, శూలంబులు= ఈటెలు; భిండివాలంబులున్= నాళికాస్త్రాలును (వడిసెలవలె ఉండే ఆయుధవిశేషాలు); తోమరములున్= చిల్లకోలలును; శరంబులున్= అమ్ములును; పఱఁగించి= ప్రయోగించి; అంబరంబు+ఎల్లన్= ఆకసం అంతటిని; అస్త్రమయంబున్+కావించినన్= అస్త్రాలతో నిండేటట్లు చేసిన; అఖిలభూతంబులును= సమస్తభూతాలును; హాహాకారవ్యాకులంబులు= హాహాకారాలు చేస్తూ కలతచెందినవి; అయ్యెన్= అయ్యాయి; అసురసైన్యంబునన్= రాక్షసులసేనలో; భేరీప్రముఖతూర్యనినదంబులు= దుందుభి మున్నగు పటహాల చప్పుడులు; సింహనాదంబులు; చెలంగెన్= ధ్వనించాయి; కొండొకసేపునకున్= కొంతతడవుకు; రావణప్రయుక్తంబు+అయిన= రావణుడిచేత ప్రయోగించబడిన; శస్త్ర+అస్త్ర, దహనంబు+ అంతయున్= శస్త్రాలయొక్కయు, మంత్రమహిమగల అస్త్రాలయొక్కయు అగ్ని సమస్తమున్నూ; నిరంతర, విశిఖ, ధారాసారంబునన్= ఎడతెగక కురిసే బాణవర్షాలవెల్లువచేత; కబళించి= మ్రింగి; రామజలధరంబు= రాముడు అనే మేఘం; గంభీరసారంబునన్= మిక్కిలి విక్రమంతో; పొదలుటయున్= అతిశయించిందికాగా; సకల, ప్లవంగ, సముదయంబును= సమస్త మైన వానరసమూహాలును; ప్రహర్ష, కోలాహల, బహుళంబు+అయ్యెన్= మిక్కుటమైన సంతోషంతో కూడిన పెద్దకలకలంతో నిండింది అయింది. పదంపడి= అటు పిమ్మట.

తాత్పర్యం: ఈ విధంగా మార్కొనిన రాముడికి రావణుడికి భయంకరమైన యుద్ధం జరిగింది. రావణుడు దట్టమైన అగ్నిశిఖలచేత ఆవరించబడిన శూలాన్ని రాముడిపై విసరగా, రాముడు దానిని మార్గమధ్యంలోనే ముక్కలు ముక్కలుగా ఖండించాడు. అంతట మాత్సర్యంతో అతిశయించి రావణుడు ఆగకుండా వరుసగా కొన్నివందలవేలు శూలాలు, నాళికాస్త్రాలు, చిల్లకోలలు, బాణాలు ప్రయోగించి ఆకసాన్ని అంతటిని శస్త్రాలతో అస్త్రాలతో కప్పాడు. అప్పుడు అఖిలభూతాలున్నూ కలతచెంది హాహాకారాలు చేశాయి. రావణుడి పరాక్రమాన్ని కాంచి రాక్షససేనలు దుందుభులు పటహాలు మున్నగు వాద్యాలను మ్రోగించి తమ సంతోషాన్ని ప్రకటించాయి; సింహనాదాలు చేశాయి. కొంతసేపటికి, రావణుడు ప్రయోగించిన అస్త్రశస్త్రాలకు సంబంధించిన కార్చిచ్చునంతటినీ తన సంతతబాణపరంపరల వృష్టిచే చల్లార్చి రాముడు అనే మేఘుడు అవక్ర విక్రమంతో అతిశయించాడు. అంతట శ్రీరామునిఅత్యద్భుత పరాక్రమ చాకచక్యానికి మిక్కుటమైన ఆనందాన్ని చెందిన వానరసేనల కోలాహలం మిన్నుముట్టింది. ఆ పిమ్మట.

విశేషం: (1) అలం: రూపకం. రాముడికి మేఘానికి, రావణబాణాలపరంపరకు అగ్నికి, రామబాణాలకూ మేఘవృష్టికి అభేదాధ్యవసాయం నిరూపించబడింది. 'గంభీరసంరంభంబునన్' - అనే పాఠం కొన్ని ప్రతులలో ఉన్నది.

శ్రీరాముఁడు రావణాసురుని సంహరించుట (సం. 3-274-24)

సీ. **కమనీయకనకపుంఖప్రభాభాసియుఁ । దీక్ష్ణముఖంబును దివిజయక్ష**
మునిసిద్ధసాధ్యసమ్మోదావహంబు నై । విలసిల్లు బాణ మవ్వీరవరుఁడు

గైకొని బ్రహ్మాస్త్రకలితమంత్రాభియు । క్తంబుగా నొనరించి కార్ముకమున
సంధించి జగములు జయపెట్టఁ జెచ్చెరఁ । దివిచి యేయుటయును దీవ్రభంగిఁ

ఆ. గడఁగి యాశరంబు గల్పాంతవహ్నియ । పోలెఁ బంక్తికంఠుఁ బొదివి నీఱు
గా నొనర్చె సూతఘన రథరథ్య స । మన్వితముగ నొక్కమాత్రలోన. 151

ప్రతిపదార్థం: ఆ+వీరవరుఁడు= వీరులలో శ్రేష్ఠుడు అయిన ఆ శ్రీరాముడు; కమనీయ, కనక, పుంఖ, ప్రభా, భాసియున్= అందమైన బంగారుపింజలకాంతిచేత ప్రకాశించేదియున్నూ; తీక్ష్ణముఖంబును= వాడి అయిన ముందుకొన కలిగినదియున్నూ; దివిజ, యక్ష, ముని, సిద్ధ, సాధ్య, సమ్మోద+ఆవహంబును+ఐ= వేల్పులకు, జక్కులకు, ఋషులకు, వేల్పులజాతికి చెందిన సిద్ధులకును సాధ్యులకును మిక్కుటంగా సంతసాన్ని చేకూర్చేదిన్నీ+అయి; విలసిల్లు= శోభిల్లు; బాణము= అమ్ము; కైకొని= చేతబూని; బ్రహ్మ+అస్త్ర, కలిత, మంత్ర+అభియుక్తంబుగాన్= బ్రహ్మకు సంబంధించిన మంత్రమహిమతో కూడిఉండేటట్లుగా; ఒనరించి= చేసి; కార్ముకమునన్= ధనుస్సును; సంధించి= ఎక్కుపెట్టి; జగములు= లోకాలు; జయ+పెట్టన్= జయజయధ్వానాలు సలుపగా; చెచ్చెరన్= వేగంగా; తివిచి= అల్లెత్రాటిని వెనుకకు లాగి; ఏయుటయును= ప్రయోగించటంచేత; తీవ్రభంగిన్= త్వరితరీతిగా; కడఁగి= పూని; ఆ శరంబు= ఆ బాణం; కల్ప+అంత, వహ్ని+అ+పోలెన్= ప్రళయసమయంలోని అగ్నివలె; పంక్తికంఠున్= పదికంఠాలు కలవాడిని, రావణుడిని; పొదివి= క్రమ్మి; సూత, ఘనరథరథ్య, సమన్వితముగన్= సారథితో గొప్పతేరితో అశ్వాలతోపాటుగా; ఒక్కమాత్రలోనన్= ఒక్కక్షణంలోనే; నీఱుగాన్= బూదిఅయ్యేటట్లుగా; ఒనర్చెన్= చేసింది.

తాత్పర్యం: శ్రీరాముడు బ్రహ్మాస్త్రాన్ని సంధించి ఒక్కత్రుటిలో రావణుడిని బుగ్గిచేశాడు. అందమైన బంగారుపింజలచేత దేదీప్యమానంగా ప్రకాశించేది, వాడిఅయిన కొన గలిగింది, వేల్పులజాతివారైన సిద్ధులు, సాధ్యులు, యక్షులు, ఋషులు సంతోషించేది అయిన అమ్మును వీరవరుడు అయిన శ్రీరాముడు బ్రహ్మాస్త్రమంత్రంతో జోడించి, వింటికి తొడిగి అల్లెత్రాటిని వెనుకకు లాగి వేగంగా ప్రయోగించాడు. ఆ బాణం ప్రళయకాలంలోని అగ్నివలె దశకంఠుడైన రావణుడిని క్రమ్మి, సారథి, రథం అశ్వాలతోపాటుగా ఒక్కక్షణంలో అతడిని బుగ్గికావించింది. జగములన్నీ జయజయధ్వానాలు చేశాయి.

విశేషం: అలం: ఉపమ.

వ. అప్పు డంబరంబున దివ్యతూర్యనాదంబులు సెలంగం గలంగి యసురు లెల్లఁ దొలంగిరి; గంధర్వగానంబులు నప్సరోనర్తనంబులుఁబ్రవర్తిల్లె; నింద్రాదిదేవోత్తము లన్నరదేవోత్తముం బ్రస్తుతించుచుం బ్రమోదంబు నొందిరి.152

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; అంబరంబునన్= ఆకసంలో; దివ్యతూర్యనాదంబులు= దేవతలకు సంబంధించిన పటహాలు మున్నగు వాద్యధ్వనులు; చెలంగన్= అతిశయించగా; అసురులు= రాక్షసులు; కలంగి= కలతచెంది; ఎల్లన్= అందరు; తొలంగిరి= అచటినుండి దూరంగా వెళ్ళారు; గంధర్వగానంబులున్= గంధర్వుల సంగీతాలు; అప్సరస్+నర్తనంబులున్= దేవకన్యల నృత్యాలు; ప్రవర్తిల్లెన్= జరిగాయి; ఇంద్ర+ఆది, దేవ+ఉత్తములు= ఇంద్రుడు మున్నగు వేలుపుపెద్దలు; ఆ నర, దేవ+ఉత్తమున్= ఆ మనుజాధిపులలో శ్రేష్ఠుడిని, శ్రీరాముడిని; ప్రస్తుతించుచున్= పొగడుతూ; ప్రమోదంబున్+ఒందిరి= సంతోషం అనుభవించారు.

తాత్పర్యం: రావణుడు మరణించిన సమయంలో ఆకసాన దేవదుందుభులు మంగళతూర్యరావాలు చెలరేగాయి. రాక్షసులు ఖిన్ను లయి యుద్ధభూమిని వీడి వెడలిపోయారు. గంధర్వులు గానం చేశారు. అప్సరసలు నాట్యం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేశారు. ఇంద్రుడు మున్నగు వేలుపుదొరలు నరనాథులలో శ్రేష్ఠుడు అయిన శ్రీరాముడిని పొగడుతూ ఆనందం పొందారు.

క. ఏకోత్సవంబు లయ్యెఁ ద్రి। లోకంబులు నఖిలలోకలుంటాకుఁడు ఘో
రాకారుఁడు దశవదనుఁడు। గాకుత్స్థనిశాతశరముఖంబునఁ బడినన్. 153

ప్రతిపదార్థం: అఖిల, లోక, లుంటాకుఁడు= సమస్తలోకాలను దోచుకొన్నవాఁడు; ఘోర+ఆకారుఁడు= భయానకమైన రూపం కలవాఁడు; దశవదనుఁడు= రావణుడు; కాకుత్స్థ, నిశాత, శర, ముఖంబునన్= కకుత్స్థవంశజుడియొక్క; (శ్రీరాముడియొక్క) వాడి బాణంవాత; పడినన్= పడటంచేత అనగా శ్రీరాముడిచేత రావణుడు సంహరించబడటంచేత; త్రిలోకంబులు= మూడుజగత్తులు; ఏక+ఉత్సవంబులు+అయ్యెన్= ఒకేసారి పండుగ జరుపుకొనేవి అయ్యాయి.

తాత్పర్యం: అఖిలలోక కంటకుడు అయిన రావణుడు శ్రీరాముడిచేత సంహరించబడటంచేత, మూడులోకాలూ సంతోషించి, ఒకేసారి పండుగ జరుపుకొన్నాయి.

ఉ. అంత ననంతకీర్తి శరణాగతరక్షణశాలి రాఘవుం
డెంతయు వేడ్కతోడ నసురేంద్రపదంబున నవ్విభీషణున్
సంతతపుణ్యుఁ బుణ్యజనసంతతివర్ధనుఁ గట్టెఁ బట్ట మ
త్యంతదయాంతరంగుఁడు గృతాహితభంగుఁడు దానుఁ దమ్ముఁడున్. 154

ప్రతిపదార్థం: అంతన్= ఆ సమయంలో; అనంతకీర్తి= అనంతమైన అనగా విస్తారమైన యశస్సు కలవాడు; శరణ+ఆగత, రక్షణశాలి= అభయం కోరి ఆశ్రయించినవారిని కాపాడడంచే ఒప్పే; అత్యంత దయా+అంతరంగుఁడు= మిక్కుటమైన కృపతో నిండిన హృదయం కలవాడు; కృత+అహిత, భంగుఁడు= శత్రువులకు అవమానం చేసేవాడు. రాఘవుండు= శ్రీరాముడు; తానున్= తాను (శ్రీరాముడు); తమ్ముఁడున్= అనుజుడును; ఎంతయున్= మిక్కుటమైన; వేడ్కతోడన్= సంతోషంతో; అసుర+ఇంద్రపదంబునన్= రాక్షసరాజు పదవిలో; ఆ+విభీషణున్; సంతతపుణ్యున్= ఎల్లప్పుడున్నూ సుకృతం చేసేవాడిని; పుణ్య, జన, సంతతి, వర్ధనున్= రాక్షస సముదాయాన్ని అభివృద్ధిచేసేవాడిని; పట్టము+కట్టెన్= పట్టాభిషేక సింహాసనంపై ఆసీనుడిని చేసి పట్టంకట్టాడు.

తాత్పర్యం: అంతట, విస్తారమైన కీర్తిని ఆర్జించినవాడు, శరణు వేడినవారిని కాపాడడంచేత ఒప్పేవాడు, దయ నిండిన హృదయం కలవాడు, శత్రువులను నిర్జించేవాడు అయిన శ్రీరాముడు తన తమ్ముడితో కూడి, మిక్కిలి సంతోషంతో లంకాపట్టణానికి రాజుగా, రాక్షసులకు ప్రభువుగా పుణ్యాత్ముడూ, రాక్షస సమూహాన్ని పెంపొందించే వాడూ అయిన విభీషణుడికి పట్టం కట్టాడు.

విశేషం: రాజ్యారంభసూచకం పట్టాభిషేకం. అది రాజు సింహాసనాన్ని అధిష్ఠించేసమయం. పట్టం అనగా రాజలాంఛన మైన పట్టు నూలు. దానిని కట్టటం, పుణ్యనదులతీర్థం శిరస్సున చల్లటం (అభిషేకించటం) పట్టాభిషేకం లేక పట్టంకట్టటం.

వ. తదనంతరంబ యవిన్ధ్యుండు విభీషణసహితుండై జానకి నుచితయానంబున నునిచికొని రామదేవు పాలికిం దెచ్చి 'దేవా! దేవిం బరిగ్రహింపు' మని విన్నవించిన నతండు. 155

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట; అవింధ్యుండు= అవింధ్యుడు (సీతాదేవిని రావణుడు సంహరించకుండగ కాపాడిన ముసలి రక్కసుడు); విభీషణసహితుండు+ఐ= విభీషణుడితో కూడినవాడయి; జానకిన్= సీతను; ఉచితయానంబునన్= తగినవాహనంలో; ఉనిచికొని= (ఆసీననుచేసి) ఉంచి; రామదేవుపాలికిన్= శ్రీరామచంద్రునియొద్దకు; తెచ్చి= తీసికొని వచ్చి; దేవా!= ప్రభూ!; దేవిన్= దేవిని; పరిగ్రహింపుము= కైకొనుము; అని= అని చెప్పి; విన్నవించినన్= వినయంగా ప్రార్థించగా; అతండు= అతడు- శ్రీరాముడు.

తాత్పర్యం: అటుపిమ్మట అవింధ్యుడు విభీషణుడితోపాటు సీతాదేవిని సగౌరవంగా సముచితవాహనంమీద ఉంచి శ్రీరామదేవుడికడకు తీసికొని వచ్చి, 'దేవా! దేవిని పరిగ్రహించుము' అని సగౌరవంగా విన్నవించాడు.

చ. **అతిమలినాంగి జీర్ణమలినాంబరధారిణి సంతతాశ్రుపం**
కితవిలసత్కపోలఁ బరికీర్ణజటాయితకేశభార నా
యతఘనదుఃఖదూషితఁ బ్రియాంగనఁ గన్గొని యప్రియాత్ముఁడై
నుతచరితుండు దద్దయు మనోవ్యథ సేయుచు నింతి కిట్లనున్. **156**

ప్రతిపదార్థం: అతిమలిన+అంగి= మిక్కిలి మాసిన శరీరం కలదానిని; జీర్ణ, మలిన+అంబర, ధారిణి= చినిగినట్టి మాసినట్టి బట్టలు ధరించినదానిని; సంతత+అశ్రు, పంకిత, విలసత్+కపోలన్= ఎల్లప్పుడూ స్రవించిన కన్నీటిచేత మలినపడినప్పటికీ, శోభిల్లుతున్న చెక్కిళ్లు కలదానిని; పరికీర్ణజటాయిత కేశభారన్= ఇటునటు చెదరి జడలుకట్టిన జుట్టుముడి కలదానిని; ఆయతఘనదుఃఖ దూషితన్= మిక్కిలి గొప్పది అయిన శోకంచేత బాధించబడినదానిని; ప్రియ+అంగనన్= భార్యను; కన్గొని= చూచి; అప్రియ+ఆత్ముఁడు+ఐ= కఠినమైన మనస్సు కలవాడై; నుతచరితుండు= ప్రస్తుతించబడిన నడవడి కలవాడు శ్రీరాముడు; తద్దయున్= మిక్కుటంగా; మనోవ్యథ= మనస్+వ్యథ= చిత్తానికిబాధ; చేయుచున్= కలిగిస్తూ; ఇంతికిన్= భామకు, సీతకు; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: మిక్కుటంగా మాసిన శరీరం కలదానిని, చినిగిపోయినట్టి మాసినట్టి వస్త్రం తాల్చినదానిని; ఎల్లప్పుడును కన్నీరు కార్చటంచేత చెక్కిళ్లపై ఏర్పడిన చారికలు కలదానిని, చిక్కువడి జడలుగా అల్లుకొనిన జుట్టుముడి కలదానిని; చిరకాలం దుఃఖభారంచేత వేగినదానిని, తనకు ప్రియమైన భార్యయైన సీతాదేవిని చూచి, ప్రస్తుతించబడిన నడవడి కలవాడైన శ్రీరాముడు కఠినాత్ముడై ఆమెకు మిక్కుట మైన చిత్తతాపం కలిగించే రీతిలో ఈవిధంగా పలికాడు.

విశేషం: స్థూలదృష్టికి ఈ పద్యంలో పరస్పరవ్యాఘాతాలైన కొన్ని అంశాలు కన్పించవచ్చును. శ్రీరాముడు నుతచరితుడుకదా; సీతాదేవిస్వరూపమే ఆమె పాతివ్రత్యానికి నిర్వికల్పమైన సాక్ష్యంగదా; ఇక శ్రీరాముడు ప్రియాంగనతో అప్రియవాక్యాలు ఎందుకు పల్కాడు? సమాధానంకొరకు తరువాతి పద్యాలు అనుశీలించవచ్చును.

సీ. **'అధికదుష్టాచారుఁ డైన దశాననుఁ । డింతకాలము తనయింటఁ బెట్టి**
కొనియున్న నిన్నుఁ గైకొనిన నస్మచ్చరి । త్రమునకుఁ దొడరదే ధర్మహాని?
పరిభవంబునకునై ప్రతికారముగ వైరిఁ । గూల్చితిఁ గాని నీకొఱకుఁ గాదు;
మెలఁత! నీ చరితంబు మేలైనఁ గీడైనఁ । గానిమ్ము, నిన్ను నిక్కముగ నొల్లఁ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. బరఁగఁ గుక్కవాతఁ బడిన హవ్యముభంగి । యయ్యె నీ తెఱంగు నరయ నిపుడు;
గాన యిచటఁ దడయఁ గాదు; చెచ్చెర నీకు । నిష్టమయిన యెడకు నేఁగు మతివ!' 157

ప్రతిపదార్థం: అతివ!= వనితా! ఓ సీతా! అధిక, దుష్ట+ఆచారుఁడు+ఐన= మిక్కిలి చెడ్డప్రవర్తన కలవాడైన; దశ+ఆననుఁడు= పదిమొగాలు కలవాడు- రావణుడు; ఇంతకాలము; తన+ఇంటన్= తన గృహంలో; పెట్టికొని+ఉన్న= పెట్టుకొని ఉంచిన; నిన్నున్= ఓ సీతా! నిన్ను; కైకొనినన్= స్వీకరిస్తే; అస్మత్+చరిత్రమునకున్= నా నడవడికి; ధర్మహాని= ధర్మానికి కీడు; తొడరదే?= ఏర్పడదా (ఏర్పడుతుంది); పరిభవంబునకున్+ఐ= (నాకు జరిగిన) అవమానానికి; ప్రతికారముగన్= మారుచేతగా; వైరిన్= శత్రువును; కూల్చితిన్= సంహరించాను; కాని= కాని; నీ కొఱకున్+కాదు= నీకోసమై కాదు; మెలఁత!= ఓ వనితా! (సీతా); నీ చరితంబు= నీ నడవడి; మేలు+ఐనన్= మంచిది అయిననూ; కీడు+ఐనన్= చెడుది అయినను; కానిమ్ము= కావచ్చును కాని; నిన్నున్= నిన్ను; నిక్కముగన్= నిజంగా; ఒల్లన్= అంగీకరించను (పరిగ్రహించజాలను); పరఁగన్= ఒప్పిదంగా; కుక్కవాతన్= కుక్క నోటిలో; పడిన= పడిన; హవ్యముభంగిన్= హోమద్రవ్యం వలె; ఇపుడు= ఈ సమయంలో; నీతెఱంగు= నీ విధం; అయ్యెన్= అయింది; కాన= కావున; ఇచటన్= ఈ స్థలంలో; తడయన్+కాదు= ఆలస్యంచేయటం మంచిది కాదు; నీకున్= నీకు; ఇష్టము+అయిన, ఎడకున్= ఇచ్చవచ్చినస్థలానికి; చెచ్చెరన్= వేగంగా; ఏగుము= వెళ్ళుము.

తాత్పర్యం: 'ఓ సీతాదేవీ! మిక్కిలి చెడునడవడి గల రావణుడిగృహంలో నీవు ఉన్నావు. అందుచేత నేను నిన్ను పరిగ్రహించజాలను. నిన్ను నేను స్వీకరిస్తే నా నడవడికి కళంకం ఏర్పడుతుంది. ధర్మానికి కీడు కలుగుతుంది. శత్రువైన రావణాసురుడిని సంహరించటం నాకు జరిగిన పరాభవాన్ని మాపుకొనటానికే కాని నీ కొరకు కాదు. నీ ప్రవర్తన మంచిదే కావచ్చును; మరి చెడ్డదే కావచ్చును. ఏదైనా, నేను నిన్ను అంగీకరింపజాలను. ఇది నిజం. కుక్కముట్టుకొనిన హోమద్రవ్యంవలె అయింది నీ సంగతి. అందుచేత ఇంక నీవు ఇక్కడ తడయరాదు. నీ ఇచ్చవచ్చిన స్థలానికి పొమ్ము.'

ఆ. అనినఁ జెవులఁ గొఱవి గొని చూఁడినట్లైనఁ । దాల్మి పెల్లగిల్లఁ దరళనయన
మొదలు నఱక నొఱగు కదళిచందంబున । నెలఁత దల్లడమున నేల వ్రాలె. 158

ప్రతిపదార్థం: అనినన్= అని శ్రీరాముడు పలుకగా; చెవులన్= చెవులలో; కొఱవి= మండేకట్టె; కొని= కైకొని; చూఁడినట్లు+ఐనన్= కాల్చినట్లుగా కాగా; తాల్మి= ఓర్పు; పెల్లగిల్లన్= పెరికివేసినట్లుగా తొలగగా; తరళనయన= కన్నీటితో చలిస్తున్న కన్నులుకల; మొదలు= మూలం (ప్రకాండంలో మొదటిభాగం); నఱకన్= ఖండించగా; ఒఱగు= వ్రాలే; కదళిచందంబునన్= అరటిచెట్టు మాదిరిగా; నెలఁత= వనిత - సీత; తల్లడమునన్= ఆరాటంతో; నేలన్= భూమిపై; వ్రాలెన్= కూలింది.

తాత్పర్యం: శ్రీరాముడు ఆరీతిగా నిష్ఠురవచనాలు పలుకగా సీతాదేవికి చెవులలో కొఱవికొని గ్రుచ్చినట్లు అనిపించింది. ఆమె ఓర్పును కోలుపోయి, కన్నీరు కారుస్తూ, మొదలు నరకిన అరటిచెట్టువలె తత్తరపాటుతో నేలపై వ్రాలిపోయింది.

విశేషం: అలం: ఉపమ.

క. వెఱఁగుపడి హర్షరాగము । తఱిఁగిన వెలువెల్లనై వదనములు వ్రాలం
దెఱఁగేది టిచ్చపడి ర । త్తఱిఁ దత్పరిజనము లెల్లఁ దద్దయు వంతన్. 159

ప్రతిపదార్థం: అత్తఱిన్= ఆతరుణంలో; తత్+పరిజనములు+ఎల్లన్= ఆతని పరిజనులందరును; తద్దయు వంతన్= మిక్కుటమైన ఆవేదనతో; వెఱఁగుపడి= ఆశ్చర్యపడి; హర్షరాగము= సంతోషంయొక్క ఎఱుపురంగు; తఱిఁగినన్= తగ్గిపోగా; వెలువెల్లనై= పాలిపోయి తెల్లబడి; వదనములు= మొగాలు; వ్రాలన్= ఒరగగా; తెఱఁగు+ఏది= ఏం చేయాలో తోచక; ఱిచ్చపడిరి= కొయ్యబారారు.

తాత్పర్యం: ఆ తరుణంలో అచ్చటిసైనికులు అందరును, రాముడిమాటలు విని అచ్చెరువుపొంది, సంతోషవర్ణం తరిగి, మొగాలు వెలవెలబోయి, ఏంచేయాలో తోచక మిక్కుటమైన ఆవేదనతో కొయ్యబారారు.

విశేషం: అలం: స్వభావోక్తి.

తే. **పడఁతి యల్లన మఱికొంతవడికిఁ దెలిసి । యలసమూర్తియై దందడి నశ్రు లురులఁ**
గేలు ముకుళించి వసుమతీపాలుఁ జూచి । యెలుఁగు గుత్తుకఁ దగులంగ నిట్టు లనియె. **160**

ప్రతిపదార్థం: పడఁతి= వనిత - సీతాదేవి; అల్లనన్= మెలమెల్లగా; మఱి, కొంత, వడికిన్= మఱికొంతసేపటికి; తెలిసి= స్పృహ వచ్చి; అలసమూర్తి+ఐ= కదలజాలని శరీరంతో; దందడిన్= వేగంగా; అశ్రులు= కన్నీటిబిందువులు; ఉరులన్= వేగంగా స్రవింపగా; కేలు= చేయి; ముకుళించి= జోడించి; వసుమతీపాలున్= రాజును - శ్రీరాముడిని; చూచి= కాంచి; ఎలుఁగు= స్వరం; కుత్తుకన్+తగులంగన్= కంఠంలోపలి భాగాన్ని తాకగా (డగ్గుత్తికవడ); ఇట్టులు+అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: సీతాదేవి కొంతసేపటికి స్పృహ తెచ్చుకొని, కదలజాలని శరీరంతో కన్నీటిబిందువులు జారుతుండగా చేతులు జోడించి ప్రభువు అయిన శ్రీరామచంద్రుడితో డగ్గుత్తికవడిన స్వరంతో ఈవిధంగా పలికింది.

విశేషం: స్వభావోక్తి.

క. **'నినుఁ గీడు వొరయకుండఁగ, । జనులకు నా నిక్క మెక్క జననాయక! యే**
ననలంబుఁ జొచ్చి వెడలెదఁ; । గనుఁగొను; మిచ్చనవు నాకుఁ గరుణింపు దగన్. **161**

ప్రతిపదార్థం: జననాయక!= ప్రజలకు ఏలికవైన వాడా, శ్రీరామా!; నినున్= నిన్ను; కీడు+పొరయకుండఁగన్= హాని చుట్టుకొనకుండా; జనులకున్= ప్రజలకు; నానిక్కము+ఎక్కన్= నాగురించిన సత్యం తెలిసేటట్లుగా; ఏన్= నేను; అనలంబున్= అగ్నిలో; చొచ్చి= ప్రవేశించి; వెడలెదన్= వెళ్ళుతాను; కనుఁగొనుము= చూడుము; ఇచ్చనవు= (ఈ+చనవు) ఈ కోరిక; తగన్= ఒప్పిదంగా; నాకున్= నాకు; కరుణింపు= దయతో ప్రసాదించుము.

తాత్పర్యం: 'ప్రజలకు ప్రభువైన ఓ రామా! ధర్మహాని నిన్ను చెందకుండగా, ప్రజలకు నాదైన సత్యం తేటతెల్లం అయ్యేటట్లు నేను అగ్నిప్రవేశం చేస్తాను. దయచేసి ఈ కోరికను నాకు ప్రసాదించుము.

విశేషం: 'అనలంబున్ చొచ్చి వెడలెదను; కనుగొనుము' అని సీత పలికిన మాటలు సార్థకాలు. వెడలెదను- అంటే వెళ్ళుతానని ఒక అర్థం, అంటే చనిపోతాను అని తాత్పర్యం. వెడలెదను- అంటే అగ్నినుండి తిరిగివస్తాను, బ్రతికి బయటపడతాను- అని మరొక అర్థం. అలాగే కనుగొనుము: చూడుము, అనిన్నీ, పరీక్షించుము అనిన్నీ అర్థా లేర్పడతాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంతేకాదు, శ్రీరాముడికి అపకీర్తి రాకుండా సీత అగ్నిలో ప్రవేశిస్తుందనీ, ఆమె పాతివ్రత్యం నిరూపించుకొనేటట్లుగా అగ్నినుండి నిరపాయంగా తిరిగివస్తుందనీ భావం ఏర్పడుతున్నది. సీతాదేవి మాటలు సత్యమైనవని, అబద్ధాలు కావని ఈ వాక్యచమత్కృతి సార్థక్యం.

ఉ. నాదగుబుద్ధి నీదు చరణస్మరణంబ యొనర్చుఁ గాని యొం
డేదియు నెన్నఁడుం దలఁప; దిట్టిద; యొండొకచందమైన ని
మ్మేదినియుం గృశానుఁడు సమీరుఁడు శీతకరుండు నర్కుఁడుం
గా దన కీక్షణంబ ననుఁ గాల్పరె; వేల్పులు చెట్ట సైతురే?' 162

ప్రతిపదార్థం: నాది+అగుబుద్ధి= నా చిత్తం; నీదు= నీయొక్క; చరణస్మరణంబు+అ= పాదాలను తలపోయటం మాత్రమే; ఒనర్చున్+కాని= చేస్తుందికాని; ఒండు+ఏదియున్= ఇంకదేనిని; ఎన్నఁడున్= ఏ సమయంలోనూ; తలఁపదు= స్మరించదు; ఇట్టిది+అ= ఇదియే సుమా; ఒండు+ఒక, చందము+ఐనన్= ఇంకొక విధంగా జరిగితే; ఈ+మేదినియున్= ఈ భూమి; కృశానుఁడున్= అగ్నిదేవుడు; సమీరుఁడున్= వాయుదేవుడును; శీతకరుండున్= చంద్రుడును; అర్కుఁడున్= సూర్యుడును; కాదు+అనక= అంగీకరించక; ననున్= నన్ను; కాల్పరె= కాల్పరె, దహించివేయరా? (దహించివేయగలరు); వేల్పులు= దేవతలు; చెట్ట= చెడ్డతనాన్ని; సైతురే= ఓర్చెదరా? (ఓర్వరు).

తాత్పర్యం: నామనస్సు ఎల్లప్పుడును నీ పాదాలను స్మరించేదే కాని వేరొండువిధం కాదు. నాకు వేరొక స్మరణమే లేదు. ఈ మాటకు పంచభూతాలు సాక్షులు. వేరొక చందమైనట్లయితే ఈ భూదేవి, అగ్నిదేవుడు, వాయుదేవుడు, చంద్రుడు, సూర్యుడు నన్ను ఈక్షణంలో దహించివేస్తారు. దేవతలు చెడుగును సైరింపరు కదా!'

విశేషం: (1) అలం: అర్థాంతరన్యాసం. (2) ఈ పద్యాన్ని వ్రాసింది ఎఱ్ఱనమహాకవి. ఆతడు తాను అరణ్యపర్వశేషాన్ని నన్నయపేరుమీదనే' తత్కవితారీతియుకొంతదోప' వ్రాశా నన్నట్లు చెప్పుకొన్నాడు. అందుచేత అతడు బుద్ధిపూర్వకంగానే నన్నయను అనుకరించాడు. ఇట్టి అనుకరణ సుస్పష్టంగా ఈ పద్యంలో చూడవచ్చును. నలోపాఖ్యానంలో ఇట్టి సన్నివేశంలో నలుడు దమయంతిశీలాన్ని శంకించినప్పుడు దమయంతి చెప్పిన సమాధానం- నన్నయవ్రాసిన పద్యం ఉదాహరించవనగును. (చూడండి. “ఏనతి పాపభావమును నెగ్గు దలంపక” - అనే పద్యం. ఆరణ్య. 2.215)

వ. అని పలుకుటయు నప్పుడు పృథివ్యాదిభూతంబు లెలుంగులు సెలంగ నెల్లవారును వినం దమదమ నామంబు లెఱింగించి యి ట్లనిరి. 163

ప్రతిపదార్థం: అని, పలుకుటయున్= అని సీత చెప్పగా; అప్పుడు= ఆ సమయంలో; పృథివీ+ఆది భూతంబులు= భూమి మున్నగు భూతాలు; ఎలుంగులు+చెలంగన్= కంఠస్వరాలు ధ్వనించగా; ఎల్లవారును= అందరును; వినన్= ఆలకించగా; తమతమనామంబులు= తమతమపేర్లు; ఎఱింగించి= తెలిపి; ఇట్లు+అనిరి= ఈ విధంగా పలికారు.

తాత్పర్యం: సీతాదేవి ఆ విధంగా పంచభూతాలను సాక్ష్యాలుగా పేర్కొని చెప్పగా, భూమి మున్నగు పంచభూతాలు తమతమనామాలు చెప్పి, అందరును ఆలకించగా ఈ విధంగా వచించాయి.

విశేషం: పంచభూతాలు 1. భూమి 2. ఆకాశం 3. నీరు 4. వాయువు 5. అగ్ని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'విను ముత్తమురాలు సుమీ । జననాయక! జనకతనయ; సందేహపడం
బనిలేదు మాకుఁ దెల్లము; । జనులకు మము మొఱఁగరాదు సకలక్రియలన్. 164

ప్రతిపదార్థం: జననాయక!= ప్రజలకు నాయకుడవైన ప్రభూ!; వినుము= ఆలకించుము; జనకతనయ= జనకుడికూతురు సీతాదేవి; ఉత్తమురాలు+చుమీ= మంచి ఇల్లాలు సుమా; సందేహము+పడన్= అనుమానించవలసిన; పని లేదు= అవసరం లేదు; మాకున్= పంచభూతాల మయిన మాకు; తెల్లము= సుస్పష్టం; జనులకున్= ప్రజలకు; మమున్= మమ్ము; సకలక్రియలన్= అన్నివ్యాపారాలలో; మొఱఁగరాదు= మోసంచేయటానికి వీలు లేదు. (సందేహపడు= పడ్వాది సంధి)

తాత్పర్యం: 'ఓ జననాయకా! శ్రీరామా! మా మాట ఆలకింపుము. పంచభూతాల మైన మాకు సమస్తవ్యాపారాలు తేటతెల్లాలు. ప్రజలు మమ్ము మోసగించలేరు. జనకుడికూతురు సీతాదేవి ఉత్తమురాలు. మహాపతివ్రత. ఇందులో సందేహానికి ఎట్టితావునూ లేదు.'

వ. అనిన యనంతరంబ సకలసురముని గణసహితంబుగాఁ బితామహుండు సనుదెంచి రాఘవుచేత సత్కృతుం డై యిట్లనియె: 'నయ్యా! నీవు సకలభూతదుస్సహుండైన రావణుం బరిమార్చి లోకహితంబు సేసితివి; వినుము! నలకూబరుశాపంబునంజేసి దశగ్రీవునకుఁ బరస్త్రీలయందు బలాత్కారంబు సెల్లదు; గావున నీధర్మపత్నియం దొక్క దురితంబును బొరయదు; నీవు నిర్విచారుండ వై యిప్పతివ్రతం బరిగ్రహించి నెమ్మదిఁ బురంబున కరుగు' మని పలికి, యతనికిఁ బ్రియంబుగాఁ దత్సమరనిహతు లైన వానరులఁ బ్రాప్తజీవులం జేసి పరమేష్ఠి సనియెఁ; బురందరసారథియును దాశరథి వీడ్కొని హరిసహస్రయుక్తం బైన రథంబు గొని నాకలోకంబున కరిగె; నంత. 165

ప్రతిపదార్థం: అనిన+అనంతరంబు+అ= అని పంచభూతాలు చెప్పిన పిమ్మట; సకల, సుర, ముని, గణ, సహితంబుగాన్= అందరు వేల్పులు ఋషులతో కూడినవాడుగా; పితామహుండు= బ్రహ్మదేవుడు; చనుదెంచి= వచ్చి; రాఘవుచేతన్= శ్రీరాముడిచేత; సత్కృతుండు+ఐ= సమ్మానించబడినవాడయి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు; అయ్యా!= ఆర్యా!; నీవు= ఓ శ్రీరామా! నీవు; సకలభూతదుస్సహుండు+ఐన= అన్నిభూతాలకున్నూ సహించరానివాడయిన; రావణున్= రావణుడిని; పరిమార్చి= సంహరించి; లోకహితంబు+చేసితివి= జగత్తుకు శ్రేయస్సు కలిగించావు; వినుము= ఆలకింపుము; నలకూబరుశాపంబునన్+చేసి= నలకూబరుడు ఇచ్చిన శాపంచేత; దశగ్రీవునకున్= రావణుడికి; పరస్త్రీలయందున్= తన భార్యలు కాని వనితలయందు; బలాత్కారంబు+చెల్లదు= బలవంతం చేసి సంభోగించటం సాధ్యపడదు; కావునన్= కాబట్టి; నీధర్మపత్నియందున్= అగ్నిసాక్షిగా వివాహమాడిన నీభార్యయందు; ఒక్కదురితంబును= ఒక్కపాపంకూడా; పొరయదు= సంక్రమించదు; నీవు= నీవు; నిర్విచారుండవు+ఐ= దుఃఖం లేనివాడవు అయి; ఈ+పతివ్రతన్= భర్తయందుమాత్రమే అనురాగం కల నిర్మలచరితను; పరిగ్రహించి= స్వీకరించి; నెమ్మదిన్= (నెఱ+మదిన్) నిండుమనస్సుతో; పురంబునకున్= (అయోధ్యా) పట్టణానికి; అరుగుము= వెడలుము; అని పలికి= అని చెప్పి; అతనికిన్= శ్రీరాముడికి; ప్రియంబుగాన్= ప్రీతిగా; తద్+సమర, నిహతులు+ఐన= ఆ యుద్ధంలో చంపబడిన; వానరులన్= కోతులను; ప్రాప్తజీవులన్+చేసి= పొందబడిన ప్రాణాలు కలవారినిగా చేసి, బ్రదికించి; పరమేష్ఠి= బ్రహ్మదేవుడు; చనియెన్= వెళ్ళాడు; పురందరసారథియును= దేవేంద్రుడిసారథి మాతలియు; దాశరథిన్, వీడ్కొని= దశరథుడి కుమారుడైన శ్రీరాముడివద్ద సెలవు గైకొని; హరిసహస్రయుక్తంబు+ఐన= వేయిగుర్రాలు పూన్చిన; రథంబు+కొని= తేరును తీసికొని; నాకలోకంబునకున్= స్వర్గలోకానికి; అరిగెన్= వెళ్ళాడు; అంతన్= తరువాత.

తాత్పర్యం: అని పంచభూతాలు సీతాదేవి మహాపతివ్రత అని సాక్ష్యం చెప్పిన పిమ్మట, బ్రహ్మదేవుడు వేల్పులు, మునులు మున్నగువారలతోపాటు అరుగుదెంచి శ్రీరాముడిచేత సమ్మానించబడి ఈ విధంగా పలికాడు: 'ఆర్యా! నీవు సకలభూతకంటకుడైన రావణుడిని సంహరించి విశ్వశ్రేయస్సును ఒనగూర్చావు. ఆలకించుము. నలకూబరుడియొక్క శాపంవలన రావణుడు పరస్త్రీలను బలాత్కారంగా మానభంగం చేయజాలడు. నీధర్మపత్నియందు ఎట్టిదోషం లేదు. నీవు ఎట్టి సంకోచాలు లేకుండ ఆమెతోపాటు నీ రాజధానియైన అయోధ్యానగరానికి ఏగుము. సీతాదేవి పరమపతివ్రతాశిరోమణి' అని పల్కి, అనంతరం బ్రహ్మదేవుడు శ్రీరాముడికి ప్రీతిగా ఆయుద్ధంలో సంహరించబడిన వానరుల నందరిని బ్రదికించి వెళ్ళాడు. దేవేంద్రుడి సారథి అయిన మాతలి, వేయిగుర్రాలు పూన్చినరథాన్ని తీసికొని, శ్రీరాముడివద్ద సెలవుతీసికొని స్వర్గలోకానికి వెళ్ళాడు. ఆ సమయంలో.

విశేషం: (1) నలకూబరశాపం: నలకూబరుడు ధనపతిఅయిన కుబేరుడికొడుకు. కుబేరుడు రావణుడి సోదరుడు. రంభనలకూబరుడికి ప్రేయసి. ఒకనాడు రావణుడు రంభను కామించి బలాత్కారంగా ఆమెను సంభోగించాడు. నలకూబరుడు ఆగ్రహించి, ఇక రావణుడు పరస్త్రీలను బలాత్కరించి మానభంగం చేయ బూనుకొంటే తల పగిలి చస్తాడుగాక' అని శపించాడు. (2) బ్రహ్మదేవుడు శ్రీరాముడితో చెప్పినమాట: సీత- పతివ్రత. ఆమె రావణసమాగమానికి ఇచ్చగింపదు. ఇక రావణుడు ఆమెను బలాత్కారం చేయటానికి వీలులేదు. అందుచేత సీతాశీలాన్ని గూర్చి రాముడు శంకించ నవసరం లేదు. (3) శ్రీరాముడు సీతాశీలాన్ని శంకించలేదు. జగదేకవీరు డైన తనయొక్కభార్య సీత శంకాతీతంగా ఉండవలెనని ఆతడి కోరిక. చరిత్రలో జగద్వీరుడుగా సుప్రసిద్ధుడైన సీజరు తన భార్య విషయమై తా నామెను శంకించటం విషయాంతరమనియు "సీజరుభార్య శంకాతీతురాలుగా" ఉండాలని చెప్పెనట! సీజరు కాలం క్రీస్తుపూర్వం సుమారునలుబది వత్సరాలు. ఆతడు రామాయణకథ బహుశః విని ఉండవచ్చును. లేక అది జగదేకవీరుల మనస్తత్వం కావచ్చును. సీతయెడ శ్రీరాముడి నిష్ఠురప్రవర్తన, కఠినవాక్యాలు పురుషసామాన్యసామ్రాజ్యవాదానికి లేదా పురుషాధిక్యసమాజవాదానికి నిదర్శనంగా కాక, జగదేకవీరుడి మనస్తత్త్వంగా గ్రహించటం న్యాయం.

మ. **అవిరోధంబుగ జానకీసహితుఁడై యాబద్ధరత్నప్రభా**
నవపుష్పంబగు పుష్పకం బను విమానం బెక్కి యర్కాన్వయ
ప్రవరుం డిమ్ముల నేఁగె సమ్మదభరప్రాగ్భాగవారాకర
ప్లవమానుం డగుచుం బురంబునకుఁ బ్రాప్తశ్రీవిశేషోన్నతిన్. **166**

ప్రతిపదార్థం: అవిరోధంబుగన్= శత్రువులు లేనివాడై; జానకీసహితుఁడు+ఐ= జనకమహారాజు కూతురు అయిన సీతాదేవిని కూడినవాడై; ఆబద్ధరత్నప్రభానవపుష్పంబు+అగు= బాగుగా చెక్కబడినమణుల కాంతులతో ప్రకాశిస్తున్న క్రొత్తపూవులు కలిగినట్టిది అగు; పుష్పకంబు+అను= పుష్పకం అనే పేరు కల; విమానంబు+ఎక్కి= విమానాన్ని అధిరోహించి; అర్క+అన్వయ, ప్రవరుండు= సూర్యవంశంలో ఉద్భవించినశ్రేష్ఠుడు; సమ్మద, భర, ప్రాక్+భాగ, వారాకర, ప్లవమానుండు+అగుచున్= సంతోష తన్మయత్వంతో, అతిశయించిన సముద్రాన్ని దాటినవాడు ఔతూ; ప్రాప్త, శ్రీవిశేష+ఉన్నతిన్= లభించిన ఐశ్వర్యంయొక్క గొప్పఅభ్యుదయంతో; పురంబునకున్= అయోధ్యానగరానికి; ఇమ్ములన్+ఏగెన్= సంప్రీతితో వెళ్ళాడు.

తాత్పర్యం: శత్రుసంహారం చేసినపిదప శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యానగరానికి వెళ్ళాడు. వారు పుష్పకం అనే విమానం ఎక్కి వెళ్ళారు. ఆ పుష్పకం రతనాలతో పొదగబడినక్రొత్తపుష్పాలు గలిగినట్టిది. సూర్యవంశపురాజులలో శ్రేష్ఠుడు అయిన శ్రీరామచంద్రుడు పొంగారు సంతోషంతో విస్తారమైన సముద్రాన్ని దాటినవాడై తనకు లభించిన శ్రీవిశేషంతో అతిశయించినవాడై అయోధ్యా నగరానికి వెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) 'శ్రీ' అనే శబ్దానికి సంస్కృతంలో సంపద, కాంతి, లక్ష్మి, శోభ, అలంకరణం, కీర్తి మున్నగు నానార్థాలు ఉన్నాయి. శ్రీరాముడు శ్రీవిశేషోన్నతుడు, అన్నిఅర్థాలతో అనుశీలించాలి. (2) పుష్పకవిమానం: సారథి లేకుండానే ఆకసంలో నడుస్తుంది! సంకల్పమాత్రాన గమ్యాన్ని పసికట్టి చేరేది! ఎంతమంది ఎక్కినా ఇంకను ఒకరికి చోటు ఉండేది! ఏవంవిధగుణగరిష్ఠమైన విమానం రామాయణ పాఠకులకు చిరపరిచితం. ఇరువదియవశతాబ్దికి పూర్వం విమానయానం సాధ్యమని విశ్వసించినవారే అరుదు. 'అకాలప్రళయం సృష్టించగల' అస్త్రాలు, సారథి లేకుండ పయనించగల విమానాలు ప్రాచీనభారతీయవాఙ్మయానికి సుపరిచితాలు.

వ. ఇ ట్లరిగి భరతాదిబంధుజనంబులు నఖిలపరిజనంబులు నభినందింప వసిష్ఠవామదేవవిహితం బయిన యభిషేకశోభనంబు వహించి రాముండు సుగ్రీవవిభీషణాది సుహృజ్జనంబులం బ్రకటబహుమానవిశేషంబుల నాదరించి వీడ్కొలిపి, యభిమతభోగంబుల నిరంతరత్యాగంబులఁ బ్రభూతయాగంబులఁ బ్రసిద్ధుం డయి బహుసహస్రసంవత్సరంబులు వసుమతీరక్షణం బొనర్చె; నిది రాఘవుచరిత్రంబు. 167

ప్రతిపదార్థం: ఇట్లు= ఈరీతిగా; అరిగి= ప్రయాణం చేసి; భరత+ఆది, బంధుజనంబులున్= భరతుడు మున్నగు చుట్టపక్కాలు; అఖిలపరిజనంబులున్= అందరు సేవకులును; అభినందింపన్= సంతోషం ప్రకటించగా; వసిష్ఠ, వామదేవ, విహితంబు+అయిన= వసిష్ఠుడిచేత, వామదేవుడిచేత ఏర్పాటుచేయబడిన; అభిషేకశోభనంబు= పవిత్రజలాలు తలపై పోసి స్నానం చేయించటం; అనేపండుగ; వహించి= మోసి; రాముండు; సుగ్రీవ, విభీషణ+ఆది= సుగ్రీవుడు, విభీషణుడు మొదలైన; సుహృత్+జనంబులన్= మిత్రులైనవారిని; ప్రకట, బహుమాన, విశేషంబులన్= సుప్రసిద్ధాలైన గొప్పబహుమతులచేత; ఆదరించి= గౌరవించి; వీడ్కొలిపి= సగౌరవంగా సాగనంపి; అభిమతభోగంబులన్= ఇష్టమైన సౌఖ్యాలతో; నిరంతరత్యాగంబులన్= సంతతదానాలతో; ప్రభూత, యాగంబులన్= గొప్పయజ్ఞాలతో; ప్రసిద్ధుండు+అయి= కీర్తిని ఆర్జించినవాడయి; బహుసహస్రసంవత్సరంబులు= పెక్కువేలఏండ్లు; వసుమతీరక్షణంబు= భూమిని కాపాడటం; ఒనర్చెన్= చేశాడు. ఇది= ఇది; రాఘవుచరిత్రంబు= శ్రీరాముడి జీవితకథ.

తాత్పర్యం: 'పుష్పక' విమానంలో పయనించి శ్రీరాముడు అయోధ్యానగరం చేరాడు. భరతుడు మున్నగు బంధువులు సంతోషాన్ని ప్రకటించారు. వసిష్ఠుడు వామదేవుడు శుభలగ్నం నిర్ణయించి పట్టాభిషేకంలో పౌరోహిత్యాన్ని నెరపారు. శ్రీరాముడు సుగ్రీవుడు, విభీషణుడు మున్నగు మిత్రులకు బహిరంగంగా కానుకలు పంచిపెట్టి, ధన్యవాదాలు తెలిపి, వారిని సగౌరవంగా సాగనంపాడు. పిదప శ్రీరాముడు పెక్కువేలసంవత్సరాలు భూమిపై శాంతిభద్రతలు నెలకొలిపి, భోగాలను అనుభవించి, త్యాగపూరితాలైన దానాలు చేసి, పెక్కు యాగాలు ఒనరించి కీర్తిని ఆర్జించాడు. ఇది శ్రీరాముడి జీవితచరిత్ర.

విశేషం: (1) భోగాలు ఎనిమిది. 1. గృహం 2. శయ్య 3. వస్త్రం 4. ఆభరణం 5. స్త్రీ 6. పుష్పం 7. గంధం 8. తాంబూలం. (2) రామరాజ్యం= భోగం+త్యాగం+యాగం+శాంతిభద్రతలు.

ఉ. వారక యిట్లు పూని వనవాసనిరంతర దుఃఖమున్ మహా
వైరికృతాపకారదురవస్థయు నోర్చి శుభంబు నొందఁడే
యారఘురాముఁ; డట్లు వసుధాధిప! నీవును దుఃఖ మింతయున్
సైరణ నోర్చి పొందెదవు సర్వమహీవలయాధిరాజ్యమున్. 168

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వసుధా+అధిప!= రాజా, ఓ ధర్మరాజా!; ఇట్లు= ఈవిధంగా; వనవాసనిరంతరదుఃఖమున్= అరణ్యాలలో ఎల్లప్పుడును నివసించటంచేత సంక్రమించిన ఆవేదనను; వారక= తప్పక; పూని= భరించి; మహా వైరి, కృత+అపకార, దురవస్థయున్= గొప్ప శత్రువులచేత చేయబడిన కీడువలన ప్రాప్తించిన చెడ్డస్థితిని; ఓర్చి= సైరించి; ఆ రఘురాముఁడు= రఘువంశంలో జనించిన ఆ శ్రీరాముడు; శుభంబున్+ఒందఁడే= మేలును పొందడా; (పొందెను); అట్లు= అదేవిధంగా; నీవును= నీవుసయితం; దుఃఖము= పరితాపం; ఇంతయున్= ఇంతటిని; సైరణన్+ఓర్చి= ఓర్పుతో భరించి; సర్వ, మహీ, వలయ+అధిరాజ్యమున్= సమస్తమైన భూమండలంలో వ్యాపించిన సామ్రాజ్యాన్ని; పొందెదవు= సంపాదించగలవు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆలకించితివిగదా శ్రీరాముడిచరిత్ర. శ్రీరాముడు ఆ విధంగా అరణ్యంలో ఎల్లప్పుడు నివసించటంవలన ఏర్పడిన ఆవేదనను అనుభవించి, శత్రువులు చేసిన అపకారాలు సైరించి, చిట్టచివరకు శుభాన్ని పొందాడు. అదేవిధంగా నీవుకూడా ఈ వనవాసదుఃఖాన్ని గడచి భూమండలమంతటా విస్తరించియున్న సామ్రాజ్యాన్ని పొంది సర్వసౌఖ్యాలను అనుభవించగలవు.

వ. **అని చెప్పిన విని యుధిష్ఠిరుండు రాముని పరాక్రమవిశేషంబు గొనియాడి, 'జానకి పాతివ్రత్యమహిమ యింత యొప్పునే!' యని పలికి, 'మునీంద్రా!, పతిభక్తితాత్పర్యంబున నఖిలదుఃఖంబులు నోర్చి శుభంబు నొందిన పుణ్యసతిచరిత్రంబు వినవలతుం జెప్పవే!' యనిన నతనికి మార్కండేయుండు 'సావిత్రి యను రాజపుత్త్రిచరిత్రంబు విను; మది నీ ప్రశ్నంబునకు నుత్తరం బగు' నని యిట్లనియె.** **169**

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని వచించగా; విని= ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; రాముని పరాక్రమవిశేషంబు= రాముడియొక్క శౌర్యాతిశయాన్ని; కొనియాడి= ప్రస్తుతించి; జానకిపాతివ్రత్యమహిమ= సీతపాతివ్రత్యంయొక్క గొప్పతనం; ఇంత+ఒప్పునే= ఇంతశోభిల్లునట్టిదిగదా; అని పలికి= అని వచించి; ముని+ఇంద్రా!= ఋషులలో శ్రేష్ఠుడవైనవాడా!, ఓ మార్కండేయా!; పతిభక్తి తాత్పర్యంబునన్= భర్తయందలి పూజ్యభావంలో తత్పరత గలిగిన; అఖిలదుఃఖంబులున్= అన్నికష్టాలను; ఓర్చి= సైరించి; శుభంబున్= మేలును; ఒందిన= పొందిన; పుణ్యసతి చరిత్రంబు= పుణ్యాత్మురాలికథ: వినవలతున్= ఆలకింప కోరుతాను; చెప్పవే= దయచేసి వచింపుము; అనినన్= అని అడుగగా; అతనికిన్= ధర్మరాజుకు; మార్కండేయుండు; సావిత్రి+అను= సావిత్రి అనే; రాజపుత్త్రిచరిత్రంబు= రాజకుమారిగాథ; వినుము= ఆలకించుము; అది= సావిత్రిగాథ; నీ ప్రశ్నంబునకున్= నీవు అడిగినదానికి; ఉత్తరంబు= సమాధానం; అగును= కాగలదు; అని= అని చెప్పి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: మార్కండేయుడు చెప్పిన రామాయణకథ విని, ధర్మరాజు శ్రీరాముడి పరాక్రమాన్ని, సీతాదేవి పాతివ్రత్యగరిమను మెచ్చుకొని, 'మునీంద్రా, మార్కండేయమహర్షీ! పతిభక్తితో అన్నికష్టాలను ఓర్చి, చివరకు శుభాన్ని పొందిన పుణ్యసతి చరిత్ర వినవలె నని ఉన్నది. దయచేసి చెప్పుము' అని ప్రార్థించాడు. మార్కండేయుడు 'ధర్మరాజా!, నీ ప్రశ్నకు సరిఅయిన సమాధానం సావిత్రిగాథ. ఆ రాజపుత్రిచరిత్ర చెప్పుతాను వినుము' అని ఈ విధంగా ఆ కథ చెప్పాడు.

విశేషం: (1) ధర్మరాజు అట్టికథలను వినగోరటంలో కల ఆంతర్యం సుగమం. అట్టి పతివ్రతలగాథలు ద్రౌపదికి ఊరట కలిగిస్తాయి. మార్కండేయుడు ధర్మరాజు మనస్తత్త్వాన్ని కనిపెట్టి సావిత్రికథను చెప్పాడు. రామాయణగాథలో కథానాయకుడు శ్రీరాముడు. సావిత్రిగాథలో నాయిక సావిత్రి. నాయకపాత్ర సత్యవంతుడిభూమిక గౌణం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మార్కండేయుఁడు ధర్మరాజునకు సావిత్ర్యుపాఖ్యానంబు సెప్పుట (సం. 3-277-5)

సీ. **కలఁడు మద్రేశుండు ఘనుఁ డశ్వపతి యను । ధరణీశుఁ; డతఁడు సంతానకాంక్ష**
నెంతయు ధృతిఁ బదునెనిమిది యేఁడులు । సావిత్రిఁ గొల్చె; నజ్జనవిభునకు
నద్దేవి ప్రత్యక్షమై 'వర మడుగుము' । నావుడు నతఁడు వినమ్రుఁ డగుచు
'నాత్మజుఁ గోరెద' ననవుడుఁ 'గన్నియ । పుట్టు నీ' కనియె నా భువనమాత;

తే. **యనుడు 'దేవి! భవత్కృప నస్మదీయ । వాంఛితము సఫలంబు గా వలదె?' యని నృ**
పోత్తముఁడు విన్నవించె; నయ్యోగమూర్తి । గాఢకారుణ్యవికచహృత్కమల యగుచు. **170**

ప్రతిపదార్థం: మద్రేశుండు= మద్రదేశానికి ప్రభువు; ఘనుఁడు= గొప్పవాడు; అశ్వపతి+అను, ధరణీశుఁడు= అశ్వపతి అనేరాజు; కలఁడు= ఉన్నాడు; అతఁడు= (ఆ అశ్వపతి); సంతానకాంక్షన్= బిడ్డలు కలుగవలె ననే కోరికతో; ఎంతయున్= మిక్కుటమైన; ధృతిన్= నిష్ఠతో; పదునెనిమిది+ఏఁడులు= పదునెనిమిది సంవత్సరాలు సావిత్రిన్= సావిత్రీదేవిని; కొల్చెన్= ఆరాధించాడు; ఆ+జనవిభునకున్= ఆ రాజుకు; అశ్వపతికి; ఆ+దేవి= సావిత్రి; ప్రత్యక్షము+ఐ= సాక్షాత్కరించి; వరము+ అడుగుము= వరాన్ని కోరుకొనుము; నావుడున్= అని చెప్పగా; అతఁడు= అశ్వపతి; వినమ్రుఁడు+అగుచున్= భక్తితో వంగినవాడు ఔతూ; ఆత్మజున్= పుత్రుడిని; కోరెదన్= వాంఛిస్తాను; అనవుడున్= అని చెప్పగా; ఆ భువనమాత= ఆ జగన్మాత- సావిత్రి; కన్నియ+పుట్టున్= కన్యక ఉద్భవిస్తుంది; నీకున్= నీకు; అనియెన్= అని చెప్పింది; అనుడున్= అనిచెప్పగా; దేవి!= ఓ సావిత్రీదేవీ!; భవత్+కృపన్= నీయొక్క దయవలన; అస్మదీయవాంఛితము= నా కోరిక; సఫలంబు+కావలదె= తీరవలెను కదా; అని; నృప+ఉత్తముఁడు= రాజులలో శ్రేష్ఠుడు - అశ్వపతి; విన్నవించెన్= నివేదించాడు; ఆ+యోగమూర్తి= సావిత్రి; గాఢ, కారుణ్య, వికచ, హృత్+కమల+అగుచున్= దట్టమైన దయతో వికసించిన పద్మంవంటి హృదయం కలది అగుచు.

తాత్పర్యం: అశ్వపతి అనే పేరుగలవాడు మద్రదేశాన్ని పరిపాలించే ప్రభువు అతడు గొప్పవాడు. ఆయన బిడ్డలకొరకు మిక్కుటమైన నిష్ఠతో పదునెనిమిదేండ్లు సావిత్రీదేవిని ఉపాసించాడు. ఆ రాజుకు సావిత్రి ప్రత్యక్షమై ఆతడిని వరం కోరుకొమ్మని అడిగింది. అతడు భక్తితో వినతుడై, 'దేవీ! నాకు కొడుకును ప్రసాదింపుము' అని ప్రార్థించాడు. అప్పుడు ఆ లోకమాత, 'నాయనా! నీకు కూతురు కలుగుతుంది' అని చెప్పింది. అంతట అశ్వపతి, 'అంబా! నీవు ప్రత్యక్షమైతివికదా; దేవీ! ఇక నాకోరిక ఈడేరవలెను కదా' అని విన్నవించాడు. అంత ఆ యోగమూర్తి అయిన సావిత్రీదేవి మిక్కుటమైన దయతో వికసించిన హృదయపద్మం కలదై.

విశేషం: సావిత్రి - యోగమూర్తి, జగన్మాత అని ఈ పద్యంలో చెప్పబడింది. అష్టాంగయోగం సుప్రసిద్ధం. 1. యమం 2. నియమం 3. ప్రాణాయామం 4. ప్రత్యాహారం 5. ధ్యానం 6. ధారణ 7. మననం 8. సమాధి. ఇరువదిఏడుయోగాలు చెప్పబడినవి. అందు ఈ పద్యంలో వాడబడిన "ధృతి" ఉన్నది. 1. విష్కంభం 2. ప్రీతి 3. ఆయుష్మత్తు 4. సౌభాగ్యం 5. శోభనం 6. అతిగండం 7. సుకర్మం 8. 'ధృతి' 9. శూలం 10. గండం 11. వృద్ధి 12. ధ్రువం 13. వ్యాఘాతం 14. హర్షణం 15. వజ్రం 16. సిద్ధి 17. వ్యతీపాతం 18. వరీయస్సు 19. పరిఘ 20. శివం 21. సిద్ధం 22. సాధ్యం 23. శుభం 24. శుభ్రం 25. బ్రహ్మం 26. ఐంద్రం 27. వైధృతి. సావిత్రి అంటే నిఘంటువులోని అర్థాలు సరస్వతి, పార్వతి, ఇచట సావిత్రి బ్రహ్మను పేర్కొనటంచేత అశ్వపతి ఉపాసించిన దేవి సరస్వతి అని భావించవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. 'ఏను నీమనోరథంబుతెఱంగు మున్న చతుర్ముఖున కెఱింగించిన నతండు గన్నియఁగా నిర్దేశించె; నద్దేవునియానతి యమోఘంబు; వినుమ క్కన్నియ కారణంబున నీకు నొక్కవిధంబునం బిదపఁ బుత్త్రశతలాభంబు నగు; సంతసిల్లు' మని యనుగ్రహించి యద్దేవి యంతర్ధానంబు నొందె; నశ్వపతియును సావిత్రీప్రసాదంబున నిజధర్మపత్ని యయిన మాళవియందు సావిత్రి యను కూఁతుం గని, యక్కన్నియ నతిగౌరవంబునం బెనిచె నంత. 171

ప్రతిపదార్థం: ఏను= నేను; నీ మనోరథంబు+తెఱంగు= నీ కోరికయొక్క తీరు; మున్ను+అ= ఇంతకుముందే; చతుర్ముఖునకున్= నాలుగు మోములు గల దేవరయైన బ్రహ్మదేవుడికి; ఎఱింగించినన్= తెలుపగా; అతండు= బ్రహ్మదేవుడు; కన్నియఁగాన్= కూతురుగా; నిర్దేశించెన్= నిర్ణయించాడు; ఆ+దేవుని+ఆనతి= ఆ బ్రహ్మదేవుడి ఆజ్ఞ; అమోఘంబు= వ్యర్థంకాదు; వినుము= ఆలకింపుము; అక్కన్నియ+కారణంబునన్= ఆ కన్యక హేతువుగా; నీకున్= నీకు; ఒక్కవిధంబునన్= ఒకానొక మార్గంలో; పిదపన్= పిమ్మట; పుత్త్ర, శత, లాభంబున్+అగున్= నూరుగురుపుత్రులు పుట్టుతారు; సంతసిల్లుము= సంతోషించుము; అని= అని చెప్పి; అనుగ్రహించి= కరుణించి; ఆ+దేవి= సావిత్రి; అంతర్ధానంబున్+ఒందెన్= అదృశ్యం అయింది; అశ్వపతియును= అశ్వపతియును; సావిత్రీప్రసాదంబునన్= సావిత్రీదేవి దయవలన; నిజధర్మపత్ని+అయిన= తనభార్య అయిన; మాళవియందున్= మాళవి అనే పేరు కల ఆమెయందు; సావిత్రి+అను, కూఁతున్+కని= సావిత్రి అనే కూతురును పొంది; ఆ+కన్నియన్= ఆ కన్యకను; అతిగౌరవంబునన్= మిక్కుటమైన శ్రద్ధతోకూడిన గారాబంతో; పెనిచెన్= పోషించాడు; అంతన్= ఆ సమయంలో.

తాత్పర్యం: 'నేను నీకోరిక తీరు నెఱిగి ఇంతకుముందే బ్రహ్మదేవుడితో సంప్రదించాను. ఆయన కన్నియగా నిర్ణయించాడు. ఆ దేవుడి నిర్ణయానికి తిరుగులేదు. అయినా ఆలకించుము. నీకు తొలుత కన్యక ఉద్భవించినా పిదప, ఆమెకారణంగానే ఒకానొక సన్నివేశం సంప్రాప్తించి నీకు నూరుగురు సుతులు లభించగలరు. సంతోషించుము' అని అనుగ్రహించి ఆ దేవి అదృశ్యమైంది. పిదప అశ్వపతిధర్మపత్ని మాళవి గర్భం ధరించి సావిత్రి అనే కూతురిని కన్నది. తలిదండ్రులు సావిత్రిని మిక్కుటమైన శ్రద్ధతో గూడిన గారాబంతో పెంచారు. అంతట.

క. ఆ వనజాక్షి పరిస్ఫుట । యౌవనయై సిద్ధసాధ్యయక్షామరక
న్యావలిఁ దన సౌందర్య । శ్రీవిలసనరేఖ నపహసించుచు నొప్పెన్. 172

ప్రతిపదార్థం: ఆ వనజ+అక్షి= ఆ పద్మాలవంటి కనులు కలది; పరిస్ఫుట యౌవన+ఐ= తేటతెల్లమయిన యౌవనం కలదిఅయి; సిద్ధ, సాధ్య, యక్ష+అమర, కన్యా+ఆవలిన్= సిద్ధులు, సాధ్యులు, యక్షులు, దేవతలలోని కన్యకల సముదాయాన్ని; తన సౌందర్య శ్రీవిలసనరేఖన్= తన అందచందాల సొంపువంపులతో; అపహసించుచున్= పరిహసిస్తూ- అనగా అతిక్రమిస్తూ; ఒప్పెన్= శోభిల్లింది.

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు కల ఆ సావిత్రి తేటతెల్లమయిన జవ్వనం కలదై, తన అందచందాల సొంపు పెంపువంపులతో వేల్పులజాతికి చెందిన కన్యకలను, సిద్ధసాధ్య యక్షకన్యకలను అందరినీ అతిక్రమించింది.

తే. 'కోరి జనపతి దనకూర్మికూఁతుఁ జూచి । గుణవయోరూపముల ననుకూలుఁ డైన
భర్త నెమ్మెయి దీనికిఁ బడయువాఁడ । నొక్కొ!' యని యెందుఁ దడవుచునుండె నెలమి. 173

ప్రతిపదార్థం: కోరి= కాంక్షించి; జనపతి= రాజు - అశ్వపతి; తనకూర్మి, కూఁతున్= తన అనుగుపుత్రికను; చూచి= అరసి; గుణ, వయస్+రూపములన్= గుణాలలోను, వయస్సులోను అందమయిన ఆకారంలోను; అనుకూలుడు+ఐన= పొత్తు కుదిరినవాడైన; భర్తన్= పతిని; ఏ+మెయిన్= ఏ రీతిగా; దీనికిన్= ఈమెకు; పడయువాఁడన్+ఒక్కో= సంపాదించగలవాడనో; అని= అని తలపోసి; ఎందున్= ఏవిధంగా నైనా; ఎలమిన్= ఉత్సాహంతో; తడవుచున్+ఉండెన్= వెదకుచుండినాడు.

తాత్పర్యం: అశ్వపతి అల్లారుముద్దుగా అందచందాలతో పెరిగి పెద్దది ఔతున్న కూతురును చూచి 'ఇంతటి సౌందర్యవతికి గుణగణాలు, వయస్సు, రూపం- ఈ మూడింటిలో చక్కగా పొత్తు కుదిరే వరుడిని ఎక్కడ ఏవిధంగా సంపాదించగలనా?' అని ఆలోచిస్తూ అన్వేషిస్తూ ఉన్నాడు.

వ. అదియును సాళ్వపతి యైన ద్యుమత్సేనుకొడుకు సత్యవంతుండు రూపవంతుం డనియును గుణవంతుం డనియును విని వానియందుఁ జిత్తంబు దగిలి యున్నను సిగ్గుపెంపున నెవ్వరికి నెఱింగింపకుండె; నంత నొక్కనాఁడు మద్రపతికడకు నారదుం డరుగుదెంచిన నతం డమ్మహాముని నుచితసపర్యాపరితోషితుం జేసి సద్గోష్ఠీవిశేషంబులు సలుపుచున్నయెడ. 174

ప్రతిపదార్థం: అదియును= ఆమెయును- సావిత్రియు; సాళ్వపతి+ఐన= సాళ్వదేశపురాజు అయిన; ద్యుమత్సేనుకొడుకు= ద్యుమత్సేనుడు అనేవాడిపుత్రుడు; సత్యవంతుండు= సత్యవంతుడు అనే పేరు కలవాడు; రూపవంతుండు+అనియును= అందం కలవా డనియు; గుణవంతుండు= మంచి గుణగణాలు కలవాడు అనియును; విని= ఆలకించి; వానియందున్= అతడియందు- సత్యవంతుడియందు; చిత్తంబు= మనస్సు; తగిలి= లగ్నమై; ఉన్నను= ఉన్నప్పటికీ; సిగ్గుపెంపునన్= లజ్జ అతిశయించటంచేత; ఎవ్వరికిన్= ఎవరికిని; ఎఱింగింపకుండెన్= తెలుపకుండా ఉండింది; అంతన్= పిమ్మట; ఒక్కనాఁడు= ఒకరోజున; మద్రపతికడకున్= మద్రదేశపు రాజుదగ్గరకు- అశ్వపతిదగ్గరకు; నారదుండు= నారదమహర్షి; అరుగుదెంచినన్= విచ్చేయగా; అతండు= అశ్వపతి; ఆ+మహామునిన్= ఆ గొప్పఋషిని; ఉచిత, సపర్యా, పరితోషితున్+చేసి= తగిన సేవలు చేయటంచేత మిగుల సంతోషం చెందిన వాడినిగా చేసి; సత్+గోష్ఠీ, విశేషంబులు= మంచి సంభాషణగరిమతో గూడినటువంటి గొప్పచర్చలు; సలుపుచున్న+ఎడన్= చేస్తున్న తరుణంలో.

తాత్పర్యం: సావిత్రి సాళ్వదేశాధీశుడైన ద్యుమత్సేనుడికొడుకు సత్యవంతుడినిగూర్చి విన్నది. అతడు అందగాడనీ, మంచిగుణాలు గలవాడనీ తెలిసి అతడిని ప్రేమించింది. కాని, అతిశయమైన లజ్జతో ఆ విషయాన్ని ఎవ్వరికీ తెలుపలేదు. అప్పుడు ఒకనాడు త్రిలోకసంచారి అయిన నారదుడు మద్రపతి అయిన అశ్వపతివద్దకు అరుదెంచాడు. అశ్వపతి ఆ మహర్షిని అతిథిమర్యాదలతో అలరించి మంచిగోష్ఠి సంభాషణలో వివిధవిషయాలు చర్చించసాగాడు. ఆ తరుణంలో.

క. నెచ్చెలులు దన్నుఁ గొలువఁగఁ । బచ్చవిలుతుకలిమి యెల్లఁ బద్మానన యై
యచ్చుపడినట్లు మెఱయుచు । నచ్చటి కేతెంచె భూవరాత్మజ నెమ్మిన్. 175

ప్రతిపదార్థం: నెచ్చెలులు= అనుగు సకియలు (నెఱ+చెలి= నెచ్చెలి); తన్నున్= తనను (సావిత్రిని); కొలువఁగన్= సేవించగా; పచ్చవిలుతుకలిమి+ఎల్లన్= మన్మథుడియొక్క సిరి అంతయు; పద్మ+ఆనన+ఐ= పద్మంవంటి ముఖం కలిగినట్టిది (సావిత్రి) అయి; అచ్చుపడినట్లు= గండరువును తీర్చిదిద్దినట్లు; భూవర+ఆత్మజ= అశ్వపతికూతురు సావిత్రి; మెఱయుచున్= తేజస్సుతో శోభిల్లుతూ; నెమ్మిన్= ప్రీతితో; అచ్చటికిన్= ఆ స్థలానికి; ఏతెంచెన్= వచ్చింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అనుగుసకియలు తనను సేవించగా, ఆ అశ్వపతిరాజుకూతురైన సావిత్రి వర్చస్సుతో శోభిల్లుతూ ప్రీతితో ఆచోటికి అరుదెంచింది. అప్పుడు ఆ రాజపుత్రిక మన్మథుడి సిరిసంపద అంతా కలిసి మూర్తీభవించి పద్మముఖి అయిన ఆ సావిత్రిగా రూపొందిందా అనిపించేటట్లు ఉండింది.

వ. ఇట్లు వచ్చి సఖీజనంబు నంతంత నిలిపి మెలపుతోడి పొలుపున నమ్ముగ్ధ లీలామధురం బగుచుండఁ దండ్రికి మ్రొక్కిన, నతండు గాఢస్నేహదోహళం బగు చిత్తంబుతో నత్తన్వి గ్రుచ్చియెత్తి నిజాంకతలంబున నునిచికొని సముచితోపలాలనకేళీపరవశుం డయ్యె; నప్పుడు నారదుం డమ్ముద్దియం జూచి యశ్వపతితోడ 'నిక్కన్నియం దగినవరున కొసంగక యి ట్లేల యునిచినవాఁడ?' వనిన నతండు గూఁతున కి ట్లనియె. 176

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; వచ్చి= అరుదెంచి; సఖీజనంబున్= చెలికత్తెలను; అంత+అంత= అంతంత, అల్లంత దూరంలో; నిలిపి= ఆపి; మెలపుతోడి పొలుపునన్= చాతుర్యంతో కూడిన సొంపుతో; ఆ+ముగ్ధ= ఆ లేతజవరాలు; లీలామధురంబు+అగుచుండన్= విలాసంతో కూడిన తీయదనం తొలుకాడుతుండగా; తండ్రికిన్= పితకు; మ్రొక్కినన్= నమస్కరించగా; అతండు= అశ్వపతి; గాఢ, స్నేహ, దోహళంబు+అగు= దట్టమైన అనురాగంచేత ఉత్సాహవంతమై ఉన్న; చిత్తంబుతోన్= మనస్సుతో; ఆ+తన్విన్= ఆ సుకుమారిని; గ్రుచ్చి+ఎత్తి= ఆప్యాయతతో దగ్గరకు తీసికొని కొద్దిగా పైకెత్తి; నిజ+అంక, తలంబునన్= తనయొడిలో; ఉనిచికొని= కూర్చుండబెట్టుకొని; సముచిత+ఉపలాలన, కేళీ, పరవశుండు+అయ్యెన్= ఒప్పిదమైన బుజ్జగింపు ఆటలో నిమగ్నుడయ్యాడు; అప్పుడు= ఆ సమయంలో; నారదుండు= నారదమహర్షి; ఆ+ముద్దియన్+ చూచి= ఆ అమ్మాయిని కాంచి; అశ్వపతితోడన్= అశ్వపతిమహారాజుతో; 'ఈ+కన్నియన్= ఈ కన్యకను; తగినవరునకున్= యోగ్యుడైన పెండ్లికొడుకునకు; ఒసంగక= ఇవ్వకుండా; ఇట్లు= ఈవిధంగా; ఏల= ఎందుకు?; ఉనిచినవాఁడవు= ఉంచావు; అనినన్= అని అడుగగా; అతండు= అశ్వపతి మహారాజు; కూఁతునకున్= పుత్రికకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా వచ్చి, సావిత్రి తన చెలికత్తెలను అల్లంతదూరంలో నిలిపి తాను తండ్రిదగ్గరకు వచ్చి నమస్కరించింది. తండ్రి అయిన అశ్వపతిమహారాజు లేజవరాలు, ముగ్ధ అయిన తనకూతురును, గ్రుచ్చియెత్తి తన ఒడిలో కూర్చుండబెట్టుకొని బుజ్జగిస్తూ మైమరచి ఉన్నాడు. అప్పుడు ఆమె తండ్రికి చిన్నకూతురుగా కన్పించింది కాని, నారదుడికి ఆమె సంపూర్ణయౌవనంతో తొణికిసలాడుతున్న సౌందర్యవతిగా కన్పించటంచేత, ఆ మహర్షి 'వయసువచ్చిన ఈ కన్యకను తగినవరుడికి ఏల ఇవ్వలేదు?' అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నను ఆలకించి అశ్వపతిమహారాజు తన కూతురుతో ఇట్లా పలికాడు.

తే. 'తల్లి! నీగుణరూపవృత్తముల కెందుఁ । దగినవరు నీవ యిమ్ముగఁ దడవి నెమ్మి
నీదు మనసున కెక్కిన నృపకుమారుఁ । గోరి వరియింపు; మిదియ నాకును బ్రియంబు'. 177

ప్రతిపదార్థం: తల్లి!= అమ్మా, సావిత్రీ!; నీగుణరూపవృత్తములకున్= నీమంచి గుణాలకు, ప్రవర్తనకు, అందచందాలకు; ఎందున్= ఎచటనైనా; తగిన= యోగ్యుడైన, వరున్= మగడిని; నీవు+అ= నీవే; ఇమ్ముగన్= ప్రీతితో; తడవి= వెదకి; నెమ్మిన్= ప్రేమతో; నీ+మనసునకున్+ఎక్కిన= నీ చిత్తానికి నచ్చిన; నృప, కుమారున్= రాజపుత్రుడిని; కోరి= ఇష్టంచొప్పున; వరియింపుము= ఎన్నుకొనుము; ఇది+అ= ఇదియే; నాకును= నాకుగూడ; ప్రియంబు= ఇష్టం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'అమ్మా, సావిత్రీ! ఆలకించితివికదా నారదమహర్షి సెలవిచ్చినమాట. నీమంచిగుణాలకు, అందచందాలకు, ప్రవర్తనకు తగిన పెండ్లికొడుకును నీవే ప్రీతితో పేర్కొనుము. నీకు ప్రేమపాత్రుడైన రాజకుమారుడిని మగనిగా నీవే వరించుము. అదియే నేనుకూడ కోరుకొనేది. నీ ఇష్టమే నా అభీష్టం'.

వ. అనిన నదియుఁ గొండొక లజ్జించి కోర్కిపెంపున సిగ్గు దొలంగం ద్రోచి ప్రకటకౌతూహల తరళితాంతరంగ యగుచుఁ దండ్రి కిట్లనియె. 178

ప్రతిపదార్థం: అనినన్= అని అశ్వపతి చెప్పగా; అదియున్= సావిత్రియు; కొండొక లజ్జించి= ఇంచుక సిగ్గుచెంది; కోర్కి పెంపునన్= వాంఛ యొక్క అతిశయంవలన; సిగ్గు= బిడియం; తొలంగన్+త్రోచి= ప్రక్కకునెట్టి; ప్రకట, కౌతూహల, తరళిత+అంతరంగ+అగుచున్= వ్యక్తమైన ఆసక్తిచేత ప్రేరేపించబడిన డెందం కలది ఔతూ; తండ్రికిన్= పితకు, అశ్వపతికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: తండ్రి అశ్వపతి చెప్పిన మాటలు విని సావిత్రి కొంతసిగ్గు చెందింది. కాని, తమకించిన కోరిక సిగ్గును ప్రక్కకు నెట్టగా ఆమె వ్యక్తమైన కుతూహలంతో ప్రోత్సహించబడిన హృదయం కలది ఔతూ తండ్రితో ఇట్లా చెప్పింది.

క. 'చిరకీర్తి సాళ్వభూవరు । వరతనయుం డయిన సత్యవంతుఁడు నాకున్
వరుఁడుగఁ గోరుదు మదిలో । నరవర! యాతనికి నిమ్ము ననుఁ బ్రీతిమెయిన్. 179

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; చిరకీర్తి= గొప్పపేరు కలవాడు అయిన; సాళ్వభూవరు వరతనయుండు+అయిన= సాళ్వదేశరాజుయొక్క శ్రేష్ఠుడగు కుమారుడైన; సత్యవంతుఁడు= సత్యవంతుడు అనేపేరు కలవాడు; నాకున్= నాకు; వరుఁడుగన్= మగడుగా; మదిలోన్= మనస్సులో; కోరుదున్= వాంఛిస్తాను; ఆతనికిన్= ఆ సత్యవంతుడికి; ననున్= నన్ను; ప్రీతిమెయిన్= సంతోషంతో; ఇమ్ము= ఒసంగుము.

తాత్పర్యం: చిరస్థాయి యైన కీర్తిని ఆర్జించిన సాళ్వదేశప్రభువు కొడుకు సత్యవంతుడు నాకు తగినవరుడు. రాజోత్తమా! అతడికి నన్ను ఇచ్చి పెండ్లిచేయుము.

వ. సాళ్వపతియును నిపుడు దైవయోగంబునం జేసి విగతచక్షుం డయి తనరాజ్యంబు వైరులచేతం గోల్పడి పుత్త్రదారసహితంబుగా వనంబున నున్నవాఁ; డట్లయినను సత్యవంతున వరియింతు' ననిన మద్రేశ్వరుండు నారదుంజూచి 'మునీంద్రా! మీ యెఱుంగని వారు లేరు; సావిత్రిచేత వరియింపంబడిన కుమారుం డెట్టివాఁడు? వానిగుణరూపశీలంబు లెఱింగింపుఁ' డనిన నారదుం డిట్లనియె. 180

ప్రతిపదార్థం: సాళ్వపతియునున్= ఆ సాళ్వదేశపురాజుసైతం; ఇపుడు= ఈసమయంలో; దైవయోగంబునన్+చేసి= విధి నిర్ణయం చేత; విగతచక్షుండు+అయి= పోయిన కనులు కలవాడు అయి (గ్రుడ్డివాడయి); తనరాజ్యంబున్= తాను ఏలే దేశాన్ని; వైరులచేతన్= శత్రువులచేత; కోల్పడి= పోగొట్టుకొని; పుత్త్ర, దార, సహితంబుగాన్= కొడుకుతో, భార్యతో పాటుగా; వనంబునన్= అడవిలో; ఉన్నవాఁడు= ఉన్నాడు; అట్లు= ఆ విధంగా; అయినను= అయినప్పటికిని; సత్యవంతున్+అ= సత్యవంతుడినే; వరియింతున్= భర్తగా స్వీకరిస్తాను; అనినన్= అని (సావిత్రి) చెప్పగా; మద్ర+ఈశ్వరుండు= మద్రదేశరాజు అశ్వపతి; నారదున్+చూచి= నారదుడిని కాంచి; 'ముని+ఇంద్రా!= మునులలో శ్రేష్ఠుడ వైన వాడా!; మీ+ఎఱుంగనివారు= మీకు

తెలియనివారు; లేరు= ఉండరు; సావిత్రిచేతన్; వరియింపంబడిన= ఎన్నుకొనబడిన; కుమారుండు= రాజకుమారుడు; ఎట్టివాఁడు= ఎటువంటివాడు; వాని= అతడియొక్క (సత్యవంతుడియొక్క); గుణరూపశీలంబులు= గుణగణాలు, ఆకారం, నడవడికలు; ఎఱింగింపుఁడు= తెలుపండి; అనినన్= అని (అశ్వపతి) అడుగగా; నారదుండు= నారదుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: సాళ్వదేశాధిపతి ఈ సమయంలో విధివిపరిపాకం చొప్పున కన్నులు కోలుపోయాడు. శత్రువులు అతడిరాజ్యాన్ని ఆక్రమించారు. అతడు భార్యాపుత్రులతోపాటు అడవిలో నివసిస్తున్నాడు. అయినను నేను సత్యవంతుడినే వరిస్తున్నాను' అని సావిత్రి చెప్పింది. ఆ మాటల నాలకించి మద్రపతి అయిన అశ్వపతి నారదుడిని చూచి, 'మునులలో శ్రేష్ఠుడవైనవాడా! మీ రెరుగనివారు ఉండరు. మా సావిత్రి ఎన్నుకొనిన సత్యవంతుడు ఎట్టివాడు? అతని గుణాలు ఎట్టివి? రూపం ఎట్టిది? నడవడిక ఎట్టిది? దయచేసి వివరించి తెల్పండి' అని ప్రార్థించాడు. నారదమహర్షి అశ్వపతికి ఈవిధంగా ప్రత్యుత్తర మిచ్చాడు.

సీ. **'సత్యంబు వలుకుట సత్యవంతుం డన । వతఁ డొప్పు; మఱియుఁ జిత్రాశ్వుఁ డనఁగ**
నామాంతరంబు నన్నరనాథసుతునకుఁ । గలదు; తేజంబునఁ గమలమిత్త్రు
బుద్ధి నింద్రాచార్యుఁ బురుడించు; శూరత । వాసవుఁ, దాలిమి వసుధఁ బోలుఁ;
గాంతిఁ జంద్రున కెనగాఁ దగు; రూపున । నాశ్వినేయుల సరియనఁ దలిర్చుఁ;

ఆ. **దపము శమము దమము దానంబు బ్రాహ్మణ । భక్తియును మహానుభావతయును**
నతనియంద కాని యన్యులయందు లేఁ; । దింత నిక్కువము మహీతలేశ! **181**

ప్రతిపదార్థం: సత్యంబు పలుకుట= నిజాన్ని చెప్పటంచేత; సత్యవంతుండు+అనన్= సత్యవంతుడు అనగా; అతఁడు= అతడు (సత్యవంతుడు); ఒప్పున్= శోభిల్లుతాడు; మఱియున్= వెండియు; చిత్ర+అశ్వుఁడు= చిత్రాశ్వుడు; అనఁగ= అనునట్టి; నామ+అంతరంబు= మరొకపేరు; అన్నరనాథసుతునకున్= ఆ రాజకుమారుడికి; కలదు= ఉన్నది; తేజంబునన్= కాంతిలో; కమలమిత్త్రున్= సూర్యుడిని; బుద్ధిన్= తెలివితేటలలో; ఇంద్ర+ఆచార్యున్= ఇంద్రుడిగురువు బృహస్పతిని; పురుడించున్= సరిపోలుతాడు; శూరతన్= పరాక్రమంలో; వాసవున్= ఇంద్రుడిని; తాలిమిన్= ఓర్పులో; వసుధన్= భూమిని; పోలున్= సాటి ఔతాడు; కాంతిన్= తేజస్సులో; చంద్రునకున్= జాబిల్లికి; ఎనగాన్+తగున్= సరిపోలుతాడు; రూపునన్= సౌందర్యంలో; ఆశ్వినేయులన్= అశ్వినిదేవతలకు; సరి+అనన్= సమానం అనేటట్లుగా; తలిర్చున్= శోభిల్లుతాడు; తపము= తపస్సు; శమము= కోపతాపాదులు లేకుండా శాంతంగా ఉండటం; దమము= వెలుపలి ఇంద్రియాలను నిగ్రహించటం; దానంబు= పరోపకారార్థం త్యాగం చేయుటం; బ్రాహ్మణభక్తియును= విప్రులపట్ల పూజ్యభావం; మహానుభావతయును= గొప్పప్రభావాన్ని కలిగి ఉండటమున్నూ; అతనియందు+అ= అతనియందు మాత్రమే; కాని; అన్యుల+అందున్= ఇతరులలో; లేదు= ఉండదు; మహీతల+ఈశ!= మహారాజా!; ఇంత= ఇదంతా; నిక్కువము= నిజం.

తాత్పర్యం: 'ఓ అశ్వపతి మహారాజా! సత్యం పలకటంచేత అతడికి సత్యవంతుడు అనే సార్థకనామధేయం ఏర్పడింది. అంతేకాక, అతడి ఇంకొక నామధేయం చిత్రాశ్వుడు. తేజస్సులో అతడు సూర్యుడిని, తెలివితేటలలో ఇంద్రుడిగురువైన బృహస్పతిని, పరాక్రమంలో ఇంద్రుడిని, ఓర్పులో భూదేవిని, కాంతిలో చంద్రుడిని, అందచందాలలో ఆశ్వినేయులను తలపిస్తాడు. తపస్సు, అంతరింద్రియ నిగ్రహం, బాహ్యేంద్రియ నిగ్రహం, త్యాగంతో కూడిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరోపకారశీలం, బ్రాహ్మణభక్తి, గొప్పప్రభావంతో కూడిన వ్యక్తిత్వం ఆ సత్యవంతుడియందు మాత్రమే కన్పిస్తాయి. ఇతరులలో కన్పించవు. ఇది నిజం.

వ. **వానియందుఁ గీ డొక్కటి గలదు; పరిణయంబు మొదలుగా నొక్కసంవత్సరంబునకు మృతింబొందు; నిది నీకుఁజెప్పవలయుటంజేసి చెప్పితి' ననిన నతండు గూఁతుమొగంబు సూచి 'తల్లీ! యిమ్మహాత్ముండు దేవరహస్యం బెఱుంగు; నీతనివచనం బమోఘంబు; నీకు నట్టివరుం డేటికి? నొండొక్కవరుని వెదకి కొ' మ్మనిన నక్కన్యక యి ట్లనియె.** **182**

ప్రతిపదార్థం: వానియందున్= ఆ సత్యవంతుడిలో; కీడు= హాని (గండం); ఒక్కటి= ఒక్కటి; కలదు= ఉన్నది; పరిణయంబు= వివాహం; మొదలుగాన్= ఆరంభంగా; ఒక్కసంవత్సరంబునకున్= ఒకయేఁటికి; మృతిన్+పొందున్= మరణిస్తాడు; ఇది= ఈ విషయం; నీకున్= నీకు; చెప్పవలయుటన్+చేసి= చెప్పవలసిరావటంచేత; చెప్పితిన్= వచించాను; అనినన్= అని నారదుడు చెప్పగా; అతండు= అతడు, అశ్వపతి; కూఁతుమొగంబు= పుత్రికముఖం; చూచి=అరసి; తల్లీ!= అమ్మా సావిత్రీ! ఈ+మహాత్ముండు= ఈ మహానుభావుడు; (నారదమహర్షి); దేవరహస్యంబు= దేవతలకు మాత్రమే తెలిసే రహస్యం; ఎఱుంగున్= తెలియగలుగుతాడు; ఈతని వచనంబు= ఈతడిమాట; అమోఘంబు= తప్పనట్టిది; నీకున్= ఓ సావిత్రీ, నీకు; అట్టివరుండు= పెండ్లికి పిదప ఒక వత్సరంమాత్రమే జీవించేమగడు; ఏటికి= ఎందుకు; ఒండు+ఒక్కవరునిన్= ఇంకొక పెండ్లికొడుకును; వెదకికొమ్ము= ఆలోచించి అన్వేషించుము; అనినన్= అని (అశ్వపతి) చెప్పగా; ఆ+కన్యక= సావిత్రి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: సత్యవంతుడిలో ఒకలోపం మాత్రం ఉన్నది. పెండ్లిఅయిన పిదప అతడు ఒకసంవత్సరానికి మరణిస్తాడు. ఇది నీకు చెప్పవలసిన అంశం కాబట్టి చెప్పక తప్పింది కాదు' అని నారదమహర్షి చెప్పాడు. అంతట అశ్వపతి కూతురైన సావిత్రిముఖం చూచి, 'అమ్మా! నారదమహర్షి త్రిలోకసంచారి మాత్రమే కాక, త్రికాలజ్ఞుడు, దేవతలకుమాత్రమే తెలిసే రహస్యాలు ఈ మహానుభావుడికి తెలుసు. ఈయనమాటకు తిరుగులేదు. నీకు ఇటువంటి వరుడెందుకు? నీవు ఇంకొకవరుడిని అన్వేషించటం మంచిది' అని హెచ్చరించాడు. అంతట సావిత్రి ఇట్లా బదులు పలికింది.

క. **'వినుము మనోవాక్కాయము । లను మూఁడుతెఱంగులందు నంతఃకరణం**
బనఘ! ప్రధానము గావున । మనమునఁ గైకొన్న భర్త మానుటఁ దగునే? **183**

ప్రతిపదార్థం: వినుము= ఆలకింపుము; మనస్+వాక్+కాయములు+అను= చిత్తం, మాట, శరీరచేష్ట అనే; మూడు+తెఱంగులందున్= మూడురీతులలో; అంతఃకరణంబు= మనస్సు; ప్రధానము= ముఖ్యమైనది; కావునన్= కాబట్టి; మనమునన్= మనస్సునందు; కైకొన్న= స్వీకరించిన; భర్తన్= మగడిని; మానుటన్= వీడుట; తగునే= భావ్యమా? (భావ్యం కాదు).

తాత్పర్యం: 'తండ్రీ! ఆలకింపుము. మనస్సు, వాక్కు, కాయం - ఈ త్రికరణాలలో మనస్సు ప్రధానం అయింది. కాబట్టి, మనసార వరించిన మగడిని మానటం పాడిగాదు కదా!.

వ. **సత్యవంతుం డెట్టివా డైననుం గాని; మ్మే నింక నొరుల వరియింప నొల్ల' ననిన నశ్వపతి నారదుదెసఁ జూచుటయు, నతం డి ట్లనియె.** **184**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సత్యవంతుండు= చిత్రాశ్వుడు; ఎట్టివాడు+ఐననున్= ఎట్టివాడు అయినప్పటికీన్నీ; కానిమ్ము= కావచ్చును; ఏను= నేను; ఇంకన్= ఇకమీద; ఒరులన్= ఇతరులను; వరియింపన్+ఒల్లన్= ఎన్నికచేయజాలను; అనినన్= అని(సావిత్రి) చెప్పగా; అశ్వపతి; నారదుదెసన్= నారదుడివైపు; చూచుటయున్= దృష్టిని సారించగా; అతండు= అతడు - నారదుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: సత్యవంతుడు ఎట్టివాడైనా కావచ్చును. నేను ఇంక ఒరులను వరించటం కల్ల' అని సావిత్రి పలికింది. అంతట ఆమెతండ్రి నారదుడివైపు దృష్టి సారించాడు. నారదుడు ఈ విధంగా పలికాడు.

చ. **'గొనములప్రోక నీ యనుఁగుఁ గూఁతురు; దీని తలంపు మాన్పఁగా**
మనకు నశక్య; మింక ననుమానము లేల? నరేంద్ర! కూఁతుఁ జ
య్యన నృపసూతి కిమ్ము; కమలానన చేసిన పుణ్యగౌరవం
బున నయినం బ్రియుండు పరిపూర్ణచిరాయురుపేతుఁ డయ్యెడున్.' **185**

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= నరులలో శ్రేష్ఠుడ వైన ఓ అశ్వపతిరాజా!; నీ అనుఁగు+కూఁతురు= నీ కూరిమిపుత్రిక; గొనములప్రోక= మంచిగుణాలరాశి; దీని తలంపు= ఈమెఆలోచన; మాన్పఁగాన్= ఆపగా; మనకున్= నీకును నాకును; అశక్యము= సాధ్యం కాదు; ఇంకన్= ఇకమీద; అనుమానములు+ఏల?= సందేహాలు ఎందుకు?; కూఁతున్= పుత్రికను; చయ్యనన్= వెంటనే; నృపసూతికిన్= రాజపుత్రుడికి, (సత్యవంతుడికి); ఇమ్ము= ఒసగుము; కమల+ఆనన= పద్మంవంటి మొగం కలది - సావిత్రి; చేసిన= ఒనర్చిన; పుణ్య, గౌరవంబునన్+అయినన్= సుకృతంయొక్క గొప్పతనంవలన అయినను; ప్రియుండు= భర్త; పరిపూర్ణ, చిర+ఆయుస్+ఉపేతుఁడు+అయ్యెడున్= దీర్ఘమైన నిండైన ఆయువుతో కూడినవాడు అగునుగాక.

తాత్పర్యం: 'ఓ అశ్వపతిమహారాజా! నీకూతురు సద్గుణాలరాశి. ఈమెమనస్సును మరలింపచేయటం మనకు సాధ్యం కాదు. ఇంక ఎట్టి సందేహాలు పెట్టుకొనకుము. నీ కూర్మికూతురును ఆ రాజకుమారుడైన సత్యవంతుడికి ఒసగుము. కమలంవంటి కళకళలాడే ముఖంగల సావిత్రి చేసినపుణ్యంవలన అయినా ఆమెభర్తకు నిండుఆయుర్దాయం లభించగలదు'.

వ. **అనిన నమ్మహీపతి మునిపతికి మ్రొక్కి 'నీవు మాకుం బరమగురుండవు; నీ యానతిచ్చినట్ల చేసెద' ననియె; నారదుండును దాని దీవించి, దివంబునకుం జనియె; నంత.** **186**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+మహీపతి= ఆరాజు, అశ్వపతి; మునిపతికిన్= మునిశ్రేష్ఠుడైన నారదుడికి; మ్రొక్కి= నమస్కరించి; నీవు= ఓ నారదా! నీవు; మాకున్= మాకు; పరమగురుండవు= పూజ్యుడయిన గురువర్యుడవు; నీ+ఆనతి+ఇచ్చిన+అట్ల= నీవు ఆజ్ఞాపించిన విధంగానే; చేసెదన్= చేస్తాను; అనియెన్= అని చెప్పాడు; నారదుండును= నారదమహర్షియున్నూ; దానిన్= ఆమెను - సావిత్రిని; దీవించి= ఆశీర్వదించి; దివంబునకున్= స్వర్గానికి; చనియెన్= వెళ్ళాడు; అంతన్= తరువాత.

తాత్పర్యం: అని నారదు డనగానే అశ్వపతి ఆ మహామునికి నమస్కరించి 'మహర్షీ! నీవు మాకు ఉత్తమగురువర్యుడవు. నీవు ఆజ్ఞాపించినట్లు చేస్తాను' అన్నాడు. నారదమహర్షి సావిత్రిని దీవించి స్వర్గానికి వెళ్ళాడు. అప్పుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. అమరఁ బుణ్యదినంబునందు బాంధవమంత్రి । వృద్ధపురోహితవితతితోడ
సావిత్రిఁ దోడ్కొని జననాయకుండు వై । వాహికమహనీయవస్తుకోటి
గొనుచుఁ బుణ్యారణ్యగోచరుండై తప । స్స్థితుఁడైన యా ద్యుమత్సేనుకడకుఁ
జనిన నారాజును సంభ్రమంబున నశ్వ । పతికి నర్ఘ్యాదిసంభావనంబు

ఆ. లాచరించి సముచితాభిమతాలాప । పూర్వకముగ సుజనపూజ్యుఁ డతని
యాగమననిమిత్త మడిగిన, మద్రేశుఁ । డెలమి సాళ్వపతికి నిట్టు లనియె. 187

ప్రతిపదార్థం: పుణ్యదినమ్మునందున్= శుభముహూర్తంతో కూడిన రోజున; అమరన్= ఒప్పిదంగా; బాంధవ, మంత్రి, వృద్ధ, పురోహిత, వితతితోడన్= చుట్టాలు, సచివులు, పెద్దలు, వైదికకర్మలు చేయించే విప్రులు- వీరల సమూహంతో; సావిత్రిన్= సావిత్రిని; తోడ్కొని= వెంటనిడుకొని వెడలి; జననాయకుండు= రాజు, అశ్వపతి; వైవాహికమహనీయవస్తుకోటి= పెండ్లికి కావలసిన గొప్పపదార్థసముదాయం; కొనుచున్= వెంట తీసికొని; పుణ్య+అరణ్య, గోచరుండు+ఐ= పవిత్రమైన అడవిలో చేరినవాడయి; తపస్+స్థితుఁడు+ఐన= తపస్సునందు నిష్ఠతో కూడిఉన్న; ఆ, ద్యుమత్సేనుకడకున్= ద్యుమత్సేనుడు అనే ఆ రాజుదగ్గరకు; చనినన్= వెళ్ళగా; ఆ రాజును= ఆరాజు ద్యుమత్సేనుడున్నూ; సంభ్రమంబునన్= మిగులత్వరతో; అశ్వపతికిన్= అశ్వపతిరాజుకు; అర్ఘ్య+ఆది, సంభావనంబులు= స్వాగతచిహ్నమైన (కాళ్ళు కడుగుకొనటానికి) నీళ్ళివ్వటం, పానీయం మున్నగు మర్యాదలు; ఆచరించి= చేసి, సముచిత+అభిమత+ఆలాప, పూర్వకముగన్= ఆ సమయానికి తగినటువంటి ఇష్టాలైనటువంటి మాటలను మున్ముందుగా పలికి; సుజనపూజ్యుఁడు= మంచివారలచేత ఆరాధించదగినవాడు ద్యుమత్సేన మహారాజు; అతని+ఆగమన, నిమిత్తము= అశ్వపతిరాకకు కల కారణం; అడిగినన్= ప్రశ్నించగా; మద్ర+ఈశుఁడు= మద్రరాజు, అశ్వపతి; ఎలమిన్= వికాసంతో; సాళ్వపతికిన్= సాళ్వదేశరాజయిన ద్యుమత్సేనుడికి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఒకానొక శుభదినం చూచుకొని అశ్వపతిమహారాజు సావిత్రిని తోడ్కొని, చుట్టాలు, సచివులు, పెద్దలు, పురోహితులు వెంట రాగా, పెండ్లికి కావలసిన సంభారాలన్నిటిని సమకూర్చుకొని, ధర్మారణ్యంలో తపస్సు కావిస్తూఉన్న ద్యుమత్సేన మహారాజు వద్దకు వెళ్ళాడు. ఆ ద్యుమత్సేనుడున్నూ అశ్వపతిమహారాజుకు స్వాగతంచెప్పి అర్ఘ్యాన్నీ, పాద్యాన్నీ సమర్పించి, మన్నించి, కుశలప్రశ్నలు వేసి, పిదప అశ్వపతి రాజేంద్రునిరాకకు గల కారణాన్నిగూర్చి అడిగాడు. అంతట అశ్వపతి సాళ్వపతితో ఈ విధంగా అన్నాడు.

క. 'ఈ కన్నియ నాకూఁతురు । మాకులమున కెల్లఁ దెప్ప మనుజోత్తమ! నీ
వీకన్నియఁ గోడలుగాఁ । గైకొనుము మదీయవచనగౌరవబుద్ధిన్.' 188

ప్రతిపదార్థం: మనుజ+ఉత్తమ!= మనుష్యులలో ఉత్తముడవైన ఓ ద్యుమత్సేనమహారాజా!; ఈ కన్నియ= ఈ కన్యక; నాకూఁతురు= నా పుత్రిక; మా కులమునకున్+ఎల్లన్= మా వంశం అంతటికిని; తెప్ప= తరింపచేసేది (పడవ); నీవు= నీవు; ఈ కన్నియన్= ఈ కన్యకను, సావిత్రిని; మదీయ, వచన, గౌరవ, బుద్ధిన్= నామాటలయందలి గౌరవంతోడి బుద్ధితో మన్నించే ఆలోచనతో; కోడలుగాన్= నీ కొడుకుకు భార్యగా; కైకొనుము= స్వీకరించుము.

తాత్పర్యం: 'ఓ ద్యుమత్సేనమహారాజా! ఈ కన్యక సావిత్రి నా కూర్మికూతురు. మా వంశాన్ని తరింపజేసే తెప్ప. నీవు ఈ కన్యకను నీ కోడలుగా దయతో స్వీకరింపుము. నా మాటలను మన్నించుము.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి సావిత్రి నతనికి నభివందనంబు సేయించి మఱియు నతండు. 189

తాత్పర్యం: అని చెప్పి, అశ్వపతి సావిత్రిచేత ద్యుమత్సేనుడికి నమస్కరింపజేశాడు. ఇంకా అత డిట్లా అన్నాడు.

క. 'నీకొడుకు సత్యవంతున । కీ కన్నియ దగు నరేంద్ర! యీ కన్నియకున్
నీ కొడుకు దగు; ననన్యగు । ణాకరు లియ్యిరువురును సమంచితమూర్తుల్.' 190

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= ఓ (ద్యుమత్సేన) రాజా!; నీకొడుకు= నీపుత్రుడు; సత్యవంతునకున్= చిత్రాశ్వుడికి; ఈ కన్నియ= ఈ పడుచుపిల్ల; తగున్= సరిపోతుంది; ఈకన్నియకున్= ఈకన్యకకు; నీకొడుకు= నీసుతుడు; తగున్= సరిపోతాడు; ఈ+ఇరువురును= ఈ ఇద్దరును; అనన్యగుణ+ఆకరులు= సాటిలేని లక్షణాలకు నెలవులు అయినవారు; సమంచితమూర్తుల్= శోభిల్లునట్టి అంగసౌష్ఠవం కలవారు.

తాత్పర్యం: 'నీకొడుకు సత్యవంతుడికి ఈ కన్నియ సావిత్రి సరిపోతుంది. మా సావిత్రికి నీకొడుకు సత్యవంతుడు సరిపోతాడు. వధూవరు లిద్దరు సాటి లేని మంచిగుణాలు కలవారు. అందచందాలతో కూడిన గొప్ప అంగసౌష్ఠవం కలవారు. ఈడుజోడు కుదిరిన జంట వీరు.

వ. అనిన నతనికి ద్యుమత్సేనుం డిట్లనియె. 191

తాత్పర్యం: అనగా అశ్వపతికి ద్యుమత్సేనుడు ఇట్లా అన్నాడు.

తే. 'విగతరాజ్యులమై ఘోరవిపినములకు । వచ్చి యిమ్మెయిఁ దప మున్నవార మేము;
బాల సుకుమారి యిది జనపాల! యడవి । నుండి మాతోడియిడుమకు నోర్చునయ్య?' 192

ప్రతిపదార్థం: జనపాల!= రాజా! ఓ అశ్వపతీ!; ఏము= మేము విగతరాజ్యులము+ఐ= పోయినరాజ్యం కలవారమై; ఘోర, విపినములకున్= భయంకరమైన అడవులకు; వచ్చి= అరుదెంచి; ఇమ్మెయిన్= ఈ రీతిగా; తపము+ఉన్నవారము= తపస్సు చేసికొంటూ ఉన్నవాళ్ళం; బాల= చిన్నపిల్ల; సుకుమారి= మిగులు కోమలత్వం కలది; ఇది= ఈమె, సావిత్రి; అడవిన్+ఉండి= అరణ్యంలో నివసించి; మాతోడి ఇడుమకున్= మాతోపాటు కష్టాలు పడటానికి; ఓర్చునయ్య?= సహింపగలుగునయ్య?

తాత్పర్యం: అశ్వపతికి ద్యుమత్సేనుడు ఈ విధంగా చెప్పాడు: 'మేము రాజ్యాన్ని కోల్పోయి భీతిగొల్పే అడవులకు వచ్చి ఈ విధంగా తపస్సు చేసికొంటున్నాము. ఓ అశ్వపతిమహారాజా! మీ అమ్మాయి చిన్నపిల్ల. మిక్కిలి సుకుమారి. మాతో ఈ అడవులలో ఉండి ఈ కష్టాలు పడుతూ కాపురం చేయకలదా?'

వ. అనిన నశ్వపతి యతని కి ట్లనియె. 193

తాత్పర్యం: అనగా అశ్వపతి ద్యుమత్సేనుడితో ఇట్లా అన్నాడు.

చ. 'కలిమియు లేమియున్ సతముగా; వవి సెందినచోఁ జెలంగుచున్
గలఁగుచు నున్కి ధీరులప్రకారమె? లెస్సగ నింతవట్టు నేఁ
దెలియుదుఁ జెప్పెదన్ వసుమతీవర! పిన్న యనంగ నేల? నే
కొలఁదియుఁ గాదు; ధీరమతి గూఁతురు; పేర్కొనఁ జాలు పెంపునన్. 194

ప్రతిపదార్థం: వసుమతీ+వర!= ఓ రాజా; ద్యుమత్సేనా!; కలిమియున్= సంపదయున్నూ; లేమియున్= దారిద్ర్యమున్నూ; సతము కావు= శాశ్వతం కావు; అవి= కలిమి లేములు; చెందినచోన్= ఏర్పడితే; చెలంగుచున్= అతిశయిస్తూ; కలఁగుచున్= కలతచెందుతూ; ఉన్కి= ఉండటం; ధీరుల, ప్రకారమె?= ధైర్యవంతుల పద్ధతియా?; లెస్సగన్= మేలుగా; ఇంత+పట్టు= ఇంతమేర; నేన్+తెలియుదున్= నేను ఎఱుగుదును; చెప్పెదన్= వచిస్తాను; కూఁతురు= నాపుత్రిక సావిత్రి; పిన్న+అనంగన్+ఏల= (సావిత్రి) చిన్నపిల్ల అనటం ఎందుకు; ఏ కొలదియున్+కాదు= అంత తక్కువది కాదు (శక్తియున్నదే); పేర్కొనన్+చాలు= ఎన్నదగిన; పెంపునన్= గొప్పదనంలో; ధీరమతి= ధైర్యంతో కూడిన మనస్సు కలది.

తాత్పర్యం: ఓ ద్యుమత్సేనమహారాజా! సంపద, దారిద్ర్యం శాశ్వతాలు కావు. సంపద చేరినప్పుడు పొంగుట. దారిద్ర్యం సంక్రమించినపుడు క్రుంగుట ధైర్యవంతుల లక్షణం కాదు. నాకు తెలిసినంత మేరకు చెప్పగలను. నా కూతురును కేవలం చిన్నపిల్లగా పరిగణించవద్దు. ఆమె శక్తియుక్తులలో తక్కువేమీ కాదు; గొప్పతనంలో పేర్కొనదగిన ధీరమతియే!

క. నీతోడ వియ్యమందగఁ । జేతోగతి నాసఁ జేసి చెచ్చెర ని ట్లే
నేతెంచితి మత్ప్రార్థన । బ్రాఁతిగఁ జేకొనక యునికి పాడియె నీకున్?' 195

ప్రతిపదార్థం: నీతోడన్= ఓ ద్యుమత్సేనమహారాజా నీతో; వియ్యము+అందఁగన్= వైవాహికసంబంధం పెట్టుకొనటానికి; చేతస్+గతిన్= మనస్సులో; ఆసన్+చేసి= ఆశించి; చెచ్చెరన్= శీఘ్రంగా; ఇట్లు= ఈరీతిగా; ఏన్= నేను; ఏతెంచితిన్= వచ్చాను; మత్+ప్రార్థన= నా విన్నపం; బ్రాఁతిగన్= ప్రీతితో; చేకొనక+ఉనికి= స్వీకరించకపోవటం; నీకున్= నీకు; పాడి+ఎ= (పాడియె?) న్యాయమా? (న్యాయంకాదు).

తాత్పర్యం: ఓ ద్యుమత్సేనమహారాజా! నేను నీతోడ వియ్యమందాలని మనస్సులో ఆశించి శీఘ్రంగా నీవద్దకు వచ్చాను. నీవు నావిన్నపాన్ని మన్నించకుండటం న్యాయం కాదు.

సావిత్రి సత్యవంతుని వివాహం బగుట (సం. 3-279-25)

వ. అనుటయు నయ్యంధనృపతి తత్సంబంధంబునకు సంతసిల్లి నిజాశ్రమవాసు లైన మునులం గూర్చుకొని శుభలగ్నంబున సత్యవంతునకు సావిత్రిం బరిణయంబు సేసె; నయ్యశ్వపతియునుం గూఁతునకు నల్లునకు వివిధాంబరాభరణాది వస్తువిశేషంబు లొసంగి నిజపురంబున కరిగెఁ; బదంపడి. 196

ప్రతిపదార్థం: అనుటయున్= అని అశ్వపతి చెప్పటమున్నూ; ఆ+అంధనృపతి= ఆ గ్రుడ్డిరాజు; తత్+సంబంధంబునకున్= ఆ వివాహసంబంధానికి, చుట్టరికానికి; సంతసిల్లి= సంతోషించి; నిజ+ఆశ్రమవాసులు+ఐన= తన ఆశ్రమంలో నివసిస్తున్న; మునులన్= ఋషులను; కూర్చుకొని= కూడగట్టుకొని; శుభలగ్నంబునన్= మంచిముహూర్తంలో; సత్యవంతునకున్= చిత్రాశ్వుడికి; సావిత్రిన్= సావిత్రిని; పరిణయంబు+చేసెన్= పెండ్లిచేశాడు; ఆ+అశ్వపతియును; కూఁతునకున్= పుత్రికకు; అల్లునకున్= జామాతకు; వివిధ+అంబర+ఆభరణ+ఆది, వస్తువిశేషంబులు= పెక్కువస్త్రాలు, భూషణాలు మున్నగు వస్తువులు; ఒసంగి= ఇచ్చి; నిజపురంబునకున్= తన రాజధానికి; అరిగెన్= వెళ్ళాడు; పదంపడి= పిమ్మట.

తాత్పర్యం: అశ్వపతి చెప్పిన మాటలకు గ్రుడ్డిరాజు ద్యుమత్సేనుడు సంతోషించి సత్యవంతుడికి సావిత్రితో వివాహం నిశ్చయించాడు. తన ఆశ్రమవాసులైన ఋషులు శుభముహూర్తం నిర్ణయించగా పెండ్లి జరిపించాడు. అశ్వపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తనకూతురికి అల్లుడికి పెక్కుకానుకలు, వస్త్రాలు, ఆభరణాలు మున్నగువస్తువుల నిచ్చి, తనరాజధానికి తరలి వెళ్ళాడు. అటుపిమ్మట.

తే. **పడఁతి రమణీయభూషణాంబరవిలాస । ముజ్జగించి వనాంతరయోగ్యలీల**
వల్కలాజినవసనయై వదల కధిక । భక్తి భర్తృ శుశ్రూషణపరత నుండె. **197**

ప్రతిపదార్థం: పడఁతి= వనిత (సావిత్రి); రమణీయభూషణ+అంబర, విలాసము= అందమైన ఆభరణాలతో వస్త్రాలతో కూడిన హొయలు; ఉజ్జగించి= వదలిపెట్టి; వన+అంతర, యోగ్య, లీలన్= అడవిలో నివసించుటకు తగిన విధంగా; వల్కల+అజిన, వసన+ఐ= నారచీరలు; లేడిమున్నగువాటిచర్మాలు వస్త్రములుగా కలదియై; అధికభక్తిన్= మిక్కిలి పూజ్యమైన భావాన్ని; వదలక= విడువక; భర్తృ, శుశ్రూషణ, పరతన్+ఉండెన్= భర్త యొక్క పరిచర్యయందలి ఆసక్తితో ఉండింది.

తాత్పర్యం: సావిత్రి అందమైన ఆభరణాలు, వస్త్రాలు మున్నగు వాటిని ధరించే హొయలు పరిత్యజించి అడవిలో నివసించటానికి అనువయిన నారచీరలు, తోలువలువలు ధరిస్తూ, మిక్కిలిభక్తితో భర్తకు పరిచర్య చేస్తూ ఉండింది.

క. **ఆ మెలఁత సేయు సవినయ । సామకథల మృదుగభీరసంభావనలన్**
మామయు నత్తయు సంతో । షామృతమునఁ దేలి రంతరంగములఁ దగన్. **198**

ప్రతిపదార్థం: మామయున్= మామగారును, భర్తతండ్రియును; అత్తయున్= అత్తగారును, భర్తతల్లియును; ఆ మెలఁత= ఆ పడతి సావిత్రి; చేయు= ఒనరించునట్టి; సవినయసామకథలన్= అణకువతో కూడిన సాత్త్వికవర్తనముతోను; మృదు, గభీర, సంభావనలన్= మెత్తనైన లోతైన (గాఢమైన) మన్ననలతోను; అంతరంగములన్= మనస్సులతో; తగన్= ఒప్పిదంగా; సంతోష+అమృతమునన్= ఆనందం అనే అమృతంలో; తేలిరి= క్రీడించారు.

తాత్పర్యం: సావిత్రి చేసే పరిచర్యలవలన, వినయంతో గూడిన మన్ననలవలన, సహజమైన వర్తనలవలన, మంచి మాటలవలన ఆమె అత్తమామల మనస్సులు రంజిల్లాయి. వారు సంతోషం అనే అమృతంలో తేలియాడారు.

విశేషం: (1) అమృతము - త్రాగితే చావులేకుండ చేసే పానీయం. ద్రావకం. ఇట సంతోషమే అమృతద్రవంగా చెప్పబడింది. (2) అలం : రూపకం.

వ. **సావిత్రియుఁ దనమగని యాయుఃప్రమాణంబు నారదముని చెప్పిన దినంబు మొదలుగా ననుదినంబును లెక్కయిడికొనుచుండె; నిట్లు వర్తిల్లుచుండ నాలుగుదివసంబులు గొఱంతగా నొక్కసంవత్సరంబు గడచిన.** **199**

ప్రతిపదార్థం: సావిత్రియున్= సావిత్రియు; తనమగని+ఆయుస్+ప్రమాణంబు= తనభర్తయొక్క ఆయువుయొక్క పరిమితి; నారదముని= నారదమహర్షి; చెప్పిన= వచించిన; దినంబు= రోజు; మొదలుగాన్= ఆరంభంగా; అనుదినంబును= ప్రతిరోజును; లెక్క+ఇడికొనుచున్+ఉండెన్= లెక్కపెట్టుకుంటూ ఉండింది; ఇట్లు= ఈ రీతిగా వర్తిల్లుచుండన్ = మెలగుతూ ఉండగా; నాలుగుదివసంబులు= నాలుగునాళ్ళు; కొఱంతగాన్= తక్కువగా; ఒక్కసంవత్సరంబు= ఒక్కయేడు; కడచినన్= జరుగగా.

తాత్పర్యం: సావిత్రి నారదమహాముని చెప్పినప్రకారం తనమగడి ఆయుః ప్రయాణం లెక్కించుకొంటూ ఉన్నది. ఈ విధంగా ప్రవర్తిస్తూ ఉండగా నాలుగునాళ్ళు తక్కువగా ఒకసంవత్సరం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. నాలవుదినంబు పతిమృతి । కాలం బని మది నెఱింగి కడునిష్ఠమెయిం
జాల భరంబుగఁ బూనెను । బాల త్రిరాత్రోపవాసపరమవ్రతమున్. 200

ప్రతిపదార్థం: బాల= అమ్మాయి సావిత్రి; నాలవుదినంబు= నాలుగవనాఁడు; పతిమృతికాలంబు+అని= భర్త మరణించే సమయం అని; మదిన్= చిత్తంలో; ఎఱింగి= తెలిసికొని; కడు= మిక్కుటమైన; నిష్ఠ, మెయిన్= దీక్షతో; చాలన్= మిక్కిలి; భరంబుగన్= బరువుతో; నిష్ఠతో; త్రిరాత్ర+ఉపవాస, పరమవ్రతమున్= పగళ్లతో గూడిన మూడురాత్రుల పాటు నిరాహార మహాదీక్షను; పూనెను= వహించింది.

తాత్పర్యం: ఆ నాటికి నాలుగవరోజు భర్త మరణించే గడువుగా మనస్సులో తెలిసికొనిన సావిత్రి మిక్కుటమైన నిష్ఠతో త్రిరాత్రోపవాస మహావ్రతాన్ని (మూడునాళ్ళ నిరాహారదీక్షను) పూనింది.

వ. దానికి విస్మయంబంది ద్యుమత్సేనుండు గోడలిం బిలిచి, 'తల్లీ! యి ట్లేల దుస్తరం బగు వ్రతంబు దొడంగితి?' తనిన నమ్మద్రరాజతనయ వినయంబుతో ని ట్లనియె. 201

ప్రతిపదార్థం: దానికిన్= సావిత్రి పూనిన - మూడునాళ్ల నిరాహారదీక్షకు; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; ద్యుమత్సేనుండు; కోడలిన్= కొడుకుభార్యను- సావిత్రిని; పిలిచి= ఆహ్వానించి; తల్లీ!= అమ్మా! సావిత్రీ!; ఇట్లు= ఈ రీతిగా; ఏల= ఎందుకు; దుస్తరంబు+అగు= దాటరాని (కఠినమైన); వ్రతంబు= నోము; తొడంగితి(వి)= ఆరంభించావు; అనినన్= అని అడుగగా; ఆ+మద్రరాజతనయ= ఆమద్రరాజుయొక్క కూతురు- సావిత్రి; వినయంబుతోన్= నమ్రతతో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పింది.

తాత్పర్యం: సావిత్రి పూనిన దీక్షకు ఆశ్చర్యం చెంది, ద్యుమత్సేనుడు కోడలిని పిలిచి, 'తల్లీ! ఇట్టి కఠోరవ్రతాన్ని ఎందుకు పూనావు?' అని ప్రశ్నించగా, ఆ మద్రరాజుపుత్రిక ఇట్లా నమ్రతతో బదులు పలికింది.

క. 'మీరు మదీయం బగు వ్రత । భారమునకు వగవవలదు; పరమశుభంబుల్
గోరి యొనరింపఁ బూనితిఁ; । గారణమును మీకు నెఱుఁగఁగా నగుఁ బిదపన్.' 202

ప్రతిపదార్థం: మీరు= మీరు; మదీయంబు+అగు= నాదైన; వ్రతభారమునకున్= నోమునందలి బరువుకు(నిష్ఠకు); వగవన్‌వలదు= విచారించ వద్దు; పరమశుభంబుల్= మిక్కిలిగొప్పవైన శుభాలను; కోరి= కాంక్షించి; (ఈ వ్రతాన్ని); ఒనరింపన్+పూనితిన్= చేయసమకట్టాను; కారణమును= హేతువును; మీకున్= మీకు; పిదపన్= పిమ్మట; ఎఱుఁగఁగాన్+అగున్= తెలియవస్తుంది.

తాత్పర్యం: 'మీరు నావ్రతభారాన్నిగూర్చి విచారించకండి. మిక్కిలిగొప్పవైన శుభాలను కోరి నే నీనోముకు ఉపక్రమించాను. కారణం మీకు పిదప తెలియ వస్తుంది.

వ. అనిన నతం 'డట్లైన మేలు గాక' యనియె; నంతఁ జతుర్థదివసంబున. 203

తాత్పర్యం: అని సావిత్రి పలుకగా ద్యుమత్సేనుడు 'అట్లైతే నీకు శుభం కలుగుగాక' అని దీవించాడు. ఇక నాలుగవ రోజున.

సీ. **కడురేపకడయ మేల్కని యింతి నిజభర్తృ । మరణదినం బని మానసమునఁ**
దద్దయు శోకసంతాపంబు గదురంగ । దినముఖోచితవిధుల్ దీర్చి భక్తిఁ
బతికి సమంచితపావనపరిచర్య । యప్పుడు కడువేడ్క నాచరించి
యత్తకు మామకు నచటివృద్ధులకును । వేర్వేఱ ప్రణమిల్లి వేడ్క వారు

తే. **తనకు సౌభాగ్యభాగ్య వర్ధనము గాఁగ । నిచ్చు దీవన మదిలో గ్రహించి యున్నఁ,**
బ్రొద్దు జా మెక్కుటయుఁ బూవుఁబోఁడిఁ బిలిచి । మామ యిట్లని పలికె సన్మాన మెసఁగ. **204**

ప్రతిపదార్థం: కడురేపకడ+అ= మిక్కిలి ప్రాతఃకాలంలోనే; మేల్కని= నిదురనుండి లేచి; ఇంతి= పడతి- సావిత్రి; నిజ, భర్తృ, మరణదినంబు+అని= తనయొక్క మగడు మరణించే రోజు అని; మానసమునన్= మనస్సులో; తద్దయున్= మిక్కిలి; శోకసంతాపంబు= దుఃఖబాధ; కదురంగన్= వ్యాపించగా; దిన, ముఖ+ఉచిత, విధుల్= ఉదయం (ప్రాతఃకాలంలో) చేయదగిన పనులు, కాలకృత్యాలు; తీర్చి= నిర్వహించి; భక్తిన్= పూజ్యభావంతో; పతికిన్= భర్తకు, సత్యవంతుడికి; సమంచిత, పావన, పరిచర్య= ఒప్పిదమైన పవిత్రమైన సేవ; అప్పుడు= ఆసమయంలో; కడువేడ్కన్= మిక్కుటమైన ప్రీతితో; ఆచరించి= చేసి; అత్తకున్= భర్త తల్లికి; మామకున్= భర్తతండ్రికి; అచటి= అచట ఉన్న; వృద్ధులకును= పెద్దలకుకూడా; వేఱు+వేఱ=(వేర్వేఱ) ప్రత్యేకంగా ఒక్కొక్కరికి; ప్రణమిల్లి= నమస్కరించి; వేడ్కన్= ప్రీతితో; వారు= అత్తమామలు, పెద్దలు; సౌభాగ్య, భాగ్య వర్ధనముగాఁగన్= మాంగల్యం అనే సంపద అభివృద్ధి అయ్యేటట్లుగా; ఇచ్చు= ఒసగు; దీవన= ఆశీర్వచనం; మదిలోన్= మనస్సులో; గ్రహించి= పుచ్చుకొని; ఉన్నన్= ఉండగా; ప్రొద్దు= సూర్యుడు; జాము+ఎక్కుటయున్= ఏడున్నరగడియలకాలం అగుటయున్నూ; పూవుఁబోఁడిన్= పూవువంటి సుకుమారశరీరం కలది - సావిత్రిని; పిలిచి= ఆహ్వానించి; సన్మానము= గౌరవం; ఎసఁగన్= శోభిల్లగా; మామ= భర్తతండ్రి ద్యుమత్సేనుడు; ఇట్లు+అని, పలికెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సావిత్రి ప్రొద్దుపొడవటానికి ముందే నిదురనుండి లేచి, ఆనాడు తనభర్త మరణించే దివసమని మనస్సులో మిక్కిలి పరితపించి, ప్రాతర్వేళలో కాల్యకృత్యాలు నెరవేర్చింది. భక్తితో భర్తకు శుశ్రూష చేసి, అత్తమామలకు, పెద్దలకు ప్రత్యేకంగా ప్రతిఒక్కరికి నమస్కరించి, వారు ప్రీతితో 'మాంగల్యసంపదను చిరకాలం పెంపొందే విధంగా అనుభవించుము' అని ఇచ్చే ఆశీర్వాదాలను మనసార గ్రహించింది. అంతలో జాము ప్రొద్దెక్కింది. సావిత్రిమామగారు పువ్వువలె సుకుమార మైన శరీరంగల కోడలిని పిలిచి మన్నించి ఈవిధంగా పలికాడు.

క. **'కడునుగ్రం బగు వ్రత మిది । దొడఁగితి; దివసత్రయంబుతో నది సెల్లెం;**
బడఁతిరో! యెంతయు దస్సితి: । దడయక పారణ యొనర్పఁదగదే యింకన్'. **205**

ప్రతిపదార్థం: ఇది= (ఈ మూడురోజుల నిరాహారదీక్ష); కడున్= మిక్కిలి; ఉగ్రంబు+అగు= కఠోరమయిన; వ్రతము= నోమును; తొడఁగితి(వి)= పూనికతో జరిపావు; దివసత్రయంబుతోన్= మూడునాళ్లతో; అది= ఆవ్రతం; చెల్లెన్= ముగిసింది; పడఁతిరో!= ఓ వనితా, సావిత్రీ!; ఎంతయున్= మిక్కిలి; డస్సితి(వి)= అలసిపోయావు. తడయక= ఆలస్యం చేయక; ఇంకన్= ఇకమీద; పారణ= వ్రతం పూర్తిగావించిన మరునాడు చేసే భోజనం; ఒనర్పన్+తగదే= చేయదగదా, చేయవచ్చునుకదా.

తాత్పర్యం: 'ఓ సావిత్రి! నీవు పూనినది కఠోరవ్రతం. ఆ మూడునాళ్ళూ గడచాయికదా. ఇక ఈ నాలుగవనాడు నీవు వ్రతాంతభోజనం చేయదగును. నీవు మిక్కిలి డస్సిఉన్నావు. ఇక ఆలసించటం తగదు.'

వ. అనిన సావిత్రి యతని కి ట్లనియె. 206

తాత్పర్యం: అనగా సావిత్రి ద్యుమత్సేనుడితో ఇట్లా పలికింది.

ఆ. 'అధిప! ప్రొద్దుగ్రుంకునంతకు నేఁడును । గుడువఁదగదు నాకుఁ; గోరి యిట్లు
గాఁగ వ్రతముఁ బూనుకాలంబునన యేను । నిశ్చయించుకొనిన నియమ మిదియ.' 207

ప్రతిపదార్థం: అధిప!= మహారాజా!; ప్రొద్దు= సూర్యుడు; క్రుంకునంతకున్= అస్తమించేవరకును; నేఁడును= ఈనాడున్నూ; నాకున్= నాకు; కుడువన్+తగదు= భోజనం చేయరాదు; కోరి= వాంఛించి; ఇట్లు= ఈ రీతిగా; కాఁగన్= అయ్యేటట్లు; వ్రతమున్= నోమును; పూనుకాలంబునన్+అ= మొదలుపెట్టే సమయంలోనే; ఏను= నేను; నిశ్చయించుకొనిన= నిర్ణయించుకొనిన; నియమము= ఏర్పాటు, సమయం; ఇది+అ= ఇదే సుమా.

తాత్పర్యం: 'మహారాజా! సూర్యుడు అస్తమించే వరకు ఈనాడుకూడ నేను భోజనం చేయటానికి వీలు లేదు. ఈ వ్రతాన్ని ఆరంభించటానికి ముందే ఈ నియమాన్ని నేను ఏర్పరచుకొని ఉన్నాను'.

వ. అనియె; నప్పుడు సత్యవంతుండు సమిత్కుశఫలాహరణార్థంబు వనంబునకుం గదలినం జూచి సావిత్రి యతనిఁ జేరంజని 'వనంబున కేనును నీతోడఁ జనుదెంతుఁ; దోడ్కొనిపోవలయు' ననిన నతండు 'నీవు త్రిరాత్రోపవాసంబునంజేసి యెంతయు డస్సినదానవు; రానోప' వనిన నత్తన్వి వాని కి ట్లనియె. 208

ప్రతిపదార్థం: అనియెన్= అని చెప్పింది; అప్పుడు= ఆ సమయంలో; సత్యవంతుండు; సమిత్+కుశ, ఫల+ఆహరణ+అర్థంబు= సమిధలు, దర్భలు, పండ్లు తీసికొనిరావటంకొరకై; వనంబునకున్= అరణ్యానికి (పోవుటకై); కదలినన్= బయలుదేరగా; చూచి= అరసి; సావిత్రి; అతనిన్= సత్యవంతుడిని; చేరన్+చని= సమీపించి; వనంబునకున్= అడవికి; ఏనును= నేనును; నీతోడన్= నీతోపాటు; చనుదెంతున్= వస్తాను; తోడ్కొనిపోవలయున్= వెంట తీసికొనిపోవలయును; అనినన్= అని పల్కగా; అతండు= సత్యవంతుడు; నీవు= ఓసావిత్రీ నీవు; త్రిరాత్ర+ఉపవాసంబునన్+చేసి= మూడుదినాలు ఉపవాసం చేయటంచేత; ఎంతయున్= మిక్కుటంగా; డస్సినదానవు= అలసి ఉన్నదానవు; రాన్+ఓపవు= వచ్చుటకు శక్తిఉన్నదానవు కావు; అనినన్= అని సత్యవంతుడు చెప్పగా; ఆ+తన్వి= ఆ సుకుమారి సావిత్రి; వానికిన్= అతడికి - సత్యవంతుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: అని సావిత్రి చెప్పింది. ఆసమయంలో సత్యవంతుడు సమిధలు, దర్భలు, పండ్లు తేవటానికై అడవికి పోవసమకట్టాడు. అంత సావిత్రి సత్యవంతుడిని చేరి, 'అడవికి ఈనాడు నేనుకూడా నీతో వస్తాను. నన్నుకూడ తీసికొని పొమ్మ' అన్నది. సత్యవంతుడు, 'నీవు మూడురాత్రుల ఉపవాసవ్రతం చేసి మిక్కుటంగా అలసి ఉన్నదానవు. నీవు రాజాలవు' అన్నాడు. అంతట సావిత్రి సత్యవంతుడితో ఇట్లా చెప్పింది.

విశేషం: ఉపవాసం అంటే రూఢ్యర్థం నిరాహారదీక్ష. దీనికి ఆధ్యాత్మికవేత్తలు చెప్పే అర్థం ఉప= దగ్గరగా, వాసము= వసించటం. అనగా దేవుడికి దగ్గరగా ఉండటం. ఉపవాసంలో ఆహారం తీసికొనకుండటమేకాక, దైవానుసంధానం, ఆత్మావలోకనం- అపరిహార్యమైన అంశాలు. ప్రపంచంలోని మతాలు అన్నియున్నూ ఏదోవిధమైన ఉపవాసదీక్షను విధిస్తున్నవి. సముచిత మైన ఉపవాసంవలన ఆరోగ్యం మెరుగవటం, అవయవాలకు విశ్రాంతి లభించటంమాత్రమే గాక, మెదడుకు ఒకరకమైన ఉత్తేజం.

చురుకుదనం ఏర్పడటం అనుభవసిద్ధం. ఆధ్యాత్మికభావపరిపుష్టమైన ఉపవాసంవలన ఇంద్రియాతీతశక్తులు సంక్రమిస్తాయి. సావిత్రి ఆవిధంగా చర్మచక్షువులు చూడలేని యమధర్మరాజును విస్ఫారినమనోనేత్రాలతో దర్శించగలిగిందని కొందరు చెప్తుతారు.

మ. 'ఉపవాసశ్రమ మించుకేనియును నాయుల్లంబునం దోఁప దీ
విపినంబుజ్జ్వలపుష్పపల్లవఫలావిర్భూత నానాలతా
గపరీతం బన విందుఁ; జూడఁగ మదిం గౌతూహలంబయ్యెః న
న్నుపరోధింపకు మింతవట్టు చన వీ యుక్తుండ వెబ్భంగులన్. 209

ప్రతిపదార్థం: ఉపవాసశ్రమము= నిరాహారదీక్షవలన ఏర్పడిన బడలిక; ఇంచుక+ఏనియును= కొంచెంకూడ; నా+ఉల్లంబునన్= నాహృదయంలో; తోఁపదు= కన్పించదు; ఈ విపినంబు= ఈ అడవి; ఉత్+జ్వల, పుష్ప, పల్లవ, ఫల+ఆవిర్భూత, నానా, లతా+అగ, పరీతంబు+అనన్= ప్రకాశించే పూవులు, చిగుళ్ళు, ఫలాలు పుట్టెడి పెక్కులతలతో, చెట్లతో వ్యాపించి ఉన్నది అని; విందున్= వింటాను; చూడఁగన్= (ఈ అడవిని) దర్శించగా; మదిన్= చిత్తంలో; కౌతూహలంబు= వేడుక; అయ్యెన్= అయింది; నన్నున్; ఉపరోధింపకుము= అడ్డు పెట్టకుము; ఏ+భంగులన్= ఏ రీతులలో ఆలోచించినా; ఇంత+పట్టు= ఇంతమాత్రం; చనవు= చొరవతోడి కోరికను; ఈన్= ఇవ్వటానికి; యుక్తుండవు= తగినవాడవు.

తాత్పర్యం: 'నిరాహారదీక్షవలన ఏర్పడిన బడలిక నా హృదయంలో ఏమాత్రం కన్పించటం లేదు. ఈ అడవి అందంతో శోభిల్లే పువ్వులు చిగురుటాకులు పండ్లు మున్నగు వాటిని కాచే లతలతో, చెట్లతో కూడిందని విన్నాను. ఈ అడవిని చూడాలని నామనసు ఉవ్విళ్ళూరుతున్నది. నన్ను ఆటంకపరచకుము. ఏవిధంగా ఆలోచించినను ఈ మాత్రం చనవు నీవు నా కీయదగునుకదా!'

వ. అనిన నతం 'డట్లకాక చనుదె' మ్మనుటయు సావిత్రి చయ్యనంజని భార్యాసహితుం డయి యున్న తనమామకుం బ్రణమిల్లి 'మీకొడుకు వనంబునకు నగ్నిహోత్రార్థంబు సమిధలు దేర నరిగెడు; నాకును నతనితోడన చని వనంబు సూడ వేడుక యయ్యెడు; మీరు నా కివ్వరంబు గృప సేయవలయు' ననిన వారును 'నిమ్మగువ యెన్నండును నెయ్యదియును నడుగ; దిత్తెఱంగు దీనికిం బ్రియంబై యున్నది; మాకు నివారింప నేల?' యని తలంచి యనుమతించుటయు, నయ్యిరువురయడుగులం బడి వీడ్కొని. 210

ప్రతిపదార్థం: అనినన్= అని సావిత్రి చెప్పగా; అతండు= అతడు- సత్యవంతుడు; అట్లు+అ, కాక= అటులే జరుగుగాక; చనుదెమ్ము= రమ్ము; అనుటయున్= అని అనగానే; సావిత్రి= సావిత్రి; చయ్యనన్= వేగంగా; చని= వెడలి; భార్యాసహితుండు+అయి= భార్యతో కూడినవాడయి; ఉన్న= ఉన్నటువంటి; తనమామకున్= ద్యుమత్సేనుడికి; ప్రణమిల్లి= నమస్కరించి; 'మీకొడుకు= మీపుత్రుడు - సత్యవంతుడు; వనంబునకున్= అడవికి; అగ్నిహోత్ర+అర్థంబు= అగ్నికార్యంకొరకు; సమిధలు= మోదుగుపుల్లలు మొదలైనవి; తేరన్= తేవటానికి; అరిగెడున్= వెడలుతున్నాడు; నాకును= నాకుకూడ; అతనితోడన్+అ= ఆయనతోడనే; చని= వెళ్ళి; వనంబు= అడవిని; చూడన్= చూచుటకు; వేడుక+అయ్యెడున్= కుతూహలం కలిగింది; మీరు= మీరు (అత్తమామలు); నాకున్= నాకు; ఈ+వరంబు= ఈ విశేషమైన కోరిక; కృప+చేయవలయున్= అనుగ్రహించవలెను;' అనినన్= అని (సావిత్రి) చెప్పగా; వారును= ఆ అత్తమామలును; ఈ+మగువ= సావిత్రి; ఎన్నండును= ఎప్పుడును; ఎయ్యదియును= ఏదియున్నా; అడుగదు= కోరదు; ఈ+తెఱంగు= ఈ రీతి; దీనికిన్= ఈమెకు - సావిత్రికి; ఎన్నండును= ఎప్పుడును; ఎయ్యదియును= ఏదియున్నా; అడుగదు= కోరదు; ఈ+తెఱంగు= ఈ రీతి; దీనికిన్= ఈమెకు- సావిత్రికి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రియంబు+ఐ+ఉన్నది= ఇష్టం అయి ఉన్నది; మాకున్; నివారింపన్+ఏల= వద్దనటం ఎందుకు? అని తలంచి= అని ఆలోచించి; అనుమతించుటయున్= అంగీకరించుటయున్నూ; ఆ+ఇరువుర+అడుగులన్+పడి= ఆ ఇద్దరిపాదాలపై వ్రాలి (నమస్కరించి); వీడ్కొని= వెళ్ళటానికి సెలవు గైకొని.

తాత్పర్యం: అని సావిత్రి చెప్పగా సత్యవంతుడు, 'సరే రమ్మ' అన్నాడు. అంతట సావిత్రి వేగంగా వెడలి, భార్యతో పాటుగ నున్న మామగారు ద్యుమత్సేనుడికి నమస్కరించి 'మీకొడుకు అగ్నికార్యాలు చేయటానికి చిదుగులు తేవటానికి అరణ్యంలోకి పోతున్నాడు. నాకును ఆయనతో కలిసి వెళ్ళి అరణ్యాన్ని దర్శించవలెనని కుతూహల మేర్పడింది. మీరు నా యీ కోరికను అనుగ్రహించవలెను' అని విన్నవించుకొన్నది. ఆ అత్తమామలు, 'ఈ సావిత్రి ఎన్నడూ ఏదీ మనలను ఇంతవరకు కోరిందిలేదు. అరణ్యాన్ని దర్శింటానికి ఈ రీతిగా వేడుక పడుతున్నది. మన మెందుకు ఈమెను నివారించాలి?' అని తలపోసి అంగీకరించారు. సావిత్రి అత్తమామలు ఇరువురి పాదాలకు మ్రొక్కి, వెళ్ళటానికి సెలవు తీసికొన్నది.

సత్యవంతుఁడు సావిత్రీ సహితుండై వనంబునకుం బోవుట (సం. 3-280-29)

క. చిత్తంబునఁ బైకొనియెడు । నుత్తలము నడంచి ముఖపయోరుహమునఁ ద
ళ్కొత్తెడు వెడనవ్వునఁ బ్రియు । చిత్తం బిగురొత్తఁ జనియెఁ జెలువ యడవికిన్. 211

ప్రతిపదార్థం: చెలువ= సుకుమారి సావిత్రి; చిత్తంబునన్= మనస్సులో; పైకొనియెడు= ఉబికివచ్చే; ఉత్తలమున్= పరితాపాన్ని; అడంచి= అణచికొని; ముఖ, పయస్+రుహమునన్= మొగం అనే పద్మంలో; తళ్కు+ఒత్తెడు= వెలుగొందే; వెడనవ్వునన్= చిరునవ్వుతో; ప్రియుచిత్తంబు= భర్తమనస్సు; ఇగురు+ఒత్తన్= చిగురించగా; అడవికిన్= అరణ్యానికి; చనియెన్= వెళ్ళింది.

తాత్పర్యం: అంతరంగంలో చెలరేగిన విచారాన్ని అణచివేసికొంటూ, ముఖపద్మంలో మందహాసం వెలుగొందగా, ప్రియుడైన సత్యవంతుడిమనస్సు చిగురించేటట్లుగా సుకుమారి అయిన సావిత్రి అరణ్యానికి వెళ్ళింది.

వ. ఇట్లాదంపతులు మందగమనంబున నరిగి పరిసరారణ్యంబు దటియం జొచ్చి; రప్పుడు. 212

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఆ దంపతులు= ఆ భార్యాభర్తలు, సావిత్రీ సత్యవంతులు; మందగమనంబునన్= మెల్లనినడకతో; అరిగి= వెళ్ళి; పరిసర+అరణ్యంబు= సమీపాన ఉన్న అడవి; తటియన్+చొచ్చిరి= సమీపానికి చేరారు; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా ఆ దంపతులు సావిత్రియు సత్యవంతుడును మెలమెల్లగా నడచి, సమీపంలో ఉన్న అరణ్యాన్ని సమీపించారు. ఆ సమయంలో.

సీ. కమనీయ కమలినీ కల్లోలవీథులఁ । గదలు రాయంచలగతుల యొప్పు,
బహుపుష్పపల్లవప్రకర చిత్రితములై । తనరారు తరులతాతతుల సొంపు,
మకరందరసపానమదవిలోలంబులై । క్రాలెడి యెలదేఁటి గముల యులివుఁ,
బరిపక్వమంజుల ఫలరసోద్ధతములై । పలుకు రాచిలుకలు పటురవంబుఁ,

ఆ. బ్రియుఁడు వేఱు వేఱ ప్రీతిమైఁ జూపుచుఁ । జెప్పుచును జనంగఁ జిగురుఁబోఁడి
గనుచు వినుచు నిర్వికారసల్లాప మిం । పార నతనితెఱఁగు నరయుచుండె. 213

ప్రతిపదార్థం: కమనీయ, కమలినీ, కల్లోలవీథులన్= సుందరా లైన సరోవరాల కెరటాలనే తెరువులలో (వరుసలలో); కదలు= నడయాడు; రాయంచల= రాజహంసల; గతుల+ఒప్పు= కదలికల అందం; బహు, పుష్ప, పల్లవ, ప్రకర, చిత్రితములు+ఐ= పెక్కుపువ్వులయొక్క, చిగురుటాకుల సముదాయాలయొక్క రంగురంగులతో శోభిల్లునవై; తనరారు= విలసిల్లే; తరులతాతతులసొంపు= చెట్లయొక్కయు, తీగెలసమూహాలయొక్కయు సొగసు; మకరంద, రస, పాన, మద, విలోలంబులు+ఐ= తేనెద్రవాన్ని త్రాగటంచేత మత్తెక్కి చరించేవి అయి; క్రాలెడి= ఒప్పెడి; ఎలతేఁటిగముల= కొదమ తుమ్మెదలయొక్క; ఉలివున్= ఝుంకారమునూ; పరిపక్వమంజులఫలరస+ఉద్ధతములు+ఐ= పండినవీ మనోహరములైనవీ అయిన పండ్లరసం త్రాగటంచేత గర్వించినవి అయి; పలుకు= మాటాడు; రాచిలుకన్= గండుచిలుకల; పటురవంబున్= పెనురవళులును; ప్రియుఁడు= భర్త- సత్యవంతుడు; వేఱువేఱ= విడివిడిగా; ప్రీతిమైన్= ప్రియమార; చూపుచున్= చూపి; చెప్పుచును= వివరంగా వచిస్తూ; చనంగన్= నడువగా; చిగురుఁబోఁడి= చిగురుటాకులవంటి సుకుమారమైన శరీరం కల సావిత్రి; కనుచున్= చూస్తూ; వినుచున్= ఆలకిస్తూ; నిర్+వికార, సల్లాపము= వికారం లేని మధురభాషణం; ఇంపారన్= ప్రీతిగొలుపగా; అతని తెఱఁగున్= అతడితీరు (సత్యవంతుడితీరుతెన్నులు); అరయుచున్+ఉండెన్= గమనిస్తూ ఉండింది.

తాత్పర్యం: రమణీయసరోవరాల కెరటాల వరుసలలో తేలియాడే రాజహంసల నడలతీరుతీయాలున్నూ, పెక్కుపువ్వులతో, చిగురుటాకులతో రంగురంగులు వెల్లివిరిస్తూ శోభిల్లే చెట్ల, తీగలసొగసున్నూ, తేనెద్రవాన్ని గ్రోలి మత్తెక్కి విహరించే కొదమతుమ్మెదలఝుంకారాలున్నూ, పండినపండ్ల మెత్తనిగుజ్జురసం పీల్చి పొగరెక్కి మాటలు పలికే చిలుకల కలరవాలనూ సత్యవంతుడు విడివిడిగా చూపిస్తూ, వివరించి చెప్తూతూ వెళ్ళుతున్నాడు. చిగురుటాకులవంటి సుకుమారమైన దేహం గల సావిత్రి ప్రియుడు చూపించే సుందరదృశ్యాలను చూస్తూనే ఉన్నది; ప్రియుడు చెప్పే మాటల నాలకిస్తూ ఉన్నది. నిర్వికారసల్లాపాలతో ఆమె అతడికి బదులు చెబుతూఉంటూనే అతడికి తెలియకుండా ఆతని తీరుతెన్నులను పరిశీలిస్తూ ఉన్నది.

విశేషం: సత్యవంతుడు సౌందర్యలాలసుడై ప్రకృతివైభవాన్ని సహృదయతతో అరసి సావిత్రికి చూపుతున్నాడు. వర్ణించి చెప్తున్నాడు. ఆతడికి రానున్న విపత్తునుగూర్చి తెలియనే తెలియదు. సావిత్రికి రాబోయేఘోరవిపత్తును గూర్చి తెలియును గదా. ఆమె నిర్వికారసల్లాపచాతురి ఉగ్గడించదగింది.

వ. తదనంతరంబ యారాజర్షినందనుండు మధురంబు లగు ఫలంబులు గోయుచు గరిడియ నిండించి, యొక్కయెడఁ బరశుపాతంబునఁ గాష్ఠదళనంబు సేయందొడంగి శ్రమంపడి యొల్లంబోయి గొడ్డలి పుడమిపై వైచి, నిరంతరనిశ్వాసవేగవిషణ్ణవదనుం డగుచు సావిత్రిం గనుంగొని. 214

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట; ఆరాజ+ఋషి, నందనుండు= రాజులలో ఋషి అయిన ద్యుమత్సేనుడికొడుకు సత్యవంతుడు; మధురంబులు+అగు= తియ్యనివి అయిన; ఫలంబులు= పండ్లు; కోయుచున్= త్రెంపుచు; గరిడియ= గంప; నిండించి= నింపి; ఒక్క+ఎడన్= ఒక్కచోట; పరశు, పాతంబునన్= గండ్రగొడ్డలివ్రేటుచేత; కాష్ఠదళనంబు+చేయన్+తొడంగి= కట్టెలు నరకటానికి పూని; శ్రమంపడి= అలసటచెంది; ఒల్లన్+పోయి= డస్సి; గొడ్డలి= పరశువు; పుడమిపైన్= భూమిపై; వైచి= వేసి; నిరంతర, నిశ్వాస, వేగ, విషణ్ణ, వదనుండు+అగుచున్= విడువకుండ వెడలే నిట్టూర్పులవేగంచేత విషాదం పొందిన మొగం కలవాడు ఔతూ; సావిత్రిన్= సావిత్రిని; కనుంగొని= చూచి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అటుపిమ్మట రాజర్షి యగు ద్యుమత్సేనుడిసుతుడైన సత్యవంతుడు తియ్యనిపండ్లను కోసి బుట్టను నింపాడు. అనంతరం గొడ్డలితో కట్టెలను నరకుతూ అలసటచెంది, గొడ్డలి పుడమిపై విడిచాడు. ఎడతెగని నిట్టూర్పులు విడుస్తూ విషాదం చెంది, సావిత్రిని చూచి.

చ. **'ఒడలు వశంబు గాదు, భ్రమ నొందినయట్లు మనంబు దూలెడిం,**
గడఁగి శిరంబు శూలవిశిఖప్రకరంబున నొంచినట్టి ద
య్యెడు, నిలువంగ నోప; నొకయించుకసేపు శ్రమంబు దీఱ నీ
యెడ శయనింతు' నావుడు సితేక్షణ మెత్తని సంభ్రమంబుతోన్. **215**

ప్రతిపదార్థం: ఒడలు= శరీరం; వశంబు+కాదు= స్వాధీనంలో లేదు; మనంబు= చిత్తం; భ్రమన్= మోహము; ఒందిన+అట్లు= పొందినట్లు; తూలెడిన్= వణకి వాలుతున్నది; కడఁగి= పూని; శిరంబు= తల; శూలవిశిఖప్రకరంబునన్= బల్లెములు బాణాల సమూహంచేత; నొంచినట్టిది+అయ్యెడున్= నొప్పి కలిగించినట్టిది అయింది; నిలువంగన్+ఓపన్= నిలబడ జాలను; ఒక+ఇంచుక, సేపు= ఒకకొంతసేపు; ఈ+ఎడన్= ఈ చోట; శ్రమంబు+తీఱన్= అలసట తగ్గేటట్లుగా; శయనింతున్= పండుకొంటాను; నావుడున్= అని (సత్యవంతుడు) చెప్పగా; సిత+ఈక్షణ= తెల్లని కాంతితో గూడిన కన్నులు (చూపులు) గల సావిత్రి; మెత్తని సంభ్రమంబుతోన్= మృదువయిన తత్తరపాటుతో.

తాత్పర్యం: 'శరీరం స్వాధీనం తప్పింది. మనస్సు భ్రమచెందినట్లు తూలుతున్నది. బల్లేలతో బాణాలతో పొడిచినట్లు తలపోటు పుట్టుతున్నది; కొంచెంసేపుకూడ ఇక నిలువలేను. అలసట తీరేవరకు శయనిస్తాను' అని సత్యవంతుడు పలుకగా, సావిత్రి మృదువైన తత్తరపాటుతో.

క. **తనయంకతలము ప్రియుశిర । మున కుపధానముగఁ జేయ భూపతనయుఁ డొ**
య్యన వ్రాలి సోలి నిశ్చే । తనుఁడైనట్లుండెఁ; గొంతతడవున కెదురన్. **216**

ప్రతిపదార్థం: తన+అంక, తలమున్= తన ఒడిని; ప్రియుశిరమునకున్= భర్తయొక్కతలకు; ఉపధానముగన్= తలగడగా; చేయన్= అమర్చగా; భూప తనయుఁడు= రాజకుమారుడు - సత్యవంతుఁడు; ఒయ్యనన్= తిన్నగా; వ్రాలి= ఒరిగి; సోలి= వివశత్వం పొంది; నిశ్చేతనుఁడు+ఐనట్లు+ఉండెన్= ప్రాణాలు లేనట్టివాడుగా ఉండినాడు; కొంత తడవునకున్= కొంతసేపటికి; ఎదురన్= ఎదురుగా.

తాత్పర్యం: సావిత్రి తన అంకతలాన్ని భర్తకు తలగడగా చేసింది. రాజకుమారుడైన సత్యవంతుడు తిన్నగా దానిపై వ్రాలి వివశత్వం చెంది, చైతన్యం లేనివాడుగా ఉండిపోయాడు. కొంతసేపటికి ఎదురుగా.

మ. **కనియెం గోమలి నీలమేఘవిలసత్కాలాంజనాకారు, ఘో**
రనిశాతోత్కటదంష్ట్రు, నుజ్జ్వలచలద్రక్తాక్షుఁ, బ్రత్యగ్ర కాం
చనవర్ణాంబరు, నంత్యకాలదహనజ్వాలాప్రచండున్, జగ
జ్జనసంత్రాసను, నొక్కదివ్యుఁ, బటుపాశప్రౌఢహస్తోద్ధతున్. **217**

ప్రతిపదార్థం: నీల, మేఘ, విలసత్‌కాల+అంజన+ఆకారున్= నల్లని మబ్బువలె శోభిల్లే నల్లని కాటుకవంటి రూపం కలవాడిని; ఘోర, నిశాత, ఉత్కట, దంష్ట్రున్= భయంకరమై, వాడిఅయి, క్రూరములైన కోరలు కలవాడిని; ఉత్+జ్వల, చలత్+రక్త+అక్షున్=

ప్రకాశమానాలై చలించే ఎఱ్ఱనికన్నులు కలవాడిని; ప్రత్యగ్రకాంచనవర్ణ+అంబరున్= పరిశుద్ధమైన బంగారురంగుతో కూడిన వస్త్రాలు కలవాడిని; అంత్య, కాల, దహన, జ్వాలాప్రచండున్= ప్రళయకాలంలోని అగ్నిశిఖవలె భయంకరమైన ఆకృతికలవాడిని; జగత్+జన, సంత్రాసనున్= లోకంలోని జనులకు భీతిని కలిగించేవాడిని; ఒక్కదివ్యున్= ఒకవేలుపును; పటు, పాశ, ప్రౌఢ, హస్త+ఉద్ధతున్= తీక్ష్ణమైన పాశాయుధమును ధరించుటయందలి నేర్పుతోగూడిన చేతిచే గర్వించినవాడిని; కోమలి= సుకుమారి-సావిత్రి; కనియెన్= చూచింది.

తాత్పర్యం: సుకుమారి సావిత్రి తనకట్టెదుట ఒక వేలుపుదొరను చూచింది. ఆ దివ్యపురుషుడు నల్లనిమబ్బువలె శోభిల్లే నల్లనికాటుకవంటి ఆకారం కలవాడు, భయంకరమై వెలుపలికి వ్యాపించిన వాడికోరలు గలవాడు, నెత్తురు రంగు కలిగి మిలమిల మెరసే నేత్రాలు కలవాడు, తళతళలాడే బంగారురంగుతో వెలుగొందే బట్టలు ధరించినవాడు, ప్రళయకాలంలోని అగ్నిజ్వాలవలె మండేవాడు, లోకంలోని జనులకు భీతిని కలిగించేవాడు, గొప్పపాశాయుధాన్ని ఒడుపుగా త్రిప్పే నేర్పుగల హస్తం చేత గర్వించినవాడు.

విశేషం: (1) ఆ లోకభీకరమూర్తిని చూచినది ఎవరు??.... "కోమలి" సావిత్రి ఇది హృదయంగమమైన ప్రతియోగస్ఫూర్తి. (2) అసాధారణం ఆశ్చర్యకరమునైన దృశ్యాన్ని ఆకస్మికంగా కన్నులు చెదరేటట్లు కన్పించటాన్ని వర్ణించటం కవితాకళలోని ఉన్నతశిఖరాలలో ఒకటి. అర్వాచీనకవులకు ఎఱ్ఱనపద్యం చక్కని చిక్కని ఒరవడి తీర్చిదిద్దింది. ఇందు - 'కనియెన్' - అనే ఒక్కపదంమాత్రమే తెలుగు. పద్యం అంతా ప్రౌఢ సంస్కృతసమాసభూయిష్ఠం. ఇట్లే - తరువాతి కాలంలో ఎన్నోపద్యాలు "అటచని కాంచె భూమిసురుఁడు' - (అల్లసానిపెద్దనగారి మనుచరిత్రలోనిది) మున్నగునవి అవతరించాయి.

వ. అప్పురుషుండును నధికసంరంభంబున సత్యవంతుం గదిసిన నయ్యింతి యెంతయు భయంబునం బ్రియునిశిరం బొయ్యన దిగువం జేర్చి నిల్చి కృతాంజలియై 'యయ్యా! నీ వెవ్వ? రియ్యెడకు నెయ్యది సేయం దలంచి విజయంచేసి?' తనిన నతం డిట్లనియె. 218

ప్రతిపదార్థం: ఆ+పురుషుండును; అధిక, సంరంభంబునన్= మిక్కుటమైన దర్పంతోకూడిన వేగిరపాటుతో; సత్యవంతున్= సత్యవంతుడిని; కదిసినన్= సమీపించగా; ఆ+ఇంతి= సావిత్రి; ఎంతయున్= మిక్కుటమైన; భయంబునన్= భీతితో; ప్రియునిశిరంబు= భర్తతల; ఒయ్యనన్= మెల్లగా; దిగువన్+చేర్చి= క్రింద పెట్టి; నిల్చి= నిలబడి; కృత+అంజలి+ఐ= చేసిన నమస్కారం కలది అయి (నమస్కరించినదై); అయ్యా!= ఆర్యా!; నీవు+ఎవ్వరు?= నీవు ఎవరవు?; ఈ+ఎడకున్= ఈ చోటికి; ఎయ్యది+చేయన్+తలంచి= ఏ పనిని చేయటానికి ఆలోచించి; విజయంచేసితి= విచ్చేశావు?; అనినన్= అని (సావిత్రి) అడుగగా; అతండు= ఆ దివ్యపురుషుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ దివ్యపురుషుడు మిక్కుటమైన దర్పంతో కూడిన వేగిరపాటుతో సత్యవంతుడిని సమీపించగా సావిత్రి మిక్కిలి భయపడి భర్తతలను మెల్లగా క్రిందికి దింపి, నిలబడి నమస్కరించి, 'ఆర్యా, నీవు ఎవ్వరవు? ఇక్కడకు ఏ పనిచేయటానికై ఇప్పుడు వచ్చావు?' అని ప్రశ్నించింది. అంతట ఆ దివ్యపురుషుడు సావిత్రితో ఈ విధంగా అన్నాడు.

సీ. 'కాలుండఁ జువ్వె యేఁ గమలాక్షి! నను నీవు । మహిత పాతివ్రత్యమహిమఁ జేసి
కానంగఁ జాలితి; కానరా దన్యులఁ; । కిదె నీదుభర్తకు నిపుడు కాల

మగుటయు వీఁడు మహాపుణ్యనిధి గాన। యితరులఁ బనుపక యేన వీనిఁ
గ్రచ్చఱఁ గొనిపోవఁగాఁ జనుదెంచితి'। నని యుగ్రభంగి నయ్యంతకుండు

ఆ. ధరణినాథతనయుతనువునఁ బ్రాదేశ। పరిమితాత్ముఁ డగుచుఁ బ్రజ్వరిల్లు
జీవు వెడలఁ దిగిచి, చెచ్చెర నతిదీర్ఘ। భయదపాశనికరబద్ధుఁ జేసి. 219

ప్రతిపదార్థం: కమల+అక్షి!= పద్మాలవంటి కన్నులు కలదానా ఓ సావిత్రీ!; ఏన్= నేను; కాలుండన్+చువ్వే= యముడను సుమా; ననున్= నన్ను; ఈవు= నీవు; మహిత, పాతివ్రత్య మహిమన్+చేసి= గొప్పదైన పాతివ్రత్య శక్తివలన; కానంగన్+చాలితి(వి)= చూడగలిగావు; అన్యులకున్= ఇతరులకు; కాన, రాదు= కనపడదు, చూడటానికి సాధ్యం కాదు; ఇది+ఎ= ఇదిగో (విను); నీదు+భర్తకున్= నీమగనికి; ఇపుడు= ఈ సమయంలో; కాలము+అగుటయున్= ఆయువు తీరటంచేత; వీఁడు= నీభర్త - సత్యవంతుడు; మహా, పుణ్య, నిధి= గొప్ప సుకృతానికి నిక్షేపమైనవాడు; కాన= కావున; ఇతరులన్= ఒరులను (నాభటులను); పనుపక= నియోగించక; ఏను+అ= నేనే; వీనిన్= ఇతడిని (సత్యవంతుడిని); క్రచ్చఱన్= వెంటనే; కొనిపోవఁగాన్= తీసికొనిపోవటానికై; చనుదెంచితిన్= వచ్చాను; అని= అని పలికి; ఆ+అంతకుండు= ఆ యముడు; ఉగ్రభంగిన్= భయంకర రీతిని; ధరణినాథ తనయుతనువునన్= రాజకుమారుడైన సత్యవంతుడిశరీరంలో; ప్రాదేశపరిమిత+ఆత్ముఁడు+అగుచున్= చూపుడువ్రేలు బొటనవ్రేలు చాపగా నైన నడిమి కొలతకు లోబడిన ఆకృతి కలవాడు ఔతూ; ప్రజ్వరిల్లు= వెలుగొందే; జీవున్= జీవుడిని (ఆత్మను); వెడలన్+తిగిచి= బయటకు వచ్చేటట్లు లాగి; చెచ్చెరన్= శీఘ్రంగా; అతి, దీర్ఘ, భయదపాశ నికర, బద్ధున్+చేసి= మిక్కుటమైన నిడివి కలిగి, భీతిని గొలిపే త్రాళ్ళసముదాయంచేత కట్టబడినవాడినిగా చేసి.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కల సావిత్రీ! నేను యమధర్మరాజును సుమా! నీవు గొప్పపతివ్రతవు కాబట్టి నన్ను చూడగలిగావు. సామాన్యమానవులు నన్ను చూడజాలరు. నీభర్త అయిన సత్యవంతుడికి ఆయువు తీరింది. ఆతడు గొప్పపుణ్యాత్ముడు కాబట్టి నేనే స్వయంగా వచ్చాను. ఈ పనిని ఇతరులకు అప్పగించలేదు.' అని పలికి ఆ యముడు మిక్కిలి నిడివియైన పాశాలను భయంకరరీతిలో ప్రయోగించి రాజకుమారుడైన సత్యవంతుడి శరీరంనుండి జుత్తిలి కొలతగల జీవుడిని బంధించి బయటకు లాగాడు.

విశేషం: ఈపద్యంలో "ప్రాదేశ పరిమితాత్ముడగుచుఁ బ్రజ్వరిల్లు జీవుఁడు" - అనే ఈ ప్రయోగం మిక్కిలి ప్రౌఢమైనది. ఆత్మస్వరూపాన్ని గూర్చి ఉపనిషత్తులలో సవిస్తరంగా చెప్పబడింది. ఉపనిషత్సారమైన భగవద్గీత భారతంలో ప్రకరణాంతరాన నిర్వచించబడింది. యముడు పాశవితతిచేత బంధించినది సత్యవంతుడి శరీరంలోని జీవుడిని మాత్రమే.

మ. కొని వేగంబున దక్షిణాభిముఖుఁడై ఘోరంపుమార్గంబునం
జనఁగాఁ జొచ్చె; ననంతరంబ మదిలో సావిత్రి శోకంబు పై
కొనఁ బ్రాణేశ్వరుదేహ మొక్కయెడ సంగుప్తంబు గావించి యా
తనిపజ్జం దగఁ దాను నేఁగెఁ బదపద్మంబుల్ పొరిం దొట్రిలన్. 220

ప్రతిపదార్థం: (యముడు); కొని= (సత్యవంతుడి జీవుడిని) తీసికొని; వేగంబునన్= త్వరగా; దక్షిణ+అభిముఖుఁడు+ఐ= దక్షిణదిక్కుకు మొగం కలవాడై; ఘోరంపుమార్గంబునన్= భయంకరమైన దారివెంబడిని; చనఁగాన్+చొచ్చెన్= వెడలసాగాడు; అనంతరంబు+అ= అటుపిమ్మట; సావిత్రి= సావిత్రి; మదిలోన్= చిత్తంలో; శోకంబు= దుఃఖం; పైకొనన్= విస్తరిల్లగా; ప్రాణ+ఈశ్వరు, దేహము= భర్తయొక్క శరీరం; ఒక్క+ఎడన్= ఒకచోట, సంగుప్తంబు+కావించి= భద్రం చేసి; ఆతని పజ్జన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆతడివెంట (యముడివెంట); తగన్= ఒప్పిదంగా; తాను= తాను సావిత్రి; పదపద్మంబుల్= అడుగుదమ్ములు (పద్మాలవంటి పాదాలు); పొరిన్= మాటిమాటికి; తొట్రిలన్= తడబడగా; ఏగన్= వెళ్ళింది.

తాత్పర్యం: యమధర్మరాజు సత్యవంతుడి శరీరంలోని జీవుడిని పరిగ్రహించి, భయంకరమైనదారిబట్టి దక్షిణదిక్కుగా వెడలసాగాడు. దుఃఖపరితప్తురాలైన సావిత్రి తనప్రాణేశ్వరుడిదేహాన్ని ఒకచోట భద్రంగా దాచిపెట్టి యమధర్మరాజును వెంబడించింది. పద్మాలవలె సుకుమారమైన ఆమెపాదాలు ఆ భయంకరమార్గంలో నడిచేటప్పుడు మాటిమాటికి తడబాటుచెందుతున్నా ఆమె పయనం సాగించింది.

ఆ. దానిఁ జూచి దండధరుఁడు 'నీ విట్లేల । వచ్చెదవు లతాంగి! వలదు నిలువు
మింక; నీ కగమ్య మిటమీఁది తెరువెల్ల' । ననిన నతని కిట్టు లనియెఁ బొలఁతి. 221

ప్రతిపదార్థం: దానిన్+చూచి= ఆమెను (సావిత్రిని) కాంచి; దండధరుఁడు= యముడు; లతా+అంగి!= తీగవలె సుకుమారమైన దేహం కలదానా, ఓ సావిత్రీ!; నీవు= నీవు; ఇట్లు= ఈ రీతిగా; ఏల= ఎందుకు; వచ్చెదవు= వస్తావు; వలదు= రావలదు; నిలువుము= ఆగుము; ఇంకన్= ఇకమీద; ఇట మీఁదితెరువు= పైన ఉన్న మార్గం; నీకున్= నీకు; అగమ్యము= పయనించ శక్యం గానిది; అనినన్= అని (యముడు) చెప్పగా; అతనికిన్= ఆ యముడికి; పొలఁతి= పడతి సావిత్రి; ఇట్టులు= ఈ రీతిగా; అనియెన్= వచించింది.

తాత్పర్యం: యముడు సావిత్రిని చూచి 'లతవలె కోమలమైన శరీరం కలదానా! నీవు ఎందుకు ఈ విధంగా నన్ను వెంబడిస్తున్నావు? ఇక రావలదు. ఆగుము. ఇకపై నున్న దారి నీవు పయనించరానిది. వెనుకకు మరలిపొమ్ము.' అని చెప్పాడు. ఆ యమధర్మరాజుకు సావిత్రి ఇట్లా బదులు పలికింది.

క. 'పతు లెందుఁ జనిన నచటికి । సతులుం జనవలదె? నీప్రసాదమునను మ
త్పతిభక్తికతమునను సం । స్తుతగుణ! నా కరుగరానిచోటుం గలదే? 222

ప్రతిపదార్థం: సంస్తుతగుణ!= బాగా పొగడబడిన గొప్పగుణాలు కలవాడా, ఓ యమధర్మరాజా!; పతులు= భర్తలు; ఎందున్+చనినన్= ఎచటకు వెళ్లినా; అచటికిన్= ఆ చోటికి; సతులున్= భార్యలును; చనన్‌వలదె= వెళ్లవలదా? వెళ్లవలెనుకదా; నీ ప్రసాదమునను= నీ అనుగ్రహంవలననూ; మత్+పతిభక్తి, కతమునను= నాకు భర్తయందు ఉన్న పూజ్యభావం కారణంగా; నాకున్= నాకు; అరుగరాని= చేరరాని; చోటున్= స్థలమన్నది; కలదే?= ఉన్నదా? (లేదు).

తాత్పర్యం: 'భర్తలు ఎక్కడికి వెళ్ళితే అక్కడికి భార్యలు కూడ వెళ్ళవలెను కదా. బాగా పొగడబడిన గొప్ప గుణాలుకల ఓ యమ ధర్మరాజా! నీ కారుణ్యంవలనను, నాకు భర్తపై గల పూజ్యభావంవలనను నేను చేరలేనిచోటు లేదు.

వ. సకలమార్గంబులయందును ధర్మమార్గంబు ప్రధానం; బట్టి ధర్మంబునకు నాధారంబు సజ్జనుల యని వినంబడు; సజ్జనసందర్శనం బెప్పుడువృథగాదు గావున సజ్జనశేఖరుండ వనంజను నీదైన సందర్శనంబునం బరమశుభంబు నొందక యేను రిత్తజనంబులతెఱంగున నూఱక యెట్లు మగుడుదు?' ననిన దాని ప్రగల్భవచనంబులకు నద్భుతం బంది ధర్ముం డిట్లనియె. 223

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సకలమార్గంబులయందును= అన్నితెరువులలోను; ధర్మమార్గంబు= ధర్మంతో కూడిన దారి; ప్రధానంబు= ముఖ్యమైనది; అట్టి= అటువంటి; ధర్మంబునకున్= ఈ జగతిని సవ్యంగా నడపే ఆధర్మానికి; ఆధారంబు= మూలం; సజ్జనులు+అ= మంచివారుమాత్రమే; అని= అని; వినంబడున్= పెద్దలు చెప్పేమాటలు వినబడతాయి; సత్+జన, సందర్శంబు= మంచివారల దర్శనం; ఎప్పుడున్= ఎన్నడును; వృథ+కాదు= వ్యర్థం కాదు; కావునన్= కాబట్టి; సజ్జన, శేఖరుండవు+అనన్+చను= మంచివారిలో శ్రేష్ఠుడవు అని చెప్పదగిన; నీదైన= నీయొక్క; సందర్శనంబునన్= సాక్షాత్కారంవలన; పరమశుభంబున్+ఒందక= గొప్ప మేలు పొందక; ఏను= నేను; రిత్త, జనంబుల, తెఱంగునన్= వ్యర్థులు అయిన ప్రజలపోలిక; ఊఱక= నిరుపయోగంగా; ఎట్లు= ఏరీతిగా; మగుడుదున్?= మరలివెళ్లగలను? అనినన్= అని వచించగా; దాని= ఆమెయొక్క - (సావిత్రియొక్క) ప్రగల్భ, వచనంబులకున్= తెలివితేటలతో నిండిన మాటలకు; అద్భుతంబు+అంది= అచ్చెరువు నంది; ధర్ముండు= యముడు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా పలికాడు.

తాత్పర్యం: అన్నిదారులలో ముఖ్యమైనదారి ధర్మమే. కాగా, ధర్మాన్ని అనుష్ఠించి చూపేవారు సజ్జనులు మాత్రమేకదా! అందుచేత సజ్జనులే ధర్మానికి ఆధారం - అని పెద్దలప్రవచనం. సజ్జనులలో నీవు శ్రేష్ఠుడవు, ధర్మరాజువు- అని చెప్పుతారు. సజ్జనసందర్శనం ఎన్నడూ వ్యర్థం కాదు. నీదివ్యసందర్శనం నాకు లభించింది కదా! దానివలన నేనేదైనా గొప్పమేలు పొందకుండా వ్యర్థజనులవలె ఊరక తిరిగిపోగలనా?' అని సావిత్రి విన్నవించింది. తెలివితేటలతో నిండిన ఆమెవాక్కులకు అచ్చెరువంది, యమధర్మరాజు ఇట్లా బదులు పలికాడు.

విశేషం: (1) ఈ గద్యంలోని విషయం మిక్కిలిప్రధానమైన దని, సావిత్రి వెలిబుచ్చిన అభిప్రాయాలు విలువగలవని ఎఱ్ఱనమహాకవి సహృదయులను సుకుమారసుందరంగా హెచ్చరించటానికి 'దానిప్రగల్భవచనంబులకు' యమధర్మరాజే అచ్చెరువు పొందినట్లు వ్రాశాడు. యముడు సావిత్రిని 'ఇటమీది తెరువు' 'నీకు అగమ్యము' అని హెచ్చరించాడు. ఆమె చెప్పినసమాధానం 'అన్నిదారుల కంటెను ధర్మం గొప్పదారి'. అయితే ధర్మం- కన్పించే తెరువు గాదు. అది అదృశ్యంగా ఉండే ఆదర్శవిశేషం. అట్టిధర్మాన్ని అనుష్ఠించే సజ్జనులు మాత్రమే చూడగలరు. సావిత్రి యమధర్మరాజునే- 'మూర్తీభవించినధర్మం' అని చెప్పదగిన వాడినే సందర్శించింది. సాధారణ మానవులు చర్మచక్షువులతో తనను చూడజాలరని ఆతడే వచించిఉన్నాడు. అందుచేత పరమపథమైన ధర్మాన్నే తాను అనుసరిస్తుండగా ఇక ఆమెకు అగమ్యమైన దారియే ఉండజాలదని సావిత్రి యముడికి విన్నవించింది. తనమాటకు ఋజువుగా ఆమె యమధర్మరాజుసందర్శనాన్నే పేర్కొన్నది. అందుచేత ధర్ముడు ఆశ్చర్యచకితుడయ్యాడు.

ఆ. **'తనులతాంగి! భవదుదారవాగ్భంగికి। మెచ్చు వచ్చె నాత్మ; నిచ్చువాఁడ**
వేఁడు మొక్కవరము విభునిజీవితమొక్క। టియును దక్కనేది యయిన నొండు.' **224**

ప్రతిపదార్థం: తనులతాంగి!= సన్నని సుకుమారమైన తీగవంటి శరీరం కలదానా, సావిత్రీ!; భవత్+ఉదార (భవదుదార,) వాక్+భంగికిన్= నీదైన గొప్పదైన మాటల తీరుకు; ఆత్మన్= మనస్సులో; మెచ్చువచ్చెన్= మెచ్చికోలు ఏర్పడింది; ఒక్కవరము= ఒకవిశిష్టమైన కోరిక; వేఁడుము= అర్థించుము; విభుని, జీవితము= భర్త జీవించటం అనే; ఒక్కటియును= ఒక్క అంశాన్ని; తక్కన్= తప్ప; ఏది+అయినన్= ఏదైన; ఒండు= వేరొకటి; ఇచ్చువాఁడన్= ఈయగలను.

తాత్పర్యం: 'సన్నని లతవంటి సుకుమారమైన శరీరం కల సావిత్రీ! నీమాటలు నామనస్సును అలరించాయి. నేను నిన్ను మెచ్చాను. నీభర్త జీవిత మొక్కటి తప్ప, మరి ఏవరమైనా కోరుకొమ్ము. నీకు ఆ వరాన్ని ఇవ్వగలను.'

సావిత్రి యమునివలన నభీష్టవరంబులు వడయుట (సం. 3-281-26)

చ. అనవుడు మద్రరాజసుత ప్రాంజలియై సమవర్తితోడ ని
ట్లను 'రిపుకోటిచే నపజయంబును బొంది వనాంతరంబునం
దనవరతవ్రతాభిరతుఁ డైన మహాత్ముఁడు సాళ్వభూవిభుం
దనఘుఁడు లబ్ధచక్షుఁ డగు నట్టులుగాఁ గరుణింపవే మదిన్.' 225

ప్రతిపదార్థం: అనవుడున్= అని యముడు చెప్పగా; మద్రరాజసుత= మద్రదేశాధిపతి అయిన అశ్వపతికూతురు సావిత్రి; ప్రాంజలి+ఐ= కైమోడ్పు ఘటించినది అయి; సమవర్తితోడన్= యమధర్మరాజుతో; ఇట్లు+అనున్= ఈవిధంగా చెప్పింది; 'రిపుకోటిచేన్= శత్రుసమూహాలచేత; అపజయంబును+పొంది= పరాజయం పొంది; వన+అంతరంబునందున్= అరణ్యంలోపల; అనవరత, వ్రత+అభిరతుఁడు+ఐన= ఎల్లప్పుడును నోములు నోమటంలోనే ఆసక్తి కలవాడయిన; మహా+ఆత్ముఁడు= మహానుభావుడు; అనఘుఁడు= పాపరహితుడు; పుణ్యాత్ముడు; సాళ్వభూవిభుండు= సాళ్వదేశాధిపతి ద్యుమత్సేనుడు; లబ్ధచక్షుఁడు= పొందిన కన్నులు కలవాడు; అగునట్టులుగాన్= అయినరీతిగా; మదిన్= మనస్సులో; కరుణింపవే= అనుగ్రహింపుమా.

తాత్పర్యం: అని యముడు చెప్పగా, సావిత్రి నమస్కరించి, అతడితో ఇట్లా పలికింది- 'శత్రువులచేత పరాభవం పొంది, మహానుభావుడైన సాళ్వదేశాధిపతి ఎల్లప్పుడు నోములునోస్తూ అరణ్యాలలో కాలం గడుపుతున్నాడు. ఆ మహానుభావుడు ద్యుమత్సేనుడు కన్నులు తిరిగిపొందేటట్లుగా దయతో అనుగ్రహించుము.'

క. నావుడు 'నట్టుల యయ్యెడు; । నీ విట రావలవ దుడుగు నెమ్మి' నని వెసం
బోవఁ దొడంగెను బితృపతి; । యా వెలఁదియు నంత నిలువ కరిగెఁ బిఱుందన్. 226

ప్రతిపదార్థం: నావుడున్= అని పలుకగా; 'అట్టుల+అయ్యెడున్= ఆ విధంగానే జరుగుగాక- (ద్యుమత్సేనుడికి గ్రుడ్డితనం పోయి తిరిగి దృష్టి లభించుగాక); నీవు= ఓ సావిత్రీ! నీవు; ఇటన్= ఇచటికి; రావలవదు= రావద్దు; నెమ్మిన్= ప్రీతితో; ఉడుగు(ము)= మానుము; అని= అని వచించి; వెసన్= వేగంగా; పితృపతి= యమధర్మరాజు; పోవన్+తొడంగెను= పోసాగాడు; ఆ వెలఁదియున్= ఆ వనితయు, సావిత్రియు; అంతన్= ఆ సమయంలో; నిలువక= ఆగక; పిఱుందన్= (యమధర్మరాజు) వెనుకనే; అరిగెన్= వెళ్ళింది.

తాత్పర్యం: సావిత్రి వరాన్ని కోరగా, 'సరే!, సాళ్వపతి ద్యుమత్సేనుడికి మరల దృష్టి ఏర్పడుగాక! నీవు కోరిన వరం ఇచ్చాను. ఇక సంతృప్తి చెంది నావెంబడి రావద్దు' అని చెప్పి యమధర్మరాజు పోసాగాడు. కాని, సావిత్రి యముడిని వెంబడించి వెళ్ళింది.

వ. ఇట్లు సనిచని మఱియు నిట్లనియె. 227

తాత్పర్యం: ఈవిధంగా చాలదూరం పోయి ఇంకా ఈ విధంగా అన్నది.

చ. 'ఎడపక వాఙ్మనఃక్రియల నేరికి హింస యొనర్పఁబూన; రె
య్యెడలను దీనులం గరుణ యేర్పడఁ బ్రోవఁగఁజూతు; రిచ్చచోఁ
గడమ వడంగ నీ కెదిరి కాంక్షితముల్ దుదిముట్టఁ దీర్తు; రె
క్కుడు మదిఁ గూర్తు రాశ్రితులకున్; విను మిన్నియు నార్యధర్మముల్. 228

ప్రతిపదార్థం: వినుము= వినుడు; ఎడపక= వ్యవధానం లేకుండా (వేగంగా); వాఙ్మనఃక్రియలన్ (వాక్+మనస్+క్రియలన్)= మాటలలో, మనస్సులో, చేతలలో; ఏరికిన్= ఎవరికీ; హింస= హాని; ఒనర్పన్+పూనరు= చేయటానికి ప్రయత్నించరు; ఎ+ఎడలను= ఏ సందర్భాలందైనా; దీనులన్= ఆర్తులను, కష్టాలలో ఉన్నవారిని; కరుణ ఏర్పడన్= దయసమకూడగా; ప్రోవఁగన్+చూతురు= కాపాడుటకే యత్నిస్తారు; ఇచ్చుచోన్= దానం చేసేటప్పుడు; కడమ+పడంగనీక= కొరతలేకుండగా; ఎదిరి, కాంక్షితముల్= ఇతరుల కోరికలు; తుదిముట్టన్= సంపూర్ణంగా; తీర్తురు= నెరవేరుస్తారు; ఆశ్రితులకున్= తమను సహాయంకొరకు ఆశ్రయించినవారికి; మదిన్= హృదయంలో; ఎక్కుడు= అధికంగా; కూర్తురు= సంతోషం కలిగిస్తారు; ఇన్నియున్= ఇవి అన్నియును; ఆర్యధర్మముల్= పూజ్యులైనవారు నిర్వహించే ధర్మాలు, నెరవేర్చే కర్తవ్యాలు.

తాత్పర్యం: ఈవిధంగా సావిత్రి యమధర్మరాజును విడువక వెంబడించి ఇట్లా వచించింది: 'దయచేసి ఆర్యధర్మాలను ఆలకించవలసింది. ఆర్యధర్మాలలో ప్రధానమైనది- త్రికరణశుద్ధి. వాక్కు, మనస్సు, క్రియ ఈ త్రికరణాలలో ఎట్టి ఎడము ఉండరాదు. మనస్సులో ఆలోచించిందే పలుకవలెను. వచించిందే చేయవలెను. మనస్సు ఒకటి, మాట ఒకటి, క్రియ ఇంకొకటి కారాదు. త్రికరణాలతో ఎవరికిని ఎట్టి హింస చేయరాదు. దీనులయెడ దయ చూపాలి. దానం చేయాలి. దానం చేసేటప్పుడు ఎట్టి కొరతలకు ఆస్కారం లేకుండా, కోరినవారు సంతృప్తి చెందేటట్లు సంపూర్ణంగా దానం చేయాలి. ఆశ్రితులను మనసార ఆదరించాలి. ఇవి ఆర్యులు నెరవేర్చవలసిన కర్తవ్యాలు. ఆచరించవలసిన ధర్మాలు.

క. నీ వెఱుఁగనియది యెయ్యది । దేవోత్తమ! ధర్మగతులతెఱఁ గెల్ల భవ
ద్భావాధీన మగుటఁ గా । దే వెలసితి నీవు ధర్మదేవత వనఁ గాన్. 229

ప్రతిపదార్థం: దేవ+ఉత్తమ!= దేవతలలో శ్రేష్ఠుడవైనవాడా! ఓ యమధర్మరాజా!; నీవు+ఎఱుఁగని+అది= నీవు తెలియనట్టిది; ఎయ్యది= (ఏ+అది) ఏది; ధర్మ, గతుల, తెఱఁగు+ఎల్లన్= ధర్మంనడచే తీరులు అన్నియును; భవత్+భావ+అధీనము+ అగుటన్+కాదే= నీయొక్క సంకల్పానికి లోనుకావటం వలననే కదా; ధర్మదేవతవు= ధర్మానికి అధిష్ఠానదైవం; అనఁగాన్= అనునట్లుగా; ఈవు= నీవు; వెలసితి(వి)= శోభిల్లావు.

తాత్పర్యం: దేవతలలో శ్రేష్ఠుడ వైన ఓ యమధర్మరాజా! నీవు సర్వజ్ఞుడవు. నీకు అన్నిధర్మసూక్ష్మాలును తెలిసినట్టివే. అందుచేతనే నీకు ధర్మదేవత అనేపేరు సిద్ధించింది. ధర్మగతులు నీసంకల్పానికి అధీనాలు అయినవే గదా.

క. సమబుద్ధితోడఁ దత్త । త్సముచిత కర్మఫల మఖిలజంతుతతులకున్
సమకూర్చుట నీ కయ్యెను । సమవర్తి యనంగఁ బేరు జగదభినుతమై. 230

ప్రతిపదార్థం: సమ, బుద్ధితోడన్= తుల్యమైన చిత్తంతో; తద్+తద్+సముచిత, కర్మఫలము= ఆయావాటికి తగిన కర్మఫలం; అఖిలజంతుతతులకున్= అన్ని ప్రాణికోటులకును; సమకూర్చుటన్= ఏర్పాటుచేయటంచేత; నీకున్= నీకు, జగత్+అభినుతము+ ఐ= లోకంచేత పొగడబడునట్టిదై; సమవర్తి+అనంగన్+పేరు= సమవర్తి అనేపేరు; అయ్యెను= ఏర్పడింది.

తాత్పర్యం: ఈ ప్రపంచంలోని ప్రాణికోటికి అంతటికిని నీవు ఆయాకర్మలకు తగిన ఫలితాన్ని తుల్యమైన బుద్ధితో సమకూర్చేవాడవు కావున, సుప్రసిద్ధమైన సమవర్తి అనే బిరుద నామం నీకు లోకంలో ఏర్పడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) యమధర్మరాజుకు నామాంతరం "సమవర్తి". సమస్తజీవకోటి తాను చేసిన కర్మలఫలితాలు అనుభవించవలసిందే. ఇక, యమధర్మరాజు వహించే భూమిక యెట్టిది? అతడు అందరియెడ సమంగా వర్తించేవాడు. ఎవరి పుణ్యపాపాలు వారు అనుభవించవలసిందే. యముడు తటస్థుడు. కర్మసిద్ధాంతం విశ్వవేదాంతానికి ప్రాచీన భారతీయులు సమర్పించిన బహుమానం. ఈ సిద్ధాంతానికి - కేవలం ఆస్తికమతం అని కాని, నాస్తికమతంఅనికాని ముద్రవేయటానికి వీలు లేదు. ఇందు ఈశ్వరుడు తటస్థుడు, సమవర్తి, సాక్షిభూతుడు. (2) ఇక, కర్మ అనే పదానికి ఎన్నోఅర్థాలు ఉన్నాయి. "గహనా కర్మణోగతిః" - అని భగవద్గీత చెప్పేమాట. ఇచ్చట ఈపద్యంలో చెప్పినమాట - "కర్మ" ఫలం. ప్రాణులు తాము చేసిన కర్మలకు అనుగుణమైన ఫలితాన్ని అనుభవించవలసి ఉంటుంది. అట్టికర్మ జన్మజన్మాంతరాలు పేరుకొంటుంది. కర్మను వింగడించినచో - (1) సంచితం (2) ప్రారబ్ధం (3) ఆగామి అని త్రివిధాలు. పూర్వజన్మలలో పేరుకున్న కర్మలఫలితం 'సంచితం'. ఈ జన్మలో అనుభవించేది ప్రారబ్ధం. ఈ జన్మలో చేసే కర్మలఫలితం ఆగామి అని చెప్పవచ్చు. కర్మసిద్ధాంతం అనే సమాసంలో ప్రధానాంశం 'కర్మ' మాత్రమే గాక 'కర్మఫలం' అని గుర్తింపవచ్చును.

క. యముఁ డండ్రు నిన్ను నార్యులు । యమియింపుదు భూతతతుల నట్లగుటఁ దగన్;
శమనుండ వైతి కల్మష । శమనంబునఁ జేసి నీవు జలజాప్తసుతా!' 231

ప్రతిపదార్థం: జలజ+ఆప్త, సుతా! పద్మాలకు ఆప్తుడైన సూర్యుడి పుత్రుడా, ఓ యమధర్మరాజా!; ఆర్యులు= పూజ్యులైన పెద్దలు; నిన్నున్= నిన్ను; యముఁడు+అండ్రు= యముడు అని అంటారు; అట్లు+అగుటన్= అందుచేతనే (నీవు); భూతతతులన్= ప్రాణికోటులను; తగన్= యథోచితంగా; యమియింపుదు= నియమిస్తావు; కల్మష, శమనంబునన్+చేసి= పాపాలను అణచటంచేత; నీవు= నీవు; శమనుండవు= 'శమనుడు' అనేవాడవు (శమింపచేసేవాడవు); ఐతి(వి)= అయినావు.

తాత్పర్యం: సూర్యుడికుమారుడ వైన ఓ యమధర్మరాజా! పూజ్యు లైన పెద్దలు నిన్ను యముడు అని అంటారు. అందుచేతనే నీవు ప్రాణికోటులను అణుస్తావు. నీకు శమనుడు అనే సార్థకనామధేయంకూడా ఉన్నది. నీవు పాపాలను శమింపజేస్తావు.'

విశేషం: యమదండనవలన పాపకర్మ క్షయమౌతుంది.

వ. అనినం బ్రేతపతి యాపుణ్యసతి కి ట్లనియె. 232

తాత్పర్యం: అనగా యముడు పుణ్యాత్మురా లయిన సావిత్రితో ఇట్లా అన్నాడు.

క. 'తృషితుఁ డగు వాని శీతల । తుషారతోయములు మోదితునిఁ జేయుగతిన్
హృషితాత్ముఁ జేసె ననుఁ గ । ల్మషహరణము లైన నీ సమంజసఫణితుల్. 233

ప్రతిపదార్థం: కల్మషహరణములు+ఐన= పాపాలను పోగొట్టేవి అయిన; నీసమంజసఫణితుల్= సరిగా అమరేటట్లు చెప్పిన నీమాటల తీరుతెన్నులు; తృషితుఁడు+అగు వానిన్= దప్పిగొన్నవాడిని; శీతల, తుషారతోయములు= చల్లని మంచినీళ్ళు; మోదితునిన్+చేయుగతిన్= సంతోషసంభరితుడిని చేసేటట్లుగా; ననున్= నన్ను; హృషిత+ఆత్మున్+చేసెన్= సంతృప్తిచెందిన ఆత్మగల వాడినిగా చేశాయి.

తాత్పర్యం: దప్పిగొన్నవాడిని చల్లనిమంచినీళ్ళు సంతోషసంభరితుడిని చేసేటట్లుగా పాపాలను పారద్రోలే నీమాటలు చక్కగా సందర్భశుద్ధి కలిగి నన్ను సంతృప్తిపరచాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) అలం: ఉపమ. (2) ఈ పద్యంలో - కృతజ్ఞతతో యమధర్మరాజు సావిత్రికి ధన్యవాదాలు సమర్పిస్తున్నాడు! అతడికి సావిత్రి చేసిన మేలేది? సావిత్రిమాటలు దప్పిగొనినవాడికి 'శీతలతుషారతోయములు' ఎట్లు అయినవి? యమధర్మరాజు నిర్వహించే భూమిక అంత సులువైనది కాదు. స్థూలదృష్టికి యముడు దండధరుడు. ప్రాణులను శిక్షించేవాడు. సూక్ష్మదృష్టికి అతడు సమవర్తి. కేవలం తటస్థుడు. సావిత్రి జ్ఞానమయి. బ్రాహ్మీమూర్తి. యమధర్మరాజుకు గూడ 'వెలుగు' ప్రసాదించింది. కనుక యముడు సావిత్రికి కృతజ్ఞత తెలుపవలసివచ్చింది.

వ. 'కావున సత్యవంతునిప్రాణంబు దక్కందక్కినకోర్కియెయ్యది యైనం జెప్పుము; సఫలంబు సేసెద' ననిన సావిత్రి 'దేవా! వైరులచేత నపహృతం బైన రాజ్యం బెప్పటియట్ల ద్యుమత్సేనుం బ్రాపించు నట్లుగా ననుగ్రహింపవే' యని వేడుటయు, వైవస్వతుం 'డట్ల యగు' నని పలికి యి ట్లనియె. 234

ప్రతిపదార్థం: కావున= కాబట్టి; సత్యవంతుని ప్రాణంబు+తక్కన్= సత్యవంతుడి అసువులు తప్ప; తక్కిన= మిగిలిన; కోర్కి= కోరిక; ఏ+అది+ఐనన్= ఏది అయినప్పటికి; చెప్పుము= వచింపుము; సఫలంబు+చేసెదన్= ఈడేరుస్తాను; అనినన్= అని చెప్పగా; సావిత్రి; 'దేవా!= ప్రభూ!; వైరులచేతన్= శత్రువులచేత; అపహృతంబు+ఐన= అపహరించబడిన; రాజ్యంబు= ప్రభుత్వం (పరిపాలన చేసే దేశం); ఎప్పటి+అట్లు+అ= యథాప్రకారం; ద్యుమత్సేనున్= ద్యుమత్సేనుడిని; ప్రాపించునట్లుగాన్= చేరేటట్లుగా; అనుగ్రహింపవే= కరుణించుమా; అని= అని; వేఁడుటయున్= ప్రార్థించగా; వైవస్వతుండు= యమధర్మరాజు; అట్లు+అ= అదే రీతిగా; అగున్= అగుగాక; అని, పలికి= అని చెప్పి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: 'కాబట్టి, సత్యవంతుడి ప్రాణంతప్ప మిగిలిన ఏకోర్కె అయినా కోరుకొమ్ము; తీరుస్తాను' అని అనగా సావిత్రి ఇట్లా అడిగింది. 'దేవా! ద్యుమత్సేనుడికి శత్రువు లపహరించిన రాజ్యం ఎప్పటివలె లభించేటట్లు అనుగ్రహించుము' అని వేడగా ఆ ప్రార్థన విని యమధర్మరాజు 'అట్లే అగుగాక' అని పలికి, ఇంకా ఇట్లా అన్నాడు.

ఆ. 'వలదు నిలువు మింక; వదలక నీభక్తి । మగని కెక్కెఁ; దుర్గమంపుఁ ద్రోవ
యిది; కృతంబు లయ్యె నెల్లయు; నీ విట । వచ్చు సెలవు లేదు వనజనయన!' 235

ప్రతిపదార్థం: వనజనయన!= పద్మాలవంటి కన్నులు కలదానా! ఓ సావిత్రీ!; వలదు= (రా)వలదు; నిలువుము= ఆగుము; ఇంకన్= ఇకమీద; వదలక= వీడక; నీభక్తి= నీపూజ్యభావం; మగనికిన్= భర్తకు; ఎక్కెన్= అతిశయంగా చెందింది; ఇది= ఇది; దుర్గమంపుఁద్రోవ (దుర్గమము+త్రోవ)= నడవటానికి వీలులేనిదారి; ఎల్లయున్= నీకోరికలు అన్నియును; కృతంబులు+అయ్యెన్= చేయబడినవి అయ్యాయి (తీరాయి); ఈవు+ఇటవచ్చు= నీవు ఇక్కడకు వచ్చే; సెలవు= అనుమతి; లేదు= లేదు.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కల సావిత్రీ! నీవు ఇంక ఇచట ఆగుము. వదలని నీ పతిభక్తి అతడికి చెందింది. నీవు కోరినకోరికలు అన్నియు నెరవేర్చబడినవి. ఇది చొరరాని తెరువు. ఇక్కడికి రావటానికి నీకు అనుమతి లేదు.'

వ. అనిన నమ్మహాభాగ యతని కి ట్లనియె. 236

తాత్పర్యం: అనగా ఆ మహానుభావురాలైన సావిత్రి యముడితో ఇట్లా మాట్లాడింది.

క. 'ధర్మాత్ములు దమ సలిపెడు । ధర్మక్రియ దప్ప రెట్టి దశలందును మో
హోర్మ్ములుఁ దాపముఁ బుట్టవు । ధార్మికహృదయములఁ బ్రథమధర్మాధ్యక్షా! 237

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధర్మాత్ములు= (ధర్మ+ఆత్ములు) ధార్మికులు; తమ, సలిపెడు= తాము చేసే; ధర్మక్రియ= ధర్మంతో కూడిన ప్రవర్తన; ఎట్టి= ఎటువంటి; దశల+అందును= అవస్థలలోను; తప్పరు= వదలి పెట్టరు; ప్రథమ+ధర్మ+అధ్యక్షా!= ధర్మపథాన్ని ఆరోహించే వారలలో మొట్టమొదటివాడా!; ధార్మిక, హృదయములన్= ధర్మాన్ని ఆచరించేవారి మనస్సులలో; మోహ+ఊర్ములున్= భ్రాంతి అనే కెరటాలున్నూ; తాపమున్= వేడిమి ఒనగూర్చేబాధయున్నూ; పుట్టవు= జనించవు.

తాత్పర్యం: 'ధర్మపీఠం అధిరోహించేవారిలో మొట్టమొదట ఎన్నదగినవాడా, ఓ యమధర్మరాజా! ఎట్టి దురవస్థలలోనైనా ధర్మాత్ములు ధర్మంతోకూడిన తమకర్తవ్యాలను వదలజాలరు. ధార్మికుల హృదయంలో పరితాపం, భ్రాంతితరంగాలు జనించవు.

క. కావునఁ బతియనుగమనం । బేవిధమున విడువఁదగునె? యెట్లయినను మో
హావేశముఁ బొందక ధ । ర్మావస్థితి సలుప వలదె యవహితబుద్ధిన్. 238

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; పతి+అనుగమనంబు= భర్తను అనుసరించి వెళ్ళటం; ఏవిధమునన్= ఏరీతిగా; విడువన్+తగునె= వీడటం తగునా- వీడటం భావ్యం కాదు; ఎట్లు+అయినను= ఏవిధంగానైనా; మోహ+ఆవేశమున్+పొందక= భ్రాంతిమూలకమైన ఉద్వేగాన్ని చెందక; ధర్మ+అవస్థితి= ధర్మాన్ని నిలపటం; అవహితబుద్ధిన్= నిష్ఠతో కూడిన చిత్తంతో; సలుపన్‌వలదె= చేయవలదా= తప్పక చేయవలెను కదా.

తాత్పర్యం: కాబట్టి, భర్తను అనుసరించి వెళ్ళటం ఏవిధంగా వదలిపెట్టేది? వదలటం న్యాయమా? ఏవిధంగా నైనా సరే భ్రాంతిమూలకమైన ఉద్వేగాన్ని వదలి అచంచలమైన నిష్ఠతో ధర్మాన్ని నిలపాలి కదా!'

తే. అనిన నంతకుఁ డిట్లను 'సతివ! నీవు । ప్రకటధర్మవిశేష తత్పరవు గాన
యింక నొక వర మిత్తుఁ; బ్రాణేశు బ్రతుకు । వలదు గాని యొం డడుగుము వలయుదాని.' 239

ప్రతిపదార్థం: అనినన్= అని సావిత్రి చెప్పగా; అంతకుఁడు= యముడు; ఇట్లు+అనున్= ఈ రీతిగా పల్కాడు; అతివ!= పడతీ! ఓ సావిత్రీ!; నీవు= నీవు; ప్రకట, ధర్మ, విశేష, తత్పరవు= ప్రసిద్ధమైన ధర్మంలోని విశిష్టతయందు మిగుల నిష్ఠ కలదానవు; కాన= కాబట్టి; ఇంకన్= ఇంకను; ఒక, వరము= ఒక వరం; ఇత్తున్= ఇచ్చెదను; ప్రాణ+ఈశు, బ్రతుకు= మగడి జీవితం; వలదు+కాని= కోరవలదు కాని; వలయుదానిన్= ఇష్టమైన దానిని (వరాన్ని); ఒండు= వేరొకటి; అడుగుము= కోరుము.

తాత్పర్యం: అని సావిత్రి పలుకగా, యమధర్మరాజు ఈ రీతిగా బదులు పలికాడు. 'ఓ సావిత్రీ! ప్రసిద్ధమైన ధర్మమునందు మిగుల ఆసక్తి కలదానవు. సంతోషం. నీ మగడిప్రాణాలను మాత్రం అడుగవద్దు. మరి ఇంకేవరాన్నైనా అర్థించుము. నీకు ఒసంగగలను'.

వ. అనుటయు నక్కాంత గృతాంజలియై 'మాతండ్రిమద్రేశ్వరుం డపుత్త్రకుం; డతనికిఁ బుత్త్రశతలాభంబు గావలయు' నని యభ్యర్థించిన నట్ల కా నిచ్చితి' నని పల్కి ధర్మరాజు 'నీవు గడుదూరంబు వచ్చి డస్సి; తింక మగుడుట లెస్స' యని పలికిన నప్పతివ్రత యి ట్లనియె. 240

ప్రతిపదార్థం: అనుటయున్= అని (యముడు) చెప్పగా; ఆ+కాంత= ఆ వనిత; కృత+అంజలి+ఐ= ఘటించిన కైమోడ్పు కలదియై; 'మా తండ్రి= నా జనకుడు అశ్వపతి; మద్ర+ఈశ్వరుండు= మద్రదేశానికి రాజు; అపుత్త్రకుండు= కొడుకులు

లేనివాడు; అతనికిన్= మా తండ్రికి; పుత్ర, శత, లాభంబు= కొడుకులు వందమంది కలగటం; కావలయున్= కావాలి; అని= అని పలికి; అభ్యర్థించినన్= వేడగా; అట్లు+అ, కాన్= అటులే జరుగుగాక; ఇచ్చితిన్= (వరాన్ని) ఒసగితిని; అని పల్కి= అని వచించి; ధర్మరాజు= యముడు; 'నీవు= ఓ సావిత్రీ! నీవు; కడుదూరంబు= మిక్కిలిదవ్వు; వచ్చి= అరుదెంచి; డస్సితి= అలశావు; ఇంకన్= ఇకమీద ఇచ్చటినుండి; మగుడుట= తిరిగివెళ్ళటం; లెస్స= మంచిది; అని పలికినన్= అని వచించగా; ఆ పతివ్రత; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: అని యమధర్మరాజు చెప్పగా, సావిత్రి అతడికి చేతులు మోడ్చి నమస్కరించి, 'మా జనకుడు మద్రదేశప్రభువైన అశ్వపతికి కొడుకులు లేరు. అతడికి కొడుకులు వందమంది కలిగేటట్లు అనుగ్రహించుము' అని ప్రార్థించింది. 'సరే నీకోరిక ఈడేరుగాక. నీ తండ్రికి నూర్గురు కొడుకులు కలిగెదరుగాక. నీవు కడుదూరం వచ్చావు. మిక్కిలి అలసిపోయావు. ఇంక వెనుకకు మరలటం మంచిది' - అని చెప్పగా, ఆ పతివ్రత యముడితో ఇంకా ఇట్లా పలికింది.

తే. **'నాకు డప్పి యెక్కడిది? మనంబు భర్తృ । చరణపంకజాసక్తమై కరము భక్తి**
నలరుచున్నది; సతులకు నన్య మెట్టి । దియును ధర్మమె భర్తృసంశ్రయము కాక! 241

ప్రతిపదార్థం: నాకున్= నాకు; డప్పి+ఎక్కడిది= శ్రమ ఎక్కడిది?; మనంబు= చిత్తం; భర్తృ, చరణ, పంకజ+ఆసక్తము+ఐ= మగడియొక్క పాదపద్మాలపై కూర్మికలదై; కరము= మిక్కిలి; భక్తిన్= పూజ్యభావంతో; అలరుచున్+ఉన్నది= శోభిల్లుతున్నది; సతులకున్= పతివ్రతలకు; అన్యము= వేరొండు; ఎట్టిదియును= ఎటువంటిది అయినను; భర్తృ, సంశ్రయము కాక= మగడియొక్క అండ తప్ప; ధర్మమె= ధర్మమగునా? (ధర్మం కాజాలదు).

తాత్పర్యం: 'ఓ యమధర్మరాజా! నాకు శ్రమ ఎక్కడిది? నామనస్సు నాభర్తపాదపద్మాలయందే ఆసక్తికలిగి మిక్కుటమైన పూజ్యభావంతో శోభిల్లుతున్నది. ఎన్నివరాలు లభించినా అవి పతివ్రతలకు భర్తను ఆశ్రయించి ఉండటంతో సరిపోలవు కదా! సతికి ఏకైకపరమధర్మం భర్తృసంశ్రయమే.

వ. **మఱియు నొక్కవిన్నపంబు సేసెద. 242**

తాత్పర్యం: ఇంకా ఒక్క మనవి చేస్తాను.

ఆ. **ఆత్మధర్మనిరతు లైన పుణ్యాత్ములు । దుర్లభులు సమస్తదురితములును**
శాంతిఁ బొందు వారి సంసర్గమునఁదీర్థ । భూతమతులు వారు భూతలమున. 243

ప్రతిపదార్థం: ఆత్మధర్మనిరతులు+ఐన= తమధర్మాన్ని నెరవేర్చటంలో నిష్ఠకలవారు అయిన; పుణ్య+ఆత్ములు= సుకృతులు; దుర్లభులు= అరుదుగా దొరుకుతారు; (అట్టి) వారి సంసర్గమునన్= వారియొక్క సమాగమంవలన; సమస్త, దురితములును= అన్నిపాపాలు; శాంతిన్+పొందున్= శమిస్తాయి; వారు= ఆత్మధర్మనిరతులు అయిన పుణ్యాత్ములు; భూతలమునన్= భూప్రదేశంలో; తీర్థభూతమతులు= గంగాది తీర్థములవలె పవిత్రమైన మనస్సులు గలవారు.

తాత్పర్యం: తమధర్మాన్ని నిర్వహించటంలో నిష్ఠ గల మహానుభావులు చాల అరుదుగా కన్పిస్తారు. అట్టివారి సంపర్కంవలన సమస్తపాపాలు పోతాయి. బుద్ధివిశేషంచేత వారు పవిత్రతీర్థాలతో సమానులు. వారు జంగమ పుణ్యతీర్థాలు.

ఉ. వారల పేర్మిఁ గాదె శశివారిజమిత్త్రులు నిర్వికారసం
చారత నుల్లసిల్లెదరు, సర్వపయోనిధులున్ నిరాకులా
కారతఁ గ్రాలెడుం, గులనగంబులు నిశ్చలరూఢిఁ జాల నొ
ప్పారెడు భూతధాత్రి నిఖిలైకధురీణతఁ బేర్మిఁ బొందెడున్.' 244

ప్రతిపదార్థం: వారలపేర్మిన్+కాదె= వారలయొక్క అనగా ఆత్మధర్మనిరతు లైన పుణ్యాత్ముల గొప్పతనంచేతనే కదా; శశి, వారిజ, మిత్త్రులు= చంద్రుడు, సూర్యుడు; నిర్వికార, సంచారతన్+ఉల్లసిల్లెదరు= గతులు తప్పక నడుస్తూ శోభిల్లుతూ ఉంటారు; సర్వ, పయోనిధులున్= సర్వసముద్రాలున్నూ; నిరాకుల+ఆకారతన్= మేరమీరని రూపంతో; క్రాలెడున్= వెలుగొందుతాయి; కులనగంబులు= కులపర్వతాలు; నిశ్చల, రూఢిన్= కదలకుండ ఉండే స్థితి కలిగి; చాలన్= మిక్కిలి; ఒప్పారెడున్= విలసిల్లుతున్నవి; భూతధాత్రి= ప్రాణులతో కూడిన భూమి; నిఖిల+ఏక, ధురీణతన్= సమస్తమున్నూ తానే భరించటంలో; పేర్మిన్= గొప్పతనాన్ని; పొందెడున్= సంపాదిస్తుంది.

తాత్పర్యం: ఆత్మధర్మనిరతు లైన మహానుభావుల గొప్పతనంవలననే కదా ఈ సృష్టి ప్రశాంతంగా కొనసాగుతున్నది. అట్టివారలమహిమవలననే సూర్యచంద్రులు గతులు తప్పక తిరుగుతున్నారు. సర్వసముద్రాలు మేరదప్పక శోభిల్లుతున్నాయి. కులపర్వతాలు కదలికలేని ఠీవితో విలసిల్లుతున్నాయి. సకలప్రాణులతో కూడినభూమి సమస్తాన్ని భరిస్తున్న గౌరవాన్ని పొందుతున్నది.

విశేషం: నిర్ణీతగణితబద్ధమై ఈ ప్రపంచం సర్వం ఒకశ్రుతిలో ఒకలయకు అనుబద్ధమై ఉండటం మహానుభావుల ధర్మనిరతితో సంవదించటం మనోహరమైన ఉదాత్తకల్పన.

వ. అని పలికి మఱియు నిట్లనియె. 245

తాత్పర్యం: అని చెప్పి, ఇంకా ఇట్లా అన్నది.

తే. 'ఏడుమాట లాడినయంత నెట్టివారు । నార్యజనులకుఁ జుట్టంబు లగుదు రనినఁ
జిరసమాలాపసంసిద్ధిఁ జేసి నీకు । నేను జుట్టమ నని చెప్ప నేల వేఱ? 246

ప్రతిపదార్థం: ఏడుమాటలు+ఆడిన= ఏడుపలుకులు పలికిన; అంతన్= మేరకు; ఎట్టివారున్= ఎవరు అయినను; ఆర్యజనులకున్= పూజ్యులైన పెద్దమనుష్యులకు; చుట్టంబులు= బంధువులు; అగుదురు= ఔతారు; అనినన్= అని చెప్పగా; చిర, సమ్+ఆలాప, సంసిద్ధిన్+చేసి= చాలకాలం మాటలాడటం ఏర్పడటంవలన; నీకున్= ఓ యమధర్మరాజా, నీకు; నేను; చుట్టమన్= చుట్టాన్ని; అని= అని; వేఱు+అ= వేరుగా; చెప్పన్+ఏల?= చెప్పటం ఎందుకు?

తాత్పర్యం: "ఏడుమాటలు మాట్లాడితే ఎటువంటివారైనా బంధువులు ఔతారు - అని పెద్దల ప్రవచనం. మనం చాల సంభాషణ కొనసాగించాం. కాబట్టి నేను నీకు ఈ విధంగా చుట్టాన్ని ఐతిని కదా!

విశేషం: "సఖ్యం సాప్తపదీనమ్" అన్న సంస్కృతలోకోక్తికి ఇది అనుసరణ. ఏడుపదాలు స్నేహాన్ని ఘటిస్తాయి- అనునప్పుడు 'ఏడుమాటలు మాటాడినను లేదా ఏడుఅడుగులు కలిసి నడిచినను చాలు సఖ్యానికి అని రెండువిధాల అర్థం చెప్పవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సావిత్రియు యముడును చాలదూరం నడచారు. చాలమాటలు మాటాడారు. ఎట్టిన ఈ లోకోక్తిని తెలిగిస్తూ చుట్టరికం సాప్తపదీనం అనినను, వెనువెంటనే "మిత్రమనోరథమును'' అని వాడుటచేత - కవిహృదయం 'సఖ్యంసాప్తపదీనం' అనే సుభాషితం అనియే సుస్పష్టం.

వ. కావున మిత్త్రమనోరథం బవశ్యకర్తవ్యంబుగాఁ జిత్తగింపు' మనిన నమ్మహానుభావుం డబ్భామినిదెసం గనుంగొని 'నీకుం బ్రసన్నుండ నైతి నీ కిష్టం బైన వరం బొక్కటి యిచ్చెద; నడుగు' మనిన నమ్మానిని యిట్లనియె. 247

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; మిత్త్ర మనోరథంబు= మిత్రులకోరిక; అవశ్యకర్తవ్యంబుగాన్= తప్పనిసరిగా తీర్చదగినట్టిదిగా; చిత్తగింపుము= కరుణించుము; అనినన్= అని (సావిత్రి చెప్పగా); ఆ+మహా+అనుభావుండు= ఆ మహాభాగుడు; ఆ+భామిని, దెసన్+కనుంగొని= ఆ వనితవైపు చూచి; నీకున్= నీకు; ప్రసన్నుండన్+ఐతిన్= అనుగ్రహం కలవాడను అయినాను; నీకున్+ ఇష్టంబు+ఐన= నీకు ప్రీతికలిగించేదైన; వరంబు= వరం; ఒక్కటి= ఒకటి; ఇచ్చెదన్= ఇస్తాను; అడుగుము= కోరుకొనుము; అనినన్= అని అనగా; ఆ+మానిని= ఆ పడతి సావిత్రి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: 'కావున మిత్రులకోరిక ఈడేర్చటం తప్పనిసరిగా నెరవేర్చవలసిన ధర్మం, అనుగ్రహించుము' అని సావిత్రి యముడికి విన్నవించింది. మహానుభావుడైన యముడు సావిత్రిని చూచి 'నీకు నేను ప్రసన్నుడ నయినాను. నీవు ఇచ్చవచ్చిన వరాన్ని కోరుకొమ్ము' అని అన్నాడు. అంత సావిత్రి యమధర్మరాజును ఇట్లా అడిగింది.

క. 'మది సత్యవంతుజీవిత । మది యిమ్ముగఁ దొలఁగఁ బెట్టి యన్యంబుల ని
చ్చెద నని పలుకుదు మును నీ; । వది యిప్పుడు లేద; యింక నడిగెదఁ బ్రీతిన్. 248

ప్రతిపదార్థం: నీవు= నీవు; మదిన్= మనసులో; సత్యవంతుజీవితము= సత్యవంతుడి బ్రదుకు; అది= ఆ అంశాన్ని; ఇమ్ముగన్= ఉపాయంగా; తొలఁగన్+పెట్టి= తప్పించి; అన్యంబులన్= ఇతరాలైన వాటిని (వరములను); ఇచ్చెదన్= అనుగ్రహిస్తాను;అని, మును, పలుకుదు(వు)= అని ఇంతకు పూర్వం అంటూ ఉండేవాడవు; అది= ఆ అపసరణం; ఇప్పుడు= ఈసారి; లేదు+అ= లేదుకదా; ఇంకన్= ఇకమీద; ప్రీతిన్= సంతోషంతో; అడిగెదన్= (వరాన్ని) కోరుకొంటాను.

తాత్పర్యం: ఇంతవరకు నీవు నీ మనస్సులో సత్యవంతుడి ప్రాణాలను ఉపాయంగా తప్పించి, తక్కినవరాలను మాత్రమే కోరుకొమ్మని చెప్పావు. కాని, ఇప్పుడు ఆ అపసరణం లేకుండా కోరుకొనుమని అడిగావు. మహాప్రసాదం. ఇక యథేచ్ఛగా నేను వరాన్ని కోరుకొంటాను.

చ. పతివిరహంబు దుస్సహము; భర్తృవినాకృత యైన కాంత దూ
షిత యగు సర్వమంగళవిశేషములందును గాన మత్ప్రియుం
డతులితకీర్తిశాలి సుగుణాఢ్యుఁడు సాళ్వసుతుండు లబ్ధజీ
వితుఁడుగ నిమ్ము ధర్మపదవీపరిరక్షణ! పుణ్యవీక్షణా! 249

ప్రతిపదార్థం: ధర్మపదవీ పరిరక్షణ!= ధర్మస్థితిని చక్కగా కాపాడేవాడా!; పుణ్యవీక్షణా!= పవిత్రమైన దృష్టికలవాడా! పతివిరహంబు= భర్తనుండి యెడబాటు; దుస్సహము= భరించరానిది; భర్తృ, వినాకృత+ఐన, కాంత= మగడు లేని భార్య, భర్త మరణించిన భార్య; సర్వమంగళవిశేషములందును= సమస్తమైన శుభకార్యాలు మున్నగువాటిలో; దూషిత+అగున్= పరిహరించబడుతుంది;

కాన= కావున; మత్+ప్రియుండు= నాభర్త; అతులితకీర్తిశాలి= సాటిలేని యశస్సుతో ఒప్పేవాడు; సుగుణ+ఆఢ్యుఁడు= మంచిగుణాలు కలవాడు; సాళ్వసుతుండు= సాళ్వదేశపురాజు కొడుకు; లబ్ధజీవితుఁడుగన్= పొందిన జీవితము కలవాడుగా; ఇమ్ము= ఒసంగుము (వరంగా).

తాత్పర్యం: ధర్మస్థితిని చక్కగా కాపాడేవాడా! పవిత్రమైన దృష్టిగలవాడా! ఓ యమధర్మరాజా! మగడి యెడబాటు మగువకు భరించరాని ఆవేదన గొలుపుతుంది. మగడు మరణించిన మగువ సమస్తమైన శుభకార్యాలనుండి పరిహరించబడుతుంది. కావున సాటిలేనియశస్సు నార్జించినవాడు, సాళ్వభూపతిసుతుఁడు సద్గుణాలప్రోవు అయిన నాభర్త తిరిగి బ్రదికేటట్లుగా దయచేసి వరాన్ని ప్రసాదింపుము.

వ. అనిన 'నట్లచేయుదు' నని యాక్షణంబ కృతాంతుండు సత్యవంతు నపగతపాశుం జేసి యాసుందరి కిట్లనియె. 250

ప్రతిపదార్థం: అనినన్= అని (సావిత్రి) పలుకగా, అట్లు+అ= అట్లే; చేయుదున్= చేస్తాను; అని= అని వచించి; ఆ, క్షణంబు+అ= ఆత్రుటిలోనే; కృతాంతుండు= యమధర్మరాజు; సత్యవంతున్= సత్యవంతుడిని; అపగతపాశున్= తొలగిన పాశం కలవాడినిగా; చేసి= ఒనరించి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: సావిత్రి ఆరీతిగా విన్నవించగా, 'సరే; అటులనే చేస్తాను' అని చెప్పి, ఆ క్షణంలోనే సత్యవంతుడిని బంధించిన పాశాలను తొలగించి ఆ పొలతితో ఈ విధంగా అన్నాడు.

చ. 'కొను మిదె నీమనఃప్రియునిఁ గోమలి! వీఁడు చతుశ్శతాబ్దముల్
మను నిటమీఁదఁ; బుత్త్రులఁ గ్రమంబున నూర్వురఁ గాంచుఁ; గీర్తివ
ర్ధనుఁ డగు; సంతతాధ్వరవితానములం బరితుష్టి సేయు న
య్యనిమిషకోటి కెల్లను; నిజాన్వయమౌళివిభూషణం బగున్.' 251

ప్రతిపదార్థం: కోమలి!= సౌకుమార్యం కలదానా- సావిత్రీ!; నీమనస్+ప్రియునిన్= (నీమనఃప్రియుడిని) నీ మనస్సుకు ప్రీతిని కలిగించేవాడిని- సత్యవంతుడిని; ఇదె= ఇదిగో; కొనుము= స్వీకరించుము; వీఁడు= ఇతఁడు - సత్యవంతుడు; ఇటమీఁదన్= ఇంకమీద; చతుస్+శత+అబ్దముల్= నాలుగవందల ఏండ్లు; మనున్= బ్రదుకును; పుత్త్రులన్= కొడుకులను; క్రమంబునన్= వరుసగా; నూర్వురన్= వందమందిని; కాంచున్= పొందుతాడు; కీర్తివర్ధనుఁడు+అగున్= యశస్సును వృద్ధిపొందించేవాడు ఔతాడు; సంతత+అధ్వర, వితానములన్= ఎల్లప్పుడును నిర్వహించే యజ్ఞాలసముదాయాలవలన; ఆ+అనిమిషకోటికిన్+ఎల్లను= ఆవేల్పులసమూహాలకు అందరికిని; పరితుష్టిన్+చేయున్= సంతృప్తిని కలిగిస్తాడు; నిజ+అన్వయ, మౌళి, విభూషణంబు+అగున్= తనవంశానికి శిరోభూషణం (శ్రేష్ఠుడు) కాగలడు.

తాత్పర్యం: 'సౌకుమార్యవతి వైన ఓ సావిత్రీ! ఇదుగో నీమనస్సుకు సంప్రీతిని కలిగించే నీభర్తప్రాణాలు తీసికొమ్ము. నీభర్త సత్యవంతుడు. ఇకమీద నాలుగువందలసంవత్సరాలు జీవించగలడు. నూరుమంది కొడుకులను కనగలడు; పేరుప్రతిష్ఠల నార్జించగలడు. పెక్కుయజ్ఞాలను చేసి వేల్పులను సంతుష్టిపరచగలడు; తనవంశంలో శ్రేష్ఠుడు కాగలడు'.

వ. అని యాదేశించి యంతర్హితుం డయ్యె; నక్కాంతయుఁగ్రమ్మఱ చని యెప్పటియట్ల జీవితేశ్వరు తల తొడలపై నిడుకొని కూర్చున్న యెడం గొండొకవడికి లబ్ధచేతనుండై సత్యవంతుండు దెలిసి నిజవల్లభం జూచి యిట్లనియె. 252

ప్రతిపదార్థం: అని+ఆదేశించి= అని ఆజ్ఞాపించి; అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడు అయ్యాడు; ఆ+కాంతయున్= సావిత్రియు; క్రమ్మఱి, చని= మరలి వెళ్లి; ఎప్పటి+అట్లు+అ= యథాప్రకారం; జీవిత+ఈశ్వరు, తల= భర్త అయిన సత్యవంతుడి శిరస్సు; తొడలపైన్+ఇడుకొని= ఒడిలో పెట్టుకొని; కూర్చున్న= ఆసీనురాలు అయి ఉన్న; ఎడన్= తరుణంలో; కొండొకవడికిన్= కొంతసేపటికి; లబ్ధచేతనుండు+ఐ= పొందిన చైతన్యం కలవాడై; సత్యవంతుండు; తెలిసి= స్పృహవచ్చి; నిజవల్లభన్+చూచి= తనభార్యను కాంచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించి యమధర్మరాజు అదృశ్యుడయ్యాడు. అంతట సావిత్రి అడవికిమరలివచ్చి, యథాప్రకారం తనభర్త సత్యవంతుడి శిరస్సును తనతొడపై ఇడుకొని కూర్చున్నది. కొంతసేపటికి సత్యవంతుడు స్పృహగాంచి తనభార్య సావిత్రిని చూచి ఇట్లా అన్నాడు.

క. 'కడుఁ దడవు నిద్ర వోయితిఁ; । బడఁతీ! ననుఁ దెలుపవలదె; బలియుఁ డొకరుఁ డె
క్కుడు జవమునఁ బట్టి బలం । బెడలఁగ ననుఁ దిగిచె; నాతఁ డెవ్వఁడు సెపుమా! 253

ప్రతిపదార్థం: పడఁతీ!= వనితా ఓ సావిత్రీ!; కడున్+తడవు= చాలసేపు; నిద్ర+పోయితిన్= నిదురించాను; ననున్+తెలుపన్‌వలదె= నన్ను నిదురనుండి మేల్కొలుప వద్దా; బలియుఁడు= బలంకలవాడు; ఒకరుఁడు= ఒకడు; ఎక్కుడు, జవమునన్= మిక్కిలి వేగంతో; పట్టి= గ్రహించి; బలంబు= శక్తి; ఎడలఁగన్= పోవగా; ననున్= నన్ను; తిగిచెన్= లాగినాడు; ఆతఁడు= (నన్ను ఆ రీతిగా ఆకర్షించినవాడు); ఎవ్వఁడు, చెపుమా= ఎవడో నాకు చెప్పుము.

తాత్పర్యం: 'సావిత్రీ! నేను చాలసేపు నిదురించాను. మరి నీవు నన్ను నిదురనుండి మేలుకొలుపవద్దా? ఎవడో ఒకదృఢకాయుడు మిక్కిలివేగంగా నన్ను పొదివి పట్టిలాగినట్లు అనిపించింది. ఆతడు ఎవడో చెపుమా!

చ. అది కల గాదు, నిక్కువమ యైనటు లున్నది; నాకు నెంతయున్
మది వెఱపుట్టె' నావుడును మానిని యిట్లను 'నీకు నంతయున్
ముదమున రేపు సెప్పెదఁ; దమోమయమై యిదె శర్వరీముఖం
బొదవెఁ; విలంబనం బిచట నొప్పదు లెమ్ము నరేంద్రనందనా!' 254

ప్రతిపదార్థం: అది= (నన్ను బలియుఁడు ఆకర్షించటం); కల= స్వప్నం; కాదు= కాదు; నిక్కువము+అ, ఐనటులు+ఉన్నది= నిజమే అయినట్లు ఉన్నది; నాకున్+ఎంతయున్= నాకు మిక్కుటంగా; వెఱపుట్టెన్= భయం కలిగింది; నావుడును= అని చెప్పగా; మానిని= అభిమానవతి అయిన సావిత్రి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది; నర+ఇంద్ర, నందనా!= రాజపుత్రుడవైన ఓ సత్యవంతుడా!; నీకున్= నీకు (ఓ సత్యవంతుడా నీకు); అంతయున్= జరిగింది అంతయును; ముదమునన్= సంతోషంతో; రేపు= మరునాడు; చెప్పెదన్= వచిస్తాను; తమస్+మయము+ఐ= (తమోమయమై) చీకటిక్రమ్మి; ఇదె= ఇదిగో; శర్వరీముఖంబు+ ఒదవె= రాత్రి ప్రారంభమయింది; ఇచటన్= ఈ స్థలంలో; విలంబము= ఆలస్యం; ఒప్పదు= భావ్యం కాదు; లెమ్ము= బయలుదేరుము.

తాత్పర్యం: 'అది స్వప్నం కాదు. నిజంగా జరిగినట్లు భావిస్తున్నాను; నా చిత్తంలో మిక్కుటమైన భీతి ఏర్పడింది' అని సత్యవంతుడు వచించగా, అభిమానవతిఅయిన సావిత్రి ఇట్లా పలికింది; 'ఓ రాజపుత్రా! నీకు జరిగింది అంతయు రేపు తెలుపుతాను. చూడుము! ఇదిగో చీకటి నలుదెసల క్రమ్ముకొన్నది. రాత్రి ప్రారంభమైంది. ఇక అడవిలో ఈచోట ఆలస్యం చేయటం మంచిది కాదు; లెమ్ము!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. అదె నక్తంచరు లిందు నందును మహోగ్రాకారులై క్రందుగా
మెదలం జొచ్చిరి, ఘోరఫేరవరుతుల్ మిన్నందెఁ దీవ్రంబులై,
పదశబ్దంబులు మీఱెఁ జూడు కలయంబాఱం దొడంగెం బెనుం
గదుపుల్ గట్టి మృగంబు; లెంతయు భయోత్కంపంబు నా కయ్యెడున్. 255

ప్రతిపదార్థం: అదె= అదిగో; నక్తంచరులు= రాక్షసులు; ఇందున్+అందున్= ఇక్కడ అక్కడ; మహా+ఉగ్ర+ఆకారులు+ఐ= మిక్కిలి భయంకరమైన రూపాలు కలవారై; క్రందుగాన్= సందడిగా; మెదలన్+చొచ్చిరి= తిరుగాడసాగారు; ఘోర, ఫేరవ, రుతుల్= భయంకరమైన నక్కలకూతలు; తీవ్రంబులు+ఐ= తీక్ష్ణాలై; మిన్ను+అందెన్= ఆకసాన్ని అంటాయి; పెనున్+ కదుపుల్‌కట్టి= పెద్దగుంపులుగా చేరి; మృగంబులు= జంతువులు; చూడు= అరయుము; కలయన్+పాఱన్+తొడంగెన్= అంతటా పరుగెత్తుతున్నాయి; చూడు= గమనించుము; పదశబ్దంబులు= అడుగుల చప్పుడులు; మీఱెన్= అతిశయించాయి; ఎంతయున్= మిక్కిలి; భయ+ఉత్కంపంబు= వెఱపు వలన ఏర్పడిన వణకు; నాకున్+అయ్యెడున్= నాకు కలుగుతున్నది.

తాత్పర్యం: చీకటి పడింది. రాత్రివేళ తిరుగాడే రాక్షసులు అదిగో ఇచట అచట భయంకరమైన రూపాలతో సందడిగా తిరుగాడుతున్నారు. వెఱపు పుట్టించే నక్కకూతలు ఆకసాన్ని అంటుతున్నాయి. పెనుగుంపులు గుంపులుగా జంతువులు ఇటునటు తిరుగుతున్నాయి. వాటిఅడుగులసవ్వడి అతిశయిస్తున్నది. చూడుము. నాకు భయంవలన వణకు పుట్టుచున్నది.

క. విను! నీవు దడయుటకు మీ । జననియు జనకుండుఁ గరము సంతాపభరం
బునఁ బొందుదు రింతకుఁ; గ్ర । న్నన వారికి సంతసం బొనర్పవె యధిపా! 256

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా, సత్యవంతుడా!:; విను= ఆలకింపుము; నీవు= నీవు; తడయుటకున్= ఆలసించటానికి; మీ జననియున్= మీ తల్లియు; జనకుండున్= తండ్రియునూ; కరము= మిక్కిలి; సంతాప, భరంబునన్= దుఃఖం అనే బరువును; ఇంతకున్= ఇప్పటికి; పొందుదురు= అనుభవిస్తారు; క్రన్ననన్= శీఘ్రంగా; వారికిన్= మీ జననీ జనకులకు; సంతసంబు= సంతోషం; ఒనర్పవె= చేయుము (చేయవా).

తాత్పర్యం: రాజా, ఓ సత్యవంతుడా! ఆలకింపుము. ఇప్పటికే నీవు ఆలస్యం చేయటంచేత మీ తల్లితండ్రులు మిక్కుటమైన శోకభారంచేత తపిస్తుంటారు. శీఘ్రంగా ఇలు చేరి వారికి సంతోషం కలిగించుము.

వ. అని పలికి తదీయవిషాదచేష్టితంబు లుపలక్షించి వెండియు. 257

ప్రతిపదార్థం: అని పలికి= అని వచించి; తదీయ, విషాద, చేష్టితంబులు= ఆతడియొక్క (సత్యవంతుడియొక్క) ఖేదంతో గూడిన చేష్టలు; ఉపలక్షించి= గమనించి.

తాత్పర్యం: అని సావిత్రి పలికి సత్యవంతుడియొక్క చేష్టలు ఖేదంతో కూడిఉండటం గమనించి.

చ. 'తమమును బెల్లుగాఁ బరఁగె, దవ్వు నిజాశ్రమభూమియున్, మదిన్
శ్రమమును బాయ దిప్పు డనుచందమ యైనఁ జనంగ నేల? యిం
పమరఁగ నింతప్రొద్దు సుగుణాకర! యిచ్చట నిల్చి రేపు వో
దమె? తెలుఁ గెద్ది?' నావుడును దన్వికి సాళ్వతనూజుఁ డిట్లనున్. 258

ప్రతిపదార్థం: తమమును= చీకటియును; పెల్లుగాన్= అధికంగా; పరఁగెన్= వ్యాపించింది; నిజ+ఆశ్రమభూమియున్= మన ఆశ్రమసీమకూడ; దవ్వు= దూరం; మదిన్= చిత్తంలో; శ్రమమును= అలసటయును; ఇప్పుడు; పాయదు= పోవదు; అను= అనునట్టి; చందము+అ+ఐనన్= రీతిగా అయితే; చనంగన్+ఏల?= పోవటం దేనికి?; సుగుణ+ఆకర!= మంచిగుణాలకు నెలవు అయినవాడా, ఓ సత్యవంతుడా!; ఇంపు+అమరఁగన్= ప్రీతి ఎసగగా; ఇంతప్రొద్దు= ఈ రాత్రిసమయం; ఇచ్చటన్= ఈస్థలంలో; నిల్చి= ఉండి; రేపు= ప్రొద్దున; పోదము+ఎ= వెడలుదమా; తెఱఁగు+ఎద్ది?= మార్గం ఏది?; నావుడును= అని వచించగా; తన్వికిన్= పొలతికి, సావిత్రికి; సాళ్వతనూజుఁడు= సాళ్వరాజు కుమారుడు - సత్యవంతుడు; ఇట్లు+అనున్= ఈవిధంగా అంటున్నాడు.

తాత్పర్యం: 'మంచిగుణాలకు నెలవు అయినవాడా, ఓ సత్యవంతుడా! అంధకారం దట్టంగా వ్యాపించింది; మనఆశ్రమం ఇక్కడికి మిక్కిలి దూరం. మనసులోని అలసటకూడా తీరలేదు అని అనిపిస్తే, ఇక తొందరపడి పోవటం ఎందుకు? ఈరాత్రిప్రొద్దు వేడుకగా ఇక్కడనే గడపి తెల్లవారినపిదప బయలుదేరి వెళ్ళవచ్చును కదా. మీ ఆలోచన ఏమిటి?' అని సావిత్రి పలికింది. సావిత్రితో సత్యవంతుడు ఇట్లా బదులు పలికాడు.

క. 'మానె శిరోవేదన, నా । మేనికిఁ దగ లావు వచ్చె, మెల్లన జరుగం
గా నేర్తుఁ, దల్లిదండ్రులఁ । గానక యే నెట్లు నిలుతుఁ గాననభూమిన్? 259

ప్రతిపదార్థం: శిరోవేదన= శిరస్+వేదన= తలనొప్పి; మానెన్= పోయింది; నామేనికిన్= నాశరీరానికి; తగన్= ఒప్పిదంగా; లావువచ్చెన్= బలం చేకూరింది; మెల్లన= మెల్లమెల్లగా; జరుగంగాన్ నేర్తున్= కదలి నడయాడగలను; తల్లిదండ్రులన్= జననీజనకులను; కానక= చూడకుండ; కాననభూమిన్= అరణ్యసీమలో; ఏన్= నేను; ఎట్లు= ఏరీతిగా; నిలుతున్?= నిలువగలను?

తాత్పర్యం: నాతలనొప్పి పూర్తిగా తగ్గింది. నాశరీరానికి ఒప్పిదంగా బలం చేకూరింది. మెల్లమెల్లగా కదలి నడవగలను. నాతలిదండ్రులను చూడకుండగా ఈ అరణ్యసీమలో నేను నిలువజాలను సుమీ.

క. ఇంతకు మున్నెన్నఁడు నే । నింత తడవు వారిఁ బాసి యెందుఁ దడయ; నేఁ
డింతవడి మసలుటకు వా । రెంత వడిరొ! యేమి యైరొ! యెట్లున్నారో! 260

ప్రతిపదార్థం: ఇంతకున్+మున్ను= ఇంతకుపూర్వం; ఎన్నఁడున్= ఎప్పుడును; ఏన్= నేను; ఇంతతడవు= ఇంతసేపు; వారిన్= వారిని (జననీజనకులను); పాసి= విడిచి; ఎందున్= ఎచటను; తడయను= ఆలసించలేదు; నేఁడు= ఈనాడు; ఇంతవడి= ఇంతసేపు; మసలుటకున్= తిరుగాడటానికి, ఆలసించినందుకు; వారు= జననీజనకులు; ఎంత+పడిరొ= ఎంతటి ఆవేదన అనుభవించారో; ఏమి+ఐరొ= ఏమైనారో; ఎట్లు= ఏ రీతిగా; ఉన్నారో= ఉన్నవారో కదా.

తాత్పర్యం: ఇంతకుపూర్వం నేను ఎప్పుడూ ఇంతసేపు జననీజనకుల నెడబాసి ఆలసించి ఉండలేదు. నేడు ఈ విధంగా నేను ఇటునటు తిరిగి ఆలసించటంవలన నా తలిదండ్రులు ఎంతటి ఆవేదన అనుభవిస్తున్నారో! ఏమైనారో! మరి ఏవిధంగా ఉన్నారో!

ఆ. సంధ్యప్రొద్దు నన్ను జనని యెన్నఁడు నిల్లు । వెడలనీదు; నేఁడు విపినభూమి
మధ్యరాత్రివేళ మసలుట కాయమ । యెట్టిపాటు పడెనొ, యే నెఱుంగ. 261

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సంధ్యప్రొద్దు= సంజవేళలో; నన్నున్= నన్ను; జనని= (నా)తల్లి; ఎన్నఁడున్= ఎప్పుడును; ఇల్లు= గృహం; వెడలనీదు= వీడనివ్వదు; నేఁడు= ఈరోజున; విపినభూమిమధ్యన్= అరణ్యసీమనడుమ; రాత్రివేళన్= రాత్రిసమయంలో; మసలుటకున్= ఆలసించటానికి; ఆయమ= ఆమె (నాజనని); ఎట్టి పాటుపడెనొ= ఎట్టి ఆవేదన పొందెనో; ఏను= నేను; ఎఱుంగన్= తెలియజాలనుకదా.

తాత్పర్యం: సాయంకాలంలో మా అమ్మ నన్ను ఇల్లు వదలి ఎచ్చటికీ పోనివ్వదు. ఈరోజున ఈ అడవిలో ఈ నిశాసమయంలో నేను ఇట్లా ఆలస్యంచేయటంవలన ఆమె ఎంతటి ఆవేదనకు లోనయిందో, నేను ఎఱుగజాలనుగదా!

సీ. కౌఁగిట ననుఁ జిక్కఁ గదియించి శిరము మూ । ర్కొంచును బాష్పముల్ గురియుచుండఁ
బట్టి 'మాయొడలులఁ బ్రాణంబులును నెల్ల । యర్థముల్ నీవ; మాయన్న! నీవు
దెప్పగా సంసారతీరంబు సేరెద । మని తలంచెదము సు మ్మన్న! యన్న!
కన్నులు లేని మాకన్నులుఁ గాళులు । నీవ కదన్న! మా నిఖిలవంశ

ఆ. మును సముద్ధరించు మోపు నీ యదియ క । దన్న!' యనుచు నిట్టు లగ్గలంపుఁ
బ్రేమ ననుదినంబుఁ బ్రేముడింతురు వృద్ధు । లక్కటకట! యేమి యైరొ నేఁడు? 262

ప్రతిపదార్థం: కౌఁగిటన్= ఆలింగనంలో; ననున్= నన్ను; చిక్కన్= గట్టిగా; కదియించి= కూర్చిపట్టి; శిరము= తల; మూర్కొంచును= ఆఘ్రాణిస్తూ; బాష్పముల్= కన్నీరు; కురియుచున్+ఉండన్= కారుతుండగా; పట్టి= అదిమి; మా+ఒడలులన్= మాశరీరంలో; ప్రాణంబులునున్= అసువులూ, ఎల్ల+అర్థముల్= సకల సంపదలూ, నీవు+అ= నీవే; మా+అన్న= మా నాయనా; నీవు= ఈవు; తెప్పగాన్= పడవగా; సంసారతీరంబు= సంసారపు సముద్రపుయొక్క గట్టు; చేరెదము= పొందుతాం; అని తలంచెదము, సుమ్ము+అన్న= అని భావిస్తాం నాయనా!; అన్న= మాతండ్రీ; కన్నులు లేని= నేత్రాలులేని; మా కన్నులున్= మా నేత్రాలు; కాళులున్= కాళ్లు; నీవు+అ= నీవే; కద+అన్న= కదా నాయనా; మా, నిఖిలవంశమును= మా సమస్తకులాన్ని; సముద్ధరించు= కాపాడే; మోపు= భారం; నీ+అది+అ, కద+అన్న= నీదే కదా నాయనా; అనుచున్= అని చెప్తూ; ఇట్టులు= ఈ రీతిగా; అగ్గలము+ప్రేమన్= (అగ్గలంపుఁబ్రేమన్) అధికమైన అనురాగంతో; అనుదినంబున్= ప్రతిరోజూ; ప్రేముడింతురు= వాత్సల్యం చూపుతారు; వృద్ధులు= ముసలివాండ్రు, జననీజనకులు; అక్కట+అకట= (అక్కటకట) అయ్యోపాపం; నేఁడు= ఈ దినం; ఏమి+ఐరొ= ఏమైనారో కదా.

తాత్పర్యం: నన్ను కౌగిటిలో గదియించుకొని నాతల ఆఘ్రాణిస్తూ కన్నీరు కారుస్తూ నన్ను పట్టుకొని, 'నాయనా! మా శరీరాలలోని పంచప్రాణాలు నీవే సుమా; మా సిరిసంపదలు అన్నియు నీవే కదా నాయనా; నీవు తెప్పగా మేము ఈ సంసారసముద్రం దాటి తీరాన్ని చేరుకొనగలమని భావిస్తున్నాం కదరా, కుమారా! కన్నులు లేని మా కన్నులు, కాళ్ళు నీవే కదా! మావంశాన్నంతా ఉద్ధరించేవాడవు నీవే నని నీమీద ఆశలు పెట్టుకొనిఉన్నాంరా నాయనా!' అని పరిపరివిధాల నామీద అనురాగం వర్షించే ముసలివారు నా తలిదండ్రులు. ప్రతిదినం నాకై పరితపించేవారు - నేడు నేను ఇంతసేపు ఆలస్యం చేయటంవలన అక్కటకటా! నాకొరకు ఎంతటిఆవేదన అనుభవించారో కదా!

విశేషం: (1) "అన్న" - తెలుగుబాసలో అనురాగతరంగిత మైన తియ్యనిపదం. (2) వాత్సల్యాన్ని ఆలంకారికులు నవరసాలలో చేర్చకపోయినా, హృదయాళువు లైన కొందరు వాత్సల్యాన్ని రసంగా పరిగణించి ఆప్తవియోగం స్థాయిభావంగా పేర్కొన్నారు. తలిదండ్రులయెడ పుత్రుడికి గల ఆర్ద్రభావం, కన్నులు లేక రాజ్యం కోలుపోయి ఏకైకసుతుడే తమజీవితసర్వస్వ మని భావించే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తలిదండ్రులవాత్సల్యం ఈ పద్యంలో హృదయంగమంగా కూర్చబడటం- రసజ్ఞుల తల లూపించక పోదు. జగన్మిథ్య అని వాదించేవారుకాని, కామక్రోధలోభమోహమదమాత్సర్య భూయిష్ఠమని ప్రపంచాన్ని నిరసించేవారుకాని జననీజనకుల వాత్సల్యంలో సత్యలేశం లేదని చెప్పనేరరుగదా. ఈ పద్యంలో ఎట్టిన "వాత్సల్యమును రసస్థాయికి పెంచినట్లు భావించవచ్చును."

ఆ. అడవి కేఁగుదెంచి యడరంగ ఫలమూల । తతులు గొనుచు నేను దడయ కపుడ
పోవఁగాన నైతి; దైవోపహతి నింత । చిక్కువడితి; నేమి సేయువాఁడ! 263

ప్రతిపదార్థం: అడవికిన్= అరణ్యానికి; ఏఁగుదెంచి= వచ్చి; అడరంగన్= త్వరపడుతూ; ఫల, మూల, తతులు= పండ్లు, కందగడ్డలు మున్నగునవి; కొనుచున్= పరిగ్రహిస్తూ; ఏను= నేను; తడయక+అపుడు+అ= ఆలసింపక అప్పుడే; పోవన్+కానను+ఐతిన్= పోలేకపోయాను; దైవ+ఉపహతిన్= విధిచేత దెబ్బతినటంచేత; ఇంత= ఇంతగా; చిక్కు+పడితిన్= ఇరుకులో పడ్డాను; ఏమి+చేయువాఁడన్= ఏమి చేయగలను.

తాత్పర్యం: అయ్యో! అరణ్యానికి వచ్చి పండ్లు కందమూలాలు మున్నగునవి సంగ్రహించుకొని ఆలసించక శీఘ్రంగా నేను మరలిపోయి ఆశ్రమం చేరిఉంటే ఎంత బాగుండేది! విధివిపరిపాకంచేత నేను ఇచ్చట చిక్కువడిపోయాను. కదా! ఇంకేమి చేయగలను?

క. నా యున్నచో టెఱుంగక । యా యాశ్రమవాసులైన యందఱ నతిదుః
ఖాయత్తుఁ డగుచు నడుగును । మాయయ్య దలంకి మాటిమాటికి నింకన్. 264

ప్రతిపదార్థం: మా+అయ్య= మా తండ్రి; నా+ఉన్నచోటు= నేను ఉన్నస్థలం; ఎఱుంగక= తెలియక; తలంకి= కలతచెంది; ఆ+ఆశ్రమవాసులు+ఐన= ఆ ఆశ్రమంలో నివసిస్తున్న; అందఱన్= అంతమందిని; అతిదుఃఖ+ఆయత్తుఁడు+అగుచున్= మిక్కుటమైన ఆవేదనతో కూడినవాడై; మాటిమాటికిన్= మరల మరల పలుమారులు; ఇంకన్= మరీమరీ; అడుగును= ప్రశ్నిస్తాడు.

తాత్పర్యం: నేను ఎచ్చట ఉన్నది మాతండ్రిగారికి తెలియదుకదా. ఆయన ఆశ్రమంలో ఉన్నవారందరిని పలుమారులు మిక్కుటమయ్యే ఆవేదనతో నాయోగక్షేమాలనుగూర్చి ప్రశ్నిస్తూ ఉంటాడు. పాపం ఆ ఆశ్రమవాసులు మాత్రం ఏమని బదులు పలుకగలరు? వారికి నా ఉనికిపట్టులు తెలియవుకదా! ఇక మాతండ్రిగారి దుఃఖం తీరేది ఎట్లా?

క. నావార్త వినక యింతకు । నావృద్ధులు భిన్నహృదయులై ప్రాణంబుల్
పోవిడుతురు గా కచటికిఁ । బోవం బనిగలదె యేనుఁ బుచ్చెద నసువుల్. 265

ప్రతిపదార్థం: నావార్త= నన్నుగూర్చిన సమాచారం; వినక= ఆలకించక; ఇంతకున్= ఇప్పటికే; ఆ వృద్ధులు= ఆ ముసలివారు - నా జననీజనకులు; భిన్నహృదయులు+ఐ= పగిలినగుండెలు కలవారై; ప్రాణంబుల్, పోవిడుతురు+కాక= ప్రాణాలు విడిచి ఉండవచ్చును; అచటికిన్= ఆ చోటికి; పోవన్ పని కలదు+ఎ= కార్యం ఉన్నదా, ప్రయోజనం కలదా; ఏను= నేను; అసువుల్= ప్రాణాలను; పుచ్చెదన్= విడిచిపెట్టుతాను.

తాత్పర్యం: నా ఉనికిపట్టులగూర్చిన సమాచారం తెలియక, ముసలివారైన నా జననీజనకులు ఈపాటికే తమప్రాణాలను విడిచిఉంటారు. ఇక నేను ఆశ్రమానికి పోయినా ప్రయోజన మేముంటుంది? నేను నాప్రాణాలను వదలిపెడతాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సత్యవంతుఁడు సావిత్రితోడ మరలి తనయాశ్రమంబునకు వచ్చుట (సం. 3-281-97)

వ. అని బహుప్రకారంబులం బలవించి కన్నీరు నించిన, నక్కాంత దుఃఖాక్రాంత యగుచు నతని నాశ్వాసించి, నవమృణాళమృదులంబులగు భుజంబులం గౌఁగిలించియెగయ నెత్తిన, మెత్తన లేచి యతండు ధూళిధూసరితం బైన శరీరంబు దుడిచికొని గమనంబున కుత్సహించిన. 266

ప్రతిపదార్థం: అని= అని తలపోసి; బహుప్రకారంబులన్= పలువిధాల; పలవించి= దుఃఖించి; కన్నీరు, నించినన్= కన్నీరు కార్చగా; ఆ+కాంత= సావిత్రి; దుఃఖ+ఆక్రాంత+అగుచున్= విషాదంచేత అలముకొనబడినది ఔతూ; అతనిన్= ఆ సత్యవంతుడిని; ఆశ్వాసించి= ఓదార్చి; నవ, మృణాళ, మృదులంబులు+అగు= లేత తామరతూండ్లవలె మెత్తనైన; భుజంబులన్= బాహువులచేత; కౌఁగిలించి= ఆశ్లేషించి; ఎగయన్+ఎత్తినన్= లేవనెత్తిగా; మెత్తన లేచి= మెల్లగా నిలబడి; అతండు= సత్యవంతుడు; ధూళి, ధూసరితంబు+ఐన= దుమ్ముచేత ఆవరించబడిన; శరీరంబు= దేహాన్ని; తుడిచికొని= దుమ్ముపోయేటట్లు ఒత్తి విదుల్చుకొని; గమనంబునకున్= పయనానికి; ఉత్సహించినన్= పూనగా.

తాత్పర్యం: అని యోచించి, పలువిధాల దుఃఖించి కంటినీరు కార్చగా సావిత్రి విషాదంచేత అలముకొనబడిందై సత్యవంతుడిని అనునయించి, లేతతామరతూండ్లవలె మిక్కిలి సుకుమారాలైన బాహువులతో అతడిని ఆలింగనం చేసికొని లేవనెత్తింది. సత్యవంతుడు మెలమెల్లగా లేచి తనశరీరంమీద నున్న దుమ్ము దులుపుకొని ఆశ్రమానికి పోవటానికి ఉత్సహించాడు.

క. ఫలభారము దుర్భర మని । వెలఁది యచట నొక్కవృక్షవిటపంబున ని
మ్ముల గరడియ దగిలిచి యు । జ్జ్వల పరశువుఁ గొనుచు మృదులసంభ్రమలీలన్. 267

ప్రతిపదార్థం: ఫలభారము= పండ్లయొక్కబరువు; దుర్భరము+అని= మోయటానికి అలవికాదు అని తలపోసి; వెలఁది= వనిత సావిత్రి; అచటన్= అచటనున్న; ఒక్క= ఒక; వృక్షవిటపంబునన్= చెట్టుకొమ్మయందు; ఇమ్ములన్= ఉపాయంతో; గరడియ= బుట్ట; తగిలిచి= వ్రేలాడగట్టి; ఉత్+జ్వల, పరశువున్= ప్రకాశించే (మిలమిలలాడే) గండ్ర గొడ్డలిని; కొనుచున్= పరిగ్రహిస్తూ; మృదులసంభ్రమలీలన్= మెత్తనైన తత్తరపాటుతో.

తాత్పర్యం: పండ్లబుట్టబరువు మోయటం కష్టమని భావించి సావిత్రి ఉపాయంచొప్పున ఆ పండ్లబుట్టను అరణ్యంలోని ఒక చెట్టుకొమ్మకు వ్రేలాడదీసింది. మిలమిలలాడే గండ్రగొడ్డలిని తనవెంట తీసికొని మెత్తని తొట్రుపాటుతో.

విశేషం: (1) సావిత్రి వహించవలసిన భారాలు రెండు. ఒకటి అలసిఉన్న జననీజనకులకై ఆవేదన చెందిఉన్న సత్యవంతుడిని ఆశ్రమం చేర్చటం. రెండు - సత్యవంతుడు కోసిన పండ్లు. ఉపాయంగా ఆమె పండ్లగంపభారాన్ని తప్పించుకోగలిగింది. ఆ పండ్లబుట్టను ఒక చెట్టుకొమ్మకు తగిలించింది. అనగా దినమెల్ల శ్రమించి సత్యవంతుడు సంపాదించిన ఆ పండ్లను విడిచి పెట్టవలసివచ్చింది. అది మానవజీవితంలోని విచిత్రవిరోధాభాసం. (2) గండ్రగొడ్డలి బరువు తక్కువ. అంతేగాక మార్గమధ్యంలో దాని అవసరం కలుగవచ్చును. అందుచేత దానిని వెంట తీసికొని వెళ్ళింది.

వ. జీవితేశ్వరువామబాహువు నిజవామభుజంబుపయి నిడికొని దక్షిణహస్తంబున నతని గ్రుచ్చి కౌఁగిలించి మందగమనంబున నాశ్రమదేశంబునకు మగిడె; నంత నక్కడ. 268

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: జీవిత+ఈశ్వరువామబాహువు= భర్త అయిన సత్యవంతుడియొక్క ఎడమచేయి; నిజ, వామభుజంబు= తనదైన ఎడమచేయి; పయిన్+ఇడికొని= పైనపెట్టుకొని; దక్షిణహస్తంబునన్= కుడిచేతితో; అతనిన్= సత్యవంతుడిని; గ్రుచ్చి+ కౌఁగిలించి= గాటంగా పట్టి ఆలింగనం చేసికొని; మంద, గమనంబునన్= మెల్లని నడకతో; ఆశ్రమదేశంబునకున్= విడిదితోటకు; మగిడెన్= మరలివెళ్ళింది; అంతన్= అటు తర్వాత; అక్కడన్= ఆస్థలంలో అనగా ఆ ఆశ్రమంలో.

తాత్పర్యం: (సావిత్రి) తనభర్తఅయిన సత్యవంతుడి ఎడమచేయి తన ఎడమబుజంపై ఉంచుకొని; కుడిచేతితో అతడిని ఆలింగనం చేసికొని మెలమెల్లగా నడుస్తూ ఆశ్రమం ఉన్నచోటికి వెడలసాగింది. అక్కడ

ఉ. **కన్నులు వచ్చి యెల్లెడలుఁ గన్గొని వృద్ధనరేంద్రుఁ డాత్మకుం**
గన్నులుఁ బోలె నైన తన గాదిలిపుత్త్రుఁడు గాననంబులో
నెన్నఁడు లేని యింత తడ వేటికిఁ జిక్కెనొ యంచు నార్తితోఁ
గన్నులు లేనియ ట్లతఁడుఁ గానక యేడ్చె సతీసమేతుఁ డై. **269**

ప్రతిపదార్థం: కన్నులు వచ్చి= కన్నులు వచ్చి (ఇంతవరకు ద్యుమత్సేనుడు గ్రుడ్డివాడు. అతడికి ఆకస్మికంగా దృష్టి వచ్చింది. సావిత్రికి యముడు అనుగ్రహించిన వరం చొప్పున); ఎల్ల+ఎడలున్= అన్నిచోటులును; కన్గొని= చూచి; వృద్ధ, నర+ ఇంద్రుఁడు= ముసలిరాజు- ద్యుమత్సేనుడు; ఆత్మకున్= తన అంతరాత్మకు; కన్నులున్+పోలెన్+ఐన= నేత్రాలు వలెనే ఉన్నటువంటి; తన, గాదిలి, పుత్త్రుఁడు= తన అనుగుకొడుకు సత్యవంతుడు; కాననంబులోన్= అరణ్యంలో; ఎన్నఁడున్‌లేని= ఎప్పుడును జరుగని; ఇంత, తడవు= ఇంతసేపు; ఏటికిన్= ఎందుకు; చిక్కెనొ= ఆలసించెనో; అంచున్= అని తలపోస్తూ; ఆర్తితోన్= దైన్యంతో; కన్నులులేని+అట్లు= నేత్రాలు లేని మాదిరిగా; అతఁడు= ద్యుమత్సేనుడు; కానక= కనుపించక (ఇపుడు ఆతనికి ప్రపంచమంతా కనిపిస్తున్నా - కొడుకు కన్పించకపోవటంచేత కన్పించనట్లుగనే ఎంచి); సతీసమేతుఁడు+ఐ= భార్యతో కూడినవాడై; ఏడ్చెన్= విలపించాడు.

తాత్పర్యం: ద్యుమత్సేనుడికి ఆకస్మికంగా గ్రుడ్డితనం పోయి దృష్టి వచ్చింది. ఇది ఆశ్చర్యకరమైన అంశం. కాని ఇంతవరకు తనఆత్మకు కన్నులవలె ఉన్నటువంటి కొడుకు సత్యవంతుడు కన్పించలేదు. ఆ వృద్ధభూపతి నల్గడలు పరికించి చూచాడు. కన్నులు వచ్చిన సంతోషపారవశ్యంతోపాటు ఆ క్షణంలోనే ఎప్పుడో అరణ్యంలోకి వెళ్ళిన కొడుకు ఇంతవరకు రాలేదు. ఆత డేమయ్యాడో అనే విషాదం అతడిని ఆవరించింది. కన్నులు వచ్చికూడ ద్యుమత్సేనుడు కన్నులు లేనివాడివలె భార్యతో కలిసి విలపించాడు.

విశేషం: ఇచ్చట కథ ఒకవింతమలుపు తిరిగింది. ఆకస్మికంగా ఆశ్చర్యకరంగా గ్రుడ్డిరాజు ద్యుమత్సేనుడికి దృష్టి వచ్చింది. ఆతడు నల్గడలు కలయజూచాడు. క్రొంగ్రొత్తప్రపంచం అత్యద్భుతంగా అతడికి గోచరించింది. కాని ఆతడు మొట్టమొదట చూడగోరేది ఆతని తనయుడైన సత్యవంతుడినేకదా. ఏడి ఆ సత్యవంతుడు? ఏమైనాడు? అడవికి పోయి చాలసేపు అయిందే?! వృద్ధభూపతికి కన్నులు వచ్చిన ఆనందంకంటె కొడుకు కన్పించకపోవటంచేత కన్నులు లేకపోవటమే మేలు అనిపించినది. అది మానవజీవితంలో నాటకీయమైన విచిత్రవిరోధాభాసం. మనిషిబ్రదుకు వెలుగునీడల వింతమెలిక. అప్పుడు ఆ తండ్రి మానసికపరిస్థితి సహృదయహృదయైక వేద్యం. అల మతి విస్తరేణ.

తరలము

కొడుకు నిందును నందు రోయుచుఁ గోరి ప్రేమభరంబునం
గొడుకుసద్గుణకోటి యెల్లను గోటిభంగుల నోలి ను

గ్గడన సేయుచు సత్యవంతునిఁ గానరే మునులార! యే
యడవిలోపల నంచు హాసుత! యంచు ధైర్యము డించుచున్. **270**

ప్రతిపదార్థం: కొడుకున్= పుత్రుడిని (సత్యవంతుడిని); ఇందున్+అందున్= ఇచటను అచటను- అన్నిచోటులలో; రోయుచున్= వెదకుతూ; కోరి= ప్రీతితో పూని; ప్రేమభరంబునన్= వాత్సల్యాతిశయంచేత; కొడుకు, సత్+గుణ, కోటి+ఎల్లను= పుత్రుడియొక్క మంచి గుణగణాలనన్నింటిని; కోటిభంగులన్= పెక్కురీతుల; ఓలిన్= వరుసగా; ఉగ్గడన+చేయుచున్= గట్టిగా వల్లిస్తూ; మునులార!= ఋషులార!; ఏ+అడవిలోపలన్= ఏ అరణ్యంలోనైనా; సత్యవంతునిన్= సత్యవంతుడిని; కానరే= చూడలేదా; అంచున్= అని అడుగుతూ; హా, సుత!= అయ్యో కొడుకా!; అంచున్= అంటూ; ధైర్యము= చిత్తస్థైర్యం; డించుచున్= కోలుపోతూ.

తాత్పర్యం: ద్యుమత్సేనుడు తనకొడుకు సత్యవంతుడిని అన్వేషించసాగాడు. అతడు వాత్సల్యాతిశయంచొప్పున తనకొడుకు గుణగణాలనన్నిటిని వరుసగా వల్లెవేస్తూ పెక్కుభంగుల అరుస్తూ అరణ్యంలో తిరుగుతూ 'ఓ ఋషులార! మీరు ఎక్కడనైనా సత్యవంతుడిని చూచారా? అని అడుగుతూ 'అయ్యో! కొడుకా! ఎక్కడ ఉంటివిరా' అని ధైర్యం కోలుపోయి విలపిస్తూ (ఉన్నాడు).

విశేషం: వృత్త లక్షణానికి చూడు: అరణ్య : 4.402 విశేషాంశం.

వ. **ఉన్నంతఁ, దదాశ్రమవాసులైన మునులందఱు నతనిం బొదివికొని తదీయనయనలాభంబునకు విస్మయం బందుచు నుచితవాక్యంబుల నతని నాశ్వాసించుచుండిరి; తదనంతరంబ యొక్క ముహూర్తంబునకు సావిత్రీసహితుండై చిత్రాశ్వుండు సనుదెంచిన నావృద్ధదంపతు లత్యంతహర్షంబున నతనిం గౌఁగిలించుకొని మూర్ధాఘ్రాణంబు సేసిరి; మునులు గరంబు సంతసిల్లి; రప్పు డారాజర్షి ముఖ్యుండు పుత్త్రునిం జూచి 'యయ్యా! యి ట్లేల వనంబున మసలి?' తని యడిగిన నతండు దాను జని పండ్లు గోయుటయును గాష్ఠదళనంబు సేయునెడం దల యేరు గదిరి నిలువనోపక విశ్రమించుటయుఁ దన్నొక పురుషుండు గలలోన నిగ్రహించుటయుం జెప్పునెడ సావిత్రి మామ కిట్లనియె.** **271**

ప్రతిపదార్థం: (ఆ రీతిగా ద్యుమత్సేనుడు); ఉన్నంతన్= ఉండగా, విలపిస్తుండగా; తద్+ఆశ్రమవాసులు+ఐన= ఆ ఆశ్రమంలో నివసించేవారు అయిన; మునులు+అందఱున్= ఋషులు ఎల్లరు; అతనిన్= ద్యుమత్సేనుడిని; పొదివికొని= చుట్టూచేరి; తదీయ, నయన, లాభంబునకున్= ఆతనికి కన్నులు లభించినందుకు; విస్మయంబు+అందుచున్= అచ్చెరువు చెందుతూ; ఉచితవాక్యంబులన్= తగినమాటలతో; అతనిన్= ద్యుమత్సేనుడిని; ఆశ్వాసించుచున్+ఉండిరి= అనునయిస్తూ ఉన్నారు; తద్+అనంతరంబు+అ= అటుపిమ్మట; ఒక్క, ముహూర్తంబునకున్= రెండుగడియల కాలానికి; సావిత్రీసహితుండు+ఐ= సావిత్రితో కూడినవాడై; చిత్రాశ్వుండు= సత్యవంతుడు; చనుదెంచినన్= అరుగుదెంచగా; ఆవృద్ధదంపతులు= ఆ ముసలి భార్యాభర్తలు; ద్యుమత్సేనుడు మరియు అతని భార్యయును; అత్యంతహర్షంబునన్= మిక్కిలి ఆనందంతో; అతనిన్= అతడిని, సత్యవంతుడిని; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; మూర్ధ+ఆఘ్రాణంబు+చేసిరి= తలను వాసన చూచారు (మూర్కొన్నారు); మునులు= ఋషులు; కరంబు= మిక్కిలి; సంతసిల్లిరి= సంతోషించారు; అప్పుడు= ఆసమయంలో; ఆరాజ+ఋషి+ముఖ్యుడు= రాజర్షులలో శ్రేష్ఠుడు, ద్యుమత్సేనుడు; పుత్త్రునిన్+చూచి= కొడుకును కాంచి; అయ్యా!= నాయనా!; ఇట్లు+ఏల= ఈరీతిగా ఎందుకు; వనంబునన్= అరణ్యంలో; మసలితి(వి)= ఆలస్యంచేశావు; అని అడిగినన్= అని

ప్రశ్నించగా; అతండు= సత్యవంతుడు; తాను= తాను; చని= వెడలి; పండ్లు= ఫలాలు; కోయుటయును= త్రెంచటమున్నూ; (పిదప) కాష్ఠదళనంబు+చేయు+ఎడన్= కట్టెలు నరకేటప్పుడు; తల+ఏరు= తలనొప్పి; కదిరి= అలముకొని; నిలువన్+ఓపక= నిలువజాలక; విశ్రమించుటయున్= విశ్రాంతి తీసికొనటమున్నూ; తన్నున్= తనను; ఒక= ఒక; పురుషుండు= మగవాడు (విశిష్టవ్యక్తి); కలలోనన్= స్వప్నంలో; నిగ్రహించుటయున్= కైవసం చేసికొనటమున్నూ; చెప్పు+ఎడన్= చేప్పేటప్పుడు; సావిత్రి; మామకున్= భర్తతండ్రికి, ద్యుమత్సేనుడికి; ఇట్లు+అనియె= ఈవిధంగా చెప్పింది.

తాత్పర్యం: ద్యుమత్సేనుడు పుత్రుడిని కానక విషాదవిహ్వలుడై ఉన్నాడు. ఆ ఆశ్రమవాసులు అయిన ఋషులు ఒకవంక అంధరాజుకు దృష్టి ఆకస్మికంగా వచ్చినందుకు ఆశ్చర్యపడ్డారు. మరొక వంక పుత్రుడిఉనికిపట్టులు తెలియజాలక దుఃఖిస్తున్న అతడిని అనునయించసాగారు. ఇంతలో రెండుగడియలు గడువగానే సావిత్రీసహితుడై సత్యవంతుడు ఆశ్రమాన్ని చేరాడు. ఆ ముసలిదంపతులు (ద్యుమత్సేనుడును అతనిభార్యయు) పుత్రుడిని ఆలింగనం చేసికొని తల నిమిరి వాసన చూచి వాత్సల్యం వర్షించారు. మునులు మిక్కిలి సంతోషించారు. అప్పుడు ఆ రాజర్షి ద్యుమత్సేనుడు - 'నాయనా! అరణ్యంలో నీ వెందుకు ఇంతఆలస్యం చేశావు?' అని ప్రశ్నించాడు. సత్యవంతుడు తాను పండ్లను కోయటం, తదుపరి కట్టెలు కొట్టేటప్పుడు తలనొప్పి అలముకొనటంచేత తాను సొలసి విశ్రమించటం, తనకు స్వప్నంలో ఒక విశిష్టవ్యక్తి కన్పించి నిగ్రహించటం తెలుపుతుండగా, సావిత్రి అందుకొని ద్యుమత్సేనుడితో ఇట్లా వచించింది.

విశేషం: (1) ముహూర్తం: రెండుగడియల కాలం. నేటి పరిభాషలో చెప్పవలెనంటే (80) ఎనుబదినిముసాల కాలం.

సీ. **'ఈ రాజసుతునకు నిద్దినంబున మర । ణం బని ముని చెప్పె నారదుండు;**
మునినాథువచనం బమోఘంబు గావున । నేమఱ కేను నే ఁ డితనితోడ
నడవికి నేఁగితి; నచట నీతఁడు సుప్తుఁ । డైయున్నయెడ వచ్చె నంతకుండు;
వచ్చి యువ్విభుని జీవముఁ గొనిపోవఁగ । వెనుకన చని యేను వివిధభంగి

ఆ. **సత్యధర్మఫణితి సంస్తుతించుటయుఁ గృ । పార్ద్రచిత్తుఁ డగుచు నజ్జముండు**
నాకు నెమ్మి నొసఁగె నాలుగువరములం । దొకట నితఁడు జీవయుక్తుఁ డయ్యె. 272

ప్రతిపదార్థం: ఈ రాజసుతునకున్= ఈ రాజపుత్రుడికి - సత్యవంతుడికి; ఈ+దినంబునన్= ఈ రోజున; మరణంబు+అని= మృత్యువు కలుగుతుందని; నారదుండు= నారదుడు; ముని= పూర్వం; చెప్పెన్= వచించాడు; మునినాథు, వచనంబు= ఋషులలో శ్రేష్ఠుడైననారదుడియొక్కమాట; అమోఘంబు= బీరువోవనట్టిది; కావునన్= కాబట్టి; ఏను= నేను; ఏమఱక= ప్రమత్తత వహించక; నేఁడు= ఈరోజున; ఇతనితోడన్= సత్యవంతుడితో; అడవికిన్= అరణ్యానికి; ఏఁగితిన్= వెళ్ళాను; అచటన్= అరణ్యంలో; ఈతఁడు= సత్యవంతుడు; సుప్తుఁడు+ఐ= నిదురించినవాడై; ఉన్న+ఎడన్= ఉన్నతరుణంలో; అంతకుండు= యముడు; వచ్చెన్= వచ్చాడు; వచ్చి= అరుదెంచి; ఈ+విభుని= ఈ విభుడియొక్క (అనగా) సత్యవంతుడియొక్క; జీవమున్= ప్రాణాన్ని; కొనిపోవఁగన్= తీసికొని పోతూ ఉండగా; వెనుకన్+అ= వెనుకనే; చని= వెళ్ళి; ఏను= నేను; వివిధభంగిన్= పెక్కురీతుల; సత్య, ధర్మ, ఫణితిన్= సత్యం, ధర్మం, అమరిఉండే తీరులో; సంస్తుతించుటయున్= పొగడటమున్నూ; కృపా+ ఆర్ద్ర, చిత్తుఁడు+అగుచున్= దయచేత తడిసిన మనస్సు కలవాడు ఔతూ; ఆ+జముండు= ఆ యముడు; నాకున్= నాకు; నెమ్మిన్= ప్రీతితో; నాలుగువరములు= నాల్గువరాలు; ఒసఁగెన్= ఇచ్చాడు; అందున్=వానిలో; ఒకటన్= ఒక వరంచేత; ఇతఁడు= సత్యవంతుడు; జీవయుక్తుఁడు= ప్రాణంతో కూడినవాడు; అయ్యెన్= అయ్యాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ రాకుమారుడైన సత్యవంతుడికి నేడు మరణకాల మని మున్ను నారదమహర్షి నుడివిఉన్నాడు. ఆ మహర్షివచనం అమోఘం కాబట్టి నేను ఈనాడు ఏమాత్రమూ ఏమరక సత్యవంతుడిని విడనాడక అతడితోపాటు అరణ్యానికి వెళ్ళాను. సత్యవంతుడు అలసట చెంది నిదురించిన సమయంలో యమధర్మరాజు విచ్చేసి, ఈ రాకుమారుడి ప్రాణాలు కొనిపోయాడు. అంతట నేనూ యముడిని వెంబడించాను. సత్యం, ధర్మం అమరియుండేరీతిగా ఆతడిని ప్రస్తుతించాను. యమధర్మరాజు కరుణించి నాకు నాలుగువరాలు ప్రసాదించాడు. వాటిలో ఒకవరంమూలంగా రాకుమారుడు సత్యవంతుడు పునర్జీవితుడు అయ్యాడు.

వ. మఱియు నొక్కవరంబు భవదీయనయనోన్మేషణకారణం బయ్యెఁ; దక్కిన వరద్వయంబున మీకు వైరి హృతరాజ్యసంప్రాప్తియు, మదీయజనకునకుఁ బుత్త్రశతలబ్ధియు నగు' నని చెప్పిన నయ్యిద్దఱుఁ బరమానందకందళితశీతలశిశిరహృదయులై కోడలి కి ట్లనిరి. 273

ప్రతిపదార్థం: మఱియున్= వెండియు; ఒక్క, వరంబు= ఒకవరం; భవదీయనయన+ఉన్మేషణ, కారణంబు= మీనేత్రాలు విప్పారటానికి మూలం; అయ్యెన్= అయింది; తక్కిన= మిగిలిన; వరద్వయంబునన్= వరాలజంటవలన; మీకున్= మీకు; వైరి, హృత, రాజ్య, సంప్రాప్తియున్= శత్రువులచేత అపహరించబడిన రాజ్యం తిరిగి ప్రాప్తించటమున్నూ; మదీయజనకునకున్= నాతండ్రికి; పుత్త్ర, శత, లబ్ధియున్= కొడుకులు నూర్గురు కలగటమున్నూ; అగున్= కలుగుతాయి; అని చెప్పినన్= అని వచించగా; ఆ+ఇద్దఱున్= (ద్యుమత్సేనదంపతులు); పరమ+ఆనంద, కందళిత, శీతల, శిశిర, హృదయులు+ఐ= మిక్కుటమైన సంతోషం చిగురొత్తటంచేత చందనంవలె చల్లని డెందములు కలవారలై; కోడలికిన్= కొడుకుభార్యకు, స్నుషకు; ఇట్లు+అనిరి= ఈవిధంగా పలికారు.

తాత్పర్యం: అంతేకాక ఇంకొక వరం మీకు కనులు రావటానికి హేతువు అయింది. ఇంక మిగిలిన రెండువరాలు మీకు శత్రువులచేత అపహరించబడినరాజ్యం తిరిగి లభించటం, నా తండ్రికి వందమంది కొడుకులు పుట్టటం' అని సావిత్రి వివరించింది. ఆ ద్యుమత్సేనదంపతులు ఇరువురును మిక్కుటమైన ఆనందంతో చందనంవలె చల్లనైన హృదయాలు కలవారు అయి, కోడలైన సావిత్రితో ఇట్లా పలికారు.

క. 'ఆపత్సముద్రమగ్నం । బై పోయెడు నస్మదన్వయము పెంపెసఁగం
దేప యయి కడవఁ బెట్టితి; । నీ పుణ్యచరిత్ర కీర్తనీయము తల్లీ!' 274

ప్రతిపదార్థం: తల్లీ= అమ్మా సావిత్రీ!; ఆపత్సముద్రమగ్నంబు+ఐ= విపత్తు అనే సాగరంలో మునిగినట్టిదై; పోయెడు= నశించే; అస్మత్+అన్వయము= మా వంశం; పెంపు+ఎసఁగన్= అభివృద్ధిచెందేటట్లుగా; తేప+అయి= తెప్పవు అయి; కడవన్+పెట్టితి(వి)= దాటించావు; నీపుణ్యచరిత్ర= సుకృతంతో కూడిన నీ జీవితవృత్తం; కీర్తనీయము= ప్రశంసించతగింది.

తాత్పర్యం: 'తల్లీ, సావిత్రీ! నీజీవితచరిత్ర మిక్కిలి ప్రశంసించతగినట్టిది. ఆపత్సముద్రంలో మునిగి నశించిపోయే మావంశాన్ని తెప్పవయి గట్టు చేర్చి కాపాడి మాకు అభ్యుదయం చేకూర్చావు.

వ. అని యభినందించి; రప్పు డయ్యిందువదనను మునివరు లందఱుం బ్రశంసావచనంబుల నుపలాలించి, వారల దీవించి నిజగృహంబులకుం జని; రంతం గతిపయదినంబులకు. 275

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని= అని పలికి; అభినందించిరి= ధన్యవాదాలు అర్పించారు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+ఇందువదనను= ఆ చంద్రముఖిని, సావిత్రిని; మునివరులు+అందఱున్= ఋషిశ్రేష్ఠులు ఎల్లరును; ప్రశంసావచనంబులన్= మెచ్చుకోలుమాటలతో; ఉపలాలించి= బుజ్జగించి; వారలన్= వారలను (ద్యుమత్సేనదంపతులను సావిత్రిని సత్యవంతుడిని); దీవించి= ఆశీర్వదించి; నిజగృహంబులకున్= తమ ఇండ్లకు; చనిరి= వెళ్ళారు; అంతన్= అటుపిమ్మట; కతిపయ, దినంబులకున్= కొన్నినాళ్లకు.

తాత్పర్యం: అని పలికి సావిత్రిని అభినందించారు. ఆ ఆశ్రమంలోని మునివరేణ్యులు అందరును చంద్రముఖి సావిత్రిని పొగడి బుజ్జగించి, వారిని ఆశీర్వదించి తమఇండ్లకు వెళ్ళారు. అంతట కొన్నినాళ్ళకు.

సీ. ఆ సాళ్వభూవిభునాప్తమంత్రులు మూల । భృత్యులుఁ బౌరులుఁ బృథివిఁ గలుగు
పెద్దలుఁ గూడి సంప్రీతి నాతని పాలి । కేతెంచి వినయసమేతు లగుచు
'నవనీశ! నీ శత్రుఁ డాత్మీయమిత్రభే । దనమునఁ జేసి బాంధవసహాయ
సహితుఁ డై మృతిఁబొందె; సకలజనంబులు । నేకచిత్తంబున నిపుడు నిన్నుఁ

ఆ. బ్రకటరాజ్యపదవిఁ బట్టంబు గట్టంగ । వచ్చినారు; నిఖిలవసుధయందు
విస్తరిల్లె నీదువిజయఘోషము; భద్ర । గజము నెక్కివేగ కదలు మింక. **276**

ప్రతిపదార్థం: ఆ సాళ్వభూవిభు+ఆప్తమంత్రులున్= ఆసాళ్వదేశరాజుయొక్క ఆంతరంగిక సచివులును; మూలభృత్యులున్= ప్రధాన సేవకులు; పౌరులున్= పురజనులు; పృథివిన్= భూమియందు; కలుగు= ఉన్న; పెద్దలున్= విశిష్టవ్యక్తులును; కూడి= కలిసి; సంప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; ఆతనిపాలికిన్= ఆ ద్యుమత్సేనుడికడకు; ఏతెంచి= వచ్చి; వినయ, సమేతులు+ అగుచున్= అణకువతో కూడిన వారు ఔతూ; అవనీశ!= రాజా, ఓ ద్యుమత్సేనా!; నీశత్రుఁడు= నీవిరోధి; ఆత్మీయ మిత్రభేదనమునన్+చేసి= తనయొక్కహితులలో ఏర్పడిన స్పర్థలవలన; బాంధవ, సహాయ, సహితుఁడు+ఐ= చుట్టాలతో సాయంచేసేవారితో కూడినవాడై; మృతిన్+పొందెన్= మరణించాడు; సకల, జనంబులున్= అందరుప్రజలును; ఏకచిత్తంబునన్= ఒకేమనస్సుతో; ఇపుడు= ఈ సమయంలో; నిన్నున్= నిన్ను; ప్రకట, రాజ్య, పదవిన్= వ్యక్తమైన రాజ్యస్థానంలో (అనగా సింహాసనంమీద రాజుగా); పట్టంబు కట్టంగన్= పట్టాభిషేకం చేయుటకై; వచ్చినారు= అరుదెంచారు; నిఖిల, వసుధయందున్= సమస్తభూమియందు; నీదు= నీయొక్క; విజయఘోషము= జయాన్నిగూర్చిన చాటింపు ప్రకటన; విస్తరిల్లెన్= వ్యాపించింది; ఇంకన్= ఇక; భద్రగజమున్+ఎక్కి= పట్టపుటేనుగును అధిరోహించి; వేగ= శీఘ్రంగా; కదలుము= బయలుదేరుము.

తాత్పర్యం: ఆ సాళ్వరాజుగారి ఆంతరంగికులు అయిన సచివులు, ప్రధానసేవకులు, పురజనులు, పెద్దలు అందరును కలిసి సంతోషంతో ద్యుమత్సేనునికడకు వచ్చి అణకువతో ఇట్లు విన్నవించారు. 'ఓ మహారాజా! నీ శత్రువు ఆత్మీయులు పన్నినకుట్రలవలన అంతశ్ఛిద్రాలకు లోనయి, తనచుట్టాలు సహవ్రతులు మున్నగువారందరితో పాటు మరణించాడు. ప్రజలు అందరు ఏకగ్రీవంగా నీకు ఇపుడు పట్టం కట్టి నిన్ను సింహాసనాన్ని ఎక్కించటానికి ఇక్కడకు అరుదెంచారు. నీవిజయసమాచారం పృథివి ఎల్లెడల చాటబడింది. ఇంక పట్టపుటేనుగు నెక్కి రాజధానికి బయలుదేరుము.

క. ప్రాకటతపోబలంబున । నాకలితవిలోచనుండ వై యున్న నినున్
లోకేశ! చూడఁగంటిమి; । మా కన్నులు చల్లనయ్యె మాభాగ్యమునన్.' **277**

ప్రతిపదార్థం: లోక+ఈశ!= మహారాజా!; ప్రాకట, తపస్+బలంబునన్= వ్యక్తమైన తపస్సుయొక్క మహిమచేత; ఆకలితవిలోచనుండవు+ఐ= కూడిన కనులు కలవాడవై; ఉన్న= ఉన్నటువంటి; నినున్= నిన్ను, ఓ ద్యుమత్సేనా; చూడన్+కంటిమి= చూడగలిగాం; మాభాగ్యమునన్= మాఅదృష్టంచేత; మాకన్నులు= మానేత్రాలు; చల్లన+అయ్యెన్= చల్లబడ్డాయి.

తాత్పర్యం: లోకానికి అధిపతి వైన ఓ ద్యుమత్సేనమహారాజా! నీ తపోమహిమ గొప్పది. నీ తపశ్శక్తివలన నీకు దృష్టి లభించింది. కన్నులు లభించిన నిన్ను మేము చూడగలగటం మా అదృష్టం. మా కన్నులు చల్లబడ్డాయి.'

వ. **అనినం బ్రహృష్టహృదయుండై ద్యుమత్సేనుండు నాక్షణంబ తదాశ్రమవాసు లయిన మునుల నామంత్రణంబు సేసి, కొడుకుం దానును గజారూఢుఁడై బహుళచతురంగసేనాసంకులగమనంబునం బురంబునకుఁ జని సకలమహీరాజ్యంబునుగైకొని, చిత్రాశ్వునకుం బ్రథితయౌవరాజ్యపట్టం బొసంగి పరమైశ్వర్యధుర్యుం డయ్యె; నిత్తెఱంగున.** **278**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన; ద్యుమత్సేనుండు= ద్యుమత్సేనుడు; ప్రహృష్టహృదయుండు+ఐ= సంతోషం చెందిన డెందం కలవాడై; ఆ క్షణంబు+అ= ఆ క్షణంలోనే; తద్+ఆశ్రమవాసులు+అయిన= ఆ ఆశ్రమంలో నివసించేవారు అయిన; మునులన్= ఋషులను; ఆమంత్రణంబు+చేసి= వీడ్కొని; కొడుకున్= పుత్రుడును, సత్యవంతుడును; తానును= తాను; గజ+ఆరూఢుఁడు+ఐ= ఏనుగును అధిరోహించినవాడై; బహుళ, చతురంగ, సేనా, సంకుల, గమనంబునన్= విరివిఅయిన నాలుగు దళాల సేనల కోలాహలంతో కూడిన ప్రయాణంచేత; పురంబునకున్= పట్టణానికి, రాజధానికి; చని= వెడలి; సకలమహీరాజ్యంబును= సమస్తమైన భూమిప్రభుత్వాన్ని; కైకొని= స్వీకరించి; చిత్రాశ్వునకున్= సత్యవంతుడికి; ప్రథిత, యౌవరాజ్యపట్టంబు= పేరు కెక్కిన యువరాజపదవి; ఒసంగి= ఇచ్చి; పరమ+ఐశ్వర్య+ధుర్యుండు= గొప్ప సంపద వహించినవాడు; అయ్యెన్= అయ్యాడు; ఈ+తెఱంగునన్= ఈరీతిగా.

తాత్పర్యం: అని చెప్పగా, సంతుష్టి చెందిన హృదయం కలవాడై, ఆక్షణంలోనే ద్యుమత్సేనుడు ఆ ఆశ్రమంలోని ఋషులకు సగౌరవంగా వీడ్కోలుచెప్పి తానూ సత్యవంతుడూ ఏనుగునెక్కి విస్తరించిన నాలుగుదళాలతో కూడిన సేనలకోలాహలంతో ప్రయాణం చేసి రాజధాని నగరానికి చేరి పట్టాభిషిక్తుడయ్యాడు. సత్యవంతుడు యువరాజు అయ్యాడు. ఈ విధంగా ద్యుమత్సేనుడు గొప్పఐశ్వర్యాన్ని వహించాడు. ఈ విధంగా.

క. **తన మగని నత్తమామల । జననీజనకులను దన్ను సకలంబును దా**
ఘనముగ సముద్ధరించెను । జనవర! సావిత్రిధర్మచరితము కంటే! **279**

ప్రతిపదార్థం: జనవర!= రాజా, ఓ ధర్మరాజా! తనమగనిన్= తనభర్తను; అత్తమామలన్= అత్తను మామను; జననీజనకులను= తల్లిని తండ్రిని; తన్నున్= తనను; సకలంబును= సమస్తాన్నీ; తాన్= తాను; ఘనముగన్= గొప్పగా; సమ్+ఉద్ధరించెను= అభ్యుదయం కలిగేటట్లు చేసింది; సావిత్రిధర్మచరితము= సావిత్రిజీవితకథ ధర్మంతో నిండినట్టిది; కంటే!= అరసితివి కదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! తనభర్తను, అత్తమామలను, తలిదండ్రులను, తనను, సమస్తాన్నీ ఉద్ధరించిన సావిత్రి జీవితచరిత్ర ధర్మంతో కూడినట్టిది అనుశీలించావు కదా!

తే. **ఆ పతివ్రత యట్ల యీ యాజ్ఞసేని । పరమకల్యాణకర్మసంభావనీయ**
యధిప! మిమ్మును మీయఖిలాన్వయంబు । నుద్ధరించు మహాభాగ్యయుక్తిఁ జేసి. **280**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అధిప!= రాజా, ఓ ధర్మరాజా! ఆ పతివ్రత+అట్లు+అ= ఆ పతివ్రతవలెనే, ఆసావిత్రివలెనే; ఈ+యాజ్ఞసేని= ఈ ద్రౌపది; పరమకల్యాణకర్మసంభావనీయ= గొప్పశుభాల నోనగూర్చేపనులచేత మన్నించదగినట్టిది; మిమ్మును= మిమ్ములను (పంచపాండవులను); మీ+అఖిల+అన్వయంబున్= మీవంశాన్ని అంతటిని; మహాభాగ్యయుక్తిన్+చేసి= గొప్పదైన అదృష్టం కూడివచ్చేటట్లు చేసి; ఉద్ధరించున్= పెంపొందిస్తుంది.

తాత్పర్యం: ఓధర్మరాజా! ఆ పతివ్రత అయిన సావిత్రివలెనే ఈ ద్రౌపది కూడ గొప్పశుభాల నొనగూర్చుపనులను చేసి గౌరవించబడి మిమ్ములనూ మీవంశాన్నీ ఉద్ధరించగలదు. అట్టి అదృష్టయోగం మీకు ఏర్పడగలదు.

క. **అని చెప్పి పాండుతనయుల । ననఘుల వీడ్కొని మునీంద్రుఁ డనుపమతేజో**
ఘనుఁ డగు మార్కండేయుఁడు । దన యాశ్రమమునకు నరిగెఁ దద్దయు నెమ్మిన్. **281**

ప్రతిపదార్థం: ముని+ఇంద్రుఁడు= ఋషులలో శ్రేష్ఠుడు; అనుపమ, తేజస్+ఘనుఁడు+అగు= సాటిలేని వర్చస్సు కల గొప్పవాడు అగు; మార్కండేయుఁడు= మృకండునికొడుకు; తద్దయున్+నెమ్మిన్= మిక్కుటమైన ప్రేమతో; అనిచెప్పి= అని వచించి; పాండుతనయులన్= పాండవులను; అనఘులన్= పాపరహితులను; వీడ్కొని= వీడి; తన ఆశ్రమమునకున్= తన ఆశ్రమానికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: సావిత్రికథను చెప్పి, సాటిలేనితేజస్వి మునిశ్రేష్ఠుడైన మార్కండేయుడు మిక్కుటమైన ప్రేమతో పాండవులను వీడ్కొని తన ఆశ్రమానికి వెళ్ళాడు.

సూర్యుఁడు బ్రాహ్మణవేషంబునఁ గర్ణునకు హితంబు సెప్పుట (సం. 3-284-4)

వ. **అని చెప్పిన విని జనమేజయుండు వైశంపాయనుతో 'మునీంద్రా! యింద్రుండు గర్ణుకవచకుండలంబు లెవ్విధంబున నపహరించెం జెప్పవే' యని యడిగిన నతం డి ట్లనియె.** **282**

ప్రతిపదార్థం: అని చెప్పిన విని; జనమేజయుండు; వైశయంపాయనుతోన్; ముని+ఇంద్రా!= ఋషులలో శ్రేష్ఠుడా!; ఇంద్రుండు; కర్ణు, కవచకుండలంబులు= కర్ణుడియొక్క కవచాన్ని, కుండలాలను; ఏ+విధంబునన్; అపహరించెన్= మోసం చేసి తీసికొన్నాడు; చెప్పవే= వచింపుమా; అని అడిగినన్= అని ప్రశ్నించగా; అతండు= అతడు (వైశంపాయనుడు); ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పిన ఆలకించి జనమేజయుడు వైశంపాయనుడితో 'మునిశ్రేష్ఠుడా! ఇంద్రుడు, కర్ణుడికవచకుండలాలను ఏవిధంగా అపహరించాడు? దయచేసి ఆ కథ చెప్పుము' అని అడిగాడు. వైశంపాయనుడు జనమేజయుడికి ఇట్లా చెప్పాడు.

సీ. **వనమున నప్పాండుతనయు లుండఁగ నందు । వరుసఁ బండ్రెం డగు వత్సరంబు**
కడపట నింద్రుఁడు గడఁగి పాండవహిత । కారియై కర్ణుని కవచకుండ
లములు మాయాప్రయోగమున హరింపంగఁ । దలఁచిన నాతని తలఁ పెఱింగి
జలజాప్తుఁ డొకనాఁడు వెలయ రాధేయున । కది యెల్ల నెఱిఁగింతు నని తలంచి

ఆ. లోకనుతుఁడు బ్రాహ్మణాకార మొప్పంగ । నతనియున్నయెడకు నరుగుదెంచి
యేకతంబ యున్న యా కర్ణుతోడ న । భీష్టభంగి దోఁప నిట్టు లనియె. 283

ప్రతిపదార్థం: ఆ+పాండుతనయులు= ఆ పాండవులు; వనమునన్= అరణ్యంలో; ఉండఁగన్= నివసిస్తున్నప్పుడు; అందున్= అందు; వరుసన్= క్రమసంఖ్యలో; పండ్రెండు+అగు= పండ్రెండవది అయిన; వత్సరంబు కడపటన్= సంవత్సరం చివర; ఇంద్రుఁడు= వేలుపుదొర; కడఁగి= పూని; పాండవ, హిత, కారి+ఐ= పాండవులకు మేలు చేయగోరేవాడై; కర్ణుని, కవచ, కుండలములు= కర్ణుడియొక్క కవచాన్ని కుండలాలను; మాయాప్రయోగమునన్= కపటంచేత; హరింపంగన్= అపహరించుటకు; తలఁచినన్= యోచించగా; ఆతనితలఁపు= దేవేంద్రుడి ఆలోచన; ఎఱింగి= తెలిసికొని; జలజ+ఆప్తుఁడు= సూర్యుడు (పద్మాలకు హితుడు); ఒకనాఁడు= ఒకదినాన; వెలయన్= ఒప్పిదంగా; రాధేయునకున్= రాధకొడుకైన కర్ణుడికి; అది+ఎల్లన్= దేవేంద్రుడి కుట్ర నంతటిని; ఎఱిఁగింతున్= తెలుపుతాను; అని తలంచి= అని ఆలోచించి; లోకనుతుఁడు= జగత్తుచే ప్రస్తుతింపబడేవాడు - సూర్యుడు; బ్రాహ్మణ+ఆకారము= విప్రవేషం; ఒప్పంగన్= శోభిల్లేటట్లుగా; అతని+ఉన్న+ఎడకున్= అతడు (కర్ణుడు) ఉన్న చోటికి; అరుగుదెంచి; వచ్చి; ఏకతంబు+అ= ఒంటరిగా; ఉన్న= ఉన్నటువంటి; ఆ కర్ణుతోడన్= ఆకర్ణుడితో; అభీష్టభంగి= ప్రియమైన విధం; తోఁపన్= ప్రస్ఫుటమయ్యేటట్లుగా; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: పాండవుల అరణ్యావాసంలో పండ్రెండవయేడు పూర్తికానున్న సమయంలో, ఇంద్రుడు పాండవులకు మేలు చేయగోరి కర్ణుడికవచకుండలాలను అపహరించాలని తలపోశాడు. ఇంద్రుడిఅభిప్రాయాన్ని తెలిసికొని, లోకబాంధవు డైన సూర్యుడు కర్ణుడికి ఆ విషయం తెలపాలని భావించి బ్రాహ్మణవేషం తాల్చి, కర్ణుడు ఏకాంతంగా ఉన్నచోటికి వచ్చి ఈ రీతిగా పలికాడు.

క. 'ఓకర్ణ! సుజనవినుత గు । ణాకల్ప! భవద్ధితార్థమై యొకకార్యం
బేకతమ చెప్ప వచ్చితిఁ । బ్రాకటముగ వినుము నాదు పలుకులు ప్రీతిన్. 284

ప్రతిపదార్థం: ఓకర్ణ!= ఓకర్ణుడా!; సుజనవినుత= మంచివారిచేత పొగడబడిన; గుణ+ఆకల్ప!= మంచిగుణాలు ఆభరణాలుగా కలవాడా!; భవత్+హిత+అర్థము+ఐ= నీయొక్క మేలుకొరకై; ఒక కార్యంబు= ఒక కర్తవ్యం; ఏకతము+అ= రహస్యంగా; చెప్పన్ వచ్చితిన్= చెప్పటంకొరకు వచ్చాను; నా+పలుకులు= నామాటలు; ప్రీతిన్= సంతోషంతో; ప్రాకటముగన్= బాగా నీకు వ్యక్తం అయ్యేటట్లుగా; వినుము= ఆలకింపుము.

తాత్పర్యం: 'ఓకర్ణా! నీమేలు కోరేవాడినై నీతో ఒక ఆంతరంగికవిషయం ముచ్చటించటంకొరకు అరుగుదెంచాను. నా మాటలు సావధానంగా ఆలకించుము.

వ. పాండవపక్షపాతియై పాకశాసనుండు భవదీయంబు లైన కవచకుండలంబులు హరియింపంగోరి, నీవు బ్రాహ్మణప్రియుండ వనియును బ్రాహ్మణు లడిగిన నెయ్యదియైనను వంచనసేయ కొసంగుదు వనియును నెఱుంగుం గావునఁ, గపటబ్రాహ్మణుండై వచ్చి యడుగం గలవాఁడు; నీవును గవచకుండలంబు లీవలవదు; రత్నకాంచనప్రముఖంబు లయిన పదార్థంబులు సూపియుం బ్రార్థించియు మఱియు నెవ్విధంబున నైనం గడపి పుచ్చవలయు; నట్లుగాక వీని నతని కిచ్చితేని మృత్యువశంబునం బొందఁగలవాఁడవు. 285

ప్రతిపదార్థం: పాండవపక్షపాతి+ఐ= పాండునందనులయెడ విశేషమైన అభిమానం కలవాడై; పాకశాసనుండు= ఇంద్రుడు; భవదీయంబులు+ఐన= నీవైన; కవచకుండలంబులు= కవచాన్ని కుండలాలను; హరియింపన్+కోరి= కపటంగా సంగ్రహించదలచి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నీవు= నీవు; బ్రాహ్మణప్రియుండవు+అనియును= విప్రులయెడ ప్రీతికలవాడవు అని; బ్రాహ్మణులు+అడిగినన్= విప్రులు అర్థిస్తే; ఏ+అదిఐనను= ఏది అయినప్పటికిని; వంచన+చేయక+ఒసంగుదువు+అనియును= మోసంచేయక చిత్తశుద్ధితో ఇస్తావు అనిన్నీ; ఎఱుంగున్+కావునన్= తెలియును కాబట్టి; కపట, బ్రాహ్మణుండు+ఐ= మాయావిప్రుడై; వచ్చి= అరుగుదెంచి; అడుగన్+కలవాఁడు= అర్థించగలవాడు; నీవును= నీవును; కవచకుండలంబులు= కవచాన్ని కుండలాలను; ఈవలవదు= ఇవ్వవద్దు; రత్న, కాంచన, ప్రముఖంబులు+అయిన= మణులు బంగారం మొదలైనవి; పదార్థంబులు= వస్తువులు; చూపియున్= ప్రదర్శించియు; ప్రార్థించియున్= వేడియు; మఱియున్= వెండియు; ఏ+విధంబునన్+ఐనన్= ఏరీతిగా నయినా; కడపి పుచ్చన్వలయున్= సమాధానపరచి పంపివేయాలి; అట్లు+కాక= ఆవిధంగా చేయక; వీనిన్= వీటిని (కవచకుండలాలను); అతనికిన్= వేషధారి అయిన విప్రుడికి, ఇంద్రుడికి; ఇచ్చితి(వి)+ఏనిన్= ఇచ్చావా; మృత్యు, వశంబునన్+పొందన్+కలవాఁడవు= మృత్యువుకు లోబడి ఉండేవాడవు ఔతావు (మరణిస్తావు).

తాత్పర్యం: పాండవులయెడ విశేషమైన అభిమానం గల దేవేంద్రుడు నీ కవచాన్ని కుండలాలను మోసం చేసి హరించగలడు. నీవు బ్రాహ్మణులయందు భక్తికలవాడవనీ; బ్రాహ్మణులు ఏది కోరినా వెనుదీయక చిత్తశుద్ధితో దానం చేస్తావనీ దేవేంద్రుడికి తెలియును కాబట్టి ఆతడు నీవద్దకు వేషధారిఅయిన విప్రుడుగా వస్తాడు. అతడికి నీవు నీకవచకుండలాల నీయవద్దు. మణులు బంగారం మున్నగునవి చూపించి ఆతడిని మభ్యపెట్టుము. ఏదోవిధంగా అతడిని బ్రతిమలాడి తప్పించుకొనుము. అంతేకాని నీ కవచకుండలాలను ఆతనికి ఇచ్చావా, నీవు మృత్యుముఖంలో దూరినట్లే సుమా, జాగ్రత్త!

చ. అమృతమయంబు సువ్వె సుగుణాకర! యిమ్మహనీయవస్తుయు
గ్మము; నివి యుండు నేనిఁ ద్రిజగంబులయందు నశేషశత్రులో
కమునకు నీవు వధ్యుఁడవు గావు, నిరంతరసౌఖ్యసాంద్రమో
దమున వెలుంగు; దే నిది హితంబుగఁ జెప్పితి మోసపోకుమీ!' 286

ప్రతిపదార్థం: సుగుణ+ఆకర!= మంచిగుణాలకు నెలవైనవాడా, ఓకర్ణా!; ఈ+మహనీయవస్తుయుగ్మమున్= గొప్పవైన ఈ రెండు వస్తువులును (కవచకుండలాలు); అమృతమయంబు+చువ్వె= అమృతంతో నిండినట్టివి సుమా; ఇవి= ఇవి (ఈ కవచకుండలాలు); ఉండున్+ఏనిన్= ఉంటే; త్రిజగంబుల+అందున్= మూడులోకాలలో; అశేష, శత్రు, లోకమునకున్= సమస్తమైన విరోధులసమూహానికి; నీవు= నీవు; వధ్యుఁడవు+కావు= చంపదగినవాడవు కావు; నిరంతర, సౌఖ్య, సాంద్ర, మోదమునన్= ఎల్లప్పుడూ అనుభవించే భోగాలచేత దట్టమైన సంతోషంతో; వెలుంగుదు= ప్రకాశిస్తావు; ఏన్= నేను; ఇది= ఈ మాట; హితంబుగన్= నీమేలును కోరి; చెప్పితిన్= వచించాను; మోసపోకుమీ= వంచనకు లోనుగాబోకుమా.

తాత్పర్యం: మంచిగుణాలకు నెలవైనవాడా, ఓకర్ణా!, నీకవచకుండలాలు గొప్పవస్తువులు, అమృతమయాలు! ఇవి ఉంటే, మూడులోకాలలోను శత్రుసమూహం నిన్ను చంపజాలదు. సహజకవచకుండలాలతో కూడిఉంటే నీవు ఎప్పుడూ సుఖశాంతులతో కూడిన సంతోషంతో వెలుగొందుతూ ఉంటావు. నీశ్రేయస్సు కోరి ఈ విషయం నేను నీకు చెప్పుతున్నాను. జాగ్రత్త. మోసపోవద్దు!'

క. అనిన విని సూతతనయుఁడు । వినయంబున నిట్టు లనియె 'విప్రాకారం
బున వచ్చిన వేల్పవు నీ । వనఘా! యెవ్వఁడవు? నాకు నానతి యీవే.' 287

ప్రతిపదార్థం: అనినన్= అని (విప్రుడు చెప్పగా); విని= ఆలకించి; సూతతనయుఁడు= సూతుడికొడుకు - కర్ణుడు; వినయంబునన్= అణకువతో; ఇట్టులు+అనియెన్= ఈవిధంగా పలికాడు; 'అనఘా!= పాపరహితుడవైనవాడా (పుణ్యపురుషుడా!); విప్ర+ఆకారంబునన్= బ్రాహ్మణవేషం తాల్చి; వచ్చిన= అరుగుదెంచిన; వేల్పవు= దేవతవు; నీవు= నీవు; ఎవ్వఁడవు?= ఎవడవు; నాకున్= నాకు; ఆనతి= అనుజ్ఞ; ఈవే= దయచేసి ఇమ్ము.

తాత్పర్యం: అని ఆ విప్రుడు వచించాడు; అంతట సూతుడికొడుకు కర్ణుడు అణకువతో ఇట్లా పలికాడు. 'పాపరహితుడా! నీవు సామాన్యబ్రాహ్మణుడవు కావు. నీవు దేవతామూర్తివి. అసలు నీవు ఏ వేల్పవో దయచేసి నాకు తెలుప ప్రార్థిస్తున్నాను.'

క. **అనుడు నతఁ 'డేను సూర్యుఁడ । మనమున నీయందుఁ గలుగు మక్కువఁ గర్జం**
బొనరఁగ నుపదేశింపఁగఁ । జనుదెంచితి' ననిన నతఁడు సంభ్రమ మొప్పన్. **288**

ప్రతిపదార్థం: అనుడున్= అని (కర్ణుడు) పల్కగా,; అతఁడు= ఆ వేషధారివిప్రుడు; 'ఏను= నేను; సూర్యుఁడన్= సూర్యుడను; మనమునన్= చిత్తంలో; నీయందున్+కలుగు, మక్కువన్= నీయందు ఉన్న ప్రేమచొప్పున; కర్జంబు= కర్తవ్యం; ఒనరఁగన్= ఒప్పిదంగా; ఉపదేశింపఁగన్= యోగ్యతతో కూడిన మాటలతో చెప్పటానికై; చనుదెంచితిన్= వచ్చాను; అనినన్= అని (సూర్యుడు) చెప్పగా; అతఁడు= అతడు, కర్ణుడు; సంభ్రమము= తత్తరపాటు; ఒప్పన్= శోభిల్లగా.

తాత్పర్యం: అని కర్ణుడు పల్కగా సూర్యుడు ఇట్లా బదులు పలికాడు: 'నేను సూర్యుడను సుమా! మనస్సులో నీమీద గల మిక్కిలి మక్కువచొప్పున నీకు కర్తవ్యాన్ని ఉపదేశించటానికై నీవద్దకు వచ్చాను.'ఆమాటలు విని కర్ణుడు తత్తరపాటుతో.

వ. **అభివందనంబు సేసి, 'దేవా! దేవరవు నాకత్యంతహితుండ వగుటంజేసి కృతార్థుండనైతి; నింకొక్క విన్నపంబు సేసెద నవధరింపుము.** **289**

ప్రతిపదార్థం: అభివందనంబు+చేసి= వినయంతో నమస్కరించి; 'దేవా!= ప్రభూ!; దేవరవు= దైవమవు; నాకున్= నాకు; అత్యంత, హితుండవు+అగుటన్+చేసి= మిక్కుటంగా నాశ్రేయస్సును కోరేవాడవు కాబట్టి; కృతార్థుండను+ఐతిన్= ధన్యుఁడనయ్యాను; ఇంకన్+ఒక్క= ఇంకొక; విన్నపంబు= మనవి; చేసెదన్= చేస్తాను; అవధరింపుము= దయచేసి వినుము.

తాత్పర్యం: కర్ణుడు నమస్కరించి ఇట్లా అన్నాడు. 'దేవా, నీవు వేల్పువు. నామీద అపారమైన కరుణ కలిగి ఉండటంచేతనే నాశ్రేయస్సును కోరేవాడ వగుటచేతనే నావద్దకు వచ్చావు. నేను ధన్యుడను. ఇంకొక విన్నపం ఉన్నది. దయచేసి సావధానంగా ఆలకించుము.

ఉ. **భూసురకోటి వేఁడుటయుఁ బోఁడిగ ప్రాణము లైన నీగి నా**
బాస; దినేశ! లోకమునఁ బ్రస్ఫుట మింతయు; నట్లు గాకయున్
వాసవుఁ డట్టె! న న్నడుగవచ్చుఁ బ్రియంపడి నాకు నొక్క బ్రాఁ
తే సురలోకవందిత! మదిం గవచంబును గుండలంబులున్. **290**

ప్రతిపదార్థం: దిన+ఈశ= ఓ సూర్యభగవానుడా; భూసురకోటి= బ్రాహ్మణసమూహం; వేఁడుటయున్= ప్రార్థించటమున్నా; పోఁడిగన్= మనోహరంగా; ప్రాణములు+ఐనన్= అసువుల నైనను; ఈఁగి= దానం చేయటం; నాబాస= నాశపథం; లోకమునన్=

జగత్తులో; ఇంతయున్= ఈవిషయం అంతయును; ప్రస్ఫుటము= తేటతెల్లం అయినట్టిది అందరికీ తెలిసినదే; అట్లు+కాకయున్= అంతమాత్రమే కాక; వాసవుఁడు+అట్టె= ఇంద్రుడు అంతటివాడే; నన్నున్= నన్ను; అడుగవచ్చున్= ప్రార్థించటానికై వస్తే; ప్రియంపడి= ప్రీతితో; సురలోకవందిత!= వేల్పులసమూహాలచేత నమస్కరించబడేవాడా!; ఓసూర్యభగవానుడా!; మదిన్= నాచిత్తంలో; కవచంబును కుండలంబులున్= కవచం కుండలాలున్నూ; నాకున్= నాకు; ఒక్క= ఒక; బ్రాఁతి+ఏ= (బ్రాఁతే) ఆసక్తి వీడలేని ప్రియమా? కాదు).

తాత్పర్యం: వేల్పులసమూహాలచేత ఆరాధించబడే ఓ సూర్యభగవానుడా!, బ్రాహ్మణులు అర్థిస్తే వెనుదీయక మనోహరఫణితిలో నా అసువులను సయితం సమర్పించగలను. ఇది నా ప్రతిజ్ఞ! ఈ విషయం లోకాని కంతటికి తేటతెల్లమే. అంతేకాక దేవేంద్రుడంతటివాడు వేడుకతో నావద్దకు 'దేహి' అని ప్రార్థించటానికే వస్తే, ఇక కుచకుండలాలు ప్రియములా? అవి నాకు తృణప్రాయాలు.

క. **జగముల నెల్లను నిండిన । పొగడిత గడు వెలితి సేసి, పొల్లయొడలికై**
తగవే జన్మవ్రత మిటు । దిగవిడువఁగ నేఁడు నాకుఁ ద్రిభువనదీపా! **291**

ప్రతిపదార్థం: త్రిభువనదీపా!= మూడులోకాలను వెలుగొందజేసేవాడా, ఓ సూర్యదేవుడా!; జగములన్+ఎల్లను= అన్ని లోకాలలోను; నిండిన= సంపూర్ణంగా వ్యాపించిన; పొగడిత= ప్రశస్తి; కడున్= మిక్కిలి; వెలితి+చేసి= కొఱతకలిగించి; పొల్ల+ఒడలికిన్+ఐ= వ్యర్థమైన (శాశ్వతంకాని) శరీరంకొరకై; జన్మవ్రతము= యావజ్జీవితం దీక్షతో పరిపాలించేనోము; ఇటు= ఈరీతిగా; దిగవిడువఁ గన్= త్రోసిపుచ్చటం; నేఁడు= ఈసమయంలో; నాకున్= నాకున్; తగవు+ఏ= పాడి అగునా (కాదు గదా).

తాత్పర్యం: మూడులోకాలను వెలుగొందజేసే ఓ సూర్యదేవా! అన్నిలోకాలలో వ్యాపించిన సత్కీర్తికి కొఱత కలిగించి, ఏమాత్రం విలువలేని ఈ పొల్లశరీరంకొరకై యావజ్జీవితం దీక్షతో పరిపాలించే నోమును నేడు నేను విడవటం పాడికాదు కదా.

విశేషం: (1) 'పొల్లఒడలికై' తనదానవ్రతాన్ని విడువజాలనని కర్ణుడు సూర్యభగవానుడితో ఖండితంగా ప్రకటించాడు. ఈవాక్యం కర్ణుడిశీలానికి గీటురాయి. (2) ఈఘట్టంలో ఎఱ్ఱన వ్రాసిన పద్యాలు సూక్ష్మదృష్టితో అనుశీలిస్తే పోతనమహాకవికి ఒజ్జబంతులైనవి. పోతన చిత్రించిన బలిచక్రవర్తి శీలం గమనించదగింది.

మ. **మతిఁ గుంతీసుతపక్షపాతి యగుచున్ మాయాస్వరూపంబుతో**
జితదైత్యుండు శతక్రతుండు నను భిక్షింపంగ నేతెంచు న
ట్టి తెఱంగైనఁ దదీయకీర్తియ చుమీ డిందుం; ద్రిలోకీసము
న్నతమై యొప్పు మదీయకీర్తి; యిదిసూ నాపుణ్య మెబ్భంగులన్. **292**

ప్రతిపదార్థం: జితదైత్యుండు= రాక్షసులను జయించినవాడు; శతక్రతుండు= వందయజ్ఞాలను చేసినవాడు, దేవేంద్రుడు; మతిన్= చిత్తంలో; కుంతీసుతపక్షపాతి+అగుచున్= పాండవులయెడ అభిమానం కలవాడు ఔతూ, మాయాస్వరూపంబుతోన్= కపటవేషధారణతో; ననున్= నన్ను; భిక్షింపంగన్= యాచించటానికై; ఏతెంచునట్టి= అరుదెంచే; తెఱంగు+ఐనన్= రీతిఏర్పడితే; తదీయకీర్తి+అ= దేవేంద్రుడియొక్క యశస్సు; డిందున్= క్రిందిదౌతుంది; చుమీ= సుమా; మదీయకీర్తి= నాయశస్సు; త్రిలోకీ, సమ్+ఉన్నతము+ఐ= మూడులోకాలలో పైకి ఎక్కినదై; ఒప్పున్= శోభిల్లుతుంది; ఏ+భంగులన్= ఎన్నివిధాలుగా చూచినా; ఇది= (ఈ విధంగా దేవేంద్రుడు నాకడకు యాచకుడై రావటం); నాపుణ్యము= నాసుకృతం; చూ= సుమ్మ.

తాత్పర్యం: రాక్షసులను జయించినవాడు, నూరుయజ్ఞాలను చేసినవాడు అయిన దేవేంద్రుడు చిత్తంలో పాండవులయెడ పొడిదప్పిన అభిమానంతో మారువేషం తాల్చి నాకడకు యాచకుడై రావటమా? రానిమ్ము. అది ఆతనికీర్తికి మాత్రమే లోటు. అప్పుడు నాకీర్తి మూడులోకాలలో ఉన్నతంగా వెలుగొందుతుంది. ఏవిధంగా చూచినా ఇది నాసుకృతవిశేషమేకదా!

ఆ. కీర్తి విడువఁజాలఁ; గీర్తితో మెలఁగంగఁ । జావు వచ్చెనేనిఁ జత్తుఁ; గాని
జగములోన నెల్ల 'సడికంటెఁ జావు మే' । లనఁగఁ బరఁగు మాట యనఘ! వినవె? 293

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా, ఓ సూర్యుడా!; కీర్తిన్= యశస్సును; విడువన్+చాలన్= వదలిపెట్టజాలను; కీర్తితోన్= యశస్సుతో; మెలఁగంగన్= ప్రవర్తిల్లగా; చావు, వచ్చెన్+ఏనిన్= మరణం సంప్రాప్తించినప్పటికి; చత్తున్= చస్తాను; కాని= అంతేకాని; జగములోనన్+ఎల్లన్= లోకంలో అంతటా; సడికంటెన్= అపకీర్తికంటే; చావు= మరణం; మేలు= మంచిది; అనఁగన్+పరఁగుమాట= అనెడి సుభాషితం; వినవె= ఆలకించవా.

తాత్పర్యం: పుణ్యాత్ముడ వైన ఓసూర్యభగవానుడా! నేను యశస్సును విడనాడజాలను. పేరుప్రతిష్ఠలతో బ్రతికేటప్పుడు మరణం ప్రాప్తించినా నాకు సమ్మతమే. లోకంలో 'అపకీర్తికంటె మరణమే మేలు' అనే సుభాషితాన్ని వినలేదా?

ఉ. 'కీర్తియ యిచ్చుఁ బుణ్యగతిఁ; గీర్తియ తల్లియుఁబోలెఁ బ్రోచు; స
త్కీర్తియ యాయువున్ సిరియుఁ; గీర్తివిహీనుఁడచూ శవంబు; దు
ష్కీర్తను నెల్లచేటులును గిట్టి హరించు' ననండె తొల్లి భ
క్తార్తిహరుండు నాఁబరఁగు నంబుజసూతి జగద్ధితంబుగన్. 294

ప్రతిపదార్థం: కీర్తి+అ= యశస్సు మాత్రమే; పుణ్యగతిన్= సుకృతలోకాన్ని; ఇచ్చున్= ప్రసాదిస్తుంది; కీర్తి+అ= యశస్సుమాత్రమే; తల్లియున్+పోలెన్= జననివలె; ప్రోచున్= కాపాడుతుంది; సత్+కీర్తి+అ= మంచియశస్సే; ఆయువున్= ఆయుర్దాయం; సిరియున్= సంపదయున్నూ; కీర్తివిహీనుఁడు+అ= కీర్తి లేనివాడే; శవంబు= పీనుగు; చూ= చుమ్ము, సుమా; తొల్లి= పూర్వం; దుష్కీర్తనున్= చెడ్డకీర్తి కలవాడిని; ఎల్ల, చేటులును= అన్నికీడులును; కిట్టి= సమీపించి; హరించున్= నశింపచేస్తాయి; (అని); భక్త+ఆర్తి, హరుండు= భక్తుల దైన్యాన్ని హరించేవాడు; నాన్= అనగా; పరఁగు= ఒప్పు; అంబుజసూతి= బ్రహ్మదేవుడు; జగత్+హితంబుగన్= జగత్తుకు శ్రేయస్సు కలిగేటట్లుగా; అనండు+ఎ= అనలేదా.

తాత్పర్యం: 'కీర్తియే పుణ్యగతిని ప్రసాదిస్తుంది. కీర్తియే కన్నతల్లివలె కాపాడుతుంది. మంచికీర్తియే ఆయువు. కీర్తియే సంపద. కీర్తిలేనివాడు పీనుగే. అపయశస్సు కలవాడిని అన్నికీడులు ఆవహించి నశింపజేస్తా' యని పూర్వం భక్తుల దైన్యాన్ని పోగొట్టేవాడైన, బ్రహ్మదేవుడు ప్రవచించి ఉన్నాడుగదా. అది జగత్తుకు శ్రేయస్సుకలిగించే సుభాషితం.

సీ. విప్రులు గడు నర్థి వేఁడినఁ గలిమిలోఁ । బొచ్చెంబు సేయక యిచ్చు టొకటి,
బలితంపుఁబగతురఁ బరిమార్చు టొక్కటి, । దండియై యనిఁ జచ్చు టొండె నొకటి,
శరణాగతుని నెట్టి శత్రువు నైనను । గరుణించి చంపక కాచు టొకటి,
భామినీద్విజవృద్ధబాలాతురుల కైన । యాపద చెచ్చెరఁ బాపు టొకటి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. యనఁగ నివి వ్రతంబులై చెల్లు నాకు; నిం। దొకటి తప్పెనేని వికలకీర్తి
నగుదుఁ; గాన నిత్తు నఖిలమ్ము నెఱుఁగ నా। ఖండలునకుఁ గవచకుండలములు.' 295

ప్రతిపదార్థం: విప్రులు= బ్రాహ్మణులు; కడున్= మిక్కిలి, అర్థిన్= కోరికతో; వేఁడినన్= ప్రార్థించగా; కలిమిలోన్= (ఉన్న) సంపదలో; పొచ్చెంబు+చేయక= తక్కువచేయక; ఇచ్చుట= దానంచేయటం; ఒకటి= ఒకటి; బలితంపు+పగతురన్= బలవంతు లైన శత్రువులను; పరిమార్చుట= సంహరించటం; ఒక్కటి= ఒకటి; అనిన్= యుద్ధంలో; దండి+ఐ= మేటిఅయి; చచ్చుట+ఒండెన్= మరణించటం కాని; ఒకటి= ఒకటి; శరణ+ఆగతునిన్= రక్షణ కోరి ఆశ్రయించినవాడిని; ఎట్టిశత్రువున్+ఐనను= ఎటువంటి విరోధిని అయినప్పటికిని; కరుణించి= దయచూపి; చంపక= సంహరించక; కాచుట= రక్షించటం; ఒకటి= ఒకటి; భామినీ, ద్విజ, వృద్ధ, బాల+ఆతురులకున్+ఐన= స్త్రీలకు బ్రాహ్మణులకు ముసలివారికి పిన్నలకు దీనులకు దాపురించిన; ఆపద= కష్టం; చెచ్చెరన్= శీఘ్రంగా; పాపుట= పోగొట్టటం; ఒకటి= ఒకటి; అనఁగన్= అనునట్టివి; ఇవి= పైనచెప్పినట్టివి; వ్రతంబులు+ఐ= నోములు అయి; నాకున్= నాకు; చెల్లున్= ఏర్పడినవి. ఇందున్= ఈ నోములలో; ఒకటి= ఒక్కటి అయినా; తప్పెనేనిన్= జరగకుండా తప్పితే; వికల, కీర్తిన్+అగుదున్= చెడినయశస్సు కలవాడనౌతాను; కానన్= కావున; అఖిలమ్మున్+ఎఱుఁగన్= అంతయును తెలియగా; ఆఖండలునకున్= దేవేంద్రుడికి; కవచకుండలములు= కవచాన్ని కుండలాలను; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: ఇవి నేను పాటించే వ్రతాలు (ప్రతిజ్ఞలు). బ్రాహ్మణులు కోరి నన్నడిగితే నా కున్న సంపదలో తక్కువ చేయకుండా దానం చేయటం ఒకటి. బలవంతులైన శత్రువులను సంహరించటం మరొకటి. లేదా యుద్ధంలో వీరుడుగా మరణించటం ఇంకొకటి. పగవాడైనా శరణువేడితే చంపకుండా దయతో రక్షించటం మరింకొక్కటి. ఆడవారు కాని, బ్రాహ్మణులు కాని, ముసలివారు కాని, చిన్నవారు కాని, దీనులు కాని ఆపదలో చిక్కుకుంటే వారి ఆపదలను తొలగించటం మరొక్కటి. వీటిలో ఏ ఒక్కటి తప్పినా ముక్కలు చెక్కలైన కీర్తి కలవాడనౌతాను. కాబట్టి, ఇవన్నీ స్పష్టమయ్యేటట్లు ఇంద్రుడికి నాకవచకుండలాలను ఇచ్చివేస్తాను.'

వ. అనినఁ గర్ణునకు సూర్యుం డిట్లనియె. 296

తాత్పర్యం: అనగా సూర్యుడు కర్ణుడితో ఇట్లా అన్నాడు.

క. 'కడు నెయ్యురు హితముగఁ జె। ప్పెడు పలుకులు వినవు; గరము బేలవు; నీ వె
క్కడ? బుద్ధితెరువు లెక్కడ? చెడక వినుము నీకుఁ దెలియఁ జెప్పెదఁ గర్ణా! 297

ప్రతిపదార్థం: కర్ణా!= ఓకర్ణా!; కడున్= మిక్కిలి; నెయ్యురు= మిత్రులు; హితముగన్= శ్రేయస్సు కలిగేటట్లుగా; చెప్పెడుపలుకులు= చెప్పేమాటలు; వినవు= వినిపించుకోవు; కరము= మిక్కిలి; బేలవు= అమాయకుడవు; నీవు+ఎక్కడ?= నీవు ఎక్కడ; బుద్ధి తెరువులు= తెలివితో గూడిన తీరుతెన్నులు; ఎక్కడ?= ఎక్కడ; నీకున్= నీకు; తెలియన్+చెప్పెదన్= తెలిసేటట్లుగా వచిస్తాను; చెడక= చెడిపోకుండ; వినుము= నేను చెప్పినట్లు నడచుకొమ్ము.

తాత్పర్యం: ఓ కర్ణా! నీ శ్రేయోభిలాషులు నీహితం కోరి చెప్పేమాటలు నీవు వినవు. నీవు మిక్కిలి అమాయకుడవు. నీవు ఎక్కడ? తెలివితేటలతో కూడిన తీరుతెన్నులు ఎక్కడ? నీకు నేను బాగుపడేమార్గం చెప్తున్నాను. నేను చెప్పినట్లు నడచుకొనుము. నీకు మేలు కలుగుతుంది.

క. తనకుఁ దనయులకు సతులకు। జననీజనకులకు బంధుజనులకుఁ గీడొం
దని తెరువునఁ గీర్తి గనినఁ। జనుఁగా కందఱును జెడుయశం బేమిటికిన్? 298

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తనకున్= తనకును; తనయులకున్= పుత్రులకు; సతులకున్= భార్యలకు; జననీజనకులకున్= తలిదండ్రులకు; బంధు, జనులకున్= చుట్టాలకును; కీడు+ఒందని, తెరువునన్= హాని కలుగని మార్గాన; కీర్తి+కనినన్= యశస్సును ఆర్జిస్తే; చనున్+గాక= ఒప్పుతుంది కాని; అందఱును= ఎల్లరును; చెడు= కీడు పొందు; యశంబు= కీర్తి; ఏమిటికిన్?= ఎందుకు?

తాత్పర్యం: తనకూ, తనపుత్రులకూ, తనభార్యలకూ, తనతలిదండ్రులకూ, చుట్టాలకూ; హాని కలుగనిమార్గంలో, యశస్సు నార్జించటం భావ్యమౌతుంది కాని అందరికి కీడు గలిగించే కీర్తి ఎందుకు?

ఉ. **కావున నీవు ప్రాణములు గావుము; కీర్తి యటుండనిమ్ము; నీ**
జీవిత మున్నఁ గీర్తి మఱి చేరదె; కీర్తి యనంగ నొక్కఁ డే
లా? వనితల్ దనూభవులు లక్ష్ములు బంధులు సార్వభౌమతే
జోవిభవంబు నిమ్మడరఁ జొప్పడుఁ బ్రాణ మొకండు గల్గినన్. **299**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఈవు= నీవు; ప్రాణములు= అసువులు; కావుము= రక్షించుకొనుము; కీర్తి+అటు+ఉండన్, ఇమ్ము= యశస్సును, అటువైపు ఉండనిమ్ము; నీజీవితము+ఉన్నన్= నీవు బ్రదికి ఉంటే; కీర్తి= యశస్సు; మఱి= మరల; చేరదు+ఎ= దగ్గరకు రాదా?; కీర్తి= యశస్సు; అనంగన్= అనగా; ఒక్కఁడు= ఒకటి మాత్రమే; ఏలా= ఎందుకు?; వనితల్= పడతులు; తనూభవులు= సంతానము; లక్ష్ములు= సంపదలు; బంధులు= చుట్టాలు; సార్వభౌమ, తేజస్+విభవంబున్= చక్రవర్తిత్వంవలన చేకూరే దేదీప్యమాన మైన కాంతి సంపదను, ఇమ్ము+అడరన్= ఇంపుశోభిల్లేటట్లుగా; ప్రాణము+ఒకండు= జీవం ఒకటి; కల్గినన్= ఉంటేనే; చొప్పడున్= అమరుతాయి.

తాత్పర్యం: కావున నీప్రథమకర్తవ్యం నీఅసువులను కాపాడుకొనటం. అసలు నీవు బ్రదికి ఉంటే నిన్ను కీర్తి చేరుతుంది. ఒక్కకీర్తిమాత్రమే చేరటం ఏమిటి? భార్యలు బిడ్డలు సంపదలు చుట్టాలు చక్రవర్తిత్వతేజస్సు ఎన్నిఅయినప్పటికి ప్రాణము లున్నప్పుడే ఇంపుసెంపులు శోభిల్లుతాయి.

క. **మృతుఁ డైన నరుఁడు వెస భ । స్మితుఁడై చనుఁగాక, కీర్తిమేలిమి గనునే?**
మృతదేహంబునకు నలం । కృతిఁ జేసినయట్ల మృతునికీర్తి తలంపన్. **300**

ప్రతిపదార్థం: మృతుఁడు+ఐనన్= మరణం చెందితే నరుఁడు= మనుజుడు; వెసన్= శీఘ్రంగా; భస్మితుఁడు+ఐ= బూడిదగా మారినవాడై; చనున్+కాక= పోవునేకాని; కీర్తి= యశస్సుయొక్క; మేలిమి+కనును+ఏ= గొప్పతనాన్ని పొందుతాడా; మృతునికీర్తి= మరణించినవాడియశస్సు; తలంపన్= యోచన చేయగా; మృతదేహంబునకున్= మరణించిన శరీరానికి, పీనుగుఒడలికి; అలంకృతి+చేసిన+అట్లు+అ= అలంకారం చేసినట్లే సుమా.

తాత్పర్యం: మరణించినపిదప మానవుడు బూడిదగా మారిపోతాడు. మరి యశస్సు యొక్క గొప్పతనాన్ని స్వయంగా చూడలేడు. పొందలేడు. ఆలోచిస్తే, మరణించిన వాడి యశస్సు చచ్చినవాడి కళేబరానికి చేసిన అలంకారంవంటిదే సుమా!

విశేషం: అలం: ఉపమ.

వ. **నీవు నాకు నత్యంతభక్తుండ వగుటంజేసి భక్తజనరక్షణంబు గర్తవ్యం బగుట ని ట్లన్నియుం జెప్పవలసె; మఱియు దేవనిర్మితం బైన రహస్యం బొక్కటి గలదు; దాననసేసి నీయందు నాకు వాత్సల్యంబు**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మిగిలియుండు; నది యిప్పు డేను జెప్పఁ; బిదపఁ దనయంతన యెఱుఁగంబడు; నీకు నర్జునునకుం దెగని పగయై యుండు; మీకుఁ గయ్యంబు నయ్యెడు; నందు నీవు సహజకవచకుండలమండితుండ వగుటంజేసి యర్జునున కజేయుండ వయ్యెద; వట్లుంగాక వీనిం గోలుపోయితివేని యెంతయు దెప్పరం బగు' ననినం గర్ణుం డిట్లనియె; 301

ప్రతిపదార్థం: నీవు= ఓకర్ణా; నాకున్= నాకు; అత్యంతభక్తుండవు= మిక్కిలి భక్తుడవు; అగుటన్+చేసి= కావటంచేత; భక్తజనరక్షణంబు= భక్తులను కాపాడటం; కర్తవ్యంబు+అగుటన్= చేయవలసిన ధర్మం కావున; ఇట్లు= ఈ రీతిగా; అన్నియున్= సమస్తమైన అంశాలను; చెప్పవలసెన్= వచించవలసివచ్చింది; మఱియున్= అంతమాత్రమే కాక; దేవనిర్మితంబు+ఐన= దేవతలచేత ఏర్పరచబడిన; రహస్యంబు+ఒక్కటి= గూఢవిషయం ఒకటి; కలదు= ఉన్నది; దానన్+అ+చేసి= దానిమూలాన (ఆ రహస్యం కారణంగా); నీయందున్= నీమీద; నాకున్= నాకు; వాత్సల్యంబు= అనురాగం; మిగిలి+ఉండున్= మిక్కుటంగా ఉంటుంది; అది= ఆరహస్యం; ఇప్పుడు= ఈసమయంలో; ఏను= నేను; చెప్పన్= వచించను; పిదపన్= పిమ్మట; తన+అంతన్+అ= దాని అంతట అదే; ఎఱుఁగన్+పడున్= వెల్లడిఔతుంది; నీకున్= నీకును; అర్జునునకున్; తెగని= తీరని; పగ+ఐ+ఉండున్= శత్రుత్వం ఏర్పడిఉంటుంది; మీకున్= మీఇరువురకు (నీకును అర్జునుడికిని); కయ్యంబున్= యుద్ధమును; అయ్యెడున్= జరుగుతుంది; అందున్= ఆయుద్ధంలో; ఈవు= నీవు; సహజ, కవచ, కుండల, మండితుండవు, అగుటన్+చేసి= ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన కవచకుండలాలతో వెలుగొందేవాడవు అగుటచేత; అర్జునునకున్; అజేయుండవు+అయ్యెదవు= గెలువశక్యంగాని వాడవు ఔతావు; అట్లున్+కాక= ఆ విధంగా కాక; వీనిన్ ఈసహజ కవచకుండలాలను; కోలుపోయితివి+ఏనిన్= పోగొట్టుకొన్నావా; ఎంతయున్= మిక్కుటమయిన; దెప్పరంబు+అగున్= ఆపద ఏర్పడుతుంది; అనినన్= అని (సూర్యుడు) చెప్పగా; కర్ణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నీవు నాకు గొప్పభక్తుడవు. భక్తులను కాపాడటం అవశ్యం నిర్వహించవలసిన ధర్మంగదా! అందుచేత నీకు అన్నిఅంశాలు వివరించి చెప్పవలసి వచ్చింది. అంతమాత్రమేకాక ఇందు ఒక దేవరహస్యం ఇమిడి ఉన్నది. ఆ రహస్యాన్ని ఇప్పుడు నీకు నేను చెప్పను. కాని అది దానంతట అదియే వెల్లడి కాగలదు. నీకున్నూ అర్జునుడికిన్నీ తీరనిపగ ఏర్పడి ఉంటుంది. మీకు యుద్ధం జరిగితీరుతుంది. ఆ యుద్ధంలో నీకు ప్రకృతిసిద్ధంగా లభించిన కవచకుండలాలు ఉండటంచేత నీవు అర్జునుడికి గెలువశక్యంగానివాడవు కాగలవు. అట్లుకాక నీవు కవచకుండలాలను కోలుపోతే నీకు మిక్కుటమైన ఆపద ఏర్పడుతుంది' అని సూర్యుడు చెప్పగా కర్ణుడు ఈవిధంగా సమాధాన మిచ్చాడు.

మ. 'కరుణామూర్తివి నీవు సంతతము భక్తశ్రీసమాధానత
త్పరచిత్తుండవు గావునం గడఁగి నాపై మక్కువం బద్మినీ
వర! మే లానతి యిచ్చి తింకొకటి దేవా! నిన్నుఁ బ్రార్థించెదం;
గరుణన్ నా ప్రతికూలదుర్లపిత వాక్యంబుల్ సహింపం దగున్. 302

ప్రతిపదార్థం: దేవా!= ప్రభూ!; పద్మినీవర!= తామరతీగకు వల్లభుడవైనవాడా, ఓ సూర్యభగవానుడా!; కరుణామూర్తివి= దయయే ఆకారంగా రూపొందినవాడవు; నీవు= నీవు; సంతతమున్= ఎల్లప్పుడును; భక్తశ్రీ సమాధాన, తద్+పర, చిత్తుండవు= నిన్ను ఆరాధించేవారికి శోభ కూర్చటంలోనే నిమగ్నమైన మనస్సు కలవాడవు; కావునన్= కాబట్టి; కడఁగి= పూనిక వహించి; నాపైన్= నామీద; మక్కువన్= వాత్సల్యం చొప్పున; మేలు= శ్రేయం; ఆనతి+ఇచ్చితి(వి)= దయతో చెప్పావు; ఇంకన్+ఒకటి=

ఇక ఒకటి; నిన్నున్= నిన్ను; ప్రార్థించెదన్= కోరెదను; కరుణన్= దయతో; నాప్రతికూల, దుర్లపిత, వాక్యంబుల్= నేను చెప్పే ఎదురుమాటలు చెడ్డవి; సహింపన్+తగున్= ఓర్చుకొన తగును.

తాత్పర్యం: దేవా! పద్మినీవల్లభా! ఓ సూర్యభగవానుడా! నీవు మూర్తీభవించిన దయవు. ఎల్లప్పుడు భక్తుల మేలు కోరి వారికి శోభ చేకూర్చటంలోనే నిమగ్నమయిన మనస్సు కలవాడవు. నామీద వాత్సల్యం చొప్పున నాశ్రేయస్సునుగూర్చి నీవు దయతో హితోపదేశం చేశావు. అయినను నిన్ను ఇంకొకటి అర్థిస్తున్నాను. నీమాటకు ఎదురుచెప్పే నా దుర్భాషల్ని మన్నించ వేడికోలు.

క. అనృతమున కెంత వెఱతును । విను మంతకునకును నంత వెఱవ; మును వహిం
చినవ్రతము విడిచి దుర్గతిఁ । జనఁ జాలుదు నయ్య! నన్నుఁ జనునే మాన్పన్? 303

ప్రతిపదార్థం: అనృతమునకున్= అసత్యానికి; ఎంత వెఱతును= ఎంతగా భయపడతానో; వినుము= అవధరించుము; అంతకునకునున్= యముడికికూడ; అంత వెఱవన్= అంతగా భయపడను; మును= ఇంతకుముందు; వహించిన వ్రతమున్= పూనిన నోమును విడిచి; దుర్గతిన్= చెడుమార్గంలో; చనన్+చాలుదునయ్యా= నడువగలుగుదునా? (నడువలేను సుమా); నన్నున్= నన్ను; మాన్పన్+చనునే (ఆ వ్రతమునుండి); ఆపటం భావ్యమా? (భావ్యం కాదు);

తాత్పర్యం: దేవా! అవధరింపుము. అసత్యానికి భయపడినట్లుగా, నేను యముడికి కూడా భయపడను. ముందు పూనిన నోమును విడిచి ఇపుడు చెడుమార్గంలో నడువజాలను. నన్ను సద్వ్రతంనుండి మరల్చటం పాడికాదు.

వ. అర్జునుండు దుర్జయుం డని చూడవలవదు, నీవును మదీయంబు లగు దివ్యాస్త్రంబు లెఱుంగుదు; జామదగ్న్యుండును ద్రోణుండును నాకు నొసంగినదివ్యాస్త్రంబు లల్పంబులు గావు, గావున నవశ్యంబును సమరంబున నమరరాజనందనుం దెగటార్పనోపుదు; నీ వింక నొండు దలంపక నాకు ననుజ్ఞ యి' మ్మనిన నొక్కింత విచారించి యాదేవుండు రాధేయున కి ట్లనియె. 304

ప్రతిపదార్థం: అర్జునుండు= అర్జునుడు; దుర్జయుండు+అని= గెలువరానివాడని; చూడన్వలవదు= తలపోయవద్దు; నీవును= నీవుకూడా; మదీయంబులు+అగు= నావైన; దివ్య+అస్త్రంబులు= దేవతామహిమ గల ఆయుధాలు; ఎఱుంగుదు(వు)= తెలియుదువు; జామదగ్న్యుండును= జమదగ్నికొడుకు పరశురాముడున్నూ; ద్రోణుండును= ద్రోణుడున్నూ; నాకున్+ఒసంగిన= నాకు ఇచ్చిన; దివ్య+అస్త్రంబులు= దేవతామహిమ కల బాణాలు; అల్పంబులు+కావు= తక్కువైనవి కావు; కావునన్= కాబట్టి; అవశ్యంబును= తప్పనిసరిగా; సమరంబునన్= యుద్ధంలో; అమరరాజనందనున్= దేవేంద్రుడికుమారుడిని-అర్జునుడిని; తెగటార్పన్+ఓపుదున్= సంహరించ జాలుదును; నీవు= నీవు; ఇంకన్= ఇక మీద; ఒండు+తలంపక= వేరొకటి ఆలోచించక; నాకున్= నాకు; అనుజ్ఞ+ఇమ్ము= ఆనతి దయచేయుము; అనినన్= అని (కర్ణుడు) వచించగా; ఒక్క+ఇంత= ఒకకొంత (తడవు); విచారించి= ఆలోచించి; ఆ దేవుండు= ఆ దేవుడు, సూర్యభగవానుడు; రాధేయునకున్= రాధకొడుకుకు - కర్ణునికి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: 'ఓ సూర్యదేవా! అర్జునుడు గెలువరానివాడని నిర్ణయించకుము. నా వద్దనున్న దివ్యాస్త్రాలను గూర్చి నీకు కూడా తెలియును. పరశురాముడు ద్రోణుడు నాకు ఇచ్చిన దివ్యాస్త్రాలు తక్కువ అయినవి కావు. కావున యుద్ధంలో నేను అర్జునుడిని సంహరించటం తథ్యం. నీవు వేరే ఆలోచనలు చేయక నన్ను ఆశీర్వదించుము' అని కర్ణుడు అన్నాడు. సూర్యుడు కొంతతడవు యోచించి కర్ణుడికి ఈవిధంగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సూర్యుఁడు గర్ణునితో నింద్రుచే శక్తిఁ గైకొను మని సెప్పుట (సం. 3-286-14)

తే. **'ఎల్లభంగుల నిశ్చయం బిదియ యేని । వత్స! విను మింక నొక్కటి; వాసవునకుఁ**
గలదు దారుణంబును నమోఘంబు నైన । శక్తి; యది నీకు నడుగుము సవినయముగ. **305**

ప్రతిపదార్థం: వత్స!= నాయనా కర్ణ!; ఎల్ల, భంగులన్= అన్నివిధాల; నిశ్చయంబు= నిర్ణయం; ఇది+అ= ఇదియే; ఏని= అయితే; ఇంకన్= ఇంక; ఒక్కటి= ఒకమాట; వినుము= ఆలకించుము; దారుణంబును= భయంకరమైనదిన్నీ; అమోఘంబును= బీరువోవనట్టిదిన్నీ; ఐన= ఐన; శక్తి= శక్తి అనే ఆయుధవిశేషం; వాసవునకున్= దేవేంద్రుడికి; కలదు= ఉన్నది; సవినయముగన్= నమ్రతతో; అది= ఆ శక్తి; నీకున్= నీకు (ఇమ్మని); అడుగుము= కోరుము.

తాత్పర్యం: 'నాయనా, కర్ణా! దేవేంద్రుడు అడిగితే కవచకుండలాలను దానం చేయటమే నీ కృతనిశ్చయం అయితే, ఇంకొక మాట చెప్తుతాను. వినుము. దేవేంద్రుడికడ తిరుగులేని భయంకరమైన ఆయుధవిశేషం ఒకటి ఉన్నది. దానిపేరు శక్తి. నీవు వినమ్రంగా ఆ శక్తిని అడిగి తీసికొనుము.

క. **తొలి తొలి బలసూదనుచేఁ । జెలువుగ నాదివ్యశక్తి చేకుఱఁ గొని కుం**
డలములుఁ గవచంబును మఱి । యలఘుమతీ! యిమ్ము భద్ర మగు నిట్లయినన్. **306**

ప్రతిపదార్థం: అలఘుమతీ!= గొప్పబుద్ధి కలవాడా, కర్ణా!; తొలి తొలి= మొట్టమొదట; బలసూదనుచేన్= దేవేంద్రుడిచేతినుండి; చెలువుగన్= పొలుపుగ; ఆ దివ్యశక్తి= ఆ దివ్యమైన ఆయుధవిశేషం; చేకుఱన్+కొని= చేకూరేటట్లుగా పరిగ్రహించి; మఱి= పిదప; కుండలములు= కుండలాలు; కవచము= తనుత్రాణం; ఇమ్ము= ఒసంగుము; ఇట్లు+అయినన్= ఈ రీతిగా జరిగితే (శక్తిని నీవు గైకొంటే); భద్రము+అగున్= (నీకు) మేలు కలుగుతుంది.

తాత్పర్యం: మేధావి అయిన ఓ కర్ణా! మెట్టమొదట ఆయుధవిశేషమైన ఆ దివ్యశక్తిని పరిగ్రహించి, పిదప నీకవచాన్ని కుండలాలను దేవేంద్రుడికి ఇమ్ము. అప్పుడు నీకు భద్రమౌతుంది.

ఉ. **వైరులఁ జంపి చంపి వెస వచ్చుఁ గరంబున కాజిలోన న**
ద్దారుణశక్తి వాసవుఁడు దానన తొల్లి సహస్రసంఖ్యలం
గ్రూరసురారిసంఘములఁ గూల్చె; మహాభుజ! నీకు నెమ్మి నా
ఘోరపు సాధనంబు దొరకొన్న నవశ్యము గెల్తు వైరులన్.' **307**

ప్రతిపదార్థం: మహా+భుజ!= గొప్పపరాక్రమం కలవాడా!; ఆ+దారుణశక్తి= ఆ ఘోర 'శక్తి'; వైరులన్= శత్రువులను; చంపి, చంపి= పలుమారులు సంహరించి; వెసన్= శీఘ్రంగా; ఆజిలోనన్= యుద్ధంలో; కరంబునకున్= చేతికి; వచ్చున్= అరుదెంచును; వాసవుఁడు= దేవేంద్రుడు; తొల్లి= పూర్వం; దానన్+అ= దానివలననే, ఆశక్తి అనే ఆయుధవిశేషంచేతనే; క్రూర, సుర+అరి, సంఘములన్= భయంకరులైన రాక్షసుల సమూహాలను; సహస్రసంఖ్యలన్= వేనకు వేలు; కూల్చెన్= సంహరించాడు; నీకున్= నీకు; ఆఘోరము+సాధనంబు= ఆ భయంకరమైన ఆయుధం; నెమ్మిన్= ఒప్పిదంగా; దొరకొన్నన్= లభించితే; వైరులన్= శత్రువులను; అవశ్యం= తప్పకుండా; గెల్తు(వు)= జయించగలవు.

తాత్పర్యం: ఆ భయంకరమైన ఆయుధవిశేషం 'శక్తి' యుద్ధంలో శత్రువులను పలుమారులు సంహరించి శీఘ్రంగా మరల మరల చేతికి చేరుతూ ఉంటుంది; ఆ ఆయుధంచేత పూర్వం వేనకువేలమంది భయంకరరాక్షసులను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దేవేంద్రుడు సంహరించి ఉన్నాడు. పరాక్రమవంతుడ వైన ఓకర్ణా! నీకు ఆ భయంకరమైన ఆయుధం 'శక్తి' లభిస్తే శత్రువులను సులువుగా జయించగలవు'.

వ. అని చెప్పి కమలహితుం డంతర్హితుం డయ్యెః కర్ణుండును వాసవురాక కెదురుసూచుచుండె; ననిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 308

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; కమలహితుండు= సూర్యుడు; అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడు అయ్యాడు; కర్ణుండును; వాసవురాకకున్= దేవేంద్రుడి ఆగమనానికి; ఎదురుచూచుచున్+ఉండెన్= నిరీక్షిస్తూ ఉన్నాడు; అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; జనమేజయుండు; వైశంపాయనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చెప్పి సూర్యుడు అంతర్థానం చెందాడు. కర్ణుడు దేవేంద్రుడిరాకకై నిరీక్షిస్తూ ఉన్నాడు - అని చెప్పగా విని జనమేజయుడు వైశంపాయనుడితో ఈ విధంగా అన్నాడు.

మధురాక్కర

'కలదు దేవగుహ్యం బని కమలబాంధవుఁడు గర్ణుఁ
బలికె నని చెప్పి; తది యెద్ది? బలియుఁ డా సూతజుండు
లలితకవచంబు మణికుండలములు నెమ్మెయిఁ బడసె?
వెలయ నివ్విధమంతయు వివరింపవలయు నాకు.' 309

ప్రతిపదార్థం: కమలబాంధవుఁడు= సూర్యుడు; దేహగుహ్యంబు= దేవతలకు సంబంధించిన రహస్యం; కలదు= ఉన్నది; అని= అంటూ; కర్ణున్= కర్ణుడితో; పలికెన్= చెప్పాడు; అని చెప్పితి(వి)= అని చెప్పావు; అది= (ఆ దేవరహస్యం); ఎద్ది= ఏది?; బలియుఁడు= బలవంతుడు; ఆ సూతజుండు= ఆ సూతుడికొడుకు-కర్ణుడు; లలితకవచంబు= మనోహరమైన తనుత్రాణం; మణికుండలములున్= మణులతో పొదగబడిన చెవిపోగులు; ఏ+మెయిన్= ఏరీతిగా; పడసెన్?= పొందాడు?; ఈ+విధము+అంతయున్= ఈరీతి సమస్తం; వెలయన్= ప్రస్ఫుటం అయ్యేటట్లుగా; నాకున్= నాకు; వివరింపన్‌వలయున్= విస్తరించి తెలుపవలెను.

తాత్పర్యం: ఏదో దేవరహస్యం కలదని కర్ణుడితో సూర్యుడు చెప్పి ఉన్నాడని నీవు చెప్పావు. ఆ రహస్యం ఏది? బలవంతుడైన ఆ సూతసుతుడు కర్ణుడు ఆ కవచకుండలాలను ఏవిధంగా సంపాదించాడు? ఈ విషయాలను తేటతెల్లంగా నాకు తెలుపగోరుతాను.

విశేషం: వృత్త లక్షణానికి చూడు. ఆరణ్యం: 6-352 విశేషాంశం.

వ. అనిన వైశంపాయనుం 'డదియంతయుం జెప్పెద విను' మని యిట్లనియెఁ; దొల్లి కుంతిభోజు నింటికి దుర్వాసుం డతిథియై వచ్చి వానిచేత సత్కృతుండై 'నాకు నీయింటఁ గొంతకాలంబు వసియింప నిష్టం బైనది; నాయున్నంత కాలంబును నీవును నీయనుచరులును నిర్వ్యాజం బగు భక్తి సేయవలయు; ని ట్లోపుదే?' యనుటయు నొడంబడి యతండు దన కూఁతుం బృథ యను కన్యం బిలిచి యమ్మహామునిం జూపి. 310

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అని (జనమేజయుడు) పల్కగా; వైశంపాయనుండు; అది= (ఆకథ); అంతయున్= సమస్తం; (ఆ దేవరహస్యగాథను); చెప్పెదన్= తెలుపుతాను; వినుము= ఆలకించుము; అని= అని వచించి; ఇట్లు+అనియెన్; తొల్లి= పూర్వం; కుంతిభోజు+ఇంటికిన్= కుంతిభోజుడి గృహానికి; దుర్వాసుండు; అతిథి+ఐ= అతిథియై వచ్చి= అరుగుదెంచి; వానిచేతన్= కుంతిభోజుడిచేత; సత్కృతుండు+ఐ= సమ్మానించబడినవాడై; నాకున్= నాకు; నీయింటన్= ఓ కుంతిభోజమహారాజా నీ గృహంలో; కొంతకాలంబు= కొన్నినాళ్లు; వసియింపన్= నివసించాలని; ఇష్టంబు+ఐనది= కోరిక కలిగింది; నా+ఉన్న+అంత, కాలంబును= నేను ఉన్న సమయంమేరకు; నీవును= నీవున్నూ; నీ+అనుచరులును= నీ సేవకులున్నూ; నిర్వ్యాజంబు+అగు= సహజమైన (ఎట్టికారణాలు లేకుండగా); భక్తి+చేయవలయున్= పూజ్యభావం చూపాలి; ఇట్లు+ఒపుదు(వు)+ఏ?= ఈరీతిగా నీవు చేయగలవా?; అనుటయున్= అని అనగానే; అతండు= అతడు, కుంతిభోజుడు; ఒడంబడి= అంగీకరించి; తనకూఁతున్= తన పుత్రికను; పృథ+అను, కన్యన్= పృథ అనే పేరుకల పెండ్లికానిది అయిన లేత జవరాలను; పిలిచి= దగ్గరకు రప్పించి; ఆ, మహా+మునిన్+చూపి= ఆ మహానుభావుడిని చూపి.

తాత్పర్యం: అని జనమేజయుడు అడుగగా- వైశంపాయనుడు, 'దాని నంతటిని సవిస్తరంగా చెప్పగలను; ఆలకించుము' అని ఈ విధంగా పలికాడు: పూర్వం కుంతిభోజుడిగృహానికి దుర్వాసమహర్షి అతిథిగా ఏతెంచాడు. కుంతిభోజుడు ఆ మునిని పూజించాడు. దుర్వాసుడు, 'ఓమహారాజా! నాకు నీ గృహంలో కొన్నినాళ్లు నివసించవలెనని కోరిక కలిగింది. నేను ఉన్నంతకాలం నీవున్నూ నీ సేవకులున్నూ ఎట్టి ప్రతిఫలాన్ని ఆశించకుండా సహనంతో నాకు పరిచర్య చేయగలరా? చెప్పుము' అని అడిగాడు. అందుకు కుంతిభోజుడు సమ్మతించి, తన పుత్రిక, పెండ్లికాని బాలను పృథ అనే కన్యకను పిలిచి ఆ మహామునిని చూపి ఈ విధంగా చెప్పాడు.

విశేషం: (1) కుంతిభోజుడు పృథను పెంచుకొనిన యాదవభూపతి. (2) అతిథి- తిథివారనక్షత్రాలు లేకుండ పయనించే బాటసారి అని మొట్టమొదటి అర్థం. తదుపరి- అతిథి అనగా స్వాగతసత్కారాలను కోరి గృహస్థులను చేరే బాటసారి - అనే అర్థం ఏర్పడింది. గృహస్థుల ఆహ్వానంచొప్పున వచ్చినవాడు 'అతిథి' అని - ఆహ్వానం లేకుండ వచ్చేవాడు 'అభ్యాగతుడు' అనే వివక్ష ఏర్పడింది. భారతీయసంస్కృతిలో గృహస్థులకు అతిథిపూజ, అభ్యాగతసేవ ప్రాముఖ్యాన్ని వహించాయి. "అతిథిదేవోభవ" - "అభ్యాగతఃస్వయంవిష్ణుః" అనే సుభాషితాలు ప్రాచీన భారతీయసంస్కృతిలో అభ్యాగతులకు అతిథులకు గల ప్రాముఖ్యాన్ని వెల్లడిస్తున్నవి. (3) దుర్వాసుడు- శీఘ్రకోపనుడుగా పౌరాణికవాఙ్మయంలో సుప్రసిద్ధుడైన ఋషివరేణ్యుడు.

ఉ. **'దేవసమానుఁ డీ ధరణిదేవుఁడు; వేడుక మద్గృహంబునం**
దా వసియింపఁ గోరుటయు, దానికి నేనును నియ్యకొంటి, నిం
దీవరనేత్ర! నీవుఁ గడుధీరవు, సద్వినయోపచారసం
భావితవృత్త; వట్లగుట భక్తి భజింపుము బ్రాహ్మణోత్తమున్. 311

ప్రతిపదార్థం: ఇందీవరనేత్ర!= నల్లకలువల వంటి కన్నులు కలదానా, ఓపృథాకుమారీ!; ఈ ధరణిదేవుఁడు= ఈబ్రాహ్మణుఁడు; దేవసమానుఁడు= దేవతలతో సమానుడు; వేడుకన్= ప్రీతితో; మత్+గృహంబునన్= మనయింటిలో; తాన్= తాను; వసియింపన్+కోరుటయున్= ఉండవలెనని ఆశించటం; దానికిన్= అందుకు; నేనునున్= నేనున్నూ; ఇయ్యకొంటిన్= సమ్మతించాను; నీవున్= నీవు; కడున్= మిక్కిలి; ధీరవు= ధైర్యవంతురాలవు; సత్+వినయ+ఉపచార, సంభావితవృత్తవు= మంచి నమ్రతతో కూడిన పరిచర్య చేయటానికి ఆలోచించే శీలం కలదానవు; అట్లు+అగుటన్= అందుచేత; భక్తిన్= పూజ్యభావంతో; బ్రాహ్మణ+ఉత్తమున్= విప్రులలో శ్రేష్ఠుడు అయినవాడిని, దుర్వాసుడిని; భజింపుము= సేవించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ బ్రాహ్మణుడు దేవతలతో సరితూగకలవాడు. ప్రీతితో మనగృహంలో నివసించటానికై కోరాడు. నేను గూడ సమ్మతించాను. నల్లకలువలవంటి నేత్రాలు గలదానా! ఓపృథాకుమారీ!; నీవు మిక్కిలి ధైర్యవంతురాలవు. అణకువతో పరిచర్యచేయగల అభిరుచి అభినివేశం కలదానవు. విప్రులలో శ్రేష్ఠుడైన ఈ దుర్వాసమహర్షిని సేవించుము.

క. ఇతఁ డెత్తఱి నెయ్యది స । మ్మతిఁ గోరిన నది ఘటించి మచ్చిక నిడి తో
షితుఁ జేయు మిమ్మహాత్ముని । మతి యలుగక యుండవలయు మానిని! యెపుడున్. 312

ప్రతిపదార్థం: మానిని!= అభిమానం కలదానా, ఓపృథాకుమారీ!; ఇతఁడు= ఈ దుర్వాసుడు; ఏతఱిన్= ఏవేళను; ఎయ్యది= (ఏ+అది)= దేనిని; కోరినన్= వాంఛిస్తే; అది= ఆ కోరిక; ఘటించి= సమకూర్చి; మచ్చికన్+ఇడి= ప్రీతితో ఒసంగి; తోషితున్+చేయుము= సంతృప్తి నందినవాడినిగా చేయుము; ఈ+మహా+ఆత్ముని, మతి= ఈమహానుభావుడియొక్క మనస్సు; ఎపుడున్= ఎప్పుడును, అలుగక ఉండన్‌వలయున్= కోపం చెందక ఉండవలయును.

తాత్పర్యం: ఓ పృథాకుమారీ! ఈ మహానుభావుడు, ఏ సమయంలో ఏ కోరిక కోరితే ఆ కోరికను వెంటనే తీర్చుము. సదా ఆతడు సంతృప్తి చెంది ఉండేటట్లుగా చూడుము. ఆతడు కోపించకూడదు సుమా.

ఆ. వినుము విప్రవరులు వెడవెడఁ గినిసిరే । నియును ధరణి యెల్ల నీఱు సేయఁ
జాలుదురు తపఃప్రశస్తులు దుర్వార । తేజు లెందు నధికధీరమతులు. 313

ప్రతిపదార్థం: వినుము= ఆలకింపుము; తపఃప్రశస్తులు= (తపస్+ప్రశస్తులు=) తపస్సుచేయటంచేత గొప్పవారు; దుర్వార, తేజులు= వారించుటకు శక్యం కాని తేజస్సు కలవారు; ఎందున్= ఎచటనైనను; అధిక, ధీరమతులు= మిక్కుటమైన ధైర్యంతో కూడిన బుద్ధికలవారు అగు, విప్రవరులు= బ్రాహ్మణోత్తములు; వెడవెడన్= కొంచెముగా నైనా; కినిసిరి+ఏనియును= కోపగిస్తే చాలు; ధరణి+ఎల్లన్= భూమిని అంతటిని; నీఱు+చేయన్+చాలుదురు= బూడిద చేయ జాలుదురు;

తాత్పర్యం: సావధానంగా ఆలకించుము. లేశమాత్రమైనా విప్రవరులు ఆగ్రహంచెందితే ఈభూగోళం సమస్తాన్ని బూడిదచేయగలశక్తి కలవారు. వారు తపస్సు చేయుటంచేత గొప్పవారు; వారించటానికి వీలులేని తేజస్సు కలవారు; మిక్కుటమైన ధైర్యంతో కూడిన తెలివితేటలు కలవారు.

క. భూదేవపరాభవమునఁ । గాదే వాతాపిదండక ప్రభృతులు పెం
పేది చెడిరి; భూదేవస । మాదరమునఁ గాదె బ్రదికినవి యిజ్జగముల్. 314

ప్రతిపదార్థం: భూదేవపరాభవమునన్+కాదు+ఏ= బ్రాహ్మణులను అవమానించటంచేతనే కదా; వాతాపి, దండక, ప్రభృతులు= వాతాపి, దండకుడు మున్నగువారు; పెంపు+ఏది= ఔన్నత్యం తరిగి; చెడిరి= నశించారు; ఈ+జగముల్= ఈ లోకాలు; భూదేవ, సమ్+ఆదరమునన్+కాదె= బ్రాహ్మణులను బాగా ఆదరించటంచేతనే కదా; బ్రదికినవి= జీవించాయి.

తాత్పర్యం: బ్రాహ్మణులను అవమానించటంచేతనే కదా వాతాపి దండకుడు మున్నగువారు తమఔన్నత్యాన్ని కోలుపోయి నశించారు. బ్రాహ్మణులను ఆదరించటంచేతనేకదా ఈ లోకాలు బ్రదికాయి.

విశేషం: (1) అగస్త్యమహాముని ఇల్వలుడి ఆతిథ్యం స్వీకరించి అతడు 'వాతాపి' అనే తన తమ్ముడిని చంపి నరమాంసాన్ని వడ్డించగా, గ్రహించి వాతాపిని జీర్ణంచేసికొన్నాడు. ఇల్వలుడు తమ్ముడిని సంహరించి నరమాంసాన్ని తెలియని అతిథులకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వడ్డించి వారు ఆరగించిన పిదప 'వాతాపీ'! రమ్ము' అని పిలిచేవాడట. అతిథిపొట్ట చీల్చుకొని పునరుజ్జీవితుడై వాతాపి బయల్వెడలేవాడట. పిదవ ఇరువురు అన్నదమ్ములును - అతిథిమాంసాన్ని కమ్మగా భుజించేవారట. ఈ పన్నాగం అగస్త్యమహర్షిదగ్గర పారలేదు.

సీ. **పసిబిడ్డ వయ్యును బడఁతి! నీ వెంతయు । గుణవంతురాలవు గురులయందుఁ**
బెద్దలయందును బృథివీసురులయందుఁ । గడుభక్తి సేయుదు కమలనయన!
బంధులుఁ జెలులు సంబంధిజనంబులుఁ । బురమువారలు నంతిపురమువారుఁ
బూఁబోఁడి! నిను నెమ్మిఁ బొగడనివారు లే; । రేమని వర్ణింతు నేను నిన్ను?

తే. **యదుకులంబునఁ బుట్టి యత్యంతసౌఖ్య । మమరఁ బెరిఁగితి నాపుత్త్రి వై, త్రిలోక**
సుందరము రూపు, ప్రాయంబు సొంపు, నిట్టి । దిచ్చరిత్రంబు సతులకు నెందుఁ గలదు? **315**

ప్రతిపదార్థం: పడఁతి= ఓపృథా దేవీ!; నీవు= నీవు; పసిబిడ్డవు+అయ్యును= చిన్నపిల్లవు అయినను; ఎంతయున్= మిక్కిలి; గుణవంతురాలవు= మంచిగుణాలు కలిగినదానవు; కమలనయన!= పద్మాలవంటి కన్నులు కలదానా, పృథాకుమారీ!; గురుల, అందున్= ఒజ్జలపట్ల; పెద్దల, అందును= వయసుమళ్ళినవారిపట్లను; పృథివీసురుల, అందున్= బ్రాహ్మణులపట్ల; కడున్= మిక్కిలి; భక్తి+చేయుదు(వు)= పూజ్యభావాన్ని చూపుతావు; పూఁబోఁడి= పువ్వువలె మనోహరమైన దేహంకలదానా!; బంధులున్= చుట్టాలూ; చెలులున్= సఖులూ; సంబంధిజనంబులున్= కావలసినవారును; పురమువారలున్= పౌరులూ, అంతిపురమువారున్= అంతఃపురంలోనివారున్నూ; నినున్= నిన్ను; నెమ్మిన్= అనురాగంతో; పొగడనివారు= ప్రశంసించనివారు; లేరు= లేరు; ఏను= నేను; నిన్నున్= నిన్ను; ఏమి+అని, వర్ణింతున్= నిన్ను ఏవిధంగా పొగడగలను; యదుకులంబునన్= యాదవవంశంలో పుట్టి= ఉద్భవించి; అత్యంతసౌఖ్యము= గొప్పభోగం; అమరన్= విలసిల్లగా; నాపుత్త్రివి+ఐ= నా కూతురువై; పెరిఁగితి(వి)= అభివృద్ధి చెందావు; రూపు= నీ రూపము; ప్రాయంబు= వయసు; సొంపు= శోభ; త్రిలోకసుందరము= మూడులోకాలలోను సుందరమైనది; ఇట్టిది= ఇటువంటిదైన; ఈ+చరిత్రంబు= ఈ నడవడిక; సతులకున్= ఆడువారికి; ఎందున్= ఎక్కడ; కలదు?= ఉన్నది?

తాత్పర్యం: ఓ పృథాకుమారీ! నీవు వయసున చిన్నపిల్లవే కాని, గొప్పగుణాలు కలదానవు. ఒజ్జలయందు పెద్దలయందు బ్రాహ్మణులయందు మిక్కిలిపూజ్యభావం చూపుతుంటావు. పద్మాలవంటికన్నులుకలదానా! చుట్టాలు నెచ్చెలులు పరిజనాలు నగరంలోనివారు, నగరిలోపలివారు నిన్ను ప్రశంసించనివారు లేరు. పూవువలె సుకుమారమైన శరీరం కలదానా!, నేను నిన్ను ఏరీతిగా అభినందించగలను? యాదవవంశంలో జన్మించి నాపుత్రికవై నీవు సకలభోగభాగ్యాలతోనూ పెరిగావు. త్రిలోకసుందరమైనది నీరూపం. లేజవ్వనపు సొగసుతో ఒయ్యార మొలికెడి ఇట్టిచరిత్ర ఆడుపిల్లలలో ఎచట కన్పిస్తుంది?

విశేషం: నీ చరిత్రంబు సతులకు నెందుగలదు? - అకాడమీ ప్రతిలోని ఈ పాదంలో యతి భంగం జరిగింది, అందుచేత తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిలోను, రామా అండ్ కో వారి ప్రతిలోను ఉన్న "ఇచ్చరిత్రంబు సతులకు నెందుగలదు?" అనే పాఠం స్వీకరించబడింది.

వ. **నీగౌరవం బంతయు నెఱింగి కాదె వహ్నిసమానుండైన యీ మహామునిఁ నారాధించుటకు నీయందు భారం బెక్కించెద; నీవును దర్పంబును నహంకారంబును దూరంబున నిడి యిప్పుణ్యపురుషుం బరితుష్టుం జేసి కృతార్థతం బొందు' మనిన నక్కన్య యి ట్లనియె.** **316**

ప్రతిపదార్థం: నీగౌరవంబు+అంతయున్= నీగొప్పతనాన్ని సమస్తమున్నూ; ఎఱింగి+కాదు+ఎ= తెలిసియే కదా; వహ్ని, సమానుండు+ఐన= నిప్పుతో తుల్యుడైన; ఈ మహామునిన్= ఈ మహర్షిని; ఆరాధించుటకున్= అర్చించటానికి, సపర్యచేయటానికి; నీయందున్= నీమీద; భారంబు= బరువు; ఎక్కించెదన్= మోపెదను; నీవును= నీవున్నూ; దర్పంబును= గర్వంబును; అహంకారంబును= స్వాతిశయాన్ని; దూరంబునన్+ఇడి= దవ్వుల పెట్టి; ఈ+పుణ్య, పురుషున్+పరితుష్టున్+చేసి= ఈ పుణ్యాత్ముడిని సంతోషించిన వాడినిగా ఒనర్చి; కృతార్థతన్+పొందుము= ధన్యత్వాన్ని అనుభవించుము; అనినన్= అని (కుంతిభోజుడు) చెప్పగా; ఆ+కన్య= పృథాకుమారి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఓపృథాకుమారీ! నీకు నీగొప్పతనం చాకచక్యాలు అనుభవామ్రేడితాలు. అందుచేతనే నిప్పుతో తుల్యుడైన ఈ మహర్షిని అర్చించి శుశ్రూషసల్పటానికై నిన్ను ఎన్నికచేసి ఆ భారాన్నంతటినీ నీపై మోపాను. నీవు గర్వాన్నీ స్వాతిశయాన్నీ సంపూర్ణంగా విడనాడి ఈ మహానుభావు డైన దుర్వాసుడిని సంతోషింపచేసి నీవు ధన్యురాలవు కమ్ము' అని కుంతిభోజుడు చెప్పగా ఆ కన్య పృథాకుమారి ఇట్లా బదులు పలికింది.

ఉ. **'కోరుదు నేను విప్రతతిఁ గొల్వఁగ నెప్పుడు నాత్మలోన; నా**
కోరినకోర్కి నేఁడు దలకూడె; నరేశ్వర! యట్లుఁ గాక నీ
కోరినయట్టి యవ్విధము గోరి యొనర్చుట నాదుభాగ్యసం
భారము గాదె! యూఱడుము భారము నాపయిఁ బెట్టి నెమ్మదిన్.' **317**

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= రాజా, ఓకుంతిభోజమహారాజా!; విప్రతతిన్= బ్రాహ్మణుల సమూహాన్ని; కొల్వఁగన్= సేవచేయటానికి; ఎప్పుడున్= ఎల్లప్పుడును; ఆత్మలోనన్= మనస్సులో; ఏను= నేను; కోరుదున్= ఆకాంక్షిస్తాను; నాకోరినకోర్కి= నేను కోరినట్టికోరిక; నేఁడు= ఈ రోజున; తలకూడెన్= సమకూరింది; అట్లున్+కాక= అట్లుకానిచో; నీకోరిన+అట్టి= నీవు అభిలషించిన; ఆ+విధము= ఆ రీతి; కోరి= మనసుపడి; ఒనర్చుట= చేయటం, నా+భాగ్య సంభారము+కాదు+ఎ= నాయొక్క అదృష్టయోగ భారంకాదా; భారమున్= బరువును, నాపయిన్+పెట్టి= నామీద మోపి; నెమ్మదిన్= (నెఱ+మదిన్=) నిండుచిత్తంతో; ఊఱడుము= విశ్రాంతి నందుము.

తాత్పర్యం: 'ఓ కుంతిభోజమహారాజా! బ్రాహ్మణులకు పరిచర్యచేయవలెనని ఎల్లప్పుడూ నేను నామదిలో ఉవ్విళ్ళూరుతుంటాను. ఈ నాటికి నాచిరకాలవాంఛ ఈడేరింది. అట్లుగాకపోయినా నీవు అభిలషించిన రీతిగా పూని అట్టిపనిని నెరవేర్చగలగటం నా అదృష్టయోగం కదా! బరువు నామీద మోపి, తండ్రీ! నీవూ ఊరటచెందుము'.

వ. **అనిన సంతసిల్లి కుంతిభోజుండు దుర్వాసున కక్కన్నియం జూపి యి ట్లనియె.** **318**

తాత్పర్యం: అనగా విని కుంతిభోజుడు సంతోషించి, దుర్వాసుడికి ఆ కన్యను చూపి ఇట్లా అన్నాడు.

క. **'ఈ పిన్నది నాకూఁతురు। తాపసజనముఖ్య! మిమ్ముఁ దాఁ గొలువంగా**
నోపుదు నని పూనెం బసి। పాపసుఁడీ! కినుక లేక పని గొనవలయున్. **319**

ప్రతిపదార్థం: ఈ పిన్నది= ఈ చిన్నది; నాకూఁతురు= నా పుత్రిక; తాపసజనముఖ్య= ఋషులలో శ్రేష్ఠుడా! ఓ దుర్వాస మహర్షీ; తాన్= తనంతట తాను; మిమ్మున్= మిమ్ము; కొలువంగాన్+ఓపుదున్+అని= సేవించజాలుదు నని; పూనెన్= పూనుకొన్నది; పసిపాప+చుఁడీ= ఈమె మిక్కిలి చిన్నపిల్ల సుమా; కినుక లేక= కోపం లేకుండా; పని, కొనవలయున్= సేవ చేయించుకొనవలెను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఋషివరేణ్యులలో ముఖ్యుడవైన దుర్వాసమహాముని! ఈ కన్యక కడుపసిబిడ్డ; నాకూతురు. ఈమె తనంతట తానై తమకు పరిచర్య చేయగలనని ముందుకు వచ్చింది. తాము కరుణతో కినుక లేకుండా ఆమె సపర్యల నందుకొన ప్రార్థన.

కుంతి దుర్వాసునకుఁ బరిచర్య సేయుట (సం. 3-288-12)

చ. ఎఱుఁగక తప్పుగా మెలఁగె నేనియు దానికి సైఁచి నేరుపుల్
గఱపి ప్రియంబుతోఁ గొలువు గైకొనఁగాఁ దగు మీకు; బాలురుం
దెఱవలు వృద్ధులుం దమకుఁ దెల్లము దప్పులు సేసిరేనియున్
మఱతురుగాని యల్గరు సమగ్రశమాన్వితు లైన తాపసుల్. 320

ప్రతిపదార్థం: ఎఱుఁగక= తెలియక; తప్పుగాన్= దోషంగా; మెలఁగెన్+ఏనియున్= ప్రవర్తించినప్పటికి; దానికిన్ సైఁచి= అందుకు సహించి; నేరుపుల్; కఱపి= సమర్థతలను బోధించి; ప్రియంబుతోన్= ప్రీతితో; కొలువు+కైకొనన్+కాన్= సేవలు స్వీకరించటం; మీకున్= మీకు; తగున్= ఒప్పుతుంది; బాలురున్= చిన్నపిల్లలును; తెఱవలున్= ఆడువారును, వృద్ధులున్= ముసలివారు; తమకున్+తెల్లము= తమకు తెలిసిన విషయమే కదా!; తప్పులు= దోషాలు; చేసిరి+ఏనియున్= సలిపినప్పటికిని; సమగ్ర, శమ+అన్వితులు+ఐన, తాపసుల్= పరిపూర్ణమైన శాంతంతో కూడిన మహర్షులు; మఱతురు+కాని= విస్మరిస్తారుకాని; అల్గరు= కోపించరు.

తాత్పర్యం: తెలియక మాఅమ్మాయి ఈ పృథాకుమారి చిన్నతనంచేత కొన్ని తప్పులు చేయవచ్చును. ఆమెను తాము క్షమించి ఆమెకు చాకచక్యంనేర్పు బోధించి ప్రీతితో సపర్యలు స్వీకరించగలరని నా విన్నపం. బాలురు ఆడువారు ముసలివారు తప్పులు చేయటం తమకు తెలిసినదే కదా! అయినను ఆతప్పులను పరిపూర్ణమైన శాంత స్వభావం కల తమవంటి తాపసులు విస్మరిస్తారు కాని కోపగించుకొనరు.

వ. అని యప్పగించి యప్పార్థివేంద్రుండు మునీంద్రునకుఁ జంద్రికాధవళం బైన సౌధంబునందు శయనాసనప్రముఖోపకరణంబులు నభిమతాహారసాధనద్రవ్యంబులు నాయితంబులు సేయించి, తాను సంతసంబున నూఱడియుండె; నంత. 321

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; అప్పగించి= ఒప్పచెప్పి; ఆ+పార్థివ+ఇంద్రుండు= ఆ రాజశ్రేష్ఠుడు, కుంతిభోజుడు; ముని+ ఇంద్రునకున్= మునులలో శ్రేష్ఠుడు దుర్వాసుడికి; చంద్రికాధవళంబు+ఐన= వెన్నెలవలె తెల్లనిది అయిన; సౌధంబునందున్= మేడలో; శయన+ఆసన, ప్రముఖ+ఉపకరణంబులున్= పరుపులు, గద్దెలు మున్నగు సాధనాలును; అభిమత+ఆహార, సాధన, ద్రవ్యంబులున్= కావలసిన భోజన సదుపాయాలును వస్తువులును; ఆయితంబులు+చేయించి= సమకూర్చి; తాను= తాను (కుంతిభోజుడు); సంతసంబునన్= సంతోషంతో; ఊఱడి+ఉండెన్= విశ్రమించి ఉన్నాడు; అంతన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అని చెప్పి కుంతిని అప్పగించి కుంతిభోజుడు దుర్వాసుడికి వెన్నెలవలె తెల్లనిది ఆయినమేడ విడిదిగా ఏర్పాటు చేశాడు. ఆమేడలో పరుపులు కుర్చీలు మున్నగు సాధనాలను, కావలసిన భోజనసదుపాయాలను, వస్తుసామగ్రినీ సమకూర్చి తాను విశ్రాంతిగా ఉన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. భావించి నాఁడునాఁటికి । వేవిధముల మిగుల భక్తివినయంబులతో
దేవోపచారముల భూ । దేవోత్తముఁ గొల్చెఁ గుంతిదేవి నియతయై. 322

ప్రతిపదార్థం: కుంతిదేవి= పృథాకుమారి; భావించి= చిత్తశుద్ధితో; నాఁడునాఁటికిన్= దినదినానికీ; వే+విధములన్= వేయిరీతుల; మిగుల= అతిశయించిన; భక్తి, వినయంబులతోన్= పూజ్యభావంతో, అణకువతో; దేవ+ఉపచారముల= వేలుపులకు తగిన పరిచర్యలతో; నియత+ఐ= దీక్షకలిగినట్టిదై; భూ, దేవ+ఉత్తమున్= బ్రాహ్మణశ్రేష్ఠుడిని, దుర్వాసుడిని; కొల్చెన్= సేవించింది.

తాత్పర్యం: కుంతీదేవి చిత్తశుద్ధితో రోజురోజుకు అనేక విధాలుగా భక్తి వినయాలతో వేలుపులకు తగిన పరిచర్యలతో దీక్షపూని ఆ బ్రాహ్మణోత్తముడైన దుర్వాసమహర్షిని సేవించింది.

సీ. అతఁడును దద్భావ మరయంగ మదిఁ గోరి । రూపించి యొకమఱి రేప వత్తు
నని పోయి నడురేయి నర్థితోఁ జనుదెంచు, । రేయి వచ్చెద నని రేప వచ్చు;
నే ప్రొద్దు వచ్చిన నింతి యప్పుడు క్రొత్త । లుగ భక్ష్యభోజ్యాదు లొగి నమర్చి;
నెయ్యదిఁ గోరిన నిచ్చకురాఁ బెట్టు; । నలయదు మదినైన నలుగ దెపుడు;

ఆ. ననుదినంబు నధిపుఁ డాత్మజఁ బిలిచి త । ద్వర్తనంబు లడుగ వనజముఖియుఁ
దాను గొలుచుతెఱఁగుఁ దాపసవరునిచం । దమును జెప్పుచుండుఁ దండ్రి యలర. 323

ప్రతిపదార్థం: అతఁడును= వాఁడును (దుర్వాసుడును); తత్+భావము= ఆమెతలపు, పృథాకుమారిమనస్సు; అరయంగన్= తెలిసికొనటానికై; మదిన్= ఎడదలో; కోరి= అభిలషించి; రూపించి= నిర్ధారణ చేసికొని; ఒకమఱి= ఒకసారి; రేప= ఉదయమే; వత్తున్= వస్తాను; అనిపోయి= అని చెప్పి వెడలి; నడురేయిన్= అర్ధరాత్రి; అర్థితోన్= ప్రీతితో; చనుదెంచున్= వస్తాడు; రేయి= రాతిరి; వచ్చెదన్+అని= వస్తాను అని చెప్పి; రేప= ప్రాతఃకాలం; వచ్చున్= వస్తాడు; ఏప్రొద్దు= ఏసమయంలో (దుర్వాసుడు); వచ్చినన్= చనుదెంచినప్పటికి; ఇంతి= పడతి, కుంతి; అప్పుడు+అ= ఆ సమయంలోనే; క్రొత్తలుగన్= క్రొత్తక్రొత్తగా, తాజాగా; భక్ష్య, భోజ్య+ఆదులు= తినుబండారాలు; ఒగిన్= ఒప్పిదంగా; అమర్చి= సమకూర్చి; ఎయ్యదిన్= (ఏ+అదిన్)= దేనిని; కోరినన్= అభిలషించినా; ఇచ్చకున్, రాన్+పెట్టున్= (అతడి) ఇష్టానికి సరిపోయేటట్లే సమకూరుస్తుంది; అలయదు= అలసట చెందదు; మదిన్+ఐనన్= మనస్సులోకూడా; ఎపుడున్= ఏసమయంలో; అలుగదు= కోపగించదు; అనుదినంబున్= ప్రతిరోజూ; అధిపుఁడు= రాజు, కుంతిభోజుడు; ఆత్మజన్= కూతురిని, కుంతిని; పిలిచి= రప్పించి; తత్+వర్తనంబులు= ఆతడియొక్క చర్యలు; అడుగన్= ప్రశ్నించగా; వనజముఖియున్= పద్మంవంటి మొగం కలిగింది, కుంతియును; తాను= తాను; కొలుచు, తెఱఁగున్= సేవించేతీరును; తాపసవరునిచందమును= మునిశ్రేష్ఠుడైన దుర్వాసుడితీరును; తండ్రి= జనకుడు, కుంతిభోజుడు; అలరన్= సంతోషించేటట్లుగా, చెప్పుచుండున్= చెప్తూఉంటుంది.

తాత్పర్యం: దుర్వాసుడు ఒక విచిత్రవ్యక్తి. అతడు తనమనస్సులో ఆ పృథాకుమారి ఓర్పును పరీక్షించవలెనని తలపోసి, ఆమె ఆలోచనలు తెలిసికొన కోరి, ఒకసారి 'ఉదయమే వస్తాను' అని చెప్పి అర్ధరాత్రి వస్తాడు. 'అర్ధరాత్రి వస్తా'నని చెప్పి ప్రాతఃకాలానికే వస్తాడు. దుర్వాసమహర్షి ఏ సమయంలో వచ్చినా కుంతి ఆ సమయంలోనే అప్పటి కప్పుడే చేసిన భక్ష్యభోజ్యాలను సమకూరుస్తూ ఉండేది. ఏది కోరినా, ఆతడు కోరినప్రకారంగానే ఏర్పాటు చేసేది. అలసట చెందేది కాదు. మనసులో లోలోపల కూడ కోపం పొందెడిది కాదు. ప్రతిరోజూ కుంతిభోజుడు కూతురైన పృథను పిలిచి దుర్వాసుడి ప్రవర్తనను గూర్చి అడుగుతూ ఉండేవాడు. ఆమె తాను చేసే శుశ్రూషనుగూర్చి దుర్వాసోమహర్షి ప్రవర్తించే తీరు గూర్చి వినోదంగా వివరించి చెప్పేది. కుంతిభోజుడు విని సంతోషిస్తూ ఉండేవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) భక్ష్యాలు తినుబండారాలు: పంచభక్ష్యాలు సుప్రసిద్ధాలు. 1. భక్ష్యం 2. భోజ్యం 3. లేహ్యం 4. చోష్యం 5. పానీయం. (2) దుర్వాసుడిశీలచిత్రణం - ప్రపంచంలో వింతప్రవర్తన కలవారు కొంతమంది ఉండవచ్చు. వారికి వారి వింతప్రవర్తన వింతగా కన్పించదు. కాని దుర్వాసుడిపాత్ర వేరు. ఆతడు బుద్ధిపూర్వకంగా ఇతరులను పరీక్షించేకొరకై వింతనడవడి పూనటం విశేషం.

వ. అంత నొక్కసంవత్సరంబు పరిపూర్ణం బయినఁ బ్రీతుండై దుర్వాసుండు కుంతిం జూచి 'నీచేసిన యారాధనంబునకు మెచ్చితి; నభిమతంబు లిచ్చెద నడుగు' మనిన నమ్మానిని గృతాంజలియై 'మీరు నావలనం బ్రసన్ను లైతిరి; దీనికి మాతండ్రియుం గరం బలరు; నింతియ చాలు; నొం డేల?' యనిన నతం 'డట్లేని నిది యొక్కమంత్రంబు గైకొనుము; దీనంజేసి యెయ్యేని వేల్పునాహ్వానంబు సేసెద వవ్వేల్పు సనుదెంచి నీవశంబున నుండు' ననిన 'నొండన వెఱచి కుంతియుం 'బ్రసాదం' బనియె; నమ్మునీంద్రుండు దాని కమ్మంత్రంబు విధియుక్తంబుగా నుపదేశించి నిజేచ్ఛం జనియెఁ; నంతఁ గొంతకాలంబునకు. 324

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; ఒక్కసంవత్సరంబు= ఒకయేడు; పరిపూర్ణంబు+అయినన్= నిండగా; ప్రీతుండు+ఐ= సంతృప్తి చెందినవా డయి; దుర్వాసుండు; కుంతిన్+చూచి= పృథను చూచి; 'నీచేసిన= నీవు ఒనర్చిన; ఆరాధనంబునకున్= అర్చనసేవకు; మెచ్చితిన్= సంతోషపూర్వకంగా నీసామర్థ్యాన్ని గుర్తించాను; అభిమతంబులు+ఇచ్చెదన్= కోరినవరాలు ఇస్తాను; అడుగుము= వేడుము; అనినన్= అని (దుర్వాసుడు) చెప్పగా; ఆ+మానిని= పృథాకుమారి; కృత+అంజలి+ఐ= చేసిననమస్కారం కలదిఅయి, 'మీరు= మీరు, నీవు (గౌరవపూర్వకమైన బహువచనం) ఓ దుర్వాసమహర్షీ!; నావలనన్= నాయెడ; ప్రసన్నులు+ఐతిరి= సంతోషించినవారు అయినారు; దీనికిన్= ఈ రీతిగా మీరు సంతోషించినందుకు; మాతండ్రియున్= మా జనకుడును (కుంతిభోజుడును); కరంబు= మిక్కిలి; అలరున్= సంతోషిస్తాడు; ఇంతియ చాలున్= ఈ మాత్రమే సరిపోతుంది; ఒండు+ఏల?= వేరు ఒకటి ఎందుకు?'; అనినన్= అని చెప్పగా; అతండు= దుర్వాసుడు; అట్లు+ఏనిన్= అటుల అయితే (ఏవరాన్నీ నీవు కోరదలచకపోతే); ఇది+ఒక్క, మంత్రంబు= ఇదిగో ఇది ఒకమంత్రం; కైకొనుము= స్వీకరించుము; దీనన్+చేసి= దీనిచేత; ఎయ్యేనివేల్పున్= ఏదేవతనైతే; ఆహ్వానంబు+చేసెదవు= పిలుస్తావో; ఆ+వేలుపు= ఆదేవత; చనుదెంచి= వచ్చి; నీవశంబునన్= నీ అధీనంలో; ఉండున్= ఉంటాడు; అనినన్= అని చెప్పగా; ఒండు+అనన్= మారుపలకటానికి; వెఱచి= భయపడి; కుంతియున్= పృథయును; ప్రసాదంబు+అనియెన్= (నీ) అనుగ్రహం (సిద్ధించింది) అని వచించింది; ఆ+ముని+ఇంద్రుండు= ఆ ఋషివరేణ్యుడు, దుర్వాసుడు; దానికిన్= ఆమెకు (పృథాకుమారికి); ఆ+ మంత్రంబు= ఆ మంత్రం; విధియుక్తంబుగాన్= శాస్త్రంలో చెప్పబడినరీతిగా; ఉపదేశించి= చెప్పినేర్పి; నిజ+ఇచ్ఛన్= తన ఇచ్చవచ్చినట్లుగా; చనియెన్= వెళ్ళాడు; అంతన్= పిదప; కొంతకాలంబునకున్= కొన్నినాళ్లకు.

తాత్పర్యం: ఆ విధంగా ఒకసంవత్సరకాలం గడచింది. కుంతి చేసిన శుశ్రూషకు సంతసించి దుర్వాసుడు ఆమెతో 'నీవు చేసిన అర్చనకు నేను మెచ్చాను; నీవు కోరిన వరాలు ఇస్తాను కోరుకొనుము' అని అన్నాడు. అంత కుంతి దుర్వాసుడికి నమస్కరించి, 'మహానుభావులు మీరు నావలన సంతోషించారు. మీసంతోషంతోపాటు మాజనకుడు కుంతిభోజుడి సంతోషంకూడా నాకు లభిస్తుంది. ఇంక వేరేవరం నాకెందుకు?' అని వినయంగా సమాధానం చెప్పింది. ఆమె మృదుమధురవాక్కులకు దుర్వాసుడు సంతోషించి, 'సరే నీవు వరాన్ని కోరుకొనకపోతే, నేనే నీకు ఒక గొప్పవరం అనుగ్రహిస్తున్నాను. నీకు ఒక మంత్రాన్ని ఉపదేశిస్తాను. నీవు ఈ మంత్రాన్ని ఉపాసించి, ఏ వేలుపును ఆహ్వానిస్తే ఆవేలుపు నీకడకు వచ్చి నీకు వశుడు కాగలడు' అని చెప్పాడు. కుంతి మారుమాట చెప్పజాలక, 'మహాప్రసాదం' అని మునికి ధన్యవాదాలు సమర్పించింది. దుర్వాసుడు కుంతికి ఆ మంత్రాన్ని శాస్త్రం విధించినప్రకారం ఉపదేశించి, తన ఇచ్చవచ్చినచోటికి పోయాడు. పిదప కొన్నినాళ్లకు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. 'మదిఁ గారుణ్యము సేసి విప్రవరుఁ డీ మంత్రంబు నా కిచ్చె; నే
నిది యేచందము చూతు' నంచు నొకనాఁ డిచ్ఛన్ ఋతుస్నాత యై
సుదతీరత్నము పూర్వశైలతటిపై శోభిల్లు తిగ్మాంశుఁ జూ
చి దళత్పద్మము మాడ్కి నుల్లసితమై చిత్తంబు రాగిల్లఁగన్. 325

ప్రతిపదార్థం: విప్రవరుఁడు= బ్రాహ్మణోత్తముడు దుర్వాసుడు; మదిన్= చిత్తంలో; కారుణ్యము+చేసి= కృప వహించి; ఈ మంత్రంబు= ఈ మంత్రం; నాకున్+ఇచ్చెన్= నాకు ఇచ్చాడు; ఏను= నేను; ఇది= ఈ మంత్రం; ఏచందము+ఒ= ఏభంగిదో; చూతున్= చూస్తాను; అంచున్= అని తలపోస్తూ; ఒకనాఁడు= ఒకరోజున; ఇచ్ఛన్= కోరికతో; ఋతుస్నాత+ఐ= ముట్టుస్నానం చేసినదై; సుదతీరత్నము= ఆడువారిలో రత్నంవంటిది, పృథాకుమారి; పూర్వ, శైల, తటిపైన్= తూర్పుకొండప్రదేశంమీద; శోభిల్లు= విలసిల్లే; తిగ్మ+అంశున్= సూర్యుడిని; చూచి= కాంచి; దళత్+పద్మము, మాడ్కిన్= విచ్చుకొంటున్న తామరపువ్వు వలె; ఉత్+లసితము+ఐ= బాగా విప్పారినదై; చిత్తంబు= మనస్సు; రాగిల్లఁగన్= అనురాగం అంకురించగా.

తాత్పర్యం: 'మనస్సులో దయ కలిగిన బ్రాహ్మణోత్తము డైన దుర్వాసుడు ఈ మంత్రాన్ని నాకు ప్రసాదించాడు కదా! దీనిప్రభావం ఎటువంటిదో పరీక్షిస్తానుగాక' అని తలపోసి, కోరికతో కుంతి, ఋతుస్నాత అయి ఒకనాడు, తూర్పుకొండచరియమీద విలసిల్లే సూర్యుడిని చూచి, వికసిస్తున్న తామరపువ్వువలె తన మనస్సులో అనురాగం విస్తరిల్లగా.

విశేషం: అలం: ఉపమ. ఇట కుంతిచిత్తం వికసిస్తున్న తామరపువ్వుతో పోల్చబడింది. సూర్యోదయానికి తామరమొగ్గ వికసిస్తుంది. తామరపువ్వు ఎర్రగా ఉంటుంది; అనురాగం ఎర్రగా ఉండటం కవిసమయం. కుంతి కన్యక. తామరపువ్వు - విచ్చుతున్నమొగ్గ. అనగా మొగ్గ కాదు, ప్రఫుల్లపుష్పం కాదు. కన్యక అయిన కుంతిచిత్తంకూడా అట్టిదే కదా.

వ. సహజకుండల కవచాభిరామంబైన తదీయమూర్తివిభవంబున కోటువడి 'దేవా! భవత్సమానసుందరుం డగు నందనుం గరుణింపవే' యని మనంబునం గోరుచు మంత్రోచ్చారణంబు చేసినఁ, బ్రభాకరుండును నిజయోగబలంబున మూర్త్యంతరంబు ధరియించి కుంతిపాలికిం జనుదెంచి మధురస్వరంబున. 326

ప్రతిపదార్థం: సహజ, కుండల, కవచ+అభిరామంబు+ఐన= ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన చెవిపోగులతో, తనుత్రాణంతో అందంగా ఉన్న; తదీయమూర్తి విభవంబునకున్= ఆతని (ఆ సూర్యుడియొక్క) ఆకృతిసంపదకు; ఓటు+పడి= లొంగిపోయి; 'దేవా!= దేవరా!; భవత్+సమాన, సుందరుండు+అగు= నీతో సరిపోలే అందగాడు అయిన; నందనున్= కుమారుడిని; కరుణింపవే?= దయతో ప్రసాదించవా?; అని= అని; మనంబునన్= ఎదలో; కోరుచున్= అభిలషిస్తూ; మంత్ర+ఉచ్చారణంబు+చేసినన్= మంత్రాన్ని జపించగా; ప్రభాకరుండును= సూర్యుడును; నిజయోగబలంబునన్= తన 'యోగ' శక్తిచేత; మూర్తి+అంతరంబు= ఇంకొకఆకారం; ధరియించి= వహించి; కుంతిపాలికిన్= పృథాకుమారివద్దకు; చనుదెంచి= వచ్చి; మధురస్వరంబునన్= తియ్యని కంఠధ్వనితో.

తాత్పర్యం: ప్రకృతిసిద్ధంగా ఏర్పడిఉన్న కుండలాలతో కవచంతో మనోహరంగా ఉన్న సూర్యుడిఆకృతిని దేదీప్యమానమైన తేజస్సును పరికించి, అతడియందు మనస్సును లగ్నం చేసి 'దేవరా! నీవంటి సుందరరూపుడైన కుమారుడిని నాకు దయతో అనుగ్రహించుము' - అని తనయెదలో తలపోసి పృథాకుమారి మంత్రాన్ని జపించింది. సూర్యుడు తనయోగబలంతో మరొకరూపం ధరించి కుంతివద్దకు వచ్చి తియ్యని కంఠస్వరంతో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) మంత్రం - ఉచ్చాటన వలన అతిలోకమహిమ ప్రాప్తింపజేసే అక్షరసంపుటం. (2) యోగబలం - యోగంవలన ఇంద్రియాతీతశక్తులు లభిస్తాయి. దేవతలకు అట్టిశక్తి సహజం. అన్యథారూపప్రతిపాదనం యోగమహిమలలో ఒకటి.

తే. **'అబల! నీమంత్రబలమున నరుగుదెంచి । నాఁడ; నీవాఁడ నైతి; మనఃప్రియంబు**
నీకు నెయ్యది యొనరింతు; నిజము చెపుమ!' । యనినఁ బడఁతి యిట్లనుఁ గమలాప్తుతోడ. **327**

ప్రతిపదార్థం: అబల!= పడతీ! ఓ పృథాకుమారీ!; నీ మంత్రబలమునన్= నీవు జపించిన మంత్రంయొక్క శక్తివలన; అరుగుదెంచినాఁడన్= వచ్చాను; నీవాఁడన్+ఐతిన్= నీకు లోబడినవాడను అయినాను; మనఃప్రియంబు= మనస్+ప్రియంబు= మనస్సుకు ప్రీతినిచ్చేది; నీకున్= నీకు; ఎయ్యది= (ఏ+అది=) ఏది; ఒనరింతున్= చేయగలను; నిజము= సత్యం; చెపుము+అ= వచించుము' అనినన్= అని(సూర్యుడు చెప్పగా); పడఁతి= వనిత, కుంతి; కమల+ఆప్తుతోడన్= సూర్యుడితో; ఇట్లు+అనున్= ఈ రీతిగా అన్నది.

తాత్పర్యం: 'ఓ కుంతీకుమారీ! నేను నీమంత్రశక్తిచేత ఆకర్షించబడి ఇక్కడికి వచ్చాను. ఇక నేను నీవాడను. నీ మనస్సుకు ఏది ప్రియమవుతుందో చెప్పుము. నీకోరిక తీరుస్తాను' అని చెప్పగా, కుంతి కమలాప్తుడైన సూర్యుడి కిట్లా సమాధానం చెప్పింది.

తే. **'కార్య మొక్కటియును లేదు; కౌతుకమున । నేను మంత్రంబు నొడివితి; నింతమాత్రఁ**
జేసి నీకు నిచ్చటికి విచ్చేయ నేల? । దివికి నరుగుము క్రమ్మఱ దేవ! నీవు.' **328**

ప్రతిపదార్థం: దేవ!= దేవరా!; కార్యము= కర్తవ్యం, చేయవలసినపని; ఒక్కటియును లేదు= ఒకటికూడ లేదు; కౌతుకమునన్= వేడుకతో; ఏను= నేను; మంత్రంబున్, నొడివితిన్= మంత్రాన్ని ఉచ్చరించాను; ఇంతమాత్రన్+చేసి= ఇంతమాత్రంచేతనే; నీకున్= ఓసూర్యా, నీకు; ఇచ్చటికిన్= ఈ చోటికి; విచ్చేయన్+ఏల= రావటం ఎందుకు?; నీవు= నీవు; క్రమ్మఱన్= మరల; దివికిన్= ఆకాశానికి; అరుగుము= తిరిగివెళ్ళుము.

తాత్పర్యం: 'ఓ సూర్యదేవా! ఇక్కడ నీవు నెరవేర్చవలసిన కర్తవ్యం ఒక్కటికూడా లేదు. ఏదో వేడుకకొరకు మంత్రాన్ని జపించాను. ఇంతమాత్రానికే నీవు విచ్చేయవలెనా? స్వామీ! దయచేసి నీవు ఆకాశానికి తిరిగిపొమ్ము.'

వ. **అనిన దానికి సూర్యుం డిట్లనియె.** **329**

తాత్పర్యం: అని అనగా కుంతీదేవితో సూర్యుడు ఈవిధంగా అన్నాడు.

ఉ. **'క్రమ్మఱి పోక తప్పెడినె? కామిని! యేమని మున్ను నీవు చి**
త్తమ్మునఁ గోరి? తద్విధము దప్పక యిప్పుడుఁ బల్కరాదె? తే
జమ్మున మత్సమానుఁ గవచస్ఫుటకుండలమండితాంగు స
త్సమ్మతుఁ బుత్త్రుఁ గోరవె నిజమ్ముగ నావలనం దలోదరీ! **330**

ప్రతిపదార్థం: కామిని!= వనితా, కుంతీ!; క్రమ్మఱి పోక, తప్పెడిన్+ఎ?= తిరిగివెళ్లక తప్పుతుందా? (ఎప్పుడో ఒకప్పుడు తిరిగి వెళ్లవలసినవాడనే కదా); నీవు= నీవు; మున్ను= ఇంతకుముందు; చిత్తమ్మునన్= మనస్సులో; ఏమి+అని= ఏది అనుకొని; కోరితి(వి)= అభిలషించావో; ఆ+విధము= ఆరీతి; తప్పక= అతిక్రమించక; ఇప్పుడు= ఈ సమయంలో; పల్కన్‌రాదు+ఎ=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వచించకూడదా; తల+ఉదరీ= సన్నని నడుముకల కుంతీ! తేజమ్మునన్= ప్రకాశంలో; మత్+సమానున్= నాతో సరిపోలేవాడిని; కవచ, స్ఫుట, కుండలమండిత+అంగున్= తనుత్రాణంతో వెలుగొందే కుండలాలతో అలంకృతమైన శరీరంకలవాడిని; సత్+సమ్మతున్= మంచివారు మెచ్చుకొనేవాడిని; పుత్త్రున్= కొడుకును; నిజమ్ముగన్= సత్యంగా; నావలనన్= నామూలాన; కోరవె= అభిలషించవా (చెప్పుము).

తాత్పర్యం: ఓ కుంతీ! ఎప్పుడో ఒకప్పుడు నేను వచ్చినదారినిబట్టి మరలివెళ్లక తప్పదు కాని, నీవు ఆహ్వానించావు కాబట్టే వచ్చాను. ఇంతకుముందు నీవు నీచిత్తంలో ఏమని అభిలషించావో ఇప్పుడు ఆ మాట తప్పక చెప్పుము. సన్నని నడుము కలదానా! తేజస్సులో నాతో పోలేవాడిని, సహజకవచకుండలాలతో శోభిల్లే శరీరం కలవాడిని పుత్రుడిని నావలన పొందవలెనని నీవు అభిలషించావు కదా! ఈ నిజం నీకు తెలియదా?.

వ. కావున నిప్పుడు మదీయసమాగమంబున కొడంబడుము; నీకోరినయట్టి తనయుండు జనియించు; నిట్లు సేయనినాఁడు నిన్నును భవజ్జననీజనకులను భస్మంబు సేయుదు; మఱియు నీదైనశీలవృత్తంబు లెఱుంగక మంత్రంబు గర్వంబునంజేసి నీ కుపదేశించిన తాపసు నీక్షణంబ నిర్దహింతు; నిదె యంబరంబుననుండి యింద్రాదిసురవరులు నీకతమ్మునఁ జిక్కువడియున్న నన్నుం జూచి నవ్వుచున్నవా; రిదె సూడుము దివ్యదృష్టి యిచ్చితి' ననినం జూచి కుంతిభోజనందన డెందంబున నమందలజ్జావివశ యగుచు దినేశ్వరున కిట్లనియె.331

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఇప్పుడు= ఈ సమయంలో మదీయ సమాగమంబునకున్= నాతోడిపొందుకు; ఒడంబడుము= సమ్మతించుము; నీకోరిన+అట్టి, తనయుండు= నీవు అభిలషించినటువంటి కొడుకు; జనియించున్= ఉద్భవిస్తాడు; ఇట్లు= ఈ రీతిగా; చేయనినాఁడు= చేయకున్నవేళ; నిన్నును= నిన్నును; భవత్+జననీజనకులను= నీతలిదండ్రులను; భస్మంబు+చేయుదున్= బూడిద చేస్తాను; మఱియున్= వెండియు; నీది+ఐన= నీదైన; శీలవృత్తంబులు= స్వభావమూ, నడవడీ ఎఱుంగక= తెలియకుండగనే; మంత్రంబు= మంత్రాన్ని; గర్వంబునన్+చేసి= దర్పంచేత; నీకున్= నీకు; ఉపదేశించిన= నేర్పిన; తాపసున్= తపస్విని; ఈక్షణంబు+అ= ఈ త్రుటిలోనే; నిర్దహింతున్= కాల్చివేస్తాను; ఇదె= ఇదిగో; అంబరంబునన్= ఆకసంలో; ఉండి= ఉండి; ఇంద్ర+ఆది, సురవరులు= ఇంద్రుడు మున్నగు వేలుపుదొరలు; నీకతమ్మునన్= నీకారణంగా; చిక్కు+పడి+ఉన్న= దురవస్థకు లోనయి ఉన్న; నన్నున్+చూచి= నన్ను అరసి; నవ్వుచున్నవారు= పరిహసిస్తున్నారు; ఇది+ఎ+చూడుము= ఇదిగో కనుగొనుము; దివ్య, దృష్టి+ఇచ్చితిన్= దేవతామహిమ కల చూపు ప్రసాదించాను; అనినన్= అని (సూర్యుడు) చెప్పగా; కుంతిభోజనందన= కుంతిభోజుడికూతురు - పృథ; చూచి= పరికించి; డెందంబునన్= హృదయంలో; అమందలజ్జా, వివశ+అగుచున్= మిక్కుట మైన సిగ్గుకు లోనయినది ఔతూ; దిన+ఈశ్వరునకున్= సూర్యుడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కావున నీవు ఇప్పుడు నాతోడిపొందుకు అంగీకరించుము. నీకోరికమేరకు మహాతేజస్వి అయిన పుత్రుడు నీకు పుడతాడు. నీవు నన్ను ఒల్లనినాడు, నిన్నూ నీతలిదండ్రులనూ బూడిద చేస్తాను. అంతేకాక నీయోగ్యత నెరుగకుండా నీశీలాన్నీ నడవడికనూ అనుశీలించకుండా నీకు ఇట్టి మంత్రాన్ని ఉపదేశించిన మహర్షిని ఈ క్షణమే దహించివేస్తాను. నేను నీమూలాన నవ్వులపాలు కావలసివచ్చింది. ఇదిగో చూడుము. నీకు దివ్యదృష్టిని ప్రసాదిస్తున్నాను. ఆకసంలో నిలిచి ఇంద్రుడు మున్నగు వేలుపుదొరలు నా దురవస్థను కాంచి పరిహసిస్తున్నారు! అని సూర్యుడు పలికాడు. కుంతి దృష్టి సారించి ఆ దృశాన్ని దర్శించి, తనహృదయంలో మిక్కుటమైన సిగ్గు చెంది సూర్యుడితో ఇట్లా చెప్పింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) దుర్వాసుడు ఇచ్చిన మంత్రంయొక్కబలం ఋజువైంది. సూర్యభగవానుడు కుంతికి ప్రత్యక్షమైనాడు. (2) అంతేకాక సూర్యుడిమహిమవలన కుంతికి దివ్యదృష్టి లభించింది. కన్యకఅయిన కుంతికి సూర్యుడిపై గల గౌరవం ఇనుమడించింది. (3) ఇక కుంతి చెప్పే అడ్డుమాటలు సూర్యుడికి పరోక్షప్రోత్సాహకాలే అయ్యాయి.

క. 'నను నిచ్చుటకుం గర్తలు । జననియు జనకుండుఁ గాక, చనునే నాకున్
వనితాధర్మము విడువఁగ; । ననఘా! యిట్లయిన వంశహానియుఁ గాదే? 332

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! ఓ సూర్యదేవా!; ననున్= నన్ను; ఇచ్చుటకున్= కన్యాదానం చేయటానికి; కర్తలు= బాధ్యులు; జననియున్, జనకుండున్+కాక= తల్లియు దండ్రియును కాబట్టి; నాకున్= నాకు; వనితాధర్మము= ఆడుదాని ధర్మం; విడువఁగన్= వదలిపెట్టగా; చనున్+ఏ= భావ్యమా; ఇట్లు+అయినన్= ఈ విధంగా జరిగితే (వనితాధర్మం విడిచి తలిదండ్రులకు తెలియకుండా నీతో సంగమించటం జరిగితే); వంశహానియున్+కాదు+ఏ= కులానికి కీడు కాదా? (వంశానికి హాని ఏర్పడుతుందికదా).

తాత్పర్యం: పుణ్యాత్ముడ వైన ఓ సూర్యదేవా! నన్ను నీ కివ్వటానికి అర్హులు నాతలిదండ్రులు. ఇది వనితాధర్మం. జననీజనకులను కాదని వనితాధర్మం మీరి స్వచ్ఛందంగా నేను నీపొందు నంగీకరిస్తే దానివలన వంశహాని కాదా?

ఆ. మంత్రబల మెఱుంగ; మదిఁ గోరి తప్పు సే । సితి మహాత్మ!; దీనిఁ జెట్ట గాఁగ
నవధరింప కెట్టు లైన నాబాల్యంబుఁ । గరుణ సైఁపవలయుఁ గమలమిత్త్ర!.' 333

ప్రతిపదార్థం: కమలమిత్త్ర!= కమలాలకు హితుడవైనవాడా! ఓ సూర్యదేవా!; మంత్ర, బలము= మంత్రశక్తి; ఎఱుంగన్= తెలిసికొన; మదిన్= మనసులో; కోరి= కాంక్షించి; మహా+ఆత్మ!= మహానుభావుడవైన సూర్యదేవా!; తప్పు+చేసితిన్= అపరాధం చేశాను; దీనిన్= ఈ అపరాధాన్ని (తెలియక చేసిన తప్పును); చెట్ట+కాఁగన్= చెడ్డదిగా; అవధరింపక= భావించక; ఎట్టులు+ఐనన్= ఏదో విధంగా; నాబాల్యంబున్= నా చిన్నతనాన్ని; కరుణన్= దయతో; సైఁపన్‌వలయున్= క్షమించవలెను.

తాత్పర్యం: మహానుభావుడవైన ఓసూర్యదేవా! మంత్రానికి ఎట్టి మహిమ ఉన్నదో పరీక్షించటంకొరకు నేను ఈ అపరాధాన్ని చేశాను. తెలియక చెసిన తప్పును నేరంగా పరిగణించక, ఓ కమలమిత్ర! నా చిన్నతనపుచేష్టను దయచేసి క్షమించుము.

వ. అని మఱియు ననేకప్రకారంబుల దివాకరు ననునయించి యెట్లునుం గ్రమ్మఱింపనేరక దనకారణంబునఁ గులంబునకును గురుజనంబులకును నపాయం బగు ననియుం దలపోసి భయంబు మిగులఁ దెగువసేసి యతని కిట్లనియె. 334

ప్రతిపదార్థం: అని= అని వచించి; మఱియున్= వెండియును; అనేకప్రకారంబులన్= పెక్కువిధాల; దివాకరున్= సూర్యుడిని; అనునయించి= బుజ్జగించి; ఎట్లునున్= ఏవిధంగాకూడా; క్రమ్మఱింపన్+నేరక= వెనుకకు మరలింపజాలక; తన, కారణంబునన్= తనమూలాన; కులంబునకును= వంశానికిన్నీ; గురుజనంబులకును= పెద్దలకున్నూ; అపాయంబు+అగున్+అనియున్= కీడు కలుగుతుంది అనిన్నీ; తలపోసి= ఆలోచించి; భయంబు, మిగులన్= భీతి అతిశయించగా; తెగువ+చేసి= సాహసించి; అతనికిన్= వాడికి (సూర్యుడికి); ఇట్లు+అనియెన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కుంతీకుమారి ఆవిధంగా చెప్పింది. మరీమరీ పెక్కువిధాల సూర్యుడిని బ్రతిమలాడింది. అన్నివిధాలా ప్రయత్నించికూడా ఆతడిని వెనుకకు మళ్ళించజాలకపోయింది. తనమూలాన తలిదండ్రులకూ గురువులకూ వంశానికీ హాని కలుగుతుందని విచారించింది. మిక్కిలి భయపడింది. చివరకు సాహసించి ఆమె సూర్యుడితో ఇట్లా అన్నది.

చ. **'ముదము దలిర్ప బంధుజనముల్ గురువర్గముఁ గూడి రూఢి నొ**
ప్పిదముగ ధర్మమార్గమునఁ బెండిలిసేయఁగఁ బిమ్మటన్ సము
న్మదరసకేళిలీలకుఁ గ్రమంబగుఁగాక కులంబు శీలమున్
వదలి వధూజనంబులకు వచ్చునె యిమ్మెయి వేడ్క సల్పఁగన్? 335

ప్రతిపదార్థం: వధూజనంబులకున్= కన్యకలకు; ముదము= సంతోషం; తలిర్పన్= చిగురించగా; బంధుజనముల్= చుట్టాలు; గురువర్గమున్= పెద్దలసమూహం; కూడి= చేరి; రూఢిన్= నిశ్చయించినరీతిగా; ఒప్పిదముగన్= విలసిల్లేటట్లుగా; ధర్మమార్గమునన్= ధర్మపథంలో (అగ్నిసాక్షిగా వేదోక్తమంత్రాలతో); పెండిలి+చేయఁగన్= వివాహం చేయగా; పిమ్మటన్= తరువాత; సమ్+ఉత్+మద, రసకేళిలీలకున్= మిక్కుటంగా మత్తెక్కిన శృంగార క్రీడా విలాసానికి; క్రమంబు+అగున్+కాక= సక్రమం అవుతుంది గాని; కులంబు= వంశం; శీలమున్= మంచిప్రవర్తనం; వదలి= విడిచిపెట్టి; ఈ+మెయిన్= ఈరీతిగా; వేడ్క, సల్పఁగన్+వచ్చును+ఎ= వేడుక చేయటం భావ్యమా?

తాత్పర్యం: సంతోషం చిగురించేటట్లుగా, చుట్టాలు తలిదండ్రులు పెద్దలు చేరి నిర్ణయించినవిధంగా ధర్మమార్గంలో వైదికమంత్రాలతో అగ్నిసాక్షిగా వివాహం జరిగిన తరువాత కన్యకలు శృంగారకేళీవిలాసాలలో తేలియాడ తగునుకాని, వంశాన్నీ శీలాన్నీ వదలి ఈవిధంగా వేడుక తీర్చుకొనటం ఎంతమాత్రం భావ్యం కాదు.

క. **బంధుమతి నైన నను ని। ర్బంధముమెయి ధర్మబాహ్యపథమున నలినీ**
బాంధవ! యిటు సేయుటయు న। మంధరభవదీయకీర్తి మలినము గాదే. 336

ప్రతిపదార్థం: నలినీబాంధవ!= పద్మాలకు బంధువు అయినవాడా, ఓ సూర్యదేవా!; బంధుమతిన్+ఐన= బంధువులు కలదాననైన; ననున్= నన్ను; నిర్బంధము, మెయిన్= బలవంతంచొప్పున; ధర్మబాహ్యపథమునన్= ధర్మానికి వెలియైన మార్గంలో; ఇటు+చేయుటయున్= ఈవిధంగా చేయటమున్నూ; అమంథర, భవదీయకీర్తి= వంకర కాని (తిన్నని) నీయశస్సు; మలినము+కాదు+ఏ= కలుషితం కాదా.

తాత్పర్యం: కమలాలకు బంధువైన ఓసూర్యదేవా! నేను నాబంధువులయెడ కూరిమి కలదానను; బలవంతంగా నీవు నన్ను ఈ విధంగా ధర్మానికి వెలిఅయిన మార్గానికి చేర్చటం తగదు. నీది తిన్ననిదైన యశస్సు. ఈవిధంగా చేస్తే నీ కీర్తి కలుషితం కాగలదు సుమా!.

చ. **జగములయందు ధర్మువును సత్యము నీయవి గావె దేవ! యే**
తగవులు నీ యెఱుంగని విధంబులె? యిట్టిది నీదు బుద్ధికిం
దగ వగునేని మార్పలుకుదాననె? యే మగుఁగాక నీకు నిం
పగుతెఱఁ గాచరింపు; మట యావల నయ్యెడు నింద కోర్చెదన్'. 337

ప్రతిపదార్థం: దేవ!= ఓ సూర్యదేవా!; జగములు+అందున్= లోకాలలో; ధర్మువును= ధర్మమును; సత్యము= నిజం; నీ+అవి+కావు+ఎ= నీవి కావా (నీవే); ఏతగవులున్= ఏధర్మాలు; నీ+ఎఱుంగని, విధంబులు+ఎ= నీకు తెలియని రీతులా; ఇట్టిది= జననీజనకులకు తెలియకుండ నీసమాగమం పొందటం; నీదు బుద్ధికిన్= నీచిత్తానికి; తగవు+అగున్+ఏనిన్= ధర్మం అయితే; మారు+పలుకుదానను+ఎ?= ఎదురుమాట చెప్పగలనా; ఏమి+అగున్+కాక= ఏమి జరిగితే అది జరుగుతుందిగాక; నీకున్= నీకు; ఇంపు+అగు= ప్రీతికలిగే; తెఱఁగు= తీరు; ఆచరింపుము= చేయుము; అట ఆవలన్= అటు పిమ్మట; అయ్యెడు= ఏర్పడే; నిందకున్= అపవాదానికి; ఓర్చెదన్= సహిస్తాను.

తాత్పర్యం: ఓ సూర్యదేవా! లోకాలలో ధర్మం, సత్యం, నీవే కదా! ఏధర్మాలు అయినా నీకు తెలియనివి కావుకదా! తలిదండ్రులకు తెలియకుండా నీసమాగమాన్ని పొందటం నీమనస్సుకు ధర్మం అని తోస్తే, నీయిష్టానుసారం చేయుము; ఇక ఆ పిదప వచ్చే నిందను నేనే సహిస్తాను.

సీ. **అనుటయు నద్దేవుఁ డయ్యిందుముఖిఁ జూచి । 'తల్లిదండ్రులును బాంధవజనంబు**
కారు నిన్నీగికిఁ గర్తలు; విను నీవ । యొడయురాలవు నీకు నుజ్జ్వలాంగి!
కామంబు లెల్లను గామించి పొందుట । నయ్యెఁ గన్యాశబ్ద మట్లుగాక
యాత్మతంత్రత్వంబునందు నీ కెగ్గు లే; । దే నేల నడతు ధర్మేతరంబు?

ఆ. **మత్సమాగమమున మదిరాక్షి! నీదు క । న్యావ్రతంబుఁ జెడదు; నందనుండు**
నధికతేజుఁ డుదయ మగు; నిన్ను నొక్కనిం । దయును బొందకుండుఁ; దథ్య మబల! **338**

ప్రతిపదార్థం: అనుటయున్= అని కుంతివచించుటయున్నూ; ఆ+దేవుఁడు= సూర్యుడు; ఆ+ఇందుముఖిన్= చంద్రుడివంటిమొగం కలిగినదానిని, కుంతిని; చూచి= అరసి; ఉజ్జ్వల+అంగి!= లావణ్యం వెల్లివిరిసే శరీరం కలదానా! కుంతీ!; తల్లిదండ్రులును= జననీజనకులును; బాంధవజనంబు= చుట్టాలును; నిన్నున్= నిన్ను; ఈగికిన్= దానం చేయటానికి; కర్తలుకారు= ఒడయులు కారు (స్వాములు కారు); విను= ఆలకించుము; నీకున్= నీకు; ఈవు+అ= నీవే; ఒడయురాలవు= స్వామినివి; కామంబులు+ ఎల్లను= కోరికలను అన్నింటిని; కామించి= అభిలషించి; పొందుటన్= అనుభవించటంచేత; కన్యాశబ్దము= కన్య అనే పదం; అయ్యెన్= ఏర్పడింది; అట్లున్+కాక= అంతమాత్రమే కాక; ఆత్మతంత్రత్వంబునందున్= తన సొంతవ్యవహారాలను నడపుటలో; నీకున్= నీకు; ఎగ్గు= కీడు; లేదు= ఉండదు; ఏను= నేను; ధర్మ+ఇతరంబు= ధర్మం కంటె ఇతరమైన దానిని (అధర్మాన్ని) ఏల నడతున్?= ఎందుకు ఆచరిస్తాను?; మదిర+అక్షి!= మత్తెక్కించే నేత్రాలు కల మగువా! కుంతీ!; మత్+సమాగమమునన్= నా పొందుచేత; నీదు, కన్యావ్రతంబు= నీకన్యా నియమం; చెడదు= భగ్నం కాదు; నందనుండున్= కొడుకును; అధిక తేజుఁడు= మిక్కుటమైన ప్రకాశం కలవాడు; ఉదయము+అగున్= జన్మిస్తాడు; అబల= పడతీ! కుంతీ!; నిన్నున్= నిన్ను; ఒక్కనిందయును= ఒక్క అపవాదుకూడా; పొందక+ఉండున్= చేరకుండా ఉంటుంది; తథ్యము= ఇది నిజం.

తాత్పర్యం: అని కుంతి పలికింది. అంతట సూర్యుడు ఆ చంద్రవదన అయిన కుంతిని చూచి ఇట్లా అన్నాడు: 'లావణ్యం వెల్లివిరిసే శరీరం కల కుంతీ! ఆలకించుము. తల్లిదండ్రులు చుట్టాలు నిన్ను దానంగా సమర్పించటానికి కర్తలు కారు. నీశరీరానికి నీవే యజమానురాలవు. అసలు కన్య అనే శబ్దానికి అర్థం కోరికలను కోరి ఈడేర్చుకొనేది అనేగదా! అంతేకాక- ఎవరికి సంబంధించిన ఆంతరంగిక వ్యవహారం వారే నిర్వహించుకొనటంలో ఎట్టి ఎగ్గు ఎవరికి లేదు. నేను అధర్మాన్ని ఏల ఆచరిస్తాను? నాసమాగమంవలన నీకన్యావ్రతానికి భంగం కలుగదు. మత్తెక్కించే కన్నులు గల కుంతీ! నీకు మహాతేజస్వి అయిన కుమారుడు ఉద్భవిస్తాడు. నీకు ఎట్టి అపవాదమూ రాదు. ఇదిసత్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) తనను కుంతి రహస్యంగా పొందటం తప్పు కాదని కొన్నిఉపపత్తులతో చెప్పాడు సూర్యుడు. అవి ఏమంటే- 1. తలిదండ్రులకు చుట్టాలకు కన్యకను దానంచేయటానికి అధికారం లేదు. 2. కన్యక అయిన వధువుకే వరుడిని ఎన్నుకొనే అధికారం సహజసిద్ధంగా ఉన్నది. 3. సమాగమం కన్యక ఆంతరంగిక వ్యవహారం. 4. సూర్యసమాగమంవలన కుంతికన్యావ్రతానికి భంగ మేర్పడదు. పై ఉపపత్తులు చెప్పింది సూర్యభగవానుడు. కన్యకకు ఆత్మతంత్రత్వంలో స్వాతంత్ర్యం ఉన్నదనే వాదానికి కుంతియే పూర్వపక్షాలు నెలకొల్పి ఉంచింది. అది వాదోపవాదాలకు సమయం కాదు. జరిగినకథను యథాతథంగా వ్యాసుడు వ్రాశాడు.

కుంతి సూర్యునివరంబున గర్భంబు దాల్చి కర్ణుం గాంచుట (సం. 3-292-1)

వ. అని యొడంబఱిచి సూర్యుండు దత్సమాగమంబునం బ్రీతుండై దానికి గర్భాధానంబు సేసి గగనంబున కరిగె; నంతఁ బూర్వపక్షంబునందుఁ జంద్రుండునుం బోలె గర్భంబు గ్రమంబునఁ బ్రవర్ధనంబు నొందుచు నభివ్యక్తంబయ్యునుబ్రభాకరునిమహిమం జేసి లోకవిదితంబుగాకుండెఁ; దత్ప్రకారంబు దాదికూఁతు రొక్కతియ యెఱుంగు; నిట్లు వర్తిల్లుచుం బది యగు మాసంబున నొక్కనాఁటి నిశాసమయంబునం గన్యాంతఃపురంబునందు. 339

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; ఒడంబఱిచి= అంగీకరింపజేసి; సూర్యుండు= సూర్యుడు; తద్+సమాగమంబునన్= ఆమె కలయిక వలన; ప్రీతుండు+ఐ= మిక్కుటంగా తృప్తిని చెందినవాడై; దానికిన్= ఆమెకు, కుంతికి; గర్భ+ఆధానంబు+చేసి= కడుపు ఉంచుట చేసి; గగనంబునకున్= ఆకాశానికి; అరిగెన్= వెళ్ళాడు; అంతన్= అటుపిమ్మట; పూర్వపక్షంబునందున్= శుక్లపక్షంలో; చంద్రుండునున్+పోలెన్= చంద్రుడివలె; గర్భంబు= కడుపు (లోనిపిండం); క్రమంబునన్= నానాటికి; ప్రవర్ధనంబున్+ ఒందుచున్= అభివృద్ధిని చెందుతూ; అభివ్యక్తంబు+అయ్యును= ప్రస్ఫుటమైనప్పటికి; ప్రభాకరుని, మహిమన్+చేసి= సూర్యుడి ప్రభావంచేత; లోక, విదితంబు+కాక+ఉండెన్= లోకంలోని జనులకు తెలియకుండింది; తద్+ప్రకారంబు= ఆవిధం; దాదికూఁతురు= దాది యొక్క కూతురు, ఒక్కతి+అ= ఒక్కతె మాత్రమే; ఎఱుంగున్= తెలియును; ఇట్లు= ఈ విధంగా; వర్తిల్లుచున్= ప్రవర్తిస్తూ; పదియగుమాసంబునన్= పదవ నెలలో; ఒక్కనాఁటి= ఒక రోజుయొక్క; నిశాసమయంబునన్= రాత్రికాలంలో; కన్యా+అంతఃపురంబునందున్= కన్నెలు ఉండే రాచనగరి లోపలిప్రదేశంలో.

తాత్పర్యం: అని చెప్పి, కుంతిని సమ్మతింపజేసి, సూర్యుడు ఆమె సమాగమంతో తృప్తిచెందినవాడై. ఆమెకు గర్భం ఆవిర్భవిల్లేటట్లు చేసి ఆకసానికి వెళ్ళాడు. అంతట శుక్లపక్షంలోని చంద్రుడివలె, కుంతిగర్భం దినదినప్రవర్ధమాన మయింది; కాని, సూర్యుడిప్రభావంవలన లోకులకు మాత్రం ఆమె గర్భం అభివ్యక్తం కాకుండా ఉండింది. ఆ విషయం ఒక దాది కూతురికి తప్ప ఇతరులకు ఎవ్వరికీ తెలియదు. ఈ విధంగా కుంతిగర్భం విలసిల్లి పదవనెలలో ఒకనాఁడు రాత్రివేళ కన్నెలఅంతిపురంలో.

విశేషం: (1) పూర్వపక్షము= శుక్లపక్షం. అమావాస్య మరునాడు పాడ్యమినుండి పూర్ణిమవరకు.

ఆ. కొడుకుఁ గనియె సహజకుండలకవచాభి । రాము విమలకమలకోమలాక్షు
దీర్ఘబాహుఁ జారుదృఢదేహుఁ దరుణార్క । తేజుఁ గుంతిభోజరాజపుత్త్రి. 340

ప్రతిపదార్థం: కుంతిభోజరాజపుత్త్రి= కుంతిభోజరాజుయొక్క కూతురు; కొడుకున్= పుత్రుని; సహజకుండలకవచ+అభిరామున్= ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన చెవిపోగులు తనుత్రాణంచేత సుందరంగా ఉన్నవాడిని; విమల, కమల కోమల+అక్షున్= నిర్మలాలు,

సుకుమారాలు అయిన కమలాలవంటి కనులు కలవాడిని; దీర్ఘబాహున్= పొడుగైన చేతులు కలవాడిని; చారుదృఢదేహున్= అందమైన బలిష్ఠమైన శరీరం కలవాడిని; తరుణ+అర్క, తేజున్= బాల సూర్యుడివంటి తేజస్సు కలవాడిని; కనియెన్= ప్రసవించింది.

తాత్పర్యం: కుంతిభోజుడి కూతురు కుంతి కుమారుడిని ప్రసవించింది. ఆ కుమారుడు ప్రకృతిసిద్ధమైన చెవిపోగులు తనుత్రాణం కల ప్రియదర్శనుడు, సుకుమారమయిన కమలాలవంటి కన్నులు కలవాడు, ఆజానుబాహుడు. అందమైన దృఢమైన శరీరం కలవాడు. తరుణసూర్యతేజస్వి.

వ. ఇట్లు జనియించిన యర్భకుం జూచి లోకాపవాదభయంబునకుం దలరి యాక్షణంబ యొక్క మంజూషలోన నబ్బాలకుం బదిలంబుగా నిడి దాని నతిదృఢంబుగాఁ దెప్పం బంధించి సఖియునుం దానును గొని పురసమీపగతంబైన యశ్వనదీప్రవాహంబున విడిచి కుంతి యెంతయు సంతాపంబున నిట్లని విలాపంబు సేసె. 341

ప్రతిపదార్థం: ఇట్లు= ఈరీతిగా; జనియించిన= పుట్టిన; అర్భకున్+చూచి= శిశువును కాంచి; లోక+అపవాద, భయంబునకున్= లోకులవలన ఏర్పడే నిందకు భయపడి; తలరి= కలతచెంది; ఆక్షణంబు+అ= వెంటనే; ఒక్క= ఒక; మంజూషలోన్= పెట్టెలో; ఆ+బాలకున్= ఆ మగబిడ్డను; పదిలంబుగాన్+ఇడి= భద్రంగా ఉంచి; దానిన్= ఆ మంజూషను; అతిదృఢంబుగాన్= మిక్కిలిగట్టిగా; తెప్పన్= నీటిమీద మునగకుండా తేలియాడే నలుచదరపు పడవమీద; బంధించి= కట్టి; సఖియునున్+తానును+ కొని= చెలికత్తెయును తాను తీసికొని వెళ్లి; పురసమీపగతంబు+ఐన= నగరానికి చేరువగా ఉన్న; అశ్వనదీ ప్రవాహంబునన్= అశ్వం అనే పేరు కల నది వెల్లువలో; విడిచి= వదలిపెట్టి; కుంతి= కుంతి; ఎంతయున్= మిక్కుటమైన; సంతాపంబునన్= దుఃఖంతో; ఇట్లు+అని= ఈ రీతిగా తలపోసి; విలాపంబు+చేసెన్= శోకించింది.

తాత్పర్యం: ఈ విధంగా ఉద్భవించిన మగబిడ్డను చూచి, లోకంలో ఏర్పడే అపనిందకు భయపడి ఆక్షణంలోనే కుంతి తన చెలికత్తెతో కలిసి ఆ శిశువును ఒక చక్కనిపెట్టెలో భద్రంగా ఉంచి ఆ పెట్టెను ఒకతెప్పపై పెట్టి గట్టిగా త్రాళ్లతో కట్టి నగరానికి దగ్గరగా ప్రవహిస్తున్న అశ్వనదిలో విడిచి పెట్టింది. కన్నబిడ్డను నదిలో విడిచిపెట్టివచ్చి కుంతి మిక్కుటమైన ఆవేదనతో ఈ విధంగా దుఃఖించింది.

ఆ. 'కొడుక! నిన్నుఁ గాంచు కొఱఁత నోములె కాని । పెంచి గారవించి పేర్మి నీదు
ప్రోపుఁ గుడువఁ గాంచు పుణ్యంబు దుదిముట్ట । నేల చేయనైతి నేను గుఱ్ఱ! 342

ప్రతిపదార్థం: కొడుక!= ఓపుత్త్రకా!; నిన్నున్= నిన్ను; కాంచు= ప్రసవించే; కొఱఁతనోములు+ఎ+కాని= లోపభూయిష్ఠమైన వ్రతాలే కాని; పెంచి= అభివృద్ధిచేసి; గారవించి= మన్నించి; పేర్మిన్= ప్రీతితో; నీ+ప్రోపున్= నీ సంరక్షణను; కుడువన్+కాంచు= అనుభవించే; పుణ్యంబు; తుదిముట్టన్= సంపూర్ణంగా; కుఱ్ఱ!= (నా) అనుగుశిశువా!; ఏను= నేను; ఏలచేయన్+ఐతిన్= ఏల చేయలేకపోయాను!

తాత్పర్యం: 'ఓ నా చిన్నశిశువా! నేను నోచిన నోములు తక్కువవి. నిన్ను నేను కన్నానే కాని, పెంచి పెద్ద చేసి, నీసంరక్షణ అనుభవించే సుకృతం నాకు సంపూర్ణంగా లేదు కదా!. ఎంతటి దురదృష్టవంతురాలను నేను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. **నెఱయం బున్నమచందురుం జెనయు నీ నెమ్మోమునం దియ్యనై**
చిఱునవ్వొప్పఁగఁ జూడనీక, పులకల్ చెన్నొంద నిన్ గ్రుచ్చి య
క్కఱదీఱం బొరి నక్కునం గరము వేడ్కం జేర్ప నీ కిమ్మెయిన్
వఱుతం ద్రోవఁగఁ జేసెనే యకట! దైవం; బెందుఁ జొత్తున్ సుతా! **343**

ప్రతిపదార్థం: సుతా= ఓకొడుకా!; నెఱయన్= నిండుదనం ఒప్పారగా; పున్నమచందురున్= పూర్ణిమనాటి చంద్రుడిని; చెనయు= పోలెడి; నీ+నెఱ+మోమునన్= నీనిండుమొగంలో; తియ్యన+ఐ= మధురమై; చిఱు, నవ్వు+ఒప్పఁగన్= మందహాసం చిందులాడగా; చూడనీక= కాంచనీయక; పులకల్= గగురుపాటు; చెన్నొందన్= శోభిల్లగా; నిన్= నిన్ను; గ్రుచ్చి= పొదివి; అక్కఱ+తీఱన్= తృప్తి తీరేవరకు; పొరిన్= వరుసగా; అక్కునన్= హృదయానికి; కరము= మిక్కిలి; వేడ్కన్= ప్రీతితో; చేర్పనీక= హత్తుకోనీకుండ; దైవంబు= విధి; ఈ+మెయిన్= ఈవిధంగా; వఱుతన్= వరదలో; త్రోవఁగన్+చేసెను+ఏ= పడవేసేటట్లుగా చేశాడా?; అకట= అయ్యో; ఎందున్+చొత్తున్= ఎందులో పడేది? (నేనీ దుఃఖం భరించలేను అని తాత్పర్యం).

తాత్పర్యం: ఓ కొడుకా! నీమొగం పున్నమచంద్రుడివలె ఉన్నదికదా. నీనెమ్మోముమీద మృదుమధురమైన మందహాసాలు చిందులాడటం నిండుగా చూడనీక, గగురుపొడిచిన ఒడలితో నిన్ను గుండెకు హత్తుకొని తనివితీరేటట్లు ముద్దాడనీక అయ్యో, ఈవిధంగా దైవం నిన్ను వరదపాలు చేసేటట్లుగా చేశాడు గదా! నేను ఎక్కడికి పోయేది?

సీ. **ఏపుణ్యసతికి నీ వింక నందనుఁడ వై । యెక్కడఁ బడియెదో యే నెఱుంగ;**
నే పుణ్యరాలొకో యెప్పుడు నినుఁ బుత్త్రుఁ । గాఁ గాంచుటకు మేలికలను గాంచు;
లలిఁ బాంసుకేళి నల్లన నడయాడుచు । నవ్యక్తమధురవాక్యామృతంబు
వీనులఁ గురియుచు వెడఁదకన్నులఁ బిన్న । నవ్వును శుభలక్షణములు నమరఁ

ఆ. **దేజరిల్లు నిన్నుఁ దెఱవ యెవ్వత యొక్కొ । యదర గ్రుచ్చి యురమునందుఁ జేర్చి**
వేడ్క మిగుల వేనవేలభంగులఁ గొని । యాడి నగుచు ముద్దులాడుఁ గొడుక! **344**

ప్రతిపదార్థం: ఏపుణ్యసతికిన్= సుకృతం చేసుకొనిన ఏవనితకు; ఈవు= నీవు; ఇంకన్= ఇకమీద; నందనుఁడవు+ఐ= పుత్రుడవు అయి; ఎక్కడన్= ఏస్థలంలో; పడియెదు+ఓ= చేరెదవో; ఏను= నేను; ఎఱుంగన్= తెలియజాలనుకదా; ఏపుణ్యరాలు+ఒకో= సుకృతం చేసికొనిన ఏఇల్లాలో కదా; ఎప్పుడున్= ఎల్లప్పుడును; నినున్= నిన్ను; పుత్త్రుకాన్= కొడుకుగా; కాంచుటకున్= చూడటానికి; మేలికలను= మంచి స్వప్నాన్ని; కాంచున్= పొందుతుంది; లలిన్= ప్రేమతో; పాంసుకేళిన్= దుమ్ములో ఆడుకొంటూఉండగా; అల్లన= మెల్లగా; నడయాడుచున్= తప్పటడుగులు వేస్తూ; అవ్యక్త, మధుర, వాక్య+అమృతంబు= తియ్యనైన జిలిబిలి పలుకులు అనే అమృతం; వీనులన్= చెవులయందు; కురియుచున్= వర్షిస్తూ; వెడఁదకన్నులన్= విశాలాలైన నేత్రాలలో; పిన్ననవ్వును= చిన్ననగవున్నూ; శుభలక్షణములున్= మంచిచిహ్నాలున్నూ; అమరన్= విలసిల్లగా; తేజరిల్లు= వెలుగొందే; నిన్నున్= నిన్ను; తెఱవ+ఎవ్వత+ఒక్కొ= వనిత యెవ్వతెయో; అదరగ్రుచ్చి= గట్టిగా పొదివి; ఉరమునందున్+చేర్చి= కౌగిలించుకొని; వేడ్కమిగులన్= ప్రీతిఅతిశయించగా; వేనవేలభంగులన్= పెక్కుపెక్కురీతుల; కొనియాడి= ఉగ్గడించి; నగుచున్= నవ్వుతూ, ముద్దులు+ఆడున్= ముద్దులు పెట్టుకొంటుందో.

తాత్పర్యం: నాచిట్టితండ్రీ! నీవు ఇంక ఏపుణ్యాత్మురాలికి కొడుకువై సంతోషపెడతావోకదా! ఎక్కడికి చేరుతావో నాకు తెలియదు కదా. ఏపుణ్యసతి కాంచిన మధురస్వప్నాలు నిజమై నీవు ఆమెకు దక్కుతావో కదా! దుమ్ములో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆడుకొనేటప్పుడు తప్పటడుగులు వేస్తూ తియ్యనైన జిలిబిలిమాటలు పలుకుతూ చెవులలో అమృతం కురిసే నిన్ను, పెద్దపెద్దకనులలో చిన్నచిన్న నవ్వులు వెలార్చేనిన్ను, శుభలక్షణాలతో మిలమిల వెలుగొందేనిన్ను, ఏఅమ్మ కౌగిలించుకొని గుండెకు హత్తుకొని వేడుకమీరగా పలుమారులు ముద్దులు పెట్టుకొని మురిసిపోతూ నవ్వుకొని ఆనందిస్తుందో కదా! అయ్యో! నాకు ఆ అదృష్టం లేకపోయెనే.

ఉ. లాలితయౌవనోజ్జ్వలవిలాసములం దిలకించు సుందరా
భీలవిచేష్టితం బమర భీమవనోద్భవసింహరేఖమై
వాలవె యింక నీ వెలమి వామవిలోచన లంగజన్మలీ
లాలసలై విపక్షులు భయాలసులై ధృతి యేది చూడఁగన్. 345

ప్రతిపదార్థం: లాలితయౌవన+ఉజ్జ్వలవిలాసములన్= మనోహరమైన యౌవనమునందలి ప్రకాశించే విలాసములతో; తిలకించు= ప్రకాశించే; సుందర+ఆభీల విచేష్టితంబు= అందమైనదీ, భయంకరమైనదీ అయిన చేష్ట, అమరన్= ఒప్పగా; భీమ-వన+ఉద్భవ-సింహ-రేఖము+ఐ= భయంకరమైన అడవిలో పుట్టకగల సింహముయొక్క చొప్పుతో; వామ-విలోచనలు= సుందరములైన కన్నులు గలవారు (స్త్రీలు); అంగజన్మ లీలా+అలసలు+ఐ= మన్మథవిలాసం చేత సోమరులయి, విపక్షులు= శత్రువులు; భయ+అలసులు+ఐ= భయముచే సోమరులయి, ధృతి= ధైర్యము; ఏది= కోలుపోయి; చూడఁగన్= చూడగా, ఇంకన్= ఇకముందు; నీవు; ఎలమిన్= సంతోషంతో, వాలవే= మీఱవా (మీఱుతావని భావం).

తాత్పర్యం: యౌవనంలో ఉజ్జ్వలమైన విలాసంతో ప్రకాశించి, సుందరమూ, భయంకరమూ అయిన చేష్ట ఒప్పగా, వెఱపుగొలిపే వనంలో ఉద్భవించిన సింహంయొక్క చొప్పుచేత, సుందరాంగులు మన్మథవిలాసం చేతనూ, శత్రువులు భయంతోనూ సోమరులయి, నిరుత్సాహులై చూస్తుండగా ఇక నీవు ప్రీతితో మీఱుదువు కదా!

విశేషం: యౌవనం వచ్చినప్పుడు కర్ణుడు సుందరుడూ, భయంకరుడూ అవుతాడు. అతని సౌందర్యానికి స్త్రీలు మన్మథావేశానికి లోనయి అలసలవుతారు. శత్రువులు అతని భయంకర రూపానికి ధైర్యం వీడిన నిరుత్సాహులు అవుతారని క్రమాన్వయం. "హిమవద్వన సంభూతం సింహం కేసరిణం యథా" అని మూలము.

ఆ. ఎచట నున్న నైన నెల్లప్పుడును నిన్నుఁ । గన్నులారఁ జూడఁగాంచుఁ గాన
తనయ! నిన్నుఁ గనిన తపనుండు గడుధన్యుఁ । డయ్యెఁ; మందభాగ్య నైతి నేను. 346

ప్రతిపదార్థం: తనయ!= ఓకుమారా!; ఎచటన్+ఉన్నన్+ఐనన్= నీవు ఎక్కడ ఉన్నప్పటికిని; ఎల్లప్పుడును= నిరంతరం; నిన్నున్= నిన్ను; కన్నులు+ఆరన్= కనులనిండుగా; చూడన్+కాంచున్+కాన= దర్శించగలుగుతాడు కాబట్టి; నిన్నున్= నిన్ను; కనిన= కన్న; తపనుండు= సూర్యుడు; కడున్= మిక్కిలి; ధన్యుఁడు+అయ్యెన్= చరితార్థుడు అయ్యాడు; ఏను= నేను; మందభాగ్యన్+ఐతిన్= దురదృష్టవంతురాలను అయినాను.

తాత్పర్యం: ఓ కుమారా! నీవు ఎచ్చట ఉన్నా నిను కన్నతండ్రి సూర్యుడు కనులార నిను కాంచగలడు కావున అతడు ధన్యుడే. ఇక, నిన్ను చూడనోచని దానను; నిను గన్నతల్లిని నేనే కేవలం నిర్భాగ్యురాలను.

చ. ఇనుఁ డఱచేత మాటువడు టెన్నఁడుఁ గల్గునె? నిన్ను నెమ్మి నేఁ
గనియెదఁ గాక యింక నొకకాలమునం దయినం దనూజ! నీ
వినుతశరీరభావమును వీనుల సన్మణికుండలంబులున్
ఘనతరవజ్రవర్మముఁ బ్రకాశత నొందక యుండనేర్చునే? 347

ప్రతిపదార్థం: తనూజ!= ఓకుమారకా!; ఇనుఁడు= సూర్యుడు; అఱచేతన్= హస్తతలాన; మాటు+పడుట= మరుగుపడటం; ఎన్నఁడున్= ఎపుడైనను; కల్గును+ఎ?= సంభవించేనా; నిన్నున్= నిన్ను; ఓకుమారా నిన్ను; నెమ్మిన్= అనురాగంతో; ఏన్= నేను; ఇంకన్= ఇకముందు; ఒకకాలమునందున్+అయినన్= కొన్నినాళ్లు కడచిన పిదపనైనా; కనియెదన్+కాక= చూస్తానుగాక; నీవినుతశరీరభావమును= ప్రస్తుతింపబడే నీ అంగసౌష్ఠవం; వీనులయొక్క= చెవుల; సత్+మణి, కుండలంబులున్= మంచి రత్నాల వంటి చెవిపోగులున్నూ; ఘనతర వజ్రవర్మమున్= గొప్పదైన వజ్ర కవచమున్నూ; ప్రకాశతన్+ఒందక+ఉండన్‌నేర్చునే= వెలుగొందక ఉండగలవా!

తాత్పర్యం: ఓ కుమారకా! సూర్యుడు ఎన్నడూ అరచేయి అడ్డుపెట్టినంత మాత్రాన కన్పించకుండా పోతాడా? కొన్నినాళ్లు గడచినపిదప ప్రేమతో నేను నిన్ను దర్శించగలనుగాక. ఎట్లాగంటే ప్రస్తుతింపబడే నీశరీరసౌష్ఠవం, చెవులకు వెలుగొందే మణులవంటి పోగులు, వజ్రకాంతులు గలిగి గొప్పదైన సహజకవచం, స్వయంప్రకాశమానాలై అందరికీ నీయునికిపట్టులు ప్రస్ఫుట మొనరిస్తాయి కదా!

విశేషం: ఇంతకుముందు- సూర్యుడు ధన్యుడు, ఆతడు తన కుమారుడు ఎక్కడ ఉన్నా కనులార గాంచగలడనీ తానే అదృష్టవిహీనను అనీ కుంతి దుఃఖించింది. ఇప్పుడు ఆమె ఊరట చెందుతున్నది. ఆ బాలకుడు ఎక్కడ ఉన్నా కుంతి ఆతడి సహజ కవచకుండలాలు స్వయంప్రకాశమానాలు కనుక, కొంతకాలం గడచినపిమ్మట నైనా గుర్తించి కన్నతల్లిగా తాను సంతసించగలను అని చెప్తున్నది. అలం: అర్థాంతరన్యాసం.

చ. దివి భువి నంతరిక్షమున దిక్కుల గాడ్పున నగ్నియందు న
ర్ణవములయందు ఘోరవిపినంబులయందును నీకు నెప్పుడున్
శివ మగుఁగాక! దిక్పతులు సిద్ధులు సాధ్యులు రుద్రు లాశ్వినుల్
భువనము లర్కచంద్రులును బుత్త్రక! నిన్ గృపఁ గాచుచుండెడున్.' 348

ప్రతిపదార్థం: పుత్త్రక!= నా చిట్టినాయనా!; దివిన్= స్వర్గంలో; భువిన్= భూలోకంలోను; అంతరిక్షమునన్= ఆకాశంలో; దిక్కులన్= దిశలలో; గాడ్పునన్= గాలిలోను; అగ్నియందున్= నిప్పులోను; అర్ణవములయందున్= సముద్రాలలో; ఘోర, విపినంబులయందును= భయంకరమైన అడవులలోనూ; నీకున్= నీకు; ఎప్పుడున్= సతతం; శివము+అగున్+కాక= శుభం కలుగును గాక; దిక్+పతులు= దిక్కులను పాలించేవారు; సిద్ధులున్, సాధ్యులున్= వేల్పులజాతులలోని సిద్ధులు, సాధ్యులును; రుద్రులున్= రుద్రులును; ఆశ్వినుల్= ఆశ్వినులు= (వేలుపువెజ్జులు); భువనములు= జగములు; అర్కచంద్రులును= సూర్యుడున్నూ చంద్రుడున్నూ; నిన్= నిన్ను; కృపన్= దయతో; కాచుచుండెడున్= రక్షిస్తూ ఉంటారుగాక!

తాత్పర్యం: ఓ నాచిట్టినాయనా!, నిన్ను కాపాడవలసిన కన్నతల్లిని నే నిప్పుడు నిర్దాక్షిణ్యంగా వదలివేయవలసి వచ్చింది. అయినను కన్నతల్లిగా నిన్ను దీవిస్తున్నాను. స్వర్గంలో భూలోకంలో ఆకాశంలో అన్నిదిక్కులలో గాలిలో,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిప్పులో, సముద్రాలలో, భయంకరమైన అడవులలో, నీకు ఎప్పుడూ శుభం కలగాలి! దిక్పాలకులు, సిద్ధులు, సాధ్యులు, రుద్రులు, వేల్పువెజ్జులు, అశ్వినీదేవతలు, జగాలు, సూర్యచంద్రులు నిన్ను దయతో రక్షిస్తారు కాక.'

విశేషం: దిక్కులు - అష్టదిక్కులు. 1. తూర్పు 2. అగ్నిమూల 3. దక్షిణం 4. నిర్బతిమూల 5. పడమర 6. వాయవ్యమూల 7. ఉత్తరం 8. ఈశాన్యం. దిక్పాలకులు: అష్టదిక్పాలకులు 1. ఇంద్రుడు 2. అగ్ని 3. యముడు 4. నిర్బతి 5. వరుణుడు 6. వాయువు 7. కుబేరుడు 8. ఈశానుడు. రుద్రులు: ఏకాదశరుద్రులు. 1. అజుడు 2. ఏకపాదుడు 3. అహిర్బుధ్న్యుడు 4. విరూపాక్షుడు 5. సురేశ్వరుడు 6. జయంతుడు 7. బహురూపుడు 8. త్ర్యంబకుడు 9. అపరాజితుడు 10. వైవస్వతుడు 11. హరుడు.

వ. అని యేడ్చుచుం గుంతి యచ్చటం దడయ వెఱచి గూఢప్రకారంబునఁ గన్యాంతఃపురంబునకు వచ్చి యెప్పటి యట్ల వర్తిల్లుచుండె; నట మంజూషయు నశ్వనదీవేగంబునఁ జర్మణ్వతికిం జని, యందుండి యమునాగత మయ్యెఁ; నట చని భాగీరథిం బడి సూతవిషయంబునం బంపానగరంబు చేరువ నరుగుచుండె; నా సమయంబున. 349

ప్రతిపదార్థం: అని= అని (దీవించి); ఏడ్చుచున్= విలపిస్తూ; కుంతి= కుంతి; అచ్చటన్= ఆస్థలంలో; తడయన్= ఆలసించటానికి; వెఱచి= భయపడి; గూఢప్రకారంబునన్= రహస్యవిధానాన; కన్యా+అంతఃపురంబునకున్= కన్నియలు ఉండే అంతిపురికి; వచ్చి; ఎప్పటి+అట్లు+అ= ఇదివరకు మాదిరిగనే; వర్తిల్లుచున్+ఉండెన్= వ్యవహరిస్తూఉంది; అట= అచట (ఆ అశ్వనదిలో); మంజూషయున్= పెట్టెయు; అశ్వనదీవేగంబునన్= అశ్వనదీ ప్రవాహం యొక్క వేగంవలన; చర్మణ్వతికిన్= చర్మణ్వతి యనే నదిని చేరి; అందున్+ఉండి= చర్మణ్వతి నుండి; యమునాగతము+అయ్యెన్= యమునానదిని చెందింది అయ్యింది; అట చని= ఆయముననుండి వెళ్ళి; భాగీరథిన్+పడి= గంగలో చేరి; సూతవిషయంబునన్= సూతదేశంలో; పంపానగరంబు చేరువన్= పంప అనే పేరు కల పట్టణానికి సమీపాన; అరుగుచుండెన్= పోతూ ఉన్నది. ఆ సమయంబునన్= అప్పుడు.

తాత్పర్యం: కుంతి తనకుమారుడిని దీవించి విలపించింది. ఆస్థలంలో ఆలసించటం మంచిది కాదని భయపడి ఆమె అంతిపురానికి చేరి ఎప్పటివలె జీవితం సాగిస్తూ ఉన్నది. అట శిశువుతోకూడిన పెట్టె అశ్వనదీప్రవాహవేగంవలన చర్మణ్వతీనదిలోకి చేరింది. చర్మణ్వతినుండి యమునానదికి చేరింది. యమునునుండి గంగానదిని చేరి సూతదేశంలోని పంపానగరసమీపానికి వస్తున్న సమయంలో.

విశేషం: (1) గంగానదికి యమునానది ఉపనది. అట్లే యమునలో వచ్చి పడుతుంది చర్మణ్వతి. చర్మణ్వతిలో కలుస్తుంది అశ్వనది. (2) విధివిలాసం విచిత్రమైనది. అశ్వనదీతీరంలోని రాజపుత్రి కుంతి పాండురాజును వివాహమాడి "గంగాతీరంలోని హస్తినాపురి చేరింది. ఆమెపుత్రుడున్నూ అంతకుముందే హస్తినాపురాన్ని చేరాడు.

సీ. ధృతరాష్ట్రసఖుఁ డైన యతిరథుం డనుసూతుఁ। డతివయుఁ దాను నతివిభూతి
గంగలోఁ జలకేళిసంగతుండై యుండి। తుంగతరంగానుషంగవశతఁ
జనుదెంచు మంజూషఁ గని కడువేడుకఁ। దనపరిజనములఁ బనిచి పట్టి
తెప్పించి ధీయుక్తి యొప్ప నేకతమున। నప్పెట్టెఁ దెఱచి తా నప్పు డందు

ఆ. వినుతహేమకవచుఁ గనకకుండలధరు। ననుపమానతేజు ఘనుఁ గుమారుఁ
గని మనంబులోన ననయంబు విస్మయం। బొనర గ్రుచ్చి యెత్తికొని ముదమున. 350

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రసఖుఁడు+ఐన= ధృతరాష్ట్రుడికి మిత్రుడు అయిన; అతిరథుండు+అను సూతుఁడు= అతిరథుడు అనేపేరు కల సూతుడు; అతివయున్= వనితయు, భార్యయు; తానునున్= తానును; అతి, విభూతిన్= మిక్కుటమైన విభవంతో; గంగలోన్= గంగానదిలో; జలకేళి= జలక్రీడలో; సంగతుండు+ఐ= కూడినవాడై; ఉండి= ఉండి; తుంగతరంగ+అనుషంగవశతన్= ఎత్తైన కెరటాలతో కూడియుండటంచేత; చనుదెంచు= వస్తున్న; మంజూషన్= పేటికను; కని= అరసి; కడువేడుకన్= మిక్కుటమైన ఆసక్తితో; తన, పరిజనములన్= తనసేవకులను; పనిచి= ఆజ్ఞాపించి; పట్టి తెప్పించి= అందుకొని తనకడకు తెప్పించి; ధీయుక్తి+ఒప్పన్= బుద్ధికుశలత ఏర్పడేటట్లుగా; ఏకతమునన్= రహస్యంగా; ఆ+పెట్టెన్= ఆపెట్టెను; తెఱచి= విప్పి; తాన్= తాను; అప్పుడు= ఆసమయంలో; అందున్= ఆపెట్టెలో; వినుతహేమకవచున్= ప్రస్తుతించబడే బంగారు మైమరువు కలవాడిని; కనక, కుండల, ధరున్= పసిడి చెవిపోగులు ధరించినవాడిని; అనుపమానతేజున్= సాటిలేనిప్రకాశం కలవాడిని; ఘనున్= గొప్పవాడిని; కుమారున్= బాలకుడిని; కని= అరసి; మనంబులోనన్= చిత్తంలో; అనయంబున్= మిక్కుటంగా; విస్మయంబు+ఒనరన్= ఆశ్చర్యం కలుగగా; ముదమునన్= సంతోషంతో; గ్రుచ్చి ఎత్తికొని= పట్టి ఎత్తుకొని.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడిమిత్రుడు అయిన అతిరథుడు అనే సూతుడు గంగలో వైభవోపేతంగా తనభార్యతో కలసి జలక్రీడలు ఆడుతున్నాడు. అప్పుడు కెరటాలతూగులో తేలియాడుతూ ఒక తెప్పపై నున్న మంజూష కన్పించింది. సూతుడు తన సేవకులను పంపించి ఆపెట్టెను తెప్పించాడు. రహస్యంగా పెట్టెను తెరచి చూచాడు. అందులో అచ్చెరువు గొలుపుతూ బంగారు కవచంతో పసిడికుండలాలతో మెరసిపోతున్న మగబిడ్డడిని చూచి సంతోష తన్మయత్వంతో పట్టి ఎత్తుకొన్నాడు.

విశేషం: సూతుడు: క్షత్రియుడికి బ్రాహ్మణస్త్రీయందు జన్మించినవాడు. వైశ్యునకు క్షత్రియస్త్రీయందు జన్మించినవాడు. వీరు ఒక ప్రత్యేక కులంగా ఏర్పడ్డారు. వీరిలో రథాలు నడపటం కొందరకు వృత్తి అయింది. కొందరకు పురాణాలు చెప్పే వృత్తి ఏర్పడింది.

వ. తన జీవితేశ్వరి యైన రాధం జూచి ఇట్లనియె. 351

తాత్పర్యం: తన ధర్మపత్ని అయిన రాధను చూచి ఈవిధంగా అన్నాడు.

క. 'అనపత్యుల మగు మనకును। మనపాలిటివేలు పిక్కుమారుని నిచ్చెన్
వనజాక్షి! వీఁడు మానుష। జనితుఁడు గాఁ; డరయ దేవసంభవుఁడు సుమీ!' 352

ప్రతిపదార్థం: వనజ+అక్షి!= పద్మాలవంటి కన్నులు కలదానా!; మనపాలిటివేలుపు= మనలను కాపాడే దేవుడు; అనపత్యులము+అగు, మనకును= సంతానవంతులం కాని మనకు; ఈ+కుమారునిన్= ఈబాలకుడిని; ఇచ్చెన్= అనుగ్రహించాడు; వీఁడు= ఈబాలకుడు; మానుషసంభవుఁడు+కాడు= మనుజజాతికి పుట్టినవాడు కాడు, అరయన్= పరిశీలించగా; దేవసంభవుఁడు= దేవతకు జన్మించినవాడు; సుమీ= సుమా.

తాత్పర్యం: సూతుడు తనధర్మపత్నిఅయిన రాధతో ఈవిధంగా పలికాడు: 'పద్మాలవంటి కన్నులు కలదానా! మనకు సంతానం లేదుకదా. మనలను రక్షించే దేవుడు అనుగ్రహించి ఈ బాలకుడిని మనకు ప్రసాదించాడు. చూడుము ఇతడి అతిలోకతేజస్సు. ఈ బాలుడు మనుష్యులకు జన్మించినవాడు కాజాలడు. ఇతడు నిశ్చయంగా దైవాంశసంభూతుడు సుమీ!'

**క. అని దానిచేతి కిచ్చినఁ । గొని యురమున నదిమి కొనియెఁ గొడుకు నతివ; య
వ్వనితకుఁ బాలెంత తెఱం । గునఁ జన్నులు సేఁపె నపుడు గూరిమిపేర్మిన్. 353**

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; దానిచేతికిన్= ఆమె చేతికి, రాధకు; ఇచ్చినన్= అందించగా; (రాధ); కొని= గ్రహించి (ఆశిశువును పట్టుకొని); ఉరమునన్= వక్షమున; అతివ (రాధ); కొడుకున్= బాలకుడిని; అదిమికొనియెన్= హత్తుకొన్నది; ఆ+వనితకున్= రాధకు; అపుడు= ఆసమయంలో; కూరిమిపేర్మిన్= ప్రేమాతిశయంచొప్పున; బాలెంత, తెఱంగునన్= బాలెంతరాలికివలె; చన్నులు+చేఁపెన్= చన్నుల నుండి పాలుకారాయి.

తాత్పర్యం: సూతుడు ఆ పసిబిడ్డను తనభార్య రాధచేతికి అందించాడు. ఆమెయు కుమారుడిని మిక్కుటమైన ప్రేమతో పుచ్చుకొని తన గుండెకు హత్తుకొన్నది. అప్పుడు బాలెంతరాలికి వలెనే ఆమెకు చన్నులు చేపాయి.

వ. ఇ ట్లాదంపతులు ప్రమోదసంపద సొంపారఁ గుమారుం గొని నిజమందిరంబున కరిగి యాత్మీయకులోచితంబు లగు జాతకర్మ సంస్కారంబొనరించి సహజకుండలాలంకృతకర్ణుం డగుటం జేసి కర్ణుం డను నామకరణంబు సేసి; రంత. 354

ప్రతిపదార్థం: ఇట్లు= ఈరీతిగా; ఆదంపతులు= ఆ భార్యాభర్తలు (రాధ అతిరథుడు); ప్రమోదసంపద= ఆనందం అనే ఐశ్వర్యం; సొంపారన్= శోభిల్లగా; కుమారున్+కొని= బాలకుడిని పరిగ్రహించి; నిజమందిరంబునకున్+అరిగి= తమ ఇంటికి వెళ్ళి; ఆత్మీయ కుల+ఉచితంబులు+అగు= తమ కులానికి అనువైన; జాతకర్మసంస్కారంబు= పుట్టినపుడు చేసే సంస్కారం; ఒనరించి= చేసి; సహజ, కుండల+అలంకృతకర్ణుండు= ప్రకృతిసిద్ధమైన కుండలాలతో అలంకరించబడిన చెవులు కలవాడు; అగుటన్+చేసి= కావటంచేత; కర్ణుండు= కర్ణుడు; అను= అనునట్టి; నామకరణంబు+చేసిరి= పేరు పెట్టారు.

తాత్పర్యం: ఈ రీతిగా ఆసూతదంపతులు (అతిరథుడు రాధయును) ఆనందతన్మయత్వంతో ఆబాలకుడిని పరిగ్రహించి తమగృహాన్ని చేరి, తమకులానికి సంప్రదాయాలకు అనుగుణంగా ఆశిశువుకు పుట్టినప్పుడే చేసే సంస్కారం చేసి, సహజమైన కుండలాలు కల కర్ణములు కలవాడు కావున కర్ణుడు అని పేరుపెట్టారు.

**క. వసువర్మధరుఁడు గావున । వసుసేనుం డనెడుపేరు వాని కిడిరి పెం
పెసఁగఁగ భూసురు; లాది । త్యసుతుం డిబ్భంగి సూతతనయుం డయ్యెన్. 355**

ప్రతిపదార్థం: వసు, వర్మధరుఁడు= పసిడికవచం ధరించి పుట్టినవాడు; కావునన్= కాబట్టి; వసుసేనుండు; అనెడుపేరు= అనే నామధేయం; భూసురులు= బ్రాహ్మణులు; పెంపు+ఎసఁగఁగన్= పేర్మి అతిశయించగా; వానికిన్= ఆ శిశువుకు; ఇడిరి= ఇచ్చారు, పెట్టారు; ఈ+భంగిన్= ఈ రీతిగా; ఆదిత్యసుతుండు= సూర్యుడికొడుకు; సూతతనయుండు+అయ్యెన్= సూతుడికొడుకు అయ్యాడు.

తాత్పర్యం: పసిడిమైమరువుతో పుట్టినవాడు కావున ఆ మగబిడ్డకు బ్రాహ్మణులు 'వసుసేనుడు' అనే నామధేయాన్ని కల్పించారు. ఈ రీతిగా సూర్యుడికొడుకు సూతసుతుడు అయ్యాడు.

వ. తద్వృత్తాంతంబంతయుఁ గుంతి తన యాప్తచారులవలన విని, శిథిలీకృతసంతాపయై యుండె; నతిరథుండును గ్రమంబున సంప్రాప్తయౌవనుం డయిన కొడుకుం దోడ్కొనివచ్చి ద్రోణాచార్యులయొద్ద నస్త్ర

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శిక్ష సేయంబెట్టె; నా సూతసూనుండు మఱియుఁ గృపాచార్యులవలనను జామదగ్న్యువలనను, వివిధాస్త్రలాభంబు నొంది, క్రమంబున దుర్యోధనుతోడ బద్ధసఖ్యుండై యతనికిఁ బ్రియంబు సేయం దివిరి దివిజరాజనందనుతో మచ్చరించుచుఁ బాండవుల కప్రియంబు సేయుచుండె. 356

ప్రతిపదార్థం: తద్+వృత్తాంతంబు+అంతయున్= కర్ణుడిసంగతి అంతా; కుంతి= పృథ; తన+ఆప్త, చారులవలనన్= తనకు ఆంతరంగికు లైన గూఢభటులవలన; విని= ఆలకించి; శిథిలీకృతసంతాప+ఐ+ఉండెన్= సడలిన ఆవేదన కలిగినదై ఉండింది; అతిరథుండును; క్రమంబునన్= కాలక్రమాన; సంప్రాప్తయౌవనుండు+అయిన= ప్రాప్తించిన జవ్వనం కలవాడయిన; కొడుకున్= కుమారుడిని; తోడ్కొనివచ్చి= తీసికొని అరుదెంచి; ద్రోణ+ఆచార్యుల+ఒద్దన్= ద్రోణుడు అనేపేరు కల గొప్పగురువుకడ; అస్త్రశిక్ష+చేయన్+పెట్టెన్= అస్త్రవిద్య నేర్చుకొనటానికి ఉంచాడు; ఆ సూతసూనుండు= ఆ సూతుడికొడుకు కర్ణుడు; మఱియున్= వెండియు; కృప+ఆచార్యులవలనను= కృపుడు అనే గురువువలనను; జామదగ్న్యువలనను= జమదగ్నికుమారుడైన పరశురాముడి వలనను; వివిధ+అస్త్రలాభంబున్+ఒంది= పెక్కుమంత్రమహిమలు కల ఆయుధాలను సంపాదించి; క్రమంబునన్= కాలక్రమంగా; దుర్యోధనుతోడన్; బద్ధసఖ్యుండు+ఐ= గాటంగా ఏర్పడిన స్నేహం కలవాడై; అతనికిన్= దుర్యోధనుడికి; ప్రియంబు= ప్రీతి; చేయన్+తివిరి= చేయబూని; దివిజ+రాజనందనుతోన్= దేవేంద్రసుతుడైన అర్జునుడితో; మచ్చరించుచున్= స్పర్థవహిస్తూ; పాండవులకున్; అప్రియంబు+చేయుచున్+ఉండెన్= అపకారం చేస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: ఆ వృత్తాంతాన్ని అంతా కుంతి తన ఆంతరంగిక గూఢచారులవలన తెలిసికొని ఆవేదన ఉడిగి ఊరడిల్లింది. అతిరథుడు తనకొడుకు యుక్తవయస్కుడు కాగానే ద్రోణాచార్యుడివద్ద అస్త్రవిద్యను అభ్యసించటానికి ఏర్పరచాడు. సూతసుతుడుగా విఖ్యాతి చెందిన కర్ణుడు ద్రోణాచార్యులకడ మాత్రమే కాక, కృపాచార్యులయొద్దను జమదగ్నికుమారుడైన పరశురాముడికడకూడా విలువిద్య నేర్చి, గొప్పఅస్త్రాలను సంపాదించాడు. కర్ణుడికి కాలక్రమంగా దుర్యోధనుడితో ప్రగాఢమైన స్నేహం ఏర్పడింది. ఆ మైత్రివలన అతడు పాండునందనులకు విరోధి అయి, వారికి అపకారాలు చేయ సమకట్టాడు.

ఉ. ఆతని యస్త్రవీర్యము, సమంచితకుండల వజ్రవర్మవి
ఖ్యాతియు, నాత్మలోఁ దలఁచి కౌరవనాయక! ధర్మసూనుఁడున్
భీతమనస్కుఁడై, యతఁ డభేద్యబలుం డని సంతతంబు ధై
ర్యాతిశయంబు డించి హృదయవ్యథఁ బొందుచు నుండెఁ గానలోన్. 357

ప్రతిపదార్థం: కౌరవనాయక!= ఓ జనమేజయ మహారాజా!; ఆతని+అస్త్రవీర్యము= కర్ణునియొక్క అస్త్రాలకు సంబంధించిన పరాక్రమము; సమ్+అంచిత, కుండల, వజ్రవర్మ, విఖ్యాతియున్= చక్కగా ప్రకృతిసిద్ధంగా అమరిఉన్న చెవిపోగులు, వజ్రం వంటి తనుత్రాణాన్నిగూర్చిన కీర్తిని; ఆత్మలోన్= మనస్సులో; తలఁచి= తలపోసి; ధర్మసూనుఁడున్= ధర్మపుత్రుడును; భీతమనస్కుఁడు+ఐ= భయం చెందిన మనస్సు కలవాడై; అతఁడు= కర్ణుఁడు; అభేద్యబలుండు+అని= భేదించటానికి వీలులేని బలం కలవాడని; సంతతంబు= ఎల్లప్పుడును; ధైర్య+అతిశయంబు= ధైర్యంయొక్క పెంపు; డించి= క్రిందకు పడవైచి; కానలోన్= అరణ్యంలో; హృదయవ్యథన్= ఎదలో ఆవేదనను; పొందుచున్+ఉండెన్= అనుభవిస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: కురువంశానికి నాయకుడైనవాడా, ఓ జనమేజయమహారాజా! కర్ణుడి అస్త్రవిద్యాపాటవాన్ని ఆతడిసహజ కవచకుండలాల కీర్తిని మనస్సులో తలచుకొని అరణ్యవాసంలో ఉన్న ధర్మనందనుడు ధైర్యం కోలుపోయి ఎదలో మిక్కిలి ఆవేదనను అనుభవిస్తూ ఉండేవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అయ్యుధిష్ఠిరునకుఁ బ్రియం బాచరింపంగోరి కర్ణుకవచకుండలంబులు కొనుటకై పురందరుం డొక్కనాఁడు బ్రాహ్మణరూపంబునం జని, మధ్యాహ్నసమయంబునఁ గర్ణుండు సూర్యోపాస్తి సేయుచుండి బ్రాహ్మణుల కభీష్టధనంబు లిచ్చుతఱి నతనిం గని, 'భిక్షాం దేహి' యనుటయుఁ గర్ణుం డతని కిట్లనియె. 358

ప్రతిపదార్థం: ఆ+యుధిష్ఠిరునకున్= ఆ ధర్మనందనుడికి; ప్రియంబు+ఆచరింపన్+కోరి= ప్రీతిని ఘటించ సంకల్పించి; కర్ణుకవచకుండలంబులు= కర్ణుడియొక్క కవచాన్నీ కుండలాలనూ; కొనుటకున్+ఐ= గ్రహించటానికై; పురందరుండు= దేవేంద్రుడు; ఒక్కనాఁడు= ఒకరోజున; బ్రాహ్మణరూపంబునన్+చని= విప్రుని ఆకారంలో వెళ్ళి; మధ్యాహ్నసమయంబునన్= పట్టపగటివేళ; కర్ణుండు; సూర్య+ఉపాస్తి+చేయుచున్+ఉండి= సూర్యుడికి ఆరాధన సలుపుతూ ఉండి; బ్రాహ్మణులకున్= విప్రులకు; అభీష్ట, ధనంబులు= కోరినద్రవ్యాలు; ఇచ్చుతఱిన్= ఒసంగేతరుణంలో; అతనిన్+కని= వాడిని (కర్ణుడిని) చూచి; "భిక్షాం దేహి" = బిచ్చాన్ని ఇమ్ము; అనుటయున్= అని అనగానే; కర్ణుండు; అతనికిన్= విప్రవేషంలో వచ్చిన దేవేంద్రుడికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కర్ణు డంటే భయపడుతున్న ధర్మనందనుడికి సంప్రీతి కలిగించటానికై, కర్ణుడికవచకుండలాలను గ్రహించతలపోసి దేవేంద్రుడు ఒకనాడు విప్రవేషధారి అయి ఏతెంచాడు. అది పట్టపగలు. ఆ మధ్యాహ్నసమయంలో కర్ణుడు సూర్యోపాసన చేస్తూ ఉన్నాడు. అక్కడ గుమిగూడిన బ్రాహ్మణులకందరికీ కోరిన ద్రవ్యాల నతడు ఒసగుతూ ఉన్నాడు. దేవేంద్రుడు ఆ సమయంలో, 'భిక్షాం దేహి' (బిచ్చము పెట్టుము) అని అడిగాడు. అతడితో కర్ణుడు ఈ విధంగా అన్నాడు.

చ. 'అలసవిలాసలాలసరసాన్విత లైన నితంబినీజనుల్
వలసిన, భూరివిస్ఫురితవస్తుసమగ్రము లైన గ్రామముల్
వలసిన, నుల్లసన్మణిసువర్ణవిభూషణగోధనావళుల్
వలసినఁ గోరు మిచ్చెద ధ్రువంబుగ' నావుడు నాతఁ డిట్లనున్. 359

ప్రతిపదార్థం: అలస, విలాస, లాలస, రస+అన్వితలు= సుకుమారమైన విలాసమునందు మిగుల అనురక్తలైన శృంగారవతులు; ఐన; నితంబినీ-జనుల్= స్త్రీలు (నితంబిని-పెద్ద నితంబము పిఱుందు గలది స్త్రీ); వలసినన్= కావలసినా, భూరి, విస్ఫురితవస్తు, సమగ్రములు= అధికంగాఒప్పే పంటలు, వస్తువులు అనువానిచే నిండినవి; ఐన, గ్రామముల్= ఊరులు, వలసినన్= కావలసినా, ఉల్లసత్+మణి, సువర్ణ, విభూషణ, గోధన+ఆవళుల్= ప్రకాశిస్తున్న మణులతో బంగారముతో కూడిన నగలూ, గోధనముల వరుసలు; వలసినన్= కావలసినా, కోరుము; ధ్రువంబుగన్= నిశ్చయంగా ఇచ్చెదన్; నావుడున్= అనినంతనే; ఆతఁడు= కపట విప్రుడైన ఇంద్రుడు; ఇట్లు+అనున్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: మృదువైన విలాసంతో కూడియున్న శృంగారవతులైన యువతులు కావలసినా, అధికమైనా పంటలతోనూ, ప్రకాశించే రత్నాలతో వస్తువులతోనూ నిండిన గ్రామాలు కావలసినా, బంగారంతోనూ కూడిన నగలూ, గోధనాలూ కావలసినా తప్పక ఇస్తాను, కోరుకో అని కర్ణుడనగా విప్రవేషంలో ఉన్న ఇంద్రుడు ఈ రీతిగా పలికాడు.

క. విను మివి యెయ్యవియును నా । కు నభీష్టము గావు; నీదు కుండలములు నీ
వినుతకవచంబు నిచ్చినఁ । గొనియెద; ని మ్మొపుదేని గుణరత్ననిధీ!. 360

ప్రతిపదార్థం: గుణరత్ననిధీ!= మంచిగుణాలు అనే రత్నాలకు నెలవైనవాడా! సుగుణసముద్రుడా!; వినుము= ఆలకింపుము; ఇవి; ఏ+అవియును= ఇవి ఏవీకూడా; నాకున్; అభీష్టము+కావు= ఇష్టాలు కావు, నీదు+కుండలములు= నీ కర్ణభూషణములు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నీ వినుత, కవచంబున్= కీర్తించబడిన నీమైతొడవును; ఇచ్చినన్= ఇస్తే; కొనియెదన్= స్వీకరిస్తాను; ఓపుదు(వు)+ఏనిన్= శక్తిఉంటే; ఇమ్ము= ఒసగుము.

తాత్పర్యం: అవధరింపుము. సుగుణరత్నాకరా! కర్ణా! నీవు చెప్పినవి ఏవియు (అన్నులమిన్నలు, అగ్రహారాలు, సువర్ణమణిభూషణగోధనరాసులు మున్నగునవి) నాకు ఇష్టాలు కావు. నీకు ఇష్టమైతే నీ చెవిపోగులనూ సుప్రసిద్ధమైన నీకవచాన్నీ దానంచేయుము గ్రహిస్తాను.

చ. **అనవుడుఁ గర్ణుఁ డిట్లనియె 'నక్కట! యేను విశిష్టవస్తువుల్**
గొనకొని యిత్తు నాఁగ నిటు గోరెదు నీవు దలంప నప్రయో
జన మగు వాని భూమిసురసత్తమ! యెంతయు బేల వైతి; ము
న్ననయఁగ నిట్టి వెవ్వరును నెవ్వరి వేఁడిరె యిజ్జగంబులన్? **361**

ప్రతిపదార్థం: అనవుడున్= అని (విప్రవేషధారి) చెప్పగా; కర్ణుఁడు, ఇట్లు+అనియెన్= ఈరీతిగా చెప్పాడు; అక్కట!= అయ్యో!; ఏను= నేను; విశిష్టవస్తువుల్= విశేషప్రాముఖ్యంగల పదార్థాలు; గొనకొని+ఇత్తున్= పూని (ఇష్టంతో) ఇస్తానని; నాఁగన్= అనగా; భూమిసురసత్తమ!= బ్రాహ్మణులలో శ్రేష్ఠుడా!; ఇటు= ఈ రీతిగా; నీవు= నీవు; తలంపన్= ఆలోచించగా; అప్రయోజనము+ అగువానిన్= లాభం లేని వాటిని; కోరెదు= కోరెదు(వు)= కోరుతున్నావు; ఎంతయున్= మిక్కిలి; బేలవు= అమాయకుడవు; ఐతి(వి)= అయినావు; మున్ను= పూర్వం; ఎనయఁగన్= ఒప్పిదంగా; ఇట్టివి= ఇట్టికోరికలు; ఎవ్వరును= ఎవరైనా; ఈ+జగమ్ములన్= ఈలోకాలలో; ఎవ్వరిన్= ఎవరినైనా; వేఁడిరె?= అడిగారా?

తాత్పర్యం: అనిన కర్ణు డీవిధంగా అన్నాడు: 'అయ్యో, ఓ బ్రాహ్మణోత్తమా! నేను నీకు విశేషమైన ప్రాముఖ్యం గల వస్తువులను ఇస్తా నని చెప్పానుకదా! నీవు అమాయకుడివలె కన్పిస్తున్నావు. నీవు ఈ ఉపయోగంలేని వస్తువులను ఎందుకు కోరుకొంటున్నావు? నీవలె ఇంతకుముందు ఎవరైనా ఎవరినైనా జగత్తులో ఇటువంటివాటిని కోరినవారు ఉన్నారా? (నీకోర్కె అపూర్వం అని భావం).

క. **కుండలములుఁ గవచము న । ట్లుండఁగ ని మ్మనఘ! వేఁడు మొండు ధనంబుల్;**
నిండింతు నీమనోరథ । మొండేమియు ననకు మింక నూర్జితచరితా!.' **362**

ప్రతిపదార్థం: ఊర్జితచరితా!= గొప్ప శీలం కలవాడా!; అనఘా!= పాపరహితుడవైనవాడా! ఓ బ్రాహ్మణోత్తమా!; కుండలములున్= చెవిదుద్దులును; కవచమున్= తనుత్రాణాన్ని; అట్లు+ఉండఁగనిమ్ము= అటులనే ఉండనిమ్ము; ఒండు ధనంబుల్= వేరుద్రవ్యాలను; వేఁడుము= కోరుకొనుము; నీమనోరథమున్= నీకోరికను; నిండింతున్= పరిపూర్ణం చేస్తాను, ఈడేర్చగలను; ఇంకన్+ఒండు+ ఏమియున్+అనకుము= దయచేసి ఇక మారుమాట పలుకవద్దు.

తాత్పర్యం: గొప్పశీలం కల బ్రాహ్మణోత్తమా! నీవు పుణ్యాత్ముడవు. నీకు నిరుపయోగాలైన కవచకుండలాల మాట దయచేసి ఎత్తకుము. వేరుద్రవ్యాలను కోరుకొమ్ము. నీకోరిక పరిపూర్ణంగా తీరేటట్లు చేయగలను. ఇక నామాటకు ఎదురుమాట చెప్పవద్దు'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన నతం డెవ్విధంబున నొడంబడక కవచకుండలంబులయంద బద్ధాభిలాషుం డయి పలికినఁ, గర్ణుం డతనిం బ్రార్థించియుఁబూజించియు ననేకమణికనకాది ద్రవ్యంబులు నివేదించియు నెట్లును నొడంబఱుపనేరక యి ట్లనియె. 363

ప్రతిపదార్థం: అనినన్= అని (కర్ణుఁడు) చెప్పగా; ఏ+విధంబునన్= ఏరీతిగా నయినను; ఒడంబడక= అంగీకరించక; కవచకుండలంబులయందున్+అ= కవచకుండలాలయందుమాత్రమే; బద్ధ+అభిలాషుండు+అయి= స్థిరంగా లగ్నమైన కోరిక కలవాడు అయి; అతండు; పలికినన్; కర్ణుండు; అతనిన్= (విప్రవేషధారిని); ప్రార్థించియున్= వేడికొనినా; పూజించియును= అర్చించినా; అనేక, మణి, కనక+ఆది, ద్రవ్యంబులు= పెక్కురత్నాలు బంగారాలు మున్నగు పదార్థాలు; నివేదించియున్= ఇవ్వచూపినా; ఎట్లునున్= ఏవిధంగానూ; ఒడంబఱుపనేరక= అతడిని అంగీకరింపజేయజాలక; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: కర్ణుడు చెప్పినమాటలకు విప్రవేషధారి సమ్మతించక తనకు కవచకుండలాలే కావా లని మొండిపట్టు పట్టాడు. కర్ణుడు ఆ విప్రవేషధారిని వేడికొన్నాడు. అతడికి పూజలు చేశాడు. పెక్కురత్నాలు బంగారాలు మున్నగుపదార్థాలను ఇవ్వజూపాడు. కాని, ఆ విప్రవేషధారి తనపట్టుదల వీడలేదు. అప్పుడు కర్ణుడు ఆ విప్రవేషధారితో ఇట్లా అన్నాడు.

తే. 'సహజములు నాకు నిక్కవచంబుఁ గుండ । లములు నివి లేకయున్న నే సమరభూమిఁ
గడిఁది శత్రులచేత భంగంబు వచ్చుఁ । గాన యీఁజాల నయ్యెద వీని నేను. 364

ప్రతిపదార్థం: నాకున్; ఈ+కవచంబున్; కుండలములున్= ఈ కవచం, పోగులు; సహజములు= పుట్టుకతోవచ్చినవి; ఇవి= ఈకవచకుండలాలు; లేకయున్నన్= లేనిచో; ఏ సమరభూమిన్= ఏ యుద్ధరంగంలోనైనా; కడిఁది, శత్రులచేతన్= గొప్పవిరోధులచేత; భంగంబు= పరాజయం; వచ్చున్= కలుగును; కాన= కావున; వీనిన్= వీటిని, ఈ కవచకుండలాలను; ఏను= నేను; ఈన్+చాలన్+అయ్యెదన్= ఈయజాలనివాడనౌతున్నాను.

తాత్పర్యం: ఈకవచకుండలాలు నాకు పుట్టుకతోనే ఉన్నవి కాని నేను సంపాదించి పెట్టుకొన్నవి కావు. ఈ కవచకుండలాలు లేకపోతే ఏ యుద్ధభూమిలోనైనా బలవంతులైన విరోధులు దాపురించినపుడు నాకు పరాజయం కలుగుతుంది. కావున ఈ కవచకుండలాలను నేను ఇవ్వలేను.

విశేషం: (1) దానం చేయవలసింది స్వార్జితమైన తనసొత్తుమాత్రమే. కవచకుండలాలు కర్ణుడిస్వార్జితాలు కావు. అంతేకాక, ఇవి అతడికి ప్రాణసమానాలు. ఈపద్యంవలన కర్ణుడికి తన కవచకుండలాల విలువ తెలిసినట్లు తేలుతున్నది. ఇది తెలియక చేసే దానం కాదు. ఈపద్యంలోని స్వారస్యం గుర్తించతగింది. (2) 'ఏ సమరభూమిఁగడిఁది శత్రులచేత భంగంబువచ్చు' - అనే ఈ పాఠానికి 'నే సమరభూమిఁగడిఁది భంగంబు వడుదు' - అనే పాఠాంతరం వావిళ్ళప్రతిలో కానవస్తున్నది.

క. నానాజనపదబహుళము । నానాధనయుతము నైన నారాజ్యము స
మ్మానంబున నిచ్చెదఁ గొన । వే ననుఁ గారింప కింక విప్రవరేణ్యా!' 365

ప్రతిపదార్థం: విప్రవరేణ్యా!= ఓబ్రాహ్మణోత్తమా!; నానా, జనపదబహుళము= పెక్కుగ్రామాలతో విస్తరించినట్టిది; నానాధనయుతమున్= పెక్కువిధాలైన ద్రవ్యాలతో కూడినది; ఐన; నారాజ్యము= నారాజ్యం; అంగదేశం; సమ్మానంబునన్= గౌరవపూర్వకంగా; ఇచ్చెదన్= సమర్పిస్తాను; ఇంకన్= ఇక; ననున్= నన్ను; కారింపక= వేధించకుండ; కొనవే= స్వీకరించుమా.

తాత్పర్యం: ఓ బ్రాహ్మణోత్తమా!, పెక్కుగ్రామాలతో విస్తరించినట్టిది, పెక్కుద్రవ్యసంపదలతో కూడినట్టిది అయిన నారాజ్యం అంగదేశం. దానిని నీకు బహుమానంగా సమర్పిస్తాను. దయతో స్వీకరించుము. ఇక నన్ను వేధించవద్దు'.

వ. అనియును నతనియందు సుముఖత్వంబు గానక కానీనుండు దరహసితాననుం డగుచుఁ గృతకభూసురు నుపలక్షించి యి ట్లనియె. 366

ప్రతిపదార్థం: అనియును= అని చెప్పికూడా; అతనియందున్= ఆ విప్రుడిలో; సుముఖత్వంబు= సమ్మతించిన పోకడ; కానక= చూడక; కానీనుండు= కన్యాపుత్రుడు కర్ణుడు; దరహసిత+ఆననుండు= చిరునవ్వుతో కూడిన మొగం కలవాడు; అగుచున్= ఔతూ; కృతకభూసురున్= కపటవిప్రుడిని; ఉపలక్షించి= చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పినప్పటికిని, ఆ బ్రాహ్మణుడియందు సమ్మతించిన జాడ కానుపించకపోవటం చూచి, కన్యకకు జనించినవాడైన కర్ణుడు చిరునవ్వుతో కూడిన మొగం కలవాడూ ఔతూ ఇట్లా అన్నాడు.

విశేషం: కర్ణుడు 'దరహసితవదనుడు' అయ్యాడు. దానికి కారణం ఆ బ్రాహ్మణుడు కపటవేషధారి అని కర్ణుడు గుర్తించటమే. కర్ణుడిముఖాన విరిసిన దరహాసముద్రకు అంతరార్థం తరువాతిపద్యంలో సుస్పష్టం.

చ. 'ఎఱిఁగితి నిన్ను నేను; విబుధేంద్రుఁడ వీవు; జగత్త్రయంబు గ్ర
చ్ఛఱ భవదీయరక్షణమునంద వెలుంగుచునుండు; నట్టి ని
న్నుఱవుగ నేను వేఁడుకొన యుక్తుఁడఁగాక, మొఱంగి నన్ను న
క్కఱ పడి నీవు వేఁడు టిది కర్జమె నిర్జితదైత్య! చెప్పుమా! 367

ప్రతిపదార్థం: నిర్జితదైత్య!= రాక్షసులను జయించినవాడా! ఓదేవేంద్రా!; నేను; నిన్నున్ ఎఱిఁగితి= నిన్ను గుర్తించాను; ఈవు= నీవు; విబుధ+ఇంద్రుఁడవు= దేవతలకు అధినేత వైనవాడవు; జగత్+త్రయంబు= మూడులోకాలు; గ్రచ్ఛఱన్= (గ్రచ్చు+అఱన్) నిష్కల్మషంగా; భవదీయరక్షణమునందున్+అ= నీయొక్క కాపుదలయందే; వెలుంగుచున్+ఉండున్= శోభిల్లుతుంటాయి; అట్టి= అటువంటి; నిన్నున్; ఉఱవుగన్= ఒప్పిదంగా; ఏను= నేను; వేడుకొనన్= ప్రార్థించటానికి; యుక్తుఁడన్+కాక= అర్హుడను గాని; మొఱంగి= వంచించి; నన్నున్; అక్కఱ+పడి= అవసరపడి; సవ్యాజంగా; నీవు (ఓఇంద్రుడా! నీవు); వేడుట= అర్థించటం; ఇది; కర్జము+ఎ?= (కర్జమె)? చేయదగిన కృత్యమా?; చెప్పుము+అ= దయచేసి వచించుము.

తాత్పర్యం: రాక్షసులను జయించిన ఓ దేవేంద్రా! నేను నిన్ను గుర్తుపట్టగలిగాను సుమా! మూడులోకాలు నీసంరక్షణలో శోభిల్లుతున్నాయికదా! అట్టి నిన్ను నేను వేడుటలో అర్థముంటుంది గాని నీవే నన్ను ఏదో వ్యాజంతో యాచించటమా? అంతేకాక నన్ను నీవు మారువేషంలో వచ్చి వంచించటం చేయవలసిన కృత్యమా? దయచేసి నీవే చెప్పుము.

విశేషం: (1) కర్ణుడు కపటవిప్రుడిని దేవేంద్రుడిగా గుర్తించాడుకదా! 'నీవు బ్రాహ్మణుడవు కావు. వంచకుడవు. నేను నీకు ఎట్టిదానాన్ని చేయను' అని కర్ణుడు అనలేదు. దేవేంద్రుడు వంచకుఁడే అయినను, కర్ణుడు తనదానవ్రతాన్ని మాత్రం విడనాడ దలచ లేదు. (2) దానానికి అంతరాత్మ త్యాగం అని మహాభారతసందేశం. సక్తుప్రస్థునిగాథ ఉదాహరణం. ధర్మరాజు అశ్వమేధయాగంలోని దానాలు గాని షోడశమహారాజులు యజ్ఞాలలో చేసినదానాలు గాని ఆధ్యాత్మికదృష్టిలో అచ్చమైన దానాలు కావని ముంగిసరూపం ధరించిన జమదగ్ని మహాముని వివరించి ఉన్నాడు. అచ్చమైన దానంలో ఆత్మార్పణ అమరిఉంటుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కర్ణుడి కవచకుండలప్రదానంలో త్యాగయోగంతో కూడిన ఆత్మార్పణం అమరిఉన్నది. ఆసంగతి దేవేంద్రుడికి తెలియును. కర్ణుడు దానవ్రతాన్ని విడనాడడు అనే విశ్వాసం దేవేంద్రుడికి ఉన్నది.

తే. **అనిన నింద్రుఁ డిట్లనియె 'మీయయ్య పద్మ । హితుఁడు మున్నింతయును జెప్పె నిష్ట మెసఁగ**
గాన నెఱిఁగితి నీ; వింకఁ గడప నేల । యనఘ! మాబోఁటులకుఁ బ్రియమైన పనికి'. **368**

ప్రతిపదార్థం: అనినన్= అని (కర్ణుడు) చెప్పగా; ఇంద్రుఁడు= వేల్పులరేడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అనఘ!= పుణ్యాత్ముడా!; మీ+అయ్య= మీతండ్రి; పద్మహితుఁడు= సూర్యుడు; ఇష్టము+ఎసఁగన్= ప్రీతి అతిశయించగా; మున్ను= మునుపు; ఇంతయున్= ఈ విషయాన్ని అంతటిని; చెప్పెన్= వచించిఉన్నాడు; కానన్= కావున; నీవు; ఎఱిఁగితి(వి)= తెలిసికొన్నావు; ఇంకన్= ఇకమీద; మాబోఁటులకున్= మావంటివారికి; ప్రియము+ఐన, పనికిన్= ఇష్టమయిన కార్యానికి; కడపన్+ఏల= ఇయ్యక పొమ్మంటావెందుకు?

తాత్పర్యం: కర్ణుడితో ఇంద్రుడు ఈ రీతిగా వచించాడు: 'పుణ్యాత్ముడవైన ఓకర్ణా! నీతండ్రి అయిన సూర్యుడు మున్ను నీమీదిప్రేమతో ఈ విషయాన్ని అంతటిని చెప్పిఉన్నాడు కాబట్టి నీవు నన్ను గుర్తించగలిగితివి సరే. ఇక మాబోటివారికి ఇష్టమైనకార్యం నెరవేర్చకుండా నీవు పొమ్మంటావెందుకు?

వ. **అనిన రాధేయుండు 'దేవా యట్లయిన నిఖిలశత్రుఘాతిని యయిన నీయమోఘశక్తి నాకుం గృప సేసి కవచకుండలంబులు గొను' మనినం బాకశాసనుం డి ట్లనియె.** **369**

ప్రతిపదార్థం: అనినన్= అని (దేవేంద్రుడు) చెప్పగా; రాధేయుండు= కర్ణుడు; దేవా= దేవరా! ఓ దేవేంద్రా!; అట్లుఅయినన్; నిఖిల, శత్రు ఘాతిని అయిన= సమస్తశత్రువులను సంహరించేది అయిన; నీ+అమోఘ, శక్తి= ఎన్నడు బీరువోనట్టి "శక్తి" అనే ఆయుధం; నాకున్= నాకు; కృప+చేసి= అనుగ్రహించి; కవచకుండలంబులు= తనుత్రాణాన్ని, కర్ణభూషణాలను; కొనుము= స్వీకరించుము; అనినన్= అని చెప్పగా; పాకశాసనుండు= దేవేంద్రుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా కర్ణుడు ఇట్లా అడిగాడు: 'దేవేంద్రా! అట్లే అయితే సమస్త శత్రువులను చంపగలిగిన తిరుగులేని శక్తి అనే నీ ఆయుధాన్ని నాకు దయచేసి ఇచ్చి, నా కవచకుండలాలను తీసికొమ్ము' అనగా ఇంద్రుడు ఇట్లా అన్నాడు.

ఉ. **'ఇచ్చెద శక్తి నీకు; విను మేర్పడ; నాజి మదీయశత్రులం**
గ్రచ్చఱఁ జంపి చంపి యది గ్రమ్మఱ చేతికి వచ్చుచుండు; నీ
కిచ్చుట యట్లు గాదు; భువి నెందును దుర్జయుఁ డైన నీరిపుం
జెచ్చెరఁ దున్ను నొక్కరుని; చేకుఱ నన్ను భజించుఁ గ్రమ్మఱన్. **370**

ప్రతిపదార్థం: నీకున్= నీకు; శక్తిన్= శక్తి అనే ఆయుధవిశేషాన్ని; ఇచ్చెదన్= ఇస్తాను; ఏర్పడన్+వినుము= సావధానంగా ఆలకించుము; ఆజిన్= యుద్ధంలో; మదీయశత్రులన్= నావిరోధులను; క్రచ్చఱన్= (క్రచ్చు+అఱన్=) శీఘ్రంగా (నిరవశేషంగా); చంపి, చంపి= పూర్తిగా సంహరించి; అది= ఆ "శక్తి"; క్రమ్మఱ= మరల; చేతికిన్ వచ్చుచుండున్= నాచేతికి చేరుతూ ఉంటుంది; నీకున్+ఇచ్చుట= నీకు ఇవ్వటం; అట్లు+కాదు= ఆ విధంగా కాదు; భువిన్= భూలోకంలో; ఎందును= ఎచ్చటను; దుర్జయుఁడు+ఐన= గెలువ నలవిగాని; నీ రిపున్= నీశత్రువును; చెచ్చెరన్= శీఘ్రంగా; ఒక్కరుని= ఒకరినిమాత్రమే; తన్మన్= సంహరిస్తుంది; క్రమ్మఱన్= మరల; చేకుఱన్= లభించేటట్టు; నన్నున్= నన్ను; భజించున్= పొందుతుంది.

తాత్పర్యం: 'నీకు నాఆయుధవిశేషం 'శక్తి' ని ఇస్తాను. కాని, నేను విధించే నియమాన్ని సావధానంగా వినుము. యుద్ధంలో నా 'శక్తి' శత్రువులను శీఘ్రంగా సంహరించి మరల నాచేతికి వస్తూ ఉంటుంది. ఇప్పుడు నేను నీకు ఇచ్చే శక్తి భూలోకంలో గెలువశక్యం గాని నీశత్రువును ఒకరిని మాత్రమే చంపి, తిరిగి నావద్దకు వచ్చి చేరి నన్ను సేవిస్తుంది.

వ. **ఇట్టిది సమయంబుగాఁ బరిగ్రహింపు' మనినఁ గర్ణుండు 'నాకుం గల పగతుండును నొక్కరుండ; వాని వధియించుటయ మదీయమనోరథం' బనుటయుఁ బురందరుండు దరహసితవదనుం డై.** **371**

ప్రతిపదార్థం: ఇట్టిది= ఇటువంటిది; సమయంబుగాన్= నియమముగా; ('శక్తి'); పరిగ్రహింపుము= స్వీకరించుము; అనినన్= అని (దేవేంద్రుడు) పలుకగా; కర్ణుండు; నాకున్+కల= నాకు ఉన్న; పగతుండును= విరోధియున్నూ; ఒక్కరుండు+అ= ఒక్కడు మాత్రమే; వానిన్= అతడిని, ఆశత్రువును; వధియించుట+అ= సంహరించుట మాత్రమే; మదీయ, మనోరథంబు= నా కోరిక; అనుటయున్= అని చెప్పగా; పురందరుండు= దేవేంద్రుడు; దరహసితవదనుండు+ఐ= చిరునవ్వుతో కూడిన మొగం కలవాడై.

తాత్పర్యం: ఈ నియమానికి అంగీకరించి నీవు నా 'శక్తి'ని పరిగ్రహించుము' అని దేవేంద్రుడు చెప్పాడు. కర్ణుడును 'నాకు గల శత్రువు ఒక్కడే. ఆతడిని సంహరించటమే నాకోరిక. అందుచేత నీవు నిర్ణయించిన నియమానికి అంగీకరిస్తున్నాను' అని అన్నాడు. దేవేంద్రుడు కర్ణుడిపలుకులు ఆలకించి చిరునవ్వుతో కూడిన మొగం కలవాడై.

ఉ. **'నీ యభిలాష మేను మది నిక్క మెఱుంగుదు; నుగ్రశౌర్యతే**
జోయుతుఁ బార్థు నోర్తు నని చూచెదు; నీ కది యేల తీరు రా
ధేయ! దయావిధేయుఁడు విధేయజగత్త్రయుఁ డవ్యయుండు నా
రాయణుఁ డమ్మహాత్మునకు రక్షకుఁ; డేరికి వాఁడు సాధ్యుఁడే?' **372**

ప్రతిపదార్థం: రాధేయ= ఓకర్ణా!; నీ+అభిలాషము= నీ కోరిక; ఏను= నేను; మదిన్= చిత్తంలో; నిక్కము= నిజంగా; ఎఱుంగుదున్= తెలియుదును; ఉగ్ర, శౌర్య, తేజోయుతున్= (తేజస్+యుతు) భయంకరమైన వర్చస్సుతో కూడినవాడిని; పార్థున్= అర్జునుడిని; ఓర్తున్= జయింతును; అని చూచెదు= అని ఆలోచిస్తావు; నీకున్; అది= అర్జునుడినిజయించటం; ఏల, తీరున్= ఎందుకు నెరవేరుతుంది?; దయావిధేయుఁడు= కరుణకు లోబడినవాడు, కృపామూర్తి; విధేయ, జగత్+త్రయుఁడు= లోబడిన మూడులోకాలు కలవాడు; అవ్యయుండు= అక్షరుడు; నారాయణుఁడు= శ్రీకృష్ణుడు; ఆ+మహా+ఆత్మునకున్= ఆ మహనీయుడికి, అర్జునుడికి; రక్షకుఁడు= కాపాడేవాడు; వాఁడు= అతడు, అర్జునుడు; ఏరికిన్= ఎవరికైనను; సాధ్యుఁడు+ఏ= సాధించదగినవాడా? (ఎవరును అర్జునుడిని జయించజాలరు.)

తాత్పర్యం: ఓకర్ణా! నీకోరికలోని ఆంతర్యం నామనస్సులో తెలిసికొన్నాను. భయంకరమైన శౌర్యం గల అర్జునుడిని యుద్ధంలో జయించవలెనని నీ ఉబలాటం కాని, నీకోరిక ఈడేరేది కాదు. మూడులోకాలున్నూ అవ్యయుడైన నారాయణదేవుడికి విధేయాలు. ఆ దేవుడు కృపారసమూర్తి. అతడు శ్రీకృష్ణుడు- అర్జునుడిని కాపాడేవాడు. కనుక, అర్జునుడు ఎవరికిన్నీ సాధ్యుడు కాడు. నీవు అర్జునుడిని గెలువజాలవు.'

వ. **అనినం దపననందనుం 'డది యట్లుండె; సహజం బైన కవచం బొలిచి యిచ్చిన మదీయదేహంబు వికృతం బగు; నిది యే మని యవధరించె?' దనిన నింద్రుండు 'నీ శరీరంబు భవజ్జనకుం డైన యరుణకిరణవర్ణం**

బెట్టి దట్టిదీప్తిం జెలువొందు' నని పలికి వానికి నమోఘశక్తి యొసంగి 'దీని నాపత్కాలంబునం దక్కఁ బెఱయప్పుడు ప్రయోగించిన నీ కపాయంబగు' నని చెప్పెఁ; దదనంతరంబ యవ్వీరుండు కవచ కుండలంబులం బుచ్చి యతని కిచ్చె. 373

ప్రతిపదార్థం: అనినన్= అని (దేవేంద్రుడు చెప్పగా); తపననందనుండు= సూర్యపుత్రుడైన కర్ణుడు; అది= అది(నీమాట); అట్లు+ఉండెన్= ఆరీతిగా ఉండనిమ్ము; సహజంబు+అయిన= పుట్టుకతో ఏర్పడిన; కవచంబు= తనుత్రాణం; ఒలిచి ఇచ్చినన్= ఒలిచి ఇస్తే; మదీయదేహంబు= నాశరీరం; వికృతంబు+అగున్= వికారం కాగలదు; ఇది= ఈ విషయం; ఏమి+అని= ఏమని; అవధరించెదు= ఆలోచిస్తావు'; అనినన్= అని అడుగగా; ఇంద్రుండు; 'నీశరీరంబు= నీదేహం; భవత్+జనకుండు+ఐన= నీతండ్రిఅయిన; అరుణకిరణువర్ణంబు= ఎర్రని కిరణాలు కలవాడైన సూర్యుడిరంగు; ఎట్టిది+అ= ఎట్టిదో; అట్టి= అటువంటి; దీప్తిన్= ప్రకాశంతో; చెలువు+ఒందున్= శోభను పొందుతుంది; అని పలికి= అని వచించి; వానికిన్= అతడికి, కర్ణుడికి; అమోఘశక్తిన్= వ్యర్థంకాని- 'శక్తి' - అనే ఆయుధ విశేషాన్ని; ఒసంగి= ఇచ్చి; దీనిన్= దీనిని; ఆపత్+కాలంబునన్+తక్కన్= ఆపద ఏర్పడిన సమయంలో తప్ప; పెఱ+అప్పుడు= వేరేసమయంలో; ప్రయోగించినన్= ఉపయోగిస్తే; నీకున్= ఓకర్ణా! నీకు; అపాయంబు+అగును= కీడుకలుగుతుంది; అని చెప్పెన్= అని వచించాడు; తత్+అనంతరంబు+అ= అటు పిమ్మట; ఆ+ వీరుండు= కర్ణుడు; కవచకుండలంబులన్+పుచ్చి= కవచకుండలాలను వెలికి తీసి; అతనికిన్= దేవేంద్రుడికి; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: అని దేవేంద్రుడు చెప్పగా కర్ణుడు. 'దానికేమిగాని ఇప్పుడు కవచం ఒలిచి నీకు ఇస్తే నాశరీరం వికార మౌతుందికదా! దీనికి నీవేమి ఆలోచించావు' అనిన, ఇంద్రుడు, 'నీశరీరం నీజనకుడైన సూర్యుడి తేజస్సుతో, బాలార్కసమానమైన రంగుతో భాసిల్లుతుంది' అని పలికి అతడికి తన ఆయుధవిశేషమైన 'శక్తి'ని ఇచ్చి, దీనిని కష్టసమయంలో మాత్రమే ప్రయోగింప దగును. కానిచో నీకే ప్రమాదం ఏర్పడగలదు' అని హెచ్చరించాడు. అంత వీరుడైన కర్ణుడు తనకవచకుండలాలను వెలికి తీసి దేవేంద్రుడికి ఇచ్చాడు.

చ. అలఘునిశాతశస్త్రమున నంగము లెల్లను నిర్వికారుఁ డై
యొలువఁ దొడంగినట్టియెడ హో యని కిన్నర యక్ష సిద్ధ సా
ధ్యులు దివినుండి యార్చుచును దూర్యరవంబు సెలంగ నద్భుతం
బెలయఁగఁ బుష్పవృష్టిఁ గురియించిరి కర్ణునిపైఁ బ్రియంబునన్. 374

ప్రతిపదార్థం: అలఘు, నిశాత, శస్త్రమునన్= గొప్ప వాడి అయిన ఆయుధంతో; అంగములు+ఎల్లను= అవయవాల నన్నిటిని; నిర్వికారుఁడు+ఐ= వికారము లేనివాడై (ధైర్యంతో చలించని చిత్తం కలవాడై); ఒలువన్+తొడంగినట్టి+ఎడన్= పైచర్మం ఒలుచుటకు పూనినట్టి సమయంలో; 'హో' అని= ఓహో, భళీ, భళీ - (ఎంతటి గొప్పదానం) అని; కిన్నర, యక్ష, సిద్ధ, సాధ్యులు= కిన్నరులు యక్షులు సిద్ధులు సాధ్యులు; దివినుండి= స్వర్గంనుండి; ఆర్చుచును= ఉద్ఘోషిస్తూనే; తూర్యరవంబు+ చెలంగన్= మంగళప్రదాలైన జంత్రవాద్యాల నాదం ధ్వనించగా; అద్భుతంబు= ఆశ్చర్యం; ఎలయఁగన్= అతిశయించగా; ప్రియంబునన్= ప్రీతితో; కర్ణునిపైన్= కర్ణుడిమీద; పుష్పవృష్టి= పూలవాన; కురియించిరి= వర్షించారు.

తాత్పర్యం: తనసహజకవచకుండలాలను దేవేంద్రుడికి అర్పించటానికై, గొప్ప పదను గలిగిన ఆయుధంతో కర్ణుడు తన అవయవాల నన్నింటి పైచర్మం ఒలువసాగాడు. అప్పుడు ఆ అద్భుతదృశ్యాన్ని తిలకించి వేలుపుతెగలవారు -

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యక్షులు కిన్నరులు సిద్ధులు సాధ్యులు ఆకసంలో చేరి - 'ఓహో, ఎంతటి ఈవి, ఏమి త్యాగం' - అని ఉద్ఘోషిస్తూ దుందుభులు మంగళతూర్యాలు మ్రోగించి ప్రీతితో కర్ణుడిపై పూలవాన కురిపించారు.

విశేషం: (1) నభమున దేవదుందుభులు మ్రోగటం! దివినుండి భువికి పుష్పవృష్టి కురియటం! అతిశయోక్తిగా అలంకారవిశేషంగా అసంగతాలైన అసత్యకల్పనలుగా ఆధునికులు కొందరు విమర్శించవచ్చు. కామక్రోధలోభ మోహమదమాత్సర్యగ్రస్తులు అయిన మానవులు నివసించేది ఈభూలోకం. ఈమానవులలోగూడ దేవతలు సయితం ఆశ్చర్యచకితులై పరవశించి సంగీత తాళలయలతో నర్తించి మెచ్చదగినట్టి అతిలోకమైన ఘనకార్యం అప్పుడపుడు చేసేవారు ఉండవచ్చును. అట్టి అద్భుతసన్నివేశాలు అనిమిషులు "అహో నేత్ర నిర్వాణమ్" అని చూడదగిన దృశ్యాలను అభివర్ణించటానికి భాషకు శక్తిచాలదు. అది శబ్దాలంకార విశేషభాషలకు అగమ్యం. సహృదయహృదయైక వేద్యం. (2) ఇచట 'రసము' - వీరము. వీరరసం దయావీరం, ధర్మవీరం, దానవీరం అని ప్రాచీనులు మూడువిభాగాలు చేశారు. వీరరసానికి స్థాయిభావం ఉత్సాహం. లోకోత్తర కార్యనిర్వహణంలో ఏర్పడే స్థిరసంకల్పానికి ఆలంకారికులు ఉత్సాహం అని వ్యపదేశంచేశారు. (3) కర్ణుడిభారతం అనే సుభాషితం తెలుగునేలలో సుప్రసిద్ధం. మహాభారతగాథకు కర్ణుడే ప్రధాననాయకుడుగా భావించేవారు ఉన్నారు. ఈ ఘట్టంలో కథానాయకుడు కర్ణుడు అనటం నిర్వివాదం. (4) కర్ణుడికిని- దుర్యోధనుడికిని కవిత్రయభారతంలో జరుగవలసిన న్యాయం జరుగలేదని విమర్శించేవారు కొందరు ఉన్నారు. నభమున దేవదుందుభులు మ్రోగటం - దివినుండి భువిపైన పుష్పవృష్టి కురియటం - ఎఱ్ఱన కర్ణుడిపట్ల (ఆరణ్యపర్వంలో), తిక్కన దుర్యోధనుడిపట్ల (శల్యపర్వంలో) హృదయంగమంగా అభివర్ణించటం చిరస్మరణీయం.

వ. ఇట్లు సూతపుత్త్రుని వికృతగాత్రుం జేసి వాసవుండు ప్రమోదవికాసభాసితుం డగుచు నిజలోకంబున కరిగెఁ; దద్వృత్తాంతం బంతయు విని కౌంతేయు లత్యంతసంతోషంబునం బొదలిరి; గాంధారేయులు దుఃఖవిదారితహృదయ లయి; రని యిట్లు కవచకుండలాభిహరణంబు సవిస్తరంబుగాఁ జెప్పిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 375

ప్రతిపదార్థం: వాసవుండు= దేవేంద్రుడు; ఇట్లు= ఈవిధంగా; సూతపుత్త్రుని= కర్ణుడిని; వికృత, గాత్రున్+చేసి= వికారమయిన శరీరం కలవాడినిగా చేసి; ప్రమోద, వికాస, భాసితుండు+అగుచున్= సంతోషంతో వికసించిన ఆకారం కలవాడు ఔతూ; నిజలోకంబునకున్= తనస్వర్గలోకానికి; అరిగెన్= వెళ్ళాడు; తత్+వృత్తాంతంబు= ఆ కథ; అంతయున్+విని= సంపూర్ణంగా ఆలకించి; కౌంతేయులు= పాండవులు; అత్యంత సంతోషంబునన్= మిక్కుటమైన ఆనందంతో; పొదలిరి= వర్ధిల్లారు; గాంధారేయులు= గాంధారికొడుకులు కౌరవులు; దుఃఖ, విదారిత, హృదయులు+అయిరి= ఆవేదనచేత చీల్చబడిన డెందాలు కలవారు అయ్యారు; అని= అని; ఇట్లు= ఈవిధంగా; కవచ, కుండల+అభిహరణంబు= కవచాన్ని కుండలాలను అపహరించటం; సవిస్తరంబుగాన్= విరివిగా (సాంగోపాంగసమృద్ధంగా); చెప్పినన్= వచించగా; విని= ఆలకించి; జనమేజయుండు; వైశంపాయనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా కర్ణుడి కవచకుండలాలు గొని అతడిని వికృతశరీరుడిగా చేసి, సంతోషంతో ప్రకాశించేవాడయి దేవేంద్రుడు తన స్వర్గలోకానికి చేరాడు. ఆ వృత్తాంతం విని పాండవులు ఆనందించారు. కౌరవులు దుఃఖించారు. ఇట్లు కవచకుండలాలను దేవేంద్రుడు అపహరించినకథను సవిస్తరంగా ఆలకించి జనమేజయమహారాజు వైశంపాయనమహర్షితో ఇట్లా అన్నాడు.

క. 'అనయము దుస్తర మగు న। వ్వనవాసము నిస్తరించి ద్వాదశవర్షం
బున కడపట నేమి విధం। బొనరించిరి మత్పితామహులు మునినాథా!' 376

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మునినాథా!= ఓ వైశంపాయనమహర్షీ!; అనయము= అత్యంతం; దుస్తరము+అగు= దాటటానికి కష్టం అయిన; ఆ+వనవాసము= ఆ అరణ్యంలో నివసించటం; నిస్తరించి= దాటి; ద్వాదశవర్షంబున+కడపటన్= పండ్రెండవ సంవత్సరంయొక్క చివర; మత్+పితామహులు= నాతాతలు; ఏమి, విధంబు+ఒనరించిరి= ఏరీతిగా ప్రవర్తించారు.

తాత్పర్యం: 'దాటుటకు మిక్కిలి కష్టమయిన వనవాసాన్ని పండ్రెండేండ్లు చేసి, పండ్రెండవయేటికడపట ఏవిధంగా మా తాతలు ప్రవర్తించారో వైశంపాయనమహర్షీ! దయచేసి తెలుపుము.'

వ. అనిన నమ్మహీపతికి నమ్మహీదేవుం డిట్లనియె; నట్లు మార్కండేయువలనఁ బుణ్యకథలు విని పాండవు లనంతరంబ క్రమ్మఱి ద్వైతవనంబునకుం జని, యం దొక్కనాఁడు సుఖాసీనుం డయి యున్న ధర్మరాజుపాలికి నొకబ్రాహ్మణుండు సంభ్రమంబునఁ జనుదెంచి యిట్లనియె. 377

ప్రతిపదార్థం: అనినన్= అని పల్కగా; ఆ+మహీపతికిన్= ఆమహారాజుకు, జనమేజయుడికి; ఆ+మహీదేవుండు= ఆ బ్రాహ్మణుడు; వైశంపాయనుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అట్లు= ఆరీతిగా; మార్కండేయువలనన్= మార్కండేయమహర్షినుండి; పుణ్యకథలు= సుకృతం చేకూర్చే గాథలు; విని= ఆలకించి; పాండవులు= పాండునందనులు; అనంతరంబు+అ= పిదప; క్రమ్మఱి= మరలి; ద్వైతవనంబునకున్+చని= ద్వైతం అనే పేరు గల అడవికి వెళ్ళి; అందున్= ఆ అడవిలో; ఒక్కనాఁడు= ఒకరోజున; సుఖ+ఆసీనుండు+అయి+ఉన్న= హాయిగా కూర్చునిఉన్న; ధర్మరాజుపాలికిన్= ధర్మనందనుడి దగ్గరకు; ఒక బ్రాహ్మణుండు= ఒక విప్రుడు; సంభ్రమంబునన్= తత్తరపాటుతో; చనుదెంచి= అరుదెంచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పల్కగా జనమేజయమహారాజుకు వైశంపాయనమహర్షి ఈవిధంగా చెప్పాడు: 'ఆవిధంగా మార్కండేయమహర్షివలన పెక్కుపుణ్యకథలు ఆలకించి విశ్రాంతినొంది పాండవులు మరల ద్వైతవనానికి తిరిగివచ్చారు. ఆ ద్వైతవనంలో, సుఖంగా కూర్చొని ఉన్న ధర్మనందనుడికడకు ఒక విప్రుడు తత్తరపాటుతో అరుదెంచి ఇట్లా అన్నాడు.'

విశేషం: రాజకుమారులు మహారాజులు భోగలాలసులై అంతఃపురసౌధాంతరాలలో నివసించవచ్చును. అయినను వారు కాంచనవజ్రపంజరంలో స్వచ్ఛందంగా బంధితులు. రాజప్రాసాదం ఒక గొప్ప కారాగారం కావచ్చును. ఇక- అరణ్యవాసం సువిశాల విశ్వవిద్యాలయం కావచ్చును. అక్కడ ఎప్పుడూ ఎదిగే మనస్సుతో ప్రకృతి సౌందర్యచిద్విలాసం అనుభవామ్రేడిత మౌతూండగా విజ్ఞానార్జన చేయవచ్చును. ప్రకృతిని మించిన పాఠశాల లేదు. విపద్దశను మించిన విశ్వవిద్యాలయం లేదు. పాండవులు పండ్రెండేళ్ళు నిరంతరజిజ్ఞాసువులై, అరణ్యవిశ్వవిద్యాలయంలో అంతేవాసులైనారు. అక్కడ ఉపన్యాసకులు మార్కండేయాదిమహర్షులు. ధర్మరాజు ఆదర్శవిద్యార్థిగా వనవాసాన్ని జ్ఞానులసన్నిధిలో గడిపాడు. విద్యాభ్యాసంచివర జరుగవలసింది విద్యాపరీక్ష. అవి యక్షప్రశ్నలు. అది ఆదర్శ ప్రశ్నపత్రం. ఆ ప్రశ్నలకు సదుత్తరాలిచ్చి, ధర్మరాజు విజ్ఞానపట్టభద్రుడయ్యాడు.

ధర్మరాజు బ్రాహ్మణుని యరణిఁ దెచ్చుటకుఁ బోవుట (సం. 3-295-7)

క. 'తరుశాఖఁ దగిల్చిన నా । యరణి యొకమృగంబు వచ్చి యతిరయమున న
త్తరువును నొరసి కొనంగా । ధరణీశ్వర! తగిలెఁ జువ్వె తచ్ఛృంగమునన్. 378

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= రాజా, ఓధర్మరాజా!; తరుశాఖన్= చెట్టుకొమ్మకు; తగిల్చిన= వ్రేలాడదీసిన; నా అరణి= నిప్పుకొయ్య; ఒకమృగంబు= ఒక లేడి; వచ్చి= చేరి; అతిరయమునన్= మిక్కిలి వేగంగా; ఆ+తరువును= ఆ చెట్టును; ఒరసికొనంగాన్= రాపిడి చేయగా; తద్+శృంగమునన్= ఆ లేడికొమ్మునందు; తగిలెన్+చువ్వె= అంటుకొనిపోయింది సుమా!

తాత్పర్యం: 'భూమికి అధిపతివైన ఓ ధర్మరాజా! నా అరణిని ఒక చెట్టుకొమ్మకు వ్రేలాడగట్టాను. అంతలో ఒకలేడి వచ్చి, వేగంగా ఆ చెట్టును ఒరసికొన్నది. నాఅరణి ఆ లేడి కొమ్ముకు తగుల్కొన్నది. ఆలేడి పరుగు లంకించుకొని పారిపోయింది.

విశేషం: (1) అరణి= అగ్నిని చేకూర్చేసాధన విశేషం. త్రచ్చి అగ్గి పుట్టించేకొయ్య. శ్రోత్రియవిప్రులు పూర్వకాలంలో అరణిని త్రచ్చి నిప్పు పుట్టించి నిత్యవిధులు నెరవేర్చేవారు. 'అరణి' లేకపోతే వైదికవిప్రుల దినచర్య స్తంభించినట్లే.

క. దానిఁ గొని పఱచె నమ్మృగ । మానతరిపులోక! నాకు నయ్యరణిఁ దగం
గా నిపుడు దేరఁ బనుపవె । భూనుత! నిత్యవిధిలోపమునఁ జనకుండన్.' 379

ప్రతిపదార్థం: ఆనత రిపులోక!= నమస్కారం చేసిన శత్రుసమూహం కలవాడా, ఓధర్మరాజా!; భూనుత!= భూమిలోని ప్రజలచేత పొగడబడినవాడా, ఓధర్మనందనా!; దానిన్= దానిని, ఆ అరణిని; కొని= పరిగ్రహించి; ఆ+మృగము= ఆలేడి; పఱచెన్= పరుగెత్తింది; నాకున్= నాకు; ఆ+అరణిన్= ఆ అరణిని; తగంగాన్= ఒప్పిదంగా; ఇపుడు= ఈసమయంలో; నిత్య, విధి= ప్రతిదినం నెరవేర్చవలసిన వైదికనియమం; లోపమునన్= లోపంతో; చనకుండన్= పోకుండా; తేరన్+పనుపవె= తెచ్చుటకు నియోగించవా.

తాత్పర్యం: శత్రువులచేత నమస్కరించబడినవాడా! భూజనులచేత ప్రశంసించబడినవాడా, ఓ ధర్మరాజా! ఆ అరణిని తీసికొని ఆలేడి పారిపోయింది. నా నిత్యానుష్ఠానానికి అరణి అవసరంకదా. అందుచేత నా అరణిని తేవటానికి నియోగించుము.'

చ. అనవుడు నా క్షణంబ మనుజాధిపుఁ డుద్ధతచాపహస్తుఁడై
యనుజులుఁ దాను నెంతయు రయంబున నాహరిణేంద్రుపజ్జఁ గై
కొని చని కూడముట్టి మెఱుఁగుల్ నిగుడం బటుసాయకంబు లే
సిన నొకయమ్ము నమ్మృగము సెందద చేరద యద్భుతంబుగన్. 380

ప్రతిపదార్థం: అనవుడున్= అని (బ్రాహ్మణుడు) చెప్పగా; మనుజ+అధిపుఁడు= రాజు, ధర్మనందనుడు; ఆ క్షణంబు+అ= ఆ క్షణంలోనే; ఉద్ధత, చాప, హస్తుఁడు+ఐ= పెద్దదైన విల్లు చేత పూనినవాడై; అనుజులు+తాను= తమ్ములు తానును; ఎంతయున్= మిక్కుటమైన; రయంబునన్= వేగంతో; ఆ హరిణ+ఇంద్రు, పజ్జన్= ఆ శ్రేష్ఠమైన లేడి పరుగెత్తేచోటుకు సమీపాన; కైకొని చని= కూడి వెళ్లి; కూడముట్టి= పొదివి; మెఱుగుల్, నిగుడన్= వెలుగులు చిందేటట్లుగా; పటుసాయకంబులు= తీవ్ర బాణాలు; ఏసినన్= ప్రయోగించగా; ఒక+అమ్మున్= ఒక బాణం అయినను; అద్భుతంబుగన్= అచ్చెరువు కొలిపేటట్లుగా; ఆ+మృగమున్= ఆ లేడిని; చెందదు+అ= తగులదు; చేరదు+అ= తాకనే తాకదు.

తాత్పర్యం: అని బ్రాహ్మణుడు పలుకగానే ధర్మనందనుడు, విల్లును ధరించి విజృంభించి, తానును తమ్ములును ఆ శ్రేష్ఠమైన లేడిని వెంబడించి పొదువచూచి మెఱపుబాణాలు ప్రయోగించారు. కాని, ఆశ్చర్యకరంగా ఒక్కబాణం అయినా ఆ లేడిని చేరలేదు. తాకనే లేదు.

వ. అదియును వారి నతిదూరంబుగా నెలయించికొని చని యొక్కఘోరవిపినంబున నదృశ్యంబైనఁ, బ్రయత్నంబు విఫలం బగుటకు విషాదంబు నందుచు నయ్యేవురు నతిశ్రాంతులై శీతలచ్ఛాయం బగు నొక్కవటమహీరుహంబు క్రింద విశ్రమించి; రప్పుడు నకులుండు ధర్మనందనున కి ట్లనియె. 381

ప్రతిపదార్థం: అదియును= ఆ లేడికూడా; వారిన్= పాండవులను; అతిదూరంబుగాన్= మిక్కిలి దవ్వులకు; ఎలయించుకొని= రప్పించుకొని; చని= వెడలి; ఒక్క= ఒక; ఘోరవిపినంబునన్= భయంకరమైన అడవిలో; అదృశ్యంబు+ఐనన్= కన్పించక పోగా; ప్రయత్నంబు= ఆ పెద్ద పూనిక; విఫలంబు+అగుటకున్= వ్యర్థం కావటానికి; విషాదంబున్+అందుచున్= విచారపడుతూ; ఆ+ఏవురున్= ఆ ఐదుగురును; అతిశ్రాంతులు+ఐ= మిక్కిలి డస్సినవారై; శీతల+ఛాయంబు+అగు= చల్లని నీడ కలిగినట్టిది అయిన; ఒక్క= ఒక; వట, మహీరుహంబు, క్రిందన్= మఱ్ఱిచెట్టు క్రింద; విశ్రమించిరి= సేదతీర్చుకొన్నారు; అప్పుడు= ఆ సమయంలో; నకులుండు; ధర్మనందనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ లేడి పాండవులను దవుదవ్వులకు కొనిపోయి ఒక భయంకరమైన అడవిలో కన్పించకుండా మాయమయిపోయింది. పాండవులు తమప్రయత్నం వ్యర్థమయినందుకు వ్యథ చెందారు. ఆ లేడి వెంటబడి బహుదూరం తిరగటం చేత బడలిన పాండవులు ఒక పెద్దమఱ్ఱిచెట్టునీడను చేరి విశ్రమించారు. అప్పుడు నకులుడు ధర్మనందనుడితో ఈ విధంగా చెప్పాడు.

క. 'కులశీలోన్నతియు విని । శ్చలకరుణారతియు ధర్మసంగ్రహమతియుం
గల మనకు నివ్విధంబున । నలజడి వచ్చుటకు మూల మది యెయ్యదియో!' 382

ప్రతిపదార్థం: కుల+శీల+ఉన్నతియున్= మంచివంశం, మంచినడవడి; వినిశ్చల, కరుణా, రతియున్= చలించని దయయందే ఇష్టం; ధర్మసంగ్రహమతియున్= ధర్మాన్ని సమకూర్చే బుద్ధియును; కల= ఉన్నట్టి; మనకున్= మనకు; ఈ+విధంబునన్= ఈరీతిగా; అలజడి= కలత; వచ్చుటకున్= దాపురించటానికి; మూలము= కారణం; అది= అది; ఎయ్యదియో= (ఏ+అది+ఓ)= ఏది అయి ఉంటుందో కదా.

తాత్పర్యం: 'మంచివంశంలో పుట్టి మంచిప్రవర్తన అలవరచుకొని, చలించని దయావ్రతాన్నే పాటిస్తూ ధర్మాన్ని సమకూర్చుకొనే బుద్ధికలిగి ఉన్నతులం అయిన మనకు ఈ రీతిగా ఆపద ప్రాప్తించటానికి కారణం ఏదై ఉండవచ్చును?'

విశేషం: (1) మంచివారికి ఆపదలు ఎందుకు వస్తాయి? యుగయుగాంతరాలనుండి మేధావులు ఈ ప్రశ్న వేస్తూనే ఉన్నారు. సముచితసమాధానాలకొరకై అన్వేషిస్తూనే ఉన్నారు. ఈ అన్వేషణ భూమికపై ప్రపంచంలోని వివిధభాషలలో ఈ విషయంపై ఆసక్తికరమైన వాఙ్మయం వేదాంతం ఏర్పడింది. పైప్రశ్నకు అనుబంధంగా ఇంకొకప్రశ్న కూడ ఏర్పడింది. (2) పురుషకారం గొప్పదా? దైవం గొప్పదా? మొదటి ప్రశ్నకు ప్రాచీనభారతదేశం చెప్పిన సమాధానాలలో పేర్కొనదగింది 'కర్మ' సిద్ధాంతం. నకులుడి ప్రశ్నకు ధర్మరాజు కర్మసిద్ధాంతాన్నే వివరించాడు. ఇక- రెండవప్రశ్నకు రెండు సమాధానాలు ఏర్పడ్డాయి. ఒకటి ఆస్తికత్వం. అంతా దైవలీల. రెండవది నాస్తికత్వం. ఇది ఇంతే. ఏమియు లేదు. మహాభారతంలో పలుతావులలో ముఖ్యంగా శాంతిపర్వంలో ఈ విషయంపై విపులచర్చలు ఉన్నాయి. ధర్మరాజు కర్మసిద్ధాంతాన్ని నమ్మిన ఆస్తికుడు. అతడితమ్ములకు ద్రౌపదికిని ఆతనిపై వ్యక్తిగతమైన గౌరవప్రపత్తులు ఉన్నవికాని అతడివేదాంతంపై దృఢవిశ్వాసం ఉన్నవారు కారు. ధర్మరాజుకంటె

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీముడు అర్జునుడు కొంతమేరకు నకులసహదేవులు యుద్ధవిద్యలో కుశలులు. అయితే కేవలం ధర్మరాజుకు వారు విధేయులు. ఆతని పెద్దరికానికి కారణం కేవలం వయస్సుమాత్రమే కాదు; ధర్మరాజు వేదాంతి, జ్ఞాని, అనుష్ఠానవేదాంతి, జిజ్ఞాసువు. అందుచేత అతడితమ్ములు తమ లౌకికశక్తిసామర్థ్యాలను మరచిపోయి అన్నగారిని ఆరాధించారు. ఇట - భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు సాగించే చర్చలనుబట్టి వారు గ్రుడ్డిగా అన్నగారిని అనుసరించలేదనిన్నీ, మంచి చెడుగులను క్షుణ్ణంగా చర్చించియే అనుష్ఠానవేదాంతి అయిన ధర్మరాజును అనుసరించిన బుద్ధికుశలులు అనిన్నీ తెలుతుంది. (3) ఈ పద్యం యొక్క పూర్వార్ధానికి' బలశౌర్య ధైర్యములు నిశ్చల కరుణారతియు నధిక సత్య ప్రౌఢిం' అనే పాఠభేదం కొన్ని ప్రతులలో కనపడుతున్నది.

వ. అనిన నమ్మహాప్రాజ్ఞుండతని కిట్లనియె. 383

తాత్పర్యం: అనగా, గొప్పవివేకం కలవాడైన ధర్మరాజు నకులుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'వినుము సుఖమునకు దుఃఖం । బునకుం గారణము దనదుపూర్వకృతం బై
చను కర్మము; కారణ మిది । యని యన్యము గలుగనేర దం దొక్కటియున్. 384

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; సుఖమునకున్= ప్రియమైన అనుభూతికి; దుఃఖంబునకున్= ఆవేదనకు; కారణము= హేతువు; తనదు, పూర్వకృతంబు+ఐ= తాను పూర్వంచేసినట్టిదై; చను= ఒప్పు; కర్మము+అ= కర్మయే; అందు= ఆ సుఖ దుఃఖానుభూతిలో; అన్యము+ఒక్కటియున్= వేరు ఏదియును ఒకటి (కర్మం కాక మరి ఏదిన్నీ); కారణము= హేతువు; ఇది= ఇది; అని= చెప్పటానికి; కలుగన్‌నేరదు= ఏర్పడదు.

తాత్పర్యం: 'ఆలకించుము. సుఖం దుఃఖం దాపురించటానికి కారణం తనపూర్వకర్మయే. కర్మ కాక వేరొక కారణం ఏది చెప్పినా అది కుదరదు'.

విశేషం: సుఖదుఃఖాలు ఎట్లా ప్రాప్తిస్తున్నాయి? అనే ప్రశ్నకు కర్మసిద్ధాంతం సముచితసమాధానం. సరే, ఈ సిద్ధాంతాన్ని ఒకవేళ సమ్మతించకపోతే వేరొకసిద్ధాంతం సహేతుకంగా ఈ సమస్యకు సమాధానం చెప్పలేదు- అని ధర్మరాజు చెప్పాడు. దేవుడిని సాక్షీభూతుడిగా సుదూరాన నిల్పి కేవలం హేతువాదంచేతనే సుఖదుఃఖానుభూతిని సమర్థించేసిద్ధాంతం 'కర్మ' వాదం. ప్రాచీనభారతదేశంలో నాస్తికదర్శనాలుగా జైనబౌద్ధాలుసయితం కర్మవాదాన్ని అంగీకరించటం గమనింపదగిన అంశం.

వ. అనుటయు భీమసేనుండు నకులున కి ట్లనియె. 385

తాత్పర్యం: అని ధర్మరాజు చెప్పగా భీముడు నకులుడితో ఈ విధంగా అన్నాడు.

ఆ. 'ప్రాతికామి వోయి పాంచాలిఁ గొలువులో । పలికిఁ దెచ్చి నపుడ యలుక యెసఁగ
నాంబికేయసుతుల నందఱఁ దునుమక । యునికి నిట్టియెడరు మనకుఁ బుట్టె'. 386

ప్రతిపదార్థం: ప్రాతికామి+పోయి= ప్రాతికామి (దుర్యోధనుడిసేవకుడు)పోయి; పాంచాలిన్= ద్రౌపదిని; కొలువులోపలికిన్= రాజసభలోకి; తెచ్చినపుడు+అ= తీసికొనివచ్చినప్పుడే; అలుక+ఎసఁగన్= కోపం విజృంభించగా; ఆంబికేయసుతులన్= ధృతరాష్ట్రుడి కుమారులను; అందఱన్; తునుమక+ఉనికిన్= సంహరించక పోవటంచేతనే; ఇట్టి+ఎడరు= ఇటువంటి ఆపద; మనకున్+పుట్టెన్= మనకు సంభవించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఆనాడు కొలువుకూటానికి ప్రాతికామి ద్రౌపదిని పిలుచుకొని వచ్చినపుడే ఆగ్రహాతిరేకంతో ఆ ధృతరాష్ట్రుడికొడుకులను అందరిని సంహరించకపోవటంచేతనే ఇప్పుడు ఈ విధమైన దుఃఖం మనకు దాపురించింది.

విశేషం: భీముడు ఈ మాటలు ధర్మరాజుతో కాక, నకులుడితో చెప్పాడు. అసలు ప్రశ్న వేసింది నకులుడే కదా, అయినను ఇది ధర్మరాజుపై ఎత్తిపొడుపే.

చ. **అనవుడు నర్జునుం డనియె 'నాసభ సూతసుతుండు పేర్చి ప**
ల్కిన పటువాక్యముల్ వినియుఁ గిన్కకుఁ బూనక యేఁ దొలంగి కా
ననమున కిట్లు కాతరజనంబులచాడ్పున నేఁగుదెంచుటన్
మనకు దురంతదుఃఖములు మానక పైకొని వచ్చెఁ దమ్ముఁడా!' **387**

ప్రతిపదార్థం: అనవుడున్= అని (భీమసేనుడు) చెప్పగా; అర్జునుండు= అర్జునుడు; అనియెన్= వచించాడు; తమ్ముఁడా= సోదరా! నకులుడా!; ఆ సభన్= ఆ కొలువుకూటంలో; సూతసుతుండు= కర్ణుడు; పేర్చి= అతిశయించి; పల్కిన= వచించిన; పటువాక్యముల్= పరుషవచనాలు; వినియున్= విననప్పటికీ; కిన్కకున్+పూనక= ఆగ్రహం చెందక; ఏన్= నేను; తొలంగి= తప్పుకొని; కాననమునకున్= అడవికి; ఇట్లు= ఈవిధంగా; కాతరజనంబుల చాడ్పునన్= భీతిచెందినవారి విధంగా; ఏఁగుదెంచుటన్= రావటంవలన; మనకున్= మనకు; దురంతదుఃఖములు= అంతం లేని కష్టాలు; మానక= ఆగక; పైకొని వచ్చెన్= దాపురించాయి.

తాత్పర్యం: భీముడు ఆ విధంగా చెప్పగా అర్జునుడు ఈ విధంగా వచించాడు: తమ్ముడా! నకులా! 'అలనాడు ఆ కొలువుకూటంలో సూతుడికొడుకు కర్ణుడు పలికిన పరుషవచనాలు ఆలకించికూడా ఆగ్రహించక పిరికివారలవలె నేను అడవులకు ఈ విధంగా అరుదెంచటంచేత మనకు అంతం లేని కష్టాలు దాపురించాయి.

విశేషం: అర్జునుడు ధర్మరాజు వేదాంతాన్ని ఖండించి భీమసేనుడిని సమర్థించాడు.

వ. **అనిన యనంతరంబ సహదేవుం డిట్లనియె.** **388**

తాత్పర్యం: అనిన తరువాత సహదేవుడు నకులుడితో ఈ విధంగా అన్నాడు.

ఆ. **'దుష్టశీలుఁ డైన దుర్ద్యూతపరుని గాం । ధారుఁ బట్టి యేను దడయ కపుడ**
తునుమకునికి నిట్టి దుర్దశ పాలైతి । మనఘ! మనము కాననాంతరమున. **389**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడ వైన నకులుడా!; దుష్టశీలుఁడు+ఐన= చెడ్డస్వభావం కలవాడు అయిన; దుర్ద్యూతపరునిన్= చెడ్డజూదం ఆడేవాడిని; గాంధారున్= గాంధారరాజసుతుడైన శకునిని; పట్టి= గ్రహించి; ఏను= నేను; తడయక+అపుడు+అ= ఆలసించక ఆసమయంలోనే; తునుమక+ఉనికిన్= సంహరించక పోవటంచేత; మనము= మనము; కానన+అంతరమునన్= అడవియందు; ఇట్టి= ఇటువంటి; దుర్దశ= చెడుఅవస్థ; పాలు+ఐతిమి= పాల్పడ్డాం.

తాత్పర్యం: 'చెడునడవడి కలవాడు, మాయజూదం ఆడేవాడు అయిన ఆగాంధారరాజసుతుడు శకునిని ఆనాడే అక్కడే సంహరించకపోవటంచేతనే మనం ఈనాడు ఈ అడవులలో ఇడుమలు కుడువవలసి వచ్చింది.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) తమ్ములు అందరును తాత్త్వికంగా ధర్మరాజుకు విముఖులే. అయినను ఆచరణలో ఆయనకు విధేయులే. (2) ధర్మరాజు తమ్ముల వాదోపవాదాలను పట్టించుకొనలేదు. అంతేగాక ఆ చర్చను మొదలుపెట్టిన నకులుడిని అచటినుండి పొమ్మని ఆజ్ఞాపించి వేరుపనికి నియమించాడు.

వ. అని యి ట్లందఱు నన్ని తెఱంగులఁ బలుకుచుండ నజాతశత్రుండు నకులుం జూచి 'భవదీయసోదరు లత్యంత పిపాసితు లైన వారు; నీ విమ్మహీరుహం బెక్కిజలంబు లున్నయెడ యరయు' మనిన నతండును నవ్వనస్పతి సమారోహణంబు సేసి దెసలు కలయం బరికించి 'దూరంబున సలిలంబు లున్న' వని యన్న కెఱింగించిన, నతం 'డట్లేని నీవు పోయి జలపానంబు సేసి మాకును జలంబులు గొనిర'మ్మని పనుచుటయు, మాద్రేయుండు వృక్షావతీర్ణుం డయి రయంబునం జని ముందట నతిమనోహరం బగు తటాకంబుఁ గని జలంబులు ద్రావంబోయిన నొక్కయశరీరభూతం బిట్లనియె. 390

ప్రతిపదార్థం: అని= అని పలికి; ఇట్లు= ఈ రీతిగా; అందఱును= అందరు (భీముడు, అర్జునుడు, సహదేవుడు); అన్ని, తెఱంగులన్= అన్నివిధాల; పలుకుచుండన్= మాట్లాడుతూ ఉండగా; అజాతశత్రుండు= శత్రువులు లేనివాడు- ధర్మరాజు; నకులున్+చూచి= నకులుడిని అరసి; 'భవదీయసోదరులు= నీ అన్నదమ్ములు; అత్యంత, పిపాసితులు= మిక్కిలి దాహం చెందినవారు; ఐనారు= అయ్యారు; నీవు= ఈవు; ఈ+మహీరుహంబు+ఎక్కి= ఈ చెట్టును అధిరోహించి; జలంబులు= నీళ్ళు; ఉన్న+ఎడ+అరయుము= ఉన్నచోటు చూడుము; అనినన్= అని (ధర్మరాజు) చెప్పగా; అతండును= అతడును (నకులుడును); ఆ+వనస్పతి= ఆచెట్టును; సమ్+ఆరోహణంబు+చేసి= పైభాగానికి ఎక్కి; దెసలు= దిక్కులు; కలయన్+పరికించి= నలుగడలు అరసి; దూరంబునన్= దవ్వుల; సలిలంబులు= నీళ్ళు; ఉన్నవి+అని= కలవు అని; అన్నకున్= అగ్రజునకు, ధర్మరాజుకు; ఎఱింగించినన్= తెలుపగా; అతండు= అతడు- ధర్మరాజు; అట్లు+ఏనిన్= అటులైతే; నీవు= నీవు; పోయి= వెడలి; జలపానంబు+చేసి= నీళ్లుత్రాగి; మాకును= మాకు కూడ; జలంబులు= నీళ్ళు; కొని= గ్రహించి; రమ్ము= అరుగుదెంచుము; అని= అని; పనుచుటయున్= నియమించుటయున్నూ; మాద్రేయుండు= మాద్రికొడుకు నకులుడు; వృక్ష+అవతీర్ణుండు+అయి= చెట్టుపైనుండి క్రిందికి దిగినవాడయి; రయంబునన్= వేగంగా; చని= వెడలి; ముందటన్= తన కన్నులఎదుట; అతి, మనస్+హరంబు+అగు= (అతిమనోహరం బగు=) మిక్కిలి రమణీయంగా ఉన్న; తటాకంబున్= చెరువును; కని= చూచి; జలంబులు= నీళ్లు, త్రావంబోయినన్= త్రాగటానికి పూనగా; ఒక్క= ఒక; అశరీరభూతంబు= శరీరం లేని ఒకప్రాణి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఈ రీతిగా తమ్ములు అందరు తమకు తోచినట్లు మాట్లాడుతూ ఉండగా, అజాతశత్రువు అయిన ధర్మరాజు నకులుడిని చూచి, 'నీఅన్నదమ్ములు దప్పిగొని ఉన్నారు. ఈ చెట్టుపై కెక్కి నీరు ఉన్నచోటును గుర్తించుము' అని చెప్పాడు. నకులుడు ఆచెట్టుపైభాగానికి ఎక్కి, నలుదెసల దృష్టిసారించి 'దవ్వుల నీళ్లు ఉన్నాయి' అని అన్న ధర్మరాజుకు తెలిపాడు. అంతట ధర్మజుడు నకులుడిని అక్కడకు వెళ్ళి 'నీవు నీళ్లు త్రావి, సోదరులకు నీళ్ళు తె'మ్మని ఆజ్ఞాపించాడు. నకులుడు అన్న ఆజ్ఞాపించినట్లు చెట్టుక్రిందికి దిగి, వేగంగా వెడలి తనముందట ఒకరమణీయతటాకాన్ని చూచి, అందలి జలాలు త్రాగటానికి సమకట్టాడు. అంతట శరీరం లేని ఒకభూతం ఈ విధంగా పలికింది.

నకులాదులు యక్షుని నిరాకరించి నీరు ద్రావి మూర్ఛితు లగుట (సం. 3-296-12)

క. 'ఓ యన్న! యీ తటాకము । నాయది; నీ వీ జలము గొనఁగ వలతేనిన్
నా యడిగిన ప్రశ్నములకు । ధీయుత! యుత్తరము లిమ్ము తేటపడంగన్.' 391

ప్రతిపదార్థం: ఓ+అన్న!= నాయనా, ప్రియసహోదరా!; ధీయుత!= బుద్ధిమంతుడవైనవాడా!; ఈ తటాకము= ఈ చెరువు; నా+అది= నాది; నీవు= ఈవు; ఈ జలము= ఈ నీరు; కొనఁగన్‌వలతు(వు)+ఏనిన్= త్రాగతలచినట్లయితే; నా+అడిగిన, ప్రశ్నములకున్= నేను అడిగేప్రశ్నలకు; తేటపడంగన్= స్పష్టంగా తెలిసేటట్లుగా; ఉత్తరములు= సమాధానాలు; ఇమ్ము= ఒసగుము.

తాత్పర్యం: 'అన్నా ఈ చెరువు నాది. నీవు ఈ చెరువులోని నీటిని త్రాగాలని అనుకొంటే, బుద్ధిమంతుడవై నేను అడిగేప్రశ్నలకు సమాధానాలు ఇమ్ము.'

విశేషం: ఈ పద్యంలో ఉన్న రెండు సంబోధనలు- 'ఓయన్న'- 'ధీయుత' అనే ప్రయోగాలలోని స్వారస్యం భావింపతగింది. ఈ మాటలు పలికినది ఒక అశరీరభూతం. అన్న- అనే పదంలో ప్రేమ మరియు గౌరవభావం మిళితమై ఉన్నవి. ధీయుత- అనే శబ్దంవలన ఈ ప్రశ్నలు సాధారణ ప్రశ్నలు కావని, వీటికి మేధావులు కొందరుమాత్రమే సముచితసమాధానాలు చెప్పగలరు- అనే ధ్వని ఇమిడి ఉన్నది.

క. అనుటయు నవ్వాక్యముదెస । ననాదరము చేసి నకులుఁ డక్కొలనం ది
య్యని నీరు ద్రావి నిశ్చే । తనుఁడై యాక్షణమ పడియెఁ దత్తీరమునన్. 392

ప్రతిపదార్థం: అనుటయున్= అని (అశరీరభూతం) వచించుటయున్నూ; ఆ+వాక్యముదెసన్= ఆ వచనంపట్ల; అనాదరము+చేసి= చులకన చేసి; నకులుఁడు; ఆ+కొలనన్= ఆ చెరువునందు; తియ్యని= మధురమైన; నీరు= జలం; త్రావి= క్రోలి; నిశ్చేత నుఁడు+ఐ= చైతన్యం లేనివాడై; ఆక్షణము+అ= ఆ త్రుటియందే; తద్+తీరమునన్= ఆ కొలనుగట్టుమీద; పడియెన్= కూలినాడు.

తాత్పర్యం: అశరీరభూతం చేసిన హెచ్చరికను చులకనచేసి నకులుడు ఆ చెరువులో ఉన్న తియ్యనినీరు గ్రోలి వెంటనే ఆ తటాకంఒడ్డున చైతన్యం లేకుండా కూలిపోయాడు.

వ. అట ధర్మపుత్త్రుండు సహదేవుం గనుంగొని 'నకులుండు జలంబులకుం జని తడసె; నీ వరిగి యతనిం దోడ్కొని జలంబులు గొనుచు ర'మ్మనిన నక్కుమారుం డతి శీఘ్రగమనంబునంబోయి యాపద్మాకరతీరంబునం బడియున్న యన్నతెఱంగుఁ జూచి విస్మయశోకవ్యాకులహృదయుం డగుచు, 'నిది యేమి నిమిత్తంబున నయ్యెనో!' యని యూహించుచుఁబెల్లడరు తృష్ణాభరంబు సహింప నోపక జలంబులదెస నాసఁ జేసి కొలనికి డిగ్గిన నెప్పటిభూతం బి ట్లనియె. 393

ప్రతిపదార్థం: అట= అక్కడ (అడవిలో ధర్మరాజు ఉన్నచోట); ధర్మపుత్త్రుండు= ధర్మనందనుడు; సహదేవున్= సహదేవుడిని; కనుంగొని= చూచి; నకులుండు; జలంబులకున్+చని= నీళ్లకొరకైవెళ్లి; తడసెన్= ఆలసించాడు; నీవు+అరిగి= నీవు వెడలి; అతనిన్= వాడిని, నకులుడిని; తోడ్కొని= వెంటబెట్టుకొని; జలంబులు+కొనుచున్= నీళ్ళుతీసికొని; రమ్ము= అరుదెమ్ము;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనినన్= అని (ధర్మరాజు) చెప్పగా; ఆ+కుమారుండు= సహదేవుడు; అతి, శీఘ్రగమనంబునన్+పోయి= మిక్కిలివేగంగా పయనించి వెళ్ళి; ఆ పద్మాకరతీరంబునన్= ఆ కొలనుగట్టున, పడి+ఉన్న= కూలిపోయిఉన్న; అన్న+తెఱంగున్+చూచి= అన్నతీరునుచూచి (నకులుడు విగతజీవుడై పడియుండటం కాంచి); విస్మయ, శోక, వ్యాకుల, హృదయుండు+అగుచున్= ఆశ్చర్యం, దుఃఖం కలవరపాటుతో కూడిన ఎద కలవాడు ఔతూ; ఇది= ఈ విధంగా పడిఉండటం; ఏమి నిమిత్తంబునన్= ఏమి కారణంచేత; అయ్యెను+ఓ= సంభవించెనో; అని ఊహించుచున్= అని తలపోస్తూ; పెల్లు+అదరు= మిక్కుటంగా అతిశయించే; తృష్ణాభరంబు= డప్పికబరువు (తీవ్రత); సహింపన్+ఓపక= తాళజాలక; జలంబులదెసన్= నీళ్ళవైపు; ఆసన్+చేసి= కోరికతో; కొలనికిన్= చెరువులోకి; డిగ్గినన్= దిగగా; ఎప్పటిభూతంబు= ఇదివరకు (హెచ్చరించిన) భూతం; ఇట్లుఅనియెన్.

తాత్పర్యం: అట అడవిలో ధర్మనందనుడు సహదేవుడిని చూచి, 'నకులుడు నీళ్ళు తేవటానికై వెళ్ళి చాల సేపయింది. నీవు వెళ్ళి నకులుడిని వెంటబెట్టుకొని నీళ్ళు కొనితెమ్ము' అని చెప్పాడు. సహదేవుడు మిక్కిలి వేగంగా పయనించి, వెళ్ళి ఆ కొలనుకడ పడిఉన్న అన్న నకులుడిని చూచి అచ్చెరువు, దుఃఖం, ఆకులపాటు క్రమ్ముకొనిన మనస్సు కలవాడు ఔతూ, ఏకారణాన ఇట్లా జరిగిందో అని యోచిస్తూ, దప్పిక మిక్కుటం కావటంచేత తట్టుకొనలేక నీరు త్రాగటంకొరకై ఆ కొలనులోకి దిగాడు. అశరీరభూతం వెనుకటివలెనే ఇట్లా పలికింది.

ఆ. **'అనఘ! యీజలాశయము నాయధీనంబు; । సాహసంబుఁజేసి చనదు చొరఁగ;**
నాదు ప్రశ్నములకు నలి నుత్తరము లిచ్చి । వారిఁ గొనుము నీకు వలసినట్లు'. **394**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఈ జల+ఆశయము= ఈ తటాకం; నా+అధీనంబు= నాకు వశమై ఉన్నట్టిది; సాహసంబున్+చేసి= తెగువ చేసి; చొరఁగన్= ప్రవేశించగా; చనదు= కూడదు; నాదుప్రశ్నములకున్= నేను అడిగేప్రశ్నలకు; నలిన్= యోగ్యంగా, ఒప్పిదంగా; ఉత్తరములు+ఇచ్చి= సమాధానాలు చెప్పి; నీకున్= నీకు; వలసినట్లు= కావలసినట్లు; వారిన్+కొనుము= నీటిని తీసికొనుము.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! ఈ కొలను నావశంలో ఉన్నది. నీవు తెగువ చేసి ఇందులో ప్రవేశించకూడదు. నేను అడిగే ప్రశ్నలకు సముచితసమాధానాలు ఇచ్చి పిదప నీవలసినట్లుగా నీరు త్రాగవచ్చును.'

క. **అనిన నది యాదరింపక । ఘనుఁ డాసలిలములు ద్రావి గ్రక్కున విష మె**
క్కినవిధమునఁ బరవశుఁడై । ఘనసాలమహీరుహంబు కైవడిఁ బడియెన్. **395**

ప్రతిపదార్థం: అనినన్= అని (అశరీరభూతం) వచించగా; ఘనుఁడు= గొప్పవాడు (సహదేవుడు); అది= ఆ హెచ్చరిక; ఆదరింపక= లెక్కపెట్టక; ఆసలిలములు= ఆ నీళ్ళు, త్రావి= త్రాగి; గ్రక్కునన్= శీఘ్రంగా; విషము= విసం; ఎక్కిన, విధమునన్= వ్యాపించిన తీరుగా; పరవశుఁడు+ఐ= స్పృహ కోల్పోయిన వాడై; ఘన, సాల, మహీరుహము, కైవడిన్= పెద్దమద్దిచెట్టు మాదిరిగా; పడియెన్= కూలాడు.

తాత్పర్యం: అశరీరభూతం చేసిన హెచ్చరికను సరకుచేయక, గొప్పవాడైన సహదేవుడు ఆ నీటిని త్రాగి, వెంటనే విషం శరీరాన్ని ఆవరించిన తీరుగా స్పృహను కోల్పోయి పెద్దమద్దిచెట్టు నేలపై పడిన తీరుగా కూలిపోయాడు.

సీ. **అంత నంతకసూనుఁ డంతరంగంబున । సంతాప మెసఁగ వాసవతనూజుఁ**
గనుఁగొని 'యన్న! నీ యనుగుఁదమ్ములు వోయి । కడుఁ దడవయ్యె; నిక్కాననమున

నెయ్యది పుట్టెనో? చయ్యన నీ వేఁగి । వారిని దోడ్కొని వారిఁ గొనుచుఁ
జనుదెమ్ము' నావుడు ఘనభుజుం డధికర । యంబున నరిగి జలాశయంబు

ఆ. తీరభూమిఁ బడిన వారి నవారిత । మహితశౌర్యధనుల మాద్రిసుతులఁ
జూచి, విస్మయైకగోచరుఁడై సవ్య । సాచి యుల్లమున విషాద మడర. 396

ప్రతిపదార్థం: అంతన్= ఆసమయంలో; అంతకసూనుఁడు= ధర్మనందనుడు; అంతరంగంబునన్= హృదయంలో; సంతాపము= దుఃఖం; ఎసఁగన్= అతిశయించగా; వాసవతనూజున్= అర్జునుడిని (దేవేంద్రుడి పుత్రుడిని); కనుఁగొని= అరసి; అన్న!= నాయనా!; నీ+అనుఁగు+తమ్ములు= ప్రియమైన నీ అనుజులు; పోయి= వెడలి; కడున్= మిక్కిలి; తడవు+అయ్యెన్= ఆలస్యం అయింది; ఈ+కాననమునన్= ఈఅడవియందు; ఏ+అది; పుట్టెను+ఓ= ఏమి సంభవించెనో; నీవు= నీవు; చయ్యనన్= శీఘ్రంగా; ఏఁగి= వెడలి; వారిని= నీతమ్ములను; తోడ్కొని= వెంటబెట్టుకొని; వారిన్+కొనుచున్= నీటిని కైకొని; చనుదెమ్ము= అరుగుదెంచుము; నావుడున్= అని (ధర్మరాజు) చెప్పగా; ఘనభుజుండు= గొప్పభుజాలు కలవాడు, పరాక్రమోపేతుడు, అర్జునుడు; అధిక, రయంబునన్= మిక్కుటమైన వేగంతో; అరిగి= వెడలి; జల+ఆశయంబు+తీర, భూమిన్= నీటికొలనుగట్టుమీది ప్రదేశంలో; పడినవారిన్= కూలినవారిని; అవారిత= వారింపశక్యముగాని; మహితశౌర్యధనులన్= గొప్ప శౌర్యమే సంపదగా కలవారిని; మాద్రిసుతులన్= మాద్రియొక్క కొడుకులను, నకులసహదేవులను; సవ్యసాచి= అర్జునుడు; చూచి= అరసి; విస్మయ+ఏక, గోచరుఁడు+ఐ= అచ్చెరువుతో మాత్రమే కూడినవాడై; ఉల్లమునన్= హృదయంలో; విషాదము= ఆవేదన; అడరన్= వ్యాపించగా. (మీది పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అంతట ధర్మనందనుడు హృదయంలో ఆవేదన అతిశయించగా, అర్జునుడిని గాంచి, 'నాయనా! నీకు ప్రియమైన తమ్ములు నకులసహదేవులు ఇరువురూ వెళ్లి చాలసేపు అయింది. ఈ అరణ్యంలో ఏ ఆపద సంభవించిందో! నీవు శీఘ్రంగా వెళ్ళి వారిని వెంటబెట్టుకొని రమ్ము. వచ్చేటప్పుడు నీళ్ళను కూడా తెమ్ము' అని చెప్పాడు. అర్జునుఁడంత మిక్కుటమైన వేగంతో వెళ్లి, ఆ కొలనుగట్టుపై పడిఉన్న మాద్రితనయులు నకులసహదేవులను చూచి ఆశ్చర్యచకితుడయ్యాడు. అతడి హృదయంలో దుఃఖం క్రమ్ముకొన్నది.

క. నాలుఁగుదిక్కులు గనుఁగొని । యాలో నెవ్వరిని గాన కత్యంతపిపా
సాలసుఁడై సలిలంబులు । గ్రోలఁగ సమకట్టి యొయ్యఁ గొలనికి డాసెన్. 397

ప్రతిపదార్థం: నాలుఁగుదిక్కులు= నాలుగు దెసలు; కనుఁగొని= చూచి; ఆలోన్= ఆనాలుగుదిక్కులలో; ఎవ్వరిని= ఎవ్వరినీ; కానక= చూడక; అత్యంత, పిపాసా+అలసుఁడు+ఐ= మిక్కుటమైన దాహంచేత డస్సినవాడై; సలిలంబులు= నీళ్ళు; క్రోలఁగన్= త్రావగా; సమకట్టి= పూని; ఒయ్యన్= తిన్నగా; కొలనికిన్= తటాకానికి; డాసెన్= సమీపించాడు.

తాత్పర్యం: అర్జునుడు నాలుగు దిక్కులా పరికించి చూచాడు. అతడికి ఎచ్చటా ఎవ్వరూ కన్పించలేదు. అంత, మిక్కుటంగా దాహం అవుతూ ఉండటంతో డస్సినవాడయి, అతడు నీరు త్రాగటానికై, తిన్నగా చెరువును సమీపించాడు.

వ. డాయుటయు నయ్యశరీరభూతం బి ట్లనియె. 398

తాత్పర్యం: సమీపించగానే ఆ శరీరంలేనిభూతం అర్జునుడితో ఇట్లా అన్నది.

మ. **'బలిమిం జొచ్చిన నెట్టివారికయినం బ్రాణంబుపై వచ్చు; నీ**
సలిలావాసము మత్పరిగ్రహము; తృష్ణాఖేదమారం జలం
బులు ద్రావన్ వలతేనిఁ బ్రశ్నములకుం బొం దొందఁగా నుత్తరం
బులు నా కి' మ్మనుడున్ మనంబునఁ బృథాపుత్త్రుండు సక్రోధుఁడై. **399**

ప్రతిపదార్థం: ఈ+సలిల+ఆవాసము= ఈ చెరువు; మత్+పరిగ్రహము= నాచే గ్రహించబడినట్టిది; బలిమిన్+చొచ్చినన్= దర్పంతో ప్రవేశిస్తే; ఎట్టివారికిన్+అయినన్= ఎటువంటివారికి అయినా; ప్రాణంబుపైన్+వచ్చున్= ప్రాణసంకటం కాగలదు; తృష్ణాఖేదము= దాహంచేత ఏర్పడిన పరితాపం; ఆరన్= చల్లారగా; జలంబులు= నీళ్ళు; త్రావన్= త్రాగటానికి; వలతు(వు)+ఏనిన్= కోరెదవేని; ప్రశ్నములకున్= నేను అడిగే ప్రశ్నలకు; పొందు+ఒందఁగాన్= సామరస్యం చేకూరేటట్లుగా; ఉత్తరంబులు= సమాధానాలు; నాకున్= నాకు; ఇమ్ము= ఒసగుము; అనుడున్= అని (అశరీరభూతం) చెప్పగా; పృథాపుత్త్రుండు= కుంతీకుమారుడు, అర్జునుడు; మనంబునన్= చిత్తంలో; సక్రోధుఁడు+ఐ= కోపంతో కూడినవాడై.

తాత్పర్యం: 'ఈ కొలను నాది. ఎట్టివారైనాసరే దర్పంతో ఈకొలను ప్రవేశిస్తే వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లటం తథ్యం. దాహం తీర్చుకొనేవారు ఈ నీళ్ళు త్రాగదలిస్తే నా ప్రశ్నలకు సరిపోయే సమాధానాలు చెప్పవలెను. నీవును నా ప్రశ్నలకు సమాధానం ఒసఁగకుండా నీళ్ళు క్రోలటానికి వీలు లేదు' అని అదృశ్యభూతం పలికింది. ఆ మాటలు ఆలకించిన అర్జునుడు మనసులో మిక్కుటమైన కోపం కలవాడై.

ఉ. **'మ్రుచ్చిలి నిల్చి దుర్వచనముల్ పచరించినఁ జెల్లనిత్తునే?**
చెచ్చెర నీయెలుం గడఁగఁ జేసెద నిప్పుడు సూడు' మంచు వి
వ్వచ్చుఁడు శబ్దభేదిశరవర్గముఁ దద్వచనంబుచక్కటిం
గ్రచ్చఱ నించె మౌర్వీరవకంపితసర్వదిగంతరాళుఁడై. **400**

ప్రతిపదార్థం: మ్రుచ్చిలి నిల్చి= దొంగతనంగా (దొంగవలె కన్పించకుండ) నిల్చి; దుర్వచనముల్= చెడుమాటలు; పచరించినన్= వెల్లడిస్తే; చెల్లనిత్తును+ఏ= సాగనిత్తునా; చెచ్చెరన్= శీఘ్రంగా; నీ+ఎలుంగు= నీకంఠస్వరం; అడఁగన్+చేసెదన్= నశించేటట్లు చేస్తాను; ఇప్పుడు= ఈ సమయంలోనే; చూడుము= అరయుము; అంచున్= అని అంటూ; వివ్వచ్చుఁడు= అర్జునుడు; శబ్ద, భేది, శర, వర్గమున్= ధ్వనినిబట్టి లక్ష్యాన్ని ఛేదించే అమ్ములగుంపును; తద్+వచనంబు+చక్కటిన్= ఆ (అశరీరభూతం) యొక్క వాక్కువెలువడినచోటికి; మౌర్వి, రవ, కంపిత, సర్వ, దిక్+అంతరాళుఁడు+ఐ= అల్లెత్రాటిధ్వనిచేత వణకించబడిన సమస్తదిక్కుల మధ్యభాగం కలవాడై; క్రచ్చఱన్= శీఘ్రంగా; నించెన్= నిండించాడు.

తాత్పర్యం: 'దొంగవలె మాటున దాగి చెడుమాటలు వెల్లడించిన నిన్ను నేను సైరింపజాలను. శీఘ్రంగా నీకంఠస్వరాన్ని మాటుపెట్టగలను. జాగ్రత్త. ఇప్పుడే. కాచుకొనుము' అని హెచ్చరించి అర్జునుడు అశరీరభూతంనుండి మాటలు వెలువడిన చోటికి శబ్దాన్నిబట్టి లక్ష్యాన్నికొట్టే అమ్ముల సముదాయం తన అల్లెత్రాటిమ్రోతకు దిగ్దిగంతాలు కంపించగా నింపాడు.

ఆ. **ఇట్లు లేయుటయును నెప్పటివాక్యంబు । మఱియు వినఁగఁబడిన మఘవసూనుఁ**
డలసి కొలనుఁ జొచ్చి యంబుపానము చేసి । యిలకు నొఱగె వివశహృదయుఁ డగుచు. **401**

ప్రతిపదార్థం: మఘవసూనుఁడు= దేవేంద్రుడికొడుకు, అర్జునుడు; ఇట్టులు= ఈ విధంగా; ఏయుటయున్= బాణాలు ప్రయోగించుటయును; ఎప్పటి వాక్యంబు= మునుపటి (వినపడిన) మాటకూర్పు; మఱియున్= వెండియు; వినఁగఁబడినన్= విన్పించగా; అలసి= డస్సి; కొలనున్+చొచ్చి= చెరువులోకి దిగి; అంబుపానము, చేసి= నీరు త్రాగి; వివశహృదయుఁడు+అగుచున్= వశం తప్పిన ఎద కలవాడు ఔతూ; ఇలకున్= నేలకు; ఒఱగెన్= కూలాడు.

తాత్పర్యం: అర్జునుడు ఇట్లా శబ్దభేదిబాణాలు ప్రయోగించినప్పటికీ, యథాప్రకారం అశరీరభూతం మరల ఆ వాక్యాలే పలికింది. దేవేంద్రుడికుమారుడైన అర్జునుడు, అలసిపోయి ఆ చెరువులో ప్రవేశించి నీరు త్రాగి, వశం తప్పిన డెందం కలవాడై నేలకు ఒరిగాడు.

వ. **తదనంతరంబ యుధిష్ఠిరుండు భీమసేను నాలోకించి 'కవలును గవ్వడియును నింతదడయుటకు నిమిత్తం బెయ్యదియో నీ వరుగు' మనినం గిమ్మీరవైరి మారుతజవంబున నమ్మువ్వురుఁ జనిన చొప్పునం జని పద్మాకరకూలంబున నిద్రాపరవశులుం బోలెఁ బడియున్న తమ్ములం గని దుఃఖితుండై.** **402**

ప్రతిపదార్థం: తదనంతరంబు+అ= అటు పిమ్మట; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; భీమసేనున్= భీముడిని; ఆలోకించి= చూచి; కవలును= నకులసహదేవులును; కవ+వడి= కవ్వడియును= సవ్యసాచియును; ఇంత= ఇంతసేపు; తడయుటకున్= ఆలసించటానికి; నిమిత్తంబు= హేతువు; ఎయ్యది+ఓ= ఏదియో; నీవు= నీవు; అరుగుము= వెడలుము; అనినన్= అని (ధర్మరాజు) చెప్పగా; కిమ్మీరవైరి= భీముడు (కిమ్మీరుడు అనే రాక్షసుడికి శత్రువు); మారుతజవంబునన్= వాయువేగాన; ఆ+మువ్వురున్= ఆ ముగ్గురును; చనినచొప్పునన్= వెళ్లిన మార్గంలో; చని= వెళ్లి; పద్మ+ఆకరకూలంబునన్= కొలనుగట్టున; నిద్రాపరవశులున్+పోలెన్= నిదురమైకంలో మునిగినవారివలె; పడి+ఉన్న= నేలపై పడిఉన్న; తమ్ములన్= అనుజులను; కని= అరసి; దుఃఖితుఁడు+ఐ= శోకం చెందినవాడై.

తాత్పర్యం: అటుపిమ్మట, ధర్మరాజు భీముడిని చూచి, 'నకులసహదేవులున్నూ అర్జునుడున్నూ ఇంతఆలస్యం చేయటానికి కారణ మేమై ఉంటుందో; నీవు వెళ్లుము' అని చెప్పాడు. అంత కిమ్మీరుడిశత్రువు అయిన భీముడు వాయువేగంతో ఆ మువ్వురుతమ్ములు వెళ్ళినమార్గాన్నిబట్టి వెళ్లి ఆ కొలనుగట్టుపై నిదురమైకంలో ఉన్నవారివలె పడిఉన్న నకులసహదేవులను అర్జునుడిని చూచి మిక్కిలి దుఃఖించాడు.

తరలము

'ఇది మనుష్యకృతంబు గాదు సురేంద్ర కిన్నర పన్నగ
త్రిదశనిర్మిత మైన కర్మము; దీని నింతయు నేర్పడం
బిదపఁ జూచెదఁగాక' యంచును భీతిదూరుఁడు నీరువ
ట్టొదవఁ దత్సలిలాశయంబు సముత్సుకుం డయి చొచ్చినన్. **403**

ప్రతిపదార్థం: ఇది= ఇది (నకులసహదేవులు; అర్జునుడు నేలగూలటం); మనుష్య, కృతంబు+కాదు= మనుజులచేత చేయబడిన పని కాదు; సుర+ఇంద్ర, కిన్నర, పన్నగ, త్రిదశ, నిర్మితము+ఐన= దేవేంద్రుడు, కిన్నరులు, పన్నగులు అయిన దేవతలచేత చేయబడినట్టిది అయిన; కర్మము= పని; దీనిన్= ఈ విషయాన్ని; ఇంతయున్= సమగ్రంగా; ఏర్పడన్= సుస్పష్టంగా; పిదపన్= తరువాత; చూచెదన్+కాక= చూస్తానులే; అంచును= అని తలపోస్తూ; భీతిదూరుఁడు= భయానికి దూరంగా ఉండేవాడు, ధైర్యవంతుడు, భీముడు; నీరు+వట్టు+ఒదవన్= దాహం ఏర్పడగా; తద్+సలిల+ఆశయంబున్= ఆనీటికొలనును; సమ్+ఉత్సుకుండు+అయి= కోరిక కలవాడై; చొచ్చినన్= ప్రవేశించగా.

తాత్పర్యం: 'ఇది మనుష్యులు చేసిన పని కాజాలదు. దేవేంద్రుడో కిన్నరులో పన్నగులో త్రిదశులో ఈ పనిని చేసిఉండవలె. ఈ విషయాన్ని తరువాత పరిశీలిస్తానుగాక' అని తలపోస్తూ ధైర్యవంతుడైన భీముడు, దాహంచొప్పున ఆ నీటికొలనులోకి దిగాడు.

విశేషం: వృత్త లక్షణానికి చూడు: ఆరణ్య. 4.402 విశేషాంశం.

వ. **అంతరిక్షగోచరం బైన వచనం బిట్లని వినంబడియె: 'నయ్యా! నీ వి ట్లేల సాహసంబు సేసెద; విక్కొలను మత్పూర్వపరిగ్రహంబు; నీ వోపుదేని నా యడిగిన యర్థంబులకు నుత్తరంబు లిచ్చి జలంబులు ద్రావు' మనిన నప్పలుకులు గైకొనక వృకోదరుండు నిపీతసలిలుండై యచ్చోటన మూర్ఛితుండై పడియె; నిట బాండవాగ్రజుండు.** **404**

ప్రతిపదార్థం: అంతరిక్షగోచరంబు+ఐన= ఆకసంనుండి వ్యక్తమైన; వచనంబు= పలుకు; ఇట్లు+అని= ఈ విధంగా; వినంబడియెన్= విన్పించింది; అయ్యా!= ఆర్యా!; నీవు= నీవు; ఇట్లు+ఏల= ఈ విధంగా ఎందుకు; సాహసంబు+చేసెదవు= తెగువ చూపిస్తావు; ఈ+కొలను; మత్+పూర్వపరిగ్రహంబు= నాచేత లోగడ గైకొనబడింది; నీవు= నీవు; ఓపుదు+ఏనిన్= చేతనైతే; నా అడిగిన= నేను ప్రశ్నించిన; అర్థంబులకున్= ప్రశ్నలకు (భావాలకు); ఉత్తరంబులు+ఇచ్చి= సమాధానాలు చెప్పి; జలంబులు= నీళ్ళు; త్రావుము= క్రోలుము; అనినన్= అని చెప్పగా; ఆ+పలుకులు= ఆ మాటలు; కైకొనక= స్వీకరించక (లెక్కసేయక); వృకోదరుండు= భీముడు; నిపీతసలిలుండు+ఐ= బాగా త్రాగబడిన నీళ్ళుకలవాడై (బాగా నీరుత్రాగి); ఆ+చోటన్+అ= ఆ స్థలంలోనే; మూర్ఛితుండు+ఐ= స్పృహతప్పినవాడయి; పడియెన్= పడిపోయాడు; ఇట= ఇక్కడ (అరణ్యంలో); పాండవ+అగ్రజుండు= పాండవులలో మొదటపుట్టినవాడు ధర్మనందనుడు.

తాత్పర్యం: అంత ఆకాశంనుండి శబ్దం విన్పించింది. 'అయ్యా! నీవు ఎందుకు ఇట్టి సాహసానికి పూనుకొంటున్నావు? ఈ కొలను పూర్వమే నాచేత పరిగ్రహించబడింది. నీకు శక్తి ఉంటే నేను అడిగే ప్రశ్నలకు సముచితసమాధానాలు చెప్పి, ఆ పిమ్మట ఈ కొలనునీరు త్రాగుము.' ఆ మాటలు సరకుగొనక, భీముడు నీటిని గ్రోలి స్పృహతప్పి అక్కడే పడిపోయాడు. ఇక అరణ్యంలో అట నున్న ధర్మరాజు.

క. **తమ్ములు నలువురు నొక్కట । నమ్మెయి మసలుటకు నాత్మ నత్యంతవిషా**
ద మ్మొలయ సముత్థితుఁ డై । క్రమ్మఱ నమ్మార్గ మపుడు గైకొని నడచెన్. **405**

ప్రతిపదార్థం: తమ్ములు= అనుజులు; నలువురున్= నలుగురున్నూ; ఒక్కటన్= ఒకేరీతిగా; ఆ+మెయిన్= ఆవిధంగా; మసలుటకున్= ఆలసించటానికి; ఆత్మన్= మనస్సులో; అత్యంతవిషాదమ్ము= మిక్కుటమయిన పరితాపం; ఒలయన్= కలుగగా; సమ్+ఉత్థితుఁడు+ఐ= లేచినవాడై; క్రమ్మఱన్= మరల; ఆ+మార్గము= ఆ దారి (తమ్ములు వెడలినదారి); అపుడు= ఆ సమయంలో; కైకొని= స్వీకరించి; నడచెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ధర్మజుడు తన నలుగురుతమ్ములూ ఒకేరీతిగా ఆలసించటంచేత మనస్సులో మిక్కిలి పరితపిస్తూ, లేచి వారు లోగడ వెడలిన దారినిబట్టి నడవసాగాడు.

సీ. **అపగత జనశబ్దమై, యనభివ్యక్త । మార్గమై, యవిరళదుర్గశైల**
తరుగుల్మవల్లీవితానమై, గజసింహ । శరభ శార్దూల సూకర లులాయ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బహుళమై, బహువిధపక్షికోలాహల । భయదమై, కడుఁ బరపైన యడవి
ననుజుల వెదకుచు ననఘుండు సని కాంచెఁ । గమలాకరంబుతీరమునఁ బడిన

ఆ. వారిఁ బూరువంశవరుల భీమార్జున । యముల నమితబలుల విమలమతులఁ
బ్రళయపతితలోకపాలసంకాశుల । భూరిపుణ్యధనుల వీరవరుల. 406

ప్రతిపదార్థం: అనఘుండు= పాపరహితుడు, ధర్మనందనుడు; అపగతజనశబ్దము+ఐ= ప్రజల ధ్వనిలేనిదై, జనసంచారంలేనిదై; న+అభివ్యక్తమార్గము+ఐ= కన్పించని దారికలదై; అవిరళ, దుర్గ, శైల, తరుగుల్మవల్లీవితానము+ఐ= దట్టమైన నడవటానికి వీలులేని కొండలతో చెట్లతో పొదలతో తీగెలసముదాయంతో కూడుకొనిఉన్నదై; గజ, సింహ, శరభ, శార్దూల, సూకర, లులాయ బహుళము+ఐ= ఏనుగులతో సింహాలతో మీగండ్లమెకాలతో అడవిపందులతో కారెనుపోతులతో దట్టమైనదై; బహువిధపక్షి కోలాహలభయదము+ఐ= పెక్కురకాలైన పిట్టల కలకలనాదంచేత భీతిగొలిపేదై; కడున్= మిక్కిలి; పరపు+ఐన, అడవిలోన్= విరివి అయిన అడవిలో; అనుజులన్= తమ్ములను; వెదకుచున్= అన్వేషిస్తూ; చని= వెడలి; కమల+ఆకరంబు తీరమునన్= కొలనుగట్టుపైన; పడినవారిన్= కూలిఉన్నవారిని; పూరువంశవరులన్= పురుమహారాజుయొక్క వంశంలో జన్మించినవారిలో శ్రేష్ఠులను; భీమ+అర్జున, యములన్= భీముడిని, అర్జునుడిని, (కవలను) నకులసహదేవులను; అమితబలులన్= గొప్పబలం కలవారిని; విమలమతులన్= నిష్కల్మషమైన బుద్ధి కలవారిని; ప్రళయపతితలోకపాలసంకాశులన్= ప్రళయకాలంలో పడిపోయిన దిక్పాలకులతో సమానులను; భూరిపుణ్యధనులన్= ఎక్కువసుకృతం ధనంగా కలవారిని; వీరవరులన్= శూరులలో శ్రేష్ఠులను; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: ధర్మరాజు అడవిలో నడవసాగాడు. ఆ అడవిలో నరసంచారశబ్దం విన్పించటం లేదు; దారితెన్నులు కానరావటం లేదు; ఎచ్చట చూచినా నడవటానికి వీలులేని రాళ్ళు రప్పలు కొండలు కోనలు చెట్లు పొదలు తీగెలు దట్టంగా అడ్డుతగులుతున్నాయి; ఏనుగులు సింహాలు మీగండ్లమెకాలు పెద్దపులులు పందులు కారెనుపోతులు తిరుగాడుతున్నాయి. పెక్కురకాలైన పక్షుల కలకలారావాలు భయంకరంగా విన్పిస్తున్నాయి. ఆ దట్టమైన అడవిలో పుణ్యాత్ముడైన ధర్మరాజు తనతమ్ములను అన్వేషిస్తూ వెడలి ఆ కొలనును చేరాడు. ఆ కొలనుగట్టుమీద స్పృహవీడి పడిఉన్న తమ్ములను - భీముడిని, అర్జునుడిని, నకులసహదేవులను పూరువంశంలో జన్మించినవారిలో శ్రేష్ఠులను, మిక్కుటమైన బలం కలవారిని, నిర్మలమైన బుద్ధికలవారిని, గొప్పపుణ్యాన్ని ఆర్జించిన మహావీరులను ధర్మరాజు చూచాడు. వారు ప్రళయకాలంలో పడిఉండే దిక్పాలకులవలె ఆ చెరువుగట్టుపై కూలిపోయి కన్పించారు.

విశేషం: అలం: ఉపమ.

మ. కని డెందంబునఁ దల్లడం బడర దీర్ఘశ్వాస వైవర్ణ్యముల్
దనుకం దాల్మి చలింప విస్మయపరీతస్వాంతుఁడై శోకబా
ష్పనిరుద్ధాకులలోచనుం డగుచు మూర్ఛల్ పైకొనం గొంతసే
పు నరేంద్రోత్తముఁ డుండెఁ జిత్రమున రూపుంబోలెఁ దా నచ్చటన్. 407

ప్రతిపదార్థం: కని= చూచి; డెందంబునన్= హృదయంలో; తల్లడంబు+అడరన్= సంతాపం అతిశయించగా; దీర్ఘశ్వాసవైవర్ణ్యముల్= నిట్టూరుపులు పాలిపోవటాలు; తనుకన్= క్రమ్ముకొనగా; తాల్మి= ఓర్పు; చలింపన్= కదలిపోగా; విస్మయపరీతస్వాంతుఁడు+

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఐ= ఆశ్చర్యంతో చుట్టుకొనబడినమనస్సు కలవాడై; శోకబాష్పనిరుద్ధ+ఆకుల, లోచనుండు+అగుచున్= దుఃఖంవలన వెలువడిన కంటినీటిచేత అడ్డగించబడి కలతచెందిన కన్నులు కలవాడు ఔతూ; మూర్ఛల్= స్పృహతప్పటాలు; పైకొనన్= వ్యాపించగా; కొంత+సేపు= కొంతతడవు; నర+ఇంద్ర+ఉత్తముఁడు= రాజులలో శ్రేష్ఠుడు; చిత్రమున+రూపున్+పోలెన్= బొమ్మలో గీయబడిన ఆకృతివలె; తాన్= తాను; అచ్చటన్= ఆకొలను దరిని; ఉండెన్= (నిలబడి) ఉన్నాడు.

తాత్పర్యం: స్పృహ కోలుపోయి ఆ కొలనుగట్టుపై పడిఉన్న తమ్ములను చూచి ధర్మరాజు కొయ్యబారిపోయి కదలక మెదలక చిత్రంలో గీయబడిన ఆకారంవలె అక్కడ కొంతతడవు నిలబడిపోయాడు. ఆదృశ్యాన్ని చూచేసరికి ధర్మరాజు చిత్తం తల్లడిల్లింది. అతడిమొగం పాలిపోయింది. వేడినిట్టూరుపులు బయల్వెడలాయి. ఆశ్చర్యచకితు డవటంచేత అతడిఓర్పు మాయమైపోయింది. దుఃఖపరితాపంచొప్పున వెలువడిన కంటినీరువలన ఆతడి దృష్టి మాసిపోయింది. మూర్ఛలు క్రమ్ముకొన్నాయి.

విశేషం: (1) అలం: స్వభావోక్తి, ఉపమ. (2) ఈపద్యంలో ఎఱ్ఱనపై తిక్కనకవితాశిల్పప్రభావముద్ర ఆంగికసాత్త్వికానుభావవర్ణనలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

వ. **పదంపడి డెందంబున ధృతి పొందుపఱుచుకొని యతం డన్నలువుర నుపలక్షించి నలుదెసలుం బరికించి యాత్మగతంబున.** **408**

ప్రతిపదార్థం: పదంపడి= పిమ్మట; అతండు= అతడు ధర్మనందనుండు; డెందంబునన్= హృదయంలో; ధృతి= ధైర్యం; పొందుపఱుచుకొని= కూడగట్టుకొని; ఆ+నలువురన్= ఆ నలుగురిని (భీముడిని, అర్జునుడిని, నకులుడిని, సహదేవుడిని); ఉపలక్షించి= చూచి; నలుదెసలున్= నాలుగుదిక్కులను; పరికించి= చూచి; ఆత్మగతంబునన్= తనలో తాను.

తాత్పర్యం: పిమ్మట కొంతతడవుకు ధర్మరాజు తేరుకొన్నాడు. అతడు తనహృదయంలో ధైర్యాన్నికూడగట్టుకొన్నాడు. కొలనుగట్టుపై పడిఉన్న తమ్ములు భీముడిని అర్జునుడిని నకులుడిని సహదేవుడిని క్రమంగా తేరిపార చూచాడు. నలుదిక్కులను పరీక్షించి చూచి, తనలో తాను (ఆలోచించసాగాడు).

తే. **'ఒరులు వచ్చిన చొప్పు లే; దరిగినట్టి । చొప్పు లేదు; పెనంగిన చొప్పు లేదు;**
ఘనభుజుల యంగకంబులు గనుఁగొనంగ । నక్షతము; లేల యొక్కొ యి ట్లయిరి వీరు? **409**

ప్రతిపదార్థం: ఒరులు= ఇతరులు; వచ్చిన= అరుగుదెంచిన; చొప్పు= తీరు; లేదు= లేదు; అరిగినట్టిచొప్పు= వెడలినతీరు; లేదు= లేదు; పెనంగినచొప్పు= పోరు సల్పిన తీరు; లేదు= లేదు; ఘనభుజుల అంగకంబులు= వీరుల అవయవాలు; కనుఁగొనంగన్= చూడగా; అక్షతములు= గాయాలు లేనట్టివి; ఏలయొక్కొ= ఎందుచేతనో; వీరు= భీమార్జున నకులసహదేవులు; ఇట్లు+అయిరి= ఈ విధంగా అయినారు.

తాత్పర్యం: 'ఆహా! ఏ మిది చోద్యం!! ఇక్కడకు ఇతరులు ఎవ్వరూ వచ్చిన జాడలు లేవు. ఇటనుండి ఇతరులు ఎవరూ వెళ్ళిన అడుగుజాడలు కన్పించవు. భీముడు అర్జునుడు నకులసహదేవులు సామాన్యులు కారు. మహావీరులు కదా; సులువుగా ఇతరులకు లొంగేవారు కారు. పోనీ, పోరాటం జరిగిందా అంటే, జరిగినట్లే లేదు. పోనీ, వీరి అవయవాలపై గాయాలు ఏవీ కానరావు. ఎందుకో వీరు ఈ విధంగా నేలకూలారు ఏమీ పాలుపోవటం లేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: సంశోధిత ప్రతిలోని నాలుగవ పాదంలో గణభంగమయింది- 'అక్షతంబు లేలకో యి ట్లయిరి వీరు'. అందుచేత వావిళ్ళ ప్రతిలోని 'అక్షతము లేలయొక్కొ యిట్లయిరి వీరు' అనే పాఠం స్వీకరించబడింది.

ఉ. **క్రూరుఁడు ధార్తరాష్ట్రుఁ డతికుత్సితుఁ; డెంతయుఁ బాపబుద్ధి గాం**
ధారుఁడు పెక్కుమాయలకుఁ దావల; మక్కట! యద్దురాత్మకుల్
వారక యెద్దియేని యొకవంచనమై యిటు సేసిరొక్కొ! యె
వ్వారలు నాత్మ నమ్ముదురె వక్రవిచారులఁ బాపకర్ములన్. **410**

ప్రతిపదార్థం: ధార్తరాష్ట్రుఁడు= ధృతరాష్ట్రుడికొడుకు దుర్యోధనుడు; క్రూరుఁడు= కఠినుడు; అతికుత్సితుఁడు= మిక్కిలికుటిలమైన బుద్ధి కలవాడు; గాంధారుఁడు= గాంధారరాజపుత్రుడు, శకుని; ఎంతయున్= మిక్కిలి; పాపబుద్ధి= పాపమైన బుద్ధి కలవాడు; పెక్కుమాయలకున్= పలురకాల మోసాలకు; తావలము= నెలవు; అక్కట!= అయ్యో!; ఆ+దురాత్మకుల్= ఆ చెడు ఆత్మ కలవారు (దుర్యోధనుడు, శకుని); వారక= ఆగక; ఎద్ది+ఏని= ఏదిఐన; ఒకవంచనమైన్= ఒకమోసంతో; ఇటు= ఈ విధంగా; చేసిరి+ఒక్కొ!= చేసిరా ఏమి!; వక్రవిచారులన్= వంకరఆలోచనలు గలవారిని; పాపకర్ములన్= దుష్టకార్యాలు గలవారిని; ఏ+వారలున్= ఎవరుగాని; ఆత్మన్= మనస్సులో; నమ్ముదురె?= విశ్వసిస్తారా?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడికుమారుడు ఆ దుర్యోధనుడు క్రూరుడు, కుటిలుడు. ఆతడికి సాయం చేసేవాడు గాంధారరాజ పుత్రుడు శకుని. పేరుకెక్కిన మాయావి. పెక్కుమోసాలకు నెలవు. అక్కట! ఆ దురాత్ములు ఏదైన కుట్ర పన్ని ఈ విధంగా చేశారా? చెడుబుద్ధికలవారిని ఎవరైనా తమమనస్సులలో విశ్వసిస్తారా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. **వదనంబుల తెలివియుఁ గర । పదరుచియుం జెడదు; వీరు వడుటకుఁ గత మీ**
యుదకము విషదుష్ట మనియు । మదిఁ దలఁపం బోల; దేమి మాయయొ యెఱుఁగన్. **411**

ప్రతిపదార్థం: వదనంబుల= మొగాలయొక్క; తెలివియున్= ప్రసన్నతయును; కరపదరుచియున్= చేతులుకాళ్ళయొక్క కాంతియు; చెడదు= పాడు కాలేదు; వీరు+పడుటకున్= వీరు కూలటానికి; కతము= కారణం; ఈ ఉదకము= ఈ నీరు; విషదుష్టము= విసం చేత చెడిపోయింది; అనియున్= అనియును; మదిన్= చిత్తంలో; తలఁపన్+పోలదు= ఊహించటానికి వీలు లేదు; ఏమిమాయ+ఒ= ఇది ఏమి మోసమో; ఎఱుఁగన్= తెలియజాలను.

తాత్పర్యం: వీరిమొగాలు ప్రసన్నంగా ఉన్నాయి. వీరి చేతులు కాళ్ళు కాంతి చెడలేదు. వీరు ఈ రీతిగా కూలటానికి కారణం ఈ కొలనునీరు విషపూరితమని ఊహచేయటానికికూడా వీలులేదు. మఱి ఇదేమి మాయయో నా ఊహకు అంతు చిక్కటం లేదు.

చ. **పుడమియు సర్వసంపదలుఁ బొల్పఱ వైరుల పాలుసేసి యీ**
యడవికి వచ్చి భీకరమృగావలిపొందున నున్న వీరి వె
న్నడికొని యిట్లు సేసెనె యనాథులఁబోలె విధాతృఁ; డింక నె
క్కడఁ జనువాఁడ? నేది గడగాఁ దరియింతు దురంతదుఃఖమున్? **412**

ప్రతిపదార్థం: పుడమియున్= భూమియు, సర్వసంపదలున్= సమస్తమైన ఐశ్వర్యాలు; పొల్పు+అఱన్= శోభ నశించగా; వైరులపాలు= శత్రువులఅధీనం; చేసి= ఒనర్చి; ఈ+అడవికిన్= ఈ అరణ్యానికి; వచ్చి= అరుదెంచి; భీకర, మృగ+ ఆవలి+ పొందునన్+ఉన్న= భయంకరమైన జంతువులను చేరి ఉన్న; వీరిన్= వీరిని (భీమార్జున నకులసహదేవులను); వెన్నడికొని= వెంటాడి; విధాత్రుఁడు= బ్రహ్మదేవుడు; ఇట్లు= ఈవిధంగా; అనాథులన్+పోలెన్= దిక్కులేనివారిని పోలేటట్లుగా; చేసెనె= ఒనర్చెనుకదా; ఇంకన్= ఇకమీద; ఎక్కడన్= ఎచటకు; చనువాఁడన్= వెడలగలను; దురంతదుఃఖమున్= అంతం లేని శోకాన్ని; ఏది= ఏది; కడగాన్= దిక్కుగా, ఆధారంగా; తరియింతున్= దాటగలను.

తాత్పర్యం: సమస్తమైన భూరాజ్యం ఐశ్వర్యాలు శోభ నశించగా శత్రువుల అధీనంచేసి ఈ అరణ్యానికి వచ్చి, భయంకరమృగాలను చేరి నివసిస్తున్న వీరిని (భీమార్జున నకులసహదేవులను) వెంబడించి బ్రహ్మదేవుడు ఈ రీతిగా దిక్కుమాలినవారివలె చేసెనుగదా. నే నింక ఎక్కడికి పోగలను? నాకు దిక్కెవరు? అంతం లేని ఈ పరితాపాన్ని ఎట్లా తరించగలను?

సీ. **పుత్త్రులు దుఃఖార్తిఁ బొగులుట కనిశంబుఁ । బొక్కచునున్న యప్పుణ్యచరిత**
మాతల్లి పాండునిమహిషి నా కెదురుగా । వచ్చి కౌఁగిటఁజేర్చి 'వత్స! నాఁడు
నీతమ్ముఁగుఱ్ఱలు నీవును నడవుల । కరిగితి, రిప్పు డయ్యనుజు లెందుఁ
జనిరి? నీ వొకడవ చనుదెంచి; తిది యేమి?' । యనిన నాయమతోడ నప్పు డేమి

ఆ. **యనఁగ నేర్చువాఁడ? నాచార్యవిదుర శాం । తనవకృపులు నను ముదంబుతోడఁ**
గుశల మడిగి రేనిఁ గుశల మే మనువాఁడ? । నెందుఁ దలఁగరాని యెడరు దగిలె.' 413

ప్రతిపదార్థం: పుత్త్రులు= తన కొడుకులు; దుఃఖ+ఆర్తిన్= శోకదైన్యంతో; పొగులుటకున్= బాధపడటానికి; అనిశంబున్= ఎల్లప్పుడును; పొక్కుచున్+ఉన్న= ఆవేదన అనుభవిస్తున్న; ఆ+పుణ్యచరిత= మంచిశీలం కలది; మాతల్లి= మాఅమ్మ; పాండుని, మహిషి= పాండురాజు దేవేరి; నాకున్= నాకు; ఎదురుగాన్= వచ్చి= స్వాగతంచెప్పుతూ అరుదెంచి; కౌఁగిటన్+చేర్చి= ఆలింగనం ఒనర్చి; వత్స!= నాయనా!; నాఁడు= ఆ రోజున; నీతమ్ము+కుఱ్ఱలున్= కుఱ్ఱలు అయిన నీ తమ్ములును; నీవును= నీవును; అడవులకున్= అరణ్యాలకు; అరిగితిరి= వెళ్ళారు; ఇప్పుడు= నేఁడు; ఆ+అనుజులు= ఆ తమ్ములు (భీమార్జుననకులసహదేవులు); ఎందున్= ఎచటికి; చనిరి?= వెళ్ళారు?; నీవు= నీవు; ఒకడవు+అ= ఒక్కడవే; చనుదెంచితి(వి)= వచ్చావు; ఇది+ఏమి?= (ఈ విధంగా తమ్ములు లేకుండా రావటం ఏమి); అనినన్= అని అడుగగా; ఆయమతోడన్= ఆమెతో (కుంతీదేవితో); అప్పుడు= ఆ సమయంలో; ఏమి+అనఁగన్= ఏమి చెప్పటానికి; నేర్చువాఁడన్= సమర్థుడను; ఆచార్య, విదుర, శాంతనవ, కృపులు= ద్రోణుడు, విదురుడు, భీష్ముడు, కృపుడు; ననున్= నన్ను; ముదంబుతోడన్= సంతోషంతో; కుశలము+అడిగిరి+ఏని= యోగక్షేమాలనుగూర్చి ప్రశ్నిస్తే; కుశలము+ఏమి+అనువాఁడన్= క్షేమాన్నిగూర్చి అడిగినప్రశ్నకు బదులు ఏమని చెప్పగలను; ఎందున్= ఏవిధంగానూ; తలఁగన్‌రాని= తప్పించుకొనటానికి వీలులేని; ఎడరు= ఆపద; తగిలెన్= సంభవించింది.

తాత్పర్యం: తనకొడుకులు శోకంచేత పరితపించి దైన్యాన్ని అనుభవించటానికి ఎల్లప్పుడు తాను ఆవేదన చెందే తల్లి కుంతీదేవి, పాండురాజు దేవేరి, పుణ్యాత్మురాలు. ఆమె నాకు సంతోషంతో స్వాగతం చెప్పుతూ వచ్చి నన్ను ఆలింగనం చేసికొని 'నాయనా! ఆనాడు నీవూ నీ తమ్ములూ కలిసి అరణ్యాలకు వెడలితిరికదా! ఈనాడు నీవు ఒంటరిగా వచ్చావేమి? నీతమ్ములు ఏమైనారు? వారు ఎక్కడికి వెళ్ళారు?' అని ప్రశ్నిస్తే నేను ఏమని సమాధానం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెప్పగలను? ద్రోణాచార్యులు, పితామహుడు భీష్ముడు, మహానుభావుడు విదురుడు, గురువు కృపుడు నన్ను చూడగానే నాయోగక్షేమాలనుగూర్చి ప్రశ్నిస్తారుకదా! నేనుమాత్రం క్షేమంగా తిరిగి వచ్చాను అని ఎట్లా బదులు పలుకగలను? ఏవిధంగానైననూ తీరని ఆపద సంప్రాప్తించిందికదా!'

వ. అని పెక్కుతెఱంగుల వగచి యా ధర్మజుండు దప్పి కోర్వక నీళ్ళు ద్రావుటకై సరోవరంబులోనికి డిగ్గుటయు నెప్పటియట్ల యశరీరభూతం బిట్లనియె. 414

ప్రతిపదార్థం: అని; పెక్కుతెఱంగులన్= పలురీతుల, వగచి= దుఃఖించి; ఆ, ధర్మజుండు; దప్పికిన్= దాహానికి; ఓర్వక= తాళజాలక; నీళ్లు; త్రావుటకున్+ఐ; సరోవరంబులోనికిన్= కొలనులోకి; డిగ్గుటయున్= దిగగా; ఎప్పటి+అట్లు+అ లోగడమాదిరిగానే; అశరీర, భూతంబు= దేహం లేని ప్రాణి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలువిధాల దుఃఖించి ధర్మరాజు దాహానికి తాళజాలక ఆ కొలనులోకి దిగాడు. ఆతడిని వారిస్తూ ఇదివరకు మాదిరిగానే శరీరంలేనిభూతం ఇట్లా పలికింది.

మ. 'విను మే నొక్క బకంబ; నిక్కొలను పృథ్వీనాథ! నాసొమ్ము; నీ
యనుజుల్ మద్వచనంబుఁ గైకొనక తోయాస్వాదులై యివ్విధం
బునఁ బ్రాణచ్యుతిఁ బొంది; రీవును గడున్ మోహంబునన్ సాహసం
బునకుం జొచ్చిన నట్ల యయ్యెడు సుమీ! మున్ముట్ట వారించితిన్. 415

ప్రతిపదార్థం: పృథ్వీనాథ!= భూపతీ! ఓధర్మరాజా!; ఏను= నేను; ఒక్క= ఒక; బకంబు+అన్= కొంగను; ఈ+కొలను= ఈసరోవరం; నాసొమ్ము= నాఆస్తి; నీ+అనుజుల్= నీతమ్ములు; మత్+వచనంబున్= నామాట; కైకొనక= లెక్కచేయకుండా; తోయ+ఆస్వాదులు+ఐ= నీరు త్రాగినవారై; ఈ+విధంబునన్= ఈ విధంగా; ప్రాణచ్యుతిన్+పొందిరి= అసువులను కోల్పోయారు; ఈవును= నీవును; కడున్= మిక్కుటమైన; మోహంబునన్= భ్రాంతితో; సాహసంబునకున్+చొచ్చినన్= తెగువకు పూనితే; అట్లు+అ (అట్ల)= ఆవిధంగానే; అయ్యెడు+చుమీ= ఔతుంది సుమా జాగ్రత్త; మున్+ముట్ట= మునుముందుగనే; వారించితిన్= అడ్డుచెప్పి హెచ్చరించాను.

తాత్పర్యం: 'ఓ ధర్మనందనా! నేను ఒకకొంగను. ఈ సరోవరం నా ఆస్తి. నీ తమ్ములు నేను చేసిన హెచ్చరిక పాటించకుండా ఇందులోని నీళ్ళు త్రాగి ఈ విధంగా ప్రాణాలను కోల్పోయారు. నీవుకూడ మిక్కుటమైన భ్రాంతిచొప్పున తెగువకు పూని ఇందలినీళ్ళను త్రాగితే నీతమ్ములకు పట్టిన దుర్గతియే నీకుకూడ దాపురించగలదు. జాగ్రత్త. మునుముందుగా నేను నీకు ఈ హెచ్చరిక చేస్తున్నాను.

క. ఏ నడిగిన యర్థములకు । భూనుత! యుత్తరము లిచ్చి పొలుపొందఁ బయః
పానంబు సేయు' మనవుడు । నా నిర్మలచరితుఁ డంబరాభిముఖుండై. 416

ప్రతిపదార్థం: ఏను= నేను; అడిగిన= కోరిన; అర్థములకున్= విషయములకు (ప్రశ్నలకు); భూనుత! భూమియందలిజనులచేత కీర్తించబడినవాడా, ఓధర్మనందనా!; ఉత్తరములు+ఇచ్చి= సమాధానాల నొసగి; పొలుపు+ఒందన్= శోభిల్లేటట్లుగా, పయః పానంబు (పయస్+పానమ్ము)చేయుము= నీళ్ళు త్రాగుము; అనవుడున్= అని (అశరీరభూతం) చెప్పుటచేత; ఆ నిర్మల, చరితుఁడు= ఆ స్వచ్ఛమైన శీలం కలవాడు, ఆ ధర్మనందనుడు; అంబర+అభిముఖుండు+ఐ= ఆకసంవైపు మొగం సారించినవాడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'భూజనులచేత ప్రశంసించబడినవాడా, ఓధర్మరాజా! నేను కోరిన ప్రశ్నలకు సరిఅయిన సమాధానాలు చెప్పి, పిదప ఒప్పిదంగా ఈ సరోవరంలోని నీరు త్రాగుము'- అని అశరీరభూతం అన్నది. అంతట నిర్మలమైనశీలం గలవాడైన ఆ ధర్మరాజు ఆకాశంవైపు తనమొగాన్ని త్రిప్పి.

విశేషం: 'నిన్ను భూజనులు ప్రశంసిస్తున్నారు. ఆ నీ కీర్తి ఎంతవరకు సమంజసమైనదో నేను నిన్ను పరీక్షింప దలచాను.'- అని అశరీరభూతం చెప్పింది. అంతట ఆ నిర్మలశీలుడు ఇట్లా బదులు పలికాడు. కీర్తికి తోడు జ్ఞానం, జ్ఞానానికితోడూ సౌశీల్యం ఉండాలి. కీర్తిజ్ఞానసౌశీల్యాలకు ముయ్యేలగుట్ట ధర్మరాజు.

వ. 'అయ్యా! నీవు బకరూపధరుండ వైన రుద్రుండవో, పావకుండవో, పవనుండవో! యట్లు గానినాఁడు కులపర్వతప్రతిము లయిన నాతమ్ములం బడఁద్రోచునట్టిబలంబు పులుఁగుల కెందునుం గలుగదు. దేవాసురగంధర్వయక్షాదులకు దుర్జయులైన యవ్వీరుల నిట్లు సేసి నీవు గాని వాఁడవ పోలెం దొలంగియున్నవాఁడవు; నాకు నద్భుతభయకౌతుకంబు లొక్కటం బొడమెడు; నీ వెవ్వండవు? నీతలంపెయ్యది? చెప్పి నాహృదయవేదన నపనయింపవే యనిన నదృశ్యభూతంబు. 417

ప్రతిపదార్థం: అయ్యా!= ఆర్యా!; నీవు= ఈవు; బకరూపధరుండవు= కొంగరూపంలో ఉన్న; రుద్రుండవు+ఓ= శివుడవో; పావకుండవు+ఓ= అగ్నిదేవుడవో; పవనుండవు+ఓ= వాయుదేవుడవో; అట్లు+కాని, నాఁడు= ఆవిధంగా కాకపోతే; కుల, పర్వత, ప్రతిములు= కులపర్వతాలతో సమానులు; అయిన= అయినట్టి; నా తమ్ములన్; పడన్+త్రోచునట్టి= కూల్చునట్టి; బలంబు= శక్తి; పులుఁగులకున్= పక్షులకు; ఎందునున్= ఎచ్చటను; కలుగదు= ఉండదు; దేవ+అసుర, గంధర్వ, యక్ష+ఆదులకున్= దేవతలకు, రాక్షసులకు, గంధర్వులకు; యక్షులు మున్నగువారికి; దుర్జయులు+ఐన= గెలువ అలవికానివారు అయిన; ఆ+వీరులను= భీమార్జున నకులసహదేవులను; ఇట్లు+చేసి= ఈవిధంగా ఒనర్చి; నీవు= ఈవు; కానివాఁడవు+అ+పోలెన్= తనకు సంబంధం లేనివాడుగనే; తొలంగి+ఉన్నవాఁడవు= ప్రక్కకు తప్పుకొని ఉన్నావు; నాకున్= నాకు; అద్భుత, భయ, కౌతుకంబులు= ఆశ్చర్యం భీతి వేడుక; ఒక్కటన్= ఒక్కసారిగా; పొడమెడున్= ఏర్పడినవి; నీవు; ఎవ్వండవు?= ఎవరవు?; నీతలంపు+ఎయ్యది?= నీఊహ ఎటువంటిది, నీవు ఏమి చేయ సంకల్పించావు?; చెప్పి= వచించి; నాహృదయవేదనన్= నా ఎదలోని సంతాపాన్ని; అపనయింపవే= దయచేసి పోగొట్టవా; అనినన్= అని (ధర్మరాజు) పలుకగా; అదృశ్యభూతంబు= కనిపించని ప్రాణి; (ఇట్లు+అనియెన్= ఈ విధంగా బదులు పలికింది.)

తాత్పర్యం: 'అయ్యా! నీవు కొంగవు కాజాలవు. కొంగరూపం ధరించిన శివుడవో, అగ్నిదేవుడవో, వాయుదేవుడవో. అట్లాకాకపోతే వీరులలో వీరాధివీరులు కులపర్వత సమానులు అయిన నాతమ్ములను (భీమార్జుననకులసహదేవులను) నేలగూల్చగల బలం పక్షులకు ఎన్నడూ కలుగనేరదు. దేవతలకు, రాక్షసులకు గంధర్వులకు యక్షులకు నాతమ్ములు గెలువ నలవిగానివారు. అట్టివీరులను ఈ విధంగా నేలపై పడవేయగలిగినవాడవు నీ వెవరవు? నాకు భయం, ఆశ్చర్యం, వేడుక నా ఎదలో ముప్పిరికొన్నవి. నీ వెవరవు? నీవు ఏమి చేయ సంకల్పించావు? దయచేసి నాకు చెప్పుము'- అనిన అదృశ్యభూతం ఈవిధంగా బదులు పలికింది.

విశేషం: (1) అలం: ఉపమ. (2) ధైర్యస్థైర్యాలకు వీరులను పర్వతాలతో పోల్చటం పరిపాటి. పర్వతాలలో కులపర్వతాలు గొప్పవి. ఆదిశేషుడు మున్నగువారు భూభారాన్ని వహించేవారు. కులపర్వతాలు భూమిని వహిస్తునట్లు పౌరాణికకథనం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'కౌరవేంద్ర! బకముఁ గాను నే; విను మొక్క। యక్షవరుఁడ; నిచట నస్మదీయ
నికృతిఁ జేసి పడిరి నీతమ్ము లందఱు'। ననుచు నాక్షణంబ యతని యెదుర. 418

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కౌరవులకు అధిపతివైనవాడా!; వినుము= ఆలకించుము; నేన్= నేను; బకమన్+కాను= కొంగను కాను; ఒక్క= ఒక; యక్షవరుఁడన్= యక్షులలో శ్రేష్ఠుడను; ఇచటన్= ఈ స్థలంలో; అస్మదీయనికృతిన్+చేసి= నా వంచనచేత; నీతమ్ములు+అందఱున్= నీ అనుజులు అందరును (భీమార్జుననకులసహదేవులు); పడిరి= కూలారు; అనుచున్= అని పలుకుతూ; ఆ క్షణంబు+అ= ఆ క్షణంలోనే; అతని+ఎదురన్= అతని ఎదుట, ఆ ధర్మరాజుముందు.

తాత్పర్యం: 'కౌరవనాయకుడ వైన ఓ ధర్మరాజా! నేను కొంగను కాను. ఒక యక్షనాయకుడను. నీ తమ్ములు నన్ను అవమానించి ఈ స్థలంలో కుప్పకూలారు' అని వచించి ఆ క్షణంలోనే ధర్మరాజుముందు (ఆ యక్షుడు ప్రత్యక్షమయ్యాడు).

మ. నిలిచెం దాళసముచ్ఛ్రితాంగుఁడు మహానిర్ఘోషసంతర్జితా
ఖిలభూతప్రకరుండు దీర్ఘవిపులగ్రీవుండు దంష్ట్రాసము
జ్జ్వలవక్త్రుండు విరూపలోచనుఁడు తీవ్రస్ఫారతేజోఘనుం
డలఘుం డా సరసీతటాంతమున నయ్యక్షుండు ఘోరాకృతిన్. 419

ప్రతిపదార్థం: ఆ+యక్షుండు= ఆ యక్షుడు; తాళసముచ్ఛ్రితాంగుఁడు= తాళ+సమ్+ఉచ్ఛ్రిత+అంగుఁడు= తాడిచెట్టువలె నిట్టనిటారుగా నిలిచిన శరీరం కలవాడు; మహా, నిర్ఘోష+సంతర్జిత+అఖిల, భూత, ప్రకరుండు= గొప్పమ్రోతచేత మిక్కిలి అదల్పబడిన ప్రాణిసమూహం కలవాడు; దీర్ఘ, విపుల, గ్రీవుండు= పొడుగైన పెద్దకంఠం కలవాడు; దంష్ట్ర, సమ్+ఉత్+జ్వల, వక్త్రుండు= కోరపండ్లచేత ప్రకాశించే నోరుకలవాడు; విరూపలోచనుడు= భీతిగొలిపే కన్నులు గలవాడు; తీవ్ర, స్ఫార+తేజస్+ఘనుండు= దేదీప్యమానంగా ప్రకాశించే వర్చస్సు కలగొప్పవాడు; అలఘుండు= గొప్పవాడు (అతికాయుడు); ఆసరసీతట+అంతమునన్= ఆ కొలనుగట్టుచివర; ఘోర+ఆకృతిన్= భయంకరరూపంతో; నిలిచెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: ఆ యక్షుడు భయంకరస్వరూపంతో ఆ సరోవరతటంచివర నిలబడ్డాడు. అతడు తాడిచెట్టువలె నిట్టనిటారుగా ఉన్న ఎత్తైనశరీరం కలవాడు. ఆతడు అక్కడికి చేరి నిలిచినప్పుడు ఏర్పడిన ధ్వనికి భూతాలు అన్నియు అదిరిపోయాయి. అతడికంఠం పొడుగైనది, విశాలమైనది. ఆతనినోటిలోని కోరలు ప్రకాశిస్తూ కన్పిస్తున్నాయి. దేదీప్యమానమైన వర్చస్సుతో అతడిశరీరం మిరుమిట్లు గొల్పుతున్నది.

వ. ఇట్లు నిలిచి కౌంతేయాగ్రజున కి ట్లనియె. 420

తాత్పర్యం: ఈ విధంగా నిలువబడి ఆ యక్షుడు ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు.

క. 'నాయనుమతి లేకుండఁగ। నీయుదకము ద్రావిరేని యెవ్వా రైనన్
ధీయుత! చత్తురు; నీ వటు। సేయవు సమ్యగ్విచారశీలుఁడ వగుటన్. 421

ప్రతిపదార్థం: ధీయుత!= బుద్ధిమంతుడా!, ఓధర్మరాజా!; నా+అనుమతి= నా అనుజ్ఞ; లేకుండఁగన్= లేకుండగా; ఈ+ఉదకము= ఈ నీరు త్రావిరి+ఏని= త్రాగారా; ఏ+వారు+ఐనన్= ఎవరు అయినా; చత్తురు= మరణిస్తారు; సమ్యక్+విచార, శీలుఁ డవు+అగుటన్= సరిఅయిన యోచనచేసే స్వభావం కలవాడవు కావటంచేత; నీవు; అటు+చేయవు= ఆ విధంగా చేయవు.

తాత్పర్యం: 'బుద్ధిమంతుడవైన ఓ ధర్మరాజా! నా అనుమతి లేకుండా ఈ సరోవరంలోని నీళ్ళు త్రాగినవారు ఎంతటిగొప్పవారయినా మరణించగలరు. నీవు సరిఅయిన యోచన చేసేవాడవు కాబట్టి ఆ రీతిగా చేయలేదు.

వ. కావున మదీయంబులగుప్రశ్నంబుల కుత్తరంబుసెప్పు మనిన నతండు 'మహాత్మా! నీ చిత్తంబునకు వచ్చునట్లుగాఁ జెప్పనాబోఁటివానికి శక్యం బగునే? యైనను నా నేర్చువిధంబునఁజెప్పెద నడుగు' మనిన నయ్యక్షుం డి ట్లనియె. 422

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి, ఈ కారణంచేత; మదీయంబులు+అగు= నావైన; ప్రశ్నంబులకున్= ప్రశ్నలకు; ఉత్తరంబు= సమాధానం; చెప్పుము= వచింపుము; అనినన్= అని (యక్షుడు) చెప్పగా; అతండు= అతడు (ధర్మనందనుడు); మహా+ఆత్మా!= గొప్పఆత్మకలవాడా, ఓయక్షా!; నీచిత్తంబునకున్= నీమనస్సుకు; వచ్చునట్లుగాన్= తేటతెల్లమయి హత్తుకొనేటట్లుగా; చెప్పన్= (సమాధానము) వచించటం; నాబోఁటివానికిన్= నావంటివానికి; శక్యంబు= సాధ్యం; అగును+ఏ= అగునా, (సాధ్యం కాకపోవచ్చును); ఐనను= అయినప్పటికిని; నా నేర్చువిధంబునన్= నాకు తెలిసినమేరకు; చెప్పెదన్= వచించగలను; అడుగుము= ప్రశ్నించుము; అనినన్= అని చెప్పగా; ఆ+యక్షుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'కావున నేను వేసేప్రశ్నలకు నీవు సముచితసమాధానాలు చెప్పాలి' అని యక్షుడు అన్నాడు. అప్పుడు ధర్మనందనుడు 'మహాత్మా! యక్షుడా! నీవు అడిగేప్రశ్నలకు నేను సమాధానాలు చెప్పగలనా? నే నెంతటివాడను? నాజ్ఞానం ఎంతటిది? అయినను, నాకు తెలిసినమేరకు సమాధానాలు చెప్పగలను. దయచేసి అడుగుము' అని విన్నవించాడు. అంత యక్షుడు ఇట్లా ప్రశ్నించాడు.

విశేషం: మహాభారతంలో తరతరాల మేధావులను ఉర్రూతలూగించిన ఘట్టాలలో ఎన్నదగింది యక్షప్రశ్నల ఘట్టం. ఈ ప్రశ్నపరంపర అడిగినది యక్షరూపాన ఉన్న యమధర్మరాజు. సమాధానాలు చెప్పినవాడు - ధర్మనందనుడు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పేఅధికారం ధర్మరాజుకు ఏవిధంగా వచ్చింది? ధర్మరాజు పంద్రెండేండ్లు అరణ్యావిశ్వవిద్యాలయంలో జిజ్ఞాసువుగా విద్యాభ్యాసం చేసినవాడు. యక్షప్రశ్నలఘట్టం అతడికి స్నాతకపరీక్ష. పరీక్షాధికారి సాక్షాత్తు యమధర్మరాజే. పంద్రెండేండ్లనుండి ధర్మరాజు మహర్షులకు వేసిన ప్రశ్నపరంపరలకు అంతు లేదు కదా! సమాధానం చెప్పే వంతు ఇప్పుడు ధర్మరాజుకు వచ్చింది. ఇది అతడికి అసిధారావ్రతం. అతడితమ్ములప్రాణాలు ఆతడి సమాధానాలలో ఇమిడి ఉన్నాయి. అంతేకాక యక్షప్రశ్నపరంపరలో రెండు స్వారస్యాలు ఉన్నాయి. అవి అన్నీ చిక్కుముడుల ప్రశ్నలు. అడిగిన యక్షుడికి సముచిత సమాధానాలు తెలియును. ఇవి జిజ్ఞాసువు అడిగిన ప్రశ్నలు కావు. పరీక్షాధికారి ప్రాగల్భ్యంతో వేసిన ఆదర్శప్రశ్నలు. ఆదర్శప్రశ్నలకు ఆదర్శసమాధానాలు ఇందులో ఉన్నాయి. విశ్వసాహితీజగత్తులో- 'యక్షప్రశ్నలు' నిరుపమానాలు.

ధర్మరాజు యక్షప్రశ్నముల కుత్తరంబు లిచ్చుట (సం. 3-297-26)

**క. 'దినకరు నెయ్యది నడపును? । దినకరు నెవ్వారు గొలిచి తిరుగుదు? రద్దే
వుని యస్తమించు టేమిట? । ననఘ! తదాధారభూత మది యెద్దియొకో'? 423**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవయిన ఓ ధర్మరాజా!; దినకరున్= సూర్యుడిని; ఏ+అది= ఏది; నడపును= నడుపుతుంది?; దినకరున్= సూర్యుడిని; ఏ+వారు= ఎవ్వరు; కొలిచి= సేవించి; తిరుగుదురు?= సంచరిస్తారు?; ఆ+దేవుని= ఆ దేవుని యొక్క; అస్తమించుట= క్రుంకుట; ఏమిటన్= దేనిచేత?; తత్+ఆధారభూతము= ఆ సూర్యుడికి ప్రాపు; అది+ఎద్ది+ఒకో?= అది ఏది ఔతుంది?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సూర్యుడిని నడిపేది ఏది? సూర్యుడిని సేవించి తిరిగేవారు ఎవరు? సూర్యుడు దేనివలన అస్తమిస్తాడు? సూర్యుడికి ఆధారమయినది ఏది?

తే. అనిన ధర్మజుఁ డిట్లను; 'నబ్జహితుని । నడపు బ్రహ్మంబు; సురకోటి నడచు కొలిచి;
ధర్మువున నస్తమితుఁ డగుఁ దపనుఁ; డమ్మ । హాత్మునకు సత్య మాధార మండ్రు బుధులు.' 424

ప్రతిపదార్థం: అనినన్= అని యక్షుడు ప్రశ్నించగా; ధర్మజుడు; ఇట్లు+అనున్; అబ్జహితునిన్= సూర్యుడిని; బ్రహ్మంబు= బ్రహ్మము; నడపున్= నడపుతాడు; కొలిచి= సేవించి; సురకోటి= వేల్పులసమూహము; నడచున్= నడుస్తుంది; తపనుఁడు= సూర్యుడు; ధర్మువునన్= ధర్మంచేతను; అస్తమితుఁడు+అగున్= అస్తమిస్తాడు; ఆ+మహా+ఆత్మునకున్= సూర్యుడికి; సత్యము= సత్యం (నిజం); ఆధారము= ప్రాపు; (అని) బుధులు= పెద్దలు; అండ్రు= చెప్పుతారు.

తాత్పర్యం: యక్షునకు ధర్మరాజు ఇట్లా సమాధానం చెప్పాడు: 'సూర్యుడిని బ్రహ్మం నడుపుతుంది. సూర్యుడిని సేవించి తిరిగేవారు వేల్పులు. సూర్యుడు ధర్మంచేత అస్తమిస్తాడు. ఆ మహాత్ముడికి ఆధారం సత్యం అని పెద్దలంటారు.'

విశేషం: ఇచట 'బ్రహ్మం' 'ధర్మువు', 'సత్యము' అనే పదాలకు ఉపనిషత్ప్రోక్తమైన అర్థాలనే గ్రహించాలి.

వ. అనిన విని యక్షుం డి ట్లనియె. 425

తాత్పర్యం: అనగా విని యక్షుడు మరల ఈ విధంగా అన్నాడు.

క. 'ఏమిట శ్రోత్రియుఁ డనఁ జను? । నేమిటఁ గడుమహిమ వడయు నిమ్ముగఁ బురుషుం?
డేమిట సహాయయుతుఁ డగు? । నేమిట నగు బుద్ధిమంతుఁ? డేర్పడఁ జెపుమా!' 426

ప్రతిపదార్థం: ఏమిటన్= దేనిచేత; శ్రోత్రియుఁడు= సంప్రదాయజ్ఞుడయిన వేదవిదుడు; అనన్+చనున్= అనదగును; ఏమిటన్= దేనిచేత; కడుమహిమ= మిక్కుటమైనగొప్పతనాన్ని; పురుషుండు= మనుజుడు; ఇమ్ముగన్= ఒప్పిదంగా; పడయున్?= పొందుతాడు?; ఏమిటన్= దేనిచేత; సహాయయుతుఁడు+అగున్?= సాయం కలవాడు ఔతాడు?; ఏమిటన్= దేనిచేత; బుద్ధిమంతుఁడు= బుద్ధికలిగినవాఁడు; అగున్= ఔతాడు?; ఏర్పడన్= తేటతెల్లంగా; చెపుము+ఆ= తప్పక చెప్పుము.

తాత్పర్యం: 'దేనివలన శ్రోత్రియుడు ఔతాడు? దేనివలన పురుషుడు గొప్పమహిమను ఒప్పిదంగా పడయగలుగుతాడు? దేనివలన సాయం పొందినవాడు ఔతాడు? దేనివలన బుద్ధిమంతుడు ఔతాడు? తేటతెల్లంగా సమాధానాలు చెప్పుము.'

వ. అనిన నతం డి ట్లనియె. 427

తాత్పర్యం: అని అడుగగా ధర్మరాజు ఇట్లా సమాధానం చెప్పాడు.

క. 'శ్రుతమువలన శ్రోత్రియుఁ డగు; । నతులతపోయుక్తిఁ గడుమహత్త్వము వడయున్;
ధృతిచే సహాయయుతుఁ డగు; । నతిశయముగ బుద్ధిమంతుఁ డగు బుధసేవన్.' 428

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: శ్రుతమువలనన్= వేదం అభ్యసించటంవలన; శ్రోత్రియుఁడు= సనాతనసంప్రదాయజ్ఞుడు; అగున్= ఔతాడు; అతుల, తపస్+యుక్తిన్= మిక్కుటమైన తపస్సుచేయటంవలన; కడు= గొప్ప; మహత్త్వము= ప్రభావం; పడయున్= సంపాదిస్తాడు; ధృతిచేన్= ధైర్యంచేత; సహాయయుతుఁడు= సాయంపొందినవాడు; అగున్= ఔతాడు; బుధసేవన్= జ్ఞానులపరిచర్యవలన; అతిశయముగన్= మిక్కుటంగా; బుద్ధిమంతుఁడు+అగున్= బుద్ధికలిగినవాడు ఔతాడు.

తాత్పర్యం: 'వేదాభ్యాసంవలన శ్రోత్రియుడు కాగలుగుతాడు. నిరుపమానమైన తపస్సువలన గొప్పప్రభావం సిద్ధిస్తుంది. ధైర్యంవలన సాయం పొందుతాడు. పెద్దలపరిచర్యవలన బుద్ధిమంతుడు ఔతాడు.'

వ. **అని చెప్పిన నప్పార్థివోత్తమునకు నప్పురుషుండు వెండియు ని ట్లనియె.** **429**

తాత్పర్యం: అని బదులు చెప్పిన ధర్మరాజుకు యక్షుడు మరల ఈ విధంగా అన్నాడు.

తే. **'ఏమి కతమున భూదేవుఁ డెసఁగు దేవ । భావమున? నాతనికి సాధుభావ మెవ్వి**
ధమున నగు? నసాధుత్వ మెద్దానఁ జెందు? మానుషుం డగు నాతఁ డేదానఁ? జెపుమ.' **430**

ప్రతిపదార్థం: ఏమి కతమునన్= ఏకారణంచేత; భూదేవుఁడు= బ్రాహ్మణుడు; దేవభావమునన్= దివ్యభావంతో; ఎసఁగున్= అతిశయిస్తాడు?; ఆతనికిన్= బ్రాహ్మణుడికి; సాధుభావము= నిర్మలస్థితి; ఏ+విధమునన్+అగున్?= ఏవిధంగా సంభవిస్తుంది?; అసాధుత్వము= మాలిన్యం; ఏ+దానన్= దేనివలన; చెందున్= కలుగుతుంది? ఆతఁడు= బ్రాహ్మణుడు; ఏదానన్= దేనివలన; మానుషుండు= మానవుడు, మర్త్యుడు; అగున్?= ఔతాడు?; చెపుము+అ= దయచేసి వచింపుము.

తాత్పర్యం: 'దేనివలన బ్రాహ్మణుడు దివ్యత్వాన్ని సాధిస్తాడు? బ్రాహ్మణుడికి నిర్మలత్వం ఎట్లేర్పడుతుంది? మాలిన్యం ఎట్లా దాపురిస్తుంది? దేనివలన బ్రాహ్మణుడు మర్త్యుడు ఔతాడు?'

చ. **అనవుడు ధర్మజుం డనియె 'నధ్యయనంబున దేవభావముం**
గను నవనీసుపర్వుఁ; డధికవ్రతశీలత సాధుభావ మా
తనికి; విశిష్టవృత్తి దిగఁద్రావి యసాధు వనంగ నుండు; శౌ
చనియతి లేక మృత్యుభయసంగతి నాతఁడు మానుషుం డగున్.' **431**

ప్రతిపదార్థం: అనవుడున్= అని (యక్షుడు) ప్రశ్నించగా; ధర్మజుండు= ధర్మనందనుడు; అనియెన్= ఇట్లా అన్నాడు; అవనీసుపర్వుఁడు= బ్రాహ్మణుడు; అధ్యయనంబునన్= చదువువలన, వేదపఠనంవలన; దేవభావమున్+కనున్= దివ్యత్వం అందుకొంటాడు; అధికవ్రతశీలతన్= మిక్కుటమైన నిష్ఠవలన; సాధుభావము= నిర్మలత్వం; ఆతనికిన్= బ్రాహ్మణుడికి (ప్రాప్తిస్తుంది); విశిష్టవృత్తిన్= సద్వర్తనాన్ని; దిగన్+త్రావి= పోవిడిచి; అసాధువు+అనంగన్+ఉండున్= కలుషితుడు అనేటట్లుగా ఉంటాడు; ఆతఁడు= విప్రుడు; శౌచనియతి లేక= శుచిత్వనియమాలను పాటించక; మృత్యుభయసంగతిన్= మరణభీతితో కూడి మానుషుండు+అగున్= మర్త్యుడు ఔతాడు.

తాత్పర్యం: యక్షుడిప్రశ్నలకు ధర్మరాజు ఇట్లా సమాధానాలు చెప్పాడు. 'విప్రుడు వేదపఠనంవలన దివ్యత్వం ఆర్జిస్తాడు. మిక్కుటమైన నిష్ఠవలన సాధుభావం ఆర్జిస్తాడు. ఎన్నదగిన సౌశీల్యాన్ని విడనాడి అసాధువు ఔతాడు. శుచిత్వాన్ని వీడి మృత్యుభయం చెంది మర్త్యుడు ఔతాడు'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: (1) బ్రాహ్మణుడికి సాధుభావ మెవ్విధంగా ఔతుంది? దేనివలన కలుగుతుంది? అనే ప్రశ్నలకు ఈ పద్యంలో సమాధానం చెప్పబడింది. ఎవడు బ్రాహ్మణుడు? అనే చర్చ ప్రాచీనసాహిత్యంలో పలుతావుల కన్పిస్తుంది. మహాభారతంలోనూ ఈ చర్చ పలుతావుల ప్రాముఖ్యం వహించించి. ధమ్మపదంలో ఎవడు బ్రాహ్మణుడు? అనే ప్రశ్నకు విపుల సమాధానం ఉన్నది. అందలి సారాంశం - కులంచేత కాని గోత్రంచేతకాని బ్రాహ్మణుడు కాజాల డనిన్నీ సౌశీల్యంవలన మాత్రమే బ్రాహ్మణత్వం సిద్ధిస్తుందనీ అందులో చెప్పబడింది. మహాభారతంలోని యక్షప్రశ్నలఘట్టంలోకూడా బ్రాహ్మణుడికి సాధుభావం సిద్ధించటం అనగా బ్రాహ్మణుడికి బ్రాహ్మణత్వం సిద్ధించటం అధికవ్రతశీలతవలన శీలానుష్ఠానంవలననే అని చెప్పబడింది. అట్లే, బ్రాహ్మణుడు - 'విశిష్టవృత్తి' దిగద్రావిన అసాధువు అయి బ్రాహ్మణత్వాన్ని కోలుపోతాడని ధర్మరాజు ప్రవచనం. (2) శుచిత్వం= శౌచనియతి అనగా కేవలం శారీరకమైన శుచిత్వం మాత్రమే కాదు. అందులో మానసికపారిశుద్ధ్యం ఇమిడి ఉన్నది. శుచిత్వం అనగా మనోవాక్కాయకర్మలలో పారిశుద్ధ్యం గలిగి ఉండటం.

క. నావుడు నతఁ డాతనితో । 'జీవన్మృతుఁ డెట్టివాఁడు? సెప్పు' మనుటయున్
'దేవాతిథిపితృభృత్యజ । నావళులకు నిడక కుడుచునతఁ' డని చెప్పెన్. 432

ప్రతిపదార్థం: నావుడున్= అని (ధర్మరాజు) చెప్పగా; అతడు= యక్షుడు ఆతనితోన్= ధర్మరాజుతో; జీవత్+మృతుఁడు= జీవిస్తూకూడా మరణించినవాడితో సమానుడు; ఎట్టివాఁడు?= ఎటువంటివాడు?; చెప్పుము= వచించుము; అనుటయున్= అని అడుగగా; దేవ+అతిథి, పితృ, భృత్యజన+ఆవళులకున్= దేవతలకు, అతిథులకు, పితరులకు, సేవకులు మున్నగువారికి అందరికి; ఇడక= పెట్టక; కుడుచు+అతఁడు= భోజనం చేసేవాడు; అని చెప్పెన్= అని సమాధానం చెప్పాడు.

తాత్పర్యం: 'జీవన్మృతుడు ఎవడు?' అని యక్షుడు ప్రశ్నించాడు. 'దేవతలకు పితృదేవతలకు అతిథులకు సేవకులు మున్నగువారికి పెట్టకుండా తాను భోజనం చేసేవాడు బ్రదికిఉండగనే మరణించినవాడితో సమానుడు' అని ధర్మరాజు సమాధానం ఇచ్చాడు.

చ. విని మగుడంగ వాఁడు పృథివీపతిఁజూచి 'ధరిత్రికంటె వ్రేఁ
గనఁ జనుదాని, నాకసముకంటెఁ గడుం బొడవైనదాని, గా
డ్పునకును నెక్కుడై జవము పొంపిరివోయెడు దానిఁ, బూరికం
టెను దఱచైన దానిని, ఘటింపఁగఁ జెప్పుము నాకు' నావుడున్. 433

ప్రతిపదార్థం: విని= ఆలకించి; మగుడంగన్= మరల; వాఁడు= యక్షుఁడు; పృథివీపతిన్+చూచి= భూపతిని కాంచి, ధర్మరాజును చూచి; ధరిత్రికంటెన్= భూమికంటె; వ్రేఁగు+అనన్+చనుదానిన్= బరువైనది అని చెప్పదగిన దానిని; ఆకసముకంటెన్= ఆకాశంకంటెను; కడున్= మిక్కిలి; పొడవు+ఐనదానిన్= నిడివి కలదానిని; గాడ్పునకును= గాలికిని; ఎక్కుడు+ఐ= అధికం అయి; జవము= వేగం; పొంపిరి, పోయెడుదానిన్= అతిశయించే దానిని; పూరికంటెను= గడ్డికంటె; తఱచు+ఐనదానిని= విరివి అయిన దానిని; ఘటింపఁగన్= సరిగా కుదిరేటట్లు; నాకున్= నాకు; చెప్పుము= వచించుము; నావుడున్= అని (యక్షుడు) చెప్పగా.

తాత్పర్యం: యక్షుడు మరల ధర్మరాజును ప్రశ్నించాడు. 'భూమికంటె బరువు అయినది ఏది? ఆకసంకంటెకూడ నిడివి కలది ఏది? గాలికంటె వేగంగా పోగలిగింది ఏది? గడ్డికంటె విరివిగా పెరిగేది ఏది? చెప్పుము'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అమ్మనుజోత్తముం డయ్యక్షోత్తమున కి ట్లనియె. 434

తాత్పర్యం: మానవులలో మేటివాడైన ఆ ధర్మరాజు ఉత్తముడైన ఆ యక్షుడితో ఇట్లా పలికాడు.

ఆ. 'తల్లి వ్రేఁగు సువ్వె ధరణికంటెను; నాక । సంబుకంటెఁ బొడవు జనకుఁ డరయ;
గాడ్పుకంటె మనసు కడుశీఘ్రగతి; తృణో । త్కరముకంటెఁ జింత గరము తఱచు'. 435

ప్రతిపదార్థం: తల్లి= జనని; ధరణికంటెను= భూమికంటె; వ్రేఁగు+చువ్వె= బరువు సుమా; జనకుఁడు= తండ్రి; ఆకసంబుకంటెన్= ఆకాశం కంటెను; అరయన్= పరిశీలించిచూడగా; పొడవు= నిడివి; గాడ్పుకంటెన్= గాలికంటె; మనసు= చిత్తం; కడున్= మిక్కిలి; శీఘ్రగతి= వేగగమనం కలది; చింత= వగపు; తృణ+ఉత్కరముకంటెన్= గడ్డిసముదాయంకంటె; తఱచు= విరివి అయింది.

తాత్పర్యం: 'భూమికంటె బరువైనది కన్నతల్లి. ఆకసంకంటె పొడవు తండ్రి. గాలికంటె వేగగమనంకలది మనస్సు. తృణసమూహంకంటె విరివి ఐనది చింత'.

వ. అనిన నంబరచరుండు మఱియు నిట్లనియె. 436

తాత్పర్యం: అనగా విని ఖేచరుడైన యక్షుడు మళ్ళీ ఇట్లా అడిగాడు.

తే. 'మొనసి నిద్రించియును గన్ను మూయ దెద్ది? । పుట్టియును జేతనత్వంబుఁ బొరయ దెద్ది?
యరయ రూపు గల్గియు హృదయంబు లేని । దెద్ది? వేగంబుకతమున నెద్ది వొదలు?' 437

ప్రతిపదార్థం: మొనసి= పూని; నిద్రించియును= నిదురించికూడా; ఎద్ది= ఏది; కన్ను= నేత్రం; మూయదు= ముకుళించదు; పుట్టియును= జన్మించికూడా; చేతనత్వంబున్= చైతన్యాన్ని; పొరయదు= వహించదు; ఎద్ది= ఏది; అరయన్= పరిశీలించగా; రూపు+కల్గియున్= ఆకృతి ఉండికూడ; హృదయంబు= డెందం; లేనిది= లేనట్టిది; ఎద్ది= ఏది?; వేగంబుకతమునన్= రయంచేత; ఎద్ది= ఏది; పొదలున్= అతిశయిస్తుంది.

తాత్పర్యం: 'నిదురించికూడా కన్నుమూయనిది ఏది? జన్మించికూడా చైతన్యం లేనిది ఏది? రూపండుండికూడా డెందం లేనిది ఏది? వేగంచేత అతిశయించేది ఏది?'

తే. అనినఁ 'గన్ను మూయదు సుప్తమయ్యు మీను; । పుట్టియును గ్రుడ్డు చేతనఁ బొరయకుండు;
హృదయరహితంబు రారూప; మేఱు రయము । కతన వర్ధిల్లు' నని చెప్పెఁ గౌరవుండు. 438

ప్రతిపదార్థం: అనినన్= అని (యక్షుడు) అడుగగా; మీను= చేప; సుప్తము+అయ్యున్= నిదురచెందికూడా; కన్ను= నేత్రాన్ని; మూయదు; పుట్టియును= జన్మించికూడా; గ్రుడ్డు= అండం; చేతనన్+పొరయక+ఉండున్= చైతన్యం కలుగకుండా ఉంటుంది; రారూపము= రాతిరూపం; హృదయరహితంబు= గుండె లేనిది; ఏఱు= నది; రయముకతనన్= వేగంచేత; వర్ధిల్లున్= అతిశయిస్తుంది; అని= అంచు; కౌరవుండు= ధర్మరాజు; చెప్పెన్= వచించాడు.

తాత్పర్యం: 'యక్షుడికి ధర్మరాజు ఇట్లా చెప్పాడు: 'చేప నిదురించికూడా నేత్రాలు మూయదు. గ్రుడ్డు జన్మించికూడా ప్రాణం లేనిదే. రాయి రూపం కలిగికూడా గుండె లేనిది. ఏఱు వేగంవలన వర్ధిల్లుతుంది అని ధర్మరాజు చెప్పాడు'.

వ. చెప్పిన, నయ్యక్షుం డతనితోఁ 'దెరువు నడచువానికి, రోగార్తునకు, గృహస్థునకు, మృతిఁ బొందినవానికి నెవ్వరు సుట్టంబు?' లనిన నప్పుడమిఱేఁ 'డన్నలువురకుం గ్రమంబున సార్థంబును, వైద్యుండును, సద్భార్యయుఁ, గృతంబైనధర్మంబును బరమమిత్త్రు' లని నిర్దేశించుటయు; నయ్యక్షుండు పాండవేయున కిట్లనియె.439

ప్రతిపదార్థం: చెప్పినన్= ధర్మరాజు (చెప్పగా); ఆ+యక్షుండు; అతనితోన్= ధర్మరాజుతో; తెరువు నడచువానికిన్= బాటసారికిన్నీ; రోగ+ఆర్తునకున్= జబ్బుచేసినవాడికి; గృహస్థునకున్= గృహమేధికి; మృతిన్+పొందినవానికిన్= మరణించినవాడికి; ఎవ్వరు= ఎవరు; చుట్టంబులు= బంధువులు; అనినన్= అని (యక్షుడు) అడుగగా; ఆ+పుడమిఱేఁడు= ఆరాజు, ధర్మనందనుడు; ఆ+నలువురకున్= ఆ నల్గురకును; క్రమంబునన్= వరుసగా; సార్థంబును= వర్తకజనసమూహమూ, వైద్యుండును= వెజ్జును; సద్భార్యయున్= మంచిఇల్లాలును; కృతంబు+ఐన= చేసిన; ధర్మంబును= ధర్మమున్నూ; పరమమిత్త్రులు= గొప్పస్నేహితులు; అని= అని; నిర్దేశించుటయున్= సమాధానం చెప్పటమున్నూ; ఆ+యక్షుండు; పాండవేయునకున్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: యక్షుడు వేసిన ప్రశ్నలు: 'బాటసారికి, రోగికి, గృహస్థుడికి, మరణించినవాడికి చుట్టాలు ఎవ్వరు?' ధర్మరాజు చెప్పిన సమాధానం. (క్రమంగా) 'సార్థం, వైద్యుడు, మంచిభార్య, చేసినధర్మం.' అంత యక్షుడు ధర్మనందనుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: (1) అలం: క్రమాలంకారం (2) సార్థము. పూర్వకాలంలో ఒకప్రదేశంనుండి మరియొక ప్రదేశానికి వివిధ పదార్థాలతో వర్తకులగుంపులు పోతూఉండేవి. అందులో ఒంటెలు మున్నగు జంతువాహనాలు, ఆయుధపాణులు అయిన భటులు, మార్గదర్శకులు అనుభవజ్ఞులు అయిన వృద్ధులు, పలువురు ఉండేవారు. సార్థములు అప్పుడప్పుడుమాత్రమే పయనించేవి. అదృష్టవశాన బాటసారికి సార్థం తెరువున కలియవచ్చును. (3) ధర్మాన్నిగూర్చిన చర్చ మహాభారతంలో పలుతావుల కాననగును. ధర్మం అనగా ఇచట నప్పెడి అర్థం - బ్రతికిఉండగా చేసినకర్మ. సుకృతం. అట్టిసుకృతం ధర్మనిర్వహణంలోనే ఏర్పడుతుంది. ధర్మానికి సుప్రసిద్ధమైన నిర్వచనం. "ధృతిః క్షమా దమోఽస్తేయం। శౌచ మింద్రియనిగ్రహః; ధీ ర్విద్యా సత్య మక్రోధో । దశకం ధర్మలక్షణమ్" - మనుస్మృతి 6-92.

క. 'ఎయ్యది ధర్మువునకుఁ గుదు । రెయ్యది యాశ్రయము గీర్తి కిమ్మగు మార్గం
బెయ్యది సురలోకమునకు । నెయ్యది సుఖమునకు నిక్క యేర్పడఁ జెపుమా!' 440

ప్రతిపదార్థం: ధర్మువునకున్= ధర్మానికి; కుదురు= పాదు; ఏ+అది= ఏది; కీర్తికిన్= యశస్సుకు; ఆశ్రయము= ఆధారం; ఏ+అది= ఏది; సురలోకమునకున్= స్వర్గానికి; ఇమ్ము+అగు= సరియైన; మార్గంబు; ఏ+అది= ఏది; సుఖమునకున్+ఇక్క= సౌఖ్యానికి (తృప్తి నిచ్చే అనుభూతికి) నెలవు; ఏ+అది?= ఏది?; ఏర్పడన్= సుస్పష్టంగా; చెపుము+ఆ= వచింపుము.

తాత్పర్యం: 'ధర్మానికి కుదురు ఏది? కీర్తికి ఆధారం ఏది? స్వర్గానికి సరియైన మార్గం ఏది? సుఖానికి నెలవు ఏది? తేటతెల్లంగా వివరింపుము.'

వ. అని యడుగుటయు. 441

తాత్పర్యం: అని అడగగానే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'అమరఁగ దాక్షిణ్యము ధ । ర్మమునకుఁ గుదు రండ్రు; కీర్తిమహిమ నెలవు దా
నము; సత్యము సురపురిమా । ర్గము; శీలము సంశ్రయంబు సుఖముల కెల్లన్'. 442

ప్రతిపదార్థం: అమరఁగన్= ఒప్పిదంగా; దాక్షిణ్యము= కారుణ్యం; ధర్మమునకున్; కుదురు= పాదు; అండ్రు= అంటారు; దానము= ఈవి; కీర్తిమహిమ= కీర్తియొక్క గొప్పతనానికి; నెలవు= చోటు; సత్యము= నిజం; సురపురిమార్గము= స్వర్గపట్టణానికి బాట; సుఖములకున్+ఎల్లన్= అన్నిసౌఖ్యాలకు; సంశ్రయంబు= ఆటపట్టు; శీలము= సత్ప్రవర్తనం.

తాత్పర్యం: 'దాక్షిణ్యం ధర్మానికి కుదురు; దానం కీర్తికి ఆధారం; సత్యం స్వర్గానికి మార్గం; శీలం సమస్తసుఖాలకు నెలవు'.

వ. అని యుధిష్ఠిరుం డెఱింగించిన వెండియు. 443

తాత్పర్యం: అని ధర్మరాజు తెలుపగా మరల.

చ. 'నరునకు నాత్మ యెవ్వఁడు? ఘనంబుగ దైవిక మైన చుట్ట మె
వ్వ? రతనికిం దదీయ మగు వర్తన మేమిట నిర్వహించు? భూ
వర! యతఁ డేమి పూని యనవద్యతఁ బొందు? నెఱుంగఁ జెప్పు మీ
వరుదుగ' నన్న నక్కురుకులాగ్రణి యాతనితోడ ని ట్లనున్. 444

ప్రతిపదార్థం: ఓభూపతీ! ధర్మరాజా!; నరునకున్= మనుజుడికి; ఆత్మ= ఆత్మ(జీవుడు); ఎవ్వఁడు?= ఎవడు?; అతనికిన్= మనుజుడికి; ఘనంబుగన్= గొప్పగా; దైవికము+ఐన, చుట్టము= అదృష్టవశాన ఏర్పడే బంధువు; ఎవ్వరు?= ఎవరు?; తదీయము+అగు= అతడికి సంబంధించిన; వర్తనము= బ్రదుకు; ఏమిటన్= దేనివలన; నిర్వహించున్= జరుపును?; భూవర!= ఓరాజా!; అతఁడు= మనుజుడు; ఏమి, పూని= దేనిని వహించి; అనవద్యతన్+పొందున్= మంచితనాన్ని పొందుతాడు; ఈవు= నీవు; అరుదుగన్= అసాధారణ ఫణితిలో; ఎఱుంగన్+చెప్పుము= తేటతెల్లంగా వచింపుము; అన్నన్= అని (యక్షుడు) పలుకగా; ఆ+కురు, కుల+అగ్రణి= కౌరవవంశంలోని గొప్పవాడు ధర్మరాజు; ఆతనితోడన్= యక్షుడితోడ; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'నరుడికి ఆత్మ ఎవ్వరు? అతడికి దైవికంగా ఏర్పడే చుట్టం ఎవ్వరు? అతడు బ్రదుకు నెట్లా నిర్వహిస్తాడు? అతడు ఏవిధంగా మంచితనాన్ని పొందుతాడు? పైప్రశ్నలకు అరుదైన రీతిలో సముచిత సమాధానాలు తేటతెల్లంగా చెప్పుము' అనగా యక్షుడికి ధర్మరాజు ఇట్లా చెప్పాడు.

తే. 'ఆత్మజుఁడు సువ్వె పురుషున కాత్మ యయ్యెః । నాతనికి భార్య దైవిక మైన చుట్టు;
మతని జీవిక పర్జన్యుకతనఁ జెల్లు; । నతఁడు దానముఁ గొనియాడి యతిశయిల్లు'. 445

ప్రతిపదార్థం: పురుషునకున్= నరుడికి; ఆత్మ= ఆత్మ; ఆత్మజుఁడు+చువ్వె= కొడుకుసుమా; అయ్యెన్= అయ్యాడు; ఆతనికిన్= నరుడికి; భార్య= పెండ్లం; దైవికము+ఐన= దైవం చేకూర్చిన; చుట్టము= బంధువు; అతనిజీవిక= నరుడి బ్రదుకుతెరువు; పర్జన్యునికతనన్= మేఘుడిమూలాన; చెల్లున్= జరుగును; అతఁడు= నరుడు; దానమున్= ఈవిని; కొనియాడి= చేసి; అతిశయిల్లున్= గొప్పతనం ఆర్జిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నరుడికి ఆత్మ - పుత్త్రుడు. అతడికి దైవికమైన చుట్టం - భార్య. అతడికి బ్రదుకు ప్రసాదించేది - మేఘుడు. అతడికి గొప్పతనం చేకూర్చేది - దానం.

విశేషం: ఇవి యక్షప్రశ్నలు. ప్రశ్నలు వేయటంలో ఒక ఒడుపు ఉన్నది. సమాధానాలు అరుదైనవి కావలెననే నియమం ఉన్నది. అందుచేత ఇచట వాడబడిన పదాలకు రూఢ్యర్థం వాచ్యార్థం చాలదు. అట్లని సుదూరమైన అర్థం చెప్పరాదు. పలుసారులు సమాధానాలు తేటతెల్లముగా ఉండవలెనని యక్షుడు అనుశాసనం వెలయించిఉన్నాడుగదా! (1) ఆత్మ అనగా సారం అని అంతరార్థం. ఆత్మకు అమరత్వ మున్నది. అందుచేత నరుడికి ఆత్మ - ఆత్మజుడు. (2)భార్యాభర్తల అనుబంధం విచిత్రమైనది. అడవిలోని ఉసిరి - అంబుధిలోని ఉప్పు ఒకచోట చేరి ఊరుగాయ అయినట్లు దాంపత్య మేర్పడుతుంది. అది దైవికంగా ఏర్పడే బంధుత్వం. (3) మానవుడి బ్రదుకుతెరువు స్థూలదృష్టికి బహుమార్గదృష్టమే అయినను కోటివిద్యలు తుదకు కూటికొరకే. కూడు లభింపజేసేవాడు మేఘుడు. (4) మానవుడు అతిశయిల్లేది త్యాగంతో, త్యాగంతో కూడిన దానంవలననే.

చ. **అనవుడు 'మేటిధర్మ మగునట్టిది యెయ్యది? యేది యెప్పుడున్**
గనియఁగఁ బండియుండు? నెసకంబున నెయ్యది నిగ్రహించినం
దనరుఁ బ్రమోదసిద్ధి? నియతంబుగ నెవ్వరితోడి సంధి యెం
దును వికలంబు గాదు? పరితోష మెలర్ప నుపన్యసింపుమా!' **446**

ప్రతిపదార్థం: అనవుడున్= అని (ధర్మరాజు) చెప్పగా; మేటి= గొప్ప; ధర్మము+అగు+అట్టిది= ధర్మం అని చెప్పతగినది; ఏ+అది= ఏది?; ఏది= ఏది; ఎప్పుడున్= ఎల్లప్పుడు; కనియఁగన్= పరిపక్వంగా; పండియుండున్= ఫలిస్తుంది; ఎసకంబునన్= పూనికతో; ఏ+అది= దేనిని; నిగ్రహించినన్= అదుపులో ఉంచితే; ప్రమోదసిద్ధి= సంతోషం కలగటం; తనరున్= విలసిల్లుతుంది; నియతంబుగన్= నియమానుసారంగా; ఎవ్వరితోడి= ఎవరితోడి; సంధి= పొత్తు; ఎందును= ఎచ్చటను; వికలంబు+కాదు= వ్యర్థం కాదు; పరితోషము+ఎలర్పన్= ప్రీతి అతిశయించగా; ఉపన్యసింపుము+ఆ= వక్కాణించుము.

తాత్పర్యం: అని ధర్మరాజు యక్షుడికి చెప్పాడు. మరల యక్షుడు ధర్మరాజును ఈరీతిగా ప్రశ్నించాడు: 'ధర్మాలన్నిటిలోను గొప్పదైన ధర్మం ఏది? ఏది సతతం పరిపూర్ణంగా ఫలితాన్ని చేకూరుస్తుంది? ఏది వదలిపెట్టితే సంతోషం చేకూరుతుంది? ఎవరితోడి పొత్తు ఎప్పుడూ చెడదు? ఈవిషయాలను ఆనందం చేకూరేటట్లు వక్కాణించుము' అని యక్షుడు ధర్మజుడిని కోరాడు.

వ. **అని దివ్యుండు పలికిన నా దివ్యబోధనుం డిట్లనియె.** **447**

ప్రతిపదార్థం: అని= అని; దివ్యుండు= యక్షుడు; పలికినన్= అడుగగా; ఆ దివ్యబోధనుండు= దివ్యమైన జ్ఞానం కలవాడు, ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: యక్షుడితో ధర్మరాజు ఈ రీతిగా పలికాడు.

ఆ. **'విను మహింస మేటి యనఁజను ధర్మంబు; । యాగకర్మ మెపుడు నమరఁ బండి**
యుండు; మనసుక్రొవ్వు ఖండింపఁగా మోద । మెసఁగు; సుజనసంధి యెడల దెందు'. **448**

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; అహింస= (భూతదయ) సకలప్రాణికోటికి ఎట్టిహాని చేయకపోవటం; మేటి= గొప్పది; అనన్+చను= అనదగిన; ధర్మంబు= ధర్మం; అమరన్= ఒప్పిదంగా; యాగకర్మము= యజ్ఞం చేయటం; ఎపుడున్= సంతతం;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పండి+ఉండున్= పంటను చేకూరుస్తుంది; మనసు క్రొవ్వు= చిత్తంలోని క్రొవ్వు - గర్వం, అహంభావం; ఖండింపఁగాన్= నిర్మూలించగా; మోదము= సంతోషం; ఎసఁగున్= పెంపొందుతుంది; సుజనసంధి= సజ్జనులతోడిపొత్తు; ఎందున్= ఎచటను; ఎడలదు= భగ్నం కాదు.

తాత్పర్యం: 'ఆలకించుము. అహింస అన్నిధర్మాలలోను మేటిధర్మం. యజ్ఞం ఎల్లప్పుడు పంటనిచ్చేకార్యం. అహంభావం పోతే సంతోషం కలుగుతుంది. సజ్జనసహవాసం ఎప్పుడూ భగ్నం కాదు.

తే. **అనిన నతఁడు 'లోకమున కెయ్యదియ దిక్కు? । జలము నన్నంబు నెద్దాన సంభవించు?**
విష మనంగ నెయ్యది? శ్రాద్ధవిధికి నెద్ది । సమయ?' మనిన నిట్లని చెప్పె జనవిభుండు. **449**

ప్రతిపదార్థం: అనినన్= అని (ధర్మరాజు) చెప్పగా; అతఁడు= యక్షుడు; లోకమునకున్= జగత్తుకు; దిక్కు= సాయమయ్యే ఆధారం; ఏ+అదియ= ఏది; జలము= నీరు; అన్నంబు= ఆహారం; ఎద్దానన్= (ఏ+దానన్) దేనిమూలాన; సంభవించున్= ఏర్పడుతాయి; విషము+అనంగన్+ఎయ్యది;= విసం అంటే ఏది?; శ్రాద్ధవిధికిన్= పితృతర్పణకర్మకు; సమయము+ఎద్ది= ఉచితకాలం ఏది; అనినన్= అని (యక్షుడు) అడుగగా; జనవిభుండు= రాజు, ధర్మరాజు; ఇట్లు+అని= ఈ విధంగా; చెప్పెన్= వచించాడు.

తాత్పర్యం: అని ధర్మనందనుడు చెప్పగా యక్షుడు తిరిగి ఈవిధంగా ప్రశ్నించాడు. 'లోకంలోని ప్రజలను ఆదుకొని సాయంచేసేవారు ఎవరు? దేనివలన నీరు, అన్నం లభిస్తాయి? విషం అనగా ఏమిటి? పితృతర్పణాలకు అనుకూలమైన కాలం ఏది?'

తే. **'సజ్జనులు దిక్కు సూవె యీ సర్వమునకు; । నభము ధరణియు జలము నన్నమ్ము నుద్భ**
వించు నెలవులు; విష మగు విప్రధనము; । లనఘ! శ్రాద్ధకాలము బ్రాహ్మణాగమంబు'. **450**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా, ఓయక్షుడా!; ఈ సర్వమునకున్= ఈ సమస్తానికి; సత్+జనులు= సజ్జనులు= మంచివారు; దిక్కు+చూవె= దిక్కు సుమా!; జలమున్+అన్నమ్మున్= నీటిని, అన్నాన్నీ; నభము= ఆకాశం; ధరణియున్= భూమియును; ఉద్భవించు= పుట్టించే; నెలవులు= స్థానాలు; విప్రధనములు= బ్రాహ్మణులసొత్తులు; విషము+అగున్= విసం కాగలదు; బ్రాహ్మణ+ఆగమంబు= విప్రుల రాక; శ్రాద్ధకాలము= పితృతర్పణానికి ఉచితసమయం.

తాత్పర్యం: 'ఈ సృష్టి సమస్తానికి దిక్కు అయినవారు సజ్జనులు. ఆకాశం నీటికి, భూమి అన్నానికి పుట్టే నెలవులు. విప్రధనం విషం ఔతుంది. బ్రాహ్మణులరాక పితృతర్పణాలకు అనువైనకాలం'.

వ. **అని తెలిపిన, నయ్యక్షుండు ధర్మనందనుతో 'మనుజుం డెయ్యది పరిత్యజించి సర్వజనప్రియుండును, నిశ్శోకుండును, నర్థవంతుండును, సుఖియును నగు?' ననిన నమ్మహీపతి యి ట్లనియె.** **451**

ప్రతిపదార్థం: అని తెలిపినన్= అని (ధర్మరాజు)వివరించి చెప్పగా; ఆ+యక్షుండు; ధర్మనందనుతోన్= ధర్మరాజుతో; ఎయ్యది= ఏది; పరిత్యజించి= వదలిపెట్టి; మనుజుండు= నరుడు; సర్వజనప్రియుండును= అందరికి ఇష్టమైనవాడును; నిశ్శోకుండును= దుఃఖం లేనివాడును; అర్థవంతుండును= సంపన్నుడును; సుఖియునున్= సౌఖ్యం కలవాడును; అగున్= కాగలడు; అనినన్= అని అడుగగా; ఆ+మహీపతి= ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ యక్షుడు ధర్మనందనుడిని ఈ రీతిగా ప్రశ్నించాడు.'దేనిని వదలిపెట్టితే మానవుడు సర్వజనాలకు ఇష్టుడు ఔతాడు? నిశ్శోకుడు ఔతాడు? సంపన్నుడు ఔతాడు? సౌఖ్యం కలవాడు ఔతాడు?'

తే. **'సర్వజనసమ్మతుం డగు గర్వ ముడిగి; క్రోధ మడఁచి శోకమునకుఁ గుదురు కాఁడు;**
వినవె యర్థాఢ్యుఁ డగు లోభ మొనర విడిచి; । తృష్ణ వర్జించి సౌఖ్యంబుతెరువుఁ గాంచు'. **452**

ప్రతిపదార్థం: వినవె= ఆలకింపుము; గర్వము+ఉడిగి= స్వాతిశయాన్ని విడనాడి; సర్వ, జన, సమ్మతుండు= అందరు ప్రజలకు ఇష్టుడు; అగున్= కాగలడు; క్రోధము+అడఁచి= ఆగ్రహాన్ని అణచిపెట్టి; శోకమునకున్= దుఃఖానికి; కుదురు+కాఁడు= పాలుగాడు; లోభము+ఒనరన్, విడిచి= పిసినారితనం ఒప్పిదంగా విడనాడితే; అర్థ+ఆఢ్యుఁడు= ధనం కలవాడు; అగున్= కాగలడు; తృష్ణ= ఆశ; వర్జించి= విడనాడి; సౌఖ్యంబుతెరువున్= సుఖాన్ని పొందేమార్గాన్ని; కాంచున్= చేరుతాడు.

తాత్పర్యం: 'గర్వం విడనాడితే అందరికి ఇష్టుడు కాగలడు. కోపం విడనాడితే శోకం పాలు కాడు. లోభం వదలిపెట్టితే సంపన్నుడు ఔతాడు. తృష్ణ వర్జిస్తే సుఖవంతుడు ఔతాడు.'

వ. **అనిన యనంతరంబ యద్దివ్యుం డతనితోఁ 'బురుషశబ్ద వాచ్యుం డెట్టివాఁడు? మఱి సర్వధని యగు వాఁ**
డెవ్వండు? నిశ్చయింపు' మనినఁ బాండవజ్యేష్ఠుం డిట్లనియె. **453**

ప్రతిపదార్థం: అనిన+అనంతరంబు+అ= అని (ధర్మరాజు) చెప్పిన పిదప; ఆ+దివ్యుండు= ఆ దివ్యుడు; ఆ యక్షుడు; అతనితోన్= ధర్మరాజుతో; 'పురుష' శబ్దవాచ్యుండు= 'పురుషుడు' అని చెప్పదగినవాడు; ఎట్టివాఁడు?= ఏలక్షణాలు కలవాడు?; మఱి= ఇంకా; సర్వధని= సర్వ సంపదలు కలవాడు; అగువాఁడు= అయినవాడు; ఎవ్వండు?= ఎవ్వడు?; నిశ్చయింపుము= నిర్ణయించి చెప్పుము; అనినన్= అని (యక్షుడు) పలుకగా; పాండవజ్యేష్ఠుండు= పాండవాగ్రజుడు, ధర్మరాజు, ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అంతట దివ్యుడైన యక్షుడు మరల ప్రశ్నించాడు. 'పురుషుడు అని అనదగినవాడు ఎవ్వడు? సర్వధని-సకలసంపదలు కలవాడు ఎవడు?' ధర్మరాజు ఈ రీతిగా బదులు పలికాడు.

క. **'దివి ముట్టి ధరణియంతట । నివిడి మెఱయుచుండు నెవ్వనియశోరమ య**
ట్టి విశిష్టచరిత్రుఁడు, య । క్షవరా! పురుషుండు నాఁ బ్రకాశత నొందున్. **454**

ప్రతిపదార్థం: యక్షవరా!= యక్షులలో శ్రేష్ఠుడ వైనవాడా!; ధరణి= భూమి; అంతటన్= అంతటను; నివిడి= వ్యాపించి; దివి, ముట్టి= ఆకసాన్ని స్పృశించి; ఎవ్వని యశః+రమ= ఎవ్వనియశోరమ= ఎవడికీర్తివైభవం; మెఱయుచున్+ఉండున్= దేదీప్యమానంగా మిరుమిట్లు కొలుపుతూ ఉంటుందో; అట్టి= అటువంటి; విశిష్టచరిత్రుఁడు= పేర్కొనదగిన ప్రవర్తన కలవాడు; పురుషుండు= పురుషుడు; నాన్= అనగా; ప్రకాశతన్+ఒందున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: 'భూమ్యాకాశాలను ఆవరించి ఎవ్వడి కీర్తివైభవం మిరుమిట్లు కొలుపుతూ విస్తరిస్తుందో అట్టి మహానుభావుడే పురుషశబ్దంతో పిలువదగినవాడు.

ఆ. **ప్రియము నప్రియంబుఁ బెల్లగు సౌఖ్యదుః । ఖములు భూతభావికార్యములును**
నెవ్వనికి సమంబు లివి సర్వధనియనఁ । బరఁగుఁ జువ్వె యట్టి భవ్యుఁ డనఘ!' **455**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! ఓయక్షుడా!; ప్రియమున్= ఇష్టమైనదిన్నీ; అప్రియంబున్= ఇష్టం కానిదిన్నీ; పెల్లు+అగు= మిక్కుటమైన; సౌఖ్యదుఃఖములు= శుభాలూ ఆవేదనలూ; భూత, భావికార్యములును= జరిగినవి జరుగబోయే పనులును; ఎవ్వనికిన్= ఎవరికి; ఇవి= ఇవి; సమంబులు= తుల్యాలో; అట్టి, భవ్యుఁడు= అటువంటి మహానుభావుడు; సర్వధని అనన్+పరఁగున్+చువ్వె= సర్వధని అని అనబడతాడు సుమా!

తాత్పర్యం: 'ప్రియం, అప్రియం, సుఖం, దుఃఖం, జరిగినకార్యాలు, జరుగబోయేకార్యాలు ఎవనికి సమానములో అట్టి మహానుభావుడు సర్వధని అని చెప్పవచ్చును.'

వ. అని వివరించిన విని యుధిష్ఠిరుదెసఁబ్రసాదమధురం బైన యాలోకనంబు నిగుడ నయ్యక్షవరుండు 'మహాత్మా! మదీయంబు లైన ప్రశ్నంబు లన్నింటికి సదుత్తరంబు లిచ్చితి; నీవలనం బ్రీతుండ నైతి; నీతమ్ములయం దొక్కరుని ప్రాణంబు లిచ్చెద నడుగు' మనిన నతండు. 456

ప్రతిపదార్థం: అని వివరించినన్= అని (ధర్మరాజు) వివరించిచెప్పగా; విని= (యక్షుడు) ఆలకించి; యుధిష్ఠిరుదెసన్= ధర్మరాజువైపు; ప్రసాదమధురంబు+ఐన= అనుగ్రహంతో మిళితమయి తియ్యనైన; ఆలోకనంబు= చూపు; నిగుడన్= వ్యాపించగా; ఆ+యక్షవరుండు= యక్షులలో శ్రేష్ఠుడు అయినవాడు; మహాత్మా!= ఓధర్మరాజా!; మదీయంబులు+ఐనప్రశ్నంబులు+ అన్నింటికిన్= నాయొక్క ప్రశ్నలకు అన్నింటికిని; సత్+ఉత్తరంబులు= మంచిసమాధానాలు; ఇచ్చితి(వి)= ఇచ్చావు; నీవలనన్= నీవలన; ప్రీతుండన్+ఐతిన్= సంతృప్తిచెందినవాడను అయినాను; నీతమ్ములయందున్= నీఅనుజులలో; ఒక్కరుని= ఒకనియొక్క; ప్రాణంబులు= అసువులు; ఇచ్చెదన్= ఇస్తాను; అడుగుము= కోరుకొమ్ము; అనినన్ (అని యక్షుడు) చెప్పగా; అతండు= ధర్మరాజు.

తాత్పర్యం: అని ధర్మరాజు వివరించి చెప్పాడు. అంతట ఆ యక్షుడు ధర్మరాజుపై అనుగ్రహపూరితాలైన తియ్యని చూడ్కులు సారించి ఇట్లన్నాడు: 'మహాత్మా! ధర్మరాజా! నేను నిన్ను అడిగిన ప్రశ్నలకు గడుసుదనంతో మాత్రమే గాక మంచి సమాధానాలను చక్కగా చెప్పావు. నేను సంతృప్తి చెందాను. నీతమ్ములలో ఒకడి ప్రాణాలను ఇస్తాను కోరుకొమ్ము' అనగా ధర్మరాజు (ఇట్లా బదులు పలికాడు).

సీ. 'శ్యామాంగు నారక్తజలరుహనేత్రు సా । లప్రాంశు నున్నతలలితబాహు
నకులుని బ్రదికింపు' నావుడు యక్షుండు । 'భీమఫల్గును లతిభీమబలులు
ప్రియులు నీ కెంతయుఁ బృథివీశ! వీరిలో । నొకనిఁ గోరక యిట్లు నకులుఁ గోరి?'
తనుడు ధర్మాత్మజుం డనియెను 'మాతండ్రి । యగు పాండువిభునకు మగువ లిరువు:

ఆ. రందు గొంతికొడుకు లైన ముప్వురిలోన । నేను బ్రదికినాఁడ; నింక మాద్రి
తనయు లిరువురందుఁ దగ నొక్కరుం డిప్డు । బ్రదుకవలదె? చెపుమ పాడితెఱఁగు. 457

ప్రతిపదార్థం: శ్యామ+అంగున్= నల్లనైన దేహం కలవాడిని; ఆరక్తజలరుహనేత్రున్= మిక్కుటమైన ఎఱుపురంగు గల పద్మాలవంటి కన్నులు కలవాడిని, చెంగల్వసోయగంకల కన్నులు కలవాడిని; సాలప్రాంశున్= మద్దిచెట్టువలె పొడవైనవాడిని; ఉన్నత, లలిత, బాహున్= ఎత్తైనవి, సుకుమారమైనవి అయిన చేతులు కలవాడిని, ఆజానుబాహుడిని; నకులునిన్= నకులుడిని; బ్రదికింపు= పునరుజ్జీవితుని గావింపుము; నావుడున్= అని(ధర్మరాజు) చెప్పగా; యక్షుండు= యక్షుడు; పృథివీ+ఈశ!= భూపతీ, ఓ ధర్మరాజా!; భీమఫల్గునులు= భీముడును అర్జునుడును; అతిభీమబలులు= మిక్కిలి భయంకరమైన బలం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కలవారు; నీకున్= నీకు; ఎంతయున్= మిక్కిలి; ప్రియులు= ప్రీతిపాత్రులు; వీరిలోన్= భీమార్జునులలో; ఒకనిన్= ఒకరిని; కోరక= అర్థించక (బ్రదికించుమనికోరక); ఇట్లు= ఈ విధంగా; నకులున్= నకులుడిని; కోరితి(వి)= కోరావు; అనుడున్= అని యక్షుడు అనగా; ధర్మ+ఆత్మజుండు+అనియెన్= ధర్మనందనుడు చెప్పాడు; మాతండ్రి= మాజనకుడు; పాండువిభునకున్= పాండురాజుకు; మగువలు= వనితలు, భార్యలు; ఇరువురు= ఇద్దరు; అందున్= వారిలో; గొంతికొడుకులు= కుంతీదేవికుమారులు; ఐన= అయినట్టి; ముువ్వురిలోనన్= ముువ్వురిలో; ఏను= నేను; బ్రదికినాఁడన్= జీవించాను; ఇంకన్= ఇక మరి; మాద్రి తనయులు= మాద్రికొడుకులు; ఇరువురందున్= ఇద్దరిలో; తగన్= ఒప్పిదంగా; ఒక్కరుండు= ఒకఁడు; ఇప్డు= ఇపుడు; బ్రదుకన్వలదు+ఎ= జీవించవలదా; పాడితెఱఁగు= ధర్మంయొక్కతీరు; చెపుము+అ= దయచేసి నీవే వచింపుము.

తాత్పర్యం: 'శ్యామలశరీరుడు, చెంగలువసోయగం చిందే కన్నులు కలవాడు ఆజానుబాహువు' మద్దిచెట్టును పోలిన నిడివి కలవాడు ఉన్నతములు లలితములు అయిన బాహువులు కలవాడు, అయిన నకులుడిని బ్రదికించుము' అని ధర్మరాజు యక్షుడిని అర్థించాడు. అంతట యక్షుడు 'మహారాజా! ధర్మజా! నీకోరిక నాకు అర్థం కాలేదు. భీముడు అర్జునుడు సుప్రసిద్ధులైన లోకోత్తరవీరులు. నీకు ప్రీతిపాత్రులు. వీరిలో ఒకరిని బ్రదికించుమని కోరక, ఈ నకులుడిని బ్రదికించుమని కోరావు ఎందుకు?' అని ఆశ్చర్యం ప్రకటించాడు. ధర్మజుడు ఇట్లా బదులు పలికాడు. 'మాతండ్రి పాండుప్రభువుకు ఇద్దరు భార్యలు. కుంతి, మాద్రి. కుంతీసుతులలో పెద్దవాడను నేను బ్రదికిఉన్నానుకదా! ఇక, మాద్రీతనయులలో ఒక్కడు బ్రదుకువలెనుకదా! నీవు ధర్మంతీరు నెఱిగి దయతో వచించుము.

విశేషం: యక్షుడిపరీక్ష - ప్రశ్నలు వేయటంతో ముగియలేదు. ఆపరీక్షలో ధర్మరాజు జ్ఞానిగా, మేధావిగా, వేదాంతిగా ఉత్తీర్ణుడైనాడు. ఇప్పుడు - యక్షుడు అడిగిన చివరిప్రశ్నకు చెప్పిన సమాధానంతో ధర్మరాజు జ్ఞానాన్ని ఆచరణంలోకి అనువదించే అనుష్ఠానవేదాంతిగా వెలుగొందుతున్నాడు.

ఆ. ధర్మనందనుండు ధర్మాత్ముఁ డని యెప్డుఁ । దగిలి జగము నన్నుఁ బొగడుచుండు;
నట్టి యేను ధర్మహానికి నోర్వఁజు । మ్మెంత వచ్చెనేని; యింత నిజము'. 458

ప్రతిపదార్థం: ధర్మనందనుండు= ధర్మరాజు; ధర్మ+ఆత్ముఁడు= ధర్మంతో కూడిన ఆత్మ కలవాడు; అని= అనుచు; ఎప్డున్= ఎల్లప్పుడున్నూ; తగిలి= ప్రియమార; జగము= లోకం (ప్రజలు); నన్నున్= నన్ను; పొగడుచుండున్= ప్రశంసిస్తూ ఉంటుంది; అట్టి= అటువంటి, లోకంచేత ధర్మాత్ముడని కీర్తించబడునట్టి; ఏను= నేను; ఎంతవచ్చెన్+ఏని= ఎట్టి ఆపద దాపురించినా; ధర్మహానికిన్= ధర్మనాశనానికి; ఓర్వన్+చుమ్ము= ఓర్వజాలను సుమీ; ఇంత= ఇది అంతా; నిజము= సత్యం.

తాత్పర్యం: ధర్మనందనుడు ధర్మాత్ముడు అని లోకం నన్ను ప్రీతితో ప్రశంసిస్తూ ఉంటుంది. అట్టి ప్రశంసలకు పాత్రుడనైన నేను ఎట్టి ఆపద దాపురించినా! సరే. ధర్మహానికి ఒడిగట్టజాలను, ఇది నిజం'.

వ. అనిన నతండు 'నీదైన ధర్మజ్ఞతకు మెచ్చితి; నీతమ్ములందఱు లబ్ధజీవితు లయ్యెద' రనిన నాక్షణంబ విగతక్షుత్పిపాసులై యన్నలువురు నిద్రవోయి మేల్కనిన తెఱంగున సముత్థితు లైనం జూచి, విస్మితుండై ధర్మపుత్త్రుం డి ట్లనియె. 459

ప్రతిపదార్థం: అనినన్= అని (ధర్మరాజు) వచించగా; అతండు= అతడు (యక్షుడు); నీదు+ఐన= నీయొక్క; ధర్మజ్ఞతకున్= ధర్మపరిజ్ఞానానికి; మెచ్చితిన్= నీయందు గౌరవం పెంచుకొన్నాను; నీతమ్ములు+అందఱున్= నీఅనుజులు అందరును; లబ్ధ,

జీవితులు+అయ్యెదరు= పొందబడిన జీవితాలు కలవారు ఔతారు. తిరిగి బ్రదుకుతారు; అనినన్= అని చెప్పగా; ఆక్షణంబు+అ= ఆత్రుటిలోనే; విగత, క్షుత్+పిపాసులు+ఐ= తీరిన ఆకలి దప్పికలు కలవారలై; ఆ+నలువురున్= ఆ నలుగురున్నూ (భీమార్జున నకులసహదేవులు); నిద్రపోయి= నిద్రించి; మేల్కనిన, తెఱంగునన్= మేలుకొన్నట్లు; సమ్+ఉత్థితులు+ఐనన్= చక్కగా లేచినవారుకాగా; చూచి= అరసి; విస్మితుండు+ఐ= మిక్కిలి ఆశ్చర్యం పొందినవాడై; ధర్మపుత్త్రుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ మాటలు విని యక్షుడు 'ధర్మజా! నీ ధర్మజ్ఞానానికి మెచ్చాను. నీ తమ్ములందరూ బ్రతుకుతారు గాక!' అని అన్నాడు. వెంటనే భీమార్జున నకుల సహదేవులు నలుగురూ ఆకలిదప్పులు లేనివారై నిద్రనుండి మేల్కొన్నట్లు లేచారు. వారిని చూచి ధర్మరాజు ఆశ్చర్యపడి ఇట్లా అన్నాడు.

చ. **'నిను నొక యక్షమాత్త్రుఁ డని నెమ్మది నమ్మఁగ నేర నయ్యెదన్.**
జననుత! నీవు నిక్కముగ శక్రుఁడవో, యలకాధిపుండవో,
యనలుఁడవో, సమీరుఁడవొ, యట్లునుగాక జగన్నుతుండు మ
జ్జనకుఁడు నైన ధర్మ్ముఁడవొ? సత్కృపఁ జెప్పుము నాకు' నావుడున్. **460**

ప్రతిపదార్థం: నినున్= నిన్ను; ఒక= ఒకానొక; యక్షమాత్రుఁడు+అని= యక్షుడు మాత్రమే అని; నెఱ+మదిన్= నెమ్మదిన్= నిండుమనస్సున; నమ్మగనేరను+అయ్యెదన్= విశ్వసింపజాలక ఉన్నాను; జననుత!= ప్రజలచేత ప్రశంసించబడేవాడా!; నీవు= నీవు, నిక్కముగన్= నిజంగా; శక్రుఁడవు+ఓ= ఇంద్రుడవో; అలకా+అధిపుండవు+ఓ= అలకాపురి రాజధానిగా కలవాడివో, కుబేరుడవో; అనలుఁడవు+ఓ= అగ్నిదేవుడవో; సమీరుఁడవు+ఒ= వాయుదేవుడవో; అట్లునుగాక= ఆరీతిగా కాక; జగత్+నుతుండున్= లోకంచేత పొగడబడేవాడున్నూ; మత్+జనకుఁడున్= (మజ్జనకుఁడు=) నా తండ్రిన్నీ; ఐన= ఐనట్టి; ధర్మ్ముఁడవు+ఒ= యమధర్మరాజువో; సత్+కృపన్= చక్కనిదయతో; నాకున్= నాకు; చెప్పుము= వచింపుము; నావుడున్= అని (ధర్మరాజు) అనగా.

తాత్పర్యం: ప్రజలచేత ప్రశంసించబడేవాడా! నిన్ను, ఎవరో సామాన్యుడైన యక్షుడుగా పరిగణించజాలను. నీవు ఎవరో మహానుభావుడవనే నమ్మకం నాకు ఏర్పడింది. నిజంగా నీవు దేవేంద్రుడవో, అలకాధిపుడు అయిన కుబేరుడవో, అగ్నిదేవుడవో, వాయుదేవుడవో అయి ఉండాలి. ఒకవేళ అట్లాకాకపోతే జగత్తులచేత ప్రశంసించబడే నాజనకుడు ధర్మదేవతవే అయి యుండాలి. దయచేసి నీవు ఎవరవో నాకు నిజం చెప్పుమని వేడుతున్నాను, అని ధర్మరాజు పలుకగా.

వ. **అమ్మహాత్ముండు మందస్మితాననుండై.** **461**

తాత్పర్యం: మహానుభావుడైన ఆ యక్షుడు చిరునవ్వుతోకూడిన మొగం కలవాడై.

మత్తకోకిలము

'ఏను ధర్మ్ముఁడఁ జువ్వె రాజకులేంద్ర! సత్యము శౌచమున్
దానముం దపమున్ శమంబును దాంతియున్ యశముం బరి
జ్ఞానయుక్తియు నాదుమూర్తులు; సమ్మదంబున నిప్డు మ
త్సూను నుత్తమధార్మికున్ నినుఁ జూచు వేడుక వచ్చితిన్. **462**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: రాజ+కుల+ఇంద్ర!= రాజుల సమూహాలలో శ్రేష్ఠుడా!; ఏను= నేను; ధర్ముఁడన్+చువ్వే= నేను యమధర్మరాజును సుమా; సత్యము= నిజం; శౌచమున్= నిర్మలత్వం; దానమున్= ఈగియున్నూ; తపమున్= తపస్సు; శమంబును= కామక్రోధాదులు లేని శాంతం; దాంతియున్= ఇంద్రియనిగ్రహమున్నూ; యశమున్= కీర్తియు; పరిజ్ఞాన, యుక్తియున్= వివేకంతో కూడిఉండటం; నాదు, మూర్తులు= నా ఆకారాలు; సమ్మదంబునన్= సంతోషంతో; ఇప్డు= ఇపుడు; ఈ సమయంలో; మత్+సూనున్= నా సుతుడిని; ఉత్తమధార్మికున్= గొప్పధర్మం కలవాడిని; నినున్= నిన్ను; చూచువేడుకన్= చూచే కోరికతో; వచ్చితిన్= వచ్చాను.

తాత్పర్యం: 'రాజులసమూహాలలో శ్రేష్ఠుడ వైన ఓధర్మరాజా! నేను యమధర్మరాజును సుమా! నాకుమారుడవు, పరమధర్మమూర్తివి అయిన నిన్ను చూచే వేడుకతో ఇప్పుడు వచ్చాను. సత్యం, శౌచం, దానం, తపస్సు, శమం, దమం, కీర్తి, వివేకం నా మూర్తులు.

విశేషం: ఈ పద్యంలో ధర్మస్వరూపం సంగ్రహంగానూ సమగ్రంగానూ నిర్వచించబడింది. మహాభారతం అంతా ఈ పద్యానికి విపులవ్యాఖ్యానమే. 'సత్యం వద' - 'సత్యమేవ జయతే' ఇవి శ్రుతివాక్యాలు. సత్యమే సౌందర్యం. సత్యమే పరబ్రహ్మస్వరూపం. ఏప్రలోభంవలన కాని ఏస్వార్థయోచనవలన కాని సత్యవ్రతానికి భంగం కలుగరాదు. శౌచం అన్నమాటకు శారీరకపరిశుభ్రత మాత్రమే అర్థం కాదు. శౌచం బాహ్యశౌచం మాత్రమేకాక ఆభ్యంతర శౌచం, మనోవాక్కాయ కర్మలలో పారిశుద్ధ్యాన్ని పాటించటంగా ఎన్నబడుతుంది. అట్లే - దానం, తపస్సు, శమం, దమం, కీర్తి, వివేకం అనేపదాలను విశాలమైన అర్థంలో స్వీకరించాలి. మహాభారతంలోని ఉపాఖ్యానాలు ఈ అంశాలను హృదయంగమంగా ఉల్లేఖించేవే. వృత్త లక్షణానికి చూడు. ఆరణ్య: 4.267 విశేషాంశం.

వ. న న్నాశ్రయించిన జనంబులు దుర్గతిం బొరయరు గావున నభిమతంబు లైన వరంబు లిచ్చెద' నడుగు మనినఁ బాండవాగ్రజుండు సంభ్రమభక్తిపరుం డగుచు దండప్రణామంబు సేసి, యద్దేవోత్తముం బ్రస్తుతించి, 'దేవా! మదీయాశ్రమవాసుండైన భూసురవరు నరణి యొక్కహరిణంబుచేత నపహృతంబయ్యెఁ; నతనికిం గర్మలోపంబు గాకుండ నయ్యరణిం గరుణింపవే' యనినఁ బ్రీతచిత్తుం డగుచు ధర్మదేవుండు. 463

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను (ధర్ముఁవును); ఆశ్రయించిన= ఆధారం చేసికొనిన; జనంబులు= మనుజులు; దుర్గతిన్= చెడుస్థితిని; పొరయరు= పొందరు; కావునన్= కాబట్టి; అభిమతంబులు+ఐన= ఇష్టాలైన; వరంబులు= వరాలు; ఇచ్చెదన్= ఇస్తాను; అడుగుము= కోరుము; అనినన్= అని (యముడు) చెప్పగా; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; సంభ్రమ, భక్తిపరుండు+ అగుచున్= తత్తరపాటుతో కూడిన పూజ్యభావం కలవాడు ఔతూ; దండప్రణామంబు+చేసి= భుజాలు భూమికి సోకేటట్లుగా నమస్కరించి; ఆ+దేవ+ఉత్తమున్= ఆ దేవతలలో శ్రేష్ఠుడైనవాడిని, యముడిని; ప్రస్తుతించి= కీర్తించి; దేవా!= దేవరా!; మదీయ+ఆశ్రమ, వాసుండు+ఐన= నా ఆశ్రమంలో నివసించేవాడు అయిన; భూసుర, వరు+అరణి= బ్రాహ్మణోత్తముడి అగ్గికొయ్య; ఒక్క, హరిణంబు+చేతన్; ఒకలేడిచేత; అపహృతంబు+అయ్యెన్= అపహరించబడింది; అతనికిన్= వానికి (ఆ బ్రాహ్మణుడికి); కర్మలోపంబు= అనుష్ఠానంలోని లోటు; కాక+ఉండన్= ఏర్పడకుండగా; ఆ+అరణిన్= ఆ అరణిని; కరుణింపవే= దయచేసి ప్రసాదించుము; అనినన్= అని (ధర్మరాజు) పలుకగా; ప్రీతచిత్తుండు+అగుచున్= సంతృప్తి చెందిన మనస్సు కలవాడు ఔతూ; ధర్మదేవుండు= యమధర్మరాజు.

తాత్పర్యం: నన్ను ఆధారంగా చేసికొనిన మనుజులు దుర్గతిని పొందరు. నీవు నన్ను ఆశ్రయించితివి. కావున నీవు కోరే వరాలను ఇస్తాను. కోరుకొనుము' అని యముడు వచించాడు. ధర్మరాజు తత్తరపాటుతో కూడిన పూజ్యభావంతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తనభుజాలు భూమికి సోకేటట్లుగా ధర్మదేవుడికి నమస్కరించి, అతడిని కీర్తించి, 'దేవా! నా ఆశ్రమంలో నివసిస్తున్న బ్రాహ్మణోత్తముడి అరణిని ఒకలేడి హరించింది. ఆతడి నిత్యానుష్ఠానానికి భంగం కలుగకుండ దయచేసి ఆ అరణిని ప్రసాదించుము' అని ప్రార్థించాడు. ఆ ధర్మదేవుడు సంతృప్తిచెందినవాడయి.

క. 'విను మేను నీమనోగతి। యనఘా! యెఱుఁగంగ వేఁడి యరణీహరణం
బొనరించితి; మృగ మెక్కడి?'। దని యమ్మహనీయవస్తు వతనికి నిచ్చెన్. 464

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా, ఓ ధర్మరాజా!; వినుము= ఆలకించుము; ఏను= నేను; నీమనోగతి= (నీమనస్+గతి) నీచిత్తప్రవృత్తి; ఎఱుఁగంగన్‌వేఁడి= తెలిసికొనగోరి; అరణీహరణంబు= అరణిని హరించటం; ఒనరించితిన్= చేశాను; మృగము= లేడి; ఎక్కడిది?= ఎచటిది?; అని= అని వచించి; ఆ+మహనీయవస్తువు= ఆ గొప్ప పదార్థాన్ని; అతనికిన్= వానికి (ధర్మరాజుకు); ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: 'పాపరహితుడ వైన ఓ ధర్మరాజా! నేను నీమానసికప్రవృత్తిని తెలిసికొనగోరి, ఆ అరణిని అపహరించాను. అంతే. లేడి ఎక్కడిది? నేనే అట్లా లేడిరూపం ధరించాను. ఇదిగో! అరణిని తీసికొమ్ము'అని వచించి యముడు ఆ మహనీయవస్తువైన అరణిని ధర్మరాజుకు తిరిగిఇచ్చాడు.

వ. ఇచ్చి మఱియు నిట్లనియె; 'పదుమూఁడవయేఁడు సనుదెంచె; నింక మీ రజ్ఞాతవాసంబు సలుపవలయు; నందు మీ రెవ్వ రెక్కడ నేరూపంబునం జరియింపం గోరిన నయ్యైరూపంబు లలవడియెడు; నె ట్లున్నను మి మ్మెవ్వరు నెఱుంగకుండు నట్లుగా వరం బిచ్చితి; నింకనొం డెయ్యదివలసిన నడుగు' మనిన నమ్మనుజేశ్వరుం డి ట్లనియె. 465

ప్రతిపదార్థం: ఇచ్చి= (అరణిని) ఒసగి; మఱియున్= వెండియును; ఇట్లు+అనియెన్= ఈ విధంగాచెప్పాడు; పదు మూఁడు+అవ+ఏఁడు= పదమూడవ వత్సరం; చనుదెంచెన్= వచ్చింది; ఇంకన్= ఇక; మీరు= పాండవులు అయిన మీరు; అజ్ఞాతవాసంబు= ఒరులకు తెలియబడకుండ నివసించటం; సలుపన్‌వలయున్= చేయాలి; అందున్= ఆ అజ్ఞాతవాసంలో; మీరు+ఎవ్వరు= మీ పాండవులలో ఎవరు ఎవరు; ఎక్కడన్= ఏస్థలంలో; ఏరూపంబునన్= ఏఆకారంలో; చరియింపన్+కోరినన్= ప్రవర్తింప తలిస్తే; అయ్యై= ఆయా; రూపంబులు= ఆకారాలు; అలవడియెడున్= ఏర్పడుతాయి గాక; ఎట్లు+ఉన్నను= ఏవిధంగా ఉన్నప్పటికీ; మిమ్మున్= (మీ పాండవులను); ఎవ్వరున్= ఎవరును; ఎఱుంగక+ఉండు+అట్లుగాన్= తెలియలేనివిధంగా; వరంబు; ఇచ్చితిన్= ప్రసాదించాను; ఇంకన్= మఱియును; ఒండు+ఎయ్యది= ఇంక ఒకటి ఏదైన; వలసినన్= అవసరమైన కోరిక; అడుగుము= అర్థించుము; అనినన్= అని (యముడు) వచించగా; ఆ+మనుజ+ఈశ్వరుండు= ఆ మానవులకు ప్రభువు ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: యముడు అరణిని ధర్మరాజుకు ఇచ్చి మరియు ఇట్లా వచించాడు. 'మీకు పంద్రెండేండ్ల అరణ్యావాసం ముగిసింది. పదుమూడవ సంవత్సరం అరుగుదెంచింది. ఇక మీరు మారువేషాలలో శత్రువులకు తెలియకుండా అజ్ఞాతవాసం పూర్తిచేయవలసి ఉన్నది. ఆ అజ్ఞాతవాసంలో మీరు ఏయేరూపాలు ధరించవలె నని కోరితే ఆయారూపాలు మీఅందరికీ అలవడగలవు. మిమ్ము ఇతరులు ఎవ్వరూ గుర్తించకుండేటట్లు మీకు వరం ప్రసాదించాను. మఱియు ఇంకొక వరం అడుగుము'. ఆ మాటలువిని ధర్మరాజు యముడితో ఇట్లా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మత్తకోకిలము

'ఆదిదేవుఁడ వైన నీవు దయామతిం బొడసూపి న
న్నాదరించుటఁ జేసి ధన్యుఁడ నైతి; నింతకు నెక్కు డొం
దేది కల్గునె? యైన నామది యెల్లనాఁడును గ్రోధ మో
హాదులం బెడఁ బాసి ధర్మమునంద నెక్కొనఁ జేయవే!' 466

ప్రతిపదార్థం: ఆది, దేవుఁడవు+అయిన= మొదటి వేల్పువు అయిన; నీవు= నీవు; దయామతిన్= కరుణతోకూడిన బుద్ధితో; పొడ+చూపి= ప్రత్యక్షమై; నన్నున్; ఆదరించుటన్+చేసి= సంప్రీతితో మన్నించటంచేత; ధన్యుడన్+ఐతిన్= చరితార్థుడ నయినాను; ఇంతకున్= నీవు ప్రత్యక్షమైకరుణతో నన్నాదరించటంకంటె; ఎక్కుడు= అధికమైనది; ఒండు= వేరు; ఏది= ఏదైనా; కల్గును+ఎ= సంభవిస్తుందా?; ఐనన్= అయినను; నా మది= నామనస్సు; ఎల్ల, నాఁడును= ఎల్ల వేళలలోనూ; క్రోధ, మోహ+ఆదులన్= కోపం, అజ్ఞానం (భ్రమ) మొదలైనవాటిని; పెడన్+పాసి= పెడమొగం పెట్టి దూరమై; ధర్మమునందున్+అ= ధర్మంలో మాత్రమే; నెక్కొనన్+చేయవే= లగ్నం అయ్యేటట్లుగా చేయుము.

తాత్పర్యం: 'దేవతలలో ప్రథముడ వయిన నీవు కరుణించి నాకు ప్రత్యక్షమై నన్ను మన్నించటంచేత నా జన్మ ధన్యమైనది. ఇంతకంటె వేరే భాగ్యయోగం నేను కోరుకొనదగింది ఏమున్నది? ఐనను నాచిత్తం ఎల్లవేళల ధర్మము నందే లగ్నమై ఉండేటట్లు దయచేసి వరం ప్రసాదించుము. నామనస్సు ఇక కోపతాపాలకు మద మాత్సర్యాదులకు అజ్ఞానానికి లోనుగాకుండ చేయుము'.

విశేషం: వృత్త లక్షణానికి చూడు. ఆరణ్య: 4.267 విశేషాంశం.

వ. అనిన నద్దేవుం డతనికి నవ్వరం బొసంగి యంతర్హితుం డయ్యెఁ; గౌంతేయులు గ్రమ్మఱి నిజాశ్రమంబున కరిగి, ధరణీదేవునకు నరణీప్రదానంబు సేసి, తత్ప్రయుక్తాశీర్వాదంబులు గైకొని, పరమానందంబునం బొంది రని యిట్లు పాండుతనయుల వనవాసప్రకారంబు సవిస్తరమధురంబుగా నుపన్యసించి. 467

ప్రతిపదార్థం: అనినన్= అని (ధర్మరాజు) చెప్పగా; ఆ+దేవుండు= ఆ దేవుడు, యముడు; అతనికిన్= ధర్మరాజుకు; ఆ, వరంబు+ఒసంగి= ఆ వరాన్ని ఇచ్చి; అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడు అయ్యాడు; కౌంతేయులు= కుంతీనందనులు, పాండవులు; క్రమ్మఱి= తిరిగి; నిజ+ఆశ్రమంబునకున్= తమ ఆశ్రమానికి; అరిగి= వెళ్ళి; ధరణీదేవునకున్= బ్రాహ్మణుడికి; అరణీప్రదానంబు+చేసి= అరణిని ఇచ్చి; తద్+ప్రయుక్త+ఆశీః+వాదంబులు= ఆ బ్రాహ్మణుడిచేత ఇవ్వబడిన దీవెనలు; కైకొని= గ్రహించి; పరమ+ఆనందంబునన్+పొందిరి= గొప్పసంతోషాన్ని అనుభవించారు; అని= అని; ఇట్లు= ఈ రీతిగా; పాండుతనయుల వనవాసప్రకారంబు= పాండవులు అరణ్యంలో నివసించిన విధం; సవిస్తర, మధురంబుగాన్= వివరాలతో కూడినట్లుగానూ, తియ్యగానూ; ఉపన్యసించి= వచించి.

తాత్పర్యం: అని ధర్మరాజు వచించాడు. యమధర్మరాజు యుధిష్ఠిరుడికి ఆ వరం అనుగ్రహించి అదృశ్యుడయ్యాడు. అంత పాండవులు తమ ఆశ్రమానికి తిరిగివెళ్ళి అరణిని ఆ బ్రాహ్మణుడికి సమర్పించారు. ఆ బ్రాహ్మణుడు పాండవులను ఆశీర్వదించాడు. పాండవులు గొప్ప ఆనందాన్ని పొందారు. అని పాండవుల వనవాసకథను, సాంగోపాంగంగా వివరాలన్నిటితో తియ్యతియ్యని మాటలతో చెప్పి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అనఘుఁడు గృష్ణద్వైపా । యనశిష్యుఁడు బోధనిధి సమంచితమేధా
ఘనునకుఁ బారిక్షితునకు । ననవరతానందసుఖసమగ్రత యొసఁగెన్. 468

ప్రతిపదార్థం: అనఘుఁడు= పాపరహితుడు; కృష్ణద్వైపాయన శిష్యుఁడు= వేదవ్యాసమహర్షియొక్క శిష్యుడు వైశంపాయనుడు; బోధనిధి= జ్ఞానానికి నెలవు; సమంచిత మేధాఘనునకున్= మిక్కిలి విలసిల్లే తెలివితేటలచేత గొప్పవాడికి; పారిక్షితునకున్= పరీక్షిత్తుకొడుకు జనమేజయుడికి; అనవరత+ఆనంద, సుఖ, సమగ్రత= సంతతమైన సంతోషం, సౌఖ్యం; ఒసఁగెన్= చేకూర్చాడు.

తాత్పర్యం: పుణ్యమూర్తి వేదవ్యాసమహర్షిశిష్యుడు జ్ఞానమూర్తి అయిన వైశంపాయనుడు మేధావి అయిన జనమేజయమహారాజుకు ఎల్లప్పుడూ ఉండే నిండు ఆనందాన్ని చేకూర్చాడు.

ఆశ్వాసాంతము

సీ. భవ్యచరిత్రుఁ డాపస్తంబసూత్రుండు, । శ్రీవత్సగోత్రుండు, శివపదాబ్జ
సంతతధ్యాన సంసక్తచిత్తుఁడు, సూర । నార్యునకును బోతమాంబికకును
నందనుఁ, డిలఁ బాకనాటిలో నీలకం । ఠేశ్వరస్థానమై యెసకమెసఁగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు । ధన్యుండు ధర్మైకతత్పరాత్ముఁ

తే. డెఱ్ఱనార్యుండు సకలలోకైక విదితుఁ । డయిన నన్నయభట్టమహాకవీంద్రు
సరససారస్వతాంశప్రశస్తి దన్నుఁ । జెందుటయు సాధుజనహర్షసిద్ధిఁ గోరి. 469

ప్రతిపదార్థం: భవ్యచరిత్రుండు= యోగ్యమైన శీలం కలవాడు; ఆపస్తంబ సూత్రుండు= ఆపస్తంబమహర్షి ప్రోక్తమైన సూత్రవిధికి కట్టుబడినవంశంలోనివాడు; శ్రీవత్సగోత్రుండు= శ్రీవత్సగోత్రానికి చెందినవాడు; శివ, పద+అబ్జ, సంతత, ధ్యాన, సంసక్త, చిత్తుఁడు= శివుడిపాదపద్మాలనుగూర్చిన ఎడతెగని ఆరాధనలో లగ్నమయిన మనస్సు కలవాడు; సూరన+ఆర్యునకును= పూజ్యుడు అయిన సూరనకును; పోతమ+అంబికకును= పోతమ అనే తల్లికి; నందనుఁడు= కొడుకు; ఇలన్= భూమిపై; పాకనాటిలో= పాకనాడు అనే ప్రదేశంలో; నీలకంఠ+ఈశ్వర, స్థానము+ఐ= నీలకంఠుడు అనే శివదేవుడు ఉండే గుడిగలిగినట్టిదై; ఎసకము+ఎసఁగు= శోభిల్లే; గుడ్లూరు= గుడ్లూరు అనే ఊరు; నెలవుగన్= నివసించేచోటుగా; గుణగరిష్ఠతన్= మంచిగుణాలయొక్క గొప్పతనంచేత; ఒప్పు= విలసిల్లే; ధన్యుండు= చరితార్థమైన జీవితం కలవాడు; ధర్మ+ఏక+తత్పర+ఆత్ముఁడు= ధర్మంలో మాత్రమే నిష్ఠగల మనస్సు కలవాడు; ఎఱ్ఱనార్యుండు= (ఎఱ్ఱాప్రెగ్గడ) ఎఱ్ఱన అని పిలువబడేవాడు; సకల, లోక+ఏక, విదితుడు+అయిన= సమస్తలోకంలో సుప్రసిద్ధుడయినవాడు అయిన; నన్నయభట్ట మహాకవి+ఇంద్రు= నన్నయభట్టు అనే గొప్పకవివరేణ్యుడి యొక్క; సరస, సారస్వత+అంశ, ప్రశస్తి= రసముతో కూడిన కవిత్వం పాలు పంచుకొనిన కీర్తి; తన్నున్= తనను; చెందుటయున్= పొందటంచేత; సాధుజనహర్షసిద్ధిన్+కోరి= సుజనసంతోషాన్ని పొందగోరి.

తాత్పర్యం: యోగ్యమైన ప్రవర్తన గలవాడు, ఆపస్తంబసూత్రుల వంశంలో జన్మించినవాడు, శ్రీవత్సగోత్రుడు, శివుడి పాదపద్మాలను ఆరాధించే మనస్సు కలవాడు, సూరనార్యుడికిన్నీ పోతమాంబికకున్నూ కొడుకు అయినవాడు పాకనాటిలో నీలకంఠేశ్వరుడి ఆలయంగల గుడ్లూరు అనే ఊరిలో నివసించేవాడు, మంచిగుణములే తనగొప్పతనానికి ఆధారమై జీవితం ధన్యమైనవాడు, ధర్మంలో మాత్రమే తాత్పర్యం కలవాడు అయిన ఎఱ్ఱన జగద్విదితుడు అయిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నన్నయభట్ట మహాకవివరేణ్యుడి సారస్వతమహిమలో పాలుపంచుకొనినట్లు పేరుపొందటంచేత సుజనసంతోషసిద్ధిని కోరి.

విశేషం: (1) ఈపద్యం ఎఱ్ఱన తననుగూర్చి తాను చెప్పుకొనినట్టిది. ఈ పద్యమే ఎఱ్ఱన ఆరణ్యపర్వాన్ని పూరించాడనటానికి నిర్వికల్పమైన నిదర్శనం. (2) ఈపద్యంలోని వాక్యాలు ఉత్తమపురుషలో కాక ప్రథమపురుషలో నుండటం గమనించదగింది. 'నేను' - అని వ్రాయక, ఎఱ్ఱన వ్రాశాడు అని చెప్పటం కవిసంప్రదాయంగా ఎన్నదగింది. 'నన్నయ భట్టు తెనుంగునన్ మహాభారత సంహితారచన బంధురు డయ్యె జగద్ధితంబుగన్' అని నన్నయ వ్రాసి ఉన్నాడు. (3) ఇప్పటికిని గుడ్లూరులో నీలకంఠేశ్వరుడి ఆలయం ఉన్నది. (4) 'నన్నయభట్టు సరససారస్వతాంశ ప్రశస్తి' తన్ను చెందినట్లు ఎఱ్ఱన చెప్పుకొన్నాడు. (5) ఎఱ్ఱన నాలుగవ ఆశ్వాసం చివర- అయిదు, ఆరు, ఏడు ఆశ్వాసాల చివర 'ఇది .... నన్నయభట్ట ప్రణీతంబైన ఆరణ్యపర్వమునందు' అనియే వ్రాసి ఆశ్వాసాంతపద్యాలను రాజరాజనరేంద్రుడికి సంబోధనలుగానే వెలయించాడు.

క. ధీరవిచారుఁడు తత్కవి । తారీతియుఁ గొంతదోఁపఁ దద్రచనయకా
నారణ్యపర్వశేషము । పూరించెఁ గవీంద్రకర్ణపుటపేయముగాన్. 470

ప్రతిపదార్థం: ధీరవిచారుఁడు= గంభీరమైన ఆలోచన కలవాడు, లోతైన యుక్తాయుక్తపరిజ్ఞానం కలవాడు; తద్+కవితా, రీతియున్= నన్నయభట్టుయొక్క కవిత్వపు పోకడ; కొంత+తోఁపన్= కొంత వ్యక్తమయ్యేటట్లుగా; తద్+రచన యకాన్= ఆతని రచనయే అగునట్లుగా; ఆరణ్యపర్వశేషము= అరణ్యపర్వంలో (నన్నయ వదలిపెట్టగా) మిగిలిన భాగం; కవి+ఇంద్ర, కర్ణ, పుట, పేయముగాన్= కవిశ్రేష్ఠుల చెవిదొప్పలచే త్రాగదగినదిగా, రుచికరంగా; పూరించెన్= పూర్తిచేశాడు.

తాత్పర్యం: గంభీరమైన యోచనచేసినవాడైన నన్నయభట్టుయొక్క కవితాశిల్పరీతి కొంత ప్రతిఫలించేటట్లుగా ఆతని రచనయే అయ్యేటట్లు ఆరణ్యపర్వశేషాన్ని కవివరేణ్యులకు ప్రీతి ఘటించేటట్లుగా ఎఱ్ఱన పూరించాడు.

విశేషం: (1) ఈ కందపద్యం, దీనికి ముందున్న సీసపద్యం లేకపోతే ఈ అరణ్యపర్వశేషం ఎఱ్ఱన వ్రాసినట్లే తెలియదు. (2) ఈ రచన చేయటం ఎఱ్ఱన నిష్కామకర్మగా భావించాడు. నన్నయపేరుమీదనే రాజరాజనరేంద్రుడిపేరుమీదనే నాలుగు, అయిదు, ఆరు, ఏడు ఆశ్వాసాలు వెలిశాయి. ఈ రెండుపద్యాల తరువాతి ఆశ్వాసాంత పద్యాలు, రాజరాజనరేంద్ర సంబోధనలు. ఆశ్వాసాంతగద్యం నన్నయపేర విలసితం. (3) ఈ పద్యంలోని మూడు పదగుంఫనలు - 1. ధీరవిచారుఁడు; 2. తత్కవితారీతియు కొంతదోఁప; 3. తద్రచనయకాన్- మిక్కిలి అర్థవంతాలు. 1. ఎఱ్ఱన ధీరవిచారుడు. తరచిచూస్తే ఆరణ్యపర్వశేషం నన్నయకృతం గాదనీ, ఎఱ్ఱన రచన అనీ తెలుస్తుంది. జాగ్రత్తగా అనుశీలించటం అవసరం అనే హెచ్చరిక ఇందులో ఉన్నది. ఛందోరీతులలో భాషలో భావసంపుటీకరణంలో ఎఱ్ఱన వ్యక్తిత్వముద్ర ఇందులో కానబడుతుంది. 2. తద్+కవితారీతియు కొంత తోప. ఇందులో నన్నయ అనుకరణం కానవస్తుంది. ప్రస్ఫుటంగా కానవస్తుంది. కాని అది! అంధానుకరణం కాదు. అది కొంతమాత్రమే అనే రెండవ హెచ్చరిక గమనించదగింది. 3. తద్+రచనయ కాన్= తద్రచనయ కాన్. ఎఱ్ఱన ఆరణ్యపర్వశేషం నన్నయకవితయే అనేటట్లుగా వ్రాశాడు. ఇందుకు ఆశ్వాసారంభపద్యాలు ఆశ్వాసాంతపద్య గద్యాలు నిదర్శనాలు.

క. వీరావతార! విమలా । చార! మహోదార! శుభవిచార! సుజనమం
దార! నవకీర్తి మౌక్తిక । హార! హరపదాబ్జమధుకరాత్మవిహారా! 471

ప్రతిపదార్థం: వీర+అవతార!= వీరుడియొక్క అవతారం కలవాడా, వీరుడిగా జన్మించినవాడా!; విమల+ఆచార!= స్వచ్ఛమైన ప్రవర్తన కలవాడా!; మహా+ఉదార= గొప్ప ఔదార్యం కలవాడా!; శుభవిచార!= మంచి ఆలోచన కలవాడా!; సుజనమందార!=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సజ్జనులకు కల్పవృక్షం వంటివాడా!; నవకీర్తిమౌక్తికహార!= క్రొత్తయశస్సు అనే ముత్యాలదండ కలవాడా!; హరపద+అబ్జ, మధుకర+ఆత్మవిహారా!= శివుడిపాదపద్మాలయందు తుమ్మెదరూపంతో విహరించేవాడా!

తాత్పర్యం: వీరుడిగా అవతరించినవాడా! నిర్మలమైన నడవడిక కలవాడా! మంచి ఆలోచనలు కలవాడా! సజ్జనుల కోరిక లొనగూర్చటంలో మందారవృక్షంవంటివాడా! మాసిపోనట్టి కీర్తి అనే ముత్యాలదండ ధరించేవాడా! శివుడిపాద పద్మాలలో తుమ్మెదగా విహరించేవాడా! ఓ రాజరాజనరేంద్రా!

విశేషం: (1) కీర్తి తెల్లగా ఉంటుంది. ఇది కవిసమయం. ముత్యాలహారం తెలుపు. (2) కోరిన కోరికల నీడేర్చేవృక్షం - స్వర్గంలోని నందనోద్యానంలో ఉండేచెట్టు మందారం.

తరలము

అమితవైభవ! లోభమోహమదాదిదుర్లభ! మంజువి
భ్రమ విలాసితకామినీజన పంచబాణ! నిరంతరా
నమదశేషనృపాలమౌళి పినద్ధముగ్ధమణిప్రభా
క్రమ సమంచిత విస్ఫురత్పదకాంతి నిర్జితపంకజా! 472

ప్రతిపదార్థం: అమిత, వైభవ!= మితిలేని సంపదకలవాడా!; లోభ, మోహ, మద+ఆది, దుర్లభ= పిసినితనం, అజ్ఞానం, గర్వం మొదలైనవి పొందని వాడా!; మంజు, విభ్రమ, విలసిత, కామినీజన పంచబాణ!= అందమైన విలాసాలచేత ప్రకాశించేటట్లు చేయబడిన స్త్రీలకు మన్మథుడి వంటివాడా!; నిరంతర+ఆనమత్+అశేష, నృపాల, మౌళి= ఎల్లప్పుడూ నమస్కరిస్తున్న నిఖిలరాజుల శిరస్సులపై; పినద్ధ, ముగ్ధ, మణి ప్రభాక్రమ, సమంచిత= కట్టబడిన అందమైన మణులయొక్క కాంతులయొక్క వరుసలతో కూడుకొన్న; విస్ఫురత్+పదకాంతి, నిర్జిత, పంకజా!= ప్రకాశిస్తున్న పాదాలయొక్క వెలుగుచేత జయించబడిన పద్మాలు కలవాడా! (సామంతులైన అనేకరాజులు రాజరాజనరేంద్రునికి నమస్కరించేటప్పుడు వారి శిరస్సులపై ఉన్న కిరీటాల మణుల కాంతులవరుసలతో అతడి పాదాలు పద్మాలను జయించాయి.

తాత్పర్యం: అపారమైన సంపదకలవాడా! పిసినారితనం, అజ్ఞానం, గర్వం మొదలైన గుణాలకు దుర్లభుడైనవాడా! అందమైన శృంగార చేష్టలచేత ప్రకాశించే స్త్రీలకు మన్మథుడైనవాడా! ఎల్లప్పుడూ నమస్కరిస్తున్న అంతులేని రాజుల శిరస్సులపై కట్టబడిన అందమైన మణులకాంతులచే ప్రకాశిస్తున్న పాదాల కాంతిచే జయింపబడిన పద్మాలుగలవాడా! అనగా సామంతులు శిరస్సుమోపి నమస్కరించగా వారి శిరోమణులకాంతులచే అతని పాదాలు కాంతిచే పద్మాలను తిరస్కరిస్తూ ఉన్నవని భావం (రాజరాజనరేంద్రా!)

విశేషం: వృత్తలక్షణానికి చూడు: ఆరణ్య 4.402 విశేషం.

గద్యము

ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతం బయిన శ్రీ మహాభారతంబునం దారణ్యపర్వంబునందు సీతాన్వేషణంబును, లంకాభిగమనంబును, రామరావణయుద్ధంబును, రాఘవాభ్యుదయంబును, సావిత్రీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చరిత్రంబును, సూర్యుండు గర్ణునకు హితోపదేశంబు సేయుటయుఁ, గర్ణుజన్మంబును, నింద్రుండు విప్రరూపంబునఁ గర్ణు కవచకుండలంబులు హరించుటయు, నారణేయంబును, యక్షప్రశ్నలును, ధర్ముండు ధర్మజునకు వరంబు లొసంగుటయు నన్నది సర్వంబును సప్తమాశ్వాసము. 473

శ్రీమదాంధ్ర మహాభారతమునందలి యారణ్యపర్వము సమాప్తము

తాత్పర్యం: ఇది ఉత్తమకవిజనులందరిచేత కీర్తించబడిన నన్నయభట్టుచేత రచించబడిన శ్రీమహాభారతంలోని (పదునెనిమిది పర్వాలలో మూడవదైన) ఆరణ్యపర్వంలో సీతకొరకై వెదకటం, లంకలోప్రవేశించటం, రామరావణుల యుద్ధం, శ్రీరాముడిఅభ్యుదయం, సావిత్రీచరిత్రం, సూర్యుడు కర్ణుడికి హితోపదేశం చేయటం, కర్ణుడి జన్మవృత్తాంతం, దేవేంద్రుడు బ్రాహ్మణవేషంలో వచ్చి కర్ణుడి సహజకవచకుండలాలను దానంగా స్వీకరించటం, అరణినిగూర్చిన కథ, యక్షప్రశ్నలు, యముడు ధర్మరాజుకు వరాలను అనుగ్రహించటం అనే అంశాలతో కూడుకొన్నది మొత్తం ఏడవ ఆశ్వాసం.

ఆరణ్యపర్వంలో సప్తమాశ్వాసం సమాప్తం

-: శ్రీమదాంధ్ర మహాభారతంలోని ఆరణ్యపర్వం ముగిసింది :-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

(ఐదవ సంపుటము)

ఆరణ్యపర్వశేషము

గద్యపద్య ప్రథమపాద సూచి

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అ		అంత నొక్క సంవత్సరంబు	1254	అక్కట నే నెఱుంగనె	696
అంగిరసు భార్య నేను	808	అంతయుఁ జూచి యెంతయు	848	అక్కట మృదుగాత్రులు	873
అంతంగౌంతేయులు	931	అంతయుం జూచి వామదేవుండు	689	అక్కట యమ్మహారణము	932
అంతఁగలియుగాంతంబు	670	అంతయు నెఱింగి రాఘవుండు	1062	అక్కట లోకమెల్ల నగ	680
అంతఁ దన కూర్మితమ్ము	1167	అంతరిక్షగోచరంబైన	1294	అక్కథకుండు శౌనకాది	721
అంతఁ దెగువసేసి	929	అంత షష్ఠదివసంబు	820	అక్కథకుండు శౌనకాది	924
అంతఁ బటుతోమరంబుల	1161	అంత సుయోధనుండు	950	అక్కథకుండు శౌనకాది	1117
అంతఁ బరమేష్ఠిచోదితమైన	646	అందఱుం గూడుకొని	1123	అక్కబంధుఁ డామిషార్థియై	1088
అంతఁ బోక వెండియు	801	అందుఁ గౌసల్యకు రాముండును	1045	అక్కువలాశ్వునకు	703
అంతఁ బ్రభాతంబగుటయు	950	అందుఁ బాండవులుండుట	882	అఖిలదేశవాసులైన	960
అంతఁ బ్రహృష్టాత్ముఁడై	890	అందొక్క దూతం బిలిచి	961	అఖిల నక్షత్రతారా	655
అంత	716	అంధక వృష్ణిభోజకుకురా	606	అఖిల లోకకర్తయగు	1045
అంత	817	అంబ నవాంబుజోజ్జ్వల	632	అగుఁగాక కర్మఫలములు	875
అంత	1154	అంబరము వాయువగ్ని	757	అగుఁగాక యట్ల యేమీ	833
అంత	1171	అంబుజాసనుఁ డింద్రుఁ	653	అగుఁగాక యేమి యిప్పుడు	957
అంతకసుతుహృదయంబున	875	ఆకటకట యిట్టి కష్టమునకు	933	అగ్ని దేవుండు తొల్లి	783
అంత నంగారకుండును	1029	అకట పరాంగన నబల	1113	అగ్నిదేవునియందును	838
అంత నంతకసూనుఁ డంత	1290	అకట యిది పరుషవాక్యము	906	అగ్నిహోత్రం బస్మదాత్మకం	631
అంత ననంతకీర్తి	1188	అక్కట కీడు దలంచితి	833	అగ్రజు వాక్యముల్ దలఁచి	911
అంత నమ్మునీంద్రులహోమవిధి	807	అక్కట నాహృదయము గడు	723	అట ధర్మతనయుండు	968
అంత నొక్కనాఁడు	678	అక్కట నీదెసం బతికి	1060	అట ధర్మపుత్త్రుండు	1289

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అట వామదేవుండును	685	అతని యుద్ధతి సైఁపక	1158	అదియును సాళ్వపతి	1199
అట్టి క్రందున జయద్రథుండు	1031	అతని యొద్దనుండి	883	అది యెట్లంటేని	614
అట్టి నారాయణాఖ్యుండనైన	652	అతలంబునఁ గ్రుంగిన	1033	అది యెట్లంటేని	751
ఇట్టి మహోత్పాతంబులు	813	అతిగాంభీర్య విభూతి	599	అది యెమ్మెయినగునో యని	967
అట్టి యవసరంబున	1074	అతిథి ప్రియుఁడు విశిష్ట	977	అది యెల్ల విని దశాననుఁ	1151
అట్టియెడం ద్రిగర్తపతి	1027	అతి నిందితము తమోగుణ	762	అదె నక్తంచరు లిందు	1230
అట్టియెడ నంగదుండు	1173	అతి మలినాంగి జీర్ణ	1189	అద్దేవి నా కిట్లనియె	1132
అట్టియెడ నధ్వరోత్స	964	అతివలు దన్నుఁ జేరుటకు	807	అధిక దుష్టాచారుఁడైన	1189
అట్టివి యేలపుట్టు	822	అతుల క్రోధ విఘూర్ణమాన	1029	అధిప తొల్లి జగత్త్రయంబు	708
అట్టి శారదాగమంబున	600	అతుల చతురంగసేనా	898	అధిప ప్రొద్దుగ్రుంకు	1211
అట్లగుటం జేసి ధర్మంబు	661	అతుల సౌభాగ్య పుణ్య	881	అధిప విహాగాకృతుల	791
అట్లగుటం జేసి హీన	737	అతులిత దక్షిణాన్విత	653	అధిప శిష్యుఁడను	1093
అట్లయిన నీకు నింద్రత్వంబు	815	అతులితపుణ్యమూర్తివి	782	అనంతరంబ నిరంతరానందం	966
అట్లు సని చేతనారహితం	1086	అతులిత పుష్పపల్లవ	677	అనఘ జగత్త్రయార్చితుఁ	785
అదరి నిఖిలాండకోటియుఁ	640	అతులిత విష్ణుశక్తి	706	అనఘ తమ్ములు నేను	928
అడరి నిశాతపట్టిసగదాసి	714	అతులిత వృష్ణికేకయ	1008	అనఘ దేవతలును మునులును	652
అడరుచు దేవసైన్య	846	అతులిత శిలావితాన	1100	అనఘ నితంబినీ తిలకమైన	734
అడవి కేఁగుదెంచి యడరంగ	1233	అత్తకు భక్తిగల్గి మది	859	అనఘ నీ ప్రయత్నమున	634
అడిగిన యప్పుడ చెచ్చెరఁ	727	అత్తఱి రావణుండు	1185	అనఘ భవత్సుకృతంబున	982
అతఁడు త్రిలోక తంత్రము	794	అత్రి నిజంబ పల్కెఁ దగ	626	అనఘ మా తండ్రి యొక్కనాఁడతి	802
అతఁడును దద్భావ మరయంగ	1258	అది కలగాదు నిక్కువమయై	1229	అనఘ యితఁడె త్రిపురహరుఁడు	838
అతనిఁ గని యించుకంతయు	978	అదియునుంగాక	745	అనఘ యింద్రలోకమున కంటె	985
అతనికిఁ బుట్టెఁ బుత్త్రుఁడు	788	అదియునుంగాక	882	అనఘ యిద్దేవుసన్నిధి	660
అతని చుట్టును గుంభకర్ణుడు	1107	అదియునుంగాక	888	అనఘ యీ జలాశయము	1290
అతని చేతం బ్రతిష్ఠితం	671	అదియునుం గొండొక సేపు	694	అనఘ యౌశీనరుండగు	746
అతని భక్తికిఁ బ్రియమంది	699	అదియును నతిసుందరం	676	అనఘ శబ్దాదివిషయంబు	759
అతని ముఖ గహ్వరంబుల	817	అదియును వారి నతి	1285	అనఘుఁ డిక్ష్వాకుఁడీ యఖిల	702

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అనఘుఁడు గృష్ణద్వైపాయన	1318	అని కౌఁగిలించుకొని	1170	అనినంగొండొక విచారించి	623
అనఘుఁడు ధార్తరాష్ట్రుఁడు	962	అని చిత్రసేనుండను	883	అనినంగౌశికుండు	752
అనఘుఁడు మత్సుతుండు	707	అని చెప్పి కమలహితుం	1252	అనినంగ్రొంచారి వారలం	820
అనఘుఁడు సాత్త్వికుండగు	763	అని చెప్పిన నప్పార్థి	1304	అనినం దద్వచనంబుల	1182
అనఘుఁ డూర్ధ్వబాహుఁడై	633	అని చెప్పిన విని జనమే	1241	అనినం దపననందనుం	1280
అనపత్యులమగు మనకును	1272	అని చెప్పిన విని యుధి	1196	అనినం బరమేష్ఠి	1056
అనపరాధులఁ గాన	1146	అని చెప్పి పాండుతనయుల	1241	అనినం బాంచాలి మందస్మిత	863
అనయంబున్ శ్రుతవంతుఁడై	744	అని చెప్పి మఱియు	759	అనినం బాంచాలి ప్రకంపిత	1001
అనయంబున నాత్మకర్మంబున	780	అని చెప్పి మార్కండేయుండిట్లనియె	837	అనినం బాంచాలి భీమార్జు	1033
అనయము దుస్తరమగు	1282	అని చెప్పి మార్కండేయుండు	628	అనినం బాండవాగ్రజుండు	975
అనలముచాయ మస్తకము	789	అని చెప్పి యమ్మునీంద్రుం	711	అనినం బ్రహృష్టహృదయుండై	1240
అన విని యుధిష్ఠిరుండ	1057	అని చెప్పి యిట్లనియెఁ	773	అనినం బ్రీతుండై పితామహు	805
అనవుడుఁ గర్ణుఁ డిట్లనియె	1276	అని తన్నాక్షేపించిన	625	అనినం బ్రేతపతి	1222
అనవుడుఁదత్ప్రతిజ్ఞయు	952	అని తలంచి తపంబు	785	అనినఁ గన్నుమూయదు	1306
అనవుడు ధర్మజుం డనియె	1304	అని తలంచుచు నల్లన	648	అనినఁ గర్ణుఁ గౌఁగిఁట	967
అనవుడు నర్జునుండనియె	1287	అని తెలిపిన నయ్యక్షుండు	1310	అనినఁ గర్ణునకు సూర్యుం	1247
అనవుడు నాక్షణంబ	1284	అని తెలిపి మఱియు	750	అనినఁ గలకల నవ్వి	709
అనవుడు మద్రరాజసుత	1220	అని తొడంగి యయ్యిరువురు	625	అనినఁ గుమారుండు	823
అనవుడు మేటిధర్మమగు	1309	అని దానిచేతి కిచ్చినఁ	1273	అనినఁ గుమారుఁడు వినయం	829
అనవుడు వీనులు గొఱవిం	1062	అని దివ్యుండు పలికిన	1309	అనినఁ గౌశికుండతని	775
అనవుడు శలుఁడిట్లనియె	686	అని దుఃఖించి భరతుండు	1065	అనినఁ జెవులఁ గొరవి	1190
అనవుడు సంతసిల్లి	823	అని దేవదూత వీడ్కొలిపి	988	అనినఁ దెలివొంది	1169
అనవుడు సూతుఁడిట్లను	683	అని ధృతరాష్ట్రుండు బహు	878	అనినఁ ద్రిజటపలుకుల	1109
అనవుడు సైంధవుండనియె	999	అనినం గర్ణుండు గౌరవపతి	957	అనినఁ బతివ్రతాతిలక	727
అనశనవ్రతంబు సంకల్పించి	1127	అనినం గలుషించి	1072	అనినఁ బోక నిల్చి	844
అనహంకృతు లక్రోధను	655	అనినం గార్తికేయుం	833	అనినఁ బ్రహసితముఖుండగుచు	1098
అని కృతాంజలులై	905	అనినం గృతాంజలియై	706	అనినన్ మాతలి నాదరించి	1184

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అనిన జయద్రథుండు	1007	అనిన నతఁడు లోకమున	1310	అనిన నింద్రుండు దీనికిం	803
అనిన దానికి సూర్యుం	1261	అనిన నతనికి ద్యుమ	1206	అనిన నింద్రుఁ డిట్లనియె	1279
అనిన దాని ప్రగల్భ వచన	677	అనిన నతనికి గంధర్వు	912	అనిన నిది వోలునని	881
అనిన దేవదూతంజూచి	982	అనిన నతనికి ధర్మవ్యాధుం	777	అనిన నిదివోలునని	959
అనిన దేవసేన దేవేంద్రున	802	అనిన నతనికి నత్తపోనిధి	1043	అనిన నివి యేటిమాటలు	688
అనిన ధర్మజుండు వాని	962	అనిన నతిప్రీతుం డగుచు	824	అనిన నుదరిపడి	1060
అనిన ధర్మజుఁడిట్లను	1033	అనిన నది యాదరింపక	1290	అనిన నేనును సంభ్రమంబున	650
అనిన ధర్మజుఁడిట్లను	1303	అనిన నదియుఁ గొండొక	1201	అనిన నే మతనికి	1128
అనిన నంతకుఁడిట్లను	1224	అనిన నద్దురాత్ముండు	1002	అనినఁబతివ్రతా	727
అనిన నంబరచరుండు	1306	అతని నద్దేవుం డతనికి	1317	అనినఁ బ్రహసిత	1098
అనిన నగుచు నాతఁ	832	అనిన నప్పాంచాలి	1017	అనిని భీష్మవచనంబుల	956
అనిన నగ్నిదేవుండిట్లనియె	786	అనిన నమ్మహాద్విజుండు	755	అనిన మార్కండేయుం	797
అనిన నగ్నిభవుండు	837	అనిన నమ్మహాప్రాజ్ఞుం	1286	అనిన యనంతరంబ దేవ	696
అనిన నజ్ఞానకితెగువ	1105	అనిన నమ్మహాభాగ	1223	అనిన యనంతరంబ	886
అనిన నట్ల చేయుదు	1228	అనిన నమ్మహీకాంతుండు	697	అనిన యనంతరంబ	1193
అనిన నతండట్లకాక	1212	అనిన నమ్మహీదేవుం	728	అనిన యనంతరంబ	1287
అనిన నతండట్లైన	1209	అనిన నమ్మహీపతి	1204	అనిన యనంతరంబ	1311
అనిన నతండమ్మానిని	1076	అనిన నమ్మహీపతికి	1283	అనిన రాధేయుండు	1279
అనిన నతండయ్యతివం	1061	అనిన నమ్మాటదన	935	అనిన వానికి నప్పరమేశ్వరి	629
అనిన నతండర్జునున	917	అనిన నమ్మునికుమారుండు	687	అనిన వానికి నమ్మానపతి	998
అనిన నతండాజల	635	అనిన నమ్మునీశ్వరుం	870	అనిన వారలొండొరువుల	710
అనిన నతండిట్లనియె	1042	అనిన నమ్మేదినీశ్వరుం	640	అనిన విని ధర్మజుండు	1044
అనిన నతండిట్లనియె	1303	అనిన నయ్యంగన	1014	అనిన విని ధర్మనందనుండ	660
అనిన నతండు గయ్యంబు	1032	అనిన నయ్యంగన క్రోధ	1003	అనిన విని ధర్మనందనుండు	617
అనిన నతండు సీధైన	1313	అనిన నర్జునుఁ డతని	918	అనిన విని బ్రాహ్మణుండు	753
అనిన నతండెవ్విధంబున	1277	అనిన నవ్విప్రుండు సత్త్వ	762	అనిన విని యక్షుం	1303
అనిన నతఁడు గొండొక	889	అనిన నశ్వపతి యతని	1206	అనిన విని యుధిష్ఠిరుండు	674

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనిన విని లజ్జాకలిత	863
అనిన విని వైదేహి	1080
అనిన విని సూతతనయుఁడు	1243
అనిన విప్వచ్ఛుం డప్వియచ్ఛరుల	912
అనిన వైశంపాయనుం	1252
అనిన సంతసిల్లి కుంతీ	607
అనిన సంతసిల్లి కుంతీ	1256
అనిన సంతసిల్లి యగ్ని	809
అనిన సంతోసిల్లి కురుపతి	958
అనిన సావిత్రి యతని	1211
అని నుతింపంగ మఱియును	966
అని పనిచినం గృత్యయు	944
అని పనిచినం గోటికాస్యుండు	993
అని పలికి జానకి	1114
అని పలికి తదీయ	1230
అని పలికి తన పుత్త్రు	619
అని పలికి దశరథాగ్ర	1139
అని పలికి దుర్వాసుం డరిగె	982
అని పలికి ద్రౌపది	1010
అని పలికి ధర్మవ్యాధుండు	745
అని పలికి పితామహుం	1053
అని పలికి మఱియు	1226
అని పలికి యమ్మహాసేనుండు	834
అని పలికి యీశ్వరుం	1041
అని పలికి రప్పుడు	772
అని పలికి వెండియు	873
అని పలికి సమీపగతుం	934
అని పలికి సావిత్రి	1206
అని పలికె నప్పుడు	852
అని పలుకంగ గౌతమ	624
అని పలుకుచు నొయ్యనొయ్యన	1081
అని పలుకుచున్న ధాత్రేయిక	1016
అని పలుకుచున్న యంగదు	1147
అని పలుకుటయు	1192
అని పలుకునప్పు డాతని	1069
అని పూర్వవైరస్మరణ	908
అని పెక్కు దెఱంగుల	1299
అని బహుప్రకారంబులం	1234
అని బుద్ధిసెప్పి వీడ్కొలిపిన	922
అని మఱియుం బెక్కు	701
అని మఱియుఁ గౌశికునకు	767
అని మఱియు ననేక	1263
అని మార్కండేయుంగతని	797
అని మార్కండేయుండుసెప్పిన	853
అనిమిషదానవేంద్రులకు	802
అనిమిషయక్షరాక్షస	1111
అనిమిషసిద్ధ సంయమి	700
అని మేలంపుఁ జందంబున	856
అని యడిగినఁ దార్క్ష్యుం	620
అని యడిగిన నమ్మహాముని	969
అని యడిగిన నమ్మహాముని	926
అని యడిగిన మది నించుక	855
అని యడుగుచున్న యెడ	610
అని యడుగుటయు	1058
అని యడుగుటయు	1307
అని యతఁడు సనిన	1129
అని యతని నొడంబఱిచి	1140
అని యప్పగించి యప్పార్థి	1257
అని యభినందించి	1238
అని యాక్రోశించుచు	1012
అని యాక్షణంబ	733
అని యాదేశించి యంతర్హితుం	1228
అని యాశ్వాసించు సమయం	609
అని యిట్లందఱునన్ని	1288
అని యిట్లు సువ్యక్తంబైన	798
అని యివ్విధంబున	692
అని యిష్టధనము లిచ్చినఁ	628
అని యుధిష్ఠిరుం	1308
అనియును నతనియందు	1278
అని యూహించి తత్ప్రకారంబు	1123
అని యెంత సెప్పిన	814
అనియె నప్పుడు భీమ	962
అనియె నప్పుడు సత్య	1211
అనియె నిట్లయ్యేవురు	1013
అని యెల్లం దునుమాడి	915
అని యేడ్వఁగఁ దద్వచనము	1082
అని యేడ్చుచుం గుంతి	1271
అని యేను వేఁడికొనుటయు	651
అని యొడంబడకున్న	888
అని యొడంబఱిచి	1266
అనిలతనూజ ధూమ్రాక్ష	457

పద్యము	పుట
అనిలసుతుండు నీలుఁడు	1167
అని వానికిం బ్రదక్షిణంబు	783
అని విచారించునెడ	1137
అని వితర్కించి యప్పటికి	1160
అని వినుతించి కృతార్థుండయ్యె	632
అని వివరించిన విని	1312
అని వెండియు	605
అని శంకించి నిజశిష్యు	685
అని శకుని సెప్పుచుండ	942
అనిశముఁ బాండుపుత్త్రులకు	925
అనుచుఁ జేరువనున్న	830
అనుచు నయ్యువరాజు	936
అనుజన్ములుఁ బాంచాలియు	971
అనుటయు నక్కాంత	1224
అనుటయు నత్రి యిట్లనియె	624
అనుటయు నద్దేవుఁ	1265
అనుటయు నయ్యంధనృపతి	1207
అనుటయు నవ్వాక్యము	1289
అనుటయు నాతఁ డిట్లనియె	687
అనుటయు భార్య యిట్లనియె	622
అనుటయు భీమసేనుండు	1286
అనుటయు లుబ్ధకుం	735
అనుడుఁ దదాజ్ఞఁ బూని	1119
అనుడు నతఁ డేను సూర్యుఁడ	1244
అనుడు నే నిట్లంటినయ్య	693
అనునెడ నింద్రుఁ డిట్లనియె	821
అనుపమతేజుఁ డున్నత	873
అనుపమ మెట్టివారలకు	776
అనుమాన మొక్కింతయును	907
అనృతమున కెంత వెఱతును	1250
అన్నంబు వెట్టె నతఁడు	979
అన్న కుమార నీయట్టి	771
అన్నతోడ నలిగి	1141
అన్న దుశ్శాసన నిన్ను	934
అన్న యిచ్చుట నే నొంటి	996
అన్నలుఁ దమ్ములున్ సతియు	872
అన్యాయార్జితమైన	976
అపగతజనశబ్దమై	1294
అప్పు డంబరంబున దివ్య	1187
అప్పు డింద్రుండు మున్ను	826
అప్పుడు నీవు సూడఁగ	927
అప్పుడు రణభూమి యంతయు	1030
అప్పుడు వయోవినయ	1181
అప్పురుషుండును నధిక	1216
అబల నీమంత్రబలమున	1261
అబల వెఱవకుండు	1077
అభినవ పద్మదళాక్షు	1058
అభినవ భానుబింబ	1183
అభివందనంబు సేసి	1244
అభ్యంతర గృహంబునకు	770
అమరఁగ దాక్షిణ్యము	1308
అమరఁ బుణ్యదినంబు	1205
అమరవరేణ్యుపన్వయిన	919
అమరవైరి విభుఁడు	1153
అమరానీకవిసృజ్యమాన	845
అమరు లిచ్చోట నుండలే	693
అమల తపోనివాసులు	983
అమల నివాతసౌధముల	871
అమితవైభవలోభ	1320
అమృతమయంబుసువ్వే	1243
అమ్మగువ కాపున్న	1104
అమ్మ నీ కెంతయు హర్షంబుగా	1106
అమ్మనుజోత్తముండ	1306
అమ్మనోజ్ఞరత్న మక్కునఁ	1133
అమ్మలార మీవలసినయట్ల	1105
అమ్మహాత్ముండు బహువిధ	696
అమ్మహాత్ముండు మంద	1314
అమ్మహాదేవుముందట	840
అయనయసంగ్రహుండు	1021
అయినను నన్నడిగితివి	1018
అయ్యగ్ని సంభవు	819
అయ్యధర్వాగ్ని తేజంబును	796
అయ్యలార జటాయువని	1127
అయ్యవసరంబున	1078
అయ్యవసరంబున నాముక్త	1168
అయ్యవసరంబున	952
అయ్యా నీవు బకరూప	1300
అయ్యుధిష్ఠిరునకుఁ బ్రియం	1275
అరదము దేహ మింద్రియము	761
అరయఁగ జీవితంబు గడు	768
అరసి యొక్కెడ	1130

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అరుగుదెంచితి రామలక్ష్మణు	1131	అస్మత్ప్రసాద విశేషంబునం	1040	ఆయతబాహు లుగ్రబలు	955
అరుణాశ్వయుక్తంబు లయిన	995	**ఆ**		ఆ యెలనాఁగభర్త గడు	726
అరుదుగ నమ్మహాత్ముని	649	ఆకులపడి నలుదెసలం	1167	ఆ యెలుఁ గేర్పడ నవనీ	1076
అరులు మిగులఁ గొని	664	ఆకులముగ శైబ్యుల	1030	ఆ రక్కసుండునుం దనచేసిన	1178
అర్జునానిలప్రేరితం	875	ఆ క్రోధునకు రసుండు	788	ఆ రక్కసు డాచేయి దునియ	1090
అర్జునుండు దుర్జయుండని	1250	అ క్షణంబకౌతుకాతిశయ	890	ఆ రాక్షసకుమారులు దండ్రి	1049
అఱువదికోటులు గపివరు	1134	ఆడితిఁ బెక్కు మాటలవి	691	ఆ రాక్షస వృషభుని	1141
అలఘునిశాతశస్త్రమున	1281	ఆతతతేజుఁ డున్నత	1048	ఆ రాజపుత్త్రుల నారూఢ	1094
అలయక మంత్రతంత్ర	856	అతనిఁగాంచి తద్బలము	1154	ఆ రామవ్రజ చైత్యసద్మ	672
అలసవిలాసలాలస	1275	అతని నుగ్రతేజు నిటలాక్ష	850	ఆ రావణుండు నిజ	1153
అలిగి యుధిష్ఠిరుఁడును	1024	ఆతని యస్త్రవీర్యము	1274	ఆ రావణు దేహంబున	1183
అలుకమెయిం దొలంగి	704	ఆతని శరపాతంబుల	1151	ఆర్చి వెనుకఁ దగిలి యశని	1178
అల్ల కాంచనరథముపై	994	ఆతెఱఁ గాత్మఁ గాంచి	709	ఆలములోన వీఁక నమరా	1006
అల్లన నగుచు నిట్లనియె	1138	ఆత్మజుఁడు సువ్వె పురుషున	1308	ఆ లవణాబ్ధి మధ్యమున	1130
అవధరింపుము దేవ	1124	ఆత్మధర్మనిరతులైన	1225	ఆలస్యం బొకయింత లేదు	620
అవని విదీర్ణమైనను	935	ఆదిత్యనిభుఁడు విపుల	810	ఆలిని రాజ్యముఁ గోల్పడి	1098
అవభృథశోభితుఁడై	964	ఆదిత్యార్చిత పాదపద్మ	1038	ఆలోనన విరథుండనై	928
అవమానితులై ధరణీ	728	ఆదిదేవుఁడగు మహాదేవు	836	ఆ వనచరుండును రామునకు	1102
అవశగతిఁ గామరోషాది	1021	ఆదిదేవుఁడవైన నీవు	1317	ఆ వనజాక్షి పరిస్ఫుట	1198
అవియెల్లం దునుమాడి	915	ఆ దివ్యాస్త్ర జ్వలనము	716	ఆ వనిత వచనములు	1097
అవిరోధంబుగ	1194	ఆ పతివ్రత యట్లయా	1240	ఆ విభుకాంత గాదె జనకాత్మజ	1043
అవ్యక్తతత్త్వ మరయఁగ	759	ఆపత్సముద్ర మగ్నంబై	1238	ఆ వైవస్వతుం డొక్కనాఁడు	634
అవ్వియచ్చరుల	902	ఆ పదియేవురు సుభీముండు	790	ఆ వైశ్రవణుండు దన	1046
అసదృశకార్ముకధరుఁడై	1074	ఆపుఁడను వహ్ని యతులిత	793	ఆ శంయునకు ధర్మపత్ని	787
అసదృశతేజుఁడు	671	ఆ మారుతంబు గ్రోలి	646	ఆ సమయంబునం జైత్ర	813
అసుఖాకారత నిద్ర	762	ఆ మెలఁత సేయు సవినయ	1208	ఆ సమయంబున నక్కడ	1103
అసురవీఁక నొకమహా	800	ఆయతకుంత కార్ముక	899	ఆ సమయంబున నఖిల	1182

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఆ సమయంబున నమ్మునీంద్రు	806
ఆ సమయమున మున్న	944
ఆ సరోవర తీరంబున	1092
ఆ సాళ్వభూవిభు యాస్త	1239
ఆ హరివీర వాహినుల	1136
ఆహవనీయ ముఖంబున	805
ఇ	
ఇంక నెవ్వారికి నిట్టి	1038
ఇంక వీరి నెఱింగితేనియు	1018
ఇంతకు మున్న వాఁడు సనియెం	1015
ఇంతకు మున్నెన్నఁడు నే	1231
ఇంతయు నెఱింగింప నీవ	611
ఇంతయు వినవలతు ననిన	784
ఇందుఁ జేసిన పుణ్యంబ	974
ఇందుఁ జేసిన పుణ్యంబులెల్ల	986
ఇంద్రకల్పులైనయేవురు	1015
ఇంద్రియంబు లన నెయ్యవి	756
ఇంద్రియంబు లనఁగ నెయ్యవి	743
ఇంద్రియంబులు దివిచిన	761
ఇంద్రియార్థంబుల కెలసిన	756
ఇచ్చి మఱియు నిట్లనియె	1316
ఇచ్చెద శక్తి నీకు విను	1279
ఇట రాఘవుండును సుగ్రీవ	1144
ఇట్టికల్పాంతంబు లనేకంబులు	606
ఇట్టి దివ్యసుఖము లే నొల్లఁ	988
ఇట్టిది సమయంబుగాఁ	1280
ఇట్టి మహోత్పాతంబులు	813
ఇట్టి వర్తనముల నెపుడుఁ	862
ఇట్టు లేయుటయును నెప్పటి	1292
ఇట్లతండు గంధమాదనంబు	1054
ఇట్లతిదూరంబుగా	1075
ఇట్లరిగి భరతాది	1195
ఇట్లరిగి యందుఁ గృత	971
ఇట్లాడ నర్హమే యే నేడ	1080
ఇట్లాదంపతులు ప్రమోద	1273
ఇట్లాదంపతులు మంద	1213
ఇట్లు కుంభకర్ణుండు	1166
ఇట్లు కాంతేయులచేతం	914
ఇట్లు ఖరదూషణాదులం	1068
ఇట్లు గవిసి చిత్రసేనుండు	901
ఇట్లు గవిసిం బ్రాకార	1150
ఇట్లు జటాయువుం గూల్చి	1084
ఇట్లు జనియించిన యర్భకుం	1267
ఇట్లు త్రిగర్త శిబిసింధు	1023
ఇట్లు దన సాధనంబులు	800
ఇట్లు దలంచి భిక్షగొనుచుం	727
ఇట్లు దలపడి యవ్వీరు	1178
ఇట్లు దలపడి రామరావణు	1185
ఇట్లు దశరథుండు సురలోక	1063
ఇట్లు దుర్యోధనుండు గర్ణ	954
ఇట్లు దృఢాశ్వ కపిలాశ్వ	715
ఇట్లు దేవతలు గుమారు	818
ఇట్లు నిలిచి కౌంతేయాగ్రజు	1301
ఇట్లు నిహన్యమానంబు	847
ఇట్లు నేలంబడి తడయక	1011
ఇట్లు నొచ్చి గంధర్వనాయకుండు	916
ఇట్లు పనిచిన	899
ఇట్లు పఱచుటయును	682
ఇట్లు పుట్టిన యప్పావకుండు	789
ఇట్లు ప్రసన్నులై యింద్రాది	717
ఇట్లు ప్రహస్తుండు వడినం	1156
ఇట్లు ప్రీతుండై యతండు	1047
ఇట్లు బలచండబలవజ్ర	1164
ఇట్లు బెట్టుగా నడఁచిన	1035
ఇట్లు మహిషాసురసంరక్షితం	843
ఇట్లు రాఘవుండు సీతా	1133
ఇట్లు రాజవేషంబు వికల్పితంబు	1036
ఇట్లు లోకంబెల్ల నేకార్ణవంబైన	638
ఇట్లు వచ్చి మహాదేవుండు	825
ఇట్లు వచ్చి వాసుదేవుండు	603
ఇట్లు వచ్చి సఖీజనంబు	1200
ఇట్లు వడచి యెడనెడం	1137
ఇట్లు వనిచిన	899
ఇట్లు వికలేంద్రియుండై	806
ఇట్లు విరథుండయి కర్ణుండు	903
ఇట్లు విహరించి యహిత	1024
ఇట్లు విహితమంగళాచారుం	828
ఇట్లు వెడలి కట్టెదురనున్న	1097
ఇట్లు వెడలి యభేద్యంబగు	1152
ఇట్లు శరణ్యవరేణ్యుండైన	650
ఇట్లు శుక్లపక్షంబునం	811

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఇట్లు సంత్యక్తశరీరుండై	795
ఇట్లు సని కువలాశ్వుండు	713
ఇట్లు సనిచని మఱియు	1220
ఇట్లు సనుదెంచు కురువీరుల	898
ఇట్లు సల్లి యందు మండూకంబు	679
ఇట్లు సూతపుత్త్రుని వికృత	1282
ఇట్లు సేతుమార్గంబున	1142
ఇతఁ డెత్తఱి నెయ్యది	1254
ఇత్తెఱంగున ధూమ్రాక్షుండు	1159
ఇది కృతయుగ ప్రవర్తనంబు	672
ఇది చిత్రసేనుండను గంధర్వ	895
ఇది తగునే దశాసన	1181
ఇది నీకుఁ బరమసౌభాగ్య	867
ఇది పరమయోగదర్శన	765
ఇది మనుష్యకృతంబు గాదు	1293
ఇది మనుష్యుల కర్మగతి	616
ఇది యట్టిద నీచెప్పిన	763
ఇది యస్మదీయ ప్రభావంబు	621
ఇది వొసగదు పాండవులం	1039
ఇది సకలంబుఁ గాంచి బుధుఁ	754
ఇది సకలసుకవిజనవినుత	719
ఇది సకలసుకవిజనవినుత	923
ఇది సకలసుకవిజనవినుత	1115
ఇది సకలసుకవిజనవినుత	1320
ఇనకులతిలకుఁడు బాణాసన	1145
ఇనవంశోత్తముఁ డిప్పుడ	1077
ఇనుఁ డఱచేత మాటువడు	1270

పద్యము	పుట
ఇనుఁ డున్న దెసనుండి	1012
ఇన్నలినాక్షి యెవ్వతియొ	992
ఇప్పుడు కామ్యకవనంబు	970
ఇభ్భంగిం బెనంకువ	1159
ఇమ్ము నరేశ్వర మాతురగ	687
ఇవ్విధంబున	1099
ఇవ్విధంబునం బెక్కు	675
ఇవ్విధంబున గంధర్వులు	899
ఇవ్విధంబున ధర్మంబు	669
ఇవ్విధంబున నాఱుపర్వంబులు	979
ఇవ్విధంబున నాఱుమాఱులు	810
ఇవ్విధంబున మహిషాసురుం	851
ఈ	
ఈ కన్నియ నాకూఁతురు	1205
ఈ కమలాక్షి నాకు	993
ఈ జన్నమొనర్చియ	965
ఈతఁ డగునె మీబాలకుచేత	620
ఈతని పౌరుషం బరయ	1020
ఈ దురాత్ముఁడు మిమ్ము	917
ఈ దేవదేవు కరుణం	660
ఈ నగంబు శృంగంబున	638
ఈ పిన్నది నాకూఁతురు	1256
ఈ యేకార్ణవ మీవటక్షితి	651
ఈ యొడలు విడిచి వేఱొక	753
ఈ రాజసుతునకు నిద్దినం	1237
ఈ లోకమ యగుఁ గొందఱ	614
ఈ లోకమునకు మీఁదై	983

పద్యము	పుట
ఈ వచ్చురథంబులవా రేవురు	1017
ఈ వనమునందు రాక్షస	1090
ఉ, ఊ	
ఉక్కున శూద్రులత్యుగ్రులై	668
ఉన్నంతఁ దదాశ్రమవాసు	1236
ఉపకారం బొనరించితి	635
ఉపవాసవ్రతసంతతాధ్యయన	615
ఉపవాసశ్రమమించుకేనియును	1212
ఉరమాడి యా శరంబుచ్చి	1165
ఉరమునయందుఁ గన్నులుఁ	1088
ఉరఘుర్మొఘవిఘాత	1103
ఉరుతర విక్రమాఢ్యు	882
ఉఱవగు నారికె పంటలు	665
ఉఱుముచు నంత్యకాల	1174
ఉల్ల పద్మాకరము పొంత	995
ఉల్లము సత్యసంయమము	605
ఊఱక మీఱనాడెదవు	624
ఎ	
ఎంతయు వృద్ధులై తమకు	773
ఎక్కడి రాఘవుఁ డక్కట	1080
ఎచట నున్ననైన నెల్లప్పుడును	1269
ఎట్టి కష్టుఁడైన నిట్టి	1037
ఎడపక వాఙ్మనఃక్రియల	1220
ఎదిరిం దన్ను నెఱుంగఁడు	897
ఎన్నఁడు నిట్టిసాహసము	920
ఎప్పుడు ధర్మహానియగు	656
ఎయ్యది ధర్మువునకుఁ	1307

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఎయ్యెడకుఁ జనినఁ	988
ఎఱకలు గల కుల శైలము	1082
ఎఱిఁగి యెఱింగి నేఁడె	1068
ఎఱిఁగితి నిన్ను నేను	1278
ఎఱుఁగక తప్పుగా	1257
ఎఱుఁగక తప్పుసేసితి	778
ఎఱుఁగవుగాక రాఘవు	1071
ఎలుంగు రాలుపడ వారలం	695
ఎల్లభంగుల నిశ్చయం	1251
ఎవ్వఁ డమ్మహాసురు వధియించు	706
ఎవ్వఁడు సత్యంబ యెప్పుడుఁ	731
ఎవ్వరిదాన వంబుజదళేక్షణ	676
ఎవ్వలన నుఱుకునో	1174
ఏ	
ఏకాన్వయజాతులైన	906
ఏకోత్సవంబులయ్యెఁ	1188
ఏడుమాట లాడినయంత	1226
ఏ దినమునందు షణ్ముఖ	828
ఏ నడిగిన యర్థములకు	1299
ఏనింద్రియములు మనసును	761
ఏ నిమ్మెయి నుత్తమ	770
ఏను దానవనాయకుండ	1079
ఏను దుర్బలుండ నైతి	794
ఏను దేవేంద్రపదవి నుండ	821
ఏను ధర్ముఁడఁజువ్వె	1314
ఏను నీమనోరథంబు	1198
ఏనును నీవలన నిజము	855
ఏనును బాండునందనులు	609
ఏను మండూక నాయకుఁడ	681
ఏను వలదన్న జూదము	876
ఏను విశ్వావసుండను	1091
ఏను సకలలోకేశ్వరుండ	1112
ఏ నెఱుఁగమి నిట్లడిగితి	863
ఏ పుణ్యసతికి నీవింకఁ	1268
ఏమికతమున భూదేవుఁ	1304
ఏమిట శ్రోత్రియుఁ డనఁజను	1303
ఏము తపంబు సేసి	945
ఏల మదిరాక్షి వలవని	1110
ఒ	
ఒండొరుఁ బట్టుచుం దిగుచు	1100
ఒండొరుల చెయిసఱచి	884
ఒండొరువులమొగంబులు	896
ఒకయల్పమనుజక్రియ	936
ఒకరుఁడ ధాత్రియంతయును	888
ఒక్కదనుజాధముండు	798
ఒక్కదినంబునందు	853
ఒక్కనాఁ డమ్మహారథులు	990
ఒడలు వశంబు గాదు	1215
ఒడ లెల్లఁ బిండికూడుగఁ	1035
ఒడిసి తలవట్టి నేలం	1035
ఒనరఁగ నాకస మాదిగ	757
ఒప్పెడునదియైనను గడు	750
ఒరులు వచ్చిన చొప్పులే	1296
ఒవ్వనివారల యెదురున	931
ఓ	
ఓకర్ణ సుజనవినుత	1242
ఓయన్న యీ తటాకము	1289
ఓ యయ్యలార యేను	1087
ఓరి దురాత్మ యీ యబల	799
ఓరి దురాత్మ యీయబల	1082
ఓరి దుష్టాత్మ యే నిట్లు	1098
క	
కడఁగి ధర్మముతోడ	610
కడఁగి బుద్ధిబలంబునంద	939
కడుఁగ్రొవ్వి తేఁకువసెడియె	689
కడుఁదడవు నిద్రవోయితిఁ	1229
కడు దుఃఖము నొందితినని	1043
కడు నుగ్రంబగు వ్రతమిది	1210
కడునెయ్యురు హితముగఁ	1247
కడుమరగిన సౌఖ్యంబులు	986
కడు మృదువులనుచుఁ	860
కడురేపకడయ మేల్కని	1210
కడు లజ్జయు దైన్యంబును	931
కదిసి ప్రహస్తుఁ డార్చి	1155
కదిసి యర్జునుతేరు	913
కనకమృగమట్లు దను	1085
కనకమృగరూపమునఁ	1073
కని గంధర్వులు గ్రమ్మఱి	911
కని డెందంబునఁ దల్లడం	1295
కని తదీయసమృద్ధికి	893
కని దానిం బ్రవేశించి	1125

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
కని ధూమ్రాక్షుండు	1157	కలఁడు మద్రేశుండు ఘనుఁ	1197	కావున శోకదైన్యముల	951
కని భక్తి మ్రొక్కుటయు	618	కలదు దేవగుహ్యంబని	1252	కావున సత్యవంతుని	1223
కని యంతంత నాక్రందన	1066	కలనీలకంఠకోలాహల	598	కీర్తియ యిచ్చుఁ బుణ్యగతిఁ	1246
కని యంతఁ గదిసి	676	కలయ నరలు వచ్చి	625	కీర్తి విడువఁజాలఁ గీర్తితో	1246
కని యిది రత్నాకరమివ్వననిధి	1126	కలవారెల్లను మడిసిరి	1160	కుండలములుఁ గవచము	1276
కనియెం గోమలినీలమేఘ	1215	కలిమియు లేమియున్	1206	కుడిచినపిమ్మటం గుసుమ	726
కనియెం గోమలి నీలమేఘ	1065	కామంబును గ్రోధంబును	768	కురుకులశేఖరుం డతఁడు	1019
కని విస్మితుండనై	647	కార్యఫలములయెడఁ	750	కులమును సిరియును	955
కని సుగ్రీవుఁడు బిట్టదల్చు	1165	కార్యమొక్కటియును లేదు	1261	కులవతులును సతులును	867
కనుకనిఁ గూడి దుర్జనులు	829	కాలచక్రము నిర్వికల్పము	657	కులశీలోన్నతియు	1285
కన్నీరు జడిగొని క్రమ్మఁ	1130	కాలవిపర్యయంబున	973	కులశైలంబులు గ్రక్కునం	812
కన్నుల నిద్రదేఱఁగ	1164	కాలుండఁజూవె యేఁ గమలాక్షి	1216	కులిశపాతభంగురమైన	1086
కన్నులు వచ్చి యెల్లెడలుఁ	1235	కావరయ్య యనినఁ గరము	908	కూడినకొండ్రముచ్చులను	1169
కమనీయంబగు జన్నిదంబు	1078	కావున	610	కృతత్రేతాద్వాపరకలి	643
కమనీయ కనకపుంఖ	1186	కావున	694	కృతమతియై యేడేఁడులు	630
కమనీయ కమలినీ కల్లోల	1213	కావునఁ గార్యజ్ఞుండవగుము	941	కృతము దలంచి చిత్తమునఁ	941
కమనీయ కమలినీ కహ్లార	1091	కావునఁ బతియనుగమనం	1224	కృతయుగమునందు ధర్మువు	661
కమనీయ జలదవర్ణుని	647	కావునఁ బతులకు నెప్పుడుఁ	857	కృతహస్తుండు ప్రహస్తుఁ	1155
కమలభవ ప్రదత్తవర	851	కావున నిట్టిదురవస్థ	932	కృష్ణద్వైపాయనుండును	973
కమలహీనమైన కమలాకరము	1013	కావున నిత్యము సమ్యగ్భావము	865	కొండొకసేపునకు మహోద్దండ	900
కరము దుఃఖపడినఁగాని	865	కావున నిప్పుడు మదీయ	1262	కొందఱుసూతు లశ్వములఁ	903
కరినికరంబుతోఁ దొడరి	1027	కావున నీవు దృఢరజ్జు	636	కొడుక విన్నుఁ గాంచు	1267
కరిరాజగమన మాతెఱఁ	994	కావున నీవు ప్రాణములు	1248	కొడుకుఁ గనియె సహజ	1266
కరివర కిరి కూర్మక్ష్మా	718	కావున భూతంబుల	782	కొడుకు నిందును నందు	1235
కరుణామూర్తివి నీవు	1249	కావున మదీయంబులగు	1302	కొడుకులం దెల్లఁ గడుగూర్చు	1022
కర్ణుని యాడినమాటలు	939	కావున మిత్రమనోరథం	1227	కొని వేగంబున దక్షిణాభి	1217
కర్మవశతఁ జావె కలుగు	752	కావున శిష్టాచారనియతిం	743	కొనుమిదె నీ మనఃప్రియునిఁ	1228

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
కొలకుల వాగులన్ నదులఁ	680
కొలను వెలువడి చనుదెంచెఁ	695
కోటఁబన్నిన ఘోరదానవ	1148
కోటిసహస్రసేన తనుఁ	1134
కోపావేశఘూర్ణమాన	690
కోరి జనపతి దనకూర్మి	1198
కోరుదు నేను విప్రతతిఁ	1256
కౌఁగిట ననుఁ జిక్కఁ గదియించి	1232
కౌరవనాథ నీకు	941
కౌరవేంద్ర బకమఁ గాను	1301
కౌశికుండును ధర్మవ్యాధు	734
క్రమమున బాహ్యేంద్రియ	943
క్రమమున రాష్ట్రములును	670
క్రమమున శిష్టాచార	743
క్రమ్మఱిపోక తప్పెడినె	1261
క్రూరుఁడు ధార్తరాష్ట్రుఁడతి	1297
క్రోధమోహనామకులైన	730
క్షత్త్రియజాతులు శూద్ర	663
క్షత్త్రియప్రభావం బేమనవచ్చు	626
క్షమయు నహింసయు	962
క్షితి సంశప్తకు లనఁగా	948
ఖ	
ఖరములఁ బూనినరథమున	1107
ఖరుండును శూర్పణఖయు	1050
ఖరుఁడు ఖరతేజుఁ	1048
గ	
గంగాదినదులతోఁ గనక	648
గంధర్వులు దెరలుటవిని	901

పద్యము	పుట
గగనమున సురవిమానము	713
గణుతింపరాని వానర	1135
గరుసులు గడవంగఁ	637
గాండివ పవన ప్రేరిత	1031
గాండీవము విల్లటె	877
గాండీవరేఖ యాఖండలు	1008
గిరిశృంగతుంగవిగ్రహుఁ	1127
గీర్వాణప్రవిముక్త బాణపటల	846
గురుఁ గొనియాడఁడు శిష్యుఁడు	669
గురువాక్యరక్షణైకాదర	1066
గురుశుశ్రూషంజేసి నీకుఁ	779
గురుశైలోన్నతగాత్రు	1057
గుహుఁడ దేవసేనఁగోరి	828
గొనముల ప్రోక నీ యనుఁగుఁ	1204
గోపాల సమన్వితుఁడై	893
ఘ	
ఘన కోదండోగ్రమౌర్వీక్వణ	914
ఘన జవ సత్త్వ చారు	1019
ఘనపక్షాహతులం బ్రకాండ	1083
ఘనబాహాబల దుర్నివార	904
ఘన శస్త్రాస్త్రమహోజ్జ్వలంబు	843
ఘనుఁడింద్రద్యుమ్నుండను	693
ఘనుఁ డిల యెల్లను బ్రాహ్మణ	671
ఘనుఁడు పరిక్షితుండనఁ	675
ఘనుఁడు రుజస్కరుఁ డనఁగా	788
ఘనుఁడు వృకోదరుండు	1028
ఘోరగదావిదారణ	1009
ఘోర విక్రముఁడైన కేశియుఁ	799

పద్యము	పుట
చ	
చంపెదేని మమ్ము	710
చక్కఁగమ్మింక ముందటి	1098
చచ్చిన పిమ్మటం గడిఁది	950
చతురంగధ్వజినీపద	712
చతురంభోధి పరీత	607
చనుఁడు రయంబున	898
చనుదెంచిరి కౌరవ	963
చను మింకొండు దలంపు	949
చనుము శుభంబుల నొందుము	842
చరమయుగచరిత	718
చలజిహ్వోగ్రవిలీఢ	1004
చవులకుఁ బ్రేముడించు	980
చామరపుండరీక	953
చారుసితోష్ణవారణలసత్త్విత	1107
చిగురుఁబోఁడి నిఖిలసింధు	1000
చిత్తంబునఁ బైకొనియెడు	1213
చిరకీర్తి సాళ్వభూవరు	1201
చిరముగ ధర్మముల్	754
చూచితె వీనిసాహసము	849
చూచితే లక్ష్మణ సుగ్రీవు	1118
చెనకి మీరు వారికిఁ గీడు	888
చెప్పిన నయ్యక్షుం డతనితోఁ	1307
చెప్పిన విని భయకంపిత	1120
చేతనరహితక్షేత్రము	766
జ	
జగములనెల్లను నిండిన	1245
జగములనెల్లను మ్రింగెడు	641

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
జగములయందు ధర్మువు	1264
జతనంబు మిగుల	723
జననాథ ద్రుపదసుతఁ	1032
జననాథ నీకార్యమునకు	1140
జననాథోత్తమ యేను	1129
జనని జనకుఁడు సద్గురుఁ	773
జననియు జనకుఁడు	724
జననుత! నీవెయ్యది	777
జననుత వీరు నాజననియు	772
జనపతి మేల్కొని యంతయు	970
జనపతులెవ్వరు నివ్విధమున	965
జనవర నీకుఁ బాండవులు	959
జనవర నీవుఁ దమ్ములును	601
జనవర మీరు దివ్యులరు	616
జనులకు నెల్లను బూజ్యుఁడు	626
జన్మమిట్టిది చరితంబు	779
జపనియమస్వాధ్యాయ	662
జానపదుల్ పురీజనులు	879
జీవహింస యెన్నండును	736
జీవితేశ్వరు వామబాహువు	1234
జైత్రులు గోత్రభూమిధర	1171
డ	
డాయఁబోయి తీవ్రసాయక	778
డాయ నరుగుదెంచుటయు	1087
డాయుటయు నయ్యశరీర	1291
త	
తగియెడు వేళలందు	858
తగు గోరక్షయొనర్ప	886
తగునే రాజకులప్రసూతులకు	1011
తడవులేదింక నిఖిల	636
తదనంతరంబ	843
తదనంతరంబ	637
తదనంతరంబ	1084
తదనంతరంబ	1153
తదనంతరంబ	1280
తదనంతరంబ గంభీర	648
తదనంతరంబ గాయక	893
తదనంతరంబ యయ్యిరువురుం	1094
తదనంతరంబ యవింధ్యుండు	1188
తదనంతరంబ యారాజర్షి	1214
తదనంతరంబ యుధిష్ఠిరుండు	1293
తదనంతరంబ రావణ	1143
తదవసరంబున సుగ్రీవ	1176
తదీయ బాణపాతంబుల	930
తద్వృత్తాంతంబంతయుఁ	1273
తనకంటె నపుడు రావణ	1172
తనకీర్తి యెంతకాలము	697
తనకుఁ దనయులకు	1247
తన కులధర్మము విడువక	738
తన జీవితేశ్వరియైన	1272
తన తక్కువయునికియు	987
తనమగని నత్తమామల	1240
తనయంకతలమ ప్రియ	1215
తనయుంగౌఁగిటఁ జేర్చుచున్	839
తనయుఁడు బృహస్పతికి	787
తనయుద్యోగము జననీ	960
తనయుని మరణంబేర్పడ	1180
తన సితకీర్తి విశ్వవసు	1108
తనులతాంగి భవదుదార	1219
తనువృత్తాంగుఁడు శుద్ధ	1018
తపమనఁగ సకలవిషయ	760
తపుండు మఱియు సకల	791
తపుఁడను వహ్ని నిరంతర	790
తమమును బెల్లుగాఁబరఁగె	1230
తమ్ములు నలువురు నొక్కట	1294
తరళదీధితిపుంజ	817
తరుశాఖఁ దగిల్చిన	1283
తరుసంఘంబులు పూన్చి	1099
తలఁపఁ బాండవ ధార్త	1001
తల్లడపడి యరదము	1034
తల్లి నీగుణరూపవృత్తముల	1200
తల్లిన్వేఁగు సువ్వె ధరణి	1306
తాను దేవదానవ	1109
తాల సాల శిలాగ్రహస్తు	1147
తాలైలాగరు సాలరసాల	1142
తివిరి మురారి నీకుఁ గడుఁ	866
తృషితుఁడగువాని శీతల	1222
తెఱపి గని దానవేశ్వరుఁ	1084
తెలివి నొందిన బుద్ధిగల	767
తేనెలు గ్రోలి క్రోలి కడుఁ	1123
తేలును గర్కటియును దెగు	1006
తొడరి చరాచరప్రతతితో	641

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
తొలఁగక యమ్మహాబలుఁడు	1028
తొలఁగకుఁడు పొదువుఁ	1023
తొలితొలి బలసూదనుచేఁ	1251
తొల్లి ముద్గలుండను	976
త్రైలోక్యంబును జలమయం	711
ద	
దనుజ నిర్మథనైకతత్పరతా	712
దమమును సత్యయుక్తియును	604
దశరథ నందనుండయిన	1161
దానంబు సత్యంబుఁ	741
దానము సత్యంబు తపో	656
దానమూర్జితఫలదం	975
దానవనాయకు చెఱఁబడి	1104
దానవుచేతఁ గష్టపడి	1056
దానాంభః పటలంబునం	598
దానిఁ గొని పఱచె	1284
దానిఁ జూచి దండధరుఁడు	1218
దానికి విస్మయం బంది	1209
దాని నుఱక యింద్ర	916
దారుణ కల్పాంతాగ్ని	850
దారుణదవానల	1162
దారుణ విక్రముండు	1150
దారుణ శౌర్యధుర్యుఁ	815
దినకరతిగ్మ తేజము	644
దినకరు నెయ్యది	1302
దివి భువి నంతరిక్షమున	1270
దివి ముట్టి ధరణి	1311
దీపితవిక్రమాస్పదుఁడు	804
దురితంబులెన్నండు	1064
దుర్యోధను చెఱఁదలిగి	969
దుష్టనిగ్రహైక	1048
దుష్టశీలుఁడైన దుర్ద్యూత	1287
దెసలు మండె ధరణి	842
దేవతలార యో ధరణి	1081
దేవతాయతనంబులున్	669
దేవతాసనములు భూదేవతావరు	729
దేవదేవ శ్రుతిప్రమాణ	700
దేవ నరదేవ ధరణీదేవ	610
దేవసమానుఁడీ ధరణి	1253
దేవా యేను సమస్తదేవ	1051
దేవిఁ బొడగంటి నేను	1124
దేవీసహితంబుగఁ బృథ్వీవరుఁ	678
దేహమున ధాతుసంశ్రయ	764
దేహోత్సాహ మెలర్ప నుద్ధత	1101
ద్యూతవ్యాజమునన్ సభాంగణ	605
ద్రుపదనందన క్రియఁగడు	1043
ద్వైతవనంబునట్టి	885
ద్వైతవనంబున ధర్మజుం	969
ధ	
ధనధాన్యపుత్త్రబాంధవ	880
ధనములు సాలఁ గల్గి	614
ధరణిసుతయు విధియు	1073
ధరణీనాథ సురేంద్రు	1184
ధరణీరక్షణ మాచరింపక	666
ధరణీరాజ్యము గోలుపోయి	1000
ధరణీశ తొల్లి నాకుం	1061
ధరణీసురులకు నెప్పుడుఁ	673
ధర్మంబు బహుప్రకారంబై	749
ధర్మంబు బహుమార్గ	732
ధర్మజుఁడు దూర్పు భీముఁడు	997
ధర్మజుఁడు మాకుఁ బ్రభుఁడె	912
ధర్మజుఁడు రాజసూయంబుఁ	957
ధర్మజుకూర్మితమ్ముఁడును	1020
ధర్మనందనుండు ధర్మాత్ముఁడని	1313
ధర్మపత్నీ సమేతులై	1041
ధర్మము సల్పుచుం దగిలి	616
ధర్మాత్ములు దమసలిపెడు	1223
ధారాపాత నితాంత వేగమున	645
ధార్మికులు సలుపునుత్తమ	740
ధీరవిచారుఁడు తత్కవితా	1319
ధీరుఁడు నిర్జితేంద్రియుఁడు	759
ధృతరాష్ట్రసఖుఁడైన యతి	1271
ధృతరాష్ట్రసూనుండు భవ	909
ధృతివేదంబులు నాలుగుం	629
న	
నకులుఁడు నిశాత సాయక	1025
నగినగి యేనియున్ విను	710
నడవవు దేవ పితృక్రియ	667
ననుఁ గనుఁగొని యెలనవ్వునఁ	650
ననుఁ బెఱవనితల చందం	1010
నను నిచ్చుటకుం గర్తలు	1263

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
నను నిట్లు దుష్టవనితా	855	నాయున్న చో టెఱుంగక	1233	నీక వగచి వగచి	774
నను నెల్లజనులకంటెను	627	నారములందురు జలముల	652	నీకింకరులము మమ్ముం	818
నన్నాశ్రయించిన జనం	1315	నారలుగట్టి కూర లశనంబుగ	880	నీకుఁ బ్రియంబుగా భవ	823
నయమును ధర్మముగల	1001	నారాచపాతముల	1025	నీకు వృద్ధసేవ లేకున్కి	940
నరనాథ కిన్నరనాథుని	1177	నారాయణాభిధానుండనైన	658	నీ కొడుకు సత్యవంతున	1206
నరనాథోత్తము నందనుల్	714	నాలవుదినంబు పతిమృతి	1209	నీ గౌరవంబంతయు నెఱింగి	1255
నరునకు నాత్మ యెవ్వఁడు	1308	నాలుగు దిక్కులుఁ గనుఁగొని	1291	నీ తలంపెఱుఁగుదు	1077
నలువురు పార్థుల	916	నావార్త వినక	1233	నీతిమంతులు ధర్మనిరతులు	751
నాకమ్మెఁ బొడసూపెఁ దాను	659	నా విని సుబలతనూజుఁడు	884	నీతోడ వియ్యమందఁగఁ	1207
నాకల నిక్కల యయ్యెడు	1109	నావుడు నట్టులయయ్యెడు	1220	నీదగు పూర్వదేహము	946
నాకుం దపంబున కనుజ్ఞ	707	నావుడు నతఁడా	1305	నీ పరాక్రమ లీల	1169
నాకు డప్పి యెక్కుడిది	1225	నిఖిల శత్రుచయము	1170	నీ పుత్త్రులేవురు	608
నాగాయుతసత్త్వుఁడు	872	నిఖిలాస్త్ర శస్త్ర విద్యా	1040	నీ ప్రియభర్తల నిర్మల	854
నా చేసిన కీడునఁ గడు	871	నిజగుణదోషకర్మ	781	నీమగఁడంత యెక్కుడె	728
నాటంగోలెఁ గృత్తిక లార్వురు	831	నిత్యముఁ గర్మియుఁ గర్మ	768	నీ మదిచంద మిట్టిదని	808
నా తలఁపును నిట్టిది	881	నిద్రించుతఱినొండె నెఱయ	835	నీయట్టి దానశీలుని	979
నా తెఱంగు సెప్పెద	730	నినుఁ గవయం దలంచి	809	నీయట్టి వీరవరుఁడు	957
నా తెఱఁగంతయు నిప్పుడు	658	నినుఁ గీడు వొరయకుండఁగ	1179	నీయధ్యయనమ్మును	774
నాదగుబుద్ధి నీదుచరణ	1192	నిను దూఱఁ దగదు	732	నీయభిలాష యేను మది	1280
నాదైన భాగ్యవశమున	775	నిను నొకయక్షమాత్రుఁడని	1301	నీ రక్షణంబు కతమున	704
నాదైన యాశ్రితత్వము	651	నిను నొకశూద్రుఁగాఁ దలఁప	776	నీలపయోదమండలము	991
నానాజనపదబహుళము	1277	నియతాహారుఁడు నిర్జితేంద్రియుఁ	1050	నీ వడిగిన యఖిలధర్మం	769
నానాసహస్రసంఖ్యానంబులై	892	నియతి గలిగి యింద్రియముల	836	నీ వతిక్రోధనుండ వగుట	730
నానాసిద్ధగణంబు గొల్వఁ	825	నిరతము రాక్షసభవమును	1053	నీవ విధాత వింద్రుఁడవు	623
నా పెద్దకొడుకు ధర్మజుఁ	871	నిలిచెం దాళసము	1288	నీ వింత నెఱుంగనొల్ల	729
నాయనుమతి లేకుండగ	1301	నిహత కంటకమైన	1301	నీవు గడుధర్మవిదుఁడవు	735
నాయిష్టవనిత మ్రింగిన	681	నీకంటె వృద్ధతముని	698	నీవు ధరిత్రిఁ బుట్టుటయు	947

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
నీవు ధర్మజ్ఞువు దేవ	867	పనివడి యహింస వ్రతముగఁ	748	పాషండదర్శనబహుళంబు	664
నీవు నాకు నత్యంతభక్తుండ	1248	పరఁగ నమ్మధుకైటభాసురుల	711	పితృదైవతకార్యంబుల	665
నీవును దమ్ములున్ సతులు	954	పరధనహరణము	687	పితృదైవతకార్యములం	747
నీవును వాలియు నేఁడును	1122	పరమంబగు వైవస్వతు	640	పిఱికితనము నేమఱుటయు	940
నీవు ప్రజాభిరక్షణము	704	పరమాపద యైనపుడును	1052	పుట్టినయాఱునాళులకుఁ	820
నీవు ప్రథమాగ్నివై యుండు	786	పరమేశుఁడు దనయూరులు	711	పుట్టుఁగల్గరియై పాపములకు	905
నీవు శిబివంశోద్భవుండైన	996	పరమేష్ఠికల్పుఁడవు	640	పుడమియు సర్వసంపదలుఁ	1297
నీవు సనకమున్న నెఱితోడ	1119	పరమోదాత్తులఁ బార్థి	1176	పుడమిఱేనిమదికి నెడ	1060
నీ వెఱుఁగని యది యెయ్యది	1221	పరిఘంబులు గదలును	1158	పుణ్యలోకంబులకుఁ బాసి	829
నెచ్చెలులు దన్నుఁ గొలువఁగఁ	1199	పరువడి మొత్తములై	1148	పుత్త్రదారసహితంబుగాఁ	977
నెఱయం బున్నమచందురుం	1268	పఱచున్ దవ్వుగఁ జేయలంతి	1074	పుత్త్ర విను మేను దక్షుని	837
ప		పలుకుటయు నలిగి	688	పుత్త్రులు దుఃఖార్తిఁ బొగులుట	1298
పటుతరపక్షి పక్షము	1083	పలుమాఱుం దలవాకిట	859	పురుడున నయ్యువతులు	1047
పట్టుపడిన సుగ్రీవునిఁ	1165	పలుమాఱు వచ్చి తన	801	పురుషవరేణ్య యిట్లు మిముఁ	1093
పడఁతి యల్లన మఱి	1191	పసిబిడ్డవయ్యును బడఁతి	1255	పురుషుఁడు కర్మాధీనత	752
పడఁతి రమణీయ	1208	పాండవపక్షపాతియై	1242	పురుషున కెయ్యది ధర్మువు	628
పతిఁ గడవంగ దైవతము	864	పాండవులచేత విముక్తుండ	937	పురుహూతాగ్రసరప్రభూత	845
పతికి ననుంగులైన	866	పాండవులయెడ నేనెట్టి	857	పులిచేత వ్రేటువడి మైఁ	1108
పతిమనసు నాఁచికొనియెడు	864	పాండవు లిప్పుడు పరమ	879	పుల్లవడి చలమురోషముఁ	691
పతియచూవె నాపాలికిఁ	730	పాండుపుత్త్రుల బహిః	1014	పెక్కుభంగుల వగచి	725
పతివిరహంబు దుస్సహము	1215	పాపకృతంబగు దుర్గతి	775	పెల్లునఁ గూలు తజ్జలము	645
పతులాత్మ నొండొక్కపడఁతులఁ	857	పాపములకెల్ల నెక్కుడు	740	పొదలి యొకని కొక్కనికిని	902
పతులిచ్చమెయిఁ బ్రవాస	859	పాపవర్తనుండు బ్రాహ్మణుం	780	ప్రకటితశౌర్యసారుల	1003
పతు లెందుఁ జనిన నచటికి	1218	పాపవినిశ్చయుండు సతి	1010	ప్రతివింధ్యాదులైన	868
పదంపడి కొన్నిదివసంబులకుఁ	1121	పాయక పదియాఱేఁడుల	833	ప్రభ నొప్పారి యనుంగుఁ	1136
పదంపడి డెందంబున ధృతి	1284	పాలితవిక్రమోన్నతులు	889	ప్రాకటతపోబలంబున	1239
పదియాఱు వర్షముల్	667	పాలితశౌర్యులు పాండ	878	ప్రాణాపానసమాహితుండై	766

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ప్రాతికామి వోయి పాంచాలి	1286
ప్రియము న ప్రియంబు	1311
ప్రియములు వాయుటయును	781
ప్రీతుండై చనుదెంచె	972
ప్రీతుఁడనైతి నీవలనఁ	981
ఫ	
ఫలభారము దుర్భరమని	1234
ఫలమూలౌషధిశాకంబులు	745
బ	
బంధుమతినైన నను	1264
బద్ధశిలాయంత్రబహుళమై	1143
బలముం దేజము నించి	820
బలిమిం జొచ్చిన నెట్టి	1292
బలియుం డా ధృతరాష్ట్ర	896
బాడబదహనుఁడనై వడి	654
బాలం దొడ్కొని యబ్జజు	804
బుద్ధిమంతులరై యూరక	897
బూదిలోఁదొరఁగిన పూర్ణాహుతి	1015
బోరన విస్ఫులింగములు	1005
బ్రహ్మలోకంబునం దక్కఁ	987
బ్రాహ్మణుండవయ్యుఁ బాప	778
భ	
భగ్నశాఖమైన పాదపం	1180
భరతుండును రాముచేతఁ	1066
భవ్యచరిత్రుఁ డాపస్తంబ	1318
భాగ్యంబుగాదె యీ పార్థుండు	603
భాగ్యముకాదె కౌరవ	967
భావించి నాఁడు నాఁటికి	1246
భీష్మద్రోణ కృపాదులు	947
భూతములయందు వెలిగెఁడు	766
భూతలనాథ యే నొకటి	884
భూతహితంబుగాఁ బలుకు	749
భూదేవపరాభవమునఁ	1254
భూమితనూజఁ గానమని	1126
భూరిభుజుండు విశ్రవసు	1055
భూవినుతప్రభావులు	1099
భూసురకదంబసుర	1115
భూసురకోటి వేఁడుటయుఁ	1244
భేరీమృదంగ గంభీర	1160
భోరునఁ విస్ఫులింగములు	715
మ	
మండువేసవిఁ బంచాగ్ని	1049
మంత్రబల మెఱుంగ మదిఁ	1263
మగిడి నగరంబు సొచ్చిన	1154
మగువఁ దగిలిన చూడ్కుల	991
మగువ యొనర్చు వశ్యవిధి	856
మచ్చరముమీఱ నొండొరుఁ	1172
మడుఁగు సొచ్చి మునిఁగి	679
మతిఁ గుంతీసుతపక్ష	1245
మతి నత్యంత జుగుప్సితం	978
మతి వైవస్వతుచేఁ దలంపఁ	637
మదగజముల రథ యోధులఁ	1024
మదగజాభిరామ మృదుల	675
మదిఁ గారుణ్యము సేసి	1260
మది నర్జునుఁ జూచి భయం	951
మదిమఱవునఁ బాపము	740
మది సత్యవంతుజీవిత	1227
మనకుఁ జులకనయ్యె	905
మన దుర్మంత్రిత మంతయు	930
మనబలమును నతి	1137
మనమున నింద్రియముల	981
మనమున నేవగింప	980
మనుజపతిఁ గాంచి యాతఁడు	686
మనుజవరేణ్య చూడ నతి	927
మనుజుండ నైన నాతెఱఁ	1146
మనుజులు పుణ్యపాపములు	613
మనువులు ధాతలున్ మునులు	985
మనుష్యజాతి యొక్కండు	1052
మనుసహితులైన మునులం	639
మమ్ము జగత్త్రయంబునకు	832
మరలిచూచి వాఁడొక్కగుల్మ	1035
మఱియుఁ దల్లిదండ్రు లిరువుర	723
మఱియుఁ బ్రాకారంబుపై	1149
మఱియు ధర్మరాజు నగరి	861
మఱియు ననవరతసురభి	894
మఱియు ననేకయుగ	601
మఱియు ననేకు లనేక	1135
మఱియు నన్యోన్యదంత	1101
మఱియు నమ్మహిపతి	891
మఱియును నర్జునప్రయుక్తం	915
మఱియు నిజభర్తృశుశ్రూష	724

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
మఱియు నొక్కటి సెప్పెద	836
మఱియు నొక్క నిదర్శనంబు	614
మఱియు నొక్కవరంబు	1238
మఱియు నొక్క విన్నపంబు	1225
మఱియు భానుండను వహ్నికి	792
మఱియు ముప్పదిమూఁడు	984
మహనీయసామ్రాజ్యమహిమ	1089
మహిషుఁడు బల మేర్పడ	848
మాకును జిత్తంబుల మృగ	889
మానము సెడియును నిమ్మై	934
మానితవిక్రమోజ్జ్వలుఁడు	827
మానె శిరోవేదన నామేనికిఁ	1231
మాయత్తఁ బృథ్వీసమానఁ	860
మాయాధికు నంత	1174
మాయాసంగరకోవిదుండు	901
మీ రమ్మహాత్ములకు	997
మీరు నిర్భయులై చరియించు	639
మీరు మదీయంబగు	1209
ముదము దలిర్పబంధు	1264
మునినాథ మహాసేనుం	797
మునిపతికి మ్రొక్కి కుంతీ	692
మునిపతి దోదవ్వులఁ గని	972
మునిపతి పర్వము పర్వం	979
మునిపత్నులరూపులు	810
మునీంద్రా యిక్ష్వాకువంశోద్భవుం	698
మును తన చేసిన కర్మంబునఁ	745
మును మర్కటబలములచే	1149

పద్యము	పుట
మునులార యేను విశ్వం	639
మున్నును మీచేతఁ గడున్	887
మూర్ధదేశమునకు వర్ధితంబై	764
మృగనేత్ర దారుణమృగ	993
మృతుఁడయి క్రమ్మఱ	620
మృతుఁడైన నరుఁడు వెస	1248
మేనఁ బ్రాణముదాల్చి భంగము	925
మేలగుక్రేపుతోఁ బాలు	629
మేలున సంతసిల్లునెడ	876
మేలైయున్నది జలము	679
మొనసి నిద్రించియును	1306
మొరసె దివ్యతూర్యములు	713
మ్రుచ్చిలి నిల్చి దుర్వచనముల్	1292
య	
యముఁ డంద్రు నిన్ను	1222
యౌవరాజ్యపదంబునకు	1059
యౌవరాజ్యపదంబునయందు	1062
ర	
రక్కసుఁడఁగాను జుమ్మీ	1131
రక్కసుఁడును దనమదిలో	1163
రయవిచలత్తురంగమ	952
రసగంధ ద్రవ్యంబులు	663
రాక్షస లక్ష్మి మహిమకు	1054
రాజకులతిలక భువన	922
రాజపుత్త్రుండు బలియుండు	685
రాజయోగ్యములైన యూహయ	684
రాజసూయంబు నట్టిద	959

పద్యము	పుట
రాజులఁ బిల్వఁ బంపుము	958
రాత్రి తెగుదల దిన	876
రాముఁ డనంగఁ బేర్మి	1111
రాముతోడఁ దొల్లి	1072
రాముఁడు సనుట విని	1063
రావణునకు రంభా	1106
రావణు నేనెఱుంగుదుఁ	1128
ల	
లంకాద్వారము దుర్నివారగ	1145
లంకాలుంటాకుఁ డుద్యల్లఘు	1159
లాలితయౌవనోజ్జ్వల	1269
లీలం గల్లోలమాలో	1125
లీల యెలర్పఁగా	992
లోకంబులు దెగటారఁగ	647
లోకత్రయంబునందును	852
లోహితరత్నభూషణుఁడు	849
వ	
వగతుమన్న నెవ్వారికి	781
వగపునఁ దేజోహీనుం	782
వగవఁగనేల దైత్యకుల	1168
వడి నడ్డం బరికట్టె	1163
వడి నొక్కపెట్ట లక్ష్మణుఁ	1179
వదనంబుల తెలివియుఁ	1297
వదనభుజోరుపాదముల	655
వనచరసేనలు దెరలిన	1149
వనజాక్షి రాజధర్మము	1002
వనజాక్షుండు గడంగి	865

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
వనమున కేఁగి వందురిన	887	వారణకోటి దదారోహకుల	1026	వినుఁ డెన్నఁడు మాయాశ్రమ	619
వనమున నప్పాండుతనయు	1241	వారలందఱు వందురి వగచి	618	వినుఁ డేను వహ్నివలనం	814
వనముల ని ట్లనిశంబును	869	వారల పేర్మిఁగాదె శశివారిజ	1226	విను చాక్షుషమన్వంతరమున	633
వనితా దుర్బల దీనబంధు	666	వారల యార్తిఁ జూచి జన	929	విను జననాయక సంయమి	796
వరగర్వోన్నతుఁడై దశా	1053	వారలుం దాను ధర్మజు	919	విను జనమేజయ పౌరవ	950
వలదు నిలువు మింక	1223	వారలు నీ తోఁబుట్టువులే	942	విను జీవుండు సనాతనుఁ	752
వలవని మాటలం	1007	వారికెల్లను దగిన	963	విను డెబ్బదియేడులదాఁకను	836
వలవదు సంభ్రమంబు	844	వారిచేత ననుజ్ఞాతుండయి	960	వినుతచరిత్రుఁ డత్రి యను	622
వసువర్మధరుఁడు గావున	1273	వారిజ నేత్ర పాండుసుత	1007	వినుత భవన్నియోగమను	606
వాఁడి తూపు లొడల వడి	1179	వారినందఱుఁ గౌసల్యా	1183	విను దక్షతనూజలు	802
వాఁడియైన కత్తివాతి	1036	వారును సంభ్రమమున	895	విను దుర్వినియాత్మకుఁ డగు	933
వాఁడు నతనిరాకపోఁడిగ	734	వాలమ్ముదాఁకి యొఱలుచు	1075	విను నాకీర్తి జగంబులఁ	786
వాఁడును బలదర్పమోహితుండై	1054	వాలిఁ జంపి యతని వనిత	1102	విను నీవు దడయుటకు	1230
వాఁడును రథంబు సత్వరంబుగా	683	వాలి గృహద్వారంబున	1096	విను నీవును నాపదలకు	974
వానిం దోడ్కొని చని	1121	వాసవ నందన సఖుఁడగు	601	విను పతివ్రతాతిలకమై	810
వానిఁ జూచి నగుచు వార	1034	విక్రమత్రయలీల నోలిన	700	విను పూర్వకర్మఫలములు	750
వానిఁ బరిభవింపవలయు	1071	విగతరాజ్యులమై ఘోర	1206	విను ప్రద్యుమ్నాదిభవ	867
వానికి దానవేంద్రు విభవంబు	1142	విగతసంభ్రముఁడై రామ	1089	విను ప్రాణాపానులు నయ్యు	765
వానికి నమ్మహేశ్వరుఁడు	1039	విజయుఁ డొకండు దక్క	1040	విను మదియుఁగాక జగమున	1002
వానికి నలిగి సుగ్రీవాది	1175	విడువవలయు విషయ	738	విను మనుజున కెవ్విధమునఁ	613
వానికి సరయువునకుఁ	788	వితతానేకమృగాకులం	989	విను మహింస ధర్మవితతి	743
వాని చేష్టలన్నియు దైత్య	801	వినయమున దేవిఁ జేరం	1131	విను మహింస మేటియనఁ	1309
వాని దెసం గృప సేయ	906	వినయము విస్తరిల్ల	737	విను మింకఁ బెక్కుమాటలఁ	656
వాని నిక్కంపు మునియ	1079	వినవె రాముఁ డనఁగ నొకఁడు	1070	విను మిక్ష్వాకుకులంబున	1045
వానియందుఁ గీ డొక్కటి	1203	విని మగుడంగ వాఁడు	1305	విను మివి యెయ్యవియును	1275
వామాక్షి నీకుఁ గుశలమె	998	విని యాతండును మౌర్వీ	1171	విను ముత్తమురాలు సుమీ	1193
వారక యిట్లు పూని వనవాస	1195	వినుఁడీ సర్వజనంబులుం	690	వినుము మనోవాక్కాయము	1203

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
వినుము విప్రవరులు	1254	వైరులఁ జంపి చంపి వెస	1251	శ్రీ లలితమూర్తి సుమహ	924
వినుము సుఖమునకు	1286	వైరులు దలఁకఁగ నిమ్మె	1028	శ్రుతమువలన శ్రోత్రియుఁ	1303
విను మేను నీ మనోగతి	1316	వైశ్వానరుండను వహ్ని	779	శ్రుతిధర్మంబులు శూద్రులు	668
విను మే నొక్క బకంబ	1299	వ్రతము ధరించి నిష్ఠ	1138	శ్రోత్రంబును దృక్కును	758
విను మొక్క యద్భుతంబు	704	**శ**		**స**	
విను విషయజ్ఞానమునకు	755	శంకర సన్నిభుండు జన	699	సంధ్యప్రొద్దు నన్ను జనని	1231
విను శిష్టచరిత గైకొని	742	శకుని కైతవము దుశ్శాసను	874	సకలచరాచరోత్పత్తి	642
విపరీత స్థితి నొంది	905	శకునియుఁ దమ్ములుం బ్రబల	900	సకలభూతములందు	673
విప్రులు గడు నర్థి వేఁడినఁ	1246	శత్రుపాలికి నిదెకొని	905	సకలమార్గంబులయందును	1218
విమలక్షాత్రగుణోన్నత	1114	శతకోటిద్వయహరిపరి	1134	సజ్జనులు దిక్కుసూవె	1310
విమలమతి నస్త్రసన్న్యాసము	707	శతఘంటా పరిభూషితంబును	1156	సతతంబును శుచియై	630
విలయపయోధిమగ్న మగు	654	శతసహస్రకోటిసంఖ్యల	1135	సతతోపవాసనియమ	737
వివిధవ్యాఘ్రమృగోరగా	662	శరణం బని వచ్చిన	909	సత్త్వగుణ నిబద్ధుం డగు	763
విశదశారదాంబుద	599	శరమరిఁ బోయుటయును	691	సత్యంబు నరులకు సంక్షిప్త	661
వీతలజ్జుఁడై పఱచె	1032	శలుఁ డొక్కనాఁడు కనకోజ్జ్వల	682	సత్యంబు వలుకుట సత్య	1202
వీరపత్ని నయ్యు వీర	1007	శాతనఖాగ్రఖండిత	1004	సత్యమును శమంబు శౌచంబు	616
వీరావతార విమలాచార	1319	శాశ్వతు నఖిలభూతేశ్వరు	642	సత్యవంతుం డెట్టివాఁడైననుం	1203
వీరుఁడు గౌరవుండు నిజ	961	శితభల్లద్వితయంబు	1179	సత్యవ్రతులార వరం	709
వీరుఁడు చిత్రయోధి దృఢ	1022	శిష్టచరితంబులు గాని	741	సత్యహితాలాపచతురత	739
వీరుఁడు సైంధవుండు	990	శూర్పణఖయు నతనికి	1069	సప్తమంబైన మారుత	842
వీ రేవురు నత్యంత	1022	శూర్పణఖానిమిత్తమున	1067	సప్తహయుఁడు మూర్తిసప్తకంబు	643
వీరోత్తమ నీకెమ్మెయి	917	శోకంబు సైపలేక యశోక	1181	సమధికదర్ప దుర్జయములై	721
వెఱఁగుపడి హర్షరాగము	1190	శోకమగ్నుండ వగు నిన్నుఁ	937	సమబుద్ధితోడఁ దత్త	1221
వేఁటవోయినారు విభు లిప్డు	999	శైబ్య సుగ్రీవాది జవనాశ్వ	601	సమయముతోడఁ గురియు	672
వేగ జాము గలుగ వెడ నిద్రఁ	862	శ్యామాంగు నారక్తజలరుహ	1312	సమరసన్నాహం బమర	1096
వేదవిహితంబులును శాస్త్ర	744	శ్రీకర సోమాన్వయరత్నాకర	1117	సముచితప్రకారంబున	827
వేదవేదాంగపారంగతుడనై	777	శ్రీ యువతిప్రియనృప	721	సర్వజన సమ్మతుం డగు	1311

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
సర్వలోకాశ్రయా సౌమ్య	922
సలిలము లుర్వి యాకసములో	747
సవ్యకరమునందును	1026
సహజకుండల కవచా	1260
సహజములు నాకు	1277
సారోదారవిభూతిమై	965
సాళ్వపతియును నిపుడు	1201
సావిత్రియుఁ దన మగని	1208
సింధురాజ సైన్యసింధు	1025
సితపీతారుణనీల	644
సితరక్తనీలపీత	657
సిరికిఁ దొలంగి కానల	877
సుగ్రీవాది సమస్త వానరులుఁ	1182
సుగ్రీవుండును మున్ను	1095
సుతుఁ డవమానించు జనకుఁ	667
సురశత్రుఁడైన ధుంధునిఁ	716
సౌమిత్రి నిశితవిశిఖ	1152
స్కందునిమీఁద నెత్తి బల	816
స్థిరమగు పుణ్యకర్మమున	753
స్థిరమతులైన పార్థులకు	999
స్ఫురదరుణాంశురాగరుచిఁ	597
స్వర్గంబునం గల గుణంబు	986
స్వర్గ నరకంబు లింద్రియ	760
హ	
హరిణవ్రాతములం గలంచుచు	894
హరుఁ డదె చిక్కె నింక	848
హలికుండెంతయు నోజతో	747
హవ్యవహనమునకు	795
హింస సేయనివాఁడు	748
హితులైన వారిఁ బ్రోచుచు	936
హితులై పెద్దలు బుద్ధి	954
హిమవత్పాదవనాంతకేలి	1003
హేతుప్రత్యయవాద	665
హైహయులు నమ్మునీంద్రునకు	618

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 6

విరాటపర్వము

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డాక్టర్ కే. సర్వోత్తమరావు
డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు
శ్రీ సింగరాజు సచ్చిదానందం
డా॥ కె. రామగోపాలకృష్ణమూర్తి

ప్రధాన సంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Virataparvamu of Tikkana Somayaji
Vol. VI.

Commentary by
Dr. K. Sarvothama Rao - 1st Canto
Dr. R. Ananta Padmanabha Rao - 2nd Canto
Sri Singaraju Sachidanandam - 3rd Canto
Dr. Medavaram Venkatanarayana Sarma - 4th Canto
Dr. K. Ramagopala krishnamurthy - 5th Canto

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Series No.605
First Edition : August 2002
First Re-print : 2006

Second Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D. Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియు వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్-ఇన్-చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

సంస్కృతి వ్యాసభారతానికి స్వతంత్ర ఆంధ్రానువాదగ్రంథమే కవిత్రయ మహాభారతం. ఆంధ్రమహాభారతాన్ని వ్యాఖ్యానసహితంగా ప్రజలకు, అందజేయాలన్న ఉద్దేశంతో ఆరంభమైన శ్రీమదాంధ్ర మహాభారత ప్రచురణ ప్రణాళికలో, ఆరవ పుస్తకం మీ ముందు ఉంచుతున్నాం. ఇది విరాటపర్వం. ఆదిపర్వం రెండు సంపుటాలుగాను, సభాపర్వం ఒక సంపుటంగాను, అరణ్యపర్వం రెండు సంపుటాలుగాను వెలువరించటం జరిగింది.

విరాటపర్వం మహాభారతంలోని ఒక ముఖ్యఘట్టం. పన్నెండేండ్ల అరణ్యవాసానంతరం ఏడాదిపాటు అజ్ఞాతంలో గడపాలని నిర్ణయం అయినప్పటికీ పాండవులు పాంచాలితో సహా అజ్ఞాతంలో ఉండడం అంత సులభమైన పనేంకాదు. అందుకే కాబోలు యక్షప్రశ్నలో యముడు ధర్మజునికి అజ్ఞాతంలో ఉన్న పాండవులను ఎవరూ గుర్తుపట్టలేరనే వరాన్ని ప్రసాదించటం. అందువల్లనే విరాటనగరంలో కీచకవధ, గోగ్రహణం వంటి సందర్భాలలో సైతం పాండవులు అజ్ఞాతాన్ని కాపాడుకోవడం జరిగింది. మహాభారతంలోని సంగ్రామఘట్టం ఉత్తరగోగ్రహణ ఘట్టంతోనే ముగించేది కూడా కద్దు. భారతం అంతటితో ఆగక ముందుకు సాగుతుంది. అభిమన్యుని వివాహంతో, సంధియత్నంతో కురుక్షేత్రానికి దారితీస్తుంది. ఇక్కడ పాత్రలు ప్రస్ఫుటంగా తమ తమ అంతరంగాన్ని వెలిబుచ్చేందుకు అవకాశం ఎక్కువ. అందువల్ల ఈ విరాటపర్వం పాఠకులను ఆకట్టుకుంటుంది; దానితోపాటు పాండవులు విరాటపర్వంలో కష్టాల కడలినుండి గట్టెక్కుతారు. ఇక్కడి నుంచి మున్ముందు యుద్ధమే జరిగినా శుభావహమే. పాండవులు పరాక్రమిస్తారనడానికి సూచన ఇక్కడ కనిపిస్తుంది. అందుకే కాబోలు విరాటపర్వం చదివితే క్షామం తొలగి వానలు కురిసి దేశమంతా సస్యశ్యామలమవుతుందని ప్రగాఢ విశ్వాసం ప్రజల్లోవుంది. అందువల్ల కూడా ఈ పర్వానికి ప్రాముఖ్యం ఎక్కువ

ఐదు ఆశ్వాసాలు ఉన్న విరాటపర్వాన్ని విశదీకరించి, వ్యాఖ్యానించినవారు వరుసగా ప్రఖ్యాతపండితులు ఆచార్య కె. సర్వోత్తమరావు, డా॥ ఆర్. అనంత పద్మనాభరావు, శ్రీ సింగరాజు సచ్చిదానందం. డా॥ మేడవరం వేంకటనారాయణ శర్మ, డా॥ కె. రామగోపాలకృష్ణమూర్తి. వీరికి పాఠకలోకం తరఫున అభినందనలు. ఈ పర్వానికి సంపాదకత్వం వహించినవారు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు. వీరికి శుభాభినందనలు.

అనతి కాలంలోనే ప్రతులన్నీ చెల్లిపోయిన కారణంగా భారతాన్ని (2008) పునర్ముద్రిస్తున్నాము. ఎప్పటిలాగే పాఠకులు సమాదరిస్తారని ఆశిస్తున్నాం.

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీవేంకటేశ్వరస్వామి వారి దివ్యానుగ్రహంతో తిరమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రధమ స్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 -' 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జులై11 తేదీన హైదరాబాదు బాలాజి భవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అర సున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్లవేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్పురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్లవేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ" కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిక్రమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగాపర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీమధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జులై3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్దారెడ్డి గారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగస్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥కె. సర్వోత్తమరావు	**శ్రీడి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్**

సలహాసంఘం

ఆచార్య తూమాటిదొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీకాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిని అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జులై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీడి. నాగసిద్దారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీస్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలో ని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్లకొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పండ్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి, విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి''.

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాస్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదక మండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

సంపాదకమండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు	శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య	డా॥అప్పజోడువేంకటసుబ్బయ్య
డా॥ కె.జె. కృష్ణమూర్తి	డా॥ కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే.	డా॥ బిరుదురాజు రామరాజు
అన్నమాచార్య ప్రాజెక్ట్‌డైరెక్టర్, తి.తి.దే.	డా॥ ఎం. కులశేఖరరావు
ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి, తి.తి.దే.	డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
	డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలుల లోని సభ్యులయొక్క సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటా లన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్' లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్త పాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ఇప్పుడు ప్రథమ సంపుటం - ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం - సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి. సుబ్బారావుగారి తరువాతి కార్యనిర్వహణాధికారి అయిన డా॥పి. కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారు వచ్చిన తక్షణమే ఆంధ్రమహాభారత ప్రచురణను గూర్చి ఆసక్తితో గమనిస్తూ అన్ని విధాల సహకరించి ఆది సభా పర్వాల విడుదలకు ఏర్పాటు చేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాల నిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ ప్రణాళిక వ్యాఖ్యా సహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. తరువాతి సంపుటాలు సైతం త్వరలోనే వెలుగుచూడనున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈసరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారతం' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారుకులైన సహృదయులు డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారికి అనేక ధన్యవాదాలు. తిరుమల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. సాహిత్య ప్రీతి కలవారైన తి.తి.దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ ఆర్. అప్పారావు, ఐ.ఏ.ఎస్., గారికి వందనములు.

సంబంధిత విభాగాధిపతిగా నూతనముగా వచ్చి సలహామండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన డా॥ పి. రంగారావు, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయ సహకారాలందించిన తదితర అధికార గణానికి నమస్సులు. ఈ ప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధాన పాత్ర వహించిన - వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదక మండలి, సలహా మండలి) యందలి విద్యావేత్తలు ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు - ఈ విద్వాంసులందరికి నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి.దేవస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడం వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్ కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానికపండితవర్యుల ఒక ఉప సంఘం (ఎడిటోరియల్‌సెల్) నిర్మాణానికి సిఫారసు చేస్తే దేవస్థానం ఆమేరకు ఎడిటోరియల్ కమిటీలో ఉన్న **డా॥ కె. సర్వోత్తమరావు, డా॥ కె.జె. కృష్ణమూర్తిగారలతో స్థానికులైన విద్వాంసులు, పండితవరేణ్యులు శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీముదివర్తి కొండమాచార్యులు** గారలతో ఎడిటోరియల్ సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు అరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈసెల్ ఉపకారం మరువరానిది. వీరు వర్క్‌షాపువలె శ్రీ వేంకటేశ్వర లైబ్రరీ మరియు సంశోధన కేంద్రంలో నిర్వహించబడ్డ కవిత్రయ మహాభారత యజ్ఞంలో పాలుపంచుకొన్నారు. అందువలననే అతి త్వరితకాలంలో ఆరణ్యపర్వ శేషభాగం ముద్రణ ఔతూ ఉండగా విరాటపర్వం కూడ ప్రెస్సుకు పంపగల్గుతున్నాము. తక్కిన పర్వసంపుటాలను ఇలాగే అందించగలమని ఆశిస్తున్నాము.

"సప్తగిరి" సంపాదకులుగా ఉండి, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి ప్రముఖ పాత్ర వహించిన కీ.శే. కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె. రాధారమణ, డాక్టర్ ఎ. సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి.ఎన్. శ్రీనివాసన్ గారికి, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్ది పాఠకులకు అతి తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయ అధికారి శ్రీ ఐ. పార్వతీశ్వర రావు గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీవేంకటేశ్వరస్వామి వారి అనుగ్రహ విశేషం వల్ల ఈమహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ ఎస్.ఎస్. రామమూర్తి

కన్వీనర్

సంపాదకుడు - సప్తగిరి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి

అధ్యక్షులు

శ్రీ అజేయ కల్లం ఐ.ఎ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకుడు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం

సంపాదకమండలి సభ్యులు

ఆచార్య నందూరి రామకృష్ణమాచార్యులు

ప్రొ॥ఎస్.బి. రఘునాథాచార్య

ఆచార్య కె.జె. కృష్ణమూర్తి

శ్రీపొత్తూరి వేంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆచార్య ఎం. బుద్ధన్న

డా॥ పి. రంగారావు (పౌరసంబంధాధికారి)
(ఎక్స్అఫిషియో సభ్యులు)

డా॥ మేడసాని మోహన్, డైరెక్టర్
(ఎక్స్అఫిషియో సభ్యులు)

ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానంద, కార్యదర్శి
ధర్మప్రచార పరిషత్తు (ఎక్స్అఫిషియో సభ్యులు)

కన్వీనర్

డా॥ ఎస్.ఎస్.రామమూర్తి,

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

	వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1.	డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2.	డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా. 1
3.	డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా 1,2
4.	డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5.	డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. 1
6.	డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7.	శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా. 2
8.	డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా. 4
9.	డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా. 5
10.	డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11.	శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12.	శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13.	డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14.	డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15.	డాక్టర్ కె. రాజన్నశాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16.	శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17.	డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18.	డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19.	డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20.	డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21.	డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22.	డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23.	డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24.	శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25.	డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26.	డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	అను. ఆశ్వా. 1,2
27.	డాక్టర్ శలాక రఘునాథశర్మ	అను. ఆశ్వా. 3,4
28.	డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	అను. ఆశ్వా. 5
29.	శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30.	డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది.	-	ఆదిపర్వం
సభా.	-	సభాపర్వం
ఆర.	-	ఆరణ్యపర్వం
విరా.	-	విరాటపర్వం
ఉద్యో.	-	ఉద్యోగపర్వం
భీష్మ.	-	భీష్మపర్వం
ద్రోణ.	-	ద్రోణపర్వం
కర్ణ.	-	కర్ణపర్వం
శల్య.	-	శల్యపర్వం
సౌప్తి.	-	సౌప్తికపర్వం
స్త్రీ.	-	స్త్రీ పర్వం
శాంతి.	-	శాంతిపర్వం
అను.	-	అనుశాసనికపర్వం
అశ్వ.	-	అశ్వమేధపర్వం
ఆశ్ర.	-	ఆశ్రమవాసపర్వం
మౌస.	-	మౌసలపర్వం
మహా.	-	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	-	స్వర్గారోహణపర్వం
సం.	-	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	-	సంస్కృత మహాభారతము
అను.	-	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	-	ప్రధాన సంపాదకుడు

క.	-	కందపద్యం
వ.	-	వచనం
ఆ.	-	ఆటవెలది
తే.	-	తేటగీతి
సీ.	-	సీసం
ఉ.	-	ఉత్పలమాల
చ.	-	చంపకమాల
మ.	-	మత్తేభవిక్రీడితం
శా.	-	శార్దూలవిక్రీడితం
ఆశ్వా.	-	ఆశ్వాసం
క్రీ.శ.	-	క్రీస్తుశకం
య.	-	యగణం
మ.	-	మగణం
త.	-	తగణం
ర.	-	రగణం
జ.	-	జగణం
భ.	-	భగణం
న.	-	నగణం
స.	-	సగణం
ల.	-	లఘువు
గ.	-	గురువు
అలం.	-	అలంకారం
సం.	-	సంవత్సరం
మొ.	-	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

విరాటపర్వము

గద్యపద్య ప్రథమపాద సూచి

పద్యము	పుట
అ	
అంగజరాజమత్తుఁ డగు	354
అంత	571
అంతం గుంతీనందన	366
అంతంతం గనుంగొని	99
అంతఃకరుణచతుష్టయ	586
అంతకంతకుఁ గదిసి	607
అంతరంగంబు నిండి	693
అంతిపురంబులోనఁ గల	486
అంతిపురముచుట్టటికం	59
అందఱు రథికులు పఱవఁగ	630
అందు	389
అందును	10
అందుల నుండుడు రను	390
అం దొరగి కీచకుండా	313
అంబరవర్తి వైన	84
అంబుజముల్ సముద్య	118
అంబురుహాక్షి వచ్చు	211
అకట మనము వచ్చినది	68
అకట యాఁడుకూయు	245
అకట సైరంధ్రి నన్ను	465
అకుటిలుఁ డార్యసమ్మతుఁ	46
అకృతాస్త్రుఁడ బాలుఁడఁగా	484
అక్కజమైన చెల్వమున	162
అక్కజమైన శౌర్యమును	430
అక్కట మోసపోయి యడి	268
అక్కట యేను వేడ్కపడి	204
అక్కిరీటి యొక్కరుండ	554
అగు దేశ కాలబలయుత	553
అగు నది యట్టిద దైవము	30
అగ్గలిక నతఁడు హయముల	435
అచ్చెరు వైనవిక్రమము	540
అజగవశార్ఙ్గాలంకృత	19
అజ్ఞులు కొంద ఱప్పుడు	492
అట్టిద యేల చేయు	298
అట్టిద యైననాఁడ	566
అట్టి నీవు వంటకట్టియలకు	253
అట్టి మహాత్ముఁ డొక్కనికి	252
అట్టి యవసరంబున	229
అట్టియెడం గురుసైన్యంబు	646
అట్టియెడఁ దన్నుఁ దాన	267
అట్టియెడ	207
అట్టియెడ	285
అట్టియెడ	332
అట్టియెడ	651
అట్టియెడఁ బాంచాలీ	218
అట్టియెడ దుశ్శాసన	658
అట్టియెడ ధర్మతనయు	442
అట్టియెడ నయ్యాయుధంబులు	511
అట్టియెడ నినతనయు	638
అట్టియెడ నుత్తరుండు	667
అట్టియెడ నుద్భట	603
అట్టియెడ మున్ను	620
అట్టియెడ వరదాన	532
అట్టియెడ వేల్పు వచ్చిన	611
అట్టియెడ శమీవృక్ష	507
అట్టియెడ సుదేష్ణ	238
అట్టిసమయంబున	584
అట్టిసమయంబున	425
అట్టిసమయమున	448
అట్టేల రాక తక్కుం	307
అట్లకాక యింతయున	376
అట్లగుటంజేసి నాకు	234
అట్ల చేయుఁడు	93
అట్లుంగాక	26
అట్లుంగాక	37
అట్లుంగాక	94
అట్లుంగాక	489
అడరివడి రథచతుశ్శతి	436
అడవులఁ బెద్దయుఁ	645
అడుగుల నునుఁగాంతి	468
అతండు నజ్ఞాతవాస	463
అతండును దనమనంబున	353
అతండు మనప్రాణంబులపై	682
అతండు మఱియును	447
అతఁడు నానాప్రకార	432
అతఁడు నియతితోడ నగ్ని	64
అతఁడును దీవ్రబాణముల	651

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అతఁడును బార్థు నిల్పి 709
అతఁడు పెండ్లికిఁ బిలిచిన 320
అతఁడు వచ్చెనేని 505
అతనిం దీవ్రశరంబులం 718
అతని యనుజుండు సూర్య 418
అతిత్వరితంబచిని సుదేష్ణ 283
అతిదృఢవేధి పేరుగల 595
అతిరథు అస్త్రశస్త్రవిదు 645
అతిరభసంబు మై నడరి 442
అతివ తగునమ్మ 203
అతివ యపాయముం బొరయు 370
అత్తఱిఁ గన్యకాజన 705
అత్తఱి లేచివచ్చి తన 737
అత్తెఱంగు వివరించి 715
అదియట్లుండె నేఁడు కౌరవులు 470
అదియును
అదియునుంగాక 55
అదియునుంగాక 191
అదియునుంగాక 466
అదియునుంగాక 741
అదియునుంగాక నృత్త 744
అదియునుఁగాక కోలుపులి 38
అదియును నిట మీఁద 530
అది లాతి యిల్లె 205
అది సిద్ధం బట్ల చెల్లుం 740
అద్దివ్యయానరత్నంబు 570
అధిప! ధర్మజుపాల 156
అధిపనందన మాలిని 518
అధిపుమఱంది సింహబలు 242
అనద నైతి నిచట నాలి 355
అనలము గూఢయత్నమున 336
అనవిని తగుమాటల 538
అన విని యుత్తరుండు 740
అన వినుచుం గలంగు 692
అనవినుచుఁ గురుపితా 673
అనవినుచుఁ దేరు డిగి 527
అనవుడు 68
అనవుడు 159
అనవుడు 123
అనవుడు 137
అనవుడు 214
అనవుడు 201
అనవుడు 467
అనవుడు 487
అనవుడు 586
అనవుడుఁ గర్ణుం డిట్లనియె 407
అనవుడుఁ గీచకుండు 291
అనవుడుఁ బాండుతనూభవు 453
అనవుడుఁ బాండునృపా 128
అనవుడు జయలక్ష్మిం 302
అనవుడు ధర్మనందనుండు 52
అనవుడు నట్టుల చేసెద 64
అనవుడు నప్పలుకులు విని 27
అనవుడు నమ్మాటలు దన 192
అనవుడు నయ్యంగన 175
అనవుడు నాచార్యుం 502
అనవుడు నాతఁ డిట్టులను 724
అనవుడు నాతఁ డిట్లనియె 714
అనవుడు నాతఁ డిట్లను 529
అనవుడు నీ చేసిన 687
అనవుడు భీష్ముని పలుకులు 749
అనవుడు భూపతి పిలువం 155
అనవుడు మత్స్యభూరమణు 101
అనవుడు మత్స్యరాజసుతు 537
అనవుడు మనమున నిస్సీ 328
అనవుడు మేనుపెంచుచు 447
అని కడఁగు నినసుతునకు 601
అని కాంతాజనములలో 461
అని కొలిచి యే బృహన్నల 42
అని కృపాశ్వత్థామాది 540
అని చూపి వెండియు 643
అని చెప్పి గంటి సూపిన 723
అని చెప్పి తా నప్పు డర్జును 499
అని చెప్పిన నందఱు 76
అని చెప్పిన పితామహు హిత 684
అని చెప్పిన వినియుగుఁ 53
అని చెప్పిన విస్మయంబు 585
అని చెప్పి మఱియు 515
అని చెప్పి యధికసమ్మా 124
అని చెప్పిన యుత్తమద్విజ 704
అని చెప్పి యుత్తరుం డతని 720
అని చెప్పి వెండియు సుశర్మం 410
అని చెప్పి రట్టి సమయమున 24
అని చెప్పి హర్షసంభ్రమ 708
అని డగ్గుత్తిక వెట్టి 25
అని తగఁజెప్పి పుచ్చ 748
అని తనమనంబునం గదిరిన 380
అని తన యభిలాషంబు 179
అని తను నుల్లసమాడిన 666
అని తలంచుచుఁ గీచకుని 175
అని తలంచుచు డోలాందోళిత 202
అని తాను నిజసహోదరుల 376
అని తార మున్ను భూసుర 84
అని తారు మున్ను విన్న 372
అనినం గేకయరాజనందన 143
అనినం జలమునఁ గుంతీ 701
అనినం దమ్ముని నెమ్మన 33
అనినం బాంచాలి సంచలిత 301
అనినం బార్థుండు పార్థివ 489
అనినఁ గటకటఁ బడి 698
అనినఁ గడులెస్స యని 45
అనినఁ గొండొక నవ్వొలయంగ 642
అనినఁ బరిజనంబులు 108
అనినఁ బాంచాలి సుదేష్ణ 295
అనినఁ బేడిఁ బొగడెదని 723
అనిన దరహసితవదనుం 485
అనిన ధౌమ్యుఁ డిట్టులనియె 63
అనిన నతం డట్ల చేయుదు నని 423

పద్యము	పుట
అనిన నతం డిట్లనియె	29
అనిన నతండును రథంబు	686
అనిన నతఁడు వికసిల్లుచు	292
అనిన నతఁడు వెఱపు	736
అనిన నతని చిత్తంబున	49
అనిన నద్దివ్యవచనామృతంబు	11
అనిన నప్పలుకులకు	43
అనిన నప్పలుకులదెస	188
అనిన నప్పలుకులు వినియు	176
అనిన నమ్మాటలు విని	553
అనిన నయ్యిరువుర	568
అనిన నవ్వెలంది వీఁడు	289
అనిన నాతనిమాటకు	474
అనిన నాతని మాట లాదరించి	395
అనిన నిది కార్యంబని	71
అనిన నిది వోలునని	42
అనిన నీ తలంచినట్ల	144
అనిన నీవేమి పనిచిన	476
అనిన పలుకులకు బృహన్నలఁ	486
అనిన బృహన్నల	374
అనిన రాధేయుం డిట్లనియె	393
అనిన రౌద్రరసము	702
అనిన విని కంకుం డతని	698
అనిన విని కవ్వడి నవ్వుచు	667
అనిన విని కీచకుండు	196
అనిన విని కీచకుఁడు	341
అనిన విని కురుపతి	567
అనిన విని కౌంతేయాగ్రజుండు	445
అనిన విని గాంగేయ	563
అనిన విని దరహసితవదనుం	295
అనిన విని దరహసితవదనుం	394
అనిన విని దరహసితవదనుం	95
అనిన విని ద్రుపదనందనకుం	302
అనిన విని ధర్మనందనానుజుం	509
అనిన విని ధర్మనందనుండు	28
అనిన విని పాంచాలి	233
అనిన విని పూని గ్రక్కునఁ	69
అనిన విని భీమసేనుం	36
అనిన విని భూనాథుండు	104
అనిన విని భూమింజయుండు	519
అనిన విని భూమింజయుండు	529
అనిన విని మందహాసంబు	727
అనిన విని మత్స్యమహీకాంతుం	745
అనిన విని మత్స్యమహీవల్లభుండు	741
అనిన విని యజాతశత్రుండ	450
అనిన విని యతం డిట్లనియె	246
అనిన విని యతండు	600
అనిన విని యతండు	730
అనిన విని యద్భుత	734
అనిన విని యనిలనంద	370
అనిన విని యనుచితంబున	204
అనిన విని యమ్మహీపతికి	109
అనిన విని యమ్మాటలు	711
అనిన విని యాజ్ఞసేని యనాధర	52
అనిన విని యాజ్ఞసేని యిట్లను	140
అనిన విని యియ్యకొను	420
అనిన విని యుత్తరుండ	574
అనిన విని యుధిష్ఠిరుం డతని	723
అనిన విని యెఱిఁగికొని	500
అనిన విని యేటిమాటలు	749
అనిన విని రాధేయుం డిట్లనియె	635
అనిన విని రాధేయుండు	549
అనిన విని వాఁడు గొన్ని	244
అనిన విని వారలవర్తనం	146
అనిన విని వార లిట్లనిరి	563
అనిన విని వారలు	674
అనిన విని విరాటవల్లభకు	380
అనిన విని విరాటుం డతని	739
అనిన విని విరాటుం డదరిపడి	414
అనిన విని వైరాటి	474
అనిన విని సంప్రీత	93
అనిన విని సక్రోధ	700
అనిన విని సవ్యసాచి	31
అనిన విని సింహబల	339
అనిన విని సుయోధనుండు భీష్మ	541
అనిన విని సుయోధనుండు రాధేయున	505
అనిన విని సైరంధ్రి యతని	466
అనిన విని సైరంధ్రి సాభి	373
అనిన విని సైరంధ్రి సైరణ	185
అనిన విరటుఁ డిట్టు	95
అనిన విరాటుం డతని	121
అనిన విరాటుండు	127
అనిన వృకోదరుండు	270
అనిన సంతసిల్లి యద్దేవి	146
అనిన సుదేష్ణ యిట్లనియె	383
అనిన సుదేష్ణయుఁ	238
అని నిగూఢభాషణముల	224
అని నిజానుజతనూజు	743
అని నియోగించి	415
అని నియోగించి గోపాలురకుం	695
అని నిశ్చయించి పలికిన విని	366
అని నిశ్చయించి పలికిన విరాటుండు	746
అని నిశ్చయించి వృకోదరుండు	299
అని పతి పలికిన విని	710
అని పనిచి తానును	416
అని పలవించు నయ్యెలుఁగు	359
అని పలికి కొండొక	298
అని పలికి కౌంతేయాగ్రజు	96
అని పలికి ధర్మనందనుం	739
అని పలికినఁ బాంచాలియు	291
అని పలికిన విని	744
అని పలికిన సంరంభం	558
అని పలికి పనుప	136
అని పలికి బలంబు	581
అని పలికి యతని	131
అని పలికి యాడుచుండు	697
అని పలికి వారలకుందు	725
అని పలుకుచు మనంబున	477

అని పలుకు నుత్తరు 528
అని పునర్వనవాస 748
అని పూని యాదృశంబు 16
అని మందహాసంబు 90
అని మనమునఁ 195
అని మఱియుఁ బెక్కు 205
అని మఱియు నానావిధ 496
అని మఱియు నిట్లనియె 254
అని మఱియును 627
అని మఱియును 711
అని మఱియును దగిన 650
అనిమిష దానవాంబర 76
అని మెత్తన యియ్యకొని 156
అని మొన మార్కొని 523
అని యంతట నిలువక 702
అని యగ్గించి 643
అని యడిగిన వైశంపాయనుఁ 23
అని యని యుగ్గడించు 167
అని యప్పగించె నేనును 263
అని యమ్ముదితయు 465
అని యిట్లు దేవజాతి 142
అని యిట్లు ధర్మజ 732
అని యిట్లు పలుమఱుం 82
అని యిట్లు పురోహితుండు 63
అని యిట్లు వేఱువేఱ 599
అని యిట్లు సెప్పిన 232
అని యిత్తెఱంగున 118
అని యుచితంబుగా 117
అని యుత్తరుండు 688
అని యుపలాలితుండగు 13
అని యువ్విళ్ళూరుచు 284
అని యూఱడిల్ల 384
అనియె గృపాచార్య 578
అనియె నప్పుడు 733
అనియె నిత్తెఱంగున 559
అని యేర్పడం 237
అని రచనాకౌతుక 5
అని వితర్కించుచుం 72
అని విరాటున కెఱింగించి 352
అని వీడఁగఁ బల్కిన 181
అని వెండియు 166
అని వెండియు 677
అని వెండియు బహు 350
అని వేడికొని 80
అని సకలబ్రహ్మ 2
అని సమస్తజనంబులు 88
అని సస్నేహంబును 516
అని సారథ్యప్రశంసా 707
అని హర్షోత్కర్షంబున 105
అనుకంపాతిశయంబున 9
అనుచుం గనుంగొనుచు 135
అనుచుం గనుంగొనుచుండ 647
అనుచుం గన్యకాజన 377
అనుచుం గలదు లేదని 255
అనుచుం గేలు మొగిచిన 210
అనుచుండం ద్రిదశేంద్ర 650
అనుచుండ ననతిదూరం 100
అనుచుండ సైన్యంబు 661
అనుచుం దొరఁగెడునశ్రుల 267
అనుచుఁ గొందలపడు 199
అనుచుఁ గ్రుంకింపరాని 316
అనుచున్ గ్రక్కున లేచి రోష 330
అనుచు డాయంజని 349
అనుచు దైన్యంబు 194
అనుచు ధనుస్తూణీర 479
అనుచు నంతంతం జేరి 134
అనుచు ననుజులదెసకు 84
అనుచు నిశ్చయరహిత 494
అనుచు నుత్తలపడు 692
అనుచు నొడఁబాటు 497
అనుచు మందమంద 241
అనుచు మత్స్యమహీవల్లభు 91
అనుచు వాలమ్ములు గురిసిన 636
అనుచు విరాటుండు 699
అనుచు విప్పచ్చుండు 490
అనుచు వీరావేశంబున 641
అనుచు వెండియు 315
అనుచు సంగీతనిలయంబు 472
అనుచు సంచలించు 308
అనుచు సింహబలుండు 215
అనుజ తనూజ మంత్రి 434
అనుటయుఁ గంకు 691
అనుటయు దరహసిత 141
అనుటయు నట్లచేయుదు 520
అనుటయు నతండు 519
అనుటయు నాటపాట గల 473
అనుటయు నాతఁడు 742
అనుటయు నెట్టకేలకు 130
అనుటయు ఫాలభాగ 408
అనుటయు మోఱకు 102
అనుటయు విరాట 582
అనుడు నకులుఁడిట్టులను డిట్టులను 121
అనుడు నతఁ డిట్టు 184
అనుడు నతఁడు దన 46
అనుడు నతని కిట్టులను 746
అనుడు బృహన్నల 478
అనుడు విరాటుఁ 229
అనుడు విషణ్ణమైన 112
అనుదినంబును 552
అను దివిజేంద్రనందను 488
అనునప్పుడు తత్ప్రదేశంబున 463
అను నప్పలుకుల 182
అను నినసూనుమాట 407
అనునెడ వాని యుగ్ర 153
అను పలు కంకుశంబు 444
అనుపలుకులకును భీష్మ 506
అనుపలుకులకును విస్మయ 450
అనుపలుకు లాకర్ణించి 504

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనుపలుకు కర్ణ	341
అనుపలుకులు విని	393
అనుమాటలు విని సంక్రందన	40
అనువచనంబు లియ్యకొనుచు	688
అన్నమయత్వాది	147
అన్నరపతి కట్టెదుర	152
అన్ని వెడఁదవాతి	655
అన్యోన్యావలోకంబు	759
అపరమితప్రకార	456
అపుడు నిశ్చేష్టితంబులై	536
అపుడు రాధేయుఁ	631
అప్పయుఁ బరిజనములు	171
అప్పు డర్జునుండు	584
అప్పు డశ్వత్థామ	665
అప్పు డా కృశోదరి వృకోదరు	320
అప్పుడు కర్ణుసైన్య	637
అప్పుడు కురుపతి	565
అప్పుడు ధర్మసూతి	230
అప్పుడు ధర్మహానికి	635
అప్పుడు పాండవోత్త	679
అప్పుడు శంఖుఁ	433
అప్పుడు సుభటులు	426
అప్పు డే పడంగి	656
అభినవ జలధర శ్యామంబు	480
అబ్బంగి నవమానింప	547
అమరనగరంబున	40
అమరేంద్రతనయుఁడు	662
అమలరత్న ప్రదీపావలి	754
అమృతమయాత్మ	766
అయిన నా నేర్చుకొలంది	187
అయ్యవసరంబున	170
అయ్యవసరంబునం దక్కిన	434
అయ్యవసరంబున మత్స్య	447
అయ్యుధిష్ఠిరుఁ	516
అరయఁగ నయ్యేడు	399
అరయ నతండు మాన	258
అరయుదముగాని	573
అరసికొని యెన్నిభంగుల	597
అరుగుదెంచుబృహన్నల	472
అరుణమణిమాలికా	671
అరుణాశ్వంబులఁ బూనిన	643
అరుదుగ నిట్టు లొక్కనికి	570
అరులగుణములైన	561
అర్జునాస్త్రఖండితాతపత్ర	616
అర్జునుఁడు గవియించిన	662
అర్జునుండును	630
అర్జునుండు వాని	645
అర్జునుఁడు దివ్యబాణ	662
అర్జునుఁడైన నేమి	543
అర్జునునకు ఖాండవ	464
అర్జునుని నావహంబున	649
అర్జునుని వియ్యమనియెడు	754
అటిముటి నంగము	640
అలమటఁ బొంది మాయ	207
అలుక భీష్ముని పలుకులు	564
అలుచైనను బగతునిదెస	400
అల్లదనంబున యనువుమై	113
అవనీచక్రము సంచలింపఁగ	300
అవనీనాయకుఁ జూచి	435
అవయవలక్షణం బాయుః	120
అవియును ద్వారకానగరంబు	390
అశుచియుఁ గష్టుఁడున్	354
అశ్వశిక్షకుండనై	44
అసదుగఁ దాఁకి మేనఁ	412
అసదృశలీలఁ బొల్చు	486
అసమున మీఁ దెఱుంగక	690
అస్మత్పితామహుం	597
ఆ	
ఆఁడు చందంబుఁ బురుష	492
ఆఁడుఁదనంబు నిక్కమున	110
ఆ కమలాక్షిరూప	365
ఆ చపలాక్షికిఁగా మన	733
ఆచార్య సూర్యతనయ	665
ఆచార్యు డెబ్బదియమ్ముల	624
ఆచార్యులైనవారలు కార్యంబు	545
ఆచార్యులైనవారలు పూజా	561
ఆతఁడు సిక్కనేని బలమంతయు	573
ఆతఁ డెవ్వఁడొక్కొ యమ్మహాత్ముని	719
ఆతనితమ్ముఁడైన మదిరాశ్వుఁడు	417
ఆతనితో నొక్కొకమరి	34
ఆతని రథ్యంబులఁ దత్సూతుని	681
ఆదరణీయసారవివిధార్థ	4
ఆదరము సంభ్రమంబును	448
ఆద్యపురుషోపలాలిత	513
ఆనతవైరి యో జయ	356
ఆ నరనాథుఁ డిట్లనియె	123
ఆపాదమస్తకము తద్రూపము	139
ఆ పాపాత్ముల నీచవ్యాపార	373
ఆ పార్థుఁడు భరతాన్వయ	257
ఆ మెయిన వివిధవర్మ	608
ఆయతబాహులున్ వెడఁదయైన	108
ఆయుధములు విడిచి	679
ఆయురైశ్వర్యకీర్తుల	190
ఆరయ నెందును గౌరవ	52
ఆరూపం బవికారమా	260
ఆఱురసంబులం జవుల	36
ఆలముసేసి నా తగుల మాఱడి	287
ఆవల వచ్చు నాపదల	194
ఆ విభుఁడు రాజ్యసుఖలీలా	122
ఆవులింత తుమ్ము హాసంబు	61
ఆ సంరంభంబున సమయ	246
ఆసవమున కని నీదు	195
ఆ సుశర్మతేరియందున్న	447
ఆస్థానంబు సేరవచ్చి	118
ఆహవకేళి వేడుక	701
ఇ	
ఇంచుక నిద్రించుసమయంబున	6
ఇంచుకయు నీడఁబోవక	438

ఇంతకు నేర్చు నీకు నొక 12
ఇంత దలరనేల 195
ఇంతప్రొద్దు కిరీటికట్టెదుర 650
ఇంతప్రొద్దేల యిచ్చోటి 241
ఇంతయుఁ గనుఁగొనియును 629
ఇంత యెఱుంగవు సైన్యము 682
ఇందఱకు నిన్నిభంగుల 268
ఇందఱుఁ జూడఁగా నిచట 227
ఇంద్రాగ్నివాయువరుణ 648
ఇంపైనప్రియ కాననిచ్చి 312
ఇక్కురుసైన్యంబు సొక్కుదక్కక 680
ఇగ్గజములు మిన్నకయును 498
ఇచ్చుట నొక కయ్యంబున 470
ఇట్టగు టెఱుఁగక వచ్చితి 484
ఇట్టిదకాని సమస్తజన 249
ఇట్టిపదంబు గాంచి 14
ఇట్టి వలవంత నిక్కడక్కడ వడి 313
ఇట్టివాఁడవు గావున 328
ఇట్టులగుట యెఱిఁగి 290
ఇట్లతని రూపాతిశయంబున 99
ఇట్లట్టెత్తిచూచి గాండీవంబు 665
ఇట్లిరువాఁగును నరవాయి 431
ఇట్లు కందర్పదర్పగోచరుండైన 173
ఇట్లు కట్టి తదీయాధి 79
ఇట్లు కర్ణుండు కయ్యంబు 640
ఇట్లు కౌరవానీకంబు 658
ఇట్లు కట్టనిచ్చి 752
ఇట్లు గనుంగొని 575
ఇట్లు గవిసిన 656
ఇట్లు గవిసి రథంబులం గడచి 678
ఇట్లు చని కూడముట్టిన 424
ఇట్లు తెలియఁజెప్పుటెల్ల 530
ఇట్లుత్తరుండు సమారూఢ 510
ఇట్లు దమతమ వర్తిల్లు 151
ఇట్లు దమ్ము నిరూపింప 371
ఇట్లు దలపడి 437
ఇట్లు దాన తమకంబున 178
ఇట్లు దోఁచినతలపునం జేసి 205
ఇట్లు ద్రోచిపోయినం 216
ఇట్లు నడచి మత్స్యనగరంబున 459
ఇట్లు నానా ప్రకారంబుల 39
ఇట్లు నానావిధ దీన 687
ఇట్లు నిలిచిన పవనతనయు 155
ఇట్లు పాండవులు 161
ఇట్లు పాణిగ్రహణం బాచరించి 762
ఇట్లు పూర్వోక్తప్రకారంబున 78
ఇట్లు పేర్చిన కోపాటోపంబున 222
ఇట్లు ప్రార్థించి పాంచాలి 211
ఇట్లు బహుప్రకారంబులగు 286
ఇట్లు బహుప్రకారంబులగు 310
ఇట్లు భగ్నబల సమాశ్వాస 626
ఇ ట్లుభయసైనికులు 440
ఇట్లు మండి శిఖిఁబోలెడి 654
ఇట్లు మత్స్యమహీవల్లభుం 97
ఇట్లు మేలుకాంచి 13
ఇట్లు రావించిన 113
ఇట్లు లంఘించి పోయి 360
ఇట్లు వచ్చి మత్స్యమహీవల్లభు 126
ఇట్లు వాఱినం దన 491
ఇట్లు వైవాహికవర్తన 756
ఇట్లు శత్రుంతపునిఁ ద్రుంచి 630
ఇట్లు శృంగారంబు సేసిన 742
ఇట్లు సంభవించి పాండవా 449
ఇట్లు సంభావించి యుత్తరుణి 379
ఇట్లు సన్నాహంబు మెఱసిన 477
ఇట్లు సమస్తజన 738
ఇట్లు సమాలింగితుండై 527
ఇట్లు సవ్యసాచి నిక్షిప్తాయుధం 497
ఇట్లు సుశర్మల బరాజితుం 448
ఇట్లు సూర్యోదయ మగుటయు 282
ఇట్లు సొచ్చి తఱియం జని 323
ఇట్లు సొత్తెంచి 132
ఇట్లూహించి రాత్రిసమయం 240
ఇడుమలఁ బడుమూడేండ్లు 577
ఇతఁ డెవ్వఁడొక్కొ రూపు 119
ఇతనియాశ్రయమున మనమెల్ల 440
ఇత్తెఱంగున 639
ఇత్తెఱంగున నుఱక 657
ఇత్తెఱంగున నొక్కయెడ 311
ఇత్తెఱంగున మత్స్యరాజ 135
ఇత్తెఱంగు నయ్యుత్తరకుమారు 538
ఇత్తెఱంగు నాకుం జెప్పుమనిన 236
ఇది కడుముద్దరాలు 48
ఇది పెనుఁబాముచందమున 71
ఇది యనన్యసామాన్యకరణంబగు- 15
ఇదియ నిశ్చయమిమ్మాట 293
ఇది యమ్మహాపురుషు 719
ఇది యేమి కంక నీవు 726
ఇది యేమియైన నేమగు 382
ఇది యొకచాపము విస్మయ 511
ఇది యొక పెద్దగట్టిమొన 572
ఇది లెస్సగాఁ దుడుచునంతకు 708
ఇది శతవృద్ధు మాజనని 81
ఇదె గంధర్వులు వచ్చి 362
ఇదె గోవర్గము సేరవచ్చితిమి 581
ఇనుఁడు దనకడకు నేతెంచిన 318
ఇన్నగమునందు గాండివ 507
ఇన్నితెఱఁగుల శ్రమము 111
ఇన్నెత్తురు గనుఁగొనిన 707
ఇప్పుడు నాకుఁ బ్రాణామంబులుగా 576
ఇమ్మదిరాక్షి డస్సె 69
ఇమ్మహనీయచాపంబు 513
ఇమ్మహనీయరూపమును 104
ఇమ్ముద్దియ నర్జుననకు 743
ఇమ్మెయిని నధిక పరితాపమ్మున 317
ఇయ్యరవిందగంధికుల మేమి 174
ఇయ్యంతిప్రాపున నయ్యనంగుండు 164
ఇరువురు వీరులు నిట్లొం 632

పద్యము	పుట
ఇవి నీతెగకొలఁదివి	507
ఇవ్వసుమతి నే పాలఁతుల	175
ఇవ్విధంబునం గనుంగొనుచు	660
ఇవ్విధంబునం జని	137
ఇవ్విధంబునం దనగాదిలి-	115
ఇవ్విధంబునం దన విజయంబు	690
ఇవ్విధంబునం బ్రకాశులై	750
ఇవ్విధంబునం బ్రవర్తిల్లు	385
ఇవ్విధంబునఁ గార్యంబు	53
ఇవ్విధంబునఁ గురుబలంబుల	572
ఇవ్విధంబునఁ గృతకృత్యుండయి	722
ఇవ్విధంబునఁ దమతమ	402
ఇవ్విధంబునఁ బలికిన	185
ఇవ్విధంబునఁ బోరెడు	666
ఇవ్విధంబున ద్రుపదపుత్రి	209
ఇవ్విధంబున ధనంజయుండు	653
ఇవ్విధంబున నంబుధిలోన	615
ఇవ్విధంబున నయ్యేవురు	602
ఇవ్విధంబున నరదంబుల	681
ఇవ్విధంబున 7నాలింగితుండయి	709
ఇవ్విధంబున నూటయేవు	363
ఇవ్విధంబున నేట్లాడుచుం	633
ఇవ్విధంబున నేనుంగు	671
ఇవ్విధంబున మదనవేదనా	305
ఇవ్విధంబున మహాబలుపట్టి	161
ఇవ్విధంబున రెండుదెఱంగుల	752
ఇవ్విధంబున విరాటుండు	436
ఇవ్విధంబున విరాటుండు	442
ఇవ్విధంబున వివాహంబు	764
ఇవ్విధంబున విసరి	158
ఇవ్విధంబున వృషభంబున	628
ఇవ్విధంబున వ్రేటువడి	703
ఇవ్విధంబున సన్నద్ధుండై	533
ఇవ్విధమున నయ్యేవురు	146
ఇవ్విధమున నేచి యిరువురు	334

పద్యము	పుట
ఈ	
ఈ కన్నియఁ గోడలిఁగా	744
ఈతఁ డజాతశత్రుఁడు	729
ఈతఁ డింతకు మీకు	735
ఈతనితోడి కయ్యమున	503
ఈతనితోడి కయ్యమున	593
ఈ నరపతియాస్థానము	227
ఈ నలువురు తక్కఁగ	452
ఈ నలువురభుజశక్తుల	403
ఈ నెలఁత గన్న మన్మథు	166
ఈ పదిపేళ్ళును నివి	523
ఈమెయి నిజజనకు	651
ఈయన ననుఁ గని సైరణ	596
ఈ యెడ ని ట్లిమ్మహనీయా	515
ఈ రథబృందంబుల	680
ఉ	
ఉగ్రుఁ డనూనమానమహి	596
ఉడుకువ లేని కయ్యమున	667
ఉడుగక వెండియున్	606
ఉత్తమకన్యాజనములు	695
ఉత్తమకన్యాజనులకు	41
ఉత్తమ వాహనంబులు	128
ఉత్తమాసనములు నుత్కృష్ట	60
ఉత్తర నలంకరింప ను	755
ఉత్తర లోనుగాఁ గల	292
ఉత్తరుఁడు సత్వరంబుగ	475
ఉత్పలగంధి నన్నుడుగు	202
ఉద్దవిడినపసుల	407
ఉన్నంత బంధుజనంబులు	348
ఉన్నతతఱి వివిధదేశోత్పన్నులు	151
ఉన్నరూప పలుకు నన్నరు	90
ఉపకారమొ బంటుతనమొ	450
ఉపతాయిలోఁ దన కొదవిన	157
ఉఱక నరుండు ద్రోణసుతు	652
ఉఱక విరోధిసైన్యముల	623

పద్యము	పుట
ఉలుకును వెక్కసపాటును	99
ఉల్లము దల్లడిల్లఁ దనువు	201
ఊ	
ఊరకయుండక పలువురతో	58
ఊహించి సుదేష్ణయు	255
ఎ	
ఎండకు వాన కోర్చి తనయిల్లు	61
ఎందును నిట్టిరూపు నరు లెవ్వరు	164
ఎక్కడ జూచినఁ దానై	452
ఎక్కడనుండి యెక్కడకు	135
ఎక్కడి మాట గొల్లతన	127
ఎక్కుడించినఁ బాండవాగ్రజుండు	76
ఎచ్చోట నున్నవాఁ డత డిచ్చోటికి	720
ఎత్తునఁ గొందుఁ గౌరవుల	461
ఎదురుగఁ బోవనిమ్ము	644
ఎద్దెసలం దనరుచులు	515
ఎప్పు డెయ్యెడ నేమిట	262
ఎయ్యది జన్మభూమి కుల	89
ఎఱిఁగి పిఱుసనినవెసఁబై	300
ఎఱిఁగి యెఱింగి నన్నడుగ	242
ఎఱుఁగెడువారికి నైనను	54
ఎఱుఁగమి చీఁకటి	743
ఎఱుఁగుట దుర్ఘట మెవ్విధి	392
ఎలదీఁగ గప్పిన లలిత	224
ఎలమియు నచ్చెరువును	14
ఎల్లచుట్టములును దల్లియు	117
ఎల్లభంగుల సైరంధ్రి నేము	353
ఎల్లి యెల్లవిధంబుల	271
ఎవ్వనివాకిట విభమద	251
ఎవ్వరితోనైన నెలుఁగెత్తి	285
ఎవ్వరు వినినను దీనికి	544
ఎవ్వరేనియింటికెద్దియే నొకటికి	203
ఏ	
ఏచి చలంబున నొంటికి	401
ఏచి మున్నీరు చేయొఁత	556
ఏటుల మ్రొగ్గవారిఁ గని	426

ఏడునూఱురథంబుల	446
ఏది కులము నామ మెయ్యది	140
ఏనన వేఱ యొక్కఁడనె	739
ఏ నపుడు ధర్మపాశాధీను	634
ఏనప్పుడు నీకుం జూపి	186
ఏ నమ్మహానుభావుల	516
ఏ నీ విజయము వొగడఁగఁ	710
ఏనుంగు నెక్కిపెక్కేనుంగు	676
ఏను గట్టువాలుదాన	134
ఏనును భక్తిమయంబగు	9
ఏనును మీరుఁ గానలకు	261
ఏను మనంబు పెంపు సెడి	265
ఏను వంటలవాఁడనై	36
ఏను విన్నపంబుసేయు	19
ఏను విల్లందుకొనిన	559
ఏను హవిష్యము కుడుతును	95
ఏమి కతంబున నిట్లీ	520
ఏమి కులంబున వాఁడొకో	100
ఏమీ నిక్కమె మున్నెఱుంగడె	414
ఏము నిను మత్స్యరాజ	109
ఏమేమీ యని గోపస్తోమము	693
ఏయుచుఁ బొడుచుచు వ్రేయుచు	446
ఏలినవానిఁ గాంచిమొనలెల్లను	436
ఏలినవాని ధనంబులు	558
ఐ	
ఐనను మత్స్యదేశమున	228
ఒ	
ఒంటిఁ దలపడి కురుసేన	489
ఒండు పనులకు సెలవు	110
ఒండేమియు లేదు విరాటుం	723
ఒండొంటితోఁ దాఁకి మండెడు	425
ఒండొరు మీరు కోర్కిమెయి	428
ఒండొరుల దోయిళుల	761
ఒకఁడు పరశురాము	713
ఒకబుషిచేత నాయుధ	419
ఒకనాఁ డేమును నాపద	24
ఒక మఱి కిరీటి కట్టెదిరికి	617
ఒకమాత్రన్ వితత ప్రసార	612
ఒకరుఁడ తాను భీతి	735
ఒక్కఁడు పెక్కండ్ర కెక్కిన	427
ఒక్కయెడ	389
ఒక్కయెడ	428
ఒడలు సిరియును నాకు	449
ఒడుపు దప్పిన మహానాగంబు	219
ఒదవెడు తృషపెల్లిదమున	200
ఒప్పెడు మేనుఁ బెంపుగల	43
ఒరుడయ్యేని మామక	506
ఒవ్వనివారు నవ్వ మహిమోదధి	301
ఒల్లరు రాజు దేవులును	266
ఓ	
ఓంకార వాచ్యునకు	17
క	
కంక వలల దామగ్రంథి	422
కంకుఁడు ధర్మసుతుఁడు	518
కందము లప్పళించి	626
కందువ సెప్పి యొక్కెడ	409
కంధరములు దెగి తలలు	451
కచ్చ యమరఁ బట్టి	158
కడిమి మెఱయంగఁ బోరు	437
కడిమిమై సౌగంధికమున	35
కడుఁ బసిబిడ్డ వీ ఁడొకటి	262
కడు వెస వచ్చి రూపఱిన	347
కథ జగత్ప్రసిద్ధి	21
కదియుచుఁ బాయుచుఁ బట్టుచు	334
కదిసిన బలములు విచ్చిన	585
కనకమయ తాలకేతువు	659
కని కొలువు సేసికొని	50
కని జయజయ శబ్ద పూర్వంబుగా	388
కని యమ్మహీరుహంబు	74
కని యుత్తరుండు గరుపాఱిన	482
కనుఁగొని కోపవేగమున	219
కనుఁగొని గారవంబును	139
కనుఁగొని ఫల్గునుండు	536
కనుఁగొనియప్డు	284
కనుఁగొని యెలన వ్వాలయు	590
కనుఁగొని సూతుం డరదము	664
కన్నియల కాట గఱపుచు	373
కపట ద్యూత మొనర్చిన	517
కమలభవ కిరీటగ్రామ	148
కమలవనంబు పొంత	310
కయ్యమునక యెపుడు	553
కరచరణాద్యంగకంబు	86
కరము లెయ్యవి శిరమేది	349
కరశీకరంబులు గరటగళ	429
కరి తురగ రథసమితి	214
కరితురగసమితిఁ గార్కొని	585
కరుణారసము పొంగి	8
కర్ణుకేతనంబు గ్రాలెడు	627
కలఁగెం దోయధి సప్తకంబు	535
కలపంబు లభినవ గంధంబు	50
కలపములు గూర్చ బహువిధ	142
కల రూపెఱిఁగింపంగా	397
కలిమికి నొప్పగు నీఁగియు	250
కలిమికి భోగములకదా	62
కలువడములు మణితోరణములు	753
కవదొనలేల పూనునొకో	613
కవలు నీకుఁ జక్రరక్షకులుగా	444
కవ్వడి యెమ్మెయి నేసిన	663
కాంచన పీఠము వెట్టఁగ	174
కాంచనమయవేదికా	591
కాంచనమాలాలంకృత	477
కాంతి దళ్కొత్తు నీ కడకంటి	212
కానితెరువునఁ బోయిన	192
కారణ మెయ్యది యగునొకో	413
కాలపక్వంబులైన లోకముల	619
కాలుతక్కువవారలు	687
కావలివారిఁదోలి యెసకంబున	545
కావున	110

పద్యము	పుట
కావున	288
కావున	382
కావున	684
కావునఁ బురుషులు నా కడం	145
కావున దీనియం దిడుట	75
కావున నా యెలనాఁగ	190
కావున నిట్టి దేశం బిప్పు డెయ్యది	399
కావున నిమ్మహీరుహం బెక్కి	508
కావున నుచితములగు	53
కావున భారతామృతము	16
కావున మదీయ పరిభవాతి	256
కావున మీకు దంతిహయ	452
కావున మీకు నప్రమాదార్థంబుగా	55
కావున మీర లభ్యుదయ	269
కావున వంచన బాహిర	302
కావున సత్యవ్రత నిష్ఠుండగు	247
కాళ్ళ యొప్పిదమాఁడు	105
కినుకకుఁ జాల కెంతయును	248
కినుక మనంబునం గదిరి	664
కిమస్థిమాలాం కిము కౌస్తుభం వా	7
కిరీటియుం గోపించి	724
కీచకకోటిచేత నొక	372
కీచకాధముండు కిమ్మీర	326
కీచకుఁ డట్లు మీఁదు	246
కీచకుఁడు వ్రేటువడి	218
కీచకునియింట నెప్పుడు	201
కీచకుల దెసఁ బుట్టిన	369
కీలారితనమునకు నే	47
కుంతీనందను లట్లత్యంత	766
కుంతీనందను లొక్కఁడొక్కఁడ	556
కుటిలబుద్ధు లిచటఁ గొనవు	548
కురుజనపదంబు చుట్లం	30
కురుపతిభీష్మకర్ణకృప	462
కురుపతి భీష్మ కర్ణ కృప	698
కురుబలంబు గెలిచి గోవుల	687
కురుబలమున్ జయించి	693
కురుబలమున్ జయించుటయు	706
కురుబల మేఁగుదెంచెనఁట	466
కురుబల మేల దైత్యసుర	699
కురురాజున్ సబలంబుగా	714
కురువిభుండును భీష్ముండు	557
కురువీరుల గెలిచి	478
కురుసేనలోన నిట్లెవ్వరుఁ	652
కూడంబాటి సముద్ధతిం	412
కూడముట్టిఁ గ్రీడి కురువంశమున	672
కూర్చుట నూత్నరత్నమునకుం	15
కృత మెఱుఁగుదు రుపకార	381
కెంగేలుఁ గేలితోఁ గీలించి	314
కెలకులఁ బిఱిందిదెసయుం	322
కేకయరాజనందనయును	138
కేకయ సాల్వులు తోడుగ	406
కేలిమై నొక్కట లీల	197
కేవల సూతులతోడన	389
కేసరివిక్రముండు కపికేతను	631
కైసేసి మదవికారోల్లాసంబున	324
కొండొకయెడఁ గని శాంతనవుం	664
కొన్నివెడమాట లాడుచు	244
కొలువుగొన నొల్లకుండుట	104
కొలువులోపల నిన్న	339
కోర్కులు గెడఁ గూడుకొని	763
కౌరవపతి యనుజన్ముల	719
కౌరవసేనఁ జూచి వడఁకఁ	485
కౌరవసేన గాదు త్రిజగంబులు	467
కౌరవసేన గోగణము	715
కౌరవాన్వయజాతులై	55
కౌరవేశ్వరుండు గనువిచ్చి	781
క్రోధం బప్రతికారమై	297
క్రోధజ్వాలలు నిగుడ	551
క్షతములఁ బెల్లు తొరఁగు	668
క్షతములఁ బెల్లు తొరఁగు	439
క్షత్త్రియుఁ డోడునే తగదు	674
క్షమియింప నెవ్వరము	563
క్షమియింపవలయు నొక	562
క్షాత్రసమగ్రు లార్యనుత	394
ఖ	
ఖాండవ మేర్చునప్పుడు	474
ఖాండవ మేర్చె దేవతలు	39
ఖేదము దక్కు మీక్షణము	237
గ	
గండుమీలకుఁ బుట్టి	189
గంధదంతావళకర్ణమారుత	423
గంధర్వుం డనుతలంపున	331
గంధర్వు లను నెపంబున	404
గజఘోటక రథసూత	613
గమనము నీఁక వేఁతొక	320
గరువంపు సంభ్రమంబుల	754
గర్జద్ఘుణుఁడై పగతుర	609
గాంగేయుఁ డవష్టంభోత్తుంగ	625
గారవమున నిజదేశాచారము	131
గుణమున లస్తకంబును	604
గుణరావంబుఁ గృపాణఘట్టన	424
గురుఁడు తలపడిన	717
గురుఁ డొక్కరుండు దక్కఁగ	646
గురునకుఁ బ్రదక్షిణంబుగ	592
గురుపుత్త్రుఁడు తేజోనిధి	593
గురుపుత్రుని రథము విడిచి	653
గురుశరములు సితపక్ష	647
గొంతికి నంత వెఱవ మీకంత	248
గోడిగజాతిలోఁగొదమ	44
గోవులకు వెనుకయై	414
గోవులతోఁ బొదువంబడి	584
గోవుల నెట్టు లాఁగితి	713
గోర బోఁజిన మాడ్కిఁ గొన్నింటి	607
ఘ	
ఘనతరకోపవేగమున	326
చ	
చంద్రవదన యింక సైరంధ్రి	364
చక్కని చిక్కని మేనులు	70

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చట్టువం బొకచేతఁ బట్టి	98
చతురానందమయాదుర్గతి	342
చని ధర్మసుతుఁడు	726
చనిన నయ్యేలనాఁగయు	235
చని మదనాగ్నిజ్వాలలు	185
చని యక్కుమారుఁ డేమయ్యెనొ	692
చని విరాటకన్యకల	371
చని వివేకరహితు హృదయంబు	321
చని వెడ వికసిల్లెడు	294
చనుఁ జనదని	185
చనుచుండి నీచహృదయుండగు	206
చనుటయు ద్రౌపది యతనిం	285
చనుదెంచి కాంచి నానేర్చిన	123
చనుదెంచి పేడితనము	107
చనునె యిమ్మాటలాడ	180
చనునె వేరొకని కజాత	249
చను వానిచేయుకార్యంబున	57
చయ్యన నేఁగి యంబుజ	283
చాల దుస్తరమైన యజ్ఞాత	738
చింతాక్రాంతుండైన కౌంతేయు	267
చింతాశల్యము వాసెనే	338
చిడిముడి పడుచు నెదురు	211
చిత్తమున గాఢరాగంబు	762
చిత్తము మెచ్చి నావలన	198
చిత్తవృత్తి యొక్కించుక	490
చిరకాలమునకుఁ గంటిమి	578
చిరకీర్తి ప్రియుఁడగు	519
చిఱునగ వొప్ప గాండివము	652
చుక్కలు తోడుతోడఁ దలచూప	318
చూచుచుఁ జేరి వ్రేల్మిడుచు	337
చెదరకుండఁ బసులఁ బొదివి	716
చెలులుఁ దానును నుత్తర	721
చెలువ యప్పలుకులు	214
చెవు లవిసెన్ దిశల్ దిరిగె	537
చేతులతీఁట వో నిటు	657
చేరఁ జనుదెంచి పాండవ	119
చ్యవనుని వాంఛకు సంయాతి	272
జ	
జననమరణాదులైన	13
జననాయకుండు నీ సభవారు	231
జనపతినందనుండు	464
జనపతి యెవ్వరి నైనను	60
జన్మములు సేయునెడ	559
జలజదళాక్షి కీచకుని	270
జలనిధి హిమవద్భూధర	20
జూదమాడి ధర్మసూనుండు	696
జెట్టితండంబుతోడ	37
జ్యాఘోషం బతిభీషణం	550
డ	
డప్పి జనించె వ్రేళుల	67
త	
తండ్రి నీవు నాకు దయతోడ	83
తంత్రీపాలుం డనంబరఁగిన	129
తక్కటివారలుం గని	706
తక్కటి వారలున్ సురల	713
తక్కినవార లాతనికి	403
తగఁ జొచ్చి తనకు నర్హంబగు	56
తగ నొక్కటి వేఁడెద నిను	453
తగవుమైఁ బరిచారికా	142
తగుసారథి దొరకొనినం	462
తత్ప్రదేశంబునకుం జని	212
తడవగుదెంచె జమ్మికి	534
తదనంతరంబ	14
తదనంతరంబ	65
తదనంతరంబ	318
తదనంతరంబ	361
తదనంతరంబ	440
తదనంతరంబ భీమనకుల	77
తదనంతరంబ యగ్ని	534
తదనంతరంబ యల్లనల్లన	277
తదనంతరంబ హుతవహున	65
తదనంతరంబునన్ దొరలు	610
తదవసరంబున నొక్కట	438
తనకడిమి కలిమి నచ్చియు	336
తనకొలఁది యెఱుంగని	724
తన కోదండము ఖండితం	663
తన తనయుకంటె నెమ్మనమున	643
తన తలసీర యరసి	137
తనదృష్టియు ముష్టియుఁ దగు	605
తనభుజశక్తియున్ రిపుల	487
తనమదిఁ గదిరిన తమకంబున	283
తనమదిఁ గరుణయు ఖేదంబును	68
తన మనుమలు పాండుతనయు	440
తన యంతన యటు వలుకుచు	369
తనయగపా టొరులె	332
తనయెు ప్పెదురఁ గన్న	259
తనికెడు నారటంబున	316
తనుఁ గాచి వెనుక వచ్చిన	215
తన్వంగి మవ్వంపుఁ దనులత	171
తప్పఁ బలికితీవు	505
తప్పుచేసితి రీ రిట్లు	710
తమ తమ బలములతో	718
తమతమ యొద్దిబలంబులు	624
తమలోన మాటలాడెడు	152
తము నెఱిఁగించి యల్ల	736
తమ్ములు ధౌమ్యుఁడున్ సతియు	29
తరణియు దుఃఖితయగు	210
తరతరమ ప్రజల	624
తరువు వెసఁ బెఱికికొని	444
తఱిమి పయి నడరుటయు	637
తఱిమి సుశర్మఁ గిట్టియతి	447
తలఁకు గలదేని శకునిం	599
తలఁకెడు వానికిన్ మగఁడ	600
తలఁపఁగ రిపులకు	501
తలచుట్టు చుట్టెఁ గుండల	532
తలపడి తలమీఱిన	605
తలపడి పోర వారి యరదంబు	441
తలపడి వాలమ్ములుపై	631

పద్యము	పుట
తలమీఁటి నిశితశర	629
తలరు నలందురున్ నవయు	305
తలుగుల పొది యొకదెస	125
తల్లియుఁ దండ్రియు దైవము	63
తానును నన్నయు నయ్యాస్థాన	219
తాను మున్నుగ శాత్రవసేన	446
తాను సుదేష్ణయున్ సుతులు	753
తా నెంత యాప్తుఁడైన మహీ	61
తిగిచి కవుంగిలించి	114
తిగిచిన నడుగులు తెరలక	333
తిరిగి తిరిగి లోకోత్తర	123
తునిమి తోడన యొక్క	655
తురగంబులఁ జూచువిధం	119
తురగముల నాలుగిట	638
తెనుఁగు బాస వినిర్మింప	10
తెప్పించి తొడుగు మీవని	475
తెలిగన్నుఁగవకాంతి	176
తెలుపు లగు చీరలను	725
తెలుపులగు వాహనములు	521
తెల్లంబు గాదె మీకెల్ల	24
తెల్లనిజోడు పెట్టుకొని	418
తేజోధనుఁ డగు నరుఁడు	619
తేరుఁ బూన్పఁ బంపు తెప్పింపు	460
తేరు సమ్ముఖంబు సేయించి	582
తొడఁగిన పనిచలం బెడపక	357
తొడరిన హరువైన దోర్బలంబున	256
తొఱఁగువోకుండ మెకములు	126
తొలుత నీవు నన్నడిగిన	512
త్రిజగదవననిత్యక్రీడ	457
త్రిభువనశుకదృఢపంజర	17
ద	
దంతిఘటాసంతానము	616
దగ్ధము లైనట్టులు సమ్య	499
దనుజకులత్రాసకరంబును	77
దవ్వులఁ జూచి మత్స్యవసుధా	85
దవ్వుల విఱిగినఁ బౌరులు	491

పద్యము	పుట
దానికిఁ జిత్తవృత్తులు	439
దానికి నేటి నిక్కము వృథా	307
దాని నెఱింగి యెంతయు	334
దామగ్రంథి, యనఁగ నొక	45
దామగ్రంథి యనువాఁడ	120
దినమకాని యింక భువనంబు	315
దీనిం బాండవులయం దెవ్వరు	512
దీని జన్మంబునఁ దేజంబు	166
దుర్భరయగు నిమఁ గర్కటి	143
దుర్వహపటుతాపత్రయ	767
దుర్వారోద్యమబాహువిక్రమ	183
దుర్వారోద్యమబాహువిక్రమ	243
దుర్యోధన దుశ్శాసన కర్ణ	273
దెసలు బీఁటలువాఱ	487
దేవకుమారకుండ యగు	720
దేవతలకైన నొక్కొక	26
దేవదత్తాభీలరావంబు	571
దేవరయానతిఁ బాండవు	388
దేవా దివ్యచిత్తంబున	21
దేవా నాలవజాతివాఁడ	100
దేవా వైశంపాయనుండు	149
దేవా వైశంపాయనుండు	345
దేవా వైశంపాయనుండు	458
దేవా వైశంపాయనుండు	589
దేవితృష దీర్పఁబూనితి	212
దేవి తృషపుట్టి వారుణి	212
దొరలు తలపడ్డనా	438
దొరలును సుభటులు	666
దైన్యంబు తలపోఁత	208
ద్విజుఁడు గురువిషయ	91
ద్రుపదనందన పరిభవ	275
ద్రుపదభూవిభుఁడుపుత్రుల	263
ద్రుపదభూవిభుఁడు పుత్రులు	752
ద్యూతక్రీడకుఁగొండొక	92
ద్యూతజ్ఞుల దెసఁ	96
ద్రోణ గాంగేయ భానుమత్సూను	387

పద్యము	పుట
ద్రోణుఁడు భీష్ముఁడుం గృపుఁడు	712
ద్రోణుఁడు రయమున నేసిన	646
ద్రౌపదీరూప మను నురిం దగిలి	163
ధ	
ధనవర్గంబులు వీరిచ్చిన	741
ధరణి దుర్లభమగు నవదాత	522
ధరణిపు చక్కఁ గట్టెదురు	59
ధరణియుఁ బట్టణంబుహయ	739
ధరణి యెల్ల గెలిచి తగ	520
ధరణి వడంకె ధూళిదివి	603
ధరణీచక్రము సంచలింపఁగ	460
ధరణీనాథుఁడు దాను దమ్ములు	718
ధరణీపరాగంబు వొరసి	236
ధర్మతమాభవు సంతత ధర్మ	249
ధర్మదేవత నీదు సత్కర్మమున	29
ధర్మనిరూపకత్వమున	25
ధర్మసుతుండు పెంచె నను	121
ధూళి పెల్లుగ నెగయంగ	715
ధైర్యధనుఁ డితఁడు	594
ధ్వాంతాకారిత కుడ్య కుట్టిమ	322
న	
నగళులలోపలి మాటలు	59
నగుచు బృహన్నల యిట్లను	471
నడదీవియలు సేసె నగరికి	727
ననుఁ గుచ్చితంపుఁ బనులకు	146
నను నీ వప్పుడు సూతమందిర	237
నను ముట్టి నీవు వెండియు	330
నను సైరంధ్రి గడంగి	490
నన్నడుగ నేల నీవును	295
నన్నిటు లా దురాత్ము	235
నన్నుఁ బరాభవించి	240
నన్ను విరాటుండు మున్ను	48
నమ్ముము కైదువు మోదగు	509
నరనాథుండు ప్రమోద సంపదు	697
నరనాథుఁగొలిచి యలవడ	56
నరుఁడు నమస్కరించి	644

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నరునకు నాకుం దక్కఁగ 79
నరుభల్లంబుల నగ్రిమ 615
నరు లొరులు దృశ్యములపై 612
నల్లవొ నిక్క మాడె నృప 395
నవతాదూరపురాణ 586
నా కవి యెల్లనేల నరనాథు 102
నాకుం బని యెయ్యది పనుపు 531
నాకుఁ జూడ మత్స్యనరపతి 31
నా కులకాంతల నెల్లను 215
నా కొడుకు పోటుమాటలు 700
నా కొఱఁతఁ దీర్చి వచ్చితి 295
నా కొలువు వారకార 188
నా చిత్తము తాదృశులగు 145
నా తోడి ప్రేముడిం గడు 495
నాదు బాహుబలమునకు 300
నాదు రూపంబు మనంబున 327
నాదు వల్లభుండు నటుఁడింత 233
నానావిధ భూతమయము 91
నా పతులగు గంధర్వులచే 346
నా యనుచరులం దెవ్వఁడు 94
నా యున్నబాము దలఁపవ 180
నాయొడలు సేర్చినప్పుడ 329
నిండె సమయాబ్దములు 748
నిక్కమ పోలె నప్పు డొక 306
నిఖిలధర్మాధర్మనిపుణంబు 226
నిగమకుసుమ గంధోన్మేష 767
నిజాంతర్గతంబున 163
నిను నర్జునుం డని యెఱింగిన 529
నిను నీవ పొగడికొని 599
నిన్నుఁగొలువంగ వచ్చితి 108
నిన్నెఱుఁగక యే నేమే 526
నిషధాద్రియం దనిమిషపతి 26
నీకుఁ దగుపదవి యిచ్చెద 121
నీచమతి నన్ను నెవఁడు 144
నీచము లయ్యెడు పనులకు 142
నీతోడి పరిచయము లే దే 375
నీపసులఁ గావఁబెట్టుము 126
నీపాలికి వచ్చి నిఖిలగోపాలక 732
నీమెచ్చు వారువంబుల 731
నీ యట్టివాడు నిస్సీ పోయెడి 677
నీరజాకరములు నిష్ఠమై 281
నీలోత్పలచ్ఛాయ నెరసి 514
నీ వలచిన యప్పుడ ధాత్రి 688
నీ వలమూఁపులావు మును 252
నీ వలుగులఁ బడుటకు 374
నీ వింత యలుగనేటికి 238
నీవు చతురమతివి నీకు 116
నీవు దమ్ములు నొక్కెడ నిలిచి 443
నీవు చక్కనిదానవు నెలఁత 379
నీవు దుర్జాతిగామికి 182
నీవును 142
నీ నెవ్వ రేమిపనికై 134
నీ వొకతవేళ యిలఁ బది 288
నునుసెలగోల చేకొని 125
నున్నదనంబుగా నలుఁగు 266
నృపనయవిద్యకుం దగిన 92
నెగయునెడ నగ్గమైనను 335
నెగసిన కొనలేచి 72
నెచ్చెలులతోడ నెంతయు 116
నెత్తమ్మిరేకులమెత్తఁదనము 181
నేల నాలుగు సెఱఁగుల 153
నేల ప్రొద్దేఱింగి చాలు 560
నేలయు నింగియుఁ దాళముల్ 221
నొగనొగతోఁ దాఁకి పగులంగ 430

ప

పంబినకోపమున్ సమయ 225
పక్షిమృగజాతులెల్లను 533
పక్షివ్యాకులముం బరేత 74
పటువిశిఖపంక్తి యత్యు 654
పటువేగంబగు శాత 437
పట్టుకొని మగుడంగొని 715
పడఁతి నన్నొఱఁ బలికిన 305
పతి యెఱింగినఁ దన ప్రాణంబు 191
పదంపడి జారచోర 319
పదంపడి పద్మినీ ప్రమోద 366
పదతలంబుల కెంపు 137
పదనికి రాఁ బులు గడిగిన 742
పనిచిన నాతఁడు నమ్మెయి 584
పని పంపఁగాని యొకతకు 265
పరగు పొదరు పొదరు 389
పరమ కృపావిధేయ 342
పరమశమనిరతసంయమి 18
పరిచారికాత్వరేఖా 131
పరిభవకరుఁ డగు కీచకు 247
పరి సమదెంచి గోగణము 494
పఱమెయిల్ గప్పిన 132
పఱియ వాపంగఁ దునియఁగా 36
పలకయు వాలును నింతింతలు 656
పలుకవచ్చుఁగాక పలికిన 634
పలుపులుఁ గాండ్లుం బగ్గంబులు 616
పలుపోకలఁ బోవుచు 232
పల్లవ ప్రసూన ఫలభరితం 335
పవనతనూజ బాహువులు 331
పసులఁ గాచికాని బ్రదుక 129
పసులు మరలె శత్రుబల 686
పసులు పట్టువడిన 585
పాండవపక్షపాతమున 504
పాండవ మధ్యముండు 551
పాండవ వీరులం గలన 546
పాండవులు వనవాసంబు 23
పాండుపుత్రుండును జిత్ర 653
పాండుపుత్రుల కేను 209
పాండుమహీపాలుండా 571
పాండురాజ సుతులు 401
పాండురాజసుతులు పాంచాలి 410
పాతకియై సుయోధనుఁడు 385
పారాశర్యుని కృతియయి 10
పాఱుతెంచిన నక్కల 244

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
పితామహుం డుపదేశించిన	404
పితృవణము దెసకుఁ జన	355
పీనుఁగు నంటఁగఁ దగునే	508
పుట్టినంతనుండి యిట్టివి	642
పుత్రులు పౌత్రులు భ్రాతలు	57
పురుషు లా లతాంగి	364
పులిఁ గనుఁగొన్న లేడులును	368
పులిఁ గోల వేసినట్టి	668
పూనిక నెఱపితి సతి	337
పృథయను పేర మదంబకు	523
పెక్కండ్ర నొక్కపోరను	37
పెట్టకట్టక మౌళిం	532
పెడకేలు గట్టి పాపపు	352
పెనఁకువఁ దనిసిన	276
పెనుఁగుదుట నిడిన	762
పెనుఁబొడువుఁ బఱపు	75
పెనుబాముల చందంబున	511
పెనుమిట్టిది పల్లం బిది	319
పెఱవారలు దమ మెలఁగెడు	161
పెలుకుఱి తాళంబిమది	158
పేరు వలలుండు కూడుం	101
పొడసూపినట్లైన వడిఁబట్ట	309
పొదుపు విరియందట్టి	511
పొరిఁ బొరిఁ బ్రీతిరెట్టిగ	96
పొలఁతుక కాంతి	170
ప్రణమదవనవిద్యాప్రౌఢ	587
ప్రబలుం డారయ నాసింహ	239
ప్రళయాంతకుండు	547
ప్రళయాంభోధరముక్త	632
ప్రియ మక్షీణము నాకు	528
ప్రీతి నలుమడింప భీముని	737
ప్రొద్దు గ్రుంకిన మఱికాని	623
ఫ	
ఫాలకుంభసంధిఁ బడి	670
బ	
బంధుశతంబులు శౌర్య	144
బకమహాసురు నిర్జించి	731
బక హిడింబ కిమ్మీరుల	253
బరవసముమైఁ ద్రిగర్తేశ్వరు	407
బలదేవప్రముఖులకును	751
బలములు దొరలుఁ బొదివి	657
బలమెల్లన్ వెఱ రెండు	614
బలరిపుఁ డిచ్చిన కుండల	532
బలవిక్రమములు	436
బలవిక్రమసంపన్నులు	192
బలియుం డా సొబగుండు	299
బలుగాలిఁ బేర్చు దావానల	557
బలువిడి మనదివ్యాస్త్రంబుల	659
బహుమహితాయుధవిద్యా	598
బహువిధంబుల నమ్మెయి	289
బహుళాష్టమి నీతఁడు	410
బాంధవశత్రవాకలిత	147
బాల కేళిమీఁదిభరము	116
బాసట లేదు క్రొవ్వడర	712
బాహుల చాయయున్ గమన	493
బాహుసమగ్రశత్రుమద	525
బిరుదుగలమగలు	380
బీరములావును మిగులఁగ	561
బుద్ధులు సెప్పుటెల్లనటు	193
బృహన్నల నవలోకించి	476
బ్రహ్మవిష్ణుమహేశ	78
బ్రాహ్మణభక్తియుఁ బరహిత	397
భ	
భంగముతోడ నున్న నను	406
భండనమున నిరుగేలను	522
భయశోకంబులు తనదు	378
భరమున నీ పోరెడునెడ	254
భల్ల మొక్కట నాతని	658
భవదాజ్ఞాదృఢబంధ	27
భవదీయ ప్రార్థనచే	472
భవ్యవిభవంబుతో	751
భాగ్యముగాదె నీ చరణ	286
భావనశాంతత్వము నిజ	124
భీకరబాణవర్షముల	431
భీముడు ధార్తరాష్ట్రకుల	80
భీష్మద్రోణకృపాది	482
భూదేవోత్తమ నాశీర్వాదం	64
భూపాలవల్లభాజన	516
భూరిభవత్కారుణ్య	12
భూవరులెల్లను నొక్కట	555
మ	
మంగళతూర్యరవములు	705
మంటయుఁబోని శాత్రవ	451
మండలచారియై రథమమానుష	433
మండితధ్వజమండలంబుల	617
మండుచు వచ్చుదానిఁ బది	656
మందరాచలచటుల	434
మందిరాభ్యంతరమున	689
మగలకు మేటియైన బలమర్దన	258
మగ లడఁకువ మండక తమ	290
మగుడం గీచకుఁ బట్ట వాఁడును	332
మగుడి వచ్చి హస్తిపురంబు	385
మజ్జనకుండు సమ్మాన్య	6
మణిమయుమ్ములుఁగల	34
మత్స్యదేశాధీశుమఱఁది	391
మత్స్యవిషయరాజ్యమహిమ	88
మత్కోదండచయంబులోన	109
మదమునఁ గీచకాగ్రజుఁడు	302
మదిర సుదేష్ణపాలి కొక	214
మదిరాశ్వుండు కడంగి	432
మనకడకు నేమిటికి వచ్చె	87
మనకీచకుల కెల్లమారియై	367
మనకుఁ బాండురాజ తనయ	568
మనకును గౌరవేంద్రునకు	580
మనచూడ్కికి వ్రేఁగయి	578
మన దేశమునకుఁ బోదము	684
మన నగరంబునకు	454
మనబల మెంత యంతయు	400
మనబానసీఁడు వలలుండను	154

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మన మియ్యెడఁ బెద్దయు 293
మనము కలంక దేఱె 527
మనమునఁ గోరుదునే 528
మనమున నూఱడిల్లు 145
మనము మోసపోయి యనిమిష 749
మన మురియాడుచుండ 205
మన మురియాడుచు నుండఁగ 467
మన మెంత పనవి పిలిచిన 350
మన మొక యేపుర మీయం 29
మనమొనల దుర్నిమిత్తము 540
మనయింట నిచ్చటచ్చోటన 117
మనలను దానవులను 660
మనల నెవ్వరు నెఱుఁగ 248
మనలోన నెవ్వఁ డెమ్మెయి 31
మనవంశంబును వృత్తంబును 52
మనవలలుండు లావున 421
మనశస్త్రాస్త్రంబుల దక్కిన 71
మనసుల నాలుకొల్పి 543
మనుజవరేణ్య నావలని 450
మనుజు లంటకుండ మఱువడఁ 509
మన్నన కుబ్బక యవమతి 60
మ మ్మెరవుగాఁ దలంచి 453
మరగి నీమూర్తిపైఁ గన్ను 255
మఱియు నక్కోమలివలని 308
మఱియు ననేకగతుల 158
మఱియు ననేక భంగుల 200
మఱియు ననేక యోధవీరులు 419
మఱియు నవసరోచితంబు 34
మఱియును 261
మఱియును నొక్క విశేషం 398
మలసి ఱంకెలు వైచుచు 660
మల్లయుద్ధనైపుణ్యంబు 333
మహనీయమూర్తియు 32
మహాభారతంబు సమస్త 21
మహితసముజ్జ్వలాకృతులు 22
మహిషవ్యాఘ్రగజాది 253
మాటలు పెక్కాడితి వీ 634
మానముఁ బ్రాణముఁ గాచితి 449
మానవకోటి 348
మానవపతి నన్నెక్కడి 42
మాయరవి యేలక్రుంకఁడొ 315
మారుతసుతుండును గృత 303
మాసినచందముఁ దనుఁ గని 168
మాసె నభోమణి నక్కలు 498
మీ పనిచినట్ల చేసెద 445
మీ రెఱిఁగినఁ జెపుఁ డీతని 119
మీ రేమి సేయుదురు దైవా 268
మీ సుభటత్వమున్ బలము 245
ముందటిభంగిన కానల 247
ముందటియట్ల యింక 380
ముందర రాజుఁ బుచ్చి 541
ముదమున నెలమి సొంపొదవి 377
ముద మొదవ రమ్యహర్మ్యము 135
మును నీవచట నచట 636
మును నీ వెచ్చో నిలు తేపని 51
మును వెఱతు నేయ మీరలు 645
మున్నుగల గోపవర్గము 130
మున్ను సుశర్మ దాను బలముం 409
ముఱిముఱిచీఁకటి యప్పుడు 440
మెడ యొఱగఁ జేతి కైదువు 682
మెఱసి యుదయుంచు గ్రహముల 510
మెఱుఁగు మొగిలు సొచ్చు 469
మెలంగినం గనుంగొని 107
మేదురదీర్ఘతరంబగు 611
మొగ మొప్పదు నాదెస 722
మొగమోడఁ డితఁడు 736
మొగిచినచేతులు ముందల 388
మొనఁ గలయఁజూచి యూరక 579
మొనలు దెరలినఁ గర్ణుండు 717
మొన లొఱపుగఁ దీర్చి 499
మోచికొని వాసవాత్మజు 70
మోహనబాణపాతమున 683
మౌళిస్రక్సంగరంగన్మధు 387

య

యానప్రక్రమ సూచకంబు 415
యూథపతితోడి దంతి 672
యోధాగ్రేసరుఁ డిద్ధతేజుఁడు 595

ర

రక్తధారలు వెడలంగ రశ్మి 669
రత్నకేతనములు రాజిత 615
రథముల్ మంచివిగాఁగ 422
రయమునఁ గిట్టి యాతని 627
రవితనయుబాణములు 633
రవిదీప్తులు సొరనేరమి 637
రవి యుదయించు నట్లు 521
రాగరసమగ్నుఁడయ్యె 186
రాజగృహంబుకంటె 57
రాజు నొచ్చిన విఱిగిరి 719
రాజునొద్దఁ బలువురకు 58
రాజులనెల్ల నుగ్రసమరంబుల 287
రాధేయుండును 637
రాలియున్న పుష్పప్రకరము 277
రుచిర మణిభూషణంబులు 215
రెండవయేఁట నొక్కం 565
రోషంబు భీషణరూపమై 639
రోషమొండెను రాజ్యాభి 544
రోహిణియొండె నొండెను 133

ల

లలితంబులగు మట్టియల 187
లలితతనూవిలాసముల 76
లలిత మణిమయ విభూషణ 75
లీల నాముందట నాలేమ 199
లోకంబుతోడివారుగ 673
లోకస్తుత్యవిభూతి నవ్య 417

వ

వంజుల నైనను వల నేర్పడఁగ 47
వగ ముట్టికొనినఁ జిత్తము 313

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
వచ్చి కొలువుసొచ్చి నెచ్చెలి	114
వచ్చితి ననవుడు విని	134
వచ్చినవాఁడు ఫల్గుణుఁ డవశ్య	567
వచ్చు మదాంధవృత్తి	298
వడిగొని గోగణంబు	549
వత్సరంబునఁ గడచను	93
వనిత మనోహరంబులగు	327
వనితా యే నొకపల్కు పల్కెద	193
వనితావేషము గల్గియున్న	107
వరుచూడ్కి ముద్దియవదనంబు	759
వరుస నేనుంగులు గురిసిన	386
వలదని యెంత సెప్పినను	289
వలపలిదిక్కున కించుక	131
వలయుపదవియందు	128
వలలుం డనంగ నీ నగర	730
వలలుం డెక్కడఁ జూచె	223
వలలునిదెస మాలిని	255
వలవదు రోయఁ బాండవుల	393
వలసిన నేలు మేను	103
వసుమతీశుపాల వసియించు	62
వాఁడునుం బనిపూని యంబర	210
వానిం దీవ్రశరంబులం	669
వానిఁ దెగఁ జూడని వైతేవి	269
వానిదెసం జింత యావంత	272
వామాక్షిరుచిరలావణ్యంబు	303
వారలకు వగవవలదు	517
వారలలోన	412
వారలును వీరలును	396
వారలు పూనినట్ల వనవాసము	403
వారలు లేరటపో పెఱ	402
వారు సంభ్రమించి వడిం గోల	346
వాలమ్ములు దాఁకధరన్	623
వాలి యజ్ఞాతవాససంవత్సరంబు	748
వాలి వివిధాస్త్రవిద్యా	55
వాసవనందను డెంతయు	564
వాసవాత్మజుండు వసుధేశ	580
వింతలు సాల నీ వలన	700
వికటభ్రూకుటిఘోరఫాల	360
వికృతపుఁజావు సంప మది	335
విచ్చి చనకుండఁ బసులం	574
విచ్చిపోయి సమస్తదేశంబులుం	390
విచ్చెం దిమిరము కాఁపులు	276
విజయుండును	658
విజయుఁడు వారి నెల్ల	663
విజ్ఞానానందరసాభిజ్ఞ	456
విడియంబలుకఁగ వెండియు	243
విద్వత్సంస్తవనీయ	2
వినఁబడ దెచ్చోటను	517
వినయంబు మిగులఁ గుంతీ	737
విని ద్రుపదధరణిపతి	463
వినుతింపందగు రాజసూయ	264
విను మట్టులు గాకున్నం	548
వినుసైరంధ్రీవేషంబున	732
విపినవాసంబు నజ్ఞాత	577
విమలవంశంబునను బుణ్య	703
విరటుఁడు దక్షిణంబునకు	493
విరటుఁడు నిన్ను నెప్డు	460
విరటుఁడు సంభ్రమమును	757
విరటుడు సూచుచుండ	288
విరటుబలంబుఁ ద్రిగర్తేశ్వరు	424
విరటుమఱంది కీచకుఁడు	384
విరాటుండు పగతుండు	392
విలసద్గాండివచాలనోద్ధతి	576
విల్లును దానును శిఖ	633
వివిధదుర్నిరూపవేషముల్	393
వివిధములగు లక్ష్యంబుల	598
వివిధాలంకరణంబుల	753
విశ్రుతవాద్యంబులు	111
విహరింప మానవాకృతి	99
విహితపరిపాటితో	758
వీఁక నెదిర్చి యిట్లు కురు	670
వీఁడె వచ్చుచున్నవాఁడు	665
వీఁ డొకఁడు కురుబలంబున	641
వీటన్ వీథులనెల్లనేనుఁగులపై	694
వీనిఁ గొని గట్టి మైమఱు	508
వీనికి మార్కొన జాలెడు	154
వీనులఁ దియ్యమెక్క మును	759
వీర లిరువురు మాన్యులు	594
వీరులకుఁ జూడ బీభత్స	522
వెండియు నతండు	614
వెండియు నుడుగక రవిసుతు	640
వెక్కసపాటు భీతియును	641
వెగడొంది యిట్లు వలుకఁగ	489
వెనుకదెస వచ్చి కదిసియు	579
వెనుకొని కర్ణుని పెడతల	672
వెరవరి గాక వీఁడు కురు	500
వెఱచితిరేని నిల్వుఁ డొక	549
వెఱవక ననుఁ జూచె	169
వెఱవక సంకేతించిన	298
వెఱవకు మన్న పోటు	496
వెలయఁగ మత్స్యరాజ్య	94
వెలవెలఁ బాఱుచు వెగడొందు	494
వెలుఁగు గని కడఁగి	441
వేడ్కఁ దొడి పూసికట్టి	726
వేదములకు నఖిలస్మృతి	3
వేరమ్ము మైమఱువుఁ దొడి	473
వేఱొకతెఱఁగున నొరులకు	58
వైచుటయును సవ్యసాచియు	638
వైదికమార్గనిష్ఠమగు	10
వైదికలౌకికవిధి	755
వైరులదూతలు నెరవగు	62
శ	
శంఖభేరీరవంబులు	536
శంతనునందనునరదము	598
శక్తిస్ఫారధనంజయాయత	609
శక్రాది సురలతో సంగ్రామ	554
శత్రుంతపాదు లగు నృప	717
శత్రునృపకాలకూటము	731

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శరణాగతసంశ్రితభయ	19	సమదవారణము జంగము	216	సురపతిధృతచూడా	343
శరములు శరాసనమున	491	సమయంబు నడపినను	635	సుశర్మయు నేలినవాని	411
శస్త్రప్రకారనిపుణుం	592	సమయము నిర్ణయింప	294	సూతుఁ బదింటను నైదిట	630
శాంతనవుండు నప్డు నిజ	660	సమయసముచితకృత్యంబు	392	సూతులు దాని కియ్యకొనుచుం	351
శిక్షితచిత్రసంగర	618	సమరంబున భటులు కడన్	439	సూతులు భీతులై ద్రుపద	362
శిరము లలాటంబును	640	సమరమున గెల్చియొరు	546	సూతుశవముతోడ	361
శుభలక్షణాంగి ఈ సుందరి	229	సమవిషమవినిమ్నోన్నత	614	సూపాధ్యక్షుఁడు గలిగిన	37
శౌర్యాటోపంబున దోర్వీర్యంబున	595	సమస్తపరిజనంబులును	410	సూర్యోదయావసరమున	458
శ్రవణపుటంబులు వ్రయ్యంగ	539	సముచితంబుగాఁ బ్రవేశించి	387	సైంధవయక్షపాంచాల	77
శ్రావ్యంబై చెలఁగన్ గభీర	647	సవినయముగఁ బ్రార్థింపుఁడు	711	సైరంధ్రిదెసఁ గనుంగొని	468
శ్రీత్వశివాత్వాలంబన	344	సవినయవృత్తిఁ గొల్వ	741	సైరంధ్రి యిట్టు లనుటకు	382
శ్రీమదపాంగాలోకన	149	సవ్యసాచిం జూచి	69	సైరంధ్రీవేషంబున	50
శ్రీమదరేఖవిషాద	458	సాంవత్సరిక దత్తకాల	758	స్వర్గముననున్న రాజులు	570
శ్రీయన గౌరినాఁ బరగు	1	సాధులు సేరి నెమ్మిగ	203	స్వాంతము బాహుగర్వఘన	325
శ్రీసంపాదనచాతుర్యా	589	సారథిఁ జూచి నీవు రభసంబు	416	**హ**	
శ్రుతిసీమంతమణికి	17	సింగం బాఁకటితో	502	హయములఁ బూన్పుము	476
శ్రౌతస్మార్తనిమిత్త	33	సింగం బున్న గుహానికేత	324	హయముల మరల్పుమీ	686
ష		సింహబలుఁడు గంధర్వుల	385	హయరథదంతిసంతతి	417
షండరూపమునఁ బ్రచ్ఛన్నుఁడై	733	సింహబలుఁడు భీమసేనుండు	402	హరిమేనల్లుఁడు బాహువీర్య	744
స		సుకుమార మానసుఁడు	732	హరిహరనాథునకు	18
సన్న్యాసివేషమున	33	సుకుమారుఁ డతడు	261	హరులహేషితములు	544
సకలరురుకుమారచాప	643	సుడియుగాలిఁ బువ్వుఁబోడి	311	హస్తిపురిఁ బేరుగల	670
సచివులఁ జూచి యిప్పుడ	415	సుదతి నీమై చక్కఁజూచుట	178	హృదాహ్లాది చతుర్థ	4
సభలఁ బలుకు దీవు	633	సురగరుడఖచరవిద్యా	141		

పీఠిక

[పీఠిక విషయసూచిక- 1. అభినవ వ్యాసుడు తిక్కన- పు. 2* 2.మహామంత్రి, దండనాథుడు, కవీంద్రుడు-పు.2* 3. ఉభయ కవిమిత్రుడు- పు.2* 4. మనుమసిద్ధి రాజ్యస్థాపనాచార్యుడు- పు.4*5. రామాయణం తిక్కన ప్రయోగవాది- పు. 5* 6.పూర్ణజీవితం- పు.6* 7.హరిహరాద్వైతం శాంతిసూక్తం- పు.7* 8. ఆత్మాశ్రయకావ్యం ఆంధ్రమహాభారతం- పు.8* 9. తిక్కన కవితా దృక్పథం- పు.9* 10.తిక్కన ప్రక్రియా దృక్పథం- పు.15* 11. ఉభయ కవిత్వ తత్త్వ విచారం-పు.16* 12. హరిహరనాథ (తత్త్వ) దర్శనం- పు.19* 13. తిక్కన ఆరణ్యపర్వశేషం ఎందుకు రచించలేదు?-పు.24* 14. విరాటపర్వం హృదయాహ్లాది-పు.25* 15. చతుర్థం విరాటపర్వం- పు.28* 16. ఊర్జిత కథోపేతం విరాటపర్వం- పు.28* 17. ఊర్జితకథలో ఒదిగిన నాటకీయత- పు.30* (1) సభారంగ సప్తకం- పు.30* (2) సన్నివేశరంగాలూ - సంభాషణ శిల్పాలూ- పు.36* (3) పాత్రోచిత, సందర్భోచిత, రసోచిత సంభాషణలు- పు.43* (4) ఊర్జితకథలో యుద్ధరంగాలు- పు.50* (5) యుద్ధఘట్టాలు: వీరోక్తులు- పు.54* (6) అభినయ విద్యావిలాసం-పు.56* 18. నానారసాభ్యుదయోల్లాసి విరాటపర్వం-పు.58 (1) రస ప్రయోగోల్లాసం-పు.63* (2) పరుష లలిత రస సంయోజనం- పు.80* 19. తిక్కన శిల్పపు తెనుగుతోట- పు.73* 20.అలంకార శిల్పం- పు.75* 21.తిక్కన కళాప్రతిభలు- పు.77* 22. తిక్కన తెలుగు ముద్ర- పు.78* 23.నన్నయ తిక్కనల కవితలు: భేదసాదృశ్యాలు- పు. 79* 24. జంట పర్వాలు- పు. 80* 25.విరాటపర్వం: ధర్మోపదేశం- పు.81* (1) పంచమవేదం ఆరాధ్యం- పు.81* (2) విధి బలీయం- పు.81* (3) బోధించటం బుధుల స్వభావం- పు.82* (4) సేవాధర్మాలు యోగక్షేమ సూత్రాలు- పు.83* (5) పరదారాభిలాష పాపం- పు. 86* (6) యోద్ధల యుద్ధనీతి- పు.85* (7) సంభాషణలలో దొరలిన సాధారణ నీతులు- పు. 93* (8) భార్యను గౌరవించటం పరమధర్మం- పు.94* (9) మహాత్ముల భార్యలను అవమానిస్తే మరణం తథ్యం- పు. 94* (10) పాపాత్ముడు వంశనాశకుడు- పు.87* (11) ప్రజారక్షణం ప్రభువుల ధర్మం- పు. 87* (12) స్త్రీ సదా రక్షణీయ- పు. 87* (13) క్షమ ఉత్తమోత్తమ గుణం- పు.87* (14) మూలంలో ఉన్న కొన్నిముచ్చటైన సూక్తులు- పు.88* (15) విరాటపర్వం సూక్తి తిలకం- పు.98* 26. విరాటపర్వం ఆధ్యాత్మిక సందేశం- పు.90* (1) పాండవులు- ముక్తిసాధనశక్తులు- పు. 90* (2) అజ్ఞాతవాసం - అహంకార మమకార నాశన సాధన- పు. 90* (3) విరాటపర్వం- ప్రకృతిని బ్రహ్మమయంగా దర్శించటం- పు. 92* (4) కీచక వధ- మనశ్చాంచల్య నివారణ సాధన- పు.94* (5) దుర్యోధన దురాలోచన - తామసికవృత్తుల విజృంభణ- పు. 95* (6) గోగ్రహణ వ్యూహం - ఇంద్రియ వ్యాపారాల వశీకరణ యత్నం- పు. 95* (7) దక్షిణ గోగ్రహణం - అభయవృత్తి విజయం- పు. 95* (8) ఉత్తర గోగ్రహణం - తామసిక వృత్తులపై బుజువర్తన సాధించిన విజయం- పు.96* (9) విరాటపర్వతత్త్వం - 'సర్వం ఖల్విదం బ్రహ్మ' సాధన- పు.98* 27. కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం- పు.98* 28.విరాటపర్వ కథాసారం- పు.100*]

మ. 'హృదయాహ్లాది, చతుర్థ, మూర్జిత కథోపేతంబు, నానారసా
భ్యుదయోల్లాసి విరాటపర్వ; మట యుద్యోగాదులుం గూడఁగాఁ
బదియేనింటిఁ దెనుంగుబాస జనసంప్రార్థ్యంబులై పెంపునం
దుదిముట్టన్ రచియించు టొప్పు బుధసంతోషంబు నిండారఁగన్!' (విరా.1.7)

ఇది పదమూడవ శతాబ్ది మూడవ పాదంలో మహాకవి తిక్కన మనసులో మసలిన మహాసంకల్పం. దాదాపు రెండువందల సంవత్సరాల క్రితం (క్రీ.శ.1055 ప్రాంతంలో) నన్నయ భట్టారకుడు పదునెనిమిది పర్వాల మహాభారతాన్ని తెలుగులో రచించాలని సంకల్పించాడు. ఆయన రచన ఆరణ్యపర్వంలో ఆగిపోయింది. రెండు శతాబ్దాల తరువాత (క్రీ.శ.1255-1260 సం॥ నడుమ) తిక్కన సోమయాజి మిగిలిన పదునేను పర్వాల భారతాన్ని పూర్తి చేయవలసిన అవసరాన్ని గుర్తించి, ఆ మహా సాహిత్యయజ్ఞాన్ని చేపట్టాడు. తెలుగువారి సాహిత్య చరిత్రలో అదొక సువర్ణఘట్టం!

1. అభినవ వ్యాసుడు తిక్కన

మహాకవి తిక్కన మహోన్నత వ్యక్తిత్వాన్ని మహనీయంగా చిత్రించిన మారన - ఆయనను 'నవీనపరాశరసూను' డని ప్రశంసించాడు.

చ. "ఉభయ కవిత్వతత్త్వ విభవోజ్జ్వలు, సంహితాధ్వరక్రియా
ప్రభు, బుధబంధు, భూరిగుణబంధురు, భారతసంహితా కథా
విభుఁ, బరతత్త్వబోధను, నవీన పరాశరసూను, సంతత
త్రిభువన కీర్తనీయయశుఁ దిక్కకవీంద్రునిఁ గొల్తు నర్థితోన్" (మార్కండేయపురాణం-పీఠిక.10)

ఈ పద్యంలోని ప్రతిపదం సార్థకం! మనిషిగా, మనీషిగా, మహాకవిగా త్రిముఖాత్మకమైన తిక్కన మూర్తిమత్త్వం ఇందులో ముచ్చట కొలుపుతుంది. మన్నన గల మనిషిగా తిక్కన వేదవిహిత యజ్ఞక్రియలను నిర్వహించిన వైదికకర్మాధికారి, పండితుల కందరికీ ఆత్మబంధువు అపార గుణనిధి, త్రిలోక కీర్తిసాంద్రుడు. మహాత్ముడైన మనీషిగా ఆయన భారత సంహితాకథావిభుడు, పరతత్త్వ బోధకుడైన పరమజ్ఞాని. మహాకవిగా తిక్కన - కవీంద్రుడు, ఉభయ కవిత్వతత్త్వ విభవోజ్జ్వలుడు. ఒక్కమాటలో చెప్పాలంటే 'అభినవపరాశరసూనుడు' అంటే ఆంధ్రులకు అభినవ వ్యాసుడు. కాబట్టే మహాభారతాన్ని రచించి ముగించాలన్న మహాకవిత్వ దీక్ష చేపట్టగలిగాడు. ఈ పద్యంలో అతిశయోక్తి లేదు: అంతా స్వభావోక్తియే!

2. మహామంత్రి, దండనాథుడు, కవీంద్రుడు

వంశపారంపర్యంగా వచ్చిన విశిష్టగుణాలు తిక్కనకు కావ్యతంత్రాన్నీ, రణతంత్రాన్నీ, రాజ్యతంత్రాన్నీ నేర్పాయి. జీవిత చరిత్ర నేర్పిన పాఠాలు అతడిని యుగపురుషుడిగా తీర్చిదిద్దాయి. తిక్కన ఇంటిపేరు కొట్టరువు వారని కేతన దశకుమార చరిత్రలో చెప్పాడు. తిక్కన పూర్వీకు లెవ్వరో కోశాధికారులుగా ఉన్నట్లు ఆ మాట సూచిస్తున్నది. తిక్కన వంశానికి మూలపురుషుడుగా చెప్పబడుతున్న మావెన 'సుంకవెగ్గడ' (పన్నులను వసూలుచేసే మంత్రి) కావటం దీనిని ధ్రువపరుస్తున్నది. మావెన పుత్రుడు గుండశౌరి, అతడి కొడుకు కేతన. అతడికి గుండన, భాస్కరమంత్రి, మహేశ్వరుడు అనే ముగ్గురు కుమారులు. వారిలో భాస్కరమంత్రి 'సారకవితాభిరాముడు, గుంటూరు విభుడు', పూర్వరామాయణ కావ్యకర్త, కవి తిక్కనకు తాత. ధనదపురం (చందవోలు) రాజధానిగా ఏలిన వెలనాటి చోడరాజు పృథ్వీశ్వరుడి ప్రతినిధిగా మంత్రి భాస్కరుడు గుంటూరు సీమ నేలాడు. అటు ప్రభుత్వం, ఇటు కవిత్వం - తాతగారి పోలికలు తిక్కనకు సారవంతంగా సంక్రమించాయి.

మంత్రి భాస్కరుడికి నలుగురు కొడుకులు - కేతన, మల్లన, సిద్ధన, కొమ్మనలు. నలుగురూ దిగ్దంతులే. వారిలో పెద్దవాడు కేతన పద్యకాదంబరీ కావ్యకర్త. మల్లన వివరాలు తెలియవు. చివరి ఇద్దరూ చరిత్రకెక్కిన ప్రసిద్ధులు. సిద్ధన నెల్లూరు నేలే తెలుగు చోడ ప్రభువైన తిక్కన భూపాలుడి వద్ద మంత్రిగా, సేనాపతిగా కుదురుకొన్నాడు. అతడి కొక కొడుకు. అతడి పేరూ తిక్కనే. తండ్రివలె అతడూ దండనాథు డయ్యాడు. భండనభీముడైన అతడు ఖడ్గతిక్కనగా పేరుపొందాడు.

మంత్రి భాస్కరుడి మరణానంతరం కొమ్మన నెల్లూరికి చేరి అక్కడ స్థిరపడి ఉంటాడు. ఆయన భోగమానాలకూ, రూపదానాలకూ, ధైర్యసత్యాలకూ, శౌచశౌర్యాలకూ ప్రసిద్ధి కెక్కాడు. ఆయనకు అన్నమయందు జన్మించిన తిక్కన విక్రమసింహపుర (నెల్లూరు) నివాసిగా వర్ధిల్లాడు. సిద్ధన వలె తిక్కన మంత్రిగా, దండనాథుడుగా, తాతవలె కవీంద్రుడుగా ముప్పేటగా తన మూర్తి మత్త్వాన్ని పెంచుకొన్నాడు. తిక్కరాజు మరణించిన తరువాత మనుమసిద్ధి నెల్లూరులో ప్రభువయ్యాడు. వయసులో అతడికంటె తిక్కన పెద్ద. అందువలన మనుమసిద్ధి అతడిని 'మామా' అని గౌరవంగా చనువుగా పిలిచేవాడు. ఖడ్గతిక్కన అతడి కాలంలో దండనాథుడుగా ఉండేవాడు. అతడు కాటమరాజుతో జరిగిన పుల్లరిపోరులో వీరమరణం పొందాడు. ఆ తరువాత తిక్కనయే మనుమసిద్ధి ఆస్థానంలో వంశపారంపర్యంగా వచ్చే మహామంత్రి పదవినీ, దండనాథపదవినీ, ఆస్థాన కవీంద్ర పదవినీ చేపట్టి ప్రశస్తి పొందాడు.

3. ఉభయకవి మిత్రుడు

తిక్కన మంత్రి పదవి చేపట్టేనాటికి, ఆ తరువాత కూడా ఆయనకు 'ఉభయకవిమిత్రుఁడు' అనే బిరుదం బుధవర్గంలో బాగా ప్రచారంలో ఉండేది. తిక్కన చివరిదాకా తన కృతులలో తప్పక నిలుపుకొన్న మక్కువబిరుద మది.

క. 'అభినుతుఁడు మనుమభూవిభు। సభఁ దెనుఁగున సంస్కృతమునఁ జతురుండై తా
నుభయకవిమిత్రనామము। త్రిభువనమున నెగడ మంత్రి తిక్కఁడు దాల్చెన్" (దశకు.1.6)

అని తిక్కన మిత్రుడు, ఒక దుర్గాధిపతి, అభినవదండి బిరుదాంచితుడు అయిన మూలఘటిక కేతన తిక్కన కంకితమిచ్చిన దశకుమార చరిత్ర కావ్యావతారికలో పేర్కొన్నాడు. సమకాలీనకవి కేతన చెప్పిన వివరణనుబట్టి తిక్కన మనుమసిద్ధి సభలో తెలుగులోనూ, సంస్కృతంలోనూ చాతుర్యం ప్రకటించటంవలన సంస్కృతాంధ్ర కవులకు ఆయన మిత్రుడుగా పిలువబడ్డాడని తెలుస్తున్నది. భాషానైపుణ్యం, కవితాచాతుర్యం ప్రకటించటం వేరు; కావ్యకళాశిల్పం ప్రదర్శించటం వేరు. అయినా, మనకు తెలిసినంతవరకు స్వయంగా మహాకవి అయిన మహామంత్రిగా కవిత్వాన్నీ, కవులనూ ఉభయభాషలలో ఆదరించి ప్రోత్సహించిన వాడూ, కృతిభర్తగా కవుల మన్నన పొందినవాడూ తిక్కన. కేతన తన దశకుమారచరిత్రలో తిక్కన వ్యక్తిత్వాన్ని విస్తృతంగా చిత్రించాడు.

తిక్కన 'మనుమసిద్ధి మహీశ సమస్త రాజ్యభారధౌరేయు'డైనా, 'దీనజనతానిధాన' మైన మానవతామూర్తి.

సీ. "సుకవీంద్ర బృంద రక్షకుఁ డెవ్వఁడనిన, వీఁ। డను నాలుకకుఁ దొడవైనవాఁడు.
చిత్త నిత్యస్థిత శివుఁ డెవ్వఁడనిన, వీఁ। డను శబ్దమున కర్థమైనవాఁడు;
దశదిశావిశ్రాంతయశుఁ డెవ్వఁడనిన, వీఁ। డని చెప్పుటకుఁ బాత్రమైనవాఁడు;
సకల విద్యాకళాచణుఁ డెవ్వఁడనిన, వీఁ। డని చూపుటకు గుఱియైనవాఁడు;

తే. మనుమసిద్ధి మహీశ సమస్త రాజ్య। భారధౌరేయుఁ, డభిరూప భావభవుఁడు,
కొట్టరువు కొమ్మనామాత్యు కూర్మిసుతుఁడు,। దీనజనతా నిధానంబు తిక్కశౌరి". (దశకు.1.89)

మహామంత్రులైనా తిక్కనవలె కృతిపతిత్వం, కవితాప్రావీణ్యం, అగ్రహారదానం, బహుయాగ దక్షిణల ప్రదానం నిర్వహించగలవారు మరొకరు లేరని కేతన కీర్తించాడు.

సీ. "సరస కవీంద్రుల సత్ప్రబంధము లొప్పఁ। గొనునను టధిక కీర్తనకుఁ దెరువు;
లలిత నానాకావ్యములు చెప్పు నుభయభా। షలయందు సనుట ప్రశంస త్రోవ;
యర్థిమైఁ బెక్కూళ్ళ నగ్రహారంబులు। గా నిచ్చుననుట పొగడ్త పొలము;
మహిత దక్షిణలైన బహువిధయాగంబు। లొనరించు ననుట వర్ణనము చొప్పు;

తే. పరుని కొకనికి నన్నియుఁ బ్రకటవృత్తి। నిజములై పెంపు సొంపార నెగడు నెట్టు?
కొమ్మనామాత్యు తిక్కన కొలఁది సచివుఁ। డింక నొక్కరుఁ డెన్నంగ నెందుఁ గలఁడు?" (దశకు.1.93)

కేతన మాటలలో తిక్కన - వేదాది సమస్త విద్యాభ్యాస విభాసి (1.87), బహుకళా సంపన్నుఁడు (1.88), సకల విద్యాకళాచణుఁడు (1.89), తెనుఁగున సంస్కృతమున చతురుఁడు (1.91), విద్యావైశారద్యసముద్ద్యోతిత మతి (1.98), సకలాగమార్థ తత్త్వ విచారోదా

రుఁడు (2.119), అనితర గమ్య వాఙ్మయ మహార్ణవ వర్తన కర్ణధారుఁడు (8.194), విద్యానిధానము (10.192), మయూర సన్నిభ మహాకవి (1.6), సారకవితానిర్మాణ చాతుర్యుఁడు (7.164), కావ్యకళాజనిభూమి (5.134), భారవికల్పుఁడు (9.85), ఆర్య భోజుఁడు (2.20)

కవుల దృష్టిలో తిక్కన - కవిజన రాజకీర సహకారము (1.8), కవిసరోజమార్తాండుఁడు (1.99), కవీంద్రలోకాధారుఁడు (2.119), పోషిత సత్కవీంద్రుఁడు (4.128), కవిలోక చాతక వ్రజ నవజలద స్తనిత భాషణ ప్రకరుఁడు (9.85).

కేతన తిక్కనను కీర్తిశాలిగానూ, విద్యాకళాపారగుడుగానూ, ధైర్యగాంభీర్యాది గుణసంపన్నుడుగానూ, మహాదాతగానూ, వైభవ సంపన్నుడుగానూ, సుందరాకారుడుగానూ, జితేంద్రియుడుగానూ, తేజోమహితుడుగానూ, వేదవిద్యాప్రవీణుడుగానూ, యజ్ఞాచరణపరుడుగానూ, నీతివిద్యానిపుణుడుగానూ, శివభక్తితత్పరుడుగానూ, పద్యాది త్రివిధ కావ్య పారీణుడుగానూ, కృతికర్తగానూ, కృతిభర్తగానూ, ఉభయకవిమిత్రుడుగానూ కీర్తించాడు. (చూడు; పీఠిక: ఆంధ్రమహాభారత సంశోధిత ముద్రిత ప్రతి - ఉ.వి.)

4. మనుమసిద్ధిరాజ్య స్థాపనాచార్యుడు

తిక్క భూపాలుడి తరువాత మనుమసిద్ధి రాజ్యానికి వచ్చినా అతడు కుదురుగా గద్దెమీద ఉండలేకపోయాడు. సామంతుల స్పర్ధలు. దాయాదుల కుట్రలు అతడిని పదభ్రష్టుడిని చేశాయి. కాకతీయ సామ్రాజ్యంలో వెలనాటి చోడులూ, తెలుగు చోళులూ సామంతులుగా ఉండేవారు. మనుమసిద్ధి తండ్రి తిక్కరాజు వెలనాటి చోడరాజైన పృథ్వీశ్వరుడిని యుద్ధంలో చంపాడు. అతడి తరువాత రాజైన కులోత్తుంగ రాజేంద్ర చోళుడు నెల్లూరిమీద పగబట్టి సమయంకొరకు ఎదురుచూచాడు. తిక్కరాజు చనిపోయిన తరువాత మనుమసిద్ధి దాయాదులైన అక్కన బయ్యనలు అతడిపై కుట్రచేసి తిరుగబడ్డారు. వారికి కులోత్తుంగ చోళుడు పరోక్షంగా సాయం చేశాడు. మనుమసిద్ధి పదభ్రష్టుడయ్యాడు. తిక్కన అతడిని అజ్ఞాతవాసంలో ఉంచి, తాను వేలకొలది శిష్యులతో కూడుకొని కాకతి గణపతిదేవచక్రవర్తిని దర్శించటానికి ఓరుగల్లు బయలుదేరాడు. గణపతిదేవుడు తిక్కనను సగౌరవంగా ఆహ్వానించాడు. తిక్కన గణపతిదేవుడి సభలో వ్యాసభారతాన్ని వివరించి చెప్పాడు. భారత వీరుల యుద్ధచరిత్రలను వర్ణించి చెప్పాడు. ఆ ఇతిహాసంలోని ధర్మనీతి తత్త్వాలను వ్యాఖ్యానించి చెప్పాడు. అనుమకొండనుండి వచ్చిన బౌద్ధులను వాదంలో ఓడించాడు. జైనుల వాదాలను ఖండించాడు. అభినవ శంకరుడివలె ధర్మాద్వైత స్థితిని ప్రవచించాడు. గణపతిదేవుడు తిక్కనను పూజించి అతడి కోరిక నడిగాడు. తిక్కన నెల్లూరిలోని రాజకీయ స్థితిని వివరించాడు. గణపతిదేవుడు సానుకూలంగా స్పందించాడు. అపారసేనలతో బయలుదేరి ముందుగా వెలనాటి చోడుడైన కుళోత్తుంగ చోడుని దండించి, అక్కన బయ్యనలకు సాయం అందకుండా చేశాడు. ఆపైన అక్కన బయ్యనలను ఓడించి నెల్లూరులో మనుమసిద్ధిని పునఃప్రతిష్ఠించాడు. ఈ విజయగాథలో మంత్రిగా, రాయబారిగా, హితుడుగా, రాజనీతివిదుడుగా, దండనాథుడుగా, కార్యచతురుడుగా చక్రం తిప్పిన తెలుగుచాణక్యుడు తిక్కనామాత్యుడు. అందుకే అతడు మనుమసిద్ధిరాజ్య స్థాపనాచార్య డయ్యాడు. క్రీ.శ. 1250లో జటావర్మ సుందరపాండ్యుడు నెల్లూరుపై దాడిచేసినట్లు తెలుస్తున్నది. ఆ దాడినికూడా మనుమసిద్ధి తిప్పికొట్టాడు. ఏమైనా ఈ పరిస్థితులన్నీ క్రీ.శ.1253 నాటికి కుదుటపడ్డాయి. ఈ కథంతా కాసె సర్వప్ప రచించిన ద్విపద సిద్ధేశ్వర చరిత్రం (15వ శతాబ్ది)లో, కూచిమంచి జగ్గకవి రచించిన సోమదేవ రాజీయం (18వ శతాబ్దం) లోనూ వర్ణించబడి ఉన్నది.

మనుమసిద్ధి పునఃపట్టాభిషిక్తుడై నెల్లూరు నేలటం మొదలుపెట్టిన తరువాత కాలం ప్రశాంతంగా నడిచింది. మహామంత్రి తిక్కన చరిత్రలో మహాకవి చరిత్ర పురివిప్పుకొన్నది.

తిక్కన జీవితంలో పదమూడో శతాబ్ది మూడో పాదం ఒక గొప్ప పరివర్తన కాలం. నిర్వచనోత్తర రామాయణ రచనం, హరిహరాద్వైత దర్శనం, ఆంధ్ర మహాభారత రచనం అనే ఘట్టాలు ఆ పరిణామాలకు మైలురాళ్ళు. ఈ పరిణామంలోనే తిక్కన సోమయాజి కావటం పతాకస్థానం.

కృతిభర్త అయిన తిక్కన కృతికర్త కావటానికి ఒక భూదేవుడి అభ్యర్థన, ఒక దేవదేవుడి సంభావన హేతువులు కావటం విశేషం. మనుమసిద్ధి తిక్కనను 'మామా' అని పిలిచినందుకు సార్థకతను కల్పించుమని కోరాడట! అతడు ధీరోదాత్తుడనీ, శ్రీరాముడివంటివాడనీ భావించిన తిక్కన నిర్వచనోత్తర రామాయణ కన్యను కృతినిచ్చి రాజుమనసు రంజింపచేశాడట! నరాంకితానికి కూడా ఒక నాణ్యమైన విలువనిచ్చిన కార్యమది. మనుమసిద్ధి కిచ్చిన కృతివలన స్నేహం కృతార్థమైనదని భావించాడు తిక్కన. ఆ తరువాత కలలో ప్రత్యక్షమైన హరిహరనాథస్వామి తిక్కన కవిత్వానికీ, వైదికమార్గ నిష్ఠమయిన వర్తనానికీ; అభేద భక్తికీ, ధర్మాద్వైత స్థితికీ మెచ్చి భారతాన్ని కృతిగా ఇమ్మని కోరాడు. తిక్కన తన కవిత్వం, తన పుట్టుకా కృతార్థత చెందినట్లు భావించి, భారతాన్ని స్వామికి అంకితం చేశాడు. నరాంకితంతో అర్థకామాలను ధర్మనిష్ఠం చేశాడు. దైవాంకితంతో పురుషార్థత్రయిని మోక్షలక్షితం చేశాడు. తిక్కన పరిపూర్ణ జీవితాన్ని సాధించాడు.

5. రామాయణంతిక్కన ప్రయోగవాది

కవిగా తిక్కన వ్యక్తిత్వాన్ని సమీక్షించేటప్పుడు రామాయణంతిక్కన, భారతంతిక్కన - అని రెండు భాగాలుగా ఆలోచించవలసి వస్తుంది. ఒక విధంగా తిక్కన కవిత్వ జీవితంలో ఈ రెండూ పూర్వార్ధం, ఉత్తరార్థం అనదగినవి. పూర్వార్ధంలో తిక్కన కావ్య ప్రయోగరంగంలో ప్రదర్శించిన తీరులు, ఉత్తరార్ధంలో తిక్కన ప్రకటించిన తీర్పులు గమనించదగినవి.

రామాయణంతిక్కన తీరు విచిత్రంగా ఉంటుంది. ఆయన పూర్వ రామాయణాన్ని వదలి ఉత్తర రామాయణాన్ని ఎన్నుకొనటం మొదటి చిత్రం. అతడి తాత మంత్రి భాస్కరుడు పూర్వ రామాయణం రచించాడు కాబట్టి, దానికి అనుబంధంగా ఉత్తర రామాయణం రచించానని తిక్కన చెప్పుకొన్న కారణం. అయినా 'మామా' అని పిలిచిన మనుమసిద్ధికి శుభమా అని ఉత్తర రామాయణం ఏమిటి? అనే అనుమానం విబుధులకు కలుగుతుంది. విషాదాంత కావ్యాన్నిచ్చిన అనౌచిత్యం తొలగేందుకు తిక్కన అందులోని కథను మోదాంతం చేశాడు. రెండవ విచిత్రం - ఆ కావ్యాన్ని నిర్వచనంగా పద్యాలలోనే వ్రాయటం. మూడవ విచిత్రం ఏమంటే - నిర్వచనోత్తర రామాయణం ఏకనాయకం, ఏకవస్తుకం అయిన కావ్యం కాకపోవటం. ఈ మూడో అంశం కొంచెం శ్రద్ధతో గమనించదగింది.

తిక్కన తనకు ముందున్న సంస్కృత, కన్నడ, తెలుగు సాహిత్యాలలోని ప్రయోగాలను పరిశీలించిన తరువాత తెలుగులో కథాకావ్యప్రక్రియను ప్రవేశపెట్టి వివిధ ప్రయోగాలు చేయాలనీ, చేయించాలనీ పూనుకొన్నట్లు స్పష్టమౌతుంది. నిర్వచనోత్తర రామాయణం రెండు కత్తులను తనలో ఇమిడ్చుకొన్న ఒరవలె గోచరిస్తుంది. ఈ సత్యాన్ని చాలామంది విమర్శకులు పేర్కొన్నారు. ఒకరిద్దరి అభిప్రాయాలు గమనిద్దాం.

(1) "నిర్వచనోత్తర రామాయణం నందలి మొదటి యేడాశ్వాసముల కథకును నాయకుడు రావణుడు. చివరి మూడాశ్వాసముల కథకును నాయకుడు శ్రీరాముడు... ఇరువురు నాయకుల నాశ్రయించుకొని రెండు కథలతో నున్న యొక గ్రంథమున కొక యేకవాక్యతగాని, ఒక రసముగాని యుండదు. నిర్వచనోత్తర రామాయణము మహాకావ్యము కాదు... రెండు లఘు కావ్యముల సంపుటి" - (డా.కేతవరపు వేంకట రామకోటిశాస్త్రి: తిక్కన కావ్యశిల్పము పు.20,22)

(2) "నాయకుని కథకంటే ప్రతినాయకుని కథయే కావ్యమునందు అధికభాగమును ఆక్రమించియున్నది." - (డా॥ పాటిబండ మాధవశర్మ: ఆం.ప్ర.సా.అ. ప్రచురణ, నిర్వచనోత్తర రామాయణం: పీఠిక. పు.45)

(3) "అష్టమాశ్వాసం నుండి దశమాశ్వాసం వరకూ గల మూడేమూడు ఆశ్వాసాలలో తెలిపిన ఒక లఘుకథకు ఉత్తర రామాయణమని పేరుపెట్టడంలో ఔచిత్యమేమిటో విచారణ చేయవలసిన అవసరమూ ఉంది" - (శ్రీ ఆవంత్స సోమసుందర్ - తిక్కన తిరునాళ్ళ సంచిక: పు.42).

ఈ మాటలు గమనిస్తే తిక్కనకు ఒక నాయకుడు, ఒక కథ (కార్యం), ఒక అంగిరసం అనే సిద్ధాంతంపట్ల అంతగా సౌముఖ్యం లేదనిపిస్తుంది. అది ఆ కాలప్రభావం కావచ్చును. పంపయుగంలోనూ, బసవయుగంలోనూ మహాపురుషుల కథలతోపాటు జైన శైవభక్తుల కథలకు కన్నడ కావ్యాలలో గణనీయమైన స్థానం లభించింది. తమిళ సాహిత్యంలో నాయనార్ల కథలకూ, ఆళ్వార్ల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వృత్తాంతాలకూ ప్రాచుర్యం కలిగింది. తెలుగులో పాల్కురికి సోమనాథుడు పురాణంలోనూ, చరిత్రకావ్యంలోనూ కథలకు కనకాభిషేకం చేశాడు. తనచుట్టూ ఉన్న సాహిత్య చైతన్యాన్ని గమనించిన తిక్కన పెద్దకథగల కావ్యం కంటె, చిన్నకథల కదంబంగా ఉండే కృతి ప్రజలకు నచ్చుతుందని భావించి ఉంటాడు.

తిక్కన ఈ అభిమతాన్ని తనవరకే పరిమితం చేసికొనలేదు. అతడి మిత్రుడు మూలఘటిక కేతనను ప్రోత్సహించి దశకుమార చరిత్రను రచింపించి, తానే కృతిపతి అయి, కృతికర్తకు 'అభినవదండి' బిరుదాన్ని ప్రదానం చేశాడు. కేతన కవితాకళలో అంతగా కాకలుతీరిన వీరుడు కాడు. అయినా తెలుగులో తొలి కథాకావ్యాన్ని సంతరించాడు. తిక్కన దానిని ప్రోత్సహించాడు. దానికి కారణం తిక్కనకు స్వయంగా కథాకావ్యమంటే ఇష్టం. ఆ ఇష్టమే ఉత్తర రామాయణ రచనకు దారి తీసింది.

తిక్కన శిష్యుడు మారన - తిక్కన నిర్యాణానంతరం - మార్కండేయ పురాణం రచించాడు. అది రసవత్తర కథాప్రపంచం, రమణీయ కథాసంహిత. తిక్కన యుగంలోని మంచన రచించిన కేయూరబాహు చరిత్ర నీతికథలకు కాణాచి. వీరిమీద తిక్కన ప్రభావం ఉన్నది. ఉత్తర రామాయణంవలె ఉత్తర హరివంశాన్ని రచించిన నాచన సోముడు కూడా వంశకథాకావ్య ప్రక్రియను చేపట్టటానికి తిక్కన కథాకావ్య దృక్పథమే దోహదం చేసింది.

తిక్కన కథాకావ్య దృక్పథమే ఆంధ్రమహాభారతాన్ని 'ప్రబంధమండలి'గా సంభావింపజేసి ఉంటుంది. కావ్యరసాన్ని కొనియాడే తిక్కనకు 'నానారసాభ్యుదయోల్లాసా'న్ని కలిగించి ఉంటుంది. తిక్కన మహాకావ్యదీక్షావిధి చేపట్టకపూర్వం కథాకావ్య రచనాపేక్ష బలంగా ఉండేది. దానితో తన జీవిత పూర్వార్ధంలో ఒక ఉద్యమాన్నే నిర్వహించాడు: 'కవిబ్రహ్మ' అనిపించుకొన్నాడు.

నిర్వచనోత్తర రామాయణ కవితాశిల్పానికి ఉన్న గౌరవం ప్రక్రియకు లేదు. తిక్కన తాను రచించింది మహాకావ్యమని చెప్పుకొన్నా "కావ్యమే కాజాలని గ్రంథము విషయమున మహాకావ్య ప్రసక్తియే లేదు. ఒక ప్రధాన ఫలమును సాధించుట నభిలషించిన నాయకుని చిత్తవృత్తి రూపమైన కథావస్తు వొకటి నిర్వచనోత్తర రామాయణమున సంధి సంధ్యంగ విన్యాసము కలిమిని నిర్మింపబడలేదు గనుక నది మహాకావ్యము కాజాలదని'' విమర్శకు గురి అయింది. (తిక్కన కావ్యశిల్పము-పు20). ప్రక్రియ బలం కలిగింది కాకపోయినా కవితాశక్తిచేత ఆ కావ్యం నేటికీ మనగలుగుతున్నది. దానికి కారణం పింగళి లక్ష్మీకాంతం గారి మాటలలో "తిక్కన భారతమును రచింపకపోయినను, ఈ రామాయణం వల్లనే ఆంధ్రసాహిత్య లోకమున శాశ్వతమైన యశమునకు భాజనమయ్యెడివాడు. కాని, భారత రచనవల్ల తెనుగున ఏ కవికి అందని బ్రహ్మపదమును చేబట్టి కవిబ్రహ్మ యయ్యెను. ఈ రామాయణమున అట్టి పదవి లభింపకున్నను కావ్యశిల్ప పారంగతుడైన మహాకవిగా పేరు పొందెడివాడు'' (ఆంధ్రసాహిత్య చరిత్ర - పు. 204, 205).

13 వ శతాబ్ది నడిమికాలంలో తిక్కన తెలుగు సాహిత్యంలో కథాకావ్య ప్రక్రియను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాడు. రామాయణం తిక్కన ప్రయోగప్రియుడు. ఉత్తరరామాయణాన్ని కథాసంపుటిగానేకాక కార్యకారణ సంబంధమైన కథా నిర్వహణపద్ధతిలో సాగించి మోదాంతంగా ముగించి కీర్తిని గడించటానికి యత్నించాడు. అయినా, ఈ ప్రయోగం అంతగా సఫలం కాలేదు. నిర్వచన రచనా పద్ధతి అనుయాయులను ఆకర్షించలేక అంతటితో ఆగిపోయింది. కవితాశైలి తరువాతి కవులలో "తన కావించిన సృష్టి తక్కొరులచేతం గాదు నాన్'' ఆశ్చర్యంలో ముంచి ఆరాధించటానికే పనికివచ్చింది కాని, అనుసరించటానికి అనువుగా మిగలకపోయింది. అయినా, అద్భుత కథాకావ్య రచనా వ్యాసంగంమాత్రం కొంత ప్రాచుర్యాన్ని పొందింది కాని,కళాగౌరవాన్ని పొందలేదు. రామాయణంతిక్కన ప్రయోగవాదిగాకంటె కవిగా తన శైలిని నిలుపుకొన్నాడు. తరువాత ఆ కవితాశక్తితో మరొక ప్రసిద్ధ ప్రక్రియను చేపట్టి యశస్సు గడించగలిగాడు. ప్రక్రియ ఫలవంతం కాకపోయినా కవిత్వంతో కవి బ్రదుకవచ్చు నన్నది తిక్కన కవిజీవిత పూర్వార్ధం చెప్పిన చక్కని గుణపాఠం!

నిర్వచనోత్తర రామాయణంలో అగస్త్యుడు చెప్పిన రాక్షసవంశ చరిత్ర విన్న శ్రీరాముడు "మసలితిరి విచిత్ర కథారసవృత్తిం దడవెఱుంగరాక'' (7.134) అని హెచ్చరించాడు. తెలుగులో చెప్పిన ఆ రామాయణకర్త తిక్కన కూడా సగం జీవితం చెల్లేదాకా విచిత్ర కథారసవృత్తిలో ఉండిపోయాడు.

నన్నయభారతం కన్ను తెరిపించేంతవరకూ తిక్కన తీరు ఇంతే.

6. పూర్ణజీవితం

తిక్కన కాల నిర్ణయంలో కొన్ని చిక్కులున్నా క్రీ.శ. 1205 లేక 1210 నుండి 1288 వరకు (78 సంవత్సరాలు లేదా 83 ఏళ్ళు సహస్రచంద్రదర్శనం చేసేంతవరకు) పూర్ణజీవితం నిర్వహించాడని చారిత్రకులు భావిస్తున్నారు. మనుమసిద్ధి తండ్రి తిక్కరాజు 1190 నుండి 1252 వరకు రాజ్యం చేసినట్లు తెలుస్తున్నది. అంతకు ముందు ఒకటి రెండేళ్ళు మనుమసిద్ధి రాజకార్యాలను చక్కదిద్దుతూ ఉన్నా, తండ్రి గతించిన కాలంలో దాయాదుల కుట్రలకు గురియై కొంతకాలం అజ్ఞాతంలో ఉండి మరల బైటపడి, తేరుకొని, స్థిరపడేసరికి 1253 వరకూ పట్టి ఉండవచ్చును. 1255 నాటికి తిక్కన నిర్వచనోత్తర రామాయణం రచించి మనుమసిద్ధికి అంకితం ఇచ్చి ఉంటాడు. 1255-1260 సంవత్సరాల నడుమ మహామంత్రిగా తిక్కన ఆంధ్రదేశంలోని మత పరిస్థితులను గమనించి సంక్షోభపడి ఉంటాడు. మనుమసిద్ధి భూపాలుడు క్రీ.శ. 1260లోనో 1263లోనో దివంగతుడైనట్లు భావింపబడుతున్నది. 1260 నాటికి తిక్కన హరిహరాద్వైత దర్శనాన్ని తెలుగునాట ప్రచారం చేసి, మతపరంగా శాంతిదూతవలె ప్రవర్తిల్లాడు. మనుమసిద్ధి రాజ్య సంస్థాపనాచార్యకత్వం 13వ శతాబ్దిలో తెలుగు మహామంత్రి తిక్కన ప్రదర్శించిన రాజకీయ చాతుర్యం ప్రకటించగా, హరిహరనాథతత్త్వం ఆ తెలుగు మహామనీషి ప్రవచించిన శాంతి ప్రబోధం వలె వినిపిస్తుంది. ఆ తరువాత హరిహరనాథుడి కంకితం చేసిన మహాభారతం తిక్కన మహాకవి జాతికిచ్చిన ధార్మిక సందేశంవలె కావ్యకళాశిల్ప ప్రస్థానంవలె ప్రకాశిస్తుంది. మనుమసిద్ధి మరణానంతరం తిక్కన మంత్రిపదవి వదలి, యజ్ఞం చేసి సోమయాజి అయి, భారతాన్ని రచించి ఉంటాడు. 1255 నుండి తెలుగునాట భారత రచనావసరం తలయెత్తినట్లున్నది. కృతితోపాటు కృతిపతికూడా అవతరించవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అప్పటినుండి దాదాపు మూడు దశాబ్దాలు మహాభారత రచన సాగి ఉంటుంది. తిక్కన విరాటపర్వం దాదాపు 50 సంవత్సరాల వయసులో మొదలై ఉండవచ్చును. లేకపోతే అంతటి జిగి, బిగి, నానారసాభ్యుదయోల్లాసం మరొక వయస్సులో సాధ్యం కాదు. ఉద్యోగపర్వం ముగిసేనాటికి షష్టిపూర్తి అయి ఉండవచ్చును. లేకపోతే అంతటి రాజనీతి పరిపక్వత అందులో ప్రతిఫలించదు. యుద్ధషట్కం ముగిసేనాటికి 70వ పడిలో పడిఉండవచ్చును. శాంతిపర్వం నాటికి అంపశయ్యమీది భీష్ముడివలెనే 75 సంవత్సరాల వాడయి ఉండవచ్చును. పండిన విజ్ఞానఖని శాంతిపర్వ తిక్కన. ఆ తరువాత త్వరత్వరగానే చివరి పర్వాలు ముగించి ఉండవచ్చును. ఆంధ్ర మహాభారతం పూర్తికావాలన్న సంకల్పం పూర్ణఫలాన్ని పొందిన పూర్ణజీవితం తిక్కన సోమయాజిది.

7. హరిహరాద్వైతం శాంతిసూక్తం

వేదవిహితమైన జీవనధర్మం సమాజంలో ఎప్పుడు సంక్షోభానికి గురి అవుతుందో అప్పుడు పంచమవేదమైన మహాభారతం ఏదో ఒక రూపంలో అవతరిస్తుంది. నన్నయ తరువాత రెండు శతాబ్దాలకు అటువంటి పరిస్థితులే మరల దేశంలో నెలకొన్నాయి. నన్నయకాలంలో జైన బౌద్ధాల వలన వైదికమైన గృహస్థ ధర్మం సమాజంలో కుంటుపడింది. దానిని పునరుద్ధరించటానికి భారత రచన చేపట్టాడు నన్నయ. తిక్కన కాలంలో శైవ వైష్ణవాలు సంఘర్షణపడి సమాజంలో వైదికమైన జీవనతత్త్వాన్ని స్వీయమతానుగుణంగా వ్యాఖ్యానించి పరస్పర ద్వేషభావంతో మతకలహాలను కల్పించి రక్తపాతం సృష్టించాయి. బసవేశ్వర ప్రోక్తమైన వీరశైవం ఒకవైపు, పండిత ప్రోక్తమైన ఆరాధ్యశైవం మరొకవైపు, రామానుజ ప్రోక్తమైన వైష్ణవం మరొకవైపు, దానిలోని తెగలు మరొకవైపు ఆంధ్రదేశంలో వ్యాపించి, సంఘంలో తమ తమ ప్రాచుర్యాలను నిలువబెట్టుకొనటానికి వ్యూహాలు పన్నటం సాగించాయి. ఈ మతాలన్నిటికీ భక్తి మూలాధారం. శైవులు శివుడే పరదైవమనీ, వైష్ణవులు విష్ణువే మూలదైవమనీ భావించి, అన్యదేవతాశ్రవణ దర్శనాదులను నిషేధించి, అన్యమతావలంబులను గర్హించి, స్వీయమత చిహ్నాలైన లింగధారణ, ముద్రాధారణాదులవంటి బాహ్యాచారాలకు అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చి, లింగం ధరించిన జంగములనూ, ఊర్ధ్వపుండ్రాలు తాల్చిన భాగవతులనూ భగవంతుడి జంగమరూపాలుగా భావించి, పూజించి స్వీయమతాభినివేశాన్ని ప్రకటించారు. పరంపరానుగతంగా వస్తున్న చాతుర్వర్ణ్యవ్యవస్థను వీరు కాదని, మతాన్నే ఒక కులంగా వ్యాప్తి చేశారు. తరువాత కులాలలో మతాల వారిని వేరు చేశారు. కులాని కొకవిధమైన ఆచారాలను ప్రవేశపెట్టారు. అందరూ కలిసి వైదిక ధర్మం మీద ఉండే ప్రామాణిక భావాన్ని సంక్షోభంలో పడవేశారు. ప్రజాదరణంకొరకు శైవ వైష్ణవులు జ్ఞాన విశిష్టమైన భక్తికంటె మూఢమైన భక్తినే ఎక్కువగా ప్రచారం చేశారు. జ్ఞానం కంటె విశ్వాసం గొప్పదన్నారు. విశ్వాసాన్ని మతానుకూలంగా ప్రదర్శించటం ముఖ్యమన్నారు. అన్యమత ద్వేషం భక్తిలో భాగమన్నారు. స్వీయమత రక్షణ వ్యాపనలు ధర్మవర్తనలన్నారు. దానితో

ప్రజలలో పరస్పర వివాదాలు మొదలయ్యాయి. అవి ఒక్కొక్కసారి రాజకీయాలలో చేరి రాజ్యాలు కూలిపోవటానికీ, వంశాలు నాశనం కావటానికీ, వీరులు నిరర్థకంగా రణరంగాలలో బలికావటానికీ దోహదం చేశాయి. తెలుగువారి మహాభారతంగా చెప్పుకొనే పల్నాటి వీరచరిత్ర మతసంక్షోభం మూలంగా సాగిన మారణయజ్ఞమే. తెలుగువీరుల నెందరినో కదనరంగంలో కోల్పోయిన విషాదగాథలు, ఖడ్గతిక్కన వంటి మేటి జోదులు నేలకొరిగిన సన్నివేశాలు తిక్కన జీవించిన కాలం చవి చూచినవే.

వీరశైవం వైష్ణవం కంటె ఆవేశ ప్రధానమైన మతం. శైవేతరులను శైవులు భవులని పిలిచి, వారి దర్శన స్పర్శన సంభాషణాదులను గర్హించి, ఆత్మరక్షణార్థం ఆయుధాలను ధరించేవారు. శివాపరాధులను శిక్షించేవారు. శివాపరాధానికి మరణమే దండనమని భావించటం కూడా పరిపాటిగా ఉండేది. ఇంత తీవ్రంగా సాగే మతోద్యమాన్ని ఎదుర్కొనటానికి వైష్ణవం కూడా కొన్ని తీవ్ర లక్షణాలు అలవరచుకొనక తప్పలేదు. వీరిరువురూ తమలో తాము తగవులాడుకొనేవారు. ఇరువురూ కలిసి వైదిక మతాచారులైన బ్రాహ్మణులను దూయబట్టేవారు. మతం పేరిట అప్పుడప్పుడు రక్తపాతం సృష్టించేవారు. తిక్కన ఈ విపరీత పరిస్థితులకు వేదనపడ్డాడు. కవిగా ఒక శ్లోకంతో తన ఆర్తిని భగవంతుడికి నివేదించుకొన్నాడు:

> "కి మస్థిమాలాం కిము కౌస్తుభం వా । పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్
> కిం కాలకూటః కిము వా యశోదాస్తన్యం । తన స్వాదు వద ప్రభో! మే". (విరా.1.11)

తిక్కన ఆర్తి భగవంతుడికి వినిపించింది. అతడు హరిహరాత్మకమైన తత్త్వదర్శనంతో వైదికధర్మంలోని అభేదభక్తిని, అద్వైతసిద్ధిని తిక్కనకు ప్రసాదించాడు. ఆ అభినవ దర్శనంతో తిక్కన లోకాన్ని దర్శించాడు. శైవవైష్ణవాదిమతాలలోని వైదిక మతాచార విలుప్తిని, భేదదృష్టిని, మూఢభక్తిని గర్హించాడు. వేదాల పరమ ప్రామాణ్య భావానికి ప్రాధాన్యమిచ్చాడు. వైదిక మార్గనిష్ఠమగు వర్తనం వలన హరిహరాభేద రూపమైన భక్తి కుదురుతుందని ప్రబోధించాడు. సగుణ స్వరూపం వెనుక నిర్గుణమై అద్వితీయమై భాసించే పరతత్త్వాన్ని దర్శించే జ్ఞానమే భేదంలేని భక్తి అని చాటి చెప్పాడు. హరిహరభేదదృష్టి జ్ఞానంవలన నశిస్తుందనీ, జ్ఞాన విరహితమైన మూఢభక్తి భేదరూపమైన కాలుష్యాన్ని హృదయంలో పెంచుతుందనీ, తత్కాలుష్య పరిక్షాళనవలనమాత్రమే చిత్తానికి నిర్మలవృత్తి ఏర్పడుతుందనీ, దానివలన భక్తుడు భగవత్పాదనిరంతర స్మరణతత్పరభావం పొందగలుగుతాడనీ, అది ఆత్మానంద ప్రదాయక మౌతుందనీ తిక్కన వేదసమ్మతమైన మార్గాన్ని లోకానికి చూపాడు.

భేదదృష్టితో పెనగులాడే శైవ వైష్ణవులకు జ్ఞానజ్యోతితో ఎదురునిలిచాడు తిక్కన. కాని, వారిపై విజృంభించలేదు. నయకోవిదుడై వారి భేదదృష్టికి విరుగుడు పెట్టాడు. "పరివాదాస్పద వాదమోద మదిరాపానంబుచే మత్తులై హరి మేలంచు, హరుండు మేలనుచు (ఉత్తరహరివంశం 2.68) క్రుమ్ములాడుకొనేవారికి హరిహరాత్మకమైన పరతత్త్వాన్ని చూపి, వారికి జ్ఞానదృష్టిని ప్రసాదించాడు. పంచమవేదమైన మహాభారతాన్ని తెలుగులో వినిర్మించి వేదహృదయాన్ని లోకహితంగా ప్రబోధించాలని భావించాడు. ఆవేగంతో పరుగులెత్తే రెండు మతవాహినులకు జ్ఞానవారధి కట్టి, వాటిని వేదక్షేత్రములవైపు మళ్ళించాడు. హరిహరనాథుడిని కల్పించటం వలనా, మహాభారతరచనం వలనా తిక్కన ఈ శాంతి విప్లవాన్ని దేశంలో విస్తరింపజేశాడు.

దీనిని బట్టి 11వ శతాబ్ది తరువాత 13వ శతాబ్ది మహాభారతావతరణాన్ని సామాజిక, మత, ధార్మిక, సాహిత్య, సాంస్కృతిక సముద్ధరణకు సమర్థమైన సాధనంగా భావించినదన్నమాట. తిక్కన రచన ఆ కాలం కడుపార కన్న ఉత్తమ రచన.

చారిత్రక భౌతిక వాదులు శైవ వైష్ణవ మతోద్యమాలను భక్తి ఉద్యమంలోని అంతర్దశలుగా భావిస్తారు. వారి దృష్టిలో భక్తి ఉద్యమం సామాజికంగా వర్గసంఘర్షణకూ, పీడిత వర్గాల తిరుగుబాటుకూ సంబంధించింది. పాలకవర్గం వైదికమైన మార్గాన్నీ, బ్రాహ్మణ మతాన్నీ అనుసరిస్తే, సామాన్య ప్రజలు శైవ వైష్ణవాలను అనుసరించేవారు. పాలకులు ఫ్యూడల్ విధానాన్నీ, చాతుర్వర్ణ్య వ్యవస్థనూ సమర్థిస్తే ప్రజలు వర్ణవ్యవస్థను నిరాకరించి, మతపరంగా ఆయామతాల వారందరూ ఒకేవర్గంవారనే భావాన్ని బలపరచేవారు. అయితే, ఆ మతస్థులలో కూడా చాతుర్వర్ణ్యాన్ని సమర్థించే వర్గాలు కూడా కొన్ని ఉండేవి. ఆ విధంగా ఒకవైపు సమాజంలోమతపరంగా ఒక గొప్ప మార్పు వచ్చే వాతావరణం కనబడటంతో పాటు, మరొకవైపు విభిన్న భావజాలాల మధ్య తీవ్రమైన ఘర్షణ కూడా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సాగేది. అది విప్లవంగా రూపొందే అవకాశాలున్నా, దానిని తిక్కన తన సమన్వయవాదంతో శాంతింపజేసి, మరల ఫ్యూడల్ విధానాన్నీ, చాతుర్వర్ణ్యవ్యవస్థనూ సమర్థించే రాచరిక వర్గానికి బలాన్ని చేకూర్చాడు. తిక్కన సమన్వయ దృక్పథం విప్లవ చైతన్యాన్ని చల్లార్చింది-అని వ్యాఖ్యానిస్తారు.

8. ఆత్మాశ్రయకావ్యం ఆంధ్రమహాభారతం

తిక్కన తన జీవితంలో ఎదుర్కొన్న పరిస్థితులతోనే స్వీయ వ్యక్తిత్వాన్ని నిర్మించుకొన్నాడు. అతడు తనంతట తాను మలచుకొన్న సజీవశిల్పం వంటివాడు. పుట్టింది గుంటూరు విభుని కుటుంబంలో, పరిపాలన దక్షత ఉగ్గుతో వచ్చిన విద్య, తాత తండ్రులు సార కవితాభిరాములు. తిక్కనకు కావ్యకళ రక్తనిష్ఠమైన సహజగుణం. మనుమసిద్ధి సాహచర్యం అతడిలో మహామంత్రిని మేల్కొల్పింది. ఆపదలో రాయబారి నైపుణ్యాన్ని అలవరిచింది. అనవరతం దాయాదుల పోరులో ఎత్తుకు పైయెత్తు వేయటంలో రాజుకు తోడ్పడటం వలన వ్యూహరచనా చాకచక్యం అలవడింది. అజ్ఞాతవాసంలో ఉన్న రాజును రక్షించుకొనే యత్నంలో గూఢచర్య తెలిసింది. గణపతిదేవుడి మైత్రి జ్ఞానశిఖరాలను చూపించింది, యుద్ధమర్మాలను నేర్పింది. లోకానుభవాన్ని నూరిపోసింది. మహామంత్రిత్వం, దండనాయకత్వం, మహాకవిత్వం - ఇవన్నీ తిక్కనను మంత్రిగా, సేనానిగా, ధర్మవేత్తగా, నీతివేత్తగా, రాయబారిగా, మాటనేర్పరిగా తీర్చిదిద్దాయి. ఆయన యజ్ఞదీక్ష వేదధర్మాన్ని నేర్పింది. సోమయాజిత్వం జ్ఞాననేత్రం తెరిపించింది. హరిహరనాథదర్శనం మోక్షమార్గాన్ని చూపింది. కవిత్వమే ఒక ఆరాధనా విశేషంగా అతడికి మిగిలింది.

జీవితంలో ఇంతటి అపారమైన అనుభవాన్ని గడించిన తిక్కన విరాటపర్వం నుండి పదునేను పర్వాలు రచించే అర్హత, అనుభవం గడించాడు. పాండవుల అజ్ఞాతవాసం వెనుక మనుమసిద్ధి అజ్ఞాతవాసవ్రతానుభవం తొంగి చూస్తుంది. రాయబారాల ఘట్టాల నిర్వహణలో తిక్కన ఓరుగల్లులో గణపతిదేవుడి సభలో ప్రదర్శించిన మాటనేర్పరితనం పనికి వచ్చింది. యుద్ధపంచకంలో తానూ తన వంశీయులూ చేసిన యుద్ధాల వ్యూహాల అనుభవం అందిపుచ్చుకొన్నట్లుగా తోడ్పడింది. యుద్ధానంతరం ఆప్తజన వియోగంతో కలిగే విషాదజీవిత దృశ్యాలు తిక్కన కళ్లారా చూచిఉంటాడు. వాటిని ఆర్ద్రంగా చిత్రించటానికి స్త్రీపర్వాదులలో అవకాశం దొరికింది. మంత్రిగా, మనీషిగా, సోమయాజిగా తిక్కన సాధించిన విజ్ఞాన శిఖరాలన్నీ శాంతి పంచక పర్వ నిర్వహణంలో కరతలామలకాలుగా పనికివచ్చాయి. తిక్కన చివర సాగించిన ఆశ్రమవాస జీవితం మహాభారత రచనలో చివరకెంతో తోడ్పడింది. ఆ విధంగా తిక్కన స్వీయ జీవితానుభవాన్ని ఆత్మాశ్రయ కావ్యంగానో, స్వీయచరిత్రగానో నిర్మించటానికి బదులు స్వీయ జీవిత ప్రతిఫలనంగా తోచే మహాభారతేతిహాసాన్ని ఆత్మీయంగా, పరాశ్రయంగా ఆవిష్కరించి, సజీవ రసాభ్యుదయోల్లాసాన్ని ప్రబంధ మండలిగా తెలుగులో ఆవిష్కరించాడు. ఒక మహాకవి పరిపూర్ణ జీవితం పరిపూర్ణంగా ప్రతిఫలించిన కావ్యేతిహాసం తిక్కన భారతం.

ఆంధ్రమహాభారత రచనకు తిక్కనకున్న అధికారాన్ని గురించి పింగళి లక్ష్మీకాంతంగారన్న మాటలు స్మరణీయాలు."ఈ పంచమ వేదమును సవిమర్శముగా విభజించినపుడు అందు మూడే ముఖ్య విషయములు గోచరించును. అవి. 1. రాజనీతి 2.యుద్ధతంత్రము 3. బ్రహ్మవిద్యోపదేశము. పుట్టుకచేతను, నడవడిచేతను, విజ్ఞానముచేతను ఈ మూడు మహాధర్మములను ఆత్మధర్మములుగా నిర్వహించి అనుభవ గోచరములు చేసికొనిన కవి తెలుగునాట తిక్కన యొక్కడే. ఈ కారణములచే భారత రచనకు తిక్కనయొక్కడే యుత్తమాధికారి యని చెప్పనగును.'' (ఆంధ్ర సాహిత్య చరిత్ర. పు.222)

9. తిక్కన కవితా దృక్పథం

రామాయణంతిక్కనకూ భారతంతిక్కనకూ మధ్య చిత్తపరిపాకంతోపాటు కవితాదృక్పథంలో కూడా పరిణామం కనబడుతుంది. దానిని సంగ్రహంగా సమీక్షించటం సమంజసం. 1. నిర్వచనోత్తర రామాయణ, విరాటపర్వ కావ్యావతారికలు తిక్కన కవితా దృక్పథాన్ని తెలిపే ప్రాథమిక సాక్ష్యాలు. వాటిలో సమానమైన కొన్ని మౌలికాంశాలున్నాయి. అవి ప్రధానంగా కవితాదర్శనానికీ, కావ్యాంతరంగ లక్షణాలకూ సంబంధించినవి. వాటిలో మార్పును సూచించేవి కొన్ని ఉన్నాయి. వాటిలో కొన్ని అంతరంగ లక్షణాలున్నా

బహిరంగ లక్షణాలే ఎక్కువగా గోచరిస్తున్నాయి. స్థూలంగా పరిశీలిస్తే తిక్కన బహిరంగ (Extrinsic) కావ్యదృక్పథాలనుండి అంతరంగ (Intrinsic) దర్శనం వైపు పయనం చేశాడని స్పష్టమవుతుంది.

2. నిర్వచనోత్తరరామాయణం నాటికి తిక్కన తనకు నికట ప్రత్యర్థులైన వీరశైవులకంటె తా నెట్లా కవితాదృక్పథంలో భేదిస్తున్నాడో చెప్పటానికి యత్నించగా, విరాటపర్వం నాటికి తాను నన్నయ ప్రస్థానానికి ఎట్లా సన్నిహితుడయ్యాడో వివరించడానికి యత్నించాడు. రామాయణంతిక్కన కవితా దర్శనంలో నన్నయ బాటకు చెందినవాడే అయినా విరాటపర్వం నాటికిగాని ఆ బాటను పూర్తిగా స్వాయత్తం చేసికొని తన ప్రతిభను ప్రదర్శించలేకపోయాడు.

మ. "అమలోదాత్తమనీష నే నుభయ కావ్యప్రౌఢిఁ బాటించు శి
ల్పమునం బారగుఁడం, గళావిదుఁడ, నాపస్తంబ సూత్రుండ, గౌ
తమ గోత్రుండ, మహేశ్వరాంఘ్రి కమల ధ్యానైకశీలుండ, న
న్నమకుం గొమ్మన మంత్రికిన్ సుతుఁడఁ దిక్కాంకుండ సన్మాన్యుఁడన్." (నిర్వ.రా.1.13)

తిక్కన తనను పరిచయం చేసికొన్న మొదటి పద్యమిది. తల్లిదండ్రుల సూత్రగోత్రాల కథనాలు సాధారణాలే. "ఉభయ కవిమిత్రుడు' అనే బిరుదం అప్పటికే ఆయనకు సహజాలంకారంగా ఉన్నది. దానిని ఆయన వివరించాడు మొదట. నే నేది వ్రాసినా తెలిసి వ్రాస్తాను - అని చెప్పే ధిషణాశక్తి మనీష. దోషాలు చేయని ఉదాత్తమయిన బుద్ధితో ఉభయకావ్యాలలో కవులు ప్రదర్శించే ప్రౌఢిని పాటించే శిల్పంలో ఆయన నిష్ణాతుడట! ఉభయ కావ్యాలంటే సంస్కృతాంధ్ర కావ్యాలనీ, దృశ్య శ్రవ్య కావ్యాలనీ, మార్గ దేశి కావ్యాలనీ, పద్య చంపూ కావ్యాలనీ, శాస్త్ర రసకావ్యాలనీ- ఇట్లా మరికొన్ని కూడా చెప్పుకొనవచ్చును. ఒక భావాన్ని చెప్పటంలో సామాన్య పదాలనే వాడుతూ అసామాన్యమైన అర్థాన్ని స్ఫురింపజేసే గడుసరితనం ప్రౌఢి. అది వర్ణ్యవస్తువు యొక్క శీలాన్ని (స్వభావాన్ని) సార్థకంగా స్ఫురింప చేయటం లేదా ధ్వనింపజేయటం శిల్పం. దీనినే ఇంగ్లీషులో 'the most delightful and perfect form of utterance' అని అంటారు. కావ్యశీలాన్ని బట్టి సార్థకమైన ప్రౌఢోక్తులు వాడటం తిక్కనకు సహజంగా ఏర్పడిన వాగ్వృత్తి. 3. కళావిదుడంటే- ప్రౌఢోక్తులను రమణీయంగా చెప్పే కళకూడా తెలిసినవాడని భావం. లలితకళాకోవిదుడని మరొక అర్థం. కాబట్టి తిక్కన రమణీయార్థ ప్రతిపాదక ప్రౌఢోక్తి ప్రయోగశిల్పంలో మేధావి అని స్పష్టం. ఇది అతడి మాటతీరు. రామాయణమైనా భారతమైనా ప్రౌఢి సదా నిలిచేదే. తిక్కనకు ముందున్న పాల్కురికి సోమనాథుడు పరుగెత్తే పలుకులవాడు (వడివడి మాటలవాడు), నన్నెచోడుడు వక్రోక్తుల వన్నెవాడు, అలంకార ప్రియుడు. వారి మాటతీరుకంటె తిక్కన క్రొత్త మాటతీరును తెలుగు సాహితికి అందిస్తున్నాడు. అది నన్నయ వలె ప్రసన్నవాక్కు కాదు; తిక్కనదే అని చెప్పదగిన ప్రౌఢశిల్పోక్తి. ఇది మారని లక్షణం. శివకవులకన్నా ఉత్తమ లక్షణం.

4. తిక్కన సాహిత్య దర్శనం ధ్వని ప్రస్థానమని ధ్వనింపజేసే గొప్ప పద్యం ఇది -

ఉ. "భూరి వివేకచిత్తులకుఁ బోలుననం దలఁపన్ దళంబులన్
సౌరభ మిచ్చు గంధవహు చందమునం బ్రకటంబు చేసి యిం
పారెడు పల్కులం బడయ నప్పలుకు ల్పరిగ్రుచ్చునట్లుగాఁ
జేరుప నేరఁగా వలయుఁ జేసెద నేఁ గృతి యన్నవారికిన్". **(నిర్వ.రా.1.5)**

కవుల కవిత్వాని కుండవలసిన సామాన్యధర్మంగా తిక్కన చెప్పుతున్నా అది అతడి దృక్పథమని స్పష్టం. ప్రథమ పురుషలో చెప్పటం వినయ వివేకం. పూలు విచ్చుకొంటూ ఉంటే పూలరేకులలో నుండి వెలువడుతున్న సువాసనను మోసికొనివచ్చే పిల్ల గాలివలె అర్థాన్ని ప్రకటించి (ప్రతీయమానం చేసి) లోకోత్తర చమత్కారాన్ని (ఇంపు) కలిగించే పలుకులు దొరికితే సహృదయులైన వివేకవంతులు 'ఎంత బాగున్నాయ్!' అంటూ గమ్యమానమైన రమణీయార్థాన్ని భావించటానికి వీలుగా - వాటిని దండ గ్రుచ్చినట్లుగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కూర్చగలవాడే కవి అని ఈ పద్యభావం. ఇందులో వ్యంగ్యార్థ ప్రధానమైన రమణీయ శబ్దాల రసానుకూలమైన గుణరీతుల విన్యాసమున్న కవిత ప్రస్తావించబడింది. తిక్కన రసధ్వని దర్శనానికి చెందిన గుణవాది. ఇది అతడి మారని దృక్పథం. శైవకవులు స్వప్నంలో కూడా దర్శించలేని ధ్వనివాదాన్ని, నన్నయ ఒరవడి పెట్టిన ధ్వనివాదాన్ని తిక్కన తన మార్గంగా చెప్పుకొన్నాడు. శివకవుల తరువాత తిక్కన తెలుగు కవితను నన్నయ వైపు మరలించాడు.

5. కవిత్వం ఎట్లా ఉండాలని తిక్కన అనుకొంటున్నాడో, ఎట్లా వ్రాశాడో చెప్పేది సుకవి(తా) ప్రశస్తి అయితే, కవిత్వం ఎట్లా ఉండకూడదని తా ననుకొంటున్నాడో సూచించేది కుకవి(తా)నింద. (నిర్వ. 1.6) తిక్కన శైవకవులవలె కుకవినింద చేశాడు. అది నన్నయ బాట కాదు. కుకవులను దుర్విటులతో పోల్చాడు. మాటల పొందిక లేకపోవటం. అనౌచిత్యంతో రసభంగం చేయటం, పాతబడ్డ మాటలనే పదే పదే వాడుతూ ఎంత ప్రయత్నించినా ఎవ్వరి హృదయాలనూ అలరించలేకపోవటం, ఏ సాహితీ ప్రస్థానానికీ చెందని తమ పద్ధతే గొప్పదిగా భావించి లోకంలో, నవ్వులపాలు కావటం కుకవిలక్షణాలుగా తిక్కన పేర్కొన్నాడు. తిక్కన కవితలో ఈ దోషా లుండవన్నమాట! రచనలో, రసపోషణలో, పదబంధపరికల్పనంలో, కావ్యదర్శనంలో నవ్యత చూపించటం సుకవుల మార్గమని వ్యతిరేక వ్యంగ్యార్థంలో చెప్పాడు తిక్కన. తిక్కన రచనలో కానవచ్చే గుణాలను గుర్తించటానికి ఇది పరోక్షంగా తోడ్పడుతుంది. ఈ లక్షణాలలో కొన్ని కావ్యాంతర్గతమైనవీ, కొన్ని బహిర్నిర్మాణ సంబంధమైనవీ అయి ఉండటం గమనించదగిన విశేషం.

6. క. "తెలుఁగు కవిత్వము చెప్పం । దలఁచిన కవి యర్థమునకుఁ దగి యుండెడుమా
టలు గొని వళులుం బ్రాసం । బులు నిలుపక మొగిని బులిమి పుచ్చుట చదురే?" **(నిర్వ.రా.1.7)**

ఇది ఎంత లక్షణోక్తియో, అంత అధిక్షేపోక్తి. శివకవుల ద్విపద కవిత్వం మీద చేసిన పరోక్ష విమర్శ. అర్థవంతమైన శబ్దాలను కోరే కవి ధ్వని మార్గాన్ని ఆశ్రయించినవా డౌతాడు. తెలుగులో యతిప్రాసలు నియమాలుగా సాగవలసిందే తప్ప 'ప్రాసోవా యతిర్వా' వంటి మినహాయింపులు పొసగవని పాల్కురికి సోమనాథుడిమీది విసురిది. యతిప్రాసలు కవిత్వ బాహ్యనియమాలు మాత్రమే.

7. ఉ. "జాత్యము గామి నొప్పయిన సంస్కృత మెయ్యెడఁ జొన్ప, వాక్య సాం
గత్యము సేయుచో నయిన గద్యము తోడుగఁ జెప్పిపెట్ట, దౌ
ర్గత్యము దోఁపఁ బ్రాసము ప్రకారము వేఱగు నక్షరంబులన్
శ్రుత్యనురూపమంచు నిడ, సూరుల కివ్విధ మింపుఁ బెంపదే?" **(నిర్వ.రా.1.14)**

నిషేధరూపంగా చెప్పిన ఈ పద్ధతి నాశ్రయించి, తనకు ముందున్న శైవకవులు చేసిన దోషాలు తాను చేయనట్లు తిక్కన చెప్పటం గమనార్హం. సంస్కృత పదాలుకానీ, తత్సమ పదాలుకానీ తెలుగులో వాడేటప్పుడు తెలుగువారు వాటిని ఏయే అర్థాలలో వాడతారో ఆ యా అర్థాలలో జాత్యమెరిగి వాడటం ముఖ్యమని తిక్కన నియమం. పద్యానికీ పద్యానికీ, వాక్యానికీ వాక్యానికీ మధ్య వచనంతో అతకటం తిక్కన కిష్టం లేదు. ప్రాసలు ధ్వనిసామ్యంగల వేరే అక్షరాలతో వాడే దుర్గతిని తిక్కన హర్షించడు. ఇవి గొప్ప కవిత్వం కంటె తప్పులు లేని కవిత్వం వ్రాయటానికి తోడ్పడే శబ్దప్రయోగ, ఛందః ప్రయోగ నియమాలు, ఈ రెండూ బాహిరాలే. శివకవులు చేసే ఈ దోషాలు నేను చేయనని తిక్కన నొసలు ఎగురవేస్తూ చెప్పినవే.

8. క. 'లలితపద హృద్య పద్యం । బులన కథార్థంబు ఘటిత పూర్వాపరమై
యలఁతి యలఁతి తునియలఁ గా । హల సంధించిన విధంబు నమరఁగవలయున్." **(నిర్వ.రా.1.16)**

కవితా లక్షణాలను కవితామయం చేసి చెప్పటం నన్నెచోడు డారంభించాడు. శివకవు లచ్చుటచ్చుట పాటించారు. తిక్కన దానిని అనుసరించాడు. నన్నయ తన కవిత్వంలో కనబడే సాపేక్ష లక్షణాలను చెప్పాడు. తిక్కన నన్నయ వలె సాపేక్ష లక్షణాలను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎన్నుకొని నన్నెచోడుడివలె చెప్పా డీ పద్యంలో. నిర్వచనంగా పద్యాలలోనే కవిత్వం చెప్పటం నిర్వచన రచనా పద్ధతి. అది ప్రక్రియ కాదు. కాని ఛందోమయమైన ఒక పద్ధతి. అది తన ప్రత్యేకత అని తిక్కన హెచ్చరిక ! ఇక- కథ కాలక్రమంతో కాక కార్యకారణ సంబంధ క్రమంతో చెప్పటం, పూర్వాపర సమన్వయంతో ఏకవాక్యత సాధించి, కథార్థాలను సంఘటించటం కథాకథనంతోతిక్కన పూర్వకవులకంటె సాధించిన విశిష్ట లక్షణం. చిన్న చిన్న పదాలతో కూడిన వాక్యాల పోహళింపుతో పద్యం ఆలోచిస్తూ మాట్లాడుతున్నట్లు. ఒక ఆలోచనకు కొంద్ర (నాగలిచాలు) కొట్టుతున్నట్లుగా తోచేటట్లు రచించటం తిక్కన రచనకు ఆయువుపట్టు. దీనినే సంభాషణ శైలి అనీ, నాటకీయ రచనమనీ ఆధునికులు పిలుస్తున్నారు. ఇవి తిక్కన కవిత్వంలో పద్యరచనకూ, కథా సంవిధానానికీ, శైలికీ సంబంధించిన సాపేక్ష లక్షణాలు. ఇవి మారేవి కావు. కావ్య నిర్మాణ సంబంధులైన విలువైన అంతర్గత గుణాలు.

9. తే. "ఎట్టి కవికైనఁ దనకృతి యింపుఁ బెంపఁ। జాలుఁ గావునఁ, గావ్యంబు సరసులైన
కవుల చెవులకు నెక్కినఁగాని నమ్మఁ। డెందుఁ బరిణతి గలుగు కవీశ్వరుండు." **(నిర్వ.రా.1.9)**

తిక్కన పరిణతి చెందే కవీశ్వరుడే. అందుకే కాళిదాస మహాకవి భావాన్ని తెలుగులో చిలకరించాడు. "ఆపరితోషా ద్విదుషాం న సాధు మన్యే ప్రయోగ విజ్ఞానమ్ । బలవదపి శిక్షితానా మాత్మన్యప్రత్యయం చేతః" అన్నది దీనికి ఆధారం. కావ్య ప్రయోజనాలలో సద్యఃపరనిర్వృతిని పేర్కొనే అంశ మిది. ఇది కూడా సాధారణ కావ్య లక్షణమే.

10. శివకవియుగం కంటె క్రొత్తయుగాన్ని నిర్మించాలన్న స్పృహ కలవాడు తిక్కన. పండితులలో, భక్తులలో, పామరులలో మతాన్ని వ్యాప్తి చేయటానికి అనువుగా వస్తువుకూ మతానికీ నీరక్షీరన్యాయం వర్తింపచేయటం, వివిధ ప్రక్రియలను సృష్టించే ప్రయోగాలు చేయటం శివకవుల పరిపాటి. శివకవులు తమ కవితను సర్వసామాన్యంగా ఉండాలని భావిస్తే తిక్కన బుధజనులు మెచ్చేటట్లుండాలనీ, ఆంధ్రావళి ఆనందించేటట్లుండాలనీ భావించి వాటి కనుకూలమైన ప్రక్రియలనే చేపట్టి, మతాన్నీ కవిత్వాన్నీ వేరుగా ఉంచటానికే యత్నించాడు. వినేవారు ఆవేశపడే కవిత్వం కాదు, వినేవారు ఆనందించే కవిత్వం కోరాడు తిక్కన. అదే 'కావ్యరసాన్ని కొనియాడే' పద్ధతి. శివకవులు కవిత్వం వలన లక్షించింది శైవావేశం. తిక్కన కవితా లక్ష్యం శిల్ప నిర్దేశం. "సరస మధుర వచో గుంఫన సప్రసాద సంబోధన గోచర బహువిధార్థ తాత్పర్యంగా" చెప్పటం తిక్కన కవితా ఫణితి.

రామాయణం నాటి తిక్కనకూ భారతం నాటి తిక్కనకూ అంతరం చాలా ఉన్నది. అప్పుడు ప్రయోగం ప్రయోగం కొరకే చేశాడు. ఇప్పుడు ప్రయోజనం కొరకు చేశాడు. అప్పుడు తన సాహిత్య దృక్పథాలను సవాలు చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇప్పుడు 'నా నేర్చిన భంగి చెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్' అని వినమ్ర భావంతో పరమ వివేక సౌరభాలను వెదచల్లాడు. అప్పుడు కలం పట్టటానికి హేతువు రాజభక్తి. ఇప్పుడు హరిహరనాథభక్తి. అప్పటి ప్రేరణ ప్రయోగోద్యమం. ఇప్పటి ధారణ కావ్యరసపోషణం. అప్పటి ప్రయోగం రెండు కథల జంటపంట! ఇప్పటి ప్రయోగం రెండు ప్రక్రియల అంటుపంట!

నిర్వచనోత్తర రామాయణావతారికకూ, విరాట పర్వావతారికకూ పొంతనే లేదు. నన్నయవలె ఒకవైపు మహాభారత ప్రశస్తిని చేశాడు. విరాట పర్వ విశిష్ట లక్షణాలను వేరుగా చెప్పాడు. ఉద్యోగాదులను గౌరవంగా సంభావించాడు. నన్నయను 'ఆంధ్రకవిత్వ విశారదుఁ' డనీ 'విద్యాదయితుఁ' డనీ, 'మహితాత్ముఁ'డనీ. 'దక్షుఁ' డనీ ప్రశంసించాడు. ఆయన రచించగా మిగిలిన విరాటాది పర్వాలు పదునేనింటిని బుధులు నిండార సంతోషించేటట్లు వ్రాయాలని సంకల్పించాడు.

నన్నయ అవతారికలో ' తన కులబ్రాహ్మణు ననురక్తు' (ఆది. 1.9) ననే పద్యానికి సమాంతరంగా తిక్కన విరాట పర్వావతారికలో హరిహరనాథుడి నోట చెప్పించిన పద్యం -

ఉ. "వైదికమార్గనిష్ఠమగు వర్తనముం దగ నిర్వహించుచున్
భేదము లేని భక్తి మతి నిర్మలవృత్తిగఁ జేయుచుండు మ
త్పాద నిరంతర స్మరణ తత్పర భావము కల్మి నాత్మ స
మ్మోదముఁ బొందఁ గావ్యరసముం గొనియాడుచునుండు దెప్పుడున్." **(వి.రా.1.15)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నన్నయ వ్యక్తిత్వ సాహితీ వ్యక్తిత్వ విశేషాలవలెనే ఇందులో తిక్కన వ్యక్తిత్వ, సాహితీ వ్యక్తిత్వ గుణాలు పేర్కొనబడ్డాయి. వైదిక మార్గ నిష్ఠమైన వర్తనం, అభేదభక్తి, నిర్మల చిత్తవృత్తి, హరిహరపాద నిరంతర స్మరణ ప్రవృత్తి, ఆత్మానందస్థితి అనేవి తిక్కన వ్యక్తిత్వ లక్షణాలు. కర్మ, భక్తి, జ్ఞానమార్గాల పరిపూర్ణ ప్రస్థానం సాగించిన పరిపూర్ణ వ్యక్తిత్వం ఆయనది. కావ్యరసాన్ని గురించి ప్రశంసిస్తూ ఉండటం ఆయన సాహితీ వ్యక్తిత్వం.

తిక్కన కావ్యరస స్పృహను నిర్వచనోత్తర రామాయణంలో ఆయన చెప్పిన ధ్వని దర్శనానికి అనుబంధంగా అన్వయించుకొనాలి. నన్నయకు మమ్మటాదుల సాహిత్య దృక్పథం వంటిది బలంగా ఉన్నదని స్పష్టమౌతున్నది. (చూడు. సభాపర్వ పీఠిక). తిక్కన మీద కూడా ఆ ప్రభావం పడింది. మమ్మటుని ప్రసిద్ధమైన కావ్యసూక్తం తిక్కన తెలుగు మాటలలో వెలుగు నింపుకొనటం చూస్తాం. మచ్చుకొక్క విషయం. "నియతి కృత నియమ రహితాం హ్లాదైక మయీ మనన్యపరతంత్రాం నవరసరుచిరాం నిర్మితి మాదధతీ భారతీ కవేర్జయతి" (కావ్యప్రకాశం 1.1) అనే సూక్తిని గమనిస్తే తిక్కన అపూర్వ వస్తు నిర్మాణ క్షమమైన ప్రజ్ఞారూపమైన ప్రతిభకు అగ్రతాంబూలం ఇస్తాడు కాబట్టే శిల్పదృష్టి ఏర్పరచుకొన్నాడు. అది నియతి కృత నియమ రహితమైన కవితా ప్రతిభకు లక్షణం! ఆహ్లాదశబ్దం తిక్కనకు ఇష్టం. అందుకే విరాటపర్వాన్ని హృదయాహ్లాదిగా మొదట పేర్కొన్నాడు. మమ్మటుడు కావ్యాన్ని (ఆ)హ్లాదమయి అన్నాడు. 'నవరసరుచిరం' కావ్యమని మమ్మటుడంటే తిక్కన 'నానా రసాభ్యుదయోల్లాసి' విరాటపర్వమన్నాడు. మమ్మటుడు అభినవగుప్తుడి రసధ్వని వాదానికి సాహిత్య క్షేత్రంలో పునఃప్రాచుర్యాన్ని కలిగించిన లాక్షణికుడు. ధ్వన్యనంతర యుగంలో రసధ్వని వాద సమర్థకులలో అగ్రేసరుడు. నన్నయాదులకు ఆదర్శపాత్రుడు. వీరందరికీ ఆదర్శప్రాయుడైన అభినవగుప్తుడి అభిమతంలో "తేన రస ఏవ వస్తుతః ఆత్మా, వస్త్వలంకార ధ్వనీతు సర్వధా రసంప్రతి పర్యవస్యేతే" (లోచన వ్యాఖ్య పు.85) అనే దర్శన సూత్రం తిక్కనకు శిరోధార్యమైనది. నన్నయ వస్తుధ్వనికీ, తిక్కన రసధ్వనికీ, ఆ తరువాత ఎఱ్ఱన అలంకార ధ్వనికీ క్రమంగా ప్రాధాన్యాన్ని తమ తమ కవితలలో కల్పించారు. (చూడు- ఆది, సభా, ఆరణ్యపర్వ పీఠికలు). హరిహరనాథుడు తిక్కనలో గుర్తించిన కావ్యరసాన్ని కొనియాడే లక్షణం ఇటువంటి రసధ్వని విచారమే.

పంచమవేదంలో వేదవ్యాసుడు నిరూపించిన అర్థం తేటపడేటట్లు తెలుగున అధికధీయుక్తితో రచించుమని రాజరాజ నరేంద్రుడు నన్నయను కోరి, ఆ తెలుగు భారతాన్ని తనకు కృతినిమ్మని అర్థించాడు ఆదిపర్వావతారికలో. తిక్కన విరాటపర్వావతారికలో హరిహరనాథుడు కూడా అదే ధోరణిలో కవి నాదేశించాడు.

క. "పారాశర్యుని కృతియయి । భారతమను పేరఁ బరఁగు పంచమవేదం
బారాధ్యము జనులకుఁ ద । ద్గౌరవ మూహించి నీ వఖండిత భక్తిన్"

తే. "తెనుఁగుబాస వినిర్మింపఁ దివురు టరయ । భవ్యపురుషార్థ తరుపక్వఫలము కాదె!
దీని కెడ నియ్యకొని వేడ్కనూని కృతిప । తిత్వ మర్థించి వచ్చితిఁ దిక్కశర్మ!" **(విరా.రా.1.17-18)**

ఈ మాటలన్నది హరిహరనాథుడు. అతడు అడుగుతున్నది భారత కృతి పతిత్వం. ఆ కాలంలోని జనులు ఆరాధించదగింది పంచమ వేదమనే దేవదేవుడి ఆదేశం. ఆయన హరిహరుడైనా విష్ణుపురాణాన్నో, శివపురాణాన్నో ప్రజలు కోరుతున్నా రనలేదు. హరిహరనాథుడు వైష్ణవ శైవ మతవాదాల కతీతుడు. ప్రజలు కూడా అట్లాగే తయారు కావాలని ఆ దైవ సంకల్పం. పంచమవేదం తెలుగులో వెలుగుచూస్తేనే అది సాధ్యం. కాబట్టి నాటి సాంఘిక మత సాహిత్య పరిస్థితులలో భారత గౌరవాన్ని భావించుమని తిక్కనను హరిహరనాథుడు హెచ్చరించాడు. ఆ కావ్యాన్ని అఖండ భక్తితో తెలుగు బాసలో వినిర్మించుమన్నాడు. అనువాదం చేయుమనలేదు. పునస్సృష్టి చేయుమన్నాడు. అట్లా చేస్తే చతుర్విధ పురుషార్థ తరుఫలం పండి చేతి కందుతుం దన్నాడు. తెలుగు ద్విపదలు ఇహపరసాధకాలని శివకవులంటే, తెలుగు కవితలు (నాలుగు చరణాల పద్యాలు) చతుర్విధ పురుషార్థ సాధకాలని తిక్కన పేర్కొన్నాడు. శివకవుల ద్విపదలు ఇహపరసుఖాలే కలిగిస్తాయి. ఇహపర సుఖాలని అన్నప్పుడు పరానికి స్వర్గసుఖమనే అర్థం ఏర్పడుతుంది. కాని, తిక్కన తెలుగు కవిత చివరకు మోక్షాన్ని కలిగిస్తుందని చెప్పటమేకాక, పంచమవేదం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కావ్యాలన్నింటి కంటె పరమ పురుషార్థ సాధకమని పేర్కొన్నాడు. స్వర్గారోహణ పర్వంతో ముగిసే ఆంధ్ర భారతం మోక్షప్రదమని పరమాత్మ చెప్పిన పరమార్థంగా పలికించాడు తిక్కన. భారతం వింటే ' బహుయాగంబులఫలంబు పరమార్థ మగున్' అని రాజరాజనరేంద్రుడి చేత నన్నయ పలికించటం ఆ కాలం ప్రభావం. భారతం బ్రహ్మానంద స్థితిని (మోక్షాన్ని) ప్రసాదిస్తుందనటం తిక్కన కాలం నాటి ప్రభావం. దానికి తిక్కన మహాభక్తుడు కావటం అంతకంటె మహిమగల కారణం కావచ్చును. తిక్కనది వైష్ణవభక్తి కాదు, వీరశైవభక్తి కాదు, భేదబుద్ధి లేని అద్వైత భక్తి. ఆదిశంకరు లన్నట్లు "స్వస్వరూపానుసంధానం భక్తి రిత్యభిధీయతే". తిక్కనది అటువంటి జ్ఞానభక్తి. అందుకే స్వప్నంలో కూడా హరిహరనాథస్వామికి సాష్టాంగ దండప్రణామం చేస్తూ మహాపదార్థమైన బ్రహ్మానందస్థితిని కోరాడు. స్వామి కరుణించి జనన మరణ రూపమైన సంసారచక్రంలో చిక్కుకొనని మోక్షజ్ఞానమార్గం వెలుగుబాటగా ఆయనకు ప్రసాదించాడు. తిక్కన పుట్టు కృతార్థమైనదని పొంగిపోయాడు. జ్ఞానభక్తికి చిటారుకొమ్మ తిక్కన!

బంగారానికి రత్నాన్ని కూర్చినట్లు భారతానికి హరిహరనాథుడిని కృతిభర్తగా నిలిపాడు తిక్కన. 'అవ్విభుం గట్టెదఁ బట్ట మప్రతిమ కావ్యకవిత్వ మహావిభూతికిన్' (విరా.1-27) అన్నాడు. 'నా నేర్చువిధంబున నిక్కావ్యంబు రచియించెద'నని నన్నయ పలికినట్లుగానే వినయముద్రతో తిక్కన "నా నేర్చిన భంగి చెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్" (విరా.1-28) అని చెప్పాడు. ఒక్క భక్తకోటిని వదలిపెట్టితే, నన్నయ తిక్కన లిద్దరూ భారతాన్ని కావ్య కవిత్వంతో నింపాలనే సంకల్పించారు. కాగా, తిక్కన కావ్య కవిత్వ మహావిభూతిని ప్రదర్శింపదలచాడు. అది హరిహరనాథుడి దివ్య విభూతిగా కూడా భావించాడు!

తిక్కన పేర్కొనే భక్తకోటికీ, శైవులూ, వైష్ణవులూ చెప్పే భక్తకోటికీ కొట్టవచ్చినంత తేడా ఉన్నది. తిక్కన కావ్యశ్రోతలైన భక్తజనులు 'విష్ణురూపాయ నమశ్శివాయ' అని పల్కెడి వైదిక మార్గ వర్తనులు. అందుకే తిక్కన అట్టి భక్తుల వైదిక ధ్యాయితకు ఇచ్చమెచ్చే పరతత్త్వాన్ని కొలుస్తూ ఇష్టసిద్ధికొరకు విరాటపర్వానికి శ్రీకారం చుట్టాడు.

ఉ. "శ్రీయన గౌరినాఁ బరఁగు చెల్వకుఁ జిత్తము పల్లవింప, భ
ద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపముఁ దాల్చి 'విష్ణురూ
పాయ నమశ్శివాయ' యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వముఁ గొల్చెద నిష్టసిద్ధికిన్." **(విరా.1.1)**

(వివరాలకు విశేష వాఖ్య చూడండి). దేశంలో భక్తులంటే శివభక్తులో, విష్ణుభక్తులో అయి ఉండాలి - అని తలపోస్తున్న రోజులలో తిక్కన అద్వైత భక్తగణాన్ని సాహిత్యలోకంలో సాక్షాత్కరింపజేశాడు. వారిలో శైవులూ, వైష్ణవులూ అంతర్భవించాలని ఆశించాడు. నిజానికి వేదతత్త్వం అదే చెప్పింది. పంచమవేదం అదే ప్రస్తుతించింది. తిక్కన అటువంటి భక్తగణానికి ప్రతినిధి! అందువలన భారతరచన భక్తకోటిని సంతోషపెట్టటానికే రచిస్తున్నానన్నాడు. తిక్కన పరిభాషలో భక్తజనావళియే ఆంధ్రావళి.

ఉ. "కావున భారతామృతముఁ గర్ణపుటంబుల నారఁ గ్రోలి యాం
ధ్రావలి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయ సంస్మృతి
శ్రీవిభవాస్పదం బయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్." **(విరా.1.30)**

అని శపథం చేశాడు. నిజానికి తిక్కన భారత కవితా ధృక్పథానికి చుక్కాని వంటి దీ పద్యం.

'భారతామృతం' అభేదరూపకాలంకారం. చెవులనే దోసిళ్లతో భారతామృతాన్ని తనివిదీర త్రాగాలనటం ఆలంకారిక అభివ్యక్తి. సాహిత్యపరంగా అమృతం ఆలోచనామృతమే. ధర్మపరంగా మానవుడి త్యాగవీరమే అమృత ప్రస్థానం. 'త్యాగే నైకే అమృతత్వ మానశుః "అన్నది ఉపనిషత్ప్రమాణం. "అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా అమృత మశ్నుతే" అనేది

ఆధ్యాత్మికపరంగా అన్వయించే జ్ఞానప్రస్థానం. చెవులార క్రోలటమంటే చవులూర వినటమే. 'వింటే భారతం వినాలి, తింటే గారెలు తినాలి' అని తెలుగు సామెత. భారతకథను ఆసక్తికరంగా చెప్పుతూనే అందులోని మానవీయ, నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, తాత్త్విక, కవితా కళామూల్యాలను, ఆలోచనామృతంగా ఆస్వాదింపజేసే అర్థగాంభీర్యం తిక్కన రచనలో సహజంగా ఉంటుందనటం ముఖ్య ప్రమాణం.

భారతాన్ని ఆంధ్రావళి 'కవిత్వ మొక తీరని దాహం' (శ్రీశ్రీ) వలె ఆస్వాదించి ఆమోదించాలి. తెలుగుదనం, తియ్యందనం, తేటదనం, దేశీయత, జాతీయత మొదలైన కవితా గుణాలతో తిక్కనభారతం తెలుగువారి జాతీయ కావ్యంగా రాణించాలి- అని తిక్కన ఆశయం.

తిక్కన తెలుగు భారతాన్ని 'మహాకవిత్వ దీక్షావిధి'గా స్వీకరించి రచించాడట ! ఇది లాక్షణిక పారిభాషిక పదం కాదు కాని, మహాకావ్య కవిత్వం రచించాలనే దీక్షతో (నేను వ్రాసేదేదో తెలిసి వ్రాస్తున్నాను అన్న ధిషణాశక్తితో కావ్యం ముగిసేంతవరకు సాగే కార్యశక్తితో) సాగించే నియమవ్రతం. 'అమలోదాత్త మనీష నే నుభయ కావ్యప్రౌఢిఁ బాటించు శిల్పమునన్ పారగుఁడన్' అని చెప్పిన తిక్కన దృక్పథం ఇక్కడ స్మరణీయం. కవితా శక్తితో రచించదలచుకొన్న కావ్యాన్నంతా ఒక కళాఖండంగా భావించి, అందులోని ప్రత్యంశాన్నీ ఆ అఖండ కళాకృతికి శిల్ప వైభవంగా చిత్రించి రచించే సార్థక సారవంతమైన రచన మహాకావ్య కవిత్వం. కవితా దర్శనంతో కవిముద్రతో కావ్యగౌరవాన్ని ఇనుమడింపచేసే శైలితో చేసే రచన ఆ కవితకు జీవితం, "తన కావించిన సృష్టి తక్కొరుల చేతం గాదునాన్" తిక్కన వ్రాశాడన్న కవితయే మహాకావ్య కవిత్వం.

ఆ కవిత్వానికి ఆ శక్తి నిచ్చేది వ్యాసకృత మహాభారత తాత్పర్యం. దానిని తాను భావించి పఠితలచేత భావింపచేయటం మరొక లక్ష్యం. చివరిది ఆ కవిత్వం పద్య గద్యాత్మకమై ఉండటం. ఇది విజ్ఞతతో కూడిన నిర్ణయం. తెలుగులో నిర్వచనకావ్యాలకూ, ద్విపద, వచన కావ్యాలకూ చంపూకావ్యాలకున్న గౌరవం, ప్రాచుర్యం, ప్రామాణికతా లేవు. తెలుగులో మహాకావ్య కవిత్వమంటే పద్యగద్యాత్మకమైన కవిత్వమే అని రూఢి. ఈ సత్యాన్ని నన్నయ ఆదికవిగా గుర్తించి, రచించి నిరూపించాడు. ప్రయోగాల పేరుతో శైవకవులూ, తిక్కనా ఆ మార్గాన్ని తప్పించి క్రొత్త మార్గాలకు తాము నాయకులు కావాలని యత్నించారు. చివరకు శైవకవులతోపాటు తిక్కన కూడా తెలిసికొన్న సత్యం-నన్నయ మార్గమే ఆంధ్రావళి ఆమోదించే మార్గమని.

10. తిక్కన ప్రక్రియాదృక్పథం

తిక్కన సోమయాజి ఆంధ్రమహాభారతాన్ని 'ప్రబంధమండలి'గా (విరా.1.8) భావించి వాటికి శ్రోతగా, భర్తగా హరిహరనాథుడిని వరించాడు. ఇది ఆ మహాకవికి గల ప్రక్రియాపరమైన దృక్పథాన్ని తెలుపుతుంది.

శాస్త్రేతిహాసమైన మూలభారతాన్ని నన్నయ కావ్యేతిహాసంగా మలచి తనకు మార్గదర్శకుడైనట్లు 'మూఁడు కృతులాంధ్రకవిత్వవిశారదుండు, విద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్' (విరా.1.6) అని ప్రశంసించటంలోనే స్పష్టపరిచాడు. నన్నయ రచనలో కావ్యమండలిని చూచిన తిక్కన విరాటపర్వంనుండి ఆంధ్ర మహాభారతాన్ని 'ప్రబంధమండలి'గా విశేషించి పోషిస్తున్నట్లు పేర్కొన్నాడు.

తిక్కనకు కథాకావ్యప్రయోగ ప్రీతి జీవలక్షణం. అతడి ప్రభావం తరువాతి కాలంలో చాలమంది కవుల మీద పడింది. అది ఎంత బలంగా ఉన్నదంటే- ఒక నాయకుడి కథ తీసికొని, నిబిడంగా కావ్యమంతా నిర్వహించి, ఒక ప్రధానరసాన్ని సాంగంగా పోషించిన కవులు తెలుగులో లెక్కకు కొద్దిమందే ఉన్నారు. ఈ పరిస్థితికి మూలకారకుడు తిక్కన- అంటే అతిశయోక్తీ కాదు, సత్యదూరమూ కాదు.

నన్నయ చేపట్టిన కావ్యేతిహాసాన్ని తిక్కన కూడా చేపట్టి కొనసాగించాడు. ఆ ప్రక్రియకు తనకిష్టమైన కథాకావ్యస్ఫూహను కూడా జోడించాడు. తిక్కన భారతానికి తాను కల్పించిన ఈ విశిష్ట వ్యక్తిత్వంతో అది ప్రబంధమండలిగా ప్రకాశిస్తుందని ప్రకటించాడు. నిర్వచనోత్తరరామాయణ కథాస్వభావం సంయుక్తవాక్యంవంటిదైతే, తిక్కన భారత కథ సంశ్లిష్ట మహావాక్యం వంటిది.

ధర్మరాజు కథ ప్రధాన వాక్యం వంటిది. అనునాయకులైన భీమార్జునాదులూ, ఉపనాయకులైన శ్రీకృష్ణాదులూ, ప్రతినాయక పక్షవర్తులైన భీష్మాది మహావీరులూ నిర్వహించిన కార్యాలు ఉపవాక్యసమూహాల వంటివి. ఉపవాక్యాలు అసమాపక క్రియలతో కూడి ఉంటాయి. భీష్మాదులందరూ యుద్ధాలు చేసి అసువులు కోల్పోయిన కథార్థాలు అసమాపకక్రియా వాక్యాలవంటివే. ఎందరు వీరు లస్తమించినా ధర్మజయత్నం ఆగలేదు. అట్లాగే గోవింద భీమార్జునుల వృత్తాలుకూడా ధర్మజుడి విజయానికి అంగాలుగా నిలపటంచేత ప్రధాన వాక్యాన్ని పోషించే ఉపవాక్యాలవంటివే.

ఉపవాక్యాలు అసమాపక క్రియలతో ముగుస్తున్నా, సమాపకక్రియకు అర్థమైన ప్రధానవాక్యం నిర్వహించబడటానికి అంచెలంచెలుగా తోడ్పడుతుంటాయి. ఈ నిర్మాణశిల్పమే తిక్కన కావ్యేతిహాసానికి ఆయువుపట్టు. మహాకార్యాలు గానీ, యుద్ధాలుగానీ నిర్వహించిన భారతవీరుల కథలూ ఘట్టాలూ కొన్ని తిక్కన రచనలో ప్రబంధాలుగా భాసిస్తాయి. ప్రతివీరులలో భీష్మ, ద్రోణ, కర్ణ, దుర్యోధనాదులూ, పాండవవీరులలో అభిమన్యుఘటోత్కచాదులూ విషాదాంత వీరులవలె గోచరిస్తారు. చివరకు కీచకుడిని కూడా తిక్కన విషాదాంత పాత్రగా చిత్రించాడు. వారి వారి కథలన్నీ స్వతంత్ర ప్రతిపత్తిగల వస్తువులుగా అనుభవాని కంది, ఉపకథలవలె ప్రధానకథకు తోడ్పడతాయి. ధర్మరాజు ఉభయాయత్తసిద్ధి అయిన నాయకుడు కాబట్టి అతడి యత్నంతోపాటు అమాత్యుల తీవ్రయత్నాలు కూడా అభ్యుదయ సాధకాలై ఫలసిద్ధికి దారితీస్తాయి. అతడి అభ్యుదయం అమాత్యుల ఉల్లాసం మీద ఆధారపడి ఉంటుంది. అంటే, ధర్మరాజు నాశ్రయించిన ధర్మవీర రసాభ్యుదయం భారతవీరుల రసోల్లాసం వలన సాధించబడుతుందన్నమాట! నాయకాశ్రితమైన ధర్మవీరం ఆయా ఘట్టాలలో నిమిత్త భేదాలనుబట్టి వివిధ వీరరస భేదాలుగా ఉద్దీప్తమౌతుంది. అది వివిధ వీరుల నాశ్రయించి పోషించబడే వివిధ రసాలతో సంవర్ధితమౌతుంది. ప్రక్రియాపరమైన ఇటువంటి నిర్మాణ విధానాన్ని వ్యక్తీకరింపజేసేది 'ప్రబంధమండలి.'

ప్రబంధమండలియొక్క అస్తిత్వాన్ని అంగీకరిస్తే, దానివెంట ఆమోదించవలసింది బహువిధాలైన అంగరసాల వ్యవస్థ. అందులోని స్థాయిభావంయొక్క అభ్యుదయం, అంగరసాల ఉల్లాసం. 'నానా రసాభ్యుదయోల్లాసి' అన్నప్పుడు తిక్కన కావ్యేతిహాసంలో కథాకావ్య స్పృహను సంవదించటంలో ఏర్పడే రసపోషణ వ్యవస్థను నిర్దేశించాడన్నమాట!

తిక్కన 'కావ్యరసముం గొనియాడు' తూ ఉంటాడని హరిహరనాథస్వామి ప్రకటించాడు. ఇతిహాసంలో కావ్యరస దృష్టిని సమన్వయించి తిక్కన కావ్యేతిహాసాన్ని వినిర్మించాడు. ధర్మజుడి ధర్మవీరరసానికి భంగం రాకుండా శాస్త్రాంశాలను కుదించటం వలనా, భారతవీరుల వివిధరసేతివృత్తాలను ప్రబంధమండలిగా నిర్మించినా, ప్రధాన నాయకవృత్తానికి వాటిని పోషకంగా నిలపటం వలనా తిక్కన కావ్యరసమర్మజ్ఞు డనిపించుకొన్నాడు.

పంపాదికవులు భారతకథను చేపట్టి భారతవీరుల ప్రత్యేక నాయకత్వ లక్షణాలకు ప్రాధాన్యం కల్పించి కావ్యాలను నిర్మించిన వైఖరి కన్నడ సాహిత్యంలో ప్రసిద్ధమై ఉన్నది. పంపడు విక్రమార్జునీయ కావ్యాన్ని ముగిస్తూ, భారతకావ్యం లోకపూజ్యం కావటానికి భారతపాత్రలే కారణమనీ, వారి విశిష్ట గుణాలు ప్రస్ఫుటంగా ప్రకటితమయ్యేటట్లు రచించటమే తన ప్రత్యేకత అనీ పేర్కొన్నాడు.

మహాస్రగ్ధర.

"చలదొళ్ దుర్యోధనం, నన్నియొళినతనయం, గండినొళ్ భీమసేనం,
బలదొళ్ మద్రేశ, నత్యున్నతియొళమరసింధూద్భవం, చాపవిద్యా
బలదొళ్ కుంభోద్భవం,సాహసద మహిమెయొళ్ ఫల్గునం, ధర్మదొళ్ ని
ర్మలచిత్తం ధర్మపుత్రం మిగిలి వర్గళినీ భారతం లోకపూజ్యం."

నానారసోల్లాసం కన్నడంలో భారతకావ్యాలు రచించిన పంపాదుల రసమార్గమైతే, తిక్కనది అంగరసాభ్యుదయాన్ని అదరించే నానారసాభ్యుదయోల్లాసం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రబంధమండలి నిర్మాణం అనేకత్వస్ఫూర్తిని కలిగించినా, కావ్యేతిహాసంలోని ఏకవాక్యతకు భంగం కలిగించదనీ, కథాకావ్య ప్రక్రియా ప్రవృత్తిని కావ్యేతిహాసంలో సంవదించినా అంగాంగి రస సమన్వయ సాధనకు అవరోధం ఏర్పడదనీ, ఒక ప్రక్రియలో దాని సహజ స్వభావం కోల్పోకుండా మరొక ప్రక్రియాలక్షణాలను సమన్వయిస్తే మరొక విశిష్ట ప్రక్రియ సిద్ధమౌతుందనీ తిక్కన నిరూపించాడు. నన్నయ నిర్మించిన భారతభాగం సహజ మిశ్ర ప్రక్రియ! తిక్కన భారతభాగం సంశ్లిష్ట మిశ్రప్రక్రియ!

11. ఉభయకవిత్వ తత్త్వవిచారం

నిర్వచనోత్తర రామాయణ కాలంనుండి తిక్కన 'ఉభయకవి మిత్రుడు'గా ప్రసిద్ధికెక్కాడు. మహాభారత ఆశ్వాసాంత గద్యాలలో కూడా ఆ బిరుదునే మొదట చెప్పుకొన్నాడు. తిక్కన శిష్యుడు మారన 'ఉభయకవిత్వ తత్త్వ విభవోజ్జ్వలుఁ' డని కీర్తించాడు. ఉభయకవులకు మిత్రుడు కావటం వేరు. అది సమన్వయవాది లక్షణం. ఉభయకవిత్వతత్త్వాల దర్శన ప్రయోగాల చేత ప్రకాశించటం వేరు. ఉభయకావ్య ప్రయోగాలకే ఒక విశిష్టమైన తత్త్వాన్ని ఆవిష్కరించి ప్రయోగాత్మకంగా లోకానికి చాటగలగటం తత్త్వ వైభవ లక్షణం. అది భారతరచనవలననే తిక్కనకు కలిగిందని మారన సాక్ష్యం పలికాడు.

ఉభయకావ్యాలు అనే సమాసంలో విడదీయలేని జంటకే 'ఉభయ' అనే విశేషణం వాడతారు. కావ్యాలలో అట్టి సంబంధం కలవి శ్రవ్య, దృశ్య కావ్యాలు. ఆ రెండు లక్షణాలను కలిపి ఒక మిశ్రప్రక్రియాగౌరవాన్ని కలిగించటమే కాకుండా, వాటి కొక తాత్త్విక పరివేషాన్ని కలిగించిన వైనాన్ని తిక్కన దృక్పథంలో పరిశీలించటం ప్రథమ కర్తవ్యమౌతుంది.

నన్నయ శ్రవ్యకావ్య ప్రక్రియలో దృశ్యకావ్య మర్యాదలను చొప్పించి నాటకీయతను కావ్యేతిహాస రచనలో ప్రవేశపెట్టాడు. దానిని తిక్కన పెంపుచేసి పోషించాడు. నన్నయ నాటకీయతలో ఆకృతిశిల్పం అగ్రతాంబూలం అందుకొంటుంది. తిక్కన నాటకీయతలో అభినయ శిల్పం అగ్రస్థానంలో నిలుస్తుంది. నన్నయనాటకీయత ప్రయోగ సంబంధి; తిక్కన నాటకీయత ప్రదర్శ సంబంధి. (వివరాలకు చూడు; సభాపర్వ పీఠిక).

నన్నయ కాలంనాటికంటె తిక్కన కాలానికి నాటకీయ శిల్పానికి పరిస్థితులు బాగా తోడ్పడ్డాయి. క్రీ.శ.13వ శతాబ్దినాటికి తెలుగు జాతి భారతదేశంలోనే నాట్యకళారంగాలలో స్వీయ వ్యక్తిత్వాన్ని నిర్మించుకొనాలని విశిష్టయత్నం చేస్తున్నది. కాకతీయులకాలంలో భరతనాట్యం కంటె విలక్షణమైన దేశీనృత్యం తెలుగు నాట వెలుగుచూస్తున్నట్లు దాఖలాలున్నాయి. జాయపసేనాని రచించిన నృత్తరత్నాకరం ఆ ప్రయత్నానికి అక్షరసాక్ష్యం. తెలంగాణంలో కాకతీయులు నిర్మించిన దేవాలయాలలో నాట్యమందిరాలు ప్రధాన దేవాలయాలకు అనుబంధంగా ఉండటం, వాటి స్తంభాలపై నాట్య శిల్ప భంగిమలు, వాద్య విశేషాల బొమ్మలు ఉంచటం శిల్ప సాక్ష్యం. రామప్ప, వేయిస్తంభాల దేవాలయాలవంటివి అందుకు ముందుగా నిలిచే ఉదాహరణలు. కాకతీయులకాలంలో కూచిపూడి నృత్య సంప్రదాయానికీ, ఆంధ్రనాట్య సంప్రదాయానికీ అంకురారోపణలు జరిగాయని నాట్యశాస్త్ర "విమర్శకులు చెప్పుతున్నారు. డా॥నటరాజ రామకృష్ణగారు ఆనాటి నాట్యాన్ని "పేరిణి నృత్య'' మనే పేర నేడు ప్రచారంలోకి తేవటం గమనిస్తున్నాం. కాకతీయ ప్రతాపరుద్రుడి కాలంవాడైన విద్యానాథుడు రచించిన 'ప్రతాపరుద్ర యశోభూషణ' మనే అలంకార శాస్త్ర గ్రంథంలో మొట్టమొదటిసారి శ్రవ్య కావ్యలక్షణాలతో పాటు దృశ్యకావ్యలక్షణాలు కూడా చర్చించబడ్డాయి. ఉభయకావ్య లక్షణాలు ఉంటేనే సమగ్ర లక్షణ గ్రంథం కాగలదనే భావం ప్రబలిన రోజులలో మహాభారత రచన తిక్కన చేపట్టాడు. అందువలన శ్రవ్యకావ్యంతో దృశ్యకావ్య స్వభావాన్ని సంఘటించి నాటకీయతను అభినయబంధురంగా తన రచనలో ప్రపంచించాడు. తెలుగులో నాటకాల అవసరాన్ని మరపించాడు. తిక్కన పాత్రలు సాత్త్విక భావాభినయంలో, నాట్యముద్రల ప్రదర్శనలో, సందర్భోచిత రసోచిత వాచికాభినయ విలాసంలో, రంగప్రయోగ కళలో సుశిక్షితులవలె కనబడతారు. దానితో కథ నాటకంగా పఠితల మనోరంగాలలో ప్రదర్శితమౌతుంది. చతుర్విధాభినయాల చతుర విన్యాసమే రసధ్వని వ్యంజన సూత్రమని తిక్కన తెలుగు కవిత కందించిన నాటకీయ కళాతత్త్వ వైభవం.

తిక్కన రచనలో మరొక విశేషం గోచరిస్తుంది. ప్రక్రియతోపాటు నృత్యనాట్యశాస్త్ర పరిభాషనుగూడా చొప్పించటం ఆయన చేసిన సాహసం. నృత్యం భావావస్థలను వ్యక్తం చేస్తుంది. నాట్యం సూక్ష్మాతిసూక్ష్మమయిన సంచారిభావస్పందనలను

సైతం ప్రదర్శించగలుగుతుంది. "రసాహి సుఖదుఃఖావస్థా రూపాః"- అనే భోజాదుల సంప్రదాయాన్నిబట్టి మానసిక అవస్థలను సంచారులకంటె విలక్షణంగా గుర్తించి రసశబ్దంతో పిలిచే పద్ధతి ఏర్పడింది. స్థాయి భావాలను మాత్రమే రసశబ్దవాచ్యం చేసే సంప్రదాయం ఆనందవర్ధనాదులది. అభినవగుప్తపాదులు అటు ధ్వన్యాలోకానికీ, ఇటు నాట్య శాస్త్రానికీ వ్యాఖ్యలు వ్రాసి ఉభయ కావ్య సంప్రదాయాలను కలిపే ఉద్యమానికి క్రొత్త ఊపిరి పోశారు. మమ్మటాదులు దీనికి సుముఖులు. నన్నయ తిక్కనలు ఆ వరుసలోని వారు. అయితే నన్నయకంటె తిక్కన తన కాలానికి అనుగుణంగా ఒక అడుగు ముందుకు వేసి పాత్రల మానసికావస్థలను వ్యక్తం చేయటానికీ, వ్యంజింపజేయటానికీ నృత్య సంప్రదాయంనుండి రసశబ్దాన్ని గ్రహించి ప్రయోగించాడు. భరతనాట్య శాస్త్రంలో నృత్య నాట్య సంప్రదాయాలలో అభినయ విశేషాలు చెప్పేటప్పుడు రసదృష్టులనీ, స్థాయిభావదృష్టులనీ, సంచారిభావ దృష్టులనీ (అష్టమాధ్యాయంలో) వివేచించటం జరిగింది. కాబట్టి అవస్థలకు సంబంధించిన రసభావాంశాలను తిక్కన రసశబ్దవాచ్యాలుగా చేయటం, భావాంశాలను వాచ్యం చేయకపోవటం తిక్కన రచనలో విశేషంగా గమనింపవలసిన అంశం. అట్లా వివేచించకపోతే డా॥కేతవరపు వేంకట రామకోటి శాస్త్రిగారన్నట్లు 'దోషం కాని రసదోషంగా' దీనిని సరిపుచ్చుకొనవలసి వస్తుంది. కాబట్టి కావ్యరసాన్ని నాట్యపరిభాషతో ధ్వనింపచేసే నవ్యకావ్యశిల్పం తిక్కన వరప్రసాదం. ఇది తిక్కన కవితలోని ధ్వని శిల్పం.

ఉదాహరణకు కొన్ని:- 1. కొమ్మనమంత్రి తిక్కనను 'కరుణార్ద్ర దృష్టి'తో చూచాడట! (విరా-1.10); స్వామి సిగమీద ఈ శశిరేఖ 'కరుణారసం' పొంగిపొరలుతున్నట్లుగా అమృతాన్ని జాలువారుస్తున్నదట (విరా-1.12); 3. హరిహరనాథుడు 'శాంతమూర్తి'గా శోభిల్లాడట (విరా-1.12); 4. ఆ స్వామి వదనంలో 'దరహాసరసము' తళుకొత్తిందట (విరా- 1.14); 5. 'దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫురద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగులట' సైరంధ్రి భర్తలు (విరా-2.55); 6. కీచకుడు 'రాగరసమున' కడలుకొన్నాడట (విరా-2.83); 7. ధర్మరాజు భీముడి 'కోపరసంబు పేర్మి' చెరిచాడట (విరా-1.137); 8. ఉపకీచకుల వధానంతరం ద్రౌపది మనసులో నిండిన 'హాస్యరసం' మొగంమీద వెల్లివిరియకుండా జాగ్రత్త పడిందట (విరా- 3.38); 9. అర్జునుడు 'వీరరసాత్మకుండు' అయ్యాడట (విరా-5.3); ఉత్తరుడు 'భయరసం' తో వణకుతూ పరుగెత్తాడట (విరా-5.78); 10. అర్జునుడు రౌద్రరస వినోది అయ్యాడట (విరా-5.154); 11. విరాటుడు పాండవులను గుర్తించి 'అద్భుతరసాక్రాంత'మైన అంతరంగంకలవాడయ్యాడట(విరా-5.334); 12. ఉత్తరాభిమన్యులు 'సౌఖ్యరసంలో' తేలియాడారట (విరా-5.402); 13. కురుసభలోని వారు శ్రీకృష్ణుడి విశ్వరూప ప్రదర్శన సమయంలో కన్నులు మూసికొని అద్భుత భయానకరసాలలో మునిగిపోయారట (ఉద్యో-3.405). ఇట్లా ఎన్ని రసాలను పేర్కొన్నా అవి కావ్య శాస్త్ర మర్యాదలోని రసాలు కావు. నాట్య శాస్త్రమర్యాదలకు చెందినవే. మరొక శాస్త్ర మర్యాదలను సాహిత్యంలో పారిభాషిక పదస్థాయిలో ప్రవేశపెట్టటంవలన కావ్యశాస్త్రానికి విస్తృతి కలుగుతుందనీ, తన రచనలో పాత్రల మానసికావస్థలను పఠితలు నాట్య ముద్రలను ఆశ్రయించి భావించటానికి సౌలభ్యం ఏర్పడుతుందనీ ఆ కాలానికి అనుగుణంగా ఆలోచించి, తిక్కన ఈ ఉభయ కావ్యతత్త్వ వైభవాన్ని ప్రదర్శించాడు. ఈ వైనం తెలిస్తే పెక్కుమంది విమర్శకులు పేర్కొన్న వమనదోషం శమిస్తుంది; చేసిన వాచ్యావాచ్య విచారం వెనుకపడుతుంది. దోషంకాని దోషంగా సరిపుచ్చుకొనే అగత్యం తొలగిపోతుంది.

ఉభయకవిమిత్రుడంటే సంస్కృతాంధ్ర కవులకు మిత్రుడని చెప్పారు కేతనాదులు. మనుమసిద్ధి సభలో "లలిత నానా కావ్యములు చెప్పు నుభయభాషలయందు ననుట ప్రశంసత్రోవ" అన్నాడు కేతన. ఉభయభాషలలో చెప్పిన ఆ లలిత నానా కావ్యాలు మనకు తెలియరాలేదు. తిక్కన సంస్కృత శ్లోకాలు రెండు ప్రచురితమయ్యాయి ఉత్తర రామాయణ ప్రారంభపద్యం సంస్కృత శార్దూలం, విరాటపర్వావతారికలో పేర్కొన్న "కిమస్థిమాలాం.... "శ్లోకం తిక్కన ఆశుకవిత- ఇంతకుమించి తిక్కన సంస్కృత రచనలు కానరావు. కాగా గంగాదేవి రచించిన 'మధురావిజయ' మనే చారిత్రక కావ్యంలోని అవతారికలో పూర్వసంస్కృత కవులను స్తుతిస్తూ తిక్కనను ఇట్లా కీర్తించింది.

"తిక్కయజ్వ కవే స్సూక్తిః । కౌముదీవ కలానిధేః
స తృష్ణై కవిభి స్స్వైరం । చకోరై రివ సేవ్యతే."

కళానిధి వంటి తిక్కన సోమయాజి కవితాసూక్తులను చంద్రుడి వెన్నెలను చకోర పక్షులవలె నిరంతరాయంగా కవులు ఆస్వాదిస్తున్నారట! 'కొందరు తిక్కయస్య కవే స్సూక్తిః' అనే పాఠాన్ని గ్రహించి ఆయన సోమయాజి తిక్కన కాదేమో అని

అనుమానించారు. కాని, కాకతీయుల కాలంలో మన తిక్కన కంటె మరొక తిక్కన ఉభయకవిమిత్రుడు లేడు. అయినా అంతటి కవి సంస్కృత రచనలు మనకందలేదు.

తిక్కన విజయసేనము, కవివాగ్బంధము, కృష్ణశతకము అనే తెలుగు రచనలు చేశాడని కొన్ని సాక్ష్యాలు చెప్పుతున్నాయి. పెదపాటి జగ్గకవి తన సంకలనగ్రంథమైన 'ప్రబంధ రత్నావళి' లో విజయసేనంలోని కొన్ని పద్యాలు పేర్కొన్నాడు. అప్పకవీ, కస్తూరి రంగకవీ సంశయప్లుతయతికి ఉదాహరణంగా తిక్కన విజయసేనంలోని పద్యాన్ని ఉదాహరించారు. కూచిమంచి తిమ్మకవి ఆ పద్యం చిమ్మపూడి అమరేశ్వరుడి విక్రమసేనంలోనిదని సర్వలక్షణసారసంగ్రహంలో పేర్కొన్నాడు. ఇప్పుడు విజయసేనంగాని, విక్రమసేనంగాని లభించడం లేదు. ఛందోగ్రంథమైన కవివాగ్బంధనానికి కవిసార్వభౌమచ్ఛందమనే మారుపేరున్నా, అది రచించింది తిక్కన అని పేర్కొన్నా, ఆ తిక్కన భారత తిక్కన అని సాక్ష్యాధారాలు సరైనవి దొరకటం లేదు. తిక్కన కృష్ణశతకం రచించినట్లు ప్రశస్తి ఉన్నది. అందులోని ఈ క్రింది పద్యం తెలుగువారి నోట నేటికీ జీవించి ఉన్నది.

"అరయన్ శంతనుపుత్రుపై విదురుపై నక్రూరుపైఁ గుబ్జపై
నరుపై ద్రౌపదిపైఁ గుచేలునిపయిన్ నందవ్రజ శ్రేణిపైఁ
బరఁగం గల్గు భవత్కృపారసము నాపైఁ గొంత రానిమ్ము నీ
చరణాబ్జంబులె నమ్మినాఁడ జగదీశా! కృష్ణ! భక్తప్రియా!"

ఈ మకుటంతో ఉన్న శతకం ఇప్పుడు లభించటం లేదు. కాగా, ఇది వెన్నెలకంటి జన్నయ్య రచించిన "దేవకీనందన శతకం'లోనిదని విమర్శకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా ఈ పద్యంలోని శైలి మాత్రం తిక్కనది కాదు. కాబట్టి నిర్వచనోత్తర రామాయణం, మహాభారతం తప్ప తిక్కన రచనలు మరేమీ ఉన్నట్లు లేవు. ఆయన సంస్కృత కవిత్వం చెప్పగలిగినా తెలుగు కవిత్వానికే అంకితమైపోయిన మహాకవి!

'ఉభయ కవిమిత్రు' డనే బిరుదానికి అర్థం చెప్పటంలో విమర్శకులు తికమకపడుతున్నారు. అందరూ సమకాలీనుడైన కేతనను ప్రక్కనపెట్టి చెప్పలేకపోతున్నారు. కాగా సంస్కృతాంధ్ర కావ్య కవితా సంప్రదాయాల సమన్వయంతో వ్రాసేవారు ఉభయ కవులు ఉభయ భాషాకవులు మాత్రమే కారు - ఉభయ మర్యాదల కవులు. సాహిత్య దర్శనాన్ని సంస్కృత సాహిత్యప్రస్థానాలనుండి గ్రహించి ప్రక్రియా ప్రయోగ కళాప్రౌఢులను దేశీయంగా వినిర్మించుకొనే కవులు ఉభయ కవిత్వ విభవులు. ఆనందవర్ధను డన్నట్లుగా వ్యాసభారతం శాస్త్రరూప కావ్యచ్ఛాయాన్వయి. దానిని నన్నయ, తిక్కనలు కావ్యరూప శాస్త్రచ్ఛాయాన్వయిగా మార్చుకొని స్వతంత్ర ప్రతిభతో వినిర్మించారు. వీరిద్దరూ ఉభయ కవిత్వతత్త్వవిదులే, కావ్యేతిహాస కవితా తత్త్వజ్ఞులే. కావ్యత్వానికి శాస్త్రత్వాన్ని ఛాయగా నిలుపగలిగిన దక్షులే. అయితే ఆ ప్రవృత్తిని తిక్కన భారత భాగంలో అనేక విధాలుగా ఆవిష్కరించే అవకాశం దొరకటంతో తిక్కనకు ఉభయకవిమిత్ర బిరుదం ఊర్జితంగా మిగిలిపోయింది. ఆధునికులు కొందరు కవిత్వాన్ని కథాకథన ప్రధానమనీ, వర్ణనా ప్రధానమనీ, నాటకీయ రచనా ప్రధానమనీ, అలంకార ప్రధానమనీ విభజిస్తారు. ఇందులో ఏ రెండింటికైనా సమప్రాధాన్యాన్ని కలిగించగలిగినవారు ఉభయ కవిత్వతత్త్వవిదులు. తిక్కన వర్ణనాత్మక నాటకీయ కవితా స్వభావాలను విశిష్టంగా మేళవించే కావ్యతత్త్వవేత్తగా భారత రచనలో ప్రసిద్ధి కెక్కాడు.

ఈ విశిష్ట లక్షణాన్ని ఎన్ని విధాల విశ్లేషించినా శ్రవ్యదృశ్యకావ్యప్రక్రియల సమష్టి తత్త్వాలను అంటుమామిడిగా అంటుత్రొక్కిన గౌరవం తిక్కనకే తొలిసారి దక్కింది. నాటకీయతను అందరూ అనుసరించినా ఉభయ కావ్య పరిభాషా మైత్రిని మాత్రం తెలుగులో మరెవ్వరూ తిక్కనవలె నిర్వహించలేకపోయారు. ప్రబంధపరమేశ్వరుడు కూడా కవిబ్రహ్మ తిక్కన సృష్టి మరెవ్వరికీ సాధ్యం కాదని చేతులెత్తి నమస్కరించాడు.

12. హరిహరనాథ (తత్త్వ) దర్శనం

తిక్కన భారత కృతిపతి హరిహరనాథుడు. భారత రచనా కుతూహలుడైన తిక్కన తన కృతిని ఎవరి కంకిత మీయాలా? అని ఆలోచిస్తూ ఇంచుక నిద్రించాడు. అందులో ఒక మహనీయ స్వప్నం వచ్చింది. తిక్కన తండ్రి కొమ్మనామాత్యుడు కలలో

కనబడ్డాడు. తిక్కన చేసిన నమస్కారా లందుకొని కరుణార్ద్రదృష్టితో చూచాడు. తిక్కన ఇదివరలో చెప్పిన 'కిమస్థిమాలాం...'శ్లోకాన్ని విని దయాళుడై భక్తవాత్సల్యంతో అతడిని కృతార్థుడిని చేసి, ఒక కార్యాన్ని అతడివలన పొందాలనే అభిలాషతో హరిహరనాథుడు వస్తూ కొమ్మనకు తన సంకల్పాన్ని దివ్యశక్తితో తెలిసేటట్లు చేసి, ముందుగా తిక్కన దగ్గరికి అతడిని పంపాడు. హరిహరనాథుడు తన సన్నిధానం కల్పిస్తున్న వైఖరిని కొమ్మన ముందుగా తిక్కనకు ప్రకటించాడు. తిక్కన సంభ్రమంతో ఆ వైపు చూచాడు. ఎదుట హరిహరనాథస్వామి ప్రసన్నుడయ్యాడు.

సీ. "కరుణారసము పొంగి తొరఁగెడు చాడ్పున । శశిరేఖ నమృతంబు జాలువాఱ,
హరినీలపాత్రిక సురభిచందనమున్న । గతి నాభిధవళపంకజము మెఱయ,
గుఱియైన చెలువున నెఱసిన లోకర । క్షణ మనంగ గళంబుచాయ దోఁప,
బ్రథమాద్రిఁ దోతెంచు భానుబింబము నా ను । రమ్మునఁ గౌస్తుభరత్న మొప్ప,

తే. సురనదియును గాళిందియు బెరసినట్టి । కాంతిపూరంబు శోభిల్లు శాంతమూర్తి
నా మనంబు నానందమగ్నముగఁ జేయ । నెలమి సన్నిధిసేసె సర్వేశ్వరుండు." **(విరా.1.12)**

ఆంధ్రసాహిత్యంలో హరిహరనాథుడి అపూర్వమైన అద్భుతమూర్తిని కల్పించి శిల్పించి తెలుగువారి కన్నుల ముందు నిల్పిన అక్షరభావచిత్రశిల్పి తిక్కన. తండ్రిగారు అడుగో చూడుమని చెప్పింది హరిహరనాథుడిని. కాని, తిక్కన ఎదుట నిలిచింది సర్వేశ్వరుడు. ఇదేమిటన్నది మొదటి ప్రశ్న. దీనికి బ్రహ్మశ్రీ ఓరుగంటి నీలకంఠశాస్త్రిగా రిట్లా వ్యాఖ్యానించారు.

"తిక్కనయజ్వమనము ఆనందమగ్నమైనదట!.... సర్వేశ్వరుని సన్నిధి చేత. ఆ సర్వేశ్వరుడు ఏ రూపమును ధరించి సన్నిధి చేసెను? కేవల హరిరూపమును గాదు, కేవల హరరూపమునుగాదు; ఇప్పు డాతని కట్టి వేరువేరు రూపములతోఁ దృష్టి గలుగదు. ఆ మహాభాగుఁడపు డద్వైతమూర్తి. సర్వజ్ఞుఁడు, సర్వాంతర్యామియునగు సర్వేశ్వరునకుఁ దదాశయము విదితమే. కావుననే యతఁ డిప్పుడు కేవల హరిరూపమునఁగాని, కేవల హరరూపమునఁగాని తన భక్తవతంసుఁడగు తిక్కయజ్వకు దర్శన మీఁదలంచలేదు. ఆ రెండు రూపము లేకభావము నందినఁ గాని కుండలీంద్రుఁడు (తిక్కన సోమయాజి) మెచ్చుఁడని తా నెఱుఁగును. శైవవైష్ణవ భేదకల్లోల విజృంభణ కీ పృథగ్భావమే కారణమగుటచే నది కవిబ్రహ్మకు అనభిమతము. కావున భక్తహృదయానువర్తియగు సర్వేశ్వరుడు తన కిట్లు సన్నిధి చేసెనని కవిబ్రహ్మ స్వయముగాఁ దెలుపుచున్నాడు". (తిక్కయజ్వ హరిహరనాథతత్త్వము.పు.18-19).

హరిహర శబ్దాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ డా॥ పాటిబండ మాధవశర్మగా రిట్లా అన్నాడు. "హరిహరశబ్దమే విచిత్రమైనది. ఇది వ్యాస మహర్షి కూర్చిన సమాసము. సమర్థములైన పదములు ఏకపదము లగుట సమాసము. ఇక్కడ సమర్థములైన తత్త్వములు ఏకతత్త్వమై సమాసము ఏర్పడినది. "నమో హరాయ హిప్రాయ నమో హరిహరాయ చ" అని వేదవ్యాసుడు హరివంశమున 'హరిహర' సమాసమును ప్రయోగించినాడు. 'హరిహరాయ' అను ప్రయోగము చతుర్థీ ఏకవచనాంతముగా ఉన్నది. కనుక ఇది ఇతరేతర ద్వంద్వసమాసము కాదు. అయినచో ద్వివచనాంతముగా ఉండవలెను. ఏకవచనములో ఉన్నది గనుక సమాహార ద్వంద్వ సమాసము కావలెను. ఆజన్మవిరోధముగాని, అవినాభావ సంబంధముగాని ఉన్నవానిని తెలుపు పదములను మాత్రమే సమాహార ద్వంద్వ సమాసమున కూర్చవలెను. లోకదృష్టిలో హరిహరులకు ఆజన్మవిరోధము. తాత్త్వికదృష్టితో అవినాభావ సంబంధము. కనుక హరిహర శబ్దము సమాహారద్వంద్వమగుట సముచితమే. అయినను తన జీవనిష్ఠమైన యభిరుచిని బట్టి దీనిని విశేషణ పూర్వపద కర్మధారయముగా కూడా గ్రహించుచున్నట్లు 'విష్ణురూపాయ నమఃశివాయ' ఇత్యాదుల వలన తెలియనగును. శివభక్తుడైన తిక్కనగారు హరిహర సమాసమును ఉత్తర పదార్థ ప్రధానముగా భావించుట సహజమే."

"వ్యాస సమాసైక రూప హరిహరనాథా!" అని తిక్కనగారు హరిహరనాథుని ఒకచోట సంబోధించినారు. తాత్త్వికముగా విచారించినపుడు హరిహరునకు కరచరణాద్యవయవయుక్తమైన రూపము లేదు. 'హరిహర' అనిన వ్యాసుని సమాసమే ఆయన

మూలరూపము. పై సీసపద్యమునందును ఇతర పద్యములందును తిక్కనగారు వర్ణించిన హరిహరనాథరూపము ఆయనకు భావనాగోచరమైన కల్యాణమూర్తి.''

"దేవతావర్ణన పాదాది మస్తకాంతముగా చేయవలెనని సంప్రదాయము. ఈ సీసపద్యమున తిక్కనగారు ఆ సంప్రదాయము పాటింపలేదు. శిరస్సునందలి శశిరేఖతో వర్ణన ప్రారంభమైనది. ఆద్యంతరహితమైన పరతత్త్వము ధరించిన హరిహరమూర్తికి పాదశిరోభేదము లేదు. 'మరుత్సరిదాకల్పిత మనోజ్ఞ చరణ శిరస్సుందరమూర్తి' హరిహరనాథుడు. ఆయన చరణమున గంగ, శిరమున గంగ, ఆయనకు చరణ శిరోభేదము లేదు. అట్లే వామదక్షిణ భేదము కూడ లేదు. ఆయన హరిహరుడు, హరహరి'' (తిక్కన కవితా వైభవం - యువభారతి ప్రచురణ - పు.12,13).

హరిహరనాథమూర్తిని అర్థాలంకారసుందరంగా తిక్కన వర్ణించాడు. ఉత్ప్రేక్షోపమాలంకారాలను ఉజ్జ్వలంగా ఉపయోగించాడు. కరుణారసంతో ఆరంభమై శాంతరసంతో ముగిసి చూచేవారికీ, ఆ మూర్తితత్త్వాన్ని గురించి ఆలోచించేవారికీ ఆనందరసంలో మగ్నమయ్యే అనుభూతి నందించే అద్భుతమూర్తిని ఆవిష్కరించాడు. కావ్యరస మర్యాదా, నాట్యరస మర్యాదా అద్వైతాన్ని పొందిన రసమూర్తిని చిత్రించాడు. ఇందులో అలంకార ధ్వని రసధ్వనిలో పర్యవసించేటట్లు రచించటం శిల్పం. భగవంతుడు ప్రసన్నుడై భక్తుడి కోర్కెలను తీర్చే ముద్రలో నిలిచిన నాట్యమూర్తిగా ఒకవైపు తోస్తాడు. ఇది నాట్యరసమూర్తి. దయ అనే భావం ఉత్కటమై రసస్థితిని పొందిన సాత్త్వికభావ చైతన్యంతో కనబడే స్వామి కావ్యరసమూర్తి. గంగా యమునల సమైక్య కాంతి ప్రవాహం తరంగితమైనట్లు శోభిల్లే శాంతమూర్తి నాట్యరసమూర్తి. ప్రేక్షకుల హృదయాలను ఆనందరసమగ్నం చేసే శమస్థాయిభావ ప్రసన్నమూర్తి కావ్యరసమూర్తి. శివకేశవు లిద్దరూ ఏకమై తమ అలంకారాలతో అనుగ్రహించే ఏకైక మార్గాన్ని ఆశ్రయించారు. ఆ అలంకారాలు కూడా రెండు రకాలు పుట్టు సొమ్ములు, పెట్టు సొమ్ములు. హరుడు తన పెట్టుడు సొమ్మైన శశిరేఖ అమృతాన్ని వర్షిస్తుంటే అదే తన కరుణారసమా అన్నట్లు తిక్కన మీద జలపాతంవలె జాలువారుస్తున్నాడు. అందులో ఉత్ప్రేక్ష కూడా అలంకారంగా అందగించింది. శివుడి తలమీద ఉన్న శశికళ సహస్రారం మీద పొంగి స్రవించే అమృతమైన ఆనందరసం. దానికి మూలస్థానం నాభి. అక్కడ కుండలిని మేల్కొల్పితే అది షట్చక్రాల ద్వారా పైకి ప్రసరిస్తుంది. మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరం, అనాహతం, విశుద్ధం, ఆజ్ఞాచక్రం దాటి సహస్రారంలో అది ఫలిస్తుంది. వెన్నుపూస నాశ్రయించి సుషుమ్న నాడి ఉంటుంది. తామరతూడువలె ఉండే ఆ మార్గం ద్వారా ఆ కుండలినీశక్తి ప్రసారమౌతుంది. ఇడ, పింగళ అనే నాడులు ఎడమ కుడిభాగాలలో ఉంటాయి. ఇవి చంద్రసూర్యశక్తులకు ప్రతీకలు, గ్రంథిస్థానాలు. ఈ రెండూ మెలికలు తిరుగుతూ వెళ్ళి ఆజ్ఞాచక్రంలో సుషుమ్నలో యోగిస్తాయి. సహస్రార పద్మంలో అమృతరూపంగా ఫలిస్తాయి. హరుడు ఆ అమృతానుభూతిని శశికళ అనే ఆభరణం ధరించిన ముద్రతో ప్రదర్శిస్తున్నాడు. ఈ సీసపద్యంలో తామరతూడుతో పుట్టి వికసించిన పద్మం, చంద్రసూర్యకళలు చెప్పబడటం గమనార్హం. హరి ఆ సహస్రారపద్మానికి మూలమైన తన నాభిని ప్రదర్శిస్తూ, కుండలినీ యోగ సాధనరూపమైన ధవళ పంకజాన్ని సహజాభరణంగా ప్రకాశింపజేసి తన యోగముద్రను ఉపమాలంకార సుందరంగా ఆవిష్కరించాడు. బొడ్డు హరినీల మణినిర్మిత పాత్రికవలె, పద్మం సురభి చందనం వలె రాణించాయట. హరినీలం గాఢమైన ప్రేమకూ, శ్రీగంధం దాని వలన మనసుకు కలిగే సౌఖ్యానికీ చక్కని ఉపమానాలు. శశిరేఖ అమృతసిద్ధిని తెలిపే శివాలంకారం. ధవళపద్మం మూలాన్నీ, సాధన వికాసాన్నీ ధ్వనింపజేసే హరిభూషణం.

నేను సకల లోకాలనూ రక్షిస్తున్నానన్న దివ్యవిభూతిని ప్రకటించే చిహ్నం శివుడి గళంలో నల్లగా మెరిసే గరళరేఖ కాంతి; శివుడి పెట్టుడు సొమ్మైనా సహజాలంకారంగా రాణించిన వన్నె. అట్లాగే హరి ధరించిన కౌస్తుభరత్నం కూడా. హరుడి తెల్లని గళం మీది ఒక నల్లని మచ్చ దివ్యవిభూతికి పతాక. ఒక నల్లని ఉరస్సుమీద తూర్పుకొండ మీద ఉదయిస్తున్న భానుబింబం వలె వెలుగొందే కౌస్తుభరత్నం ఒక దివ్య సంపదకు ప్రతీక. హరుడి అలంకారాలను ఉత్ప్రేక్షతో, హరి అలంకారాలను ఉపమతో వర్ణించటం ఒక విశేషం. ఆ రెండిటినీ సురనదీ కాళిందీ నదులవలె కలిపి ఉత్ప్రేక్షతో ఉన్మీలింపజేయటం మరొక విశేషం. ఉత్ప్రేక్ష అధ్యవసాయ మూలకం. ఉపమ భేదాభేద సాధర్మ్య మూలకం. ఉపమానం యొక్క తాదాత్మ్యాన్ని ఉపమేయంలో సంభావించటం

ఉత్ప్రేక్ష. ఉపమానోపమేయ సాదృశ్య భావనం ఉపమ. విష్ణ్వలంకారాల సాదృశ్యభావనం ద్వారా హరిగుణాలను ధ్వనింపజేయటం అలంకారశిల్పం. పద్మం, లక్ష్మి అనే అలంకారాలు వికసించిన హృదయంలో స్థిరంగా నిలిచే ఐహికాముష్మిక సంపదలను తెలియజేస్తున్నాయి. హరి కరుణారసంతో ఇచ్చే సిద్ధులవి. శశిరేఖ, గరళకంఠం భక్తవశంకరత్వాన్నీ, లోకరక్షణ కళా పాండిత్యాన్నీ ప్రకటిస్తున్నాయి. హరుడు కరుణిస్తే కలిగే సిద్ధులు యోగక్షేమాలు. ఇవి హరిహరుడిలో కాంతిపూరాలుగా ప్రవహించే దివ్య విభూతులు. ఆ ప్రవాహాలు శివుడిలో గంగగా, విష్ణువులో కాళిందిగా కనబడవచ్చును కాని, హరిహరుడిలో ఆ రెండూ కలిసిన ఒక వింత కాంతి కనపడుతుంది. వర్ణసంయోజనంలో తెలుపులో నలుపు కలిసి తెలుపులో భాగమైపోతుంది; లేదా నలుపుతో తెలుపు కలిసి లీనమైపోతుంది.

"శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయగ్ం శివః"

అనే మంత్రార్థం అలంకార ధ్వని వలన స్ఫురిస్తుంది. ఆ తత్త్వం పఠితను ఆనందమగ్నం చేస్తుంది. దీనిని ఈ పద్యం ధ్వనింపచేస్తున్నది.

'కిమస్థిమాలాం కిము కౌస్తుభంవా' అనే శ్లోకం కూడా అలంకారాలనూ, అనుభవాలనూ ఆలంబనంగా చేసికొని చెప్పిన అలంకారోక్తి. అస్థిమాల కౌస్తుభం అలంకారాలు, కాలకూటం యశోదాస్తన్యం అనుభవాలు. ఈ అలంకారశిల్పాన్ని దేవుడు మెచ్చాడు కాబట్టి తిక్కన ఈ పద్యాన్నికూడా అదే ఒరవడిలో నడిపి పరమేశ్వరానుగ్రహాన్ని పొందటానికి ప్రయత్నించాడు.

శివకేశవాభేదాన్ని విరోధాభాసంతో ధ్వనింప జేయటం మరొక విశేషం. ఇందులో హరిహరులకు సహజవిరోధం ఉన్నట్లు చెప్పటం, అది ఆభాసమని తెలిపి పరిహరించబడేటట్లు చేయటం ఇందులోని అలంకార శిల్పం. శివుడి తలమీది శశిరేఖకూ హరినాభి ధవళ పంకజానికీ ప్రకృతిసిద్ధమైన వైరం ఉన్నది. కాని, కడుపులో అమృతాన్నీ, మరకరందాన్నీ దాచుకుని లోకానికి పంచిపెట్టటంలో ఆ రెండూ ఒకటే కాబట్టి ఆ వైరం ఆభాసమై తొలగిపోతుంది. గరళం నల్లనిది, ప్రళయహేతువు. కౌస్తుభరత్నం కాంతిమంతమైనది, సంపదలనిచ్చేది. ఈ రెండూ విరుద్ధాలే అయినా లోకాన్ని రక్షించి పోషించే భక్త రక్షణ కళాప్రావీణ్యంలో ఆ వైరుద్ధ్యం ఆభాసమైపోతుంది. గంగా యమునలు విడివిడిగా పారితే వాటి వర్ణాలే వేరు. కలిసి పారితే పాపనివారణంలో అవి పుణ్యకాంతి ప్రవాహాలే. ఈ భావనం మనస్సులో చేస్తే సహృదయుడికి కలిగేది ఆనందమే. అది అలంకారం వలన ఏర్పడే అలౌకికానందం కావచ్చును. ఆధ్యాత్మిక భావనం వలన కలిగే బ్రహ్మానందం కావచ్చును. దయారసం సగుణబ్రహ్మ భావనలో కలిగే అలౌకికానందం. శాంతరసం నిర్గుణ తత్త్వచింతనం వలన కలిగే బ్రహ్మానందం. అభినవగుప్తుల అభిప్రాయంలో శాంతరసం ప్రకృతి రసం. మిగిలిన రసాలన్నీ వికృతి రసాలే. హరిహరరూపాన్ని ఆశ్రయించి వ్యక్తమయ్యే కరుణారసాదులు ఆ దేవుడి తత్త్వాన్ని దర్శించి సహృదయుడు పొందే శాంతరసంలో లయిస్తాయి. ప్రకృతి రసమైన శాంతంగా మిగిలిపోతాయి. ఆ స్థితియే 'రసోవైసః'. కరుణారసంగా తోచేదీ ఆనందమే, శాంతంగా నిలిచేదీ ఆనందమే. 'ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్' అనే వేదతత్త్వమే సర్వేశ్వర తత్త్వం. అలంకారధ్వనిని రసధ్వనిలో పర్యవసింపజేసే ఒక అద్భుత శిల్పం ఈ పద్యం! తిక్కన హరిహరనాథుడి దయ వలన పొందిన బ్రహ్మానందస్థితి ఈ పద్యంలోని పరమ రసధ్వని.

తిక్కన కీర్తించిన హరిహరనాథుడు తిక్కన ప్రతిభాజన్యుడా? పూర్వప్రసిద్ధుడా? అనే అంశంమీద అనేకు లనేకవిధాలుగా తమ అభిప్రాయాలను తెలిపారు. నాథశబ్దం జైన సంప్రదాయాన్ని సూచిస్తుందనీ, ఆ మతంనుండి హరిహరనాథ భావనను క్రమంగా అద్వైతంలోకి తిక్కన తెచ్చుకొన్నాడనీ చెప్పేవారు కొందరున్నారు. భారతీయ సంప్రదాయంలో ఒకే దైవాన్ని ఆయా ప్రయోజనాల ననుసరించి అనేకరూపాలలో ఉపాసించే పరిపాటి ఉన్నది. అంతేకాదు. హరిహరబ్రహ్మలను కలిపి దత్తాత్రేయ రూపంగా ఉపాసించే పరిపాటీ కనబడుతుంది. చతుర్ముఖుడిని వదలి హరిహరోపాసనం చేసే పద్ధతులు కూడా ఉన్నాయి. స్మార్తశైవంలో శివశక్తులను కలిపి అర్ధనారీశ్వరుడుగా భావించే పద్ధతి కనబడుతున్నది. పాణిన్యాదులు 'వృషాకపి' శబ్దాన్ని హరిహరాత్మక రూపం పట్ల కూడా వాడిన పట్టులున్నాయి. మహారాష్ట్ర ప్రాంతంలోని త్ర్యంబక క్షేత్రం దగ్గర హరిహరనాథ దేవులకు దేవాలయాలున్నాయి. నెల్లూరులోకూడా ఈ సంప్రదాయానికి చెందిన దేవాలయం ఉన్నది. కాని, మరెక్కడా తెలుగునాట అట్టి దేవాలయాలు లేవు. అయితే వ్యష్టిమూర్తుల ఆరాధనం సామాన్య జనులకు సన్నిహితంగా ఉండటం వలన, సంయుక్త

రూపారూపనామతత్త్వాలను తెలిసి ఉపాసించటం క్లిష్టం కావటం చేత హరిహరనాథ దేవుడి వంటి మూర్తులు, నృసింహావతారం వలె ఉద్దిష్ట ప్రయోజన సాధన కొరకే మొదట అవతరించి, ఆ తరువాత అవసరాన్ని బట్టి, ప్రజాదరణాన్ని బట్టి కొనసాగుతూ ఉంటాయి. అందువలన పూర్వం ఒక ప్రయోజనం కొరకు హరిహరభావనం భారతదేశంలో కొన్ని కొన్ని ప్రాంతాలలో ప్రవర్ధిల్లి ఉండవచ్చును. దానిని తిక్కన 13వ శతాబ్దంలో సమకాలీన మతసమన్వయ దృష్టి కొరకు వినియోగించుకొని ఉంటాడు. డాక్టర్ ఓగేటి అచ్యుతరామశాస్త్రి వంటి విమర్శకులు హరిహరనాథుడంటే శ్రీ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామియే అని భావించారు. హరిహరనాథుడు అనే పేరులో హరికి ప్రథమస్థానం ఉన్నది. ఆ తరువాత హరుని ప్రసక్తి వచ్చింది. వ్యాసుడుకానీ, మరెవ్వరైనా కానీ ఈ శబ్దాన్ని మొదట సృష్టించి ఉండవచ్చును. దాన్ని విష్ణుపారమ్యానికి అనుకూలంగా వాడి ఉండవచ్చును. కాని, తిక్కన 'చిత్తనిత్యస్థితశివుడు' కాబట్టి ఎప్పుడు హరిహరనాథుడిని వర్ణించినా శివాంశను ముందుగా చెప్పి విష్ణ్వంశను తరువాత చెప్పుతాడు. తిక్కన వర్ణించే పద్ధతిలో ఆ దేవుడు 'హరహరి' కావాలి. హరిహరసమాసంలోని పదాలు ఉత్తరోత్తరాలు బలీయాలనే న్యాయంతో తిక్కన హరుడిని ముందూ హరిని తరువాతా చెప్పాడని సమర్థించే వారూ ఉండవచ్చును. దీనిని వేదాంతపరంగా వ్యాఖ్యానించవచ్చును అనేవారూ ఉండవచ్చును. భగవంతుడు వస్తుతః హరిహరుడే. అయితే ఆయన ప్రకృతి దర్పణంలో ప్రతిఫలించినప్పుడు కుడి ఎడమలుగా వ్యత్యస్తమై కనబడుతాడు. సగుణమూర్తి దర్పణ ప్రతిబింబతుల్యుడైన పరతత్త్వం. బింబరూపుడు హరిహరుడు, ప్రతిబింబరూపుడు హరహరి. తిక్కన బింబాన్ని ప్రతిబింబముగా దర్శించి బింబాన్నే కీర్తించాడు. అందువలన తిక్కన హరప్రశంస ముందుగా హరిప్రశంస ఆ తరువాతా చేస్తాడని పేర్కొనవచ్చును.

ఇన్ని వాదాలున్నా హరిహరుడు వైదికధ్యాయిత కిచ్చమెచ్చే పరతత్త్వం. అతడు సర్వేశ్వరుడు. నిరాకార నిరంజనుడు. ఆనంద స్వరూపుడు. తిక్కన హరిహరుడికి ఆనందముద్రకూ అవినాభావ సంబంధాన్ని భావించాడు.

ఈ అంశాన్ని ఆరుద్రగారు ఆర్ద్రంగా వివరించారు. 'ఆనందం' అన్నది తిక్కనగారి ఆశయం. భారతంలో ప్రతి పర్వాంతంలో ఆనందముద్ర ఉంటుంది. హరిహరనాథుడిని ఆనందరూపునిగా వారు ఊహించారు. పర్వాంత పద్యాలలో ఆఖరి సంబోధనలు ఎలా ఉన్నాయో చూడండి. 1. విరాట పర్వాంతం-ఆనంద సంసస్తూయమానా!;2. ఉద్యోగ పర్వాంతం - పరమానందానుభూత్యేకరూపా!; 3. భీష్మపర్వాంతం-సంతతానంద సాంద్రా!; 4. ద్రోణ పర్వాంతం - శాశ్వతానందమూర్తీ!; 5. కర్ణ పర్వాంతం - నిర్భరానంద దేహా!; 6. శల్యపర్వాంతం - ఆనందరూపా!; 7. సౌప్తికపర్వాంతం - సుస్థిరానందభాసా!; 8. స్త్రీపర్వాంతం - ఆనందశీలా!; 9. శాంతిపర్వాంతం - భాస్వదానందమార్గా!; 10. ఆనుశాసనిక పర్వాంతం - నిష్కలానందమూర్తీ!; 11. అశ్వమేధ పర్వాంతం - దర్శితానంద వర్మా!; 12. ఆశ్రమవాస పర్వాంతం - సానందవర్గా!; 13. మౌసల పర్వాంతం - ఆనంద ప్రకాశస్వరూపా!; 14. మహాప్రస్థానిక పర్వాంతం - సంభృతానందలీలా!; 15. గ్రంథాంతం - సంభృతానందభావా!.

పర్వాంతంలో ఆనందముద్రను వేసిన తిక్కనగారు గ్రంథాదిని దానిని వాడారా అన్న అనుమానం కలుగుతుంది. "శ్రీయనగౌరినా బరఁగు..." అనే మంగళాచరణం అయ్యాక వెంటనే తిక్కనగారు వచనంలో ఆనందముద్ర వేశారు. "...అని సకల బ్రహ్మప్రార్థనంబు చేసి, తత్ప్రసాదాసాదిత కవిత్వ తత్త్వనిరతిశయానుభావానంద భరితాంతఃకరణుండ నగుచు..." (విరా.1.2). అయితే కావ్యం మొట్టమొదటి పద్యంలో కాక రెండవ నెంబరు వచనంలో 'భావానందం' ఉంది కనుక గ్రంథాంతంలో ఉపధాపద్యంలో (ఆఖరిదానికి ముందున్నదానిలో) కూడా భావానందం వాడితేనేగాని శిల్పంలో నిండుదనం రాదు. అందుకే ఆ ఉపధాపద్యం లోపలే'' కేవల భావానందమయా! వేదవ్యాస వర్ణనారూఢదయా!'' అని ఉపధాచరణంలో వాడి సరిపుచ్చారు. (స్వర్గా.96)'' (సమగ్రాంధ్రసాహిత్యం 2. సం. పుట. 131-133)

తిక్కన హరిహరనాథ తత్త్వ విచారంలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి ఈ క్రింది మాటలు విలువైనవి. "కల్పితములైన నామరూప భేదములచే భగవంతుని పేరను, మతము పేరను దారుణ కలహములకు లోనై అలజడి పొందుచుండిన ఆంధ్రులకు తిక్కన ప్రసాదించిన భగవత్తత్త్వము హరిహరనాథుడు.''

"హరిహరనాథ నామరూపములను గూర్చి ఆంధ్రులలో భిన్నాభిప్రాయములు కలవు..ఆ తత్త్వము సగుణము, సాకారమును ఐనప్పుడు శివకేశవాత్మకము; నిర్గుణమును, నిరాకారమైనపుడు ఉపనిషత్ప్రతిపాదితమైన పరమాత్మ - ఓంకారము తద్వాచకము. ఆ తత్త్వము సగుణాత్మకముగా సాకారముగా ఆరాధనీయమైనపుడు శ్రీయన గౌరినాబరగెడి స్త్రీతత్త్వము. అయ్యది నిర్గుణాత్మకమై ఓంకార వాచ్యమైనపుడు హ్రీంకార వాచ్యమగును. ఈ అర్థమునే తిక్కన షష్ఠ్యంత పద్యములలో నిట్లు వ్యక్తమొనర్చెను:

క. "ఓంకారవాచ్యునకు నన। హంకార నిరూఢ భావనారాధ్యునకున్
హ్రీంకారమయ మనోజ్ఞా। లంకారోల్లాస నిత్యలాలిత్యునకున్". (విరా.1.32)

కాబట్టి హరిహరుని శివకేశవాత్మకమూర్తిగా భావన చేయుట ఆరాధనార్థము. అప్పు డా దేవుడు భక్తిగమ్యుడు; యోగగమ్యుడైనప్పుడు హరిహరునకు ఆకారము లేదు. 'నాదామృత ధారాసారరూపుఁడు', 'నాసాగ్ర నివాసరసికుఁడు' మరియు వ్యాసుని వాఙ్మయప్రపంచమునకు హరిహరనాథుడు లక్ష్యమట. 'వేదవ్యాస వచోవిభవ లక్ష్య హరిహరనాథా!'

క. 'శ్రీసంపాది పదాంబుజ!। నాసాగ్రనివాస రసిక! నాదామృత ధా
రాఽఽసారరూప! వేద। వ్యాస వ్యంజిత విహార! హరిహరనాథా!' (భీష్మ.1.1.)

అక్కడ వేదవ్యాసవచస్సు అనగా బ్రహ్మసూత్రము అని అర్థము. కావున బ్రహ్మసూత్రములలో ఏ పరతత్త్వము నిర్దేశింపబడినదో ఆ పదార్థమే తిక్కనార్యునకు లక్ష్యమైన హరిహరనాథతత్త్వము. అదియే ఉపనిషత్ప్రతిపాదితము. ఆ తత్త్వము జ్ఞానగమ్యము. అంతేకాదు. ఆ దేవుడు 'క్రతుభూషణమణి'. నిత్యాగ్నిహోత్రపరతంత్రులకు, క్రతుపరాయణులకు, 'అపూర్వ' మనెడి వేదవిహిత కర్మానుష్ఠాన ఫలము నొసగెడి యజ్ఞపురుషుడు. కావున ఆ దేవుడు పూర్వమీమాంసా ప్రతిపాదితమైన తత్త్వము కూడా అగును....

"ఈ హరిహరనాథ తత్త్వము తిక్కనగారు కల్పించినది కాదు. వ్యాసుని భారతమున గల అనేక తత్త్వములలో ఒక తత్త్వముగనున్నది. మఱియు విష్ణుని అష్టోత్తర శతనామావళిలో "హరిహరరూపైక మూర్తయే నమః" అన్నచోట పేర్కొనబడినది. ఇట్లు అనేక తత్త్వములలో నొకటిగ, అనేక నామములలో నొకటిగా నున్న ఆ సర్వదేవతాద్వైతమూర్తియైన తత్త్వమును తిక్కనార్యుడు ధర్మాద్వైతమూర్తియైన భారతమున ఏకైక పరతత్త్వముగా ప్రతిష్ఠించెను. భారతకృతిపతియైన హరిహరనాథుడు ఏదో ఒక గ్రామమున వెలసిన, గుడి కట్టించుకొన్న దేవుడు కాడు. సృష్టిస్థితిలయములకు కర్తయైన విశ్వమయుడు. సారాంశమేమనగా హరిహరనాథుడు శైవులకు, వైష్ణవులకు, కర్మిష్ఠులకు, జ్ఞానులకు, భక్తులకు, యోగులకు, మంత్రోపాసకులకు, తపస్వులకు, సాధారణ శరణ్యుడు. ఐహిక మనోరథములనుగాని, ఆముష్మికసుఖమునుగాని, మోక్షపదవినిగాని, యోగసిద్ధినిగాని ప్రసాదించెడి సర్వఫలప్రదాత. తిక్కన భారత రచనావసరమున హరిహరనాథుడు సాక్షాత్కరించినపుడు 'జన్మాంతర దుఃఖముల్ తొలఁగునట్లుగఁ జేసి కృతార్థుఁ జేయవే' అని బ్రహ్మానందస్థితిని కోరి నమస్కరింపగా ఆ దేవుడు "జనన మరణాదులైన సంసారదురితములకు నగపడకుండంగఁ దొలఁగు తెరువుగను వెలుంగు నీకిచ్చితి" నని వర మొసగెను. అనగా మోక్షమన్నమాట. తన జీవితయాత్ర సార్థకమైనదనియు, మోక్షపదవి నిశ్చితమని ఎరిగియు, అంతతో కర్మసన్న్యాసము చేయక లోకసంగ్రహార్థమై భారత రచన కుపక్రమించెను." (ఆంధ్ర సాహిత్య చరిత్ర.పు.210-213)

13. తిక్కన ఆరణ్యపర్వశేషం ఎందుకు రచించలేదు?

ఉ. "ఆదరణీయ సార వివిధార్థ గతిస్ఫురణంబు గల్గి య
ష్టాదశపర్వ నిర్వహణ సంభృతమై పెనుపొందియుండ నం
దాదిఁ దొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వ విశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్". (విరా.1.6.)

పదునెనిమిది పర్వాల మహాభారత రచనా ప్రణాళికలో నన్నయభట్టు మూడు కృతులు (పర్వాలు) దక్షతతో నిర్వహించాడని తిక్కన కొనియాడాడు. నన్నయభట్టు మూడు పర్వాలు పూర్తిగా రచించాడా? రచిస్తే, తరువాత కొంతకాలానికి కొంతభాగం శిథిలమైతే, ఎఱ్ఱాప్రెగ్గడ ఆరణ్యపర్వశేషం పూరించాడా? ఆరణ్యపర్వం అసమగ్రంగానే ఉండిపోయిందని తెలిసి కూడా తిక్కన సోమయాజి దానిని ఏవో కారణాల వలన వదలిపెట్టి విరాటపర్వంనుండి రచనం చేయటం ఆరంభించాడా? తిక్కన, ఆయన శిష్యులు, మిత్రులు తప్ప తరువాతి కవులందరూ ఎఱ్ఱాప్రెగ్గడను ఆరణ్యపర్వశేషకర్తగా కీర్తించటంలో గల అంతరార్థ మేమిటి? మొదలైన అనేక ప్రశ్నలు బుధజనులను వెంటాడుతూనే ఉన్నాయి. నన్నయభాగం నరాంకితం కావటం, తిక్కన భాగం దైవాంకితం కావటం, ఆరణ్య పర్వరచన అనర్థదాయకమనే అనుమానం ఉండటం మొదలైన కారణాలను కొందరు చెప్పినా అవి నిలిచేవి కావని తేలిపోయాయి. తిక్కన పాటించిన ఒక విశిష్ట సాహిత్య నీతిని ఎఱ్ఱాప్రెగ్గడ పాటించాడనీ భావించటం జరిగింది. (వివరాలకు చూడండి. ఆరణ్యపర్వం ప్రథమ ద్వితీయ భాగాల పీఠికలు). వీటన్నిటితోపాటు మరికొన్ని కారణాలను ఊహించే అంతర్గత సాక్ష్యాలు కనబడుతున్నాయి. ఆరణ్యపర్వకథ తన రచనాప్రవృత్తికి అనువైనదిగా తిక్కన భావించినట్లు లేదు. కారణాలు కొన్ని:

1. తిక్కన 'ఉభయ కవి మిత్రుడు.' శ్రవ్యకావ్య మర్యాదలలో దృశ్యకావ్యమర్యాదలను సమన్వయించి ఉభయ కావ్యకళాతత్త్వ విభవోజ్జ్వలత్వాన్ని ప్రకటించడానికి 'విరాటపర్వం' శ్రీకారంగా తోడ్పడింది.

2. తిక్కన జీవితేతివృత్తం మహాభారతేతివృత్తంలో ప్రతిఫలించటం విరాటపర్వంనుండి ప్రారంభమయింది. మనుమసిద్ధి భూపాలుడి అజ్ఞాతవాసం పాండవ అజ్ఞాతవాసంతో సరిపోలుతుంది. తిక్కన ఓరుగల్లు పయనం, రాయబార లక్షణం, రాజనీతి నైపుణ్యం ఉద్యోగపర్వంతో ఉన్మీలిస్తాయి. ఆరణ్యపర్వకథ తిక్కన ఆత్మాశ్రయ స్వభావానికి అనురూపమైనది కాదు.

3. మహాభారత కథ జగత్ప్రసిద్ధం కాబట్టి పూర్వపర్వంలో జరిగిన కథ చెప్పకుండానే విరాటపర్వం మొదలుపెట్టవచ్చును. పఠితలకు ఏమాత్రమూ అసౌకర్యం ఉండదు. అంతేకాదు; అన్ని పర్వాలూ ఒకేరకంగా ఉండవు కాబట్టి ఒక్కొక్కపర్వాన్ని ఒక్కొక్క విధంగా చెప్పవచ్చును - (విరా.1.42) 'వలసినట్లు చెప్పవచ్చియుండు' అన్నాడు. ఆరణ్యపర్వంకంటె విరాటపర్వం తీరే వేరు.

4. వైశంపాయనుడు 'పరమ పవిత్రులగు పాండుపుత్రుల చరిత్రం బుపాఖ్యాన సహితంబుగా వ్యాఖ్యానంబు సేయుచుండ వారల వనవాస సమ్యగనుష్ఠానంబు సవిస్తరంబుగా విని' (విరా. 143) జనమేజయుడు విరాటపర్వకథను గురించి ఒక ప్రశ్న వేశాడట. ఈ వాక్యంలో తిక్కన ఆరణ్యపర్వ కథాస్వభావాన్ని తెలిపాడు. అది పాండవుల చరిత్రను (కథను లేదా శీలాన్ని) అనేక ఉపాఖ్యానాల నాధారంగా చేసికొని వ్యాఖ్యానించినట్లు ఉంటుందట. వనవాసవ్రతాన్ని సముచితంగా అనుష్ఠించిన పద్ధతి సవిస్తరంగా చెప్పినట్లుంటుందట. తిక్కన కథాకావ్య స్పృహ ఎక్కువగా కలవాడు. ఆఖ్యాన ఉపాఖ్యానాల సమ్యఙ్నిర్మాణాన్ని నిర్వహించినవాడు నన్నయ. విరాటపర్వ కథ దానికి భిన్నంగా ఉన్నది. అందువలన విరాటపర్వంతో కథ నారంభించటం నన్నయ వస్తు నిర్మాణ దృష్టికంటె విలక్షణంగా గోచరించేది. విరాటపర్వంలో ఉపాఖ్యానాలే లేవు కూడా. అందువలన దాని వైనమే వేరు.

5. ఆరణ్యపర్వం వరకు నన్నయ కథాకథనానికి వన్నెపెట్టే వర్ణనలే నిర్వహించాడు. కథలో ఒదిగిన రూపకనిర్మాణాన్నే రూపుకట్టించాడు. విరాటపర్వంనుండి ఆ తీరు మారింది. తిక్కన కథనూ వర్ణననూ అభినయాన్నీ హరిహరనాథుడి రూపంవలె సగం సగం చేసి సంవిధానం చేశాడు. నన్నయ రచన కృతి (కావ్యం) కాగా, తిక్కన రచన ప్రబంధమయింది.

ఇటువంటి అనేక విధాలైన అంతర్గత కావ్యలక్షణాల వలన తిక్కన విరాటపర్వం నుండి ఆరంభించటమే ఔచిత్యవంతంగా గోచరిస్తున్నది. అంతేకాదు. అష్టాదశపర్వాలలో మిగిలినవాటి కంటె విరాటపర్వానికి విశిష్టలక్షణాలను నాలుగింటిని పేర్కొన్నాడు తిక్కన. దానితో పర్వాలన్నీ ఒక యెత్తు; విరాటపర్వ మొక్కటీ ఒక యెత్తు-అని తిక్కన భావించినట్లు స్పష్టం. తిక్కన రచన చదివిన తరువాత తెలుగువారందరూ ఆ అభిప్రాయంతో ఏకీభవిస్తారు కూడా.

14. విరాటపర్వం హృదయాహ్లాది

హృదయానికి ఆహ్లాదాన్ని కలిగించేది విరాటపర్వమట! ఈ లక్షణం అన్నిటికంటె మొదట లెక్కించతగిందట! ఆహ్లాదం కలిగించేది ఎవరికి? సహృదయులకు. పేరు విరాటపర్వం. విరాటనగరంలో పాండవులు అజ్ఞాతవాస జీవితాన్ని నిర్వహించిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కథను చెప్పేది కాబట్టి అది విరాటపర్వం. ఆహ్లాదం విరాటుడి వలన పాండవులకు కలుగవచ్చును; పాండవుల వలన విరాటుడికి కూడా కలుగవచ్చును; కథను తన్మయత్వంతో భావించే సహృదయులకు వారిరువురి వలన ఆహ్లాదం కలుగవచ్చును; కవి వర్ణనల వలన, కల్పనలవలన పఠితలకు ఆహ్లాదం కలుగవచ్చును. ఈ విధంగా నాలుగు రకాల ఆహ్లాదం కలిగించే స్వభావం విరాటపర్వకథకు సహజంగా ఉన్నదని తిక్కన నిర్దేశం.

విరాటపర్వంలో సహృదయ స్థానీయుడు జనమేజయ మహారాజు. అతడు కథను వినదలచుకొని వేసే ప్రశ్నలోనే శ్రోతృహృదయాన్ని వ్యక్తం చేస్తాడు. మూలంలో అతడు వైశంపాయనుడిని ఇట్లా అడిగాడు:

"కథం విరాట నగరే మమపూర్వపితామహాః। అజ్ఞాతవాసముషితాః దుర్యోధన భయార్దితాః ॥
పతివ్రతా మహాభాగా సతతం బ్రహ్మవాదినీ। ద్రౌపదీ చ కథం బ్రహ్మ న్నజ్ఞాతా దుఃఖితా-వసత్॥" (సం.4.1-2)

'పాండవులు దుర్యోధనుడి వలని భయంతో పీడితులై అజ్ఞాతవాసం ఎట్లా గడిపారు? పతివ్రత, పుణ్యాత్మురాలు, శ్రీకృష్ణస్మరణ తత్పరురాలు అయిన ద్రౌపది దుఃఖంతో ఎట్లా గడిపింది?' అని జనమేజయుడి ప్రశ్నలు. ఇందులో శ్రోత కోరుకొంటున్న ముఖ్యవిషయమేమంటే - దుర్యోధనుడు చారచక్షువై పాండవులను గుర్తించాలని యత్నిస్తూంటే, ఆ ప్రయత్నం సఫలం కాకుండా రహస్యంగా కష్టాల కోర్చి, దుఃఖంతో కాలం ఎట్లా గడిపారో చెప్పుమని అడిగాడు. కథాకథనంలో శ్రోత కోరుతున్న ప్రధానతాత్పర్యమది! మరి తిక్కనగారి జనమేజయుడి తీరు వేరు.

చ. "మహిత సముజ్జ్వలాకృతులు, మానధనుల్, జనమాన్యు లంగనా
సహితముగాఁగ నేమిగతి సమ్యగుపాయనిగూఢవృత్తిమై
నహితుల కప్రభేద్యముగ నా పదుమూఁడగునేఁడు మత్పితా
మహులు చరించి? రంతయుఁ గ్రమంబున నా కెఱుఁగంగఁ జెప్పుమా!" (విరా.1.44)

పాండవులు సహజంగా సమున్నతమైనవీ, సముజ్జ్వలమైనవీ అయిన ఆకారాలు కలవారు. వారు మారురూపాలు ఎట్లా ధరించారు? రూపాలకు వేషాలు మారినా వారి తేజస్సులు మారవు. ఒకవేళ తేజస్సులను కూడా కప్పిపుచ్చుకొని అణగిమణగి ఉన్నారనుకొన్నా, వారు సహజంగా అభిమానధనులు కావటంతో సేవావృత్తిలో మాటపడి సహించే ప్రవృత్తి తక్కువ. అయినా వారు తలవంచి ఎట్లా మసలగలిగారు? వారు అనామకులు కారు. లోకమంతా వారిని గుర్తించి పూజించే మాననీయులు. ఎంత తమను తాము గోప్యంగా ఉంచుకొని తిరుగుతున్నా ప్రజలు వారిని గుర్తించి పూజిస్తారు. అట్టి లోకకీర్తి గలవారు లోకాన్ని ఎట్లా కన్నుగప్పారు? సరే! పాండవులు మగవారు. ఎన్ని తిప్పలైనా పడి ఎట్లాగో తమను తాము రక్షించుకొంటారు. కాని, వారు భార్యాసహితులే. ఆమెను వదలి అయిదుగురు వేరువేరుగా ఉండటానికి వీలులేదే? ఈ జటిల సమస్యను ఎట్లా ఎదుర్కొన్నారు? ఎటువంటి సమయోచిత సముచిత ఉపాయాలతో వారు శత్రువులకు అప్రభేద్యంగా, రహస్యంగా ఆ పదమూడవ యేడు ఎట్లా గడపగలిగారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు వరుసగా సవివరంగా నాకు తెలిసేటట్లు చెప్పుమని జనమేజయుడి వేడుకోలు. మూలంలో శ్రోత పాండవులు ఎట్లా భయంతో బాధపడుతూ గడిపారో చెప్పుమని కోరాడు. తెలుగులో పాండవులు ఎట్లా నిపుణంగా, అద్భుతంగా అజ్ఞాతవాసాన్ని శత్రువుల కంటబడకుండా నిర్వహించారో వినాలని కోరాడు. అడిగేవారికి అనుగుణంగా చెప్పేవారి కథనం సాగుతుంది. అందువలన వ్యాసకథనంలోని పద్ధతి శత్రువుల భయం వలన పాండవులు పొందిన ప్రయాసకు ప్రాధాన్యం ఇస్తుంది. తిక్కన కథనంలో 'సమ్యగుపాయ నిగూఢవృత్తిమై నహితుల కప్రభేద్యముగ' ఎట్లా చరించారో చెప్పే పద్ధతికి ప్రాచుర్యం ఉంటుంది. వ్యాసుడి రచన పఠితలకు హృదయోద్వేగం కలిగిస్తుంది. తిక్కన కథ హృదయాహ్లాదం కలిగిస్తుంది.

మూలంలో జనమేజయుడు తాతలు పడిన బాధలు వినాలని ఆర్ద్రుడై అడిగాడు. తెలుగులో జనమేజయుడు అంత అమాయకుడు కాడు. కథకుడికే ఒక పథకాన్ని చూపించగల ప్రౌఢుడు. అందుకే తానడిగిన క్రమంలోనే కథ చెప్పుమన్నాడు. అన్వయం ఇట్లా కుదురుతుంది: (1) మహిత సముజ్జ్వలాకృతులు సమ్యగుపాయ నిగూఢవృత్తిమై ఏమిగతి చరించిరి? అన్నది

మొదటి ప్రశ్న. దీనికి బదులుగా ప్రథమాశ్వాసంలోని కథ ప్రవర్తిల్లింది. పాండవులు మారువేషాలు వేయలేదు. యముడి దయవలన వారికి మారురూపాలు వచ్చాయి. రూపాలకు తగిన వేషాలు అమరాయి. ఆ రూపాలు పాండవుల ఆకృతులపై ఆరోపిత రూపాలు. అవి వారి సహజమైన మహిత సముజ్జ్వలాకృతులను కప్పివైచి ఆరోపిత రూప సహజత్వాన్ని ప్రకటిస్తాయి. అవీ సముజ్జ్వలంగానే ఉంటాయి. కాని పాండవులని గుర్తించటానికి వీలులేకుండా ఉంటాయి. ద్రౌపది సైరంధ్రీరూపం కూడా అటువంటిదే. దానివలన శత్రువులకు అప్రభేద్యంగా చరించగలిగారు. ద్రౌపదీ పాండవుల ప్రచ్ఛన్న రూపవైభవాలను వర్ణించటానికి తిక్కన తన కావ్యకళాశిల్ప వైభవాన్ని విశేషంగా ప్రదర్శించాడు. మారురూపాలలో మహోజ్జ్వలంగా ఉన్నా అసలు రూపాలను గుర్తించలేని నిగూఢవృత్తి ఈ ఘట్టంలో పఠితల హృదయాలకు ఆహ్లాదం కలిగిస్తుంది.

(2) మానధనులు సమ్యగుపాయ నిగూఢవృత్తిమై ఏమిగతి చరించారు? - అనేది రెండో ప్రశ్న. అభిమానం దెబ్బతినే ఘట్టాలలో అజ్ఞాతవాసం భగ్నం కాకుండా పాండవులు సతీసమేతంగా ఎట్లా తమ గౌరవాలను కాపాడుకొన్నారో వివరించి చెప్పుమని ఈ ప్రశ్న తాత్పర్యం. ఈ ప్రశ్నకు ద్వితీయాశ్వాస వృత్తాంతం ప్రధాన సమాధానం. కీచకుడు ద్రౌపదిని కామించి ఆమెను నిండుకొలువుముందు క్రిందపడవేసి అవమానించాడు. అది ఆమెకూ, పాండవులందరికీ మానభంగమే. భీము దుద్రిక్తుడై మహావృక్షాన్ని పెరికి విజృంభించబోయినపుడు ధర్మజుడు అతడిని వారించటం, ద్రౌపదిని మందలించి అంతఃపురానికి పంపటం అజ్ఞాతవాసవ్రతాన్ని నిలుపుకొనటానికే కాని, ఆత్మాభిమానాన్ని చంపుకొని కాదు. అది సమయోచితమైన ఉపాయం. భీముడు కీచకోపకీచక సంహారాన్ని నిగూఢవృత్తితో నిర్వహించటం సమ్యగుపాయం. ఈ ఘట్టాన్ని తిక్కన ఒక ప్రబంధంగా తీర్చిదిద్దాడు. మానధనుల మానవీరాన్ని మహనీయంగా పోషించి ఆహ్లాదాన్ని అద్భుతంగా అందించాడు.

(3) జనమాన్యులు సమ్యగుపాయ నిగూఢవృత్తిమై ఏమిగతి చరించిరి? - అన్నది మూడవ ప్రశ్న. విరాటుడి కొలువులో పాండవులూ, ద్రౌపదీ సేవావృత్తులలో ఉన్నా, వారికి జనాదరణం అపరిమితంగా ఉండేది. కంకుభట్టు రాజు తరువాత రాజంతటివాడి వలె సభలో గౌరవాదరాలు పొందేవాడు. మత్స్యభూనాథుడి నీతివిద్య కంకుభట్టు. అతడి మాటమీదనే భీముడిని మల్లయుద్ధంలోకి దింపాడు. సింహశార్దూలాది క్రూరమృగాలతో పోరించేవాడు. చివరి కతడి మాటమీదనే భీముడికి ధర్మరాజుతోపాటు ఉత్తమ రథతురగాలను ఇప్పించి సుశర్మపై యుద్ధానికి నడిపించాడు. నకుల సహదేవులు ఆయా శాఖలలో ప్రధానాధికారులై రాజు మన్ననలను పొంది సుశర్మపై చేసే యుద్ధంలో తోడ్పడ్డారు. సుశర్మతో జరిగిన యుద్ధంలో విజయం ధర్మజ, భీమ, నకుల, సహదేవులు సాధించిపెట్టిందే. విరాటుడి మానప్రాణాలను రక్షించి అందరి మన్ననలను పొందిన జనమాన్యుల చరిత్ర తృతీయాశ్వాసంలో ప్రధానంగా తురంగలిస్తుంది.

(4) అహితుల కప్రభేద్యముగ సమ్యగుపాయ నిగూఢవృత్తిమై ఏమిగతి చరించిరి? - అన్నది నాలుగవ ప్రశ్న. దీనికి సమాధానం చతుర్థ పంచమాశ్వాసాల వృత్తాంతం. అంటే ఉత్తరగోగ్రహణ కథ. ఇందులో బృహన్నల అయిన అర్జునుడు నిజరూపంతో కౌరవులను ఓడించి, మరల నిగూఢవృత్తితో విరాటనగరం చేరటం, తరువాత సమ్యగుపాయంతో పాండవులు భార్యాసమేతులై బయలు మెరసి, అజ్ఞాతవాసవ్రతాన్ని నిర్విఘ్నంగా ముగించి ఉత్తరాభిమన్యుల వివాహం జరిపించటం అనే కథ ఇందులో వర్ణితం. ఉత్తర కుమారుడి ప్రగల్భాలూ, అర్జునుడి వీరాలాపాలూ, అతడి యుద్ధ విలాసాలూ పఠితలను ఆహ్లాదమగ్నులనుగా చేస్తాయి. ఈ విధంగా ప్రశ్నలే కథాప్రగతికి మార్గదర్శకాలు కావటం కూడా బుధులకు ఆహ్లాదదాయకమే.

విరాటపర్వంలో హృదయాహ్లాదం కలిగించే మరొక విశేషం ఉన్నది. ఈ పర్వం ఒక అంతర్నాటకం వంటిది. పాండవులు మారురూపాలతో వ్యవహరించే విచిత్ర కథావృత్తం విరాటపర్వం. వారికి మారుపేర్లుకూడా ఉన్నాయి. వాటికితోడు గూఢనామాలు కూడా ఉన్నాయి. ఈ పర్వంలో యథావకాశంగా ఒక్కొక్కరూ మూడు రకాల పేర్లతో సూచించబడుతుంటారు. కంకుడు, వలలుడు, బృహన్నల, దామగ్రంథి, తంత్రీపాలుడు, సైరంధ్రి అనే మారుపేర్లతో కథ నడుస్తున్నా వారి సహజ నామాలతో కథకుడు వారి చర్యలను వివరిస్తుంటాడు. ఇందులో ఒక విశేషం ఉన్నది. కంకుడు వృత్తికి సన్న్యాసి, మాటల ధోరణికి ధర్మరాజు, భీముడు వృత్తికి వంటలవాడు, మల్లుడు. కాని, చేష్టలకు భీమసేనుడు. బృహన్నలది చిత్రమైన అవస్థ. అతడు మారురూపంలో

పేడి. కాబట్టి పౌరుష కార్యాలకు పనికిరాడు. అంతఃపుర కన్యలకు నాట్యం నేర్పుతాడు. వేషానికి పేడిగా ఉన్నా రోషానికి అర్జునుడే. దామగ్రంథి, తంత్రీపాలుడు వృత్తులలో నిమగ్నులై ఉన్నా స్వీయప్రవృత్తులను రక్షించుకొనేవారే. అట్లాగే ద్రౌపది. ఆమె సేవావృత్తిలో సైరంధ్రి, మనఃప్రవృత్తిలో పాండవ పట్టమహిషి. పఠితలు మారురూపాలలో ఉన్న పాండవుల అసలురూపాలను భావిస్తుంటారు. పఠితలకు తెలిసిన రహస్యాలు విరాటపర్వంలోని ఇతర పాత్రలకు తెలియవు. వారు భీముడిని చూచి వలలుడని తలపోస్తారు. పఠితలు వలలుడిని చూచి భీముడని తెలిసి ఆనందిస్తారు. ఈ రహస్యం తెలియని పాత్రల అజ్ఞానానికి నవ్వుకొంటారు. అయినా వాళ్ళు పొందే అనుభవాన్ని కూడా పంచుకొంటారు. కాని, అది నిజం కాదనీ, పఠితలు పొందే అనుభవమే సత్యమని చిత్రంగా భావిస్తారు. ఈ ద్వంద్వానుభవమే ఆహ్లాదం.

కథాకథనంలో ఉత్కంఠా పరిపోషణం వలన ఆహ్లాదం కలుగుతుంది. విరాటపర్వంలో అడుగడుగునా వచ్చే అడ్డంకులను అజ్ఞాతవాసవ్రతం భగ్నం కాకుండా సమ్యగుపాయాలతో పాండవులు అధిరోహించటంలో ఉత్కంఠ పోషించబడింది. మల్లముఖ్యుడి సమస్య ఉత్కంఠకు అంకురారోపణం చేసింది. అతడిని భీముడు ఓడించటంతో అది ఉత్కంఠావహంగా ముగిసింది. కీచకుడు పాండవాజ్ఞాతవాసానికి ప్రళయంగా తారసిల్లాడు. పాంచాలి గుట్టు రట్టుకెక్కితే పాండవుల గుట్టు బయటపడ్డట్టే. సుదేష్ణ కపటోపాయం పరిస్థితిని తీవ్రతరం చేసింది. సభాసన్నివేశంలో ధర్మజ భీమ ద్రౌపదుల సంభాషణలు, చేష్టలు ఉత్కంఠకు ఉన్నత స్థాయిని కలిగించాయి. భీముడి వ్యూహం, ద్రౌపది నాటకం, కీచకోపకీచక రహస్య వధ ఉత్కంఠకు ఊపిరిపోశాయి. అవి గంధర్వుల చర్యలనే ప్రవాదం కథలో ఉత్కంఠా వాతావరణాన్ని బలంగా సృష్టించింది. దక్షిణోత్తర గోగ్రహణాలు పాండవ ప్రవాసానికి అగ్నిపరీక్షలు. ఆ రెండు ఘట్టాలూ ముగిసేంతవరకు పఠిత ఉత్కంఠతో ఊగిపోతాడు. పాండవులు బయలుమెరిసే ఘట్టం ఉత్కంఠావహం. ఉత్తరాభిమన్యుల వివాహం విరాటపర్వంలో ఉత్కంఠకు ఉపసంహారం. ఉత్కంఠతో పఠితకు ఊపిరాడని ఆహ్లాదం కలుగుతుంది. అది ఆనందం కాదు.

15. చతుర్థం విరాటపర్వం

మహాభారతంలోని అష్టాదశపర్వాలలో విరాటపర్వం నాలుగవది. వరుసలో నాలుగవది అనటంలో విశేషం లేదు. చతుర్థ శబ్దం వలన బుధజనులకు నాలుగు విశేషాలు స్ఫురిస్తాయి. 1. రాజనీతికి సంబంధించిన చతురుపాయాలలో చతుర్థమైన యుద్ధోపాయం గమ్యమానం. ఇది ఒక విధంగా సార్థకం. ఈ పర్వంలో పాండవ అజ్ఞాతవాస భంగ కారణాలైనవన్నీ యుద్ధంతోనే నివృత్తమౌతాయి, లేదా పరిష్కృతమౌతాయి. మల్ల, కీచక, ఉపకీచక యుద్ధాలు, దక్షిణోత్తర గోగ్రహణ యుద్ధాలూ అందుకు సాక్ష్యాలు. 2. రూపక నిర్మాణంలో అంకాలకు సంబంధించిన అర్థ విశేషం రెండవది. సామాన్యంగా సంస్కృతంలో పంచసంధులతో కూడిన ఇతివృత్తం గల నాటకం ఏడంకాలలో రచించబడుతుంది. అందులో చతుర్థాంకం గర్భసంధికి అనుకూలంగా ఉంటుంది. కాళిదాస మహాకవి రచించిన అభిజ్ఞానశాకుంతల నాటకంలో చతుర్థాంకం అత్యుత్తమమైనదిగా పరిగణించబడుతుంది. "కావ్యేషు నాటకం రమ్యం, నాటకేషు శకుంతలా। తత్రాపి చ చతుర్థో-ంకః, తత్ర శ్లోక చతుష్టయమ్॥" అని ప్రసిద్ధి. అట్లాగే మహాభారతం ఒక నాటకమైతే అందులో విరాటపర్వం గర్భసంధిని నిర్వహించే చతుర్థాంకం వంటిది. ఇందులో పతాకస్థానీయులుగా కీచకుడు, సుశర్మ కనబడతారు. వారి కథలు స్వీయప్రయోజనాలను సాధిస్తూనే కథాకార్యానికి తోడ్పడతాయి. అర్థప్రకృతి అయిన పతాకతోపాటు ప్రాప్త్యాశ అనే కార్యావస్థ ఇందులో నిర్వహించబడుతుంది. కీచకసంహారం, సుశర్మతోడి, కౌరవులతోడి యుద్ధం అనేవి ప్రాప్త్యాశను చిత్రిస్తాయి. పాండవులు కీచక సంహారంతో గండం గడిచి బయటపడతారు; ఉత్తర గోగ్రహణ యుద్ధంతో గడువు గడిచి గట్టున పడతారు. కార్యం ఏమవుతుందో అనే ఉత్కంఠ గర్భసంధిలో బలంగా ఉండటం గమనార్హం. గర్భసంధ్యంగాలు కూడా ఇందులో సాంగంగా అన్వయించబడటం విశేషం. తిక్కన నాటకీయ శిల్ప ప్రౌఢికి చతుర్థాంకతుల్యమైన చతుర్థ పర్వనిర్వహణం చతురోదాహరణం. 3. చతుర్విధ రాజవిద్యలలో నాల్గవది దండనీతి. దానిని చిత్రించే ఘట్టాలు ఇందులో స్పష్టంగా కనబడుతున్నాయి కాబట్టి చతుర్థమనే పదం రాజవిద్యాపరంగా సార్థకమవుతున్నది. 4. వేదాంతపరంగా విరాటపర్వాన్ని మోక్షశాస్త్రంగా భావిస్తారు.

జీవుడు పురాకృత కర్మఫల భోగం కొరకు ఒక రూపాన్ని ఆశ్రయించి అందులో ఆ భోగాన్ని అనుభవించి చివరకు యోగంతో ఆ శరీరాన్నుండి జీవుడిని ముక్తుని చేసికొనటం మోక్షమంటారు. పాండవులు మారురూపాలతో తాము ప్రతిజ్ఞచేసిన అజ్ఞాతవ్రత రూపకర్మను అనుభవించి, అందులోనుండి దైవానుగ్రహంతో నిపుణంగా ముక్తులైన విధం చెప్పబడింది కాబట్టి, చతుర్థపురుషార్థతుల్యమైన కథ కలిగిందని తాత్త్వికపరంగా వ్యాఖ్యానించ వీలున్నది. తిక్కన వాడిన 'చతుర్థ' పదం పై విధంగా చతురమైన అర్థ చతుష్టయాన్ని స్ఫురింపజేస్తున్నది.

16. ఊర్జితకథోపేతం విరాటపర్వం

ఊర్జిత కథ అంటే బిగువు కలిగిన కథ, లేదా జిగిబిగి కల కథ - అని శ్రవ్యకావ్యపరంగానూ, ఇతివృత్తం well-knit plot అని దృశ్యకావ్యపరంగానూ అన్వయం చెప్పవచ్చును. సంవిధానబంధురమైనది శ్రవ్యకావ్యకథ; సంధి పంచక బంధురమైనది దృశ్యకావ్యకథ. ఈ రెండు లక్షణాలూ విరాటపర్వాని కున్నాయి. తిక్కనను ఉభయ కవిత్వ తత్త్వ విభవోజ్జ్వలుడిగా చేశాయి.

సంవిధాన బంధురమైన కథ

శ్రవ్యకావ్యంలో బిగి సన్నివేశ సంవిధానాన్ని కార్యకారణబద్ధంగా నిబంధించటంలో స్పష్టమవుతుంది. దీనిని రెండు విధాలుగా గమనించవచ్చును:

1. ఆశ్వాస విభాగం: ధర్మరాజు ధౌమ్యుడి ఓదార్పుమాటలు విని తేరుకొని, తమ్ముల మనోధైర్యాన్ని గమనించి, ధర్మదేవత ఇచ్చిన వరాలతో మనసు దిటవు చేసికొని, 'నాకుఁజూడ మత్స్యనరపతి సద్ధర్మవర్తి, సుజనహితుఁ, డవార్యబాహుబలుఁడు గాన నతనిపాల నందఱుఁ దగవైన పనుల నిలుచు టభిమతంబు' **(1.64)** అని నిశ్చయించాడు. దాని కనుగుణంగా వారందరూ మెలగవలసిన పనులను నిశ్చయించుకొని కొలువులో సముచితంగా చేరారు. అంతటితో ఆ కార్యం ముగిసింది. ప్రథమాశ్వాసం కూడా ముగుస్తుంది. రెండవ ఆశ్వాసం భీముడు మల్లుడితో యుద్ధం చేసి అతడిని జయించటంతో ప్రారంభమై, కీచకుడిని సంహరించటంతో ముగుస్తుంది. మల్లుర ద్వంద్వయుద్ధం ఇందులోని సంవిధాన శిల్పం. జగదేకమల్లుడిని భీముడు బహిరంగంగానూ కీచకుడిని రహస్యంగానూ అద్భుతంగా చంపటం వలన ఉభయ మల్లవిద్యా ప్రదర్శనలతో ఒక సంవిధాన సౌష్ఠవాన్ని ద్వితీయాశ్వాసం సంతరించుకొన్నది. తృతీయాశ్వాసంలో దొమ్మియుద్ధం లేదా పలువురు వీరులతో చేసే యుద్ధాలు చిత్రించబడ్డాయి. ఉపకీచకుల వధలో ఒకడు పలువురిని చంపిన పద్ధతి, సుశర్మ తోడి యుద్ధంలో పలువురితో సంకుల, ద్వంద్వయుద్ధాలు చేసిన పద్ధతి వర్ణించబడి సజాతీయ యుద్ధ సన్నివేశ సంవిధానం సాధించబడింది. చతుర్థాశ్వాసం ఉత్తరుడు రథికుడుగా బృహన్నల సారథిగా యుద్ధయాత్ర ప్రారంభించటంతో మొదలవుతుంది. క్రమంగా బృహన్నల అర్జునుడుగా మారి రథికుడై, ఉత్తరుడిని సారథిగా చేసికొని భీష్మాదికురువీరుల కెదురు నడిచిన ఘట్టంతో ముగుస్తుంది. రథిక సారథులు వ్యత్యస్తమయ్యే వృత్తాంతం ఈ ఆశ్వాసానికి సంవిధాన చమత్కారాన్ని సంతరించింది. చివరిది పంచమాశ్వాసం. అర్జునుడు ఏకైక వీరుడై కౌరవ వీరులను నురుమాడటం ఇందులోని కథ. ముగింపులో ఉత్తరాభిమన్యుల వివాహం మంగళాంత సూచకం.

2. ప్రబంధ మండలి : శ్రవ్యకావ్యపరంగా తిక్కన మహాభారతాన్ని ప్రబంధ మండలిగా పేర్కొన్నాడు. ఒక కార్యం, ఒక నాయకుడు, ఒక రసం, ఒక విశిష్ట రచనాశైలి ఉన్నది ప్రబంధం. విరాటపర్వమంతా కలిసి ఒక ప్రబంధం కావచ్చును. లేదా, మూడు ప్రబంధాలు కావచ్చును. అవి- 1.కీచకవధ 2. దక్షిణగోగ్రహణం 3.ఉత్తరగోగ్రహణం. ఈ మూడు ఘట్టాలూ నిర్వహణలో ప్రబంధాలవంటివే. కీచకవధలో భీముడు నాయకుడు, యుద్ధవీరం ప్రధానరసం. దక్షిణ గోగ్రహణంలో నలుగురు పాండవులు నాయక స్థానీయులు, యుద్ధవీరం రసం. ఉత్తర గోగ్రహణంలో అర్జునుడు నాయకుడు, యుద్ధవీరం రసం. అనునాయకుల విజయాలన్నీ నాయకుడైన ధర్మరాజుకు అంగభూతాలవుతాయి. అనునాయక కార్యనిర్వహణ రూపాలైన ఈ మూడు ఘట్టాలూ మూడు ప్రబంధాల మండలిగా భావించవచ్చును. లేదా విరాటపర్వంలో పాండవులు ప్రదర్శించిన వీరం ధర్మజనాయకాశ్రితమై ఆరంభంలో మధ్యలో నిర్వహణంలో పోషించబడటం ప్రబంధశిల్పం. ఇది నిబిడ కథాసంవిధానం వలన సిద్ధించిన ప్రబంధ నిబంధనం. తిక్కన విరాటపర్వం కవితాశైలి రసాభ్యుచిత బంధం. వర్ణనాత్మక, ఆలంకారిక, నాటకీయ శైలుల త్రివేణీ సంగమం.

3. సంధి పంచక బంధురమైన కథ

ఊర్జితకథ అంటే దృశ్యకావ్య పరిభాషలో ఇతివృత్తం.

"ఇతివృత్తంతు నాట్యస్య శరీరం పరికల్పితమ్।

పంచభిః సంధిభి స్తస్య విభాగః సంప్రకల్పితమ్." (నాట్యశాస్త్రమ్ 10.1)

"ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికల్పితమ్" అనే పాఠాంతరం కూడా ఉన్నది. వృత్తమంటే కథ. ఇతివృత్తమంటే: పంచసంధులతో అలంకరించబడిన కథ. విరాటపర్వం ఒక నాటకమైతే అందులో అయిదు ఆశ్వాసాలూ వరుసగా అయిదు సంధులకు ఆలవాలాలై ఉన్నాయి. ప్రథమాశ్వాసంలో ముఖసంధి ఉన్నది. విరాటుడి కొలువులో పాండవులు అజ్ఞాతవాసవ్రతాన్ని నిర్వహించాలని సంకల్పించటం బీజం. పాండవులలో ప్రతివారూ విరాటుడి మనసు మెప్పించేటట్లు వర్తించాలని కార్యం ఆరంభిస్తారు. సేవలలో చేరి సేవిస్తారు. ఆరంభ బీజసంబంధం కలది ముఖసంధి. ద్వితీయాశ్వాసంలో ప్రతిముఖసంధి, భీముడు మల్లుడితో యుద్ధం చేసి ఓడించిన ఘట్టం బిందువు. దానివలన భీముడు శత్రుమర్దన క్రియకు ఉన్ముఖుడై ప్రధాన కథా ప్రయోజనానికి అడ్డం వచ్చిన శక్తులను తొలగించే ప్రయత్నంలో ఉంటాడు. కీచకుడు ద్రౌపదిని మోహించి, ఆమెను అవమానించినప్పుడు అతడిని సంహరించే తీవ్రయత్నానికి పూనుకొంటాడు. అందువలన ప్రతిముఖసంధి భాసించింది. మూడవ ఆశ్వాసంలో గర్భసంధి. కీచక సంహారార్థం ద్రౌపదీ భీములు ఒక పన్నాగం పన్నటం, అతడిని అర్ధరాత్రి నర్తనశాలకు రమ్మని సంకేతించటం, భీము డతడిని వంచించి చంపటం అనే కథలోనూ ఉపకీచకోదంతంలోనూ గర్భసంధి అలంకరించబడింది. కీచక వృత్తాంత వ్యాప్తి కారణంగా సుశర్మతో దక్షిణ గోగ్రహణ యుద్ధం జరగటం పతాక. ఫలం సిద్ధిస్తుందో లేదో అనే సంశయంతో కార్యయత్నం ఊగిసలాడినా చివరకు సంవత్సర నియమం ముగియటంతో ప్రాప్త్యాశతో గర్భసంధి సిద్ధించింది. దక్షిణ గోగ్రహణ యుద్ధ విజయానంతరం కథలో ప్రాప్త్యాశ ఏర్పడింది. నాలుగవ ఆశ్వాసంలో విమర్శ సంధి. ఇందులో ఉత్తరుడి కథ ప్రకరి వంటిది. అజ్ఞాతవాస నియమకాలం తీరటంతో అర్జునుడు నిజరూపం ధరించి కౌరవసేనలపై యుద్ధానికి పోవటం విమర్శ సంధి. పంచమాశ్వాసంలో నిర్వహణ సంధి అద్భుతంగా నిర్వహించబడుతుంది. అర్జునుడి యుద్ధవీరం, పాండవులు బయలు మెరయటం, అభిమన్యుడి వివాహం అనే ఘట్టాలలో కార్యం ఫలాన్ని పొందుతుంది. నాటక వస్తువు కెంతటి నిర్మాణ సౌష్ఠవం ఉండాలో అంతటి బిగువు కలిగిన కథ ఇందులో ఉన్నది.

తెలుగులో భారత నాటక కర్తలలో ముఖ్యులు తిరుపతి వేంకటకవులు. వారు భారత నాటకాలు వ్రాస్తూ విరాటపర్వకథను వదలివేశారు. ఎందువలన అంటే- అది స్వయం సమగ్రమైన రెండు మూడు నాటకాలుగా రచించదగిన ఊర్జితకథ కలది కావటమే. కీచక వధను, దక్షిణ గోగ్రహణాన్ని, ఉత్తర గోగ్రహణాన్ని వేరు వేరు నాటకాలుగా కొందరు రచించారు. భారత పాత్రలు మారు రూపాలు ధరించి చరించే ఈ పర్వం భారత నాటక స్రవంతిలో ఒదగటం కష్టం. అది దాని ప్రత్యేకత; ఒక రకమైన ఊర్జిత కథా స్వభావం.

విరాటపర్వంలో ఉపాఖ్యానాలు లేవు. మొదటి నుండి చివరి వరకు వేగంగా సాగిపోయే కార్యచైతన్యం కథను ఊర్జితం చేసింది. ఉజ్జ్వలం చేసింది.

17. ఊర్జిత కథలో ఒదిగిన నాటకీయత

విరాటపర్వం ఊర్జితకథతో బిగిని, నాటకీయతతో జిగిని సంతరించుకొన్నది. నిబిడమైన కథలో నిపుణమైన నాటకీయతను నింపి కావ్యశరీరానికి సంధిబంధ రూపసౌందర్యంతోపాటు అభినయబంధురమైన విలాసలావణ్యాలను ప్రదర్శించగల అభివ్యక్తి మాధుర్యాన్ని తిక్కన కల్పించాడు.

కథలో నాటకీయత ఆరు అంశాల నాశ్రయించి ఆవిష్కృతమౌతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

1. కథా సన్నివేశాలను నాటకరంగాలుగా తోచేటట్లు రూపొందించటం - రంగపరికల్పనం.

2. పాత్రల సంభాషణలే కథకు ప్రాణం పోస్తున్నట్లు నిర్వహించటం - సంభాషణ శిల్పం.

3. మాట్లాడే పాత్రలు చతుర్విధాభినయంలో జీవిస్తున్నట్లు చిత్రించటం - చతుర్విధాభినయ ప్రదర్శన చాతుర్యం.

4. కథలో సహజంగా సాగే వర్ణనాంశాలను రూపక మర్యాదలుగా మలచటం - రూపక మర్యాదల రూపకల్పనం.

5. రసాభ్యుదయోల్లాసంతోపాటు రసాభ్యుచిత బంధాన్ని కూడా పోషించి రక్తి కట్టించటం - శ్రవ్యకావ్యశైలితో దృశ్యకావ్యశైలిని సమన్వయించటం.

6. ఉభయ కావ్యశిల్పాలనూ ఔచిత్య పోషకంగా ఉన్మీలింప చేయటం - ఉభయ కావ్యప్రౌఢి పాటించే శిల్పం.

వీటిని సమన్వయించుకొంటూ సమీక్షిస్తే తిక్కన రచనలో నాటకీయత సాక్షాత్కరిస్తుంది. అయిదాశ్వాసాల విరాట పర్వకథను విశ్లేషిస్తే ముప్పది రంగాల మహారూపకంగా తోస్తుంది. మూడు నాటకాల సంపుటిగా ముచ్చట కొలుపుతుంది. ఆ రంగాలలో పరిమాణాన్ని బట్టి చిన్నవి కొన్ని, అంకాలవలె పెద్దవి కొన్ని. స్వభావాన్ని బట్టి వాటిని సభారంగాలనీ, సమావేశరంగాలనీ, సంభాషణ రంగాలనీ, సమరరంగాలనీ సమీక్షించవచ్చును. పాత్రలను బట్టి ఏకపాత్ర, ద్విపాత్ర, బహుపాత్రరంగాలనీ విశ్లేషించవచ్చును. ప్రదర్శన ప్రవృత్తిని బట్టి స్థిరరంగాలనీ, చలద్రంగాలనీ, మిశ్ర రంగాలనీ వివేచించవచ్చును. వీటిలో స్థలకాలపాత్రలకు సంబంధించిన ఐక్యత్రయాన్ని సంభావించవచ్చును. వీటిలో కొన్ని సమాంతర నిర్మాణ, రసభావ, రచనా శిల్పాలను ప్రకటించేవిగా కనబడవచ్చును. శ్రవ్యకావ్యంలో ఒదగగలిగిన దశరూపక స్వభావ సన్నివేశాలను యథావకాశంగా విరాటపర్వంలో విశేషంగా సహృదయులు సందర్శించవచ్చును. ఇంత వైవిధ్యంతో కూడిన నాటకీయత ఈ పర్వంలోని ఊర్జిత కథకు ఉజ్జ్వలతను ప్రసాదించింది.

(1) సభారంగ సప్తకం : రాజు తీర్చిన కొలువు సభ. విరాటపర్వంలో విరాటుడు రాజు. అతడి పురంలో అజ్ఞాత జీవితం సాగిస్తున్నారు పాండవులు. సంవత్సరం గడిచేంతవరకు విరాటుడికి పాండవులు అంగభూతులు. అయినా వారు పరోక్షంగా విరాట నగర, సామ్రాజ్య రక్షకులు. వారి కథ కనుకూలంగా విరాటుడు అయిదుసార్లు సభ తీర్చిన ఘట్టాలను తిక్కన తీర్చిదిద్దాడు. ప్రతినాయకుడైన దుర్యోధనుడు, నాయకుడైన ధర్మరాజు తీర్చిన సభలను తుల్యబలంతో తిక్కన చిత్రించాడు. రంగాలలో సభారంగాలకు సమున్నత స్థానం ఉన్నది. అవి వట్టి సన్నివేశాలు మాత్రమే కావు; వస్తుధ్వనితో రసధ్వనిని పోషించటానికి తిక్కన వాడుకొన్న చక్కని శిల్ప సామగ్రులు.

బయలి కొలువు : పాండవులు మారురూపాలతో విరాటనగరంలో ప్రవేశించేటప్పుడు దైవయోగం వలన విరాటుడు బయలి కొలువు తీర్చి ఉన్నాడు. మూలంలో యుధిష్ఠిరుడు రాజసభలో ప్రవేశించినట్లున్నది. తిక్కన దానిని బయలికొలువుగా మార్చాడు. రాజసభలో మంత్రులచేత నిశ్చయించబడిన కార్యకలాపాలకు ప్రాధాన్యం ఉంటుంది. బయలి కొలువులో ప్రజలతో రాజుకు ముఖాముఖి ఏర్పడుతుంది. పాండవ ప్రవేశానికి బయలికొలువే సముచితం. నిండుకొలువులో రాజు మంత్రిమండలి సలహాలతో తీర్పులిస్తాడు. బయలి కొలువులో తానే స్వయంగా ఝటితి స్ఫూర్తితో నిర్ణయాలు తీసికొని అమలు చేస్తాడు. కథకు కావలసింది ఈ రెండో మెలకువే. అందువలన పాండవులకూ విరాటుడికీ మాత్రమే సంభాషణలు నడుస్తాయి. కథ వేగవంతమవుతుంది. తిక్కన మార్పు సన్నివేశౌచిత్యానికి చక్కని ఒరవడి.

తిక్కన సభను కల్పించటంలో ఎట్లా చొరవ తీసికొన్నాడో, దానిని నిర్వహించటంలో కూడా మూలం కంటె ముందుచూపుతో శ్రద్ధ తీసికొన్నాడు. దానిని నాలుగు అంశాలలో మనం గమనించవచ్చును. 1. విరాటుడిలో సాత్త్విక సంస్కారాన్ని సముచితంగా పోషించటం. 2. పాత్రోచిత చతుర్విధాభినయాలను చిత్రించటం. 3. పాండవుల ప్రవేశ క్రమాన్ని మూలంలో కంటె భిన్నంగా సంఘటించటం 4. భావికథార్థ సూచనలతో ఉభయకావ్యప్రౌఢి పాటించే శిల్పాన్ని ప్రదర్శించటం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విరాటుడు ఆనాడు బయలి కొలువు తీర్చటం దైవనియోగం. ఇది తిక్కన ఆ రంగావహనకు ఇచ్చిన అన్వయ సూత్రం. ఈ రంగంలో వ్యవహరించే పాత్రలన్నీ దేవు డాడించే పాత్రలు. పాండవు లజ్ఞాతంగా విరాటుడి కొలువులో ఉండాలి. మారురూపాలలో ఉన్నా పాండవులు మహిత సముజ్జ్వలాకృతులు. వారి ఆకారాలను చూచిన విరాటుడు వారందరూ మహారాజయోగానికి అర్హులని భావిస్తాడు. వారి పుట్టుపూర్వోత్తరాలను గురించి గుచ్చి గుచ్చి అడుగుతాడు. తన రాజ్యాన్ని సైతం ధర్మజాదులకు ఇచ్చుకొనటానికి సిద్ధమౌతాడు. వారందరూ ధర్మరాజు కొలువులో ఉండి ఆయన ప్రశంస లందుకొన్నారని చెప్పుకొన్నా, వారు అయిదుగురు ఆ రోజే వరుసగా తన కొలువులో చేరినా, అతడు వారిని పాండవులని గుర్తించలేకపోయాడు. ఆ తరువాత సుదేష్ణ, కీచకుడు సైతం వారిని పాండవులుగా, సైరంధ్రిని ద్రౌపదిగా గుర్తించలేకపోయారు. ఇది కూడా దైవనియోగమే. మారురూపాలతో ప్రజల మధ్యకు వచ్చిన పాండవులను ప్రజలూ, రాజూ గుర్తించలేకపోయారనటం భావికథాగతికి ధ్వని సంకేతం. దుర్యోధనుడి చారులుకూడా వారిని మారురూపాలతో గుర్తించలేకపోయారు. వారి వీరకృత్యాలవలన మాత్రమే దుర్యోధనుడు అనుమానించగలిగాడు. పాండవులను గుర్తించగలిగినవారు ఆ కాలంలో ఒకరో ఇద్దరో ఉన్నారు. వారు భీష్ముడు, ద్రోణుడు. వారు రంగంలో ప్రవేశించేంతవరకు పాండవులకు భయం లేదని వస్తుధ్వని.

మూలంలో విరాటుడు నిర్మల హృదయుడు, సంస్కారవంతుడు. తిక్కన చిత్రించిన విరాటుడు సాత్త్వికగుణ సంపన్నుడేకాక, సాత్త్వికాభినయ సమర్థుడు. వ్యక్తుల రూపరేఖలను చూచి వారి జాతకాలను చెప్పగలిగిన గడుసరి. ఎంత ఉత్తముడో అంత ఉద్విగ్న హృదయుడు. తెలిసి తెలిసి ఎవరికీ అపకారం చేసేవాడు కాడు. ధర్మజుడే అన్నట్లు అతడు అక్షరాలా సద్ధర్మవర్తి, సుజనహితుడు. అయినా అవార్యబాహుబలుడు. బయలి కొలువులో విరాటుడి చేష్టలు ఈ లక్షణాలన్నిటికీ అభినయ వ్యాఖ్యలు.

విరాటుడు - సన్న్యాసి రూపంలో వస్తున్న ధర్మరాజును చూచి త్రిమూర్తులతో పోల్చాడు. త్రిజగాలనూ ఏలదగినవాడన్నాడు. మూర్ధాభిషిక్తులు మ్రొక్కదగిన పాదపద్మాలు గల సమ్రాట్టుగా ఉన్నాడని ఊహించాడు. మహాత్ముడని ప్రశంసించాడు. మత్స్యరాజ్యాన్నంతా అతడి కిచ్చినా తక్కువే అనుకొన్నాడు. ప్రజలందరూ అతడిని చూచి ప్రత్యుత్థానం చేస్తే, తానూ లేచి, గద్దియ దిగి నమస్కరించి, ఆయన ఇచ్చిన ఆశీస్సులను పొందాడు. ధర్మరాజును సముచిత సమున్నతాసనం మీద కూర్చుండబెట్టాడు. వినయంతో కుశల ప్రశ్నలు ప్రారంభించాడు. మూలంలోని విరాటుడికి ఇంత భక్తిశ్రద్ధలూ, వినయవివేకాలూ లేవు. తెలుగు విరాటుడి మనస్సులో మొదట ధర్మరాజు చిత్రాన్ని ఇట్లా ముద్రించాడు కాబట్టే, ఆ తరువాత అజ్ఞాతవ్రతాంతంలో ధర్మరాజును గుర్తించి అతడు నిశ్శంకగా- 'వినయంబు మిగులఁ గుంతీతనయాగ్రజు పాదపీఠతలమున ఫాలంబును బొందఁ జాఁగిమ్రొక్కి యతని కౌఁగిలి వడసె సమ్మదము తళుకొత్తన్' (5.340) అని తిక్కన చెప్పాడు. బయలు మెరిసిన ధర్మరాజును మ్రొక్కిన విజ్ఞతకూ, అతడి కౌగిలి పొందగలిగే యోగ్యతకూ తగిన బీజాలను విరాటుడి హృదయక్షేత్రంలో ఈ కొలువులోనే నాటాడు తిక్కన. దానితో తిక్కన చెక్కిన చైతన్యశిల్పమయ్యాడు విరాటుడు.

విరాటుడిలో సాత్త్వికభావస్పందన సాంద్రంగా స్ఫురిస్తుంది. మదించిన ఏనుగు వలె వస్తున్న వలలుడిని చూచి విరటుడు ఉలికిపడ్డాడు. వెక్కసపడ్డాడు. అతడి విపుల వక్షస్థలాన్ని చూచి పరవశించాడు. భూతలానికి దిగివచ్చిన సూర్యుడో చంద్రుడో అని ఊహించాడు. భీము డంగీకరించగా హర్షోత్కర్షంతో మనసులో పొంగిపోయాడు. పేడిరూపంలో దాగి ఉన్న అర్జునుడి సహజ వీరలక్షణాలను లోలోన భావించి తన కోదండాన్నీ రథాన్నీ ఇవ్వటానికి సిద్ధమయ్యాడు. బృహన్నల శాపవృత్తాంతం విని విషణ్ణహృదయుడైపోయాడు. ముద్దులు మూటకట్టే తన కూతురు ఉత్తర నిండుసభలో తనకు మ్రొక్కితే విరాటుడు ఉబ్బిపోయాడు. కూతురును మక్కువతో దగ్గరకు తీసికొన్నాడు. ఆమె మొగంలో తన మొగముంచి కళ్ళారా చూచాడు. మునివేళ్ళతో ఆమె ముంగురులు సవరించాడు. పులుకుపులుకున చూచాడు. శిరోజాలను వాత్సల్యంతో స్పృశించాడు. విరాటుడికి ఏ భావమైనా అరకొరగా రాదు. గట్లు పొంగేటట్లు ప్రవహిస్తుంది. బృహన్నల చేతిలో ఉత్తరను ఉంచుతూ అంపకాలప్పుడు ఆడపిల్లను అత్తమామల చేతులలో పెడుతున్నంత ఆర్భాటం చేశాడు. కూతురిని గురుకులానికి పంపుతున్నంత సంబరపడ్డాడు. నకుల, సహదేవులకు వారు కోరుకొన్న ఉద్యోగాలిచ్చి మనసులో తృప్తిపడ్డాడు. మూలంలో విరాటుడికి ఇంతటి నాగరకమైన అభినయ నైపుణ్యం లేదు. ఇది విరాటుడికి తిక్కన నేర్పిన నాట్యవిద్య.

రూపాలూ వేషాలూ మారి సాక్షాత్తూ రూపకంలోని నటులవలె రంగప్రవేశం చేసిన పాండవులను అటు వ్యాసుడూ, ఇటు తిక్కనా అభినివేశంతో వర్ణించారు. వ్యాసుడు పాండవుల రూపవేషాల వివరాలను తెలుపుతున్నట్లు వర్ణించగా, తిక్కన ఒక క్రమపద్ధతిలో పాత్రోచిత వేషధారణను అమర్చాడు. తిక్కన వేషాలంకరణమర్మజ్ఞుడుగా పాత్రలను చిత్రించి ఆంగికాభినయాన్ని సాంగంగా సాక్షాత్కరింపజేశాడు. దానికి తోడు పాత్రోచిత విశిష్టాభినయ ముద్రలను (manarisms) తిక్కన మేళవించాడు. దానితో పాత్రోచితాభినయం చేయగలిగిన సుశిక్షిత నటులుగా తెలుగులో వెలుగొందారు. వారి సమున్నత రూప వైభవాలకు అనుగుణంగా సీసపద్యాలను, వృత్తాలనూ వాడి తిక్కన ఛందోమయమైన శిల్పాలంకారాన్ని సంతరించాడు. ధర్మజ భీమార్జున ద్రౌపదుల రూపాలూ, ఉత్తర సౌందర్యం సీసపద్యాలలో చిత్రించటం విశేషం. తిక్కన పాత్రలకు వలెనే సీసపద్యాలకు కూడా క్రమాలంకార సంస్కృతిని అలవరచాడు.

మూలంలో ధర్మరాజాదులు మాట్లాడుతున్నప్పుడు వారికి అసత్యదోషం కలుగకుండా శ్లేషార్థ విశిష్టపద ప్రయోగాలతో వాచికాభినయాన్ని సాగించాడు వ్యాసుడు. అది ఋషి అయిన వ్యాసభట్టారకుడు పాండవులలో సత్యనిరతిని కాపాడటానికి చేసిన ఉదాత్త ప్రయత్నం. సంస్కృత శబ్దాలలోని వ్యుత్పత్తిమూలకమైన శ్లేషను తెలుగులోనికి తెచ్చి తెలుగుదనాన్ని తగ్గించ తలచుకొనలేదు తిక్కన. తాను చేస్తున్న ఈ మార్పును విజ్ఞులు విమర్శిస్తారని ముందే ఊహించి ధర్మరాజుతో మన ముందరికాళ్ళకు బంధాలు వేయించాడు.

ఆ. "ఉన్నరూప పలుకు నన్నరు లెక్కడఁ। గలరు? తోఁచినట్లు పలుకు పలుక
నైన చందమయ్యె; నంతియకా కంత। పట్టి చూడఁగలరె యెట్టివారు?' ' (విరా.1.191)

ఈ మాటలు నాలుగు ప్రయోజనాలు సాధిస్తున్నాయి. సన్న్యాసి రూపంలో ఉన్న ధర్మరాజు వేదాంత ధోరణిలో పలుకుతున్నట్లు పాత్రోచిత సంభాషణను చిత్రించటం ఒక ప్రయోజనం. శ్లేష నాశ్రయించి నిజం పలికినట్లు చిత్రించటం మానవ పాత్రల సహజ స్వభావం కాదని తిక్కన భావించినట్లు చెప్పటం రెండవ ప్రయోజనం. ఒకవేళ కవిత్వంలో శ్లేషమయంగా పాండవులు మాట్లాడినట్లు రచించినా పాఠకు లంత సులభంగా అర్థం చేసికొనలేరని తిక్కన భావించటం మూడవ ప్రయోజనం. తిక్కన ఒక పద్యంలో ఏదైనా విశేషాన్ని నిక్షిప్తం చేసి చెప్పితే దానిని తరువాతి పద్యంలోనూ వచనంలోనూ సూచించటం పరిపాటి. అందువలన ఈ శ్లేషోక్తులను తిక్కన మన్నించి ఉండకపోవచ్చును. ఈ మూడే కాక, నాటక శిల్పమైన మరొక ప్రయోజనాన్ని ఉద్దేశించి ధర్మరాజుచేత ఈ మాటలు తిక్కన పలికించి ఉండవచ్చును.

"మృదు లలిత పదాఢ్యం, గూఢశబ్దార్థహీనమ్। జనపద సుఖబోధ్యం, యుక్తిమ న్నృత్యయోగ్యమ్
బహుకృత రసమార్గం, సంధి సంధానయుక్తమ్। స భవతి శుభకావ్యం, నాటక ప్రేక్షకాణామ్"

అన్న భరతుడి వాక్యం తిక్కనకు కొలమానంగా నిలిచి ఉంటుంది. అందువలన మూలంలో కంటె భిన్నంగా పాండవ పాత్రలు శ్లేషను పరిత్యజించేటట్లు తిక్కన చేశాడు. శ్లేషను వదలినా ఉభయ కావ్య శిల్పాన్ని వదలుకొనేటట్లు చేయలేదు. మచ్చుకు ధర్మరాజు వాక్య విన్యాసాన్ని సమీక్షిద్దాం.

మూలం:"యుధిష్ఠిర స్యాస మహం పురా సఖా। వైయాఘ్రపద్యః పునరస్మి బ్రాహ్మణః
అక్షాన్ ప్రవప్తుం కుశలో-స్మి దేవితా। కఙ్కేతి నామ్నాస్మి విరాట విశ్రుతః" (సం.4-6-10)

నేను పూర్వం యుధిష్ఠిరుడి చెలికాడినని ప్రకృతార్థం. నీకూ యుద్ధంలో స్థిరంగా తోడుగా ఉంటానని శ్లేషార్థం. వ్యాఘ్రపాదగోత్రం వాడినని ఒక అర్థం. యముడి కొడుకునని శ్లేషార్థం (వ్యాఘ్రం వలె ప్రాణులపై పడేవాడు వ్యాఘ్రపదుడు - అంటే యముడు. అతడి కొడుకు వైయాఘ్రపద్యుడు). నేను బ్రాహ్మణుడనని ప్రకృతార్థం. బ్రాహ్మణుల కోర్కెలను విరివిగా

తీర్చేవాడనని రెండో అర్థం. కంకుడంటే యముడనే అర్థం కూడా ఉంది కాబట్టి ధర్మరాజనే అర్థం గూఢంగా స్ఫురిస్తుంది. పాచిక లాడటంలో నేర్పరి కావటం అనే వాక్యంలో శ్లేషేమీ లేదు. 'అక్షాన్ ప్రయోక్తుం కుశలః' అనే అంశం విరాటుడికి కావలసింది. అందులో గూఢార్థంగానీ, శ్లేషార్థం కాని లేదు కాబట్టి, దానిని తెలిసికొని ధర్మరాజును అతడు మన్నించాడు. మిగిలిన మాటలలోని శ్లేషలన్నీ అక్కడ నిరర్థకాలే అయిపోయాయి. అందువలన శ్లేషమూలక ధ్వనిని తిక్కన మన్నించక సన్నివేశానికి 'తోచినట్లు పలుకు పలుకనైన' చందాన్ని అనుసరించాడు. తిక్కన తన మనసులోని మాటను ధర్మరాజుచేత చెప్పించి మిగిలిన పాండవులందరిదీ అదే బాట అని ధ్వనింపజేశాడు.

తిక్కన పలికించిన మాటలు శ్లేషలు కావు; వ్యంగ్యాలు. నేను ద్విజుడ నన్నాడు. ద్విజశబ్దం బ్రాహ్మణ క్షత్రియ వాచి. కురువిషయ జాతుడన్నాడు. పూర్వకాలంలో గోత్రం చెప్పటం పరిపాటి. తిక్కన కాలంలో దేశం చెప్పితే చాలు. సుజనప్రియుడట! అందుకే విరాటుడి వద్దకు వచ్చాడని భావం. ధర్మసుతు సఖుడు కావటం వలన ఉత్తముడని ధ్వని. సన్న్యాసాశ్రమంతో కూడి ఉన్నాడట. ప్రస్తుత సన్న్యాసి వేషం ఒక ప్రయోజనంతో కూడి ఉన్నదని వ్యంగ్యం. రాజులకు కావలసిన బహు వినోదాలు కంకుడికి తెలుసునట. ఆ మాట విరాటుడికి ఆసక్తి కలిగించేది. ద్యూతక్రీడ తెలుసట కాని, బంధువులతో మోసగించబడటం చేత దానిమీద విరక్తిగలిగి దేశం వదలి లేచివచ్చాడట! అందువలన పందెం లేని జూదమే ఆడతాడట! ధర్మపరుల స్నేహంతో రాజనీతి విద్యలో కొంత పరిచయం ఉన్నదట! పేరు కంకుడట! తెలుగులో కంకుభట్టు మూలంలో కంటె ఎక్కువ మాట్లాడాడు. అయినా ప్రతి మాటా విరాటపర్వంలో భావికథలో అతనివృత్తంలో సత్యమయ్యేటట్లు మాట్లాడాడు. భావికథార్థ వ్యంజకమైన పతాకస్థానాన్ని తన మాటలతో రూపకమర్యాదలలో నిలుపగలిగాడు. వ్యాసుడి ధర్మరాజు సత్యసంధుడు, తిక్కన ధర్మరాజు వాక్యనిపుణుడు.

ఇట్లాగే భీమాదుల మాటలూ సాగాయి. తిక్కన వారి మాటలకు వాస్తవరక్తినీ వ్యంజనా శక్తినీ ప్రసాదించాడు. అజ్ఞాతవాసంలో పాండవులు పెట్టుకొన్న పేర్లు మూలంలో కంటె తెలుగులో కొన్ని మారాయి. దీనిని గురించి జనహితవ్యాఖ్య ఇట్లా పేర్కొన్నది. "మూలంలోనూ, తెలుగులోనూ కొన్ని పేర్లు యథాతథంగా ఉన్నాయి. కొన్ని మార్పు చెందాయి. కారణం ఏమిటో! సంస్కృతంలోని పేర్లకు వ్యాఖ్యాతలు అర్థాలు వ్రాశారు. తెలుగులోని పేర్లకు అంతగా అర్థం కొన్నిట కుదరటం లేదు.

ధర్మరాజు- (సం) కంకః (తె) కంకుడు, కంకుభట్టు; కంకుడంటే యమధర్మరాజు, ఇతడు అతని కొడుకు. "ఆత్మావై పుత్ర నామాఽసి'' - అందుచేత అతడూ కంకుడే. భీముడు - (సం) వల్లవః వలలుడు, వల్లవః అంటే వంటవాడని అర్థం. కాని, తెలుగులో ఆ అర్థం ఉందా? పరిశీలించాలి. అర్జునుడు - (సం) బృహన్నలః (తె) బృహన్నల, బృహత్= కప్పబడే, నలః- రలయో రభేదః, నరః=అర్జునుడు; ప్రచ్ఛన్నవేషంలో ఉన్న అర్జునుడు. నకులుడు- (సం) గ్రన్థికః (తె) దామగ్రంథి. గ్రంథమనగా ఆయుర్వేదము. అది ఎరిగినవాడు గ్రన్థికుడు. ఈ అర్థము అశ్వినీదేవతల కుమారుడుగా సముచితము. సహదేవుడు - (సం) తన్తిపాలః; (తె) తంత్రీపాలుడు. తన్తి= గోశాస్త్రజ్ఞానం; దీనితో ఆవుల్ని రక్షించేవాడు అని సంస్కృతంలో అర్థం. కాని, తెలుగులో ఒక రేఫం అదనంగా చేరింది. దీని కర్థం అదే అవుతుంది. సంస్కృతంలో తన పేరు అరిష్టనేమి-అని సహదేవుడు చెప్పుకొంటాడు. ఈ రెండు పేర్లు ఏమిటో? ద్రౌపది- (సం) మాలినీ; (తె) మాలిని - మాలలు కూర్చేది. పాండవుల రహస్య వ్యవహారానికి పేర్లు రెండింటా సమానమే. అవి వరుసగా జయ, జయంత, విజయ, జయత్సేన, జయద్బల-అనేవి'' (పు.1.245, 246)

విరాటుడి బయలుసభకు తుల్యంగా సుదేష్ణ బయలుసభ చిత్రించబడింది. ఆమె అంతఃపురం నుండి బయటకు వచ్చి ఒక భవనోపరితలంమీద చివర నిలిచి బయటి బజారులోకి చూస్తుండగా ద్రౌపది కనబడుతుంది. ఆకర్షితురాలై ఆమెను చెలితో తన కడకు పిలిపించుకొంటుంది. అంతఃపురోచితమైన బయలు సభ. ఎంత చక్కని సామ్యం! సైరంధ్రిగా ద్రౌపది తనను పరిచయం చేసికొంటూ తన కైదుగురు గంధర్వులు పతులని చెప్పుకొన్నది. పతివ్రతలుగా వాసికెక్కిన సైరంధ్రీజాతి వనిత నని చెప్పుకొన్నది. సత్యాన్ని మనోహరంగా చెప్పికొని అజ్ఞాతవాసాన్ని విజ్ఞతతో నడుపుకొన్న ద్రౌపది ఈ రంగానికి అనుబంధమైన ఉపరంగంలో పాత్రోచితంగా ప్రవర్తించింది.

విరాటుడి కొలువులో పాండవులు జ్యేష్ఠానుపూర్విగా ప్రవేశించారు. ఆ తరువాత ద్రౌపది సుదేష్ణ అంతఃపురంలో ప్రవేశించినట్లు తోస్తుంది. అయినా, ఈరెండు సన్నివేశాలూ సమాంతరంగా జరిగాయి. కాని, కథాకథనంలో క్రమం పాటించాడు తిక్కన. విశేషమేమంటే-తిక్కన వర్ణించిన తీరు కుంభకోణప్రతిలో తప్ప మిగిలిన సంస్కృతభారత ప్రతులలో కానరాదు. కాబట్టి భండార్కర్ ప్రతిని బట్టి చూస్తే ఈ కల్పన అమూలకం. అయినా, దీని కొక ఆధారం ఒక సంస్కృత ప్రతిలో ఉన్నది. కాబట్టి కల్పిత మనటానికి వీలులేదు. కాగా, తిక్కన ఈ కల్పననే సమర్థించాడని భావించాలి. భండార్కర్ ప్రతిలో పాండవులు - ధర్మరాజు, భీముడు, ద్రౌపది, సహదేవుడు, అర్జునుడు, నకులుడు - అనే క్రమంలో విరాటుడి కొలువులో ప్రవేశించినట్లున్నది. ఇది వ్యూహాత్మకంగా చేసిన ప్రవేశం కావచ్చును. ధర్మరాజు ముందు మార్గం చూపాలి. అతడు నగరిలో ప్రవేశించిన తరువాత అతడికి రక్షాకవచంవలె భీముడు ప్రవేశించాలి.వరుసలో పాండవ పట్టమహిషి సురక్షితంగా సుదేష్ణ అంతఃపురంలో చేరాలి. అంతవరకూ అర్జునుడు ఆమెకు అండగా గుప్తంగా ఉండాలి. ఆ సంధికాలంలో చిన్నవాడైన సహదేవుడు విరాటుడి కొలువులో కుదురుకొనాలి. ఆ తరువాత పేడిరూపంలో ఉన్న అర్జునుడు అంతఃపుర ప్రవేశాన్ని పొందగలగటం జరుగుతుందా? లేదా? అని పరిశీలించాలి. అది ధ్రువపడిన తరువాత నకులుడు ప్రవేశించాలి. పాండవులలో ధర్మరాజు తరువాత నకులుడికి ఒక ప్రత్యేక స్థానమున్నది. మాద్రేయులలో అతడు ప్రథముడు. పెద్ద కొడుకులు చేసే పనులు ఏవైనా చేయవలసి వస్తే ధర్మరాజు నకులుడినే ప్రయోగిస్తాడు. యక్షప్రశ్నల ఘట్టంలో ఆ పనే చేశాడు. పాండవులలో ఇద్దరే బ్రతికి ఉండవలసిన అవసరం వస్తే ధర్మజుడి తరువాత నకులుడే ఉండాలి. ఈ ధర్మాన్ని ఆశ్రయించి ధర్మజాదులందరూ విరాటుడి కొలువులో సురక్షితంగా చేరారన్న విషయాన్ని ధ్రువపరచుకొన్న తరువాతే నకులుడు ప్రవేశించటం లౌకిక వ్యూహాన్ని అనుసరించి సమంజసం. అయితే ఈ వ్యూహంవలన కథలో ఎటువంటి విశిష్ట ప్రయోజనం సాధించబడటం లేదు. కథకు నిబిడబంధం ఏర్పడటం లేదు. తిక్కన అందుకే దీనిని గ్రహించలేదు.

పాండవులు జ్యేష్ఠానుపూర్విగా ప్రవేశించటంతో కథలో ఐక్యత సాధించబడింది. పాండవులు తాము అజ్ఞాతవాసంలో ఎట్లా మెలగాలని భావించి ఏ క్రమంలో ఆ అంశాన్ని ఆవిష్కరించారో ఆ క్రమమే ఇక్కడ పాటించబడింది. రెండవ ఆశ్వాసంలో ద్రౌపది, అయిదవ ఆశ్వాసంలో అర్జునుడు పాండవులను జ్యేష్ఠానుపూర్విగానే పరిచయం చేశారు. తిక్కన ఆ పద్ధతినే ఇక్కడ పాటించాడు. వా రేవరుసలో వచ్చినా ఇతరులు గుర్తించలేని విధంగా యమధర్మరాజు వరం వారికి ఉండటం దైవనిర్ణయం. అట్లని తిక్కన పాండవ పురుషకారాన్ని తక్కువ చేయలేదు. ప్రయోజనం లేని వ్యూహాన్ని ప్రవేశపెట్టలే దంతే!

ఎందువల్లనంటే - పాండవులు బయలు మెరయటంలో మొదట అర్జునుడు నిలుస్తాడు. కాని, విరాటుని ఎదుట ధర్మరాజుతో కలిసి వస్తాడు. దీనికీ మూలప్రతిలోని ప్రవేశక్రమానికీ పొత్తు కుదరలేదు. ఇక కౌరవుల ఆలోచనలో ధర్మరాజున్న దేశం గోసంపదతో వర్ధిల్లుతుందని భీష్ముడు చేసిన సూచన విరాటనగరంలో పాండవులుండ వచ్చునన్న ఊహకు ఊపిరిపోసింది. ఒక స్త్రీ కారణంగా గంధర్వుడు కీచకుడిని వింతగా చంపాడన్న వార్త భీముడినీ, ద్రౌపదినీ గుర్తించటానికి తోడ్పడింది. ఆ తరువాత ఉత్తరగోగ్రహణంలో అర్జునుడిని గుర్తించటం కుదిరింది. మూల భారతం - ఈ క్రమాన్ని ధ్వనింపజేసేటట్లు ప్రవేశక్రమాన్ని కల్పించిందని భావించినా ధర్మజ భీమ ద్రౌపదుల ప్రవేశం తరువాత సహదేవ నకులుల నడుమ అర్జునుడిని ఎందుకు పేర్కొన్నదో తెలియటం లేదు. అందువలన తిక్కన వీటన్నిటికంటె పాండవుల ధర్మశీలాన్ని తెలిపే జ్యేష్ఠానుక్రమమే ఔచిత్యమని భావించి ఉండవచ్చును.

దీనికి తోడు మరొక బలమైన కారణం కూడా ఉన్నది. తిక్కన దేశీయ దృక్పథం కలవాడు కాబట్టి ఉత్తరాది ప్రతుల కంటె దక్షిణాది ప్రతులలో కానవచ్చే విశేషాలకే ఆయన ప్రాముఖ్యమిస్తాడని విమర్శకులు భావిస్తారు. మచ్చుకు ఆచార్య వి.రామచంద్రగారి ఈ పరిశీలన గమనించతగింది.

"శ్రీ పి.పి.యస్.శాస్త్రిగారి దాక్షిణాత్యప్రతియే ఔత్తరాహిక ప్రతికంటెఁ దిక్కన భారతమునకుఁ జేరువగా నున్నదని చెప్పుట కాధారములైన కొన్ని యంశముల నిదే విరాటపర్వమునుండి యుదాహరించుచున్నాను.

(1) పాండవులు విరాట నగరము సొచ్చుటకు మునుపు ధర్మరాజు దుర్గాస్తవ మొనర్చినట్లు ఔత్తరాహప్రతిలో నున్నది. ఇది తిక్కన భారతములోఁగాని, దాక్షిణాత్య సంస్కృత ప్రతిలోఁగాని లేదు.

(2) అర్జునుడు కౌరవులతో మార్కొనునప్పుడు అతని యుద్ధమును జూచుటకు దేవేంద్రాదు లమరావతి నుండి విమానస్థులై వచ్చి యాకాశవీథిలో నదృశ్యులై నిలిచినట్లు దాక్షిణాత్యప్రతి యభివర్ణించుచున్నది. (అధ్యా. 62 శ్లో. 1-24). ఈ విషయ: మతిసంక్షిప్తముగానే యైనను దెలుఁగు భారతములోఁ గన్పడుచున్నది. ఇది యౌత్తరాహిక ప్రతిలో లేదు.

(3) దాక్షిణాత్యప్రతిలో భీమార్జునులు రహస్యముగా ధర్మరాజును గలిసికొనుటయు, విరాటాదులను జంపెదమనుటయు, ధర్మజుఁడు వారిని వారించుటయు వర్ణింపబడియున్నవి. (అధ్యా. 63. శ్లో. 94-112). ఇది తెలుగు భారతములో నున్నది. ఔత్తరాహిక ప్రతిలో లేదు.

(4) తెలుగు భారతములో నుత్తరుఁడు అర్జునున కుత్తర నిమ్మని విరాటునికి బోధించుటయు, వల్లెయని విరాటు డంగీకరించుటయు నుల్లేఖింపబడియున్నది. ఇది దాక్షిణాత్యప్రతిలోనే గాని (అధ్యా.65) యౌత్తరాహిక ప్రతిలో లేదు.

(5) తెలుగు భారతములో దుర్యోధనుడు పాండవుల యగపాటు సమయకాలము ముగియకమునుపే జరిగెనేమో తెలిసికొనుటకై ధర్మరాజుకడ కొక దూతను బంపును. అత డా దూతకు సమయాబ్దములు నిండెనని చెప్పి పంపును. ఈ విషయము సంస్కృతమున దాక్షిణాత్యప్రతిలోనేగాని (అధ్యా.66) ఔత్తరాహిక ప్రతిలో లేదు.

(6) పాండవు లాయుధములను శమీవృక్షమున నిక్షేపించి, విరాట నగరమున కేగుటకు మునుపు యమునిఁ బ్రార్థించి యెవరికి వలసిన వేషములను వారు ధరించినట్లు తెలుఁగు భారతములో నున్నది. ఇది దాక్షిణాత్య ప్రతిలోఁ గలదు. (అధ్యా 7.శ్లో.3-10). ఔత్తరాహిక ప్రతిలో నీ ప్రసక్తియే లేదు. ఇంకను గావలెనన్నచో నిట్టి విషయము లనేకములు చూపవచ్చును'' (తిక్కన కవితా శిల్పము. పు.9-10). ఇటువంటి తిక్కన దేశీయదృక్పథమే పాండవ ప్రవేశ ఘట్ట రచనకు కూడా దోహదమై ఉండవచ్చును.

తిక్కన తీర్చిన సభారంగాలన్నీ సన్న్యాసిగా ప్రవేశించిన ధర్మరాజు సమ్రాట్టుగా బయలు మెరయటానికి ఏర్పాటైన శిల్పసోపానాలుగా అమరటం విశేషం. బయలి సభలో ధర్మజుడు విరాటుడిని ఆశ్రయించినట్లు పైకి తోచినా విరాటుడే ధర్మజుడికి నమస్కరించి ఆశీస్సులను పొందినట్లు చిత్రించటం అత డున్న పూజ్యస్థానానికి వ్యంజకం. భీమాదులు ధర్మజుడి కొలువులోని వారమని చెప్పుకొన్నప్పుడు విరాటుడు నిస్సంశయంగా వారిని కొలువులో చేర్చుకొనటం ధర్మరాజుకు విరాటుడి హృదయంలో ఉన్న గౌరవ స్థానానికి సంకేతం. రెండవ సభలో కీచకుడి దుష్ప్రవర్తనాన్ని చూచి, సైరంధ్రి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక విముఖుడై నిష్క్రమించిన విరాటుడి కొలువులో ప్రభువు తరువాతి ప్రభువువలె మాట్లాడాడు ధర్మరాజు. కీచకుడి వలన విరాటుడు గ్రహణం పట్టాడు. ఆ దురవస్థ నుండి అతడిని ఉద్ధరించగలిగిన ధర్మదేవతగా ధర్మరాజు విరాటసభారంగంలో ప్రవేశించాడు. నిజానికి విరాటనగర ప్రభుత్వ శాసకుడు ధర్మరాజైనాడు. ఆ రెండోరంగంలో దక్షిణగోగ్రహణవార్త విని విరాటుడు ఉగ్రుడై బంధుహితవర్గంతో యుద్ధానికి సిద్ధమయ్యే రంగం మూడవది. అందులో విరాటవర్గం చేసే వీరసన్నాహాలు విస్తృతంగా వర్ణించబడతాయి. అయినా, అతడి బలం చాలదని విరాటుడు బయలి సభలో నిలబడటం స్పష్టం చేస్తుంది. ఇది నాలుగవ రంగం. మొదటి బయలిరంగానికి సమాంతరమైన రంగం. అవసరం వస్తే యుద్ధంలో సాయం చేయగలమని పాండవు లిచ్చిన మాటను నిరూపించుకొనవలసిన వీరరంగం. ధర్మరాజు తననూ భీమనకులసహదేవులనూ యుద్ధవీరులుగా పరిచయం చేసికొని మహారథాలను పొందటం కథలో విజయహేతువుగా ధ్వనించబడుతున్నది. పాండవులు కీచకులను చంపి విరాటుడిని దుష్టశక్తుల నుండి విముక్తుని చేశారు. ఇప్పుడు వైరశక్తుల నుండి రక్షించి విజయుడిని చేశారు. దక్షిణ గోగ్రహణంలో పాండవులు విరాటుడి ప్రాణ మాన రాజ్య రక్షణం చేశారు.

తే. "ఒడలు సిరియును నాకు నీయొసఁగినవియ। కానఁ దగ సమర్పించెదఁ గరుణ; నీవు
సమ్మతించి యిమ్మత్స్యదేశంబుఁ గావు;। పంచి పనిగొని నన్ను రక్షించుకొనుము." (విరా.3.224)

అని విరాటుడిచేత అనిపించుకొన్నారు. ఈ సన్నివేశంలో నైతికంగా, ధార్మికంగా, లౌకికంగా మత్స్య దేశానికి రాజు ధర్మరాజని తేలింది. దానిని పాండవులు బయలు మెరసిన సభలో నిరూపించుకొన్నారు. విరాటుడి సభలో పాండవుల ఉనికి అభేద్యమని వ్యంగ్యంగా నిరూపితమయింది. ఈ విధంగా సభారంగ సప్తకం అజ్ఞాతవాసంలో కూడా ధర్మరాజు సమ్రాట్టుగానే సమ్మానించబడటాన్ని ధ్వనింపజేస్తున్నది.

(2) సన్నివేశ రంగాలూ, సంభాషణ శిల్పాలూ

విరాటపర్వం సన్నివేశ బంధురం; సంభాషణ సుందరం. ప్రతి సన్నివేశం ఒక ప్రయోజనాన్ని సాధిస్తుంది. ప్రతి సంభాషణం ఒక ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. సన్నివేశాన్ని సంభాషణలు నాటకీకరిస్తాయి. సంభాషణలతో సన్నివేశం ఉభయ కవిత్వ తత్త్వవిభవోజ్జ్వలం ఔతుంది. విరాటపర్వమంతా ఈ గుణాలకు విరామం లేని ఉదాహరణమే. అయినా హృదయాహ్లాదం కొరకు కొన్ని సన్నివేశరంగాలూ, కొన్ని సంభాషణ శిల్పాలూ పరిశీలిద్దాం.

(i) సంభాషణమంటే అడిగిన దానికి అనువైన సమాధానమివ్వటమనే అర్థంలో తిక్కన వాడాడు (విరా. 2.274). కీచకుడు నర్తనశాలకు రాబోతున్నాడని భీముడికి తెలియచెప్పటానికి వంటశాలకు వచ్చింది ద్రౌపది. చతురోక్తితో ఒక చక్కని కందపద్యం చెప్పింది. దానికి భీముడు కూడా చతురోక్తితో ఒక కందపద్యంలో తిరిగి సమాధానం చెప్పాడు. ఆ రెండు పద్యాలు మల్లెచెండ్లవలె మనోహరాలు. వాటిని తిక్కన అభినయదళాలలో పొదివి చెప్పిన తీరు ఆహ్లాదకరం. చూడండి. సగం వికసించిన పద్మం వలె మొగం తేటపడి ఉన్నదట ద్రౌపదికి. ఆమె వాయుపుత్రుడిని చూడగానే అతడిలో గుట్టుగా ఉన్న క్రోధాగ్నిని రాజబెట్టాలని మనసు కలిగిందట. దానికి చతురోక్తిని సాధనంగా తీసికొన్నదట! చతురోక్తి అంటే నర్మోక్తి కావచ్చును. నిపుణోక్తి కావచ్చును, సరసోక్తి కావచ్చును. తలచుకొన్న పనిని సాధించగలిగే కార్యోక్తి కావచ్చును. ఈ లక్షణాలన్నీ కలిసిన ప్రౌఢోక్తి కావచ్చును. తిక్కన ద్రౌపది 'ప్రౌఢి పాటించు శిల్పాన్నే' ప్రదర్శిస్తుందికదా!

క. "నా కొఱఁతఁ దీర్చి వచ్చితి;। నీ కొఱఁతయ యింక, సూతునిం దెగఁజూడన్
లోకము వంచింపను దగు। చీఁకటిరే యొదవె; నేమి సేసెదొ చెపుమా!" (విరా.2.271)

'నా వాటా పని నేను చేసివచ్చాను నా మాట నిలుపుకొన్నాను. ఇక నీ వంతే మిగిలి ఉన్నది. కీచకుడిని చంపటానికీ, లోకం కన్ను కప్పటానికీ అనువుగా ఈ రోజు చీకటి రోజయింది. ఏమి చేస్తావో ఏమో!' అన్నది. భీముడిని రెచ్చగొట్టే నేర్పే ఇందులో చాతుర్యం. 'ఆడదాన్ని నేనే అనుకొన్న పనిని అనుకొన్నట్లుగా చేసి చూపించాను. మరి నీవు మగవాడివి ఏం చేస్తావో? పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్నాయి. నీకు కార్యసాధనోత్సాహం ఉన్నదో లేదో?' అని సరసంగా మాట్లాడుతూనే సాహసాన్ని ఎగద్రోసింది. చీకట్లో లోకం కన్ను కప్పి కీచకుడిని చంపటమే ఇక నీ పని - అని లక్ష్యాన్ని గుర్తు చేసింది. ఆ మాట విని భీముడు తన పనిమీద ద్రౌపది ఎంత శ్రద్ధ చూపుతున్నదో గమనించాడు. తన క్రోధాగ్నిని ప్రజ్వలింపజేసే ప్రజ్ఞను లోలోన మెచ్చుకొన్నాడు. ఆమె ముఖం వికసింపజేసికొంటూ, హర్షంతో, ఆశతో, ఆకాంక్షతో, ఆసక్తి కలిగించేటట్లు మాట్లాడుతూ ఉంటే భీముడు చిరునవ్వు చిలికిస్తూ పలికాడట! మగువ మనసు తెలిసిన మనోహరుడు మందహాసం చేయటం సరసోక్తికి ఫలం. చతురోక్తిలోని సరసత్వానికి సమాధానం అభినయంతో ఇచ్చాడు భీముడు. వరుసగా ఆమె ప్రశ్నలకు నిపుణంగా సమాధానం చెప్పనారంభించాడు. అంటే సంభాషించాడని అర్థం.

క. "నన్నడుగ నేల? నీవును। నన్నీచుఁడు నేమి మాటలాడితి? రది నా
కున్నట్టు లెఱుఁగఁ జెప్పుము। ని న్నే మెచ్చించువాఁడ నీరజవదనా!" (విరా.1.273)

'నీవంతు పని నీవు చేశావు. నా వంతు సంగతి నీవడగకుండానే చేస్తాను. ఆ భయం నీకు వద్దు. అయితే ఆ నీచుడూ నీవూ ఏమి మాట్లాడారో ఉన్నది ఉన్నట్లుగా చెప్పుము' అని అడిగాడు. ' ఆ నీచుడు' అనే విశేషణమే భీమకోపాగ్ని ప్రజ్వలనానికి శిఖవలె నిలిచింది. కాని, ఆ క్రోధాన్ని అప్పుడు వ్యక్తం చెయ్యలేదు. కోపం రగులుకొన్నది. దాన్ని మంటగా మార్చాలంటే శత్రుకృతాపరాధ శ్రవణం కావాలి. దానిని కోరాడు భీముడు. వికసించిన ఆమె ముఖాన్ని చూచాడు. మురిపెంగా 'నీరజవదనా!' అని పిలిచాడు. 'నిన్ను నేను మెప్పిస్తానుగా మాటలెందుకు?' అని కొసమెరుపు వాక్యం చిలిపిగా చిలికించాడు. అది మాట కాదు. ప్రబంధంలో భావికథార్థ ధ్వని. నాటకంలో పతాక స్థానం. నర్తనశాలలో కటిక చీకటిలో కీచకుడిని గూఢమర్దన క్రియతో చంపి, అంతటితో ఆగక ద్రౌపది మనస్సులో తనను మెచ్చుకొనాలని అతడిని వికృతపు చావుకు గురి చేశాడు. మాంసపు ముద్దగా మార్చివేశాడు. అతడి శవాన్ని చూపుతూ ద్రౌపది ప్రతీకారం చల్లారేటట్లు ఆహ్లాదం కలిగేటట్లు మాట్లాడాడు. ఆమెవైపు చూచిన పరాయివాడి గతి అంతేనని ధైర్యం చెప్పాడు. (విరా.2.358) 'పయోజాననా!' అనే సంబుద్ధితో మురిపించాడు. భీముడి చతురోక్తి నర్మోక్తియే కాదు; నిపుణోక్తి, కార్యసాధనోక్తి! (మరి కొన్ని వివరాలకు విరా. 2.354 నుండి 361 వరకూ వ్యాఖ్యలోని విశేషాంశాలు చూడండి.)

సంభాషణ రెండు పద్యాలే. అవి పూర్వాపర సన్నివేశ, సంభాషణల సంవిధాన సామర్థ్యంతో చతురోక్తులుగా భాసించి తిక్కన కవితలో శిల్పోక్తులై ఉభయ కావ్యకళావైభవాన్ని ధ్వనిమయం చేస్తున్నాయి. ఇట్లా అల్పాక్షరాలలో అనల్పార్థభావనం చేయించటం తిక్కన సంభాషణ శిల్పం!

(ii) వక్త తన అభిప్రాయం ఎదుటివారు అంగీకరించేటట్లుగా మాట్లాడటం సప్రయోజన సంభాషణం. దీనికి-విరాటుడు సుదేష్ణతో సైరంధ్రిని అంతఃపురం నుండి పంపివేయుమని నచ్చబలికిన సంభాషణ సార్థకమైన ఉదాహరణ. ముచ్చటగా మూడు పద్యాలలో హేతుబద్ధంగా విరాటుడు మాట్లాడాడు (విరా.3.31-33). సుదేష్ణ దానికి తగినట్లు అంగీకరించింది (విరా.3.34) (వీటి వివరణానికి వ్యాఖ్యలో విశేషాంశాలను గమనించండి).

(iii) ఓదార్పు మాటలు ఎదుటివారి కలత తీరుస్తాయి. అట్లా మాట్లాడటం ఒక సంభాషణ కళ. ఓదార్చేవారిని బట్టీ, ఓదార్చబడేవారిని బట్టీ, అప్పటి సన్నివేశాన్నిబట్టీ ఉపశమన వాక్యాల తీరు మారుతూ ఉంటుంది. ఉదాహరణకు - ఒకటి రెండు:

ధర్మరాజు బ్రాహ్మణులకు వీడ్కోలు పలికాడు. వారి ఎడబాటు అతడి హృదయాన్ని విషాదంలో ముంచింది. మరల అంతమంది బ్రాహ్మణులకు ఆశ్రయమిచ్చి ఆరాధించుకొనే అదృష్టం కలుగుతుందా? అని కుమిలిపోయాడు. గొంతు బొంగురుపోయింది. కన్నీరు మున్నీరయ్యాడు. తమ్ము లెన్ని ఓదార్పు మాటలు చెప్పినా అతడు తేరుకొనటం లేదు. అప్పుడు ప్రక్కనున్న ధౌమ్యుడు అతడి విషాదం తగ్గేటట్లు సంభాషించాడు.

ధౌమ్యుడికి ధర్మరాజు చిత్తవృత్తి బాగా తెలుసు. అతడు వస్తుతః ధీరోదాత్తుడు. ధీరుడు కాబట్టి అతడు సామాన్యంగా విషణ్ణుడు కాడు కాని, ధర్మహాని కలిగినా, ధర్మాన్ని నిర్వహించలేకపోయినా, ఆ దుస్థితికి దుఃఖిస్తాడు. అది ధర్మహానిభీతివలన కలిగే ఆవేదనే కాని, లౌకిక శోకం కాదు. ఈ రహస్యం తెలిసిన ధౌమ్యుడు ధర్మరాజులోని ధర్మవీరుడిని జాగృతం చేశాడు. విధి అలంఘ్యమన్న వాస్తవాన్ని గుర్తు చేశాడు. అతడు పురాణేతిహాస కథార్థ స్మృతియుతుడు. అతడి దుఃఖంవంటి దుఃఖం మరొకడు పొంది ఉన్నాడన్న దృష్టాంతాలు వింటే చాలు; అంతటివారే అంతటి దురవస్థలపాలై తేరుకొని ధర్మనిర్వహణం చేయగా, నే నా పెద్దలు చూపిన బాటనే నడవాలని భావించి తనను తాను నిబ్బరించుకొంటాడు. ఈ మూడు కీలకాలూ తెలిసిన ధౌమ్యుడు మూడు పద్యాలు పలుకుతాడు. (విరా. 1.51, 53,54) ఆ మాటలు విని ధర్మజుడు కలకతేరాడు. తమ్ములవైపు మొగమెత్తి చూచాడు. ముచ్చటైన ఆ మూడు పద్యాలలో మొదటిపద్యం ధర్మజనాయకత్వ ప్రశంసకు మణికిరీటం!

ఉ. "ధర్మనిరూపకత్వమున, ధైర్యమునన్, మహనీయవృత్తి స
త్కర్మ విధిజ్ఞతం, జతురతా మహిమన్, దృఢబుద్ధి నెవ్వరున్
ధర్మజుపాటిగా రనఁగ ధాత్రిఁ బ్రసిద్ధుఁడ వైన యిట్టి నీ
పేర్మికి నీడె దుర్దశలపెల్లునకున్ దురపిల్లు టారయన్?" (విరా.1.51)

మనిషిని మూడు రకాలుగా అంచనా వేస్తుంది లోకం. అతడు తాను ఎటువంటి వాడినని భావిస్తున్నాడో అట్లా ఉంటున్నాడా? అతడిని లోకం ఎటువంటివాడని భావిస్తున్నదో అట్లా మసలుతున్నాడా? నిజంగా అతడు ఎటువంటివాడో అట్లా ఉన్నాడా! అని. ఈ మూడు రకాల ప్రశ్నలకూ ఒకే సమాధానం ఇచ్చేవాడు మహితాత్ముడు. ధర్మరాజు అటువంటివాడు. ధౌమ్యుడు ధర్మజుడి ఐదు గుణాలను పేర్కొన్నాడు. అవి లోకంలో రూఢికెక్కాయి అన్నాడు. అవన్నీ విషాదాన్ని కలిగించేవి కావు. అధిగమించగలిగే ఆదర్శ గుణాలు. ధర్మజుడు ధర్మాన్ని, లేదా కర్తవ్యాన్ని నిరూపించుకొనే నిశ్చయాత్మక ప్రజ్ఞ కలవాడు. అతడికి అజ్ఞాతవాస వ్రతం కర్తవ్యం. దాని పాలనం ధర్మం. దానిని ఎట్లా నిర్వహించాలో ఆలోచించటం విశేషం. ఆ వివేకోదయం కలిగితే విషాదం వెనుకకు తిరుగుతుంది - అని ధౌమ్యుడు మొదటి విశేషణంతో సూచించాడు. ధర్మ నిర్వహణంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా ధైర్యంతో ఎదుర్కొనటం ధర్మజ లక్షణం. ధర్మవీరులకు విషాదం విరుద్ధ గుణం; దానిని జయించుమని రెండవ విశేషణం వాడాడు ధౌమ్యుడు. ధర్మనిర్వహణంలో ఉదాత్తవర్తనంతో కూడిన విజ్ఞత అవసరం. దానిని జ్ఞాపకం చేశాడు. విషాదం విజ్ఞత కాదని హెచ్చరించాడు. విజ్ఞత ఉన్నా కార్యాన్ని నేర్పరితనంతో నిర్వహించే ప్రతిభ ఉండాలి. దానిని గుర్తు చేశాడు. విషాద పరిత్యాగమే చతురతా మహిమ అని వ్యాఖ్యానించాడు. ఇన్ని ఉన్నా స్థిరబుద్ధి కార్యదక్షులకు అవసరం. స్థిరచిత్తులకు విషాదం కలగటం స్వభావ విరుద్ధం. ఒకవేళ కలిగితే వారు అప్రౌఢు లనబడతారు. ధర్మరాజు నిజంగా ధర్మదేవత వరం వలన పుట్టినవాడైతే ధీరత్వాన్ని విడిచి విషాదమగ్నుడు కాడని లోకం అనుకొంటుంది. కాబట్టి నీవిట్లా దుఃఖించటం నీ వ్యక్తిత్వానికి తగినట్లుగా ఉన్నదా? ఆలోచించుకో!-అని ధౌమ్యుడు ధర్మజుడి వివేకాన్ని మేలుకొలిపి విషాదాన్ని తొలగింపజేశాడు.

తిక్కన అంతటితో ఆగడు. ఆయన ఉభయ కవిత్వ తత్త్వం వెలారుస్తాడు. ఇది విషాదంలో నుండి వీరుడు పుట్టిన వైఖరిని ధ్వనింపజేసే దొడ్డపద్యం. విరాటపర్వ ప్రబంధానికీ, రూపకానికీ నాంది వంటి పద్యం. అయిదాశ్వాసాల విరాటపర్వ కథలో ధర్మజుడు నిర్వహించే నాయక పాత్రలోని అయిదు ముఖ్యాంశాలను ఇందులో శబ్దార్థాల నాశ్రయించి సూత్రధారుడైన ధౌమ్యుడు ధ్వనింపజేశాడు. ధర్మదేవుడి వరం వలన ఏర్పడిన మారురూపాలతో విరాటుడి కొలువులో వర్తించవలసిన విధానాన్ని నిరూపించటంలో ప్రథమాశ్వాసంలో ధర్మజుడు అగ్రస్థానంలో నిలిచాడు. కీచకుడి వలన ఏర్పడిన విపత్తును ధైర్యంగా ఎదుర్కొనే ప్రవృత్తిని భీమాదులకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ నిపుణంగా నేర్పి, తెరవెనుక సూత్రధారిగా నిలిచి ధీరు డనిపించుకొన్నాడు ద్వితీయాశ్వాసంలో, దక్షిణ గోగ్రహణ ఘట్టంలో మహోన్నత బుద్ధితో విరాటుడిని రక్షించి, సుశర్మను విడిపించి ఉదాత్తుడనీ, సత్కర్మ విధిజ్ఞుడనీ ప్రశంసలందుకొన్నాడు. తృతీయాశ్వాసంలో, చతుర్థాశ్వాసంలో ధర్మజ ప్రసక్తి ఉండదు. కాబట్టి పంచమాశ్వాసంలో ధర్మరాజు విరాటుడితో ఉత్తర గోగ్రహణ విజయ ప్రస్తావనలో అర్జునుడే విజయాన్ని సాధించాడని చెప్పటంలో ప్రదర్శించిన వాక్చాతుర్య మహిమా, బయలు మెరిసేటప్పుడు విరాటుడి గద్దెపై కూర్చున్నప్పుడు ప్రదర్శించిన దృఢబుద్ధీ చివరి రెండు విశేషణాలలో ధ్వనిస్తున్నాయి. ఇందులోని వస్తు నిర్దేశాత్మక నాందీలక్షణం తిక్కన సాధించిన ఉభయకావ్యశిల్పం.

(iv) ఒక్కొక్కసారి సన్నివేశంలో ప్రవర్తిల్లే సంభాషణలను రెండు వైపులా పదునున్న కత్తివలె అటు గతాన్నీ ఇటు భవిష్యత్తునూ ధ్వనింపజేసేటట్లు రచించటం తిక్కన ఉభయకావ్యశిల్పం. ధౌమ్యుడి మాటలకు తేరుకొన్న ధర్మజుడు తమ్ములవైపు చూచాడు. అందులో ఎంత లోతున్నదో తమ్ములకే తెలుసు. ధర్మజుడి కీర్తిని నిలువబెట్టవలసిన కార్యశూరులు భీమాదులని ఆయన చూపులలోని అంతరార్థం. దానిని తెలిసికొన్న భీముడు ఇట్లా అన్నాడు:

మ. “భవదాజ్ఞాదృఢబంధ సంయమిత శుంభద్వేగమై కాక నాఁ
డవలీలన్ మన యర్జునద్విపము గ్రోధావేశ దుర్దాంత ద
ర్ప విలాసోద్భటభంగి నే పదరి కౌరవ్యాంబుజశ్రేణిఁ జి
క్కువడం జేయదె యొక్క వ్రేల్మిడిన నీకున్ వేడ్క సంధిల్లఁగన్”. (విరా.1.56)

ఈ మాటలు విని ధర్మరాజు తెలివొందిన మొగంతో శిరఃకంపం చేశాడట! ఈ అభినయ విశేషం భీముడి మాటలలోని విశేషాన్ని భావింపజేస్తుంది. అర్జున మదేభ విజృంభణాన్ని మత్తేభవిక్రీడితంతో వర్ణించి చెప్పటం మన తలలూపిస్తుంది. అయితే, భీముడు అర్జున పరాక్రమాన్ని గురించి ఇంతగా ఎందుకు చెప్పాడు? అతడి పరాక్రమ ప్రదర్శనానికి ధర్మజుడి ఆజ్ఞ అనే గొలుసులు అడ్డు వచ్చాయని అధిక్షేపించటానికా? ఆనాటి విషాదానికి ఆనాటి ధర్మజవర్తనమే కారణమని ఎత్తిపొడవటానికా? భీముడు తనను గురించి చెప్పుకొనకుండా అర్జునుడిని గురించి చెప్పటం మరొకరకమైన నిష్ఠురం! భీముడి మాట ధర్మజుడికి కళంకప్రాయం. ఆ నింద అతడు మోస్తూనే ఉండాలి. ఇక ఇప్పుడు విషాదపడుతూ కూర్చుంటే తమ్ముల ముందు పరువు కూడా నిలవదని భావించి అతడు మొగం విప్పార జేసికొని తల ఊచాడా? - అని అనేక ప్రశ్నలు తలయెత్తుతాయి. ఈ పద్యంలోని కీలకమంతా ‘నాఁడు’ అనే కాలనిర్దేశవాచకంలో ఉన్నది. ద్రౌపదికి భంగపాటు జరిగిన ఆనాడు-అని ప్రకరణార్థం. ఆనాడు అర్జున ద్విపాన్ని అనుమతిస్తే కౌరవ్యాంబుజశ్రేణిని చిక్కుపరచేదట! అంతే. రూపుమాపేది కాదట! భీముడు అంత నిగ్రహంగా మాట్లాడటం ఆశ్చర్యకరం! అయితే ఆ మాట అనిపించింది తిక్కన. నాఁడు అట్లయింది. ఇకముందు అజ్ఞాతవాసవ్రతానంతరం ధర్మజుడు అర్జునుడిని నియమించే అవసరం ఉండకపోవచ్చును. ఆ సన్నివేశం ఏనాడు ఏర్పడుతుంది? ఏదో ఒక రోజు ఏర్పడుతుంది - అనే ధైర్యంతో ధర్మజుడు సంతోషించి తలఊపాడు.

తిక్కన అంతటితో పఠితలను ఆగనీయలేదు. ఈ పద్యంలో పతాక స్థానాన్ని ప్రజ్ఞావంతంగా నిలిపాడు. విరాటపర్వంలో భీముడెన్ని యుద్ధాలు చేసినా కౌరవులతో చేసే అవకాశం దొరకలేదు. కాని, అర్జునుడికి మాత్రం లభించింది. ఉత్తరగోగ్రహణయుద్ధంలో అప్పుడు అర్జునుడు ధర్మజ ‘ఆజ్ఞాదృఢబంధ సంయమిత శుంభద్వేగుఁడు’ కాడు. స్వీయ నిర్ణయంతో ‘క్రోధావేశ దుర్దాంత దర్ప విలాసోద్ధతి’తో కౌరవ వీరులను చిక్కుపరచాడు. ‘నాఁడు’ను భావికథార్థవ్యంజకంగా సూచించి, తిక్కన పతాకస్థానంగా ప్రయోగించి ఉభయ కావ్య శిల్పాన్ని ప్రదర్శించాడు.

(v) కొన్ని సన్నివేశాలలో ఒక పాత్ర చేసే సంభాషణలను బట్టి, అభినయాన్ని బట్టి ఆ పాత్ర వ్యక్తిత్వాన్ని పాఠకు లూహించే విధంగా చిత్రించటం ఉభయ కావ్యరచనా శిల్పం. తిక్కన రచనలో ఇట్టి శిల్పం అనల్పం. విరాటపర్వమంతా విస్తరించుకొని ఉన్న ఈ కళను సమీక్షించటం సాధ్యం కాదు. అయినా మచ్చుకు సుదేష్ణ పాత్ర చిత్రణకు సంబంధించినంతవరకు పరిశీలిద్దాం.

సుదేష్ణ విరాటుడి పట్టమహిషి. విరాటపర్వంలో ఆ పాత్ర అంతఃపురాన్ని దాటి బయటికి రాలేదు. అందువలన సన్నివేశాలన్నీ ఆమె మందిరానికే పరిమితమై ఉంటాయి.

ఒకనాడు సుదేష్ణ హర్మ్యతలంమీద చెలులతో కూడి విహరిస్తూ వీథిలో వెళుతున్న సైరంధ్రినీ ఆమె వైఖరినీ ప్రీతితో చూచింది. ఆమెను గురించి తెలిసికొనాలని కుతూహలపడింది. ఆమెను పిలుచుకొని రమ్మని ఇద్దరు ప్రౌఢాంగనలను పంపింది. ద్రౌపది ఉదాత్త గంభీరంగా అంతఃపురంలోకి వచ్చింది. ఆమెను సుదేష్ణ గౌరవంతో చూచింది. స్నేహంతో చేతులు ముందుకు చాచింది. శరీరంతో నమ్రభావం ప్రదర్శించింది. దంతకాంతులు సగం వెలువడేటట్లు మందహాసంతో అత్యంత ఆదరంతో దగ్గరికి రమ్మని పిలిచింది. ద్రౌపది దగ్గరికి వచ్చి నిలబడింది. ఆమె రూపాన్ని ఆపాదమస్తకం చూచింది. కుతూహలంతో ఔచిత్యం చెడిపోకుండా కుశలప్రశ్న లడిగింది. ద్రౌపది తాను సైరంధ్రీ జాతి వనితననీ, తనకు అయిదుగురు భర్తలనీ, కారణాంతరాల వలన తాను శత్రువుల చేత అవమానించబడినట్లూ, భర్తలతో కలిసి అడవికి వెళ్ళినట్లూ, బ్రహ్మచర్యంతో ఉన్నట్లూ, ఒక యేడు మాత్రం ఇంకా నియమంతో ఉండాలనీ, ధర్మాత్మురాలని విని సుదేష్ణ వద్ద సేవలో ఉండాలని వచ్చినట్లూ నివేదించుకొన్నది. కాని,

సుదేష్ణ ఆమె మానవాంగన అంటే నమ్మలేకపోయింది. ఎవరివో నిజం చెప్పుమని ఆమెను గుచ్చి గుచ్చి అడిగింది. ఆమె అనుమానం పోయేటట్లు ద్రౌపది మాట్లాడింది. తాను పూర్వం సత్యభామాద్రౌపదుల అంతఃపురాలలో సైరంధ్రిగా ఉండేదాననని, పేరు మాలిని అనీ చెప్పి, తనకు వచ్చిన విద్యలన్నీ పేర్కొని ఆమెను అనునయించింది. సేవకు అనుమతించుమని వేడింది. ఆ మాటలు విని సుదేష్ణ ఆశ్చర్యపోయింది. తన మనసులోని మాట దాచుకోకుండా పైకి చెప్పింది.

మ. "...విను! నీరూపము చూచి మానృపతి యువ్విళ్ళూరు; నే నెమ్మెయిం
బని గొందుం? దగ నింతులుం దగిలి నీపైఁ జూడ్కి నెక్కొల్పి నె
మ్మనముల్ విస్మయమందఁ జూచెదరు; భామా! పల్కు లింకేటికిన్?". (విరా.1.321)

అందువలన 'నిన్ను భరించటం కష్ట' మన్నది. నిన్ను అంతఃపురంలో ఉంచుకుంటే నా నాశనం నేనే కొనితెచ్చుకొన్నట్లే' అని కుండబ్రద్దలు కొట్టినట్లు మాట్లాడింది.

ఆ మాటలకు ద్రౌపది నిపుణంగా సమాధానం చెప్పింది. తన భర్తలు గంధర్వులనీ, వారు సామాన్యులు కారనీ, బలపరాక్రమాలున్నవారనీ, తనను ఒక్క నిమిషమైనా ఏమరి ఉండరనీ చెప్పింది. అంతటితో ఆగక-

క. "నీచమతి నన్ను నెవ్వఁడు। సూచిన నా రాత్రిలోనఁ జూతురు దెగఁ దా
రా చపలు హరిహరాదులు। గాచిన బలవిక్రమము లఖర్వము లైనన్.'

క. "బంధుశతంబులు శౌర్య మ। దాంధములై శక్తి సంపదాభీలములై
సింధుర సదృశత నున్నను। సంధుల సంధు లెడలించి చంపుదు రతనిన్." (విరా.1.324-325)

అని చెప్పి పురుషులు తనవైపు తేరిపార చూడటానికి భయపడతారనీ, పైపెచ్చు తాను శీలవతిననీ పలికి, సుదేష్ణను అనునయ వాక్యాలతో అంగీకరింపజేసింది. నీచపు పనులకూ, ఎంగిలితిండ్లకూ నియోగించవద్దని వేడింది. సుదేష్ణ సంతోషించి, సైరంధ్రిని ఊరడించి, సేవలో ఉంచుకొన్నది.

స్వభావంలో సుదేష్ణ అన్ని విధాలా విరాటుడి అర్ధాంగిగా కనబడుతుంది. మంచివారిని మంచి మనసుతో చూడటం, సున్నితమైన మనస్సుతో ఉద్విగ్నంగా స్పందించటం, మాటలో నడతలో సంస్కారం ఉట్టిపడటం అనేవి సహజంగా గోచరిస్తాయి. ఉదాత్తురాలుగా కనబడుతున్న ద్రౌపదిని సహజంగా తనంతట తానే పిలిచి ఆదరించిన సుదేష్ణ - సేవించదగిన ఉత్తమురాలనటంలో అనుమానం లేదు.

అయితే ఆమె ఆదర్శవంతురాలు కాదు. తెలుపు నలుపుల వింత కలయిక ఆమె వర్తనం. ఒడుదుడుకులు లేకుండా బ్రతుకు సాగించా లనుకొనే సుఖమయ జీవి. తన సుఖం కంటె ధర్మం గొప్పదని ఆమె తలంచదు. అందువలన ఆమెలో అంతస్సంఘర్షణ అప్పుడప్పుడు చెలరేగుతుంది. ఎట్లాగంటే సైరంధ్రిని అందంగా ఉన్నదని ముచ్చటపడి పిలిపించుకొన్నది. మర్యాద చేసింది. ఆడవారిని కూడా ఆకర్షించే ఆమె అందాన్ని ఎగాదిగా చూచింది. అబ్బురపాటుతో ప్రశంసించింది. కాని, ఆమెను తనవద్ద ఉంచుకొంటే ఆమె అందమే తనకు శత్రువవుతుందని భయపడింది. దానితో - తానే పిలిపించిన ద్రౌపదిని తిరిగి పొమ్మనే స్థితికి వచ్చింది. ద్రౌపది అనునయిస్తే అంగీకరించింది. దానినిబట్టి ఆమెకు స్థిరబుద్ధికాని, స్వయంనిర్ణయశక్తిగాని లేవని తోస్తున్నది. విరాటుడికి కూడా ఈ లక్షణాలున్నాయి. అందుకే వారు కీచకుడి అదుపులో ఉండిపోవలసివచ్చింది.

తిక్కన వీరి సంభాషణలలో పతాకస్థానాలను ప్రదర్శించాడు. ద్రౌపది సౌందర్యం సుదేష్ణ మందిరంలో ప్రవేశించే పురుషులను ఆకర్షిస్తుందన్నమాట సత్యం. భయంతోనో, భక్తితోనో సుదేష్ణ తన భర్తను సైరంధ్రిబారినపడకుండా కాపాడుకొనగలిగింది. మరి కీచకుడిని తాను నియంత్రించలేకపోయింది. అది ఆమె దోషమని అంటే ఆమె పూర్తిగా అంగీకరించకపోవచ్చును. ద్రౌపదికున్న

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అపూర్వ సౌందర్యం వలన కలిగే సహజ ప్రమాదంగానే ఆమె భావిస్తుంది. అందుకే కీచకుడి పట్ల ఆమె నిర్లిప్తంగా ఉండిపోయింది. సైరంధ్రి భర్తలు బలవంతులని విన్నది. కాని, వారి ప్రభావాన్ని కన్నులారా చూడలేదు. కీచకుడి భవిష్యత్తును సైరంధ్రికీ, ఆమె పతులకూ వదలివేసింది. ఇటువంటి ప్రవృత్తి సుదేష్ణకున్న సంగతి ఆమె మాటలే ధ్వనింపజేశాయి.

విరాటపర్వంలో సుదేష్ణావిరాటులు తుల్యప్రవృత్తులుగా వారి చేష్టలలో మాటలలో ఎట్లా కనపడతారో, ధర్మజులు ద్రౌపది కూడా వారి వాక్యశక్తులలో తుల్య ప్రవృత్తులుగా స్ఫురిస్తారు. వారు తెలిసి పలికినా, తెలియక పలికినా అవి నిజాలై కూర్చుంటాయి. ద్రౌపది తాను సైరంధ్రిగా సుదేష్ణ మందిరంలో ఉంటానని పేర్కొన్నప్పుడు ధర్మరాజు నవ్వుతూ 'మన వంశంబును వృత్తంబును బెంపును గావఁజాలు పుణ్యవతివి; దుర్జనులగు తులువల తలఁపులు గనుఁగొని యేమఱక మెలఁగఁగా వలయుఁజుమీ!' (విరా.1.110) అని అన్నాడు. ఆ మాట నిజమై కీచకోదంతంగా ప్రవర్తిల్లింది. ఇంతకుముందు రెండు కంద పద్యాలూ ఆత్మరక్షణ కొరకూ, సుదేష్ణను నమ్మించటానికీ ద్రౌపది అన్నమాటలు కానీ, అవి కీచక ఉపకీచకవధకు సూచికలుగా వర్తిల్లాయి. ఉభయ దంపతుల ఊర్జిత లక్షణాలు మాటలతో, చేష్టలతో ధ్వనింపచేయటం తిక్కన రచనా శిల్పం.

విరాటుడికీ సుదేష్ణకూ ధర్మభీతి కంటె మించి బంధుప్రీతి ఉన్నది. ఆ రెండింటికి ఘర్షణ వస్తే బంధుప్రీతివైపే ఎక్కువ మొగ్గుచూపుతారు. (ధర్మో రక్షతి రక్షితః అనేది ద్రౌపది ధర్మజాదుల పట్ల సుముఖంగానూ, సుదేష్ణావిరాటుల పట్ల విముఖంగానూ వర్తిస్తుంది.) కీచకుడు సుదేష్ణమందిరంలో ఆమె ఎదుటనే సైరంధ్రిని మదనావేశంతో వింతవింతగా పలకరించాడు. మదనవికారాలను ప్రదర్శించాడు. తనను పలకరించటానికై వచ్చినప్పుడు సుదేష్ణ కూర్చుండటానికి బంగారు గద్దె వేయించి అతడి పట్ల భ్రాతృవాత్సల్యంతో 'ప్రియము చూడ్కి ముసుఁగువడ' చూచింది. అతడు క్షేమసమాచారాలు మాని సైరంధ్రిని గురించి ప్రశ్నల వర్షం కురిపిస్తూ ఉంటే ఉక్కిరిబిక్కిరైపోయింది. ఉపాయంతో అతడి మాటలు తప్పిద్దామని ప్రయత్నం చేసింది. కాని, విఫలురాలయింది.

సైరంధ్రి పలికిన మందలింపులకు చిన్నబోయి సింహబలుడు సుదేష్ణ వద్దకు మరల వచ్చాడు. సైరంధ్రి వివరాలను చెప్పుమని ఆమెను తొందరపెట్టాడు. తమ్ముడి మనఃస్థితిని చూచి విచారించి, రాగరసమగ్నుడైన వాడు తన మాట విని మాట మార్చుకుంటాడా? 'మాయదైవమ! నేనేమి చేయుదాన?' అని బాధపడింది. అయినా ప్రయత్నించి చూస్తానని అతడి భోగవనితల సౌందర్యాదులను జ్ఞాపకం చేస్తూ నీరసాకార అయిన సైరంధ్రిని కోరటం ఏమి బాగున్నది? అని మందలించింది. అతడు మొండికెత్తి ఏ ఉపాయంతోనైనా సైరంధ్రిని తనకు కూర్చకపోతే మన్మథబాధతో చనిపోతానని బెదిరించాడు. అప్పుడు చనువుగా తమ్ముడితో 'మనసులేని మగువల పొందు సుఖమీయు'దని రసికసూత్రాన్ని వల్లించింది. చివరకు ధర్మవర్తనాన్ని బోధించి మందలించింది.

తే. "ఆయురైశ్వర్యకీర్తుల నపహరించు। పరసతీ సంగమము ధర్మపథమునందుఁ
బరఁగువారలు పరిహరింపంగఁ గనియు। వినియుఁ దెలియవె యిది దుర్వివేకమగుట?" (విరా.2.69)

అని హెచ్చరించింది. గంధర్వుల వలని భయాన్ని బయట పెట్టింది. కానితెరగుల పోయి వివేకవంతులు అపథ్యమైన పనులు చేయరని చెప్పి, తన మాట వినుమని బ్రతిమిలాడింది. ఇంతవరకు ఆమె ధర్మశీలగా, అంతఃపుర ధర్మరక్షకురాలుగా ఆమె మాటలు నిరూపిస్తున్నాయి.

గంధర్వు లెదిరిస్తే కీచకుడు తన బలంతో వారిని చంపుతానన్నాడు. తన మేలు కోరితే సైరంధ్రిని కూర్చుమన్నాడు. దైన్యంతో అక్కకాళ్ళమీద పడ్డాడు. సుదేష్ణ చిన్నబోయింది. పొంగివస్తున్న కన్నీళ్ళను కళ్ళల్లోనే దాచుకొన్నది. లోన ధర్మసంఘర్షణ పడింది. అందులో బంధుప్రీతికి మొగ్గుచూపింది. గతి లేక తన మనోగతిని మార్చుకొన్నది.

ఉ. "అవలవచ్చు నాపదల కన్నిటి కోర్చి లతాంగిఁ గూర్చి కా
కీ వెడమాటలన్ మరలఁ డెన్నివిధంబులఁ జూపి చెప్పినం,

గావలమైన వీఁడు; తగుకార్యము వట్టునె? వీని కెమ్మెయిం
జావు నిజంబు మన్మథునిశాతశరంబులనైన నక్కటా!'' (విరా.2.78)

తమ్ముడి కొరకు సైరంధ్రిని - ఆసవం తెప్పించే మిషతో- అతడి ఇంటికి పంపుతానని మాట ఇచ్చింది. ఇంటికి పొమ్మని తొందరపెట్టింది. 'ఆవలవచ్చు నాపదల కన్నిటి కోర్వ' టానికి మానసికంగా సిద్ధమయింది. తమ్ముడికి చావు తప్పదని నిశ్చయించింది. చనిపోయేవాడి చివరికోర్కె తీర్చబోతున్నట్లుగా జాలిపడింది. కన్నీటితో పాటు ధర్మదృష్టి కారిపోయింది. సైరంధ్రికి ఇచ్చిన మాట ప్రక్కనపెట్టింది. వంచనతో తమ్ముడికి తోడ్పడింది. సైరంధ్రికి అన్యాయం చేయటానికే సిద్ధపడింది.

కౌరవులపై విజయానికి ఉత్తరకుమారుడు కాక బృహన్నలే కారకుడని చెప్పినప్పుడు పరమపూజ్యుడైన కంకుభట్టును సారెతో కొట్టిన విరాటుడు ఎట్లా బంధుప్రీతికి లోనయ్యాడో, అట్లాగే సుదేష్ణ సైంధవునింటికి సైరంధ్రిని పంపటానికై సిద్ధపడింది. తిక్కన ఈ స్థితిని స్పష్టంగా వర్ణించాడు.

క. "అనిన విని యనుచితంబున। కనయము శంకించియును లతాంగి మదిం ద
మ్ముని వలవంతఁ దలఁచి యి। ట్లనియెం బాంచాలితోడ సాదరవృత్తిన్.'' (విరా.2-97)

కీచకుడు సైరంధ్రికి పరపురుషుడు. అతడి గృహం ఆమె వెళ్లకూడనిది. కాని, సుదేష్ణ 'అది పరాయి ఇల్లా?' అని పలికింది! సుదేష్ణ మహారాణి. ఆమె త్రాగే కల్లు నొక నికృష్టురాలు తెస్తే తాగాలా? నెచ్చెలి తెస్తే తప్పు? అని నిష్ఠురాలాడి సైరంధ్రినే పంపటానికి కుంటిసాకు చూపింది. సైరంధ్రి అందరికీ తెలిసిందే కాబట్టి ఏ కీడూ పుట్టదట! సైరంధ్రిని చూచింది మొదలు అందరికీ ఆమె పెంపును గూర్చే సుదేష్ణ చెప్పుతున్నదట! ఇవన్నీ కల్లబొల్లి మాటలు! భ్రాతృప్రేమ సుదేష్ణను పయోముఖ విషకుంభంగా మార్చింది.

కీచకుడి చేత త్రోయబడి, ధర్మజుడి చేత మందలించబడి ద్రౌపది కన్నీరు మున్నీరుగా సుదేష్ణ మందిరానికి తిరిగివస్తూ 'నన్నీ విధంగా ఆ దురాత్ముడి భవనానికి వెళ్ళుమన్న ఆ ధూర్తురాలి పన్నాగాలను బట్టబయలు చేస్తా' నంటూ తూలుతూ వచ్చింది. సుదేష్ణ తన కేమీ తెలియనట్లు తొట్రుబాటుతో ఆమెకు ఎదురు వచ్చింది. కల్లబొల్లి ఆవేదనను ప్రదర్శించింది. గొంతు కావాలని మార్చింది. ఆమె దైన్యానికి జాలిపడింది. ఆమెకు కీడు చేసిన వారిని నొంచుతాను. భంగపరుస్తాను. కష్టాలపాల్చేస్తాను. చివరకు చంపుతాను అని ప్రగల్భాలు పలికింది. సైరంధ్రి సుదేష్ణ పన్నిన పన్నాగం కారణంగా తా ననుభవించిన పాట్లను చెప్పి ఎత్తిపొడిచింది. సుదేష్ణ బిత్తర పోయింది. తత్తరపాటుతో సైరంధ్రికి ధైర్యం చెప్పింది. 'భయపడకు ఇప్పుడే కీచకుడిని దండించి నీకు ఆహ్లాదం కలిగిస్తాను.' అని ఆదరంతో అనునయించింది. ఆమె మాటలు వింటూంటే సైరంధ్రికి 'అసత్య సంవాదిని' అని అనిపించింది ఆ కల్లబొల్లితనానికి ఆమెకు కోపం కూడా వచ్చింది. నిర్లక్ష్యంగా ఆమెను ఉపేక్షించి ఇట్లా అన్నది.

క. "నీ వింత యలుగ నేటికి?। నా వంతయుఁ బౌరజన మనఃఖేదము నొ
క్కావంత ద్రిక్కకుండఁగ। లావంతులు మత్పతులు గలరు పగఁ దీర్పన్.'' (విరా.2.161)

అని హెచ్చరించింది. ఆ బెదిరింపునకు సుదేష్ణతోపాటు ఆమె పరిజనం కూడా భయంతో వణికిపోయారు. ఎన్నో ఓదార్పు మాటలు పలికారు. అయినా సైరంధ్రి వినలేదు. అన్నపానీయాలు ముట్టలేదు. ఆమె సత్యాగ్రహాన్ని చూచి చేసేది లేక సుదేష్ణ నివ్వెరగంది ఉండిపోయింది. తమ్ముడి చావుకబురు ఏవిధంగా వినవలసి వస్తుందో అని గుండెలో బిక్కుబిక్కుమంటూ సుదేష్ణ కుమిలిపోయింది.

కీచకుడు నర్తనశాలలో గంధర్వులచేత వికృతపు చావు చచ్చాడన్న వార్త అర్ధరాత్రివేళ అంతఃపురంలో పాక్కింది. సుదేష్ణ బయటికి కనబడని బడబాగ్ని వంటి శోకాన్ని అనుభవించింది. మరి కొన్ని క్షణాలలో ఉపకీచకులందరూ ఊచముట్టుగా చంపబడ్డారన్న

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వార్త కొరివిమీద పిడుగుపడ్డట్లయింది. 'సహోదర మరణశోకాయత్తచిత్త' అయిన సుదేష్ణను విరాటుడు ఓదార్చాడు. సైరంధ్రి నేవిధంగానైనా అంతఃపురాన్నుండి పంపివేయుమన్నాడు. విరాటుడి మాట ఆమెకు ఊతగా దొరికింది. సైరంధ్రికిచ్చిన మాటను రాజాజ్ఞతో తుడిచివేయవచ్చునని ఊహించి అంగీకరించింది.

తెల్లవారింది. సైరంధ్రి కన్యకాపరివృతయై సుదేష్ణ మందిరానికి తిరిగి వచ్చింది. లోన పొంగివచ్చే ఆనందాన్ని అణచుకొంటూ నిబ్బరంగా రాణి ముందు నిలబడింది. సైరంధ్రిని చూచేసరికి సుదేష్ణకు మనసులో భయశోకాలు ఒక్కసారిగా పొంగివచ్చాయి. వినయంగా ప్రియసంభాషణలతో ఆమెను దగ్గరికి తీసి గౌరవించింది. భర్త ఇచ్చిన ఆజ్ఞను ఆమెకు వినిపించి, తమ్ముడి చావుకు బావురుమని ఏడ్చింది.

క. "బిరుదు గల మగలు గలరని। తర మిడి చంపింపఁ జూచెదవు; జనములు నీ
పొరువునఁ బోవెఱతురు; మా। పురమును రాష్ట్రంబు వెడలి పొ మ్మెంధైనన్". (విరా.3.61)

అని గుండెలోని మంటను గుప్పిస్తూ గద్దించింది. సైరంధ్రి చచ్చిన పామును కర్రతో కొట్టలేదు. వినయంతోనే వేడుకొన్నది. పదమూడు రోజుల గడువు కోరింది. తనకు మేలు చేస్తే గంధర్వపతులు కృతజ్ఞులై మేలు చేస్తారనీ, కీడు చేస్తే ప్రమాదం తప్పదనీ మెత్తగా చెప్పింది. తన మాటలు మన్నించకపోతే ఏమౌతుందిలే అనుకొనవద్దన్నది. తనను అంతఃపురంలో ఉంచుకొనటం మేలని చెప్పింది. భర్త మాటకు తల ఊపి సైరంధ్రిని ఊరు వదలి పొమ్మన్న గడుసరి సుదేష్ణ ఆమె మాట కాదంటే ఏకీడు మూడుతుందో అని ఆమె కోర్కెను మన్నించింది. దానికి మరల భర్తను సంప్రతించలేదు. రాజు వెళ్ళుమన్నా, రాణి ఉండుమన్నది. కీచకుడు పోయిన తరువాత రాజమందిరంమీద గంధర్వసతి అయిన సైరంధ్రిభయం క్రొత్తగా ఆవరించింది. పాపం, సుదేష్ణా విరాటులు పరభయంతో జీవించటానికి అలవాటుపడ్డారు. చివరకు పాండవుల నాశ్రయించి బ్రతికిపోయారు.

(3) పాత్రోచిత సందర్భోచిత రసోచిత సంభాషణలు

విరాటపర్వంలోని సంభాషణలు సహజంగా ఆహ్లాదకరంగా ఉంటాయి. అందుకు అవి పాత్రస్వభావోచితంగా ఉండటం ఒక బలమైన కారణం. పాత్రోచితాలంటే పాత్ర స్వభావ వ్యంజకాలని భావం. పాత్రలు వివిధ సన్నివేశాలలో సందర్భోచితంగా మాట్లాడి సమయస్ఫూర్తిని ప్రకటిస్తారు; వివిధ ఘట్టాలలో సాంద్రమైన అనుభవాన్ని మాటలలో రంగరించి ఆవిష్కరిస్తారు. పాత్రోచిత సందర్భోచిత రసోచిత సంభాషణలు మహాభారతమంతా వ్యాపించి ఉన్న పాత్రలలో విరాటపర్వ సందర్భాన్ని అనుసరించి పరిశీలిస్తే ఊర్జిత కథోపేతమైన ఈ పర్వస్వభావం సాక్షాత్కరిస్తుంది. మచ్చుకు కొన్ని:

ధర్మరాజు మెత్తని పులి. ఆ కాలంలో ఆయన పరమ ప్రామాణికుడైన సత్యవాది. ధర్మశీలి. శత్రువులకు కూడా ఆయన మాటల మీద పరమ విశ్వాసం. కపటి అయిన దుర్యోధనుడు అజ్ఞాతవాసవ్రతం నిండకుండానే అర్జునుడు బయలు మెరశాడన్న అనుమానంతో, భీష్ముడు నిండిందని చెప్పినా ఆయన మాట నమ్మక, ధర్మజుడి నడిగి తేల్చుకొనటానికి దూతను పంపాడు. అధిష్ఠిత సత్యవ్రతుడైన యుధిష్ఠిరుఁ డిట్లా అన్నాడు.

క. "నిండె సమయాబ్దములు, నిం। కొండన లే; దిపుడ చని సుయోధనుతో భీ
ష్మ్ముండును గురుఁడును వినఁగా। నిండె నను; నిండె నిండె నిక్కంబునకున్". (విరా.5.370)

ప్రతిజ్ఞ చేసిన సంవత్సరాలన్నీ నిండాయి అన్నది సత్యవాక్యం. మరొకమాట లేదు-అనటం నిశ్చయార్థకం. ఈ విషయం దుర్యోధనుడికి వెంటనే తెలియచెప్పుమనటంలో ఆ కపటి అంతలోనే ఏమైనా దుష్టవ్యూహం వేయగలడని వ్యంగ్యం. ఆ నిజాన్ని భీష్ముడూ ద్రోణుడూ వింటుండగా చెప్పుమనటం దుర్యోధనుడి దుర్వ్యవసాయం పెద్దలకు తెలియాలనీ, ఈ సత్యానికి పెద్దల సాక్ష్యం ఉండాలనీ భావం. దుర్యోధనుడికి ధర్మరాజు వాక్యం మీద నమ్మకం ఉండటం నైతికమైన విలువ. మరి నిజాన్ని ముమ్మారు చెప్పటం లౌకిక వ్యవహారం. అందుకే నిండెననే పదాన్ని మూడుసార్లు ఉచ్చరించటం. చెప్పినది చిన్న కంద పద్యమైనా అందులో

నాలుగు వాక్యాలు నింపి నాలుగువైపులా బిగించిన గడుసరితనం ప్రకటించాడు. ఇది ధర్మరాజు పాత్రోచిత రస సంభాషణానికి సత్యోదాహరణం. ఈ పర్వంలో సంభాషణలకే ఎక్కువ ప్రాముఖ్యం, ప్రాచుర్యం ఉంటాయి. నాయకుడైన ధర్మరాజు పలికినవి ఇటువంటివి అనేకం ఉన్నాయి. ఆయా సందర్భాలలో విశేష వ్యాఖ్యలలో వాటిని గమనించవచ్చును. ప్రస్తుతం ప్రసిద్ధమైనవి మూడు ఘట్టాలు.

1. సన్న్యాసిగా విరాటుడి ముందు పలికిన పద్యాలు (విరా.1.191, 193, 195, 196,197-వీటిని గురించి ఇదివరకే ముచ్చటించటమైనది.)

2. విరాటుడి సభలో భీముడితో, ద్రౌపదితో పలికిన మాటలు (విరా.2.136,150) (వివరాలకు విశేషవ్యాఖ్య చూడండి).

3. ఉత్తర గోగ్రహణ యుద్ధానంతరం ఆ విజయం ఎవరి వలన కలిగి ఉంటుంది అనే చర్చ సాగినప్పుడు విరాటుడితో ధర్మరాజు (కంకుభట్టు) పలికిన మాటలు (5.249-258), అందులో ఒక పద్యం -

చ. "కురుపతి భీష్మ కర్ణ కృప కుంభజ ముఖ్య మహోగ్రయోధ వి
స్ఫురణము నోర్వఁజాలి రణభూమి భుజాబల ముల్లసిల్ల ను
త్తరుఁడ జయించెనేని వసుధావర! యింతటికంటె నింక న
చ్చెరువును గల్గునే ధరఁ బ్రసిద్ధికి నెక్కఁడె యాతఁ డొక్కఁడున్." (విరా.5.249)

ధర్మరాజు వ్యంగ్యధోరణిలో మాట్లాడేటప్పుడు కాకువును ప్రయోగిస్తాడు. ఉత్తరుఁడ-అనే ఏవార్థకం అధిక్షేపార్థక కాకువు. ఉత్తరుడే జయించి ఉంటే అనే అనుమానం అందులో వ్యంగ్యం. ఉత్తరుడే జయిస్తే ఈ లోకంలో ఇంతకంటె ఆశ్చర్యం ఏముంటుంది? ఇది నిందాస్తుతి. అత డొక్కడే ప్రసిద్ధికెక్కడా? అన్నదాంట్లో ద్వంద్వార్థం ఉంది. అతడు అర్జునుడితో కీర్తి పంచుకొనవచ్చునుగాని ఏకైక వీరుడు కాలేడని కాకువు. విరాటుడి ముందు ధైర్యంగా అంతమాట అనగలవాడు కంకుభట్టే. అతడి మాట రాజుకు కోపం తెప్పించవచ్చునుగాని భావికథార్థసత్యం. మరొక విశేష మేమంటే ధర్మజు డాడిన ఈ వాక్యం కథాగతికి తోడ్పడుతుంది. విరాటుడికి కోపం వచ్చి ధర్మరాజును సారెతో కొట్టటానికి ఈ వాక్యమే కారణం. ఇది భావికథాసూచకమైన పతాకస్థానం. ఈ విధంగా ఊర్జిత కథాప్రవృత్తికి ఈ సంభాషణ ఉపయోగపడింది. (వివరాలకు చూడండి విశేష వ్యాఖ్య).

ధర్మజుడు ధర్మవీరుడు, దయావీరుడు, యుద్ధవీరుడు, త్యాగవీరుడు, దానవీరుడు. ఆయా సందర్భాలలో ఆయా వీరరసభేదాలు ముందుకు వచ్చి ప్రకాశిస్తుంటాయి. ఆయన సంభాషణలలో దక్షిణ గోగ్రహణ యుద్ధ విజయానంతరం విరాటుడు కృతజ్ఞతలతో ధర్మరాజుకు తన రాజ్యాన్నీ, తన సేనలనూ సమర్పించుకొన్నాడు. కాని, ధర్మజుడు వాటిని స్వీకరించలేదు. ఉత్తమ ధర్మవీరుడివలె ఉన్నతంగా వ్యవహరించాడు. ఇట్లా అన్నాడు:

చ. "మనుజవరేణ్య! నావలని మన్నన యిట్టిద కాదె! శత్రుమ
ర్దన మొనరించి మత్స్యనగరంబున కుత్సవ ముల్లసిల్ల నీ
చనుటయ నాకుఁ దేజమును సంపదయుం గరిమంబుఁ గాక! యి
ట్లనఁ దగునయ్య? యే నిచట నైనది యేటిది? యింత యేటికిన్?" (విరా.3.226)

అవికత్థనత్వం ధీరోదాత్త లక్షణం. విరాటుడు పొగడటం ఆయనకు సహజంగా నచ్చలేదు. అజ్ఞాతవాసవ్రతం విరాటనగరంలో ఆ రాజు నాశ్రయించి నిర్వహిస్తూ ఉండటం వలన శత్రుమర్దనం అతడి కర్తవ్య మనుకొన్నాడు. కర్తవ్య నిర్వహణ ప్రతిఫలాన్ని కోరదు. విరాటుడితోడి స్నేహం అద్వైత భావానికి దారితీసింది. అందువలన విరాటుడి తేజం, సంపద, గరిమం తనవే ననుకొని తృప్తిపడి తృష్ణను నిగ్రహించుకొనగలిగాడు. మహోపకారం చేసినా దానిని చెప్పుకొనకుండా ఉండటం, ప్రతిఫలాన్ని కోరకుండా

ఉండటం కర్మయోగి లక్షణం. అంత చేసి 'ఇంత ఏటికిన్?' అనగలిగినవాడు దాన, దయా, త్యాగ, వీరస్వభావాలు కలవాడే. 'త్యాగేనైకే అమృతత్వ మానశుః' అని ఉపనిషత్సూక్తి. ఈ పద్యం పలికిన ధర్మరాజు ధర్మవీర, త్యాగవీర, దయావీర రసమూర్తి. పైవాక్యాలు రసోచిత సంభాషణ శిల్పాలు.

భీముడు రౌద్రోద్రేకి. శత్రువులమీదకు సుడిగాలివలె రేగటం అతడి సహజప్రకృతి. పరవీర భయంకరంగా ప్రతిజ్ఞలు చేయటం అతడి సహజాలంకారం. ద్రౌపది యెదుట కీచకవధ చేస్తానని అతడు చేసిన ఈ ప్రతిజ్ఞ ఉజ్జ్వలోదాహరణం.

మ. "అవనీచక్రము సంచలింపఁగ, దివం బల్లాడ, నాశాచయం
బవధూతంబుగ, గోత్రశైల నికరం బాకంపముం బొంద, న
ర్ణవముల్ ఘూర్ణన మొందఁ గ్రోధము గృతార్థత్వంబు నొందించి చి
త్రవధప్రౌఢి వహించి సూతునకు రౌద్రం బేర్పడం జూపుదున్." (విరా.2.284)

అతడికి ఆగ్రహం అవధులు మీరి పొంగుతుంది. దానికి అడ్డుకట్ట వేసేవారు వెంట ఉండాలి. భారతకథలో ధర్మరాజు భీమమదేభానికి అంకుశం. ఈ ఘట్టంలో ద్రౌపది నియామకశక్తిగా పనిచేసింది. నిగూఢవృత్తితో యుద్ధం చేయాలని నియోగించింది. భీముడి తీవ్రక్రోధం కథలో నిగూఢయుద్ధస్ఫూర్తికి హేతువయింది. ఈ సంభాషణం ఊర్జిత కథాగతికి సోపానం.

భీముడు నర్తనశాలలో ద్రౌపదిస్థానంలో శయ్యమీద పరుండి ఉంటాడు. కటికచీకటిలో కీచకుడు అతడిని సమీపించి సైరంధ్రి అని భ్రమించి తన వలపును, శృంగారనాయక లక్షణాలను ప్రశంసించుకొంటాడు. అతడికి భీముడు గొంతుమార్చి గూఢార్థగుంఫితంగా గంభీరహాస్యం పల్లవించేటట్లు మాట్లాడాడు. భారతంలో మరెక్కడా భీముడి ఈ లీల కనపడదు. ఆ ముచ్చటైన మాటలు గల మూడు పద్యాలు సందర్భోచిత సంభాషణ శిల్పాలు.

తే. "ఇట్టివాఁడవు గావున నీవు నిన్నుఁ। బొగడికొనఁ దగు; నకట! నాపోల్కియాఁడు
దాని వెదకియు నెయ్యెడ నైన నీకుఁ। బడయవచ్చునె యెఱుఁగక పలికి తిట్లు."

క. "నాయొడలు చేర్చినప్పుడ। నీయొడ లెట్లగునొ దాని నీ వెఱిఁగెదు; న
న్నేయబలల తోడిదిగాఁ। జేయఁ దలంచితివి; తప్పు సేసితి గంటే!"

క. "నను ముట్టి నీవు వెండియు। వనితల సంగతికిఁ బోవువాఁడవె? యైనం
దను వేఁ బడసిన ఫలమే। కనియెద విదె చిత్తభవవికారము లెల్లన్." (విరా.2.337-339)

రౌద్రాన్ని కడుపులో పెట్టుకొని హాస్యాన్ని పెదవుల మీద చిలికించిన ఈ వాక్య విన్యాసం అపూర్వం; వికృతికి వింత ఆవిష్కారం. ఔచిత్యం వీడని వ్యంగ్యార్థ గౌరవం కథకు ఆహ్లాదాన్ని అందించింది. (వివరాలకు విశేష వ్యాఖ్యలు చూడండి).

ద్రౌపదీ హృదయాహ్లాదకరుడు భీముడు. కీచకవధ ఘట్టం అతడి ఆ స్వభావాన్ని ఆద్యంతం రసోచితంగా అనుభవింప జేస్తుంది. కీచకుడిని చూచినప్పటినుండి ద్రౌపది తనతో మాట్లాడేంత వరకు భీముడు మాటలు లేని కోపాన్నే ప్రదర్శించాడు. ఆ తరువాత మాటలు పెంచాడు. చివరకు వాటిని చేతలలోకి మార్చాడు. తన వ్యూహంలో భార్యను భాగస్వామిని చేశాడు. ఆమె కోరిన రీతిలో ఆమెకు ఆహ్లాదం కలిగించేటట్లు కీచకుడిని వికృతపు చావుకు గురిచేశాడు. మరుగున ఉన్న మగువను మనసుపడి రంగం మీదకు తెచ్చాడు. కీచకుడి వింత పీనుగును చూపించాడు. మనసారా ఇట్లా నివేదించాడు:

శా. "చింతాశల్యము వాసెనే? భుజబలోత్సేకంబు నీ కెక్కెనే?
శాంతిం బొందెనె రోషపావకుఁడు? దుశ్చారిత్రునిం జూచితే?

సంతోషించితె? యిట్లుగాక బ్రదుకన్ శక్యంబె దుర్వృత్తి నీ
చెంతం జేరినయట్టి వీరులకు నాచేతం బయోజాననా!'' (విరా.2.358)

భీముడి రౌద్రం వీరంగా శృంగార రసాహ్లాద సుందరంగా పరిణామం చెందించిన ఈ పద్యం బీభత్స రమణీయంగా తిక్కన తీర్చిదిద్దాడు. దృశ్యం బీభత్సం. ద్రౌపదికి కలిగింది ఆహ్లాదం. ఆ రెంటినీ వ్యంగ్యంగా సూచించేది ఈ రసోచిత సంభాషణం.

అర్జునుడు గాండీవసుందరుడు, మహాస్త్రకోవిదుడు, జగదేకవీరుడు, శృంగారవీరరసమూర్తి, నారాయణప్రాణమిత్రుడు. ఈ లక్షణాలన్నీ విరాటపర్వంలో మొదట కుంఠితాలై తరువాత పునర్భవిస్తాయి. అతడికి గాండీవమంటే ఆరవప్రాణం. దానిని ఇతరుల కిమ్మని ఎవరైనా అంటే అతడి తల వేయి ముక్కలుగా బ్రద్దలు కొడతానని ప్రతిజ్ఞ చేసిన గాండీవప్రియుడు గాండీవి. గాండీవం వదలి మరల గాండీవాన్ని ధరించే మధ్యకాలమే గాండీవి అజ్ఞాతవాసకాలం. అజ్ఞాతవాసంలో ప్రవేశించేముందు ఆ గాండీవాన్ని గుప్తంగా, తనకు దూరంగా ఉంచవలసి వచ్చినందుకు మనసులో కటకటపడ్డాడు.

చ. "ఇది పెనుఁబాము చందమున నెంతయు భీషణమై జనంబులన్
బెదరఁగఁ జేయు; నట్లగుటఁ బెట్టి చనన్ వలయుం దలంచి నా
హృదయము దీనిఁ బాయుటకు నియ్యకొనం జొర; దెట్టు చెప్పినం
దుది నొకచోట వైచుటయ తోఁచిన కార్యము నయ్యెడుం గటా!'' (విరా.1.160)

శస్త్రములు దాచటం అజ్ఞాతవాస వ్రతానికి పూర్వరంగం. అందరి కళ్ళూ మొదట గాండీవంమీదనే పడ్డాయి. అర్జునుడికి దానితో ఉన్నంత అనుబంధం మిగిలిన పాండవులకు వారి ఆయుధాల మీద లేదు. కాబట్టి విరాటపర్వంలో రూపాల మార్పుకు శ్రీకారం గాండీవగోపనంతో ప్రారంభం కావాలి. మహావీరుడైన అర్జునుడు గాండీవాన్ని తన శరీరంలో ఒక భాగంగా భావించాడు. దానిని దాచక తప్పకపోవటంతో మనసులో వేదనపడ్డాడు. మహాభారతంలో గాండీవంతో విడివడే విషాద సన్నివేశం మరెక్కడా కానరాదు. అంతటి అపూర్వ సన్నివేశంలోని అపూర్వ సంభాషణ మిది!

ఉత్తర గోగ్రహణ యుద్ధంలో అర్జునుడి ప్రధాన లక్ష్యం దుర్యోధనుడిని దెబ్బతీయటమే. ఓడించి పీడించి, అవమానించి కసితీర్చుకొనటమే. అప్పటి ఆ చిత్తవృత్తి ప్రతిఫలించే అధిక్షేపోక్తులు విరాటపర్వంలో అనేకమున్నా, ఈ క్రింది రెండు పద్యాలూ జంట నక్షత్రాలవంటివి:

(1) క్షత్రియుఁ డోడునే తగదు కౌరవరాజ ! (విరా.5.203)

(2) ఏమంగు నెక్కిపెక్కేనుంగు లిరుగడ...(విరా.5,204)
వీటి విశేష వ్యాఖ్యలను గమనిస్తే కథలో వీటికున్న విలువ తెలియవస్తుంది. (చూడండి వ్యాఖ్య).

ఉత్తరుడి సూచనపై విరాటుడు ఉత్తరను అర్జునుడికి ఇవ్వాలని సిద్ధపడ్డాడు. కాని, విజయుడు ఔచిత్యాన్ని చూపించి, తన గురుత్వాన్ని గౌరవస్థానంలో నిలిపి, తాను కాముకుడను కానని తెలిపికొని, తన కొడుకైన అభిమన్యుడికిచ్చి పెండ్లి చేయటానికి నిశ్చయించిన ఘట్టం అతడి ఉదాత్త వర్తనానికి ఉన్నత శిఖరం.

మ. "హరిమేనల్లుఁడు, బాహువీర్యపటు శౌర్యస్ఫూర్తి, త్రైలోక్య సుం
దరుఁ, డాచార పవిత్రుఁ, డంచితకళాదక్షుం, డుదారుండు, కా
తరసంరక్షకుఁ, డార్యసమ్మతుఁడు విద్యావైభవోల్లాసి, య
త్యురు తేజుండు వరించుఁగాక యభిమన్యుం డీ సరోజాననన్''. (విరా5.363)

విరాటపర్వాన్ని విజయుడు శుభాంతం చేశాడు. అభిమన్యుడి వివాహం పాండవ వంశకర్తకు బీజావాపన. శ్రీకృష్ణుడు పాండవ వంశరక్షకు డనిపించుకొనడానికి శ్రీకారం. అభిమన్యుడికి అర్జునతనయుడనే కీర్తికంటె సుభద్రాతనయుడనీ, అంతకంటే మించి హరిమేనల్లుడనీ ప్రశస్తి ఉన్నది. దానికి భావి భారత కథంతా సాక్షిగా నిలువబోతున్నది. ఈ పద్యం ఆ కథాస్రవంతికి జన్మస్థానం. ఈ సంభాషణ ఒక వంశ చరిత్రాధ్యాయానికి శుభారంభం. (ఇంకా వివరాలకు చూడండి 5.363 పద్య విశేష వ్యాఖ్య).

ద్రౌపది త్రేతాగ్ని సంపుటి 1. పరిభవాగ్ని, 2. ప్రతీకారాగ్ని, 3. క్రోధాగ్ని. మనసులో ఈ అగ్నులు మండినప్పుడు మాటలు అగ్నికీలలుగా వేడిని క్రుమ్మరిస్తాయి. విరాటపర్వంలో ఈ త్రేతాగ్నులు మండిన సంభాషణలు కీచకోదంతంలో కనబడతాయి.

ఉ. "మీ సుభటత్వమున్ బలము మిన్నక పోవఁగ దుస్ససేనుఁ డ
ట్లా సభలోన నన్ బఱిచె; నంతియకాక జయద్రథుండు సం
త్రాసభరంబు లే కనుచితం బొనరించినఁ జెల్లిపోయె; నేఁ
డీ సభికుల్ గనుంగొనఁగ నిట్లయితిన్; వగ నాకు వింతయే?" (విరా2.176)

ఈ పద్యం ఆమె పరిభవాగ్నిని కుళ్ళగించినట్లున్న సంభాషణం. దీనివలన పాండవులకు - ప్రత్యేకించి ఈ సందర్భంలో - భీముడికి - సానుభూతి, రోషం కలిగి ఆమె పరితాపాన్ని తీర్చటానికి ఉత్సహించాలి. కథ ముందుకు సాగాలి. భీముడు దుశ్శాసనుడిని చంపి రక్తం త్రాగుతానని శపథం చేశాడు. జయద్రథుడిని పట్టి బంధించాడు. కాలహరణం పనికిరాదని కీచకుడిని భీముడే ఏదో చేయాలనే స్పృహ ఈ మాటలవెనుక ఉన్నది. ఇటువంటి దుఃఖాలు కలుగటం ఆమెకు పరిపాటే. కాని, వాటిని తీర్చటానికి ముందుకు వచ్చే వీరుడు భీముడే! భీమనాయకమైన కీచక ప్రబంధంలో ప్రేరకశక్తిగా పనిచేసే పరిభవాగ్నిశిఖ ఈ పద్యం.

ఎప్పుడు ఎవరికి ఏ అగ్ని నంటించాలో ద్రౌపదికి బాగా తెలుసు. మహానసంలో నిద్రపోతున్న భీముడిని సమీపించి మందమందంగా మాట్లాడుతూ చేతితో స్పృశిస్తూ ఈ క్రింది మాటలతో మేల్కొల్పింది. అది మేల్కొల్పటమే కాదు; ప్రతీకారాగ్నిని పవనాత్మజుడిలో రగుల్కొలపటం కూడా.

ఉ. "నన్నుఁ బరాభవించి సదనంబునకుం జని కీచకుండు ము
న్నున్న తెఱంగు దప్పక సుఖోచితశయ్యను నిద్ర సేయ నీ
కన్ను మొగుడ్చునూఱటకుఁ గారణ మెయ్యది? భీమసేన! మీ
యన్న పరాక్రమంబు వలదన్న నొకో దయమాలి తక్కటా!" (విరా2.166)

కీచకుడు ద్రౌపదిని సభ వెలుపల పరాభవించాడు. ఆమెకు సభలో పరాభవాగ్నిని మిగిల్చాడు ధర్మరాజు. అంతేకాక ప్రతీకారాగ్నిని ప్రదర్శించబోయిన భీముడిని అదుపులో పెట్టాడు. పరాభవాగ్ని ప్రతీకారంతోనే ఉపశమిస్తుంది. పరాభవించిన కీచకుడు తన భవనంలో సుఖంగా నిద్రపోతున్నాడు కాని ప్రతీకారాగ్నితో మండిపోవలసిన భీముడు మాత్రం అతడివలెనే సుఖంగా నిద్రపోతున్నాడు. సుఖనిద్రలో అప్పుడు కీచకుడికీ, భీముడికీ తేడా లేదు. నిద్రపోనిది, లేదా ప్రతీకారంతో కుమిలిపోతున్నది ద్రౌపది. ఆమె వచ్చి భీముడిని తాకింది. అది తాకటం కాదు; తన ప్రతీకారాగ్నిని భీముడిలో ప్రవేశపెట్టటం. చెవిలో మందమందంగా మాట్లాడింది. అది మంద్రభాషణం కాదు; అగ్నిని రెచ్చగొట్టటానికి ఊదటం. భీముడు నిద్రపోవటానికి కారణం ధర్మరాజు అతడిని సభలో పరాక్రమించవద్దని నియమించటమే అని శంకించింది. కాని, వెంటనే ' నీ అన్న ఆ మాట అన్నాడని నామీద దయ తప్పావా? ఎంతపని చేశావు!' అని అడిగింది. ఆ మాటకు ఎన్ని అర్థాలో! కాంతాసమ్మితంగా వేసిన ప్రశ్న అది. 'నిన్ను అవేశంతో పరాక్రమించవద్దన్నారు కాని, నా మనసెరిగి తగిన ఉపాయం ఆలోచించవద్దన్నారా? ధర్మరాజు నన్ను ఆదుకొనవద్దన లేదే? నిన్ను నిద్రపొమ్మనలేదే? శత్రువుకు ఎదురు లేదని తెలిస్తే వాడు నిశ్చింతగా నిద్రపోయి రేపు మరల నా వెంట పడడా? ఈ సంగతి నీవే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తెలిసికొని నేను నిద్రపోలేననీ, ప్రతీకారం కొరకు ప్రతీక్షిస్తుంటాననీ ఊహించలేకపోయావా? నన్ను గురించి ఏమాత్రం పట్టించుకొన్నా నీకు నిద్ర ఎట్లా పట్టుతుంది? ఈమాత్రం దయ కూడా లేదా?' అని అనేక విధాల వ్యంగ్యార్థాలు స్ఫురించేటట్లు బ్రతిమిలాడినట్లే పలుకుతూ అధిక్షేపించింది. 'నాకు నిద్ర లేదు', నీవు నిద్రపోరాదు, శత్రువును నిద్రపోనివ్వరాదు. ఈ తాత్పర్యాన్ని గ్రహించి ప్రతీకారం చేయటమే నా హృదయానికి ఆహ్లాదకరం' - అని ధ్వనిమయంగా ఉపదేశించింది. ఇది సార్థకమైన సందర్భోచిత సంభాషణం! (మరికొన్ని వివరాలకు విశేషవ్యాఖ్య చూడండి).

తిక్కన ఔచిత్య పాలనకు ఈ పద్యాన్ని మచ్చుతునకగా పేర్కొనవచ్చును. మూలంలో ద్రౌపది ఈ సందర్భంలో అన్నమాట లివి-

"ఉత్తిష్ఠోత్తిష్ఠ, కిం శేతే, భీమసేన! యథా మృతః।
నా మృతస్య హి పాపీయాన్ భార్యా మాలభ్య జీవతి?" (సం4.16-9)

'భీమసేనా! చచ్చినవాడు పడుకొన్నట్లు అట్టే కదలకుండా పడుకొన్నావేమిటి? లెమ్ము లెమ్ము! నేను బ్రతికున్నవాడి భార్యనైతే ఆ పాపి చావకుండా ఉంటాడా?'- అని శ్లోకతాత్పర్యం. చచ్చినవాడితో భర్తను పోల్చటం గ్రామ్యత్వ లక్షణమని తిక్కన భావించి ఉంటాడు. అందువల్ల తెలుగులో అగ్రామ్యత్వమనే స్వభావం గల ఉదారత అనే అర్థగుణాన్ని ఆవిష్కరించాడు. అయితే వ్యాసహృదయాన్ని నాగరకంగా తెలుగులో పలికించాడు. మూలంలో ద్రౌపది చెప్పిన తాత్పర్యాన్నే తెలుగులో ఔచిత్యవంతంగా చేశాడు. మూలంలో ఉన్నది అనౌచిత్యమా? గ్రామ్యమా? అన్నది చర్చనీయాంశం. మానం పోయిన క్షత్రియుడు ప్రాణం పోయినవాడితో సమానం. భార్యను సభలో తన్నిన దుష్టుడిని చంపకుండా నిశ్చింతగా నిద్రపోయేవాడు మృతుడితో సమానుడే. అందువలననే వ్యాసు డీ ఉపమానాన్ని నిపుణంగా వాడాడు. అంత నిర్లిప్తుడుగా పడుకొన్న భీముడికి అంత ఘాటైన ఉపమానంతో చురక వేస్తేకాని కార్యశూరుడై లేవడు. మల్లయుద్ధంలో ఎదుటివాడు పెద్దదెబ్బకొడితేనే కాని భీముడు వాడిని చచ్చేటట్లు కొట్టడు. D Q®@"` ē‹ # ఇల్లాలు కాబట్టి ఆ పాపి చస్తేనే నేను బ్రతికి ఉన్న భర్త కలదాని ననుకొంటానని అన్నది. సామాన్యంగా ఆమె అట్లా అనకూడదు కాని, కోపం వచ్చినప్పుడు లోకంలో చావుల ప్రసక్తి రావటం సామాన్యమే. అయితే అది అగ్రామ్యం కాదు. ఉదారగుణం కాదు. అందుకే తిక్కన మార్చాడు. ఉపమాలంకారాన్ని మార్చి సంభావన చేశాడు. మృత ప్రసక్తిని మార్చి నిద్రతో తేల్చాడు. ఇటు భీముడూ అటు కీచకుడూ సుఖనిద్రపోవటం ద్రౌపది పట్ల దయ తప్పటమే అని ధ్వనింపజేశాడు. మూలంలో ఉన్న మోటుతనం పోయింది. తెలుగులో తెలివి మెరిసింది. మూలంలో భీముడు ద్రౌపది మాటలు విని శత్రువును ప్రతీకారంతో చంపుతాడు. తెలుగులో భీముడు శత్రువును ఎట్లాగూ చంపుతాడు. దానితో ద్రౌపదికి హృదయాహ్లాదాన్ని పెంచేటట్లు చంపుతాడు. సంభాషణలో మాటల తీరు మారితే సన్నివేశాల తీర్పులు మారుతాయి-అని ఈ పద్యం చాటి చెప్పుతున్నది.

తిక్కన తన పద్య శిల్పానికి తానే ముగ్ధుడౌతూ ఉంటాడు. అటువంటి సూచనలు కూడా వెనుకాముందు సూచిస్తూనే ఉంటాడు. ఒక్కొక్కసారి మంచిపద్యాన్ని ఒక సందర్భంలో కంటె ఎక్కువ సార్లు పూర్తిగానో, పాక్షికంగానో వాడుకొంటాడు. అవి తిక్కన మెచ్చిన పద్యాలుగా మనం భావించవచ్చును. అటువంటి పద్యాలలో ఒక్కటి. రెండుసార్లు రెండు సన్నివేశాలలో, రెండు ప్రయోజనాలను సాధించటానికి వాడిన ప్రసిద్ధ పద్యం ఈ క్రిందిది. ఇది రసోచిత సంభాషణకు రమణీయోదాహరణం.

శా. "దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతు
ల్గీర్వాణాకృతు లేవు రిప్తు నిను దోర్లీలన్ వెసన్ గిట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిన్ కీచకా!" (విరా.2.55-172)

కీచకుడిని భయపెట్టటానికి ఒకసారీ, భీముడిలోని పౌరుషాన్ని పొంగించటానికి మరొకసారీ ద్రౌపది పలికిన ఈ పద్యం విరాటపర్వ శిరోమణి. (వివరాలకు ఈ పద్యాల విశేష వ్యాఖ్యలు చదవండి).

ఇక్కడ మరొక విశేషం స్మరించాలి. విరాటపర్వంలో ద్రౌపది తన భర్తలను గురించి ప్రశంసించిన పద్యాలు పరమాహ్లాదకరంగా ఉంటాయి. ఉద్యోగపర్వంలో ద్రౌపది తనను గురించి చెప్పుకొనే పద్యాలు పరమోదాత్తంగా ఉంటాయి. అట్టి విరాట పర్వ పద్యాలలో ఇది ప్రథమగణ్యం. ఉద్యోగపర్వ పద్యాలలో 'వరమునఁ బుట్టితిన్, భరతవంశముఁ జొచ్చితి........' (ఉద్యో.3.108) అనేది అగ్రగణ్యం. భర్తల ప్రశంస పద్యాన్ని పునరుక్తి చేసింది కాని, తన పద్యాన్ని ఒక్కసారే పలికి ఔచిత్యం, ఔదాత్త్యం ప్రదర్శించింది. అది తిక్కన నేర్పిన రసోదంచిత సంభాషణ శిల్ప విద్య.

ఈ విధంగా పాత్రోచిత, సందర్భోచిత, రసోచిత సంభాషణలను ప్రతిపాత్రతో పలికించిన ప్రతిభ విరాటోద్యోగపర్వ పద్యాలలో తిక్కన ప్రదర్శించాడు. వాటన్నిటిని విస్తరించటం ఈ పీఠికలో కుదురదు. అయినా కొన్ని గొప్ప పద్యాలను మచ్చుకు సూచించటం సమంజసం.

ప్రశంసాత్మక సంభాషణలకు విరాటపర్వం ప్రసిద్ధి. వాటిలో కొన్ని పద్యాలు ఆంధ్రావళి మోదాన్ని పొందాయి. అజరామరంగా నిలిచిపోయాయి. వాటిని నాలుగు విధాలుగా విశ్లేషించవచ్చును:

1. పాండవుల పూర్వవైభవాన్నీ, అజ్ఞాతవాసవిధానాన్నీ పాండవ వర్గంలోవారే ప్రశంసించిన పద్యాలు.

2. పాండవులను ఇతరులు వివిధ సందర్భాలలో ప్రశంసించిన పద్యాలు.

3. పాండవులు ఇతరులను సన్నివేశగతంగా ప్రశంసించిన పద్యాలు.

4. ద్రౌపదిని కీచకుడు విరహావేశంతో ప్రశంసించిన పద్యాలు.వంటశాలలో ద్రౌపది భీముడియెదుట పాండవుల పూర్వస్థితిని, అజ్ఞాతవాస జీవన దైన్యస్థితిని తులనాత్మకంగా వర్ణిస్తూ పలికిన పద్యాలు ఆణిముత్యాలు. వాటిల్లో జనాదరణం బాగా పొందినవి రెండు.

1. ధర్మరాజు ప్రశంసలోని సీసపద్యం-

సీ. 'ఎవ్వని వాకిట నిభమద పంకంబు। రాజభూషణ రజోరాజి నడఁగు' (విరా.2.191).

2.సహదేవుడిని గురించి కుంతి చెప్పిన మాటలుగా ద్రౌపది పేర్కొన్న పద్యం -

చ. 'కడుఁ బసిబిడ్డ వీఁ డొకటి గా దవునా నెఱుఁగండు...' (విరా.2-213)

పాండవులు బయలుమెరసిన ఘట్టంలో అర్జునుడు పాండవులను, పరిచయం చేస్తూ చేసిన ప్రశంసలు సహృదయుల మన్ననలను బాగా పొందాయి. వాటన్నింటిలో ధర్మరాజు ప్రశంస -

సీ. 'నడదివియలు సేసె నగరికి మాణిక్య। మకుటముల్ పూనిన మనుజపతుల....' (విరా.5-320)

ఇతరవీరులు పాండవులను ప్రశంసించిన పద్యాలు విరాటపర్వంలోని యుద్ధ సన్నివేశాలలో ఎక్కువగా కనుపట్టుతాయి. అయితే అన్నింటిలో అర్జున ప్రశంసలే అధికం.

శా. 'సింగం బాఁకటితో గుహాంతరమునం జేడ్పాటుమై నుండి......' (విరా.4.95)

అనే పద్యం అర్జునుడి యుద్ధవీర రసమూర్తిని ఆవిష్కరించే అత్యుత్తమ ప్రశంస- దీనిని ద్రోణాచార్యుడు చేశాడు. శిష్యవాత్సల్యంతో పాటు వీరమర్యాదను కూడా పాటించాడు

ఉ. 'వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తు మనంగరాదు.....' (విరా.4.234)

ఈ మాటలన్నది కురుపితామహుడు భీష్ముడు. ఉత్తరగోగ్రహణ యుద్ధానికి వచ్చిన విజయుడిని ప్రశంసిస్తూనే కురు పాండవులకు మైత్రి కలపాలని యత్నించిన పద్యం. విజయోత్సాహాన్ని ప్రశంసించాలంటే ఈ పద్యాలు రెండూ సామెతలవలె తెలుగువారి జిహ్వాగ్రాలలో నాట్యమాడుతూ ఉంటాయి. సమకాలీన భారతవీరుల మనసులలో అర్జును డంటే ఉన్న అభిప్రాయాలకు ఈ పద్యాలు రెండూ అద్దంపట్టుతాయి. రణరంగంలో ద్రోణభీష్ములు జంటకవులవలె ఆశువుగా చెప్పిన పద్యాలవలె ఇవి హృద్యాలు.

దక్షిణ గోగ్రహణ యుద్ధంలో విజయాన్ని సాధించి పెట్టిన ధర్మరాజ, భీమ, నకుల, సహదేవులను విరాటుడు ప్రశంసించాడు. (చూడు.విరా.3.223-232) అందులో సందర్భోచితంగా భీముడిని ప్రశంసించిన తీరు పలువురి ప్రశంసల నందుకొన్నది. అది-

ఉ. 'మంటయుఁబోని శాత్రవ సమాజము నించుకయేని శంకలే, కంటఁగఁ దాఁకి' (విరా.3.229)

దుర్యోధనుడి సభలో భీష్ముడు ధర్మరాజును గురించి (విరా.3.103, 104), దుర్యోధనుడు భీముడిని గురించి చెప్పిన అంశాలు (విరా.114-117) గమనించదగినవి.

ఉత్తరగోగ్రహణ యుద్ధారంభంలో అర్జునుడు కౌరవవీరులను ఉత్తరుడికి పరిచయం చేసిన తీరు వీరోచిత ప్రశంసలకు ఉదాత్తోదాహరణం. (చూడుడు. విరా.5.4-20). అర్జునుడు తన తాతను, గురువులను, గురుపుత్రుడిని కీర్తించటంలో ఆశ్చర్యం లేదు. అతడి ప్రత్యర్థులైన కర్ణుడిని, దుర్యోధనుడిని కూడా ప్రశంసించటం అతడి ఉత్తమశీలం. శత్రువులను గురించి అతడి అవగాహన అంతటి గాఢమైనది. (చూడు. వివరాలకు - విరా.5 13-15)

ఆంధ్రమహాభారతంలో ద్రౌపది సౌందర్యాన్ని కీచకుడివలె మరెవ్వరూ ప్రశంసించలేదు. విరాటపర్వ ద్వితీయాశ్వాసం ఒకవైపు ద్రౌపది ప్రశంసకు స్వర్ణాధ్యాయం; మరొకవైపు ద్రౌపది పరిభవ దుఃఖానికి కష్టాధ్యాయం. సైరంధ్రి రూపంలో ఉన్న ద్రౌపది సౌందర్యం నివురుగప్పిన నిప్పు. ఆ అందమే కీచకుడిని రాగరససాగరమగ్నుడిని చేసింది. విరహావేదనకు గురిచేసింది. వెర్రెక్కించి వెంటపడేటట్లు చేసింది. కీచకుడు రూపాభిమాని. ఆమె రూపలావణ్యాలను చూచి, భావించి, తన్మయత్వంతో పది పద్యాలలో కీర్తించాడు. తిక్కన స్వయంగా వర్ణించినవి వీటికంటె వేరు. వాటన్నింటిలో పంచరత్నాలవంటి అయిదు పద్యాలు బుధవరుల ప్రశంస లందుకొన్నాయి. పంచరత్నాలు పంచవైభవాలకు ప్రతీకలు!

1. రూప వైభవం

ఉ. 'ఎందును నిట్టి రూపు నరు లెవ్వరుఁ గాంచిరె?...' (విరా.2.26)

2. సౌందర్య వైభవం

సీ. 'ఇయ్యింతి ప్రాపున నయ్యనంగుఁడు పార్వ। తీశునైనను దక్కనేలకున్నె, (విరా.2.27)

3. లావణ్య వైభవం

సీ. 'నెత్తమ్మి రేకుల మెత్తఁదనము దెచ్చి। యచ్చునఁ బెట్టిన ట్లందమొంది' (విరా.2.52)

4. సౌకుమార్య వైభవం

సీ. 'గండుమీలకుఁ బుట్టి కాముబాణములతోఁ। గలసి యాడెడు నట్టి కన్నుఁగవయు' (విరా.2.67)

5. విలాస వైభవం

సీ. 'కాంతి దళ్కొత్తు నీ కడగంటి చూడ్కితోఁ। బొందఁగానని మేను పొగులుటయును' (విరా.2.118)

(వివరాలకు ఆయా పద్య విశేష వ్యాఖ్యలు చూడండి).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(4) ఊర్జితకథలో యుద్ధరంగాలు

ఊర్జిత కథలో చిత్రించబడే యుద్ధ ఘట్టాలలో వైవిధ్యాన్ని బట్టి సన్నివేశాలలో ప్రత్యేకతలను పాటించటం సర్వసామాన్యం. వాటిలో స్థిర చరసన్నివేశాల నిర్వహణం, ద్వంద్వ సంకులయుద్ధాల వ్యూహ సంయోజనం, సంభాషణలతో సాత్త్వికాది భావాల సమ్మేళనం, కథన వర్ణన పద్ధతుల సముచిత మిశ్రమం, శ్రవ్యదృశ్య కావ్యరస సమ్మేళనం తిక్కన నిబిడ కథాబంధం కొరకు వినియోగించే శిల్ప సామగ్రి. వాటిని దిఙ్మాత్రంగానైనా పరిశీలిస్తే యుద్ధ సన్నివేశ కథా సంవిధానం తేటపడుతుంది.

విరాటపర్వంలో మొదట మల్లయుద్ధాలు ప్రవర్తిల్లుతాయి. అందులో భీముడు నాయకుడు. మొదటి సన్నివేశంలో మల్లుడు ప్రతివీరుడు. ఆ రంగం చిన్నది అయినా అందులో నిర్మాణ శిల్పం ఉన్నది. మల్లుడు రాజసభలో ఒక తేటగీతి పద్యంలో సవాలు విసరుతాడు (2.7). అది ప్రగల్భరూపమైన యుద్ధసంభాషణ. 'ఓ రాజా! నేను నాలుగు చెరగుల నేలలో ఉన్న రాజుల కొలువులన్నింటినీ దర్శించాను. నా కెదురు నిలిచే మల్లు డెక్కడా కానరాలేదు. మీ రాజ్యంలో ఉన్నాడా?' అని ప్రశ్నించాడు. ఇది ఉద్ధతవాక్యం. దీనితో తిక్కన దృశ్యం ప్రారంభించాడు. ఎదురుగా రాజాజ్ఞతో, కంకుడి అనుమతితో నిలిచిన వలలుడిని ప్రవేశపెట్టాడు. అతడూ రాజుతో తేటగీతిలోనే పలికాడు (2.13). అది వినయముద్రితమైన వీరోక్తి. 'నే నప్పుడప్పుడూ ధర్మరాజుకు వేడుక కలిగించటానికి మల్లులతో పోరుతుండేవాడిని. అట్లాగే నా నేర్చిన విధంగా నీ వేడుకకై యుద్ధం చేస్తా' నన్నాడు. ప్రగల్భానికీ ప్రతాపానికీ మధ్య మల్లయుద్ధం!

తిక్కన మల్లయుద్ధంలో మాటలు పెట్టడు. పోరేవారికి విరామం ఉండదు. చూచేవారికి ఉత్కంఠవలన మాట్లాడే తీరిక ఉండదు. కార్యబహుళంగా ద్వంద్వయుద్ధం నడిపిస్తాడు. అయినా అందులో వైవిధ్యం చూపిస్తాడు. ప్రాంగణంలో ప్రవేశించి, భుజాలు చరిచి, రంగానికి మ్రొక్కి, మట్టి మొగానికి రాచుకొని, మీద చల్లుకొని, నడుము బిగించి, మునివేళ్ళతో పట్టు మొదలుపెట్టటం దగ్గరినుండి అంతా ఉత్కంఠతో నడుస్తుంది. ఉపతాయివంటి అనేక గతులు కుస్తీపట్లూ కళ్ళకు విడివిడిగా వరుసగా కనబడతాయి. చివరకు మల్లుడిని పైకెత్తి, నేలకు కొట్టి, వీపున మండిపెట్టి, పెలుకురితాళంతో నొక్కి ముక్కున నెత్తురు కారుతూ ఓడిపోయేంతవరకూ మల్లయుద్ధాన్ని కళ్ళకు కట్టిస్తాడు తిక్కన.

ఊర్జితకథ అంటే వివరాలు వర్ణించిన కథ అని కాదు. కథలోని అంశాలను మధ్యలో విరామం కలిగినట్లు స్ఫురించనీయకుండా ఒకదాని తరువాత మరొకటి సహజ పరిణామంగా సాగినట్లు వర్ణించి సన్నివేశ సాంద్రతను సాధించిన కథ. మల్లయుద్ధ సన్నివేశం దానికి మంచి నిదర్శనం. భీమకీచక మల్లయుద్ధం దీని బృహద్రూపం.

ఇది భీముడు కీచక సంహారం ముందు చేసిన (Rehearsals) అభ్యాసంవలె ఉంటుంది. నర్తనశాలలోని మల్లయుద్ధంలో భీమకీచకులు ముందు దీర్ఘంగా మాట్లాడుకొంటారు. కాని, అది యుద్ధ సంభాషణ కాదు. ఒకరిది కామ విలాస ప్రలాపం; మరొకరిది గూఢవాక్యోల్లాసం. ఆ రెండూ మల్లయుద్ధానికి ముందుమాటలుగా ఉండవు. ఒక్కసారి తుఫాను ముందు కురిసే తొలకరిజల్లులుగా ఉంటాయి. భీముడు విజృంభించి కీచకుడి తలబట్టి వంచటంతో యుద్ధం ప్రారంభమౌతుంది. మల్లుడితో యుద్ధం ఆరు పద్యగద్యాల నిడివితో సాగగా, కీచకుడితో యుద్ధం పదునైదు పద్యగద్యాల పరిమితిలో విస్తరించింది. మల్లుడితో యుద్ధం పగటివేళ జరిగింది కాబట్టి కాబోలు కుస్తీపట్లన్నీ స్పష్టంగా తెలిశాయి పేర్లతోసహా. మరి నర్తనశాలలోని యుద్ధం చీకట్లో సాగింది కదా! మల్లుల పోరాటపు తీరులే గోచరించాయికాని కుస్తీపట్ల వివరాలు తెలియరాలేదు. చీకట్లో గోప్యంగా జరిగే మల్లయుద్ధ శిల్పంలోని కుస్తీపట్ల విశేషాలు వాచ్యంకాకుండా ధ్వనింపచేయటం తిక్కన నేర్పు. భీముడికి మల్లుడితోడి యుద్ధం అసమయుద్ధం. కీచకుడితోడి యుద్ధం సమయుద్ధం. అందుకే చాలసేపు పోరాడవలసివచ్చినట్లు వర్ణన. కీచకు డలసిపోయినట్లు కనబడేంతవరకూ భీముడు సమతౌల్యాన్ని పాటించాడు. ఆ తరువాత ఒక్కసారి విజృంభించి పైకి వస్తున్న శత్రువును క్రిందకు గుంజి పిడికిటితో పిడుగుపాటు దెబ్బలు కొట్టి, పండిన పళ్ళ చెట్టును నిలువున కూల్చినట్లు నేలపై పడవేశాడు. కీచకుడు తన్నుకొని చచ్చాడు. ఆ తరువాత ద్రౌపది హృదయాహ్లాదం కొరకు కీచకుడి శవాన్ని మాంసపు ముద్దగా మార్చాడు. మల్లుడితోడి యుద్ధంలో కుస్తీపట్లనే

గమనించి ఉల్లాసపడే పఠిత కీచకుడితోడి యుద్ధంలో భంగిమలను భావించి ఉత్సాహపడతాడు. మొదటి దానికంటె రెండవది ఉదాత్తమైనదని ఆహ్లాదిస్తాడు.

మొదటి యుద్ధంలో ముందు వెనుకల పలుచని సంభాషణలు, రెండవ యుద్ధంలో మొదలు చివరలలో విస్తృతమైన సంభాషణలు. మల్లయుద్ధ ఘట్టాలకు సంబంధించినంతవరకు ఉభయ కావ్య నిర్మాణ శిల్పంలో కీచకవధ ఒక ఊర్జిత కథ.

దక్షిణ ఉత్తర గోగ్రహణ యుద్ధాలు ప్రతిఘటన (contrast) శిల్పాన్ని ప్రదర్శించే విశిష్ట ఘట్టాలు. ఆ తారతమ్యాన్ని భావిస్తే పఠితకు వైవిధ్యంవలన కలిగే వింత ఆహ్లాదం స్ఫురిస్తుంది. ఊర్జిత కథ కుండే ఉభయపక్షాలు ప్రత్యక్షమౌతాయి.

(i) సుశర్మ దాడి పగతీర్చుకొనేది. కౌరవుల దాడి గోవుల పేరుతో పాండవులను బయటపడేటట్లు చేసేది. మొదటిదానిలో సుశర్మ ఆత్మగౌరవం ముఖ్యం. రెండవదానిలో దుర్యోధనుడి దుర్మంత్ర ఫలితం ముఖ్యం. ఈ రెండు యుద్ధాల ప్రవృత్తులూ ఫలితాలూ ఆ ప్రయోజనాలను ప్రతిఫలించేటట్లు ఉంటాయి. అందువలననే చివరకు సుశర్మ బందీ ఔతాడు. దుర్యోధనుడు ఘోరంగా పరాజితుడౌతాడు.

(ii) సుశర్మ చేసే యుద్ధంలో అతడు ప్రతివీరుడు, ఏకవీరుడు. విరాటుడు బలగంతో కూడుకొన్న బహువీరుడు. సుశర్మసైన్యం అపారం. రథసంఖ్యా బహుళం; అయినా అవ్యవస్థితం. విరాటసైన్యం పరిమితమైనా సంఘటితం. ఆయావీరుల వెంటనడిచే చతురంగబలం సుశిక్షితం. వ్యూహబహుళం. సుశర్మపక్షంలో ఒకడు పెక్కురితో పోరే వైఖరి అధికం. విరాటపక్షంలో ఒకరి తరువాత ఒకరు సమయోచితంగా యుద్ధాన్ని నడిపించటం బహుళం. అయినా మొత్తం మీద అందరూ కలసి శత్రువును క్రమ్ముకొనే అవగాహనతో కూడుకొన్నది. ఇరుపక్షాలూ మెరుపుదాడులతో మెలకువ ప్రదర్శించేవే. సుశర్మ మెరుపుదాడితో విరటుని బంధించి శత్రుసైన్యంతో సంక్షోభాన్ని సృష్టిస్తాడు. దానికి పాండవులు తగిన సమాధానం మెరుపు దాడులతోనే చెప్పి విరాటుడిని విడిపిస్తారు. భీముడు సుశర్మను బంధిస్తాడు. ప్రేక్షకులకు ఇది ఒక పోటీయుద్ధంగా ఉంటుంది. దొమ్మియుద్ధం కూడా పెక్కుసార్లు ప్రవర్తిల్లుతుంది. అప్పుడు ఉభయ సైన్యాలూ పగ్గంలాగే పోటీ (Tug of war) లో ముందుకు వెనుకకు ఊగిసలాడుతున్నట్లు కనిపిస్తాయి. చివరకు పాండవులున్న విరాటపక్షం విజయం సాధిస్తుంది. ఇది మనుష్యులు చూచి మెచ్చుకొనే యుద్ధంగా ఉంటుంది. దీనికి ప్రతిగా ఉత్తర గోగ్రహణయుద్ధం దేవతలు చూచి మెచ్చుకొనే విధంగా సాగుతుంది. ఆ తారతమ్యం ఆ ఉభయ యుద్ధసన్నివేశాలలో స్పష్టంగా తోస్తుంది.

(iii) ఉత్తర గోగ్రహణ యుద్ధంలో అర్జునుడు ఏకవీరుడు. నాయక స్థానీయుడు. ప్రతినాయక పక్షంలో బహునాయకత్వం. ప్రదర్శితమౌతుంది. ఆ సేనకు సర్వసైన్యాధ్యక్షుడు వేరే లేడు. దుర్యోధనుడు రాజుకాబట్టి అతడి భావానికి అనుగుణంగా నడవటం, అతడిని రక్షించుకొనటం ఆ యుద్ధ లక్ష్యం. అందువలన ద్రోణ భీష్మాశ్వత్థామాదులు అంటీ పట్టనట్లు యుద్ధం చేస్తారు. కర్ణుడు అంతా తానే నిర్వహిస్తానని ప్రగల్భా లాడతాడు. ద్రోణభీష్మాదులు అర్జున ప్రతాపాన్ని (అంటే శత్రు పరాక్రమాన్ని) అంచనాకట్టి చెప్పినా కర్ణుడు లెక్కచేయడు. పరబలాన్ని తక్కువగానూ, స్వీయబలాన్ని ఎక్కువగానూ భావించి విజృంభించి చివరకు పరాభవం పాలుకావటం అతడి యుద్ధవీర స్వభావం. దాన్ని వివేకజ్ఞులైన భీష్మాదులు అధిక్షేపిస్తారు. రారాజు కర్ణుడిపై యుద్ధభారముంచి నిర్లిప్తంగా నిలిచిపోతాడు. అతడిని దుర్యోధనుడు సమర్థించి, అతడితోపాటు తానూ భంగపడతాడు. అట్లా జరగాలనీ, దానివలన ఒక గుణపాఠం దుర్యోధనుడు తెలిసికొనవలెననీ కౌరవపక్షంలోని వృద్ధవీరులు భావిస్తారు. దీనితో కౌరవపక్షంలో సంఘటిత యుద్ధం సాధ్యపడలేదు. ఎవరికి వారు తమ ప్రతాపాలను ప్రదర్శించుకొనటానికే అర్జునుడి మీద దాడిచేశారు. వరుసగా వీగిపోయారు. ఐక్యత లేని ఏకవాక్యత లేని కౌరవపక్ష యుద్ధం అడుగడుగునా ఏ విధంగా అపజయం పాలౌతుందో చిత్రించే యుద్ధ విశేష వర్ణనం ఈ ఘట్టంలో పఠితలకు ఆసక్తిని కలిగించే అంశం.

(iv) అర్జునుడి కదలికలు అడుగడుగునా అద్భుతాన్ని ఆవిష్కరిస్తాయి. అతడు పోరిన తీరులు చిత్రించే సన్నివేశాలు పఠితలలో ఆహ్లాదాన్ని పొంగింపచేస్తాయి. బృహన్నలగా అర్జునుడి రూపం భీష్మాదులలో వితర్కాన్ని లేవదీస్తుంది. అర్జునుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శమీవృక్షం దగ్గర నిజాకారంతో నిలిచినప్పుడు ఉత్తరకుమారుడిని అద్భుతంలో ముంచివేశాడు. దేవదత్తాన్ని పూరించి శత్రువుల గుండెలలో దడ పుట్టించాడు. అర్జునుడిని గుర్తించిన భీష్మాదులు యుద్ధం అసాధ్యమని నిశ్చయించారు. కర్ణుడు దురహంకారంతో వారిని తృణీకరించి అర్జునుడిని సంహరిస్తానని ప్రగల్భాలాడి ప్రతాపం చూపించాడు. దుర్యోధనుడు యుద్ధంచేయటంకంటె అజ్ఞాతవాస వ్రతకాలం పూర్తికాకుండానే అర్జునుడు బయటపడ్డాడన్న సాకుతో పాండవులను మరల అరణ్యాజ్ఞాతవాసాలకు పంపాలని కపటిగా ఆలోచించాడు. భీష్ముడు పాండవుల అరణ్యాజ్ఞాతవాస కాలం పూర్తయిందని ప్రకటించాడు. దానితో దుర్యోధనుడి దుష్టవ్యూహం భగ్నమైపోయింది. ఇక మిగిలింది కొనితెచ్చుకొన్నయుద్ధమే. కర్ణుడిని నమ్ముకొని చావుతప్పి కన్నులొట్టపోయినట్లు యుద్ధం చేయటమే దుర్యోధనుడికి మిగిలింది. ఆ స్థితికి ముఖ్యకారకుడు ప్రత్యక్షంగా దుర్యోధనుడిపై లక్ష్యం పెట్టి వ్యూహాన్ని పన్ని యుద్ధం సాగించిన అర్జునుడు. అతడి ధాటికి కర్ణుడు నిలువలేడని నిరూపించదలచిన భీష్మద్రోణాదులు పరోక్షకారకులు; గురువులను నిందించిన కర్ణదుర్యోధనులకు తగిన శాస్తి జరగాలని లోన భావించిన అశ్వత్థామాదులు. నిజానికి దుర్యోధనుడు తన వారితోనే లోపలిపోరు చేశాడు. పగవాడితో బైటిపోరు చేశాడు. ఉభయభ్రష్టుడైనట్లు చిత్రించటం వ్యూహ శిల్పం.

(v). అర్జునుడు అద్భుత వ్యూహరచనా ధురంధరుడు. బాణాలతో, బాణాలవంటి మాటలతో పోరాడగలడు. పెద్దలకు బాణాలతో వినయాన్ని ప్రదర్శించగలడు; విక్రమాన్ని చవి చూపించగలడు; సమయోచిత ప్రజ్ఞతో వ్యూహరచనను చేయగలడు. అర్జునుడి యుద్ధవ్యూహం స్థిరమైన, విజయ సాధకమైన వ్యూహం. కౌరవులకు ప్రత్యేకించి యుద్ధవ్యూహం లేదు. గోధనాన్ని అపహరించటమే వారి గొప్ప వ్యూహం. అర్జునుడు అందుకే దుర్యోధనుడిని దొంగగా పరిగణించాడు. దానికి తగినట్లుగానే వ్యూహాన్ని రచించాడు. అందులోని కొన్ని విశేషాలు-

(అ) భీష్మద్రోణాదులు రాజుకు రక్షగా సైన్యముఖంలో ఉన్నారు. అందువలన వారిని ముందుగా ఎదుర్కొనకుండా నమస్కార బాణాలతో కుశల ప్రశ్నలు వేసి, వారి సౌముఖ్యాన్ని సాధించి, రథాన్ని ప్రక్కదారి పట్టించటం మొదటి దశ. దీనివలన భీకరయుద్ధం తప్పింది.

(ఆ) సైన్య మధ్యంలో గోవులు నడుస్తున్నాయి. వాటిని తప్పించి, రక్షించి, నగరంవైపు గోపాలురతో సహా క్షేమంగా పంపించటం అర్జునుడి ప్రథమకర్తవ్యం కావటం సముచితం. అందుకే గోవులున్న సైన్య మధ్యభాగంమీద మొదటిదాడి చేశాడు. వాటిచుట్టూ మూగిఉన్న సైన్యంతో సంకులసమరం చేసి లక్ష్యాన్ని సాధించాడు. గోవులు తిరిగిపోయాయి. కౌరవ సైన్య వ్యూహంలో నడిమిభాగం వెలితిపడింది. అందులోకి అర్జునుడు ప్రవేశించి సముద్రాన్ని మహామత్స్యం సంక్షోభపరిచినట్లు సంకులసమరం చేశాడు. ఏకవీరుడు అనేక సైనికులను నేలమట్టం చేసే ఘట్టం ఇందులో ఆసక్తికరంగా సాగింది. ఇది రెండో దశ. దీనివలన గోధన విముక్తి కలిగింది. దుర్యోధనుడి దాడి విఫలమయింది.

(ఇ) కౌరవ వ్యూహం నడుము విరిగి రెండు ముక్కలైంది. మొదటి ముక్క భీష్మాది వీర రక్షితం. రెండవ ముక్క కర్ణరక్షితం. దుర్యోధనుడు కర్ణకవచంలో రెండవభాగంలో ఉన్నాడు. అర్జునుడు మొదటి భాగాన్ని మాని రెండో భాగంవైపు పోరు సాగించాడు. ఇది యుద్ధవ్యూహంలో ఆయువుపట్టు వంటిది. లక్ష్యం దుర్యోధనుడికి బుద్ధిచెప్పటం. అంతేకాదు, ఆ భాగంలో అడ్డం వచ్చినవారికి కూడా బాణాలతో బదులు చెప్పటం. అంతటితో ఆగకపోతే భంగపరచి రంగాన్నివీడి పరుగెత్తేటట్లు చేయటం. కొందరు పొగరుమీరి పొడిచేద్దామని మీదపడితే పరాభవించటం, అవసరంవస్తే ప్రాణాలు తీయటం అర్జునుడి యుద్ధతంత్రంలో భాగం. అందుకే చిత్రాంగదాదులను చంపాడు. కర్ణుడిని విరథుడిని చేసి దూరంగా పంపాడు. దుర్యోధనుడు తాను నమ్ముకొన్న కర్ణుడనే కవచం శిథిలమైపోయింది. తనను తాను రక్షించుకొనే దయనీయస్థితిలో పడ్డాడు. అప్పుడు రాజుకు బాసటగా నిలిచారు ద్రోణాదులు. వీరు ధర్మయుద్ధవీరులు, కాబట్టి ఏకవీరుడైన అర్జునుడితో ఒకరితరువాత ఒకరు ద్వంద్వయుద్ధానికి విల్లమ్ములతో సిద్ధమయ్యారు. క్రమంగా ద్రోణుడు, అశ్వత్థామ, కృపాచార్యుడు యుద్ధ విముఖులైన తరువాత భీష్ముడు చివరకు తారసిల్లాడు. ఈ సన్నివేశం చూస్తే భారత కావ్య పఠితలకు కురుక్షేత్ర యుద్ధం తలక్రిందుగా మొదలయిందా అని ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇందులో మొదట కర్ణపర్వం, ఆ తరువాత ద్రోణపర్వం, ఆ మీద భీష్మపర్వం సాగినట్లుంటుంది. చివరకు దుర్యోధనుడితో జరిగే యుద్ధం ప్రవర్తిల్లుతుంది. విజయుడు అన్నింట విజయుడు కావటం విశేషం.

(ఈ) దక్షిణోత్తర గోగ్రహణ రంగాలలో దొమ్మియుద్ధాలకంటె ద్వంద్వయుద్ధాలు రసవత్తరంగా ఉంటాయి. పెక్కురిమీద పెక్కురు చేసే యుద్ధంలో రసభావాలకంటె బలాబలాల ప్రదర్శనలకే ఎక్కువ అవకాశం ఉండటంచేత పరిస్థితుల పరిణామాలే అందులో ప్రధానంగా ప్రదర్శితమౌతాయి. పెక్కురితో ఒక్కరు చేసే యుద్ధాలలో వీరుల వీరకృత్యాలు వెల్లివిరుస్తాయి. ఒక్కడు పెక్కురితో చేసే యుద్ధాలలో వీరవిహారం విశ్వరూపం తాలుస్తుంది. ఒక్కడు మరొక వీరుడితో చేసే యుద్ధంలో వీరరసపోషకాలైన ఆంగిక, ఆహార్య, వాచిక, సాత్త్వికాభినయ ముద్రితాలైన యుద్ధక్రీడలు ఊర్జితంగా రాణిస్తాయి. ఈ నాలుగు రకాల యుద్ధ విధానాలనూ తిక్కన ఈ రెండు ఘట్టాలలో వర్ణించాడు. కాని, ఉత్తరగోగ్రహణంలో శత్రుపక్షంలో మహాయోధులు ఎందరో ఉండటంచేత వారితో అర్జునుడు చేసే యుద్ధ సన్నివేశాలు ద్వంద్వయుద్ధక్రీడకే అలంకార ప్రాయాలుగా ఉంటాయి. ద్రోణాదివీరుల వ్యక్తిగత వీరస్వభావాల వైవిధ్యం, వాటిని సముచిత వ్యూహాలతో స్వీయ పరాక్రమ ప్రదర్శకంగా అర్జునుడు ఎదుర్కొని విజయంసాధించే వైలక్షణ్యం పఠితలకు హృదయాహ్లాదాన్ని కలిగిస్తాయి. అందువలన లీలాయుద్ధమైనా భీష్మాదులతో సాగిన ద్వంద్వయుద్ధ ఘట్టాలు ఉపరంజకంగా ఉంటాయి. అస్త్రశస్త్ర ప్రయోగాలు అమరులకే అద్భుతాశ్చర్యాలను కలిగిస్తాయి.

(ఉ) కర్ణ దుర్యోధనులతో అర్జునుడు చేసిన ద్వంద్వయుద్ధ ఘట్టాలలో బాణ ప్రయోగాల కెంత ప్రాధాన్యముంటుందో సహజవీరులైన వారినడుమ సాగే సంభాషణల కంత ప్రాముఖ్యముంటుంది. యుద్ధఘట్టాలలో వీరుల మధ్య పోరు వర్ణనకే సాధ్యం. అది శ్రవ్యకావ్య శిల్పానికి శిఖరప్రాయం. మరి వీరుల మధ్య సాగే వీరాలాపాలు నాటకీయతకు పోషకాలు. తిక్కన ఉభయకావ్య శిల్పప్రౌఢి పాటించి ఆయా ఘట్టాలను ఊర్జితం చేశాడు.

(5) యుద్ధఘట్టాలు : వీరోక్తులు

అందువలన యుద్ధఘట్టాలలో వీరుల వీరోక్తులకు విశిష్టస్థానం తిక్కన కల్పించాడు. మచ్చుకు కొన్ని-

1. ప్రగల్భోక్తులు : వీటిని తెలుగులో బడాయిమాట లంటారు. ఇవి సామాన్యంగా మూడు రకాలు. తన శక్తి తనకు తెలియకుండా గొప్పలు సాధిస్తానని చెప్పుకునేవి కొన్ని. దీనికి ఉత్తరకుమారుడు ప్రసిద్ధి. తన శక్తిని ఎక్కువగా అంచనా వేసికొని శత్రువులపట్ల నిర్లక్ష్యంగా మాట్లాడేవి కొన్ని. మల్లుడు, కీచకుడు, సుశర్మ- దీనికి సాక్ష్యం. ఎదుటివారి శక్తిని తక్కువగా అంచనావేసి తన నెప్పుడూ వారికంటె ఎక్కువగా భావించి అసాధ్యమైన విషయాలను సైతం అవలీలగా సాధించగలనని గొప్పలు పలికేవి కొన్ని. కర్ణుడు ఈ రకం ప్రగల్భాలకు ఏకైక నిదర్శనం. పరబలాన్ని నమ్ముకొని అద్భుతాలు సాధించగలనని అహంకరించి మాట్లాడేవి కొన్ని. వీటికి దుర్యోధనుడు పెట్టింది పేరు. ఇవన్నీ కలిపి ప్రతిపక్షంలో హరివిల్లువలె రాణిస్తే వాటికి అర్జునాదులు ప్రతిగా మాట్లాడే పౌరుషవాక్యాలు ప్రతిఘటన శిల్పాన్ని పోషిస్తాయి.

2. పరిశీలిస్తే ఆయా సందర్భాలలో ప్రతిజ్ఞలూ, ప్రతాపాలూ, నిష్ఠురాలూ, అధిక్షేపాలూ, వ్యంగ్యాలూ, ఉపాలంభనలూ, ప్రశంసలూ, నిందలూ, అవహేళనలూ, భయాలూ, భంగపాట్లూ, విజయగర్జనలూ, వెక్కిరింతలూ, వెటకారాలూ మొదలైనవాటిని వ్యక్తం చేసే ఉక్తి విశేషాలు యుద్ధక్రీడను ఉక్తులతో ఉజ్జ్వలతరం చేస్తాయి. తిక్కన ఈ కళలో సిద్ధహస్తుడు. ఉదాహరణ కొకటి రెండు:

(అ) ఉత్తరుడి అసమర్థ ప్రగల్భం: చ. 'కురుపతి భీష్మకర్ణ కృపకుంభజ ముఖ్యులు............' (విరా.4.11)

(ఆ) కర్ణుడి బింకపు ప్రగల్భాలు:

1. చ. 'వెఱచితిరేని నిల్వఁ డొకవీరున కొక్కఁడ చాలుఁ గాక..........' (విరా.4.201)

2. శా. 'జ్యాఘోషం బతిభీషణంబయి దిశాచక్రంబు నిండన్..........' (విరా.4.202)

3 క. 'క్రోధజ్వాలలు నిగుడ వి । రోధబలేంధనముఁ బొదుపు క్రూరతమై.........' (విరా.4.203)

ఈ యుద్ధఘట్టాలలో వీరులు ముఖాముఖి తలపడ్డప్పుడు చేసికొనే అధిక్షేపోక్తులూ, అవహేళనోక్తులూ, వ్యంగ్యోక్తులూ ప్రసిద్ధాలు. ప్రత్యేకించి అశ్వత్థామకూ కర్ణుడికీ మధ్య జరిగే సంభాషణలలో రవ్వలవలె వెలుగొందే అధిక్షేపాలు ఆసక్తికరాలు.

అశ్వత్థామ:-

క. “నిను నీవ పొగడికొని పలి । కిన పలుకులు పెక్కు గలవు క్రీడి యనికి వ
చ్చినవాఁ డిదె పులివలె; మా । ర్కొనరాదే కర్ణ! సేనకుం బ్రియమెసఁగన్”.

క. “తలఁకు గలదేని శకునిం । బిలిచి విచారింపఁ బొమ్ము పృథివీపతి నీ
తలన మన కార్యఖడ్గం । బుల మో పెక్కించె; రిత్తవోవునె నీకున్?” (విరా.5.22,23)

దీనికి సమాధానంగా కర్ణుడు పలికిన ప్రతాపోక్తి:-

చ. “తలఁకెడు వానికిన్ మగఁడ తా నటె నన్నడఁకించువాఁ డిసీ!
పలుకకు; భీతున ట్లొదుఁగఁ బాఱునె శూరుఁడు, నిన్ను నచ్చి యే”
“కలనికి వచ్చితిన్ నరుఁడ కాఁడట వాసవుఁ డైన నేమి? నా
బలముఁ జలంబు నేరిమియు బంటుతనంబును నీవ చూడుమీ!” (విరా.5.25)

(వీటిలోని విశేషాలకు వ్యాఖ్యానం చూడండి).

కర్ణాశ్వత్థామల అధిక్షేపోక్తులకంటె ఆసక్తికరమైన కర్ణార్జునుల అమర్షోక్తులు (కోపంతో పలికే ఈటెలవంటి ఎత్తిపొడుపు మాటలు) రసవత్తరాలు. వాటిలో ఒక్కొక్క పద్యం ఒక్కొక్క ఉక్తి విశేషం. (వివరాలకు చూడండి 5.88-95).

ఉత్తరగోగ్రహణ ఘట్టంలో కౌరవ సైన్యంలోని శిష్టచతుష్టయం, చివరకు అర్జునుడు కర్ణుడినే కాక దుర్యోధనుడిని కూడా ఉపాలంభించిన విధం ఒకదాని కంటె మరొకటి విశేషం. కర్ణుడి ప్రగల్భాలను పరిహసించటం ఒక తీరు; దుర్యోధనుడి దురహంకారాన్ని అధిక్షేపించటం మరొక తీరు. ఉపాలంభనమంటే మనసు మర్మస్థానంలో గ్రుచ్చుకొనేటట్లు ఎత్తిపొడవటం. వెనుకా ముందూ ఆలోచించకుండా దుర్యోధనుడిని రెచ్చగొట్టి నే నున్నానని ముందుకు దూకి, చివరకు తానూ రాజూ కలిసి గోతిలోపడే కర్ణుడి ప్రగల్భవైఖరిని ఎత్తిపొడవటం కర్ణోపాలంభనంలో సాధారణాంశమైతే, ఇతరులసాయంతో కార్యాలు సాధించినా ఆత్మాభిమానంతో అతిశయించే దుర్యోధనుడు అపజయంపాలయ్యే సూచనలు అర్జునుడి ప్రతాపంవలన ఏర్పడినా, పగతో తిరగబడాలనే అతడి మూర్ఖప్రవృత్తిని అందరూ ఎగతాళిచేయటం విశేషాంశం.

శిష్టచతుష్టయంలో భీష్ముడు పెద్దవాడు. సమ్మోహనాస్త్రంతో అందరూ మూర్ఛితులైనా, ఆయుధాలు చేతులుజారిపోయినా, తలపాగాలు కోల్పోయినా తెలిసికొనలేక అర్జునుడిపై యుద్ధం చేయాలని లజ్జలేక ఊరుకొనే దుర్యోధనుడిని భీష్ముడు మోమాటంలేకుండా, నిష్ఠురంగా, నిస్సంశయంగా అవహేళన చేస్తూ, మారుమాటాడలేనట్లుగా మాట్లాడతాడు. ఆయన చేసిన ఉపాలంభనం నిష్ఠురాధిక్షేపం.

ఉ. “మోహన బాణపాతమున ముందలచీర లెఱుంగకున్న యీ
బాహుబలంబుతోఁ గడఁగి పార్థునిఁ దాఁకెడుబుద్ధిఁ గ్రమ్మఱన్
సాహసవృత్తిఁ జేసి యవిచారతఁ బోయితిమేని వాఁడు పూ
ర్ణాహుతి సేయఁడే మనల నందఱ నొక్కట మార్గణాగ్నికిన్?” (విరా.5.218)

దుర్యోధనుడు పెద్దలతో నిష్కారణంగా వివాదాలు పడతాడు. వారు పాండవ పక్షపాతులని నిందిస్తూ ఉంటాడు. ఇప్పుడా వివాదాలు చేసే సమయం కాదనీ విరోధులతో యుద్ధం చేసే సమయం వచ్చిందనీ ఉపాలంభించాడు. ద్రోణాచార్యుడు. అతడిది మర్మాధిక్షేపం.

ఉ. "అచ్చెరువైన విక్రమము నగ్గలికన్ సమరంబు గోరి యీ
వచ్చుచునున్నవాఁడు బలవద్రిపుభీషణబాహుఁడైన వి
వృచ్చుఁడ; యింక మిన్నక వివాదము సేసినఁ బోవ దియ్యెడం,
బొచ్చెములేని బల్మిగలఁ బోరి కమర్పుము దర్ప మేర్పడన్". (విరా.4.181)

అందరికంటె అధికంగా దుర్యోధనుడిని అమర్షాధిక్షేపాలతో ఉపాలంభించేవాడు ఆవేశపరుడైన అశ్వత్థామ. అతడి మాటలతో శ్రుతి కలుపుతాడు కృపాచార్యుడు (4.227).

కపట ద్యూతంలో శకుని సంపాదించిన రాజ్యాన్ని అపహరించి,ద్రౌపదిని అవమానించి, వారి రాజ్యాన్ని భోగిస్తూ సుఖం మరిగిన దుర్యోధనుడు నాడు యుద్ధం గెలవాలంటే శకుని తోడు పనికివస్తుందా? అని గుట్టుముట్టుకొనేటట్లు గట్టిగా మందలించాడు. అతడివి వెటకారపు వ్యంగ్యోక్తులు. మచ్చు కొక్కటి-

చ. "పాండవవీరులం గలన బాహుబలంబున నోర్చియే సము
ద్దండత నీవు దొల్లి ద్రుపదక్షితిపాత్మజఁ గొల్వులోనికిం
దెండని పుచ్చి; తద్దెసకుఁ దెచ్చుట సౌబలునీతిఁ గాదె? యా
తండ మరల్పుఁ గాక సముదగ్రత వచ్చు విరోధి నిప్పుడున్" (విరా.4.194)

ఉపాలంభనలకే ఉదాత్తోదాహరణం అర్జునుడు దుర్యోధనుడిని చేసిన వ్యంగ్యోపాలంభనం.

ఉ. 'క్షత్రియుఁ డోడునే తగదు కౌరవరాజ! యొకండ నేఁ.......' (విరా.5.203)

సీ. 'ఏనుంగు నెక్కి పెక్కేనుంగు లిరుగడ । రాఁ బురవీథులఁ గ్రాలఁ గలదె?' (విరా.5.204)

(వివరాలకు విశేష వ్యాఖ్యాంశాలను పరిశీలించండి).

(6) అభినయ విద్యా విలాసం

విరాటపర్వంలోని శ్రవ్యకావ్యశోభకు దృశ్య కావ్య వైభవాన్ని కలిగించేది తిక్కన ప్రబంధ రచనలో ప్రదర్శించే అభినయ విద్యావిలాసం. తిక్కన పాత్రలు మనసును కాని, మాటను కాని అభినయించి చూపుతారు. వాటిని తిక్కన చలనచిత్రంవలె వర్ణించి చూపుతాడు. తిక్కన రచనలో ఒక నృత్యరత్నాకరం తురంగలిస్తుంది; అభినయ దర్పణం మెరుస్తుంది. మచ్చుకు కొన్ని అభినయపద్యాలు:

1. ద్రౌపది అభినయిస్తూ మాట్లాడుతుంది : పాండవులు అడవిలో విరాటనగరంవైపు నడుస్తున్నారు. సుకుమారి అయిన ద్రౌపది అలసిపోయింది. తన అలసటను అభినయోచితంగా భర్తలకు చెప్పుకొన్న పద్యం హృద్యం. ఉ. 'డప్పి జనించె, వేళులపుటంబులు పొక్కఁ దొడంగె... ఒక్కడుగు నేఁగెడు దానికి నోర్వ నెమ్మియిన్' (విరా.1.148). ఈ పద్యంలోని క్రియలను తద్ధర్మకాలంలోకి మార్చి 'డప్పి జనించు, పొక్కఁ దొడంగు. చిప్పిలఁ జొచ్చు' అని చెప్పితే అలసట అనే అవస్థకు నాట్యసూత్రమౌతుంది. సుదేష్ణ కీచకుడి ఇంటికి పోయి కల్లు తీసికొని రమ్మని పనిచినప్పుడు ద్రౌపదికి మొదట ఉల్లం తల్లడిల్లింది. శరీరమంతా చెమటలు పట్టింది. మనిషి డీలాపడింది. మనసులో బాధ అధికంగా మొదలయింది. ఆ తరువాత వితర్కం పెల్లుబికింది. దైవం గుర్తుకు

వచ్చింది. అభినయముద్రితమైన వాచికాభినయం వర్ణించిన ఈ పద్యం (విరా.2.91) ఆస్వాద మధురం. భీముడు ద్రౌపదీ హృదయోల్లాసం కొరకు కీచకుడిని వికృతపు చావుకు గురిచేసి, మాంసపు ముద్దవలె భయానక బీభత్సంగా ఉన్న అతడి శవాన్ని ఆమెకు చూపాడు. అప్పు డామె కన్నార్పకుండా చూస్తూ శవం దగ్గరికి పోయింది. పీడ వదిలిం దన్నట్లు అచ్చమైన తెలుగు పడుచువలె మెటికలు విరిచింది. తగినశాస్తి జరిగిందిలే అన్నట్లు తల ఊపింది. ఎంతలో ఎంతపని జరిగింది? అని ముక్కుమీద వేలువేసికొన్నది. 'కీచకా! దీని కొరకేనా నీ వింత చేశావు? నీకిప్పుడు చావే సుఖం. అంత అతిగా చేసినందుకే ఇంత అనుభవిస్తున్నావు'. అని అనుకొన్నది. ఆ శవాన్ని చూచినకొద్దీ ఆమెకు భయం కలిగింది. అభినయంలోనుండి మాటలు పుట్టి, అవి మరల అభినయంలో మునిగిపోయే వింత పద్యం (2,356) చలనచిత్రం చూపిస్తున్నట్లుంది. ద్రౌపది పాత్ర ఎప్పుడూ అభినయిస్తూ మాట్లాడుతుంది. అది ఆమె నాగరక లక్షణం.

2. భీముడు మాటకు ముందు అభినయిస్తాడు : కీచకుడు ద్రౌపదిని నేలమీదకు పడలాగినప్పుడు భీముడు అగ్రహోదగ్రుడైనాడు. అతడి భయంకరాకారాన్ని తిక్కన అపూర్వంగా ఆవిష్కరించాడు. (విరా.1.133, 134) అచ్చమైన అభినయం ఆకృతి కొన్నట్లుండే ఆ రెండు పద్యాలు తెలుగు సాహిత్యంలో క్రోధ భావాభినయానికి తిక్కన చెక్కిన శబ్దార్థ గుణాల అక్షర శిల్పం. ఇంతటి రసభావోద్రేకాన్ని ప్రదర్శించిన భీముడు ఒక్కమాట కూడా మాట్లాడకపోవటం ఒక వింత. అంతేకాదు. అంబరాన్ని అందేటట్లుగా ఆగ్రహాన్ని ప్రదర్శించగలిగిన పవనతనయుడు అవసరం వచ్చినప్పుడు నిగ్రహంతో వ్యవహరించగలడు. కీచకసంహారార్థం చీకట్లో నర్తనశాలకు పోతున్న భీముడు తన నడకలో తేడా రాకుండా ముందుకు సాగాడు. యుద్ధానికి పోతున్న ఉత్సాహాన్ని బయటపెట్టకుండా కప్పిపుచ్చుకొన్నాడు. రోషం వలన కలిగే ఉద్రేకం వేగిరపాటుతనం పైకి వెలువడకుండా నిబ్బరించుకొన్నాడు. ఎవ్వరికీ అతడు శత్రువును చంపటానికి పోతున్నాడన్న అనుమానం ఆవంతకూడా రాకుండా నిభాయించుకొంటూ నిర్నిద్రంగా విక్రమగంభీరంగా వెళ్ళాడు. విభిన్న భావావస్థలలో భీముడు ప్రదర్శించిన అభినయ నైపుణ్యం అపూర్వం.

భీముడు కోపాన్ని పెంచగలడు, కప్పిపుచ్చగలడు, అంతేకాక, అణచిపెట్టగలడుకూడా అని చెప్పే పద్యం (విరా.2.232) అభినయసుందరం. నర్తనశాలలో సంకేతస్థలంలో ద్రౌపది స్థానంలో రహస్యంగా భీముడు కూర్చున్నాడు. కీచకుడు వచ్చి కేలుసాచాడు. భీముడికి ఒడలు మండింది. కోపం కట్టలు త్రెంచుకొంటూ మనసులో పొంగింది. శరీరం ప్రతీకార తీవ్రతకు కంపించింది. కాని ఆ ఆవేశాన్ని ధైర్యంతో నిగ్రహించుకొన్నాడు. కీచకుడి మన్మథ చేష్టలను, మాటలను, వాటి వైఖరిని బాగా గమనించాలని ఓపికపట్టి కదలకుండా కూర్చున్నాడు. అతడి పద్ధతి చూస్తే 'అవికారనిగూఢ నిజప్రకారుడై' ఉన్నాడు. భీముడు కోపాన్ని పొంగించినా, కుదించినా ఎంత మనోహరంగా ఉంటాడో తిక్కన తెలుగువారికి తెలియజెప్పాడు. ఈ అభినయ వివరాలన్నీ వ్యాసుడి రచనలో అంతగా కానరావు.

భీముడి రౌద్రోద్రేకం ఎన్నిసార్లు చూచినా తనివితీరదు. అట్లా చిత్రించాడు తిక్కన. ఉపకీచకులపై కోపం వచ్చినప్పుడు భీముడు 'శుంభన్మూర్తి విస్ఫూర్తితో' శోభిల్లాడు. అంటే తిక్కన పరిభాషలో ఆంగికాభినయ సాత్త్వికాభినయ సమగ్రంగా నిలిచాడన్నమాట! క్రోధభావోద్రేకానికి సజీవ శిల్పం ఈ పద్యం.

మ. "వికట భ్రూకుటి ఘోరఫాలకలిత స్వేదోద్భటుండుం, జల
ద్వికృతోష్ఠద్వయుఁడుం, బ్రమర్దన దశావిర్భావ సంభావితాం
గకుఁడుం, జిత్తవిదాహదోహల సమగ్ర క్రోధవేగుండు నై
బకవిధ్వంసకుఁ డయ్యెడన్ నిలిచె శుంభన్మూర్తివిస్ఫూర్తితోన్." (విరా.3.25)

ఈ భయంకరరూపాన్ని చూచి ఉపకీచకులు గంధర్వులు వచ్చారని భయపడి సంక్షోభాత్ములై ప్రాణరక్షణకొరకు వారు పడ్డపాట్లు హాసోల్లాసం కలిగిస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. “ఇదె గంధర్వులు వచ్చి ముట్టికొని; రిం కెట్లొక్కొ యంచున్ భయం
బొదవం బల్లములందు డాఁగియు, సమీపోర్వీజముల్ బ్రాఁకియుం.
జెదరం బాఱియు, నీరు సొచ్చియును, నిశ్చేష్టం బదద్వంద్వముల్
గుదివడ్డం బెగడొందియున్ భరితసంక్షోభాత్ములై రత్తఱిన్”. (విరా.3.28)

అనిల సుతుడికి అభినయమే అలంకారమన్నట్లు తిక్కన ఆ పాత్రను తీర్చిదిద్దాడు. (వివరాలకు పై పద్యాల విశేషవ్యాఖ్యలు గమనించండి).

3. ఉత్తరుడు ఉత్తమ నటుడు : విరాటపర్వంలో భీముడు క్రోధాన్నీ, ద్రౌపది వేదననూ, కీచకుడు విరహాన్నీ, ఉత్తరుడు భయాన్నీ అభినయించటంలో ఆరితేరినవా రనిపిస్తారు. వారి వారి అభినయాలలో వారి వారి స్వభావాలు కూడా అంతర్జ్యోతులవలె ప్రకాశిస్తూ ఉంటాయి. భీముడు ఉద్ధతుడైనా ఉదాత్తుడివలె వ్యవహరించినవాడు, ద్రౌపది అభిమానవతియైనా భరించలేని అవమాన దుఃఖాన్ని అనుభవించిన ఉదాత్తురాలు. కీచకుడు సింహబలుడైనా విరహోన్మత్తుడు. ఉత్తరుడు ఉత్తముడైనా పిరికివాడు; భూమింజయుడని పేరు పెట్టుకొన్న భూరిభయస్థుడు; అతడు రథికుడైనా సారథిగా రాణించినవాడు. అర్జునుడి సాహచర్యంతో భయాన్ని ధైర్యంగా మార్చుకొనే మర్మం తెలిసికొన్నవాడు. చేసిన మేలు మరవనివాడు. కృతజ్ఞతాభావపూర్ణుడు. వీరాభిమాని, విజయాభిలాషి. అతడి పిరికితనం తెలుగులో బాగా పేరు మ్రోగటానికి తిక్కన అభినయశిల్పమే కారణమయింది. తిక్కన ఉత్తరుడి పాత్రకు ఉజ్జ్వల నవరత్న పద్యహారాన్ని ప్రసాదించాడు. ఆ రత్నాలను ఇవిగా గుర్తించవచ్చును - విరా. చతుర్థాశ్వాసంలోని 51,55,80,173,177. పంచమాశ్వాసంలోని 112,113,186,265 సంఖ్యలు గల పద్యాలు. ఈ పద్యరత్నాల వెలుగులను విశేషవ్యాఖ్యలలో దర్శింపవచ్చును.

4. కీచకుడు చతుర్విధాభినయ చతురుడు : తిక్కన చిత్రణలో కీచకు డెంత రూపాభిమానియో, అంత రూపకాభినయాభిమాని; ఎంత నానాభరణ ధరణశీలియో అంత నానా రసభావప్రకటన శీలి. ఎంత దుర్విదగ్ధుడో అంత అభినయ విదగ్ధుడు.ఎంత బలగర్వితుడో అంత విరహ భావోన్మత్తుడు. అతడు సైరంధ్రిని చూచి వలచాడు. కాముకుడుగా కాక ప్రేమికుడుగా స్పందించాడు. అందువలననే అతడు సాత్త్వికాభినయాన్ని సహజంగా సాధించగలిగాడు. విరహమూర్తి అయిన శృంగారనాయకుడు మాత్రమే వెలువరించగల అభినయ ప్రజ్ఞను ప్రదర్శించగలిగాడు. కీచకాభినయాన్ని నాలుగు విధాలుగా విశ్లేషించుకొనవచ్చును. ఒక్కొక్కదానికి మచ్చుకు ఒక్కొక్క ఉదాహరణం.

1. భావావస్థకు తగిన ఆంగికాభినయ ప్రదర్శనం.

చ. “అని యని యుగ్గడించు, ధృతి యల్లల నాడినఁ దల్లడించుఁ, బై
కొను తలపోఁత నించు, మదిఁ గోర్కులు పేర్చిన నప్పళించు, నె
ట్టన తెగ నగ్గలించు, నచటన్ జనులం బరికించు, బుద్ధి దూ
లిన వెస నెంతయుం గళవళించు మనోజ వికార మగ్నుఁడై.” (విరా.2.31)

2. భావావస్థకు తగిన ఆహార్యాభినయం.

క. “చిడిముడి పడుచు నెదురుచనఁ। గడఁగుచు హారములు సక్కఁగాఁ ద్రోచుచు మ
ల్లడి గొనుచు, దుర్విలాసం। బొడలికి నొడఁ గూర్చుచుండ...........” (విరా.2.114)

3. భావావస్థకు తగిన వాచికాభినయం.

సీ. "సుదతి నీమైఁ జక్కఁ జూచుట కోడెదఁ। గనుఁబాటు వొరయునో యని తలంచి......" (విరా.2.47)

అభిలాష అనే మదనావస్థను వ్యక్తంచేసే వాచికాభినయానికి సముచితోదాహరణం.

4. భావావస్థకు తగిన సాత్త్వికభావాభినయం.

చ. "తలరు నలందురున్ నవయుఁ దాపభరంబున వెచ్చనూర్చు మే
నలయఁగ నొల్లఁబోవు, వెగడందుఁ, గలంగుఁ, బరిభ్రమించుఁ, గొం
దలపడుఁ, దల్లడం బడరి ధైర్యము దూలిన బెగ్గడిల్లు వి
చ్చలవిడిఁ బేర్చు నెవ్వగల సందడి డెందము గంది చేడ్పడున్". (విరా.2.293)

(పై పద్యాల అన్నింటి విశేషాలకు వ్యాఖ్య చూడండి). చతుర్విధాభినయాలే కాక, మదనావస్థల దశలు, మదన వికార విశేషాలూ తెలిపే అభినయాన్ని కీచకుడు చతురంగా ప్రదర్శించగలిగాడు. శృంగార నాయకుల రంగ ప్రదర్శనానికి తిక్కన చిత్రించిన కీచకుడు ఒక నమూనా పాత్ర!

తిక్కన రచనలోని నాటకీయతను చవిచూచిన తరువాత తెలుగుకవులు నాటకాలను ప్రబంధాలుగా మలచటానికే యుగయుగాలు యత్నించారు. తిక్కన కథాకావ్యస్పృహ బహురూపధారణం చేసింది. నాటకాన్ని గర్భీకరించుకొన్నదే ఊర్జితకథగా వాసికెక్కింది.

18. నానారసాభ్యుదయోల్లాసి విరాటపర్వం

ఇది తిక్కన విరాటపర్వానికి నిబంధించిన రససూత్రం. దీనిని వ్యాఖ్యానించి తిక్కన రచనకు అన్వయించడానికి దాదాపు రెండు శతాబ్దులుగా తెలుగు విమర్శకులు నానాయత్నాలు చేస్తున్నారు. అనేక రసాల క్రమవికాసం వలన (పెంపుదల వలన) ప్రకాశించేది అని ఆ సమాసానికి విగ్రహవాక్యం. దీనిని మరి కొందరు మరికొన్ని రకాలుగా చెప్తారు. బహువిధాలైన రసాల యొక్క అభ్యుదయాలనూ, రసాలయొక్క ఉల్లాసాలనూ కలిగింది అనీ, పెక్కు రకాలుగా ఉండే రసపోషణల చేత ఉల్లాసకరమైనది అనీ, అనేక రసాల పెంపుదల చేత ఉత్సాహస్ఫూర్తి కలిగిందనీ, బహువిధాలుగా భారత రస అభ్యుదయానికి ప్రకాశం కలిగించేదనీ విగ్రహవాక్యాలు చెప్పటం ఉన్నది. వీటికి ఏకవాక్యత సాధించుకొని అనుశీలించటమే విరాటపర్వ రస విమర్శ.

(1) నానారసాలు - ఈ సమాసానికి ఆరు రకాలుగా అర్థం చెప్పవచ్చును.

1. కావ్యరసాలూ, నాట్యరసాలూ 2. అంగాంగి రసాలు 3. వివిధ రసభేదాలు 4. జన్యజనక రసాలు 5. పరుష లలిత రసాలు 6. ప్రకృతి వికృతి రసాలు.

2. అభ్యుదయ+ఉల్లాసాలు - ఈ సమాసానికి అన్వయం రెండు విధాలు.

1. అభ్యుదయమూ ఉల్లాసమూ అని ద్వంద్వం. అవి కలది విరాటపర్వం.

2. అభ్యుదయం యొక్క ఉల్లాసం తత్పురుషం. అది కలది విరాటపర్వం.

శృంగారాది నవరసాలు కావ్యరసాలుగా ప్రసిద్ధి. అష్టరసాలు లేదా నవరసాలు నాట్యరసాలుగా కూడా ప్రసిద్ధి. ఇవికాక అభినయ రసాలని నాట్యశాస్త్రంలో మరికొన్ని ముద్రలు ప్రసిద్ధి. కావ్యరసాల క్రమవికాసంలో ప్రకాశించే నాట్యరసాల విన్యాసం కలిగిన విస్ఫూర్తిని నిరూపించటం ఒక పద్ధతి నవరసాలేకాక కరుణరసం, భక్తిరసం మొదలైన రసాలనుకూడా తిక్కన చిత్రించిన విధం సమీక్షించటం ఇంకొక పద్ధతి. ప్రబంధమండలిగా భాసించే విరాటపర్వంలో కీచకవధ, దక్షిణ గోగ్రహణం, ఉత్తర గోగ్రహణం

అనే ప్రబంధాలలో నాయకాశ్రితమైన అంగిరసాలూ, వివిధాంగరసాల విచారం మరొక పద్ధతి. మహాభారతంలో ధర్మరాజాశ్రితమైన ధర్మవీరమనే అంగిరసాన్ని పోషించే విరాటపర్వంలోని ప్రబంధాలలోని అంగరసాల సమన్వయం ఇంకొక పద్ధతి. శృంగారాది రసాలలో కానవచ్చే భేదాలూ, రసాభాసాదులూ విరాటపర్వంలో నిర్వహించబడిన విధానంలోని వైవిధ్యాల అభ్యుదయ విలాసాల విచారం మరింకొక పద్ధతి. శృంగార వీర రౌద్ర భయానకరసాలు జనకరసాలు. వాటినుండి క్రమంగా హాస్యాద్భుత కరుణ బీభత్స రసాల ఉత్పత్తి వికాసోల్లాసాల విచారం మరొక పద్ధతి. నవరసాలలో వీర రౌద్ర భయానక బీభత్సాలు పరుష రసాలు. శృంగారాద్భుత హాస్య కరుణ శాంతరసాలు లలిత రసాలు. వాటి మిశ్రమంతో కలిగే విశిష్ట వికాస ప్రకాశాల సమీక్షణం మరొక పద్ధతి. సహృదయులలో ఒక ప్రకృతి రసం ఉండగా కావ్యం వలన కలిగే వికృతిరసాల పొంగులు, హంగులు ప్రకాశించిన విధం సమీక్షించటం మరొక విధం. ఇన్ని విధాలుగా విరాటపర్వ రస సమీక్ష చేయవచ్చునని తిక్కన ఈ విశేషణం వలన సూచించాడు.

పాశ్చాత్యుల దృక్పథంలో ఇతిహాసం అనేక రసాల సమాహారం. భారతీయులలో కూడా భావాలన్నీ కవి నేర్పరితనంతో రసాలుగా రూపొందవచ్చుననే వాదం (అనంతా వై రసాః) కథాకావ్యప్రవృత్తి గల తిక్కన విరాటపర్వంలో ప్రవేశపెట్టాడని భావించేవారూ కొందరున్నారు. రసాభ్యుదయం సహానుభుతితో పఠితలు పొందే రసానుభూతులనూ, రసోల్లాసం సానుభూతితో పఠితలు పొందే రసానుభూతులనూ సూచిస్తాయని భావించవచ్చును. ఈ దృక్పథంతో కూడా విరాటపర్వ రసవిమర్శ చేయవచ్చును.

తిక్కన నాటకీయతను గణనీయంగా సంవదించినా విరాటపర్వం సహజంగా శ్రవ్యకావ్యం. అందులో కవి కథనానికీ, వర్ణనానికీ, కవిత్వానికీ విశేష ప్రాధాన్యం ఉంటుంది. కవి పాత్రలమాటల చుట్టూ పరివేషం వలె తన వాక్కులను ప్రదర్శిస్తాడు. తానూ పాత్రలతోపాటు నడయాడుతూ తన వ్యాఖ్యలతో, వర్ణనలతో హంగుదారుడుగా సమర్థిస్తూ ఉంటాడు. అభినయిస్తున్నది పాత్ర అయినా ఆయా సమయాలలో అభినయాన్ని అన్వయించి చెప్పేది తిక్కన. దానికి తగిన పరిసరాలు కల్పించేది తిక్కన. దీనినే రసపరిభాషలో చెప్పాలంటే ఆలంబన, ఉద్దీపన, తటస్థ విభావాల వర్ణనంతో పాత్రలు పఠితల రసభావాలకు కారకులౌతారు. ఆ రసభావాల భావనకు కవుల కవితోక్తులు తోడుపడతాయి. ప్రకృతి వర్ణనలు, కథావర్ణనలు, మానవ స్వభావ సూచనలు, సార్థక విశేషణాలు, అలంకారాలు, జాతీయాలు, కవితా సౌందర్యాలు, ఛందో-లంకారాలు - ఇవన్నీ పఠితలు రసభావాలను భావనం చేయటానికి రమణీయ ప్రేరకశక్తులు. తిక్కన తన రచనలో ఈ అంశాలనన్నింటిని పొందికగా అమర్చి పఠితల మనసులలో రసస్ఫూర్తి కలిగేటట్లు రాణింపజేస్తాడు. శ్రీనాథు డీ వర్ణనాత్మక కవితా శక్తినే 'రసాభ్యుచితబంధ' మని ప్రశంసించాడు. "వాక్రుత్తు తిక్కయజ్వప్రకారము రసా । భ్యుచిత బంధముగ నొక్కొక్కమాటు" (కాశీఖండము. 1.13). తిక్కన రచనలో ఆయన మెచ్చిన గుణమది!

భీముడి రౌద్రరూపాన్ని తిక్కన రసోన్నిద్రంగా వర్ణించాడు.

చ. "కనుఁగొని కోపవేగమునఁ గన్నుల నిప్పులు రాల, నంగముల్
గనలఁగ సాంద్ర ఘర్మ సలిలంబులు గ్రమ్మ, నితాంతదంతపీ
డనరటదాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్త న
ర్తన ఘటనా ప్రకార భయదస్ఫురణా పరిణద్ధమూర్తియై." (విరా.2.133)

ఈ పద్యంలో వర్ణనం, రచన, నాటకీయత అనే మూడు లక్షణాలు ముప్పేటగా పెనవేసికొన్నాయి. పఠిత ఈ మూడింటి వలనా రసానుభవం పొందుతాడు. వర్ణనం పాత్రరూపాన్ని భావింపజేస్తుంది. రచన రూపాన్ని దర్శింపజేస్తుంది. నాటకీయత ఆంగికాభినయాదులను ఆస్వాదింపజేస్తుంది. ఇందులో ప్రబంధ రచన ప్రధానం. అది శబ్దగుణాలైన ఓజస్సుతో, శాంతితో నిబిడమై తోచింది. అలంకారంలో అభినయం మెరిసింది. అంటే, ఈ పద్యంలో శ్రవ్యకావ్యలక్షణాల వలన రసాభివ్యక్తి కలుగుతూ ఉండగా నాటకీయత దానిని రాణింపజేసిందన్నమాట! ఇందులో రౌద్రరస(మూర్తి) విభావం రూపుకట్టింది. అది సహజాభినయ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముద్రలతో ఉండేటట్లు వర్ణించటం తిక్కన ప్రతిభ. అభినయ స్వభావాన్ని ముద్రించకుండా వర్ణిస్తే ఇది వట్టి శబ్దాడంబరమయ్యేది. కాని, తిక్కనది ఉభయకావ్య శిల్పం. ఇందులో రూపానికి అభినయం అలంకారం.

అయితే ఆ తరువాతి పద్యం ఈ స్వభావానికి విరుద్ధం. అదీ రౌద్రమూర్తి వర్ణనమే;

సీ. “నేలయు నింగియుఁ దాళముల్గాఁ జేసి। యేపున రేఁగి వాయించి యాడఁ,
గులపర్వతంబులు గూల్చి యొండొంటితోఁ। దాఁకంగ వీఁకమైఁ దన్నియాడ,
నేడుసాగరములు నిక్కడక్కడఁబెట్టి। పలుచని రొంపి మై నలఁదికొనఁగ,
దిక్కులు నాలుగు నొక్కచోటికిఁ దెచ్చి। పిసికి పిండలి సేసి పిడుచఁగొనఁగ,

తే. మిగిలి బ్రహ్మాండభాండంబు పగుల వ్రేయ। నప్పళించుచుఁ బ్రళయకాలానలమున
గండరించిన రూపంబు కరణి భీముఁ। డతిభయంకరాకారత నతిశయిల్లె!” (విరా.2.134)

ఇందులో అలంకారాన్ని ఆశ్రయించి భీముడి రూపాన్ని ఆలోచించి భావించాలి. అయినా అది భౌతికమూర్తికంటె మించిన భావచైతన్యమూర్తి. అమూర్తమైన రసానుభవాన్ని గాలిగొడుగులతో ఆకాశాని కెత్తినట్లుంది - ఈ అర్థాలంకార శక్తి, అర్థగుణశక్తి. ఈ పద్యం అందించేది కావ్యరసం. నాట్యరసం కంటె కావ్యరసం భావనామయంగా ఎంత ఎత్తు ఎదుగగలదో చూపించే ‘రసాభ్యుచిత బంధం’. బ్రహ్మాండభాండాన్ని పగులగొట్టేటట్లు నిలబడిన ప్రళయాగ్నియొక్క పోతపోసిన విగ్రహంవలె భయంకరాకారంతో అతిశయిల్లాడట భీముడు! ఈ రూపాన్ని భావించి దర్శించినవారికే భయభావం అనుభవంలోకి వచ్చేది. లేదా ఆశ్చర్యంలో మునిగిపోవలసిందే. ఇది రూపకాని కొదిగే రూపం కాదు. చతుర్విధాభినయాల పరిధికంటె మించింది. ఈ వర్ణనం తిక్కన కావ్యరసకల్పకం. రూపాభినయం వలన కలిగే రసానుభవం ఒకసారి, భావనాబలంతో పట్టుకొనే రసానుభవం మరొకసారి కలిగింది. ఒకే రౌద్రరసాన్ని ఆస్వాదింపజేస్తే, ఒకదానికంటె మరొకటి మెరిసిపోతున్న అనుభవంతో పఠిత దీనిని ‘నానారసాభ్యుదయోల్లాసం’ అంటాడు. అనేక విధాలుగా ఒకే రసాన్ని పెంచి ప్రకాశింపజేసే శిల్పం - అని ఇక్కడ తాత్పర్యం.

స్థాయిభావాలు బలమైనవి కాబట్టి వాటిని ఏమాత్రం పోషించినా రసానుభవాలను కలిగిస్తాయి. ఒక్కొక్కసారి సంచారి భావాలకు కూడా కవి తన ప్రతిభతో రసానుభవం కలిగించే అభ్యుదయాన్ని కలిగించి ప్రకాశింప జేయవచ్చును. విశేష మేమంటే కొన్ని సంచారిభావాలు స్థాయిభావాలను పోషిస్తూనే కాక స్వతంత్రంగా కూడా విస్తరించి రసస్థితిని పొందగలవని లాక్షణికులు గుర్తించారు. అటువంటి సంచారులలో అగ్రగణ్యం ‘నిర్వేదం’. ఇది శృంగారాదులలో స్వతంత్ర ప్రతిపత్తిని సాధించగలదు. ఒక్కొక్కసారి శాంతరసానికి స్థాయిగా కూడా నిలువగలదు. ఈ విధంగా బహుళ ప్రయోజనాలకు ఉపయోగించే భావాలకు రసస్థితిని కలిగించటం తిక్కన నేర్పు.

సుదేష్ణ ద్రౌపదిని కీచకుడి ఇంటికి పోయి కల్లు తెమ్మని బలవంతాన ఒప్పించింది. అసలే అంతకు పూర్వం కీచకుడు పలికిన మాటలు ఆమెకు కర్ణశూలాలుగా బాధపెట్టాయి. ఆపైన సుదేష్ణ ఇచ్చిన అనుచితమైన ఆదేశం పిడుగుపడిన వారిని కొరవితో కొట్టినంత బాధ కలిగించింది. అప్పుడు ద్రౌపది ‘నిర్వేదనం’ పొందిందని తిక్కన వర్ణించాడు (విరా.2.103). దానిని రెండంచెలలో విస్తరించాడు.

చ. “అలమటఁ బొందు ‘మాయవిధియా’ యని దైవము దూఱు, ‘నిత్తఱిం
గలదొకొ నాకు దిక్కను, మొగంబున నశ్రులు వెల్లిగొల్పు, దొ
ట్రిలఁబడు, జల్లనం జెదరు డెందముఁ గూడఁగఁ దెచ్చి ‘నన్నుఁ గే
వలమున ముట్ట నెవ్వరికి వచ్చు?’ ననుం, గలఁగున్, వెనుంబడున్.”

వ. అట్టియెడ.

సీ. "దైన్యంబు తలపోఁత తలకొన్నఁ జెలువ కాననమున వెల్లఁదనంబు గదిరె;
భయరసవేగంబు పైకొని ముట్టినఁ। గాంతకుఁ దనులతఁ గంప మడరె;
బెగ డంతకంతకు మిగిలిన నింతికిఁ। బదముల నటఁ దొట్రుపాటు బెరసెఁ;
దల్లడం బొందినఁ దన్వికి నవయవం। బుల నెల్ల ఘర్మాంబుకళిక లెసఁగెఁ;

ఆ. దలఁకు పుట్టె, గొంకు కొలఁదికి మీఱె, వె। న్బాటు దోఁచె, ముట్టుపాటు దొడరె,
వెఱఁగుపాటు దనికె, నెఱనాడె నొవ్వనె। వ్వగలు వగల నీనె, దిగులు వొదివె". (విరా.2.104-106)

"నిర్వేదో నామ దారిద్ర్య వ్యాధ్యవమానాధిక్షేపాకృష్ట । క్రోధ తాడనేష్టజనవియోగ తత్త్వజ్ఞానాదిభిః" అని నాట్యశాస్త్రం (7.28). ఇందులో అవమానం వలన కలిగిన నిర్వేదం వర్ణితం. దీన్ని స్త్రీలు, నీచప్రవృత్తులు, కుత్సితులు అభినయించాలి. వారిలో స్త్రీపరంగా, అందులోనూ ఉదాత్తనాయిక అయిన ద్రౌపదిపరంగా వర్ణిస్తే అది రసస్థాయి పొందటంలో ఔచిత్యం ఉంటుంది. ఈ కీలకం తిక్కన తెలిసి చేశాడు. అంతే కాదు- తత్త్వజ్ఞానం, ఆపద, ఈర్ష్య మొదలైన వాటివలన తనను తాను కించపరచుకొనటం నిర్వేదమౌతుందనీ, నిర్వేదం విభావానుభావ రసాలకు అంగభూతంగానే కాక స్వతంత్రంగా కూడా ఉంటుందనీ దశరూపకం వివేచించింది. తిక్కన ఆపద వలన కలిగిన నిర్వేదానికి స్వతంత్ర రూపకల్పనం చేశా డిక్కడ.

పై రెండు పద్యాలలో తిక్కన చూపిన రసాభ్యుదయ శిల్పం విశిష్టం. సుదేష్ణ యొక్క అనుచిత వ్యాపారం వలన ద్రౌపదిలో నిర్వేద సూచకమైన అనుభావాలు గోచరించినట్లు మొదటి పద్యం వర్ణించింది. విభావం ఆంగికంగానే కాక వాచికంగా కూడా అభివ్యక్తం కావటంచేత అది పుష్టిమంతం అయింది; అభినయసుందరంగా పాఠకులకు అందుబాటులోకి వెంటనే వచ్చింది. "రుదిత, నిశ్వ్వసి, తోచ్ఛ్వసిత సంప్రధారణాదిభిః అనుభావైః త మభినయేత్" అని నాట్యశాస్త్రం. ద్రౌపది ఆ అనుభావాలను నిర్వేద వ్యంజకంగా వ్యక్తం చేసినట్లు తిక్కన వర్ణించాడు. తిక్కన రోదనాన్ని నాగరకం చేసి రెండు దశలలో చెప్పాడు. మొదట అలమటపడింది. లోలోన కటకటపడి బాధపడిందన్నమాట. ఆ బాధను 'ఓ మాయదైవమా!' అనటంలో సూచించింది. ఇది సగంవాక్యమే. 'నిన్ను నమ్మిన నన్ను ఇంతపని చేస్తావా? నీవే రక్షిస్తావనుకొన్నానే, ఆర్తత్రాణపరాయణుడ వనుకొన్నానే, ఇట్లా చేశావేమి?' మొదలైన భావాలను సహృదయుడు భావించగలిగేటట్లు తిక్కన ఆ దైవసంబోధనను ధ్వనిమయంగా నిబంధించాడు. దైవానుగ్రహం తప్పిందని తెలియగానే ఆమెకు కన్నీరు మున్నీరయింది. ఇది సాత్త్వికరోదనం. అందులో వితర్కాన్ని మిశ్రమం చేసింది. 'మరి ఇప్పుడు నాకు దిక్కెవ్వరు?' అని బావురుమన్నది. అంటే, ఆమె తనకు నిస్సహాయత ఏర్పడ్డట్లు భావించింది. దానితో మనసు గుభేలుమన్నది. మరేమాటా ఆమె నోట వెలువడలేదు. అయినా, ఆమె ధీరురాలు కాబట్టి చెదరిన గుండెను దిటవు చేసికొన్నది. ధృతిని మనసులో నిలుపుకొన్నది. 'న న్నెవ్వరు తాకగలరు?' అని లోలోన ధైర్యం చెప్పుకొన్నది, అయినా, సన్నివేశ తీవ్రతను భావించి కలతపడింది. ముందుకు పోవటానికి వెనకాడింది. ధైర్యంతో నిలద్రొక్కుకొన్నా, నిర్వేదం ఉపశమించకుండా ఆమెను ముంచెత్తింది. ఆ ముంపు సంచారిభావం రసంగా పరిణమించే అవస్థ. దానిని దురవస్థగా తిక్కన పేర్కొన్నాడు. ప్రదర్శించిన భావాలూ, సాత్త్వికభావాలూ రసస్థితికి సంకేతాలు. సీసపద్యంలో ఈ రసాభ్యుదయ శిల్పం ప్రదర్శించబడింది. నిర్వేదాన్ని దైన్యాదిసంచారులు పోషించి స్థాయిత్వాన్ని కల్పించినంతపని చేశాయి.

దైన్యం అనే భావాన్ని భావనం చేయగా ఆమెకు భయం పుట్టింది. దానివలన మొగం వెలవెలపోయింది. భయతీవ్రతను అనుభవించటం వలన బెదరుపాటు మేరమీరి శరీరం కంపించింది. ఆ భయం అంతకంతకు పెరగటంవలన ఆమెకు విషాదం కలిగి పాదాలు తడబడ్డాయి. భయంతో ఆమె తల్లడిల్లిపోవటం మొదలుపెట్టింది. దానితో ఆమె క్షోభపడింది. దానివలన ఆమె శరీరానికి ముచ్చెమటలు పట్టాయి. క్రమంగా నిశ్చేష్టురాలైపోయింది. బాధ ఆయువుపట్లు తాకింది. పెనుచింతలు మనసులో పెరిగాయి. చివరకు అంతంలేని దిగులు మనసంతా ఆవరించింది. భావం రసంగా మారిన ఈ అభ్యుదయ క్రమం చిత్రించటం

అపూర్వం. ఇప్పుడు నిర్వేదం సంచారి కాదు. రసనామయోగ్యమైన స్థాయి. దాని అభ్యుదయ ప్రకారం పైపద్యాల వర్ణన వికాసం. ఇటువంటి నానారసాల అభ్యుదయాల ప్రకాశమే నానారసాభ్యుదయోల్లాసం! ఇది ఒక పేలు!

నానారస సంసృష్టికి తెలుగు సాహిత్యంలోనే ఒక వెలుగు కిరణం వలె నిలిచే పద్యం:

సీ. 'వెఱవక ననుఁ జూచె వీఁడని యెదఁ గలు। షించిన నొండొండ చెమట వొడమ,
ననుచిత కృత్యంబు లాచరించు విధాతృ। బలిమికి నివ్వెఱపాటు దోఁప,
నిచ్చట దిక్కులే రెవ్వరు నా కను। భయమున మేనఁ గంపంబు పుట్టఁ,
జేయంగ నేమి యుపాయంబు లేమి నా। ననమున వెల్లఁదనంబు గదుర

తే. నున్న పాంచాలిఁ గనుఁగొని య న్నరాధ। ముఁడు వివేకవిహీనుఁడై ముదితుఁ డగుచు
మదనవికృతియ కాఁ దనమదిఁ దలంచి। రాగసాగరపూర నిర్మగ్నుఁడయ్యె.' (విరా.2.33)

(వివరాలకు ముందుగా విశేష వ్యాఖ్య చూడండి).

ఈ పద్యం వర్ణనాత్మక కథన పద్ధతికి చెందింది. కవి ఇందులో సంచారిభావోదయాలకు అనుగుణంగా కలిగిన సాత్త్విక భావోదయాలను నాటకీయ శైలిలో వర్ణించి రసవ్యంజకత్వాన్ని సాధించాడు. అంతటితో ఆగకుండా విరుద్ధరసాలను ధ్వనింపజేయటానికి ఒకే రకమైన సాత్త్వికభావాలను వాడి ఉభయకావ్య ప్రౌఢి పాటించే అపూర్వ రసశిల్పాన్ని చిత్రించాడు. వాటితోపాటు తిక్కన తన వ్యాఖ్యలను కూడా జతపరిచాడు. చివరకు రసానుభూతిని మనకు వదలివేశాడు. ఇది ఒక సంశ్లిష్ట శిల్పం.

సీసపద్యపాదాలలో వర్ణ్యవస్తువు ద్రౌపదికి భయాదులవలన కలిగిన సాత్త్విక భావోదయం. కారణకార్యసంబద్ధంగా స్వేదం, నివ్వెరపాటు, కంపం, వైవర్ణ్యం చిత్రించబడ్డాయి. ఆమెను (ఆ విభావాన్ని) కీచకుడు చూచాడు. అతడికి ఆమె సాత్త్విక భావోదయం మదనవికారం వలన కలిగినదిగా స్ఫురించింది. ఆ భావనవలన అతడు సంతోషించి రాగసాగరంలో మునిగిపోయాడు. (శృంగార రసభావనంలో తాదాత్మ్యం పొందాడు). తిక్కన ఈ మధ్యలో వ్యాఖ్యానం చేస్తూ 'కామీ స్వతాం పశ్యతి' అనే న్యాయంతో చూచిన కీచకుడు నరాధముడనీ, ఆమెవి మదనవికారాలని భావించటం వివేకం లేకపోవటమే ననీ సూచించాడు. సహృదయు డీ పద్యం వలన పొందే రసానుభూతి నానారసాభ్యుదయోల్లాసంలో ఒక ప్రయోగం.

సహజాలూ, ఔచిత్యాలూ, ధర్మసమ్మతాలూ అయిన పాత్రల భావాలలో, సాత్త్వికభావాలలో పఠితలు తాదాత్మ్యం (Identity) పొందుతారు. మిగతా వాటిల్లో కొన్నింటిని సానుభూతి (Sympathy) తో స్వీకరిస్తారు. కొన్నింటిని ప్రతిచర్య (Reaction) తో తిరస్కరిస్తారు. పైపద్యంలో ద్రౌపది ప్రదర్శించే భావాలలో పఠితలందరికీ పరిపూర్ణ తాదాత్మ్యం కలుగుతుంది. కాబట్టి ఈ పద్యం ద్రౌపదివలెనే పఠితకు కూడా భయభావానుభవం కలుగజేస్తుంది. మరి ఆమె సాత్త్వికభావాలను మదన వికారాలుగా భావించిన కీచకుడితో పఠిత తాదాత్మ్యం పొందలేడు. అవి సహజాలు కావు. ఔచిత్యాలు కావు. ధర్మసమ్మతాలూ కావు కాబట్టి. కావని తిక్కన అతడి స్వభావాన్ని గురించి వ్యాఖ్యానించాడు కాబట్టి. కాని, కీచకుడు మాత్రం శృంగార నాయకుడివలె రాగసాగరపూర నిర్మగ్నుడైనాడు. నిజానికి - కీచకుడిలో వ్యక్తమయ్యే శృంగారం సహృదయులు అనౌచిత్యమని భావిస్తే రసభంగం కావాలి. ఏకత్ర భాసిస్తున్న రతిభావన మనుకొంటే రసాభాసం కావాలి. కీచకుడు తుచ్ఛకాముకుడుగా కాక రూపాభిమానిగా ద్రౌపదిని రమిస్తున్నాడని భావిస్తే సామాన్యంగా విషాదరూపకాలలో విషాదపాత్రలయందు ప్రకటించే సానుభూతితో కూడిన రసానుభూతి ఉండాలి. రసికుల మధ్య చర్చకు పెడితే చివరకు మిగిలేది ఒక్కొక్కసారి రసాభాసమే కావచ్చును. రసాభాసానికి కూడా నానారసదృక్పథాలతో అభ్యుధయోల్లాసాన్ని కలిగించిన గొప్ప పద్య మిది. ద్రౌపది రసవిభావం. ఆమెయందు భయ ముంది కాని రతి లేదు. దానిని కీచకుడు విరుద్ధంగా భావించి రతిగా తలంచి రసానందం పొందాడు. కాని, పఠిత దానిని పొందలేడు. కీచక శృంగారం ఆభాసం ఔతుంది. దానివలన హాసం జనిస్తుంది. దానితో ద్రౌపది భయానుభవం కూడా ఆభాసమౌతుంది. పద్యం మొత్తం కలిసి పఠితకు ఒక మందహాసంగా కూడా మిగలవచ్చును. ఆ స్థితి ఆలోచనా రమణీయం.

(1) రస ప్రయోగోల్లాసం

తిక్కన పద్యాలలోనే కాక విరాటపర్వ ప్రబంధ ఘట్టాలలో కూడా శృంగారాది కావ్యరసాలలో అపూర్వ ప్రయోగాలు చేసి భావికవులకు బాటలు చూపించాడు. వాటిని స్థూలంగా వివేచించినా కొన్ని విశేషాలు బయటపడతాయి.

(i) శృంగారరసం : మహాభారతంలో శృంగారరసస్థితి విచిత్రమైనది. నాయికా నాయకులైన ద్రౌపదీపాండవుల నడుమ శృంగారం దాంపత్యధర్మంగా ప్రవర్తిల్లుతుందే కాని, రసాభ్యుదయోల్లాసంగా సాగదు. అరణ్యాజ్ఞాతవాసాలలో వారు బ్రహ్మచర్యంలో ఉన్నారు. ద్రౌపదితో భీమాదులు మాట్లాడినా క్షేమసమాచారాలూ, కర్తవ్యాంశాలే కాని సరస సల్లాపాలుండవు. ఎడనెడ అర్జునుడి దక్షిణ నాయకత్వం శృంగారరసదీప్తిని ప్రదర్శించినా ఆ అవకాశం విరాటపర్వంలో లేనే లేదు. ఇకపోతే ఉత్తరాభిమన్యుల వివాహ సందర్భంలో వారి పరస్పర దర్శన స్పర్శనాదుల వలన కలిగిన స్పర్శ సౌఖ్యరసం చిగురించింది కాని, అది సంభోగ శృంగార రసోల్లాసంగా వర్ణించబడలేదు. విరాటరాజ దంపతులున్నా వారి మధ్య విలాససన్నివేశాలు లేవు. విషాదఘట్టంలోనో కూతురు వివాహసందర్భంలోనో వారిద్దరు ఒకచోట కనపడతారు. వారి చిక్కులు వారివి, వారి సమస్యలు వారివి. అంతేకాని ఏ దంపతులూ సంభోగ శృంగార భావనలే ప్రసరించరు.

అయితే ద్రౌపదితో పొందుకోరి, ఆమెను వెంటాడి, అక్క మెడలు వంచి, ఆమెను సంకేతస్థలంలో కలిసి భోగించి శృంగారఫలాన్ని పొందాలని అనుకొని, అభిలాష విప్రలంభాన్ని అత్యుత్కటంగా అనుభవించినవాడు కీచకుడు. అతడి పాత్ర శృంగారరసపోషణలో ఒక చిక్కుముడి. అతడు వస్తుతః రసికుడు. రూపాభిమాని. సైరంధ్రివేషంలో ఉన్న ద్రౌపది యొక్క అపూర్వ సౌందర్యశోభను గుర్తించి, కీర్తించి, ఆశించి, దాని కొరకై పరితపించి, ఆమె పొందు పొందకపోతే ప్రాణాలు వదలటానికైనా సిద్ధపడిన రసికుడు; ముమ్మూర్తులా శృంగార నాయకుడు. అతడు నోరారా, మనసారా ద్రౌపది సౌందర్యాన్ని కీర్తించాడు (మూలాతిశయంగా). ద్రౌపది సౌందర్యాన్ని పాండవులకంటె ఇతరులే ఎక్కువగా కీర్తించటం కనబడుతుంది. అట్టివారిలో కీచకుడు అగ్రస్థానంలో నిలుస్తాడు. అతడి శృంగార సౌందర్య ప్రియత్వం అభినందనీయ మనిపిస్తుంది. కాని, అతడు తెలిసి తెలిసి అన్యుల భార్యపై రతిభావాన్ని పెంచుకొని, విరహాన్ని అనుభవించటం ధార్మికంగా దోషం. అందువలన అది ధార్మికులకు నచ్చదు. అతడి రతిభావం స్థాయిత్వం పొందదు. పైపెచ్చు ఔచిత్యదృష్టితో రసభంగహేతు వవుతుంది. అది అతడి వరకు కావ్యన్యాయాన్ని సమకూరుస్తుంది. ఎవడి చావు సబబని సహృదయుల కనిపిస్తుందో అతడు దుష్టపాత్ర (విలన్). సంస్కృత భారతంలో కీచకుడు కాముకుడైన దుష్టపాత్ర. తిక్కన కీచకుడి కాముక ప్రవృత్తిని రసిక ప్రవృత్తిగా మార్చాడు. దానికై వరుసగా నాలుగు గుణాలను అతడికి అమర్చాడు. రూపాభిమాని కావటం చేత సైరంధ్రి అని కూడా తలంచక ఆమె అందాన్ని ఆశించి, ఆరాధించాడు. నానాభరణశీలుడు కావటం చేత క్రొత్త సొమ్ము మీద మోజుపడ్డాడు. దుర్విదగ్ధుడు కావటం చేత తనను చూచి అందరి వలె ఆమె మోహిస్తుందని భ్రమించాడు. బలగర్వితుడు కావటం చేత గంధర్వులు తన మానప్రాణాలు హరిస్తారని బెదిరించినా లెక్కచేయలేదు. సుదేష్ణ నీతులు చెప్పినా తలకెక్కించుకొనలేదు. సైరంధ్రి తిరస్కరించినా ఆమెను కోరి వెంటబడటం మానలేదు. ఒంటరిగా కటిక చీకట్లో నర్తనశాలకు రమ్మన్నా వెనుకాడలేదు. ఆ గుణాలే సైరంధ్రిని పొందగలనని అతడు భావించడానికి ఆశాకిరణాలుగా అమరాయి. మరి ఆ గుణాలే అతడు వికృతపు చావు పొందటానికి విశిష్టకారణాలు కూడా అయ్యాయి. తిక్కన అతడి రూపాభిమానాన్ని అభిలాష విప్రలంభంగా పెంచి అద్భుత కవిత్వం రచించాడు. అందులో అతడిని వనితాశరీరసంగమాన్ని మాత్రమే కోరే కాముకుడిగా కాక ఆమె సాంగత్యాన్ని పొందే అదృష్టాన్ని మనసారా కోరే రసికశేఖరుడిగా చిత్రించాడు. భయంతో అక్క వద్దన్నా, ధర్మాన్ని చూపి భర్తల పరాక్రమాన్ని పొగడి సైరంధ్రి బెదిరించినా అతడు తన మనోధర్మమైన మదనవేదనను మానలేకపోయాడు. శృంగారనాయకుల వలె దశవిధ మన్మథావస్థలను అనుభవించాడు. మూలంలోని కీచకుడికి తిక్కన తీర్చిదిద్దిన కీచకుడికున్న చిత్తశుద్ధిలేదు. మోహంలో కూడా తళుక్కున మెరిసే శృంగారనాయక లక్షణం లేదు. వ్యాసుడు చిత్రించిన దుష్టపాత్రను తిక్కన విరహపాత్రగా, పఠితల సానుభూతికి పాత్రుడయ్యే విషాదపాత్రగా చిత్రించాడు. ఎన్ని విశిష్టగుణాలున్నా ఒక బలమైన బలహీనత వలన చివరకు తననూ, తనవారిని విషాదాంతానికి గురి చేసే పాత్ర విషాద పాత్ర. ఆ పాత్ర వంచనతో చంపబడినా, చచ్చినందుకు

ఎవరూ విచారించకపోయినా, సుదేష్ణవలె కంటతడి పెట్టలేకపోయినా, కొంత సానుభూతిని ప్రదర్శిస్తారు. తిక్కన వర్ణించిన విరహవర్ణనలోని పూర్వరాగ విప్రలంభ శృంగార రసాభ్యుదయోల్లాసం వలన కీచకుడి పట్ల తెలుగువారికి సానుభూతితో కూడిన రసానుభూతి కలిగింది. దుష్టపాత్ర విషాదపాత్రగా మారి సానుభూతిని పొందింది. దానివలన ఆ ఘట్టంలో శృంగారరసభంగస్థితి మారి శృంగార రసాభాసస్థితి ఏర్పడింది. రసాభాసం కూడా రసం వలె అనుభవాన్ని అందిస్తుందని ఆలంకారికు లంగీకరిస్తారు. దానికి ఈ ఘట్టంలోని శృంగార రసాభాసాన్ని మోదంతో ఆమోదించే ఆంధ్రావళియే సాక్షి. నాయికానాయకులలో ఏకత్ర తోచే అనురాగంతో రాణించే రసాభాస శిల్పాన్ని పోషించి తిక్కన పెద్దనకు బాటచూపాడు. ఇంత జరిగినా ఈ శృంగారం సంభోగ పర్యంతం కాకపోవటంతో రసికులు అనౌచిత్యాన్ని మరిచిపోయి అనువుగా ఆభాసాన్ని రసంగా అనుభవించి ఆహ్లాదిస్తారు. శృంగారం రసమైతే ఆనందం; ఆభాసమైతే ఆహ్లాదం.

(ii) హాస్యరసం : హాస్యం పేరు చెప్పగానే విరాటపర్వంలో గుర్తుకు వచ్చేవాడు ఉత్తరుడు. వికృతివలన హాసం పుట్టుతుంది. వికృతి ఆకారంలో, వేషంలో, ప్రవృత్తిలో, మాటలో, చేష్టలో, సన్నివేశగతమైన ప్రవర్తనలో- ఎట్లా బయటపడినా ఎదుటివారికి నవ్వు పుట్టిస్తుంది. పాత్రలు నవ్వుతూ నవ్వించేవి కొన్ని, తమ వికారాలతో ఎదుటివారిని నవ్వించేవి కొన్ని ఒక్కొక్కసారి ఉదాత్త ప్రవృత్తులు. రసాలు వికారాన్నీ, ఆభాసనూ పొందినప్పుడు కూడా వికృతి స్ఫురిస్తుంది. అప్పుడు కూడా నవ్వు పుట్టుకొస్తుంది. హాస్యం ప్రహసనాల్లోనో, ప్రకరణాల్లోనో ప్రధానరసంగా ఉండగలుగుతుంది. కాని నాటకాలలోకాని, కావ్యాలలోకాని, ఇతిహాసాది ప్రక్రియలలోకాని అదెప్పుడూ అంగభూతమే. ఒక్కొక్కసారి అది రసస్థాయికి రాకపోవచ్చును. విరాటపర్వంలోని హాస్యం వైవిధ్యంతో కూడుకొని ఉన్నా అది రసస్థాయికి చేరుకోలేదు. భావస్థాయిలోనే ఉండిపోయింది. అందువలన హాస్యరసం విరాటపర్వంలో హాసోల్లాసంగానే అందగిస్తుంది. అంగిరసాభ్యుదయానికి తోడ్పడుతుంది.

"శృంగారరసం నుండి హాస్యం జనిస్తుందని భరతముని పేర్కొన్నాడు- జన్యజనక రసవివేచన సందర్భంలో ఈ అంశాన్ని అర్వాచీనాలంకారికులందరూ అనువదించారు. కాని, ఇది ఒక విధమగు భేదం మాత్రమే. రూపకములందలి విదూషకహాస్యం ఈ విధానికి చెందినది. అంతేకాదు, శృంగారం అనుకృతి రూపంగా-అంటే ఆభాసరూపంగా హాస్యానికి హేతువవుతుంది. వికృతములైన వేష అలంకారాలు హాస్యానికి విభావాలని చెప్పినప్పుడు, వికృతి పదాన్ని దేశ-కాల-వయః ప్రకృతి-అవస్థా వైపరీత్యమని అభినవగుప్తుడు వివరించినాడు. కాగా, సర్వ రసములందలి అనౌచిత్య ప్రవృత్తి (ఆభాసం) హాస్యానికి విభావం అవుతుందని సారాంశం. "వాగంగాది వికార దర్శనజన్మా, వికాసాఖ్యః హాసః" అని జగన్నాథుడు. వాచికం, ఆంగికం మున్నగువాని యందలి వైపరీత్యం దర్శించటం వల్ల కలిగే మనోవికాసం హాసం అనబడుతుంది. విశ్వనాథుడు హాస్యరసాన్ని ఇట్లా వివరించినాడు: "వికృతాకార వాగ్వేష చేష్టాదేః నర్తకాత్ భవేత్ హాస్యః" - వికృతంగా ఉన్న ఆకారం, వాక్కు, వేషం, చేష్ట మున్నగువానితో కూడిన నర్తకుని (నటుని) వల్ల హాస్యం కలుగుతుంది. కాగా ఆకారం, వాక్కు, వేషం, చేష్టలు - అంటే ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్త్వికాభినయములందలి వైపరీత్యం హాస్యరసహేతువు అవుతుందని అర్థం. నటుని ద్వారా (పాత్రలద్వారా) ఈ వైపరీత్యం దర్శించిన సదస్యునిలో కలిగే మనోవికాసం హాస్యరసానికి దారితీస్తుంది" (డా.పి.యస్.ఆర్. అప్పారావుగారి - సాత్త్వికాభినయము. పుట.467-468). ఇది లక్షణ సూత్రమైతే దీన్ని సర్వాంగసుందరంగా ఆవిష్కరించిన లక్ష్యం విరాటపర్వం!

విరాటపర్వంలో పాండవులు ధరించిన రూపాలు వారి ప్రకృతిరూపాలకు వికృతులుగా రాణిస్తాయి. అయినా అవి హాస్యానికి విభావాలు కావు. అయితే ఎడనెడ వారు చేసే చేష్టలు సుస్మిత హాస్యాన్ని సృష్టించి మనకు చిరునవ్వును (స్మితాన్ని) కలిగించవచ్చును. ఉదాహరణకు భీముడు నర్తనశాలలో గొంతు మార్చి సైరంధ్రివలె కీచకుడితో మాట్లాడిన మాటలు గంభీరమైన చిరునవ్వును కలిగిస్తాయి. ఉత్తరకుమారుడు అంతఃపురంలో పలికిన ప్రగల్భాలు వీరోచితాలుగా ఉన్నా, అవి అతడి తలకు మించినవనే వికృతభావం తోచటం వలన మనకు హసితం కలుగుతుంది. సింహబలు డంతటివాడు సైరంధ్రిని వలచి విరహంలో మునిగి అభిమానాన్ని, లజ్జను, ఔచిత్యాన్ని కోల్పోయి ఉన్మత్తుడివలె వ్యవహరించే తరుణంలో మనకు 'విహసితం' కలుగుతుంది. కర్ణుడు వీరోచిత ప్రగల్భాలాడినప్పుడూ, అర్జునుడి చేతిలో ఓడిపోయినప్పుడూ, అతడిని గురించి అశ్వత్థామాదులు అధిక్షేపించినప్పుడూ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనకు 'ఉపహసితం' కలుగుతుంది. దుర్యోధనుడు అర్జునుడి చేతిలో చిత్తుగా ఓడిపోయినప్పుడూ, భీష్మాదు లతనిని మందలించినప్పుడూ మనకు అపహసితం స్ఫురిస్తుంది. భీముడి భయంకరరూపాన్ని చూచి ఉపకీచకులు ప్రాణాలు దక్కించుకొనటానికి పరుగెత్తసాగినప్పుడూ, రథాన్ని దిగి ఉత్తరుడు పరుగెత్తుతూ పరిపరివిధాల బేలగా పలికినప్పుడూ, దుర్యోధనాదులను అర్జునుడు ఉపాలంభించినప్పుడూ మనం అతిహసితాన్ని పొందుతాం. సూక్ష్మంగా పరిశీలిస్తే కీచకోదంతం శృంగారం నుండి హాస్యం జనించటానికీ, ఆభాసం నుండి హాస్యం పుట్టటానికీ చక్కని ఉదాహరణం. అందులో ఆరు రకాల హాస్యాలూ అభ్యుదయం చెందాయి. అట్లాగే ఉత్తర గోగ్రహణంలో ఉత్తరుడి చేష్టలలో మాటలలో సహజ వికార చేష్టల వలన పుట్టిన హాస్యం, కర్ణ దుర్యోధనాదులలో వీరాభాసం వలన పుట్టిన హాస్యం, భీమార్జునులు చేసిన శత్రుపరిహాసం వలన కలిగిన హాస్యం గమనిస్తే ఆరువిధాల హాస్యాలూ వీరరసాన్ని ఆశ్రయించి ఉల్లాసాన్ని ప్రదర్శించాయని వెల్లడౌతుంది. నవ దంపతులైన ఉత్తరాభిమన్యుల అభిలాషా వైచిత్రిలో కనపరచిన ఆసక్తులు సున్నితహాస్యాన్ని చిలకరించటం గమనిస్తాం. అంతేకాదు సుదేష్ణ సైరంధ్రి సౌందర్యాన్ని చూచి ఆమె తన భర్తను వశం చేసికొంటుందేమోనని శంకించినప్పుడూ, కపట తృష్ణ అభినయించినప్పుడూ, బృహన్నలా సారథ్యాన్ని గురించి ఉత్తరుడు చిరుబురులాడినప్పుడూ, సుశర్మ శక్తికి మించిన ప్రగల్భాలాడినప్పుడూ, విరాటుడు ప్రతి సన్నివేశంలోనూ చేసే అత్యభినయాన్ని గమనించినప్పుడూ మనకు హాసం కలగటం సహజం. ఒక్కటి మాత్రం సత్యం. విరాటపర్వంలోని ప్రతిపాత్రా ఎక్కడో ఒకచోట, లేక కొన్నిచోట్ల మనలను నవ్విస్తుంది. పాత్రలు కూడా ఆయా సమయాలలో అనువుగా నవ్వుతాయి. తిక్కన అభినయంలో నవ్వుకే ఎక్కువ పంట. విరాటపర్వంలో నవ్వు రసాలను కవ్విస్తుందేకాని వాటిని నవ్వులపాలు చేయదు. నానారసాభ్యుదయోల్లాసానికి నవ్వొక దివ్యౌషధం!

(iii) వీరరసం: విరాటపర్వం వీరరస సమగ్రావతారం. మరొక మాటలో చెప్పాలంటే- నానావిధవీరరసాభ్యుదయోల్లాసమే విరాటపర్వం. "వీరోనామోత్తమ ప్రకృతి రుత్సాహాత్మకః సచాసంమోహాధ్యవసాయ నయవినయ బలపరాక్రమ శక్తి ప్రతాప ప్రభావాదిః విభావైః ఉత్పద్యతే. తస్య స్థైర్య ధైర్య శౌర్య త్యాగ వైశారద్యాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యమ్'' అని నాట్యశాస్త్రం (6,67), "శౌర్య ధైర్య వీర్య గర్వై రుత్సాహ పరాక్రమ ప్రభావైశ్చ । వాక్యై శ్చాక్షేపకృతై ర్వీరరసః సమ్యగభినేయః'' (68), "వీరస్యాపి చ యత్కర్మ సో-ద్భుతః పరికీర్తితః'' (42)- ఈ నిర్వచనాలు అక్షరాలా విరాటపర్వంలో నిరూపించబడతాయి.

విరాటపర్వంలో పాండవులు నాయకులు. వారు ఉత్తమ ప్రకృతులు. వారు మెచ్చి ఆశ్రయించిన విరాటుడు ఉత్తముడు. వారి నాశ్రయించుకొని ప్రవర్తిల్లిన ఉత్సాహం రసస్థాయికి చేరగలిగిన పతాక సన్నివేశాలు ఈ పర్వంలో ఉండటంతో ఇది వీరరసోల్లాసం. ఉత్సాహం ధర్మమూలమైనప్పుడు రసంగా అభ్యుదయాన్ని పొందుతుంది. వివిధ ప్రయోజనాల కొరకు దానిని వినియోగించుకొనటం వలన వీరరసభేదాలు ఏర్పడతాయి. వాటి ప్రకాశం చేత వీరరసోల్లాసం వ్యక్తమవుతుంది. విరాటపర్వంలో ఇటువంటి వీరరసాభ్యుదయోల్లాసం విచిత్రంగా అనుభవాని కందుతుంది.

వీరరసమంటే ధర్మవీరమే. అది వీరరసభేదాల కన్నింటికి మూలస్థానం. దయాదానయుద్ధాది వీరాలన్నీ ధర్మసమ్మతాలు కాకపోతే రసాలు కావు. రసాభాసా లౌతాయి. కాబట్టి వీరులందరూ ధర్మవీరాన్నే గౌరవిస్తారు. పాండవులందరూ ధర్మరాజుకు తలవంచుతారు. ధర్మజుడు అజ్ఞాతవాసవ్రత నిర్వహణోత్సాహంతో విరాటపర్వకథాకార్యాన్ని ఆరంభం నుండి నిర్వహణం వరకూ సాగించి ధర్మవీరు డనిపించుకొన్నాడు. ధర్మజుడి ధర్మవీరోత్సాహం భీమార్జునుల వీరోత్సాహాలవలె యుద్ధక్రీడలలో ఉజ్జ్వలంగా వెలువడకపోవచ్చును. కాని, వాటి నన్నింటిని ధర్మసూత్రంతో దర్శకుడివలె ఆడించే సూత్రధారుడు ధర్మరాజు. అతడే విరాటపర్వంలో నిజానికి వీరరస అభ్యుదయ మార్గప్రవర్తకుడు.

అజ్ఞాతవాసం ఎవరి వద్ద ఎట్లా నిర్వహించాలనే ప్రశ్నకు ధర్మరాజు నిర్ణయమే సముచిత సమాధానం:

ఆ. "నాకుఁ జూడ మత్స్యనరపతి సద్ధర్మ । వర్తి, సుజనహితుఁ, డవార్యబాహు
బలుఁడు గాన యతనిపాల నందఱుఁ దగ । వైన పనుల నిలుచు టభిమతంబు''. (విరా.1.64)

విరాటుడి కున్నవని చెప్పిన మూడు గుణాలూ పాండవులకు సహజంగా ఉన్నవే. అందువలన సజాతీయ గుణవరిష్ఠుడైన రాజు నెన్నుకొన్నారు. అతడి కొలువులో కూడా పాండవులు తగనైన పనులే చేపట్టారు. ఆ తరువాత విరాటుడి నిర్ణయాలపై ధర్మజుడి సద్ధర్మవర్తన ప్రభావం కనపడింది. కీచకాదులకు భయపడి తా నేమీ చేయలేకపోయినా రాజు సుజనహితాన్ని కోరి గంధర్వులు నిర్వహించిన పాత్రను సహించే శీలాన్ని సంపాదించుకొన్నాడు. విరాటుడికి సహజంగా బలం ఉండవచ్చును కాని దాన్ని అవార్యబలంగా మార్చింది ధర్మరాజాదులే. ధర్మరాజు మాట పాండవులకు రుజువైన బాట!

విరాటనగరం దృగ్గోచరం కాగానే తమ్ములను చూచి -

క. “చక్కని చిక్కని మేనులు । నిక్కోదండములునైన నెఱుఁగరె; మన మీ
చక్కటి నిలుతమె? శస్త్రము । లొక్కెడ దాఁచుటకు, వేషయోజనములకున్” (విరా.1.156)

అని హెచ్చరించింది ధర్మరాజే. వేషయోజనానికి ముందుగా నడిచి యమధర్మరాజును ధ్యానించిందీ ధర్మరాజే. ఆయనకు సన్న్యాసిరూపం వచ్చింది. వెంటనే అందరికీ అనుకొన్న రూపాలు ఏర్పడ్డాయి. ఇది భారత నాయక తత్త్వాన్ని వ్యంగ్యంగా ధ్వనింపజేసే దృశ్యం. కార్యారంభంలోనూ ఫలానుభవంలోనూ పాండవులైదుగురైనా ధర్మజుడిదే అగ్రస్థానం. అతడి సంకల్పమే అందరి సంకల్పం. ధర్మరాజుది ధర్మవీరం. అందరివీ దానికి అనుబంధవీరాలే. వారిని నియమించటం, నియంత్రించటం, నిర్వహించటం, ప్రేరేపించటం, రక్షించటం, ప్రోత్సహించటం, తనతో కలిపి నడుపుకొనటం అతడికి బాగా తెలుసు. అతడు అన్నింట అజాతశత్రువైన నాయకుడు.

ధర్మరాజు శమీవృక్ష శాఖకు ఆయుధాల మూటను వ్రేలగట్టి, ఆయుధాల అధిదైవతాలను ఉద్దేశించి ఇట్లా ప్రార్థించాడు. ఇది మూలంలో లేనిది.

క. “నరునకు నాకుం దక్కఁగ । నొరులకు మీరూపు సూపకున్నది విష వి
స్ఫురితభుజగభంగి భయం । కరమూర్తులు దాల్చి యుండఁగా వలయుఁ జుడీ!” (విరా.1.176)

అజ్ఞాతవాసంలో ఆయుధాలను ముట్టుకొనే అవకాశం తనకూ అర్జునుడికే ఉండాలని ఆశించటం స్వార్థం కాదు. అజ్ఞాతవ్రతధర్మం రక్షించవలసివస్తే శస్త్రాలు చేపట్టదగినవారు వారిరువురే అని ధర్మరాజు నిర్దేశం. తా నెట్లాగూ చేపట్టడు. పేడివాడైన బృహన్నల చేపట్టే అవకాశం లేదు. (అయినా ముందుగా అతడికే ఆ అవకాశం ఏర్పడింది.) అందువలన అజ్ఞాతవాసంలో స్వీయ శస్త్రాల అవసరం ఉండకపోవచ్చుననే భావం ఒకటి; భీముడికి గద ఉపయోగించే అవకాశం లేకుండా చేయటం మరొకటి. ఈ మాట లని భీముడికి సహనం అవసరమని బోధించటం వ్యంగ్యం. తమ్ముల స్వభావాలు తెలిసి, తాను నిర్వహించవలసిన పాత్రను గుర్తించి, వివేకంతో మాట్లాడటం నాయకుడైన ధర్మరాజుకే చెల్లింది. అత డన్నమాట వృథాకాకపోవటం అతడి మహిమకు చిహ్నం!

విరాటపర్వంలో ధర్మరాజు తా నెప్పుడూ భీముడిని తన అదుపులో ఉండేటట్లు చూచుకొనేవాడు. భీముడి ఉద్యోగం వంటశాలలో అయినా విరటుడి కొలువులో ఎప్పుడూ ఉండేటట్లు చూచేవాడు. మల్లయుద్ధాలకని పిలిపించి కనుసన్నలలో మసలేటట్లు జాగ్రత్తపడేవాడు. దక్షిణగోగ్రహణ యుద్ధంలో పాల్గొనటానికి బయటి కొలువులో తన చూపుమేరలో ఉండేటట్లు చూచుకొన్నాడు. యుద్ధంలో కూడా ధర్మరాజు సైగల కనుకూలంగా పోరి విరాటుడిని శత్రువుల నుండి విముక్తుడిని చేసేటట్లు చేశాడు. ఇన్ని జాగ్రత్తలు భీముడిపట్ల తీసికొన్నా ఒక్కొక్కసారి అతడు ఒడలు తెలియని రౌద్రావేశంతో ప్రమాదం తెచ్చిపెట్టేవాడు. అప్పుడు ధర్మరాజు అంకుశం వలె నిలిచి అతడిని అదుపులో పెట్టేవాడు. ధర్మరాజు సామాన్యంగా సైగలతోనే పని సాగిస్తాడు. శ్రుతి మించినప్పుడు మాటలు ప్రయోగిస్తాడు. అజ్ఞాతవాసంలో గూఢంగా, అన్యాపదేశంగా మాట్లాడటం అతడి నేర్పు.

కీచకుడు ద్రౌపదిని నేలపై పడలాగిన దృశ్యం చూచాడు భీముడు. ఆ దుష్టాత్ముని నియంత్రించలేక మొగం త్రిప్పుకొన్న విరాటుడిని చూచాడు. రౌద్రం పొంగివచ్చింది. ప్రక్కనున్న ఎత్తైన చెట్టును పెకలించి, విజృంభించి వారిరువురినీ సంహరిద్దామని సంభ్రమించాడు.. కాని, అనుమతి కొరకు ధర్మజుడివైపు చూచాడు. ఆయన గొప్ప అన్యాపదేశం పలికాడు:

మ. "వలలుం డెక్కడఁ జూచె నొండెడ నసేవ్యక్ష్మాజముల్ పుట్టవే?
ఫలితంబై వరశాఖ లొప్పఁగ ననల్పప్రీతి సంధించుచున్
విలసచ్ఛాయ నుపాశ్రిత ప్రతతికిన్ విశ్రాంతి గావింపఁగాఁ
గల యీ భూజము వంటకట్టియలకై ఖండింపఁగా నేటికిన్?" (విరా.2.136)

ఇది ప్రౌఢవాక్యం. (వివరాలకు వ్యాఖ్య చూడండి). ఇందులోని చెట్టు ఒక్కటే. భీముడు పీకదలచుకున్నదీ, ధర్మజుడు నిలుపదలచుకొన్నదీ కూడా ఒక్కటే. అది మత్స్యభూనాథుడు. మరి భీముడు ఒక్క చెట్టుతో ఇద్దరిని చంపదలచాడు. ధర్మజుడు అసేవ్యక్ష్మాజముల్ పుట్టవా? అని బహువచనంలో మొదట పలికాడు. అయినా అందులో ఒక భూజము ప్రీతిని సంధించేది కాబట్టి దానిని వాటితో కలిపి రూపుమాపవద్దు - అని ధ్వనింపజేశాడు. తాత్పర్యం తేలిందేమిటంటే - ఆసేవ్యక్ష్మాజములను (కీచకోపకీచకులను) చంపవలసిందే, విరాటుడిని మాత్రం కాదు. అందులోనూ అందరినీ ఒకసారి చంపటం వ్యూహం కాదు. పట్టపగలు అందరూ చూచే సభలో నీవే చంపుతున్నట్లుగా తెలిసేటట్లు, ఇంత రౌద్రోద్రేకంతో చంపగూడదు. తగిన సమయం ఇది కాదు.. అని హెచ్చరించాడు వ్యంగ్యంగా. ఆ తరువాత భీముడు ధర్మజుడితో కలవలేదు. అతడి ఆజ్ఞ తీసికొనలేదు. ద్రౌపదికి నిద్రపోతున్నట్లు కనబడ్డాడు. కాని లోలోన ఆలోచించాడు. ఆమె కోరికకు తగినట్లు వ్యూహం పన్నాడు. అప్పుడు ధర్మరాజు ప్రసక్తి వచ్చింది. సభలో భీముడిని వారించటంలోని అంతరార్థం ద్రౌపది చెప్పింది. భీముడు తల ఊపాడంతే! కాని, ధర్మజుడి అంతరాంతరాలను అంచనా వేసి అసేవ్యక్ష్మాజములైన వారిని ఖండించటానికి రహస్యవ్యూహం పన్నాడు. ధర్మజుడి గూఢవాక్యం భీముడికి భావిగూఢ మార్గ నిర్దేశకం! ఈ పద్యం అన్ని విధాలా పాండవులనూ ధర్మాన్నీ రక్షించింది.

విరాటుడి కొలువులో భీముడు ఉపశమించినా ద్రౌపది విజృంభించింది. ఆమె కోపంతో ఎదిరించి మాట్లాడటం మొదలు పెట్టేసరికి ధర్మరాజుకు గుండెదడ పుట్టింది. నెన్నుదురు చెమటతో నిండిపోయింది. రోషం పొడుచుకొని వచ్చింది. కాని నిగ్రహించుకొని, ఆమెను నిగ్రహించుకొనుమని హెచ్చరించాడు. (వి.2.148) ఆమె అధిక్షేపిస్తూ నిష్క్రమించింది. ధర్మరాజు నియంత్రణకు భార్యా, తమ్ములూ బుసలు కొడతారు. కాని, అతడి ధర్మశక్తిని చూచి తలొగ్గుతారు. భీమ ద్రౌపదుల రౌద్రోల్లాసం ధర్మజుడి ధర్మవీరంలో అంతర్లయించిపోయింది. కీచకవధానంతరం ధర్మరాజు కిమ్మనడు.ఎందుకని? ద్రౌపదీ భీములు సభలో కోపగించినా, ఆ తరువాత ధర్మరాజు హృదయాన్ని ఊహించి, దానికి అనువుగా వ్యూహాన్ని నిర్వహించారు. లేకపోతే, అది ధర్మవిరుద్ధమైతే, ధర్మజుడి బాటకు విపరీతమైతే, తానే యమధర్మరాజై ఉండేవాడు. తెర వెనుక సూత్రధారుడు ధర్మరాజు.

పాండవుల అజ్ఞాతవాసాన్ని భంగం చేయాలన్న వ్యూహంతో సుశర్మ దక్షిణ గోగ్రహణం చేశాడు. విరాటుడు తమ్ములతో కొడుకులతో పోరుకు సిద్ధమైనాడు. అతడు ఆశ్రితులైన కంకాదులను సహాయమడుగలేదు. కంకుడు వస్తానని ముందుకు వస్తే కాదనలేదు. వలల దామగ్రంథి తంత్రీపాలురను కూడా యుద్ధానికి పిలిపించుమని సలహా చెప్పగా విని, వెంటనే వారందరికీ రథాలిప్పించాడు. చివరకు విజయానికి కారకులైన కంకాదులను ప్రశంసించాడు. వారిలో పరమపూజ్యుడు ధర్మరాజు. అతడికి రాజ్యాన్ని అర్పించటానికి సిద్ధమయ్యాడు. కాని, అతడు విరటుడి సంతోషమే తన సంతోషమని చెప్పి అతడిని స్నేహంతో గౌరవించాడు. విరాటు డతని ప్రవర్తనకు ఆశ్చర్యపోయాడు.

క. "ఉపకారమొ, బంటుతనమొ। కృపయో, పెంపో, సమగ్రకీర్తి ప్రియమో
రిపుదుస్సహ మగు నీ రణ। నిపుణతకుం గారణంబు నెయ్యమొ యెఱుఁగన్" (విరా.3.228)

ఈ పద్యం ధర్మజుడి నీతికి నీరాజనం. విరాటుడిని రక్షించటంలో చూపిన యుద్ధనైపుణ్యానికి హేతు వేమిటి? అయిదు ప్రశ్నలు వేశాడు. అందులో దయ కేంద్రం. అంటే దయావీరం ముఖ్యం. మిగతావి దానికి పోషకమైన భావాలు. ధర్మజుడి దయావీరం అంతటితో ఆగలేదు. సుశర్మను సపరివారంగా వదలిపెట్టించటంలో మరింత ప్రకాశించింది. యుద్ధం చేసి వీరాన్ని ప్రకటించి శత్రువును బంధించిన భీమాదుల కంటె, దయామయుడై అతడికి క్షమాభిక్ష పెట్టించిన ధర్మజుడు ఘనుడు! యుద్ధ దయారసాలు ధర్మవీర పోషకాలై ఉల్లసిల్లటం ఈ ఘట్టంలోని విశేషం.

ఉత్తరగోగ్రహణ యుద్ధంలో ఉత్తరుడు విజయం సాధించాడన్న వార్త విని ధర్మజుడు చేసిన వ్యాఖ్యానం ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టగలిగిన అతడి విజ్ఞతకు తార్కాణం.

ఉ. "ఆహవకేళి వేడుక బృహన్నల చిత్తమునం దెలర్చినన్
సాహసవృత్తి నుత్తరుని సారథిగాఁ గొనిపోయి కౌరవ
వ్యూహము నోర్చి నీపసుల నొక్కఁడుఁ దక్కకయుండ సత్వరో
త్సాహతఁ దెచ్చెఁ గావలయుఁ; దప్పదు నాపలు; కట్ల చూడుమీ!" (విరా.5.257)

విరాటునకు విజ్ఞత నేర్పబోయి సారెల దెబ్బలు తిన్న సహనమూర్తి యుధిష్ఠిరుడు. విరాటుడు సారెలతో కొట్టాడని తెలిసిన అర్జునుడు మండిపడి అతడిని సంహరిస్తానని ఆవేశపడినప్పుడు ధర్మరాజు అతడిని శాంతింపజేశాడు. (5.313). మరునాడు-

చ. "చని ధర్మసుతుఁడు సింహా। సనమున భీమాదు లాత్మసముచితరుచిరా
సనముల సభాస్థలిం గయి। కొని పంచాగ్నులును బోలెఁ గూర్చున్నంతన్" (విరా.5.316)

విరాటపర్వంలో నాయకుడు ధర్మరాజనీ, మహాభారతంలో, కురుక్షేత్ర యుద్ధానంతరం మరల అతడే కురురాజ్య సార్వభౌముడనీ కవి ధ్వనింపజేశాడు. ఇందులో రససమన్వయం ధర్మరాజు కనుగుణంగానే సాగుతుంది.

ధర్మవీరం రసానాం రసః, ధర్మజుడు ఆ మూలరసానికి ప్రతీక. అతడు అయిదు ఆశ్వాసాలలోనూ ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ కీర్తింపబడతాడు. అది అందుకు సాక్ష్యం. భీమాదుల యుద్ధాలలో కానవచ్చే యుద్ధవీరాదులు దాని అభ్యుదయ వీచికలు. దుర్యోధనుడి దుష్టవ్యూహం వలన ప్రవర్తిల్లిన రౌద్రం ధర్మవీరానికి అంగం. ఇట్లా సాగే ఈ కథలో ధర్మజుడి ధర్మవీరం ఈ పర్వానికి మాత్రమే పరిమితమైనది కాదు. అది భారతేతిహాసం చివరిదాకా సాగే అంగిరసం. విరాటపర్వంలోని మూడు ప్రబంధ ఘట్టాలలో వెలుగొందే వివిధరసాలు ఆ మూలరసానికి ఉల్లాసాలు. కాబట్టి ప్రత్యేక ప్రతిపత్తితో కానవచ్చే విరాటపర్వంలో 'నానారసాభ్యుదయోల్లాసమే' అనుశీలించదగిందని తిక్కనగారి నిర్దేశం.

(iv) అద్భుతరసం : వీరకర్మయొక్క ఫలమే అద్భుతం. "వీరస్యాపి చ యత్కర్మ సో-ద్భుతః పరికీర్తితః" (నాట్య.6.42) అని భరతుడు. విస్మయం దీని స్థాయి భావం. అద్భుతం మానసికం, ఆంగికం, వాచికం- అని మూడు విధాలుగా శారదాతనయాదులు వింగడించారు. సామాన్యంగా ప్రధానపాత్రలు వీరకర్మలు చేస్తున్నప్పుడు ప్రక్కనున్న పాత్రలుకాని, చూపరులుకాని, ఆకాశంలో నిలిచి చూస్తున్న దేవతలు కాని వాటిని చూచి, ఆశ్చర్యపడినట్లు వర్ణించడం వీరరసజన్యమైన అద్భుత రసాన్ని చిత్రించటం. అద్భుతమైన దృశ్యాలనో దేవతామహిమలవంటివో చూచి, భావించి ప్రధాన పాత్రలు పొందే విస్మయ భావాతిశయం జనకరసమైన అద్భుతం.

విరాటపర్వంలో రెండు రకాలైన అద్భుతాలూ అభ్యుదయోల్లాస దశలను పొందినట్లు తిక్కన వర్ణించాడు. ఇందులో ప్రబంధాల వంటి మూడు సన్నివేశాలలోనూ అద్భుతం కలిగించినవాడే నాయకు డన్నట్లు తీర్పు చెప్పాడు. కీచకవధఘట్టంలో భీముడి పరాక్రమానికి అబ్బురపడిన ద్రౌపది అతడిని ఉత్తమ నాయకుడిగా కీర్తించింది.

సీ. "కొలువులోపల నిన్న కోప మట్లెత్తినఁ। దలఁకక నిలిచిన ధైర్యమహిమ,
నేఁ డిందుఁ జనుదెంచి నిర్వికారతఁ బ్రజ। కన్నులు గప్పిన గౌరవంబు,
మనవారిలోన నొక్కనినైనఁ బిల్వ కు। త్సాహంబు సేసిన సాహసంబు,
లోకదుర్జయుఁడగు నీ కీచకునిని వ్రే। ల్మిడి రూపుమాపిన కడిమిసొంపు

తే. సూడఁ, దలపోయ, మెచ్చ, సంస్తుతి యొనర్ప। నాతలంబె నీ యుత్తమనాయకత్వ
మెఱిఁగి నినుఁ గొనియాడ నే నెంతదాన?। మహిత విస్మయానంద నిర్మగ్ననైతి." (విరా.2.360)

ఇది ద్రౌపది చేసిన ప్రశంసయే కాదు. భీముడి వీరాద్భుతాకారాన్ని చూచి, తలపోసి, మెచ్చి, సంస్తుతి చేసి ఆమె పొందిన అభ్యుదయోల్లాస క్రమాన్ని ఆవిష్కరించిన అద్భుత రచన. ఈ పద్యం అమూలకం. (మరికొన్ని వివరాలకు విశేషవ్యాఖ్య చూడండి).

కీచకవధ ఘట్టంలో నాయకుడు భీముడని ప్రకటించడానికి నైతికమైన అర్హత ఉన్న వ్యక్తి ద్రౌపది. కీచకుడు తనను చూచి మోహించి అతడి ఇంటికి అక్కసాయంతో పిలిపించుకొని పొందాలని చేసిన ప్రయత్నాల నన్నింటిని చాకచక్యంతో, ధైర్యంతో, దైవబలంతో ఆమె ఎదుర్కొన్నది. సగం కథకు ఆమెయే నాయకురాలై ముందుకు నడిపించింది. కీచకవధ భీముడే చేయగలడు. అందువలన అతడి చేతిలో పెట్టింది. అతడు అద్భుతంగా దానిని నిర్వహించాడు. అంటే - ద్రౌపదే అద్భుతరసంలో మునిగేటట్లు నిర్వహించాడు. కీచకవధ తరువాత దానిని నలుగురికీ ఎలుగెత్తి చెప్పి తరువాత కథాగతికి కారకురాలైనదీ ద్రౌపదియే. ఉపకీచకు లందరినీ ఒక్కుమ్మడిగా చంపి, అద్భుతంమీద మరొక అత్యద్భుతాన్ని భీముడు సృష్టించాడు. కీచకుడిని చంపి భీముడు ద్రౌపది మానం రక్షించాడు. ఉపకీచకులను చంపి ఆమె ప్రాణం రక్షించాడు. 'మానము ప్రాణమున్ గొనుట'కు ఎవరైనా ప్రయత్నం చేస్తే భీమ పరాక్రమం ఎటువంటి ఫలితాన్ని పొందింపజేస్తుందో ప్రకటించాడు. అందుకే ద్రౌపది గూఢంగా భీముడిని గంధర్వపతిగా కీర్తించింది.

తే. "కీచకుల దెసఁ బుట్టిన కిల్బిషంబు । పాచి నన్ను రక్షించిన పరమధర్మ
రతికి, గంధర్వపతికి నిరంతరంబు । భక్తియుక్తిమైఁ బ్రణమిల్లి బ్రదుకుదాన." (విరా.3.40)

భీముడి వీరకార్యంలోని పరమధర్మరతిని ప్రశంసించింది. భీముడిలో ధీరోద్ధతుడిని కాక ధీరోదాత్తుడిని దర్శించింది. ఉత్తమ నాయకత్వ లక్షణాలను ఉల్లేఖించింది. దానికి తగ్గట్లు భీముడు 'నిగూఢవచన చాతుర్యధుర్యుఁడై' పలికిన పలుకులు పరమోదాత్తాలు.

చ. "అతివ యపాయముం బొరయునప్పుడు గావక తక్కొనేని నా
పతి పతియే తలంప? మగపాడియె? లోకము పాడియే? భవ
త్పతు లిటు లాచరించుట గదా భవదీయ మనోనువర్తన
స్థితి కుచితంబు; వారల నుతింపఁగ నేల నిసర్గవృత్తులన్?" (విరా.3.42)

ఉద్ధతుడైతే భార్య ప్రశంసలకు ఉబ్బితబ్బిబ్బయ్యేవాడు. కాని, భీముడు భార్యను రక్షించుకొనటం భర్తల ధర్మం. అది ఔచిత్యం; కాబట్టి దానిని ప్రత్యేకించి ప్రశంసించవలసిన అవసరం లేదన్నాడు. అంతేకాదు, తాను ఒక్కడే ఆ పని చేసినా 'భవత్పతులిటు లాచరించుట గదా' అని సమష్టి బాధ్యతగా పేర్కొనటం భీముడిలోని ఉదాత్త నాయక లక్షణం! కీచకుడిని చంపి ద్రౌపదీ రమణుడయ్యాడు, ఉపకీచకులను చంపి ద్రౌపదికి దేవుడయ్యాడు భీముడు. ద్రౌపది పాత్ర ప్రకటించిన అద్భుతం ప్రధానంగా మానసికం. పతితల హృదయాలకు సన్నిహితం!

కార్యనిర్వహణంలో (నిర్వహణ సంధిలో) అద్భుతం ప్రదర్శితం కావాలని లాక్షణికమతం. తిక్కన విరాటపర్వంలో అట్టి అద్భుతరస వికాసోల్లాసాన్ని ప్రస్ఫుటంగా ప్రదర్శించాడు. కీచకవధవలన విరాటనగరంలో భయంతో కూడిన అద్భుతం ప్రజల హృదయాలలో ప్రకాశించింది. అది కార్యనిర్వహణకు నిండుదనం కల్పించింది. అట్లాగే దక్షిణగోగ్రహణ ఘట్టంలో పాండవ పరాక్రమానికి విరాటుడు పొందే అద్భుతం నీరాజనా లిచ్చింది. ఉత్తరగోగ్రహణ ఘట్టంలో ఉత్తరుడు ప్రదర్శించిన ఆశ్చర్య భావోల్లాసం అర్జునుడి అపూర్వ యుద్ధ వీరంనుండి పుట్టిన విలాసం వలె వింత గొలిపింది. అర్జునుడి ప్రతాప ప్రదర్శనాన్ని అపూర్వంగా దర్శించాలని వచ్చి ఆకాశమార్గంలో నిలిచి ప్రశంసించిన దేవతాసమూహం అద్భుత రసానికి అభివ్యక్తిశక్తిగా అమరింది. దక్షిణగోగ్రహణ ఘట్టంలో నిర్వహణంలో అద్భుతాన్నీ, ఉత్తరగోగ్రహణంలో నిరంతరం సాగిన అద్భుతరసాన్నీ చిత్రించి తిక్కన సన్నివేశోచిత రసప్రయోగ నైపుణ్యాన్ని ప్రదర్శించాడు.

దక్షిణ గోగ్రహణ ఘట్టంలో యుద్ధమంతా ఒక యెత్తు, చివరకు భీముడు సుశర్మను బంధించటం ఒక్కటీ ఒక యెత్తు. ఆ నిర్వహణమే అద్భుత విజయపతాకగా నిలిచింది.

ఉ. "మంటయుఁ బోని శాత్రవసమాజము నించుకయేని శంక లే
కంటఁగఁ దాఁకి వెండి తెగటార్చె మహాద్భుతశక్తిశాలి యీ
వంటలవాని చేసిన యవార్య పరాక్రమ మొండు చోటులం
గంటిమె వింటిమే? యితఁడ కాఁడె వెసన్ గెలిపించె నన్ననిన్." (విరా.3.229)

విరాటుడిచేత మహాద్భుత శక్తిశాలిగా భీముడిని ప్రశంసింపజేసింది. అతడు పొందిన అద్భుతం కూడా ప్రధానంగా మానసికం.

అర్జునుడు యుద్ధం ఆరంభించినప్పటినుండి అడుగడుగునా అద్భుత ప్రశంసలే. ఉత్తరుడు, భీష్ముడు, ద్రోణుడు, అశ్వత్థామ మొదలైనవారు రణరంగంలోనూ, దేవతలు ఆకాశరంగంలోనూ అద్భుతాన్ని వైవిధ్యంతో దర్శించారు. ఆ రసాభ్యుదయోల్లాసాన్ని ఆవిష్కరించారు. ఆ చిత్రణలో మానసిక, ఆంగిక, వాచికాలను ముప్పేటగా విస్తరింపజేశాడు తిక్కన. ఉత్తరుడూ, విరాటుడూ ఆంగికమైన అద్భుతంతో వాచికాద్భుతాన్ని ప్రకాశింపచేశారు. ధర్మరాజాదులు మానసికమైన అద్భుతాన్ని వాచికంగా వెలువరించారు. దేవతలు వాచికమైన అద్భుతాన్నే ప్రదర్శించారు. ఈ విధంగా అద్భుతం అన్ని రకాలుగా అద్భుతంగా ఆవిష్కృతమైనది.

ఉత్తరగోగ్రహణ ఘట్టంలో అర్జున నాయకత్వాన్ని ధర్మజుడు గూఢార్థ ప్రధానంగా సమర్థించాడు. ఉత్తరుడు లక్ష్యార్థ ప్రధానంగా ప్రదర్శించాడు. కురువీరులు, దేవతలు, విరాటుడు వ్యంగ్యార్థ వాచ్యార్థ ప్రధానంగా వ్యక్తం చేశారు. అభివ్యక్తిలో వైవిధ్యం తోస్తుంది. చివరకు విరాటుడి కృతజ్ఞతోక్తి అర్జున యుద్ధవీరానికి అక్షరనీరాజనంగా (విరా.5,346) నిలిచింది.

(v) రౌద్రరసం : క్రోధస్థాయిభావాత్మకం రౌద్రం. విరాటపర్వంలో రౌద్రరసాభ్యుదయమూర్తిగా చెప్పుకొనదగిన ఉత్తమ వీరుడు భీముడు. రౌద్రరసాభాసానికి ఉదాహరణం దుర్యోధనుడు. అయితే అజ్ఞాతవాసంలో ఉన్న భీముడిలోని రౌద్రం లోకానికి ప్రకటితం కాదు. ధర్మనియతి చేత నియంత్రితమౌతుంది. అందువలన భీముడి రౌద్రం వీరానికి అంగమైపోయింది. కాని, తిక్కన భీమరౌద్ర ప్రవృత్తిని అద్భుతంగా చిత్రించాడు. రౌద్రం ఆంగికమనీ, నైపథ్యమనీ, వాచికమనీ మూడు విధాలు. అందులో భీముడి యందు ఆంగికమైన రౌద్రాన్ని అధికంగా చిత్రించి మిగిలిన రెండింటిని దానికి పోషకంగా తిక్కన నిలిపాడు. నిజానికి విరాటపర్వంలో భీముడికి మాటలు తక్కువ, అభినయం ఎక్కువ. అభినయాన్ని ఆచరణగా అనువదించటం అన్నింటికంటె ఎక్కువ. భీముడి రౌద్రాన్ని వర్ణించిన తిక్కనపద్యాలు ఆణిముత్యాలు. 'భీముడు ధీరోదాత్తుడు కాడు; కీచకుడిని వంచనతో చంపాడు కదా!' అని అనుమానించవచ్చును. అతడు అజ్ఞాతవాస వ్రతధర్మరక్షణ కొరకు గత్యంతరం లేని ఉపాయంగా వంచనకు పాల్పడవలసి వచ్చింది. అది ధర్మరాజుకు సమ్మతంగా సాగింది కాబట్టి ఔద్ధత్యం ఔదాత్త్యానికి అంగమైపోయింది. కీచకుడు ఉద్ధతుడే. అధర్మమని తెలిసి గర్వోద్ధతితో సైరంధ్రిని వలచి విరహంలో పడ్డాడు. శృంగారనాయకుడైపోయాడు. అతడి రత్యుత్సాహంలో రౌద్రం నామమాత్రంగా నిలిచింది.

ప్రతినాయకుడైన దుర్యోధనుడు ఉద్ధతుడైన రౌద్రరసమూర్తి. ఉదాత్తులు ధర్మసాధకులు; ఉద్ధతులు అర్థసాధకులు. ఉద్ధతులు ఉదాత్తులు కారు. వారు మాయాపరులు, ప్రచండులు, చపలులు, అహంకార దర్పభూయిష్ఠులు, ఆత్మశ్లాఘానిరతులు. దుష్టచతుష్టయంలో ఈ లక్షణాలు సమగ్రంగా ఉన్నవాడు దుర్యోధనుడు. అతడి తమ్ముడు దుశ్శాసనుడు అతడి నీడ. అతడి మామ అతడికి అన్నింట తగినవాడు. కాగా, అతడికి మిత్రుడై, మిత్రుడి కొరకై ఒక్కొక్కసారి ఔదాత్త్యాన్ని ఔద్ధత్యం కొరకు బలిపెట్టుకొనే కర్ణుడు ఉద్ధతప్రాయుడయ్యాడు. అర్థసాధనం ధర్మసమ్మతమైతే రౌద్రం రసాభ్యుదయాన్ని సాధిస్తుంది. అధర్మబద్ధమైతే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అది ఆభాసంగా పరిణమిస్తుంది. ఉత్తరగోగ్రహణంలో దుర్యోధనుడూ, తన మిత్రులూ, అనుజులూ కలిసి, రౌద్రరసాభాసానికి ప్రతినిధులుగా నిలిచారు. గురుజనులైన ఆచార్య పితృభ్రాతృముని సురగణాలపై కోపించటం వలన రౌద్రరసాభాసం కలుగుతుంది. దీనికి పెట్టింది పేరు దుర్యోధనుడు. అతడికి వంతపాడేవాడు కర్ణుడు. ఇద్దరూ ఉత్తర గోగ్రహణ యుద్ధంలో శృంగభంగానికి గురిఅయ్యారు.

దుర్యోధనుడు వీరుడైనా పాండవుల అజ్ఞాతవాసాన్ని భగ్నం చేయటానికే యుద్ధాన్ని తలపెట్టాడు. దానిని ధార్మికులు గర్హించారు. అర్జునుడు అజ్ఞాతవాసవ్రతం భగ్నం చేశాడని నిరూపించటానికి ధర్మజుడినే అడిగి తెలిసికొని దుర్యోధనుడు తన చపలత్వాన్ని ప్రదర్శించాడు. పితామహుడు హితైషియై-

ఉ. "వచ్చినవాఁడు ఫల్గునుఁ; డవశ్యము గెల్తు మనంగ రాదు; రా
లచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వనేర్చునే?
హెచ్చుగుఁ గుందగుం, దొడరు టెల్లవిధంబుల కోర్చు; టట్లుగా
కిచ్చఁ దలంచి యొక్కమెయి నిత్తఱిఁ బొందగుచేఁతయుం దగున్" (విరా.4.234)

అని మంచిమాట చెపితే తిరస్కరించి నిర్లక్ష్యపు చిరునవ్వుతో ఇట్లా అన్నాడు :

ఆ. "మనకుఁ బాండురాజతనయవర్గమునకు । నెట్లు పొందు గలుగు? నేను రాజ్య
భాగ మీను; సమరభంగిక విక్రమ । నిరతిఁ బూను టిదియ నిశ్చయంబు" (విరా.4.236)

అని మూర్ఖంగా మాట్లాడాడు. అహంకార దర్ప భూయిష్ఠు డనిపించుకొన్నాడు. ఈ మాటలు ఉద్యోగపర్వంలో చర్చనీయాంశాలౌతాయి. (3,84-88). తిక్కన తన పద్యాలనే మరల వాడుకొన్న విలువైన మాటలివి. కురుక్షేత్రయుద్ధానికి కూకటి వేళ్ళివి.

నాయకపక్ష రౌద్రం వీరానికి ప్రత్యక్షంగా అంగం కావటం, ప్రతినాయకపక్ష రౌద్రం ఆభాసమై నాయకపక్షవీరానికి పరోక్షంగా పోషకం కావటం. విరాటపర్వ రౌద్రరసోల్లాసం.

(vi) కరుణ రసం : రౌద్రకర్మ వలన కరుణం పుట్టుతుంది. భీముడు కీచకుడిని చంపటంవలన ఉపకీచకులు దుఃఖించారు. వారిలో కరుణం ప్రతీకారరూపమైన రౌద్రాన్ని సృష్టించింది. దానిని భీముడు మరల రౌద్రచర్యతో రూపుమాపాడు. తత్ఫలితంగా సుదేష్ణావిరటులకు శోకం కలిగింది. ఆ కరుణం గంధర్వ పరాక్రమ భయంతో ప్రతిచర్యకు పూనుకొనకుండానే సమసిపోయింది. తన రౌద్రకర్మవలన పాండవులు శోకసముద్రంలో మునగాలని దుర్యోధనుడి తలంపు.

తే. "సమయ సముచిత కృత్యంబు చక్కఁజేసి । పాండవులు రాజ్యమున కాసపడకమున్న
యరసి యెఱిఁగి యరణ్యంబునందుఁ దొంటి । యట్ల యిడుమలఁ గుడువఁబో నడుపవలయు".
(విరా.3.91)

ఇది క్రోధమూలమైన సంకల్పం. శత్రువులకు శోకం కలిగించాలని యత్నించినవాడు తన ప్రయత్నంలో విఫలుడైతే తన కొరవితో తానే తలగోకికొన్నట్లు స్వీయరౌద్ర కర్మఫలాన్ని తానే అనుభవించవలసి వస్తుంది. అప్పుడు వారి కరుణరసం ఎదుటివారిలో సహానుభూతిని సృష్టించకపోగా వికటించి, ఆభాసమై, నవ్వుల పాలౌతుంది. ఈ రసోల్లాసం దుర్యోధనుడు ప్రదర్శించాడు. తన దుఃఖాన్ని తానే కొనితెచ్చుకొన్నాడు. అతడి మిత్రుడైన కర్ణుడి పనీ, ఇతడికి ప్రతినిధి సుశర్మ పనీ అంతే అయింది. అట్లా అయినందుకు పఠితలు ఆహ్లాదిస్తారు కూడా! విరాటపర్వంలో పాండవ శత్రువులు కార్చే కన్నీరు పఠితలలో కన్నీరు పెట్టించదు. అది కరుణరసాభాస శిల్పం!

(vii) భయానక బీభత్సరసాలు : భయం స్థాయి భావంగా కలిగింది భయానకం. ఇది ఉత్తములలో ఉండదు. అందువలన మధ్యమాదులలో చిత్రిస్తారు. విరాటపర్వంలో భయానికి మారుపేరు ఉత్తరుడు. ఆ తరువాత అతడి తండ్రి విరాటుడు. ఆ తరువాత సుదేష్ణ. ఈ ముఖ్యపాత్రలే కాక భయానికి గురి అయ్యేవారు ప్రజలు, కౌరవసేనలోని సైనికులు. రౌద్రరూపంలో భీముడిని చూచి ఉపకీచకులు భయపడ్డారు. (వి.రా.3.28.29); గంధర్వులచేత కీచకులను చంపించిన సైరంధ్రిని చూచి ప్రజలు భయపడ్డారు. (విరా.3.37.38) అర్జునుడి ప్రతాపాన్ని చూచి కురుసైనికులు భయపడ్డారు. వారివారి ప్రవృత్తులను బట్టి వారు భయానక రసాన్ని ప్రదర్శించారు. అనుభవించారు. భయానకాన్ని కూడా ఆంగికం, వాచికం, మానసికం, సాత్త్వికం అని విశ్లేషించి వివేచించవచ్చును. వాటికి విరాటపర్వంలో విలువైన పద్యాలు రచించాడు తిక్కన. సందర్భోచితంగా వాటిని గుర్తించటం సులభం.

భయానక పోషణంలో భయకారకాలైన విభావాలను భయంకరంగా సృష్టించటం, వాటిని చూచి భయపడుతున్న విభావాలను సహజంగా చిత్రించటం ముఖ్యపాత్ర నిర్వహిస్తాయి. ఒక్కొక్కసారి పఠితలకే ప్రత్యక్షంగా భయం కలిగించే దృశ్యాలను వర్ణించటం మరొక విశేషం. మొదటి రెండూ రసాభ్యుదయ ప్రక్రియలు. మూడవది రసోల్లాస ప్రక్రియ. తిక్కన ఈ మూడు శాఖలలో ఆంధ్రావళి మోదపడే గొప్ప పద్య రచన చేశాడు. ఎట్లాగంటే, ప్రత్యక్షంగా పఠితలకు భయానక బీభత్సరసాలను అందిస్తున్నప్పుడు వాటిని రామణీయకంతో మిశ్రమం చేస్తాడు. అంటే భయాన్నీ బీభత్సాన్నీ కలిగించే సన్నివేశాలలోని వస్తువులను ఆహ్లాదకరమైన ఉపమానాలలో పోల్చి చెప్పి, ఆ రసాస్వాదనం వలన ఒక 'సౌఖ్యరసాన్ని' పఠితలకు సమకూరుస్తాడు. ఇది తిక్కన రచనలో అసాధారణమైన సాధారణాంశం.

1. శమీవృక్షవర్ణనం (1.162); ఆ వృక్షం జాతభీతి పరిసరవర్తిగా భయంకరంగా ఉన్నా చక్రవర్తివలె గంభీరంగా ఉన్నదని చేసిన వర్ణనం అమూలకం, అద్భుతం. (వివరాలకు వ్యాఖ్య చూడండి).

2. చీకట్లో తోచే నర్తనశాల వర్ణనం (2.327); అందమైన భవనం అంధకారంలో భయంకరంగా ఉన్నట్లు భ్రాంతి కలిగించటం ఇందులోని శిల్పం. భయానక విభావమైన ఆ భవనంలో భీముడు నిర్భయంగా వెళ్లటం అక్కడి సందర్భం.

3. కురుసైన్య వర్ణనం (4.50.52); 'భీష్మద్రోణకృపాది ధన్వి నికరాభీలంబైన' కౌరవసైన్యం నడుస్తుంటే రేగిన దుమ్ము ఉత్తరుడికి భయంకరంగా గోచరించినా అది లలితవనలాలిత్యాన్ని ప్రదర్శిస్తున్నట్లు వర్ణించటం విశేషం. సైన్యాన్ని ఉత్తరుడు వర్ణిస్తూనే అతడు దానివలన పొందిన భయాన్ని ఆవిష్కరిస్తాడు. అది భయానక రసాభ్యుదయ చిత్రణం.

4. భయకంపితమైన ప్రకృతి వర్ణనం (4.172): అర్జును డూదిన దేవదత్త శంఖనాదానికి కంపించిన ప్రకృతిని అలంకారసుందరంగా వర్ణించి ఆస్వాదనీయం చేయటం ఇందులోని విశేషం.

5. అర్జునుడి భయంకర విజృంభణం (4.243) అలంకారబంధురం.

6. క్షతగాత్రులైన సైనికులను భీకర రమణీయంగా వర్ణించటం (5.38).

శా. "శక్తిస్ఫార ధనంజయాయత భుజాసంరంభ గాండీవ ని
ర్ముక్త క్రూర శరావలీ దళిత శత్రువ్రాతముల్ శోణితా
సిక్తాకారతఁ బొంది సాంద్ర కుసుమశ్రేణీ వికాసోల్లస
ద్రక్తాశోక తరువ్రజంబుల క్రియన్ రంజిల్లి యొప్పెం గడున్". (విరా.5.38)

ఈ విధమైన వర్ణనం భయానక బీభత్స విభావాలను రమణీయంగా పఠితలకు ప్రదర్శించి ఆస్వాదయోగ్యత కలిగించే తిక్కన శిల్ప ముద్ర.

బీభత్స భయానకరసాలు జన్యజనకరసాలు. ఈ రెండింటిని మిశ్రమం చేసి పఠితలకు అలంకారసుందరంగా అందించటం

తిక్కనగారికి ఇష్టం. విరాటపర్వంలో అర్జునుడు భయంకర సంకులసమరంలో కౌరవసైన్యాన్ని తురుమాడినప్పుడు రణక్షేత్రం 'అభిరామంబయ్యును ఘోరప్రకారం బయ్యె'నని (విరా.5.60) చేసిన తిక్కన వర్ణన ఈ శిల్పానికి కలికితురాయి. భయానక బీభత్సాలు కూడా రసానందం కలిగించేటట్లు చేసే రమణీయ శిల్పం తిక్కన సొత్తు.

(viii) శాంతరసం : తిక్కన శాంతరసాన్ని అవతారికలో, ఆశ్వాసారంభాంత పద్యాలలో హరిహరనాథస్వామిని వర్ణించిన పట్టులలో పోషించాడు. కావ్యవర్ణనాంశాలలోని నానారసాభ్యుదయోల్లాసాలన్నీ స్వామికి అంకితమౌతున్న అనుభూతినీ, చివరకు ఆనందముద్రతో ఆనందాన్నీ తిక్కన తనతోపాటు పఠితలకూ అందించాడు.

(2) పరుష లలిత రస సంయోజనం: విరాటపర్వం హృదయాహ్లాదంగా ఉండటానికి మరొక కారణం పరుష రసాల నడుమ లలిత రసాలను పొదగటం. నన్నయ పర్వ సంగ్రహంలో పేర్కొన్నట్లు విరాటపర్వం సభారంజనం, సర్వమనోజ్ఞం కావటానికి (ఆది.1.42) పరుష లలిత రస సంయోజనమే కారణం.

పాండవులు విరాటుడి కొలువులో ప్రవేశించే ఘట్టంలో సైరంధ్రి సౌందర్యలావణ్య వర్ణనం పరుష రసాల మధ్య మాధుర్యాన్ని కల్పించింది. సైరంధ్రి రూపమాధుర్యాన్ని 'ఆపాదమస్తకము తద్రూపము వీక్షించుచుం గుతూహల మడరన్' (విరా.1.311) మాట్లాడిందట సుదేష్ణ! అటువంటి కుతూహలం ఆడవారికే కలిగితే ఇక కీచకుడి మాట చెప్పాలా? మూలంలోవలె కాక తిక్కన పాండవులందరూ ప్రవేశించిన తరువాత సైరంధ్రి రూపమాధుర్యాన్ని ప్రవేశపెట్టడం సముచితం. అది తరువాతి కథకు చక్కని పూర్వరంగం.

ద్వితీయాశ్వాసంలో మొదటా చివరా మల్లయుద్ధాలు. అవి పరుషరసాలు. మధ్యలో విరహ మాధుర్యం, రూపవిలాస విభ్రమం. ద్రౌపది సౌందర్యభావనం కథను రమణీయ మధురంగా మార్చాయి. రౌద్ర భయానకాదులూ, కరుణ హాస్యాదులూ ఆ శృంగార లాలిత్యానికి దాసోహమంటాయి. భీముడి రౌద్రోద్రేకంతో దీటుగా కీచకుడి విరహతాపం వర్ణింపబడటంచేత పరుషలాలిత్యాలు చెరిసగంగా కలిసి చెలిమి చేసి ఆంధ్రావళికి ఆహ్లాదం కలిగిస్తాయి.

ఉద్ధత రసాల మధ్య ఉపకీచకుల అసమర్థ అనౌచిత్య కార్యకలాపం హాస్యాన్ని పుట్టిస్తుంది. దక్షిణగోగ్రహణంలో సుశర్మ యుద్ధాట్టహాసం హాస్యాస్పదంగా మారుతుంది. ఉద్ధత రసాల నడుమ ఆభాసాలు ఆహ్లాదదాయకాలవుతాయి.

ఉత్తర గోగ్రహణంలో వీర రౌద్రరసాలకు విరుద్ధమైన ఉత్తర కుమారుడి హాస్యం రసాభాసానికి దారితీయకుండా రసాభ్యుదయానికి దోహదం చేయటం అపూర్వం. ఆ రసలాలిత్యం ఉత్తరగోగ్రహణ యుద్ధ రసాస్వాదన రసిక ద్వారం. ఉత్తరుడు సహృదయ స్థానీయుడై అర్జునుడి అద్భుత యుద్ధవీరాన్ని సమయోచితంగా అనుభవిస్తూ వ్యాఖ్యానిస్తాడు. ఉత్తరగోగ్రహణ యుద్ధంలో ఉత్తరుడు హృదయాహ్లాద మార్గదర్శి. ఆ యుద్ధ రథసారథి, యుద్ధానంతరం కథాసారథి. అర్జునుడు పరుషరసాల ప్రవర్తకుడైతే, ఉత్తరుడు లలితరసాల అనువర్తకుడు. ఉత్తరుడు లేకపోతే ఉత్తరగోగ్రహణ యుద్ధంలో లాలిత్యం లేదు. ఆత్మీయత లేదు.

చివరకు విరాటపర్వానికే ఒక అపూర్వ మాధుర్యాన్ని ప్రసాదించిన రమణీయదృశ్యం ఉత్తరాభిమన్యుల వివాహం. 'కుంతీనందను ల ట్లత్యంత విభవ మెసఁగఁ బరిణయము సేసి సుహృత్ సంతోషోజ్జ్వలురై' (విరా.5.404) నారని కథ ముగించాడు తిక్కన. ఆ సుహృత్తులలో సహృదయులు కూడా దాగి ఉన్నారు.

'బుధసంతోషంబు నిండారఁగన్' రచించబూనిన తిక్కన విరాటపర్వాన్ని 'సుహృత్ సంతోషోజ్జ్వలంగా' చెప్పి, మాట నిలబెట్టుకొన్నాడు. హృదయాహ్లాదాన్ని కలిగించాడు.

19. తిక్కన శిల్పపు తెనుగు తోట

"ఈనిన ఆలమందగతి, ఇంపు లిగిర్చి ఫలించినట్టి యు
ద్యానము పోల్కి, సస్యరమ యాడెడి వేదికఁబోలు నీ తెలం

గాణమునం దనంత సుముఖస్వరజీవనమైన శబ్దసం
తానము నేలె తిక్కనవిధాత తెనుంగుల జాతు లేర్పడన్'' -రాయప్రోలు సుబ్బారావు (తెనుగు మాన్యము)

తిక్కన తెలుగుదనానికి కల్పించిన పలుకు సొగసంతా జిలుగునుడికారంతో జీవిస్తుంది. దానిని కీర్తించని కవి లేడు. విమర్శకుడు లేడు. 'తిక్కన శిల్పపుఁదెనుఁగుతోఁట' (రామాయణ కల్పవృక్షం) అని విశ్వనాథవారంటే, రాయప్రోలువారు 'తెనుంగుల జాతులేర్పడన్ తిక్కనవిధాత శబ్దసంతానాన్ని ఏలా' డన్నారు. వీరిద్దరివీ కవితామయమైన సమీక్షలు. కాగా, పింగళి లక్ష్మీకాంతంగారు తిక్కన భాషాప్రయోగ శక్తిని ప్రామాణికంగా వివేచించారు.

"కావ్యరచనకు యోగ్యమైన ఆంధ్రభాష లేని రోజులలో శిష్టమైన భాషను నిర్మించుకొని కావ్యరచనను నిర్వహించిన సిద్ధసంకల్పుడు నన్నయ. ఆయన చేతిలో తత్సమ శబ్దజాలమువలె శుద్ధాంధ్రము పెంపొందలేదు. అచ్చతెనుఁగున కా గౌరవము తెచ్చినవాడు తిక్కన. ఒక భాషయొక్క శక్తియు, సంపన్నతయు అది వ్యక్తము చేయు భావములయు, నర్థములయు గంభీరతను బట్టి తెలియవచ్చును. అచ్చ తెనుఁగు భాష సూక్ష్మాతిసూక్ష్మములైన మనోభావములను వ్యక్తము చేయుటయందును, అతి గంభీరములైన శాస్త్రపరమార్థములను నిష్కర్షగా వివరించుటయందును కూడ సమర్థమే యని తన ప్రయోగములచే లోకములకు చూపినవాడు తిక్కన. అట్టి యీ భాషయంతయు ఆయన సృష్టించుకొన్నదే. ఆ భాషాసృష్టిలో కొంతవరకు నాటి వాడుకపదముల సహాయము చాల కలదు. ఆయన వాక్యములు వ్యాకరణ లక్షణానుసారముగానే ఉన్నను, భాషయంతయు వ్యావహారిక భాష. అందును నెల్లూరు మాండలిక పద ప్రయోగములు అమితముగా కలవు. (ఆ మండలములో 'పనిలేదు, పలుకకుండుము' అను మాటలు ఇతర ప్రాంతములలో 'అక్కరలేదు, ఊరకుండుము' అని వాడుదురు. అట్లే వచ్చిన దానికి, పోయిన దానికి' అనునవి 'వచ్చుటకు, పోవుటకు' అను భావార్థమున ఉపయోగింతురు. ప్రశ్నార్థకమున 'ఎట్ల!, అనుట ఇంకొక మాండలికము. 'నీవు రావా ఎట్ల?' అనిన 'నీవు రావా ఏమి?' అని అర్థము. ఇట్టి ప్రయోగములు (తిక్కన) భారతమున తండోపతండములుగా నున్నవి. వ్యావహారిక భాషాపదములకే శుద్ధరూపమును కొత్త ప్రాణము నిచ్చి ఆయన భారతము రచించెను.'' (ఆంధ్ర సాహిత్య చరిత్ర పు. 236).

చ. "ఇది కడుముద్దరాలు; పను లేమియుఁ జేయఁగ నేర; దెంతయున్
మృదు; వొక కీడుపాటునకు మేకొనఁజాల; దుదాత్తచిత్త; యొం
టి దిరుగుదాని కోర్వ; దొకటిం దనుఁ దా సవరించు చొప్పెఱుం
గదు; తగ నొడ్లనుం గొలువఁగా వెర వెమ్మెయిఁ గల్గ నక్కటా!'' (విరా.1.103)

తిక్కన తెలుగుదనాని కీపద్యం 'మచ్చుతునక. మృదువు, ఉదాత్తచిత్త, అనే తత్సమ పదాలు తప్ప మిగిలినవన్నీ అచ్చ తెలుగులే. వీటిలో కొన్ని తెలుగు జాతీయాలుగా వాడుకలో నిలిచిన తెలుగు జాతులే. అయితే, వాడిన తత్సమ పదాలకు బదులు అచ్చ తెలుగుపదాలు వాడితే ఉద్దిష్టభావం ఒద్దికగా కలుగకపోవచ్చును. 'తిరుగుదాని కోర్వదు' అన్నది నెల్లూరి మాండలికం. ఇందులో మాధుర్యం (పృథక్పదత్వం + ఉక్తివైచిత్ర్యం), సౌకుమార్యం (అపారుష్యం + సుకుమారంగా చెప్పటం) అనే శబ్దార్థగుణాల సంయోజనంతో పుట్టిన పాంచాలీరీతి ప్రకాశిస్తున్నది. పాంచాలిని పాంచాలీరీతిలో పరిచయం చేయటం తిక్కన శిల్పం. తేనెవంటి తెలుగు మాటలు పూనినట్లు చెప్పటం తెనుగుతోట.

పైపద్యంలో ధర్మరాజు అనురాగవతి, సుకుమార అయిన భార్యను గురించి పలికాడు కాబట్టి సౌకుమార్యం కొరకు తెలుగు పదాలు వాడాడనుకొన్నా, యుద్ధంలో అర్జునుడు బద్ధశత్రువైన కర్ణుడితో పలికేటప్పుడు కూడా అచ్చతెలుగులో అధిక్షేపించాడు.

క. 'మాటలు పెక్కాడితి వీ। పోటు మగలు వినఁగ నింకఁ బోవుట దగ దె
ప్పాట; నదిగాక తమ్ముని। పాటును గన్నారఁ గంటి; పాఱకు మింకన్'. (విరా.5.89)

ఇందులో ఒక్క తత్సమపదం కూడా లేదు. కాని దీప్తరసత్వం కలిగిన కాంతి అనే అర్థగుణం ఉన్నది. అది అధిక్షేపోక్తికి పోషకం.

తిక్కన అచ్చ తెనుగులోనే కవిత్వమంతా వ్రాయలేదు. అచ్చ తెనుగును అంత విరివిగా కావ్యస్పృహతో వాడింది ఆయనే అని తాత్పర్యం. వీలైనంతవరకు సంస్కృత భారతానికి తెలుగుదనంతో కూడిన క్రొత్త జీవితాన్ని ఆయన ఇచ్చాడు. పునస్సృష్టి చేశాడు. "సంస్కృతమూలంలో భావం ఉంది. అది తెలుగువారి అనుభూతికి రావాలి. ఆ శ్లోకాలకు తాత్పర్యం చెబితే సరిపడదు. ఆ మూలం ఉత్తేజం ఇవ్వగా తెలుగులో ఒక రసాయన చర్య జరగాలి (Alchemy). అప్పు డది కళగా రూపొందుతుంది" అన్నారు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు. (ఆరు యుగాల ఆంధ్రకవిత - పు.108)

కీచకుడు ద్రౌపదిని మోహపారవశ్యంతో ఎన్నో విధాల ప్రశంసించాడు, ప్రార్థించాడు, అనునయించాడు, ప్రాధేయపడ్డాడు. మూలంలోని మాటలు ముచ్చటైన మెచ్చుకోళ్లు. తెలుగులో అవి సాలంకార సరసోక్తులు. మచ్చు కొక్కటి.

"ఏవం రూపా మయా నారీ కాచి దన్యా మహీతలే
న దృష్టపూర్వా సుశ్రోణి యాదృశీ త్వ మనిందితే" (సం.అనువాదం.4.14.15)

డాక్టర్ శలాక రఘునాథశర్మగారు పేర్కొన్న పై మూల శ్లోకంలోని రూపా, సుశ్రోణి - అనే రెండు పదాలను ఆధారంగా చేసికొని తెలుగుపద్యం గాలిగుమ్మటంవలె భావనాకాశంలో లేచింది. ఉత్ప్రేక్షలో ఉయ్యాల లూగింది. రూపం తత్సమ పదాలతో అందం అచ్చ తెలుగు పదాలతో - ఒక రుచిరమూర్తి రూపొందింది.

సీ. 'నెత్తమ్మిరేకుల మెత్తఁదనము దెచ్చి। యచ్చునఁ బెట్టిన ట్లందమొంది,
చక్రవాకంబుల చందంబు గొనివచ్చి। కుప్పలు పోసిన ట్లొప్పు మెఱసి,
చందురు నునుఁగాంతి కం దేర్చి కూర్చి బా। గునకుఁ దెచ్చినయట్లు కొమరు మిగిలి,
యళికులంబుల కప్పు గలయంతయును దెచ్చి। నారు వోసిన భంగి నవకమెక్కి

తే. యంఘ్రితలములుఁ గుచములు నాననంబుఁ। గచభరంబును నిట్లున్న రుచిరమూర్తి
యనుపమాన భోగములకు నాస్పదంబు। కాదె; యీ త్రిప్పు లేటికిఁ గమలవదన!' (విరా.2.52)

మూలం ద్రౌపది కచకుచకటిభారాన్ని బాగా వర్ణించింది. తిక్కన కుచాలనూ, ముఖాన్నీ, శిరోజాలనూ వర్ణించాడే కాని పిరుదుల జోలికి పోలేదు. కుచాలను కూడా చక్రవాక పక్షుల ఉపమానంతోనే సరిపుచ్చాడు. ఇది తిక్కన ఔచిత్య దృష్టికి దృష్టాంతం. ఉదారత (వికటత్వం, నృత్యత్పదవద్భావం+అగ్రామ్యత్వం) అనే శబ్దార్థాల గుణసమ్మేళనం ఈ పద్యంలో వర్ణించబడుతున్న ద్రౌపది యొక్క, అభ్యర్థిస్తున్న కీచకుడి యొక్క ఉదారతను చాటుతున్నాయి. ఉత్ప్రేక్షతో అర్థగుణ వికటత్వాన్ని సాధించిన తీరు తెలుగు మాటలలో చెప్పటం, ఆమె శరీరావయవాలను సంస్కృత పదాలలో పేర్కొనటం, తన మాట వచ్చేసరికి 'త్రిప్పులేటికి' అని అచ్చ తెలుగులో పలకటం గ్రామ్యత్వ నివారణం కొరకే. గుణాలంకార శోభితమైన ఉక్తి విశేషం తిక్కన రచనా సౌందర్యం.

ఇట్లాగే మూలంతో పోల్చి తిక్కన తెలుగువెలుగును సమీక్షించటం వ్యాఖ్యానంలో పలుచోట్ల జరిగింది. వాటిని గమనింప వేడికోలు!

20. అలంకారశిల్పం

తిక్కన అలంకారాలలో ఉపమను ఎక్కువగా వాడతాడని విమర్శకులు వివేచించారు. అంతేకాదు తిక్కన నిత్యజీవితంలోనుండి ఉపమానాలు తీసికొని సర్వజనసులభంగా కావ్యార్థాలను వర్ణిస్తాడనే ప్రశస్తి ఉన్నది. మచ్చుకు కొన్ని-

1. 'నీఱు గవిసియున్న నిప్పుఁబోలె (విరా.1.228)
2. 'పిడుగు పడినవానిఁ గొఱవిం జూఁడిన తెఱంగున' (విరా.2.103)
3. 'బెబ్బులియున్న పొదరు సొచ్చు లేడి చందంబున' (విరా.2.112)
4. 'నివుఱు గవిసిన మెఱయని నిప్పువోలె' (విరా.4.75)
5. 'పెన్నిధిఁ గన్న పేద చందంబున' (విరా.4.149)
6. 'మంటలో మిడుతలు సొచ్చినట్లయిన' (విరా.5.33)
7. 'వేల్పు వచ్చిన యట్ల మేను పొంగ' (విరా.5.40)
8. 'ఏనుంగునకు సిళ్ల చూపినట్లు' (విరా. 5.81)
9. 'ఉపలాలితుండగు ఢింభకుండు తన కొలది యెఱుంగక మహాపదార్థంబు వేఁడు విధంబున' (విరా.1.22)
10. 'పంచాగ్నులును బోలెఁ గూర్చున్నంతన్ (విరా.5.316)

తిక్కన ఉపమాలంకారాలను శిల్ప సుందరంగా వాడతాడు. ఉదాహరణకు ఒక సూర్యోపమానంతో అతడు సాధించిన శిల్ప వైశిష్ట్యాన్ని డాక్టర్ సజ్జాజు లక్ష్మీనరసింహారావుగారు ఇట్లా వివేచించారు - "తిక్కన ఉపమానములందు వస్తువులకన్న వాని చైతన్యప్రభావ జీవలక్షణాదుల ప్రాధాన్య ముండుటచే నవి విస్తృత భావావరణము తమలో నిక్షేపించుకొని పరమసార్థకము లగుచున్నవి. ఆంధ్ర భారతమున సూర్యునకు సంబంధించిన ఉపమానములు ఏబది వరకు నున్నవి. ఉత్తర గోగ్రహణ సన్నివేశమున నర్జునుడు కౌరవసేనలపైబడి మహాద్భుత సమరక్రీడ ప్రదర్శించినాడు. తిక్కన మహావీరుని రణవైశారద్యమును పాఠకులకు హృదయగతము చేయుటకై ఎన్నో చక్కని ఉపమాచిత్రముల వినియోగించెను. 'వేల్పు వచ్చినట్లు' మేనుపొంగ అర్జునుడు కోదండము వలయోదాత్త స్ఫురణ వెలుఁగుచుండ జ్యానాదము చేసి, అసంఖ్యాకబాణముల ప్రయోగించెను. 'యథారశ్మిభి రాదిత్యః ప్రాచ్ఛాదయత మేదినీమ్' అనుమూలము ననుసరించి తిక్కన చేసిన వర్ణన మిది.

మ. "ఒక మాత్రన్ వితత ప్రసార నిబిడాత్యుగ్రాస్త్ర సంతానముల్
సకలానీకములందుఁ బర్వ నరు భాస్వన్మూర్తి శోభిల్లె దీ
ప్తి కలాపంబులు లోకమంతటను విస్తీర్ణంబులై యొౌగప
ద్యకృతవ్యాప్తి వెలుంగ నొప్పెసఁగు మార్తాండున్ విడంబించుచున్." (విరా.5.42)

మరియొక భావమును తిక్కన మార్చెను.

క. "నరు లొరులు దృశ్యములపైఁ। బరఁగింపఁగఁ జూడ్కు లెట్లు పడుఁ దప్పక య
ప్పరుసున నరుఁ డేయు నిశిత। శరములు లక్ష్యములు తప్పి చనవించుకయున్". (విరా.5.43)

సుదూరదృశ్యమగు నరశర ప్రయోగ విలాసమును ప్రత్యక్షము చేయుటకు తొలుత సూర్యకిరణ ప్రసార స్వభావముతో పోల్చి, మరల ఇంకను సులభముగా నవగతమగు సార్వత్రిక విషయముతో కూడ పోల్చినాడు. అర్జునుని బాణప్రయోగవేగము తెల్పుటకుగాని, లక్ష్యశుద్ధిని తెల్పుటకుగాని ఇంతకన్న సరిపోవు ఉపమానము లుండవను భావము కల్గించు రచనము ఇది. గగన మధ్యస్థుడై సూర్యుడు చండకిరణముల నేలనాల్గుచెరగుల ఒక్కసారి గుప్పించునట్లు అర్జునుడు రణరంగమున విస్తరించియున్న కురుసేనా సమూహములం దన్నింటను బాణముల నింపుట వర్ణించబడినది. అర్జునుని బలశౌర్యములు తెలియుటకు తిక్కన ఇట్టివే ఎన్నో ఉపమలు ప్రయోగించినాడు. కాని, ఈ సూర్యోపమ ఒక శిల్పమున భాగమైనది. ఈ శిల్పము విరాటపర్వమున

నర్జునపాత్ర చిత్రణమునకు సంబంధించినది. ధర్మజాదుల వేషధారణ విధానము వేరు. అర్జునున కూర్వశి శాపము వలన కల్గిన బృహన్నలాత్వము వేరు. విరటుని చేరవచ్చిన అతనిని తిక్కన-

ఆ. 'మంచు మఱుఁగుపడిన మార్తాండుఁడును బోలె। నీఱు గవిసియున్న నిప్పుఁ బోలె
వేషధారి యైన విష్ణుండుఁబోలె న। వ్విరటు కొలువు సేర నరుఁడు వచ్చె'. (విరా.1.228)

అని వర్ణించెను. ఇట మూలమున "శిఖీవ యజ్ఞేషు ఘృతేన సిక్తః" వంటి ఉపమలుండగా తిక్కన వానిని వదలెను. తేజః ప్రతాప వైభవములు తొలగి కాంత్యుదగ్రత లేని ఆకారముతో నత డిట ప్రవేశించెను. పాండవుల దుర్గతి కిది పరాకాష్ఠ. పాశుపతాస్త్రవేదికి నర్తనవేదిక దక్కినది. చతుర్థాశ్వాసమున నజ్ఞాతవాస సమయము పరిసమాప్త మగుచుండుటచే బృహన్నలాకృతి తొలగి యథాపూర్వాకృతి నంది అర్జునుడు వచ్చుటకు తిక్కన 'రాత్రిం బుచ్చి తోతెంచు మార్తాండు మాడ్కి' (విరా.4.254) అని పోల్చెను. ఇది నవాభ్యుదయమును సూచించును. పంచమాశ్వాసమున రణోజ్జ్వలు డగుటచే అర్జును దైన్యస్థితి పూర్తిగా తొలగుటను పైన చెప్పబడిన పద్యమున సూర్యోపమాన గ్రహణముచే తిక్కన నిరూపించెను. ఈ పోలికచే అజ్ఞాతవాసదైన్యము పూర్తిగా తొలగి, భావి కురుక్షేత్ర సమరనాయకత్వము స్ఫురించు తీవ్రతతో నర్జునుడు మనకు దర్శన మిచ్చుచున్నాడు. అభిమన్యుడు పద్మవ్యూహమునఁజొచ్చి దివసకాలమంతయు చండపరాక్రమముతో శత్రుభీకరుడై పోరి, సాయం సమయమున కూలిపోవుటను గూడ తిక్కన సూర్యసంబంధములగు అనేకోపమానములతో నిర్వహించెను. (ద్రోణ. 2.39, 48, 60, 96, 126). ఇట్టి భావ సంయమనము, పూర్వోత్తర విషయానుక్రమణరూపశిల్పము కవిబ్రహ్మ నైపుణ్యమును తెలుపును." (ఆంధ్ర మహాభారతము అలంకార సమీక్ష. పు.115.116). విరాటపర్వంలో తిక్కన ప్రదర్శించిన అలంకారశిల్పాన్ని వ్యాఖ్యలో విస్తృతంగా వివరించటం జరిగింది. సహృదయు లాయా విశేషాలను ఆయా చోట్ల గమనింప ప్రార్థన.

21. తిక్కన కళాప్రతిభలు

విరాటపర్వ శిల్ప సౌందర్యాన్ని గురించి ఎందరో మహానుభావులు ఇదివరకే ఎన్నో విలువైన అంశాలను పేర్కొని ఉన్నారు. వారి పరిశీలనలు భారత కవితా తత్త్వ దీపికలు. వాటిలో కోరాడ రామకృష్ణయ్యగారి ఆంధ్రభారత కవితా విమర్శనం (1929) ప్రత్యేకంగా పేర్కొనదగింది. తిక్కన భావిప్రబంధ కవులకు ఎట్లా కవితలో మార్గదర్శకుడైనాడో కోరాడ వారు అట్లా భారత విమర్శలో భావివిమర్శకులకు బాటలు చూపారు. తిక్కనార్యుని కళాప్రతిభలను గురించి చెప్పిన కొన్ని అంశాలు:

1. తిక్కనార్యుని వర్ణనలు : "తిక్కనార్యుని వర్ణనలన్నియు సహజగుణశోభితములుగాని కృత్రిమ భావగర్భితములు కావు. స్వాభావికములు, సందర్భానుకూలము లైయుండునే కాని సాంకేతికములును (conventional) పాండిత్య ప్రకర్షను చాటునవియై సమయము దొరకినది కదాయని చేయబడినవిగా నుండవు...వర్ణనలు కూడా కథాగమనమునే సూచించుచుండును.' (పు.385)

2. ప్రకృతి వర్ణనలు : "తిక్కనార్యుడు మూలమున లేని ప్రకృతి వర్ణనలను పలుచోట్లఁ దెచ్చిపెట్టినాడు. అవి యాయా కథాసందర్భముల కత్యంతానుకూలములై కథాప్రవృత్తికిఁ దోడుపడుచు, కథాగమనముయొక్క కాలవైఖరిని సూచించుచుండును. మరియు నాయక పాత్రల యవస్థలలో ప్రకృతి తన సానుభూతిని తెలుపుచున్నదా యన్నట్లుండును." (పు.391)

3. "తిక్కనార్యుని కథ సచలనంబై, పాత్రలు సచేతనంబులై మనల నంతగా నాకర్షించుటకుఁ గల కారణములలో ముఖ్యమైనవి రెండు: అతని మనోవృత్తి వివరణశక్తి, నాటకకళాచాతుర్యము. వీనికిఁ దగినట్లుగా సహజము, స్వాభావికము నగు నాతని కవితా నైపుణ్యము, జాతీయ ప్రయోగ నైపుణ్యంబును దోడుపడి యతని కవితాసృష్టి నప్రతిమానమైనదానినిగాఁ జేసినవి." (పుట: 396, 397)

4. "సందర్భానుకూలముగ నీతడు ప్రయోగించిన జాతీయము (Telugu idiom) తరువాతి కవులుగాని, పూర్వమున నున్న నన్నపార్యుడుగాని ప్రయోగించినట్లగపడదు. కాని, యా పదబంధముల బిగి, శక్తి (force and vigour) యిప్పటి మన వ్యావహారిక భాషలో వలెనే కనబడుచుండును. కొన్ని యుదాహరణములు మాత్రము చూపెదను-

(1) విప్రులం జుట్టలం బెట్టుకొని సుఖముండుదుమో. (2) దీని నౌ గాదనుఁడా. (3) ఈ త్రిప్పులేటికి కమలవదన- (డొంకతిరుగుడు మాటలని యిప్పుడు మనమందుము.) (4) కొంకుగొస రించుకయు లేక కూలఁదాఁచె. (5) మీ ముక్కున నూర్పుగలుగ నొక మూర్ఖునిచేఁ బడితిన్. (8) ఆపదల కెల్ల నోర్చెద దాని కేమి? (7) విచారము కోర్కికిఁ గాని వావియే? (8) ఇట్టి యవగాఢపుఁ బొత్తు మనంగవచ్చునే? (9) నన్ను ని ట్లాలిగొనఁగనేల? (10) ఆ తల కెయ్యుడు లేదు నేనియున్. (11) రాధేయుం డొక చీఁకిం గొనఁడు. (12) సంవత్సరంబునుం జేరువ చేరువల్ గడచె. (13) తప్పుగ్రుంకఁ దీఱదు నీకున్. (14) కని కొలువు చేసికొని, (15) ఆశాచక్రముల కొలఁదులు బారవెట్టంగ. (16) నా నేర్చు పనుల వెంట నీకడ నిలువం దలంచి. (17) నేల నాలుగు చెఱఁగుల నృపుల కొలువులందు వర్తించితి. (18) వీనికి మార్కొనఁ జాలెడు దానికి. (19) ఆఁడుఁబుట్టువులతోడన నీవును బుట్టినావు.(20) వలదన్న నుడిగెడువాఁడు గాఁడు- మాయదైవమ- నేనేమి చేయుదాన? (21) ఆ లేమ పొలసిన చూడ్కికిఁ జుబ్బనచూఱగాదె (22) కొని రమ్మా చూతముగాని నీ గమన వేగంబున్ (23) పిడుగు పడినవానిం గొఱవిం జూఁడిన తెఱంగున. (24) ఏడు సాగరములు నిక్కడక్కడఁ బెట్టి పలుచని రొంపి మై నలఁది కొనఁగ. (25) వెనుకన్ గూడఁగ ముట్టి పట్టుకొని తన్నెన్; పల్కు లింకేటికిన్. (26) అకట యాఁడుకూయు నాల కూయు లాఁతివారికైన నరయవలయు. (27) వీఁడొకటి కాదవునా నెఱుఁ గండు. (28) నెయ్యంబు తియ్యంబు నెఱప నడచి. (29) వన్యసత్త్వముల పొల్పడి చచ్చిన చోటఁ బూరియున్ మొలవదె? (30) నావలని మన్నన యట్టిద కాదె. (31) సారథి నారయుచున్నవాఁ డెఱింగిన పని సెప్పఁగావలయు. (32) బొమ్మపొత్తికలకుం దెండీ. (33)పసుల దయ్య మెఱుఁగుఁ బడఁతుల సంతోషమేల నాకు? (34) ఎవ్విధిఁ జని తేమి యనుచు. (35) చెప్పఁ దొడఁగితి నింకఁ గొఱఁత వెట్టంగ నేల? (36) ఏచి మున్నీరు చేయాఁత నీఁద. (37) తగినవారి చెవికిఁ జేఁదుగాఁగ. (38) చిత్తములం దెడ సేయునట్టి తరమే మీరల్. (39) తానట నన్నుడికించువాఁ డిసీ! (40) తన చేతికొలఁది చూపి క్రీడి సెలఁగె. (41) కన్గిఱిపిన మాత్రలోన. (42) తొల్లింటి చూఱగలదె! (43) పని దెగుఁ గొంతేయుఁడు సొరఁడుగాని క్రౌర్యంబునకున్. (44) నీ వరవాయించుకలేక పఱపవలయు రథంబున్. ఇక భాషా విషయమును బరికింపగా నీతని కవితలో నిప్పు డర్థము మారిపోయిన పదజాల మెంతైనఁ గనఁబడును.'' (పుటలు. 439-441)

ఈ విధంగా తిక్కన కవితాకళా ప్రతిభలు వివరించాలంటే మరల భారతమంత ఔతుంది. పదునేను పర్వాల పీఠికలలో వాటి ప్రశంస చేసే అవకాశం ముందున్నది.

22. తిక్కన తెలుగు ముద్ర

తిక్కన భారతం చదువుతూ ఉంటే వ్యాసభారతానికి అనువాదమనే స్ఫూర్తి కలుగదు. తెలుగునేలమీద జరిగిన కథను తెలుగు వాతావరణంలో నుడికారంతో వెలువరిస్తున్నట్లుగా ఉంటుంది. అది తిక్కన వేసిన తెలుగు ముద్ర. ఉదాహరణకు కొన్ని అంశాలు:

1. తెలుగుకవికి కలలో కనబడ్డ దేవుడు కూడా తెలుగు రాచరికపు మర్యాదలు పాటించాడు.
2. తెలుగుబాసలో కవిత్వం వ్రాస్తే పురుషార్థఫలం అందుతుందని గీర్వాణభాషా కవిత్వం మెచ్చుకొనే భగవంతు డంటాడు.
3. పాండవులకు నీతులు చెప్పే ధౌమ్యుడు తెలుగువాళ్ళను దృష్టిలో పెట్టుకొని సమకాలీన స్పృహతో మాట్లాడుతాడు.
4. పాండవులకు అమరిన వేషాలలో తెలుగువారి అలంకారాలు కూడా చేరి వాళ్ళమీద తెలుగువారి ముద్రలు వేశాయి. వారి చేష్టలలో కొన్ని తెలుగునాట నున్న వివిధవృత్తులవారినుండి ఎన్నుకొన్నవి ఉన్నాయి.
5. అశ్వశాస్త్రం, పశుశాస్త్రం, వృక్షశాస్త్రం మొదలైన శాస్త్రాల ప్రసంగాలు వచ్చినప్పుడు తెలుగునాట వాడుకలో ఉన్న పరిభాష వెలుగు చూచింది.

6. నాట్యశాస్త్ర మర్యాదలలో తెలుగుదనం ఉట్టిపడింది. గురుకులాలలో గురుపూజ చేసి కన్యలను విద్యాభ్యాసాలకంపే సంప్రదాయం కన్నులకు కట్టుతుంది.

7. సంస్కృత మల్లయుద్ధం ముసుగులో తెలుగువారి కుస్తీపట్లు చోటుచేసికొన్నాయి.

8. కీచకుడి విరహ ఘట్టంలో యక్షగాన వైఖరి స్పష్టమౌతుంది. తిక్కన సూత్రధారుడుగా కీచకాది పాత్రల అభినయానికి వంత పాడుతూ అభినయిస్తాడు.

9. భీముడి రౌద్రం ఆంధ్రుల ఆవేశానికి అనువుగా ఉంటుంది.

10. ద్రౌపది పాత్ర ప్రదర్శించే పౌరుషాభిమానాలు సత్యభామ పాత్రను అభిమానించే ఆంధ్రులకు అభిమానపాత్రాలు ఔతాయి.

11. ఉపకీచకవధఘట్టం అద్భుత కథాప్రవృత్తిలో నడిచి ఆకాలపు తెలుగువారికి ఆహ్లాదం కలిగించింది.

12. విరాటుడి ఔదార్యం తెలుగువారి అతిథి సత్కార సంస్కృతికి ఆదర్శం.

13. సుదేష్ణ అంతఃపురం తిక్కననాటి అంతఃపుర మర్యాదలకు ఆలవాలం.

14. దక్షిణ గోగ్రహణంలో తిక్కన ప్రవేశపెట్టిన దొమ్మిపోరూ, అందులోని వీరుల విహారాలూ పల్నాటియుద్ధం వంటి తెలుగువారి యుద్ధాలను తలపిస్తాయి.

15. ఉత్తరకుమారుడు ఎంతటి భారతీయుడో అంతటి తెలుగువాడయ్యాడు. ఆ పుణ్యం తిక్కనది.

16. ఉత్తరగోగ్రహణయుద్ధంలోని వీరుల మాటలు తెలుగు పలుకుబళ్ళు.

17. తెలుగువారికి ఈటెల యుద్ధం కంటె మాటల యుద్ధం కష్టం. అందువలన తిక్కనలో క్రియాత్మక యుద్ధం కంటె అధిక్షేపాత్మక సంభాషణలు మూలంలో కంటె అధికం. అది తెలుగువారి పోరుతీరు.

18. విరాటుడి ద్యూత వ్యసనం తెలుగు జానపదుల జూదాల మోజువలె ఉండటంతో ఆసక్తికరంగా తోస్తుంది.

19. పెళ్లితో ముగిసే కావ్యమంటే తెలుగువారికి హృదయాహ్లాదం కలుగుతుంది. విరాటపర్వం ఉత్తరాభిమన్యుల వివాహంతో ముగుస్తుంది. కాబట్టి భారతపఠనం ఈ పర్వంతోనే తెలుగువారు ప్రారంభిస్తారు.

20. ఉత్తర తెలుగు రాచబిడ్డవలె వ్యవహరిస్తుంది. అలంకరించుకొంటుంది. మాట్లాడుతుంది. ఉత్తరాభిమన్యుల వివాహం తెలుగు రాజకుటుంబాలలో సాగే ఆచారాలతో ముడిపడ్డ ముచ్చట. పెళ్ళిపీటల మీద వధూవరులు కూర్చొనటం, వారి మధ్య తెరపట్టడం, వారు పోసికొనే తలంబ్రాలూ తెలుగువారికి సర్వశుభాలను కలిగించే వేడుక సంబరాలు. అందుకే తెలుగువారి పెండ్లి శుభలేఖలలో సీతారాముల తలంబ్రాల ప్రశస్తిని మంగళగీతంగా ముద్రించుకొంటారు. ఆ సంప్రదాయాన్ని అచ్చంగా తిక్కన విరాటపర్వంలో చిత్రించి కనుల పండువుగా చేశాడు. మొత్తంమీద విరాటపర్వం తిక్కన్న తీర్చిదిద్దిన 'శిల్పపుఁ దెనుఁగు తోఁట!'

23. నన్నయ తిక్కనల కవితలు: భేద సాదృశ్యాలు

నన్నయ తరువాత మహాభారత రచన చేపట్టిన కవి తిక్కన. మహాకవులైన వారిద్దరి కవితలలో కొన్ని భేదాలున్నాయి. సాదృశ్యాలున్నాయి. సూత్రప్రాయంగా వాటిని ఇట్లా పేర్కొనవచ్చును.

భేదాలు:

నన్నయ కవిత్వం	తిక్కన కవిత్వం
1. ప్రసన్న కథాకలి(వి)తార్థయుక్తి ఆఖ్యానపద్ధతి (Narrative Style)	1. నాటకీయత, నాటకీయ పద్ధతి (DramaticStyle) కథ చెప్పుతున్నా నాటకం చూచినట్లుంటుంది.
2. అక్షర రమ్యత; శబ్దాల కూర్పుతో కలిగే రచనా సౌందర్యం కవితకు శ్రవణానందశక్తిని కలిగిస్తుంది.	2. వాక్య రమ్యత; పదాలూ వాక్యాలూ శైలీసార్థకంగా కుదిరి పద్యంలో మాట్లాడుతున్న అనుభూతినిస్తుంది.
3. నానారుచిరార్థసూక్తి.	3. రసాభ్యుచిత బంధం.
4. శబ్దగుణ ప్రధాన రచన.	4. అర్థగుణప్రధాన రచన.
5. వస్తుధ్వని ప్రధాన రచన.	5. రసధ్వని ప్రధాన రచన.
6. ధారామధురమైన పద్యరచన.	6. ఆలోచిస్తూ మాట్లాడుతున్నట్లుండే రచన.
7. రచనలో శబ్దార్థాలకు సమప్రాధాన్యం	7. రచనలో శబ్దంకంటె అర్థానికి ప్రాధాన్యం.
8. తత్సమపద బహుళమైన శైలి.	8. దేశ్యపదబహుళమైన శైలి
9. వర్ణనలలో స్థిరచిత్రా లెక్కువ.	9. వర్ణనలలో చలనచిత్రా లెక్కువ.
10. నన్నయలో పాత్రచిత్రణం అధికం.	10. తిక్కనలో పాత్రపోషణం అధికం.
11. నన్నయ భారతభాగం నరాంకితం.	11. తిక్కన భారతభాగం దైవాంకితం.

సాదృశ్యాలు:

1. ఇరువురూ వైదిక ధర్మంలో అభినివేశం కలవారే. సమకాలీన స్పృహ కలవారే.
2. ఇరువురూ ఆంధ్ర మహాభారతాన్ని మతదృష్టితోకంటె కావ్యశిల్పదృష్టితోనే రచించారు.
3. ఇరువురూ ఆంధ్ర మహాభారతాన్ని కావ్యేతిహాసంగా తీర్చిదిద్దారు. ధ్వని ప్రస్థానాన్ని అనుసరించారు.
4. ఇరువురూ వీలైన చోటులలో భారతకథలో, పాత్రచిత్రణలో, పోషణలో తెలుగుదనాన్ని రంగరించి తెలుగువారి ముద్రవేశారు.
5. ఇరువురూ తాము నివసించిన కాలంలో ప్రజలలో వాడుకలో ఉన్న తెలుగు పదజాలాన్ని కావ్యస్థం చేశారు.
6. ఇరువురూ ఒకే ప్రణాళికను (విషయానుక్రమణికను) అనుసరించారు.

ఇరువురూ ధ్వనిరసదర్శనానికి సంబంధించినవారు కావటం చేత మాటలతీరులలో తేడా ఉన్నా, మనసొక్కటిగా మహాభారతాన్ని తెలుగువారికి అందించగలిగారు.

24. జంట పర్వాలు

అష్టాదశ పర్వాలలో కొన్నింటిని జంటగా భావించటం తెలుగువారికి పరిపాటి. అవి - ఆదిసభాపర్వాలు, విరాటోద్యోగపర్వాలు, భీష్మద్రోణపర్వాలు, కర్ణశల్యపర్వాలు, శాంత్యానుశాసనిక పర్వాలు, అశ్వమేధాశ్రమవాసపర్వాలు. వీటిలో విరాటోద్యోగాలను కలిపి అనుశీలించటం అవసరం. “తిక్కన కవితా సువర్ణానికి ఒరగల్లుల వంటి విరాట ఉద్యోగ పర్వాలు చదివితే ఆయన పని‘వాడి’ తనాన్ని పసిగట్టినట్టే- తక్కిన పర్వాలన్నీ ఆ పునాదుల మీద లేచినవే” (ఆరుయుగాల ఆంధ్రకవిత- పు.112) అన్న ఇంద్రగంటి

హనుమచ్ఛాస్త్రిగారి మాటలు స్మరణీయాలు. అందువలన విరాటోద్యోగాల సమ్యక్పరిశీలనం ఉద్యోగపర్వపీఠికలో ఉండటం వాంఛనీయం.

25. విరాటపర్వం : ధర్మోపదేశం

విరాటపర్వం ఉపరంజనంతోపాటు ఉపదేశాన్ని కూడా అందిస్తుంది. రామాయణంలో సుందరకాండకువలె మహాభారతంలో విరాటపర్వానికి ఒక ప్రత్యేక స్థానం ఉన్నది. చతుర్విధపురుషార్థాలకు సంబంధించిన అనేకాంశాలు ఈ పర్వంలో సముచితంగా సంగ్రహంగా సందర్భోచితంగా సంతరించబడ్డాయి. విరాటపర్వం చదివిన పఠిత ఎంతటి విపత్తులలో ఉన్నా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని విజయుడౌతాడు. దానికి తగిన వ్యుత్పత్తి ఇందులో అక్షరబద్ధం చేయబడి ఉన్నది.

సంస్కృత భారతంలో వ్యాసభట్టారకుడు విరాటపర్వాన్ని సూక్తిసుధాకరంగా నిర్మించాడు. తిక్కన తెలుగులో సూక్తులు తగ్గించి కవితోక్తులను పెంచాడు. అందువలన ఉభయకవుల వాఙ్మయ ధారలను కొన్నింటిని పేర్కొనటం సమంజసం.

(1)పంచమవేదం ఆరాధ్యం: తిక్కన మహాభారత ప్రశస్తిని గురించి చెప్పిన ఈ క్రింది రెండు పద్యాలూ తెలుగువారి నాల్కలమీద సదా నాట్యం చేస్తుంటాయి.

క. "వేదములకు నఖిలస్మృతి । వాదములకు బహుపురాణ వర్గంబులకున్
వాదైన చోటులను దా । మూదల ధర్మార్థ కామ మోక్ష స్థితికిన్." (విరా.1.4)

క. "పారాశర్యుని కృతి యయి । భారతమను పేరఁ బరఁగు పంచమవేదం
బారాధ్యము జనులకుఁ; ద । ద్గౌరవ మూహించి నీ వఖండిత భక్తిన్". (విరా.1.17)

వేదవ్యాస విరచిత మహాభారతం పంచమవేదం, పరమప్రామాణ్యం. ప్రజలకు అది ఆరాధించదగింది. అంటే అనుసరించ దగింది. ఎందువలననంటే వేదాలకూ, ధర్మశాస్త్రార్థాలకూ, బహుపురాణ ప్రతిపాదిత అర్థాలకూ వాదు ఏర్పడితే ధర్మార్థ కామ మోక్ష పురుషార్థ సంబంధులైన అంశాలలో భారతమే ఉపాదేయం అని తాత్పర్యం. శ్రుతిస్మృతి పురాణవాదాలకు వారధిగా నిలిచే భారతం భారతీయ జీవన ధార్మికసూక్తం!

(2) విధి బలీయం : విరాటపర్వం పేరు వినగానే సముజ్జ్వలాకృతులు, మానధనులు, జనమాన్యులూ అయిన పాండవులు ఎంత దీనమైన స్థితి ననుభవించవలసివచ్చింది? - అని జాలివేస్తుంది. దానికి లౌకిక కారణంకంటె మరేదైనా అలౌకిక కారణముంటుందా? అన్న ప్రశ్న కలుగుతుంది. మహాభారత శ్రోత అయిన జనమేజయుడికి అటువంటిప్రశ్న కలిగింది, నాయకుడైన ధర్మరాజుకూ కలిగింది. ధౌమ్యుడు దానికి కారణం 'విధి' అని పేర్కొన్నాడు. జనజీవితంలో అటువంటి ఘట్టాలు ఏర్పడ్డప్పుడు అందరినీ ఊరటపరచేది 'విధివిలాస'మని చెప్పే ఆ కర్మసిద్ధాంతమే. కథలో భాగంగానే ఉంటూ ఆ సత్యం సూక్తిగా రాణించింది.

క. "దేవతలకైన నొక్కొక । చో వలయున కాదె శత్రుసూదనవిధి కా
లావాప్తికి మును దమస । ద్భావంబు లడంచి యుడుగఁబడి యుండంగన్". (విరా.1.53)

విధి ప్రభావాన్ని ధౌమ్యుడు పరోక్షంగా పేర్కొంటే, ద్రౌపది భీముడితో ప్రత్యక్షంగానే ప్రస్తావనకు తెచ్చింది మహానసంలో జరిగిన ఏకాంత సమావేశంలో.

"దత్త్వా యాచన్తి పురుషా హత్వా వధ్యన్తి చాపరే ।
పాతయిత్వా చ పాత్యన్తే పరై రితి చ మే శ్రుతమ్ ॥" (సం.4.19.5)

ఒకప్పటి దాతలే యాచకులై పోవచ్చును. ఒకప్పటి విజేతలే పరాజితులు కావచ్చును. ఒకప్పుడు ఇతరులను కూల్చినవాడే తాను కూలిపోవచ్చును. విధి ప్రభావం (కాలమహిమ) ఇటువంటిదని నేను విని ఉన్నాను.

"న దైవ స్యాతి భారో-స్తి న దైవ స్యాతి వర్తనమ్।
ఇతి చా ప్యాగమం భూయో దైవస్య ప్రతిపాలయే॥". (సం.4.19.6)

దైవం(విధి) దుష్కరమైనది. దైవాన్ని (విధిని) అతిక్రమించలేం. కాబట్టి మరల దైవం అనుకూలించాలి (వక్రించిన విధి అనుకూలం కావాలి) అని ఎదురుచూస్తున్నాను.

"స్థితం పూర్వం జలం యత్ర పునస్తత్రైవ తిష్ఠతి ।
ఇతి పర్యాయ మిచ్ఛన్తీ ప్రతీక్షామ్యుదయం పునః". (సం.4.19.7)

జలం ముందెక్కడుండేదో అక్కడికే మరల చేరుతుంది. (సాగరం-> మేఘం-> వర్షం-> నది-> సాగరం-> ఇది జలవర్తులం.) అట్లాగే సంపదకూడా పూర్వమున్న చోటికే చేరుతుంది. కాని, అటువంటి కాలం కలిసివచ్చేంతవరకు ఓపికపట్టాలి. (ఓపిక పట్టి ఉన్నాను.)

"దైవేన కిల యస్యార్థః సునీతో-పి విపద్యతే।
దైవస్యచాగమే యత్న స్తేన కార్యో విజానతా॥". (సం.4.19.8)

మానవయత్నం ఎంత సవ్యంగా సాగినా దైవం అనుకూలించకపోతే కార్యం చెడిపోవచ్చును. అయినా, నిరాశా నిస్పృహలకు గురికాక, మరల దైవానుకూల్యం కొరకు ప్రయత్నిస్తే కార్యం ఫలిస్తుంది.

తిక్కన ఈ ప్రబోధాంశాలను తెలుగులో నిలుపలేదు. ఆ సందర్భంలో సంభాషణ శిల్పానికి ప్రాధాన్యాన్ని కల్పించి నీతిబోధను తగ్గించాడు. వ్యాసుడు ఋషి, తిక్కన కవి.

(3) బోధించటం బుధుల స్వభావం : విరాటపర్వంలో పాండవులు విరటుడి కొలువులో అజ్ఞాతంలో నివసించారు. ఆ సంగతి నూహించి ధౌమ్యుడు పాండవులకు సేవాధర్మాలు బోధించాడు. ఆ బోధ మొదలుపెట్టబోతూ 'వినేవారికి తెలియనివి కావు. కాని, సనాతన ధర్మార్థకామ పురుషార్థ వ్యుత్పత్తి లోకానికి యథావకాశంగా జ్ఞాపకం చేయటం ఋషులకు, ప్రవక్తలకు, ఆచార్యులకు, కవులకు సహజధర్మం' -అని అన్నాడు.

"విదితే చాపి వక్తవ్యం సుహృద్భి రనురాగతః ।
ఏష ధర్మశ్చ కామశ్చ అర్థశ్చైవ సనాతనః॥" (సం.4.4.6)

అన్నీ తెలిసినప్పటికీ మిత్రులు అనురాగంతో చెప్పటం ధర్మం. దానివలన సనాతనధర్మం, అర్థం, కామం అనుసరించి వస్తాయి. ఇది కావ్యాలలో సూక్తులు చెప్పే ప్రక్రియకు వెనుకనున్న ధర్మరహస్యం! దీనిని తిక్కన చక్కని కందపద్యంగా మన కందించాడు.

క. "ఎఱిఁగెడువారికి నైనను। గఱపక తక్క రుచిత ప్రకారము శుభముం
గొఱలు హితు లట్లగుట నం। దఱకును జెప్పంగవలయుఁ దగియెడు బుద్ధుల్." (విరా.1.116)

(4) సేవాధర్మాలు యోగక్షేమ సూత్రాలు : విరాటపర్వంలో ధౌమ్యుడు పాండవులకు బోధించిన రాజసేవాధర్మాలు రాజాస్థానాలలో పనిచేసే ఉద్యోగులకు ఏర్పరచిన ప్రవర్తన నియమావళిగా రాణించాయి. ధౌమ్యోపదేశాలన్నీ (విరా. 1.116-140) కథలో అన్వయించక పోవచ్చును. కొన్ని కథలో ప్రతిఫలించవచ్చును. అది కథాంశంగా కంటె ప్రబోధాంశంగా వ్యాసతిక్కనలు భావించారు. అయితే

వ్యాససూక్తులను కొన్నింటిని తిక్కన కథ కనుగుణంగా మార్చి మలచి చెప్పిన పద్ధతి స్పష్టంగా గోచరిస్తుంది. మచ్చు కొకటి రెండు.

"నాస్యయానం న పర్యఙ్కం న పీఠం న గజం రథమ్ ।
ఆరోహేత్ సమ్మతో-స్మీతి స రాజవసతిం వసేత్॥" (సం.4.4.10)

రాజసేవలో ఉన్నవాడు తాను రాజుకు చాలా ఇష్టుడనని గర్వించి రాజులకు, తదితరులకు సంబంధించిన వాహనాలనూ, పాన్పునూ, పీఠాన్నీ, ఏనుగునూ, రథాన్నీ ఎక్కనివాడే రాజగృహంలో ఉండగలడు - అని వ్యాససూక్తి. దీనిని తిక్కన సందర్భోచితంగా మార్చాడు.

ఆ. "ఉత్తమాసనములు నుత్కృష్టవాహనం। బులును గరుణఁ దమకు భూమిపాలుఁ
డీక తార యెక్కు టెంతటి మన్నన। గలుగువారి కైనఁ గార్య మగునె?" (విరా.1.132)

మూలంలో ఎక్కకూడనివి ఇతరుల వాహనాలూ, పాన్పులూ, పీఠాలూ, ఏనుగులూ, రథాలూ. తిక్కన రచనలో ఉత్తమ ఆసనాలూ, ఉత్కృష్ట వాహనాలూ మాత్రమే. అవి ఇతరులవని కాదు. విరాటపర్వ కథలో పాండవులు ఇతరుల వాహనాలనుగానీ, పీఠాలనుగానీ ఎక్కిన జాడలు లేవు. వారు ఎక్కింది విరాటుడి సింహాసనం (రాజుయొక్క ఉత్తమ ఆసనం). దక్షిణ గోగ్రహణంలో ఉత్కృష్ట రథాలూ. ఆ రథాలు రాజు ఇచ్చినవే. ఉత్తమాసనం కూడా రాజు ఇస్తానన్నదే. కాని, ఇస్తానన్నప్పుడు స్వీకరించలేదు- అప్పుడు వారు సేవావృత్తిలో ఉన్నారు కాబట్టి. అజ్ఞాతవాసం అయిపోయిన తరువాత తమ రాజాధిరాజ పదవిని నిరూపించుకొనటానికి రాజసింహాసనాన్ని గ్రహించారు. ఆసనాలను, వాహనాలను మాత్రమే పేర్కొనటం తిక్కన పాటించిన సన్నివేశౌచిత్యం. 'భూపాలుడు ఈయక తమంతట తామే ఎక్కటం' - అనే మార్పు అమూలకం. వీటివలన తిక్కనసూక్తికి సందర్భశుద్ధి ఏర్పడింది.

"యచ్చ భర్తానుయుఞ్జీత తదేవాభ్యనువర్తయేత్।
ప్రమాద మవహేలాం చ కోపం చ పరివర్జయేత్॥ (సం.4.4.17)

ప్రభువు ఏది శాసిస్తాడో, అడుగుతాడో దానినే చేయాలి, చెప్పాలి. పొరపాటు, కోపం, గర్వం అనేవాటిని పూర్తిగా వదలిపెట్టాలి- ఇది వ్యాససూక్తి. దీనిని తిక్కన తెలుగులోనికి తీసికొని రాలేదు. తెస్తే బాగుండేది. సుదేష్ణ కీచకుడి మందిరానికి వెళ్ళి మద్యం తెమ్మని ఆజ్ఞాపించింది సైరంధ్రిని. సైరంధ్రిగా రాజ్ఞిసేవలో ఉన్న ద్రౌపది తనను పంపవద్దని వేడికొనగలిగిందే కాని, ఆమె ఆజ్ఞను తిరస్కరించలేకపోయింది. కారణం - ఈ సేవాధర్మమే.

"అనుకూలో భవేచ్చాస్య సర్వార్థేషు కథాసు చ।
అప్రియం చాహితం యత్ స్యాత్ తదస్మై నానువర్ణయేత్॥". (సం.4.4.19)

పనులలో, పలుకులలో సేవకుడు రాజుకు అనుకూలంగానే ఉండాలి. రాజుకు ప్రియం, హితం కాని దానిని చెప్పనేరాదు - అని వ్యాసోక్తి. దీనిని తిక్కన తెలుగులో చెప్పలేదు. కాని, ఉండదగిన సేవాధర్మం - ఉత్తరగోగ్రహణ యుద్ధ విజయం సాధించింది ఉత్తరు డొంటిగా కాదు; బృహన్నలతో కూడటం వలననే అది సాధ్యమయి ఉంటుందని ధర్మజు డన్నాడు. రాజు కది అప్రియవాక్యం కావటం చేత అతడు పాచికతో కంకుభట్టును కొట్టాడు. కథా సందర్భౌచిత్యం గల సూక్తి ఇది.

"యస్య కోపో మహాబాధః ప్రసాదశ్చ మహాఫలః।
కస్తస్య మనసా పీచ్ఛే దనర్థం ప్రాజ్ఞ సమ్మతః॥" (సం.4.4.27)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎవరికోపం మహాభయంకరమో, ఎవరి అనుగ్రహం మహాఫలమో అట్టి యజమానికి బుద్ధిమంతుడు మనస్సులో కూడా కీడుతలపెట్టడు - అని వ్యాసోక్తి. తిక్కన దీనిని తెలుగులోనికి తేలేదు. భీముడు రాజసభలో రౌద్రోద్రేకం ప్రదర్శించటం విరాటుడికి కీడు తలపెట్టటమే ఔతుంది. కాబట్టి సేవాధర్మాన్ని అనుసరించి ధర్మజుడు అతడిని వారించాడు. ఇది ఆ సందర్భంలో పనికివచ్చింది.

"లాభేన హర్షయేద్ యస్తు నవ్యథేద్ యో-వమానితః।
అసంమూఢశ్చ యో నిత్యం స రాజవసతిం వసేత్॥" (సం.4.4.31)

రాజువలన లాభం పొందినప్పుడు పొంగిపోకుండా, అవమానం పొందినప్పుడు క్రుంగిపోకుండా ఎవడు నిరంతరం మెలకువతో మెలగుతూ ఉంటాడో వాడే రాజమందిరంలో సేవలో ఉండగలడు - అని వ్యాసుడి సూక్తి. ఇది పాండవుల అజ్ఞాతవాస ప్రవర్తనను సూచిస్తుంది. తిక్కన దీనిని గ్రహించాడు.

క "మన్నన కుబ్బక యవమతి। దన్నొందిన స్రుక్కఁబడక ధరణీశుకడన్
మున్నున్నయట్ల మెలఁగిన। యన్నరునకు శుభము లొదవు, నాపద లడఁగున్." (విరా.1.133)

మూలంలో కొలువులో స్థిరంగా ఉండే లక్షణంగా చెప్పగా, తెలుగులో ఆపదలు తొలగి, శుభాలు కలిగే లక్షణంగా చెప్పటం సందర్భోచిత రచనాశిల్పం !

రాజసేవలో రాణించే వారి గుణగణాలనన్నీ ఒక శ్లోకంలో మణిహారంగా కూర్చి చెప్పాడు వ్యాసమహర్షి.

"అమ్లానో బలవాన్ శూర శ్ఛాయే వానుగతః సదా।
సత్యవాదీ మృదు ర్దాన్తః స రాజవసతిం వసేత్॥" (సం.4.4.37)

అలసతలేనివాడూ, బలం కలవాడూ, శూరుడూ, ఎప్పుడూ రాజును నీడవలె అనుసరిస్తూ ఉండేవాడూ, సత్యం పలికేవాడూ, మృదుస్వభావం కలవాడూ, ఇంద్రియాలను జయించినవాడూ రాజమందిరంలో సేవలో ఉండగలడు - అని వ్యాసుడు పలికిన సూక్తి అన్నివిధాలా విరాటపర్వంలోని పాండవ ప్రవర్తనకు మార్గదర్శక సూత్రంగా రాణించింది. తిక్కన దీనిని గ్రహించలేదు.

(5) పరదారాభిలాష పాపం : కీచకుడి వృత్తాంతం ద్వారా లోకానికి చెప్పదలచుకొన్న నీతి - పరదారాభిలాషవలన పాపమే కాక ప్రాణహాని కూడా కలుగుతుందని. దాని కనుకూలంగా స్త్రీపాత్రలైన ద్రౌపది నోట, సుదేష్ణనోట కీచకుడికి ప్రబోధం నిర్వహించబడింది. అందులో ఈ క్రింది పద్యాలు సూక్తి మౌక్తికాలు.

క. "చనుఁ జనదని చూడక యం। దని మ్రాఁకుల పండ్లు గోయఁ దలఁచుట హితమే?
మును చెడిన రావణాదుల। విని యెఱుఁగవె యెన్నఁడును వివేకవిహీనా!". (విరా.2.58)

ఇది సైరంధ్రి సందర్భోచితంగా పలికిన హితోక్తి అయినా, తెలుగువారు 'వివేకవిహీనా!' అనే మకుటంగల శతకంలోని పద్యం వలె హృద్యంగా సంభాషణలలో కూడా వాడుకొంటారు. ఈ సూక్తివలన రావణుడి ప్రక్కన కీచకుడికి ఇంత చోటు దొరికింది.

తే. "ఆయురైశ్వర్య కీర్తుల నపహరించు। పరసతీసంగమము; ధర్మపథమునందుఁ
బరఁగువారలు పరిహరింపంగఁ గనియు। వినియుఁ దెలియవె యిది దుర్వివేక మగుట". (విరా.2.69)

పరదారా సంగమం ధార్మికులు - పరిహరించదగింది. ఎందువలన అంటే దానివలన ఆయువు, ఐశ్వర్యం, కీర్తి నశిస్తాయి కాబట్టి. ఈ ధర్మాన్ని ఇదివరకే పెద్దలవలన వినికూడా తెలిసికొనలేకపోతే దానిని దుర్వివేకం అంటారు - అని ఘాటుగా ధర్మబోధ

చేసింది తన తమ్ముడికి సుదేష్ణ. ఇరువురూ ఒకే అంశాన్ని చెప్పినా సైరంధ్రి మిత్ర సమ్మితంగా చెప్పింది. సుదేష్ణ ప్రభుసమ్మితంగా పలికింది. అందుకే అవి వైవిధ్యంతో రాణించాయి. పాత్ర స్వభావ వ్యంజకాలుగా శోభించాయి.

(6) యోద్ధల యుద్ధనీతి : విరాటపర్వం యుద్ధమయం. భీమార్జున నాయకత్వాలలో సాగిన యుద్ధాలలో ధర్మజ దర్శకత్వం ఉంటుంది. పాండవపక్షంలో ధర్మజు డెంత పెద్దవాడో, కౌరవపక్షంలో భీష్ము డటువంటివాడు. యుద్ధఘట్టాలలో వీరోక్తులు తిక్కన విస్తృతంగా రచించాడు. అక్కడక్కడ యుద్ధనీతికి సంబంధించిన సూక్తులు వెలయించాడు. నన్నయవలె తిక్కన నానారుచిరార్థసూక్తిని ప్రత్యేకించి ఒక్కొక్క పద్యంలో ఆవిష్కరించటం అరుదు. అందువలన వాటిని సంభాషణల వరుసలలోనుండి వేరు చేయటం కష్టం. అయినా అక్కడక్కడ అటువంటి అవకాశం లేకపోలేదు. మచ్చుకు భీష్మయుద్ధనీతి సూక్తులు.

ఆ. “నేల ప్రొద్దెఱింగి చాలు మానిసి రణో । ద్యమ మొనర్చి కాక, తగినవారి
చెవికిఁ జేదు గాఁగ నవమాన వాక్యంబు । లుడుగ కిట్లు పలుకు టొప్పు నెట్లు?”

క. “బీరము లావును మిగులఁగ । వైరులు తఱియైనఁ దొడర వచ్చిన చోటన్
దూరమున వెరవుతోడి వి । చారము గలుగు టిది తగదె సద్బుద్ధులకున్?”

ఆ. “అరుల గుణములైన నగ్గింతు రెప్పుడుఁ । గలయ బెరసినపుడు కలితనంబు
మెఱయుదురు మహాత్ము; లెఱుఁగఁడు తుదిమొద । లెట్టివారి నితఁడు బెట్టు పలుకు”. (సం.4.221-223).

మొదటిపద్యంలో ‘ఇట్లు’, మూడవపద్యంలో ‘ఇతఁడు’ - అనే పదాలు కథాసందర్భంతో సూక్తి కున్న లంకె. వాటిని సాధారణీకరణం చేసికొంటే సూక్తి స్వతంత్రంగా రాణిస్తుంది. రెండవపద్యం సూక్తికి ముక్తకం.

(7) సంభాషణలలో దొరలిన సాధారణ నీతులు : పాండవులు విరటుడి కొలువులో చేరేటప్పుడు పలికిన పలుకులలో లోకనీతికి, సేవానీతికి సంబంధించిన సూక్తులు సహజంగా రాణించాయి. ఆ పాత్రలలో ధర్మరాజు పాత్ర అగ్రగణ్యం. ఆయన సందర్భశుద్ధిగా మాట్లాడిన కొన్ని మాటలే వన్నెగల సూక్తులుగా భాసించాయి. మచ్చుకు.

(i) ‘ఉన్న రూప పలుకు నన్నరు లెక్కడఁ । గలరు? - ’ (విరా.1.191)

(ii) ‘నానావిధభూతమయము । మే నతి చంచలము ...’ (విరా.1.193)

భీముడు :

(iii) ‘కొలువు గొన నొల్లకుండుట । గలిగినఁ బొమ్మనుట యంతకంటెను మే(లు)- (విరా.1.224)

విరాటుడు :

(iv) “ఎల్లచుట్టములును దల్లియుఁ దోడును । జెలియుఁ బరిజనంబుఁ జెలువ నీకు
గురువ యింక నొక్క కొఱఁతయు లేదిందుఁ । జేరి బ్రదుకు బుద్ధి గౌరవమున”. (విరా.1.253)

నకులుడు :

(v) ‘దేవ ! తమ తమ । నేర్పు పనుల వెంట నెగడి బ్రదుకఁ వలయుఁగాక-’ (విరా.1.266)

(8) భార్యను గౌరవించటం పరమధర్మం : ద్రౌపది కీచకుడిని మందలిస్తూ చెప్పిన మాటలలో సూక్తులు కొన్ని ముత్యాలవలె మెరుస్తున్నాయి. వ్యాసుడు ద్రౌపదిని ధర్మప్రబోధిని వలె మలచాడు; తిక్కన నీతిసూచికవలె చిత్రించాడు. అందువలన తెలుగులోకంటె సంస్కృతంలోనే ద్రౌపది వాక్యాలు కొన్ని సూక్తులవలె రాణిస్తాయి. మచ్చుకు-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కీచకుడికి భార్యపట్ల పచరించవలసిన ధర్మాలను గురించి చెప్పినట్లు కొన్ని సంస్కృత ప్రతులలో కనపడుతున్నది. తిక్కన వాటిని గ్రహించలేదు. అయినా అవి మూలహృదయంలోని భాగంగానే గ్రహించాలి. ఆ శ్లోకా లివి-

"స్వేషు దారేషు మేధావీ కురుతే యత్న ముత్తమమ్ ।
స్వదారనిరతో హ్యాశు నరో భద్రాణి పశ్యతి ॥"

(తెలివిగలవాడు, తన భార్యయందు ఆసక్తి గల నరుడు శీఘ్రంగా శుభములు పొందుతాడు.)

"న చాధర్మేణ లిప్యేత నాపకీర్తి మవాప్నుయాత్।
స్వదారేషు రతిర్ధర్మో మృతస్యాపి న సంశయః॥"

(అధర్మం అంటకుండుగాక! అపకీర్తి పొందకుండుగాక! చచ్చినను తన భార్యయందు ప్రీతి ఉండటం ధర్మం. అందులో సందేహం లేదు.)

"స్వజాతి దారా మర్త్యస్య ఇహలోకే పరత్ర చ ।
ప్రేతకార్యాణి కుర్వన్తి నివాపై స్తర్పయన్తి చ
తదక్షయ్యం చ ధర్మంచ స్వర్గ్య మాహు ర్మనీషిణః॥"

(స్వజాతిభార్య భర్తకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ప్రేతకార్యాన్నీ, నువ్వుల నీళ్ళతో తర్పణాలనూ ఇస్తుంది. అవి క్షయం కాని ధర్మాన్నీ, స్వర్గాన్నీ కలిగిస్తా యని పెద్దలంటారు.)

"ప్రియా హి ప్రాణినాం దారా స్తస్మా త్త్వం ధర్మభాగ్ భవ ।
పరదారరతో మర్త్యో న చ భద్రాణి పశ్యతి ॥"

(జీవులకు భార్య మిక్కిలి ప్రియురాలు. కాబట్టి ధర్మవంతుడవు కమ్ము. ఇతరుల భార్యలను పొందగోరేవాడు శుభాలను పొందడు.)

"పరదారే న తే బుద్ధి ర్జాతు కార్యా కథంచన ।
వివర్జనం హ్యకార్యాణా మేతత్ సుపురుషవ్రతమ్ ॥"

(పరభార్యల మీద మనసు నిలుపరాదు. చేయరాని పనులు వదలివేయుటం మంచివారి లక్షణం.)

స్వీయదారా మాహాత్మ్యాన్ని చెప్పటం వలన కీచకుడు పరదారావ్యామోహాన్ని వదలుకొంటాడేమోనని ద్రౌపది నీతిబోధ చేసి ఉంటుంది. లోకంలో కొందరి పట్ల ఇటువంటి ప్రబోధం సత్ఫలితాల నివ్వ వచ్చును. (పై శ్లోకాలు డా॥ శలాక రఘునాథశర్మగారు అనువదించిన విరాటపర్వం నుండి గ్రహించటం జరిగింది. పు. 110-111).

(9) మహాత్ముల భార్యలను అవమానిస్తే మరణం తథ్యం :

"దిశః ప్రపన్నో గిరిగహ్వరాణి వా ।
Q® తO ష ఞ' ఉ_న్తరితోఽపివా క్షితేః ॥"

జుహ్వన్ జపన్ వా ప్రపతన్ గిరే స్తటా ।
ద్ధుతాశనాదిత్య గతిం గతోఽపివా ॥

భార్యాభిమన్తా పురుషో మహాత్మనాం।
నజాతు ముచ్యేత కథం చ నాహతః॥''

దిక్కులలో శరణు జొచ్చినా, కొండగుహలలో దూరినా, సొరంగంలోనికి చొరపడ్డా, భూగర్భంలోనికి ప్రవేశించినా, హోమాలూ, జపాలూ చేస్తున్నా, కొండకొమ్ముపై నుండి దూకుతున్నా, అగ్నివలె, ఆదిత్యుడి వలె పరుగెత్తుతున్నా మహాత్ముల భార్యను అవమానించినవాడు చావునుండి ఎన్నటికి తప్పించుకొనలేడు. (డా॥ శలాక రఘునాథశర్మగారి విరాటపర్వం. పు.115)

(10) పాపాత్ముడు వంశనాశకుడు : సుదేష్ణ కీచకుడి మదనోన్మాదాన్ని గమనించి, అతడికి మరణం తప్పదని భావించి, లోకులు తలచే సూక్తిని తలపోసినట్లు కొన్ని సంస్కృత ప్రతులలో కనపడుతున్నది.

“అపి చైతత్ పురా ప్రోక్తం నిపుణై ర్మనుజోత్తమైః।
ఏకస్తు కురుతే పాపం స్వజాతి స్తేన హన్యతే॥'' (శ.ర.శ.విరా.పు.121)

ఒకడు పాపం చేస్తాడు. దానితో అతడి కులమంతా నాశనమౌతుంది - అని పూర్వం విజ్ఞులన్నారు. కీచకుడి కథ చెప్పే నీతి ఇదే.

(11) ప్రజా రక్షణం ప్రభువుల ధర్మం :

కీచకుడిచేత తరుమబడి విరాటుడి సభాద్వారం వద్ద నిలిచి ద్రౌపది రాజుకు చేసిన అభ్యర్థన రాజధర్మనిర్వహణ ప్రబోధిని. ఈ క్రింది శ్లోకాలు కొన్ని ప్రతులలో ఉన్నాయి.

“ప్రజారక్షణశీలానాం రాజ్ఞాం హ్యమిత తేజసామ్।
కార్యం హి పాలనం నిత్యం ధర్మే సత్యే చ తిష్ఠతామ్॥

స్వప్రజాయాం ప్రజాయాం చ విశేషం నాధిగచ్ఛతామ్।
ప్రియేష్వపి చ ద్వేష్యేషు సమత్వం యే సమాశ్రితాః॥

వివాదేషు ప్రవృత్తేషు సమం కార్యానుదర్శినా।
రాజ్ఞా ధర్మాసనస్థేన జితౌ లోకావుభావపి॥'' (శ.ర.శ.విరా.పు.132-133)

ప్రజారక్షణమే స్వభావంగా గల తేజస్వులగు రాజులకు సత్యధర్మాలలో నిష్ఠ కలిగినవారిని రక్షించటం కార్యం. అటువంటి రాజులు తమ కన్నబిడ్డలనూ, ప్రజలనూ వేరుగా భావించరు. వారు ప్రియులపట్లా, ద్వేషించతగినవారిపట్లా సమభావాన్ని కలిగిఉంటారు. ధర్మాసనంమీద కూర్చొన్న రాజు సమదృష్టితో కార్యాలను సమీక్షిస్తే ఇహపరాలను పొందుతాడు.

(12) స్త్రీ సదా రక్షణీయ : విరాటుడి సభలో ధర్మరాజు ద్రౌపదికి స్త్రీ ధర్మాలు ఉపన్యసించినట్లు కొన్ని సంస్కృతప్రతులలో కానవస్తున్నది. ఆ శ్లోకాలలో ప్రసిద్ధమైనది.

“పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే।
పుత్రస్తు స్థావిరేభావే న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి॥'' (శ.ర.శ.విరా.పు.143)

బాల్యంలో తండ్రీ, యౌవనంలో భర్తా, ముసలితనంలో పుత్రుడూ స్త్రీని రక్షిస్తారు. కాబట్టి స్త్రీని ఎప్పుడూ రక్షణ లేకుండా ఆమె పాటికి ఆమెను వదలిపెట్టకూడదు. (ఈ సందర్భంలో స్వాతంత్ర్యం అనే మాటకు స్వేచ్ఛ అనే ఇప్పటి అర్థం కాదు) స్త్రీ సదా రక్షణీయ అని భావం.

(13) క్షమ ఉత్తమోత్తమ గుణం : ధర్మరాజు ద్రౌపదికి విరాటుడి సభలో క్షమాగుణ వైశిష్ట్యాన్ని వివరించాడు.

"క్షమా సత్యం, క్షమా దానం, క్షమా ధర్మః, క్షమా తపః ।
క్షమావతా మయం లోకః పరలోకః క్షమావతామ్ ॥

క్షమా ధర్మః 'క్షమా దానం, క్షమా యజ్ఞం, క్షమా యశః ।
క్షమా సత్యం, క్షమా శీలం, క్షమా కీర్తిః, క్షమా పరమ్ ॥

క్షమా పుణ్యం, క్షమా తీర్థం, క్షమా సర్వ మితి శ్రుతిః ।
క్షమావతా మయం లోకః పరశ్చైవ క్షమావతామ్ ॥
ఏతత్ సర్వం విజానన్తి సా క్షమా మనస్యద్యతే". (డా॥ వై. రామకృష్ణరావుగారి - విరాట భారతి. పుట. 34-35)

(14) మూలంలో ఉన్న కొన్ని ముచ్చటైన సూక్తులు :

1. ద్రౌపదికి భీముడి యెదుట చెప్పించినవి.

"భార్యాయాం రక్ష్యమాణాయాం ప్రజాభవతి రక్షితా ।
ప్రజాయాం రక్ష్యమాణాయా మాత్మా భవతి రక్షితః ॥

ఆత్మాహి జాయతే తస్యాం తేన జాయాం విదుర్బుధాః ।
భర్తా తు భార్యయా రక్ష్యః, కథం జాయా న్మమోదరే ॥

వదతాం వర్ణ ధర్మాంశ్చ బ్రాహ్మణానాం హి మే శ్రుతమ్।
క్షత్రియస్య సదా ధర్మో నాన్యః శత్రునిబర్హణాత్ ॥" (సం.4.20.27- 29)

సంతానాన్ని రక్షించుకొనటం అంటే తనను తాను రక్షించుకొనటమే. ఆత్మయే భార్యయందు జన్మిస్తుంది. అందుకే భార్య 'జాయ' అనబడుతుంది. భర్త తన కడుపున సంతానమై పుడతాడు కాబట్టి, భార్య కూడా భర్తను రక్షించుకొనాలి. వర్ణ ధర్మాలను చెప్పే బ్రాహ్మణులు ఇట్లా చెప్పారు. ఇవి భార్యనూ, భర్తనూ, సంతానాన్నీ పరస్పరం రక్షించుకొనే ధర్మాలు. తిక్కన వీటిని సందర్భశుద్ధిని గమనించి వదలివేసినట్లున్నాడు.

2. దుర్యోధనుడితో భీష్ముడు పాండవాన్వేషణోపాయాన్ని చెప్పే సందర్భంలో అనిన మాటలు.

"వృద్ధానుశాసనే తాత తిష్ఠతః సత్యశీలినః ।
అవశ్యం త్విహ ధీరేణ సతాం మధ్యే వివక్షతా ।
యథామతి వివక్తవ్యం సర్వశో ధర్మ లిప్సయా॥ " (సం.4.27.10 - 11)

పెద్దల మాటమీద విశ్వాసం గల సత్యశీలుడైనవాడు సజ్జనుల మధ్య ధీరుడై పలకాలి. ఎప్పుడూ ధర్మసాధనోద్దేశంతో యోగ్యమైన విధంగా పలకాలి. ఈ శ్లోక తాత్పర్యాన్ని తిక్కన సంభాషణలలో కలిపివేశాడు. (విరా.3.102). అందువలన సూక్తిగా రూపుకట్టలేదు.

3. కృపాచార్యుడు దుర్యోధనుడికి చెప్పిన రాజనీతి, యుద్ధనీతి -

"ఉచ్చావచం బలం జ్ఞాత్వా మధ్యస్థం చాపి భారత।
ప్రహృష్ట మప్రహృష్టంచ సందధామ తథా పరైః॥

సామ్నా దానేన భేదేన దణ్డేన బలి కర్మణా।
న్యాయే నాక్రమ్య చ పరాన్ బలా చ్చానమ్య దుర్బలాన్।
సాన్త్వయిత్వా చ మిత్రాణి బలం చాభాష్యతాం సుఖమ్।
సకోశ బల సంవృద్ధః సమ్యక్ సిద్ధి మవాప్స్యసి"॥ (సం.4.28.10 - 12)

శత్రువులతో తలపడేటప్పుడు ఉభయ బలాలలో ఉండే ఎక్కువ తక్కువలూ, సమస్థితులూ, రాగద్వేషాలూ గుర్తించాలి. సామ దాన భేద దండోపాయాలతో శత్రువులను స్వాధీనం చేసికొనాలి. తగినంత బలం లేని వారిని బలంతో లొంగదీసికొనాలి. మిత్రులను మంచిమాటలతో వశపరచుకొనాలి. స్వీయసేనల యోగక్షేమాలు విచారిస్తూ ఉండాలి. కోశాగారాన్నీ, సేనలనూ పెంచుకొంటే నీవు జయాన్ని సాధించగలవు. అజ్ఞాతంలో ఉన్న పాండవులను గుర్తించే మార్గాలను చర్చిస్తున్న సందర్భంలో ఈ మాటలు అంతగా పొసగవు. అందువలన తిక్కన ఈ యుద్ధనీతి వాక్యాలను వదలివేశాడు.

4. బృహన్నల ఉత్తరకుమారుడితో చెప్పిన క్షత్రియలక్షణం:

"నైష శూరైః స్మృతో ధర్మః క్షత్త్రియస్య పలాయనమ్।
శ్రేయస్తే మరణం యుద్ధే న భీతస్య పలాయనమ్॥" (సం.4.36.26)

శూరుడైన క్షత్రియుడి హృదయంలో పారిపోదామనే అధర్మమైన ఆలోచన రావటమే తప్పు. భయపడి పారిపోవటం కంటె రణరంగంలో చావటం మేలు.

5. కృపాచార్యుడు కర్ణుడితో పలికినమాటలలో యుద్ధనీతి.

"దేశకాలేన సంయుక్తం యుద్ధం విజయదం భవేత్।
హీనకాలం తదే వేహ ఫలవన్న భవత్యుత॥

దేశేకాలేన విక్రాన్తం కల్యాణాయ విధీయతే।
ఆనుకూల్యేన కార్యాణా మన్తరం సంవిధీయతామ్।
భారం హి రథకారస్య న వ్యవస్యన్తి పణ్డితాః॥" (సం.4.44.3-4)

దేశకాలాలు కలిసివచ్చిన యుద్ధం విజయాన్ని కలిగిస్తుంది. కాలం కలిసిరాకపోతే అది నిష్ఫలమౌతుంది. కాబట్టి దేశకాలాలను గమనించి పరాక్రమించటం మంచిది. దేశకాలాలు సరిపడితేనే యుద్ధకార్యాలు ఫలించేది. రథాలు తయారుచేసేవాడిమీద భారముంచి వివేకవంతులు యుద్ధాలకు పూనుకోరు. ఈ తాత్పర్యాన్నంతా తిక్కన ఒక కందపద్యంలో ధ్వనింపచేశాడు. (విరా.4.208).

6. ధర్మరాజు విరాటుడితో జూదంవలన కలిగే నష్టాలు చెప్పాడు. అది ఒక మంచి సూక్తిగా కుదిరింది.

"అస్మాత్క్షితి వినాశశ్చ, వాక్పారుష్య మనంతరమ్।
అవిశ్వాసం బుధై ర్నిత్యం ఏకాహ్నే ద్రవ్యనాశనమ్." (సం.4.64.34అనుబంధం)

జూదం వలన రాజ్యం నశిస్తుంది. వాక్పారుష్యం కలుగుతుంది. పండితులకు విశ్వాసం నశిస్తుంది. ఒక దినంలోనే ద్రవ్యమంతా నశిస్తుంది.

మొత్తంమీద గమనిస్తే మూలంలోని సూక్తులను తిక్కన బాగా తగ్గించాడు. దానివలన రచనలో చిక్కదనాన్నీ, ఔచిత్యాన్నీ పాటించాడు. మూలంలో సూక్తులను విడిగా ఎన్నవచ్చును. తిక్కన రచనలో సూక్తులను రచనలోనుండి పిండుకొనవచ్చును. ఒకటి శాస్త్రేతిహాస రచన. మరొకటి కావ్యేతిహాస రచన.

(15) విరాటపర్వం సూక్తి తిలకం :

సూక్తులన్నీ ఒక యెత్తు. ద్రౌపది సుదేష్ణతో పలికిన మాటలలోని సూక్తి ఒక్కటీ మరొక ఎత్తు.

"సాధులు చేరి నెమ్మిగ నిజస్థిర వృత్తము దుష్టకోటిచే
బాధలఁ బొందకుండఁ దమపాల వసించినఁ, బెద్ద వారు ది
క్కై ధరియించి వారి కొక యాపద పుట్టక యుండఁ గాచుటొ
ప్పై ధరఁ గీర్తి కెక్కదె? యపాయము సేసిన నింద వుట్టదే?" (విరా.2.95)

విరాటపర్వానికి తాత్త్విక తిలకం ఈ పద్యం. పలికింది కృష్ణ (ద్రౌపది).

తిక్కన ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సూక్తి తిలకంతో అలంకరించి, దాని తత్త్వాన్ని ఆవిష్కరిస్తాడు. పై పద్యంలో అజ్ఞాతవాసంలో ఉన్న ఆశ్రితులపట్ల ఆశ్రయ మిచ్చిన వారు నిర్వహించవలసిన ధర్మం చెప్పబడింది. అది విరాటపర్వానికి ధర్మమూలం.

మరి ఉద్యోగపర్వానికి సూక్తి తిలక మేది? ధర్మసూత్ర మేది?

ఉ. "సారపు ధర్మమున్ విమలసత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁబాఱిన దైన యవస్థ, దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారలచే టగుఁ గాని, ధర్మని
స్తారక మయ్యు, సత్యశుభదాయక మయ్యును దైవ ముండెడున్." (ఉద్యో. 3.273)

విరాటపర్వ సూక్తి తిలకం దిద్దింది కృష్ణ! ఉద్యోగపర్వ సూక్తి తిలకం నిలిపింది కృష్ణుడు! ఉభయపర్వాలకు ఉజ్జ్వల తిలకాలను అందించిన తిక్కన సోమయాజి ధన్యుడు!

26. విరాటపర్వం: ఆధ్యాత్మిక సందేశం

మహాభారతాన్ని అధ్యాత్మ విదులు వేదాంతంగా భావిస్తారు. ఇతిహాస వస్తువులో చెప్పబడే పాత్రలూ, సన్నివేశాలూ మొదలైనవి పైకి కథాకథనంలో భాగంగా కనపడుతున్నా అంతరార్థంలో అవి గూఢమైనవిగా తోచి, ఆధ్యాత్మిక సాధనను ధ్వనింపచేసే ప్రతీకాత్మక సందేశాన్ని అందిస్తాయని వేదాంతులు భావిస్తారు, వ్యాఖ్యానిస్తారు. అవి కావ్యగత తత్త్వానందాన్ని ఆస్వాదింపచేసి బ్రహ్మానందాన్ని పొందే ఆధ్యాత్మిక సాధనామార్గాన్ని ఆవిష్కరిస్తాయి. భారతకథ ఉత్తమోత్తమ ఆధ్యాత్మిక ప్రతీకాత్మక కావ్యేతిహాసం. అందులో విరాటపర్వం ఒక విశిష్ట సందేశకావ్యం.

1. పాండవులు - ముక్తిసాధనశక్తులు :

పాండవులు మత్స్యదేశాన్ని పాలించే విరాటుడి నగరంలో ఒక సంవత్సరంపాటు నియమం తప్పకుండా అజ్ఞాతవాసం చేయటం విరాటపర్వ ప్రధానేతివృత్తం. పాండవులంటే ముక్తి సాధనశక్తులు. పాండురాజు కుంతీదేవియందు యముడి అనుగ్రహంతో

ధర్మరాజును పుత్రుడుగా పొందాడు. అంటే - సాధకుడిలోని రజోమిశ్రిత సాత్త్వికవృత్తి, కుంతీవృత్తి అని పిలువబడే భూవిషయక వాసనావృత్తిని యమాది అష్టాంగ యోగకర్మ సాధనలద్వారా ముక్తి సాధకమైన ధర్మగుణాన్ని (ధర్మరాజును) పొందిందన్నమాట! ధర్మరాజంటే - యమనియమాద్యష్టాంగయోగంతో వెలిగే ధర్మప్రకాశం.

భీముడు వాయుపుత్రుడు. అంటే కుంభక ప్రాణాయామ యోగంతో సాధకుడు పొందే నిర్భయస్థితి - భీముడు భయంలేనివాడు కాబట్టి అభయసాధనా వృత్తి. అర్జునుడు ఇంద్ర తనయుడు. ఇంధతే ప్రకాశతే - అనే ధాత్వర్థంతో శరీరంలో మిలమిల ప్రకాశించే మనస్సు ఇంద్రుడు. ఋజుపదంనుండి అర్జునశబ్దం పుట్టుతుంది కాబట్టి - ఋజువర్తనం అనే అర్థం ఇస్తుంది. అందువలన అర్జునుడంటే సాధకుడి మనోనిగ్రహ సాధనాయోగంతో వెలుగొందే ఋజుశీలం, లేదా నిత్య సత్య ప్రభావం.

మాద్రి అశ్వినీదేవతలవలన నకుల సహదేవులను కవలలుగా కన్నది. అశ్వినీదేవతలు అద్వైతపరమాత్మ వృత్తులకు ప్రతీకలు. ప్రకృతిపురుషుల అద్వైతభావనం, ధ్యానం మాద్రీవృత్తి. న+కుల - అంటే భూ విషయకాంశాలను గ్రహించని అసంగస్థితి. దివ్ అంటే ప్రకాశం. సహదేవుడంటే సహజ ప్రకాశంతో కూడుకొన్న పరమాత్మ జ్ఞానవృత్తి.

కౌరవులు ముక్తి విరోధకాలైన ఐహిక వృత్తులకు ప్రతీకలు. వారు ధృతరాష్ట్రుడికి గాంధారియందు జన్మించారు. అంటే- తమోగుణంవలన వాసనలను పూర్తిగా గ్రహించే మనోవృత్తినుండి నూటొక్కరకాలైన తామసిక వృత్తులు పుట్టాయన్నమాట! వాటిలో మొదటి వృత్తి దుర్యోధన వృత్తి. దుర్+యోధనుడు= చెడుమార్గంలో యుద్ధం చేసేవాడు. అతడికి పాండవులంటే పడదు. అంటే-ముక్తి సాధనాశక్తుల ప్రగతిని ఎప్పుడూ ఎదుర్కొని నిరోధించే ముక్తి విరోధక శక్తులకు దుర్యోధనుడు నాయకుడన్నమాట! దుర్యోధనుడు మాయావి అయి పాండవుల కేర్పరచిన అరణ్య అజ్ఞాతవాస నియమాలు ముక్తినిరోధకమైన అవరోధాలే. ఆ అవరోధాలను క్రమంగా జయించి సాధన కనుకూలంగా మలచుకొనటమే పాండవుల అరణ్యాజ్ఞాతవాస కథలోని అంతరార్థం.

ధర్మరాజు అసలు పేరు యుధిష్ఠిరుడు. అంటే, యుధి= యుద్ధమునందు; స్థిరుడు= నిశ్చలంగా ఉండేవాడని అర్థం. తామసిక వృత్తులు (కౌరవులు) తమను అంతం చేయటానికి దుర్నీతితో (దుర్యోధనుడు) పోరాడుతుంటే, సాత్త్విక వృత్తి అయిన ధర్మతేజం (ధర్మరాజు) ధర్మంనుండి చలించకుండా నిలకడగా తమోవృత్తులతో యుద్ధం సాగించే ప్రవృత్తికి ప్రతినిధి కాబట్టి ఆయనకు ఆకాశవాణి ఆపేరు పెట్టింది. అతడికి ఎల్లప్పుడూ భీమార్జున నకుల సహదేవుల సహాయం ఉంటుంది. అంటే ముక్తి సాధనమైన సాత్త్విక ధర్మప్రవృత్తికి అభయం, ఋజువర్తనం, అసంగచిత్తవృత్తి, జ్ఞానవృత్తి సహాయకంగా, పోషకంగా ఉంటాయన్నమాట. వీరందరూ కలిసి తామసిక వృత్తులతో యుద్ధం చేస్తారు. ఒక్కొక్కసారి ఒక్కొక్కరుగా చేసినా యుధిష్ఠిర శక్తిగా వారు రాణించటం గమనార్హం!

పాండవపత్ని ద్రౌపది. ఆమె పేరు కృష్ణ. ద్రౌపది సాధకుడి మనసులోని ముక్తి కామనకు ప్రతీక. అందుకే ఆమెను నివృత్తి తత్త్వమని (కృష్ణ అని) పిలుస్తారు. ఆమె పంచపాండవుల భార్య. ఆమె అట్లా పాండవపత్ని కావటానికి పంచేంద్రోపాఖ్యానం కారణం. ఒకే ఇంద్రుడు అయిదు రూపాలు తాల్చాడని ఆ ఉపాఖ్యానం చెప్పింది. ఇంద్రుడు మనస్సుకు ప్రతీక కాబట్టి పాండవులు అంటే - అష్టాంగ యోగసాధన, అభయసాధన, ఋజువర్తన సాధన, ఐహిక భోగవిరక్తి సాధన, జ్ఞాన ప్రకాశ సాధన - అనే పంచసాధనలు మనస్సంయమనానికి సంబంధించినవే కావటంచేత ద్రౌపది పాండవపత్ని అయింది. అంటే ఒక మనస్సే అయిదు సాధనలను గ్రహించగా ముక్తికామన వాటి నాశ్రయించి ప్రసరిస్తుంది - అని అంతరార్థం.

2. అజ్ఞాతవాసం - అహంకార మమకారనాశన సాధన :

ఈ విధంగా ముక్తి సాధన శక్తులుగా భావించబడే పాండవులూ, ద్రౌపదీ కలిసి అజ్ఞాతవాసంలో మారుపేర్లతో, మారు వృత్తులలో విరాటుడిని సేవిస్తూ నియమాన్ని పూర్తి చేసి నిజస్థితిని పొందారు. ఈ కథలోని అంతరార్థాన్ని ఆధ్యాత్మికంగా అందుకొనాలి. దాని కనుగుణంగా ఆధ్యాత్మిక ప్రతీకాత్మక తత్త్వార్థసంభావనం చేయాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

1. అరణ్యావాసం = పాండవులు పన్నెండేళ్ళ అరణ్యావాసాన్ని ముగించారు= సాధకుడిలో ముక్తిని కోరే సాత్త్విక వృత్తులు - పది ఇంద్రియాలూ, మనస్సు, వాసనావృత జీవుడూ అనే పన్నెండు జీవప్రకృతి తత్త్వాలలోనూ ప్రశాంత స్థితిలో ఉండగలిగేటట్లు చేసే ఆధ్యాత్మిక సాధన పన్నెండేళ్ళ వనవాసం. దానిని ముగించి, ఆ తరువాత వారు అజ్ఞాతవాసాన్ని స్వీకరించారు.

2. అజ్ఞాతవాసం = అహంకార మమకార నాశన సాధన. అంటే సాధకుడిలో ముక్తిని కోరే సాత్త్విక వృత్తులు 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే సాధనా క్రమాన్ని ఎన్నుకొన్నాయన్నమాట.

3. అరణ్య అజ్ఞాతవాసాలు = అహం బ్రహ్మా-స్మి, సర్వం ఖల్విదం బ్రహ్మ-అనేవి సాధనలు; ఈ రెండూ సాధించటం పూర్ణయోగం-జీవన్ముక్తావస్థను చేరుకొనే సాధనాక్రమం. అరణ్యపర్వంలో సాత్త్విక వృత్తులు శరీర ప్రవృత్తులలో ప్రతిదానిలోనూ ఉన్న వినశ్వరశీలమైన గుణాన్ని గుర్తిస్తూ నేతి నేతి వాదంతో నిషేధించుకొంటూ చివరకు శరీరంలోని మనోబుద్ధ్యహంకారాలనే అంతఃకరణ చతుష్టయంలో చిట్టచివరిదైన 'అహం' అనే దాని యొక్క బ్రహ్మతత్త్వాన్ని గుర్తించి, దానిని బ్రహ్మగానే తెలియటం అరణ్యపర్వం ధ్వనింపజేసే ఆధ్యాత్మిక సాధన. ఈ సాధన ముగిసిన తరువాత 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే సాధన చేపట్టాలి. అదే అజ్ఞాతవాసంలోని ఆధ్యాత్మికమైన అంతరార్థం. ఈ సాధనలో సర్వప్రకృతిలోనూ ప్రతిబింబంగా భాసిస్తూ, దానిని పుట్టించి, పోషించి, లయింపజేసే చైతన్యపురుషుడిని పరబ్రహ్మతత్త్వంగా గుర్తించటం జరుగుతుంది. అప్పుడు ప్రకృతిలోని ప్రతిపదార్థమూ అవినశ్వరమైన బ్రహ్మస్వరూపమే అనే విజ్ఞానం సాధకుడికి సిద్ధిస్తుంది. అంటే - సాధకుడు సాధనలలో సర్వప్రకృతినీ నిషేధిస్తూ ఆరోహణ క్రమంలో సాగి తానే బ్రహ్మముగా గుర్తించి, తిరిగి అవరోహణ క్రమంలో - మొదట తానే నిషేధించిన ప్రకృతినంతా బ్రహ్మమయంగానే దర్శించటం - అని తాత్పర్యం.

3. విరాటపర్వం - ప్రకృతిని బ్రహ్మమయంగా దర్శించటం :

విరాటపర్వం అంటే ప్రకృతినంతా బ్రహ్మమయంగా దర్శించటం. దానికి అనుగుణంగా సాగే ఆధ్యాత్మిక సాధనను ఇందులోని పాత్రలూ, సన్నివేశాలూ ప్రతీకాత్మకంగా ధ్వనింపచేస్తూ ఉంటాయి. వాటిని ఈ క్రింది విధంగా భావించవచ్చును.

(i) మత్స్య దేశాన్ని పాలించే వాడు విరాటరాజు= అహంకార మమకారాలను నశింపజేసే సాధనా నిలయంలో సాధించదగిన తత్త్వం- వివిధ ప్రకృతి జీవులలోనూ ప్రకాశిస్తూ ఉన్న పరమాత్మ తత్త్వం. మత్+స్యదేశం= అహంకార మమకారాలను నశింపచేసే సాధనాస్థలం. వి+రాట్= వివిధ రూపాలతో ప్రకృతిలో ప్రకాశించే పరబ్రహ్మ తత్త్వం - అని శబ్దవ్యుత్పత్తుల నాశ్రయించి ప్రతీకలుగా భావించాలి. ఆ తత్త్వాన్ని ముక్తిసాధనాలైన సాత్త్విక శక్తులు సేవిస్తాయి (ఉపాసిస్తాయి).

(ii) శమీవృక్షం మీద ఆయుధాలు దాచటం = శమి అంటే శమం = ఇంద్రియ నిగ్రహం. ఆయుధాలు= తామసిక వృత్తులు: ఇంద్రియ నిగ్రహంతో తామసిక వృత్తులు బయటపడకుండా గుప్తంగా అణచి ఉంచటం.

(iii) పాండవులు, ద్రౌపది సేవావృత్తులను స్వీకరించటం= ముక్తిసాధన శక్తులు రాజసవృత్తులను దూరంగా ఉంచటం.

(iv) అజ్ఞాతవాస జీవితాలకు అనుగుణమైన రూపాలను తాల్చటం= విరాట్ పురుష ధ్యానయోగంలో ప్రవేశించే సాధనావస్థలను ఎన్నుకొనటం.

(v) **కంకుభట్టు :** యుధిష్ఠిరుడు కంకుడనే పేర బ్రాహ్మణసన్న్యాసి రూపం తాల్చి అక్షముల సాయంతో విరాటుడి కొలువులో చేరి అతడికి మిత్రుడిగా కుదురుకొనటం= కంకుడంటే యముడనీ, కంకతే ఉద్గచ్ఛతే ఇతి కంకః - అనే వ్యుత్పత్తిని ఆశ్రయించి ఉన్నతస్థితికి ఎగిరే సాధనావృత్తి అనీ, బ్రహ్మమును చేర్చే సాధన అనీ గ్రహించాలి. బ్రాహ్మణసన్న్యాసి వేషమంటే - బ్రహ్మభావనమని అర్థం. అక్షములంటే ఇంద్రియ వ్యాపారాలు. అవి కృష్ణ లోహిత వర్ణాలు కలవి. అంటే - తామసిక రాజస గుణాలని భావం. సుహృత్ద్యూత మంటే అన్నిటిని సాధించే మానసిక వ్యాపారమని భావం.

దీనివలన గ్రహించవలసిన తాత్పర్యం ఇది- అష్టాంగ యోగసాధన మనే ముక్తి సాధన శక్తి బ్రహ్మమును చేరే సాధనగా భావించి, విజృంభించి దానికి తగిన సిద్ధుల నన్నింటినీ సాధించటానికి రాజస తామసిక గుణాలను క్రీడామాత్రంగా నిగ్రహించి 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే ఆధ్యాత్మికానుభవాన్ని పొందటం. అదే సాధన కంకపాత్ర మన కందించే ఆధ్యాత్మికానుభూతి.

(vi) **వలలుడు** : భీముడు వలలుడనే పేర వంటలవాడుగా, మల్లుడుగా విరాటుడిని సేవిస్తూ వినోదాన్ని కలిగిస్తాడు. భీముడంటే అభయవృత్తి. వలలుడు అనే పదానికి 'వబయో రభేదః' అనే న్యాయాన్ని అనుసరించి బలలుడు - లేదా శక్తిమంతుడు అని అర్థం. దీనినిబట్టి అభయ సాధనా ప్రవృత్తి విశేష ప్రయోజనం సాధించే విధంగా గొప్ప శక్తిని ప్రదర్శిస్తూ సాధనలో బలంగా పాల్గొనటం - అనే ఆధ్యాత్మిక సాధనను వలలుడి వృత్తం వ్యక్తం చేస్తుంది.

(vii) **బృహన్నల** : ఋజువర్తనకే మారుపేరైన అర్జునుడు బృహన్నలగా మారాడు. బృహన్నల= బృహత్+నల, 'న, లాతి, గృహ్ణాతి, ఇతి నలః' అనే వ్యుత్పత్తి నాశ్రయించి నల - అంటే దేనినీ గ్రహించని అసంగవృత్తి అని గ్రహించ వీలౌతుంది. బృహత్- అంటే గొప్పది అని అర్థం. కాబట్టి బృహన్నల అనగా - ఎంతో గొప్ప స్థాయిలోని అసంగవృత్తి అని భావం. బృహన్నల వేషం స్త్రీ పురుష లక్షణాలు లేని షండం. అది పరమాత్మతత్త్వం వంటిది. నాట్యం అంటే అనుకరణం. తాత్త్వికంగా దానిని గ్రహిస్తే - గురువులు బోధించిన సాధనాభ్యాసాలను అనుకరిస్తూ పరమాత్మను పొందటం అని చెప్పాలి. దీనిని సమన్వయించుకొంటే - సాధకుడిలోని ఋజువర్తన శీలం గురుశిక్షణ క్రమంతో గొప్పదైన అసంగవృత్తితో 'సర్వం ఖల్విదం బ్రహ్మ' సాధనకు ఉపక్రమించటం - అని తాత్పర్యం.

(viii) **దామగ్రంథి** : నకులుడు దామగ్రంథి నామంతో విరటుడి కొలువులో అశ్వశిక్షకుడుగా చేరాడు. భూసంబంధమైన (భౌతికమైన విషయ సుఖాలను) ఆశించని మానసిక ప్రవృత్తి నకులుడు. అత డిప్పుడు దామగ్రంథి సాధనలో నిలిచాడు. అంటే దండను గట్టిగా ముడివేసే ప్రవృత్తిలో సాధన సాగించాడని భావం. ఐహిక భోగవిరక్తి వృత్తిని గట్టిగా ముడివేసి నడిపించటం దామగ్రంథి సాధన. అతడి వృత్తి అశ్వశిక్షణ. అశ్వాలు ఇంద్రియాలకూ, ప్రకృతికీ ప్రతీకలు. అశ్వశిక్షణ అతడి వృత్తి. అంటే ఇంద్రియాలను 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే సాధనకు అనుగుణంగా శిక్షించటం (నియమించటం) అతడి వృత్తి. దీనిని ప్రకృతి శిక్షణ అని కూడా అంటారు. తాత్పర్య మేమంటే- ప్రకృతి (ఇంద్రియ) శిక్షణ కార్యాన్ని ఐహిక భోగ విరక్తిగల చిత్తవృత్తితో గట్టిగా ముడివేసి 'సర్వం ఖల్విదం బ్రహ్మ' సాధనను సాగించటం దామగ్రంథి పాత్ర మనకు బోధించే ఆధ్యాత్మిక తత్త్వం.

(ix) **తంత్రీపాలుడు** : సహదేవుడు తంత్రీపాలుడనే పేరుతో గోసంరక్షణ కార్యాన్ని చేపట్టి విరాటుడిని సేవించాడు. సహదేవుడు జ్ఞాన ప్రకాశంతో వెలుగొందే చిత్తవృత్తికి ప్రతీక. తంత్రీపాలుడంటే- క్రమం తప్పని ధారావాహికమైన ధ్యాన శిక్షణావృత్తి. గోరక్షణం అంటే ఇంద్రియ వృత్తులను రక్షించి సాధన సాగించటం. మొత్తంమీద తాత్పర్య మేమంటే-జ్ఞానంతో ప్రకాశించే మనః ప్రవృత్తిని సక్రమ శిక్షణ పద్ధతిలో నిరంతరంగా దృఢపరచి, ఇంద్రియ వ్యాపారాలను సాధన కనుగుణంగా తోడ్పడేటట్లు రక్షించుకొంటూ 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే ఆధ్యాత్మిక స్థితిని సాధించటమే సహదేవుడు తంత్రీపాలుడుగా గోరక్షణ చేసే వృత్తి మనకందించే పరమార్థం.

(x) **మాలిని (సైరంధ్రి)** : ద్రౌపది మాలిని అనే పేరుతో సైరంధ్రీ వేషం ధరించి విరాటుడి పట్టమహిషి అయిన సుదేష్ణ అంతఃపురంలో సైరంధ్రిగా చేరింది. దీనిని ఆధ్యాత్మికంగా భావించాలి. ద్రౌపది అంటే ముక్తికామన. మాలిని అంటే 'మాలము' కలది. 'మాల మున్నత భూతలమ్' అనే అర్థాన్ని గ్రహిస్తే ఉన్నతస్థితిని పొందేది అని భావం. ఆమె వృత్తిచేత సైరంధ్రి. సీరంధ్ర అనే పదం మీద స్వార్థంలో 'అణ్' ప్రత్యయం చేరితే వృద్ధి వచ్చి సైరంధ్ర ఔతుంది. స్త్రీ పరంగా జీప్ చేరిస్తే సైరంధ్రీ ఔతుంది. సీ= నాశనం చేసేది; రంధ్రం= లోపం. కాబట్టి లోపాలను నశింపజేసే మనఃప్రవృత్తి సైరంధ్రీవృత్తి.

(xi) **సుదేష్ణ** : సుధేష్ణ అనే పదానికి తద్భవం సుదేష్ణ. ఈ శబ్దాన్ని రెండు రకాలుగా భావించవచ్చును. సు+ధా+ఈషణ= సుధేషణ; సు+ధిషణ= సుధిషణ. వీటినే సుధేష్ణగా పేర్కొన్నారు. సు= చక్కగా; ధా= ఉంచిన; ఈషణ= కోరికలు కలది సుధేషణ అని అర్థం. కోర్కెలను నిగ్రహించి సమస్థితిలో ఉంచే మానసిక ప్రవృత్తి అని తాత్పర్యం. సు= చక్కని; ధిషణ= బుద్ధి కలది -

అంటే ముక్తిని సాధించాలనే మనోవృత్తి అని భావం. ఆమెను ద్రౌపది సేవించింది. అంటే మోక్షసాధన ప్రవృత్తిని మోక్ష కామన భజించిందని భావం.

(xii) **షడ్విధాత్మగతానుశీలములు :** ముక్తి సాధన శక్తులు ఆరు - ముక్తి సాధన ప్రవృత్తులను ఆరింటిని ఎన్నుకొని, వాటి స్వభావాన్ని సూచించే మారుపేర్లను పెట్టుకొని 'సర్వం ఖల్విదం బ్రహ్మ' సాధనను సాగించాయి. ఆ సాధనలో ఆరు రకాలైన ఆత్మగతానుశీలన పద్ధతులు ద్రౌపదీపాండవుల పాత్రల ప్రవర్తన పద్ధతులలో ప్రకటితమయ్యేటట్లు చిత్రించబడ్డాయి. వాటిని సూక్ష్మంగా ఇట్లా భావించవచ్చును.

(1) సఖ్యం - ధర్మరాజు విరాటుడిని స్నేహప్రవృత్తితో సేవించాడు.

(2) ఆత్మ నివేదనం - భీముడు తన బలసంపదనంతా విరాటుడిని సేవించటంలో ధర్మరక్షణపరంగా సమర్పించుకొన్నాడు.

(3) భగవంతుడి కొరకు సమస్త కర్మాచరణం - అర్జునుడి జీవితం అటు అంతఃపురంలో నాట్యాచార్యుడుగా, యుద్ధభూమిలో శత్రు సంహారశక్తిగా ప్రకాశించి విరాటుడి అంతర్బహిశ్శత్రు మర్దన సర్వకార్య చతురుడై భాసించాడు.

(4) అవసరమయ్యేటంత వరకు విషయ స్వీకారం - ఇది నకులుడి వర్తనకు తగింది. నకులుడు అశ్వరక్షకుడిగా పరోక్షంగా, విరాటుడికి యుద్ధ ప్రక్రియలో ప్రత్యక్షంగా, పరిమితంగా సహాయపడ్డాడు.

(5) భగవంతుడికై సర్వభోగవర్జనం - గోరక్షణ వృత్తిలో విరాటుడిని సేవించిన సహదేవుడి శీలంలోని అంకితభావం ఇందులో స్ఫురిస్తుంది.

(6) సాధుమార్గానువర్తనం - ఇది విరాటపర్వంలోని ద్రౌపది ప్రవర్తనలో ముమ్మార్తులా ప్రత్యక్షమౌతుంది.

4. కీచక వధ - మనశ్చాంచల్య నివారణ సాధన :

కీచక మంటే లోపల గుల్లగా ఉన్న వెదురు బొంగు. అది గాలికి ఈలలు వేస్తుంది. అట్లాగే కీచకుడు కూడా మనస్సులో ధర్మప్రవృత్తి లేక చరించే కాముకుడు, చంచలుడు, రాగజీవి. కాబట్టి మనశ్చాంచల్యానికి అతడు ప్రతినిధిగా భావించాలి. వేదాంతుల పరిభాషలో దీనిని అపరాశక్తియొక్క చంచల మనోవ్యాపారంగా గ్రహించవచ్చును. కీచకుడు సుదేష్ణ సోదరుడు. సుదేష్ణ మోక్షసాధన చిత్తవృత్తి. ఆమె పరాశక్తి యొక్క సుస్థిర మనోవ్యాపారమైతే కీచకుడు అపరాశక్తియొక్క చంచల మనోవ్యాపారం. అతడు విరాటుడి సేనాపతి. అంటే - విశ్వ ప్రకృతియొక్క వృత్తులను నడిపించే చంచలాత్మకమైన మనస్సని గ్రహించాలి. అతడు సైరంధ్రిని మోహించాడు. ఆమెను కోరాడు; ఆమెయొక్క సైరంధ్రీ వృత్తికీ, సుదేష్ణ సేవకూ, అజ్ఞాతవాస వ్రతానికీ అడ్డు తగిలాడు. అంటే - మోక్షసాధన చిత్తవృత్తి నాశ్రయించిన మోక్షకామన దోషాలను తొలగించుకొనే సాధనలో ఉండగా విషయ వాసనలతో కూడుకొన్న చంచలమనఃప్రవృత్తి అడ్డుతగిలి, ఆధ్యాత్మిక సాధనకు విఘ్నం కలిగించటానికి యత్నం చేసిందన్న మాట. చంచలమనఃప్రవృత్తి మోక్షకామనను తన వశం చేసికొని చెరచటానికి ప్రయత్నిస్తుంది. మోక్షసాధన చిత్తవృత్తిని వక్రమార్గం పట్టించటానికి యత్నిస్తుంది. మదిర వంటి మోహంలో ముంచటానికి పూనుకొంటుంది. విషయ భోగరుచులను ఎరగా చూపిస్తుంది. అట్లాగే కీచకుడు తన అక్కను ఒప్పించి సైరంధ్రిని కల్లు నెపంగా తన మందిరానికి వచ్చేటట్లు చేశాడు.

ద్రౌపది కీచకుడి బారిన పడకుండా రక్షించటానికి సూర్యుడు ఒక రాక్షసుడిని సృజించి అదృశ్యశక్తిగా ఆమెకు రక్షగా నిలిపాడు. సూర్యుడు జ్ఞానతేజస్సుకు ప్రతీక. సాధకుడిలో సంస్కారరూపంగా ఉన్న జ్ఞానం ప్రబుద్ధమై చాంచల్యరూప విఘ్నాన్ని ఎదుర్కొని, దానినుండి తప్పించుకొనే సహజ ప్రతిభను ప్రదర్శిస్తుంది - అని దీని తాత్పర్యం. సైరంధ్రిని తాకిన కీచకుడు సూర్యుడు పంపిన రాక్షసశక్తి ప్రయోగానికి తట్టుకొనలేక నేలపై పడతాడు. అంటే - అపరాశక్తి సాధకుడిలో హఠాత్తుగా ఉద్దీప్తమైన జ్ఞానదీప్తిని తట్టుకొనలేక కూలిపోయిందని భావం. అయినా కీచకుడు మోహాన్ని వీడలేదు. ద్రౌపది కీచకుడిని తుదముట్టించాలని సంకల్పించింది. అంటే చాంచల్య ప్రభావం తనమీద పడకుండా తనను తాను ఉద్ధరించుకొనటానికి యత్నించిందని భావం. ఆ

ప్రయత్నంలో భీముడిని ఆశ్రయించింది. అంటే-అభయవృత్తిని ఆశ్రయించింది. అతడు కీచకుడిని బృహన్నల విద్యాలయమైన నర్తనశాలలో రాత్రివేళ రహస్యంగా చంపే ఉపాయం పన్నాడు. దానికి తగ్గట్లుగా ద్రౌపది సహాయాన్ని తీసికొన్నాడు. కీచకుడిని మల్లయుద్ధంలో తుదముట్టించాడు. ఈ అంశాన్ని ఆధ్యాత్మికంగా భావిస్తే ఇట్లా ఉంటుంది - అభయవృత్తి విజృంభించి, ఋజువృత్తికి సంబంధించిన కార్యక్షేత్రంలో చరించి, ముక్తికామనకు విఘ్నంగా నిలిచిన చంచలత్వాన్ని బలవంతాన అణచివేసే తీవ్రయత్నం చేసిందన్నది కీచకవధలోని తత్త్వ రహస్యం.

భీముడు చేసిన ఉపకీచక సంహారానికి కూడా అంతరార్థం ఉన్నది. సాధకుడిలో చాంచల్యం తొలగినా దానిని పునరుద్ధరించి మోక్షకామనకు దానితో ముడిపెట్టి తుదముట్టించాలని మనసులోని మాయావ్యాపారాలన్నీ కలిసి కృషి చేస్తాయి. వాటిని నిర్దయగా ఒక్కసారిగా అణచి వేయటం కర్తవ్యం. ఆ పని అభయవృత్తితో మోక్షకామన సాధించగలుగుతుందని ఉపకీచక వధ తత్త్వబోధ చేస్తుంది.

భర్త యొక్క ప్రేరణతో సుదేష్ణ సైరంధ్రిని బహిష్కరించటానికి యత్నించటం అజ్ఞాతవ్రతంలో అంతఃపుర పరంగా ఏర్పడిన పెద్ద విఘ్నం. దీనిని తట్టుకొంటే మోక్షకామన విజయం సాధించినట్లే. విఘ్నాలలో ప్రకృతికి సంబంధించిన భయాదులు, బుద్ధికి సంబంధించిన అనుమానాలూ ప్రధానమైనవి. విరాటుడూ సుదేష్ణా ఆ రెండు విఘ్నాలనూ సైరంధ్రికి కల్పించారు. ఆమె గంధర్వపతుల ఆగ్రహానుగ్రహాలను గూర్చి చెప్పి తన సైరంధ్రీ వృత్తిని స్థిరపరచుకొన్నది. అంటే మోక్ష కామనకు అంతశ్శత్రువులు (అంతఃపురంలోని శత్రువులు) ఎదురైతే తనలో దివ్యశక్తులను ప్రదర్శించగలిగిన యమ నియమాది అష్టాంగ యోగాది సిద్ధులను చూపించి వాటిని దమించటం జరుగుతుంది. ఈ తాత్పర్యమే సుదేష్ణ కొలువులో ఆమెకు గంధర్వభయాన్ని కలిగించి సైరంధ్రి నిర్భయంగా జీవించటంలో ధ్వనింపజేయబడుతున్నది.

మొత్తంమీద కీచకవధ మనశ్చాంచల్య నివారణ సాధనను బోధిస్తుందని తాత్పర్యం.

5. దుర్యోధన దురాలోచన - తామసికవృత్తుల విజృంభణ

(1) దుర్యోధనుడి గూఢచారులు అజ్ఞాతవాసంలో ఉన్న పాండవులను గుర్తించలేకపోయారు= దుర్యోధనుడంటే చెడు మార్గంలో ముక్తిసాధన శక్తులను నాశనం చేయాలని యత్నించే తామసిక ప్రవృత్తి. అతడి చారులు అతడి దుష్టమైన ఆలోచనలకు, యత్నాలకు ప్రతినిధులు. వారికి యమ నియమాభయ ఋజువర్తనాది వృత్తులు గుప్తంగా జ్ఞానంలో లీనమై సర్వప్రకృతి యందు బ్రహ్మాన్ని దర్శించే యోగంలో బ్రహ్మాభేద స్థితిని సాధించి ఉండటం చేత, అట్టి సాత్త్వికవృత్తులను తామస వృత్తులు గుర్తించలేకపోయాయి. దుర్యోధనుడు స్వయంగా తామసవృత్తులకు నాయకుడు కావటం చేత అతడూ విఫలుడైనాడు.

(2) దుర్యోధనుడు భీష్మ ద్రోణ కృపాశ్వత్థామల సలహాలను కోరాడు. భీష్ముడు పాండవులుండే దేశ లక్షణాలు చెప్పాడు. దుర్యోధనుడి నాశ్రయించి ఉన్న భీష్మాదులు బ్రదుకు తెరువుకై తామసవృత్తుల నాశ్రయించి స్వేచ్ఛను కోల్పోయి ఉన్న సాత్త్విక వృత్తులు. వీరిని పాక్షిక సాత్త్వికవృత్తు లనవచ్చును. ఈ పాక్షిక సాత్త్విక వృత్తులు సాధకులలో శుద్ధ సాత్త్విక వృత్తులు గూఢంగా ఏ విధంగా ఉంటాయో తెలిసికొని చెప్పగలరు. కాని, వాటిని బహిర్గతం చేయలేవు. భంజించలేవు. అందువలన భీష్ముడి సలహా ననుసరించి పాండవుల అజ్ఞాతవాసవ్రతాన్ని భగ్నం చేయటానికి దుర్యోధనుడు యత్నం చేశాడు. అంటే పాక్షిక సాత్త్విక వృత్తుల సహాయంతో మోక్ష సాధన వృత్తులను గుర్తించే మెలకువ తెలిసికొన్నాడన్నమాట. తామస వృత్తులతోనే కాక, పాక్షిక సాత్త్విక వృత్తులవలన కూడా మోక్షసాధన వృత్తులకు విఘ్నాలు తప్పవన్నమాట!

(3) కీచక సంహార వార్త ఒక కీలకం. కీచకుడిని చంపింది భీముడనీ, దానికి కారణమైన వనిత ద్రౌపది అనీ దుర్యోధనుడు ఊహించాడు. ముక్తికామన సాధనలోని లోపాలను సరిచేసే మనఃప్రవృత్తితో ప్రేరేపించబడిన అభయవృత్తిచేత మనశ్చాంచల్యాన్ని తుదముట్టించగలదన్న కీలకాన్ని తామసవృత్తి పసికట్టింది. దొంగ గుట్టు దొంగకే తెలుసు. అందుకే దుర్యోధనుడికి కీచకవృత్తాంతం కీలకమై తోచింది. కర్ణాదులకు ఆ రహస్యం తోచకపోవటానికి కారణం వారు శుద్ధ తామసగుణ వృత్తులు కాకపోవటమే.

6. గోగ్రహణ వ్యూహం - ఇంద్రియ వ్యాపారాల వశీకరణ యత్నం

దుర్యోధనుడు పాండవులను గుర్తించి వారిని మరల అరణ్యాజ్ఞాతవాసాలకు పంపాలని దురాలోచనం చేశాడు. పాండవులను గుర్తించటానికి గోగ్రహణం ఉపాయమయింది. అంటే బ్రహ్మానుభవ యోగంలో మునిగి ఉన్న ఇంద్రియ వృత్తులను వక్రమార్గానికి మళ్ళించి తామసిక వృత్తుల అధీనంలోకి తీసికొని రావాలని చేసే తామసిక ప్రయత్నం గోగ్రహణ యత్నం.

గోగ్రహణం రెండు ముఖాలుగా సాగింది. 1. దక్షిణ గోగ్రహణం 2. ఉత్తర గోగ్రహణం. దక్షిణగోగ్రహణమంటే దక్షిణ దిక్కున ఉన్న విరాటుడి గోవులను గ్రహించటమని బాహ్యార్థం. సాధకుడిలో 'సర్వం ఖల్విదం బ్రహ్మ' సాధనలో సమర్థములైన ఇంద్రియాల గుట్టు మట్టులను గ్రహించటమని అంతరార్థం. ఉత్తర గోగ్రహణమంటే ఉత్తర దిక్కున ఉన్న విరాటుడి గోవులను గ్రహించటమని బాహ్యార్థం. సాధకుడిలోని సాత్త్విక శక్తులతో నిత్యం పోరాటం సాగించే అపరాశక్తి యొక్క తామసిక వృత్తి (దుర్యోధనుడు) పాక్షిక సాత్త్విక వృత్తుల (భీష్మాదుల) సాయంతో అహంకారమమకార వృత్తులను నాశనం చేసే దేశంలో (మత్స్యదేశంలో) విశ్వ ప్రకృతిలో (విరాటుడి) శ్రేష్ఠమైన మార్గంలో (ఉత్తర దిశలో) ఉన్న ఇంద్రియ వ్యాపారాలను (గోవులను) పట్టుకొని ముక్తి వృత్తులను (పాండవులను గుర్తించి) నాశనం చేసే ప్రయత్నం - అని ఉత్తర గోగ్రహణంలోని అంతరార్థం.

7. దక్షిణ గోగ్రహణం - అభయవృత్తి విజయం

(1) త్రిగర్తాధీశుడయిన సుశర్మ దక్షిణ గోగ్రహణం చేశాడు= సు+శర్మ అంటే చక్కని మోక్షసుఖం అని భావం. త్రిగర్త దేశం అంటే త్రిపుటీసాధన. ధ్యాత ఒక్కటే తప్ప ధ్యేయం ధ్యానం వేరుగా లేవని తెలిసి, తానే సర్వప్రకృతి స్వరూపంగా తెలిసికొనటం త్రిపుటీ సాధన. సాధకుడే సాధ్యమైన భగవంతుడూ, సాధకుడే సాధనలూ కూడ ఔతాడు- అని గుర్తించే సాధన సుశర్మ. మోక్షం త్రిపుటీ సాధన వలననే సాధ్యం అనే విశ్వాసానికి సుశర్మ ప్రతినిధి. మత్స్యదేశం మీద సుశర్మ ఇదివరలో దాడి చేశాడు కాని, కీచకుడి చేతిలో ఓడిపోయాడు. కీచకుడు లేని మత్స్యదేశం మీద దండెత్తి విరాటుడిని ఓడించి పగతీర్చుకొనటం సుశర్మ వ్యూహంలోని పరమ ప్రయోజనం. దక్షిణ గోగ్రహణ యుద్ధానికి విరాటుడితో కలిసి పాండవులు రాకపోవచ్చుననీ, ఆ తరువాత దుర్యోధనుడు చేసే ఉత్తర గోగ్రహణంలో తమకు ఆశ్రయమిచ్చిన విరాటుడిని రక్షించుకొనటానికై పాండవులు కౌరవులతో యుద్ధానికి దిగవచ్చుననీ దుర్యోధనుడి ఊహ.

దీని తాత్పర్యం గ్రహిస్తే - సుశర్మ భావంలో విరాటుడిని పట్టుకొంటే పాండవులను గుర్తించినట్లే, పట్టుకొన్నట్లే. "సర్వంఖల్విదం బ్రహ్మ" అనే సాధనలో ప్రకాశించే విరాట్టును పట్టుకొంటే మోక్ష సాధన ప్రవృత్తులను పట్టుకొన్నట్టే. అయితే మోక్ష సుఖానికి ప్రతినిధి అయిన సుశర్మ మనశ్చాంచల్యం వలన ఒకసారి ఓడిపోయాడు. ఇప్పుడు దుష్టమార్గంలో ముక్తి సాధన ప్రవృత్తులకు అపకారం తలపెట్టే తామసప్రవృత్తి (దుర్యోధనుడి) అండ చేరాడు. తామసికవృత్తి యొక్క వ్యూహంలో భాగంగా మోక్షసాధన ప్రవృత్తిలో సమర్థాలైన ఇంద్రియాలను పట్టి కల్లోలపరచాలని యత్నించాడు. అందువలన అతడి సాధన కపట సాధనగా మారింది.

విరాటుడికి స్వయంగా తమ్ములున్నారు. కొడుకులున్నారు. వారందరు సమర్థులే. వారందరి కంటే మిన్నగా ధర్మజ భీమ నకుల సహదేవులు ఆసటగా బాసటగా నిలిచారు. కవచంగా అతడిని రక్షించారు. అట్లా జరుగుతుందని సుశర్మ ఊహించలేదు.

(2) సుశర్మ విరాటుడిని బంధించి తన రథం మీద ఉంచాడు. ధర్మజుడు విరాటుడిని విడిపించండని భీమనకుల సహదేవులను ఆజ్ఞాపించాడు. భీముడు విజృంభించి నకులసహదేవులతో కలసి, సుశర్మను బంధించి విరాటుడిని విడిపించాడు. దీని తాత్పర్యాన్ని ఇట్లా భావించవచ్చును. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే సాధనలో విరాట్పురుషుడిని (విశ్వప్రకృతిని) త్రిపుటి బద్ధమైన వాసనా విముక్తి జన్యమైన సుఖ వృత్తి వశపరచుకొన్నది. కాని, ఆ త్రిపుటి సాధన శుద్ధసాత్త్వికవృత్తితో కాక, తామసిక వృత్తి యొక్క స్నేహంతో కూడిన పాక్షిక సాత్త్విక వృత్తి (సుశర్మ)తో జరిగింది. కాబట్టి మొదటి నుండి సాధనలో బలాన్ని బాగా పుంజుకొని ఉన్న యమనియమాది సాత్త్విక సాధన పాటవం యొక్క ఆమోదంతో సాధకుడిలోని అభయవృత్తీ, ఐహిక భోగ విరక్తి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వృత్తి జ్ఞానవృత్తి కలిసి విశ్వప్రకృతిని కపట సాధన నుండి విడిపించి శుద్ధ సాత్త్విక సాధనంతో విశ్వప్రకృతిని జ్ఞానప్రకాశంలో విలీనం చేశాయని గ్రహించాలి.

ఒక్కొక్కసారి దుర్యోధనాది తామసిక శక్తుల కంటె సుశర్మవంటి కపట సాత్త్విక శక్తుల వలననే మోక్షసాధనకు బలమైన అవరోధాలు కలుగుతాయనీ, వాటిని మోక్షసాధన శక్తులు సంఘటితంగా ఎదుర్కొని తమ ఆధ్యాత్మిక సాధనను రక్షించుకొనాలనే హితవు దక్షిణ గోగ్రహణ కథ వలన మనకు అందుతుంది.

8. ఉత్తర గోగ్రహణం - తామసిక వృత్తులపై ఋజువర్తన సాధించిన విజయం

1. దుర్యోధనుడు భీష్మాదుల సాయంతో పాండవులను గుర్తించి వారి అజ్ఞాతవాసవ్రత నియమాన్ని భంగం చేయాలని చేసిన బృహత్తరమైన ప్రయత్నం ఉత్తర గోగ్రహణం. అంటే- అపరాశక్తి యొక్క తామసిక వృత్తి - తనకు సాయపడుతూ తనతో జతపడి ఉన్న పాక్షిక సాత్త్విక శక్తులను తన వెంట నడిపించుకొని సాధకుడి విశ్వప్రకృతిలోని శ్రేష్ఠములైన సాత్త్వికాలైన ఇంద్రియ వ్యాపారాలను పట్టుకొని ఆ ముక్తి వృత్తులను నాశనం చేయటానికి పూనుకొన్నది. అది ముక్తిసాధన ముందుకు సాగకుండ అపరాశక్తి కపటవర్తనంతో చేసిన ప్రబల విఘ్న ప్రయత్నం.

2. విరాట నగరంలో అప్పుడున్న విరటుడి సంతానం ఉత్తరుడు, ఉత్తర. అంటే ఉన్నత మార్గాన సాధకుడిని తరింపజేసే ముక్తిసాధనావృత్తు లన్నమాట. అవి విశ్వరూప ప్రకృతిలో చైతన్యవంతంగా ఉన్నాయి- అని భావం. ఉత్తరుడికి భూమింజయుడు అనే మరొక పేరు ఉన్నది. అంటే- భూమికి సంబంధించిన (ఐహికాలైన) వాంఛలను జయించే కోర్కెల ఉన్నత సాధనా వృత్తి.

3. గోపాలుడు ఉత్తర గోగ్రహణ వార్తను ఉత్తరుడికి నివేదించి, కౌరవులను ఓడించి గోగణాన్ని రక్షించుకొనుమని కోరుతారు. సాధకుడిలోని శ్రేష్ఠములైన ఇంద్రియ వ్యాపారాలను పరిరక్షించే మనోవృత్తులు అపరాశక్తియొక్క తామసికవృత్తులు చేసిన అపహరణ వృత్తిని గురించి ఉన్నత మార్గాన తరింపజేసే పరాశక్తియొక్క ఉన్నతమైన విశ్వరూపోపాసనా సాధనను ప్రబోధించి తెలియ జేశాయన్నమాట.

4. బృహన్నలను సారథిగా చేసికొనుమని ఉత్తరద్వారా ఉత్తరుడికి ద్రౌపది సూచించింది. విపత్కర పరిస్థితులలో సాధకుడిలోని ముక్తిమనోవృత్తి (ద్రౌపది) విశ్వ ప్రకృతిలోని ఉన్నత చైతన్యవృత్తిని (ఉత్తరను) ప్రేరేపించింది. ఐహిక వాంఛా విజయం సాధించాలని ఉత్సాహపడే శ్రేష్ఠమైన ముక్తిసాధన (ఉత్తరుడు) విస్తారమైన అసంగయోగవృత్తిని (బృహన్నలను) సారథిగా చేసికొంటే అపరాశక్తి యొక్క తామసిక వృత్తిని ఓడించవచ్చునని సూచించబడింది.

5. షండవేషంలో రథంమీద శమీవృక్షాన్ని సమీపిస్తున్న అర్జునుడిని చూచి భీష్మాదులు భయపడ్డారు. శమీ వృక్షం అంటే శమం. అంతరింద్రియ నిగ్రహం. షండవేషం అంటే నిర్గుణ నిరాకార తత్త్వం. రథం అంటే శరీరం. శరీరం ధరించిన అద్వైత భగవత్తత్త్వంగా శమప్రధానమైన ఋజుప్రవర్తనా శీలాన్ని గుర్తించటమే, షండవేషంలో రథం మీద ఉన్న అర్జునుడిని గుర్తించటం. సాధకుడిలోని పాక్షిక సాత్త్విక వృత్తులు (భీష్మాదులు) సాక్షాత్ అద్వైత పరమాత్మతత్త్వాన్ని గుర్తించటంతో తమలోని అపరాశక్తి యొక్క తామసిక వ్యాపారం ఇక పనిచేయలేదని భయపడ్డాయి.

6. యుద్ధంలో అర్జునుడు తనంతట తాను భీష్మ ద్రోణులను ముందుగా కవ్వించలేదు. లక్ష్యం దుర్యోధనుడికి ఓటమి రుచి చూపించి బుద్ధి చెప్పటమే. అతడికి అండగా నిలిచేవారిని తగిన విధంగా దండించటమే. గోవులను మళ్ళించటం ముఖ్య ప్రయోజనంగా కనపడుతున్నా, అది అవాంతర ప్రయోజనంగా మారింది. ఈ కథార్థాల అంతరార్థాన్ని ఈ విధంగా భావించవచ్చును. సాధకుడిలోని పాక్షిక సాత్త్విక వృత్తులు రాజ్యసంపద కొరకు తామసిక వృత్తికి లోబడినా, అవి సహజంగా సాత్త్విక ప్రవృత్తులే కావటం చేత అవి ముక్తిమార్గానికి అడ్డం నిలువవు కాబట్టి, వాటిని నిర్లిప్తంగా వదలివేయటం నీతి. ఒకవేళ తామసిక వృత్తి ప్రేరణతో అడ్డుపడ్డప్పుడు అణచివేయాలి. అంటే- సాధనకు అడ్డురాని ప్రవృత్తుల జోలికి అనవసరంగా వెళ్ళగూడదని సాధన రహస్యం.

7. దుర్యోధన కర్ణాదులను ఓడించటమే అర్జున పరాక్రమ ధ్యేయం. ధర్మానుశాసనంలో వర్ధిల్లి మోక్షసాధన కనువైన శమమార్గంలో సాగుతున్న ఋజుప్రవర్తనాశీలం తామసిక రాజసిక శక్తులను అవలీలగా ఓడించి విజయాన్ని సాధించగలదనే ఆధ్యాత్మిక సందేశం అర్జున పరాక్రమ వృత్తమైన ఉత్తరగోగ్రహణ యుద్ధగాథలో ధ్వనితం.

8. ఉత్తరార్జునుల వృత్తం - ఉత్తరుడు= ఉన్నత మార్గాన సాధకుడిని తరింపజేసే ముక్తి సాధనా వృత్తి. అర్జునుడు ఋజువర్తన ప్రవృత్తి. బృహన్నల= పరమాత్మ తత్త్వం. సాధకుడి ముక్తి సాధనా ప్రవృత్తి పరతత్త్వాన్ని ఆశ్రయించి, తామసిక ప్రవృత్తులపై చేసే యుద్ధానికి సారథ్యం వహించుమని ప్రార్థించింది. ధైర్యం కోల్పోయిన ఉత్తరుడి రథానికి బృహన్నల సారథిగా ఉండి నడిపాడు. తామస ప్రవృత్తి విజృంభణాన్ని చూచి ముక్తి సాధన ప్రవృత్తి ధైర్యాన్ని కోల్పోయింది. అప్పుడు పరమాత్మతత్త్వం అభయమిచ్చి ముక్తి సాధన రూప ఋజువర్తన శీలరూపమైన తన సగుణరూపాన్ని చూపి ఉన్నత మార్గంలో ముక్తిసాధన పద్ధతిని ప్రదర్శించి చూపించింది. అప్పుడు ఆ ఋజు ప్రవర్తన లీలను దర్శిస్తూ ముక్తి మార్గాన్ని తెలిసికొన్న ఉన్నత మార్గవర్తి అయిన సాధకుడు ఉత్తరుడు. రథికుడు సారథి అయ్యాడు. సారథి రథికుడయ్యాడు. విజయం సాధించింది ఒకరు. విజయుడని ప్రకటించబడింది మరొకరు. అయినా వారిరువురి భావనలో అద్వైతమే నిలిచింది. అది ఉత్తరార్జునులు బోధించిన అద్వైతానుభూతి.

9. విరాటుడు ధర్మరాజును సారెతో కొట్టటం. ద్రౌపది ధర్మజుని రక్తం భూమిమీద పడకుండా బంగారు పాత్రలోనికి పట్టటం-అంటే= అష్టాంగ యోగ సాధన చాల పవిత్రమైనదనీ, దానికి ఏమాత్రమూ ఆఘాతం జరుగనీయకూడదనీ, అట్లా జరిగితే ముక్తి మార్గ సాధన పూర్తిగా దెబ్బతింటుందనీ అంతరార్థంగా గ్రహించాలి.

10. ఉత్తరాభిమన్యుల వివాహం: ఉత్+తర= ఉన్నత పదంలో తరింపజేసే జ్ఞాన మనోవృత్తి అని అర్థం. అభిమన్యుడూ 'అభితః మనుతే ఇతి అభిమన్యుః'- అంతటా పరమాత్మను తలచే (దర్శించే) వాడు అని అర్థం. ఉత్తరాభిమన్యుల వివాహమంటే ఉన్నత పథంలో సాగే సాధకుడి మనోవృత్తి 'సర్వం ఖల్విదం బ్రహ్మ' సాధనను కూడినప్పుడే ముక్తిని సాధించగలదని తాత్పర్యం. ఈ ముక్తి సాధనాసిద్ధికి మూలం గొప్ప అసంగవృత్తితో కూడిన ఋజుప్రవర్తన శీలం అనే సత్యాన్ని కూడా ఇక్కడ స్మరించాలి.

9. విరాటపర్వతత్త్వం - "సర్వం ఖల్విదం బ్రహ్మ"సాధన

"సర్వం ఖల్విదం బ్రహ్మ'' సాధనాక్రమంలో ముఖ్యములైన సాధనములలో బలమైనవి అభయవృత్తి ఒకటీ; గొప్ప అసంగవృత్తితో కూడిన ఋజు ప్రవర్తన మఱియొకటీ అనీ, ఆ రెండింటిలోనూ కూడా ఋజువర్తనా శీలానికి ఎంతో ప్రాధాన్యం ఇవ్వాలనీ, విరాటపర్వకథలో అంతరార్థపరంగా సారాంశాన్ని సాధకులు సులభంగానే అర్థం చేసికొనగలరు. రామాయణంలో సుందరకాండ పఠనం సర్వకామితాలను తీరుస్తుం దన్నట్లే భారతంలో విరాటపర్వం చదివితే వర్షాలు కురువక క్షామం వచ్చిన కాలంలో వర్షాలు కురిసి పంటలు పండి సుభిక్షంగా కాలం గడుస్తుందనే వాడుక వుంది. అంటే - సాధనాలు గొడ్డుపోయి మనస్సు కలవరము పడే సమయంలో బలమైన అభయవృత్తితోనూ, గొప్ప ఋజుప్రవర్తనతోనూ "సర్వం ఖల్విదం బ్రహ్మ'' సాధన సాగిస్తే పాఠకులకు సంపూర్ణ ముక్తి లభించటం ఖాయం అని విరాటపర్వ పఠనానికి చెప్పిన ఫలశ్రుతిని మనం అంతరార్థపరంగా అర్థం చేసికొనాలి.'' (అంతరార్థ భారతము పు.271).

(కళాప్రపూర్ణ, సరస్వతీ కంఠాభరణ, తత్త్వార్థ ప్రబోధక, విద్వాన్ డా. వేదుల సూర్యనారాయణ శర్మగారు రచించి ప్రచురించిన 'అంతరార్థ మహాభారతము' (ముక్తిసాధనా మార్గము) (1986) అనే గ్రంథం ఈ అంశాన్ని వివరించటంలో బాగా తోడ్పడింది. కొన్ని వాక్యాలు అందులో నుండి యథాతథంగా కూడా వాడుకొన్నాను. అందుకు కృతజ్ఞుడను).

27. కవిత్రయ మహాభారతం - వ్యాఖ్యానం

ఆదికావ్యమైన ఆంధ్ర మహాభారతం తెలుగులో అవతరించి దాదాపు వెయ్యేళ్ళు ఔతున్నా ఇంతవరకు దానికి సమగ్రవ్యాఖ్య వెలువడలేదు. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో కవిత్రయ మహాభారతానికి తెలుగులో శిష్ట

వ్యావహారిక భాషలో సరళవ్యాఖ్య వెలువడటం ఆంధ్రావళి ఆనందించే అపూర్వమైన సాహిత్యోత్సవం. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు భారతీయ వైదిక ధర్మ ప్రచార మహోద్యమాన్ని చేపట్టి మహనీయంగా సాగిస్తున్నారు. అందులో ఈ పంచమ వేద వ్యాఖ్యాన ప్రణాళిక ఒక మహత్తర సారస్వత యజ్ఞం. ఏడుకొండలస్వామి మాత్రమే చేపట్టి ధర్మరక్షణ కళా ప్రావీణ్యంతో ఈ బృహత్తర ధర్మకార్యాన్ని ప్రజలకు ప్రసన్నంగా ప్రసాదించగలిగిన పరమదయాళువు. ఆ దేవదేవుడి కృపాకటాక్షాలతో పండితులు, పెద్దలు పదునెనిమిది పర్వాల ఈ దివ్య ప్రబంధమండలిని పరిష్కరించి, ప్రతిపద్యానికి వ్యాఖ్యానం వెలయించి, సవిమర్శకమైన పీఠికలు సంతరించి, కథాసారాదులతో సర్వార్థసాధకంగా రూపొందించి, సర్వాంగసుందరంగా ప్రచురించి, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారు చేసికొన్న వెలుగుల పుణ్యం. ఈ పవిత్ర మహత్తర ప్రయత్నానికి శ్రీ తిరుమలేశుని పక్షాన బాధ్యత వహించి అభ్యుదయ పరంపరను విజయవంతంగా సమకూరుస్తున్న మాన్యులు, మహనీయులు టి.టి.డి. బోర్డు ఛైర్మన్, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, సంపాదకులూ, వారి సహకారులూ, సంపాదక సలహా మండలుల సభ్యులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, 'ఎడిటోరియల్ సెల్' సభ్యులూ, పలురకాలుగా దీనికి తోడ్పడుతున్న అధికార అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటి. అది రెండు భాగాలుగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపుదిద్దుకొన్నది. విస్తృతమైన ఆరణ్యపర్వం మూడవ సంపుటిగా రెండు భాగాలలో ప్రచురించబడింది. మొదటిభాగం నన్నయ రచించిన ఆరణ్యపర్వభాగం. రెండవ భాగం ఎఱ్ఱాప్రెగడ పూరించిన ఆరణ్యపర్వశేషం. ఈ విధంగా విభజించబడి ప్రచురించటం తెలుగులో ఇదే ప్రథమం. అది దాని ప్రత్యేకత కూడా. ఇక నాల్గవ సంపుటి ఈ విరాటపర్వం.

ప్రతి యేటా, పల్లెపల్లెలా విరాటపర్వాన్ని వినటం తెలుగువారి ధార్మిక సంస్కృతి. ఈ పర్వాన్ని విన్నా, తెలిసి చదివినా, చదువుకొన్నా వారి జీవితాలలో విజయపరంపరలూ, శుభపరంపరలూ కలుగుతాయి. విరాటపర్వం చదివినచోట సకాలంలో వానలు పడి దేశం సుభిక్షమౌతుంది. దేశాన్ని క్రమ్మిన అజ్ఞాత ప్రమాదజీమూతాలు తొలగిపోయి ధర్మప్రకాశం వెల్లివిరుస్తుంది. విరాటపర్వం చతుర్థమే కాదు, చతుర్విధ పురుషార్థఫలప్రదం!

విరాటపర్వ వ్యాఖ్యానాన్ని, ఒక్కొక్కరు ఒక్కొక్క ఆశ్వాసం చొప్పున, విద్వన్మణులైదుగురు రచించారు. ప్రథమాశ్వాస వ్యాఖ్యాత ఆచార్య కె. సర్వోత్తమరావుగారు - శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఆంధ్ర శాఖాధ్యక్షులుగా పనిచేసిన ప్రసిద్ధ పరిశోధకులు. ద్వితీయాశ్వాస వ్యాఖ్యాత డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావుగారు - ప్రసిద్ధాంధ్రాచార్యులేకాక ప్రస్తుతం క్రొత్త ఢిల్లీలో దూరదర్శన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్. తృతీయాశ్వాస వ్యాఖ్యాత శ్రీ సింగరాజు సచ్చిదానందంగారు - తిరుమల తిరుపతి దేవస్థానం కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేసిన ప్రముఖ విద్వాంసులు. చతుర్థాశ్వాస వ్యాఖ్యాత డాక్టర్ మేడవరం వేంకట నారాయణశర్మగారు - మదనపల్లె బి.టి. కళాశాలలో ప్రాచార్యుడుగా పనిచేసిన పండితవర్యులు. పంచమాశ్వాస వ్యాఖ్యాత డాక్టర్ కె. రామగోపాల కృష్ణమూర్తిగారు - ప్రభుత్వ కళాశాలాచార్యులు, ప్రముఖ సాహితీవేత్త. పంచాగ్నుల వలె ప్రకాశించే ఈ పండిత పంచకం ప్రతిభాపూర్ణంగా వ్యాఖ్యానాలను రచించి ఈ విరాటపర్వాన్ని విజ్ఞానపర్వంగా మార్చారు. వారికి నా నమోవాకాలు.

తిక్కన కవిత్వంలోని కళాశిల్ప విశేషాలను సహృదయులకు అందుబాటులోకి తీసికొని రావటానికి నేను చాలా చోట్ల విశేషవ్యాఖ్యలు వ్రాసి వివరించాను. అవి 'సంపా.' అనే సంకేతాక్షరాలతో సూచించబడ్డాయి. విరాటపర్వ వైశిష్ట్యాలను తిక్కన జీవిత కవితా శిల్ప విశేషాలను సవిమర్శకంగా పీఠికలో వివరించాను. విరాటపర్వ కథాసారం సర్వజన సులభంగా సంతరించాను. అందులో ఈనాటికీ తెలుగువారి నాల్కలమీద నాట్యం చేస్తున్న కొన్ని మధురమైన పద్యాలను మధ్యలో పేర్కొన్నాను. ఈ ప్రయత్నం ఆంధ్రావళి ఆమోదాన్ని పొందుతుందని ఆశిస్తున్నాను. విరాటపర్వ వ్యాఖ్యానం ప్రామాణికంగా వెలువడటానికి నాకెన్నో విధాల సహకరించిన ప్రముఖ విద్వత్కవులు, పరిశోధకులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారికీ, మిత్రులు డా.అట్లా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వెంకటరామిరెడ్డిగారికి, ప్రూఫులు సరిచూడటంలో తోడ్పడిన మిత్రులు శ్రీకె.పి. బాబుగారికీ, శ్రీమతి సుశీలా లక్ష్మీ విద్యానాథులకూ, ముద్రణ కనువైన అక్షరాకృతినిచ్చిన శ్రీ దత్తసాయి గ్రాఫిక్స్ అధినేత్రి డాక్టర్ జి.యస్.లక్ష్మికి నా హార్దమైన కృతజ్ఞతలు.

పరమ కళ్యాణ భద్రమూర్తి శ్రీపద్మావతీ సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యమూర్తి. ఆ స్వామి వేదాత్ముడు, వేదాంతవేద్యుడు పరతత్త్వరూపుడు; అయినా భక్తసులభుడు, సాహిత్య సంగీత ప్రియుడు, రసానందరూపుడు. తిక్కన కృతి నిచ్చిన హరిహరనాథదేవుడు శ్రీ వేంకటేశ్వరస్వామివారే అని ఒక వాదం ఉన్నది. అదే నిజమైతే అంతకంటే కావలసిందేమున్నది? ఆ స్వామికే ఈ అక్షరవేదం అంకితం అయినట్లే. ఆ స్వామికి ఈ పంచమవేదం తులసీమాల, వ్యాఖ్యానం సుగంధ పరిమళసేవ, విరాటపర్వం విరులపూదండ. పూజ, విశేషాంశాలు పణ్యారాల సుగంధాల నివేదన, విరాటపర్వ పీఠిక విరాణ్మూర్తికి మంగళనీరాజనం. ఈ పర్వం స్వామివారికి సారస్వతమైన అక్షరార్చనం. సత్య శివ సుందర రూపుడైన స్వామివారి దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యా సంపుటిని వాఙ్మయారాధనలోని పుణ్య పూజాకుసుమ మంజరిగా సమర్పించుకొంటున్నాను. విశ్వశ్రేయస్సును ప్రసాదించుమని ఆ విరాడ్రూపుని వేడుకొంటున్నాను.

హైదరాబాదు
23-11-2001

జి.వి.సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు
కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విరాటపర్వ కథాసారం

"మహిత సముజ్జ్వలాకృతులు మానధనుల్ జనమాన్యు లంగనా
సహితము గాఁగ నేమిగతి సమ్యగుపాయ నిగూఢ వృత్తిమై
నహితుల కప్రభేద్యముగ నా పదుమూఁడగు నేఁడు మత్స్యతా
మహులు చరించి రంతయుఁ గ్రమంబున నా కెఱుఁగంగఁ జెప్పుమా!"

అని జనమేజయుడు వైశంపాయన మహర్షిని ఆసక్తిగా అడిగాడు. చతుర్థం, ఊర్జితకథోపేతం, నానారసాభ్యుదయోల్లాసి అయిన విరాటపర్వకథ వైశంపాయనుడు వినిపించ నారంభించాడు. పాండవులు తమ వెంట అగ్నిహోత్రాదులతో వస్తున్న వేలాది బ్రాహ్మణోత్తములను ఆగండని అభ్యర్థించారు. బాహ్య పరివారానికి సముచితమైన వీడ్కోలు పలికారు. వారొక ఏకాంత ప్రదేశంలో నిలిచారు. ధౌమ్యుడు వారివెంట ఉన్నాడు. కురుజనపదానికి చుట్టుపట్లనున్న పాంచాల, చేది, మత్స్య, సాళ్వ, విదేహ, బాహ్లిక, దశార్ణ, శూరసేన, కళింగ, మగధ దేశాలలో నివాసయోగ్యమైనదానినిగా మత్స్యదేశాన్ని ఎన్నిక చేశారు. మత్స్యనరపతి సుజనహితుడు, ధర్మశీలుడు కావటం చేత అతడి కొలువులో మారువేషాలలో చేరి అజ్ఞాతవాస వ్రతాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

పాండవుల అజ్ఞాతవాస జీవితం

ధర్మజుడు సన్యాసి వేషంలో కంకుడనే పేరుతో రాజుకు చెలికాడై విద్యాగోష్ఠులతో, పుణ్యకథా సల్లాపాలతో, అనువైనప్పుడు అక్షక్రీడతో గౌరవప్రదంగా గడపాలని నిర్ణయించుకొన్నాడు.

భీమసేనుడు వంటలవాడై, వలలుడనే పేరుతో రుచికరాలైన వివిధ వంటకాలను ప్రభువుకు వండి వడ్డించటానికీ, రాజు కోరితే మల్లులతో గాని, కరిసింహవ్యాఘ్రాదులతో గాని పోరి వినోదాన్ని కలిగించటానికి పూనుకొన్నాడు.

అర్జునుడు బృహన్నలాఖ్యుడైన పేడియై అంతఃపుర కన్యలకు వివిధ నాట్య విశేషాలను నేర్పటానికి చేరదలచుకొన్నాడు. ఊర్వశి యిచ్చిన శాపం, ఇంద్రుడి వరం పార్థుడికి అజ్ఞాతవాసంలో అనువైన సాధనాలుగా పనికివచ్చాయి.

నకులుడు దామగ్రంథిగా అశ్వశాలలో ప్రవేశించి అశ్వశిక్షణ చాతుర్యాన్ని ప్రదర్శించటానికీ, సహదేవుడు తంత్రీపాలుడుగా గోరక్షణ నైపుణ్యాన్ని వెలార్చటానికీ నిశ్చయించుకొన్నారు. ద్రౌపది సైరంధ్రిగా సుదేష్ణారాణి కొలువులో చేరి మాలిని అనే పేరుతో మలినమైన పనుల జోలికిపోక, గౌరవప్రదంగా అంతఃపురంలో అజ్ఞాతవాసం గడపటానికి నిర్ణయించుకొన్నది. ధౌమ్యుడు శాంతి రక్షా మంత్రాలు చదివి వారిని సాగనంపి తానొక ఆశ్రమంలో ఆగిపోయాడు.

పాండవులు భార్యా సమేతులై అడవి దారులలో నడిచి మత్స్యనగరాన్ని సమీపించారు. ఊరి వెలుపల నున్న శ్మశానంలో భయంకరంగా పెరిగి ఉన్న శమీవృక్షానికి తమ ఆయుధాలను శవాకారంలో మూటగట్టి వ్రేలగట్టారు. తాము నదిలో స్నానం చేశారు. అజ్ఞాతవాసంలో ఎవరూ వారిని కనుగొనకుండా ఉండేటట్లు వరమిచ్చిన ధర్మదేవతను ప్రార్థించారు. వారు సంకల్పించిన రూపాలు, వేషాలు అత్యంత సహజంగా అమరాయి. అదృష్టవశాత్తు విరాటరాజు ఆనాడు నగరం వెడలివచ్చి బయలికొలువు ఇస్తూ ఉండటం చేత అవలీలగా అతని కొలువులో చేరిపోయారు. ద్రౌపది సైరంధ్రిగా కుదిరిపోయింది. తమ తమ కొలువులలో నైపుణ్యాన్ని ప్రకటించి అందరి మన్ననలనూ పొందగలిగారు. వారిలో వారు రహస్య నామాలతో పిలుచుకొంటూ వీలైనప్పుడెల్లా కళ్ళారా చూచుకొంటూ కాలక్షేపం చేస్తున్నారు.

ఒకసారి విరటుడి కొలువులో మల్లవీరుల సమావేశమయింది. ఆ సమయంలో ఎక్కడినుండో ఒక భయంకరకాయుడైన మల్లుడు వచ్చి తనను గెలిచే వారెవరైనా మత్స్యనాథుడి సభలో ఉన్నారా? అని గద్దించాడు. అక్కడ గుమికూడిన మల్లయుద్ధ నిపుణులందరూ అతడి భీకరాకారం చూచి నీరుగారిపోయారు. దేశం పరువు గంగపాలైపోయేటట్లుంది. విరాటుడు విచారపడ్డాడు.

అప్పుడు కంకుభట్టు వలలుడిని గురించి చెప్పి అతడిని పిలిపించుమన్నాడు. విరటుడు వలలుడిని పిలిచి ఆ మల్లుడిని ఎదుర్కొనుమని ఆజ్ఞాపించాడు; ధర్మరాజు కనుసైగతో అనుమతించాడు.

భీముడి కానాడు పండుగగా తోచింది. వివిధ మల్లయుద్ధక్రీడా నైపుణ్యాలతో ఆ మల్లుడిని చాలా సేపు మూడు చెరువుల నీళ్ళు త్రాగించాడు. చివరకు కాళ్ళూ చేతులూ పట్టి గిరగిర తిప్పి నేలపై కొట్టి నెత్తురు కక్కేటట్లు చరచాడు. ఆ మల్లుడు భయంకరంగా ఓడిపోయాడు. విరటుడు మెచ్చి వలలుడికి కానుక లిచ్చాడు. వాటిని బీద ప్రజలకు పంచుకొంటూ వలలుడు మత్తగజంవలె వంటశాలవైపు నడిచిపోయాడు.

వలలుడి మల్లయుద్ధమంటే విరటుడి కొక వినోదమయింది. అతడిచేత పులులు, సింహాల వంటి క్రూరమృగాలతో పోరించుకొని చూడటం మత్స్యరాజు కొక ప్రీతి అయింది. అట్లా కొన్ని రోజులు తక్కువగా సంవత్సరం పూర్తికావస్తున్నది. ఒకనాడు-

కీచకోదంతం

మత్స్యరాజు బావమరది, ఆ దేశానికి దండనాథుడు, నూటైదుగురు కీచకులకు పెద్దన్న, రూపాభిమాని, నానాభరణశీలుడు, దుర్విదగ్ధుడు, బలగర్వితుడు అయిన సింహబలుడు - అక్కగారైన సుదేష్ణకు మ్రొక్కటానికి వచ్చి ప్రక్కనే ఉన్న అపూర్వ లావణ్యమూర్తి సైరంధ్రిని చూచాడు. మొదటి చూపులోనే మదనాస్త్రానికి దాసుడైనాడు. ఆమెపై నుండి చూపును ప్రక్కకు త్రిప్పుకోలేకపోయాడు. అంతవర కాతడు అంతటి అందగత్తెను చూడలేదు. అందుకు ఆశ్చర్యంలో మునిగిపోయాడు. త్రిమూర్తులకు కూడ పొందజాలనంత అందాన్ని సహజంగా పొందగల ఆ సుందరాంగి ఎవరో తెలిసికొనాలని అతడి మనసు ఉరకలు వేసింది. తమకంతో తలపులు తల్లడిల్లిపోసాగాయి. అతడికి తెలియకుండానే అతడు మన్మథవికార చేష్టలు పలురకాలుగా ప్రకటించడం ప్రారంభించాడు.

సైరంధ్రివైపు సూటిగా చూపులో చూపుపెట్టి చూచాడు. ఆమెకు కోపం వచ్చి మొగమంతా చెమట పోసింది. అనుచితమైన పనులు ఆచరించటానికి ఆరంభించాడు. ఆమె నివ్వెరపోయింది. ఆమెను కళ్ళతో మ్రింగేటట్లు చూశాడు. ఆమె గజగజవణికిపోయింది. ఆమెను సమీపించబోయాడు. ఆమె తెల్లబోయింది. ఆమె భయపడి సాత్త్వికభావాలు ప్రకటించినా ఆ దుర్విదగ్ధుడు అవన్నీ మారవికారాలుగా భావించి రాగసాగర నిర్మగ్నుడైనాడు. ఆమెను గురించిన వివరాలను అక్కగారి నడిగాడు.

కీచకుడి చిత్తవృత్తి సుదేష్ణకు చీకాకు కలిగించింది. మాటమార్చి చూచింది. అతడి మనసు మారేటట్లు లేదు. అక్కగారితో మాట్లాడటం మాని సైరంధ్రితోనే సంభాషణ మొదలుపెట్టాడు. 'ఓ చంద్రవదనా! నీవంటి అందచందాలు ఈ లోకంలో మరెవ్వరికైనా ఉన్నాయా? నీ వెవరి కూతురవు? నీ భర్త ఎవరు? నీ పేరేమిటి?' అని గుచ్చి గుచ్చి అడిగాడు. ఆమె మొగం తప్పించింది. అతడు విరహతప్తుడై ఆమె సౌందర్యాన్ని సంకీర్తనం చేయనారంభించాడు. ఆమెను పొందలేకపోతే తనకు ప్రాణాలు పోతాయనీ, ప్రాణం పోయిన తరువాత తనను మరలా పొందవచ్చునా? అని ఆమెను అనునయించాడు. అతడి స్థితిని చూచి సైరంధ్రి తొందరపాటులేకుండా నేర్పుతో వ్యవహరించటం మేలనుకొన్నది.

'అన్నా! నేనున్న స్థితిని, నా శరీరాన్ని, నా మాసిన చీరలనూ చూస్తే ఏవగింపు కలగటం లేదూ? ఉత్తములు ఇటువంటి మదన వికారపు మాటలు మాట్లాడతారా? నీకూ అప్పచెల్లెళ్ళున్నారుగదా! ఇట్లా వ్యవహరించటం ఉచితమా? పైపెచ్చు నేను పతివ్రతను. నన్ను ఇట్లా అడుగవచ్చునా?' అని అతడిని నిలవదీసి అడగింది సైరంధ్రి.

అతడు వినిపించుకొనే స్థితిలో లేడు. ఆమె శరీరాంగాలను వర్ణిస్తూ 'పరసతీసంగమం వలన వచ్చే పాపానికైనా సిద్ధపడతానుగాని, నీ తనూసంగమాన్ని మాత్రం వదులుకొని, బ్రతుకలేను' అని వెంటపడ్డాడు. ద్రౌపది అతడిని నీచునిగా నిశ్చయించి బెదిరించి అదలించడానికి యత్నించింది.

"దుర్వారోద్యమ బాహువిక్రమ రసాస్తోక ప్రతాప స్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథనవిద్యా పారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతులు లేవు రిష్టు నిను దోర్లీలన్ వెసన్ గిట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిన్ గీచకా!"

అని గద్దించింది సైరంధ్రి. కీచకుడు గంధర్వుల బలాన్ని లెక్కచేయకుండా మాట్లాడాడు. 'అందని మ్రానిపండ్ల కొరకు అర్రులు చాచి రావణాదులవలె చెడిపోవద్ద'ని సైరంధ్రి మందలించింది. అతడు మొగం చిన్నబుచ్చుకొని సుదేష్ణను సమీపించాడు. సైరంధ్రి వివరాలను చెప్పుమని బలవంతపెట్టాడు.

సుదేష్ణ కీచకుడికి నీతులు బోధించింది. అతడిని వలచి వలపించే వనిత లెందరో ఉండగా, పరవనితను కోరటం ధర్మం కాదన్నది. 'లోకంలోని వనితలందరూ ఆమె కాలిగోటికి సరిరా'రనీ, ఆమెను ఏదో ఒక ఉపాయంతో తన వద్దకు పంపకపోతే మన్మథతాపంతో మరణించటం తథ్య మనీ కీచకుడన్నాడు. ఆమె మరలా నీతులు చెప్పబోయింది. అతడు వారించి ఆమెకు నమస్కరించి 'ఇక ఈ వెడమాటలు చాలు. ఆమెను నాతో కలిపే మాటలేవైనా ఉంటే చెప్పుము. లేదా నా చావు నిజం. ఆ మీద నీ తమ్ముడిని స్మరించుకొంటూ ఉందువుగాక' అని లేచి వెళ్లబోయాడు. సుదేష్ణ మనసులో భయపడింది. చివరకు తమ్ముడికి మాట ఇచ్చింది. ఒక రోజులో సైరంధ్రిని మద్యం కొరకు అతడి నివాసానికి పంపుతాననీ, అప్పుడు అభిమతాన్ని తీర్చుకొనుమనీ సూచించింది. ఆ మాట విని కీచకుడు ఉప్పొంగిపోయి నిజమందిరానికి పోయి, వివిధ మధురసాలను సిద్ధం చేసికొని విరహవేదనపడుతూ సైరంధ్రి రాకకొరకు ఎదురుచూస్తూ ఉన్నాడు.

సుదేష్ణ ఆసవ పిపాస అభినయించింది. సైరంధ్రిని పిలిచి రుచిగల ఆసవాన్ని కీచకుడి యింటినుంచి తెచ్చిపెట్టుమన్నది. తన నా అనుచిత కార్యానికి నియోగించవద్దని సైరంధ్రి బ్రతిమిలాడుకొన్నది. అందుకు సుదేష్ణ నిష్ఠురాలాడింది. సుదేష్ణ తమ్ముడికి మేలు చేయాలని పన్నుగడ పన్నిందని స్పష్టమైంది. ఆసవ పాత్రను తీసికొని సైరంధ్రి కీచకునింటికి ఒంటిగా బయలుదేరింది. తనకు కలుగనున్న ఆపదను స్మరించుకొని మహాపదలకు పరిహారమైన హరినామస్మరణను మనసులో నిలుపుకొని, పుండరీకాక్షుడిని అంతః ప్రసన్నుడిని చేసికొని ముందుకు సాగింది. సూర్యనారాయణుడిని స్మరించింది. 'తండ్రీ! నేను నిజంగా పాండవులను ఏకచిత్తంతో భావించేదానినైతే నాకెటువంటి కీడూ కలుగకుండా రక్షించే భారం నీదే!' అని నమస్కరించింది. సూర్యనారాయణుడు వెంటనే ఆమెను రక్షించే నిమిత్తం ఒక రక్కసుని కల్పించి కనపడకుండా ఆమె వెంట రక్షకుడుగా ఉండేటట్లు కరుణించాడు. ఎట్టకేలకు మెల్లగా సైరంధ్రి పులిపొదలో లేడి ప్రవేశించినట్లు కీచకమందిరంలో అడుగుపెట్టింది.

కీచకు డామెను చూచి సంతోషంతో సంభ్రమంతో ఉక్కిరిబిక్కిరయిపోయాడు. ఆమె కెదురుపోతూ వింత విలాసాలు వెలార్చటం ఆరంభించాడు. ఆమె అతడి వైఖరిని గమనించి గంభీరంగా నించున్నది. 'దేవి ఆసవ పిపాసతో మదిర తెమ్మన్నది. ఇప్పించండి' అని ముక్తసరిగా పలికింది. కీచకుడు చనువుగా సమీపించి మొగంలో మొగం పెట్టి తమకంతో ఇట్లా అన్నాడు. 'లీలావతీ! నీవు దేవి దప్పిక తీర్చాలని చూస్తున్నావే కాని, నా దప్పికను నీ రసవత్తర సంభావనతో తీర్చాలని అనుకోవేమిటి? ఇదేం న్యాయం చెప్పుము? నీ పొందు నాకిచ్చి ఈ జన్మ సఫలం చెయ్. మన్మథుడిని బంటుగా నన్నేలుకో. ఈ సిగ్గుతెరలు మాని చెలిమికలిమిని పంచు' అని తొందరపెట్టాడు. 'ఆలస్యమవుతున్నది. దేవి ఎదురుచూస్తూ ఉంటుంది. తడవైతే ఆమె కోపగిస్తుంది. తిరిగి వెళ్ళాలి. త్వరగా మదిర నిప్పించండి' అని నిబ్బరంగా పలికింది సైరంధ్రి. దానికి కీచకుడు బాధపడుతూ 'మదిర తీసికొనిపోవటానికి మదవతు లెందరో ఉన్నారు. కాని, మదన సుధారసాన్ని అందించగలిగిన నీ అధరాన్ని నేను కోరుతున్నాను. నా సైన్య సంపదను, పరిచారికా సహస్రాన్ని నీ కర్పిస్తాను. నా కులకాంతలచేత నీకు సేవలు చేయిస్తాను. నేను నీ కనుసన్నలలో మసలుతాను' అని తమకంతో తనను తాను నిగ్రహించుకోలేక ఆమె పైబడి పట్టుకొన్నాడు కీచకుడు.

సూర్యవరం చేత ఆమెను రక్షిస్తున్న అసురశక్తి ఆమె శరీరంలో చేరి కీచకుడిని ఆవలకు తోసింది. వడిగా మందిరాన్ని వీడి సైరంధ్రి పరుగు పెట్టింది. కీచకుడు ఆమె వెంటపడ్డాడు. భయంతో ఎక్కడికి పోవాలో తోచక ద్రౌపది విలవిలలాడింది. విరాటరాజు కొలువుతీర్చి ఉండటం తెలియవచ్చింది. ఆ సభవైపు ఆమె పరుగులు తీసింది. జనులు చూస్తున్నారన్న లజ్జ కూడా లేకుండా కీచకుడు ఆమెను తరుముకొంటూ వెళ్ళాడు. మదపుటేనుగు జంగమలతను పట్టుకొన్నట్లు, పెద్ద గద్ద ఆడుపామును ఒడిసి పట్టినట్లు రాక్షసుడు దేవకాంతను బలవంతాన పొదివినట్లు సింహబలుడు ఆమె తలపట్టి తిగిచి కూలపడద్రోశాడు. అప్పుడు పాంచాలీ రక్షకుడైన రాక్షసుడు కీచకుడిని నేలపై పొరలిపడేటట్లు గట్టిగా కొట్టాడు. తనపాటు ఇతరులు చూడకుండా గబగబా లేచి కీచకుడు వెంటనే వెళ్ళలేదు. ఒడుపు తప్పిన మహాసర్పంవలె నిట్టూర్పులు నిగుడిస్తూ ఉన్నాడు.

ఆ సమయంలో రాజు కొలువులో భీమసేను డుండటంచేత ఈ దృశ్యాన్ని చూచాడు. సతికి జరిగిన ఆ అవమానాన్ని సహించలేక అగ్నిహోత్రుడుగా మండాడు. ప్రళయకాల రుద్రాకారంతో మేను పెంచి కీచకుడిని మట్టు పెట్టాలని తలపెట్టి, అతడి ఆనతి మీరలేని మత్స్యపతిని కూడా మడియింపచేయాలని ప్రక్కనున్న మహావృక్షాన్ని పెకలించటానికి చూపులు సారించాడు. భీముడి అసమయ సాహసం వలన అజ్ఞాతవాసం భంగమౌతుందని కంకుభట్టుగా సభలో ఉన్న ధర్మరాజు నిపుణంగా, ఎవరూ బయటివారు తెలిసికొనలేనివిధంగా భీమయత్నాన్ని ఇట్లా వారించాడు.

"వలలుం డెక్కడఁ జూచె నొండెడ నసేవ్యక్ష్మాజముల్ పుట్టవే?
ఫలితం బై వరశాఖ లొప్పఁగ ననల్పప్రీతి సంధించుచున్
విలసచ్ఛాయ నుపాశ్రిత ప్రతతికిన్ విశ్రాంతి గావింపఁగాఁ
గల యీ భూజము వంటకట్టియలకై ఖండింపఁగా నేటికిన్?"

ధర్మరాజు మాటలలో నిగూఢార్థాన్ని తెలిసికొని భీముడు శాంతించాడు.

సైరంధ్రిగా ఉన్న ద్రౌపది కీచకుడు లాగగా నేలపైబడి, వేడి నిట్టూర్పులు నిగుడిస్తూ, కన్నులవెంట నీరుకారగా, దీనవదనంతో లేచి విరటుడి కొలువులోకి వచ్చింది. కోపాతిశయంతో సమయభంగం మాట మరచి సాగ్రహంగా తన భర్తలకు తగిలి వచ్చేటట్లు మాట్లాడసాగింది. 'మహావీరులు గంధర్వులైదుగురు నాకు భర్తలై ఈవిధంగా ఒకడు నన్ను అవమానం చేస్తుంటే చూస్తూ మిన్నకుండటం ఆశ్చర్యం కాదా! ఇక ఎవరి భార్యలు ఈ రాజ్యంలో మర్యాదగా బ్రతుకగలుగుతారు? ఈ సభలో ధర్మభీతితో ఎవరైనా ఒక మాటైనా మాట్లాడారా? ఈవిధంగా కీచకుడు పతివ్రతనైన నన్ను ఏ ఆడవారినీ అవమానించని విధంగా అవమానిస్తుంటే చూస్తూ కూర్చున్న మీలో కొందరికైనా దయ రాలేదా? ఇందుకు ఈ మత్స్యదేశానికి ప్రభువుగా ఉన్న ఈ రాజు ననాలి. కీచకుడు చేసిన అధర్మాన్ని చూచి దండించకుండా వదిలిపెడతారా?' అని రోషంగా పలికింది. ఆ మాటలకు విరాటుడు మారు పల్కలేకపోయాడు. పైగా కీచకుడిని సాంత్వన వాక్యాలతో సమాధానపరచి పంపాడు. ప్రజ లామె దైన్యానికి సానుభూతి ప్రకటించారు.

ధర్మరాజుకు రోషం వచ్చింది. కాని, నిగ్రహించుకొన్నాడు. నిర్వికారంగా సహజ స్వరంతో ద్రౌపదితో ఇట్లా అన్నాడు. 'ఓవనితా! నీ మాటలన్నీ రాజూ, సభవారూ విన్నారు. ఇంక పలుమాటలు పలుకకుండా సుదేష్ణ సదనానికి వెళ్లుము. నీ పరాభవాన్ని చూచి నీ పతులైన గంధర్వులు కోపించకుంటారా? ఇది సమయం కాదు. నీకైనా, వారికైనా ఇప్పు డేమైనా వారు కోపాన్ని ప్రకటించరు. కాబట్టి నీ పతులను నిందించబోకుము. సభలలో ఇంతసేపు శంకలేకుండా ప్రకటంగా నిలిచి ధిక్కరించటం సమంజసం కాదు' అని ధర్మరాజు హెచ్చరించినా సైరంధ్రి అక్కడినుండి కదలలేదు. అప్పుడు ధర్మరాజు మరలా ఇట్లా మందలించాడు. 'నీవు కులసతీ గౌరవం కించపడేటట్లు ఇట్లా సభలో పలుపోకలతో విచ్చలవిడిగా నాట్యం చేస్తున్న విధంగా మెలగటం తగునా?' అన్నాడు. ఆ మాటకు పాంచాలి సాభిప్రాయంగా సమాధానం చెప్పింది. 'కంకభట్ట! నా భర్త నటుడు. ఆ మాట నిజం. పెద్దవారివలెనే చిన్నవారు కూడా! కాబట్టి నా పతివలెనే నేనూ నటిని కాబట్టి నాకు నాట్యం పరిచయమే. నా భర్త నటుడే కాదు, జూదరి కూడా. ఇక జూదరి ఆలికి మర్యాద ఎక్కడుంటుంది?' అని ఆర్తితో అక్కడినుండి వెళ్లిపోయింది సైరంధ్రి.

అంతఃపురానికి వెళ్ళి జరిగినదంతా ఆ రాణికి చెప్పింది సైరంధ్రి. 'దుఃఖించకు. నేను కీచకుడిని దండిస్తా'నని సుదేష్ణ ఓదార్చింది. ఆమె మాటలు లెక్క సేయకుండా సైరంధ్రి 'నీకెందుకమ్మా అంతకష్టం? కాలాంతకులు నా పతులున్నారు. వారే పగతీర్చుకొంటారులే' అని చెప్పింది. ఆ మాటలకు అంతఃపురంలోని స్త్రీలందరూ భయపడ్డారు. ఆ రాత్రి అందరూ శయనించారు.

కీచకవధ

ద్రౌపది వంటశాలలో నిద్రిస్తున్న భీముడి వద్దకు రహస్యంగా పోయింది. కరస్పర్శ చేస్తూ మెల్లగా పిలిచి లేపింది. భీమసేనుడు మేల్కొన్నాడు. ఇంత అర్ధరాత్రివేళ ఇక్కడికి ఎందుకొచ్చావని అడిగాడు. తెలిసికూడా నన్నడుగుతావేమిటని తన అవమానగాథనంతా వివరించి చెప్పింది ద్రౌపది. 'మహా బలులైన మీరందరూ ఉన్నా ఆనాడు దుశ్శాసనుడు ఆ సభలో ఆ విధంగా అవమానం చేశాడు. ఆపైన సైంధవు డావిధంగా అనుచితంగా వ్యవహరించాడు. ఇప్పుడు ఈ విధంగా కీచకుడు నన్ను పరాభవించాడు'. 'అని వాపోయింది. ఆ మాటలకు వాయుసుతుడు ఉద్రిక్తుడై 'నన్ను ధర్మరాజు వారించకుండా ఉన్నట్లయితే కీచకుడినీ, మత్స్యపతినీ అక్కడే మట్టుపెట్టి ఉండేవాడిని' అన్నాడు. 'అయితే దానివలన అజ్ఞాతవాస సమయ భంగమయ్యేది. మరలా అరణ్య, అజ్ఞాతవాసాలు చేయవలసివచ్చేది. ఆ విపత్తుకు మనమిద్దరమూ కారకులమయ్యేవారం. అందువలన ధర్మజుడు మనలను వారించాడు. ఆయన సత్యవ్రతనిష్ఠు'డని ద్రౌపది వివరించింది. భీముడి మనసులో ధర్మజుడిపై భక్తి కుదిరేటట్లు ధర్మరాజును కీర్తించింది.

"ఎవ్వని వాకిట నిభమదపంకంబు। రాజభూషణ రజోరాజి నడఁగు,
ఎవ్వని చారిత్ర మెల్లలోకములకు। నొజ్జయై వినయంబు నొఱపుఁ గఱపు,
నెవ్వని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి। మానితసంపద లీనుచుండు,
నెవ్వని గుణలత లేడు వారాసుల। కడపటి కొండపైఁ గలయఁ బ్రాకు,
నతడు భూరి ప్రతాప మహాప్రదీప। దూరవిఘటిత గర్వాంధకారవైరి
వీరకోటీర మణిఘృణి వేష్టితాంఘ్రి। తలుఁడు; కేవల మర్త్యుఁడె ధర్మసుతుడు?"

ధర్మజుడి నాయకత్వంలో ధైర్యాన్ని వీడకుండా ధర్మాన్ని సాధించుమని భీముడిని ప్రోత్సహించింది. భీమ పరాక్రమాన్ని పలువిధాల ప్రశంసించింది. అర్జునాదుల దైన్యానికి జాలిని ప్రకటించింది. సమయభంగం కాకుండా కీచకుడిని చంపకపోతే తాను ఉరి వేసుకొనిగాని, నీట మునిగికాని, అగ్నిలోపడికాని, విషం తినిగాని చనిపోతానని చెప్పింది.

భీముడు చిరునవ్వు నవ్వి ఇట్లా అన్నాడు. 'కమలాక్షీ! కీచకుడిని చంపటానికి నీ వింతగా చెప్పాలా? నిన్ను పరాభవించినవాడు ఇప్పటికీ బ్రతికి ఉండటమే తప్పు. అయినా ఉపాయంతో చంపాలి. వాడు రేపు కూడా నిన్ను సమీపించవచ్చును. నీవు క్రమంగా ఒడబడినట్లు నటించి వాడికి నర్తనశాలను సంకేతస్థలంగా పేర్కొని, ఒంటరిగా రమ్మని నిర్దేశించుము. సంకేతస్థలంలో నీ బదులు నేనే చిమ్మచీకట్లో పరుండి ఉంటాను. కీచకుడు సమీపించగానే, నేను విజృంభించి చంపి నీకు చూపుతాను' -అని నిశ్చయించాడు. ఆ విధంగా జరిగేటట్లు యత్నించుమని చెప్పి ద్రౌపదిని ఆమె శయనమందిరానికి పంపాడు భీముడు.

తెల్లవారింది. సింహబలుడు ద్రౌపదిపైని మమకారంతో మరొకటి చూడలేక వినలేక సింగారం చేసికొని సుదేష్ణ మందిరానికి బయలుదేరివెళ్ళాడు. ఆ మందిరంలో ఆమెను దర్శించి, ఏకాంతంలో మనసు విప్పి మాట్లాడి, ఏవిధంగానైనా అంగీకరించేటట్లుచేసి, దగ్గరికి తీసికొని, ఆ పైని శయ్యకు చేర్చి మన్మథ రాజ్య సాఫల్యాన్ని పొందాలని ఉవ్విళ్ళూరుతూ ఉన్నాడు. దానికి అనుకూలంగా ద్రౌపది కూడా ఒంటరిపాటున కనపడింది. ఆమె ఎదుట తన పరాక్రమాన్ని చెప్పుకొని విరాటనగరంలో తాను కోరిన వనిత వశంకాక తప్పదని ప్రగల్భాలాడాడు. ద్రౌపది కూడా భీముడు చెప్పిన పన్నాగాన్ని మనసులో ఉంచుకొని అతడివైపు మెత్తబడినట్లు చూచింది. మగువలు తమ భంగులు రహస్యంగా ఉండాలని కోరుకొంటారనీ, విచ్చలవిడిగా బాహాటంగా వలపులు వారికి నచ్చవనీ అంటుంది. ఆమె హృదయం కనిపెట్టి కీచకుడు ఆమె చెప్పినట్లే నడుచుకొంటానంటాడు. రాత్రివేళ నర్తనశాల రహస్య వర్తనానికి

అనుకూలంగా ఉంటుందని సూచిస్తుంది సైరంధ్రి. కీచకుడు ఉబ్బితబ్బిబ్బై ఆ రాత్రికే ఒంటిగా నర్తనశాలకు వస్తానని చెప్పి వెళ్ళుతాడు. ద్రౌపది భీముడి కీ సంగతిని నిపుణంగా తెలియపరుస్తుంది. అత డారాత్రికి కీచకుడిని సంహరిస్తానని పరమోత్సాహంగా ప్రతిజ్ఞ చేశా డామెముందు.

చీకటి పడింది. నర్తనశాలలో గాఢాంధకారం అలముకొని ఉన్నచోట, ఉత్తర విశ్రాంతి తీసుకొనే లీలాపర్యంకం మీద భీముడు గుడ్డకప్పుకొని పండుకొని ఉన్నాడు. దానికి దగ్గరలోనే ద్రౌపది చాటుగా నిలువబడి ఉన్నది. కీచకుడు మన్మథోన్మాదంతో సింహముండే గుహాంతర్భాగానికి మాతంగం వచ్చినట్లుగా భీముడిని చేరవచ్చాడు. శయనం మీద సైరంధ్రి ఉన్నట్లు తోచింది. కీచకుడు గగుర్పాటుతో సరసభాషణం మొదలు పెట్టాడు. 'వనితా! నీ కిష్టమైన వస్తువులు కానుకలుగా తెచ్చాను. సంతోషంతో తీసికో! విచిత్రమేమిటంటే ఎప్పుడూ స్త్రీలే నాకు కానుకలు లంచంగా పెట్టి నన్ను పొందుతూ ఉంటారు. నా రూపాన్ని చూచినా, నా లావణ్యాన్ని గమనించినా, నా విలాసాన్ని భావించినా, నా వివేకాన్ని గుర్తించినా ఏ వనిత కూడా నా పొందు విడువలేదు. ఇంతవరకు నేనే వనితల నేలుకునేవాడిని; ఇప్పుడు నీవే నన్నేలుకోవాలి! ఆ గౌరవం నీకొక్కతెకే దక్కుతున్నది' -అని అన్నాడు కీచకుడు.

ద్రౌపదికి కూడా వినపడేటట్లు గొంతు మార్చి కీచకుడితో పరిహాసాలు పలికాడు పవనపుత్రుడు. 'నిన్ను నీవు పొగడుకొనటానికి నీ వంటి వాడికే చెల్లింది. ఇక నాసంగతి నీకు తెలియదు. నావంటి ఆడుది ఎంత వెదకినా నీ కెక్కడా కనపడదు. పొందటం మరీ కష్టం. నా ఒడలికి నీ ఒడలు తాకితే చాలు. అది ఎట్లా ఉంటుందో నీకే తెలిసి వస్తుంది. నన్ను ఏ అబలతోనైనా పోల్చదలుచుకొంటే నీవు తప్పుచేసినట్లే! నను ముట్టి నీవు మరలా వనితల సంగతికి పోగలవా? నేనీ తనువును పొందిన ఫలాన్నీ, చిత్తభవ వికారాలన్నీ ఒక్కసారి చవిచూస్తావు. రా' అని వెంటనే లేచి రోషకఠినమైన హాసంతో విజృంభించి కీచకుడి శిరస్సు వంచి బలంగా కొట్టబోయాడు భీముడు. కీచకుడు వెంటనే విదుల్చుకొని గంధర్వుడని భావించి భీముడిని కాళ్ళు చేతులు పట్టి నేలపై నెట్టాడు. పవనకుమారుడు విజృంభించి కీచకుడిని పట్టాడు. ఇద్దరూ మదేభాలవలె ద్వంద్వయుద్ధం సాగించారు. భీముడు గూఢమర్దన క్రియలతో కీచకుడిని చంపి, కాళ్లూ చేతులూ కడుపులోకి చొప్పించి ముద్ద చేసి భయంకరంగా పడవేశాడు. ఆ వికృతాకారాన్ని ద్రౌపదికి చూపి 'ఇదిగో నా మాట నిలుపుకొన్నాను. నీ అవమానభారాన్ని మాన్పాను ద్రౌపదీ! నీ చింత తొలగిందా? నా భుజబలం నీకు నచ్చిందా? నీకు శాంతి చిక్కిందా? ఈ దుర్మార్గుడి గతి చూచావా? నిన్ను అవమానించదలచుకొన్న ఎంతటి వీరుడిగతి అయినా ఇంతే! ఇది తెలిసి ఆనందించు' అని పలికాడు భీముడు. భీముడిని ఉత్తమనాయకుడిగా కీర్తించింది ద్రౌపది.

ఉపకీచక వధ

భీముడు వంటశాలకు వెళ్ళాడు. ద్రౌపది నర్తనశాల బయటకు వచ్చి కావలివారలను పిలిచి, కీచకమరణాన్ని ప్రకటించింది. ఉపకీచకులూ కీచక శవాన్ని గమనించారు. ద్రౌపదియే దీనికి కారణమని భావించి ఆమెను తెచ్చి అతడి శవానికి కట్టి శ్మశానానికి తీసికొని శోకిస్తూ ఎలుగెత్తి వెళ్ళసాగారు. ద్రౌపది గంధర్వులను పిలిచింది; రక్షించండని రోదించింది. ఆ సంగతి గమనించిన భీముడు ఉపకీచకులను సంహరించి, ద్రౌపదిని విడిపించి రహస్యంగా తన వంటశాలకు చేరాడు. ద్రౌపది సుదేష్ణ మందిరానికి చేరింది.

విరాటుడు కీచకోపకీచకుల మరణవార్త విని భార్యతో సహా విచారించాడు. సైరంధ్రిని అంతఃపురం నుండి పంపివేయడానికి నిశ్చయించాడు. ఆ పని సుదేష్ణకు అప్పగించాడు. కాని, సైరంధ్రి పదమూడు రోజులు మాత్రమే అంతఃపురంలో ఉండటానికి అనుమతి కోరింది. అట్లా చేస్తే గంధర్వులు మేలు చేస్తారనీ లేకపోతే ఆగ్రహిస్తారనీ చెప్పింది. సుదేష్ణ భయంతో మారుమాటాడలేక ఆమె కోరికను అంగీకరించి, అంతఃపురంలో ఉండటానికి అంగీకరించింది.

దుర్యోధనుని దురాలోచన

పాండవుల అజ్ఞాతవాసాన్ని భగ్నం చేయాలని దుర్యోధనుడి దుర్మంత్రం. నలుదిక్కులా చారులను పంపాడు. వారు పాండవుల తెరగును గుర్తించలేక నిరాశతో తిరిగి వచ్చారు. అయితే, 'మత్స్యదేశంలో కీచకుడినీ, ఉపకీచకులనూ ఒక స్త్రీ

కారణంగా నడిరేయి గంధర్వులు అతి విచిత్రంగా, భయంకరంగా చంపారు. విరాటు డెంత ప్రయత్నించినా గంధర్వులు కనపడలేదట' అని విన్నవించుకొన్నారు. దుర్యోధనుడు కర్ణ దుశ్శాసన శకునులతోనూ భీష్మాదులతోనూ చర్చలు జరిపాడు. ధర్మరా జెక్కడ ఉంటే అక్కడ దేశం సుభిక్షంగా ఉంటుందనీ, గోధనం అధికంగా పెంపొందుతుందనీ, పాడి సమృద్ధిగా ఉంటుందనీ భీష్ముడు తెలియజెప్పాడు. అప్పటి దేశాలన్నింటిలో మత్స్యదేశం సుభిక్షంగానూ, సమృద్ధంగానూ ఉన్నట్లు చారుల వలన గ్రహించారు. మరొక నిదర్శనం. బాహుయుద్ధంలో సింహబలుడు, భీమసేనుడు, శల్యుడు, బలరాముడు సమాన బలురు. కాబట్టి, గెలుపు ఈ నలుగురిలోనే ఒకరిపై మరొకరికి కలుగుతుంది. ఈ విధంగా ఊహించగా కీచక మర్దనుడు భీముడే కావచ్చునని నిశ్చయించారు. మత్స్యదేశంలో పాండవుల ఉనికిని దుర్యోధనాదులు శంకించారు.

దుష్టచతుష్టయం ఒక పన్నాగం సిద్ధం చేసింది. మొదట విరాటుని గోధనాన్ని అపహరించాలి. దానిని రక్షించటానికి మారువేషాలలో ఉన్న పాండవులు బయటపడతారు. పోరు చేస్తారు. వారిని గుర్తించి మరలా అరణ్య, అజ్ఞాతవాసాలకు పంపాలి అని వ్యూహం పన్నారు. మొదట సుశర్మ దక్షిణదిశగా విరాటనగరాన్ని ముట్టడించి గోవులను హరించాలి. దానితో విరటుడు ససైన్యుడై ఆ వైపు నడచి యుద్ధాన్ని సాగిస్తాడు. వెనువెంటనే ఉత్తరదిశగా కౌరవులు దాడి చేసి గోవులను హరించాలి. ఆ సమయంలో గోధనాన్ని, రాజును, తమను రక్షించుకొనడానికి పాండవులు బయటపడి యుద్ధానికి రాకమానరు. వ్రతభంగానికి పాల్పడకమానరని చిక్కని చక్కని రచన చేసికొని దుర్యోధనుడు గోగ్రహణ ద్వయ యాత్రలకు రణభేరి మ్రోగించాడు.

దక్షిణ గోగ్రహణం

బహుళాష్టమినాడు సుశర్మ దక్షిణ గోగ్రహణం చేశాడు. సుశర్మ సైనికులచేత దెబ్బలు తిన్న గోపాలురు విరాటుడికి గోగ్రహణ వృత్తాంతాన్ని విన్నవించుకొన్నారు. విరాటుడు సుశర్మ సాహసానికి కోపించి రాజధానిలో రణభేరి మ్రోగించి సైన్యాన్ని క్షణాలలో సమీకరించాడు. స్వయంగా తాను రథమెక్కి ఊరి వెలుపల సిద్ధమైనాడు. అతడి వెంట అతడి తమ్ముడు శతానీకుడు, అతడి తమ్ముడు మదిరాశ్వుడు, అతడి అనుజుడు సూర్యదత్తుడు రథాలతో సిద్ధమైనారు. మత్స్యభూపాలుడి పెద్దకొడుకు శంఖుడు సైన్యాలన్నింటినీ మోహరించి విభీషణ శంఖాన్ని పూరించాడు. అందరూ యుద్ధయాత్రకు సిద్ధమయ్యారు.

అంతలో కంకుభట్టు విరాటుడితో ఒక మనవి చేసికొన్నాడు. తాను, వలలుడు, దామగ్రంథి, తంత్రీపాలుడు కూడ శస్త్రాస్త్రప్రయోగాలు తెలిసినవారు కాబట్టి యుద్ధానికి రథాలపై తీసికొనిపోవట ముచితమని పేర్కొన్నాడు. ఆ రాజు సంతోషించి వారందరికీ సముచిత రథాల నిచ్చి తమలో కలుపుకొని యుద్ధయాత్ర సాగించాడు.

విరాట సుశర్మల సైన్యాలు సంకులంగా సమరం చేశాయి. విరాట విజృంభణం సుశర్మకు భారమైంది. సుశర్మ విరాటుడి మీద రథాలతో దొమ్మియుద్ధం చేసి అతడి తేరు విరుగగొట్టి బందీగా పట్టి తన రథం మీద పెట్టి సమరాన్ని సాగించాడు. ధర్మరాజు దానిని గమనించి భీముడిని హెచ్చరించి తమ కాశ్రయ మిచ్చిన విరాటుడిని విజయుడిని చేయుమని ఆదేశించాడు. అయితే, భీముడు వృక్షాలను పెకలించి భీకరయుద్ధం చేసి తన ఉనికిని బయటపెట్టుకొనకుండా నకుల సహదేవులు చక్రరక్షకులుగా గదా, చక్ర, కోదండాలతోనే పోరి విజయం సాధించాలని నిర్దేశించాడు. భీముడు ధర్మజాదులు చూస్తుండగానే సుశర్మ సైన్యాన్ని కార్చిచ్చువలె చుట్టుముట్టి ఊచకోత కోశాడు. వేల రథాలను నేలమట్టం చేశాడు. ధర్మజుడు కూడా బాణాలతో సుశర్మ సైన్యాలను ధ్వంసం చేశాడు. విరటుడు తప్పించుకొని భూమి మీదకు దూకి గదతో యుద్ధాన్ని ఆరంభించాడు. సుశర్మ రథాన్ని విరగగొట్టాడు. భీముడు సుశర్మ రథం మీదకు దూకి అతడిని పెడరెక్కలు విరిచి కట్టి బంధించాడు. అతడి సేనానులు భయంతో కొందరు పారిపోయారు; మిగిలినవారు లొంగిపోయారు. పాండవుల కారణంగా విరాటుడికి విజయం లభించింది.

విరటుడు ధర్మజుడికి కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు. 'నీవు నా మానాన్ని, ప్రాణాన్ని కాపాడావు. దీనికి తగిన బహుమానాన్ని నేనే మివ్వగలను? నా సింహాసనాన్నే నీవు స్వీకరించుము. ఈ శరీరం ఈ సంపద ఈ రెండూ నీ విచ్చినవే ఇప్పుడు. కాబట్టి ఆ రెంటినీ నీకే సమర్పిస్తాను. స్వీకరించి మత్స్యదేశాన్ని రక్షించుము. నాచేత సేవలు కొని నన్ను మన్నించుము' అని వేడికొన్నాడు.

ధర్మరాజు వినయంగా 'నేను మీ దేశంలో ఉన్నాను. మీ ప్రాపున ఉన్నాను. మిమ్మల్నీ, మీ దేశాన్నీ రక్షించటం నా ధర్మం. ఇందులో నన్ను ప్రత్యేకంగా పొగడవలసిన అవసరం లే' దని పేర్కొన్నాడు. కంక, వలల, దామగ్రంథి, తంత్రీపాలుల యుద్ధనైపుణ్యాన్ని విరటుడు మెచ్చుకొన్నాడు. ధర్మజుడు చేసిన సహాయానికి కోరిన కోర్కె తీర్చి ఋణ విముక్తుడ నౌతానని విరటుడన్నాడు. దానికి ధర్మరాజు సుశర్మను సపరివారంగా క్షమించి విడిచిపెట్టుమని కోరాడు. విరటుడు సంతోషంగా అంగీకరించి దానిని అమలు చేశాడు.

గోధనం తిరిగి చేతికి లభించింది. విరటుడు విజయోత్సవాన్ని నగరంలో జరుపుకొనటానికి చారుల చేత కబురు పంపాడు. విరాటనగరం విజయోత్సవ శృంగారాలతో కళకళలాడుతున్నది.

ఉత్తర గోగ్రహణం

నవమినాడు ఉదయమే దుర్యోధనుడు భీష్మద్రోణకృపాదులైన వీరులందరూ కలసిరాగా అపారసైన్యంతో ఉత్తరదిక్కున విరాటుడి గోవులను ముట్టడించి మరలించి హస్తినవైపు తోలుకొనిపోసాగాడు. ఆ విపత్తును గవాధ్యక్షుడు రాజధాని అంతః పురంలో ఉన్న భూమింజయుడిని దర్శించి విన్నవించుకొన్నాడు. అపార కురుసైన్యాన్ని ఎదుర్కొని గోధనాన్ని రక్షించుకొని అభిమానాన్ని కాపాడుకొమ్మని కోరాడు. ఉత్తరుడు కౌరవులపై దాడి వెడలటానికి సిద్ధమయ్యాడు. కాని, తగిన సారథి నగరంలో లేడని తెలిసికొన్నాడు. సారథిని సమకూర్చండని ఆజ్ఞాపించాడు. తగిన సారథియే కనుక దొరికితే దుర్యోధన, భీష్మ, కర్ణ, కృప, ద్రోణాశ్వత్థామాది వీరులందరితో రణరంగంలో పార్థుడివలె పోరి గోవులను అవలీలగా తిరిగి తెస్తానని ప్రకటించాడు.

ఆ మాటలు ద్రౌపది విన్నది. అప్పు డేర్పడిన క్లిష్టపరిస్థితిని పేడిరూపంలో ఉన్న అర్జునుడికి చెప్పింది. అజ్ఞాతవాసకాలం ఆ రోజుతో ముగుస్తున్నదని గమనించి పార్థుడు తన సారథ్యానికి ఉత్తరుడు ఒప్పుకొనేటట్లు చేయుమని ద్రౌపదిని కోరాడు. ఆమె బృహన్నల రథచోదనశక్తిని గురించి ఉత్తరకు చెప్పి, ఆమెఅన్న అయిన ఉత్తరకుమారుడికి నివేదించుమన్నది. పూర్వం ఖాండవ దహన సమయంలో బృహన్నల అర్జునుడికి రథసారథిగా ఉండి విజయాన్ని సాధించటానికి తోడ్పడ్డాడని ఉత్తర ఉత్తరకుమారుడితో చెప్పింది.

భీష్మాదులతో యుద్ధం చేయబోతూ పేడివాడిని సారథిగా పెట్టుకొంటే అపహాస్యాల పాలౌతానని ఉత్తరుడు మొదట ఒప్పుకొనలేదు. కాని, ద్రౌపది కూడా బృహన్నల నేర్పును చెప్పి ఒప్పించటంతో అంగీకరించాడు. ఉత్తర బృహన్నలను రథసారథిగా ఉండటానికి కోరింది. ఉత్తరుడు కూడా అతడిని ఆహ్వానించాడు. అర్జునుడివలె తనకూ విజయాన్ని కలిగించుమని కోరాడు. బృహన్నల రథాన్ని ఆయత్తం చేశాడు. ఉత్తర తనకు కురువీరుల తలపాగాలను బొమ్మపొత్తిళ్ళుగా తెచ్చి పెట్టుమని బృహన్నలను కోరుకొన్నది. అందుకు బృహన్నల అంగీకరించాడు. ఉత్తరుడు రథమెక్కాడు. ఉత్తరదిశగా రథాన్ని పోనిచ్చాడు బృహన్నల.

నగరం వెలువడుతున్నది రథం. గోవులను తరలించుకొని వెళ్ళుతున్న కౌరవసైన్యం వలన రేగిన ధూళి ఆకాశాన్నంతా జేవురురంగుతో అవరించుకొని ఉన్నది. ఎట్టఎదుట కౌరవసేన భీషణంగా నిలువబడి ఉన్నది. ఉత్తరు డాసేనను చూచి నిలువెల్లా కంపించిపోయాడు. తడబడుతూ ఇట్లా అన్నాడు:

"భీష్మద్రోణ కృపాది ధన్వి నికరాభీలంబు, దుర్యోధన
గ్రీష్మాదిత్య పటుప్రతాప విసరాకీర్ణంబు, శస్త్రాస్త్రజా
లోష్మస్ఫార చతుర్విధోజ్జ్వల బలాత్యుగ్రం, బుదగ్రధ్వజా
ర్చిష్మత్త్వాకలితంబు సైన్య మిది యేఁ జేరంగ శక్తుండనే?"

'ఆ మహావీరుల ముందు నేనెంత, నా బలమెంత? కౌరవ బలమింత ఉంటుందని తెలియక యుద్ధానికి వచ్చాను. ఎదుర్కొనే ధైర్యం నాకు లేదు' అని గడగడ వణుకుతూ రథాన్ని వెనక్కు త్రిప్పుమన్నాడు ఉత్తరకుమారుడు.

బృహన్నల అతడికి నగరంలో చేసిన ప్రతిజ్ఞలను జ్ఞాపకం చేశాడు. 'విజయం దేవుడెరుగు, పసులమాట దయ్యమెరుగు, పడతుల సంతోషం ముఖ్యం కాదు. వీరితో నేను యుద్ధం చేయలే' నని నీరు కారిపోయి మాట్లాడాడు ఉత్తరుడు. అప్పుడు బృహన్నల ఉత్తరకుమారుడికి ధైర్యం చెప్పాడు. ఉత్తమవీరుడుగా విజృంభించి కురువీరులమీద విజయాన్ని సాధించటం కార్యం కాని, వెనుదిరిగి పోవటం కాదని నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు. ఒంటరిగా యుద్ధం చేయలేనని ఉత్తరుడు వెనుకాడాడు. 'ధైర్యం తెచ్చుకొని కౌరవ సైన్యాన్ని ముట్టడించి గోవర్గాన్ని కొనిపోవాలి కాని ఈ భయమెందుకు? సైరంధ్రి నన్ను గురించి చెప్పిన తరువాత సారథిగా ఎన్నుకొన్నావు. నేను నొగలెక్కిన తరువాత మడమ త్రిప్పటమనే మాట ఉండకూడ' దని రథాన్ని విచ్చుడు ముందుకు పోనిచ్చాడు.

ఉత్తరుడు భయకంపితుడయ్యాడు. 'పారిపోతే పౌరులు నవ్వుతారని ప్రాణాలు పోగొట్టుకొంటానా? నన్ను ఆపబోకుము నీకంత క్రొవ్వు అరగకపోతే యుద్ధం చేయి' అని బాణాలూ విల్లంబులూ రథంమీద పడవేసి నేలమీదకు దూకి సిగ్గువదలి పురంవైపు పరుగు తీయటం ప్రారంభించాడు. బృహన్నల గుర్రాలను ఆపి, నొగలు దూకి ఉత్తరుడిని పట్టి తీసికొని రావటానికి అతడి వెంట పరుగెత్తసాగాడు.

బృహన్నల ఆకారాన్నీ గమనాన్నీ గమనించి కౌరవులు అనుమానంలో పడ్డారు. రూపం పౌరుషం, తీరు స్త్రైణం. బాహువుల వైనం నడిచే వైఖరి అర్జునుడిది. బహుశః పార్థుడు అజ్ఞాతవాసంలో ఈ వేషంలో ఇక్కడ ఉన్నాడేమో! దక్షిణ గోగ్రహణానికి సారథులందరు పోగా మిగిలిన ఇతడిని పట్టుకొని ఉత్తరుడు తెచ్చాడేమో! కౌరవ సైన్య బలాబలాలు తెలియక మొదట రథమెక్కి వచ్చినా రాజకుమారుడు భయపడి తిరిగి పోతున్నాడేమో-నని పరిపరివిధాల భావించటం మొదలుపెట్టారు కౌరవవీరులు.

మదకరి గమనంతో అర్జునుడు సాగి ఉత్తరుడిని నిలువరించాడు. ఉత్తరుడు వెలవెలపోయాడు. నోట తడియారి తల్లడిల్లాడు. శరీరమంతా చెమటలు కారిపోయాయి. కాళ్ళూ చేతులూ గజగజ వణికిపోయాయి. గుండె దడదడ కొట్టుకొన్నది. దీనదృష్టులతో కంపించిన గొంతుతో తనను వదలిపెట్టుమని బృహన్నలను వేడుకొన్నాడు. వదలితే విలువైన కానుక లిస్తా నన్నాడు. తన కొరకు ఆతురతతో ఎదురు చూచే అమ్మ దగ్గరకు తొందరగా వెళ్ళాలన్నాడు. ఇట్లా ఎన్నో రకాలుగా దీనాలాపాలను చేస్తున్న ఉత్తరుడికి అర్జునుడు ధైర్యం చెప్పి, కురువీరులతో యుద్ధం తానే చేస్తాననీ, ఉత్తరుడిని రథసారథ్యం చెయ్యుమనీ కోరాడు. అతడంగీకరించక పోయినా బలవంతాన నొగలమీద కూర్చుండబెట్టి శమీవృక్షంవైపు రథాన్ని పోనిచ్చాడు.

పేడిరూపంలో ఉన్నా ప్రతాపతేజుడివలె నివురుగప్పిన నిప్పువలె ఉన్న బృహన్నలను అర్జునుడిగా అనుమానించారు భీష్మద్రోణులు. అజ్ఞాతవాసం గడువు పూర్తికాకుండా బయటపడుతున్నాడేమిటని ద్రోణుడు భీష్ముడిని అడిగాడు. భీష్ముడు కాలాన్ని లెక్కగట్టి గడువు ముగిసిందనీ, ప్రతాప ప్రకటనకు సమయం ఆసన్నమైందనీ గూఢంగా హెచ్చరించాడు. ఆచార్యుడు అర్జునుడికి సమయభంగం లేదని గ్రహించాడు.

"సింగం బాకటితో గుహాంతరమునం జేడ్పాటు మై నుండి మా
తంగ స్ఫూర్జిత యూథ దర్శన సముద్యత్క్రోధమై వచ్చు నో
జం గాంతార నివాసఖిన్నమతి నస్మత్సేనపై వీడె వ
చ్చెం గుంతీసుతమధ్యముండు సమరస్థేమాభిరామాకృతిన్."

'అర్జునుడితో సమానంగా పోరగలిగిన వీరులు మనలో ఉన్నారా? అనేదే అనుమానం. పరమేశ్వరుడిని ప్రీతుడిని చేసి పాశుపతాస్త్రాన్ని సంపాదించాడని విన్నాం. అతడికి ఆవులను మరలించటం అవలీల'.

ఆ మాటలు విని కర్ణుడు కటకట పడ్డాడు. పాండవ పక్షపాతంతో ఆచార్యుడు పార్థుడిని పొగడాడని ఈసడించుకొన్నాడు. అర్జునుడే కనుక వస్తే యుద్ధంలో బాణాలతో సమాధానం చెపుతానని బీరాలు పలికాడు. దుర్యోధనుడు అర్జునుడిని గుర్తించి మరల పాండవులను అరణ్య, అజ్ఞాతవాసాలకు పంపుదామని హెచ్చరించాడు. భీష్మద్రోణాశ్వత్థామలు వారి మాటలకు తమలో తాము నవ్వుకొని ఊరకున్నారు.

అర్జునుడు శమీవృక్షం దగ్గర రథం ఆపాడు. ఉత్తరుడిని ఆ వృక్షం ఎక్కించి ఆయుధాల మూటలోనుండి గాండీవాన్నీ, అక్షయతూణీరాలనూ తీయించాడు. తాను అర్జునుడి నని ఉత్తరుడికి తెలియబలికాడు. అజ్ఞాతవాసవ్రతకాలం పూర్తి కావటంతో నిజతేజోరూపాన్ని మరల పొందాడు. గాండీవధారియై రథమెక్కాడు.

ఉత్తరుడు బృహన్నలను అర్జునుడిగా తెలిసికొని పరమానందభరితుడయ్యాడు. తెలియక పలికిన పలుకులకు మన్నింపుమని వేడుకొన్నాడు. అర్జునుడు ఉత్తరుడిని వాత్సల్యంతో కౌగిలించుకొన్నాడు. పార్థుడి రథానికి సారథిగా ఉండాలని ఉత్తరుడి మనసులో ఎప్పటినుండో కోరికగా ఉండేది. అది ఈనాటికి తీరిందని సంతోషపడ్డాడు. అర్జునుడు రథారూఢుడై గాండీవాన్ని చేపట్టి గుణధ్వని చేశాడు. దేవదత్తాన్ని పూరించాడు. దిక్కులు దద్దరిల్లాయి. కపిధ్వజం రెపరెపలాడింది. కిరీటం సూర్యకాంతులను ప్రసరించింది. కౌరవవీరులు అర్జునుడిని గుర్తించారు. ఇక యుద్ధం తప్పదనుకొన్నారు.

అప్పుడు ద్రోణాచార్యుడు దుర్యోధనుడిని పిలిచి 'ఇక పార్థుడు పరాక్రమాన్ని ప్రదర్శించబోతున్నాడు. అందరూ ఇక యుద్ధానికే సిద్ధంకం' డని హెచ్చరించాడు. 'అజ్ఞాతవాసకాలం పూర్తికాకుండా పాండవులను గుర్తించి మరల అరణ్యాజ్ఞాతవాసాలకు పంపాలనే గదా ఇంతయత్నం చేసింది. దీనికి విచారపడవలసిన పనిలేదు' అని అన్నాడు సుయోధనుడు. ద్రోణాచార్యులను అధిక్షేపించాడు. అర్జునుడి పరాక్రమాన్ని ప్రశంసించిన కృపాచార్యుడిని కర్ణుడు తూలనాడాడు. అందుకు అశ్వత్థామ ఆగ్రహించాడు. దుర్యోధనుడు వారందరినీ సమాధానపరిచి భీష్ముడివద్దకు వెళ్ళి పాండవులకు అరణ్య అజ్ఞాతవాస కాలం పూర్తి అయిందా? తెలియజెప్పుమన్నాడు. భీష్ముడు పూర్తి అయిందని నిష్కర్ష చేశాడు. గడువు పూర్తి అయిన తరువాత అడుగు ముందుకు వేస్తున్న అర్జునుడిని తక్కువ అంచనా వేయవద్దని హెచ్చరించాడు. ఇట్లా హితవు కూడా చెప్పాడు.

"వచ్చినవాడు ఫల్గునుఁ డవశ్యము గెల్తుమనంగ రాదు; రా
లచ్చికి నై పెనంగిన బలంబులు రెండును గెల్వవచ్చునే?
హెచ్చుగుఁ గుందగుం; దొడరు టెల్ల విధంబుల కోర్చు; టట్లుగా
కిచ్చఁ దలంచి యొక్కమెయి నిత్తఱిఁ బొందగు చేతయుం దగున్."

ఈ మాటలకు సుయోధనుడు చిరునవ్వు నవ్వి 'మనకూ పాండవులకూ పొత్తు కుదరదు. నేను రాజ్యభాగ మీయను. యుద్ధం చేసి పరాక్రమాన్ని ప్రదర్శించటమే నా ఇష్టం' అని స్పష్టం చేశాడు.

భీష్మాదులు చిన్నబుచ్చుకొన్నారు. కవ్వడి గాండీవ గుణధ్వని కౌరవవీరులకు హెచ్చరిక చేసింది. అందరూ వ్యూహం పన్ని సమరానికి సన్నద్ధమయ్యారు.

అర్జునుడు ముందుగా గోవులను మళ్ళించి, ఆ తరువాత వ్యూహంలో ఉన్న కురువీరులపై దాడి చేయాలని నిశ్చయించాడు. భీష్మద్రోణులకు నమస్కార బాణాలను యోగక్షేమ బాణాలను పాదాల వద్ద చెవులవద్ద పడేటట్లు వేసి వారి వాత్సల్యాన్నీ ప్రశంసలనూ చూరగొన్నాడు. ఆ తరువాత అర్జునుడు కౌరవసైన్యంమీద విరుచుకపడ్డాడు. అందరినీ రక్తసిక్తం చేశాడు శరపరంపరలతో.

"శక్తి స్ఫార ధనంజయాయత భుజాసంరంభ గాండీవని
ర్ముక్త క్రూర శరావలీ దళిత శత్రువ్రాతముల్ శోణితా
సిక్తాకారతఁ బొంది సాంద్ర కుసుమశ్రేణీ విలాసోల్లస
ద్రక్తాశోక తరు వ్రజంబుల క్రియన్ రంజిల్లి యొప్పెం గడున్".

కౌరవ సైన్యవ్యూహంలో అర్జునుడు మధ్యభాగంలో ప్రవేశించి సేనను రెండు పాయలుగా చీల్చాడు. ఆ మీద అడ్డంగా దాడి చేశాడు. నాలుగు మూలలా కలయ తిరిగాడు. పెక్కురకాల రథచంక్రమణ విధానాలను ప్రదర్శించి పార్థుడు సైన్యాన్ని కలతపెట్టాడు. ఒక సముద్రంలో మహామత్స్యం విచ్చలవిడిగా విహరిస్తూ సంక్షోభాన్ని కలిగించినట్లయింది అర్జునుడి యుద్ధ రథయాత్ర.

అర్జునుడు మహావీరులపై బాణాలు సంధించాడు. ద్రోణాచార్యుడిని డెబ్బై బాణాలతో కొట్టాడు. అశ్వత్థామను ఏడు బాణాలతో చరిచాడు. కృపాచార్యుడిని పది బాణాలతో బాదాడు. దుశ్శాసనుడిని పదునైదు బాణాలతో కొట్టాడు. శకునికి ఎనిమిది బాణాల రుచి చూపించాడు. భీష్ముడి మీద అరవై బాణాలను అనుసంధించాడు. కర్ణుడి సారథిని, గుర్రాలను చంపి, మర్మాంగాలు ఛేదించేటట్లు అతడిని కొట్టాడు. ఆ దెబ్బకు తట్టుకోలేక కౌరవవీరులు తల్లడిల్లారు. భీష్ముడి అండన చేరి తల దాచుకొన్నారు. భీష్ముడు వారినందరిని పురికొలిపి యుద్ధాన్ని ముమ్మరం చేశాడు.

అర్జునుడు కర్ణుని ఢీకొనాలని యత్నించాడు. నడుమ చిత్రాంగదాది కురుకుమారులు చాలామంది కలిసి అడ్డుపడ్డారు. వారిలో కొందరిని పార్థుడు ఓడించాడు. కొందరిని చంపాడు. కర్ణుడి తమ్ముడు సంగ్రామజిత్తు విజ్వచ్చుడి మీదకు వచ్చాడు. కాని, అతని చేతిలో చచ్చాడు. తమ్ముడి చావు చూచి కోపించి కర్ణుడు అర్జునుడిపై విజృంభించాడు. పోరు ఘోరంగా సాగింది. నరుడి రథ తురగాలను నాలుగు బాణాలతో కొట్టాడు కర్ణుడు. ఉత్తరుడిని ఆరు బాణాలతో, రథాన్ని ఎనిమిది బాణాలతో, టెక్కాన్ని పది బాణాలతో, అర్జునుడి శరీరాన్ని అరవై బాణాలతో కొట్టాడు. అర్జునుడికి రోషం పొంగింది. కర్ణుడి శిరాన్ని, లలాటాన్ని, కంఠాన్ని, బాహువులను, వక్షఃస్థలాన్ని బాణాలతో గుప్పించాడు. ఆ ధాటికి ఓర్వలేక కర్ణుడు రణరంగాన్ని వీడి వెళ్ళిపోయాడు. అతడిని చూచి నవ్వుతూ అర్జును డిట్లా అన్నాడు: 'వీ డొకడు కురుబలంలో నేనే మహావీరుడిని - అంటాడు. వీడి పరాక్రమం ఇట్లా నీరుగారింది.'

అర్జునుడు రథాన్ని ద్రోణాచార్యుడివైపు మళ్లించుమన్నాడు ఉత్తరుడితో. ఎర్రని గుర్రాలు కట్టి రథం మీద వీరమూర్తివలె నిలుచున్న ద్రోణుడికి సూటిగా రథం సాగింది. పార్థుడు గురువుకు నమస్కరించాడు. 'చాలా కాలం అడవులలో ఉండి అగచాట్లు పడ్డాం. ఇప్పుడు యుద్ధం చేసే అవకాశం దొరికింది. మాయందు దయచూపండి' -అని ప్రార్థించాడు. ముందు మీరు బాణం వేస్తే కాని నేను వేయను' అని అర్జును డనగానే ద్రోణుడు ఇరవై వాడిబాణాలు కిరీటిపై సంధించాడు. వాటి నతడు మధ్యలోనే విరుగకొట్టాడు. ఇరువురూ మత్తేభాల వలె ఢీకొన్నారు. ఇంద్రాగ్ని వాయు వరుణాది దేవతాకాలైన బాణా లొకరిపై మరొకరు వేసికొన్నారు. విరుగుడు అస్త్రాలను కూడా ప్రయోగించుకొన్నారు. యుద్ధభూమంతా చీకట్లు క్రమ్మినట్లయింది. భయంకర యుద్ధం ఇరువురి మధ్య సాగింది. అర్జునుడి యుద్ధం ముందు గురుడుగాని, హరుడు గాని నిలువగలరు గాని మరొకరికి సాధ్యమౌతుందా? అని దేవతలు మెచ్చుకొన్నారు. ద్రోణుడిని బాణాల వెల్లువలో పార్థుడు ముంచాడు. సైనికులు హాహాకారాలు చేశారు. అంతలో అశ్వత్థామ తన తండ్రికి తోడువచ్చి అర్జునుడిపై బాణాలు గుప్పించాడు. అతడు కూడా రెట్టించి గుప్పించాడు. ఇరువురి నడుమా మహేంద్ర వృత్రాసురుల యుద్ధంవలె పోరు సాగింది. అశ్వత్థామ తూణీరాలు ఓటుపోయాయి. అర్జునుడి అక్షయ తూణీరాలు పెంపుగాంచాయి.

అశ్వత్థామను వదలి అర్జునుడు కృపాచార్యుడిని ఢీకొన్నాడు. ఇరువురికీ సంకులంగా సమరం జరిగింది. పార్థుడు పంతంతో కృపాచార్యుడి రథం విరుగగొట్టాడు. అతడు అశ్వత్థామరథమెక్కి తొలగిపోయాడు. అడ్డం వచ్చిన సైన్యాన్ని నురుమాడుతూ విజయుడు భీష్ముడివైపు రథం పోనిచ్చాడు. మదించిన ఆబోతులవలె రంకెలు వేసికొంటూ తాతా మనుమడూ శరయుద్ధంలో కలియబడ్డారు. పితామహుడు వివిధాస్త్ర ప్రయోగాలు చేస్తే వాటిని విజ్వచ్చుడు విఫలం చేశాడు. పై పెచ్చు భీష్ముడి విల్లును రెండుసార్లు విరుగగొట్టాడు. రెండవసారి మరొక విల్లందుకొనేలోగా అతడి వక్షంలో బాణాలు నాటాడు. వాటికి భీష్ముడు ఒరిగి పడబోయి రథకంబాన్ని ఆలంబనంగా చేసికొని నిలబడ్డాడు. ఆ స్థితిలో సారథి భీష్ముడి రథాన్ని ప్రక్కకు తీసికొనిపోయాడు.

అర్జునుడు గాండీవ గుణాన్ని మ్రోగించుకొంటూ భుజబలం ప్రదర్శిస్తూ రథంమీద నిరాఘాటంగా పోతుంటే కర్ణ కృపాచార్యాది ప్రభృతులందరూ కళ్ళప్పగించి చూస్తూ నిలుచుండిపోయారు.

విజయుడు క్రమంగా - తమ్ములూ ఆప్తభృత్యులు పరివేష్టించి ఉండగా మధ్యలో దుర్యోధనుడు నిలిచి ఉన్న చోటుకు రథాన్ని పోనిచ్చాడు.ముందుగా రెండు బాణాలు వక్షఃస్థలం మీద కొట్టాడు. దుర్యోధనుడు బొమలు ముడిచి వాడి బాణాన్ని పార్థుని నొసలిపై నాటాడు. ఇంతలో వికర్ణుడు ఒక భద్రగజం మీద కెక్కి అర్జునుడికి అడ్డం వచ్చాడు. క్రుద్ధుడై అర్జునుడు ఒక్క బాణంతో ఏనుగును కూలగొట్టాడు. వికర్ణుడు వెల్లకిలబడి లేచి పరుగెత్తాడు. దుర్యోధనుడిని శరపరంపరతో ముంచెత్తుతున్నాడు విప్పచ్చుడు. రారాజు వెనుకంజ వేస్తున్నాడు. రాజును రక్షించుకొనటం వీరుల బాధ్యతగా గుర్తించండని ఎలుగెత్తి చాటుతున్నాడు కర్ణుడు. ద్రోణాదు లతడి మాటలు పట్టించుకొనే స్థితిలో లేరు. అర్జునుడు దుర్యోధనుడిని సంబోధించి ఇట్లా అధిక్షేపించటం మొదలు పెట్టాడు: 'ఓ కౌరవరాజా! వీరక్షత్రియుడు యుద్ధంలో ఓడి ఇట్లా పారిపోతాడా? నేనా చిన్నవాడిని! అభిమానివిగా, బలదర్ప సమగ్రుడివిగా పేరొందిన నీవు మిత్రులతో సహా ఇట్లా పలాయనం చిత్తగిస్తే బలవంతులు మెచ్చుతారా? ఇరుగడలా పెక్కేనుగులు కదలి వస్తూంటే రేపు పురవీథులలో నీవు భద్రగజం మీద ఊరేగవద్దా? భూషణాలంకారాలతో, కస్తూరీ చందనాదులతో రేపు నిండు సభలో గండుమీరవద్దా? మనోహర చతురాంగనలతో నీవు మదన లీలల్లో తేలియాడవద్దా? ఇట్లా యుద్ధంలో ఓడి తిరిగిపోయేదానికన్నా తనువు చాలించటం మంచిది. ఇది రణరంగం. జూదమాడే నేర్పు ఇక్కడ సాగదు సుమా! నీవంటి వాడు వెనుదిరిగి పరుగెత్తటమా? నిలు నిలు' మని విజయుడు రారాజును ములుకులవంటి మాటలతో ఎత్తిపొడిచాడు.

ఆ మాటలకు అభిమానపడి సుయోధనుడు వెనుదిరిగి యుద్ధం చేయ నారంభించాడు. భీష్మాదులు కూడా ఆయనకు సాయంగా నిలిచారు. పోరు సంకులంగా సాగింది. పార్థుడు ఉత్తర మాటలు తలచి సమ్మోహనాస్త్రాన్ని సంధించాడు. వీరులందరు మూర్ఛలో మునిగిపోయారు. అప్పుడు ఉత్తరుడిని దుర్యోధనాదుల తలపాగాలను తెచ్చి భద్రపరుచుమని, ఉత్తరకుమారికి బొమ్మపొత్తికలుగా బహూకరించవచ్చునని నిర్దేశించాడు. భీష్ముడి జోలికి వెళ్ళవద్దన్నాడు. ఉత్తరుడు తలపాగాలు తెచ్చి రథంమీద పెట్టాడు. భీష్మ డంతలో ఒడలు తెలిసి అర్జునుడిపై బాణాలు గుప్పాడు. పార్థుడు గూడ తాతను నొప్పించి దూరంగా రథాన్ని నడిపించి విరామప్రాంతంలో నిలిపాడు.

దుర్యోధనాదులు సమ్మోహనాస్త్ర భ్రాంతి నుండి మేల్కొని యుద్ధానికి సిద్ధమవుతుండగా భీష్ముడు వారి తలపాగాలు లేని విషయం తెలియజెప్పి, ఒడలు తెలియనప్పుడు అర్జునుడు ప్రాణాలు తీయనందుకు అభినందించాలని నచ్చచెప్పాడు. కౌరవుల ప్రాణాలు అర్జునుడి దయాభిక్షగా అభివర్ణించాడు. దుర్యోధనుడు చేసేది లేక సైన్యాన్ని హస్తినాపురం వైపు నడిపించుమన్నాడు. విరటుడి గోవులను విప్పచ్చునకు వదలిపెట్టి వెళ్ళిపోయాడు. కిరీటి కొంతదూరం కౌరవసైన్యాన్ని తరిమి గాంగేయాదులకు నమస్కరించి, మధ్యందిన మార్తాండబింబంవలె దుర్నిరీక్ష్య తేజంతో వెలుగుతూ విజయశంఖాన్ని పూరించాడు.

కురుబలాలను గెలిచింది ఉత్తరుడే అని నగరంలో చెప్పుమన్నాడు అర్జునుడు. దానికి ఉత్తరుడు వినయంతో 'నేను విజయాన్ని సాధించి గోవులను మరలించానని చెప్పినా జనులు నమ్మవద్దా? అయినా అర్జునా, నీవు చెప్పుమన్నప్పుడే చెప్పుమన్న విధంగానే రాజుకు నిజం చెప్పి ఒప్పిదాన్ని పాటిస్తా' నని మాట ఇచ్చాడు. రథాన్ని శమీవృక్షం దగ్గరకు తీసికొని వెళ్ళారు. గాండీవ తూణీరాలను యథాస్థలంలో ఉంచారు. విజయుడు బృహన్నల వేషాన్ని ధరించాడు. దివ్యాభరణాలను ప్రార్థించి అంతర్హితం చేయించాడు. తాను సారథిగా నొగలెక్కాడు, ఉత్తరుడు రథికుడుగా రథమెక్కాడు. గోపాలుర చేత విజయవార్త ముందుగా మత్స్యమహీపతికి తెలియపంపాడు.

విరాటుడు విజయోత్సాహంతో దక్షిణ దిక్కు నుండి నగరానికి చేరికొన్నాడు. వేడుకలు చేసికొన్నాడు. ఉత్తరుడు నగరంలో కనపడకపోవటంతో అతడిని గురించి అడిగాడు. ఉత్తరగోగ్రహణ వృత్తాంతం, భీష్మాది మహావీరులతో యుద్ధం చేసి ఒంటిగా విజయాన్ని సాధించటానికి బృహన్నలను సారథిగా చేసికొని ఉత్తరుడు వెడలిన సంగతి తెలిసికొన్నాడు. కురుసైన్యాన్ని ఎదిరించే

శక్తి ఉత్తరకుమారుడికి లేదని, అతడు రణరంగంలో ఏమయిపోతాడోనని భయవిహ్వలుడయ్యాడు. బృహన్నల బాహుపరాక్రమంతో రాకుమారుడు విజయం సాధించగలడని కంకుభట్టు ధైర్యం చెప్పాడు. అంతలో ఉత్తరుని విజయవార్తలు గోపాలురు వచ్చి నివేదించారు. విరటుడి ఆనందోత్సాహాలకు అవధులు లేకుండా పోయాయి. విజయోత్సాహంతో ఊగిపోయాడు. ఆ ఆనంద సమయంలో కంకుభట్టుతో కలిసి జూదం ఆడటానికి పూనుకొన్నాడు. ఆ సమయంలో మత్స్యమహీపతి ఉత్తరకుమారుడి పరాక్రమాన్ని ప్రశంసించి తన కుమారుడి ఉత్తమ వీరత్వాన్ని ప్రశంసించాడు. ఆ విజయానికి మూలకారకుడు ఖాండవ దహనాది యుద్ధాలలో అఖండకీర్తిని గడించిన బృహన్నలగా కంకుభట్టు కీర్తించాడు. అందుకు విరటుడికి కోపం వచ్చి చేతిలో ఉన్న సారెతో కంకుభట్టు నుదురుపై కొట్టాడు. రక్తం చిందింది. ప్రక్కనున్న సైరంధ్రి బంగారు కలశంలోని నీటితో కడిగి నెత్తురు బొట్లు నేలమీద పడకుండా చీరకొంగుతో తుడిచి అదిమి పట్టింది. అట్లా చేయటానికి గల కారణమేమి టని విరటుడు ఆమె నడిగాడు. 'కంకుభట్టు ధర్మమూర్తి. అతడి నెత్తురు ఎన్ని బొట్లు నేలమీద పడితే అన్నేళ్ళు ఆ దేశంలో వానలుండవు. అందువలన రక్తం స్రవించకుండా అదిమిపట్టా'నని చెప్పింది. అంతలో ఉత్తరకుమారుడు ప్రవేశించాడు. విరటుడు అతనిని కౌగిలించుకొని సన్మానించాడు. 'కుమారా! భీష్మ ద్రోణ కృప కర్ణాది మహావీరులు గోగ్రహణ సమయంలో శస్త్రాస్త్రాలను పుంఖానుపుంఖంగా ప్రయోగిస్తుంటే ఒంటరిగా నీవు ఎట్లా పోరు సల్పి రణరంగంలో నిలువగలిగావు? ప్రచండ పరాక్రమంతో వారు నిన్ను కమ్ముకొని ముమ్మరిస్తుంటే నీ కెవ్వరూ తోడు కూడా లేరే! ధైర్యంతో ఎట్లా ఎదురొడ్డగలిగావు? ఒకడా పరశురాముడిని గెలిచినవాడు, మరొకడా ధనుర్విద్యాగురువు; మిగిలినవారిలో ఒక్కొక్కరూ దేవదానవులు కలిసి దండెత్తినా వారిని ఓడింపగలిగిన ధీరవరేణ్యులు; వీరందరినీ ఒంటిగా ఎట్లా జయించావు? గోవులను ఎట్లా మరల్చావు? అభిమానధనుడైన ఆ సుయోధనుడు నీ విజయాన్ని అంగీకరించి ఎట్లా వెనుదిరిగి వెళ్ళగలిగాడు? ఇవన్నీ మనసులో భాసిస్తేనే భయం వేస్తున్నది. ఆ యుద్ధగాథను సవిస్తారంగా వివరించి చెప్పు'మని ఉత్కంఠతో ఉత్తరకుమారుడిని అడిగాడు విరటుడు.

'తండ్రీ! ఆ కౌరవ సేనలను నేను గెల్వలేదు. ఆ గోవులను నేను మరల్చ లేదు. దేవ సంభవుడైన ఒక మహానుభావుడు నాకు అభయమిచ్చి, తానే యుద్ధాన్ని చేసి, విజయాన్ని సాధించి, మన గోధనాన్ని మనకిచ్చి, అంతర్ధానమైనాడు' అని చతురంగా సమాధానం చెప్పాడు ఉత్తరకుమారుడు. యుద్ధ కథంతా వివరంగా విని ఆ మహానుభావుడిని చూడాలని ఆసక్తి పడ్డాడు విరటుడు. అతడు ఇవ్వాళ రేపట్లో దర్శనమిస్తాడని ఉత్తరుడు సమాధానపరిచాడు.

విరటుడు బృహన్నలను సముచితంగా సమాదరించాడు. బృహన్నల అంతఃపురానికి వెళ్ళి ఉత్తరకు తాము తెచ్చిన వీరుల తలపాగాలను బొమ్మ పొత్తికలుగా ఇచ్చి ఆమెను సంతోషపెట్టాడు.

పాండవులు బయలు మెరయటం

ఆ రాత్రి ద్రౌపదీ పాండవులు రహస్యంగా సమావేశమై మరునాడు రాజసభలో బయలు మెరయటానికి నిర్ణయించుకొన్నారు. మరునాడు సూర్యోదయ కాలానికి పాండవులు సముజ్జ్వల వేషాలతో రాజసభకు వెళ్ళి సింహాసనం మీద ధర్మరాజు, అతడి ప్రక్కన ఉచితాసనాలపై భీమాదులు కూర్చుండి పంచాగ్నులవలె వెలుగొందుతూ ఉన్నారు. విరాటుడు సభకు వచ్చి కంకుభట్టు గద్దెపై కూర్చుండి లేవనందుకు ఆగ్రహించాడు. అప్పుడు అర్జునుడు ధర్మరాజును విరటుడికి పరిచయము చేశాడు.

"నడదివియలు సేసె నగరికి మాణిక్య। మకుటముల్ పూనిన మనుజపతులఁ,
దగునాజ్ఞ సూయాణముగ నొనరించె మం। చిగ నేల నాలుగు చెఱఁగులకును,
బ్రీతార్థిజనుల సచేతన త్యాగధ్వ। జములుగా నన్ని దేశములఁ బఱపె,
దిక్కులన్నింటను దెలుపారు పూఁత గా। వించె నుజ్జ్వల యశోవిభ్రమంబు,
రాజసూయాధ్వర ప్రవర్తకుఁడు, నిత్య। సత్యభాషా మహావ్రతశాలి, పాండు
రాజదుగ్ధపయోనిధిరాజు ధర్మ। రాజు సుమ్ము మత్స్యావనీరమణ! యితడు."

"ఈతఁ డజాతశత్రుడు మహిం దగ దిగ్విజయంబు సేసె వి
ద్యాతిశయార్థి వాసవుమహాసనమైనను నెక్కె నర్జునుఁ డు
ద్యోతిత మూర్తి, కౌరవకులోద్వహుఁ, డార్యనికాయ సంతత
ఖ్యాతచరిత్రుఁ డీ చిఱుత గద్దియకుం దగఁడే నరేశ్వరా!"

ఆ మాటలు విని విరటుడు విస్మయానందమగ్నుడై, 'ఇతడు ధర్మారాజైతే భీమార్జున నకుల సహదేవులు, ద్రౌపది ఏరి?' అని ఆసక్తిగా అడిగాడు. కవ్వడి ఇట్లా అన్నాడు. 'వలలుడనే వంటవాడుగా మీవద్ద ఉంటూ, మల్లయుద్ధ ప్రతాపాలను ప్రదర్శిస్తూ మీ ప్రశంసలందుకొనిన బకాసుర సంహారకుడు అవక్రపరాక్రముడు భీముడు, ఉత్తమ హయశిక్షకుడుగా నీ మెచ్చు లందుకొనిన దామగ్రంథి నకులుడు, సమస్త గోపాలక ముఖ్యవృత్తిలో ఉండి తంత్రీపాలుడనే పేరుతో మెలగిన వీరుడు సహదేవుడు. ఇకమాలినిపేర సైరంధ్రిగా సుదేష్ణాంతఃపురంలో వర్తించిన ఇల్లాలు ద్రౌపది. ఆమె కొరకై కీచకోపకీచకులు గంధర్వకార్యమనే పేర భీమసేనుడిచేత రాత్రికి రాత్రే చంపబడ్డారు.'

భీముడు అర్జునుడిని - బృహన్నల వేషంలో ప్రచ్ఛన్న రూపుడుగా ఉన్న బీభత్సుడిగా పరిచయం చేశాడు. విరటుడితోపాటు అందరూ అద్భుతరసాక్రాంతులయ్యారు. తా నిదివరలో చెప్పినట్లు కౌరవసేనతో యుద్ధం చేసి గోవులను మరలించిన దేవసంభూతుడే అర్జును డని ఉత్తరుడు తెలియపరిచాడు. ద్రౌపదీ పాండవులను వినయభక్తి ప్రవత్తులతో విరటాదులందరూ సేవించారు. పాండవు లిచ్చిన తనువులే, సంపదలే తమవని మత్స్యభూపతీ, ఉత్తరుడూ కృతజ్ఞతలు ప్రకటించారు. పాండవులకు ప్రత్యుపకారం బంధుత్వం కలుపుకొనటంతో సార్థకమవుతుందని ఉత్తరుడు సూచించాడు. విరటుడు ఉప్పొంగి అర్జునుడికి ఉత్తర నిచ్చి వివాహం చేయాలని భావించాడు. కాని, నాట్యగురువైన అర్జునుడు తాను తండ్రివంటివాడినని, అభిమన్యుడి కిచ్చి వివాహం చేయటం తన అభీష్టమని స్పష్టం చేశాడు.

'హరిమేనల్లుఁడు బాహువీర్య పటు శౌర్య స్ఫూర్తి త్రైలోక్య సుం
దరుఁ, డాచారపవిత్రుఁ, డంచితకళాదక్షుం, డుదారుండు గా
తర సంరక్షకుఁ, డార్యసమ్మతుఁడు, విద్యావైభవోల్లాసి, య
త్యురుతేజుండు వరించుఁగాక యభిమన్యుం డీ సరోజాననన్.'

ఆ ప్రతిపాదనను యుధిష్ఠిరుడు ఆమోదించాడు. అందరూ అంగీకరించారు. అర్జునుడితో వియ్యమందే అదృష్టం కలిగినందుకు విరటుడు ఉప్పొంగిపోయాడు. అపూర్వాలంకారాలతో ప్రకాశిస్తున్న పాండవులకు, ద్రౌపదికి ఉత్తర చేత మ్రొక్కించారు. మాత్స్య కౌరవ వంశాలు ఉత్తరాభిమన్యుల వివాహంతో అన్యోన్య బాంధవ్యాలను పెంచుకొన్నాయి. అగణితపుణ్యాలను గడించుకొన్నాయి.

ఉత్తరాభిమన్యుల వివాహం

హస్తినాపురానికి తిరిగిపోతున్న దుర్యోధనుడి మనస్సులో ఒక అనుమానం పీడిస్తూనే ఉన్నది. 'అజ్ఞాతవాసకాలం ముగియకుండానే అర్జునుడు బయటపడ్డాడా? అట్లా జరిగితే పాండవులు మరలా అరణ్యాజ్ఞాతవాసాలు చేయాలి కదా!' అని అతడి శంక. భీష్ముడు గడువు ముగిసిందని చెప్పాడు. అయినా దుర్యోధనుడికి నమ్మకం కుదరలేదు. ధర్మరాజు అబద్ధమాడ డని అతడి వద్దకు ఒక దూతను పంపాడు. అతడు గడువు ముమ్మాటికి ముగిసిందని నొక్కి చెప్పి పంపాడు. ఆ దూతమాట బయట పెట్టకుండా దుర్యోధనుడు నిండుసభ పెట్టి మరలా అందరిముందు అదే ప్రశ్న అడిగాడు. భీష్ముడు లేచి 'నే నప్పుడే

చెప్పాను ముగిసిందని. ముగియలేదని ఎవరన్నా అంటే నవ్విపోతారు. ఇటువంటి మాటలు తెలివిలేని మాటలు' అని -అన్నాడు. అందరూ దానికి అంగీకరించారు. చేసేది మరేమీ లేక మాయదారులు సాగక దుర్యోధనుడు ఇంటి త్రోవ పట్టాడు.

విరాటనగరంలో వివాహ ముహూర్తాలు పెట్టించారు. బంధుజనుల కందరికీ పిలుపులందాయి. అటు యాదవులూ, ఇటు ద్రుపద వంశంవారూ కదలి వచ్చారు. వసుదేవుని వెంట సుభద్రాభిమన్యులు వచ్చారు. పాండవులు సర్వ వైభవాలతో ఉపప్లావ్యంలో విడిది చేశారు.

వివాహ సన్నాహాలన్నీ వడివడిగా సాగిపోసాగాయి. లగ్న మాసన్నమైనదని పెళ్లివారు మగపెళ్ళివారికి తెలియపరిచారు. యుధిష్ఠిరుడు వాసుదేవాదులతో కలిసి అభిమన్యుడిని అలంకరించుకొని బంధుమిత్ర సమేతంగా వివాహవేదికవద్దకు చేరారు. విరటుడు మంగళతూర్యాలు మ్రోగుతూ ఉండగా వరపూజ చేశాడు. వివాహమంటపంలో వధూవరుల నుంచారు. నూత్నవధూవరులు ఒకరినొకరు చూసుకొనాలన్న ఆసక్తితో ఆలస్యాన్ని ఓర్చుకోలేకపోయారు. తొలి చూపుల జల్లులు కురిసినప్పుడు తలంబ్రాలు పోసుకొన్నప్పుడు, వధూవరులకు చిరుచెమటలు పొటమరించాయి. పాణిగ్రహణానంతరం ఒకే పీటపై ఆసీనులైన వారిరువురు పెనుపాదులో కలిసిమెలసిన చూతవృక్షం నవమల్లికవలె నూత్నశోభతో అన్యోన్య అనురాగంతో వెలుగొందారు. ఉత్తరాభిమన్యుల వివాహమహోత్సవం పరమానంద భరితం.

- జి.వి.సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

విరాటపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
కృతి నిర్మాణ ప్రస్తావన	---	2
షష్ఠ్యంతములు	---	17
కథా ప్రారంభము	4-1-1	19
ధౌమ్యుండు పాండవుల నూరార్చుట	4-1-22	25
పాంచాలీ పాండవులు తమ మెలంగవలయు పనుల నిశ్చయించుకొనుట	4-1-15	31
ధౌమ్యుఁడు పాండవులకు సేవాధర్మంబు లెఱింగించుట	4-4-6	54
పాండవులు పాంచాలితోఁడ విరాటునగరంబునకు బయలుదేరుట	4-4-48	65
పాండవులు దమ యాయుధంబుల శమీవృక్షమునఁ బెట్టుట	4-5-9	76
ధర్మరాజు సన్న్యాసివేషంబున విరటుఁ గొల్వవచ్చుట	4-6-1	85
భీముఁడు వంటలవాఁడై విరటుఁ గొల్వ వచ్చుట	4-7-1	98
అర్జునుఁడు పేడిరూపమున విరటుఁ గొల్వవచ్చుట	4-10-1	105
నకులుఁ డశ్వపాలకుఁడై విరటుఁ గొల్వవచ్చుట	4-11-1	118
సహదేవుఁడు గోపవేషంబున విరటుఁ గొల్వవచ్చుట	4-9-1	124
ద్రౌపది సైరంధ్రీ వేషమున సుదేష్ణఁ గొలువ వచ్చుట	4-8-1	131

ద్వితీయాశ్వాసము

భీముఁడు మల్లునితో యుద్ధము సేయుట	4-12-17	156
కీచకుఁడు పాంచాలిం జూచి మోహించుట	4-13-1	162
కీచకుఁడు సుదేష్ణవలన ద్రౌపది తెఱం గెఱుంగఁ గోరుట	4-13-5	174
ద్రౌపది కీచకునితోఁ బరుషవాక్యంబులు వలుకుట	4-13-28	184
కీచకుండు ద్రౌపదియందలి మోహంబునఁ బరితపించుట	4-14-7	197
ద్రౌపది కీచకునింటికిఁ గల్లు దేరంబోవుట	4-14-17	207

కీచకుఁడు ద్రౌపదిం బట్టుకొనుటకు వెంటఁ దగులుట	4-15-7	218
ద్రౌపది తన భంగపాటు విరాటునితోఁ జెప్పుట	4-15-13	227
సుదేష్ణ ద్రౌపది నూఱడించుట	4-15-36	236
ద్రౌపది భీమసేనుతోఁ దన భంగపాటు సెప్పి పరితపించుట	4-16-5	241
ద్రౌపది భీమసేనుతోఁ ధర్మరాజు మహిమ చెప్పుట	4-17-15	250
భీముఁడు కీచకునిఁ జంపుటకుఁ బ్రతిజ్ఞ చేయుట	4-20-1	271
ప్రభాతకాల వర్ణనము	---	276
కీచకుఁడు ద్రౌపది నియ్యకొలుప యత్నించుట	4-21-7	284
ద్రౌపది భీమునితోఁ గీచకుఁడు నర్తనశాలకు రాఁబోవుటం జెప్పుట	4-21-25	295
కీచకుఁడు ద్రౌపదియందలి మోహంబునఁ బరితాపంబు నొందుట	---	304
కీచకుఁ డుద్యానవనంబున విహరించుట	---	311
సూర్యాస్తమయ వర్ణనము	---	318
భీమ కీచకులు నర్తనశాలలోఁ గలిసికొనుట	4-21-38	321
భీమసేనుఁడు కీచకుని సంహరించుట	4-21-50	331

తృతీయాశ్వాసము

ఉపకీచకులు ద్రౌపదిం దమ యన్న శవంబుతోఁ గట్టి దహింపం గొనిపోవుట	4-21-62	349
భీముఁ డుపకీచకులం జంపి ద్రౌపదిని విడిపించుట	4-22-16	362
ద్రౌపది యర్జునునితో సల్లాపంబు సేయుట	4-23-17	375
దుర్యోధనుని వేగులవారు పాండవుల వెదకి కానక వచ్చుట	4-24-5	389
భీష్ముఁడు దుర్యోధనునితో ధర్మరాజు సుగుణంబులఁ జెప్పుట	4-27-1	399
సుశర్మ దక్షిణ గోగ్రహణంబు చేయుట	4-20-27	414
విరటుఁడు సుశర్మమీఁద యుద్ధము చేయఁబోవుట	4-30-8	418
విరాట సుశర్మల సైన్యంబు సంకులంబుగాఁ బోరుట	4-31-1	429
విరాటుఁడు సుశర్మమీఁదఁ దన రథంబు తోలించి పోరుట	4-31-17	441
పాండవులు సుశర్మ నోడించి విరాటుని విడిపించుట	4-32-26	450
ధర్మరాజు సుశర్మను సపరివారంబుగా విడిపించుట	4-32-46	457

చతుర్థాశ్వాసము

ఉత్తర గోగ్రహణము	4-33-1	458
భూమింజయుండు గోవుల విడిపింపఁ గౌరవులతోఁ బోరుటకుఁ బోనెన్నుట	4-34-1	461
ఉత్తరుఁడు బృహన్నలను దనకు సారథిగాఁ జేసికొనుట	4-35-10	472
ఉత్తరుఁడు కురుసైన్యంబు గనుంగొని భయభ్రాంతుం డగుట	4-36-8	482
అర్జునుఁ డుత్తరునిఁ దనకు సారథిఁగాఁ జేసికొనుట	4-36-41	496
అర్జునుఁడు శమీవృక్ష నిక్షిప్తంబైన గాండివంబు గొనుట	4-38-1	507

అర్జునుఁ డుత్తరునకుఁ దన్నెఱింగించుట	4-39-1	515
ఉత్తరుఁడు బృహన్నల నర్జునుఁగా నెఱుంగుట	4-39-21	525
అర్జునుఁ డుత్తరసారథికంబైన రథం బెక్కి దేవదత్తంబు పూరించుట	4-41-1	534
దుర్యోధనుఁడు ద్రోణాచార్యుల నధిక్షేపించుట	4-42-20	544
కర్ణుఁడు గృపాచార్యు నధిక్షేపించి పలుకుట	4-46-1	558
భీష్ముఁ డర్జును నజ్ఞాతవాసవత్సర వ్యాప్తి నిష్కర్షించుట	4-47-1	565
ద్రోణాచార్యుఁ డర్జునుం జూచి ప్రశంసించుట	4-48-3	576
యుద్ధారంభము	4-48-12	582

పంచమాశ్వాసము

అర్జునుఁ డుత్తరునకుఁ గౌరవవీరుల వేఱువేఱ నిరూపించి చెప్పుట	4-49-1	589
అర్జునుఁడు కౌరవ సైన్యంబుల నుఱుమాడుట	---	603
అర్జునుండు చిత్రాంగద ప్రభృతి కురుకుమారుల నిర్జించుట	4-49-7	628
కర్ణార్జునుల ద్వంద్వయుద్ధము	4-55-14	636
అర్జునుఁడు ద్రోణాచార్యులతో యుద్ధంబు సేయుట	4-53-1	645
అర్జునుఁ డశ్వత్థామతో యుద్ధము సేయుట	4-53-65	651
అర్జునుఁడు కృపాచార్యునితో యుద్ధము సేయుట	4-52-1	653
అర్జునుఁడు భీష్మునితో యుద్ధంబు సేయుట	4-56-1	659
అర్జునుఁడు దుర్యోధనునితో యుద్ధంబు సేయుట	4-60-1	668
అర్జునుఁడు దుర్యోధను నుపాలంభించుట	4-60-15	674
దుర్యోధనుఁడు పరాజితుఁడై మరలి తన పురంబునకుఁ బోవుట	4-61-24	684
విరాటుఁ డుత్తరుండు గురుసైన్యంబు గెలువఁబోవుట విని చింతించుట	4-63-9	690
విరాటుండు కంకుని సారెఁగొని వ్రేయుట	4-63-44	702
విరాటుఁ డుత్తరుని సమర ప్రకారం బడుగుట	4-64-12	712
అర్జునుఁ డుత్తరకు బొమ్మపొత్తికలుగాఁ గురువీరుల శిరోంబరంబు లిచ్చుట	---	721
అర్జునుఁ విరాటునకుఁ దమ్మెఱింగించుట	4-65-1	730
విరాటునకు భీముఁ డర్జును నెఱింగించుట	4-66-1	733
విరాటుని మంత్రు లుత్తరను బాండవులయొద్దకుఁ దోడ్తెచ్చుట	4-66-27	742
శ్రీకృష్ణుఁడు బలదేవాదులతోఁ బాండవులఁ జూడవచ్చుట	4-67-19	750
అభిమన్యుని వివాహమహోత్సవము	4-67-31	756

శ్రీమదాంధ్ర మహాభారతము

విరాట పర్వము

(1,2,3,4,5 ఆశ్వాసాలు)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

విరాటపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీయన గౌరినాఁ బరఁగు చెల్వకుఁ జిత్తము పల్లవింప భ
ద్రాయితమూర్తి యై హరిహరంబగు రూపము దాల్చి "విష్ణు రూ
పాయ నమశ్శివాయ" యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చ మెచ్చు పరతత్త్వముఁ గొల్చెద నిష్టసిద్ధికిన్. 1

ప్రతిపదార్థం: శ్రీ+అనన్= 'శ్రీ' (లక్ష్మి) అనీ; గౌరినాన్= 'గౌరి' (పార్వతి) అనీ; పరఁగు= ఒప్పే; చెల్వకున్= సౌందర్యవతి అయిన వనితకు; చిత్తము= మనస్సు; పల్లవింపన్= చిగురించగా (కోరికలు మోసులెత్తగా, ఆహ్లాదించగా); భద్రాయితమూర్తి+ఐ= మంగళకరమైన రూపం కలిగినది అయి; హరిహరంబు+అగు= హరిహరాత్మకమయిన; రూపము+తాల్చి= ఆకారం ధరించి; విష్ణు రూపాయ శివాయనమః+అని పల్కెడు= 'విష్ణు స్వరూపుడైన శివునికి (కొరకు) నమస్కారం' అని కీర్తించే; భక్త జనంబు= భక్తులయిన జనులయొక్క; వైదిక ధ్యాయితకున్= వేదవిహిత ధ్యానానికి; ఇచ్చన్= మనసులో; మెచ్చు= మెచ్చుకొనే; పరతత్త్వమున్= పరతత్త్వవాచ్యుడయిన పరబ్రహ్మ స్వరూపాన్ని; ఇష్టసిద్ధికిన్= నా కోరిక ఫలించేందుకు; కొల్చెదన్= సేవిస్తాను.

తాత్పర్యం: శ్రీ (లక్ష్మి) అనీ, గౌరి (పార్వతి) అనీ పిలువబడే వనితకు మనసు చిగురించేటట్లు మంగళకరమైన హరిహరులు కలిసిన రూపాన్ని ధరించి, 'విష్ణు రూపుడైన శివుడికి నమస్కార'మని కీర్తించే భక్తుల వేదవిహితమైన ఉపాసనా పద్ధతికి మనసులో మెచ్చుకొనే ఆ పరమాత్మను (పరబ్రహ్మతత్త్వాన్ని) నా కోరిక ఫలించాలని ప్రార్థిస్తున్నాను.

విశేషం : నన్నయ తరువాత తిక్కన ఆంధ్ర మహాభారతాన్ని విరాటపర్వం నుండి రచించటానికి ప్రారంభిస్తూ మంగళారంభంగా ఈ పద్యాన్ని రచించాడు. తాను రచిస్తున్న భారత భాగానికి అవతారికను నిర్వహించాడు. దానిలోని మొదటి అంగం నాంది వంటి మంగళాశాసనం. అది శ్రీకారంతో ప్రారంభం కావటం సంప్రదాయం, శుభాలనూ, సంపదలనూ, కోరిన కోరికలను ఇచ్చే దేవత లక్ష్మి. ఆమె 'శ్రీ' శబ్దం చేత సూచించబడింది.

'ఆశీర్నమస్క్రియా వస్తు నిర్దేశోవాஉపి తన్ముఖమ్' అనే నియమంచేత గ్రంథారంభం ఆశీఃపురస్సరంగా కానీ, నమస్క్రియా రూపంగా కానీ, వస్తు నిర్దేశకంగా (కథార్థ సూచకంగా) కానీ ఉండాలి. తిక్కన పరతత్త్వాన్ని ఇష్టసిద్ధికై ప్రార్థిస్తున్నాడు కాబట్టి, ఈ మంగళారంభ పద్యం నమస్క్రియా రూపమై రాణిస్తున్నది. నన్నయ ఆశీఃపురస్సరంగా మొదటి పద్యం వ్రాయగా తిక్కన నమస్క్రియా రూపంగా వ్రాయటం గమనించదగింది.

తిక్కన హరిహరులకు అభేదమని చెప్పే భక్తితత్త్వాన్ని ప్రతిపాదించాడు. ఆ స్వామిని నిర్గుణంగా ఉపాసిస్తే పరబ్రహ్మతత్త్వం; సగుణంగా ఆరాధిస్తే హరిహరనాథస్వామి. ఆయన భార్యకూడా శ్రీగౌరుల ఏకస్వరూపం. ఆమెను లోకంలో లక్ష్మీదేవి అనీ, గౌరీదేవి అనీ పిలుస్తారు- అని చెప్పటం విశేషం. అందుచేత దేవుడి రూప మొక్కటే; ఆయన దేవేరి కూడ ఒక్కతే, దీనితో పాటు మంత్రం కూడా ఒక్కటే-అది 'విష్ణురూపాయ నమః శివాయ'. గ్రంథాన్ని శ్రీకారంతో మొదలు పెట్టటం మంగళప్రదం; విష్ణు రూపుడైన శివుడికి నమస్కారమన్నాడు తిక్కన. అంతే కాదు భారతం కార్ష్ణవేదం (శ్రీకృష్ణ సంబంధమైన వేదం) అని ప్రసిద్ధి చెందింది. అందులో ఉపాసించదగింది వాసుదేవ తత్త్వమని పండితులు చెప్పుతారు. కాబట్టి శ్రీకారంతో తన కృతిని ఆరంభించి అనేక ప్రయోజనాలను సాధించాడు తిక్కన.

హరిహరనాథుడు తిక్కన కృతిభర్త కూడా కావటం విశేషం. హరిహరాత్మకమైన రూపం ధరించిన ఆ పరమాత్మ భద్రాయితమూర్తి. భద్రవ దాచరితామూర్తిః యస్యసః - మంగళకరమైన మూర్తికలవాడని అర్థం. 'కర్తః క్యఙ్ సలోపశ్చ' అనే సూత్రం ప్రకారం క్యఙ్.' అకృత్ సార్వ ధాతుకయో ర్దీర్ఘః' అనే సూత్రం చేత దీర్ఘం వచ్చింది. భూతార్థక క్తప్రత్యయమున్నూ, ఇడాగమమున్నూ రాగా 'భద్రాయిత మూర్తి' అనే రూపం ఏర్పడింది.

శ్రీగౌరీ శబ్దవాచ్యురాలైన పరాశక్తికి పరమానందం కలిగించే భద్రమూర్తి హరిహరనాథుడని వర్ణించటం చేత మహాభారతంలో ప్రతిపాదించబడే వైదికధర్మ నిష్ఠమైన గార్హస్థ్య జీవితతత్త్వం ధ్వనిమయంగా సూచించబడుతున్నది. నన్నయ త్రిమూర్త్యాత్మకంగా సూచిస్తే తిక్కన ఆ తాత్పర్యాన్నే హరిహరనాథ పరంగా చెప్పి వస్తునిర్దేశంలో ఏకవాక్యతను పాటించాడు.

తిక్కన ఈ పద్యంలో తన ఇష్టసిద్ధిని కోరుతున్నాడు. కృతిభర్త అయిన హరిహరనాథుడు ఉత్తమ కవితాశక్తిని ప్రసాదిస్తాడు; పరతత్త్వమైన ఆతడే జన్మాంతర దుఃఖం లేని మోక్షాన్ని అనుగ్రహిస్తాడు. ఈ రెండు రకాల కోరికలూ అవతారికలో సూచించబడనున్నాయి. అంటే మొత్తం మీద - కావ్యం వ్రాసిన తిక్కనకూ, చదివిన పఠితలకూ ఇహ పర సౌఖ్యాలు భారతం వలన కలుగుతాయని తాత్పర్యం. వృత్తం: ఉత్పలమాల, (సంపా.)

కృతి నిర్మాణ ప్రస్తావన

వ. అని సకల బ్రహ్మప్రార్థనంబు సేసి, తత్ప్రసాదాసాదిత కవిత్వ తత్త్వ నిరతిశయాను భావానంద భరితాంతః కరణుండ నగుచుండి యొక్కనాఁ డిట్లని వితర్కించితి. 2

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; సకల బ్రహ్మ ప్రార్థనంబు+చేసి= కళాసహితమయిన పరబ్రహ్మను (సగుణబ్రహ్మను) ప్రార్థించి; తద్= అతని; ప్రసాద+ఆసాదిత= అనుగ్రహంచేత పొందబడిన; కవిత్వతత్త్వ= కవిత్వతత్త్వము యొక్క; నిరతిశయ= సంపూర్ణమయిన; అనుభావ= అనుభవం చేత (అంటే తద్ భావ భావనం వలన) కలిగిన; ఆనంద= ఆనందం చేత; భరిత= నిండిన; అంతఃకరణుండన్+అగుచున్+ఉండి= మనసు కలవాడనై ఉండి; ఒక్కనాఁడు= ఒక దినం; ఇట్లు+అని= ఈ విధంగా; వితర్కించితిన్= ఆలోచించాను.

తాత్పర్యం: ఈ ప్రకారంగా కళాప్రపూర్ణమయిన పరబ్రహ్మను (సగుణ బ్రహ్మను) ప్రార్థించి, ఆ పరబ్రహ్మ అనుగ్రహం వలన పొందిన కవిత్వతత్త్వాన్ని నిరంతర భావనం చేయటంవలన కలిగిన మహానందంతో నిండిన మనస్సుతో ఒకనాడు ఇట్లా ఆలోచించాను.

విశేషం : సకల అంటే కళలతో కూడిందని విశేషార్థం. తిక్కన ప్రార్థించినది సకల (సగుణ) బ్రహ్మమును, నిష్కల (నిర్గుణ) బ్రహ్మమును కాదు. శ్రీదేవి, గౌరీదేవి ఇద్దరూ కళలే. పరతత్త్వం కళాసహితం. ఇక్కడ పరతత్త్వం హరిహరనాథుడే. ఆ స్వామిప్రసాదంవలన తిక్కనకు కవిత్వం అబ్బింది. కవితాతత్త్వం తెలిసింది. తత్ భావభావనం వలన కలిగే ఆనందం ఆలోచనామృతం, అనిర్వచనీయం. అటువంటి ఆనందానుభవంతో తిక్కన ఒకసారి ఇట్లా ఆలోచించాడు.

శా. విద్వత్సంస్తవనీయ భవ్య కవితావేశుండు, విజ్ఞాన సం
పద్విఖ్యాతుఁడు, సంయమి ప్రకర సంభావ్యానుభావుండు, గృ
ష్ణద్వైపాయనుఁ డర్థి లోకహితనిష్ఠం బూని కావించె ధ
ర్మాద్వైతస్థితి భారతాఖ్య మగు లేఖ్యంబైన యామ్నాయమున్. 3

ప్రతిపదార్థం: విద్వత్= విద్వాంసుల చేత; సంస్తవనీయ= కొనియాడతగిన; భవ్య= శుభప్రదమయిన, ఉదాత్తమయిన; కవితా+ఆవేశుండు= కవితావేశం కలవాడు; విజ్ఞాన= ఆధ్యాత్మిక జ్ఞానమనే; సంపద్= ఐశ్వర్యంతో; విఖ్యాతుఁడు= సుప్రసిద్ధుడయిన వాడు; సంయమి ప్రకర= మునుల సముదాయం చేత; సంభావ్య= గౌరవింపతగిన; అనుభావుండు= మహిమ కలవాడు అయిన; కృష్ణద్వైపాయనుఁడు= వేదవ్యాస భగవానుడు; అర్థిన్= కోరికతో; లోకహిత నిష్ఠన్+పూని= లోకులకు హితం చేయటంలో దీక్ష వహించి (లోకాలకు హితం సమాకూర్చే విషయంలో పట్టుదల వహించి); ధర్మ= ధర్మస్థితితోనూ; అద్వైతస్థితిన్= అద్వైత స్థితితోనూ; భారత+ఆఖ్యము+అగు= భారతమనే పేరుకలదైన; లేఖ్యంబు+ఐన= వ్రాయదగిన; ఆమ్నాయమున్= పరంపరగా అభ్యసించబడే దానిని, (వేదాన్ని); కావించెన్= రచించాడు.

తాత్పర్యం: పండితులు ప్రశంసించే ఉదాత్త కవితావేశం కలవాడు కృష్ణద్వైపాయనుడు. ఆధ్యాత్మిక జ్ఞానంతో సుప్రసిద్ధుడయిన వాడు. మహర్షుల చేత గౌరవించదగిన ప్రభావం కలవాడు. ఆ మహర్షి లోకహితం కోరి ధర్మాద్వైత స్థితితో భారత సంహితను రచించాడు.

విశేషం : కృష్ణద్వైపాయనుడనే పేరు వ్యాసుడిది. 'ద్వీప మేవ అయనం యస్యసః' - ద్వీపాయనః, యమునా ద్వీపమే స్థానంగా కలవాడనీ, లేదా యమునాద్వీపంలో పుట్టినవాడనీ వ్యుత్పత్త్యర్థం. ద్వీపాయనుడే ద్వైపాయనుడు. ద్వైపాయనుడు+కృష్ణుడు= కృష్ణద్వైపాయనుడు. విశేషణానికి పరనిపాతం వచ్చి కృష్ణద్వైపాయనుడు అనే పదం ఏర్పడింది. కృష్ణుడని వేదవ్యాసుడికి పేరు.

ఆమ్నాయ మంటే గురుశిష్యపరంపరచేత కంఠస్థవిద్యగా అభ్యసించబడేదీ, ధర్మాధర్మాలను ఉపదేశించేదీ ఐన వేదమని భావం. 'భారతం పంచమో వేదః' అని ప్రసిద్ధి. చతుర్వేదసారం పంచమవేదం. వేదం అపౌరుషేయం; పంచమవేదం పౌరుషేయం. కాబట్టి అది అలేఖ్యం, ఇది లేఖ్యం.

'ధర్మాద్వైత స్థితి' అనే సమాసానికి అనేక అర్థాలున్నాయి. అది పూర్వ మీమాంస, ఉత్తర మీమాంసల జోడింపునూ, ధర్మజిజ్ఞాస, బ్రహ్మజిజ్ఞాసల సమన్వయాన్నీ సూచిస్తుంది. అట్లాగే నిష్కామ కర్మలను అనుష్ఠించటం వలన పరమాత్మతో అద్వైతాన్ని పొందటం కూడా ధర్మాద్వైత స్థితియే. ధర్మంతో అద్వైతమైన లేదా అభిన్నమైన స్థితినే ధర్మాద్వైత స్థితిగా కూడా పండితులు వ్యాఖ్యానిస్తారు. కర్మ జ్ఞానాల కలిమి 'ధర్మాద్వైతస్థితి' అని మరి కొందరు.

క. వేదములకు నఖిల స్మృతి। వాదములకు బహు పురాణ వర్గంబులకున్
వా దైన చోటులను దా। మూదల ధర్మార్థ కామ మోక్ష స్థితికిన్. 4

ప్రతిపదార్థం: వేదములకున్= ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం - అనబడే నాలుగు వేదాలకు; అఖిల స్మృతి వాదములకున్= మను గౌతమాది స్మృతులన్నిటిలోని వాక్యాలకు; బహు పురాణ వర్గంబులకున్= బ్రహ్మాండ పురాణం మొదలయిన పురాణ సమూహాలకు; వాదు+ఐన చోటులను= వివాదగ్రస్తాలయిన స్థలాలలో; ధర్మ+అర్థ కామ మోక్ష స్థితికిన్= ధర్మార్థ కామ మోక్షాల స్థాపనకు; తాన్= భారతం; మూదల= ప్రమాణం - అంటే నిర్ణాయకం (నిశ్చయించేది; మూల+తల= మూదల).

తాత్పర్యం: వేదాలకూ, స్మృతులకూ, పురాణాలకూ, ధర్మార్థ కామ మోక్షాల విషయంలో వివాదం ఏర్పడితే ఆయా సందర్భాలలో మహాభారతం పురుషార్థ నిర్ణాయక గ్రంథంగా నిలుస్తుంది.

విశేషం : వేదాలూ, స్మృతులూ, పురాణాలూ భిన్న భిన్న కాలాలలో వెలసిన గ్రంథాలు. వేదాలు అపౌరుషేయా లయితే శాస్త్రకారులు, మహాకవులు వ్రాసినవి స్మృతులూ, పురాణాలూ, ఒక్కొక్కప్పుడు వీటిలో పరస్పర వైరుద్ధ్యాలు కనిపించవచ్చును. వాటివలన ఆయా అంశాల వాస్తవ స్వరూపం పఠితకు స్పష్టం కాకపోవచ్చును. అటువంటి సందర్భాలలో భారత మొక్కటే ప్రమాణం.

శాస్త్రవిహిత కర్తవ్యం ధర్మం. డబ్బు మొదలయిన వాటిని సంపాదించటం అర్థం. ఇంద్రియాదులను తృప్తి పరచటం కామం. అన్ని రకాల బంధాల నుండి విముక్తి పొందటం మోక్షం. అర్థాన్ని, కామాన్ని ధర్మదృష్టితోనే చూడాలి. ఆ దృష్టితోనే సాధించాలి. పురుషార్థ సాధనలో అన్నింటికీ మూలం ధర్మం; అన్నింటినీ పాలించేది ధర్మం. అటువంటి ధర్మతత్త్వాన్ని గురించి సూక్ష్మంగా వివేచించేదీ, దాని ఆచరణ విధానాన్ని బోధించేదీ మహాభారతం.

వ. అదియును. **5**

తాత్పర్యం: ఆ మహాభారతం (ఆ తరువాత).

ఉ. ఆదరణీయ సార వివిధార్థ గతి స్ఫురణంబు గల్గి య
ష్టాదశ పర్వ నిర్వహణ సంభృతమై పెనుపొందియుండ; నం
దాదిఁ దొడంగి మూఁడుకృతు లాంధ్ర కవిత్వ విశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్. **6**

ప్రతిపదార్థం: ఆదరణీయ= ఆదరింపదగిన; సార= శ్రేష్ఠమయిన; వివిధ= అనేక విధాలయిన; అర్థగతి= అర్థాల పోకడల యొక్క; స్ఫురణంబు= స్ఫూర్తి; కల్గి= కలిగి; అష్టాదశ పర్వ= పదునెనిమిది పర్వాల యొక్క; నిర్వహణ= నిర్వహణ చేత; సంభృతము+ఐ= కూడినదై; పెనుపొంది+ఉండన్= మహత్త్వంతో కూడి ఉండగా; అందున్= ఆ మహాభారతంలో; ఆదిన్+తొడంగి= ఆదిపర్వం నుండి మొదలుపెట్టి; మూఁడు కృతులు= మూడు పర్వాలు; ఆంధ్ర కవిత్వ విశారదుండు= తెనుగులో కవిత్వం చెప్పటంలో విద్వాంసుడయిన వాడున్నూ; విద్యాదయితుండు= సరస్వతీదేవికి (విద్యలకు) ప్రియుడయిన వాడున్నూ; మహిత+ఆత్ముఁడు= మహాత్ముడున్నూ (అయిన); నన్నయభట్టు; దక్షతన్= సామర్థ్యంతో; ఒనర్చెన్= రచించాడు.

తాత్పర్యం: ఆదరించదగిన అనేక అర్థ స్ఫూర్తులతో నిండిన భారతం పదునెనిమిది పర్వాలతో కూడి పెంపారి ఉండగా, అందులో మొదటి మూడు పర్వాలను దక్షతతో నన్నయభట్టారకుడు తెనుగులో రచించాడు. అతడు ఆంధ్రకవితా విశారదుడు, విద్యాదయితుడు, మహితాత్ముడు.

విశేషం : 'విద్యాదయితుడు' అనే పదానికి సరస్వతీదేవికి ప్రియుడనీ, సర్వ విద్యలకు ప్రియుడనీ, విద్యలే ప్రియురాండ్రుగా కలవాడనీ, బ్రహ్మతో సమానుడనీ, శ్రీవిద్యా రూపమయిన విజ్ఞానానికి ప్రతీక అనీ పండితులు వ్యాఖ్యానిస్తారు.

మూడు కృతులంటే ఆది, సభా, ఆరణ్యపర్వాలు, తిక్కన మూడు కృతులను నన్నయ వ్రాశాడని చెప్పటం వలన ఆయన కాలం నాటికి నన్నయ భారతభాగం పూర్తిగా ఉండేదనీ, ఆ తరువాత ఏ కారణాలవలననో కొంత భాగం నశించి పోగా ఎఱ్ఱన దానిని పూరించి ఉంటాడనీ, కొందరు భావించే అవకాశం ఏర్పడింది.

మ. హృదయాహ్లాది, చతుర్థ, మూర్జిత కథోపేతంబు, నానా రసా
భ్యుదయోల్లాసి విరాటపర్వ; మట యుద్యోగాదులుం గూడఁగాఁ
బదియేనింటిఁ దెనుంగుబాస జనసంప్రార్థ్యంబులై పెంపునం
దుదిముట్టన్ రచియించు టొప్పు బుధ సంతోషంబు నిండారఁగన్. **7**

ప్రతిపదార్థం: హృదయ= మనస్సుకు; ఆహ్లాది= సంతోషాన్ని ప్రసాదించేదీ; ఊర్జిత= కట్టుదిట్టమయిన; కథా+ఉపేతంబు= కథలతో కూడినదీ; నానా రస+అభ్యుదయ+ఉల్లాసి= అనేక రసాల అభ్యుదయం చేత (క్రమపోషణంతో) ప్రకాశించేదీ; చతుర్థము= పదునెనిమిది పర్వాల వరుసలో నాల్గవదయిన విరాటపర్వం; అట, ఉద్యోగ+ఆదులున్+కూడఁగాన్= ఆ పైన ఉద్యోగపర్వం (మొదలయినవి) ఒనగూడగా (లెక్కపెట్టగా); పది+ఏనింటిన్= పదునైదుపర్వాలను; తెనుంగు బాసన్= తెలుగు భాషలో; జన సంప్రార్థ్యంబులు+ఐ= జనులచేత ప్రార్థించదగినవై; పెంపునన్= అతిశయంతో; తుది ముట్టన్= చివరిదాకా; బుధ= పండితుల; సంతోషంబు, నిండారఁగన్= సంతోషం బాగా కలిగేటట్లు; రచియించుట+ఒప్పున్= రచించటం తగును.

తాత్పర్యం: సహృదయుల హృదయాలకు ఆహ్లాదం కలిగించేదీ, భారతంలోని పదునెనిమిది పర్వాలలో నాల్గవదీ, నిబిడమైన కథతో కూడుకొన్నదీ, వివిధ రసాల క్రమపోషణతో ఏర్పడే వికాసం వలన ఉల్లాసాన్ని కలిగించేదీ విరాటపర్వం, ఆపైన ఉద్యోగపర్వం మొదలుకొని స్వర్గారోహణపర్వం దాకా ఉన్న పర్వాలతో కలుపుకొని పదునైదు పర్వాలు జనులచేత కీర్తించబడేటట్లుగా, పండితులు సంతోషించేటట్లుగా తెలుగుభాషలో పూర్తిగా రచించటం సమంజసం. (అంటే నిర్మించవలసిన అవసరం ఉన్నది అని భావం.)

విశేషం : పాండవులు అజ్ఞాతవాస కాలంలో విరాటనగరంలో నివసించినప్పుడు జరిగిన కథార్థాలను చెప్పేది కాబట్టి ఈ పర్వానికి విరాటపర్వమనే పేరు పెట్టబడింది. ఈ పర్వంలో పాండవులు మారువేషాలలో జీవించే కథ ప్రధానంగా ఉండటం చేత శ్రవ్యకావ్యంలో దృశ్యకావ్య మర్యాదలు ఆసక్తిదాయకంగా చోటు చేసికొంటాయి. అందువలన పఠితలకు మానసికోల్లాసం కలుగుతుంది. భారతంలో విరాటపర్వం మహానాటకంలో అంతర్నాటకంగా ఉత్కంఠను రేకెత్తిస్తుంది. ఈ కావ్యగుణంలో అన్ని పర్వాలకంటే విరాటపర్వమే మిన్న. అందువలన 'హృదయాహ్లాది' అనే విశేషణం ముందుగా వాడాడు తిక్కన.

పంచ సంధులు పోషించబడిన నాటకాలలో చతుర్థాంకానికి ప్రాధాన్యం ఉంటుంది. 'కావ్యేషు నాటకం రమ్యం, నాటకేషు శకుంతలా, తత్రాపి చ చతుర్థోఽఙ్కః అనే శ్లోకం ప్రసిద్ధి కెక్కింది. అందుకే చతుర్థాంకంలో గర్భసంధి వర్తిల్లుతుంది. ప్రారంభించబడిన కార్యం ఏవిధంగా సఫలమౌతుందో అనే ఉత్కంఠ అందులో పోషించబడుతుంది. విరాటపర్వం వరుససంఖ్యకు నాల్గవదే కాక, రూపక మర్యాదలో నాల్గవ అంకానికి ఉండే ప్రాముఖ్యాన్ని పొంది ఉన్నదని తాత్పర్యం.

'ఊర్జిత కథ' అంటే నిబిడమైన కథ అనీ, సంధిబంధాలతో సంపన్నమైన కథ అనీ, ఉదాత్తమైన కథ అనీ అర్థాలున్నాయి. ఉపాఖ్యానాలు దాదాపు లేని విరాటపర్వ కథ కడు చిక్కనిది. మూడు ప్రబంధాల వంటి కీచకవధ, దక్షిణ గోగ్రహణ, ఉత్తర గోగ్రహణ ఘట్టాల వలన విరాటపర్వం ఒక ఉదాత్త ప్రబంధ మండలిగా రాణిస్తున్నది. ఒక్కొక్క ఘట్టం ఒక్కొక్క ప్రబంధంగా రాణించే బిగువైన కథ కలిగినది. అందువలన అన్ని పర్వాలలో కంటె విరాటపర్వ కథలో బిగు వెక్కువ.

విరాటపర్వంలో శృంగారాది సర్వరస పోషణకు అవకాశం ఉన్నది. ఆ గుణాన్ని గుర్తించి అంగి రసాల అభ్యుదయం, అంగరసాల ఉల్లాసం పఠితలు అనుభవించేటట్లు పండిత పామరులు మెచ్చుకొనేటట్లు విరాటపర్వాన్ని రచించాలనీ, మిగతా పర్వాలను అట్లాగే రచించి భారతాన్ని ముగించాలనీ తిక్కన సంకల్పించాడు. (సంపా.)

క. **అని రచనా కౌతుకమున। మన మలరఁగ 'నీ ప్రబంధ మండలి కధినా**
ధునిఁగా నే పురుషునిఁ బే। ర్కొనువాఁడనొ' యను తలంపు గూరిన మదితోన్. **8**

ప్రతిపదార్థం: అని= అని తలంచి అని భావం; రచనా కౌతుకమునన్= భారత రచన కొనసాగించాలనే కుతూహలంతో; మనము= మనస్సు; అలరఁగన్= సంతోషించగా; ఈ ప్రబంధ మండలికిన్= ఈ ప్రబంధ సముదాయానికి; అధినాథునిగాన్= కృతిభర్తనుగా; ఏ పురుషునిన్= ఏ పురుషుని; పేర్కొనువాఁడనొ= ఎన్నుకోవాలో; అను= అనే; తలంపు= ఆలోచన; కూరిన= బాగుగా నాటుకొన్న; మదితోన్= మనస్సుతో.

తాత్పర్యం: అని తలంచి, భారతరచన చేయాలనే కుతూహలంతో మనస్సు ఉత్సాహపడింది. ఈ ప్రబంధ మండలికి 'కృతిపతిగా ఏ పురుషుడిని ఎన్నుకొనాలో!' అనే ఆలోచన మనస్సులో బాగా నాటుకొన్నది.

విశేషం : ఈ పద్యంలోని 'ప్రబంధమండలి' అనే పద సముదాయానికి నిర్దిష్టమయిన అర్థం చెప్పలేము. తిక్కన నన్నయ్యను ప్రశంసించిన పద్యంలో 'కృతులు' అనే మాట వాడాడు. సందర్భం బట్టి 'కృతులు' అంటే పర్వాలు అనే అర్థం కుదురుతుంది. అట్లాగే 'ప్రబంధ మండలి' అంటే 'పర్వాల సముదాయం' అని చెప్పుకొనటం సమంజసం. అంతేకాని అష్టాదశ (18) వర్ణనలున్న సాహిత్య ప్రక్రియ కాదు.

వ. ఇంచుక నిద్రించు సమయంబున. 9

ప్రతిపదార్థం: ఇంచుక= కాసేపు; నిద్రించు సమయంబునన్= కునుకు పట్టిన వేళ.

తాత్పర్యం: కృతి భర్తగా ఎవరిని ఎన్నుకొనాలా అని ఆలోచిస్తూ కాసేపు కునుకు తీసిన వేళ.

విశేషం : నిద్ర పోవటం రెండు రకాలు. ఆలోచిస్తూ నిద్రపోవటం, నిద్రపోతూ ఆలోచించటం. నిద్రలో చాల వాటికి 'పరిష్కార మార్గాలు' స్ఫురిస్తాయి. తిక్కనకు కూడా అట్లాగే 'పరిష్కారమార్గం' తెలియటానికి వీలయింది.

2. కావ్య పరిభాషలో నిద్రను ముద్రగా గ్రహిస్తారు. కావ్య సృష్టికి మూలమైన ప్రతిభాచైతన్యం సమాధ్యవస్థలో నిత్య జాగృతమై ఉంటుందనీ, మేల్కొన్నప్పుడు స్ఫురించని అపూర్వాంశాలు భావసమాధిలో స్ఫురిస్తాయనీ కావ్య శాస్త్రజ్ఞులు చెపుతారు. తిక్కన నిద్ర భావసమాధికి సంకేతంగా గ్రహించాలి. (సంపా.)

సీ. మజ్జనకుండు, సమ్మాన్య గౌతమ గోత్ర । మహితుండు, భాస్కరమంత్రి తనయుఁ,
దన్నమాంబాపతి, యనఘులు కేతన । మల్లన సిద్ధనామాత్యవరుల
కూరిమి తమ్ముండు, గుంటూరి విభుఁడు కొ । మ్మన దండనాథుండు, మధుర కీర్తి
విస్తర స్ఫారుఁ డాపస్తంబసూత్ర ప । విత్రశీలుఁడు సాంగవేదవేది

తే. యర్థిఁ గల వచ్చి వాత్సల్య మతిశయిల్ల । నస్మదీయ ప్రణామంబు లాదరించి
తుష్టి దీవించి, కరుణార్ద్ర దృష్టిఁ జూచి । యెలమి నిట్లని యానతి యిచ్చె నాకు. 10

ప్రతిపదార్థం: మత్= నాయొక్క; జనకుండు= తండ్రి; సమ్మాన్య= చక్కగా పూజింపదగిన; గౌతమగోత్ర మహితుండు= గౌతమ గోత్రంలో పుట్టటం వలన గొప్పవాడు; భాస్కర మంత్రి= భాస్కర మంత్రి యొక్క; తనయుఁడు= కుమారుడు; అన్నమాంబాపతి= అన్నమాంబకు మగడు; అనఘులు= పాపరహితులైన; కేతన, మల్లన, సిద్ధన= కేతన, మల్లన, సిద్ధనలనబడే; అమాత్యవరుల= శ్రేష్ఠులయిన మంత్రుల యొక్క; కూరిమి తమ్ముండు= ప్రేమాస్పదుడయిన (ముద్దుల) తమ్ముడు; గుంటూరి విభుఁడు= గుంటూరి సీమకు దండనాథుడయిన వాడు; కొమ్మన దండనాథుండు; మధుర= ఇంపయిన; కీర్తి= కీర్తి యొక్క; విస్తర= వ్యాపనం చేత; స్ఫారుఁడు= ప్రకాశించేవాడు; ఆపస్తంబ సూత్ర= ఆపస్తంబ సూత్రం చేత; పవిత్రశీలుఁడు= పవిత్రమయిన ఆచారం కలవాడు; సాంగ వేద వేది= శిక్ష, కల్పం మొదలయిన ఆరు వేదాంగాలతో వేదాన్ని చక్కగా అధ్యయనం చేయటంద్వారా చక్కగా తెలిసికొన్నవాడు; అర్థిన్= కోరికతో; కలన్= కలలో; వచ్చి= కనబడి; వాత్సల్యము+అతిశయిల్లన్= వాత్సల్యభావం పెల్లుబుకగా; అస్మదీయ= నాయొక్క; ప్రణామంబులు= నమస్కారాలను; ఆదరించి= గ్రహించి; తుష్టిన్= సంతోషంతో; దీవించి= ఆశీర్వదించి; కరుణా+ఆర్ద్రదృష్టిన్= దయతో తడిసిన చూపులతో; చూచి= కనుగొని; ఎలమిన్= సంతోషంతో; నాకున్= నాకు; ఇట్లు= ఈ ప్రకారంగా; ఆనతి= ఆజ్ఞను; ఇచ్చెన్= ఇచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నా తండ్రి కొమ్మన. ఆయనది గౌతమగోత్రం. ఆయన తండ్రి భాస్కర మంత్రి. కేతన, మల్లన, సిద్ధనలు కొమ్మనకు అన్నలు. అతడు ఆ అన్నలకు ముద్దు తమ్ముడు, అన్నమాంబ మగడు. గుంటూరి సీమకు దండనాథుడు. గొప్పగా పేరు ప్రతిష్ఠ లున్న వ్యక్తి, ఆపస్తంబ సూత్రుడు. పవిత్ర స్వభావుడు. వేదవేదాంగాలను చక్కగా అభ్యసించినవాడు. అటువంటి తండ్రి కలలో కనిపించాడు. నా నమస్కారాలు స్వీకరించాడు. మనసారా దీవించాడు. వాత్సల్యంతో కరుణార్ద్ర దృష్టితో నన్ను చూచాడు. ఈ విధంగా ఆజ్ఞాపించాడు.

విశేషం : శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం - వీటిని 'షడంగములు' అంటారు. వేదాన్ని షడంగాలతో అధ్యయనం చేసేవారిని 'సాంగవేద 'వేది' అంటారు. కొమ్మనలోని వైదికనిష్ఠ, పరిపాలనానుభవం గుర్తించదగిన అంశాలు. ఇవే తిక్కనలో పరిమళించాయి.

వ. "కి మస్థి మాలాం కిము కౌస్తుభం వా । పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్ । కిం కాలకూటః కిము వా యశోదా । స్తన్యం తవ స్వాదు వద ప్రభో మే," అని నీవు తొల్లి రచియించిన పద్యంబు గాఢాదరంబున నవధరించి, భక్తవత్సలుం డగు హరిహరనాథుండు నీదెస దయాళుండై యునికిం జేసి నిన్నుం గృతార్థునిఁ జేయం గార్యార్థి యయి నాకలోక నివాసి యయిన నాకుఁ దన దివ్య చిత్తంబునం గల యక్కారుణ్యంబు తెఱం గెఱుంగునట్టి శక్తిం బ్రసాదించి నన్ను నాకర్షించి కొలిపించికొని వీఁడె విజయం చేయుచున్నవాఁడనుచుం జూపుటయు సవిశేష సంభ్రమ సంభరిత హృదయుండ నయి యవ్వలనుఁ గలయం గనుంగొనునప్పుడు.11

ప్రతిపదార్థం: ప్రభో!= దేవా! ఓ భగవంతుడా!; త్వమ్= నీవు; పరిష్క్రియాయాం= అలంకరణలో; అస్థి మాలాం= ఎముకల దండను; బహుమన్యసే కిం?= అమితంగా అభిమానిస్తావా?; వా= లేకపోతే; కౌస్తుభం= కౌస్తుభరత్నాన్ని; బహుమన్యసే కిము= ఇష్టపడతావా?; కాలకూటః= క్షీరసాగర మథన సమయంలో సమస్తలోకాలను కలవరపెట్టుతూ పుట్టిన కాలకూట విషం; తవ= నీకు; స్వాదు కిమ్?= రుచికరమా?; వా= లేకపోతే; యశోదాస్తన్యం= యశోద చనుబాలు; తవ= నీకు; స్వాదు కిమ్?= రుచికరమా?; మే= నాకు; వద= చెప్పుము; అని; నీవు; తొల్లి= పూర్వం; రచియించిన, పద్యంబున్; గాఢ+ఆదరంబునన్= ఎక్కువ ఆదరంతో; అవధరించి= శ్రద్ధగా ఆలకించి; భక్తవత్సలుండు+అగు= భక్తులపై వాత్సల్యం గల; హరిహరనాథుండు; నీ దెసన్= నీ పట్ల; దయాళుండు+ఐ= దయ కలిగినవాడై; ఉనికిన్+చేసి= ఉండటం చేత; నిన్నున్= నిన్ను; కృతార్థునిన్+చేయన్= ధన్యుడిని చేయటానికి; కార్య+అర్థి+అయి= పనిగట్టుకొని; నాకలోక నివాసి+అయిన= స్వర్గలోకంలో ఉన్న; నాకు; తన దివ్య చిత్తంబునన్+కల= తన మహిమాన్వితమైన మనసులో ఉన్న; ఆ+కారుణ్యంబు తెఱంగు= ఆ దయా స్వభావాన్ని; ఎఱుంగున్+అట్టి= తెలిసికొనే; శక్తిన్= శక్తిని; ప్రసాదించి= అనుగ్రహించి; నన్నున్= నన్ను; ఆకర్షించి= దగ్గరకు రప్పించుకొని; కొలిపించుకొని= సేవచేయించుకొని; వీఁడె= ఇదిగో; విజయం చేయుచున్న వాఁడు= వస్తున్నాడు; అనుచున్= అంటూ; చూపుటయును= చూపించగా; సవిశేష సంభ్రమ సంభరిత హృదయుండన్+అయి= అబ్బురమైన తొందరతో కూడిన మనసుకలవాడనయి; ఆ+వలనున్= ఆ దిక్కు; కలయన్+ కనుఁగొను+అప్పుడు= కలయచూసే వేళ.

తాత్పర్యం: "ఓ ప్రభూ! నీ అలంకరణలో ఎముకల దండలూ ఉన్నాయి, కౌస్తుభ రత్నం కూడా ఉన్నది. వాటిలో నీకేది ఇష్టం? నీవు కాలకూటం త్రాగావు; యశోద చనుబాలూ త్రాగావు. వాటిలో నీకేది రుచిగా ఉంది? తేల్చి చెప్పుము!" అంటూ సంస్కృతంలో నీవు వ్రాసిన పద్యాన్ని హరిహరనాథుడు గుర్తించాడు. 'నీ వంటే ఆ స్వామికి ఎంతో దయ, నిన్ను ధన్యుడిని చేయాలని అనుకొన్నాడు. నీమీద ఉన్న ఆ అభిమానాన్ని తెలిసికొనే శక్తిని స్వర్గంలో ఉన్న నాకు

ప్రసాదించాడు. నన్ను తన దగ్గరికి రప్పించుకొన్నాడు. నా సేవలందుకొన్నాడు. ఇదిగో ఆ స్వామి వేంచేస్తున్నాడు' -అని అంటూ ఉండగా నేను ఆ వైపు తేరిపార చూశాను. అప్పుడు.

విశేషం : భగవదనుగ్రహం సామాన్యమయింది కాదు. హరిహరనాథుడు తిక్కన వ్రాసిన శ్లోకాన్ని మెచ్చుకొనటం తిక్కన తపః పుణ్యఫల పరిపాకమే. తిక్కన తండ్రి స్వర్గంలో ఉన్నాడనటం వలన తిక్కన వంశీయుల గొప్పతనం, పుణ్యసంపద వెల్లడౌతున్నవి.

సీ. **కరుణారసము పొంగి తొరఁగెడు చాడ్పున । శశిరేఖ నమృతంబు జాలువాఱ**
హరినీలపాత్రిక సురభిచందన మున్న । గతి నాభి ధవళపంకజము మెఱయ
గుఱియైన చెలువున నెఱసిన లోక ర । క్షణ మనంగ గళంబు చాయ దోఁపఁ
బ్రథమాద్రిఁ దోఁతెంచు భానుబింబము నా ను । రమ్మునఁ గౌస్తుభరత్న మొప్ప

తే. **సురనదియును గాళిందియు బెరసినట్టి । కాంతిపూరంబు శోభిల్లు శాంతమూర్తి**
నా మనంబు నానంద మగ్నముగఁ జేయ । నెలమి సన్నిధి సేసె సర్వేశ్వరుండు. **12**

ప్రతిపదార్థం: కరుణారసము= దయ అనే రసం; పొంగి తొరఁగెడు చాడ్పునన్= పొంగి పొరలుతున్నట్లుగా; శశిరేఖన్= చంద్రరేఖ నుండి; అమృతంబు జాలువాఱన్= అమృతం ప్రవహించగా; హరినీల పాత్రికన్= ఇంద్రనీలమణులు పొదిగిన చిన్న పాత్రలో; సురభి చందనము+ఉన్నగతిన్= గుబాళించే మంచి గంధం ఉన్నట్లుగా; నాభిన్= బొడ్డులో; ధవళ పంకజము= తెల్లని తామరపూవు; మెఱయన్= ప్రకాశించగా; గుఱి+ఐన= గుర్తయిన; చెలువునన్= అందంతో; నెఱసిన= ఒప్పిన; లోకరక్షణము+అనంగన్= లోక రక్షణమా అనునట్లు; గళంబు చాయ= కంఠ కాంతి; తోఁపన్= కనబడగా; ప్రథమ+అద్రిన్= తూరుపు కొండమీద; తోఁతెంచు= కనిపించే; భానుబింబము నాన్= సూర్యబింబమా అని ఊహించేటట్లు; ఉరమ్మునన్= వక్షఃస్థలంలో; కౌస్తుభరత్నము+ఒప్పన్= కౌస్తుభ మనే పేరు గల రత్నం ప్రకాశించగా; సుర నదియును= గంగానది; కాళిందియున్= యమునా నది (రెండూ); బెరసినట్టి= కలసి ఒకటయిన; కాంతిపూరంబు= కాంతిప్రవాహం; శోభిల్లు= ప్రకాశించే; శాంతమూర్తి= శాంతస్వరూపు డయిన; సర్వ+ఈశ్వరుండు= సర్వానికి ఈశ్వరుడయిన హరిహరనాథుడు; నా మనంబున్= నా మనస్సును; ఆనంద మగ్నముగన్+చేయన్= ఆనందంలో మునిగేటట్లు చేసేందుకు; ఎలమిన్= సంతోషంతో; సన్నిధి+చేసెన్= ప్రత్యక్షమయ్యాడు.

తాత్పర్యం: నాకు హరిహరనాథుడు ప్రత్యక్షమైనాడు. ఆయన శిరసు మీద చంద్రరేఖ ఉన్నది. చంద్రరేఖ నుండి స్రవించే అమృతం దయారసం పొంగి పొరలుతూ ఉన్నట్లుగా ఉన్నది. ఆ స్వామి బొడ్డులో తెల్లని తామరపూవు ఉన్నది. అది ఇంద్ర నీల మణులు పొదిగిన పాత్రలో గుబాళించే మంచిగంధంవలె ఉన్నది. కంఠం నలుపుగా ఉన్నది. అది లోకరక్షణ కొరకు నిలిచిన గుర్తు వలె ఉన్నది. రొమ్మున కౌస్తుభరత్నం ఉన్నది. అది తూరుపు కొండ మీద ఉదయించే సూర్యబింబం వలె ఉన్నది. గంగా యమునా నదుల కలయికలోని వెలుగుల వెల్లువవలె హరిహరనాథుడు సాక్షాత్కరించాడు.

విశేషం : పద్యం సీస పద్యం. సీస పద్యానికి 4 పెద్ద పాదాలుంటాయి. ఆ తరువాత ఆటవెలది గాని తేటగీతి గాని జోడిస్తారు. తిక్కన 1,3 (బేసి) పాదాలలో శివుడినీ, 2,4 (సమ) పాదాలలో విష్ణువునూ కీర్తించాడు. చివర తేటగీతిలో ఇద్దరిని కలిపి వర్ణించాడు. ఈ క్రమం సగుణోపాసన నుండి నిర్గుణోపాసనకు సాగే విధాన్ని సూచిస్తున్నది.

పద్యంలోని 'కరుణారసం' అనే మాట భగవంతుడి దయాగుణాన్ని స్పష్టం చేస్తుంది. విష్ణువు నీలమేఘ శ్యాముడు కావటం వలన ఇంద్రనీలమణులచేత నిర్మించబడిన పాత్రతో నాభిని పోల్చటం సమంజసం. భగవంతుడు జగద్రక్షకు డనటానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'గరళకంఠం' సాక్ష్యం. భారతీయులకు గంగాయమునలు పవిత్ర నదులు, తీర్థాలు. శివుడికీ గంగకూ తెలుపుదనంలోనూ యమునకూ విష్ణువుకూ నల్లని రంగులోనూ పోలికలుండటం విశేషం. గంగాయమునలు భిన్న నదులయినా అవి కలిసిన చోట నీళ్ళు రంగుల తేడా చేత వేరువేరుగా కొంతదూరం కనిపించినా ఆ తరువాత ఒకటిగా కలిసిపోతాయి. అట్లాగే హరిహరులు రంగులలో వేషాలలో ఇద్దరుగా తోచినా తత్త్వంలో వారు ఒక్కరే అన్న అభేదం దృష్టికి ఆనటం ఒక ప్రత్యేకత. ఆంధ్ర వాఙ్మయంలోని హరిహరనాథ స్తుతిపద్యాలలో ఈ పద్యం తలమానికమైనది.

వ. ఏనును భక్తిమయం బగు సాష్టాంగదండప్రణామం బాచరించి, కొండొక దొలంగి వినయావనతుండనై, లలాటోపరిభాగంబున నంజలిపుటంబు ఘటించి, నయనంబులు నవయవంబులును బ్రమదబాష్ప సలిల విలులితంబులును, బులకపటల పరికలితంబులునుం గా నంతంత నిలిచిన నద్దేవుండు. 13

ప్రతిపదార్థం: ఏనును= నేను కూడా; భక్తిమయంబు+అగు= భక్తితో నిండినదైన; స+అష్ట+అంగ దండ ప్రణామంబు+ఆచరించి= శరీరంలోని ఎనిమిది అంగాలు నేలకు తగిలేటట్లు దండం వలె బోరగిల పడుకొని చేసే నమస్కారం చేసి; కొండొక+తొలంగి= కొద్దిగా ప్రక్కకు తప్పుకొని; వినయ+అవనతుండను+ఐ= వినయంతో వంగినవాడనై; లలాట+ఉపరిభాగంబునన్= నుదుటి పైభాగం మీద; అంజలిపుటంబు ఘటించి= దొప్పవలె ముకుళింపచేసిన దోసిలితో నమస్కారం చేసి; నయనంబులున్= కన్నులూ; అవయవంబులును= శరీరంలోని భాగాలన్నీ; ప్రమద బాష్పసలిల విలులితంబులును= ఆనంద బాష్ప జలాన్ని విడిచేవి; పులక పటల= గగుర్పాటుల సముదాయంతో; పరికలితంబులునున్+కాన్= కూడినవి కాగా; అంతంతన్= అల్లంత దూరాన; నిలిచినన్= నిలువగా; ఆ+దేవుండు= అప్పుడు ఆ దేవుడు.

తాత్పర్యం: నేను భక్తితో సాష్టాంగ నమస్కారం చేశాను. ఒకప్రక్కకు ఓరగా నిలబడ్డాను. వినయంతో కొంచెం ముందుకు వంగాను. నొసటి మీద చేతులు జోడించాను. నా కళ్ళు ఆనంద బాష్పాలతో నిండాయి. నా శరీరమంతా రోమాంచంతో గగుర్పొడిచింది. అప్పుడా దేవుడు.

విశేషం : భగవంతుడు ప్రసన్నుడైనప్పుడు భక్తుడు ప్రదర్శించే భక్తిభావాన్ని తెలిపే ఆంగిక సాత్త్వికాభినయాలు ఇందులో వర్ణించబడ్డాయి. సాష్టాంగ దండప్రణామం శరణాగతికీ, వినయంతో లలాటం వద్ద దోసిలితో సంఘటించిన నమస్కారం ఆత్మార్పణ భావానికీ ఆంగికాభినయాలు. ఆనందబాష్పాలూ, పులకలూ ఆనందానుభవానికి సాత్త్వికాభినయాలు. (సంపా.)

క. అనుకంపాతిశయంబునఁ। దన దక్షిణనేత్రమును సుధారోచియ కా
నను వింత లేక చూచి, వ। దనమున దరహాసరసము దళుకొత్తంగన్. 14

ప్రతిపదార్థం: అనుకంపా+అతిశయంబునన్= దయాధిక్యం చేత; తన= తనయొక్క; దక్షిణ నేత్రమును= కుడి కన్ను కూడా; సుధారోచియ కాన్= చంద్రుడే కాగా; ననున్= నన్ను; వింత లేక= కొత్త లేక; చూచి= పరిశీలించి; వదనమునన్= ముఖంలో; దరహాస రసము= చిరునవ్వు అనే రసం; తళుకొత్తంగన్= చిందగా (తొణికిసలాడగా).

తాత్పర్యం: హరిహరనాథుడు నా వైపు దయతో చూచాడు. అప్పుడా దేవుడి కుడి కన్ను కూడా చంద్రుడే అయినాడు. చిరునవ్వు తొణికిసలాడుతూ నాతో ఈ విధంగా అన్నాడు.

విశేషం : విష్ణువు కుడికన్ను సూర్యుడు. ఎడమ కన్ను చంద్రుడు. సూర్యుడనటం వలన వేడిమి తప్పని సరి. కాని, కుడికన్ను చంద్రుడు కావటంతో 'చల్లనయ్య' అయినాడు ఆ స్వామి. 'దరహాసరసం' వంటి వింత ప్రయోగాలు తిక్కన ప్రత్యేకతను తెలుపుతాయి.

ఉ. 'వైదిక మార్గ నిష్ఠమగు వర్తనముం దగ నిర్వహించుచున్
భేదము లేని భక్తి మతి నిర్మల వృత్తిఁగఁ జేయుచుండు మ
త్పాద నిరంతర స్మరణ తత్పర భావము కల్మి, నాత్మ స
మ్మోదముఁ బొందఁ గావ్య రసముం గొనియాడుచు నుండు దెప్పుడున్. 15

ప్రతిపదార్థం: వైదిక మార్గ నిష్ఠము+అగు= వేద సమ్మతమయిన మార్గాన్ని అనుసరించే; వర్తనమున్= ప్రవర్తనను; తగన్+నిర్వహించుచున్= తగిన విధంగా కొనసాగిస్తూ; భేదము లేని= శివకేశవ భేదం లేని; భక్తిన్= భక్తితో; మతిన్= మనస్సును; నిర్మల వృత్తిఁగన్= మాలిన్యం లేని ప్రవృత్తి కలదానినిగా; చేయుచుండు= చేసే; మత్= నాయొక్క; పాద= పాదాలయొక్క; నిరంతర= ఎల్లప్పుడూ; స్మరణ తత్పర భావము= భక్తితో తలంచటంవలన భావించటంలో తన్మయమైన భావం; కల్మిన్= ఉండటం చేత; ఆత్మ= మనస్సు, అంతరాత్మ; సమ్మోదమున్+పొందన్= ఆనందాన్ని పొందగా; కావ్య రసమున్= కావ్యములందలి రసాన్ని; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; కొనియాడుచున్+ఉండుదు(వు)= మెచ్చుకుంటూ ఉంటావు.

తాత్పర్యం: 'నీవు వైదిక మార్గంలో జీవిస్తున్నావు. శివకేశవ భేదరహిత మయిన భక్తితో నాపాద స్మరణ చేస్తున్నావు. ఆ రీతిగా ఆత్మానందం పొందుతూ కావ్యరసాన్ని ఆస్వాదిస్తూ ఉంటావు.

విశేషం : భారతం మొదలు పెట్టేనాటికి తిక్కనలో నాలుగు లక్షణాలున్నాయి. మొదటిది వైదిక మార్గవర్తనం, రెండవది శివకేశవ భేదరహిత మయిన భక్తి, మూడవది కావ్యరసాస్వాదం, నాల్గవది బ్రహ్మానంద స్థితి పొందాలనే ఆకాంక్ష. 'నిరంతర భగవన్నామస్మరణ' సర్వశుభాలను కలిగిస్తుంది.

వ. అందును. 16

తాత్పర్యం: అందులో కూడా విశేషించి.

క. పారాశర్యుని కృతి యయి। భారత మను పేరఁ బరఁగు పంచమవేదం
బారాధ్యము జనులకుఁ ద। ద్గౌరవ మూహించి నీ వఖండిత భక్తిన్. 17

ప్రతిపదార్థం: పారాశర్యుని= పరాశరుని కుమారుడయిన వ్యాసుని; కృతి+అయి= రచన అయి; భారతము+అను పేరన్= భారతమనే పేరుతో; పరఁగు= ప్రసిద్ధము అయిన; పంచమ వేదంబు= ఐదవ వేదం; జనులకున్= ప్రజలకు; ఆరాధ్యము= ఆరాధించదగినది; తద్= ఆ; గౌరవము= గొప్పతనాన్ని, మహిమను; ఊహించి= భావన చేసి; నీవు; అఖండిత భక్తిన్= నిరంతరమయిన (అంతరాయంలేని) భక్తితో.

తాత్పర్యం: వేదవ్యాసుడు రచించిన భారతం పంచమవేదం అని ప్రసిద్ధి పొందింది. ప్రజల కది ఆరాధించదగింది. దాని గొప్పతనాన్ని మనసులో భావించి, దానిమీది నిరంతర భక్తితో నీవు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం : వేదాలు నాలుగు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వ వేదం, భారతం పంచమవేదం. అంటే వేదాల సారాన్ని తనలో ఇముడ్చుకొన్న వేదమని అభిప్రాయం.

తే. తెనుఁగుబాస వినిర్మింపఁ దివురు టరయ। భవ్య పురుషార్థ తరుపక్వ ఫలము గాదె!
దీని కెడ నియ్యకొని వేడ్క నూని కృతిపతిత్వ మర్థించి వచ్చితిఁ దిక్కశర్మ!' 18

ప్రతిపదార్థం: తిక్కశర్మ!= ఓ తిక్కనా!; తెనుఁగు బాసన్= తెలుగు భాషలో; వినిర్మింపన్= సరిక్రొత్త రచన అన్నట్లుగా రచన చేయటానికి; తివురుట= ప్రయత్నించటం; అరయన్= పరిశీలించగా; భవ్య= మంగళకరమయిన; పురుషార్థ= ధర్మార్థ కామ మోక్షములనే; తరు= చెట్టుయొక్క; పక్వ= పండిన; ఫలము కాదె= పండు కదా; దీనికిన్= తెలుగులో నిర్మించే నీ ప్రయత్నానికి; ఎడన్= మనస్సులో; ఇయ్యకొని= అంగీకరించి; వేడ్కన్+ఊని= ఎంతో కుతూహలపడి; కృతిపతిత్వము= కృతికి పతిగా ఉండాలనే భావంతో; అర్థించి= కోరి; వచ్చితిన్= వచ్చాను.

తాత్పర్యం: తిక్కనా! నీవు తెలుగు భాషలో భారతం నిర్మించటానికి పూనుకొనటం ఎటువంటిదంటే। పురుషార్థములనే చెట్టుకు పండిన పండు వంటిది. ఈ నీ ప్రయత్నం నా మనసుకు నచ్చింది. ఇందుకు నే నెంతో కుతూహలపడి కృతిపతిత్వాన్ని కోరి వచ్చాను.'

విశేషం : 'వినిర్మింపన్' అనే మాట సాభిప్రాయం. తెలుగు భారతం యథానువాదం కాదు. అనుసృజనం వంటిది. వ్యాస భారతంలో నిబంధింపబడి నిరూపింపబడిన తాత్పర్యాన్నీ, తత్త్వాన్నీ తెలుగులో తేటపడేటట్లు పునర్నిర్మించటమే ఆ 'వినిర్మించటం'. వినిర్మాణమంటే విశిష్టమైన నిర్మాణమని కూడా భావం. వ్యాస భారతం శాస్త్రేతిహాసమైతే తెలుగులోని కవిత్రయ భారతం కావ్యేతిహాసంగా అవతరించింది. ఆ ప్రక్రియా భేదం వినిర్మాణంలోని విశేషం. మహాభారతంలో పాండవులు సాధించిన చతుర్విధ పురుషార్థ జీవిత సమగ్రేతివృత్తం వర్ణించబడింది. కాబట్టి అది పురుషార్థ పరిపక్వ ఫలం వంటిది. ఆ భారతాన్ని రచించిన కవి జీవితం కూడా పురుషార్థ వృక్షానికి పండిన పండే అవుతుందని - అంటే ఆ మహాకవికి మోక్ష ఫలాన్ని అందిస్తుందని భావం. భగవంతుడిని కూడా కృతిపతిత్వం కోసం ప్రేరేపించే పరమార్థ గ్రంథం భారతం. (సంపా.)

వ. అనిన నద్దివ్యవచనామృతంబు నా యుల్లంబున వెల్లిగొనినఁ బునః పునః ప్రణామంబు లాచరించి, యప్రమేయ ప్రభావ భావనాతీతుండయ్యును నప్పరమేశ్వరుం డాశ్రితులకు నత్యంత సులభుండని బుధులవలన విని యునికిం జేసి ననుబోఁటి బాలస్వభావునకు నిట్టి మహనీయ మహిమ దొరఁకొనుటయుం గలుగున కాక యని తలంచుచు నవ్విభునకు విన్నపంబు సేయువాఁడనయి కొమ్మనామాత్యునాననం బాలోకించి తదనుమతి వడసి యిట్లంటి. 19

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; ఆ+దివ్య వచన+అమృతంబు= హరిహరనాథుని మహిమగల ఆ మాటలనే అమృతం; నా+ఉల్లంబునన్= నా మనసులో; వెల్లిగొనినన్= పొంగి పొరలగా; పునఃపునః= మాటి మాటికి; ప్రణామంబులు+ఆచరించి= నమస్కారాలు చేసి; అప్రమేయ= మితియిడడానికి వీలు లేని; ప్రభావ= మహిమచేత; భావనా+అతీతుండు+అయ్యునున్= ఊహకు అందని వాడయినా; ఆ+పరమేశ్వరుండు= ఆ దేవదేవుడు; ఆశ్రితులకున్= తనను శరణుపొందినవారికి; అతి+అంత సులభుండు+అని= మిగుల సులభంగా లభించేవాడని; బుధులవలనన్= పండితుల వలన; విని+ఉనికిన్+చేసి= విని ఉండటం వలన; ననున్+బోఁటి= నావంటి; బాలస్వభావునకున్= పరిణతి చెందని స్వభావం కలవానికి కూడా; ఇట్టి మహనీయ మహిమ= ఇటువంటి గొప్పశక్తి; దొరఁకొనుటయున్= లభించటం కూడా; కలుగున్+అ కాక= తప్పక సిద్ధిస్తుంది కదా; అని, తలంచుచున్= అనుకొంటూ; ఆ+విభునకున్= ఆ హరిహరనాథస్వామికి; విన్నపంబు= మనవి; చేయువాఁడన్+అయి= చేసేవాడనయి; కొమ్మన+ అమాత్యు+ఆననంబు= కొమ్మనమంత్రి ముఖం; ఆలోకించి= చూచి; తద్+అనుమతిన్= అతని అనుమతిని; వడసి= పొంది; ఇట్లు+అంటిన్= ఈ విధంగా అన్నాను.

తాత్పర్యం: ఆ హరిహరనాథుని మాటలు అమృత తుల్యాలు. వాటిని వినగానే నా మనస్సులోని అలౌకికానుభూతి పొంగులెత్తింది. మళ్ళీ మళ్ళీ నమస్కరించాను. ఆ దేవదేవుడు మహాప్రభావం కలవాడు. మానవుల భావనలకు అందని

వాడు, అయినా ఆశ్రితులకు సులభుడు అని పండితులవలన లోగడ విని ఉండటంచేత ఆ భావాన్ని పదే పదే మననం చేసికొన్నాను. అందువలన నావంటి బాలస్వభావుడికి కూడా గొప్ప శక్తి కలుగుతుందికదా! అనే ధైర్యం కలిగింది. దేవుడికి ఏదో విన్నవించాలనే తపనతో మా తండ్రి వైపు చూచాను. ఆయన అనుమతించాడు. ఆ తరువాత ఈ విధంగా అన్నాను.

విశేషం : తిక్కన ఎంత చదువరియో అంత సంస్కారవంతుడు. తనను బాలస్వభావుడిగా చెప్పుకొనటం వినయానికి గుర్తు. భగవంతుడికి విన్నవించుకొనేందుకు తిక్కన తండ్రివైపు చూడటం పెద్దలపట్ల గౌరవాన్ని, వృద్ధసేవ పట్ల ఆదరాన్ని వ్యక్తం చేస్తుంది.

క. భూరి భవత్కారుణ్య। క్షీరాంబుధిలోన నాదు చిత్తంబును వి
స్తార మహితముగ నునిచితి। వారయ నచ్చెరువు గాదె యఖిలాండపతీ! 20

ప్రతిపదార్థం: అఖిల+అండపతీ!= బ్రహ్మాండ నాయకా!; భూరి= అధికమయిన; భవత్= నీయొక్క; కారుణ్యా= దయ అనే; క్షీర+అంబుధిలోనన్= పాల సముద్రంలో; నాదు= నాయొక్క; చిత్తంబును= మనస్సును; విస్తార మహితముగన్= విరివిఐన గొప్పతనం కలదానినిగా; ఉనిచితివి= ఉంచావు; అరయన్= చూడగా; అచ్చెరువు కాదె?= ఆశ్చర్యం కదా!

తాత్పర్యం: బ్రహ్మాండ నాయకా! అతి విస్తారమైన నీ దయ అనే పాలసముద్రంలో నామనస్సును ఎంతో గొప్పదనం కలిగిన దానినిగా చేసి భద్రంగా ఉంచి అనుగ్రహించావు. ఇది నిజంగా ఆశ్చర్యం కదా?

విశేషం : అలం: రూపకం; 'క్షీరాంబుధి నాదు తుచ్ఛ చిత్తంబున' అని కొన్ని ప్రతులలో ఉన్నది. తుచ్ఛ శబ్దాన్ని అత్యల్పమనే అర్థంలో వాడటం ప్రసిద్ధి. అప్పుడు అతి విస్తారమైన నీదయ అనే పాలసముద్రాన్ని అత్యల్పమైన నా చిత్తంలో విశాలంగా ఉంచటం ఆశ్చర్యం కాదా! అని తాత్పర్యం ఏర్పడుతుంది. ఉన్న పాఠం కంటె కొన్ని విధాల ఈ పాఠమే అన్వయ సుందరంగా ఉన్నది. (సంపా.)

ఉ. ఇంతకు నేర్చు నీకు, నొక యింతటిలోన, మదీయవాణి న
త్యంత విభూతిఁ బెంపెసఁగు నట్టి నినుం గొనియాడఁ జేత దా
నెంతటి పెద్ద? నీ కరుణ నిట్లు పదస్థుఁడ నైతి నింక జ
న్మాంతర దుఃఖముల్ దొలఁగు నట్లుగఁ జేసి సుఖాత్ముఁ జేయవే. 21

ప్రతిపదార్థం: ఇంతకున్ నేర్చు= ఇంతటి మహిమను ప్రదర్శించే సమర్థుడవయిన; నీకున్; అత్యంతవిభూతిన్= మిక్కిలి ఐశ్వర్యంతో; పెంపు+ఎసఁగునట్టి= ప్రసిద్ధి గడించిన; నినున్= నిన్ను; ఒక+ఇంతటిలోనన్= అనతికాలంలోనే; మదీయ వాణిన్= నా యొక్క వాక్కుతో; కొనియాడన్+చేత= పొగడింప చేసికొనటం; తాను+ఎంతటి పెద్ద?= అదేమంత ఘనకార్యం? నీ కరుణన్= నీ దయతో; ఇట్లు పదస్థుఁడన్+ఐతిన్= ఈవిధంగా ఇంతటి పదవిలోకి (భారతరచన చేయగల స్థితికి) వచ్చాను; ఇంకన్= ఇకముందు; జన్మ+అంతరదుఃఖముల్= మరోజన్మవలన కలిగే దుఃఖాలను; తొలఁగునట్లుగన్+చేసి= తొలగిపోయే విధంగా చేసి; సుఖ+ఆత్మున్+చేయవే= సుఖస్వరూపునిగా చేయుమా!

తాత్పర్యం: ఇంత మహిమను ప్రదర్శించ గలిగిన నీవు అనంతమైన ఐశ్వర్యంతో పెంపారే నిన్ను అనతికాలంలోనే నా వాక్కుల చేత కీర్తింపజేసికొనేటట్లు చేయటం అదెంత గొప్ప? నీ కరుణవలన ఈ పదవి (మహాభారతాన్ని తెలుగులో నిర్మించే అదృష్టం) నాకు దక్కింది. నాకు పునర్జన్మ దుఃఖం లేకుండా చేసి సుఖాత్ముడిని చేయవయ్యా!

విశేషం : భక్తుడు భగవంతుడిని స్మరించటం సహజం. కాని భగవంతుడు భక్తుడిని కరుణించడం విశేషం. తిక్కనను మెచ్చి హరిహరనాథుడు అనుగ్రహించాడు; కృతిపతిత్వం కోరాడు; భగవంతుడి పరిపూర్ణానుగ్రహం కలవాడు తిక్కన. అయినా నిగర్వి. మహాభారతాన్ని తెలుగులో నిర్మించే ఉత్తమాధికారం భగవద్దత్తమే అని భావించాడు. మహామహిమాన్వితుడైన దైవమే తన వాక్కులకు తగినంత శక్తినిచ్చి భారతాన్ని రచింప చేయిస్తాడని భావించాడు. భగవత్కృపవలన వ్రాసే ఈ కావ్యంవలన యశస్సు, అర్థలాభం వంటి కావ్య ప్రయోజనాలను తిక్కన కోరలేదు. పునర్జన్మ రహితమైన శాశ్వత మోక్షస్థితిని కోరాడు. కవిత్వం కవికి మోక్ష సాధనమని తిక్కన అభిప్రాయం.

వ. అని యుపలాలితుం డగు డింభకుండు దన కొలంది యెఱుంగక మహాపదార్థంబు వేఁడు విధంబున బ్రహ్మానంద స్థితిం గోరి సర్వాంగాలింగిత మహీతలం బగు నమస్కారంబు సేసిన నజ్జగన్నాథుండు. 22

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; ఉపలాలితుండు+అగు= బుజ్జగింపబడినవాడు అయిన; డింభకుండు= బాలుడు; తన కొలంది= తన శక్తి; ఎఱుంగక= తెలియక; మహత్+పదార్థంబు= గొప్పదైన వస్తువును; వేఁడు విధంబునన్= కోరుకొనే రీతిలో; బ్రహ్మ+ఆనంద, స్థితిన్+కోరి= ఆత్మానందాన్ని పొందే అనుభవస్థితిని కోరి; సర్వ+అంగ+ఆలింగిత మహీతలంబు+అగు= అన్ని అవయవాలతో తాకబడిన భూతలం కలిగిన; నమస్కారంబు+చేసినన్= సాష్టాంగ నమస్కారం చేయగా; ఆ+జగత్+నాథుండు= లోకాలకు నాయకుడయిన హరిహరనాథుడు.

తాత్పర్యం: బుజ్జగించబడిన బాలకుడు తన శక్తి ఏమాత్రమూ తెలిసికొనకుండా గొప్ప వస్తువును కోరేవిధంగా నేను బ్రహ్మానందం కలగాలని కోరుకొని సాష్టాంగ దండప్రణామం చేశాను. అప్పుడు ఆ దేవుడు.

**తే. జనన మరణాదులైన సంసార దురిత। ములకు నగపడకుండంగఁ దొలఁగు తెరువు
గనువెలుంగు నీ కిచ్చితి ననిన లేచి। నిలిచి సంతోష మెద నిండ నెలవుకొనఁగ. 23**

ప్రతిపదార్థం: జనన+మరణ+ఆదులు+ఐన= పుట్టుక, చావు మొదలయిన; సంసార దురితములకున్= సాంసారిక బాధలకు, దుఃఖాలకు; అగపడకుండంగన్= లోబడకుండ; తొలఁగు= తప్పించుకొనే; తెరువు= మార్గం; కను= చూచేటటువంటి; వెలుంగు= వెలుగు, కాంతి (జ్ఞానం, వివేకం, అని భావం); నీకున్= నీకు; ఇచ్చితిన్; అనినన్; లేచి; నిలిచి; ఎదనిండన్= మనసునిండుగా; సంతోషము; నెలవుకొనఁగన్= చోటుచేసికోగా, కలుగగా.

తాత్పర్యం: జననమూ, మరణమూ మొదలయిన సంసార దుఃఖాలకు లోబడకుండా తప్పించుకొనే మార్గం తెలిసికొనే వెలుగు నీకు ప్రసాదించాను' అని హరిహరనాథుడు సెలవిచ్చాడు. ఈ మాట వినటంతో నా మనసు ఆనందంతో నిండిపోయింది.

విశేషం: మానవుడు జనన మరణాది సంసార దుఃఖాలతో సతమత మవుతుంటాడు. ఈ దుఃఖ నివారణకు భగవదనుగ్రహం కావాలి. ఆ అనుగ్రహాన్ని తిక్కన పొందాడు. జననం, మరణం అనేవి నరక యాతనలకు కేంద్రాలు. పుణ్యం స్వర్గానికి, పాపం నరకానికి హేతువులు. సుఖదుఃఖాల అనుభవం నశిస్తే కాని మోక్షం దక్కదు. ఆ వెలుగు అనుగ్రహపాత్రులకే వేద్యం. బహుజన్మపుణ్యపాకఫలం. ఆ అనుభవం అనిర్వచనీయం.

వ. ఇట్లు మేలుకాంచి. 24

తాత్పర్యం: ఈ విధంగా మేలుకొని.

క. ఎలమియు నచ్చెరువును సరి। నెలసి పొదలు మానసమున నెంతయుఁబ్రొద్దేఁ
గలలోనఁ గన్న చందము। దలఁచుచు నుండితిని భక్తి తాత్పర్యమునన్. 25

ప్రతిపదార్థం: ఎలమియున్= సంతోషమూ; అచ్చెరువునున్= ఆశ్చర్యమూ; సరిన్+ఎలసి పొదలు= సమానంగా వ్యాపించి వర్ధిల్లే; మానసమునన్= మనస్సుతో; ఏన్= నేను; కలలోనన్+కన్నచందము= కలలో చూచిన విధం; తలఁచుచున్= భావించుకొంటూ; ఎంతయున్+ప్రొద్దు= ఎంతోసేపు; భక్తి తాత్పర్యమునన్= భక్తి పారవశ్యంతో; ఉండితిని= ఉండిపోయాను.

తాత్పర్యం: నా మనసు సంతోషంతో, ఆశ్చర్యంతో సమానంగా నిండిపోయింది. నేను కలలో దర్శించిన దృశ్యాన్ని తలచుకొంటూ ఎంతోసేపు భక్తి పారవశ్యంతో ఉండిపోయాను.

విశేషం: భారతీయుల స్వప్నశాస్త్రంలో, శకునశాస్త్రంలో 'కలలకు' ప్రాధాన్యం ఉన్నది. ఆ శాస్త్రజ్ఞులు కలలు భావి సూచకాలుగా భావిస్తారు. కొందరు అవి శుభాశుభ శకునాలుగా విశ్వసిస్తారు. కలల సమయాన్ని బట్టి ఫలితాలను చెప్పేవారున్నారు. మంచి కల వస్తే మేలుకొన్న తరువాత నిద్ర పోకూడదని శాస్త్రం. అందుచేత తిక్కన తన 'కలను' తలచుకొంటూ భక్తిపారవశ్యంతో ఉన్నాడు.

వ. తదనంతరంబ. 26

తాత్పర్యం: ఆ తరువాత.

ఉ. ఇట్టి పదంబు గాంచి పరమేశ్వరునిం గృతినాథుఁ జేసి యే
పట్టునఁ బూజ్యమూర్తి యగు భారత సంహితఁ జెప్పఁగంటి; నా
పుట్టుఁ గృతార్థతం బొరసెఁ, బుణ్యచరిత్రుఁడ నైతి; నవ్విభుం
గట్టెదఁ బట్ట మప్రతిమ కావ్య కవిత్వ మహావిభూతికిన్. 27

ప్రతిపదార్థం: ఇట్టి పదంబు+కాంచి= ఇటువంటి ఉన్నతమైన పదవిని పొంది; పరమేశ్వరునిన్= హరిహరనాథుని; కృతినాథున్+చేసి= (భారతానికి) కృతిభర్తనుగా చేసి; ఏ పట్టునన్= ఏ సందర్భంలోనైనా, ఏ విధంగా చూచినా; పుజ్యమూర్తి+అగు= ఆరాధించటానికి తగిన స్వరూపం కలిగిన; భారత సంహితన్= భారతమనే వేదాన్ని; చెప్పన్+కంటిన్= (తెలుగులో) చెప్పే భాగ్యం పొందగలిగాను; నా పుట్టున్= నా జన్మకూడా; కృతార్థతన్+పొరసెన్= సాఫల్యం పొందింది; పుణ్యచరిత్రుఁడన్+ఐతిన్= పుణ్యశీలుడిని అయ్యాను; అప్రతిమ= సాటిలేని; కావ్యకవిత్వ= కావ్య సంబంధమైన కవిత్వమనే; మహావిభూతికిన్= గొప్ప ఐశ్వర్యానికి; ఆ+విభున్= ఆ హరిహర నాథుడిని; పట్టము+కట్టెదన్= పట్టాభిషిక్తుడిని చేస్తాను.

తాత్పర్యం: నేను ఉన్నతస్థితిని అందుకొన్నాను. పరమేశ్వరుడిని కృతిపతిగా ఎన్నుకొన్నాను. భారతమనే పంచమవేదాన్ని తెలుగులో నిర్మించే అదృష్టం పొందాను. ఆ భారతం అన్ని విధాలా ఆరాధనీయం. నా జన్మ సఫలమయింది. నా చరిత్ర పుణ్యవంతమైనది. ఈ కావ్య కవిత్వ మహత్త్వ సంపదకు ఆ హరిహరనాథుడిని పట్టం కట్టుతాను.

విశేషం: తిక్కన ఒక మహాకవి. అతడికి కవిత్వం దైవానుగ్రహం వలన లభించింది. ఆ కవిత్వకళతో భారతం చెప్పాలనుకొన్నాడు. దేవుడే కృతిపతిత్వం కోరాడు. ఈరీతిగా లక్ష్యమూ సంప్రార్థనా రెండూ ఒకరిలో ఒకే కవిలో ఫలించటం చాలా గొప్ప విషయం. 'అప్రతిమకారుణికత్వ మహావిభూతికిన్' - ఈ పాఠం కొన్ని ప్రతులలో కనపడుతున్నది.

ఉ. కూర్చుట నూత్నరత్నమునకుం గనకంబునకుం దగున్; జనా
భ్యర్చిత మైన భారత మపార కృపాపరతంత్రవృత్తిమైఁ
బేర్చిన దేవదేవునకుఁ బ్రీతిగ నిచ్చుట సర్వసిద్ధి; నా
నేర్చిన భంగిఁ జెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్. 28

ప్రతిపదార్థం: నూత్నరత్నమునకున్= కొత్తరత్నానికి; కనకంబునకున్= మేలిమి బంగారానికి; కూర్చుట= జత చేయటం; తగున్= ఒప్పుతుంది; జన= జనులచే; అభి+అర్చితము+ఐన భారతము= పూజించబడిన భారతం; అపార= హద్దులేని; కృపాపరతంత్ర= దయాపరవశమైన; వృత్తిమైన్= ప్రవర్తనతో; పేర్చిన= అతిశయించిన; దేవదేవునకున్= దేవదేవునికి; ప్రీతిగన్= ప్రీతికలిగే విధంగా; ఇచ్చుట= ఇవ్వటం అంటే; సర్వసిద్ధి= సర్వమూ సిద్ధించినట్లే; నా నేర్చిన భంగిన్= నాకు చేతనైన విధంగా; చెప్పి; భక్తకోటికిన్= భక్తుల సమూహానికి; వరణీయుఁడన్+అయ్యెదన్= వరించ (అభిమానించ, ప్రేమించ) తగిన వాడినిగా ఔతాను.

తాత్పర్యం: బంగారానికి నూత్న రత్నాన్ని కూర్చటం సముచితం. భారతం జనులందరూ ఆరాధించే గ్రంథం. బంగారంవంటిది. దేవదేవుడూ దయాపరుడూ అయిన హరిహరనాథుడు రత్నం. ఆయనకు ప్రీతితో కృతి ఇవ్వటం అంటే బంగారానికి రత్నం కూర్చినట్లే, సిద్ధులన్నీ సమకూరినట్లే. కాబట్టి నా చేతనైనట్లు భారతాన్ని తెలుగులో చెప్పి భక్తులకు ప్రేమపాత్రుడను ఔతాను.

విశేషం: అలం: సమాలంకారం. ఇక్కడ భారతాన్ని నూత్న రత్నంగానూ, హరిహరనాథుడిని బంగారంగానూ చెప్పటం సహజసుందరంగా ఉన్నది. అందువలన రెంటికీ సరిపోయింది. భూతదయను, అహింసను భారతం ప్రబోధిస్తుంది. భగవంతుడేమో దయాసముద్రుడు. అందువలన ఆనురూప్యం కుదిరింది.

నన్నయ భారతం నరాంకితం. తిక్కన భారతం హరిహరనాథాంకితం. తిక్కన ఆరణ్యపర్వ శేషాన్ని వదలి విరాటపర్వం మొదలు పెట్టాడు. అందుచేత తిక్కన రచన నూత్నరత్నమైనది. బంగారంలో పొదగటంవలన రత్నానికి స్వచ్ఛత ఏర్పడినట్లు భారతానికి కూడా క్రొత్త అమరిక సహజంగా కలిగింది.

తిక్కన పండితుడైనా వినయశీలుడు. చదువరైనా తనను సామాన్య మానవునిగానే చెప్పుకొన్నాడు. వినయంతో 'నా నేర్చిన భంగి' అని చెప్పుకొన్నాడు. ఇది అహంకారం నశించిన స్థితిని తెలియజేస్తుంది. నన్నయకూడా 'నా నేర్చువిధంబున నిక్కావ్యంబు రచియించెద' - అనటం గమనార్హం.

వ. ఇది యనన్య సామాన్య కరణం బగు పరమధర్మ ప్రకారంబు. 29

ప్రతిపదార్థం: ఇది= ఈ భగవదంకిత ప్రక్రియ; (న+అన్య) అనన్య+సామాన్య కరణంబు+అగు= సామాన్యములైన ఇతర సాధనాలవల్ల సమకూరని; పరమధర్మ= ఉత్కృష్టమైన ధర్మముయొక్క; ప్రకారంబు= విధానం.

తాత్పర్యం: ఈ విధంగా భగవంతుడికి అంకితమిచ్చే ప్రక్రియ మరే ఇతర సాధనాలవలన కలిగేది కాదు. ఇది ఒక ఉత్తమ ధర్మం ఆచరించే పద్ధతి.

విశేషం: భగవదంకితం పరమధర్మ మని తిక్కన భావించాడు. నరాంకితం కంటె దైవాంకితం దివ్యమైన దనీ, ఉత్తమమైన దనీ ఆయన భావం. నిర్వచనోత్తర రామాయణ కావ్యాన్ని మనుమసిద్ధి భూపాలుడికి అంకితమిచ్చి, ఆంధ్రమహాభారతాన్ని దైవాంకితం చేసిన తిక్కనకు రెండు విధానాలలో ఉన్న తారతమ్యం బాగా తెలుసు. (సంపా.)

ఉ. కావున భారతామృతముఁ గర్ణపుటంబుల నారఁగ్రోలి యాం
ధ్రావళి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయ సంస్మృతి
శ్రీ విభవాస్పదం బయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్. 30

ప్రతిపదార్థం: కావునన్= అందువలన; భారత+అమృతమున్= భారతమనే అమృతాన్ని; కర్ణపుటంబులన్= దొప్పలవంటి చెవులతో; ఆరన్+క్రోలి= తనివి తీరేటట్లు పూర్తిగా సేవించి, త్రాగి; ఆంధ్ర+ఆవళి= తెలుగు వారంతా; మోదమున్+పొరయునట్లుగన్= ఆహ్లాదం పొందేవిధంగా; సాత్యవతేయసంస్మృతి= వేదవ్యాసుడిని స్మరించటమనే; శ్రీవిభవ+ఆస్పదంబు+అయిన= మంగళకరమైన వైభవానికి నిలయమైన; చిత్తముతోడన్= మనస్సుతో; మహాకవిత్వదీక్షావిధిన్+ఒంది= గొప్పకవిత వ్రాయాలి అనే దీక్ష వహించి; పద్యములన్, గద్యములన్= పద్యాలలో, గద్యాలలో (చంపువుగా); కృతుల్= పర్వాలను; రచియించెదన్= రచిస్తాను,

తాత్పర్యం: అందువలన - ఆంధ్రులందరూ మహాభారత మనే అమృతాన్ని చెవులనే దొప్పలతో తనివితీరా త్రాగి, ఆహ్లాదాన్ని పొందేటట్లుగా - వ్యాసమహర్షి భావనమనే సంపదయొక్క వైభవంతో నిండిన మనస్సుతో భారతపర్వాలను మహాకావ్యంలో ఉండదగిన ఉత్తమ కవిత్వంతో రచించవలెనన్న గొప్పదీక్షను పూని నియమంతో పద్యాలలోనూ గద్యాలలోనూ (అంటే చంపూ రచనగా) రచిస్తాను.

విశేషం: భారతాన్ని అమృతంగా రూపకం చేసి చెప్పటంలో దాని నిత్యత్వాన్నీ, ఆస్వాదనీయత్వాన్నీ, విశ్వజనీనత్వాన్నీ తిక్కన వ్యంగ్యంగా పేర్కొన్నాడు. దొప్పలవంటి చెవులతో ఆంధ్రులందరూ త్రాగేటట్లు వ్రాస్తానని తిక్కన ప్రతిజ్ఞ చేస్తున్నాడు. తన కవిత శ్రవణానందాన్ని కలిగిస్తుందనీ, చవులూరిస్తుందనీ, ఆలోచనామృతాన్ని అందిస్తుందనీ, పఠితలకు కావ్యానందాన్ని కలిగిస్తుందనీ ఈ రూపకాలంకార నిర్వహణంలోని సార్థక్యం. 'ఆంధ్రావళి మోదముంబొరయునట్లుగ' అని అనటంలో కావ్యం నిర్వహించవలసిన సామాజిక ప్రయోజనాలను (ఉపరంజన ఉపదేశాలను) తిక్కన సూచించాడు. 'జనమత కృష్ణద్వైపాయన మునివృషభాభిహిత మహాభారతబద్ధ నిరూపితార్థ మేర్పడఁ దెనుఁగున' రచించిన నన్నయ వలెనే తిక్కన కూడా వేదవ్యాసమహర్షియెడగల భక్తితోకూడిన తాత్పర్య భావనం చేత మహనీయ మైన బుద్ధితో భారతపర్వాలను రచించాలనుకొన్నాడు. ఆ రచనకు అనువైన మహాకవిత్వ దీక్షను చేపట్టాడు. విస్తృతమైన కావ్యాన్ని రసమయంగా, శిల్పసుందరంగా, అర్థగంభీరంగా, ఉదాత్తశైలిలో రచించే కవిత్వ రచనా ప్రవృత్తిని మహాకవిత్వ దీక్షావిధి అంటారు. తిక్కన మొదట నిర్వచన కావ్యం రచించి క్రొత్త ప్రయోగం చేశాడు. అది పండితుల మన్ననలను పొందింది కాని, 'ఆంధ్రావళి' ఆదరాన్ని పొందలేదు. అందువలన ఆంధ్రులందరి ఆదరాన్ని పొందాలని గద్యపద్యాత్మకమైన రచనను చేపట్టాడు. ఇది అంతకు పూర్వమే నన్నయ చూపిన మార్గం. (సంపా.)

వ. అని పూని యీదృశంబు లగు పుణ్యప్రబంధంబులు దేవసన్నిధిం బ్రశంసించుటయు నొక్క యారాధన విశేషం బగుటం జేసి. 31

ప్రతిపదార్థం: అని; పూని; ఈ దృశంబులు+అగు= ఇటువంటి; పుణ్యప్రబంధంబులు= పుణ్యగ్రంథాలు; దేవసన్నిధిన్= దేవుడి సమక్షంలో; ప్రశంసించుటయున్= బాగా చెప్పటం కూడా; ఒక్క+ఆరాధన విశేషంబు= ఒక ఆరాధన మార్గం; అగుటన్+చేసి= కావటం చేత.

తాత్పర్యం: నేను కవిత్వ దీక్ష వహించాను. ఈవిధంగా దైవసన్నిధిలో పుణ్యప్రబంధాలు చెప్పటం కూడా ఒక విశిష్టమైన ఆరాధన ఔతుంది.

విశేషం: శివాలయాలలో 'తేవారం' విష్ణ్వాలయాలలో 'నాలాయిరం' పఠించటం సంప్రదాయం. అంతేకాకుండా దేవాలయంలో 'పురాణాలు' చదవటం కూడా ఆనవాయితి. అందుచేత భారతం రచించి, వినిపించటం కూడ ఒక 'ఆరాధనావిశేషం'.

షష్ఠ్యంతములు

క. ఓంకార వాచ్యునకు, నన। హంకార నిరూఢ భావనారాధ్యునకున్,
హ్రీంకారమయ మనోజ్ఞా। లంకారోల్లాస నిత్యలాలిత్యునకున్. 32

ప్రతిపదార్థం: ఓంకార వాచ్యునకున్= 'ఓం' అనే శబ్దంచేత చెప్పబడే వానికి; అనహంకార నిరూఢభావనా= అహంకారం ఏ మాత్రమూ పాతుకొనని భావన చేత; ఆరాధ్యునకున్= ఆరాధించదగిన వానికి; హ్రీంకారమయ= హ్రీంకారరూపమయిన; మనోజ్ఞ= మనోహరమయిన; అలంకార= భూషణం యొక్క; ఉల్లాస= ప్రకాశం చేత; నిత్యలాలిత్యునకున్= ఎల్లప్పుడు సౌందర్యం కలవానికి.

తాత్పర్యం: ఓంకార మనే ప్రణవం చేత చెప్పబడేవాడున్నూ, అహంకారం లేని భావనకు అందేవాడున్నూ, హ్రీంకార రూపమయిన అలంకారంతో ప్రకాశించేవాడున్నూ అయిన హరిహరనాథుడికి.

విశేషం: భగవంతుడు ఓంకార స్వరూపుడు. ఓంకారంలో అ-ఉ-మ కారాలు ఉన్నాయి. ఇవి బ్రహ్మ విష్ణు మహేశ్వర వాచకాలు. ఈ వర్ణమే ప్రణవం. హరిహరనాథుడు ఓంకారవాచ్యుడు. అహంకార రహితులే స్వామిని గుర్తించగలరు. హ్రీంకారం పరమేశ్వరీ వాచకం. దీనికి మాయాబీజ మని, హృల్లేఖామంత్రమని సంకేతం కూడా. రూపరహితుడయిన పరమేశ్వరుడికి హ్రీంకారం వలన సుందరరూపం సిద్ధిస్తుంది. ఈ రూపం ఉపాసకులకు అవసరం.

క. త్రిభువన శుక దృఢపంజర। విభవ మహితునకు, సమస్త విష్టప నిర్మో
క భుజంగపతి, కఖిల జగ। ద భిన్న రూపునకు, భావనాతీతునకున్. 33

ప్రతిపదార్థం: త్రిభువన= మూడు లోకా లనే; శుక= చిలుకకు; దృఢ= గట్టిదైన; పంజర= పంజరము యొక్క; విభవ= ఐశ్వర్యశక్తిచేత; మహితునకున్= పూజితు డయినవానికి; సమస్త విష్టప= అన్ని లోకాలనే; నిర్మోక= కుబుసం కల; భుజంగపతికిన్= నాగరాజుకు; అఖిలజగత్+అభిన్నరూపునకున్= అన్ని లోకాల తోడను భేదము లేని రూపం కలవానికి; భావనా+అతీతునకున్= ఊహాకందనివానికి.

తాత్పర్యం: స్వర్గ మర్త్య పాతాళాలని మూడు లోకాలు, లేదా భూర్భువస్సువర్లోకాలని మూడు లోకాలు. ఈ త్రిలోకాలనే చిలుకకు సంరక్షకమైన గట్టి పంజరంవంటివాడు హరిహరనాథుడు. లోకాలు అనేవి పాముకుబుసం వంటివి కూడా. ఆ సమస్తలోకాలనే కుబుసాన్ని విడిచిన సర్పరాజు వంటివాడు హరిహరనాథుడు. సర్వలోకాలు ధరించిన వాడూ, సర్వలోక స్వరూపుడూ అయిన హరిహరనాథుడు ఊహలకు అందనివాడు. అటువంటివానికి.

విశేషం: అలం: రూపకం. శుకం పంజరస్థమయినా పంజరం కంటె శుకం భిన్నం. అట్లాగే కుబుసం పామును అంటిపెట్టుకొన్నా పాము వదలి వేయటంతో భిన్నమవుతుంది. మొదటిదానిని సుస్పష్ట భేదసంబంధంగా, రెండవదానిని అస్పష్ట భేద సంబంధంగా చెప్పవచ్చును. ముల్లోకాలు భిన్నం కాకపోయినా హరిహరనాథుడి కంటె 'భిన్నంగా' కనిపిస్తాయి.

క. శ్రుతి సీమంత మణికి, నా। శ్రిత వాంఛాపూర్తి కరణ చింతామణి, కా
నత దురిత తమో ద్యుమణికిఁ। గ్రతుభూషణమణికి, లోకరక్షా మణికిన్. 34

ప్రతిపదార్థం: శ్రుతి సీమంత మణికిన్= వేదాల పాపట అయిన ఉపనిషత్తులకు చివర చేర్చుక్కగా ప్రకాశించే రత్నమయిన వాడికి; ఆశ్రిత= తనను ఆశ్రయించిన భక్తజనుల; వాంఛాపూర్తికరణ= కోరికలను నెరవేర్చటంలో; చింతామణికి= చింతామణి అయిన వానికి; ఆనత= వినయవంతులయిన భక్తుల; దురిత తమోద్యుమణికిన్= పాపాలనే చీకటికి సూర్యుడయిన వానికి; క్రతు భూషణమణికిన్= యజ్ఞాలకు అలంకారంగా విలసిల్లే మాణిక్యమైన వానికి; లోకరక్షామణికిన్= లోకాలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా రక్షించే మణి అయిన వానికి.

తాత్పర్యం: వేదాల పాపట రత్నం అయిన వాడికి, ఆశ్రయించిన వారి కోర్కెలు తీర్చే చింతామణి అయిన వాడికీ, శరణు వేడిన భక్తుల పాపాలనే చీకట్లను పారద్రోలే సూర్యుడయిన వాడికీ, యజ్ఞాలకు తలమానిక మయినవాడికీ, లోకాలను రక్షించే శ్రేష్ఠుడికీ.

విశేషం: అలం: రూపకం. హరిహరనాథుడు వేదం అనే నాయికకు పాపట బొట్టు లాంటివాడు. ఆశ్రితుల కోరికలను తీర్చే చింతామణి. నమస్కరించిన వారి పాపాలనే చీకట్లను పోగొట్టే సూర్యుడు. యజ్ఞాలను ప్రకాశింప చేసేవాడు.

క. **పరమశమ నిరత సంయమి। వరమానస కుముదహాస వర్ధన చంచ**
చ్చరణ నఖ చంద్రికా వి। స్ఫురణా చిత్రప్రకార శోభాఢ్యునకున్. **35**

ప్రతిపదార్థం: పరమశమ= ఉత్తమ శాంతియందు; నిరత= ఆసక్తులయిన; సంయమివర= యోగీశ్వరుల; మానస= మనస్సు లనెడి; కుముద= కలువ పూవులయొక్క; హాస= వికాసాన్ని; వర్ధన= పెంపొందించే; చంచత్= ప్రకాశించే; చరణ= పాదాల యందలి; నఖ= గోళ్ళయొక్క తెల్లదనమనే; చంద్రికా= వెన్నెలకు సంబంధించిన; విస్ఫురణా= ప్రకాశం యొక్క; చిత్ర ప్రకార= అనేక విధాలయిన; శోభా= సొంపులతో; ఆఢ్యునకున్= కూడిఉన్న గొప్పవాడికి.

తాత్పర్యం: పరమశాంతులయిన మహర్షుల మనస్సులనే కలువపూలకు వికాసాన్ని కలిగించే కాళ్ళ గోళ్ళ తెల్లని కాంతులనే వెన్నెల వెలుగుల సొంపులతో కూడిన వాడికి.

విశేషం: మునులు పరమశాంతులు. వారి మనస్సులు కలువల వంటివి. ఆ కలువల వికాసానికి హరిహరనాథుడి గోళ్ళ చంద్రకాంతులు సహకరిస్తున్నాయి. అంటే మునుల మనస్సులు భగవచ్చరణాలపై వ్రాలి శరణాగతిని పొందగా భగవంతుడు కరుణించి వారిని కృతార్థులను చేస్తాడని భావం. 'శమం' అంటే అంతరింద్రియ నిగ్రహం. మనస్సును విషయాలపట్ల ఆసక్తం కాకుండా నిగ్రహించటం. శాంతిని తాత్కాలికంగా కాకుండా స్థిరంగా నిలపటమే పరమశమం.

క. **హరిహరనాథునకు, మరు। త్సరిదాకల్పిత మనోజ్ఞ చరణ శిరస్సుం**
దరమూర్తికి, భావనత। త్పర చేతో యుక్త భక్తపరతంత్రునకున్. **36**

ప్రతిపదార్థం: మరుత్= దేవతల; సరిత్= నది అయిన మందాకిని చేత; ఆకల్పిత= అలంకరింపబడిన; మనోజ్ఞ= మనోహరమయిన; చరణ= పాదాలూ; శిరస్= మూర్ధమూ కల; సుందరమూర్తికిన్= అందమైన స్వరూపం కలవాడికి; భావన= ధ్యానంలో; తత్పర= ఆసక్తమయిన; చేతస్= మనస్సుతో; యుక్త= కూడిన; భక్త= భక్తులకు; పరతంత్రునకున్= వశుడయిన వానికి.

తాత్పర్యం: దేవగంగ చేత అలంకరించబడిన అందమైన పాదాలూ, శిరస్సూ కల సుందరమూర్తికీ, ధ్యానంలో నిమగ్నమయిన మనస్సు కల భక్తజనులకు వశుడై ఉండే వాడికి.

విశేషం: గంగానది విష్ణుపాదంలో పుట్టిందని, ఆ నదిని శివుడు జటాజూటంలో బంధించాడని ఐతిహ్యం. అయితే హరిహరనాథుడు సమన్వితమూర్తి. అందువలన గంగ హరిహరనాథుడి పాదాలనూ శిరస్సునూ ఒకేసారి అలంకరించింది. దానివలన సుందరస్వరూపుడై నాడు. అటువంటి అపూర్వ సౌందర్యతత్త్వ స్వరూపాన్ని భావించే భక్తులకూ జ్ఞానులకూ ఆ దేవదేవుడు సదా అధీనుడై ఉంటాడు. అంటే హరిహరనాథుడు భక్తపరాధీనుడని భావం.

భగవంతుడిని పాదాలనుండి శిరస్సు దాకా ఆరాధించటం సంప్రదాయం. భక్తులు పాదాలను సేవిస్తారు. శిరస్సును దర్శించి తన్మయులౌతారు. ఇవి భావనకు సంబంధించిన అంశాలు. ఈ భావనలో ఆత్మసంతృప్తి, తన్మయత్వం రెండూ దక్కుతాయి.

కథా ప్రారంభము (సం.4-1-1)

వ. ఏను విన్నపంబు సేయు తెఱంగుగా నంతస్సన్నిధిం గలిగించుకొని యమ్మహాకావ్యంబు నర్థంబు సంగతంబు చేసెద. 37

ప్రతిపదార్థం: ఏను= నేను (తిక్కన); విన్నపంబు+చేయుతెఱంగుగాన్= విన్నవిస్తున్నట్టుగా; అంతస్సన్నిధిన్+కలిగించుకొని= హృదయంలో సాకారంగా ప్రత్యక్షంగా సామీప్యాన్ని కలిగించుకొని; ఆ+మహాకావ్యంబు= కావ్యరూపమైన ఆ మహాభారత ఇతిహాసం యొక్క; అర్థంబు= తాత్పర్యాన్ని, తత్త్వాన్ని, ప్రయోజనాన్ని; సంగతంబు చేసెదన్= స్పష్టం చేస్తాను.

తాత్పర్యం: హరిహరనాథుడికి నేను స్వయంగా విన్నవిస్తున్నట్లు మనస్సులో సాన్నిధ్యం కలిగించుకొన్నాను. కావ్య స్వరూప మహాభారతేతిహాసంలోని తాత్పర్యాన్నీ, తత్త్వాన్నీ, ప్రయోజనాన్నీ స్పష్టం చేస్తాను.

క. శరణాగత సంశ్రిత భయ । హరణా! సురనికర శేఖరానర్ఘమణి
స్ఫురణా పరిచయ రంజిత । చరణా! వనమాలికా భుజంగాభరణా! 38

ప్రతిపదార్థం: శరణ+ఆగత= నీవే 'శరణు' అంటూ 'శరణు' పొందిన; సంశ్రిత= ఆశ్రితులయొక్క; భయహరణా!= భయాన్ని పోగొట్టేవాడా!; సురనికర= దేవతల సముదాయంయొక్క; శేఖర= శిరస్సుల మీద ఉన్న భూషణాలలోని; అనర్ఘమణి= అమూల్యమయిన మణులయొక్క; స్ఫురణా= కాంతులయొక్క; పరిచయ= సంబంధం చేత; రంజిత= ఎఱ్ఱబడిన; చరణా!= పాదాలు కలవాడా!; వనమాలికా= వనమాలనూ; భుజంగ= పామునూ; ఆభరణా!= ఆభరణాలుగా కలవాడా!

తాత్పర్యం: శరణు కోరి ఆశ్రయించిన వారల భయాన్ని పోగొట్టేవాడా! ఇంద్రాది దేవతలు నమస్కరించగా వారి శిరోభూషణాల (కిరీటాల) కాంతులచేత మిగుల ప్రకాశించే పాదాలు కలవాడా! వనమాలికనూ, పామునూ ఆభరణాలుగా కలవాడా! ఓ హరిహరనాథా!

విశేషం: అలం: క్రమం. ఈ పద్యంలో మూడు సంబోధనలున్నాయి. మొదటి రెండూ హరి కయినా హరుడి కయినా సమానమే. కాని, మూడవది హరిహరనాథుడికే. వనమాల ఆభరణంగా కలవాడు విష్ణువు. పామును ఆభరణంగా కలవాడు శివుడు. ఈ రెండూ కలవాడు హరిహరనాథుడు.

క. అజగవ శార్ఙ్గాలంకృత! । భుజగర్వ నిరస్తదైత్య! భూమస్తుత్యా!
త్రిజగద్ధారణ నిత్యా! । భుజగ సమాచరిత శయన భూషణ కృత్యా! 39

ప్రతిపదార్థం: అజగవ= అజగవం (అనే పేరు గల ధనుస్సు) చేతనూ; 'శార్ఙ్గం= శార్ఙ్గం (ధనుస్సు పేరు) చేతనూ; అలంకృత!= అలంకరించబడినవాడా!; భుజ= భుజాలయొక్క; గర్వ= గర్వంచేత; నిరస్త= తొలగించివేయబడిన; దైత్యా!= రాక్షసులుకలవాడా!; భూమస్తుత్యా!= ఎన్నో విధాలుగా, సర్వాతిశయత్వం చేత స్తుతింపదగిన వాడా!; త్రిజగత్+ధారణ నిత్యా!= మూడు లోకాలనూ ధరించటంలో శాశ్వతుడవు అయిన వాడా!; భుజగ= పాముచేత; సమాచరిత= ఆచరించబడిన; శయన (కృత్యా)= శయనంగాను; భూషణకృత్యా!= భూషణంగాను చేసికొనిన వాడా!

తాత్పర్యం: అజగవం, శార్ఙ్గం అనే ధనుస్సులు ధరించి శత్రు సంహారం చేసినవాడా! ముల్లోకాలకు ఆధార భూతుడవైన నిత్యుడా! అనేక విధాలుగా సర్వాతిశయుడిగా కీర్తింపదగిన సుప్రసిద్ధుడా! సర్పాన్ని శయ్యగానూ (హరి), (హరుడు) ఆభరణంగానూ చేసికొనిన మహనీయా! హరిహరనాథా!

విశేషం: అలం: క్రమం. శివుని వింటికి 'అజగవం' అని పేరు. దానికే పినాకం అని మరో పేరు కూడా ఉన్నది. విష్ణుమూర్తి వింటికి 'శార్ఙ్గం' అని పేరు. శయనం ఆధార మయితే భూషణం సహస్రారమౌతుంది. కుండలినీ శక్తి భుజగరూపంలో ఉంటుందని యోగశాస్త్రం. కుండలినీయోగం ద్వారా హరిహరనాథ తత్త్వానుభూతిని పొందవచ్చునని తాత్పర్యం.

క. జలనిధి హిమవద్భూధర। కలిత జనన కేళికౌతుక వ్యక్తా వ్య
క్త లలిత సౌందర్య స్ఫుర। దలఘుతను స్త్రీ సనాథ! హరిహరనాథా! 40

ప్రతిపదార్థం: జలనిధి= సముద్రం నుండి; హిమవద్భూధర= హిమవత్పర్వతం నుండి; కలిత= కలిగిన; జనన= జన్మమనే; కేళికౌతుక= క్రీడా కుతూహలం చేత; వ్యక్త+అవ్యక్త= స్పష్టమూ అస్పష్టమూ ఐన - అంటే స్పష్టాస్పష్టమైన; లలిత సౌందర్య= మనోహరమయిన సౌందర్యంతో; స్ఫురత్= ప్రకాశించే; అలఘుతను= ఉత్తమ శరీరం గల; స్త్రీ సనాథ= అంగనతో కూడిన వాడా! హరిహరనాథా!

తాత్పర్యం: అటు క్షీర సముద్రానికీ, ఇటు హిమవత్పర్వతానికీ పుట్టి లీలగా ధరించిన దివ్యవేషంతో, వ్యక్తావ్యక్తమైన కోమల సౌందర్య స్ఫూర్తితో ప్రకాశించే స్త్రీమూర్తికి నాథుడవైనవాడా! హరిహరనాథా!

విశేషం: అలం: క్రమం. హరిహరనాథుడి భార్యకు రెండు పేర్లు. అవి లక్ష్మి, పార్వతి అని, కాని, ఆమె ఆకృతి ఒక్కటే. అయితే లోకంలో లక్ష్మి పాలమున్నీటిలో పుట్టిందనీ, గౌరి హిమవంతుడి కూతురనీ ప్రసిద్ధి ఉన్నది. ఒకరికి రెండు పుట్టుకలు, ఇద్దరు తండ్రులు ఎట్లా ఉంటారు? ఇది లోక విరుద్ధం. అందువలన ఆ పుట్టుకలు ఆమె లీలలుగా తిక్కన కీర్తించాడు. ఆమె తత్త్వతః మూల ప్రకృతి అయిన మాయ. ఆమె పరమేశ్వరుడిని ఆశ్రయించుకొని ఉన్నప్పుడు అవ్యక్తరూపిణి, (ప్రత్యేకంగా తెలియబడని రూపం కలది అని భావం.) పరమేశ్వరుడు సృష్టిని నిర్వహించేటప్పుడు ఆ మూలప్రకృతిని ఆధారంగా చేసికొని సృష్టికార్యాన్ని చేస్తాడు. అప్పుడామె ఇరవైమూడు తత్త్వాలుగా వ్యక్తమౌతుంది. ఆ తత్త్వాలు ఇవి - మహత్తత్త్వం, అహంకారం, పంచతన్మాత్రలు, పంచమహాభూతాలు, అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కరణేంద్రియాలు, మనస్సు. **"త్రయోవింశతి తత్త్వాని వ్యక్త శబ్దేన సూరయః। వదన్త్యవ్యక్త శబ్దేన ప్రకృతించ పరాంతథా" అని బ్రహ్మాండపురాణం.** ఆమె శరీరం అలఘువు అనటం చేత విశ్వవ్యాప్తమైన ఆమె తత్త్వం అవ్యక్త సుందరమనీ, ప్రకృతియొక్క పరమసౌందర్యం ఆమె యొక్క వ్యక్త సౌందర్యమనీ, హరిహరనాథుడిలో ప్రతిఫలించిన ఆ మహామాయ అనే స్త్రీ వ్యక్తావ్యక్తమైన సౌందర్య స్ఫూర్తి కలిగినదనీ తిక్కన తత్త్వసుందరంగా అభివర్ణించాడు. పై రెండు పద్యాలూ ఆశ్వాసారంభ పద్యాలు. కృతిపతిని వినుమని సంబోధిస్తూ చెప్పేవి. అందువలననే ఇవి సంబుద్ధ్యంతాలుగా ఉన్నాయి. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. దేవా, దివ్య చిత్తంబున నవధరింపుము. 41

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; దివ్యచిత్తంబునన్= దివ్యమయిన మనస్సుతో; అవధరింపుము= చిత్తగింపుము.

తాత్పర్యం: హరిహరనాథా! నీ మహిమాన్వితమైన మనస్సుతో వినుము.

విశేషం: 'అవధరింపుము' అనటంలో ఆంతర్యం గ్రహించవలసిందిగా విన్నపం. దివ్యచిత్త మనటంలో 'నీవే పలికించే ఈ పలుకులను నీ మహిమలుగానే గ్రహించు' మని ఆంతర్యం. తిక్కన సమయం దొరికినప్పుడెల్లా తన వాక్యాలలో హరిహరనాథుడి పట్ల తనకు గల భక్తిని సార్థకములైన విశేషణ విశేష్యాలతో ప్రకటిస్తూ ఉంటాడు.

ఆ. కథ జగత్ప్రసిద్ధి గావునఁ బూర్వ ప । ర్వార్థ యుక్తి చేయునట్టి యెడల
యత్న మించుకంత యయినను వలవదు । వలసినట్లు చెప్పవచ్చి యుండు. 42

ప్రతిపదార్థం: కథ= భారతకథ; జగత్ప్రసిద్ధి= లోక ప్రసిద్ధి కలది; కావునన్= కాబట్టి; పూర్వపర్వ+అర్థయుక్తి= వెనుకటి పర్వాల అర్థాన్ని సమకూర్చటం; చేయు+అట్టి+ఎడలన్= చేసే సందర్భాలలో; యత్నము= ప్రయత్నం; ఇంచుక+అంత+అయినను= ఏకొద్ది పాటి అయినా; వలవదు= అక్కరలేదు; వలసిన+అట్లు= అవసరమైనట్లు; చెప్పన్+వచ్చి+ఉండు= చెప్పటానికి వీలుగా ఉంటుంది.

తాత్పర్యం: మహాభారతకథ లోకంలో ప్రసిద్ధమై ఉండటంచేత జరిగిన కథను, జరగబోయే కథను జోడించే సందర్భాలలో ఎటువంటి ప్రత్యేక ప్రయత్నం అక్కర లేకుండానే ఎక్కడనుండైనా మొదలుపెట్టవచ్చును.

విశేషం: పూర్వాపరకథార్థ సమన్వయం మహాకావ్యాలలో, ఇతిహాసాలలో పాటించే కథాకథన శిల్పం. దానిని తిక్కన ఇక్కడ సూచించాడు. 'కథ జగత్ప్రసిద్ధ' అనే పాఠాంతరానికి కథ జగత్తునందు ప్రసిద్ధమైనది-అని అర్థం చెప్పవచ్చును.

వ. మహాభారతంబు సమస్త దురితాపహంబును, నభిమత శుభావహంబును, నశుభ హరణంబునుం గావున నొక్క మహాఫలంబు గోరి జనమేజయుండు కృష్ణద్వైపాయన మహాముని కారుణ్యంబు వడసి, తదీయ ప్రియశిష్యుం డైన వైశంపాయను వలన వినిన కథ యగుటం జేసి తత్ప్రకారంబు నడపెద; నది యె ట్లనినం బరమ పవిత్రు లగు పాండుపుత్త్రుల చరిత్రం బుపాఖ్యాన సహితంబుగా వ్యాఖ్యానంబు సేయుచుండ వారల వనవాస సమ్యగనుష్ఠానంబు సవిస్తరంబుగా విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 43

ప్రతిపదార్థం: మహాభారతంబు; సమస్త, దురిత+అపహంబును= అన్ని పాపాలనూ తొలగించేదీ; అభిమత, శుభ+ఆవహంబును= కోరుకొన్న శుభాలను కలిగించేదీ; అశుభ హరణంబునున్= మంగళకరాలు కాని వాటిని నశింపచేసేదీ కూడా; కావునన్= కాబట్టి; ఒక్క మహత్+ఫలంబు= ఒక గొప్ప ఫలితాన్ని - అంటే మోక్షాన్ని; కోరి= ఆశించి; జనమేజయుండు; కృష్ణద్వైపాయన మహత్+ముని= వ్యాసమహర్షియొక్క; కారుణ్యంబు+పడసి= దయను పొంది; తదీయ, ప్రియ, శిష్యుండు+ఐన= అతని (వ్యాసుని) మనసు కెక్కిన శిష్యుడైన; వైశంపాయను వలన; వినిన; కథ; అగుటన్+చేసి; తద్+ప్రకారంబు= ఆ విధంగా; నడపెదన్= కథను నడుపుతాను; అది= ఆ కథయొక్క క్రమం; ఎట్లు+అనినన్= ఏవిధంగా ఉంటుందంటే; పరమ, పవిత్రులు+అగు= ఎంతో నిర్మలమైన శీలం కలిగిన, చరిత్రకలవారైన; పాండుపుత్త్రుల, చరిత్రంబు= పాండవుల కథను; ఉప+ఆఖ్యాన సహితంబుగా= ఉపకథలతో కలిసినదిగా;

వ్యాఖ్యానంబు= వివరించటం; చేయుచున్+ఉండన్; వారల= పాండవుల యొక్క; వనవాస, సమ్యక్+అనుష్ఠానంబు= వనవాసవ్రతాన్ని సముచితంగా ఆచరించటం (నిర్వహించటం); సవిస్తరంబు+కాన్= విశదంగా; విని; జనమేజయుండు; వైశంపాయనునకున్= వైశంపాయనునికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: మహాభారతం పాపాలన్నింటిని పోగొట్టేది. కోరిన శుభాలను కలిగించేది. అమంగళాలను తొలగించేది. కాబట్టి ఒక మహాఫలాన్ని (మోక్షాన్ని) ఆశించి జనమేజయుడు వ్యాసమహర్షి దయనుపొంది, భారతం ఆతడి ప్రియశిష్యుడగు వైశంపాయనుడు చెప్పగా వినిన కథ కావటం చేత, ఆ పద్ధతి ననుసరించి కథను నడుపుతాను. అది ఎట్లాగంటే వినండి! ఎంతో నిర్మలమైన శీలంగల పాండవుల చరిత్రను ఉపాఖ్యానాలతో జతకలిపి వివరిస్తూ ఉండగా పాండవులు వనవాసవ్రతాన్ని సముచితంగా సాగించిన విధాన్ని విస్తారంగా విని, జనమేజయుడు వైశంపాయనుడితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: వ్యాసుడు రచించిన జయకావ్యాన్ని వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పాడు. ఆ చెప్పేటప్పుడు జనమేజయుడికి కలిగిన అనుమానాలను తీర్చటానికి అనేక ఉపాఖ్యానాలను, అంశాలను చేర్చి చెప్పి వ్యాస తాత్పర్యానికి వ్యాఖ్యానం చేశాడు. ఆ అంశాలన్నీ కలిసి జయకావ్యం భారతంగా రూపొందింది. (సంపా.)

చ. **"మహిత సముజ్జ్వలాకృతులు, మానధనుల్, జనమాన్యు లంగనా**
సహితము గాఁగ నేమిగతి సమ్యగుపాయ నిగూఢ వృత్తిమై
నహితుల కప్రభేద్యముగ నా పదుమూఁడగు నేఁడు మత్పితా
మహులు చరించి? రంతయుఁ గ్రమంబున నా కెఱుఁగంగఁ జెప్పుమా." **44**

ప్రతిపదార్థం: మహిత= గొప్పవయిన; సముజ్జ్వల+ఆకృతులు= ప్రకాశవంతమయిన ఆకారాలు కలవారూ; మానధనుల్= అభిమానమే సంపదగా కలవారూ; జనమాన్యులు= ప్రజలచేత గౌరవించ దగినవారూ అయినటువంటి; మత్+పితామహులు= నా తాతలు; అంగనా సహితము+కాఁగన్= స్త్రీ అయిన ద్రౌపదితో సహా; ఏమిగతిన్= ఏవిధంగా; సమ్యక్= చక్కని; ఉపాయ= ఉపాయంతో కూడిన; నిగూఢ= చాల రహస్యమయిన; వృత్తిమైన్= ప్రవర్తనతో; అహితులకున్= విరోధులకు; అప్రభేద్యముగన్= భేదించటానికి ఏ మాత్రమూ వీలుకాకుండా; ఆ పదుమూఁడు+అగు+ఏఁడు= అరణ్యవాసానంతరం చేయవలసిన అజ్ఞాతవాసమయిన పదమూడవ సంవత్సరాన్ని; చరించిరి= గడిపారు? అంతయున్= ఆ వృత్తాంతమంతా; క్రమంబునన్= వరుసగా; నాకున్= నాకు; ఎఱుఁగంగన్= తెలిసేవిధంగా; చెప్పుమా= చెప్పుము.

తాత్పర్యం: 'మా తాతలయిన పాండవులు స్ఫురద్రూపులు, అభిమానధనులు, ప్రజల గౌరవాలను అందుకొన్నవారు. అటువంటి పాండవులు ద్రౌపదితో కలిసి అజ్ఞాతవాసకాలాన్ని బయటపెట్టదలచే విరోధులకు అసాధ్యంగా అతిరహస్యంగా చాతుర్యంతో ఎట్లా గడిపారో చెప్పండి.'

విశేషం: ఆకారాన్ని బట్టి ఒక మనిషిని సులభంగా గుర్తించవచ్చును. ప్రకాశవంతమైన స్ఫురద్రూపాలు గల పాండవులు తమను గోప్యంగా ఉంచుకొనటం దుర్లభం. అజ్ఞాతవాసంలో పాండవులు తమ రాజసాన్ని, తేజస్వితను ఎట్లా దాచుకొన్నారు? అన్నది ఆశ్చర్యకరమైన మొదటి ప్రశ్న. అట్లాగే అభిమానధనులు ఒకరికి లొంగి బ్రతుకలేరు. ఇతరుల తిరస్కారాన్ని సహించలేరు. అటువంటి వారు ఎన్నడూ బయటపడకుండా ఎట్లా ఒదిగి నివసించగలిగారు? అన్నది రెండో ప్రశ్న. అంతేగాకుండా ఐదుగురు ఒక అంగనతో ప్రచ్ఛన్న జీవితం గడపటం అసాధ్యం. అయిదుగురు భర్తలు, ఒక భార్య ఒకచోటే కలిసి ఉంటే బయటపడటం, ఇతరులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గుర్తించటం సులభం. అందుచేత పాండవులు అజ్ఞాతవాసాన్ని ఎట్లా గడిపారన్నది కుతూహలమయిన ప్రశ్నే అవుతుంది. పాండవులు గడిపిన అజ్ఞాతవాసంలో వారిని పరీక్షకు గురిచేసిన సన్నివేశాలుగల విరాటపర్వంలో అంశాలు గమనించ తగినవని కావ్యకథాశిల్ప మర్మాన్ని తిక్కన సూచిస్తున్నాడు.

క. అని యడిగిన వైశంపా౹ యనుఁ డమ్మనుజేంద్రచంద్రు నధి కౌత్సుక్యం
బున కలిమికిఁ దన హృదయం౹ బున గాఢాదరము భరితముగ ని ట్లనియెన్. 45

ప్రతిపదార్థం: అని+అడిగినన్= అని అడుగగానే; వైశంపాయనుఁడు; ఆ+మనుజ+ఇంద్ర చంద్రున్= ఆ రాజోత్తమునియొక్క; అధిక+ఔత్సుక్యంబున కలిమికిన్= ఎక్కువ కుతూహలంయొక్క ఉనికికి; తన= తనయొక్క; హృదయంబునన్= మనసులో; గాఢ+ఆదరము= దృఢమయిన ఆదరం; భరితము+కన్= నిండగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని జనమేజయుడు తన కుతూహలాన్ని ప్రకటించగానే వైశంపాయనుడు అధికమైన ఆదరంతో ఈ విధంగా అన్నాడు.

వ. పాండవులు వనవాసంబు సముచితంబుగా సలిపి, పండ్రెండగు నేఁటి కడపటఁ దమకు ధర్మదేవతా సమాగమం బయినం, దత్ప్రసాదంబున నజ్ఞాతవాస సమయంబునకు భంగంబు గాకుండ వరంబు వడసి, యంతకుమున్ను తమ వెనుక నడవులం దిరుగుచు నగ్నిహోత్రంబులఁ దోడన కొని వర్తిల్లు భూసురోత్తములు దమ్ముం బరివేష్టించి యుండఁ దారనుష్ఠింపం బూనిన పని వారల కెఱింగింపం దలంచి కర (కమల)ంబులు మొగిచి సవినయంబుగా ని ట్లనిరి. 46

ప్రతిపదార్థం: పాండవులు= ధర్మరాజాదులు; వనవాసంబున్= అరణ్యవాసాన్ని; సముచితంబుగాన్= తగినవిధంగా; సలిపి= పూర్తిచేసి; పండ్రెండు+అగు+ఏఁటి+కడపటన్= పన్నెండవ సంవత్సరం చివర; తమకున్= తమకు; ధర్మదేవతా సమాగమంబు= యమధర్మరాజుతో కలయిక; అయినన్= కాగా; తద్+ప్రసాదంబునన్= ఆయన అనుగ్రహంచేత; అజ్ఞాతవాస సమయంబునకున్= పదమూడవ సంవత్సరమయిన అజ్ఞాతవాస కాలానికి; భంగంబు+కాకుండన్= విఘ్నం కలుగకుండా; వరంబు+పడసి= వరం పొంది; అంతకుమున్ను= అంతకుముందు అరణ్యవాసంలో; తమ వెనుకన్= తమతో బాటు ఉంటూ; అడవులన్+తిరుగుచున్= అరణ్యాలలో తిరుగుతూ; అగ్నిహోత్రంబులన్= నిత్యమూ తాము ఉపాసించే అగ్నిహోత్రాలను; తోడన్+అ, కొని= వెంటపెట్టుకొని; వర్తిల్లు= ప్రకాశించే; భూసుర+ఉత్తములు= బ్రాహ్మణశ్రేష్ఠులు; తమ్మున్= తమను (పాండవులను); పరివేష్టించి+ఉండన్= చుట్టి ఉండగా; తారు= తాము; అనుష్ఠింపన్+పూనిన= చేయదలచిన; పని= కర్తవ్యాన్ని; వారలకున్= బ్రాహ్మణులకు; ఎఱింగింపన్+తలంచి= తెలియజేయాలని భావించి; కర(కమలం)ంబులు= పద్మాలవంటి చేతులను; మొగిచి= జోడించి; సవినయంబుగాన్= వినయంతో; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: పాండవులు అరణ్యవాసం పూర్తి చేశారు. ఆ అరణ్యవాసం చివర యమధర్మరాజు (యక్షప్రశ్నల ఘట్టంలో) ప్రత్యక్షమైనాడు. 'అజ్ఞాతవాసంలో ఎటువంటి ఇబ్బందులు రా' వని పాండవులకు వరం ఇచ్చాడు. అగ్నిహోత్రాలతో తమతో పాటు అడవులలో ఉంటూ ఉన్న బ్రాహ్మణులు చుట్టూ కూర్చొని ఉండగా వారికి తాము చేయబోయే 'అజ్ఞాతవాసం' గురించి చెప్పాలని పాండవు లనుకొన్నారు. అందువలన బ్రాహ్మణులకు వినయంతో చేతులు జోడించి ఈ విధంగా అన్నారు.

సీ. 'తెల్లంబు గాదె మీ కెల్ల సుయోధను। చేసిన కుటిల విచేష్టితంబు

లకట! మాతో మీరు నడవుల నిడుమలఁ। బొందితి; రొకభంగిఁ బోయెఁ గాల;

మిది పదుమూఁ డగు నేఁడు మా కజ్ఞాత। వాసంబు సలుపంగ వలయు; నిందు

ధార్తరాష్ట్రులు సూతతనయ సౌబలులును। జెఱుపన వేతురు; చిన్నసన్న

ఆ. యెఱిఁగి రేనిఁ జాలనెగ్గు వాటిల్లు, న। ట్లగుట మమ్ము నింక నతి రహస్య

వృత్తిమై నిరస్తవిఘ్నుల రై చరి। యింపుఁ డని యనుగ్రహింపవలయు.' 47

ప్రతిపదార్థం: సుయోధను చేసిన= దుర్యోధనుడు చేసినటువంటి; కుటిల విచేష్టితంబులు= వంచనతో కూడిన దుష్టతంత్రాలు; మీకున్+ఎల్లన్= మీకందరికి; తెల్లంబు+కాదె= తెలుసుకదా; అకట; మాతోన్= ప్రతిజ్ఞాపాలనం కొరకు సిద్ధమయిన మాతో; మీరును= అవ్యాజ అభిమానంతో అనుసరించిన మీరు కూడా; అడవులన్= అరణ్యాలలో; ఇడుమలన్+పొందితిరి= కష్టాల పాలయ్యారు; కాలము+ఒకభంగిన్+పోయెన్= ఏదో ఒక రకంగా కాలం గడిచిపోయింది; ఇది పదుమూఁడు+అగు+ఏఁడు= అజ్ఞాతవాసం పూర్తి చేసికొనవలసిన పదమూడవ సంవత్సరం ఇది; మాకున్= ప్రతిజ్ఞ ప్రకారం నడచుకొనవలసిన మాకు; అజ్ఞాతవాసంబు= ఎవరూ గుర్తించకుండా రహస్యంగా నివసించటం; సలుపంగవలయున్= పూర్తిచేయవలసిన అవసరమున్నది; ఇందున్= ఈ అజ్ఞాతవాసకాలంలో; ధార్తరాష్ట్రులు= కౌరవులు; సూతతనయ సౌబలులును= కర్ణుడు, శకునియు; చెఱుపన్+అ+వేతురు= భంగం చేయడానికే చూస్తారు (ప్రయత్నిస్తారు); చిన్నసన్న= చిన్న గుర్తు; ఎఱిఁగిరి+ఏని= తెలుసుకున్నట్లయితే; చాలన్+ఎగ్గు= మిక్కిలి కీడు; పాటిల్లున్= కల్గుతుంది; అట్లు+అగుటన్= అందుచేత; మమ్మున్= మమ్మల్ని; ఇంకన్= ఇకమీద; అతిరహస్య వృత్తిమైన్= మిగుల నిగూఢమయిన ప్రవర్తనతో; నిరస్త విఘ్నులరు+ఐ= పోయిన ఆటంకములు కలవారై - ఎటువంటి ఆటంకాలు లేనివారయి; చరియింపుఁడు+అని= అజ్ఞాతవాస కాలం గడపండి అని; అనుగ్రహింపవలయున్= అనుగ్రహించాలి.

తాత్పర్యం: 'బ్రాహ్మణోత్తములారా! దుర్యోధనుడు చేసిన దుష్టతంత్రాలు మీకు తెలుసుకదా! మామీది ఆదరంతో మాతో పాటు మీరంతా అరణ్యాలలో చాల కష్టాలు అనుభవించారు. పన్నెండు సంవత్సరాల కాలం ఏదో ఒకవిధంగా గడిచిపోయింది. ఇది పదమూడవ సంవత్సరం. మేము అజ్ఞాతవాసం పూర్తి చేసికొనవలసిన సంవత్సరం. దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని మొదలయిన వారంతా ఏవిధంగానైనా మా అజ్ఞాతవాసం చెడగొట్టటానికే తప్పక ప్రయత్నిస్తారు. ఏదయినా చిన్న 'ఆచూకి' దొరికితే చాలు. మాకు కష్టాలు తప్పవు. అందుచేత 'అజ్ఞాతవాసం' ఎటువంటి అడ్డంకులు లేకుండా సాగేటట్లు ఆశీర్వదించండి.'

వ. అని చెప్పి; రట్టి సమయంబున ధర్మనందనుండు విషణ్ణహృదయుండై. 48

తాత్పర్యం: అని చెప్పారు. ఆ సమయంలో ధర్మరాజు విచార హృదయంతో (ఇట్లాఅన్నాడు).

క. 'ఒకనాఁ డేమును నాపద। లకు విడుమరఁ గాంచి విప్రులం జుట్టలఁ బె

ట్టుకొని సుఖముండఁ బడయుదు। మొకొ! యిప్పా టెందుఁ గలదె యొరు లెవ్వరికిన్?' 49

ప్రతిపదార్థం: ఒకనాఁడు= ఏదో ఒకరోజున; ఏమునున్= మేము కూడా; ఆపదలకున్= ఆపదల నుండి; విడుమరన్+కాంచి= విడుదల పొంది; విప్రులన్= బ్రాహ్మణులను; చుట్టలన్= చుట్టాలను; పెట్టుకొని= దగ్గర ఉంచుకొని; సుఖము+ఉండన్= సుఖంగా

జీవితం గడపట మనే (అదృష్టం); పడయుదుముు+ఒకొ!= పొందుతామా!; ఒరులు+ఎవ్వరికిన్= ఇతరులెవ్వరికయినా; ఈ+పాటు= ఇటువంటి అరణ్యవాస అజ్ఞాతవాసాల వలని కష్టం; ఎందున్= ఎక్కడయినా; కలదె?= ఉన్నదా? (లేదని భావం).

తాత్పర్యం: 'బ్రాహ్మణులారా! మేము ఆపదల బారినుండి ఏనాటికైనా గట్టెక్కుతామా? మీ వంటి బ్రాహ్మణులు, చుట్టాలు అందరూ మా చుట్టూ గుమికూడి ఉండగా సుఖంగా జీవితం గడుపుతామా? ఇటువంటి కష్టం ఇంకెవరికయినా ఎన్నడైనా కలిగిందా?'

వ. అని డగ్గుత్తిక వెట్టి దుఃఖ పరవశుం డగుటయు, నమ్మహీసురవరులుం దమ్ములు నతని నాశ్వాసించుచుండఁ దత్పార్శ్వంబున నున్న ధౌమ్యుండు తదీయ విషాదాపనోదంబు సేయం దలంచి యి ట్లనియె. 50

ప్రతిపదార్థం: అని= తన బాధలను వారితో చెప్పుకొని; డగ్గుత్తిక+పెట్టి= గద్గదస్వరంతో; దుఃఖపరవశుండు+అగుటయున్= దుఃఖం కారణంగా వశం తప్పిన వాడు కాగా; ఆ+మహీసుర వరులున్+తమ్ములున్= ఆ బ్రాహ్మణులూ, తమ్ములూ కూడా; అతనిన్= ఆ ధర్మరాజును; ఆశ్వాసించుచున్+ఉండన్= ఓదారుస్తుండగా; తత్+పార్శ్వంబునన్+ఉన్న= ఆ బ్రాహ్మణుల ప్రక్కనున్న; ధౌమ్యుండు= పురోహితుడయిన ధౌమ్యుడు; తదీయ= ధర్మరాజుయొక్క; విషాద+అపనోదంబు+చేయన్+తలంచి= విచారం పోగొట్టాలని తలంచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు దుఃఖపరవశుడైనాడు. అందుచేత అతడి గొంతు దుఃఖ తీవ్రతకు గాద్గద్యంతో జీరవోయింది. ఆ స్థితిని గమనించి చుట్టూ ఉన్న బ్రాహ్మణులూ, తమ్ములూ అతడిని ఓదార్చసాగారు. అప్పుడు ప్రక్కనే ఉన్న ధౌమ్యుడు ధర్మరాజుయొక్క విచారాన్ని పోగొట్టాలని తలంచి ఇట్లా అన్నాడు.

ధౌమ్యుండు పాండవుల నూరార్చుట (సం. 4-1-22) (కుంభకోణప్రతి)

ఉ. 'ధర్మనిరూపకత్వమున ధైర్యముననన్, మహనీయవృత్తి, స
త్కర్మ విధిజ్ఞతం జతురతా మహిమన్, దృఢబుద్ధి నెవ్వరున్
ధర్మజుపాటిగా రనఁగ ధాత్రిఁ బ్రసిద్ధుఁడ వైన యిట్టి నీ
పేర్మికి నీడె? దుర్దశల పెల్లునకున్ దురపిల్లు టారయన్. 51

ప్రతిపదార్థం: ధర్మనిరూపకత్వమునన్= ధర్మాధర్మాలను నిరూపించటంలోనూ; ధైర్యమునన్= దిటవుతనంలోనూ; మహనీయ వృత్తిన్= అందరూ మెచ్చుకొనే ఘనమయిన ప్రవర్తనలోనూ; సత్కర్మ విధిజ్ఞతన్= ఉత్తమ కర్మల విధానాన్ని తెలిసి ఉండటంలోనూ; చతురతా మహిమన్= చాతుర్యంతో కూడిన శక్తిలోనూ; దృఢబుద్ధిన్= దృఢమయిన బుద్ధిలోనూ; ఎవ్వరున్= ఎవరుగాని; ధర్మజుపాటి+కారు= ధర్మరాజు సాటి రారు; అనఁగన్= అనేటట్లు; ధాత్రిన్= భూలోకంలో; ప్రసిద్ధుఁడవు+ఐన= ప్రసిద్ధుడ వైన; ఇట్టి= ఇటువంటి; నీ పేర్మికిన్= నీ ఘనతకు; ఆరయన్= బాగా పరిశీలిస్తే; దుర్దశల పెల్లునకున్= దురవస్థల పెంపునకు; దురపిల్లుట= దుఃఖించటం; ఈడె?= తగునా?

తాత్పర్యం: 'ధర్మరాజుకు సాటి అయిన వ్యక్తి మరొకడు లేడనీ, అతడు ధర్మాధర్మాలను నిర్ణయించటంలో మేటి అనీ, ధైర్యశాలి అనీ, ఉదాత్తప్రవృత్తి కలవాడనీ, సత్కర్మలూ, వాటి విధులూ బాగా తెలిసినవాడనీ, నేర్పరితనం కలవాడనీ, శక్తియుక్తులను ప్రదర్శించే నైపుణ్యం కలవాడనీ లోకంలో నీవు ప్రశస్తి పొంది ఉన్నావు. అటువంటి ఘనత కలిగిన ధీరుడవైన నీవు కష్టాలు క్రమ్ముకొనినప్పుడు ఈ విధంగా దుఃఖించటం నీ గౌరవానికి తగిందా? (కాదని భావం).

వ. అట్లుంగాక **52**

తాత్పర్యం: అంతే కాకుండా.

క. దేవతల కైన నొక్కొక। చో వలయున కాదె శత్రుసూదనవిధి కా
లావాప్తికి మును దమ స। ద్భావంబు లడంచి యుడుగఁబడి యుండంగన్. **53**

ప్రతిపదార్థం: దేవతలకున్+ఐనన్= దేవతలకయినా సరే; ఒక్కొక చోన్= ఒక్కొక్కప్పుడు; శత్రుసూదన విధి కాల+అవాప్తికిన్= శత్రుసంహార కాలం రాకకు (విరోధులు సంహరింపబడే కాలం వచ్చేదాక); మును= పూర్వం; తమ సద్భావంబులు= తమవైన దివ్యస్వభావాలను; అడంచి= అణచుకొని; ఉడుగన్+పడి+ఉండంగన్= విజృంభించకుండా ఒదిగి ఉండటం; వలయున్+అ+కాదె= తప్పదు కదా (అవసరం కదా).

తాత్పర్యం: దేవతలు సమర్థులు కావచ్చును. కాని, కొన్నివేళలలో వారి సామర్థ్యం పనికి రాదు. ప్రత్యేకించి విరోధులను సంహరించే కాలంలో, అటువంటి సందర్భాలలో కాలం కలిసి వచ్చేదాకా తమ సామర్థ్యాన్ని బహిర్గతం చేయకుండా అణగి ఉండటం అవసరం కదా.

విశేషం: దేవతలే కొన్ని వేళలలో అణగి ఉన్నప్పుడు మానవ మాత్రులు ఒదిగి ఉండటం తప్పుకాదు. దీనివలన వారి సామర్థ్యానికి ఎటువంటి లోటు రాదు.

సీ. నిషధాద్రియం దనిమిషపతి ప్రచ్ఛన్న। సంచరణమున వర్తించుటయును
నదితి గర్భంబున నవతార మై వామ। నాకారమున హరి యడఁగుటయును
జనని యూరు ప్రదేశంబున నతి నిగూ। ఢంబుగా నౌర్వుండు డాఁగుటయును
ధేను శరీర విలీనుఁడై యజ్ఞాత। చర్య మార్తాండుండు సలుపుటయును

ఆ. వినమె! యిట్లు వడిన వీరలు పదపడి। తమకు నగ్గమైన తఱి జయింప
రెట్లు ప్రబల రిపుల; నీవును నాపద। కోర్చి భంగపాటు దీర్చికొనుము.' **54**

ప్రతిపదార్థం: అనిమిషపతి= దేవేంద్రుడు; నిషధ+అద్రియందున్= నిషధ పర్వతం మీద; ప్రచ్ఛన్న సంచరణమునన్= నిజస్వరూపం ఇతరులకు తెలియకుండా రహస్యంగా; వర్తించుటయున్= నివసించటం; హరి= విష్ణుమూర్తి; అదితిగర్భంబునన్= అదితి కడుపున; అవతారము+ఐ= అవతారం తాల్చి; వామన+ఆకారమునన్= పొట్టివాని రూపంలో; అడఁగుటయును= అణగి ఉండటమూ; ఔర్వుండు= ఔర్వుడు; జనని= తల్లియొక్క; ఊరు ప్రదేశంబునన్= తొడ లోపల; అతి నిగూఢంబుగాన్= ఎంతో రహస్యంగా; డాఁగుటయును= దాగుకొనటమూ; మార్తాండుండు= సూర్యుడు; ధేను శరీర విలీనుఁడు+ఐ= ఆవు శరీరంలో విలీనమయిపోయి; అజ్ఞాత చర్య= ఎవరికీ తెలియటానికి వీలు లేని విధంగా; సలుపుటయును= వాసంచేయటము; వినమె= వినలేదా; ఇట్లు= ఈ విధంగా; పడినన్= కష్టాలు పడిన; వీరలు= దేవేంద్రుడు, విష్ణుమూర్తి, ఔర్వుడు, సూర్యుడు మొదలయిన వారు; పదపడి= ఆ తరువాత; తమకున్= తమకు; అగ్గమైన తఱిన్= వీలయినప్పుడు; ప్రబలరిపులన్= బలవంతులయిన శత్రువులను; జయింపరు+ఎట్లు= జయించలేదా ఏమి, జయించారుకదా!; నీవునున్= నీవుకూడా; ఆపదకున్+ఓర్చి= ఆపదలకు తట్టుకొని; భంగపాటున్= ఇతరులు నీకు చేసిన అవమానానికి ప్రతీకారాన్ని; తీర్చికొనుము.

తాత్పర్యం: ఇంద్రుడు నిషధ పర్వతం మీద రహస్య జీవనం గడిపాడు. హరి అదితిగర్భంలో ప్రవేశించి వామన రూపుడయ్యాడు. ఔర్వుడు తల్లి తొడలో దాగి ఉన్నాడు. సూర్యుడు ధేను శరీర విలీను డయి అజ్ఞాతవాసం గడిపాడు.

వీరందరు సమర్థులే. అయినా కష్టాలు పడ్డారు. కాలం కలిసి రాగా విరోధులను జయించారు. అట్లాగే నీవు కూడా ఆపదలకు, ఇబ్బందులకు ఓర్చుకొని, ఆ తరువాత ప్రతీకారంచేసి అవమానం తీర్చుకొమ్ము.'

విశేషం: ఇంద్రుడు అనిమిషపతి. ఎంతో జాగ్రత్తగా విరోధి విజృంభణం కాకుండా పాలన సాగించే వ్యక్తి. అతడికి వృత్రుడి వలన 'చిక్కు' ఏర్పడింది. నురుగును వజ్రాయుధానికి కూర్చి వృత్రుడిని చంపాడు. అపుడు బ్రహ్మహత్య చేశావని భూతసంఘం నిందించింది. ఇంద్రుడి త్రిలోకాధిపత్యం ఊడిపోయింది. చివరకు నిషధ పర్వతం మీద తలదాచుకొన్నాడు. అపుడు నహుషుడికి ఇంద్రపదవి దక్కింది. అయినా అహంకారం వలన నహుషుడు శాపగ్రస్తుడయ్యాడు. ఇంద్రుడు బృహస్పతి, అగ్నిహోత్రాదుల సహాయంతో మరల అమర రాజ్యాధిపతి అయ్యాడు. బలిచక్రవర్తిని అణచటంకొఱకు విష్ణువు వామనరూపుడయ్యాడు. అన్నిటిని హరించగలిగిన వాడు హరి. అయినా అదితిగర్భంలో శిశువయ్యాడు. బ్రహ్మాండమంత వ్యాపించగలిగిన వాడు పొట్టి వాడయినాడు. భృగువంశం వాడు ఔర్వుడు. భృగు వంశజులు కృతవీర్యుడికి యాజకత్వం చేసేవారు. అందుచేత రాజు సంతోషించి యాజకులకు ధనం ఇచ్చేవాడు. కొంత కాలానికి కోశాగారం ఖాళీ అయింది. కృతవీర్యుడు కూడా చనిపోయాడు. రాజకుమారులకు దిక్కు తోచలేదు. యాజకత్వం పేరుతో భృగువంశజులు అంతా దోచారని వాళ్ళు అనుమానించారు. తీసికొన్న ద్రవ్యాన్నంతటిని తిరిగి ఇచ్చేయవలసిందిగా ప్రకటించారు. ఆ యాజకులలో కొందరు రాజకుమారులకు డబ్బు ఇచ్చేశారు. మరి కొందరు బ్రాహ్మణులకు దానం చేశారు. ఇంకా కొందరు ఇళ్ళలో పాతిపెట్టారు. రాజకుమారులు వీరిని గుర్తించారు. రాజవంచకులని నిర్ణయించారు. కనబడిన ప్రతి భార్గవుడిని వధించారు. చివరకు 'చూలాండ్రను' కూడా వదలిపెట్టలేదు. ఈ మారణహోమాన్ని ఒకానొక భృగుపత్ని చూచింది. తన కడుపులోని పిండాన్ని తొడలో దాచింది. నూరేళ్ళు నిండాయి. ఆ తరువాత కొడుకును కన్నది. ఊరువు-అంటే తొడ. తొడలో నుండి పుట్టాడు కనుక ఔర్వుడు. ఈ సీసపద్యంలో ధేను శరీర విలీనుడయి మార్తాండుడు ప్రవర్తించాడనే వృత్తాంతాన్ని గురించి డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారిట్లా వ్యాఖ్యానించారు: "ఆ ధేనువు సురభి. విశ్వకర్మ తపోనియతుడై యజ్ఞార్థముగాను, మోక్షార్థముగాను అమృతమయ మూర్తియును, కామరూపిణియు నగు నొక కన్యకను తనమనోవృత్తిచే కల్పించెను. ఆమెయే సురభి. మఱియు నితడు తేజోమయుడగు ఒక పురుషునికూడ సృజించెను. అతడు సురభిని చూచి కామమోహితుడై ఆర్తినొందెను. బ్రహ్మవచ్చి "మాఽఽఽర్తోభవ - (మా ఆర్తఃభవ) అని ఆతని ఆర్తత్వముడిపి ఆ కన్యనిచ్చెను. కాన వానికి మార్తాండుడని పేరువచ్చెను. వీరికి ఏకాదశ రుద్రులు, సౌరభేయకులు జన్మించిరి. మార్తాండుడు ధేనుశరీర విలీనుడగుట అనగా సురభి శరీరమునందు కామమోహితుడయి అజ్ఞాతచర్య సలుపుట అని తోచుచున్నది."

క. **అనవుడు నప్పలుకులు విని। తన చిత్తము కలఁక దేఱి ధర్మతనూజుం**
డనుజన్ముల దెసఁ జూచిన। ననిలసుతుం డిట్టు లనియె నాతనితోడన్. **55**

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; ఆ+పలుకులు= ఆ మాటలు; విని; తన చిత్తము= తన మనస్సు; కలఁక+తేఱి= బాధనుండి తేరికొని; ధర్మతనూజుండు= ధర్మరాజు; అనుజన్ముల దెసన్= తమ్ముళ్ళవైపు; చూచినన్= చూడగా; అనిలసుతుండు= వాయుపుత్రుడయిన భీముడు; అతని తోడన్= అతనితో (ధర్మరాజుతో); ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: పురోహితు డయిన ధౌమ్యుడు చెప్పిన మాటలను ధర్మరాజు విన్నాడు. అతడి మనస్తాపం ఉపశమించింది. తమ్ముళ్ళ వైపు చూశాడు. అపుడు భీముడు అతడితో ఈ విధంగా అన్నాడు.

మ. **'భవదాజ్ఞా దృఢబంధ సంయమిత శుంభ ద్వేగ మై కాక నాఁ**
డవలీలన్ మన యర్జున ద్విపము గ్రోధావేశదుర్దాంత ద
ర్ప విలాసోద్భట భంగి నేపడరి కౌరవ్యాంబుజ శ్రేణిఁ జి
క్కువడం జేయదె యొక్కవ్రేల్మిడిన నీకున్ వేడ్క సంధిల్లఁగన్.' **56**

ప్రతిపదార్థం: భవత్= నీ యొక్క; ఆజ్ఞా= ఆజ్ఞ అనే; దృఢబంధ= గట్టి గొలుసులతో; సంయమిత= కట్టబడిన; శుంభత్+వేగము+ఐ= ఉజ్జ్వల వేగం కలది; కాక= కాకపోతే; నాఁడు= ద్రౌపదికి సభలో పరాభవం జరిగిన రోజున; అవలీలన్= తేలికగా; మన అర్జున ద్విపము= మన అర్జును డనే ఏనుగు; క్రోధ+ఆవేశ= కోపావేశం చేత; దుర్దాంత దర్ప విలాస= అణచడానికి వీలుకాని గర్వ విలసనం యొక్క; ఉద్భటభంగిన్= భయంకర మయిన రీతితో; ఏపు+అడరి= విజృంభించి; నీకున్= నీకు; వేడ్క సంధిల్లఁగన్= సంతోషం కలిగేటట్లుగా; ఒక్క వ్రేల్మిడిన్+అ= ఒక్కచిటికెలోనే; కౌరవ్య+అంబుజశ్రేణిన్= కౌరవు లనే పద్మాల వరుసను; చిక్కు+పడన్+చేయదె= చిక్కు పరచగలిగి ఉండేదికదా! (చీకాకు పరచగలిగేదికదా!)

తాత్పర్యం: 'నిండుసభలో ద్రౌపది ఆ విధంగా అవమానించబడిన ఆ నాడు మన అర్జునుడనే మదించిన ఏనుగు విజృంభించి ప్రదర్శించిన వేగం నీ ఆజ్ఞ అనే గట్టి బంధంచేత నియమించబడింది. లేకపోతే ఆ అర్జున గజం కోపావేశంతో పెల్లుబికిన గర్వ విలాసంతో భయంకరమైన పద్ధతిలో విజృంభించి కౌరవులనే పద్మాల సమూహాన్ని ఒక్కక్షణంలోనే చిందరవందర చేసి నీకు సంతోషాన్ని కలిగించి ఉండేదే.'

విశేషం: అలం: రూపకం.

వ. **అనిన విని ధర్మనందనుండు తెలివొందిన మొగంబు తోడ శిరఃకంపంబుసేసె; నట్టి సమయంబున నవ్విప్రులందఱు నొక్క మొగిన 'మీ తలంపునకు దైవం బనుకూలంబు గావుత' మని పాండుపుత్త్రుల దీవించి పునర్దర్శనం బయ్యెడు మనుచు వీడ్కొని నిజస్థానంబులకుం జనిరి; తదనంతరంబ బాహ్యపరివారం బెల్లను సముచిత ప్రకారంబున వీడుకోలు వడసి తమ తమ పొందుపట్లకుం బోయిన.** **57**

ప్రతిపదార్థం: అనినన్+విని= అని చెప్పగా విని; ధర్మనందనుండు= ధర్మరాజు; తెలివి+ఒందిన మొగంబుతోడన్= ప్రసన్నముఖంతో; శిరస్+కంపంబు+చేసెన్= తల ఊపాడు. అట్టి సమయంబునన్= ఆ సమయంలో; ఆ+విప్రులందఱును= ఆ బ్రాహ్మణులందరున్నూ; ఒక్క మొగిన= ఏకకంఠంతో; మీ తలంపునకున్= మీ సంకల్పానికి; దైవంబు= దైవం; అనుకూలంబు+కావుతన్= అనుకూలించుగాత; అని= అని; పాండుపుత్త్రులన్= పాండవులను; దీవించి= ఆశీర్వదించి; పునర్దర్శనంబు+అయ్యెడున్= మరల మీదర్శనం అగుగాక! అంటూ; వీడ్కొని= వీడుకోలు పుచ్చుకొని; నిజస్థానంబులకున్= తమ తమ చోట్లకు; చనిరి= వెళ్లారు; తదనంతరంబు+అ= ఆ తరువాత; బాహ్యపరివారంబు+ఎల్లను= బాహ్యపరివారమంతా; సముచిత ప్రకారంబునన్= తగిన రీతిలో; వీడుకోలు+పడసి= వీడ్కోలు పొంది; తమ తమ= తమతమయొక్క; పొందుపట్లకున్= క్షేమంగా నివసించటానికి అనువయిన ప్రదేశాలకు; పోయినన్= వెళ్ళగా.

తాత్పర్యం: ధర్మరాజు భీముడి మాటలు విన్నాడు. ప్రసన్నుడయ్యాడు. అపుడు బ్రాహ్మణులందరూ 'దైవం మీ ఆలోచనకు అనుకూలించుగాక' అని దీవించారు. 'మరల మీ దర్శనం సిద్ధించుగాక' అని చెప్పారు. తమ తమ ప్రదేశాలకు వెళ్లిపోయారు. ఆ తరువాత బాహ్యపరివార జనులందరూ పాండవుల దగ్గర సెలవు పుచ్చుకొని తమ తమ అనువైన నివాసాలకు వెళ్ళిపోగా (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: దుర్యోధనుడి దగ్గర ఉండటానికి ఇష్టపడని వారు, పాండవులంటే అభిమానించే విప్రులు ధర్మరాజుతో అడవికి వచ్చారు. వారితో పాటు పాండవుల వెంట వచ్చినవారు మరికొందరున్నారు. సేవలకొరకు కొందరు వచ్చారు. వీరందరూ కలిసి బాహ్య పరివారజనులుగా పరిగణించబడతారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. తమ్ములు ధౌమ్యుఁడున్ సతియుఁ దా నరదంబులతోడఁ గ్రోశమా
త్ర మ్మొక చోటి కల్లఁ జని, ధర్మతనూభవుఁ డందు నాఁటిరే
యిమ్ముల సల్పి వేగుటయు నీప్సితకార్యము సేయఁగా విచా
రమ్మున నున్నచో నమరరాజతనూభవుఁ జూచి యిట్లనున్. 58

ప్రతిపదార్థం: తమ్ములు= తమ్ముళ్ళు; ధౌమ్యుఁడున్= ధౌమ్యుడూ; సతియున్= ద్రౌపది కూడా; తాను= ధర్మరాజు; అరదంబుల తోడన్= రథాలతో; క్రోశమాత్రము= పరుగు (రెండున్నరమైళ్ల) దూరం; ఒకచోటికిన్= ఒక ప్రదేశానికి; అల్లన్= మెల్లగా; చని= వెళ్ళి; అందున్= అక్కడ; నాఁటిరేయి= ఆరోజు రాత్రి; ఇమ్ములన్+చల్పి= సుఖంగా కాలం గడిపి; వేగుటయున్= తెలతెల్లవారగా; ఈప్సిత కార్యము= చేయగోరినకార్యం; చేయఁగాన్= చేయటానికి; విచారమ్మునన్+ఉన్నచోన్= ఆలోచనలో ఉండగా; ధర్మతనూభవుఁ డు= ధర్మరాజు; అమరరాజతనూభవున్= ఇంద్రుని కొడుకయిన అర్జునుని; చూచి= చూచి; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: తమ్ముళ్ళూ, పురోహితుడయిన ధౌమ్యుడూ, ద్రౌపదీ మొదలయిన వారు వెంటరాగా ధర్మరాజు పరుగు దూరం రథాలతో మెల్లగా పయనించాడు. అక్కడ తగిన స్థలంలో రాత్రి సుఖంగా కాలం గడిపాడు. పొద్దు పొడుస్తూ ఉన్నది. ధర్మరాజు కర్తవ్యాన్ని ఆలోచించాడు. అర్జునుడిని చూచి ఇట్లా అన్నాడు.

క. 'మన మొక యేవుర మీయం। గనయుం దో నరుగుదేరఁగా నెయ్యెడఁ బో
యిన నెఱుఁగ కుండుదురె? యి। ద్దినములు గడపంగ నెద్ది తెఱఁ గయ్యెడినో!' 59

ప్రతిపదార్థం: మనము= మనం: ఒక= ఒక; ఏవురము= అయిదుగురం; ఈ+అంగనయున్= ఈ ద్రౌపది; తోన్= మనతో కూడా; అరుగుదేరఁగాన్= రాగా; ఏ+ఎడన్= ఎక్కడకు; పోయినన్= వెళ్ళినా; ఎఱుఁగక+ఉండుదురె?= గుర్తు పట్టకుండా ఉంటారా?; ఈ+దినములు= ఈ అజ్ఞాతవాసకాలపు రోజులు; గడపంగన్= కడపటానికి; ఎద్ది= ఏది; తెఱఁగు= ఉపాయం; అయ్యెడినో= అవుతుందో!

తాత్పర్యం: 'మనం ఒక అయిదుగురం. అంగన అయిన ద్రౌపది కూడిరాగా మన మందరం కలిసికట్టుగా ఎక్కడికయినా వెళ్ళితే జనులు మనలను గుర్తించకుండా ఉంటారా? అజ్ఞాతవాసం ఎట్లా గడపాలో ఉపాయ మేదో మరి.'

విశేషం: పై పద్యంలో 'ఒక' అనే మాట సార్థకం. పాండవులు అయిదుగురయినా వారంతా ఒకటే. మాటలలో, చేతలలో కొన్ని వేళల తారతమ్యం కనబడ్డా భావంలో ఏకత ఉన్నది. పైగా ధర్మరాజు మాటను అందరూ పాటించటమే ఆ ఏకత.

వ. అనిన నతం డి ట్లనియె. 60

తాత్పర్యం: ధర్మరాజు మాటలు విన్న అర్జునుడు ఈ విధంగా అన్నాడు.

తే. 'ధర్మదేవత నీదు సత్కర్మమునకు। మెచ్చి యెంతయుఁ బ్రీతిమై నిచ్చినట్టి
వరము గలుగంగ మన మేమి వర్తనమున। నెచట నున్నను నొరులకు నెఱుఁగ నగునె? 61

ప్రతిపదార్థం: ధర్మదేవత= యమధర్మరాజు; నీదు= నీయొక్క; సత్కర్మమునకున్= మంచి పనికి; మెచ్చి; ఎంతయున్= ఎంతో; ప్రీతిమైన్= సంతోషంతో; ఇచ్చిన+అట్టి= ఇచ్చినటువంటి; వరము; కలుగంగన్= ఉండగా; మనము= మనందరం; ఏమి వర్తనమునన్= ఎటువంటి నడవడికతో; ఎచటన్= ఎక్కడ; ఉన్ననున్= ఉన్నప్పటికినీ; ఒరులకున్= ఇతరులకు; ఎఱుఁగన్+అగునె?= తెలియటానికి వీలవుతుందా?

తాత్పర్యం: 'యముడు నీ సత్ప్రవర్తనకు మెచ్చుకొన్నాడు. సంతోషంతో వరం అనుగ్రహించాడు. ఆ వరం ఉన్నది కనుక మనకు భయం లేదు. ఎక్కడ ఏవిధంగా నడచుకొన్నా మనలను ఇతరులు గుర్తుపట్టలేరు.

విశేషం: ధర్మరాజు అరణ్యవాసకాలంలో యక్షప్రశ్నలకు జవాబు లిచ్చాడు. యక్షుడు సంతోషించాడు. 'నీ తమ్ములలో ఒకరిని బ్రతికిస్తాను. నీ ఇష్టం వచ్చిన వాడిని కోరుకొమ్ము' అన్నాడు. అపుడు ధర్మరాజు నకులుడిని కోరుకొన్నాడు. అదేమిటి భీముడిని గాని, అర్జునుడిని గాని కోరుకొనకూడదా? అని యముడు ప్రశ్నించాడు. 'కుంతి కుమారుడిని నేను. మాద్రి కొడుకు నకులుడు. అందుచేత నకులుడిని కోరుకొన్నాను' అన్నాడు. అతడి ధర్మదృష్టికి యముడు మెచ్చుకొన్నాడు. 'అజ్ఞాతవాసంలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా వరం ఇస్తున్నా'నని అనుగ్రహించాడు.

వ. **కురు జనపదంబు చుట్టం బాంచాల చేది మత్స్య సాళ్వ విదేహ బాహ్లిక దశార్ణ శూరసేన కళింగ మగధ దేశంబులు సుభిక్షంబులు, జనాకీర్ణంబులు, నతిస్థిరంబులు నై నివాసయోగ్యత కలిగి యున్నయవి యని విందుము. వానియందు మీకుఁ జూడం బోలిన యెడఁ దగిన చందంబున నిలుచువారము గాక' యనినం బ్రియంబంది ధర్మనందనుం డి ట్లనియె.** **62**

ప్రతిపదార్థం: కురుజనపదంబు= కురుభూమి యొక్క; చుట్లన్= చుట్టుపట్ల; పాంచాల= పాంచాలదేశం; చేది= చేదిదేశం; మత్స్య= మత్స్యదేశం; సాళ్వ విదేహ బాహ్లిక దశార్ణ శూరసేన కళింగ మగధ దేశంబులు= సాళ్వ, విదేహ, బాహ్లిక, దశార్ణ, శూరసేన, కళింగ, మగధ దేశాలు; సుభిక్షంబులు= ఈతి బాధలు లేకుండా పాడిపంటలతో నిండి ఉన్నాయి; జన+ఆకీర్ణంబులు= జనసాంద్రతతో నిండుగా ఉన్నాయి; అతిస్థిరంబులును+ఐ= మిక్కిలి నిలకడ గల్గినవై నివాసయోగ్యత= నివసించడానికి అవసరమయిన సానుకూల పరిస్థితి; కలిగి+ఉన్న+అవి= కలిగి ఉన్నాయి అని; విందుము= వింటాం; వానియందున్= ఆ దేశాలలో; మీకున్= మీకు; చూడన్+పోలిన+ఎడన్= తగినదని తోచినచోట; తగిన చందంబునన్= తగిన రీతిని; నిలుచువారము+కాక= ఉందాము గాక; అనినన్= అని అర్జునుడు చెప్పగా; ప్రియంబు+అంది= సంతోషించి; ధర్మనందనుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'కురుదేశం చుట్టూ పాంచాల, చేది, మత్స్య దేశాలు ఉన్నాయి. ఇవే కాక సాళ్వ, విదేహ, బాహ్లిక, దశార్ణ, శూరసేన, కళింగ, మగధ దేశాలు కూడా ఉన్నాయి. ఈ దేశాలన్నీ సుభిక్షంగా ఉన్నాయి. ఇవన్నీ నివాసయోగ్యాలు. ఇక్కడ సుస్థిర ప్రభుత్వాలు ఉన్నాయి. పైగా జన సంకీర్ణాలు అని వింటున్నాం. ఈ ప్రదేశాలలో మీకు నచ్చిన చోట అందరం ఉందాం' అనగానే ధర్మరాజు అర్జునుడితో ఈ విధంగా అన్నాడు.

క. **'అగు నది యట్టిద; దైవము । దగ నిచ్చిన యవ్వరంబు దప్పునె? మనకున్**
విగత భయ వాస యోగ్యం । బుగ నొక్కెడ సెప్పు మిపుడ పోవఁగవలయున్. **63**

ప్రతిపదార్థం: అగును= అవును; అది= నీవు చెప్పిన దేశాల స్థితి; అట్టిది+అ= అట్టిదే; దైవము= భగవంతుడు; తగన్= తగినట్లు; ఇచ్చిన= ఇచ్చినటువంటి; ఆ+వరంబు= అజ్ఞాతవాస రక్షణ వరము; తప్పునె?= తప్పుతుందా; మనకున్= మనకు; విగత భయవాస యోగ్యంబుగన్= ఏమాత్రం భయమన్నది లేని వాస యోగ్యత కలిగేటట్లు; ఒక్క+ఎడ= ఒక్కచోటు; చెప్పు= చెప్పుము; ఇపుడు+అ= ఇప్పుడే; పోవఁగవలయున్= పోవాలి.

తాత్పర్యం: 'అవును. నీవన్న మాట నిజం. దైవ మిచ్చిన వరం తప్పుతుందా? అయితే ఎటువంటి భయం లేకుండా మనం ఉండదగిన చోటేదో చెప్పుము. మన మింక ఆలస్యం చేయకుండా సాగాలి.

విశేషం: పాండవులు అరణ్యవాసం పూర్తి చేశారు. ఇక అజ్ఞాతవాసం చేయాలి. అజ్ఞాతవాసంలో కూడు గూడు మాత్రం చాలవు. నిర్భయత కూడా అవసరం. ఇవన్నీ శత్రుదేశంలో దొరకవచ్చు; కాని మిత్రదేశంలో ఈ సౌకర్యా లుంటే ఇబ్బంది లుండవు.

ఆ. నాకుఁ జూడ మత్స్య నరపతి సద్ధర్మ। వర్తి, సుజనహితుఁ, డవార్య బాహు
బలుఁడు గాన యతని పాల నందఱుఁ దగ। వైన పనుల నిలుచు టభిమతంబు. 64

ప్రతిపదార్థం: నాకున్; చూడన్= అన్నిరకాలుగా సూక్ష్మబుద్ధితో పరిశీలించి చూస్తే; మత్స్యనరపతి= మత్స్య దేశంలోని ప్రజలకు రాజయిన విరాటుడు; సద్ధర్మవర్తి= చక్కని ధర్మంతో ప్రవర్తించే వాడు; సుజనహితుఁడు= సత్పురుషులకు హితుడు; అవార్య= వారించటానికి వీలుకాని; బాహుబలుఁడు= భుజబలం కలిగినవాడు; కాన= కాబట్టి; అతని పాలన్= అతని దగ్గర; అందఱున్= పాండవులయిన మనమూ, ద్రౌపది కూడా; తగవు+ఐన= మన గౌరవమర్యాదలకు తగిన; పనులన్= పనులలో; నిలుచుట= ఉండటం; అభిమతంబు= ఇష్టం.

తాత్పర్యం: మత్స్యదేశానికి రాజయిన విరాటుడు ధార్మికుడు, సుజన ప్రియుడు, భుజబలశాలి. ఎన్ని రకాలుగా ఆలోచించినా మత్స్యదేశంలో విరాటుడి కొలువులో మనం తగిన పనులు చేస్తూ ఉండటమే నాకు ఇష్టం.

పాంచాలీ పాండవులు తమ మెలంగవలయు పనుల నిశ్చయించుకొనుట (సం 4-1-15)

క. మనలోన నెవ్వఁ డెమ్మెయి। పని వెంటను విరటు మనము వడయుద? మదియె
ల్లను నేర్పరించి యందఱుఁ। దన తనమది నున్న తెఱఁగు తథ్యమ చెపుఁడా! 65

ప్రతిపదార్థం: మనలోనన్= మనలో (పాండవులమయిన మనలో); ఎవ్వఁడు= ఎవడు; ఏ+మెయి= ఏవిధమైన; పని వెంటను= పని నెపంతో; విరటు మనము+పడయుదము= విరాట మహారాజు మనసును మెప్పిద్దాం; అది= అది; ఎల్లనున్= అంతా; ఏర్పరించి= నిర్ణయించి; అందఱున్= అందరూ; తన తనమదిన్= వారి వారి మనస్సులలో; ఉన్న తెఱఁగు= ఆలోచించి నిర్ణయించుకొన్న విధానాన్ని; తథ్యము+అ= వాస్తవంగా (యథాతథంగా); చెపుఁడా= చెప్పండి.

తాత్పర్యం: విరాట మహారాజు మెప్పు పొందే విధంగా మనలో ఎవరెవరు ఏపని చేద్దామో నిర్ణయించండి. మీ మీ మనస్సులలోని అభిప్రాయాలను విశదం చేయండి.'

వ. అనిన విని సవ్యసాచి సవితర్కంబును సవిషాదంబును సగౌరవంబునుంగా నతని నుపలక్షించుచు నిట్లనియె. 66

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్ విని= ధర్మరాజు వాక్యాన్ని విని; సవ్యసాచి= అర్జునుడు; సవితర్కంబును= ఆలోచనతోనూ; సవిషాదంబును= విచారంతోనూ; సగౌరవంబునున్+కాన్= గౌరవంతోనూ కూడిందిగా; అతనిన్= ధర్మరాజును; ఉపలక్షించుచున్= చూస్తూ; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అర్జునుడు ధర్మరాజు మాటలు విన్నాడు. అతడి వైపు చూచాడు. ఆ చూపులో ఆలోచన ఉన్నది. విషాదం ఉన్నది. గౌరవమూ ఉన్నది. ధర్మరాజును చూచి అర్జునుడు ఈ విధంగా అన్నాడు.

విశేషం: మనిషి చూపులు అనేక రకాలు. చూపులు మనసులోని భావాలను పట్టి ఇస్తాయి. అర్జునుడి చూపులో ఆలోచన ఉన్నది. ఆ ఆలోచనలో కర్తవ్య నిష్ఠ కనిపిస్తున్నది. విషాదం ఉన్నది. తన అన్నకు కష్టదశ కలిగినందుకు విషాదం. గౌరవం ఉన్నది. ఆ గౌరవం భయంతో కాదు. లాంఛనప్రాయమూ కాదు. హృదయ సంబంధి కూడా. తిక్కన కవితలో దృశ్యకావ్య లక్షణాలు అడుగడుగునా కనపడతాయి. వాటిలో నవ్వులను, చూపులను అతడు విశేషించి అభినయాత్మకంగా వర్ణిస్తాడు.

సీ. **'మహనీయమూర్తియు, మానవైభవమును, । సౌకుమార్యంబును, సరసతయును,**
మార్దవంబుఁ, బ్రభుత్వ మహిమయు, నపగత । కల్మషత్వంబును, గౌరవంబు
శాంతియు, దాంతియుఁ, జాగంబు, భోగంబుఁ, । గారుణ్యమును, సత్యసారతయును,
ధర్మమయ క్రియా తత్పరత్వంబును । గీర్తి, ధనార్జన క్రీడనంబుఁ

ఆ. **గలిగి జనుల నేలఁ గాని, యెన్నందును । నొరులఁ గొల్చి తిరుగ వెరవు లేని**
యట్టి నీవు విరటు నెట్టి చందంబున । ననుచరించు వాఁడ వధిప! చెపుమ.' 67

ప్రతిపదార్థం: అధిప!= ధర్మరాజా!; మహనీయమూర్తియున్= గొప్ప రూపమూ; మానవైభవమును= అభిమానంతో కూడిన వైభవమూ; సౌకుమార్యంబును= సుకుమారత్వమున్నూ; సరసతయును= సరసత్వమున్నూ; మార్దవంబున్= మృదుత్వమున్నూ; ప్రభుత్వ మహిమయున్= అధికారం యొక్క అతిశయమూ; అపగత కల్మషత్వంబును= దోషరాహిత్యమూ; గౌరవంబు= గౌరవమున్నూ; శాంతియున్, దాంతియున్= శమమున్నూ దమమున్నూ; చాగంబు= త్యాగమూ; భోగంబున్= భోగమూ; కారుణ్యమును= దయయూ; సత్య సారతయును= శ్రేష్ఠమయిన సత్యమూ; ధర్మమయ క్రియా తత్పరత్వంబును= ధార్మికమయిన పనులు చేయటంలో ఆసక్తి; కీర్తి, ధన+ఆర్జన క్రీడనంబున్= కీర్తిని, ధనాన్ని ఆర్జించే ఆటయున్నూ; కలిగి= కలిగి; జనులన్= ప్రజలను; ఏలన్+కాని= పరిపాలించడానికే కాని; ఎన్నండును= ఏనాడూ; ఒరులన్= ఇతరులను, కొల్చి= సేవించి; తిరుగన్= వ్యవహరించటానికి; వెరవు లేని+అట్టి= ఉపాయమూ, నేర్పూ లేనట్టి; నీవు= నీవు; విరటున్= విరాటుని; ఎట్టి చందంబునన్= ఏ విధంగా; అనుచరించువాఁడవు= అనుసరించి సేవిస్తావు; చెపుము+అ= చెప్పుము.

తాత్పర్యం: 'ధర్మరాజా! నీకు చక్కని రూపమున్నది. అభిమానవైభవమున్నది. సౌకుమార్యమున్నది. సరసత్వమున్నది. మృదుత్వం ఉన్నది. ప్రాభవం ఉన్నది. నిష్కల్మషత్వం, గౌరవం, శాంతి, దాంతి, త్యాగభోగాలు, దయాసత్యాలు ఉన్నాయి. ధార్మిక క్రియాశీలత ఉన్నది. కీర్తిని ఆర్జించటం నీ ప్రవృత్తి. అన్నీ ఉన్నప్పటికీ ఇతరులను సేవించే నేర్పు నీకు లేదు. (సేవ లందుకొనటమే నీకు తెలుసు). అటువంటి నీవు సామాన్యుడయిన విరాటుడిని ఎట్లా సేవిస్తావో చెప్పుము.'

విశేషం: అంతరింద్రియ నిగ్రహం శాంతి. బహిరింద్రియ నిగ్రహం దాంతి. కొందరిలో రూపం ఉంటే వైభవం ఉండదు. సౌకుమార్యముంటే సరసత్వం ఉండదు. దాంతి ఉంటే శాంతి ఉండదు. అన్నీ ఉన్నా ధార్మిక క్రియాశీలం ఉండదు. కాని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మరాజులో అన్నీ ఉన్నాయి. అతడు సద్గుణాల రాశి. ధర్మరాజు చంద్రవంశంలో పుట్టినవాడు. చంద్రునికి 16 కళలున్నాయి. అట్లాగే ఈ పద్యంలో ధర్మరాజుకు 16 గుణాలు చెప్పబడ్డాయి. అంటే ధర్మరాజు షోడశ గుణకళాపూర్ణుడని ధ్వని.

క. అనినం దమ్ముని నెమ్మన । మునఁ బుట్టిన వగపు భావమున నెఱిఁగియు గీ
టునఁ బుచ్చుచుఁ బ్రస్తుత కా । ర్య నిరూపణ దశయ మెఱయ నతఁ డి ట్లనియెన్. 68

ప్రతిపదార్థం: అనినన్= ధర్మరాజును చూచి అర్జునుడు పలుకగా; తమ్ముని= అర్జునుడి యొక్క; నెమ్మనమునన్= నిండు మనసులో; పుట్టిన వగపు= కలిగిన బాధ; భావమునన్= మనసులో; ఎఱిఁగియున్= తెలిసికూడా (అర్థం చేసికొన్నప్పటికీ); గీటునన్+పుచ్చుచున్= నిర్లక్ష్యం చేస్తూ; ప్రస్తుత కార్య నిరూపణదశ+అ= ఇప్పటి కార్యం నిర్వహించే అవస్థ (ప్రస్తుతం ఏ పనిచేయాలో ఆ పనిని నిశ్చయించే స్థితి); మెఱయన్= బయల్పడేటట్లుగా; అతఁడు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: తమ్ముడి మనసులోని ఆరాటాన్ని, బాధను ధర్మరాజు గుర్తించాడు. అయినా అట్లాంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వలేదు. ప్రస్తుతం తీసికొనవలసిన నిర్ణయంకొఱకు ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. 'స న్న్యాసి వేషమున రా । జన్యునిఁ గని యెపుడుఁ గొలిచి సభ్యత్వమునన్
మాన్యుఁడనై పుణ్యకథా । విన్న్యాస మొనర్తు నతని వేడుకకుఁ దగన్. 69

ప్రతిపదార్థం: సన్న్యాసి వేషమునన్= సన్యాసి వేషంతో; రాజన్యునిన్= విరాట మహారాజును; కని= చూచి; ఎపుడున్= ఎప్పుడూ; కొలిచి= సేవించి; సభ్యత్వమునన్= సభా యోగ్యతతో; మాన్యుఁడన్+ఐ= గౌరవింప దగిన వాడనై; అతని వేడుకకున్+తగన్= విరాటుని వినోదానికి తగినవిధంగా; పుణ్యకథా విన్యాసము+ఒనర్తున్= పుణ్యగాథలను ప్రవచనం చేస్తాను.

తాత్పర్యం: నేను సన్యాసివేషంతో విరాటుడి కొలువులో ప్రవేశిస్తాను. అందులో సభ్యుడి నౌతాను. ఆ మహారాజు కుతూహలానికి తగినట్లుగా పుణ్యకథలు చెపుతూ ఉంటాను.

విశేషం: ఆంధ్రమహాభారత సంశోధిత ముద్రణంలో 'సన్యాసి' పాఠాన్ని గురించి ఈ క్రింది పాదసూచి ఇవ్వబడింది. 'సన్యాసి-శ,ష,మున్నగు పెక్కు ప్రతులలో నీశబ్దము 'న' కారద్విత్వ రహితముగనే యున్నది. ఈ రూపమే భారతకూలంకష వ్యాఖ్యయందు సమర్థింపబడినది. 'సమ్' అనే ఉపసర్గయొక్క 'మ' కారము బిందువై 'న' కారద్విత్వమును పొంది, ఆపయిని, 'య' కారము ఉండుటచేత నకారద్విత్వమున్ను లోపించినది. ఇది ప్రాసలోనే యున్నది. సన్న్యాసి, రాజన్న్య, మాన్న్య, విన్న్యాస - అనివా; సంన్యాసి - ఉ,ఐ,ఓ,చ,ట (స్థిరవర్ణమునకు ముందు బిందువు; సన్న్యాసి వేషమున - ఇచ్చట మూలము "కంకో నామ ద్విజో భూత్వా మతాక్షః ప్రియదేవనమ్." చిత్రశాలాప్రతి. వావిళ్ళ తెలుఁగు లిపి ప్రతియందును ఇట్లే యున్నది." **(విరా.పు.15)**

క. శ్రౌత స్మార్త నిమిత్త । జ్యోతిర్విద్యలు వహించి యోగ్య సమయసం
జాత ప్రాగల్భ్యుఁడ నై । చాతుర్యము మెఱసి మానసం బలరింతున్. 70

ప్రతిపదార్థం: శ్రౌత, స్మార్త, నిమిత్త, జ్యోతిస్+విద్యలు= వేదాలు, స్మృతులు, శకునాలు, నక్షత్రాలు- అనే విషయాలకు సంబంధించిన విద్యలను; వహించి= అవలంబించి; యోగ్య= తగిన; సమయ= సమయాలలో, సంజాత= కలిగిన; ప్రాగల్భ్యుఁడను+ఐ= ప్రతిభ కలవాడనై; చాతుర్యము= నేర్పు; మెఱసి= బయల్పరచి; మానసంబు= (విరటుని) మనస్సు; అలరింతున్= సంతోషపెట్టుతాను.

తాత్పర్యం: శ్రౌతం, స్మార్తం, శకునశాస్త్రం, జ్యోతిషం అనే విద్యలు నాకు తెలుసు. ఈ శాస్త్ర విషయాలకు సంబంధించిన ప్రతిభను తగిన సమయాలలో ప్రకటిస్తూ విరాటుడి మనస్సుకు సంతోషం కలిగిస్తాను.

క. ఆతనితో నొక్కొక మరి। కౌతూహలవృత్తికిం దగం దొడఁగి మృదు
ద్యూతంబునఁ గ్రీడింతుం। జేతోముద మొదవ నక్షశిక్షాప్రౌఢిన్. 71

ప్రతిపదార్థం: ఆతనితోన్= విరాటునితో; ఒక్కొకమరి= ఒక్కొక్కసారి; కౌతుహలవృత్తికిన్+తగన్= ఆసక్తికి తగినట్లుగా; తొడఁగి= పూనుకొని; అక్షశిక్షా ప్రౌఢిన్= పాచికలాటలోని నేర్పుతో; చేతన్+ముదము= మనస్సుకు సంతోషం; ఒదవన్= కలిగేటట్లు; మృదు ద్యూతంబునన్= పందెం ఒడ్డటం లేని మైత్రీపూర్వకమయిన జూదంతో; క్రీడింతున్= ఆడతాను.

తాత్పర్యం: అతడితో నేను సుకుమారమయిన సరదా జూదం ఆడతాను. ఆ ఆట ఆతని కుతూహలానికి తగ్గట్లు ఉంటుంది. ఈ ఆటవలన రాజు సంతోష పడతాడు. పైగా నా నేర్పు అతడికి తెలుస్తుంది.

విశేషం: మృదుద్యూతం అంటే సరదా కొరకు పందెం లేకుండా ఆడే జూదం.

తే. మణిమయమ్ములుఁ గలధౌతమయములును సు। వర్ణ మయములు నాదిగా వలయునట్టి
యడ్డసాళులు గలవు నా కభిమతముగ। వానిఁ గొనిపోయి చూపుదు వరుసతోడ. 72

ప్రతిపదార్థం: మణిమయమ్ములు= మణులతో చేయబడినవి; కలధౌత మయములును= వెండితో చేసినవి; సువర్ణమయములున్= బంగారంతో చేసినవి; ఆదిగాన్= మొదలుగా; వలయునట్టి= కావలసిన; అడ్డసాళులు= పాచికలు; నాకున్= నాకు; కలవు= కలవు; వానిన్+కొనిపోయి= వాటిని తీసికొని వెళ్ళి; అభిమతముగన్= ఇష్టంతో; వరుసతోడన్= వరుసగా; చూపుదున్= చూపిస్తాను.

తాత్పర్యం: నా దగ్గర ఎన్నో పాచిక లున్నాయి. కొన్ని మణిమయాలు, కొన్ని వెండివి, కొన్ని బంగారంవి. వాటిని తీసికొనిపోయి వరుసగా రాజుకు చూపిస్తాను.

వ. మఱియు నవసరోచితంబు లగు వినోదంబులం బ్రమోదంబు పుట్టించుచుఁ బ్రసాదంబునకుం బాత్రుండ నై. కంకుండను నామధేయంబు ధరియించి చరియింతు; నయ్యుర్వీశ్వరుండు మ త్పూర్వవర్తనం బడిగె నేనియు ధర్మపుత్త్రుతోడి మైత్రిం దగిలి యతనిపాల వసియింతు ననంగలవాఁడ' నని చెప్పి, యనిలతనయు నిరీక్షించి తత్కాలజనితం బయిన ఖేదంబునం దొరఁగ సమకట్టు బాష్పజలంబులు మగుడ నింకించుచు నిట్టూర్పు లడంచి ధైర్యం బవలంబించి యి ట్లనియె. 73

ప్రతిపదార్థం: మఱియున్= మరియు; అవసర+ఉచితంబులు+అగు= సమయానికి తగిన; వినోదంబులన్= వినోదాలతో; ప్రమోదంబు = సంతోషం; పుట్టించుచున్= కలిగిస్తూ; ప్రసాదంబునకున్= అనుగ్రహానికి; పాత్రుండను+ఐ= అర్హుడనయి; కంకుండు+అను= కంకుడనే; నామధేయంబు, ధరియించి= పేరుపెట్టుకొని; చరియింతున్= ప్రవర్తిస్తాను; ఆ+ఉర్వీ+ఈశ్వరుండు= ఆ రాజు; మత్+పూర్వవర్తనంబు= నా పూర్వపు+నడవడి; అడిగెన్+ఏనియున్= అడిగితే; ధర్మపుత్త్రుతోడి= ధర్మరాజుతోడి; మైత్రిన్+తగిలి= స్నేహం పెంచుకొని; అతని పాలన్ వసియింతున్= అతని దగ్గర నివసించేవాడిని; అనన్+కలవాఁడన్= అని చెప్పగలవాడను; అని చెప్పి= ఆ విధంగా చెప్పి; అనిలతనయున్= భీముని; నిరీక్షించి= చూచి; తత్కాలజనితంబు+అయిన= ఆ సమయంలో పుట్టిన; ఖేదంబునన్= దుఃఖంచేత; తొరఁగన్ సమకట్టు= స్రవించబోయే; బాష్పజలంబులు= కన్నీరు; మగుడన్= మరల; ఇంకించుచున్= (కనులలోనే) ఇంకిపోయేటట్లు చేసి; నిట్టూర్పులు= నిట్టూర్పులు; అడంచి= అణచికొని; ధైర్యంబు+అవలంబించి= ధైర్యాన్ని తెచ్చుకొని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సమయానికి తగిన వినోదాలతో రాజుకు సంతోషం కలిగిస్తాను. అతడి అనుగ్రహానికి పాత్రుడ నవుతాను. కంకుడనే పేరుతో సంచరిస్తాను. ఆ రాజు ఒకవేళ నా పుట్టుపూర్వోత్తరాలు అడిగితే 'నేను ధర్మరాజు స్నేహితుడిని, అతడి దగ్గరుండేవాడిని' అని చెప్తుతాను. ఇట్లా అంటూ ధర్మరాజు భీముడివైపు చూచాడు. కన్నీటిని ఆపుకొంటూ, నిట్టూర్పు లణచుకొంటూ ధైర్యంతో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

సీ. **'కడిమిమై సౌగంధికమున యక్షుల మద। మడఁచి కృష్ణకుఁ బువ్వు లట్లు దెచ్చెఁ;**
గిమ్మీరదానవు నమ్మెయి నిర్జించి। విగతకంటకముఁ గావించె వనము;
బకదైత్యుఁ దొడరి యాభంగి రూపఱఁ జేసి। రక్షించె నేకచక్రాపురంబు;
నప్పాటఁ బ్రబలు జటాసురు నడరి దం। డితుఁ జేసి మనలఁ బెట్టించుకొనియె;

తే. **నితఁడు పుట్టినకోలెను నెసఁకమెసఁగ। దర్పమునన వర్తిల్లు నుదగ్రమూర్తి**
యకట! యొరు చిత్తమున కెక్కునట్లు గాఁగ। మెలఁగి యేమి విధంబునఁ గొలుచువాఁడు.' **74**

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ భీముడు; కడిమిమైన్= బలంతో; సౌగంధికమునన్= సౌగంధిక కమలాల విషయంలో; యక్షుల మదమున్= యక్షుల గర్వాన్ని; అడఁచి= అణచి; కృష్ణకున్= ద్రౌపదికి; అట్లు= ఆ విధంగా (ఆశ్చర్యం కలిగేటట్లు అని భావం); పువ్వులు+తెచ్చెన్= పువ్వులు తెచ్చాడు; కిమ్మీర దానవున్= కిమ్మీరుడనే రాక్షసుని; ఆ+మెయిన్= ఆ విధంగా (అంత ప్రసిద్ధి వహించేటట్లు); నిర్జించి= చంపి; వనమున్= అరణ్యాన్ని; విగత, కంటకమున్+కావించెన్= శత్రురహితం చేశాడు; బక దైత్యున్= బకాసురుడిని; తొడరి= పూనుకొని; ఆ భంగిన్= ఆ రీతిగా; రూపు+అఱన్+చేసి= రూపుమాపి; ఏక చక్రాపురంబున్= ఏకచక్రపురాన్ని; రక్షించెన్= రక్షించాడు; ఆ+పాటన్= ఆ విధంగా; ప్రబలు= బలిష్ఠుడయిన; జటాసురున్= జటాసురుని; అడరి= ఎదుర్కొని; దండితున్+చేసి= దండించబడిన వాడినిగా చేసి; మనలన్= మనలను (పాండవులను); పెట్టించుకొనియెన్= విడిపించుకొన్నాడు; పుట్టినకోలెను= పుట్టినప్పటినుండి; ఎసకము+ఎసఁగన్= అతిశయించేటట్లు; దర్పమునన్+అ= గర్వంతోనే; వర్తిల్లు= ప్రవర్తించే; ఉదగ్రమూర్తి= భయంకరరూపుడు; అకట= అయ్యో!; ఒరుచిత్తమునకున్= ఇతరుల మనస్సుకు; ఎక్కునట్లు+కాఁగన్= నచ్చేటట్లు; మెలఁగి= ప్రవర్తించి; ఏమి విధంబునన్+కొలుచువాఁడు= ఎట్లా సేవిస్తాడో!

తాత్పర్యం: 'అలనాడు పరాక్రమంతో సౌగంధిక కమలం విషయంలో యక్షులమదాన్ని అణచి ద్రౌపదికి ఆ బంగారుపూలను ఆ విధంగా (అద్భుతంగా) తెచ్చిపెట్టాడు. అప్పుడు ఆ రకంగా (అపూర్వంగా) కిమ్మీరు డనే రాక్షసుడిని చంపి అరణ్యంలో శత్రుభయం లేకుండా చేశాడు; బకాసురుడిని ఆ విధంగా (ఆశ్చర్యం కలిగేటట్లు ద్వంద్వ యుద్ధంలో చంపి ఏకచక్రపురాన్ని రక్షించాడు; జటాసురుడిని మహాబలంతో ఆ విధంగా (అబ్బురపాటు కలిగేటట్లు) సంహరించి మనలను విడిపించాడు. అట్టి ఈ భీముడు పుట్టినప్పటినుండి అడ్డులేని గర్వంతో మసలుతున్న క్రోధమూర్తి. అక్కటా! ఇటువంటివాడు ఇతరుల మనసులకు నచ్చేటట్లు వారు మెచ్చేటట్లు మెలగుతూ ఏ విధంగా సేవక వృత్తి నిర్వహించగలడు?' (అది సాధ్యంకాని పనికదా అని భావం)

విశేషం: అలం: ఉదాత్తం. ధర్మరాజు తన వాక్యాలలో 'అట్లు', 'అమ్మెయి' 'ఆభంగి', 'అప్పాట' అనే మాటలు వాడి భీముడు ఆయా సందర్భాలలో ప్రదర్శించిన బలపరాక్రమాలను ధ్వనిమయం చేశాడు. మాటలలో తెలుగుపలుకుబడిని ప్రదర్శించాడు. భీముడు స్వభావంచేత ఉద్ధతుడు. పరధిక్కారాన్ని సహించలేని అభిమాని. అటువంటివాడు సేవకావృత్తిలో మసలటం ఎంతకష్టమో ధర్మరాజు ఈ మాటలలో వ్యక్తం చేశాడు. (సంపా.)

వ. అనిన విని భీమసేనుం డి ట్లనియె. 75

ప్రతిపదార్థం: అనినన్+విని= ధర్మరాజు మాటలను విని; భీమసేనుండు= భీముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మరాజు పలికిన మాటలన్నీ విని భీముడు ఈ విధంగా అన్నాడు.

తే. 'ఏను వంటలవాఁడ నై యా నరేంద్రుఁ। గొలిచి గరగరగాఁ గూడు గూర చిత్త
మునకు వచ్చిన చందంబునన యొనర్చి। నేర్చి మెలఁగుదుఁ గరము వినీతి మెఱసి. 76

ప్రతిపదార్థం: ఏను= నేను; వంటలవాఁడను+ఐ= వంటలవాడుగా; ఆ నరేంద్రున్= ఆ విరాట మహారాజును; కొలిచి= సేవించి; గరగరగాన్= నిర్మలంగా; కూడు; కూర; చిత్తమునకున్ వచ్చిన= రాజు మనసుకు వచ్చిన; చందంబునన్= రీతిగా; ఒనర్చి= చేసి (వండి); కరమున్= మిక్కిలి; వినీతి మెఱసి= వినయం చూపుతూ; నేర్చి= నేర్పుకలిగి (నేర్పుతో); మెలఁగుదున్= ప్రవర్తిస్తాను.

తాత్పర్యం: 'నేను వంటలవాడుగా విరాటుడిని సేవిస్తాను. రుచిగా శుచిగా వంటకాలు వండుతాను. రాజు మనస్సు మెచ్చే విధంగా వంటకాలు చేస్తాను. వినయంతో వ్యవహరిస్తాను. నేర్పుతో ప్రవర్తిస్తాను.

ఉ. ఆఱురసంబులం జవులయందలి క్రొత్తలు వుట్ట నిచ్చలున్
వేతొకభంగిఁ బాకములు విన్ననువొప్పఁగఁ జేసి చేసి న
న్మీఱఁగ బానసీని నొకనిం బురిఁ గానని యట్లుగాఁగ మేన్
గాఱియవెట్టియైన నొడికంబుగ వండుదుఁ గూడుగూరలన్. 77

ప్రతిపదార్థం: ఆఱురసంబులన్= షడ్రసాలలోనూ; చవుల+అందలి= రుచులలోని; క్రొత్తలు+పుట్టన్= క్రొత్తదనం కలిగేటట్లు; నిచ్చలున్= ఎల్లప్పుడు; (అన్నివేళలలోనూ); వేఱొకభంగిన్= ప్రత్యేకత కనిపించేవిధంగా; పాకములు= వంటలు; విన్ననువు+ఒప్పఁగన్= నేర్పు కలిగేవిధంగా (నేర్పు స్పష్టమయ్యేటట్లుగా); చేసి చేసి= ఎన్నోసార్లు చేసి; నన్ మీఱఁగన్= నన్ను మించే; బానసీనిన్= వంటలవానిని; ఒకనిన్= మరొకనిని; పురిన్= నగరంలో; కానని+అట్లు+కాఁగన్= వెదకిననూ దొరకనట్లుగా; మేన్= శరీరము; కాఱియపెట్టి+ఐనన్= కష్టపెట్టి అయినా; ఒడికంబుగన్= ఇంపుగా; కూడు కూరలున్; వండుదున్= వండుతాను.

తాత్పర్యం: 'నేను రకరకాల వంటలు చేస్తాను. అవి షడ్రసోపేతంగా ఉంటాయి. పైగా వాటి రుచులలో క్రొత్తదనం ఉంటుంది. ఎప్పుడూ చేసేవి కాకుండా నిత్యనూతనంగా కూడా ఉంటాయి. నన్ను మించే వంటలవాడు నగరంలో ఎవరూ లేరు - అన్నట్లుగా వండుతాను. ఈ వంటపనిలో ఎట్లాంటి శారీరక కష్టాన్ని అయినా లెక్కపెట్టక శ్రమించి కూడూ, కూరలూ చక్కగా వండుతాను.

విశేషం: ఆరు రసములు - ఉప్పు, పులుపు, తీపి, వగరు, కారం, చేదు. వీటిని షడ్రుచులు అని కూడా అంటారు.

తే. పఱియ వాపంగఁ దునియఁగా విఱువవలయు। నెడలఁ గాళులఁ జేతులఁ దొడలఁ బట్టి
కడఁగి యనువుగఁ జేసి ప్రొయ్యిడుదుఁ గాని। కత్తి గొడ్డలి యడుగ నేఁ గట్టియలకు. 78

ప్రతిపదార్థం: పఱియ+పాపంగన్= (కట్టెలు) చీల్చడానికి; తునియఁగాన్= ముక్కలుగా; విఱువవలయు+ఎడలన్= విరవవలసి వచ్చినపుడు; కాళులన్= కాళ్ళతో; చేతులన్= చేతులతో; తొడలన్= తొడలతో; పట్టి= పట్టి; కడఁగి= ప్రయత్నించి; అనువుగన్+చేసి=

పొయ్యిమంటకు అనుకూలమయ్యేటట్లు చేసి; ప్రొయ్యి+ఇడుదున్= పొయ్యిలో పెడతాను; కాని; ఏన్= నేను; కట్టియలకున్= కట్టెలకోసం; కత్తి= కత్తిని; గొడ్డలి= గొడ్డలిని; అడుగన్= అడగను.

తాత్పర్యం: కట్టెలు చీల్చవలసి వచ్చినా, ముక్కలుగా విరవవలసిన అవసరం ఏర్పడ్డా, కాళ్ళతో చేతులతో తొడలతో పట్టి చీలుస్తాను, విరుస్తాను, వాటిని పొయ్యిలో పెడతాను. అంతేకాని కట్టెలకొరకు కత్తి, గొడ్డలి అడగను.

క. సూపాధ్యక్షుఁడు గలిగిన । నాపురుషునితోడ సఖ్య మగునట్లుగ నే
నే పాట నైన నడవఁగ । నోపుదుఁ దత్తద్విధ ప్రయోగముల మెయిన్. 79

ప్రతిపదార్థం: సూప+అధ్యక్షుఁడు= వంటశాలకు అధిపతి; కలిగినన్= ఉంటే; ఆ పురుషునితోడన్= ఆ అధికారితో; సఖ్యము= స్నేహం; అగునట్లుగన్= అయ్యేటట్లు; ఏను= నేను; ఏ పాటన్+ఐనన్= ఏ విధంగానయినా; తద్+తద్+విధ ప్రయోగముల మెయిన్= ఆయా విధాలయిన ప్రయోగాలతో; నడవఁగన్+ఓపుదున్= నడచుకొనగలను.

తాత్పర్యం: వంటశాలకు అధికారి ఉన్నట్లయితే అతడితో స్నేహం కలుపుతాను.

విశేషం: వైరం ఎవరితోనూ పనికిరాదు. మరీ ఉద్యోగనిర్వహణలో పై అధికారితో వైరం పెట్టుకొనటం తగని పని. అందుచేత సామరస్య పూర్వకంగా ప్రవర్తిస్తానని భీముడు చెప్పాడు.

వ. అట్లుంగాక. 80

తాత్పర్యం: అంతే కాకుండా.

తే. జెట్టితండంబుతోడఁ జేపట్టి హొంత । కారి విఱిచినయట్టు లగ్గలిక విఱుతు
లాఁగు వేగంబు మెఱసి బలంబు నెఱపి । మల్లుతనమున మెప్పింతు మనుజవిభుని. 81

ప్రతిపదార్థం: జెట్టి తండంబుతోడన్= మల్లయుద్ధంచేసే వారి సమూహంతో; చేపట్టి= చేపట్లు పట్టి; హొంతకారి= శ్రేష్ఠుడయిన మల్లుడు; విఱిచిన+అట్టులు= విరిచినవిధంగా; అగ్గలికన్= అతిశయంతో; విఱుతున్= ఓడిస్తాను; లాఁగు వేగంబు= లంఘించే మల్లుని నేర్పులోని వేగాన్ని; మెఱసి= ప్రదర్శించి; బలంబు నెఱపి= బలాన్ని ప్రకటించి; మనుజవిభునిన్= విరాట మహారాజును; మల్లుతనమునన్= మల్లుతనంలో; మెప్పింతున్= మెప్పిస్తాను.

తాత్పర్యం: హేమాహేమీలయిన మల్లురతో కుస్తీలు పడతాను. వారిని మల్లయుద్ధంలో ఓడిస్తాను. మల్లయుద్ధంలో లంఘించే నైపుణ్యంతో కూడిన వేగాన్ని ప్రదర్శిస్తాను. నా బలాన్ని ప్రకటిస్తాను. మల్లుతనంలో రాజును మెప్పిస్తాను.

క. పెక్కండ్ర నొక్క పోరను । నుక్కఱ భంజించి చంపు టుడుగుదు; రాజుం
దక్కటి చూపఱు లెంతయు । వెక్కసపడఁ జిత్రగతుల విహరింతుఁ దగన్. 82

ప్రతిపదార్థం: ఒక్క పోరనున్= ఒకే యుద్ధంలోనే; పెక్కంఁడ్రను= చాలమందిని; ఉక్కు+అఱన్= గర్వం అణగేటట్లు; భంజించి= ఓడించి, లొంగిపోయేటట్లు చేసి; చంపుట= చంపటం; ఉడుగుదున్= మానివేస్తాను (చంపను అని భావం); రాజున్= రాజు; తక్కటి= మిగిలిన; చూపఱులు= చూచేవారు (ప్రేక్షకులు); ఎంతయున్ వెక్కస పడన్= ఎంతో అబ్బురపడే విధంగా; చిత్రగతులన్= అనేక రకాలయిన మల్ల బంధవిశేషాలతో; తగన్ విహరింతున్= తగినట్లుగా విహరిస్తాను.

తాత్పర్యం: ఒకే యుద్ధంలో చాలమందిని ఓడించి చంపకుండా వదలివేస్తాను. రాజూ ఇతర ప్రేక్షకులూ ఆశ్చర్యపడేటట్లుగా చిత్ర విచిత్రాలైన మల్ల బంధపద్ధతులతో సమయానికి తగినట్లుగా వినోదాన్ని కలిగిస్తూ విహరిస్తాను.

విశేషం: ఉ.వి. సంశోధిత ముద్రణ ప్రతిలో 'భంజించి జంపుటుడుగుదు' రనే పాఠం ఉన్నది. కాని, అది వ్యాకరణ సమ్మతం కాదు. కాబట్టి 'భంజించి చంపుటుడుగుదు'- అనే పాఠాంతరాన్ని గ్రహించటమైనది. 'భంజింతుఁ జంపు టుడుగుదు' అనే పాఠాంతరం కూడా ఉన్నది కాని, అంతకంటె పై పాఠమే సముచితంగా ఉన్నది. ఎట్లాగంటే- భీముడు మల్లయుద్ధ నిపుణుడు. మల్లయుద్ధంలో సామాన్యంగా ద్వంద్వయుద్ధం ప్రసిద్ధం. భీము డొకేసారి పెక్కురు మల్లురతో తలపడగలడు. అదొక విశేషం. మల్లయుద్ధంలో అనేక ఆవృత్తులు ఉంటాయి. భీముడు చేసే యుద్ధంలో ఒకే ఆవృత్తిలో పెక్కండ్రను డీకొని వారిని డీలాపడేటట్లు చేయటం ఆశ్చర్యం. మల్లయుద్ధంలో ప్రత్యర్థి నేలపై కూలి లేవలేని దీనస్థితిలో ఉండవచ్చును. అప్పుడు అతడితో యుద్ధం మానవచ్చును. లేదా అతడిని చంపవచ్చును. పగతో చేసే యుద్ధంలో ప్రత్యర్థిని చంపటం సహజం. పోటీకొరకో, విలాసంకొరకో చేసే మల్లయుద్ధాలలో ప్రత్యర్థిని 'భంజించి', చంపకుండా వదలటమే న్యాయం. భీముడు ప్రత్యర్థిని ప్రాణాలతో వదిలే అలవాటు లేనివాడు. అందువలన అన్నగారికి నమ్మకం కుదిరేటట్లు ప్రత్యేకంగా ఆ విషయాన్ని పేర్కొన్నాడు. కాగా, పలువురితో ఒక్కసారిగా చేసే యుద్ధంలో పలురకాల మల్ల క్రీడలను ప్రదర్శింపవలసివస్తుంది. దొమ్మి యుద్ధంలోవలె భీముడు ఏక వీరుడై మల్లురను ఓడించే ఆ యుద్ధక్రీడ రాజుకే కాదు, చూచేవారికెవ్వరికైనా అపూర్వంగా ఉంటుంది. చిత్రగతులతో వీరవిహారం చేయటం భీముడు ప్రదర్శించబోయే నేర్పరితనం. కొందరు -చంపుట ఉడుగుట' అంటే - యుద్ధంలో ఓడినవారిపై భీముడు దయచూపి వదలుట అని భావిస్తారు. కాని, అది ప్రస్తుతం కాదు. ఆవేశపరుడైన భీముడు తనను తాను నిగ్రహించుకొని వినోదక్రీడను విరోధక్రీడగా భావించకుండా ఉంటానని అన్నకు వ్యంగ్యంగా చెప్పుతున్న మాటే అది. తనమాటకు పోషకంగా రాబోయే పద్యంలో మల్లురవలెనే, సింహాది మృగాలను సైతం చంపకుండా వాటిని తన ఉక్కుపట్టుతో అణచి ఉంచుతానంటాడు. ఇది సమయోచిత సంభాషణం. (సంపా.)

చ. **అదియునుఁ గాక కోలుపులి నైనను, గా రెనుపోతు నైన, ను**
న్మదకరినైన, నుగ్రమృగనాథుని నైనను గిట్టి ముట్టి బె
ట్టిదముగఁ గాలఁ గేలను గడింది మగంటిమి యుల్లసిల్లఁ బ
ట్టుదు నడఁగంగ మాత్స్యుఁడు గడున్ వెఱఁగందుచుఁ బిచ్చలింపఁగన్. **83**

ప్రతిపదార్థం: అదియునున్+కాక= అంతేకాకుండా; కోలుపులిన్+ఐనను= పెద్దపులినయినా; కారు+ఎను పోతున్+ఐనన్= అడవి దున్నపోతునయినా; ఉత్+మదకరిని+ఐనన్= మిక్కిలి మదించిన ఏనుగునయినా; ఉగ్ర, మృగనాథునిన్+ఐనన్= భయంకరమయిన సింహాన్నయినా; కిట్టి= సమీపించి; ముట్టి= ఎదిరించి; బెట్టిదముగన్= క్రూరంగా, కఠినంగా; కాలన్= కాలితో; కేలను= చేతితో; కడింది మగంటిమి= మిక్కుటమయిన పౌరుషం; ఉల్లసిల్లన్= ప్రకటితం కాగా; మాత్స్యుఁడు= విరాటమహారాజు; కడున్= మిక్కిలి (ఎంతో); వెఱఁగందుచున్= ఆశ్చర్యపడుతూ, నిశ్చేష్టుడౌతూ; పిచ్చలింపఁగన్= మిక్కిలి మెచ్చుకొనేటట్లు; అడఁగంగన్+పట్టుదున్= అణచిపట్టుకొంటాను.

తాత్పర్యం: అంతే కాదు. విరాటమహారాజు అబ్బురపాటుతో నిశ్చేష్టుడై నన్ను పొగడ్తలతో ముంచెత్తేటట్లు పెద్దపులిని గాని, అడవిదున్ననుగాని, మదించిన ఏనుగునుగాని, భయంకరమయిన సింహాన్నిగాని, సమీపించి, ఎదిరించి, కమ్ముకొని, మేటి పౌరుషాన్ని ప్రదర్శించి, కాలితో, చేతితో అణచి ఉక్కిరిబిక్కిరి అయ్యేటట్లు అదిమి పట్టుకొంటాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: క్రూరమృగాలతో పోరాటం సాహసంతో కూడుకొన్న పని. వేగానికి పులి, ఎదురుదాడికి అడవిదున్న, తిరుగులేని బలానికి మదపుటేనుగు, క్రూరత్వానికి సింహం లోకంలో ప్రసిద్ధం. వాటి నన్నింటిని అదుపులో ఉంచగలిగిన భీమ పరాక్రమం తప్పక ప్రశంసనీయమే ఔతుంది. (సంపా.)

వ. ఇట్లు నానాప్రకారంబుల నతని మనంబు వడయుచు వలలుండను సమాఖ్య వహింతు; నమ్మహీపతి 'నీ వెవ్వరి వాఁడ?' వని యడిగె నేని 'పాండవాగ్రజునకు బానసంబు సేయుదు ననం గలవాఁడ' ననిన విని ధర్మజుం డమ్మెయికి సమ్మతించి బీభత్సు వీక్షించి ఘూర్ణమాన మానసుం డగుచు నిట్లనియె. 84

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నానా ప్రకారంబులన్= అనేకరకాలుగా; అతని మనంబు= విరాటుని మనస్సును; పడయుచున్= లోగొనుచూ, ఆకర్షిస్తూ; వలలుండు+అను సమాఖ్య= వలలుడు అనే పేరు; వహింతున్= ధరిస్తాను, పెట్టుకుంటాను; ఆ+మహీపతి= ఆ రాజు; నీవు; ఎవ్వరి వాఁడవు= ఎవరివి, ఎవరిదగ్గర ఉన్నావు; అని+అడిగెన్+ఏని= ప్రశ్నించినట్లయితే; పాండవ+అగ్రజునకున్= ధర్మరాజుకు; బానసంబు= వంట; చేయుదున్= చేస్తాను; అనన్+కలవాఁడను= అంటాను; అనినన్= అని చెప్పగా; విని; ధర్మజుండు= ధర్మరాజు; ఆ+మెయికిన్= ఆ పద్ధతికి (భీముడు వలలుడుగా వ్యవహరించటానికి); సమ్మతించి= ఒప్పుకొని; బీభత్సునిన్= అర్జునుని; వీక్షించి= చూచి; ఘూర్ణమాన మానసుండు+అగుచున్= కలతపడిన మనస్సు కలవాడౌతూ; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా ఎన్నో రకాలుగా విరాటమహారాజు మనస్సును ఆకర్షిస్తాను. వలలుడనే పేరుతో వ్యవహరిస్తాను. 'నీ వెవర' వని అడిగితే ధర్మరాజు దగ్గర వంటలు చేసేవాడిని అని చెప్పుతాను' అని భీము డన్నాడు. ఆ మాటలు వినిన ధర్మరాజు భీముడి అజ్ఞాతవాస వర్ణన విధానానికి అంగీకారం తెలిపాడు. ఆ తరువాత అర్జునుడి వైపు చూచాడు. అతడి మనస్సు కలవరపాటుకు లోనయింది. అర్జునుడితో ఈ విధంగా అన్నాడు.

ఉ. 'ఖాండవ మేర్చె; దేవతలుఁ గానని యీశ్వరుఁ గాంచె; దోర్బలో
ద్దండ మహాసుర ప్రతతి దర్ప మడంచి ప్రియం బొనర్చి యా
ఖండలుఁ డున్న గద్దియసగంబున నుండె; మహానుభావుఁ డీ
తం డొక మర్త్యుఁ జేరి యనుదాత్తత నెమ్మెయిఁ గొల్చువాఁ డొకో!' 85

ప్రతిపదార్థం: ఈతండు= అర్జునుడు; ఖాండవము= ఖాండవవనాన్ని; ఏర్చెన్= దహింపచేశాడు; దేవతలున్+కానని= దేవతలు కూడ దర్శించలేని; ఈశ్వరున్+కాంచెన్= ఈశ్వరుని ప్రత్యక్షం చేసికొన్నాడు; దోర్బల= భుజబలంచేత; ఉద్దండ= భయంకరమయిన; మహా+అసుర= గొప్పరాక్షసుల యొక్క; ప్రతతి= సమూహం యొక్క; దర్పమున్= గర్వాన్ని; అడంచి= అణచి; ప్రియంబు+ఒనర్చి= ప్రీతి చేసి; ఆఖండలుఁడు= ఇంద్రుడు; ఉన్నగద్దియ= అధిష్ఠించిన సింహాసనంయొక్క; సగంబునన్+ఉండెన్= సగభాగంలో కూర్చున్నాడు; మహా+అనుభావుఁడు= (ఇంతటి) మేటి ప్రభావం కలవాడు; ఒకమర్త్యున్+చేరి= ఒక మానవమాత్రుని ఆశ్రయించి; అనుదాత్తతన్= తక్కువదనంతో, దైన్యంతో; ఏ+మెయిన్= ఏ విధంగా; కొల్చువాఁడు+ఒకో!= సేవిస్తాడో కదా!

తాత్పర్యం: 'ఈ అర్జునుడు ఖాండవవనాన్ని కాల్చాడు. దేవతలు కూడా చూడలేని ఈశ్వరుడిని ప్రత్యక్షం చేసికొన్నాడు. భుజబలదర్పితులయిన రాక్షసుల గర్వాన్ని అణచివేశాడు. ఇంద్రుడికి సంప్రీతి కలిగించాడు. అతని అర్ధాసనం అలంకరించాడు. అటువంటి మహానుభావుడైన అర్జునుడు సామాన్యుడయిన ఒక రాజును ఆశ్రయించి దైన్యంతో ఏ విధంగా సేవిస్తాడో కదా!'

విశేషం: అలం: విషమం. అనురూపాలు కాని వాటికి కలిగిన సంబంధాన్ని గురించి వర్ణిస్తే విషమాలంకారం. ఈ పద్యంలో అర్జునుడు మహానుభావుడుగా చెప్పబడ్డాడు. అతడు ఒక సామాన్య మానవుడిని ఆశ్రయించి సేవించవలసిన హీనస్థితి (అనుదాత్తత) ఏర్పడిందే అని ధర్మరాజు మనసులో కలతచెంది విచారించాడు. అర్జునుడు మహాత్ముడనటానికి నాలుగు హేతువు లిందులో ధర్మరాజు పేర్కొన్నాడు. 1. ఖాండవ దహనం. 2. దేవతలుకూడా చూడలేని పరమేశ్వరుడిని ప్రత్యక్షంగా దర్శించటం, 3. దేవతలకు సింహస్వప్నంగా మారిన నివాతకవచాది భీకర రాక్షస సమూహాన్ని సంహరించి దేవతలకు మేలుచేయటం. 4. ఇంద్రుడితో కలిసి అతడి సింహాసనమీద కూర్చొనటం. ఈ నాలుగు ఆది సభాపర్వకథార్థాలలో ప్రసక్తాలైనవే. విశేషమేమంటే - ఆ నాల్గింటిని భూలోకంలో అర్జును డొక్కడే సాధించాడు. సత్రయాగాలలో ఆజ్యహవిస్సులను ఆరగించి అజీర్ణవ్యాధికి గురి అయిన అగ్నిదేవుడు శ్రీకృష్ణార్జునుల నాశ్రయించి వారి రక్షణలో ఖాండవదహనంచేసి అందులోని ఓషధుల ప్రభావం వలన తన రుగ్మతను పోగొట్టుకొని అర్జునుడికి గాండీవం, రథం ఇచ్చాడు. ఖాండవదహనంలో అగ్ని అర్జునుడిని ఆశ్రయించాడు. అర్జునుడు ఇంద్రుడిని జయించాడు. పాశుపతాస్త్ర ఘట్టంలో కిరాతవేషంలో వచ్చిన పరమశివుడిని ప్రతాపంతో మెప్పించి వరాలను పొందాడు. ఆ తరువాత ఇంద్రుడు అర్జునుడిని తనువుతో అమరావతికి తీసికొనిపోయి, అర్ధ సింహాసనం మీద కూర్చుండబెట్టుకొని, తనూ దిక్పాలకులూ కలిసి దివ్యాస్త్రాల నెన్నింటినో అతడికి అనుగ్రహించారు. అర్జునుడు ఇంద్రుడి కోరికపై నివాతకవచాదులను సంహరించి అతడికి ప్రీతి కలిగించాడు. ఇంద్రుడు, పరమేశ్వరుడు వంటి సర్వలోకాధిపతులను మెప్పించిన మహావీరుడైన అర్జునుడు అన్ని విధాలా మహానుభావుడు. అంటే దివ్యుడు. అతడు దివ్యుడని దేవతలు కూడ పేర్కొన్నారు. అటువంటి మహానుభావుడు ఒక సామాన్యమానవుడైన విరాటుడిని సేవించటం ఎట్లా సాధ్యం! అని ఆశ్చర్యపోయాడు ధర్మరాజు. అందరికంటె అర్జునుడిదే అధికమైన సమస్య. అతడి దివ్యత్వం దాచిపెట్టుకొనలేనిది. అందుకే అంతటి ఆవేదన ధర్మరాజుకు. (సంపా.)

క. అను మాటలు విని సంక్రం। దన నందనుఁ డిట్టు లనియె 'దైవంబుకతం
బున నాకు నొక్క చందం। బనువై యున్న యది; దీని నౌఁగా దనుఁడా! 86

ప్రతిపదార్థం: అను మాటలు= ధర్మరాజు మాట్లాడిన మాటలను; విని= విని; సంక్రందన నందనుండు= ఇంద్రుని కుమారుడయిన అర్జునుడు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; దైవంబు కతంబునన్= దైవ నిర్ణయం ప్రకారం; నాకున్= నాకు; ఒక్క చందంబు= ఒక పద్ధతి; అనువు+ఐ+ఉన్న+అది= అనుకూలంగా ఉన్నది. దీనిని; ఔన్+కాదు+అనుఁడా!= ఔను కాదు అని మీ అభిప్రాయం చెప్పండి.

తాత్పర్యం: ధర్మరాజు మాటలు విని అర్జునుడు ఇట్లా అన్నాడు- 'దైవానుగ్రహంవలన నా అజ్ఞాతవాసవేషానికి ఒక ఉపాయం నిర్ణీతమై ఉన్నది. ఇది తగునో కాదో మీరే చెప్పండి.

వ. అమరనగరంబున కరిగినయెడ నూర్వశి నన్ను నపుంసకుంగా శపియించిన, నాకు నాకేశుండు గరుణించి, 'ఈ శాప ఫలంబు భవదజ్ఞాతవాస వత్సరంబున ననుభవించి, తదనంతరంబ శాప మోక్షంబ వడయు' మని దీవించెం గావునఁ బేడితనంబు దాల్చి బాహులదీర్ఘత్వంబునకు, గుణకిణంబులకు, గంచుకంబును, శంఖ వలయంబులును మాటు సేసికొని విరాటు కడకుం జని. 87

ప్రతిపదార్థం: అమరనగరంబునకున్= అమరావతికి; అరిగిన+ఎడన్= వెళ్ళినపుడు; ఊర్వశి; నన్ను; నపుంసకున్+కాన్= నపుంసకుడయ్యేటట్లు; శపియించినన్= శపించగా; నాకున్= నాకు; నాక+ఈశుండు= స్వర్గాధిపతి అయిన దేవేంద్రుడు; కరుణించి= అనుగ్రహించి; ఈ శాపఫలంబున్= ఊర్వశి ఇచ్చిన ఈ శాపం యొక్క ఫలితాన్ని; భవత్= నీ యొక్క; అజ్ఞాతవాసవత్సరంబునన్= అజ్ఞాతవాసం చేయవలసిన సంవత్సరంలో; అనుభవించి= అనుభవించి; తదనంతరంబు+అ= తరువాత; శాపమోక్షంబు+

పడయుము= శాపవిముక్తిని పొందుము; అని= అని; దీవించెన్= దీవించాడు; కావునన్= కాబట్టి; పేడితనంబు+తాల్చి= నపుంసకత్వాన్ని ధరించి; బాహుల దీర్ఘత్వంబునకున్= చేతుల పొడగరితనానికి; గుణకిణంబులకున్= వింటినారి దెబ్బలవలన ఏర్పడ్డ కాయలకు; కంచుకంబును= రవికెయు; శంఖవలయంబులున్= శంఖాలతో చేసిన గాజులను; మాటు చేసికొని= అడ్డుపెట్టుకొని; విరాటుకడకున్+చని= విరాటమహారాజు దగ్గరికి వెళ్ళి.

తాత్పర్యం: నేను అమరావతికి వెళ్ళినప్పుడు ఊర్వశి నన్ను 'నపుంసకుడవు క' మ్మని శపించింది. కాని, దేవేంద్రుడు కరుణించి 'ఈ శాపఫలితాన్ని అజ్ఞాతవాస కాలంలో అనుభవించుము. అది ముగియగానే శాప విముక్తి కలుగుతుందని దీవించాడు. అందుచేత పేడితనం ధరిస్తాను. నా ఆజానుబాహుత్వం కనబడకుండా కంచుకం ధరిస్తాను. చేతులమీద, భుజాలమీద ఉన్న కాయలు కనబడకుండా శంఖపు గాజులు వేసికొంటాను. నపుంసకవేషంలో విరాటుడి దగ్గరికి వెళ్ళుతాను.

విశేషం: ఒక్కొకసారి శాపమే వరంగా పరిణమిస్తుందనటానికి ఇది తార్కాణం. అర్జునుడు అమరావతిలో ఉన్నప్పుడు ఇంద్రుడు అతడికి అర్ధాసనం ఇచ్చి, స్వీయకిరీటాన్ని ధరింపచేసి, ఎన్నో సత్కారాలు చేసి, ఒక మణిమయ భవనంలో ఉంచాడు. ఊర్వశి అతడిపై మరులుకొని రాత్రివేళ అతడిని సమీపించి, పొందుకోరింది. అర్జును డామెను తల్లిగా గౌరవించాడు. ఊర్వశి తాను దేవవేశ్య ననీ, ఉపభోగ్యురాలననీ, అది దేవలోక ధర్మమనీ బోధించింది. కాని, అర్జునుడు భూలోక ధర్మాన్ని అనుసరించి, చంద్రవంశకర్త అయిన పురూరవుడికి పత్నిగా ఉన్న ఊర్వశి తల్లివంటిదని బదులు చెప్పి ఆమె కోర్కెను తిరస్కరించాడు. అందు కామె కోపించి అతడిని నపుంసకుడివి కమ్మని శపించింది. అర్జునుడు ఖిన్నుడయ్యాడు. కాని, అతడి ధర్మవ్రతానికి మెచ్చి ఇంద్రుడాశాపం అజ్ఞాతవాస కాలంలో మాత్రమే ప్రవర్తిల్లేటట్లు అనుగ్రహించాడు. ఇది పూర్వమే దైవ నిర్ణయంగా ఏర్పడింది. కాబట్టి మరొక మార్గం లేదని అర్జునుడు చెప్పాడు. ధర్మజు డనుమతించాడు. నపుంసకుడైనా అర్జునుడు తన శరీర సహజచిహ్నాలను కొన్నింటిని కలిగి ఉంటాడు. అవి పొడవైన చేతులు, గాండీవపు అల్లెత్రాటి ఒరవడివలన భుజాలమీద, చేతులమీద ఏర్పడిన కాయలు; వాటిని సముచితంగా కప్పిపుచ్చుకొనేందుకు కంచుకం, శంఖాల గాజులు ధరించటం విశేషం. (సంపా.)

క. ఉత్తమ కన్యాజనులకు । నృత్తము గఱపంగ నాకు నేర్పు గలదు; త
ద్వృత్తమునకు న న్నేలుము; । చిత్తమునకు నెక్కఁ బనులు చేసెద నందున్. 88

ప్రతిపదార్థం: నాకున్= (అర్జునునికి); ఉత్తమ కన్యాజనులకున్= మంచి గుణాలు కల కన్యల సమూహాలకు; నృత్తము= నాట్యం; కఱపంగన్= నేర్పటానికి (తగిన); నేర్పు= నైపుణ్యం; కలదు= ఉన్నది; నన్నున్= నన్ను; తత్+వృత్తమునకున్= ఆ పనికి; ఏలుము= నియుక్తునిగా చేయుము; చిత్తమునకున్+ఎక్కన్= మనసుకు నచ్చేవిధంగా; పనులు= పనులు; చేసెదన్= చేస్తాను; అందున్= అని మనవి చేస్తాను.

తాత్పర్యం: నాకు నాట్యం తెలుసు. అంతఃపురంలోని ఉత్తమ కన్యలకు నాట్యం నేర్పుతాను. ఈ పనికి నన్ను నియోగించుము. నీ మనసుకు నచ్చేటట్లు పనిచేస్తాను- అని అంటాను.

విశేషం: 1. అర్జునుడు ధనుర్విద్యా విశారదుడు మాత్రమే కాదు. నాట్యం తెలిసినవాడు కూడా. అజ్ఞాతవాసంలో అవసరం ఉంటుందని గ్రహించి ఇంద్రుడు అమరావతిలో చిత్రసేనుడనే గంధర్వరాజువద్ద అర్జునునికి గీత వాద్య నృత్యాలను నేర్పి పండితుడిని చేయించాడు. ఆ విద్యను అర్జునుడు వినియోగించుకొంటున్నాడు.

2. నాట్యశాస్త్ర మర్యాదలో నృత్తం. నృత్యం, నాట్యం అనే పారిభాషిక పదాలు ప్రసిద్ధాలు. నృత్తం ఆంగికవిన్యాస ప్రచారం. నృత్యం భావప్రధానం. నాట్యం అభినయ రసప్రధానం. భరతనాట్యకోవిదులు నృత్తమును పరమేశ్వరుడు ప్రవర్తింపజేశాడని చెప్పుతారు. ఏమైనా సాహిత్యంలో నృత్త, నృత్య, నాట్యశబ్దాలు నాట్యం అనే అర్థంలోనే వాడబడుతూ ఉంటాయి. (సంపా.)

క. అని కొలిచి యే బృహన్నల। యను నామముతోడఁ గన్యకాంతఃపుర వ

ర్తన మొనరించుచు లాసిక। తనమున నిపుణుండనై యతని మెచ్చింతున్. 89

ప్రతిపదార్థం: అని= నాట్యం నేర్పుతానని; కొలిచి= సేవలో కుదురుకొని; ఏన్= నేను; బృహన్నల+అను నామముతోడన్= బృహన్నల అనే పేరుతో; కన్యకా+అంతఃపురవర్తనము= కన్యలుండే అంతఃపురంలో ప్రవర్తించటం; ఒనరించుచున్= చేస్తూ; లాసికతనమునన్= నాట్యంలో, ఆటకత్తె తనంలో; నిపుణుండన్+ఐ= నేర్పరితనం కలవాడనై; అతనిన్= అతనిని (విరాటుని); మెచ్చింతున్= మెప్పిస్తాను.

తాత్పర్యం: విరాటుడి కొలువులో బృహన్నల పేరుతో అడుగుపెట్టుతాను. కన్యకాంతఃపురంలో సంచరిస్తాను. సుకుమారమయిన నాట్యంలో నేర్పరితనాన్ని ప్రదర్శిస్తాను. విరాటుడిని మెప్పిస్తాను.

క. మానవపతి న 'న్నెక్కడి। దానవు నీ' వనియెనేని 'ద్రౌపదికడ స

మ్మానంబు వడసి మెలఁగుదు;। నా నగళుల నృత్యగురువ ననఁగల వాఁడన్'. 90

ప్రతిపదార్థం: మానవపతి= విరాటమహారాజు; నన్నున్; ఎక్కడిదానవు+నీవు+అనియెన్+ఏని= నీవు ఎవరు? ఎక్కడనుండి వచ్చావు? ఎవరి తాలూకు మనిషివి? అని అడిగినట్లయితే; ద్రౌపది కడన్= ద్రౌపది దగ్గర; సమ్మానంబు+పడసి= గౌరవం పొంది; మెలఁగుదున్= ఉండేదానిని; ఆ నగళులన్= ఆ ద్రౌపదియొక్క అంతఃపురాలలో; నృత్యగురువు+అన్+అనన్+కలవాఁడన్= నాట్యం నేర్పే గురువును అని అంటాను.

తాత్పర్యం: ఆ రాజు 'నీ వెక్కడిదానవు?'- అని నన్నడిగితే- 'నేను ద్రౌపది ఆదరగౌరవాలను పొంది, ఆమె అంతఃపురాలలో నృత్యగురువుగా పేరుపొందానని చెప్పుతాను.'

విశేషం: ఉ.వి. సంశోధిత ప్రతిలో 'నృత్యగురువయనఁగలవాఁడన్' అనే పాఠం ఉన్నది. 'నృత్యగురువనంగలవాఁడన్' అని పాఠాంతరం ఉన్నది. వావిళ్ళ ప్రతిలో 'నృత్యగురువననఁగలవాడన్' అని ఉన్నది. ఇక్కడ ఏవార్థకం (నృత్యగురువు+అ) లేదు. 'గురువు' 'నేను'కు విశేషణం. కాబట్టి అస్మద్విశేషణం. దీనికి చివర ఏకత్వంలో 'ను అంతాగమమయి, అది పరం కాగా, విశేషణపదం అంతానికి అత్వంవచ్చి, (నేను) గురువు+అ+ను= (నేను) గురువన్+అనఁగలవాఁడన్. నేను గురువననఁగలవాఁడన్ అగును- (బాల కారక. 33, 34 సూ.) కాబట్టి ఈ పాఠాన్ని గ్రహించడమైనది. (సంపా.) నపుంసకుడిని స్త్రీగా సంబోధించటం లోకవ్యవహారం.

తే. అనిన 'నిది వోలు' నని యియ్యకొని యజాత। వైరి యల్లన నకులుని వలను సూచి

నెమ్మనంబున నుమ్మలికమ్ము గదుర। నెలుఁగు చందంబు వేఱుగా నిట్టు లనియె. 91

ప్రతిపదార్థం: అనినన్= అర్జునుడు తాను బృహన్నలఅయి నాట్యగురువుగా ఉంటానని చెప్పగా; ఇది= ఈ పద్ధతి; పోలున్= తగును (బాగుంది); అని= అని; ఇయ్యకొని= సమ్మతించి; అజాతవైరి= ధర్మరాజు; అల్లనన్= మెల్లగా; నకులుని వలను= నకులుని వైపు; చూచి; నెఱ+మనంబునన్= నిండు మనస్సులో; ఉమ్మలికమ్ము+కదురన్= వేదన అతిశయించగా; ఎలుఁగు చందంబు వేఱు+ కాన్= కంఠస్వరం మారిపోగా (డగ్గుత్తికతో); ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడి మాటలు విన్న ధర్మరాజు 'ఇది చాల బాగుంది' అని తన సమ్మతి తెలియజేశాడు. ఆ తరువాత నకులుడి వైపు చూచాడు. అతడిని చూడగానే ధర్మరాజు మనసులో వేదన కలిగింది. గొంతు బొంగురుపోయింది. అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 1. అజాతవైరి అంటే పుట్టని శత్రువులు కలవాడు అని అర్థం. ధర్మరాజుకు దుర్యోధనుడు శత్రువుకాదా? అనే సందేహం కలగటం సహజం. కాని, ధర్మరాజు మనసా ప్రతివారిని మిత్రుడిగా భావించేవాడు. దుర్యోధనుడికి ధర్మరాజు శత్రువు కావచ్చును కాని, ధర్మరాజుకు దుర్యోధనాదుల యెడల శత్రుభావం లేదు.

2. మనసులో దుఃఖం పొంగుతున్నప్పుడు కంఠస్వరం మారటం సహజం. ఇది సాత్త్విక భావం. తిక్కన రచనలో అభినయాంశాలు వస్తువును నాటకీయంగా రమ్యతరం చేస్తాయి అనటానికి ఇది ఒక ఉదాహరణ.

ఉ. 'ఒప్పెడు మేనుఁ బెంపు గల యుల్లము, నాగరికంపుఁ జందముం
జెప్పక చూప కీతని విశేషముఁ దెల్పెడుఁ గొల్చుటెంతయున్
డెప్పర; మేమి సేయుదుఁ గడింది విచారము పుట్టె; నె ట్లితం
డప్పురి సంచరించునొకొ! యన్యు లెఱుంగక యుండునట్లుగన్.' 92

ప్రతిపదార్థం: ఒప్పెడు మేను= చక్కని శరీరం; పెంపు+కల+ఉల్లము= ఎంతో ఉన్నతమయిన మనస్సు; నాగరికము+చందమున్= నాగరకత తీరు; చెప్పక= చెప్పకుండాను; చూపక= చూపనవసరం లేకుండా; ఈతని విశేషమున్+తెల్పెడున్= ఇతని ఆధిక్యాన్ని తెలుపుతున్నాయి కాబట్టి; కొల్చుట= సేవించటం; ఎంతయున్= ఎంతో; డెప్పరము= చేయడానికి వీలుకానిది; ఏమి+చేయుదున్?= నేనేం చేయగలను?; కడింది= అధికమయిన; విచారము+పుట్టెన్= దుఃఖం కలుగుతున్నది; ఆ+పురిన్= ఆ విరాటుని నగరంలో; అన్యులు= ఇతరులు; ఎఱుంగక+ఉండు+అట్లుగన్= తెలియకుండా ఉండేటట్లు; ఇతండు= నకులుడు; ఎట్లు= ఏ విధంగా; సంచరించును+ఒకొ!= సంచరిస్తాడో మరి!

తాత్పర్యం: 'నకులుడికి చక్కని శరీరం ఉన్నది. దానికి తోడు గొప్ప మనసు ఉన్నది. ఈతడి నాగరికతను శరీరం, మనసు రెండూ పట్టిస్తాయి. ఇతరులను సేవించటం సుతరామూ ఇతడికి చాల కష్టం. ఇబ్బందులు తప్పవు. ఇతరులు గుర్తుపట్టకుండా ఇతడు ఆ పట్టణంలో ఏ విధంగా సంచరిస్తాడో ఏమో! ఏం చేసేది? నా మనస్సులో ఎంతో విచారం కలుగుతున్నది'

విశేషం: అలం: విషమం. అనురూపాలుకాని అంశాలకు సంబంధం ఇందులో విచారించబడింది. నకులుడు అందగాడు. మేను సుకుమారమైనది. మనసు కోమలమైనది. నడవడిక చాల నాగరకమైనది. అతడి వైఖరి ఒక విశేష వ్యక్తిత్వాన్ని తెలుపుతూ ఉంటుంది.

అతడు సేవకవృత్తికి తగినవాడు కాడు. అయినా చేయవలసివస్తున్నది. అందుకు ధర్మరాజు మనసులో ఎంతో విచారపడుతున్నాడు. నకులుడి లక్షణాలు సుకుమారుడి కుండేవి కాని, సేవకుడికుండేవి కావు. అందువలన అతడు సేవకవృత్తిలో కుదిరినా చూచేవారు అతడిని అన్యథా భావించే అవకాశం ఉన్నది. అజ్ఞాతవాసం అప్పుడు సమస్య కాగలదు. ఈ అననురూపమైన అంశాల విచారంతో ధర్మజుడు వ్యథ చెందాడు. పై అలంకారం వలన నకులుడి పాత్రపట్ల సహృదయులలో సానుభూతిని కలిగించే భావశిల్పం గమనార్హం. (సంపా.)

వ. అనిన నప్పలుకులకు నకులుం డిట్లనియె. 93

తాత్పర్యం: అనిన ధర్మరాజు మాటలు విని నకులుడు ఈ విధంగా పలికాడు.

ఆ. **'అశ్వశిక్షకుండనై మత్స్యభూవిభుఁ। గొలుచువాఁడ; గుఱ్ఱములకు వలయు**
తెఱఁగు లెల్లఁ జాల నెఱుఁగుదు; రూపుగా। నరయ నేర్తు వాని ననుదినంబు. 94

ప్రతిపదార్థం: అశ్వశిక్షకుండను+ఐ= గుర్రాలను శిక్షించేవాడినయి; మత్స్యభూవిభున్= మత్స్యదేశానికి రాజయిన విరాటుని; కొలుచువాఁడన్= సేవిస్తాను; గుఱ్ఱములకున్= గుర్రాలకు; వలయు= అవసరమయిన; తెఱఁగులు= పద్ధతులు; ఎల్లన్= అన్నీ; చాలన్= బాగా; ఎఱుఁగుదున్= తెలిసినవాడిని; అనుదినంబు= ప్రతిదినం; వానిన్= గుర్రాలను; రూపుగాన్= చక్కగా; అరయనేర్తున్= పర్యవేక్షిస్తాను.

తాత్పర్యం: అశ్వశిక్షకునిగా సేవలోచేరి నేను మత్స్యరాజును మెప్పిస్తాను. అశ్వాలకు అవసరమయిన శిక్షణ పద్ధతులన్నీ బాగా తెలిసినవాడిని. ప్రతిరోజూ ఎంతో నేర్పుతో గుర్రాల బాగోగులు పర్యవేక్షణ చేస్తాను.

విశేషం: 'గుఱ్ఱములకు వలయు తెఱఁగు లెల్లఁ జాల నెఱుఁగుదు' నని నకులుడు చెప్పాడు. ఆ పరిజ్ఞానంతో అశ్వశిక్షణలో విరాటరాజును మెప్పిస్తానన్నాడు. ధర్మజు డామాటలతో సంతృప్తిపడేవాడు కాడు. 'ఆ తెఱఁగు లెల్ల' వివరించి చెప్పితేకాని అనుమతించడు. అందువలన తరువాత సీసపద్యంలో తిక్కన ఆ వివరాలను చెప్పించాడు. (సంపా.)

సీ. **గోడిగ జాతిలోఁ గొదమ పెంటుల నేర్చి। మావుల హత్తించు మార్దవంబుఁ,**
త్రాళ్ళఁ బట్టింపంగఁ దఱి యైన కొదమల। సంచంబు లెఱిఁగి శిక్షించు నేర్పుఁ,
గళ్యాలఁ బదిలంబు గాని గుఱ్ఱంబులఁ। గ్రొత్త ముట్టున కియ్య కొలుపు వెరవుఁ,
బెనఁగు శూకలముల బిరుసుతనంబులఁ। జలము డింపక తీర్పఁ జాలుటయును.

తే. **నలవరించిన వాఁడ; లాయమున నున్న। యపుడు దొసఁగించుకయు లేనియట్లు గాఁగ**
మాటి మాటికిఁ బరికించి మందడీల। కెల్ల నూఱట యగుచు వర్తిల్ల నేర్తు. 95

ప్రతిపదార్థం: గోడిగ జాతిలోన్= ఆడుగుర్రాల జాతిలో; కొదమపెంటులన్= వయసువచ్చిన ఆడుగుర్రాలను; ఏర్చి= వేరుపరచి; మావులన్= మగ గుర్రాలతో; హత్తించు= కలిపేటటువంటి; మార్దవంబున్= మృదువయిన నేర్పునూ; త్రాళ్ళన్+పట్టింపంగన్= త్రాళ్ళు వేయటానికి; తఱి+ఐన= వయసువచ్చిన; కొదమల= పిల్ల గుర్రాలయొక్క; సంచంబులు= జాతివైనాలను; ఎఱిఁగి= తెలిసికొని; శిక్షించు= అలవరచే; నేర్పున్= నేర్పున్నూ; కళ్యాలన్= నోటికి వేసే కళ్ళేలకు; పదిలంబు+కాని= లొంగనటువంటి; గుఱ్ఱంబులన్= గుర్రాలను; కొత్తముట్టునకున్= చిన్న దారపు పోగునకు, ఇయ్యకొలుపు= అలవాటు చేసే; వెరవున్= ఉపాయమున్నూ; పెనఁగు= గింజుకొనే; శూకలముల= మొండి గుర్రాలయొక్క; బిరుసుతనంబులన్= పొగరుబోతుతనాలను; చలము= పట్టుదల; డింపక= వదలిపెట్టకుండా; తీర్పన్+చాలుటయును= చక్కచేయటమున్నూ; లాయమునన్= గుర్రాలశాలలో; ఉన్న+అపుడు= ఉన్నప్పుడు; దొసఁగు= దోషం; ఇంచుకయున్= కొంచెంకూడా; లేని+అట్లు+కాఁగన్= లేకుండా ఉండేటట్లు; అలవరించినవాఁడన్= నేర్చుకొన్నవాడిని; మాటికిన్+మాటికిన్= ప్రతిసారీ; పరికించి= పరిశీలించి; మందడీలకున్+ఎల్లన్= అశ్వశిక్షకులకందరికీ; ఊఱట+అగుచున్= ఓదార్పు, విశ్రాంతి కలిగిస్తూ; వర్తిల్లన్+నేర్తున్= నడచుకొనగలను.

తాత్పర్యం: వయసువచ్చిన ఆడు గుర్రాలలో ఎదకు వచ్చిన వాటిని గుర్తిస్తాను. ఎన్నిక చేసిన మగ గుర్రాలతో వాటిని కలిపే నేర్పు నా కున్నది. పిల్ల గుర్రాల లక్షణాలను గుర్తించి వాటిని తాళ్ళతో కళ్లెంవేసి అలవాటుచేసే నేర్పు నా కున్నది.

కళ్ళేలకు లొంగని గుర్రాలు ఉండవచ్చును. వాటిని కేవలం నూలుపోగు కళ్ళెంచేతనే లోబరచుకొనే నేర్పు నాకున్నది. మారాంచేసే మొండి గుర్రాల పొగరును తగ్గించి లొంగదీసికొనే నేర్పు నాకున్నది. అశ్వశాలలోని గుర్రాలకు ఎటువంటి రోగాలూ రాకుండా, లోపాలు ఏర్పడకుండా మెలకువతో ఉంటాను. మాటిమాటికి వాటిని పరీక్షిస్తాను. అశ్వశిక్షకులకు ఊరట, విశ్రాంతి కలిగే విధంగా పరామరికతో ప్రవర్తిస్తాను.

విశేషం: మూలంలో ఈ విధంగా లేదు. ఇది తిక్కన చేసిన విస్తృతి. తిక్కన తనకున్న అశ్వశిక్షణ విజ్ఞాన సంపదను నకులుడి పాత్రలో నిక్షేపించాడు. తిక్కన ఏది చెప్పినా ఒక క్రమంలో చెప్పి, తన కావ్యకళా శిక్షణాచార్యకత్వాన్ని నిరూపించుకొంటాడు. అశ్వశిక్షకుడి బాధ్యత అశ్వసంతతిని పెంచి దానిని ఆరోగ్యంగా సుశిక్షితంగా ఉంచటం. రాజుకు హర్షం కలిగించే పద్ధతి అది. అందువలన - ఈ సీసపద్యంలో నకులు డొక క్రమంలో తన అశ్వశిక్షణ విజ్ఞానాన్ని వివరించాడు. ఉత్తమజాతి గుర్రాలు పుట్టటానికి ఉత్తమజాతివైన ఆడ మగ గుర్రాలను హత్తించే జ్ఞానం ఉండాలి. వాటికి పుట్టిన గుర్రపుపిల్లలు ఏ జాతికి చెందాయో తెలిసి, వాటికి తగిన శిక్షణలివ్వాలి. కళ్ళేలు నోట తగిలించుకొనే గుర్రాలు పరిణతిని సూచిస్తాయి. ఆ స్థితికి వాటిని తీసికొని రావటానికి ముందు నోటిలో మెత్తని దారాల కండెలు ఉంచటం పరిపాటి. వాటిని నిపుణంగా అలవరచే నేర్పు కావాలి. గుర్రాలలో కొన్ని మొండివి, పెంకెవి, పొగరుబోతువికూడా ఉంటాయి. వాటిని వంచటం అంత సులభం కాదు. మొండివాటిని మొండితనంతోనే వంచవలసి వస్తుంది. అందువలన ఆ యా సమయాలలో అశ్వశిక్షకులు పట్టుదల సడలించకూడదు. అశ్వం ఉపయోగానికి వచ్చేటప్పుడు దాని శరీరంమీద ఉండే ఉత్త మాశ్వ లక్షణాలను, ఆయా సమయాలలో వచ్చే రోగాలూ, వాటి వలన కలిగే దోషాలూ, వాటి నివారణ చర్యలూ, తెలిసిఉండి వాటిని మాటిమాటికి పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు సరిచేస్తుండాలి. గుర్రాలశాలలో ఉన్న సుశిక్షితమైన అశ్వాలు రాజుకు సైన్యబలం. వాటిని తయారుచేసేవారు అశ్వశిక్షకులు. వారిలో కూడా అందరూ అన్నీ తెలిసినవారు ఉండకపోవచ్చును. సమస్యలన్నీ తెలిసినవాడు అశ్వశిక్షకుడుగా ఉంటే, మిగిలినవారికి ఊరట కలుగుతుంది. విజ్ఞానం పెరుగుతుంది. గుర్రాల ఎదలనుండి - గుర్రాల గుణాల వరకూ తెలిసిన తన అశ్వవిజ్ఞానాన్ని నకులుడు ఒక క్రమంలో చెప్పినట్లు వర్ణించటం తిక్కనకున్న అశ్వశాస్త్ర విజ్ఞానానికి నిదర్శనం. (సంపా.)

క. **దామగ్రంథి యనఁగ నొక। నామము వెట్టుకొనువాఁడ, నా తొంటి విధం**
బా మనుజేశ్వరుఁ డడిగిన। నే మీకడవాఁడ నందు; నిది దెఱఁ గధిపా!' **96**

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధర్మరాజా!; దామగ్రంథి+అనఁగన్+ఒక నామము= దామగ్రంథి అనే ఒక పేరు; పెట్టుకొనువాఁడన్= పెట్టుకొంటాను; నా తొంటి విధంబు= నా పూర్వపద్ధతిని; ఆ మనుజ+ఈశ్వరుఁడు= ఆ మహారాజు; అడిగినన్= అడిగినట్లయితే; నేన్= నేను; మీ కడవాఁడన్= మీ దగ్గర (ధర్మరాజు దగ్గర) ఉన్నవాడిని అని; అందున్= అంటాను; ఇది తెఱఁగు= ఇది నా పద్ధతి.

తాత్పర్యం: ధర్మరాజా! నేను దామగ్రంథి అనే పేరు పెట్టుకుంటాను. 'ఎవరు నీవు? ఇంతకుముందు నీవెక్కడున్నా?' వని నా పూర్వచరిత్ర నడిగితే ధర్మరాజు దగ్గర ఉండేవాడిని అని చెప్పుతాను. ఈ రకంగా మెలగటమే నేను నిర్ణయించుకొన్న పద్ధతి.'

క. **అనినఁ 'గడు లెస్స' యని నె। మ్మనమున నూఱడి, విభుం డమానుష తేజో**
ధనుఁ డగు సహదేవుఁ గనుం। గొని యిట్లను వగలు మిగిలి కొందలపఱుపన్. **97**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; కడున్ లెస్స= చాలా బాగుంది; అని= అని; నెమ్మనమునన్= నిండుమనసులో; ఊఱడి= ఊరడిల్లి; విభుండు= ధర్మరాజు; వగలుమిగిలి= దుఃఖం ఎక్కువయి; కొందలము+పఱుపన్= కలవరపెట్టగా; అమానుష తేజోధనుఁ

డు+అగు= సామాన్య మానవులకు అతీతమయిన తేజస్సు అనే ధనం కలవాడయిన; సహదేవున్= సహదేవుని; కనుంగొని= చూచి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: నకులుడి మాటలు విని ధర్మరాజు 'చాలా బాగుంది' అని అనుకొన్నాడు, సంతృప్తిపడ్డాడు. ఆ తరువాత మహాతేజస్వి అయిన సహదేవుడిని చూచి మనస్సు బాధతో కలవరపడుతూ ఉండగా ఇట్లా అన్నాడు.

చ. **'అకుటిలుఁ; డార్యసమ్మతుఁ, డహంకృతి దూరుఁడు, నీతి నిర్మలా**
త్మకుఁ డనవద్య శీలుఁడు, సధర్ముఁడు, దాంతుఁడు, గొంతిముద్దుసే
యు కొడుకు, మేను లేఁత, దన యుల్లము మెత్తన, యిట్టి యీతఁ డె
ట్లొకొ యొరు నాశ్రయించు? విధి యోపదె యెవ్వరి నెట్లు సేయఁగన్!' **98**

ప్రతిపదార్థం: అకుటిలుఁడు= వంకరబుద్ధి లేని ఋజుస్వభావం కలవాడు; ఆర్యసమ్మతుఁడు= పెద్దలకు ప్రీతి పాత్రమయినవాడు; అహంకృతి దూరుఁడు= అహంకారం లేనివాడు; నీతి నిర్మల+ఆత్మకుఁడు= నీతిచేత నిర్మలమయిన మనస్సు కలవాడు; అనవద్య శీలుఁడు= ఏ మాత్రమూ నింద్యం కాని ప్రవర్తన కలవాడు; సధర్ముఁడు= ధర్మముతో కూడినవాడు; దాంతుఁడు= ఇంద్రియ నిగ్రహం కలవాడు; గొంతి= కుంతీదేవి; ముద్దు+చేయుకొడుకు= గారాబం చేసే కొడుకు; మేను లేఁత= శరీరం సుకుమారమైనది; తన+ఉల్లము మెత్తన= అతని మనస్సు మెత్తనిది; ఇట్టి= ఇటువంటి; ఈతఁడు= సహదేవుడు; ఎట్లు= ఏరకంగా; ఒరున్= మరొకరిని; ఆశ్రయించున్+ఒకొ= ఆశ్రయించునో కదా!; విధి= విధి (దైవం); ఏ+వారిన్= ఎవ్వరినయినా; ఎట్లు= ఎట్లయినా; చేయఁగన్= చేయటానికి; ఓపదె?= చాలదా?

తాత్పర్యం: 'సహదేవుడు నిష్కపటి, సజ్జనహితుడు, అహంకారరహితుడు, నిర్మలమనస్కుడు, నిష్కళంకశీలుడు, ధార్మికుడు, దాంతుడు. పై పెచ్చు కుంతీదేవి ఎంతో గారాబంగా చూచుకొనే ముద్దుబిడ్డ. అంతే కాదు. ఇతడి శరీరం కోమలం. ఇతడి మనస్సు మృదులం. ఇటువంటివాడు ఎవరిని ఆశ్రయించి ఉండగలడు? నిజానికి విధి ఎంతటిదో? ఎంతటివారినైనా సరే ఏ విధంగానైనా చేయగలుగుతుంది.'

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ఇక్కడ విశేషం సామాన్యంతో సమర్థించబడింది. మూలంలో సహదేవుడిని గురించిన ఈ వర్ణనం లేదు. తమ్ములందరిని సమానంగా ప్రేమించే ధర్మరాజుయొక్క సమచిత్తవృత్తిని ధ్వనింపజేసేటట్లు తిక్కన ఇక్కడ సమతాగుణాన్ని కథాంశ నిర్మాణంలో పాటించాడు. ఈ పద్యంలో విషమాలంకారం కూడా ఉన్నది. సహదేవుడి కుండే సహజలక్షణాలు ఉదాత్తుడైన రాజుకు ఉండేవి కాని, సేవకునికి ఉండేవి కావు. అతడు ఒకరిసేవ ఎట్లా చేయగలుగుతాడు? అని ధర్మరాజు విచారం. తిక్కన సహదేవుడిని వర్ణించేటప్పుడు కుంతి గారాబుబిడ్డగా పేర్కొనటం సామాన్యంగా మరచిపోడు. కుటుంబంలో కడగొట్టుబిడ్డ అదృష్టమది. గారాబంగా పెరిగేవారు శ్రమకు గురికాలేరు. అందుకని ధర్మజుడు మరీ విచారించాడు. ఈ పద్యం అమూలకం కావటం తిక్కన పాత్రచిత్రణ నైపుణ్యానికి పతాకగా నిలుస్తున్నది. (సంపా.)

క. **అనుడు నతఁడు దన చిత్తం । బునఁ దోఁచిన విధము ధర్మపుత్రునితో ని**
ట్లని చెప్పె నాతనికిఁ బు । ట్టిన యుత్తలపాటు గొంత డిందుపడంగన్. **99**

ప్రతిపదార్థం: అనుడున్= అనగానే; ఆతనికిన్= ధర్మరాజుకు; పుట్టిన= ఏర్పడ్డ; ఉత్తలపాటు= దుఃఖం; కొంత= కొంతమట్టుకు; డిందుపడంగన్= తగ్గిపోయేటట్లు; అతఁడు= సహదేవుడు; తన చిత్తంబునన్= తన మనసులో; తోఁచినవిధము= తోచినరీతిని; ధర్మపుత్రునితోన్= ధర్మరాజుతో; ఇట్లు+అని= ఈ విధంగా; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: అన్నగారైన ధర్మరాజు హృదయంలో కలిగిన బాధ కొంత ఉపశమించేటట్లు సహదేవుడు తన మనసులోని మాటను ఈ విధంగా ఆయనతో చెప్పాడు.

క. **'కీలారితనమునకు నేఁ। జాలుదు నని కొలిచిమత్స్య జనపాలుకడన్**
మేలగు నడవడిఁ దంత్రీ। పాలుం డను పేరుతోడఁ బరఁగుదు నధిపా! **100**

ప్రతిపదార్థం: అధిపా!= ధర్మరాజా!; కీలారి తనమునకున్= పశుపాలనానికి; నేన్= నేను; చాలుదును= తగుదును; అని= అని; కొలిచి= సేవలో చేరి; మత్స్యజనపాలుకడన్= మత్స్యదేశపు రాజైన విరాటుని దగ్గర; మేలు+అగు= అనువైన; నడవడిన్= ప్రవర్తనతో; తంత్రీపాలుఁడు= తంత్రీపాలుడు; అను పేరుతోడన్= అనే పేరుతో; పరఁగుదున్= వ్యవహరిస్తాను.

తాత్పర్యం: 'నేను పశుపాలనంలో సమర్థుడనని చెప్పి, విరాటుడి కొలువులో గోరక్షకుడిగా చేరతాను. తంత్రీపాలుడనే పేరుతో వ్యవహరిస్తాను. మంచి నడవడికతో సంచరిస్తాను.

సీ. **వంజల నైనను వల నేర్పడఁగ నొక। భంగిఁ జేపఁగ జేసి పాలు గొనఁగ.**
బడుగుల నైనను బాటించి పరికించి। గోమున మైఁ గండ క్రొవ్వుదేఱఁ,
దెవులు గొంటులనైనఁ దీర్చి సంకటమున। కోపి ముందటియట్ల రూపు సేయ,
నట్టల నైనను నలువైన వెరవున। ముట్టె యంటఁగఁ బట్టి కట్టి విడువఁ.

ఆ. **బిదుకఁ గదుపు సేర్పఁ బెదరు వాపఁగ నీరు। మేపు గలుగు నెడకు మెలఁగ, వెలువ**
మెకము నరయ, ము్రుచ్చు మెలఁగిన వెలిగొట్ట। నేర్తుఁ; బసికిఁ జాలఁ గూర్తు నేను. **101**

ప్రతిపదార్థం: వంజలన్+ఐనను= (వంధ్య ప్రకృతి-వంజ వికృతి) గొడ్డుటావులనయినా; వలను= నేర్పు; ఏర్పడఁగన్= ప్రకటించబడేటట్లు; ఒక భంగిన్= ఒక విధంగా; చేఁపఁగన్+చేసి= చేపేటట్లుచేసి; పాలు+కొనఁగన్= పాలు పితకటానికి; (నేర్తున్ అనే క్రియతో అన్వయం); బడుగులన్+ఐనను= బక్కచిక్కిన వాటినయినా; పాటించి పరికించి= ఆదరించి కారణాలను పరిశీలించి; గోమునన్= గారాబంతో; మైన్= శరీరంలో; కండ క్రొవ్వు తేఱన్= కండా, కొవ్వూ బాగా పట్టేటట్లుగా, (నేర్తున్‌తో అన్వయం); తెవులు గొంటులన్+ఐనన్= రోగం వచ్చిన వాటినయినా; తీర్చి= సరిగాచేసి, రోగం నయం అయ్యేలా చేసి; సంకటమునకున్+ఓపి= కష్టానికి ఓర్చి; ముందటి+ అట్లు+అ= ముందు ఎట్లా ఉందో అట్లాగే; రూపు చేయన్= బలిసేవిధంగా చేయడానికి; ('నేర్తున్'తో అన్వయం); నట్టలన్+ఐనను= పొగరుబోతు ఆవులనయినా; నలువైన వెరవునన్= తగిన ఉపాయంతో; ముట్టె= మూతి; అంటఁగన్+పట్టి= బిగించిపట్టి; కట్టివిడువన్= ముక్కుత్రాడు వేసి విడవటానికి, (నేర్తున్‌తో అన్వయం); పిదుకన్= పాలు పితకటానికి; కదుపు+చేర్పన్= మందలోకి పంపటానికి; బెదరు+పాపఁగన్= బెదరు పోగొట్టటానికి; నీరు మేపు కలుగు+ఎడకున్= నీరూ మేతా ఉన్న చోటికి; మెలఁగన్= సంచరించేటట్లు; వెలువమెకమున్+అరయన్= మీదపడే సింహాన్ని తెలిసికొంటానికి; ముచ్చు= దొంగ; మెలఁగినన్= ప్రవేశిస్తే; వెలి+కొట్టన్= మందనుండి పారద్రోలటానికి; (నేర్తున్‌తో అన్వయం); పసికిన్= పశువులకు; నేను= నేను; చాలన్= చాలా; కూర్తున్= ఇష్టాన్ని చేకూరుస్తాను.

తాత్పర్యం: గొడ్డుటావులను కూడా చేపేటట్లు చేసి పాలు పితుకుతాను. బక్కచిక్కిన వాటినికూడా బాగా పరీక్షచేస్తాను. కండపట్టేటట్లు, క్రొవ్వు పట్టేవిధంగా మేపుతాను. తరచు రోగాలకు పాలయ్యే పశువులకు రోగం నయమయ్యేటట్లు చేస్తాను. ఎంత పొగరుబోతు ఆవునయినా పట్టుకొని ముకుతాడు బిగించి కట్టివేస్తాను. ఆవుల పాలు పితుకుతాను.

వాటిని మందలో చేరుస్తాను. వాటి బెదరు పోగొడతాను. నీరూ మేతా ఉన్నచోటు తెలిసికొని మేపుతాను. సింహం మొదలయిన క్రూరమృగాలుండే ప్రదేశాలు గుర్తిస్తాను. దొంగలను పసిగడతాను. వారిని శిక్షిస్తాను. పశువులకు ప్రీతికరంగా వ్యవహరిస్తాను.

విశేషం: 1. మూలపాఠంలో ఈ వివరాలు లేవు. అధికపాఠంలో కొన్ని వివరాలున్నాయి. ఇటువంటి వివరాలు లేకుండా చెప్పటమే మూలంలోని కథాస్వభావం. అజ్ఞాతవాసంలో పాండవులు నిర్వహించబోయే పాత్రలకు సంబంధించిన పరిజ్ఞానాన్ని వివరించటం తిక్కన స్వభావం. నకుల సహదేవులు కవలు. వారిద్ద రెన్నుకొన్న వృత్తులు కూడా కవలవంటివి. పశుపాలనకు సంబంధించినవి. తిక్కన వారి వాక్యాలను సీసపద్యాలలోనే చెప్పించి కావ్యకళలో కూడా కవలుగా పలికింపజేశాడు. తిక్కన ఛందశ్శిల్ప మిది. (సంపా.)

2. ఈ సీసంలోని తొలి నాలుగు పాదాలూ - పిదుకన్, కదుపుసేర్పన్, బెదరువాపఁగన్, నీరుమేపుగలుగునెడకు మెలఁగన్ - అనే (ఆటవెలఁదిలోని) నాలుగు అసమాపక క్రియలతో క్రమంగా అన్వయిస్తూ ఉన్నాయి. తిక్కన కవితలో సామాన్యంగా కానవచ్చే ఈ క్రమాలంకార విన్యాసం గమనించదగింది. (సంపా.)

వ. నన్ను విరాటుండు 'మున్ను నీ వెందుండు' దని నిరూపించెనేని' "యుధిష్ఠిరుగోష్ఠంబుల కధిష్ఠాతనై యుండుదు ననియెద' నని పలికినఁ గౌంతేయాగ్రజుం" డిది యుక్తం బగు' నని యనుమతి సేసి, పాంచాలి నాలోకించి, ఖిన్నాంతఃకరణుం డగుచు ని ట్లనియె. 102

ప్రతిపదార్థం: విరాటుండు= విరాట మహారాజు; మున్ను= ముందు; నీవు= నీవు; ఎందున్+ఉండుదు(వు)+అని= ఎక్కడ ఉండేవాడివని; నన్నున్= నన్నుగురించి; నిరూపించెనేని= తెలిసికొనవలె ననుకొంటే; యుధిష్ఠిరు గోష్ఠంబులకున్= ధర్మరాజు గోశాలలకు; అధిష్ఠాతను+ఐ= అధిపతినై; ఉండుదును+అనియెదను+అని= ఉండేవాడినని చెప్పుతాను అని; పలికినన్= చెప్పగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతీకుమారులలో పెద్దవాడయిన ధర్మరాజు; ఇది= ఈ విధం; యుక్తంబు+అగున్+అని= తగి ఉన్నదని; అనుమతి+చేసి= అంగీకరించి; పాంచాలిన్= ద్రౌపదిని; ఆలోకించి= చూచి; ఖిన్న+అంతఃకరణుండు= కలత చెందిన మనస్సు కలవాడు; అగుచున్= ఔతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'ఇంతకుముందు నీ వెక్కడున్నావయ్యా?!' అని విరాటమహారాజు నన్ను అడిగితే 'ధర్మరాజు గోశాలకు అధ్యక్షుడిగా ఉండేవాడినని చెప్పుతాను. 'సహదేవుడి మాటలను విన్న ధర్మరాజు 'ఈ ఉపాయం బాగున్న' దని తన అనుమతిని ప్రకటించాడు. ఆ తరువాత ద్రౌపదిని చూచి వేదనతో నిండిన మనసుతో ఈ విధంగా పలికాడు.

చ. 'ఇది కడు ముద్దరాలు, పను లేమియుఁ జేయఁగ నేర, దెంతయున్
మృదు, వొక కీడుపాటునకు మేకొనఁజాల, దుదాత్తచిత్త, యొం
టి దిరుగు దాని కోర్వ, దొకటిం దను దా సవరించుచొ ప్పెఱుం
గదు, తగ నొద్దనుం గొలువఁగా వెర వెమ్మెయిఁ గల్గు నక్కటా!' 103

ప్రతిపదార్థం: అక్కటా!= అయ్యో!; ఇది= ఈ ద్రౌపది; కడుముద్దరాలు= మరీ ముగ్ధరాలు, కడు సుకుమారి; పనులు+ఏమియున్+ చేయఁగన్+నేరదు= పనులేవీ స్వయంగా చేసికొనలేదు (ఎప్పుడూ పరిచారికలచేత పనులు చేయించుకొనటమే తెలిసిన సుఖజీవితానికి అలవడింది అని భావం); ఎంతయున్= ఎంతో; మృదువు= మెత్తని స్వభావం కలది; ఒక కీడుపాటునకున్= ఒక నీచమయిన

పనికి కూడా, కష్టమయిన లేదా కష్టం కలిగించే పనికి కూడా; మేకొనన్+చాలదు= సమ్మతింపలేదు; ఉదాత్తచిత్త= ఉన్నతమైన (ఆశయాలతో కూడిన) మనసు కలిగినది; ఒంటి= ఒంటరిగా; తిరుగుదానికిన్= సంచరించడానికి; ఓర్వదు= తాళజాలదు; ఒకటిన్= ఒకటికూడా (ఏ ఒక్కటీ); తను, తాన్= తనంతట తాను; సవరించుచొప్పు= చక్కబెట్టుకొనే తీరు; ఎఱుంగదు= తెలియనిది; తగన్= తగినట్లు; ఒడ్లనున్= ఇతరులను; కొలువఁగాన్= సేవించటానికి; వెరవు= నేర్పు; ఏ+మెయిన్= ఏ విధంగా; కల్గున్?= కలుగుతుంది? (వీలవుతుంది?).

తాత్పర్యం: 'ఈమె సుకుమారి. ఏ పనినయినా చేయించుకొనటమే కాని చేయటం చేతకాని సుతిమెత్తనిది. నీచమయిన పనులకు దూరంగా ఉంటుంది. ఒంటరిగా తిరగడం ఎప్పుడూ అలవాటు లేనిది. చాలా పెద్ద మనసు కలిగింది. ఏ ఒక్కటి కూడా తనంత తాను చక్కబెట్టుకొనే తీరు తెలియనిది. ఇటువంటి ఈమె ఇతరులను ఏ విధంగా సేవిస్తుందో? ఆ నేర్పు ఈమెకు ఎట్లా అలవడుతుందో?'

విశేషం: తిక్కనగారి ప్రసిద్ధ పద్యాలలో ఇది ఒకటి. అర్థగుణమైన ప్రసాదం ఈ రచనకు ప్రాణం. ఈ ఘట్టాన్ని మూలంతో పోలిస్తే తిక్కనగారి కవితాకళాశిల్పం మరీ తేటపడుతుంది.

> **"ఇయంతు నః ప్రియా భార్యా । ప్రాణేభ్యోఽపి గరీయసీ । మాతేవ పరిపాల్యా చ పూజ్యా జ్యేష్ఠేవ చ స్వసా॥**
> **కేనస్మ కర్మణా కృష్ణా ద్రౌపదీ విచరిష్యతి । నహి కించిత్ విజానాతి కర్మ కర్తుం యథాస్త్రియః॥**
> **సుకుమారీ చ బాలా చ రాజపుత్రీ యశస్వినీ । పతివ్రతా మహాభాగా కథంను విచరిష్యతి"॥ (సం.4.3. 12-14)**

'ద్రౌపది మనందరికీ ప్రియమైన భార్య. మన ప్రాణాలకంటె మిన్న అయినది. ఆమె తల్లివలె పరిరక్షించదగింది. సోదరివలె మన్నించదగింది'- అని అనటం తిక్కన వదలివేశాడు. మూలంలో ఆర్ద్రత ఉన్నా, తెలుగులో ఔచిత్యం ఉన్నది. పాండవపత్నిగా ఆమె ప్రశంస అజ్ఞాతవాస నియమానికి ప్రస్తుతంకాదు. ఆమె ఇతరుల సేవలో ఎట్లా ఉండగలుగుతుంది-అనేదే ప్రస్తుతాంశం. పాండవు లందరిలో ఆ అంశాన్ని మాత్రమే ఎన్నుకొని తిక్కన విషమాలంకార సుందరంగా వ్యక్తీకరించాడు. ఈ శ్లోకం దానికి భిన్నం. అందువలన తిక్కన దానిని గ్రహించలేదు. ఇక మిగిలిన రెండు శ్లోకాలలోని విశేషణాలు తెలుగు పద్యానికి ముడిసరుకుగా పనికి వచ్చాయి. కాని, తిక్కన పద్యంలో ద్రౌపదిని వర్ణించిన తీరు అనుభావ వ్యంజకంగానూ, భావికథార్థ సూచకంగానూ ఉండటం తిక్కన కావ్యకళాశిల్పం. విరాటపర్వంలో-విశేషించి కీచక ఘట్టంలో-ద్రౌపది పడేపాట్లను ప్రచ్ఛన్నంగా ధ్వనింపజేసే వాక్య విన్యాసం గమనార్హం. ఆమె కడు ముద్దరాలు. ఎంతో మనోజ్ఞమైనది-అని భావం. సుదేష్ణను మెప్పించిందీ, కీచకుడిని ఆకర్షించిందీ అయిన లావణ్యవిశేషం ఇందులో సూచితం. కష్టపడే పనులు చేయలేనిది. కాబట్టే సైరంధ్రిగా అలంకరణ సేవలో ఉండిపోయింది. ఆమె ఎంతో మెత్తనిది కాబట్టి కొలువులో ఒదిగి మర్యాదగా ఉండగలిగింది. ఒక కీడుపాటునకు కూడా సహించలేనిది కాబట్టి కీచకుడి వలపు బాసలను ఓర్చుకొనలేకపోయింది. ఉదాత్తచిత్త కాబట్టి అన్యపురుషవాంఛకు లోనుకాకుండా కీచకుడికి అన్యకాంతాసమాగమవాంఛ హేయమని చెప్పగలిగింది. ఒంటిగా తిరగటానికి సిద్ధపడదనే విశేషం - కీచకుడి ఇంటికి కల్లు తీసికొని రావటానికి ఒంటిగా పోవటాన్ని ఆమె అంగీకరించకపోవటానికి హేతువయింది. ఏ విషయాన్నైనా తాను స్వతంత్రించి ఒంటరిగా చేయటం అలవాటు లేనిదట. అంటే భర్తల అనుమతితో చేసేది అనే భావం ఏర్పడుతుంది. కీచకోదంతాన్ని పాండవుల దృష్టికి తెచ్చి, వారి ఎఱుకతో కార్యాన్ని నిర్వహించిన కథార్థాన్ని ఇది స్ఫురింపజేస్తుంది. ఇది వస్తుధ్వని. ఇక ద్రౌపదికి వాడిన విశేషణాలన్నీ ఆమె మహారాజ్ఞీత్వాన్ని సూచించేవి. సేవలు చేయించుకొన తగిన స్నిగ్ధమూర్తి ఎవరిని సేవించగలదు? అనే విషమాలంకార చిత్రణకు అనువుగా చెప్పబడినవి. తిక్కన తెలుగు పదాల జిలుగు రచనకు ఈ పద్యం హృద్యమైన ఉదాహరణం. (సంపా.)

క. అనిన నతని చిత్తంబున । వెనుఁబాటంతయును బాయు వెరవు కలిమి యె
ల్లను దెలియునట్లుగా ని । ట్లనియెం బాంచాలి యుచితమగు చందమునన్. 104

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అతని= ధర్మరాజు యొక్క; చిత్తంబునన్= మనసులోని; వెనుఁబాటు= సంకోచం; అంతయున్= అంతా; పాయు= పోయే; వెరవు కలిమి+ఎల్లను= ఉపాయం అంతా; తెలియునట్లుగాన్= తెలిసేవిధంగా; పాంచాలి= పాంచాలదేశపురాజైన ద్రుపదుని కూతురు ద్రౌపది; ఉచితము+అగు= తగిన; చందమునన్= రీతిగా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= బదులు పలికింది.

తాత్పర్యం: ధర్మరాజు మాటలను ద్రౌపది విన్నది. అతడి మనసులోని బెంగను పోగొట్టాలని అనుకొన్నది. తనకు ఆ నేర్పు ఉన్నదని తెలియబరచాలనుకొన్నది. ఈ విధంగా అతడితో అన్నది.

క. 'సైరంధ్రీ వేషంబునఁ। జేరుదు నంతఃపురంబు చెంతకు; నన్నా
భూరమణుదేవి యెంతయు। గారవమునఁ బిలువనంపఁగా వినయమునన్. 105

ప్రతిపదార్థం: సైరంధ్రీ వేషంబునన్= సైరంధ్రీవేషంలో; అంతఃపురంబు= రాణివాసం; చెంతకున్= దగ్గరకు; చేరుదును= చేరుతాను; ఆ భూరమణుదేవి= ఆ విరాటమహారాజు దేవి అయిన సుదేష్ణాదేవి; నన్నున్= నన్ను; ఎంతయున్ గారవమునన్= ఎంతో గౌరవంతో; పిలువన్+అంపఁగాన్= పిలిపిస్తే; వినయమునన్= వినయంతో.

తాత్పర్యం: సైరంధ్రీవేషంలో అంతఃపురసమీపానికి వెళ్ళుతాను. అప్పుడు నన్ను విరాటుడి రాణి సాదరంగా పిలిపిస్తే సవినయంగా దర్శనం చేసికొంటాను.

విశేషం: మూలంలో ధర్మరాజు ద్రౌపదితో **"మాల్యగంధానలంకారాన్ వస్త్రాణి వివిధాని చ। ఏతా న్యేవాభిజానాతి యతో జాతా హి భామినీ' (4.3.15)** అని అన్నట్లున్నది. చిన్నప్పటినుండి ఆమెకు పూలమాల లల్లటం, అలంకారాలు చేసికొనటం, వివిధ వస్త్రాలను ఎన్నికచేసి ధరించటం వంటివి చాలా ఇష్టమైనవిగా ఉండేవన్నాడు! అతడి మాటలలో ద్రౌపదికి సైరంధ్రిగా మసలటానికి అనువైన మాలాలంకరణాదిక్రియలతో సహజంగా ఆసక్తి ఉన్నదని, అందువలన సైరంధ్రిగా కుదురుకొనుమని వ్యంగ్యంగా సూచించినట్లు ఉన్నది. తిక్కన ఆ మాటలు తెలుగులోకి తీసికొని రాలేదు. సైరంధ్రీవేషం ద్రౌపది స్వయంనిర్ణయంగానే తెలిపాడు. అది ఆమె వివేకాన్ని ప్రదర్శించింది. (సంపా.)

క. కని కొలువు సేసికొని మా। లిని నాఁజని 'సాధ్వి యిది ; మలీమసవృత్తం
బున పొంతఁ బోవ దెన్నఁడు'। నను వ్రేకఁదనంబు దోఁచునట్లు చరింతున్. 106

ప్రతిపదార్థం: మాలిని నాన్+చని= మాలిని అనే పేరుతో వెళ్ళి; కని= చూచి; కొలువు+చేసికొని= కొలువులో స్థానం సంపాదించి; ఇది= ఈమె; సాధ్వి= మహాపతివ్రత; ఎన్నఁడున్= ఎన్నడూ; మలీమసవృత్తంబున పొంతన్= కల్మష ప్రవర్తనంయొక్క దరిదాపులకు (నీచము, దుష్టము నయిన ప్రవర్తన పొంతకు); పోవదు= పోదు; అను వ్రేకఁదనంబు= అనే గౌరవభావం; తోఁచునట్లు= మనస్సున కలిగే విధంగా; చరింతున్= ప్రవర్తిస్తాను.

తాత్పర్యం: మాలిని - అనే పేరుతో వెళ్ళి, సుదేష్ణ దర్శనం చేసికొని, ఆమె కొలువులో చేరతాను. ఈమె మహాపతివ్రత. ఎన్నడూ కల్మషప్రవర్తనల జోలికి పోదు - అని అందరూ గౌరవించే విధంగా ప్రవర్తిస్తాను.

సీ. కలపంబు లభినవగంధంబులుగఁ గూర్చి। తనువున నలఁదుదుఁ దనుపుగాఁగ
మృగమదపంకంబు మృదువుగా సారించి। తిలకంబు వెట్టుదుఁ జెలువు మిగులఁ;
బువ్వులు బహు విధంబులఁ గట్టి ముడి కొక్క। భంగిగా నెత్తులు వట్టి యిత్తు;
హారముల్ మెఱయ నొయ్యారంబుగాఁ గ్రుచ్చి। యందంబు వింతగా నలవరింతు;

ఆ. వివిధ శిల్పములఁ బ్రవీణ నై మఱియును। వలయు పనుల వెంట మెలఁగ నేర్తు;
మత్స్యరాజమహిషి మనమున మక్కువ। నెలకొనంగ నిట్లు గొలువ నేర్తు. 107

ప్రతిపదార్థం: కలపంబులు= మై పూతలు; అభినవగంధంబులుగన్= క్రొత్తసువాసనలతో గుబాళించే విధంగా; కూర్చి= తయారుచేసి; తనువు+కాఁగన్= చల్లన అయ్యేటట్లుగా; తనువునన్= శరీరంపై; అలఁదుదున్= పూస్తాను; మృగమదపంకంబు= కస్తూరి చందనం కలిపి తయారు చేసిన తడిమిశ్రమాన్ని; మృదువుగాన్= మెత్తగా; సారించి= మెదిపి (రంగరించి); చెలువు మిగులన్= అందం మరికొంత ప్రకాశించేవిధంగా; తిలకంబు+పెట్టుదున్= బొట్టుపెట్టుతాను; పువ్వులు= పూలను; బహువిధంబులన్= అనేక విధాలుగా; కట్టి= కట్టి; ముడికిన్+ఒక్కభంగిగాన్= ఒక్కొక్క రకమైన జుట్టు ముడికి ఒకొక్క రీతిగా; ఎత్తులుపట్టి+ఇత్తున్= చెండ్లుకట్టి ఇస్తాను; హారముల్ మెఱయన్= దండలు ప్రకాశించే విధంగా; ఒయ్యారంబుగాన్= ఒయ్యారంగా; గ్రుచ్చి= కూర్చి; అందంబు= అందం; వింతగాన్= వింత గొలిపే విధంగా; అలవరింతున్= కూరుస్తాను; వివిధ శిల్పములన్= ఎన్నోరకాల పనితనాలలో; ప్రవీణనై= నేర్పరితనం పెంచుకొని; మఱియును= ఇంకా; వలయు పనుల వెంటన్= కావలసిన పనులలో; మెలఁగన్, నేర్తున్= సంచరిస్తాను; మత్స్యరాజమహిషి= మత్స్యదేశపు రాజయిన విరాటుని పట్టమహిషి అయిన సుదేష్ణయొక్క; మనమునన్= మనసులో; మక్కువ నెలకొనంగన్= ప్రీతి కలిగేవిధంగా; ఇట్లు= ఈ విధంగా; కొలువన్+నేర్తున్= సేవించటం ఎరుగుదును.

తాత్పర్యం: నేను చక్కని మై పూతలు తయారుచేస్తాను. అవి ఎప్పుడూ గుబాళిస్తూ ఉంటాయి. వాటిని రాణి శరీరానికి సున్నితంగా పూస్తాను. కస్తూరిని చందనంతో కలిపి మెత్తగా మెదుపుతాను. రాణికి అందంగా తిలకం పెట్టుతాను. ఎన్నోరకాలయిన పూలమాలలు కట్టుతాను. ముడి కొకవిధంగా చెండ్లు కట్టి ఇస్తాను. అందంగా హారాలు కూర్చుతాను. వాటితో క్రొత్త అందాలు విరజిమ్మే విధంగా చేస్తాను. ఎంతో నైపుణ్యంతో అవసరమయిన పనులు చేస్తాను. మహారాణికి నాపట్ల మక్కువ కలిగే విధంగా ఆమెను సేవిస్తాను.

విశేషం: సైరంధ్రీ జాతి వారు నిర్వహించే పనులు పై పద్యంలో కనిపిస్తాయి. పరిమళభరితమయిన అనులేపనాలు కూర్చటం, రకరకాలయిన బొట్టులు దిద్దటం, అనేక విధాలయిన హారాలు, చెండ్లు తయారుచేయటం. రంగురంగుల దండలు గ్రుచ్చటం. గౌరవానికి ఎటువంటి లోపం కలగకుండా పతివ్రతాచారంతో ప్రవర్తించటం, చాలతక్కువ మాటలాడటం, పాపభీతి కలిగి ఉండటం, 'ఎంగిలి' కి దూరంగా ఉండటం, ఇతరుల కాళ్ళు కడగటం వంటివి చేయకపోవటం, పురుషులతో మాట్లాడకుండటం, చెడునడతల జోలికి పోకుండా ఉండటం. నీచమయిన పనులకు దూరంగా ఉండటం - ఇవి సైరంధ్రీలక్షణాలు. సేవావృత్తిలో ఉన్నా తనదంటూ 'ఒక పద్ధతిని' పాటించటం సైరంధ్రి విశిష్టగుణం.

క. 'మును నీ వెచ్చో నిలు? తే। పని మెయి వర్తిల్లు?' దనినఁ బాంచాలికి నే
ననుచారిణినై తగఁ బం। చిన గరువపుఁ బనులు నేర్చి చేయుదు నందున్.' 108

ప్రతిపదార్థం: మును= ముందు; నీవు= నీవు; ఎచ్చోన్= ఎక్కడ; నిలుతు(వు)?= ఉండేదానివి?; ఏ-పనిమెయిన్+వర్తిల్లుదు(వు)?= ఏపనితో ఉండేదానివి?; అనినన్= అని అడిగితే; పాంచాలికిన్= ద్రౌపదికి; నేను= నేను; అనుచారిణిన్+ఐ= పరిచారికనై; తగన్+పంచిన= తగినట్లు చెప్పిన; గరువము+పనులు= గౌరవంతో కూడిన పనులు; నేర్చి చేయుదున్= నైపుణ్యంతో చేసేదానిని(అని); అందున్= మనవి చేస్తాను.

తాత్పర్యం: 'ఇంతకు ముందు నీ వెక్కడ ఉన్నావు? ఏం పనిచేసేదానివి?- అని అడిగితే, నేను ద్రౌపదికి పరిచారికగా ఉండి, నా గౌరవానికి ఎటువంటి భంగం కలిగించని పనులు పురమాయిస్తే వాటిని ఎంతో నేర్పుతో చేసేదానిని అని మనవి చేస్తాను.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనవుడు ధర్మనందనుండు ద్రుపదనందన కి ట్లనియె. 109

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; ధర్మనందనుండు= ధర్మరాజు; ద్రుపదనందనకున్= ద్రౌపదితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అనగానే ధర్మరాజు ద్రౌపదితో ఇట్లా అన్నాడు.

క. 'మన వంశంబును, వృత్తం। బును, బెంపును గావఁ జాలు పుణ్యసతివి; దు
ర్జను లగు తులువల తలఁపులు। గనుఁగొని యేమఱక మెలఁగఁగా వలయుఁ జుమీ!' 110

ప్రతిపదార్థం: మనవంశంబును= మనవంశాన్ని; వృత్తంబును= మన ప్రవర్తనను; పెంపును= గొప్పతనాన్ని; కావన్+చాలు= రక్షించగలిగిన; పుణ్యసతివి= సాధ్వివి; దుర్జనులు+అగు= దుర్మార్గులయిన; తులువల= తుంటరుల; తలఁపులు= ఆలోచనలు; కనుఁగొని= తెలిసికొని; ఏమఱక= ఏ మాత్రం ఏమరుపాటు చెందక, ఎటువంటి పొరపాటు జరగకుండా; మెలఁగఁగాన్+వలయున్+చుమీ!= ప్రవర్తించాలి సుమా!.

తాత్పర్యం: 'మన వంశం, మన ప్రవర్తన, గొప్పదనం అన్నీ తెలిసిన పతివ్రతవు. దుర్మార్గులయిన తుంటరుల మనస్సులలోని చెడు ఆలోచనలను పసిగట్టి, ఎటువంటి ఏమరుపాటు లేకుండా ప్రవర్తించాలి సుమా!'.

విశేషం: ధర్మజుడి మాటలలో దుర్మార్గులయిన తుంటరుల ప్రసక్తి వచ్చింది. ఈ ప్రస్తావనవలన కీచకుడి వృత్తాంతాన్ని తిక్కన స్ఫురింపజేశాడు: ధర్మజుడు వశ్యవాక్కని ధ్వనింపజేశాడు. పతివ్రత అయిన గృహిణివలననే వంశగౌరవం పెరుగుతుందనీ, గృహనీతి విద్య నిలుస్తుందనీ, అభ్యుదయాలు సిద్ధిస్తాయనీ ధర్మజుడు చెప్పిన మాటలు కూడా సార్థకాలు. "మన వంశంబున వృత్తంబును" - ఆనందాశ్రమప్రతి.

క. 'అనిన విని యాజ్ఞసేని యనాదర మందస్మిత సుందర వదనారవింద యయి యతని కిట్లనియె. 111

ప్రతిపదార్థం: అనినన్+విని= అని చెప్పగా విని; యాజ్ఞసేని= ద్రౌపది; అనాదర= అనాదరంతో కూడిన; మందస్మిత= చిరునవ్వు చేత; సుందర= అందమయిన; వదన+అరవింద+అయి= ముఖపద్మం కలదయి; అతనికిన్= ధర్మరాజు(కు)తో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ధర్మరాజు భయాన్ని ద్రౌపది అర్థంచేసికొన్నది. అతడి మాటలకు స్పందించింది. చిరునవ్వుతో తన అనాదర భావాన్ని వ్యక్తం చేసింది.

విశేషం: నవ్వులు అనేక రకాలు. మూలంలో లేని ద్రౌపదియొక్క 'అనాదర మందహాసం' తిక్కన సృష్టి. ద్రౌపది నవ్వులో 'అనాదరణ' కనిపించటంలో ' నాకు తెలియదా? మీ రంతగా చెప్పాలా?' అనే భావాలు వ్యక్తమవుతున్నాయి. 'గతంలో ఎన్నో ఇబ్బందుల నుండి బయటపడిన నాకు ఇటువంటివి క్రొత్తవి కావు. అయినా తుంటరులను నేను లెక్కచేయను. వారు నన్నేమి చేయలేరు. అది నాకు సమస్య కాదు'- అనే భావం నవ్వులో ధ్వనింప చేసింది. ద్రుపదుడికి యజ్ఞసేనుడని మరొక పేరుంది. అతడి కుమార్తె యాజ్ఞసేని. తిక్కన ఈ పదాన్ని సాభిప్రాయంగా వాడాడు.

క. 'ఆరయ నెందును గౌరవ। భారం బెడలంగనీక పాతివ్రత్యా
చారము మై వర్తింతురు। సైరంధ్రీ జాతివారు సౌజన్యమునన్. 112

ప్రతిపదార్థం: ఆరయన్= బాగా పరిశీలిస్తే; సైరంధ్రీ జాతివారు= సైరంధ్రీ జాతివారు; ఎందును= ఎక్కడైనా; గౌరవభారంబు= మహత్తరమయిన మర్యాద; ఎడలంగన్+ఈక= పోనీకుండా; పాతివ్రత్య+ఆచారము మైన్= పతివ్రతకు తగిన ప్రవర్తనతో; సౌజన్యమునన్= మంచితనంతో; వర్తింతురు= ప్రవర్తిస్తారు.

తాత్పర్యం: సైరంధ్రీజాతివారు గౌరవం కలవారు. తమ గౌరవాన్ని ఎప్పుడూ కాపాడుకొంటారు. సౌజన్యబుద్ధితో ప్రవర్తిస్తారు. పాతివ్రత్యంతో నడచుకొంటారు.

క. కావున నుచితము లగు నా। కా వెంటం గొలిచి తిరుగునప్పుడు, మితభా
షా విరచనమును, వ్రతసం। భా వనమును గౌరవంబుఁ బాపభయంబున్.' 113

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; నాకున్= నాకు; ఆ వెంటన్= ఆ పనిమీద; కొలిచి తిరుగునప్పుడు= సేవించి తిరిగేవేళ; మిత భాషావిరచనమును= ముక్తసరిగా మాట్లాడటమున్నూ; వ్రతసంభావనమును= పాతివ్రత్య వ్రతాదరణమున్నూ, అజ్ఞాతవాసం యొక్క ఆంక్షలున్నూ; గౌరవంబున్= మర్యాదయున్నూ; పాపభయంబున్= పాపభీతియున్నూ; ఉచితములు+అగున్= (నాకు) తగినవిగా ఉంటాయి.

తాత్పర్యం: సైరంధ్రిగా నేను నాకు తగిన పనులు చేస్తుంటాను. తక్కువగా మాటలాడతాను. పాతివ్రత్యనియమాన్ని, అజ్ఞాతవాస కాలనియమాలను గుర్తుంచుకొంటాను. పాపభీతిని వదలిపెట్టను. గౌరవం కాపాడతాను.'

క. అని చెప్పిన విని 'యగుఁ బొ'। మ్మని కైకొని ధర్మతనయుఁ 'డందఱమును ని
ట్లనపాయత వర్తిల్లుద'। మని తమ్ములతోడ నిశ్చయంబుగఁ బలికెన్. 114

ప్రతిపదార్థం: అని= అని; చెప్పినన్= చెప్పగా; విని= విని; అగున్+పొమ్ము= అవుతుందిలే (తెలుగులో 'సరేలే పో' అని అంగీకారాన్ని తెలిపే జాతీయం ఇది); అని= సరేనని; కైకొని= అంగీకరించి; ధర్మతనయుఁడు= ధర్మరాజు; అందఱమును= అందరమూ; ఇట్లు= ఈ విధంగా; న+అపాయతన్= ఎటువంటి ఆపదలు లేకుండా; వర్తిల్లుదము= అజ్ఞాతవాసకాలంలో సంచరిద్దాం; అని= అని; తమ్ములతోడన్= తన తమ్ముళ్ళతో; నిశ్చయంబుగన్= నిర్ధారణగా; పలికెన్= చెప్పాడు.

తాత్పర్యం: ద్రౌపది మాటలను విన్న ధర్మరాజు సరేనని ఒప్పుకొన్నాడు. 'అందరమూ నిరపాయంగా అజ్ఞాతవాసకాలాన్ని గడుపుదాం' అని తమ్ముళ్ళతో చెప్పాడు.

వ. ఇవ్విధంబునఁ గార్యంబు నిర్ణయించి, 'మన యగ్నిహోత్రంబుల నెల్ల ధౌమ్యులు రక్షించువారు; వంటలవారును మహానసాధ్యక్షులును బాంచాలీపరిచారికలును ద్రుపదపురంబున నిలుచువారు; రథంబులుగొని యింద్రసేనాదులైన సారథులు ద్వారకానగరంబున కరుగువారు; వీ రెల్లను దమ్మెవ్వరైనను మన వార్త లడిగిరేని 'ద్వైతవనంబున మమ్ము విడిచి పోయి రట యెఱుంగ' మనంగల వా' రని చెప్పి యుత్తెఱంగున నభ్యంతర పరివారంబు నెల్ల నియోగించి వీడుకొలిపె; నయ్యవసరంబున ధౌమ్యుండు పాండుకుమారుల కి ట్లనియె. 115

ప్రతిపదార్థం: ఇవ్విధంబునన్= ఈ పద్ధతిలో; కార్యంబు= అజ్ఞాతవాసకాలంలో మెలగవలసిన పద్ధతిని (కర్తవ్యాన్ని); నిర్ణయించి= నిశ్చయించుకొని; మన= మనయొక్క; అగ్నిహోత్రంబులన్ ఎల్లన్= అగ్నిహోత్రాలనన్నింటిని; ధౌమ్యులు= ధౌమ్యుడు (బహువచనం గౌరవవాచకం); రక్షించువారు= రక్షిస్తారు; వంటవారును= వంటలవారు; మహానస+అధ్యక్షులును= వంటశాలకు అధిపతులు;

పాంచాలీ పరిచారికలును= ద్రౌపది సేవకురాండ్రు; ద్రుపదపురంబునన్= ద్రుపద మహారాజు పట్టణమయిన అహిచ్ఛత్రమనే నగరంలో; నిలుచువారు= ఉంటారు; రథంబులు+కొని= రథాలను తీసికొని; ఇంద్రసేన+ఆదులు+ఐన సారథులు= ఇంద్రసేనుడు మొదలయిన సారథులు; ద్వారకా నగరంబునకున్= ద్వారకా నగరానికి; అరుగువారు= వెళ్ళుతారు; వీరు+ఎల్లను= వీరందరూ; తమ్మున్= తమను; ఎవ్వరు+ఐనను= ఎవరైనా; మనవార్తలు= అజ్ఞాతవాస ప్రదేశం గురించిగాని, పాండవుల భావికర్తవ్యాన్ని గురించిగాని; అడిగిరి+ఏనిన్= అడిగినట్లయితే; ద్వైతవనంబునన్= ద్వైతవనంలో; మమ్మున్+విడిచి= మమ్మల్ని వదలిపెట్టి; పోయిరి= వెళ్ళారు; అట= ఆపై; ఎఱుంగము= (తర్వాతి సంగతి) తెలియదు; అనన్+కలవారు= అని చెప్పవలెను; అని, చెప్పి= అని పలికి; ఈ+ తెఱంగునన్= ఈ విధంగా; అభ్యంతర పరివారంబు+ఎల్లన్= అంతఃపురాలలో పనిచేసే ఆంతరంగిక సిబ్బందినంతటిని; నియోగించి= నియమించి; వీడుకొలిపెన్= పంపివేశాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; ధౌమ్యుండు= పాండవుల పురోహితుడ యిన ధౌమ్యుడు; పాండుకుమారులకున్= పాండు మహారాజు కుమారులయిన ధర్మరాజాదులకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మరాజు కర్తవ్యం నిశ్చయించాడు. ఆటుపై అగ్నిహోత్రరక్షణకు ధౌమ్యుడిని నియోగించాడు. వంటలవారు, పాంచాలీ పరిజనం ద్రుపదుడి నగరానికి వెళ్ళాలని చెప్పాడు. ఇంద్రసేనుడు మొదలయిన సారథులు ద్వారకా నగరానికి వెళ్ళాలని ఆదేశించాడు. ఎవరయినా మా గురించి వివరాలు అడిగితే 'ద్వైతవనంలో మమ్మల్ని వదలిపెట్టి వెళ్ళారు. ఆ తరువాతి సంగతి మా కేమీ తెలియదు' అని చెప్పాలి - అని ఆదేశించాడు. ఆభ్యంతర పరివారాన్ని పంపివేశాడు. ఆ తరువాత ధౌమ్యుడు పాండవులతో ఇట్లా అన్నాడు.

విశేషం: 1. "ద్రుపదుల రాజధాని గంగకుత్తరమున అహిచ్ఛత్రమై యుండెను. అహిచ్ఛత్రము ప్రస్తుతమున సంయుక్తప్రాంతమందలి రామాపురమునకు సమీపమునఁ గలదు. ద్రుపదుని మఱియొక రాజధాని కాంపిల్యము. ఇది గంగకు పడమటి యొడ్డున నుండవచ్చును"- (చర్ల నారాయణశాస్త్రి- మహాభారతమీమాంస-మూడవభాగము (1984, పు. 231).

2. 'రక్షించువారు, నిలుచువారు, అడుగువారు' మొదలైన విధ్యర్థక క్రియలు ధర్మజుడి ప్రభుతను వ్యక్తంచేస్తూ 'ప్రభు సమ్మితంగా' రాణిస్తున్నాయి.

3. రాజుకు-బాహ్యపరివారం, ఆభ్యంతరపరివారం, ఆత్మీయపరివారం-అని మూడురకాల పరివారాలుంటాయి. ధర్మజుడివెంట తమ తమ అగ్నిహోత్రాలతోసహా అనుసరిస్తున్న విప్రవర్యులు బాహ్యపరివారం. వీరు సేవకులు కారు. మిత్రులవంటివారు. సేవకవృత్తిలో ఉండి రాజును సేవించే ఆంతరంగికులు ఆభ్యంతరపరివారం. ఈ వచనంలో చెప్పబడిన వారే, ధౌమ్యుడు పురోహితుడు. అతడు ఆత్మీయపరివారంలో చేరతాడు. ఒక్కొక్కపరివార వర్గం పాండవులను వీడిపోయే క్రమం చెప్పటంలో తిక్కన ప్రదర్శించిన లోకజ్ఞత విశిష్టం. ధర్మరాజు బ్రాహ్మణులకు నమస్కరిస్తూ కన్నీళ్ళతో సాగనంపాడు. (1.46.57); ఆభ్యంతర పరివారాన్ని ఆజ్ఞాపించి సాగనంపాడు (1.115); ధౌమ్యుడిని అగ్నిహోత్రుడివలె గౌరవిస్తూ ప్రదక్షిణ నమస్కారాలు చేసి సెలవుతీసికొని వెళ్ళిపోయాడు (1.146.147). ధర్మజుడి ఔచిత్యవర్తనానికి ఈ మూడువీడ్కోలులు ముచ్చటైన ఉదాహరణలు. (సంపా.)

ధౌమ్యుఁడు పాండవులకు సేవాధర్మంబు లెఱింగించుట (సం.4-4-6)

క. **'ఎఱిఁగెడు వారికి నైనను। గఱపక తక్కరుచిత ప్రకారము శుభముం**

గొఱలు హితు; లట్లగుట నం। దఱకును జెప్పంగ వలయుఁ దగియెడు బుద్ధుల్. **116**

ప్రతిపదార్థం: ఎఱిఁగెడువారికిన్+ఐనను= తెలిసినవారికయినా; ఉచిత ప్రకారము= తగిన పద్ధతిలో; శుభమున్= శుభమును; కొఱలు= కోరే; హితులు= స్నేహితులు, మేలు కోరేవారు; కఱపక తక్కరు= ఉపదేశం చేయకుండా వదలిపెట్టరు; అట్లు+అగుటన్= అందుచేత; తగియెడు బుద్ధుల్= ఉచితమైన నీతులు, హితోక్తులు; అందఱకును= అందరికి; చెప్పంగవలయున్= చెప్పాలి.

తాత్పర్యం: లోకంలో తెలిసినవా రెందరో ఉండవచ్చును. కాని, శ్రేయోభిలాషులయినవారు అటువంటివిజ్ఞులకు కూడా బుద్ధులు చెప్పకుండా ఉండలేరు. అందుచేత అదనెరిగి అందరికీ తగిన బుద్ధులు చెప్పవలసిందే.

వ. అదియునుం గాక. 117

ప్రతిపదార్థం: అదీ కాక.

తే. కౌరవాన్వయజాతులై గారవమునఁ। బెరిఁగినట్టి మీ రొండొక నరునిఁ గొలిచి
మసలి వర్తిల్లి మానావమానములకు। నోర్చి, యడఁకువతోడన యునికి యరిది. 118

ప్రతిపదార్థం: కౌరవ+అన్వయజాతులు+ఐ= కౌరవ వంశంలో పుట్టినవారై; గారవమునన్= గౌరవంతో, గొప్పతనంతో; పెరిఁగిన అట్టి మీరు= పెరిగినటువంటి మీరు; ఒండొక= మరొక; నరునిన్= మానవమాత్రుని; కొలిచి= సేవించి; మసలి వర్తిల్లి= అణగిమణగి నడచుకొని; మాన+అవమానములకున్= గౌరవానికీ, అవమానానికీ; ఓర్చి= సహించుకొని; అడఁకువ తోడన్+అ= అణగిమణగి వినయంతో; ఉనికి= ఉండటం; అరిది= కష్టం.

తాత్పర్యం: మీరు కురువంశంలో పుట్టినవారు. గౌరవంగా పెరిగినవారు. మీవంటివారు మరొక సామాన్య మానవమాత్రుడిని సేవిస్తూ మానావమానాలు సహిస్తూ అణగిమణగి సవినయంగా ఉండటం వీలుకాని పని.

క. వాలి వివిధాస్త్ర విద్యా। జ్వాలల వెలుఁగొందు పాండవజ్వలనం బా
భీలత మండం దొడరినఁ। గాల విరోధంబు మఱచి కార్యముఁ దప్పున్. 119

ప్రతిపదార్థం: వాలి= విజృంభించి; వివిధ+అస్త్రవిద్యాజ్వాలలన్= అనేకరీతులయిన అస్త్రవిద్యలనే మంటలతో; వెలుఁగొందు= ప్రకాశించే; పాండవజ్వలనంబు= పాండవు లనే అగ్ని; కాలవిరోధంబు మఱచి= ప్రతికూలరూపమయిన కాలాన్ని మరిచి; ఆభీలతన్= భయంకరంగా; మండన్+తొడరినన్= మండటం మొదలు పెట్టితే; కార్యమున్+తప్పున్= అజ్ఞాతవాసంలో రహస్యంగా జీవితం గడపవలసిన కార్యం చెడిపోతుంది.

తాత్పర్యం: వివిధాస్త్రాలు మంటలవంటివి. వాటిని ధరించే పాండవులు అగ్నులవంటివారు. అటువంటి పాండవులు కాలవిరోధాన్ని మరచిపోకూడదు. కాదని మరచి మండిపడితే అనగా బాహాటంగా పరాక్రమాదులను ప్రదర్శిస్తే తమ ఉనికిని బహిర్గతం చేసికొంటారు. అజ్ఞాతవాసం భంగమవుతుంది. కార్యం చెడిపోతుంది.

విశేషం: అలం: రూపకం. పాండవులు మొదట ఆయుధాలను దాచిపెట్టుకొనాలి అని సూచన. (సంపా.)

వ. కావున మీకు నప్రమాదార్థంబుగా నా నేర్చిన విధంబున నుపదేశం బవశ్యకర్తవ్యంబు; రాజులం గొలిచి యెమ్మెయి నయినను బ్రదుకు జనంబులు గీడునుం బొరయకుండునట్టి సాధారణ నీతి సంక్షేప రూపంబున నెఱింగించెద సావధానులరయి వినుండు. 120

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; మీకున్= మీకు; అప్రమాద+అర్థంబు= ఏమరుపాటు కలుగకుండా; నా నేర్చిన విధంబునన్= నే నెరిగిన రీతిని; ఉపదేశంబు= హితవు చెప్పటం; అవశ్య కర్తవ్యంబు= తప్పక చేయదగినపని; రాజులన్+కొలిచి= ప్రభువులను సేవించి; ఏ+మెయిన్+అయినను= ఏ విధంగానయినా; బ్రదుకు, జనంబులు= జీవితాన్ని గడిపేవారు; కీడునున్+పొరయక+ ఉండునట్టి= హాని కలుగకుండా ఉండే; సాధారణనీతి= సామాన్యంగా పాటించేవర్తన విధానం; సంక్షేపరూపంబునన్= సంగ్రహంగా; ఎఱింగించెదన్= తెలుపుతాను; సావధానులరు+అయి= ఏకాగ్రచిత్తం కలవారై; వినుండు= వినండి.

తాత్పర్యం: మీకు ఎటువంటి ప్రమాదం కలుగకుండా ఉండాలని నా ఆశయం. అందుచేత నాకు చేతనయిన విధంగా ఉపదేశం చేస్తాను. రాజులను సేవించి జీవించే వారు కడు జాగ్రత్తగా ఉండాలి. అందువలన రాజసేవలో ఇబ్బందులకు లోనుగాని విధంగా సాధారణనీతిని సంగ్రహంగా చెప్పుతాను. శ్రద్ధగా వినండి.

క. తగఁ జొచ్చి తనకు నర్హం। బగు నెడఁ గూర్చుండి రూప మవికృతవేషం
బుగ సమయ మెఱిఁగి కొలిచిన। జగతీవల్లభున కతఁడు సమ్మాన్యుఁ డగున్. 121

ప్రతిపదార్థం: తగన్= తగినట్లు; చొచ్చి= సభాప్రాంగణంలోకి ప్రవేశించి; తనకున్= తనకు; అర్హంబు+అగు+ఎడన్= తగినచోట; కూర్చుండి= కూర్చొని; రూపము= తన రూపం; అవికృతవేషంబుగన్= వికారం కాని వేషం కలిగి ఉండేటట్లు; సమయము+ఎఱిఁగి= సమయం తెలిసికొని; కొలిచినన్= సేవించినట్లయితే; జగతీవల్లభునకున్= రాజుకు; అతఁడు= అతడు; సమ్మాన్యుఁడు+అగున్= గౌరవించదగినవాడవుతాడు.

తాత్పర్యం: తగిన పద్ధతిలో సభలోనికి అడుగుపెట్టాలి. తన స్థానానికి తగిన ఆసనంలో కూర్చొనాలి. తన రూపంగాని వేషంగాని వికృతంగా ఉండకుండా చూచుకొనాలి. సమయం తెలిసికొని మసలుకొంటూ సేవించాలి. అట్లా చేయగల వ్యక్తి రాజుకు గౌరవార్హుడౌతాడు (రాజు యొక్క గౌరవానికి పాత్రుడౌతాడు).

విశేషం: రాజులు సహజంగా అధికారదర్పంవలన తరచూ కోపపడతారు. కొలువుకూటంలో అంగీకారం లేక ప్రవేశించడం వారి ఆగ్రహానికి కారణమవుతుంది. అట్లాగే అర్హతలకు అనుగుణంగా వేసిన ఆసనాలు గుర్తించి తన తాహతుకు తగిన స్థలంలో కూర్చొనాలి. లేకపోతే మర్యాదను అతిక్రమించినట్లవుతుంది. సభలో రాజు ప్రసంగించేవేళ, సమయం చూసి తనకు అవకాశం కలిగినప్పుడు మాత్రమే మాట్లాడటం మంచిది. లేకుంటే అనవసర ప్రసంగ మవుతుంది. సభలోనివారు నాగరకులు. నాగరకుల వేషానికి భిన్నంగా వేషధారణ పనికిరాదు. అంతేకాకుండా వికృతవేషంతో ప్రవేశించడం 'ఎబ్బెట్టుగా' కూడా ఉంటుంది.

క. 'నరనాథుఁ గొలిచి యలవడఁ। దిరిగితి నా కేమి' యనుచుఁ దేఁకువ లేమిన్
మరియాద దప్ప మెలఁగినఁ। బురుషార్థంబునకు హాని పుట్టకయున్నే? 122

ప్రతిపదార్థం: నరనాథున్= రాజును; కొలిచి= సేవించి; అలవడన్= మిగుల పరిచితుడయ్యేటట్లు; తిరిగితిన్= తిరిగాను; నాకున్= నాకు; ఏమి?= ఏమౌతుంది?; అనుచున్= అంటూ; తేఁకువ లేమిన్= జంకు గొంకు లేకుండా; మరియాద+తప్పన్+మెలఁగినన్= హద్దుమీరి ప్రవర్తిస్తే; పురుషార్థంబునకున్= పురుష ప్రయోజనానికే; హాని+పుట్టక+ఉన్నే?= కీడు కలగకుండా ఉంటుందా?.

తాత్పర్యం: నేను రాజు కొలువులో ఉన్నాను. రాజుతో చనువుగా తిరుగుతున్నాను. నా కేమిటి?- అని అనుకొంటూ నిర్భయంగా మర్యాద నతిక్రమించి నడచుకొంటే మొదటికే మోసం వస్తుంది.

ఉ. రాజగృహంబుకంటె నభిరామముగా నిలు గట్టఁ గూడ, దే
యోజ నృపాలుఁ డాకృతికి నొప్పగు వేషము లాచరించు, నే
యోజ విహారముల్ సలుప నుల్లమునం గడువేడ్క సేయు, నే
యోజ విదగ్ధుఁడై పలుకు; నొడ్డులకుం దగ దట్లు సేయఁగన్. 123

ప్రతిపదార్థం: రాజగృహంబుకంటెన్= రాజుగారి ఇంటికన్నా; అభిరామముగాన్= అందంగా; ఇలు= ఇల్లు; కట్టన్+కూడదు= కట్టగూడదు; నృపాలుఁడు= రాజు; ఏ+ఓజన్= ఏరకంగా; ఆకృతికిన్= ఆకారానికి; ఒప్పు+అగు= తగిన; వేషములున్= వేషధారణలు; ఆచరించున్= ఆచరిస్తాడో; ఏ+ఓజన్= ఏ విధంగా; విహారముల్= విహారాలను; చలుపన్= చేయడానికి; ఉల్లమునన్= మనస్సులో; కడువేడ్క+చేయున్= బాగా ఇష్టపడుతాడో; ఏ+ఓజన్= ఏ విధంగా; విదగ్ధుఁడు+ఐ= నేర్పరియై; పలుకున్= మాట్లాడతాడో; ఒడ్డులకున్= ఇతరులకు; అట్లు చేయఁగన్= ఆ విధంగా చేయటం; తగదు= తగదు.

తాత్పర్యం: రాజుగారి ఇంటికన్నా అందంగా ఇల్లు కట్టుకొనకూడదు. రాజుగారి వేషధారణ పద్ధతిలో తాను దుస్తులు తొడుగుకొనకూడదు. రాజు చేసే విహారంవలె తానూ విహరించకూడదు. రాజు మాట్లాడే పద్ధతిలో తాను మాట్లాడటం తగదు.

విశేషం: రాజులు సహజంగా అందరికంటె అధికంగా ఉండాలని అనుకొంటారు. రాజసం వారి లక్షణం. అందుచేత సేవకులు రాజుకంటె ఎందులోనూ అధికులుగా ఉండరాదు. రాజభవనంకంటె ఎత్తైన భవనాన్ని సేవకుడు కట్టుకుంటే సంపదలో రాజుకంటె మించిన వాడనే స్ఫూర్తి కలుగుతుంది. అది ఆర్థికమైన ఆధిక్యం. వేషధారణం వైభవానికీ, విహారం విలాసానికీ సంబంధించినవి. ఆయా రంగాలలో కూడా సేవకుడు తన ఆధిక్యాన్ని ప్రదర్శించకుండా అణకువతో జీవించటం మంచిది. (సంపా.)

క. పుత్రులు పౌత్రులు భ్రాతలు । మిత్రు లనరు రాజు లాజ్ఞ మిగిలిన చోటన్
శత్రుల కాఁ దమయలుకకుఁ । బాత్రము సేయుదురు నిజశుభస్థితి పొంటెన్. 124

ప్రతిపదార్థం: రాజులు= రాజులు; ఆజ్ఞ= తమ ఆజ్ఞ; మిగిలినచోటన్= అతిక్రమించే చోట; పుత్రులు= కొడుకులు; పౌత్రులు= మనుమళ్ళు; భ్రాతలు= సోదరులు; మిత్రులు= స్నేహితులు; అనరు= అని భావించరు; నిజశుభస్థితి పొంటెన్= తన భద్రమైన స్థితికొరకు; శత్రువులు+ఐన= శత్రువులే; కాన్= అయినట్లుగా; తమ అలుకకున్= తమ కోపానికి; పాత్రము+చేయుదురు= గురిచేస్తారు.

తాత్పర్యం: తమ ఆజ్ఞను మీరినవారిని కొడుకులనిగాని, మనుమలనిగాని, సోదరులనిగాని, స్నేహితులనిగాని రాజులు పరిగణించరు. తమ మేలుకొరకు, భద్రతకొరకు వారిని శత్రువులుగానే పరిగణిస్తారు. కోపం పెంచుకొని వారి అంతు చూస్తారు.

విశేషం: రాచరికం ముళ్ళకిరీటం వంటిది. రాజకీయాలలో నీతిని పాటించేవారు అరుదు. అందువలన రాజశాసనాన్ని ధిక్కరించే వాడెవ్వడైనా రాజధిక్కారం చేసినవాడె ఔతాడు. ధిక్కారాన్ని రాజు సహించడు. చిన్నపామునైనా పెద్దకర్రతో కొట్టవలెనని- పుత్రుడైనా, తమ్ముడైనా, మిత్రుడైనా, పౌత్రుడైనా అతడిని శత్రువుగానే భావించి నిగ్రహిస్తాడు. కోపించి చంపుతాడుకూడా, కాబట్టి రాజాజ్ఞాధిక్కారం సేవకుడికి హానికరం. (సంపా.)

క. చనువాని చేయుకార్యం । బున కడ్డము సొచ్చి నేరుపున మెలఁగుచుఁ దా
నును బయిఁ బూసికొనుటఁ దన । మును మెలఁగిన మెలఁకువకును ముప్పగుఁ బిదపన్. 125

ప్రతిపదార్థం: చనువాని చేయుకార్యంబునకున్= చెల్లుబడి కలిగినవాడు చేసేపనికి; అడ్డము+చొచ్చి= అడ్డుగా ప్రవేశించి; నేరుపునన్= నేర్పుతో; మెలఁగుచున్= ప్రవర్తిస్తూ; తానును= తాను; పయిన్+పూనుకొనుటన్= తగుదునమ్మా అంటూ ఆ పనిని మీదవేసికొనటం; పిదపన్= ఆ తరువాత; తన= తనయొక్క; మును= ముందు; మెలఁగిన= ప్రవర్తించిన; మెలఁకువకును= జాగరూకతతో కూడిన ప్రవర్తనకుకూడా; ముప్పు+అగున్= ముప్పే అవుతుంది.

తాత్పర్యం: ఏదయినా సరే సాధించుకొనగలిగిన సమర్థుడి పనికి అడ్డు వెళ్ళకూడదు. అట్లా అడ్డువెళ్ళి తగుదునమ్మా అంటూ ఆ కార్యాన్ని మీదవేసికొని, నేర్పును ప్రదర్శిస్తూ పూనుకుతిరిగితే అసలుస్థితికి కూడా ముప్పురాక తప్పదు.

ఆ. **రాజునొద్దఁ బలువురకు సంకటంబు గాఁ। దిరుగు పనుల నెంత తేజ మయిన**
వాని బుద్ధి గలుగు వా రొల్ల; రవి మీఁదఁ। జేటు తెచ్చు టెట్లు సిద్ధ మగుట. **126**

ప్రతిపదార్థం: రాజు+ఒద్దన్= రాజుదగ్గర; పలువురకున్= అనేకులకు; సంకటంబు+కాన్= ఇబ్బంది కలిగేటట్లు; తిరుగుపనులన్= మెలగే పనులవలన; ఎంత తేజము+అయినన్= ఎంతతేజస్సు ఉన్నా; అది= ఆ ప్రవర్తన; మీఁదన్= తర్వాతికాలంలో; చేటు తెచ్చుట= ఇబ్బంది కలిగించటం; సిద్ధము+అగుటన్= తథ్యం కావటం చేత, వానిన్= ఆ పనులకు; బుద్ధికలుగువారు= తెలివయినవారు; ఒల్లరు= అంగీకరించరు.

తాత్పర్యం: రాజుతో సన్నిహితంగా ఉండటంలో తప్పు లేదు. కాని, రాజువద్ద ఉండే చాలామందికి కష్టం కలిగించే పనులలో మాత్రం జోక్యం పనికిరాదు. అటువంటి పనులవలన సేవకుడి శక్తి బహిర్గతం కావచ్చును. కాని, ఆ తర్వాత హాని కలగటం మాత్రం తథ్యం. అందుచేత తెలివిగలవారు అటువంటి పనులకు ఇష్టపడరు.

క. **ఊరక యుండక, పలువుర। తో రవ మెసఁగంగఁ బలుకఁ దొడరకయు, మదిం**
జేరువ గల నాగరికులుఁ। దారుఁ గలసి పలుక వలయు ధరణీశుకడన్. **127**

ప్రతిపదార్థం: ధరణీ+ఈశుకడన్= రాజుదగ్గర; ఊరక+ఉండక= మౌనంగా ఉండక; పలువురతోన్= చాలమందితో; రవము+ఎసఁగంగన్= ఆర్భాటాలు ప్రకటిస్తూ; పలుకన్+తొడరకయున్= మాటలాడటం మొదలుపెట్టక; మదిన్= మనస్సులో; చేరువ= సాన్నిహిత్యం; కల= కలిగిన; నాగరికులున్= నాగరికులును; తారున్= తామును; కలసి= కలసి; పలుకవలయున్= మాట్లాడటం సబబు.

తాత్పర్యం: రాజు దగ్గర మౌనంగానూ ఉండకూడదు. అట్లా అని పదిమందితో ఆర్భాటంగా మాట్లాడటం పనికిరాదు. తనకు దగ్గరివారైన కొలువుకాండ్రతో కలిసి తాను రాజుతో మాట్లాడటం సబబు.

క. **వేఱొక తెఱఁగున నొరులకు। మాఱాడక యునికి లెస్స మనుజేంద్రుకడం;**
దీఱమి గల చోటులఁ దా। మీఁటి కడఁగి వచ్చి పంపు మెయికొన వలయున్. **128**

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్రుకడన్= రాజుదగ్గర; ఒరులకున్= ఇతరులకు; వేఱొక తెఱఁగునన్= ఇంకొకపద్ధతిలో, వ్యతిరేక ధోరణిలో; మాఱు+ఆడక+ఉనికి= సమాధానం (బదులు) చెప్పకుండా ఉండటం; లెస్స= మంచిది; తీఱమి= అక్కర; కలచోటులన్= ఉన్నచోటులలో; తాన్= తానే; మీఁటి కడఁగి వచ్చి= పూనుకొని ముందుకు వచ్చి; పంపు= రాజాజ్ఞను; మెయికొనవలయున్= అంగీకరించాలి.

తాత్పర్యం: తాను రాజుదగ్గర ఉన్నప్పుడు వ్యతిరేకత తోచే విధంగా ఇతరులకు సమాధానం చెప్పకూడదు. అవసరం ఏర్పడితే మాత్రం తనంతట తానే ముందుకు వచ్చి రాజాజ్ఞను నిర్వర్తించాలి.

చ. ధరణిపు చక్కఁ గట్టెదురు దక్కి పిఱుందును గాని యట్లుగా
నిరుగెలనం దగం గొలిచి యే మనునో, యెటు సూచునొక్కొ! యె
వ్వరి దెస నెప్పు డే తలఁపు వచ్చునొ యీతని కంచుఁ జూడ్కి సు
స్థిరముగఁ దన్ముఖంబునన చేర్చుచు నుండుట నీతి కొల్వునన్. 129

ప్రతిపదార్థం: ధరణిపు= రాజుయొక్క; చక్కన్= సమక్షంలో; కడు+ఎదురు+దక్కి= సూటియైన ఎట్టఎదుట ఉండటాన్ని వదలిపెట్టి; పిఱుందును= వెనుకవైపును; కాని+అట్లుగాన్= కాని విధంగా; ఇరు+కెలనన్= రెండుపక్కలా; తగన్= తగునట్లు; కొలిచి= సేవించి; ఏమి+అనునో= ఏమి అంటాడో; ఎటు చూచున్+ఒక్కొ= ఎటువైపు చూస్తాడో; ఈతనికిన్= ఈతనికి (రాజుకు); ఎవ్వరిదెసన్= ఎవరి పట్ల; ఎప్పుడు= ఎప్పుడు; ఏ తలఁపు= ఎటువంటి అభిప్రాయం; వచ్చునొ= వస్తుందో (కలుగుతుందో); అంచున్= అంటూ; చూడ్కి= చూపు; సుస్థిరముగన్= నిశ్చలంగా; తత్+ముఖంబునన= ఆ రాజు ముఖంమీదనే; చేర్చుచున్= ఉంచుతూ; కొల్వునన్= సభలో; ఉండుట= ఉండటం; నీతి= న్యాయం.

తాత్పర్యం: కొలువులో రాజుకు మరీ ఎట్టఎదురుగానూ ఉండకూడదు. అట్లాగని వెనుకవైపూ ఉండకూడదు. ఏదో ఒక ప్రక్కన నిలబడి సేవించాలి. ఏమంటాడో, ఎటు చూస్తాడో, ఎవరిని చూస్తే ఎటువంటి ఆలోచన కలుగుతుందో - మొదలయిన భావాలను మనసులో ఉంచుకొని రాజుముఖంమీదనే దృష్టి సారించి సభలో మెలగాలి.

క. నగళులలోపలి మాటలు। దగునే వెలి నుగ్గడింపఁ దన? కేర్పడ నొం
డుగడం బుట్టినఁ బతి విన। నగుపని చెప్పెడిది గాక యాతనితోడన్. 130

ప్రతిపదార్థం: నగళులలోపలి= అంతఃపురాలలోని; మాటలు= మాటలు; వెలిన్+ఉగ్గడింపన్= పైకి చెప్పటం (బయట పెట్టటం); తనకున్= తనకు(సేవకుడికి); తగునే?= తగునా?; ఏర్పడన్= స్పష్టంగా; ఒండుకడన్+పుట్టినన్= మరో చోట (అటువంటి మాటలు వినటం) సంభవిస్తే; పతి= రాజు; వినన్+అగు= వినదగిన; పని= విషయం; ఆతనితోడన్= రాజుతో; చెప్పెడిది+కాక= చెప్పాలి.

తాత్పర్యం: అంతఃపురాలలోని మాటలు ఎప్పటికీ బయటపెట్టరాదు. ఇతరత్రా మరెక్కడయినా రాజుకు సంబంధించిన మాటలు వింటే ముందు ఆలోచించాలి. ఆ తరువాత ఆ మాటలు రాజు వినదగినవయితే చెప్పాలి.

విశేషం: అంతఃపుర విశేషాలు బయట పొక్కితే ఆరా తీస్తారు. చెప్పినవాని ప్రాణం నిలవదు. అలాగే సేవకుడు ఇతరత్రా తనకు తెలిసిన విషయం రాజుకు చెప్పకపోయినా తప్పే. అయితే సేవకుడు అందులో కొంత విచక్షణ చూపాలి. విన్న మాటలలో అసలు నిజం తెలిసికొనాలి. ఆ తరువాత రాజుకు చెప్పదగినదా కాదా అని ఆలోచించాలి. రాజు వినదగినదయితేనే చెప్పాలి. అనవసరమయిన విషయం చెప్పరాదు. రాజుకు అప్రియమయిన విషయం ఎపుడూ చెప్పరాదు.

క. అంతిపురము చుట్టఱికం। బెంతయుఁ గీ, డంతకంటె నెగ్గు తదీయో
పాంత చర కుబ్జ వామన। కాంతాదులతోడి పొందుకలిమి భటునకున్. 131

ప్రతిపదార్థం: భటునకున్= సేవకునికి; అంతిపురము చుట్టరికంబు= అంతఃపురంతో చుట్టరికం; ఎంతయున్+కడు= ఎంతో హాని కలిగిస్తుంది; తదీయ+ఉపాంతచర= అంతఃపుర సమీపంలో తిరిగే; కుబ్జవామన కాంతాదులతోడి= గూనివారు, పొట్టివారు, పరిచారికలు మొదలయిన వారితో; పొందు కలిమి= స్నేహం కలిగి ఉండటం; అంతకంటెన్= అంతకంటే; ఎగ్గు= కీడు.

తాత్పర్యం: భటుడికి అంతఃపురంతో సంబంధం మంచిది కాదు. హానికారి. అక్కడ తిరిగే గూనివారు, వామనులు, పరిచారికలు మొదలగువాళ్ళతో స్నేహం అంతకంటె కీడు కలిగిస్తుంది.

ఆ. **ఉత్తమాసనములు, నుత్కృష్ట వాహనం। బులును గరుణఁ దమకు భూమిపాలుఁ**
డీక తార యెక్కు టెంతటి మన్నన। గలుగువారికైనఁ గార్య మగునె? **132**

ప్రతిపదార్థం: ఉత్తమ+ఆసనములున్= శ్రేష్ఠమయిన ఆసనాలును (గద్దెలు); ఉత్కృష్టవాహనంబులును= మహనీయమయిన వాహనాలు (ఏనుగులు గుర్రాలవంటివి); కరుణన్= దయతో; తమకున్= తమకు; భూమిపాలుఁడు= రాజు; ఈక= ఇవ్వకుండానే; తారు+అ= తామే; ఎక్కుట= ఎక్కటం; ఎంతటి= ఎంత ఎక్కువ; మన్నన= గౌరవం; కలుగువారికిన్+ఐనన్= కలవారికయినా; కార్యము+అగునె?= చేయదగింది ఔతుందా? (కాదు).

తాత్పర్యం: రాజు అనుగ్రహిస్తేనే ఆసనాలు అధిరోహించాలి. అట్లాగే వాహనాలు కూడా. రాజానుగ్రహం లేకుండ శ్రేష్ఠమైన ఆసనాలు పెద్ద పెద్ద వాహనాలు తమంతట తాము ఎన్నుకొనటమో, అధిరోహించటమో ఎంతగా రాజగౌరవం పొంది ఉన్న వారికైనా పనికిరాదు.

క. **మన్నన కుబ్బక, యవమతి। దన్నొందిన స్రుక్కఁబడక, ధరణీశుకడన్**
మున్నున్న యట్ల మెలఁగిన। యన్నరునకు శుభము లొదవు నాపద లడఁగున్. **133**

ప్రతిపదార్థం: మన్ననకున్= రాజు చేసిన గౌరవానికి; ఉబ్బక= పొంగిపోకుండా; అవమతి= అవమానం; తన్ను+ఒందినన్= తనకు కలిగితే; స్రుక్కఁబడక= క్రుంగిపోకుండా; ధరణీశుకడన్= రాజుదగ్గర; మున్ను= పూర్వం; ఉన్న+అట్లు+అ= ఉన్నట్లే; మెలఁగిన= ప్రవర్తించినట్టి; ఆ+నరునకున్= ఆ మనుష్యునకు; శుభములు= శుభాలు; ఒదవున్= కలుగుతాయి; ఆపదలు= ఆపదలు; అడఁగున్= అణగిపోతాయి.

తాత్పర్యం: రాజు తనను గౌరవించాడని ఉబ్బిపోరాదు. అవమానించాడని క్రుంగిపోరాదు. ఆ రెండింటిని లెక్కించక వెనుకటివలెనే రాజుదగ్గర ప్రవర్తించే సేవకులకు మంచి జరుగుతుంది. ఆపదలు తొలగిపోతాయి.

క. **జనపతి యెవ్వరి నైనను। మనుపఁ జెఱుపఁ బూనియునికి మది దెలియ నెఱిం**
గిన యేనిఁ దాను వెలిపు। చ్చునె మునుము న్నెట్టి పాలసుండును దానిన్? **134**

ప్రతిపదార్థం: జనపతి= రాజు; ఎవ్వరిన్+ఐనను= ఎవ్వరినైనా; మనుపన్= రక్షించడానికి గాని; చెఱుపన్= చంపటానికిగాని; పూని+ఉనికి= సంసిద్ధుడుగా ఉన్నాడని; మదిన్= మనసులో; తెలియన్+ఎఱింగిన+ఏనిన్= బాగా తెలిసినప్పటికీ; దానిన్= దానిని; ఎట్టి పాలసుండును= ఎంత మూఢుడయినా (అవివేకి అయినా); మునుమున్ను= ముందుగానే; తాను= తాను; వెలిపుచ్చునె?= బయటపెట్టుతాడా?

తాత్పర్యం: ఒక వేళ రాజు ఎవరినైనా సంరక్షించాలని అనుకొనవచ్చును. లేదా శిక్షించాలని అనుకొనవచ్చును. ఆ విషయాలు తనకు తెలిసినా, అవి అమలు కాకముందే సేవకుడైనవాడు తనంతట తాను బయటపెట్టేవాడు మూర్ఖుడు.

విశేషం: 'నెఱింగెనయేనిఁ' - ఆనందాశ్రమ గ్రంథమాల ప్రతి.

ఉ. **ఎండకు వాన కోర్చి, తనయిల్లు ప్రవాసపుఁ జోటు నాక, యా**
కొందు, నలంగుదున్, నిదురకుం దఱి దప్పెడు, డప్పి పుట్టె, నొ
క్కండన యెట్లొకో యనక కార్యము ముట్టినచోట నేలినా
తం డొక చాయ చూపినను దత్పరతం బని సేయు టొప్పగున్. **135**

ప్రతిపదార్థం: ఎండకున్= ఎండకూ; వానకున్= వానకూ; ఓర్చి= ఓర్చుకొని; తన ఇల్లు, ప్రవాసము+చోటు నాక= ఇది తనయిల్లు, ఇది పరాయి చోటు అనుకొనకుండా; ఆ కొందున్= ఆకలిగొందును; నలంగుదున్= నలిగి (ఆలసి) పోతాను; నిదురకున్+తఱి తప్పెడున్= నిద్రకు సమయం మించిపోతుంది; డప్పి+పుట్టెన్= దాహం వేస్తున్నది; ఒక్కండన+ఎట్లు+ఒకో= ఒక్కడినే ఎట్లాగో; అనక= అని తలపక; కార్యము= పని; ముట్టినచోటన్= కలిగినచోట; ఏలిన+అతండు= రాజు; ఒక చాయ= ఒక రీతి; చూపినను= చూపిస్తే కూడా; తత్పరతన్= నిష్ఠతో, ఏకాగ్రతతో; పనిచేయుట= పనిచేయడం; ఒప్పు+అగున్= ఉచితమౌతుంది.

తాత్పర్యం: ఎండకూ, వానకూ సహించాలి. తనయిల్లనీ, పొరుగుచోటనీ అనుకొనరాదు. ఆకలి వేస్తుంది, అలసిపోతాను, నిద్రకు సమయం మించిపోతుంది, దాహం వేస్తున్నది, ఒక్కడినే ఎట్లా? అనే ఆలోచనలకు అవకాశం ఎప్పుడూ ఇవ్వకూడదు. అనుకోకుండా రాజు ఒక పనిని సూచించినట్లయితే ఆ పనిని శ్రద్ధతో, భక్తితో చెయ్యాలి.

క. **తా నెంత యాప్తుఁ డైన మ । హీనాయకుసొమ్ము పాముసెమ్ములుగా లో**
నూనిన భయమునఁ బొరయక । మానినఁగా కేల కలుగు మానము బ్రదుకున్? **136**

ప్రతిపదార్థం: (రాజు) తాను= తాను; ఎంత= ఎంత; ఆప్తుఁడు+ఐనన్= కావలసినవాడైనా; మహీనాయకు సొమ్ము= రాజుసొమ్ము; పాము+ఎమ్ములుగాన్= పాము ఎముకలుగా; లోన్+ఊనిన= లోపల పొందిన; భయమునన్= భయంతో; పొరయక= గ్రహించక; మానినన్+కాక= మానివేస్తే కాని; మానము= గౌరవం; బ్రదుకున్= బ్రదుకును; ఏల కలుగున్?= ఎందుకు కలుగుతుంది? ఎట్లా కొనసాగుతుంది?

తాత్పర్యం: రాజుకు తాను ఎంత ఆప్తుడయినా కావచ్చును. రాజధనాన్ని పాము ఎముకలవలె భావించాలి. వాటిని పరికించాలి. వాటిని సంగ్రహించే గుణం మానితేనేగాని మానమూ, ప్రాణమూ నిలువవు.

విశేషం: అలం: ఉపమ. రాజధనం పాము ఎముకలవలె సంగ్రహించకూడదని చెప్పింది తిక్కన. ఈ ఉపమానం మూలంలో లేదు. విషతుల్యాలైన పాము ఎముకలు సేకరించగూడనివి అని లోక ప్రసిద్ధి. సేకరిస్తే ప్రాణహాని కలుగుతుంది. అట్లాగే రాజధనం గ్రహించి కూడబెట్టటం చేటని భావం. (సంపా.)

ఆ. **ఆవులింత, తుమ్ము, హాసంబు, నిష్ఠీవ । నంబు గుప్త వర్తనములు గాఁగఁ**
జలుప వలయు నృపతి కొలువున్న యెడల, బా । హిరము లైనఁ గెలని కెగ్గు లగుట. **137**

ప్రతిపదార్థం: నృపతి= రాజు; కొలువు+ఉన్న+ఎడలన్= సభతీర్చి ఉన్నప్పుడు; ఆవులింత= ఆవులించటం; తుమ్ము= తుమ్మటం; హాసంబు= నవ్వు; నిష్ఠీవనంబు= ఉమ్మివేయటం; (ఇవి) బాహిరములు+ఐనన్= బయటపెడితే; కెలనికిన్= ప్రక్కన ఉన్నవారికి; ఎగ్గులు+అగుటన్= సహించటానికి శక్యం కానివి అవటంచేత; గుప్త వర్తనములు+కాఁగన్= గుట్టుగా ఆచరించబడేవి అయ్యేటట్లుగా; చలుపన్+వలయున్= చేయాలి.

తాత్పర్యం: రాజు కొలువు తీరినపుడు సేవకుడు ఆవులించకూడదు. తుమ్మటం మంచిది కాదు. నవ్వటం అసలే పనికిరాదు. ఉమ్మివేయటం తప్పు అవుతుంది. వీటిని బహిరంగంగా చేస్తే ప్రక్కవాళ్ళకు సహించరానివి. కాబట్టి వాటిని గోప్యంగా చేయాలి.

క. **వైరుల దూతలు, నెరవగు। వారు, నిరాకృతులుఁ బాపవంతులుఁ దమకుం**
జేరువఁగా వర్తించుట। నేరమి; తుదిఁ బోయి చేటు నిందయు వచ్చున్. **138**

ప్రతిపదార్థం: వైరుల దూతలున్= శత్రువుల దూతలు; ఎరవు+అగువారు= భేదం కలిగించేవారు; నిరాకృతులున్= రాజుచేత నిరాకరించబడిన వారూ; పాపవంతులున్= పాపపు పనులు చేసేవారు; తమకున్= తమకు; చేరువఁగా= దగ్గరగా; వర్తించుట= ఉండటం; నేరమి= తప్పు; తుదిన్+పోయి= చివరకు; చేటు= కీడు; నిందయున్= నిందకూడా; వచ్చున్= వచ్చును.

తాత్పర్యం: శత్రువుల దూతలుగాని, భేదభావాన్ని కలిగించేవారుగాని, రాజు ఆగ్రహానికి పాత్రులై నిరాకరించబడిన వారుగాని, పాపాత్ములుగాని, తమకు దగ్గరగా ఉండటం మంచిది కాదు. దీనివలన చివరకు కీడూ, నిందా వస్తాయి.

ఆ. **వసుమతీశు పాల వసియించు నేనుంగు। తోడ నైన, దోమతోడ నైన**
వైర మగు తెఱంగు వలవదు; తా నెంత। పూజ్యుఁ డైన జనుల పొందు లెస్స. **139**

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశు పాలన్= రాజుదగ్గర; వసియించు= ఉండే; ఏనుంగుతోడన్+ఐనన్= ఏనుగుతోనయినా (పెద్దవానితోనయినా); దోమతోడన్+ఐనన్= దోమతో అయినా (చిన్నవాడితోనయినా); వైరము+అగు తెఱంగు వలవదు= శత్రుత్వం ఏర్పడే పద్ధతి పనికిరాదు; తాను= తాను; ఎంత- పూజ్యుఁడు+ఐనన్= తానెంత పూజించదగినవాడయినా; జనులపొందు= ప్రజలతో స్నేహం; లెస్స= మంచిది.

తాత్పర్యం: రాజుదగ్గర మెలగే ఏనుగుతోనయినా, దోమతోనయినా వైరం కలిగే ప్రవర్తన మంచిది కాదు. భటుడు తా నెంత పూజనీయుడయినా రాజు కొలువుకు సంబంధించిన జనులతో స్నేహం కలిగి ఉండటం మేలు.

క. **కలిమికి భోగముల కదా। ఫల మని తను మెఱసి బయలుపడఁ బెల్లుగ వి**
చ్చలవిడి భోగింపక వే। డ్కలు సలుపఁగ వలయు భటుఁ డడంకువతోడన్.' **140**

ప్రతిపదార్థం: కలిమికిన్= సంపదకు; భోగములు+అ, కదా= భోగాలేకదా; ఫలము+అని= ఫలితం అని; తను మెఱసి= తాను ప్రకాశించి; బయలుపడన్= బయటపడేటట్లుగా; పెల్లుగన్= అధికంగా; విచ్చలవిడిన్= విచ్చలవిడిగా; భోగింపక= అనుభవించకుండా; భటుఁడు= సేవకుడు; అడంకువతోడన్= వినయంతో; వేడ్కలు+చలుపఁగ వలయున్= వేడుకలు చేసుకోవాలి.

తాత్పర్యం: భోగాల కొరకే కదా సంపదలని సేవకుడు విచ్చలవిడిగా భోగించరాదు. రాజునకు కంటగింపు కలుగకుండా నమ్రతతో వేడుకలు చేసికొనాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని యిట్లు పురోహితుండు సేవాధర్మంబు లెఱింగించిన ధర్మజ భీమార్జున నకుల సహదేవులు ప్రసన్న చిత్తులై యిట్లనిరి. 141

ప్రతిపదార్థం: అని+ఇట్లు= అని ఈ విధంగా; పురోహితుండు= పురోహితుడైన ధౌమ్యుడు; సేవాధర్మంబులు= సేవాధర్మాలను; ఎఱింగించినన్= తెలియపరచగా; ధర్మజ, భీమ+అర్జున, నకుల, సహదేవులు= ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు; ప్రసన్నచిత్తులు+ఐ= ప్రసన్నములైన మనస్సులు కలవారై; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: పురోహితుడయిన ధౌమ్యుడు సేవాధర్మాలు చెప్పగా విని పాండవులు సంతోషించి ఇట్లా అన్నారు.

క. 'తల్లియుఁ దండ్రియు దైవము। నెల్ల సుహృజ్జనము మీర; యిట్లు గొలిచి వ
ర్తిల్లెడు తెఱంగు లెంతయుఁ। దెల్లము సేసితిరి; బ్రతికితిమి మీ కరుణన్.' 142

ప్రతిపదార్థం: మీరు+అ= మీరే (ధౌమ్యుడే) (బహువచనం గౌరవవాచకం); తల్లియున్+తండ్రియున్+దైవమున్= తల్లీ తండ్రీ దైవమే కాక; ఎల్ల, సుహృత్+జనమున్= స్నేహితులనబడేవారందరూ (మీరే); ఇట్లు= ఈ విధంగా; కొలిచి, వర్తిల్లెడి, తెఱంగులు= కొలువు చేసేటప్పుడు పాటించే నడవడిక పద్ధతులు; ఎంతయున్= ఎంతగానో; తెల్లము+చేసితిరి= తెలిసేటట్లు స్పష్టం చేశారు; మీ, కరుణన్= మీ యొక్క దయవలన; బ్రతికితిమి= బ్రతికిపోయాం. (అంటే రక్షించబడ్డాం అని అర్థం, తెలుగు జాతీయం).

తాత్పర్యం: 'మాకు తల్లైనా, తండ్రైనా, దైవమైనా, మిత్రసమూహమైనా అన్నీ మీరే. మేము కొలువు చేసేటప్పుడు పాటించవలసిన నడవడికల పద్ధతులను మీరు ఎంతో మేలుగా స్పష్టమయ్యేటట్లు చెప్పారు. నిజంగా మీ దయ వలన మేము బ్రతికిపోయాం.'

విశేషం: రాబోయే హితాన్ని సూచించేవాడు పురోహితుడు. అజ్ఞాతవాసంలో ప్రభువును సేవించే పదవులలో ఉండబోతున్నారు పాండవులు. వారందరికీ సామాన్య సేవానియమావళిని ధౌమ్యుడు బోధించాడు. వాటిని ధారణలో ఉంచుకొనండని హితవు చెప్పాడు. సమయోచితమైన భావిహితాన్ని చెప్పిన పురోహితుడిలో పాండవులు తల్లినీ, తండ్రినీ, దైవాన్నీ, హితుడినీ చూచారు. పురోహితుడొకడుంటే వారందరూ ఉన్నట్లే అని వారి భావం. ధౌమ్యుడి యందు పాండవుల కున్న గౌరవభావం ఇందులో ధ్వని. మూలంలో అంత ఆప్యాయంగా మాట్లాడగలిగినవారైనా కుంతి, విదురుడు మాత్రమే పాండవులకున్నారని, ఆ తరువాత ధౌమ్యుడేఅని పాండవులన్నారు. ఇది బంధుత్వంతో పోల్చి చెప్పేమాట. తిక్కన దీనిని విశ్వజనీనం చేశాడు. చెప్పే పద్ధతిలోని ఆప్యాయతకు మూలం ప్రాధాన్యమిస్తే, తిక్కన రచన తత్కాలోచిత వృత్తి ధర్మ ప్రబోధ ప్రవృత్తికి ప్రాధాన్యమిచ్చింది. ధౌమ్యుడిని స్నేహమూర్తిగానే కాక లోకజ్ఞుడిగా, హితుడిగా మూర్తి కట్టించింది. (సంపా.)

ఆ. అనిన ధౌమ్యుఁ డిట్టు లనియె; 'నీ వత్సర। మొకఁడు నెట్టు లయిన నుడిగి మడిఁగి
సంకటముల కోర్చి చరియించి యాపద। నిస్తరించి పిదప నెగడవలయు'. 143

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ధౌమ్యుఁడు= ధౌమ్యుడు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; ఈవత్సరము+ఒకఁడున్= ఈ సంవత్సరం ఒకటే; ఎట్టులు+అయినన్= ఏదోవిధంగా; ఉడిగి మడిఁగి= అణగి మణగి ఉండి; సంకటములకున్+ఓర్చి= కష్టాలు సహించి; చరియించి= తిరిగి; ఆపదన్= ఆపదను; నిస్తరించి= దాటి; పిదపన్= తరువాత; నెగడన్+వలయున్= బయటపడాలి.

తాత్పర్యం: అపుడు ధౌమ్యుడు ఇట్లా అన్నాడు. 'ఈ ఒక్క సంవత్సరకాలం ఎట్లాగయినా అణగి మణగి ఉండాలి. కష్టాలకు ఓర్చుకొనాలి. ఆపదనుండి గట్టెక్కి బయటపడాలి.'

విశేషం: అజ్ఞాతవాసకాలంలో 'సంకటాలకు' ఓర్పువహించాలనీ, 'ఆపదల'ను దాటాలనీ సూచించాడు ధౌమ్యుడు. భావికథలో కీచకాదులవలన సంకటాలు, దక్షిణ ఉత్తర గోగ్రహణాల వలన ఆపదలు వస్తాయి. ఆ యా సందర్భాలలో ఇతరులకు తెలియరాకుండా వ్యవహరించి పాండవులు విజయవంతంగా వ్రతాన్ని ముగించి బయటపడతారనే భావికథ పరితల కిందులో తిక్కన స్ఫురింపచేస్తున్నాడు. (సంపా.)

క. అనవుడు, 'నట్టుల చేసెద' । మని వారలు భక్తియుక్తి నతనికి నభివం
దన మొనరించినఁ దగు దీ । వన లిచ్చె నతండు గాఢవాత్సల్యమునన్. 144

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; వారలు= పాండవులు; అట్టులు+అ= అట్లే; చేసెదము= చేస్తాం; అని= అని; భక్తియుక్తిన్= భక్తితో; అతనికిన్= ధౌమ్యునికి; అభివందనము= నమస్కారం; ఒనరించినన్= చేయగా; గాఢ వాత్సల్యమునన్= మిక్కుటమయిన ప్రేమతో; అతండు= ధౌమ్యుడు; తగు దీవెనలు= తగిన దీవెనలు; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: అనగానే 'అట్లాగే చేస్తామని పాండవు లన్నారు. భక్తితో ధౌమ్యుడికి నమస్కరించారు. అతిశయించిన వాత్సల్యంతో ధౌమ్యుడు పాండవులకు దీవెనలు ఇచ్చాడు.

క. భూదేవోత్తము నాశీ । ర్వాదంబులఁ బ్రీతిఁ బొంది వారలు ప్రస్థా
నాదరపరు లగుటయు స । మ్మోదావహ పుణ్యకర్మముల కుద్యతుఁడై. 145

ప్రతిపదార్థం: వారలు= పాండవులు; భూదేవ+ఉత్తము+ఆశీర్వాదంబులన్= బ్రాహ్మణశ్రేష్ఠుడైన ధౌమ్యుని దీవనలతో; ప్రీతిన్= సంతోషాన్ని, సంతృప్తిని; పొంది= అనుభవించి; ప్రస్థాన+ఆదరపరులు+అగుటయున్= ప్రయాణం చేయటంలో ఆసక్తి కలిగినవారు కాగా; (అతడు) సమ్మోద+ఆవహ= సంతోషం కలిగించే; పుణ్యకర్మములకున్= పుణ్యకార్యాలకు; ఉద్యతుఁడు+ఐ= పూనినవాడై.

తాత్పర్యం: ధౌమ్యుడి ఆశీర్వాదాలతో పాండవులు ప్రీతిచెందారు. తరువాత ప్రయాణోన్ముఖులయ్యారు. అపుడు ధౌమ్యుడు పాండవులకు శుభసంతోషాలు కలిగించే పుణ్యకర్మలకు పూనుకొన్నాడు.

ఆ. అతఁడు నియతితోడ నగ్ని సముజ్జ్వలం । బుగ నొనర్చి కామ్యపూజ దీర్చి
యాన సమయ మంగళార్థంబు లగు మంత్ర । సంచయములు దగ జపించుచుండె. 146

ప్రతిపదార్థం: అతఁడు= ధౌమ్యుడు; నియతి తోడన్= నియమంతో; అగ్నిన్, సముజ్జ్వలంబుగన్+ఒనర్చి= అగ్నిని ప్రజ్వలింపచేసి; కామ్యపూజ= కోరికకు అనుగుణంగా చేసే పూజ (అగ్నికార్యం); తీర్చి= నెరవేర్చి (సిద్ధింపజేసి); యాన సమయ= ప్రయాణ సమయంలో; మంగళ+అర్థంబులు+అగు= శుభాలు కలగటానికి ఉద్దేశించబడిన; మంత్ర సంచయములు= మంత్రసముదాయాలు; తగన్= ఉచితమైన విధంగా; జపించుచున్+ఉండెన్= జపిస్తున్నాడు.

తాత్పర్యం: ధౌమ్యుడు నియమంతో అగ్నిని ప్రజ్వలింపచేశాడు. కామ్యపూజ నిర్వర్తించాడు. తరువాత, ప్రయాణంలో శుభం జరిగేందుకు తగిన మంత్రాలు జపిస్తున్నాడు.

విశేషం: అగ్ని సర్వదేవతలకు ప్రతినిధి, కర్మసాక్షి, ఫలప్రదాత. అందువలననే సర్వకార్యాలలో అగ్నిని ఆరాధించటం వైదికధర్మం. అగ్నికార్యం సకామంగా, నిష్కామంగా చేయవచ్చును. ఆ రెండు పద్ధతులకూ నియమనిష్ఠలు, ఆచరణపద్ధతులు, మంత్రాలూ వేరుగా ఉంటాయి కూడా. ఇక్కడ ధౌమ్యుడు నియమనిష్ఠలతో అగ్నిని ప్రజ్వలింపచేశాడు. కామ్యపూజ చేశాడు. అంటే-పాండవులు

అజ్ఞాతవాసవ్రతాన్ని నియమనిష్ఠలతో విజయవంతంగా పూర్తిచేయాలని సంకల్పించి అగ్నిపూజ చేశాడన్నమాట. మూలంలో **'తేషాం సమిధ్య తానగ్నీన్ మన్త్రవచ్చ జుహావ సః. సమృద్ధి వృద్ధి లాభాయ పృథ్వీ విజయాయ చ" (4.4.55)** అని ఉన్నది. పాండవులకు సమృద్ధి, వృద్ధి, పృథివీ విజయం కలగాలని సంకల్పించి చేసినట్లు ఉన్నది. తిక్కన దానిని వాచ్యం చేయకుండా సమయోచిత సంకల్పాన్ని పఠితల ఊహకు వదలివేశాడు. రాజ్యలాభంకంటె ముందు అజ్ఞాతవాస నియమ సమాప్తి ముఖ్యమని తిక్కన తీర్పు. అది సందర్భోచిత్యం కూడా. యాత్రలకు, యుద్ధయాత్రలకు పయనమయ్యేటప్పుడు మార్గంలో విఘ్నాలు రాకుండా రక్షించుమని పంచభూతాలనూ, భగవంతుడినీ ప్రార్థించే మంత్రాలను ధౌమ్యుడు చదువుతున్నాడు. మంత్రాలు ముందు నడుస్తాయి. పాండవులు ఆ వెంట మంగళప్రస్థానం సాగిస్తారని భావం. (సంపా.) 'తగ జపించుచుండె' - పెక్కుప్రతులు; 'తెగ జపించుచుండె'- ఉస్మానియా ప్రతి.

పాండవులు పాంచాలితోడ విరాటు నగరంబునకు బయలుదేరుట (సం.4-4-48)

వ. **తదనంతరంబ, హుతవహునకుం బురోహితునకుం బ్రదక్షిణంబు సేసి, యమ్మహీసురవరేణ్యు నను మతి వడసి, పాండవులు పాంచాలిం బురస్కరించుకొని, యాతండును దోడన యరుగుదేరం గదలి, శుభ నిమిత్తంబులు గైకొనుచుం జని, దశార్ణ దేశంబున కుత్తరంబునఁ బాంచాల జనపద యామ్యదిగ్భాగంబున సాళ్వ శూరసేన విషయంబులలోనం గాళిందీ దక్షిణతీరం బొరసికొని, పశ్చిమాభిముఖ ప్రయాణంబుల నెడనెడ వన్యాహారంబుల శరీర యాత్రలు నడపుచు, నానా మృగ వివిధ విహారంబులను, మనోహర కుసుమ కదంబ గంధ మకరంద బిందు సందోహ సుందర తరుచ్ఛాయా సేవనంబులను, గమల పరాగ పరంపరా ధూ సరిత భాసుర జలాశయ సమవగాహనంబులను, సరిత్సంగమ స్నానాద్యనుష్ఠానంబులను, బహుప్రకార పాదప గుల్మలతావ లోకనంబులను, బక్షికుల ప్రకరానేకభంగి విరుతాకర్ణనంబులను వినోదించుచుఁ, గానన మార్గంబుల నరిగి, మత్స్యమండలంబు గడి సేరి ధౌమ్యుని వీడుకొనిరి; అవ్విప్రవరుండును నొక్క పుణ్యాశ్రమంబున వసియించె; వారు మఱియు నూళ్ళు సొరక యడవి తెరువుల నడచి విరాటు నగరంబున కనతిదూరం బగు కాంతారంబునం దఱిమి పోవు సమయంబునఁ బథిశ్రమంబు నూని యాజ్ఞసేని యిట్లనియె.** **147**

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తరువాత వెంటనే; పాండవులు= పాండవులు; హుతవహునకున్= అగ్నిదేవునికి; పురోహితునకున్= పురోహితుడైన ధౌమ్యునికి; ప్రదక్షిణంబు+చేసి= ప్రదక్షిణం చేసి; ఆ+మహీసురవరేణ్యు= బ్రాహ్మణ శ్రేష్ఠుడైన ధౌమ్యుని యొక్క; అనుమతి= అనుజ్ఞ; పడసి= పొంది; పాంచాలిన్= ద్రౌపదిని; పురస్కరించుకొని= ముందిడుకొని; ఆతండును= ధౌమ్యుడును; తోడన్+అ= కూడానే; కదలి= బయలుదేరి; అరుగుదేరన్= రాగా; శుభనిమిత్తంబులు= శుభశకునాలు; కైకొనుచున్= పొందుతూ; చని= వెళ్ళి; దశార్ణ దేశంబునకున్= దశార్ణదేశానికి; ఉత్తరంబునన్= ఉత్తర దిక్కున; పాంచాలజనపద= పాంచాలదేశంయొక్క; యామ్యదిక్+భాగంబునన్= దక్షిణదిక్కున; సాళ్వ, శూరసేన, విషయంబులలోనన్= సాళ్వ, శూరసేన దేశాలలో; కాళిందీ దక్షిణ తీరంబు= యమునానది దక్షిణపుఒడ్డును; ఒరసికొని= రాచుకొని (ప్రక్కనుండి); పశ్చిమ+అభిముఖ ప్రయాణంబులన్= పడమటి దిక్కువైపు చేసే ప్రయాణాలలో; ఎడన్+ఎడన్= అక్కడక్కడ; వన్య+ఆహారంబులన్= కందమూల ఫలాలతో (వనంలో దొరికే ఆహారంతో); శరీర యాత్రలు= శరీరం పోషించుకొనటాలు; నడపుచున్= కొనసాగిస్తూ; నానామృగ వివిధ విహారంబులను= అనేక విధాలనుండే మృగాలయొక్క పెక్కురకాల సంచారాలచేత; మనోహర= అందమైన, మనస్సులనాకర్షించే; కుసుమ కదంబ= పూలగుత్తుల యొక్క; గంధ= సుగంధం యొక్క; మకరంద, బిందు= పూదేనె చుక్కల

యొక్క; సందోహ= సముదాయంచేతను; సుందర= అందంగా ఉన్న; తరుచ్ఛాయా సేవనంబులను= చెట్లనీడలను ఆశ్రయించి ఉండటంతోనూ; కమల పరాగ పరంపరా= పద్మాల పుప్పొడి సముదాయాలతో; ధూసరిత= బూడిద రంగు కలదిగా చేయబడి; భాసుర= ప్రకాశించే; జల+ఆశయ= సరోవరాలలో; సమవగాహనంబులను= మునుకలతో స్నానాలు చేయుటమున్నూ; సరిత్+సంగమ= నదీ సంగమ ప్రదేశాలలో; స్నాన+ఆది+ అనుష్ఠానంబులను= స్నానం మొదలయిన అనుష్ఠానాలు నిర్వర్తిస్తూ; బహుప్రకార= అనేక విధాలయిన; పాదప= చెట్ల; గుల్మ= పొదల; లతా= తీగల; అవలోకనంబులను= చూడటాలచేతనూ; పక్షికుల= పక్షిజాతుల; ప్రకర= సమూహాల యొక్క; అనేక భంగి విరుత= రకరకాల కూతల; ఆకర్ణనంబులన్= వినటాల చేతనూ; వినోదించుచున్= వినోదిస్తూ; కానన మార్గంబులన్= అడవి దారులలో; అరిగి= వెళ్ళి; మత్స్యమండలంబు= మత్స్యదేశం యొక్క; గడి+చేరి= సరిహద్దు చేరి; ధౌమ్యునిన్= ధౌమ్యుని; వీడుకొనిరి= (సెలవు తీసికొన్నారు) విడిచిపెట్టారు; ఆ+ విప్రవరుండును= ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడైన ధౌమ్యుడును; ఒక్క= ఒక; పుణ్య+ఆశ్రమంబునన్= పవిత్రమైన ఆశ్రమంలో; వసియించెన్= ఉండిపోయాడు; వారు= పాండవులు; మఱియున్= తరువాత; ఊళ్ళు+చొరక= గ్రామాలలో ప్రవేశించక; అడవి తెరువులన్= అడవి దారులలో; నడచి= నడచుకొంటూ; విరాటు నగరంబునకున్= విరాటనగరానికి; అనతి దూరంబు+అగు= సమీపంలో ఉన్న; కాంతారంబునన్= అడవిలో; తఱిమి పోవు సమయంబునన్= వేగంగా వెళ్ళేసమయంలో; యాజ్ఞసేని= ద్రౌపది; పరిశ్రమంబున్= ప్రయాణపు బడలికను; ఊని= పొంది; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: తరువాత పాండవులు అగ్నిదేవుడికి, ధౌమ్యుడికి ప్రదక్షిణ నమస్కారం చేశారు. ధౌమ్యుడి అనుమతి స్వీకరించారు. ద్రౌపదిని ముందుంచుకొని, ధౌమ్యుడిని వెంటబెట్టుకొని బయలుదేరారు. శుభశకునాలు కనిపిస్తూ ఉంటే దశార్ణదేశానికి ఉత్తరాన, పాంచాలదేశానికి దక్షిణాన, సాళ్వ శూరసేన దేశాలలో ప్రవహించే యమునానది దక్షిణపు ఒడ్డువెంబడి, పశ్చిమంగా ప్రయాణించారు. దారిలో అక్కడక్కడ కందమూల ఫలాదులతో ఆకలిబాధలు తీర్చుకొంటూ వెళ్ళుతున్నారు. ఎన్నో విధాలైన మృగాలు, వివిధ రీతులుగా విహరిస్తూ ఉంటే దర్శిస్తూ కదిలారు. మకరంద బిందువులతో కూడి, మనోహరమయిన పుష్పగుచ్ఛాల సువాసనలతో నిండిన చెట్ల నీడలలో నడిచారు. పద్మాల పుప్పొడి తేలిన చెరువులలో స్నానాలు చేశారు. నదీ సంగమాలలో పవిత్ర స్నానాలు అనుష్ఠానాలు నిర్వర్తించారు. ఎన్నోరకాల చెట్లనూ, పొదరిండ్లనూ, తీగలనూ చూచారు. వ్యక్తుల రకరకాల ధ్వనులు వింటూ వినోదిస్తూ అడవి మార్గాలలో ప్రయాణించారు. మత్స్యదేశం పొలిమేర చేరారు. అక్కడ ధౌమ్యుడివద్ద సెలవుతీసికొని ముందుకు సాగారు. ధౌమ్యుడు ఒక పుణ్యాశ్రమంలో వసించాడు. తరువాత పాండవులు ఊళ్ళ వెంబడి వెళ్ళటం తప్పించి అడవి బాటలలో నడక సాగించారు. వారు విరాటనగర సమీపంలో ఉన్న అడవిలో ప్రయాణాన్ని పరుగులిడుతున్నట్లు వేగంగా సాగించారు. అపుడు ద్రౌపది ప్రయాణపు బడలికతో ఈ విధంగా పలికింది.

విశేషం: 1. పురోహితుడు యజమానుడికొరకు సంకల్పించి యజ్ఞకార్యం, కామ్యపూజ చేశాడు. దానిఫలం అనుభవించేది యజమానుడు (ఇక్కడ పాండవులు). పాండవులు ఆ పూజాకార్య కర్తృత్వ భోక్తృత్వాలను వినయంతో అంగీకరించి అగ్నిభట్టారకుడికీ, ధౌమ్యుడికీ సగౌరవంగా ప్రదక్షిణ నమస్కారాలతో తమ భక్తి ప్రపత్తులను తెలిపారు. ధౌమ్యపూజకు వెంటనే ప్రతిఫలంగా శుభశకునాలు గోచరించాయి. అవి దైవానుకూల్య చిహ్నాలు, తిక్కన శకునాలను వదలకుండా వర్ణిస్తాడు. అవి ఆనాటి సాంఘిక విశ్వాసాలలో విశిష్టస్థానం కలిగి ఉండవచ్చును. ఇక్కడ మాత్రం దైవసాముఖ్యానికి సూచికగా ధ్వనిమయంగా వర్ణించబడ్డాయి.

2. జనపదాలను వదలి పాండవులు వనపదాలలో ప్రయాణించే ఒక మధుర దృశ్యాన్ని అక్షరరమణీయమైన వచనంతో మధుర గుణశోభితంగా తిక్కన వర్ణించాడు. వర్ణనా ప్రియుడైన తిక్కన వచనాన్ని కూడా కవితామయం చేస్తాడన్న దాని కిది

ఉదాహరణం. దట్టమైన అడవులలో దివారాత్రాలు పయనిస్తూ అడవులలో దొరికే శాకాహారం భక్షణంతో మాత్రమే రోజులు సాగిస్తూ సరోవరాలలో, నదులలో, సంగమతీర్థాలలో స్నానాలు చేస్తూ పరిమళభరితాలైన పుష్పిత వృక్షాల ఛాయలలో వసిస్తూ సాగించిన పాండవుల ప్రయాణం ఎంత శ్రమతో కూడి ఉన్నదో అంత మనోహరంగా ఉన్నది. ఇట్టి విరుద్ధ భావాల అనుభూతుల విశిష్టచిత్రణమే తిక్కన శిల్పం. వచనాన్ని వనవిహారవ్యంజకంగా వాడిన రచనా శిల్పి తిక్కన. ఇది అమూలకం. మూలంలో దేశాల పేర్లున్నాయి. కాని వన సౌందర్యం మచ్చుకైనా లేదు. ఈ వచనంలోని వృత్త్యనుప్రాస, అంత్యానుప్రాసల నాదమాధుర్యం లేదు. ఇదంతా తిక్కన కల్పన.

3. 'తటిమి పోవు'- చక్కని తెలుగు జాతీయం ఎవరో తరుముతూ ఉంటే వేగంగా పోతున్నట్లు త్వరగా నడిచే నడకతో చేసే ప్రయాణం 'తటిమిపోవటం'- అన్నిదేశాలు నడిచి వచ్చినప్పుడు ద్రౌపదికి శ్రమ తోచలేదు. చివరి ఘట్టంలో లక్ష్యాన్ని తొందరగా చేరాలని అతివేగంగా నడిచారు. కోమలి అయిన ద్రౌపది ఆయాసానికి గురి అయింది.

4. మూలంలో పాండవులు అగ్నికి ప్రదక్షిణం చేసి ప్రస్థానం సాగించిన తరువాత ధౌమ్యుడు అగ్నిహోత్రాలతో పాంచాలదేశానికి వెళ్ళినట్లు ఉన్నది. తిక్కన దానిని మార్చాడు. మత్స్యదేశపు పొలిమేరలదాకా ధౌమ్యుడు పాండవులను అనుగమించాడనీ, ఆ తరువాత వారిని వీడ్కొని ఒక పుణ్యాశ్రమంలో నివసించాడనీ పేర్కొన్నాడు. ధౌమ్యుడికి ఒక ప్రత్యేకతను, గుర్తింపును తిక్కన కల్పించాడు. (సంపా.)

ఉ. 'డప్పి జనించె, వ్రేళుల పుటంబులు పొక్కఁ దొడంగె, గోళ్ళలోఁ
జిప్పిలఁ జొచ్చె నెత్తురులు, చిత్తము నాకుఁ గడు న్వశంబుగా
దప్పుర మిచ్చ టచ్చటను నాసల వచ్చితి, నెంత ద వ్వొకో!
యిప్పటి భంగి నొక్కడుగు నేఁగెడు దానికి నోర్వ నెమ్మెయిన్'. 148

ప్రతిపదార్థం: డప్పి జనించెన్= దాహం వేస్తున్నది; వ్రేళుల పుటంబులు= వేళ్ల చివరలు; పొక్కన్+తొడంగెన్= బొబ్బలెక్కటం మొదలు పెట్టాయి. గోళ్ళలోన్= గోళ్లలో; నెత్తురులు= నెత్తురులు; చిప్పిలన్+చొచ్చెన్= చిమ్ముతున్నాయి; నాకున్= నాకు; చిత్తము= మనసు; కడున్= మిక్కిలిగా; వశంబు+కాదు= వశంలో లేదు; ఆ+పురము= ఆ విరాటుని నగరం; ఇచ్చటన్+అచ్చటన్+అను+ఆసలన్= ఇక్కడే, దగ్గరే అనే ఆశలతో; వచ్చితిన్= వచ్చాను; ఎంతదవ్వు+ఒకో!= (ఆ పట్టణం) ఇంకా ఎంతదూరం ఉన్నదో ఏమో; ఇప్పటి భంగిన్= ఇప్పుడున్న పరిస్థితిని బట్టి; ఒక్క+అడుగున్= ఒక్క అడుగు కూడా; ఏగెడు దానికిన్= వెళ్లటానికి; ఏ+మెయిన్= ఏ విధంగానూ; ఓర్వన్= శక్తురాలను కాను.

తాత్పర్యం: 'దాహం వేస్తున్నది. కాలివ్రేళ్లు పొక్కి బొబ్బలెక్కుతున్నాయి. గోళ్ళలో నెత్తురు చిమ్ముతున్నది. శరీరం స్పృహ తప్పుతున్నది. విరాట నగరం ఇక్కడే ఎంతో దూరం లేదు- అనుకొంటూనే ఎంతో దూరం ఆశతో వచ్చాను. ఇప్పుడున్న పరిస్థితినిబట్టి నే నింక ఒక్క అడుగుకూడా ముందుకు వేయలేను.'

విశేషం: తిక్కనది 'రసాభ్యుచితబంధం'. అందులో శ్రవ్యకావ్యంలో దృశ్యకావ్యమర్యాదలను ప్రవేశపెట్టి కల్పించే సన్నివేశ చారుత్వం. నాటకోచిత రచనాశిల్పం పోషించబడుతాయి. మూలంలో 'బలవాన్ మే పరిశ్రమః' అని తాను బాగా అలసిపోయాను అని ద్రౌపది అంటుంది. తెలుగులో ప్రయాణపు బడలికను సూచించే అనుభావాలను ప్రదర్శించి ఎదుటివారికి రసానుకూల విభావంగా ప్రత్యక్షమయ్యేటట్లు తిక్కన చిత్రించిన ద్రౌపది మాట్లాడింది. కాళ్లవేళ్ళ కొసలు బొబ్బలెక్కటం, గోళ్ళు రక్తం చిందటం, మనసు తూలిపోవటం - ఇవి అలసటకు అనుభావాలు (అభినయ చేష్టలు). అలసటలో ద్రౌపది ప్రకటించే వాచికాభినయం కూడా

తెలుగుదనాన్ని పుక్కిట పట్టుతున్నది. 'దూరం దూరం ఎంతెంతదూరం' అని తెలుగునుడికారం. ఇక్కడే ఇక్కడే అనటం ఊతపదం. పాండవులు ఇక్కడే ఇక్కడే అని చెపుతుంటే ద్రౌపది నిజమే కాబోలని ఆశతో వచ్చినట్లు, ఇంకెంత దూరమో అని నీరసించినట్లు కనబడుతుంది. 'నేను ఒక్క అడుగు కూడా వేయలే'ననటం కూడా తెలుగు పలుకుబడియే. 'ఏగెడుదానికి ఓర్వను' అనటంలో నెల్లూరు మాండలిక ప్రభావం కనబడుతున్నది. ఈ పద్యంలో ద్రౌపది బడలికతో తూలిపోవటం అనే విభావాన్ని సృష్టించటం తిక్కన శిల్పమే. అంతేకాదు. ఇక్కడ ఒక నాటకీయమైన సన్నివేశాన్ని కల్పించాడు. అది ముందు పద్యాలలో తెలుస్తుంది. (సంపా.)

వ. అనవుడు. 149

తాత్పర్యం: అనగానే.

క. తన మదిఁ గరుణయు ఖేదం। బును బిరిగొనుచుండ ధర్మపుత్త్రుఁడు నకులుం
గనుఁగొని ద్రుపదనృపతి నం। దన దెస యాతనికిఁ జూపి తగ నిట్లనియెన్. 150

ప్రతిపదార్థం: తనమదిన్= తన మనస్సులో; కరుణయున్= జాలీ; ఖేదంబును= దుఃఖమూ; పిరిగొనుచుండన్= పెనవేసికొనిపోతుండగా; ధర్మపుత్త్రుఁడు= యమధర్మరాజు కుమారుడయిన ధర్మరాజు; నకులున్= నకులుడిని; కనుఁగొని= చూచి; అతనికిన్= ఆ నకులునికి; ద్రుపదనృపతి నందనదెస= ద్రుపదమహారాజు కుమార్తె అయిన ద్రౌపదివైపు; ఆతనికిన్= అతనికి (నకులునికి); చూపి= చూపించి; తగన్= అనువుగా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాను.

తాత్పర్యం: ధర్మరాజు ద్రౌపది పడుతున్న అలసటవలని బాధను చూచాడు. జాలి దుఃఖం కలిసి అతడి మనసును పిండివేశాయి. ద్రౌపదిని చూపిస్తూ ధర్మరాజు నకులుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలసిన ద్రౌపదిని చూచిన ధర్మజుడికి జాలి, దుఃఖం పెనవేసికొని మనసులో పొంగాయి. ఈ అనుభవాలు ద్రౌపది అనే విభావాన్ని పరికించిన ధర్మజుడనే సహృదయుడు పొందే స్పందనగా ఏర్పడ్డాయి. తనలో కలిగిన ఈ స్పందనను తమ్ములతో పంచుకొనటానికి పూనుకొన్నాడు ధర్మరాజు. కౌంతేయులలో పెద్దవాడయిన ధర్మజుడు మాద్రేయులలో పెద్దవాడిని చూచి ఇట్లా అనటం విశేషం. (సంపా.)

ఆ. 'అకట! మనము వచ్చినది గడుదవ్వు, నేఁ। డప్పురంబు సొత్త మని తలంచి
తటిమి నడచితిమి లతాతన్వి యిది; వడ। గొనియె; మోచి తెమ్ము కొంత దవ్వు' 151

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; మనము= మనం; వచ్చినది= ప్రయాణం చేసింది; కడుదవ్వు= చాలాదూరం; నేఁడు= ఈ నాడే; ఆ+పురంబున్= ఆ విరాట మహారాజు పట్టణాన్ని; చొత్తము+అని= ప్రవేశిద్దామని; తలంచి= అనుకొని తలపోసి; తటిమి నడచితిమి= తరుముతున్నట్లుగా త్వరగా నడిచాము; ఇది= ఈమె (ద్రౌపది); లతాతన్వి= లతవలె సుకుమారమయిన శరీరం కలది; వడగొనియెన్= వడదెబ్బతిన్నది; కొంతదవ్వు మోచి= కొంతదూరం దాకా మోసికొని; తెమ్ము= తీసికొనిరమ్ము.

తాత్పర్యం: 'మనం ఇప్పటికే చాలాదూరం నడిచాం. ఈ రోజే విరాటమహారాజు పట్టణం చేరుకొనాలని తరిమి తరిమి వేగంగా నడిచాము. ద్రౌపది శరీరం తీగవలె సుకుమార మయింది. వడదెబ్బ తిన్నది. అందుచేత ఈమెను కొంతదూరం మోసికొనిరమ్ము.'

విశేషం: 'వడ గొనియె'- తిక్కన తెలుగు జాతీయం. తీవ్రమైన ఎండవేడికి వడగాడ్పుకు మూర్ఛపొందితే 'వడగొట్టింది.' అనటం సామాన్యం. అంతటి తీవ్రమైన అలసటకు కూడా ఆ మాట వాడటం గమనార్హం. వడదెబ్బ తిన్నవారికి శైత్యోపచారాలు కావాలి. విశ్రాంతి కావాలి. అందువలననే ఆమెను ఎత్తుకొని రమ్మని నకులుడిని ధర్మరాజు ఆదేశించాడు. (సంపా.)

క. అనిన విని పూని గ్రక్కున। జనుదేరమి, నతఁడు డస్సెఁ జాలం డని నె
మ్మనమున నెఱింగి యాతని। యనుజన్మునిఁ బనిచె; నతఁడు నలసుం డయినన్. 152

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= విని; పూని= పూనుకొని; గ్రక్కునన్= తొందరగా; చనుదేరమిన్= ముందుకు రాకపోవటం చేత; అతఁడు= నకులుడు; డస్సెన్= అలసిపోయాడు; చాలండు+అని= మోసికొని రావడానికి సమర్థుడు కాడని; నెఱ+మనమునన్= నిండుమనస్సులో; ఎఱింగి= తెలిసికొని; ఆతని= ఆ నకులుడి; అనుజన్మునిన్= తమ్ముడయిన సహదేవుని; పనిచెన్= ఆజ్ఞాపించాడు; అతఁడున్= అతడు కూడా; అలసుండు+అయినన్= అలసిపోయినవాడు కాగా.

తాత్పర్యం: ఆ మాటలను నకులుడు విన్నాడు. అయితే వెంటనే ముందుకు రాలేదు. నకులుడు అలసిపోయాడని ధర్మరాజు గుర్తించాడు. సహదేవుడిని చూచి నకులుడు అలసిపోయాడు ద్రౌపదిని మోసికొనిరాలేడు. నీవు మోసికొని రమ్ము' అని అతడిని పురమాయించాడు. అతడు కూడా అలసిఉన్నందున ముందుకు రాకపోగా అపుడు ధర్మరాజు (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. సవ్యసాచిం జూచి. 153

తాత్పర్యం: అర్జునుడి వైపు చూచి.

ఉ. 'ఇమ్మదిరాక్షి డస్సె, మన కీనడుమన్ విడియంగ నొండుచో
టిమ్మును గాదు; నిక్కమున కేమును డస్సితి; మట్లు గాన నీ
వెమ్మెయినైన దీని భరియించి పురంబు సమీప భూమికిం
దె' మ్మని చెప్ప నాతఁడును దెచ్చెఁ బ్రియంబునఁ బుష్పకోమలిన్. 154

ప్రతిపదార్థం: ఈ+మదిర+అక్షి= మత్తిల్లిన కళ్ళుగల ఈ ద్రౌపది; డస్సెన్= అలసిపోయింది; మనకున్= మనకు; ఈ నడుమన్= ఈ అరణ్యప్రాంతంలో; విడియంగన్= విడిది చేయటానికి; ఒండుచోటు= ఏదైన ఒక స్థలం; ఇమ్మును+కాదు= అనువైనదిగా లేదు; నిక్కమునకున్= నిజానికి; ఏమును= మేము కూడా; డస్సితిమి= అలసిపోయాము; అట్లు+కానన్= ఆ కారణంవలన; నీవు= నీవు; ఏ+మెయిన్+ఐనన్= ఏ విధంగా నయినా; దీనిన్= ఈ ద్రౌపదిని; భరియించి= మోసికొని; పురంబు సమీపభూమికిన్= విరాటుని పట్టణ ప్రాంతానికి; తెమ్ము= తీసికొనిరమ్ము; అని= అని; చెప్పన్= చెప్పగా; ఆతఁడును= అర్జునుడును; పుష్పకోమలిన్= పువ్వువలె కోమలి అయిన ద్రౌపదిని; ప్రియంబునన్= ప్రీతితో; తెచ్చెన్= మోసికొని వచ్చాడు.

తాత్పర్యం: 'ద్రౌపది అలసిపోయింది. ఈ అడవిలో మనం విడిది చేయటానికి అనువయిన ప్రదేశం లేదు. నిజానికి మేము కూడా అలసిపోయాం. అందుచేత అర్జునా! నీవు ఏ విధంగానైనా సరే ద్రౌపదిని విరాటుడి నగరప్రాంతానికి మోసికొని రమ్ము' అని ధర్మరాజు చెప్పాడు. అర్జునుడు కుసుమకోమలి అయిన ద్రౌపదిని ప్రీతితో మోసికొని వచ్చాడు.

విశేషం: 1. మూలంలో ద్రౌపది 'వసామేహాపరాం రాత్రిం' అని ఒకరాత్రి అక్కడ ఉండిపోదామని ప్రతిపాదించింది. ఆ మాట తెలుగులో లేదు. కాలసూచనం కథ కనువుగా లేకపోతే తిక్కన వదిలివేస్తాడు. అవసరం వచ్చినచోట అనువుగా సూచిస్తాడు. రాత్రి ప్రసక్తి రాకపోయినా 'మన కీ నడుమన్ విడియంగ నొండు చో టిమ్మను గాదు' అని సూచించి ఆ లోపాన్ని నిపుణంగా ధర్మజుడు తొలగించాడు. తప్పనిసరిగా ప్రయాణం చేయాలన్న విషయాన్ని సమర్థించాడు. 'తఱిమినడక' తప్పదని హెచ్చరించాడు. అందువలన ద్రౌపదిని ఎవరైనా ఎత్తుకొని రాక తప్పదని నిశ్చయించుకొన్నాడు.

2. ధర్మరాజు గడుసరి. అంతగా జాలిపడినవాడు ఆమెను తానే ఎత్తుకొని మోయవచ్చుగా? తానుకూడా అలసిపోయాడు. అబల కాబట్టి ద్రౌపది పైకి చెప్పింది. మగవాడుకాబట్టి, పెద్దవాడుకాబట్టి తొందరపని కాబట్టి తా నామాట అనలేకపోయాడు. అయితే భీముడిని అడుగవచ్చునుకదా? అర్జునుడు లేనప్పుడు భీముడే ఆమెను మోసేవాడు. మరి ఇప్పుడు ధర్మరాజు నకులుడిని అడిగాడు. అతడు అలసిపోయి ముందుకు రాలేదు; సహదేవుడూ అట్లాగే చేశాడు. ఇక అర్జునుడి వంతు వచ్చింది. 'అందరమూ అలసిపోయి ఉన్నాం. నీకు తప్పదు' అన్నట్లు ధర్మజు డన్నాడు. అభిమానధనుడైన అర్జునుడు ఆమెను పూలతీవవలె ఎత్తుకొని అవలీలగా వెళ్ళాడు. కౌంతేయులలో పెద్దవాడు ధర్మజుడు. అతడి తరువాత మాద్రేయులలో ప్రథముడు నకులుడు. కర్మకాండకు సంబంధించి పాండవులలో వారిరువురు పెద్దవారు. అందువలననే యక్షుడు ఒక్కడిని బ్రతికిస్తానంటే నకులుడిని ధర్మరా జెన్నుకొన్నాడు. ఆ తరువాతవారే చిన్నవారు. అందువలన నకులుడితో మొదలుపెట్టి, అతడు కాదన్న తరువాత సహదేవుడు. అర్జునుడు అనే క్రమంలో అడుగుతూ వచ్చాడు. అర్జునుడు కూడా కాదంటే భీమునికి తప్పేది కాదు. పాండవులలో భీమార్జునులు సర్వసమర్థులని మరొకసారి ఈ సన్నివేశం నిరూపించింది. మూలంలో ధర్మరాజు సరాసరి అర్జునుడినే అడుగుతాడు. తెలుగులో ధర్మరాజు ఈ చిన్ని నాటక మాడాడు. ఎవరికీ ధర్మమీమాంస రాకుండా సన్నివేశాన్ని కాపాడాడు. (సంపా.)

క. **మోచికొని వాసవాత్మజుఁ। డా చెలువం దేర నిట్టు లరిగి పురము దృ**
గ్గోచర మగుటయుఁ దమ్ములఁ। జూచుచు వారలకు ధర్మసుతుఁ డిట్లనియెన్. **155**

ప్రతిపదార్థం: వాసవ+ఆత్మజుఁడు= ఇంద్రుని కొడుకయిన అర్జునుడు; ఆ చెలువన్= ద్రౌపదిని; మోచికొని తేరన్= మోసికొనిరాగా; ఇట్టులు+అరిగి= ఇట్లా నడిచి; పురము= విరాటుని పట్టణం; దృక్+గోచరము+అగుటయున్= కనుచూపుమేరలో కనబడగా; ధర్మ సుతుఁడు= యమధర్మరాజు కుమారుడయిన ధర్మరాజు; తమ్ములన్= తమ్ములను; చూచుచున్= చూస్తూ; వారలకున్= భీమాది పాండవులతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు ద్రౌపదిని మోసికొని వచ్చాడు. పాండవులు నడక సాగించారు. కనుచూపుమేరలో పట్టణం కనిపించింది. ధర్మరాజు తమ్ముళ్ళను చూచి ఈ విధంగా అన్నాడు.

క. **'చక్కని చిక్కని మేనులు। నిక్కోదండములు నైన నెఱుఁగరె? మన మీ**
చక్కటి నిలుతమె? శస్త్రము। లొక్కెడ దాఁచుటకు, వేషయోజనములకున్.' **156**

ప్రతిపదార్థం: చక్కని= చక్కని; చిక్కని= దృఢమయిన; మేనులున్= శరీరాలును; ఈ కోదండములున్+ఐనన్= ఈ ధనుస్సులూ అయితే; ఎఱుఁగరె= తెలిసికొనరా; మనము= మనం; శస్త్రములు= ఆయుధాలు; ఒక్క+ఎడన్= ఒకచోట; దాఁచుటకున్= దాచటానికి; వేష యోజనములకున్= అజ్ఞాతవాసానికి తగిన విధంగా వేషాలు వేసికొనటానికి; ఈ చక్కటిన్= ఈ ప్రదేశంలో; నిలుతమె?= ఆగుదామా?.

తాత్పర్యం: 'మన ఆకారాలను, ధనువులను చూడగానే ప్రజలు మనలను గుర్తుపట్టరా? అందుచేత మన ఆయుధాలు దాచుకొనటానికీ, వేషాలు మార్చుకొనటానికీ ఈ ప్రదేశంలో ఆగుదామా?'

వ. అనిన నిది కార్యంబని మధ్యమపాండవుం డా సుమధ్య నొక్క శీతల సికతాతలంబున డించె; దక్కినవారలు నట్ల చేయుద మని నిలిచి; రట్టియెడలఁ బాండవాగ్రజుండు గాండీవి చేతి వి ల్లుపలక్షించి యతని కిట్లనియె. 157

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఇది కార్యంబు+అని= ఈ పని చేయతగినదని; మధ్యమ పాండవుండు= పాండవ మధ్యముడయిన అర్జునుడు; సుమధ్యన్= చక్కని నడుము కలిగిన ద్రౌపదిని; శీతలసికతాతలంబునన్= చల్లని ఇసుక తిన్నెమీద; డించెన్= దించాడు; తక్కిన వారలున్= మిగిలినవారును; అట్లు+అ చేయుదము+అని= ఆ రకంగానే చేద్దామని; నిలిచిరి= నిలిచారు; అట్టి+ఎడలన్= ఆ సమయంలో; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; గాండీవి చేతి= అర్జునుని చేతిలో ఉన్న; విల్లు+ఉపలక్షించి= వింటిని తేరిపార చూచి; అతనికిన్= అర్జునునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇది చేయతగినపని అని అర్జునుడు అభిప్రాయపడినాడు. ద్రౌపదిని చల్లని ఇసుకతిన్నెమీద దించాడు. మిగతావారంతా అట్లాగే చేద్దామని అక్కడే ఆగారు. ధర్మరాజు గాండీవాన్ని చూచాడు. అర్జునుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'మన శస్త్రాస్త్రంబులు ద। క్కినయవి యొకభంగి; వీటికిని గాండివము౦
గొనిపోయితిమేని సుయో। ధనునకు నగపాటు నిశ్చితం బూహింపన్.' 158

ప్రతిపదార్థం: మన= మనయొక్క; శస్త్ర+అస్త్రంబులు= శస్త్రాలు, అస్త్రాలు; తక్కినయవి= మిగిలినవి; ఒకభంగి= ఒక ఎత్తు; వీటికిని= విరాటుడి నగరంలోపలికి; గాండివమున్= గాండీవాన్ని; కొనిపోయితిమి+ఏనిన్= తీసికొనివెళ్ళితే; సుయోధనునకున్= దుర్యోధనునికి; అగపాటు= తెలియటం; ఊహింపన్= ఆలోచిస్తే; నిశ్చితంబు= నిశ్చయం.

తాత్పర్యం: 'మన ఆయుధాలన్నీ ఒక ఎత్తు, అర్జునుడి గాండీవం మరొకఎత్తు. ఈ గాండీవంతో విరాటుడి పట్టణంలో అడుగుపెట్టితే దుర్యోధనుడికి మన 'ఆచూకి' తెలియటం నిశ్చయం.'

వ. అనవుడు. 159

తాత్పర్యం: అనగానే.

చ. 'ఇది పెనుఁబాము చందమున నెంతయు భీషణమై జనంబులన్
బెదరఁగఁ జేయు; నట్లగుటఁ బెట్టి చనన్ వలయుం; దలంచి నా
హృదయము దీనిఁ బాయుటకు నియ్యకొనం జొర; దెట్లు చెప్పినం
దుది నొకచోట వైచుటయ తోఁచిన కార్యము నయ్యెడుం గటా!' 160

ప్రతిపదార్థం: ఇది= ఈ గాండీవం; పెను+పాము చందమునన్= పెద్దపామువలె; ఎంతయున్= ఎంతో; భీషణము+ఐ= భయంకరమై; జనంబులన్= ప్రజలను; బెదరఁగన్+చేయున్= బెదరగొట్టుతుంది; అట్లు+అగుటన్= ఆ విధంగా (బెదరకొట్టేది) కావటంచేత; పెట్టి చనన్+వలయున్= ఎక్కడయినా భద్రంగా దాచిపెట్టి వెళ్ళాలి; తలంచి= దీనిని తలచుకొని; నా హృదయము= నా మనసు; దీనిన్= దీనిని; పాయుటకున్= వదలిపెట్టడానికి; ఇయ్యకొనన్+చొరదు= అంగీకరించటానికి సమ్మతించటం లేదు; ఎట్లు చెప్పినన్= ఏ విధంగా చెప్పినా; తుదిన్= చివరకు; ఒకచోటన్= ఏదో ఒకచోట; వైచుటయ= దాచడమే; తోఁచిన కార్యము+అయ్యెడున్= ఇప్పటికి తోచినపని ఔతుంది; కటా!= అయ్యో!.

తాత్పర్యం: 'ఈ గాండీవం పెద్దపామువంటిది. ప్రజలను బెదరగొట్టుతుంది. అందుచేత దీనిని ఎక్కడయినా దాచివెళ్ళాలి. ఈ మాట అనుకొంటున్న కొద్దీ దీన్ని విడిచిపెట్టటానికి నా మనసు ఏమాత్రమూ అంగీకరించటం లేదు. ఏమయినా సరే! చివరకు ఒకచోట దాచిపెట్టి వెళ్ళటమే మంచిదనిపిస్తున్నది.'

విశేషం: భారతంలో తాము ధరించే ఆయుధాలతో తమకు బిరుదనామాలు వచ్చినవారు శ్రీకృష్ణార్జునులు- చక్రి, గాండీవులుగా ప్రసిద్ధికెక్కారు. అర్జునుడికి గాండీవం అగ్నిదత్తమైనది. గాండీవం మహాసర్పంవలె భయంకరంగా ఉంటుంది. కవ్వడి అయిన అర్జునుడు రెండు చేతులతో ప్రయోగించే పాశుపతాస్త్రాదులవంటి మహాస్త్రాలను వహించే సామర్థ్యం దానికి ఉన్నది. ఆ గాండీవాన్ని అర్జునుడు ప్రాణంకంటె ఎక్కువగా ప్రేమిస్తాడు. గాండీవాన్ని ఎవరైనా దూషించినా, దానిని మరెవరికైనా ఇమ్మని తనను అవమానించినా వారితలను బ్రద్దలు చేస్తానని స్వయంగా శపథం చేసికొన్నాడు. ఒకసారి ధర్మరాజు (కర్ణపర్వంలో) అర్జునుడిపై కోపగించి 'గాండీవాన్ని శ్రీకృష్ణుడికి ఇస్తే అతడు కర్ణుడిని సంహరించి ఉండేవాడు కదా' అని అధిక్షేపించాడు. అర్జునుడు ఆగ్రహించి ధర్మజుని తల బ్రద్దలు చేయబోయాడు. శ్రీకృష్ణుడు ధర్మసూక్ష్మాన్ని చూపించి ఆ ఆపదను తొలగించాడు. అర్జునుడు స్వర్గారోహణం చేసేంతవరకు గాండీవాన్ని ధరించే ఉన్నాడు. అతడి శరీరంలో అది ఒక భాగమని భావించాడు. అందుకే గాండీవాన్ని వదలి ఉండలేక మనస్సు ఊగిసలాడుతూ ఉండగా అంతగా బాధపడ్డాడు. దానిని దాచిపెట్టక తప్పదని నిశ్చయించి 'కటా' అని చివరకు విట్టూర్చాడు. (సంపా.)

వ. అని వితర్కించుచుం గిరీటి యురియాడు చిత్తంబు నుత్తలం బుడిపికొని నిశ్చయించి, యాయుధంబులు నిక్షేపించుటయ కర్జంబుగాఁ బలికి యోగ్యస్థల నిరూపణంబునకు నలుదిక్కులుం బరికించి ప్రేతభూమి పరిసరారణ్యంబునందు. 161

ప్రతిపదార్థం: అని= అని; కిరీటి= అర్జునుడు; వితర్కించుచున్= ఆలోచిస్తూ; ఉరియాడు= ఊగులాడే (చలించే); చిత్తంబు+ఉత్తలంబున్= మనసుయొక్క కలతపాటును; ఉడిపికొని= దిగమ్రింగుకొని; నిశ్చయించి= ఒక నిర్ణయానికి వచ్చి; ఆయుధంబులు= ఆయుధాలను; నిక్షేపించుటయ= దాచటమే; కర్జంబుగాన్= చేయతగిన పనిగా; పలికి= చెప్పి; యోగ్యస్థల నిరూపణంబునకున్= తగినచోటు నిరూపించటానికి; నలుదిక్కులున్= నాలుగు దిక్కులను; పరికించి= కలయచూచి; ప్రేతభూమి= శ్మశానం యొక్క; పరిసర+అరణ్యంబునందున్= దగ్గరున్న దట్టమైన అడవిలో.

తాత్పర్యం: అర్జునుడు ఆలోచించాడు. ఊగిసలాడే మనసులోని కలతపాటును అణచుకొన్నాడు. ఆయుధాలు దాచడమే కర్తవ్యమని నిశ్చయించుకొన్నాడు. గాండీవం దాచడానికి తగిన చోటుకొరకు నలువైపులా చూచాడు. శ్మశానానికి దగ్గరగా ఉన్న అరణ్యంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. నెగసిన కొనలేచి నింగినంతంతకు। నవులఁ ద్రోచుచుఁ దనరారు దానిఁ,
జాఁగిన శాఖ లాశాచక్రమున కొలం। దులు బారవెట్టంగఁ బొలుచు దానిఁ,
గవట లొండొంటితోఁ; గదియుచు నెడములు। మ్రింగి ప్రబ్బఁగ సొంపు మిగులు దాని,
లోని జొంపము పవలును బెను జీఁకటి। నొదవించి పొదలంగ నొప్పుదానిఁ

తే. గనియెఁ బవమాన వివిధ వర్తన కళాను। వర్తి; గాకఘూకారవస్ఫూర్తి జాత
భీతి పరిసరవర్తి నాభీల భుజగ। చండమూర్తి, శమీతరు చక్రవర్తి. 162

ప్రతిపదార్థం: నెగసిన కొనలు= పైకి లేచిన కొమ్మల రెమ్మల చివరలు; ఏచి= అతిశయించి; నింగిన్= ఆకాశాన్ని; అంతంతకున్= ఇంకా పైపైకి; అవలన్+త్రోచుచున్= బయటికి గెంటుతూ; తనరారుదానిన్= ప్రకాశించేదానిని; చాఁగిన శాఖలు= సాగిన కొమ్మలు; ఆశా చక్రమున= దిక్చక్రం యొక్క; కొలందులు= (హద్దులను) ప్రమాణాలను; బార+పెట్టంగన్= బారలతో కొలిచేవిధంగా; పొలుచుదానిన్= రాణించేదానిని; కవటలు= పెద్దపెద్ద కొమ్మలు; ఒండొంటితోన్= ఒకదానితో ఒకటి; కదియుచున్= రాచుకొనేవిధంగా; ఎడములు గ్రింగి ప్రబ్బఁగన్= నడుమ నున్న ఖాళీలను క్రమ్మి వ్యాపించగా; సొంపు మిగులుదానిన్= సొగసు ఎక్కువైఉన్నదానిని; లోనిజొంపము= లోపలిగుబురు; పవలును= పగలుకూడా; పెను+చీఁకటిన్= దట్టమయిన చీకటిని; ఒదవించి= కలిగించి; పొదలంగన్= వ్యాపించగా; ఒప్పుదానిన్= ఒప్పునటువంటి దానిని; పవమాన= గాలిచేత; వివిధవర్తన= అనేకరీతుల; కళా+అనువర్తిన్= కళలను అనుసరించేదానిని; కాక= కాకుల; ఘూక= గుడ్లగూబలయొక్క; ఆరవ స్ఫూర్తిన్= ధ్వనుల స్ఫురణతో; జాత= పుట్టిన; భీతి= భయంకల; పరిసరవర్తిన్= చుట్టుపట్ల తిరిగేవారు కలిగిన దానిని; ఆభీల= మిక్కిలి భయంకరమయిన; భుజగచండమూర్తిన్= పామువలె తీవ్రమయిన స్వరూపం కలదానిని; శమీతరు చక్రవర్తిన్= శ్రేష్ఠమైన జమ్మిచెట్టును; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: జమ్మిచెట్టుకున్న చిట్టచివరికొనలు ఆకాశాన్ని అంతకంతకు వెనక్కి నెడుతున్నాయి. కొమ్మలు నలువైపులా సాగి దిగంతాలను కొలిచేవిధంగా ఉన్నాయి. పెద్దపెద్ద కొమ్మలు ఒకదానితో ఒకటి రాచుకొంటూ మధ్య ఏమాత్రం ఎడం లేకుండా వ్యాపించి ఉన్నాయి. దట్టమయిన ఆకుల గుబురులు పగటి వేళలోనూ దట్టమైన చీకటిని కలిగిస్తున్నాయి. ఆ చెట్టు గాలికి కదులుతుంటే ఎన్నో నర్తన కళలను అభ్యసిస్తున్నట్లుగా ఉన్నది. ఆ చెట్టుమీద కాకులు, గుడ్లగూబలున్నాయి. భీకరమైన వాటి అరపులకు పరిసరజనం భయపడుతున్నారు. ఆచెట్టుమొత్తం భయంకరమైన మహాసర్పంవలె ప్రచండంగా గోచరిస్తున్నది. అటువంటి ఆ శమీవృక్ష చక్రవర్తిని అర్జునుడు చూచాడు.

విశేషం: 1.అలం: రూపకం, అతిశయోక్తి, అంత్యానుప్రాస. భీషణసుందరమైన ఈ శమీవృక్ష వర్ణనం మూలంలో లేదు. ఇది తిక్కన ప్రతిభాజన్యం. శమీతరువును చక్రవర్తిగా చెప్పి రూపకాలంకారాన్ని నిర్వహించారు. తిక్కన మానవులలో చక్రవర్తికి ఏ విధంగా విశిష్ట లక్షణాలుంటాయో తరువులలోకూడ చక్రవర్తి అయిన చెట్టుకు ఆ జాతికి చెందిన విశేషలక్షణా లుండటం సహజం. రూపకం చేస్తున్నప్పుడు మానవతరు లక్షణాలను రెండింటినీ అన్వయించటం అలంకారశిల్పం. దానికి పద్యనిర్మాణ శిల్పం భావవిస్ఫూర్తికి తోడుపడుతుంది.

2. పాండవులు చక్రవర్తులు. వారి చక్రవర్తిత్వానికి వారి బల మెంత కారణమో, వారి ఆయుధాలు కూడ అంతకారణం. ఆ ఆయుధాలను తనవద్ద ఉంచుకొని రక్షించగలిగినవాడు కూడా చక్రవర్తి కావాలి. అధముడు దానికి అధికారి కాడు. అందువలననే తిక్కన శమీతరు చక్రవర్తిని దర్శింపచేశాడు.

3. చక్రవర్తి రూప వైభవ వర్ణనం ఉదాత్తంగా విస్తృతంగా జరగాలి కాబట్టి, తిక్కన సీసపద్యం ఎత్తుకొన్నాడు. దానితో సీసపాదాలకూ, ఎత్తుగీతికీ నడుమ 'కనియెన్' అనే క్రియను ప్రయోగించాడు. పద్యం సహజంగా రెండు భాగాలుగా విభక్తమైపోయింది. రెంటికీ క్రియ ఒకటే. సీసంలోని నాలుగుపాదాలూ 'దానిన్' అనే పదంతో ముగుస్తూ అంత్యానుప్రాసతో అందంగా గోచరిస్తాయి. ఎత్తుగీతిలో 'రసస్ఫూర్తి', 'పరిసరవర్తి', 'చండమూర్తి', 'చక్రవర్తి' అనే పదాలు అనుప్రాసతో ఆసక్తిని పెంచుతాయి. 'కనియెన్' అనేక్రియతో భౌతికంగా చూచిన స్ఫూర్తిని సీసపద్యపాదాలలో, భావుకంగా దర్శించిన స్ఫూర్తిని ఎత్తుగీతిలో నిబంధించటం తిక్కన రచనాశిల్పం.

4. అర్జునుడు తనగాండీవాన్ని 'ఇది పెనుఁబాము చందమున నెంతయు భీషణమై జనంబులన్ బెదరఁగఁ జేయున్' అని చెప్పాడు. దానిని భరించగల శమీవృక్షంకూడా ఆ లక్షణాలు కలిగి ఉండాలి. అర్జునుడు వాటిని శమీతరు చక్రవర్తిలో చూచాడు. అతడు భయంకరమైన భుజగంవలె ప్రచండమూర్తి చండుడు-అంటే ఉగ్రస్వభావుడు, వాడిమి కలవాడు. పెనుఁబాము

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లక్షణం ఆ వృక్షరూపానికి ఉండటం అర్జునుడు గమనించాడు. పాములు ఉండటంచేత భయంకరమూర్తి కలిగి ఉన్నది- అని కొందరు వ్యాఖ్యానం చేశారు. అది వృక్షపరంగా మాత్రం అన్వయిస్తుంది. పూర్వాపర శిల్ప సమన్వయ సమర్థం కాదు. 'ఆభీలభుజగ చండమూర్తి' ని ఉపమాన పూర్వపద కర్మధారయంగా గ్రహించటం సమంజసం. చెట్టుకూ, పామువంటి చండమూర్తికీ వర్తించేవి ఎత్తుగీతిలోని విశేషణాలు. గాలిచేత కదలాడటంవలన వివిధ భంగిమలలో అందంగా కనిపించేది చెట్టు. బుసలుకొట్టుతూ అనేకరకాలుగా ప్రసరిస్తూ (వర్తిస్తూ)ఉండే సర్పగతికళానువర్తి భుజగచండమూర్తి ఆ శమీతరు చక్రవర్తి కాకులూ గుడ్లగూబలూ మొదలైన పక్షుల కూతలు బాగా వినపడటంచేత చుట్టుప్రక్కల తిరిగే వారికి భయం కలిగించేది అని వృక్షపరమైన అర్థం. భీకరమైన సర్పం (కొండచిలువ వంటిది) విజృంభించి అడవిలో తిరగటం మొదలుపెడితే పక్షులు భయంతో రొదలు చేయటం సహజం. అటువంటి భయాందోళనలను తనచుట్టూ కలిగించగలిగేది భుజగచండమూర్తి. గాలివాటుగా అనేకవిధాలుగా వర్తించి చుట్టూ ఉన్నవారిని ఆక్రందనలకు గురిచేసేవాడు కోపనుడైన చండశాసనుడు.

5. పామువలె ఉగ్రస్వభావం కలవాడు శమీతరుచక్రవర్తి. ఆ చెట్టుకున్న కొనలు ఆకాశాన్ని ఆవలకు తోస్తున్నట్లుంటాయి. అలాగే పాము నాలుక కొనలు కూడా భాసిస్తాయి. అంటే -భుజగచండమూర్తి రాజ్యవిస్తరణలో కడుక్రూరుడని భావం. సాగిన చెట్టు కొమ్మలు దిక్కులను బారలతో కొలుస్తున్నట్లున్నాయి. చెట్టుకు గుండ్రంగా చుట్టుకొన్న పాము విస్తరించి సాగితే దిక్కులు కొలుస్తున్న మానదండంగా ఉండవచ్చును. ఇది సర్పపరమైన అర్థం. దిగంతాలవరకు రాజ్యవిస్తరణ చేయాలన్న ప్రచండుడి వర్తన అందులో ధ్వని. పెద్దకొమ్మలు కదియబారి ఎడం లేకుండా ఉండటంవలన అందంగా కనపడటం వృక్షలక్షణం. పెద్దవైన ఆడుపాములతో (కొమ్మలతో) కలిసి ఎడం లేకుండా క్రీడించటంవలన అందంగా ఉండేది భుజగచండమూర్తి. (సర్ప క్రీడలో వ్యవధానం ఉండకపోవటం ప్రసిద్ధం). క్రూరుడైన రాజు బలవంతంగా వనితలను భయపెట్టి నిరంతరం క్రీడిస్తుంటాడనే భావం వ్యంగ్యం. లోని ఆకులగుబుర్లవలన పగళ్ళలోకూడ పెనుచీకట్లను కల్పించే నేర్పుతో ఒప్పారేది చెట్టు. జొంపములంటే నిరంతరధార లని అర్థం ఉన్నది. లోని జొంపములంటే సర్పపరంగా విషధారలు. వాటిని వెలిగ్రక్కటం ద్వారా విషధూమాలను వ్యాపింపజేసి పగళ్ళను చీకట్లుగా మార్చే ప్రభావం కలిగి ఉండటం భుజగచండమూర్తి లక్షణం. మనసులోని ఆలోచనల గుంపులచేత వెలుగునుకూడా చీకటిగా మార్చగలిగే దుష్టస్వభావం కలిగి ఉండటం క్రూరుడైన రాజు లక్షణం. ఏతద్భావనతో తిక్కన రూపకాలంకారాన్ని భీకర రమణీయంగా నిర్వహించాడు. పెనుబాముయొక్క స్వభావాన్ని సహజంగా తనలో గర్భీకరించుకొన్న శమీతరుచక్రవర్తి గాండీవధనువును రక్షించగలిగిన ఆభీలభుజగచండమూర్తి అని నిశ్చయించాడు అర్జునుడు.

6. శ్మశానం ప్రక్కన ఉండే జమ్మిచెట్టును ఇంతటి అలంకార సుందరంగా తెలుగులో వర్ణించిన కవి మరొకరు లేరు. శమీతరుచక్రవర్తిని దర్శించగలిగిన వాడు భావుకచక్రవర్తి. తిక్కన భారతంలోని ప్రసిద్ధమైన పద్యాలలో ఇది ఒకటి. రూపకాతిశయోక్తులను, అంత్యానుప్రాసను నిపుణంగా మేళవించిన అలంకృతమైన ఉదాత్త రచన. (సంపా.)

వ. కని యమ్మహీరుహంబు ధర్మనందనునకుం జూపి యిట్లనియె. 163

ప్రతిపదార్థం: కని= ఆ జమ్మిచెట్టును చూచి; ఆ+మహీరుహంబున్= ఆ శమీవృక్షాన్ని; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; చూపి= చూపించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: చూచి, ఆ జమ్మిచెట్టును ధర్మరాజుకు చూపించి ఈ విధంగా అన్నాడు.

శా. 'పక్షివ్యాకులముం, బరేత నిలయోపాంతోత్థమున్, డాకినీ
రక్షోభూత పిశాచ గోచరము దుర్గంధంబునై చూడఁ జి
త్తక్షోభం బొనరించు; నట్లగుటఁ జెంతం జేరరా దీ శమీ
వృక్షం బెవ్వరి; కిందుఁ బెట్టుదమె పృథ్వీనాథ! శస్త్రాస్త్రముల్? 164

ప్రతిపదార్థం: పృథ్వీనాథ!= ఓ భూనాథ! (ధర్మరాజా!); పక్షివ్యాకులమున్= పక్షులకలకలం నిండినదీ; పరేత నిలయ+ఉపాంత+ ఉత్థమున్= శ్మశానానికి దగ్గరలో మొలచినదీ; డాకినీ= డాకినులు; రక్షస్= రాక్షసులు; భూత= భూతాలు; పిశాచ= పిశాచాదులతో; గోచరమున్= కనబడేదీ; దుర్గంధంబున్+ఐ= కంపుతో కూడిందీ అయిన; ఈ శమీవృక్షంబున్= ఈ జమ్మిచెట్టును; చూడన్= చూడగానే; చిత్తక్షోభంబు+ఒనరించున్= మనస్సుకు వ్యాకులత కలిగిస్తుంది; అట్లు+అగుటన్= అట్లా కావడంవలన; ఎవ్వరికిన్= ఎవరికిని; చెంతన్+చేరరాదు= దగ్గరికి చేరడానికి వీలు కాదు; (అందుచేత); శస్త్ర+అస్త్రముల్= మన శస్త్రాలు, అస్త్రాలు; ఇదున్+పెట్టుదమె?= ఈ జమ్మిచెట్టుమీద పెట్టుదామా?

తాత్పర్యం: 'ధర్మరాజా! ఈ జమ్మిచెట్టు నిరంతరం పక్షులరొదలతో నిండి కలతపెట్టేదిగా ఉంటుంది. శ్మశానానికి దగ్గరగా ఉండటంచేత భూతపిశాచ రాక్షస గణాలతో కూడి భయంకరంగా ఉంటుంది. చుట్టూ దుర్గంధం వ్యాపించి ఉంటుంది. దీనివైపు చూస్తేనే మనస్సులో ఒక విధమైన కలత పుట్టుతుంది. అందువలన ఈ చెట్టు దగ్గరికి ఎవ్వరూ రారు. కాబట్టి మన శస్త్రాస్త్రాలను దీనిమీద భద్రపరుద్దామా?

విశేషం: శ్మశానానికి దగ్గరగా ఉండటంవలన చాలమంది రారు. పిశాచాలు భూతాలు ఉండటంవలన భయంకరం. దుర్వాసన కారణంగా దగ్గరికి చేరడానికి అసహ్యం. అందుచేత అస్త్రశస్త్రాలకు భయం లేదని అభిప్రాయం.' దుర్గస్థంబునై'- పెక్కుప్రతులు.

క. పెనుఁ బొడువుఁ బఅపు జొంప। మ్మును గలయది; దీన నెల్ల పురుషులకుఁ బ్రయో
జన మొకఁడు లేదు, చేరం। జనఁ, జూడఁగ, నరయ, నెక్క సమకట్టంగన్. 165

ప్రతిపదార్థం: పెను+పొడువు= పెద్దఎత్తూ; పఅపు= విశాలత్వం; జొంపమ్మును+కల+అది= గుబురూ కలిగింది; దీనన్= ఈ కారణాలవలన; ఎల్ల పురుషులకున్= మానవులందరికి; చేరన్+చనన్= దగ్గరికి రావటానికి కానీ; చూడఁగన్= చూడటానికి కానీ; అరయన్= నిశితంగా పరిశీలించటానికి కానీ; ఎక్కన్ సమకట్టంగన్= ఎక్కటానికి ప్రయత్నం చేయటానికికానీ; ప్రయోజనము= ఉపయోగం; ఒకఁడు= ఒక్కటికూడా; లేదు= లేదు.

తాత్పర్యం: ఈ చెట్టు ఎత్తయింది. చాలా విస్తారమయింది. గుబురయింది. అందుచేత ఎవరూ దగ్గరికి రారు. వచ్చినా చూడరు. దానిని నిశితంగా చూడటంవలనగాని, ఎక్కటం వలనగాని, ఎవరికీ ఎటువంటి ప్రయోజనమూ లేదు.

విశేషం: శస్త్రాస్త్రాలు రహస్యంగా ఉండగలవు అనటానికి తగిన హేతువులను అర్జునుడు పేర్కొన్నాడు. ఎత్తు, వైశాల్యం, గుబురుతనం అనే గుణాలు చెట్టు నెక్కేవాళ్ళను భయపెడతాయి. అందువలన గుబురులో ఎత్తుగా దాచబడిన ఆయుధాలు ఎవరికీ కనపడవు. గాండీవం వంటి పెద్దవిల్లును కూడా తనలో దాచుకొనే వైశాల్యం ఆ చెట్టుకు ఉన్నది. కాబట్టి భయం లేదు. ఇక ఎవరైనా చూడటానికి దగ్గరికి వచ్చినా, ఎక్కటానికిసమకట్టినా వారికి ఏ లాభమూ ఉండదు. చేరటానికి దుర్గంధం, చూడటానికి భయంకరాకారం, ఎక్కటానికి ఫలపుష్పాదు లేవీ లేకపోవటం అనేవి అడ్డువచ్చే బలమైన కారణాలు. ఆ కారణాలవలన ఆయుధాలు సురక్షితంగా ఉండగలవని నిశ్చితాంశం. ధర్మజుడి అంగీకారం పొందాలంటే ప్రతిపాదన ఎంత తర్కబద్ధంగా ఉండాలో అర్జునుడి మాటలు వ్యక్తం చేస్తున్నాయి. (సంపా.)

ఉ. కావున దీనియందు బిడుట కార్యము కైదువులెల్లఁ; గేశచ
ర్మావృత సంచయంబుగ శవాకృతిగా నొనరించి కట్టినం
బోవరు దీని డి క్కొరులు భూవర! నెమ్మది నూఱడిల్లు; మె
చ్చో వసియించినం బిదపఁ జొప్పడుఁ గ్రమ్మఱ వచ్చి కైకొనన్.' 166

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; కైదువులు+ఎల్లన్= ఆయుధాలన్నీ; దీని+అందున్= ఈ జమ్మిచెట్టు గుబురులో; ఇడుట= పెట్టటం; కార్యము= చేయదగినపని; కేశచర్మ+ఆవృత+సంచయంబుగన్= వెంట్రుకలతో కూడిన చర్మంతో చుట్టబడిన సముదాయం కలదిగా; శవ+ఆకృతిగాన్= శవాకారంగా; ఒనరించి= చేసి; కట్టినన్= కట్టినట్లయితే; ఒరులు= ఇతరులు; దీని దిక్కు పోవరు= ఈ చెట్టువైపు వెళ్ళరు; భూవర!= రాజా! (ధర్మరాజా!); నెఱ+మదిన్= నిండుమనసుతో; ఊఱడిల్లుము= ఊరటచెందుము; ఎచ్చోవసియించినన్= మనం ఎక్కడ ఉన్నా; పిదపన్= అజ్ఞాతవాసం తరువాత; క్రమ్మఱ వచ్చి= తిరిగివచ్చి; కైకొనన్= తీసికొనటానికి; చొప్పడున్= సాధ్యపడుతుంది.

తాత్పర్యం: అందుచేత మన ఆయుధాలను ఈ జమ్మిచెట్టు మీద దాచడం సబబయిన పని, వెంట్రుకలతో కూడిన చర్మంతో ఆయుధాలను చుట్టి శవంవలె అమర్చి కట్టిపెట్టితే ఈ వైపు ఎవరూ రారు. మహారాజా! నీవు మనస్సున బాధపడవద్దు. మనం ఎక్కడున్నా, చివరకు తిరిగివచ్చి మన ఆయుధాలను మనం తీసికొనటానికి వీలవుతుంది.'

పాండవులు దమ యాయుధంబుల శమీవృక్షమునఁ బెట్టుట (సం. 4-5-9)

వ. అని చెప్పిన నందఱు నత్తెఱంగున కియ్యకొనుటయు, నతండు గాండీవంబు నవలోకించి. 167

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; చెప్పినన్= చెప్పగా; అందఱున్= అందరును; ఆ+తెఱంగునకున్= ఆ పద్ధతికి; ఇయ్యకొనుటయున్= సమ్మతించగా; అతండు= అర్జునుడు; గాండీవంబున్= గాండీవాన్ని; అవలోకించి= చూసి.

తాత్పర్యం: అని చెప్పగా అందరూ దానికి ఒప్పుకొన్నారు. అపుడు అర్జునుడు గాండీవం వైపు చూచి.

చ. 'అనిమిష దాన వాంబరచరాదిక జాతుల నెల్లఁ బోర నీ
ధనువునఁ గాదె గెల్తు! సముదగ్ర విరోధి భయావహంబు; దీ
నిని నొక ప్రూనఁ గట్టి చను నిశ్చయ మొందఁగఁ జేసె దైవ; మే
మనఁ గల? దట్ల కాక' యని యాత్మ నలందురి మందచేష్టుఁడై. 168

ప్రతిపదార్థం: అనిమిష= దేవతలూ; దానవ= రాక్షసులూ; అంబరచర= గంధర్వులు; ఆదిక= మొదలయిన; జాతులన్+ఎల్లన్= జాతులన్నిటినీ; పోరన్= యుద్ధంలో; ఈ ధనువునన్+కాదె= ఈ వింటితో కదా; గెల్తున్= గెలిచేవాడిని; సముదగ్రవిరోధి భయ+ఆవహంబున్= గొప్పవారయిన విరోధులకు కూడా భయాన్ని కలిగించే; దీనిని= ఈ గాండీవాన్ని; ఒక ప్రూనన్= ఒక చెట్టునందు; కట్టి చనునిశ్చయము= కట్టి వెళ్ళే నిర్ణయాన్ని; ఒందఁగన్+చేసెన్= చేసే విధంగా (తీసికొనే విధంగా) చేసింది; దైవమున్= దైవాన్ని; ఏమి+అనన్+కలదు?= ఏమనటానికి వీలుంది?; అట్లు+అకాక+అని= అట్లాగే కానీ అని; ఆత్మన్= మనస్సులో; అలందురి= బాధపడి; మందచేష్టుఁడు+ఐ= చేష్ట లుడిగిన వాడయి.

తాత్పర్యం: 'నేను ఈ ధనుస్సు సహాయంతో అనేక యుద్ధాలలో దేవదానవ గంధర్వాదులను గెలిచినవాడిని. ఈ గాండీవం శత్రుభయంకరమయినది. ఇటువంటి గాండీవాన్ని ఒక చెట్టుకు కట్టిపడవేసే నిర్ణయాన్ని దైవం నిశ్చయించింది. ఈ పరిస్థితిలో ఏమనటానికీ పాలుపోవటంలేదు' -అని అర్జునుడు మనసులో బాధపడి ఉత్సాహరహితుడై ఉండిపోయాడు.

వ. ఎక్కు డించినఁ బాండవాగ్రజుండు. 169

ప్రతిపదార్థం: ఎక్కు డించినన్= మోపెట్టిన అల్లెత్రాటిని విప్పగా; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడయిన ధర్మరాజు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అర్జునుడు గాండీవం నారిముడి విప్పాడు. అప్పుడు ధర్మరాజు.

క. దనుజకుల త్రాసకరం। బును రిపుభంజనము రత్నభూషిత రూపం
బును గురుదేశాహ్లాదన। మును నగు నిజకార్ముకంబు మో పెడలించెన్. 170

ప్రతిపదార్థం: దనుజకుల= రాక్షస సమూహానికి; త్రాసకరంబును= భయాన్ని కలిగించేదీ; రిపుభంజనమున్= విరోధులను సంహరించేదీ; రత్నభూషిత= రత్నాలతో అలంకరించబడిన; రూపంబును= ఆకారం కలదీ; కురుదేశ+ఆహ్లాదనమునున్= కురుదేశానికి సంతోషాన్ని కలిగించేదీ; అగు= అయినటువంటి; నిజకార్ముకంబు మోపు= తన వింటినారిబిగువును; ఎడలించెన్= తొలగించాడు.

తాత్పర్యం: రాక్షసులకు భయంకర మయినదీ, విరోధినాశనకర మయినదీ, రత్నాలు పొదిగినదీ, కురుదేశానికి సంతోషం కలిగించేదీ అయిన తన వింటినారిని ధర్మరాజు విప్పాడు.

వ. తదనంతరంబ భీమ నకుల సహదేవులదెసఁ గనుంగొని. 171

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తర్వాత వెంటనే; భీమ నకుల సహదేవుల దెసన్= భీమ నకుల సహదేవులవైపు; కనుంగొని= చూచి.

తాత్పర్యం: ఆ తరువాత వెంటనే ధర్మరాజు భీమనకుల సహదేవులవైపు (వారి వింటినారులను కూడ సడలించండి అని సూచిస్తున్నట్లు) చూచాడు.

సీ. 'సైంధవ యక్ష పాంచాల త్రిగర్తుల। దీనన యోర్చితి మానధనుఁడ!
సౌరాష్ట్రనాథాది శత్రులు దీనిచేఁ। గాదె మర్దితు లైరి ఘనభుజుండ!
కాళింగ పాండ్య మాగధుల నిర్జించుచో। నిదియ కైదువు నీకు విదితయశుఁడ!'
యని క్రమంబున వారలందఱ విండులు। పెంపెసలార వేర్వేఱ పొగడి

ఆ. గొనయములు వదల్ప ననుమతి సేయుడు। వారు నట్ల చేసి తేరఁ, జాప
ములును దొనలు వర్మములు నసి ముద్గ రా। ద్యాయుధములుఁ గూడ నతఁడు గట్టె. 172

ప్రతిపదార్థం: మానధనుఁడ!= అభిమానమే ధనంగా కలిగిన భీమసేనా!; సైంధవ= సైంధవుడినీ; యక్ష= యక్షులనూ; పాంచాల= పాంచాలురనూ; త్రిగర్తులన్= త్రిగర్తదేశాధిపతి అయిన సుశర్మనూ; దీనన్= దీనితోనే; ఓర్చితి(వి)= నిర్జించావు, జయించావు; ఘనభుజుండ!= దీర్ఘమయిన భుజాలు కల నకులా!; సౌరాష్ట్రనాథ+ఆది= సౌరాష్ట్రదేశానికి రాజు మొదలయిన; శత్రులు= విరోధులు; దీనిచేన్= దీనిచేతనే; మర్దితులు+ఐరి కాదె= తాడించబడ్డారు కదా; విదితయశుఁడ!= ప్రకటితమయిన కీర్తి కలిగిన సహదేవా!; కళింగ= కళింగరాజు; పాండ్య= పాండ్యరాజు; మాగధులన్= మగధరాజులను; నిర్జించుచోన్= జయించటానికి సిద్ధమయినవేళ; నీకున్= నీకు; ఇదియ కైదువు= ఇదే ఆయుధం; అని= అని; క్రమంబునన్= క్రమంగా; వారలు+అందఱ= భీమసేనాదుల; విండులు= ధనుస్సులు; పెంపు+ఎసలారన్= గొప్పతనం ప్రకటితం కాగా; వేర్వేఱన్= వేరువేరుగా; పొగడి= ప్రశంసించి; గొనయములు= అల్లెత్రాళ్ళు; వదల్పన్= వదలించటానికి; అనుమతి= ఆజ్ఞ; చేయుడున్= చేయగానే; వారున్= భీమాది పాండవులందరు; అట్లు+అ=

ఆ విధంగానే; చేసి= చేసి; తేరన్= తేగా; చాపములును= ధనుస్సులను; దొనలు= అమ్ముల పొదులను; వర్మములున్= కవచాదులను; అదిసి= కత్తులను; ముద్గర+ఆది= ఇనుపగుదియలు మొదలయిన; ఆయుధములు= ఆయుధాలను; అతఁడు= ధర్మరాజు; కూడన్+కట్టెన్= చేర్చి కట్టకట్టాడు.

తాత్పర్యం: 'మానధనుడవయిన భీమా! సైంధవుడినీ, యక్షులనూ, పాంచాలురనూ, త్రిగర్తుడినీ దీనితోనే కదా ఓడించావు. నకులా! సౌరాష్ట్రదేశరాజు మొదలయిన విరోధులను దీనిచేతనే కదా సంహరించావు. సహదేవా! కళింగపాండ్యమగధ దేశపు రాజులను జయించేవేళ ఈ కోదండమే కదా నీకు సహాయపడ్డది' - అని వరుసగా వారి ధనుస్సులను ప్రశంసించాడు. అలా ప్రశంసించి, వారి ధనుస్సుల నారులు విప్పటానికి ధర్మరాజు అనుమతించాడు. వారు ఆ పనిని పూర్తిచేయగా ధనుస్సులు, అమ్ముల పొదులు, కవచాలు, కత్తులు, గుదియలు మొదలయిన ఆయుధాలను ఒకచోట చేర్చి, ధర్మరాజు కట్టకట్టాడు.

విశేషం: ధనువులకు నారులు సడలించి మూటకట్టే ఈ ఘట్టాన్ని తిక్కన నాటకీయంగా చిత్రించాడు. మూలంలో కథాకథనంలో భాగంగా సాగిన అంశాలను పాత్రోచిత భంగిమలలో చిత్రించాడు. అర్జునుడు గాండీవాన్ని వీడలేక విషాదాన్ని ప్రదర్శించాడు. గాండీవ మాహాత్మ్యాన్ని గురించి అర్జునుడే స్మరించి వియోగచింతను పొందినట్లు చిత్రించటం నాటకీయం. ఆ తరువాత భీమనకుల సహదేవుల కార్ముకాల గొప్పతనాలను ధర్మజుడు కీర్తించినట్లు రచించటం నాటకీయం. మధ్య ధర్మజుడు తన వింటి మహిమను తానే చెప్పుకొన్నట్లు కాక తిక్కన వర్ణించి వదలిపెట్టటం ఔచిత్యం. ఆత్మప్రశంస చేసికొనని ధీరోదాత్తుడిగా ధర్మరాజును మిగిల్చాడు తిక్కన. మూలంలో కథా కథన శిల్పంలో భాగంగా ఉన్నదానిని పాత్రోచిత సంభాషణ వైఖరిగా మార్చటం ఇందులోని నాటకీయత. ఆ కళ తిక్కనకు కరతలామలకం. (సంపా.)

వ. ఇట్లు పూర్వోక్త ప్రకారంబునం బొదివి, మహోరగంబులం బెట్టియలం బెట్టి కట్టు చందంబున బంధించి, వానిం గొనుచు, నయ్యజాతశత్రుండు ధర్మదేవతా దత్తవరుం డగుటంజేసి నిశ్శంకం బైన యంతఃకరణంబుతోడ శమీవృక్ష సమారోహణం బాచరించి. 173

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పూర్వ+ఉక్తప్రకారంబునన్= ముందు చెప్పిన పద్ధతిలో; ఆ+అజాత శత్రుండు= ఆ ధర్మరాజు; పొదివి= పట్టుకొని; మహా+ఉరగంబులన్= పెద్దపెద్ద పాములను; పెట్టియలన్= పెట్టెలలో; పెట్టి కట్టు చందంబునన్= పెట్టి కట్టే విధంగా; బంధించి= గట్టిగా కట్టి; వానిన్+కొనుచున్= వాటిని తీసికొని; ధర్మదేవతా దత్తవరుండు+అగుటన్+చేసి= యమధర్మరాజుచేత ఇవ్వబడిన వరం కలవాడు కావటం వలన; నిశ్శంకంబు+ఐన= సంకోచం లేని; అంతఃకరణంబుతోడన్= మనస్సుతో; శమీవృక్ష సమారోహణంబున్= జమ్మిచెట్టు ఎక్కటాన్ని; ఆచరించి= చేసి.

తాత్పర్యం: ఆ విధంగా ముందు చెప్పినట్లు ధర్మరాజు చేర్చి పట్టుకొన్నాడు. పాములను పెట్టెలలో పెట్టి బంధించినట్లుగా ఆ ఆయుధాలన్నిటిని మోపు కట్టాడు. యముడివలన వరం పొందినవాడు కావటంవలన ధర్మరాజు నిస్సంకోచంగా ఆ జమ్మిచెట్టు ఎక్కాడు.

విశేషం: అలం: ఉపమ. అర్జునుడు గాండీవాన్ని పామువంటిదని చెప్పినది మొదలు పాండవుల ఆయుధాల నన్నిటినీ సర్పోపమానంతో వర్ణించి కథను నిర్వహించటం తిక్కన కావ్యకళా శిల్పాంశం. (సంపా.)

తే. బ్రహ్మ విష్ణు మహేశ దిక్పాల చంద్ర। సూర్య వనదేవతా పితృస్తుతు లొనర్చి
దివియు భువియును జూచి ప్రార్థించి, యొక్క। విపులశాఖ నాయుధములు వ్రేలఁగట్టె. 174

ప్రతిపదార్థం: బ్రహ్మ, విష్ణు, మహా+ఈశ; దిక్+పాల, చంద్ర, సూర్య, వనదేవతా, పితృ, స్తుతులు= బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు, దిక్పాలకులు, చంద్రుడు, సూర్యుడు, వనదేవతలు, పితృదేవతలకు సంబంధించిన స్తోత్రాలను; ఒనర్చి= చేసి; దివియున్= ఆకాశాన్ని; భువియును= భూమిని; చూచి= చూచి; ప్రార్థించి= ప్రార్థన చేసి; ఒక్క విపులశాఖన్= ఒక పెద్ద కొమ్మకు; ఆయుధములు= ఆయుధాలను; వ్రేలన్+కట్టెన్= వ్రేలాడకట్టాడు.

తాత్పర్యం: ధర్మరాజు బ్రహ్మను, ఈశ్వరుడిని, విష్ణువును, దిక్పాలకులను, చంద్రుడిని, సూర్యుడిని, వనదేవతలను, పితృదేవతలను స్తుతించాడు. భూమ్యాకాశాలను చూచాడు, ప్రార్థించాడు. ఒక పెద్దకొమ్మకు ఆయుధాలను వ్రేలాడ గట్టాడు.

వ. ఇట్లు కట్టి తదీయాధిదైవతంబుల నుద్దేశించి నమస్కరించి. 175

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కట్టి= కట్టి; తదీయ+అధిదైవతంబులన్= వాటి అధిదేవతలను; ఉద్దేశించి= గురించి; నమస్కరించి= నమస్కారం చేసి.

తాత్పర్యం: ధర్మరాజు ఆయుధాలను వ్రేలాడగట్టాడు. ఆ ఆయుధాల అధిదేవతలకు నమస్కరించాడు. తదనంతరం ఆయుధాల నుద్దేశించి ఈ విధంగా అన్నాడు.

విశేషం: 1. ధర్మరాజు ఆయుధాల అధిదేవతలను స్మరించి వారిరక్ష వాటికి ఉండేటట్లు ప్రార్థించాడు. పాండవుల ఆయుధాలలో కొన్ని దైవదత్తాలు. గాండీవం, అక్షయతూణీరాలు మొదలైనవి అటువంటివే. అంతేకాక రాజులు వారి ఆయుధాలను పనిముట్లుగానే భావించరు. దైవస్వరూపాలుగా భావిస్తారు. అందువలననే ఆయుధపూజ ఒక సంప్రదాయ మైంది. ఒక్కొక్క ఆయుధానికి ఒక్కొక అధిదైవం ఉంటుంది. ఆ దైవమే ఆ ఆయుధరూపంలో వర్తిస్తుంది అని విశ్వాసం. ఆయుధాలలో అస్త్రాలు కూడా చేరుతాయి. అవి మంత్రరూపాలు. మంత్రాలకు అధిదైవతా లుండటం ప్రసిద్ధం. ఏమైనా అటువంటి రక్షా దేవతలందరూ కలిసి ఆయుధాలను కాపాడుతూ ఉండాలని సంప్రదాయబద్ధంగా ధర్మజుడు ప్రార్థించాడని భావం. ఇది అమూలకం.

2. మూలంలో చెట్టెక్కి, ఆయుధాలను కొమ్మకు వ్రేలాడకట్టింది నకులుడు. తెలుగులో ధర్మజుడు. ఈ మార్పు తిక్కన ఔచిత్యకల్పనకు తార్కాణం. ధర్మజుడైతేనే అధిదేవతలను ఆరాధించగలడు. వారి రక్షను ఆవహింపచేయగలడు. తనకూ అర్జునుడికీ తప్ప ఇతరులకు ఆ ఆయుధాలు ఆయుధాలవలె కనపడకుండా ఉండేటట్లు చూడండి- అని అడుగ గలడు. అతని మాటలు మన్నించి అధిదేవతలు అనుగ్రహించగలరు. నకులుడు ఇటువంటి పనులు చేయలేడు. ధర్మజుడు కట్టింది ఆయుధాల మూట; చెట్టుకొమ్మకు కట్టిపెట్టింది మంత్రాల మూట! ఇది తిక్కన తీర్పు (సంపా.)

క. 'నరునకు నాకుం దక్కఁగ। నొరులకు మీరూపు సూపకున్నది; విషవి
స్ఫురిత భుజగభంగి భయం। కర మూర్తులు దాల్చి యుండఁగా వలయుఁ జుఁడీ. 176

ప్రతిపదార్థం: నరునకున్= అర్జునునికి; నాకున్= నాకు; తక్కఁగన్= తప్పించి; ఒరులకున్= ఇతరులకు; మీ రూపు= మీ రూపాన్ని; చూపక+ఉన్నది= చూపించకండి; విష= విషంతో; విస్ఫురిత= ప్రకాశించే (విజృంభించే); భుజగభంగిన్= పాములవలె; భయంకరమూర్తులు= భయంకరమయిన ఆకారాలు; తాల్చి= ధరించి; ఉండఁగాన్ వలయున్+చుఁడీ!= ఉండాలి సుమా!.

తాత్పర్యం: 'అర్జునుడికీ నాకూ తప్ప ఇతరులకు మీ ఉనికిని చూపించకండి. మీరు విషసర్పాలవలె కనపడాలి. మీ ఆకారం భయంకరంగా ఉండాలి.

విశేషం: భవిష్యత్కథలో అర్జునుడు ఉత్తరగోగ్రహణ సందర్భంలో ఈ ఆయుధాలను వాడుకొనవలసి వస్తుంది. అందుచేత తనకూ, అర్జునునికీ తప్ప ఇతరులకు కనబడరాదని ధర్మరాజు చెప్పటం ఒక విశేషం. అర్జునుడిపట్ల అతని అనురాగానికి ఈ మాట తార్కాణం కూడా. చూపక+ఉండునది - చూపకున్నది.

ఉ. **భీముఁడు ధార్తరాష్ట్రకుల భీషణరోషుఁడు; చిత్త మెప్పు డె**
ట్లై మదమెత్తునో; యతని యాగ్రహవృత్తికి లోనుగాక మీ
రే మెయి నైన వంచన వహించి తొలంగుట మత్సమీహితం;
బేమఱకుండఁగా వలయు నిప్విషమాబ్దములోన నాతనిన్. **177**

ప్రతిపదార్థం: భీముఁడు= భీముడు; ధార్తరాష్ట్రకుల= ధృతరాష్ట్రుని పుత్రసమూహానికి (వారిపట్ల); భీషణరోషుఁడు= భయంకరమయిన రోషం కలవాడు; చిత్తము= అతని మనస్సు; ఎప్పుడు+ఎట్లు+ఐ= ఎప్పుడు ఎట్లా అయి; మదము+ఎత్తునో= మదించునో; అతని= భీమునియొక్క; ఆగ్రహవృత్తికిన్= కోపప్రవర్తనకు; లోనుకాక= లోబడక; మీరు= మీరు (ఆయుధాలు); ఏమెయిన్+ఐనన్= ఏ విధంగానయినా; వంచన వహించి= వంచనభావంతో; తొలంగుట= తప్పుకొనటం; మత్+సమీహితంబు= నాకోరిక; ఈ+విషమ+అబ్దములోనన్= ఈ సంక్లిష్ట అజ్ఞాతవాస కాలంలో; అతనిన్= భీముని; ఏమఱక+ఉండఁగాన్+వలయున్= ఏమరకూడదు.

తాత్పర్యం: భీముడు కౌరవులందరిమీద పట్టరాని రోషాన్ని ప్రదర్శిస్తాడు. అతడి మనస్సు ఏ సమయంలో ఎట్లా మదావేశాన్ని ప్రకటిస్తుందో. అతడికి ఆగ్రహం వస్తే మిమ్మల్ని ఆశ్రయించవచ్చును. అప్పుడు అతడి కోపప్రవృత్తికి మీరుకూడా వశమై పోకుండా ఏదైనా ఒక కపటమైన మిషతో తప్పుకొనండి. ఇది నా కోరిక, క్లిష్టమైన ఈ అజ్ఞాతవాస సంవత్సర కాలంలో (అందరం అతడిపట్ల) ఏమరకుండా ఉండాలి.

విశేషం: 1. ఈ మాటలు మూలంలో లేవు. తిక్కన కల్పించాడు. ఆయుధాల అధిదేవతల భావనం, కీర్తనం వృధా కారాదు. వారు ప్రచ్ఛన్నంగా ధర్మజుడికి ప్రసన్నులై ఉన్నారు. ఆయుధాలు పనిముట్లు కావు. రక్షామూర్తులైన దేవతలు. వారికి తనమనసులోని మాట చెప్పుకొన్నాడు. పరోక్షంగా దేవతలను వరం కోరినట్లు కోరాడు. భీము డావేశపరుడనీ, అసమయ సాహసాలు ప్రదర్శించటం నీతి కాదనీ, అతడిని అదుపులో పెట్టుకొనాలనీ కుబేరుడు (ఆరణ్యపర్వంలో) ధర్మరాజుకు హితవు చెప్పాడు. దాని నిక్కడ అనుసంధించుకొన్నాడు విజ్ఞుడైన ధర్మజుడు. కౌరవులు పాండవుల అజ్ఞాతవాసనియమాన్ని భంగం చేయటానికి కుటిలయత్నాలు చేయవచ్చును. అవి రోషావేశపరుడైన భీముడిని రెచ్చగొట్టవచ్చును. అతడు ఆవేశంతో ఆయుధాలను వెలికితీసి కౌరవులమీద విజృంభించవచ్చును. అటువంటి పని చేయగలవాడు భీముడొక్కడే. ఒకవేళ మేరమీరి సాహసిస్తే ఆయుధాలు అదృశ్యంగా ఉండి అతడిచేతిలో పడగూడదని ధర్మజుడి అభిమతం. అజ్ఞాతవాసంలో పాండవులను గుర్తించటానికి తోడ్పడే ప్రధాన చిహ్నాలు ఆయుధాలని ఈ ప్రకరణం తెలిపింది.

2. విశేషమేమంటే - ఎట్టి పరిస్థితులలోనూ ఆయుధాలను వెలికి తీయవద్దని భీముడితో చెప్పవచ్చును కదా! ఒకడి ఆయుధ ధారణం అందరికి ఆపద కలిగిస్తుందని హెచ్చరించవచ్చును. తన ఆనతి భీముడు మీరినా ఆయుధాలైనా పాటిస్తాయని భీమాదులను పరోక్షంగా హెచ్చరించాడు ధర్మరాజు. అందువలననే ఆయుధాలనే అతడికి వశం కాకుండా ఉండండని కోరటం ప్రకరణౌచిత్యం. దేవతలు పిలిస్తే పలుకుతారు ధర్మరాజుకు. (సంపా.)

వ. **అని వేడికొని వృక్షంబు డిగ్గి దానికిం బ్రదక్షిణంబు వచ్చి ప్రణమిల్లి భీమసేనుదెస మరలి చూచి సాంత్వన వచన సమేతంబుగా నతనిం గౌఁగిటంజేర్చి యనునయించి తమ చేసిన విధంబు తత్ప్రదేశవర్తు లయిన గోపాలాది క్షుద్రజనంబులకు మఱుఁగు వెట్టం దలంచి వారల కభిముఖులై పాండునందను లందఱు నిట్లనిరి.** **178**

ప్రతిపదార్థం: అని వేఁడికొని= అని ప్రార్థించి; వృక్షంబు డిగ్గి= జమ్మిచెట్టు నుండి దిగి; దానికిన్= ఆ వృక్షానికి; ప్రదక్షిణంబు వచ్చి= ప్రదక్షిణంచేసి; ప్రణమిల్లి= నమస్కరించి; భీమసేనుదెసన్= భీమునివైపు; మరలిచూచి= తిరిగిచూచి; సాంత్వనవచన సమేతంబుగాన్= ఓదార్పు మాటలతో; అతనిన్= భీముని; కౌఁగిటన్+చేర్చి= కౌగిట్లో చేర్చుకొని (ఆలింగనం చేసికొని); అనునయించి= ఊరడించి; తమ చేసిన విధంబున్= తాము చేసిన దానిని; తత్ప్రదేశవర్తులు= ఆ ప్రదేశంలో తిరిగేవారు (తచ్చాడేవారు); గోపాల+ఆది= పశువుల కాపర్లు మొదలైన; క్షుద్రజనంబులకున్= సామాన్య ప్రజలకు; మఱుఁగు+పెట్టన్+తలంచి= కప్పిపుచ్చాలనుకొని; వారలకున్= ఆ క్షుద్రజనులకు; అభిముఖులు+ఐ= ఎదురు ముఖం కలవారై (ఆ ప్రజల వైపు తిరిగి); పాండునందనులు+అందఱును= పాండవులందరూ; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: ఇట్లా ప్రార్థించి ధర్మరాజు చెట్టు దిగాడు. ఆ చెట్టుకు ప్రదక్షిణం చేశాడు. నమస్కరించాడు. భీముడివైపు తిరిగాడు. అనునయించాడు. ఆప్యాయంగా కౌగిలించుకొని ఊరడించాడు. తాము చేసినపని ఆ చుట్టుప్రక్కలున్న గొడ్ల కాపరులకు తెలియకుండా ఉండేందుకుగాను వారి వైపు తిరిగాడు. పాండవులందరు ఆ గోపాలకులతో ఇట్లా అన్నారు.

విశేషం: ధర్మజుడు భీముడి రోషావేశంవలన కలిగే విపత్తును వ్యంగ్యంగా పేర్కొని ఆయుధాల మిషతో ఎత్తిపొడిచాడు. భీముడి మనస్సు నొచ్చుకొని ఉండవచ్చును. అది అతడు బయటపెట్టకుండా గంభీరంగానే అన్నాడు. అయినా అతడి మనసును గుర్తించి ధర్మజుడు అతడిని బుజ్జగించాడు. సమయోచిత వ్యవహారజ్ఞుడు ధర్మజుడు.(సంపా.)

చ. **'ఇది శతవృద్ధ మాజనని; యిప్పుడు మృత్యువుఁ బొందె; నట్లు సే**
యుదుము; కులప్రయుక్త మగుచున్న సనాతన ధర్మ మిత్తెఱం
గ; దహన కర్మ మొల్ల; మది గానిదిగా మును నిశ్చయించి మా
మొదలిటివా రొనర్చు విధముం గొనియాడితి మేము నియ్యెడన్. **179**

ప్రతిపదార్థం: ఇది= ఈ శవం; శతవృద్ధ= నూరు సంవత్సరాలు నిండిన ముసలిది; మా జనని= మా తల్లి; ఇప్పుడు= ఇప్పుడు; మృత్యువున్+పొందెన్= మరణించింది; (చచ్చిన వారిని) అట్లు= ఆ విధంగా; చేయుదుము= చేస్తాము; కులప్రయుక్తము+అగుచున్+ఉన్న= మా కులంవారిచేత చేయబడుతున్న; సనాతన ధర్మము= ప్రాచీన ధర్మం; ఈ+తెఱంగు+అ= ఈ పద్ధతే; దహనకర్మము= అగ్ని సంస్కారం చేసేపద్ధతిని; ఒల్లము= అంగీకరించం; అది కానిదిగాన్= శవదహనం పనికిరానిదిగా; మును= ముందు; నిశ్చయించి= నిర్ణయించి; మా మొదలిటివారు= మా పూర్వులు; ఒనర్చు= చేసే; విధమున్= పద్ధతి ప్రకారం; మేమున్= మేము కూడా; ఈ+ఎడన్= ఈ సమయంలో; కొనియాడితిమి= ఆదరించాము.

తాత్పర్యం: 'ఈమె మా తల్లి. నూరేళ్ళు నిండిన ముసలిది. ఇప్పుడు చనిపోయింది. మేము దహనం చేయం. ఇది మా కులాచారం. ఇదే మా సనాతన ధర్మం. మా పెద్దలు ఏ రకంగా చేసేవారో అదే మేము ఇప్పుడు చేశాం.

విశేషం: తల్లి (కుంతి) బ్రతికుండగా తల్లి చనిపోయిందని ధర్మరాజు చెప్పటం సమంజసమా కాదా అన్నది ప్రశ్న. అట్లాగే దహనం, ఖననం అనే రెండు పద్ధతులుంటే రెండూ కాక చెట్టుకు కట్టడం ఏమిటన్నది మరో ప్రశ్న. రెండవది కులాచార మనటంవలన సందేహనివృత్తి. మొదటిది ఆపద్ధర్మం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **అని యిట్లు పలుమఱుం దెలియఁబలికి శస్త్రాస్త్రంబుల నిక్షేపణంబు నిగూఢం బగుటకు నూఱడిల్లి; యచ్చేరువం జచ్చిన పసరంబు వడియున్నం జూచి, సహదేవుం బనిచి, ధర్మ తనయుండు దాని చర్మం బొలిపించి, శీతాతప వర్ష పరిహారంబుగా నాయుధంబులం బొదివించి, మఱియును దత్సమీపంబున నొక్క శుష్కశవంబు నవలోకించి 'యిది యుంఛవృత్తి యైన మానవు కళేబరంబు గావలయు' ననుచు నదియునుం గైదువుల కట్టపయిం బెట్టి కట్టించె; నివ్విధంబున నత్యంతగుప్తి యాచరించి, 'దీని దుర్గంధంబున వనచారు లెవ్వరుం జేర రని నవ్వుచు వార లచ్చోటు వాసి విరాట పురాభిముఖులై చనుచుండి, యజ్ఞాతవాస కాలంబునం దమ రహస్యపు వ్యవహారంబునకు ననువుగా నేవుర పేళ్ళును గ్రమంబున జయుండును, జయంతుండును, విజయుండును, జయత్సేనుండును, జయద్బలుండునని సంకేతించుకొని, యాజ్ఞసేనీ పురస్సరంబుగాఁ బుణ్యనదీ తీర్థావతరణంబు సేసి, తదీయస్నానంబునం బథిశ్రమం బపనయించి, దేవపితృతర్పణ మంగళ జపహోమ ధ్యానాద్యనుష్ఠానంబు లొనర్చిరి; తదనంతరంబ యక్కౌంతేయాగ్రజుండు ప్రాఙ్ముఖుం డయి నిర్మలచిత్తంబున ధర్మదేవతం దలంచి యిట్లనియె.** **180**

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ విధంగా; పలుమఱున్= అనేకసార్లు; తెలియన్+పలికి= తెలిసేవిధంగా చెప్పి; శస్త్ర+అస్త్రంబుల నిక్షేపణంబు= ఆయుధాల దాపరికం; నిగూఢంబు+అగుటకున్= రహస్యమవడానికి; ఊఱడిల్లి= ఎంతో సంతృప్తిపడి; ఆ+చేరువన్= ఆ సమీపంలో; చచ్చిన= మరణించిన; పసరంబు= పశువు; పడియున్నన్+చూచి= పడిఉండటం చూచి; సహదేవున్= సహదేవుని; పనిచి= పంపి (ఆజ్ఞాపించి); ధర్మతనయుండు= ధర్మరాజు; దాని చర్మంబు+ఒలిపించి= చచ్చిన పశువు చర్మాన్ని ఒలిపించి; శీత+అతపవర్షపరిహారంబుగాన్= చలి ఎండ వాన తగలకుండేటట్లుగా; ఆయుధంబులన్= ఆయుధాలను; పొదివించి= చుట్టించి; మఱియును= మరింకా; తద్+సమీపంబునన్= దానిదగ్గర; ఒక్క= ఒక; శుష్క= ఎండిపోయిన; శవంబున్= శవాన్ని; అవలోకించి= చూచి; ఇది= ఇదికదా; ఉంఛవృత్తి+ఐన= పొలాలలో కోతలయిన తరువాత రాలిన గింజలను ఏరుకొని తినేవృత్తిలో బ్రతికే; మానవు కళేబరంబు కావలయున్= మనిషి యొక్క శవం కావచ్చును; అనుచున్; అదియునున్= ఆ శవాన్ని కూడా; కైదువుల కట్టపయిన్= ఆయుధాల కట్టపయిని; పెట్టి కట్టించెన్= పెట్టి కట్టించాడు; ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; అత్యంత= మిక్కిలి; గుప్తి= దాపరికాన్ని; ఆచరించి= చేసి; దీని= దీనియొక్క; దుర్గంధంబునన్= చెడుకంపు కారణంగా; వనచారులు= అడవిలో తిరిగేవారు; ఎవ్వరున్+చేరరు+అని= ఎవ్వరుకూడా సమీపించరు అని; నవ్వుచున్= (సంతృప్తి సూచకంగా) నవ్వుతూ; వారలు= పాండవులు; ఆ+చోటు+పాసి= ఆ ప్రదేశాన్ని వదలిపెట్టి; విరాటపుర+అభిముఖులు+ఐ= విరాటమహారాజు పురం వైపు; చనుచున్+ఉండి= వెళ్ళుతూ; అజ్ఞాతవాసకాలంబునన్= అజ్ఞాతవాసకాలంలో; తమ= తమయొక్క; రహస్యము+వ్యవహారంబునకున్= రహస్యంగా పిలుచుకొనటానికి; అనువుగాన్= తగిన విధంగా; ఏవుర పేళ్ళును= ఐదుగురి పేర్లను; క్రమంబునన్= వరుసగా, క్రమంగా; జయుండును= (ధర్మరాజు పేరు) జయుండు; జయంతుండును= (భీముని పేరు) జయంతుడు; విజయుండును= (అర్జునుని పేరు) విజయుడు; జయత్సేనుండును= (నకులుని పేరు) జయత్సేనుడు; జయద్బలుండును= (సహదేవుని పేరు) జయద్బలుండు; అని= అనే పేరుతో; సంకేతించుకొని= సంకేతపు పేర్లు పెట్టుకొని; యాజ్ఞసేనీపురస్సరంబుగాన్= ద్రౌపదిని ముున్నిడుకొని; పుణ్యనదీతీర్థ+అవతరణంబు+చేసి= పుణ్యనదీతీర్థంలో దిగి; తదీయ స్నానంబునన్= ఆ పుణ్యనదిలో స్నానం చేయటం వలన; పథిశ్రమంబు= ప్రయాణపు బడలికను; అపనయించి= పోగొట్టుకొని; దేవపితృతర్పణ మంగళ జపహోమ= దేవతలకూ; పితృదేవతలకూ తర్పణాదులను, శుభాన్ని కలిగించే జపాలనూ, హోమాలనూ; ధ్యాన+ఆది+అనుష్ఠానంబులు= ధ్యానం మొదలయిన అనుష్ఠానాలనూ; ఒనర్చిరి= చేశారు; తద్+అనంతరంబు+అ= ఆ తర్వాత; ఆ+కౌంతేయ+అగ్రజుండు= కుంతీపుత్రులలో పెద్దవాడయిన ధర్మరాజు; ప్రాక్+ముఖుండు+అయి= తూర్పు ముఖం కలవాడయి; నిర్మల చిత్తంబునన్= కల్మషంలేని మనస్సులో; ధర్మదేవతన్+తలంచి= యమధర్మరాజును తలచుకొని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా ఎన్నోసార్లు అందరికీ తెలిపేటట్లు చెప్పాడు. తమ ఆయుధాలు చాల రహస్యమయిన పద్ధతిలో దాచినందుకు ధర్మరాజు సంతోషించాడు. ఆ తరువాత దగ్గరలో చచ్చిపడిఉన్న జంతువును చూచాడు. దాని చర్మాన్ని ఒలిచితీయుమని సహదేవుడిని ఆజ్ఞాపించాడు. దానిని ఆయుధాలకు చలి గాలి, ఎండ, వానలు సోకకుండా వాటిమీద చుట్టించాడు. దగ్గరలో ఒక ఎండిన శవాన్ని చూచాడు. బహుశః దానిని ఉంఛవృత్తి చేసే మానవుడి కళేబరమని భావించాడు. ఆ శవాన్నికూడా ఆయుధాలమీద పెట్టి కట్టించాడు. ఈ విధంగా ఆయుధరక్షణ కార్యక్రమం పూర్తి చేశాడు. దుర్వాసన కారణంగా అడవిలో తిరిగేవారు కూడా ఎవరూ దగ్గరకు రారని భావించి సంతోషించాడు.

ఈవిధంగా వారు ఆ ప్రదేశం విడిచి విరాటనగరంవైపు వెళుతూ అజ్ఞాతవాసకాలంలో తమ రహస్య వ్యవహారాలకు అనుకూలంగా అయిదుగురి పేర్లను వరుసగా జయుడు, జయంతుడు, విజయుడు, జయత్సేనుడు, జయద్బలుడు అని మార్చుకొన్నారు. వారు ద్రౌపదిని ముందుంచుకొని పవిత్ర నదులందు దిగి స్నానాలు చేశారు. ఆ స్నానాలతో దారిబడలికలు తీర్చుకొని, దేవతలకు, పితృదేవతలకు తర్పణాలు సలిపారు. జపాలు, హోమాలు, దైవధ్యానాలు మొదలైన అనుష్ఠానాలు నెరవేర్చారు. అటుపిమ్మట కుంతి కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజు తూర్పుముఖంగా కూర్చొని నిర్మలమైన మనస్సుతో ధర్మదేవతను స్మరించి ఇలా అన్నాడు.

విశేషం: 1. మారువేషాలలో ఉన్నప్పుడు మారుపేర్లు ఉండటం అవసరం. అందరి పేర్లూ జయశబ్దంతో ప్రారంభం కావటం విశేషం. పేర్లు విజయ సూచకములు. విజయుడి పేరు విజయుడిగానే ఉండటం గమనార్హం. ద్రౌపదికి మారుపేరు పెట్టలేదు. ఆమెను మారుపేరు లేకుండా సర్వనామంగానే పిలవటానికి నిశ్చయించాడు ధర్మరాజు. ఒక పేరుతో అయిదుగురు పురుషులు ఒక స్త్రీని పిలిస్తే ఇతరులు అనుమానించే అవకాశం ఉంది. అందువలన ఆమెకు రహస్యసంజ్ఞ లేకుండటమే ఔచిత్యం.

2. విరాటనగరానికి పోతూ ధర్మరాజు దుర్గాదేవిని స్తుతించినట్లు, ఆమె ప్రత్యక్షమైనట్లు, అజ్ఞాతవాసంలో వారి నెవరు గుర్తించకుండా ఉండేటట్లూ, ఆ తరువాత కొలది కాలంలోనే జరిగేయుద్ధంలో పాండవులకు విజయం లభిస్తుందనీ, రాజ్యం ప్రాప్తిస్తుందనీ అభయం, రక్ష ఇచ్చినట్లూ ఒక అధ్యాయమే (6వ అధ్యాయం) కొన్ని సంస్కృత ప్రతులలో ఉన్నది. తిక్కన దీనిని తెలుగులోనికి తేలేదు. భండార్కరు ప్రతిలోకూడా ఇది లేదు. ఆరణ్యపర్వం చివర ధర్ముడు పాండవులకు ఇటువంటివరమే ఇచ్చి ఉన్నాడు. దానిని స్మరించి ధర్ముడిని ప్రార్థించినట్లు మాత్రమే వ్రాశారు. పూర్వాపరవైరుద్ధ్యం లేని కథానిర్మాణాన్ని తిక్కన సాధించాడు. అవసరమైన కథాంశాలను వదలి ఔచిత్యం పాటించాడు.

3. శ్మశాన దర్శనం, శవస్పర్శనం మొదలైన అమంగళకరమైన చర్యలనుండి పవిత్రులు కావటానికి పుణ్యతీర్థస్నానం, తర్పణాదులు, అర్చనాదులు పాండవులు చేసినట్లు చెప్పటం కూడా తిక్కన కల్పనే. అజ్ఞాతవాసాన్ని ఒక నియమ వ్రతంగా చేపట్టబోతున్న శుభారంభాన్ని ఇది సూచిస్తున్నది. (సంపా.)

ఆ. 'తండ్రి! నీవు నాకు దయతోడ నిచ్చిన । వరము చిత్తగించి, వలయు తెఱఁగు
సమయ సముచితముగ సమకట్టు మయ్య! యీ । రాకుమారు లవిధిఁ బోక యుండ.' 181

ప్రతిపదార్థం: తండ్రి!= తండ్రీ; నీవు= నీవు; నాకున్= నాకు; దయతోడన్= కరుణతో; ఇచ్చిన= ఇచ్చినటువంటి (ప్రసాదించినట్టి); వరమున్= వరాన్ని; చిత్తగించి= తలంచి; ఈ రాకుమారులు= రాజకుమారులయిన ఈ పాండవులు; న+నిధిన్+పోక+ఉండన్= అక్రమాన్ని ఆచరించకుండా; వలయు తెఱఁగు= తగిన పద్ధతిని; సమయసముచితముగన్= అజ్ఞాతవాస కాలానికి తగినట్లుగా; సమకట్టుము+అయ్య= సమకూర్చుము.

తాత్పర్యం: 'తండ్రీ! నీవు నాకిచ్చిన వరాన్ని మన్నించి, ఈ రాకుమారులు అధర్మానికి పాల్పడకుండా కాపాడుము. మేము చేయవలసిన పని ఏ సమయాలలో ఏ విధంగా చెయ్యాలో దానికి తగినట్లుగా సమకూర్చుమయ్యా!'

వ. అనుచు ననుజుల దెసకు దూర వగచి డగ్గుత్తిక వెట్టి మఱియును. 182

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; అనుజులదెసకున్= తమ్ముళ్ళస్థితికి (దెసకు); దూర వగచి= (దురపిల్లి అని భావం) మిక్కిలి దుఃఖించి; డగ్గుత్తిక+పెట్టి= వణికే గొంతుతో; మఱియును= మరలా (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: అని తమ్ముళ్ళ దురవస్థకు చాలా బాధపడ్డాడు. దుఃఖం కారణంగా కంఠం గద్గదం కాగా ఇట్లా పలికాడు.

ఉ. అంబరవర్తి వైనఁ గని యక్షునిచే నగపడ్డ వీరి ప్రా
ణంబులు మున్ను నిన్నడిగి, నల్వురకున్ నయవిక్రమ ప్రభా
వంబులు వేఁడికొన్న నతివత్సలభావము; బొంది యాదరా
ర్ద్రంబగు చూడ్కితోఁ బ్రియహిత స్థిరభాషల నూఱడింపవే. 183

ప్రతిపదార్థం: అంబరవర్తివి+ఐనన్= ఆకాశంలో ఉండేవాడివి కాగా; కని= చూచి; యక్షునిచేన్+అగపడ్డ= యక్షునికి లోబడిన; వీరి ప్రాణంబులు= తమ్ముళ్ళ ప్రాణాలు; మున్ను నిన్నున్+అడిగి= ముందు నిన్నడిగి; నల్వురకున్= ఆ నలుగురికీ; నయవిక్రమ ప్రభావంబులున్= నీతి, పరాక్రమం, మహిమలను; వేడికొన్నన్= కోరుకొంటే; అతి వత్సల భావమున్+పొంది= అమితమయిన వాత్సల్యభావాన్ని వహించి; ఆదర+ఆర్ద్రంబు+అగుచూడ్కితోన్= ఆదరంతో తడిసిన చూపులతో; ప్రియహిత స్థిర భాషలన్= ప్రియాన్ని, హితాన్ని కలిగించే నిలకడతో కూడిన మాటలతో; ఊఱడింపవే= ఊరడించలేదా.

తాత్పర్యం: 'ఆకాశంలో ఉన్న నిన్ను చూచాను. యక్షుడి వశమైన నా తమ్ముళ్ళ ప్రాణాలు అడిగాను. నలుగురికీ నీతిని, పరాక్రమాన్ని, మహిమను వేడుకొన్నాను. నీ వెంతో వాత్సల్యం కనబరచావు. ఆదరదృష్టితో ఊరడించావు'.

వ. అని తారు మున్ను భూసురవరు నరణి దేర నరిగిన నాఁడు సరోవరతీరంబునం దనకు ధర్ముండు సేసిన మన్నన దోఁప నతనికి విన్నవించినవాఁడై కరకమలంబులు మొగిచి, ఫాలభాగంబునం గదియించి, సంప్రార్థనంబుగా వినయ వినమిత మస్తకుం డగుటయుఁ, దదనుగ్రహంబునఁ బాండవాగ్రజుండున్న యునికిన సన్న్యాసి రూపం బలవడి ధాతుపట దండకమండలు కలిత మూర్తి యయ్యెః నయ్యవసరంబున వారందఱు మహాద్భుతం బంద వారివారికి నయ్యైవేషంబుల కనుగుణంబులగు నంబరాభరణ మాల్యాద్యుపకరణంబులు సన్నిహితంబు లయినం జూచి సంతసిల్లి, యెల్లవారిం గలయం గనుఁగొని, క్రమంబున నొంటిమైఁ జనుదెండని నియోగించి, యతండు నానావిధంబులగు నక్షంబులముడి కక్షంబున నిడికొని, చని, దైవయోగంబున విరాటుండు వెడలివచ్చి బయలికొలు విచ్చుటంజేసి తదాస్థానంబు చేరంబోవునప్పుడు. 184

ప్రతిపదార్థం: అని; తారు= తాము (పాండవులు); మున్ను= ముందు; భూసురవరును+అరణిన్= బ్రాహ్మణుని అరణిని; తేరన్= తీసికొని రావటానికి; అరిగిననాఁడు= వెళ్ళిననాడు; సరోవరతీరంబునన్= కొలనుగట్టు మీద; తనకున్= తనకు; ధర్ముండు+చేసిన= యమధర్మరాజు చేసినటువంటి; మన్నన+తోఁపన్= ఆదరం తోచే విధంగా; విన్నవించినవాఁడు+ఐ= విన్నపం

చేసినవాడయి; కరకమలంబులు= పద్మాలవంటి చేతులు; మొగిచి= ముడిచి; ఫాలభాగంబునన్+కదియించి= నుదుటి మీద చేర్చి; సంప్రార్థనంబుగాన్= ప్రార్థనా పూర్వకంగా; వినయ వినమిత మస్తకుండు= వినయంతో వంచిన తల కలవాడు; అగుటయున్= కాగా; తద్+అనుగ్రహంబునన్= అతని అనుగ్రహంచేత; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు ఉండగా; ఉన్న ఉనికిన్+అ= ఉన్నట్టుండి; సన్న్యాసి రూపంబు+అలవడి= సన్న్యాసి రూపం సమకూరగా; ధాతుపట= కాషాయవస్త్రం; దండకమండలు కలిత మూర్తియయ్యెన్= దండం, కమండలువుతో కూడిన రూపం కలవాడయ్యాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; వారు+అందఱున్= పాండవులందరు; మహా+అద్భుతంబు+అందన్= ఆశ్చర్యం పొందగా; వారి వారికిన్= వారివారికి; అయ్యైవేషంబులకున్+ అనుగుణంబులు+అగు= ఆయా వేషాలకు అనుగుణమయిన; అంబర+ఆభరణ+మాల్య+ఆది+ఉపకరణంబులు= వస్త్రాలు, ఆభరణాలు, దండలు మొదలయిన సాధనాలు; సన్నిహితంబులు+అయినన్+చూచి= దగ్గరికి చేరడం చూచి; సంతసిల్లి= సంతోషించి; ఎల్లవారిన్= అందరిని; కలయన్+కనుఁగొని= కలయచూచి; క్రమంబునన్= క్రమంగా; ఒంటిమైన్ చనుదెండు+అని= ఒక్కొక్కరే రండని; నియోగించి= ఏర్పాటు చేసి; అతండు= అతడు (ధర్మరాజు); నానావిధంబులు+అగు= అనేక విధాలయిన; అక్షంబులముడిన్= పాచికలమూటను; కక్షంబునన్= చంకలో; ఇడికొని= పెట్టుకొని; చని= వెళ్ళి; దైవయోగంబునన్= దైవానుగ్రహంచేత; విరాటుండు= విరాటమహారాజు; వెడలి వచ్చి= మందిరంనుండి బయటికి వచ్చి; బయలికొలువు+ఇచ్చుటన్+చేసి= బయట సభచేసి ఉండటంవలన; తద్+ఆస్థానంబు= విరాటమహారాజుయొక్క ఆస్థానాన్ని; చేరన్+పోవునప్పుడు= సమీపిస్తున్నప్పుడు.

తాత్పర్యం: విప్రుడి అరణి కొరకు వెళ్ళినరోజున చెరువుగట్టుమీద తనపై, తనతమ్ముళ్ళపై చూపిన అనుగ్రహాన్ని ధర్ముడి హృదయంలో స్ఫురించేటట్లు ధర్మరాజు విన్నవించుకొన్నాడు. చేతులు మోడ్చాడు. వినయంతో నమస్కరించాడు. అపుడు యముడి అనుగ్రహంవలన ధర్మరాజుకు సన్న్యాసివేషం సంక్రమించింది. కాషాయవస్త్రం దండం కమండలువు వచ్చాయి. అదే సమయంలో అందరూ ఆశ్చర్యపడేటట్లు పాండవుల వేషాలకు తగిన వస్త్రాలు ఆభరణాలు, మాలికలు మొదలయినవి ఎదురుగా కనబడ్డాయి. అందరూ సంతోషించారు. అందరిని చూచి ధర్మరాజు 'వరుసగా ఒక్కొక్కరూ రండి' అని ఆజ్ఞాపించాడు. తాను పాచికలమూటను చంకలో పెట్టుకొని వెళ్ళాడు. దైవవశాత్తు ఆనాడు విరాట మహారాజు బయట కొలువయి ఉన్నాడు. ధర్మరాజు ఆస్థానం సమీపిస్తుండగా.

విశేషం: యమధర్మరాజు ప్రసన్నుడైనాడు. దానికి కారణం ధర్మజుడి సంప్రార్థన. నమస్కారం, వినమిత మస్తకం, ధ్యానం, విన్నపం- అనే నాలుగు అంశాలు సంప్రార్థనలో ఉన్నాయి. రెండు చేతులు జోడించి నమస్కరించటం ప్రార్థనాముద్ర, మిత్రులకు హృదయందగ్గర, గురుదేవమూర్తులకు నెన్నుదురు దగ్గర, దేవతలకు శిరస్సుమీద చేతులుంచి నమస్కరించటం ఆచారం. ఇక్కడ ధర్మ్యుడిని దేవుడిగా, తండ్రిగా భావించి ధర్మజుడు నమస్కరించాడు కాబట్టి చేతులు ఫాలభాగంలో కదియించి ఉంచటమే నాట్యశాస్త్ర మర్యాద. తిక్కన నాటకీయత కీ నాట్యముద్రలు అలంకారాలు. భావాభివ్యక్తులు. నమస్కరించి, నిర్మలభావంతో ధ్యానించి లోన ధర్ముడి అంతర్దర్శనం చేసికొని అతడి వత్సలరసచైతన్యాన్ని జాగృతం చేశాడు. ఆ ధ్యానఫలమే పాండవుల వేషాలు. ఆ దైవానుగ్రహఫలమే విరాటుడు ఆనాడు నగరం బయట ప్రజలమధ్య కొలువు తీర్చి అందరికీ సులభంగా దర్శనం కలిగే అవకాశం కలిగించటం. ఈ బయటి కొలువు తిక్కన లోకజ్ఞతకు చిహ్నం. అమూలకం (సంపా.)

ధర్మరాజు సన్న్యాసి వేషంబున విరటుఁ గొల్వవచ్చుట (సం.4-6-1)

ఉ. **దవ్వులఁ జూచి మత్స్యవసుధావతి 'యీ చనుదెంచుచున్నవాఁ**
డెవ్వఁడొ? నాదు చూడ్కులకు నెంతయు వ్రేఁగయి తోఁచె నెట్టితం
డివ్విధిఁ బొందెనో? జగము లెల్లను నేలఁగఁ జాలు తేజ మా
మువ్వుర తోడి జోడి యగు మూర్తి; యతీంద్రుని యొప్పుగంటిరే? 185

ప్రతిపదార్థం: మత్స్యవసుధావతి= మత్స్యదేశపు రాజయిన విరాటుడు; దవ్వులన్= దూరాన్నుండి; చూచి= చూచి; ఈ చనుదెంచుచున్నవాఁడు+ఎవ్వఁడొ?= ఇటువైపు వస్తున్న వాడెవడో; నాదు చూడ్కులకున్= నా చూపులకు; ఎంతయున్= మిక్కిలి; వేఁగు+అయి, తోఁచెన్= అబ్బురంగా కనిపిస్తున్నాడు; ఇతండు= ఇతడు; ఎట్లు= ఏ విధంగా; ఈ+విధిన్+పొందెనో= ఈ స్థితిని పొందాడో; జగములు+ఎల్లన్= లోకాలన్నిటినీ; ఏలఁగన్+చాలు= పరిపాలించగలిగిన; తేజము= తేజస్సు; ఆ మువ్వురతోడి జోడియగుమూర్తి= ఆ త్రిమూర్తులతో సమానమయిన రూపం కలవాడయి; యతి+ఇంద్రుని ఒప్పు= సన్న్యాసులలో శ్రేష్ఠుడైన అతని తీరును; కంటిరే!= చూచారా!

తాత్పర్యం: విరాటుడు దూరం నుండి ధర్మరాజు వైపు చూచాడు. 'ఈ వచ్చేవ్యక్తి ఎవడో మహాతేజస్విగా కనిపిస్తున్నాడు. నా చూపులకు అబ్బురపాటు కలిగిస్తున్నాడు. లోకాలన్నీ పరిపాలించే తేజస్సు, ఆ త్రిమూర్తులతో సమానమయిన రూపం ఇతడికి ఉన్నాయి. యతీంద్రుడివలె ఉన్నాడు. గమనించారా?

విశేషం: 1. ధర్మరాజు కంకుభట్టుగా మారి విరాటుడి కొలువుకు చేరబోతున్నప్పుడు కొంత వైశంపాయనుడు చెప్పిన కథగా, కొంత విరాటుడి స్వగతంగా, కొంత ప్రకాశ భాషణంగా మూలంలో చిత్రించబడి ఉన్నది. తిక్కన ఆ మొత్తాన్ని విరాటుడు ప్రకాశంగా ప్రజలతో అన్నట్లే రచించటం విశేషం. ఇది నాటకీయత.

2. యతి వేషంలో ఉన్న కంకుభట్టు శరీర లక్షణాలలో ధర్మరాజే. వేషంలో మార్పేకాని, అంగవిన్యాసంలో లేదు. దీనిని తిక్కన తన కవితలో ధ్వనింపజేశాడు. వరుసగా నాలుగు పద్యాలు వ్రాశాడు. అందులో మొదటిది ఇది.

3. ఇందులో విరాటుడు కంకుభట్టును ఒక మహాత్ముడైన యతీంద్రుడిగా దూరంనుండి దర్శించాడు. ఆశ్చర్యపడ్డాడు. అతడి రూపం అపూర్వవ్యక్తి దర్శనం చేసినప్పుడు కలిగే అబ్బురపాటును చూపులకు కలిగించింది. అతడు లోకాలన్నీ ఏలగలిగినవాడు. త్రిమూర్తులతో దీటైనవాడు. అయినా యతీంద్రు డెందుకైనాడో తెలియని ఒక విరోధాభాసం విరటుడి మాటలలో ప్రశ్నార్థకంగా నిలిచింది. చక్రవర్తి యతీంద్రుడైనట్లు కనపడే ఒక విభ్రాంతి ఈ పద్యంలో ప్రధానాంశం. వర్ణ్యగుణం కంకుభట్టులో ఉన్న తేజస్సు. అది లోన క్షాత్ర లక్షణం, పైకి యతీంద్రలక్షణం. దీనిని విరాటుడు గుర్తించి వివేకవంతు డనిపించుకొన్నాడు. (సంపా.)

సీ. **కరచరణాద్యంగకంబు లేలొకొ రత్న । భూషణ ప్రకరంబు పొందు దొఱఁగె?;**
నుభయ పార్శ్వంబుల నిభఘట లేలొకో । చనుదేవు సమదాళి సమితి మొరయఁ?;
బాయు తొలంగు మంచాయత వేత్ర హ । స్తుల మొత్త మేలొకో తోడ రాదు?;
ధవళాతపత్రముల్ దఱచుగా నేలొకో । పట్టరు మౌక్తిక ప్రభలు వెలుఁగ?;

తే. **నితఁడు రాజగు; రాజను నింత మాత్ర । గాదు; మూర్ధాభిషిక్త వర్గంబుఁ దనదు**
చరణయుగ్మంబు గొలిపింపఁ జాలు సార్వ । భౌమ పదవికిఁ దగియెడు భంగివాఁడు. **186**

ప్రతిపదార్థం: కరచరణ+ఆది+అంగకంబులు= చేతులు, కాళ్ళు మొదలయిన అవయవాలు; రత్నభూషణప్రకరంబు; పొందు= రత్నాలంకార సముదాయం యొక్క సాహచర్యాన్ని; తొఱఁగెన్= విడిచాయి; ఏల+ఒకొ?= ఎందుచేతనో?; సమద+ఆళి సమితి= మదించిన తుమ్మెదల సముదాయం; మొరయన్= మ్రోగేటట్లు; ఇభఘటలు= ఏనుగుల గుంపులు; ఉభయ పార్శ్వంబులన్= రెండు ప్రక్కలా; చనుదేవు= రావు; ఏల+ఒకో?= ఎందువలననో?; పాయు(ము)= తప్పుకో; తొలంగుము+అంచున్= తొలగిపో అంటూ; ఆయత వేత్రహస్తుల మొత్తము= పొడవైన బెత్తాలు చేతుల్లో ఉన్న వారి సముదాయం; తోడన్+రాదు= కూడా రావటంలేదు;

ఏల+ఒకో?= ఎందుకో?; మౌక్తికప్రభలు= ముత్యాలకాంతులు; వెలుఁగన్= ప్రకాశించేటట్లు; ధవళ+ఆతపత్రముల్= వెల్లగొడుగులు; తఱచుగాన్= విరివిగా; పట్టరు= పట్టుకొనరు; ఏల+ఒకో?= ఎందుకో?; ఇతఁడు= కనిపించే సన్న్యాసి; రాజు+అగున్= రాజయి ఉంటాడు; రాజు+అను+ఇంత మాత్ర, కాదు= రాజు మాత్రమే కాదు; మూర్ధ+అభిషిక్త వర్గంబు= పట్టాభిషేకం పొందిన రాజులను; తనదు చరణ యుగ్మంబున్= తన పాదాల జంటను; కొలిపింపన్+చాలు= సేవింపజేయగలిగిన; సార్వభౌమ పదవికిన్= చక్రవర్తి పదవికి; తగియెడు భంగివాఁడు= తగిన రీతిలో ఉన్నాడు.

తాత్పర్యం: కాళ్ళు చేతులు మొదలగు అవయవాలలో ఎందుకో రత్నాభరణాలు తీసివేసినట్లు కనిపిస్తున్నాయి . తుమ్మెదలఝుంకారాలతో ఇరువైపుల ఏనుగులు ఎందుకో రావటంలేదు. 'తప్పుకోండి, ప్రక్కకు జరగండి' అంటూ వేత్రహస్తులు వెంటరావటం లేదు ఎందుచేతనో మరి? ముత్యాల కాంతులను వెదజల్లే వెల్లగొడుగులు విరివిగా పట్టటం లేదు ఎందుచేతనో? ఇతడు బహుశః రాజయి ఉంటాడు. రాజుమాత్రమే కాదు, మూర్ధాభిషిక్తులయిన రాజులతో తన పాదాలు కొలిపించుకొనగల రాజరాజపదవికి తగినవాడు.

విశేషం: 1. దూరం నుండి సమీపానికి నడిచి వస్తున్న కంకుభట్టును చూస్తున్నాడు విరాటుడు. అతని నడకలో 'సార్వభౌమపదవికి దగియెడు భంగి' కనపడింది. చక్రవర్తి పురవీధులలో ఊరేగబోయినప్పుడు ఏ విధంగా ఠీవిగా నడిచే వైఖరిని ప్రదర్శిస్తాడో ఆ విధంగా కంకుభట్టు శరీరభంగిమలను ప్రకటిస్తున్నాడు. భేదమంతా ఎక్కడ ఉన్నదంటే ఆ మందీ మార్బలం ఆయన చుట్టూ లేరు. లేకపోయినా ఉన్నట్లు ఒక భావచిత్రాన్ని అతడి తీరు విరాటునికి తోపింపచేస్తున్నది. అరణ్యవాసంలో ధర్మజుడు నడిచినా అట్లాగే ఉండేది. కాని, అక్కడ గుర్తించే నాగరకులు లేరు. ఇప్పుడు విరాటుడు విజ్ఞుడైన భావుకుడు కాబట్టి నడక తీరునుబట్టి చక్రవర్తి హంగుల నన్నింటిని భావించగలిగాడు.

2. కంకుభట్టు రాజలాంఛనాలు తొలగిన రాజశేఖరుడు అని తిక్కన వర్ణించాడు. అతడి కాళ్ళకూ చేతులకూ ఉన్న రత్నాభరణాలు అప్పుడే తీసినట్లున్నాయట! అతడికి ఇరుప్రక్కల మదపుటేనుగులు రావటం అప్పుడే మానివేసినట్లున్నాయట! అతడి ముందు వెనుకల వేత్రహస్తులు ప్రజలను 'తొలగి దూరంగా ఉండండి' అని రాజును ప్రేమతో చూడాలని త్రొక్కిసలాడుతూ ముందుకువస్తున్న ప్రజలను అదుపు చేసే వైభవాన్ని అప్పుడే మానివేసినట్లున్నదట! ఆయన నడుస్తుంటే వెనక ముత్యాల వెల్లగొడుగులు పట్టటం అప్పుడే మానినట్లున్నదట! అవి రాజైన ప్రతివాడికీ ఉండవచ్చును. కాని, అతడు రాజాధిరాజువలె కనబడుతున్నాడు. మూర్ధాభిషిక్తులు పాదాలకు నమస్కరిస్తుంటే వారినతులను స్వీకరించటానికి అనువుగా భద్రంగా నడిచే వైఖరి అతడి పాదపద్ధతులలో కనపడుతున్నదట! అంటే, చక్రవర్తిత్వ వైభవాన్ని మానుకొని తనవద్దకు ఏదో మిషతో వస్తున్న దేవపురుషుడై ఉండి ఉంటాడు అన్న భావన విరాటుడికి కలిగింది. పై పద్యంలో రూపంలోని తేజస్సు, ఈ పద్యంలో నడకలోని భంగిమలు వర్ణించబడ్డాయి. (సంపా.)

క. **మన కడకు నేమిటికి వ । చ్చెనొకో; యే నిమ్మహాత్ము చెప్పిన పనులె**
ల్లను జేయువాఁడఁ గోరిన । కనకాంబరమణులు తలఁపు గడవఁగ నిత్తున్. **187**

ప్రతిపదార్థం: మన కడకున్= మన దగ్గరకు; ఏమిటికిన్= ఎందుకు; వచ్చెన్+ఒకో= వచ్చాడో; ఏను= నేను; ఈ+మహాత్ము చెప్పిన పనులు= ఈ మహాత్ముడు చెప్పిన పనులు; ఎల్లను= అన్నిటిని; చేయువాఁడన్= చేస్తాను; కోరిన= కోరినట్టి; కనక+అంబరమణులు= బంగారం,బట్టలు, మణులు మొదలయినవాటిని; తలఁపు+కడవఁగన్= కోరికకు మించి అడిగినదానికంటె అధికంగా; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: ఇతడు మన దగ్గరికి ఎందుకు వస్తున్నాడో! ఇతడు మహాత్ముడు. ఇతడు చెప్పిన పనులన్నీ నేను చేస్తాను. ఇతడు అడిగే బంగారాన్ని, వస్త్రాలను, మణులను అడిగినదానికంటె అధికంగా ఇస్తాను.

విశేషం: సమీపించిన కంకుభట్టును దగ్గరగా చూచాడు విరాటుడు. అత డేదో అర్థార్థి అయి వస్తున్నట్లు పసికట్టాడు. అందువలననే ఎందుకు వస్తున్నాడో (ఏ కోరికను కోరటానికి వస్తున్నాడో) అని మొదట అనుకొన్నాడు. ఒకవేళ అతడే అడిగితే దానిని తప్పకుండా చేయటానికి తరువాత సిద్ధపడ్డాడు. అంతటివాడు అడిగితే అడిగినదానికంటె అధికంగా ఇవ్వటమే ఔచిత్యమని భావించాడు ఈ మాటలంటున్న విరాటుడు ఇంగితజ్ఞుడు, ఉచితజ్ఞుడు, అతిథి సేవాతత్పరుడు అనిపించుకొన్నాడు. ధర్మరాజు వ్యక్తిత్వంలో - అందులోనూ యతీంద్రరూపంలో పరులను ఆకర్షించే ఉదాత్త గుణ రూప గౌరవం ఉన్నదని ధ్వని. (సంపా.)

ఆ. మత్స్యవిషయ రాజ్యమహిమకు యుక్తుండు। గాఁ దలంచెనేని గారవమున
నట్లచేసి, భక్తి ననుచరింతు నమాత్య। సుత సుహృద్భటార్య యుతము గాఁగ'. **188**

ప్రతిపదార్థం: మత్స్యవిషయ రాజ్యమహిమకున్= మత్స్యదేశపు రాజ్యవైభవానికి; యుక్తుండుగాన్+తలంచెన్+ఏని= తగినవాడననుకొంటే; గారవమునన్= మర్యాదతో; అట్లు+అ+చేసి= ఆ విధంగానే చేసి; అమాత్య= మంత్రులు; సుత= కొడుకులు; సుహృద్= స్నేహితులు; భట= సేవకులు; ఆర్యయుతము+కాఁగన్= పెద్దలు మొదలయిన వారితో కూడా; భక్తిన్= భక్తితో; అనుచరింతున్= పరిచర్యలుచేస్తాను.

తాత్పర్యం: మత్స్యరాజ్యవైభవానికి తాను తగినవాడని అత డనుకొంటే గౌరవభావంతో అతడిని ఆ విధంగానే చేస్తాను. నా మంత్రులతో, కుమారులతో, స్నేహితులతో, భటులతో, పురజనులతో సహా అతడిని భక్తితో సేవిస్తాను.'

విశేషం: 'మత్స్య రాజ్య వైభవానికి తాను యోగ్యుడని కంకుభట్టు భావిస్తే గౌరవంతో నే నత డనుకొన్నట్లే చేస్తాను' - ఈ మాటలు సాభిప్రాయాలు. సమ్రాట్టుగా ఉండదగిన కంకుభట్టు మత్స్యరాజ్యాన్ని కోరుకొనడు. కాని, ఒకవేళ కోరుకొంటే అది అతడి యోగ్యతకు తగినంత కానుక కాదు. అందువలన అనుమానం లేకుండా గౌరవంగా సమర్పిస్తానని విరాటుడు భావించటం అతని ఉదాత్తతకు చిహ్నం. కొందరు భావించినట్లుగా బలహీనత కాదు. కాకపోగా, భావికథార్థవ్యంజకం కూడా. (సంపా.)

ఆ. అని సమస్తజనంబులుఁ దదభిముఖులయి భక్తియుక్తిం బ్రత్యుత్థానంబు సేయం దానును గద్దియ డిగ్గి యెదురు సని నమస్కరించి, యతని యాశీర్వాదంబులు గైకొని, సగౌరవంబుగాఁ దోడ్కొని చనుదెంచి సమంచిత సమున్నతాసనంబున నునిచి వినయావనతుం డయి. **189**

ప్రతిపదార్థం: అని= అని; సమస్తజనంబులు= ప్రజలందరూ; తద్+అభిముఖులు+అయి= ఆ సన్న్యాసికి ఎదురై; భక్తియుక్తిన్= భక్తితో కూడుకొని; ప్రతి+ఉత్థానంబు= ఎదురుగా లేచి నిలవటం; చేయన్= చేయగా; తానును= విరాటరాజు కూడ; గద్దియ డిగ్గి= ఆసనం దిగి; ఎదురు+చని= ఎదురు వెళ్ళి; నమస్కరించి= నమస్కారం చేసి; అతని= ఆ యతి (వేషధారి) యొక్క; ఆశీర్వాదంబులు కైకొని= దీవెనలు స్వీకరించి; సగౌరవంబుగాన్= గౌరవంతో; తోడ్కొని= తోడుగా వెంబడించి; చనుదెంచి= వచ్చి; సమంచిత= తగిన; సమున్నత= ఎత్తయిన; ఆసనంబునన్= గద్దెమీద; ఉనిచి= సుఖాసీనుడిని చేసి; వినయ+అవనతుండు+అయి= వినయంతో వంగినవాడయి.

తాత్పర్యం: అని విరాటు డన్నాడు. సభాసదులందరూ కంకుభట్టుకు ఎదురుగా భక్తితో లేచి నిలుచున్నారు. విరాటుడు కూడా సింహాసనంనుండి దిగాడు. ఎదురేగినాడు. నమస్కరించాడు. అతడి దీవెనలు పొందాడు. మర్యాదలతో వెంటతీసికొని వచ్చాడు. తగిన ఆసనం మీద కూర్చుండబెట్టాడు. వినయంతో నమ్రతతో (ఇట్లా అన్నాడు.)

విశేషం: విరాటరాజు కొలువులో ఉన్న సభాసదులు రాజు మనసెరిగి నడచుకొనేవారు. సేవాధర్మం తెలిసినవారు. అందుకే రాజుకంటె ముందు లేచి కంకుభట్టుకు అభివాదనం తెలిపారు. ఆ తరువాత విరాటుడు తాను చేయవలసిన ఉత్తమాతిథి పరిచర్యలు చేశాడు. విరాటుడి సభ సుశిక్షితం. రాజుకు భిన్నంగా భావించేవారు అందులో లేరు. ఉన్నట్లయితే కవి ఏ ఉల్లేఖాలంకారమో ఎత్తుకొని చెప్పేవాడు. తిక్కన ఆ పని చేయలేదు. సన్న్యాసి వేషంలో ఉన్న ధర్మరాజుకు ఏకగ్రీవమైన ఆహ్వానం లభించింది. (సంపా.)

ఉ. 'ఎయ్యది జన్మభూమి? కుల మెయ్యది? యెయ్యది యున్నచోటు? పే
రెయ్యది? మీర లిందులకు నిప్పుడు వచ్చిన దానికిం గతం
బెయ్యది? నాకు నింతయును నేర్పడఁగా నెఱిఁగింపుఁ డున్న రూ
పయ్యది' నావుడున్ నరవరాగ్రణి క య్యతిముఖ్యుఁ డిట్లనున్. 190

ప్రతిపదార్థం: జన్మభూమి= పుట్టినచోటు; ఏ+అది?= ఏది; కులము= కులం; ఏ+అది= ఏది? ఉన్నచోటు= నివాసస్థలం; ఏ+అది?= ఏది; పేరు= పేరు; ఏ+అది?= ఏది; మీరలు= మీరు; ఇందులకున్= ఈ ప్రదేశానికి (ఇక్కడికి); ఇప్పుడు= కొలువు తీరి ఉన్నవేళ; వచ్చినదానికిన్= రావడానికి; కతంబు+ఏ+అది?= కారణ మేది; నాకున్= నాకు; ఉన్న+రూపు+ఆ+అది+ఇంతయునున్= అసలు విషయమంతా; ఏర్పడఁగాన్= స్పష్టపడేటట్లు; ఎఱిఁగింపుఁడు= తెలియజేయండి; నావుడున్= అనగానే; ఆ+యతిముఖ్యుఁడు= ఆ యతులలో ముఖ్యుడయినవాడు; నరవర+అగ్రణికిన్= మహారాజుతో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ' మీ జన్మస్థల మేది? మీ వంశం ఏది? మీరు ఇంతకుముందు వసించిన చోటేది? పేరేమిటి? మీరు ఇక్కడికి ఇప్పుడు రావటానికి కారణం ఏమిటి? నాకు అన్నీ స్పష్టంగా చెప్పండి' అనగానే విరాటమహారాజుతో ఆ యతివర్యుడు ఇట్లా అన్నాడు.

విశేషం: 1. విరాటుడికీ యతీంద్రుడి వేషంలో ఉన్న ధర్మరాజుకూ నడుమ జరిగిన సంభాషణను తిక్కన మూలంలోకంటె భిన్నంగా విశిష్టంగా తీర్చిదిద్దాడు. మూలంలో యతీంద్రుడు రాగానే విరాటు డేమీ మాట్లాడక పూర్వమే. **"సమ్రాడ్ విజానా త్విహ జీవనార్థి నం। వినష్ట సర్వస్వ ముపాగతం ద్విజమ్" (4,6,8)** ప్రభూ! సర్వస్వాన్ని కోల్పోయి బ్రదుకు తెరువుకై మిమ్మల్ని ఆశ్రయించటానికి వచ్చాను-అని నివేదించుకొన్నాడు. రాజాతడి కోర్కె నంగీకరించి స్వాగతంచెప్పి తరువాత అతడి వివరాలను గురించి అడిగాడు. తిక్కన రచనలో ధర్మరాజు అంత బేలగా మొదటనే బయటపడడు. దానివలన పాత్ర చిత్రణలో, సన్నివేశ నిర్వహణంలో ఔదాత్త్యం ఏర్పడింది.

2. మూలంలో అడిగిన ప్రశ్నలు నాలుగు- ఏ రాజు దేశం నుండి ఇక్కడకు వచ్చారు? మీ గోత్రం ఏమిటి? మీ పేరేమిటి? మీ రేవిద్యలో నిపుణులు? అని. తెలుగులో తిక్కన వేయించిన ప్రశ్నలు వేరు. 1. మీ పుట్టిన చోటేది? 2. మీ కుల మేమిటి? 3. మీరున్నచో టేది? 4. మీ పేరేమి? 5. మీ రిప్పుడు ఎందుకు వచ్చారు? మూలంలో అడిగిన ప్రశ్నలు యతీంద్రులను అడిగినట్లున్నాయి. తెలుగులో అడిగిన ప్రశ్నలు యతీంద్రవేషంలో ఉన్న రాజేంద్రుడిని తెలిసికొనాలని అడిగినట్లు ప్రౌఢంగా ఉన్నాయి. తెలుగు భారతంలోని విరాటుడు మూలంలోవలె అమాయకుడు కాడు. విజ్ఞుడు లోగుట్టును తెలిసికొందామని వేస్తున్నట్లున్న విరాటుడి ప్రశ్నలకు ధర్మరాజు ఆచి, తూచి సమాధానం చెప్పాలి. అందుకే సమాధాన స్వభావం కూడా తిక్కన రచనలో మారిపోయింది. తెలుగుభారతం పునస్సృష్టం కదా!

3. విరాటు డడిగిన ప్రశ్నలలో అతడిలో రగుల్కొంటున్న ఆసక్తి వ్యక్తమౌతున్నది. దానిని పద్య రచనా నిర్మాణం ధ్వనింపజేస్తున్నది. పద్యంలో మొదటి మూడు చరణాలు 'ఎయ్యది' అనే ప్రశ్నలతో సమంగా విరుగుతాయి. ఆ రచన వక్త యొక్క

అభిలాషను వ్యక్తం చేస్తున్నది. నాలుగో చరణం 'అయ్యది'తో మొదలౌతుంది. సత్యం తెలిసికొనాలన్న ఆసక్తిని తెలుపుతున్నది. పద్యరచనలో అంత్యానుప్రాస సమత అనే గుణంలోని మార్గాభేదం అనే శబ్ద గుణ లక్షణం. అవైషమ్యం, ప్రక్రమాభేదం అనే అర్థగుణ లక్షణాలు సందర్భోచితంగా పోషించబడ్డాయి. (సంపా.)

ఆ. 'ఉన్నరూప పలుకు నన్నరు లెక్కడఁ। గలరు? తోఁచినట్లు పలుకు వలుక
నైన చంద మయ్యెఁ; నంతియ కా, కంత। పట్టి చూడఁగలరె యెట్టివారు?' 191

ప్రతిపదార్థం: ఉన్నరూపు+అ= ఉన్నరూపును అంటే వాస్తవాన్నే; పలుకు= మాటలాడేటటువంటి; ఆ+నరులు= అట్లాంటి మనుష్యులు; ఎక్కడన్+కలరు?= ఎక్కడున్నారు?; తోఁచినట్లు= తోచిన విధంగా; పలుకు= మాట; పలుకన్+ఐన చందము+అయ్యెన్= మాట్లాడేతీరు అయింది; అంతియ కాక= అంతేకాక; ఎట్టివారున్= ఎలాంటి వారయినా; అంతపట్టిచూడన్+కలరె?= అంతగా పట్టి చూస్తారా?

తాత్పర్యం: ఉన్నది ఉన్నట్లు చెప్పే మనుష్య లెక్కడున్నారు? వారివారికి తోచేవిధంగా మాట్లాడే వైనమే కనిపిస్తుంది. అంతేకాక, ఎవరయినా ఎటువంటి వారయినా అంతగా పట్టి చూస్తారా?

విశేషం: యతీంద్రుడిలోని రాజలక్షణాలను ఉద్దేశించి ప్రశ్నించినట్లున్న విరాటుడి ప్రశ్నలకు ధర్మరాజు యతీంద్రుడివలె సమాధానం చెప్పటం మొదలు పెట్టాడు. యతి వేదాంతం మాట్లాడాలి. 'నీ జన్మభూమి ఏది'- అంటే ఏమి చెప్పాలి? జీవుడు పరమాత్మనుండి పుట్టి పరమాత్మలో లీనమౌతాడు కాబట్టి తన జన్మభూమి పరమాత్మ అని చెప్పాలి. లేదా లౌకికంగా అయితే మాతృయోని అని చెప్పాలి. వ్యావహారికంలో - మాతృగర్భం నుండి బయటపడ్డనేల ఏ రాజ్యంలో ఉంటుందో ఆ స్థలం పేరు చెప్పాలి. ఏది సమాధానం? ఎవరైనా గుచ్చి గుచ్చి అడిగితే ఇవన్నీ చెప్పాలా? అసలు యతీంద్రుడికి పూర్వాశ్రమ పరిత్యాగానంతరం జన్మభూమి విశ్వమేఔతుందని చెప్పాలా? విరాటుడు 'ఉన్నరూపు' చెప్పుమంటాడు. ఆ మాటకు అర్థాలెన్నో అసలు సత్యం చెప్పుమని, ప్రస్తుతం ఉన్న వాస్తవం చెప్పుమని, వస్తువు ఆ విధంగా ఉండటానికి గల కారణం చెప్పుమని అర్థాలేర్పడతాయి. వీటిల్లో ఏది చెప్పాలి? అడిగినవారికి తగినట్లు ఏది చెప్పాలి? అడిగినవారికి వీటిలో ఏది కావాలి? కాబట్టి ఉన్నరూపును ఇదమిత్థమని చెప్పేవారు లోకంలో లేరు. ఎందుకంటే ఉన్నది పరమాత్మ ఒక్కడే. అదే సత్యం. దేహాలు ఉపాధి భేదాలు. దేహాన్ని పరమాత్మగా ఎట్లా చెప్పాలి? కాబట్టి ఆత్మ పుట్టిన చోటును కొందరు, దేహంపుట్టిన చోటును కొందరు చెప్పవచ్చును. అది వారు ప్రశ్నలోని అర్థం గ్రహించే స్థాయిమీద ఆధారపడి ఉంటుంది. యతీంద్రుడిని ప్రశ్నించేటప్పుడు పృచ్ఛకుడు ఏ స్థాయిలో ప్రశ్నించవలెనో తెలిసికొనుమని ప్రచ్ఛన్నంగా ధర్మరాజు హెచ్చరించాడు. కాబట్టి అడిగేవారి చందం ఒకటైతే చెప్పేవారి చందం మరొకటి. లోకంలో వారి వారికి తోచిన పద్ధతులే వాటికి ప్రమాణాలు. అందువలన తాత్త్వికులు చెప్పే మాటలను మార్మికంగానే గ్రహించాలి- అని వేదాంతివలె మాట్లాడి విరాటుడి లౌకిక ప్రజ్ఞను మాటల మాయాజాలంతో కప్పివేశాడు. అతడు నిజంగా వేదాంతి అని విరాటుడు నమ్మేటట్లు వ్యవహరించాడు. అది ధర్మరాజు ప్రదర్శించిన ప్రౌఢి. విరాటుడు ధర్మజుడిలో చక్రవర్తిత్వ లక్షణాలకు హేతువు తెలిసికొందామని వేస్తున్న ప్రశ్నల గాలాలకు ప్రతిగా కల్పించిన ఆత్మరక్షాకవచాలు ఈ వచనాలు. ఇవి మూలంలో లేవు. (సంపా.)

వ. అని మందహాసంబు సేయుచు మఱియును. 192

ప్రతిపదార్థం: అని= అని; మందహాసంబు+చేయుచున్= చిరునవ్వు నవ్వుతూ; మఱియును= ఇంకా ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని చిరునవ్వు నవ్వుతూ ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ధర్మరాజు చిరునవ్వునవ్వటం సాభిప్రాయం. 'ఉన్నరూపు చెప్పు'మని అడిగిన విరాటుడితో ఉన్నరూపంటే అతడికి అర్థంకాని ఒక వేదాంత ధోరణిలో మొదలుపెట్టి ఎత్తుకు పైఎత్తు వేశానని, అది తెలిసికొనటం విరాటుడికి సాధ్యం కాదని చిరునవ్వు నవ్వి ఉండవచ్చును. లేదా, అడిగిన వారిమీద వాత్సల్యం ఉప్పొంగగా ఆనందంతో తన వివరాలు చెప్పుతున్నట్లు స్ఫురింపచేయటానికి చిరునవ్వు నవ్వి ఉండవచ్చును. ధర్మరాజుకు గడుసరితనం నేర్పాడు తిక్కన (సంపా.)

క. నానావిధ భూతమయము। మే; నతిచంచలము మనము; మెయికొని నిక్కం
బే నరునకుఁ జెల్లింపం। గానగు? సత్యంబు నడపుక్రమ మట్లుండెన్'. 193

ప్రతిపదార్థం: మేను= శరీరం; నానావిధ= అనేకవిధాలయిన; భూతమయము= భూతాలతో నిండినది; మనము= మనస్సు; అతిచంచలము= చాలా చంచలమయినది; మెయికొని= ప్రయత్నించి; నిక్కంబు= సత్యం; ఏ నరునకున్+చెల్లింపంగాన్+ అగున్= ఏ మానవ మాత్రునికి నెరవేర్చటానికి వీలవుతుంది; సత్యంబు నడపు= సత్యాన్ని నడిపించే; క్రమము= పద్ధతి; అట్లు+ఉండెన్= అట్లా ఉంది.

తాత్పర్యం: ఈ శరీరం పంచభూతాలతో కూడినది. ఇక మనసు అయితే అసలు నిలకడలేనిది. వీటిని ఆధారంగా చేసికొని సత్య నిరూపణ చేయటం ఎవరికి సాధ్యమౌతుంది? సత్యమే (ఉన్నరూపే) జీవితంలో చెప్పాలంటే ఇట్లాగే ఉంటుంది.

వ. అనుచు మత్స్యమహీవల్లభు నవలోకించి. 194

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; మత్స్యమహీవల్లభున్= ఆ విరాట మహారాజును; అవలోకించి= చూచి.

తాత్పర్యం: అంటూ విరాటరాజును చూచి.

క. 'ద్విజుఁడఁ, గురు విషయ జాతుఁడ। సుజనప్రియుఁ డైన ధర్మసుతు సఖుఁడఁ బరి
వ్రజనాశ్రమ కలితుండ, మ। నుజవల్లభ యోగ్య బహు వినోదకరుండన్. 195

ప్రతిపదార్థం: ద్విజుఁడన్= బ్రాహ్మణుడిని-లేదా-క్షత్రియుడిని; కురువిషయజాతుఁడన్= కురుదేశంలో పుట్టినవాడిని; సుజన ప్రియుఁడు+ఐన= సజ్జనులకు ప్రియుడయిన; ధర్మసుతు సఖుఁడన్= యమధర్మరాజు కుమారుడయిన ధర్మరాజు స్నేహితుడిని; పరివ్రజన+ఆశ్రమ కలితుండన్= సన్న్యాసాశ్రమ విధానంతో కూడిన వాడిని; మనుజవల్లభ యోగ్య= రాజులకు తగిన; బహు వినోదకరుండన్= ఎన్నో వినోదాలు చేయగలవాడిని.

తాత్పర్యం: 'రాజా! నేను ద్విజుడిని. కురుదేశంలో జన్మించాను. ధర్మరాజుకు స్నేహితుడిని. అయితే ఇపుడు సన్న్యాసాశ్రమం స్వీకరించినవాడిని. రాజులకు తగిన వినోదాలను కల్పించగలవాడిని.

విశేషం: ఉపనయనసంస్కారం బ్రాహ్మణులకూ క్షత్రియులకూ ఉంటుంది. అందువలన ధర్మరాజు అబద్ధం చెప్పినట్లు కాదు. రెండవది పరివ్రాజక వ్రతమంటే ఒక చోట నిలవకుండా సంచరించేవారి వ్రతం. ఇక్కడ వ్రతం అజ్ఞాతవాసకాలంలో ఎవరికీ ఆచూకీ తెలియనివ్వకుండా మెలగే వ్రతం. ఆస్థానంలో 'విప్రవినోదులు' ఉంటారు కాని, అట్లా కాక నేను ప్రభువులకు మాత్రం ఉచితమైన వినోదాలు చేయగలవాడిని అని చెప్పక చెప్పటం. 'మనుజ వల్లభుడనైన నాకు అనువైన వినోదాలను చేయగలవాడను'

అని చెప్పినట్లు ధర్మరాజుపరంగా కూడా అన్వయించవచ్చును. మనుజవల్లభ!= ఓ రాజా! (విరాటుడా!) అని సంబుద్ధిగానైనా అన్వయించవచ్చును. యోగ్య బహు, వినోదకరుండన్= ఉచితములైన పెక్కు వినోదములను చేయగలవాడిని - అని చెప్పవచ్చును.

క. ద్యూతక్రీడకుఁ గొండొక। నేతుం; గపటమున నొవ్వని జనంబులు నా
చేతి ధనమెల్లఁ గొని పరి। భూతి యొనర్చిన, విరక్తి పుట్టి వెడలితిన్. 196

ప్రతిపదార్థం: ద్యూత క్రీడకున్= జూదం అనే ఆటకు; కొండొకనేతున్= కొంతకు కొంత నేర్చినవాడిని; ఒవ్వని= గిట్టని; జనంబులు= ప్రజలు; కపటమునన్= మోసంతో; నాచేతి ధనము+ఎల్లన్= నా చేతిలోని డబ్బు అంతా; కొని= లాక్కొని; పరిభూతి= పరాభవం, అవమానం; ఒనర్చినన్= చేయగా; విరక్తిపుట్టి= వైరాగ్యం కలిగి; వెడలితిన్= బయటపడ్డాను.

తాత్పర్యం: జూదం కొద్దిగా నేర్చినవాడిని కాని, గిట్టనివాళ్ళు మోసంతో నా చేతిలోని డబ్బు అంతా కాజేశారు. నన్ను అవమానించారు. ఆ కారణంగా విరక్తి కలిగింది. అందుచేత స్వస్థలం వదలిపెట్టాను.

విశేషం: 1. 'కొండొక నేర్తున్' - అని పాఠాంతరం. దానిని స్వీకరిస్తే ప్రాసమైత్రి చెడుతుంది. మాయాద్యూతం నేర్వలేదని విశేషార్థం. డబ్బుఅంతా పోయిందనటం, అవమానం చేశారనడం అంతా ధర్మరాజుకు సంబంధించిన అంశాలు. విరక్తి కారణంగా గడ్డం పెంచుకొనటం, సన్న్యాసం స్వీకరించడం సమానధర్మాలు. అయితే ఇందులోని అంతరార్థాన్ని గ్రహించే శక్తి విరాటమహారాజుకు లేదు. నేరుచుదును - నేరుతును. బాల. క్రి. 97చే 'రు' లోపింపగా, 'నేతును' ఔతుంది. (బాల.క్రియ.108)

2. ద్యూతవిద్యా నైపుణ్యాన్ని గురించి చెప్పేకథనంలో మూలానికీ, తిక్కన రచనకూ కొంత బేధం కనబడుతున్నది. **'అక్షాన్ ప్రయోక్తుం కుశలోఽస్మి'** -పాచికలాడటంలో నేర్పుకలవాడిని అని మూలంలో కంకుడు చెప్పాడు. ఆ నేర్పరితనం యుధిష్ఠిరుడితో చెలిమి చేయటంవలన వచ్చినట్లు ధ్వనింపచేశాడు. కాని, తిక్కన 'ద్యూతక్రీడకు కొండొకనేరుతును' అని మార్చాడు. శత్రువులు కపటద్యూతంలో తన ధనాన్నంతా కాజేసి అవమానపరచిన విషయం మూలంలో ధర్మరాజు చెప్పాడు. మాయాద్యూత ప్రసక్తి తీసికొనిరాడు తిక్కన కంకుభట్టు. తనకు ధర్మరాజు చెలిమివలన ద్యూతక్రీడలో పరిచయం ఏర్పడిందని చెప్పడు. మూలంలో మరొక విశేషం ఉన్నది. **"ప్రాప్తో వివాదః ప్రథమో విశామ్పతే । న విద్యతే కించన మత్స్య హీనతః । న మే జితః కశ్చన ధారయేద్ ధనం వరో మమైష్యోఽస్తు తవ ప్రసాదతః॥' (సం4,6,12)** అని అన్నట్లు ఉన్నది. 'ఓ మత్స్యభూపతీ! ద్యూతంలో అల్పుని వలన గొప్పవాడికీ వివాదం రాదన లేము. కాబట్టి నేను జూదంలో గెలిచినా ఓడినవాడు అప్పుపడినట్లు కాదు. మీరు అనుగ్రహించి ఆ విధంగా మీతో జూదమాడటానికి వరమిప్పించండి' అని అన్నాడు. ఆ మాటలు విన్న విరాటుడు ఉప్పొంగిపోయాడు. ఇన్నాళ్ళకు నాతో సుహృద్ద్యూతం ఆడే సహృదయుడు దొరికాడనుకొన్నాడు. జూదమాడినా, కయ్యమాడినా, వియ్యమాడినా సములతో చెయ్యాలికాబట్టి విరాటుడు కంకుభట్టుకు తన ఆస్థానంలో తనతో సమానమైన హోదా ఇచ్చాడు. భోగాలన్నీ తనతో సమానంగా జరిపించాడు. ఎవరైనా వేతనంగా కంకుభట్టుకు ధనమిస్తే ఆ రాజోద్యోగిని ప్రాణాలు తీస్తానన్నాడు. తిక్కన కంకుడి సంభాషణను మార్చి ధర్మజుడివలె పరోక్ష సత్యవాదిగా చిత్రించాడు. విరాటుడిచేత "ద్యూతజ్ఞుల దెసఁగొండొక ప్రీతియుఁ గలదు" (విరా.1-207) అని చెప్పించాడు. ధర్మరాజులో ద్యూతజ్ఞుడికంటె ధర్మజ్ఞుని నెక్కువగా ప్రదర్శించటం తిక్కన అభిమతం. అందుకే ఈ స్వల్పమైన మార్పు, ఈ మార్పుకు అనుగుణంగా తిక్కన రాబోయే పద్యంలో 'నృప నయవిద్యకుం దగిన నే ర్పలవడ్డది గొంత కొంత' (విరా.1-197) అని చెప్పించాడు. ఈ మాటలు అమూలకాలు; తిక్కన తీర్చిదిద్దిన కంకుడికి వాఙ్మయ భూషణాలు. (సంపా.)

చ. నృపనయవిద్యకుం దగిన నే ర్పలవడ్డది గొంత కొంత; ధ
ర్మపరుల సంగతిం దగిలి మచ్చిక నుండుదు; బేరు కంకుఁ; దే
వపుఁ గొలు వైన నాకు నిలువన్ మది గొల్పదు; కాన నిన్ను భూ
మిపతులలోన సాధుజనమిత్త్రుఁడు నా విని కొల్వ వచ్చితిన్. 197

ప్రతిపదార్థం: నృప నయవిద్యకున్= రాజనీతివిద్యకు; తగిన నేర్పు= తగిన చాతుర్యం; కొంత కొంత= కొద్ది కొద్దిగా; అలవడ్డది= అలవడింది; ధర్మపరుల సంగతిన్= ధార్మికుల స్నేహంలో; తగిలి= ఆసక్తి కలిగి; మచ్చికన్+ఉండుదున్= చనువుతో ఉంటాను; పేరు కంకుఁడు= నా పేరు కంకుడు; ఏవము+కొలువు+అయినన్= నీచమయిన సేవ అయితే; నాకున్= నాకు; నిలువన్= ఉండడానికి; మది+కొల్పదు= ఇష్టం కాదు; కానన్= అందుచేత; నిన్నున్= నిన్ను; భూమిపతులలోనన్= రాజులలో; సాధుజనమిత్రుఁడు= సత్పురుషుల స్నేహితుడు; నాన్, విని= అనగా విని; కొలువన్= కొలవడానికి (సేవించటానికి); వచ్చితిన్= వచ్చాను.

తాత్పర్యం: ఓ రాజా! నాకు రాజనీతి విద్య తెలుసు. ఆ విద్యకు తగిన చాతుర్యం నాకు కొంత అలవాటులో ఉన్నది. పైగా ధార్మికులయినవారితో స్నేహంగా ఉంటాను. నా పేరు కంకుడు. నేను నీచమయిన కొలువు చేయను. అట్లాంటి కొలువులో నాకు నిలువ బుద్ధి కాదు. రాజులలో నీవు సజ్జనులకు మిత్రుడవని విన్నాను. నిన్ను సేవించటానికి వచ్చాను.

విశేషం: మూలంలో కంకుడు తనకు రాజనీతి విద్యలో పరిచయమున్నదని చెప్పినట్లు లేదు. తిక్కన సందర్భశుద్ధితో కల్పించి చెప్పించాడు. దక్షిణగోగ్రహణ ఘట్టంలో ధర్మజునీతి విరాటునికి ఉపయోగపడుతుంది. దానికి బీజంగా ఈ నైపుణ్యాన్ని ఇక్కడ చెప్పించి తిక్కన ఔచిత్యాన్ని పాటించాడు. (సంపా.)

తే. **వత్సరంబునఁ గడచను వ్రతము నాకు । దాని నీపాలఁ జల్పి యుత్సాహవృత్తి**
మెఱయ, నీకుఁ గృతజ్ఞత నెఱపి, తొల్లి । యెగ్గు సేసిన వారి జయింపఁ బోదు'. **198**

ప్రతిపదార్థం: వత్సరంబునన్= ఒక సంవత్సరకాలంలో; కడచను= పూర్తిచేయవలసిన; వ్రతము= వ్రతం; నాకున్= నాకు (ఉంది); దానిన్= ఆ వ్రతాన్ని; నీ పాలన్= నీ దగ్గర; చల్పి= పూర్తిచేసి; ఉత్సాహవృత్తిమెఱయన్= ఉత్సాహం బయటపడేటట్లు; నీకున్+కృతజ్ఞత= నీపట్ల కృతజ్ఞతను; నెఱపి= ప్రకటించి; తొల్లి= ముందు; నాకున్= నాకు; ఎగ్గు= కీడును; చేసిన= ఆచరించిన; వారిన్= వారిని; జయింపన్+పోదున్= జయించడానికి వెళ్ళుతాను.

తాత్పర్యం: నాకు ఒక వ్రతం ఉన్నది. ఆ వ్రతకాలం సంవత్సరం పాటు నీ దగ్గరే ఆ వ్రతం పూర్తి చేసికొంటాను. నీకు కృతజ్ఞత తెలుపుకొంటాను. ఆ తరువాత నాకు అపకారం చేసిన వారిని జయించటం కొరకు ఉత్సాహంతో వెళ్ళుతాను.

విశేషం: కంకుడు అంటే యమధర్మరాజు. తండ్రి పేరు కొడుకుకు కూడా సరిపోతుంది. అందుచేత తనను కంకుడు అని పరిచయం చేసుకొనటం సబబు.

వ. **అనిన విని సంప్రీత చేతస్కుండై విరాటుం డతని కిట్లనియె.** **199**

ప్రతిపదార్థం: అనినన్ విని= ఆ మాటలను విని; సంప్రీత చేతస్కుండు+ఐ= ప్రీతి పొందిన మనస్సు కలవాడయి; విరాటుండు= విరాటమహారాజు; అతనికిన్+ఇట్లు+అనియెన్= అతనితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ మాటలకు విరాటుడు సంతోషించాడు. కంకుడితో ఇట్లా అన్నాడు.

తే. **'అట్ల చేయుఁడు రుచిరోన్నతాసనములు । వాహనములు భోజనములు వస్త్రములును**
వలయు భోగంబులును నెల్లవర్తనములు । నాకు నెట్లట్ల మీకును నడపువాఁడ. **200**

ప్రతిపదార్థం: అట్లు+అ= అట్లాగే; చేయుఁడు= చేయండి; రుచిర+ఉన్నత+ఆసనములున్= కాంతిమంతములయిన ఉన్నత ఆసనాలును; వాహనములున్= వాహనాలును; భోజనములున్= భోజనాలును; వస్త్రములునున్= వస్త్రాలును; వలయు భోగంబులును= అవసరమయిన సుఖభోగాదులును; ఎల్లవర్తనములున్= అన్ని పరిచర్యలును; నాకున్+ఎట్లు= నాకు ఎట్లా జరుగుతాయో; అట్లు+అ= అదేవిధంగా; మీకున్= మీకు; నడపువాఁడన్= జరిపిస్తాను.

తాత్పర్యం: అట్లాగే చేయండి. ఉన్నత ఆసనాలు, వాహనాలు, ఆహారాలు, వస్త్రాలు ఇంకా ఇతర భోజనాదులు అన్ని మర్యాదలు నాకు ఎట్లా జరుగుతాయో మీకూ అట్లాగే జరిపిస్తాను.

విశేషం: విరాట మహారాజు మాటలలో రెండు అంశాలు ఉన్నాయి. మొదటిది ప్రకటన. రెండవది సూచన. కంకుభట్టు వేషంలో ఉన్న ధర్మరాజుకు తనతో సమానమయిన ప్రతిపత్తి ఇస్తున్నట్లు చెప్పటం ప్రకటన. కొలువు నామమాత్రమే ననటం సూచన. అంత్యానుప్రాస రచనకు రక్తి కట్టించింది.

క. నా యనుచరులం దెవ్వఁడు। మీ యెడ భయభక్తి లేక మిగిలి మెలఁగెనే
నా యధముని దండితుఁగాఁ। జేయుదు నతఁ డెంతయుం బ్రసిద్ధుం డయినన్. 201

ప్రతిపదార్థం: నా+అనుచరులందున్= నా సేవకులలో; ఎవ్వఁడు= ఎవ్వడయినా; మీ+ఎడన్= మీ మీద (పట్ల); భయభక్తి లేక= భయంతోడి భక్తి లేకుండా; మిగిలి= హద్దుమీరి; మెలఁగెన్+ఏని= ప్రవర్తించినట్లయితే; అతఁడు= అతడు; ఎంతయున్= ఎంతటి (ఎంతగా); ప్రసిద్ధుండు= ప్రసిద్ధుడు; అయినన్= అయినా; ఆ+అధమునిన్= ఆ నీచుని; దండితున్+కాన్+చేయుదున్= దండింపచేస్తాను.

తాత్పర్యం: నా సేవకులలో ఎవడయినా సరే మీ పట్ల భయంతోడి భక్తి లేకుండా హద్దు మీరి ప్రవర్తించినట్లయితే ఆ నీచుడిని దండిస్తాను. అతడు ఎంత ప్రసిద్ధు డయినా సరే దండన తప్పదు.

వ. అట్లుంగాక. 202

తాత్పర్యం: అంతే కాక.

చ. వెలయఁగ మత్స్యరాజ్యపదవీ పరిపాలన సేయఁగా మదిం
దలఁచుట యెంతయుం బ్రియము తమ్ములుఁ బుత్త్రులు బంధులుం బ్రధా
నులును బలంబు నేను సుమనోవిభుతుల్యుఁడవైన నిన్ను మి
క్కిలి యగు భక్తిఁ గొల్చి కృతకృత్యతఁ బొందుదు; మట్ల చేయవే! 203

ప్రతిపదార్థం: (నీవు); మత్స్యరాజ్య పదవీ పరిపాలన= మత్స్యరాజ్యానికి రాజుగా ఉండి పరిపాలించటం; వెలయఁగన్+చేయఁగాన్= ప్రసిద్ధికెక్కే (విధంగా)టట్లు చేయటానికి; మదిన్+తలఁచుట= మనసులో భావించటం; ఎంతయున్+ప్రియము= నాకుఎంతో ఇష్టం; తమ్ములున్= నా తమ్ముళ్ళు; పుత్త్రులున్= కొడుకులూ; (శౌనకుడు, మదిరాక్షుడు, సూర్యదత్తుడు), (శంఖుడు, ఉత్తరుడు); బంధువులున్= చుట్టాలూ; ప్రధానులును= మంత్రులూ; బలంబున్= బలగమూ - రథ,గజ,తురగ, పదాతిబలం; నేనున్= నేనూ; సుమనో విభు తుల్యుఁడవు+ఐన= దేవతలకు రాజైన ఇంద్రునితో సమానుడవయిన; నిన్నున్= నిన్ను; మిక్కిలి+అగు= ఎక్కువయిన; భక్తిన్= భక్తితో; కొల్చి= సేవించి; కృతకృత్యతన్= కృతార్థతను; పొందుదుము= పొందుతాము; అట్లు+అ= ఆ విధంగా; చేయవే!= చేయుమా!; (చేయవలసిందిగా కోరుతున్నాను.)

తాత్పర్యం: నీవు మత్స్యదేశాన్ని పరిపాలించటం నాకు చాలా ఇష్టం. నీవు దేవేంద్రుడితో సమానుడివి. నా అనుజులు, కుమారులు, బంధువులు, అమాత్యులు, నా బలగం, నేనూ నిన్ను అతిభక్తితో సేవిస్తాం. అటువంటి అవకాశం నాకు తప్పక కల్పించవలసిందిగా కోరుతున్నాను.'

వ. అనిన విని దరహసితవదనుం డగుచుఁ బాండవాగ్రజుం డతని కిట్లనియె. 204

ప్రతిపదార్థం: అనినన్+విని= అని చెప్పగా విని; దరహసిత= చిరునవ్వుతో కూడిన; వదనుండు= ముఖం కలవాడు; అగుచున్= ఔతూ; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడయిన ధర్మరాజు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ విరాట మహారాజుతో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ మాటలు విని చిరునవ్వు నవ్వుతూ ధర్మరాజు విరాటమహారాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: విరాటుడు కంకుభట్టును దేవేంద్రుడి వంటివాడవని ప్రశంసించి, సకుటుంబ పరివారంగా అతడికి సేవచేస్తానన్నప్పుడు అతడు చిరునవ్వుతో కూడిన మొగం కలవాడయ్యాడు. ఈ చిరునవ్వు అతడి ధీరోదాత్తతను వ్యక్తం చేస్తున్నది. (సంపా.)

క. 'ఏను హవిష్యమ కుడుతును। భూనాయక ! నాకు శయ్య భూమియ; యిమ్మైఁ
బూని వ్రతంబులు సలిపెడు। వానికి నిన్నియును నిట్లు వలయునె చెపుమా!' 205

ప్రతిపదార్థం: భూనాయక!= రాజా!; ఏను= నేను; హవిష్యము+అ= హోమం చేయటానికి అర్హమైన పదార్థాలనే; కుడుతును= భుజిస్తాను, ప్రసాదంగా ఆరగిస్తాను; నాకున్= నాకు; భూమియ= నేలయే; శయ్య= సెజ్జ; ఈ మైన్= ఈ విధంగా; పూని= ప్రయత్నించి; వ్రతంబులు+చలిపెడు= వ్రతాలు చేసేటటువంటి; వానికిన్= వానికి; ఇన్నియును= ఈ వైభవాలన్నీ; ఇట్లు= ఈ విధంగా; వలయునె?= కావాలా?; చెపుమా!= చెప్పుమా!

తాత్పర్యం: రాజా! హోమార్హమైన పవిత్ర పదార్థాలే నా భోజనం, నేలయే సెజ్జ. నేను వ్రతాచరణ చేసేవాడిని. నాకు ఇటువంటి మర్యాదలు కావాలా?.

విశేషం: ఈ మాటలు మూలంలో లేవు. ద్విజుడివలె వర్తిస్తున్న ధర్మరాజు ద్విజుని ఆహార విహారాలనే పాటించాడు. హోమం చేయడానికై వండే అన్నం హవిష్యం. ఈ అన్నాన్ని వార్చటం చేయరు. ఇగురపెడతారు. ఇగురపెట్టిన దాన్నే హోమం చేస్తారు. పైగా దైవం కొరకు ఉద్దేశించినది ఆ హోమం, వ్రతం పట్టినవారికి కొన్ని ప్రత్యేక నియమాలు ఉంటాయి. వాటిని నిర్దేశిస్తూ కంకుభట్టు తన ద్విజత్వాన్నే కాక తన నైష్ఠికత్వాన్నీ, వ్రతదీక్షనూ వ్యక్తం చేశాడు.

ఆ. అనిన విరటుఁ డిట్టు లనియె 'నెత్తెఱఁగున। నడవ నిష్ట మట్ల నడచి మీకు
మనసు వచ్చినన్ని దినములు సలుపుఁ డి। చ్చోట నదియ మాకు శోభనంబు. 206

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విరటుఁడు= విరాటమహారాజు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; ఏ+ తెఱఁగునన్= ఏ విధంగా; నడవన్+ఇష్టము= ప్రవర్తించడం ఇష్టమో; అట్లు+అ= ఆ విధంగానే; నడచి= ప్రవర్తించి; మీకున్= మీకు; మనసు వచ్చినన్ని దినములు= మనసుకు నచ్చినన్ని రోజులు; ఈ+చోటన్= ఇక్కడ; చలుపుఁడు= కడపండి; అది+అ= అదే; మాకున్= మాకందరికి; శోభనంబు= మేలు, మంచిది.

తాత్పర్యం: అపుడు విరాటుడు ఇట్లా అన్నాడు: 'మీకు ఏ విధంగా ఉండాలనే కోరిక ఉందో ఆ విధంగానే మీకు ఇష్టమయినన్ని రోజులు ఇక్కడ ఉండండి. అదే మాకు ఇష్టం. అదే మేలు కూడా.

క. ద్యూతజ్ఞుల దెసఁ గొండొక। ప్రీతియుఁ గల; దట్లుగాక పెద్దల రగు మీ
రే తెఱఁగున విహరించినఁ। జేతోమోదంబు; దగ వసింపుఁడు నెమ్మిన్'. 207

ప్రతిపదార్థం: ద్యూతజ్ఞుల దెసన్= జూదం తెలిసిన వారిపట్ల; కొండొక= ఒకరకమయిన; ప్రీతియున్+కలదు= ప్రీతి ఉంది; అట్లు+కాక= అదీ కాకుండా; పెద్దలరు+అగు= పెద్దలయిన; మీరు= మీరు; ఏ+తెఱఁగునన్+విహరించినన్= ఏ విధంగా ప్రవర్తించినా; చేతస్+మోదంబు= మనస్సుకు సంతోషము; తగన్= తగినట్లు; నెమ్మిన్= స్నేహంతో; వసింపుఁడు= వాసం చేయండి.

తాత్పర్యం: జూదం ఆడటం తెలిసిన వారంటే నాకు అభిమానం. అదీకాక మీరు పెద్దలు. మీరు ఏ విధంగా ప్రవర్తించినా నాకు సంతోషం. మీరు మీ హోదాకు తగినట్లుగా సుఖంగా ఉండండి.

విశేషం: విరాటునికి పెద్దలంటే భక్తి విశ్వాసా లున్నాయి. ధర్మజ్ఞులు, నీతిజ్ఞ లంటే భయభక్తు లున్నాయి. ద్యూతజ్ఞులంటే అభిమానం ఉన్నది. ధర్మరాజు (కంకుభట్టు) పట్ల ఈ మూడూ కలిసి ముచ్చట కొలిపాయి. (సంపా.)

వ. అని పలికి కౌంతేయాగ్రజు నత్యంత సంతుష్టాంతరంగుం జేసి. 208

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; కౌంతేయ+అగ్రజున్= కుంతీపుత్రులలో పెద్దవాడయిన ధర్మరాజును; అత్యంత సంతుష్ట+అంతరంగున్= ఎంతో సంతుష్టి చెందిన మనస్సు కలవానిగా; చేసి= చేసి.

తాత్పర్యం: అని పలికి విరాటమహారాజు ధర్మరాజును (కంకుభట్టును) సంతోషపెట్టి.

చ. పొరిఁ బొరిఁ బ్రీతి రెట్టిగ నపూర్వవిలోకన మాచరించుఁ ద
త్పరమగు సద్వివేకములు భావ నిరూపణ సేయుఁ గౌతుక
స్ఫురణఁ గరంబు దత్కరముఁ బొంద నయంబునఁ జేర్చి వాక్య వి
స్తర చతురత్వ మేర్పడఁగ సల్లపనం బొనరించు నర్థితోన్. 209

ప్రతిపదార్థం: పొరిన్+పొరిన్= మాటిమాటికి; ప్రీతి= ప్రియము; రెట్టిగన్= రెట్టింపు కాగా; అపూర్వవిలోకనము+ఆచరించున్= వింతగా చూడడం (వీక్షించడం) చేస్తాడు; తద్+పరము+అగు= ఆసక్తికరమైన; సత్+వివేకములు= చక్కని వివేకాలు; భావనిరూపణ+చేయున్= భావాన్ని స్పష్టం చేస్తాయి; కౌతుక స్ఫురణన్= కుతుహలం కలిగిన స్ఫూర్తితో; నయంబునన్= నీతితో; కరంబున్= తనచేతిని; తద్+కరమున్= అతని చేతితో; పొందన్+చేర్చి; కలియగలిపి= కరచాలనం చేసి; అర్థితోన్= ప్రీతితో; వాక్యవిస్తర చతురత్వము= వాక్కులను వివరించడంలోని చాతుర్యం; ఏర్పడఁగన్= స్పష్టపడే విధంగా; సల్లపనంబు+ఒనరించున్= సల్లాపం చేస్తాడు.

తాత్పర్యం: విరాట మహారాజు ధర్మరాజును మాటిమాటికి అపూర్వంగా చూస్తాడు. అతడి చూపులో రెట్టింపు ప్రీతి కనిపిస్తూ ఉన్నది. భావనిరూపణలో ఆసక్తి, విచక్షణ లున్నాయి. అతడి సల్లాపంలో కుతూహలం స్ఫురిస్తూ ఉన్నది. వాక్చాతుర్యం పొడసూపుతూ ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ధర్మరాజు విరాటుడి కొలువులో చేరటం ఒక ఉదాత్త రమణీయ దృశ్యం. దాని ఆరంభ నిర్వహణాలను చిత్రించటంలో వ్యాసుడూ తిక్కనా తమ తమ పద్ధతులలో ప్రత్యేకతలను ప్రదర్శించారు. వ్యాసుడిది పురాణదృష్టి. తిక్కనది ప్రబంధదృష్టి, నాటకీయశిల్పం. మూలంలోని కొన్ని ప్రతులలో ఈ క్రింది రెండు శ్లోకాలు కనబడుతున్నాయి.

"ఏవం తు రాజ్ఞః ప్రథమం సమాగమో । బభూవ మాత్స్యస్య యుధిష్ఠిరస్య చ,
విరాట రాజస్య హి తేన సంగమో । బభూవ విష్ణో రివ వజ్రపాణినా.
త మాసనస్థం ప్రియరూప దర్శనం । నిరీక్షమాణో న తతర్ప భూమిపః,
సభాం చ తాం ప్రజ్వలయన్ యుధిష్ఠిరః । శ్రియా యథా శుక్ర ఇవ త్రివిష్టపమ్." (సం. 4.6.15 పాదసూచి)

విరాటరాజుకు ధర్మరాజుతో కలిగిన ఆ ప్రథమ సమావేశం ఇంద్రుడికీ విష్ణువుకూ జరిగిన సమావేశంవలె సొంపారిందట. ధర్మరాజు అసనంమీద కూర్చున్నాడట. ఆయన ప్రియ రూపదర్శనం విరాటుడికి ఎంతచూచినా తనివితీరలేదట! ధర్మరాజు సభలో కూర్చుంటే దేవేంద్రుడు తన ఐశ్వర్యంతో స్వర్గాన్ని అలంకరించినట్లుగా తోచిందట. ఈ వర్ణనం చేసింది వైశంపాయనుడు. ఇందులోని ఉపమాలంకార నిర్వహణం పురాణ కథాకథన శిల్పానికి సముచితంగా ఉన్నది. కంకుడిని విరాటుడు అంత ప్రీతితో చూడటానికి హేతువును అలంకార సుందరంగా ఆ వర్ణన ధ్వనింపజేస్తున్నది.

తిక్కన ఆ శ్లోకాలకు బదులు ఈ పద్యాన్ని తెలుగులో వ్రాశాడు. పై శ్లోకాలు ప్రక్షిప్తాలని భావిస్తే తిక్కన రచించిన ఈ పద్యం అమూలకమే కాదు, అపూర్వం కూడా. ధర్మరాజు యొక్క తేజోమయ రూపవైభవాన్ని దర్శిస్తున్న విరాటుడు సహృదయస్థానీయుడు. అపూర్వవస్తు దర్శనం వలన కలిగే అబ్బురపాటుతో మనసులోని ప్రీతి రెట్టింపు అయ్యేటట్లుగా మాటి మాటికీ తనవితీరకుండా అపూర్వంగా చూస్తున్నాడు. ధర్మజుడి ఔజ్జ్వల్యం విరాటుడిచేత ఆ పని చేయించింది. ధర్మజుడి యందు తత్పరమైన బుద్ధి అతడి గుణ విశేషాదులను వివేచించి అతని వ్యక్తిత్వాన్ని నిరూపించే యత్నం చేస్తున్నది. ఆలోచించిన కొలది అంతందొరకని గుణ గాంభీర్య మాతడిది. అందువలన ఆలోచనలు మాని ఆసక్తితో మిత్రుడితో మాట్లాడినట్లు చతురవాక్యవిన్యాసాలు మనసారా ప్రసరింపచేశాడు. గంభీరోజ్జ్వలుడైన ధర్మజుని వ్యక్తిత్వం విరాటరాజును అయస్కాంతం ఇనుమును ఆకర్షించినట్లు ఆకర్షించింది. మూలకర్త అలంకారం వలన సాధించిన ఈ తాత్పర్యాన్ని తిక్కన అభినయం వలన సాధించాడు. భక్తి గౌరవ పూర్ణమైన స్నేహాభినయం విరాటుడిలో తిక్కన అనుభావస్ఫూర్తితో చిత్రించాడు. పఠితచేత ప్రత్యక్షంగా అనుభవింపజేశాడు. అతడి నాటకీయ రచనాశిల్పానికి ఈ పద్యం ఒక మచ్చుతునక. (సంపా.)

వ. ఇట్లు మత్స్య మహీవల్లభుం డతనిం గలిపికొని పరివారంబును దానును దదీయ సంభావనా తత్పరులైయుండి; రంత. 210

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రకంగా; మత్స్యమహీవల్లభుండు= మత్స్యదేశపు రాజయిన విరాట మహారాజు; అతనిన్= కంకుడిని, కలిపికొని= కూడుకొని; తదీయ= అతడిదైన; పరివారంబును= బలగమూ; తానును= తానున్నూ (విరాటరాజూ); సంభావనా తత్పరులు+ఐ= గౌరవించటంలో ఆసక్తు లయినవారుగా; ఉండిరి= ఉండసాగారు; అంత= అటుపిమ్మట.

తాత్పర్యం: ఈ విధంగా విరాట మహారాజు ధర్మరాజును కలుపుకొన్నాడు. తానూ, తన పరివారమూ కంకుభట్టును గౌరవించటంలో ఆసక్తిని కనబరచారు. అటు పిదప.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీముఁడు వంటలవాఁడై విరటుఁ గొల్వ వచ్చుట (సం.4.7.1)

సీ. చట్టువం బొకచేతఁ బట్టి ఖడ్గము చంకఁ। దగిలించి సురియతో బిగియ ద్రిండు
గట్టిన నునుఁజేల కప్పెంతయును జెన్ను। సేయంగ దాపలి చేతి యందు
బెడిదంపుఁగోలలు బెడఁగొంద బహువర్ణ। చిత్రితాజినము పై చీర గాఁగఁ;
జూపఱెల్లను దన రూపంబు చూడ్కికి। వ్రేఁగైన నత్యంత విస్మయంబుఁ

తే. బొందుచుండ సమీరణ పుత్త్రుఁ డగ్ర। జుండు వోయిన దెసఁ దప్ప నొండువలన
సమదవారణపతి గమనమున మత్స్య। ధరణి వల్లభు సభ చేర నరుగుటయును. 211

ప్రతిపదార్థం: చట్టువంబున్= గరిటెను; ఒకచేతన్+పట్టి= ఒకచేతితో పట్టుకొని; ఖడ్గము= కత్తిని; చంకన్= చంకకు; తగిలించి= తగిలించుకొని; సురియతోన్= చుర కత్తితో; బిగియన్= బిగిసేటట్లు; ద్రిండు= దట్టి; కట్టిన నును చేల కప్పు= నున్నని వస్త్రంయొక్క నలుపు; ఎంతయును= ఎంతగానో; చెన్ను+చేయంగన్= అందగించగా; దాపలి= ఎడమ; చేతియందున్= చేతిలో; బెడిదము+కోలలు= కరకుట్లు కాల్చడానికి ఉపయోగించే కఠినమయిన శూలాలు; బెడఁగు+ఒందన్= ప్రకాశించగా; బహువర్ణ= అనేక విధాలయిన రంగులున్న; చిత్రిత+అజినము= చిత్రింపబడిన లేడిచర్మం; పై చీర కాఁగన్= ఉత్తరీయం కాగా; చూపఱు= ప్రేక్షకులు; ఎల్లను= అందరును; తన రూపంబు= భీముని రూపం; చూడ్కికిన్= దృష్టికి; వ్రేఁగు+అయినన్= బరువు కాగా; అతి+అంత+విస్మయంబున్= ఎంతో ఆశ్చర్యం (అల్పంగాని వింత); పొందుచున్+ఉండన్= అనుభవిస్తూ ఉండగా; సమీరణ పుత్త్రుఁడు= వాయుపుత్రుడయిన భీముడు; అగ్రజుండు= అన్న అయిన ధర్మరాజు; పోయిన దెసన్+తప్పన్= వెళ్ళిన దిక్కు వదలి; ఒండు వలనన్= మరో దిక్కున; సమద వారణపతి గమనమునన్= మదించిన గజరాజునడకవంటి నడకతో; మత్స్యధరణి వల్లభు సభ= విరాటుని సభ; చేరన్+అరుగుటయును= చేరువకు పోగా.

తాత్పర్యం: భీముడి కుడిచేతిలో గరిటె ఉన్నది. అతడు కత్తిని చంకకు తగిలించుకొన్నాడు. చురకత్తిని బిగించి దట్టీకట్టిన నల్లని వస్త్రం నిగనిగలాడుతూ ఉన్నది. ఎడమ చేతిలో కఠినమయిన శూలాలు ఉన్నాయి. రంగురంగుల లేడి చర్మం ఉత్తరీయంగా వేలాడుతున్నది. చూసేవారికి భీముడి రూపం దుస్సహంగా ఉన్నది. ప్రేక్షకులు అతడి ఆకారాన్ని చూచి ఆశ్చర్యపడుతున్నారు. ధర్మరాజు కంకుభట్టుగా వెళ్ళిన వైపునుండి కాక మరో దిక్కు నుండి భీముడు మదించిన గజేంద్రుని నడకవంటి నడకతో గంభీరంగా విరాట మహారాజు సభను సమీపించాడు.

విశేషం: 1. తిక్కన నాటకీయతలో ఆహార్యాభినయ వర్ణనం ఒక రమణీయాంశం. భీముడు ధరించింది వంటలవాడి వేషం. ఆ వేషాన్ని తిక్కన స్వభావోక్తి అలంకారంతో నిర్వహించాడు. భీముడి ఆకారం సమున్నతం. దానిని పఠితలకు ప్రత్యక్షం చేయటానికి సీసపద్యాన్ని ఎత్తుకొన్నాడు. మూలకర్త భీమరూపాన్ని అలంకారాలతో నిరూపించ యత్నించాడు. అయితే, ఆ వర్ణనం భీముడి రూపాన్ని ఒక సమన్వయంతో రూపుకట్టించలేదు. మూలంలో అతడు భీమబలుడు. తేజస్సుతో వెలిగిపోతున్నాడు. సింహవిలాసవిక్రముడు, అతడి చేతిలో తెడ్డు, గరిట, మొక్కవోని ఉక్కుకత్తి ఉన్నాయి. వంటలవాడి వేషంలో అతడు సూర్యుడివలె ప్రకాశిస్తున్నాడు. నల్లని వస్త్రాలతో పెద్ద పర్వతంవలె విరాటుడిని సమీపించాడని మూలం వర్ణించింది. తిక్కన మూలంలోని అలంకారాలను తీసివేశాడు. వంటవాడి వేషానికి ఒక పరిపూర్ణతను కల్పించాడు. తిక్కన కాలంనాటి రాజాస్థాన పాకనిపుణుడు ధరించే వేషాన్ని మన కళ్ళముందు ఉంచాడు. వంటలవాడికి వృత్తిపరమైన అలంకారాలు వంట పరికరాలు. వాటినిబట్టి అతడి వృత్తి నైపుణ్యాన్ని అంచనా కట్టవచ్చును. వాటికి ఒక వరుస, వైనం ఉన్నట్లు తిక్కన అమర్చాడు. తెలుగు వంటలవాడికి గరిటె సహజాలంకారం. అది అతడిచేతికి ఉపాంగం. ఆ వృత్తికి ప్రధాన చిహ్నం. దానిని కుడిచేతిలో పెట్టించాడు. పదార్థాలను కలిపేది గరిట, పదార్థాలను ముక్కలు చేసేది ఖడ్గం (కత్తి), వంటవాడు కత్తిని చంకకు తగిలించుకొనటం పరిపాటి. నడుముకు అందంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దిండులాగా కట్టుకొన్న నున్నని నల్లటి వస్త్రపు దట్టీలో చురియ (చురకత్తి) చక్కగా బిగింపబడివుంది. ఎడమచేతిలో కరకుట్లు కాల్చటానికి ఉపయోగించే శూలాలు. రంగురంగుల లేడి చర్మంతో ఉత్తరీయం. అది వంటపొయ్యి వేడికి రక్షగా ఉపయోగించే కవచం. ఇవన్నీ వంటవాడి ఆహార్యాభినయంలో అలంకారాలే. ఆ వేషంలో భీముడు వింతైన అత్యంత ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాడు. వంటలవాడు అంతటి మేటి రూపంకలిగి ఉండటం అరుదు. అందుకే అందరికీ ఆశ్చర్యం. వృత్తి ధర్మాన్నిబట్టి వినయంగా రావాలి. కాని, అతడు మదించిన ఏనుగువలె నడిచివస్తున్నాడు. ఆ లక్షణం కూడా చూచేవారికి అబ్బురపాటు కలిగించింది. అద్భుతభావానికి ఆలంబనమైన విభావాన్ని స్వభావోక్తిలో చెప్పి, దానిని చూచి ఆశ్చర్యం చెందిన ప్రేక్షకులను, వారి మనోభావాలను ఆ తరువాత చిత్రించాడు తిక్కన. ఈ క్రమమైన కావ్యశిల్పం మూలంలోకంటె తెలుగులో తేటతనాన్ని ప్రదర్శించింది. మూలంలోని అలంకారాలు తెలుగులో లేకపోవటమే తిక్కన కవితకు సహజాలంకారం. (సంపా.)

2. ధర్మరాజు వెళ్ళిన వైపు వదలిపెట్టి భీముడు మరో దిక్కుగా కదలి రావడంలో అంతరార్థం ఉన్నది. విరాట మహారాజుకు అనుమానం కలగటానికి వీల్లేదు.

వ. అంతంతం గనుంగొని. 212

ప్రతిపదార్థం: అంతన్+అంతన్= అల్లంత దూరాన; కనుంగొని= చూచి.

తాత్పర్యం: అల్లంత దూరాన్నుండి చూచి.

క. ఉలుకును వెక్కసపాటును। దలకొను నెమ్మనముతోడ ధాత్రీరమణుం
దలఘు భుజ విపుల వక్ష। స్థ్సల రేఖాకాంతిఁ బరవశత్వముఁ బొందెన్. 213

ప్రతిపదార్థం: ధాత్రీరమణుండు= భూతలనాథుడయిన విరాటుడు; ఉలుకును= భయమూ; వెక్కసపాటును= ఆశ్చర్యమూ; తలకొను= కలిగే; నెమ్మనముతోడన్= నిండయిన మనస్సుతో; అలఘు= లఘువు కాని, పొడుగయిన; భుజ= చేతులు; విపుల= విశాలమైన; వక్షస్స్థల= వక్షః స్థలముల; రేఖాకాంతిన్= రూపు రేఖలతో; పరవశత్వమున్= తన్మయత్వమును; పొందెన్= పొందాడు.

తాత్పర్యం: విరాట మహారాజు భీముడిని చూశాడు. అతడి మనసులో భయం చోటు చేసికొన్నది. ఆశ్చర్యం కలిగింది. అతడి పొడుగాటి భుజాలు, విశాలమయిన వక్షఃస్థలం పరవశత్వాన్ని కలిగించాయి.

వ. ఇట్లతని రూపాతిశయంబున కోటువడి చూచుచు నిజాంతర్గతంబున. 214

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అతని= భీముడియొక్క; రూప+అతిశయంబునకున్= రూపం యొక్క ఆధిక్యానికి; ఓటు+పడి= వశమయిపోయి; చూచుచున్= వీక్షిస్తూ; నిజ+అంతర్గతంబునన్= తన మనస్సులో.

తాత్పర్యం: ఈ విధంగా భీముడి చక్కని రూపానికి లోబడిపోయాడు. అతడిని చూస్తూ మనసులో.

క. విహరింప మానవాకృతి। సహితంబుగ మహికి నర్థిఁ జనుదెంచిన ప
ద్మహితుఁడొ హిమకరుఁడొ శచీ। గృహమేథియొ కాక యితఁడు కేవల నరుఁడే! 215

ప్రతిపదార్థం: మానవ+ఆకృతి సహితంబుగన్= మానవ రూపంతో కూడా; అర్థిన్= కుతూహలంతో; మహికిన్= భూమిమీదకు; విహరింపన్= విహరించడానికి; చనుదెంచిన= వచ్చినటువంటి; పద్మహితుఁడొ= తామరలకు మేలు చేకూర్చే సూర్యుడో; హిమ కరుఁడొ= మంచుకిరణములుగలచంద్రుడో; శచీగృహమేధియొ= శచీదేవిభర్త అయిన ఇంద్రుడో; కాక= కాక; ఇతఁడు= భీముడు; కేవల నరుఁడే= మానవ మాత్రుడా!

తాత్పర్యం: ఇతడు మానవమాత్రుడు కాడు. మానవాకారంలో భూమిమీదికి వచ్చిన సూర్యుడో, చంద్రుడో లేదా ఇంద్రుడో మరి.

విశేషం: తేజస్సును బట్టి సూర్యుడు, సౌందర్యాన్నిబట్టి చంద్రుడు, వైభవ, గమనాలనుబట్టి ఇంద్రుడు.

క. **ఏమి కులంబున వాఁడొకొ? । నామం బెద్ది యగు నొక్కొ? నా భృత్యులలో**
నీ మనుజోత్తముఁ దొల్లియు । నే మెఱుఁగుదు మనఁగ నిచట నెవ్వరు గలరో? **216**

ప్రతిపదార్థం: ఏమి కులంబున వాఁడు+ఒకొ= ఏ కులం వాడో; నామంబు+ఎద్ది+అగున్+ఒక్కొ= పేరేమిటో; నా భృత్యులలోన్= నా సేవకులలో; ఈ+మనుజ+ఉత్తమున్= ఈ పురుషశ్రేష్ఠుని; తొల్లియున్= ముందెప్పుడో; ఏము= మేము; ఎఱుఁగుదుము= ఎఱుగుదుము; అనఁగన్= అనగా; ఇచటన్= ఇచ్చట; ఎవ్వరు కలరో= ఎవరున్నారో (ఎవరైనా ఉన్నారా?).

తాత్పర్యం: ఇతడు ఏ కులంవాడో, ఇతని పేరేమిటో, ఇతడిని గుర్తుపట్టగలిగినవారు నా సేవకులలో ఎవరైనా ఉన్నారా?

క. **అనుచుండ ననతి దూరం । బున కల్లన వచ్చి పవనపుత్త్రుఁడు మనుజేం**
ద్రునకు జయశబ్దయుతముగ । వినయంబున మ్రొక్కి విన్నవించె నిభృతుఁడై. **217**

ప్రతిపదార్థం: అనుచున్+ఉండన్= విరాట మహారాజు ఈ విధంగా తర్కిస్తూ ఉండగా; పవన పుత్త్రుఁడు= వాయుపుత్రుడయిన భీముడు; అనతి దూరంబునకున్= చాలా దగ్గరికి; అల్లనన్= మెల్లగా; వచ్చి; జయశబ్దయుతముగన్= ప్రభువులకు జయమగుగాక! వంటి జయశబ్దాలతో; మనుజ+ఇంద్రునకున్= రాజుకు; వినయంబునన్= వినయంతో; మ్రొక్కి= నమస్కరించి; నిభృతుఁడు+ఐ= వినమ్రత కలవాడై; విన్నవించెన్= విన్నవించాడు.

తాత్పర్యం: ఇట్లా విరాటుడు మనసులో తర్కించుకొంటూ ఉండగా భీముడు దగ్గరికి వచ్చాడు. జయనాదంతో వినమ్రుడై విరాటమహారాజుకు మ్రొక్కాడు. వినయంతో ఈ విధంగా మాట్లాడటం మొదలు పెట్టాడు.

విశేషం: 1. విరాటుడి వితర్కాన్ని తెలిసికొన్న భటులు భీముడి వద్దకు వెళ్ళి అతడి వివరాలను రాజు తెలిసికొనదలచాడని చెప్పారనీ, వారి మాటల ననుసరించి భీముడు విరాటుడిని సమీపించాడనీ మూలం. తిక్కన ఆ భటుల ప్రమేయాన్ని వదిలాడు. రాజు చేసే బయలు సభలో ఎవరైనా వచ్చి రాజుకు తమ గోడు చెప్పుకొనవచ్చునన్న సంప్రదాయాన్ని కాపాడాడు.

2. జయ శబ్దం భటులు వచ్చి రాజు ముందు చెప్పే మొదటి గౌరవశుభవాచకం. ధర్మరాజు యతిరూపంలో వచ్చాడు. కాబట్టి అతడు చెప్పలేదు. వంటలవాడైన భీముడు చెప్పాడు. ఇది పాత్రౌచిత్యం, ప్రకరణౌచిత్యం. 'జయ' శబ్దంలో 'జయ' నామంతో రహస్యంగా ఉన్న ధర్మరాజుకు అభివందనం కూడా చెప్పినట్లయింది. మూలంలో లేని 'జయ' శబ్దం తెలుగులో ఈ విశేష ప్రయోజనాలను సాధించింది. (సంపా.)

శా. **'దేవా! నాలవజాతివాఁడ నిను నర్థిం గొల్వఁగా వచ్చితిన్;**
సేవాదక్షత నొండుమై నెఱుఁగ; నీ చిత్తంబునన్ మెచ్చున
ట్లే వండం గడునేర్తు; బానసమునం దిచ్చోటనే కాదు న
న్నే వీటన్ మిగులంగ నెవ్వఁడును లేఁ డెబ్భంగులం జూచినన్. **218**

ప్రతిపదార్థం: దేవా!= రాజా!; ఏన్= నేను; నాలవజాతివాఁడన్= శూద్రజాతివాడిని (పంచభూతాలలో నాలవదిఅయిన వాయువుకు పుట్టినవాడిని); నినున్= నిన్ను; అర్థిన్= కుతూహలంతో; కొల్వఁగాన్= సేవించాలని; వచ్చితిన్= వచ్చాను. సేవాదక్షతన్= సేవించే నేర్పులో; ఒండుమైన్= మరోవిధంగా (వక్రపద్ధతులు); ఎఱుఁగన్= ఎరగను; నీ చిత్తంబునన్= నీ మనస్సులో; మెచ్చునట్లు= మెచ్చుకొనేటట్లు; ఏన్= నేను; వండన్+కడున్+నేర్తున్= వండటం బాగా నేర్చాను; బాననము నందున్= వండటంలో; ఏ+భంగులన్+చూచినన్=ఏ రకంగా చూచినా; ఈ+చోటనే కాదు= ఇక్కడే కాదు; ఏ వీటన్= ఏ ఊళ్ళోనూ; నన్నున్= నన్ను; మిగులంగన్= అతిక్రమించటానికి (మించటానికి); ఎవ్వఁడును= ఎవ్వడూ; లేఁడు= లేడు.

తాత్పర్యం: 'రాజా! నేను నాలవజాతి వాడిని. నీకు సేవ చేయాలని వచ్చాను. వేరేవిధంగా సేవించటం నాకు తెలియదు. నీవు మెచ్చుకొనే విధంగా వంటలు చేస్తాను. ఎన్ని విధాల చూచినా వంటలో నన్ను మించినవాడు ఏ పట్టణంలోనూ లేడు.

విశేషం: పంచభూతాలలో 'వాయువు' నాల్గవ భూతం. భీముడు వాయుదేవుడి కుమారుడు. భీముడు తనను తాను పరిచయం చేసికొనటం సవ్యసమన్వితంగా ఉండటం గమనించదగింది.

క. **పేరు వలలుండు; కూడుం। జీరయు నిడి సాకతంబు సేసినఁ జాలుం**
గోరిన వంటకములు నా। నేరిమిఁ దగ నెఱపి కొలుతు నిశ్చలభక్తిన్.' 219

ప్రతిపదార్థం: పేరు= పేరు; వలలుండు= వలలుడు; కూడున్= తిండీ; చీరయున్= గుడ్డా; ఇడి= ఇచ్చి; సాకతంబు+చేసినన్= అనుగ్రహించినట్లయితే; చాలున్= అంతే చాలు; కోరిన వంటకములు= కోరినవంటలు; నానేరిమిన్= నా నేర్పు; తగన్+నెఱపి= తగిన విధంగా ప్రదర్శించి; నిశ్చలభక్తిన్= నిశ్చలమయిన భక్తితో; కొలుతున్= సేవిస్తాను.

తాత్పర్యం: నా పేరు వలలుడు. నాకు కూడూగుడ్డా ఇస్తే చాలు. నేర్పుతో కోరిన వంటకాలు చేసి పెట్టుతాను. నిశ్చలమయిన భక్తితో సేవిస్తాను.'

విశేషం: సేవలు అనేకవిధాలు. సేవకులకు ఇచ్చే భుక్తి కూడా అనేక విధాలు. కూడూ గుడ్డా మాత్రం తీసికొని చేసేది ఒకరకమయిన సేవావృత్తి. చీర అనేమాటకు తిక్కన కాలంలో 'ఆచ్ఛాదనం' అనే సామాన్యార్థం మాత్రమే ఉన్నది.

చ. **అనవుడు మత్స్యభూరమణుఁ డాతని కిట్లను 'నెట్లు శూద్రుఁగా**
నినుఁ దలఁపంగవచ్చు? ధరణీ భరణ క్షమమూర్తి వీవు; నీ
కనుగుణమైన యానమును నాసనమున్ రుచిరాతపత్రముం
జనవరి కొల్వు నిచ్చెద గజవ్రజముం బరికింపు పెంపుతోన్.' 220

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; మత్స్యభూరమణుఁడు= మత్స్యదేశపు రాజు; ఆతనికిన్= భీమునికి; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పటానికి సంసిద్ధుడయ్యాడు; నినున్= నిన్ను; శూద్రున్+కాన్= శూద్రునిగా; ఎట్లు= ఏ విధంగా; తలఁపంగన్+వచ్చున్= భావింపవచ్చు; ఈవు= నీవు; ధరణీభరణక్షమమూర్తివి= భూమిని పాలించగల సమర్థుడివి; నీకున్= నీకు; అనుగుణము+ఐన= తగిన; యానమును= వాహనాన్ని; ఆసనమున్= పీఠాన్ని; రుచిర= కాంతిమంతమయిన; ఆతపత్రమున్= గొడుగును; చనవరి= చనువుతో మెలగదగిన వాడియొక్క చేయగలిగిన; కొల్వున్= సేవను; ఇచ్చెదన్= ఇస్తాను; గజవ్రజమున్= ఏనుగుల సమూహాన్ని; పెంపుతోన్= గౌరవంతో; పరికింపు= పర్యవేక్షణ చేయుము.

తాత్పర్యం: అపుడు విరాటమహారాజు భీముడితో ఇట్లా అన్నాడు; “నిన్ను శూద్రుడని ఎట్లా నమ్మమంటావు? నీ రూపం పరిశీలిస్తే భూభారం వహించగలిగిన సమర్థత కనిపిస్తున్నది. నేను నీకు తగిన వాహనం ఇస్తాను. పీఠం సమకూరుస్తాను. గొడుగును సన్నద్ధం చేస్తాను. చనవరిగా ప్రవర్తించే పదవిని సమకూరుస్తాను. నా గజసముదాయాన్ని పర్యవేక్షిస్తూ ఉండవయ్యా.

విశేషం: 1. విరాటుడు భీముడిని భూభారాన్ని వహించగల భూపతిలక్షణా లున్నవాడుగా భావించాడు. కాని, అతడు తనది సేవావృత్తి ప్రధానమైన శూద్రకులంగా చెప్పుకొన్నాడు. ఆ రెంటికీ పొంతన కుదరలేదు. రాజప్రతినిధివలె సేవలు చేసే కొలువు అతడికి యోగ్యంగా ఉంటుందని రాజు భావించాడు. అందువలననే చనవరి కొలువు నిస్తానన్నాడు. అంటే రాజపక్షాన తనశాఖలో స్వతంత్ర నిర్ణయాలను తీసికొనే పదవి. అటువంటి పదవులు సేనాధ్యక్షులకు ఉండవచ్చును. వారికి వాహనం, సింహాసనం, గొడుగు మొదలైన రాజలాంఛనా లుంటాయి. అందువలననే గజ సైన్యాధ్యక్షునిగా పదవి నిస్తానన్నాడు. అతడు సభలో గజరాజువలె నడచివచ్చాడని తిక్కన చెప్పాడు. ఆ నడకకు తగిన ఉద్యోగాన్ని విరాటుడు ఇస్తానని అన్నట్లు అతికినట్లు చెప్పాడు తిక్కన, మనిషిని చూచి యోగ్యతను నిశ్చయించే ఇంగితజ్ఞత, లోకజ్ఞత విరాటుడికి ఉన్నట్లు తిక్కన చిత్రించాడు.

2. ‘చనవరి కొలువు’ ప్రసక్తి మూల భారతంలో లేదు. తిక్కన తన కాలంనాటి రాచరికపు పరిపాలన వ్యవస్థలో ఉన్న కొలువుల తీరులను విరాటుడి కొలువుకు అన్వయించి చెప్పి తెలుగుదనాన్ని కల్పించాడు. నాలవజాతి వాడను - అనటంలోని అంతరార్థాన్ని - అనగా వాయుపుత్రుడను అనే అర్థాన్ని రాజు గమనించినట్లు లేదు (సంపా.)

క. అనుటయు మోఱకుచందం। బున మో మడ్డము గదల్చి భూవిభుఁడు సభా
జనులు విన ననిలసుతుఁ డి। ట్లనియెం బ్రస్ఫుట నిరర్గళాలాపములన్. 221

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; అనిలసుతుఁడు= వాయువు కుమారుడయిన భీముడు; మోఱకు చందంబునన్= మూర్ఖునివలె; మోము+అడ్డము+కదల్చి= ముఖం అడ్డంగా త్రిప్పి; భూవిభుఁడున్= రాజూ; సభాజనులున్= సభలోని వారందరూ; వినన్= వినేటట్లు; ప్రస్ఫుట= స్పష్టమయిన; నిరర్గళ= ధారాళమయిన; ఆలాపములన్= నిండైనమాటలతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: విరాటుడు ఇట్లా అనగానే భీముడు మూర్ఖుడివలె ముఖం అడ్డంగా త్రిప్పాడు. రాజూ, సభాసదులు వినే విధంగా స్ఫుటంగా, ధారాళంగా ఇట్లా చెప్పాడు.

విశేషం: మూర్ఖుడివలె మొగం అడ్డంగా త్రిప్పటం వలలపాత్రకు తిక్కన కల్పించిన పాత్రస్వభావాభినయం (మేనరిజం). మూలంలో ఈ నాటకీయత లేదు. అయితే ఇది మూర్ఖుడి అభినయం కాదు. మొరటువాడి అభినయం. తన నిశ్చితాభిప్రాయాన్ని ఏ పరిస్థితులలోనూ మార్చుకొనటానికి ఏ మాత్రం అంగీకరించని ఉద్ధతుని లక్షణం. తిక్కన నాటకీయతలో అది భావానికి భాష్యమై భాసించింది.(సంపా.)

ఉ. ‘నా కవి యెల్ల నేల? నరనాథులకుం బ్రియ మొందునట్లుగాఁ
బాకము చేయనేర్తు జనపాలక! ధర్మసుతుండు పెద్దయుం
జేకొని యుండు బానసము సేయు విధంబున కిచ్చ మెచ్చి; పు
ణ్యాకరమూర్తివైన నిను నాతనిఁ; గొల్చినయట్ల కొల్చెదన్. 222

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: జనపాలక!= రాజా!; నాకున్+అవి+ఎల్లన్+ఏల?= నా కవన్నీ ఎందుకు?; నరనాథులకున్= రాజులకు; ప్రియము+ ఒందునట్లుగాన్= ప్రీతి కలిగే విధంగా; పాకము= వంటను; చేయన్+నేర్తున్= చేయగలను; బానసము= వంటను; చేయువిధం బునకున్= చేసేవిధానానికి; ఇచ్చన్+మెచ్చి= మనసులో మెచ్చుకొని; ధర్మసుతుండు= యమధర్మరాజు కుమారుడయిన ధర్మరాజు; పెద్దయున్+చేకొని+ఉండున్= ఎంతగానో ఆదరించేవాడు; పుణ్య+ఆకరమూర్తివి+ఐన= పుణ్యమునకు స్థానమైన మూర్తిగలవాడవైన; నినున్= నిన్ను; ఆతనిన్= ధర్మరాజును; కొల్చిన అట్లు+అ= సేవించిన విధంగానే; కొల్చెదన్= సేవిస్తాను.

తాత్పర్యం: 'రాజా! నా కవన్నీ ఎందుకయ్యా? రాజులకు ఇంపుగా వంట చేస్తాను. నేను వంట చేసే పద్ధతికి ధర్మరాజు ఎంతో సంతోషించేవాడు. నన్ను బాగా ఆదరించేవాడు. నీవు పుణ్యాత్ముడివి. అందుచేత ధర్మరాజును సేవించినట్లుగానే నిన్ను సేవిస్తాను.

విశేషం: లోకంలో యాచించేవారు తమ కోరికలను ప్రకటించి, పుణ్యముంటుంది బాబూ అనటం అలవాటు. అట్లాగే భీముడు పుణ్యాత్ముడివి అన్నాడు. పాండవులకు అజ్ఞాతవాసకాలంలో రక్షణ ఇవ్వటం తెలియక చేసిన పుణ్యం. ఈ మాటలలో భీముడి వాక్చాతుర్యం స్పష్టమవుతుంది.

చ. **వలసిన నేలు; మేను బలవంతుఁడఁ; గారెనుబోతు దంతి బె**
బ్బులి మృగనాథునిం దొడరి పోరుదు శూరత యుల్లసిల్లఁగా
దలమును లావు విద్య మెయిదర్పముఁ బేర్చి పెనంగు జెట్టి మ
ల్లుల విఱుతున్ వడిన్ గడియలోనన చూడ్కికి వేడ్కసేయుదున్. **223**

ప్రతిపదార్థం: ఏను= నేను; బలవంతుఁడన్= బలవంతుడిని; కారు+ఎను+పోతున్= అడవిదున్నను; దంతిన్= ఏనుగును; బెబ్బులిన్= పెద్దపులిని; మృగనాథునిన్= సింహాన్ని; శూరత= శౌర్యం; ఉల్లసిల్లఁగాన్= ప్రకాశించేవిధంగా, విజృంభించే విధంగా; తొడరి పోరుదున్= ఎదుర్కొని పోరాడుతాను; దలమును= ఆధిక్యమూ; లావు= బలమూ; విద్య= విద్య; మెయిదర్పమున్+పేర్చి= ఒంటి పొగరు అతిశయించి; పెనంగు= పోరాడేటటువంటి; జెట్టిమల్లులన్= మల్లయుద్ధ వీరులను; గడియలోనన= గడియలోనే; వడిన్= వేగంగా (త్వరగా); విఱుతున్= చిత్తుచేసి ఓడిస్తాను; చూడ్కికిన్= చూపులకు, కళ్ళకు; వేడ్క+చేయుదున్= వినోదం కలిగిస్తాను; వలసినన్= కావాలంటే; ఏలుము!= ఏలుకోవయ్యా!

తాత్పర్యం: 'నేను బలవంతుడిని. అడవి దున్నలతో, ఏనుగులతో, పెద్దపులులతో, సింహాలతోనూ పోరాడతాను. బలవంతులూ, మల్లవిద్యావంతులూ, కండకావరం కలిగినవారయిన మల్లులతో కనులపండువుగా పోరాడతాను. వాళ్ళందరినీ ఒక్క గడియలో విరిచి పారేస్తాను. ఇట్లాంటివాడినైన నన్ను ని కిష్టమైతే ఏలుకొమ్ము.

విశేషం: రాజుల కొలువులలో విందులూ, వినోదాలూ జోడుగుర్రాలుగా సాగుతుంటాయి. వలలుడు వంటలు చేయగలడు, వింతరుచులు తినిపించగలడు. అట్లాగే మల్లులతో, మృగాలతో పోరాడి రాజులకు వినోదం కలిగించగలడు. రాజులు స్వయంగా అడవులలో వేటాడేటప్పుడు క్రూరమృగాలను ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు వాటిని లోబరచుకొని, జయించి, చంపేమెలకువలు నేర్చుకోవాలి. మల్లయుద్ధం మనుషులతో చేసేది, క్రూరజంతువులతో చేసేది, బలవంతమైన పశువులతో చేసేది- అని మూడు రకాలుగా ఉంటుంది. వాటిని రాజ సభలలో (ప్రాచ్య పాశ్చాత్య దేశాలలో కూడా) పౌరుష వినోద క్రీడలుగా పరిగణిస్తారు. వాటిల్లో విజేతలకు బిరుదాలూ బహుమతులూ ఇస్తారు. అటువంటి వినోదాలను కూడా అవలీలగా చేసి రాజు మెప్పును పొందగలవని చెప్పాడు. భీముడు అతడి ఉద్యోగం వలన రాజుకు ద్విముఖమైన-లేదా- ద్విగుణీకృతమైన ఫలం దక్కుతుందని సూచన. (సంపా.)

క. కొలువు గొన నొల్ల కుండుట। గలిగినఁ బొమ్మనుట యంత కంటెను మేఁ; లే
వలసిన కడ కేఁగెద; నీ। తలఁ పెయ్యది? యానతిమ్ము ధరణీనాథా!' 224

ప్రతిపదార్థం: ధరణీనాథా!= రాజా!; కొలువు+కొనన్= నాచేత కొలువు చేయించుకొనటానికి; ఒల్లక+ఉండుట= అంగీకరించక పోవటం; కలిగినన్= కలిగినట్లయితే; అంతకంటెను= దానికంటె; పొమ్ము+అనుట= పొమ్మనటం; మేలు= మంచిది; ఏన్= నేను; వలసిన కడకున్= ఇష్టం వచ్చిన చోటుకు; ఏఁగెదన్= వెళ్ళుతాను; నీ తలఁపు= నీ అభిప్రాయం; ఏ+అది= ఏదో; ఆనతి+ఇమ్ము= చెప్పుము.

తాత్పర్యం: మహారాజా! నా చేత కొలువు చేయించుకొనటం నీకు ఇష్టం లేకపోతే నన్ను పొమ్మనటం మంచిది. నా ఇష్టం వచ్చిన చోటుకు నేను వెళ్ళుతాను. నీ ఉద్దేశం ఏమిటో చెప్పవయ్యా.'

విశేషం: 'కట్టె విరిచి పొయ్యిలో పెట్టటం' ఒక జాతీయం. వలలుడి వృత్తి వంటపని. అందుచేత ఖండితంగా, పరుషంగా పలకటం వృత్తి సహజమయిన సంభాషణ.

వ. అనిన విని భూనాథుండు సానునయంబుగా నిట్లనియె. 225

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా విని; భూ నాథుండు= రాజయిన విరాట మహారాజు; స+అనునయంబు+కాన్= బ్రతిమాలే విధంగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ మాటలను విన్న విరాటమహారాజు బ్రతిమాలే ధోరణిలో ఇట్లా అన్నాడు.

ఉ. 'ఇమ్మహనీయ రూపమును నేడ్తెఱఁ గన్గొని వేడ్క నీకు యో
గ్యమ్మగు భంగిఁ జెప్పితిమి గాని నరోత్తమ! యొండు గాదు; నీ
వెమ్మెయి నైన నిల్చుటయ యిష్టము; వంటల మేరవాఁడవై
యిమ్ముల నుండు సూదజనమెల్లను నీదగు పంపు చేయఁగన్.' 226

ప్రతిపదార్థం: నర+ఉత్తమ!= నరులలో ఉత్తముడవయిన వాడా!; ఈ+మహనీయ రూపమునున్= గొప్పదయిన ఈ రూపాన్ని; ఏడ్తెఱన్= పరాక్రమాన్ని; కన్గొని= చూచి; వేడ్కన్= కుతూహలంతో; నీకున్= నీకు; యోగ్యమ్ము+అగుభంగిన్= తగిన పద్ధతిలో; చెప్పితిమి= చెప్పాము; కాని= కాని; ఒండు కాదు= మరొకటి కాదు; నీవు= నీవు; ఏ+మెయిన్+ఐనన్= ఏ విధంగా నయినా; నిల్చుట+అ= ఇక్కడ ఉండటమే; ఇష్టము= (మా) కోరిక; సూదజనము+ఎల్లను= వంటలుచేసేవారంతా; నీదు+అగు+పంపు= ఆజ్ఞను; చేయఁగన్= నిర్వర్తించగా; వంటలమేరవాఁడవు+ఐ= వంటలయేర్పాటు చేసేవాడవై, వంటశాలకు అధ్యక్షుడవయి; ఇమ్ములన్+ఉండుము= సుఖంగా ఉండుము.

తాత్పర్యం: 'నీ రూపాతిశయాన్ని పరాక్రమాన్ని చూచి వేడుకతో నీకు తగిన విధంగా చెప్పాము. అంతేకాని మరో రకంగా కాదు. ఏ విధంగానయినా నీవు ఇక్కడ ఉండటమే మాకు చాలా ఇష్టం. నీవు వంటశాలకు అధికారిగా ఉండుము. వంట వాళ్ళంతా నీ ఆన పాటిస్తారు.

విశేషం: విరాటుడు భీముడికి తగిన ఉద్యోగం గజాధ్యక్షపదవిగా భావించి అతడిని నియోగిస్తానని పలికాడు. భీముడు నా కది వద్దు వంటలవాడి ఉద్యోగమే కావాలన్నాడు. తా నడిగినది ఇవ్వకుండా మరొకటి ఇస్తాను స్వీకరిస్తావా? అనటం మర్యాదగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎదుటివారి కోర్కెను తిరస్కరించటం కూడా ఔతుంది. నాగరక ప్రపంచంలో భీముడామర్యాదను అనుసరించి 'మీ కిష్టంలేకపోతే నన్ను వెళ్ళిపొమ్మనండి కాని నా కిష్టమైన సేవను మార్చకండి' - అని సున్నితంగా హెచ్చరించాడు. భీముడిది అజ్ఞాతవాసనియమ సమస్య. విరాటుడిది యోగ్యుడైన సేవకుడు దొరికినప్పుడు అతడి సేవలు వినియోగించుకొనకుండా జారవిడుచుకొనటం నీతికాదనే వ్యవహార సమస్య. అందువలననే విరాటుడు భీముడిని నయాన, వినయాన అడిగాడే కాని ధిక్కరింపలేదు. తన హృదయాన్ని ఈ పద్యంలో తేటతెల్లం చేశాడు. అతడి తాత్పర్యం ఒక్కటే. భీముడి సేవలను తప్పకుండా వాడుకొనటమే అతడి అభిమతం. అందువలన అడిగిన ఉద్యోగం ఇచ్చాడు. అయితే 'బానసమునం దిచ్చోటనే కాదు నన్నేవీటన్ మిగులంగ నెవ్వరును లేఁ డెబ్బంగులన్ చూచినన్' (విరా.1.218) అని భీముడు చెప్పిన యోగ్యతలకు అనుగుణంగా 'వంటల మేరవాడవై యిమ్ముల నుండు' మన్నాడు. మూలంలో **"మహానసే త్వం భవ మే పురస్కృతః"** అని ఉండగా తిక్కన మహానసశబ్దం వాడకుండా తెలుగు పదాలతోనే కథ నడపటం విశేషం. సంస్కృత పదబంధాలకు, పారిభాషికపదాలకు తెలుగు పలుకుబడులు కల్పించటం తిక్కన నేర్పు. వంటలమేరవాడు, మహానసాధ్యక్షుడు. మేరవాడు అనేమాట సర్వాధికారి అనే పదానికి సమానార్థకం. వంటల పరిధికి సంబంధించినంతవరకు అతడి మాటే మేర-అంటే-అవధి. చివరిమాట, తిరుగులేని ఆజ్ఞ. ఇది తిక్కన నాటి వ్యవహారంలో ఉన్న సేవాపదవీ సూచకమైన పారిభాషిక పదం కావచ్చును. (సంపా) సూదజనమెల్లనుం, సూపజనమెల్లను - అని పాఠాంతరాలు.

క. అని హర్షోత్కర్షంబున। మన మలరఁగఁ బల్కి మత్స్యమనుజాధీశుం
డనిలసుతు నేలె; నాతఁడుఁ। దన మనమున నూఱడిల్లెఁ దదవసరమునన్. 227

ప్రతిపదార్థం: అని= అని; హర్ష+ఉత్కర్షంబునన్= సంతోషాతిశయంతో; మనము= మనస్సు; అలరఁగన్= ఒప్పగా; పల్కి= చెప్పి; మత్స్యమనుజ+అధీశుండు= మత్స్యరాజయిన విరాటుడు; అనిలసుతున్= వాయుసుతుడయిన భీముని; ఏలెన్= సేవకుడుగా స్వీకరించాడు; అతఁడున్= ఆ భీముడు కూడా; తన మనమునన్= తన మనస్సులో; ఊఱడిల్లెన్= సంతృప్తి చెందాడు; తత్+అవసరమునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అని సంతోషంతో విరాటమహారాజు మాట్లాడి భీముడిని ఏలుకొన్నాడు. భీముడు కూడా ఎంతో సంతృప్తి పడ్డాడు. ఆ సమయంలో.

అర్జునుఁడు పేడిరూపమున విరటుఁ గొల్వ వచ్చుట (సం.4.10.1)

సీ. కాళ్ళ యొప్పిద మాఁడు కట్టనుజ్జ్వలము చే। యంగ, సంకుల బాహు లంద మెడలఁ,
గంచుక మంగంబు కాంతికి మాటుగా। మెడ హేమ పట్టిక మెఱయ కుండ,
వదనంబు కొమరు భావనఁ జేసి వేఱుగా। నుదుటి పెం పలకలఁ బొదువఁ బడఁగఁ,
బవడంపు జొత్తులఁ జెవుల రూ పడఁగంగఁ। బాపట తలకట్టు భంగి దప్ప,

ఆ. మంచు మఱుఁగు వడిన మార్తాండుఁడును బోలె। నీఱు గవిసియున్న నిప్పుఁ బోలె
వేషధారి యైన విష్ణుండుఁ బోలె న। వ్విరటు కొలువు చేర నరుఁడు వచ్చె. 228

ప్రతిపదార్థం: కాళ్ళ+ఒప్పిదము= కాళ్ళ పొందికను; ఆఁడుకట్టు= తానుకట్టిన చీరతీరు; అనుజ్జ్వలము+చేయంగన్= మాటుపరచగా; సంకులన్= శంఖవలయాలతో; బాహుల అందము+ఎడలన్= భుజాలయొక్క సౌందర్యం తొలగిపోగా; కంచుకము= పొడుగాటి రవికె; అంగంబు కాంతికిన్= శరీరకాంతికి; మాటుగాన్= మాటు కాగా; మెడ= కంఠం; హేమపట్టికన్= బంగారు పట్టెడచేత; మెఱయక+ఉండన్= ప్రకాశించకుండా ఉండగా; వదనంబు కొమరు= ముఖసౌందర్యం; భావనన్+చేసి= పసుపు రాసుకొనటం వలన; వేఱుకాన్= వేరే రకంగా అయిపోగా; నుదుటి పెంపు= నొసటి వెడల్పు; అలకలన్= ముంగురులచేత; పొదువన్+పడఁగన్=

కప్పివేయబడగా; పవడంపు జొత్తులన్= పగడాల కమ్మలచేత; చెవులరూపు= చెవుల అందం; అడగంగన్= అణగిపోగా; పాపట= సీమంతం; తలకట్టు భంగితప్పన్= కురులుముడిచిన వైఖరిలో తప్పిపోగా; మంచు= మంచుచేత; మఱుఁగు+పడిన= మరుగుపడిన; మార్తాండుఁడును+పోలెన్= సూర్యుని వలె; నీఱు+కవిసి+ఉన్న= బూడిద కప్పిన; నిప్పున్+పోలెన్= అగ్నివలె; వేషధారి+ఐన= వేషం వేసికొన్న; విష్ణుండున్+పోలెన్= విష్ణువువలె; నరుఁడు= అర్జునుడు; ఆ+విరటు కొలువు= ఆ విరాట మహారాజు సభను; చేరన్= చేరగా; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: అర్జునుడు ఆడవేషంలో విరటుడి కొలువుకు వస్తున్నాడు. కాళ్ళ అందం కనబడని పద్ధతిలో చీర, చేతులఅందం కనబడనట్లు శంఖవలయాలు, శరీరకాంతిని కప్పిపుచ్చే విధంగా కంచుకం, మెడఅందం సన్నగిల్లే విధంగా హేమపట్టిక, ముఖసౌందర్యం డీలా పడే విధంగా పసుపు పూత, నుదురు కనబడని విధంగా ముంగురులు, చెవుల అందం చెడిపోయే విధంగా పగడాల కమ్మలు పాపటవల్ల-అందం రాణించని విధంగా కురులు ముడిచిన - తలకట్టు ఉన్నాయి. మంచుకప్పిన సూర్యుడివలె, నివురు కప్పిన నిప్పువలె అర్జునుడు కనిపించాడు. వేషధారి అయిన విష్ణువువలె అతడు ఉన్నాడు. ఇటువంటి వేషంలో అర్జునుడు విరటుడి కొలువు చేరాడు.

విశేషం: అర్జునుడికి పేడి రూపం వచ్చింది. దానికి తగిన ఆహార్యమంతా ధర్ముడి దయవలన ఏర్పడింది. ఆ అబ్బురమైన రూపవైభవం మూలంలో పఠితకు ప్రత్యక్షం కాదు. అందమైన మగవాడు స్త్రీల అలంకారాలు పెట్టుకొన్నాడనీ, ఉన్నతుడైన పురుషుడు పొడవైన కుండలాలు, బంగారు గాజులు ధరించి ఉన్నట్లున్నాడనీ మూలం పేడివాడి రూపాన్ని చిత్రించింది. విరాటు డడిగిన ప్రశ్నలనుబట్టి బృహన్నల శ్యామవర్ణం వాడనీ, యువకుడనీ, ముడివీడిన జుట్టువాడనీ, పూలమాలలు ధరించాడనీ, వస్త్రాలను వింతగా ధరించాడనీ తెలుస్తుంది. మూలంలో వివరా లిచ్చినట్లుంటుందే కాని, వాటి సంఘటితరూపం కన్నులకు తోచినట్లుండదు. తిక్కన అర్జునుడి పేడిరూపాన్ని అత్యద్భుతంగా చిత్రించాడు. ఈ రూపం వ్యాసభారతకాలం నాటిది కాదు. తిక్కన కాలంనాటిది.

పేడివారిలో ముఖ్యంగా రెండు తెరగులవారుంటారు. స్త్రీ లక్షణాలు శరీరంమీద కనపడుతున్నా స్త్రీత్వం లేనివారు. పురుషశరీరంవంటి శరీరం కలిగి ఉన్నా నపుంసకత్వం వలన స్త్రీ లక్షణాలు భాసించేవారు. ఇందులో రెండవ తెగకు చెందిన రూపం అర్జునుడికి వచ్చింది. ఊర్వశి శాపంకూడా అటువంటిదే. తిక్కన దానిని అలంకార సుందరంగా ఆవిష్కరించాడు. సీసపద్యంలో ఆజానుబాహువైన అర్జునుడి రూపవర్ణనకు సీసపద్యం సముచితం.

పేడివాని రూపాన్ని వర్ణించేటప్పుడు కాళ్ళు, చేతులు, శరీరకాంతి, మెడ, ముఖం, నుదురు, చెవులు, పాపటుతలకట్టు అనే అంగాలను ఎన్నుకొనటం వర్ణ్యవస్తు స్వరూప స్వభావాలను తెలిసి చేసిన పని. అర్జునుడి ఆయా శరీరవయవాల సహజ సౌందర్య శోభ స్త్రీ సహజమైన ఆభరణాలతో కప్పివేయటం వలన అతడి పురుషరూపం కుంఠితమై అనుజ్జ్వలమై పోయిందట. ఇది పేడివాడి అందంలో ఉండే ఆంతర్యం. పురుషరూపం కాంతిహీనమౌతుంది. ఆడవేషం ఆభాసమౌతుంది. అందువలన శృంగార రూపాభాస స్థితి ఏర్పడుతుంది.

దానిని మూడు దశలుగా చిత్రీకరించాడు తిక్కన. అర్జునుడి పురుషత్వం మంచు మరుగునపడిన మార్తాండుడివలె అయిపోయిందట. అర్జునుడి పాదాల సొబగు ఆడుకట్టుతో వెల వెలపోయింది. బాహువుల అందం శంఖవలయాలతో మరుగుపడింది. శరీరకాంతిని కంచుకం కప్పివేసింది. మెడ సొగసును బంగారుపట్టి మ్రింగివేసింది. కాళ్ళనుండి మెడదాకా చూస్తే మంచు కప్పిన మార్తాండుడివలె ఉన్నాడట బృహన్నలాకారంలో అర్జునుడు.

ఆ తరువాత- వదనకాంతి పసుపు పూసుకొనటంచేత, నుదుటి పెంపు ముంగురులతో కప్పబడటంచేత అర్జునుడు సమానధర్మం కలిగిన- నివురుకప్పిన అగ్నివలె భాసించాడు.

ఆ పైన- పగడాల కమ్మలు చెవుల ఇంపును, పాపటతీరు తలకట్టు వైఖరిని మార్చటంతో వేషధారి అయిన విష్ణువువలె భాసించాడు.

ఎత్తుగీతిలో ఉన్నమూడు ఉపమానాలూ అర్జునుడి శరీరాన్ని చూచేవారికి మూడు రకాల భావాలను కల్పిస్తున్నాయి. మంచువలె కప్పే ఆభరణాలు లలితాలైనవి. కాంతిని కప్పే శక్తి వాటికంతగా లేనివి. కాదనుకొంటే పోయేవి. నివురువలె ఆభరణాలు దట్టమైనవి. అయినా తొలగిస్తే పోయేవి. వేషధారణం రూపాన్నే మార్చేది. వేషం తీసివేస్తేకాని పోనిది. ఈ మూడురకాల అలంకారాలతో రూప వికృతిని తోపింపచేసే వింతరూపం తెలుగు సాహిత్యంలోనే అపూర్వం. (సంపా.)

క. చనుదెంచి పేడితనమును। వనితారూపంబు నమర వాసవసుతుఁ డా
మనుజాధీశునకు సభా। జనులకుఁ దనుఁ జూపి మందసంచారమునన్. 229

ప్రతిపదార్థం: వాసవ సుతుఁడు= ఇంద్రుడి కుమారుడయిన అర్జునుడు; పేడితనమును= నపుంసకత్వం; వనితారూపంబును= ఆడరూపం; అమరన్= ఒప్పగా; మనుజ+అధీశునకున్= మనుష్యులకు అధికారి అయిన విరటుడికి; సభా జనులకున్= సభలోని వారికి; తనున్+చూపి= కనిపించి; మంద సంచారమునన్= మెల్లని నడకతో.

తాత్పర్యం: అర్జునుడు పేడితనంతోను, ఆడరూపుతోను వచ్చి రాజునకు, సభాసదులకు కనిపించి మెల్లని నడకలతో (తరువాతి వచనంతో అన్వయం).

వ. మెలంగినం గనుంగొని మత్స్యజనవిభుండు దన యొద్దివారలతో నిట్లనియె. 230

ప్రతిపదార్థం: మెలంగినన్= మసలగా; కనుంగొని= చూచి; మత్స్యజనవిభుండు= మత్స్యదేశంలోని జనులకు పాలకుడయిన విరాట మహారాజు; తన+ఒద్దివారలతోన్= తన దగ్గరలో ఉన్న వారితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు పేడిరూపంలో ఆ విధంగా మసలగా విరాటుడు చూచి, తన సమీపంలో ఉన్నవారితో ఇట్లా అన్నాడు.

మ. 'వనితావేషము గల్గియున్నయది; చెల్వం బాఁడుచందంబు గా
దు నిరూపింప మహానుభావతయు, నిర్దోషత్వమున్ రాజసం
బును శోభిల్లెడు; నెవ్వఁడే నొక జగత్పూజ్యుండు క్రీడార్థ మి
ట్లొనరం దాల్చిన రూపు గావలయు; మీ రూహింపుఁడా యట్లగున్.' 231

ప్రతిపదార్థం: వనితావేషమున్= ఆడవేషాన్ని; కల్గి ఉన్నది= ధరించి ఉన్నది, వేసికొన్నది; చెల్వంబు= రూపురేఖలు చూస్తే; ఆఁడుచందంబు కాదు= ఆడపోలిక లేదు; నిరూపింపన్= పరిశీలించి చూస్తే; మహానుభావతయున్= గొప్ప మహిమ; నిర్దోషత్వమున్= దోషం లేకపోవటమూ; రాజసంబును= రాజసస్వభావమూ; శోభిల్లెడున్= ప్రకాశిస్తుంది; ఎవ్వఁడు+ఏన్+ఒక= ఎవడయినా ఒక; జగత్+పూజ్యుండు= లోకంచేత పూజింపదగినవాడు; క్రీడా+అర్థము= వినోదం కొరకు; ఇట్లు+ఒనరన్= ఇట్లా ఉండాలని; తాల్చిన= ధరించిన; రూపు కావలయున్= రూపం అయి ఉండాలి; మీరు+ఊహింపుఁడా= మీరు ఆలోచించండి; అట్లు+అగున్= అంతే అవుతుంది.

తాత్పర్యం: 'వేషం చూస్తే ఆడవేషంగా ఉన్నది. అయితే ఆ తీరులో ఆడపోలిక కనిపించదు. నిదానించి చూస్తే రాజసం కనిపిస్తుంది. పెద్దరికం, పెద్దతనం కనబడుతూ ఉన్నది. ఆకారంలో దోషరాహిత్యం (సాముద్రిక లక్షణాలకు భిన్నమయినవి లేవు) కనిపిస్తూ ఉన్నది. ఇతడు లోకమాన్యుడు కావచ్చును. వినోదం కొరకు ఈ రూపం స్వీకరించాడేమో! మీరు కూడా ఊహించండి. అవును తేరిపార చూస్తే అంతే.'

తే. **అనినఁ బరిజనంబులు విస్మయంబు గదుర। నిశ్చయము చేసి పలుకంగ నేర్పు లేక**
చూచుచుండఁగ నా సవ్యసాచి సేరఁ। జని విరాటనృపాలుతో సవినయముగ. **232**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; పరిజనంబులు= సేవకులు; విస్మయంబు+కదురన్= ఆశ్చర్యం కలుగగా; నిశ్చయము= నిర్ణయాన్ని; చేసి= చేసి; పలుకంగన్= మాట్లాడటానికి; నేర్పు లేక= నేర్పులేనందున; చూచుచున్+ఉండఁగన్= ఊరక చూస్తూ ఉండగా; ఆ సవ్యసాచి= ఆ అర్జునుడు; చేరన్+చని= దగ్గరికి వచ్చి; సవినయముగన్= వినయంతో; విరాట నృపాలుతోన్= విరాటమహారాజుతో; (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: విరటుడి మాటలకు సేవకులు ఆశ్చర్యపడ్డారు. ఏమి చెప్పాలో నిశ్చయించుకొనలేకపోయారు. ఏమీ మాట్లాడలేక చూస్తూ ఉండిపోయారు. ఈలోగా అర్జునుడు దగ్గరికి వచ్చాడు. విరాటుడితో సవినయంగా ఇట్లా అన్నాడు.

క. **'నిన్నుఁ గొలువంగ వచ్చితిఁ। గన్నియలకు నాట గఱపఁగా నోపుదు వి**
ద్వన్నుత! మన్నామంబు బృ। హన్నల; యేఁ బేడి' యనుడు నతఁ డిట్లనియెన్. **233**

ప్రతిపదార్థం: విద్వత్+నుత!= విద్వాంసులచేత పొగడబడేవాడా!; నిన్నున్= నిన్ను; కొలువంగన్= సేవించడానికి; వచ్చితిన్= వచ్చాను; కన్నియలకున్= కన్యలకు; ఆట= నృత్యం; కఱపఁగాన్+ఓపుదున్= నేర్పుతాను; మత్+నామంబు= నా పేరు; బృహన్నల= బృహన్నల; ఏన్= నేను; పేడిని= నపుంసకుడిని; అనుడున్= అనగానే; అతఁడు= ఆ విరాట మహారాజు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్=అన్నాడు.

తాత్పర్యం: 'మహారాజా! నిన్ను సేవించటానికి వచ్చాను. అంతఃపురంలోని కన్యలకు ఆటపాటలు నేర్పుతాను. నా పేరు బృహన్నల. నేను నపుంసకుడిని' అనగానే విరాటుడు ఇట్లా అన్నాడు.

ఉ. **'ఆయతబాహులున్ వెడఁదయైన సమున్నత వక్షమున్ సరో**
జాయత లోచనంబులుఁ బ్రసన్నముఖంబు నుదాత్తరేఖయుం
గాయజుఁ గ్రేణి సేయు నన౯ గౌశికు మీఱు ననంగ విభ్రమ
శ్రీయును బెంపునుం గలుగఁ జేసి విధాతృఁడు పేడిఁ జేసెనే? **234**

ప్రతిపదార్థం: ఆయతబాహులున్= పొడవయిన చేతులూ; వెడఁద+ఐన= విశాలమయిన; సమున్నత వక్షమున్= ఎత్తయిన రొమ్మూ; సరోజ+ఆయత లోచనంబులున్= పద్మాలవంటి విశాలమయిన కనులూ; ప్రసన్నముఖంబున్= నిర్మలమయిన ముఖమూ; ఉదాత్త రేఖయున్= ఉదాత్తమయిన శరీరసౌందర్యం; కాయజున్= మన్మథుని; క్రేణి+చేయున్= తిరస్కరిస్తుంది; అనన్= అనేటట్లు; కౌశికున్= ఇంద్రుని; మీఱున్+అనంగన్= అతిశయిస్తాడనేటట్లు; విభ్రమశ్రీయును= విలాస సంపదనూ; పెంపునున్= ఉదాత్తతనూ (దీనిని); కలుగన్+చేసి= కలిగించి; విధాతృఁడు= బ్రహ్మ; పేడిన్+చేసెనే?= నపుంసకుని చేశాడే!.

తాత్పర్యం: ఇతడికి పొడవయిన చేతు లున్నాయి. విశాలమూ. ఉన్నతమూ అయిన వక్షఃస్థలం ఉన్నది. పద్మాలవలె విశాలమయిన కళ్ళున్నాయి. నిర్మలమయిన ముఖం దర్శనీయంగా ఉన్నది. ఉదాత్తమయిన సౌందర్యం స్పష్టంగా కనిపిస్తూ ఉన్నది. ఇవన్నీ చూస్తుంటే ఇతని రూపం మన్మథుడిని మించేటట్లు ఉన్నది. ఇంద్రుడిని తీసిపారేసే విధంగా ఉన్నది. ఇటువంటి విలాసం, వైభవం కల్పించిన బ్రహ్మ చివరకు ఇతడిని నపుంసకుడిని చేశాడే!

శా. **మత్కోదండచయంబులోన నొక సమ్మానార్హచాపంబు భా**
స్వత్కాండంబులు హేమచంద్రక కనద్వర్మంబు నీ కెంతయున్
సత్కారంబున నిచ్చి వాహన పరిష్కారాంక సంభావ్య సం
పత్కల్యాణుని జేసి వైభవము దర్పంబున్ విజృంభింపఁగన్. **235**

ప్రతిపదార్థం: మత్= నా యొక్క; కోదండచయంబులోనన్= ధనుస్సుల సమూహంలో; ఒక= ఒక; సమ్మాన+అర్హచాపంబు= గౌరవోచితమయిన ధనుస్సు; భాస్వత్+కాండంబులు= మెఱిసిపోయే బాణాలూ; హేమచంద్రక కనత్+వర్మంబు= బంగారు నెమలికన్నులవంటి బొట్లతో తళతళా మెరిసే కవచమూ; నీకున్= నీకు; ఎంతయున్= ఎంతో; సత్కారంబునన్= గౌరవంతో; ఇచ్చి= ఇచ్చి; వాహనపరిష్కార+అంక+సంభావ్య; సంపత్+కల్యాణునిన్+చేసి= వాహనం, అలంకారం అనే చిహ్నాలతో గౌరవించదగిన సంపద అనే శుభం కలవానిగా చేసి; వైభవము= ఐశ్వర్యం; దర్పంబున్= గర్వమూ; విజృంభింపఁగన్= విజృంభించగా.

తాత్పర్యం: నాకున్న విండ్లలో నీకు ఒక గౌరవప్రదమైన చాపం ఇవ్వాలని ఉన్నది. వెలుగులీనే బాణాలు, బంగారుపూలు మెరిసే కవచం నీ కిచ్చి సన్మానించాలని ఉన్నది. వాహనం, అలంకారం వంటి గౌరవలాంఛనా లిచ్చి అర్హత కలిగించాలని ఉన్నది. ఐశ్వర్యవంతుడిని చేయాలని ఉన్నది. నిన్ను రాజుగా చేయాలని ఉన్నది.

విశేషం: ధనుస్సు, బాణాలు, వాహనాలు, ఆభరణాలు రాజుల గౌరవాలకు చిహ్నాలు. కవచాల పై భాగంలో బంగారు పూల తాపడం అలవాటు. ఇవి పరాక్రమాలకు ప్రతీకలు. పైగా అందం కూడా.

క. **ఏము నిను మత్స్యరాజ। శ్రీ మహిమకు నెల్ల యుక్తుఁ జేయఁ దలంపం**
గా మా మనోరథమునకు। నీ మాట విరుద్ధమయ్యె నిది యెట్లొక్కో!' **236**

ప్రతిపదార్థం: ఏము= మేము; నినున్= నిన్ను; మత్స్యరాజశ్రీ మహిమకున్+ఎల్లన్= మత్స్య దేశాధిపతి సంపదల మహిమకంతటికీ; యుక్తున్+చేయన్+తలంపంగాన్= నియోగిద్దామనుకుంటే; మా మనోరథమునకున్= మా కోరికకు; ఈ మాట= ఈ మాట; విరుద్ధము+ అయ్యెన్= వ్యతిరేకమయింది; ఇది+ఎట్లు+ఒక్కో!= ఇది ఎట్లో మరి!.

తాత్పర్యం: నిన్ను మత్స్యరాజ వైభవాని కంతటికీ అధికారిగా చేద్దామనుకొంటున్నాను. అయితే నీ మాటలు అందుకు విరుద్ధంగా ఉన్నవి. మరి ఇది ఎట్లాగో?

వ. **అనిన విని యమ్మహీపతికి బృహన్నల యిట్లనియె.** **237**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+మహీపతికిన్= ఆ విరాటమహారాజుకు; బృహన్నల= అర్జునుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: విరాటుడి మాటలను అర్జునుడు విన్నాడు. తదనంతరం ఇట్లా అన్నాడు.

ఉ. **'ఆఁడుఁదనంబు నిక్కమున కారసి చూచిన లేదు; పుంస్త్వముం**
బోఁడిమి దప్పియున్నది; నపుంసకజన్మ మవశ్యభోగ్యమై
వాఁడిమి గల్గు శాపమున వచ్చెఁ బురాకృతకర్మ భావ్య మె
వ్వాఁడును నేర్చునే! తొలఁగ వైవఁగ నోర్వక పోవవచ్చునే? 238

ప్రతిపదార్థం: నిక్కమునకున్= నిజానికి; అరసి చూచినన్= బాగా పరిశీలించి చూస్తే; ఆఁడుఁదనంబు= స్త్రీత్వం; లేదు= లేదు; పుంస్త్వమున్= మగతనం; పోఁడిమి+తప్పి+ఉన్నది= ఒప్పు (పటుత్వం) తప్పింది - మగతనం రూపు తప్పింది; నపుంసక జన్మము= పేడితనపు పుట్టుక (పేడితనం కలగటం); వాఁడిమి కల్గు శాపమునన్= తీవ్రమయిన, క్రూరమైన శాపంతో; అవశ్యభోగ్యము+ఐ= తప్పకుండా అనుభవించటానికి తగినదిగా; వచ్చెన్= వచ్చింది; ఏ+వాఁడును= ఎవడయినా; పురాకృత= పూర్వం చేసిన; కర్మభావ్యము= కర్మల వలన కాదగిన దానిని; తొలఁగ వైవఁగన్ నేర్చునే!= తొలగించగలడా!; ఓర్వక= అనుభవించకుండా, భరించక; పోవన్వచ్చునే?= తప్పించుకొనగలడా?

తాత్పర్యం: 'నిదానించి చూస్తే అసలు ఆడుతనం లేదు. మగతనం రూపు తప్పింది. ఒక క్రూరమైన శాపం వలన నపుంసకత్వం అవశ్యం అనుభవించవలసివచ్చింది. కర్మఫలాన్ని ఎవరూ తప్పించలేరు. తప్పించుకోనూ లేరు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. కర్మ బలీయమయినది. ఎవరికయినా కర్మఫలం తప్పదు. **"అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్"** - అని సంస్కృతంలో సూక్తి ఉన్నది. అర్జునుడి పేడివేషం కర్మఫలమే. వేషంలో స్త్రీత్వం ఉండవచ్చును. కాని 'పుంస్త్వం' పోలేదు. అది ఓటు వోయింది. ఊర్వశిశాపఫలితంవలన అర్జునుడు నపుంసకత్వాన్ని వహించవలసి వచ్చింది. దాని కనువైన వేషం ధర్ముడి దయవలన అమరింది. ఒక సంవత్సరంపాటు ఊర్వశిశాపం వర్తించి అజ్ఞాతవాసంలో ఇతరులకు తెలియకుండా ఉండటానికి ఉపయోగపడుతుందనీ, ఆ తరువాత నపుంసకత్వ శాపం తొలగిపోతుందనీ ఇంద్రుడి వరం. దీనిని అర్జునుడు గూఢంగా ధ్వనింపచేసి అసత్యదోషాన్ని నివారించుకొన్నాడు.

వ. **కావున 239**

తాత్పర్యం: అందుచేత.

తే. **ఒండు పనులకు సెలవు లేకునికిఁ జేసి। యభ్యసించితి శైశవమాదిగాఁగ**
దండలాసక విధమును గుండలియును। బ్రెక్కణంబు తెఱంగును బేరణంబు. 240

ప్రతిపదార్థం: ఒండు పనులకున్= ఇతరమయిన పనులకు; సెలవు లేక+ఉనికిన్+చేసి= అనుకూలత, అవకాశము లేకపోవటం చేత; శైశవము+ఆది కాఁగన్= చిన్నతనం నుండి; దండలాసక విధమును= కోలాటమాడేరీతిని; కుండలియును= కుండలాకార నృత్యాన్ని; ప్రెక్కణంబు తెఱంగును= ప్రేంఖణ నృత్యాన్నీ; పేరణంబున్= పేరణియున్నూ; అభ్యసించితి(న్)= నేర్చుకొన్నాను.

తాత్పర్యం: పేడితనంవలన ఏ పనీ చేయటానికి వీలు లేకపోయింది. చిన్నప్పటినుండి దండలాసకం, కుండలి, ప్రెక్కణం, పేరణం-అనే నృత్యరీతులను నేర్చుకొన్నాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **విశ్రుత వాద్యంబులు మం। జుశ్రుతి సంభావ్యగీత సుగతులు సద్భా**
వాశ్రయములుఁ దజ్జన్యర। సాశ్రయములు నైన యభినయంబు లెఱుఁగుదున్. **241**

ప్రతిపదార్థం: విశ్రుత వాద్యంబులు= ప్రసిద్ధమయిన వాద్యాలూ; మంజు= మనోహరమయిన; శ్రుతి= శ్రుతి చేత; సంభావ్య= భావించదగిన; గీత= గీతాల యొక్క; సుగతులున్= మంచి నడకలును; సద్భావ+ఆశ్రయములున్= మంచి భావాలకు ఆశ్రయాలయినవి; తద్+జన్యరస+ఆశ్రయములున్+ఐన= వాటినుండి పుట్టిన రసాలకు నిలయాలయిన; అభినయంబులు= రకరకాలయిన అభినయాలు; ఎఱుఁగుదున్= నాకు తెలుసు.

తాత్పర్యం: ప్రసిద్ధాలయిన వాద్యాల వాయింపు నాకు వచ్చును. మంచి శ్రుతులతో కూడిన గీతాలు, గతులు నాకు తెలుసును. రసభావాశ్రయాలయిన అభినయాలు నాకు తెలుసును.

విశేషం: మూలంలో బృహన్నల అనిన మాట లివి-

"గాయామి నృత్యా మ్యథ వాదయామి । భద్రోఽస్మి నృత్యే కుశలోఽస్మి గీతే
త్వ ముత్తరాయై ప్రదిశస్వ మాం స్వయం । భవామి దేవ్యా నరదేవ నర్తకః" (సం.4.10.8.)

మహారాజా! నేను పాడగలను. ఆడగలను. వాద్యాలను వాయించగలను. ఆటపాటలలో ఆరితేరాను. నన్ను ఉత్తరకు నాట్యాచార్యుడిగా నియమించుము. ఆమెకు నృత్యవిద్య నేర్పుతాను - అని సూటిగా సంగ్రహంగా బృహన్నల చెప్పాడు. అయితే, తిక్కన - నృత్యంలో తనకాలంలో ప్రచారంలో ఉన్న భేదాలను పై పద్యంలో పేర్కొన్నాడు. గీత వాద్యాలను ఈ పద్యంలో పేర్కొని వదలివేశాడు. ఉత్తరకు నాట్యాచార్యుడిగా నియమించుమని అడగటం ఔచిత్యం కాదు. అత డేదో మిషమీద వచ్చాడనే అనుమానం విరాటుడికి కలుగవచ్చును. అందువలన తిక్కన ఆ మాటను బృహన్నలచేత అనిపించక ఔచిత్యం పాటించాడు. విరాటుడే తన కుమార్తెకు బృహన్నలచేత నాట్యం చెప్పించే నిర్ణయం తీసికొన్నట్లు చిత్రించి కథను రక్తి కట్టించాడు. తిక్కన చేసిన మార్పు సూక్ష్మమైనది. విలువైనది. (సంపా.)

తే. **ఇన్ని తెఱఁగుల శ్రమము చేయింతుఁ జతుర। తా విహీనము లైన పాత్రముల నైన**
నట్టువొజ్జనై మెలఁగుదు నగళులందు। నిపుణ నైపథ్య విధులకు నేర్తు నధిప!' **242**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; చతురతా విహీనములు+ఐన= నేర్పులేనటువంటి; పాత్రములన్+ఐనన్= పాత్రధారులనయినా; ఇన్నితెఱంగులన్= ఇన్ని విధాల; శ్రమము చేయింతున్= సాధన చేయిస్తాను; నగళులందున్= అంతఃపురాలలో; నట్టువు+ఒజ్జను+ఐ= నాట్యాన్ని నేర్పే శిక్షకురాలనై; మెలఁగుదున్= సంచరిస్తాను; నిపుణ= నేర్పరితనంతో కూడిన; నైపథ్య విధులకున్= నాట్యానికి అవసరమయిన వేషాలంకరణాలపద్ధతులను; నేర్తున్= చక్కగా ఎరుగుదును.

తాత్పర్యం: రాజా! నా నేర్పు ఎటువంటిదో వినుము. నేర్పరితనం ఏమాత్రం లేనివాళ్ళచేతనయినా సాధన చేయిస్తాను; వారిని తీర్చి దిద్దుతాను. నాట్యం నేర్పుతూ అంతఃపురాలలో ఉంటాను. అంతేకాక నాకు నేపథ్యవిద్యలలో కూడ నైపుణ్యం ఉన్నది.

విశేషం: నేపథ్యం అనే మాటకు నాట్యస్నానం, వస్త్రాద్యలంకారం అనే అర్థాలున్నాయి. రంగంలో ప్రదర్శించటానికి ముందు చేసే అలంకరణ మంతా నైపథ్య విధులే. నాట్యం నేర్పే వారికి అలంకరణ విధులు కూడా తెలియవలసిన అవసరముంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **అనుడు విషణ్ణమైన హృదయంబున గారవ మొంద నైపుణం**
బున నుచితంబుమై నరసి పొచ్చెము లేమిఁ దదీయ సేవ గై
కొనుటకు నిశ్చయించి తన కూఁతు విరాటుఁడు పిల్వఁబుచ్చె న
ర్తనమునకై బృహన్నలకుఁ దత్పరతం దగ నప్పగింపఁగన్. **243**

ప్రతిపదార్థం: అనుడున్= అనగానే; విరాటుఁడు= విరాటమహారాజు; విషణ్ణము+ఐన= విషాదంతో కూడిన; హృదయంబునన్= మనసుతో; గారవము+ఒందన్= గౌరవం కలుగగా; నైపుణంబునన్= నిపుణతతో; ఉచితంబుమైన్= తగిన రీతితో; అరసి= పరిశీలించి; పొచ్చెము+లేమిన్= దోషం లేకపోవడంచేత; తదీయ సేవ= ఆ పేడి సేవ; కైకొనుటకున్= స్వీకరించడానికి; నిశ్చయించి= నిశ్చయించుకొని; తన కూఁతున్= తన కూతురయిన ఉత్తరను; నర్తనమునకై= నాట్య శిక్షణ కొరకు; బృహన్నలకున్= బృహన్నలకు; తత్పరతన్= భక్తితో; తగన్+అప్పగింపఁగన్= తగిన విధంగా అప్పగించటానికి; పిల్వన్+పుచ్చెన్= పిలవటానికి కబురంపాడు.

తాత్పర్యం: బృహన్నలను చూడగానే విరాటుడి మనసులో బాధతో కూడిన ఆదరం పెరిగింది. ఒకసారి పేడి వేషాన్ని నిశితంగా పరిశీలించాడు. మోసం లేదని గ్రహించాడు. ఆమె చేత సేవలు చేయించుకొనటానికి విరాటుడు నిశ్చయించుకొన్నాడు. తన కూతురిని బృహన్నలకు శిష్యురాలుగా నాట్యాభ్యాసం కొరకు అప్పచెప్పడానికై కబురంపాడు.

విశేషం: ఈ ఘట్టాన్ని తిక్కన మూలాతిరిక్తంగా తీర్చిదిద్దాడు. మూలం ఇట్లా ఉన్నది.

"బృహన్నలాం తా మభివీక్ష్య మత్స్యరాట్ । కలాసు నృత్యేషు తథైవ వాదితే।
సమ్మంత్ర్య రాజా వివిధైః స్వమంత్రిభిః । పరీక్ష్య చైవం ప్రమదాభి రాశు వై ।
అపుంస్త్వ మప్యస్య నిశమ్యచ స్థిరం । తతః కుమారీపుర ముత్ససర్జ తమ్।
స శిక్షయామాస చగీతవాదితం । సుతాం విరాటస్య ధనంజయః ప్రభుః ॥" (సం.4.11.11-12)

విరాటుడు బృహన్నలకు కళలలోనూ, నృత్యంలోనూ, వాద్యాలలోనూ ఉన్న నేర్పరితనాన్ని తాను పరీక్షించటమే కాకుండా మంత్రుల చేతకూడా పరిశీలింప చేశాడు. అంతటితో ఆగకుండా స్త్రీలచేత అతనిని బాగా పరీక్షింప చేసి అతడి నపుంసకత్వాన్ని నిర్ధారణ చేసికొన్నాడు. ఆ తరువాత నిశ్శంకగా అతడిని కన్యలుండే అంతఃపురానికి పంపాడు. బృహన్నల విరాటుడి పుత్రికకు పాటలను వాద్యాలను నేర్పాడు - ఇది సంస్కృతభారత కథనం. మూలంలోని విరాటుడు లోకజ్ఞుడు. అన్ని పరీక్షలను భౌతికంగా చేయించి వాస్తవాన్ని ధ్రువపరచుకొన్నాడు. బృహన్నలను సరాసరి అంతఃపురానికి పంపాడు.

తిక్కన చిత్రించిన విరాటుడు లోకజ్ఞుడు కాడని చెప్పలేము కాని, అంతకంటె సహృదయుడైన ఇంగితజ్ఞుడు-అని నిశ్చయంగా చెప్పవచ్చును. ఉన్నతుడైన ఒక మహాపురుషుడు విధి వక్రించి నపుంసకు డయ్యాడు. ఆడువారికి ఆటపాటలు చెప్పటానికి సిద్ధమయ్యాడు. అతడి దయనీయ స్థితికి సహృదయుడైన విరాటుడు విషణ్ణుడైనాడు. కాని, కర్తవ్యాన్ని మరవలేదు. నిపుణంగా పరిశీలించి (పరీక్షించి కాదు) అతడి నపుంసకత్వాన్ని నిర్ధారించుకొన్నాడు. మూలకథలో వలె మంత్రుల సాయం, స్త్రీల సహాయం తీసికొనలేదు. వారిచేత పరీక్షలు చేయించలేదు. ఇది విరాటపాత్రకు తిక్కన కల్పించిన హుందాతనం, ఇంగితజ్ఞాన దీప్తి. తాను స్వయంగా నిర్ణయించిన ఈ సత్యాన్ని సభలో పరోక్షంగా ప్రదర్శించాడు. బృహన్నలను అంతఃపురానికి సరాసరి పంపలేదు. తన కుమార్తె అయిన ఉత్తరను నిండుసభకు పిలిపించాడు, గురుపూజ చేయించాడు. గురువు చేతుల్లో తన కూతురిని ఉంచాడు. గురుశిష్య సంబంధాన్ని నాట్యాచార్యుడి వద్ద విద్యనేర్చుకొనే సమయంలో చేసే విద్యారంభోత్సవ సంప్రదాయాన్నీ తిక్కన చిత్రించాడు. అంటే తెలుగునాట ఆ రోజులలో ఉండే నాట్యవిద్యా సంప్రదాయ సంస్కృతిని భారతంలో ప్రతిఫలింప చేశాడన్నమాట. విశ్వనాథవారన్నట్లు - "తిక్కన శిల్పపుఁ దెనుఁగు తోఁట".(సంపా.)

వ. ఇట్లు రావించిన. 244

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; రావించినన్= రప్పించగా.

తాత్పర్యం: విరాట మహారాజు కబురంపించగా ఉత్తర వచ్చింది. రాగా.

సీ. అల్లఁదనంబున యనువు మైకొనఁ జూచు। నడపు కాంతికి వింతతొడవు గాఁగ;
వెడవెడ నూఁగారి వింతయై యేర్పడఁ। దేరని వళులలో నారు నిగుడ;
నిట్టలు ద్రోచుచు నెలవుల కల మేర। లెల్లను బిగి యెక్కి యేర్పడంగఁ,
దెలుపును గప్పును వెలయంగ మెఱుఁ గెక్కు। తారకంబులఁ గల్కితనము దొడరఁ

ఆ. జరణములును నడుముఁ జన్నులుఁ గన్నులు। జవ్వనంబు చెన్ను నివ్వటిల్లు
చునికిఁ దెలుపుచుండ నుత్తర చనుదెంచె। నలరువిలుతు పువ్వుటమ్ము వోలె. 245

ప్రతిపదార్థం: అల్లఁదనంబున యనువు= మాంద్యము యొక్క ఒప్పును; మైకొనన్+చూచు= అలవరించుకొనడానికి చూచే; నడపు= నడక; కాంతికిన్= సహజమయిన అందానికి; వింత తొడవు+కాఁగన్= కొత్త అలంకారం కాగా; వెడవెడ నూఁగారి= కొద్ది కొద్దిగా లేఁతదై; వింత+ఐ= కొత్తదై; ఏర్పడన్= ఏర్పడగా; తేరని= రూపుదిద్దుకొనని; వళులలోన్= కడుపు మీది మడతలలో; ఆరు-నిగుడన్= రోమావళి వ్యాపింపగా; నిట్టలు+త్రోచుచు= పైకి పొంగుతూ; నెలవుల కల= చుట్టూరా ఉన్న; మేరలు+ఎల్లను= హద్దులన్నియు; బిగి+ఎక్కి= బిగువై; ఏర్పడంగన్= స్పష్టంగా కనబడగా; తెలుపును+కప్పును= తెలుపూ, నలుపూ; వెలయంగన్= ప్రకాశించగా; మెఱుఁగు+ఎక్కు తారకంబులన్= మెరసే కనుగ్రుడ్లలో; కల్కి తనము+తొడరన్= మనోజ్ఞత కనిపించగా; చరణములును, నడుమున్, చన్నులున్, కన్నులున్= పాదాలు, నడుమూ, స్తనాలు, కళ్ళూ; జవ్వనంబు చెన్ను= యౌవన సౌందర్యం; నివ్వటిల్లుచున్+ఉనికిన్= నిండారుతూ ఉండటం; తెలుపుచున్+ఉండన్= వ్యక్తపరుస్తూ ఉండగా; అలరు విలుతు= పువ్వులు బాణాలుగా కల మన్మథుని; పువ్వు+అమ్ముపోలెన్= పూలబాణం వలె; ఉత్తర= ఉత్తర; చనుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: ఉత్తర- తన నడక కుండే సహజమైన మాంద్యమునందలి ఒప్పు వింత అలంకార మయ్యేటట్లుగా (పాదాలతో నడిచి వచ్చింది). ఏర్పడీ ఏర్పడని వళులమీద మొలిచీ మొలవని రోమావళి నిండుదనం కలిగించగా (నడుము సొగసుతో నడిచి వచ్చింది). ఉరము మీద ఉన్న చోటును త్రోసికొంటూ పెల్లుబుకుతూ అక్కడ ఉన్న తావులన్నీ బిగువుగా ఆవరించిన (యౌవనోదయ సమయంలో పొటమరించిన) వక్షోజాలు ప్రకటమౌతూ ఉండగా (చనుల సొంపుతో వచ్చింది). తెలుపు నలుపుల వింతకాంతులు కంటి పాపలకు మనోజ్ఞత్వాన్ని కలిగిస్తూ ఉండగా(కన్నుల విలాసంతో కదలి వచ్చింది). ఈ విధంగా పాదాలకు, నడుముకు, చన్నులకు కన్నులకూ వయసు వయ్యారం కలిగిస్తున్నట్లు తేటపడగా మన్మథుడి పూవుటమ్ము వలె (కొలువులోకి) వచ్చింది.

విశేషం: అలం: ఉపమ, క్రమాలంకారం. ఉత్తర ఉదయిస్తున్న యావనంతో ఒప్పారుతున్న కన్య. ఆమెను మన్మథుడి బాణంతో పోల్చి తిక్కన వర్ణించాడు. మూలంలో ఉత్తర సభలోకి రానేలేదు. కాబట్టి ఇది తిక్కన కల్పించిందే. బాణం ప్రయోగిస్తే ఎట్లా దూసుకొని వస్తుందో అట్లా ఉత్తర వచ్చింది. ఇది సమానధర్మం. మామూలు బాణానికీ మన్మథ బాణానికీ భేదం ఉంటుంది. ఉత్తర యౌవన సౌందర్య లక్షణాలను ప్రకటిస్తున్నది. బాణం మన్మథభావ ప్రేరకమైన లక్షణాలను ప్రదర్శిస్తున్నది. ఆ సామ్యాన్ని సమానగుణ వ్యంజకంగా చిత్రించటమే ఈ సీస పద్య రచనా సౌందర్యం.

1. నడక - వేగమైన నడక బాలచేష్ట. వేగం అందమైన మందగమనంగా మారటం యౌవన చేష్ట. వేగంగా దూసుకొని పోవటం మామూలు బాణానికి స్వభావం. నెమ్మదిగా అందంగా సాగటం మన్మథబాణ స్వభావం.

2. నడుము - నడుముకు వళులు అందం. వళులకు నూగారు సింగారం. రెండూ బాగా కనపడకపోతున్నా వాటి చెలిమి కలిమి ఒక నిండుదనాన్ని కలిగిస్తున్నది. ఇది ఉత్తర నడుము సొగసు. మన్మథబాణానికి నడుము తామరతూడు. దానికి నూగారు ఉంటుంది. కాని, అది ఉండీ లేనట్లుగా ఉండి నడుముకు పట్టునిస్తుంది. అదే దాని నిండుదనం.

3. చన్నులు - ఉదయిస్తున్న యౌవనంలో కన్యలకు చన్నులు విస్తృతంగా కనబడవు. కాని, ఎడదమీద పైకి నిక్కబొడుచుకొంటూ ఉన్న తావునంతా బిగువుతో ఆక్రమిస్తున్న స్ఫూర్తి తోస్తుంది. మన్మథబాణ స్వభావం కూడా ఇటువంటిదే. నిష్ఠలు-ప్రకృతి; నిట్టలు- వికృతి. నియమ నిష్ఠల నన్నింటిని ప్రక్కకు తోస్తూ ఆయా స్థానాలలో (దశలలో) ఉన్నమేరలన్నీ (నియమాలన్నీ) బిగిసేటట్లు చేస్తున్నది మన్మథబాణం. రెంటికీ అర్థసామ్యం గమ్యం.

4. కన్నులు - తెల్లని కళ్ళు, నల్లని కనుగుడ్లూ యౌవనంలో మెరుస్తూ ఉంటాయి. కళ్ళలో వలపు చూపుల చాతుర్యం మొగ్గ తొడుగుతూ ఉంటుంది. ఇది ఉత్తరలో కలికితనంగా కళ్ళలో బయటపడుతున్నది. మన్మథబాణంలో తారకవలె మెరుపులతో కూడుకొన్న తెల్లనితనం నల్లని బాణానికి నేర్పరితనంతో ప్రసరించే ప్రజ్ఞను బైట పెడుతున్నది. బాణం లక్ష్యాన్ని తాకుతుంది. ఉత్తర అందరి హృదయాలనూ ఆకట్టుకొన్నది. సీస పాదాలలోని వర్ణనకూ ఎత్తు గీతిలోని చరణములు, నడుము, చన్నులు, కన్నులు అనే పదాలను క్రమంగా అన్వయించుకొనాలి. కాబట్టి ఇందులో క్రమాలంకారం ఉన్నది. తిక్కన విరాటపర్వంలో చేయబోయే స్త్రీ వర్ణనలనే శరపరంపరలలో ఇది తొలిబాణం. తిక్కనకు అత్యంత ప్రీతిపాత్రమైన 'అర్థవ్యక్తి' 'ప్రసాద' గుణాల విశిష్ట సమ్మేళనం ఇందులో పరస్పర పోషకంగా నిబంధించబడటం రచనా సౌందర్యం. (సంపా.)

5. అల్లఁదనంబున యనువు - అల్లఁదనము యొక్క అనువు(ఒప్పు) మాంద్యంలో ఉండే ఒప్పు. 'షష్ఠీతత్పురుషంబులందు నగాగమంబు విభాషనగు! ప్రౌఢ. సమాస. । అరదంబున యురవడికి - వంటిది.

ఆ. **వచ్చి కొలువు సొచ్చి, నెచ్చెలి పిండు నం। తంత నిలువఁబనిచి, యల్ల నల్లఁ**
గదిసి, ప్రౌఢవనిత కైవడి ముద్దియ। ముద్దువుట్టఁ దనకు మ్రొక్కుటయును. **246**

ప్రతిపదార్థం: వచ్చి= వచ్చి; కొలువు= సభలో; చొచ్చి= ప్రవేశించి; నెచ్చెలి పిండున్= చెలికత్తెల సముదాయాన్ని; అంతన్= అంతన్ నిలువన్+పనిచి= అక్కడే ఆగిపొమ్మని ఆజ్ఞాపించి; అల్లనల్లన్ కదిసి= మెల్లగా దగ్గరకు వచ్చి; ముద్దియ= ముగ్ధ అయిన ఉత్తర; ప్రౌఢ వనిత కైవడిన్= ప్రౌఢురాలయిన యువతివలె; ముద్దు+పుట్టన్= ముద్దు వచ్చేవిధంగా; తనకున్= తండ్రికి; మ్రొక్కుటయును= నమస్కరించగా.

తాత్పర్యం: ఉత్తర కొలువులోనికి వచ్చింది. చెలికత్తెలను అల్లంత దూరాన ఆగండని కోరింది. మెల్ల మెల్లగా తండ్రి దగ్గరకు వచ్చింది. ముగ్ధ అయిన ఆమె ప్రౌఢవలె వచ్చి ముద్దువచ్చేటట్లు తండ్రికి మ్రొక్కింది.

చ. **తిగిచి కవుంగిలించి, జగతీవిభుఁ డక్కమలాయతాక్షి నె**
మ్మొగము మొగంబునం గదియ మోపుఁ; గరాంగుళులం గపోల మిం
పుగఁ బుడుకుం; బొరింబొరి నపూర్వ విలోకన మాచరించుఁ; గ
ప్పగు మృదుమౌళి నుజ్జ్వల నఖాంకురచేష్ట యొనర్చు నర్మిలిన్. **247**

ప్రతిపదార్థం: జగతీవిభుండు= విరాట మహారాజు; తిగిచి= చేరదీసి; కవుంగిలించి= కౌగలించుకొని; ఆ+కమల+ఆయత+అక్షి= కమలాలవంటి విశాలమయిన కళ్ళున్న ఉత్తర యొక్క; నెఱి+మొగము= చక్కని ముఖాన్ని; మొగంబునన్= తన ముఖం మీద; కదియన్ మోపున్= తాకే విధంగా దగ్గరికి చేరదీసికొంటున్నాడు; కర+అంగుళులన్= చేతివేళ్ళతో; కపోలము= చెక్కిళ్ళను; ఇంపుగన్+పుడుకున్= ఎంతో ప్రీతితో నిమురుతాడు; పొరిన్+పొరిన్= మాటి మాటికి; అపూర్వ విలోకనము+ఆచరించున్= వింత చూపు చూస్తాడు; అర్మిలిన్= వాత్సల్యంతో; కప్పు+అగు= నల్లనైన; మృదుమౌళిన్= మెత్తని శిరస్సున; ఉజ్జ్వల= ప్రకాశిస్తున్న; నఖ+అంకుర= అంకురాల వంటి గోళ్ళతో; చేష్ట+ఒనర్చున్= స్పృశిస్తాడు.

తాత్పర్యం: విరాటుడు ఉత్తరను చేరదీశాడు, కౌగిలించుకొన్నాడు, ఉత్తర ముఖాన్ని దగ్గరికి చేరదీసి స్పృశించాడు. చేతివేళ్ళతో ఆమె బుగ్గలను నిమిరాడు. తన కూతురయినా మాటి మాటికి కొత్తగా చూచాడు. ఆమె మెత్తని నల్లని తలవెంట్రుకలను మునివేళ్ళతో వాత్సల్యంతో స్పృశించాడు.

విశేషం: తండ్రి విరాటుడు. అతడు రాజు. రాచరికపు కార్యాలతో మునిగిన వారికి అంతఃపురంలోని పిల్లలతో కలిసి కాలం గడపటం తక్కువ. అందుచేత విరాటుడు కుమార్తె కనబడగానే వాత్సల్యంతో చేరదీశాడు. అదిగాక కుమార్తె అందచందాలు తల్లి కంటె కూడా తండ్రికి వింతగా అగపడటం సహజం కూడా.

వ. **ఇవ్విధంబునం దన గాదిలికూఁతు నుపలాలించి, బృహన్నల దెసం గనుంగొని, సాదర దరహసిత రుచిరాననుండై 'యిమ్మగువ నీకు నాట గఱపందగు పాత్రం బగునే?' యని యడిగి, తత్ప్రతివచనంబుల యందలి నాగరికత్వంబునకుఁ జిత్తంబు రంజిల్ల మధుర సల్లాపంబు సేసి, కర్పూర సహితం బగు తాంబూలంబు వెట్టి, చిత్రంబు లగు చీనాంబరంబులిచ్చి, మణిమయంబు లగు నాభరణంబు లొసంగి సంభావించి యవ్విభుండు.** **248**

ప్రతిపదార్థం: ఆ+విభుండు= ఆ రాజు; ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; తన= తనయొక్క; గాదిలి కూఁతున్= ప్రియమయిన కూతురిని; ఉపలాలించి= ఆదరించి; బృహన్నల దెసన్+కనుంగొని= బృహన్నల కేసి చూచి; సాదర= ఆదరంతో కూడిన; దరహసిత= చిరునవ్వుతో; రుచిర= ప్రకాశించే; ఆననుండు+ఐ= ముఖం కలవాడయి; ఈ+మగువ= ఈ బిడ్డ అయిన ఉత్తర; ఆట= నాట్యం; కఱపన్= నేర్పటానికి; నీకున్= నీకు; తగు పాత్రంబు+అగునే= తగిన పాత్రురాలా; అని= అని; అడిగి= అడిగి; తత్+ప్రతివచనంబుల అందలి= ఆ బృహన్నల సమాధాన వాక్కులలోని; నాగరికత్వంబునకున్= నాగరికతకు; చిత్తంబు= మనసు; రంజిల్లన్= సంతోషించగా; మధురసల్లాపంబు+చేసి= ఇంపయిన ఇష్టాగోష్ఠిని కొనసాగించి; కర్పూర సహితంబు+అగు= కర్పూరంతో కూడిన; తాంబూలంబు+పెట్టి= తాంబూలం ఇచ్చి; చిత్రంబులు+అగు= అబ్బురం కలిగించేవయిన; చీన+అంబరంబు= పట్టువస్త్రాలు; ఇచ్చి= (కానుకగా)ఇచ్చి; మణిమయంబులు+అగు= మణులతో కూడిన; ఆభరణంబులు+ఒసంగి= నగలు ఇచ్చి; సంభావించి= గౌరవించి.

తాత్పర్యం: విరాట మహారాజు తన ముద్దులకూతురిని బుజ్జగించాడు. బృహన్నల వైపు చూచాడు. ఆదరంతో చిరునవ్వు నవ్వాడు. 'నీవు నాట్యం నేర్పటానికి ఈమె తగిన పాత్రమౌనా (యోగ్యురాలేనా)?' అని అడిగాడు. బృహన్నల చెప్పిన సమాధానంలోని నాగరికత్వానికి చాల సంతోషించాడు. అతడితో మధుర ప్రసంగం చేశాడు. కర్పూర తాంబూలం ఇచ్చాడు. చీనాంబరాలు, మణిమయ ఆభరణాలు ఇచ్చి గౌరవించాడు. తదనంతరం విరాటుడు ఈ రీతిగా పలికాడు.

విశేషం: 1. గురువులు శిష్యుల విద్యార్హతలను నిర్ణయిస్తారు. అతడంగీకరిస్తేనే శిష్యులకు విద్యాబోధన. అది గురుకుల సంప్రదాయం. అది సాంస్కృతికాంశం. అందువలననే 'ఇమ్మగువ నీకు నాట గఱపందగు పాత్రం బగునే?' అని విరాటుడు బృహన్నలను అడిగాడు. రాజు మర్యాదలు పాటిస్తే ప్రజలు మర్యాదలు పాటిస్తారు. 'యథా రాజా తథా ప్రజా!'

2. విద్యాభ్యాసారంభ సమయంలో గురుపూజ చేయటం సంప్రదాయం. ఆ పూజ పిండి కొద్ది రొట్టె. తాంబూలం ఒక గౌరవప్రదమైన ఒప్పందానికి సాంస్కృతికమైన లౌకిక మర్యాద. అన్ని శుభకార్యాలలోనూ ఇది సర్వసామాన్య మర్యాదగా తెలుగునాట చెలామణి ఔతున్నది. విరాటుడు దానిని పాటించినట్లుగా తిక్కన చిత్రించాడు. (సంపా.)

ఆ. 'నీవు చతురమతివి; నీకు నిక్కన్నియ। నప్పగింప నేల? యైన నాదు
హృదయమతులు దీనియెడఁ గడునార్ద్రమై। యుండుఁ గానఁ జెప్పకుండ రాదు. 249

ప్రతిపదార్థం: నీవు= నీవు; చతురమతివి= నిపుణమయిన బుద్ధి కలదానివి; నీకున్= నీకు; ఈ+కన్నియన్= ఈ ఉత్తరను; అప్పగింపన్+ఏల= అప్పగించట మెందుకు?; ఐనన్= ఐనా; నాదు= నాయొక్క; హృదయమతులు= మనసూ, బుద్ధి; దీని యెడన్= ఈమె యందు; కడున్= ఎంతో; ఆర్ద్రము+ఐ+ఉండున్= వాత్సల్యరసంతో తడిసిఉంటాయి; కానన్= అందుచేత; చెప్పక+ ఉండన్+రాదు= చెప్పకుండా ఊరుకోరాదు.

తాత్పర్యం: 'బృహన్నలా! నీవు నిపుణురాలివి. ఈమెను వేరుగా నీకు అప్పగించవలసిన అవసరం లేదు. అయినా ఉత్తర పట్ల నా మనసు వాత్సల్య రసంతో ఆర్ద్రంగా ఉంటుంది. అందుచేత చెప్పకుండా ఉండలేను సుమా.

క. నెచ్చెలులతోడ నెంతయు। మచ్చిగఁ దన యిచ్చ నాడ మరిగినయదియై
విచ్చలవిడి నింతకు ము। న్నిచ్చేడియ మెలఁగు; శిక్ష యెఱుఁగదు సుమ్మీ! 250

ప్రతిపదార్థం: నెఱ+చెలులతోడన్= ప్రీతిపాత్రలైన చెలికత్తెలతో; ఎంతయున్ మచ్చిగన్=ఎంతో మచ్చికతో; తన+ఇచ్చన్= తన ఇష్టం వచ్చినట్లు; ఆడన్= ఆడడానికి; మరిగిన+అది+ఐ= అలవాటు పడినదై; ఈ+చేడియ= ఈ ఉత్తర; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా (కట్టుబాట్లు, శిక్షణ లేకుండా); ఇంతకున్మున్ను= ఇంతకుముందు; మెలఁగున్= ప్రవర్తించేది; శిక్ష= నాట్య శిక్షణ (విద్య నేర్చుకొనటంలో ఉండే నియమపాలన); ఎఱుఁగదు సుమ్మీ= ఎరగదు సుమా!

తాత్పర్యం: ఈ ఉత్తరకు ఆటలంటే ఇష్టం. చెలికత్తెలతో ఇష్టం వచ్చినట్లు ఆడుతుంది. విచ్చలవిడిగా మెలగుతూ ఉంటుంది. శిక్షణ అంటే ఏమిటో ఈమెకు ఏమాత్రమూ తెలియదు.

ఆ. బాల కేళిమీఁది భరము క్రమంబున। విడువఁ గళలయందు వేడ్క సొనిపి
నయముతోడ నర్తనంబుల శిక్షింపు। నెలంత కేడుగడయు నీవ కాదె!' 251

ప్రతిపదార్థం: బాల= బాలిక అయిన ఉత్తర; కేళిమీఁది భరము= ఆటల పట్ల ఆసక్తి; క్రమంబునన్+విడువన్= క్రమంగా వదలిపెట్టగా; కళల+అందున్= నాట్యకళయందు; వేడ్క= కుతూహలాన్ని; చొనిపి= కలిగించి; నయముతోడన్= నేర్పుతో; నర్తనంబులన్= నాట్య విశేషాలతో; శిక్షింపు(ము)= శిక్షణ కలిగించుము; నెలఁతకున్= ఈ ఉత్తరకు; ఏడుగడయున్= రక్షణం; నీవు+అ,కాదె!= నీవే కదా!

తాత్పర్యం: ఈమె బాలిక. ఈమె కున్న క్రీడాసక్తిని కళలపట్ల ఆసక్తిగా మార్చుము. నర్తనంలో తగిన శిక్షణను ఇమ్ము. ఈమెకు అన్నివిధాల నీవే రక్షకుడివి.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఏడుగడ= తల్లి, తండ్రి, విద్య, గురువు, దైవం, దాత, పురుషుడు - స్త్రీకి ఈ ఏడుగురు రక్షకులు.

చ. **అని యుచితంబుగాఁ బలికి, యంగన హస్తముఁ బట్టి, తత్కరం**
బునఁ గదియించి, 'నీ గురువుఁ బొల్తి! తగం గొనియాడు; మెట్లు సె
ప్పె నటుల భక్తిమై నడపు; పెం పెసలారఁగఁ గూడు గూర చం
దన కుసుమాదులున్ నడపి తప్పక యారసి గౌరవింపుమీ! 252

ప్రతిపదార్థం: అని= అని; ఉచితంబుగాన్= తగినవిధంగా; పలికి= మాటలాడి; అంగన= ఉత్తర యొక్క; హస్తమున్= చేతిని; పట్టి= పట్టుకొని; తద్+కరంబునన్+కదియించి= ఆ బృహన్నల చేతిలో పెట్టి; పొల్తి! (పొలతీ)= ఓ అమ్మాయీ!; నీ గురువున్= నీ గురువయిన బృహన్నలను; తగన్= తగినవిధంగా; కొనియాడుము= గౌరవించుము; ఎట్లు+చెప్పెన్= ఎట్లా చెబితే; అటులు+అ= ఆ విధంగా; భక్తిమై నడపు(ము)= భక్తితో జరిపించుము; పెంపు+ఎసలారఁగన్= పెంపు అతిశయించగా; కూడు+కూర= కూడు కూర; చందనకుసుమాదులున్= గంధం, పుష్పం మొదలయినవి; నడపి= జరిపించి; తప్పక+అరసి= తప్పకుండా అందుతున్నాయా లేదా అని తెలిసికొని; గౌరవింపుమీ!= గౌరవించుమా!.

తాత్పర్యం: అని తగిన విధంగా మాట్లాడాడు. ఉత్తర చేతిని బృహన్నల చేతిలో పెట్టాడు. 'అమ్మా! ఈమె నీ గురువు. ఆ గురువు హోదాకు తగినట్లు గౌరవించుము. బృహన్నల ఎట్లా చెప్పితే అట్లా భక్తితో నడుచుకొమ్ము. మన గొప్ప తనానికి తగినట్లు ఆహారం. కూడు. కూర, గంధం. పూలు మొదలయినవి సమకూర్పుము. శ్రద్ధతో గౌరవించుము.

ఆ. **ఎల్ల చుట్టములును దల్లియుఁ దోడును। జెలియుఁ బరిజనంబుఁ జెలువ! నీకు**
గురువ; యింక నొక్క కొఱఁతయు లే దిందుఁ। జేరి బ్రదుకు బుద్ధి గౌరవమున. 253

ప్రతిపదార్థం: చెలువ!= (వనితా) అమ్మా!; ఎల్ల చుట్టములును= నీ కున్న బంధువులందరూ; తల్లియున్= తల్లిన్నీ; తోడును= తోడబుట్టిన వారూ, సన్నిహితులూ; చెలియున్= స్నేహితురాలున్నూ; పరిజనంబున్= సేవకులున్నూ; నీకున్= నీకు; గురువు+అ= గురువయిన బృహన్నల మాత్రమే; ఇందున్= ఈ విషయంలో; ఇంకన్= ఇంకా; ఒక్క కొఱఁతయున్= ఒక్క లోటు కూడా; లేదు= లేదు; చేరి= ఈమె దగ్గర చేరి; బుద్ధి గౌరవమునన్= తెలివి తేటల వలన కలిగే గొప్పతనంతో; బ్రదుకు(ము)= జీవించుము.

తాత్పర్యం: అమ్మా! ఉత్తరా! నీకు చుట్టాలు తల్లి, తండ్రి, తోడు, చెలి, బలగం అంతా గురువే. నీకు ఏ లోటూ లేదు. బృహన్నల దగ్గర తెలివితేటలతో గౌరవమైన పద్ధతిలో జీవించుము.

విశేషం: ప్రాచీన కాలంలో 'గురువు'కు విశిష్టస్థానం ఉండేది. శిక్షణకాలంలో గురువే సర్వస్వం. తల్లిదండ్రుల ప్రమేయం చాల తక్కువ.

క. **మన యింట నిచ్చ టచ్చో। టన కెచ్చట నైన నీ బృహన్నల మెలఁగం**
జనియెడు మానిసి; తన మన। మున కిమ్ముగునట్టి చరితమున వర్తించున్.' 254

ప్రతిపదార్థం: మన+ఇంటన్= మన ఇంట్లో; ఇచ్చటన్= ఇక్కడ; ఆ+చోటు+అనక= అక్కడ అనకుండా; ఎచ్చటన్+ఐనన్= ఎక్కడయినా; ఈ బృహన్నల= ఈ బృహన్నల; మెలఁగన్+చనియెడు= తిరుగదగిన; మానిసి= మనిషి; తన మనమునకున్= తన మనస్సుకు; ఇమ్ము+అగునట్టి= ఇష్టమయిన; చరితమునన్= నడవడికతో; వర్తించున్= ప్రవర్తిస్తుంది.

తాత్పర్యం: ఈ బృహన్నల మనస్సుకు నచ్చిన విధంగా ప్రవర్తించవచ్చును. ఈమెకు అంతఃపుర సంచారంలో నిషేధం ఏ మాత్రం లేదు.'

వ. అని యిత్తెఱంగున నయ్యిరువుర నొండొరులకు నప్పగించి పుచ్చిన యనంతరంబ నకులుండు. 255

ప్రతిపదార్థం: అని= అని; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఆ+ఇరువురన్= ఆ ఇద్దరిని; ఒండు+ఒరులకున్= ఒకరి కొకరిని; అప్పగించి= అప్పగించి; పుచ్చిన= పంపించిన; అనంతరంబు+అ= పిదప; నకులుండు= నకులుడు.

తాత్పర్యం: ఉత్తరను బృహన్నలకు, బృహన్నలను ఉత్తరకు అప్పగించి పంపించాడు. ఈ లోగా నకులుడు.

నకులుఁ డశ్వపాలకుఁడై విరటుఁ గొల్వవచ్చుట (సం.4-11-1)

ఉ. అంబుజముల్ సముద్యదరుణాంశునిఁ గన్న విధంబునన్ వికా
సంబున నుల్లసిల్లి జనచారువిలోచనముల్ నిజోజ్జ్వలాం
గంబున కర్థిమై నభిముఖంబులుగాఁ జనుదెంచి దైవ యో
గంబున భూవిభుండు తురగంబులఁ దేరఁగఁ బంచి చూడఁగన్. 256

ప్రతిపదార్థం: అంబుజముల్= పద్మాలు; సమ్+ఉద్యత్= అప్పుడప్పుడే ఉదయించే; అరుణ+అంశునిన్= సూర్యుడిని; కన్న విధంబునన్= చూచినట్లుగా; జన= జనుల; చారు= అందమయిన; విలోచనముల్= కన్నులు; వికాసంబునన్+ఉల్లసిల్లి= వికాసంతో విప్పారి; నిజ= తనయొక్క; ఉజ్జ్వల= కాంతిమంతమయిన; అంగంబునకున్= శరీరానికి; అర్థిమైన్= కోరికతో; అభిముఖంబులు+కాన్= ఎదురు కాగా; చనుదెంచి= వచ్చి; దైవయోగంబునన్= దైవవశాత్తు; భూవిభుండు= రాజు; తురగంబులన్= గుఱ్ఱాలను; తేరఁగన్+పంచి= తీసికొని రావలసిందిగా ఆజ్ఞాపించి; చూడఁగన్= చూస్తూ ఉండగా.

తాత్పర్యం: పద్మాలు అపుడపుడే ఉదయించే సూర్యుడిని చూచిన విధంగా ప్రజల నేత్రాలు వికాసంతో విప్పారుతున్నాయి, నకులుడి స్ఫురద్రూపం మీద పడుతున్నాయి. దైవవశాత్తు విరాటుడు గుఱ్ఱాలను తీసికొనిరమ్మని ఆజ్ఞాపించాడు. వాటిని తదేకంగా పరిశీలిస్తున్నాడు. ఆ సమయంలో నకులుడు.

విశేషం: అలం: ఉపమ. పాండవులలో నకులుడు చాల అందగాడు. ఒకసారి చూస్తే మరల చూడాలనిపించే రూపం అతడిది. అతని రూపం ఉదయించే సూర్యుడి వంటిది. ప్రజల చూపులు (కళ్ళు) పద్మాలవంటివి.

వ. ఆస్థానంబు సేరవచ్చి ఘోటకంబుల నుపలక్షించుచున్న నన్నరేంద్రుండు గనుంగొని పరిజనంబుల కతనిం జూపి. 257

ప్రతిపదార్థం: ఆస్థానంబు= కొలువు కూటాన్ని; చేరన్+వచ్చి= సమీపించి; ఘోటకంబులన్= గుఱ్ఱాలను; ఉపలక్షించుచున్+ఉన్నన్= చూస్తూ ఉండగా; ఆ+నర+ఇంద్రుండు= ఆ (విరాట మహా) రాజు; గనుంగొని= తేరిపార చూచి; పరిజనంబులకున్= సేవకులకు; అతనిన్+చూపి= అతనిని చూపించి.

తాత్పర్యం: నకులుడు కొలువు దగ్గరికి వచ్చాడు. గుఱ్ఱాలను చూస్తున్నాడు. మహారాజు నకులుడి పరిశీలనను గుర్తించాడు. పరివారానికి చూపించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'ఇతఁ డెవ్వఁ డొక్కొ! రూపు ని। రతి శయమై మనమునకుఁ బ్రియం బొసఁగెడుఁ జూ

చితిరే చిత్తంబు ను దా। త్తత గానఁగ నయ్యెడున్ వదనమున భంగిన్. 258

ప్రతిపదార్థం: ఇతఁడు= గుర్రాలను పరిశీలిస్తున్న ఇతడు; ఎవ్వఁడు+ఒక్కొ!= ఎవడో కదా!; రూపు= ఇతని రూపం; నిరతిశయము+ఐ= ఎంతో అధికమై; మనమునకున్= మనసుకు; ప్రియంబు+ఒసఁగెడున్= ప్రీతి కలిగిస్తున్నది; వదనమున భంగిన్= ముఖం తీరుతెన్నులో; చిత్తంబు+ఉదాత్తత= మనసులోని గొప్పదనం; కానఁగన్+అయ్యెడున్= కనబడుతున్నది; చూచితిరే= చూచారా.

తాత్పర్యం: 'ఇత డెవరో? ఇంతటి చక్కని రూపం మనసుకు ఎంతో ప్రీతి కలిగిస్తూ ఉన్నది. ఉదాత్తమయిన మనోగతి ముఖంలో ప్రతిఫలిస్తూ ఉన్నది.

క. తురగంబులఁ జూచు విధం। బరయఁగ నితఁ డశ్వవిద్యయందు నిపుణతా

స్ఫురణము గల వాఁ డగు బం। ధురమూర్తి పరాక్రమాన్వితుఁడు గానోపున్. 259

ప్రతిపదార్థం: ఇతఁడు= నకులుడు; తురగంబులన్= గుర్రాలను; చూచు విధంబు+అరయఁగన్= పరిశీలించే తీరు చూస్తే; అశ్వవిద్య+అందున్= అశ్వశాస్త్రంలో; నిపుణతాస్ఫురణము= నైపుణ్య స్ఫూర్తి; కలవాఁడు+అగున్= కలిగినవారు అయి ఉండాలి; ఇతఁడు= ఈ నకులుడు; బంధురమూర్తి= రమ్యమయిన ఆకారం కలవాడు; పరాక్రమ+అన్వితుఁడు= పరాక్రమంతో కూడినవాడు; కాన్+ఓపున్= కావచ్చును.

తాత్పర్యం: ఇతడు గుర్రాలను పరిశీలించే తీరు చూస్తే ఇతడికి అశ్వశాస్త్రంలో ఎంతో నైపుణ్యం ఉన్నట్లు అనిపిస్తున్నది. ఇతడు సుందరాకారం మాత్రమే కలవాడు కాదు. పరాక్రమోపేతుడు కూడా.

విశేషం: విరాటుడు, నకులుడు- ఇద్దరూ అశ్వలక్షణాలు తెలిసినవారే. నకులుడి పరిశీలన విరాటుడిని ఆకట్టుకొన్నది. ఆకారం పరాక్రమం రెండూ ఒకచోట కనబడటం అరుదు. నకులుడిలో ఈ రెండూ ఉండటం విశేషం.

క. మీ రెఱిఁగినఁ జెప్పుఁ డీతని। పే; రెఱుఁగని యట్టులైనఁ బెంపారంగాఁ

జేరం జని యల్లన యొకఁ। డారసి యెఱుఁగంగ వలయు నను సమయమునన్. 260

ప్రతిపదార్థం: మీరు= మీరు; ఈతని పేరు= ఇతని పేరు; ఎఱిఁగినన్= తెలిసి ఉంటే; చెపుఁడు= చెప్పండి; ఎఱుఁగని+అట్టులు+ఐనన్= తెలియక పోతే; పెంపు+ఆరంగాన్= సగౌరవంగా; చేరన్+చని= దగ్గరికి వెళ్ళి; అల్లన= మెల్లగా; ఒకఁడు= ఒకవ్యక్తి; ఆరసి= విచారించి; ఎఱుఁగంగవలయున్= తెలిసికొనాలి; అను సమయమునన్= అని చెబుతున్న సమయంలో.

తాత్పర్యం: మీకు తెలిసి ఉంటే ఇతడి పేరు చెప్పండి. తెలియకపోతే ఎవరయినా దగ్గరికి వెళ్ళి హుందాగా విచారించి తెలిసికొనాలి- అని అనుకొంటున్న సయయంలో.

క. చేరఁ జనుదెంచి పాండవ। వీరుఁడు మత్స్యాధిపునకు వినతుండై 'దే

వా! రాజవాహనములగు। వారువముల నరయ నేర్తు వల నేర్పడఁగన్. 261

ప్రతిపదార్థం: పాండవ వీరుఁడు= నకులుడు; చేరన్+చనుదెంచి= దగ్గరకు వచ్చి; మత్స్య+అధిపునకున్= మత్స్య రాజ్యానికి అధిపతి అయిన విరాటునికి; వినతుండు+ఐ= నమస్కరించిన వాడయి; దేవా!= ప్రభూ!; రాజవాహనములు+అగు= మహారాజులు ఎక్కి స్వారి చేయగలిగిన వాహనాలు, మహారాజుకు సంబంధించిన వాహనాలయిన; వారువములన్= గుర్రాలను; వలను+ఏర్పడఁగన్= నేర్పరితనం బయలుపడే విధంగా; అరయన్ నేర్తున్= పర్యవేక్షణ చేయగలను.

తాత్పర్యం: నకులుడు విరాటుడి దగ్గరకు వచ్చి నమస్కరించాడు. 'దేవా! నేను రాజవాహనాలయిన గుర్రాలను చాల నేర్పుగా కనిపెట్టి జాగ్రత్తగా చూచుకొంటాను.

వ. దామగ్రంథి యనువాఁడ, నాకు నశ్వవిషయం బయిన విచక్షణత్వం బెల్లనుం గల; దవధరింపు' మని యిట్లనియె. **262**

ప్రతిపదార్థం: దామగ్రంథి+అనువాఁడన్= దామగ్రంథి అనే పేరుగలవాడిని; నాకున్= నాకు; అశ్వవిషయంబు+అయిన= గుర్రాలకు సంబంధించిన; విచక్షణత్వంబు+ఎల్లనున్= జ్ఞానమంతా; కలదు= ఉన్నది; అవధరింపుము+అని= చిత్తగింపుము అని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: నాపేరు దామగ్రంథి. నాకు అశ్వశాస్త్రం తెలుసు. వినవలసినది'- అని ఈ విధంగా అన్నాడు.

సీ. 'అవయవ లక్షణం, బాయుః ప్రమాణంబు, । గర్భంబు, లింగితాకారములును,
మాత్రాంతరము, వయోమానంబు, దేశకా । లోచితాహార ప్రయోగభంగి,
జాత్యనురూప శిక్షావిధి, క్రమగతి । వ్యాయామ సాత్మ్య ప్రవర్తనంబు,
ప్రమద విషాదాది బహువిధ చిత్తధ । ర్మము, పోషణ ప్రకారము, చికిత్స

ఆ. పరిచితములు ధరణిపాల! నీ ముందట । రూపురేఖ మెఱయఁ జూపనేర్తు;
బవర మైన నాకుఁ బని యేమి యనఁ, జేతి । బలిమి కలిమి నెఱపఁ దలఁపు గలదు.' **263**

ప్రతిపదార్థం: ధరణిపాల!= భూమిని పాలించే ఓ రాజా!; అవయవ లక్షణంబు= గుర్రాల అవయవాల లక్షణం; ఆయుఃప్రమాణంబు= గుర్రాల ఆయువు యొక్క పరిమాణం; గర్భంబులు= చూలుతో ఉందా లేదా అనే అంశాలు; ఇంగిత+ఆకారములును= మానసికమయిన అభిప్రాయాలు, ఆ కారణంగా శరీరంలో కలిగే మార్పులూ; మాత్ర+అంతరము= పరిమాణం యొక్క భేదం; వయోమానంబున్= వయస్సు యొక్క ప్రమాణమూ; దేశ+కాల+ఉచిత+ఆహార+ప్రయోగభంగి= దేశానికి, కాలానికి తగినట్లు తిండి పెట్టేతీరు; జాతి+అనురూప= జాతికి తగిన; శిక్షావిధి= అశ్వశిక్షణ పద్ధతి; క్రమగతి= ఒప్పిదమైన నడకయు; వ్యాయామ= వ్యాయామం చేత; సాత్మ్య= సహజమైన; ప్రవర్తనంబు= నడవడి; ప్రమద= సంతోషం; విషాద= సంతాపం; ఆది= మొదలయిన; బహువిధ= అనేక విధాలయిన; చిత్తధర్మము= మనోలక్షణం; పోషణ ప్రకారము= పోషించే తీరు; చికిత్స= వైద్యం; పరిచితములు= బాగా తెలుసు; నీ ముందటన్= నీ సమక్షంలో; రూపురేఖ మెఱయన్= రూపురేఖ ప్రకాశించగా; చూపన్+నేర్తున్= చూపగలను; బవరము+ఐనన్= యుద్ధం వస్తే; నాకున్= నాకు; పని+ఏమి+అనన్= ఈ యుద్ధంతో ఏమిజోలి అని అనను; బలిమి కలిమి= బల సంపదను; నెఱపన్= ప్రకటించే; తలఁపు= ఊహ - ఆలోచన; కలదు= ఉన్నది.

తాత్పర్యం: అశ్వలక్షణాలు ఎటువంటివో నాకు తెలుసు. చూడగానే గుర్రాల ఆయుఃప్రమాణం చెప్పగలను. చూలో కాదో చెప్పగలను. ఆకారాన్ని చూచి మనోభావం చెప్పగలను. వయః పరిమితులు, జాతికి తగిన శిక్షణ విధానము, వ్యాయామ పద్ధతులు, చిత్తవృత్తుల రీతులు, గుర్రాల మేతలు, పోషణ పద్ధతులు, చికిత్సా పద్ధతులు నాకు తెలుసు. వాటిని మీ యెదుట ప్రదర్శించి చూపగలను. ఒకవేళ యుద్ధం వస్తే అది నాపని కాదని ఊరుకోను. నా బల సంపదను ప్రదర్శించాలని భావిస్తాను.

వ. అనిన విరాటుం డతని కిట్లనియె. 264

తాత్పర్యం: అనగా విని విరాటరాజు నకులుడితో ఇట్లా అన్నాడు.

క. 'నీకుఁ దగు పదవి యిచ్చెదఁ। నా కలిమికి నెల్ల రక్షణం బొనరింపం
గాక హయశిక్షకుఁడ వను। నా కొలఁదియె? యిట్లు పలుకు టనుచిత మరయన్.' 265

ప్రతిపదార్థం: నీకున్= నీకు; తగు= తగిన; పదవి= పదవిని; ఇచ్చెదన్= ఇస్తాను; నా కలిమికిన్+ఎల్లన్= నా ఐశ్వర్యానికంతటికీ; రక్షణంబు+ఒనరింపన్+కాక= రక్షణ చేకూరుద్దువు గాని; హయశిక్షకుఁడవు+అను+ఆ కొలఁదియె= హయ శిక్షకుడవు అనటం మాత్రమేనా?; అరయన్= పరిశీలించగా; ఇట్లు= ఈ విధంగా; పలుకుట= మాటలాడటం; అనుచితము= తగదు.

తాత్పర్యం: 'నీకు తగిన పదవి ఇస్తాను. నా ఐశ్వర్యాన్ని కాపాడుదువులే. నీవు గుర్రాల కాపరివని మాత్రమే అనటం తగదు. ఇట్లా మాటలాడటం నీకు సముచితంగా లేదు.'

ఆ. అనుడు నకులుఁ డిట్టులను 'దేవ! తమ తమ। నేర్చు పనుల వెంట నెగడి బ్రదుక
వలయుఁ గాక, నగరఁ దలము దప్పిన మెలం। కువల కొలువు లియ్యకొనుటఁ దగునె? 266

ప్రతిపదార్థం: అనుడున్= అనగానే; నకులుఁడు= నకులుడు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= చెప్పసాగాడు; దేవ= దేవా!; తమ తమ నేర్చు= తాము నేర్చిన; పనుల వెంటన్= పనులలో; నెగడి= ప్రవర్తించి; బ్రదుకవలయున్+కాక= బ్రతకాలి కాని; నగరన్= రాజమందిరంలో; తలము తప్పిన= వీలుకాని; మెలంకువల కొలువులు= నేర్పరితనంతో కూడిన కొలువు సేవలు; ఇయ్యకొనుట= ఒప్పుకొనటం; తగునె?= తగునా? (తగదు).

తాత్పర్యం: అనగానే నకులుడు ఈ విధంగా చెప్పసాగాడు. 'రాజా! ఎవరైనా వారికి తెలిసిన పనులు వారు చేస్తూ బ్రతకాలి. అంతేకాని వీలుకాని (చేతకాని) సేవలకు ఒప్పుకొనటం న్యాయం కాదు.

విశేషం: ఈ భావం అమూలకం. తగిన వానికే తగిన పదవి- అనే ధర్మం నకులుడి శీలంగా వ్యక్తం చేశాడు. అది ఉత్తమ రాజనీతి. (సంపా.)

ఉ. ధర్మసుతుండు పెంచె ననుఁ దాన తురంగమ శాస్త్రశిక్షకుం
గర్మరుఁ జేసి యాత్మతురగంబుల కెల్లను నన్న యుక్తుఁగా
నర్మిలి నిల్పి యీఁగియుఁ బ్రియంబును నాయెడ నాఁడు నాఁటికిం
బేర్మి వహించుచుండ నడపెం దన తమ్ములలోని వానిఁగన్. 267

ప్రతిపదార్థం: ధర్మసుతుండు= ధర్మరాజు; ననున్ పెంచెన్= నన్ను పెంచాడు; తాన్+అ= తానే; తురంగమ శాస్త్ర శిక్షకున్= అశ్వశాస్త్రానికి సంబంధించిన విద్యాభ్యాసంలో; కర్మరున్+చేసి= కార్యశూరునిగా తయారుచేసి; ఆత్మతురంగంబులకున్+ఎల్లనున్= తన గుర్రాలన్నిటికి; నన్నున్+అ= నన్నే; యుక్తున్+కాన్= తగిన వానినిగా; అర్మిలిన్= ఆదరంతో; నిల్పి= నిలిపి; ఈఁగియున్= దానమూ; ప్రియంబును= ప్రీతియు; నా+ఎడన్= నా మీద; నాఁడు నాఁటికిన్= నానాటికి; పేర్మి వహించుచున్+ఉండన్= అధికం అవుతూ ఉండగా; తన తమ్ములలోని వానిఁగన్= తన తమ్ములలో ఒకనిగా; నడపెన్= పోషించాడు.

తాత్పర్యం: ధర్మరాజు నన్ను పెంచాడు. అశ్వశాస్త్రశిక్షణలో నన్ను నేర్పరిగా చేశాడు. గుర్రాలకు అధిపతిని చేశాడు. నానాటికి నా పట్ల ప్రీతి పెరిగింది. అందుచేత నన్ను తన తమ్ముళ్ళలో ఒకడిగా చూచుకొనే వాడు.

విశేషం: పాత్రోచిత సంభాషణ శిల్ప రచనలో తిక్కన చూపే ప్రజ్ఞకు ఈ పద్యం మహనీయోదాహరణం. ఆ విషయం మూలంతో పోలిస్తే బాగా తేటపడుతుంది.

"పంచానాం పాండుపుత్రాణాం జ్యేష్ఠో రాజా (భ్రాతా) యుధిష్ఠిరః
తే నాహ మశ్వేషు పురా నియుక్తః శత్రుకర్శన॥
అశ్వానాం ప్రకృతిం వేద్మి విషయం చాపి సర్వశః
దుష్టానాం ప్రతిపత్తిం చ కృత్స్నం చైవ చికిత్సితమ్"॥ (సం.4.11.6-7)

'పంచపాండవులలో పెద్దవాడు (రాజు) యుధిష్ఠిరుడు. ఆయన నన్ను తన అశ్వాలకు అధికారిగా నియోగించాడు. గుర్రాల స్వభావాలు నాకు తెలుసు. వాటికి సంబంధించిన శిక్షణలు, వైద్యవిధానాలూ నాకు కరతలామలకాలు' - అని నకులుడు అంటాడు. మూలంలో. మూలంలో నకులుడు ధర్మరాజు మెచ్చిన అశ్వశాలాధ్యక్షుడు మాత్రమే. తిక్కన రచనలో ధర్మరాజు స్వయంగా శిక్షణ నిచ్చి తన తమ్ములలో ఒకడిగా పరిగణించి ప్రేమించిన విశిష్టవ్యక్తి. ఈ పద్యం నకులుడికి ధర్మరాజు మీద ఉన్న ఆప్యాయతను, ఆదర గౌరవాలను వ్యక్తం చేస్తున్నది. మనసుతో పలికిన మాట లతనివి. అందువలననే పైకి వ్యవహారోచిత వాచ్యార్థం - లోనారసి చూస్తే భక్తి ప్రపత్తులతో ధర్మరాజుకు కృతజ్ఞతలు చెప్పుతున్నట్లు పలికే రమణీయార్థం.

ప్రకృతార్థం: 'ధర్మరాజు ఆశ్రయమిచ్చి, అన్నంపెట్టి నన్ను పెంచి పెద్దవాడిని చేశాడు. అంతేకాదు అశ్వశిక్షణలో విద్యావంతుడిని, అనుభవ జ్ఞానం కలవాడినీ చేశాడు. తన వద్దనే కొలువు చూపించాడు. తన గుర్రాలకు అధిపతిగా అభిమానంతో నియోగించాడు. నాటి నాటికి నా మీద పెరిగే ప్రేమను ప్రకటించాడు. అందాకా ఎందుకు? ఆయన తమ్ములలో ఒకనిగానే నన్ను చూచాడు.'

రమణీయార్థం: 'ధర్మరాజు నా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందింపచేశాడు. తురంగాలు ఇంద్రియాలకు సంకేతాలు. అందువలన ఇంద్రియాలను నిగ్రహించే విద్యలో నన్ను కర్మమార్గంలో కార్యశూరుడిని చేశాడు. తనలోని ఆశల (తురగాల) కన్నిటికీ నేనే అర్హుడిగా నిలచేటట్లు ప్రేమతో చూచాడు. ఆయా సందర్భాలలో నా మీద ప్రత్యేకాభిమానం చూపేవాడు. (యక్ష ప్రశ్నల ఘట్టంలో తమ్ములలో ఒక్కడిని బ్రతికించుకొమ్మని ధర్ముడు అవకాశమిస్తే నకులుడినే ఎన్నుకొన్నాడు ధర్మరాజు. జమ్మిచెట్టు మీదకు ఎక్కి అస్త్రాలను మూటకట్టి దాచినప్పుడు తన తరువాత నకులుడినే నియోగించాడు. ఇటువంటివి దానికి తార్కాణాలు). వ్యవహారంలో తన తల్లికి పుట్టిన తమ్ములు కౌంతేయులైన భీమార్జునుల వలెనే సవతి తల్లి కొడుకునైన మాద్రేయుడనైన నన్ను కూడా భావించి ఏకోదర ప్రేమను పంచిపెట్టాడు. 'తన తమ్ములు'- అనే పదంలో అర్థవైచిత్రి ఉన్నది. 'కర్మఠుని', 'ఆత్మ తురగంబులు' మొదలైన పదాలు అంతరార్థాన్ని దర్శించటానికి తోడ్పడే శబ్దార్థవైచిత్రుల కర దీపికలు. మూలంలోని నకులుడికి ఇంతటి వాక్చాతుర్యం లేదు. మాటలలో ధర్మజుడి తమ్ముడనిపించుకొన్నట్లు చిత్రించి నకులపాత్రకు ఒక ఔన్నత్యాన్ని కల్పించాడు తిక్కన. ఆర్ద్రమైన నకులుడి భావాలను మాధుర్యగుణంతో తిక్కన మధురతరం చేశాడు. పృథక్పదత్వం, అర్థవైచిత్ర్యం, ఉక్తి వైచిత్ర్యం అనే మాధుర్య గుణ లక్షణాలు ఈ పద్యరచనలో ప్రసన్నమయ్యాయి. (సంపా.)

క. ఆ విభుఁడు రాజ్యసుఖ లీ। లా విముఖత వెడలి బంధులం దొఱఁగి యథే
ష్టావాసత బ్రుంగుడు వడి। పోవుట నెచ్చోటఁ గడుపుఁ బ్రోతునొ యనుచున్. 268

ప్రతిపదార్థం: ఆ విభుఁడు= ధర్మరాజు; రాజ్యసుఖలీలా విముఖతన్= రాజ్య సౌఖ్యాల యొక్క విలాసాల పట్ల గల వైరాగ్యం వలన; వెడలి= రాజ్యం వదలి; బంధులన్= బంధువులను; తొఱఁగి= వదలిపెట్టి; యథా+ఇష్ట+ఆవాసతన్= ఇష్టం వచ్చిన చోట నివసించటం వలన; బ్రుంగుడు+పడి= మరుగునపడి; పోవుటన్=పోవటం చేత; ఏ+చోటన్= ఎక్కడ; కడుపున్+ ప్రోతునొ= పొట్ట పోసుకుంటానో; అనుచున్= అనుకొంటూ.

తాత్పర్యం: ధర్మరాజు రాజ్యంమీద విముఖతతో వెళ్ళిపోయాడు. చుట్టాలను వదలిపెట్టాడు. తనకు తోచిన చోట (ఉన్నాడు) వసించాడు. ఆ తరువాత అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. ఇంక నేను ఎక్కడ పొట్టపోసుకొన గలనా? అని అనుకొంటూ (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తిరిగి తిరిగి లోకోత్తర । చరితుఁడు సుజనుండు మత్స్యజనవిభుఁడు యుధి
ష్ఠిరునట్ల యనఁగ విని నినుఁ । గర మనురాగమునఁ గొలువఁగా నియ్యెడకున్. 269

ప్రతిపదార్థం: తిరిగి తిరిగి= తిరిగి తిరిగి; యుధిష్ఠిరున్+అట్ల= ధర్మరాజు వలె; లోక+ఉత్తర చరితుఁడు= అసామాన్యమయిన ప్రవర్తన కలవాడు; సుజనుండు= మంచివాడు; మత్స్య జనవిభుఁడు= మత్స్య దేశంలోని జనులకు అధిపతి అయినవాడు; అనఁ గన్+విని= అని చెప్పుకొంటూ ఉంటే విని; నినున్= నిన్ను; కరము= ఎంతో; అనురాగమునన్= ప్రేమతో; కొలువఁగాన్= సేవించడానికి; ఈ+ఎడకున్= ఇక్కడకు.

తాత్పర్యం: చాలాచోట్లు తిరిగాను. విరాటుడు సజ్జనుడని, పుణ్యాత్ముడని, ధర్మరాజు వంటివాడని విన్నాను. అందుచేత ఎంతో సంప్రీతితో మిమ్ము సేవించడానికి ఇక్కడకు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. చనుదెంచి కాంచి నా నే । ర్చిన తెలఁగున విన్నపంబు సేసితి; నన్నుం
బని గొనఁ దలఁచిన నేలెడి; । దనుమానము గలిగెనేని నరిగెద నధిపా!' 270

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; కాంచి= చూచి; నా నేర్చిన తెఱఁగునన్= నాకు చేతనయినట్లు ; విన్నపంబు+చేసితిన్= మనవి చేశాను; నన్నున్= నన్ను; పని+కొనన్+తలఁచినన్= పనుల్లో నియోగించ తలచినట్టయితే; ఏలెడిది= ఏలుకొనేది; అధిపా!= రాజా!; అనుమానము+కలిగెన్+ఏనిన్= సందేహం కలిగితే; అరిగెదన్= ఇపుడే తిరిగి వెళ్ళిపోతాను.

తాత్పర్యం: ఇక్కడకు వచ్చాను. నిన్ను చూచాను. నాకు చేతనయిన పద్ధతిలో విన్నవించుకొన్నాను. నాచేత పని చేయించుకొన దలచినట్లయితే ఏలుకొమ్ము. లేదా మీకు సందేహం కలిగితే వెళ్ళిపోతాను'.

వ. అనవుడు. 271

తాత్పర్యం: అనగానే.

ఉ. ఆ నరనాథుఁ డిట్లనియె; 'నశ్వములం బరికించి యున్కి యిం
పేని తురంగశాలలకు నెల్లను ముఖ్యుఁడవై తదీయ నా
నా నియత ప్రకార కరణంబులఁ ద్రిమ్మరుచున్న వారి ము
న్నే నెటు లట్ల నీ వరసి యిచ్చమెయిం బనిగొమ్ము నెమ్మితోన్.' 272

ప్రతిపదార్థం: ఆ నరనాథుఁడు= విరాటుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అశ్వములన్= గుఱ్ఱాలను; పరికించి+ఉన్కి= పర్యవేక్షిస్తూ ఉండటం; ఇంపు+ఏని= ఇష్టం అయితే; తురంగ శాలలకున్+ఎల్లను= గుఱ్ఱాల శాలలన్నిటికి; ముఖ్యుఁడవు+ఐ= ప్రధానాధికారివై; తదీయ= ఆ అశ్వశాలలకు సంబంధించిన; నానా= అనేకాలయిన; నియతప్రకార= నియమిత విధానాలతో కూడిన; కరణంబులన్= పనులలో; త్రిమ్మరుచున్+ఉన్న= తిరుగుతున్న; వారిన్= వారిని; మున్ను= పూర్వం; ఏన్= నేను; ఎటులు= ఏవిధంగానో; అట్లు+అ= అట్లే; నీవు= నీవు; అరసి= పర్యవేక్షించి; ఇచ్చమెయిన్= నీ ఇష్టం వచ్చినట్లు; నెమ్మితోన్= ప్రేమతో; పని+కొమ్ము= పనిచేయించుకొనుము.

తాత్పర్యం: విరాట మహారాజు ఈ విధంగా అన్నాడు - 'అశ్వపరిరక్షణమే నీ కిష్టమయితే అశ్వశాల లన్నిటికీ ప్రధానుడవుగా ఉండుము. నేను అశ్వపాలకులను ఏవిధంగా చూచేవాడినో ఆ రకంగానే నీవూ చూడుము. ప్రీతితో వాళ్ళచేత పనులు చేయించుకొనుము'.

విశేషం: నకులుడిని నియోగించటంలో మూలంలో లేని ఎన్నో విశేషాలను సమకాలీన ప్రభుత్వ పరిజ్ఞానంలో నుండి ఎన్నుకొని ఇందులో సందర్భోచితంగా తిక్కన నిబంధించాడు. అతడు మనుమసిద్ధికి మహామంత్రి కదా! విరాటుడికి అశ్వశాలలు ఎన్నో ఉన్నాయి. వాటి అన్నిటి మీదా నకులుడు సర్వాధికారి. ప్రభుత్వంలో పలురకాల బాధ్యతలు నిర్వహించే వారు-వాహనాలైన అశ్వాలను అనేక ప్రయోజనాలకు ఉపయోగించుకొంటారు. వారు ఆయా పనులమీద తిరుగుతూ ఉంటారు. వారందరినీ కనిపెట్టి చూచి ఎవరిని ఏవిధంగా వినియోగించుకొనాలో, గౌరవించాలో, జీత బత్తేలిచ్చి పోషించాలో రాజే స్వయంగా చూచుకొనేవాడు. ఇక ఆ అధికారాలను నకులుడికి దత్తం చేశాడు విరాటుడు. రాజు తన బాధ్యతలను దత్తం చేసి ఏర్పాటు చేసిన ఉన్నత పదవి నకులుడిది అని గ్రహించాలి. (సంపా.)

క. అని చెప్పి యధిక సమ్మా। నన పూర్వము గాఁగ మత్స్య నరపతి మాద్రీ
తనయుఁ దగ నిల్పె నాతఁడు। తనమదిఁ బ్రియమందె; నతని తమ్ముం డంతన్. 273

ప్రతిపదార్థం: అని చెప్పి= అని చెప్పి; అధిక సమ్మానన పూర్వము+కాఁగన్= ఎక్కువ గౌరవ పూర్వకం అయ్యే విధంగా; మత్స్య నరపతి= మత్స్య రాజు అయిన విరాటుడు; మాద్రీతనయున్= మాద్రి కొడుకు అయిన నకులుని; తగన్= తగిన విధంగా; నిల్పెన్= ఆస్థానంలో ఉంచాడు; అతఁడున్= ఆ నకులుడూ; తనమదిన్= తన మనసులో; ప్రియము+అందెన్= ప్రీతి చెందాడు; అంతన్= అపుడు; అతని తమ్ముండు= నకులుని తమ్ముడు సహదేవుడు.

తాత్పర్యం: అని చెప్పి, విరాట మహారాజు మాద్రి కొడుకు అయిన నకులుడిని గౌరవ పూర్వకమైన ఆస్థానంలో ఉంచాడు. నకులుడు తన మనసులో సంతృప్తి చెందాడు. తరువాత నకులుని తమ్ముడు సహదేవుడు-

సహదేవుఁడు గోపవేషంబున విరటుఁ గొల్వ వచ్చుట (సం.4-9-1)

క. భావన శాంతత్వము నిజ। భావంబున నూష్మలతయుఁ బ్రకటంబులు గా
నా విధుఁడు మనుజవేషం। బై వచ్చెనో? శిఖి శరీరి యయ్యెనో? యనఁగన్. 274

ప్రతిపదార్థం: భావనన్= భావన చేత (ఎదుటివారికి తోచే విధంలో); శాంతత్వము= ప్రశాంతత; నిజభావంబునన్= తన మనసులో; ఊష్మలతయున్= తేజస్సూ; ప్రకటంబులు+కాన్= స్పష్టం కాగా; ఆ విధుఁడు= ఆ చంద్రుడు; మనుజవేషుండు+ఐ= మానవాకారం ధరించిన వాడయి; వచ్చెనో= వచ్చాడో?; శిఖి= అగ్ని; శరీరి= శరీరం కలవాడు; అయ్యెనొ+అనఁగన్= రూపు తాల్చాడో అన్నట్లు.

తాత్పర్యం: పైకి చూస్తే ప్రశాంతత తోచేటట్లూ, మనసులో పరాక్రమ తేజస్సు ప్రకటిత మయ్యేటట్లూ ఉన్న సహదేవుడు ఆ చంద్రుడే మానవాకారంతో వచ్చాడా? లేదా అగ్నిదేవుడే ఆకారం తాల్చాడా? అన్నట్లు ఉన్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, క్రమం. సహదేవుడు గోపవేషంతో వచ్చి విరాటుడి కొలువులో చేరిన ఘట్టాన్ని తీర్చిదిద్దిన విధం విశిష్టం. మూలానికీ తెలుగు రచనకూ ఏమీ పోలికలు లేవు. ఈ ఘట్టం తిక్కన పునస్సృష్టి. **"తమాయాన్త మభిప్రేక్ష్య భ్రాజమానం నరర్షభమ్"** (సం.4.9.2) అని మాత్రం మూలంలో ఉన్నది. తిక్కన చిత్రణ వేరు. పైకి చూస్తే ప్రశాంతభావం స్ఫురిస్తుంది. అందువలన భావించే వారికి ఆ చంద్రుడే మానవాకారం ధరించి భూమి మీదకు దిగివచ్చాడా! అని అనిపిస్తాడు. అతడి మనసులో కార్చిచ్చు. అందువలన అగ్నిదేవుడే ఆకారం తాల్చాడా అన్నట్లు అనిపిస్తున్నాడు. విరుద్ధ గుణాల విచిత్ర సమ్మేళనం విశిష్ట వ్యక్తుల స్వభావం. అతడి ఆకారం చూస్తే ఆకర్షణతో దగ్గరికి పోవాలనిపిస్తుంది. అతడి అంతస్తేజం కొంతభయాన్ని కలిగిస్తుంది. సుందర తేజస్సు అతడి రూపునే కాక, స్వభావాన్నికూడా వ్యంజింప చేస్తున్నది. విధిచేత సేవకు వచ్చాడే కాని అభిమాన ధనుడైన సహదేవుడు లోలోన ప్రజ్వలిస్తున్నాడని ధ్వని. ఇందులో ఉత్ప్రేక్షాలంకారం సాభిప్రాయం. శాంతత్వాన్ని చంద్రుడితో, ఊష్మలతను అగ్నితో క్రమంగా అన్వయించటంలో క్రమాలంకారం కూడా ఉన్నది. (సంపా.)

క. **తలుగుల పొది యొక దెసఁ బె। య్యల దామెన యొక్క వలన ననువై యుండన్**
మొల మోపి పెక్కుచుట్లన్। బలు ద్రాటం జుట్టి గోపభావం బలరన్. **275**

ప్రతిపదార్థం: తలుగుల పొది= పలువుల కట్ట; ఒక దెసన్= ఒక ప్రక్కనూ; పెయ్యల దామెన= పెయ్యదూడలను కట్టే త్రాడు; ఒక్కవలనన్= ఒక ప్రక్కనూ; అనువు+ఐ ఉండన్= వీలుగా ఉండగా; పెక్కుచుట్లన్= ఎన్నో చుట్లను; బలుత్రాటన్+చుట్టి= బలమయిన త్రాటితో కట్టి; మొలన్+మోపి= మొలలో దోపుకొని; గోపభావంబు= గొల్లతనం; అలరన్= ఒప్పగా.

తాత్పర్యం: ఒక ప్రక్క పలుపుల మోపు, మరో ప్రక్క పెయ్య దూడల త్రాళ్ళు, ఎన్నోచుట్లు చుట్టిన ఒక పెద్దత్రాడు మొలలో దోపుకొన్న వేషం గొల్లతనాన్ని స్పష్టం చేస్తూండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: సహదేవుడు చక్కని గోపాలుని వేషం కట్టి, గొల్లవానివలెమాట్లాడుతూ విరాటుని వద్దకు వచ్చినట్లు మూలంలో ఉన్నది. కాని. ఆ వేషం వివరాలు లేవు. పాండవులకు ఆయా వేషాలూ, ఆహార్యాభినయం ధర్మదేవుడు ప్రసాదించినవి. అందువలన తిక్కన వాటిని తప్పకుండా వర్ణించాడు. గొల్లవాని వేషంలో మూడు రకాలైన తాళ్ళు అలంకారాలుగా అమరాయి. ఒకటి పశువులను కట్టి వేయటానికి ఉపయోగించే పలుపులమూట ఒకవైపు. పెయ్యదూడలను నిలువరించటానికి ఉపయోగించే సన్నని తాళ్ళ చుట్టలు మరొకవైపు. నీరు తోడటానికీ. పశువులను పలుపువేసి దూరంగా మేతకు పంపి అవి తప్పిపోకుండా చెట్లకు కట్టివేయటానికి ఉపయోగపడే పెద్ద త్రాడు నడుముకు కట్టుకున్న గొల్లవేషం వ్యాసుని నాటిది కాకపోవచ్చును. తిక్కన నాటిదని తప్పక చెప్పవచ్చును.

ఈ వర్ణనలు కవితలో జాతి వార్తలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. సమకాలీన జీవన చిత్రాలను తనకవితలో ప్రతిఫలింపచేసి తెలుగుదనాన్ని పోషించటం తిక్కన రచనా శిల్పం. ఈ పద్యంలో గొల్లవేషంలోని సహదేవుడి స్థిరచిత్రం వర్ణించబడింది. రాబోయే పద్యంలో చలచిత్రం ప్రదర్శించబడుతున్నది. (సంపా.)

చ. **నునుసెలగోల చేకొని, మనోహర మౌ తన మేను రాజు చూ**
పును బ్రజచూడ్కులం దిగువఁ బుష్కరపత్ర నిభంబు లైన లో
చనముల మూర్తి దెల్పఁగ ససంభ్రమతం జనుదెంచె నల్లన
ల్లన వెడభీతి దోఁప జనులన్ వెగడయ్యెడు దృష్టిఁ జూచుచున్. **276**

ప్రతిపదార్థం: నును= నున్నని; సెలగోల= పసుల కాపరి కఱ్ఱను; చేకొని= ధరించి (చేత పట్టుకొని); మనోహరము+ఔ= అందమయిన; తన మేను= తన శరీరం; రాజు చూపును= విరాట మహారాజు యొక్క చూపును; ప్రజ చూడ్కులన్= ప్రజల

దృష్టులనూ; తిగువన్= ఆకర్షించగా; పుష్కరపత్ర= తామర రేకులతో; నిభంబులు+ఐన= సమానములయిన; లోచనములన్= కన్నులద్వారా; మూర్తి= చలాకీతనంతోకూడిన వర్చస్సు; తెల్పఁగన్= చాటుతుండగా; ససంభ్రమతన్= తొట్రుపాటుతో; అల్లనల్లన= మెల్లగా; వెడభీతి= చిరుభయం; తోఁపన్= కనిపించగా; జనులన్= ప్రజలను; వెగడు+అయ్యెడు దృష్టిన్= తడబడుతున్న చూపుతో; చూచుచున్= చూస్తూ; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: సహదేవుడు చేతిలో నున్నని పసుల కాపరి కర్ర పట్టుకొన్నాడు. అతడి సుందరాకారం గల శరీరం రాజు చూపును ఆకర్షిస్తున్నది. ప్రజల చూపులను కూడా ఆకట్టుకొంటూ ఉన్నది. తామరరేకులవంటి కళ్ళల్లో చలాకీతనం తొంగి చూస్తూ ఉన్నది. అతడి చూపులలో అవ్యక్తభయం తొణికిస లాడుతూ ఉన్నది. తడబడే చూపులతో ప్రజలను చూస్తూ సహదేవుడు మెల్లగా వచ్చాడు.

విశేషం: సెలగోల పసులకాపరి వేషానికే అలంకారం. దానికి తోడు సహదేవుడు సహజంగా అందగాడు. అది మనస్సులను హరించే అందం. రాజు, ప్రజలు అందుకే అతడిని అబ్బురపాటుతో చూచారు. వేషానికీ రూపానికీ పొంతన లేదని గమనించి వెగడుపడే దృష్టులు సారించారు. అట్లా వారు గుచ్చిగుచ్చి చూస్తుంటే సహదేవుడికి సంభ్రమం కలగటం సహజం. అజ్ఞాతవాస నియమంలో ఎవరైనా గుర్తిస్తే ప్రమాదం. అందుకే అతడికి వెడభీతి. బెదరు చూపులతో అతడు జనాన్ని చూస్తూ మెల్లమెల్లగా రాజు దగ్గరికి వచ్చాడు. ఎంతటి చైతన్య శీలమైన అభినయ శిల్పం! తిక్కన నాటకీయతకు దక్కిన చక్కని ఉదాహరణం, అలంకారాలు వాడకుండా అచ్చమైన అభినయంతో కవితను రక్తికట్టించటం తిక్కన నేర్పరితనం. (సంపా.)

వ. ఇట్లు వచ్చి మత్స్యమహీవల్లభు నంతంతం జేరి వినయావనతుం డగుచు నిట్లనియె. 277

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వచ్చి= కొలువు కూటానికి దగ్గరలో ఉన్న ప్రదేశానికి వచ్చి; మత్స్య మహీవల్లభున్= మత్స్య భూమికి అధిపతి అయిన విరాట మహారాజును; అంతన్+అంతన్= దగ్గర దగ్గరగా; చేరి= సమీపించి; వినయ+అవనతుండు+అగుచున్= వినయంతో వంగినవాడు ఔతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: పసుల కాపరి వేషంలో సహదేవుడు వచ్చాడు. విరాటుడిని మెల్లగా సమీపించాడు. వినయంతో నమస్కరించాడు. తదనంతరం ఈ విధంగా అన్నాడు.

క. 'నీ పసులఁ గావఁ బెట్టుము। భూపాలక! నన్నుః నేను బూని యరసినన్
గోపంక్తులు రుజవడ; వొరు। చేపడ వెన్నఁడును; డప్పిఁ జేడ్పడ వెచటన్. 278

ప్రతిపదార్థం: భూపాలక!= భూమిని పాలించే ఓ రాజా!; నన్నున్= నన్ను; నీ పసులన్= నీ పశువులను; కావన్+పెట్టుము= రక్షించడానికి నియమించుము; నేను= నేను; పూని= ప్రయత్నించి; అరసినన్= పరిరక్షిస్తే; గోపంక్తులు= ఆలమందలు; రుజ+పడవు= రోగాల పాలుకావు; ఎన్నఁడును= ఏనాడుగాని; ఒరు చేపడవు= ఇతరులకు లోబడవు; ఎచటన్= ఎక్కడా; డప్పిన్= దాహంతో; చేడ్పడవు= బాధపడవు.

తాత్పర్యం: 'రాజా! నీ ఆలమందను కాపాడటానికి నన్ను అధికారిగా నియమించుము. నా పర్యవేక్షణలో ఆలమందలకు రోగాలు అంటవు. ఇతరులు ఈ ఆలమందను లోబరచుకోలేరు. అలసట అసలు ఉండదు. దప్పికతో బాధపడవు.

తే. తొఱఁగు వోకుండ మెకములు గఱవకుండఁ। బాఁడి దఱుఁగకయుుండ నాపాటి గొల్ల
లిచ్చమెచ్చ, నీ దృష్టికి నెక్కఁ గదుపు। నరయ నేర్తు; న న్నేలుము ధరణినాథ!' 279

ప్రతిపదార్థం: ధరణినాథ!= భూపాలక!; తొఱఁగు+పోకుండన్= పశువులు తప్పించుకొని పోకుండా; మెకములు= మృగాలు; కఱవక+ఉండన్= కరవకుండా ఉండేటట్లు; పాఁడి తఱుఁగక+ఉండన్= పాడిపాలు తగ్గిపోకుండా ఉండే విధంగా; నాపాటి గొల్లలు= నా వంటి (సాటివారైన) గోపాలకులు; ఇచ్చన్+మెచ్చన్= మనసులో మెచ్చుకొనే విధంగా; నీ దృష్టికిన్+ఎక్కన్= నీమనసుకు నచ్చే విధంగా; కదుపున్= ఆలమందను; అరయన్+నేర్తున్= పరిరక్షించగలుగుతాను; నన్నున్= నన్ను; ఏలుము= ఏలుకొమ్ము.

తాత్పర్యం: ఓ మహారాజా! నన్ను పసుల కాపరిగా ఏలుకొంటే పసులు తప్పిపోవు. క్రూరజంతువుల బారిన పడవు. పాడి తగ్గిపోదు. తోటి గొల్లలు మెచ్చుకొంటారు. నీవు కూడా మెచ్చుకొంటావు. అంతగా ఆలమందను కాపాడుతాను. నన్ను ఏలుకొమ్ము.

విశేషం: 'మెప్పు' చేసేవారికి ఉత్సాహకారి. ఆ మెప్పు సమానుల మధ్య అయితే ఎంతో సముత్సాహాన్ని ఇస్తుంది. పైగా రాజే మెచ్చితే సాటివారిలో మరికొంత గౌరవం. పశు సంరక్షణలో తీసికొనవలసిన ప్రాథమికాంశాలను ఏకరువు పెట్టి పశుశాస్త్ర విజ్ఞానాన్ని సహదేవుడు ప్రదర్శించి తన యోగ్యతను చాటుకొన్నాడు.

వ. అనిన విరాటుండు పాండవావరజున కిట్లనియె. 280

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విరాటుండు= విరాట మహారాజు; పాండవ+అవరజునకున్= పాండవులలో చిన్నవానితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగానే విరాటుడు సహదేవుడితో ఇట్లా అన్నాడు.

ఉ. 'ఎక్కడి మాట? గొల్లతన మించుకయేనియు లేదు నీ దెసం;
జక్కని మేను నీ గఱువ చందముఁ గాంతియుఁ జూడవచ్చినన్
నిక్కువ మీవు సూర్య శశి నిర్మల వంశజులైన రాజులం
దొక్క మహానుభావు తనయుండవు గావలయున్ నరోత్తమా!' 281

ప్రతిపదార్థం: నర+ఉత్తమా!= నరులలో ఉత్తముడవయిన వాడా!; ఎక్కడి మాట?= ఇది యెక్కడి మాట?; నీదెసన్= నీ దగ్గర; గొల్ల తనము= గొల్లతనం; ఇంచుక+ఏనియున్+లేదు= కొంచెం కూడా లేదు; చక్కని మేను= అందమయిన శరీరం; నీ గఱువ చందమున్= నీ గాంభీర్యం; కాంతియున్= కాంతి; చూడవచ్చినన్= చూస్తే; నిక్కువము= నిజంగా; ఈవు= నీవు; సూర్య= సూర్యుని యొక్క; శశి= చంద్రుని యొక్క; నిర్మల= కళంకంలేని; వంశజులు+ఐన= వంశంలో పుట్టిన; రాజులందున్= రాజులలో; ఒక్క మహా+అనుభావు తనయుండవు= ఒక గొప్ప మహారాజు కుమారుడివి; కావలయున్= అయి ఉంటావు.

తాత్పర్యం: ఎక్కడి మాట లివి? నీలో గొల్లతనం కాసంతయినా లేదు. నీ శరీరం చక్కగా ఉన్నది. నీలో గాంభీర్యం ఉన్నది. నీలో కాంతి స్పష్టమవుతూ ఉన్నది. బాగా ఆలోచిస్తే నీవు సూర్యవంశజుడివి కావచ్చును, లేదా చంద్రవంశజుడివి కావచ్చును.

విశేషం: ఆకారాన్ని చూచి వ్యక్తిత్వాన్నీ, గుణసంపదనూ, అభిజాత్యాన్నీ అలవోకగా చెప్పగల సూక్ష్మబుద్ధి కలవాడు విరాటుడు. పాండవులను విశిష్టవ్యక్తులుగా గుర్తించి, ఆ వివేకాన్ని దాచుకొనకుండా బయటికి చెప్పిన నిర్మలచిత్తుడు. వారి యోగ్యతకు తగిన పదవు లివ్వాలని ముందుకు వచ్చిన ఉచితజ్ఞుడు. ఇది అతడి రాజనీతిలో ఒక భాగమని కొందరు భావిస్తారు. ఎదుటివారిని

ఆకాశానికెత్తి, ఆశలు చూపించి, ప్రలోభపెట్టి పరీక్షించటం ఆయన మొదట ప్రయోగించే సమ్మోహనాస్త్రం. దానికి ఎదుటివారు లొంగితే వారిని అతడు అనుమానించవచ్చును. కాని, పాండవుల వల్ల ఆ పని జరుగలేదు. అంతేకాదు. పాండవులలోని లోవెలుగును చూచి, ఆకార వైభవాన్ని చూచి విరాటుడు ప్రభావితుడై స్పందించాడే కాని, అది రాజకీయం కాదు. సహదేవుడి ఆకృతి చూచి అతడు సూర్యచంద్రవంశజుడై ఉండాలని ఊహించాడు. సత్యానికి ఎంత దగ్గరగా అతడి అంచనా ఉండింది? అంతటి వివేకశాలి కూడా పాండవులను గుర్తించలేకపోయాడు. ధర్మజుడి కొలువులో పనిచేసిన అయిదుగురు ఒకేనాడు తన కొలువులో చేరటానికి రాగా వారిని వరుసగా చేర్చుకొన్న విరటుడికి 'ఈ అయిదుగురు ఎవరు?'-అనే ప్రశ్న స్ఫురించలేదు. అతని కొలువులో ఉన్న జనులకు కూడా ఆ ఆలోచన రాలేదు. అది ధర్మడి వరప్రభావం. పాండవుల కున్న దైవకవచం అడుగడుగున ధ్వనింపబడటం విరాటపాత్ర చిత్రణలోని ప్రబంధ ధ్వని (సంపా.)

ఆ. వలయు పదవియందు నిలిచి నా రాజ్యమం। తయును జక్కఁ బెట్టి నయము విక్ర
మంబు నడపు నంత మానిసివై యుండి। కుచ్ఛితంపు బ్రదుకు గోరఁ దగునె? 282

ప్రతిపదార్థం: వలయు= నీ ఇష్టం వచ్చిన; పదవి+అందున్= పదవిలో; నిలిచి= కుదురుకొని; నా రాజ్యము+అంతయునున్= నా రాజ్యమంతా; చక్కన్+పెట్టి= చక్కజేసి; నయము= నీతి; విక్రమంబు= పరాక్రమం; నడపునంత= నడిపించగలిగినంతటి; మానిసివి+ఐ= సమర్థుడవయి ఉండి; కుచ్ఛితము+బ్రదుకు= హీనమయిన బ్రదుకు; కోరన్+తగునె?= కోరడం న్యాయమా?

తాత్పర్యం: నీ కిష్టమైన పదవిలో కుదురుకొని నా రాజ్యాన్నంతా చక్కబెట్టి నయనీతి పరాక్రమాలను ప్రదర్శించగలిగిన సమర్థుడవై ఉండికూడా, ఇటువంటి అల్పమైన జీవనోపాధిని కోరట మెందుకు?

విశేషం: నీతి అనే మాట మంత్రాలోచనాన్ని తెలియజేస్తుంది. పరాక్రమం సమర నైపుణ్యాన్ని స్పష్టం చేస్తుంది. తగిన వ్యక్తికి తగిన పదవి ఇవ్వటం అవసరం. అట్లా ఇవ్వకపోవటం అధికారి లోపం కూడా అవుతుంది.

వ. ఉత్తమ వాహనంబులు, మహనీయాయుధంబులు నిచ్చెద; మత్స్యదేశంబున భవదభిమతస్థలం బొసంగెద; మదీయ మండల సేనా పరిపాలనంబు సేసి వర్తిల్లుము.' 283

ప్రతిపదార్థం: ఉత్తమ వాహనంబులు= శ్రేష్ఠమయిన వాహనాలు; మహనీయ= గొప్పవయిన; ఆయుధంబులున్= ఆయుధాలను; ఇచ్చెదన్= ఇస్తాను; మత్స్యదేశంబునన్= మత్స్య దేశంలో; భవత్+అభిమత స్థలంబు+ఒసంగెదన్= నీకు ఇష్టమయిన ప్రదేశాన్ని ఇస్తాను; మదీయ= నాదైన; మండల సేనా పరిపాలనంబు= మండల సేనలను పరిపాలించటం; చేసి= నిర్వహించి (బాధ్యత స్వీకరించి); వర్తిల్లుము= ఉండుము.

తాత్పర్యం: నీకు ఉత్తమ వాహనాలు ఇస్తాను. శ్రేష్ఠమయిన ఆయుధాలను ఇస్తాను. మత్స్యదేశంలో నీవు కోరిన ప్రదేశాన్ని కూడా ఇస్తాను. నా మండల సేనలను పరిపాలించుము.'

క. అనవుడుఁ బాండు నృపాలక। తనయుఁడు మ్రొక్కుచు విరాట ధరణీశున కి
ట్లను 'హీనకులుఁడ, బాలుఁడ। మును నాగరికంపుఁ గార్యముల వెర వెఱుఁగన్. 284

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; పాండునృపాలక తనయుఁడు= పాండురాజు కుమారుడయిన సహదేవుడు; విరాట ధరణీశునకున్= విరాట మహారాజుకు; మ్రొక్కుచున్= నమస్కరిస్తూ; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; హీనకులుండన్= తక్కువ కులం వాడిని; బాలుఁడన్= బాలుడిని; మును= పూర్వం (ముందటి నుండి); నాగరికము+కార్యముల వెరవు= నాగరికపు పనుల తీరును; ఎఱుఁగన్= తెలిసిన వాడిని కాను.

తాత్పర్యం: అనగానే సహదేవుడు విరాటుడికి మ్రొక్కి ఇట్లా అన్నాడు. 'రాజా! నేనేమో హీనకులుడిని. ముందెప్పుడూ నాగరికాలయిన పనుల తీరు తెన్నులు తెలిసిన వాడిని కాను.

ఆ. పసులఁ గాచి కాని బ్రదుకఁ గౌరవుల ప్రాఁ। తలము మున్ను; నేను ధర్మపుత్త్రు
పశుగణంబు నెల్లఁ బాలింతు నమ్మహీ। వరుని చిత్తమునకు వచ్చువాఁడ. 285

ప్రతిపదార్థం: పసులన్= పశువులను; కాచికాని బ్రదుకన్= కాచుకొంటూమాత్రమే బ్రతికేవాడను; మున్ను= గతంలో; కౌరవుల ప్రాఁతలము= కురువంశీయులైన రాజులయొక్క సేవకులం; నేను= నేను; ధర్మపుత్త్రు= యమధర్మరాజు కుమారుడయిన ధర్మరాజు యొక్క; పశుగణంబున్+ఎల్లన్= పశువుల మందలనన్నిటిని; పాలింతున్= రక్షించేవాడిని; ఆ+మహీవరుని చిత్తమునకున్= ఆ మహారాజు మనసుకు నచ్చే విధంగా; వచ్చువాఁడన్= ప్రవర్తించేవాడిని.

తాత్పర్యం: గతంలో మేము కౌరవులకు సేవకులం. పశుగణాన్ని రక్షించే వాడిని. పశువులను కాపాడడం తప్ప మరే విధంగా బ్రతుకలేని వాడిని. ఇంతకుముందు ధర్మరాజుయొక్క పశుగణాన్ని పాలిస్తూ ఉండేవాడిని. ఆ విధంగా ఆ మహారాజు మన్ననకు పాత్రుడైనవాడిని.

వ. తంత్రీపాలుం డనం బరఁగిన వాఁడ; నా చేతం గ్రేపులు పురాణించుటం జేసి కొండొక కాలంబునన కదుపులం బెనుతు; నే నగునని కైకొనిన యాఁబోతు పంచితంబు మూర్కొనినను, బైగాలి వీచినను గొడ్డునకైనం జూలు నిలుచు; నుంగిడి యదురు ద్రిక్క యను వానికి నా పేరు సెప్పినం జాలు; మఱియును బసికి వలయు తెఱంగు లెల్ల నెఱుంగుదు; వేఱొక్క పనికిం గాను గాని యే నీ వెంట నీ మనసు వడయం జాలుదు; నా వలనం బ్రయోజనంబు గొనవలయు నేని నొండుమాటలు దక్కి పసులం బరికింప నియోగింపుము.' 286

ప్రతిపదార్థం: తంత్రీపాలుండు+అనన్= తంత్రీపాలుడు అనే పేరుతో; పరఁగినవాఁడన్= వ్యవహరించబడిన వాడిని; నా చేతన్= నా చేతిలో (నా సంరక్షణలో); క్రేపులు= దూడలు; పురాణించుటన్+చేసి= పెరుగటంవలన - పెరగడం వలన; కొండొక కాలంబుననను+అ= కొద్ది కాలంలోనే; కదుపులన్= ఆలమందలను; పెనుతున్= పెంచుతాను; నేను+అగున్+అని= నేను 'అవుతుంది' అని; కైకొనిన= స్వీకరించిన; ఆఁబోతు= ఆంబోతు; పంచితంబు= మూత్రాన్ని; మూర్కొనినను= వాసన చూచినా; పై గాలి వీచినను= పై గాలి వీచినా; గొడ్డునకున్+ఐనన్= గర్భం రానే రాదు అని తేల్చి వేసిన దానికయినా; చూలు= గర్భం; నిలుచున్= నిలుస్తుంది; ఉంగిడి= పశువులకు వచ్చే రోగం; అదురున్+త్రిక్క+అనువానికిన్= అదురుడు, తిరుగుడు అనే పశువుల రోగం వచ్చిన వాటికి; నా పేరు= నా పేరును; చెప్పినన్+చాలున్= చెప్పినాచాలు; మఱియును= ఇంతే కాకుండా; పసికి= పశువులకు; వలయు= అవసరమయిన; తెఱంగులు+ఎల్లన్= పద్ధతులన్నీ; ఎఱుంగుదున్= తెలుసు; వేఱొక్క, పనికిన్= వేరే పనికి; కాను= తగినవాడిని కాను; కాని= అయినప్పటికి; ఏన్= నేను; ఈవెంటన్= ఈ పనిమీద; నీ మనసు= నీ మనసును; పడయన్+చాలుదున్= చూరగొంటాను; నా వలనన్= నావలన; ప్రయోజనంబున్= ఏదయినా ప్రయోజనాన్ని; కొనవలయున్+ఏని= చేయించాలనుకొంటే; ఒండు మాటలు+తక్కి= మరో రకమైన మాటలు వదలిపెట్టి; పసులన్= ఆవులను లేదా గోసంపదను; పరికింపన్= పర్యవేక్షణ చేయడానికి; నియోగింపుము= నియుక్తుడిని చేయుము.

తాత్పర్యం: నా పేరు తంత్రీపాలుడు. నా 'హస్తవాసి' మంచిది, అందుచేత దూడలు బాగా పెరుగుతాయి. అతి తక్కువ కాలంలో ఆలమందలను పెంచుతాను. నేను ఎంపిక చేస్తే ఆబోతు మూత్రం వాసన చూచినా, పైగాలి వీచినా

గొడ్డుటావులకు సైతం చూలు నిలవటం ఖాయం. ఉంగిడి, అదురు, త్రిక్క అనే రోగాలు నా పేరు చెప్పితే దగ్గరికి రావు. పశువుల రకాలన్నీ నాకు తెలియును. వేరే పనికి నేను తగను. ఈ పనిలో మాత్రం 'నేను నీ మనసుకు నచ్చే విధంగా నడుచుకొంటాను. నా వలన నీ కేమయినా ప్రయోజనం ఉన్నదనుకొంటే మరోమాట వద్దు. నన్ను పశుపాలనకు నియోగించుము'.

విశేషం: పశువులకు వచ్చే రోగాలు తగ్గించటానికి కొందరు మందులు, మంత్రాలు నేర్చి సిద్ధులు సాధించటం మన దేశంలో కనపడుతుంది. పాము కాటుకు మంత్రాలు మందుకావటం. మంత్రగాని పేరే ఒక్కొకసారి మంత్రంగా పనిచేయటం చూస్తాం. సహదేవుడు తాను అటువంటి వాడినని చెప్పుకొన్నాడు. అటువంటివాడు పశుగణాధ్యక్షుడుగా ఉంటే పశుసంపద భద్రంగా ఉండగలదనే విశ్వాసం విరాటునికి కలిగేటట్లు పలకటం ఇందులో విశేషం. ఆ మహిమ అంతా ధర్మజుని దయవలన కలిగిందని ధ్వని. (సంపా.)

చ. అనుటయు నెట్టకేలకు ధరాధిపుఁ డట్టుల కాక యంచు నా
తని వదనంబు సూచి 'యుచితం బగునేనిఁ బ్రియంబ యేని, నె
ట్లును గురుకార్య వర్తనములున్ రుచియింపక యుండునేని, గో
ధనముల కెల్ల రక్షణముఁ దత్పరతం దగఁ జేయు ముఖ్యతన్. 287

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఎట్టకేలకున్= చివరకు; ధరాధిపుఁడు= రాజు; అట్టుల కాక= అట్లే అగుగాక; అంచున్= అంటూ; అతని వదనంబు= అతడి ముఖం; చూచి= చూచి; ఉచితంబు+అగునేనిన్= తగినట్లయితే; ప్రియంబు+అ+ఏనిన్= ఇష్టమయితే; ఎట్లును= ఏవిధంగానూ; గురుకార్య వర్తనములున్= పెద్ద పనులలో ఉండటాలు; రుచియింపక+ఉండునేనిన్= ఇష్టం కాకపోతే; గోధనములకున్+ఎల్లన్= గో సంపదలకంతకూ; రక్షణమున్= కాపాడటాన్ని; తత్పరతన్= ఆసక్తితో; ముఖ్యతన్= ప్రాధాన్యంతో; తగన్+చేయుము= తగినవిధంగా చేయుము.

తాత్పర్యం: సహదేవుడి వేడికోలును విరాటుడు విన్నాడు. చివరకు అట్లాగే అని అతడి ముఖం వైపు చూచాడు. సరేనన్నాడు. 'నీకు సరి అనిపిస్తే, ఇష్టమైతే, పెద్ద పనులను చేపట్టటం ఇష్టం కాకపోతే, గోసంపదను శ్రద్ధతో ప్రాధాన్య బుద్ధితో తగిన విధంగా రక్షించుము.

క. మున్ను గల గోపవర్గము। నిన్నుం గని కొలిచి భక్తి నీ పనిసేయన్
మన్నన మానిసివై నీ। వున్నం గడు మేల కాక యొప్పమి గలదే?' 288

ప్రతిపదార్థం: మున్ను+కల= ముందుండే; గోపవర్గము= గోపాలుర సముదాయం; నిన్నున్= నిన్ను; కని= చూచి; కొలిచి= సేవించి; భక్తిన్= భక్తితో; నీ పని చేయన్= నీవు చెప్పిన పనిచేస్తూ ఉండగా; మన్నన మానిసివి+ఐ= గౌరవించ దగిన మనిషివై; నీవు= నీవు; ఉన్నన్= ఉండగా; కడున్= ఎంతో; మేలు+అ= మేలే; కాక= అంతే కాని; ఒప్పమి= (నీ సేవలకు) ఇష్టపడకపోవడం; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: నా దగ్గర ఇదివరకే గోపాలురు ఉన్నారు. వారందరు నిన్ను కొలుస్తారు. భక్తితో నీవు చెప్పిన పని చేస్తారు. నీవు గౌరవంగా ఉంటే చాలా మేలే కాని, నీ సేవలకు ఇష్టపడకపోవడం ఉంటుందా?' (తప్పక అంగీకరిస్తాను)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి యతని యభిమతంబు సలిపి నిలిపె; నట్లయ్యేవురును విరటుం గొలిచి నిలిచిరి; తదనంతరంబ. 289

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికి= మాటలాడి; అతనిన్= సహదేవుని; అభిమతంబు= కోరికను; సలిపి= తీర్చి; నిలిపెన్= (అతడు కోరిన పదవిలో) నిలిపాడు; అట్లు= ఆ విధంగా; ఆ+ఏవురును= ఆ అయిదుగురును; విరటున్= విరాట మహారాజును; కొలిచి= సేవించి; నిలిచిరి= నిలదొక్కుకున్నారు; తదనంతరంబు+అ= ఆపై.

తాత్పర్యం: అని చెప్పి అతడి కోరిక తీర్చాడు. గోపాలకులకు ముఖ్యునిగా సహదేవుడిని ఉంచుకొన్నాడు. అట్లా పాండవులు అయిదుగురూ విరాటుడి కొలువులో చేరారు. అటు తరువాత.

ద్రౌపది సైరంధ్రీవేషమున సుదేష్ణఁ గొలువ వచ్చుట (సం.4-8-1)

క. గారవమున నిజదేశా। చారముమై నల్లియున్న జడ యగు కబరీ
భారంబు విచ్చి తుఱుముగ। సైరంధ్రీ జాతివేష సముచిత భంగిన్. 290

ప్రతిపదార్థం: గారవమునన్= గౌరవంతో; నిజదేశ+ఆచారముమైన్= తన దేశపు అలవాటును బట్టి; అల్లిఉన్న జడ+అగు కబరీ భారంబు= అల్లి ఉన్న జడ కల కేశపాశం; విచ్చి= విప్పి; సైరంధ్రీ జాతి వేష సముచిత భంగిన్= సైరంధ్రీజాతి వేషానికి తగిన రీతిలో; తుఱుముగన్= కొప్పుగా ముడిచినట్లు.

తాత్పర్యం: ద్రౌపది తన దేశాచారం ప్రకారం అల్లిన జడగల కేశపాశం అంతా విప్పి, సైరంధ్రీ వేషానికి తగినట్లుగా కొప్పుగా అమర్చటానికి అనువుగా చేసింది.

క. వలపలి దిక్కున కించుక। మలఁగంగాఁ దుఱు మిడి, కుఱుమాపుడుఁ బుట్టం
బలవడఁ గట్టి జరరవ। ల్కలమున నెవ్విఁగుఁజన్నుఁగవ గప్పి తగన్. 291

ప్రతిపదార్థం: వలపలి దిక్కునకున్= కుడిప్రక్కకు; ఇంచుక= కొద్దిగా; మలఁగంగాన్= ఒరిగేటట్లుగా; తుఱుము+ఇడి= కొప్పుపెట్టి; కుఱుమాపుడు పుట్టంబు= కొద్దిగా మాసిన చీర; అలవడన్+కట్టి= తగినట్లు కట్టి; జరరవల్కలమునన్= ముదుక అయిన నార వస్త్రంతో; నెవ్విఁగు+చన్నుఁగవన్= ఉన్నతమయిన కుచద్వయాన్ని; తగన్+కప్పి= తగునట్లు (పూర్తిగా) కప్పుకొని.

తాత్పర్యం: సైరంధ్రి కుడివైపునకు కొద్దిగా ఒరిగేటట్లు కొప్పు అమర్చుకొన్నది. కొద్దిగా మాసిన చీర కట్టుకొన్నది. ముదుకైన నారవస్త్రంతో స్తనమండలం కప్పుకొన్నది.

క. పరిచారికాత్వరేఖా। పరిణతి దనమేన నచ్చుపడ భావనకుం
దిరమై తలకొను నంతః। కరణముతోఁ బురము ద్రుపదకన్యక చొచ్చెన్. 292

ప్రతిపదార్థం: పరిచారికాత్వరేఖా పరిణతిన్= పరిచారికా లక్షణపు పరిణామం; తనమేనన్= తన శరీరంలో; అచ్చుపడన్= స్పష్ట పడుతుండగా; భావనకున్= ఆ పరిచారికా భావం తన ఆలోచనయందు; తిరము+ఐ= నిశ్చితంగా; తలకొను= తాల్చేటటువంటి; అంతఃకరణముతోన్= మనస్సుతో; ద్రుపద కన్యక= ద్రౌపది; పురము చొచ్చెన్= పట్టణంలో ప్రవేశించింది.

తాత్పర్యం: ద్రౌపది తన ఆకారంలో దాసీత్వ లక్షణాన్ని స్పష్టపడేటట్లు చేసికొన్నది. దాసీభావాన్ని స్థిరంగా మనసులో నిలుపుకొని పురప్రవేశం చేసింది.

వ. ఇట్లు సొత్తెంచి. 293

తాత్పర్యం: ఇట్లా ప్రవేశించి.

సీ. పఱమొయిల్ గప్పినఁ బాడఱి నునుఁగాంతి। గదలిన యమృతాంశు కలయుఁ బోలెఁ
బెనుమంచు మీఁదఁ బర్వినవికాసము దప్పి। చెలువు గుందిన సరోజిని విధమున,
ధూమంబు వొదివిన దుఱఁగలి మెఱుఁగులు। నలఁగి మాసిన దీప కళిక పగిది,
ధూళి పైఁబొరసినఁ దొంగలించుట మాని। లావణ్య మెడలిన లతిక భంగి,

తే. గంధకారికా వేషంబు కతన మూర్తి। యుజ్జ్వలత్వంబు మఱువడియుండఁ బాండు
తనయ మహిషి యంచితగతిఁ జనఁగ రాజ। వీథిఁ బౌరజనంబు లవ్వెలఁదిఁ జూచి. 294

ప్రతిపదార్థం: పఱమొయిల్= పెద్దమేఘం; కప్పినన్= కప్పివేయగా; పాడఱి= పాడయిపోయి (మరుగునపడి); నునుఁగాంతి= మృదువయినకాంతి; కదలిన= తొలగిన (తగ్గిపోయిన); అమృత+అంశు-కలయున్+పోలెన్= అమృత కిరణుడయిన చంద్రుని కళవలె; పెనుమంచు= ఎక్కువ మంచు; మీఁదన్+పర్వినన్= మీద పడగా (కప్పగా); వికాసము+తప్పి= కాంతి తగ్గి; చెలువు= అందం; కుందిన= తరిగిన; సరోజిని విధమునన్= పద్మంవలె; ధూమంబు= పొగ; పొదివినన్= క్రమ్మగా; తుఱఁగలి మెఱుఁగులు= ప్రసరించే కాంతి మెరుపులు; నలఁగి= తగ్గి; మాసిన= మాసిపోయిన; దీపకళిక పగిది= దీపపుమొగ్గ వలె; ధూళి= దుమ్ము; పైన్+పొరసినన్= మీద క్రమ్మగా; తొంగలించుట= ప్రకాశించటం; మాని= మానివేసి (తగ్గి); లావణ్యము= కోమలత్వం; ఎడలిన= తరిగిన; లతిక, భంగి= తీగవలె; గంధకారికా వేషంబుకతన= సైరంధ్రీ వేషం వలన; మూర్తి+ఉజ్జ్వలత్వంబు= శరీరకాంతి; మఱువడి+ఉండన్= మరుగుపడి ఉండగా; పాండుతనయ మహిషి= పాండవుల రాణి (ద్రౌపది); అంచితగతిన్+చనఁగన్= చక్కని గమనంతో రాగా; రాజవీథిన్= రాజవీథిలో; పౌరజనంబులు= పురజనులు; ఆ+వెలఁదిన్+చూచి= ఆమెను చూచి.

తాత్పర్యం: ద్రౌపది సైరంధ్రీ వేషంలో మేఘం క్రమ్మటం చేత నిండుకాంతి తరిగిన చంద్రకళ వలె ఉన్నది. మంచు కప్పగా వికాసం లేక అందం తరిగిన పద్మంవలె ఉన్నది. పొగ క్రమ్మగా కాంతి తళుకులు తగ్గిన దీపశిఖవలె ఉన్నది. దుమ్ము పడగా నిగనిగలు తగ్గి లావణ్యం కొరవడిన తీగవలె ఉన్నది. ఈ వేషం వలన రూపంలోని ఉజ్జ్వలత్వం మరుగున పడింది. అటువంటి వేషంతో కదలి వెళ్ళుతున్న ద్రౌపదిని పురజనులు చూచి. (ఇట్లా అనుకొన్నారు - రాబోయే పద్యంతో అన్వయం).

విశేషం: అలం: మాలోపమ. సైరంధ్రీ వేషం వలన ద్రౌపది యొక్క ఉజ్జ్వలత్వం మరుగుపడింది. ఔజ్జ్వల్యం ఉత్తమ నాయికా లక్షణాలలో ఒకటి. **"రూప సంపన్న దేహత్వ మౌజ్జ్వల్యం పరికీర్త్యతే"** అని ప్రతాపరుద్రీయకారుడు విద్యానాథు డన్నాడు. అంటే ద్రౌపది యొక్క రూపసంపద మరుగుపడినట్లయింది. ఆ రూపసంపదలోని నాలుగు గుణాలను వ్యంగ్యంగా పేర్కొంటూ అవి మరుగుపడిన విధాన్ని ఉపమాలంకార సుందరంగా వర్ణించాడు తిక్కన. ద్రౌపది రూపసంపద యొక్క మొదటి గుణం 'నునుఁ గాంతి' - అది చంద్రరేఖ ప్రసరించే వెన్నెలవలె మృదువుగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆ గుణం దట్టమైన మబ్బుతో కప్పబడినట్లు దృశ్యాదృశ్యమై పోయింది. రెండవ గుణం 'వికాసం' - నిరంతరం నవనవోన్మేషంగా వికసిస్తున్నట్లుండే యౌవన విలాసం వికాసం.

వికాసమే అందంగా ఉండేది పద్మం. మంచువలన పద్మం వికసించటం మాని ముకుళించుకొంటుంది. అట్లాగే దాసీత్వభావం వలన ద్రౌపది ఔజ్జ్వల్యం వాడిపోయి అందాన్ని కోల్పోయినట్లయింది. మూడవ గుణం 'తుఱఁగలి మెఱుఁగులు' - శరీర నైగనిగ్య లక్షణాలు. పొగ మూగటం వలన కాంతి మాసిన దీపపు మొగ్గవలె (అగ్నిశిఖవలె) ఆమె శరీర నైగనిగ్యం మాసిన చీర మొదలైన సైరంధ్రీ వేషాదుల వలన వన్నె తగ్గి కనబడింది. నాల్గవ గుణం 'లావణ్యం' - శరీర కోమలత్వం. సైరంధ్రీ వేషం వలన దేహం ధూళిధూసరితమైన తీగవలె ఉన్నది. అంటే ఆమె శరీరానికున్న సహజ కోమలత్వం దుమ్ముకొట్టుకొని పోయినట్లయింది. ద్రౌపది ఔజ్జ్వల్యం మరుగుపడిందే కాని మాయం కాలేదు. ఆ మరుగుపడిన మేని కాంతియే పౌరజనులకు ఆశ్చర్యం కలిగించింది. వరుసగా ఉపమాలంకారాలు వాడి సైరంధ్రీ రూపవర్ణనం చేయటం వలన మాలవలె ఉపమాలంకారం భాసించటం చేత అలంకారం మాలోపమ. (సంపా.)

ఉ. 'రోహిణి యొండె, నొండెను నరుంధతి గాక మనుష్య జాతియే?
యీ హరిణాక్షి చెల్వమున యేడ్తెఱ చూడ్కుల నాఁచికోల కా
దాహితగౌరవం బగు; శుభాంగము తేజముఁ జూడ బుద్ధి సం
దేహముఁ బొందుచున్నది; సతీజను లిట్టిరె యెజ్జగంబులన్!' 295

ప్రతిపదార్థం: రోహిణి+ఒండెన్= రోహిణియో; అరుంధతి+ఒండెనున్= అరుంధతియో (అయి ఉండాలి); కాక మనుష్యజాతియే?= కాకపోతే (ఈమె) మానవజాతికి చెందిన స్త్రీయేనా?; ఈ హరిణ+అక్షి= లేడికన్నులవంటి కన్నులు గల ఈ స్త్రీ; చెల్వమున+ఏడ్తెఱ= సౌందర్యముయొక్క, అతిశయం; చూడ్కులన్ నాఁచికోల కాదు= చూపులను ఆకర్షించటమే కాదు; అహిత గౌరవంబు+అగున్= ఉంచబడిన గౌరవం కలది (గౌరవించాలని అనిపించేది) అవుతున్నది; శుభ+అంగము= ఈమె మంగళకరమయిన శరీరం యొక్క; తేజము+చూడన్= కాంతి చూస్తే; బుద్ధి సందేహము పొందుచున్నది= బుద్ధికి సందేహం కలుగుతున్నది; ఏ+జగంబులన్= ఏలోకాలలో అయినా; సతీజనులు= సాధ్వీమణులు; ఇట్టిరె?= ఇట్టివారా?

తాత్పర్యం: 'ఈమె రోహిణి కాని, అరుంధతి కాని అయి ఉండాలి. అంతేకాని మానవకాంత మాత్రం కాదు. తన రూపాధిక్యం చేత చూపులను ఆకట్టుకొనటమే కాదు. అందరి గౌరవాన్నీ పొందుతున్నది. శుభప్రదమయిన ఆ శరీరకాంతి చూస్తే సందేహం కలుగుతున్నది. ఏ లోకాలలో అయినా ఇటువంటి సతీమతల్లులు ఉంటారా?'

విశేషం: అలం: సందేహం. ద్రౌపదియొక్క మంగళకరమైన శరీరాన్నీ, ఆ శరీర కాంతినీ చూచిన పౌరులకు బుద్ధిలో సందేహం కలిగిందట! సందేహాలంకారాన్ని ప్రయోగిస్తున్నానని తిక్కన ముద్రగా (గుర్తుగా ఆ పేరే వాడి) చెప్పాడు. అనిశ్చయ జ్ఞానం సందేహం. సందేహం వలన ఏర్పడే అలంకారం సందేహం. వర్ణ్యావర్ణ్యాల సాధారణ ధర్మాలను మాత్రమే దర్శించి విశేష ధర్మాన్ని దర్శించకపోవటం వలన కలిగే అనిశ్చయభావం ఇందులో వర్ణించబడుతుంది. స్త్రీముఖాన్ని చూచి ఇది పద్మమో చంద్రబింబమో నాకు నిర్ణయం కాలేదు - అని సందేహాన్ని వ్యక్తం చేయటం సందేహాలంకారం. ఈ పద్యంలో పౌరులు ద్రౌపదిని చూచి ఇటువంటి సందేహమే పొందారు. సతీమణుల పేర్ల మీద ఆకాశంలో కనపడే ఉజ్జ్వల నక్షత్రాలు రెండు. రోహిణి చంద్రబింబం ప్రక్కన మిలమిలా మెరుస్తుంది. తన కాంతితో చూపరులను ఆకర్షిస్తుంది. అరుంధతి మినుకు మినుకుమని దర్శనమిస్తుంది. ఆమెను దర్శిస్తే పుణ్యం వస్తుందనే గౌరవభావాన్ని చూపరులకు కలిగిస్తుంది. ద్రౌపది కాంతిమతిగా, పుణ్యవతిగా కనబడుతున్నదని ధ్వని. ద్రౌపదీ శరీరకాంతి చూస్తే ఆమె రోహిణి కాని, అరుంధతి కాని అయి ఉండాలి తప్ప మానవ జాతిస్త్రీ అయి ఉండటానికి వీలు లేదు. ఏ లోకంలోనైనా ఇల్లాండ్రు ఇటువంటి సందేహాన్ని కలిగించే రూప వైభవం కలవారు ఉన్నారా? అని ఆశ్చర్యపోయారు పౌరులు. ఇందులో ద్రౌపది ఎవరనే ప్రశ్నకు అనిశ్చయ జ్ఞానమే మిగులుతుంది. రోహిణీ అరుంధతుల సాధారణ ధర్మమే దర్శింపబడుతుంది తప్ప ద్రౌపది యొక్క విశేషధర్మం వివేచింపబడదు. అందువలన ఇది సందేహాలంకారం. తిక్కన ఈ అలంకారాన్ని ఇక్కడ ప్రజల భావనలో నిబంధించటం ప్రకరణౌచిత్యం. ద్రౌపది సైరంధ్రి వేషంలో మొదటిసారి ప్రజలముందుకు

వచ్చింది. చూపరు లామెవేషం చూచి ఏమనుకుంటారో ఈ పద్యం సాక్ష్యం పలికింది. దీనినిబట్టి సుదేష్ణగాని, కీచకాదులు కాని, మరెందరైనా కాని ఆమె ద్రౌపదీత్వాన్ని గుర్తించలేరు. దేవాంగనయేమో అని సందేహంతో ఉండిపోతారు. ఆ భావమే ఆమెకూ, ఆమె అజ్ఞాతవాస వ్రతానికీ శ్రీరామరక్ష. ఇది చక్కని అలంకార ధ్వని. (సంపా.)

వ. అనుచు నంతంతం జేరి. 296

తాత్పర్యం: అనుకొంటూ దగ్గరికి వచ్చి.

క. 'నీ వెవ్వ, రేమి పనికై। యే వలనికిఁ బోవుచునికి యిది?' నావుడు న
ద్దేవియు సౌముఖ్యము స। ద్భావంబును దోఁప నుచితభంగిం జెప్పెన్. 297

ప్రతిపదార్థం: నీవు+ఎవ్వరు?= నీ వెవరవు?; ఏమి పనికై= ఏ పనిమీద; ఏ వలనికిన్= ఎక్కడకు; పోవుచున్+ఉనికి?= పోతూ ఉండటం?; ఇది; నావుడున్= అనగానే; ఆ+దేవియున్= ఆ ద్రౌపదియు; సౌముఖ్యము= సుముఖత; సద్భావంబును+తోఁపన్= మంచి మనసు తోచేటట్లు; ఉచిత భంగిన్= తగిన రీతిగా; చెప్పెన్= చెప్పింది.

తాత్పర్యం: 'నీ వెవరవు? ఏ పనిమీద ఎక్కడకి పోతున్నావు?' అని అనగానే ఆ ద్రౌపది సుముఖత, సద్భావమూ ప్రకటితమయ్యేటట్లు (ఇట్లా) చెప్పింది.

ఆ. 'ఏను గట్టువాలుదాన; నా కెవ్వరు। కడుపు కూడు వెట్టి, కట్టఁ జీర
యిచ్చి సాకతమున నేలుదు రట్టి వా। రలకుఁ బనులు సేసి మెలఁగు బుద్ధి. 298

ప్రతిపదార్థం: ఏను= నేను; గట్టు వాలుదానన్= సైరంధ్రీ జాతి స్త్రీని; నాకున్= నాకు; ఎవ్వరు= ఎవరయితే; కడుపుకూడు= తినడానికి తిండి; పెట్టి= పెట్టి; కట్టన్= కట్టుకొనడానికి; చీర= వలువ; ఇచ్చి= ఇచ్చి; సాకతమునన్= దయతో; ఏలుదురు= పోషిస్తారో; అట్టివారలకున్= అట్టివారికి; పనులు= పనులు; చేసి= చేసి; మెలఁగు బుద్ధిన్= ప్రవర్తించే బుద్ధితో.

తాత్పర్యం: 'నేను సైరంధ్రిని. కూడు గుడ్డా నాకు చాలు. ఎవరు దయతో నన్ను పోషిస్తారో వారి దగ్గర పనులు చేయాలనే బుద్ధితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: గట్టువాలు - అంటే పర్వతం వలె చలించనిది. పురుష సాంగత్యాన్ని కోరక ధైర్యంతో ఉండేదని వ్యుత్పత్త్యర్థం.

క. వచ్చితి' ననవుడు విని జను। లచ్చెరువును సందియంబు నడరెడు మదితో
'నిచ్చెలువ గడుపు కూటికి। నెచ్చటనే నిలుచునట్టె! యిది పలుకగునే?' 299

ప్రతిపదార్థం: వచ్చితిన్= వచ్చాను; అనవుడున్= అనగానే; జనులు= ప్రజలు; విని= విని; అచ్చెరువును= ఆశ్చర్యమూ; సందియంబున్= సందేహం; అడరెడు మదితోన్= కలిగే మనసుతో; ఈ+చెలువ= ఈమె (ద్రౌపది); కడుపుకూటికిన్= కడుపుకూటికి; ఎచ్చటన్+ఏన్= ఎక్కడయినా; నిలుచునట్టె= ఉంటుందంట!; ఇది= ఇది; పలుకు+అగునే?= నిజమయిన మాటేనా?

తాత్పర్యం: అందుకే వచ్చాను.' అనగానే విని జనులంతా ఆశ్చర్యమూ, సందేహమూ కల మనసులతో 'ఈమె కడుపుకూటికి ఎక్కడయినా ఉంటుందట! ఇది నమ్మదగిన మాటేనా?'

వ. అనుచుం గనుంగొనుచు ముసురుకొని చనుచుండం బాంచాల రాజనందన రాజమందిరంబు చక్కటికి నరుగు నవసరంబున. 300

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; కనుంగొనుచున్= చూస్తూ; ముసురుకొని= క్రమ్ముకొని; చనుచున్+ఉండన్= వెళ్ళుతుండగా; పాంచాల రాజనందన= పాంచాలదేశపు రాజు-కుమార్తె (ద్రౌపది); రాజమందిరంబు= రాజభవనం; చక్కటికిన్= దగ్గరకు; అరుగు+అవసరంబునన్= వెళ్ళే సమయంలో.

తాత్పర్యం: అంటూ ఆమెను చూచారు. ప్రజలు ఆమెను చుట్టుముట్టి నడుస్తున్నారు. అప్పుడు ద్రౌపది రాజమందిరం దగ్గరకు వేళ్లే సమయంలో.

క. ముదమొదవ రమ్యహర్మ్యము। తుది నిలువునఁ బ్రణయసఖులతోడ విహారా
స్పదమగు నెలవున మెలఁగెడు। సుదేష్ణ తజ్జాలకములఁ జూచెం బ్రీతిన్. 301

ప్రతిపదార్థం: సుదేష్ణ; ముదము+ఒదవన్= సంతోషం కలుగగా; రమ్య= అందమయిన; హర్మ్యముతుదినిలువునన్= మేడ చివరి అంతస్తునందు; ప్రణయసఖులతోడన్= తన్ను గాఢంగా అభిమానించే చెలికత్తెలతో; విహార+ఆస్పదము+అగు= విహరించడానికి యోగ్యమయిన; నెలవునన్= ప్రదేశంలో; మెలఁగెడు= సంచరించే; సుదేష్ణ= ఆ విరాటమహారాజు భార్య అయిన సుదేష్ణ; తద్+జాలకములన్= ఆ మేడభాగంలోని కిటికీలగుండా; ప్రీతిన్+చూచెన్= సంతోషంతో చూచింది.

తాత్పర్యం: విరాట మహారాజు పట్టమహిషి సుదేష్ణ విహారంకొరకు ఆమె అనుగు చెలికత్తెలతో కలిసి మేడపైభాగంలో విహరిస్తూ ఉన్నది. ఆ మేడ కిటికీలగుండా సైరంధ్రిని ఆసక్తితో చూచింది.

వ. ఇత్తెఱంగున మత్స్యరాజమహిషి ద్రౌపది నాలోకించి కుతూహలంబున. 302

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; మత్స్యరాజమహిషి= మత్స్యరాజయిన విరాటుని పట్టపురాణి సుదేష్ణ; ద్రౌపదిన్= ద్రౌపదిని; ఆలోకించి= పరిశీలనగాచూచి; కుతూహలంబునన్= వేడ్కతో.

తాత్పర్యం: ఈ విధంగా విరాటమహారాజు పట్టపురాణి సుదేష్ణ ద్రౌపదిని చూచి కుతూహలంతో, (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. 'ఎక్కడనుండి యెక్కడకు నేఁగెడినో యిది యొక్క కాంత రూ
పెక్కుడు; పెంపు సొంపు మన కేర్పడుచున్నది: దా వినీతయై
స్రుక్కుచు నీచభామినుల చొప్పనఁ బల్కెడుఁ బౌరులుం గడున్
వెక్కసమంది చూచెదరు; వేగమ తోడ్కొని రండు నెమ్మితోన్.' 303

ప్రతిపదార్థం: ఇది= ఈమె; ఒక్కకాంత= ఒక్క స్త్రీ; ఎక్కడనుండి= ఎక్కడనుండి; ఎక్కడకున్+ఏఁగెడిన్+ఓ= ఎక్కడికి వెళుతుందో; రూపు+ఎక్కుడు= రూపం ఎక్కువ (అతిశయమయిన రూపం); పెంపు సొంపు= ఔన్నత్య సంపద; మనకున్= మనకు; ఏర్పడుచున్+ఉన్నది= స్పష్టమవుతూ ఉన్నది; తాన్= తాను; వినీత+ఐ= వినయవతి అయి; స్రుక్కుచున్= సంకోచభావం వ్యక్తపరుస్తూ;

నీచభామినుల చొప్పునన్= నీచమయిన పనులు చేసే స్త్రీల విధంగా; పల్కెడున్= మాట్లాడుతూ ఉన్నది; పౌరులున్= పురజనులు కూడా; కడున్= ఎంతో; వెక్కసము+అంది= ఆశ్చర్యపడుతూ; చూచెదరు= చూస్తున్నారు; వేగము+అ= వేగమే; నెమ్మితోన్= ఆదరంతో; తోడ్కొని రండు= వెంటబెట్టుకొని రండి.

తాత్పర్యం: 'ఈమె ఎక్కడనుండి ఎక్కడికి వెళ్ళుతున్నదో? ఒంటరి ఆడది. ఈమెలో అందం ఔన్నత్యం (హుందాతనం) కనిపిస్తూ ఉన్నాయి. అయినా సేవకురాలి వలె వినయంతో వంగి మాట్లాడుతూ ఉన్నది. పట్టణంలోని ప్రజలు కూడా ఎంతో వింతగా చూస్తున్నారు. తొందరగా వెళ్ళి ఆమెను వెంటబెట్టుకొని రండి.'

విశేషం: సైరంధ్రిని చూడగానే సుదేష్ణకు కుతూహలం కలిగింది. దీనినే ఔత్సుక్యం అని కూడా అంటారు. సంచారిభావాలలో ఒకటి. గాఢమైన ఆసక్తి అని సామాన్యార్థం. "అధునైవాస్యలాభో మమాస్త్వితీచ్ఛా ఔత్సుక్యమ్" అని లాక్షణికు లంటారు. కాలవిలంబనం లేకుండా ఇప్పుడే నాకు ఇది లభించాలి అనే కోరిక యొక్క తీవ్రదశ కుతూహలం, లేదా ఔత్సుక్యం. సైరంధ్రిని చూడగానే సుదేష్ణకు జన్మాంతర సౌహృదరూపమైన ప్రేరణతో కాని, ధర్ముడు పాండవుల కిచ్చిన వరం వలన కాని- అంటే దైవప్రేరణతోకాని కుతూహలం కలిగింది. ఆ కుతూహలాన్ని వ్యక్తం చేసే వాచికాభినయమే ఈ పద్య నిర్మాణ రహస్యం. పద్యం చిన్న చిన్న వాక్యాలతో కాహళ సంధించిన విధంగా ఉంటుంది. అది తిక్కన పద్య శైలికూడా. కుతూహల భావావిష్కార క్రమం ఈ రచనలోని శిల్పం. 1. ఈమె ఎక్కడినుండి ఎక్కడికి పోతున్నదో? ఇది మొదట సుదేష్ణ వేసిన ప్రశ్న. బాటసారులను ఎవరు చూచినా మొదట తెలిసికొనదలచే వివరం ఇది. సుదేష్ణ ఆ సంగతి తెలిసికొనటానికి మాత్రమే అడుగలేదు. ఆమె తన కొరకే వస్తే ఎంత బాగుంటుంది అన్న కుతుహలంతో అడిగినట్లున్నది. 2.ఆమె ఒంటరిగానే ఉన్నది. దానికి కారణ మేమిటో? అని పైకి ఆసక్తి. ఆమె నాతో చెలిమి చేస్తుందేమో! అన్నది లోని ఆసక్తి. 3. ఆమె చాల అందగత్తె. ఔన్నత్య సంపదకూడా తనకు కనబడుతున్నది. ఆమెకు సమానంగా ఉన్న ఆ లక్షణాలు ఆమె ఉన్నత కులసంజాతగా తెలుపుతున్నవి. అటువంటి గుణాలు కల వనిత తనతో కలిసి ఉంటే బాగుంటుందని మనసులోని కుతూహలం. 4. అంతటి ఉదాత్తురాలు వినయంతో దాసీభావంతో అట్లా మాట్లాడుతున్న దేమిటి? దాని కేదో బలమైన కారణం ఉండి ఉండాలి. అది నేను తెలిసికొనాలి - అనే ఆసక్తి సుదేష్ణకు కలిగింది. 5. ఒంటరిగా ఉన్న ఆడదానిని జనులు చాల వింతగా ఒక మాదిరిగా చూస్తారు. అది ఆమెకు మర్యాద కాదు. ఆమెకు ఆశ్రయ మిచ్చి రక్షించటం కులీననైన నాకర్తవ్యం అనుకొన్నది సుదేష్ణ. ఇన్ని లోన అనుకున్నది కాబట్టే చివరకు ఆదరంతో ఆమెను తొందరగా తీసికొని రండని చెలికత్తెలను పురమాయించింది. తిక్కన పాత్రలను ఆలోచిస్తూ మాట్లాడుతున్నట్లు చిత్రిస్తాడు. అది నాటకీయతలో ఒక శిల్పం. అటువంటి శిల్పానికి ఈ పద్యం మచ్చుతునక. (సంపా.)

క. అని పలికి పనుపఁ బ్రౌఢాం । గన లిరువురు వోయి ద్రుపదకన్యకతో ని
ట్లనిరి; 'విరాటుమహిషి నినుఁ । దనపాలికిఁ బిలువఁ బంపె దయ పెంపెసఁగన్.' 304

ప్రతిపదార్థం: అని పలికి= అని పలికి; పనుపన్= సుదేష్ణ పంపగా; ప్రౌఢ+అంగనలు= నేర్పరులైన స్త్రీలు; ఇరువురు= ఇద్దరు; పోయి= కదలివెళ్ళి; ద్రుపదకన్యకతోన్= ద్రౌపదితో; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు; విరాటుమహిషి= విరాటుని రాణి; నినున్= నిన్ను; దయపెంపు+ఎసఁగన్= దయ ఆధిక్యం అతిశయించగా; తన పాలికిన్= తన దగ్గరికి; పిలువన్= పిలుచుకొని రావటానికి; పంపెన్= ఆజ్ఞాపించింది.

తాత్పర్యం: అని సుదేష్ణ చెప్పి పంపింది. ఇద్దరు గడుసరివనితలు బయలుదేరారు. ద్రౌపది దగ్గరికి వెళ్ళి ఇట్లా అన్నారు. 'విరాటమహారాజు పట్టమహిషి సుదేష్ణాదేవి దయతో నిన్ను తన దగ్గరకు తీసికొనిరమ్మని పంపించింది.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: సైరంధ్రి యొక్క వివరాలు తెలిసికొని రావటం వేరు. ఆమెను నిపుణంగా ఒప్పించి వెంట తీసికొనిరావటం వేరు. మొదటిపనికి ఎవరైనా చాలు. రెండపనికి ప్రౌఢాంగనలే కావాలి. కావలిసివస్తే తమ నేర్పరితనాన్ని ప్రదర్శించి కార్యం సాధించుకొని రావాలి. అటువంటి చాతుర్యం కలవారిని ఇద్దరిని ఎన్నికచేసి పంపింది సుదేష్ణ. ఆమె కూడా నేర్పరి అనిపించుకొన్నది. (సంపా.)

వ. అనవుడు. 305

తాత్పర్యం: అనగానే.

క. తన తలసీర యరసి య। వ్వనితారత్నంబు వినయవైభవము సతీ
తను వొందిన చందంబునఁ। జనియెం గేకయసుతానుచారికలబడిన్. 306

ప్రతిపదార్థం: తన తల+చీర= తన తలమీద కప్పుకున్న వస్త్రం; అరసి= సర్దుకుని; ఆ+వనితారత్నంబు= స్త్రీలలో శ్రేష్ఠురాలయిన ఆ ద్రౌపది; వినయవైభవము= వినయం యొక్క సంపద; సతీతనువు= పతివ్రతారూపం; ఒందిన చందంబునన్= పొందిన విధంగా; కేకయసుతా+అనుచారికలబడిన్= సుదేష్ణ సఖుల వెంబడి; చనియెన్= లోపలికి వెళ్ళింది.

తాత్పర్యం: ద్రౌపది మేలిముసుగు సవరించుకొన్నది. వినయం స్త్రీ రూపం ధరించిందా అన్నట్లు ఆ ఇద్దరిచెలుల వెంబడి అంతఃపురంలోనికి వెళ్ళింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. వినయమే ద్రౌపదీ రూపాన్ని తాల్చినట్లుగా భావించటం ఉత్ప్రేక్ష. సుదేష్ణ కేకయరాజు కుమార్తె. అంతః పురంలోనివారు రెండురకాలవారు. పరిచారికలు, అనుచారికలు పరిచారికలు. సేవలు చేసేవారు, అనుచారికలు అనుసరించి తిరిగేవారు. సుదేష్ణ మనోభావం తెలిసినవారు కావటంవలన వారు ద్రౌపదిని తమవెంబడి తీసికొని రాగలిగారు. ద్రౌపదికూడా రావటానికి మారుపలుకకుండా ఒప్పుకొన్నది. మొదటి కారణం తన అవసరం. ఎక్కువకాలం ప్రజలనడుమ బజారులో ఉండరాదు. ఎవరైనా గుర్తించవచ్చును. అందువలన భద్రత కొరకు వెంటనే అంగీకరించింది. అంతేకాక అట్లా అంగీకరించటం రాణిపట్ల ఆమె చూపే వినయంగా తోస్తుంది.

వ. ఇవ్విధంబునం జని సౌధంబు నుపరిభాగం బెక్కి. 307

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; చని= వెళ్లి; సౌధంబు+ఉపరిభాగంబు= మేడ పైభాగం; ఎక్కి= ఎక్కి.

తాత్పర్యం: ద్రౌపది అనుచారికలతో వెళ్ళింది. అంతఃపురసౌధం పైభాగం ఎక్కి (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. పదతలంబుల కెంపు పరఁగిన తలము కుం। కుమలిప్తమైన చందము వహింప,
నంగంబు నునుఁగాంతి యడరిన గోడలు। వేదులు మణిమయ విధము నొందఁ,
గనుఁగవ మెఱుఁగులు గదిరిన ముందఱఁ। బుష్పోపహారంబు పొలుపుఁ దాల్ప,
వేనలికప్పు పర్విన మీఁదు నీల దు। కూలంబు మేల్కట్టు కొమరు వడయఁ,

తే. దాను జొచ్చిన కతన మత్స్యక్షితీశు। నింట నిమ్మెయిఁ గ్రొత్తయొ ప్పెసక మెసఁగ
న మ్మహాదేవి యున్నెడ కల్లనల్లఁ। బాండురాజతనూభవపత్ని యరిగె. 308

ప్రతిపదార్థం: పదతలంబుల కెంపు= పాదాల అడుగుభాగాల ఎర్రదనం; పరఁగిన= వ్యాపించిన; తలము= ప్రదేశం; కుంకుమ లిప్తము+ఐన= కుంకుమతో పూయబడిన; చందము వహింపన్= రీతిని పొందగా; అంగంబు నునుఁగాంతి= శరీరంయొక్క నున్నదనపు, మిసమిసలు; అడరిన= వ్యాపించిన; గోడలు= గోడలు; వేదులు= అరుగులు; మణిమయవిధమున్+ఒందన్= మణులు తాపించినతీరును పొందగా; కనుఁగవ మెఱుఁగులు= కనుదోయికాంతులు; కదిరిన ముందఱన్= ప్రసరించిన ముందుభాగం; పుష్ప= పువ్వుల; ఉపహారంబు పొలుపున్+తాల్పన్= కానుకరీతిని ధరించగా; వేనలికప్పు= కొప్పునల్లదనం; పర్వినమీఁదు= వ్యాపించిన పైభాగం; నీలదుకూలంబు= నల్లని పట్టువస్త్రం; మేల్కట్టు= పైన కట్టే చాందినియొక్క; కొమరు+పడయన్= అందాన్ని పొందగా; పాండురాజ తనూభవపత్ని= పాండురాజు కుమారులయిన పాండవులయొక్క భార్య అయిన ద్రౌపది; తాను= తాను; చొచ్చినకతనన్= ప్రవేశించటంవలన; మత్స్యక్షితి+ఈశు+ఇంటన్= మత్స్యదేశపురాజు విరాటుని ఇంటిలో; ఈ+మెయిన్= ఈ విధంగా; క్రొత్త+ఒప్పు= కొత్తదయిన సౌందర్యం; ఎసకము+ఎసఁగన్= అతిశయింపగా; ఆ+మహాదేవి= ఆ మహారాణి; ఉన్న+ఎడకున్= ఉన్నచోటికి; అల్లనల్లన్= మెల్ల మెల్లగా; అరిగెన్= వెళ్ళింది.

తాత్పర్యం: ద్రౌపది పాదతలాలు ఎర్రగా ఉన్నాయి. అందుచేత నడిచేచోటంతా కుంకుమపూసినట్లు ఎర్రబడిపోతున్నది. ద్రౌపది శరీరం మిసమిసలాడుతూ ఉన్నది. అందుచేత ఆమె తిరిగేప్రదేశంలోని గోడలూ, అరుగులూ మణులు పొదిగిన విధంగా ప్రకాశిస్తున్నాయి. ఆమెకళ్ళల్లో కాంతులు మెరిసిపోతున్నాయి. వాటివలన ముందట పూలు చల్లినట్టుగా ఉన్నది. ఆమెజుట్టు నల్లగా ఉన్నది. ఆ కారణంవలన పైభాగం నల్లని పట్టుచాందినీకట్టుగా కనిపిస్తూ ఉన్నది. ద్రౌపది అడుగుపెట్టగానే విరాటుడి అంతఃపురం క్రొత్తసొంపులతో ప్రకాశిస్తున్నది. ఈ విధంగా ద్రౌపది సుదేష్ణ ఉన్నచోటికి మందగమనంతో గంభీరంగా కదలివెళ్ళింది.

విశేషం: అలం: ఉల్లాసం. తద్గుణం. ఉల్లాసాలంకారానికి - **"ఏకస్య గుణదోషాభ్యా ముల్లాసోఽన్యస్య తౌ యది"** - అని లక్షణం. ఒకదాని గుణదోషాలచేత మరియొక దానికి గుణదోషాలు ప్రాప్తించినట్లు వర్ణిస్తే ఉల్లాసాలంకారం. ద్రౌపది ఉల్లాసంగా సుదేష్ణ అంతఃపురానికి వెళ్ళింది. దానిని తిక్కన అర్థాలంకారంతో తీర్చిదిద్దాడు. తాను ఆ అంతఃపురంలో అరుణిమ కారణంగా దానికి నూతనవిలాసం కలిగేటట్లు ప్రవేశించిందట. ఇది అలంకారోక్తి. దానిని విస్తరించటానికి సీసపద్యపాదాలు తిక్కన రచించాడు. ఆమె పాదాలు అడుగిడిన భవనతలంపై కుంకుమ పూసినట్లయింది. ఎఱ్ఱనిగుణం ఎఱ్ఱని గుణాన్ని ప్రాప్తింపచేసింది. అట్లాగే శరీర నైగనిగ్యం గోడలకు మణులకాంతుల సొంపును కలిగించింది. కన్నుల కాంతులు ముందు పూలుచల్లిన పొలుపును కల్పించాయి. నల్లని శిరోజాలకాంతి భవనం పైభాగాన నల్లనిచాందినీ కట్టిన అందాన్ని కలిగింపజేసింది. దాసీవేషంచేత కప్పబడిన ద్రౌపది మేనికాంతియే ఇంతటి వైభవాన్ని ప్రదర్శిస్తుంటే సుదేష్ణ తనకంటె మించిన కాంతిమతి వచ్చిందని ఆశ్చర్యపోకతప్పదు. అర్థాలంకారాన్ని సార్థకంగా వాడి ఔదాత్త్యాన్ని, ఔచిత్యాన్ని పోషించటం తిక్కన నైజం. ఇది స్త్రీ అంగాంగవర్ణన మని కొందరు విమర్శిస్తారు. అది పొరపాటు. ఇది ద్రౌపదియొక్క కాంతిగుణవైభవ ప్రదర్శన వర్ణనం. సుదేష్ణ మనసులో అంకురించిన కుతూహలభావాన్ని కుసుమింపచేయటానికి తోడ్పడే విభావవిస్ఫూర్తి ఈ పద్యం. కొందరిందులోని అలంకారం తద్గుణమంటారు. 'తద్గుణ స్స్వగుణత్యాగా దన్యదీయ గుణగ్రహః' అని తద్గుణ లక్షణం. ఒకటి స్వగుణాన్ని విడిచి అన్యగుణాన్ని గ్రహించడం తద్గుణం. ఇక్కడ 'తలము' (నేల) స్వీయ వర్ణ గుణాన్ని విడిచి, సైరంధ్రి పాదతలముల కెంపువర్ణాన్ని స్వీకరించింది. ఇట్లాగే మిగిలినవి. (సంపా.)

వ. కేకయరాజనందనయును. 309

తాత్పర్యం: కేకయ రాజకుమార్తె అయిన సుదేష్ణకూడా. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. **కనుఁగొని గారవంబును మొగంబునఁ గేలఁ బురఃప్రసారముం**
దనువున నమ్రభావమును దంతమరీచుల సామి నిర్గమం
బును దనలోఁ గడల్కొనఁగ భూరితరాదరరేఖ, "నిందు ర."
మ్మనవుడు నంత నంత ద్రుపదాత్మజ సేరి వినీతి నిల్చినన్. **310**

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; మొగంబునన్= ముఖంలో; గారవంబును= గౌరవం; కేలన్= చేతితో; పురఃప్రసారమున్= ముందుకు చాచడమూ; తనువునన్= దేహంలో (రూపంలో); నమ్రభావమును= వినయస్వభావమున్నూ; దంతమరీచులన్= దంతకాంతులలో; సామినిర్గమంబును= సగం వెడలటమునూ; తనలోన్= తనలో (సుదేష్ణలో); కడల్కొనఁగన్= వ్యాపించగా; భూరితర= అత్యధికమయిన; ఆదరరేఖన్= ఆదరస్ఫూర్తితో; ఇందున్ రమ్మ= ఇటురమ్ము; అనవుడున్= అనగానే; ద్రుపద+ఆత్మజ= ద్రుపదుని కూతురు ద్రౌపది; అంతన్+అంతన్= మెల్లమెల్లగా; చేరి= సమీపించి; వినీతిన్= వినయంతో; నిల్చినన్= నిలబడగా.

తాత్పర్యం: సుదేష్ణ ద్రౌపదిని చూచింది. సుదేష్ణ ముఖంలో గౌరవం కనబడింది. చేతులు ముందుకు చాచింది. సగం కనబడీకనబడనట్లు దంతకాంతులు వ్యాపించాయి. ఆదరంతో దగ్గరికి రమ్మని పిలిచింది. మెల్లమెల్లగా ద్రౌపది ఆమె దరికి చేరి నిలబడింది.

విశేషం: ఈ పద్యాన్ని ఈ విధంగా సంస్కరించటం యుక్తతరమనిపిస్తున్నది. ఇందులో నాలుగు జంటలున్నాయి. 1) గారవంబును- మొగంబును, 2) పురఃప్రసారమున్-కేలును, 3) నమ్రభావమును- తనువును, 4) సామినిర్గమంబును- దంతమరీచులున్- వీనిలో మొదటి పదముల చివరను' ద్వితీయార్థకం. రెండవపదముల చివరి 'ను' సముచ్చయార్థకం. ఇవి తనలో(సుదేష్ణలో) కడల్గొనఁగన్= కలుగగా- ఇది తెలుగు విశ్వవిద్యాలయమూ, మున్నంగిశర్మా అంగీకరించిన పాఠం. మున్నంగిశర్మ తాత్పర్యం - చూచి, మొగము ప్రేమమును - పెద్దతనమును చేతులు ముందునకు చాచి కోలును (చాచికొనుటయు), తనువు ఇంచుక ముందుకు మ్రొగ్గతిలుటయు, పలువరుస మెఱుఁగులు సగము మాత్రము వెలువడుటయు తనలో (సుదేష్ణలో) నెక్కొనఁగా మిక్కిలి మన్నన భావముతో- ఇట 'గారవంబును మొగంబు' నిత్యాదులగు జతలు భాషాశైలీ ప్రయుక్తములు. ఇట్టివే యితర పర్వములందుం జూపట్టెడి - తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిలోని అధోనిర్దిష్ట సూచన గమనించదగినది (సంపా.)

క. **ఆపాదమస్తకము త। ద్రూపము వీక్షించుచుం గుతూహల మడరన్**
భూపాల మహిషి యిట్లను। నా పొలఁతుకతోడ నుచితమయ్యెడి భంగిన్. **311**

ప్రతిపదార్థం: భూపాలమహిషి= విరాటమహారాజు పట్టమహిషి సుదేష్ణ; ఆపాదమస్తకము= కాలినుండి తలదాకా; తద్రూపమున్= ఆమె రూపాన్ని; వీక్షించుచున్= చూస్తూ; కుతూహలము+అడరన్= కుతూహలం కలిగేటట్లు; ఆ పొలఁతుకతోడన్= ఆ ద్రౌపదితో; ఉచితము+అయ్యెడి భంగిన్= తగిన రీతిలో; ఇట్లు+అనున్= ఇలా అన్నది.

తాత్పర్యం: ఆమె రూపాన్ని ఆపాదమస్తకం పరిశీలించింది. కుతూహలంతో సుదేష్ణ తగిన రీతిలో ద్రౌపదితో ఇట్లా పలికింది.

విశేషం: పురుషుల వీక్షణాలకు స్త్రీల వీక్షణాలకు తేడా ఉన్నది. స్త్రీలు ఒక్కచూపుతో అన్నిటిని ఆకళింపు చేసికొంటారు. సుదేష్ణ ద్రౌపదిని పరిశీలించిన తీరు ఇటువంటిదే!

ఆ. 'ఏది కులము? నామ మెయ్యది? యెవ్వరి। దాన? వేమి పనికిఁ బూని యిప్పు
డెచటు బుద్ధిఁదలఁచి యేఁగెద? వింతయు। నెఱుఁగఁ జెప్పుమాకు మెఱుఁగుఁబోఁడి!' 312

ప్రతిపదార్థం: మెఱుఁగుఁబోఁడి!= మెరుపుతీగవంటి శరీరం కలదానా!; ఏది కులము?= నీదేమి కులం?; ఏ+అది= ఏది; నామము= పేరు; ఎవ్వరి దానవు?= ఎవ్వరికి చెందినదానవు? ఏమిపనికిన్= ఏ పనికి; పూని= ప్రయత్నించి; ఇప్పుడు= ఇప్పుడు; ఎచటు= ఏ ప్రదేశాన్ని; బుద్ధిన్+తలఁచి= మనసులో అనుకొని; ఏఁగెదవు?= బయలుదేరావు?; ఇంతయున్= ఇదంతా; మాకున్= మాకు; ఎఱుంగన్+చెప్పు= తెలిసే విధంగా మాకు చెప్పుము.

తాత్పర్యం: 'నీకులం ఏది? నీ పేరేమి? నీవు ఎవరిదానవు? ఏ పనిమీద ఎక్కడకు వెళ్ళుదామని బయలుదేరావు? అంతా మాకు స్పష్టంగా చెప్పుము.'

విశేషం: అపరిచితులను ప్రశ్నించే విధానం ఈ పద్యంలో కనిపిస్తుంది. నీవు ఎవ్వరిదానవు? అని అడగటంలో ఎవరి భార్యవనీ ఎవరి కూతురవనీ అడిగినట్లయింది.

వ. అనిన విని యాజ్ఞసేని యిట్లను; 'నేను సైరంధ్రీజాతి సంభూత; నభిధానంబు మాలిని; పురుషపంచక సనాథనై యుండుదు; నొక్కకారణంబున నుద్ధతులగు విరోధులచేతం బతుల సన్నిధిం దలవట్టి యీడ్వంబడి, వనంబున కరిగి, వ్రతంబుమై వల్లభసహితంబుగా వన్యాహారంబులం గాలంబు గడపుచు బ్రహ్మచర్యంబు నడపితి; నిటమీఁద నియమాచరణంబునకు నొక్క సంవత్సరంబు గొఱంత కలదు. నీవు ధర్మవర్తిని వని వినుటం జేసి నానేర్చు పనులవెంట నీకడ నిలువం దలంచి యిందు వచ్చితి' ననవుడు సుదేష్ణ యిట్లనియె. 313

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= విని; యాజ్ఞసేని= ద్రౌపది; ఇట్లు+అనున్= ఈవిధంగా అన్నది; నేను= నేను; సైరంధ్రీజాతి సంభూతన్= సైరంధ్రీజాతిలో పుట్టినదానను; అభిధానంబు= పేరు; మాలిని= మాలిని; పురుషపంచక సనాథను+ఐ= అయిదుగురు పురుషులతో కూడినదాననై; ఉండుదున్= ఉంటాను; ఒక్క కారణంబునన్= ఒక కారణంవలన; ఉద్ధతులు+అగు= బలవంతులయిన; విరోధులచేతన్= విరోధుల చేతిలో; పతుల సన్నిధిన్= భర్తల ఎదుట; తలపట్టి= తలపట్టుకొని (శిరోజాలు పట్టుకొని); ఈడ్వన్+పడి= లాగబడి; వనంబునకున్+అరిగి= అడవికి వెళ్ళి; వ్రతంబుమై= వ్రతనియమంతో; వల్లభసహితంబుగాన్= పతులతో సహా; వన్య+ఆహారంబులన్ = అడవిలో దొరికే కందమూల ఫలాదులయిన ఆహారాలతో; కాలంబు= కాలాన్ని; కడపుచున్= గడుపుతూ; బ్రహ్మచర్యంబు= బ్రహ్మచర్యాన్ని; నడపితిన్= ఆచరించాను (నిర్వహించాను); ఇటమీఁదన్= ఇకనైన; నియమ+ఆచరణంబునకున్= నియమాన్ని ఆచరించటానికి (నియమ సంపూర్తికి); ఒక్క సంవత్సరంబు= ఒక ఏడు; కొఱంత= లోటు; కలదు= ఉన్నది; నీవు= నీవు; ధర్మవర్తినివి+అని= ధర్మమార్గంలో నడచే దానివని; వినుటన్+చేసి= వినటంవలన; నానేర్చుపనుల వెంటన్= నాకు చేతనయిన పనులతో; నీ కడన్= నీ దగ్గర; నిలువన్+తలంచి= ఉండాలని అనుకొని; ఇందున్= ఇక్కడికి; వచ్చితిన్= వచ్చాను; అనవుడున్= అనగానే; సుదేష్ణ= సుదేష్ణ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: సుదేష్ణ ప్రశ్నలను ద్రౌపది అర్థం చేసికొన్నది. ద్రౌపది ఇట్లా చెప్పింది - 'నేను సైరంధ్రీజాతిలో పుట్టాను. నా పేరు మాలిని. అయిదుగురు భర్తలతో ఉంటాను. ఒకానొక కారణంవలన అహంకారమతులయిన విరోధులు నా మగల ఎదుటే నన్ను జుట్టుపట్టి లాగారు. మగలతో అడవికి వెళ్ళాను. ఒక వ్రత నియమంచేత కందమూల ఫలాదులతో కాలక్షేపం చేశాను. బ్రహ్మచర్యాన్ని అవలంబించాను. ఇంక నా నియమసంపూర్తికి ఒక ఏడు మాత్రం ఉన్నది. నీవు

ధర్మపరురాలవని విన్నాను. నీ దగ్గరే ఉండాలనుకొన్నాను. అందుచేత ఇక్కడకు వచ్చాను. నా చేతనయిన పనులు చేస్తాను' అనగానే సుదేష్ణ ఇట్లా పలికింది.

క. 'సుర గరుడ ఖచర విద్యా। ధర కిన్నర యక్ష సిద్ధ తరుణులలో నీ
వరయఁగ నొక్కత వగు ది। వ్పురికిం జనుదేరఁ గతము బొంకక చెపుమా!' 314

ప్రతిపదార్థం: సుర= దేవతలు; గరుడ= గరుడులు; ఖచర= ఖేచరులు-ఆకాశంలో సంచరించేవారు; విద్యాధరులు= విద్యాధరులు; కిన్నర= కిన్నరులు; యక్ష= యక్షులు; సిద్ధ= సిద్ధులు అనువారియొక్క; తరుణులలోన్= స్త్రీలలో; నీవు= నీవు; అరయఁగన్= బాగా ఆలోచించి చూస్తే; ఒక్కతవు+అగుదు(వు)= ఒక్కతవు అయి ఉంటావు? ఈ పురికిన్= ఈ నగరానికి; చనుదేరన్= రావడానికి; కతము= కారణం; బొంకక= అబద్ధం ఆడకుండా; చెపుమా!= చెప్పుము!.

తాత్పర్యం: 'దేవతల, గరుడుల, ఖేచరుల, విద్యాధరుల, కిన్నరుల, యక్షుల, సిద్ధుల కాంతలలో నీవు ఒకతెవు కావచ్చును. ఈ నగరానికి రావడానికి కారణ మేమిటో అబద్ధమాడకుండా చెప్పుము.'

విశేషం: మూలంలో సుదేష్ణ ద్రౌపదిని మానవాంగన అని నమ్మలేకపోయింది. దానికి ఆమె శరీర నిర్మాణ విశేషాలనే సాముద్రిక శాస్త్ర మర్యాదతో వివరించి చెప్పింది. తిక్కన దానినంతా వదలివేశాడు. ఆ శ్లోకాలివి -

"నైవంరూపా భవన్త్యేవ యథా వదసి భామిని । ప్రేషయన్తీవ వై దాసీ ర్దాసాంశ్చ వివిధాన్ బహూన్॥
నోచ్చ గుల్ఫా సంహతోరుస్త్రిగంభీరా షడున్నతా । రక్తా పంచసు రక్తేషు హంస గద్గద భాషిణీ॥
సుకేశీ సుస్తనీ శ్యామా పీనశ్రోణి పయోధరా । తేన తేనైవ సంపన్నా కాశ్మీరీవ తురంగమీ ॥
అరాల పక్ష్మనయనా బింబోష్ఠీ తనుమధ్యమా । కంబుగ్రీవా గూఢశిరా పూర్ణచంద్ర నిభాననా॥
(శారదోత్పలపత్రాక్ష్యా శారదోత్పల గంధయా । శారదోత్పల సేవిన్యా రూపేణ సదృశీ శ్రియా।) (సం.3.9. 9-12)

క. అనుటయు దరహసితము మో। మునకుఁ దొడవుగాఁగఁ బలుకు ముద్దియ 'యేఁ గృ
ష్ణునిదేవి సత్యభామకుఁ। బనిసేయుదుఁ దొల్లి, పిదపఁ బాంచాలికడన్. 315

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ముద్దియ= ముద్దరాలయిన ద్రౌపది; మోమునకున్= ముఖానికి; దరహసితము= చిరునవ్వు; తొడవుకాఁగన్= అలంకారం కాగా; పలుకున్= ఇట్లా అన్నది; తొల్లి= పూర్వం; ఏన్= నేను; కృష్ణునిదేవి= కృష్ణుని భార్య; సత్యభామకున్= సత్యభామకు; పని చేయుదున్= సేవలు చేస్తుండేదానిని; పిదపన్= తర్వాత; పాంచాలికడన్= ద్రౌపది దగ్గర.

తాత్పర్యం: అనగానే ద్రౌపది ముఖంలో చిరునవ్వు కనిపించింది. ఆ చిరునవ్వు ద్రౌపదికి అలంకారంగా అమరింది. 'నేను ముందు కృష్ణుడి భార్య సత్యభామ దగ్గర, ఆ తరువాత ద్రౌపది దగ్గర పనిచేస్తూ ఉండేదానిని' అని వివరణ నిచ్చింది.

విశేషం: ద్రౌపది కూడా ధర్మరాజువలె దరహాసం చేసింది. ఎందువలన అంటే తాను దాదాపు అంతా దాచుకోకుండా చెప్పినా ఆమె నమ్మటం లేదు. ద్రౌపదిగా గుర్తించటం లేదు. మానవవనితలో దైవవనితను దర్శిస్తూ మరేదో అపూర్వ విశేషాలను వినాలని సుదేష్ణ కోరుతున్నది. అందుకు ద్రౌపది నవ్వింది. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **తగవుమైఁ బరిచారికా ధర్మములకు। నెల్లఁ జాలి వర్తించితిఁ; దల్లి! వినుము**
నాకుఁ బ్రాణంబు ప్రాణమై నన్నుఁ దన్న। కాఁగ భావించి యాదేవి గారవించు. **316**

ప్రతిపదార్థం: తల్లి!= అమ్మా!; వినుము= ఆలకించుము; తగవుమైన్= తగిన విధంగా; పరిచారికా ధర్మములకున్+ఎల్లన్= పరిచారికల పనుల కన్నిటికిని; చాలి= సమర్థురాలినై; వర్తించితిన్= ప్రవర్తించాను; నాకున్= నాకు; ప్రాణంబు ప్రాణమై= ప్రాణానికి ప్రాణమై; నన్నున్= నన్ను; తన్నున్+అ కాఁగన్= తననే అనుకొనేటట్లు; భావించి= తలచి; ఆ దేవి= ఆ ద్రౌపది; గారవించున్= గౌరవిస్తూ ఉండేది.

తాత్పర్యం: 'పరిచారికల విధులు నాకు తెలుసు. పరిచారికలు చేసే పనులన్నీ చేశాను. ఆ పనులలో నేను సమర్థురాలినై ప్రవర్తించాను. అమ్మా! వినుము. ద్రౌపది నన్ను ప్రాణానికి ప్రాణంగా భావించి నేనే తాననుకొన్నట్లు ఆదరించేది.

విశేషం: ద్రౌపది సైరంధ్రిని ఏ విధంగా భావించేదో అట్లే సుదేష్ణకూడా భావించాలని భావం. (సంపా.)

వ. **నీవును.** **317**

తాత్పర్యం: నీవుకూడా.

క. **నీచము లయ్యెడు పనులకు। నా చాలమి యెఱిఁగి మన్ననకుఁ బాత్రముగా**
నీ చిత్తంబునఁ గైకొని। యాచారము తప్పకుండ నరయుము నన్నున్'. **318**

ప్రతిపదార్థం: నీచములు+అయ్యెడు పనులకున్= తక్కువ రకపు పనులకు; నా చాలమి= నా అసమర్థత; ఎఱిఁగి= తెలిసికొని; మన్ననకున్= గౌరవానికి; పాత్రముగాన్= అర్హమయ్యేటట్లు; నీ చిత్తంబునన్= నీ మనసులో; కైకొని= స్వీకరించి; నన్నున్= నన్ను; ఆచారము తప్పకుండన్= నా సైరంధ్రీజాతి ఆచారం తప్పకుండగా; అరయుము= ఏలుకొమ్ము.

తాత్పర్యం: 'నీచమయిన పనులకు నేను తగను. ఈ విషయం నీవు తెలిసికొమ్ము. గౌరవమయిన పద్ధతిలో నన్ను స్వీకరించుము. నా ఆచారము తప్పని విధంగా నన్ను ఏలుకొమ్ము.'

వ. **అని యిట్లు దేవజాతి యను సందియంబు వాయం బలికి మఱియును.** **319**

ప్రతిపదార్థం: అని= అని; ఇట్లు= ఈ విధంగా; దేవజాతి+అను= దేవజాతి వనిత అనే; సందియంబు= సందేహం; పాయన్= తొలగేటట్లు; పలికి= మాటలాడి; మఱియును= ఆ తరువాత.

తాత్పర్యం: తనను దేవజాతికి చెందిన దానినిగా సందేహిస్తూవున్న సుదేష్ణ అనుమానం తొలగేటట్లు ద్రౌపది ఈ విధంగా పలికి, ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **'కలపములు గూర్ప బహువిధ। తిలకంబులు వెట్ట వింత తెరువునఁ బలు పు**
వ్వులు గట్టి కట్టి ముద్దుగఁ। దల ముడువఁగ సరులు గ్రువ్వఁ దద్దయు నేర్తున్.' **320**

ప్రతిపదార్థం: కలపములు= చందనాదులు; కూర్పన్= కలపటానికి; బహువిధ= రకరకాల; తిలకంబులు+పెట్టన్= తిలకాలు పెట్టటానికి; వింత తెరువునన్= కొత్తదయిన పద్ధతిలో; పలుపువ్వులు= అనేక రకాలయిన పువ్వులు; కట్టికట్టి= చెండుకట్టి; ముద్దుగన్= తనకూ, ఇతరులకూ ముద్దువచ్చేటట్లు; తలన్+ముడువఁగన్= తలలో ముడవటానికి; సరులు= దండలు; గ్రువ్వన్= గుచ్చటానికి; తద్దయున్= మిక్కిలి; నేర్తున్= నేర్చాను.

తాత్పర్యం: 'కలపాలు కలపటం తెలుసు. రకరకాలయిన తిలకాలు దిద్దటమూ తెలుసు. వింతవింతలుగా చెండ్లు కట్టటం, ముద్దుగా తలలో ముడవటం, దండ గుచ్చటం అన్నీ బాగా నేర్చాను.'

మ. అనినం గేకయరాజనందన ప్రభూతాశ్చర్యయై యిట్లనున్
'విను! నీ రూపము చూచి మా నృపతి యువ్విళ్లూరు; నే నెమ్మెయిం
బనిగొందుం? దగ నింతులుం దగిలి నీపైఁ జూడ్కి నెక్కొల్పి నె
మ్మనముల్ విస్మయమందఁ జూచెదరు భామా! పల్కు లింకేటికిన్? 321

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; కేకయరాజనందన= కేకయదేశానికి రాజయిన వాడి కుమార్తె సుదేష్ణ; ప్రభూత= ఎక్కువయిన; ఆశ్చర్య+ఐ= ఆశ్చర్యం కలదై; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది; భామా!= వనితా!; విను= వినుము; నీ రూపమున్+చూచి= నీ అందాన్ని చూచి; మా నృపతి= మా రాజు విరాటుడు; ఉవ్విళ్ళూరున్= మనసులో కోరుకొంటాడు; నేను= నేను; ఏ+మెయిన్= ఏ విధంగా?; పని+కొందున్?= పనిచేయించుకొనగలను; తగన్= చక్కగా; ఇంతులున్= స్త్రీలు కూడా; తగిలి= ఆసక్తలై; నీపైన్+చూడ్కి= నీమీద దృష్టిని; నెక్కొల్పి= నిల్పి; నెఱ+మనముల్= నిండు మనస్సులు; విస్మయము+అందన్= ఆశ్చర్యపడే విధంగా; చూచెదరు= చూస్తారు; పల్కులు= మాటలు; ఇంకన్+ఏటికిన్?= వేరే ఎందుకు?

తాత్పర్యం: ఆ మాటలు విన్న సుదేష్ణ ఆశ్చర్యపడుతూ ఇట్లా అన్నది: 'భామా! నీ రూపాన్ని చూచి మా రాజు ఉవ్విళ్లూరటం ఖాయం. అటువంటి నీ చేత నేను ఎట్లా పనిచేయించుకొంటాను? ఆడవాళ్ళుకూడా నీ మీద చూపులు నిలిపి వింతగా చూస్తారు. ఇంకా వేరే మాటలు ఎందుకు?

విశేషం: మగవారి స్వభావాన్ని స్త్రీలు ఎట్లా పసికట్టుతారో తెలియటానికి సుదేష్ణ మాటలు చాలు. ఈ సందర్భంలో మూలంలోని సుదేష్ణకంటె తిక్కన సుదేష్ణ చాల నిబ్బరంగా, నిండుగా, హుందాతనంతో మాట్లాడింది. 'ఇంకా వేరే మాట లెందుకు?' అనే వాక్యం మూలానికి కూడా వర్తిస్తుంది. సుదేష్ణ సైరంధ్రి విషయంలో తన భర్తనే అనుమానించింది. తమ్ముడైన కీచకుడిని శంకించలేదు. కీచకుడు చెప్పినమాట వింటాడు. అతడిని సులభంగా అదుపులో పెట్టవచ్చు ననుకున్నదో ఏమో! అదీగాక మొదట భర్తలనే అనుమానించటం స్త్రీల స్వభావం.

క. దుర్భర యగు నినుఁ గర్కటి । గర్భము ధరియించునట్లు గైకొని నాకై
నిర్భర విధ్వంసదశా । విర్భావము దెచ్చుకొనుట వెరవై యున్నే?' 322

ప్రతిపదార్థం: దుర్భర+అగు= భరించడానికి సాధ్యంకాని; నినున్= నిన్ను; కర్కటి= ఆడపీత; గర్భము= కడుపును; ధరియించునట్లు= మోసేవిధంగా; కైకొని= స్వీకరించి; నాకై= నా కొరకు; నిర్భర= అధికమైన; విధ్వంస, దశా+ఆవిర్భావము= వినాశమనే అవస్థ యొక్క పుట్టుక; తెచ్చుకొనుట= కొనితెచ్చుకొనటం; వెరవు+ఐ+ఉన్నే?= తెలివి అవుతుందా?

తాత్పర్యం: నిన్ను భరించడం చాల కష్టం. పీతగర్భం వంటిదే నీ రక్షణ. నా సంపూర్ణ వినాశనం నేనే కొనితెచ్చుకొనటం. అది తెలివయిన పని కాదు.'

విశేషం: అలం: ఉపమ. ఎండ్రకాయ గర్భం చిత్రమయింది. (తేలు-ఎండ్రకాయ తప్ప) ఇతర ప్రాణులలో ప్రసవం సాధారణంగా తల్లికి బిడ్డకు క్షేమకరం. కాని, ఎండ్రకాయ పిల్లలు పొట్ట బ్రద్దలు కాగా బయటికి వస్తాయి. తల్లి చనిపోతుంది. కొన్ని కడుపులో దాచుకోవచ్చును. కొన్ని దాచుకోవటం కష్టం. అట్లాగే ద్రౌపదీ రక్షణం స్వీయవినాశనానికే దారితీస్తుందని భావం.

ఆ. అనిన 'నీ తలంచినట్ల కా; దేర్పడ। వినుము! నాదు పతులు వెరవు లావు
నలఘు విక్రమంబుఁ గలుగు గంధర్వు; లే। మఱరు నన్ను నొక్క మాత్ర యైన. 323

ప్రతిపదార్థం: అనినన్= అనగా; నీ తలంచినట్ల కాదు= నీవు అనుకున్నట్లు కాదు; ఏర్పడన్= స్పష్టంగా; వినుము= ఆలకించుము;నాదు పతులు= నా భర్తలు; వెరవు= ఉపాయం; లావు= బలం; అలఘు విక్రమంబున్= గొప్ప పరాక్రమం; కలుగు= కలిగిన; గంధర్వులు= గంధర్వులు; ఒక్కమాత్ర+ఐనన్= ఒక్క క్షణమయినా; నన్నున్= నన్ను; ఏమఱరు= ఏమరుపాటు లేక జాగ్రత్తగా చూస్తారు.

తాత్పర్యం: ఆ మాటలు వినిన తరువాత ద్రౌపది ఇట్లా అన్నది. 'నీవు అనుకొన్నట్లు కానే కాదు. నాభర్తలు సామాన్యులు కారు. ఉపాయం తెలిసినవారు. బలం కలవారు. దీనికితోడు పరాక్రమం కలవారుకూడా. ఒక్క నిమిషమయినా నావిషయంలో పరాకుగా ఉండరు.

క. నీచమతి నన్ను నెవ్వఁడు। సూచిన నా రాత్రిలోనఁ జూతురు దెగఁ దా
రా చపలు హరిహరాదులు। గాచిన బలవిక్రమము లఖర్వములైనన్. 324

ప్రతిపదార్థం: నీచమతిన్= నీచమయిన బుద్ధితో; నన్నున్= నన్ను; ఎవ్వఁడు= ఎవ్వడు; చూచినన్= చూసినప్పటికీ ఆ చపలున్= ఆ చంచలబుద్ధికలవాడిని; హరిహర+ఆదులు= విష్ణువు శివుడు మొదలయినవారు; కాచినన్= రక్షించినా; (అతనికి); బలవిక్రమములు= బలపరాక్రమాదులు; అఖర్వములు+అయినన్= మొక్కవోనివి అయినా; ఆ రాత్రిలోనన్= అదే రాత్రిలో; తెగన్+చూతురు= అంతమొందిస్తారు.

తాత్పర్యం: నన్ను ఎవడయినా నీచబుద్ధితో చూసినట్లయితే, నా పతులు ఆ నీచుడిని ఆ రాత్రే నరికివేస్తారు. వారిని హరిహరాదులు రక్షించినా సరే! వారికెంత బలమూ, విక్రమమూ ఉన్నా సరే!

విశేషం: ఈ వాక్యాలు భావి కీచకవధను సూచిస్తున్నాయి.

క. బంధుశతంబులు శౌర్యమ। దాంధములై శక్తి సంపదాభీలములై
సింధురసదృశత నున్నను। సంధుల సంధు లెడలించి చంపుదు రతనిన్. 325

ప్రతిపదార్థం: బంధుశతంబులు= వందలకొద్దీ చుట్టాలు; శౌర్యమద= పరాక్రమ గర్వముతో; అంధములు+ఐ= కళ్ళు కానరానివారై; శక్తిసంపద్= శక్తి సంపదతో; ఆభీలములు+ఐ= భయంకరమయినవై; సింధుర సదృశతన్= ఏనుగుల వలె; ఉన్నను= ఉన్నాసరే; (నా భర్తలు) అతనిన్= అతడిని; సంధుల సంధులు+ఎడలించి= సంధిబంధాలను తొలగించి; చంపుదురు= చంపుతారు.

తాత్పర్యం: వందలకొద్ది చుట్టాలు శౌర్య గర్వితులై ఉండవచ్చును; స్వయంగా మదాంధులు కావచ్చును. శక్తి సంపదతో భయంకరులు కావచ్చును. ఏనుగువలె ఉండవచ్చును. అయినా నా భర్తలు కీళ్ళకు కీళ్ళు విడదీసి వాడిని చంపివేస్తారు.

విశేషం: ఈ పద్యంలో ముందు జరగబోయే నూరుగురు ఉపకీచకులను సైతం భీముడు చంపే వృత్తాంతం రేఖామాత్రంగా సూచితం. కీచకుడికి ఏనుగంత బలం ఉన్నది. చుట్టాలున్నారు. అదిగాక ఎదురులేని అధికారం ఉన్నది. అయినా భీమునిచేతిలో ప్రాణాలు పోగొట్టుకొన్నాడు.

వ. కావునఁ బురుషులు నాకడం దేఱి చూడను వెఱతు; రదియునుంగాక. 326

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; పురుషులు= మగవాళ్ళు; నాకడన్= నావైపు; తేఱి చూడను= తేరిపార చూడటానికి; వెఱతురు= భయపడతారు; అదియునున్+కాక= అదీ కాక.

తాత్పర్యం: మగవాళ్ళు నా వైపు తేరిపారచూడటానికి కూడా భయపడతారు. అదీ కాక.

క. నా చిత్తము తాదృశులకు। గోచరమే? యస్మదీయ కులజన సంశి
క్షాచార మహిమ యట్టిది। యే? చెప్పకు తద్విధాతిహీన వచనముల్. 327

ప్రతిపదార్థం: నా చిత్తము= నా మనసు; తాదృశులకున్= అలాంటి పురుషులకు; గోచరమే= కనబడుతుందా (బయటపడుతుందా?); అస్మదీయ= నా యొక్క; కులజన= వంశపురుషుల; సంశిక్షా+ఆచార= శిక్షణ, ఆచారాలయొక్క; మహిమ= ప్రభావం; అట్టిదియే= అటువంటిదా, సామాన్యమైనటువంటిదా?; తద్విధ= అటువంటి; అతిహీనవచనముల్= మిక్కిలి నీచమయిన మాటలు; చెప్పకు= చెప్పవద్దు.

తాత్పర్యం: నా మనసు అటువంటివారికి గోచరించదు. (నాపై ప్రభావం చూపే) కులము, పెద్దల శిక్షణ ఆచారం అటువంటిది కాదు. అటువంటి నీచమయిన మాటలు మాట్లాడకుము.

చ. మనమున నూఱడిల్లు; మనుమానము మానుము; నన్ను నేలు; మే
పనులు నుదాత్త నాగరిక భంగుల నీమది కెక్కునట్లు నే
ర్పును భయభక్తులున్ మెఱయ రూపుగఁ జేసెదఁ; దద్జ్ఞులైన స
జ్జనులు నుతింప వర్తనము సాధులు వృద్ధులు మెచ్చఁ జల్పెదన్. 328

ప్రతిపదార్థం: మనమునన్= మనసులో; ఊఱడిల్లుము= ఊరటచెందుము; అనుమానము= సందేహం; మానుము= మానుకొమ్ము; నన్నున్+ఏలుము= నన్ను స్వీకరించుము; ఏ పనులు= ఏ పనులు; ఉదాత్త= ఉన్నతమైన; నాగరిక భంగులన్= సంస్కారవంతమయిన రీతిలో; నీ మదికిన్+ఎక్కునట్లు= నీ మనసుకు హత్తుకొనేవిధంగా; నేర్పును= నిపుణత; భయభక్తులున్= భయమూ భక్తియూ; మెఱయన్= ప్రకాశించేవిధంగా; రూపుగన్+చేసెదన్= చక్కగా చేస్తాను; వర్తనము= నా ప్రవర్తన; తద్జ్ఞులు+ఐన సజ్జనులు= దానిని తెలిసిన సత్పురుషులు; నుతింపన్= స్తుతించేవిధంగా; సాధులు, వృద్ధులు= సన్మార్గులూ, పెద్దలూ; మెచ్చన్= ప్రశంసించే విధంగా; చల్పెదన్= ఆచరిస్తాను.

తాత్పర్యం: మనసులో ఊరట చెందుము. నాపట్ల సందేహం వదలిపెట్టుము. నన్ను సేవకురాలిగా స్వీకరించుము. ఏ పనులలో ఉదాత్తత, ఏ పనులలో నాగరికత ఉంటాయో వాటిలో నీకు ఏవి నచ్చుతాయో ఆ పద్ధతిలో నేర్పుతో భయభక్తులతో చేస్తాను. నా చేతలను సజ్జనులు మెచ్చుకొనే విధంగా ఉత్తములు, సాధుజనులు, పెద్దలు ప్రశంసించే విధంగా ప్రవర్తిస్తాను.

క. ననుఁ గుచ్చితంపుఁ బనులకుఁ। బనుపక, యెంగిలికి లోనుపఱుపక తగు మ
న్ననతోడ నరయు వారల। కనురాగము నెఱపి నడతు రస్మత్పతులున్.' 329

ప్రతిపదార్థం: ననున్= నన్ను; కుచ్చితము+పనులకున్= నీచమయిన పనులకు; పనుపక= పంపక; ఎంగిలికిన్= ఎంగిలికి; లోనుపఱుపక= లోబరచకుండా; తగు మన్ననతోడన్= తగిన గౌరవంతో; అరయువారలకున్= చూచేవారికి; అస్మద్+పతులున్= నా మగవారుకూడా; అనురాగము నెఱపి= ప్రేమను. అభిమానాన్ని ప్రకటించి; నడతురు= ప్రవర్తిస్తారు.

తాత్పర్యం: నన్ను నీచపు పనులకు పంపనివారిని, ఎంగిలి పెట్టకుండా తగిన గౌరవంతో చూచేవారిని నా భర్తలు ఆదరంతో చూస్తారు.'

ఆ. అనిన సంతసిల్లి యద్దేవి సైరంధ్రి। నూఱడిల్లఁ బలికి యునిచికొనియె;
నంతిపురము చరిత కలవడ మెలఁగుచు। నుండె న వ్వధూటియును ముదమున. 330

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+దేవి= సుదేష్ణ;; సంతసిల్లి= సంతోషపడి; సైరంధ్రిన్= సైరంధ్రిని; ఊఱడిల్లన్+పలికి= కుదుటపడేటట్లు మాట్లాడి; ఉనిచికొనియెన్= తన దగ్గర సేవకురాలిగా ఉంచుకొన్నది; ఆ+వధూటియును= ఆ ద్రౌపదికూడా; ముదమునన్= సంతోషంతో; అంతిపురము చరితకున్= అంతఃపురంలో మెలగవలసిన విధానానికి; అలవడన్= తగిన విధంగా; మెలఁగుచున్+ఉండెన్= మెలగుతూ ఉన్నది.

తాత్పర్యం: సుదేష్ణ ఆ మాటలకు సంతోషించింది. సైరంధ్రిని ఊరడింపుమాటలతో కుదుటపరిచింది. తన దగ్గర సేవకురాలిగా ఉంచుకొన్నది. సైరంధ్రి కూడా సంతోషంతో అంతఃపుర మర్యాదలకు అనుగుణంగా ప్రవర్తించసాగింది.

క. ఇవ్విధమున నయ్యేవురు। నవ్వెలఁదియు సకల జనుల కజ్ఞాతముగా
న వ్విరటు ప్రోలఁ బ్రమదము। నివ్వటిల వసించి రుచిత నిభృతత్వమునన్. 331

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ విధంగా; ఆ+ఏవురున్= ఆ అయిదుగురూ; ఆ+వెలఁదియున్= ఆ ద్రౌపదియూ; సకలజనులకున్= అన్నిరకాల ప్రజలకు; అజ్ఞాతముగాన్= తెలియకుండా; ఆ+విరటు ప్రోలన్= ఆ విరాటుని నగరంలో; ప్రమదము= సంతోషం; నివ్వటిలన్= కలిగేవిధంగా; ఉచిత= తగిన; నిభృతత్వమునన్= నిబ్బరంతో; వసించిరి= ఉన్నారు, నివసించారు.

తాత్పర్యం: ఈ విధంగా పాండవులు అయిదుగురూ, ద్రౌపదీ ఎవ్వరికీ తెలియకుండా విరాటుడి నగరంలో సంతోషంతో ఉన్నారు. నిబ్బరంగా (సహనంతో కూడిన స్తిమిత భావంతో) నివసించారు.

విశేషం: ద్రౌపదీ సమేతులై పాండవులు విరాటుడి కొలువు చేరిన క్రమంలో ఔత్తరాహ సంస్కృత మూల భారత ప్రతికీ, దాక్షిణాత్య సంస్కృత మూల భారత ప్రతికీ భేదం ఉన్నది. ఔత్తారాహ ప్రతిలో క్రమం - ధర్మరాజు, భీముడు, ద్రౌపది, సహదేవుడు, అర్జునుడు, నకులుడు వరుసగా ప్రవేశించినట్లు ఉన్నది. దాక్షిణాత్య ప్రతిలో - ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, ద్రౌపది వరుసగా ప్రవేశించినట్లు ఉన్నది. తిక్కన తన భారతంలో 'దాక్షిణాత్య' ప్రతిని అనుసరించినట్లు తోస్తున్నది (సంపా.)

వ. అనిన విని 'వారల వర్తనం బటమీఁదఁ జెల్లిన తెఱం గెఱింగింపు' మని యడిగిన. 332

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= విని; వారల= వారలయొక్క; వర్తనంబు= జీవనవిధానం; అటమీఁదన్= ఆ తరువాత; చెల్లిన= ప్రవర్తిల్లిన; తెఱంగు= విధానం; ఎఱింగింపుము+అని= తెలియజేయుము అని; అడిగినన్= అడుగగా.

తాత్పర్యం: పాండవుల తర్వాతి వృత్తాంతం తెలుపవలసిందిగా జనమేజయుడు అడుగగా.

ఆశ్వాసాంతము

సీ. బాంధవ శాత్రవాకలిత భావభవా! భవపాశబంధ సం
బంధవిరామ రామ! పరిపక్వ వివేక నిరూఢ భక్త హృ
ద్గ్రంధి విభేదనా! పరమకారుణికా! పరిమాణదూర! దుః
ఖేంధన పావకాయిత సమీక్షణ! నిత్య మహాద్భుత ప్రదా! 333

ప్రతిపదార్థం: బాంధవ= చుట్టరికంచేతను; శాత్రవ= వైరంచేతను; ఆకలిత= కూడుకొన్న; భావభవా!= మన్మథుడు కలవాడా!; భవపాశబంధ= సంసారం అనెడి పాశబంధంతో; సంబంధ విరామ రామ!= సంబంధాన్ని పోగొట్టే మనోహరుడా; పరిపక్వ= పండిన; వివేక= విజ్ఞానంచేత; నిరూఢ= ప్రసిద్ధులయిన; భక్తహృద్గ్రంథి= భక్తుల యొక్క హృదయానికి సంబంధించిన ముడులను; విభేదనా!= విప్పేవాడా!; పరమకారుణికా!= ఎంతో కరుణా స్వభావం కలవాడా!; పరిమాణదూర!= (భావుకతకు) కొలతకు అందనివాడా!; దుఃఖ+ఇంధన= దుఃఖమనే కట్టెలకు; పావక+ఆయిత= అగ్నివలె ఆచరించిన; సమ్+ఈక్షణ!= చక్కనిచూపులు కలవాడా!; నిత్య= నిత్యమైన; మహా+అద్భుతప్రదా!= చాలగొప్పదయిన ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని ఇచ్చేవాడా!.

తాత్పర్యం: మన్మథుడిని శత్రువుగాను మిత్రుడిగాను కలిగినవాడా! సంసారమనే పాశబంధాన్ని త్రెంచే మనోహరుడా! పరిపక్వమయిన విజ్ఞానంచేత ప్రసిద్ధులయిన భక్తుల హృదయగ్రంథులను విప్పేవాడా! కరుణా స్వభావం కలవాడా! భావనకు అందని వాడా! దుఃఖమనే కట్టెలకు అగ్నివంటి చూపులు కలవాడా! నిత్యమయిన గొప్పవయిన ఆశ్చర్యాలను కలిగించేవాడా హరిహరనాథా!

విశేషం: అలం: రూపకం. హరిహరనాథుడిలో ఇటు హరిస్వరూపం ఉన్నది. అటు హరుడి స్వరూపంకూడా ఉన్నది. మన్మథుడు విష్ణువు కుమారుడు కావటం వలన హరిహరనాథుడికి - హరికి బంధువు అయ్యాడు. శివుడు మన్మథుడిని దహించటంవలన హరిహరనాథుడిలో - శివుడికి శత్రువయ్యాడు. సంసార జన్మబంధాలు వదలిపెట్టినవారికి మనోహరమయినవాడు. పరిపక్వజ్ఞానం కలిగినభక్తుల హృదయాలలోని చిక్కుముళ్ళను విప్పేవాడు. ఎంతో దయకలవాడు. ఊహలకు అతీతంగా అందనివాడు. భక్తుల దుఃఖాలను దగ్ధం చేసేవాడు. నిత్యమైన ఆనందాన్ని, అద్భుతాలను ప్రసాదించేవాడు.

క. అన్నమయత్వాది విరా। మోన్నత! వాఙ్మనసదూర! యోగిస్మేరా!
భిన్నాభిన్నాకార। ఛ్ఛన్నాత్మీయ ప్రకార! జగదాధారా! 334

ప్రతిపదార్థం: అన్నమయత్వ+ఆది= అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయము లనెడి పంచకోశాలు మొదలయిన; విరామ+ఉన్నత!= కోశాలను అతిక్రమించినవాడా!; వాక్+మనసదూర!= వాక్కుకు, మనసుకు అందనంతదూరంలో ఉన్నవాడా!; యోగిస్మేరా!= యోగులయొక్క ఆనందహాసమైనవాడా!; భిన్న= భిన్నమైన; అభిన్న= అభిన్నమైన; ఆకారచ్ఛన్న= ఆకారాలతో కప్పబడిన; ఆత్మీయప్రకార!= ఆత్మరూపం కలవాడా!; జగత్+ఆధారా!= జగత్తులకు ఆధారమైనవాడా!.

తాత్పర్యం: అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయములనెడి పంచ కోశాలకు అతీతుడయినఉన్నతుడా! వాక్కులకు మనసుకు దూరమయినవాడా! యోగుల చిరునవ్వులలో వెల్లివిరిసేవాడా!; జగత్తుకంటె భిన్నంగానూ! జగత్తే తానుగానూ కనిపించేవాడా! లోకాలకు ఆధారమయినవాడా! హరిహరనాథా!

విశేషం: అన్నమయం, ప్రాణమయం, మనోమయం, విజ్ఞానమయం, ఆనందమయం అనే పంచకోశాలకు అతీతుడయినవాడా! ఆ హరిహరుడి స్వరూపాన్ని మాటలలో వర్ణించలేము. మనసులో ఊహించలేము. యోగుల హృదయాలలో ఆనందరూపుడుగా ఉంటాడు. జగత్తుకంటె భిన్నంగా, జగత్తే తానుగా కనిపిస్తాడు.

మాలిని.

కమలభవ కిరీటగ్రామ పద్మావలీ సం। గమసుభగ పదాబ్జా! గాఢభక్తి ప్రకార
ప్రముదిత ముని శశ్వద్భావనా గమ్య! రమ్య! క్రమపరిణతమూర్తీ! శ్రౌతశాఖాగ్రవర్తీ! 335

ప్రతిపదార్థం: కమలభవ= బ్రహ్మయొక్క; కిరీటగ్రామ= కిరీటాల సముదాయం అనే; పద్మ+ఆవలీ= పద్మాల సమూహంయొక్క; సంగమ= కలయికతో; సుభగ= సుందరమయిన; పద+అబ్జా= పాదపద్మాలు కలవాడా?; గాఢభక్తిప్రకార= గాఢమయిన భక్తి విధానంచేత; ప్రముదిత= మిక్కిలి సంతోషించే; ముని= మునులయొక్క; శశ్వత్‌భావనా= నిరంతర భావనచేత; గమ్య= పొందదగినవాడా!; రమ్య= రమణీయమయిన; క్రమపరిణత= క్రమపరిణామంగల; మూర్తీ!= రూపంకలవాడా!; శ్రౌతశాఖా+అగ్రవర్తీ= వేదశాఖల చివరలందు- అనగా ఉపనిషత్తుల యందు ఉండేవాడా!.

తాత్పర్యం: బ్రహ్మ చతుర్ముఖుడు. నాలుగు ముఖాలకూ నాలుగు కిరీటాలుండడం చేత 'కిరీటిగ్రామ.' అందుచేతనే 'పద్మావలి.' అట్టి బ్రహ్మ చేసే పాదాభివందనం స్వీకరించేవాడా! భక్తుల నిరంతర ధ్యానంలో గోచరించేవాడా! క్రమపరిణామం కలిగిన రూపం కలిగినవాడా! వేదాంత వేద్యుడా!

విశేషం: మత్స్యాద్యవతారాలు ఒకరకమైన పరిణామాన్ని తెలియజేస్తాయి. పంచభూతాలలోకూడా కనిపించే మరొక పరిణామం ఉన్నది. ఆకాశం నుండి వాయువు, వాయువునుండి అగ్ని, అగ్నినుండి నీరు, నీటినుండి భూమి పుట్టాయని చెప్పే క్రమం ఒకటి. మాలినీ వృత్తంలోని ప్రతిపాదానికీ 15 అక్షరాలుంటాయి. గణాలు: న న మ య య. 9వ అక్షరం యతిమైత్రి స్థానం. ప్రాస నియమం ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీమహాభారతము నందలి విరాటపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము. 336

తాత్పర్యం: ఇది మంగళకరమైన 'ఉభయకవిమిత్రుడు' అనే బిరుదనామం గలవాడు, కొమ్మనామాత్యుడి పుత్రుడు, పండితులను సేవిస్తూ ప్రకాశించేవాడు. (పండితులచేత పూజించబడేవాడు) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలోని విరాటపర్వంలో మొదటి ఆశ్వాసం.

విరాటపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

విరాటపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీమదపాంగాలోకన। ధామసకృత్సంగ రూఢ తాదృశ విభవో

ద్ధామాశ్రితలోకా! లో। కామయ నిర్వరణ నిపుణ! హరిహరనాథా!' 1

ప్రతిపదార్థం: హరిహరనాథా!= ఓ దేవా!; శ్రీమత్+అపాంగ+ఆలోకన, ధామ= శోభావంతాలైన (సిరిగల) క్రీగంటి చూపుల కాంతి యొక్క; సకృత్‌సంగ= ఒకమారు తగులగానే; రూఢ= కలిగిన; తాదృశ, విభవ= అటువంటి గొప్పతనంచేత (వైభవంచేత); ఉద్దామ= గొప్పవారైన; ఆశ్రిత, లోకా!= ఆశ్రయించిన భక్తజనులు కలవాడా!; లోక+ఆమయ= సమస్తజనుల యొక్క ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక రుగ్మతలను (రోగాలను); నిర్వరణ నిపుణ= నిశ్శేషంగా హరించడంలో నేర్పరితనం కలవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వైభవోపేతాలైన నీ క్రీగంటి చూపుల కాంతి ఒక్కమారు తగులగానే ఆ గొప్పతనం చేత నిన్ను ఆశ్రయించిన భక్త జనులను గొప్పవారిని చేసేవాడా! లోకుల సమస్త రోగాలనూ, దుఃఖాలనూ పోయేటట్లు చేయగలవాడా!

విశేషం: తిక్కన తాను ప్రతిపాదించిన హరిహరనాథ తత్త్వాన్ని తన గ్రంథంలో ఆశ్వాసం మొదట్లోనూ, చివరలోనూ వ్రాసే పద్యాలలో నిరూపించాడు. శివకేశవుల అభేదాన్ని కవి హరిహరనాథ రూపంలో దర్శించాడు. గ్రంథాన్ని హరిహరనాథుడికి అంకితం చేశాడు కాబట్టి, తొలిపద్యం ఆ దేవుడిని సంబోధిస్తూ చెప్పాడు.

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కి ట్లనియె; నట్టియెడ ధర్మసూనుండు సభాజనంబుల యుల్లంబులు రంజిల్ల రాజునకు వినోదంబులు వివిధోదాత్త ప్రకారంబులఁ జలుపుచు, నొక్కొక్కమాటు మధుర ప్రసంగంబుగా నాడిన నెత్తంబున గెలిచిన విత్తంబులు తమ్ముల కొసంగుచుండు; వాయునందనుండు వంటకు మిగిలిన మాంసంబు లమ్మునెపంబున నిచ్చలు సహోదరులకు నిచ్చుచుండు; వివ్వచ్చుండు సంగీత ప్రసంగంబున మెచ్చువడసిన కనకాంబరాదులు సోదరులకుం జేర్చుచుండు; నకులుండు దురంగంబుల గ్రాసంబులం గనిన ధనంబులు తోడంబుట్టువులకుఁ బెట్టుచుండు; సహదేవుండు గోవులం జూచి భూవల్లభుండు సంతసిల్లిన సమయంబున సముపార్జితంబు లగు పదార్థంబులన్నియు నన్నలవశంబు సేయుచు వారలకు గోరసంబులం దుష్టి సలుపుచుండు; ద్రౌపది త న్నరసికొని తిరుగుచున్న వీరలం గన్నులారం జూచుచు నుచితంపు నడవడి మెలంగుచుండు. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ హరిహరనాథా!; వైశంపాయనుండు; జనమేజయునకున్+ఇట్లు+అనియెన్; అట్టి+ఎడన్= ఆ సమయాన; ధర్మసూనుండు= ధర్మరాజు; సభాజనంబుల= విరాట మహారాజు కొలువులోని సభ్యుల యొక్క; ఉల్లంబులు= మనస్సులు; రంజిల్లన్= సంతోషించగా; రాజునకున్= విరాటరాజునకు; వినోదంబులు= ఆహ్లాదాన్ని కలిగించే మాటలను, చర్యలను; వివిధ+ఉదాత్త ప్రకారంబులన్= అనేక రకాలైన సముచిత పద్ధతులలో; చలుపుచున్= చేస్తూ, ఒక్కొక్క మాటు= ఒక్కొక్కసారి;

మధురప్రసంగంబుగాన్= తియ్యని వాక్యాలతో; ఆడిన= ఆటాడిన; నెత్తంబునన్= పాచికలాటలో; గెలిచిన= సంపాదించిన; విత్తంబులు= ధనాలను; తమ్ములకున్= తన తమ్ములకు; ఒసంగుచున్+ఉండున్= ఇస్తూ ఉండేవాడు; వాయునందనుండు= భీముడు; వంటకున్ మిగిలిన మాంసంబులు= వండగా మిగిలిన మాంసాలను; అమ్మునెపంబునన్= అమ్ముతాననే కారణం చూపి; నిచ్చలున్= ప్రతిరోజూ; సహోదరులకున్= తమ్ములకు; ఇచ్చుచున్+ఉండున్= ఇస్తూ ఉండేవాడు; వివ్వచ్చుండు= అర్జునుడు; సంగీతప్రసంగంబునన్= పాటలు పాడేటప్పుడు; మెచ్చు+పడసిన= కానుకగా పొందిన; కనక+అంబర+ఆదులు= బంగారం, పట్టు వస్త్రాలు మొదలైనవాటిని; సోదరులకున్= మిగిలిన తమ్ములకు; చేర్చుచున్+ఉండున్= అందిస్తూ ఉండేవాడు; నకులుండు= నకులుడు; తురంగంబుల= గుర్రాల యొక్క; గ్రాసంబులన్= గడ్డిని కొనేటప్పుడు; కనిన, ధనంబులు= మిగిల్చిన డబ్బులు; తోడంబుట్టువులకున్= అన్నదమ్ములకు; పెట్టుచున్+ఉండున్= ఇచ్చేవాడు; సహదేవుండు= సహదేవుడు; గోవులన్+చూచి= ఆవులను పరిశీలించి; భూవల్లభుండు= రాజైన విరాటుడు; సంతసిల్లిన సమయంబునన్= సంతోషించిన సందర్భాలలో; సముపార్జితంబులు+అగు= సంపాదించిన; పదార్థంబులు= వస్తువులు; అన్నియున్= అన్నిటినీ; అన్నలవశంబు చేయుచున్= అన్నలకు అందిస్తూ; వారలకున్= వారికి; గోరసంబులన్= పాలతో; తుష్టి సలుపుచున్+ఉండున్= సంతోషాన్ని కలిగిస్తుండేవాడు; ద్రౌపది= ద్రౌపది; తన్నున్+అరసికొని= తనను కనిపెట్టి; తిరుగుచున్న వీరలన్= తిరిగే వీళ్లను (పాండవులను); కన్నులు+ఆరన్+చూచుచున్= కంటినిండా చూస్తూ; ఉచితము+నడవడిన్= సందర్భానుసారమైన వర్తనతో; మెలంగుచున్+ఉండున్= మసలుతుండేది.

తాత్పర్యం: హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయుడికి ఈ విధంగా చెప్పాడు: ఆ అజ్ఞాతవాసకాలంలో ధర్మరాజు అనేకమైన ఉత్తమ పద్ధతులలో రాజుతో వినోద ప్రసంగాలు చేస్తూ సభ్యుల మనస్సులను సంతోషపెట్టుతూ ఉండేవాడు. ఒక్కొక్కసారి తియ్యని మాటలతో స్నేహపూర్వకంగా ఆడిన జూదంలో గెలిచిన ధనాలను ధర్మరాజు తమ్ములకు ఇస్తూ ఉండేవాడు. భీముడు వంటకు వాడగా మిగిలిన వివిధ మాంసాలను అమ్మే మిషతో అన్నదమ్ములకు అందజేస్తూ ఉండేవాడు. అర్జునుడు సంగీత నాట్య ప్రదర్శనల సందర్భంగా మెప్పులు పొంది కానుకలుగా సంపాదించిన బంగారం పట్టువస్త్రాలు మొదలైనవాటిని సోదరులకు ఇస్తూ ఉండేవాడు. నకులుడు గుర్రాల దాణాలను కొనుగోలు చేసేటప్పుడు మిగిలే ధనాలను తోబుట్టువులకు పంచుతూ ఉండేవాడు. విరాటరాజు గోవులను చూచి ఉప్పొంగిపోయిన సమయాలలో కానుకలుగా ఇచ్చిన పదార్థాల నన్నిటినీ సహదేవుడు అన్నలకు అర్పణ చేస్తూ పాలూ, పెరుగూ, వెన్న మొదలైన గోరసాలను వారికిచ్చి తృప్తిపరుస్తూ ఉండేవాడు. తనను కంటిని రెప్పవలె కాపాడుతూ తిరుగుతున్న పాండవులను కన్నారా చూచుకొంటూ తగిన రీతిగా ద్రౌపది మసలుతూ ఉన్నది.

విశేషం: 1. ఆశ్వాసాది పద్యం తరువాత తిక్కన 'దేవా!' అని కృతిభర్త, కృతిశ్రోత అయిన హరిహరనాథుడిని సంబోధించి కథ సాగిస్తాడు. ఇది అతని ఆశ్వాసారంభ రచనా శిల్పం. (సంపా.)

2. పాండవులు ఐదుగురు విరాటుడి కొలువులో తలా ఒక పనిలో చేరారు. ఒకరిపై ఒకరికి ఎనలేని ప్రేమ. విధివశాత్తు ఆ సంవత్సరం అట్లా నడుచుకొనక తప్పదు. అయినా సోదర ప్రేమతో ఒకరినొకరు ఆదుకొంటూ, ద్రౌపదిని కంటికి రెప్పవలె కాపాడుతున్నారు.

3. పాండవుల ప్రవర్తనలను తిక్కన మూలంలోకంటె ఉదాత్తీకరించాడు. ధర్మరాజు బ్రాహ్మణులనందరినీ ఒక త్రాట గట్టినట్లు చేసి వారితో ద్యూతక్రీడలు స్వేచ్ఛగా ఆడాడని మూలంలో ఉన్నది. తిక్కన దానిని వదలాడు. ధర్మరాజు సుహృద్ద్యూతం ఆడింది విరాటునితో మాత్రమే అని సూచించాడు. రాజుతో సమానగౌరవాన్ని పొందుతున్న కంకుభట్టు ఇతరులతో పాచికలాడినట్లు చెప్పటం ఔచిత్యం కాదని తిక్కన భావించి ఉంటాడు. మూలంలో భీముడు- విరాటుడు ఉపయోగించగా మిగిలిన వండిన

మాంసాలనూ, భక్ష్యాలనూ సోదరులకు ఇచ్చేవాడని ఉన్నది. తిక్కన - వంటకు మిగిలిన మాంసాలను అమ్మినట్లుగా సోదరులకు అందించేవాడని చమత్కారంగా మార్చాడు. ఇవి వండిన మాంసాలు కాకపోవచ్చును. భుక్తశేషం సోదరులకు పెట్టని ఒక పెద్దరికాన్ని భీముడికి తిక్కన దక్కించాడు. మూలంలో బృహన్నలకు దొరికిన కానుకలు పాతబట్టలే. కాని, తిక్కన రచనలో కనకాంబరాలు. మూలంలో నకులుడు అశ్వశిక్షణలో తన నేర్పును ప్రదర్శించి రాజుగారి మన్ననలు పొందాడని ఉన్నది. కాని, తిక్కన రచనలో గుర్రాల దాణాల మీద వచ్చిన ధనాలు సోదరుల కిచ్చినట్లుగా ఉన్నది. ఇక్కడ మూలమే అందంగా ఉన్నది. మూలంలో ద్రౌపది నిపుణంగా భర్తలను అరసికొంటూ అజ్ఞాతవాస సమయం చెడకుండా ప్రవర్తిల్లినట్లు చెప్పబడింది. తెలుగులో పాండవులే ఆమెను ఒక కంట రక్షించుకొంటూ రహస్యంగా మసలినట్లు ఉన్నది. అజ్ఞాతవాసాన్ని విరాటనగరంలో నిర్వహిస్తున్న పాండవులు మరల తల్లి గర్భంలో ఉన్నట్లు గూఢంగా నివసించారనీ, దుర్యోధనుడి వలన ఏదైనా కీడు కలుగుతుందేమోనని ఎప్పుడూ శంకిస్తుండేవారనీ మూలభారతం చెప్పింది. తిక్కన ఆ ప్రసక్తి తేలేదు. (సంపా.)

తే. ఇట్లు దమతమ వర్తిల్లు నెడల సకల। జనములకు హృదయానురంజన మొనర్చి
తాల్మి, పుయిలోట, యడఁకువ, తగవు మెలపు। నెఱితెఱంగు, వాటింపంగ నేర్పు గలిగి. 3

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తమ తమ వర్తిల్లు+ఎడలన్= వారు వారు నడచుకొనే చోట్ల; సకల జనములకున్= ప్రజలందరికీ; హృదయ+అనురంజనము+ఒనర్చి= హృదయ సంతోషాన్ని కలిగించి; తాల్మి= ఓర్పు; పుయిలోట= జంకు; అడఁకువ= అణగిమణగి ఉండటం; తగవు= ధర్మం; మెలపు= జాగ్రత్త; నెఱితెఱంగు= నిపుణత, మంచినడవడి; పాటింపంగన్= ఆచరణలో కనపడేటట్లు; నేర్పు కలిగి= సమర్థులై (ప్రవర్తించారని భావం).

తాత్పర్యం: ఈ విధంగా పాండవులు తాము పనిచేసే చోట్ల ప్రజలందరూ మనసులలో సంతోషించి మెచ్చుకొనేటట్లు వర్తించారు. ఓర్పు, జంకు, అణగిమణగి ఉండటం, ధర్మం, అప్రమత్తత, మంచివడవడి అనే ఆరు గుణాలను ఆచరణలో పెట్టే నేర్పు కలిగి (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: పాండవులు తమ తమ అజ్ఞాతవాస వృత్తులలో రాణించారు. సేవావృత్తుల వలన ప్రజారంజనం కలిగించారు. ఇక వారి సేవాధర్మంలో ఆరు గుణాలను పాటించారు. అవే ప్రజాహృదయరంజన హేతువులు. ధౌమ్యుడు బోధించిన సేవాధర్మంలో మేలి గుణాలను ఆచరించి చూపించారు. ద్రౌపదీ సహిత పాండవులు మొత్తం ఆరుగురు. తిక్కన చెప్పిన గుణాలు కూడా ఆరే. షాడ్గుణ్యం -వరుసగా ధర్మజుడిలో ఓర్పు, భీముడిలో ఎక్కడ బయటపడతానో అనే జంకు, అర్జునుడిలో ఆడువారి నడుమ అణగిమణగి ఉండే అణకువ, నకులుడిలో స్వీయ కర్తవ్యపాలనలో ధార్మిక ప్రవృత్తి, సహదేవుడిలో అప్రమత్తత, ద్రౌపదిలో మంచి నడవడి, ఉదాత్తశీలం అనేవి అజ్ఞాతవాసంలో ప్రస్ఫుటంగా కానవచ్చే గుణాలు. ఒక్కొక్కరిలో ఒక్కొక్క గుణంగానూ తోచవచ్చును; అందరిలోనూ ఆయా సమయాలలో సందర్భోచితంగా ఆరు గుణాలూ సమష్టిగా ప్రదర్శితం కావచ్చును. ఈ విశ్లేషణ మూలంలో కానరాదు. తన కావ్యరచనలో అనుశీలించవలసిన అంశాలను ఆయా సందర్భాలలో మొదటనే సూచించటం తిక్కన పాటించే కథాకథన కళాశిల్పం. (సంపా.)

క. ఉన్నతఁటి వివిధదేశో। త్పన్నులు నద్భుతవిధాయి బలవిక్రమ సం
పన్నులు నగుమల్లులు విభ। వోన్నతుఁడగు విరటుపాల నుద్భటవృత్తిన్ 4

ప్రతిపదార్థం: ఉన్నతఁటిన్= ఆ విధంగా అజ్ఞాతవాసం చేస్తున్న సమయంలో; వివిధ దేశ+ఉత్పన్నులు= వివిధ దేశాలలో పుట్టిన వారు; అద్భుత విధాయి= ఆశ్చర్యకరమైన; బలవిక్రమ సంపన్నులు= బలం, పరాక్రమం అనే సంపద కలవారు; అగు మల్లులు= అయిన కుస్తీ పట్టువారు (మల్లయుద్ధ నిపుణులు); విభవ+ఉన్నతుఁడు+అగు= సంపదచే గొప్పవాడయిన; విరటుపాలన్= విరాటునిముందు; ఉద్భటవృత్తిన్= సంరంభంగా, గర్వాన్ని ప్రదర్శిస్తూ (వచ్చారు).

తాత్పర్యం: ఆ విధంగా పాండవులు ఉన్నప్పుడు వివిధ దేశాలకు చెందినవారూ, బల పరాక్రమ సంపన్నులూ అయిన మల్లయోధులు సంరంభంగా పటాటోపంతో విరాటరాజు కొలువులోకి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తమలోన మాటలాడెడు। సమయంబున నొక్క రుఁడు విశాలోరస్కుం
డమితబలుఁడు, పంచానన। సమమూర్తిస్ఫూర్తి యధిక సంరంభమునన్. 5

ప్రతిపదార్థం: తమలోనన్= వారిలో వారు; మాటలాడెడు సమయంబునన్= మాట్లాడేటప్పుడు; విశాల+ఉరస్కుండు= విశాలమైన ఎదురు రొమ్ము గలిగినవాడు; అమితబలుఁడు= అధికమైన బలం కలవాడు; పంచానన సమమూర్తి, స్ఫూర్తి= సింహంతో సమానమైన ఆకారం గలిగిన తేజస్సు కలవాడు; ఒక్కరుఁడు= ఒకడు; అధికసంరంభమునన్= మిక్కిలి ఆటోపంగా; (తర్వాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: వాళ్లలో వాళ్ళు మాట్లాడుకొంటుండగా సింహంవంటి ఆకారవైభవం కలవాడూ, బలాఢ్యుడు అయిన ఒక గంభీరవ్యక్తి ఆటోపంగా వచ్చాడు.

విశేషం: మూలంలో ఆ మల్లుడి పేరు 'జీమూతు' డని ఉన్నది. తిక్కన దానిని చెప్పలేదు. (సంపా.)

వ. అన్నరపతి కట్టెదుర నిల్చి మ్రొక్కి భుజాస్ఫాలనంబు సేసి యిట్లనియె. 6

ప్రతిపదార్థం: ఆ+నరపతి= ఆ విరాటుని; కడు+ఎదురన్= ఎట్టఎదురుగా; నిల్చి= నిలబడి; మ్రొక్కి= నమస్కరించి; భుజా+ఆస్ఫాలనంబు+చేసి= భుజాలు అప్పళించి (చరచి); ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ వ్యక్తి విరాటమహారాజు కెదురుగా వచ్చి నిలబడి, మల్లయుద్ధాని కాహ్వానిస్తున్నట్లు భుజాలు (జబ్బలు) చరుస్తూ ఇట్లా అన్నాడు.

విశేషం: 1. పాండవుల అజ్ఞాతవాసం నాలుగు నెలల కాలం ప్రశాంతంగా గడచిపోయింది. అప్పుడు విరాట నగరంలో బ్రహ్మోత్సవాలు వచ్చాయి. ఆ సందర్భంగా దేశంలో మల్లులందరూ నగరంలో సమావేశమయ్యారు. మల్ల క్రీడలు బ్రహ్మోత్సవ వినోదాలలో ముఖ్యమైనవి. మల్ల వీరులు రాజుగారి ఎదుట తమ నైపుణ్యాలు ప్రదర్శించి బహుమతు లందుకొనటం ఆ ఉత్సవంలో చెప్పుకొన తగిన విశేషం.

"అథ మాసే చతుర్థే తు బ్రహ్మణః సుమహోత్సవః,
ఆసీత్సమృద్ధో మత్స్యేషు పురుషాణాం సుసమ్మతః.
తత్ర మల్లాః సమాపేతు ర్దిగ్భ్యో రాజన్ సహస్రశః,
మహాకాయా మహావీర్యాః కాలఖంజా ఇవాసురాః.
వీర్యోన్నద్ధా బలోదగ్రా రాజ్ఞా సమభిపూజితాః,
సింహస్కంధ కటిగ్రీవాః స్వవదాతా మనస్వినః
అసకృ ల్లబ్ధలక్షాస్తే రంగే పార్థివ సన్నిధౌ॥
తేషా మేకో మహానాసీత్ సర్వమల్లా న్సమాహ్వయత్
ఆవల్గమానం తం రంగే నోపతిష్ఠతి కశ్చన' (సం.4-12-12-15)

మల్లులు విరటుని కొలువుకు రావటాన్ని అలంకారికంగా వ్యాసుడు వర్ణించాడు. సత్యలోకంలో బ్రహ్మకొలువుకూ, కైలాసంలో శివుడి కొలువుకూ వచ్చినట్లు వచ్చారట. వారు కాలఖంజులనే రాక్షసుల వలె భయంకరాకారులట. సింహస్కంధులట. అయినా

వారు నిర్మలులట, అభిమానధనులట, అనేక విజయాలు సాధించారట. వారందరిలో ఒకడు జగదేకమల్లుడట. అతడిని రంగంలో దిగి ఎదిరించేవాడు లేడట! అతడు రాజుకు సవాలుగా మారాడట! ఇది మూల కథనం. వ్యాసుడి కథనంలో సత్యనిష్ఠ కనబడుతుంది కాని, కావ్యకళ తక్కువ. నాలుగు నెలలకు వచ్చిన బ్రహ్మోత్సవం గురించి చెప్పకపోయినా, మల్లులు విరాట నగరానికి రావటం బ్రహ్మలోకానికి, శివలోకానికి భక్తులు వచ్చినట్లున్నదని వర్ణించకపోయినా, మల్లులు రాక్షసులవలె ఉన్నారని పేర్కొనకపోయినా కథ కెటువంటి లోపం లేదు. జగదేక మల్లుడి పాత్ర, అతడి ప్రాగల్భ్యం, విరటుడి కొలువుకే ఒక సవాలుగా మారిందన్న వివరం మూలంలో లేదు. అసలు కథకు ప్రాణం ఆ ఘట్టం. దాని చిత్రణం మూలంలో లేదు. తిక్కన పొల్లునంతా వదలి ప్రాణాన్ని పట్టుకొన్నాడు. ఆ మల్లవీరుడు నానారాజాస్థాన సందర్శనం చేస్తూ విజయపత్రాలను గ్రహిస్తూ విరాటనగరంమీదకు దాడి వచ్చినట్లు వచ్చాడు. బాహువులప్పళించి సవాలు చేశాడు. ఇక్కడ తిక్కన కథా ప్రవృత్తినే మార్చాడు. ఇది పునస్సృష్టి, ఋషి వంటి వేదవ్యాసుల చిత్రణ కంటె కవిబ్రహ్మ కల్పనం రసవత్తరం, సన్నివేశ మధురం. మల్లుడు రాజునకు నమస్కరించి సభామర్యాదను పాటించాడు. బాహువులప్పళించి మల్లవీర మర్యాదను ప్రదర్శించాడు. కొందరు విమర్శకులు బాహువులప్పళించటం అవినయంగా వ్యాఖ్యానించారు. అది పొరపాటు. అది జాతివార్తా విశేషం. తిక్కన సమకాలీన మల్లమర్యాదలకు ఈ ఘట్టంలో ప్రాణం పోశాడు. మూలం కంటె కావ్య కళాగౌరవంతో సన్నివేశాన్ని తిక్కన చిత్రించాడు. (సంపా.)

తే. **'నేల నాలుగు సెఱఁగుల నృపుల కొలువు। లందు నేను వర్తించితి నవనినాథ!**
యగ్గలించి, నా యెదుర బాహప్పళించి। కడఁగఁజాలెడు మల్లులఁ గాన నెందు.' **7**

ప్రతిపదార్థం: అవనినాథ!= ఓ విరాటరాజా!; నేల నాలుగు చెఱఁగుల= ఈ ప్రపంచం నలుమూలలా ఉన్న; నృపుల కొలువులందున్= రాజాస్థానాలలో; నేను వర్తించితిన్= నేను తిరిగాను; అగ్గలించి= అతిశయించి, ఉత్సాహంగా వచ్చి; నా+ఎదురన్= నా ముందు; బాహు+అప్పళించి= భుజాలు చరచి; కడఁగన్+చాలెడు= పూనుకొనగల; మల్లులన్= కుస్తీ పట్టేవారిని; ఎందున్= ఎక్కడా; కానన్= చూడలేదు.

తాత్పర్యం: 'ఓ విరాటరాజా! భూప్రపంచం నలుమూలలా ఉండే రాజుల కొలువులన్నీ తిరిగాను. కాని, నా ముందుకు వచ్చి నిలబడి ఉత్సాహంగా భుజాలు చరిచి నిలబడగలిగిన వీరుడిని చూడలేదు.'

చ. **అనునెడ వాని యుగ్రసమదాకృతియుం, బటువాక్యవృత్తియుం,**
గని, విని, మల్లులెల్ల భయకంపితమూర్తులు దాల్చి మాఱుప
ల్కను, గనువిచ్చి చూడను, మొగం బెగయింపను జాలకున్న న
జ్జనపతి వేడ్క మ్రోడుపడు చందము గాంచి యుధిష్ఠిరుం డనున్. **8**

ప్రతిపదార్థం: అను+ఎడన్= అట్లా మాట్లాడేటప్పుడు; వాని ఉగ్ర సమద+ఆకృతియున్= అతని భయంకరాకారాన్ని; పటువాక్య వృత్తియున్= కఠినమైన మాటలతీరును; కని,విని= (క్రమంగా) చూచి, విని; మల్లులు+ఎల్లన్= కొలువులోని మల్లులందరూ; భయకంపిత మూర్తులు+తాల్చి= భయంచేత వణకుతున్న ఆకారాలు కలవారై; మాఱు+పల్కను= ఎదురు జవాబు చెప్పడానికీ; కనువిచ్చిచూడను= కళ్ళు తెరచి చూడటానికీ; మొగంబు+ఎగయింపను= మొగం ఎత్తి చూడటానికీ. (కూడ); చాలక+ఉన్నన్= సమర్థులు కాకపోగా; ఆ+జనపతి= ఆ రాజు, విరాటునియొక్క; వేడ్క= ఉత్సాహం; మ్రోడుపడుచందము= వాడిపోయే విధాన్ని; కాంచి=చూచి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: (భయంకరాకారుడైన) ఆ మల్లుడి భయంకరాకారాన్నీ పరుష వాక్యాలనూ విని కొలువులోని మల్లులు అందరూ భయపడి మారుమాటాడలేక కన్నులు విచ్చి చూడలేక, ముఖం పైకెత్తలేక నిశ్చేష్టులయ్యారు. అప్పుడు విరాట మహారాజు యొక్క ఉత్సాహం మోడువారి పోవటాన్ని చూచి ధర్మరా జిట్లా అన్నాడు.

విశేషం: తిక్కన రచనలో నాటకీయత అచ్చుపడేటట్లు కనపడే పద్యాలలో ఇది ఒకటి. నాటకీయతలో ఆంగిక, ఆహార్య, వాచిక, సాత్త్వికాభినయ వర్ణనం ముఖ్యాంశం. ఇక్కడ జగదేక మల్లుడి ఉగ్రసముదాకృతి ఆంగికాభినయ సంబంధి. భయంకరమైన మదించిన ఆకారం భయానక రసాన్ని చూపరులలో కలిగించే రౌద్రరస విభావం. అతడి మాటలు పరుషవాక్యవృత్తి కలిగినవి. 'వాక్యవృత్తి' రసవ్యంజకమైన వాచికాభినయ విన్యాసాన్ని ప్రకటించింది. ఆ భయంకర మల్లరూపాన్ని చూచిన ఆస్థాన మల్లులు ప్రేక్షకులవంటివారు. వారిలో భయానకరసం ప్రకోపించింది. రసం సాత్త్విక భావాలవలన వ్యక్తమై సాక్షాత్తు పఠితలు రసానందాన్ని పొందటానికి ఉపకరిస్తుంది. కంపం (శరీరం వణకటం) భయం వలన కలిగే సాత్త్విక భావం. మారుమాట్లాడలేకపోవటం, మొగమెత్తి చూడలేకపోవటం కంపాన్ని పోషించే సాత్త్విక భావాభివ్యక్తులు. ఆస్థాన మల్లులు భయకంపితులయ్యారు. వారిని చూచి విరాటుడి ఉత్సాహం మోడువారింది. వేడ్క, మ్రోడుపడు, చందము - ఈ మూడూ తెలుగు జాతీయపు పలుకుబళ్ళు. పూలతో, పండ్లతో విరిసిన చెట్టు ఒక్కసారిగా ఎండిపోవటం వంటిది - విరాటుడి మానసికోత్సాహం మోడువారటం. ఆ చందాన్ని (ఆ పరిణామ విధానాన్ని) ధర్మరాజు గమనించాడు. వెంటనే తన కర్తవ్యాన్ని గుర్తించాడు. మోడువారిన రాజు వేడ్కను మరల చిగురింప చేసే ఉపాయం చెప్పటం తన ధర్మంగా భావించాడు. మూలంలో ధర్మరాజుప్రసక్తి లేదు. అభినయ చిత్రణ లేదు. **"యదా సర్వే విమనస స్తే మల్లా హతచేతసః అథ సూదేన తం మల్లం యోధయామాస మామత్స్యరాట్"** (సం.4.12.16) అని మాత్రమే ఉన్నది. మూలంలో ధర్మజుడి నీతిసహాయం విరాటునికి అవసరం లేకపోయింది. కంకుభట్టును విరటుని వివేకశక్తిగా చిత్రించ దలచుకొన్న తిక్కన కథ మార్చాడు. ధర్మరాజు సలహాను ప్రవేశపెట్టాడు. రంగంలోని ప్రతిపాత్రా సజీవంగా అభినయిస్తున్నట్లు చిత్రించి నాటకీయతను రక్తి కట్టించాడు. కథలో అడుగడుగున తిక్కన ఉభయకావ్యకళాప్రౌఢి పాటించే శిల్పం ప్రదర్శితమౌతూనే ఉండటం తెలియదగిన విశేషం. (సంపా.)

క. 'వీనికి మార్కొనఁజాలెడు। దానికిఁ దగువాని ధర్మతనయుని పురిలో
నానానియుద్ధలంపటు। నే నొక్కనిఁ గంటి నిపుణుఁ డిందుల కతఁడున్. 9

ప్రతిపదార్థం: వీనికిన్, మార్కొనన్+చాలెడు దానికిన్= ఇతడిని ఎదురించటానికి; తగువానిన్= సమర్థుడైనవాడిని; ధర్మతనయుని పురిలోన్= ధర్మరాజు నగరంలో; నానానియుద్ధలంపటున్= అనేక రకాలైన బాహుయుద్ధాలలో ఆసక్తి కలవాడిని; ఒక్కనిన్= ఒకడిని; ఏను+కంటిన్= నేను చూచాను; అతఁడున్= వాడు; ఇందులకున్= ఈ విషయానికి (విషయంలో) నిపుణుఁడు= సమర్థుడు, నేర్పరి.

తాత్పర్యం: 'ఓ రాజా! ఈ మల్లయోధుడితో సరిసమానంగా బాహుయుద్ధం చేయగల సమర్థుడిని ఒకడిని నేను ధర్మరాజు నగరంలో చూచాను. అత డీ విషయంలో నైపుణ్యం గలవాడు.

విశేషం: ధర్మరాజు తాను స్వయంగా రహస్యం బయటపడకుండా ఉండే విధంగా భీముడిని సభకు పరిచయం చేయటం విశేషం. ఆయుధాలు పట్టి యుద్ధం చేయకూడదనే నియమం గల యుద్ధం నియుద్ధం. 'ధర్మతనయుని పురిలో పనిచేసినవాడే కంకుభట్టు. అందువలన వలలుడిని గుర్తించటం సహజం. కంకుడు లేదా కంకుభట్టు కొలువులో ఉన్నప్పుడే వలలుడు విరాటుడి కొలువులో చేరాడు.

క. మన బానసీఁడు వలలుం। డను శూద్రుఁడు నాకుఁ దెల్ల; మధిక బలుల నో
ర్చినవాఁ డనేక మల్లుల। నిను మెచ్చింపంగఁ జాలు; నిజ మిది యధిపా! 10

ప్రతిపదార్థం: అధిపా!= ఓ విరాటరాజా!; మన బానసీఁడు= మనవద్ద వంటలవాడుగా ఉన్న; వలలుండు+అను శూద్రుఁడు= 'వలలుడు' అనే పేరుతో ఉన్న శూద్రకులంవాడు; నాకున్+తెల్లము= నాకు+తెలుసు, నేను ఎరిగినవాడు; అధిక బలులన్= మిక్కిలి బలవంతులను; అనేక మల్లులన్= ఎందరో కుస్తీ పట్టేవారిని; ఓర్చినవాఁడు= గెలిచాడు; నిను మెచ్చింపంగన్+చాలున్= నిన్ను సంతోషపరచగల సమర్థుడు; ఇది= ఈ మాట; నిజము= వాస్తవం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ మహారాజా! మనవద్ద వంటలవాడు అయిన వలలుడు ఎందరినో మల్లయుద్ధంలో ఓడించిన అధిక బలాఢ్యుడు. నా కా సంగతి బాగా తెలుసు. అతడు నీ మనస్సును రంజింప జేయగల సమర్థుడు. నా మాట వాస్తవం.

విశేషం: పాత్రోచిత, సందర్భోచిత సంభాషణ చిత్రణం తిక్కనకు సహజవిద్య, మ్రానుపడిన విరాటుడికి ఉపాయం చెప్పే కంకుడు దీర్ఘ సమాసాలతో, వృత్తాలతో ఉపన్యాసం చేయకూడదు. చిన్న చిన్న వాక్యాలలో కంద పద్యాలవంటి లఘు ఛ్చందస్సులలో మాట్లాడింప చేయటం ఔచిత్యం. అలతి అలతి పదాలతో కాహళ సంధించినట్లు, చెవిలో తొందరగా ముక్తసరిగా సలహా చెప్పుతున్నట్లున్నాయి ధర్మజుడి వాక్యాలు. 9,10 పద్యాలు అందుకు చక్కని ఉదాహరణలు. మన బానసీడు వలలుడనే శూద్రుడు - భీముడు జ్ఞాపకం రావటానికి ఈ వాక్యం తోడ్పడుతుంది. నాకు తెల్లము - (నాకు బాగా తెలుసు)- అనే చిన్న వాక్యం అతడిమీద విరటునికి నమ్మకం కలిగిస్తుంది. మిత్రవాక్యం ప్రమాణం. అధికబలులైన మల్లులను అనేకులను ఓడించా డా వలలుడు - అనే వాక్యం మల్లయుద్ధంలో అతడికున్న దీర్ఘమైన, స్థిరమైన, ఉన్నతమైన అనుభవాన్ని చెప్పక చెపుతున్నది. అతడు ఈ మల్లవీరుడిని జయించి నీకు సంతోషాన్ని కలిగిస్తాడు - అనే వాక్యం మోడువారిన అతడి మనసును చిగురింపచేసే ఆశా మంత్రం. నిజ మిది - అని దృఢంగా చెప్పటం అతని మనస్సుకు ధైర్యం చెప్పటం. ఈ వరుసలో వాక్యాలు పలుకగలిగిన ధర్మరాజు వాక్య నిపుణుడు. ఆ మాటలు విన్న తరువాత విరాటుడు మరొక మాట లేకుండానే ధర్మజుడి సలహాను పాటించి తీరాలి. తిక్కన అట్లాగే చిత్రించాడు. నాకు తెల్లము, నిజ మిది - ఇవి తెలుగువారి పలుకుబడిలో ఎదుటివారికి ధైర్యం చెప్పటంలో వాడే ఊతపదాల వంటి వాక్యమూలికలు. జీవద్భాష తెలిసిన కవి వాడే వాక్యవిన్యాసాలు. (సంపా.)

క. **అనవుడు భూపతి పిలువం। బనిచె; నతని నతఁడు నపుడ భయభక్తులతోఁ**
జనుదెంచి, మల్లవర్గముఁ। గని మై వెఱుగంగ నిలిచెఁ గౌతూహలియై. **11**

ప్రతిపదార్థం: అనవుడు= అనగానే; భూపతి= విరాటరాజు; అతనిన్= (భీముని) వలలుని; పిలువన్+పనిచెన్= పిలిపించాడు; అతఁడు= వలలుడు; అపుడు+అ= వెంటనే; భయభక్తులతోన్+చనుదెంచి= వినయ విధేయతలతో వచ్చి; మల్లవర్గమున్= కుస్తీ పట్టేందుకు సిద్ధంగా ఉన్నవారిని; కని= చూచి; మై+పెఱుగంగన్= శరీరంవిజృంభించగా; కౌతూహలి+ఐ= ఉత్సాహం కలవాడై; నిలిచెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: అప్పుడు విరాటరాజు వలలుడిని పిలిపించాడు. అతడు ఎంతో భయం, భక్తి ప్రకటమయ్యే వినయంతో వచ్చి ఎదురుగా ఉన్న మల్లులను చూచి ఉప్పొంగిపోయి శరీరాన్ని పెంచాడు. (సాటి యోధులను చూస్తే యోధులకు ఉత్సాహం రావటం సహజం!)

విశేషం: విరాటుడు పిలువనంపితే మూలంలో భీముడు ఇష్టం లేకుండానే వచ్చాడు. అనిష్టంగానే మల్లయుద్ధానికి సిద్ధమయ్యాడు. తెలుగులో దానికి విరుద్ధంగా తిక్కన చిత్రించాడు. (సంపా.)

వ. **ఇట్లు నిలిచిన పవనతనయు నవలోకించి, యవనీవల్లభుం డమ్మల్లముఖ్యుం జూపి, 'యితనితోడి యుద్ధంబునకు సన్నద్ధుండవు గ' మ్మనిన నతండును ధర్మతనయు కనుసన్న గనుంగొని యమ్మత్స్యవిభునకు వినయంబుతో నిట్లనియె.** **12**

ప్రతిపదార్థం: ఇట్లు నిలిచిన= ఈ విధంగా నిలబడ్డ; పవన తనయున్= భీముని (వలలుని); అవలోకించి= చూచి; అవనీవల్లభుండు= విరాటరాజు; ఆ+మల్లముఖ్యున్+చూపి= ఎదురుగా ఉన్న యోధుని చూపి; ఇతనితోడి యుద్ధంబునకున్= ఇతడితో పోరుకు; సన్నద్ధుండవు, కమ్ము+అనినన్= సిద్ధపడుమని చెప్పగానే; అతండును= వలలుడు కూడా; ధర్మతనయు= ధర్మరాజు యొక్క; కనుసన్న+కనుంగొని= కనుసైగను గమనించి; ఆ+మత్స్యవిభునకున్= ఆ విరాటరాజుతో; వినయంబుతోన్+ఇట్లు+అనియెన్= నెమ్మదిగా ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా భీముడు విరాటుడి ఎదుట నిలువబడగా ఆ రాజు అక్కడ ఉన్న మల్లవీరుడిని చూపించి, 'ఇతడితో యుద్ధం చేయటానికి సిద్ధం కమ్మ' అని ఆజ్ఞాపించాడు. భీముడు ధర్మరాజు వైపు చూచాడు. అతడి కనుసైగను గమనించాడు. మత్స్యరాజుతో వినయంగా ఇట్లా అన్నాడు.

విశేషం: భీముడు ధర్మజుడి వైపు చూడటం, అతడు సరే అన్నట్లు సైగ చేయటం - ఆ అన్నదమ్ముల అనుబంధమూ, ధర్మజుడిపై భీముడికి గల భక్తీ ఇందు ద్యోతకమవుతున్నాయి.

తే. **'అధిప! ధర్మజుపాల నున్నప్పు డతని । వేడుకకుఁ దగఁ బెనఁగుదు వింతలైన**
జెట్టిమల్లులతో, నిప్పు డట్టువోలె । నీదు వేడ్కకుఁ బెనఁగెద నేర్చినట్లు.' **13**

ప్రతిపదార్థం: అధిప!= ఓ విరాట మహారాజా!; ధర్మజు పాలన్+ఉన్నప్పుడు= ధర్మరాజు వద్ద నే నుండేటప్పుడు; అతని వేడుకకున్+తగన్= ఆయన ఆనందానికి తగినట్లుగా; వింతలు+ఐన జెట్టి మల్లులతోన్= విశేషమైన ఈ యోధులతో; పెనఁగుదున్= కుస్తీ పట్లు పట్టేవాడిని; అట్టు+పోలెన్+ఇప్పుడు= అప్పటివలె ఇప్పుడు; నీదు వేడ్కకున్= నీ సంతోషం కొరకు; నేర్చినట్లు= నాకు చేతనైననట్లుగా; పెనఁగెదన్= పోరాడుతాను.

తాత్పర్యం: 'ఓ విరాటరాజా! నేను ధర్మరాజు కొలువులో ఉన్నప్పుడు ఆయన మనస్సుకు ఉల్లాసం కలిగే విధంగా మల్లులతో కుస్తీ పట్లు పట్టి చూపేవాడిని. ఇప్పుడు కూడా అదేవిధంగా మీ కానందం కలిగేటట్లుగా ఈ మల్లులను ఒక పట్టుపట్టి చూపిస్తాను.

భీముఁడు మల్లునితో యుద్ధము చేయుట (సం.4-12-17)

వ. **అని మెత్తన యియ్యకొని, గర్జించి, గజాలస్యంబునం బ్రాంగణంబు సొచ్చి, భూపాలుని ముందట భుజాస్ఫాలనంబు సేసి, మ్రొక్కి మరలునెడ, నంతకుమున్న యమ్మల్లవరుండు నరపతి యనుమతి వడసి, కృతపరికర బంధుండై యరుగుదెంచి యచ్చట నునికింజేసి యతండును ననిలసుతుండునుం బరస్పర మూర్తుల నవలోకించి యుద్ధరంగంబు మన్ను ఫాలప్రదేశంబున ధరియించి శరీరంబులపైఁ జల్లుకొని రెండు సేతుల మునివ్రేళ్ళను గొండొక పుచ్చికొని యొండొరుల దెసకు వైచి, యున్నతంబులగు నపసవ్య కరంబుల నాకుంచిత సవ్య బాహు తలంబుల నప్పళించు చప్పుళ్ళు గలసి యొక్కరుండ మల్లసఱచిన చందంబున వీతేర వింతతానకంబుల నిలిచి కదిసిన యప్పుడు వృకోదరుండు.** **14**

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; మెత్తన+ఇయ్యకొని= వినయపూర్వకంగా అంగీకరించి; గర్జించి= శబ్దం చేసి; గజ+ఆలస్యంబునన్= ఏనుగుమదంతో; ప్రాంగణంబు+చొచ్చి= లోపలికి వచ్చి; భూపాలుని ముందటన్= విరాటుని ముందు; భుజ+ఆస్ఫాలనంబు+చేసి= భుజాలు చరిచి; మ్రొక్కి= నమస్కరించి; మరలు+ఎడన్= వెనుకకు వెళ్ళేటప్పుడు; అంతకుమున్న+అ= అంతకుముందే; ఆ+మల్లవరుండు= ఆ యోధశ్రేష్ఠుడు; నరపతి= విరాటుడి యొక్క; అనుమతి+పడసి+అంగీకారం తీసికొని; కృతపరికరబంధుండై= నడికట్టు సిద్ధం చేసికొని; అరుగుదెంచి= వచ్చి; అచ్చటన్+ఉనికిన్+చేసి= అక్కడ ఉండటం చేత; అతండును= ఆ మల్లుడును; అనిలసుతుండునున్= భీముడు (వలలుడు)ను; పరస్పర మూర్తులన్= ఒకరొకరి ఆకారాలను; అవలోకించి= చూచి; యుద్ధరంగంబుమన్ను= మల్ల యుద్ధం చేసే నేలపై ఉన్న మట్టిని; ఫాలప్రదేశంబునన్= నొసట; ధరియించి= పూసికొని; శరీరంబులపైన్= ఒడళ్లపై; చల్లుకొని= విదిలించుకొని; రెండుచేతుల= తమ రెండు చేతుల యొక్క; మునివ్రేళ్లను= కొసవ్రేళ్లతో;

కొండొకపుచ్చుకొని= కొద్దిగా తీసికొని; ఒండు+ఒరులదెసకున్+వైచి= ఒకరు మరొకరి వైపునకువేసి; ఉన్నతంబులు+అగు= ఎత్తైన; అపసవ్యకరంబులన్= కుడి చేతులతో; ఆకుంచిత= ముడిచిన; సవ్యబాహుతలంబులన్= ఎడమ భుజాలపై; అప్ఫళించు= చరచే; చప్పుళ్ళు కలసి= శబ్దాలు ఏకమై; ఒక్కరుండు+అ= ఒక్కడే; మల్ల+చఱచిన చందంబునన్= కుస్తీ పట్టడానికి ముందు చేసే శబ్దం చేసినట్లుగా; వీతేరన్= రాగా; వింతతానకంబులన్= జెట్టీలు నిలిచే విశేషాలతో; నిలిచి= నిలబడి; కదిసినన్= ఒకరిపై ఒకరు లంఘించగా; అప్పుడు= ఆ సమయంలో; వృకోదరుండు= భీముడు (వలలుడు). (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అని భీముడు (వలలుడు) వినయంతో అంగీకరించి, ఉత్సాహంతో గర్జించి, మదించిన ఏనుగువలె ముందుకు వచ్చి, రాజు ఎదుట జబ్బ చరిచి, నమస్కరించి, మరలాడు. మల్లవీరుడు అంతకుముందే విరటుడి అనుమతితో నడుంకట్టు బిగించి వచ్చి కుస్తీపట్టుకు సిద్ధమై నిలిచి ఉన్నాడు. అతడూ భీముడూ ఒకరొకరి ఆకారాలను తేరిపార చూచుకొన్నారు. మల్లయుద్ధ రంగంలో ఉన్న మట్టిని నుదురులపై ధరించారు. శరీరాలపై చల్లుకొన్నారు. మునివేళ్ళతో మరికొంత మట్టి తీసికొని ఒకరివైపు మరొకరు వేసికొన్నారు. ఎడమ చేతులను వంచి కుడిచేతులతో జబ్బలు చరుచుకొన్నారు. వారిద్దరూ ఒకేసారి చరచుకొనటంతో ఒకే చప్పుడుగా వినిపించింది. వింతవింతగా స్థాన భేదాలతో నిలిచి ఒక్కసారి ఇద్దరూ కలియబడ్డారు. అప్పుడు భీముడు.

విశేషం: మల్లయుద్ధ సంప్రదాయాలలో పరికరబంధం మొదటిది. ఇందులో అంతకుమించి వస్త్రధారణ ఉండదు. విద్యాప్రదర్శనకు ముందు గురునకు నమస్కారం సంప్రదాయం. గురుస్థానంలో భీముడు రాజుకు నమస్కరించాడు. గురుభావన, రాజభావన కలిసివచ్చాయి. మట్టిని ఫాలప్రదేశంలో బొట్టుగా పెట్టుకొంటారు. పరస్పరం ఒకరివైపు మరొకరు మట్టి చల్లుకొంటారు. బజ్జ చరచడం కూడా అటువంటిదే. అహమహమికగా యుద్ధం ప్రారంభం కాబోతున్నది.

సీ. **ఉపతాయిలోఁ దన కొదవిన తోరహ। త్తము సూపి వ్రేయక సమదవృత్తిఁ**
బాసి క్రమ్మఱఁ జేరు; బలువిడి వాఁడు పై। నదరిన జరగక యవనిఁ గ్రుంగి
నిలుచు; నొత్తొరువున వలచినయప్పుడు। గొనిపోవు; నవలీలఁ గూలవైచు;
జళికి పట్టిస మను సన్నపు విన్నాణ। ములు దొరకొన్నను ముట్టఁగొనఁడు;

తే. **కాలిదెసఁ జొరవచ్చుట గానిపించి। యుడుగు; సీసానఁ బట్టియు నుప్పళించుఁ;**
బోవనిచ్చు; మగుడ నేచి పోరఁజేరు। నెడల సరిసేయ నగు తడవీక హత్తు. 15

ప్రతిపదార్థం: ఉపతాయిలోన్= మల్ల విజ్ఞానంలో; తనకున్+ఒదవిన= తనకు తెలిసిన; తోరహత్తము+చూపి= ఒక రకమైన మల్లబంధ విశేషాన్ని చూపించి; వ్రేయక= కొట్టక; సమదవృత్తిన్+పాసి= మదించినట్లుగా (గంభీరంగా) వదలిపెట్టి; క్రమ్మఱన్+చేరున్= మళ్ళీ సమీపించేవాడు; బలువిడిన్= ఎక్కువ బలంతో; వాఁడు= మల్లుడు; పైన్+అదరినన్= పైకిరాగా; జరగక= కదలక; అవనిన్= నేలపై; క్రుంగినిలుచున్= వంగి నిలబడేవాడు; ఒత్తొరువునన్= గట్టిగా అదిమి; వలచిన+అప్పుడు= కోరిన సమయంలో; కొనిపోవున్= తీసికొని వెళ్ళేవాడు; అవలీలన్= తేలికగా; కూలవైచున్= పడద్రోసేవాడు; జళికి, పట్టిసము+అను= జళికి, పట్టిసం అనే పేర్లుగల; సన్నపు విన్నాణములు= సున్నితమైన నేర్పులు; దొరకొన్నను= చూపించినా; ముట్టన్+కొనఁడు= దగ్గరగా తీసికొనడు; కాలిదెసన్= కాలివైపు; చొరవచ్చుట= లోపలికి రావటం; కానిపించి= చూపజేసి; ఉడుగున్= విరమించి నిలిచేవాడు; సీసానన్+పట్టియున్= సీసమనే మల్లబంధంలో ఇరికించి; ఉప్పళించున్= పైకెత్తివేసేవాడు; పోవనిచ్చున్= పోనిచ్చి; మగుడన్+ఏచి= మళ్ళీ పట్టుకొని; పోరన్+ చేరు+ఎడలన్= పోరాడేందుకు దగ్గరగా చేరినప్పుడు; సరిచేయన్+అగు= చక్కచేయటానికి; తడవు+ఈక+హత్తున్= ఆలస్యం చేయకహత్తుకొనేవాడు.

తాత్పర్యం: మల్లయోధులైన వారిరువురు ఒకరితో ఒకరు కుస్తీ పట్లు ప్రారంభించారు. మల్లబంధ విశేషాలలో ఆరితేరిన వలలుడు గంభీరంగా అనేక విన్యాసాలు చూపిస్తూ మల్లుడిని గట్టిగా అదిమి నేలపై పడవేశాడు. తన మీదిమీదికి వచ్చే అతగాడిని అదుపులో పెట్టేవాడు. అనేకవిధాలైన జెట్టీల నేర్పును చూపిస్తూ వలలుడు కుస్తీ పట్లు పట్టసాగాడు.

విశేషం: తిక్కన ఈ పద్యంలో అనేక విధాలైన జెట్టీల కుస్తీ పట్లు పేర్కొన్నాడు. ఇది ఒక విధమైన ప్రదర్శనా యుద్ధం (Exhibition match). కొంతసేపు వినోదం కలిగించాలి. మల్లుని చంపటం మాత్రమే భీముడి ఉద్దేశం కాదు.

వ. మఱియు ననేకగతుల యోజలు మెఱయుచుఁ గొండొకసేపు విరాటునకు వినోదంబు సలిపి. 16

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; అనేకగతుల= అనేక విధాలైన; ఓజలు= ప్రకారాలు; మెఱయుచున్= చూపిస్తూ; కొండు+ఒకసేపు= కొంతసేపు; విరాటునకున్+వినోదంబు సలిపి= రాజుకు ఆనందం కలిగించి.

తాత్పర్యం: ఇంకా ఎన్నో రకాలుగా ఉత్సాహాన్ని ప్రకటించి రాజుకు ఆనందం కలిగించాడు.

విశేషం: విరాటుడికి వేడుక కలిగించటం, వెంటనే చంపకుండా, ప్రజలకు అనుమానం రాకుండా చేయటం ముఖ్యం. అజ్ఞాతవాస సమయం అని గుర్తుంచుకొనాలి.

ఆ. కచ్చ యమరఁ బట్టి కాళ్ళును జేతులు। వ్రేల మత్తగజములీల మెఱయ
ముష్టి బలువు నెఱయ ముక్కున వాతను। నెత్తురొలుక మల్లు నెత్తివైచె. 17

ప్రతిపదార్థం: కచ్చ= దట్టీ; అమరన్+పట్టి= తగినట్లుగా పట్టుకొని; కాళ్ళునున్+చేతులు వ్రేలన్= కాళ్ళు, చేతులు వేలాడుతూ ఉండగా; మత్తగజములీలన్ మెఱయన్= మదించిన ఏనుగువలె ప్రకాశించగా; ముష్టి బలువు నెఱయన్= పిడికిటిబలం నిండగా; ముక్కునన్+వాతను= ముక్కులోను, నోటిలోను; నెత్తుర+ఒలుకన్= రక్తం కారగా; మల్లున్+ఎత్తివైచెన్= మల్లుని పైకెత్తివిసిరివేశాడు.

తాత్పర్యం: మల్లుడి దట్టీ పట్టుకొని, కాళ్ళు చేతులు వేలాడుతూ మదించిన ఏనుగులా ఉన్నవానిని పిడికిట గుద్ది ముక్కునా నోటా నెత్తురు కారగా ఎత్తిపడవేశాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇవ్విధంబున విసరి నేలతో వ్రేసి వీఁపున మండివెట్టిన. 18

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; విసరి= విసరి; నేలతో వ్రేసి= నేలమీద పడవేసి; వీఁపునన్= వీపుమీద; మండి+పెట్టినన్= మోకాలు మోపిపెట్టగా.

తాత్పర్యం: ఈ విధంగా నేలమీద పడవేసి వీపుమీద మోకాలు మోపిపెట్టగా.

క. పెలుకుఱి తాళం బీ మదిఁ। దలఁచి యనువుగాక ధరణితలము గరతలం
బుల నప్పళించె వాఁ డ। క్కొలు వార్వఁగ విఱిచి మెఱసెఁ గుంతీసుతుఁడున్. 19

ప్రతిపదార్థం: వాఁడు= మల్లుడు; పెలుకుఱి= భయం వలన అంగాలు విలవిలపోగా; తాళంబు+ఈన్= ఒక్క చరుపు చరవాలని; మదిన్+తలఁచి= మనస్సులో అనుకొని; అనువుగాక= వీలుపడక; ధరణితలము= నేలమీద; కరతలంబులన్= అరచేతులతో;

అప్పళించెన్= చరిచాడు; ఆ+కొలువు= ఆ సభలోని అందరూ; ఆర్వఁగన్= భయంకర శబ్దం చేయగా; కుంతీ సుతుఁడున్= భీముడును; విఱిచి మెఱసెన్= ఓడించి ప్రకాశించాడు.

తాత్పర్యం: ఆ మల్లుడు తాళమనే మల్లబంధంతో వలలుడిని పట్టదలచి, వీలుపడక నేలను చేతులతో బాదుతూ ఊపిరాడక విలవిలలాడాడు. సభ్యులందరూ పెద్దగా హర్షధ్వానాలు చేస్తూ ఉండగా భీముడు ఆ మల్లుడిని ఓడించాడు.

విశేషం: 1. ఈ మల్లయుద్ధ ఘట్టం తిక్కన కవితలోని జాతివార్తా విశేషాలకు చక్కని నిదర్శనం. మూలంలోవలె తిక్కన కూడా మల్లశాస్త్ర విశేష పరిజ్ఞానంతో యుద్ధ సన్నివేశాన్ని వర్ణించటం విశేషం. మూలంలో మల్లయుద్ధంలోని అనేక రకాలైన పట్టులు, భంగిమలు, చేర్పులు, చర్యలు వర్ణించబడ్డాయి. ఉదాహరణకు కొన్ని శ్లోకాలు -

"ఉభౌ పరమ సంహృష్టౌ ముక్తా వివ మహాగజౌ
కృత ప్రతికృతై శ్చిత్రై, ర్బాహుభిశ్చ సుసంకటైః
సంనిపాతావధూతై శ్చ ప్రమాథోన్మథనై స్తథా
క్షేపణై ర్ముష్టిభి శ్చైవ వరాహోద్ధత నిఃస్వనైః
తలై ర్వజ్రనిపాతై శ్చ ప్రసృష్టాభి స్తథైవ చ॥
శలాకా నఖపాతైశ్చ పాదోద్ధూతై శ్చ దారుణైః।
జానుభి శ్చాశ్మ నిర్ఘోషైః శిరోభి శ్చావఘట్టనైః
తద్యుద్ధ మభవత్ ఘోర మశస్త్రం బాహుతేజసా
బల ప్రాణేన శూరాణాం సమాజోత్సవ సంనిధౌ॥..."
"ప్రకర్షణాకర్షణయో రభ్యాకర్ష వికర్షణైః
ఆకర్షతు రథాన్యోన్యం జానుభిశ్చాపి జఘ్నుతః
తతః శబ్దేన మహతా భర్త్సయన్తౌ పరస్పరమ్
వ్యూఢోరస్కౌ దీర్ఘభుజౌ నియుద్ధ కుశలా వుభౌ
బాహుభి స్సమసజ్జేతా మాయసైః పరిఘై రివ॥.."
డా.శలాక రఘునాథశర్మ గారి వ్యాఖ్య. శ్రీమహాభారతమ్-విరాటపర్వ (13.27-30; 32-33)

వీటిలో మొదటి మూడు శ్లోకాలలో మల్లయుద్ధంలోని కుస్తీ పట్లను పేర్కొన్నాడు కవి. అవి-1) ఒకచోట పట్టి నొక్కటం, 2)వదలటం, 3) పిడికిలితో చేతులను గట్టిగా పట్టి ఎదుటివారిని బలహీనపరచటం, 4. దేహాన్ని గట్టిగా ఒడిసిపట్టటం, 5. దూరంగా త్రోయటం, 6) నేలమీద పడద్రోసి మర్దించటం, 7) పైకి లేవనెత్తి మర్దించటం, 8) ఉన్నచోటునుండి లాగి పడగొట్టటం, 9) రొమ్ము నడుమ రెండు పిడికిళ్ళతో కొట్టటం, 10) మెడలు వంచి చేతులు భుజంమీద పెట్టి చరుస్తూ ఏదుపంది అరచినట్లు చప్పుడు పుట్టించటం, 11) పిడుగుపాటులవంటి చరపులు చరచటం, 12) వ్రేళ్ళు పట్టుకొని లాగటం వంటి కుస్తీ పట్లు, 13) వ్రేళ్ళు వంచకుండా పెట్టి గోళ్ళతో పొడవటాలు, 14) కాళ్ళు చాచి తన్నటాలు, 15) గండశిల మీదపడ్డట్లు శత్రువు మీదపడి మోకాళ్ళతో పొడవటాలు, 16) తలతో పొడవటాలు అనే ముష్టియుద్ధ చర్యలు, 17) ఒక్క పెట్టున లాగి ముద్దగా చేయటం, 18. ముందు వెనుకలకు గుంజటం, 19) వేగంగా వెనుకకు త్రోసి పడగొట్టటం, 20) మోకాళ్ళతో పొడుచుకొనటం-వంటి నేర్పులు, 21) పెద్ద పెద్ద అరుపులతో ఒకరి నొకరు బెదిరించుకొనటం, 22) విశాలమైన రొమ్ములు, పొడుగైన చేతులు ప్రదర్శించుకొనటం, 23) చేతులతో శత్రువును పైకెత్తి గిరగిరా త్రిప్పటం, 24) నేలపై పడి నిశ్చేష్టితుడై ఉన్న శత్రువును మర్దించటం, 25) ఊపిరి ఆడకుండ చేసి చంపటం, 26) జయించి సింహగర్జనల వంటి విజయఘోష పెట్టటం - ఇవి మల్లయుద్ధంలో ప్రసిద్ధమైన భంగిమలు. ఇవన్నీ ఈ వరుసలోనే వర్తిల్లినట్లు చెప్పిన వ్యాసుడు శాస్త్రవిజ్ఞాన పండితుడివలె మనకు ఆశ్చర్యం కలిగిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యాసుడు శాస్త్ర విజ్ఞాని. తిక్కన అనుభవ జ్ఞాని. మల్లయుద్ధ శాస్త్రమే కాక, తెలుగునాట ప్రవర్తిల్లే దేశీ కుస్తీల పరిజ్ఞానం తిక్కనకు కరతలామలకం. భీమ. మల్లుల యుద్ధంలోని కుస్తీపట్లకు తెలుగుపేర్లు తెలియచెప్పాడు తిక్కన. ఇది జాతి వార్తా విశేషం. తిక్కన పేర్కొన్న తెలుగు కుస్తీ పట్లు - కొన్ని పేరు పెట్టినవి: కొన్ని తీరు పేర్కొన్నవి.

1. **ఉపతాయి** - మల్లయుద్ధంలో అపార అనుభవ జ్ఞానం, శాస్త్ర వైదుష్యం.
2. **తోరహత్తము** - ఒకచోట పిడికిలితో పట్టటం (పట్టి చరచకుండా వదలటం తరువాతిది)
3. **ఒత్తారువు** - మిక్కిలి అదమటం, సంపీడనం, దేహాన్ని గట్టిగా ఒడిసి పట్టటం.
4. **జళికి** - రొమ్ము నడుమ పిడికిళ్ళతో కొట్టటం.
5. **పట్టిసము** - మెడలు వంచి చేతులు భుజంమీద పెట్టి చరచటం.
6. **పీసం** - కాళ్ళు చేతులు మెడ కదలకుండా బంధించటం.
7. **ముష్టిబలువు** - పిడికిలితో ఎదుటివారి చేతులను గట్టిగా పట్టి వారిని బలహీనపరచటం.
8. **మండిపెట్టుట** - ఒక కాలు నేలమీద మరొక మోకాలు శత్రువు వీపుమీద పెట్టి నొక్కి పట్టటం.
9. **పెలుకుటి తాళము** - ఒక్కపెట్టున లాగి తాళం వలె ముద్ద చేయటం. ఉక్కిరి బిక్కిరాడకుండా చేయటం.
10. **అప్పళించటం** - చరచటం, భుజాస్ఫాలనం.
11. **విఱుచుట** - నడుం విరిగేటట్లు చేయటం, వికారంగా ఎముకలు విరిగేటట్లు చేయటం, ఓడించటం, చంపటం, చేతులు వెనుకకు త్రిప్పి కట్టటం, అడుగుల కీళ్ళు విరిచివేయటం, శరీరం నుండి ఒక అంగాన్ని వేరు చేయటం మొదలైనవి.

తిక్కన తన కాలం నాటికి మల్లయుద్ధంలో తెలుగు పేర్లతో స్థిరపడిన వాటిని ఎన్నుకొని తన రచనలో నిబంధించాడు. మిగిలిన వాటిని మూలంలోవలెనే వివరించాడు. ఏమైనా వ్యాసుడి శాస్త్ర విజ్ఞానాన్ని తెలుగువారి అనుభవ కళావిజ్ఞానంగా మార్చి, తెలుగువారి కుస్తీపట్ల కౌశల్యాన్ని ఈ ఘట్టంలో వెలుగులోకి తెచ్చాడు. (సంపా.)

2. మూలంలో భీముడు జీమూతుడిని చంపినట్లున్నది.

> **"తస్మిన్ వినిహతే వీరే జీమూతే లోకవిశ్రుతే**
> **విరాటః పరమం హర్ష మగచ్ఛద్ బాన్ధవైః సహ".** (సం.4.12.14)

లోక ప్రసిద్ధుడైన జీమూతుడు భీముడి చేతిలో చావగా విరాటుడు బంధువు లందరితో కలిసి ఆనందించాడట. తిక్కన తెలుగులో "కొలు వార్వఁగ విఱిచి మెఱసెఁ గుంతీసుతుఁడున్" - అని చెప్పాడు. విఱుచు- అనే క్రియకు చంపు, ఓడించు-అనే రెండర్థాలూ ఉన్నాయి. కొందరు భీముడు మల్లుడిని ఓడించాడని వ్రాశారు. రాబోయే వచనంలో 'ఇవ్విధంబున మహాబలుపట్టి యాజెట్టి నెట్టన గెల్చిన మత్స్యపతి మెచ్చి' - అని ఉండటం వలన. నెట్టన= అనివార్యంగా, కాక తప్పనిదిగా, పూర్ణంగా, సమగ్రంగా, యథార్థంగా, నిక్కంగా - అని అర్థాలున్నాయి (సూర్యరాయాంధ్ర నిఘంటువు) నెట్టన గెల్చాడంటే - పూర్తిగా గెలిచాడు, నిజంగా గెలిచాడు వంటి అర్థమే వస్తుంది. కాని చంపి గెలిచాడు అనే అర్థం రాదని వారు భావించారు. ఒకవేళ అదే నిజమైతే తిక్కన కథను మార్చాడని చెప్పాలి. మూలంలో ఆ జగజెట్టి బ్రతికి ఉంటే భీమపరాక్రమం దేశమంతా అతడివలన వ్యాప్తి చెందుతుందని భావించి ధర్మజుడి కనుసైగకు అనుగుణంగా అతడిని చంపినట్లు చెప్పుతారు. మరి తిక్కన అతడిని జీవచ్ఛవంగా భావించి వదలిపెట్టాడేమో! ఏమైనా, ఎటువంటి అర్థాన్ని చెప్పుకొనటానికైనా తిక్కన వాడిన 'విఱుచు'- అనే క్రియ సమర్థమైనది. తెలుగు క్రియలకున్న అనేకార్థ స్ఫూర్తికి ఇది తిలకం వంటిది.

3.**'పెలుకురికి బోరగిలపడి । దల పరియలు గాగ ధరణితలమున బడఁజే । తుల నప్పళించి తా నఁ క్కొలు వార్వఁగ మెఱసి విడిచెఁ గుంతీసుతుఁడున్'** - అనే పాఠాంతరం కూడా ఉన్నది. దీనిని బట్టికూడ భీముడు మల్లుడిని చంపక వదలిపెట్టి **'ఉక్కఱ భంజించి, చంపు టుడుగుడు' (విరా.1.82)** నని పలికిన మాటను నిలబెట్టుకొన్నాడని తాత్పర్యం ఏర్పడుతున్నది. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇవ్విధంబున మహాబలుపట్టి యాజెట్టి నెట్టన గెల్చిన మత్స్యపతి మెచ్చి తన కిచ్చిన ధనంబు లచ్చటి (యర్థి) జనంబుల కిచ్చి నిజ నివాసంబునకుం జనియె; మఱియు నిత్తెఱంగున నతనికి వేడ్కసలుపుచుండుఁ; జిక్కని మల్లులులేని తఱి నంతిపురంబు నింతులు సూడ నయ్యవనీ కాంతుండు పోరింప శార్దూల శుండాలాదులతోడ నీడంబోక పెనంగి భంగంబునకుం దెచ్చి మెచ్చించుచుండు. 20

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఇట్లా; మహాబలుపట్టి= వాయుపుత్రుడైన భీముడు (వలలుడు); ఆ జెట్టిన్= ఆ మల్లుని; నెట్టన గెల్చిన= తుదకు గెలిచినందుకు; మత్స్యపతి మెచ్చి= విరాటరాజు సంతోషించి; తనకున్+ఇచ్చిన ధనంబులు= తనకు బహుమతిగా ఇచ్చిన రొక్కాలను; అచ్చటి (అర్థి) జనంబులకున్= యాచకులకు; ఇచ్చి= ఇచ్చి; నిజనివాసంబునకున్+చనియెన్= తానున్న ప్రదేశానికి వెళ్ళాడు; మఱియున్= ఇంకను; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; అతనికిన్+వేడ్క= ఆయనకు వినోదం; సలుపుచుండున్= కలిగించేవాడు; చిక్కని మల్లులు= బలవంతులైన జెట్టీలు; లేని తఱిన్= లేనప్పుడు; అంతిపురంబు+ఇంతులు= రాజస్త్రీలు; చూడన్= చూడగా; ఆ+అవనీకాంతుండు= విరాటరాజు; పోరింపన్= ఉసిగొల్పగా; శార్దూల= పెద్దపులులు; శుండాల+ ఆదులతోడన్= ఏనుగులు మొదలైన వాటితో; ఈడన్+పోక= వెనుదీయక; పెనంగి= పోరాడి; భంగంబునకున్+తెచ్చి= ఓడించి; మెచ్చించుచున్+ఉండున్= సంతోష పెట్టుతూ ఉండేవాడు.

తాత్పర్యం: ఈ విధంగా వలలుడు ఆ మల్లుడిని ఓడించినందుకు విరాటరాజు సంబరపడి కానుకలిచ్చాడు. వలలుడు ఆ రొక్కాన్ని యాచకుల కిచ్చి వెళ్ళిపోయాడు. వినోదప్రియుడైన ఆ మహారాజు బలవంతులైన మల్లులు లేనప్పుడు వేడ్కకై పులులతోనూ, ఏనుగులతోనూ పోరించగా భీముడు పెనుగులాడేవాడు. అంతఃపుర స్త్రీలు అది చూచి సంబరపడేవారు.

క. పెఱవారలు తమమెలఁగెడు । తెఱఁగులు దొరఁకొన్న వింత తెరువుల నేర్పుల్
మెఱయుచుఁ బతిచిత్తము గొన । నొఱపు గలిగి మాన్యవృత్తి నుండుదురు దగన్. 21

ప్రతిపదార్థం: పెఱవారలు= ఇతరులు; తమ మెలఁగెడు తెఱఁగులు= (పాండవులు) తాము మసలే తీరులు; దొరఁకొన్నన్= ప్రారంభించగా; వింత తెరువులన్= సరిక్రొత్తమార్గాలలో నేర్పుల్= తమ తమ నేర్పులను; మెఱయుచున్= వెలయింపచేస్తూ; పతిచిత్తము+కొనన్= విరాటుని మనస్సు మెప్పించే విధంగా; ఒరపు+కలిగి= చాకచక్యం కలిగిఉండి; మాన్యవృత్తిన్= గౌరవప్రదమైన ప్రవర్తనతో; తగన్+ఉండుదురు= సముచితంగా ఉంటున్నారు.

తాత్పర్యం: పాండవులు తమ ప్రవర్తనలు ఇతరులు గుర్తించలేని విధంగా ఎంతో చాకచక్యంగా అపూర్వమైన వింతపద్ధతులతో అజ్ఞాతంగా మెలగుతూ, విరాటుడి కానందం కలిగిస్తూ జీవించారు.

విశేషం: సంస్కృతంలో వ్యాసుడు నకులార్జున సహదేవులు తమ విద్యలతో ఎట్లా సంతోష పెట్టేవారో చెప్పాడు (14-12-29 నుండి 32). తిక్కన దానిని వదిలేశాడు.

కీచకుఁడు పాంచాలిం జూచి మోహించుట (సం.4-13-1)

వ. ఇట్లు పాండవులు పాంచాలీ సహితంబుగా విరాటు నగరంబున వర్తించుచుఁ గతిపయదినంబులు గొఱంతగా నేఁడుకాలంబు గడపిన సమయంబున మత్స్యపతి మఱందియు, దండనాథుండును, గీచకాగ్రజుండును, రూపాభిమానియు, నానాభరణ ధరణశీలుండును. దుర్విదగ్ధుండును. బలగర్వితుండును నగు సింహబలుండు దనయప్ప సుదేష్ణకు మ్రొక్కంజనువాఁ డద్దేవి కనతిదూరంబున నున్న ద్రుపదరాజనందనం గనుంగొని. 22

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవులు; పాంచాలీ సహితంబుగాన్= ద్రౌపదితో గూడ; విరాటు నగరంబునన్= విరాటుడు పాలించే మత్స్య దేశరాజధానిలో; వర్తించుచున్= ఉంటూ; కతిపయదినంబులు= కొన్ని రోజులు; కొఱంతగాన్+ఏఁడు కాలంబు= సంవత్సరానికి కొంచెం తక్కువగా; కడపిన సమయంబునన్= గడిపినప్పుడు; మత్స్యపతి మఱందియున్= విరాటుని బావమరదీ; దండనాథుండును= సేనాధ్యక్షుడూ; కీచక+అగ్రజుండును= కీచకులలో పెద్దవాడూ; రూప+అభిమానియున్= తన రూపాన్ని అభిమానించేవాడూ; నానాభరణ ధరణ శీలుండును= అనేక రకాలైన అలంకారాలు ధరించే స్వభావం కలవాడూ; దుర్విదగ్ధుండును= వివేకం లేనివాడూ; బలగర్వితుండునున్+అగు= తనబలంచేత గర్వించినవాడూ అయిన; సింహబలుండు= సింహబలు డనేవాడు; తన అప్ప= తన అక్క అయిన; సుదేష్ణకున్; మ్రొక్కన్+చనువాఁడు= నమస్కరించటానికి వెళ్లుతున్నవాడు; ఆ+దేవికిన్= ఆ మహారాణికి; అనతిదూరంబునన్= సమీపాన; ఉన్న= ఉండిన; ద్రుపదరాజనందనన్= ద్రౌపదిని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: ఈ విధంగా పాండవులు ద్రౌపదీ సమేతంగా విరాటనగరంలో ఉంటూ అజ్ఞాతవాసం గడుపుతున్నారు. సంవత్సరానికి కొద్ది రోజులు తక్కువగా ఉండే సమయంలో విరాటరాజు బావమరది అయిన సింహబలు డనేవాడు ఒక రోజు తన అక్క సుదేష్ణను చూచి గౌరవంగా నమస్కరించటానికి వచ్చి ఆమె సమీపంలో ఉన్న ద్రౌపదిని చూచాడు. అతడు నూట్రైదుగురు కీచకులకు అన్న, అందమైన రూపాన్ని అభిమానించేవాడు, అనేకరకాలైన అలంకారాలను ధరించే స్వభావం కలవాడు, వివేక విహీనుడు, బలగర్వితుడు.

విశేషం: 1. యౌవనం, ధనసంపత్తి, ప్రభుత్వం, అవివేకం- వీటిలో ఒక్కొక్కటే అనర్థ దాయకం. నాలుగూ కీచకుడిలో రాశీభూతంగా ఉన్నాయి.

2. సంస్కృతంలో 'మాసా దశ సమత్యయుః, (4-13-1) అని 10 మాసాలు గడిచినట్లు చెప్పబడింది. రెండు నెలల వ్యవధిలో దుర్యోధనుడు గ్రహించకపోడని తిక్కన సమంజసమైన మార్పు చేశాడు.

ఉ. అక్కజమైన చెల్వమున నాత్మకు వ్రేఁగయి పొల్చు పొల్తిపై
నెక్కొను చూడ్కిఁ గ్రమ్మఱుప నేరక యూరక నిల్చెఁ గాముచేఁ
జిక్కిన నెమ్మనంబుఁ గడుఁ జేడ్పడు మానముఁ జేష్టితంబులం
దక్కిన యంగముం దలఁకు ధైర్యమునై యతఁ డప్పు డయ్యెడన్. 23

ప్రతిపదార్థం: అక్కజము+ఐన= అబ్బురపాటు కలిగించే; చెల్వమునన్= అందంతో; ఆత్మకున్= మనస్సుకు; వ్రేఁగు+అయి పొల్చు= తాపం కలిగించే; పొల్తిపైన్= స్త్రీపై; నెక్కొనుచూడ్కిన్= నిలిచిన చూపును; క్రమ్మఱుపన్+నేరక= మరలించలేక; కాముచేన్+చిక్కిన= మన్మథునికి వశమైన; నెఱ+మనంబున్= నిండు మనస్సూ; కడున్+చేడ్పడు= మిక్కిలి కలత పడే; మానమున్= అభిమానమూ; చేష్టితంబులన్= చేష్టలను; తక్కిన= కోల్పోయిన; అంగమున్= శరీరమున్నూ; తలఁకు= చలించే; ధైర్యమును+ఐ= ధైర్యమూ కలిగి; అతఁడు= సింహబలుడు; అప్పుడు; ఆ+ఎడన్= అచ్చట; ఊరక, నిల్చెన్= వ్యర్థంగా నిలబడ్డాడు.

తాత్పర్యం: ఆశ్చర్యాన్ని కలిగించే ద్రౌపది సౌందర్యం కీచకుడి హృదయానికి భరించలేనిదయింది. ఆమె మీద వాలిన చూపులను మరల వెనుకకు మరల్చుకొనలేక అట్లాగే నిశ్చేష్టుడై నిలిచిపోయాడు. మన్మథుడికి లొంగిపోయిన అతడి మనస్సు కలత చెందింది. అతడి నిబ్బరం చెదిరిపోయింది. అతడి శరీరం చేష్టలు దక్కింది. ధైర్యం చలించింది. వరుసగా ఈ అవస్థలను అతడు పొందాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: విరాటపర్వం నానారసాభ్యుదయోల్లాసి. అపూర్వ సౌందర్యవతి అయిన ద్రౌపది కీచకుడికి శృంగార విభావంగా ప్రత్యక్షమైంది. అతడు మన్మథాయత్తుడైనాడు. శృంగార రసావిష్టులైన నాయికానాయకులలో దశవిధ మన్మథావస్థలను వర్ణించటం ప్రబంధ సంప్రదాయం. తిక్కన కీచకుడిలో ఆ దశావస్థలు చిత్రించాడు.

"దృఙ్మన స్సంగసంకల్పా, జాగరః కృశతాఽరతిః
హ్రీత్యాగోన్మాద మూర్ఛాంతా ఇత్యనంగదశా దశ."

అని లక్షణోక్తి. దృక్సంగమం, (దర్శనం వలన చక్షుప్రీతి), మనస్సంగమం, సంకల్పం, జాగరం, కృశత, అరతి, హ్రీత్యాగం, ఉన్మాదం, మూర్ఛ, అంతం (మరణం) అనేవి దశవిధమన్మథావస్థలు. వీటిలో దృక్సంగమం ఈ పద్యంలో వర్ణించబడింది. ద్రౌపదిది అపూర్వమైన సౌందర్యం. దానివలన కీచకుడికి అద్భుతం, రతిభావం రెండూ కలిగాయి. చూపులు ఆమె అందం మీద వాలాయి. అందులో చిక్కుకొన్నాయి. సంగమించాయి. అది దృఙ్మీలనం - లేదా - దృక్సంగమం. ఆ అవస్థను వ్యక్తం చేసే అనుభావాలు (చేష్టలు) సాత్త్వికభావాలుగా (సహజంగా కలిగే అభినయాలవలె) అతని శరీరంలో పొటమరించాయి. చూపులు వెనుకకు తీసికొనలేని తన్మయత్వం (మైమరపు), రతిభావం చేత మనసు చలించటం, శరీరం స్తంభావస్థను (చేష్టలు లేకుండా కొయ్యబారిపోయినట్లు కావటం) పొందటం, స్థైర్యాన్ని కోల్పోవటం - వలపు చూపులు ప్రసరించిన ప్రథమావస్థకు అభివ్యక్తులైన వారి అభినయముద్రలు. పాత్రలు అభినయిస్తున్నట్లు వర్ణించటం తిక్కన నాటకీయతలో ప్రధాన లక్షణం. (సంపా.)

తే. ద్రౌపదీ రూప మను నురిఁ దగిలి తనదు। హృదయ మను మృగ మత్తఱి నుదిలగొనుచుఁ
గాముఁడను బల్లిదపు వేఁటకాని బారిఁ। బడుట కెంతయు నా సింహబలుఁడు తలరి. 24

ప్రతిపదార్థం: ద్రౌపదీరూపము+అను= ద్రౌపదీ సౌందర్యమను; ఉరిన్+తగిలి= ఉరిత్రాడుకు తగిలికొని; తన హృదయము+అను= మృగము= తన హృదయమనే జింక; ఆ+తఱిన్= ఆ సమయంలో; ఉదిలగొనుచున్= పరితపిస్తూ; కాముఁడు+అను= మన్మథుడనే; బల్లిదము+వేటకాని= బలిష్ఠుడైన వేటగాడియొక్క; బారిన్+పడుటకున్= గురిలోపడినందుకు; ఆ సింహబలుఁడు= ఆ కీచకుడు; ఎంతయున్= ఎంతో; తలరి= చలించి.

తాత్పర్యం: ద్రౌపదీ రూప సౌందర్యమనే ఉచ్చులో చిక్కి ఆ కీచకుడి హృదయం అనే జింక మన్మథుడనే బలిష్ఠుడైన వేటగాడి పన్నుగడలో పడిపోవటం వలన అప్పుడు ఆ సింహబలుడు చలించి. (ముందరకు అన్వయం.)

విశేషం: 1. అలం: సావయవ రూపకం. ద్రౌపది రూపం, కీచకుడి హృదయం, మన్మథుడు అనే ఉపమేయాలమీద ఉరి, జింక, వేటకాడు అనే ఉపమానాలు ఆరోపించబడ్డాయి.

2. ఇందులో మనస్సంగమమనే ద్వితీయ మన్మథావస్థ అలంకార సుందరంగా వర్ణించబడింది. వలలోపడిన మృగం వేటగాడి చేత చంపబడుతుంది - అనే భావన చేత, ద్రౌపది చేత ప్రేరితుడైన భీముడి చేత కీచకుడు వధించబడతాడని అలంకార ధ్వని.

3. వలలో చిక్కిన జింకవలె హృదయం రాగబద్ధమైనదనీ, మోహమగ్నమైనదనీ వ్యంగ్యం.

4. పేరుకు సింహబలుడు కాని, లేడివలె ద్రౌపదీ రూపమనే ఉచ్చులో పడ్డాడు. విషమాలంకారచ్ఛాయ కనపడుతున్నది. కీచకుడు రూపాభిమాని కాబట్టి అందమైన ఆకారాన్ని చూచి అభిమానించి వశుడైపోయాడని ధ్వని. (సంపా.)

వ. నిజాంతర్గతంబున. 25

తాత్పర్యం: తన మనస్సులో.

ఉ. 'ఎందును నిట్టిరూపు నరు లెవ్వరుఁ గాంచిరె? నాక కాదు సం
క్రందనసూతికిం దగిలి కన్గొనఁ జాలదె! దీన నిందిరా
నందను నాజ్ఞ యేచి భువనంబులఁ బ్రబ్బదె? యిత్తలోదరిం
జెందఁగఁ గాన్పుగాదె ఫలసిద్ధి పురాతన పుణ్యవృద్ధికిన్! 26

ప్రతిపదార్థం: నరులు+ఎవ్వరున్= మానవులెవరైనా; ఎందునున్= ఎక్కడైనా; ఇట్టిరూపున్= ఈ విధమైన సౌందర్యాన్ని; కాంచిరె?= చూచారా?; నాకున్+ అ కాదు= నాకే కాదు; సంక్రందన సూతికిన్= ఇంద్రుడి కుమారుడైన జయంతుడికి కూడా; తగిలి= ఆసక్తి పొంది; కన్గొనన్+చాలదె!= చూడ తగిందే సుమా!; దీనన్= దీనిచేత (ఇట్టిరూపుచేత); ఇందిరానందను+ఆజ్ఞ= మన్మథుడి ఆదేశం; ఏచి= అతిశయించి; భువనంబులన్= లోకాలలో; ప్రబ్బదె?= వ్యాపించదా?; పురాతన= పూర్వజన్మ; పుణ్యవృద్ధికిన్= పుణ్యాతిశయానికి; ఫలసిద్ధి= ఫలితం దక్కటం; ఈ+తలోదరిన్= ఈ సుందరిని; చెందఁగన్+కాన్పుకాదె!= పొందగలగటమే కదా!

తాత్పర్యం: 'ఎక్కడైనా ఇటువంటి సౌందర్యరాశిని మానవు లెవ్వరైనా చూచారా? నేనే కాదు, ఆ దేవేంద్రుడి కొడుకైన జయంతుడుకూడా ఈమె అందాన్ని ఆసక్తితో చూడక మానలేడు. దీనివలన కలిగిన మన్మథేచ్ఛ అతిశయించి లోకాల నన్నిటిని ముంచెత్తదా? ఈ సుందరాంగి పొందు లభించినవాడి జీవితం నిజంగా పూర్వజన్మల పుణ్యాలపంట!

విశేషం: అలం: సంబంధాతిశయోక్తి, కావ్యార్థాపత్తి. సంక్రందనసూతికిన్, ద్రౌపదీరూపమునకును సంబంధం లేకున్ననూ, సంబంధమున్నట్లు వర్ణింపబడటం చేత సంబంధాతిశయోక్తి. సంక్రందన సూతి జయంతుడే కాక, అర్జునుడు కూడా, ఆమె రూపును తగిలికొనువాడే కదా! అయితే అందగాడుగా జయంతుడే కాని, అర్జునుడు చెప్పబడడు. సంక్రందన సూతికే తగిలి కన్గొనవచ్చునంటే ఇంక నా సంగతి వేరే చెప్పాలా? అనటం చేత అలంకారం కావ్యార్థాపత్తి. ఇందిరా నందనుడి (మన్మథుడి) ఆజ్ఞ ఏచి ప్రబ్బుటకు ఈమె రూపే సాధనమనటం వలన, ఆమె సౌందర్యాతిశయం ద్యోతకమవుతున్నది. 'పుణ్యబుద్ధికిన్' అనే పాఠంకంటె 'పుణ్యవృద్ధికిన్' అనే పాఠాంతరం అనువుగా ఉండటంతో దీనిని గ్రహించటం జరిగింది. ఈ పద్యంలో 'సంకల్పం' అనే మూడవ మన్మథావస్థ ప్రారంభమైనది. మనుషులే కాక దేవతలు కూడా చూచి ఆశ్చర్యపడే రూప సౌందర్యం ద్రౌపదిదని పేర్కొంటూ, ఆమెపొందు పూర్వజన్మఫలంవలనగాని లభించదని భావించాడు. ద్రౌపది పుణ్యవతి అని, దివ్యసౌందర్యవతి అని ధ్వని. నాయికా సంగమాన్ని గాఢంగా సంకల్పించటం ఇందులో స్పష్టం. (సంపా.)

సీ. ఇయ్యింతి ప్రాపున నయ్యనంగుఁడు పార్వ। తీశునైనను దక్కనేలకున్నె!
యిన్నాతి చెలువంబు గన్న శచీ ప్రియుం। డైనను గనుకలి నవియకున్నె!
యిత్తన్వి కెనలేమి కెదిరి పన్నిదము భా। షావిభుతోనైనఁ జఱవరాదె!
యిత్తలోదరి జీవితేశున కిందిరా। పతినైన మెచ్చక పలుకఁజనదె!.

తే. కుసుమబాణుని బాణముల్ గూడ నైదు। కరఁగి నేరిమి వాటించి కరువు గట్టి
పోసి చేసి చైతన్యసంపుటము దగ ఘ। టించెనో కాక యిట్టి చేడియలు గలరె! 27

ప్రతిపదార్థం: ఈ+ఇంతిప్రాపునన్= ఈమె అండతో; ఆ+అనంగుఁడు= ఆ మన్మథుడు; పార్వతీ+ఈశున్+ఐనను= శివుడిని అయినా; తక్కన్+ఏలక+ఉన్నె= లొంగేటట్లు చేయలేడా?; ఈ+నాతిచెలువంబు= ఈమె అందాన్ని; కన్న= చూచిన; శచీప్రియుండు+ఐనను= ఇంద్రుడైనా; కనుకలిన్= చూడటం చేతనే; అవియక+ఉన్నె!= విరహంతో చిక్కిపోకుండా ఉంటాడా!; ఈ+తన్వికిన్= ఈమెకు; ఎనలేమికిన్= సాటిలేకపోవటం అనేవిషయమై; భాషావిభుతోన్+ఐనన్= బ్రహ్మతోనైనా; ఎదిరిపన్నిదము=

ఎదురుపందెం; చఱవరాదె!= వేయవచ్చునుకదా!; ఈ+తలోదరి= ఈమెయొక్క; జీవిత+ఈశునకున్= భర్తకు; ఇందిరాపతిన్+ఐనన్= విష్ణువునైనా; మెచ్చక= ప్రశంసించక; పలుకన్+చనదె!= మాట్లాడవచ్చును కదా!; కుసుమబాణుని బాణముల్= మన్మథుని బాణాలు; కూడన్= కలిపి; ఐదు కరఁగి= ఐదూ కరగించి; నేరిమి+పాటించి= నేర్పు ప్రదర్శించి; కరువు+కట్టి= మూసను ఏర్పరచి; పోసి= అందులో పోసి; చేసి= రూపం తయారుచేసి; చైతన్యసంపుటము= ప్రాణచైతన్యాన్ని; తగన్+ఘటించెనో= ఒప్పునట్లుగా కూర్చాడేమో!; కాక= లేకపోతే; ఇట్టి చేడియలు= ఇటువంటి స్త్రీలు; కలరె!= ఉంటారా!.

తాత్పర్యం: ఈ అందమైన వనిత అండదండలుంటే అలనాడు మన్మథుడు పార్వతీపతి అయిన పరమేశ్వరుడిని సైతం లొంగదీసికొని తన చెప్పుచేతలలో ఉంచుకొనకుండా ఉండేవాడా! ఈ వయసుకత్తె అందాన్ని చూస్తే శచీమనోహరుడైన ఇంద్రుడు కూడా దృక్సంగమం వలన కలిగిన విరహంతో చిక్కిశల్యమై పోకుండా ఉండేవాడా!; ఈ సన్నని మేనుగల అందగత్తెకు లోకంలో ఎవ్వరూ సాటిలేకపోవటం అనే విషయంపై సరస్వతీదేవి భర్త అయిన బ్రహ్మ దేవుడితో సైతం ఎదురుపందెం వేసి గెలువవచ్చును కదా! ఈ సుందరికి భర్త అయిన వాడు లక్ష్మీపతి అయిన విష్ణుదేవుని సంపదనూ, సౌందర్యాన్ని సైతం లెక్కచేయకుండా మాట్లాడవచ్చును కదా! ఈమె అందాన్ని చూస్తే బ్రహ్మదేవుడు మన్మథబాణాలైదింటిని కలిపి ఒకేసారి కరిగించి, నేర్పుతో మూసలో పోసి, రూపుకట్టించి, ప్రాణంపోసి, చైతన్యస్ఫూర్తిని సంఘటించాడేమో! లేకపోతే ఇటువంటి అందగత్తెలు ఈ సృష్టిలో సామాన్యంగా ఉంటారా? (ఈమె బ్రహ్మదేవుడి విశిష్ట సృష్టి).

విశేషం: అలం: పరికరాంకురం, కావ్యార్థాపత్తి, వ్యతిరేకం, ఉత్ప్రేక్ష. ద్రౌపది సౌందర్యాన్ని అలంకారికంగా వర్ణించిన తిక్కన మేటి పద్యాలలో ఇది ఒకటి.

1. సీస పద్యం మొదటి పాదంలో వ్యతిరేకాలంకారం గోచరిస్తుంది. ఉపమానం కంటె ఉపమేయమే బలంగా చిత్రించబడే స్ఫూర్తివలన ద్రౌపది సౌందర్యానికి అతిశయం భాసించింది.

2. ఈ పద్యంలో భార్యాసహితులైన దేవతలనే పేర్కొనటం విశేషం. ద్రౌపది సౌందర్యం వారి ప్రియురాండ్ర నుండి భర్తలను దూరం చేయగల శక్తి కలదని తిక్కన నిరూపణ. వివాహితులైన దేవతలే ఆమె సౌందర్యం చూస్తే విరహానికి గురి ఔతారనగా ఇక కీచకుడి మాట వేరేచెప్పాలా? అని అర్థాపత్తి అలంకారం ధ్వనింపచేశాడు. శచీవల్లభుడి విషయం చెప్పటంచేత కైముతిక న్యాయంతో కీచకుడి అర్థం కూడా ధ్వనిమయంగా సిద్ధించటం అర్థాపత్తి. ఇట్లాగే వాణీచతుర్ముఖుల. లక్ష్మీనారాయణుల విషయంలోనూ కూడ అన్వయించుకొనాలి.

3. వ్యతిరేకాలంకారాన్ని ఆశ్రయించి ద్రౌపది సౌందర్యాన్ని ధ్వనింపచేయటం సీసపద్యపాదాలలోని శిల్పం. ఉపమానం కంటె ఉపమేయం బలంగా ఉన్నట్లు చిత్రించటం ఈ అలంకార స్వభావం. మహేశ్వరుడు మన్మథుడి కంటె గొప్పవాడు. అతడిని కూడా ధిక్కరించగలిగే శక్తి మన్మథుడికి ద్రౌపది సౌందర్యం కలిగిస్తుందట! భోగప్రియుడు ఇంద్రుడు, ఆయనకు భార్య ఉన్నది. వేయి కన్నులున్నాయి. అయినా ఆయన చూపులను ఆకర్షించి విరహంతో చిక్కిపోయేటట్లు చేయగలిగినది ద్రౌపది సౌందర్యం. ఆమె అందానికి ఎదురు లేదు. అందువలన ఆ అందాన్ని సృష్టించిన సరస్వతీ భర్తనే (బ్రహ్మనే) 'మరల నావలె సృష్టి చేయగలవా?' అని అడుగగలిగిన శక్తి కలది ద్రౌపది అందం. ఇందిరాపతి ఐశ్వర్యవంతుడు. ద్రౌపదిని పొందినవాడు అతడికంటె ఘనుడు. ఈ విధంగా ఉపమేయ స్థానీయులందరిని అధికతరం చేసి చెప్పిన వైఖరితో ద్రౌపది సౌందర్యాన్ని ధ్వనిమయం చేశాడు తిక్కన.

4. ఈశ్వరుడు, ఇంద్రుడు, బ్రహ్మ, విష్ణువు - వీరికి బదులుగా పార్వతీశుడు, శచీప్రియుడు, భాషావిభుడు, ఇందిరాపతి అని విశేష్యాలను సాభిప్రాయంగా ప్రయోగించడంచేత అలంకారం పరికరాంకురం.

5. ఎత్తుగీతిలో ఉత్ప్రేక్ష అందగించింది. అరవిందం, అశోకం, చూతం, నవమల్లిక, నీలోత్పలం- అనే అయిదు పూలు మన్మథుడి పంచబాణాలు. ఉపమానం యొక్క తాదాత్మ్యాన్ని ఉపమేయంలో సంభావించటం ఉత్ప్రేక్ష. పంచబాణుడి ఒక్కొక్క బాణమే ఎంతో ప్రభావం కలది. అటువంటి అయిదు బాణాలూ కలిపి ఒక మూసలో పోసి రూపొందించి ప్రాణప్రతిష్ఠ చేసినట్లు ఉన్న సౌందర్యమో అన్నట్లు అపూర్వంగా ఉన్నది ద్రౌపది సౌందర్యం. అంతటి అందగత్తెలు సృష్టిలో లేరు.

6. సీస పాదాలలో క్రమంగా ద్రౌపదీ సౌందర్యబలాన్నీ, ప్రభావాన్నీ, సాటిలేనితనాన్నీ, వైభవాన్నీ చిత్రించాడు. ఎత్తుగీతిలో అపూర్వతను అభివ్యక్తం చేశాడు. కీచకుడు సంకల్పావస్థను ప్రదర్శిస్తూ సంగమానుకూల సౌందర్యాలంబనాన్ని ఉల్లేఖంగా కీర్తించటం-రసభావపోషకం.

7. ఈ సీసపద్యం, విశేషించి ఎత్తుగీతి అల్లసాని పెద్దనాది ప్రబంధకవులకు మార్గదర్శకమైనది. చూడండి: మనుచరిత్ర. 2.36 (సంపా.)

క. ఈ నెలఁతఁ గన్న మన్మథుఁ। డైనఁ జిగురు గొడుగుఁ పువ్వుటమ్ములపొదులున్
లోనుగ సెజ్జలు సేయం। దా నియమింపండె? విరహతాపము పేర్మిన్.' 28

ప్రతిపదార్థం: ఈ నెలఁతన్+కన్న= ఈ స్త్రీని చూచినచో; మన్మథుఁడు+ఐనన్= మదనుడైనా; విరహతాపముపేర్మిన్= విరహతాపాతిశయంచేత; చిగురుగొడుగు= చిగురుటాకుల గొడుగు; పువ్వు+అమ్ములపొదులున్= పూలబాణాల పొదులు; లోనుగన్= మొదలయినవి; తాను= ఆయన; సెజ్జలు+చేయన్= పడకలు తయారుచేయడానికి; నియమింపండె?= ఆజ్ఞాపించడా?

తాత్పర్యం: ఈమెను చూచి, మన్మథుడు విరహతాపానికి లోనయి, తన చిగురాకు గొడుగులను, పూలబాణాల పొదులను తనకు మెత్తటి పరుపుగా తయారుచేయుమని ఆజ్ఞాపించక తప్పదు.'

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ద్రౌపదిని చూస్తే మన్మథుడికైనా విరహతాపం కలగకమానదని సూచించి, తిక్కన కీచకుడి మోహాన్నీ ద్రౌపది సౌందర్యాన్నీ వ్యంగ్యంగా చెప్పాడు.

వ. అని వెండియు. 29

తాత్పర్యం: అని మరలా (ఇట్లా అనుకొన్నాడు.)

సీ. దీని జన్మంబునఁ దేజంబునొందిన। యింతియుఁ బతియును నెవ్వరొక్కొ!
దీని నామాకృతిగా నోఁచి పడసిన। యింపగు వర్ణంబు లెవ్వియొక్కొ!
దీని వల్లభుఁ డనఁగా నిల సొబగు సొం। పెసఁగ వర్తిల్లు వాఁ డెవ్వఁడొక్కొ!
దీని వసించుటఁ దా నొప్పి పెంపున। నేపారు మందిరం బెద్దియొక్కొ!

ఆ. దీనిఁ బొందఁగాంచు తెఱఁగు నా కెయ్యది। యొక్కొ! యిట్టిపనికి నూఅడిల్లి
తోడుకొనఁగ నిచట నీడగు చుట్టంబుఁ। దడవి యెట్టులొక్కొ పడయువాఁడ!' 30

ప్రతిపదార్థం: దీని జన్మంబునన్= ఈమె పుట్టుకచేత; తేజంబున్+ఒందిన= ప్రకాశించిన; ఇంతియున్, పతియునున్= భార్యాభర్తలు (తల్లిదండ్రులు); ఎవ్వరు+ఒక్కొ!= ఎవరో కదా!; దీని నామాకృతిగాన్+నోఁచి= ఈమె పేరు అగునట్లుగా నోములు నోచి; పడసిన= పొందిన; ఇంపు+అగు వర్ణంబులు= సొంపయిన అక్షరాలు; ఎవ్విఒక్కొ!= ఏవో కదా!; దీని వల్లభుఁడు+అనఁగాన్= ఈమె భర్తగా;

ఇలన్= భూమిమీద; సొబగు సొంపు+ఎసఁగన్= అందచందాలు అతిశయించగా; వర్తిల్లు= జీవించునట్టి; వాఁడు= ఎవ్వ+డు+ఒక్కొ!= వాడెవడో కదా!; దీని వసించుటన్= ఈమె ఉండటం చేత; తాన్+ఒప్పి= తాను (మందిరం) అందగించి; పెంపునన్= ఐశ్వర్యవంతమై; ఏపారు= ప్రకాశించే; మందిరంబు= గృహం; ఎద్ది+ఒక్కొ!= ఏదో కదా!; దీనిన్+పొందన్+కాంచు= ఈమెను అనుభవించగల; తెఱఁగు= విధం; నాకున్+ఏ+అది+ఒక్కొ!= నా కెట్లా కలుగుతుందో కదా!; ఇట్టిపనికిన్= ఈ పనికి; ఊఁఉడిల్లి= ఉపశమనం పొంది; తోడుకొనఁగన్= సహాయం పొందటానికి; ఇచటన్= ఇక్కడ; ఈడు+అగు= సరిఅయిన; చుట్టంబున్= బంధువును; తడవి= వెదకి; ఎట్టులు+ఒక్కొ!= ఎట్లా; పడయువాఁడన్?= పొందుతానోగదా!

తాత్పర్యం: 'ఈ సుందరికి జన్మనిచ్చి వెలుగొందిన ఆ పుణ్యదంపతులు ఎవరో కదా! ఈమె పేరుగా రూపొందటానికి నోములు నోచిన ఆ అందమైన అక్షరాలు ఏవో! ఈమె భర్తగా ఈ లోకంలో అందచందాలతో ఒప్పారే ఆ సౌభాగ్యవంతుడు ఎవడో! ఈమె నివసించటం చేత తన ఉనికియొక్క అందాన్నీ అతిశయాన్నీ పెంచుకొన్న ఆ మందిరం ఏదో? ఈమెపొందును పొందగలిగే మార్గం నా కేదో? ఈ పనికి న న్నోదార్చి నాకు తోడుపడే తగిన బంధువును (ఆప్తుడిని) నే నెట్లా వెదకి పట్టుకొనవలెనోగదా!

విశేషం: అలం: పర్యాయోక్తం. ప్రతిపాదంలోనూ 'ఒక్కొ' - అను మాటను ఆవృత్తం చేయటం చేత పద్యంలో శాబ్దికమైన సమత ఏర్పడింది. స్త్రీ జీవితంలో క్రమబద్ధమైన పరిణామాలు - పుట్టడం, నామకరణం, వివాహమాడటం, అత్తగారింటికి వెళ్ళటం - అనే విషయాలు-ఇవి పద్యంలో క్రమంగా పేర్కొనబడ్డాయి. దానివలన అర్థసంబంధమైన సమతకూడ సిద్ధించింది. పైగా స్త్రీ జీవితంలోని ఆనుపూర్వి పాటించబడింది. ఇది తిక్కన పద్య శిల్పంలోని రహస్యం. ఈమె ఎవరికూతురో, ఈమె పేరేదో, ఈమె భర్త ఎవరో, ఈమె ఇల్లు ఏదో అనక, వాటినే భంగ్యంతరంగా చెప్పటం వలన అలంకారం పర్యాయోక్తం. దానిచేత ఆయా వాటి ఔన్నత్యం ద్యోతకమవుతున్నది.

చ. **అని యని యుగ్గడించు, ధృతి యల్లల నాడినఁ దల్లడించుఁ బై**
కొను తలపోఁత నించు, మదిఁ గోర్కులు పేర్చిన నప్పళించు, నె
ట్టన తెగ నగ్గలించు, నచటన్ జనులం బరికించు, బుద్ధి దూ
లిన వెస నెంతయుం గళవళించు మనోజవికారమగ్నుఁడై. 31

ప్రతిపదార్థం: మనోజ, వికార, మగ్నుఁడు+ఐ= (కీచకుడు) మన్మథుడి వలన మనసులో కలిగిన భావవికారాలలో మునిగినవాడై (మదనభావావేశపరుడై); అని+అని= మాటిమాటికి (ఈ విధంగా పెక్కుసార్లు); ఉగ్గడించున్= ప్రశంసిస్తాడు; ధృతి= మనోధైర్యం; అల్లన్+అలన్+ఆడినన్= చలిస్తే; తల్లడించున్= కలవరపడతాడు; పైకొను= క్రమ్ముకొని వచ్చే; తలపోఁతన్= ఆలోచనచేత; ఇంచున్= సంతోషిస్తాడు; మదిన్= మనస్సులో; కోర్కులు పేర్చినన్= కోరికలు పెల్లుబ్బగా; అప్పళించున్= తమకిస్తాడు; నెట్టన= అనివార్యంగా, అధికంగా; తెగన్+అగ్గలించున్= తెగించటానికి ఉత్సాహం ప్రదర్శిస్తాడు; అచటన్= అక్కడి; జనులన్= మనుష్యులను; పరికించున్= చూస్తాడు; బుద్ధి+తూలినన్= మనస్సు కలవరపడగా; వెసన్+ఎంతయున్= వెంటనే మిక్కిలిగా; కళవళించున్= తికమక పడతాడు, తల్లడిల్లుతాడు.

తాత్పర్యం: రతిభావతీవ్రతచేత కీచకుడు మన్మథ వికారాలకు లోనయ్యాడు. ద్రౌపదీ సౌందర్యాన్ని గురించి అన్నమాటే అంటూ అనేక విధాలుగా ప్రశంసిస్తూ మాట్లాడసాగాడు. ముంచుకొని వచ్చే ఎన్నో వలపు తలపులకు సంతోషించసాగాడు. మనసులో కోరికలు పెల్లుబికితే తట్టుకొనలేక తమకించేవాడు. వారించటానికి వీలులేని ఉద్రేకంతో ఎంతకైనా తెగించటానికి ఉత్సహించేవాడు; తనను (వింతగా) చూస్తున్న జనులను తేరిపార చూచేవాడు. మతి తప్పినట్లు కాగా వెంటనే ఎంతో తల్లడిల్లేవాడు.

విశేషం: 26వ పద్యం నుండి 30వ పద్యం వరకు తిక్కన కీచకుడి వాచికాభినయాన్ని కళాసుందరంగా వ్యక్తీకరించాడు. ఈ పద్యంలో ఆంగికాభినయాన్ని అభినయబంధురంగా ఆవిష్కరించాడు.

1. మదన వికార చేష్టలను వర్ణించటంలో ఇంతటి మధురమైన పద్యం తెలుగులో అంతవరకు వెలువడలేదు. తిక్కన వాడిన విశేషణాలూ, క్రియలూ; రమణీయార్థ ప్రతిపాదకాలు. ఉదాహరణకు - 'మనోజ వికార మగ్నుఁడై' అనే విశేషణం గమనిద్దాం. మనోజ= మనస్సునుండిపుట్టిన; మన్మథ సంబంధమైన - అనిన్నీ; వికార= భావాలలో, చేష్టలలో అనిన్నీ చెప్పుకొనవచ్చును. వికార శబ్దాన్ని లాక్షణికులు భావపరంగానూ, చేష్టాపరంగానూ వాడతారు. భావాలంటే సంచారి భావాలు. భావాల వలన వాటికి అనుగుణమైన అనుభావలు (చేష్టలు) జనించటం నాట్యంలో, జీవితంలో గమనిస్తాం. ఇక్కడ తిక్కన ఆ రహస్యాన్ని కళామయంగా శ్లేషలో నిబంధించాడు. అందువలన ఈ పద్యంలోని భావాలనూ, చేష్టలనూ వివేచించటం వివేకం.

2. మన్మథావస్థలలో మూడవదైన సంకల్పంలో రతిభావం ఉత్కటావస్థకు చేరుతుంది. అంటే స్థాయి గౌరవాన్ని పొందుతుంది. ఆ సమయంలో సంచారి భావాలతో రతిభావాన్ని పోషించే ప్రక్రియను తిక్కన చేపట్టటం సార్థక రసాభ్యుదయ శిల్పం. నాలుగు పద్యాలలో సంచారిభావ సమున్మేషాన్ని చిత్రించిన తిక్కన ఇందులో చేష్టలను చిత్రించి ఆ అంశానికి ఒక సమగ్రతను సాధించాడు.

3. మనోజ వికార మగ్నుడైనవాడు ప్రదర్శించే చేష్టలు అప్రయత్నకృతాలు కావటం చేత సాత్త్విక భావాలవంటివి. భావాలని పేరుపెట్టినా సాత్త్వికభావాలు సహజభావాభివ్యక్తులైన చేష్టలే. తిక్కన ఆ చిత్రణను అపూర్వంగా ఈ పద్యంలో నిర్వహించాడు.

(1) పదే పదే ద్రౌపది సౌందర్యాన్ని ప్రస్తావించి ప్రశంసించటం ప్రలాపం. (ఇది వాఙ్మయ చేష్ట).

(2) ఆమె తనను అంగీకరిస్తుందో లేదో అనే అనుమానంతో మనోనిగ్రహం చలించగా అతడు తబ్బిబ్బు పడిపోయేవాడు. (తల్లడిల్లటం భావానుగుణమైన చేష్ట).

(3) వలపు తలపులు ముప్పిరికొంటూంటే దానికి సంతోషించటం తన్మయత్వభంగిమ (చేష్ట).

(4) కోర్కెలు పిచ్చుటిల్లుతూ ఉంటే తట్టుకోలేక అప్పళించటం (చేష్ట).

(5) కోర్కెలు అనివార్యం కాగా, తెగించి ఆమెను దరిచేరటానికి ఉత్సహించటం (చేష్ట).

(6) ఆవేశంతో ఆమెవైపు పోతే చూచేవా రేమనుకొంటారో అనే అనుమానంతో జనంవైపు చూడటం (చేష్ట).

(7) వలపు తలపులతో మతిచలించినంత మనోవేదన పడుతూ నిస్సహాయస్థితిని వ్యక్తం చేయటం కళవళింత (చేష్ట).

రసాభ్యుదయం భావానుభావ పరిణామ క్రమంతో వ్యక్తీకరించటంలో ప్రకాశిస్తుంది. ఉగ్గడించు, తల్లడించు, తలపోఁతనించు, అప్పళించు, అగ్గలించు, పరికించు, కళవళించు - క్రియలను వాడి అచ్చతెనుగు క్రియలకున్న అర్థశక్తిని తిక్కన ప్రదర్శించటం ఆయన కవితా శిల్ప విశేషం.

(4) అలం: సముచ్చయం. ఏకకాలంలో అనేక కార్యాలు జరిగినట్లు వర్ణించబడటం సముచ్చయాలంకార లక్షణం. దానికి పద్యం హృద్యమైన ఉదాహరణ. (సంపా.)

క. మాసిన చందముఁ దనుఁ గని । రోసిన డెందంబుఁ గల తరుణి నెఱుఁగఁడ బి
ట్టేసిన మదనునిచే ధృతి । వాసిన బెగడొందు సింహబలుఁ డట్టియెడన్. 32

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయలో; బిట్టు+ఏసిన= తీవ్రంగా బాణాలతో కొట్టిన; మదనునిచేన్= మన్మథుని చేత; ధృతి+పాసిన= ధైర్యాన్ని కోల్పోగా; బెగడొందు= కలతచెందే; సింహబలుఁడు= కీచకుడు; మాసిన చందమున్= కాంతి తరిగిన విధంగా ఉన్నా; తనున్+కని రోసిన= తనను చూచి అసహ్యించుకొనే; డెందంబున్+కల= మనస్సుగల; తరుణిన్+ఎఱుఁగఁడు+అ= ద్రౌపది మనస్సు తెలిసికొనలేకపోయాడు.

తాత్పర్యం: మన్మథ వికారానికి లోనైన ఆ కీచకుడు ఆ సమయంలో నిబ్బరాన్ని కోల్పోయి ఉండటం చేత ద్రౌపది మాసిన దుస్తులలో కళావిహీనంగా ఉన్నా, తనను చూచి అసహ్యించుకొంటున్నా ఆమె మనస్సును గ్రహించలేకపోయాడు.

విశేషం: తిక్కన సందర్భాన్ని బట్టి ఒక్కొక్క సంచారిభావాన్ని ఒక్కొక్క పద్యంలో వర్ణించి రసాభ్యుదయోల్లాసాన్ని కలిగించే కావ్య రస శిల్పాన్ని ప్రదర్శిస్తాడు. సంకల్పమనే మదనావస్థలో ఉన్న కీచకుడి చిత్తవృత్తికి పోషకంగా ఈ పద్యంలో మోహమనే సంచారి భావాన్ని తిక్కన పోషించాడు. "భయ వియోగాది ప్రయోజ్యా వస్తుతత్త్వానవధారణీ చిత్తవృత్తి ర్మోహః" అని లక్షణం. రక్తుడైన కీచకుడు మోహావిష్టుడు. అందువలన ద్రౌపది కాంతిహీనంగా ఉన్నా, తనను మనసులో ఏవగించుకొంటున్నా ఆమె మనస్తత్త్వాన్ని (వస్తుతత్త్వాన్ని) వివేచించే స్థితిలో లేడు. దుర్విదగ్ధుడి విశిష్ట లక్షణమిది. (సంపా.)

సీ. **వెఱవక ననుఁ జూచె వీఁడని యెదఁ గలు । షించిన నొండొండ చెమట వొడమ,**
ననుచితకృత్యంబు లాచరించు విధాతృ । బలిమికి నివ్వెఱపాటు దోఁప,
నిచ్చట దిక్కులే రెవ్వరు నా కను । భయమున మేనఁ గంపంబు పుట్టఁ,
జేయంగ నేమి యుపాయంబు లేమి నా । ననమున వెల్లఁదనంబు గదుర

తే. **నున్న పాంచాలిఁ గనుఁగొని యన్నరాధ । ముఁడు వివేక విహీనుఁడై ముదితుఁ డగుచు**
మదనవికృతియకాఁ దన మదిఁ దలంచి । రాగసాగరపూర నిర్మగ్నుఁ డయ్యె. **33**

ప్రతిపదార్థం: వీఁడు= ఇతడు, కీచకుడు; వెఱవక= భయపడక, వెనుకాడక; ననున్+చూచెన్+అని= నన్ను చూచాడని; ఎదన్= హృదయంలో; కలుషించినన్= కలతబారటం చేత; ఒండు+ఒండ= క్రమక్రమంగా; చెమట+పొడమన్= (ఒడలంతా) చెమటపట్టగా; అనుచితకృత్యంబులు= ఒప్పని పనులు; ఆచరించు= చేసే; విధాతృబలిమికిన్= బ్రహ్మదేవుని శక్తికి, విధి బలీయతకు; నిండు+వెఱపాటు+తోఁపన్= (మిక్కలి భయం వలన కలిగే) నిశ్చేష్టత ప్రకటితం కాగా; నాకున్= (ద్రౌపదికి); ఇచ్చటన్= ఇక్కడ; ఎవ్వరున్= ఎవరూ; దిక్కులేరు= రక్షించేవారు లేరు; అనుభయమునన్= అనే భయంతో; మేనన్+కంపంబు+పుట్టన్= శరీరంలో వణకు పుట్టగా; చేయంగన్= చేయటానికి (ఆ విపత్తు నుండి తప్పించుకొనటానికి); ఏమి+ఉపాయంబు= ఎటువంటి ఉపాయమూ; లేమిన్= లేకపోవటం చేత; ఆననమునన్= ముఖంపై; వెల్లన్+తనంబు= వెలవెలబాటు; కదురన్= కలుగగా; ఉన్న పాంచాలిన్= ఉన్నటువంటి ద్రౌపదిని; ఆ+నర+అధముఁడు= ఆ నీచుడు; కనుఁగొని= చూచి; వివేకవిహీనుఁడు+ఐ= ఇది మంచి, ఇది చెడు అని విడమరచి తెలిసికొనే తెలివి కోల్పోయినవాడై; ముదితుఁడు+అగుచున్= (తనలో తాను) సంతోషిస్తూ; మదన వికృతి+అ కాన్= (ద్రౌపది ప్రకటించిన సాత్త్వికభావాలను) మన్మథవికారముగా (శృంగార చేష్టలుగా); తలంచి= తలపోసి; రాగసాగరపూర= అనురాగం (వలపు) అనే సముద్రపు నీటిలో; నిర్మగ్నుఁడు+అయ్యెన్= మునిగిపోయాడు.

తాత్పర్యం: ఈ కీచకుడు నన్ను జంకుగొంకులు లేకుండా చూస్తున్నాడే అని ద్రౌపది మనసులో కలత పడింది. దానివలన ఆమె శరీరం నిండా అంచెలంచెలుగా క్రమంగా చెమటపట్టింది. 'బలమైన ఆ విధి నా పట్ల ఎప్పుడూ ఉచితంగాని పనులే ఎందుకు చేస్తాడో? వాటిని తప్పించుకొనటం ఎట్లా?' అనే భావం తోచగానే ఆమె నిశ్చేష్టురాలై పోయింది. ఈ సమయంలో నా కెవ్వరూ ఇక్కడ దిక్కులేరనే భయం కలిగేసరికి ఆమె శరీరంలో వణకు పుట్టింది. ఈ అపాయాన్ని తప్పించుకొనటానికి ఏ ఉపాయమూ లేదనిపించటం చేత ఆమె ముఖం వెలవెలపోయింది. ఇటువంటి భయహావభావాలను ప్రదర్శిస్తున్న ద్రౌపదిని నీచుడూ, వివేకరహితుడూ అయిన కీచకుడు పరిశీలించాడు. ఆమె ప్రకటిస్తున్న భయసాత్త్విక భావాలన్నీ తనపై వలపుచేత ప్రదర్శిస్తున్న చేష్టలని భావించి లోలోన మురిసిపోతూ క్రమంగా వలపు మున్నీట మునిగిపోయాడు.

విశేషం: 1. తెలుగు సాహిత్యంలో ఈ పద్యం ఒక అపూర్వ ప్రయోగం. పై సీసంలోని నాలుగు పాదాలలో వరుసగా స్వేదం, స్తంభం, వేపథువు, వైవర్ణ్యం అనే సాత్త్విక భావాలు వర్ణించబడ్డాయి. సాత్త్విక భావాలంటే భావాలు కావు. సమాహిత చిత్తం నుండి అప్రయత్నంగా వెలువడే చేష్టలు. తిక్కన ద్రౌపదిలో భయాన్నీ, కీచకుడిలో రతిభావాన్నీ ఈ సందర్భంలో పోషించాలి. రతి భావానికి శృంగార విభావం కావాలి. ద్రౌపది అందంగా ఉన్నదే కాని భయవిహ్వలురాలై ఆ భావాన్ని వ్యక్తం చేసే సాత్త్విక భావాలను ప్రకటిస్తున్నది. అంచెలంచెలుగా చెమటపోయటం, నిశ్చేష్టురాలై పోవటం, శరీరం వణకటం, ముఖం వెలవెలపోవటం అనేవి భయభావం వలన కలిగే సాత్త్వికభావాలు. వీటినే శృంగార రసపరంగా రతిభావజనకాలైనవిగా కీచకుడు భ్రమించినట్లు తిక్కన చిత్రించాడు. విరుద్ధ రసభావాల నడుమ సాత్త్విక భావాలు సమంగా ఏ విధంగా ఉండటానికి వీలుంటుందో తిక్కన సూక్ష్మబుద్ధితో వివేచించి కవితలో ఆవిష్కరించాడు. సాత్త్వికభావా లొకటైనా విరుద్ధభావాలకు అనుగుణంగా వ్యాఖ్యానించే కావ్య రసమర్మం ఈ పద్య శిల్పం. ఇది అసాధారణం.

2. 'కామీ స్వతాం పశ్యతి' - అని కాళిదాసోక్తి, భయభావ జనితమైన సహజ చేష్టలను రతిభావావిష్టుడైన కీచకుడు తన కనుకూలంగా వ్యాఖ్యానించుకొన్నాడు. నాయకుడు సూటిగా నాయికవైపు చూస్తే లజ్జాతిశయం వలన కలిగిన బెరుకు చేత చెమటపోయటం శృంగార రసంలో సహజం. నాయక సాన్నిహిత్యం వలన కలుగబోయే పరిణామాలను భావించి చేష్టలుడిగి అతడికి వశం కావటం స్తంభంగా అతడికి భాసించింది. ప్రథమ సమాగమ భీతిచేత శరీరం కంపించటం ముగ్ధకు సహజం. అంతకాలం నిబ్బరంగా ఉండి నాయకుడికి అంతలోనే వశమై పోతున్నందుకు తన బలహీనతకు తానే తెల్లబోవటం నైజం. కీచకుడు ఆమెను గురించి అట్లా భావిస్తే పఠిత అతడు నీచు డనుకొంటాడు; వివేకవిహీను డనుకొంటాడు - తిక్కన సహృదయుడి ప్రతిస్పందనకు ప్రతిబింబంగా 'అన్నరాధముడు, వివేకవిహీనుడు' అని విశేషణాలు వాడాడు. సామాజిక నిష్ఠమైన కావ్యరస పోషణ తెలిసిన కవి చేసే పని ఇది. భయసాత్త్విక భావాలను, రతి కనుకూలంగా ఎందుకు భావించాడు? అంటే - అతడు రాగసాగర పూర నిర్మగ్నుడైనాడు కాబట్టి. రాగరసం శృంగార రసంగా చెప్పటానికి వీల్లేదు. కాని రసాభాసానికి "ఏకత్రైవానురాగశ్చేత్"అనే శ్లోకంతో ఉన్న ప్రతాపరుద్రీయ నిర్వచనం ప్రసిద్ధం. అటువంటి అనురాగమే ఈ రాగం. ఒక విధంగా అది ఆభాస సూచకంగా తిక్కన వాడాడేమో! రసాభాస శిల్పంలో వాడదగిన రసవదలంకార శిల్పంగా తిక్కన భావించాడేమో! రాగసాగరమన్నప్పుడు రూపకం రాణించింది. సాగరమగ్నుడైన కీచకుడు అకారణంగా మరణించనున్నాడని ధ్వని అనుగమ్యమానమౌతున్నది (సంపా.)

వ. అయ్యవసరంబున. 34

తాత్పర్యం: ఆ సమయంలో.

చ. పొలఁతుక కాంతి యింత పొలివోవఁగనీ కెసలారఁ దార ని
శ్చలతఁ గడంగి క్రోలికొనఁజాలుటఁ గీచకముఖ్యు లోచనం
బులు 'నయనం ప్రధాన' మను పూర్వవచస్స్థితి తప్పకుండఁగా
నెలమి వహించెఁ దక్కుఁ గల యింద్రియ వర్గము ధిక్కరించుచున్. 35

ప్రతిపదార్థం: పొలఁతుక= ద్రౌపది యొక్క; కాంతి= శోభ; ఇంత పొలివోవఁగన్+ఈక=కొంచెంకూడా వృథా కాకుండా; ఎసలారన్= ఒప్పారగా; తార నిశ్చలత= కంటి చూపు (కనుగుడ్లను) తదేకంగా నిలిపి; కడంగి= పూని; క్రోలికొనన్+చాలుటన్= చూపులతో జుర్రుకొన గలగటం చేత; తక్కున్+కల= మిగిలిన; ఇంద్రియవర్గమున్= కన్నులు తప్ప మిగిలిన ఇంద్రియ సముదాయాన్ని; ధిక్కరించుచున్= తిరస్కరిస్తూ; కీచకముఖ్యు= కీచకులలో శ్రేష్ఠుడైన సింహబలుడి యొక్క; లోచనంబులు= కళ్ళు; 'నయనం ప్రధానం'= కళ్ళు ముఖ్యమనే; పూర్వవచఃస్థితి= పాతకాలపు సూక్తి, సామెత; తప్పకుండఁగాన్= పొల్లుపోకుండా నిజంచేసే విధంగా; ఎలమి వహించెన్= ప్రీతిని పొందాయి.

తాత్పర్యం: ద్రౌపది శరీర సౌందర్య శోభ కొంచెం కూడా వృథా కాకుండా రెప్పపాటు లేని చూపులతో జుర్రుకొందామనే తపనతో తదేకంగా ఆమెనే చూస్తున్న కీచకుడి కన్నులు **"సర్వేంద్రియాణాం నయనం ప్రధానం"** అనే నానుడిని నిజంచేసే విధంగా ప్రీతిని పొందాయి.

విశేషం: అలం: నిరుక్తి, లోకోక్తి, వ్యుత్పత్తి వలన నామాలకు అన్వార్థాన్ని కల్పిస్తే నిరుక్త్యలంకారం. **'సర్వస్య గాత్రస్యశిరః ప్రధానం; సర్వేంద్రియాణాం నయనం ప్రధానం'** అని ప్రసిద్ధమైన సూక్తి. దీనికి సమాహార రూపం **'నయనం ప్రధానం'**. ఆ మాత్రం అంటే ఆ సూక్తి అంతా లోకుల మనస్సులలో స్ఫురిస్తుంది. లోచనం, నేత్రం అనే శబ్దాలు వాడితే సరిపోయేచోట నయన శబ్దాన్ని వాడి తిక్కన చమత్కరించాడు. నీయతే అనేన ఇతి నయనం- అని గురుబాల ప్రబోధిక. దీనిచేత అర్థాలు పొందించబడతాయి కాబట్టి నయనం. కీచకుడి చూపు తన కామ్యార్థ సిద్ధి కొరకు ఉపయోగించిన సాధనం అని దృఙ్మీలనంతో ఉత్కట మదనావస్థగా తిక్కన వ్యాఖ్యానించాడు. అందువలన నిరుక్త్యలంకారం భాసించింది. అందాన్ని కన్నులతో జుర్రుకోవటం అనే తెలుగు లోకోక్తిని వర్ణనంలో కలిపి చెప్పటం వలన లోకోక్త్యలంకారం. జాగరమనే మదనావస్థను కూడా ఈ సాత్త్వికభావం ధ్వనింప చేస్తున్నది. రాగ సాగర పూర నిర్మగ్నుడైన కీచకుడు రెప్పపాటులేని చూపును ప్రదర్శిస్తున్నాడంటే - నీట మునిగి చనిపోయిన వాడి స్థితి స్ఫురించి భావికథార్థం అలంకార ధ్వనితో పోషించబడిన రసధ్వనిగా గమ్యమానం ఔతున్నది.(సంపా.)

క. అప్పయుఁ బరిజనములుఁ దనుఁ। దప్పక కనుఁగొనుచునుండఁ దగవేది కరం
బొప్పని తమకము చిత్తముఁ। గప్పికొనుట నుత్తలంబు గదురఁగ నచ్చోన్. 36

ప్రతిపదార్థం: తనున్= కీచకుడిని; ఆ+చోటన్ - అచ్చోన్= అక్కడ; అప్పయున్= అక్క; సుదేష్ణాదేవి; పరిజనములున్= చుట్టూ ఉన్న పరిచారికలూ; తప్పక= విడవక, అదేపనిగా; కనుఁగొనుచున్+ఉండన్= గమనిస్తూ ఉండగా; తగవు+ఏది= మర్యాద లేకుండా; కరంబు= మిక్కిలి; ఒప్పని= తగని, భరించరాని; తమకము= మోహం; చిత్తమున్= మనస్సును; కప్పికొనుటన్= ఆవరించటం చేత; ఉత్తలంబు= కలతతో కూడిన వేగిరపాటు; కదురఁగన్= కలుగగా, అతిశయించగా.

తాత్పర్యం: తన అక్క అయిన సుదేష్ణాదేవి, ఆమె చుట్టూ ఉన్న పరిచారికలూ తనవైపే చూస్తూ ఉన్నా, మర్యాద లేకుండా కీచకుడు మిక్కిలి మించిన తగని మోహం మనస్సును ఆవరించటం చేత ఆపలేని వేగిరపాటును అధికంగా పొందుతూ అక్కడ. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: శృంగార దశవిధావస్థల వలెనే అష్టాదశ శృంగార చేష్టలు కూడ చెప్పబడ్డాయి. సాహిత్య దర్పణకారుడు వాటిని ఇరవై ఎనిమిదిగా పేర్కొన్నాడు. అవి నాయికా నాయకులకు సత్త్వజాలైన అలంకారాలని చెప్పాడు. వాటిలో మూడు మనస్సు వలన పుట్టేవనీ, ఏడు అయత్నంగా పుట్టేవనీ, పదునెనిమిది స్వభావం వలన కలిగేవనీ విశ్లేషించి చెప్పాడు. స్వభావజాలైన శృంగార చేష్టలలో 'తపన' అనేది ఒకటి. **"తపనం ప్రియ విచ్ఛేద స్మరావేగోత్థ చేష్టితం"** అని దాని లక్షణం. ప్రియ విరహ సమయంలో మోహాతిరేకం చేత కలిగే చేష్ట తపన. ఇది ఇక్కడ కీచకపరంగా తిక్కన చిత్రించాడు. ఇక్కడ పూర్వరాగ విరహావస్థలో కీచకుడి మోహాతిశయావస్థ వలన వేగిరపాటు, కలతపాటు అనే చేష్టావిశేషాలు సూచించబడుతున్నాయి. తరువాతి పద్యంలో దాని అభినయాంశ వివరించబడింది. తిక్కన నాటకీయ రచనలో సూక్ష్మంగా వివరించే రసభావాభినయ శిల్ప ప్రౌఢిని ఈ పద్యం. తరువాతి పద్యం ప్రదర్శిస్తున్నాయి. (సంపా.)

సీ. తన్వంగి మవ్వంపుఁ దనులత నెసఁగెడు। నునుఁగాంతి వెల్లువ మునుఁగఁబాఱఁ,
గిసలయహస్త కెంగేల నేపారు క్రొ। మ్మిం చను లేయెండ మిగులఁ బర్వఁ,
గమలాస్య ముద్దు మొగంబు లేమెఱుఁగుల। మొత్తంబు పరి చుట్టు ముట్టికొనఁగ,
ధవళాక్షి తొంగలి తఱచు ఱెప్పల చెన్ను। కప్పను చీఁకటి గవియుదేర,

తే. **బెగ్గలం బంత కంతకు నగ్గలింప । నొదవు చెమటతోఁ జిత్తంబు చెదరి యెందు**
మెలఁగఁ దలఁపేది యా సింహబలుఁ డనంగు । పట్టి యాడెడు జంత్రంబు పగిది నుండె. **37**

ప్రతిపదార్థం: తను+అంగి= సన్నని మేనుగల సైరంధ్రి (ద్రౌపది) యొక్క; మవ్వము+తనులతన్= కోమలమైన లతవంటి శరీరం పై; ఎసఁగెడు= ప్రకాశించే; నును+కాంతి వెల్లువ= లలితమైన కాంతి అనే వరద; మునుఁగన్+పాఱన్= (కీచకుడు) మునిగిపోయేటట్లు ప్రవహించగా; కిసలయహస్త= చిగురాకులవంటి చేతులు గల ఆ సుందరి యొక్క; కెంపు+కేలన్= ఎర్రని చేతిలో; ఏపు+ఆరు= అతిశయించే; క్రొత్త+మించు+అను= క్రొత్త మెరుపుతీగఅనే; లేత+ఎండ= లేత ఎండ; మిగులన్+పర్వన్= మిక్కుటంగా వ్యాపించగా; కమల+ఆస్య= పద్మం వంటి మొగం గల సైరంధ్రి (ద్రౌపది) యొక్క; ముద్దుమొగంబు= అందమైన ముఖం యొక్క; లేఁత+మెఱుంగులు= నునుకాంతులు; మొత్తంబు= సమూహం అనే; పరి= సేన; చుట్టుముట్టికొనఁగన్= చుట్టూమూగి ఆవహించగా; ధవళ+అక్షి= తెల్లని కన్నులు గల ఆమె యొక్క; తొంగలి= వాలే; తఱచు= దట్టమైన; ఱెప్పల చెన్ను కప్పు= కనురెప్పల అందమైన నల్లని కాంతి; అను చీఁకటి= అనే చీకటి; కనియున్+తేరన్= క్రమ్ముకోగా; బెగ్గలంబు= భయం; అంతకున్+అంతకున్+అగ్గలింపన్= మరీ మరీ అధికంకాగా; ఒదవుచెమటతోన్= పుట్టే చెమట చేత; చిత్తంబు చెదరి= మనసు చెదిరిపోయి; ఎందున్+మెలఁగన్= ఎక్కడా నిలవటానికి; తలఁపు+ఏది= మనసురాక; ఆ సింహబలుఁడు= ఆ కీచకుడు; అనంగు పట్టి+ఆడెడు= మన్మథుడు పట్టి ఆడించే; జంత్రంబు పగిదిన్= యంత్రం వలె; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: ఆ సన్నని మేనుగల సైరంధ్రి యొక్క లేతతీగవంటి శరీరంనుండి పెల్లుబికే అందమైన వెలుగు వెల్లువవలె పొంగి అతడిని ముంచివేస్తుండగా; చిగురాకుల వంటి చేతులు గల ఆ సైరంధ్రి కెంపులవలె ఎర్రగా ఉన్న చేతుల నుండి అతిశయించి వెలువడే క్రొత్త మెరుపుల లేతయెండ అతడిపై మిక్కిలి వ్యాపించగా, కమలంవంటి మొగం కలిగిన ఆ సైరంధ్రి అందమైన ముఖం ప్రసరించే లలితమైనకాంతుల సమూహం అతడిపై కాంతి సైన్యం వలె విజృంభించి చుట్టుముట్టగా, తెల్లని కన్నులు గల ఆ వాలుగంటి యొక్క పెద్దవైన కనురెప్పలు అందమైన నల్లని కాంతితో అతడిపై చీకట్లు ముసిరేటట్లు చేయగా, ఆ సింహబలుడు (కీచకుడు) భయం (విహ్వలం) అంతకంతకూ మనసులో అధికం కాగా, ఒంటినిండా పట్టే చెమటతో ఉక్కిరిబిక్కిరై మనసు చెదిరిపోయి, ఎక్కడా ఒకచోట ఉండటానికి మనసురాక, మన్మథుడు పట్టి ఆడించే ఒక యంత్రపు బొమ్మ వలె కనిపించాడు.

విశేషం: 1. అలం: ఉపమ (రూపకానుప్రాణితం), క్రమాలంకారం, సింహబలుడు మన్మథుడి చేతి కీలుబొమ్మవలె అత డాడించినట్లు ఆడుతున్నాడని అపూర్వమైన ఉపమాలంకారాన్ని చెప్పి కీచకుడి మదనావస్థను సహృదయుల హృదయాలకు ఆలంకారికంగా అందేటట్లు చేశాడు తిక్కన. కీచకుడికి 'బెగ్గలము' పుట్టి అంతకంతకు అగ్గలించిందట. బెగ్గలమంటే భయం, విహ్వలత, వివశత్వం, వ్యాకులత, కలత-అని సూర్యరాయాంధ్ర నిఘంటువు. తిక్కన తెలుగు పదం వాడితే దాని కెన్ని అర్థాలున్నాయో అన్నీ అక్కడ అన్వయించేటట్లు ప్రయోగించటం ఆయన ప్రౌఢి. సంస్కృత పదమైతే ఇన్ని అర్థాలు ఒక్కచోట కలిసిరావు. అందువలన 'బెగ్గలం' అనేది మోహాతిశయం వలన కలిగే శృంగార చేష్టలకు మూలమైన సాత్త్విక భావం. దానికి నాలుగు ముఖాలున్నాయి. నాలుగు అభినయాలున్నాయి. వాటిని తిక్కన క్రమాలంకార సుందరంగా ఈ పద్యంలో ఆవిష్కరించాడు. అది భావనామయం. 1. సన్నని తీవెవంటిసైరంధ్రిమేనుకాంతి మెరుపుతీగవలె మెరిసిపోతున్నది. దాని కాంతి వెల్లువవలె కీచకుడిని ముంచివేస్తున్నది. దానికి అతడు భయపడ్డాడు. భయంతో మొదలైన అతడి మానసికావస్థలు అంతటితో ఆగలేదు. ఆపైన మరికొన్ని పరిణామాలకు దారితీశాయి. ద్రౌపది శరీరాన్నంతా తేరిపార చూచినప్పుడు ఆమె శరీరకాంతి అతడి కొక విద్యుద్ఘాతం వలె బెడిసికొట్టింది. అందుకే ఆ భయం. కాని, ఆ అవస్థ మోహమగ్నుడైన అతడికి ఒక వివశత్వాన్ని కలిగించటానికి కారణమయింది. 2. ఆ తరువాత కరగ్రహణం కొరకు ఆమె చేతులను చూచాడు. చూస్తే చిగురుటాకుల వలె కెంపుల రంగును క్రుమ్మరిస్తూ మనోహరంగా ఉన్నాయి. కాని, ఆ కరకాంతులు లేయెండ చిరువేడిని పుట్టిస్తున్నాయి. అందుకు అతడికి చెమటపట్టింది. భయంవలన కలిగిన

సాత్త్వికభావం చెమటపట్టటం. దానికి కారణం ఆమె చేతులనుండి వెలువడే క్రొత్త మెరుపు లేయెండ అని చెప్పటం ఆలంకారికం. ఆమె చేతుల వలన అతడికి మిగిలేది బెదిరింపులే కాని ఆదరింపులు కావని ధ్వని. కాని, మోహమగ్నుడు కావటం చేత అతడు శృంగార విలాసంగా భ్రమించాడు. ఇది విహ్వలత లక్షణం. 3. ముద్దులాడి చేయిపట్టుకొన్న తరువాత రసికుడు ఆమె ముద్దుల మోమును ముద్దుపెట్టుకొనాలని భావిస్తాడు. అది అతడి తపనావస్థలోని స్వభావజమైన వేగిరపాటు లక్షణం. పద్మంవంటి అందమైన ఆమె ముఖంలో లావణ్యకాంతులు ఒక్కసారిగా అతడిని సైన్యం చుట్టుముట్టినట్లు క్రమ్ముకొని బెదిరించాయి. ఆ భావనలో అతడి మనసు చెదరిపోయింది. ఎటూ కదలటానికి వీలులేని బందీగా చిక్కిపోయాడు. ఇది వివశత్వ లక్షణం. 4. సైరంధ్రి సహజంగా ధవళాక్షి. విశాలమైన కన్నులలో కనుగ్రుడ్లకు కాంతినిచ్చే తెల్లదనం ఎవరి కళ్ళలో కనపడుతుందో ఆమె ధవళాక్షి. కళ్ళు తెరిస్తే సైరంధ్రి ధవళాక్షి. ఆమె చూపులలో చూపులుంచి. ఆ చూపులు తనపై నిలిచేటట్లు ఆమెను సమీపించాలని కీచకుడు ఆమె కళ్ళను చూచాడు. ఆమె భయంతో కనురెప్పలు చాలసార్లు మూస్తున్నది. అందువలన కనురెప్పల నూగారువలన ఏర్పడే నల్లనికాంతి చీకటిగా రేగి అతడిని ముంచివేస్తున్నది. ఆ చీకటిలో అతడికి ఎటూ కదలాడే వీలులేక మనసు చెడి వ్యాకులపాటుతో (కలతతో) ఉండిపోయాడు. ఈ విధంగా 'బెగ్గలం' అనే మాటను కీచకుడు సార్థకం చేశాడు. క్రమాలంకారాన్ని పోషించాడు. సీసపద్యంలోని పూర్వార్ధంలో ఉపమను, ఉత్తరార్ధంలో రూపకాన్ని సమాసాలలో నిబంధించటం రూపకంతో ఉపమకు వన్నెతెచ్చే అలంకారశిల్పం.

2. తిక్కన సమాంతర తుల్య పద్య శిల్ప నిర్మాత. ఈ పద్యం "వెఱవకు ననుఁ జూచె వీఁడని యెదఁ గలుషించిన నొండొండ చెమట వొడమ" (33వ పద్యం) అనే పద్యానికి ప్రతిరూప శిల్పం. అక్కడ ద్రౌపదికి భయం వలన కలిగిన సాత్త్విక భావాలు వర్ణించాడు. ఇక్కడ కీచకుడికి భయం వలన కలిగిన శృంగార సాత్త్విక స్వభావ చేష్టలు వర్ణించాడు. కీచకుడికి భయకారకమైనది సైరంధ్రి (ద్రౌపది) యొక్క కాంతి గుణం. అది శరీరంలో, చేతులలో, ముఖంలో, కన్నులలో వివిధ రీతులలో ప్రసరించి కీచకుడిని వివిధావస్థలకు గురిచేయించింది. ద్రౌపది పతివ్రతా ప్రభావాన్ని తిక్కన ఆమెలో కాంతిగా నిలిపి, మోహపరవశుడైన కీచకుఁ డా కాంతికి భీతుడు, వివశుడు, క్షుబ్ధుడు, నిశ్చేష్టుడు అయినట్లు ధ్వనింప చేయటం రసధ్వని. శ్రీనాథు డన్నట్లు ఇది 'రసాభ్యుచితబంధం'. (కాశీఖండము 1.13)

4. 'అనంగు పట్టియాడెడు జంత్రంబు పగిదినుండె' - (వ్యాఖ.) - ధాతుజ విశేషణ పూర్వావ్యవహితకర్తృ ప్రథమకు తఱచుగ యొక్క షష్ఠి ఔతుంది - అనఁగుని యొక్క పట్టి ఆడు జంత్రమని అర్థం. 'యొక్కకు లోపంబు బహుళంబు". అనే సూత్రంచేత యొక్క లోపించి 'అనంగుపట్టియాడెడు..' అని ప్రయోగించబడింది. (సంపా.)

కీచకుఁడు సుదేష్ణవలన ద్రౌపదితెఱం గెఱుంగఁ గోరుట (సం.4.13-5)

వ. ఇట్లు కందర్పదర్ప గోచరుండైన కీచకుండు నిజసహోదరివలన నక్కోమలి కలరూపు తెలియందలంచి దాని దెసం దగిలిన దృష్టి యెట్టకేలకుం దిగిచికొని చని యద్దేవికిం బ్రణమిల్లిన. 38

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; కందర్పదర్పగోచరుండు+ఐన= మన్మథుని గర్వానికి గురి అయినవాడు; కీచకుండు; నిజసహోదరి వలనన్= తన అక్క సుదేష్ణ వలన; ఆ+కోమలి కలరూపు= ఆ వనిత (సైరంధ్రి) యొక్క వాస్తవ పరిస్థితిని; తెలియన్+తలంచి= తెలిసికొనవలెనని భావించి; దానిదెసన్= ఆమె పట్ల; తగిలిన= తగుల్కొనిన; దృష్టి= చూపును; ఎట్టకేలకున్= చిట్టచివరకు ఎట్లాగో; తిగిచికొని= వెనుకకు మరలించికొని; చని= వెళ్ళి; ఆ+దేవికిన్= ఆ రాణికి; ప్రణమిల్లినన్= నమస్కరించగా.

తాత్పర్యం: మన్మథ ప్రభావానికి గురిఅయిన కీచకుడు తన అక్క సుదేష్ణ నడిగి సైరంధ్రిని గురించిన వాస్తవాలను తెలిసికొనాలనే కోరికతో, ఎట్టకేలకు సైరంధ్రిపై నుండి దృష్టి మరలించి అక్కను సమీపించి ఆమెకు నమస్కారం చేశాడు.

విశేషం: నిర్వ్యాజంగా అక్కకు భక్తితో మ్రొక్కటానికి వచ్చిన కీచకుడు ఇప్పుడు సవ్యాజంగా సైరంధ్రి వివరాలు తెలిసికొనటానికి నమస్కరించాడు. 'సంకల్పం' అనే మదనావస్థను ఫలవంతం చేసికొనటానికి అతడికి ఇది ఒక ఉపాయంగా ఉపయోగపడింది.

క. కాంచన పీఠము వెట్టఁగఁ। బంచి ప్రియము చూడ్కి ముసుఁగువడఁ దను సంభా
వించునెడ నాతఁ డప్పకుఁ। బాంచాలిం జూపి వేగపడి యిట్లనియెన్. 39

ప్రతిపదార్థం: కాంచన పీఠము= బంగారు గద్దెను; పెట్టఁగన్= ఉంచటానికి; పంచి= పరిచారికలను ఆజ్ఞాపించి; ప్రియము= తమ్ముని మీది ప్రేమ; చూడ్కిన్= చూపులో; ముసుఁగుపడన్= క్రమ్ముకొనగా; తనున్= (కీచకుని); సంభావించు+ఎడన్= ఆదరించే మాటలు మాట్లాడేటప్పుడు; అతఁడు= కీచకుడు; అప్పకున్= అక్కకు; పాంచాలిన్= ద్రౌపదిని; చూపి= చూపించి; వేగము+పడి= త్వరపడి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సుదేష్ణ తమ్ముడి కొరకు పరిచారికలను పురమాయించి బంగారు గద్దెను వేయించింది. ప్రీతితో నిండిన చూపులతో తమ్ముడిని ముంచెత్తింది. అనువైన విధంగా మర్యాదగా మాటలాడటం మొదలుపెట్టింది. కాని, అతడు ఆమె మాటలు పట్టించుకొనక తొందరపడి ద్రౌపది వైపు చేయి చూపిస్తూ అక్కతో ఇట్లా పలికాడు.

విశేషం: దృఙ్మేలనం, మనస్సంగమం, సంకల్పం అనే మదనావస్థలను పొంది వివశుడైన కీచకుడు ద్రౌపదిని కనుకలితో వలచాడు, ఇప్పుడు వినుకలితో దానిని పెంపొందింప దలచుకొన్నాడు. నడుమ ఎట్టి విఘాతాన్నీ అతడు సహించేటట్లు లేడు. సుదేష్ణ చెప్పే మాటలు వలపునకు పరోక్ష పోషకాలు, ద్రౌపది మాటలు ప్రత్యక్ష పోషకాలు. వాటినే వినదలచుకొని లౌకిక ప్రసంగాలపట్ల అరుచిని ప్రదర్శించాడు. ఇది సంకల్పంలోని వినుకలి ప్రారంభదశ. (సంపా.)

ఉ. 'ఇయ్యరవిందగంధి కుల మేమి? చరిత్రము చంద మెట్లు? పే
రెయ్యది? నాథుఁ డెవ్వఁ? డిది యెచ్చట నెప్పుడు నుండు? నిప్డు దా
నియ్యెడ కేఁగుదేవలయు టేపని సేయఁగఁ బూని? దీనిపై
నెయ్యము కల్మి యేకొలఁది నీ మది? కింతయు నాకుఁ జెప్పుమా!' 40

ప్రతిపదార్థం: ఈ+అరవిందగంధి= (పద్మగంధం వంటి మేని వాసనగల) ఈ వనిత యొక్క; కులము= వంశం, జాతి; ఏమి?= ఏమిటి?; చరిత్రము చందము= నడవడిక పద్ధతి; ఎట్లు?= ఎటువంటిది?; పేరు= నామం; ఏ+అది= ఏది; నాథుఁడు= భర్త; ఎవ్వఁడు?= ఎవడు?; ఇది= ఈమె; ఎచ్చటన్= ఎక్కడ; ఎప్పుడున్= ఎల్లప్పుడు; ఉండున్?= ఉంటుంది?; ఇప్డు= ఇప్పుడు; తాన్= తాను; ఈ+ఎడకున్+ ఇక్కడికి; ఏఁగుదేవలయుట= రావటం; ఏ పని+చేయఁగన్+పూని?= ఏ పనిని చేయటానికి?; నీ మదికిన్= నీ మనస్సుకు; దీనిపైన్= ఈమె మీద; నెయ్యము= ప్రేమ; కల్మి= కలిగి ఉండటం; ఏ+కొలఁది?= ఏ పాటిది?; నాకున్= నాకు (కీచకుడికి); ఇంతయున్= ఈ వివరాలన్నీ; చెప్పుమా!= చెప్పాలి సుమా!

తాత్పర్యం: 'అక్కా! ఈ పద్మసువాసన లీనే కాంత కుల మేమిటి? ఈమె నడవడిక ఎట్లాంటిది? పేరేమిటి? ఊరేమిటి? దీని భర్త ఎవరు? ఎక్కడ ఉంటున్నది? ఇక్కడికి ఏం పనిమీద వచ్చింది? దీనిని నీవు ఎంత ప్రీతితో చూచుకొంటున్నావు? ఇవి అన్నీ వివరించి చెప్పాలి.'

విశేషం: ఇన్ని ప్రశ్నలు ఒక్కసారిగా వేయటంలో కీచకుడి తమకం స్ఫురణకు వస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అనవుడు నయ్యంగన 'యితఁ । డనంగశర దళిత హృదయుఁ డయ్యె నకట! యీ
తని చిత్తవృత్తి మరలుప । ననురూపం బగు నుపాయ మది యెయ్యదియో?' 41

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆ+అంగన= ఆ సుదేష్ణ; అకట!= అయ్యో!; ఇతఁడు= కీచకుడు; అనంగ శరదళిత హృదయుఁడు= మన్మథ బాణాలచేత చీల్చబడిన మనస్సు కలవాడు; అయ్యెన్= అయినాడు; ఈతని= కీచకుడి యొక్క; చిత్తవృత్తి= మానసిక పద్ధతిని; మరలుపన్= మరలించటానికి; అనురూపంబు+అగు= తగిన; ఉపాయము= ఉపాయం; అది+ఎయ్యదియో!= అదేదో కదా!.

తాత్పర్యం: కీచకుడి మాటలు విని సుదేష్ణ ఇట్లా అనుకొన్నది - 'ఇతడి హృదయం మన్మథ బాణాల తాకిడికి గాయపడింది (అంటే ఇతడు మన్మథ భావావేశపరుడైనాడు అని భావం). ఇప్పటి ఇతని మనోధోరణిని మరలించటానికి తగిన ఉపాయం ఏదో?'

వ. అని తలంచుచుఁ గీచకుని మాటలు గీటునంబుచ్చి యొండు పలుకులు జరిపిన, నతండును సత్త్వహీనుండు గావున సత్వరుండై క్రమ్మఱి, ద్రౌపది యున్న యెడకుం జని, యా సమీపంబున నట్లాడుచు నమ్మానవతితో నిట్లనియె. 42

ప్రతిపదార్థం: అని, తలంచుచున్= అని ఆలోచిస్తూ; కీచకుని మాటలు; గీటునన్+పుచ్చి= అనాదరించి; ఒండుపలుకులు= వేరే మాటలు; జరిపినన్= కొనసాగించగా; సత్త్వహీనుండు= మనోనిగ్రహం లేనివాడు; కావునన్; సత్వరుండు+ఐ= తొందరపాటు కలవాడై; క్రమ్మఱి= మరలి; ద్రౌపది+ఉన్న+ఎడకున్+చని= ద్రౌపది ఉన్నచోటికి పోయి; ఆ సమీపంబునన్= ఆ ప్రాంతంలో; ఆడుచున్+ఆడుచున్= తారట్లాడుతూ; ఆ+మానవతితోన్= మానధనురాలైన సైరంధ్రితో (ద్రౌపదితో); ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కీచకుడి మాటలు లెక్కపెట్టకుండా సుదేష్ణ మాటమార్చడానికి ప్రయత్నించింది. కాని, వాడు అవివేకికాబట్టి తాల్మికోల్పోయి తొందరపాటుతో మరలివచ్చి ద్రౌపది సమీపంగా తిరుగుతూ ఆమెతో ఇట్లా అన్నాడు.

విశేషం: కార్యసాధనలో ఉపేక్ష ఒక ఉపాయం (శుక్రనీతి). సుదేష్ణ దానిని ప్రయత్నించబోయింది. కీచకుడు లొంగలేదు.

క. 'ఇవ్వసుమతి నే పొలఁతుల । కివ్విధమునఁ జెలువు గలదె యెన్నండును? నీ
వెవ్వరి తనయవు? నీ పతి । యెవ్వఁడు? పే రేమి? సెప్పు మిందునిభాస్యా!' 43

ప్రతిపదార్థం: ఇందు నిభ+ఆస్యా!= చంద్రుడి వంటి ముఖం కలదానా!; ఈ+వసుమతిన్= ఈ భూమిపై; ఎన్నండును= ఎప్పుడైనా; పొలఁతులకున్= స్త్రీలకు; ఈ+విధమునన్= ఇటువంటి; చెలువు= సౌందర్యం; కలదె?= ఉన్నదా? (లేదని భావం); నీవు; ఎవ్వరి; తనయవు?= కూతురివి?; నీ పతి+ఎవ్వఁడు?= నీ మగ డెవరు?; పేరు+ఏమి?= నీ పేరేమిటి? చెప్పుము.

తాత్పర్యం: 'ఓ చంద్రవదనా! ఏనాడయినా? ఈ భూమిమీద ఏ వనితలకైనా ఇంతటి అందచందా లున్నాయా? నీ వెవరి కూతురివి? నీ మగ డెవరు? నీ పేరేమి? చెప్పుము'.

విశేషం: ఇవ్విధమునఁ జెలువు - ఈ అనే విశేషణం సౌందర్య ప్రశంసాసూచకం. ఇందునిభాస్యా! - అనే సంబోధన సమయస్ఫూర్తిగా వాడాడు. రూపాభిమాని అయిన కీచకుడిని మోహపెట్టే విశిష్ట సౌందర్యం ద్రౌపదికి ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన నప్పలుకులు వినియు వినమి భావించి యప్పాంచాలి నిర్వికారయై యూరకున్న నచ్చపలుండు వెండియు నిట్లనియె. 44

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+పలుకులు= ఆ మాటలు; వినియున్= వినికూడా; వినమిన్= విననట్లుగానే; భావించి= నటించి; ఆ+పాంచాలి= పాంచాల రాజపుత్రి అయిన ఆ ద్రౌపది; నిర్వికార+ఐ= ఏవిధమైన వికారం లేని మనస్సు కలదై (చలించక); ఊరక+ఉన్నన్= మాట్లాడకుండా ఉండగా; ఆ+చపలుండు= చంచలచిత్తుడైన ఆ కీచకుడు; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: కీచకుడు మాట్లాడిన మాటలు వినీ విననట్లుగా నటిస్తూ ద్రౌపది నిర్వికారచిత్తంతో మాట్లాడకుండా నిలుచున్నది. కాని, చంచలచిత్తుడైన ఆ కీచకుడు ఆమెతో ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: ద్రౌపది అతడి మాటలకు మారు పలకలేదు. చలించలేదు. కానీ, కీచకుడు తమకంతో వేగిరపడుతూ ఉండటం చేత నిగ్రహించుకొన లేకపోయాడు. ఆమె ధీరురాలు, అతడు చంచలుడు. భిన్న ప్రవృత్తుల వైరుద్ధ్యం వైవిధ్యాన్ని కల్పిస్తూ రసోల్లాసాన్ని కలిగిస్తుంది. (సంపా.)

సీ. 'తెలి గన్నుఁగవ కాంతి పొలుపార నించుక। కను విచ్చి చూచినఁ గాదె యబల!
చెలువంపు నెమ్మోము నెలమి సొం పినుమడి। గా నల్ల నవ్వినఁ గాదె యింతి!.
దంతమౌక్తికరుచి దలకొన మఱుమాట। వలికినఁ గాదె యుత్పలదళాక్షి!
యుల్లంబు సరసత దెల్లంబుగా లీలఁ। గైకొన్నఁగాదె పంకరుహవదన!'

ఆ. యనుచుఁ జూచుఁ, జేరుఁ, నమ్ముగ్ధ పలుకులు। వినఁగఁ గోరుఁ, గేలు తనదు కేలఁ
గీలుకొలుపఁ దలఁచుఁ గీచకాధముఁడు ని। జానురక్తిఁ దెలుప నప్పళించు. 45

ప్రతిపదార్థం: కీచకాధముఁడు= కీచకుడనే నీచుడు (సంభాషణ కొనసాగిస్తూ); అబల!= ఓ కోమలీ!; తెలి+కన్నుఁగవకాంతి= తెల్లని కనుదోయి యొక్క వెలుగు; పొలుపారన్= ప్రకాశించగా; ఇంచుక= కొంచెం; కనువిచ్చి= కనులు తెరచి; చూచినన్+కాదె= చూడరాదా?; ఇంతి!= ఓ స్త్రీ!; చెలువము+నెఱి+మోము= అందమైన, నిండైన ముఖం యొక్క; ఎలమిసొంపు= వికాస సౌందర్యం; ఇనుమడిగాన్= రెట్టింపుకాగా; అల్లన్= నెమ్మదిగా; నవ్వినన్+కాదె= నవ్వకూడదా?; ఉత్పలదళ+అక్షి!= కలువ రేకులవంటి కనులదానా!; దంతమౌక్తిక రుచి= ముత్యాలపలువరుస కాంతి; తలకొనన్= ప్రసరించగా; మాఱుమాట= బదులు పలుకు; పలికినన్+కాదె?= పలుకరాదా?; పంకరుహవదన!= పద్మముఖీ!; ఉల్లంబు= మనసులోని; సరసత= రసికత్వం; తెల్లంబుకాన్= తెలిసేటట్లు; లీలన్= విలాస చేష్టలను (శృంగారహావభావాలను), కైకొన్నన్+కాదె?= స్వీకరించరాదా?; అనుచున్= అని పలుకుతూ; చూచున్= ఆమె వైపు చూస్తాడు; చేరున్= ఆమెను సమీపిస్తాడు; ఆ+ముగ్ధ పలుకులు= ఆ సహజసుందరియొక్క మాటలు; వినఁగన్+కోరున్= వినాలని ఉబలాటపడతాడు; కేలు= ఆమె చేతిని; తనదుకేలన్= తన చేతితో; కీలుకొలుపన్= పట్టుకొనటానికి; తలఁచున్= భావిస్తాడు; నిజ+అనురక్తిన్= తన వలపును; తెలుపన్= ఆమెకు తెలియచెప్పటానికి; అప్పళించున్= ప్రయత్నిస్తాడు.

తాత్పర్యం: 'ఓ కోమలీ! నీ తెల్లని కన్నుల కాంతి వెలిగిపోయేటట్లు కొద్దిగా నీ కన్నులు విచ్చి చూస్తే ఏమౌతుంది? ఓ కాంతా! అందమైన నీ నిండు మొగంలోని వికాస సౌందర్యం రెట్టింపయ్యేటట్లు మెల్లగా నవ్వితే ఏం పోతుంది? కలువ రేకుల కన్నుల దానా! నీ ముత్యాలవంటి పలువరుస మెరుగులు వ్యాపించేటట్లు నోరువిచ్చి మారు పల్కితే ఏమి ఒలికిపోతుంది? పద్మముఖీ! నీ మనసులోని సరసత్వం తేటతెల్లమయ్యేటట్లు, శృంగారహావ భావాలను ప్రదర్శిస్తే ఏం

పోతుంది?' అంటూ ఆ అధముడైన కీచకుడు ఆమె వైపు చూస్తాడు. ఆమెను సమీపిస్తాడు, ఆ ముద్దరాలి మాటలు వినాలని ముచ్చటపడతాడు, ఆమె చేతిని తన చేతిలోకి తీసికొందామని భావిస్తాడు. తన వలపును ఆమెకు తెలపటానికి ప్రయత్నిస్తాడు.

విశేషం: 1.అలం: క్రమాలంకారం లేదా యథాసంఖ్యాలంకారం. సైరంధ్రిని కన్నులు విచ్చి చూస్తే ఏమౌతుంది?. అని ఆమె వైపు అదేపనిగా చూస్తాడు: నవ్వితే ఏమౌతుంది అని అంటూ సమీపిస్తాడు: మారు పలికితే ఏమౌతుంది? అని ఆమె మాటలు వినాలని తహతహలాడతాడు; లీలలను ప్రదర్శిస్తే ఏమౌతుంది అని అంటూ ఆమె చేతిని తన చేతిలోకి తీసికొనాలని యత్నిస్తాడు. ఆ విధంగా సీస పద్య పాదాలలోని మాటలకూ, ఎత్తుగీతిలోని క్రియలకూ వరుసగా అన్వయం చెప్పుకొనాలి కాబట్టి క్రమాలంకారం. ఈ అలంకారం కీచకుడు సైరంధ్రిని పొందటంలో అత డనుభవించ దలచుకొన్న నాలుగు దశలను క్రమంగా ధ్వనింప చేస్తుంది.

2. ద్రౌపది తన వైముఖ్యాన్నీ అనాదరాన్నీ అతడి మాటలు విన్నా విననట్లు నటించటం ద్వారా వ్యక్తం చేసింది. కీచకుడు - తిక్కన మాటలలో - అధముడు. వాస్తవాన్ని తెలిసికొనలేక ఆమె శృంగార చేష్టలను ప్రదర్శిస్తున్నదని భావించేవాడు. శృంగార చేష్టలలో 'విహృతం' అనేది ఒకటి. **"వక్తవ్యకాలేఽప్యవచో వ్రీడయా విహృతం మతమ్"** అని లక్షణం. పలుకవలసిన సమయంలో సిగ్గు వలన పలుకకుండా మౌనంగా ఉండటం విహృతం. సైరంధ్రి విహృతాన్ని ప్రదర్శిస్తున్నదని కీచకుడు భావించాడు. విహృతానికి విరుగుడు విలాసం. **"యానవస్థా నాసనాదీనాం ముఖనేత్రాది కర్మణాం । విశేషస్తు విలాసస్స్యా దిష్ట సందర్శనాదినా"** - అని విలాస లక్షణం. ప్రియుడిని చూడగానే నడకలో, నించోటంలో, కూర్చోటంలో, చూడటంలో, మాట్లాడటం మొదలైన వాటిల్లో ప్రదర్శించే హేలా విశేషాలు విలాసంలో ప్రకటితాలౌతాయి. విముఖురాలైన నాయికను ప్రసన్నురాలిని చేసికొని, విలాసవతిగా మార్చుకొనటానికి నాయకుడు అనునయాన్ని (సాంత్వనాన్ని) ఆశ్రయిస్తాడు. కీచకు డీ పద్యంలో ప్రదర్శించింది ప్రార్థనారూప సాంత్వన ప్రక్రియ.

3. సాంత్వన ప్రక్రియలో కీచకుడు మొదట 'కుతూహలాన్ని' ప్రకటిస్తున్నాడు. ప్రదర్శిస్తున్నాడు. "రమ్యవస్తు సమాలోకే లోలతాస్యా త్కుతూహలమ్'' అని లక్షణం. రమించదగిన సైరంధ్రి విలాసాన్ని చూచి, కైవసం చేసికొని, రమించాలని చాపల్యాన్ని ప్రకటించటం కీచకుడు ఈ పద్యంలో చేసిన మదన చేష్ట. ఈ అంశాన్ని 'అచ్చపలుండు' అనే విశేషణంలో తిక్కన సూచించాడు. అటు మాటలో (వాచికాభినయంలో) ఇటు చేతలో (ఆంగికాభినయంలో) దానినిప్రదర్శిస్తున్నట్లు తిక్కన చిత్రించి నాటకీయతను రక్తికట్టించాడు.

4. కుతూహల ప్రకటనలో కూడా ఒక క్రమాన్ని పాటించటం తిక్కన రసశిల్ప రహస్యం. వలచిన దాని పొందు పొందేటప్పుడు ఆమె మనసులో కూడ కుతూహలం ఉండాలని వలపుకాడు అనుకొనటం సహజం. ఆ కుతూహలం నాలుగు దశలలో ప్రకటితమౌతుంది. (1) చూపు, సిగ్గుతో కనురెప్పలు వాలి ఉన్న నాయిక ఆసక్తితో కళ్ళు అర్ధ నిమీలితంగా తెరిచి తన సౌముఖ్యాన్ని తెలుపుతుంది. (2) అందమైన ముఖాన్ని సుముఖంగా చేసి తన మనసులోని రతిభావ సమ్మోదాన్ని చిరునవ్వు కాంతులతో తెలియపరుస్తుంది. (3) ఆ మీద మనసుతోపాటు మధురంగా మాటకూడా కలుపుతుంది. (4) ఆ తరువాత స్పర్శాదుల వలన కలిగే అనుభవాలను లీలలుగా ప్రదర్శిస్తుంది. నాయిక ప్రదర్శించే ఆ నాలుగు దశలను క్రమంగా నాయకుడు చూస్తూ, సమీపిస్తూ, మాటలు రక్తితో వింటూ, కేలు కేలు కలుపుతూ రమిస్తాడు. వాటన్నింటిని భావనామయంగా ఊహిస్తూ కీచకుడు కళ్ళు తెరిచే కలలుకంటూ, ఆమెను ఆ కలలను నిజం చేయుమన్నట్లుగా అనునయించాడు. ఒక మదనావస్థలోని ఇన్ని అంతర్దశలను చిత్రించిన తిక్కన రసబ్రహ్మ.

5. 'చూచుఁజేరు' అను పాఠానికి 'చూచుఁగేరు' అని పాఠాంతరం ఉన్నది. అదే ఉచితమైనదని కొందరి భావం. అది సరికాదు. కేరు అనే క్రియకు ఉత్సహించు, కుతూహలపడు, విజృంభించు, తిరస్కరించు, పరిహసించు-అనే అర్థాలున్నాయి. అందువలన దీనిని గ్రహిస్తే సందర్భశుద్ధి లేకపోగా, విరుద్ధార్థ స్ఫూర్తి కూడా కలుగుతుంది. కాబట్టి ప్రస్తుత పాఠమే ప్రశస్తం. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు దాన తమకంబున వడిగొనుచు, నప్పు డయ్యంగన యింగితం బూహింప వెరవుమాలి మఱియును. 46

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తాను+అ= తనకుతానే (కీచకుడు); తమకంబునన్= మోహావేశంతో; వడిగొనుచున్= వేగిరపడుతూ; అప్పుడు= ఆ సమయంలో; ఆ+అంగన= ఆమె యొక్క; ఇంగితంబు= మనోభావాన్ని; ఊహింపన్= ఊహించటానికి; వెరవుమాలి= శక్తిలేక (ఉపాయంతోచక); మఱియును= ఇంకా (ఇట్లా పలికాడు).

తాత్పర్యం: మోహావేశంతో వేగిరపడుతున్న కీచకుడు ద్రౌపది మనస్సును తెలిసికొనే ఉపాయం తోచక (శక్తిచాలక) ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. 'సుదతి! నీమ్మెై చక్కఁ జూచుట కోడెదఁ। గనుఁ బాటు పొరయునో యని తలంచి;
మదిఁ బొనర్చిన మాట మగువ! నీ పెంపునఁ। గుదిసి నా నాలుక తుదికి రాదు ;
పడఁతి! నీ కరములు పట్టంగఁ దివిరి శం। కించి వడంకెడుఁ గేలు సూడు;
నెఱి నిట్టి దని యింతి! నీ నెమ్మనం బెన్ని। భంగుల నరసినఁ బట్టు వడదు ;

తే. చెలువ! యింక నొక్కించుక సేపు నీ వ। నాదరంబున నెప్పటియట్ల యున్న
మన్మథుఁడు సమయించిన మగుడ నన్నుఁ। బడయవచ్చునె యెన్ని యుపాయములను?' 47

ప్రతిపదార్థం: సుదతి!= మంచి దంతములు కలదానా!; కనుఁబాటు= దృష్టిదోషం; పొరయునో+అని= తగులుతుందేమోనని; తలంచి= అనుకొని; నీ మ్మెై= నీ శరీరాన్ని; చక్కన్+చూచుటకున్= సూటిగా చూడటానికి; ఓడెదన్= జంకుతాను; మగువ!= ఓ వనితా; మదిన్= మనస్సులో; పొనర్చినమాట= పుట్టిన పలుకు; నీ పెంపునన్= నీ ఆధిక్యం వలన; కుదిసి= అణగిపోయి (ముడుచుకొని); నా; నాలుక తుదికిన్‌రాదు= నాలుక చివరిదాకా రాదు; పడఁతి!= ఓ వనితా!; నీ కరములు= నీ చేతులు; పట్టఁగన్+తివిరి= పట్టుకొనాలని యత్నించి; శంకించి= జంకు గలిగి; కేలు= చేయి; వడంకెడున్= వణుకుతున్నది; చూడు!= ఇదిగో ఈ చేయి చూడుము!; ఇంతి!= ఓ వనితా!; నీ నెఱి+మనంబు= నీ నిండు మనస్సు; నెఱిన్= పూర్తిగా; ఇట్టిది+అని= ఇటువంటిదని; ఎన్నిభంగులన్+అరసినన్= ఎన్ని రకాలుగా ఆలోచించినా; పట్టు+పడదు= స్పష్టం కాదు; చెలువ!= ఓ అందమైనదానా!; ఇంకన్= ఇక మీద; ఒక్కించుకసేపు= కొంచెం సేపు; నీవు; అనాదరంబునన్= ఆదరం చూపకుండా; ఎప్పటి+అట్లు+అ+ఉన్నన్= ఎప్పటి వలెనే ఉంటే; మన్మథుడు; సమయించినన్= చంపివేస్తే; మగుడన్= తిరిగి; నన్నున్= (కీచకుని); ఎన్ని+ఉపాయములను= ఎన్ని ఉపాయాల చేతనైనా; పడయన్+వచ్చునె?= పొందగలవా? (లేదని భావం).

తాత్పర్యం: ఓ సుందరీ! దృష్టిదోషం తగులుతుందేమోనని నీ మేని సౌందర్యాన్ని చూడటానికే జంకుతున్నాను. నీ ఆధిక్యం చూచిన తరువాత మాట్లాడాలన్నా నాలుక చివరిదాకా మాటలు రావటం లేదు. నీ చేతులు పట్టుకొనాలని ప్రయత్నించినా (నన్ను గ్రహిస్తావో లేదో అన్న) అనుమానంతో చేతులు వణుకుతున్నాయి. ఎన్ని రకాలుగా ఆలోచించినా అసలు నీ మనస్సు ఏమిటో నాకు అంతుపట్టటం లేదు. నీ విట్లాగే మరికొంత సేపు నన్ను అలక్ష్యం చేస్తే ఆ పాడు మదనుడు నన్ను మట్టుపెట్టుతాడు. అప్పుడు ఎన్ని ఉపాయాలతో యత్నించినా నన్ను నీవు తిరిగి పొందలేవు.

విశేషం: తిక్కన రచించిన గొప్ప పద్యాలలో ఇది ఒకటి. రచనా శిల్పం అనల్పం. 1. తిక్కన ఒక గొప్ప పద్యం రచించి దానికి ప్రతిగా అంతటి గొప్ప పద్యాన్ని మరొకటి వ్రాసి చూపించే ప్రతిభ ప్రదర్శించటం ఆయన నైజం. 'తెలిగన్నుఁగవకాంతి పొలుపార నించుక కనువిచ్చి చూచినఁ గాదె యబల' - అనే 45వ పద్యానికి సమాంతర ప్రతి శిల్పంగా ఈ సీసాన్ని రచించాడు. సైరంధ్రికీ కీచకుడికీ భావసాజాత్యం, తాదాత్మ్యం ఉన్నట్లు కీచకుడు భావిస్తున్నట్లు ఈ పద్యంలో చిత్రించటం ఇక్కడ విశేషం. తిక్కనగా

రన్నట్లు అతడి 'తమకానికి' (46) ఇది నిదర్శనం. సైరంధ్రి కన్నెత్తి చూడదు - కీచకుడూ ఆమెను సూటిగా చూడలేదు. కారణాలు వేరు. కాని అవస్థలు సమం. ఆమె మాట్లాడదు-ఇతడి నోటామాట వెలువడదు. ఆమె లీలగా చేయి అందించదు. ఇతడూ చేయి వణకటం చేత అందించ(గ్రహించ)లేడు. ఆమె తీరు ఎదుటివారు గ్రహించటం కష్టం. అతడు ఆమె తీరునే కాదు తన తీరును కూడా వివేచించుకొనే స్థితిలో లేడు. సమానావస్థల ననుభవించేవాడు సానుభూతిని, సహానుభూతిని పొందాలి. కాని, సైరంధ్రి అటువంటి ఆదరబుద్ధిని ప్రదర్శించటం లేదు. మన్మథావస్థల కన్నింటికి చివరిది మన్మథబాధతో మరణించటం. అది జరిగితే ఇరువురికి పొందు కలుగదు. అది జరుగక పూర్వమే ఉపాయాంతరం చేత సమాన ధర్మాన్ని అనుభవిస్తున్న తనను రక్షించుకొనటం సైరంధ్రి కర్తవ్యమని కీచకుడి విన్నపం. విరుద్ధ రసభావ వ్యంజకాలైన సాత్త్విక భావాలను ద్రౌపది పాత్ర నాలంబనంగా చేసికొని చిత్రించిన పద్యం (33) ఒకవైపు, కీచకుడి పాత్ర నాలంబనంగా నిర్మించిన పద్యం ఇక్కడ ఈ వైపు - సమాంతర రచనా కళాఖండాలు.

2. తిక్కన తన రచనలోని మర్మాన్ని పఠితలకు కొన్ని సంకేతాల ద్వారా వ్యాఖ్యల ద్వారా సూచిస్తుంటాడు. ఈ పద్యం తరువాతి వచనంలో తిక్కన 'తన యభిలాషంబు తేటపడంబలికిన' (48) అని సూచించాడు. అభిలాష - అనేది కోరిక అనే సామాన్యార్థమే కాదు. శృంగార రసపరమైన పారిభాషిక పదార్థాన్ని కూడా ప్రకటిస్తుంది. శృంగారం సంభోగ విప్రలంభ భేదం చేత ద్వివిధం. వాటితో విప్రలంభ శృంగారం అభిలాష, ఈర్ష్యా, విరహ, ప్రవాస కారణాలతో జనించి నాలుగు రకాలుగా రాణిస్తుంది. అభిలాష విప్రలంభానికి పూర్వరాగ విప్రలంభమని కూడా పేరు. తిక్కన ఈ పద్యంలో 'అభిలాష' ను స్పష్టంగా చిత్రించానని చెప్పటం గమనించదగింది. అంటే రతిభావావస్థ రసస్థితిని (ఉత్కటావస్థను, స్థాయిస్థితిని) అందుకొన్నదని ధ్వనింప చేస్తున్నాడు. దశవిధావస్థల నీ ఘట్టంలో చిత్రిస్తున్నానని సూచించాడు. ఇది తిక్కన రసాభ్యుదయ శిల్పం.

3. ఈ పద్యంలో ప్రౌఢమైన వ్యాజస్తుతి ఉన్నది. నిందచేత స్తుతిగాని, స్తుతిచేత నిందగాని స్ఫురింపజేయటం వ్యాజనింద. అది కవిప్రౌఢోక్తిచేత గాఢతరం కావటం ఇక్కడ దర్శనీయం. ఇక్కడ పరోక్షంగా చేసింది ద్రౌపదీ సౌందర్యస్తుతి; ప్రత్యక్షంగా చేసింది తనకు మన్మథావస్థ వలన ఏర్పడిన తొట్రుపాటు. అంటే ఆత్మ నింద. మరొకరకంగా చూస్తే కీచకుడు రసిక ప్రతిస్పందనను ప్రదర్శించి లలితుడివలె రాణించాడు. కాని, దానిని సైరంధ్రి అనాదరించటం చేత బూడిదలో పోసిన పన్నీరైపోతున్నది. కాబట్టి ఈరకంగా చూస్తే కీచకుడిది ప్రశంస; ద్రౌపది పట్ల నింద. ఈ విధంగా విరుద్ధ భావచిత్రణాన్ని అవిరుద్ధంగా సాగించటం తిక్కన నేర్పరితనం.

4. ఇందులో నాటకీయంగా 'గండం' అనే అంగం పోషించబడింది. ఒక పాత్ర అసంకల్పితంగా భావికథలో తనకు జరిగే ఒక కీడును తన మాటలలో ధ్వనింపచేస్తే గండమౌతుంది. ఈ పద్యంలో కీచక వచనాలన్నీ భావికథలో ద్రౌపదీ భీములు పన్నే మాయోపాయం వలన అతడు పొందే విషాదాంతాన్ని ధ్వనింపచేస్తున్నాయి.

5. తిక్కన 45వ పద్యంలో కుతూహలాన్నీ, ఇందులో అభిలాషనూ పోషించాడు. అభిలాషా విప్రలంభంలో చూడటంలో, పలకరించటంలో, కేలు పట్టటంలో, మనసు నర్థం చేసికొనటంలో మోహంవలన విఫలుడైనట్లు చిత్రించటం శృంగార రసాభాస చిత్రణ శిల్పం. (సంపా.)

వ. అని తన యభిలాషంబు తేటపడం బలికిన నబ్బోటి కలుషించియు, దుర్వారం బైన పరిభవ వికారంబు దోఁపకుండ తన్నుందాన యుపశమించుకొని 'వీడు దురభిమానియై యున్నవాఁడు, వేగిరపడుట వెరవుగాదు. వెరవు తోడన తప్పించుకొనవలయు' నని తలంచి యతని కిట్లనియె. 48

ప్రతిపదార్థం: అని; తన; అభిలాషంబు= కోరిక; తేటపడన్= స్పష్ట పడేటట్లుగా; పలికినన్= మాటలాడగా; ఆ+బోటి= ద్రౌపది; కలుషించియున్= కోపించినా; దుర్వారంబు+ఐన= వారింపశక్యంగాని; పరిభవ వికారంబు= అవమానం వలన కలిగిన వికారాన్ని;

తోఁపకుండన్= బయటపడనీయకుండా; తన్నున్= తాన్+అ= తనను తానే; ఉపశమించుకొని= నిగ్రహించుకొని; వీఁడు= కీచకుడు; దురభిమాని+అయి= ఎవరిని లెక్కచేయని గర్విష్ఠి అయి; ఉన్నవాఁడు= ఉన్నాడు; వేగిరపడుట= తొందరపడుట; వెరవుకాదు= యుక్తం కాదు; వెరవు తోడను+అ= నేర్పుతోనే, ఉపాయంతో; తప్పించుకొనవలయును+అని; తలంచి= భావించి; అతనికిన్+ఇట్లు+అనియెన్= అతనితో ఇట్లా అన్నది.

తాత్పర్యం: కీచకుడు తన మనస్సులోని కోరిక బయటపడేటట్లు మాట్లాడటంతో ద్రౌపది కోపించి కూడా, ఆ భరించలేని పరాభవాన్ని బయటికి పొక్కనీయకుండా, తనను తాను నిగ్రహించుకొని, వీడు దురహంకారి అని తలచి, తొందరపాటు మంచిది కాదని, ఎట్లాగో నేర్పుగా తప్పించుకొనాలని అనుకొని అతడితో ఇట్లా అన్నది.

క. 'నాయున్నబాముఁ దలఁపవ; యీ యొడ లీ చీర యిట్టి యేవపుఁజందం
బో యన్న! మదన వికృతిం జేయు ననుట యెంతయును నిషిద్ధము గాదే! 49

ప్రతిపదార్థం: ఓ+అన్న!= ఓ సోదరా!; నా+ఉన్న బామున్= నే నున్న కష్టపరిస్థితి; తలఁపవు+అ= నీవు ఆలోచించవు;ఈ+ఒడలు= ఈ శరీరం; ఈ+చీర= ఈ వస్త్రం; ఇట్టి= ఇటువంటి; ఏవము+చందంబు= అసహ్యమైన ఆకారం; మదన వికృతిన్+చేయున్+అనుట= మదన వికారం కలిగిస్తుందంటే; ఎంతయును= అధికంగా; నిషిద్ధము కాదే!= తగనిది కదా!

తాత్పర్యం: 'ఓ అన్నా! కష్టాలలో ఉన్న నా పరిస్థితి నీ వూహించటం లేదు. నా మేను, నా కట్టు, బొట్టు, తీరు ఎంత అసహ్యంగా ఉన్నాయో ఆలోచించుము. ఈ పరిస్థితిలో కూడా నీకు మదనవికారం కలిగిం దనటం ఏమీ భావ్యం కాదు.

విశేషం: 'ఆఈఏ'లు త్రికం. ఆ మూడు సర్వనామాలూ తెలుగులో నిర్దేశార్థకాలే కాక, అనంత భావార్థకాలు. ద్రౌపది తన మేనును, చీరను 'ఈ' తో చూపుతూ చెప్పటం చేత శృంగార విభావ సౌందర్య రాహిత్యం స్ఫురిస్తున్నది. అన్న, అయ్య, అప్ప - అనేవి గౌరవ వాచకాలు. తనకంటె పెద్దవయసు కలవాడు అయితే అతడిని అన్నా అని పిలవటం తెలుగువారి అలవాటు. తనను వలచి విరహాన్ని ప్రకటిస్తున్న కీచకుడిని 'ఓ అన్న!' అని బంధువాచకంతోనూ గౌరవవాచకంతోనూ పిలిచి తనను కామించటం ధర్మవిరుద్ధమని ద్రౌపది పరోక్షంగా హెచ్చరించింది. (సంపా.)

తే. చనునె యిమ్మాటలాడ సజ్జనుల కాఁడుఁ బుట్టువులతోడ నీవును బుట్టినాఁడ;
వట్లుగాకయు హీనవంశాభిజాత నై పతివ్రతనగు నన్ను నడుగఁ దగునె?' 50

ప్రతిపదార్థం: సత్+జనులకున్= మంచివారికి; ఈ+మాటలు+ఆడన్= ఇటువంటి మాటలు పలుకటం; చనునె?= తగునా?; నీవును= నీవుకూడా; ఆఁడుఁబుట్టువులతోడన్= ఆడపడుచులతో; పుట్టినాఁడవు= పుట్టావు; అట్లు+కాకయున్= అట్లా కాకపోయినా; హీనవంశ+అభిజాతను+ఐ= తక్కువ కులంలో పుట్టినదాననై; పతివ్రతన్= పతివ్రతను; అగు= అయిన; నన్నున్; అడుగన్+తగునె?= అడుగవచ్చునా? (కామంతో కోరవచ్చునా?).

తాత్పర్యం: మంచివారు ఇటువంటి మాటలు మాటాడవచ్చునా? నీవా తోబుట్టువులు ఉన్నవాడివి. అందువలన అందరినీ ఆడుబడుచులుగా భావించి అసలే అట్లా మాట్లాడకూడదు. అది అట్లా ఉండగా, తక్కువ కులంలో పుట్టిన దాననూ, పతివ్రతనూ అయిన నన్ను ఇట్లా అడుగవచ్చునా?'

విశేషం: అడుగుట అనేది అచ్చమైన తెలుగు భాష, కామక్రీడకు అని అర్థం. హీనవంశాభిజాత అనేచోట శ్లేష ఉన్నదని కొందరు. హీనవంశంలో పుట్టావని ఒక అర్థం. హీన!= ఓరీహీనుడా!; వంశ+అభిజాతను= సద్వంశంలో జన్మించినదానను; అనికూడా విరవవచ్చును. పాఠకులు ఈ చమత్కారం గమనించాలి. ఆఁడుపుట్టువులతో పుట్టినవాడవు అనటంలో నీ అప్ప చెల్లెండ్రను ఎవరైనా ఇట్లా అడిగితే ఏం చేస్తావు? -అనే హెచ్చరిక ఉన్నది.

క. **అని వీడఁగఁ బల్కిన న। మ్మనుజాధముఁ డంతఁ బోక మదనోన్మాదం**
బునఁ దన్ను నెదిరి నెఱుఁగక। వనితకు నిట్లనియె గారవంపుఁ బలుకులన్. **51**

ప్రతిపదార్థం: అని= అని పలికి; వీడఁగఁన్= వదలించుకొన్నట్లు; పల్కినన్= మాట్లాడగా; ఆ+మనుజ+అధముఁడు= ఆ నీచమానవుడు, కీచకుడు; అంతన్+పోక= అంతటితో ఆగక; మదన+ఉన్మాదంబునన్= మన్మథోద్రేకంతో; తన్నున్= తనను; ఎదిరిని= ఎదుటివారిని; ఎఱుఁగక= తెలిసికొనలేక; వనితకున్= ఆకాంతకు; గారవము+పలుకులన్= మర్యాదగల మాటలతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా స్పష్టంగా చెప్పినా కీచకుడు అంతటితో ఆగక, మన్మథావేశంతో ద్రౌపది అభిప్రాయం తెలిసికొనలేక మర్యాదగా ఇట్లా అన్నాడు.

విశేషం: 1. తిక్కన కీచకుడిపట్ల నరాధముడు (33వ) కీచకాధముడు (45) మనుజాధముడు (51) అని ముమ్మారు అధమ శబ్దం ప్రయోగించాడు. వివేకం లేనివాడు అనే అర్థం కావచ్చును. 2. వీడు= స్పష్టమగు-అని సూర్యరాయాంధ్ర నిఘంటువు పేర్కొన్నది. వదలించుకొనుట-అనే అర్థం సముచితం.

సీ. **'నెత్తమ్మిరేకుల మెత్తఁదనము దెచ్చి। యచ్చునఁ బెట్టిన ట్లంద మొంది,**
చక్రవాకంబుల చందంబు గొనివచ్చి। కుప్పలు సేసిన ట్లొప్పు మెఱసి,
చందురు నునుఁగాంతి కం దేర్చి కూర్చి బా। గునకుఁ దెచ్చిన యట్లు కొమరు మిగిలి,
యళికులంబుల కప్పు గలయంతయును దెచ్చి। నారు వోసిన భంగి నవక మెక్కి,

తే. **యంఘ్రితలములుఁ, గుచములు, నాననంబుఁ,। గచభరంబును నిట్లున్న రుచిరమూర్తి**
యనుపమాన భోగములకు నాస్పదంబు। కాదె? యీ త్రిప్పు లేటికిఁ గమలవదన?' **52**

ప్రతిపదార్థం: కమలవదన!= పద్మం వంటి ముఖం కలదానా!; నెత్తమ్మిరేకుల మెత్తఁదనము= చక్కని తామరరేకుల మృదుత్వాన్ని; తెచ్చి= తీసికొని వచ్చి; అచ్చునన్+పెట్టినట్లు= అచ్చుబోసినట్లు; అందము+ఒంది= అందమైన చందాన్ని పొంది; చక్రవాకంబుల చందంబు= చక్రవాకపక్షుల (గుండ్రని) తీరును; కొనివచ్చి= తీసికొని వచ్చి; కుప్పలు+చేసినట్లు= (రెండు) కుప్పలుగా పోసినట్లు; ఒప్పు+మెఱసి= అందంతో ప్రకాశించి; చందురు నునుకాంతి= చంద్రుని చక్కని కాంతిని; కందు= మచ్చను; ఏర్చి= వేరుచేసి; కూర్చి= అచ్చమైన కాంతిని ఒకచోట ప్రోగుచేసి; బాగునకున్+తెచ్చిన+అట్లు= శుభ్రపరచి తీసికొని వచ్చినట్లుగా; కొమరు, మిగిలి= అందం అతిశయించి; అళికులంబులకప్పు= తుమ్మెదల సమూహాల నల్లదనం; కల+అంతయును= ఉన్నదంతా; నారు+పోసినభంగి= నారుపోసినట్లుగా; నవకము+ఎక్కి= నిగనిగలాడి; అంఘ్రితలములున్= అరికాళ్ళున్నూ; కుచములున్= స్తనాలున్నూ; ఆననంబున్= ముఖమున్నూ; కచభరంబును= ఒత్తైన కేశసమూహమున్నూ; ఇట్లు+ఉన్న= ఇంత బాగా ఉన్న; రుచిరమూర్తి= చక్కని రూపం; అనుపమానభోగములకున్= సాటిలేని సౌఖ్యాలకు; ఆస్పదంబు+కాదె= చోటు కాదా? ఈ త్రిప్పులు= ఈ డొంకతిరుగుళ్ళు; ఏటికిన్?= ఇంకా ఎందుకు?

తాత్పర్యం: 'ఓ సుందరీ! తామర రేకుల మెత్తదనం తెచ్చి, అచ్చుపోశారో అన్నట్లు నీ అడుగులు అందంగా ఉన్నాయి. చక్రవాకపక్షుల గుండ్రనితనాన్ని పోగుచేసి కుప్పలు పోసినట్లు నీ స్తనాలు ఒప్పుగా ఉన్నాయి. చంద్రబింబంలోని కళంకాన్ని తొలగించి కాంతిని బాగుచేసి దాని అందాన్ని అతిశయింప జేసినట్లుంది నీ ముఖ సౌందర్యం. తుమ్మెదల నల్లదనాన్ని కుప్ప చేసి ప్రోగుపోసినట్లున్నది నిగనిగలాడుతున్న నీ కొప్పు. ఇంత అందమైన నీ సుందరరూపం సాటిలేని భోగాలను పొందటానికి తగినది సుమా! ఇక నీ కీ త్రిప్పట లెందుకు?

విశేషం: 1. పాదాలు చిగురుటాకులతోను, స్తనాలు చక్రవాకాలతోను, ముఖాన్ని చంద్రుడితోను, కురులను తుమ్మెదల బారుతోను పోల్చటం కవి సమయం. ఇక్కడ తిక్కన ఈ నాలుగింటిని సీసపద్యంలో విశేషంగా చెప్పాడు.

2. పాదాలు పద్మాలవలె పూజార్హాలు. చక్రవాకాలతో పోల్చడంతో స్తన సౌష్ఠవం కూడా తోస్తున్నది. కీచకుడు అవయవాల సొంపును పాదాల నుండి తలదాకా ఆపాదమస్తకం వర్ణించాడు. చూపు పాదాల నుండి క్రమంగా పైకి పాకింది. దేవతలను పాదాల నుండి మస్తకం వరకూ, మానవులను మస్తకంనుండి పాదాలవరకూ వర్ణించటం అలవాటు. ఆమె మానవకాంత కాదని కీచకుడి అభిప్రాయం.

తే. **నీవు దుర్జాతిగామికి నీవ సాక్షి; । పరసతీ సంగమున వచ్చు పాపమునకు**
నోరుతును గాని, సైరింప నోపఁ బచ్చ । విలుతు తూపుల తాఁకున కలరుఁ బోఁడి!' **53**

ప్రతిపదార్థం: నీవు; అలరున్+పోఁడి!= పువ్వువంటి మేనుగలదానా!; దుర్జాతి= నీచ జాతిదానివి; కామికిన్= కాకపోవటానికి; నీవు+అ= నీకు నీవే; సాక్షి= సాక్ష్యం; పరసతీ సంగమునన్= పరస్త్రీ సంభోగం వలన; వచ్చు, పాపమునకున్= కలిగే పాపాన్ని; ఓరుతును+కాని= సహిస్తాను గాని; పచ్చవిలుతు= మన్మథుని; తూపుల తాఁకునకున్= బాణాల దెబ్బకు; సైరింపన్+ఓపన్= ఓర్చుకొనలేను.

తాత్పర్యం: ఓ సుందరీ! నీవు నీచజాతి దానివి కాదనటానికి నీవే సాక్షివి. నేను పరస్త్రీ సాంగత్యం వలన కలిగే పాపాన్ని ఓర్చుకొనగలను కాని, మన్మథబాణాల తాకిడికి ఓర్చుకొనలేకున్నాను,'

విశేషం: ద్రౌపది హీనవంశాభిజాతను, పతివ్రతను అన్నదానికి ఇది కీచకుడి సమాధానం, దోషంలో గుణాన్ని భావించి ఆ దోషాన్ని కోరుకొనటం అనుజ్ఞాలంకారం.

క. **అను నప్పలుకుల కయ్యం । గన కోపము గదిరి 'నీచు గావున జంకిం**
చినఁ గాని మెత్తఁబడి పోఁ' । డని మనమునఁ దలఁచి యిట్టు లనియెం బెలుచన్. **54**

ప్రతిపదార్థం: అను+ఆ+పలుకులకున్= కీచకుడనే ఆ మాటలకు; ఆ+అంగన= ఆ ద్రౌపది; కోపము= కోపం; కదిరి= కలిగి; నీచు= అల్పుడు; కావునన్= కాబట్టి; జంకించినన్+కాని= బెదిరిస్తే గాని; మెత్తఁబడిపోఁడు+అని= అంగీకరించడని; మనమునన్+తలఁచి= మనస్సులో అనుకొని; పెలుచన్= పెద్ద ధ్వనితో గద్దిస్తున్నట్లుగా; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: కీచకుడి మాటలకు ద్రౌపది ఎక్కువ కోపం చెందింది. 'వీడు నీచుడు కాబట్టి భయపెట్టితేగాని తొలగిపోడని భావించి గట్టిగా ఇట్లా చెప్పింది.

విశేషం: ద్రౌపది మానసిక పరిస్థితిని, ఆమె కోపస్వభావాన్ని కవి చెప్పబోతున్నాడు. నీచుడితో మాట్లాడదగిన విధంగా మాట్లాడితే కాని వాడు జంకడు.

ద్రౌపది కీచకునితోఁ బరుష వాక్యంబులు వలుకుట (సం.4-13-28)

శా. 'దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసం గిట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా!' 55

ప్రతిపదార్థం: కీచకా!= ఓ కీచకా!; మత్పతుల్= నా భర్తలు; దుర్వార= అణపరాని; ఉద్యమ= ప్రయత్నం గల; బాహువిక్రమరస= భుజ బలాతిశయసారం చేత; అస్తోక= తక్కువగాని; ప్రతాప= పరాక్రమం చేత; స్ఫురత్= ప్రకాశిస్తున్న; గర్వ= గర్వంచేత; అంధ= కనులు మూతబడ్డ; ప్రతివీర= శత్రువుల యొక్క; నిర్మథన= వధించటమనే; విద్యాపారగుల్= విద్యను ఆసాంతం చదివినవారు; గీర్వాణ+ఆకృతులు= దేవతలతో సమానమైన రూపాలు కలవారు; గంధర్వుల్+ఏవురు= గంధర్వులైదుగురు; నినున్= నిన్ను; దోర్లీలన్= భుజబల విలాసంతో; వెసన్+కిట్టి= అవలీలగా పట్టి; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; మానమున్+ప్రాణమున్+కొనుట= నీ పరువునూ;, ప్రాణాన్నీ హరించడం; తథ్యం= తప్పదు.

తాత్పర్యం: 'ఓయి కీచకా! వారించటానికి వీలులేని భుజ బల పరాక్రమం గలిగిన గర్విష్ఠులైన శత్రువుల నవలీలగా వధించే విద్యలో ప్రవీణులని ప్రఖ్యాతిగాంచిన ఐదుగురు గంధర్వులు నా భర్తలు. వారు ఇప్పుడే అవలీలగా నీ మానప్రాణాలు హరిస్తారు సుమా!

విశేషం: 1. తిక్కన భారత రచనలో తెలుగువారి మక్కువ చూరగొన్న పద్య రత్నాలలో ఇది ఒకటి. తిక్కనే తన రచనకు తానే మురిసిపోయి విరాటపర్వంలోని ఈ అశ్వాసంలోనే మరల మరొకసారి ద్రౌపదినోట పలికించి (172వ పద్యం) తన కీ పద్యం మీద ఉన్న అభిమానాన్ని ప్రకటించుకొన్నాడు. ఇట్లా తిక్కన పునరావృత్తి చేసిన రెండుమూడు వృత్తాలలో ఇది మొదటిది. అదీ దీని ఘనత!

2. తెలుగులోని విమర్శకులు తిక్కన కవితను సమీక్షించేటప్పుడు ఈ పద్యాన్ని సాధారణంగా వదలిపెట్టరు. అందువలన అందరి ప్రశంసలనూ స్మరించలేము కాని, ఈ శతాబ్ది మొదటిపాదంలో 'ఆంధ్ర భారత కవితా విమర్శనము' (1929) అనే విలువైన గ్రంథాన్ని రచించి, భారత విమర్శకు ఒక మంచి బాటను చూపించిన కీ.శే. కోదాడ రామకృష్ణయ్యగారి మాటలు ముందుగా స్మరించదగినవి. వ్యాఖ్యకు మంచి బాటలు వారి ఈ క్రింది మాటలు:

"ద్రౌపదికి బాగుగఁ గోపము గదిరినది. వీఁడు నీచుఁడు గావున జంకించిన గాని పోడని తలంచినది. ఆ స్థితిలో కీచకుని జంకించుటకును, ద్రౌపదికి గదిరిన కోపమును వెలిపుచ్చుటకును తిక్కన యెట్టి గంభీరమగు శైలిని, దానికిఁ దగిన వృత్తము నవలంబించినాఁడో చూడుడు. శార్దూల వృత్తమును వాడినాడు. అందులో ద్రౌపది - 'కీచకా' యని సంబోధించినది. 'ఓ యన్న' యను సమయము దాటినది గదా యిపుడు. అత్యంత గంభీరము, భయంకరమునగు 'దుర్వారోద్య' మేత్యాద్యతిదీర్ఘ సమాసముతో పాటు- **'మత్పతుల్; గీర్వాణాకృతుల్; గంధర్వుల్'** అను నీ హలంత పదములన్నియు నెదుటివానిని జంకించి యదల్చి వేయుటకుఁ దగినవియై యున్నవి. అవసరము కలిగినఁ గాని, తిక్కన ప్రౌఢసంస్కృత దీర్ఘ సమాసములు వాడడు. ఈ సందర్భమున నీ పద్యమును ద్రౌపదిచేఁ బలికించి దానికంటెను గంభీరంబగు నామె స్వభావమును వెల్లడి చేసినాడు. మఱియు నామె చెప్పఁదలచిన విషయమునంత ఒక్క పద్యముననే యిమిడ్చినాఁడు. ఆ సంగ్రహ నైపుణ్యముఁ (brevity of expression) బరికింపుడు. ఇట్టి సమాసములనే కాక యీ శార్దూల వృత్తము సైతము తిక్కన చాల అరుదుగనే వాడినట్లున్నాడు...సంస్కృత మూలమున ద్రౌపది ధర్మాధర్మ విచారణతోఁ గూడిన యొక్క ధర్మోపన్యాస మిచ్చినది...**"గంధర్వాః పతయో మమ - తే త్వాం నిహన్యుః"** అను దానికి గాను తిక్కనార్యుఁ డీ దుర్వారోద్యమేత్యాది పద్యమును రచించినాఁడు''. (ఆంధ్రకవితా విమర్శనము - పు. 289-290).

3.ఈ పద్యశిల్పాన్ని గురించి కీ.శే. డాక్టర్ పాటిబండ మాధవశర్మగారి వ్యాఖ్య గమనార్హం: "కీచక భర్త్సనమున ద్రౌపది ప్రయోగించిన "దుర్వారోద్యమ'' ఇత్యాది శార్దూల వృత్తము యొక్క నిర్మాణమునందు తిక్కన యద్భుతమైన శిల్పము ప్రదర్శించెను. **"విచ్ఛిన్నపాదం పూర్వార్ధే ద్వితీయార్ధే సమాసవత్ । శార్దూలం క్రీడితం భాతి విపరీత మతోఽధమమ్" (సువృత్త తిలకము. 2.37)** అని క్షేమేంద్రుని యుపదేశము. తిక్కన దర్శన మందుకు భిన్నముగా నున్నది. క్షేమేంద్రుడు అధమమని తెగడిన నిర్మాణమునే తిక్కన మహాశిల్పముగా నిచ్చట ప్రదర్శించెను. ద్రౌపదీ వాక్యము పూర్వార్ధమున అవిచ్ఛిన్న సమాసవంతము, ఉత్తరార్ధమున అసమస్త పదము, విచ్ఛేద బహుళమునై యున్నది. కీచకుని నీచ ప్రసంగము వినివిని యెట్లును వాడా ప్రసంగమును మానడని నిశ్చయించుకొని చిరము నిరోధించుకొన్న క్రోధమును ద్రౌపది యొక్కసారిగా వాగ్రూపమున బహిర్గతము చేసినది. చిరవిరుద్ధ క్రోధ ప్రవాహముయొక్క యుద్గతి ఆరంభమున అత్యంత మోజోమయమగుట సహజము. ఆ యోజోలక్షణము అవిచ్ఛిన్న కల్లోలాయమాన ధారాపాతము. ఓజోవ్యయమునఁ గ్రమముగ వాగ్విచ్ఛేదనము, క్రమవర్ధమాన క్రోధాద్యుద్వేగ నిర్వహణమున క్షేమేంద్రుని యుపదేశము గ్రాహ్యము. చిరనిరుద్ధ క్రోధావేశము యొక్క హఠాద్యుత్క్రాంతియందు అది త్యాజ్యమే. తిక్కన నిర్మాణమే యిచ్చట ఉపాదేయ మగుచున్నది. పద్యమందలి స్థాయ్యక్షరము రేఫము. మూర్ధన్యమైన రేఫము ఆగ్నేయము. అది శ్రుతినికర్తన చిత్త సంతాపన శీలమని యభినవులు. అట్టి రేఫము బహువారావృత్తిచే స్థాయిత్వమును, ప్రాసాక్షరయోగముచే పుష్టిని పొంది పద్యమున దీప్తిని చక్కగా వ్యాపింపఁజేయుచున్నది. దంత్యత్వముచే కాఠిన్య లక్షణములయిన తవర్గాక్షరములు అనువారి భావమున రేఫకృత దీప్తిని పోషించుచున్నవి. ప్రథమ ద్వితీయ తృతీయ పాదములందు వడి ఉకార అకార ఈకార యుక్తమై ద్రౌపది వాక్యోచ్చారణము అనుదాత్త స్వరమున నారంభించి క్రమముగ ఉచ్చస్వరత్వమును దాల్చుచున్నదని సూచించుచున్నది. ప్రాసాక్షరమురేఫ పరసంయోగముచే ప్రాసాక్షరమురేఫ పరసంయోగముచే పరుషతరమై దారుపిండ ధర్మమును వ్యంజించుచున్నది. "దుర్'' అన్న యుపసర్గము వాక్యారంభమునం దుండి కీచక దూషణరూప వాక్యోత్పత్తికి బీజత్వము ధరించుచున్నది. పూర్వపాదద్వయము హలంతత్వముచే తీక్ష్ణమై యున్నది. పద్యపూర్వ భాగమున సుదీర్ఘ సమాసము పాండవుల ప్రతివీర నిర్మథన విద్యాపారగత్వమును వ్యంజింపగా ఉత్తరార్ధము భిన్నాంగమై భీమకృత కీచక మాన ప్రాణాంగ భంగక్రమమును ప్రత్యక్షము చేయుచున్నది. ఘోషాక్షర బాహుళ్యముచే పద్యమున గాఢత్వరూపమైన ఓజస్సు మూర్తీభవించుచున్నది.

ఈ పద్యమునఁ దాను గావించిన శిల్పము తిక్కనకే మెచ్చుకొల్పి యుండవలయును. తాను కీచకుని భంగించిన తెఱంగును భీమసేనునకుఁ జెప్పు సందర్భమునఁ దిక్కన ఈ పద్యమును యథారూపముగ ద్రౌపది ముఖమున బునరుక్తము చేసెను. భర్త్సనమాత్ర ప్రయోజనమైన స్త్రైణ క్రోధమును - అమర్షను వ్యంజించుటకు శార్దూల వృత్త నిర్మాణ మెట్లుండవలెనో తిక్కన శిల్పించి చూపెను.'' (ఆంధ్ర మహాభారతము: ఛందఃశిల్పము. పు-398. (సంపా.)

తే. **అనుడు నతఁ డిట్టు లనియె 'నా యతుల బాహు । బలముఁ జెనయంగ భవదీయ పతులు కారు**
మూఁడులోకంబులందు నెవ్వాఁడు లేమి । నిక్కువం బింత నమ్ముము నీరజాక్షి!' **56**

ప్రతిపదార్థం: అనుడున్= అనగా విని; అతఁడు= కీచకుడు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికాడు; నీరజ+అక్షి!= పద్మాలవంటి కన్నులు కలదానా!; నా= నా యొక్క; అతుల బాహుబలమున్= సాటిలేని భుజశక్తిని; చెనయంగన్= ఎదిరించటానికి; భవదీయపతులు+అ= నీ భర్తలే; కారు= కాదు; మూఁడు లోకములందున్= (స్వర్గం, భూతలం, పాతాళం అనే) మూడు లోకాలలోనూ; ఏ+వాఁడున్= ఎవ్వడూ; లేమి= లేకపోవటం; నిక్కువంబు= నిజం; ఇంత= దీనిని; నమ్ముము.

తాత్పర్యం: ఆమెమాటలు విని కీచకుడు ఇట్లా అన్నాడు. "పద్మాలవంటి కన్నులు కలదానా! నన్నెదిరించటానికి నీ భర్తలే కాదు, మూడులోకాలలో మరెవ్వరూ సమర్థులు లేరన్నది నిజం. ఇది నమ్ముము'.

విశేషం: కీచకుడి మదాంధత్వం ఇందులో తెలుస్తుంది.

వ. అనిన విని సైరంధ్రి సైరణ దక్కి ధిక్కరించి యిట్లనియె. 57

ప్రతిపదార్థం: అనినన్, విని= అనగా విని; సైరంధ్రి= సైరంధ్రి వేషంలో ఉన్న ద్రౌపది; సైరణ+తక్కి= ఓర్పు కోల్పోయి; ధిక్కరించి= ఎదిరించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అనగా విని సైరంధ్రి సహనాన్ని కోల్పోయి కీచకుడిని ఎదిరించి ఇట్లా అన్నది.

క. 'చనుఁ జనదని చూడక యం। దని మ్రాఁకులపండ్లు గోయఁ దలఁచుట హితమే?
మును చెడిన రావణాదుల। విని యెఱుఁగవె యెన్నఁడును వివేకవిహీనా!' 58

ప్రతిపదార్థం: వివేకవిహీనా!= ఓయీ వివేకం (బుద్ధి) లేనివాడా!; చనున్+చనదు చూడక= ఇది తగింది, ఇది తగనిది అని ఆలోచించకుండా; అందని మ్రాఁకుల= (ఎత్తుగా ఉండి) అందని చెట్ల యొక్క; పండ్లు+కోయన్+తలఁచుట= పండ్లు కోయాలనుకొనటం; హితమే?= మేలా?; మును చెడిన= పూర్వకాలంలో చెడిపోయిన; రావణ+ఆదులన్= రావణాసురుడు మొదలైనవారిని గురించి; ఎన్నఁడును= ఎప్పుడుకూడా; విని+ఎఱుఁగవె?= వినలేదా?

తాత్పర్యం: ఓయీ వివేకం లేని కీచకా! ఈ పని తగునా తగదా అని ఆలోచించక, అందని చెట్లకు కాసిన పండ్లు కావాలని కోరుకొన్నట్లుగా, దుర్లభాలైన వాటిని కోరటం మేలుగాదు. తొల్లి రావణాదులు ఇటువంటి కోర్కెలు కోరి చెడిపోయారని ఎన్నడూ వినలేదా?

విశేషం: 'అందని మ్రానిపండ్లు' అనేది తెలుగు జాతీయం. అందని ద్రాక్షపండ్లు పుల్లన. పురాణగాథతో ప్రస్తుతాంశాన్ని మేళవించి ద్రౌపది హెచ్చరిస్తున్నది. రావణాదులవలె కీడు తెచ్చుకుంటావని చెప్పింది. త్రేతాయుగంలో రావణుడు స్త్రీ వ్యామోహం చేత తాను తన వంశాన్ని కూడా నాశనం చేయటం ఇక్కడ ద్రౌపది గుర్తుచేస్తున్నది. పరస్త్రీ వ్యామోహం ఎంతటి ఘోరాల పాలు చేస్తుందో తెలియజేసింది. అలం: లలితం; చెప్పదలచుకొన్న విషయాన్ని చెప్పకుండా దానితో సమానంగా మరో అప్రస్తుత విషయం చెప్పటం లలితాలంకారం.

తే. ఇవ్విధంబునఁ బలికిన యింతి పలుకు। గాన నేరక తమ యప్పకడకు మగుడ
నరిగి నెవ్వగ మనమునఁ బిరిగొనంగఁ। జిన్నఁబోయిన మొగముతో సింహబలుఁడు. 59

ప్రతిపదార్థం: ఈ విధంబునన్+పలికిన= ఇట్లా మాట్లాడిన; ఇంతిపలుకు= సైరంధ్రి మాటను; కాననేరక= తెలిసికొనలేక; తమ అప్పకడకున్= తన అక్క వద్దకు; సింహబలుఁడు= కీచకుడు; నెఱ+వగ= మిక్కిలి దుఃఖం; పిరిగొనంగన్= ఆవహించగా; చిన్నఁబోయిన మొగముతోన్= వాడిపోయిన ముఖంతో; మగుడన్+అరిగెన్= మళ్ళీ వెళ్ళాడు.

తాత్పర్యం: ఇట్లా మాట్లాడిన ఆమె మాటను అర్థం చేసికొనలేక సింహబలుడు మనసులో మిక్కిలి బాధ నిండిపోగా మొగం చిన్నబుచ్చుకొని తిరిగి తన అక్క దగ్గరికి వెళ్ళాడు.

క. చని మదనాగ్ని జ్వాలలు। దనుకఁగ నిట్టూర్పు గాడ్పు దండడి నిగుడం
దను నూరార్పఁగ సఖి దొరఁ। కొనమికి వెనుఁబడుచుఁ కీచకుం డా సతితోన్. 60

ప్రతిపదార్థం: కీచకుండు= కీచకుడు; చని= వెళ్ళి; మదన+అగ్నిజ్వాలలు= విరహం అనే అగ్ని యొక్క మంటలు; తనుకఁగన్= పైకి రేగగా; నిడు+ఊర్పు గాడ్పు= నిట్టూర్పు సెగలు; దండడి నిగుడన్= మాటిమాటికీ (సాంద్రతతో) వ్యాపించగా; తనున్=

తనను (కీచకుడిని); ఊరార్పఁగన్= ఊరడించటానికి, సఖి= సైరంధ్రి; దొరకొనమికిన్= అంగీకరించక పోవటం చేత; వెనుఁబడుచున్= వెనుకకు మరలి; చని= వెళ్లి; ఆ సతితోన్= సుదేష్ణతో.

తాత్పర్యం: కీచకుడు అట్లా వెళ్ళి మన్మథాగ్ని జ్వాలలు కాల్చివేయగా నిట్టూర్పులు దీర్ఘంగా విడుస్తూ, ద్రౌపది తన మాటకు అంగీకరించలేదనే పరితాపంతో మళ్ళీ వచ్చి సుదేష్ణతో ఇట్లా అన్నాడు.

వ. 'ఏ నప్పుడు నీకుం జూపి యన్వయ నామధేయంబు లడిగిన యప్పొలఁతి వలనం జిక్కి చిత్తం బుత్తలపడుచున్నయది; యిటమీఁద నీవ యెఱుంగు; దయ్యింతి యింతసేపు నీ చేరువనుండి యిప్పుడెట మెలంగె?' నని యడిగిన విని, యతని వేగిరపాటు చూచి శిరఃకంపంబు సేయుచు సుదేష్ణ నిజాంతర్గతంబున. 61

ప్రతిపదార్థం: ఏన్+అప్పుడు= నేను వచ్చిన వెంటనే; నీకున్+చూపి= నీకు చూపించి; ఏను= నేను; అన్వయ నామధేయంబులు= వంశమూ, పేరూ; అడిగిన= ప్రశ్నించిన; ఆ+పొలఁతి వలనన్+చిక్కి= ఆ వనితపైన లగ్నమై; చిత్తంబు= మనస్సు; ఉత్తలము+పడుచున్+ఉన్న+అది= బాధపడుతున్నది; ఇటమీఁదన్= ఇకపైన; ఈవు+అ= నీవే; ఎఱుంగుదు(వు)= తెలిసికొంటావు; ఆ+ఇంతి= ఆ వనిత; ఇంతసేపు= ఇంతకాలం; నీ చేరువన్+ఉండి= నీ దగ్గర ఉండి; ఇప్పుడు; ఎట మెలఁగెన్?= ఎక్కడికి వెళ్ళింది; అని, అడిగిన; విని; అతని= కీచకుడి యొక్క; వేగిరపాటు= తొందరపాటు; చూచి= గమనించి; సుదేష్ణ; శిరఃకంపంబు+చేయుచున్= తల ఆడిస్తూ; నిజ+అంతర్గతంబునన్= తన మనస్సులో.

తాత్పర్యం: 'నే నప్పుడు నీకు చూపించి వంశాన్నీ, పేరునూ గురించి అడిగిన స్త్రీమీది మోహంతో నా మనస్సు వేగిరపడుతున్నది. ఆపైన నీకే తెలుసు. ఆమె ఇంతవరకు నీ దగ్గరే ఉండి ఇప్పు డెక్కడికి వెళ్ళింది?' అని కీచకుడడిగాడు. అతడి తత్తరపాటు చూచి సుదేష్ణ తల ఊపుతూ మనస్సులో ఇట్లా అనుకొన్నది.

విశేషం: శిరఃకంపం ఒక సాత్త్విక భావం. వితర్క సూచకం. తిక్కన నాటకీయ శిల్ప సంకేతం. (సంపా.)

తే. 'రాగరసమగ్నుఁడయ్యె సైరంధ్రిఁ జూచి। యకట! దీన నింకేమి యపాయమగునొ?
వలదు తగదన్న నుడిగెడు వాఁడె వీఁడు? మాయదైవమ! యే నేమి సేయుదాన? 62

ప్రతిపదార్థం: వీఁడు= ఇతడు, కీచకుడు; సైరంధ్రిన్+చూచి= సైరంధ్రిని చూచి; రాగరసమగ్నుఁడు+అయ్యెన్= మోహమనే (వలపనే) నీటిలో మునిగాడు; దీనన్= ఇందువలన; ఇంకన్+ఏమి అపాయము+అగునొ?= ఏమి కీడు జరుగుతుందో; వలదు, తగదు+అన్నన్= వద్దు, మంచిది కాదని చెప్పినా; ఉడిగెడు వాఁడె?= మానుకొనే వాడుకాదు; మాయదైవమ!= ఓయి మాయలు కల్పించే భగవంతుడా!; ఏను+ఏమి, చేయుదానన్?= నేనేం చేసేది?

తాత్పర్యం: సైరంధ్రిని చూచి కీచకుడు మోహపరవశుడైనాడు. దీనివలన ఏమి అపాయం కలుగుతుందో తెలియదు. వలదని వారించినా వీడు మానేవాడు కాడు (మాట వింటాడా?). భగవంతుడా! ఇప్పుడు నే నేమి చేసేది?

విశేషం: ఈ పద్యంలో 'అకట!' అనే విచార సూచకమైన ఆశ్చర్యార్థకం మొదట గమనించ తగింది. సైరంధ్రిని చూచి రాగరసంలో కీచకుడు మునిగాడని గ్రహించింది సుదేష్ణ. అయితే విచార మెందుకు? సైరంధ్రి పరపురుషులను కోరని చిత్తవృత్తి కలిగినందుకా? అంతఃపుర స్త్రీల పట్ల రాణిమందిరంలో ఒక పురుషుడు అట్లా వ్యవహరించినందుకా? ఈ రెండు ప్రశ్నలు ధర్మసంబంధులు. దీనికంటె ఆమెను కలవరపెట్టేది సైరంధ్రి భర్తల పరాక్రమం (ప్రథమాశ్వాసంలో 324,325 పద్యాలు గమనించాలి). నీచమతితో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆమెను చూచినవాడిని హరిహరాదులు అడ్డం వచ్చినా ఆమె భర్తలు ఆ రాత్రిలోపే మట్టుపెట్టుతారట! వందలకొలది బంధువులున్నా, ఎంత శక్తిమంతుడైనా అతడు చావటం తప్పదట! సైరంధ్రి చెప్పిన ఆ మాటలు కీచకుడిపట్ల మరణమృదంగం వలె మనస్సులో మారుమ్రోగి ఉంటాయి. ఆ గండాన్ని స్మరించి ఆమె 'అయ్యో!' అని బాధపడింది. అందుకే ఈ వలపు వలన కీచకుడికి ఎటువంటి అపాయం వస్తుందో అని భయపడింది. ఆ సంగతి అతడితో చెప్పటానికి వీలు లేదు. కాక, ఎట్లా చెప్పినా అతడు వినడు. దుర్విదగ్ధుడు కావటం చేత ఒకరు చెప్పిన మాట వినడు. తనకు తోచదు. అందువలన ఆ పరిస్థితులలో ఆమె ఏమీ చేయలేని ఒక నిస్సహాయస్థితిలో నిలిచిపోయింది. అప్పటి ఆమె మానసికస్థితిని 'మాయదైవమా!' అని దయనీయంగా అనటంలో తిక్కన ధ్వనింపచేశాడు. జరుగకూడనిది ఏదైనా జరిగినా, పొసగకూడనిది ఎక్కడైనా పొసగినా అది విధివైపరీత్యంగా భావించటం లోకసహజం. ఆ లోకవైపరీత్య భావానికి వాచికమైన ప్రతిస్పందన 'మాయదైవమా!' అనే తెలుగుజాతీయం. భావానుగుణమైన వాచికాభినయం ఈ పద్యంలోని రసశిల్పం. (సంపా.)

వ. అయిన నా నేర్చుకొలందిఁ దగిన తెఱంగున వారించి చూచెదంగాక!' యని యూహించి యిట్లనియె. 63

ప్రతిపదార్థం: అయినన్= అయినప్పటికి; నానేర్చుకొలందిన్= నా శక్తి కొలదీ; తగిన తెఱంగునన్= తగిన విధంగా; వారించి చూచెదన్+కాక!= సాధ్యమైనంతవరకు వద్దని చెప్పి చూస్తాను; అని; ఊహించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అయినా నా శక్తివంచన లేకుండా వద్దని చెప్పి చూస్తానని ఊహించి సుదేష్ణ ఇట్లా అన్నది.

విశేషం: కీచకుడి ఔద్ధత్యం, తన భద్రత దృష్టిలో పెట్టుకొని మితిమీరకుండా సుదేష్ణ ప్రవర్తించింది.

సీ. 'లలితంబు లగు మట్టియల చప్పు డింపార। నంచకైవడి నడ నల్ల వచ్చి,
యెడ మేని నెత్తావి సుడియంగఁ బయ్యెద। సగము దూలించి పై మగుడఁ దిగిచి,
సోలెడు నెలదీఁగె లీలఁ గ్రాలుచు వింత। చెలువంబు దలకొనఁ జేరి నిలిచి
తెలిగన్నుఁగవకు నెచ్చెలియైన లేఁతన। వ్వొలయంగ సరసంపుఁ బలుకు పలికి,

తే. మెఱయు చెయ్వుల రాగంబు మెయికొనంగ। నెడఁద సొగయించు మాటల నెలమి మిగుల
నిన్ను ననురక్తిఁ గొలుచు నన్నెలఁత లుండ। నీరసాకార సైరంధ్రిఁ గోరఁ దగునె?' 64

ప్రతిపదార్థం: లలితంబులు+అగు= మనోహరమైన; మట్టియల చప్పుడు= కాలిమట్టెల శబ్దం; ఇంపు+ఆరన్= చెవికి ఇంపు కలిగించేటట్లు; అంచకైవడి నడన్= హంసనడకవంటి నడకతో; అల్లన్+వచ్చి= మెల్లగా వచ్చి; ఎడమేని నెత్తావి= సున్నితమైన శరీరపు మంచివాసన; సుడియంగన్= ప్రసరించగా; పయ్యెద= పైట; సగము తూలించి= సగభాగం విలాసంగా జార్చి; మగుడన్+తిగిచి= మళ్ళీ మీదికి లాగుకొని; సోలెడు ఎలదీఁగెలీలన్= వ్రాలే లేత తీగవలె; క్రాలుచున్= చలిస్తూ; వింత చెలువంబు= కొత్త అందం; తలకొనన్= కలిగేటట్లు; చేరి, నిలిచి= ప్రక్కకు వచ్చి నిలబడి; తెలికన్నుఁగవకున్= తెల్లని కన్నుల జంటకు; నెచ్చెలి+ఐన= చెలి అయిన (సైదోడయిన అని భావం); లేఁతనవ్వు= చిరునవ్వు; ఒలయంగన్= వ్యాపించగా; సరసము+పలుకు= వలపు మాటలు; పలికి= మాట్లాడి; మెఱయు చెయ్వులన్= ప్రకాశించే ప్రేమ చేష్టలలో; రాగంబు= వలపు; మెయికొనంగన్= కలుగగా; ఎడఁదన్= మనస్సును; సొగయించుమాటలన్= పరవశింపజేసే మాటలతో; ఎలమి= సంతోషం; మిగులన్= అతిశయించగా; నిన్నున్= (కీచకుడిని); అనురక్తిన్= ప్రేమతో; కొలుచు= సేవించే; ఆ+నెలఁతలు+ఉండన్= ఆ కాంతలుండగా; నీరస+ఆకారన్= రసహీనమైన రూపం కలిగిన; సైరంధ్రిన్= ఆ పూలుముడిచే దానిని; కోరన్+తగునె?= కోరటం భావ్యమా?

తాత్పర్యం: అందమైన కాలిమట్టెల చిరుసవ్వడులు చెవికి, మనసుకు హాయి కలిగిస్తూ ఉండగా హంస నడకలతో మెల్లగా వచ్చి, సున్నితమైన శరీరపు సువాసన చుట్టుముట్టగా, పైట సగం జారిపోగా దానిని పైకి మరల సర్దుకొంటూ, గాలికి అటునిటు తూగే లేత తీగవలె ఒప్పారుతూ అబ్బురం కొలిపే అందం తొణికిసలాడేటట్లు దగ్గరగా చేరి నిలువగా, తెల్లని కాంతుల కనుదోయికి ఇష్టసఖి (సాటి) అయిన చిరునవ్వు చిలికేటట్లు వలపు మాటలు పలికి, ప్రదర్శించే ప్రతి చేష్టలోనూ మనసులోని వలపు ఒలకపోయగా, మనసును మరపించే మాటలతో ప్రీతిని పెంచేటట్లు నిన్ను అనురాగంతో సేవించే ఆ అందగత్తెలు (అంతమంది నీ ఇంట) ఉండగా (వారందరినీ వదలి), ఎటువంటి రాగరసాన్ని అందించలేని ఆకారం గల (నీరసాకార) ఈ సైరంధ్రిని కోరటంలో ఏమి న్యాయం ఉన్నది?

విశేషం: మట్టెలతో నడచివచ్చే వనిత సామీప్యాన్ని కోరి ఆసక్తిని, పయ్యెదను జార్చుకొనే వనిత అభిలాషను, తీగవంటి మేనును, వింత సోయగాలతో ప్రదర్శించే లలితాంగి పొందును, తెలిగన్నుల కాంతితో చిరునవ్వును ప్రదర్శిస్తూ వలపు మాటలు పలికే వనిత సాముఖ్యాన్నీ, శృంగార చేష్టలు ప్రకటించే వనిత లీలావిభ్రమాన్నీ, మనసును మరపించే మాటలాడే వనిత పారవశ్యాన్నీ ప్రకటిస్తారని సుదేష్ణ చెప్పటం తమ్ముడి మనసు మరల్చటానికే! ప్రియుడికై బయలుదేరిన స్థితి నుండి అతడి పొందులో పరవశించేంతవరకు ఆరు రకాలైన స్త్రీల మదన చేష్టలు ఈ సీసంలో చెప్పబడ్డాయి. ఒక్కొక్క చరణంలో వర్ణించబడిన వనిత ఒక్కొక్కరు వేరుగా ఉండవచ్చును. ఒక్క వనితలోని వివిధావస్థలు కావచ్చును. హావభావాలను అట్లా రసానుభవానికి అనుగుణంగా ఆవిష్కరించగలిగిన అందమైన ఆకారం కలిగినవారు కీచకుడికి ఎందరో ఉన్నారు. అత డప్పటికే దక్షిణ నాయకుడు. అతడి రసికతకు తగినంత రసికురాలు సైరంధ్రి కాదనీ (మనసులో వలపు లేనిదనీ) సుదేష్ణ నచ్చచెప్పి అతడిని వారింపచేయటానికి ప్రయత్నించింది. కాని, కీచకుడి దృష్టికి సుదేష్ణ మాటలు అపరిణతాలు, అనాదరణీయాలుగా తోచాయి. అది నిజం కూడా. ఇంతటి వర్ణనం నిష్ఫలం కావటం అతడి రాగరసమగ్నతకు రమణీయ వ్యాఖ్యానం. సీసపద్య ప్రథమ తృతీయ చరణాలలో ఉపమాలంకారం. ద్వితీయచతుర్థ చరణాల్లో స్వభావోక్తి అలంకారం రచనకు వన్నె పెట్టుతున్నాయి. (సంపా.)

వ. అనిన నప్పలుకులదెస ననాదరంబు సేయుచు నచ్చేడియం జూచి కీచకుం డిట్లనియె. 65

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+పలుకుల, దెసన్= ఆ మాటల పట్ల; అనాదరంబు+చేయుచున్= లెక్కపెట్టక; కీచకుండు; ఆ+చేడియన్= ఆ సుదేష్ణను; చూచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సుదేష్ణ మాటలను లెక్కపెట్టక కీచకు డిట్లా అన్నాడు.

క. 'నా కొలువు వార కా; ర। న్నాకేశుం గొలుచు నంగనలలోనైనన్
లేకునికి నాకుఁ దెల్లం। బా కొమ్మకు నీడు పోల్పనయ్యెడు సుదతుల్. 66

ప్రతిపదార్థం: నా కొలువు వారు+అ= నా కొలువులోనివారే; కారు= కాదు; ఆ+నాక+ఈశున్= ఆ ఇంద్రుని; కొలుచు+ అంగనలలోన్+ ఐనన్= సేవించే (దేవ) వనితలలో కూడా; ఆ కొమ్మకున్= ఆ స్త్రీతో; పోల్పన్= పోల్చటానికి; ఈడు= సరి (అయిన); సుదతుల్= స్త్రీలు; లేక+ఉనికి= లేకపోవటం; నాకున్+తెల్లము= నాకు స్పష్టంగా తెలియును.

తాత్పర్యం: సైరంధ్రితో పోల్చదగిన స్త్రీలు నా కొలువులోనే కాదు, ఆ ఇంద్రుడిసభలో కూడా లేరు. అది నాకు తెలుసు.

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. నాకేశుడిని కొలిచే స్త్రీలలో కూడా లేరనటంవలన సేవించే స్త్రీలలలో ఇతర స్త్రీలమాట వేరే చెప్పాలా? అని భావం కనుక కావ్యార్థాపత్తి. ద్రౌపది అపూర్వ సౌందర్యవతి అని కీచకుడి భావన. అట్లా చెప్పగలిగిన అనుభవజ్ఞుడు కూడా అతడు. (సంపా.)

సీ. గండుమీలకుఁ బుట్టి కాము బాణములతోఁ। గలసి యాడెడు నట్టి కన్నుఁ గవయు,
బిస కాండముల శిక్షఁ బెరిఁగి లేఁ దీఁగల। మెచ్చక యున్నట్టి మృదు కరములుఁ,
జిగురులతో సంధి సేసి యంబుజముల। పై నెత్తి చను నట్టి పదతలములుఁ,
గలకంఠములచేతఁ గఱచిన విద్య వీ। ణల కిచ్చునట్టి తిన్నని యెలుంగు,

తే. నత్తెఱంగున రేఖయు, నవ్విధంబు। గరువ చందంబు, నమ్మెయి కలికితనము,
నట్టి చెన్నును సైరంధ్రియంద కాక। కలవె యొరులకు? నెఱుఁగక పలికి తబల! 67

ప్రతిపదార్థం: గండుమీలకున్= పెద్ద చేపలకు; పుట్టి= జన్మించి; కామబాణములతోన్= మన్మథబాణాలతో; కలిసి+ఆడెడు+అట్టి= కలిసిమెలసి ఆడుకొనే; కన్నుఁగవయున్= కనుదోయి; బిసకాండముల శిక్షన్= తామరతూండ్ల శిక్షణలో; పెరిఁగి= పెద్దవి అయి; లేఁత+తీగల మెచ్చక+ఉన్న+అట్టి= లేత తీగలను మెచ్చని; మృదుకరములున్= మెత్తని చేతులు; చిగురులతోన్ సంధి+చేసి= చిగురుటాకులతో సఖ్యపడి; అంబుజములపైన్+ఎత్తి= తామరల మీద యుద్ధానికి; చను+అట్టి= వెళ్ళే; పదతలములున్= అరికాళ్ళు; కలకంఠముల చేతన్= కోకిలల చేత; కఱచిన విద్య= నేర్చుకొన్న చదువు; వీణలకున్+ఇచ్చు+అట్టి= వీణలకు ఇచ్చే; తిన్నని+ ఎలుంగున్= చక్కని కంఠస్వరం; ఆ+తెఱంగున రేఖయున్= ఆ విధమైన ఆకార లక్షణం; ఆ+విధంబు= అటువంటి (సాటిలేని అని భావం); గరువచందంబున్= ప్రౌఢమైన చక్కదనం; ఆ+మెయి కలికితనమున్= ఆ విధమైన సౌందర్యం; అట్టి చెన్నును= అటువంటి (సాటిలేని) చక్కదనం; సైరంధ్రి+అందున్+అ= సైరంధ్రిలో మాత్రమే; కాక= కాకపోతే; ఒరులకున్= ఇతరులకు; కలవె= ఉన్నాయా? అబల!= వనితా! (సుదేష్ణ!); ఎఱుఁగక= తెలియక; పలికితి(వి)= మాట్లాడావు.

తాత్పర్యం: పెద్ద చేపలకు పుట్టి, మన్మథబాణాలతో కలిసి ఆడే కళ్ళూ, తామర తూళ్ళ శిక్షణలో పెరిగి లేత తీగల సౌకుమార్యం మెచ్చని చేతులూ, చిగురాకులతో చెలిమి చేసికొని పద్మాలపై దండెత్తే అరికాళ్ళూ, కోకిలల వద్ద నేర్చుకొన్న స్వరవిద్యను వీణెలకు అందించే మెల్లని కంఠస్వరం, ఆ సాటిలేని రూపవైభవం, ఆ సాటిలేని గడుసుదనం, అటువంటిదే అయిన నేర్పరితనం, అంతటి చక్కదనం సైరంధ్రిలోనే ఉన్నాయి కాని ఇతర వనితలలో కనబడతాయా? (లేవని భావం). ఓ అమాయకురాలవైన అక్కా! నీవు ఈ విషయం గమనించకుండా మాట్లాడావు.

విశేషం: 1. అలం: ఆర్థీ ఉపమ. క్రమాలంకారం; కారణమాల.

2. ద్రౌపదీ సౌందర్య వర్ణనంలో వాక్యగత పూర్ణ ఆర్థీ ఉపమాలంకారాన్ని తిక్కన సార్థకంగా వాడి ప్రౌఢిని ప్రదర్శించాడు. 'వలె' వంటి ఉపమావాచకాలు వాడకుండా ఆ అర్థాన్ని చెప్పే విశిష్ట పదాలతో వాక్యాల ద్వారా, సమాసాల ద్వారా, తద్ధితాల ద్వారా ఆర్థీ ఉపమ రచనలో రాణిస్తుంది. భావుకుడైన వాడు ఈ అలంకారాన్ని సార్థకంగా ప్రయోగిస్తాడు. సైరంధ్రీ సౌందర్య భావనంలో ఊహాలోకాలలో విహరిస్తూ, సుదేష్ణకు తెలియని సౌందర్య విశేషాలను వివరించాలనే కీచకుడి తమకం ఈ అలంకారోక్తిని ప్రదర్శించినట్లు రచించటం సార్థకశిల్పం. ఆర్థీ ఉపమ ధ్వనికి, అందులోనూ రసధ్వనికి ఎంతో ఉపస్కారకంగా ఉంటుందని లాక్షణికుల అభిమతం. దానికి ఈ తిక్కన పద్యం ఉచితోదాహరణం.

3. సీసపాదాల పూర్వార్థంలో ఉపమాలంకార ధ్వని పుట్టి, శిక్షఁబెరిగి, సంధి చేసి, కఱచినవిద్య - ఇవి ఉపమాద్యోతకాలు, సమానార్థకాలు. ఇక రెండుమూడు పాదాల ఉత్తరార్థాలలో ఉపమానాలకంటె ఉపమేయాలకు ఆధిక్యం చెప్పబడటం చేత వ్యతిరేకాలంకారం (మెచ్చని, పైనెత్తిచను= తిరస్కరించు); మొదటిపాదంలోని ఉత్తరార్థంలో కలసియాడు= సమానం - కాబట్టి ఉపమాధ్వని. నాల్గవపాదం ఉత్తరార్థంలో - వీణలకు విద్యలేదు కాబట్టి వ్యతిరేకాలంకారధ్వని.

4. అలంకారధ్వని రసధ్వనిలో పర్యవసించే ఒక శిల్పప్రస్థానం ఈ పద్యంలో ప్రత్యక్షమౌతుంది. ఎత్తుగీతిలో సైరంధ్రి అందంలో రేఖ, గఱువచందము, కలికితనము, చెన్ను-అనేవి క్రమంగా పేర్కొనబడ్డాయి. ఇతరులయందు ఉండనివిధంగా ఒక ప్రత్యేకత, అపూర్వత వాటియందు చెప్పబడింది. ఆ నాలుగింటిలోని ఆ విశేషాలను నాల్గు సీసపద్యపాదాలలో వర్ణించి తిక్కన క్రమాలంకారాన్ని లేదా యథాసంఖ్యాలంకారాన్ని పాటించాడు. అందులో మరొక చమత్కారం కారణమాలను పొదగటం. ఇందులో పూర్వపూర్వములకు ఉత్తరోత్తరాలు కారణాలైనట్లు నిబద్ధించబడటం చేత కారణమాల రాణించింది. ఎట్లాగంటే - సైరంధ్రి అందం ముందుగా కన్నుగవలో రూపుతాల్చింది. అట్లా రూపుకట్టటానికి కారణం ఆమె కన్నులు గండు చేపలకు పుట్టటం, మదనబాణాలతో కలిసి ఆడటం. పుట్టి ఆటలాడుతున్న బాల్యం భావనామయం. గండుమీలకు పుట్టినాయంటే వాటి పోలిక కలిగి ఉన్నాయని కవిసమయం. మదనబాణాలతో కలిసి ఆడాయంటే చూపులు తూపులుగా ఉండటమే కాక కామభావకారకాలవి వ్యంగ్యం. ఆమె అందానికి ఒక తీరును కల్పించేది కన్నుగవ సౌందర్యమని భావం. సైరంధ్రి సౌందర్యంలోని రెండవగుణం సాటిలేని గరువతనం. ఆ గర్వం శిక్షణలో పెరగటం వలన, లేతగుణాన్ని మెచ్చలేకపోవు ప్రౌఢివలన ఏర్పడింది. (కారణమాల). ఆమె కోమలమైన చేతులు తామరతూండ్ల వద్ద శిక్షణతో పెరిగాయట. అంటే ఆ తామరతూండ్ల వలె కోమలత్వాన్ని క్రమంగా అలవరచుకొని అందంతో అతిశయించాయన్నమాట. తామరతూండ్లు గరువచందాన్ని ప్రకటిస్తూ లేతీగలవలె రూపొంది వాటి కంటె మెత్తగా ఉండటం చేత వాటిని మెచ్చలేదట! అంటే తామరతూండ్లవలె, లేతతీగలవలె ఉన్నా వాటికంటె మిన్నగా మృదువులుగా ఉన్నాయని ధ్వని. గరువతనంతో లేదీగలను లెక్కచేయని సైరంధ్రి అందం చిగురాకులతో సంధి చేసిందట. ఆమె అరికాళ్ళు చిగురాకులతో సంధి (చెలిమి) చేసి పద్మాలపై దాడి చేసినట్లు ఉన్నాయట. అంటే చిగురాకుల వలె ఎర్రగా ఉండి పద్మాలకంటె అందంగా ఉండి ఆమె కలికితనాన్ని ప్రదర్శిస్తున్నాయన్నమాట! సైరంధ్రిమాట సౌందర్యం కోకిలవద్ద చదువు నేర్చుకొన్నదట! వీణలకు చదువు చెప్పే సన్నని తియ్యని కంఠనాదంతో తన విలాసాన్నంతా ప్రదర్శించిందట! కళ్ళనుండి కాళ్ళవరకూ ఆమె అందం ఒక క్రమాభివృద్ధి చెందినట్లు పుట్టి పరులపై దండెత్తి పోయేటంత కలికితనం సంపాదించింది. అది ఆంగిక సౌందర్యం తీరు. ఆమె మాటలు పంచమస్వర మధురం. వీణానాదానికి వంకలు తీర్చే గురుపీఠం. ప్రత్యక్షరం మధురం-అని వర్ణించి, సైరంధ్రి అందమే ఒక అందమైన వ్యక్తిత్వంతో పరిణతి చెందినట్లు - ఉపమానాలన్నీ క్రమంగా దానికి కారణమాలగా తోచేటట్లు చిత్రించటం తిక్కన అలంకారధ్వని రసధ్వనిలో పర్యవసింపచేసే కావ్యరసవిద్య. తిక్కనగారి గొప్ప పద్యాలలో ఇది ఒకటి. (సంపా.)

వ. కావున నా యెలనాఁగ నేమి యుపాయంబుననైన నన్నుం జేర్పవైతేని కందర్పదర్పంబున నలందురి వందుదు' ననిన నవ్వెలంది వెండియు నిట్లనియె. 68

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఆ ఎలనాఁగన్= ఆ సైరంధ్రిని; ఏమి+ఉపాయంబునన్+ఐనన్= ఏ ఉపాయంతోనైనా సరే; నన్నున్= నాతో; చేర్పవు+ఐ(తివి)+ఏని= చేర్చక (కూర్చక)పోతే; కందర్పదర్పంబునన్= మన్మథప్రతాప గర్వంచేత; అలందురి= కృశించి; వందుదున్= బాధపడతాను; అనినన్= అని అనగా; ఆ+వెలంది= ఆ సుదేష్ణ; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: 'కాబట్టి, ఆ సైరంధ్రిని ఏ ఉపాయంతోనయినా సరే నాతో కలపకపోతే నేను మన్మథుడు మదించి వేసే బాణాలకు కృశించిపోతాను' - అని కీచకుడు అనగా సుదేష్ణ ఇంకా ఇట్లా అన్నది.

తే. 'ఆయురైశ్వర్య కీర్తుల నపహరించుఁ। బరసతీ సంగమము; ధర్మపథమునందుఁ
బరఁగువారలు పరిహరింపంగఁ గనియు। వినియుఁ దెలియవె యిది దుర్వివేక మగుట. 69

ప్రతిపదార్థం: పరసతీ సంగమము= పరస్త్రీ పొందు; ఆయుః+ఐశ్వర్య కీర్తులను= ఆయుస్సును, ధనాన్ని, పేరు ప్రఖ్యాతులను; అపహరించున్= నశింపజేయును; ధర్మపథమునందున్= న్యాయమార్గంలో; పరఁగువారలు= ఒప్పెడువారు; పరిహరింపంగన్=

వదలిపెట్టటం; ఇది= ఈ పని; దుర్వివేకము= దుర్బుద్ధి; అగుట= కావటం; కనియున్, వినియున్, తెలియవె?= స్వయంగా చూచికాని, ఎవరైనా చెప్పగా వినికాని తెలిసికొనలేదా?

తాత్పర్యం: 'పరస్త్రీతోడి పొందు ఐశ్వర్యాన్ని, కీర్తినీ, ఆయుస్సును నశింపజేస్తుందనీ, ధర్మపరులు దీనిని నిషేధిస్తారనీ నీవు ఎక్కడా చూచిగాని, వినిగాని ఎరుగవా? అది దుర్వివేకం అని తెలియదా?

విశేషం: పరసతీ సమాగమం వలన ఆయువు, ఐశ్వర్యము, కీర్తి నశిస్తాయని భారతం (1-8-31) చెప్పుతున్నది. (శీలం వరభూషణమే).

సీ. పతి యెఱింగినఁ దన ప్రాణంబుపై వచ్చు। నను భయంబున నుల్లమదరు చుండ,
జనులు గాంచిన మానుషము దూలుఁ దన కను। పుయిలోటమున మోము పుల్లగిలఁగ,
బోటికిఁ దోఁచినఁ బొలియుఁ దేఁకువ యను। వెగడునఁ జెయ్వులు వీడుపడఁగ,
బంధుల కగపడ్డఁ బాయు నన్వయ మను। కలఁక మైఁ జెమటలు క్రమ్ము దేరఁ,

తే. గ్రీడ దెసఁ గౌతుకం బురియాడ రతుల। చవులు గొనియాడ నేరని జార పొందు
హృదయమున కింపు చేయమి నెఱుక గలుగు। వారు దీని సుఖంబుగాఁ గోర రెందు. 70

ప్రతిపదార్థం: పతి+ఎఱింగినన్= భర్త తెలిసికొంటే; తన ప్రాణంబుపైన్+వచ్చున్+అను= తన ప్రాణం మీదకు వస్తుందని; భయంబునన్= భయంతో; ఉల్లము+అదరుచుండన్= మనస్సు భయపడుతూ ఉండగా; జనులు కాంచినన్= ఇతరులెవరైనా చూస్తే; తనకు; మానుషము+తూలున్+అను= పరువుపోతుందనే; పుయిలోటమునన్= సంకోచంతో; మోము= ముఖం; పుల్లగిలఁగన్= వెలవెలపోగా; బోటికిన్+తోఁచినన్= చెలికత్తెకు తెలిస్తే; తేఁకువ= గౌరవం (మర్యాద); పొలియున్= నశిస్తుంది; అను వెగడునన్= అనే భయంతో; చెయ్వులు= విలాసచేష్టలు; వీడుపడఁగన్= వదలిపెట్టగా; బంధులకున్+అగపడ్డన్= బంధువుల కంటపడితే; అన్వయము= వంశప్రతిష్ఠ; పాయున్+అను= పోతుందనే; కలఁకన్= భయంతో; మైన్= శరీరమునందు; చెమటలు క్రమ్ముదేరన్= చెమటలు పట్టగా; క్రీడదెసన్= రతి క్రీడలో; కౌతుకంబు= ఆసక్తి; ఉరియాడన్= చలించగా; రతుల చవులు= రతిరుచులు; కొనియాడనేరని= పొగడలేని; జారపొందు= రంకుటాలితో కలయిక, రంకుతనం; హృదయమునకున్= మనస్సునకు; ఇంపుచేయమిన్= ప్రియంకలిగించదు కాబట్టి; ఎఱుక+కలుగువారు= బుద్ధిమంతులు; దీని సుఖంబు= జారసుఖాన్ని; ఎందున్+కోరరు= ఎన్నడూ కోరరు.

తాత్పర్యం: జారశృంగారంలో (రంకుతనంలో) పాల్గొనే వనిత పురుషుడి హృదయానికి సంతోషాన్ని కలిగించలేదు. భర్త తెలిసికొంటే తన ప్రాణంమీదకే వస్తుందని ఆమె గుండె గడగడలాడుతూ ఉంటుంది. జనాలకు తెలిస్తే పరువుపోతుందనే భయంతో ఆమె ముఖం వెలవెలబోతుంది. చెలికత్తెకు తెలిస్తే అవమానం కలుగుతుందనే భయంతో ఆమె విలాస చేష్టలు ప్రదర్శించలేకపోతుంది. బంధువులకు తెలిస్తే వెలివేస్తారనే భయంతో ఆమె మనసు వికలమై చెమటలు పట్టుతాయి. రతి క్రీడా సమయంలో కూడా మనస్సు బాధపడుతుండటం వలన ఆసక్తిని చూపలేక రతిలోని రుచులను అనుభవించలేదు. కాబట్టి జారిణీ స్త్రీ సాంగత్యం మనస్సుకు ఉల్లాసకరం కాదని తెలివిగల వారు దాని కెప్పుడూ దూరంగా ఉంటారు.

వ. అదియునుంగాక. 71

తాత్పర్యం: అంతేకాక.

క. బలవిక్రమ సంపన్నులు । గల రేవురు దానిపతులు గంధర్వులు; వా
రలఁ దలఁచిన నా చిత్తము । దలఁకెడు; నది యేల నీకుఁ దమ్ముఁడ! చెపుమా! 72

ప్రతిపదార్థం: దాని పతులు= ఆమె భర్తలు; గంధర్వులు= గంధర్వలోకం వారు; బలవిక్రమ సంపన్నులు= బలపరాక్రమం అధికంగా గలవారు; ఏవురు+కలరు= ఐదుగురున్నారు; వారలన్+తలఁచినన్= వారిని తలచుకొంటే; నా చిత్తము= నా మనస్సు; తలఁకెడున్= కలవరపడుతున్నది; (కాబట్టి) తమ్ముఁడ!= ఓ తమ్ముడా; నీకున్; అది= ఆమె పొందు; ఏల చెపుమా!= ఎందుకు చెప్పుము.

తాత్పర్యం: బలోపేతులైన దాని భర్తలు గంధర్వులు ఐదుగురున్నారు. వారిని తలచుకొంటేనే నా మనస్సు కలత పడుతున్నది. ఒరే తమ్ముడా! దాని ధ్యాస నీకెందుకు చెప్పుము.

విశేషం: గంధర్వులు, బలవిక్రమ సంపన్నులు ఐదుగురు అని చెప్పి భయపెట్టాలని చెప్పిచూచింది. తమ్ముడా! అని ప్రియంగా సంబోధించింది.

తే. కాని తెరువునఁ బోయినఁ గలుగునయ్య! । బ్రదుకు? చవి యెంతయైన నపథ్యములకు
వేడ్క సేయుదురయ్య వివేకు? లెవ్వి । ధమున నా బుద్ధి వినవయ్య తమక ముడిగి.' 73

ప్రతిపదార్థం: కాని తెరువునన్= చెడుత్రోవలో; పోయినన్= పోతే; బ్రతుకు= జీవితం; కలుగున్+అయ్య!= కలుగదు; చవి+ఎంత+ఐనన్= ఎంతటి రుచి(ఆసక్తి) ఉన్నను; వివేకులు= బుద్ధిమంతులు; అపథ్యములకున్= హితము కానివాటికి; వేడ్క+చేయుదురు+అయ్య?= ఉబలాటపడతారా నాయనా?; తమకము+ఉడిగి= మోహాన్ని వదలిపెట్టి; నాబుద్ధి= నేను చెప్పేమాటలు; వినవయ్య!= వినుము.

తాత్పర్యం: చెడుబాటలో సాగితే బ్రతుకు నిలిచేనా? హితం కాని పనులు ఎంత రక్తిని కలిగించినా బుద్ధిమంతులు వాటిని కోరరు. కాబట్టి నా మాట విని ఏ విధంగానైనా సరే నీ మోహాన్ని మానుకొనుము.'

విశేషం: ఎంత అందంగా ఉన్నా పరసతీ వ్యామోహం వివేక లక్షణం కాదు. తమకంలో ఉన్న నీవు నా మాటలు వినుమని సుదేష్ణ చనవుగా పలికింది.

క. అనవుడు నమ్మాటలు దన । మనమునకు సహింపరామి మల్లడిగొనుచున్
మనసిజ పరతంత్రత ని । ట్లని పల్కె సుదేష్ణతోడ నతఁ దుద్ధతుఁడై. 74

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; ఆ+మాటలు= ఆమె చెప్పిన పలుకులు; తన మనమునకున్= కీచకుని మనస్సునకు; సహింపరామిన్= ఓర్చుకోలేనివి కావటంచేత; అతఁడు= కీచకుడు; మల్లడి+కొనుచున్= పరితపిస్తూ; మనసిజ పరతంత్రతన్= మన్మథునికి లోబడియుండుటచేత; ఉద్ధతుఁడు+ఐ= గర్వించినవాడై; సుదేష్ణతోడన్= సుదేష్ణతో; ఇట్లు+అని పలికెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సుదేష్ణ చెప్పిన మాటలు కీచకుడి మనస్సుకు ఓర్వరానివైనాయి. మన్మథ పారవశ్యంలో బాధపడుతూ అతడు గర్వంగా సుదేష్ణతో ఇట్లా అన్నాడు.

విశేషం: మనసిజ పరతంత్రత - పదప్రయోగం ఔచిత్యవంతం. మన్మథుడు ప్రవేశించిన మనస్సులో మరొకరు ప్రవేశించటం కష్టం. అందుకే కీచకుడి కా మాటలు రుచించలేదు.

మ. 'వనితా! యే నొక పల్కు పల్కెదఁ జతుర్వారాశి మధ్యంబునన్
ఘనబాహాబల మొప్ప నన్ను నెదురంగా నొక్కఁడున్ లేమి యె
వ్వనికిం దెల్లము గాదె! దాని మగలన్ వజ్రాహతిం గూలు శై
ల నికాయం బన మద్భుజాసమదలీలన్ గీ టడంగించెదన్. 75

ప్రతిపదార్థం: వనితా!= ఓ సుదేష్ణా!; ఏను+ఒక పల్కుపల్కెదన్= నేనొక మాట చెప్పుతాను; చతుర్+వార్+రాశి మధ్యంబునన్= నాలుగు సముద్రాల నడుమగల భూమిమీద; ఘనబాహాబలము= గొప్పవైన భుజాల బలం; ఒప్పన్= ఒప్పగా; నన్నున్+ఎదురంగాన్= నన్నెదిరించటానికి; ఒక్కఁడున్ లేమి= ఒక్కడు కూడా లేకపోవటం; ఎవ్వనికిన్+తెల్లము కాదె?= ఎవరికి తెలియదు? (అందరికీ తెలుసుకదా!); దాని మగలన్= ఆమె భర్తలను; మత్+భుజాసమదలీలన్= నా భుజబల గర్వంయొక్క విలాసంతో; వజ్ర+ఆహతిన్= వజ్రాయుధంతో కొట్టటం వలన; కూలు= పడిపోయే; శైలకాయంబు= పర్వత సముదాయమో; అనన్= అన్నట్లు; గీటు+అడంగించెదన్= కూల్చివేస్తాను.

తాత్పర్యం: 'ఓ సుదేష్ణా! నాలుగు సముద్రాల మధ్యలో ఉన్న ఈ నేలపై నా బాహుబలాన్ని ఎదిరించి నిలువగలవాడు లేడని అందరికీ తెలుసు కదా! వజ్రాయుధం దెబ్బతో కూలిన పర్వతాలో అన్నట్లు నా భుజబలంతో దాని భర్తలను కూల్చి వేస్తాను.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఉపమానం యొక్క తాదాత్మ్యమును ఉపమేయమునందు సంభావించటం ఉత్ప్రేక్ష. ఇంద్రుడు తన వజ్రాయుధంతో పర్వతాల రెక్కలను ఛేదించటం పురాణ ప్రసిద్ధం. అట్లా వజ్రాయుధపాతంతో పడిపోయిన పర్వతాలో అన్నట్లు సైరంధ్రీ భర్తలను చంపుతాననటం అలంకారం. సింహబలుడు తన అక్కను 'వనితా!' - అని సంబోధించటం ద్వారా ఔద్ధత్యం వెల్లడయింది.

ఉ. బుద్ధులు సెప్పు టెల్ల నటు వో విడు; మెయ్యెయి నైన సౌఖ్యసం
సిద్ధి యొనర్పు నాకు; నెడ సేసినఁ దాపము రూపుమాపు; నా
వృద్ధియ కోరుదేని 'నవివేకివి నీ' వని నన్ను ని ట్లసం
బద్ధములైన వాక్యములు పల్కక వే పిలిపింపు కోమలిన్.' 76

ప్రతిపదార్థం: బుద్ధులు చెప్పుట+ఎల్లన్= నీతులు చెప్పటమంతా; అటు+పోవిడుము= అట్లా వదలివేయుము; ఏ+మెయిన్+ఐనన్= ఎట్లాగైనా; నాకున్= (కీచకుడికి) సౌఖ్యసంసిద్ధి= ఆమెపొందువలని సుఖాన్ని; ఒనర్పు= కలిగించుము; ఎడచేసినన్= ఆలస్యం చేస్తే; తాపము= మన్మథతాపము, విరహబాధ; రూపుమాపున్= (నన్ను) నాశనం చేస్తుంది; నా వృద్ధి+అ= నా ఉన్నతినే; కోరుదు(వు)+ఏనిన్= కోరేదానివైతే; నీవు= (కీచకుడా, నీవు); అవివేకివి= బుద్ధిహీనుడవు; అని= అని అంటూ; అసంబద్ధములు+ఐన= అసంగతాలైన; వాక్యములు= మాటలు; పల్కక= ఆడక; కోమలిన్= ఆ సుకుమారిని; వే పిలిపింపు= త్వరగా పిలువనంపుము.

తాత్పర్యం: నీవు నాకు బుద్ధులు చెప్పటం మానివేయుము. ఏదో ఒక ఉపాయంతో నాకు ఆమెను పొందే సౌఖ్యాన్ని కలిగించుము. ఆలస్యం చేశావంటే నేను మన్మథ తాపంతో మరణిస్తాను. కాబట్టి నీవు నిజంగా నా మేలునే కోరేదానివైతే 'నీవు అవివేకివి' అంటూ అసంగతాలైన మాటలతో నన్ను నిందించక, శీఘ్రంగా సైరంధ్రిని పిలిపించుము.'

విశేషం: వనితా! అని గర్వంగా పలికి ఇప్పుడు హెచ్చరిస్తున్నాడు.

తే. **అనుచు దైన్యంబు నొందెడు నాననంబు। తోడ దిగ్గన లేచి యత్తోయజాక్షి**
చరణ పీఠంబుకడఁ జక్కఁజాఁగి మ్రొక్కి। యున్న నద్దేవి కనుఁగొని చిన్నఁబోయి. **77**

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; దైన్యంబున్+ఒందెడు= దీనత్వం పొందే; ఆననంబుతోడన్= ముఖంతో; దిగ్గనన్ లేచి= వెంటనే లేచి; ఆ+తోయజాక్షి= ఆ సుదేష్ణ యొక్క; చరణపీఠంబుకడన్= అడుగుపీటవద్ద; చక్కన్+చాఁగి మ్రొక్కి= నిలువునా సాష్టాంగపడి; ఆ+దేవి= ఆ సుదేష్ణను; కనుఁగొని= చూచి; చిన్నబోయి= మొగం చిన్నబుచ్చుకొని.

తాత్పర్యం: అని మాట్లాడుతూ ముఖంలో దీనత్వం ఉట్టిపడేటట్లు వెంటనే లేచి ఆ సుదేష్ణ పాదాలు పెట్టుకొనే పీటవద్ద నిలువునా పడి సాష్టాంగ నమస్కారం చేసిన ఆ కీచకుడిని చూచి సుదేష్ణ చిన్నబోయి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: కీచకుడు మూర్ఖుడు. అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు - అనే రకం. దాసుడి తప్పులు దండంతో సరి - అని అక్కను ప్రసన్నురాలిని చేసికొనటానికి ఇది ఒక్కటే బ్రహ్మాస్త్ర మనుకొన్నాడు. సప్తవ్యసనాలలో 'వెలది' ని ముందుగానే చెప్పారు. కీచకుడు వ్యసనపరుడు. 'కామాతురాణాం న సుఖం న లజ్జా' అన్న సూక్తి కీచకుడి వర్తనంలో నిజమైనది.

ఉ. **'ఆవల వచ్చు నాపదల కన్నిటి కోర్చి లతాంగిఁ గూర్చి కా**
కీ వెడ మాటలన్ మరలఁ; డెన్ని విధంబులఁ జూపి చెప్పినం
గావల మైన వీఁడు తగు కార్యము వట్టునె? వీని కెమ్మెయిం
జావు నిజంబు మన్మథునిశాత శరంబులనైన నక్కటా!' **78**

ప్రతిపదార్థం: ఆవలన్= తర్వాత; వచ్చు+ఆపదలకున్= వచ్చే కష్టాలకు; అన్నిటికిన్+ఓర్చి= అన్నీ భరించి; లతాంగిన్+కూర్చికాక= సైరంధ్రిని అతనితో కలిపికాక; ఈ వెడమాటలన్= ఈ వట్టి మాటలతో; మరలఁడు= మనసు మరల్చుకోడు; కావలము+ఐన వీఁడు= కండకావరం కలిగిన వీడు; ఎన్ని విధంబులన్= ఎన్ని రకాలుగా; చూపి, చెప్పినన్= నిరూపించి చెప్పినా; తగు కార్యము= తగిన పనిని; పట్టునె?= చేపట్టుతాడా?; అక్కటా!= అయ్యో!; వీనికిన్= కీచకుడికి; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; మన్మథునిశాత శరంబులన్+ఐనన్= మన్మథుడి యొక్క వాడి అయిన బాణాలతోనైనా; చావు= చావటం; నిజంబు= తథ్యం (తప్పదని భావం).

తాత్పర్యం: 'తర్వాత ఎన్ని ఆపదలు వచ్చినా, ప్రస్తుతానికి సైరంధ్రిని వీడికి కూరిస్తే తప్ప, వట్టి మాటలతో తృప్తిపడి తిరిగిపోయేటట్లు లేడు. మిక్కిలి గర్వం గలవాడు కావున ఎంతచెప్పినా మంచిమాటలు గ్రహించలేడు. వీ డెట్లాగూ సైరంధ్రి భర్తలచేత కాకపోయినా, మదనబాణాలచేతనైనా చావటం నిజం.'

విశేషం: 1. అక్కపట్ల ఉన్న చనవుతో కీచకుడు అడుగుతున్నాడు. తమ్ముడిపట్ల ఉన్న మమకారంతో సుదేష్ణ ఆలోచిస్తున్నది. వలదన్నా మానని గర్వాంధుడు సింహబలుడు. అతడి చావు రాసిపెట్టినట్లున్నది. అయితే అది సైరంధ్రి భర్తలవలననా? మన్మథుడి బాణాల వలననా అనేదే ప్రశ్న. మన్మథుడి వలన చనిపోతే దానికి కారకురాలు సుదేష్ణ మరొక రకంగా అయితే కీచకుడే బాధ్యుడు. (సంపా.)

2.'కావలము= పాపము. ఇయ్యది కీచకునికి విశేషణము గానఁ గావలము గలవాఁడని చెప్పవలయును. కావలము కీచకుఁడని చెప్పునప్పుడు కీచకుఁడు కావలము కలవాఁడు గాని కావలము కాఁడు కనుకఁ దాత్పర్యము పాపఁగమిచేఁ గావలము గలవాడను నర్థము లక్షణచే వచ్చునని భావము. మహాకవులు మిక్కుటముగ కలవాఁడను నర్థమునఁ గావలమని ధర్మధర్ముల కభేదముగా వాడుచుండుటయుఁ గలదు. "తేజసస్తు న వయస్సమీక్ష్యతే" - ఇచ్చట తేజసః (మహాకవి కాళిదాసు) అనఁగా నెక్కువ ప్రతాపము గలవానికని ధర్మధర్ముల కభేదము చెప్పికొనక తప్పదు" (కీ.శే. పళ్ళె పూర్ణ ప్రజ్ఞాచార్యులు : విరాటపర్వ టిప్పణి).

క. అని మనమునఁ దలపోయుచుఁ। దన తమ్ముని నల్లనెత్తి దండడి దొరఁగం
జనుదెంచు నశ్రుపూరము। కనుఁగవలో మ్రింగికొనుచుఁ గామిని పలికెన్. 79

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; కామిని= సుదేష్ణ; మనమునన్+తలపోయుచున్= మనస్సులో అనుకొంటూ; తన తమ్మునిన్= తన తమ్ముడైన కీచకుడిని; అల్లనన్+ఎత్తి= మెల్లగా ఎత్తి; దండడి తొరఁగన్= వేగంగా కారటానికి; చనుదెంచు= వచ్చే; అశ్రుపూరము= కన్నీళ్ళధారను; కనుఁగవలోన్= కనుదోయిలో; మ్రింగికొనుచున్= అణచుకొంటూ; పలికెన్= మాట్లాడింది.

తాత్పర్యం: ఆ విధంగా మనస్సులో అనుకొంటూ కీచకుడిని లేవనెత్తి ధారలుగా పొంగివచ్చే కన్నీళ్ళను కనుదోయిలో కుక్కుకొంటూ సుదేష్ణ మాట్లాడింది.

విశేషం: 1. తిక్కన సాత్త్విక భావాలను సందర్భోచితంగా విస్తరించి నాటకీయతను రక్తి కట్టిస్తాడు. వెనుకటి పద్యంలో భావసంఘర్షణలో సుదేష్ణ మథనపడింది. సింహబలుడి చావు నిజం. అది తేలిపోయింది. అతడి కోరిక కాదంటే అతడి చావుకు తాను కారకురాలౌతుంది. కాని ఆమెకు తమ్ముడిమీద అలవిమాలిన మమకారం. ఔనంటే - ఆమె అంతఃపుర ధర్మాన్నీ, ఇచ్చిన మాటనూ తప్పినట్లౌతుంది. దానికితోడు కీచకుడి చావుకు పరోక్ష కారణమౌతుంది. ఆమె స్థితి 'ముందు నుయ్యి - వెనుక గొయ్యి'వలె తారసిల్లింది. కీచకుడు ఏవిధంగానైనా సైరంధ్రిని కూర్చుమంటాడు. ఏవిధంగా కూర్చయత్నించినా అతడి చావు తప్పదని ఆమెకు తెలుసు. అందువలన వలపు కారణంగా తమ్ముడు చనిపోతాడన్న తీవ్ర వేదన ఆమె కన్నులలో ధారాపాతంగా జారే కన్నీరును కలిగించింది. కాని, ఆ భావగాంభీర్యాన్ని, ఆమె మనసులోని బాధను అతడు గ్రహించలేడు. అయినా, తమ్ముడు. అందువలన ఆప్యాయంగా అతడిని పైకి లేపింది. కళ్ళనీళ్ళు మ్రింగికొన్నది. అంటే నిగ్రహించుకొన్నది. ధారలుగా కారటానికి సిద్ధమైన కన్నీరును ఆపుకొనటం ఇందలి అభినయాంశం. అనిశ్చితమైన ఆవేదన నుండి ఆమె ఒక నిశ్చిత స్థితికి వచ్చిందని రసధ్వని. మ్రొక్కుతున్న తమ్ముడికి అక్కగా మాట్లాడ నిశ్చయించటం ఆంగికాభినయంలో అశ్రువు అనే సాత్త్విక భావం చేసే ధ్వని. తరువాతి పద్యంలో వాచికాభినయం వ్యక్తం కాబోతున్నది. తిక్కన రచనలో రసాభ్యుదయ శిల్పం క్రమ పరిణామ రమణీయం. (సంపా.)

ఆ. 'ఇంత దలరనేల? యెమ్మెయినైనను। కొమ్మ నలవరించి కూర్చు టరుదె?
యుమ్మలంబు దక్కి యూఱటతోడ నీ। వేఁగు; మసలవలవ దింక నిచట. 80

ప్రతిపదార్థం: ఇంత+తలరన్+ఏల?= ఇంతగా చింతపడటమెందుకు? ఏ+మెయిన్+ఐనను= ఏవిధంగానైనా; కొమ్మన్= ఆమెను అలవరించి= సానుకూలపరచి, అంగీకరించేటట్లు చేసి; కూర్చుట= నీకు పొందుకలిగించటం; అరుదె?= కష్టమా?; ఉమ్మలంబు= విరహతాపాన్ని; తక్కి= వదలిపెట్టి; ఊఱటతోడన్= కుదుటితనంతో; నీవు+ఏఁగు= నీవు వెళ్ళుము; ఇంకన్= ఇక మీదట; ఇచటన్= ఇక్కడ (అంతఃపురంలో); మసలవలవదు= ఆలస్యం చేయవద్దు.

తాత్పర్యం: 'ఎందుకు ఇంతగా చింతిస్తావు? ఎట్లాగైనా సైరంధ్రిని ఒప్పించి నీతో పొందు కల్పించటం అసాధ్యమేమీ కాదు. మనసులోని వేదన వదలి నీవు ఊరటపొంది ఇంటికి వెళ్ళిపొమ్ము? ఇక్కడ మసలవద్దు.'

విశేషం: సుదేష్ణ నిపుణురాలు. కీచకుడిని ఊరట పరచకపోతే ఆ ప్రదేశాన్ని వీడిపోడు. మొదట అతడిని తిరిగి పంపాలి. ఆ ఉపాయం అతడికి నచ్చేటట్లు ఉండాలి. రాబోయే పద్యం దానికి తార్కాణం.

క. ఆసవమున కని నీదు ని। వాసమునకు దివములో నవశ్యంబును నే
నా సుదతిం బుత్తెంతు ని। జాసక్తి ఫలింపఁ గొఱలు మభిమత కేళిన్.' 81

ప్రతిపదార్థం: ఆ సుదతిన్= ఆ సైరంధ్రిని; ఆసవమునకున్+అని= మద్యానికని (మద్యం తెచ్చే మిషతో అని భావం); నీదు నివాసమునకున్= నీ ఇంటికి; దివములోన్= పగటిపూట; అవశ్యంబును= తప్పకుండా; పుత్తెంతున్= పంపుతాను; నిజ+ఆసక్తి= నీ కోరిక; ఫలింపన్= సమకూరేటట్లు; అభిమతకేళిన్= ఇష్టమైన క్రీడను; కొఱలుము= పొందుము.

తాత్పర్యం: నేను ఈ రోజు ముగిసేలోగా మద్యం తీసికొనిరమ్మని సైరంధ్రిని నీ మందిరానికి తప్పక పంపుతాను. అప్పుడు నీ యిష్టం ప్రకారం విలాసంగా నీ కోరిక నెరవేర్చుకొనుము.'

విశేషం: 1. సుదేష్ణ మాటలను తిక్కన మూలంలోకంటె సందర్భోచితంగా మార్చాడు.

"పర్వణి త్వం సముద్దిశ్య సురామన్నం చ కారయ । తత్రైనాం ప్రేషయిష్యామి సురాహారీం తవాన్తికమ్॥
తత్ర సంప్రేషితా మేనాం విజనే నిరవగ్రహే । సాన్త్వయేథా యథాకామం సాన్త్వమానా రమేద్ యది॥

(సం.4.14.5-6)

పండుగనాడు కీచకుడు సుదేష్ణకొరకు రుచ్యమైన ఆహారాలను, మద్యాలను తయారుచేయించాలట! వాటిలో సురను తెప్పించుకొనే నెపంతో సుదేష్ణ సైరంధ్రిని కీచకుడి మందిరానికి పంపుతుందట! ఆమె అక్కడికి వెళ్ళినప్పుడు అతడు ఆ ప్రాంతంలో జనులెవ్వరూ లేకుండా చూచుకొనాలట! ఎటువంటి ఆటంకాలూ లేని తావును ఎన్నుకోవాలట! అక్కడ అతడు తన కోరికమేరకు ఆమెను ఒప్పించాలట. ఆమె ఇష్టపడితే ఆమెతో భోగించాలట! - ఇది మూలంలో సుదేష్ణ చెప్పిన వ్యూహం. తెలుగులో అది మారింది. ఎప్పుడో వచ్చే పండుగకొరకు సుదేష్ణ ఆగలేదు. ఆ పగలు తెల్లవారే లోపల పంపుతానన్నది. తెచ్చేది సుర కాబట్టి అన్నం వండవలసిన పనిలేదు. పండుగే లేదు కాబట్టి పంచభక్ష్యపరమాన్నాల ప్రసక్తి తెలుగులో రాలేదు. కీచకుడు తయారుచేసిన ఆసవాలూ, వాటి నంజుళ్ళూ సుదేష్ణ కోరిక మీద చేసినవి కావు. అతడి వలపు తెలపటానికి చేసినవి మాత్రమే. సైరంధ్రి కీచకుడి మందిరానికి వెళ్ళినప్పుడు ఆమె నతడు ఒప్పించాలనీ, అంగీకరిస్తేనే ఆమెను పొందాలనీ సూచించింది. ఆ మాటలు తెలుగులో లేవు. ఆమె నంగీకరింపచేసే బాధ్యత తెలుగు భారతంలో సుదేష్ణ తీసికొన్నది. ఈ మార్పులో ఒక లోతైన ఆలోచన సుదేష్ణ మనసులో ఉన్నట్లు తిక్కన చిత్రించాడు. ముందు ముందు అది ఆవిష్కృతమౌతుంది. వ్యాసుడి సుదేష్ణకంటె తిక్కన సుదేష్ణ గడుసరి. (సంపా.)

2. దినము : దినము అని పాఠాంతరము; నిజశబ్దానికి యుష్మదర్థము, అస్మదర్థమూ రెండూ తిక్కన వాడాడు. (విరాటపర్వం 2-263)

కీచకుండు ద్రౌపదియందలి మోహంబునఁ బరితపించుట (సం. 4-14-7)

వ. అనిన విని కీచకుండు ముదిత హృదయుండయి నిజసదనంబునకుం జని వివిధ మధురసంబు లొనరించి, సముచిత ఖాద్యంబులు సమకట్టి, తత్ప్రదేశంబు విజనంబు గావించి, యొక్క రమ్యస్థలంబుననుండి పాంచాలివలని తగులు చిత్తంబు నుత్తలపఱుపం దలరి నెవ్వగల కగపడి తలపోఁతలకుం జొచ్చి దుర్విదగ్ధుండు గావున నమ్ముగ్ధకుం దన సన్నిధిఁ గామ వికారంబు వుట్టుట గలుగ భావించుచు. 82

ప్రతిపదార్థం: అనినన్+విని= అని సుదేష్ణ చెప్పగా విని; కీచకుండు; ముదిత హృదయుండు+అయి= సంతోషించిన మనస్సు గలవాడయి; నిజసదనంబునకున్= తన మందిరానికి; చని= వెళ్ళి; వివిధ మధురసంబులు= అనేక రకాలైన మద్యాలను, ఒనరించి= తయారుచేసి; సముచిత ఖాద్యంబులు= వాటికి తగిన తినుబండారాలను; సమకట్టి= సిద్ధపరచి; తద్+ప్రదేశంబు= ఆ స్థలాన్ని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విజనంబు+కావించి= జనులు లేనట్లుగా చేసి; ఒక్క రమ్యస్థలంబునన్= ఒక మనోహర ప్రదేశంలో; ఉండి; పాంచాలివలని= ద్రౌపదిపట్లగల; తగులు= మోహం; చిత్తంబున్+ఉత్తలపఱుపన్= మనస్సును ఉద్వేగపరచగా; తలరి= చలించి; నెఱ+వగలకున్= మిక్కిలి చింతలకు; అగపడి= లోనై; తలపోఁతలకున్+చొచ్చి= పరిపరివిధాలైన ఊహాలలో ప్రవేశించి (మనసు చొప్పించి); దుర్విదగ్ధుండుకావునన్= అవివేకి కావటం వలన; ఆ+ముగ్ధకున్= ఆ ముద్దరాలికి, ఆ సైరంధ్రికి; తన సన్నిధిన్= తన ఎదుట దగ్గరగా ఉన్న వేళలో; కామవికారంబు+పుట్టుట= (ఆమెలో) కామ (రతి) భావం పుట్టటం; కలుగన్= సాక్షాత్తు కంటిముందు కనపడుతున్నట్లు అనుభవిస్తున్నట్లు; భావించుచున్= తన్మయత్వంలో తనలో తాను ఊహించుకొంటూ.

తాత్పర్యం: సుదేష్ణ మాటలకు సంతోషపడి తన మందిరానికి వెళ్ళి పలురకాలైన మద్యాలను, వాటి కనుగుణంగా తినే భక్ష్యాలను సిద్ధపరచి, ఆ మందిరపు చుట్టుపక్కల జనం లేకుండా చేసి, ఒక మనోహర ప్రదేశంలో కూర్చుండి, అవివేకి కావడం వలన సైరంధ్రి తన దగ్గరకు చేరినట్లు, (తన దర్శనస్పర్శనాదులవలన) ఆమెలో మన్మథభావాలు రేకెత్తినట్లు, అవి తన కన్నులకు కనపడుతున్నట్లు, తన్మయత్వంలో భావించి ఆ భావనలో రమిస్తూ - (ఇట్లా అనుకొన్నాడు.)

విశేషం: ఈ సన్నివేశం అమూలకం. తిక్కన ప్రతిభాజన్యమైన రమణీయ రంగ పరికల్పనం. ఇందులో కీచకుడు భావుకుడుగా, రసికుడుగా, శృంగారనాయక లక్షణ విశిష్టుడుగా పఠితలకు పరిచయమౌతాడు. భావి శృంగారనాయకులకు వెలుగుబాట చూపిస్తాడు. తిక్కన కవితా శిల్పమంతా ఇతడి నోట పుక్కిటపట్టించినట్లు సన్నివేశం మధురంగా చిత్రించబడింది. విచిత్ర మేమంటే- ఇది భౌతికరంగం కాదు: భావనాలోకంలో సాక్షాత్తూ ప్రత్యక్షంగా అనుభవిస్తున్నట్లు కాల్పనిక, స్వాప్నిక దర్శనం వలె భాసించే రంగం. సంకల్పం అనే మదనావస్థలో ఇదొక మధురతరంగం. (సంపా.)

సీ. **'కేలిమై నొక్కట లీలఁ గ్రేళ్ళుఱికెడు । వాలుగు సోగల నేలుదెంచి,**
కరువలి సుడియమిఁ గందక చెన్నొందు । నెఱవిరితమ్ముల నుఱక తెగడి,
బెడఁగొందఁ దుడిచి మైఁ దొడసిన వలరాజు । వాలిక తూపులఁ దూలఁ దోలి,
పొలపంబు మెఱసి దిక్కులఁ గాంతి పూరించు । క్రొక్కారు మెఱుఁగుల నుక్కడంచి,

తే. **తన విలోచనములు నాదు మనము నాఁచి । కొనఁగ నయ్యింతి ననుఁ గనుఁగొనియె, నాత్మఁ**
గై కొనియె, రాగ రసమునఁ గడలుకొనియె । మదన వికృతి బయల్పడ నుదిలకొనియె. 83

ప్రతిపదార్థం: ఆ+ఇంతి= ఆ సైరంధ్రి; లీలన్= విలాస చేష్టతో; కేలిమైన్= క్రీడగా; ఒక్కటన్= ఒక్కసారిగా; క్రేళ్ళు+ఉఱికెడు= ఎగిరిపడే; వాలుగుసోగలన్= వాలుగ చేపల పొడవును; ఏలు+తెంచి= తగ్గించి; కరువలి= గాలి; సుడియమిన్= వీచకపోవటం వలన; కందక= వాడిపోక; చెన్ను+ఒందు= అందంగా వెలిగే; నెఱ విరి తమ్ములన్= నిండుగా వికసించిన కమలాలను; ఉఱక= లెక్కపెట్టకుండా; తెగడి= తిరస్కరించి; బెడఁగు+ఒందన్= అందం కలిగేటట్లు; తుడిచి= శుభ్రంచేసి; మైన్+తొడసిన= ఆకారాన్ని కడిగిన; వలరాజు వాలికతూపులన్= మన్మథుని వాడిబాణాలను; తూలన్+తోలి= తిరస్కరించి; పొలపంబుమెఱసి= కాంతి జిగేలుమని; దిక్కులన్+కాంతిపూరించు= దిక్కులను వెలుగుతో నింపివేసే; క్రొత్త+కారుమెఱుఁగులన్= వర్షాకాలపు తొలికారు మెఱుపుల యొక్క; ఉక్కు+అడంచి= గర్వం పోగొట్టి; తన విలోచనములు= సైరంధ్రి కనులు; నాదు మనమున్= నా మనస్సును; ఆఁచికొనఁగన్= ఆకట్టుకొనగా; ననున్+కనుఁగొనియెన్= నన్ను చూచింది; ఆత్మన్+కైకొనియెన్= మనస్సు హరించింది; రాగరసమునన్= వలపురసంతో; కడలుకొనియెన్= ఉప్పొంగింది; మదనవికృతి= రతిభావం; బయల్పడన్= బయటపడేటట్లు; ఉదిలకొనియెన్= వేగిరపడుతుంది (ఉత్తలపాటు పొందుతుంది.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'విలాస క్రీడగా ఒక్కసారి పైకి కుప్పించి ఎగిరే వాలుగ చేపల పొడుగరితనాన్ని శాసించి ఆ సైరంధ్రి తన చూపులతో నా మనస్సును దోచుకొనేటట్లు నన్ను చూచింది; గాలి కొట్టకపోవటం చేత చెక్కుచెదరకుండా నిలిచి అందాలను విరజిమ్మే వికసించిన పద్మాలను తిరస్కరించేటట్లు చూచి నన్ను లోబరచుకొన్నది; అందం అతిశయించేటట్లు శుభ్రం చేసి బాగా కడిగిపెట్టిన మన్మథుడి వాడి బాణాలను ఓడించిన చూపులతో చూచి నన్ను రాగరసంలో పొంగులు వారేటట్లు చేసింది. కాంతి మిరుమిట్లు కొలిపేటట్లు దిక్కులనిండా మెరిసే తొలకరి మెరుపుల గర్వాన్ని అణచిన చూపులతో మదనవికారం ప్రకటితమయ్యేటట్లు చూచి నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

విశేషం: అలం: క్రమాలంకారం. మాలోపమ. 1. సీసపద్యపాదాలలోని చూపుల లీలలతో ఆమె సాధించిన వలపు చర్యలు ఎత్తుగీతిలో వరుసగా చెప్పబడ్డాయి. వాటితో క్రమంగా అన్వయం కలిగింది. కాబట్టి క్రమాలంకారం లేదా యథాసంఖ్యాలంకారం.

2. ఇందులో సైరంధ్రి చూపుల విలాస వైభవం వర్ణితం. అది మాలోపమాలంకారంలో ప్రదర్శితం. చేపలవలె విశాలంగా ఉండి వాటికంటె లీలావిలాసంలో మిన్న అయిన చూపులు మనసును ఆకర్షిస్తాయి. ఆకర్షించి ఆమె కీచకుడి వద్దకు సమీపిస్తుంది. గాలికి కదలని పద్మాలవలె తదేకదృష్టితో వికసించిన పద్మాలవంటి కన్నులను అతడిమీదనే నిలిపి అభిలాషను వ్యక్తం చేస్తుంది. ఆ చూపులు అతడి హృదయాన్ని కైవసం చేసుకొంటాయి. అంటే నాయిక కౌగిలికి సమీపించిందని భావం. కడిగి తుడిచి వాడిచేసిన మదన బాణాలకంటె వాడి అయిన చూపులను ఆసక్తితో ప్రసరించి అతడిని కన్నులతో జుర్రుకొంటుంది. ఆ చూపులు అతడిని రాగరసంలో ముంచితేలుస్తాయి. తొలకరి మెరుపులవంటి కాంతి తళతళలను మించిన వెలుగులు వెదచల్లే చూపులతో చూస్తూ మనసులోని రతి కోర్కెను ప్రదర్శిస్తూ అతడిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. దూరంగా చూచినది మొదలు మదన ప్రీతి కలిగించేవరకు ఒక శృంగారనాయిక ప్రసరించే చూపుల విలాసవైభవాలను, తత్ప్రభావాలను మాలోపమాలంకారంతో ఆవిష్కరించిన ఈ పద్యం కీచకుడి కాల్పనికభావనాశక్తికి (Romantic imagination) చక్కని ఉదాహరణం.

3. దృఙ్మీలన మనే మదనావస్థను స్మరణలో కీచకుడు పునశ్చరణం చేయటం వలన అతడి మనసులోని రతిభావం ఉద్దీప్తమౌతుంది. రసాభ్యుదయశిల్పంలో ఇది ఒక శిల్పం. (సంపా.)

ఉ. చిత్తము మెచ్చి నావలనఁ జిక్కఁగ వెండియు నా లతాంగి య
చ్చొత్తిన యట్లు నాకుఁ దన యుల్లము దెల్లము సేయకున్కిఁ దా
నత్తఱిఁ గ్రొత్తకాన్పగుట నడ్డము సొచ్చిన సిగ్గుపెంపు త
న్నుత్తలమందఁ జేయుటకునో తలపోసి యెఱుంగ నయ్యెదన్.' 84

ప్రతిపదార్థం: చిత్తము మెచ్చి= మనసుపడి; నా వలనన్+చిక్కఁగన్= నా యందు ఆసక్తిని చూపగా; వెండియున్= అంతేగాక; ఆ లతా+అంగి= ఆ సైరంధ్రి; అచ్చు+ఒత్తిన+అట్లు= అచ్చు గ్రుద్దినట్లు విస్పష్టంగా; నాకున్= నాకు; తన ఉల్లము= తన మనస్సు; తెల్లము+చేయక+ఉన్కిన్= బయట పెట్టక పోవటం వలన; తాను+ఆ+తఱిన్= తాను ఆ సమయంలో; క్రొత్త కాన్పు+ అగుటన్= క్రొత్తగా చూడటం జరిగదంవల్ల; అడ్డము+చొచ్చిన= అడ్డుపడిన; సిగ్గు పెంపు= అధికమైన సిగ్గు; తన్ను= తనను; ఉత్తలము+అందక+చేయుటకునో= కలవరపాటును కలిగించినందువల్లనో ఏమో; తలపోసి+ఎఱుంగన్+అయ్యెదన్= భావించి తెలిసికోలేకపోయాను.

తాత్పర్యం: సైరంధ్రి మనస్సు నా మీద లగ్నమైనప్పటికీ తన భావం నాకు స్పష్టంగా వెల్లడి చేయలేకపోయింది. దానికి కారణం ఉన్నది. తానప్పుడు నన్ను మొదటిసారి చూడటం వలన సిగ్గు బాగా అడ్డుపడి తనకు తత్తరపాటు కలిగించి ఉండటం కావచ్చునేమో! అప్పుడు నేను దానిని గురించి ఆలోచించలేకపోయాను.'

విశేషం: కీచకుడు తన దుర్విదగ్ధత్వాన్ని మరొకసారి ప్రదర్శిస్తున్నా డీ పద్యంలో. ఒక వాస్తవాన్ని విపరీతంగా వ్యాఖ్యానించటం దుర్విదగ్ధత్వం. కీచకుడిని చూచి సైరంధ్రి భయపడింది. అతడిపై కోపగించుకొన్నది. అతడి ప్రవర్తనకు అసహ్యించుకొన్నది. మొదట మాటాడకుండా ఉండిపోయింది. ఈ చర్యల కన్నింటికీ తొలిచూపు వలన కలిగిన సిగ్గు కారణమని దుర్వ్యాఖ్యానం చేయటం ఈ పద్యంలో గమనించవచ్చును. (సంపా.)

తే. **అనుచుఁ గొందలపడు కోర్కె లగ్గలించి । చిఱ్ఱుముఱ్ఱాడుచుండ నచ్చెలువ చెలువు**
తగిలి తన యిచ్చఁబాఱు చిత్తంబు పజ్జ । నరిగి యిట్లను నక్కీచకాధముండు. 85

ప్రతిపదార్థం: అనుచున్= ఆ విధంగా అంటూ; ఆ+కీచక+అధముండు= నీచుడైన ఆ కీచకుడు; కొందలపడు= కలతపడే; కోర్కెలు+అగ్గలించి= కోర్కెలు అధికమై; చిఱ్ఱుముఱ్ఱు+ఆడుచున్+ఉండన్= పెనగులాడుతూ ఉండగా; ఆ+చెలువ చెలువు= ఆ సైరంధ్రి సొగసునందు; తగిలి= తగుల్కొని; తన+ఇచ్చన్+పాఱు= దాని ఇష్టప్రకారం పరుగెత్తే; చిత్తంబుపజ్జన్= మనస్సు వెంట; అరిగి= వెళ్ళి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అట్లా అంటూ అధముడైన ఆ కీచకుడు కలతపెట్టే తన కోర్కెల విజృంభణానికి సంక్షోభపడి కొట్టుమిట్టాడుతూ తన మనసు సైరంధ్రి సొగసులో చిక్కుకొని యథేచ్ఛగా విహరిస్తూ ఉండగా దానివెంట నడుస్తూ ఈ విధంగా అనుకొన్నాడు.

విశేషం: 'మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః,' అనే సూక్తి స్మరణీయం. కీచకుడు మనస్సుమీది నిగ్రహాన్ని కోల్పోయి మదనావేశంతో ప్రలాపమనే మదనచేష్టను ప్రదర్శించాడు. తిక్కన అతడి ప్రలాపాన్నికూడా కాల్పనిక కళా సుందరంగా చిత్రించాడు. (సంపా.)

సీ. **'లీల నాముందట నా లేమ పొలసినఁ । జూడ్కికిఁ జుబ్బనచూఱగాదె!**
కనువిచ్చి నన్ను నా తనుమధ్య సూచినఁ । దనువున కమృతసేచనము గాదె!
చిఱునవ్వు బెరయ నచ్చెలువ నా తోడఁ బ । ల్కినఁ జెవులకు రసాయనము గాదె!
యెలమి నమ్మెలఁత నన్నేలయింపఁ దివిరిన । నెడఁద కానందంబు నిక్క గాదె!

తే. **యా నితంబిని మక్కువ ననఁగి పెనఁగి । యింపు పొంపిరివోవ న న్నేలికొనఁగఁ**
దలఁచి పొందిన నది జన్మఫలము గాదె!' యనుచు వలరాజు బారికి నగ్గమయ్యె. 86

ప్రతిపదార్థం: ఆ లేమ= ఆ వనిత, సైరంధ్రి; లీలన్= విలాసంగా; నా ముందటన్= నా ఎదుట; పొలసినన్= తిరిగితే; చూడ్కికిన్= నా చూపునకు; చుబ్బనచూఱకాదె!= కన్నులతో జుర్రుకొన్న సంబరం కాదా!; ఆ తనుమధ్య= సన్నని నడుముగల ఆమె; కనువిచ్చి= కళ్ళు తెరచి; చూచినన్= చూస్తే; తనువునకున్= శరీరానికి; అమృతసేచనము+కాదె!= అమృతంలో తడిసినట్లేకదా!; ఆ+చెలువ= ఆమె; చిరునవ్వు బెరయన్= చిరునవ్వు చిందించగా; నాతోడన్+పల్కినన్= నాతో మాట్లాడితే చాలు; రస+అయనము కాదె!= శ్రవణానందం కాదా, చెవులకు పండుగ కాదా!; ఆ+మెలఁత= ఆమె; ఎలమిన్= సంతోషంతో; నన్నున్+ఏలయింపన్= నన్ను పొందడానికి; తివిరినన్= ప్రయత్నించినట్లయితే; ఎడఁదకున్= హృదయానికి; ఆనందంబు+ఇక్క= ఆనందానికి చోటు; కాదె?= కాదా!; ఆ నితంబిని= ఆ స్త్రీ; మక్కువన్= ప్రేమతో; అనఁగి పెనఁగి= వశమై క్రీడించి; ఇంపు= ప్రేమ; పొంపిరిపోవన్= అతిశయించగా; నన్ను+ఏలికొనఁగన్= నన్ను భర్తగా మన్నించటానికి; తలఁచి= తలపోసి; పొందినన్= కూడితే; అది జన్మఫలము కాదె!= అది పుట్టుకకు సార్థకం కాదా!; అనుచున్= అంటూ; వలరాజు బారికిన్= మన్మథుడి బారికి; అగ్గమయ్యెన్= వశమయ్యాడు.

తాత్పర్యం: 'ఆ సుందరి నా ముందు విలాసంగా మసలితే చాలు - నా చూపులు జుర్రుకొనే ఆనందం కలిగినట్లే. నన్ను కన్ను తెరచి చూస్తే చాలు - నా శరీరానికి అమృతాభిషేకం చేసినట్లే. ఆమె చిరునవ్వు చిందిస్తూ మాట్లాడితే చాలు - నాకు శ్రవణానందాన్ని అందించినట్లే. ఆ వనిత నన్ను సంతోషపెట్టా లనుకొంటే చాలు - పరమానందం సిద్ధించినట్లే. ఆమె వలపుతో కలసి మెలసి నన్ను పొందితే చాలు - ఈ పుట్టుక నెత్తినందుకు ఫలాన్ని పొందినట్లే' అని అనుకొంటూ కీచకుడు మన్మథుడికి వశమైపోయాడు.

విశేషం: 1.అలం: అంత్యానుప్రాసం. ప్రతిపాదం చివర 'కాదె!' అనే ఆశ్చర్యార్థకాన్ని పునరావృత్తం చేయటం వలన ప్రలాప స్వభావం ప్రసన్నమౌతున్నది.

2. తిక్కన తన పద్యాలలో పాటించిన శిల్ప రహస్యాలను అక్కడికక్కడ వెంటనే సూచించే స్వభావం కలవాడు. ఈ ఘట్టంలో రచించిన పద్యాలలో గమనించదగిన అంశంగా రాబోయే వచనంలో 'అనంగ విభ్రమములకు అనుగుణమైన అనేకవిధాల ప్రలాపాలతో ప్రొద్దుపుచ్చుతున్నట్లు' చెప్పాడు. దీనినిబట్టి - కీచకుడు సైరంధ్రి ప్రదర్శించినట్లుగా తాను భావిస్తున్న శృంగార హావ భావాలకు అనుగుణంగా అతడు ప్రలాపాలు చేస్తున్నాడన్నమాట. ప్రలాపాలంటే సామాన్యార్థంలో అర్థరహితాలైన మాటలు పలకటమని గ్రహించవచ్చును. కాని, ఇక్కడ అది పారిభాషిక పదంగా వాడబడింది. దశవిధ శృంగారావస్థలకు మరి రెండింటిని చేర్చాడు ప్రతాపరుద్రీయంలో విద్యానాథుడు. అవి ప్రలాపం, (సం)జ్వరం. "ప్రలాపం: ప్రియ సంశ్లిష్ట గుణాలాప ఉదాహృతః" అని ప్రియ (యా) గుణస్తుతి ప్రలాపమని చెప్పాడు. జ్వరమంటే అధిక మదనతాపంగా పేర్కొన్నాడు. ఈ పద్యంలో కీచకుడు తన ప్రియురాలుగా భావిస్తున్న సైరంధ్రి యొక్క శృంగార విలాసాలు తనలో కలిగించే అనుభవ విశేషాలను పేర్కొంటూ ప్రలాపాలు (గుణకీర్తనలు) చేశాడు. సాన్నిహిత్యం, దృష్టిప్రసారం, పలుకరింపు, విలాసం, సంయోగం - అనే నాయికా శృంగార విభ్రమాల విశేషఫల వర్ణనమే ఈ ప్రలాపరూప పద్యశిల్పం. (సంపా.)

వ. మఱియు ననేకభంగుల ననంగ విభ్రమంబుల కనురూపంబులైన బహువిధ ప్రలాపంబులం బ్రొద్దుగడుపుచు నమ్మదిరాక్షిరాక కెదురు చూచుచుండె; నక్కడ పాంచాలి రావించి సుదేష్ణ తృష్ణ భావించుచు నిట్లనియె. 87

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; అనేకభంగులన్= అనేకవిధాలుగా; అనంగ విభ్రమంబులకున్= మదన విలాసాలకు; అనురూపంబులు+ఐన= తగిన; బహువిధ ప్రలాపంబులన్= పలు రకాల పలవరింతలతో, (ఒకవిధమైన మదనావస్థతో); ప్రొద్దు+కడుపుచున్= ప్రొద్దుపుచ్చుతూ; ఆ+మదిరాక్షి= ఆ సైరంధ్రి యొక్క; రాకకున్= రావటానికి; ఎదురుచూచుచున్+ఉండెన్= ఎదురుచూస్తూ ఉన్నాడు; అక్కడ= రాణి మందిరంలో; సుదేష్ణ= సుదేష్ణాదేవి; పాంచాలిన్+రావించి= సైరంధ్రిని పిలిపించి; తృష్ణ భావించుచున్= మద్యం త్రాగాలనే దప్పికను నటిస్తూ; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అక్కడ ఈ విధంగా కీచకుడు మన్మథ భావాలకు అనుగుణమైన పలవరింతలు ప్రలాపాలు చేస్తున్నాడు. ఆమె రాకకు ఎదురు చూస్తున్నాడు. ఇక్కడ అంతఃపురంలో సుదేష్ణ సైరంధ్రిని రావించి మద్యం త్రాగాలనే దప్పికను నటిస్తూ ఇట్లా అన్నది.

విశేషం: కృత్రిమ పిపాసను సుదేష్ణ చక్కగా నటించింది. ఇక్కడ మదిరాక్షి అని సైరంధ్రిని వర్ణించటం సాభిప్రాయం. ఆమె మదిరకోసం తన ఇంటికి రావాలి; కాబట్టి ఆమె మదిరాక్షి వలె వస్తుందని కీచకుడి భావన.

క. 'ఒదవెడు తృష పెల్లిదమున। వదనము వఱువట్లు వట్టె వాసిత రాజ
న్మదిరారస మానఁగ నా। హృదయంబున వేడ్క యెసకమెసఁగెడుఁ దరుణీ! 88

ప్రతిపదార్థం: తరుణీ!= ఓ వనితా!; ఒదవెడు= కలుగుతున్న; తృష పెల్లిదమునన్= దప్పిక యొక్క ఆధిక్యంచేత; వదనము= నోరు; వఱువట్లు+పట్టెన్= మిక్కిలి ఎండిపోయింది; వాసితరాజత్+మదిరారసము= సువాసనతో కూడిన సురను; ఆనఁగన్= త్రాగటానికి; నా హృదయంబునన్= నా మనస్సులో; వేడ్క= కోరిక; ఎసకమెసఁగెడున్= అధికమవుతున్నది.

తాత్పర్యం: 'ఓ తరుణీ! దప్పిక ఎక్కువగా ఉండి నా నోరు ఎండిపోతున్నది. చక్కని సువాసనతో కూడిన మదిరను తాగాలని నామనస్సు తీవ్రంగా వేడుక చూపుతున్నది.

విశేషం: సంభాషణ లెక్కువ, కథ చెప్పే తీరు తక్కువ. అంతా రూపకంలోని పాత్రలవలె సుదేష్ణ. సైరంధ్రి రంగస్థలంపై ప్రదర్శించినట్లు కళ్ళకు కట్టిస్తున్నాడు తిక్కన.

క. కీచకుని యింట నెప్పుడు। వాచవి యగు బహువిధముల వారుణి గలుగున్
వే చని యచటికిఁ గొని ర। మ్మా చూతముగాని నీ గమన వేగంబున్. 89

ప్రతిపదార్థం: ఎప్పుడున్= ఎల్లవేళల; కీచకుని+ఇంటన్= కీచకుడి ఇంట్లో; వాచవి+అగు= రుచికరాలైన; బహువిధముల= పలు రకాలైన; వారుణి= మద్యం; కలుగున్= ఉంటుంది; అచటికిన్= అక్కడకు; వే+చని= త్వరగా వెళ్ళి; కొనిరమ్మా= తీసికొని రావాలి; నీ గమనవేగంబున్= నీ వెంత త్వరగా వెళ్ళి వస్తావో; చూతముగాని= చూద్దాంగా.

తాత్పర్యం: కీచకుడి ఇంట్లో ఎప్పుడూ మంచి రుచిగల మద్యం ఉంటుంది. నీవు త్వరగా వెళ్ళి తీసికొని రావాలి. నీ వెంత త్వరగా వెళ్ళి వస్తావో చూద్దాం.

వ. అనవుడు. 90

తాత్పర్యం: అనగా.

ఉ. ఉల్లము దల్లడిల్లఁ దను వుద్గత ఘర్మజలంబు దాల్చుచున్
డిల్లపడంగ 'నా కిది కడింది విచారము పుట్టె; నందుఁ బో
నొల్ల ననంగ రా, దచటి కూరక పోవను రాదు, నేర్పు సం
ధిల్లఁగ దీనిఁ బాపికొను దీమస మెట్టిది యొక్కొ దైవమా!' 91

ప్రతిపదార్థం: ఉల్లము= మనస్సు; తల్లడిల్లన్= అల్లాడిపోగా; తనువు= శరీరం; ఉద్గత ఘర్మజలంబు= పైకుబికిన చెమటను; తాల్చుచున్= ధరిస్తూ; డిల్లపడంగన్= భయంతో నీరసపడగా; ఇది= సుదేష్ణ ఆదేశం వలన; నాకున్= (సైరంధ్రికి); కడింది విచారము= అధిక దుఃఖం; పుట్టెన్= కలిగింది; అందున్= కీచకుని ఇంటికి; పోన్+ఒల్లను= వెళ్ళటం ఇష్టం లేదు; అనంగరాదు= అనటానికి వీలుకాదు; అచటికిన్+ఊరక పోవను రాదు= అక్కడికి నిస్సహాయంగా (ఒంటరిగా) వెళ్ళటానికీ వీలులేదు; దైవమా!= ఓ భగవంతుడా!; నేర్పు+సంధిల్లఁగన్= నైపుణ్యంతో; దీనిన్= ఈ సమస్యను; పాపికొను= వదిలించుకొనే; దీమసము+ఎట్టిది+ఒక్కొ!= ఉపాయ మెటువంటిదో కదా!

తాత్పర్యం: ద్రౌపది మనసు కంపించిపోయింది. దానితో శరీరమంతా చెమటపట్టింది. పైపెచ్చు నీరసించింది. అప్పుడు ఇట్లా అనుకొన్నది; 'సుదేష్ణమాటవలన నాకు మిక్కిలి దుఃఖం కలిగింది. అయినా, నేను కీచకుడి ఇంటికి పోలేను అని అనలేను. అక్కడికి ఒంటరిగా పోనూ లేను. ఓ భగవంతుడా! ఈ చిక్కునుండి బయటపడే ఉపాయం ఏదో నీవే చూపించాలి.'

విశేషం: 1. అలం: వికల్పం. **'విరోధే తుల్య బలయో ర్వికల్పాలంకృతి ర్మతా'** అని లక్షణం. సమాన బలం గల రెండు విరుద్ధాంశాల మధ్య వికల్పాన్ని చెప్పేది వికల్పాలంకారం. సేవావృత్తిలో ఉన్న ద్రౌపది యజమానురాలి ఆజ్ఞను దాటటానికి వీలు లేదు. అంటే ఆమె కీచకుడి ఇంటికి పోవటం ధర్మం. అందువలన ఆమె వెళ్ళననటానికి ఒకవైపు వీలు లేదు. ఇక రెండవవైపు ఒంటరిగా ఆతడి మందిరానికి పోతే అతడామెను బలాత్కరించే అపాయం పొంచి ఉన్నది. కాబట్టి పోవటానికీ వీలులేదు. సేవాధర్మం స్వీయధర్మం రెండూ సమానబలం కలిగినవే. ఈ రెండింటి మధ్య సంఘర్షణ ఏర్పడింది. కాబట్టి ఆమె మనస్సు ఉయ్యాల ఊగినట్లు ఊగిసలాడుతున్నది. ఒత్తిడిలో నుండి ఉపాయం పుట్టాలి. ఒత్తిడికి తట్టుకోలేక ఉపాయం కొరకు ఆమె నిస్సహాయతతో భగవంతుడిని స్మరించింది. ద్రౌపది ఎప్పుడు భగవంతుడిని స్మరించినా అతడి అనుగ్రహం పిలిచినట్లు పలుకుతుంది. ఇది ఆమె చరిత్రలో కాదనలేని సత్యం. కథలో ఏర్పడే సన్నివేశాలలో అంతర్గర్భితంగా భగవద్రక్ష కొనసాగుతుందని కథార్థధ్వని.

2. మరొక విశేషం: వ్యాసభారతంలో ఈ మనస్సంఘర్షణ లేదు. మూలంలో ద్రౌపది సూటిగా, మూలంగా ధర్మావేశంతో మాట్లాడుతుంది.

"న గచ్ఛేయ మహం తస్య రాజపుత్రి ! నివేశనమ్ । త్వ మేవ రాజ్ఞి! జానాసి యథా స నిరపత్రపః।" **(సం.4.14.11)** ఓ రాజపుత్రీ! నేను కీచకుడింటికి పోను, ఓ రాజ్ఞీ ! అత డెంత లజ్జలేనివాడో నీకు తెలియదా?' అని కుండబ్రద్దలు కొట్టినట్లు మాట్లాడుతుంది. అది సమయోచిత సంభాషణావైఖరి కాదు. అంతర్మథనం. అది కథార్థాలను రక్తి కట్టిస్తుంది. తిక్కన నాటకీయతకు, రసపోషణకు ఈ అమూలక కల్పనం అమూల్యోదాహరణం. (సంపా.)

వ. అని తలంచుచు డోలాందోళితమానస యగుచు నమ్మానిని సుదేష్ణ కిట్లనియె. 92

ప్రతిపదార్థం: అని తలంచుచున్= అని తలపోస్తూ; డోలా+ఆందోళితమానస= ఉయ్యాలవలె ఊపబడే మనస్సు కలది; అగుచున్= అవుతూ; ఆ+మానిని= ఆ కాంత (ద్రౌపది); సుదేష్ణకున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అని ఆలోచిస్తూ ఉయ్యాలవలె ఊగిసలాడే మనస్సుగల సైరంధ్రి సుదేష్ణతో ఇట్లా అన్నది.

ఉ. 'ఉత్పలగంధి! నన్నుడుగు, మొడ్లను బంపుము కల్లుదేర; నే
సత్పథవృత్తి నీ కడన సంతతమున్ బహుమానపాత్రనై
తత్పరతం జరించి యుచితంపుఁ బనుల్ దగఁ జేయఁ గాక దు
ష్కృత్పరివారయోగ్య పరిచారముమైఁ జను నట్టి దాననే? 93

ప్రతిపదార్థం: ఉత్పలగంధి!= కలువల సౌరభంగల శరీరం గలదానా!; నన్నున్+ఉడుగుము= నన్ను వదలిపెట్టుము (విడువుము); కల్లుతేరన్= కల్లు తీసికొనిరావటానికి; ఒడ్లను= ఇతరులను; పంపుము; ఏన్= నేను; సత్పథవృత్తిన్= సన్మార్గ ప్రవర్తనంతో; సంతతమున్= ఎల్లప్పుడును; నీ కడన్+అ= నీవద్దనే; బహుమానపాత్రను+ఐ= గౌరవార్హురాలినై; తత్పరతన్= ఆసక్తితో; చరించి= మెలగి; ఉచితము+పనుల్= తగినపనులను; తగన్+చేయన్+కాక= సరిగా చేయటానికే గాని; దుష్కృత్ పరివారయోగ్య పరిచారముమైన్= నీచ సేవకులకు తగిన పనికై; చను+అట్టిదాననే?= వెళ్ళేటిదాననా?

తాత్పర్యం: 'ఓ వనితా! నన్ను వదలిపెట్టుము. కల్లు తీసికొనిరావటానికి ఇంక ఎవ్వరినైనా పంపుము. నీ దగ్గర నే నెప్పుడూ సన్మార్గవర్తినై సమ్మానార్హమైన కార్యాన్ని మాత్రమే చేసే దానినే గాని, ఇట్లా నీచ పరిచారికలు చేయదగిన పనులు చేసేదానినా? (కాదు).

విశేషం: పూలు ముడిచే సుకుమారమైన పని చేస్తానే గాని, కల్లు తీసికొనిరావటం వంటి నీచపు పనులు చేయనని మహారాణి కొలువులో చేరేటప్పుడే సైరంధ్రి చెప్పింది. ఇప్పు డామాట ధైర్యంగా గుర్తుచేస్తున్నది.

క. అతివ! తగునమ్మ నీ గృహ। మతి నిర్మల చరితభరితమని యీ యెడ మ
త్పతుల యసన్నిధి నైనను। మతి నూఱడి యున్నచోట మన్నన దప్పన్. 94

ప్రతిపదార్థం: అతివ!= ఓ సుదేష్ణాదేవీ; నీ గృహము= మీ అంతఃపురం; అతినిర్మల చరితభరితము= అత్యంత పవిత్రమైన నడవడికచేత నిండినది; అని= అనుకొని; ఈ+ఎడన్= ఈ ప్రదేశంలో; మత్+పతుల+అసన్నిధిన్+ఐనను= నా భర్తలు దగ్గర లేకున్నా; మతిన్+ ఊఱడి= మనస్సులో ఊఱటపడి; ఉన్నచోటన్= ఉన్నప్పుడు; మన్నన+తప్పన్= గౌరవం తప్పటం; తగునమ్మ?= తగునా తల్లీ?

తాత్పర్యం: ఓ దేవీ! ఇక్కడ నీ ఇంట సదాచార సంపన్నత కలదని తెలిసి, నా భర్తలు దగ్గర లేకున్నా, నేను నమ్మకంతో సరిపెట్టుకొని ధైర్యంగా ఉంటూ ఉండగా ఈ విధంగా మర్యాద తప్పటం న్యాయమా?

ఉ. సాధులు సేరి నెమ్మిగ నిజస్థిర వృత్తము దుష్టకోటిచే
బాధలఁ బొందకుండఁ దమపాల వసించినఁ బెద్దవారు ది
క్కై ధరియించి వారికొక యాపద పుట్టకయుండఁ గాచు టొ
ప్పై ధరఁ గీర్తి కెక్కదె? యపాయము సేసిన నింద వుట్టదే? 95

ప్రతిపదార్థం: సాధులు= సజ్జనులు; చేరి= ప్రయత్నించి; నెమ్మిగన్= ప్రీతితో; నిజస్థిరవృత్తము= తమ నిశ్చల సదాచార ప్రవర్తన; దుష్టకోటిచేన్= దుర్మార్గులచేత; బాధలన్+పొందకుండన్= బాధలుపడకుండా; తమపాలన్+వసించినన్= తమను ఆశ్రయించి ఉండగా; పెద్దవారు= ఉన్నతులైనవారు; దిక్కు+ఐ= ఆధారమై; ధరియించి= పోషించి; వారికిన్= ఆశ్రయించినవారికి; ఒక ఆపద+పుట్టక+ ఉండన్= ఏవిధమైన ఆపదా కలగకుండా; కాచుట+ఒప్పు+ఐ= కాపాడటం తగినదై; ధరన్+కీర్తికిన్+ఎక్కదె?= లోకంలో ప్రశస్తి పొందదా?; అపాయం చేసినన్= కీడు కలిగిస్తే; నింద+పుట్టదే?= నింద కలుగదా?

తాత్పర్యం: సజ్జనులైనవారు తమ సత్ప్రవర్తన చెడ్డవారి చేత చెరచబడకుండా కాపాడుకొనటానికి పెద్దలను ఆశ్రయిస్తే వారు వారికి ఆశ్రయమిచ్చి, వారి యోగక్షేమాల భారం వహించి, వారికి ఎటువంటి ఆపదలు కలుగకుండా కాపాడి, అన్నివిధాల రక్షిస్తే కీర్తి పొందుతారు. అట్లాకాక వారిని అపాయానికి గురిచేస్తే నిందల పాలవుతారు.

విశేషం: శరణాగత రక్షకులైన సజ్జనుల లక్షణాలు చెప్పే ఈ పద్యం చక్కని సూక్తి. ఇందులో సజ్జనుల ప్రసక్తి పాండవులకు, పెద్దల ప్రసక్తి విరాటరాజునకు పరోక్షంగా వర్తిస్తుంది.

ఆ. ఎవ్వరేని యింటి కెద్దియే నొకటికి। నన్నుఁ బంపఁదగునె? నిన్ను నాఁడ
కొలుచునెడ ననుజ్ఞగొనన? నీచములగు। పనుల కేను జాలకునికి సెప్పి.' 96

ప్రతిపదార్థం: ఎవ్వరేని+ఇంటికిన్= ఎవరి ఇంటికైనా; ఎద్దియేన్+ఒకటికిన్= దేనికో ఒకదానికి; నన్నున్+పంపన్+తగునె?= నన్ను పంపవచ్చునా?; నిన్నున్+కొలుచున్+ఎడన్= మీ కొలువులో చేరినపుడు; నాఁడు+అ= ఆ రోజే; నీచములు+అగు పనులకున్= చెడుపనులకు; ఏను+చాలక+ఉనికి= నేను సరిపోనని; చెప్పి= విన్నవించి; అనుజ్ఞ+కొనన?= అనుమతి పొందలేదా?

తాత్పర్యం: నన్ను ఎవరింటికో ఎందుకో ఒకదానికి పంపటం భావ్యం కాదు. నేను మీకొలువులో చేరేనాడే నీచపు పనులు చేయనని మీతో చెప్పి మీ అంగీకారం పొందలేదా?'

విశేషం: 'ఎవ్వరేని యింటికిన్' - ఇది 'ఎవ్వనియేని ముఖామృతాంశుబింబమ్మున' అను వాగనుశాసనుని ప్రయోగము వంటిది. అపర్థమునకు సమాసమధ్యపాత మిట విశేషము. 'ఒకటికి నన్నుఁబంపఁ దగునె?' - ఇందలి అశ్లీలత కవినాటికి లేదని యెఱుఁగనగును. కాళిదాసు తన యభిజ్ఞాన శాకుంతలమున - దుష్యంతుఁడు తననుఁ దోడ్కొని పోవునో పోవడోయని డోలాయమాన మానసయగు శకుంతల నూరడింపజేయుటకు 'విశ్వస్తా భవ' (ఆయన చెప్పినట్లు తోడ్కొనిపోవును గాన - నమ్మకము గలదాని వగుము) అని చెలికత్తెచేఁ బల్కించినాఁడు. ఆయన కాలములో 'విశ్వస్తావిధవే సమే' అనునది ప్రచారములో నుండినచో అప్పుడే వివాహితయగు శకుంతల నట్లాశీర్వదించుట జరుగదు కదా! అట్లే మనకాలమునం దశ్లీలములుగా నొప్పు కొన్ని పదములు తిక్కనాది మహాకవుల కాలములయందు సభ్యార్థములుగనే యున్నవని యూహింపనగు. ఏ కవులైనను వారివారి కాలంబులం దశ్లీల ప్రతీతి జనకంబుల మానుదురే కాని భావికాలాశ్లీల ప్రతీతి జనకంబుల మానసాధ్యము కాదు గదా! 'ఎవ్వరేని యింటి కెద్దియే నొకటికి' ననుటచే ఈ సుదేష్ణ కపట వర్తనము ద్రౌపదికి విదితమైనట్లు గూడ స్ఫురించెడివి. అయిన నేల పోయె నన్నచోఁ దన పాతివ్రత్య మహిమచే సంరక్షితము గాఁగలనను నమ్మికచేతనని తెలియునది." (కీ.శే. పళ్ళె పూర్ణప్రజ్ఞాచార్యులు - విరాటపర్వ టిప్పణి). ఎవ్వరేని...ఎవరి ఇంటికి బడితే వారి ఇంటికి, దేనికి పడితే దానికి- అని గోప్యంగా చెప్పటంలో, అవి ఎంతటి అవాచ్యాలో తెలుస్తున్నది (సంపా.)

క. **అనిన విని యనుచితంబున। కనయము శంకించియును లతాంగి మదిన్ త**
మ్ముని వలవంత దలఁచి యి। ట్లనియెం బాంచాలితోడ సాదర వృత్తిన్. 97

ప్రతిపదార్థం: అనినన్+విని= ఆ మాటలు విని; అనుచితంబునకున్= అనువుకాని పనికి; అనయమున్= మిక్కిలిగా; శంకించియును= అనుమానపడి కూడా; లతా+అంగి= సుదేష్ణ; మదిన్= మనస్సులో; తమ్ముని వలవంత= కీచకుడి విరహ బాధను; తలఁచి= జ్ఞాపకం చేసికొని; పాంచాలితోడన్= (ద్రౌపది) సైరంధ్రితో; స+ఆదరవృత్తిన్= గౌరవభావంతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ద్రౌపది చెప్పిన మాటలు విని చెడుపనిమీద పంపుతున్నందుకు సందేహించినా తమ్ముడైన కీచకుడి విరహబాధను స్మరించి గౌరవపురస్సరంగా సుదేష్ణ ఇట్లా అన్నది.

ఉ. **'అక్కట! యేను వేడ్కపడి యానెడు నాసవ మర్థిఁ దేర నొం**
డొక్క నికృష్టఁ బంచుటకు నోపక చెప్పిన దీని నీవు గో
సెక్కఁగఁజేసి నిన్ను నతిహీన విధాన నియుక్తఁ జేతగా
నిక్కమ యుమ్మలించి; తిది నెయ్యము తియ్యము కల్మియే? సఖీ! 98

ప్రతిపదార్థం: సఖీ!= ఓ చెలీ (సైరంధ్రీ)!; ఏను= నేను; వేడ్కపడి= ముచ్చటపడి; ఆనెడు ఆసవము= త్రాగే మద్యం; అర్థిన్+తేరన్= అక్కరగా తీసికొని రావటానికి; ఒండు+ఒక్క= మరొక; నికృష్టన్= నీచ స్త్రీని; పంచుటకున్+ఓపక= పంపటం ఇష్టం లేక; చెప్పినన్= ఈ పని అప్పగిస్తే; నీవు, గోసు+ఎక్కఁగన్+చేసి= నీవు దానిని దోషంగా పెద్ద చేసి; నిన్నున్; అతిహీన విధాననియుక్తన్= మిక్కిలి నీచకార్యానికి పంపినదానిగా; చేఁత+కాన్= చేయుటమని; నిక్కము+అ= తప్పక; ఉమ్మలించితి(వి)= దుఃఖపడుతున్నావు; ఇది నెయ్యము తియ్యము= ఇది స్నేహమూ, ప్రీతీ; కల్మి ఏ?= కలిగి ఉండటమవుతుందా?

తాత్పర్యం: 'ఓ చెలీ! నేను ఎంతో మనసుపడి త్రాగే మద్యాన్ని తెచ్చేందుకు నీచస్త్రీ నెవ్వరినీ పంపటం ఇష్టం లేక నీకు చెప్పితే, నీ వేమో దాని నొకక పెద్ద దోషంగా భావించి నీచకార్యం చెప్పానని నిజంగా భావించి లోలోన బాధపడుతున్నావు. ఇది స్నేహమాధుర్యం కలిగి ఉండట మనిపించుకొంటుందా?

విశేషం: సైరంధ్రి అనుచిత కార్యమని పేర్కొన్న పనిని ఉచితమైనదని సుదేష్ణ వాదించటమే కాక - స్నేహం, ప్రీతి ఉన్నచోట ఏ పని అయినా నీచమనీ, ఉదాత్తమనీ పాటించటం పాడికాదని స్నేహధర్మమర్మాన్ని చూపుతున్నది. మాటల గడుసరితనాన్ని ప్రదర్శించింది. (సంపా.)

క. అది లాఁతియిల్లె? నినుఁ దమ। హృదయంబుల నెవ్వరేని నెఱుఁగరె? యేఁ జె
ప్పుదు నీదు పెంపు నినుఁగ। న్నది మొదలుగ నెల్లవారి కయ్యై భంగిన్. 99

ప్రతిపదార్థం: అది= ఆ కీచకుని ఇల్లు; లాఁతి+ఇల్లె?= పరాయి యిల్లు కాదు గదా?; నినున్= సైరంధ్రిని; తమ హృదయంబులన్= తమ మనస్సులలో; ఎవ్వరు+ఏనిన్+ఎఱుఁగరె?= ఎవరికైనా తెలియదా?; ఏన్= నేను; నినున్+కన్నది మొదలుగన్= నిన్ను చూసినప్పటి నుండి; ఎల్లవారికిన్= అందరికీ; ఆ+ఐ+భంగిన్= ఎన్నో విధాలుగా; నీదు పెంపు చెప్పుదున్= నీ గొప్పతనం చెప్పుతూ ఉంటాను.

తాత్పర్యం: కీచకుడి ఇల్లు నీకేమైనా పరాయి ఇల్లా? నీవు అందరి మనసులకూ ఎక్కినదానవే? (అందరూ మెచ్చేదానివే); నిన్ను చూచినది మొదలు నీలోని సద్గుణాలను అందరికీ ఎన్నో విధాలుగా చెప్పేదానిని. కాబట్టి నీవు అందరికీ తెలుసు.'

విశేషం: నా ఇల్లు ఎట్లా నిర్మలచరితభరితమో మా తమ్ముడి ఇల్లు కూడా అట్లాగే; పరాయి ఇల్లు కాదని సుదేష్ణ నమ్మబలుకుతున్నది.

క. అని మఱియుఁ బెక్కుభంగులఁ। దనుఁ బ్రార్థింపంగ ద్రుపదతనయకుఁ జిత్తం
బున'నింకఁ బెద్ద పెనఁగం। జన దీయమతోడ' నను విచారము పుట్టెన్. 100

ప్రతిపదార్థం: అని; మఱియున్= ఇంకా; పెక్కు భంగులన్= అనేక విధాలుగా; తనున్+ప్రార్థింపంగన్= సైరంధ్రిని వేడగా; ద్రుపద తనయకున్= ద్రౌపదికి; చిత్తంబునన్= మనస్సులో; ఈయమ తోడన్= ఈమెతో; ఇంకన్+పెద్ద పెనఁగన్+చనదు= ఇకపై అడ్డం చెప్పటం తగదు; అను విచారము= అనే ఆలోచన; పుట్టెన్= కలిగింది.

తాత్పర్యం: అని ఇంకా సైరంధ్రిని అనేక విధాలుగా ప్రార్థించటం చేత, ' ఈ సుదేష్ణతో ఇంకా ఎక్కువగా వాదులాడటం మంచిదికా' దనే ఆలోచన ద్రౌపదికి (సైరంధ్రికి) కలిగింది.

వ. ఇట్లు దోఁచిన తలంపునం జేసి. 101

తాత్పర్యం: ఈ విధంగా పుట్టిన ఆలోచనతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

ద్రౌపది కీచకునింటికిఁ గల్లు దేరంబోవుట (సం.4-14-17)

చ. మన మురియాడుచుండ ననుమానముతోన సుదేష్ణఁ జూచి 'నీ
వనయముఁ గోరినట్టి పని యర్థిమెయిం జని చేయుదానఁ గా'

కను తన మాట కప్పొలఁతి హర్షముఁ బొందుచు నందియిచ్చు కాం
చన చషకంబు పుచ్చికొని చారువిలోచన యార్తమూర్తియై. 102

ప్రతిపదార్థం: చారువిలోచన= అందమైన కన్నులు కలది, ద్రౌపది; మనము= మనస్సు; ఉరియాడుచుండన్= ఊగిసలాడుతూ ఉండగా; అనుమానముతోన్+అ= సందేహిస్తూనే; సుదేష్ణన్+చూచి= సుదేష్ణను చూచి; నీవు; అనయమున్+కోరిన+అట్టిపని= ఎంతో, మరిమరీ కోరిన పనిని; అర్థిమెయిన్= ప్రేమతో, ఆసక్తితో; చని= వెళ్ళి; చేయుదానన్+కాక= చేస్తానులే; అను తనమాటకున్= అనే సైరంధ్రి మాటలకు; ఆ+పొలఁతి= ఆ దేవి (సుదేష్ణ); హర్షమున్+పొందుచున్= సంతోషిస్తూ; అంది+ఇచ్చు= చేతికి అందించే; కాంచన చషకంబు= బంగారు మధుపాత్రను; పుచ్చికొని= తీసికొని; ఆర్తమూర్తి+ఐ= దీనమైన ఆకారంకలదై;

తాత్పర్యం: ద్రౌపది తన మనస్సు ఊగిసలాడుతూ ఉండగా, సందేహంగానే సుదేష్ణ వైపు చూచి, 'నీ వింతగా కోరిన పనిని నీ మీది ప్రీతితో తప్పక చేస్తాను' అని చెప్పింది. ఆ మాటకు ఆ సుదేష్ణ ఎంతో సంతోషిస్తూ తన కందించిన బంగారు పానపాత్రను తీసికొని శోకమూర్తి అయి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: సముచ్చయం. ఇది చక్కని అభినయ బంధురమైన రచన. మనసు ఊగిసలాడటం, అనుమానంతో చూడటం, నీమీది గౌరవంతో, ఇంతగా అడుగుతున్నావు కాబట్టి ఈ పని చేస్తానని ఒప్పుకొనటం, ద్రౌపది మాటలు విని సుదేష్ణ వెంటనే సంతోషంతో పొంగిపోవటం, ఆలస్యం చేయకుండా పానపాత్రను అందించటం, ద్రౌపది దానిని తీసికొనటం. అంతవరకూ అందంగా ఉన్న ద్రౌపది చూపులు ఆర్తితో నిండిపోవటం, ఆ అభినయంతో ఆమె శోకమూర్తిగా కనపడటం అనే అభినయ విశేషాలు ఒక క్రమ విన్యాసంలో నిబంధించటం ఈ పద్యంలోని నాటకీయత. ఏకకాలంలో కాదగిన (యౌగపద్యం గల) అంశాలను కూర్చి చెప్పితే సముచ్చయాలంకారం. దానిని తిక్కన ఒక క్రమవిన్యాసంతో ప్రయోగించాడు. (అభినయ వ్యాఖ్యకు రాబోయే పద్య విశేషాంశాన్ని కూడా చూడండి). (సంపా.)

వ. చనుచుండి, నీచహృదయుండగు కీచకుండు తనయెదుర నప్పుడాడిన కర్ణశూలంబులగు మాటల మీఁదం బిడుగుపడినవానిఁ గొఱవింజూఁడిన తెఱంగున సుదేష్ణ ద న్ననుచిత వ్యాపారంబునకు నియోగించుటకు నిర్వేదనంబునం బొంది. 103

ప్రతిపదార్థం: చనుచున్+ఉండి= వెళ్ళుతూ; నీచ హృదయుండు+అగు= నీచమైన మనస్సు గల; కీచకుండు= కీచకుడు; తన+ఎదురన్= తనముందు; అప్పుడు+ఆడిన= మొదటిసారి కలిసినప్పుడు పలికిన; కర్ణశూలంబులు+అగు మాటలమీఁదన్= చెవికి శూలాలు గుచ్చుకుంటే కలిగే బాధవంటి బాధ కలిగించే మాటలపై; పిడుగుపడినవానిన్= పిడుగుపడ్డవానిని; కొఱవిన్+చూఁడిన తెఱంగునన్= కొఱవితో కాల్చినట్లుగా; చమైన మనస్సుగల; సుదేష్ణ; తన్నున్= తనను (సైరంధ్రిని); అనుచిత వ్యాపారంబునకున్= తగని పనికి; నియోగించుటకున్= పంపినందుకు; నిర్వేదనంబునన్+పొంది= దుఃఖించి.

తాత్పర్యం: సైరంధ్రి అట్లా వెళ్ళుతూ నీచుడైన కీచకుడు తనముందు చెవికి శూలాలు సోకినట్లు కఠినంగా మాట్లాడిన మాటల తరువాత సుదేష్ణ తనను తగనిపనికి పంపటం పిడుగు పడినవాడిని కొఱవితో కాల్చినట్లు కాగా, నిర్వేదన స్థితి పొందింది.

విశేషం: అలం: ఉపమ. తిక్కన నాటకీయ పరిభాషను, అభినయ ముద్రలకు సంబంధించిన నాట్యాంశాలను కావ్యరచనలో ప్రవేశపెట్టి ఉభయకావ్య ప్రౌఢి పాటించే శిల్పాన్ని ప్రదర్శిస్తా డనటానికి ఈ పద్యం ఒక తార్కాణం. 'నిర్వేదంబునం బొంది' అన్న

ప్రయోగం గమనించదగింది. నిర్వేదం అనే భావాన్ని పొంది అని కాదు. నిర్వేదం అనే భావంలో ఆ భావానికి తగిన అనుభావాలను ప్రదర్శిస్తున్న నాట్యముద్రను మూర్తిమత్తులా అలవరచుకొని అని అర్థం చెప్పాలి. నిర్వేదం సంచారిభావం. దాని అనుభవ, అభినయస్థితి నిర్వేదనం. "నిర్వేదో నామ దారిద్ర్య వ్యాధ్యవమానాధిక్షేపాకృష్ట క్రోధ తాడనేష్టజన వియోగ తత్త్వజ్ఞానాదిభిః విభావైః సముత్పద్యతే. స్త్రీ నీచకుత్సితసత్త్వానాం రుదిత నిశ్వసితో చ్ఛ్వసిత సంప్రధారణాదిభిః అనుభావైః తమభినయేత్" అని భరత నాట్యశాస్త్రం (Vll-28). దారిద్ర్యం, వ్యాధి, అవమానం, అధిక్షేపం, తిట్టు, క్రోధతాడనం, ఇష్టజనవియోగం, తత్త్వజ్ఞానం మొదలైన విభావాల వలన నిర్వేదం కలుగుతుంది. రోదనం, ఉచ్ఛ్వాసనిశ్వాసాలు, సంప్రధారణం మొదలైన అనుభావాలతో స్త్రీలు, నీచ ప్రవృత్తులు, కుత్సితులు నిర్వేదాన్ని అభినయించాలి. చెప్పగూడని పని చెప్పి మాట తప్పి సైరంధ్రిని వంచించి అవమానించింది సుదేష్ణ; నీచ హృదయుడై కర్ణశూలాల వంటి మాటలు మాట్లాడి అవమానాన్ని ఆకృష్ట (తిట్టు)ను ప్రదర్శించిన కీచకుడు ద్రౌపదికి కలిగిన నిర్వేదనానికి విభావాలు. వీటి వలన సైరంధ్రి ఆర్తమూర్తి అయిందని పై పద్యంలో చెప్పబడింది. అంటే రోదనం లేదా ఆర్తి అనే అనుభావం మూర్తమైనట్లు గోచరించిందన్నమాట! తెలుగులో చెప్పాలంటే తన నిస్సహాయస్థితికి బావురుమని ఏడ్చినట్లు ఆకారం పెట్టిందన్నమాట! భావానుభావాలను తిక్కన ఇట్లా అభినయ సుందరంగా ఆవిష్కరించాడు. దాన్ని ఉపమాలంకార గమ్యంగా కూడా చేశాడు. కీచకుడి మాటలవలన పిడుగుపడితే కలిగే బాధను, ఆ మీద కొరవిపెట్టి కాలిస్తే కలిగే వేదనను సుదేష్ణ నియోగం వలన పొందిందని భావం. ఒకటి ఒక్కసారిగా శిలాన్ని నిలువునా కూల్చేది, రెండోది మనసునంతా కోపంతో దహించి వేసేది. కావ్యాలంకార నాట్యాలంకారాల ఈ కమనీయ సంయోజనం కవిబ్రహ్మ సృష్టి. (సంపా.)

చ. **అలమటఁ బొంది మాయ విధియా! యని దైవము దూఱు, నిత్తఱిం**
గలరొకొ నాకు దిక్కను, మొగంబున నశ్రులు వెల్లిగొల్పుఁ, దొ
ట్రిలఁబడు, జల్లనం జెదరు డెందముఁ గూడఁగఁ దెచ్చి నన్నుఁ గే
వలమున ముట్ట నెవ్వరికి వచ్చుననుం, గలఁగున్, వెనుంబడున్. **104**

ప్రతిపదార్థం: అలమటన్+పొంది= చింతపడి; దైవమున్= భగవంతుడిని; మాయవిధియా+అని= అయ్యో ఎంతటి క్రూర ప్రారబ్ధం కల్పించావయ్యా! అని; దూఱున్= తిట్టుతుంది; ఈ+తఱిన్= ఈ సమయంలో; నాకున్+దిక్కు= నాకు ఆధారం; శరణం; కలరు+ఒకొ అనున్= ఉన్నారా అని అంటుంది; మొగంబునన్= ముఖం మీద; అశ్రులు వెల్లి+కొల్పున్= కన్నీళ్ళను మిక్కుటంగా కారుస్తుంది; తొట్రిలన్+పడున్= తడబడుతుంది; జల్లు+అనన్= జల్లుమనేటట్లు; చెదరుడెందమున్= చలించే మనస్సును; కూడఁగన్+తెచ్చి= కూడదీసికొని; నన్నున్= సైరంధ్రిని; కేవలమునన్= కావాలని; ముట్టన్= తాకటానికి; ఎవ్వరికిన్+వచ్చున్= ఎవ్వరికి సాధ్యపడుతుంది; అనున్= అంటుంది; కలఁగున్= కలతపడుతుంది; వెనున్+పడున్= వెనుకకు తగ్గుతుంది.

తాత్పర్యం: బాధపడుతూ, మాయవిధీ! అని దైవాన్ని నిందిస్తూ, తనకు దిక్కెవ్వరూ లేరని కన్నీళ్ళు బాగా కారుస్తూ, తూలుతూ, సైరంధ్రి కొంతసేపటికి తన మనస్సు కుదుటపరచుకొని, తనను అన్యులు ఎవ్వరూ ముట్టజాలరని ధైర్యం తెచ్చుకొని కూడా కలతపడి వెనుకకు తగ్గింది.

విశేషం: నిర్వేదం అనే సంచారి భావంలో ప్రదర్శించే చేష్టాదికాలు (అనుభావాలు) ఇందులో సహజంగా వర్ణించటం అభినయ సౌందర్యాన్నీ, భావశబలతనూ వెలారుస్తున్నాయి. (సంపా.)

క. **అట్టియెడ.** **105**

తాత్పర్యం: ఆ సమయంలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. దైన్యంబు తలపోఁత తలకొన్నఁ జెలువ కా। ననమున వెల్లఁదనంబు గదిరె;
భయరసవేగంబు పైకొని ముట్టినఁ। గాంతకుఁ దనులతఁ గంప మడరె;
బెగ డంతకంతకు మిగిలిన నింతికిఁ। బదముల నటఁ దొట్రుపాటు బెరసెఁ;
దల్లడం బొందినఁ దన్వికి నవయవం। బుల నెల్ల ఘర్మాంబు కళిక లెసఁగెఁ;

ఆ. దలఁకు పుట్టెఁ, గొంకు కొలఁదికి మీఱె, వె। న్బాటు దోఁచె, ముట్టుపాటు దొడరె
వెఱఁగుపాటు దనికె, నెఱ నాడె నొవ్వు నె। వ్వగలు వగల నీనె, దిగులు వొదివె. 106

ప్రతిపదార్థం: చెలువకున్= సైరంధ్రికి; దైన్యంబు= తనకప్పుడు కలిగిన దీనత్వ సంబంధమైన; తలపోఁత= ఆలోచన; తలకొన్నన్= కలుగగా, ముసురుకోగా; ఆననమునన్= ముఖంమీద; వెల్లఁదనంబు= వెలవెలపాటు; కదిరెన్= ఆవహించింది; కాంతకున్= సైరంధ్రికి; భయరసవేగంబు= మిక్కుటమైన భయమనే రసం యొక్క తీవ్రత; పైకొని ముట్టినన్= ఆవహింపగా, క్రమ్ముకోగా; తనులతన్= శరీరంలో; కంపము+అడరెన్= వణుకు పుట్టింది; ఇంతికిన్= ఆమెకు; బెగడు= విహ్వాలత్వం; అంతకున్+అంతకున్= క్షణక్షణానికి; మిగిలినన్= ఎక్కువకాగా; పదములన్= అడుగులలో; తొట్రుపాటు బెరసెన్= తడబాటు కలిగింది; తన్వికిన్= ఆమెకు; తల్లడంబు+ఒందినన్= కలతపాటు కలుగటంతో; అవయవంబులన్+ఎల్లన్= శరీరంలోని అంగాలనిండా; ఘర్మ+అంబుకళికలు= చెమట నీటి బిందువులు; తొడరెన్= వ్యాపించాయి; తలఁకు+పుట్టెన్= భయంపుట్టింది; కొంకు= సంకోచం; కొలఁదికి మీఱెన్= మోతాదుకు మించింది, అతిశయించింది; వెన్+పాటు+తోఁచెన్= దిగులు కలిగింది; ముట్టుపాటు+తొడరెన్= సంకటం కలిగింది; వెఱఁగుపాటు= భయం వలన నిశ్చేష్టత; తనికెన్= కలిగింది; నొవ్వు= బాధ; నెఱనాడెన్= పూర్ణంగా నాటుకొన్నది (జీవస్థానంలో తగిలింది); నెఱ+వగలు= పూర్తిచింత; వగలన్= దుఃఖాలను; ఈనెన్= నింపివేసింది; దిగులు+పొదివెన్= దిగులు చుట్టుకొన్నది.

తాత్పర్యం: ద్రౌపదికి మనస్సున దీనత్వం కలుగటంతో ముఖం తెల్లబోయింది. భయంతో శరీరం వణకసాగింది. శరీరం పరవశం కావటంతో అడుగులు తొట్రుపడసాగాయి. కలతపాటు కలగటంతో దేహమంతటా చెమటలు పట్టాయి. భయం, సంకోచం, నిశ్చేష్టత, సంకటపాటు, బాధ అతిశయించాయి. దిగులు పెనవేసికొన్నది.

విశేషం: 1. భావ సంఘర్షణలను చిత్రించేటప్పుడు తిక్కన ఆకృతుల కంటె అభినయాలను ఎక్కువగా వర్ణిస్తాడు. ముందు పద్యంలో ద్రౌపది అనుభావాలను చెప్పి ఈ పద్యంలో సాత్త్వికభావాలను చిత్రించాడు. రసాభ్యుదయోల్లాస శిల్పంలో ఈ పద్యం ఒక రత్నం. ఇందులోని శిల్పాన్ని నాలుగు రకాలుగా వివేచించవచ్చును. 1. భావోదయం.2.అనుభావ ప్రకటనం. 3. సాత్త్వికభావ ప్రదర్శనం. 4. వాటియొక్క అభ్యుదయ క్రమోల్లాసం. ఈ సీసపద్యంలో అనుభావ సాత్త్వికభావాలు వరుసగా సీసపద్య పాదాలలోనూ, భావోదయ క్రమం ఎత్తుగీతిలోనూ, వాటి అభ్యుదయాన్ని క్రమాలంకారంలో ఉల్లాసపరచటం అలంకార రచనలోనూ తిక్కన ఆవిష్కరించాడు. ఆ క్రమాన్ని ఈవిధంగా భావించవచ్చును.

భావం		**అనుభావం**	**సాత్త్వికభావం**
1. తలఁకు పుట్టటం	-	1. ధైర్యంబు తలపోత	1. మొగమున వెల్లదనం.
2. భయం మితిమీరటం	-	2. భయరసవేగం పైకొనటం	2. శరీరం వణకటం.
3. వెన్‌బాటు తోచటం	-	3. విహ్వాలత అంతకంతకు పెరగటం	3. నడకలో తడబాటు.
4. ముట్టుపాటు (కలత) పుట్టటం	-	4. తల్లడిల్లడం	4. ఒడలెల్ల చెమటపట్టడం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎత్తుగీతి పూర్వార్ధంలో భయం అనే రసభావం యొక్క నాలుగు దశలను వికాసక్రమంలో పేర్కొనటం, ఆ భావదశలకు తగిన అనుభావసాత్త్విక భావాభివ్యక్తులను సీసపద్య పాదాల పూర్వోత్తరార్ధాలలో క్రమంగా వర్ణించటం క్రమాలంకార విన్యాసం. ఎత్తుగీతి ఉత్తరార్ధంలో భావోల్లాసాన్ని అవస్థాపరంగా పేర్కొనటం జరిగింది. తరువాతి వచనంలో 'ఇవ్విధంబున ద్రుపదపుత్రి దురవస్థం బొందుచు' అని తిక్కన తన రసభావ శిల్పరహస్యాన్ని సూచించాడు. దానిని అన్వయించుకొంటే ద్రౌపది పొందిన దురవస్థ (భరించటానికి శక్యంగాని మనోవేదన) నాలుగు ముఖాలుగా పరిణతి చెందింది. అవి- వెఱగుపాటు పొందటం, అదే ఒక దురవస్థ దశ. దాని కంటె దుర్భరమైనవి క్రమంగా - మర్మస్థానాలను బాధపెట్టే వేదన, నెవ్వగల వగలు, దిగులు. ఇంత క్రమబద్ధంగా ఒక పాత్రలోని భావానుభావాల కనుగుణమైన సాత్త్వికభావాలను వర్ణించి, అవి మానసిక అవస్థలుగా రూపొందిన పద్ధతిని ప్రదర్శించిన అభినయశిల్పాన్ని శ్రవ్యకావ్యంలో మొదట ప్రవేశపెట్టినవాడు కవిబ్రహ్మ తిక్కన. మహాకవిత్వంలో ఉండే అభినయ నిర్మాణ శిల్పానికి (Structural beauty) ఈ పద్యం తార్కాణం. (సంపా.)

2. విధి ఒక వ్యక్తిని ఎంత దయనీయ స్థితికి తీసికొనివస్తుందో ఈ పద్యం ఉదాహరణంగా చెప్పవచ్చును. సకలరాజన్యుల చేత పరిచర్యలు పొందవలసిన పాండవ పట్టమహిషి ఒక పరిచారికగా సుదేష్ణ కొలువులో చేరటం విధి వైపరీత్యం. ఆమెకు ఈ కష్టకాలంలో తోడ్పడేవారు ఎవ్వరూ లేరనే బాధ కలిగింది. ఆ నీచుడి ఇంటికి వెళ్ళక తప్పలేదు. అట్టి దయనీయ స్థితిని తిక్కన ఈ పద్యంలో వివరించాడు. భావం ఒకటే అయినా వేర్వేరు పదాలను వాడటం భావతీవ్రతకు, సమగ్రతకు దోహదం చేశాయి.

వ. **ఇవ్విధంబున ద్రుపదపుత్రి దురవస్థం బొందుచు 'మహాపదలకుం బరిహరణంబు హరి (చరణ) స్మరణంబ' యని తన హృదయపుండరీకంబునం బుండరీకాక్షు నిక్షేపించుకొని, సుదేష్ణ మందిరంబు వెలువడి దినకరుం గనుంగొని వినయవినమితోత్తమాంగయై నిజాంతర్గతంబున.** **107**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; ద్రుపదపుత్రి= ద్రౌపది (సైరంధ్రి); దురవస్థన్+పొందుచున్= పడరాని మానసికవేదన పడుతూ; మహా+ఆపదలకున్= గొప్ప కష్టాలకు; పరిహరణంబు= నివారణోపాయం; హరి (చరణ) స్మరణంబు+అ= విష్ణు పాదాలను తలంచటమే; అని= అనుకొని; తన హృదయపుండరీకంబునన్= తన హృదయకమలంలో; పుండరీకాక్షున్= తెల్లని పద్మాలవంటి కన్నులు కలవాడైన విష్ణువును; నిక్షేపించుకొని= నిలుపుకొని; సుదేష్ణ మందిరంబు= సుదేష్ణ నివసించే భవనం నుండి; వెలువడి= బయటికి వచ్చి; దినకరున్= సూర్యుడిని; కనుంగొని= చూచి; వినయ వినమిత+ఉత్తమ+అంగ+ఐ= అణకువచే వంచిన శిరస్సుగలదై; నిజ+అంతర్గతంబునన్= తన మనస్సులో.

తాత్పర్యం: ద్రౌపది ఈ విధంగా దుఃఖిస్తూ, కష్టాలు గట్టెక్కటానికి భగవంతుడి స్మరణమాత్రమే మార్గమని తలచి, విష్ణువును ధ్యానించి, సుదేష్ణ మందిరం వెలువడి, సూర్యుడిని చూచి అణకువతో తలవంచుకొని నమస్కరించి, తన మనస్సులో, (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: రూపకం; పుండరీకాక్షుడు అన్నది సాభిప్రాయ విశేషణం, పుండరీకముల వంటి కనులుగల నారాయణుడిని స్మరించటం వలన ఆమెను కనుపాపవలె కాపాడవలసిన బాధ్యత విష్ణుమూర్తిపై పడింది. ద్రౌపది మందిరం నుండి బయటికి రాగానే సూర్యుడికి నమస్కరించింది. సూర్యుడు కమలాప్తుడు, ద్రౌపది హృదయపుండరీకానికి కూడా వికాసం కలిగించక తప్పదు. నారాయణుడి పుండరీకాక్షులను కూడా వికసింపజేయక తప్పదు. ద్రౌపది హృదయపద్మం వికసిస్తుందని ధ్వని.

తే. **'పాండుపుత్రులకేను తప్పని మనంబు । గలుగుదాననయేని నో కమలమిత్ర!**
కీచకుని దెస న న్నొక కీడు తెరువు । వొరయకుండఁగ రక్షింపు కరుణతోడ.' **108**

ప్రతిపదార్థం: ఓ కమలమిత్ర!= పద్మాలకు మిత్రుడవైన ఓ సూర్యభగవానుడా!; ఏను= నేను (సైరంధ్రి); పాండుపుత్రులకున్= పాండవులకు; తప్పనిమనంబు= తొలగనిమనస్సు; కలుగుదానను+అ+ఏనిన్= కలదానినైతే; కీచకునిదెసన్= కీచకుని వలన; నన్నున్= నన్ను; ఒక కీడు తెరువు= ఎటువంటి హాని జరిగేపద్ధతి; పొరయక+ఉండఁగన్= ఏర్పడకుండా; కరుణతోడన్= దయతో; రక్షింపు(ము)= రక్షించుము.

తాత్పర్యం: 'ఓ సూర్యభగవానుడా! నేను పాండవులను తప్ప ఇతరులను భర్తలుగా భావించని పతివ్రతనైతే నాకు కీచకుడి వలన ఎటువంటి అపాయం జరిగే దారు లేర్పడకుండా దయతో రక్షించుము.'

విశేషం: ద్రౌపది మహాభక్తురాలు. ఒకసారి భగవంతుడిని సమాహితచిత్తంతో స్మరిస్తే ఆయన వెంటనే ప్రసన్నుడౌతాడు. ఆమెకు శ్రీకృష్ణుడే శ్రీమన్నారాయణుడు. ఆమె హరినామస్మరణం ఆపదలనుండి కాపాడుతుందని గాఢమైన విశ్వాసం కలది. **"యద్భావం తద్భవతి."** ఆమె మనఃపద్మంలో పుండరీకాక్షుడిని స్థిరంగా నిలుపుకొన్నది. ఆమె మనసు పుండరీకం, ఆ దేవుడి చూపు పుండరీకం. ఆతడి కరుణ ఆమె పట్ల ఉండటం సహజసిద్ధం అని ధ్వని. మందిరం దాటి బయటికి వచ్చింది ద్రౌపది. ఆమెకు సూర్యనారాయణుడు ఎదుట మింట కనిపించాడు. **"సూర్యో నారాయణో హరిః"** అని సంప్రదాయం. హరి పద్మాక్షుడు, సూర్యుడు పద్మమిత్రుడు. పైపెచ్చు నారాయణ నామధేయుడు. సర్వవ్యాపకుడైన హరికి ప్రత్యక్ష సాక్షి సూర్యుడు. ఆయనకు నమస్కరించింది. సూర్యుడు మహాపదార్థాలలో ఒకడు. జగత్సాక్షి, ద్రౌపది పాతివ్రత్యానికి సాక్షిగా నిలువదగిన దైవం ఆతడే - అందువలన ఈ విధంగా ఆయనను ప్రార్థించింది. ఆమె పతులపట్ల చెదరని భక్తి గలదని చెప్పగలిగిన ఆ కర్మసాక్షియే, ఆ ధర్మానికి కీడు రాకుండా ఉండే మార్గాలను కల్పించి ఆమె శీలాన్ని రక్షించే బాధ్యత తీసికొనగల మహితాత్ముడు. నారాయణుడైనా, సూర్యనారాయణుడైనా తత్త్వతః ఒక్కడే. **"ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి'** కదా! అటువంటి భేదం లేని భక్తితో ద్రౌపది సూర్యుడికి నమస్కరించింది. అనన్యచింతతో స్మరించిన ఆమెయొక్క యోగక్షేమం వహించవలసిన బాధ్యత ఆ భగవానుడిదే! (సంపా.)

వ. అనుచుం గేలు మొగిచిన. 109

తాత్పర్యం: అంటూ చేతులెత్తి నమస్కరించగా.

క. తరణియు దుఃఖితయగు న । త్తరుణిం గాచుటకు నత్యుదగ్రభుజావి
స్ఫురణాఢ్యు నొక్క రక్కసుఁ । గరుణార్ద్రమనస్కుఁ డగుచు గ్రక్కునఁ బనిచెన్. 110

ప్రతిపదార్థం: తరణియున్= సూర్యుడునూ; కరుణార్ద్ర మనస్కుఁడు+అగుచున్= దయారసంతో తడిపిన మనస్సుకలవాడై; దుఃఖిత+అగు+దుఖంతోఉన్న; ఆ+తరుణిన్= ఆ కాంతను; కాచుటకున్= రక్షించుట కొరకై; అతి+ఉదగ్ర భుజావిస్ఫురణ+ఆఢ్యున్= మిక్కిలి అధికమైన భుజపరాక్రమంచేత గొప్పవాడైన; ఒక్క రక్కసున్= ఒక రాక్షసుడిని; గ్రక్కునన్= వెంటనే; పనిచెన్= పంపాడు.

తాత్పర్యం: ద్రౌపది మొర విన్న సూర్యుడు దయాంతరంగంతో ఆమెను రక్షించటానికి బాహుబలాఢ్యుడైన ఒక రాక్షసుడిని పంపాడు.

వ. వాఁడునుం బనిపూని యంబరతలంబున నదృశ్యాకారుండై వచ్చి నిలిచె. 111

ప్రతిపదార్థం: వాఁడునున్= వాడు కూడా; పనిపూని= బాధ్యత స్వీకరించి; అంబరతలంబునన్= ఆకాశమార్గంలో; అదృశ్య+ఆకారుండు+ఐ= కనబడని రూపం కలవాడై; వచ్చి; నిలిచెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: ఆ రాక్షసుడు వెంటనే పనిపూని వచ్చి ఆకాశంలో ఎవరికీ కనబడకుండా ఆమెకు రక్షగా నిలబడ్డాడు.

తే. **ఇట్లు ప్రార్థించి పాంచాలి యెట్టకేని। సింహబలు మందిరం బల్లఁ జేర నరిగి**
యొల్లఁబోవుచు బెబ్బులి యున్న పొదరు। సొచ్చు లేడి చందంబునఁ జొచ్చుటయును. **112**

ప్రతిపదార్థం: ఇట్లు ప్రార్థించి= ఇట్లా వేడికొని; పాంచాలి= ద్రౌపది (సైరంధ్రి); ఎట్టకేనిన్= ఎట్లానో, ప్రయాసతో; సింహబలు మందిరంబు= కీచకుని నివాసభవనం; అల్లన్+చేరనరిగి= నెమ్మదిగా సమీపించి; ఒల్లన్+పోవుచున్= కలతపడుతూ; బెబ్బులి+ఉన్న పొదరు= బెబ్బులి ఉన్న పొదను; చొచ్చు లేడి చందంబునన్= ప్రవేశించే లేడివలె; చొచ్చుటయును= ప్రవేశించగా.

తాత్పర్యం: ఇట్లా ప్రార్థించి, ప్రయాసపడుతూ సైరంధ్రి ఎట్లాగో కీచకుడి గృహాన్ని చేరి కలతపడుతూ, పెద్దపులి ఉండే పొదలోపలికి వెళ్ళే లేడివలె ఆ మందిరంలో ప్రవేశించినంతనే. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. 'బెబ్బులి యున్న పొదరు సొచ్చు లేడి చందంబున' అనేది జాతీయం. బలవంతులైన వారి ప్రయోజనాలకై నిస్సహాయులైనవారు బలి కావలసిన స్థితి ఏర్పడుతుంది. ఆ సందర్భంగా ఈ మాట వాడుతారు. ఈ ఉపమాలంకారం సందర్భోచితంగా సంతరించబడింది. తిక్కన ఉపమానాలన్నీ సామాన్య జనజీవన పరిధిలోనుండి ఎన్నుకొనబడటం గమనార్హం. 'ఆంధ్రావళి మోదముం బొరయునట్లు' ఆయన చేసే రచనకు ఇది ఒక సహజాలంకారం.

ఉ. **అంబురుహాక్షి వచ్చు తెరు వారయఁ గీచకముఖ్యుఁ డప్డు తె**
ల్లంబుగఁ జూచి యుల్లము కలంకయు వారక మేన వెమ్ముతా
పంబును డిగ్గఁ ద్రావి, గరుపాఱుచు నుత్కట సంభ్రమంబు హ
ర్షంబుఁ బెనంగొనంగ నతిచంచలభావ పరీతమూర్తియై. **113**

ప్రతిపదార్థం: కీచక ముఖ్యుఁడు= కీచకులలో మొదట లెక్కించదగినవాడు, సింహబలుడు; అప్డు= అప్పుడు; అంబురుహ+అక్షి= కమలాల వంటి కనులుగల సైరంధ్రి; వచ్చు తెరువు= వచ్చే దారిని; ఆరయన్= తేరిపారగా; తెల్లంబుగన్+చూచి= స్పష్టంగా చూచి, ఉల్లము కలంకయున్= మనస్సులోని కలతనూ; వారక= ఎడతెగక; మేనన్+వెమ్మ= శరీరాన్ని తపింపచేసే; తాపంబును= విరహబాధనూ; డిగ్గన్+తావి= దిగమ్రింగి; గరుపాఱుచున్= గగుర్పాటు నొందుతూ; ఉత్కట సంభ్రమంబు= మిక్కిలి తొట్రుపాటు; హర్షంబున్= సంతోషం; పెనంగొనంగన్= ముప్పిరికొనగా (పెనవేసికొనగా); అతి చంచలభావ పరీతమూర్తి+ఐ= మిక్కిలి చాపల్యంతో పెనగొన్న మనస్సు కలవాడై.

తాత్పర్యం: కీచకుడు సైరంధ్రి వచ్చే దారిని కనువిచ్చి స్పష్టంగా తేరిపార చూచాడు. మనసులోని కలతను శరీరంలోని ఆరని మదనతాపాన్ని దిగమ్రింగుకొన్నాడు. గగుర్పాటుతో కూడిన ఆశ్చర్యం, సంతోషం పెనవేసికొనగా చపల స్వభావంతో కూడినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **చిడిముడి పడుచు నెదురు చనఁ। గడఁగుచు హారములు సక్కఁగాఁ ద్రోచుచు మ**
ల్లడి గొనుచు దుర్విలాసం। బొడలికి నొడఁ గూర్చుచుండ నుగ్మలి యంతన్. **114**

ప్రతిపదార్థం: చిడిముడి పడుచున్= తొట్రుపాటు పడుతూ; ఎదురుచనన్= ఎదురుగా పోవటానికి; కడఁగుచున్= ప్రయత్నిస్తూ; హారములు+చక్కఁగాన్+త్రోచుచున్= మెడలో హారాలు సరిచేసికొంటూ; మల్లడి గొనుచున్= సుడులు సుడులుగా తిరుగుతూ; ఒడలికిన్= శరీరానికి; దుర్విలాసంబు= దుష్టమైన విలాసం; ఒడన్+కూర్చుచున్+ఉండన్= ప్రదర్శిస్తూ ఉండగా; ఉగ్మలి= సైరంధ్రి; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: కీచకుడు తొట్రుపాటు పడుతూ, ఎదురుపోవటానికి సమకట్టి, హారాలు సవరించుకొంటూ, శరీరం మీద ఉదాత్తంగాని శృంగార చేష్టలు ప్రదర్శిస్తూ నిలుచున్నాడు. అప్పుడు సైరంధ్రి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'దుర్విలాసం' అనేది సాభిప్రాయమైన ప్రయోగం. కీచకుడు రూపాభిమాని. హారాలు సవరించుకొనడం వంటివి చేశాడు. దుర్విదగ్ధుడి హర్షం కాబట్టి దుర్విలాసం.

వ. తత్ప్రదేశంబునకుం జని. 115

తాత్పర్యం: ఆ ప్రదేశానికి వెళ్ళి.

తే. 'దేవి తృష పుట్టి వారుణిదేరఁ బనుప। నరుగుదెంచితిఁ బోయింపుఁ' డనిన నింతి
నెమ్మొగంబున దృష్టులు నిలిపి, తమక। మడర నిట్లను నా కీచకాధముండు. 116

ప్రతిపదార్థం: దేవి= సుదేష్ణాదేవి; తృష పుట్టి= మద్యపు దప్పికగొని; వారుణి+తేరన్= మద్యం తెమ్మని; పనుపన్+అరుగుదెంచితిన్= పంపగా వచ్చాను; పోయింపుఁడు+అనినన్= పోయించండి అని అనగా; ఇంతి నెఱ+మొగంబునన్= సైరంధ్రి అందమైన ముఖంమీద; దృష్టులు నిలిపి= చూపులు నిలిపి; తమకము+అడరన్= మోహం అతిశయించగా; ఆ కీచక+అధముండు= ఆ నీచుడైన కీచకుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'సుదేష్ణాదేవి దప్పికగొని మద్యం తీసికొని రమ్మని పంపగా వచ్చాను. పోయించం'డని సైరంధ్రి పలుకగా, మోహపరవశత్వంతో ఆమెను చూస్తూ ఆ నీచకీచకు డిట్లా అన్నాడు.

విశేషం: సైరంధ్రి (ద్రౌపది) తలవంచుకొని ముక్తసరిగా మాట్లాడటం ఆమె స్వభావానికి ఉచితం.

క. 'దేవి తృష దీర్పఁ బూనితి;। వా వెలఁది సహోదరుండ నగు నా తృష లీ
లావతి! నీదు సరస సం। భావనమెయిఁ దీర్పకునికి పాడియె చెపుమా! 117

ప్రతిపదార్థం: లీలావతి!= ఓ సౌందర్యవతీ!; దేవి= సుదేష్ణాదేవి యొక్క; తృష+తీర్పన్+పూనితివి= దప్పిక తీర్చటానికి పూనుకొన్నావు; (కాని); ఆ వెలఁది= ఆమె యొక్క; సహోదరుండన్+అగు= తమ్ముడనైన; నా తృషను= నా యొక్క దప్పికను; నీదు సరస సంభావనమెయిన్= నీ సరసమైన మన్నన చేత; తీర్పక+ఉనికి= తీర్చకుండా ఉండటం; పాడియె చెపుమా!= న్యాయమా చెప్పుము!

తాత్పర్యం: 'ఓ సుందరాంగీ! మీ దేవి దప్పిక తీర్చటానికి పూనుకొన్న నీవు, ఆమె తమ్ముడనైన నా దప్పిక కూడా నీ సరస సల్లాపాలతో తీర్చకుండటం న్యాయమా? చెప్పుము.

విశేషం: ఇక్కడ తృష= దప్పిక, కామము అనే అర్థాల మీద కవి ఇద్దరి చేతా మాట్లాడించి చమత్కరించాడు. ఒకరు కోరే అర్థం మరొకరికి తెలియజేశాడు. సుదేష్ణ దాహం మదిరతో తీరుతుంది. కీచకుడి దాహం ఆమె సరస సంభావనతో చల్లారుతుంది.

సీ. కాంతి దళ్కొత్తు నీ కడగంటి చూడ్కితోఁ। బొందఁగానని మేను పొగులుటయును,
దీపారు నీ పల్కుఁ దెల్లంబుగా వినఁ। గానని వీనులు గందుటయును,
నింపగు నీ చెయ్వు లెలమిమైఁ గొనియాడఁ। గానని కోర్కులు గలఁగుటయును,
సొగయించు నీ కేళిఁ దగిలి యానందంబుఁ। బొందఁగానని మది గుందుటయును

తే. బాయ, నాదగు జన్మంబు ఫలము నొంద। భావజన్మని పూనిక పార మెయ్య
నన్ను బంటుగా నేలుము నలినవదన!। యింక నీ సిగ్గుదెర యోల మేల నీకు?' 118

ప్రతిపదార్థం: నలినవదన!= పద్మంవంటి ముఖం కలదానా! సైరంధ్రీ!; కాంతి= కాంతి అనే గుణం; తళ్కొత్తు= ప్రకాశించే; నీ కడగంటి చూడ్కితోన్= నీ క్రీగంటి చూపుతో; పొందన్+కానని మేను= కూడలేని శరీరం; పొగులుటయును= తపించటమున్నూ; తీపారు= తియ్యని; నీ పల్కున్= నీ మాటను; తెల్లంబుగాన్= స్పష్టంగా; వినన్+కానని= విననోచని; వీనులు= చెవులు; కందుటయును= తాపం చెందటమున్నూ; ఇంపు+అగు= అందమైన; నీ చెయ్వులు= నీ చేష్టలు; ఎలమిమైన్= సంతోషంగా; కొనియాడన్+కానని= ప్రశంసించలేని; కోర్కులు= కోరికలు; కలఁగుటయును= కలత చెందటమున్నూ; సొగయించు= సొక్కింపచేసే; నీ కేళిన్+తగిలి= నీ శృంగార చేష్టలలో చిక్కి; ఆనందంబు= సంతోషం; పొందన్+కానని= పొందలేని; మది= మనస్సు; కుందుటయును= తపించటం; పాయన్= పోయేటట్లుగా; నాది+అగు జన్మంబు= నాయొక్క పుట్టుక; ఫలమున్+ఒందన్= ఫలించేటట్లు; భావ జన్మని= మన్మథుని; పూనిక= ప్రయత్నం; పారము+ఎయ్యన్= అంచులు ముట్టేటట్లు (పరిపూర్ణమయ్యేటట్లు); నన్నున్ బంటుగాన్+ఏలుము= నన్ను నీ సేవకుడిగా పాలించుకొనుము; ఇంకన్= ఇకమీద; ఈ సిగ్గు తెర+ఓలము= సిగ్గు అనే తెరమరుగు; నీకున్+ఏల?= నీ కెందుకు?

తాత్పర్యం: నీ కటాక్ష వీక్షణాలను పొందకపోవటంచేత కలిగిన దేహతాపాన్నీ, నీ తీయని పలుకులు వినలేకపోవటం చేత కలిగిన శ్రవణతాపాన్నీ, అందమైన నీ విలాస చేష్టలను ప్రీతితో మెచ్చలేని కోర్కెల వలన కలిగిన మదనతాపాన్నీ, నీతో రహస్య క్రీడలతో రమిస్తూ ఆనందం పొందకపోవటం వలన కలిగిన మనస్తాపాన్నీ పోగొట్టి నా జన్మ సఫలం చేసి నన్ను నీ బంటుగా స్వీకరించి పాలించుము. ఇక మీద కూడా ఈ సిగ్గు తెరల చాటుమాటుతనం ఎందుకు?'

విశేషం: 1.'అగ్ని దగ్గరుండి, ప్రియురాలు దూరంగా ఉండి తాపం కలిగిస్తారు. అగ్ని దూరంగా పోతే ప్రియురాలు దగ్గరైతే తాపం తగ్గుతుంది' అనే లోకోక్తి ప్రసిద్ధం. సైరంధ్రిపై వలపు పెంచుకొన్న కీచకుడు మదనతాపంతో వేగిపోతున్నాడు. దానికి నాలుగు కారణాలను సీస పద్యపాదాలలో వరుసగా చెప్పాడు. మెరుపులవలె మెరిసే కడగంటి చూపులు పొందలేని శరీరం విరహతాపాన్ని పొందింది. ఇప్పుడు అట్టి చూపులు ప్రసరింపచేయటానికి సమీపించింది కాబట్టి అది తగ్గిపోతుందని అతడి భావన. అట్లాగే వలపుమాటలు వినని చెవులు తాపాన్ని పొందాయి. ఇప్పు డా వలపుమాటలవలన ఆ తాపం తగ్గుతుంది. వలపు చేష్టలను పొగడి కోరికలు తీర్చుకొనలేదని తాపం ఉండేది. ఆమెను పొంది సుఖం అనుభవించలేదని మనోవేదన ఉండేది. అవన్నీ నీవు దరిచేరటం వలన తగ్గి (తొలగి) పోతాయి-అని అన్నాడు. సీస పద్యపాదాలు అంత్యానుప్రాసంతో అలంకరించబడటం గమనించతగింది. కీచకుడి విరహతాపంలోని మాధుర్యగుణం. సాతత్య స్వభావం దానివలన ధ్వనించబడుతున్నది.

2. సీస పద్య పాదాలలోని వాక్యాలు 'పాయన్' అనే క్రియతో అన్వయించే ఒక క్రమం ఇందులో ఉన్నది. తాపం క్రమంగా శరీరంలో, చెవులలో, కోర్కెలలో, హృదయంలో వ్యాపించగా అది మరల క్రమంగా ఉపశమిస్తుందని సూచించబడింది. అంతేకాక తాపం తగ్గిన తరువాత కలిగే ఫలితాంశాలను నాల్గింటిని ఎత్తుగీతిలో తిక్కన చెప్పాడు. అవి - ఆమె కటాక్షం వలన జన్మసఫలం కావటం; వలపు మాటలు వినటం వలన మన్మథభావం పరిపూర్ణం కావటం, అందమైన ఆమె వలపు చేష్టలతో పెల్లుబికే కోర్కెల వలన కలిగే తృప్తి వలన ఆమెకు బంటుగా వశుడై పోవటం, సుఖకేళితో ఆనందం పొంది సిగ్గుతెరలు లేకుండా చనువుతో మెలగటం కలుగుతుందట! ఇందులో అందమైన ఒక క్రమం ఉన్నది. నలినవదన అన్నప్పుడు ఉపమాస్ఫూర్తి, సిగ్గుతెర యోలము అన్నప్పుడు రూపకస్ఫూర్తి రాణించాయి. అలంకారాలు కాకపోయినా అలంకారాల అనుభూతిని కలిగించే సూక్తివైచిత్రి ఇది.

3. సంకల్పం అనే మదనావస్థకు తిక్కన క్రమవికాసాన్ని కలిగిస్తూ, ఈ పద్యంలో ఒక పరిణత స్థితిని చిత్రించాడు. రసాభ్యుదయ శిల్పంలో ఇది ప్రతిభావంతమైన ప్రయోగం. (సంపా.)

వ. అనవుడు. 119

తాత్పర్యం: అనగా.

తే. చెలువ యప్పలుకులు పెడ చెవులఁ బెట్టి। ధీర గావున విగతవికార యగుచు
'మదిర వోయింపుఁ డద్దేవి యెదురుచూచు। నలుగుఁ దడవైన మగుడఁ బోవలయు'ననిన. 120

ప్రతిపదార్థం: చెలువ= సైరంధ్రి; ఆ+పలుకులు= కీచకుని మాటలు; పెడచెవులన్+పెట్టి= పట్టించుకొనకుండా; ధీర+కావునన్= ధీరురాలు కాబట్టి; విగతవికార+అగుచున్= ఎటువంటి చాంచల్యం లేనిది ఔతూ; ఆ+దేవి= ఆ సుదేష్ణాదేవి; ఎదురుచూచున్= ఎదురుచూస్తుంటుంది; తడవు+ఐనన్= ఆలస్యమైతే; అలుగున్= కోపపడుతుంది; మగుడన్= మరల; పోవలయున్= వెళ్ళిపోవాలి; మదిర+పోయింపుఁడు= మద్యం పోయించండి; అనినన్= అనగా.

తాత్పర్యం: కీచకుడి మాటలను ద్రౌపది లక్ష్యపెట్టక, ధీరురాలుకాబట్టి ఎటువంటి వికారానికీ లోనుకాకుండా ఉండి, 'త్వరగా మద్యం పోయించండి. ఆలస్యమైతే దేవి కోపిస్తుంది. నేను శీఘ్రంగా వెనుకకు వెళ్ళాలి' అని అనగా - (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ద్రౌపది తన ముఖభావాలను కనబడనీయకుండా గంభీరంగా మాట్లాడింది.

చ. 'మదిర సుదేష్ణపాలి కొకమాత్రన పుచ్చెద నొడ్ల చేత; నిం
పొదవెడు నట్టి దీని చవి యుల్లము సొక్కఁగ నాను మీవు; నీ
వదన సరోజ సౌరభమవారణ నన్నును గ్రోల నిమ్ము; బె
ట్టిదుఁ డగు కాము తూపులఁ దొడింబడకుండఁగఁ గావు మిత్తఱిన్. 121

ప్రతిపదార్థం: మదిరన్= మద్యాన్ని; సుదేష్ణపాలికిన్= సుదేష్ణవద్దకు; ఒక మాత్రన్+అ= ఒక రెప్పపాటుకాలంలోనే; ఒడ్లచేతన్= ఇతరులచేత; పుచ్చెదన్= పంపుతాను; ఇంపు+ఒదవెడు+అట్టి= ఆనందాన్ని కలిగించే; దీని చవి= ఈ మద్యం రుచిని; ఉల్లము= మనస్సు; సొక్కఁగన్= పరవశమయ్యేటట్లు; ఈవు+ఆనుము= నీవు త్రాగుము; నీ వదన సరోజ సౌరభము= నీ ముఖకమలం యొక్క సుగంధం; అవారణన్= అడ్డులేకుండా; నన్నును= నన్నుకూడా; గ్రోలనిమ్ము= త్రాగనిమ్ము; బెట్టిదుఁడు+అగు= క్రూరుడైన; కాముతూపులన్= మన్మథుడి యొక్క బాణాలకు; తొడిన్+పడక+ఉండఁగన్= తొట్రుపాటు; ఈ+తఱిన్+కావుము= ఇప్పుడు కాపాడుము.

తాత్పర్యం: 'నేను మద్యాన్ని అక్క సుదేష్ణకు ఇతరుల ద్వారా ఇప్పుడే పంపుతాను. నీవు ఈ మద్యం త్రాగి, ఈ వేళ నీ ముఖపద్మం లోని మంచి వాసనను నన్ను త్రాగనిచ్చి, నా మదనతాపాన్ని పోగొట్టి రక్షించుము.

క. కరితురగ రథసమితిఁ బొం। పిరివోయెడు నాదు లక్ష్మి పెంపున కెల్లన్
సరసిరుహవదన! నీవ కు। దురుగా నొనరించెదం గుతూహల మెసఁగన్. 122

ప్రతిపదార్థం: సరసిరుహ+వదన!= పద్మం వంటి ముఖంగల ఓ సైరంధ్రీ!; కరి, తురగ, రథసమితిన్= ఏనుగులు, గుర్రాలు, రథాల సమూహంతో; పొంపిరి+పోయెడు= అతిశయించే; నాదులక్ష్మి= నా సంపద యొక్క; పెంపునకున్= అతిశయానికి; ఎల్లన్= అంతటికి; నీవు+అ కుదురుగాన్= నీవే ఆధారంగా; కుతూహలము+ఎసఁగన్= ఆనందం నిండగా; ఒనరించెదన్= చేస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ పద్మముఖీ! చతురంగబలాలతో పెంపారే నా సంపద కంతటికీ కుతూహలంతో నిన్నే కుదురుగా రాణిని చేస్తాను.

క. రుచిర మణి భూషణంబులు। నుచిత విహారప్రకార యోగ్యాగార
ప్రచయము సుందరగణికా। నిచయము నొప్పించువాఁడ నీకుం దరుణీ! 123

ప్రతిపదార్థం: తరుణీ!= ఓ వనితా!; నీకున్= (సైరంధ్రికి); రుచిరమణిభూషణంబులు= అందమైన మణులతో చెక్కబడిన ఆభరణాలు; ఉచిత= తగిన; విహార ప్రకార= క్రీడించటానికి; యోగ్య+అగార ప్రచయము= తగిన ఇళ్ల సముదాయం; సుందర గణికానిచయమున్= అందమైన వేశ్యల సమూహాన్ని; ఒప్పించువాడన్= సమకూర్చి ఇస్తాను.

తాత్పర్యం: ఓ సైరంధ్రీ! నీకు అందమైన మణిహారాలను, విలాస గృహాలను, పరిచారికలుగా వేశ్యాసమూహాలను పుష్కలంగా సమకూర్చి ఇస్తాను.

విశేషం: గణికా సంచారం మందిరానికి అందం. వారు అలంకరణలోనూ, తదితర పరిచర్యలలోనూ నేర్పరులు. నాట్య సంగీత విన్యాసాలతో రాణి మనస్సు రంజింపజేస్తారు.

క. నా కులకాంతల నెల్లను। నీకుం బనిసేయఁ బనిచి నెయ్యంబున నే
నీ కనుసన్నన మెలఁగెద। నే కార్యంబైన నడుపు మీవ తగంగన్.' 124

ప్రతిపదార్థం: నా కులకాంతలను= నా భార్యలను; ఎల్లను= అందరినీ; నీకున్= నీకు; పని+చేయన్+పనిచి= సేవలు చేసేందుకు ఆజ్ఞాపించి; నెయ్యంబునన్= ప్రేమతో; నేన్= నేను; నీ కనుసన్నన్+అ= నీ కనుసన్నలలోనే; మెలఁగెదన్= తిరుగుతాను; ఏ కార్యంబు+ఐనన్= ఏ పని అయినా; ఈవు+అ= నీవే; తగంగన్= సరిగా; నడుపుము= జరుపుము.

తాత్పర్యం: నా భార్యల నందరినీ నీ దాసీజనంగా చేసి, స్నేహంతో నేను నీ కనుసన్నలలో మెలగుతాను. అన్ని పనులు నీవే నడిపించుము. (సర్వాధికారాలు నీ కిస్తాను).'

విశేషం: సాధారణ స్త్రీలు కోరుకొనే ఆభరణాలు, రథగజతురగాది సంపదలు, విలాసవస్తువులు కల్పిస్తానని చెప్పి కీచకుడు సైరంధ్రిని తనవశం చేసికొనజూస్తున్నాడు. తన భార్యలను అందరినీ తనకు దాసీలనుగా చేస్తానంటే సైరంధ్రి లోబడుతుందని ఆ నీచుడి ఆలోచన. ఇవి మోహావేశపు పలుకులు.

వ. అనుచు సింహబలుండు తన యంతరంగంబున నంతకంత కగ్గలించు తమకంబునఁ దన్నుఁదా నెఱుంగక పయింబడి పట్టుకొనిన. 125

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ సింహబలుండు= కీచకుడు; తన అంతరంగంబునన్= తన మనస్సులో; అంతకున్+అంతకున్= క్షణక్షణానికి; అగ్గలించు= అధికమవుతున్న; తమకంబునన్= మోహంతో; తన్నున్+తాను+ఎఱుంగక= ఒడలు మరచి; పయిన్+పడి= పైనబడి; పట్టుకొనినన్= ఒడిసి పట్టగా.

తాత్పర్యం: అంటూ కీచకుడు మోహావేశపరవశుడై తన ఒడలు మరచి సైరంధ్రిపైబడి ఒడిసి పట్టగా.

క. తనుఁ గాచి వెనుక వచ్చిన। దనుజు మహాబలము తనదు తనువొందిన, నా
తని చే విదిల్చి రభసం। బునఁ దన్మందిరము ద్రుపదపుత్రిక వెడలెన్. 126

ప్రతిపదార్థం: ద్రుపదపుత్రిక= ద్రౌపది; తనున్= (సైరంధ్రిని); కాచి= రక్షించి; వెనుకన్+వచ్చిన= వెంబడించి వస్తున్న; దనుజు మహాబలము= రాక్షసుడి యొక్క అధికశక్తి; తనదు తనువు= తన శరీరం; ఒందినన్= ప్రవేశించగా; ఆతని చే= కీచకుడి చేతిని; విదిల్చి= ఒక్కుమ్మడిగా విదిలించుకొని; రభసంబునన్= వేగంగా; తద్+మందిరము= ఆ ఇంటినుండి; వెడలెన్= బయటపడింది.

తాత్పర్యం: తనకు రక్షకుడుగా తన వెంబడి వస్తున్న రాక్షసుడి అధికశక్తి సైరంధ్రి నావహించగా ఆమె కీచకుడి చేతిని గట్టిగా విదిలించి, వేగంగా ఆ ఇంటినుండి బయటికి వచ్చింది.

వ. ఇట్లు ద్రోచిపోయినం గీచకుండు వెనువెంటం దగిలిన నమ్మగువయు మరలి చూచి భయభ్రాంతయై 'యెవ్వలనికిం బోదునో' యని తలంచి, దైవయోగంబున విరాటుం డప్పుడు గొలువునికింజేసి తత్సభా భాగంబు దెసకు వెసం బాఱినం, గామాయత్తచిత్తుండును, గర్వోన్మత్తుండును గావున జనసమూహంబు సరకుసేయక రహస్యప్రకాశవిభేదవిచారంబు దక్కి. 127

ప్రతిపదార్థం: ఇట్లు+త్రోచిపోయినన్= ఈ విధంగా విదిలించి సైరంధ్రి వెళ్లగా; కీచకుండు; వెనువెంటన్= వెంబడించి; తగిలినన్= తరుమగా; ఆ+మగువయున్= ఆ సైరంధ్రియూ; మరలి చూచి= వెనుదిరిగి కనుగొని భయభ్రాంత+ఐ= భయపడి; ఏ+వలనికిన్+పోదునో అని= ఏ మూలకు వెళ్ళాలా? అని; తలంచి= ఆలోచించి; దైవయోగంబునన్= అదృష్టవశాత్తు; విరాటుండు; అప్పుడు; కొలువు= సభ తీర్చి; ఉనికిన్+చేసి= ఉండటం చేత; తద్+సభాభాగంబుదెసకున్= ఆ సభవైపునకు; వెసన్+పాటినన్= వేగంగా పరువెత్తగా; కామ+ఆయత్తచిత్తుండును= స్త్రీవాంఛతో నిండిన మనస్సు కలవాడూ; గర్వ+ఉన్మత్తుండును= గర్వంచేత మత్తెక్కి పొగరుపట్టినవాడూ; కావునన్; జన సమూహంబున్ సరకు+చేయక= జనుల గుంపును లెక్కచేయక; రహస్యప్రకార విభేద విచారంబున్+తక్కి= గుట్టు రట్టు ఔతుందనే ఆలోచన కూడా లేకుండ.

తాత్పర్యం: ఈ విధంగా సైరంధ్రి తనను విదిలించి వెళ్ళిపోగా, కీచకుడు వదలక ఆమెను వెంబడించాడు. భయంతో పరుగు తీసి, ఎక్కడికి పోవాలో తెలియక, అదృష్టవశాత్తు విరాటమహారాజు అప్పుడు కొలువు తీర్చి ఉండటం చూచి ఆమె ఆ సభలోకి ప్రవేశించింది. కామంతో కళ్ళు మూసికొనిపోయిన ఆ గర్విష్ఠి కీచకుడు జనాలను లెక్కపెట్టక, గుట్టు రట్టు అవుతందనే సంగతి కూడా మరచిపోయి. (తరువాతి పద్యంతో అన్వయం.)

కీచకుఁడు ద్రౌపదిం బట్టుకొనుటకు వెంటఁదగులుట (సం.4-15-7)

**సీ. సమదవారణము జంగమలత వెనుకొని। సరభసంబునఁ బట్టఁ జనువిధమునఁ
గ్రూరదానవుఁడు భూచారి నిర్జరకాంతఁ। బొదువ రయమ్మునఁ బోవుభంగి
ఘోర గృధ్రము సుకుమార నాగాంగనఁ। బటుగతి నొడియంగఁ బాఱు కరణిఁ
బ్రబల బిడాలంబు బాలశారిక మీఁద। నడరి సత్వరముగ నరుగుమాడ్కి**

**తే. సింహబలుఁ డత్యుదగ్రతఁ జిగురుబోఁడి। పజ్జఁ గదువడిఁ దగిలి కోపంబు గదుర
నొడిచి తలపట్టి తిగిచి మహోగ్రవృత్తి। గొంకు కొసరించుకయు లేక కూలఁదాఁచె. 128**

ప్రతిపదార్థం: సమదవారణము= మదించిన ఏనుగు; జంగమలతన్= కదలి నడిచే తీగను; వెనుకొని= వెంబడించి; సరభసంబునన్= వేగంగా; పట్టన్+చనువిధమునన్= పట్టటానికి వెళ్ళినట్లు; క్రూరదానవుఁడు= భయంకర రాక్షసుడు; భూచారి= భూలోకంలో తిరిగే; నిర్జరకాంతన్= దేవతాస్త్రీని; పొదువన్= పట్టుకోవటానికి; రయమ్మునన్= వేగంగా; పోవుభంగిన్= వెళ్ళునట్లు; ఘోరగృధ్రము=

భయంకరమైన గ్రద్ద; సుకుమార నాగ+అంగనన్= సున్నితమైన నాగవనితను; పటుగతిన్= గట్టిగా; ఒడియంగన్= పట్టుకొనటానికి; పొఱుకరణిన్= పరుగెత్తేటట్లు; ప్రబల బిడాలంబు= బలమైన గండుపిల్లి; బాలశారికమీఁదన్= చిన్నగోరువంక మీదికి; అడరి= అతిశయించి; సత్వరముగన్= వేగంగా; అరుగుమాడ్కిన్= వెళ్ళునట్లు; సింహబలుఁడు= కీచకుడు; అతి+ఉదగ్రతన్= మిక్కిలి గర్వంతో; చిగురుబోఁడి పజ్జన్= సైరంధ్రి వెనుక; కడువడిన్= మిక్కిలి వేగంగా; తగిలి= వెంబడించి; కోపంబు కదురన్= కోపంరాగా; ఒడిచి తలపట్టి= ఎగసి నిపుణంగా సిగపట్టి; తిగిచి= లాగి; మహా+ఉగ్రవృత్తిన్= మిక్కిలి భయంకరంగా; కొంకుకొసరు+ఇంచుకయున్ లేక= వెనుకంజ కాస్త కూడా లేకుండా; కూలన్+తాఁచెన్= నేలపై పడేటట్లు తన్నాడు.(త్రోశాడు).

తాత్పర్యం: మదపుటేనుగు నడిచే తీగను వేగంగా పట్టబోయినట్లు. రాక్షసుడు భూలోకానికి వచ్చిన దేవకాంతను త్వరగా పట్టబోయినట్లు. పెద్ద గ్రద్ద యాడుపామును వేగంగా ఒడిసి పట్టబోయినట్లు, గండుపిల్లి గోరువంక పిల్ల మీదికి దురుసుగా దూకి, పట్టటానికి పరుగెత్తినట్లుగా కీచకుడు మిక్కిలి కోపంతో కోమలాంగి అయిన ద్రౌపది వెంటబడి పరుగిడి ఎగసి జుట్టుముడిపట్టి లాగి, ఏమాత్రం జంకుగొంకు లేకుండా నేల బడద్రోశాడు. (పడతన్నాడు.)

విశేషం: 1. అలం: మాలోపమ, ఉల్లేఖం. క్రమాలంకారం లేదా యథాసంఖ్యాలంకారం.

2. మూలంలో కంటె తిక్కన ఈ సన్నివేశాన్ని సహజసుందరంగా చిత్రించాడు. ఎట్లాగంటే - మూలంలో కీచకుడు మొదట ఆమెకుడిచేయి పట్టుకొన్నాడు. ఆమె విదిలించి కొట్టింది. అతడు అంతటితో ఆగక ఆమెను పట్టుకొనటానికి యత్నించి పైటను చిక్కించుకొన్నాడు. ఆమె నిట్టూర్పులు నిగుడిస్తూ వేగంగా విదిలించి కొట్టింది. అతడు మొదలు నరికిన చెట్టువలె నేలమీద పడ్డాడు. అప్పుడు ఆమె భయంతో పరుగెత్తి రాజూ, యుధిష్ఠిరుడూ ఉన్న సభలో ప్రవేశించి శరణువేడింది.

"తాం కీచకః ప్రధావన్తీం కేశపాశే పరామృశత్
అథైనాం పశ్యతో రాజ్ఞః పాతయిత్వా పదావధీత్' (సం.4.15.7)

వేగంగా పరుగెత్తుతున్న ద్రౌపదిని కీచకుడు వెన్నంటి జడపట్టుకొని, రాజు చూస్తూ ఉండగానే, నేలమీద పడవేసి కాలితో తన్నాడు. ఇది మూలకథనం. తిక్కన దీనిని మార్చి సహజత్వాన్నీ, ఔచిత్యాన్నీ పోషించాడు. తిక్కన తీర్చిన కీచకుడు ఆమె చేయిపట్టుకొనబోవలేదు. మదనావేశంతో ఆమెను కౌగిలించుకొనబోయాడు. (పైనబడి పట్టుకొన్నాడట). ఆమె (దనుజదత్తబలంతో) అతడిని త్రోసిందట. అతడు ఆమె కొంగుపట్టుకొనటం, ఆమె త్రోయటం, అతడు విరిగినచెట్టువలె నేలపై పడటం తిక్కన తీసివేశాడు. సైరంధ్రి అతడిని త్రోసి, త్వరగా పరుగెత్తింది. అతడు వెన్నంటాడు. ఈ సారి అతడు పట్టుకొంటే కీడుమూడుతుందని భావించి విరాటుడి సభవైపు పరుగెత్తటం మొదలుపెట్టింది. కాని, మూలంలో చెప్పబడినట్లు అప్పటికి రాజును శరణు వేడలేదు. రాజుముందే కీచకుడు సైరంధ్రిని కొప్పుపట్టి లాగి పడవేసి ఆమెను కాలితో తన్నినట్లు సంస్కృత భారతం. ధూర్తుడైన కీచకుడి కది సహజం. కాని, ద్రౌపది పాదహతి పొందినట్లు చెప్పటం తిక్కనకు ఉచిత మనిపించలేదు. అందుకే - నిపుణంగా 'కూలఁదాఁచెన్' - అని తెలుగులో చెప్పాడు. కూలబడేటట్లుగా తాచాడని దానికి అర్థం. కూలబడగా (కూలబడినతరువాత) తాఁచాడనే అర్థం దూరాన్వయం ఔతుంది. తెలుగులో 'తాఁచు' అనే క్రియకు విసరివేయు, కొట్టు, పాదంతోతన్ను, అదుము, అణగద్రొక్కు అనే అర్థాలున్నాయి. కాబట్టి ఒక చేత్తో జుట్టుముడిపట్టిలాగి, మరొక చేత్తో ఆమెను కొట్టి, నేలకు విసరివేసినట్లు అర్థం చెప్పే అవకాశం తిక్కన కల్పించాడు. 158వ పద్యంలో కీచకుడు 'వెనుకం గూడఁగ ముట్టి పట్టికొని తన్నెన్' అని ద్రౌపది (సైరంధ్రి) సుదేష్ణతో చెప్పింది. 'తన్నెన్' అనే క్రియకు కొట్టు, పాదంతో తాడించు అనే రెండర్థాలున్నాయి. తిక్కన తెలుగు క్రియలు వాడి ఔచిత్యం పోషిస్తాడన్నదానికి ఇదొక ఉదాహరణం. 'కూలఁదాఁచెన్' అన్నప్పుడు నేలమీద పడేటట్లు త్రోశాడనీ లేక తన్నాడనీ అర్థం చెప్పుకొనవచ్చును. పాదతాడనం తెలుగులో చెప్పబడలేదు. అది తిక్కన పాటించిన ఔచిత్యం. మరొక విశేషం. 257వ పద్యంలో కీచకుడే 'అట్లు ద్రోవన్' అని అన్నాడు. ఈ ప్రతిలో ఆ పాఠమే ఉన్నది. 'తాపన్', 'తన్నన్' అనే పాఠాంతరాలు కూడా ఉన్నాయి. దీనిని బట్టి తిక్కన తాను చేసిన ఔచిత్యాన్ని పరోక్షంగా పలుచోట్ల సమర్థించుకొన్నాడు కూడా. ఆమె శరీరంలో సూర్యవరంతో

రాక్షసబలం నిక్షిప్తమై ఉండటం చేత ఆమె వేగంగా పరుగెత్తింది. ఆమెను అందుకొనటం అతడికి అంత తేలిక కాలేదు. కసికొద్దీ ఆమెను వెన్నంటిన కీచకుడు ఎంతో ప్రయత్నం చేసి ఆమె కొప్పును పట్టుకొని వెనుకకు లాగాడు. వేగంగా ముందుకు పోతున్న మనిషిని ఒక్కసారి జుట్టుపట్టి లాగి కొట్టి త్రోస్తే కుప్పగూలటం సహజం. అటువంటి సహజ సన్నివేశాన్ని తిక్కన చిత్రించాడు.

3. పరుగెత్తే సన్నివేశాన్ని చలనచిత్రంగా వర్ణించటం తిక్కన వర్ణనాశిల్పం. ఉపమాలంకారాలను వరుసగా నాలుగింటిని వాడి అప్పటి ఆ పాత్రల స్వభావదశా విశేషాలను ధ్వనింపచేశాడు. 1. మదించిన ఏనుగు నడుస్తున్న తీగను వేగంగా తుండంతో పెనవేసి పట్టుకొనాలనుకొంటుంది. లత అబల, మదించిన ఏనుగు ధూర్తం. ద్రౌపదిని బాహువులతో కబళించాలని మదించినవాడి ప్రయత్నం. అందులో అతడి బలగర్వం విఫలమయింది. 2. ఆమె అతడి చేతికి చిక్కలేదు. బలగర్వితుడు రాక్షసుడివలె తయారయ్యాడు. విజాతిస్త్రీ అయిన నిర్జరకాంతను పొదివి (రెండు బాహువుల మధ్య ఇరికించి) కౌగిలించిపట్టుకొనాలని యత్నించాడు. అతడు కాముకుడు, వెనుకాడనివాడు. ఆమె విముఖురాలు, భీతురాలు. అదీ సఫలం కాలేదు. 3. ఆమె ఆడునాగువలె సూటిగా పరుగెత్తకుండా వంకర టింకరలుగా పరుగెత్తుతుండవచ్చును. వెంటాడే వారినుండి తప్పించుకొనే పద్ధతులలో అది ఒకటని ప్రసిద్ధం. పెద్ద గ్రద్ద పామును వీలునుబట్టి గట్టిగా ఒడిసిపట్టటానికి ప్రయత్నిస్తుంది. కీచకుడు ఆ పద్ధతిని వాడాడు. ఆమె కొప్పు చిక్కింది. 4. గండుపిల్లి వెనకనుండి ఎగిరిదూకి గోరువంక పిల్ల గొంతు పట్టుకుంటుంది. అట్లాగే కీచకుడు కుప్పించి ఎగసి (ఎడరి) ఆమె కొప్పును పట్టిలాగాడు, తన్నాడు. ఆ పట్టు యొక్క తీవ్రతకు ఆమె పడక తప్పలేదు. తిక్కన సీసపద్యపాదాలలో నాలుగంశాలు చెప్పాడంటే, ఎత్తుగీతిలో యథాసంఖ్యాలంకారాన్ని ప్రయోగిస్తా డన్నమాటే! కీచకుడు అత్యుగ్రతతో వెన్నాడటం మొదలుపెట్టి మహోగ్రవృత్తితో ఆమెను కూలత్రోశాడట! సైరంధ్రి తనను తిరస్కరించి త్రోసివేయటం వలన కలిగిన అవమానంతో అతడి యందు కలిగింది క్రోధం. అది తారస్థాయిలో ఉంటే ఉగ్రత. ఇది కలిగినప్పుడు మదించిన ఏనుగువలె వెన్నంటి పరుగెత్తాడు. ఆ తరువాత క్రోధం ద్విగుణీకృతమైంది. (కోపంబు గదుర) రాక్షసుడివలె వ్యవహరించాడు. ఆపైన గ్రద్దవలె ఆమెను ఒడిచి కొప్పును పట్టాడు. చివరి దశ అయిన మహోగ్రవృత్తితో జంకుగొంకు లేకుండా కూలదోశాడు. సీస చరణాలలోని మానసిక దశలకూ ఎత్తుగీతిలోని క్రియాదశలకూ క్రమాన్వయం కుదరటం అలంకార శిల్పం. అదే యథాసంఖ్యాలంకారం. ద్రౌపదిని వెన్నంటిన ఆ దృశ్యాన్ని అనేక విధాలుగా వర్ణించటం వలన ఉల్లేఖాలంకారం కూడా గమ్యమానం ఔతున్నది. భీము డీ దృశ్యాన్ని గమనించాడు. కీచకుడి మహోగ్రవృత్తికి ప్రతిక్రియగా భయంకరాకారతను ప్రదర్శించాడు. (134 పద్యం) తులనాత్మకపద్య రచనా శిల్పం తిక్కన నైజం. (సంపా.)

వ. అట్టియెడఁ బాంచాలీ రక్షకుండైన రాక్షసుం డతని డొల్లవ్రేసిన. 129

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; పాంచాలీ రక్షకుండు+ఐన= ద్రౌపదిని రహస్యంగా రక్షించేవాడైన; రాక్షసుండు; అతనిన్= కీచకుడిని; డొల్లవ్రేసినన్= పడద్రోయగా.

తాత్పర్యం: ద్రౌపదిని కాపాడటానికి (సూర్యప్రేరితుడై) ఆమె వెంటనంటి తిరిగే రాక్షసుడు ఆ సమయంలో కీచకుడిని నేలపైపడతోశాడు. అప్పుడు.

క. కీచకుఁడు వ్రేటుపడి తన। నీచపుదశ యొరు లెఱుంగ నేరకయుండన్
లేచి వెనుకఁ జని విస్మయ। గోచరుఁడై యసురకతనఁ గుంఠితుఁడగుచున్. 130

ప్రతిపదార్థం: కీచకుఁడు; వ్రేటుపడి= దెబ్బతిని; తన నీచము+దశ= తన అధమస్థితిని, తనకు జరిగిన అవమానాన్ని; ఒరులు+ఎఱుంగ నేరక+ఉండన్= ఇతరులు తెలిసికొనకుండా ఉండాలని; లేచి= పైకి లేచి నిలబడి; వెనుకన్+చని= వెనుతిరిగి; విస్మయగోచరుఁడు+ఐ= ఆశ్చర్యానికి లోనై; అసురకతనన్= రాక్షసుడి వలన; కుంఠితుఁడు+అగుచున్= భయపడిన (ముక్కవోయిన) వాడౌతూ.

తాత్పర్యం: ద్రౌపదీసంరక్షకుడైన రాక్షసుడిచేత కీచకుడు కొట్టబడి తనదీనమైన స్థితిని ఇతరులు తెలిసికొనకుండా వెంటనే లేచి, రాక్షసుడి కారణంగా ద్రౌపదివెంటబడక వెనుతిరిగి మొక్కవోయినవాడౌతూ (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: జీవితంలో మొదటిసారి ఎదురుదెబ్బతిన్న గర్వోన్నతుడు పొందే చిన్నతనం మొక్కవోవటం - లేదా - కుంఠితుడు కావటం. ఆయుధం మొక్కవోవటం వంటి దిది. భావి మరణానికి మొదటి సూచన. (సంపా.)

వ. ఒడుపు దప్పిన మహానాగంబునుం బోలె నిట్టూర్పు నిగుడ నిట్టలంబగు కోపంబు పెల్లున మల్లడిగొనుచుండె; నయ్యవసరంబున. 131

ప్రతిపదార్థం: ఒడుపు+తప్పిన= పట్టు తప్పిన; మహానాగంబునున్+పోలెన్= పెద్ద పామువలె; నిడు+ఊర్పు నిగుడన్= దీర్ఘశ్వాసలు (బుసలు) కలుగగా; ఇట్టలంబు+అగు= గొప్పదైన; కోపంబు పెల్లునన్= కోపాతిశయంచేత; మల్లడిగొనుచుండెన్= లోలోన కుతకుతలాడుతూ ఉన్నాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: పట్టుదప్పిన పెద్దపామువలె బుసలు కొట్టుతూ, కోపం ఎక్కువగా కీచకుడు లోలోన ఉడికిపోతున్నాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తానును నన్నయు నయ్యా। స్థానమ్మున నుండి పవనతనయుఁ డసహ్యం
బైన మనోవల్లభ యవ। మానము, నా సింహబలుని మదజృంభణమున్. 132

ప్రతిపదార్థం: పవనతనయుఁడు= భీముడు; తానును= తానూ; అన్నయున్= ధర్మజుడును; ఆ+ఆస్థానమునన్+ఉండి= ఆ విరాటుని కొలువులో ఉండి; అసహ్యంబు+ఐన= ఓర్చుకొనలేని; మనస్+వల్లభ= ద్రౌపదియొక్క; అవమానమున్= భంగపాటును; ఆ సింహబలుని= ఆ కీచకుడి; మదజృంభణమున్= గర్వాతిశయాన్నీ.

తాత్పర్యం: విరాటుడి కొలువులో అన్నతోగూడ కూర్చొని ఉన్న భీముడు ద్రౌపదికి జరిగిన అవమానాన్నీ, కీచకుడి పొగరుబోతుతనాన్నీ. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. కనుఁగొని కోప వేగమునఁ గన్నుల నిప్పులు రాల, నంగము
ల్గనలఁగ, సాంద్ర ఘర్మ సలిలంబులు గ్రమ్మ, నితాంతదంతపీ
డనరట దాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్త న
ర్తన ఘటనా ప్రకార భయదస్ఫురణా పరిణద్ధ మూర్తియై. 133

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; కోపవేగమునన్= కోపభావం యొక్క తీవ్రత చేత; కన్నులన్= కన్నుల నుండి; నిప్పులు రాలన్= నిప్పులు రాలినట్లు ఎర్రనికాంతులు కురియగా; అంగముల్+కనలఁగన్= అవయవాలు వేడెక్కగా; సాంద్ర ఘర్మ సలిలంబులు= దట్టంగా చెమట బిందువులు; క్రమ్మన్= పట్టగా; నితాంత= ఆగకుండా; దంతపీడన= పండ్లు కొరకటంచేత; రటత్= చప్పుడు చేస్తున్న; ఆస్యరంగ= ముఖమనే రంగస్థలంపై; వికట= వంకలు తిరిగిన; భ్రుకుటీ= బొమముడియొక్క; చటుల= కదలికవలన; ప్రవృత్త= ఏర్పడిన; నర్తన= నాట్యం యొక్క; ఘటనా= అమరిక యొక్క; ప్రకార= పద్ధతి చేత; భయద= భయాన్ని కలిగించే; స్ఫురణా= ప్రకాశం చేత; పరిణద్ధ= రూపొందిన; మూర్తి+ఐ= ఆకారం కలవాడై.

తాత్పర్యం: భీముడు కీచకుడి మద విజృంభణాన్ని చూచాడు. అతడి మనసులో కోపం తీవ్రంగా రేగటం వలన కన్నుల నుండి నిప్పులు రాలాయి. ఒడలంతా ఉడికిపోయింది. దట్టంగా చెమటబిందువులు క్రమ్మాయి. కోపంతో ఎడతెగకుండా పండ్లు పటపట కొరకటం వలన ధ్వనిస్తున్న ముఖమనే రంగస్థలం మీద వంపులు తిరిగే కనుబొమల కదలికల వలన ఏర్పడిన నాట్యప్రదర్శన వైఖరిచేత భయంకరంగా రూపుదాల్చిన ఆకారం కలవాడై.

విశేషం: 1. అలం: రూపకం, వృత్త్యనుప్రాసం.

2. భీముడి కోపభావాన్ని అభినయ బంధురంగా రూపుగట్టించిన మంచి పద్యమిది. కోపం ఒక్కసారిగా వేగంగా ప్రజ్వరిల్లింది. జ్వలనం కోపస్వభావం. మనసులోని కోపపు మంట కళ్ళలో నుండి నిప్పులు రాలుస్తున్నది. కళ్ళు ఎర్రబడటం కోపంయొక్క మొదటి అనుభావం. భార్య కవమానం చేసినవాడిమీద పగతో కూడిన క్రోధం భగ్గున మండింది. ప్రతీకారభావంతో ఒడలంతా వేడెక్కిపోయింది. తమ భార్యను అవమానిస్తుంటే చూడవలసివచ్చిందనే అప్పటి నిస్సహాయత వలన శరీరమంతా చెమటలు క్రమ్మాయి. అంతటి అవమానం చేసినవాడికి తగిన శాస్తి చేయాలి. అతడిపై ప్రతీకారం తీసికొనాలి-అనే రోషం అతడిచేత పళ్ళు పటపట లాడింపజేసింది. కనుబొమలను అల్లల్లాడ చేయించింది. అది క్రోధనర్తకి భయంకర నాట్యం చేస్తున్నట్లున్నది. పళ్ళ పటపటలు కాలి ఇనుపగజ్జెలు, కనుబొమల విన్యాసం నాట్యవైఖరులు, ముఖం నాట్యరంగం, కోపం భయంకరాకారంతో రూపుకట్టి తాండవించినట్లు భీముడు తన ఆకారాన్ని ప్రదర్శించాడు. దాన్ని తిక్కన రూపకంలో రూపొందించాడు. తకార, రకార, టకారాల పునరావృత్తి వలన వృత్త్యనుప్రాసం రూపొంది రుద్రనాట్య లయ నినదించింది. ఓజోగుణ భూయిష్ఠమైన ఈ రచన తిక్కన 'రసాభ్యుచితబంధం'. ఓజోగుణంలో శబ్దగుణ స్వభావం ఈ పద్యంలోనూ, అర్థగుణస్వభావం రాబోయే పద్యంలోనూ ప్రదర్శించి శబ్దార్థ గుణ ప్రధాన రచన చేయగల ఉభయగుణప్రౌఢిని నిరూపించాడు. కవిబ్రహ్మ.

3. ఛందశ్శిల్పం; "రతి, ఉత్సాహము, క్రోధము, శోకము, హర్షము, ఆవేగము, సంభ్రమము, ఔత్సుక్యము, భయము, ఉగ్రత - మున్నగు భావములు ఉత్కటావస్థయందు చిత్తద్రుతి హేతువులగును. కవిత్రయ మిట్టి భావముతోడనే చిత్తస్పందత్వరను వ్యంజింపవలసినపట్ల తరచు చంపకమాలావృత్తమును ప్రయోగించిరి. కీచకుడు రాజమార్గమున ద్రౌపదినిఁ బరాభవించుటఁ దిలకించిన భీముని క్రోధమును తిక్కన చంపకమునందే వర్ణించెను. ఇదియు క్రోధవేగముయొక్క సాత్త్వికాభినయమే. అజ్ఞాతవాసమున భీముడు తన క్రోధోద్రేకమును సంయమించుకొనక తప్పదు. ఎంత సంయమించుకొన్నను అది శరీరము నందగపడకమానదు. అజ్ఞాతవాస వ్రతమున క్రోధప్రకటనము కారాని కోపముయొక్క అనివార్యవ్యక్తిని తిక్కన వర్ణించెను."

"తిక్కన చంపకమున జగణములు ఇంచుమించుగా నన్నియు స్థగితములైనవి. శకలితములైన ఆ జగణముల యంగములు పూర్వోత్తర గణములకుఁ దగుల్కొని భగణ, సగణములు రూపొందినవి. 'కోపవేగమునఁ గన్నులు నిప్పులురాల'. 'సాంద్రఘర్మసలిలమ్ములు గ్రమ్మ' అను తీరున పద్యపూర్వార్ధమున గల భగణరూపమున నవరోహణము స్ఫుటమై యుత్ ప్లుతమగుచున్న హృదయగతిని అణచి శాంతము చేయు భీముని యత్నమును సూచించుచున్నది. అణచరాని యుత్ప్లుతి 'నితాంత'. 'ప్రవృత్త'. 'ప్రకార' పదములందు తలయెత్తుచున్నది. అణఁచబడిన యుత్ప్లుతి యంతయు ఆరోహణరూపము ధరించి పద్యము నుత్తరార్ధము నందలి సగణావభాసమునకు గారణమైనది. 'వికట..మూర్తియై' అన్న వాక్యంబునందలి పదములు పెక్కు నగణరూపమున నున్నవి. అణఁచరాని కోపము యొక్క వేగము భీముని క్రమవర్ధమాన భయంకరాకారమున పర్యవసించుట పద్యమందలి క్రమవర్ధమాన వాక్యప్రమాణముననుు గుర్తింపవచ్చును. "నితాంత..ప్రకారము' అక్షరఘటనా ప్రకారమున ప్రస్ఫుటమగుచున్నది. 'నితాంతదంతపీడనమున' బిందుపూర్వక దంత్యాక్షరములు మర్దలధణంధణలు మొరయించుట. వికటభ్రుకుటీచటుల ప్రవృత్తనర్తనమున మూర్ధన్య పరుషటకారవృత్తి శ్రుతికటువులైన పదఘట్టనములను దలపించుట యక్షరములచే వర్ణ్యవస్తుసాక్షాత్కారము చేయించు మహాశిల్పము."

-డాక్టర్ పాటిబండ మాధవశర్మ (ఆంధ్ర మహాభారతము; ఛందశ్శిల్పము. పు. 420-422)

సీ. నేలయు నింగియుఁ దాళముల్గాఁ జేసి। యేపున రేఁగి వాయించి యాడఁ,
గులపర్వతంబులు గూల్చి యొండొంటితోఁ దాఁకంగ వీఁకమైఁ దన్ని యాడ,
నేడు సాగరములు నిక్కడక్కడఁ బెట్టి। పలుచని రొంపి మై నలఁదికొనఁగ,
దిక్కులు నాలుగు నొక్క చోటికిఁ దెచ్చి। పిసికి పిండలి సేసి పిడుచగొనఁగ,

తే. మిగిలి బ్రహ్మాండభాండంబు పగుల వ్రేయ। నప్పళించుచుఁ బ్రళయకాలానలమున
గండరించిన రూపంబు కరణి భీముఁ। డతి భయంకరాకారత నతిశయిల్లె. 134

ప్రతిపదార్థం: నేలయున్, నింగియున్= భూమి, ఆకాశమూ; తాళముల్+కాన్+చేసి= తాళాలుగాచేసి; ఏపునన్, రేఁగి= గర్వంతో పెట్రేగి; వాయించి+ఆడన్= వాయించి ఆడేటట్లుగా; కులపర్వతంబులు+కూల్చి= కులపర్వతాలను పడగొట్టి; ఒండు+ ఒంటితోన్+తాఁకంగన్= ఒకదానితో ఒకటి ఢీకొనేటట్లు; వీఁకమైన్= పరాక్రమంతో; తన్ని+ఆడన్= తన్ని ఆడేటట్లుగా; ఏడు సాగరములున్= ఏడు సముద్రాలను; ఇక్కడన్+అక్కడన్+పెట్టి= ఇటు నటుచేసి; పలుచని రొంపి= పలచటి బురద; మైన్+ అలఁదికొనఁగన్= ఒంటికి పూసికొనేట్టుగా; దిక్కులు నాలుగున్= నాలుగు దిక్కులను; ఒక్కచోటికిన్+తెచ్చి= ఒకటిగా జేసి; పిసికి పిండలి చేసి= పిసికి ముద్దజేసి; పిడుచకొనఁగన్= మ్రింగేటట్లుగా; మిగిలి= అతిశయించి; బ్రహ్మాండభాండంబు= బ్రహ్మాండమనే కుండను; పగులవ్రేయన్= పగలగొట్టడానికి; అప్పళించుచున్= ప్రయత్నిస్తూ; భీముడు; ప్రళయకాల+అనలమునన్= ప్రళయకాలంలోని అగ్నిలోనుండి; గండరించిన రూపంబు కరణిన్= రూపొందించిన ఆకారంవలె; అతిభయంకర+ఆకారతన్= మిక్కిలి భయం కలిగించే రూపంతో; అతిశయిల్లెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: నేలనూ, ఆకాశాన్నీ తాళాలుగా చేసికొని పేట్రేగి వాయించి ఆడినట్లుగానూ, కులపర్వతాలను పడగొట్టి ఒకటి మీద ఒకటి పడేటట్లు తన్ని ఆడినట్లుగానూ, ఏడు సముద్రాలను అటునిటు చేసి నీరు పోగా మిగిలిన పలుచని బురదను శరీరం నిండా పూసికొన్నట్లుగానూ, నాలుగు దిక్కులనూ కలిసి ఒకచోట చేర్చి ముద్దచేసి మ్రింగ బోతున్నట్లుగానూ అతిశయించి, బ్రహ్మాండమనే భాండాన్ని పగులగొట్టాలని, జబ్బలు చరుస్తూ ప్రళయకాలంలోని మహాగ్ని పుట్టి మానవరూపం తాల్చిందా అన్నట్లు భీముడు మిక్కిలి భయాన్ని కలిగించే ఆకారంతో ప్రకాశించాడు.

విశేషం: 1. అలం: సీసపాదాలలో - అత్యుక్తి; ఎత్తుగీతిలో - ఉత్ప్రేక్ష, క్రమాలంకారం.

"అత్యుక్తి రద్భుతాతథ్య శౌర్యోదార్యాది వర్ణనమ్." అద్భుతాలూ, అసహజాలూ అయిన శౌర్యోదార్యాదులను వర్ణించటం అత్యుక్తి. ఉపమాన తాదాత్మ్యాన్ని ఉపమేయంలో సంభావించటం ఉత్ప్రేక్ష. ఈ రెండలంకారాలను ఒకచోట కూర్చటం వలన తిక్కన భీముడి భయంకర రూపాన్ని అపూర్వంగా, భావనామయంగా, అద్భుతంగా ప్రత్యక్షీకరించగలిగాడు. పైపద్యంలో క్రోధోద్రేకం వలన కలిగిన ఆంగికాభినయాన్ని సమాసాడంబరంతో అక్షరరమ్యంగా రూపకాలంకారాన్ని ఆశ్రయించి రూపుకట్టించాడు. ఈ పద్యంలో తిక్కన భీముడి మనస్సులో రేకెత్తిన క్రోధ తీవ్రతను అలంకారికంగా పఠితల మనస్సులలో రూపొందేటట్లు చిత్రింపదలచుకొన్నాడు. రెండు పద్యాలలోనూ భీముడి భయంకరాకారమే వర్ణించబడింది. పైపద్యంలో భీముడి ముఖమే ఒక నర్తనశాల, అతడి కోపమే ఒక కరాళ నృత్యం. ఈ పద్యంలో బ్రహ్మాండభాండాన్ని పగలగొట్టటానికి రూపుతాల్చిన ప్రళయాగ్నివలె తోచటం సాత్త్వికాభినయం. భీముడి మనసులో పుట్టింది క్రోధం. అది ఉత్కటావస్థ పొంది రౌద్రరసరూపం తాల్చింది. ఆ రౌద్రరసముద్రలో ఉన్న భీముడి రూపం చూచేవారికి భయంకరంగా ఉన్నది. తిక్కన రసశిల్పం ఇక్కడ విశిష్టం. 'రసం సామాజిక నిష్ఠం కదా! భీముడు రౌద్రరసవిభావం; ఆయనను చూస్తే ప్రేక్షకులకు కలిగేది భయం. జనకజన్యరస విశిష్ట సమ్మేళనం భయాన్ని కలిగించే రౌద్రాకారం రసానుభవాన్ని కలిగించే రమణీయ విభావం. ఇది రసశిల్పం తెలిసిన కవి మాత్రమే చేయగలడు. విభావాన్ని

చూచిన సహృదయుడు విభావనం చేస్తాడు. భౌతిక విభావాన్ని పైపద్యంలో ప్రదర్శించిన తిక్కన సహృదయ పక్షంలో భీముడి రౌద్రాన్ని ఈ పద్యంలో భావనామయం చేశాడు. ఆలోచనామృతాన్ని అందించాడు. దానికి తోడ్పడే అర్థాలంకారాలు అత్యుక్తి, ఉత్ప్రేక్ష. అలంకారంతో రసధ్వనిని కల్పించటం ఇందులోని వర్ణనాశిల్పం.

2. తిక్కన కల్పించిన క్రమాలంకారం పై రెండు అలంకారాలకు అంతస్సూత్రం. ప్రళయాగ్ని రూపుడుగా కనబడుతున్న భీముడు కౌరవాంతకు డౌతాడని అలంకారధ్వని. భూమ్యాకాశాలను కలిపి తాళం వేస్తూ నాట్యం చేస్తున్నట్లున్నది అతడి హావం. ఇది జాతీయప్రయోగంతో సాధిస్తున్న ధ్వని. రెండు అసాధ్యమైన, విరుద్ధమైన అంశాలను కలిపి సాధించే ఒక సాహసాన్ని నేలానింగీ కలిపి తాళం వేసి ఆడటం వలె చెప్పటం తెలుగు జాతీయం. అజ్ఞాతవాసంలో ఉన్న వాస్తవాన్నీ, కీచకుడిని సంహరించటాన్నీ భీముడు అద్భుతంగా సాధించే భావికథార్థం. భూమ్యాకాశాలను తాళాలుగా మ్రోగిస్తే బ్రహ్మాండభాండం పగలటం. ఇదీ జాతీయమే, ఇందుట్లో వస్తుధ్వని, కులపర్వతాలను ఒకదానిపై ఒకటివేసి తన్ని ఆడినట్లుగా అతడి కోపం పెచ్చుపెరిగిందట. ఈ అత్యుక్తి ద్వంద్వయుద్ధంలో కీచకుడి సంహారాన్ని ప్రౌఢంగా ధ్వనింపజేస్తున్నది. ఆ పని చేయటానికి సిద్ధపడుతున్నట్లు కీచకుడు అప్పళించాడు. సప్తసాగరాలను ఇంకింపచేయటం తెలుగు జాతీయం. 'సముద్రా లింకినా, భూమి బ్రద్దలైనా, ప్రళయం వచ్చినా నేనీపని చేస్తా'ననే వాక్యాలు లోకంలో వింటాం. ఆ ప్రాగల్భ్యం భీముడి రౌద్రోద్రేకంలో ప్రత్యక్షమయింది. సముద్రజలాలను ఇట్టట్టు చేసేదీ, ఇంకింప చేసేదీ ప్రళయకాలాగ్ని. ఇది కవిసమయం కూడా. అందువలననే ఈ భావోద్రేకాన్ని ప్రదర్శిస్తున్న భీముడు ప్రళయకాలాగ్ని రూపం తాల్చినట్లుగా తోచాడు. ఇక నాల్గవపాదంలో నలుదిక్కులను ముద్దచేసి మ్రింగే భయంకర భావావిష్కారం జరిగింది. అందువలననే భీముడు 'భయంకరాకారత నతిశయిల్లె'నని తిక్కన వర్ణించాడు. సీసపద్యంలో క్రమాలంకారం పాటించటం తిక్కన సహజశిల్పం. దానిని భావనామయం చేయటం ఇక్కడ రసధ్వని శిల్పం. (సంపా.)

3. కులపర్వతాలు ఏడు: మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, గంధమాదనం, వింధ్యం, పారియాత్రం, సప్తసముద్రాలు: లవణ, ఇక్షు, సురా, ఘృత, దధి, క్షీర, జల సముద్రాలు.

వ. ఇట్లు పేర్చిన కోపాటోపంబున నవిచారిత సమయవర్తనుండయి వృకోదరుండు కీచకుని గీటడంగింపంజూచి తత్సంబంధబద్ధుండును నాజ్ఞాపరిపాలకుండును గావున మత్స్యపతిఁ దన యలుకలోని వానిన కాఁ దలంచుచు నచ్చేరువ నున్న యున్నతవృక్షంబు నిరీక్షించి, యాననంబు పల్లటిల్ల ధర్మతనయుం గనుంగొనిన నతండు తన నయనాకారంబున వారించి యిట్లనియె. 135

ప్రతిపదార్థం: ఇట్లు పేర్చిన= ఈ విధంగా అధికమైన; కోప+ఆటోపంబునన్= కోపాతిశయంచేత; అవిచారిత సమయ వర్తనుండు+అయి= ఆలోచించబడని అజ్ఞాతవాస వ్రత ప్రవర్తన కలవాడై - అంటే - అజ్ఞాతవాస నియమాన్ని గురించి పట్టించుకొనని ఆచరణకు పూనుకొన్నవాడై ఉన్న; వృకోదరుండు= భీముడు; కీచకునిన్+గీటు+అడంగింపన్= కీచకుడిని మట్టుబెట్టాలని; చూచి= చూచి; తత్‌సంబంధబద్ధుండును= వానితో చుట్టరికం వలన కట్టబడ్డవాడూ; ఆజ్ఞాపరిపాలకుండును= ఆ కీచకుని ఆనతి పాటించేవాడూ; కావునన్= కనుక; మత్స్యపతిన్= మత్స్యదేశానికి రాజయిన విరాటరాజు; తన అలుకలోని వానిన్+అ= తనకోప పరిధిలోకి వచ్చేవాడినిగానే; తలంచుచున్= భావిస్తూ; ఆ+చేరువన్+ఉన్న= ఆ సమీపంలో ఉన్న; ఉన్నతవృక్షంబు= పెద్దచెట్టును; నిరీక్షించి= ఎగాదిగ చూచి; ఆననంబు పల్లటిల్లన్= ముఖము ఎఱ్ఱబారగా; ధర్మతనయున్= ధర్మరాజును; కనుంగొనినన్= చూడగా; అతండు= ధర్మరాజు; తన= తనయొక్క; నయన+ఆకారంబునన్+వారించి= కనుసైగలతో అడ్డుపెట్టి; ఇట్లు+అనియెన్; ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అధికమైన కోపంతో భీముడు తమ అజ్ఞాతవాస ప్రతిజ్ఞను మరచిపోయి కీచకుడిని మట్టుబెట్టాలని చూచి, కీచకుడితోడి చుట్టరికంవలన, అతడి ఆజ్ఞకు విరాటరాజు లోబడి ఉండటం వలన విరాటుడినీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తనకోప పరిధిలోని వాడినిగా భావిస్తూ, దగ్గరలో ఉన్న పెద్దచెట్టును ఎగాదిగా చూచి మొగం ఎర్రబారగా ధర్మరాజు వైపు చూచాడు. భీముడి ఆకారాన్ని చూచి ధర్మరాజు కనుసైగలతో వారించి ఇట్లా అన్నాడు.

విశేషం: తిక్కన నాటకీయత కిది మచ్చుతునక. భీముడు ఆవేశపరుడైనా ఆదేశంకొరకు అన్నవైపు చూడటం, అతడు వారించగానే ఆగిపోవటం భీముడిలోని సమయజ్ఞతను, క్రమశిక్షణను తెలియజేస్తాయి.

మ. **'వలలుం డెక్కడఁ జూచె నొండెడ నసేవ్యక్ష్మాజముల్ పుట్టవే?**
ఫలితంబై వరశాఖ లొప్పఁగ ననల్పప్రీతి సంధించుచున్
విలసచ్ఛాయ నుపాశ్రిత ప్రతతికిన్ విశ్రాంతి గావింపఁగాఁ
గల యీ భూజము వంటకట్టియలకై ఖండింపఁగా నేటికిన్?' **136**

ప్రతిపదార్థం: వలలుండు= వలలుడు అనే పేరుతో వ్యవహరిస్తున్న వంటవాడు (భీముడు); ఎక్కడన్+చూచెన్= ఎక్కడ చూచాడో; ఒండు+ఎడన్= మరొకచోట; అసేవ్యక్ష్మాజముల్= సేవింపదగని చెట్లు; పుట్టవే?= పుట్టవా?; ఫలితంబు+ఐ= పండ్లు పండినదై; వరశాఖలు+ఒప్పఁగన్= మంచి కొమ్మలు కలుగగా; అనల్పప్రీతిన్= ఎక్కువ సంతోషాన్ని; సంధించుచున్= కలిగిస్తూ; విలసత్+ఛాయన్= ప్రకాశిస్తున్న నీడతో; ఉప+ఆశ్రిత ప్రతతికిన్= దగ్గర చేరిన జనసమూహానికి; విశ్రాంతి+కావింపఁగాన్+కల= ఊఱట కలిగించగల; ఈ భూజమున్= ఈ చెట్టు; వంటకట్టియలకై= వంటకట్టెలకొరకు; ఖండింపఁగాన్+ఏటికిన్?= నరికి వెయ్యడం ఎందుకు?

తాత్పర్యం: 'వంటలవాడైన వలలుడు ఎక్కడ చూచాడో కాని ఇక్కడ కాక మరొకచోట పనికిమాలిన చెట్లు పుట్టవా? పండ్లు బాగా పండిన పెద్దకొమ్మలతోగూడి, విశాలమై నీడనిచ్చి ఆశ్రయించిన వారికి శ్రమను పోగొట్టే ఈ చెట్టును వంటకట్టెలకొరకు నరికివేయటం దేనికి?'

విశేషం: 1. అలం: గూఢోక్తి, ప్రస్తుతాంకురం. (అన్యాపదేశం).

2. భీముడు కోపవేగంతో పెచ్చుపెరిగి ఒక పెద్దవృక్షాన్ని పెరికి అటు కీచకుడినీ, ఇటు విరాటునీ వధించటానికి యత్నిస్తూ ఆ చెట్టువైపు చూచి గురి నిలిపాడు. కాని, ఆ పనికి ధర్మరాజుయొక్క అనుమతి కావాలి కాబట్టి అతడి వైపు చూచాడు. అతడు కనుసైగతో అతడి ప్రయత్నాన్ని మాన్పాడు. ఇది ఆంగికమైన అభినయాంశం. దానికి పోషకంగా వాచికాభినయాంశంగా ఈ పద్యాన్ని పలికాడు. భీముడితో ధర్మజుడు సూటిగా మాట్లాడకూడదు. దేనిమీదనో పెట్టి అన్యాపదేశంగా చెప్పాలి. ఆ చెప్పే పద్ధతి కూడా గూఢంగా ఉండాలి. భీముడితో చెప్పుతున్నా, అతడికి ఆ మాటలలోని అర్థం రహస్యభాషలో అర్థమౌతున్నా, చుట్టూ ఉన్నవారికి తెలియకూడదు. అట్లా మాట్లాడటం గూఢోక్త్యలంకారం. ధర్మరాజు మాటలు 'నిగూఢ భాషణలు' అని తిక్కన రాబోయే పద్యంలో పేర్కొన్నాడు. ప్రస్తుత వర్ణనం చేత ప్రస్తుత వృత్తాంతమే ద్యోతమానమైతే ప్రస్తుతాంకురాలంకారం. ధర్మరాజు వంటలవాడి చిత్తవృత్తి మీద చమత్కరించి అన్యాపదేశంగా గూఢోక్తులు పలికాడు. వలలుడు అని నామ నిర్దేశం చేయటం వలన వంటవాడి ప్రసక్తి ప్రకటంగా, భీముడి ప్రసక్తి గూఢంగా తెలియబడుతుంది. రెండూ ప్రస్తుతాలే కావటం చేత ప్రస్తుతాంకురం. వంటలవాడు కట్టెలకొరకు కూల్చటానికే చెట్టువైపు చూస్తాడు. భీముడు చూచిన వృక్షం కీచకుడినీ, విరాటుడినీ చంపటానికి ఉపయోగించదలచుకొన్న ఆయుధం. ధర్మరాజు ఆ చెట్టును కేంద్రంగా చేసి అన్యాపదేశంగా గూఢోక్తులు పలికాడు. ఆ చెట్టును విరాటుడికి అన్యాపదేశం చేశాడు. అది పండ్లు పండిన వరశాఖలున్న పచ్చని చెట్టు, విస్తారమైన నీడతో ఆశ్రయమిచ్చి సేద తీర్చగలిగిన చెట్టు. అంటే కుటుంబ పరివార సమేతంగా విస్తృత రాజ్యాన్ని పాలిస్తూ పాండవులకు వివిధ శాఖలలో ఆశ్రయమిచ్చి వారి అజ్ఞాతవాస వ్రతాన్ని ఫలవంతం చేస్తున్న విరాటుడు వరఫలవృక్షం. దానివైపు కట్టెల కొరకు చూస్తే, మరొకవైపు అసేవ్య వృక్షాలు (పనికిమాలిన చెట్లు) అంటే సేవలు కోల్పోయి, అజ్ఞాతవాసవ్రతం భంగమైన పాండవ వృక్షాలు కట్టెలకు సిద్ధమౌతాయి.

కాబట్టి ఆ చెట్టును పెరికితే తమ ఆశ్రయాన్ని తామే నాశనం చేసికొన్నట్లు పాండవులు రెంటికి చెడ్డ రేవడులు కాగలరని వ్యంగ్యమైన సూచన. భీముడికి మాత్రమే తెలిసే కనుసైగలు, గూఢోక్తులు ధర్మరాజు మాట్లాడతాడు. అవి చెడ్డ రేవడులు కాగలరని వ్యంగ్యమైన సూచన. భీముడికి మాత్రమే తెలిసే కనుసైగలు, గూఢోక్తులు ధర్మరాజు మాట్లాడతాడు. అవి ఆ సభలో ద్రౌపదికి మాత్రమే అర్థం కావటం విశేషం. తెలుగువారు అన్యాపదేశంగా మాట్లాడే మాటలకు 'వలలుం డెక్కడ చూచె' నసే ఈ పద్యాన్ని ఒక సంకేతంగా సంభాషణలలో ఉటంకించటం సాహిత్యమర్యాద. తెలుగునాట అంత ప్రచారం చెందిం దీ పద్యం. (సంపా.)

3. కీ.శే. పళ్ళె పూర్ణప్రజ్ఞాచార్యులు గారు విరాటపర్వ టిప్పణిలో భీముడికీ - ఇతరులకూ స్ఫురించే అర్థాలను వేరువేరుగా వింగడించి వివరించారు. అందులోని ముఖ్యాంశాలు -

భీమపరంగా - 'ఓ భీమసేనా! ఏల చెట్టువైపు చూచెదవు? ఈ చెట్టు పెఱికికొని యీ జేని నీతని బావమఱఁదినీ చంపఁజూచెదవు. ఈరాజు సేవ్యక్ష్మాజము - ఈ యజ్ఞాతవాసమునం దరణ్యావాస దుఃఖతప్తులమగు మనకు సేవనీయమైన వృక్షమువలె బసయిచ్చిన మహానుభావుడు. సంపన్నుడై బంధుగుల పోషించుచు, నాశ్రయించిన మనబోటి వారికి, నిలువ నీడ యిచ్చుచు ఛాయావృక్షమువలె నున్నవాడు. అట్టి మహాపురుషునిదెసపై నుపకారముల నేమియును దలంపక మనకు సమయభంగ మను భీతియు లేక కీచకుని మందలింపలే డాయె నను చిన్న నేరమెన్ని ద్రుంపవచ్చునే? అట్లు సేయుట యాశ్రితృహనన న్యాయమగును. ఇతని యింటిలో మనము దలదాచుకొంటిమి కాన మనకు సమయభంగము కాకుండుటకుఁ గాని, యితని ప్రియము సేఁతకుఁగాని యేతద్బంధువగు కీచకునిఁ ద్రుంచుటయుఁ బ్రస్తుత ముచితముకాదు. అంతగా నీకుఁ ద్రుంపవలయునవియేయున్న హస్తినాపురములో భ్రాతృత్వాదుల నేనియు నెన్నక మనసర్వస్వము నపహరించి మనకు నిలువనీడ లేకుండ జేసిన నీరస తరువులనుబోలు దుర్యోధనాదులు లేరా? చంపెదనని ప్రతిజ్ఞను జేసితివే! వారిని సమయానంతరము చంపుము. అజ్ఞాతవాసానంతరము తన ముద్దుకూతురగు నుత్తరను మన యర్జునపుత్రుండగు నభిమన్యునకు నొసంగి, యిట్లే ముందును హితము గావించుచు వరశాఖలు విజృంభింపగా మనకుఁ బ్రీతిఁగావించు జేనిని ద్రుంపఁదగదు".

ఇతరులకుఁ దోచునర్థము; 'ఈ వంటలవాడికి ఈ చెట్టు ఎక్కడ కానుపించెను? ప్రొయ్యిలోనికి కావలయు నన్న వేఱొకచోట శుష్కవృక్షంబులు లేకపోయెనే? ఇయ్యది పండ్లతోను, మంచికొమ్మలతోను విస్తరించి, యాశ్రయించిన బాటసారులకు నుపయోగపడుచు, నిల్వనీడనిచ్చుచున్నది. దీనిని వంటకట్టియలకై కొట్టుట ఉచితము కాదు."

తే. **అని నిగూఢభాషణముల నయ్యజాత । శత్రుఁ డనిలజు కోపరసంబు పేర్మి**
చెఱిచె, నయ్యన్నదమ్ముల చేష్టితములు । దెల్లముగ నప్డు సూచుచు నల్లలేచి. **137**

ప్రతిపదార్థం: అని= అంటూ; నిగూఢభాషణములన్= రహస్య వాక్యాలచేత; ఆ+అజాతశత్రుఁడు= ఆ ధర్మరాజు; అనిలజు= భీముడియొక్క; కోపరసంబు పేర్మిన్+చెఱిచెన్= కోపావేశాన్ని తగ్గించాడు; ఆ+అన్నదమ్ముల చేష్టితములు= ధర్మజభీములచర్యలు; తెల్లముగన్= స్పష్టంగా; అప్డు= అప్పుడు; చూచుచున్= గమనిస్తూ; అల్లన్+లేచి= మెల్లగా లేచి.

తాత్పర్యం: ధర్మజుడు రహస్యవచనాలతో భీముడి కోపాతిశయాన్ని తగ్గించాడు. అన్నదమ్ముల చేష్టలను ద్రౌపది గమనిస్తూ మెల్లగా లేచింది.

సీ. **ఎలదీఁగఁ గప్పిన లలితపరాగంబు । క్రియ మేన మేదినీ రేణువొప్పఁ,**
జంపకంబున నవసౌరభం బెసఁగెడు । కరణి నాసిక వేఁడి గాడ్పు నిగుడఁ,
దోయజ దళములతుది మంచు దొరఁగెడు । గతిఁ గన్నుఁగవ నశ్రుకణము లురుల,
నిందుబింబము మీఁది కందు చందంబునఁ । గురులు నెమ్మొగమున నెరసియుండ,

తే. సర్వజన వంద్య యైన పాంచాలి సింహ। బలునిచే నివ్విధంబున భంగపాటు
దనకు వచ్చిన నెంతయు దైన్యమొంది। యవ్విరాటుని సభఁ జేర నరిగి నిలిచి. 138

ప్రతిపదార్థం: ఎలతీఁగన్= లేత తీగను; కప్పిన= చుట్టుకొన్న; లలిత పరాగంబుక్రియన్= మెత్తని పుప్పొడివలె; మేనన్= శరీరంపై; మేదినీరేణువు+ఒప్పన్= దుమ్ము నిలవగా; చంపకంబునన్= సంపెంగపువ్వునుండి; నవసౌరభంబు+ఎసఁగెడు= కొత్తవాసన కలిగినట్లు; కరణి= రీతి; నాసికన్= ముక్కున; వేడిగాడ్పు నిగుడన్= వేడి నిట్టూర్పు రాగా; తోయజదళముల తుదిన్= తామరరేకుల కొనలలో; మంచు తొరఁగెడుగతిన్= మంచుబిందువులు జారినట్లు; కన్ను+కవన్= కనుదోయినుండి; అశ్రుకణములు+ఉరులన్= కన్నీరు జారగా; ఇందుబింబము మీఁది= చంద్రబింబము మీదనున్న; కందుచందంబునన్= మచ్చవలె; కురులు= వెంట్రుకలు; నెఱ+మొగమునన్= అందమైన మొగంపై; నెరసి+ఉండన్= వ్యాపించి ఉండగా; సర్వజనవంద్య+ఐన= జనులందరిచేత మ్రొక్కులందే; పాంచాలి= ద్రౌపది; సింహబలునిచేన్= కీచకుడిచేత; ఈ విధంబునన్ భంగపాటు= ఇటువంటి అవమానం; తనకున్ వచ్చినన్= తనకు కలుగగా; ఎంతయున్+దైన్యము+ఒంది= ఎంతో దుఃఖపడి; ఆ విరాటుని సభన్, చేరన్+అరిగి నిలిచి= దగ్గరకు వెళ్ళి నిలిచింది.

తాత్పర్యం: లేతతీగమీద దట్టంగా పడిన మెత్తని పుప్పొడివలె ఆమె శరీరంమీద దుమ్ముధూళి క్రమ్ముకొన్నది. సంపెంగ పువ్వునుండి క్రొత్తసువాసన ప్రసరిస్తూ ఉన్నట్లు ఆమె ముక్కునుండి వేడి నిట్టూర్పులు వెలువడుతూ ఉన్నాయి. పద్మదళాల అంచులనుండి మంచుకణాలు పడుతున్నట్లు ఆమె కనుదోయినుండి కన్నీటి బొట్లు రాలుతున్నాయి. చంద్రబింబంమీద మచ్చలున్నట్లుగానే అందమైన నిండుమొగం మీద కురులు బాగా వ్యాపించి ఉన్నాయి. అందరిచేత గౌరవించబడే ద్రౌపది కీచకుడిచేత ఆవిధంగా అవమానాలపాలు కావటంతో ఎంతో దీనురాలై ఆ విరాటుడి సభను సమీపించి నిలిచింది.

విశేషం: అలం: ఉపమ. జనవంద్యురాలైన పాంచాలి భంగపాటు వలన దైన్యం పొందింది అనే భావాన్ని ఉపమాలంకార సుందరంగా తిక్కన ఈ సీసపద్య పాదాలలో ఆవిష్కరించాడు. తీగమీద పుప్పొడి పడి ఉండటం గౌరవం, మేని మీద దుమ్ముపడి ఉండటం దైన్యం. సంపెంగపూవు వాసనవంటి సుగంధ పరిమళ నిశ్వాసం కలిగి ఉండటం ఉత్తమజాతి స్త్రీ గౌరవలక్షణం, వేడి నిట్టూర్పులు దైన్య లక్షణం. పద్మదళాల అంచులపై మంచుబిందువులు స్రవించినట్లు ఆనందబాష్పాలు రాలటం గౌరవం, అంతటి అందమైన కన్నులనుండి కన్నీరుకారటం దైన్యం. చంద్రబింబానికి మచ్చవలె మొగంమీద ముంగురులు అందంగా ఉండటం గౌరవం, మొగంమీద కురులు క్రమ్ముకొనటం దైన్యం. పరోక్షంగా ఆ దైన్యరూపం ఆమెయొక్క అజ్ఞాతవాసవ్రత రక్షణకవచంగా ఉండటం ప్రకరణౌచిత్యం. ఉపమాలంకారంలోని ఉపమానాలన్నీ కవిసమయసిద్ధాలై ఉండటం గమనించదగిన అంశం. (సంపా.)

ద్రౌపది తన భంగపాటు విరాటునితోఁ జెప్పుట (సం.4-15-13)

ఉ. పంబిన కోపమున్ సమయభంగ భయంబును నగ్గలించి యు
ల్లంబు పెనంగొనంగఁ బతులం దగ సభ్యులఁ జూచుమాడ్కి రూ
క్షంబగు చూడ్కి నా ద్రుపదుకన్నియ సూచి సభాజనప్రతా
నంబును మత్స్యనాథుఁడు వినంగ నెలుంగు చలింప నిట్లనున్. 139

ప్రతిపదార్థం: పంబినకోపమున్= అతిశయించిన కోపమూ; సమయభంగభయంబును= ప్రతిన చెడిపోతుందనే భయమూ; అగ్గలించి= అధికమై; ఉల్లంబు= మనస్సు; పెనంగొనంగన్= కలవరపరచగా; పతులన్= భర్తలను; తగన్+సభ్యులన్+చూచుమాడ్కిన్=

తగినట్లు సభాజనులను చూచినట్లే; రూక్షంబు+అగుచూడ్కిన్= క్రూరమైన చూపుతో; ఆ+ద్రుపదుకన్నియ+చూచి= ఆ ద్రౌపది చూచి; సభాజన ప్రతానంబును= సభలోని జనసమూహమూ; మత్స్యనాథుఁడున్= విరాటరాజునూ; వినంగన్= వినేటట్లు; ఎలుంగు చలింపన్= స్వరం కంపింపగా (గద్గద స్వరంతో); ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఒకవైపు పెల్లుబికే కోపం, మరొకవైపు అజ్ఞాతవాస భంగభయం మిక్కుటమై కలవరపరచగా సైరంధ్రి (ద్రౌపది) సభాసదులను చూచినట్లుగా తన భర్తలను తీక్ష్ణంగా చూచి, విస్తారమైన ఆ సభలోని సభాసదులూ, విరాటుడూ వినేటట్లు గద్గదస్వరంతో ఇట్లా పలికింది.

విశేషం: ద్రౌపది సమయభంగ భయంతో మాట్లాడటం ఆమె సమయజ్ఞతకు సూచకం. ఇప్పు డామె పరిస్థితి దయాస్పదం; కౌరవసభలో భర్తలు ఉండీ రక్షించలేకపోయారు. అప్పుడు రాజు భంగపరిస్తే, ఇప్పుడు రాజు బావమరిది. సభ్యులపై రూక్షవీక్షణం తగునా? అంటే తర్వాతి పద్యాలలో సమాధానం కన్పిస్తుంది.

సీ. **'నిఖిల ధర్మాధర్మ నిపుణంబు లైన శు। ద్ధాంతరంగంబుల నతిశయిల్లి,**
శిష్ట సంరక్షణ దుష్ట నిగ్రహముల। నీతి వాటింపంగ నేర్పు గల్గి,
సకల శస్త్రాస్త్ర సంచయములఁ బరమాద్భు। తంబు సేయు పరిశ్రమంబు దాల్చి,
దుర్దమ ప్రతిభట మర్దన క్రీడమైఁ జతురులు నా నెందు నుతికి నెక్కి,

తే. **యున్న గంధర్వు లేవురు నన్ను నిట్టు। లొకఁడు వఱుపంగ నూరక యునికి సూడ**
నచ్చెరువు గాదె! యెవ్వరి యాండ్రు రింకఁ। బరిభవంబునఁ బొందకఁ బ్రదుకువారు? **140**

ప్రతిపదార్థం: నిఖిల ధర్మ+అధర్మనిపుణంబులు= అన్నిరకాలైన ధర్మాలలో, అధర్మాలలో నైపుణ్యం గలిగిన; శుద్ధ+అంతరంగంబులన్= స్వచ్ఛమైన మనస్సులచేత; అతిశయిల్లి= వృద్ధిపొంది; శిష్టసంరక్షణ= సజ్జనులను రక్షించటంలోనూ; దుష్ట నిగ్రహములన్= దుష్టులను శిక్షించడంలోనూ; నీతి+పాటింపంగన్= ధర్మాన్ని పాటించటంలోను; నేర్పు+కల్గి= సామంపతులన్= భర్తలను; సామర్థ్యం వహించి; సకల శస్త్ర+అస్త్రసంచయములన్= అన్ని బాణాల, అస్త్రాల సముదాయాలలో; పరమ+అద్భుతంబు+చేయు= మిక్కిలి ఆశ్చర్యాన్ని కలిగించే; పరిశ్రమలు తాల్చి= చక్కని అభ్యాసం, సామర్థ్యం కలిగి; దుర్దమ= అణచలేని; ప్రతిభట మర్దనక్రీడమైన్= అణచరాని శత్రువీరులను చంపటమనే ఆటలో; చతురులు నాన్= సమర్థులని; ఎందున్= అంతటా; నుతికిన్+ఎక్కి+ఉన్న= ప్రసిద్ధివహించిన; గంధర్వులు+ఏవురు= ఐదుగురు గంధర్వులు; నన్నున్= నన్ను (ద్రౌపదిని); ఇట్టులు+ఒకఁడు= ఈ విధంగా ఒకడు (ఒక నీచుడు); వఱుపంగన్= పాటుపడజేయగా, బాధపెట్టగా; ఊఱక+ఉనికి= అలక్ష్యంగా ఉండటం; చూడన్= చూస్తే; అచ్చెరువు కాదె?= ఆశ్చర్యంగా లేదూ?; ఇంకన్= ఇకమీద; ఎవ్వరి ఆండ్రురు= ఎవ్వరి భార్యలు; పరిభవంబునన్= అవమానాన్ని; పొందక బ్రదుకువారు?= పొందకుండా బ్రతకగలరు?

తాత్పర్యం: ఏది ధర్మమో, ఏది అధర్మమో క్షుణ్ణంగా తెలిసినవారూ, సాధుజనులను రక్షించి, దుష్టులను శిక్షించేవారూ, అస్త్రశస్త్రవిద్యలలో ఆరితేరినవారూ, శత్రువుల నవలీలగా చంపగల గంధర్వులైన నా భర్తలు ఐదుగురు కీచకుడీ విధంగా నన్ను అవమానించగా ఉదాసీనంగా ఊరకుండిపోయారు. ఇకపై లోకంలో ఇతరుల భార్యలకు ఇటువంటి అవమానం కలిగితే రక్షించే దిక్కు ఎవరుంటారు?

విశేషం: అలం: పరికరం. 'అలంకారః పరికర స్సాభిప్రాయ విశేషణైః' - విశేషణం సాభిప్రాయమైతే పరికరాలంకారం. ద్రౌపది తన భర్తలైన అయిదుగురు గంధర్వుల విశిష్ట గుణాలను సీసపద్య పాదాలలో పేర్కొన్నది. అవి మొత్తం నాలుగు. ఆ నాలుగూ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సామూహికంగా అయిదుగురికీ అన్వయిస్తాయి. పరిశీలించి చూస్తే ధర్మజ, భీమార్జునులకు మొదటిమాటా, చివరిది కవలలైన నకుల సహదేవులకూ అన్వయిస్తాయి. ఇట్లు విశేషణాలను వాడటం సాభిప్రాయం. ధర్మాధర్మ నిర్ణయ నిపుణులైన ధర్మజ్ఞుల సభలలో ఉత్తముడుగా రాణించేవాడు ధర్మరాజు. శిష్టులను రక్షించాలనీ దుష్టులను శిక్షించాలనీ భావించే నీతి పాటించే నేర్పరి భీముడు. సమస్త శస్త్రాస్త్రాలను అద్భుతంగా ప్రయోగించే పరిశ్రమ కలవాడు అర్జునుడు. అసాధ్యులైన శత్రువులను చంపటం క్రీడగా భావించే చతురులు నకుల సహదేవులు. ఈ విధంగా విశేషణాలు సాభిప్రాయం కావటం చేత పరికరాలంకారం భూషించబడింది. ఈ విధంగా పతుల పరాక్రమ విశేషాలను పరోక్షంగా పొగడి, వారు మారుపలుకకుండా మిన్నకున్నందుకు నొచ్చుకొన్నది. ఇట్లా ఊరుకొంటే ఎవరి భార్యలు అవమానాలు పొందక బ్రతుకుతారు? అని హెచ్చరించి, తాను ఎవరికీ కానిదై అవమానం పొంది చనిపోవటం తప్పదు - అని వ్యంగ్యంగా వేదన వ్యక్తం చేసింది. (సంపా.)

క. ఈ నరపతి యాస్థానము। లో నొక్కరుఁడైన ధర్మలోప భయమునన్
బూని తగవైన వెడ పలు। కైనను బలుకంగఁ జాలఁ డయ్యెను నకటా! 141

ప్రతిపదార్థం: అకటా!= ఔరా! అయ్యో!; ఈ నరపతి+ఆస్థానములోన్= ఈ విరాటరాజు కొలువులో; ధర్మలోప భయమునన్= ధర్మానికి విఘ్నం కలుగుతుందనే భయంతో; ఒక్కరుఁడు+ఐనన్= ఒక్కడైనా; పూని= ప్రయత్నించి; తగవు+ఐన= న్యాయమైన వెడపలుకు+ఐనను= చిన్నమాట అయినా; పలుకంగన్+చాలఁడు+అయ్యెను= మాట్లాడలేకపోయాడు.

తాత్పర్యం: ఈ విరాట మహారాజు సభలో ఉన్న ఇంతమందిలో ఒక్కరైనా ధర్మానికి లోపం జరుగుతుందేమో నన్న భయం వలన ధర్మ రక్షణం కొరకు ముందుకు వచ్చి ఒక్క చిన్నమాటైనా న్యాయంగా పలికేవారు లేకపోయారు. అధర్మానికి భయపడేవారే లేకపోయారు.

విశేషం: అలం: గూఢోక్తి. ప్రక్కనున్న వారికి తెలియకుండా తనవారి నుద్దేశించి గూఢంగా పలుకటం గూఢోక్తి అలంకారం. ఈ పద్యంలో అందరికీ అర్థమయ్యే తాత్పర్యం పైన చెప్పుకొన్నది. ఇక రెండవ అర్థం గంధర్వులను ఉద్దేశించి - అంటే తన పతులైన ధర్మరాజాదులను ఉద్దేశించి చెప్పే తాత్పర్యం ఇది-ఈ రాజాస్థానంలో ఉన్న ఒక్కడైనా అజ్ఞాతవాస ధర్మం భగ్నమౌతుందేమోనన్న భయంతో, ఆ పూనికకే ప్రాధాన్యమిచ్చి, అనువైన ఒకమాటకూడా మాటాడలేనివాడైపోయాడు కదా! అయ్యో! ఎంతటి దీన పరిస్థితి ఏర్పడింది. గూఢోక్తి వలన ఈ సన్నివేశంలో నాటకీయ సంభాషణ శ్లేషవలె రాణిస్తూ జనాంతిక చమత్కారాన్ని ప్రదర్శించి, తిక్కన రచనా శిల్పాన్ని వెలార్చింది. (సంపా.)

ఉ. ఇందఱుఁ జూడఁగా నిచట నిమ్మెయి నన్నుఁ బతివ్రతా గుణా
స్పందిత వర్తనం బరమ సాధ్వి ననిందితశీలఁ గీచకుం
డెందును నెట్టి యంగనల నెవ్వరుఁజేయనియట్లు సేయఁగాఁ
గొందఱకైన నిప్డు కృపకుం దఱిగాదటె? యేమి సెప్పుదున్? 142

ప్రతిపదార్థం: ఇచటన్= ఈ విరాటుని కొలువులో; ఇందఱున్+చూడఁగాన్= ఇంతమంది సభాసదులు చూస్తూ ఉండగా; ఈ+మెయిన్= ఈ విధంగా; పతివ్రతా గుణ+అస్పందిత వర్తనన్= పాతివ్రత్య ధర్మాన్ని వీడని నడవడిక కలదానిని; పరమసాధ్విన్= ఉత్తమమైన సాధుస్వభావం కలిగినదానిని; అనిందిత శీలన్= నిందకు తావులేని చరితం (స్వభావం) కలదానిని; నన్నున్= (ద్రౌపదిని); కీచకుండు= కీచకుడు; ఎందునున్= ఎక్కడా; ఎట్టి+అంగనలన్= ఏ స్త్రీలను; ఎవ్వరున్ చేయని+అట్లు= ఎవ్వరూ చేయని విధంగా; చేయఁగాన్= చేస్తే; కొందఱకున్+ఐనన్= కొంతమందికైనా; ఇప్డు= ఇప్పుడు; కృపకున్= దయకు; తఱికాదటె?= సమయం కాదా? ఏమిచెప్పుదున్?= ఏమి చెప్పుకొనేది?

తాత్పర్యం: ఇంతమంది సభాసదులు చూస్తుండగా పతివ్రతాగుణ సంపన్నమైన ప్రవర్తన కలదానను, ఉత్తమ సాధుస్వభావం కలదానను, మచ్చలేని శీలంగలదానిని అయిన నన్ను ఈ కీచకుడు ఇంతకుముం దెన్నడు ఏ స్త్రీకీ జరగని విధంగా అవమానం చేస్తే, ఇంతమందిలో కొంతమందికైనా ఇప్పుడు కొద్దిపాటి దయనైనా చూపే తరుణం కాదా ఇది? ఇక ఏమనాలో నాకు ఏమీ తోచటం లేదు!

విశేషం: అలం: గూఢోక్తి. సభలో అందరినీ ఉద్దేశించి ద్రౌపది మాట్లాడుతున్నట్లుంటుంది. కాని, ఆమె తనపతులను ఉద్దేశించి గూఢంగా పలుకుతున్నట్లుంటుంది. ఆమె మాటలలోని మర్మం అది. సభాసదులందరినీ ఉద్దేశించి చెప్పిన సాధారణ తాత్పర్యం పైన పేర్కొన్నది. ఇక ఆమె గూఢంగా పాండవుల నుద్దేశించిన తాత్పర్య మిది. ఇంతమంది చూచేటట్లుగా ఈ సభాస్థలిలో ఈ విధంగా కీచకుడు నన్ను అవమానించాడు. అయినా పతులను మనసారా సేవించే వ్రతం నుండి తొలగని ప్రవర్తన కలదానినిగా ఉన్నాను. సాధ్వులలో శ్రేష్ఠురాలుగానే ఉన్నాను. నా శీలం కళంకితం కాలేదు. ఇంతవరకు నన్ను నేను రక్షించుకొన్నాను. నేను పడిన కష్టాలు మరే ఇల్లాలూ పడి ఉండదు. అయినా, నా పతులైన అయిదుగురిలో కొందరికైనా ఇప్పటికీ దయ చూపించదగిన సమయం వచ్చింది అనే భావం కలగలేదంటే - ఇక నే నేమి చెప్పేది? ఈ పద్యంలో ఇందరు చూడగా అనే మాట ప్రజలకూ వర్తిస్తుంది. పాండవులకూ వర్తిస్తుంది. 'కొందఱికైనన్'- అనే మాట అక్కడున్న ధర్మజభీములకైనా దయరాదా? అన్నట్లు స్పష్టమౌతుంది. గూఢోక్తిని (భార్యాభర్తల నడుమ) నిష్ఠురోక్తులకు మారుగా వాడిన తిక్కన వాక్యచాతుర్యం ప్రశంసనీయం. (సంపా.)

ఉ. ఐనను మత్స్యదేశమున యాజ్ఞ కితం డొడయుండు గాన నా
కీ నరనాథు దూఱఁదగు; నెయ్యది యేని నధర్మ మెవ్వ రెం
దైన నొనర్చినం బ్రభువు లారసి దండన మాచరింతు; రి
చ్చో ననుఁ దన్ను కీచకునిఁ జూచియు నూరక యున్కి పాడియే?' 143

ప్రతిపదార్థం: ఐనను= ఐనప్పటికీ; మత్స్యదేశమున+ఆజ్ఞకున్= ఈ మత్స్యదేశం యొక్క ప్రభుత్వానికి; ఇతండు= విరటుడు; ఒడయుండు+కానన్= రాజుగాబట్టి; నాకున్= (ద్రౌపదికి); ఈ నరనాథున్= ఈ విరాటరాజును; దూఱన్+తగున్= నిందించటం భావ్యం; ఏ+అది+ఏనిన్= ఏదైనా; అధర్మము= ధర్మము కానిదాన్ని; ఎవ్వరు+ఎందైనన్= ఎవరైనా, ఎక్కడైనా; ఒనర్చినన్= చేస్తే; ప్రభువులు= రాజులు; అరసి= గమనించి; దండనము+ఆచరింతురు= శిక్షిస్తారు; ఈ+చోన్= ఇక్కడ; ననున్= (ద్రౌపదిని); తన్ను= తన్నిన; కీచకునిన్+చూచియున్= కీచకుడిని చూచికూడా; ఊరక, ఉన్కి, పాడియే?= ఊరుకొనటం ధర్మమా?

తాత్పర్యం: ఇంత జరిగినందుకు ఈ మత్స్యదేశాధినేత అయిన ఈ విరాటరాజును నేను నిందించాలి. ఏదైనా ధర్మలోపం ఎక్కడైనా జరిగితే రాజు దానిని గమనించి శిక్షించాలి. ఈ సభలో ఈ విధంగా నన్ను తన్నిన కీచకుడిని చూస్తూ ఊరుకొనటం ధర్మమా?'

విశేషం: అలం: గూఢోక్తి. ఈ పద్యంలోకూడా గూఢోక్తి రమణీయంగా నిర్వహించబడింది. గూఢోక్తిలో అధిక్షేపోక్తిని కూడ తిక్కన మేళవించాడు. ఈ పద్యంలో 'ఇతండు ఒడయుండుగాన' 'నరనాథు దూఱఁదగు', ప్రభువు లారసి దండన మాచరింతురు 'మొదలైన మాటలు గమనించదగినవి. ఆమె మత్స్యదేశంలో ఉన్నది కాబట్టి, కీచకుడి వలని అవమానం మత్స్యదేశంలో జరిగింది కాబట్టి, ఆ రాజ్యానికి ఏలిక విరాటుడు కాబట్టి, అత డా విషయంలో తగిన ఆజ్ఞ ఈయదగినవాడు. కాబట్టి పాండవులు మారుపల్కక కూర్చున్నారని భావించినా, ఆజ్ఞ ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్న విరాటుడు నిందించదగినవాడు కాబట్టి ద్రౌపది అతడిని అధిక్షేపించింది. ఒకవేళ విరాటుడు తగిన ఆజ్ఞ ఇవ్వలేకపోతే, అధర్మాన్ని అరికట్టలేకపోతే పాండవులు మారుపల్కకుండా ఉండటం న్యాయమా? వారు తగిన చర్యలు తీసికొనటానికి అవకాశం ఉన్నదని ద్రౌపది ధర్మమార్గాన్ని సూచించింది. లోకంలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాజు లుంటారు. ప్రభువు లుంటారు. రాజులు సామంతులు కావచ్చును, కాని ప్రభువులు ఒకరికి తలఒగ్గి ఉండరు. విరటుడు రాజు; ధర్మజుడు ప్రభువు. అతడి తమ్ములుకూడ ప్రభువులే. రాజు అసమర్థుడై అధర్మాన్ని అణచలేకపోతే, ధర్మాన్ని రక్షించలేకపోతే, ప్రభువులు మిన్నకుండరాదు. వారు పరిస్థితిని పరిశీలించి రంగంలోకి దిగి అధర్మపరులకు తగిన దండన విధించాలి. అది ధర్మం కాబట్టి 'ఇది మత్స్యదేశం, విరటుడే ఆజ్ఞ ఇవ్వాలి - అని కూర్చోకుండా, మీ ప్రభుత్వాన్ని ప్రదర్శించి నన్ను ఆపదనుండి రక్షించండి. ఊరక ఉండటం న్యాయం కాదు' అని ద్రౌపది గూఢంగా ధర్మజాదులను అధిక్షేపించింది. రహస్యంగా పాండవులను క్రియాశీలురు కమ్మని ప్రేరేపించింది. ఈ తాత్పర్యం సభలోనివారికి తెలియరాదు. పాండవులకే తెలిసివస్తుంది. పఠితలకు రెండర్థాలూ స్ఫురిస్తాయి. ఇది గూఢోక్తి రమ్యత. (సంపా.)

చ. **అనుడు విరాటుఁ డుల్లమున నక్కటికం బొలయంగ నంగనం**
గనుఁగొని, కీచకుం గినియఁగాఁ దగు సత్త్వము లేమిఁ జేసి సాం
త్వనములు పల్కి రోషభరితస్థితిఁ గంపితమూర్తి యైన యా
తని మది కుందు వాపిన నతండును బోయె నివాసభూమికిన్. **144**

ప్రతిపదార్థం: అనుడున్= ఆ విధంగా ద్రౌపది పలుకగా; విరాటుఁడు= విరాటమహారాజు; ఉల్లమునన్= మనస్సులో; అక్కటికంబు+ ఒలయంగన్= దయకలుగగా; అంగనన్= ద్రౌపదిని; కనుఁగొని= చూచి; కీచకున్= కీచకుడిపై; కినియఁగాన్+తగు= కోపించటానికి తగిన; సత్త్వము లేమిన్+చేసి= శక్తిలేకపోవటం వలన; సాంత్వనములు పల్కి= ఓదార్పుమాటలాడి; రోషభరితస్థితిన్= కోపంతో నిండిన మానసిక స్థితి చేత; కంపితమూర్తి+ఐన= వణకే దేహంతో ఉన్న; ఆతని మది కుందు+పాపినన్= కీచకుడి మనస్సులోని పరితాపాన్ని పోగొట్టగా; అతండును= కీచకుడుకూడ; నివాసభూమికిన్+పోయెన్= ఇంటికి వెళ్ళాడు.

తాత్పర్యం: ద్రౌపది మాట్లాడిన మాటలను విని విరాటుడు మనసులో దయబూని ద్రౌపదిని చూచాడు. కాని కీచకుడిని మందలించే ధైర్యం లేకపోవటం వలన ఆమెను ఊరడించాడు. నిండిన కోపంతో ఊగి (వణికి) పోతున్న ఆ కీచకుడి పరితాపాన్ని విరాటుడు అనునయంతో ఉపశమింపజేశాడు. అప్పుడు కీచకు డింటిముఖం పట్టాడు.

వ. **అట్టి యవసరంబున.** **145**

తాత్పర్యం: ఆ సమయంలో.

సీ. **'శుభలక్షణాంగి యీ సుందరి సైరంధ్రి। యగు టెట్లొకో!' యని వగచువారు,**
'నిమ్మేని కక్కట యిట్టిది సేసెనే !। మాయ దైవం' బని మఱుఁగువారు,
'నింత కీ డొనరించెనే! రాజు సూడ నీ। దుష్టాత్మకుం' డని దూఱువారు,
'దేవి యుపేక్షయ చూవె! యీయమకు ని। ప్పాటు వచ్చుట' యని ప్రందువారు

తే. **నగుచు సభవార లందఱు నంత నంత। నల్ల నల్లన గుజగుజ లాడుచుండి;**
రుల్లమున నిండి ఖేదంబు వెల్లివిరిసె। నాఁగ మోముల విన్నఁదనంబు గదుర. **146**

ప్రతిపదార్థం: శుభలక్షణ+అంగి= మంచి అవయవాలు కలిగిన; ఈ సుందరి= ఈ సౌందర్యవతి; సైరంధ్రి అగుట+ఎట్లు+ఒకో= సైరంధ్రీ వేషంలో ఉండటం ఎందుకు జరిగిందో; అని వగచువారున్= అని దుఃఖించేవారూ; మాయ దైవంబు= దుష్టుడైన విధి; ఈ+మేనికిన్=ఈ (అందమైన) శరీరానికి; ఇట్టిది+చేసెనే= ఇటువంటి విపరీతమైన పని చేశాడే; అని= అని; మఱుఁగువారు=

బాధపడేవారూ; రాజు+చూడన్= రాజు చూడగా; ఈ దుష్టాత్మకుండు= ఈ చెడు స్వభావముగల కీచకుడు; ఇంతకీడు+ఒనరించెనే!= ఇట్టి చెడ్డపని చేశాడే; అని దూఱువారు= అని నిందించేవారూ; దేవి+ఉపేక్ష+అ చూవె= సుదేష్ణ అలసత్వమేగదా చూడగా; ఈయమకున్= ద్రౌపదికి; ఈ+పాటు= ఈ కష్టం; వచ్చుట అని వ్రందువారున్= పరితపించువారూ; అగుచున్= ఔతూ; సభవారలు+అందఱున్= సభాసదులంతా; ఉల్లమునన్= మనస్సులో; నిండి= నిండిన; ఖేదంబు= దుఃఖం; వెల్లివిరిసెన్+నాఁగన్= పైకి వచ్చిందా అన్నట్లు; మోములన్ విన్నఁదనంబు+కదురన్= మొగాలపై దైన్యం ఉట్టిపడగా; అంతన్+అంతన్= దూరదూరంగా; అల్లనన్+అల్లనన్= మెల్లమెల్లగా; గుజగుజలు+ఆడుచుండిరి= గుసగుసలాడసాగారు;

తాత్పర్యం: మంగళకరమైన లక్షణాలు గల ఈ సుందరాంగి సైరంధ్రిగా ఎందుకు మారిందో - అని కొందరు విచారించసాగారు. ఇంతటి లలితాంగికి ఇటువంటి కష్టాలు పెట్టాడు. దేవుడు నిజంగా నిర్దయుడు - అని కొందరు కుతకుతలాడసాగారు. దుర్మార్గుడైన కీచకుడు రాజు చూస్తుండగానే ఈమెకు ఇంతటి కీడు చేశాడే-అని కొందరు అతడిని నిందించసాగారు. ఈమెకు ఈ అవమానం కలగటానికి కారణం సుదేష్ణ ఉపేక్షయే - అని కొందరు పరితపించసాగారు. ఈ విధంగా సభాసదులందరూ మెల్లమెల్లగా, గుసగుసలాడుతూ, మనసులలోని దుఃఖం పొంగిపొరలగా ముఖాలు వెలవెలపోతూ కనిపించారు.

విశేషం: అలం: ఉల్లేఖం. **"బహుభిర్బహుధోల్లేఖా దేకస్యోల్లేఖ ఇష్యతే".** ఒకే వస్తువును అనేకులు అనేక విధంగా వర్ణించినట్లు చెప్పితే ఉల్లేఖం. సభ్యులలో కొన్ని వర్గాలవారు తమకు తోచిన వ్యాఖ్యలు చేశారు. అవన్నీ ద్రౌపదిపట్ల సానుభూతితో, గౌరవంతో సాగినవే. సభ్యుల నుద్దేశించి ద్రౌపది పెట్టుకొన్న మొరకు సభ్యుల మాటలు మౌనప్రతిస్పందన. 'యథారాజా తథా ప్రజా' అన్నట్లు ఆ సభాసదులు కూడా జాలిని ప్రదర్శించారే తప్ప ఆమెకు కలిగిన కష్టాన్ని తీర్చలేకపోయారు. ఉల్లేఖంలో కూడా తిక్కన ఒక క్రమాన్ని పాటించాడు. ఉత్తమజాతి స్త్రీగా నిరూపించేవి ఆమె శుభ లక్షణాంగకాలు. ఉదాత్తురాలికి అనుదాత్తమైన పరిస్థితి ప్రాప్తించింది. ఆమె శరీరం కోమలం. కాని, ఆమె చేసే సేవలు కఠినం. స్వభావానికి తగినటువంటి సేవావృత్తి లభించలేదని భావం. రాజు చూస్తుండగా దుర్మార్గుడు ఆమెకు కీడు చేశాడు. ఉత్తమురాలికి తగని అవమానం జరిగిందని జాలిపడి, అవమానించినవాడిని నిందించారు. దీనికంతా కారణం దేవి ఉపేక్షాభావ మని నిశ్చయించి విచారించారు. ద్రౌపది అమాయకత్వంపై వారు సానుభూతి ప్రకటించారు. పరిస్థితిని విశ్లేషించి వివేకాన్ని ప్రదర్శించగల ప్రవృత్తిని సభ్యులలో చిత్రించి తిక్కన రాజ సభాసదుల పాత్రకు న్యాయం చేశాడు. విరటుడి వలెనే ఆ సభ్యులు కూడా ధర్మాన్ని సమర్థిస్తారు. దానిని అభిమానిస్తారు. కాని, అధర్మాన్ని ఎదుర్కొనలేరు-అని తిక్కన తీర్పు. ఉల్లేఖాలంకారం సభాస్వభావ వ్యంజకం కావటం విశేషం. (సంపా.)

ఉ. అప్పుడు ధర్మసూతి హృదయంబు గలంగ, లలాట భాగముం
గప్పఁగ ఘర్మవారి, యధికంబగు రోషము నొందియుండియుం
దప్పఁగఁ ద్రోచికొంచుఁ దనధైర్యము పెంపున నిర్వికారుఁడై
యెప్పుడుఁ దాను పల్కు నెలుఁ గేర్పడ ద్రౌపదితోడ నిట్లనున్. 147

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ధర్మసూతి= ధర్మరాజు; హృదయంబు కలంగన్= మనస్సు కలతపడగా; ఘర్మవారి= చెమటనీరు; లలాటభాగమున్+కప్పఁగన్= నుదుటిపై వ్యాపించగా; అధికంబు+అగు రోషమున్= ఎక్కువైన కోపం; ఒంది+ఉండియున్= పొందికూడా; తప్పఁగన్+త్రోచికొంచున్= తొలగత్రోసికొంటూ; తన ధైర్యము పెంపునన్= తన స్థిరమైన మనస్సు యొక్క గొప్పతనంతో; నిర్వికారుఁడు+ఐ= మనోవికారాలు లేనివాడై, నిబ్బరం కలవాడై; ఎప్పుడున్+తాను; పల్కు+ఎలుఁగు+ఏర్పడన్= తాను మామూలుగా మాట్లాడే కంఠస్వరంతో; ద్రౌపదితోడన్+ఇట్లు+అనున్= ద్రౌపదితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అప్పుడు ధర్మరాజు మనస్సు కలతచెందింది. నెన్నుదురుమీద చెమట క్రమ్మింది. మిక్కుటమైన రోషం పెచ్చుపెరిగింది. అయినా, ఆ రోషాన్ని ధీరగుణంతో అణచుకొన్నాడు. వికారం లేని మనసుతో స్థైర్యాన్ని పొందాడు. ఎప్పుడూ మాట్లాడే కంఠస్వరంతో ఈ విధంగా ద్రౌపదితో అన్నాడు.

విశేషం: ద్రౌపది పలికిన గూఢోక్తులకు, అధిక్షేపోక్తులకు, కీచకుడి అనౌచిత్య వర్తనానికి ధర్మరాజు చిత్తం కలత చెందింది. అది స్వేదమనే సాత్త్వికభావంతో వ్యక్తమయింది. కీచకుడి దుష్టవర్తనం అతడిలో రోషాన్ని పెంచింది. ధీరుడు కాబట్టి ధర్మరాజు దానిని అదుపు చేసికొన్నాడు. ఎంతటి మానసిక సంక్షోభాన్నైనా సంయమించుకొనటంలో వశీకృతచిత్తుడు ధర్మరాజు. (సంపా.)

సీ. **'జననాయకుండు నీ సభవారు నీదగు। తెఱఁగెల్ల నెఱిఁగిరి తెఱవ! యింక**
మానక యీ పలుమాట లాడఁగ నేల?। చనుము నీవు సుదేష్ణ సదనమునకు;
నీ పరాభవమునఁ గోపింప నేరరే। గంధర్వులకుఁ దఱిగాదుగాక;
సమయ మెయ్యది యేనిఁ దమకును నీకుఁ గ। ల్గిన యట్టులైనను గినియ రిచట

తే. **గాన నాథుల దూఱంగఁ గాదు వినుము। సతికిఁ దానెంత వడియును సభలలోనఁ**
దడవుగా నిల్చి యిట్టు లుదగ్రవృత్తి। శంక సెడి ధిక్కరింపంగఁ జనునె చెపుమ!' **148**

ప్రతిపదార్థం: తెఱవ!= ఓ వనితా! (ద్రౌపదీ!); జననాయకుండున్= రాజూ; ఈ సభవారున్= ఈ సభలో జనులూ; నీది+అగు= తెఱఁగు+ఎల్లన్= నీ భంగపాటునంతా; ఎఱిఁగిరి= తెలిసికొన్నారు; ఇంకన్+మానక= ఇంక చాలించక; ఈ పలుమాటలు= ఇట్లాంటి అనేక రకాలైన మాటలు; అడఁగన్+ఏల?= పలకటం ఎందుకు?; సుదేష్ణ సదనమునకున్= మహారాణి నివాసానికి; నీవు చనుము= నీవు వెళ్ళిపొమ్ము; గంధర్వులకున్= గంధర్వులకు; తఱి+కాదు+కాక= సమయం కాదు కానీ లేకపోతే; నీ పరాభవమునన్= నీ అవమానానికి; కోపింప నేరరే?= కోపపడలేరా?; సమయము+ఎయ్యది+ఏని= ఏదైనా ఒక నియమం; తమకును, నీకున్= వాళ్ళకూ నీకూ; కల్గిన అట్టులు+ఐనను= ఉన్నట్లయితే; ఇచటన్+కినియరు= ఇక్కడ కోపపడరు; కానన్= కావున; వినుము= తెలిసికొనుము; సతికిన్= భార్యకు; నాథులన్= భర్తలను; దూఱంగన్+కాదు= నిందించతగదు; తాను+ఎంత+పడియును= తాను ఎంతబాధ పడినా, సభలలోనన్= సభలలో; ఇట్టులు= ఈ విధంగా; తడవుగాన్ నిల్చి= ఎక్కువసేపు నిలబడి; ఉదగ్రవృత్తిన్= కోపంగా; శంక+చెడి= సంకోచం లేకుండా; ధిక్కరింపంగన్= ఎదిరించటం; చనునె చెపుమ= తగునా చెప్పుము.

తాత్పర్యం: 'ఓ సైరంధ్రీ! నీ సమాచారం రాజుగారికి, సభాసదులకు సవివరంగా తెలిసింది. ఇంక ఎక్కువ మాట్లాడకుండా రాణిగారి మందిరానికి వెళ్ళిపొమ్ము. నీకు జరిగిన అవమానానికి నీ భర్తలైన గంధర్వులు కోపించరా? కాని, ఇది తగిన సమయం కాదని ఊరకున్నారు. నీకూ వారికీ ఏదో నియమం ఉన్నట్లయితే, సమయం కాదని వా రిప్పుడు కోపగించరు. కాబట్టి దానిని గమనించక నీ భర్తలను నీవు నిందించటం ఉచితం కాదు. సతి తా నెన్ని పాట్లుపడినా నిండు సభలలో చాలాసేపు నిలబడి ఆవేశంతో సంకోచం లేకుండా ఎదిరించి మాట్లాడటం మంచిదా? నీవే చెప్పుము.'

విశేషం: అలం: గూఢోక్తి. ద్రౌపది గూఢోక్తులతో మాట్లాడింది. ధర్మరాజు కూడ గూఢోక్తులతోనే ఆమెకు సమాధానం చెప్పసాగాడు. ఆమె ఉద్వేగకరంగా మాట్లాడింది. ధర్మజుడు నిబ్బరంగా, నిర్వికారంగా మాట్లాడుతున్నాడు. ప్రజలు ధర్మజుడి మాటల తీరులో తేడా లేదు కాబట్టి సభలో ఆమెను మందలిస్తున్నాడనే భావించి ఊరుకుంటారు. ధర్మరాజు మాటలు సభ్యుల దృష్టిలో మందలింపు మాటలుగా, ద్రౌపది దృష్టిలో చేయవలసిన కర్తవ్యాన్ని బోధిస్తున్న విధివాక్యాలుగా స్ఫురించటం గూఢోక్తి అలంకార విశేషం. గంధర్వుల పేరు చెప్పి తన మనసులోని అభిప్రాయాన్ని చెప్పాడు ధర్మరాజు. ఈ మాటలు ఆమె కెంత సూచనలో, ఆ సభలో ఉన్న భీమునికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కూడా అంత సూచనలే! వారికి తోచే తాత్పర్యం ఇట్లా ఉంటుంది. 'ఓ సైరంధ్రీ! నీకు జరిగిన అవమానాన్ని అటు రాజూ! ఇటు సభాసదులూ తెలిసికొన్నారు. ఇక దానిని గురించి వివరించటం మానటం మంచిది. అట్లా కాకుండా నీవు సభలో నిలువబడి పలుమాటలు మాట్లాడుతున్నావు. అది మంచిది కాదు. అందువలన నీవు వెంటనే సుదేష్ణాదేవి మందిరానికి వెళ్ళిపొమ్ము.' (భావి కార్యక్రమం అక్కడి నుండి సాగాలి కాని, సభలో కాదు. నీ పరాభవాన్ని చూచిన మాకు (గంధర్వులకు) కోపం రాదా? వచ్చింది. కాని, దానిని ప్రదర్శించే సమయం కాదిది. కోపం వలన నియమభంగం ఔతుంది. అంటే నీకూ మాకూ కూడా అజ్ఞాతవాసవ్రతం చెడుతుంది. కాబట్టి మేమిక్కడ మారుపల్కటానికి వీలులేదు. దీనిని గమనించి నీవు మమ్ములను (నీ భర్తలను) నిందించవద్దు. నేను చెప్పేమాటలు బాగా అర్థం చేసికొమ్ము, భార్యవైన నీవు ఎన్నోపాట్లు పడిన మాట నిజమే. సమయ నియమబద్ధులైన భర్తలు సభలో ఉండగా వారి నుద్దేశించి గూఢంగానైనా ఎక్కువసేపు మాట్లాడటమే దోషం. పైపెచ్చు నీవు జంకూ గొంకూ లేకుండా కోపోద్రేకంతో ధిక్కరించి మాట్లాడటంవలన ఏం ప్రయోజనం సాధించగలుగుతావు? నీ వెంత మాట్లాడినా మేము నిండుసభలో ఏమీ మారుమాట మాట్లాడలేం. ఇది సమయం కాదు; ఈ సభ స్థలం కాదు. రాణిమందిరంలోనే జరుగవలసిన పని జరగాలి. నీవు ఆవేశం మానాలి. మాకు నీకంటె ఎక్కువగానే కోపంగా ఉన్నది. నియమం చెడకుండా ఉపాయం ఆలోచించాలి. ప్రస్తుతానికి నీ విక్కడ ఉండటం శ్రేయస్కరం కాదు. ఎవరైనా నిన్ను ద్రౌపదిగా గుర్తిస్తే అజ్ఞాతవాస వ్రతం భంగం కాకతప్పదు') అని గూఢోక్తులకు గూఢోక్తులతోనే సమాధానం చెప్పించటం తిక్కన సంభాషణ శిల్పం. (సంపా.)

వ. అనియిట్లు సెప్పిన ధర్మతనయుని పలుకులు విని వెండియు సైరంధ్రి యచ్చోటు గదలక నిలిచి యెద్దియేనియుం బలుకం దలంచినం జూచి యతండు మఱియు నిట్లనియె. 149

ప్రతిపదార్థం: అని+ఇట్లు+చెప్పినన్= అని ఈ విధంగా పలికిన; ధర్మతనయుని= ధర్మరాజు యొక్క; పలుకులు విని= మాటలు విని; వెండియున్= తిరిగి; సైరంధ్రి; ఆ+చోటు కదలక నిలిచి= అక్కడి నుండి కదలకుండా నిలబడి; ఎద్ది+ఏనియున్= ఏదో; పలుకన్+తలంచినన్= మాట్లాడాలనే ఉద్దేశంతో ఉండటం; చూచి= గమనించి; అతండు= ధర్మరాజు; మఱియున్= ఇంకను; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఇట్లా మాట్లాడిన మాటలు వినికూడా ద్రౌపది అక్కడినుండి కదలకుండా నిలబడి, ఏదో మాట్లాడాలని అనుకొంటుండగా, ధర్మరాజు మళ్ళీ ఇట్లా అన్నాడు.

విశేషం: ధర్మరాజు ద్రౌపదిని సుదేష్ణ అంతఃపురానికి పొమ్మన్నాడు. ద్రౌపది పోవటానికి ఆలస్యం చేసింది. దాని వెనుక ఏదో కారణం ఉండాలి. దానిని వ్యంగ్యంగా పఠిత ఊహకు వదలిపెట్టటం ఇక్కడ విశేషం. అంతఃపురానికి వెళ్ళితే సమస్య తీరదు. కాగా, అది మరీ తీవ్రతరం కావచ్చును. కాబట్టి సమస్యను వేగంగా తీర్చవలసిన అవసరం ఉన్నదని ఆమె భావం. దానిని ఎట్లాగైనా ధర్మరాజుకు గుప్తంగానే చెప్పవలెనని యత్నించటం ద్రౌపది అప్పటి మసలటంలోని పరమ తాత్పర్యం. దానిని ధర్మరాజు గ్రహించి, ఆమె అక్కడ ఉండి, ఆ మాటలు చెప్పనవసరం లేదని, త్వరగా వెళ్ళుమని సూచించాడు. ఆమె దానిని గ్రహించలేదు. అందువలననే ఆమె ఆరాటపడసాగింది. ధర్మరాజుశాసనాన్ని కాదనటానికి వీలులేదు; అయినా తన మనసులోని మాట చెప్పకొనకుండా ఉండటానికి వీలులేదు. ఈ సంఘర్షణలో ద్రౌపది వెనుకముందాడుతున్నది. (సంపా.)

క. 'పలుపోకలఁ బోవుచు వి। చ్చలవిడి నాట్యంబు సలుపు చాడ్పున నిచటన్
గులసతుల గఱువ చందము। దొలఁగఁగ నిట్లునికి దగునె తోయజవదనా!' 150

ప్రతిపదార్థం: తోయజవదనా!= పద్మంవంటి ముఖం కలదానా!, ఓ సైరంధ్రీ; పలుపోకలన్+పోవుచున్= పెక్కు హొయలులు పోతూ; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; నాట్యంబు సలుపు చాడ్పునన్= నాట్యం చేస్తున్నట్లుగా; ఇచ్చటన్= ఈ కొలువులో; కులసతుల=

కులస్త్రీలయొక్క; గఱువ చందము తొలఁగఁగన్= గొప్పతనం తొలగిపోయేటట్లు; ఇట్లు+ఉనికి+తగునె?= ఇక్కడ ఇట్లా ఉండటం భావ్యమా?

తాత్పర్యం: 'ఓ సైరంధ్రీ! ఇట్లా స్వైరవిహారం చేస్తూ నాట్యం చేస్తున్నట్లుగా ఈ కొలువులో కులస్త్రీల ఔన్నత్యం తొలగిపోయేటట్లు నీవు నిలబడటం సంభావ్యం కాదు.'

విశేషం: అలం: ఉపమ. సమాజంలో ఉండే ఒక ఆచారానికి సంబంధించిన సాంస్కృతికమైన ఉపమానాన్ని తిక్కన సాభిప్రాయంగా ఇక్కడ వాడటం విశేషం. కులసతుల గౌరవ వర్తనం ఇందులో చెప్పబడింది. అది పలుపోకడలు పోవటం వలన, విచ్చలవిడిగా నాట్యం చేయటం వలన కులసతి గౌరవం తొలగిపోతుంది-అనే భావం సాంస్కృతికమైన ఒక విలువ. తెలుగులో 'పలుపోకలు పోవుట' - జాతీయం. దానికి- అనేక మార్గాలలో తిరగటం, పెక్కుహొయలు ప్రదర్శించటం, పలు కపటచేష్టలు చేయటం, పెక్కుమందితో విహరించటం (చరించటం), పలు రీతులలో అభినయించటం (వర్తించటం)-అని అర్థాలు చెప్పవచ్చును. ఇవన్నీ కులసతికి నిషేధాలే. 'విచ్చలవిడి నాట్య' మాడటం- అనేది కూడా తెలుగు జాతీయమే. ఇష్టం వచ్చినట్లు చేతులూపుతూ, కాళ్ళూపుతూ, అభినయిస్తూ మాట్లాడటం. అదుపూ ఆజ్ఞా లేకుండా వ్యవహరించటం. ప్రేలటం, స్వతంత్ర ధోరణితో ఆవేశంగా వ్యవహరించటం. కపటనాటకాలు ఆడటం, కపట నటనం చేయటం మొదలైన అర్థాలు చెప్పవచ్చును. భర్త మాట జవదాటని కులసతికి ఈ లక్షణాలు పనికిరానివి. కాబట్టి సభలో ఉండటం కులసతి లక్షణ విరుద్ధమని ధర్మజుడి అభిప్రాయం. అందులో సున్నితమైన మందలింపూ ఉన్నది. పరుషమైన అదలింపూ ఉన్నది. (సంపా.)

వ. అనిన విని పాంచాలి సాభిప్రాయంబుగా నతని కిట్లనియె. 151

తాత్పర్యం: ధర్మజుని మాటలు విని ద్రౌపది ఉద్దేశపూర్వకంగా ఆయనతో ఇట్లా అన్నది.

తే. 'నాదు వల్లభుండు నటుఁ; డింత నిక్కంబు;। పెద్దవారి యట్ల పిన్నవారు
గానఁ బతుల విధమకాకయే శైలూషి;। గా ననంగరాదు కంకభట్ట! 152

ప్రతిపదార్థం: కంకభట్ట!= కంకభట్టు వేషంలో ఉన్నవాడా! (ధర్మరాజా!); నాదు వల్లభుండు= నా భర్త; నటుడు= నటించేవాడు. నాట్యాచార్యుడు; ఇంతనిక్కంబు= అంతవరకు నిజమే; పెద్దవారి+అట్లు+అ= పెద్దవారివలెనే; పిన్నవారు= చిన్నవారు ప్రవర్తిస్తారు; కానన్= కాబట్టి; పతుల విధము+అ+కాక= భర్తల పద్ధతిలోగాక; ఏన్= నేను (ద్రౌపది); శైలూషిన్= నాట్యకత్తెను; కాను+అనంగరాదు= కాను అని అనటానికి వీలు లేదు.

తాత్పర్యం: 'ఓ కంకభట్టా! నా భర్త నటుడు. ఇది కాదనలేని వాస్తవం. పెద్దవారితోడి వారే చిన్నవారు. కాబట్టి, నేనూ నా భర్త వంటి దానినే. అందువలన నేను నర్తకిని కాను అనటానికి వీలులేదు.

విశేషం: 1. అలం: పరికరం. **"అలంకారః పరికర స్సాభిప్రాయ విశేషణైః".** విశేషణం సాభిప్రాయమైతే అది పరికరాలంకారం. ఈ పద్యంలో ద్రౌపది 'నాదు వల్లభుండు నటుఁడు' అని అన్నది. 'నటుడు' అనే విశేషణం సాభిప్రాయం. దానివలన బృహన్నల సూచితుడయ్యాడు. మత్స్యయంత్రాన్ని ఛేదించి స్వయంవర సభలో ఆమెను గ్రహించిన భర్త అర్జునుడు. అతడు నాట్యాచార్యుడై ఉత్తరాదులకు నాట్యం నేర్పుతున్నాడు. 'నటుడి భార్యను కాబట్టి నేను నర్తకినే. పెద్దలవలె పిన్నలుండటం న్యాయం. నన్ను నర్తకిని కాదనటానికి వీలులేదు, అని ధర్మజుడి మాటలకు ప్రత్యాఖ్యానం చేసింది. ధర్మరాజు మాటవరసకు జాతీయ ప్రయోగంగా 'నాట్యంబు సలుపు చాడ్పున' నిండు సభలో మెలగవద్దని హెచ్చరించాడు. అక్కడి అర్థం ఔపచారికం. దానిని వాచ్యంగా గ్రహించి

ద్రౌపది త్రిప్పికొట్టింది. ద్రౌపది అభిమానవతి. మాటపడదు. అందువలన మాటకు మాట వడ్డించింది. దానికి కారణం ఆమె చెప్పదలచుకొన్న మాటను ధర్మరాజు సభలో చెప్పనీయలేదనే రోషం.

2. 'నేను ఆటవెలది' నని ద్రౌపది చెప్పిన పలుకులను 'ఆటవెలది' లో రచించటం తిక్కన ప్రదర్శించిన వృత్తౌచిత్యం. (సంపా.)

వ. అట్లగుటంజేసి నాకు నాట్యంబును పరిచితంబ; మత్పతి శైలూషుండ కాఁడు, కితవుండునుం గావున జూదరి యాలికి గఱువచందం బెక్కడిది?' యనుచు నచ్చోటు వాసి తన చిత్తంబున. 153

ప్రతిపదార్థం: అట్లు+అగుటన్+చేసి= అట్లా కావటం వలన; నాకున్= (ద్రౌపదికి); నాట్యంబును పరిచితంబు+అ= నాట్యంకూడా తెలుసు; మత్పతి= నా భర్త; శైలూషుండు+అ-కాఁడు= ఆటకాడు మాత్రమే కాదు; కితవుండునున్+కావునన్= జూదరి కూడా కాబట్టి; జూదరి+ఆలికిన్= జూదరి యొక్క భార్యకు; గఱువచందంబు= పెద్దరికం, గౌరవం, ఔన్నత్యం; ఎక్కడిది?= ఎక్కడ ఉంటుంది?; అనుచున్= అనిపల్కుచు; ఆ+చోటువాసి= అంటూ ఆ ప్రదేశం వదలి; తన చిత్తంబునన్= తన మనస్సులో.

తాత్పర్యం: అట్లా కావటం వలన నాకు నాట్యం చేయటం అలవాటే. నా భర్త నాట్యకాడు మాత్రమే కాదు. జూదరి కూడా! జూదరి భార్యకు పెద్దరికం, గౌరవం ఎక్కడి నుండి వస్తుంది?' అంటూ ఆ ప్రదేశం వదలిపెట్టి, తన మనస్సులో, (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: పరికరాంకురం. **"సాభిప్రాయే విశేష్యే తు భవే త్పరికరాంకురః".** విశేష్యం సాభిప్రాయంగా ప్రయోగించబడితే పరికరాంకురాలంకార మౌతుంది. వెనుకటి పద్యంలో ద్రౌపది తాను నర్తకినే అని చెప్పుకొనటానికి తగిన హేతువును పేర్కొన్నది. నాట్యాచార్యుడైన అర్జునుడికి భార్య కావటం చేత తాను నర్తకినని చెప్పి, సాభిప్రాయంగా సమర్థించుకొన్నది. అందులో అధిక్షేపంతోపాటు ఒక అనౌచిత్యం కూడా స్ఫురించే అవకాశం ఉన్నది. ఎట్లాగంటే- 'నిజంగా నా భర్త అర్జునుడే. అతడు ఇప్పుడు నాట్యం చేస్తున్నాడు కాబట్టి నన్ను రక్షించుకొనే స్థితిలో లేడు. అందువలన నేనూ, నన్ను నేను రక్షించుకొనటానికి ఎన్నో నటనలు చేయవలసి వస్తున్నది. భర్త యొక్క వృత్తియే భార్యకు ప్రవృత్తిగా మారింది' - అని పలికి అర్జునుడు (బృహన్నల) సాకుగా భర్తల అసమర్థతను ఎత్తిపొడిచి అవహేళనం చేసింది. రోషంతో ఆ మాట అని ఆమె నాలుక కొరుక్కొని ఉంటుంది. వెంటనే ఆ అనౌచిత్యాన్ని పరిహరించే మరొక వాక్యాన్ని ఇప్పుడు పలికింది. 'నా భర్త నటుడే కాదు జూదరి కూడా' - అని. ఈ రెండు విశేష్యాలూ సాభిప్రాయాలు. నా భర్త నటుడైన అర్జునుడే కాడు. జూదరి అయిన ధర్మరాజు కూడా! అని ఒక అర్థం. నా భర్త నటుడూ, జూదరీ - రెండూ అయినవాడు అని - రెండో అర్థం. ధర్మరాజు వాడిన 'విచ్చలవిడి నాట్యంబు సూపు చాడ్పున' - అనే పోలికకు తగిన వడ్డింపు ఇక్కడ వచ్చింది. ధర్మరాజు కంకభట్టుగా వేషాన్ని ధరించి నటిస్తున్నాడు. కాబట్టి అతడూ నటుడే. ఆ నటనలోకూడా జూదరి పాత్రనే నిర్వహిస్తున్నాడు. నటనలోకూడా జూదరి అయిన విశేష లక్షణం ధర్మరాజుకే దక్కింది. దానిని ఎత్తి పొడిచింది ద్రౌపది. జూదరి భార్యను అమ్ముకొంటాడు. ఆమెకు కలిగే అవమానాన్ని లక్ష్యపెట్టడు. అతడికి ఇల్లాలైన వనితకు లోకంలో గౌరవం ఉండదు. గౌరవం పోయిన జూదరి భార్యకు 'విచ్చలవిడితనం' దోషం కాదని అధిక్షేపించింది. ద్రౌపది యందు ధర్మజుడు ఆరోపిస్తున్న అవలక్షణాలన్నీ ధర్మరాజు జూదరి కావటం వలన ఏర్పడినవే అని అధిక్షేపోక్తి. ధర్మరాజు తనను మాట్లడనీయకుండా అడ్డుపడ్డాడు. ఆమె కూడా ఆయన మాట్లాడలేనట్లు అడ్డుపలికి ఆయన సమాధానం కొరకు వేచి ఉండకుండానే వెనుదిరిగిపోయింది. ధర్మరాజు ఆదేశించినట్లే సుదేష్ణ యొక్క అంతఃపురానికి ఆమె వెళ్ళి ధర్మరాజు ఆనతిని పాటించింది. కాని, అధిక్షేపోక్తితో తన తీవ్ర పరితాపాన్ని వ్యక్తం చేసింది. తన కష్టాల కన్నిటికీ ధర్మజుడిని బాధ్యుడిని చేసింది. ఆ కష్టాలు తీర్చే బాధ్యత కూడా అతడిమీదనే పెట్టింది. ఇక మాటలతో పనిలే దన్నట్లు, కార్యాచరణమే ముఖ్యమన్నట్లు గిరున తిరిగి వెళ్ళిపోయింది. తిక్కన రచనలో పాత్రల ప్రతికదలికలో రసధ్వని రవళిస్తుంది. అందుకు ఈ సన్నివేశం సజీవోదాహరణం. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సుదేష్ణ ద్రౌపది నూఱడించుట (సం.4-15-36)

ఉ. 'న న్నిటు లాదురాత్ము సదనంబునకుం జనుమన్నజంత కీ
బన్నములన్నియుం దెలిపి ప్ర య్యిడనే' యని పోయె నార్తయై
కన్నుల బాష్పపూరములు గ్రమ్ముఁగ మోమున దైన్యమొందఁగా
నన్నలినాక్షి తొట్రిలుచు నంగము దూల సుదేష్ణపాలికిన్. 154

ప్రతిపదార్థం: ఆ+నలిన+అక్షి= పద్మాలవంటి కన్నులు గల ఆ సైరంధ్రి (ద్రౌపది); నన్నున్+ఇటులు= నన్ను ఈ విధంగా; ఆ దురాత్మసదనంబునకున్= ఆ దుష్టుడైన కీచకుని ఇంటికి; చనుము+అన్న= వెళ్ళుమన్న; జంతకున్= ధూర్తురాలికి, (సుదేష్ణకు); ఈ బన్నములు+అన్నియున్= ఈ అవమానాలన్నీ; తెలిపి= తెలిసేటట్లు చెప్పి; ప్రయ్యి+ఇడను+ఏ= నిందించనా? (తిట్టిపోయనా?); అని ఆర్త+ఐ= అని అనుకొంటూ పెద్దగా ఏడుస్తూ; కన్నులన్ బాష్పపూరములు= కళ్ళలో కన్నీటి ధారలు; క్రమ్మఁగాన్= వ్యాపించగా; మోమునన్= ముఖంమీద; దైన్యము+ఒందఁగాన్= దీనత్వం కనిపించగా; తొట్రిలుచున్= తడబడతూ; అంగము+తూలన్= శరీరం తూలుతూ ఉండగా; సుదేష్ణపాలికిన్= సుదేష్ణవద్దకు; పోయెన్= వెళ్ళింది.

తాత్పర్యం: 'నన్ను ఆ దుష్టుడైన కీచకుడి ఇంటికి వెళ్ళుమన్న ఆ ధూర్తురాలికి నాకు జరిగిన అవమానాలన్నీ తెలియచెప్పి నిందించా'లని అనుకొంటూ కన్నీళ్ళు ధారాపాతంగా ప్రవహించగా, బావురుమని దుఃఖిస్తూ శరీరం కంపించగా, తూలుతూ, దీనవదనంతో ఆ సైరంధ్రి సుదేష్ణవద్దకు వెళ్ళింది.

విశేషం: తిక్కన రచించిన అభినయాత్మకమైన పద్యాలలో ఇది ఒకటి. మనసులోని భావపరిణామానికి అనువుగా ఆంగిక అభినయం ప్రవర్తిల్లినట్లు వర్ణించటం తిక్కన నాటకీయ రచనా శిల్పం. ఈ పద్యంలో ద్రౌపది మనస్సులో అనుకొన్న మాటలివి; 'నన్ను ఈ విధంగా - ఆ దురాత్ముడి ఇంటికి పొమ్మని - పంపిన - ఆ జంతకు - నా పడిన అవమానాలన్నీ - చెప్పి - నోరారా నిందిస్తాను' - ఈ మాట లనుకుంటూ సుదేష్ణ వద్దకు పోతున్న ద్రౌపది రోదించింది. నమ్మినవారు మోసం చేయగా, గత్యంతరం లేక మరలవారి వద్దకే వెళ్ళవలసిన దీనస్థితి వచ్చినప్పుడు ఉన్నతవంశసంజాతురాలు, ఉత్తమురాలు, అభిమానవతి అయిన సతి మొదట బావురుమన్నట్లు రోదించటం సహజ సాత్త్వికాభినయం. కీచకుడి ఇంటికి పంపిన సన్నివేశ స్మరణం చేత ద్రౌపదికి కన్నీటి ధారలు పొంగి వచ్చాయి. మాట తప్పిన యజమానురాలి దుర్నీతికి బలి అయిన ఒక ఇల్లాలు బలవంతంగా ఒక దుర్మార్గుడి ఇంటికి ఒంటరిగా వెళ్ళవలసి వచ్చినప్పుడు సంభవించే అపాయాన్ని తలచినప్పుడు కళ్ళనీళ్ళు పొంగి పొరలటం సహజాభినయం. అక్కడ కీచకుడు ఆమెపట్ల వర్తించిన వికార చేష్టలను, పలికిన వాక్యాలను, తాను పడిన అవమానాలను తలపునకు తెచ్చుకొన్నప్పుడు ఆమె కంపించిపోయింది. సుదేష్ణకు ఆ సంగతులు ఎట్లా చెప్పాలి? - అనే అభిమానం అడ్డం వచ్చి, చెప్పక తప్పని తన దయనీయ స్థితిని భావించి, ముందుకు వెళ్ళలేక వెళ్ళుతున్నప్పుడు ఆమె శరీరం తూలినట్లయింది. ఈ అభినయం భావప్రవాహ ప్రతిస్పందనం. తిక్కన అభినయ కళాప్రతిభకు అభినవ దర్పణం! (సంపా.)

తే. చనిన, నయ్యేలనాఁగయు సంభ్రమంబుఁ। దెచ్చికొని తానెఱుంగని తెఱఁగు దాల్చి
శాఠ్యమున నుమ్మలించి పాంచాలితోడ। నెలుఁగువేఱొక భంగిగా నిట్టులనియె. 155

ప్రతిపదార్థం: చనినన్= వెళ్ళగా, ఆ+ఎలనాఁగయున్= ఆ మహారాణి సుదేష్ణ కూడా; సంభ్రమంబున్+తెచ్చుకొని= వేగిరపాటును తెచ్చిపెట్టుకొని; తాను+ఎఱుంగని తెఱఁగు+తాల్చి= తనకేమీ తెలియదన్న వైఖరిని ప్రదర్శిస్తూ; శాఠ్యమునన్= కపటంగా; ఉమ్మలించి= దుఃఖాన్ని తెచ్చిపెట్టుకొని; పాంచాలితోడన్= సైరంధ్రితో; ఎలుఁగు వేఱు+ఒక భంగిగాన్= డగ్గుత్తిక చెందినట్లుగా; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ద్రౌపది అట్లా వెళ్ళగా సుదేష్ణకూడా వేగిరపాటును తెచ్చిపెట్టుకొని, తన కేమీ తెలియనట్లుగా ప్రవర్తిస్తూ, కపటమైన దుఃఖాన్ని కొనితెచ్చుకొని, సైరంధ్రితో డగ్గుత్తిక చెందిన స్వరంతో ఈ విధంగా పలికింది.

విశేషం: సైరంధ్రిది సహజాభినయం, సుదేష్ణది కపటాభినయం. తులనాత్మక పరిశీలనలో ఈ వైరుద్ధ్యం తిక్కన రచనలో ప్రసన్నం. (సంపా.)

సీ. **'ధరణీ పరాగంబు వొరసి ధూసరితమై। చేడియ! నీ మేను చెన్నుదఱిఁగెఁ;**
జిత్తంబు తలపోఁతచే వాడు పొదవిన। చెలువ। నీ నెమ్మోము చిన్నఁబోయెఁ;
బ్రస్వేదమునఁ దోఁగి ఫాలంబుతో నంటి। యుగ్మలి ! నీ కురు లొప్పు కుందెఁ;
గన్నీరు వఱ్ఱొడ్డి కాంతి యెంతయుఁగొన్న। వెలఁది! నీ కనుఁగవ విన్ననయ్యెఁ;

ఆ. **నేది కారణమున నెవ్వ రెచ్చోట నీ। కేమి కీ డొనర్చి రెట్టిపాటి**
సాహసికులొ వారిఁ జంపుదు నొంపుదు। భంగపఱుతు నిడుమపఱుతుఁ జెఱుతు. **156**

ప్రతిపదార్థం: చేడియ= ఓ వనితా! (సైరంధ్రీ!); ధరణీ పరాగంబు= నేలమీది దుమ్మును; పొరసి= పొంది; ధూసరితము+ఐ= బూడిదరంగు కలదై; నీ మేను= నీ శరీరం; చెన్ను+తఱిఁగెన్= అందం కోల్పోయింది; చెలువ!= ఓ సైరంధ్రీ; చిత్తంబు తలపోఁతచేన్= మనసులోని చింతవలన; వాడు+పొదవినన్= వాడినందువలన; నీ నెఱ+మోము= నీ అందమైన ముఖం; చిన్నఁబోయెన్= కాంతిహీనమైనది; ఉగ్మలి!= ఓ సైరంధ్రీ!; ప్రస్వేదమునన్+తోఁగి= మిక్కిలి చెమటపోసి; ఫాలంబుతోన్+అంటి= నుదుటికి అంటుకొని; నీ కురులు= నీ కేశాలు; ఒప్పు కుందెన్= అందవిహీనాలైనవి; వెలఁది!= సైరంధ్రీ!; కన్నీరు= కన్నీరు; వఱ్ఱు+ఒడ్డి= ప్రవహించి; కాంతి+ఎంతయున్+కొన్న= కాంతి నంతటినీ తగ్గించటంచేత; నీ కనుఁగవ= నీ రెండు కళ్ళు; విన్నన్+అయ్యెన్= చిన్నబోయి ఉన్నాయి; ఏది కారణమున్= ఏ కారణంవలన; ఎవ్వరు, ఏ+చోటన్= ఎవరైనా, ఎక్కడైనా; నీకున్+ఏమి కీడు+ఒనర్చిరి?= నీ కేదైనా బాధ కలిగించారా?; ఎట్టిపాటి సాహసికులో= వాళ్ళు ఎంతధైర్యవంతులో! ఐనప్పటికీ; వారిన్+చంపుదున్= వారిని నాశనం చేస్తాను; నొంపుదున్= బాధిస్తాను; భంగపఱతున్= అవమానం చేస్తాను; ఇడుమపఱుతున్= కష్టపెట్టుతాను; చెఱుతున్= నశింపచేస్తాను.

తాత్పర్యం: దుమ్ము అంటుకొని నీ శరీరం కాంతిహీనం అయింది. మనసులోని చింతచేత నీ ముఖం వాడి చిన్నవోయింది. చెమటకు తడిసి నీ ముంగురులు నుదురు కంటుకొనటంచేత అందంకోల్పోయి ఉన్నాయి. కన్నీరు కారి నీ కళ్ళు విలాసరహితంగా ఉన్నాయి. నీకు ఎవరైనా ఎక్కడైనా ఎప్పుడైనా అపకారం చేశారా? వారి కెంత ధైర్యం? వారిని చంపుతాను. అవమానాల పాలుచేస్తాను. కష్టాల పాలుచేస్తాను. రూపుమాపుతాను.

వ. **ఇత్తెఱంగు నాకుం జెప్పు 'మనిన 'నీ వెఱింగియు నెఱుంగమి భావించిన, నింక నే మని పలుకంగలదాన? నైనను విను' మని సైరంధ్రి యిట్లనియె.** **157**

ప్రతిపదార్థం: ఈ+తెఱంగు= ఈ సంగతి; నాకున్+చెప్పుము+అనినన్= నాకు చెప్పుమని అనగా; నీవు ఎఱింగియున్= నీకు తెలిసికూడా; ఎఱుంగమి భావించినన్= తెలియనట్లుగా భావిస్తే; ఇంకన్+ఏమని, పలుకన్+కలదానను?= ఇంక ఏమని చెప్పేది?; ఐనను వినుము+అని= ఐనా వినుమని; సైరంధ్రి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ఎట్లా జరిగిందో నాకు చెప్పు' మని అడుగగా సుదేష్ణను చూచి సైరంధ్రి ఇట్లా అన్నది. 'అన్నీ తెలిసీ, తెలియనిదానివలె నన్ను అడిగితే నే నింక ఏమని చెప్పగలను?

మ. **' నను నీ వప్పుడు సూతమందిరమున న్మద్యంబుఁ దెమ్మన్నఁ బో**
యిన నాతం డవినీతి సేసినను జేయీ కేను మత్స్యావనీ
శుని యాస్థానము దిక్కు వే చనిన నచ్చోఁ దీవ్రకోపంబున
న్వెనుకం గూడఁగ ముట్టి పట్టికొని తన్నెం బల్కు లింకేటికిన్?' **158**

ప్రతిపదార్థం: ననున్= (ద్రౌపదిని); ఈవు= నీవు సుదేష్ణ; అప్పుడు= ఆ సమయంలో; సూత మందిరమునన్= కీచకుడి ఇంటిలో; మద్యంబు తెమ్ము+అన్నన్= కల్లు తీసికొనిరమ్మని చెప్పగా; పోయినన్= వెళ్ళితే; ఆతండు= ఆ కీచకుడు; అవినీతి+చేసినను= దుర్మార్గపు పనిచేయగా; చేయి+ఈక= పట్టుకోనీక; ఏను= ద్రౌపదినైన నేను; మత్స్య+అవనీశుని+ఆస్థానము దిక్కు= విరాటరాజు కొలువువైపు; వే+చనినన్= త్వరగా వెళ్ళగా; అచ్చోన్= అక్కడ; తీవ్రకోపంబునన్= అధికమైన కోపంతో; వెనుకన్+కూడఁగన్+ముట్టి= వెంబడించి; పట్టికొని తన్నెన్= నన్ను పట్టుకొని తన్నాడు; పల్కులు+ఇంకన్+ఏటికిన్?= వేరే మాట లిం కెందుకులే.

తాత్పర్యం: 'అప్పుడు నీవు నన్ను సూతుడైన కీచకుడి ఇంటికి మద్యం తెమ్మని పంపగా నేను వెళ్ళాను. అప్పుడతడు అవినీతి పనిచేయబోగా, నే నతడికి అవకాశ మివ్వక విరాటరాజు కొలువువైపు పరుగుతీశాను. అతడు మిక్కిలి కోపంతో నా వెనుకనే వచ్చి నన్ను పట్టుకొని తన్నాడు. ఇంతకంటె నే నేమి చెప్పేది?'

వ. **అని యేర్పడం బలికిన.** **159**

తాత్పర్యం: అని తెలిసేటట్లు చెప్పగా.

ఉ. **'ఖేదము దక్కు మీ క్షణమ కీచకు దండితుఁ జేసి నీకు నా**
హ్లాద మొనర్తు నే నని నయంబునఁ గేకయరాజపుత్రి య
త్యాదరవృత్తితో ననునయం బొనరించిన నయ్యసత్య సం
వాదిని పూన్కి పాండుసుతవల్లభ యాలము సేసి యిట్లనున్. **160**

ప్రతిపదార్థం: ఖేదము+తక్కుము= విచారించటం మానివేయి; ఈక్షణము+అ= ఇప్పుడే; నేను= నేను; కీచకున్ దండితున్+చేసి= కీచకుడిని దండించి; నీకున్+ఆహ్లాదము+ఒనర్తున్= నీకు (ద్రౌపదికి) సంతోషం కలిగిస్తాను; అని= అని పలికి; కేకయరాజపుత్రి= సుదేష్ణ; నయంబునన్= కోమలంగా, నెమ్మదిగా; అతి+ఆదరవృత్తితోన్= ఎంతో గౌరవంగా; అనునయంబు+ఒనరించినన్= ఓదార్చగా; ఆ+అసత్యసంవాదిని పూన్కి= ఆ అబద్ధాలకోరుప్రయత్నం; ఆలము+చేసి= లక్ష్యపెట్టకుండా; పాండుసుతవల్లభ= పాండవపత్ని ద్రౌపది; ఇట్లు+అనున్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: 'నీవు విచారం మానుము! ఆ కీచకుడిని దండించి నీకు సంతోషం కలిగిస్తానులే' అని సుదేష్ణ ఎంతో ఆదరంగా ఓదార్పు మాటలు పలికింది. ఆ అబద్ధాలకోరు మాటలను నిర్లక్ష్యం చేస్తూ ద్రౌపది ఇట్లా అన్నది.

విశేషం: సుదేష్ణ కావాలని కీచకుడి ఇంటికి సైరంధ్రిని పంపింది. కీచకుడు దుష్టుడు, నీచుడని తెలుసు. సైరంధ్రి పట్ల అగౌరవం ప్రదర్శించటం తన వంశానికే కళంకం అని సుదేష్ణకు తెలుసు. ఈ సందిగ్ధ పరిస్థితిని ఇక్కడ కవి చక్కగా వర్ణించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'నీ వింత యలుగ నేటికి? । నా వంతయుఁ బౌరజన మనఃఖేదము నొ
క్కావంత ద్రిక్కకుండఁ గ । లావంతులు మత్పతులు గలరు పగఁ దీర్పన్'. 161

ప్రతిపదార్థం: నీవు= సుదేష్ణ; ఇంత+అలుగన్+ఏటికిన్= ఇంతగా కోపించట మెందుకు? (అవసరంలేదని భావం); నా వంతయున్= నా దుఃఖమూ; పౌరజనమనఃఖేదమున్= లోకుల మనస్సులోని దుఃఖమూ; ఒక్క+ఆవంత= కొంచెంకూడా; త్రిక్కకుండన్= విడవకుండా; కలావంతులు= సమర్థులు; మత్+పతులు= నా భర్తలు; పగన్+దీర్పన్+కలరు= పగ సాధించగలరు.

తాత్పర్యం: 'ఓ సుదేష్ణాదేవీ! నీవు అంతగా కోపపడవలసిన పనిలేదులే! నా కష్టాలను, లోకుల దుఃఖాన్నీ కించిత్తుకూడా మిగల్చకుండా పగదీర్చగల సమర్థులు నా భర్తలు ఉన్నారులే.'

విశేషం: ఇక్కడ వ్యంగ్యంగా కీచకుడిని మట్టుపెట్టటం త్వరలో జరగగలదని కవి సూచించాడు.

క. అనిన సుదేష్ణయుఁ దత్పరి । జనములు వెఱఁబొంది యెన్ని సాంత్వనములు సె
ప్పినఁ దేఱద, మజ్జన భో । జనములకుం జొరద ద్రుపదసంభవ యెట్లున్. 162

ప్రతిపదార్థం: అనినన్= ఆమె అట్లా అనగానే; సుదేష్ణయున్= సుదేష్ణయూ; తద్+పరిజనములున్= ఆమె పరిచారికలూ; వెఱన్+పొంది= భయపడి; ఎన్ని సాంత్వనములు= ఎన్ని రకాల ఓదార్పు మాటలు; చెప్పినన్= చెప్పినా; ద్రుపద సంభవ= ద్రౌపది; తేఱద= తేరుకోదు; ఎట్లున్= ఎన్నిరకాల యత్నించినా; మజ్జన= స్నానం చేయటానికీ; భోజనములకున్= అన్నం తినటానికీ; చొరదు= పూనుకొనదు.

తాత్పర్యం: ద్రౌపది మాటలకు సుదేష్ణ, ఆమె పరిచారికలూ భయభ్రాంతులయ్యారు. వారు ఎన్ని ఓదార్పు మాటలు చెప్పినా ద్రౌపది కోపం వదలలేదు. స్నానం చేయలేదు. అన్నపానాదులు ముట్టలేదు.

విశేషం: క్రియలమీద అవధారణార్థకం చేర్చి తేఱదు+అ, చొరదు+అ అని ప్రయోగించి తిక్కన ద్రౌపది దృఢ ప్రవృత్తిని, వేదన తీవ్రతను ధ్వనింపచేశాడు. (సంపా.)

వ. అట్టియెడ సుదేష్ణసేయునది లేక నివ్వెఱఁగంది యుండెఁ; దక్కటి యంగనలును గీచకుని నీచత్వంబు దలంచి వాని చేటున కొడంబడిరి; పరిభవానల సంతప్తయైనపాంచాలి నిజశయనస్థానంబునకుం జని తల్పంబుపై మేను వైచి, యపాంగంబులం దొరంగు కన్నీరు చెవుల కొలంకులు నిండ నెవ్వగలు నివ్వటిలం దలపోయుచుండి. 163

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో సుదేష్ణ; చేయు+అదిలేక= చేసే దేమీ తోచక; నివ్వెఱఁగు+అంది+ఉండెన్= ఆశ్చర్యంతో చేష్టలుడిగి ఉండిపోయింది; తక్కటి అంగనలును= మిగతా స్త్రీలు కూడా; కీచకుని నీచత్వంబు+తలంచి= కీచకుడియొక్క అల్పత్వాన్ని మనసులో భావించి; వాని= అతడి యొక్క; చేటునకున్+ఒడంబడిరి= ముప్పునకు అంగీకరించారు; పరిభవ+అనలసంతప్త+ఐన= అవమానమనే అగ్నిచేత కాల్చబడిన; పాంచాలి= ద్రౌపది; నిజశయనస్థానంబునకున్= తన పడకటింటికి; చని= వెళ్ళి; తల్పంబుపైన్= పడకపై; మేను వైచి= నడుము వాల్చి; అపాంగంబులన్= కనుగొలకుల నుండి; తొరంగు కన్నీరు= వచ్చే కన్నీళ్ళు; చెవుల కొలంకులు, నిండన్= చెవులనే సరస్సులు నిండగా; నెఱ+వగలు= పెనుదుఃఖం; నివ్వటిలన్= కలుగగా; తలపోయుచున్+ఉండి= ఎన్నో ఆలోచనలు చేస్తూ.

తాత్పర్యం: అప్పుడు సుదేష్ణ చేసే దేమీ లేక అచ్చెరువుతో భయభ్రాంతురాలై ఊరక ఉండిపోయింది. మిగిలిన ఆడువారు కీచకుడి నీచస్వభావాన్ని తలచి, వాడికి తప్పక కీడు కలగటానికి మనసులలో అంగీకరించారు. ద్రౌపది అవమానాగ్నితో వేగిపోతూ పడకగదిలోకి పోయి పడకమీద నడుం వాల్చింది. అయినా, ఆమె కనుకొలకుల నుండి కన్నీరు ధారలుగా కారుతూ చెవులు అనే సరస్సులు నిండిపోతున్నాయి. హృదయం నుండి పెల్లుబుకుతున్న దుఃఖం అతిశయిస్తూ ఉండగా ఎన్నో ఆలోచనలు చేస్తూ ఉండింది.

విశేషం: 1. మేను వైచి- తెలుగు జాతీయం. శరీరాన్ని పక్కమీద పడేసి అని అర్థం. ఆ చర్య దుఃఖ వివశత్వాన్ని సూచిస్తుంది. కన్నీరు కనుకొలకుల నుండి జారి చెవులదొప్పలు నిండటం- అనే అవస్థ ఆమె ఆలోచనలో పడి ఒకే భంగిమలో చాలా సేపు ఉండిపోయిందని సూచన. భావి కార్య నిర్వహణకై ఆమె యోచించ నారంభించింది. (సంపా.)

2. కొన్ని ప్రతులలో ఈ క్రింది అధిక పాఠం కనపడుతున్నదని ఉ.వి. సంశోధిత మహాభారత ముద్రిత ప్రతిలో పాదసూచిగా ఇవ్వబడింది. "వాని చేటున కొడంబడిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె- అయ్యా! కీచకుం డేవంశంబునవాఁ డెవ్వం డనిన నమ్మునివరుం డా జనపతి కిట్లని చెప్పె - బ్రాహ్మణియందు క్షత్రియుని వలనం బుట్టినవాఁడు సూతుం డనంబరఁగుఁ; బ్రతిలోమజాతులలోన న(స)ద్విజుండనఁబరఁగి క్షత్రియునికంటె నించుక తక్కువయు, వైశ్యునికంటె నధికుండునై ప్రాతిలోమ్యంబున రాజసంబంధార్హుం డగునట్టి సూతువంశంబున సూతవిషయాధీశుండును రాజకన్యా సముద్భూతుండును నగు కీచకుం డనువాఁడు గలండు; వానికి మాళవియందు నూటయాఱ్వురు కీచకులు పుట్టి; రం దగ్రజుండు బలవంతుండై యుండి కేకయరాజపుత్రియగు తమ తల్లి చెలియలి కూఁతురైన సుదేష్ణకుం బరిచరించుచు విరాటనగరంబున నుండు; వాని తమ్ములు నూటయేవురును వానిన యనుసరించి యుండుదు రని యిట్లు సూతవంశ ప్రకారం బెఱింగించి యిట్లనియె; నంతం బరిభవానల..."

క. 'ప్రబలుం డారయ నా సిం। హబలుం; డాతని జయింప ననిలతనయు బా
హుబలంబ కూడఁ దగు; దై। వబలం బును నాతనికి నవశ్యముఁ గల్గున్.' 164

ప్రతిపదార్థం: ఆరయన్= ఆలోచించి చూడగా; ఆ సింహబలుండు= ఆ కీచకుడు; ప్రబలుండు= చాల బలవంతుడు; ఆతనిన్= జయింపన్= వాడిని జయించడానికి; అనిలతనయు బాహుబలంబు+అ= భీముడి భుజబలమే; కూడన్+తగున్= సరితూగుతుంది; ఆతనికిన్= భీముడికి; దైవబలంబును= దైవశక్తికూడా; అవశ్యమున్+కల్గున్= తప్పక సిద్ధిస్తుంది.

తాత్పర్యం: 'ఆ కీచకుడు బలాఢ్యుడు. అతడిని జయించడానికి తగిన సమర్థుడు ఒక్క భీముడే. అతడి భుజబలశక్తికి తోడు దైవబలం కూడా తప్పక సమకూరుతుంది.'

విశేషం: 1. కీచకుడు సింహబల నామధేయుడు, ప్రబలుడు, అతడిది మృగరాజ బలమని ధ్వని. మరి భీముడు అనిలతనయుడు కావటంచేత దైవబలం, ప్రభంజనత్వం సహజసిద్ధం. విరోధులను సంహరించేటప్పు డతడిలో అతడి తండ్రి ఆవేశిస్తాడు. ఎన్ని శారీరక ఉపద్రవాలు వచ్చినా, రాక్షసులతో యుద్ధాలు వచ్చినా భీముడు ఎప్పుడూ విజయుడే - అని తర్కబద్ధంగా ప్రతివ్యూహాన్ని ఊహించింది ద్రౌపది. 2. ఈ పద్యానికి మారుగా ఈ క్రింది పద్యం ఒక ప్రతిలో కనపడుతున్నదని ఉ.వి. సంశోధిత మహాభారతం పేర్కొన్నది. '**తే. ప్రబలుఁ డారయ నా సింహబలుఁడు నతని, బరగ సమయింప ననిలజుబాహుబలము(ను), కాక యితరుల కలవియే ఘనుఁడ(డి)తండు, దైవబల మతనికి (క) నవశ్యంబు గలదు.**" (ఈ పద్యంలోని నాల్గవ పాదంలో యతిమైత్రి లేదు.)

ద్రౌపది భీమసేనుతోఁ దన భంగపాటు సెప్పి పరితపించుట (సం.4-16-5)

వ. ఇట్లూహించి రాత్రిసమయం బగుటయు, సమస్త జనంబులుఁ గ్రమంబున నిద్రింపం దొడంగినం దానును శయ్యాతలంబు విడిచి, మేని ధూళి గడిగి, ధౌత పరిధాన పరీతయై మహానస గృహంబున సుప్తుండైన వృకోదరు కడకుం జని. 165

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఊహించి= ఆలోచించి; రాత్రి సమయంబు= రాత్రివేళ; అగుటయున్= కావటం వలన; సమస్త జనంబులున్= అంతఃపురంలోని జనమంతా; క్రమంబునన్, నిద్రింపన్+తొడంగినన్= క్రమంగా నిద్ర కుపక్రమించగా; తానును= ద్రౌపది; శయ్యాతలంబు విడిచి= పడకనువదలి; మేని ధూళి+కడిగి= శిరరం పైనున్న దుమ్ము కడుగుకొని; ధౌతపరిధానపరీత+ఐ= ఉతికిన చీర కట్టుకొని; మహానస గృహంబునన్= వంటింటిలో; సుప్తుండు+ఐన= నిద్రిస్తున్న; వృకోదరుకడకున్+చని= భీముడి దగ్గరకు వెళ్ళి.

తాత్పర్యం: ఇట్లు ఆలోచించి, రాత్రి కావటం వలన జనులందరూ నిద్రలో మునుగగా ద్రౌపది పడకటిల్లు వదలి, శరీరంపై కమ్మిన దుమ్ము కడుగుకొని, ఉతికిన చీర కట్టుకొని, వంటింట్లో నిద్రపోతున్న భీముడి దగ్గరకు వెళ్ళింది.

ఉ. 'నన్నుఁ బరాభవించి సదనంబునకుం జని కీచకుండు ము
న్నున్న తెఱంగు దప్పక సుఖోచిత శయ్యను నిద్ర సేయ నీ
కన్ను మొగుడ్చు నూఱటకుఁ గారణ మెయ్యది? భీమసేన! మీ
యన్న పరాక్రమంబు వలదన్న నొకో దయమాలి తక్కటా!' 166

ప్రతిపదార్థం: భీమసేన!= ఓ భీమసేనా!; నన్నున్+పరాభవించి= నన్ను అవమానించి; సదనంబునకున్= ఇంటికి; చని= వెళ్ళి; కీచకుండు; మున్ను+ఉన్న తెఱంగు+తప్పక= ఇంతకు ముందున్న తీరు వదలక; సుఖ+ఉచితశయ్యను= మెత్తని పాన్పుపై; నిద్ర+చేయన్= హాయిగా నిద్రించగా; నీకన్నుమొగుడ్చు= నీవు నిద్రపోయే; ఊఱటకున్= నిశ్చింతకు; కారణము+ఏ+అది?= కారణమేమి?; అక్కటా!= ఔరా!; మీ+అన్న= ధర్మజుడు; పరాక్రమంబు= సాహసం; వలదు+అన్నన్+ఒకో= వద్దన్నందువలన కాబోలు; దయమాలితి(వి)?= నాపై దయచూపటం మానావు?

తాత్పర్యం: 'ఓ భీమసేనా! నన్ను అవమానించి కీచకుడు ఇంటికి వెళ్ళి హాయిగా ఇంతకుముందు వలె యథావిధిగా సుఖశయ్యపై నిద్రపోతుంటే, నీవు నిశ్చింతగా నిద్రపోవటానికి కారణ మేమిటి? అక్కటా! మీ అన్న ధర్మజుడు నీవు సాహసం చూపించటానికి ఇది తగిన సమయం కాదని చెప్పటం వలన కాబోలు, నీవు నాపై దయచూపటం లేదు'.

విశేషం: అలం: సంభావన. ప్రతిపదసార్థకమైన ధ్వనిమయ రచన ఇది. తనను అవమానించి కూడా కీచకుడు ఎటువంటి ప్రతిఘటననుగాని, కీడునుగాని పొందకుండా సుఖశయ్యమీద నిద్రపోవటం ద్రౌపది సహించలేకపోయింది. ఆమెకు పరాభవాగ్ని వలన రాత్రి నిద్రపట్టలేదు. ఆమెను రక్షించవలసిన, శత్రువును శిక్షించవలసిన భీముడు మాత్రం నిశ్చింతగా నిద్రపోతున్నాడు. శత్రువును నిద్రపోనిస్తున్నాడు. తనకొరకు మేల్కొని ఉండవలసిన భర్తలు నిశ్చింతగా నిద్రపోవటం, శత్రువు సుఖంగా ఉండటం అనే ఆ విపరీతస్థితిని చెప్పి అధిక్షేపిస్తూనే దానికి కారణాన్ని కూడా సంభావించింది. భీముడి నిశ్చింతకు కారణం ధర్మరాజు అతడి పరాక్రమాన్ని వారించటంగా ఊహించింది. ఇందులో భీముడిపై అధిక్షేపమూ ఉన్నది; దానికి తగిన కారణం ఉండటం వలన

సమర్థనీయమనే సాంత్వనమూ ఉన్నది. ద్రౌపది మాటలలో పృథక్పదత్వంతో కూడి శబ్దగుణ మాధుర్యమూ ఉన్నది. ఉక్తివైచిత్ర్యంతో కూడిన అర్థగుణమాధుర్యమూ ఉన్నది. పతిహృదయాన్ని తన కనుకూలంగా మార్చుకొనే నేర్పును మాధుర్య గుణ వ్యంజితం చేయటం సార్థకం. (సంపా.)

వ. **అనుచు మంద మంద సంభాషణంబుల సంబోధించు పాంచాలిపాణిస్పర్శంబున మేలుకని 'యిది యెవ్వ' రనవుడు? నే' నను నమ్మానిని యెలుంగెఱింగి భీమసేనుండు 'యాజ్ఞసేని కీచకు దురాచరణంబు నాకుఁ బ్రకటించి వాని నిర్జింప నియోగించునదియై యరుగుదెంచెంగావలయు; నత్తెఱం గిత్తెఱవ దాన చెప్పవిందు' నని తలంచి.** **167**

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; మంద మంద సంభాషణంబులన్= మెల్లమెల్లని మాటలతో; సంబోధించు= పిలిచే; పాంచాలి= ద్రౌపది యొక్క; పాణిస్పర్శంబునన్= చేతి తాకుడుకు; మేలుకని= నిద్రలేచి; ఇది ఎవ్వరు= ఎవరది?; అనవుడున్= అనగా; నేను= నేను (ద్రౌపదిని); అను+అ+మానిని= అనే ద్రౌపది యొక్క; ఎలుంగు= గొంతు సవ్వడి; భీమసేనుండు= భీముడు; ఎఱింగి= గుర్తించి; యాజ్ఞసేని= ద్రౌపది; కీచకు దురాచరణంబు= కీచకుడు చేసిన అవినీతి; నాకున్+ప్రకటించి= భీమునికి తెలియజెప్పి; వానిన్ నిర్జింపన్= కీచకుడిని చంపటానికి; నియోగించునది+ఐ= ప్రేరేపించటానికై; అరుగుదెంచెన్+ కావలయున్= వచ్చింది కాబోలు; ఆ+తెఱంగు= ఆ పద్ధతి; ఈ+తెఱవ= ఈ ద్రౌపది; తాన్+అ= తానే; చెప్పన్‌విందున్= చెప్పగా వింటాను; అని తలంచి= అని భావించి

తాత్పర్యం: అని మెల్లమెల్లగా మాట్లాడుతూ చేతితో తాకగా ద్రౌపది స్పర్శకు భీముడు మేల్కొని, ఎవరు? అని అనగా, నేనని ద్రౌపది బదులు పలికింది. కీచకుడి దుష్టకార్యాలను తెలిపి వాటిని మట్టుపెట్టటానికి తనను ప్రేరేపించటానికి వచ్చిందని భీముడు భావించాడు. ఆ సంగతి ఆమె నోటనే వినాలని అనుకొన్నాడు.

విశేషం: లోక సహజమైన విషయాన్ని ఇక్కడ తిక్కన చూపాడు. రాత్రిపూట సహజంగా భార్యాభర్తలు ఒకరి గొంతు ఒకరు పోల్చుకొనగలరు. 'నేను' అంటే చాలు. ఫలానా ద్రౌపదిని అని చెప్పనక్కరలేదు. అదే మాట అన్నది ద్రౌపది.

తే. **'ఇంత ప్రొద్దేల యిచ్చోటి కేఁగుదేరఁ। గారణం బేమి? యెవ్వరుఁ గానకుండు**
నట్లుగాఁ జనుదెంచితె యంబుజాక్షి !'। యనిన నయ్యింతి యిట్లను నతనితోడ. **168**

ప్రతిపదార్థం: అంబుజాక్షి!= ఓ ద్రౌపదీ!; ఇంతప్రొద్దు= ఇంత రాత్రివేళ; ఏల= ఎందుకు?; ఈ+చోటికిన్= ఇక్కడికి; ఏఁగు+తేరన్= రావటానికి; కారణంబు+ఏమి?= కారణమేమి?; ఎవ్వరున్+కానకుండునట్లుగాన్= ఎవరూ చూడకుండా; చను+తెంచితె?= వచ్చావా? అనినన్= అని భీముడనగా; ఆ+ఇంతి= ద్రౌపది; అతనితోడన్ ఇట్లు+అనున్= భీముడితో ఇట్లా అన్నది.

తాత్పర్యం: 'ఓ ద్రౌపదీ! ఇంత ప్రొద్దుపోయిన తర్వాత ఇట్లా ఎందుకొచ్చావు? కారణమేమిటి? ఎవరూ చూడకుండా వచ్చావా?' అని భీము డనగా ద్రౌపది ఇట్లా పలికింది.

విశేషం: ద్రౌపది రాకకు కారణం భీము డిదివరకే ఊహించాడు. కాని, ఆమె నోటనే వినాలని ఈ ప్రశ్నలు వేశాడు. నడిరేయి రాకకూ, రహస్య భాషణకూ ఏదో రహస్యమైన కారణమే ఉండాలి. అయితే ఆమెరాకగానీ, ఆమెమాటలుగానీ మరెవ్వరికీ తెలియకుండా జాగ్రత్త వహించటం జరిగిందా? అని ప్రశ్నించి అజ్ఞాతవాస వ్రత స్పృహను ప్రకటించాడు భీముడు. (సంపా.)

చ. 'ఎఱిఁగి యెఱింగి నన్నడుగ నేమిటి? కప్పు డెఱింగి యింతకు
న్మఱచుట గల్గెనే, నది వినం బనిలే; దటుగాక యున్న రూ
పెఱిఁగియు నేన చెప్ప విన నిష్టము గల్గుట చాల లెస్స; య
త్తెఱఁ గెఱిఁగించెదన్ వినుము తెల్లముగా మొదలింటినుండియున్. 169

ప్రతిపదార్థం: ఎఱిఁగి+ఎఱింగి= తెలిసి తెలిసి; నన్నున్+అడుగన్+ఏమిటికిన్= నన్నడగటం దేనికి?; అప్పుడు= ఆ సమయంలో (కొలువు దగ్గర జరిగిన సంఘటన సందర్భంలో,); ఎఱింగి= తెలిసి; ఇంతకున్+మఱచుట= ఇంతలో మరచిపోవటం; కల్గెన్+ఏన్= జరిగివుంటే; అది వినన్+పనిలేదు= దానినిగూర్చి విన నవసరం లేదు; అటు+కాక= అట్లాకాక; ఉన్న రూపు+ఎఱిఁగియున్= ఉన్నదంతా తెలిసి కూడా; నేను+అ చెప్పన్+వినన్= నేనే చెప్పగా వినాలని; ఇష్టము+కల్గుట= ఇష్టపడటం; చాల లెస్స= చాలా బాగుంది; మొదలింటి నుండియున్= మొదటి నుండీ; ఆ తెఱఁగు= ఆ ప్రకారం; తెల్లముగాన్=సవిస్తరంగా; ఎఱిఁగించెదన్= వివరిస్తాను; వినుము= వినుము.

తాత్పర్యం: 'భీమసేనా! తెలిసి తెలిసీ నీవు నన్ను ఎందు కడుగుతావు? కొలువులో జరిగింది చూశావుకదా! ఇంతలోనే మరిచిపోతే నేను చెప్పపనిలేదు. నీవు విన నవసరం లేదు. అట్లాకాక ఉన్నదంతా నా నోటితో వినాలని ఉంటే సరే, తేటతెల్లంగా చెప్పుతాను విను.

విశేషం: 1. ద్రౌపది వివేకవతి - భీముడు తెలిసి తెలిసి కావాలని అడుగుతున్నాడని పసిగట్టింది. ఆమె గడుసరి. సూర్యోదయ సమయాన కొలువులో తెలిసికొన్న సంగతిని చంద్రోదయ సమయానికి మరచిపోయేవారికి జ్ఞాపకం చేసి కూడా ప్రయోజనం లేదులే అని ఎత్తిపొడిచింది. అది మరువరానిదని కూడా గూఢంగా హెచ్చరించింది. ద్రౌపది పరేంగితజ్ఞురాలు. ఎదుటివారి మనసును పసిగట్టగల సూక్ష్మబుద్ధి కలది. అందువలననే తన నోట స్వయంగా వినాలనే కోరికతో భీము డడుగుతున్నట్లుగా నిశ్చయించి విషయం తెల్లమయ్యేటట్లు చెప్పనారంభించింది.

2. తెల్లమయ్యేటట్లు చెప్పటమంటే - జరిగిన కథలోని వివరాల జోలికి పోకుండా తాత్పర్యం బోధనపడేటట్లు, ప్రధానాంశాలు వదలకుండా చెప్పటమన్నమాట. పునఃకథనంలో ఈ కథాకథన శిల్పాన్ని తిక్కన ప్రయోగిస్తున్నాడని సూచన.

3. విరాటుడి సభవద్ద ద్రౌపదికి కీచకుడివలన కలిగిన అవమానం భీముడికి తెలుసుకాని, దాని వివరాలు తెలియవు. ఆ సన్నివేశమే భీముడిలో రౌద్రాగ్నిని ప్రకోపింపచేసింది. దానిని ధర్మరాజు చల్లార్చాడు. ఆ కోపాగ్ని మరల ప్రజ్వలించబడాలి. అందుకు ద్రౌపదినోట కథనంతా భీముడు వినాలి. శత్రుకృత పరాభవ శ్రవణం- అందులోనూ అవమానిత అయిన అర్ధాంగి చెప్పగా వినటం, భీముడిలో శత్రుసంహార సమర్థమైన రౌద్రోద్రేకానికి సమర్థమైన కారణం కాగలదు. తిక్కన రసాభ్యుదయోల్లాస శిల్పంలో ఇదొక సంవిధానం. (సంపా.)

చ. అధిపు మఱంది సింహబలుఁ డప్పకు మ్రొక్కఁగ వచ్చి నన్ను న
త్యధికమనోజ రాగ మతియై కనుఁగొంచుఁ గడంగి యెన్నియేన్
విధములఁ బల్కి నాకుఁ దన విన్నను వెల్లను జూపి చెప్పి మా
నధన విహీనతం జెనకినం గడునేవము పుట్టి యయ్యెడన్. 170

ప్రతిపదార్థం: అధిపుమఱంది= విరాటుని బావమరిది; సింహబలుఁడు= కీచకుడు; అప్పకున్ మ్రొక్కఁగన్+వచ్చి= అక్కకు నమస్కరించడానికి వచ్చి; నన్నున్= ద్రౌపదిని; అతి+అధికమనోజరాగమతి+ఐ= ఎక్కువైన మన్మథావేశంతో; కనుఁగొంచున్=

చూస్తూ; కడంగి= ప్రయత్నించి; ఎన్నియేన్ విధములన్+పల్కి= ఎన్నో రకాలుగా మాట్లాడి; నాకున్= ద్రౌపదికి; తన విన్ననువు= తన నేర్పరితనం; ఎల్లన్+చూపి= అంతా ప్రదర్శించి; చెప్పి= తననుగురించి తాను పొగడికొని; మానధనవిహీనతన్= సిగ్గులేకుండా; చెనకినన్= సమీపించగా; ఆ+ఎడన్= అక్కడ; కడున్+ఏవముపుట్టె= మిక్కిలి అసహ్యం కలిగి.

తాత్పర్యం: ఓ భీమసేనా! విరాటుడి బావమరిది కీచకుడు తన అక్క సుదేష్ణకు మ్రొక్కటానికి వచ్చి, నన్ను మదనావేశంతో చూస్తూ ఎన్నో రకాలుగా మాట్లాడి తన నేర్పరితనం చూపించి, పొగడికొని, సిగ్గులేకుండా నన్ను సమీపించాడు. అప్పుడు నాకు అసహ్యం కలిగింది.

విశేషం: 1. ఉ.వి. సం. ప్రతిలో "చూచి చెప్పి" అని ఉన్నది. దానికంటె "చూపి చెప్పి" అనే పాఠం పొసగుతుంది. కాబట్టి ఇక్కడ గ్రహించటమైనది. కీచక ప్రథమ సన్నివేశంలోని అంశాల నన్నింటిని బీరువోకుండా ఈ పద్యంలో సూచించింది. అవి- మదనాతిశయంతో చూడటం, ఎన్నో రకాలుగా విలాసంగా మాట్లాడటం, తన నేర్పరితనాన్ని చూపటం, పొగడుకొనటం. అంతటితో ఆగకుండా తాకటానికి దగ్గరికి రావటం-ఇవన్నీ మదనాతురుడు ప్రదర్శించే చేష్టలే. వాటన్నిటిలో సిగ్గులేనితనం కనబడింది ద్రౌపదికి. అందువలన ఆమెకు ఏవగింపు కలిగింది. కీచకుడు మదనాతురుడైనా, ద్రౌపది అతడిపట్ల ఏవగింపు ప్రదర్శించిందని తాత్పర్యం. భీముడికి కీచకుడి వర్తనం కోపాన్నీ, ద్రౌపది వర్తనం సానుభూతినీ కలిగిస్తాయి. (సంపా.)

క. విడియం బలుకఁగ వెండియు । నుడుగక కీచకుఁడు మన్మథోన్మాదము ద
న్నడరిన న న్నడుగుటకుం । దొడరినఁ గోపించి వానితో నిట్లంటిన్. 171

ప్రతిపదార్థం: విడియన్= నన్ను వదలిపోయేటట్లు; పలుకఁగన్= మాట్లాడగా; వెండియున్= మరల; ఉడుగక= వదలిపెట్టక; కీచకుఁడు; మన్మథ+ఉన్మాదము= మదనుని పిచ్చి; తన్నున్= కీచకుడిని; అడరినన్= అధికంగా ఆవహించగా; నన్నున్+ అడుగుటకున్= నన్ను కోరటానికి; తొడరినన్= ప్రయత్నించగా; కోపించి= కోపపడి; వానితోన్+ఇట్లు+అంటిన్= ఆ కీచకుడితో ఇట్లా అన్నాను.

తాత్పర్యం: అతడిని విదిలించినట్లు నేను మాట్లాడినా అతడు మత్తెక్కిన మదనావేశంతో నన్ను కామంతో కోరగా, వాడిమీద కోపించి నే నిట్లా అన్నాను.

విశేషం: వెనుక పద్యంలో ద్రౌపది కీచకుడు మనోజరాగమతితో వ్యవహరించిన తీరు చెప్పింది. ఈ పద్యంలో మదనోన్మాదావస్థను ప్రకటించిన విధం తెలిపింది. 'అడుగుట' అనే క్రియకు తెలుగులో కామకేళికి పిలవటం అనే అర్థం ఉంది. అది ఉన్మాదావస్థకు చిహ్నంగా చెప్పింది. (సంపా.)

శా. దుర్వారోద్యమ బాహు విక్రమరసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతు
ల్గీర్వాణాకృతు లేవు రిప్పు నిను దోర్లీలన్ వెసన్ గిట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా! 172

కీచకవధ ప్రయత్నం (ఈ పద్యానికి అర్థ తాత్పర్యాలు 55వ పద్యం వద్ద ఇవ్వబడ్డాయి.)

విశేషం: ఈ పద్యం కీచకుడిని బెదిరించటానికి అప్పుడు పలికింది. ఇప్పుడు కీచకుడి ముందు పాండవ ప్రతాపాన్ని కీర్తించిన పద్ధతిని భీముడికి తెలియజెప్పటమే కాక, 'ఇప్డు నిను దోర్లీలన్ వెసన్గిట్టి.. మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిన్' అని

తానన్న మాటలు నిజం చేయవలసిన అవసరం వచ్చిందని భీముడికి పరోక్షంగా సూచించటానికి అవే మాటలు తు-చ తప్పక పునరుక్తం చేయటం జరిగింది. ఇకముందు భీముడు కీచకవధప్రయత్నం చేస్తాడనీ, అందులో దుర్వార ఉద్యమం, బాహువిక్రమం, గర్వాంధ ప్రతివీరనిర్మథన విద్యా ప్రదర్శనం అనే దశలు స్ఫురిస్తాయని ధ్వని. (సంపా.)

వ. అనిన విని వాఁడు గొన్ని ప్రల్లదంబులు పలికిన నేనునుం దత్కాలోచిత వచనంబులం ద్రోచిపుచ్చినం బోయెఁ; బదంపడి పాపాత్మయైన సుదేష్ణ తనకు మదిరారసంబు దేరం గీచక నివాసంబునకు నన్నుం బనిచినం బోవుట కొడంబడక, యెన్ని సెప్పిన నన్నింటికి నన్ని సెప్పి నిర్బంధించినం బెద్ద పెనంగ నొల్లక నా మనంబున నన్నెవ్వరికి నేమి సేయవచ్చు నని మీలావు నచ్చి సూతునింటికి సురకుం బోయిన. 173

ప్రతిపదార్థం: అనినన్, విని= అనగా విని; వాఁడు= కీచకుడు; కొన్ని ప్రల్లదంబులు= కొన్ని వదరుబోతుమాటలు; పలికినన్=పలుకగా; నేనునున్= నేనుకూడా; తద్+కాలోచిత వచనంబులన్= ఆ సమయానికి తగిన మాటలతో; త్రోచిపుచ్చినన్= త్రోసివేయగా; పోయెన్= పోయాడు; పదంపడి= మళ్ళీ; పాపాత్మ+ఐన= పాపిష్ఠిదైన; సుదేష్ణ; తనకున్; మదిరారసంబు= కల్లు; తేరన్= తీసికొనిరమ్మని; కీచక నివాసంబునకున్= కీచకుడి ఇంటికి; నన్నున్+పనిచినన్= నన్ను పంపగా; పోవుటకున్+ఒడంబడక= పోవటానికి ఇష్టపడక; ఎన్ని చెప్పినన్= ఎన్ని కారణాలు చెప్పినా; అన్నింటికిన్+అన్ని+చెప్పి= అన్నిటికీ అన్ని విధాల అడ్డంకులు చెప్పి; నిర్బంధించినన్= బలవంతం చేయగా; పెద్ద పెనంగన్= చాలాసేపు ఘర్షణపడటం; ఒల్లక= ఇష్టం లేక; నా మనంబునన్= నా మనస్సులో; నన్నున్+ఎవ్వరికిన్+ ఏమిచేయవచ్చున్+అని= నన్ను ఎవరేమి చేయగలరనే ధైర్యంతో; మీలావు నచ్చి= మీ బలంపై నమ్మకంతో; సూతుని+ఇంటికిన్= కీచకుడి ఇంటికి; సురకున్= కల్లుతేవటానికి; పోయినన్= పోవగా.

తాత్పర్యం: కీచకుడు ఎన్నో రకాల వదరుబోతు మాటలు పలుకగా, నేను సమయోచితంగా మాట్లాడి త్రోసిపుచ్చాను. ఎట్టకేలకు అతడు మరలిపోయాడు. కాని, ఆ తరువాత పాపాత్మురాలైన ఆ సుదేష్ణ మాత్రం నన్ను కల్లు తెమ్మని కీచకుడి ఇంటికి పొమ్మని ఆజ్ఞాపించింది. నేను పోనని వాదించినా ఆమె వినలేదు. నే నెన్ని కారణాలు చెప్పినా, అన్నింటికీ ఆమె అడ్డంకులు చెప్పి బలవంతపెట్టింది. ఎక్కువగా ఘర్షణ పడటం బాగుండదని తలచి, నా మదిలో మీ బలసంపన్నతపై ఉన్న నమ్మకంతో, నన్ను ఎవ్వరూ ఏమీ చేయలేరని నిశ్చయించుకొని కీచకుడి ఇంటికి కల్లు తెద్దామని వెళ్ళాను.

క. కొన్ని వెడమాట లాడుచు। నన్ను నతఁడు చెట్టవట్టినం ద్రోచి వెసం
జన్న వెనుకొనుటయును మీ। యున్నెడ కే నపుడు సంభ్రమోపేతగతిన్. 174

ప్రతిపదార్థం: అతఁడు= కీచకుడు; కొన్ని వెడమాటలు+ఆడుచున్= కొన్ని అసందర్భపు మాటలు పలుకుతూ; నన్నున్= ద్రౌపదిని; చెట్ట+పట్టినన్= చేయిపట్టుకోగా; త్రోచి,వెసన్+చన్నన్= తొలగద్రోసి వెళ్లగా; వెనుకొనుటయును= వెంబడించగా; మీ+ఉన్న+ ఎడకున్= మీరున్నచోటికి; సంభ్రమ+ఉపేతగతిన్= వేగిరపాటుతో కూడిన నడకతో; ఏను+అపుడు= నేను (ద్రౌపది) అప్పుడు.

తాత్పర్యం: కీచకుడు కొన్ని అసందర్భపు మాటలాడుతూ నన్ను చేయిపట్టుకొనపోగా, నేను వాడిని తొలగద్రోసి పోసాగాను. వాడు నన్ను వెంబడించాడు. నే నప్పుడు వడివడిగా మీరున్న చోటికి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. పాఱుతెంచిన నక్కులపాంసనుండు। గోప మడరంగ వెనుకన కూడముట్టె;
నట యెఱుంగుదు వీవు; మీ యన్న పెద్ద। తనముఁ జూచితి; వేమందు ననిలతనయ! 175

ప్రతిపదార్థం: పాఱుతెంచినన్= పరుగెత్తి రాగా; ఆ+కులపాంసనుండు= ఆ కులభ్రష్టుడు; కోపము+అడరంగన్= కోపం ఎక్కువకాగా; వెనుకన కూడముట్టెన్= వెంబడించి పట్టుకొన్నాడు; అట= అప్పటినుండి; అనిలతనయ!= భీమా!; నీవు+ఎఱుంగుదు(వు)= నీకు తెలుసు; మీ+అన్న= ధర్మజుడియొక్క; పెద్దతనము చూచితివి= గొప్పతనం చూచావు; ఏమందును?= ఇంక ఏమి చెప్పగలను?

తాత్పర్యం: నే నట్లా పరుగెత్తి రాగా ఆ కులభ్రష్టుడైన కీచకుడు నన్ను వెంబడించి వచ్చి పట్టుకొన్నాడు. ఆ సభలో ఏం జరిగిందో నీకు తెలుసు. మీ అన్న ధర్మజుడు చూపిన పెద్దతనం చూచావు. ఇంక అంతకన్నా ఎక్కువ ఏమి చెప్పగలను?

విశేషం: సభలో పెత్తనం నిర్వహించేవారు ఎట్లా ప్రవర్తిస్తారో, ధర్మానికి ఎట్లా విఘాతం కలుగుతుందో ద్రౌపది ఇక్కడ ఎత్తిపొడిచింది.

ఉ. **మీ సుభటత్వమున్ బలము మిన్నకపోవఁగ దుస్ససేనుఁ డ**
ట్లా సభలోన నన్ బఱిచె; నంతియకాక జయద్రథుండు సం
త్రాసభరంబు లే కనుచితం బొనరించినఁ జెల్లిపోయె; నేఁ
డీ సభికుల్ గనుంగొనఁగ నిట్లయితిన్; వగ నాకు వింతయే! **176**

ప్రతిపదార్థం: మీ సుభటత్వమున్= మీ పరాక్రమమూ; బలమున్= శక్తీ; మిన్నకపోవఁగన్= వమ్మయిపోగా; దుస్ససేనుఁడు= దుశ్శాసనుడు; అట్లు+ఆ సభలోనన్= ఆ విధంగా ఆ సభలో; నన్+పఱిచెన్= నన్ను అవమానించాడు; అంతియకాక= అంతేకాక; జయద్రథుండు= సైంధవుడు; సంత్రాసభరంబులేక= ఎట్టి భయం లేకుండా; అనుచితంబు+ఒనరించినన్= ఉచితంకాని పనిచేయగా; చెల్లిపోయెన్= చెల్లుబాటు అయింది; నేఁడు= ఈ రోజు; ఈ సభికుల్= విరాటుడి కొలువులో సభ్యులు(జూదరులని); కనుంగొనఁ గన్= చూడగా; ఇట్లు+అయితిన్= ఈ విధంగా అయ్యాను; నాకున్= ద్రౌపదికి; వగ= దుఃఖం; వింతయే!= క్రొత్తగాదు కదా!

తాత్పర్యం: మీ బలపరాక్రమాలు వమ్మయిపోయాయా అన్నట్లు ధృతరాష్ట్రుడి కొలువులో దుశ్శాసనుడు నన్ను అవమానించాడు. అంతేకాక, సైంధవుడు నన్ను నిర్భయంగా అట్లా తీసికొని పోయి అనుచితం చేసినా చెల్లిపోయింది. ఈనాడు విరాటుడి కొలువులో సభాసదులందరూ చూస్తూ ఉండగా వీడు ఈ విధంగా చేశాడు. అయినా మిమ్ములను అనుకొని ప్రయోజనం లేదు. దుఃఖపడటం నాకీనాడు క్రొత్తగాదుగదా!.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ద్రౌపది జన్మించినదాది కష్టాల ననుభవిస్తున్నది. పాండవపత్ని అయినది మొదలు ఆమెకు కడగండ్లు చుట్టుముట్టాయి. దుశ్శాసనుడు నిండు కొలువులో వస్త్రాపహరణ ప్రయత్నం చేశాడు. భర్తలంతా చూస్తూ నిలుచుండిపోయారు. కృష్ణుడు రక్షించాడు. వనవాసకాలంలో సైంధవుడు ద్రౌపదిని నిర్భయంగా తీసికొని వెళ్ళాడు. పాండవులు విడిపించుకొని వచ్చారు. ఇన్ని అవమానాలకు తలదన్నేటట్లు ఈనాడు నీచకీచకుడు భర్తలూ, సభ్యులూ చూస్తుండగా తన్నాడు. కాని, పాండవులు అజ్ఞాతవాస భయంతో సభలో ఏమీ చేయలేకపోయారు. 'వగనాకు వింతయే' - అనే సామాన్యాంశంచేత విశేషాంశం సమర్థించబడింది. కాబట్టి అర్థాంతరన్యాసాలంకారం.

ఆ. **అకట! యాఁడుకూయు నాలకూయును లాఁతి। వారికైన నరయవలయు ననిన**
నన్నుఁ గీచకుండు దన్నంగ నెట్టులు। సూడ నేర్చె ధర్మసూనుఁ డపుడు.' **177**

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; ఆఁడుకూయున్= ఆడదాని ఏడుపును; ఆలకూయును= ఆవుల అరుపును; లాఁతివారికైనన్= పరులకైనా; అరయన్+వలయు+అనినన్= గమనించి రక్షించాలి అని లోకంలో ప్రసిద్ధి ఉండగా; నన్నున్= ద్రౌపదిని; కీచకుండు+అపుడు= అప్పుడు కీచకుడు; తన్నంగన్= తన్నగా; ధర్మసూనుఁడు= ధర్మజుడు; ఎట్టులు+చూడన్‌నేర్చెన్?= ఎట్లా చూడగలిగాడు?

తాత్పర్యం: స్త్రీరోదనాన్నీ, గోమాత అరుపునూ విన్నప్పుడు పరాయివారైనా వారిని పట్టించుకొని రక్షించటం లోకపరిపాటి. అట్లాంటిది ఆ సభలో కీచకుడు నన్ను తన్నగా చూచి ధర్మజుడు చూస్తూ ఎట్లా ఉండిపోయాడు?'

విశేషం: భర్తల సమక్షంలో అవమానాన్ని పలుమార్లు పొందటం భరించరానిదిగా ఉన్నదని ద్రౌపది భావం.

వ. అనిన విని యతం డిట్లనియె. 178

తాత్పర్యం: ఆ మాటలు విని భీము డిట్లా అన్నాడు.

ఉ. 'కీచకుఁడట్లు మీఁదు పరికింపక నిన్నుఁ బరాభవింపఁగాఁ
జూచి మహోగ్రకోప వివశుండగు నన్నును జూచి ధైర్య హే
మాచలుఁడైన ధర్మసుతుఁ డమ్మెయి వారణ సేయకున్న నే
నీచత వాని మత్స్యవిభునిం బరివారము నుగ్గు సేసినన్. 179

ప్రతిపదార్థం: కీచకుఁడు; అట్లు మీఁదు పరికింపక= ఆ విధంగా క్రిందుమీదులు చూడక; నిన్ను పరాభవింపఁగాన్+చూచి= ద్రౌపది నవమానించటం చూచి; మహా+ఉగ్రకోపవివశుండు+అగు= అధికమైన కోపావేశంతో ఉన్న; నన్నును+చూచి= భీముడిని చూచి; ధైర్యహేమ+అచలుఁడు+ఐన= ధైర్యంలో మేరుపర్వత సమానుడైన; ధర్మసుతుఁడు= ధర్మరాజు; ఆ+మెయిన్= ఆ విధంగా; వారణచేయక+ఉన్నన్= నివారించనిచో; నేన్= భీముడు; నీచతన్= హీనంగా; వానిన్= కీచకుడినీ; మత్స్యవిభునిన్= విరాటుడినీ; పరివారమున్= సేనలనూ; నుగ్గుచేసినన్= మట్టుపెట్టినట్లయితే.

తాత్పర్యం: 'కీచకుడు క్రిందు మీదులు చూడకుండా ఆ విధంగా నిన్ను పరాభవించటం చూచి కోపావేశంతో ఒడలు తెలియని నన్ను చూచి, ధైర్యంలో మేరుపర్వత సమానుడైన ధర్మజుడు నన్ను అడ్డుపెట్టకపోతే కీచకుడిని, విరాటుడిని, అతని సేనలను నేను మట్టుపెట్టి ఉండేవాడిని.

విశేషం: ధర్మరాజును నిర్దయుడిగా చిత్రించింది ద్రౌపది. అది పరిభవ వేదన వలననే కావచ్చును. 'మీ అన్న పెద్దతనము' అని ఎత్తిపొడిచింది. దానికి భీము డిచ్చిన సమాధాన మిది. భార్యను పరిభవించిన కీచకుడిని ఒకవైపు చూచాడు ధర్మరాజు, ఆ దృశ్యాన్ని చూచి మహోగ్రకోపవివశుడైన భీముడిని మరొక వైపు చూచాడు. మొదటి దృశ్యం చూచి భీముడివలె ధర్మజుడూ కోపావేశంతో విజృంభించి ఉండాలి. భీముడి ఆవేశాన్ని చూచి అభినందించి ఉండాలి. కాని, అతడు మేరుపర్వతంవలె స్థిరచిత్తుడై ఉండిపోయాడు. స్థైర్యాన్ని పర్వతంతో పోల్చి చెప్పటం కవిసమయం. పర్వతాలలో శ్రేష్ఠమైనది మేరుపర్వతం కాబట్టి ధీరులలో అగ్రగణ్యుడు ధర్మజుడని భీముడి భావం. (సంపా.)

వ. ఆ సంరంభంబున సమయభంగంబుగా జనంబులు మనల నెఱింగిరయేని. 180

ప్రతిపదార్థం: ఆ సంరంభంబునన్= ఆ సంక్షోభంలో; సమయభంగంబు+కాన్= అజ్ఞాతవాస ప్రతిజ్ఞ చెడిపోగా; జనంబులు= లోకులు; మనలన్+ఎఱింగిరి+అ+ఏని= మనలను కనిపెడితే.

తాత్పర్యం: ఆ ఉద్రిక్త పరిస్థితిలో అజ్ఞాతవాస ప్రతిజ్ఞావాస ప్రతిజ్ఞాపాలన వమ్మయిపోయి, లోకులు మనలను గుర్తిస్తే, (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ముందటి భంగిన కానల। యందుఁ జరింపంగ వలదె? యది నీవును నే
నుం దెచ్చిన యాపదగా। నిందింపరె యెల్లవారు నీరజనయనా! 181

ప్రతిపదార్థం: నీరజనయనా!= పద్మాక్షీ, ద్రౌపదీ!; ముందటిభంగిన్+అ= ఇంతకుముందువలెనే; కానల+అందున్= అరణ్యాలలో; చరింపంగవలదె!= తిరగాలికదా!; అది= ఆ స్థితి; నీవును నేనున్= నీవూ నేనూ; తెచ్చిన= తెచ్చిపెట్టిన; ఆపదకాన్= ఇబ్బందిగా; ఎల్లవారు= అందరూ; నిందింపరు+ఎ?= ఆడిపోసుకోరా?

తాత్పర్యం: ఓ ద్రౌపదీ! అట్లా చేసి ఉంటే ఇంతకు ముందువలె మళ్ళీ అరణ్యవాసం చేయవలసి వచ్చేది. అది నీవూ నేనూ కలిసి కల్పించిన ఆపదగా జనులందరూ నిందించరా?

విశేషం: పంచపాండవులలో భీముడు ఉద్ధతుడు. అతడి వలన ఏదో ఒక ఆపద వస్తుందని లోకులు అనుకొనటం పరిపాటి. మాటపడకుండా చూచుకొనాలని భీముడి తపన.

వ. కావున సత్యవ్రత నిష్ఠుండగు యుధిష్ఠిరుండు పొగడ్తకుం దగువాఁడుగాని దూఱువడ నర్హుండుగాఁ' డని వెండియు నిట్లనియె. 182

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; సత్యవ్రత నిష్ఠుండు+అగు= ఆడిన మాటకు కట్టుబడి ఉండే; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; పొగడ్తకున్= ప్రశంసకు; తగువాఁడు+కాని= అర్హుడే కాని; దూఱు+పడన్= నింద పడటానికి; అర్హుండు+కాఁడు= తగడు; అని వెండియున్= అని మరల; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆడిన మాటలకు లోబడి ఉండే స్వభావం గల ధర్మరాజు ప్రశంసాపాత్రుడేకాని, నిందార్హుడు కాడు' అని భీముడు మరల ఇట్లా అంటున్నాడు.

విశేషం: ధర్మరాజు వర్తనానికి మూలకారణం అతడి సత్యవ్రత నిష్ఠయే అని భీముడి వ్యాఖ్య. (సంపా.)

క. 'పరిభవకరుఁడగు కీచకుఁ। బరిమార్చుట యిపుడు గడవఁబడియెనె? యిమ్మై
దురపిల్ల నేల? వ్రేల్మిడిఁ । బొరిగొని నీ మనము కలఁక పుత్తు లతాంగీ! 183

ప్రతిపదార్థం: లతాంగీ!= తీగవంటి కోమలమైన శరీరం కలదానా, ద్రౌపదీ!; పరిభవకరుఁడు+అగు= అవమానం కలిగించిన; కీచకున్= కీచకుడిని; పరిమార్చుట= చంపటం; ఇపుడు= ఇప్పుడు; కడవన్+పడియెనె?= దాటిపోయిందా?; ఈ+మెయిన్= ఈ విధంగా; దురపిల్లన్+ఏల?= బాధపడట మెందుకు?; వ్రేల్మిడిన్= వెంటనే; పొరిగొని= చంపి; నీ మనము= నీ మనస్సులోని; కలఁకపుత్తున్= దుఃఖాన్ని పోగొట్టుతాను.

తాత్పర్యం: 'ద్రౌపదీ! నిన్ను అవమానించిన కీచకుడిని మట్టుపెట్టటం ఇప్పటికైనా మించిపోలేదు. ఈ విధంగా నీవు బాధపడ నవసరం లేదు. నేను వెంటనే వాడిని చంపి నీ మనస్సులోని చింతను పోగొట్టుతాను.

విశేషం: ఓదార్పు మాటలు చెప్పటంలో ఇట్లా సహజంగా జరుగుతుంది. 'ఇప్పు డేం మించిపోయింది? రెండు నిమిషాలలో నీ పని పూర్తి చేస్తా'నంటే ఎదుటివారికి ఊరట కలుగుతుంది. భీము డదే చేశాడు.

వ. మనల నెవ్వరు నెఱుఁగకుండునట్టి తెఱంగు తలపోయవలయుఁగాక, పగతుని భంజించుట యెంతపని?' యనిన విని యా మానిని యిట్లనియె. 184

ప్రతిపదార్థం: మనలను= పాండవులను; ఎవ్వరున్+ఎఱుఁగక+ఉండు+అట్టి= ఎవ్వరూ గుర్తుపట్టని; తెఱంగు= ఉపాయం; తలపోయవలయున్+కాక= ఆలోచించాలిగాని; పగతునిన్= శత్రువును; భంజించుట= చంపటం; ఎంతపని?= సులభమే; అనినన్; విని; ఆ మానిని= ద్రౌపది.

తాత్పర్యం: మనలను లోకులు గుర్తించని రీతిలో ఉపాయం ఆలోచించాలికాని, శత్రువును మట్టుపెట్టటం ఒక లెక్కలోనిది కాదు' అని భీముడు పలుకగా ద్రౌపది ఇట్లా అన్నది.

క. 'గొంతికి నంత వెఱవ, మీ। కంత వెఱవ, దైవమునకు నంత వెఱవ, న
త్యంత కలుషాత్మ విరటుని। కాంతకు నే వెఱతుఁ బనులు గావించునెడన్. 185

ప్రతిపదార్థం: ఏన్= నేను; గొంతికిన్= కుంతికి, అత్తగారికి; అంత వెఱవన్= అంత భయపడను; మీకున్+అంత వెఱవన్= పతులైన మిమ్ములను చూచి భయపడను; దైవమునకున్+అంత వెఱవన్= దేవుడికి కూడా అంత భయపడను; అతి+అంతకలుషాత్మ= మిక్కిలి నీచస్వభావురాలైన; విరటుని కాంతకున్= సుదేష్ణకు; పనులు కావించు+ఎడన్= సేవలు చేసేటప్పుడు; వెఱతున్= నేను భయపడతాను.

తాత్పర్యం: 'నా జీవితంలో నేను అత్తగారైన కుంతికి భయపడలేదు. పతులైన మీకు భయపడలేదు. చివరకు ఆ దైవానికి కూడా భయపడలేదు. కాని, దురాత్మురాలైన సుదేష్ణకు సేవలు చేస్తూ అమితంగా భయపడుతున్నాను.

విశేషం: అత్తకు, పతులకు, దైవానికి కూడా భయపడవలసిన అవసరం రాలేదు. కాని, ఈనాడు సుదేష్ణ కొలువు భయంకరమని భావన.

చ. కినుకకుఁ జాల కెంతయును గీడ్పడి నా పడుపాటులెల్ల వ
మ్మునఁ గలయంగ నిట్టు లొక మూర్ఖునిచేఁ దుదిఁబోయి కోలుపో
యెనె యభిమానమ న్వగపు నేడ్తెఱ డెందము కొందలంబుఁ బొం
దిన ధృతి మాలి యేఁ బలికితిం దగవెల్ల నెఱింగియుండియున్. 186

ప్రతిపదార్థం: కినుకకున్+చాలక= కోపగించటానికి అవకాశం లేక; ఎంతయును+కీడ్పడి= ఎన్నో అవమానాలు భరించి; నా పడుపాటులు+ఎల్లన్= నేను అనుభవించిన కష్టాలన్నీ; వమ్మునన్+కలయంగన్= వ్యర్థమైపోగా; తుదిన్+పోయి= చివరకు పోయి పోయి; ఇట్టులు+ఒక= ఈ విధంగా ఒక; మూర్ఖునిచేన్= నీచుడైన కీచకుడిచేత; అభిమానము= పరువు; కోలుపోయెనె?= నశించిందా? అను, వగపు= అనే దుఃఖంయొక్క; ఏడ్తెఱన్= అతిశయంతో; డెందము= హృదయం; కొందలంబున్+పొందినన్= కలత చెందగా; ధృతిమాలి= ధైర్యాన్ని కోల్పోయి; తగవు+ఎల్లన్= న్యాయమంతా; ఎఱింగి+ఉండియున్= తెలిసికూడా; ఏన్+పలికితిన్= నేను మాట్లాడాను.

తాత్పర్యం: కోపతాపాలు తెలుపుకొనే వీలు లేక ఎన్నో అవమానాలను భరించి నేను పడే పాట్లన్నీ వ్యర్థమైపోగా, చివరకు మూర్ఖుడైన ఈ కీచకుడి వలన ఆత్మగౌరవం కోల్పోవలసి వచ్చిం దనే దుఃఖంతో మంచీ చెడూ తెలిసినదానినైనా మనసు కలత చెందటం చేత ఇట్లా అన్నానుగాని, ధర్మరాజు గొప్పతనం తెలియనిదానిని కాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఆత్మగౌరవం కోల్పోయే అవమానం కలిగినప్పుడు ఎంతటి వివేకవంతులైనా విజ్ఞతను కోల్పోయి మాట్లాడటం సహజం. అయితే, ఉత్తములు తమ పొరపాటు తెలిసికొని వెంటనే తమను తాము సరిదిద్దుకొంటారు. ద్రౌపది దానికి ఉదాహరణం.(సంపా.)

ద్రౌపది భీమునితో ధర్మరాజు మహిమ చెప్పుట (సం.4-17-15)

వ. ఇట్టిద కాని సమస్త జనస్తవనీయుండగు పాండవాగ్రజు నిక్కంబ నిందించినదానం గా 'నని పలికి మఱియును. 187

ప్రతిపదార్థం: ఇట్టిది+అకాని= అంతేకాని; సమస్త జనస్తవనీయుండు+అగు= జనులందరిచేతా ప్రశంసించబడే; పాండవ+అగ్రజున్= ధర్మరాజును; నిక్కంబు+అ= నిజంగా; నిందించిన దానన్+కాను= నిందించలేదు; అని పలికి; మఱియును.

తాత్పర్యం: ఇంతేకాని, జనులందరి చేత కీర్తించబడే ధర్మరాజును నిజంగా నిందించేదానిని కాను' అని పలికి ఇంకా ఇట్లా అన్నది.

క. 'ధర్మతనూభవు సంతత । ధర్మనిరతి మనము బ్రదుకఁ దలఁచుట యరుదే?
నిర్మలుఁ డగు నాతని స । త్కర్మంబునఁ గాదె బ్రదుకు ధాత్రికి నెల్లన్. 188

ప్రతిపదార్థం: ధర్మతనూభవు= ధర్మరాజు యొక్క; సంతతధర్మనిరతిన్= నిత్యధర్మదీక్షచేత; మనము= పాండవులు; బ్రదుకన్+తలఁచుట= బ్రతకాలనుకొనటం; అరుదే!= అబ్బురమా?; నిర్మలుఁడు+అగు= నిష్కల్మషుడైన; ఆతని సత్కర్మంబునన్+కాదె= ఆయన మంచి పనుల వలననేకదా; ధాత్రికిన్+ఎల్లన్= లోకానికంతా; బ్రతుకుకాదె?= మనుగడకదా!.

తాత్పర్యం: 'ఆ ధర్మరాజు ధర్మదీక్షవలన సమస్త జగత్తు రక్షించబడుతున్నది. ఆ ధర్మం వలనే పాండవులమైన మనం బ్రతకాలనుకొనటం సహజమే కదా!

విశేషం: విశ్వాన్ని ధరించేది ధర్మం. ఆ ధర్మమే మూర్తికట్టినవాడు ధర్మరాజు. ప్రపంచమే అతడి ధర్మనిరతితో బ్రతుకుతూ ఉంటే పాండవులు కూడా ఆ ధర్మ ప్రభావంతోనే బ్రతుకుతున్నా రనటంలో ఆశ్చర్య మేముంది? (సంపా.)

సీ. చనునె వేఱొకని కజాతశత్రుండను । పేర దిగ్విజయంబు పెంపు దాల్ప?
రాజసూయ మహాధ్వరముఁ గోరి చేయంగఁ । దీరునే పెఱధరిత్రీపతులకు?
ధర్మైకనిరతుఁ డాతం డొక్కరుఁడ చూవె । యనఁ జన నొరులకు నలవి యగునె?
నిత్యవ్రతంబుగా సత్యంబు పాటింప । వచ్చునె యొరుల కెవ్వరికి నైన?

తే. నయ్యుధిష్ఠిరు గాంభీర్య మతనిధైర్య । మరయ నొండెడఁ గలుగునె? యతఁడు కీర్తి
ధరుఁడు కరుణోత్తరుఁడు మహీసుర సమృద్ధి । కరుఁడు నిజవంశకరుఁ డుపకారపరుఁడు. 189

ప్రతిపదార్థం: అజాతశత్రుండు+అనుపేరన్= పుట్టని శత్రువులు కలవాడు అనే పేరుతో; దిగ్విజయంబు= అన్ని దిక్కులను జయించి; పెంపు+తాల్పన్= అతిశయించటం; వేఱు+ఒకనికిన్= మరొకరికి; చనునె?= సాధ్యమా?; రాజసూయ మహా+అధ్వరము= రాజసూయం అనే గొప్ప యజ్ఞాన్ని; పెఱ ధరిత్రీపతులకున్= ఇతర రాజులకు; కోరి చేయంగన్= కావాలని చేయటానికి; తీరునే?= వీలుపడుతుందా? ధర్మ+ఏకనిరతుండు= ధర్మదీక్షకలవాడు; ఆతండు+ఒక్కరుఁడు+అ చూవె= ఆయన ఒక్కడేకదా; అనన్+చనన్=

అనటానికి; ఒరులకున్= ఇతరులకు; అలవి+అగునె?= సాధ్యపడుతుందా?; నిత్యవ్రతంబుకాన్= అనుదినం దీక్షగా; సత్యంబు= సత్యాన్ని; ఎవ్వరికిన్+ఐనన్= ఎవరికైనా; ఒరులకున్= ఇతరులకు; పాటింపవచ్చునె?= పాలించసాధ్యమా; ఆ+యుధిష్ఠిరు గాంభీర్యము= ఆ ధర్మజుడి గంభీరస్వభావం; అతని ధైర్యము= ఆయన సాహసం; అరయన్= చూడగా; ఒండు+ఎడన్+కలుగునె?= మరొకచోట ఉంటుందా?; అతఁడు కీర్తిధరుఁడు= అతడు ఖ్యాతిని చక్కగా ధరించినవాడు; కరుణా+ఉత్తరుఁడు= దయాగుణంచేత శ్రేష్ఠుడు; మహీసుర సమృద్ధికరుఁడు= బ్రాహ్మణులకు సంపదను కలిగించేవాడు; నిజవంశకరుఁడు= తన వంశానికి కీర్తి తెచ్చేవాడు; ఉపకార పరుఁడు= ఉపకారం చేసేవాడు.

తాత్పర్యం: అజాతశత్రుడనే బిరుదం కలిగి ఉండి కూడా దిగ్విజయం చేసి కీర్తికెక్కటం ధర్మరాజుకు తప్ప వేరొకరికి సాధ్యమౌతుందా? రాజసూయ మహాయజ్ఞాన్ని కోరి నిర్విఘ్నంగా నిర్వహించటం మిగిలిన భూపతులకు శక్యమౌతుందా? ధర్మాచారపరాయణుడని కీర్తించటానికి అత డొక్కడే తగినవాడుకాని, ఇతరుల కది వీలవుతుందా? సత్యవ్రతాన్ని నిత్యంగా పాటించటం అతడివలె ఇతరుల కెవ్వరికైనా సాధ్యమౌతుందా? ఆ ధర్మరాజుకున్న గాంభీర్యం, ధైర్యం మరొకరిలో ఎక్కడైనా కానవస్తాయా? అతడు యశస్వి, కరుణామయుడు, బ్రాహ్మణ హితకరుడు, చంద్రవంశకీర్తికరుడు, ఉపకారపరుడు.

విశేషం: అలం: ఉదాత్తం. ఎత్తుగీతిలో ధీరోదాత్త నాయక లక్షణాలు పేర్కొనబడ్డాయి. సీసపద్య పాదాలలో ఉదాత్త నాయకులందరిలో శ్రేష్ఠుడైన మహానాయకుడి లక్షణాలు చెప్పబడ్డాయి. ధీరుడంటే కష్టాలను సహించేవాడు. ఉదాత్తుడంటే తనను తాను పొగడుకొనని వాడు. దయామయుడు. హర్షశోకాదులచేత అభిభూతుడు కానివాడు. అంతేకాక గంభీరుడు, మహాసత్త్వుడు, దృఢవ్రతుడు, గూఢమానము కలవాడని లాక్షణికులు చెప్పారు. ఈ లక్షణాలన్నీ ఎత్తుగీతిలో ప్రస్తావించబడ్డాయి. ఈ లక్షణాలన్నీ ధర్మరాజు చరిత్రలో సంభవిల్లిన నాలుగు విలక్షణాంశాలలో ధ్వనించబడుతున్నాయి. దిగ్విజయం చేసి కూడా అజాతశత్రు వనిపించుకొన్న మహాసత్త్వుడు. రాజసూయం చేయటం వలన వచ్చే ఫలితాలను గురించి తెలిసి కూడా పితృతృప్తి కొరకు సాహసంతో చేసిన ధీరుడు. ధర్మాచరణం వలన కలిగే కష్టనిష్ఠురాలను ఎదురొడ్డి నిలిచిన గంభీరుడు. సత్యవ్రతాన్ని నిత్యంగా పాటించటం వలన ఎన్ని ఆపదలు వచ్చినా ఆ వ్రతాన్ని వీడని దృఢవ్రతుడు - ఆయా గుణాలలో అతడికంటె ఘనుడు మరొక్కడు లేడని అతడి ఔదాత్త్యాన్ని ఉదాత్తాలంకారంలో చెప్పటం సార్థకం. (సంపా.)

క. కలిమికి నొప్పగు నీఁగియు, । బలిమికిఁ దొడవైన యట్టి బలఁగమునై లో
కులచిత్తములకు వ్రేఁగగు । కొలఁది మన న్గొంతి పెద్దకొడుకున కమరున్. 190

ప్రతిపదార్థం: కలిమికిన్= సంపదకు; ఒప్పు+అగు= తగిన; ఈఁగియున్= దానగుణమూ; బలిమికిన్= బలానికి; తొడవు+ఐన+అట్టి= అలంకారప్రాయమయిన; బలఁగమున్+ఐ= పరివారం కలవాడై; లోకుల చిత్తములకున్= జనుల హృదయాలకు; వ్రేఁగు+అగు కొలఁదిన్= అబ్బురమైన (పట్టనంత) పరిమితిచేత; మనన్= ప్రవర్తించటానికి; గొంతి పెద్దకొడుకునకున్= ధర్మరాజునకు; అమరున్= సాధ్యపడుతుంది.

తాత్పర్యం: తనకున్న సంపదకు తగినట్లుగా దానం చేస్తూ, శౌర్యానికి తగ్గట్లు సహాయ సంపత్తులూ బలగమూ కలిగి లోకుల హృదయాలు పట్టనంతగా ఆనందం కలిగించే ప్రవర్తన కొనసాగించటం ఆ ధర్మరాజుకే చెల్లింది.

విశేషం: ధనం దానం వలన ఫలిస్తుంది. శౌర్యం సహాయ సంపత్తులతో ప్రకాశిస్తుంది. ఆ రెండింటినీ సాధించిన రాజులు ప్రజల హృదయాలను చూరగొంటారు. ధర్మరాజు అటువంటివారిలో అగ్రగణ్యుడు. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **ఎవ్వని వాకిట నిభమదపంకంబు। రాజభూషణ రజోరాజి నడఁగు;**

నెవ్వని చారిత్ర మెల్ల లోకములకు। నొజ్జయై వినయంబు నొఱపుఁ గఱపు;

నెవ్వని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి। మానిత సంపద లీనుచుండు;

నెవ్వని గుణలత లేడు వారాసుల। కడపటి కొండపైఁ గలయఁబ్రాఁకు;

తే. **నతఁడు భూరిప్రతాప మహాప్రదీప। దూర విఘటిత గర్వాంధకారవైరి**

వీర కోటీరమణి ఘృణివేష్టితాంఘ్రి। తలుఁడు కేవల మర్త్యుఁడె ధర్మసుతుఁడు! 191

ప్రతిపదార్థం: ఇభమద పంకంబు= ఏనుగుల మదజలం వలన నేల తడిసి ఏర్పడిన బురద; ఎవ్వని వాకిటన్= ఎవరి వాకిటి ముందు; రాజభూషణ= రాజులయొక్క అలంకారాల రాపిడివలన రాలిన; రజోరాజిన్= దుమ్ము సముదాయంచేత; అడఁగున్= అణగుతుందో; ఎల్లలోకములకున్= సమస్త లోకాలకు; ఎవ్వని చారిత్రము= ఎవని నడవడి; ఒజ్జ+ఐ= గురుత్వం వహించి; వినయంబున్+ఒఱపున్= వినయంయొక్క పద్ధతిని; కఱపున్= నేర్పుతుందో; ఎవ్వని కడకంటన్= ఎవరి కనుకొనలలో; నివ్వటిల్లెడుచూడ్కి= ప్రసరించే చూపు; మానితసంపదలు= అధిక సంపదలు; ఈనుచుండున్= కలిగిస్తూ ఉంటుందో; ఎవ్వని గుణలతలు= ఎవరి గుణాలనే తీగలు; ఏడువారాసుల= ఏడు సముద్రాల; కడపటికొండపైన్= చివరనున్న చక్రవాళ పర్వతంపై; కలయన్+ప్రాఁకున్= బాగా అల్లుకొంటుందో; అతఁడు= ఆయన; భూరిప్రతాప= గొప్ప పరాక్రమమనే; మహాప్రదీప= గొప్పదీపంచేత; దూరవిఘటిత= దూరంగా పారదోలబడిన; గర్వాంధకార= గర్వమనే చీకటి కల; వైరివీర= శత్రురాజుల; కోటీర= కిరీటాలలో; మణిఘృణి= రత్నకాంతులచేత; వేష్టిత= చుట్టబడిన; అంఘ్రితలుఁడు= పాదాలు (అడుగులు) కలవాడు; ధర్మసుతుఁడు= ధర్మజుడు; కేవల మర్త్యుఁడె?= సామాన్య మానవుడా? (కాదని భావం).

తాత్పర్యం: ఎవరి ముంగిట్లో మదపుటేనుగుల శరీరాలనుండి కారే మదజలధారలవలన ఏర్పడిన బురదను ఆయనను సేవించటానికి వచ్చే మహారాజుల అలంకారాల ఒరిపిడివలన రాలిన ధూళి రాజిఅనే దుమ్ము అణచివేస్తుందో అట్టి ధర్మరాజు సామాన్య మానవుడా? ఎవరి ఉత్తమ ప్రవర్తన లోకాల కన్నింటికీ ఆదర్శమై (గురువై) వినయ వర్తనానికి ఒరవడి పెట్టుతుందో అట్టి ధర్మరాజు సామాన్య మానవుడా? ఎవరి కటాక్ష వీక్షణం గొప్ప సంపదలను కలుగజేస్తుందో, అటువంటి ధర్మరాజు సామాన్య మానవుడా? ఎవరి సుగుణాలనే తీవెలు సప్తసముద్రాలు దాటి చక్రవాళ పర్వతం మీదకు కలయప్రాకుతాయో అట్టి ధర్మరాజు సామాన్య నరుడా? ఎవరి మహాపరాక్రమమనే పెద్ద దీపం శత్రువుల గర్వమనే అంధకారాన్ని దూరంగా పారద్రోలుతుందో, ఎవరి పాదాలు శత్రువీరుల కిరీటాలలోని రత్నకాంతులతో సదా ఆవరింపబడి వెలిగిపోతూ ఉంటాయో అటువంటి ధర్మరాజు కేవలం మానవుడా? (కాడు-దివ్యమానవ సదృశుడని భావం.)

విశేషం: అలం: ఉదాత్తం. రాజభూషణ రజోరాజిన్ అనే సమాసానికి రాజులు ధరించే అలంకారాల రాపిడి వలన ఏర్పడిన రత్నాల పొడి సమూహమని అర్థం. ఆ రాజులు మహారాజులు. వారు ఎన్నో అభరణాలు ధరిస్తారు. వారు ధర్మరాజును ఒకరి నొకరు తోసుకుంటూ రావటం వలన రాపిడికి లోనై నుగ్గునుగ్గై ధూళిగా అయి ఆ పంకాన్ని అణచివేస్తాయి. దీనివలన ఆ రాజులయొక్క మహత్త్వమూ, వారి అపరిమిత సంఖ్యా, వారి అభరణాల విరివీ, ధర్మరాజుదర్శనం కొరకు వారు పడే తహతహా ఇవన్నీ వ్యజ్యమానమౌతాయి. 'ధర్మరాజు శాంతమూర్తి' అనే కీర్తి లోకంలో వ్యాప్తి చెందింది. అది అతడి వినయపద్ధతి. ఆ పద్ధతికి ఆయనే ఆదర్శంగా లోకం చెప్పుకొంటుంది. అతడు చక్రవర్తి. అర్థులు అతడిని ఆశ్రయించినప్పుడు కడకంటితో చూస్తే చాలు,

అర్థులకు మహనీయసంపద లభిస్తుంది. అత డంతటి దయామయుడైన దాత. అతడి సుగుణాలు సప్త సముద్రాలు దాటి లోకాంతరాలకు వ్యాపించాయి. అతడి ప్రతాపానికి రాజులందరూ తలలు వంచారు. వారు అతడికి నమస్కారాలు చేస్తున్నప్పుడు వారి కిరీటమణికాంతులతో అతడి పాదాలు వెలిగిపోతుంటాయి. 'నా విష్ణుః పృథివీపతిః' అని న్యాయం, పృథివీపతు లెందరో తన పాదాలమీద పడి సేవించే ధర్మరాజు ఎవడు? అనే ప్రశ్న ఏర్పడుతుంది. అతడు కేవల మర్త్యుడు మాత్రం కాడు - అనే సమాధానం మాత్రం సత్యం. (సంపా.)

ఉ. **అట్టి మహాత్ముఁ డొక్కనికి నాశ్రితుఁడై వెడకూడుఁ జీరయుం**
బెట్టఁగ నిల్చి వాని మది ప్రీతికి నీడగువృత్తిఁ బేరునుం
బుట్టును మాలి యిప్పు డిటు బ్రుంగుడుపాటునఁ బొందఁ జూచి నా
కెట్టు మనంబు వట్టు? ధృతి యెమ్మెయిఁ దూలక నిల్చుఁ? జెప్పుమా! **192**

ప్రతిపదార్థం: అట్టి మహాత్ముఁడు= ఆ విధమైన మహానుభావుడు (ధర్మజుడు); ఒక్కనికిన్= ఒక రాజునకు (అనామకునకు అనిర్వని) అందుకే పేరు చెప్పలేదు; ఆశ్రితుఁడు+ఐ= ఆశ్రయించినవాడై; వెడకూడు= అల్పమైన భోజనం; చీరయున్+పెట్టఁగన్= కట్టుబట్టలు ఇవ్వగా; నిల్చి= వాడివద్ద సేవకుడుగా కుదిరి; వానిమది ప్రీతికిన్= అతడి మనస్సుకు సంతోషం కలిగించటానికి; ఈడు+అగువృత్తిన్= తగినవర్తనం పాటిస్తూ; పేరునున్+పుట్టును మాలి= పేరూ, పుట్టుకా వదలి; ఇప్పుడు+ఇటు= ఇప్పు డిట్లా; బ్రుంగుడుపాటునన్+పొందన్= మరుగున పడిపోవటం; చూచి; నాకున్; మనంబు+ఎట్టు+పట్టున్?= ఎట్లా మనస్కరిస్తుంది; ధృతి= ధైర్యం; ఏ+మెయిన్= ఏ విధంగా; తూలక నిల్చున్?= చలించదో; చెప్పుమా!= నీవే చెప్పుము.

తాత్పర్యం: ఆ విధమైన మహితాత్ముడైన ధర్మజుడు సాధారణ వ్యక్తివలె ఒక రాజు వద్ద కూడూ అల్పమైన గుడ్డ కొరకు పరిచర్యలు చేయటం, పేరూ, వంశప్రతిష్ఠ, కులగౌరవం వదలి గోప్యంగా ఉండిపోవటం చూస్తే ధైర్యం చలించి, మనస్సు వికలమౌతున్నది. నాకు మిక్కిలి దుఃఖం కలుగుతున్నది.

విశేషం: రోజులు బాగా లేనపుడు తలవంచక తప్పదని ఈ కథ చెప్పుతున్నది.

ఉ. **నీ వలమూపులావు మును నేల వహించిన నాగకూర్మ గో**
త్రావనిభృద్దిశాకరుల కారయ నూఱటపట్టు గాదె? సం
భావన భూజనంబులకుఁ బండువు గాదె? మహోగ్ర కోప రే
ఖావిభవంబు వైరులకుఁ గాలము చేరువ గాదె పావనీ! **193**

ప్రతిపదార్థం: పావనీ!= పవనపుత్రుడవైన ఓ భీమా!; ఆరయన్= పరిశీలించగా; నీ వలమూపులావు= నీ కుడిభుజబలం; మును= పూర్వం; నేలన్+వహించిన= భూభారాన్ని మోసిన; నాగ, కూర్మ, గోత్ర+అవనిభృత్= ఆదిశేషువు, తాబేలు, కులపర్వతాలకు; దిశాకరులకు= దిగ్గజాలకు; ఊఱటపట్టు+కాదె= ఊరటకు స్థానం కాదా?; సంభావన= నీవు గౌరవించటం; భూజనంబులకున్= లోకులకు; పండువు కాదె?= పండుగ కాదా?; మహా+ఉగ్రకోపరేఖావిభవంబు= మిక్కిలి భయాన్ని కొలిపే నీ కోప పరిపూర్ణత అనెడి సంపద; వైరులకున్= శత్రువులకు; కాలము చేరువు+అకాదె= కాలం మూడటమేకదా!

తాత్పర్యం: ఓ భీమసేనా! నీ కుడిభుజపు బలపరాక్రమం చూచి ఇంతకుముందు భూభారం మోపిన ఆదిశేషువు, ఆదికూర్మం, ఏడుకులపర్వతాలూ, ఎనిమిదిదిగ్గజాలూ ఊరటపొందాయి. నీవు గౌరవంగా చూడటం లోకానికి పండుగ ఔతుంది. నీవు కోపంతో మహోగ్రమైన స్వరూపాన్ని వహిస్తే శత్రువులకు కాలం మూడినట్లేకదా!

విశేషం: అలం: అతిశయోక్తి. ఇక్కడ భూభారాన్ని ఆదిశేషుడు మోస్తూ ఉండటమనే పురాణగాథ ప్రస్తావించబడింది. అట్లాగే దశావతారాలలో ఒకటైన కూర్మావతారరూపంలో శ్రీవిష్ణువు భూ భారాన్ని మోశాడని గాథ. భూమిని సప్తకుల పర్వతాలూ, ఎనిమిది దిక్కులలో అష్టదిగ్గజాలూ మోస్తాయని ప్రతీతి. ఇక్కడ ఆ పురాణ గాథలు ఆధారంగా ద్రౌపది భీముడి భుజబలాన్ని ప్రశంసిస్తున్నది. పొగడ్తలకు లొంగనివాడు లేడు. అందులో భీముడూ ఒక భాగమే.

తే. **బక హిడింబ కిమ్మీరుల బాహుబలము। నా జరాసంధు నుగ్రదర్పాతిశయము**
లోకభీకరములు విజయాకరములు। నైన నీ కరములకు లోనయ్యెఁ గాదె! **194**

ప్రతిపదార్థం: బక= బకాసురుడియొక్క; హిడింబ= హిడింబాసురుడియొక్క; కిమ్మీరుల= కిమ్మీరుడియొక్క; బాహుబలమున్= భుజశక్తి; ఆ జరాసంధు= జరాసంధుడియొక్క; ఉగ్రదర్ప+అతిశయము= భయంకరమైన గర్వాధిక్యమూ; లోకభీకరములు= జనానికి భయాన్ని కలిగించేవి; విజయ+ఆకరములున్= జయాన్ని చేకూర్చేవి; ఐన; నీ కరములకున్= నీ చేతులకు; లోనయ్యెన్+ కాదె!= లోకువయినవికదా!

తాత్పర్యం: లోకాలకు భయాన్నీ, విజయాలనూ కలిగించే నీ చేతులకు బక, హిడింబ, కిమ్మీరుల బాహుబలాలు, జరాసంధాదుల భయంకర గర్వాతిశయాలు లొంగిపోయాయి కదా!

విశేషం: భీముడు తన చేతి మీదుగా బకాసురుడిని చంపాడు. హిడింబుడిని మట్టుపెట్టాడు. కిమ్మీరుడిని అంతమొందించాడు. జరాసంధుడిని చీల్చి వేశాడు. ఇవి అన్నీ ఆయన భుజ పరాక్రమానికి సాక్షులు. వాటిని వరుసగా గుర్తు చేసింది ద్రౌపది.

ఆ. **అట్టి నీవు వంటకట్టియలకు లావు। సూపుచుండ నెపుడుఁ జూచి చూచి**
వగతు; నదియుఁగాక తగవేది యమ్మత్స్య। మేదినీశ్వరుఁడు వినోదములకు **195**

ప్రతిపదార్థం: అట్టి నీవు= అంతటి బలసంపన్నుడవైన నీవు; వంటకట్టియలకున్= వంటకట్టెల కొరకు; లావు+చూపుచున్+ఉండన్= బలప్రయోగం చేస్తుంటే; ఎపుడున్+చూచిచూచి, వగతున్= నిత్యం పెక్కుసార్లు చూస్తూ ఎంతో బాధపడుతుంటాను; అదియున్+కాక= అంతేకాక; తగవు+ఏది= న్యాయం తప్పి; ఆ మత్స్యమేదినీ+ఈశ్వరుఁడు= ఆ విరాటరాజు; వినోదములకున్= ఆహ్లాదం కొరకు.

తాత్పర్యం: అంతటి బలసమన్వితుడవైన నీవు నీ భుజబలాన్ని వంటకట్టెలు విరచటానికి వినియోగించటం నిత్యం చూచి దుఃఖపడుతూ ఉంటాను. అంతేకాక. ధర్మం తప్పి, ఆ విరాటరాజు తన వినోదాల కొరకు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: వలలుడు బలం కలవాడు కాబట్టి అతడిని ఇతరమృగాలపైకి మల్లురపైకి పంపుతాడు విరాటుడు. అది హింసాత్మక చర్య అని ద్రౌపది గర్హిస్తున్నది.

మ. **మహిష వ్యాఘ్ర గజాది సత్త్వ చయమున్, మల్లవ్రజంబుం గృపా**
రహితుండై యెదు రొడ్డుచున్ వరుసఁ బోరంజూచు నిన్నెప్పుడున్;
మహనీయంబగు నీ శరీరము జగన్మాన్యంబు; నీచక్రియా
విహితం బైన కుజీవనంబు విధి గావించెం గటా దీనికిన్. **196**

ప్రతిపదార్థం: కృపారహితుండు+ఐ= (విరటుడు) దయమాలి; మహిష= దున్నపోతులు; వ్యాఘ్ర= పెద్దపులులు; గజ+ఆది= ఏనుగులు మొదలైన; సత్త్వచయమున్= జంతువుల సముదాయమునూ; మల్లవ్రజంబున్= జెట్టీల గుంపునూ; ఎదురు+ఒడ్డుచున్= నీకు ఎదురుగా నిలబెడుతూ; వరుసన్= వరుసగా; పోరన్= నీవు వారలతోపోరాటం చేస్తూ ఉండగా; ఎప్పుడున్+నిన్నున్= ఎప్పుడూ నిన్ను; చూచున్= (వినోదంగా) చూస్తూ ఉంటాడు; మహనీయంబు+అగు= గొప్పదైన; నీ శరీరము= నీ మేను; జగత్+మాన్యంబు= లోకం ప్రశంసించదగింది; విధి= దైవం; నీచక్రియా విహితంబు+ఐన= నీచమైన పనులు చేయటానికి అనువయిన; కుజీవనంబున్= చెడు ప్రవృత్తిని; దీనికిన్= నీదేహానికి; కావించెన్+కటా!= ఏర్పరచాడు కదా!

తాత్పర్యం: (విరాటుడు) దున్నపోతులు, పెద్దపులులు, ఏనుగులు మొదలైన జంతువులతోను, జెట్టీలతోను నిర్దయగా పోటీలు పెట్టి నీచేత ఎదుర్కొనేటట్లు చేసి ఆడిస్తుంటాడు. లోకులు మెచ్చుకొనే నీ శరీరం ఇట్లా నీచపుపనులకు తలొగ్గటం విధి కావించిన దుష్క్రియ కాక మరేమిటి?'

విశేషం: రాజుల వినోదాలు రకరకాలు. కొందరు జూదమాడుతారు. విరాటుడు ధర్మరాజుతో ఆడేవాడు. మరికొందరు నాట్యం చూస్తారు. అర్జునుడు ఆ విద్య చూపేవాడు. మల్లురతోను, క్రూరమృగాలతోను బలాఢ్యులకు పోటీలు పెట్టి రాజులు వినోదించేవారు. విరాటుడు వలలుడిని అందుకు వినియోగించుకొనటం విధి వైపరీత్యం. ద్రౌపది బాధ ఇదే. అయితే, భీముడి చేత అటువంటి వినోదాలు చేయించవచ్చునని సూచించింది ధర్మరాజే. అజ్ఞాతవాస వ్రతకాలంలో అతడు శరీర వ్యాయామంలో వెనుకపడకుండా ఉండటానికి ధర్మజుడి పన్నాగ మది. ఆ రహస్యం తెలియని ద్రౌపది బాధపడడంలో ఆశ్చర్యం లేదు.

వ. అని మఱియు నిట్లనియె 'వివేకహీనుండగు విరాటుండు నిన్నుంబోరించునప్పుడు నిజాంతఃపురకాంతలకు వినోదంబు సేయ వారల రావించిన నేనును సుదేష్ణతో నరుగుదెంచి చూచుచుండుదు; నయ్యవసరంబున. 197

ప్రతిపదార్థం: వివేకహీనుండు+అగు= తెలివిలేనివాడైన; విరాటుండు; నిన్నున్+పోరించునప్పుడు= నీచేత యుద్ధం చేయించేటప్పుడు; నిజ+అంతఃపురకాంతలకున్= తన అంతఃపురస్త్రీలకు; వినోదంబు+చేయన్= ఆహ్లాదం కలిగించటానికి; వారలన్= వారిని; రావించినన్= రప్పించగా; నేనును; సుదేష్ణతో; అరుగుదెంచి= వచ్చి; చూచుచుండుదున్= చూస్తూ ఉంటాను; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: తెలివిమాలినవాడైన ఆ విరాటుడు నీచేత జంతువులతో పోరాడింపచేసేటప్పుడు అంతఃపురకాంతలను కూడా వినోదం కొరకు పిలిపించేవాడు. సుదేష్ణాదులతో పాటు నేనూ వచ్చి నిన్ను చూస్తూ ఉండే దానిని. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: వివేకహీనుడని విరాటరాజును పేర్కొనటం సాభిప్రాయం. ఆనాడు మల్లయుద్ధాలు అంతఃపురస్త్రీలకు వినోదాన్ని కలిగించటానికి కూడా ఏర్పాటు చేసేవారు.

క. భరమున నీ పోరెడు నెడఁ । బరమ విషాదంబు, నీవు బలిమి మెఱసి యు
ద్ధురవృత్తి జయము గొనినం । బరితోషముఁ బొందు నన్ను భావించి మదిన్. 198

ప్రతిపదార్థం: భరమునన్= కష్టంతో; నీ పోరెడు+ఎడన్= నీవు పోరాడే సమయంలో; పరమవిషాదంబు= అధిక దుఃఖాన్నీ; నీవు బలిమి మెఱసి= నీవు పరాక్రమం అతిశయించగా; ఉద్ధుర వృత్తిన్= దృఢమైన ప్రవర్తనతో; జయము+కొనినన్= విజయం సాధిస్తే; పరితోషమున్+పొందు= సంతోషించే; నన్నున్= నన్ను (ద్రౌపదిని); భావించి= తలంచి; మదిన్= మనస్సులో.

తాత్పర్యం: ఓ భీమసేనా! నీవు మల్లయుద్ధాలలో కష్టపడుతున్నప్పుడు నేను పొందే దుఃఖాన్నీ, నీవు బలాన్ని ప్రౌఢంగా ప్రదర్శించి జయం సాధించినపుడు నేను పొందే సంతోషాన్నీ గమనించి, నన్ను గురించి ఆలోచిస్తూ మనస్సులో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: భర్తపడుతున్న ఆవేదననూ, ఆవేశాన్నీ చూచి దుఃఖాన్నీ, హర్షాన్నీ పొందటం స్త్రీలకు సహజం. అవి ఇతరులకు తెలిసిపోయేవి.

వ. ఊహించి సుదేష్ణయుఁ దత్పరిజనంబులుం దమలోన. 199

ప్రతిపదార్థం: ఊహించి= ఊహచేసి; సుదేష్ణయున్; తత్+పరిజనంబులున్= అక్కడి పరిచారికలు కూడా; తమలోనన్= తమలో తాము.

తాత్పర్యం: అట్లా ఊహచేసి సుదేష్ణా, అక్కడి పరిజనాలూ తమలో తాము. (తరువాతి పద్యంతో సమన్వయం).

క. 'వలలుని దెస మాలినిచూ। డ్కుల తెఱఁ గెడపొందుఁ దెలిపెడుం గంటిరె! వీ
రలు వచ్చిన సమయంబును। దలఁపఁగ నొక్కటియ యివ్విధం బెట్లొక్కో! 200

ప్రతిపదార్థం: వలలునిదెసన్= భీముడివైపు; మాలినిచూడ్కు= సైరంధ్రి చూపులయొక్క; తెఱఁగు= పద్ధతి; ఎడపొందున్+తెలిపెడున్= ప్రేమను ప్రకటిస్తున్నాయి; కంటిరె?= చూచారా?; వీరలు= వీరిద్దరు (భీముడు-ద్రౌపది); వచ్చిన సమయంబును= కొలువులోకి వచ్చినవేళ; తలఁపఁగన్+ఒక్కటియ= ఆలోచిస్తే ఒకటే; ఈ+విధంబు+ఎట్లొక్కో!= ఇది ఎట్లా జరిగిందో గదా!

తాత్పర్యం: 'ఈ వలలుడిని సైరంధ్రి చూచే చూపుల తీరు మనసు కలిసిన జాడ తెలియజేసేదిగా ఉన్నది. మనకొలువులోకి వీరిద్దరూ ఒకే సమయంలో రావటం కూడా జరిగింది. ఈ తీ రేమిటో ఆశ్చర్యంగా ఉన్నది.'

వ. అనుచుం గలదు లేదని పెక్కు విధంబులం దలపోసి గుజగుజలు పోవుచుండుదు రట్టియెడ. 201

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; కలదు, లేదు+అని= ఉందీ, లేదు అని; పెక్కువిధంబులన్= అనేక రకాలుగా; తలపోసి= ఆలోచించి; గుజగుజలు పోవుచుండుదురు= గుసగుసలు ఆడుతుంటారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అని అంటూ తల కొక రకంగా ఆలోచిస్తూ, ఔను కాదని వాదించుకొంటూ, గుసగుసలాడుకొంటూ ఉంటారు. అప్పుడు.

తే. మరగి నీమూర్తిపైఁ గన్ను మనముఁ దగిలి। యుండ నేమఱియుండి యొక్కొక్కమాటు
తలఁచికొని వారిదెస మది నిలుపు నప్పు। డెఱుఁగనగు వారు నా తెఱఁ గెఱుఁగుటెల్ల. 202

ప్రతిపదార్థం: నీమూర్తిపైన్= నీ ఆకారంపై; మరగి= ఆసక్తికలిగి; కన్నున్= చూపూ; మనమున్= మనస్సూ; తగిలి+ఉండన్= లగ్నమై ఉండగా; ఏమఱి+ఉండి= మైమరచి ఉండి; ఒక్కొక్కమాటు= ఒక్కొక్కసారి; తలఁచికొని= ఆలోచించి; వారిదెసన్=

పరిచారికలవైపు; మది నిలుపునప్పుడు= చూపుత్రిప్పినపుడు; వారు= పరిచారికలు; నా తెఱఁగు+ఎఱుఁగుట+ఎల్లన్= నా ప్రవర్తన అంతా గమనించటం; ఎఱుఁగన్+అగున్= తెలుస్తుంది.

తాత్పర్యం: నా చూపులూ, మనస్సూ నీమీద ఆసక్తితో లగ్నమై ఉండగా ఒడలు మరచి ఉండేదానిని. మధ్య మధ్య ఒక్కొక్కసారి నా స్థితిని నేను తలచుకొంటూ వారివైపు చూచేదానిని. అప్పుడు వారు నన్ను గమనిస్తున్న తీరును తెలిసికొనేదానిని.

విశేషం: అప్రయత్నంగా భీముడి ఆకారాన్ని అనురాగపూరిత నయనాలతో ద్రౌపది చూడటం స్వభావం. ప్రేమలో పడ్డవారికి ఎదుటివారు తమను గమనిస్తారని అనుకోరు. లోక సహజమైన భావాన్ని కవి ఇట్లా ఎత్తి చూపాడు.

వ. కావున మదీయ పరిభవాతిరేకంబునకు నీ వుద్రేకించిన జనంబులు మనల భేదింతురు; నీకుం బోలిన భంగి రహస్యభంగంబు గాకుండ నరిభంగంబు సేయు' మని వెండియు. 203

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; మదీయ పరిభవ+అతిరేకంబునకున్= నాకు కలిగిన అవమానాతిశయానికి; నీవు+ఉద్రేకించినన్= నీవు విజృంభిస్తే; జనంబులు= లోకులు; మనలన్ భేదింతురు= మనలను సులభంగా గుర్తు పట్టివేస్తారు. నీకున్+పోలినభంగిన్= నీకు అనువైన విధంగా; రహస్య భంగంబు+కాకుండన్= అజ్ఞాతవాస సమయం బయటపడకుండా; అరిభంగంబు= శత్రువును చంపటం; చేయుము= చేయుము; అని= అని చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: నేను పొందిన అవమానభారానికి కోపపడి నీవు నిజంగా విక్రమిస్తే లోకులు మనలను ఇట్టే పోల్చుకొనగలరు. కాబట్టి, నీ కనువైనవిధంగా మన రహస్యవర్తనం బయటపడకుండా, శత్రువును చంపాలి' అని ద్రౌపది చెప్పి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. తొడరిన హరునైన దోర్బలంబునఁ దన్ను। మిగులంగనీఁడను మేటి మాట,
యమరేంద్రు నర్ధాసనమునకు నైన న। ర్హుం డెంతయును నను రూఢిమాట,
జము నిల్లు సొచ్చిన జంతువు నైనను। గాచు నెమ్మెయి నను రాచమాట,
తనుఁ గోరి యూర్వశి దాన వచ్చిన నైన। లోలుండు గాఁడను మేలిమాట.

తే. శౌర్యవైభవ ప్రాభవ శౌచములకు। నొరులకైనఁ గైవారమై యుల్లసిల్లు
నొక్కరుని కివి యెల్లను నిక్కమట్టె !। యెందుఁ గలుగునె యర్జును నీడువాఁడు ? 204

ప్రతిపదార్థం: తొడరిన= ఎదుర్కొనిన; హరున్+ఐనన్= శివుడినైనా; దోస్+బలంబునన్= భుజశక్తితో; తన్నున్ మిగులంగన్+ఈఁడు= తనను మించిపోనీడు; అను మేటిమాట= అనే గొప్పమాట; అమరేంద్రు+అర్ధ+ఆసనమునకున్+ఐనన్= ఇంద్రుడి సగం సింహాసనానికైనా; ఎంతయునున్= ఎంతైనా; అర్హుండు= సమర్థుడు; అను రూఢిమాట= అనే గట్టిమాట; జము+ఇల్లు= యమలోకం; చొచ్చినజంతువున్+ఐనను= ప్రవేశించిన పశువునైనా; ఏ+మెయిన్+కాచున్= ఎట్లాగైనా కాపాడుతాడు; అను రాచమాట= అనే పౌరుషపు మాట; ఊర్వశి= ఊర్వశి; తనున్+కోరి= తనను వరించి; తాన్+అవచ్చినన్+ఐనన్= తనంతట తానే వచ్చినా; లోలుండు+కాఁడు= లోబడడు; అను మేలిమాట= అనే మంచిమాట; శౌర్య= పరాక్రమానికి; వైభవ= ఐశ్వర్యానికి; ప్రాభవ= ప్రభుత్వానికి; శౌచములకున్= శుచిత్వానికి; ఒరులకైనన్= ఇతరులకైనా; కైవారము+ఐ= పొగడదగినదై; ఉల్లసిల్లున్= (అర్జునుడు)

ప్రకాశిస్తుంటాడు; ఒక్కరునికిన్= అలా ప్రకాశించటం (అర్జునుడు తప్ప) మరో వ్యక్తి యెడల; ఒక్కరునికిన్= ఇవి+ఎల్లను= ఇవి అన్నీ; నిక్కము+అట్టె!= నిజాలౌతాయా!; అర్జును+ఈడువాఁడు= అర్జునుడితో సమానుడు; ఎందున్+కలుగునె?= ఎక్కడైనా ఉంటాడా?

తాత్పర్యం: పరమేశ్వరుడే ఎదిరించినా అతడిని భుజబలంలో తనను మించనీయడు అనే గొప్ప కీర్తి, ఇంద్రుడి సగం గద్దె మీద కూర్చుండ గలిగిన అర్హత ఎంతైనా కలవాడు అనే గట్టి కీర్తి, యమలోకంలో ప్రవేశించిన జంతువునైనా ఏదో విధంగా రక్షించగలడనే పౌరుషపు కీర్తి, ఊర్వశి తనను కోరి తనంతట తాను వచ్చినా స్త్రీలోలుడు కాని ఉత్తమ కీర్తి వరుసగా తన పరాక్రమానికీ, వైభవానికీ, మహిమకూ, నిర్మల వర్తనానికీ సాక్షులై శత్రువులచేత కూడా పొగడ్తలు పొందగలగటం ఒక్కరికి మాత్రమే చెల్లింది. ఆ ఒక్కడు ఆ అర్జునుడు. అతడితో దీటైనవాడు మరొకడు లేడు. ఇది సత్యం.

విశేషం: అలం: ఉదాత్తం, యథాసంఖ్యం. పాశుపతాస్త్ర సంపాదన ఘట్టంలో పరమేశ్వరుడితో దీటైనవాడని అనిపించుకొనటం అర్జునుడి పరాక్రమానికి ఒక ప్రశంసాపత్రం. ఇట్లాగే మిగిలిన సీసపద్య పాదాలను వైభవ, ప్రాభవ, శౌచాలనే గుణాలకు అన్వయించుకొనాలి. మాట అనే పదానికి పలుకు, కీర్తి, అపకీర్తి, సంభాషణ, రూఢి మొదలైన అర్థాలున్నాయి. తిక్కన ఈ పద్యంలో కీర్తి అనే అర్థంలో ప్రయోగించాడు. మేటి మాట- అంటే అంతకంటె మించి చెప్పదగిన మాట (కీర్తి) లేదని భావం. రూఢిమాట- అంటే లోకంలో బాగా స్థిరపడిన మాట (కీర్తి) అని అర్థం. రాచమాట- అంటే గర్వంగా చెప్పుకొనే మాట (కీర్తి) అని తాత్పర్యం. మేలిమాట- అంటే అంతకు మించి చెప్పలేని మంచిమాట (నిష్కల్మషమైన కీర్తి) అని భావం. కైవారం రాజగుణకీర్తనకు సంబంధించిన స్తుతి. అర్జునుడు నాలుగు గుణాలలో సాటిలేని మేటికీర్తిని పొందాడు. అట్లా పొందినవాడు సమకాలీన భారతంలో మరొకడు లేడు. అట్టి ఉదాత్తుడి వర్తనం ఉదాత్తాలంకార శోభితం కావటం సార్థకం. (సంపా.)

పాశుపతాస్త్ర గాథ, ఇంద్రసింహాసనం ఎక్కటం, గో సంరక్షణ, ఊర్వశీ పరాభవం, అర్జునుడి బలపరాక్రమాలకు నిదర్శనాలు. కడచిన భారతకథలో ఇవి వచ్చాయి. వాటిని గమనించగలరు.

క. **ఆ పార్థుఁడు భరతాన్వయ। దీపకుఁ డమరేంద్ర సుతుఁడు తేజోనిధి వి**
ద్యాపారగుండు వినుత। వ్యాపారుం డాపదలకు నగ్గం బయ్యెన్. **205**

ప్రతిపదార్థం: ఆ పార్థుఁడు= ఆ అర్జునుడు; భరత+అన్వయదీపకుఁడు= భరతవంశాన్ని ప్రకాశింపజేసిన వాడు; అమర+ఇంద్ర సుతుండు= దేవేంద్రుడి కుమారుడు; తేజస్+నిధి= పరాక్రమానికి ఆటపట్టు; విద్యాపారగుండు= విద్యలను పారం ముట్టేటట్లు పూర్తిగా నేర్చినవాడు; వినుత వ్యాపారుండు= పేరెన్నికగన్న పనులు చేసేవాడు; ఆపదలకున్+అగ్గంబు+అయ్యెన్= కష్టాలపాలయ్యాడు.

తాత్పర్యం: ఆ అర్జునుడు భరతవంశానికే పేరు తెచ్చినవాడు, దేవేంద్రుడి కుమారుడు, పరాక్రమశాలి, అస్త్రశస్త్ర విద్యానిధి, ప్రశంసించదగిన ఆచరణ కలవాడు అయిన ఆ ఘనుడు ఈనాడు ఆపదలకు గురి అయ్యాడు.

విశేషం: బలహీనుడు కష్టాలకు లోనుకావటం సహజం. భుజబలపరాక్రమం కలిగిన అర్జునుడి అంతటివాడు అన్న మాటకు కట్టుపడి, అజ్ఞాతవాసానికి సిద్ధపడి, బృహన్నలా రూపంలో ఆడవాళ్ళతో కలసి మెలసి నాట్యాచార్యుడుగా ప్రవర్తించటం ద్రౌపది మనస్సుకు కష్టం కలిగించింది. విధి బలీయం. ఎంతటివారైనా విధికి తలొగ్గక తప్పదు. ఈ విధంగా ద్రౌపది ఇక్కడ అర్జునుడి గుణగానం చేసింది.

చ. **అరయ నతండు మానధనుఁ డక్కట రంగమునందు నిల్చి సుం**
దరులకు నాట సూపెడు విధం బతిదీనము; దానిఁ జూచి యేఁ
బురపురఁ బొక్కుదుం; గడుపుఁ బ్రోచికొనన్ లఘువృత్తి కిమ్మెయిం
జొరనగువాఁడె దేవపతిసూనుఁడు? దైవము చేఁత సూచితే? **206**

ప్రతిపదార్థం: అక్కట!= ఔరా!; మానధనుఁడు= అభిమానమే ధనంగా కలవాడైన; అతండు= ఆ అర్జునుడు; రంగమునందున్ నిల్చి= నాట్యరంగంమీద నిలబడి; సుందరులకున్= స్త్రీలకు; ఆట+చూపెడువిధంబు= నాట్యం చేసిచూపే తీరు; అరయన్= ఆలోచించగా; అతిదీనము= కడు జాలి కలిగించేది; దానిన్+చూచి= అది చూచి; ఏన్= నేను-(ద్రౌపది); పురపురన్ పొక్కుదున్= లోలోపల మిగుల దుఃఖిస్తాను; దేవపతిసూనుఁడు= ఇంద్రుడి కుమారుడు; కడుపున్+ప్రోచికొనన్= ఆకలి తీర్చుకొనటానికి; ఈ+మెయిన్= ఈ విధంగా; లఘువృత్తికిన్= నీచపు పనికి; చొరన్+అగువాఁడె?= పాల్పడదగినవాడా?; దైవము చేఁత= భగవంతుడి చేష్ట; చూచితే?= చూచావా?

తాత్పర్యం: అటువంటి అభిమానధనుడైన అర్జునుడు నాట్యరంగంలో నిలబడి రాచకన్నెలకు నాట్యం నేర్పవలసి వచ్చిన ఆ స్థితి ఎంతో దయనీయం. జాలి కలిగిస్తున్నది. దానిని చూచి నేను లోలోన దుఃఖంతో కుమిలిపోతూ ఉంటాను. దేవేంద్రుడి కుమారుడైన అర్జునుడు కడుపు నింపుకొనటానికి ఇంతటి నీచవృత్తికి పాల్పడటమా? విధి చేసే వింత చేష్టలు చూచావా?

విశేషం: ఊర్వశి శాపంవలన అర్జునుడికి ఈ స్థితి ఏర్పడింది. అది అతడికి అజ్ఞాతవాస సమయంలో బృహన్నలగా ఉండటానికి ఉపకరించింది.

చ. **'మగలకు మేటియైన బలమర్దననందనుఁ బేడిఁ జేయఁగాఁ**
దగునె విధాత నీకు?' నని దైవము దూఱుదు, నోర్వరాని నె
వ్వగ తలకొన్న నెంతయును వందుదు, నిద్దురవస్థ యెన్నఁడో
తెగుటని సంతతంబును మదిం దలపోయుదు నేమి సేయుదున్? **207**

ప్రతిపదార్థం: విధాత!= ఓ బ్రహ్మదేవా!; మగలకున్= పురుషులకు; మేటి+ఐన= శ్రేష్ఠుడైన; బలమర్దన నందనున్= ఇంద్రుడి కుమారుడైన అర్జునుడిని; పేడిన్+చేయఁగాన్= నపుంసకుడిని చేయగా; నీకున్; తగునె?= న్యాయమా?; అని దైవమున్ దూఱుదున్= అని విధిని నిందిస్తాను; ఓర్వరాని= భరించరాని; నెఱ+వగ తలకొన్నన్= అధిక దుఃఖం కలుగగా; ఎంతయును= ఎంతైనా; వందుదున్= చింతిస్తాను; ఈ+దురవస్థ= ఈ కష్టం; ఎన్నఁడో తెగుట+అని= ఎప్పుడు తొలగిపోతుందా? అని; సంతతంబును= ఎల్లప్పుడూ; మదిన్+తలపోయుదున్= మనసులో ఆలోచిస్తాను; ఏమి చేయుదున్?= ఇంతకంటె చేయగలిగింది ఏముంది?

తాత్పర్యం: 'ఓ బ్రహ్మదేవా! అంతటి ఇంద్రకుమారుడిని పేడివాడిగా చేసి ఆడిస్తున్న నీ చేష్టలు దూషితా'లని ఆ భగవంతుడిని నిందిస్తాను, భరించరాని దుఃఖం నన్ను ఆక్రమిస్తుంది. ఈ కష్టాలు ఎన్నడు గట్టెక్కుతాయా? అని ఆలోచిస్తాను. ఐనా చేసేది ఏముంది?

విశేషం: ఎంతటి బలవంతుడికైనా విధిని తప్పించుకొనటం సాధ్యం కాదు. పరాక్రమంచేత పరమశివుడి పాశుపతాస్త్రాన్ని ప్రసాదంగా పొందిన బలవంతుడైన అర్జునుడు బృహన్నలా రూపం దాల్చడం విచిత్రం. అజ్ఞాతవాస సమయంలో ఒక్కొక్కరు ఒక్కొక్క

రూపం దాల్చాలనుకొన్నారు. ఊర్వశి శాపం గుర్తుకు వచ్చింది అర్జునుడికి. అది అర్జునుడికి వరంగా మారింది. అది ఇంద్రుడిచ్చిన వరంప్రభావం.

సీ. తనయొ ప్పెదురఁ గన్నఁ దగిలి యెవ్వరికైన । మలఁగి క్రమ్మఱఁ జూడవలయువాఁడు,
తన వర్తనము విన్న మునిజనంబులకైన । నలవరించికొనంగవలయువాఁడు,
తన బంటుతన మాజిఁ గనిన మార్తురకైన । బలుమాఱు నగ్గింపవలయువాఁడు,
తన వితరణ కేళి వినినఁ గల్పకతరు । వులకైనఁ దలయూఁపవలయువాడు.

తే. నకులుఁ డొరులకు నశ్వశిక్షకుఁడుగాఁగ । నగునె యాతని దుస్థితి యనుదినంబుఁ
గాంచి కన్నీ రడంచుచుఁ గడవరాని । దైవఘటనకు నొత్తుఁ జిత్తంబులోన. 208

ప్రతిపదార్థం: తన+ఒప్పు= తన అందాన్ని; ఎదురన్+కన్నన్= ఎదుటపడి చూస్తే; తగిలి= ఆసక్తితో; ఎవ్వరికిన్+ఐనన్= ఎటువంటివారికైనా; మలఁగి= తిరిగి మరలా; క్రమ్మఱన్= మరొకమారు; చూడన్+వలయువాఁడు= చూడాలనిపించేవాడు; తన వర్తనము= తన నడవడి; విన్న= వినిన; మునిజనంబులకున్+ఐనన్= మునులకైనా; అలవరించికొనంగన్+వలయువాఁడు= అలవాటు చేసికొనవలెనని+అనిపింపచేసేవాడు; తన బంటుతనము= తన శూరత్వాన్ని; ఆజిన్+కనినన్= యుద్ధంలో చూస్తే; మార్తురకున్+ఐనన్= శత్రువులకైనా; పలుమాఱు= పెక్కుసార్లు; అగ్గింపన్+వలయువాఁడు= మెచ్చుకొనదగినవాడు; తన వితరణ+కేళి= తన దానగుణవిలాసాన్ని; వినినన్= విన్నట్లైతే; కల్పకతరువులకున్+ఐనన్= కల్పవృక్షాలకైనా, తల+ఊఁపన్+వలయువాఁడు= తలవూపి మెచ్చుకొన తగినవాడు; ఒరులకున్= ఇతరులకు; అశ్వశిక్షకుఁడు= గుర్రాలకు శిక్షణనిచ్చే కాపరిగా; నకులుఁడు= నకులుడు; కాఁగన్+అగునె?= కావటం న్యాయమా?; ఆతని దున్+స్థితి= నకులుడి కష్టపరిస్థితి; అనుదినంబున్+కాంచి= రోజూ చూచి; కన్నీరు+అడంచుచున్= కన్నీళ్ళు క్రుక్కుకొంటూ; కడవన్+రాని= దాటరాని; దైవఘటనకున్= విధిచేష్టలకు; చిత్తంబులోనన్= మనస్సులో; నొత్తున్= బాధపడతాను.

తాత్పర్యం: తన అందాన్ని ఎదుటబడి చూస్తే మరల తిరిగి చూడాలని ఎవరికైన అనిపించే అందగాడు, తన ప్రవర్తనాన్ని గురించి వింటే మునులకైనా దానిని అనుసరించాలని అనిపించే ఆదర్శశీలుడు, యుద్ధంలో తన పరాక్రమాన్ని చూస్తే శత్రువులకు కూడా పెక్కుసార్లు కీర్తించవలెనని అనిపించే శూరుడు, తన దానవిశేషాలను వింటే కల్పవృక్షాలచేత కూడా తలలూపింప జేయగల దానశీలుడు అయిన నకులుడు ఇతరులసేవలో గుర్రాలకు శిక్షకుడుగా ఉండదగినవాడా? అతడి శోచనీయస్థితిని చూచి నిత్యం కన్నీరు పెట్టుతుంటాను. దాటరాని దైవ సంఘటనను మనస్సులో తలచుకొని నొచ్చుకొంటూ ఉంటాను.

విశేషం: 1.నకులుడిలో విరుద్ధ గుణాల విశిష్ట మేళనం కనబడుతుంది. ఆకర్షించే అందం ఒకవైపు, మునులకు కూడా ఆదర్శంగా ఉండే నియమ నిష్ఠలు మరొకవైపూ ప్రవృత్తి నివృత్తి లక్షణాల సంయోజనాన్ని వ్యక్తం చేస్తున్నాయి. యుద్ధం చేసే వీరకృత్యం ఒకవైపు ఉన్నదంతా దానం చేసే దానవృత్తం మరొకవైపు రాజస సాత్త్విక ప్రవృత్తులను తెలుపుతున్నాయి. అతడు అశ్వశిక్షకుడైనాడు. అశ్వాలు ఇంద్రియాలకు ప్రతీకలు. ఇంద్రియాలను భోగ, యోగ, యుద్ధ, దాన ప్రవృత్తులలో నియంత్రించగలగటం రాజయోగి లక్షణం. అంతటి ఉత్తమాధికారి భౌతికంగా గుర్రాలకు-అదీ ఇతరుల గుర్రాలకు నడవడి నేర్పేవాడయ్యా డన్నదే ద్రౌపది దుఃఖం. పూర్వవైభవ సంస్మరణం ప్రస్తుత నిరంతర దుఃఖానికి కారణం కావటం విశేషం. 2. ఈ పద్యంలో శబ్దార్థ మాధుర్య గుణాలు పోషించబడ్డాయి. పృథక్ పదత్వ రూపమైన శబ్దగుణమాధుర్యం సౌందర్యాన్ని పోషిస్తే, సౌశీల్యాన్నీ, పరాక్రమాన్నీ, దానగుణాన్నీ వ్యంజింపజేసే ఉక్తి వైచిత్ర్యం ఇందులోని అర్థగుణమాధుర్యాన్ని పోషించింది. ఉభయగుణ పోషకమైన ఈ రచన నకులుడి బాహిరమైన, ఆంతరమైన సౌందర్యాలను రూపుకట్టించింది. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శా. ఆ రూపం బవికార, మా భుజబలం బత్యంత నిర్గర్వ, మా
శూరత్వంబు దయారసానుగత, మా శుంభత్క్రియాజ్ఞాన మా
ర్యారంభ ప్రతికూల వాదరహితం, బా యీ౱ గి సన్మాన వి
స్తారోదాత్తము మాద్రి పిన్నకొడు కేతన్మాత్రు౦డే చూడ౱గన్? 209

ప్రతిపదార్థం: చూడ౱గన్= పరిశీలించగా; ఆ రూపంబు= అంతటి సౌందర్యం; న+వికారము= మార్పులేనిది; ఆ భుజబలంబు= ఆ భుజబలం; అత్యంత నిర్గర్వము= మిక్కిలి గర్వం లేనట్టిది; ఆ శూరత్వంబు= ఆ సాహసం; దయా+రస+అనుగతము= దయారసాన్ని అనుసరించి ఉండేది, దయతో కూడినది; ఆ శుంభత్+క్రియాజ్ఞానము= ఆ ప్రకాశించే పనులలోని నేర్పరితనం; ఆర్య+ఆరంభ ప్రతికూల= పెద్దల నడవడికకు అడ్డు చెప్పే; వాదరహితంబు= వాదం లేనట్టిది; ఆ+ఈ౱గి= ఆ దానగుణం; సత్+ మానవిస్తార+ ఉదాత్తము= గౌరవం యొక్క గొప్పతనంచేత ప్రకాశించేది; మాద్రి పిన్నకొడుకు= మాద్రి చిన్నకొడుకు సహదేవుడు; ఏతద్+మాత్రు౦డే?= సామాన్యుడా?

తాత్పర్యం: మాద్రి చిన్న కొడుకైన సహదేవుడు సామాన్యుడా? (అసామాన్యుడని భావం). అతడి ఆ రూపం నిర్వికారం. ఆ బాహుబలం గర్వం లేనిది. ఆ పరాక్రమం దయారసంతో కూడింది. ఆ కార్య నిర్వహణ పరిజ్ఞానం పెద్దల నడవడికకు వ్యతిరేకం కానిది, వివాదాలకు గురి కానిది. ఆ దానం గౌరవ ప్రపత్తిచేత ఉదాత్తమైనది. కనుక, అతడు వయసులో చిన్నవాడైనా గుణాలలో పెద్దవాడే.

విశేషం: 1. తెలుగులో 'ఆ' అనే నిర్దేశక వాచకము ధ్వనిమయం. అది అనంతత్వాన్నీ, అద్భుతాన్నీ, అసదృశత్వాన్నీ, అస్వాద మాధుర్యాన్నీ ధ్వనిమయంగా నిర్దేశిస్తుంది. ఈ పద్యంలో 'ఆ' అనే విశేషణం అసదృశత్వాన్ని (దాన్ని పోలింది మరొకటి లేదు అనే భావం) ధ్వనింపచేస్తున్నది. 'ఆ' గుణవాచకంగా పునరావృతం కావటం చేత పద్యంలో శ్లేష అనే గుణం రూపు కట్టింది. మసృణత్వం శబ్దగుణలక్షణం, ఘటన అర్థగుణశ్లేష లక్షణం. ఆ రెండూ పద్యంలో అందంగా అమరాయి. 2. శ్లేషలో కాకువు రాణించటం అలంకార లక్షణం. 'మాద్రిపిన్నకొడుకు+ఏతన్మాత్రు౦డే చూడ౱గన్?' అనే వాక్యంలో కాకువు ఉన్నది. దాని వలన రెండు అర్థాలు స్ఫురిస్తాయి. మాద్రి చిన్నకొడుకు చిన్నకొడుకువలె ఉండడు, పెద్దకొడుకువలెనే ఉంటాడు. వయసుకు చిన్నవాడైనా గుణాలలో అన్నను పోలి ఉంటాడు-అని ఒక అర్థం. అందువలననే ద్రౌపది నకులుడి యందు ఏ గుణాలున్నాయని చెప్పిందో - వాటినీ సహదేవుడి యందు కూడా పేర్కొన్నది. నకులుడి వలెనే ఇతడు కూడా అందగాడు, బలవంతుడు, పరాక్రమవంతుడు, యుద్ధ కార్యకుశలుడు, దానపరుడు, అందువలన అన్నింటా అన్నను పోలినవాడనే తాత్పర్యం స్ఫురిస్తుంది. నకుల సహదేవులు కవలబిడ్డలు కాబట్టి ఒకరి పోలికలు మరొకరికి కొట్టవచ్చినట్లుగా ఉండటంలో ఆశ్చర్యం లేదు. కాని- ఇక్కడ రెండవ అర్థం ఇట్లా చెప్పుకొనాలి- అతడు 'ఏతన్మాత్రు౦డే' -అటువంటివాడే (నిశ్చితార్థం) కాని సామాన్యుడా? అనిపిస్తాడు. అంటే సమానగుణాలున్నా సహదేవుడిలో అవి విశిష్టంగా ఉంటాయని కాకువు. అది ఎట్లాగంటే - నకులుడియందు విరుద్ధ లక్షణ సమాహారం కనపడితే, సహదేవుడిలో అసామాన్యగుణ సమారోపణం కనబడుతుంది. సుందరరూపానికి చపలత్వం (విలాసత్వం) సామాన్య లక్షణంగా చెప్పబడుతుంది. కాని, సహదేవుడి సౌందర్యం అవికారం. ఇది అసామాన్య లక్షణం. అట్లాగే భుజబలం నిగర్వంగా, శౌర్యం దయారసంగా, క్రియాజ్ఞానం వివాదరహితంగా, దానం గౌరవోదాత్తంగా ఉండటం-అనేవి అసామాన్య లక్షణాలే ఔతాయి. దీనిని బట్టి చూస్తే 'ఏతన్మాత్రు౦డే?' -నకులుడి వంటివాడా సహదేవుడు? అతడి కంటె అన్నింటా ఘనుడు - అని చెప్పినట్లు స్ఫురిస్తుంది. తిక్కన శ్లేషగుణావిష్కార రచనకు ఈ పద్యం ప్రసిద్ధోదాహరణం. (సంపా.)

క. సుకుమారుఁ డతఁడు గోపా। లకవృత్తి వహించి యడవులం గ్రుమ్మరుచు
న్కికి నాక కాదు పగవా। రికినైనను నకట! మన మెరియదే వగలన్? 210

ప్రతిపదార్థం: అకట!= ఔరా!; అతఁడు= ఆ సహదేవుడు; సుకుమారుఁడు= కోమలుడు (నీడపట్టున సుఖపడవలసినవాడు); గోపాలకవృత్తిన్+వహించి= గొల్లవాడి పనిని అంగీకరించి; అడవులన్+గ్రుమ్మరుచున్+ఉన్కికిన్= అడవులలో తిరుగుతుండటానికి; నాకు+అ కాదు= నాకేకాదు; పగవారికిన్+ఐనను= శత్రువులకైనా; వగలన్= దుఃఖాలతో; మనము+ఎరియదే?= మనస్సు పరితపించదా?

తాత్పర్యం: అతికోమలుడైన ఆ సహదేవుడు ఆవుల కాపరిగా ఉంటూ అడవులలో సంచరిస్తూ ఉండటం చూస్తే నాకే కాదు, శత్రువులకైనా దుఃఖంతో మనసు పరితపిస్తుంది.

విశేషం: 'ఇటువంటి కష్టాలు పగవారికి కూడా రాకూడదు' - వంటి లోకోక్తులు తెలుగు పలుకుబడిలో సహజం. దైన్యం యొక్క పరాకాష్ఠను తెలిపే అభివ్యక్తి అది. ఇక్కడ సహదేవుడి వంటి సుకుమారుడు అడవులలో పశువులను కాయటం అనే దీనావస్థను పొందాడని చూచేవారు అమితంగా బాధపడతారు-అనే అర్థాన్ని జాతీయంతో ధ్వనింపచేసింది ద్రౌపది. (సంపా.)

ఉ. ఏనును మీరుఁ గానలకు నేగునెడ న్ననుఁ జేరి యెంతయున్
దీనత దోఁపఁ గుంతి సహదేవుని నిల్లడపెట్టి నాకు 'న
మ్మా! నిను నమ్మి చాల విషమంబగు నివ్వనవాస మీతఁడుం
బూనఁగ నియ్యకొంటి' నని బోరన నశ్రులు గ్రమ్ముచుండఁగన్. 211

ప్రతిపదార్థం: ఏనును= నేనూ (ద్రౌపది); మీరున్= మీరున్నూ, (పాండవులున్నూ); కానలకున్+ఏగు+ఎడన్= అడవులకు వెళ్ళేటప్పుడు; కుంతి= అత్తగారైన కుంతీదేవి; ననున్+చేరి= నా దగ్గరకు వచ్చి; ఎంతయున్= ఎంతో; దీనత+తోఁపన్= దైన్యం ఉట్టిపడగా; సహదేవునిన్; నాకున్; ఇల్లు+అడ పెట్టి= అప్పగించి; అమ్మా!= ఓ ద్రౌపదీ; నినున్+నమ్మి= నిన్ను నమ్మి; చాల విషమంబు+అగు= ఎంతో కష్టమైన; ఈ+వనవాసము= ఈ అరణ్యవాసం; ఈతఁడున్= ఈ సహదేవుడు కూడ; పూనఁగన్= చేయటానికి; ఇయ్యకొంటిన్= ఒప్పుకొన్నాను; అని= అని పలికి; బోరనన్= ధారలు కట్టేటట్లు; అశ్రులు+క్రమ్ముచుండఁగన్= కన్నీరు నిండగా.

తాత్పర్యం: నేనూ మీరూ అరణ్యవాసానికి బయలుదేరేటప్పుడు కుంతి నన్ను దగ్గరకు తీసికొని నాకు సహదేవుడిని అప్పగిస్తూ 'కోడలా! నిన్ను నమ్మి అతికష్టమైన ఈ వనవాసాన్ని చేయటానికి సహదేవుడిని పంపటానికి ఒప్పుకొంటున్నాను' అని కన్నీరు ధారలు కట్టగా అన్నది.

విశేషం: భార్య తల్లితో సమానంగా ప్రవర్తిస్తుంది ఒక్కొక్కసారి. మరొకసారి దాసిగా నడుచుకొంటుంది. ఇక్కడ ద్రౌపదిపై చిన్న కొడుకు భారాన్ని మోపింది కుంతి. మాద్రి చనిపోయినా తన సొంతబిడ్డగా చూచుకొన్నది. తన కడగొట్టు బిడ్డగా భావించి గారాబం చేసింది. అందుకే అంత మమకారం. 2. ఇల్లడ పెట్టడం= మరల తిరిగి ఇచ్చే నియమంతో ఒకరి వద్ద ధనాన్ని దాచిపెట్టుకొనటం.

వ. మఱియును. 212

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అంతేకాక.

చ. **'కడుఁ బసిబిడ్డ వీఁ; డొకటి కాదవునా నెఱుఁగండు; ముంద రె**
య్యెడ నొకపా టెఱుంగఁ; డెద యెంతయుఁ గోమల; మెప్పుడైన నేఁ
గుడువఁగఁ బిల్తుఁగాని తనకుం గల యాఁకటిప్రొ ద్దెఱుంగఁ డీ
కొడు కిటు పోకకు న్మనము గుందెడు; ని న్గని యూఁఅడిల్లెడున్. **213**

ప్రతిపదార్థం: వీఁడు= ఈ సహదేవుడు; కడున్+పసిబిడ్డ= మిక్కిలి గారాల బిడ్డ; ఒకటి కాదు+అవున్+నన్= ఒకటి ఔను, ఒకటి కాదు అని; ఎఱుఁగండు= తెలియనివాడు, చెప్పలేడు; ముందరఁ= ఇంతకుముందు; ఏ+ఎడన్= ఎక్కడా; ఒకపాటు= ఏ కష్టాన్నీ; ఎఱుంగఁడు= అనుభవించలేదు; ఎద+ఎంతయున్= మనసెంతో; కోమలము= సున్నితం; ఎప్పుడైనన్= ఎన్నడైనా; నేన్= నేను (కాంతి); కుడువఁగన్= అన్నం తినుమని; పిల్తున్+కాని= పిలుస్తానుగాని; తనకున్+కల= సహదేవుడికి గల; ఆఁకటిప్రొద్దు= ఆకలయ్యే వేళను; ఎఱుంగఁడు= తెలిసికొనలేడు; ఈ కొడుకు= అట్టి కొడుకు - ఈ సహదేవుడు; ఇటు పోకకున్= ఇట్లా అరణ్యాలకు వెళ్ళటానికి; మనము+కుందెడున్= నా మనస్సు విచారపడుతున్నది; నిన్+కని= నిన్ను చూచి; ఊఁఅడిల్లెడున్= ఊరట పొందుతున్నది.

తాత్పర్యం: 'ఓ కోడలా! ఈ సహదేవుడు మిక్కిలి పసిబిడ్డ. ఔను, కాదని చెప్పలేని చిరుతడు. ఇంతకుమునుపు ఎట్టి కష్టాలు తెలియనివాడు. మిక్కిలి సున్నిత స్వభావం కలవాడు. ఆకలి వేళ కూడా తెలిసికొనలేడు. నేను పిలిచి అన్నం పెట్టుతాను కాని, తనకు తానై అడగడు. అలాంటి కొడుకు ఇట్లా అడవులకు వెళుతుంటే మనస్సు విలవిలలాడుతున్నది. అయినా నిన్ను చూచి ఊరటపొందుతున్నది.

విశేషం: తల్లి మమకారంతో నిండిన పై ఆవేదన, చిన్నకొడుకు అమాయకత్వం లోకంలో ఆడపిల్లను అప్పగింతలు పెట్టే స్థితిని గుర్తుకు తెస్తున్నది.

తే. **ఎప్పు డెయ్యెడ నేమిట నెట్టు లరయ। వలసె నమ్మెయి నారయు మలసి డస్సి**
నొచ్చియైనను నేమఱ కిచ్చఁ దలఁచి। తడవి నాచేత దీవన వడయు మమ్మ!' **214**

ప్రతిపదార్థం: అమ్మ!= ద్రౌపదీ!; ఎప్పుడు= ఎప్పుడైనా; ఏ+ఎడన్= ఎక్కడైనా; ఏమిటన్= అన్నిటా; ఎట్టులు+అరయవలసెన్= ఎట్లా చూచుకొనాలో; ఆ+మెయిన్= ఆ విధంగా; ఆరయుము= చూచుకొమ్ము; అలసి= అలిసిపోయి; డస్సి= శ్రమపడి; నొచ్చి+ఐనను= కష్టమైనా; ఏమఱక= మరపులేక; ఇచ్చన్+తలఁచి= మనసు కనిపెట్టి; తడవి= కాపాడి; నాచేతన్= నా వలన, కుంతిచేత; దీవన+పడయుము= ఆశీస్సులు పొందుము.

తాత్పర్యం: ఓ ద్రౌపదీ! ఎక్కడైనా, ఎప్పుడైనా, అన్నిటా ఎట్లా చూచుకొనాలో అట్లా చూచుకొమ్ము. అలసి, సొలసి, కష్టపడి, మరపులేకుండా అతడి మనస్సు కనిపెట్టి కాపాడి నా దీవనలను పొందుము.'

విశేషం: 1. ఇక్కడ పసిపిల్లవాడి సంరక్షణ బాధ్యతను అప్పగించే ఒక తల్లి హృదయాన్ని కవి చక్కగా చిత్రించాడు. చిన్న చిన్న మాటలతో తల్లి ఆవేదనను వ్యక్తం చేశాడు. 2. కుంతి 211వ పద్యంలో ఇల్లడపెట్టినట్లు మాట్లాడింది. కాబట్టి అరణ్యాజ్ఞాతవాసాల తరువాత సహదేవుడిని తిరిగి తన కిచ్చి ఆశీస్సులను పొందుమని ద్రౌపది నడిగింది. రాబోయే వచనంలో అజ్ఞాతవాసంలో అతడిని స్వయంగా సేవించలేనందుకు ద్రౌపది విచారం వెలిపుచ్చింది.

వ. అని యప్పగించె; నేనును వనవాసకాలంబున నానేర్చు విధంబున మీకు నెల్లను గారామైన తమ్ముని నమ్మెయిం బరికించికొని వచ్చితి; నిపు డజ్ఞాతవాసాయాసితుండగు నతని నాకు ననుసరింప వెరవు గామిం జేసి చేయునది లేక చింతిల్లుచున్నదాన; నా తెఱంగు వినుము. 215

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; అప్పగించెన్= అప్పగించింది; నేనును= నేను కూడా (ద్రౌపది కూడా); వనవాస కాలంబునన్= అరణ్యావాస సమయంలో; నానేర్చువిధంబునన్= నా శక్తి కొద్దీ; మీకున్+ఎల్లను= మీకందరికీ; గారము+ఐన తమ్మునిన్= ముద్దుల తమ్ముడైన సహదేవుడిని; ఆ+మెయిన్= అట్లా; పరికించుకొని వచ్చితిన్= కాపాడుకొంటూ వచ్చాను; ఇపుడు; అజ్ఞాతవాస+ ఆయాసితుండు+అగు= అజ్ఞాతవాస నియమంచేత అలసినవాడైన; అతనిన్= సహదేవుడిని; నాకున్= నాకూ (ద్రౌపదికి); అనుసరింపన్= వెంబడించటానికి; వెరవుకామిన్+చేసి= సాధ్యపడకపోవడంవలన; చేయునదిలేక= చేసేదిలేక; చింతిల్లుచున్+ ఉన్నదానన్= బాధపడుతున్నాను; నాతెఱంగు వినుము= నా కథ వినుము.

తాత్పర్యం: అని చెప్పి నాకు అప్పగించింది. నేను అరణ్యావాస సమయంలో నా శక్తికొద్దీ మీ అందరికీ గారాబు తమ్ముడైన సహదేవుడిని ఆ విధంగా కంటికి రెప్పగా కాపాడాను. మరి ఇప్పుడు అజ్ఞాతంగా ఉన్న సమయంలో అతడి శ్రమ పోగొట్టటం నాకు చేతకావటం లేదు. అందుకు చేసే దేమీ లేక మనస్సులో బాధపడుతున్నాను. ఇక నా సంగతి వినుము.

సీ. ద్రుపద భూవిభుఁడు పుత్త్రులకంటె నెంతయుఁ। బెంపు సేయుచు గారవింపఁ బెరిఁగి,
కుంతీమహాదేవి కోడండ్ర లోపల। నగ్గలంబుగఁ గొనియాడఁబరఁగి,
ప్రాణంబులకు నెల్లఁ బ్రాణంబుగా మీరు। నెయ్యంబు తియ్యంబు నెఱప నడచి,
మదిఁ దల్లిదండ్రుల మాఱుగాఁ గొని జను। లనిశంబు భక్తి సేయంగ నెగడి

తే. రూపగుణ విక్రమంబుల రూఢికెక్కు। నట్టి కొడుకులఁ గని భరతాన్వయంబు
నందు నా యిల్ల యిల్లుగా నతిశయిల్లి। తగవుమై బాంధవులచేతఁ బొగడు వడసి. 216

ప్రతిపదార్థం: ద్రుపద భూవిభుఁడు= ద్రుపద మహారాజు; పుత్త్రులకంటెన్= కొడుకుల కంటె; ఎంతయున్+పెంపు+చేయుచున్= ఎంతో మిన్నగా చూస్తూ; గారవింపన్+పెరిఁగి= గౌరవించగా పెద్దదాననై; కుంతీమహాదేవి= మహారాణి అయిన కుంతీదేవి యొక్క; కోడండ్రలోపలన్= కోడళ్ళలో; అగ్గలంబుగన్= అధికంగా; కొనియాడన్+పరఁగి= పొగడగా వర్ధిల్లి; మీరు= పాండవులు; ప్రాణంబు లకున్+ఎల్లన్+ప్రాణంబు+కాన్= ప్రాణాధికంగా; నెయ్యంబు= స్నేహం; తియ్యంబునెఱపన్= మాధుర్యపు వలపు ప్రసరింప చేసేటట్లు; నడచి= ప్రవర్తించి; జనులు= లోకులు; మదిన్= మనస్సులో; తల్లిదండ్రుల మాఱుగాన్+కొని= తల్లిదండ్రులకు బదులుగా లెక్కించి; అనిశంబున్= ఎప్పుడూ; భక్తి+చేయంగన్= భక్తితో చూడగా; నెగడి= వర్ధిల్లి; రూపగుణ విక్రమంబులన్= రూపంలోను, గుణంలోను, పరాక్రమంలోనూ; రూఢికిన్+ఎక్కు= ప్రసిద్ధులైన; అట్టి కొడుకులన్= అంతటి ఉపపాండవులను; కని= పొంది; భరత+అన్వయంబునందున్= భరతవంశంలో; నా+ఇల్లు+అ= నా కుటుంబమే; ఇల్లు+కాన్+అతిశయిల్లి= గొప్పదైన కుటుంబంగా వర్ధిల్లి; తగవుమైన్= న్యాయమైన రీతిలో; బాంధవులచేతన్+పొగడు+పడసి= చుట్టాల వలన పొగడ్తలు పొంది.

తాత్పర్యం: ద్రుపద మహారాజు తన కొడుకుల కంటె గారాబుగా పెంచి పెద్ద చేస్తే గౌరవంగా పెరిగాను. కుంతీదేవి తన కోడళ్ళందరిలో నన్ను అధికంగా పొగడగా వర్ధిల్లాను. మీరందరూ (భర్తలైదుగురూ) సమానంగా స్నేహానురాగాలు పంచగా ప్రవర్తిల్లాను. లోకులు తల్లిదండ్రులకు మారుగా భక్తితో నన్ను సేవించేటట్లు మసలాను. రూపగుణ బలపరాక్రమాలలో పేరొందిన కుమారులకు తల్లినయ్యాను. భరతవంశంలో నా కుటుంబమే గొప్ప కుటుంబంగా ప్రకాశించాను. అందరితో న్యాయంగా వర్తించటం చేత బంధువుల పొగడ్తలను పొంది.

విశేషం: ఉత్తమురాలైన ఇల్లాలికి ఉండవలసిన సప్తగుణాలు ఇందులో పేర్కొనబడ్డాయి. 1.పుట్టింటి గౌరవం ద్రుపదునింట వంశోద్ధారకుడైన పుత్రుడికంటె ద్రౌపది ఎక్కువగా గౌరవించబడటం విశేషం. 2. మెట్టినింటి మన్నన - పాండవులకు ద్రౌపదితో పాటు మరికొందరు భార్యలు కూడా ఉన్నారు. వారందరికంటె ఘనంగా చూడటమే కాకుండా, ఘనంగా అందరి ముందూ పొగడి చెప్పేది అత్తగారు. అది అందరికీ కలిగే అదృష్టం కంటె విశిష్టం. 3. భర్తల అనురాగం (వాల్లభ్యం) - అయిదుగురు భర్తలూ తమ పంచప్రాణాలకు ప్రాణమైనదానినిగా ద్రౌపదిని చూచుకొనేవారు. అంటే ఆమె లేకపోతే తాము బ్రదుకజాలమనే అనురాగాన్ని ప్రదర్శించేవారన్నమాట! అది సతి పొందే వాల్లభ్య విశేషం. 4. ప్రజానురాగం - ప్రజలకు ప్రత్యక్ష దేవతలు వారి తల్లిదండ్రులు. వారిని భక్తితో పూజించటం వారి ప్రథమ కర్తవ్యం. అయితే ద్రౌపది తల్లిదండ్రులను మరపింపజేసే వాత్సల్యాన్ని ప్రజల పట్ల ప్రదర్శించటం చేత మాతాపితరులకు బదులు ద్రౌపదినే భక్తితో చూచేవారట! ఇది ప్రజానురాగానికి పరాకాష్ఠ. 5. సంతానవతి కావటం- గుణవంతులై ప్రసిద్ధిపొందిన పుత్రులను పొంది ఉండటం పుత్రోత్సవాన్ని పొందటమే. 6. కుటుంబ గౌరవం - 'నా ఇల్లే ఇల్లుగ' (అనన్వయాలంకారం) చెప్పటం విశేషం. ద్రౌపది కుటుంబంతో పోల్చ దగిన కుటుంబం ద్రౌపది కుటుంబ మొక్కటే అని చెప్పుకొనగల గౌరవం ద్వారా భరతవంశ గౌరవం నిలిపింది. 7. బంధుప్రీతి - అన్నీ ఉన్నా బంధువులందరూ ఏకగ్రీవంగా మెచ్చుకొనటం ఇల్లాళ్ళకందరికీ అబ్బే అదృష్టం కాదు. అది ద్రౌపదికి కలిగింది. దానికి కారణం ఆమె న్యాయం తప్పకుండా నడుస్తుంది కాబట్టి. ఉత్తమ సాధ్వికి ఉత్తమోదాహరణం ద్రౌపది. (సంపా.)

మ. **వినుతింపందగు రాజసూయమునఁ బృథ్వీదేవతా కోటికె**
ల్లను సంతృప్తి యొనర్చి, వారి దయఁ గళ్యాణాత్మనై, పుణ్యవ
ర్తన పాండుక్షితిపాలు కోడ లనఁగా రాజన్యమాన్యప్రియాం
గనలందెల్లఁ బొగడ్తఁగంటి నతిలోకంబైన మీ మన్ననన్. **217**

ప్రతిపదార్థం: వినుతింపన్+తగు= పొగడదగిన; రాజసూయమునన్= రాజసూయయాగంలో; పృథ్వీదేవతాకోటికిన్+ఎల్లను= బ్రాహ్మణుల సముదాయానికంతటికీ; సంతృప్తి+ఒనర్చి= మంచి తృప్తి కలిగించి; వారి దయన్= వారి అనుగ్రహంతో; కళ్యాణ+ఆత్మన్+ఐ= శుభప్రదమైన మనసు కలదానినై; అతిలోకంబు+ఐన= అపూర్వమైన; మీ మన్ననన్= మీ అభిమానంచేత; రాజన్యమాన్య ప్రియ+ అంగనలందున్+ఎల్లన్= గౌరవించదగిన రాజుల పట్టపురాణులందరిలో; పాండుక్షితిపాలుకోడలు= పాండురాజు కోడలైన ద్రౌపది; పుణ్యవర్తన= పుణ్యాలు కలిగించే నడవడి కలది; అనఁగాన్= అనేటట్లు; పొగడ్తన్+కంటిన్= ప్రశంసలందుకొన్నాను.

తాత్పర్యం: లోకప్రసిద్ధమైన రాజసూయయాగంలో బ్రాహ్మణుల కందరికీ దక్షిణలిచ్చి తృప్తిపరచి వారి దయచేత నిర్మలమైన చిత్తం కలదాననయ్యాను. 'పాండురాజు కోడలైన ద్రౌపది పుణ్యాంగన' అని మహారాజుల పత్నులూ. మాన్యలూ అయిన రాణులందరూ ప్రశంసించే కీర్తి సంపాదించాను. వీటి నన్నింటినీ మీరిచ్చిన ఆదరాభిమానాలవలననే పొందగలిగాను.

విశేషం: పాండవుల చరిత్రలో రాజసూయం ప్రతిష్ఠాత్మక ఘట్టం. ఆ యజ్ఞాన్ని వారు ధర్మపత్నీ సమేతంగా చేశారు. ధర్మరాజాదులతో పాటు ద్రౌపది పొందిన లాభాలను ఈ పద్యం పేర్కొన్నది. బ్రాహ్మణాశీస్సులతో ఆమె కల్యాణాత్మకురాలైనది. రాజసూయయాగంలో ధర్మరాజును దర్శించటానికి వచ్చిన మహారాజుల పట్టమహిషులందరూ ద్రౌపదిని 'పాండురాజు కోడలు' 'పుణ్యాంగన' అనీ కీర్తించారట! స్వర్గస్థుడైన మామగారు నారదుడిద్వారా ధర్మరాజును రాజసూయం చేయుమని కోరగా దానిని నిష్ఠాపరురాలై భర్తతో కలిసి నిర్వహించిన గౌరవం ఆమెకు దిక్కింది. పైపద్యంలో అన్నీ ద్రౌపదికి స్వయంగా లభించిన లాభాలే. ఇవన్నీ భర్తల ప్రేమ వలన తనకు లభించినవి. ఈ విశ్లేషణాత్మక వివేచన ఆమె వివేకాన్ని తెలుపుతున్నది. (సంపా.)

ఉ. ఏను మనంబు పెంపు సెడి యిప్పుడు నీచతరప్రకారముం
బూని నికృష్టనై యుదర పోషణకై తగవేది యెంతయున్
దీనతఁ బొంది యిమ్మెయి సుదేష్ణ పనుల్ గనుసన్నఁ జేయుచున్
హీనత నున్కి మీకు వగపేమియుఁ జేయద యేమి సేయుదున్? 218

ప్రతిపదార్థం: ఏను= ద్రౌపది; మనంబు పెంపు+చెడి= మనస్సులోగల అభిమానాన్ని కోల్పోయి; ఇప్పుడు= ఈ అజ్ఞాతవాస సమయంలో; నీచతర ప్రకారమున్+పూని= అల్పమైన వృత్తిని చేపట్టి; నికృష్టను+ఐ= హీనురాలనై; ఉదర పోషణకై= పొట్టకూటి కొరకు; తగవు+ఏది= న్యాయం వీడి; ఎంతయున్ దీనతన్+పొంది= ఎంతో దైన్యం పొంది; ఈ+మెయిన్= ఈ విధంగా; సుదేష్ణ పనుల్= సుదేష్ణయొక్క పనులు; కనుసన్నన్+చేయుచున్= కనుసైగలమాత్రం చేతనే పనిచేస్తూ; హీనతన్+ఉన్కి= హీనంగా ఉండటం; మీకున్= పాండవులకు; వగపు= దుఃఖం; ఏమియున్+చేయదు+అ= కలిగించదా? ఏమి+చేయుదున్= ఇందుకు నేనేమి చేయగలను

తాత్పర్యం: నేను మానాభిమానాలు కోల్పోయి నీచంగా పొట్టకూటి కొరకు న్యాయం తప్పి దీనంగా ఈ విధమైన సుదేష్ణ పరిచర్యలకు పూనుకొని ఆమె కనుసన్నలలో హీనంగా చేస్తూండటం మీకు ఏ మాత్రం దుఃఖాన్ని కలిగించటం లేదు. నేనేం చేసేది? అది నా దురదృష్టం.

విశేషం: ఒకానొకప్పుడు రాజాధిరాజపరమేశ్వరుడైన ధర్మజుడి కొలువులో రాజుల భార్యలచేత నమస్కారాలు పొందిన పట్టమహిషి ద్రౌపది ఈనాడు ఒకరి కొలువులో పరిచారికగా పనిచేయటం విధి వైపరీత్యం. బండ్లు ఓడలు, ఓడలు బండ్లు కావటమనే సామెత గుర్తుకు తెస్తుంది. అయితే, ఇక్కడ విశేషమేమంటే-పాండవుల దైన్యస్థితిని చూచి ద్రౌపది ప్రతినిత్యమూ పరితపిస్తున్నది. కాని, ఆమె దీనస్థితిని చూచి పాండవు లెవ్వరూ పరితాపం చెందటం లేదని ఆమె నిష్ఠురమాడింది. పతి మనస్సును తనవైపు సానుభూతితో మరలించుకొనటానికి ఈ అధిక్షేపం సరసమైన ఆయుధం.

క. పని పంపఁగాని యొకతకుఁ। బనిసేయ నెఱుంగ; నన్నుఁ బనిగొనునెడఁ బాం
డుని యగ్రమహిషి గొంకుచుఁ। బనిగఱపెడు చందమునన పనుచుటెఱుఁగవే? 219

ప్రతిపదార్థం: పని పంపన్+కాని= పనులు చేయుమని ఒకరిని ఆజ్ఞాపించటమేకాని; ఒకతకున్= ఒక వనితకు; పనిచేయన్= సేవచేయుటం; ఎఱుంగన్= ఎరగను; నన్నున్+పనిగొను+ఎడన్= నాచేత పని చేయించుకొనేటప్పుడు; పాండుని అగ్రమహిషి= కుంతీదేవి; కొంకుచున్= సందేహిస్తూ; పనిగఱపెడు చందమునన్+అ= పనులు నేర్పే పద్ధతిగానే; పనుచుట= ఆజ్ఞాపించటం; ఎఱుఁగవు+ఏ?= ఎరుగవా? (నీకు బాగా తెలియునని భావం).

తాత్పర్యం: పట్టమహిషిగా సహస్రపరిజనులచేత పనులు చేయించుకొనటమేగాని, ఒకరి వద్ద పనిచేయటం నాకు తెలియదు. అత్తగారు కుంతీదేవి కూడా నాకేదైనా పని చెప్పదలచుకొన్నప్పుడు వెనుకాడుతూనే, ఆజ్ఞాపిస్తున్నట్లుకాక పని నేర్పటానికి పనిచెప్పిన విధంగానే పనులు చెప్పేది.

విశేషం: అత్తగారు కూడా మన్ననగా చూచేది ద్రౌపదిని. అజమాయిషీగా పనులు చేయించటం ఒక పద్ధతి. ఆదరంగా బుజ్జగించి కోడలికి పని చెప్పటం ఒక పద్ధతి. కుంతి లౌకిక మెరిగిన సాధ్వి. మనసు నొప్పించకుండా పనులు చేయించుకొనేది. అందుకే ద్రౌపది పొగడ్త లందుకొన్నది. అత్తా కోడళ్ళ అనుబంధానికి కుంతీ ద్రౌపదుల సంబంధం నిదర్శనం.

ఉ. ఒల్లరు రాజుదేవులును నొడ్డులు రాచిన చందనంబు; మే
నెల్లఁ జెమర్పఁగా నలయ కేను శ్రమంపడి నిల్చి నిల్చి య
ల్లల్లన మార్దవం బొనరునట్లుగ నెట్టకునేని రాచి మీ
తల్లికి భక్తిఁ బెట్టెడు విధంబునఁ బెట్టుదు; బ్రహ్మఁ దిట్టుదున్. 220

ప్రతిపదార్థం: రాజు= విరాటరాజుయొక్క; దేవులునున్= సుదేష్ణమొదలైన రాణులూ; ఒడ్డులు రాచిన= ఇతరులు తీసిన; చందనంబు= గంధాన్ని; ఒల్లరు= అంగీకరించరు; మేను+ఎల్లన్+చెమర్పఁగాన్= శరీరమంతా చెమట పట్టేటట్లు; అలయక= అలసిపోకుండా; ఏను= ద్రౌపది; శ్రమంపడి= కష్టపడి; నిల్చి నిల్చి, అల్లన్+అల్లన్= మెలమెల్లగా; మార్దవంబు+ఒనరునట్లుగన్= మెత్త దనం వచ్చేటట్లు; ఎట్టకున్+ఏనిన్= ఏదో విధంగా; రాచి= అరగదీసి; మీ తల్లికిన్= మీకు తల్లీ నాకు అత్తగారూ అయిన కుంతీదేవికి; భక్తిన్= భక్తితో; పెట్టెడు విధంబునన్= శరీరానికి అలదే రీతిగా; పెట్టుదున్= వారి శరీరాలకు అలదుతున్నాను; బ్రహ్మన్+తిట్టుదున్= (నాకిటువంటి దుస్థితిని కలిగించినందుకు) విధిని దూషిస్తాను.

తాత్పర్యం: ఇతరులు తీసిన గంధాన్ని సుదేష్ణ మొదలైన రాణులు ఒప్పుకోరు. నేనే శ్రమపడి చెమటలు పట్టేటట్లు అరగదీసి మెత్తటి చందనాన్ని, మీ తల్లికి భక్తితో అలదిన విధంగా వారికి అలదుతున్నాను. నాకీ స్థితిని కలిగించిన బ్రహ్మను లోలోన నిందిస్తాను.

విశేషం: ఇక్కడ గంధం అరగతీసే ఒక ప్రక్రియ చెప్పబడింది. చందనానులేపనం రాజుల కలవాటు. మనం ఈ రోజు స్నో, పౌడరు పూసికొన్నట్లు వారు చందనం పూసికొనేవారు. అది ఆరోగ్యానికి, ఆహ్లాదానికి, సువాసనకు పనికివస్తుంది. గంధం తీయడం ఒక కళ. మెత్తగా అరగదీసి శరీరానికి అలదాలి. అత్తగారి పరిచర్యలలో ఒక భాగంగా సేవాదృక్పథంతో చేసేది ద్రౌపది. ఇక్కడ పరిచారిక వలె చేయటం బ్రహ్మ వ్రాసిన తలరాత అని బాధపడుతున్నది.

ఉ. నున్నఁదనంబుగా నలుఁగు నూఱియుఁ జందన మట్లు రాచియుం
బన్నుగఁ గ్రొత్తలైన కలపంబులు గూర్చియు నా సుదేష్ణకుం
గన్నుల సన్నలం బనులు గైకొని వారక చేయుచుండుటన్
ము న్నటులున్న పాణితలముల్ బలు కాయలు గాచెఁ జూచితే! 221

ప్రతిపదార్థం: నున్నఁదనంబుగాన్= మెత్తగా; నలుఁగు నూరియున్= నలుగుపిండి నూరి; చందనము+అట్లు రాచియున్= గంధంవలె పూతపూసి; పన్నుగన్= చక్కగా; క్రొత్తలు+ఐన= క్రొత్త క్రొత్తవైన; కలపంబులు= కలపడాలు (వివిధ సుగంధ ద్రవ్యాల మిశ్రమాలు); కూర్చియున్= సమకూర్చి; ఆ సుదేష్ణకున్= ఆ పట్టమహిషికి; కన్నుల సన్నలన్= కనుసైగలతోనే; పనులు= పరిచర్యలు; కైకొని= అంగీకరించి; వారక చేయుచుండుటన్= ఎప్పుడూ కాదనక చేయటం వలన; మున్ను= ఇంతకుముందు; అటులు+ఉన్న= అట్లా మెత్తగా ఉన్న; పాణితలముల్= అరచేతులు; పలుకాయలు+కాచెన్= ఎన్నో కాయలు కాచాయి; చూచితే?= చూచావా?

తాత్పర్యం: మెత్తగా నలుగుపిండిని గంధంవలె నూరి, మైపూతలు పూసి, సువాసనల కలపములను ఏర్పరచి, ఎప్పుడూ రాణిగారి కనుసన్నలలో పరిచర్యలు చేస్తుంటాను. అందువలన సుకుమారమైన నా అరచేతులు ఎలా కాయలుగాచినాయో చూచితివా!

విశేషం: యజమానుల మెప్పు పొందడానికి పరిచారకులు ఎన్నో తంటాలు పడతారు. చందనాది అనులేపనాలు సమకూర్చి వారి మెప్పు పొందుతారు. అనురాగ ప్రేరకాలైన సువాసనలు వారి సౌభాగ్యానికి చిహ్నాలు. ఇవి ఏర్పరచిన పరిచారికలను రాజులు

బహుమానాలతో సన్మానిస్తారు. ఇక్కడ ద్రౌపది పరిచారికగా అట్లా చేయాల్సి వచ్చింది. చేతులు కాయలు కాయటం అనేది నానుడి. కష్టించి పనిచేసేవారి అరచేతులు కాయలు కాస్తాయి. అలవాటు లేని పనులు చేయటం వలన అట్లా ఔతుంది. ద్రౌపది పరిస్థితి అట్లాఉన్నది.

క. **అనుచుం దొరఁగెడు నశ్రుల। మునిఁగినమో మతని వక్షమునఁ జేర్చిన న**
వ్వనిత యవస్థయ తాల్చుచు। ననిలసుతుం డడలె డెంద మలమటఁ బొందన్. **222**

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; తొరఁగెడు అశ్రులన్= పొరలిపారే కన్నీటిచేత; మునిఁగిన మోము= తడిసిన ముఖం; అతని వక్షమునన్+చేర్చినన్= ఆయన ఎదురు రొమ్ముపై చేర్చగా; ఆ+వనిత= ద్రౌపది; అవస్థ+అ= కష్టాన్ని; తాల్చుచున్= తనదిగా భావించి తలచుకొంటూ; డెందము= మనస్సు; అలమటన్+పొందన్= కలత పడగా; అనిలసుతుండు= భీముడు, అడలెన్= దుఃఖించాడు.

తాత్పర్యం: అట్లా దుఃఖిస్తూ భీముడి గుండెలపై ముఖాన్ని చేర్చింది ద్రౌపది. ఆమె కష్టస్థితిని చూచి భీముడు కలతపడ్డ హృదయంతో దుఃఖించాడు.

విశేషం: మనస్సులో కష్టాన్ని ఇతరులకు చెప్పేటప్పుడు వరద వలె వచ్చే కన్నీరు బయటికి వచ్చేస్తే మనస్సులో తాపం తీరిపోతుంది. సన్నిహితుల ముందు కష్టాలు చెప్పుకొనటం, వారి ఆసరా తీసికొని గుండెలకు హత్తుకొనేటట్లు ఏడ్వడం సహజం. ఆపుకొనలేని దుఃఖం కలిగితే అది సహజం! ఇక్కడ కవి అది మన కళ్ళకు కట్టేటట్లు రవివర్మ చిత్రంవలె చూపించాడు.

తే. **అట్టి యెడఁ దన్నుఁ దాన యూరార్చి కొనుచు। నంబుజానన నెమ్మొగ మల్లఁ దుడిచి.**
యనునయించి తత్కరములు దనమొగంబుఁ। గదియఁ జేర్చుచు నిట్టూర్పుగాడ్పునిగుడ. **223**

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= అప్పుడు; తన్నున్+తాను+అ= తనను తానే; ఊరార్చికొనుచున్= ఓదార్చుకొని; అంబుజ+ఆనన= పద్మముఖి ద్రౌపదియొక్క; నెఱ+మొగము= అందమైన ముఖాన్ని; అల్లన్+తుడిచి= మెల్లగా తుడిచి; అనునయించి= ఓదార్చి; తద్+కరములు= ఆమె చేతులను; తన మొగంబున్= తన మొగంపై; కదియన్+ చేర్చుచున్= దగ్గరగా తీసికొని; నిడు+ఊర్పు గాడ్పు నిగుడన్= నిట్టూర్పు గాలి వ్యాపింపగా.

తాత్పర్యం: అప్పుడు భీముడు తనను తానే ఓదార్చుకొంటూ ద్రౌపది కన్నీరు తుడిచి, ఆమె చేతులు తన బుగ్గలపై సుతారంగా అదిమి దగ్గరగా తీసికొని నిట్టూర్పు పుచ్చుతూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఇది అతి సహజమైన స్వభావం. చిన్న పిల్లలు చేతులు కాలాయని మన దగ్గరకు వస్తే ఆ చేతులు ముద్దాడుతూ మన బుగ్గలకు రాచుకొంటాం. అదే చేశాడు భీముడు. తిక్కన లోకజ్ఞత అది.

వ. **చింతాక్రాంతుండైన కౌంతేయునకు నయ్యింతి యిట్లనియె.** **224**

ప్రతిపదార్థం: చింతా+ఆక్రాంతుండు+ఐన= విచారంచేత ఆక్రమించబడినవాడైన; కౌంతేయునకున్= భీముడికి; ఆ+ఇంతి= ద్రౌపది; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: భీముడు చింతపడుతుండగా ద్రౌపది ఇట్లా అన్నది.

తే. **'ఇందఱకు నిన్నిభంగుల నిడుమ గుడువ । వలసె ధర్మతనూభవువలనఁ జేసి,**
దాయ లొడ్డిన మాయ జూదంపుటురులఁ । బడి కులంబున కాతఁ డిప్పాటు దెచ్చె. **225**

ప్రతిపదార్థం: ధర్మతనూభవు వలనన్+చేసి= ధర్మరాజువలన; ఇందఱకున్= ఇంతమందికి; ఇన్నిభంగులన్= ఇన్ని రకాల; ఇడుమ కుడువవలసెన్= కష్టాలు అనుభవించవలసి వచ్చింది; దాయలు+ఒడ్డిన= దాయాదులు పన్నిన; మాయజూదము+ఉరులన్+పడి= మాయ జూదమనే వలలో పడి; కులంబునకున్= వంశానికంతటికీ; అతఁడు; ఈ+పాటు తెచ్చెన్= ఈ కష్టాన్ని కలిగించాడు.

తాత్పర్యం: 'దాయాదులు పన్నిన మాయజూదమనే వలలో చిక్కుకొన్న ధర్మరాజు జూదమాడి పణంగా ఒడ్డటం వలన మనమందరం ఈనాడు ఇన్ని రకాలుగా కష్టాలకు లోనయ్యాం. ధర్మజుడే మన వంశానికి వాటిల్లిన ఈ భంగపాటు కంతటికీ కారణం.

ఉ. **అక్కట! మోసపోయి యడియాసలఁ జావక యున్నదాన; ము**
న్నొక్కెడ నే దురంతదురితోత్కట బాధలఁ బెట్టియున్న నా
కెక్కడి దుఃఖశాంతి గడయెయ్దుట యెమ్మెయిఁ గల్గ నేర్చు? మీ
ముక్కున నూర్పు గల్గ నొక మూర్ఖునిచేఁ బడితిన్ సభాస్థలిన్. **226**

ప్రతిపదార్థం: అక్కట!= ఔరా!; మోసపోయి= వంచించబడి కూడా; అడియాసలన్+చావక+ఉన్నదానన్= చివరి ఆశలతో ఇంకా చావకుండా ఉన్నాను; మున్ను= పూర్వజన్మలో; ఒక్క+ఎడన్= ఒకప్పుడు; ఏన్= నేను; దురంత= అంతులేని; దురిత+ఉత్కట బాధలన్+పెట్టియున్న= అధికమైన పాపిష్ఠి బాధలను పెట్టి ఉన్న; నాకున్= నాకు; ఎక్కడి దుఃఖశాంతి= దుఃఖానికి శాంతి ఎక్కడిది?; కడ+ఎయ్దుట+ఏమెయిన్+కల్గనేర్చున్= గట్టెక్కుట ఏ విధంగా కలుగుతుంది?; మీ ముక్కునన్+ఊర్పుకల్గన్= మీరు ప్రాణాలతో ఉండగా; ఒక మూర్ఖునిచేన్= ఒక నీచుడిచేత; సభాస్థలిన్= సభలో; పడితిన్= భంగపడ్డాను.

తాత్పర్యం: ఔరా! నేను మోసపోయి చావకుండా ఆశాపాశంతో ఇంకా బ్రదికి ఉన్నాను. పూర్వజన్మలో నేను ఎవరినో నిరంతరం కష్టాలపాలు చేసి ఉంటాను. అందువలననే నాకు దుఃఖశాంతి లేదు. ఈ దుఃఖం నుండి బయటపడి గట్టెక్కటం ఏ విధంగా సాధ్యమౌతుంది? మీరు ప్రాణాలతో ఉండగానే ఒక మూర్ఖుడిచేత సభలో ఆ విధంగా భంగపడ్డాను కదా!

విశేషం: సజీవులుగా ఉండగా అనడానికి 'ముక్కున ఊర్పు కల్గన్' అనే జాతీయాన్ని కవి ప్రయోగించాడు. భర్తలు బ్రతికి ఉండగా, సభలో జనులు చూస్తుండగా అవమానంపాలు కావటం భరించరానిది. ఈ మాటలు భీముడి కోపాన్ని రెచ్చగొట్టగలవు.

క. **మీ రేమి సేయుదురు? దై । వారంభము గాక శుభము నశుభంబును సం**
సారులకుం దమ తఱి నని । వారణఁ బొందంగ మాన్పవచ్చునె? దానిన్. **227**

ప్రతిపదార్థం: మీరు= మీరు- పాండవులు; ఏమి+చేయుదురు?= ఏం చేస్తారు?; దైవ+ఆరంభము+కాక= దైవఘటనమేగాని మరొకటికాదు; సంసారులకున్= జనులకు; శుభమున్+అశుభంబును= శుభాశుభాలు, మంచి చెడులు; తమ తఱిన్= వాటి సమయాలలో; అనివారణన్= తప్పించటానికి వీలులేని విధంగా; పొందంగన్= పొందుతూ ఉండగా; దానిన్= ఆ అనుభవాన్ని; మాన్పవచ్చునె?= ఆపగలమా?

తాత్పర్యం: అయినా మీరేం చేస్తారు? విధిఘటన దాటటానికి ఎవరికీ సాధ్యం కాదు. శుభాశుభాలను సంసారులు ఆయా సమయాలలో అనుభవించాల్సిందే. దానిని నివారించటం ఎవరికీ సాధ్యం కాదు గదా!

విశేషం: హరిశ్చంద్రుడు, నలుడు-ఇట్లా ఎందరో చక్రవర్తులు విధికి తలవంచారు. కర్మఫలరూపాలైన శుభాశుభాలు వాటి అంతట అవి ఆయా సమయాలలో వస్తూ ఉంటాయి. వాటిని అతిక్రమించటానికి ఎవరికీ సాధ్యం కాదు. ద్రౌపది ఈ విషయాన్ని భీముడి ముందు స్పష్టం చేయటంలో రెండు హేతువులున్నాయి. దైవసంకల్పం అనివార్యం అని చెప్పటం; పాండవుల పురుషకారంలో ఆనుకూల్యం లేకపోవటం వారి కర్మఫలమని ఓదార్చటం.

ఉ. కావున మీర లభ్యుదయ గౌరవ మొందుట యాత్మఁ గోరి యే
నే విధినైన నాపదల కెల్లను నోర్చెద; దాని కేమి! యీ
కావరమైన కీచకుఁడు కామనిపీడితుఁడై యలంతులం
బోవక యేచి పట్టుకొనఁ బోయినఁ దూలెదఁగాక యిమ్మెయిన్. 228

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; మీరలు= పాండవులు; అభ్యుదయ గౌరవము+ఒందుట= ఉన్నతిని, గౌరవాన్ని పొందటం; ఆత్మన్+కోరి= మనస్సులో కోరుకొని; ఏను= నేను; ఏవిధిన్+ఐనన్= ఏ విధంగానైనా; ఆపదలకున్+ఎల్లనున్= కష్టాలన్నిటికీ; ఓర్చెదన్= ఓర్చుకొంటాను; దానికిన్+ఏమి= దానికేం గాని; ఈ కావరము+ఐన కీచకుఁడు= క్రొవ్వుపట్టిన ఈ కీచకుడు; కామనిపీడితుఁడు+ఐ= మన్మథావేశంతో; అలంతులన్+పోవక= చిన్న చిన్న ప్రయత్నాలతో ఆగక; ఏచి పట్టుకొనన్+పోయినన్= విజృంభించి పట్టుకొనబోవటం చేత; ఈ+మెయిన్= ఈ విధంగా; తూలెదన్+కాక= భయంతో వణికిపోతున్నాను.

తాత్పర్యం: కాబట్టి మీ గౌరవాన్నీ, ఔన్నత్యాన్నీ మనస్సులో కోరుకొని నేను ఎట్లాగైనా ఆపదలన్నిటినీ ఓర్చుకొంటాను. అది ఫర్వాలేదు. కాని, ఈ పొగరుబోతు కీచకుడు మదనపీడితుడై చిన్న చిన్న యత్నాలతో ఆగక, విజృంభించి నన్ను పట్టుకొనటానికి ప్రయత్నించటంతో ఇంతగా భయంతో వణికిపోతున్నాను.

విశేషం: ఆపదలు ఒకదాని వెంబడి ఒకటి ద్రౌపదిని చుట్టుముట్టాయి. కాని, పాండవుల అజ్ఞాతవాసం పూర్తి కావాలి. దానికి ద్రౌపది సహకారం అవసరం. అందుకే అవమానాలు భరిస్తున్నది. కాని, కీచకుడి కండకావరం ఆమెను దుఃఖాల పాలు చేసింది. అందుకే భీముడితో మదనాతురుడైన కీచకుడి ఆగడాలను చెప్పుకొని విలపించింది.

తే. వానిఁ దెగఁ జూడవైతేని వాయుపుత్ర। నీవు గనుఁగొన నురినైన, నీరనైన,
నగ్నినైన, విషంబున నైన, నేను। మేను దొఱఁగుదు నెట్టు; నీ యాన సుమ్ము!' 229

ప్రతిపదార్థం: వాయుపుత్ర!= భీమసేనా!; వానిన్= ఆ కీచకుడిని; తెగన్+చూడనైతి+ఏనిన్= చంపప్రయత్నించనిచో; నీవు కనుఁగొనన్= నీవు (భీముడు) చూస్తూ ఉండగానే; ఉరిన్+ఐనన్= ఉరివేసికొని అయినా; నీరన్+ఐనన్= నీళ్ళలోపడి అయినా; అగ్నిన్+ఐనన్= అగ్నిలో దూకి అయినా; విషంబునన్+ఐనన్= విషం త్రాగి అయినా; నేను= (ద్రౌపది); ఎట్టున్= ఎట్లాగైనా; మేను దొఱఁగుదున్= శరీరం వదిలిపెట్టుతాను; నీ+ఆన సుమ్ము!= నీమీద ఒట్టు సుమా!

తాత్పర్యం: ఓ భీమసేనా! ఆ నీచ కీచకుడిని సంహరించకపోతే నేను నీ యెదుటనే ప్రాణత్యాగం చేస్తాను. ఉరి వేసికొనిగాని, నీళ్ళలో దూకిగాని, అగ్నిలో పడిగాని, విషం తినిగాని శరీరం విడిచిపెడతాను. నీమీద ఒట్టు.'

విశేషం: నీ ఆనసుమ్ము- అనేది జాతీయం. ఆత్మీయులతో మాట్లాడేటప్పుడు అట్లా అనటం సహజం. అది ఆత్మీయతకు నిదర్శనం.

వ. అనిన వృకోదరుండు చిఱునవ్వు నవ్వుచు నిట్లనియె. 230

తాత్పర్యం: ఆ మాటలు విని భీముడు చిరునగవు చిందిస్తూ ఇట్లా అన్నాడు.

భీముఁడు కీచకునిఁ జంపుటకుఁ బ్రతిజ్ఞ చేయుట (సం.4-20-1)

చ. 'జలజదళాక్షి! కీచకునిఁ జంపుట కిమ్మెయి ముట్టఁబల్కఁగా
వలయునె? యేను జూడ ననివారణ నిన్నుఁ బరాభవించి వాఁ
డిల మన, నింక నాంధ్రకును నెవ్వరు భంగము నీఁగఁజాలువా?
రలఘు మదీయ బాహుబల మప్పుడు చూపనితప్పు చాలదే? 231

ప్రతిపదార్థం: జలజదళ+అక్షి!= తామరపూరేకులవంటి కన్నులు కలదానా!; కీచకునిన్+చంపుటకున్= కీచకుడిని చంపటానికి; ఈ+మెయిన్= ఈవిధంగా; ముట్టన్+పల్కఁగాన్= మర్మాలు తగిలేటట్లు మాట్లాడటం; వలయునె?= అవసరమా?; ఏను+చూడన్= నేను చూడగా; అనివారణన్= అడ్డులేకుండా; నిన్నున్= ద్రౌపదిని; పరాభవించి= అవమానించి; వాఁడు= కీచకుడు; ఇలన్= భూమిపై; మనన్= జీవించగా; ఇంకన్= ఇకపై; ఆంధ్రకునున్= ఇల్లాండ్రకు; ఎవ్వరు భంగమున్+ఈఁగఁన్+చాలువారు?= ఎవరు కష్టాలు గట్టెక్కించగలరు?; అలఘు= గొప్పదైన; మదీయ బాహుబలము= నా భుజశక్తి; అప్పుడు చూపని తప్పు= ఆ సమయంలో ప్రదర్శించని పొరబాటు; చాలదే?= చాలదా?

తాత్పర్యం: 'ఓ ద్రౌపదీ! కీచకుడిని చంపటం కొరకు ఈ విధంగా మర్మాలు తగిలేటట్లు ఇంతగా నచ్చచెప్పవలెనా? నేను చూస్తుండగా అడ్డూ ఆపూ లేకుండా నిన్ను పరాభవించిన ఆ కీచకుడు ఇంకా భూమిపై జీవించి ఉంటే ఇల్లాండ్రను మానభంగాలనుండి గట్టెక్కించే మార్గ మేది? ఆనాడు విరాటుడి కొలువులో నా మహా భుజశక్తిని చూపకపోవటమే తప్పయింది. అది చాలు. (మరల ఆ తప్పు చేయను అని భావం.)

విశేషం: ఈ పద్యంలో 'ముట్టన్ పల్కు' అనే క్రియ సార్థకం. తిక్కన ద్రౌపదీ సంభాషణలోని శిల్పరహస్యాన్ని ఈ క్రియాపదంతో సూచించాడు. ముట్టఁబల్కుట-అంటే మర్మస్థానాలను తాకేటట్లు మాట్లాడటం అని శబ్దరత్నాకరం చెప్పింది. వక్త తాను ఏ ప్రయోజనాన్ని సాధింపదలచుకొన్నాడో అది సాధ్యమయ్యేటట్లు నిపుణంగా సప్రయోజనంగా మాట్లాడటం 'ముట్టఁబల్కటం'. నిర్లిప్తంగా ఉండి, నిద్రపోతున్న భీముడిలో రౌద్రాన్ని ప్రజ్వలింపజేయటం, అతిశీఘ్రంగా, రహస్యంగా కీచకుడిని సంహరింపజేయటం ద్రౌపది సాధింపదలచుకొన్న ప్రయోజనం. అది సఫలమయ్యేటట్లు ముట్టబలికిందని తాత్పర్యం. ఆ అంశాన్ని ఇట్లా భావించవచ్చును. 1.ధర్మరాజు మాయజూదపు ఉరులలో తాను చిక్కుకొని తనవారి కందరికీ కష్టాలు తెచ్చాడట! ధర్మరాజు మహిమను అంతకుముందే అంతగా ప్రశంసిస్తూ పలికిన ద్రౌపది మరల ఇట్లా అనటం ఆశ్చర్యం కలిగించే విషయం. ధర్మజుడి ఓటమివలన అరణ్యఅజ్ఞాతవాసాలు సంభవించాయి. దానికి తోడు ద్రౌపదికి అవమాన పరంపరలు కూడా ఆరంభమయ్యాయి. కులపతికి కలిగే ఇక్కట్టులే కులానికి పాటు కలిగిస్తాయని మొదటి హెచ్చరిక. అయిదుగురు భర్తలున్నా భార్యకు మానసంరక్షణం అనుమానస్థితిలో పడటం శోచనీయమని 225వ పద్యంలో ముట్టబలికింది. 2. పతుల ఎదుట సతులకు జరిగే అవమానాలు సతులకు ప్రాణాంతకాలు, పతులకు ఆత్మహత్యా సదృశాలు. పతులు మానధనులై తనను రక్షించగలరని ఆశపడ్డ ద్రౌపది మోసపోవటమే జరిగింది. నిజానికి ఆమె ప్రాణాలు వదలిపెట్టవలసింది. కాని, ఎప్పుడైనా భర్తలు బ్రతికి ఉండగా తనకు జరిగే అవమానాలకు ప్రతీకారం చేస్తారనే ఆడియాసలతో

ఆమె బ్రతుకు దుఃఖభారంతో సాగిస్తున్నది. ఆ దుఃఖం శాంతించేటట్లు లేదు. ఆమె కష్టాలు గట్టెక్కేటట్లు లేవు. ఎందుకంటే, భర్తలు బ్రతికి ఉండగానే నిండుసభలో ఒక మూర్ఖుడు (కీచకుడు) తనను అవమానించాడు. కాని, అప్పుడు కూడా వారు బ్రతికి ఉన్నట్లు నిరూపించుకొనలేకపోయారు. భార్యా మాన సంరక్షణం చేయలేని భర్తలు జీవన్మృతులవంటి వారని ఆమె ఉద్ధతుడైన భీముడు ఉలికిపడేటట్లు 226వ పద్యంలో ముట్ట బలికింది. 3. భర్తల అశక్తతకు విధివైపరీత్యం కారణమని సత్యం చెప్పినా ఎత్తి పొడుపుగా కాకువులో ముట్టబలికింది. పాండవులు కురుసభలో ధర్మబద్ధులు. విరాటసభలో సమయబద్ధులు. ద్రౌపది మాత్రం వారి వ్రతనిష్ఠవలన బాధితురాలు. పాండవుల వ్రతనిష్ఠ వలన వారికి అభ్యుదయ గౌరవాలు కలుగుతాయి. వారు ధర్మవీరు లనిపించుకొంటారు. కాని, ఆపదలన్నీ అనుభవించేది మాత్రం ద్రౌపదియే. భర్తలకు అభ్యుదయం కలిగేటట్లయితే ద్రౌపది ఎన్ని అవమానాలైనా పడటానికి సిద్ధమే అని చెప్పింది. ఆ మాటలు ఆమె దీనావస్థకు పరాకాష్ఠ. దానిని ముట్టబలికింది 227, 228 పద్యాలలో. 4. ఇప్పుడు ఆమె నిష్ఠురాలు ఎందుకు మాట్లాడుతున్నదో తెలుపుతున్నది. 'కీచకుడి చేష్టలు శ్రుతి మించుతున్నాయి. అతడు కామం చేత పీడింపబడుతున్నాడు. (మన్మథ బాధను పొందుతున్నాడు.) అంటే రతిక్రీడకు తొందరపడుతున్నాడని భావం. మొదట మాటలతో, చిన్న చిన్న చేష్టలతో పోతాడేమో అని అనుకొంటే ఇప్పుడు అంతటితో ఆగక విజృంభించి నన్ను పట్టుకొనటానికి సిద్ధమయ్యాడు భర్తలు చూస్తుండగానే. అతడెప్పుడైనా ఏ విధంగానైనా ఎక్కడైనా నాపై సాహసించగలడు. అప్పుడు నన్ను రక్షించే దెవరు? - 'ఒకవేళ రక్షించగలిగితే నీవొక్కడవే ప్రస్తుతం సమర్థుడవు'- అనే ఆశ తన మనసులో ఉన్నట్లు ముట్టబలికింది 228వ పద్యంలో. 5. ఇప్పుడు శీఘ్రంగా కీచకుడిని చంపటం తప్ప మరొక మార్గం లేదు. ఇది ఉపేక్షకు, విచికిత్సకు సమయం కాదు. ఒకవేళ దానిని భీముడు నిర్వహించకపోతే నేను ఉరిపోసుకునిగాని నీటిలో దూకిగాని, అగ్నిలో పడిగాని, విషం త్రాగిగాని చచ్చిపోతానన్నది. ఇది బెదిరింపు మాట కాదు. 'మీ మీద ఒట్టుపెట్టి చెపుతున్నాను. మీమీద నాకున్న భక్తి అటువంటిది. నమ్మకం అటువంటిది. నాకు మానభంగం కంటే ప్రాణభంగమే శ్రేష్ఠం'- అని ముట్టబలికింది.

ఆ మాటలకు ప్రతిస్పందన భీముడి ఈ మాటలు. భీముడు ద్రౌపది మాటలలోని ప్రయోగశక్తిని గుర్తించినట్లు పలికాడు. ద్రౌపదిని పరాభవించిన కీచకుడు తనచేత చావటం తప్పదని సంకల్పించాడు. ఆ పని అప్పటికే ఆలస్యమైనందుకు విచారించాడు. దుఃఖభావం నుండి భీముడిని ఉద్ధరించి, క్రోధభావ తీవ్రతను అతడిలో ప్రజ్వలింపచేసి, సత్వర కార్యోన్ముఖుడిగా మార్చిన ద్రౌపది వాక్ శిల్పం రసాభ్యుదయోల్లాసానికి రమణీయోదాహరణం. (సంపా.)

తే. **ఎల్లి యెల్ల విధంబుల నెందుఁజొచ్చె । నేని, నా ధర్మ తనయుండు దాన వచ్చి**
యడ్డపడెనేని నీవ పెంపారు కరుణఁ । గాచితేని నాచేఁ బడుఁ గీచకుండు. **232**

ప్రతిపదార్థం: కీచకుండు= కీచకుడు; ఎల్లి= రేపు; ఎల్ల విధంబులన్= ఎన్నిరకాలుగానైనా; ఎందున్+చొచ్చెన్+ఏనిన్= ఎక్కడ దాగినా; ఆ ధర్మతనయుండు= ఆ ధర్మజుడే; తాను+అ,వచ్చి= తానే వచ్చి; అడ్డపడెనేనిన్= అడ్డుపడినా; నీవు+అ= ద్రౌపది కూడా; పెంపారు కరుణన్= పైకి పొంగివచ్చే దయతో; కాచితి(వి)+ఏనిన్= కాపాడినా; నాచేన్+పడున్= నా చేతిలో చస్తాడు.

తాత్పర్యం: రేపటి దినం ఆ కీచకుడు ఎక్కడ ఎట్లా దాగి ఉన్నా, స్వయంగా ధర్మజుడు వచ్చి అడ్డుపడినా, నీవు కూడా అధిక దయతో క్షమించినా, నా చేతిలో అతడికి చావు మూడింది.

విశేషం: భీముడి శపథం సూటిగా, ఘాటుగా ఉన్నది. ప్రతిపదసార్థకంగా సాగింది. కాల విలంబనం వలన కీడు మూడవచ్చునని ద్రౌపది చేసిన సూచనకు ప్రతిస్పందనగా 'రేపే కీచకుడు నా చేతిలో చస్తాడు' అని ప్రధానాంశాన్ని ప్రకటించాడు. చంపదగిన శత్రువును సత్వరమే చంపటం భీముడి స్వభావం. కాని, అతడి ప్రయత్నాన్ని ఆపు చేయగల శక్తులు రెండున్నాయి. ఒకడు ధర్మరాజు, మరొకరు ద్రౌపది. అలనాడు సైంధవుడి పట్ల అదే జరిగింది. ధర్మరాజు అతడిని చంపవద్దన్నాడు, అందువలన అతడికి పాండవదాసుడనే బిరుదాన్నిచ్చి వదలిపెట్టాడు భీముడు. ద్రౌపది సైంధవ వధను మొదట కోరింది. భీముడు దాని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కనుకూలంగా వ్యవహరించి చంపబోయాడు. అర్జునుడు ధర్మజునాజ్ఞను జ్ఞాపకం చేసి వారించాడు. చివరకు ద్రౌపది పట్టుపట్టి సైంధవుడిని చంపటానికి ధర్మరాజును ఒప్పిస్తుందేమో అని భీముడు ఆశపడ్డాడు. సైంధవుడిని బందీగా తెచ్చి అన్నముందు ఉంచాడు. అప్పుడు ద్రౌపది తన మనసు మార్చుకొని పాండవదాసుడైన వాడిపై ధర్మరాజువలెనే దయావర్షాన్ని కురిపించింది. ఈ ఉదంతాన్ని జ్ఞాపకం చేసి భీముడు రెండు విధాల గడుసరితనం ప్రకటించాడు. 'నే నెప్పుడూ కార్యశీలినే. ధర్మరాజూ, నీవే సహనమూర్తులు, నా కార్యాలకు అడ్డుపడేవారు' అని ఎత్తిపొడిచి, తనయందు కీచకఘట్టంలో కూడా లోపం లేదని పరోక్షంగా సమర్థించుకొన్నాడు. 2. ధర్మజుడికి తెలిస్తే కీచకుడి మీద దయతో నన్ను వారిస్తాడు. నీవు నాతో చెప్పినట్లు ధర్మరాజుకు కూడా తెలిపావంటే అతడు నిన్ను కూడా మారుస్తాడు. అయినా నేను మారను. మీరిద్దరూ కలిసి వచ్చినా, ఎన్ని రకాలుగా వారించినా నా ప్రతిజ్ఞ ఆగదు అని హెచ్చరించాడు. కీచకవధ అనే కార్యనిర్వహణానికి భీముడు ప్రకృష్టమైన ప్రయత్నావస్థను ప్రకటించాడు. (సంపా.)

వ. వానిదెసం జింత యావంత వలవ; దమ్మాటలు విడువు' మని యూఱడిల్లం బలికి, దుర్దశల నలందురు నవ్వెలంది డెందంబుకుందు వాపం దలంచి యిట్లనియె. 233

ప్రతిపదార్థం: వానిదెసన్= కీచకుడిపట్ల; చింత= దుఃఖం; ఆవంత వలవదు= కొంచెం కూడా వద్దు; ఆ+మాటలు విడువుము= ఇక అతడి గురించి మాటలు మాట్లాడటం ఆపివేయుము; అని; ఊరడిల్లన్+పలికి= మనసు తేరుకొనేటట్లు మాటలాడి; దుర్దశలన్+అలందురు= కష్టాలు కడగళ్ళతో దుఃఖించే; ఆ+వెలంది= ద్రౌపది యొక్క; డెందంబుకుందు= మనసులోని బాధను; పాపన్+తలంచి= పోగొట్టదలచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇక నీవు కీచకుడి పట్ల ఆవంత కూడా చింత పడవలసిన అవసరం లేదు. వాడి మాటలు ఇక మరచిపోమ్మ' అని ద్రౌపది మనస్సు ఊరడిల్లేటట్లు పలికాడు. అంతేకాక, భీముడు కలసిరాని కష్టకాలంలో ఆమె పొందుతున్న తీవ్ర మనోవేదనను తగ్గించవలెననే భావంతో ఈ విధంగా పలికాడు.

సీ. 'చ్యవనుని వాంఛకు సంయాతినందన । యిడుమలఁ గుడువదె యడవిలోన?
రాఘవుతోడ నరణ్యవాసము చేసి । సంతాప మందదె జనకతనయ?
కుంభసంభవునకై ఘోరదుర్గముల లో । పాముద్ర యలజడి పాలుగాదె?
నలునిపిఱుందఁ గానల కేఁగి దమయంతి । మనుజులు పడనియుమ్మలిక పడదె?

తే. వారు సైరణచేసి దుర్వారమైన । నిరతిశయ దుఃఖభారంబు నిస్తరించి
సౌఖ్యమొందరె? నీవు నా చందమునన । యాపదల కోర్చి సంపద లనుభవింపు. 234

ప్రతిపదార్థం: చ్యవనుని వాంఛకున్= చ్యవనుడి కోర్కెకు; సంయాతినందన= సంయాతి కుమార్తె సుకన్య; అడవిలోనన్= అరణ్యంలో; ఇడుమలన్+కుడువదె?= కష్టాల ననుభవించలేదా?; రాఘవుతోడన్= రాముడితో; అరణ్యవాసము చేసి= అడవులలో కలిసి నివసించి; జనకతనయ= సీత; సంతాపము+అందదె?= కష్టపడలేదా? కుంభసంభవునకై= అగస్త్యుడి కొరకై; ఘోరదుర్గములన్= ఘోరారణ్యాలలో; లోపాముద్ర= అగస్త్యుడి భార్య; అలజడి పాలు కాదె= అవస్థల పాలుపడలేదా?; నలుని పిఱుందన్= నలుడి వెంట; కానలకున్+ఏఁగి= అడవులకు వెళ్ళి; దయయంతి; మనుజులు పడని= మనుష్యులు పడనటువంటి; ఉమ్మలిక, పడదె?= దుఃఖాన్ని అనుభవించలేదా?; వారు సైరణ+చేసి= వారంతా ఓర్చుకొని; దుర్వారము+ఐన= భరించరానిదైన; నిరతిశయ దుఃఖభారంబు= అధికమైన కష్టాలబరువును; విస్తరించి= దాటి, ఎట్లాగో మోసి; సౌఖ్యము+ఒందరె?= సుఖపడలేదా?; నీవున్= నీవుకూడా (ద్రౌపది కూడా); ఆ చందమునన్= ఆ విధంగానే; ఆపదలకున్+ఓర్చి= ఆపదలు భరించి; సంపదలు+అనుభవింపు= సౌఖ్యాన్ని పొందుము.

తాత్పర్యం: చ్యవనుడి కోర్కెను మన్నించి సుకన్య అడవిలోబడి కష్టాలను భరించలేదా? రఘురాముడితో అడవుల కేగి సీతమ్మ ఇడుముల పడలేదా? అగస్త్యుడి వెంట పర్వతాలు దాటి లోపాముద్ర అగచాట్లు పడలేదా? నలుడిని వెంబడించి అడవులకు వెళ్ళి దమయంతి మనుష్యులు పడలేని పాట్లు పడలేదా? వారందరూ ఎట్లాగో కష్టాల బరువు కోర్చుకొని సుఖాల తీరాన్ని చేరలేదా? అదే విధంగా నీవు కూడా కష్టాలను ఓర్చుకొని సంపదలను అనుభవించుము.

విశేషం: సుకన్య కథ: (సుకన్య శర్యాతి కుమార్తె అని మహాభారతారణ్యపర్వం చెప్పింది. సంయాతి శర్యాతి కొడుకు. తిక్కనసంయాతి కూతురుగా పేర్కొన్నాడు.) భృగుని కుమారుడు చ్యవనుడు. ఇతడు అనేక సంవత్సరాలు తపస్సు చేశాడు. శరీరమంతా పుట్టలు పోశాయి. ఒకనాడు శర్యాతి అనే రాజు తన కుమార్తె సుకన్యతో చ్యవనుడు తపస్సు చేసికొనే ప్రాంతానికి వచ్చాడు. సుకన్య చిలిపితనంతో పుట్టను గమనించక చ్యవనుడి పుట్టలోనుండి మెరుపులు రావటం చూచి త్రవ్వించింది. ఆ దోషానికి చ్యవనుడు కోపగించాడు. శర్యాతి యొక్క సైనికులను బాధించాడు. ఆ బాధను తొలగించటానికి సుకన్యను తనకిచ్చి వివాహం చేయుమని శర్యాతిని కోరాడు. తండ్రి ఇష్టపడకపోయినా, చ్యవనుడు వృద్ధుడైనా అతడిని వివాహం చేసికొన్నది సుకన్య. ఆ తరువాత చ్యవనుడు ఆశ్వినుల సహకారం వలన, తపశ్శక్తి వలన యువకుడై భార్యకు సుఖసౌఖ్యాలను అందజేశాడు. ఈ విధంగా సుకన్య వృద్ధుడిని వివాహం చేసికొని అనేక కష్టాలు పడి చివరకు సుఖసంతోషాలను పొందగలిగింది. సీతకథ: రామాయణంలోని ఈమె కథ ప్రసిద్ధం. పితృవాక్య పరిపాలకుడైన శ్రీరాముడి ననుసరించి సీత అరణ్యవాసం చేయవలసి వచ్చింది. రాముడితో కలిసి అడవులలో ఎన్నో కష్టాలు అనుభవించింది. రావణుడి చెరలో చిక్కి, అశోకవనంలో ఎన్నో కడగండ్లు భరించింది. మాయలేడిని తెమ్మన్న కారణంగా భర్తకు దూరమయింది. రావణ సంహారానంతరం మరల భర్తదరి చేరకలిగింది. రాజ్యసుఖాలను అనుభవించింది. 3. దమయంతి కథ: నలదమయంతులు ఆదర్శ ప్రేమ దంపతులు. నిషధ రాజును స్వయంవరంలో వివాహమాడింది దమయంతి. స్వయంవరానికి ఇంద్రాది దిక్పాలురు విచ్చేశారు. వారు కూడా దమయంతిని కోరి వచ్చారు. అయినా దమయంతి నలుడిని వరించింది. కలి ఆమెను పొందలేకపోయి పగబట్టాడు. ఫలితంగా కష్టాలపాలైంది. కలి పురుషుడు పెట్టిన కష్టాలు ఇంతంత కాదు. జూదంలో నలుడు సర్వస్వాన్నీ కోల్పోయాడు. అరణ్యాలలో దమయంతిని వదలి నలుడు వెళ్ళిపోయాడు. తక్షకుడి కాటువలన నలుడికి వికృతరూపం కలిగింది. కష్టాలు గట్టెక్కి ద్వితీయ స్వయంవరం నెపంతో దమయంతి మళ్ళీ నలుడిని నిజరూపంతో పొందగలిగింది. నలుడు రాజ్యాన్ని మరలా పొందాడు. దమయంతి రాజ్యభోగాల ననుభవించింది. లోపాముద్ర కథ: అగస్త్యుడు చాలా కాలం బ్రహ్మచర్య వ్రతం చేశాడు. తన తపఃప్రభావంతో విదర్భరాజుకు లోపాముద్ర జన్మించేటట్లు చేశాడు. ఆమెనే తన కిచ్చి వివాహం చేయుమని రాజు నడిగాడు. ఆమెకు వస్త్రాభరణాల కొరకు ఎందరినో ఆశ్రయించాడు. చివరకు అవి సంపాదించి పెట్టి ఆమె ద్వారా పుత్రులను పొందాడు. ఈ నాలుగు కథలలో ఆయా పతివ్రతలు కష్టాల పాలుగావటం, వాటిని ఓర్చుకొని కొన్నాళ్ళకు సుఖాన్ని పొందటం పురాణ ప్రసిద్ధం. అంతేకాదు. ఈ కథలన్నీ ఆరణ్యపర్వంలో మునుల వలన పాండవులు విన్నవే. వాటిని గుర్తుకు తెచ్చి భీముడు ద్రౌపది నోదారుస్తున్నాడు. అప్పుడు శ్రవణంలో నిలిచిన కథలు ఇప్పుడు మననంలోకి మారాయి. పురాణశ్రవణ ఫలితాలలో ఇది ఒకటి. తమతో సమానంగా కష్టా లనుభవించిన ఇతరులను తలచుకొంటే కొంత ఊరట కలుగుతుంది. అది మానవ స్వభావం. మనం చేసిన పని ఫలించకపోతే, ఎదుటివారిని చూచి వారూ కష్టాలలో ఉంటే చూచి ఊరట పొందుతాం. ఇదే తిక్కన కావ్యశిల్పం.

వ. **దుర్యోధన దుశ్శాసన కర్ణ శకుని సైంధవ ప్రముఖంబగు దుష్ట లోకంబు నధోలోకంబున కనుచునంతకు మదీయాంతరంగంబు చింతాభర భుగ్నంబును, నవమాన పంకమగ్నంబును, గోపోద్విగ్నంబును నై వేగిరపడుచున్నయది; ధార్తరాష్ట్రులకుం గాలావసానం బైనయట్లు మనకు సమయ కాలావసానం బయ్యె; నజ్ఞాత వాసంబునకుం జొచ్చి పదునొండు నెలలు సని పండ్రెండవనెల వర్తిల్లుచున్నది. దీని కొలంత దీటిన నీదు వంతయుం దీఱు; నూఱడిల్లి యుండుము; సింహబలుండు నిన్నుఁ బరిభవించి మై మైతోన యునికింజేసి**

యెల్లియుం జెనక వచ్చు; నీవునుం గ్రమంబున నొడంబడుట భావించికొని వానికి నర్తనశాల సంకేత ప్రదేశంబుగాఁ జెప్పి యొంటిమెయిం జనుదేర నియమింపుము; వాఁడు వచ్చిన నా సొబగునిం దెగఁజూచి, నీకుం జూపి నీ చిత్తంబు వడసెద; నిత్తెఱంగు దప్ప నొండు విధంబు గర్జంబుగా; దిదియె నిశ్చయం; బిట్ల చేయు వార; మిమ్మాటలవలనం దప్పవు గాని, వేగుచున్నయది; జనులు మేలుకాంచి మనలం గాంచి రేని వంచన బయలు పడినం గార్యంబు దప్పుఁ; గీచక వధంబునకుం బూనిన నా మనోరథంబు దుది ముట్టవలయు; నిజశయన స్థానంబునకుం బొ' మ్మని శయ్యాతలంబు విడిచి యత్తన్విం దటిమి కొన్ని యడుగు లనిచి, మరలి మారుతాత్మజుండు కలుషితాత్ముండగుచు సెజ్జకు వచ్చె; నచ్చెలువయుం దన నిద్రించు నెడకుం బోయి పర్యంక భాగంబునం దనువు వైచి, యంకిలి దేఱని దెందంబునఁ గొందలంబుతోడి నిశ్చయంబున నిద్రంబొరయని కనుదోయి మొగిడ్చి యుండె; నంత. 235

ప్రతిపదార్థం: దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకుని, సైంధవ, ప్రముఖంబు+అగు= దుర్యోధన దుశ్శాసన కర్ణ శకుని సైంధవాది యోధులతో కూడిన; దుష్టలోకంబున్= దుండగుల సమూహాన్ని; అధో+లోకంబునకున్, అనుచు+అంతకున్= నరకానికి పంపునంతవరకు; మదీయ+అంతరంగంబు= నా మనస్సు; చింతాభరభుగ్నంబును= దుఃఖభారంతో వంగినదీ; అవమాన పంకమగ్నంబును= అవమానమనే బురదలో మునిగినదీ; కోప+ఉద్విగ్నంబునున్+ఐ= కోపంతో కలవరపడినదీ అయి; వేగిర పడుచున్న+అది= తొందరపడుతున్నది; ధార్తరాష్ట్రులకున్= కౌరవులకు; కాల+అవసానంబు+ఐన+అట్లు= కాలం తీరినట్లు, మృత్యువు సమీపించినట్లు; మనకున్= పాండవులకు; సమయకాల+అవసానంబు+అయ్యెన్= ప్రతిజ్ఞ చేసిన కాలం ముగిసే రోజులు దగ్గరపడ్డాయి; అజ్ఞాతవాసంబునకున్+చొచ్చి= రహస్యంగా ఉండే నియమంతో ప్రవేశించి; పదునొకండునెలలు చని= పదకొండు నెలలు పూర్తి అయి; పండ్రెండవ నెల= పన్నెండో నెల; వర్తిల్లుచున్+ఉన్నది= జరుగుతున్నది; దీని కొఱంత తీఱినన్= ఈ ఉపద్రవం తప్పితే; నీదువంతయున్= నీదుఃఖం కూడా; తీఱున్= తొలగిపోతుంది; ఊరడిల్లి+ఉండుము= ఊరట పొంది ఉండుము; సింహబలుఁడు= కీచకుడు; నిన్నున్+పరిభవించి= నిన్ను (ద్రౌపదిని) అవమానించి; మైమైతోన్+అ= సశరీరంగా; ఉనికిన్+చేసి= ఉండటం చేత; ఎల్లియున్= రేపు కూడా; చెనక వచ్చున్= సమీపించవచ్చును; నీవునున్= నీవుకూడా (ద్రౌపది కూడా); క్రమంబునన్+ఒడంబడుట= నెమ్మదిగా అంగీకరించటం; భావించికొని= ఊహించుకొని; వానికిన్= కీచకుడికి; నర్తనశాల= నాట్యశాల; సంకేత ప్రదేశంబుగాన్+చెప్పి= గుర్తుగా (కలిసే స్థలంగా) చెప్పి; ఒంటిమెయిన్= ఒంటరిగా; జనుదేరన్= వచ్చుటకు; నియమింపుము= ఆజ్ఞాపించుము, ఏర్పాటు చేయుము; హఁడు= అతడు; వచ్చినన్= రాగా; ఆ సొబగునిన్= ఆ సుందరుణ్ణి, చక్కనివాణ్ణి; తెగన్+చూచి= చంపి; నీకున్+చూపి= నీకు (ద్రౌపదికి) చూపి; నీ చిత్తంబు+పడసెదన్= నీ మనసు మెప్పిస్తాను; ఈ+తెఱంగు తప్పన్= ఈ పద్ధతి కాకుండా; ఒండు విధంబు= మరొక పద్ధతి; కర్జంబు+కాదు= ఫలించే పని కాదు; ఇది+ఎ+నిశ్చయంబు= ఇదే నిర్ణయం; ఇట్ల చేయువారము= ఇట్లాగే చేద్దాం; ఈ+మాటలవలనన్+తప్పవుకాని= ఇక ఈ మాటలవలన పనులు తీరేవి కావు; వేగుచున్న+అది= తెల్లవారబోతున్నది; జనులు,మేలుకాంచి= లోకులు మేల్కొని; మనలన్+కాంచిరి+ఏనిన్= మనలను (భీమద్రౌపదులను) చూస్తే; వంచన బయలుపడినన్= అజ్ఞాతవాసం బహిరంగమైతే; కార్యంబు+తప్పున్= అజ్ఞాతవాసకార్యానికి భంగం ఏర్పడుతుంది; కీచక వధంబునకున్+పూనిన= కీచకుడిని చంపటానికి పూనుకొన్న; నా మనోరథంబు= నా సంకల్పం, కోరిక; తుదిముట్టవలయున్= పూర్తికావాలి; నిజ శయన స్థానంబునకున్+పొమ్ము= నీవు పరుండే ప్రదేశానికి వెళ్ళిపొమ్ము; అని; తన శయ్యాతలంబు= తన పడక; విడిచి= వదలిపెట్టి; ఆ తన్విన్+తటిమి= ద్రౌపదిని వెంబడించి; కొన్ని అడుగులు+అనిచి= కొంత దూరం వీడ్కొల్పి; మారుత+ఆత్మజుండు= గాడ్పుకొడుకు భీముడు; కలుషిత+ఆత్ముండు+అగుచున్= కలవరపడ్డ మనస్సుతో; సెజ్జకున్+వచ్చెన్= పడక మీదికి వచ్చాడు; ఆ+చెలువయున్= ద్రౌపది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కూడా; తన నిద్రించు+ఎడకున్+పోయి= తాను నిద్రించే ప్రదేశానికి పోయి; పర్యంక భాగంబునన్= పడకపై; తనువు వైచి= శరీరం పడవేసి; అంకిలి తేఱని డెందంబునన్= కలతవీడని మనస్సుతో; కొందలంబుతోడి= కలవరంతో కూడిన; నిశ్చయంబునన్= నిర్ణయంతో; నిద్రన్+పొరయని= నిద్రరాని; కనుదోయి మోడ్చి= కళ్ళు మూసికొని; ఉండెన్= ఉన్నది; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: దుర్యోధన దుశ్శాసన కర్ణ శకుని సైంధవాది దుష్టుల నందరినీ నరకలోకానికి పంపేటంత వరకు నా మనస్సు చింతా భారంతో వంగిపోయి, అవమానమనే బురదలో కుంగిపోయి, కోపతాపంతో కలత చెంది తొందరపడుతున్నది. దానికి తోడు కౌరవులకు కాలం మూడినట్లు మన అజ్ఞాతవాస సమయంకూడా పూర్తి కావస్తున్నది. పదకొండు నెలలు పూర్తి అయి, పన్నెండో నెల నడుస్తున్నది. ఇంక, ఈ గడువు కాస్తా తీరితే నీ దుఃఖం కూడా తీరుతుంది. కాబట్టి ఊరడిల్లి ఉండుము. కీచకుడు నిన్ను అవమానించి ఇంకా శరీరంతో బ్రతికి ఉన్నాడు. కాబట్టి రేపు వాడు వచ్చినపుడు మట్టుబెట్టవచ్చును. నీవు కూడా క్రమంగా అతడిని అంగీకరిస్తున్నట్లు ఊహించి (నటించి) నర్తనశాలను సంకేతంగా చెప్పి వాడిని అక్కడికి ఒంటరిగా రమ్మని చెప్పుము. అట్లా వస్తే ఆ సొగసుకాడిని మట్టుబెట్టి, నీకు కళ్ళారా చూపి, నీ మనస్సు రంజింపచేస్తాను. ఇది తప్ప మరొక ఉపాయం లేదు. ఇదే నిర్ణయం. ఇట్లాగే చేద్దాం. ఇక ఈ కార్యం మాటలతో తీరేది కాదు. చేష్టలకు దిగాలి. అదిగో తెల్లవారబోతున్నది. లోకం గుర్తిస్తే, అజ్ఞాతవాస వ్రతానికి భంగం వాటిల్లుతుంది. మన కార్యానికి భంగం కలుగుతుంది. కీచకుడిని చంపాలనుకొన్న నా కోరిక తీరాలి. నీవు వెళ్ళి నీప్రక్కపై పడుకొమ్మని చెప్పి ఆమెను తొందరపెట్టి కొంతదూరం కలసి వెళ్ళి వీడ్కోలు చెప్పి భీముడు కోపంతో కలతచెంది తన పడకపై నడుం వాల్చాడు. ఆమెకూడా పోయి తన పడకపై తనువు వాల్చింది. కాని, కంటికి నిద్ర రాలేదు. అయినా కనుదోయి మూసికొని కదలకుండా పడుకొని ఉండిపోయింది. అప్పుడు.

విశేషం: భీముడి వ్యూహకుశలత, కార్యదక్షత, ఉత్సాహస్ఫూర్తి, ఫలితాన్ని సాధించటంలో దృఢ నిశ్చయం, సమయోచితాలైన ఉపాయాలను సాధించే చాతుర్యం- మొదలైన నాయకలక్షణాలను ఇందులో ప్రదర్శించాడు. (సంపా.)

ప్రభాతకాల వర్ణనము

(ఇది మూలమునందు లేదు)

తే. **ద్రుపద నందన పరిభవ దుఃఖమునకు। నుల్లమున దురపిల్లుచు నున్న సరసి**
వేఁడి నిట్టూర్పులో యన వెడలెఁ గ్రొత్త। తావి మూతులు విచ్చు నెత్తమ్మివిరుల. **236**

ప్రతిపదార్థం: ద్రుపదనందన= ద్రౌపది యొక్క; పరిభవ దుఃఖమునకున్= అవమానం వలన కలిగిన దుఃఖానికి; ఉల్లమునన్= మనసులో; దురపిల్లుచున్+ఉన్న= విలపిస్తున్న; సరసి= సరస్సు; వేఁడి నిట్టూర్పులో+అనన్= వేడి నిశ్వాసాలో అన్నట్లు; మూతులు విచ్చు= వికసించు; నెత్తమ్మి విరులన్= చక్కని తామరపూలనుండి; క్రొత్త, తావి= క్రొత్త వాసనలు; వెడలెన్= వెలుపలికి వ్యాపించాయి.

తాత్పర్యం: ద్రౌపది అవమాన దుఃఖాన్ని చూచి విలపిస్తున్న సరస్సు అనే స్నేహితురాలు విడిచిన వేడి నిట్టూర్పులో అన్నట్లుగా మూతులు విచ్చుకొంటున్న కమలాలనుండి వచ్చే కొంగ్రొత్త సువాసనలు వెలువడసాగాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ప్రకృతి కథానాయికపట్ల సానుభూతి చూపినట్లు కవి వర్ణించటం విశేషం. వర్ణనను కథలో మేళవింపజేయటం భాగం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విచ్చెం దిమిరము; కాఁపులు । వచ్చె మధుపకులము లబ్జవనముల; కురులం
జొచ్చె విరులు తరులతికల; । నిచ్చె రథాంగములు వంత యెల్లఁ దొగలకున్. 237

ప్రతిపదార్థం: తిమిరము= చీకటి; విచ్చెన్= తొలగిపోయింది; మధుపకులములు= తుమ్మెదల సముదాయం; అబ్జవనములకున్= తామరపూవుల సముదాయానికి; కాఁపులు వచ్చెన్= కాపురం వచ్చాయి; విరులు= పూలు; తరులతికలన్= చెట్ల తీగల నుండి; ఉరులన్+చొచ్చెన్= రాల దొడిగాయి; రథాంగములు= చక్రవాకపక్షులు; వంతన్+ఎల్లన్= తమ బాధనంతా; తొగలకున్= కలువలకు; ఇచ్చెన్= ఇచ్చాయి.

తాత్పర్యం: చీకటి తొలగింది. తుమ్మెదలు తామరపూలపై వాలాయి. చెట్లనుండి, తీగలనుండి పూలు రాలాయి. చక్రవాకాలు తమ బాధనంతా కలువపూలకు ఇచ్చాయి.

విశేషం: చక్రవాక పక్షులకు రాత్రి పూట కళ్ళు కనబడవు కాబట్టి జంటలు వియోగావస్థ పొందుతాయి -అని కవిసమయం. కలువలు రాత్రంతా వికసించి సూర్యోదయంతో ముకుళిస్తాయి. తెల్లవారుతుండగా చక్రవాక పక్షులు వికసిస్తూ తమ రాత్రి బాధను ముకుళిస్తున్న కలువలకు అప్పగించినట్లున్నదట! తమ చుట్టమైన చంద్రుడు అస్తమించగా కలువలు ముకుళించాయి. వాటి ముకుళనాన్ని కవి వాటి బాధగా సంభావిస్తూ, అంతవరకూ తమ బాధను చక్రవాకాలు వాటి కందించినట్లు చమత్కరించాడు. (సంపా.)

సీ. పెనఁకువఁ దనిసిన తనువు లొండొంటితోఁ । గీలించి నిద్రించి మేలుకాంచి,
తరుణులుఁ బతులు వాతాయనంబుల నల్లఁ । బొలయు వేఁబోకటి మలయపవను
నింపారు చోఁకున నిగురొత్తు చిత్తంబు । లెలసి యొండొరులపైఁ బొలయు చూడ్కు
లాదట నుపకరణావళి వెడ వెడ । యాదరించుచు రాగ మడరఁ దొడరి

తే. కేళి సలిపిరి భవన దీర్ఘికల తమ్మి । విరుల నెత్తావి నెనయంగ బెరసి చెమట
పొడము మేనుల తనికంపు ప్రోచి తఱుచు । టూర్పుగాడ్పుల పరిమళ ముల్లసిల్ల. 238

ప్రతిపదార్థం: పెనఁకువన్= కలయికచేత; తనిసిన తనువులు= తృప్తిపొందిన శరీరాలు; ఒండు+ఒంటితోన్= ఒకదానితో మరొకదానిని; కీలించి= చేర్చి; నిద్రించి మేలుకాంచి= నిద్రపోయి మేల్కొని; తరుణులున్, పతులున్= భార్యలూ భర్తలూ; వాతాయనంబులన్= కిటికీల నుండి; అల్లన్= మెల్లగా; పొలయు= వీచే; వేఁబోకటి= వేకువజామునందలి; మలయపవను= మందమారుతం యొక్క; ఇంపారు చోఁకునన్= సుఖమైన స్పర్శచే; ఇగురొత్తు= కోరికల వలన చిగురించే; చిత్తంబులు= మనస్సులు; ఎలసి= పొంది; ఒండొరులపైన్= ఒకళ్ళ మీద ఒకరు; పొలయు= వ్యాపించే; చూడ్కులు= చూపులు; ఆదటన్= ప్రేమతో; ఉపకరణ+ఆవళిన్= చందనాది ద్రవ్యాలతో; వెడవెడ= మిక్కిలి కొంచెంగా; ఆదరించుచున్= గౌరవిస్తూ; రాగమడరన్= ప్రేమ అతిశయించగా; తొడరి= పూనుకొని; భవనదీర్ఘికల= ఇళ్ళలోని బావులలోని; తమ్మివిరుల= తామరపూలయొక్క; నెత్తావిన్+ఎనయంగన్= వాసనలు నిండగా; బెరసి= వ్యాపించి; చెమటపొడము మేనులన్= చెమట పట్టే శరీరాలపై; తనికంపు= చిరువాసనను; తఱుచు+ఊర్పుగాడ్పుల= మాటిమాటికి నిట్టూర్పుల; పరిమళము+ఉల్లసిల్లన్= వాసనలు వ్యాపించగా; కేళి సలిపిరి= రతిక్రీడలు చేశారు.

తాత్పర్యం: దంపతులు కలిసి రతి తృప్తి నొంది ఒకొళ్లనొకళ్లు కౌగిలించుకొని నిద్రపోయి తెల్లవారే సమయంలో లేచి, మందమారుతం కిటికీలలో నుండి వీస్తూ సోకగా మరల ఒకరిపై ఒకరికి మమకారం అధికమై భోగసాధనాలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉపకరణాలు కొద్దిగా తీసికొని ఇళ్ళనడబావులలోని తామరపూల సువాసనలు నిశ్వాసాలతో కలిసి శరీరంపై చెమట సుగంధాన్ని అధికం చేయగా రతికేళి సలిపారు.

విశేషం: రాత్రి రతికేళిలో మైమరచి కౌగిలింతలలో పడుకొనటం దంపతులకు సహజం. తెల్లవారే వేళ మళ్ళీ రతిక్రియ కుపక్రమించటం పరిపాటి.

తే. **రాలియున్న పుష్పప్రకరము విదిర్చి। చెన్నుగా నున్న సేసిన సెజ్జ యనఁగ**
వేగుటయుఁ జుక్కలన్నియు విరిసి విశద। భాతిఁ జెలువొందెఁ జూడ నంబరతలంబు. **239**

ప్రతిపదార్థం: వేగుటయున్= తెల్లవారగా; రాలియున్న= రాలిపడిన; పుష్పప్రకరము, విదిర్చి= పూలరాసులను విదిల్చి; చెన్నుగాన్, నున్న చేసిన= అందంగా నునుపు చేసిన; సెజ్జ+అనఁగన్= పడక అనేటట్లు; అంబరతలంబు= ఆకాశం; చుక్కలు+అన్నియున్= నక్షత్రాలన్నీ; విరిసి= తొలగిపోయి; విశదభాతిన్= స్పష్టమైన ప్రకాశంతో; చూడన్= చూడగా; చెలువొందెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: తెల్లవారగానే నక్షత్రాలన్నీ పోయి నిర్మలమైన ఆకాశం రాలిపడిన పూలన్నీ విదిల్చి నునుపు చేసిన పాన్పా అన్నట్లు ఉన్నది.

విశేషం: అలం: ఉత్రేక్ష. వేకువజామున ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అది పూలు విదిల్చి నునుపుచేసిన పాన్పువలె ఉన్నదని కవి చమత్కరించాడు. పాన్పుపై పూలు సువాసనకేగాక కమ్మగా నిద్రపట్టటానికి కూడా ఉపయోగపడతాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

వ. **తదనంతరంబ యల్ల నల్లన తెఱపి యిచ్చి యవులవులం జను నంధకారంబు దూరంబుల యందును లేకునికి వలనం గడళ్ళప్పళించి నెరసి విరసినం బోలుచు కలుకట్టలుంబోని దిక్తటంబులును, దమపాసిన కందువలు రోసి యెత్తిన మెడలను బచరించిన చూడ్కులు వేడ్కలం గ్రందైన డెందంబులుం దమము పాసినం గలిగి మెలంగుచు నొండొంటి బిట్టుగాంచి యొదవు సమ్మదంబునం బొదలు మేనులు బెరయించి పరమానందం బునం జొక్కుచు జక్కవకవలు గలసి పొలసి నలిరేఁగి చెలఁగుచు రేయింటి యాఁకటి పెల్లునం గొదగొని కమిచి చంచువులం దిగిచి త్రుంచి యానుచు నిక్కడక్కడఁ బఱచినం జిక్కువడి యున్న మృణాల శకలంబుల వలన బాల చంద్ర శతాభిరామంబులగు శంభు జలమూర్తి విశేషంబులంబోని సరోవరంబులును, జీఁకటి వాసినం బ్రభాతం బను వింత మానిసి మెలంగి ముసుంగు వుచ్చినట్లు మేలుకని యెఱకలు పొదల విదిర్చి కూర్చికొని కలగొనం బలుకు పులుఁగుల యెలుంగుల వలన నొండొంటిం దెలుపుకరణి నొప్పు ధరణీరుహంబులును, బరఁగు నరుణోదయ రాగపటలంబు నెనయు కెంజాయ రంజిల్ల వికసిల్లు రక్తారవిందంబుల దండడి నెగసి చరించు చంచరీకంబుల యెఱకల నెఱుల గిటికొని క్రొత్తయగు కాంతి ప్రవాహంబులం గడలుకొల్పు పుప్పొళ్ళు డుల్చి రాల్చుచుం బోలయు మలయానిలంబునం గ్రాలు మవ్వంపుఁదీవలఁ గడివోయి తొరఁగిన విరుల వలన మీనకేతన పురాతన బాణశాలలం బోని లతా మండపంబులును, మొగిడియు జనంబు సంధ్యాంజలిపుటకరణంబుల ననుకరించు విధంబునం దర్శనీయంబులగు కుముద వనంబులును, నేమేని నెపంబున నొండొరుల మేలుకొలుపు రమణ రమణీ జనంబుల నర్మాలాపంబులం బెరయు దరహాసంబుల**

కాంతిఁ దెలుపెక్కునట్లు వెలరారు దీపంబులును, మునుకడ వచ్చి యెఱుక సేయమికి వాతాయన పవనుని పయిం బుట్టిన యలుక విధంబున వేగుఁబోకట నంకురించు మదంబునఁ గెంపు గదురుట నిద్రలేమినని శంకింపక యింపునం గదియు విదగ్ధ విటజనంబుల మనంబులం దిగుచు లలనాలోచనంబులును, రేపకడ వనలక్ష్మి పురశ్రీ నలంకరించు వడువున నెడపడక యెల్లెడల నిగుడు విభాత కుసుమ కదంబ పరిమళంబును నై యున్నంత. 240

1. తదనంతరంబ.................దిక్తటంబులును.

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= తెల్లవారుతున్నంతనే; అల్లన+అల్లన= మెల్ల మెల్లగా; తెఱపి+ఇచ్చి= సందిచ్చి-తొలగిపోయి; అవులన్+అవులన్+చను= దూరదూరంగా పోయే; అంధకారంబు= చీకటి; దూరంబుల+అందును లేక+ఉనికి వలనన్= దూరప్రదేశాలలో కూడ లేకపోవటం వలన; కడళ్ళు= దిక్కులు; అప్పళించి= తాకి; నెరసి= నిండి; విరిసినన్= విచ్చిపోగా; పొలుచు= ఒప్పే; కలు కట్టలున్+పోని= రాతి కట్టలను పోలిన; దిక్+తటంబులును= దిక్ప్రదేశాలూ;

తాత్పర్యం: తెల్లవారుతున్నది. చీకటి మెల్లమెల్లగా విచ్చుతూ దూరప్రదేశాలలో కూడా తొలగిపోవటంచేత, దిక్కులను స్పృశించి నిండి విచ్చిపోగా దిక్ప్రదేశాలు రాతికట్టలవలె ఒప్పుతున్నాయి. అలంకారం: ఉపమ.

2. తమ పాసిన.................సరోవరంబులును.

ప్రతిపదార్థం: తమ, పాసిన= తాము (జక్కవలు) వీడిన; కందువలు= చోట్లను; రోసి= వెదకి; ఎత్తిన, మెడలను; పచరించిన= ప్రసరింపజేసిన; చూడ్కులున్= చూపులూ; వేడ్కలన్= వేడుకలచే; క్రందు+ఐన= అధికమైన; దెందంబులున్= మనస్సులును; తమము= చీకటి పాసినన్= తొలగగా; కలిగి; మెలంగుచున్= వర్తిల్లుతూ; ఒండు+ఒంటిన్= ఒకదాని నొకటి; బిట్టు= శీఘ్రంగా; కాంచి= చూచి; ఒదవు= కలిగే; సమ్మదంబునన్= సంతోషంతో; పొదలు= ఒప్పే; మేనులు= శరీరాలు; బెరయించి= చేర్చి; పరమ+ఆనందంబునన్= అధిక సంతోషంతో; చొక్కుచున్= పరవశిస్తూ; జక్కవకవలు= చక్రవాక దంపతులు; కలసి= కూడి; పొలసి= చొక్కి; నలిరేఁగి= విజృంభించి; చెలంగుచున్= కూస్తూ; రేయింటి, ఆఁకటి, పెల్లునన్= రాత్రి ఏమీ తికనపోవటం వలన కలిగిన ఆకలి తీవ్రతచేత; గొదకొని= యత్నించి; కమిచి= గ్రహించి; చంచువులన్= ముక్కులతో; తిగిచి= లాగి; త్రుంచి= ముక్కలు చేసి; ఆనుచున్= తింటూ; ఇక్కడన్+అక్కడన్= ఇక్కడా, అక్కడా; పఱచినన్= పరవగా; చిక్కు+పడి+ఉన్న= చిక్కుపడిపోయిన; మృణాల, శకలంబులవలనన్= తామరతూటి ముక్కల వలన; బాల, చంద్ర, శత+అభిరామంబులు+అగు= నూరు బాలచంద్రబింబాల చేత మనోహరాలయిన; శంభు, జల, మూర్తి విశేషంబులన్+పోని= శివుడియొక్క జలరూప విశేషాలవంటి; సరోవరంబులును= సరస్సులును.

తాత్పర్యం: చక్రవాక మిథునాలకు రాత్రివేళ పరస్పర వియోగం, అవి కన్నులు కనిపించక తమ తమ చోట్లను విడిచిపెట్టుతాయి. తెల్లవారిన పిదప అవి రేయి తాము విడిచిన స్థానాలను వెదుకుతూ, మెడ ఎత్తుకుని, చూపులు ప్రసరింపజేస్తూ పరస్పరం కలిసికొనటం వలన వేడుక లధికమై మనస్సులు సంతోషపడుతూ ఉండగా ప్రవర్తిల్లుతాయి. అవి తమ శరీరాలను ఒకదానితోనొకటి చేర్చి, మిక్కిలి సంతోషంతో పరవశిస్తూ, విజృంభించి కూస్తూ, రాత్రి ఏమీ తినకపోవటం వలన కలిగిన ఆకటి తీవ్రతతో తామరతూండ్లను లాగి ముక్కలు చేసి చిందరవందరగా పడవేస్తాయి. ఆ ముక్కలు నూరు బాలచంద్రుల చేత మనోహరాలయిన ఈశ్వరుడి జలమూర్తి విశేషాలు అన్నట్లుగా సరస్సులుంటాయి.

అలం: స్వభావోక్తి.

3. చీఁకటివాసినం.................ధరణీరుహంబులును.

ప్రతిపదార్థం: చీఁకటి; పాసినన్= తొలగిపోగా; ప్రభాతంబు+అను, వింతమానిసి= ఉదయసమయ మనే వింత మనుష్యుడు; మెలంగి= వర్తిల్లి; ముసుంగు+పుచ్చిన+అట్లు= ముసుగు తొలగించిన విధంగా; మేలుకని= నిద్రలేచి; ఎఱకలు= రెక్కలు; పొదలన్= ఒప్పుగా; విదిర్చి= విదలించి; కూర్చికొని= సరిచేసికొని; కలగొనన్= కలతచెందగా; పలుకు= కూయునట్టి; పులుఁగుల+ఎలుంగుల వలనన్= పక్షుల రొదల మిషచేత; ఒండు+ఒంటిన్= ఒకదాని నొకటి; తెలుపు, కరణిన్= మేల్కొలిపే విధంగా; ఒప్పు; ధరణీరుహంబులును= చెట్లునూ.

తాత్పర్యం: చీకటి తొలగిపోగా ఉదయమనే వింత మనుష్యుడు, వచ్చి ముసుగుతొలగించినట్లు మేల్కొని రెక్కలు విదిలించుకొని, సరిచేసికొని, కలతపడినట్లు కూసే పక్షుల రొదల మిషచేత ఒకదాని నొకటి మేలుకొలిపే విధంగా ఒప్పే చెట్లునూ.

అలం: స్వభావోక్తి, రూపకం, ఉత్ప్రేక్ష.

4. పరఁగు నరుణోదయరాగ.................లతా మండపంబులును.

ప్రతిపదార్థం: పరఁగు= ఒప్పునట్టి, అరుణ+ఉదయ, రాగ, పటలంబున్= సూర్యోదయము యొక్క ఎరుపుకాంతుల సమూహాన్ని; ఎనయు= సరిపోలే; కెంజాయ (కెంపు+చాయ)= ఎర్రనికాంతి; రంజిల్లన్= ప్రకాశించగా; వికసిల్లు= విచ్చే; రక్త+అరవిందంబులన్= ఎర్రతామరల యందు; దందడిన్= దట్టంగా; ఎగసి= ఎగిరి; చరించు= తిరిగే; చంచరీకంబుల= తుమ్మెదలయొక్క; ఎఱకల, నెఱులన్= రెక్కల సందులందు; గిఱికొని= చిక్కుకొని; క్రొత్త+అగు, కాంతి, ప్రవాహంబులన్= నూతనకాంతుల ప్రవాహాలను; కడలుకొల్పు= అతిశయింపజేసే; పుప్పొళ్ళు, డుల్చి రాల్చుచున్= డుల్లగొట్టి రాలుస్తూ; పొలయు= వీచే; మలయ+అనిలంబునన్= మలయవాయువు చేత; క్రాలు= ఒప్పే; మవ్వము+తీవలన్= లేతతీగలనుండి; కడి+పోయి= వాసనపోయి; తొరఁగిన విరులవలన= రాలిపోయిన పువ్వులవలన; మీనకేతన, పురాతన, బాణ, శాలలన్+పోని= మన్మథుడి ప్రాత బాణగృహాలను పోలిన; లతా, మండపంబులును= పూలతీగలమంటపాలునూ.

తాత్పర్యం: ఉదయ సూర్యుడి ఎఱ్ఱని కాంతి ప్రసరించగా వికసించే ఎర్రతామరపూలయందు దట్టంగా ఎగురుతూ తిరిగే తుమ్మెదరెక్కల సందుల్లో చిక్కుకొని నూతనకాంతుల ప్రవాహాలను అతిశయింపజేసే పుప్పొళ్ళను డుల్లగొట్టి రాలుస్తూ వీచే మలయవాయువుచేత ఒప్పే లేతతీగలనుండి వాసనపోయి రాలిపోయిన పువ్వులు కలిగి మన్మథుడి ప్రాత బాణ గృహాలవలె ఉన్న లతామండపాలునూ.

అలం: స్వభావోక్తి, ఉపమ.

5. మొగిడియు.................కుముదవనంబులును.

ప్రతిపదార్థం: మొగిడియున్= ముడుచుకొని కూడా; జనంబు, సంధ్యా+అంజలిపుట, కరణంబులన్= సంధ్యావందన మాచరించేటప్పటి జనుల దొప్పలవంటి దోసిళ్లను; అనుకరించు విధంబునన్= అనుసరించేటట్లు; దర్శనీయంబులు+అగు= చూడదగిఉన్న; కుముద, వనంబులునున్= తెల్లకలువల తోపులును.

తాత్పర్యం: ప్రాతస్సంధ్యా సమయంలో ముడుచుకొని కూడా, సంధ్యావందనమాచరించే జనుల అంజలిపుటాలను అనుకరించే రీతిగా చూడదగిఉన్న తెల్లకలువల సమూహాలునూ.

అలం: ఉపమ.

6. ఏమేని నెపంబున.................వెలరారు దీపంబులును.

ప్రతిపదార్థం: ఏమి+ఏని, నెపంబునన్= ఏదో ఒక మిషచేత; ఒండు+ఒరులన్= ఒకరినొకరు; మేలుకొలుపు= మేలుకొలిపే; రమణ, రమణీ జనంబుల= ప్రియుల, ప్రియురాండ్ర యొక్క; నర్మ+ఆలాపంబులన్= పరిహాస గర్భిత వాక్కులచేత; బెరయు= కలిగే; దరహాసంబుల, కాంతిన్= చిరునవ్వుల కాంతిచేత; తెలుపు+ఎక్కు+అట్లు= తెలుపెక్కే విధంగా; వెలరారు, దీపంబులును= తెల్లనైన దీపాలూ.

తాత్పర్యం: ఏదో ఒక నెపంతో ఒకరి నొకరు మేలుకొలిపే దంపతుల పరిహాస గర్భిత వాక్కుల చేత కలిగే చిరునవ్వుల కాంతుల చెంత తెలుపెక్కినవాయా అన్నట్లున్న దీపాలూ.

అలం: తద్గుణం, ఉత్ప్రేక్ష.

7. మునుకడ వచ్చి...............లలనా లోచనంబులును.

ప్రతిపదార్థం: మునుకడ= ముందుగా; వచ్చి; ఎఱుక+చేయమికిన్= తెలుపకపోవటానికి; వాతాయన, పవనుని, పయిన్= కిటికీల గాలిమీద; పుట్టిన; అలుక, విధంబునన్= కోపం రీతిగా; వేగుఁబోకటన్= తెల్లవారుజామున; అంకురించు= పుట్టే; మదంబునన్= మదంచేత; కెంపు= ఎరుపు; కదురుట= కలగటం; నిద్ర, లేమిన్+అని= నిద్ర లేకపోవటంచేతనని; శంకింపక= సంశయించక; ఇంపునన్= సంతోషంతో; కదియు= కూడే; విదగ్ధ, విట, జనంబుల, మనంబులన్= నేర్పరులైన విట జనుల మనస్సులను; తిగుచు= ఆకర్షించే; లలనా; లోచనంబులును= స్త్రీల కన్నులూ.

తాత్పర్యం: ముందుగా వచ్చి తమను మేలుకొలుపకపోవటంచేత కిటికీల గాలిపై కలిగిన కోపం చేతనా అనేటట్లు ప్రియురాండ్ర కళ్ళు ఎఱ్ఱబడ్డాయి; కాని, తెల్లవారుజామున కలిగే మదం వలన అవి సహజంగానే ఎర్రనయ్యాయి. పైగా రాత్రి అంతా ప్రియులను కూడటంవలన నిద్రలేక కలిగిన ఎరుపు అని విదగ్ధులైన విటజనులు సంశయించక, తెల్లవారువేళ సంతోషంతో ప్రియురాండ్రను సమీపించినప్పుడు వారి మనస్సులను ఆకర్షిస్తూవున్న ఆ ప్రియురాండ్ర అందమైన నయనాలూ,

అలం: ఉత్ప్రేక్ష.

8. రేపకడ.................నై యున్నంత.

ప్రతిపదార్థం: రేపకడ= ప్రొద్దున; వనలక్ష్మి= వనమనే లక్ష్మి; పురశ్రీన్= నగరమనే లక్ష్మిని; అలంకరించు, వడువునన్= అలంకరించే విధంగా; ఎడపడక= ఎడతెగక; ఎల్ల+ఎడలన్= అన్నిచోట్లా; నిగుడు= వ్యాపించే; విభాత, కుసుమ, కదంబ, పరిమళంబును= వేకువజామునందలి పూల సమూహంయొక్క సువాసనల!; ఐ= అయి; ఉన్న+అంతన్= ఉండగా.

తాత్పర్యం: ప్రొద్దుననే వనలక్ష్మి నగరలక్ష్మిని అలంకరిస్తున్నదా అనే విధంగా, ఎడతెగకుండా అన్నిచోట్లా వ్యాపించే ఉదయ సమయ పుష్పసౌగంధ్యమూ కలిగి ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

అలం: ఉత్ప్రేక్ష. వనలక్ష్మి - రూపకం.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష; ఎడనెడ - ఉపమ. రూపకం-ఉత్ప్రేక్షను అతిశయింప చేశాయి. ప్రభాత వేళ కనువిందు చేసే ప్రకృతి సౌందర్యాన్ని ఊహాసుందరంగా ఆవిష్కరించటం ఇక్కడి అలంకారశిల్పం. వెనుకటి పద్యంలో తెల్లవారుజామున నక్షత్రాలు మాయమై ఆకాశం నిర్మలంగా తేటపడింది. 1. ఆ తరువాత-చీకట్లు క్రమంగా విరిసి దూరదూరంగా పోయి దిక్తటాలు బయట పడటం మొదట వర్ణించబడింది. అవి ముగిసిన చీకట్లు వరిసిపోగా బయటపడిన రాతికట్టలవలె ఉన్నాయి. ఇక్కడ ఉత్ప్రేక్షా గర్భిత ఉపమాలంకారం భావనీయం. 2. ఆ తరువాత - చక్రవాక పక్షులు రాత్రంతా తామరతూండ్ల ముక్కలను చిమ్మటం వలన ఆ ముక్కలు మిలమిలలాడుతూ ఉండగా మెరుస్తున్న సరోవరాలు వెలుగు చూచాయి. ఆ సరోవరాలు చంద్రకళలతో వెలుగొందే శివుడి జలమూర్తులో అన్నట్లున్నాయట! ఈ వర్ణనలో ఉపమాలంకార రంజితమైన ఉత్ప్రేక్ష భాసిస్తున్నది. దిక్కులు తెల్లబడి ఆ కాంతులు నీళ్ళలో ప్రతిఫలించటం ప్రభాత ప్రకృతి సౌందర్య దర్శకులకు సహజంగా గోచరించే సుందర దృశ్యమే. 3. ఆ తరువాత - జనుల దృష్టి నాకర్షించేవి చెట్లమీద వినపడే పక్షుల కలకలారావాలు. ప్రభాతం అనే మనిషి చీకటి అనే (ముసుగు వేసికొని అందరినీ భయపెట్టి ఒక్కసారిగా పై) ముసుగు తీసి వేయగా అంతవరకూ సడీ సవ్వడీ లేకుడా ఉన్న చెట్లు ఒక్కసారి రెక్కలు విచ్చి ఎగురుతూ వ్రాలుతూ అరుస్తున్న పక్షుల కూతలనే మాటలతో చెలరేగి పరస్పరం యోగక్షేమాల పలకరింపులు మొదలుపెట్టినట్లున్నాయట! రూపకానుప్రాణిత ఉత్ప్రేక్ష ఇందులో ప్రకాశిస్తున్నది. 4. ఆ తరువాత అరుణోదయం- ఆ సమయంలో ఆకాశంలో కానవచ్చే అరుణకాంతితో దీటైన కాంతులు గలవి ఇలలో ఎర్రదామరలు. వాటి మీద తుమ్మెదలు విశృంఖలంగా తిరగటం వలన వాటి రెక్కలకు పుప్పొడు లంటాయి. వాటిని మలయపవనుడు దులిపి నేలకు రాలుస్తున్నాడు. అతడి వీరవిహారానికి పూలు రాలి లతామండపాల నిండా పడుతున్నాయి. అప్పుడవి మన్మథుడి పాత ఆయుధాగారాలా అన్నట్లు ఉన్నాయట! ఉపమానుప్రాణిత ఉత్ప్రేక్ష ఊహారమణీయం. రాత్రి ఎంత మన్మథోద్దీపకంగా ఉన్నదో అరుణోదయవేళ సైతం అంతటి మన్మథోద్దీపకంగా ఉన్నదని ధ్వని. మన్మథుడి పంచబాణాలు పూలే. (అరవిందం, అశోకం, చూతం, నవమల్లిక, నీలోత్పలం). 5. ఆ తరువాత నిష్ఠాగరిష్ఠుల ప్రాతఃకాల సంధ్యావందన దృశ్యాలు గోచరిస్తాయి. తెల్లవారేకొద్దీ కలువపూలు ముకుళిస్తాయి. ఆ ముకుళించిన కలువలు సూర్యుడికి అంజలి పట్టే భక్తుల కరపుటాలవలె ఉన్నాయట! ఉపమాలంకార మండిత మీ వర్ణనం. 6. ఆ తరువాత - ప్రభాత కాంతికి దీపాలు వెలవెలపోవటం సహజ రమణీయ దృశ్యం. ఆ దీపాలు మేలుకొలుపుల మిషతో నర్మ సంభాషణలు చేస్తున్న దంపతుల చిరునవ్వుల కాంతులచేత పరిహసించబడ్డాయట! అందువలన వెలవెలపోయాయేమో అన్నట్లు ఉన్నాయట. ఊహారమణీయమైన ఉత్ప్రేక్ష. 7. ఆ తరువాత - తెల్లవారే లోపల మరొకసారి విటులను ఆకర్షించి వినోదించాలనే వేడుకతో కొంటె చూపులు విసిరే వేశ్యల, విటకత్తెల పోకడలు గమనించదగినవి. రాత్రిళ్ళంతా నిద్రలేదు. అందువలన కన్నులు ఎర్రపడ్డాయి. కాని, ఆ కళ్ళు తొలిజాము కైపువలన అట్లా ఎర్రపడ్డాయని తలంచి, నేర్పరులైన విటులు తమను మరొకసారి కూడటానికి అనువుగా వారిని రెచ్చగొట్టుతున్నట్లున్నాయట విటకత్తెల చిలిపి చూపులు, ఊహారమ్యమైన ఉత్ప్రేక్ష. 8. ఆ తరువాత- ప్రభాత వాతావరణంలో గుబాళించే పూలవాసన అనుభవించ దగింది - అది వనలక్ష్మి పురలక్ష్మిని ప్రభాత సేవ కొరకు అలంకరిస్తున్నట్లు దర్శనీయంగా, పూజనీయంగా, పవిత్రంగా కనబడిందట! 9. హరిహరనాథ భక్తుడైన తిక్కన హరుని అష్ట విధ రూపాల ప్రసక్తి ఈ వచనంలో తెచ్చాడు. అష్టవిధ ప్రభాతకాల వైభవాలను ఇందులో వర్ణించాడు. (సంపా.)

సీ. **నీరజాకరములు నిష్ఠమైఁ జేసిన। భవ్యతపంబుల ఫల మనంగ,**
దివసముఖాభినందిత చక్రయుగ్మకం। బుల యనురాగంపుఁబ్రో వనంగ,
హరిహరబ్రహ్మ మహానుభావంబు లొ। క్కటి గాఁగఁ గరఁగిన గట్టి యనఁగ,
నతుల వేదత్రయ లతికాచయము పెను। పొందఁ బుట్టెడు మూలకంద మనఁగ

తే. నఖిల జగముల కందెఱ యగుచు జన స। మాజ కరపుట హృదయ సరోజములకు
ముకుళనంబును జృంభణంబును నొనర్చి। భానుబింబంబు పూర్వాద్రిపై వెలింగె. 241

ప్రతిపదార్థం: నీరజ+ఆకరములు= తామర కొలకులు; నిష్ఠమైన్+చేసిన= నియమంతో దీక్షగా చేసిన; భవ్యతపంబులఫలము+అనంగన్= చేసిన మంగళప్రదమైన తపస్సుల ఫలమో అన్నట్లుగా; దివసముఖ= ప్రాతఃకాలం చేత; అభినందిత= సంతోషింప జేయబడిన; చక్రయుగ్మకంబుల= చక్రవాక పక్షుల జంటల యొక్క; అనురాగము+ప్రోవు+అనంగన్= ప్రేమరాశి అనునట్లు; హరిహరబ్రహ్మ= త్రిమూర్తుల-విష్ణు మహేశ్వర బ్రహ్మల యొక్క; మహత్+అనుభావంబులు= గొప్ప ప్రభావాలు; ఒక్కటి+కాఁగన్= ఒకటిగా అయ్యేటట్లు; కరఁగిన= కరిగించి చేసిన; గట్టి= కణిక; అనఁగన్= అనునట్లు; అతుల= సాటిలేని; వేదత్రయ= మూడు వేదాలనే; లతికాచయము= తీగల సమూహం; పెనుపొందన్= అభివృద్ధి చెందేటట్లు; పుట్టెడు= పుట్టిన; మూలకందము+అనఁగన్= మొదటి దుంప అన్నట్లు; అఖిలజగముల= అన్ని లోకాలకు; కన్+తెఱ= కనురెప్ప; అగుచున్= ఔతూ; జనసమాజ= జనసమూహాల యొక్క; కరపుట= దొప్పలలాంటి చేతులకు; హృదయసరోజములకున్= హృదయాలు అనే కమలాలకు; ముకుళనంబును= ముడుచుకొనటమూ; జృంభణంబునున్= వికాసాన్ని; ఒనర్చి= కలిగించి; భానుబింబంబు= సూర్యబింబం; పూర్వాద్రిపైన్= తూర్పుకొండపై; వెలింగెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: తామర కొలకులు నిష్ఠతో చేసిన పవిత్ర తపస్సులకు ఫలితమో అన్నట్లు, తెల్లవారగానే కూడుకొన్న చక్రవాకపక్షుల జంటల అనురాగమంతా ఒక రాశిగా రూపొందిందా అన్నట్లు, త్రిమూర్తుల మహిమలను కరగించి చేసిన సిద్ధగుళికయా అన్నట్లు, వేదాలు అనే ఎగబ్రాకే తీగలు పుట్టిన దుంపా అన్నట్లు సకల లోకాలకు కనురెప్పగా ఉండే సూర్యుడి పూర్ణబింబ రూపం తూర్పుకొండమీద ప్రకాశించింది. లోకానికి కనురెప్ప అయిన సూర్యుడు క్రమంగా జనుల చేతి అంజలులకు ముకుళనాన్నీ, హృదయపద్మాలకు వికాసాన్నీ కలుగజేసి తూర్పుకొండపై ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, రూపకం, తుల్యయోగిత, యథాసంఖ్యం. ఈ పద్య రచనా మహత్త్వాన్ని కీ.శే.భూపతి లక్ష్మీనారాయణరావుగారిట్లా వ్యాఖ్యానించారు. 'భవ్యతపః ఫలంబగు పరంజ్యోతి స్వరూపము, విశుద్ధ ప్రేమ పరిణామమగు రసస్థితి, హరిహరబ్రహ్మైక్య జ్ఞానమూర్తి, వేదత్రయ జన్మకారణమగు పరబ్రహ్మ స్వరూపము నను నిట్టి యలౌకికోపమానములచే వర్ణన కుదాత్తత సిద్ధించినది. హృదయంగమములైన యీ యుత్ప్రేక్షలు రచనకు మనోహరత్వము నాపాదించుటయేగాక, సూర్యభగవానుని పరబ్రహ్మతత్త్వమును బ్రతిపాదించునవియై, పఠితృమానసములను భక్తిభావపూరితములుగా నొనర్చుచున్నవి. 'అఖిల జగముల కన్దెఱ యగుచు' ననుటలో, సూర్యభగవానుడు చైతన్యప్రదాతయు, జ్ఞానప్రదాతయు నగునను నర్థము సిద్ధించినది. అట్టి పరబ్రహ్మ స్వరూప సాక్షాత్కారముచే జనుల హృదయములు వికాసము నొందుటయు, వారు భక్తిచేఁ గరములు మోడ్చి, సూర్యభగవానునకుఁ బ్రణమిల్లుటయు, నొక్కుమ్మడి జరుగు కార్యములు. ఈ యుదాత్తార్థమును బ్రతిపాదించుచుఁ, దిక్కన, యథాసంఖ్య, రూపకోత్ప్రేక్షా తుల్యయోగితల నతి ప్రౌఢముగఁ బోషించి యున్నాడు. జగజ్జ్యోతియు, విష్ణుస్వరూపమును నగు సూర్యుని వర్ణించుచుఁ దిక్కన గ్రహించిన పవిత్రములగు నుపమానము లతని యుదాత్త కవితాతత్త్వమునకు నిదర్శనము లగును.'' (భారతము- తిక్కన రచన - రెండవ ముద్రణ: 1962 పు. 25-26). హరి హర బ్రహ్మ మహానుభావంబు లొక్కటి గాఁగఁ గరఁగిన గుటిక యనఁగ' - అనే పాఠాంతరం ఉన్నది.

కీచకుఁడు ద్రౌపది నియ్యకొలుప యత్నించుట (సం.4-21-7)

వ. ఇట్లు సూర్యోదయ మగుటయు సమయ సముచిత కరణీయంబులు వేగిరంబ నడపి వేగిరపాటుతో సింగారంబు సేసికొని సింహబలుండు. 242

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సూర్య+ఉదయము+అగుటయున్= ప్రొద్దు పొడుపు కాగా; సింహబలుఁడు= కీచకుడు; సమయ సముచిత= సమయానికి తగిన; కరణీయంబులు= పనులు; వేగిరంబు+అ= త్వరగా; నడపి= జరిపి; వేగిరపాటుతోన్= తొందరపాటుతో; సింగారంబు+చేసికొని= అలంకరించుకొని.

తాత్పర్యం: ఇట్లు సూర్యోదయం కాగా, ప్రాతఃకాలంలో చేయదగిన కృత్యాలను త్వరగా పూర్తి చేసి, వడివడిగా అలంకరించుకొని కీచకుడు.

విశేషం: కీచకుడు 'నానాభరణధరణ శీలుఁడు' అని తిక్కన (2.32) చెప్పటం గమనించదగింది. అతడి వేగిరపాటు కామ భావోద్వేగాన్ని సూచిస్తున్నది. (సంపా.)

క. **తన మదిఁ గదిరిన తమకం । బునఁ జిడిముడిపడుచు ద్రుపదపుత్రికపై నూ**
నిన వేడ్క దిగువ నొకటియుఁ । గనుఁగొన విన లేక మదనకంపితుఁ డగుచున్. **243**

ప్రతిపదార్థం: తన మదిన్= కీచకుడి మనస్సులో; కదిరిన తమకంబునన్= అధికమైన మోహంతో; చిడిముడి పడుచున్= తొట్రుపడుతూ; ద్రుపద పుత్రికపైన్= ద్రౌపదిపై; ఊనిన వేడ్క= కలిగిన కోరిక; తిగువన్= ఆకర్షించగా; ఒకటియున్+కనుఁగొనన్= ఏ ఒక్కటీ చూడటానికి; వినన్= వినడానికీ; లేక= మనస్సు నిలువక; మదనకంపితుఁడు+అగుచున్= మన్మథ చలితుడై.

తాత్పర్యం: కీచకుడు తన మనస్సులో పెరిగిన మోహంతో చిడుముడిపాటుతో తొట్రుపడుతూ ద్రౌపదిపై కలిగిన ఉత్కంఠతో ఏదీ చూడలేక, ఏదీ వినలేక మదనావేశంతో, (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'కామాతురాణాం న భయం న లజ్జా' అనే సూక్తికి ఇది నిదర్శనంగా కనబడుతున్నది. ఇక్కడ కీచకుడి కంటికి ఏదీ కనబడదు. చెవికి ఏదీ వినబడదు.

వ. **అతిత్వరితంబ సుదేష్ణ మందిరంబున కరుగుచు నంతరంగంబున.** **244**

ప్రతిపదార్థం: అతిత్వరితంబు+అ= మిక్కిలి వేగంగా; సుదేష్ణ మందిరంబునకున్= సుదేష్ణ ఇంటికి; అరుగుచున్= వెళ్లుతూ; అంతరంగంబునన్= మనస్సులో.

తాత్పర్యం: అతి వేగంగా సుదేష్ణ అంతఃపురానికి వెళ్ళుతూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. **'చయ్యన నేఁగి యంబుజ విశాల విలోచనఁ గాంచి ప్రీతిమై**
నయ్యెడ నేకతంబ హృదయం బలరం దఁగఁబల్కి యొక్కమై
నియ్యకొనంగఁ జేసి యెలయించెద, నిక్కకుఁ దార్చి, నేర్పునన్
శయ్యకుఁ దెచ్చెదం గుసుమసాయకు పూనికి నేఁడ తీర్చెదన్'. **245**

ప్రతిపదార్థం: చయ్యనన్+ఏఁగి= త్వరగా వెళ్లి; అంబుజ విశాల విలోచనన్= పద్మాలవలె విశాలమయిన కన్నులు గల ద్రౌపదిని; కాంచి= చూచి; ప్రీతిమైన్= ప్రేమతో; ఆ+ఎడన్= అక్కడే; ఏకతంబు+అ= ఒంటరిగా; హృదయంబు+అలరన్+తగన్+పల్కి= మనస్సు మెచ్చుకునేటట్లు తగినట్లు మాట్లాడి; ఒక్కమైన్= ఏదో ఒక విధంగా; ఇయ్యకొనంగన్+చేసి= అంగీకరించేటట్లు చేసి;

ఎలయించెదన్= అలరిస్తాను; ఇక్కకున్= ఏకాంత మందిరానికి; తార్చి= చేర్చి; నేర్పునన్= మెలకువతో; శయ్యకున్+తెచ్చెదన్= పడకపై చేరుస్తాను; నేఁడు+అ= ఈరోజే; కుసుమసాయకుపూనికిన్= మన్మథుడి ప్రయత్నాన్ని, రతిసౌఖ్యాన్ని; నేఁడు+అ= ఈ దినమే; తీర్చెదన్= పూర్తి చేస్తాను.

తాత్పర్యం: 'నేను త్వరగా పోయి, సైరంధ్రిని చూచి, ప్రీతితో అక్కడ ఏకాంతంలో కలిసి మనసు మురిసేటట్లు మాట్లాడి, ఏదో విధంగా ఆమెను ఒప్పించి ఇంటికి తీసికొని వచ్చి, నేడే నా మదనవాంఛను తీర్చుకొంటాను.'

విశేషం: మదనావేశంలో ఊగిసలాడుతున్నాడు కీచకుడు. సైరంధ్రి అంగీకరిస్తుందా? లేదా? అనేది అనుమానం. తార్చి= అనే మాట తార్పుడుగాండ్ర విషయంలో వాడుతారు. వ్యభిచార స్వభావం కలవారిపట్ల అది సరిపోతుంది. మాటి మాటికి మదనావేశంతో పరవశించిపోతున్నాడు కీచకుడు.

క. అని యువ్విళ్లూరుచు వెసఁ। జని కేకయ రాజపుత్రి సదనంబున న
య్యనిమిషచారువిలోచన। యనురూప విధాన నిరతయై యుండంగన్. 246

ప్రతిపదార్థం: అని, ఉవ్విళ్లూరుచున్= అని ఉబలాటపడుతూ; వెసన్+చని= త్వరగా వెళ్ళి; కేకయ రాజపుత్రి సదనంబునన్= సుదేష్ణ మందిరంలో; ఆ+అనిమిషచారువిలోచన= ఆ చేపలవంటి అందమైన కనులుగల సైరంధ్రి; అనురూప విధాన= ఆమె వృత్తికి తగిన పనిలో; నిరత+ఐ+ఉండంగన్= లగ్నమై ఉండగా.

తాత్పర్యం: కీచకుడు ఆ విధంగా ఉబలాటపడుతూ త్వరగా వెళ్ళి సుదేష్ణ మందిరంలో అందమైన కనులుగల సైరంధ్రి తన పనిలో నిమగ్నఅయి ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'అనిమిష చారు విలోచన' అనే విశేషణం ద్రౌపది తత్కాలంలో కీచకుడి వర్తనం పట్ల ప్రదర్శిస్తున్న జాగరూకతనూ, 'అనురూప విధాన' మనే ప్రయోగం భీమద్రౌపదులు క్రిందటి రాత్రి యోచించిన పథకానికి అనుగుణంగా - అనే అర్థాన్ని కూడా ధ్వనింప చేయటం విశేషం. (సంపా.)

చ. కనుఁగొని యప్డు గ్రొత్తయగు కౌతుకవృత్తి మునింగి పల్లటి
ల్లిన ధృతితోఁ గ్రమం బరయలేని మనంబు చలింప నచ్చటన్
జను లెడ యౌటఁ గాంచు నెఱి సాలక గ్రక్కున నింతిఁ జేరఁగాఁ
జనియె విధాతృలుబ్ధకవశంబునఁ బోవు మృగంబు చాడ్పునన్. 247

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; అప్డు= ఆ సమయంలో; క్రొత్త+అగు కౌతుకవృత్తిన్= క్రొత్తదైన అనుభవం కొరకు పడే ఆశగల భావంతో; మునింగి= పడిపోయి; పల్లటిల్లిన= మిగుల చలించిన; ధృతితోన్= ధైర్యంతో; క్రమంబు+అరయలేని= ఉచితానుచితాలు తెలిసికొనలేని; మనంబు= మనస్సు; చలింపన్= స్పందించగా; అచ్చటన్= అక్కడ; జనులు ఎడ+ఔటన్= పరివారం దూరం కావటం కొరకు; కాంచు= నిరీక్షించి చూచే; నెఱి= ఓపిక, బుద్ధి; చాలక= సరిపోక; విధాతృ= బ్రహ్మ అనే; లుబ్ధక వశంబునన్= వేటగాని చేతిలో పడటానికి; పోవు= పోయే; మృగంబు చాడ్పునన్= జింకవలె; గ్రక్కునన్= త్వరగా; ఇంతిన్+చేరఁగాన్= ద్రౌపదిని సమీపించటానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: సైరంధ్రిని చూచి కీచకుడు క్రొత్త కోరికలు చిగురెత్తగా ఆసక్తిలో మునిగి, ధైర్యం కోల్పోయి, వివేకాన్ని వీడి, మనస్సు చలించగా, దగ్గరలో పరిజనం లేకుండా వేచిచూచే ఓపిక కూడా లేకుండా విధి అనే వేటగాడి ఉరిలోకి తనంతటతాను ఉరికే మగజింకవలె శీఘ్రంగా ఆమె సమీపానికి వెళ్ళాడు.

విశేషం: అలం: ఉపమ. జరగబోయే కథను వ్యంగ్యంగా చెప్పుతున్నాడు కవి. కీచకుడు మృగం వలె ప్రాణాలు కోల్పోతాడు. అయితే అది విధి నిర్ణయం. వాడు దానికి లోబడ్డాడు. మృగోపమానం ఇంద్రియలోలుపత్వాన్ని ధ్వనింపచేస్తున్నది.

క. చనుటయు ద్రౌపది యతనిం। గనియుం గానని విధంబు గైకొని చిత్తం
బున బెదరక తనముందటి। పనివెరవున నుండె భీముపలుకుల యూఁతన్. 248

ప్రతిపదార్థం: చనుటయున్= వెళ్ళగా; ద్రౌపది; అతనిన్+కనియున్= కీచకుడిని చూచి కూడా; కానని విధంబు+ కైకొని= చూడనట్లుగా భావించి; చిత్తంబునన్+బెదరక= మనస్సులో భీతిల్లక; భీముని పలుకుల+ఊఁతన్= భీముడిచ్చిన మాటల ధైర్యంతో; తన ముందటి= అతడు రాక మునుపు తన చేతిలో ఉన్న; పనివెరవునన్+ఉండె= పనిలో నిమగ్నఅయి ఉన్నది.

తాత్పర్యం: అట్లా కీచకుడు దగ్గరికి వెళ్ళగా, ద్రౌపది భీము డిచ్చిన మాటలను ఊతగా తీసికొని, అతడిని చూచినా చూడనట్లు నటిస్తూ, దూరంగా తొలగిపోకుండా, మనోధైర్యంతో తాను చేస్తూఉన్న పనిలో నిమగ్నురాలైనట్లు ఉండింది.

వ. అట్టియెడ. 249

తాత్పర్యం: ఆ సమయంలో.

సీ. ఎవ్వరితోనైన నెలుఁగెత్తి యొక్కింత। పనిలేని వెంగలి పలుకు వలుకు;
మట్టియ లొండొంటి బిట్టుదాఁకఁగ నేల। నందంద మునిగాళ్ళ నప్పళించుఁ;
గడువికారంబుగా నొడలెల్ల విఱుచుచు। మలఁగి రిత్తకు రిత్త సెలఁగి నవ్వుఁ;
దాళంబుగాఁ గరతలమునఁ బెలుచఁ గం। బంబు వ్రేయుచు వెడపాట పాడు;

తే. మలయు, నంతంతఁ జేరువఁ బొలయు, నింతి। తన్ను చూడమి కెంతయుఁ దల్లడిల్లు;
నిక్కడక్కడఁబడుఁ, దగు లినుమడింపఁ। జూచు నత్తన్విఁ బొరిఁబొరిఁ గీచకుండు. 250

ప్రతిపదార్థం: కీచకుండు= కీచకుడు; ఎవ్వరితోన్+ఐనన్= ఎవరితోనైనా; ఎలుఁగు+ఎత్తి= గొంతెత్తి; ఒక్కింత= కొంచెమైనా; పనిలేని= వ్యర్థమైన; వెంగలిపలుకు= తెలివిలేని మాటను; పలుకున్= మాట్లాడుతాడు; మట్టియలు= కాలి మట్టెలు; ఒండొంటిన్= ఒకదానికొకటి; బిట్టుదాఁకఁగన్= గట్టిగా తాకగా; నేలన్= నేలమీద; అందంద= అక్కడక్కడ; ముని+కాళ్ళన్= ముందు కాళ్ళతో, కొనగోళ్ళతో; అప్పళించున్= తట్టేవాడు; కడువికారంబు+కాన్= మిక్కిలి అసహ్యంగా; ఒడలు+ఎల్లన్= శరీరమంతా; విఱుచుచున్= విరుస్తూ; మలఁగి= మరలి; రిత్తకు రిత్త= వృథాగా; చెలఁగి నవ్వున్= పెద్దగా నవ్వేవాడు; కరతలమునన్= అరచేతితో; తాళంబుగాన్= తాళంగా; పెలుచన్= శబ్దం చేసేటట్లు; కంబంబు వ్రేయుచున్= స్తంభాన్ని తట్టుతూ; వెడపాట పాడున్= అల్పమైన పాట పాడేవాడు; అంతంతన్= అక్కడక్కడ; మలయున్= తిరుగుతాడు; చేరువన్= దగ్గరగా; పొలయున్= సంచరిస్తాడు; ఇంతి= ద్రౌపది; తన్నున్= (కీచకుడిని); చూడమికిన్= చూడకపోవటానికి; ఎంతయున్+తల్లడిల్లున్= ఎంతో బాధపడతాడు; ఇక్కడ+అక్కడ= ఇక్కడా అక్కడా; పడున్= పడతాడు; తగులు= మోహం; ఇనుమడింపన్= రెట్టింపు కాగా; ఆ తన్విన్= ద్రౌపదిని; పొరిన్+పొరిన్= మాటిమాటికీ; చూచున్= చూస్తాడు.

తాత్పర్యం: కీచకుడు కంటబడ్డవారితో వృథాగా మాటలు చెప్పుతూ, కాలిమట్టెలు శబ్దం చేసేటట్లు మునిగాళ్ళతో నేల మీద తడుతూ, వికారంగా ఒడలు విరుచుకొంటూ, అకారణంగా నవ్వుతూ, అరచేతితో స్తంభాన్ని తట్టి తాళం వేస్తూ,

వెడ పాట పాడుతూ, సైరంధ్రికి దగ్గరగా వెళ్ళి, ఆమె తనను చూడకపోవటంతో మిక్కిలి బాధపడుతూ, అధిక మోహంతో సైరంధ్రిని చూస్తూ ఉన్నాడు.

విశేషం: అలం: యథాసంఖ్యం. కీచకు డిక్కడ ప్రదర్శిస్తున్న చేష్టలు దుర్విలాసాలని తరువాతి వచనంలో తిక్కన పేర్కొన్నాడు. అవి కీచకుడి ఉన్మత్తావస్థను ధ్వనింపచేస్తున్నాయి. ఒక్కొక్క చేష్ట ఒక్కొక్క దుర్విలాసాన్ని తెలుపుతున్నట్లు క్రమంగా అన్వయించటం అలంకార సౌందర్యం. అక్కడక్కడే తిరుగుతూ అనవసరంగా, అర్థరహితంగా, ఎవ్వరితో పడితే వారితో పెద్దగా గొంతు పెంచి మాట్లాడాడట- తాను వచ్చినట్ల సైరంధ్రి తెలిసికొని కన్నెత్తి చూడాలని! కాని, ఆమె దగ్గరలో ఉండి కూడా అతడిని చూడలేదు. అందుకని కాలి మట్టెలు నేలకు తాకేటట్లుగా శబ్దం చేస్తూ మునికాళ్ళను అప్పళించాడు. అయినా ఆమె చూడలేదు. (ఆరోజులలో మగవాళ్ళు కూడా మట్టెలు పెట్టుకొనేవారు కాబోలు! అందరూ కాకపోయినా కీచకుడి వంటి నానాభరణధరణశీలురు ధరించేవారేమో! అవి ధనవంతుల అలంకారాలలోనివి కావచ్చును.) అందుకు కలతపడ్డాడు. ఆమెను ఆకర్షించటానికీ, తన విరహవేదనను ఆమెకు తెలుపటానికీ ఒడలెల్లా విరుస్తూ, కారణం లేకుండానే కలకలా నవ్వుతూ క్రిందా మీదా పడ్డాడు (శతధా యత్నించాడని భావం). అయినా లాభం లేకపోయింది. మోహం అతిశయించగా ఆమె వైపు సూటిగా తేపతేపకు చూస్తూ స్తంభాల మీద చేతులు పెట్టి తాళం వేస్తూ కూనిరాగాలు తీయటం మొదలుపెట్టాడు. ఉన్మత్తుడి వింత వలపును అభినయ సుందరంగా చలనచిత్రంగా చిత్రించిన తిక్కన నాటకీయత కీపద్యం చక్కని ఉదాహరణం. (సంపా.)

వ. ఇట్లు బహుప్రకారంబులగు దుర్విలాసంబులు సేయుచు నద్దురాత్ముండు ద్రుపదనందన డాయంబోయి. 251

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; బహుప్రకారంబులు+అగు= అనేకరకాలైన; దుర్విలాసంబులు= చెడుశృంగార చేష్టలు; చేయుచున్= చేస్తూ; ఆ దురాత్ముండు= ఆ కీచకుడు; ద్రుపదనందనన్= ద్రౌపదిని; డాయన్+పోయి= సమీపించి.

తాత్పర్యం: ఈ విధంగా అనేకరకాలుగా వికార శృంగార చేష్టలు చేస్తూ ఆ దుష్ట కీచకుడు ద్రౌపదిని సమీపించి.

ఉ. 'భాగ్యము గాదె నీ చరణపద్మము లెప్పుడుఁ జేరి కొల్వఁగా
యోగ్యత గల్గెనేని, నను నొక్కని నొల్లవొ? కామసౌఖ్యవై
రాగ్యము నీ మనంబునఁ దిరంబొ? నిజం బెఱుఁగంగఁ జెప్పు; సౌ
భాగ్యము గుందునే మగలపై నొక యించుక చూడ్కి నిల్పినన్. 252

ప్రతిపదార్థం: నీ చరణపద్మములు= నీ (ద్రౌపది) పాదపద్మాలు; ఎప్పుడున్= నిరంతరం; చేరికొల్వఁగాన్= ఆశ్రయించి కొలవటానికి; యోగ్యత కల్గెన్+ఏని= అవకాశం కలిగితే; భాగ్యము+కాదె!= అదృష్టం కదా!; ననున్+ఒక్కనిన్+ఒల్లవొ?= ఈ కీచకుడిని ఒకడినే కోరుకొనవా?; నీ మనంబునన్= నీ మనస్సులో; కామసౌఖ్యవైరాగ్యము= మన్మథసుఖాలపై ఆశలేకపోవటం; తిరంబొ?= మారనిదా?, స్థిరమా?; నిజంబు+ఎఱుఁగంగన్+చెప్పు= ఉన్నమాట తెలిపేటట్లు చెప్పుము; మగలపైన్= పురుషుల మీద; ఒక+ ఇంచుక చూడ్కినిల్పినన్= కొంచెమైనా దృష్టి నిలిపితే; సౌభాగ్యము= నీ అందం; కుందునే?= తగ్గిపోతుందా?

తాత్పర్యం: 'నీ పాదపద్మాలను ఆశ్రయించి కొలిచే భాగ్యమబ్బితే అదృష్టవంతుడిని గదా! ఈ కీచకుడిని ఒక్కడినే మోహించటం ఇష్టం లేదా? లేక పురుషజాతిపైనే వైరాగ్యభావం కలిగిందా? ఉన్న విషయం స్పష్టంగా చెప్పుము. మగవారివైపు కాస్త కడకంటిచూపు ప్రసరింపజేస్తే నీ సొమ్మేమైనా తరిగిపోతుందా?

విశేషం: క్షణక్షణానికి కీచకుడి వియోగవ్యథ అధికమవుతున్నది. మాటలు తూలుతున్నాడు. అడుగులకు మడుగులొత్తటానికి కూడా సిద్ధపడుతున్నాడు. 'సౌభాగ్యము కుందునే' - నీ సొమ్మేమైనా పోతుందా? అనే జాతీయానికి ప్రతిరూపం. స్త్రీకి సౌభాగ్యం అందం - కాబట్టి అందమైనా అ(త)రిగిపోతుందా? అన్నట్లు కూడా గ్రహించవచ్చును.

ఉ. ఆలము సేసి నా తగుల మాఱడిపుచ్చఁగ నేల బేల! న
న్నేలి యనంత భోగముల నిచ్చమెయిన్ విహరింపు నిత్యల
క్ష్మీ లతికాలవాలమగు జీవనమంతయు నీ మొగంబకాఁ
బాలన సేయు మిప్పురము భామిను లెల్లను నిన్నుఁ గొల్వఁగన్. 253

ప్రతిపదార్థం: ఆలము+చేసి= నిర్లక్ష్యం చేసి; నా తగులము= నా ఆశను; ఆఱడిపుచ్చఁగన్+ఏల?= వృథా చేయటం ఎందుకు?; బేల!= ఓ అమాయకురాలా!; నన్నున్+ఏలి= నన్ను (ఈ కీచకుడిని) వరించి; అనంతభోగములన్= అపారమైన సుఖాలతో; ఇచ్చమెయిన్= నీ ఇష్టం వచ్చినట్లు; విహరింపు(ము)= క్రీడించుము; నిత్యలక్ష్మీ= నిరంతర సంపద అనే; లతికా+ఆలవాలము+అగు= తీగకు పాదు అయిన; జీవనము+అంతయున్= నా బ్రతుకంతా; నీ మొగంబు+అకాన్= నీ పక్షం కాగా; ఈ+పురము= ఈ పట్టణంలోని; భామినులు+ఎల్లను= స్త్రీలంతా; నిన్నున్+కొల్వఁగన్= నిన్ను సేవించగా; పాలన చేయుము= ఏలుకొమ్ము.

తాత్పర్యం: ఓ అమాయకురాలా! ఈ విధంగా నన్ను లెక్కపెట్టకుండా చూచి నీపై నా ఆశను వమ్ము చేయకుము. నన్ను అనుగ్రహించి అంతు లేని సంపదలను, సుఖాలను స్వేచ్ఛగా అనుభవించుము. నా సంపదకు నీవే రాణివై ఈ పట్టణంలోని స్త్రీలు అందరూ నిన్ను కొలువగా రాణివాసంలో రాణించుము.

విశేషం: అలం: శ్లిష్టరూపకం. లక్ష్మీలతికలకు ఆలవాలం జీవనం - జీవనమంటే నీరని అర్థం. లతలకు నీరు, సంపదలకు బ్రతుకు అని శ్లేష మొత్తం మీద రూపకాలంకారం. కామాంధులైన రావణ కీచకులు ఒకే మాదిరి మాట్లాడారు. రావణుడు కూడా సీతమ్మను ఇట్లాగే ప్రలోభపెట్టాడు. ద్రౌపదితో కీచకుడు సంపదలను గూర్చిన ప్రలోభాన్ని కలిగించే మాటలు మాట్లాడటం వ్యర్థం. ఆమె మనస్సు చలించదు.

ఉ. రాజుల నెల్ల నుగ్రసమరంబుల వ్రేల్మిడి నేర్చి పేర్చి యీ
భూజనకోటి నాదగు విభుత్వ సమగ్రత నాదరింప వి
భ్రాజిత రాజ్యతంత్రములు పాలన సేయుదు నేన; వీటికిన్
రా జనఁగా నెపం బిడి విరాటునకుం దగఁ గూడు వెట్టుదున్. 254

ప్రతిపదార్థం: ఉగ్రసమరంబులన్= తీవ్రమైన యుద్ధాలలో; రాజులన్+ఎల్లన్= రాజులనందరినీ; వ్రేల్మిడిన్= క్షణకాలంలో; ఏర్చి= దహించి; పేర్చి= అతిశయించి; ఈ భూజనకోటి= ఈ ప్రజల సమూహం; నాదగు= నాయొక్క; విభుత్వ సమగ్రతన్= ఆధిపత్య పరిపూర్ణతను; ఆదరింపన్= గౌరవించగా; విభ్రాజిత= ప్రకాశించే; రాజ్యతంత్రములు= రాచరికపు కార్యకలాపాలు; నేను+అ= కీచకుడైన నేనే; పాలన+చేయుదున్= నిర్వహిస్తున్నాను; వీటికిన్= ఈ నగరానికి; రాజు+అనఁగాన్= రాజు అనే; నెపంబు+ఇడి= సాకు చెప్పి; విరాటునకున్+తగన్+కూడు పెట్టుదున్= విరాట మహారాజుకు తగినట్లుగా అన్నం పెట్టుతున్నాను.

తాత్పర్యం: నేను భయంకర యుద్ధాలలో రాజులనందరినీ యుద్ధభూమిలో క్షణంలో చంపి, మించి, ఈ దేశంలో జనులందరూ నా సమగ్ర ప్రభుత్వాన్ని ఆదరిస్తూ ఉండగా నేనే రాజునై రాజ్యాంగం నడుపుతున్నాను. నామమాత్రంగా విరాటరాజును రాజుగా పేరుపెట్టి అతడికి తగినట్లు తిండి పడవేస్తున్నాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: కీచకుడి ఆత్మస్తుతి అతడి ఔద్ధత్యాన్ని ప్రదర్శిస్తున్నది. (సంపా.)

వ. కావున. **255**

తాత్పర్యం: కాబట్టి.

క. నీ వొకత వేల? యిలఁ బది । వేవుర నే వలచి పట్ట వెదకిన నడ్డం
బై వచ్చి వలదు నా నిం । దేవాఁడు మగండు? దీని నెఱుఁగవు కంటే! **256**

ప్రతిపదార్థం: నీవు ఒకతవు+ఏల?= నీవు ఒక్కదానివే కాదు; ఇలన్= భూమిపై; పదివేవురన్= పదివేల మందిని; నే వలచిపట్టన్= నేను కోరిపట్టుకొనదలచి; వెదకినన్= వెదికిచూస్తే; అడ్డంబు+ఐ+వచ్చి= అడ్డంగా వచ్చి; వలదునాన్= వద్దని అనడానికి; ఇందున్+ఏ+వాఁడు= ఇక్కడ ఎవ్వడు; మగండు= పురుషుడు (సమర్థుడు) కలడు?; దీనిన్+ఎఱుఁగవు, కంటే!= దీన్ని తెలిసికొనలేకున్నావుగదా!

తాత్పర్యం: ఓ సైరంధ్రీ! నీవు ఒక్కదానివే కాదు, భూమిపై పదివేలమందినైనా నేను కోరి పట్టుకొంటే కాదని వారించగల మగాడు ఇక్కడ లేడు. దీనిని నీవు తెలిసికొనలేకున్నావు కదా!

విశేషం: కన్ను మిన్ను తెలియని అహంకారం కీచకుడి కంటికి పొరగా నిలిచింది.

చ. విరటుఁడు సూచుచుండ నిను వేవుర ముందట నట్లు ద్రోవ నొ
క్కరుఁడును గాదుగూడ దనఁగల్గెనె? పోటరులైన భర్త లే
వురు గలరంటి; వారి యలవుం జలముం గడగంటి; నింక నె
వ్వరు గల? రెట్లు దప్పె? దనివారణఁ బట్టెద నెందుఁ జొచ్చినన్.' **257**

ప్రతిపదార్థం: విరటుఁడు= విరాటరాజు; చూచుచుండన్= చూస్తుండగా; నినున్= ద్రౌపదిని; వేవుర ముందటన్= వేలమంది ముందు; అట్లు త్రోవన్= అట్లా త్రోసివేయగా; ఒక్కరుఁడును= ఒక్కడు కూడా; కాదు కూడదు+అనన్+కల్గెనె?= ఇది తగనిది, చేయరానిది అనగలిగాడా?; పోటరులు+ఐన= బలవంతులైన; భర్తలు= మగలు; ఏవురు= ఐదుగురు; కలరు+అంటి(వి)= ఉన్నారన్నావు; వారి+అలవున్= వారి బలసంపద; చలమున్= పట్టుదల; కడ+కంటిన్= అంతుచూచాను; ఇంకన్+ఎవ్వరు కలరు?= ఇంక ఎవరున్నారు?; ఎట్లు తప్పెదు?= ఎట్లా తప్పించుకొంటావు?; ఎందున్+చొచ్చినన్= ఎక్కడ చొరబడ్డా; అనివారణన్= అడ్డులేకుండా; పట్టెదన్= పట్టుకొంటాను, వశం చేసికొంటాను.

తాత్పర్యం: విరాటమహారాజు చూస్తుండగా సభలో వేలమంది ముందట నేను నిన్ను అట్లా త్రోసిపడవేసినా నన్ను అడ్డుకొన్నవారు ఎవరూ లేరు. నీకు బలవంతులైన ఐదుగురు భర్తలున్నారని పలికావు. వారి బలపరాక్రమాలు ఇప్పుడు తెలిసివచ్చాయి కదా! వారి అంతు చూస్తాను. నీవు ఎక్కడ చొరబడ్డా, అడ్డులేకుండా నిన్ను గ్రహిస్తాను.

విశేషం: ముందు వినయంగా, ఆ తర్వాత కఠినంగా మాట్లాడటం దుష్టుల లక్షణం. ఇక్కడ శ్రుతిమించి రాగాన పడుతున్నది కీచకుడి మాట తీరు. పట్టుకొంటాను - అనే క్రియ అతడి భావి క్రియకు సూచనగా చివర నిలపటం విశేషం. దానిని ద్రౌపది గ్రహించి కార్యాచరణకు దిగవలసి ఉన్నది. 'త్రోపన్' అనే పాఠానికి 'తాపన్', 'తన్నన్' అనే పాఠాంతరాలు ఉన్నాయి. (వివరాలకు ఈ ఆశ్వాసంలోని 128వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. **అనిన నవ్వెలంది 'వీఁడు దమకించి యున్నవాడు; నా యంత్రించు మాటలకు మున్న కదియంబడినఁ గర్జంబు దప్పు' నని విచారించి.** **258**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+వెలంది= ద్రౌపది; వీఁడు= కీచకుడు; తమకించి+ఉన్నవాఁడు= త్వరపడుతున్నాడు; నా యంత్రించు మాటలకున్+మున్ను+అ= నేను కట్టడి చేసే మాటలు చెప్పక పూర్వమే; కదియన్+పడిన= మీదపడితే; కర్జంబు+తప్పున్+అని= చేయవలసిన పని చెడుతుందని; విచారించి= ఆలోచించి.

తాత్పర్యం: 'కీచకుడు నన్ను పట్టుకొనటానికి త్వరపడుతున్నాడు. నేను కట్టడి చేయవలసిన మాటలు చెప్పకముందే వీడు నన్ను సమీపిస్తే అనుకొన్న పని చెడిపోతుం'దని ఆలోచించి, ద్రౌపది. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **బహువిధంబుల నమ్మెయిఁ బలుకు నతని । పలుకు లేర్పడ విని, మెత్తఁబడినయట్లు**
సుభగ మెయివడి చూపుగాఁ జూచి తనదు । హృదయ మెఱిఁగించు తెఱఁగున నిట్టులనియె. **259**

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ విధంగా; బహువిధంబులన్= అనేక ప్రకారాలుగా; పలుకు= మాట్లాడే; అతని పలుకులు= కీచకుడి మాటలు; ఏర్పడన్+విని= శ్రద్ధగా ఆలకించి; మెత్తన్+పడిన+అట్లు= అంగీకరించినట్లుగా, లోబడినట్లుగా; సుభగ= మంచి భాగ్యంగల ద్రౌపది; మెయివడి చూపుగాన్= ఒప్పుకొన్న చూపుగా చూచి; తనదు హృదయంబు+ఎఱిఁగించు తెఱఁగునన్= తన మనస్సు బయటపెట్టుతున్నట్లుగా; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఆ విధంగా అనేక రీతులుగా పలుకుతున్న కీచకుడి మాటలన్నీ ద్రౌపది శ్రద్ధగా విని, మనసు మెత్తపడి అంగీకరించినట్లు అతడి వైపు చూచింది. తన మనసులోని మాటను చెప్పుకొంటున్నట్లు ఇట్లా పలికింది.

విశేషం: మెత్తబడటం మనసుకు సంబంధించిన గుణం. మెయివడి చూపులు ఆంగికాభినయానికి సంబంధించినవి. ఇక వాచికాభినయం ప్రారంభం కానున్నది. అభినయభాషలో చెప్పిన అందమైన భావం. (సంపా.)

చ. **'వలదని యెంత సెప్పినను వావిరివై కడు వేగపాటుమైఁ**
బలుమఱు నెల్లెడం దొడరఁబాఱెదు; నీ హృదయంబు నట్లకాఁ
దలఁపు మనోజు తూపులకుఁ దక్కటి చిత్తములుం; గడంగి వి
చ్చలవిడిసేఁత గర్జమె? విచారము గోర్కికిఁ గాని వావియే? **260**

ప్రతిపదార్థం: వలదు+అని= వద్దని; ఎంత చెప్పినను= ఎంత చెప్పినా; వావిరివి+ఐ= వెంటబడివచ్చేవాడివై; కడువేగపాటుమైన్= మిక్కిలి తొందరపాటుతో; పలుమఱున్= పెక్కుసార్లు; ఎల్ల+ఎడన్= కనబడిన ప్రతిచోటా; తొడరన్+పాఱెదు= నాతో కూడటానికి తొందరపడతావు; మనోజు తూపులకున్= మన్మథుడి బాణాలకు; నీ హృదయంబున్+అట్ల= నీ మనస్సు వలెనే; తక్కటి చిత్తములున్= ఇతరుల మనసులు కూడా; కాన్= ఔతాయని; తలఁపు= అనుకొమ్ము; కడంగి= పూనుకొని, కావాలని; విచ్చలవిడిచేఁత= గుట్టుమట్టు లేకుండా బయటపడి వ్యవహరించటం; కర్జమె?= తగిన పనియా?; విచారము= ఆలోచన; కోర్కికిన్= కోరికకు; కాని వావియే?= కాని వరసయా? (అంటే - కోరికకూ ఆలోచనకూ పొత్తు లేదా? అని భావం.)

తాత్పర్యం: 'నేను వద్దని ఎంత వారించినా వినకుండా వెంబడించి మాటిమాటికి తొందరపాటుతో నామీదికి వస్తున్నావు. నీ మనస్సు మన్మథవశమైనట్లే, అందరి మనస్సులుగూడ మదనావేశానికి లోనౌతాయని గ్రహించుము. ఆలోచనకూ కోరికకూ పొంతన ఉండదా?

విశేషం: మెత్తబడిన మానవతి నేరం మగవాడిమీద వేయటం గడుసుదనం. వలదని చెప్పిందట? ఏమి వలదని? అన్నది ప్రశ్న, ఎక్కడబడితే అక్కడ వెంటబడి కూడబలకటం వలదని చెప్పినట్లు తెలుతుంది. అయితే ఆమె కిష్టం లేదా? అని అనుమానం కలుగుతుంది. మన్మథుడు మగవాళ్ళను ఎట్లా బాణాలతో కొట్టుతాడో ఆడవాళ్ళను కూడా అట్లాగే కొట్టుతాడని ఊహించాలట. ఆ సంగతి తెలిస్తే మన్మథ క్రియ గుట్టుగా సాగాలని తెలుస్తుందట! బట్టబయలు ప్రణయం పనికిరాదట! లోకంలో రసికులకు కోర్కె ఉంటే చాలదట! దానిని గుట్టుగా తీర్చుకొనే ఆలోచన కూడా ఉండాలట! ఈ పద్యంలో చివరి వాక్యం మలి మెరుపు, 'విచారము గోర్కికి కాని వావియే? ఇందులో కాకుధ్వని ఉంది. నిజంగా ఆలోచించి పనిచేయటం కోర్కెతీరటానికి విరుద్ధమైన పొంతన కాదు. ఆలోచించి పనిచేస్తే మన బంధుత్వం కుదిరేదే - అని, కాకువులో ఆలోచించటం కోర్కె తీరటానికి తగిన పొంతన కాదు అనిన్నీ అర్థాలు ఏర్పడతాయి. మొదటి అర్థం ప్రకృతం. రెండవ అర్థం అప్రకృతమైనా భావికథార్థ వ్యంజకం! ఈ కాకువు వలన ద్రౌపది అక్రమ సంబంధాన్ని సమర్థిస్తున్న అర్థచ్ఛాయ కూడా కలుగకుండా తిక్కన కల్పించాడు. (సంపా.)

క. **మగ లడఁకువ నుండక తమ। తగులమ పాటింతు; రెట్టి తగులం బైనన్**
మగువల యెడలన యడఁగుం; దగవు విడిచి యడిచిపడరు ధైర్యము పేర్మిన్. **261**

ప్రతిపదార్థం: మగలు= పురుషులు; అడఁకువన్+ఉండక= అణగి మణగి ఉండక; తమ తగులము+అ= తమ మోహాన్నే; పాటింతురు= బహిర్గతం చేస్తారు; ఎట్టి తగులంబు+ఐనన్= ఎంత మోహమున్నా; మగువల+ఎడలన్+అ= స్త్రీల మనస్సులలోనే; అడఁగున్= అణగి ఉంటుంది; ధైర్యము పేర్మిన్= అధికమైన ధైర్యంతో; తగవు విడిచి= న్యాయం వదలి; అడిచిపడరు= బయటపడరు.

తాత్పర్యం: పురుషులు మోహావేశాన్ని రహస్యంగా ఉంచుకొనకుండా బయటకు వ్యక్తపరుస్తారు. స్త్రీలు తమ మోహాన్ని మనస్సులోనే ధైర్యంగా అణచుకొంటారుగాని, బయటపడరు.

విశేషం: ప్రణయ ప్రదర్శనలో స్త్రీ పురుషుల స్వభావాన్ని తెలిపే ఈ పద్యం సూక్తి, ఈ సూక్తిలో ధ్వనిగా స్ఫురించేది ద్రౌపది హృదయంలో ఉన్న గూఢమైన కోరిక. అది సూక్తిలో నిబద్ధం కావటం వలన ఆమె మాటలు దోషజుష్టాలు కావటం లేదు. ఇది తిక్కన ఆ పాత్రకు నేర్పిన వాక్య శిల్పం. (సంపా.)

తే. **ఇట్టు లగుట యెఱిఁగి యెల్లభంగుల రహ। స్యంబు గోలుపోనియట్లు గాఁగ**
నడరు నీదు కోర్కి కనురూప మెట్టిది। యట్టి భోగభంగి ననుభవింపు.' **262**

ప్రతిపదార్థం: ఇట్టులు+అగుట, ఎఱిఁగి= ఇట్లా ఉండటం తెలిసికొని; ఎల్లభంగులన్= అన్ని విధాల; రహస్యంబు కోలుపోని+ అట్లుకాఁగన్= రహస్యం బయటపడనట్లుగా; అడరు= అతిశయించే; నీదు కోర్కికిన్= నీ అభిలాషకు; అనురూపము+ఎట్టిది= తగిన విధమేదో; అట్టి భోగభంగిన్= అటువంటి అనుభవ పద్ధతితో; అనుభవింపుము= పొందుము.

తాత్పర్యం: ఓ కీచకా! ఈ విషయాన్ని నీవు తెలిసికొని, అన్ని విధాలా రహస్యం బయటపడని విధంగా, అంటే గోప్యంగా, అతిశయించే నీ కోర్కెకు అనువైన పద్ధతి ఏదో అటువంటి భోగపద్ధతిలోనే నన్ను పొందుము.'

విశేషం: ఈ పద్యానికి మరొక విధంగా అర్థం చెప్పవచ్చును. ద్రౌపది సమయోచితంగా వ్యూహం ప్రకారం అభినయిస్తూ మాట్లాడుతున్న వైఖరి ప్రకృతార్థం. అయితే, తిక్కన ఆమె నోట పతివ్రత పలుకరాని పలుకులు రాకుండా రక్షించే రచనా శిల్పాన్ని పాటిస్తున్నాడు. ఆ వరుసలో ఈ పద్యం పరాకాష్ఠ. ఇందులో భోగ ప్రసక్తి వచ్చింది. కాని అది అశ్లీలం కాకూడదు, అనౌచిత్యం కాకూడదు. కాబట్టి ఈ పద్యాన్ని ఈ విధంగా చెప్పుకొనవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్టులు+అగుట= స్త్రీలు బయటపడరు అనే విషయాన్ని - అంటే నా మనసులో ఉన్న గుట్టును నేను బయటపెట్టను అనే అంశాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; ఎల్లభంగులన్= అన్ని విధాలా; రహస్యంబు, కోలుపోని+అట్లు, కాఁగన్= భీముడు పన్నిన రహస్య వ్యూహం భగ్నంకాని విధంగా; అడరు= ఒప్పారు; నీదు కోర్కికిన్= నీవు నన్ను పొందాలి అనే అధర్మ వాంఛకు; అనురూపము+ఎట్టిది+అట్టి+భోగ, భంగిన్= తగిన ఫలం ఎటువంటిదో అటువంటి ఫలాన్ని (అంటే మృత్యువును); అనుభవింపుము= పొందుము.

తాత్పర్యం: నా గుట్టును నేను బయటపెట్టని పద్ధతిని తెలిసికొని, అన్నివిధాలా మా రహస్య వ్యూహం భగ్నం కాకుండా ఉండే విధంగానే సాగుతున్న నీ కోర్కెకు (నన్ను పొందాలన్న కోర్కెకు) ఎటువంటి ఫలాన్ని అనుభవించవలసి ఉంటుందో అటువంటి ఫలభోగాన్ని (మృత్యువును) పొందుము. కీచకుడికి కలిగిన పరసతీగమనవాంఛకు తగిన ఫలం మరణమని ద్రౌపది మాటలలోని గూఢార్థం. పరస్త్రీ గమనం వలన ఆయుస్సు క్షయమౌతుందని ఆర్యోక్తి, **"ఆయుః క్షతిర్వికలంతా పృపహాస్యతా చ । నిందార్థ హాని లఘుతా విగతిః పరత్ర । స్యాదేవ యద్యపి రతేన పరాంగనాయాః"**- ఇత్యాది సూక్తి లోకప్రసిద్ధం. ఈ తాత్పర్యం పఠితలు ఊహించగలిగింది; ద్రౌపదికి అవాచ్యదోషం కలిగించనిది, ఔచిత్యం పోషించేది, విజ్ఞులు మెచ్చేది, తిక్కన రచనా కళను తెలిపేది. కాని, కామి అయిన కీచకుడికి, కథాగతికి మొదటి అర్థమే ప్రస్తుతం. (సంపా.)

చ. అనవుడుఁ గీచకుండు హృదయంబునఁ బొంగి లతాంగితోడ ని
ట్లను 'ధృతిఁ గోలుపుచ్చెఁ గుసుమాయుధుఁ; డేటి విచార; మిట్టు లేఁ
ప నగునె? యైన నీదయిన పం పెదఁ గైకొని చేయువాఁడ; నే
యనువున నెప్పు డెయ్యెడ నిజాభిమతం బొడఁగూర్తు చెప్పుమా!' 263

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; కీచకుండు; హృదయంబునన్+పొంగి= మనస్సులో ఉప్పొంగి; లతాంగితోడన్= ద్రౌపదితో; ఇట్లు+అనున్; కుసుమ+ఆయుధుఁడు= మన్మథుడు; ధృతిన్+కోలుపుచ్చెన్= ధైర్యం సడలిపోయేటట్లు చేశాడు; ఏటి విచారము?= ఇంకా దిగులు ఎందుకు? ఇట్టులు= ఈ విధంగా; ఏఁపన్+అగునె?= బాధించ తగునా?; ఐనన్= అయినప్పటికీ; నీది+అయిన= నీయొక్క; పంపు= ఆజ్ఞను; ఎదన్+కైకొని= మనసారా; చేయువాఁడన్= చేస్తాను; ఏ+అనువునన్= ఏ ఉపాయంతో; ఎప్పుడు? ఏ+ఎడన్?= ఎక్కడ?; నిజ+అభిమతంబు= నా కోరిక; ఒడన్+కూర్తు(ను) చెప్పుమా?= తీరుస్తావో చెప్పుము.

తాత్పర్యం: ద్రౌపది చెప్పిన మాటలకు కీచకుడి హృదయం ఉప్పొంగిపోయింది. ఆమెతో ఇట్లా అన్నాడు; 'సరే! మన్మథుడు నా కొండంత ధైర్యాన్ని సడలించాడు. అయినా ఇంకా నన్ను బాధించటం ధర్మం కాదు. నీ ఆజ్ఞ మనసార పాటిస్తాను. నీ ఉపాయంతో నా కోరిక ఎప్పుడు ఎక్కడ తీరుస్తావో చెప్పుము.'

విశేషం: నిజ శబ్దాన్ని తిక్కన ఆత్మార్థంలోనూ, యుష్మదర్థంలోనూ, అస్మదర్థంలోనూ వాడాడు. ఇక్కడ అస్మదర్థంలో ప్రయోగించబడింది. (సంపా.)

క. అని పలికినఁ బాంచాలియుఁ । దన యురులం గీచకుండు దగులుట భావం
బున నిశ్చయించి యిట్లను । ననురాగాయత్తచిత్త యైనది వోలెన్. 264

ప్రతిపదార్థం: అని పలికినన్= అని కీచకుడు పలుకగా; పాంచాలియున్= ద్రౌపది కూడా; కీచకుండు; తన+ఉరులన్ +తగులుట= తన ఉచ్చులో చిక్కుకొనటం; భావంబునన్= మనస్సులో; నిశ్చయించి= నిర్ణయించుకొని; అనురాగ+ఆయత్తచిత్త+ఐన+అది+ పోలెన్= ప్రేమ నిండిన హృదయం ఉన్నదానివలె; ఇట్లు+అనున్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: కీచకుడు అట్లా మాట్లాడగా ద్రౌపది అతడు తన ఉచ్చులో చిక్కకొన్నాడని భావించి ప్రేమ నిండిన మనసుగలదానివలె ఇట్లా పలికింది.

విశేషం: ఇక్కడ ఉచ్చులో చిక్కుకొన్న మృగంతో కీచకుడిని పోల్చటం విశేషం. ప్రాణాలు కోల్పోవటానికి ముందు గిజగిజలాడే విధంగా ఉన్నది కీచకుడి మనస్స్థితి.

ఉ. 'ఉత్తర లోనుగాఁ గల పయోజముఖుల్ పగలెల్లఁ బ్రీతితో
నృత్తముఁ జేసి పోవ కమనీయరహస్యవిధిన్ నిశీథినీ
వృత్తముఁ గోరువారలకు వేడ్కకుఁ బట్టగుచుండు నా గృహం;
బుత్తమ మిత్తెఱంగునకు నొంటిమెయిం దగ నీవు వచ్చినన్.' 265

ప్రతిపదార్థం: ఉత్తర లోనుగాన్+కల పయోజముఖుల్= ఉత్తర మొదలైన పద్మవదనలు; పగలు+ఎల్లన్= పగలంతా; ప్రీతితోన్= ఇష్టంతో; నృత్తమున్+చేసి, పోవన్= నాట్యంచేసి పోగా; కమనీయ రహస్య, విధిన్= మనోజ్ఞమైన రహస్య పద్ధతిలో; నిశీథినీ, వృత్తమున్= చీకటి తప్పును; కోరు, వారలకున్= కోరేవాళ్ళకు; ఆ+గృహంబు= ఆ నర్తనశాల; వేడ్కకున్= వేడుకకు; పట్టు+అగుచున్+ఉండున్= చోటు అవుతూ ఉంటుంది; ఈ+తెఱంగునకున్= ఈ విధానికి; ఒంటిమెయిన్= ఒంటరిగా; ఈవు; తగన్= ఒప్పునట్లుగా; వచ్చినన్= వస్తే; ఉత్తమము= శ్రేష్ఠం.

తాత్పర్యం: ఉత్తర మొదలైన కన్యలందరూ పగలంతా ప్రీతితో నాట్యం చేసిపోగా అతిరహస్యంగా చీకటితప్పు చేయగోరేవారికి ఆ నర్తనశాల వేడుక కలిగించే సంకేతప్రదేశం. అటువంటి రహస్యక్రీడకు నీవు ఒంటరిగా వస్తే మంచిది.

విశేషం: ద్రౌపది తమోఽభిసారికవలె మాట్లాడింది. తమోఽభిసారిక అంటే చీకట్లో నల్లని దుస్తులు ధరించి ఎవరికీ తెలియకుండా, ఎవరూ గుర్తు పట్టకుండా స్వయంగా ప్రియుడిని కూడటానికి సంకేత స్థలానికి పోయే వనిత. **'కమనీయ రహస్య విధిన్ నిశీథినీ వృత్తము గోరువారలకున్'** అని ఉదాత్త సంస్కృత సమాసాలను ప్రయోగించటం సాభిప్రాయం. తాను అత్యంతరహస్యంగా రాత్రి చరిత్రను కోరుతున్నదని భావం. అనగా, అతి గోప్యంగా రాత్రిళ్ళలో మాత్రమే రహస్యరతిని ఆమె కోరుతున్నట్లు ధ్వని. ఇక్కడ ఔచిత్య పోషకంగా ఉదారత అనే అర్థగుణాన్ని ప్రదర్శించింది. అంటే అగ్రామ్యత్వం (గ్రామ్యత్వం ప్రసంగంలో దొరలకుండా ఆ భావాన్నే అగ్రామ్యంగా చెప్పటం) ప్రదర్శించింది. పద్యాన్వయంలో- 'ఆ గృహంబు ఉత్తమము' అని చెప్పి 'ఇత్తెఱంగునకు నొంటి మెయిం దగ నీవు వచ్చినన్' అని అసంపూర్ణంగా వాక్యాన్ని ముగించటంలో ఆమె కోర్కె వ్యంగ్యంగా వ్యక్తమౌతుందని కొందరు వ్యాఖ్యానిస్తారు. ఆ అన్వయం అంత సమర్థనీయం కాదు. ఆ గృహం ఉత్తమమనటం కంటె, నీవు ఒంటరిగా వస్తే 'ఉత్తమము' అని నిర్దేశించిందనటం ఉత్తమం. ఆ మాటను ఊనికతో వాక్యారంభంలో ఉంచటం సార్థకం. అతడు ఒంటరిగా రావటమే భీమ వ్యూహాన్ని అనుసరించి కమనీయ రహస్య విధిన్ నిశీథినీ వృత్తము కోరువారలకు (భీమద్రౌపదులకు) (ఆ పద్ధతియే) శ్రేష్ఠమైనది. ఉత్తమమైనది అని ధ్వని. గృహం కాదు ముఖ్యం, ఒంటరిగా రావటమని గ్రహించాలి. రాబోయే పద్యంలో కీచకు డిచ్చే సమాధానం ఈ అంశాన్నే ధ్రువపరుస్తున్నది. (సంపా.)

క. అనిన నతఁడు వికసిల్లుచు । 'నను నెమ్మెయి నేలుకొనిన నళినానన! నీ
యనుమతి సేయనె? యొక్కడఁ । జనుదెంచెద నేఁటి రాత్రి సమ్మదలీలన్. 266

ప్రతిపదార్థం: అనినన్= ద్రౌపది అట్లా అనగా; అతఁడు= కీచకుడు; వికసిల్లుచున్= ఉల్లాసపడుతూ; నళిన+ఆనన!= పద్మముఖీ! ద్రౌపదీ!; ననున్= నన్ను (కీచకుడిని); ఏ+మెయిన్= ఏవిధంగా; ఏలుకొనినన్= పాలించినా (ఇది శృంగార స్ఫోరకమైన పదం); నీ

అనుమతి+చేయనె?= నీ ఆజ్ఞ పాటించనా?; నేఁటి రాత్రి= ఈనాటి రాత్రి; సమ్మదలీలన్= సంతోషంతో; ఒక్కఁడన్= ఒక్కడినే; చనుదెంచెదన్= వస్తాను.

తాత్పర్యం: ద్రౌపది ఆ మాటలు అనగా కీచకుడు ఉల్లాసపడ్డాడు. 'ఓ పద్మముఖీ! నన్ను ఏ విధంగా నీవు ఏలుకొంటే ఆ విధంగా నీ ఆజ్ఞ శిరసావహిస్తాను. ఈ రాత్రికి నేను సంతోషంతో ఒంటరిగా వస్తాను.

విశేషం: తిక్కన పదప్రయోగ కౌశలం గమనించదగింది. అనుకొనని విధంగా సైరంధ్రి అంగీకారం తెలిపేసరికి కీచకుడికి సంతోషం కలిగింది. ఎట్లా? క్రమంగా ముఖం వికసించినట్లు, హృదయం విప్పారినట్లు అభినయంలో వ్యక్తమయ్యేటట్లు. 'వికసిల్లుచున్' అనే క్రియ ఆ భావాన్ని అభినయంలో గమ్యమానం చేస్తుంది. ఏలుకొనుట, అనుమతి - అనే మాటలు ప్రభుత్వంలోనూ, ప్రణయంలోనూ ఆయా అర్థాలలో ప్రయోగించే పదాలు. ద్రౌపదికి పూర్తిగా దాసుడైన కీచకుడు ఆమె ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించటానికి సిద్ధమయ్యాడు. ఆమె ప్రభుత్వాన్నీ, ప్రణయాన్నీ అంగీకరించాడు. దానితో భీమ ద్రౌపదుల వ్యూహం ఫలోన్ముఖం అయింది. 'ఒంటరిగా ఈ రాత్రి సంతోషంతో కూడిన విలాసంతో వస్తానని, 'ఒంటరిగా రమ్మన్న ఆజ్ఞను పాటిస్తా'నని హామీ ఇచ్చాడు. ఇదే ద్రౌపదికీ, కథాగతికీ కావలసింది. (సంపా.)

తే. **ఇదియ నిశ్చయ; మిమ్మాట వదలకుండు'। మనిన 'నీ వొక్కరుండవ యరుగుదేర**
వలయు; లేకున్న నయ్యెడ నిలుచుదానఁ। గానుజూ నిక్కువం' బని పూని పలికి. **267**

ప్రతిపదార్థం: ఇది+అ= ఇదే, ఈ మాటే; నిశ్చయము= నిర్ణయం, ఖాయం; ఈ మాట= నీవు ఇచ్చిన వాగ్దానం; వదలక+ఉండుము= విడువకుండా కాపాడుకో; అనినన్= అని కీచకుడు పలుకగా; నీవు= నీవు (కీచకుడు); ఒక్కరుండవు+అ= ఒక్కడివే; అరుగు దేర వలయున్= రావాలి!; లేక+ఉన్నన్= అట్లా కాకపోతే; ఆ+ఎడన్= అక్కడ; నిలుచుదానన్+కాను+చూ= నిలబడను (ఉండను) సుమా!; నిక్కువంబు= ఈ మాట నిజం; అని= అంటూ; పూని పలికి= ఒత్తి చెప్పి, (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఇది నా నిర్ణయం. నీవన్న మాట నీవు తప్పకుండా పాటించుము!' అన్నాడు కీచకుడు. ఆ మాటలు విని ద్రౌపది - 'నీ వొక్కడివే రావాలి. లేకపోతే, నే నక్కడ నిలువకుండా వెళ్ళిపోతాను సుమా! నా మాట నిజం' అని గట్టిగా ఒత్తి చెప్పింది.

విశేషం: అతడు 'నిశ్చయం' అనటం, ఆమె 'నిక్కువం' అనటం- ఈ ఉభయ వాక్యాలలోని ఊనిక గల పదాలు, ఆమె అంగీకరించినా దానిని పూర్తిగా నమ్మలేని ఆశ్చర్యంలో ఉన్నాడు కీచకుడు. అందువలన అనుమానం తీర్చుకొనటానికి 'నీవిచ్చిన మాటను తప్పకుండా నిలుపుకొను' మన్నాడు. అతడు ధ్రువపరచుకొనటానికి ఆ మాట అన్నాడు. ద్రౌపదికి ఒక అవకాశం దొరికింది. కీచకుడు చంచలుడు. అతడు చెప్పిన మాటను చెప్పినట్లుగా చేస్తాడో లేదో అని ఆమెకు అనుమానం. అది తీరేటట్లుగా ఒంటరిగా కీచకుడు రావటాన్ని ధ్రువపరచుకొనేటట్లుగా మాట్లాడింది. 'ఒంటరిగా రాకపోతే నీకు నేను దక్క'నని భయపెట్టింది. అది నిజమని నొక్కి చెప్పింది. అదే భావికార్యఫలానికి బీజం. (సంపా.)

క. **'మన మియ్యెడఁ బెద్దయుఁ బ్రొ। ద్దనుమానములేక మాటలాడుట దగ; దీ**
వును బొ, మ్మేనును నాదగు। పనికేఁగెద' ననియెఁ గమలపత్రేక్షణయున్.' **268**

ప్రతిపదార్థం: కమలపత్ర+ఈక్షణయున్= పద్మదళాల వంటి కనులుగల ద్రౌపదియూ; మనము= మనం - ద్రౌపది, కీచకుడు; ఈ+ఎడన్= ఇక్కడ; పెద్దయున్+ప్రొద్దు= ఎక్కువసేపు; అనుమానములేక= సంకోచం లేకుండా; మాటలు+ఆడుట=

మాట్లాడుకొనటం; తగదు= భావ్యం కాదు; ఈవును= నీవుకూడా; పొమ్ము= వెళ్ళిపొమ్ము; ఏనును= నేను కూడా; నాదగు పనికిన్+ఏఁగెదన్= నా పని చేసికొనటానికి పోతాను; అనియెన్= అన్నది.

తాత్పర్యం: 'మన మిద్దరం ఇక్కడ ఎక్కువ సేపు సంకోచం లేకుండా మాట్లాడుకొనటం భావ్యం కాదు. నీవు వెళ్ళి పొమ్ము. నేనూ నా పని మీద పోతాను' అని ద్రౌపది కీచకుడిని నమ్మబలికింది.

విశేషం: 'ఈవును బొమ్ము; ఏనును నాదగుపని కేఁగెదన్' - నీవింక పొమ్ము, నేను భీముడి వద్ద కేగి నీవు పోవటానికి (చావటానికి) చేయవలసిన పని చేస్తాను - అనే గూఢార్థం కూడా ధ్వనిస్తున్నది. (సంపా.)

చ. సమయము నిర్ణయింప విని చంద్రనిభానన పల్కులప్డు చి
త్తమునకు నింపుఁబెంపఁగ ముదంబునఁ గీచకముఖ్యుఁ డాత్మగే
హమునకుఁ బోయె; నమ్ముదిత యచ్చట వెండియుఁ బ్రస్తుతక్రియా
సముచిత వర్తనంబుఁ దగఁ జల్పి మహానసశాలలోనికిన్. 269

ప్రతిపదార్థం: సమయము నిర్ణయింపన్= సంకేత స్థలంలో కలిసే కాలాన్ని నిశ్చయించగా; విని; చంద్రనిభ+ఆనన= చంద్రుడితో సమమైన ముఖం గల ద్రౌపదియొక్క; పల్కులు= మాటలు; అప్డు= అప్పుడు; చిత్తమునకున్= మనస్సుకు; ఇంపున్+పెంపఁగన్= ప్రీతిని అతిశయింపజేయగా; కీచక ముఖ్యుఁడు= కీచకులలో శ్రేష్ఠుడైన సింహబలుడు; ముదంబునన్= సంతోషంతో; ఆత్మగేహమునకున్= తన ఇంటికి; పోయెన్= వెళ్ళాడు; ఆ+ముదిత= ద్రౌపది; అచ్చటన్= ఆ స్థలంలో; వెండియున్= మళ్ళీ; ప్రస్తుత క్రియా సముచిత వర్తనంబున్= అప్పటి కవసరమైన పనిని; తగన్+చల్పి= పూర్తిచేసి; మహానసశాలలోనికిన్= వంట ఇంట్లోకి (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: సంకేత సమయాన్ని నిశ్చయించిన ద్రౌపది మాటలు విని, కీచకుడు సంతోషపడి తన యింటికి వెళ్ళాడు. ద్రౌపది కూడా అక్కడ తాను చేస్తున్న పనిని పూర్తి చేసి వంటశాలకు (వెళ్లిందని ముందరి పద్యంతో అన్వయం.)

ద్రౌపది భీమునితోఁ గీచకుఁడు నర్తనశాలకు రాఁబోవుటం జెప్పుట (సం.4-21-25)

క. చని వెడ వికసిల్లెడు నా। ననపద్మముతోడ ననిలనందనునకు ని
ట్లనియెఁ జతురోక్తిరీతి న। తని గూఢక్రోధవహ్ని దరికొల్పంగన్. 270

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; వెడ వికసిల్లెడు= ఇంచుక వికసించిన; ఆననపద్మముతోడన్= పద్మంవంటి వదనంతో; అనిలనందనునకున్= భీముడితో; చతుర+ఉక్తిరీతిన్= మాటల నేర్పరితనంతో; అతని= భీముడియొక్క; గూఢక్రోధ వహ్నిన్= దాగిన కోపమనే నిప్పును; దరికొల్పంగన్= మంటను ఎగద్రోసి మండించటానికై; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ద్రౌపది వంటశాలలోనికి వెళ్ళి ఇంచుక సంతోషంతో వికసించిన ముఖంతో భీముడి మనసులో దాగిఉన్న కోపాగ్నిని తన మాట నేర్పరితనంతో ప్రజ్వరిల్లచేయటానికి ఇట్లా అన్నది.

విశేషం: అలం: రూపకం. గూఢకోపాగ్నిని ప్రజ్వలింపచేసేటట్లు చతురంగా మాట్లాబోతున్నదనటం విశేషం. గూఢకోపాగ్ని ప్రజ్వరిల్లి నా గూఢంగానే ఉండేటట్లు నిర్దేశించబోతున్నదని ధ్వని. (సంపా.)

తే. 'నా కొలఁతఁ దీర్చివచ్చితి; । నీ కొలఁతయ యింక; సూతునిం దెగ జూడన్
లోకము వంచింపను దగు । చీఁకటి రే యొదవె; నేమి చేసెదొ చెపుమా?' 271

ప్రతిపదార్థం: నా కొలఁతన్= నా వంతు పనిని; తీర్చి వచ్చితిన్= పూర్తి చేసి వచ్చాను; ఇంకన్= ఇకమీద; నీ కొలఁత+అ= నీ వంతు పని మాత్రమే ఉన్నది; సూతునిన్= కీచకుడిని; తెగన్+చూడన్= చంపడానికి; లోకమున్+వంచింపను= జమలను మోసపుచ్చటానికి; తగు= తగిన; చీఁకటిరేయి= చీకటి రాత్రి; ఒదవెన్= కలుగనున్నది; ఏమి+చేసెదొ చెపుమా!= ఏమి చేస్తావో చెప్పుము.

తాత్పర్యం: 'నా వంతు పని నేను పూర్తి చేసి వచ్చాను. నీ వంతు పనే ఇంక మిగిలి ఉన్నది. కీచక సంహారానికీ, లోకాన్ని మోసం చేయడానికీ తగిన చీకటిరాత్రి రానున్నది. ఇంక నీ ఇష్టం. ఏం చేస్తావో చెప్పుము.'

విశేషం: ఈ పద్యంలో చివరి పాదంలోని ప్రాసస్థానంలో 'చీఁకటి' శబ్దం ఉన్నది. అందులో ప్రాసస్థానంలో అరసున్నతో కూడిన కవర్ణం ఉండటం, మిగిలిన మూడు పాదాలలో అరసున్నలేని క వర్ణాలుండటం గమనించదగింది. దీనిని ఆనందరంగరాట్ఛందము సమర్థిస్తున్నది.

"ఒకటి కరసున్న గలిగి మూఁటి కవి లేక । ప్రాసములు లఘుపరములై పైని చెల్లుఁ;
గృతుల నొక్కొక్కచో నది యెట్టులనిన । నిఁకను నెఱిఁగింతుఁ జెప్పుఁడీ సుకవులనఁగ"

ఈ విధమైన ప్రాసమును అప్పకవే చెప్పాడు. దాని కతడు పెట్టిన పేరు ఖండాఖండ ప్రాసం. దాని లక్షణం- 'క, నిడుపులు నరసున్నలు దమ, కెడమనుగల కచటతపల కిలఁ బ్రాసములై, తొడరును నిర్బిందువు లొ, క్కెడ ఖండాఖండ సంజ్ఞ నినశశినయన'' అప్పకవి. తృతీయాశ్వాసంలో అతడు ఖండాఖండప్రాసకు ఈ పద్యాన్నే లక్ష్యంగా ఇచ్చాడు. అయినా ఈ శబ్దాన్ని శ.ర. సబిందుకంగానూ, చి.ని. సూ.ని. నిర్బిందుకంగానూ పేర్కొన్నాయి. నిర్బిందుకమయితే విశేషమే లేదు. (సంపా.)

వ. అనిన విని దరహసిత వదనుం డగుచు వృకోదరుం డిట్లనియె. 272

తాత్పర్యం: ఆ మాట విని చిరునవ్వుతో కూడిన ముఖంతో భీము డిట్లా అన్నాడు.

క. 'నన్నడుగ నేల? నీవును । నన్నీచుఁడు నేమి మాటలాడితి? రది నా
కున్నట్టు లెఱుఁగఁ జెప్పుము । ని న్నే మెచ్చింతువాఁడ నీరజవదనా!' 273

ప్రతిపదార్థం: నీరజవదనా!= పద్మముఖీ! ఓ ద్రౌపదీ!; నన్నున్= (భీముడిని); అడుగన్+ఏల?= అడగటం ఎందుకు?; నీవునున్= నీవూ (ద్రౌపది); ఆ నీచుఁడున్= ఆ అల్పుడూ (కీచకుడూ); ఏమి మాటలు+ఆడితిరి?= ఏమి మాట్లాడుకొన్నారో?; అది; నాకు; ఉన్న+అట్టులు= ఉన్నది ఉన్నట్లుగా; ఎఱుఁగన్+చెప్పుము= తెలియజేయుము; నిన్నున్= ద్రౌపదిని; ఏన్= నేను (భీముడు); మెచ్చించువాఁడన్= మెప్పిస్తాను.

తాత్పర్యం: 'ఓ ద్రౌపదీ! నన్ను అడగటం దేనికి? నీవూ, ఆ నీచుడూ ఏమేమి మాట్లాడుకొన్నారో నాకు ఉన్నది ఉన్నట్లుగా తెలుపుము. నిన్ను నేను మెప్పిస్తాను.'

వ. అనినఁ బాంచాలి సుదేష్ణ మందిరంబునం దా నుచితాచరణంబున నునికియు, సింహబలుండు సింగారించుకొని వచ్చుటయు, రేయింటి మాటలవలనం దాను బెదరమియు, వాఁడు సామ దాన భేద

దండంబులు సూపి పలుకుటయు, దానికి మెయికోలు భావించికొని క్రమంబునం దగిన సంభాణంబు సేసి, నాట్యమండపంబు సంకేతస్థలంబుగాఁజెప్పి, యొక్కరుండవచ్చువాఁడవని నియమించుటయు, నద్దురాత్మ్ముండు ప్రముదితాత్మ్ముండగుచు రాత్రిసమయంబున నయ్యెడకు నొంటిమెయిం జనుదెంచువాఁడై చనుటయుఁ దెలియంజెప్పిన, నతండు పరమాహ్లాదంబునంబొంది. 274

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పాంచాలి= ద్రౌపది; సుదేష్ణ మందిరంబునన్= సుదేష్ణ యొక్క అంతపురంలో; తాను= (ద్రౌపది); ఉచిత+ఆచరణంబునన్+ఉనికియున్= తన పనిలో తాను ఉండటమున్నూ; సింహబలుండు= కీచకుడు; సింగారించుకొని= అలంకరించుకొని; వచ్చుటయున్= రావటమున్నూ; రేయింటి= రాత్రి; మాటలవలనన్= భీమసేనుడు పల్కిన ఓదార్పుమాటలవలన; తాను బెదరమియున్= ద్రౌపది భయపడక ఉండటమున్నూ; వాఁడు= కీచకుడు; సామదానభేద దండంబులు= చతుర్విధోపాయాలు (నెమ్మదిగా చెప్పటం, దానం చేయుటం; తగవు పెట్టడం; దండించటం); చూపి; పలుకుటయున్= మాట్లాడటమున్నూ; దానికిన్= అందుకు; మెయికోలు= ఒప్పుకొనటంగా; భావించికొని= అనుకొని; క్రమంబునన్= వరుసగా; తగిన సంభాషణంబు+చేసి= తగిన మాటలు మాట్లాడి; నాట్యమండపంబు= నర్తనశాల; సంకేతస్థలంబుగాన్= కలిసికొనే రహస్య ప్రదేశంగా; చెప్పి, ఒక్కరుండు+అ= ఒకడే; వచ్చువాఁడవు= రావాలి; అని నియమించుటయున్= అని కట్టడి చేయుటమున్నూ; ఆ+దురాత్మ్ముండు= ఆ నీచుడు; ప్రముదిత+ఆత్మ్ముండు+అగుచున్= సంతుష్టమనస్కుడై; రాత్రి సమయంబునన్= రాత్రిపూట; ఆ+ఎడకున్= అక్కడికి; ఒంటిమెయిన్= ఒంటరిగా; చనుదెంచువాఁడై= వస్తానని; చనుటయున్= వెళ్లటమున్నూ; తెలియన్+చెప్పినన్= స్పష్టమయ్యేటట్లు చెప్పగా; అతండు= భీముడు; పరమ+ఆహ్లాదంబునన్= మిక్కిలి సంతోషం; పొంది= అనుభవించి.

తాత్పర్యం: అని చెప్పగా ద్రౌపది-సుదేష్ణమందిరంలో తాను తన పనిలో నిమగ్నమై ఉండటం, అక్కడికి కీచకుడు సింగారించుకొని రావటం, రాత్రి భీముడు తనకు ధైర్యం చెప్పటం వలన తాను బెదరకపోవటం, కీచకుడు సామదాన భేద దండోపాయాలతో లోబరుచుకొనాలని ప్రయత్నించటం. ద్రౌపది లోబడినట్లుగా నటించి వాడిని నర్తనశాలకు ఒంటరిగా రాత్రిపూట రమ్మని చెప్పటం, వాడు మూర్ఖుడు కాబట్టి వస్తానని చెప్పి సంతోషంతో పొంగుతూ వెళ్ళటం తేటపడేటట్లు చెప్పింది. ఆ మాటలు విని భీముడు మిక్కుటమైన సంతోషంతో పొంగిపోయాడు.

విశేషం: 1. కీచకుడు సామదానభేద దండోపాయాలను ప్రదర్శించి మాట్లాడాడు - అనటం తెలుగు పలుకుబడి. యుద్ధంలో ప్రయోగించేవి ఆ చతురుపాయాలు. శత్రువును లొంగదీసికొనటానికి క్రమంగా సంధి మాటలతో, కొంత రాజ్యత్యాగంతో, శత్రువుల మధ్య కలతలు పెట్టటంతో, చివరకు యుద్ధం చేయటంతో సాధించటం యుద్ధప్రక్రియలో ప్రసిద్ధాలు. ఒక క్రమంలో ఏ రంగంలోనైనా కార్యాన్ని సాధించే పద్ధతికి కూడా తెలుగువారు ఈ పలుకుబడిని ప్రయోగిస్తారు. అందువలననే ద్రౌపది కామ వ్యవహారంలో చతురుపాయాలను ఉటంకించింది. తిక్కన కావ్యకళా శిల్పంలో ఇదొక నేర్పరితనం. వెనుక జరిగిన సంభాషణలో ఉన్న నిర్మాణ శిల్ప రహస్యాలను తరువాతి సంభాషణలలో సూచించి కావ్యార్థ పూర్వాపర సమన్వయ సమాలోచనను పఠితలలో రేకెత్తింప చేస్తాడు తిక్కన. ఇది మహా కవిత్వ దీక్షావిధిలోని ఒక లక్షణం. ఈ సమన్వయ సూత్రం ప్రకారం కీచకుడు పలికిన మాటలలో సామోపాయం 252వ పద్యంలో, భేదోపాయం 253లో, దానోపాయం 254లో, దండోపాయం 256. 257వ పద్యాలలో కనబడతాయి. యుద్ధానికి సన్నద్ధుడవుతున్న భీముడితో చతురుపాయాల ప్రసక్తి తెచ్చి మాట్లాడటం చతురవాక్య విన్యాసం - గుప్తక్రోధాగ్నిని ప్రజ్వలింపజేసే ఇంధనం. కీచకుడు చతురుపాయాలను మదన యుద్ధ సాధనం కొరకు వాడాడు. యుద్ధం సిద్ధించింది. మరి భీముడు? ద్రౌపదిచేత సామదాన భేదోపాయాలు ప్రయోగించాడు. ద్రౌపది సుముఖంగా మాట్లాడటం సామం, తనను రహస్యంగా ఇచ్చుకొంటాననటం దానం, ఒంటరిగా సంకేతస్థలానికి రమ్మని పిలవటం భేదం. ఈ మూడూ వంచనతో విఫలం కావటంతో యుద్ధం కంటె కీచకుడికి గత్యంతరం లేకపోవటం దండం. యుద్ధం సిద్ధించింది. కీచకుడు కోరుకొన్న

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మన్మథయుద్ధం వంచనతో వీగిపోతుంది; భీముడు కోరుకొన్న రహస్య ద్వంద్వయుద్ధం ఫలిస్తుంది. భీముడి ప్రహ్లాదానికి ఆ భావమే ఆధారం. పఠితలను భావనామయం చేయగల శిల్పకీలకాలు ఎక్కువగా ఇటువంటి పలుకుబళ్లు. 2. కథను చెప్పినట్లు తెలియజెప్పడానికి వచనం బాగా అనుకూలిస్తుంది. అందుకే తిక్కన చకచకా జరిగిన కథను పది వాక్యాలలో క్లుప్తంగా చెప్పించాడు. కథాకథనశైలిలో ఇది ఒక ఒడుపు. (సంపా.)

శా. 'క్రోధం బప్రతికారమై హృదయముం గుందింప నత్యంత చిం
తాధూతాత్ముఁడనైన నాకుఁ బరమోత్సాహంబు సంధిల్ల దు
స్సాధం బైన విరుద్ధ కార్య మిటు లాసన్నంబుగా సంఘటిం
తే ధర్మాత్మజుఁ డిచ్చమెచ్చఁ బగ సాధింపంగఁ గాన్పల్పమే?' 275

ప్రతిపదార్థం: క్రోధంబు= కోపం; అప్రతికారము+ఐ= తీర్చుకోలేనిదై; హృదయమున్= మనస్సును; కుందింపన్= బాధించగా; అత్యంత= మిక్కిలి; చింతాధూత+ఆత్ముఁడను+ఐన నాకున్= విచారంచేత చలించిన మనస్సు కలిగి ఉన్న నాకు (భీముడికి); పరమ+ ఉత్సాహంబు= మిక్కిలి సంతోషం; సంధిల్లన్= కలుగగా; దుస్+సాధంబు+ఐన= కష్టసాధ్యమైన; విరుద్ధ కార్యము= అజ్ఞాతవాసానికి వ్యతిరేకమైన పనిని; ఇటులు= ఈ విధంగా; ఆసన్నంబుగాన్= దగ్గరపడేటట్లు; సంఘటింతే?= కూర్చిపెట్టావుగదా!; ధర్మ+ఆత్మజుఁడు= ధర్మరాజు; ఇచ్చన్+మెచ్చన్= మనసులో మెచ్చుకొనేటట్లు; పగ సాధింపంగన్= శత్రువును జయించటాన్ని; కాన్పు (కాన్పుట)= చూడటం, సాధించటం; అల్పమే?= సులభమా?

తాత్పర్యం: 'ప్రతీకారం తీర్చుకొనలేని కోపం నా హృదయాన్ని క్రుంగదీయగా మిక్కిలి వ్యాకులచిత్తంతో ఉన్న నాకు అత్యంత ఉత్సాహాన్ని కలిగించేటట్లు, కష్టసాధ్యమైన పనీ, అజ్ఞాతవాస ప్రవర్తనకు పూర్తిగా విరుద్ధమైనదీ అయిన ఇటువంటి కార్యాన్ని వెంటనే చేసేటట్లు సంఘటించావు. ఇక ధర్మరాజు మనసులో మెచ్చుకొనేటట్లు పగ సాధించి చూపటం సామాన్యమా? (లేదా-తేలికే.)

విశేషం: 1. కీచకుడిని చంపటం (పగసాధించటం) ఎంత ముఖ్యమో - దానిని అజ్ఞాతవాస సమయం చెడకుండా సాధించటం అంతే ముఖ్యం. అప్పుడే ధర్మరాజు మెచ్చుకొంటాడు. ఆ విధంగా అతడు మెచ్చుకొనేటట్లు పగసాధించగలగటం అల్పం కాదు. కష్టం. దానిని నీవు నేర్పుతో చేశావని భీముడు ద్రౌపదిని మెచ్చుకొంటున్నాడు.

2. రసాభ్యుదయ రహస్యాలను ధ్వనిమయంగా సంభాషణలలోనూ, సాత్త్వికాభినయాలలోనూ సూచించటం తిక్కన నైజం. భీముడి మనస్సులో పగసాధించాలనే క్రోధం ఉన్నది. అది గూఢంగా ఉన్నది. ప్రతీకారానికి అవకాశం లేకపోవటం చేత గుండెలోని నిప్పువలె అది అతడి హృదయాన్ని చింతతో దహించి వేస్తున్నది. ఇప్పుడు ద్రౌపది ప్రతీకారానికి తగిన కార్య సంఘటన చేసింది. చింత తొలగిపోయి వీరరసోచితమైన ఉత్సాహమనే స్థాయిభావం ప్రబుద్ధమయింది. అసాధ్యమైన కార్యాన్ని అద్భుతంగా నిర్వహించే భావం ఉత్సాహం. ద్రౌపది సంఘటించిన కార్యానికి ఆ రెండు లక్షణాలూ ఉన్నాయి. సింహబలుడిని అజ్ఞాతవాసనియమ భంగం కాకుండా రహస్యంగా సంహరించాలి. ఇది వీరరసకార్యం. దాని నిర్వహణం వలన ధర్మరాజు హృదయంలో అద్భుతం జనిస్తుంది. జన్యజనకరసాభ్యుదయ భావస్థితి ఇందులో గమ్యం. కీచకవధ కార్యనిర్వహణంలో ఉన్న సంశ్లిష్టత వ్యంగ్యం.

3. "ధర్మాత్మజుఁ డిచ్చ మెచ్చఁ బగ సాధింపంగఁ గాన్పల్పమే?" అనే వాక్యంలో కాకుధ్వని ఉన్నది. ఆశ్చర్యార్థకంలో పలికితే= సామాన్యమా? కాదని భావం. ఏవార్థకంలో పలికితే - చాల తేలికే అని భావం. ఇది ఎంత తేలికో అంత కష్టం అన్నట్లుంటుంది. (సంపా.)

వ. అని పలికి కొండొక విచారించి. 276

తాత్పర్యం: అని మాట్లాడి కొంతసేపు ఆలోచించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'వెఱవక సంకేతించిన। తెఱఁగున నయ్యెడకు నరుగుదెంచునొకో! కొం
దఱఁ దెచ్చునొకో! వెడఁగై। యఱిముఱి వెలిపుచ్చునొకొ రహస్యం బెల్లన్! 277

ప్రతిపదార్థం: వెఱవక= భయపడక; సంకేతించిన తెఱఁగునన్= గుర్తు చెప్పిన విధంగా; ఆ+ఎడకున్= అక్కడకు; అరుగుదెంచునొకో!= వస్తాడా?; కొందఱన్= కొందరిని; తెచ్చునొకో?= వెంటతీసికొని వస్తాడా?; వెడఁగు+ఐ= వెఱ్ఱివాడై; అఱిముఱిన్= తొందరపాటుతో; రహస్యంబు+ఎల్లన్= రహస్యమంతా; వెలిపుచ్చునొకొ!= బయటపెట్టుతాడా!.

తాత్పర్యం: భయపడకుండా (అనుమానం లేకుండా) నీవు గుర్తు చెప్పినచోటికి వస్తాడా? లేక మరికొందరిని సహాయంగా తీసికొని వస్తాడా? తొందరపాటువలన మూఢుడై రహస్యాన్నంతా బట్టబయలు చేస్తాడా?

విశేషం: కీచకుడు మోసపోయాడా? లేక తాము మోసపోయామా? అనేది భీముడి భయం, తనమీద అనవసరమైన నెపం వస్తుంది. అందుకే సంశయనివారణకొరకు అడుగుతున్నాడు.

ఉ. అట్టిద యేల చేయు? ననయంబు నయం బొడఁగూడఁ బల్కి నీ
విట్టి తెఱంగు సేయుమని యేర్పడఁ జెప్పిన దాని కత్తఱిం
బుట్టిన సంతసంబు ననువుం బరికించితికాదె! యింక ని
ట్ట ట్టనఁ డెట్టులైన హృదయంబున నెక్కడి శంక వానికిన్. 278

ప్రతిపదార్థం: అట్టిది+అ ఏల చేయున్?= అట్లా ఎందుకు చేస్తాడు? అనయంబున్= మిక్కిలి; నయంబు+ఒడన్+కూడన్= ప్రియం కలిగేటట్లు; పల్కి= మాట్లాడి; నీవు+ఇట్టి తెఱంగు+చేయుము+అని= నీవిటువంటిరీతి చేయుమని; ఏర్పడన్+చెప్పిన దానికిన్= తెలిసేటట్లు చెప్పినదాని వలన; ఆ+తఱిన్= అప్పుడు; పుట్టిన సంతసంబు= కలిగిన సంతోషం; అనువున్= రీతి, విధం; పరికించితి(వి)కాదె!= చూచావుగదా!; ఇంకన్+ఇట్టు+అట్టు+అనఁడు= ఇక ఇటనీ అటనీ ఊగిసలాడడు; ఎట్టులు+ఐనన్= ఎట్లాగైనా; హృదయంబునన్= మనస్సులో; వానికిన్= కీచకునకు; ఎక్కడి శంక?= అనుమాన మెక్కడిది?

తాత్పర్యం: అయినా కీచకు డట్లా ఎందుకు చేస్తాడులే! నీవు ప్రీతిగా మాట్లాడి, 'నీ వట్లా చేయు'మని స్పష్టంగా చెప్పినప్పుడు వాడికి కలిగిన సంతోషపు రీతి చూచావుగదా! ఇక ఎటూ పోలేడు, ఏమీ అనలేడు. వాడి మనసులో అనుమానానికి తావెక్కడ ఉంటుంది?

విశేషం: 1. ఆడది బొంకితే గోడపెట్టినట్లు ఉంటుంది. మాయాంధకారం వంటి మోహపు వాగురలో చిక్కిన మృగం కీచకుడు. వాడికి ఇంగితజ్ఞానం శూన్యం. అందుకే భీముడు ధైర్యంగా ఉన్నాడు. 2. పుట్టిన, సంతసంబు+అనువున్= కలిగిన సంతోషం యొక్క విధము- అని షష్ఠీసమాసం - ఉకారానికి అచ్చుపదం కాగా నుగాగమం అయి సంతసంబుననువు అయింది. సంతోషించిన విధము - అని అర్థం.

ఉ. వచ్చు, మదాంధవృత్తి ననివారణ నొక్కఁడ నాట్యశాలకుం
జొచ్చు, నవశ్యమున్ వెదకి చూచి ననుం గని యప్పు సంగరం

బిచ్చు, మదీయ బాహుబల హీనబలుండయి నీకుఁబ్రీతిగాఁ

జచ్చు. నసంశయం బిది; విచారము లన్నియు నింక నేటికిన్?' 279

ప్రతిపదార్థం: వచ్చున్= తప్పకుండా వస్తాడు; మద+అంధవృత్తిన్= కన్నుగానని గర్వంతో; అనివారణన్= అడ్డు లేకుండా; నాట్యశాలకున్= నర్తనశాలకు; ఒక్కఁడు+అ= ఒంటరిగా; చొచ్చున్= ప్రవేశిస్తాడు; అవశ్యమున్= తప్పకుండా; వెదకి చూచి= వెదకిచూచి; ననున్+కని= నన్ను చూచి; అప్డు= అప్పుడే; సంగరంబు+ఇచ్చున్= యుద్ధం చేస్తాడు; మదీయబాహుబల= నా భుజబలంచేత; హీనలుండు+అయి= క్షీణించిన బలంకలవాడయి; నీకున్= నీకు (ద్రౌపదికి); ప్రీతికాన్+చచ్చున్= సంతోషం కలిగేటట్లు చస్తాడు; ఇది= ఇది; అసంశయంబు= అనుమానం లేనిమాట; విచారములు= ఆలోచనలు; అన్నియున్= అన్నీ; ఇంకన్+ఏటికిన్?= ఇంక దేనికి?

తాత్పర్యం: కీచకుడు తప్పక వస్తాడు. కన్నుగానని మోహాంధకారంతో నిరభ్యంతరంగా నర్తనశాలలో ఒంటరిగానే ప్రవేశిస్తాడు. తప్పకుండా వెదకి నన్ను చూచి యుద్ధం చేస్తాడు. నా బాహుబలంముందు తన బలాన్ని కోల్పోయి నీకు ప్రీతి కలిగేటట్లు చస్తాడు. ఇందుకు అనుమానం లేదు. ఇంకా నీవు పలురకాలుగా ఆలోచించి విచారించ నవసరం లేదు.'

విశేషం: జరగబోయేది యథాతథంగా భీము డూహిస్తున్నాడు.

వ. అని నిశ్చయించి వృకోదరుండు వెండియు నిట్లనియె. 280

తాత్పర్యం: అని పలికి, తానన్న మాటలు తప్పక జరిగేవని నిర్ధారణ చేసి భీముడు మళ్ళీ ఇట్లా అన్నాడు.

మ. 'బలియుం డా సొబగుండు భావభవదర్పభ్రాంతుఁడై వచ్చి ని

శ్చల సర్వాంగత నున్న న న్నరసి నీ చందంబు గాకున్న నా

కులతం బొందెడు, నప్డు మండపము సంక్షోభింపఁగా నేతుఁ గ

ట్టలుకన్ బెబ్బులిఁ గోలవ్రేచినటు లుగ్రాకార మేపారఁగన్. 281

ప్రతిపదార్థం: బలియుండు= బలిష్టుడైన; ఆ సొబగుండు= ఆ విటుడు; భావభవదర్ప భ్రాంతుఁడు+ఐ= మన్మథగర్వంతో చలితుడై; వచ్చి; నిశ్చల= చలనం లేని; సర్వాంగతన్+ఉన్న= అన్ని అంగాలు కలవాడనై ఉండగా; నన్నున్+అరసి= నన్ను (భీముడిని) చూచి; నీ చందంబు+కాక+ఉన్న= నీవలె ఉండకపోవటంతో; ఆకులతన్+పొందెడున్= కలతపడతాడు; అప్డు= అప్పుడు; మండపము= నర్తనశాల మండపం; సంక్షోభింపఁగాన్= చలించేటట్లు; కడు+అలుకన్= మిక్కిలి కోపంతో; కోలన్= పెద్ద కర్రతో; బెబ్బులిన్= పెద్దపులిని; వ్రేచిన+అటులు= కొట్టినట్లు; ఉగ్ర+ఆకారము= మిక్కిలి కోపంతోడి భయంకరమైన రూపం; ఏపారఁగన్= అతిశయించగా; ఏతున్= బాధిస్తాను.

తాత్పర్యం: ఆ కీచకుడు మదనావేశంతో వచ్చి నిశ్చలంగా ఉండే నన్ను తడవిచూచి, నీవు కాకపోవటం తెలిసికొని కలత చెందుతాడు. అపుడు నేను కర్రతో కొట్టిన పెద్దపులి వలె తీవ్ర కోపంతో కూడిన భయంకర రూపంతో ఆ మండపమంతా సంక్షోభించేటట్లు విజృంభించి బాధిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ. కీచకుడు భీముడిని తాకటం కోలతో కొట్టటంతోను, భీముడు - దానికి ప్రతిక్రియగా పెనుకోపంతో లేస్తున్న బెబ్బులితోనూ పోల్చబడ్డారు. బలియుడు, సొబగుడు అనే మాటలు కీచకుడిని వెక్కిరిస్తూ భీము డుపయోగించినవి. మొనగాడు, సోగ్గాడు అనే గ్రామ్యాలకు సమానమైనవి. భావభవదర్పభ్రాంతుడై - అనే సమాసానికి శ్లేషార్థం చెప్పుకొనవచ్చును. భావమునుండి పుట్టిన గర్వం వలన కలిగిన మోహంతో - అని ఒక అర్థం. మన్మథ సంబంధమైన గర్వం వలన కలిగిన మోహంతో అని రెండో అర్థం చెప్పవచ్చును. (సంపా.)

క. ఎఱిఁగి పిఱుసనిన వెసఁ బై। కుఱుకుదు సాళువము గాకి నొడిసిన భంగిన్
వెఱచఱవం బొదువుదుఁ బఱి। పఱిసేయుదు నీదు పూన్కి పారం బెయిదన్. 282

ప్రతిపదార్థం: ఎఱిఁగి= (అసలు సంగతి) తెలిసికొని; పిఱు+చనినన్= వెనుకాడితే; వెసన్= వెంటనే; సాళువము= డేగ; కాకిన్= కాకిని; ఒడిసిన భంగిన్= ఒడుపుగా పట్టుకొన్నట్లు; పైకిన్+ఉఱుకుదున్= పైకి దూకుతాను; వెఱ, చఱవన్= భయం వ్యాపించేటట్లు; పొదువుదున్= ఆక్రమించి పట్టుకొంటాను; నీదుపూన్కి= ద్రౌపది ప్రయత్నం (కోర్కె); పారంబు+ఎయిదన్= తుదముట్టగా; పఱిపఱి+చేయుదున్= పీడిస్తాను.

తాత్పర్యం: కీచకుడు నన్ను గుర్తించి వెనుకడుగు వేస్తే వాడిమీది కెగబడి డేగ కాకిని ఒడిచిపట్టుకొన్నట్లుగా వాడిని పట్టుకొంటాను. నీ కసి తీరేటట్లు వాడిని పీడించి నుగ్గునుగ్గు చేస్తాను.

విశేషం: అలం: ఉపమ.

ఆ. నాదు బాహుబలమునకు మాఱుకొనఁజాలు। భుజబలంబుగలిగి పోక చిక్కఁ
బెనఁగి నన్నుఁ గొంత కినియింప నోపెడు। చందమైన వినుము సరసిజాక్షి! 283

ప్రతిపదార్థం: సరసిజ+అక్షి!= పద్మాక్షీ-ద్రౌపదీ!; నాదు బాహు బలమునకున్= నాయొక్క (భీముడి) భుజశక్తికి; మాఱుకొనన్+చాలు= ఎదుర్కొనే సమర్థమైన; భుజబలంబు+కలిగి= భుజశక్తి కలిగి; పోక= పారిపోవక; చిక్కన్+పెనఁగి= గట్టిగా పెనగులాడి; నన్నున్= నన్ను (భీముడిని); కొంత= కొంచెం; కినియింపన్+ఓపెడు= కోపింపజేసే; చందము+ఐనన్= విధమైతే; వినుము.

తాత్పర్యం: ద్రౌపదీ! కీచకుడు నాతో యుద్ధం చేయుగల శక్తిగలవాడై, వెనుకాడక ఎదిరించి గట్టిగా పెనగులాడి నన్ను కోపింపజేస్తే ఏమవుతుందో వినుము.

విశేషం: జరుగబోయే ప్రతివ్యూహం ఎట్లా ఉంటుందో ముందుగా చెప్పుతున్నాడు. చదరంగంలో పావులు కదిలించి రాజుయొక్క ఆట కట్టించటంవంటిదే ఎదుటివాడి బలాన్ని అంచనా వేయటం. భీముడు ద్రౌపదికి నమ్మకం కలిగించటానికే ఈ మాటలు అంటున్నాడు.

మ. అవనీచక్రము సంచలింపఁగ, దివం బల్లాడ, నాశాచయం
బవధూతంబుగ, గోత్రశైలనికరం బాకంపముం బొంద, న
ర్ణవముల్ ఘూర్ణనమొందఁ, గ్రోధము గృతార్థత్వంబు నొందించి, చి
త్రవధప్రౌఢి వహించి సూతునకు రౌద్రం బేర్పడం జూపుదున్.' 284

ప్రతిపదార్థం: అవనీచక్రము= చక్రమువంటి భూమి; సంచలింపఁగన్= మిగుల కదిలేటట్లు; దివంబు= ఆకాశం; అల్లాడన్= దద్దరిల్లగా; ఆశాచయంబు= దిక్కుల సముదాయం; అవధూతంబుగన్= కొట్టుకొనిపోయే రీతిగా; గోత్రశైల; నికరంబు= కులపర్వతాల

సమూహం; ఆకంపమున్+పొందన్= బాగా వణకగా; అర్ణవముల్= సముద్రాలు; ఘూర్ణనము+ఒందన్= తిరుగుడుపడి కలత చెందగా; క్రోధము= కోపం; కృతార్థత్వంబున్+ఒందించి= సఫలమయ్యేటట్లు; చిత్రవధ ప్రౌఢిన్= చిత్రహింస చేసే నేర్పరితనంతో; సూతునకున్= కీచకుడికి; రౌద్రంబు= రుద్రభావం, రౌద్ర రసస్ఫూర్తితో కూడిన క్రౌర్యం; ఏర్పడన్= స్పష్టంగా; చూపుదున్= చూపిస్తాను.

తాత్పర్యం: భూ మండలం కంపించగా, ఆకాశం అల్లల్లాడగా, దిక్కులు పిక్కటిల్లగా, కుల పర్వతాలు వణకగా; సముద్రాలు కల్లోలితం కాగా; నా క్రోధం సఫలమయ్యేటట్లు చిత్రవధ చేసే నేర్పరితనాన్ని ప్రదర్శించి, నా రౌద్రరూపాన్ని ఆ కీచకుడికి ప్రత్యక్షం చేస్తాను.

విశేషం: అలం: అతిశయోక్తి, క్రోధము కృతార్థత్వం పొందటమంటే రౌద్రంగా మారటం, ఎదుటివారికి ప్రాణహాని, కరుణం కలిగించటం. రౌద్రం అంటే రుద్రభావం, రుద్రుడు కోపిస్తే జగత్ప్రళయం సంభవించటం కవిసమయం. దానిని తాను తన రౌద్రం వలన కల్పించి కీచకుడికి ప్రళయాన్ని సృష్టిస్తానని రౌద్రోద్రేకంతో భీముడు పలికాడు. (సంపా.)

వ. అనినం బాంచాలి సంచలితస్వాంతయై, నిజాంతర్గతంబున 'నితని తీవ్రక్రోధంబు గుప్తసాధనంబునకు బాధకంబగు' నని బోధింపం దలంచి యిట్లనియె. 285

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పాంచాలి= ద్రౌపది; సంచలితస్వాంత+ఐ= చలించిన మనస్సు గలదై; నిజ+అంతర్గతంబునన్=తన మనస్సులో; ఇతని= భీముడియొక్క; తీవ్రక్రోధంబు= అధికమైన కోపం; గుప్తసాధనంబునకున్= అజ్ఞాతవాస రహస్యస్థితికి; బాధకంబు+అగున్+అని= భంగకరమవుతుందని; బోధింపన్+తలఁచి= చెప్పాలి అనుకొని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: భీము డిట్లా మాట్లాడేసరికి ద్రౌపది మనసులో ఉలిక్కిపడింది. భీముడి తీవ్రకోపావేశం తమ అజ్ఞాతవాసానికి భంగకరమవుతుందని ఆయనకు తెలిసేటట్లు చెప్పాలని ఇట్లా అన్నది.

ఉ. 'ఒవ్వనివారు నవ్వ, మహిమోదధి ధర్మసుతుండు దీనికిన్
నెవ్వగఁబొంద, భూజనులు నింద యొనర్పఁగ నే నొనర్చు నీ
చివ్వకు నీవు నల్కమెయిఁ జేసిన యాపని గూఢవృత్తికిన్
దవ్వగునేని నా యభిమతం బొడఁ గూడియు నిష్ఫలంబగున్ 286

ప్రతిపదార్థం: ఒవ్వనివారు= శత్రువులు; నవ్వన్= నవ్వేటట్లు; మహిమ+ఉదధి= గొప్పతనంలో సముద్రుడి వంటివాడు; ధర్మసుతుండు= ధర్మరాజు; దీనికిన్= ఈ పనికి; నెఱి+వగన్+పొందన్= ఎంతో బాధపడేటట్లు; భూజనులు= లోకులు; నింద+ఒనర్పఁగన్= తిట్టేటట్లు; నేను+ఒనర్చు= నేను చేసే; ఈ చివ్వకున్= ఈ తగాదాకు; నీవు అల్కమెయిన్+చేసిన= నీవు కోపంతో చేసినట్లైతే; ఆ పని= ఆ విధంగా రౌద్రాన్ని లోక ప్రళయంగా ప్రదర్శించడం; గూఢవృత్తికిన్= రహస్య వర్తనానికి; దవ్వు+అగునేని= దూరమైతే; నా అభిమతంబు= నా కోరిక; ఒడఁగూడియున్= నెరవేరికూడా; నిష్ఫలంబు+అగున్= నిష్ప్రయోజనం ఔతుంది.

తాత్పర్యం: 'మనమంటే పడనివారంతా నవ్వేటట్లు, ధర్మరాజుకు అధిక దుఃఖం కలిగేటట్లు, లోకనింద సంభవించేటట్లు, ఈ కలహంలో నీవు పెనుకోపంతో రహస్యం చెడగొడితే నా కోర్కె తీరినా చివరకు ఫలితం శూన్యమే ఔతుంది.

విశేషం: అజ్ఞాతవాసం భీముడి రౌద్రోద్రేకం వలన భగ్నం కాకూడదనీ, అంతటి రౌద్రంతో సాధించే కార్యం కూడా గుట్టుగా సాగాలనీ ద్రౌపది హెచ్చరించింది.

క. కావున వంచన బాహిర। పోవక యుండంగ మన రిపుం బరిమార్పం
గావచ్చునేని నట్టిద। నా వల; పటుగాక తక్కినను వలదు సుమీ!' 287

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; వంచన= మోసం; బాహిరపోవక+ఉండంగన్= బయల్పడకుండా; మన రిపున్= మన శత్రువును; పరిమార్పంగాన్ వచ్చునేనిన్= చంపటానికి వీలైతే; అట్టిది+అ= అట్లాంటిదే; నా వలపు= నా అభిమతం; అటు+కాక తక్కినను= అట్లా కాకపోతే; వలదు సుమీ!= ఈ యత్నం వద్దు సుమా!

తాత్పర్యం: మన అజ్ఞాతవాసం బహిరంగం కాకుండా మన శత్రువును చంపగలగాలి. అదే నా అభిమతం, అట్లా కాకపోతే ఈ ప్రయత్నమే వద్దు.'

వ. అనిన విని ద్రుపదనందనకుం బాండునందనుం డిట్లనియె. 288

తాత్పర్యం: ఆ మాటలు విని ద్రౌపదితో భీము డిట్లా అన్నాడు.

చ. 'మదమునఁ గీచకాగ్రజుఁడు మార్కొని నిల్చిన వీఁక మైమెయిం
గదిసితి మేని నప్పుడు ప్రకాశరహస్యవిభేదబుద్ధి నా
కొదవునె? యైన నేఁ దలఁచి యోపినభంగి నిగూఢవృత్తిమైఁ
బదిలము గల్గి తిన్నని యుపాయమునం దెగఁజూతు నాతనిన్.' 289

ప్రతిపదార్థం: కీచక+అగ్రజుఁడు= కీచకుల అన్న అయిన సింహబలుడు; మదమునన్= గర్వంతో; మార్కొని నిల్చినన్= ఎదిరించి నిలబడితే; వీఁకన్= పరాక్రమంతో; మై మెయిన్= అనాయాసంగా; కదిసితిమి+ఏనిన్= కలియబడితే; అప్పుడు= ఆ సమయంలో; ప్రకాశ, రహస్య విభేదబుద్ధి= ప్రకాశానికీ, రహస్యానికీ కల తేడాను పాటించే తెలివి; నాకున్+ఒదవునె?= నాకు కలుగుతుందా?; ఐనన్= ఐనా; నేన్+తలఁచి= నేను ఆలోచించి; ఓపినభంగిన్= నా శక్తికొద్దీ; నిగూఢవృత్తిమైన్= రహస్యమైన పద్ధతిలో; పదిలము, కల్గి= జాగ్రత్తతో; తిన్నని+ఉపాయమునన్= సవ్యమైన ఉపాయంతో; అతనిన్= కీచకుడిని; తెగన్+చూతున్= చంప యత్నిస్తాను.

తాత్పర్యం: 'కీచకుడు మదించి ఎదిరించి నిలబడితే, అపుడు పరాక్రమించి అనాయాసంగా కలియబడితే, ఇది రహస్యంగా చేయాలి. ఇది ప్రకాశంగా చేయాలి - అనే విచక్షణ ఆ సమయంలో నా కెట్లా ఉంటుంది? అయినా, నీవు చెప్పిన విషయం మనసులో ఉంచుకొని ఓపినంతవరకు రహస్య పద్ధతిని భద్రంగా కాపాడుతూ తగిన ఉపాయంతో కీచకుడిని చంప యత్నిస్తాను.'

విశేషం: ద్రౌపది హెచ్చరిక భీముడి ఆవేశప్రవృత్తిలో కూడా మరచిపోలేని ఒక జాగ్రత్తను కలిగించింది. ఉపాయం సిద్ధించినా అపాయం కలుగకుండా వారించే ప్రయత్నం చేస్తేనే ఫలసిద్ధి కలిగేది. కార్యసాధనలో దేహశక్తి కంటె బుద్ధికుశలత ముఖ్యం.(సంపా.)

క. అనవుడు 'జయలక్ష్మిం జే। కొను' మని దీవించి, 'యింతకుం గేకయ నం
దన నన్నుఁ దడవుఁ' దడయం। జన దియ్యెడ'నని లతాంగి చనియెం బ్రీతిన్. 290

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; జయలక్ష్మిన్= విజయమనే సంపదను; చేకొనుము+అని= పొందుమని; దీవించి= ఆశీర్వదించి; ఇంతకున్= ఇప్పటికే; కేకయనందన= సుదేష్ణ; నన్నున్= నన్ను; తడవున్= వెదకుతూ ఉంటుంది; ఈ+ఎడన్= ఇక్కడ;

తడయన్+చనదు= ఆలస్యం చేయడం మంచిది కాదు; అని= అని పలికి; లతాంగి= తీగవంటి శరీరంగల ద్రౌపది; ప్రీతిన్+చనియెన్= సంతృప్తితో వెళ్లింది.

తాత్పర్యం: ఆ మాటలు విని 'జయలక్ష్మిని పొందు' మని భీముడికి ద్రౌపది శుభాకాంక్షలు తెలిపింది. 'ఇప్పటికే సుదేష్ణ నాకొరకు వెదకుతూ ఉంటుంది. ఇక్కడ ఇంకా ఆలస్యం చేయటం మంచిది కాదు' అని అంటూ ద్రౌపది సంతృప్తితో వెళ్ళిపోయింది.

విశేషం: యుద్ధానికి వెళ్ళే భర్తలను వీరవనితలు 'విజయోఽస్తు' అని దీవిస్తారు కాని పాదాభివందనాలు చేయరు. అది యుద్ధ మర్యాద. విజయం తథ్యమని నిశ్చయం ఏర్పడిన తర్వాత ద్రౌపది హృదయంలో ఒక సంతృప్తి ఏర్పడింది. భార్య దీవెన భర్తకు విజయ సూచన! (సంపా.)

వ. మారుతసుతుండును గృతనిశ్చయుండై యుండె; నటఁ గీచకుండు కందర్పదర్పగోచరుండై పరిజనంబుల వంచించి యేకాంతస్థలంబున. 291

ప్రతిపదార్థం: మారుత సుతుండును= వాయుతనయుడు భీముడు కూడా; కృతనిశ్చయుండు+ఐ= కార్యం సాధించాలి అని చేయబడిన నిర్ణయంకలవాడై, (మనసులో గట్టిగా సంకల్పించుకొని అని భావం); ఉండెన్= ఉన్నాడు; అటన్= అక్కడ; కీచకుండు; కందర్ప, దర్ప, గోచరుండు+ఐ= మన్మథుడి గర్వానికి (మదనతాపానికి) గురి అయినవాడై; పరిజనంబులన్= పరివారాలను; వంచించి= కంటబడకుండా; ఏకాంత స్థలంబునన్= ఒంటరి ప్రదేశంలో.

తాత్పర్యం: ఇక్కడ భీముడు కూడా స్థిరనిశ్చయంతో ఉన్నాడు. అక్కడ కీచకుడు మదనతాపానికి గురిఅయి సేవకుల కళ్ళు గప్పి ఒంటరి ప్రదేశానికి చేరి (తరువాతి పద్యంతో అన్వయం.)

కీచకుఁడు ద్రౌపదియందలి మోహంబునఁ బరితాపంబు నొందుట
(ఇది మూలమునందు లేదు)

సీ. వామాక్షి రుచిర లావణ్యంబు భావించుఁ। దన్వంగి రూపు చిత్తమున నిలుపుఁ,
గంబుకంధరచెన్ను కైవడి తలపోయు । నంగన సౌకుమార్యముఁ దలంచు,
భామిని సహజ విభ్రమ మెదఁ గీలించుఁ। బడఁతి చెయ్వులు మదిఁ బట్టుకొలుపు,
మానిని గరువంపు మాటపొం దూహించు। దళితాబ్జముఖి తిన్నఁదనము మెచ్చు,

తే. నడరి కోర్కులు చిట్టుముట్టాడ వెడఁగు। పడిన యుల్లంబు పట్టునఁ బఱుపఁ దనకు
వశముగాకున్న నెంతయు వంతఁబొందుఁ।, జింత యెసకంబు వడిగొని చిక్కువఱుప. 292

ప్రతిపదార్థం: వామాక్షి= అందమైన కన్నులుగల ద్రౌపదియొక్క; రుచిరలావణ్యంబు= కాంతిమంతమైన మేని నిగనిగను; భావించున్= మరల మరల తలుస్తాడు; తన్వంగిరూపు= సన్నని మేనుగల ద్రౌపది ఆకారాన్ని; చిత్తమునన్+నిలుపు= మనస్సులో పదిల పరచుకొంటాడు; కంబుకంధర= శంఖంవంటి కంఠం కల ద్రౌపదియొక్క; చెన్నుకైవడి= అందాల తీరును; తలపోయున్= ఆలోచిస్తాడు; అంగన= అందమైన ద్రౌపది యొక్క; అంగన= ఆ స్త్రీయొక్క; సౌకుమార్యమున్= కోమలత్వమును; తలంచున్= భావిస్తాడు, స్మరిస్తాడు; భామిని= ఆ మగువయొక్క; సహజ విభ్రమము= సహజమైన విలాసాన్ని; ఎదన్+కీలించున్= మనస్సుతో హత్తుకొంటాడు; పడఁతి= యువతి అయిన ద్రౌపదియొక్క; చెయ్వులు= చేష్టలు; మదిన్= మనస్సులో; పట్టుకొలుపున్=

నిలుపుకొంటాడు; మానిని= అభిమానవతి అయిన ద్రౌపది యొక్క; గరువము+మాటపొందు= గడుసరి మాటల పొందిక; ఊహించున్= భావిస్తాడు; దళిత+అబ్జముఖి= వికసించిన పద్మంవంటి ముఖం కల ద్రౌపది యొక్క; తిన్నఁదనమున్= చక్కదనాన్ని; మెచ్చున్= మెచ్చుకొంటాడు; అడరి= అతిశయించి; కోర్కులు= ఆశలు; చిఱ్ఱుముఱ్ఱు+ఆడన్= తొందరపెట్టగా; వెడఁగు పడిన= కలత పడిన; ఉల్లంబు= మనస్సును; పట్టునన్+పఱుపన్= కుదుటపరచుకొనటానికి; తనకున్= కీచకుడికి; వశము+కాక+ఉన్నన్= సాధ్యపడకపోవటం వలన; ఎంతయున్= మిక్కిలి; చింత= విచారం; ఎసకంబు= అధికమై; వడిగొని= త్వరపడి; చిక్కు+పఱుపన్= చిరాకు పెట్టగా; వంతన్+పొందున్= బాధపడతాడు.

తాత్పర్యం: కీచకుడు అందమైన కన్నులుగల ద్రౌపది మేని నిగనిగలను మరీ మరీ తలంచేవాడు. సన్నని ఆమె అందమైన రూపాన్ని మనసులో నిలుపుకొనేవాడు. శంఖం వంటి కంఠం గల ఆమె అందాల తీరును మనసులో తలపోసేవాడు. అందమైన శరీరంగల ఆమె కోమలత్వాన్ని భావించేవాడు. ఒయ్యారి అయిన ఆమె శరీర విలాసాలను మనసుకు హత్తుకొనేవాడు. ప్రౌఢురాలైన ద్రౌపది చేష్టలను హృదయంలో గట్టిగా నిలుపుకొనేవాడు; అభిమానవతి అయిన ఆమె గడుసరి మాటల పొందికలోని (అంతరార్థాలను) ఊహించేవాడు. వికసించిన పద్మం వలె ఉన్న ఆమె ముఖంలోని చక్కదనాన్ని ప్రశంసించేవాడు. ఈ విధంగా కోర్కెలు అతిశయించి తొందరపెట్టగా (సందడించగా) కలతపడిన మనస్సును కుదుటపరచుకొనలేకపోవటంతో చింత పెచ్చుపెరగగా వ్యాకులపడుతూ ఎంతో విరహబాధ పొందాడు.

విశేషం: అమూలకంగా వర్ణించిన కీచకుడి విరహ వర్ణన తెలుగు సాహిత్యంలోనే ఒక శృంగార నాయకుడి దశవిధ కామావస్థల ఆలంకారిక వర్ణనకు దారులు వేసింది. నాయిక అంగీకారం తెలిపింది. 'అభిలాష' ఫలసిద్ధి కొరకు అఱ్రులు చాస్తున్నది. అభిలాష దశవిధ కామావస్థలలో మొదటిది. **"వ్యవసాయా త్సమారబ్ధః సంకల్పేచ్ఛా సముద్భవః । సమాగమో పాయకృతః సోఽభిలాషః ప్రకీర్తితః॥"** 'నాట్యశాస్త్రమ్. 12-173. తాను కామించిన యువతిని గురించిన పర్యాలోచనతో కూడిన జ్ఞానంతో ప్రారంభమై, సంకల్పపూర్వకమైన ఇచ్ఛచేత ఉద్రిక్తమై, సమాగమోపాయాన్ని అన్వేషించటం వరకు సాగే మానసికావస్థ అభిలాష. తిక్కన ఈ అవస్థను సమగ్రంగా వర్ణించాడు ఈ ఘట్టంలో.

ఈ పద్యంలో సైరంధ్రి రూపవైభవాన్ని కీచకుడు దర్శించి మనస్సులో పర్యాలోచనం చేస్తున్న దశ వ్యక్తమౌతున్నది. ఇవి మూడంచెలుగా చెప్పబడుతున్నాయి. అవి: రూపం-గుణం-పర్యాలోచన విధానం. వాటి వర్ణన విధానం.

1. రూపం - వామాక్షి ; గుణం - లావణ్యం ; పర్యాలోచనం - భావించడం.
2. రూపం - తన్వంగి ; గుణం - రూపు ; పర్యాలోచనం - చిత్తమున నిలపటం.
3. రూపం - కంబుకంధర ; గుణం - చెన్నుకైవడి ; పర్యాలోచనం - తలపోయటం.
4. రూపం - అంగన ; గుణం - సౌకుమార్యం ; పర్యాలోచనం - తలంచటం.
5. రూపం - భామిని ; గుణం - సహజవిభ్రమం ; పర్యాలోచనం - ఎదఁగీలించటం.
6. రూపం - పడతి ; గుణం - చెయ్వులు ; పర్యాలోచనం - మదిఁ బట్టుకొలుపటం.
7. రూపం - మానిని ; గుణం - గరువంపు మాటల పొందు ; పర్యాలోచనం - ఊహించటం.
8. రూపం - దళితాబ్జముఖి ; గుణం - తిన్నదనం ; పర్యాలోచనం - మెచ్చుకొనటం.

అష్టవిధ రూపగుణ పర్యాలోచనల వలన మనసులో సందడించే కోర్కెలను కీచకుఁడు నిలువరించుకొనలేకపోవటం అభిలాషలో ఇచ్ఛ అనే అంతర్దశ. చింత పెచ్చుపెరగటం వలన వ్యాకులపడటం ఉత్కంఠ అనే అంతర్దశ. ఎంతో వంత పొందటం సంకల్పదశలోని భాగం. తిక్కన కీచకుడి విరహవర్ణనం ఎంత రసోద్విగ్నమో, అంత శాస్త్రోక్తంగా ఉండటం విశేషం. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. తలరు, నలందురున్, నవయుఁ, దాపభరంబున వెచ్చనూర్చు, మే
నలయఁగ నొల్లఁబోవు, వెగడందుఁ, గలంగుఁ, బరిభ్రమించుఁ, గొం
దలపడుఁ, దల్లడం బడరి ధైర్యము దూలిన బెగ్గడిల్లు, వి
చ్చలవిడిఁ బేర్చు, నెవ్వగల సందడి డెందము గంది చేడ్పడున్. 293

ప్రతిపదార్థం: తలరున్= తొందరపడతాడు; అలందురున్= దుఃఖిస్తాడు; నవయున్= కృశిస్తాడు; తాపభరంబునన్= మన్మథ సంబంధమైన తాపాధిక్యంతో; వెచ్చన్+ఊర్చున్= వేడినిట్టూర్పులు విడుస్తుంటాడు; మేన్+అలయఁగన్= శరీరం అలసిపోతే; ఒల్లన్+పోవున్= మూర్ఛపోతాడు; వెగడు+అందున్= భయపడతాడు; కలంగున్= కలత పడతాడు; పరిభ్రమించున్= తిరుగుతాడు; కొందలపడున్= సంక్షోభాన్ని ప్రకటిస్తాడు; తల్లడంబు= కలత; అడరి= ఎక్కువై; ధైర్యము+తూలినన్= ధైర్యం నశించగా; బెగ్గడిల్లున్= భయపడతాడు; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; పేర్చున్= రేగిపోతాడు; నెఱ+వగల సందడిన్= మదనతాపం వలని బాధలు ఎక్కువకాగా; డెందము, కంది= మనస్సు బాధపడి తపించి; చేడ్పడున్= బాధతో చలించిపోతాడు.

తాత్పర్యం: కీచకుడు సైరంధ్రితోడి విరహవేదనలో వివిధ మదన వికారాలను ప్రకటించాడు. త్వరపడతాడు, దుఃఖిస్తాడు, కృశిస్తాడు, మన్మథతాపంతో నిట్టూరుస్తాడు, శరీరం అలసిపోతే మూర్ఛపోతాడు, భయపడతాడు, కలతపడతాడు, అటూ ఇటూ తిరుగాడుతాడు, క్షోభిస్తాడు, గుండెదడ ఎక్కువై భయపడతాడు, కట్టడ లేకుండా రెచ్చిపోతాడు, విరహతాపం వలన మనస్సు బాధపడి కంపించిపోతాడు.

విశేషం: విరహ వేదన అధికమైనప్పుడు కాముకుడు ప్రదర్శించే చేష్ట లివి. ఇవి మానసిక వికారాలకు వ్యంజకాలు. ఇన్ని భావాలకు, అవస్థలకు సంబంధించిన పరిభాషాపదాలను చాలావరకు తెలుగు పదాలలో చెప్పి తిక్కన అర్థవ్యక్తిని ప్రదర్శించటం తెలుగు భాషాశక్తిని ప్రవచించటం. (సంపా.)

వ. ఇవ్విధంబున మదనవేదనా దూయమాన మానసుం డగుచు నిట్లని వితర్కించు. 294

ప్రతిపదార్థం: ఈ విధంగా మన్మథబాధచే తపిస్తున్న మనస్సుగల కీచకుడు తన మనస్సులో ఇట్లా ఆలోచించసాగాడు.

సీ. 'పడఁతి నన్నూఱడఁ బలికిన భంగిన। నిచ్చమై నిక్కకు వచ్చునొక్కొ!
వచ్చి తొల్లిటియట్ల వడిఁ ద్రోచిపోవక। పొలఁతి యింపెసలారఁ బొందునొక్కొ!
తలపోఁతఁ గలిగి యమ్మెలఁత వచ్చుటకు నొం। డొక వింత పుట్టకయుండునొక్కొ!
గంధర్వు లేవురు గలరని చెప్పె న। న్నెలఁతుక మాటలు నిక్కమొక్కొ!

తే. తెఱవ చిడిముడిపాటు సుదేష్ణ యెఱిఁగి। వేడ్కఁ బనిపంచు టుడిగి రా విడుచునొక్కొ!
మదనుఁ డింతికి నొజ్జయై మతకములును। నదను నెఱిఁగించి నాకడ కనుచునొక్కొ! 295

ప్రతిపదార్థం: పడఁతి= ఆ వనిత; నన్నున్= (కీచకుడిని); ఊఱడన్+పలికిన భంగినన్= ఊరడిస్తూ మాట్లాడినట్లుగానే; ఇచ్చమైన్= ఇష్టపడి; ఇక్కకున్= సంకేతస్థలానికి; వచ్చును+ఒక్కొ!= వస్తుందా?; వచ్చి; తొల్లిటి+అట్ల+అ= ఇంతకుముందు వలెనే; వడిన్+త్రోచిపోవక= వేగంగా త్రోసివేసిపోక; పొలఁతి= ఆ స్త్రీ; ఇంపు+ఎసలారన్= ప్రీతి అతిశయించగా; పొందున్+ఒక్కొ= నన్ను కూడుతుందా?; తలపోఁత+కలిగి= మనసుపడి; ఆ+మెలఁతవచ్చుటకున్= ఆ వనిత రావటానికి; ఒండొకవింత= మరొక

ఆశ్చర్యకరమైన విషయం; పుట్టక+ఉండును+ఒక్కొ!= పుట్టకుండా ఉంటుందా!; గంధర్వులు+ఏవురు= ఐదుగురు గంధర్వులు భర్తలుగా; కలరు+అని చెప్పెన్= ఉన్నారని చెప్పింది; ఆ+నెలఁతుకమాటలు= ఆ వనిత మాటలు; నిక్కము+ఒక్కొ?= నిజమా?; తెఱవ= ఆ వనిత యొక్క; చిడిముడిపాటు= తొట్రుపాటు; సుదేష్ణ+ఎఱిఁగి= సుదేష్ణ తెలిసికొని; వేడ్కన్+పని+పంచుట+ఉడిగి= వేడుకగా పరిచర్యలకు పంపటం మాని; రాన్+విడుచున్+ఒక్కొ!= రావటానికి అంగీకరిస్తుందా?; మదనుఁడు= మన్మథుడు; ఇంతికిన్= ఆమెకు; ఒజ్జ+ఐ= గురువై; మతకములునున్= విలాసాలున్నూ, మాయలున్నూ; అదనున్= సమయం; ఎఱిఁగించి= తెలిపి; నా కడకున్= నా వద్దకు; అనుచున్+ఒక్కొ!= పంపుతాడా?

తాత్పర్యం: 'ఆ వనిత నన్ను అనునయిస్తూ మాట్లాడిన విధంగానే ఇష్టపడి సంకేతస్థలానికి నిజంగా వస్తుందా? వచ్చినా ఇంతకుముందు వలె విదిలించిపోకుండా ఆమె ఆసక్తితో నన్ను పొందుతుందా? నన్ను గురించి ఆలోచిస్తూ రావటానికి బయలుదేరేలోగా ఆమెకు ఏదో వింత తలపు పుట్టకుండా ఉంటుందా? గంధర్వు లైదుగురు తనకు భర్తలుగా ఉన్నారని చెప్పిన ఆమె మాటలు నిజమై ఉండవచ్చునా? వలపువలన కలిగిన ఆమె తొట్రుపాటును గమనించి సుదేష్ణ మరేదైనా పని చెప్పకుండా సంకేతస్థలానికి రావటానికి వీలు కలిగిస్తుందా? మన్మథుడే ఆమెకు గురువై ఇతరుల కన్నుగప్పే గుట్టుమట్టులూ, మాయమర్మాలూ, వాటిని ఆయా సమయాలలో ప్రయోగించే నేర్పులూ తెలియజెప్పి (స్ఫురింపజేసి) నా దగ్గరికి పంపుతాడా?

విశేషం: అలం: అంత్యానుప్రాసం. దశవిధ కామావస్థలలో 'చింత' రెండవది. ఆ అవస్థను ఈ పద్యంలో తిక్కన క్రమంగా విస్తరించి రచించాడు. ఏ ఉపాయంతో ప్రియాసంగమం జరుగుతుందో అని స్వయంగాగానీ, నర్మసచివాదులతోగాని చేసే ఆలోచన చింత, కొందరు చింతను - చింత, చింతనం, విచింతనం అని మూడు రకాలుగా చెప్తుతారు. సైరంధ్రి అన్నమాట ప్రకారం తనకొరకు సంకేతస్థలానికి చెప్పిన సమయంలో చెప్పినట్లు వస్తుందా? - అని కీచకుడు శంకిస్తున్నాడు ఇక్కడ, అకస్మాత్తుగా ఆమెలో వచ్చిన పరిణామానికి తట్టుకొనలేని కీచకుడు చింతించటంలో శంకించటాన్ని మొదట వర్ణించటం ఔచిత్యం. ఇది విచింతనంలో ఒక భాగం. అన్నీ సవ్యంగా నడవాలనే ఆతురతలో అట్లా నడుస్తాయా? అనే అనుమానం ఈ శంకావస్థకు మూలం. అందులో కూడా ఒక క్రమాన్ని పాటించి భావించటం జరిగింది. ఆమె కోర్కెతో సుముఖత ప్రకటించింది - అది నిజమైన కోర్కెఅయి సంకేతస్థలానికి రావాలని కోరిక. వలపు నిజమైతే వస్తుంది. కాకపోతే రాదు. ఇది శంక. ఈ శంక విరహవేదనను తీవ్రతరం చేస్తుంది. వచ్చినా ఇదివరకువలె తనను త్రోసివేయక తన సామీప్యాన్ని, సంగమాన్ని అంగీకరిస్తుందో లేదో అని మరొక శంక. ఆమెకు కూడా వలపు చింత కలిగి, వేదనపడుతూ, తన వద్దకు రావాలని తొందరపడుతూ ఉంటే, ఏదైనా తెలియని ఒక అద్భుతం జరిగి రాలేకపోతుందేమో! అయిదుగురు భర్తలున్నారనీ. నా రామెను రక్షిస్తుంటారనీ చెప్పిన మాట నిజమా? అబద్ధమా? అని శంక కలిగింది. వస్తే వాళ్ళకు తెలిసేటట్లు వస్తుందా, రహస్యంగా వస్తుందా? అంతుపట్టని అనుమానం. ఒకవేళ ఆమె వలపుతీవ్రత వలన తొట్రుపాటు పడుతుంటే గుర్తించి సుదేష్ణ అడ్డుపని కల్పించి పంపదేమో! అని శంకించి, శంకించి, చివరకు అడ్డంకుల నన్నింటినీ అధిరోహించగలిగే నేర్పునూ, చేర్పునూ ఆమెకు మన్మథుడే స్వయంగా సమకూర్చాలని ఆశించాడు. ఈ పద్యంలో అయిదురకాల శంకలను కీచకుడు వ్యక్తం చేశాడు. అవి వరుసగా- ఆమె నిజంగా తనను కోరుతున్నదా? పొందుకు సిద్ధమవుతున్నదా? వేరే ఏవైనా ఆలోచనలున్నాయా? చింతకు, తరువాతి రెండూ చింతనకూ, అయిదవదీ, చివరిదీ అయిన ఆకాంక్ష విచింతనకూ సంబంధించి సాగటం - చింత అనే అవస్థను తిక్కన ఆవిష్కరించిన క్రమం. పద్యరచనలో అంత్యప్రాసాలంకారం చింతావస్థలో కీచకుడి దశావిస్ఫూర్తిని లయాత్మకంగా పఠితలకు స్ఫురింపజేసింది. (సంపా.)

ఉ. **నిక్కము పోలె నప్పుడొక నేలిమిమై ననుఁ ద్రోచిపుచ్చఁగా**
నక్కమలాక్షి పొందు దగ నాడి, తుదిన్ నిజమేది, నేఁటి రే
యిక్కకు రాక తక్కిన, సహించునె నన్ మరుఁ? డట్టులైన నా
కెక్కడిప్రాణ, మేటితను, వెయ్యది నిల్కడ, యేమిసేయుదున్? **296**

ప్రతిపదార్థం: నిక్కమపోలెన్= నిజమా అన్నట్లు; అప్పుడు+ఒకనేరిమిమైన్= అప్పుడు ఏదో ఒక నేర్పుతో; ననున్+త్రోచిపుచ్చఁగాన్= నన్ను నెట్టివేయగా; ఆ+కమల+అక్షి= పద్మాలవంటి కన్నులుగల ఆ సైరంధ్రి; పొందున్= కలయికను; తగన్+ఆడి= అనువుగా మాట్లాడి; తుదిన్= చివరకు; నిజము+ఏది= ఆ వాస్తవాన్ని కాదని; నేఁటిరేయి= ఈనాటి రాత్రి; ఇక్కకున్= సంకేత స్థలానికి; రాకతక్కినన్= రాకపోతే; మరుఁడు= మదనుడు; నన్+సహించునె?= నన్ను ఓర్చుకొంటాడా?; అట్టులు+ఐనన్= అట్లాఐతే; నాకున్+ఎక్కడి ప్రాణము?= నా ప్రాణం నిలుస్తుందా?; ఏటి తనువు?= ఈ శరీరమెందుకు?; నిల్కడ ఏ+అది?= నిలుకడ ఎక్కడిది?; ఏమి+చేయుదున్= ఏమి చేసేది?

తాత్పర్యం: తనకు ఇష్టం లేకున్నా, నన్ను నేర్పుతో త్రోసిపుచ్చటానికై నిజంగా పొందుకోరుతున్నట్లే సమయానుకూలంగా మాట్లాడి, ఆ కమలాక్షి నాతో పొందుకోరి అంత సహజంగా అనువుగా మాట్లాడి కూడా చివరకు ఈ నిజాన్ని కల్లజేసి నేటి రాత్రికి సంకేతస్థలానికి రాకుండా మానివేస్తే మన్మథుడు నన్ను సహిస్తాడా? సహించకపోతే ఇక నా ప్రాణాలు నిలుస్తాయా? ఇక ఈ తను వెందుకు? ఇక నాకు శాంతి ఎక్కడిది? ఆ పరిస్థితులలో ఇక నేనేమి చేసేది?

విశేషం: ఇందులో 'అనుస్మృతి' అనే కామావస్థ వర్ణించబడింది. దేశ కాలాలను అనుసరించి పూర్వం అనుభూతాలైన విషయాలను మరల మరల తలచుకొనటం అనుస్మృతిగా సింగభూపాలుడు పేర్కొన్నాడు (చూడు: సాత్త్వికాభినయం: పి.యస్.ఆర్.అప్పారావు. పు.445). అప్పుడు త్రోచిపుచ్చింది ఇప్పుడు పొందు కోరుతున్నది సైరంధ్రి. ఇందులో రెండవది ప్రస్తుత వాస్తవం. ఒకవేళ ఇది కూడా నిజం కాకపోతే దిక్కేమిటి? అని కీచకుడి 'అనుస్మృతి'. ధీరుడైతే విరహాన్ని అతిక్రమిస్తాడు. కాముకుడైతే మరుని చేతిలో మరణంపాలౌతాడు. దశవిధ మన్మథావస్థలన్నీ అనుభవిస్తే చివరకు మిగిలేది మృత్యువే. దానిని కూడా స్మరిస్తూ కీచకుడు బెంబేలెత్తి పోతున్నాడు. ప్రియురాలు తనను వంచిస్తుందనే భావననే సహించలేకపోతున్నాడు. ఈ లక్షణమే దుష్టుడైన కీచకుడియందు కూడా శృంగారనాయక లక్షణాలను తలపింపచేస్తున్నది. (సంపా.)

క. అట్టేల రాక తక్కుం? గట్టిఁడియే యా లతాంగి? కామాతురు నన్
బెట్టి యచట దానికి మన । సెట్టు నిలుచుఁ? దగవు విడువ నెట్టులు నేర్చున్? 297

ప్రతిపదార్థం: అట్టు+ఏల= అట్లా ఎందుకు; రాకతక్కున్= రాకుండా మానుతుంది? ఆ లతాంగి= ఆ వనిత; కట్టిఁడి+ఏ= అంత కఠినాత్మురాలా? నన్= నన్ను (కీచకుడిని); కామాతురున్= మదనావేశపరుడిగా; పెట్టి= ఉంచి; అచటన్= అక్కడ; దానికిన్= ఆమెకు; మనసు+ఎట్టునిలుచున్?= మనసు ఎట్లా నిలుస్తుంది?; తగవు విడువన్= ధర్మం వదలటానికి; ఎట్టులు నేర్చున్?= ఎట్లా చాలుతుంది?

తాత్పర్యం: ఆ లతాంగి రాకుండా అట్లా ఎలా ఉంటుంది? అంత కఠినాత్మురాలా? న న్నిక్కడ ఇంత కామపరవశుడినిగా చేసి అక్కడ ఆమె నిబ్బరంగా ఉండటానికి మనసెట్లా వస్తుంది? ఎంతైనా న్యాయం తప్పి ఎట్లా నడుస్తుంది?

విశేషం: 'అనుస్మృతి' అనే కామావస్థలో 'వితర్కం' అనే భావం ఇందులో ఆవిష్కరించబడింది. తనవలెనే ఆమె కూడా విరహాన్ని పొందుతుందనీ, ఆమెలో కూడా అనుస్మృతి అనే అవస్థ కలుగుతుందనీ, అది విరహధర్మమనీ, ఆమె వచ్చి తీరుతుందనీ వితర్కించాడు కీచకుడు. (సంపా.)

ఉ. దానికి నేటి నిక్కము? వృథా పరితాపముదక్కి, బాసమైఁ
బూనికి డిగ్గఁద్రావి, వెసఁబోయెద నిప్పుడ; పోయి ముట్టి య
బ్జాననఁ బట్టి తెచ్చి హృదయం బలరంగ ననంగతంత్రవి
ద్యా నిపుణత్వ మేర్పఱిచెదం; బ్రమదాంబుధి నోలలార్చెదన్. 298

ప్రతిపదార్థం: దానికిన్= ఆమెకు; ఏటి నిక్కము?= ఎక్కడి నిజాయితీ?; వృథా పరితాపము= ఫలితం లేని ఈ మనోవేదన; తక్కి= మాని; బాసమైన్= ఇచ్చినమాట మీది; పూనికి= ప్రయత్నం; డిగ్గన్+త్రావి= దిగమ్రింగి, వదిలిపెట్టి; ఇప్పుడు+అ= వెంటనే; వెసన్+పోయెదన్= వేగంగా వెళ్ళుతాను; పోయి= వెళ్ళి; ముట్టి= ఆక్రమించి; అబ్జ+ఆననన్= ఆ పద్మముఖిని; పట్టితెచ్చి= పట్టి తీసికొనివచ్చి; హృదయంబు+అలరంగన్= మనస్సు రంజిల్లేటట్లు; అనంగతంత్ర విద్యానిపుణత్వము= మన్మథ క్రియాకలాపంలో నేర్పరితనాన్ని; ఏర్పఱిచెదన్= ప్రదర్శిస్తాను; ప్రమద+అంబుధిన్= సంతోష సముద్రంలో; ఓలలార్చెదన్= తేలియాడేటట్లు చేస్తాను.

తాత్పర్యం: ఆమెకు నిజం పాటించాలన్న నియమం ఉన్నదా? అందుకే, ఈ వృథా విరహవేదనను వదలిపెట్టి, చేసిన బాసను దిగమ్రింగి, ఇప్పుడే వేగంగా నేను వెళ్ళుతాను. వెళ్ళి ఆమెను ముట్టడించి పట్టి తీసికొని వస్తాను. మనసు రంజిల్లేటట్లు రతిక్రీడలలో నాకున్న పాండిత్యాన్నీ, నేర్పరితనాన్నీ ప్రదర్శించి చూపిస్తాను, సంతోషసాగరంలో ఓలలాడిస్తాను.

విశేషం: 1. అలం: రూపకం. ప్రమదాంబుధిలో ఓలలాడటంలో ఆ అలంకారం ఉన్నది. 2. ఈ పద్యంలో 'ఉద్వేగం' అనేకామావస్థ వర్ణించబడింది. **"ఆసనే శయనే చాపి న తుష్యతి, న తిష్ఠతి । నిత్యమే వోత్సుకా చ స్యా దుద్వేగస్థానమాశ్రితా॥"** (నా.శా.12.181) ఆసన శయనాలలో సంతోషం కాని, నిలుకడకాని లేకపోవటం వలన ఉద్వేగంతో ప్రియురాలిని కలియాలనే ఉత్సుకత ప్రకటించటం ఉద్వేగం. సైరంధ్రిని వెంటనే పొందాలన్న ఉత్సుకత కీచకుడి కామభావోద్వేగాన్ని తెలుపుతున్నది. దాని కనుగుణంగా ఆలోచించటం ఇందులోని ప్రవృత్తి. సైరంధ్రి మాటమీద నిలబడుతుందని నమ్మితే ఉద్వేగానికి ఊపిరి లేదు. ఆ శంకతో మొదలై అనుకొన్న నియమాన్ని దిగమ్రింగి (రసాత్మకమైన క్రియ), ఆమెను శీఘ్రంగా పట్టి తెచ్చి రతిక్రీడలలో ముంచి తేల్చేంతవరకు ఊహించాడు కీచకుడు. అతడు దుర్విదగ్ధు డనటానికి ఇదొక ఉదాహరణ. అయినా, అతడి భావతీవ్రత శృంగారనాయకులకైతే ఒక అలంకారం కాకమానదు. అతడిని అట్లా ప్రదర్శించటం కూడా తిక్కన సంకల్పం. (సంపా.)

ఆ. **అనుచు సంచలించు, నడియాసఁ గ్రమ్మఱఁ । బాసఁ దలఁచి ధృతికిఁ బట్టువెట్టు**
మరుని కోహటించి యురియాడుఁ, దుదిముట్టఁ । గాన నిశ్చయించుఁ గలఁగుఁ దేఱు. **299**

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; అడియాసన్= తీరని ఆశగా; సంచలించున్= కంపించిపోతాడు; క్రమ్మఱన్= మళ్ళీ; బాసన్+తలఁచి= ఆమె ఇచ్చిన మాట గుర్తుకు తెచ్చుకొని; ధృతికిన్= ధైర్యానికి; పట్టు+పెట్టు= ఆధారం కలిగిస్తాడు; మరునికిన్= మన్మథుడికి; ఓహటించి= వెనుదీసి; ఉరి యాడున్= ఊగిసలాడతాడు; తుదిముట్టన్+కానన్= చివరివరకు చూడటానికి లేదా చనిపోయే యత్నం చేయటానికీ; నిశ్చయించున్= నిర్ణయిస్తాడు. కలఁగున్= అంతలోనే కలత పడతాడు; తేఱున్= అంతలోనే తేరుకొంటాడు.

తాత్పర్యం: ఈ విధంగా అనుకొంటూ తన ఆశలన్నీ అడియాస లైపోతాయేమో అని భావించి నిలువునా కంపించిపోయేవాడు. మళ్ళీ ఆమె ఇచ్చిన మాటను తలచుకొని ధైర్యాన్ని కూడగట్టుకొనేవాడు. అయినా మన్మథుడు పెట్టే తొందరకు జంకి వెనుకకూ ముందుకూ ఊగిసలాడేవాడు. చివరివరకు ఏమి జరుగుతుందో చూద్దామనీ (చనిపోయే యత్నం చేద్దామనీ) నిశ్చయించుకొనేవాడు. అంతలోనే కలతపడేవాడు, వెంటనే తేరుకొనేవాడు.

విశేషం: ఉద్వేగంలోని చిత్తవైకల్యం ఈ పద్యంలో వర్ణితం. అనిశ్చిత చిత్తస్థితి వలన విరహదశలో కలిగే - సంచలించడం, ధైర్యం తెచ్చుకొనటం, ఊగిసలాడటం, తుదముట్ట చూడ నిశ్చయించటం, కలత పడటం, తేరుకొనటం - అనే మదన వికారాలను ఒక క్రమ విన్యాస పద్ధతిలో తిక్కన సంవిధానం చేయటం సులభంగా గమనించవచ్చును. (సంపా.)

వ. **మఱియు నక్కోమలివలని ప్రేముడిం దగిలి.** **300**

తాత్పర్యం: ఆ ద్రౌపదిపైని మోహంలో చిక్కుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **పొడసూపినట్లైన వడిఁబట్ట సమకట్టి। పరికించి కానక బమ్మరించు;**
మెలఁగినయట్లైన బలికింపఁ దలఁచి,ని। రూపించి లేమి నశ్రులు వహించుఁ;
గదిసినయట్లైనఁ గౌఁగిలింపఁ గడంగి। యారసి బొంకైన నలఁత నొందు;
నొడఁబడ్డయట్లైన నదరి పైకొనఁజూచి। చెన్నఁటి యగుట నిశ్చేష్టఁ బొరయు;

తే. **లలిత వివిధ విహారంబులకు లతాంగి। యెలసి సొలసిన యట్లైన నెలమిఁ గలిసి**
యభిమతక్రీడ సలుపంగ నప్పళించి। వెదకి రిత్తబయల్ గని విహ్వలించు. **301**

ప్రతిపదార్థం: పొడసూపినట్లు+ఐనన్= కనబడినట్లుగా అనిపిస్తే; వడిన్+పట్టన్ సమకట్టి= త్వరగా పట్టుకొనాలని ప్రయత్నించి; పరికించి= (ఆ తరువాత) పరిశీలించి చూచి; కానక= కనబడక; బమ్మరించున్= ఆశ్చర్యపోతాడు; మెలఁగిన+అట్లు+ఐనన్= దగ్గరగా తిరుగుతున్నట్లు తోస్తే; పలికింపన్+తలఁచి= మాట్లాడించాలని అనుకొని; నిరూపించి= పరీక్షగా చూచి; లేమిన్= లేకపోవటం వలన; అశ్రులు వహించున్= కన్నీరు పెట్టుకొంటాడు; కదిసిన+అట్లు+ఐనన్= మరీ దగ్గరకు వచ్చినట్లు అనిపిస్తే; కౌఁగిలింపన్+కడంగి= కౌగిట చేర్చటానికి పూనుకొని; అరసి= బాగా చూచి, పరిశీలించి; బొంకు+ఐనన్= అదంతా అబద్ధమని తేలితే; అలఁతన్+ఒందున్= బాధ (శ్రమ) పడతాడు; ఒడఁబడ్డ+అట్లు+ఐనన్= (తనతో కూడటానికి) ఒప్పుకొన్నట్లు తోస్తే; అదరి= అతిశయించి; పైకొనన్+చూచి= పైన పడి క్రమ్ముకొనటానికి ప్రయత్నించి; చెన్నఁటి+అగుటన్= ఉత్తదే కావటం చేత; నిశ్చేష్టన్+పొరయున్= చేష్టలుడుగుతాడు; లలిత వివిధ విహారంబులకున్= సుకుమారమైన అనేక క్రీడలకు; లతాంగి= వనిత (సైరంధ్రి); ఎలసిసొలసిన అట్లు+ఐనన్= వశమై దరిచేరినట్లు అనిపించగా; ఎలమిన్= ప్రీతితో; కలిసి= కూడి; అభిమతక్రీడ= తనకు ఇష్టమైన పని (రతికేళి); చలుపంగన్= చేయటానికి; అప్పళించి= ప్రయత్నించి; వెదకి= తేరిపార బాగా చూచి; రిత్తబయల్ కని= శూన్య ప్రదేశం చూచి; విహ్వలించున్= శరీరావయవాలు స్వాధీనం తప్పినట్లుగా వివశుడైపోతాడు.

తాత్పర్యం: సైరంధ్రి ఎదుట కనపడినట్లనిపించేది. కీచకు డామెను వెంటనే పట్టుకొనాలని పూనుకొనేవాడు. తీరా చూస్తే కనపడేది కాదు. అందుకు ఆశ్చర్యపోయేవాడు. ఆమె తన ప్రక్కన తిరుగుతున్నట్లు అనిపించేది. అతడు ఆమెను పలకరించాలని భావించి ముందుకు వెళ్ళేవాడు. పరిశీలించి చూస్తే ఏమీ ఉండేది కాదు. అందుకు కన్నీరు పెట్టుకొనేవాడు. ఆమె తనకు బాగా దగ్గరగా వచ్చినట్లనిపించేది. అత డామెకు కౌగిలించుకొనాలని ప్రయత్నించి, అదంతా అబద్ధమని తెలిసి మనసు నొచ్చుకొనేవాడు. ఆమె తనతో కూడటానికి సుముఖురాలైన ట్లనిపించేది. వెంటనే ఆమెపై బడి కౌగిలించుకొనాలని చూచేవాడు. అదంతా ఉత్తదే అని తెలిసి కొయ్యబారిపోయేవాడు. ఆమె అతి కోమలమైన వివిధ విలాసాలతో తనకు వశమై, దరిచేరినట్లు అన్పించగా, వెంటనే ప్రీతితో ఆమెను అభిమత రతిక్రీడలలో ముంచెత్తాలని ప్రయత్నించేవాడు. చివరకు అంతా చూస్తే శూన్యమైన ఆకాశమే అని తెలిసికొని శరీరమంతా స్వాధీనం తప్పినట్లు వివశుడయ్యేవాడు.

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం. ఈ పద్యంలో కీచకుడి కామావస్థలలోని ఉన్మాదావస్థ వర్ణితమైనది. అనుమానంతో మొదలైన విరహవేదన ఉన్మాదంతో పరిణతి చెందింది. ఇందులో నాయిక నాయకుడిని కూడేటప్పుడు సాధారణంగా కానవచ్చే దర్శన, స్పర్శన, సామీప్య, సల్లాప, స్నేహ, సంశ్లేష, సౌముఖ్య, సమ్మోహ, విలాస, విహార దశలను భావించుకొని ఉన్మత్త దశలో అవియే నిజమని భావించి మోసపోయి చివరకు వివశుడయ్యాడని వర్ణించిన ఈ రచనలో ఒక క్రమంతో పాటు రసధ్వని కూడా రాణించింది.

కీచకుడి మదనోన్మాదం ఫలాన్ని పొందనున్నట్లు కనబడుతున్నా సైరంధ్రితో పొందు అనుమానాశ్రితమనీ, చివరకు అది అబద్ధమేననీ, పరిశీలించి చూస్తే అతడికి దక్కేది శూన్యమేననీ భావి కథారసార్థాలను తిక్కన ధ్వనింప చేస్తున్నాడు. రసభావ వ్యక్తీకరణం వలన ధ్వనించే రసార్థాలు రసధ్వని రసకందాలు. (సంపా.)

కీచకుఁ డుద్యానవనంబున విహరించుట

(ఇది మూలమునందు లేదు)

వ. ఇట్లు బహుప్రకారంబులగు మన్మథ వికారంబుల కగపడి వెగడంది యమందసంతాపభరితాంతఃకరణుం డగుచు సింహబలుండు పరిచారికాప్రార్థనం జేసి మజ్జన భోజనంబు లొకభంగి నడపినవాఁడై, తదనంతరంబ మనోజవేదనాపనోదనార్థంబు మందిరారామభూమికిం జని తత్ప్రదేశంబున. 302

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; బహుప్రకారంబులు+అగు= అనేకరకాలైన; మన్మథ వికారంబులకున్= శృంగారభావ చేష్టలకు; అగపడి= లోబడి; వెగడంది= భయపడి; అమంద సంతాపభరిత+అంతఃకరణుండు+అగుచున్= మిక్కిలి విచారంతో కూడిన మనస్సుకలవాడై; సింహబలుండు= కీచకుడు; పరిచారికా ప్రార్థనన్+చేసి= సేవికల కోరిక మేరకు; మజ్జన భోజనంబులు= స్నానభోజనాలు; ఒక భంగిన్ నడిపినవాఁడై= ఏదో విధంగా జరిపి; తద్+అనంతరంబు+అ= తర్వాత; మనోజవేదనా+అపనోదన+అర్థంబు= మన్మథ తాపం పోగొట్టుకొనటానికి; మందిర+ఆరామభూమికిన్+చని= ఇంటితోటలోనికి వెళ్ళి; తద్+ప్రదేశంబునన్= అక్కడ.

తాత్పర్యం: ఇట్లా అనేక విధాలైన మదనవికారాలకులోనై తడబాటుపడి మిక్కిలి దుఃఖంతో నిండిన హృదయంతో కీచకుడు పరిచారికల బలవంతం మీద స్నాన భోజనాదులు ఏదో విధంగా ముగించుకొని, ఆ తరువాత మదనతాపం చల్లార్చుకొనటానికై అంతఃపురంలోని ఉద్యానవనంలోకి ప్రవేశించి, అక్కడ.

విశేషం: మన్మథ దశావస్థలలో అరతి, గమనం అనే వాటిని కావ్యాలంకారసంగ్రహంవంటి లక్షణ గ్రంథాలు చెప్పాయి. విరహతాపం వలన స్నానపానాదులందు ప్రీతి లేకపోవటం- అరతి. మదనతాపానికి గృహంలో ఉండలేక శైత్యోపచారార్థమై ఉద్యానవనాదులలో విహరించటం, జలక్రీడలాడటం, చిగురుపాన్పుపై పవళించటం వంటి క్రియలు చేయటంలో తిరగటం (విహరించటం) గమనం. ఆ రెండు అవస్థలను తిక్కన కీచకుడిపట్ల ఈ వచనంలో పేర్కొన్నాడు. తరువాతి రెండు పద్యాలలో గమనావస్థను విస్తరించాడు. (సంపా.)

చ. కమలవనంబుపొంత నునుగాడ్పొకయించుక యాదరించుఁ, జి
త్తమునకుఁ దానఁ దల్లడము దన్కుటయుం జని గారవంపుఁజూ
తముకడ నిల్చు, నిల్చి యది తాపముఁ బెంచిన లేఁత తీవ జొం
పముఁ జొరఁబాఱు నం దలఁత పైకొనినన్ వెడలున్ వెనుంబడున్. 303

ప్రతిపదార్థం: కమలవనంబు పొంతన్= తామర వనం (కొలను) దగ్గర; నునుగాడ్పు= మెల్లని గాలిని; ఒక+ఇంచుక= కొద్దిగా; ఆదరించున్= మన్నిస్తాడు; దానన్= దానివలన; చిత్తమునకున్= మనస్సునకు; తల్లడము= బాధ; తన్కుటయున్= అతిశయించగా; చని= వెళ్ళి; గారవము+చూతముకడన్= ప్రియమైన మామిడిచెట్టువద్ద; నిల్చున్= నిలబడతాడు; నిల్చి= నిలబడి; అది తాపమున్+పెంచినన్= అది విరహవేదన పెంచగా; లేఁత తీవ= లేత తీగల యొక్క; జొంపమున్= గుబురులోకి, పొదరింట్లోకి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చొఱన్+పొఱున్= ప్రవేశిస్తాడు; అందున్= అందులో; అలఁత= అలసత(ట); పైకొనినన్= ఎక్కువ కాగా; వెడలున్= బయటకు వెళ్ళేవాడు; వెనుంబడున్= ఉపాయం తోచక మనసులో చింతపడేవాడు.

తాత్పర్యం: కీచకుడు తామరపూల కొలను దగ్గర నిలబడి చల్లని పిల్లగాలిని కొంతసేపు సేవించేవాడు. కాని, దాని వలన మదన వేదన ఎక్కువయ్యేది. అక్కడినుండి కదలి తనకు ప్రీతికరమైన మామిడి చెట్టు వద్ద నిలబడేవాడు. అది తాపాన్ని తగ్గించటానికి బదులు మరింత పెంచేది. ఆపైన లేదీగల పొదరిండ్లలో దూరేవాడు. అక్కడ జడతతో కూడిన గ్లాని ఏర్పడేది. పొదరిళ్ళలో ఉండలేక బయటపడేవాడు. మరే ఉపాయం తోచక మనసులో చింతించేవాడు.

విశేషం: ఉద్యానవనంలో బహిస్తాపాన్ని తగ్గించగల వస్తువులను మదనతాపం తగ్గటానికి కీచకుడు ఆశ్రయించ నారంభించాడు. అవి విరహతాపాన్ని తగ్గించటానికి బదులు పెంచసాగాయి. ఒకదానిని విడిచి మరొకదానిని ఆశ్రయిస్తూ తిరుగుతున్నాడు. కొలను దగ్గరి మలయపవనం, మామిడి చెట్టునీడ, లేదీవల మంటపాలూ ఇవన్నీ సూర్యతాపాన్ని తగ్గిస్తాయి కాని, విరహతాపాన్ని పెంచుతాయి. అంతర్గతమైన మదనతాపం తగ్గించే ఉపాయాంతరం తోచక కీచకుడు చింతించాడు. "అలఁత పైకొనినన్" అని అనటంలో తిక్కన విరహతాపంలో గోచరించే జాడ్యం గ్లాని, ఆలస్యం అనే సంచారిభావాలను ధ్వనింపచేస్తున్నాడు. చేయవలసిన పనులలో ఏది చేయాలి? ఏది చేయగూడదు? అనే ఆలోచన తోచక చింతించటం జాడ్యం, బడలికపడటం గ్లాని, చేయవలసిన పనులలో చురుకుదనం చూపకపోవటం ఆలస్యం. పై మూడు చర్యలలో ఈ మూడు సంచారిభావాలూ స్పష్టమౌతున్నాయి. (సంపా.)

ఆ. సుడియుగాలిఁ బువ్వుఁ బొడిఁ దన్నుఁ గప్పునో। యనుచు బెగ్గలించు నగ్గలముగఁ
గురియు తేనియలకుఁ గొంకు లతాగుల్మ। తరు సమీపములకు నరిగియరిగి. 304

ప్రతిపదార్థం: లతా, గుల్మ, తరు సమీపములకున్= తీగల పొదల దగ్గరకూ, చెట్ల దగ్గరకూ; అరిగి+అరిగి= వెళ్ళి వెళ్ళి; సుడియుగాలిన్= చుట్టుకొని వీచే గాలి వలన; పువ్వు+పొడి= పుప్పొడి; తన్నున్= తనను (కీచకుడిని); కప్పునో= కప్పివేస్తుందేమో; అనుచున్= అని భావిస్తూ; అగ్గలముగన్= అధికంగా; బెగ్గలించున్= భయపడతాడు; కురియు తేనియలకున్= కురిసే పూలతేనెల జల్లులకు; కొంకున్= జంకేవాడు.

తాత్పర్యం: పూదీగల పొదరిండ్ల దగ్గరికీ, పూలచెట్ల దగ్గరికీ (సుగంధాన్ని సేవించి అలత పోగొట్టుకొనటానికి) కీచకుడు పోయేవాడు. పొదరిండ్ల దగ్గర సుడిగాలి వీచినప్పుడు పుప్పొడి తనను కప్పివేస్తుందేమో అని భయపడేవాడు. పూల చెట్లనీడలలో తిరుగుతున్నప్పుడు పూదేనెలు కురిసి ముంచివేస్తాయేమో అని లోలోన మిగుల జంకేవాడు.

విశేషం: గమనమనే మదనావస్థలో అలతను పోగొట్టుకొనటానికి చేసే రెండు యత్నాలు ఇందులో చెప్పబడ్డాయి. **"సుగంధం పుష్టివర్ధనమ్"** అని న్యాయం. సువాసనలు పీలిస్తే అలసత తీరి బలం చేకూరుతుందని పూల పొదరిళ్ల పొంతా, పూలచెట్ల పొంతా తిరిగాడు. కాని, పూల పుప్పొడులూ, మకరందాలూ మదనతాపాన్ని పెంచుతున్నాయి. దిక్కు తోచక తిరగటం సాగించాడు. (సంపా.)

వ. ఇత్తెఱంగున నొక్కయెడనయినను గాలూనక లీలోద్యానంబు కలయం గ్రుమ్మరుచు. 305

తాత్పర్యం: ఈ విధంగా ఒక్కచోట కూడా కాలు నిలుపకుండా విలాసోద్యానవనంలో కలయ తిరుగుతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఇంపైన ప్రియ కాననిచ్చి, నిల్చిన మధు। వాదట నాను మత్తాలివిభునిఁ,
జెట్టుపల్ పచరించి చుట్టుఁ గ్రుమ్మరి మనో। రమ నియ్యకొలుపు మరాళవిభుని,
ఫలరస మొండొంటి కెలమిఁ జంచుల నిచ్చు। మెయిన చొక్కెడు శుకమిథునములను,
గమిఁ బాసి తలిరుజొంపమునకు మెయిమెయిఁ। దాఁకంగఁ జను పికదంపతులను

తే. జూచి చూచి యుల్లంబున నేచి కోర్కు। లడర చిడిముడిపడు, వ్రూనుపడు, వెడంగు
పడు, వెనుంబడుఁ దల్లడపడు, దురంత। చింతబారికి నగపడు సింహబలుఁడు. 306

ప్రతిపదార్థం: ఇంపైనప్రియకున్= ఇష్టమైన ప్రియురాలికి; ఆనన్+ఇచ్చి= త్రాగటాని కిచ్చిన పిమ్మట; నిల్చినమధువు= మిగిలిన తేనెను; ఆదటన్= ప్రీతితో; ఆను= త్రాగే; మత్త+అలివిభునిన్= మదించిన మగ తుమ్మెదను; చెట్టుపల్= రెక్కలు; పచరించి= విప్పార్చి; చుట్టున్+క్రుమ్మరి= చుట్టూ తిరిగి; మనోరమన్= ప్రియురాలిని; ఇయ్యకొలుపు= అంగీకరింపజేసే; మరాళవిభునిన్= రాజహంసను; ఫలరసము= పండ్లరసాన్ని; ఒండు+ఒంటిన్= ఒకదాని కొకటి; ఎలమిన్= ప్రేమతో; చంచులన్+ఇచ్చు= ముక్కుపుటాలతో అందించే; మెయిన్+అ= విధంగా; చొక్కెడు= సోలిపోవు; శుకమిథునములను= చిలుకల జంటలను; గమిన్+పాసి= గుంపును వదలి; తలిరు జొంపమునకున్= చిగురుపొదలకు; మెయిమెయిన్+తాఁకంగన్= శరీరాలు పరస్పరం రాచుకొనగా; చను= వెళ్ళే; పికదంపతులను= కోయిలల జంటలను; సింహబలుఁడు= కీచకుడు; చూచి చూచి= ఆసక్తితో చూచి; ఉల్లంబునన్= మనస్సులో; ఏచి= విజృంభించి; కోర్కులు+అడరన్= కోరికలు రేగగా; చిడిముడిపడున్= తొట్రుపడతాడు; వ్రానుపడున్= నిశ్చేష్టుడౌతాడు; వెడంగుపడున్= కలతపడతాడు; వెనుంబడున్= చింతిస్తాడు; తల్లడపడున్= కంపించిపోతాడు; దురంత చింత బారికిన్= అంతులేని బాధకు; అగపడున్= వశమౌతాడు.

తాత్పర్యం: ప్రియురాలికి ముందుగా పూదేనె పానీయాన్ని త్రాగనిచ్చి మిగిలిన పూదేనెను త్రాగుతున్న మగ తుమ్మెదను, రెక్కలను విప్పి ప్రేయసి చుట్టుతిరిగి దాని మనస్సు కరగించి లోబరుచుకొనే రాజహంసను, పండ్లరసాలను ఒకదాని కొకటి ముక్కులతో ముచ్చటగా పంచుకొంటూ మురిసిపోయే చిలుకజంటలను, గుంపును కనుగప్పి ఏకాంతంలో ఒకదాని శరీరానికి మరొకటి తాకేటట్లు సాగే కోయిల జంటలను సింహబలుడైన కీచకుడు ఆసక్తితో చూచి, చూచి మనస్సులో కోర్కెలు రేగగా తొట్రుపడేవాడు, నిశ్చేష్టుడయ్యేవాడు, కలత చెందేవాడు, తపించేవాడు, తల్లడిల్లేవాడు, మితిమీరిన చింతకు లొంగిపోయేవాడు.

విశేషం: 1. అలం: యథాసంఖ్యం. శృంగార రసపోషణలో ఆలంబన, ఉద్దీపన, తటస్థ విభావాలను యథావకాశంగా వర్ణించటం కావ్యసంప్రదాయం. నాయికానాయకుల యౌవనాదులు ఆలంబన విభావాలు, చేష్టాదులు ఉద్దీపన విభావాలు. ఉద్యానాదులు తటస్థ విభావాలు. అయితే తటస్థ విభావాలను ఉద్దీపన విభావాలుగా మార్చి చిత్రించటమే కవి ప్రతిభ. జడమైన ఉద్యానవనంలో చైతన్యస్ఫోరకమైన తిర్యక్కులు ఉద్దీపనకు తోడ్పడతాయి. ఉద్యానవనంలోని తుమ్మెదల జంటలు, హంస మిథునాలు, శుకపికాల దంపతులు సలిపే లలిత శృంగార చేష్టలు తటస్థ విభావంలోని ఉద్దీపన విభావ శక్తులు. కాళిదాసాది మహాకవులు నాయికానాయకుల రత్యుద్దీపనానికి వీటిని విభావాలుగా వాడారు. పశుపక్ష్యాదులందు మానవత్వారోపణం భావనామయం. ప్రియురాలికి మధువును ముందుగా ఇచ్చి మిగిలినది తాను త్రాగటం మనసిచ్చి పుచ్చుకొనటానికి సంకేతం; రెక్కలతో ప్రియురాలిని అనునయించి అంగీకరింప చేయటం సాంత్వన చాతుర్యం; ఫలరసాలను కలిపి అనుభవించటం మనసు లేకమైన మధుర భావనం. ఒంటరిగా జంటలు క్రీడించటం సంకేతస్థలాలలో స్వేచ్ఛగా రమించటం వంటివి. నాయిక పొందుగోరే సింహబలుడికి ఈ దృశ్యాలన్నీ ఉద్దీపకాలే ఔతాయి. వాటిలోకూడా ఒక క్రమవికాసదశ కనపడటం విశేషం. కావ్యంలో ఉద్దీపన విభావాలను చూచి ఉద్దీప్తమైన

పాత్ర కీచకుడు. పాఠకుడికి అతడు ప్రత్యక్ష విభావ మౌతాడు. అతడిలో పై నాలుగు దృశ్యాలను చూడటం వలన నాలుగు భావచేష్టలు అనుభవించాడు. వరుసగా అవి- చిడిముడి పడటం, మ్రానుపడటం, వెడంగు పడటం, వెనుబడటం. కోరికలు పెల్లుబుకగా అతడు తల్లడపడటం జరిగింది. ఇందులో తిక్కనకు ప్రీతిపాత్రమైన యథాసంఖ్యాలంకారం రాణిస్తున్నది.

2. తిర్యక్కుల శృంగారం రసాభాస మంటారు. నిజమే. అది పఠితకు ప్రత్యక్ష విభావమైనప్పుడు. మరి ఆ శృంగారం కావ్యనాయక రత్యుద్దీపక విభావంగా వర్ణించబడినప్పుడు రసాభాసం కాదు, రసపోషకం. పశుపక్ష్యాదుల శృంగారం భావశబలతను ప్రదర్శించలేదు. మానసికావస్థలనే చూపగలుగుతుంది. అయితే ఈ పద్యంలో తుమ్మెదల హంసల శుకపికాల వలన కలిగే మానసికావస్థలు కీచకుడిలో సంచారిభావాల పెంపుదలకు తోడ్పడుతున్నవి. 'చూచిచూచి యుల్లంబున వేచి కోర్కులడరన్' అని స్పష్టంగా తిక్కన పేర్కొనటం గమనార్హం. తిక్కన రసశిల్పి. (సంపా.)

3. ఈ పద్యం కాళిదాసు కుమారసంభవ కావ్యంలోని అకాల వసంతావిర్భావ వర్ణన సందర్భంగా చెప్పిన-

'మధు ద్విరేఫః కుసుమైకపాత్రే - పపౌ ప్రియాం స్వామనువర్తమానః।
శృఙ్గేణ సంస్పర్శనిమీలితాక్షీం - మృగీమకణ్డూయత కృష్ణసారః॥
దదౌ రసాత్ పఙ్కజరేణుగన్ధి - గజాయ గణ్డూషజలం కరేణుః।
అర్ధోపభుక్తేన బిసేన జాయాం - సంభావయామాస రథాఙ్గనామా॥' - అనే శ్లోకాలను స్ఫురింపజేస్తున్నది.

వ. ఇట్టి వలవంత నిక్కడక్కడ వడిఁ దిరిగి తిరిగి. 307

తాత్పర్యం: ఇట్లాంటి విరహబాధతో అటూ ఇటూ వేగంగా తిరిగి తిరిగి.

క. వగ ముట్టికొనినఁ జిత్తము। వెగడొందఁగ మేను గలయ వెమ్మఁగ ధృతి పాఁ
తగల నొక తీవయింటికిఁ। దగియుండెడు చంద్రకాంతతల్పము సేరెన్. 308

ప్రతిపదార్థం: వగ= బాధ; ముట్టికొనినన్= ఆవహించగా; చిత్తము= మనస్సు; వెగడు+ఒందఁగన్= తడబాటు కలుగగా; మేను= శరీరం; కలయన్= అంతా; వెమ్మఁగన్= తాపం పొందగా; ధృతిపాఁతు= ధైర్యము యొక్క మూలం; అగలన్= పగిలిపోగా; ఒక తీవ+ఇంటికిన్= ఒక లతాగృహానికి; తగియుండెడు= సరిపోయిన; చంద్రకాంత తల్పము= చలువరాతి తిన్నెను; చేరెన్= చేరాడు.

తాత్పర్యం: విరహతాపం విపరీతం కాగా అతడి మనసు కలత పొందింది; శరీరమంతా వేడెక్కింది; మనోధైర్యం మూలంతో సహా తెగింది. నెమ్మదిగా ఒక లతామండపంలో అమరిఉన్న చలువరాతి శయ్యమీదకు చేరాడు.

విశేషం: విరహుల పాలిటి వరాలు చంద్రకాంత శిలావేదికలు. మేనిలోని తాపాన్ని పోగొడతాయి. ఒకరకంగా అధికం చేస్తాయి. కీచకుడికి తాపాన్ని అధికం చేసింది ఆ ప్రదేశం.

క. అం దొఱగి కీచకుం డా। యిందీవరనయన నాత్మ నిడి వేడ్కమెయిన్
డెందము చన విచ్చలవిడిఁ। గందర్పుఁడు వెట్టిఁ జేయఁగా నిట్లనియెన్. 309

ప్రతిపదార్థం: అందున్= దానిపై; ఒఱగి= వ్రాలి; కీచకుండు; ఆ+ఇందీవరనయనన్= కలువలవంటి కన్నులు గల సైరంధ్రిని; ఆత్మన్+ఇడి= మనస్సులో ఉంచుకొని; వేడ్కమెయిన్= వేడుకతో; డెందము= మనస్సు; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; చనన్= పోగా -

ఊహలలో ఎగిరిపోతూ ఉంటే; కందర్పుఁడు= మన్మథుడు; వెఱ్ఱిన్+చేయఁగాన్= వెఱ్ఱివాడిని చేయగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ చంద్రకాంతశిలాతల్పంపై పరుండి కీచకు డా కలువలవంటి కన్నులు గల సైరంధ్రిని మనసులో నిలిపికొని, హృదయం ఆసక్తితో పరిపరివిధాల ఊహలలో తేలుతూ ఉండగా, మన్మథుడు అతడిని వెఱ్ఱివాడిని చేసి ఆడిస్తూ ఉంటే, ఇట్లా పలికాడు.

విశేషం: మనస్సు పరిపరివిధాలుగా పోవటం, మన్మథుడు వెఱ్ఱివాడిని చేయటం-అనే అంశాలు కీచకుడి ఉన్మత్తావస్థను సూచిస్తున్నాయి. **"తత్సంశ్రితాం కథాం యుంక్తే సర్వావస్థాగతాపి హి । పుంసః ప్రద్వేష్టి చాప్యన్యా నున్మాదః సంప్రకీర్తితః॥ తిష్ఠ త్యనిమిషదృష్టి ర్దీర్ఘం నిఃశ్వసతి గచ్ఛతి ధ్యానమ్ । రోదితి విహారకాలే నాట్య మిదం స్యా త్తథోన్మాదే॥** (నా.శా. 12,185, 186). ఇది నాయికాపరంగా చెప్పిన లక్షణం. దీనిని ఇక్కడ పురుషపరంగా అన్వయించుకొనాలి. సర్వావస్థలలో నాయికాశ్రితమైన కథలనే ఎన్నుతూ, మిగిలినవాటిని ద్వేషించటం ఉన్మాద స్వభావం. కళ్ళార్పకుండా చూడటం, నిట్టూర్చటం, ఏదో ఏదో ఆలోచిస్తూ ఉండటం, విహార సమయంలో కూడా రోదించటం మొదలైనవి ఉన్మాద చేష్టలుగా భరతమహర్షి చెప్పాడు. ఆ అవస్థలోనే ఒక వస్తువును మరొక వస్తువుగా భావించటం ఉన్మాద మన్నాడు రసార్ణవ సుధాకరకర్త సింగభూపాలుడు. తిక్కన ఈ అవస్థను కీచకపాత్రోచితంగా నిర్వహించటం ప్రకరణౌచిత్యం. (సంపా.)

సీ. **'కెంగేలుఁ గేలితోఁ గీలించి నెయ్యంపు। మాటలఁ దగు మాఱుమాట లార్తుఁ**
గుచము లురంబునఁ గుదియించి క్రమమున। నిఱిసిన కౌఁగిట నింపొనర్తు,
నంగుళంబుల నల్ల నలకలఁ గబళించి। కెమ్మోవి యాని యెక్కింతుఁ గాయ్పు,
మనము మనంబునఁ బెనఁచి కేళికిఁ జొచ్చి। సతిఁ దేల్తు సౌఖ్యరసంపునిట్టఁ,
తే. **దనివు మొదలైనఁ జిగురొత్తు తమకమునకుఁ। బ్రాఁకు వెట్టుచు మగుడఁ బైఁబడుచు నింతి**
వింత భంగుల కెలయించి వెకలిఁజేసి। యభిమత క్రీడనములకు నలవరింతు.' **310**

ప్రతిపదార్థం: కెంపు+కేలున్= ఆమె ఎఱ్ఱని చేతిని; కేలితోన్= (కీచకుడు) తన చేతితో; కీలించి= పట్టుకొని; నెయ్యము+మాటలన్= ప్రియమైన పలుకులతో; తగు మాఱుమాటలు+ఆర్తున్= తగిన మారుమాటలు పలికిస్తాను, చెప్పుతాను; కుచములు= స్తనములు; ఉరంబునన్= రొమ్మున; కుదియించి= గ్రుచ్చి; క్రమమునన్= క్రమంగా; ఇఱిసిన కౌఁగిటన్= బిగి కౌగిలిలో; ఇంపు+ఒనర్తున్= సౌఖ్యం కలిగిస్తాను; అంగుళంబులన్= వేళ్ళతో; అల్లన్= మెల్లగా; అలకలన్= ముంగురులను; కబళించి= పట్టుకొని; కెంపు+మోవి= ఎఱ్ఱని పెదవిని; ఆని= త్రాగి; కాయ్పున్= కామాన్ని; ఎక్కింతున్= వ్యాపింప చేస్తాను; మనము= మనస్సు; మనంబునన్+పెనఁచి= నా హృదయంతో పెనగజేసి; కేళికిన్+చొచ్చి= రతికేళికి ఉపక్రమించి; సౌఖ్యరసము+నిట్టన్= సంతోషరసప్రవాహంలో; సతిన్+తేల్తున్= ప్రియురాలిని అలరిస్తాను; తనివు= తృప్తి; మొదలైనన్= మొదలైతే; చిగురు+ఒత్తు= కలిగే; తమకమునకున్= మోహానికి; ప్రాఁకు+పెట్టుచున్= ఆశ్రయం కలిగిస్తూ; మగుడన్= మరల; పైన్+పడుచున్= ఆమెపై బడి కప్పిస్తూ; ఇంతిన్= సైరంధ్రిని; వింతభంగులకున్= అపూర్వమైన పద్ధతులకు; ఎలయించి= ఉన్ముఖురాలిగా చేసి; వెకలిన్+చేసి= వెఱ్ఱిగా నన్ను కోరేదాన్నిగా చేసి; అభిమతక్రీడనములకున్= ఇష్టమైన రతి వినోదాలకు; అలవరింతున్= అలవడేటట్లు చేస్తాను (నేర్పుతాను).

తాత్పర్యం: ఆమె లేత ఎఱ్ఱని చేతిని నా చేతితో పట్టుకొని వలపు మాటలాడి తగినట్లు ఆమెచేత కూడా పలికిస్తాను. ఆమె కుచాలను గుండెలకు హత్తుకొని బిగికౌగిట చేర్చి సంతోషం కలిగిస్తాను. ముంగురులను కొనవేళ్ళతో మెల్లగా

సవరించి ఆమె పెదవిని ముద్దాడి కామాన్ని పెంపు చేస్తాను. నా మనస్సు ఆమె మనస్సుతో పెనవేసికొనేటట్లు చేసి రతికేళికి ఉపక్రమించి ఆమెను సౌఖ్యరస ప్రవాహంలో ఓలలాడిస్తాను. సంతృప్తి మొదలైతే మోహం చిగురెత్తుతుంది. దానికి పందిరి పెట్టినట్లు మరల మరల ఆమెపై పడుతూ అపూర్వమైన పద్ధతులకు ఆమె అలవాటుపడేటట్లు చేసి, నన్ను వదలలేని వెర్రిదానినిగా చేసి వశపరచుకొని నాకిష్టమైన రతిక్రీడలన్నీ ఆమెకు నేర్పుతాను.

విశేషం: మదనపరవశుడైన కీచకుడు ద్రౌపది చేజిక్కినట్లుగా భ్రమలో ఈ విధంగా భావిస్తున్నాడు. ఉన్మాదం అనే కామావస్థలో కామోన్మాదం అనే సంచారి భావం సలక్షణంగా ఈ పద్యంలో ఆవిష్కరించబడింది. ఇది తిక్కన మాటలలో భావరతి. (చూడు తరువాతి వచనం). (సంపా.)

వ. అనుచు వెండియు నిగుడు మనోరథంబులను, భావరతంబుల, శిశిరోపచారంబులఁ బ్రొద్దు గడపి (కడపి), కడగానక. 311

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; వెండియున్= మరల; నిగుడు= చెలరేగే; మనోరథంబులను= కోరికలతో; భావరతంబులన్= ఊహలలో సాగే, మానసిక రతులతో; శిశిర+ఉపచారంబులను= శైత్యోపచారాలతో; ప్రొద్దు+కడపి, కడపి= కాలక్షేపం చేసి చేసి; కడ+కానక= ఎంతకూ ప్రొద్దుబోక.

తాత్పర్యం: అంటూ మళ్ళీ చిగురించే కోర్కెలతో, సంకల్పరతులతో, శైత్యోపచారాలతో కాలక్షేపం చేసి దానికి అంతం కనిపించక. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'మాయరవి యేల క్రుంకఁడొ। కో?' యను, 'నిట్టేల తడసెనో?' యనుఁ; 'గ్రుంకం
బోయెడుఁ జూ యిప్పుడ' యను। 'దాయపటిచె' నను మనోజతాపము పేర్మిన్.' 312

ప్రతిపదార్థం: మనోజతాపముపేర్మిన్= మదనవేదన యొక్క ఆధిక్యం చేత; మాయరవి= కపటి అయిన సూర్యుడు; ఏలక్రుంకడొకో!= ఎందుకు అస్తమించడో; అనున్; ఇట్టు+ఏల తడసెనో?= ఇట్లా ఎందుకు ఆలస్యం చేశాడో?; అనున్; ఇప్పుడు+అ= ఇప్పుడే; క్రుంకన్+పోయెడున్+చూ!= అస్తమించబోతున్నాడు గదా!; అనున్; దాయ+పటిచెన్= పగవాడై బాధపెట్టాడు; అనున్= అంటాడు.

తాత్పర్యం: మదనతాపం ఎక్కువ కావటంతో కీచకుడు- 'ఈ దుర్మార్గుడైన సూర్యుడు ఇంకా ఎందుకు అస్తమించడో?' అంటాడు. 'ఇంత ఆలస్యం ఎందుకు చేశాడో?' అంటాడు. 'అదుగో! అస్తమించబోతున్నాడు' అంటాడు. 'పగవాడై బాధపెట్టుతున్నాడు' అంటాడు.

విశేషం: విప్రలంభంలోని ఉన్మాదావస్థలో - రాణించే మరొక అంశం- ఉపాలంభనం. ఇక్కడ ప్రొద్దుక్రుంకితే రతి ఫలిస్తుందని ఉన్మత్తుడై ఊహిస్తున్న కీచకుడికి ఎంతసేపటికి అస్తమించని ఆదిత్యుడి మీద ఆగ్రహం వచ్చింది. 'మాయరవి' అని ఉపాలంభించాడు. తదేకదృష్టితో సూర్యగతిని గమనిస్తూ ఉండటం చేత- ఎందుకు క్రుంకడు? ఆలస్యం ఎందుకు చేస్తున్నాడు? ఇక ఇప్పుడు క్రుంకుతాడులే!-ఇటువంటి సమయోచిత వాక్య చాపల్యాన్ని ప్రదర్శించాడు. (సంపా.)

తే. 'దినము కాని యింక భువనంబులం దిట। వట్టి రాత్రి లేని యట్టుగాఁగఁ
జేసెనొక్కొ విధి? విశేషించి నాకకా। నేఁడ దినము సాఁగి నిలిచె నొక్కొ!' 313

ప్రతిపదార్థం: విధి= బ్రహ్మ; దినము+అ+కాని= పగలే కాని; ఇంకన్= ఇకపై; భువనంబులందున్= ప్రపంచంలో; ఇట+వట్టి= ఇకమీద; రాత్రి లేని+అట్టు+కాఁగన్= రాత్రి లేనట్లుగా; చేసె నొక్కొ!= చేశాడేమో!; విశేషించి= అధికంగా; నాకున్+అకాన్= నా కొరకే; నేఁడు+అ= ఈ రోజే; దివము= పగలు; సాఁగి= పొడవై; నిలిచెన్+ఒక్కొ!= నిలిచిపోయిందేమో!

తాత్పర్యం: 'బ్రహ్మ పగలేకాని, లోకంలో రాత్రి అసలే లేకుండా చేశాడా? నా కొరకు మాత్రమే ఈనాడు, పగలు దీర్ఘమై సాగిందా?'

విశేషం: అలం: వ్యాజనింద. నిందచేత నింద స్ఫురించేటట్లు వ్యాజనింద, ప్రియా విరహం వలన దీర్ఘంగా తోస్తున్న పగటిని నెపంగా చేసికొని బ్రహ్మను రాత్రిలేని పగలును కల్పించినందుకు ఉపాలంభనం చేశాడు. ఇప్పుడు కీచకుడికి కావలసింది రాత్రి. అందువలన ఈ పరోక్ష సూర్యోపాలంభనం ప్రకరణౌచిత్యం. (సంపా.)

తే. **అనుచుఁ గ్రుంకింపరానిప్రొ ద్దరసి యరసి। శిశిర పర్యంకమున మేను చేర్చి చేర్చి,**
వంతఁ దలపోసి తలపోసి వనరి వనరి। మిగుల వందురి వందురి, పొగిలి పొగిలి. **314**

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; క్రుంకింపరాని= అస్తమించేటట్లు చేయలేని; ప్రొద్దు= సూర్యుడిని; అరసి+అరసి= చూచి చూచి; శిశిరపర్యంకమునన్= చల్లని పాన్పుపై; మేను= శరీరం; చేర్చిచేర్చి= చాలాసేపు చేరవేసి; వంతన్= దిగులుతో; తలపోసి, తలపోసి= మరీ మరీ ఆలోచించి; వనరి వనరి= మరీ మరీ దుఃఖపడి; మిగులన్= ఎక్కువగా; వందురి వందురి= మరీ మరీ బాధపడి; పొగిలి పొగిలి= బాగా తపించి.

తాత్పర్యం: అని అంటూ, అస్తమింపచేయలేని ప్రొద్దును పదే పదే చూస్తూ, విరహతాపాన్ని చల్లార్చే పాన్పుపై శరీరాన్ని తేప తేపకూ చేరుస్తూ, వలపు దిగులుతో మరీ మరీ ఆలోచిస్తూ, దుఃఖపడుతూ, బాధపడుతూ, మిక్కిలి తపించాడు.

విశేషం: 1.అలం: వృత్త్యనుప్రాసం. ఇక్కడ అరసి అరసి, చేర్చి చేర్చి, వనరి వనరి, వందురి వందురి, పొగిలి పొగిలి అని ఆమ్రేడితంగా చెప్పడంలో కీచకుడి ఆవేదనలోని తీవ్రత వ్యక్తమవుతున్నది. 2. ఇందులో 'వ్యాధి' అనే మదనావస్థ వర్ణితం. 'కోరుకొన్న కలయిక సాధ్యం కాకపోవటంచేత కలిగే తాపం వ్యాధి' అవుతుంది. సంతాపం, నిశ్వాసం, చల్లని వస్తువులను ఆశ్రయించటం, సేవించటం, జీవితాన్ని లెక్కచేయకపోవటం, మరణించాలన్న తలంపు, ధైర్యం కోలుపోవటం, ఒక్కసారి (విరుచుకొని) పడిపోవటం, అవయవాలు వదులుగా ఉండటం మున్నగునవి ఇందలి చేష్టలు అని సింగభూపాలుడు (రసార్ణవసుధాకరం II. 194-195- డాక్టర్ పి.యస్.ఆర్.అప్పారావుగారి 'సాత్త్వికాభినయం' నుండి పు. 449). (సంపా.)

సీ. **తనికెడు నారటంబున నంతకంతకు। వెమ్ముచు నునికికి విడుమరయును,**
గోలు మసంగెడు కోర్కుల వెనువెంటఁ। బాఱుచు నునికికి నూఱటయును,
వావిరిఁ బొదివెడు వగల సందడిఁబడి। యురియుచు నునికికి నుడుకువయును,
నందంద కదిరెడు కొందలపాటుచేఁ। దలఁకుచు నునికికి నిలుకడయును

ఆ. **లేమిఁ దాల్మిగొనఁగలేక యలందురి। తనువు నింద్రియములు మనము ధృతియుఁ**
దనవశంబుగాక తల్లడపడి సింహ। బలుఁడు విషమబాణుబారిఁ బాఱె. **315**

ప్రతిపదార్థం: తనికెడు+ఆరటంబునన్= విస్తరించే ఆరాటంతో; అంతకున్+అంతకున్= మాటిమాటికి; వెమ్ముచున్= తాపం పొందుతూ; ఉనికికిన్= ఉండటానికి; విడుమరయును= విడుపున్నూ; కోలుమసంగెడు= మిక్కిలి అతిశయించే; కోర్కుల వెనువెంటన్=

కోర్కెల వెంబడి; పాఱుచున్+ఉనికికిన్= పరుగెత్తుతుండటానికి; ఊఱటయును= ఊరడింపున్నూ; వావిరిన్= వరసగా; పొదివెడు= క్రమ్ముకొనే; వగలసందడిన్= చింతల అలజడిలో; పడి= చిక్కుకొని; ఉరియుచున్= తపిస్తూ; ఉనికికిన్= ఉండటానికి; ఉడుకువయును= విరామమున్నూ; అందు+అందు+అ= అప్పటికప్పుడే; కదిరెడు= కలిగే; కొందలపాటుచేన్= సంక్షోభంతో; తలఁకుచున్= భయపడుతూ; ఉనికికిన్= ఉండటానికి; నిలుకడయును= స్తిమితమున్నూ; లేమిన్= లేకపోవటం వలన (ఇది నాలుగు సీసపు పాదాలలోని చివరి క్రియలకూ అన్వయిస్తుంది); తాల్మికొనఁగలేక= ఓర్పు వహించలేక; అలందురి= శ్రమపడి; తనువు= శరీరం; ఇంద్రియములు= ఐదు ఇంద్రియాలు; మనము= మనస్సు; ధృతియున్= ధైర్యం; తవవశంబు+కాక= తనవల్లగాక; తల్లడము+పడి= కలతచెంది; సింహబలుఁడు= కీచకుడు; విషమబాణుబారిన్= మన్మథుడి బారినపడి; పాఱెన్= పోయాడు.

తాత్పర్యం: అంతకంతకు పెరిగే ఆరాటంతో తాపం పెచ్చుపెరుగుతూ ఉంటే దానికి విడుదల లేకపోవటం వలన, చెలరేగే కోర్కెల వెంట పరుగెత్తుతూ ఉంటే విరామం లేకపోవటం వలన, విరివిగా క్రమ్ముకొనే వలపు కోరికల సందడిలో పడి తపిస్తూ ఉంటే దానికి విశ్రాంతి లేకపోవటం వలన, అప్పటికప్పుడు పుట్టుకొని వచ్చే కలతపాటుతో భయపడుతూ ఉంటే, దానికి నిలుపుదల లేకపోవటం వలన సహనం చూపలేక, వ్యథపొంది, శరీరం, ఇంద్రియాలూ, మనస్సూ, ధైర్యమూ తన వశం నుండి తప్పుకోగా సింహబలుడు తల్లడిల్లి మన్మథుడి బారినపడి పరుగులు తీశాడు.

విశేషం: 1. అలం: యథాసంఖ్యం. సీసపద్యపాదాలలోని వాక్యార్థాలకూ ఎత్తుగీతిలోని శబ్దాలకూ క్రమంగా అన్వయం కుదురుతుంది కాబట్టి యథాసంఖ్యాలంకారం. తాపానికి విడుదల లేకపోవటంతో శరీరం వశం తప్పింది. పరుగెత్తే కోర్కెలకు విరామం లేకపోవటంతో ఇంద్రియాలు వశం తప్పాయి. వలపు కోరికల సందడికి విశ్రాంతి లేకపోవటంతో మనస్సు వశం తప్పింది. కలతవలని భయం ఆగకపోవటంతో ధైర్యం వశం తప్పింది. ఈ నాలుగూ వశం తప్పటంతో సహనం కోల్పోయాడు. దానితో అయిదు బాణాల అనంగుడికి వశమైపోయాడు. అతడి వెంట పరుగెత్తసాగాడు. 2. వ్యాధి అనే మన్మథావస్థలో మన్మథతాపం వలన పడే బాధను వర్ణించటం పరాకాష్ఠ. ప్రియురాలి తోడి సమాగమం బాగా ఆలస్యం అవుతూ ఉండటంచేత కలిగే మన్మథ జ్వరం తాపమని విద్యానాథుడు ప్రతాపరుద్రీయంలో పేర్కొన్నాడు. ఆ తాపాన్ని నిగ్రహించుకోలేని స్థితి వలన శరీరాదులకు కలిగిన 'వ్యాధి' అవస్థను తిక్కన శాస్త్రోక్తంగా, ప్రకరణోచితంగా వర్ణించటం ప్రశంసనీయం. (సంపా.)

క. ఇమ్మెయిని నధిక పరితా। పమ్మునఁ బడు సూతు హృదయపద్మం బలరం
దమ్మికొలంకులు మొగుడ, వ। నమ్ములు సోలంగ దివసనాథుఁడు గ్రుంకెన్. 316

ప్రతిపదార్థం: ఈ మెయినిన్= ఈ విధంగా; అధిక పరితాపమ్మునన్+పడు= మిక్కిలి బాధపడే; సూతుహృదయపద్మంబు= సూతుడయిన కీచకుడి మనస్సు అనే పద్మం; అలరన్= విప్పారగా, సంతోషంగా; తమ్మి కొలంకులు= పద్మ సరోవరాలు; మొగుడన్= ముకుళించగా; వనమ్ములు= తోటలు; సోలంగన్= సొమ్మసిల్లగా; దివసనాథుఁడు= సూర్యుడు; క్రుంకెన్= అస్తమించాడు.

తాత్పర్యం: ఈ విధంగా మిక్కిలి మదనబాధ పొందే కీచకుడి మనస్సు సంతోషించగా, కమల సరోవరాలు ముకుళించగా, వనాలు సోలిపోగా సూర్యుడు అస్తమించాడు.

విశేషం: సూర్యాస్తమయానికి పద్మాలు ముకుళించాయి. వనాలు వన్నె తప్పాయి. కాని, కీచకుడి హృదయపద్మం మాత్రం వికసించింది. అంటే ఒక కార్యానికి బాధకమైనది మరొక కార్యానికి సాధకమైనదన్నమాట. ఇది వ్యాఘాతం. హృదయపద్మం- రూపకం. సూర్యాస్తమయం కావటం కీచకుడి ప్రణయసిద్ధికి ప్రారంభంగా అనిపించినా చివర కది వ్యాఘాతానికి దారి తీయబోతున్నదని అలంకార ధ్వని. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. తదనంతరంబ. 317

తాత్పర్యం: ఆ తరువాత.

సూర్యాస్తమయ వర్ణనము

(ఇది మూలమునందు లేదు)

క. ఇనుఁడు దనకడకు నేతెం । చిన రాగముఁ బొందు టిది యుచిత మనఁగాఁ గెం
పున మెఱసి పశ్చిమాశాం । గన జనసంభావనముల గౌరవ మందెన్. 318

ప్రతిపదార్థం: ఇనుఁడు= సూర్యుడు (ప్రియుడు); తన కడకున్= తనవద్దకు; ఏతెంచినన్= వచ్చినచో; రాగమున్= ప్రేమను (ఎఱ్ఱదనాన్ని); పొందుట+ఇది= పొందటమనేది; ఉచితము+అనఁగాన్= న్యాయమన్నట్లు; పశ్చిమ+ఆశా+అంగన= పశ్చిమ దిక్కు అనే స్త్రీ; కెంపునన్ మెఱసి= ఎర్రదనంతో ప్రకాశించి; జనసంభావనముల= ప్రజల మన్ననల యొక్క; గౌరవము+అందెన్= గౌరవం పొందింది.

తాత్పర్యం: సూర్యుడు తనవద్దకు రాగా రాగం పొందటం (ఎర్రబడటం) అనేది న్యాయమే అన్నట్లు ఎర్రదనంతో వెలుగొందే పడమర దిక్కనే కాంత జనుల ప్రశంసలతో గౌరవం పొందింది.

విశేషం: 1. అలం: శ్లేష. ఉత్ప్రేక్ష, సమాసోక్తి, రూపకం. 2. ఇనుఁడు= (నానార్థాలు) సూర్యుడు, నాథుడు, రాజు; అంగన= వనిత, భార్య, రాగము+పొందుట= ఎర్రదనం వహించు, అనురాగం పొందుట; కెంపునన్= ఎర్రదనంతో, పద్మరాగమణితో; సంభావనములు= గౌరవాలు; నమస్సులు, ప్రశంసలు; గౌరవము= పెద్దరికం, మర్యాద, మన్నన. ఈ నానార్థస్ఫూర్తితో ఈ పద్యాన్ని అన్వయించవచ్చును. కాబట్టి శ్లేష. నాథుడైన సూర్యుడు కవయటానికి సమీపిస్తే పశ్చిమ దిక్కు అనే భార్య సహజంగా అనురాగాన్ని పొంది ఔచిత్యంతో శోభిల్లింది. అని లోకంలో ప్రజలంతా ఆమెను సంధ్యావందనాదులతో ప్రశంసిస్తూ ఉంటే - ఆమె గౌరవం పొందింది - అని అర్థమేర్పడి ఒక అనుకూలవతి యొక్క భర్తృ వాల్లభ్య గౌరవాన్ని భావించగలుగుతాం. ఈ అన్వయాన్నే - ఒక నాథుడికీ, భార్యకూ మధ్యా, ఒక రాజుకూ అభిసారికకూ మధ్య కూడా చేయవచ్చును. అందువలన శ్లేషాలంకారం. ఇందులో ప్రస్తుతాంశం వలన మరొక అప్రస్తుతాంశం స్ఫురిస్తున్నది కాబట్టి సమాసోక్తి. సూర్యుడు తన దరికి రాగానే పశ్చిమ దిశాంగన అనురాగం చెందిందేమో అన్నట్లు కెంజాయను వహించిందనటంలో ఉత్ప్రేక్ష. పశ్చిమాంగన అన్నప్పుడు రూపకం. 3. కవి ప్రకృతిని అలంకారికంగా వర్ణించటం ఒక యెత్తు; కావ్యంలోని ఒకపాత్రయొక్క చిత్తవృత్తి కనుగుణంగా సంభావనం చేయటం మరొక యెత్తు, తిక్కన చేసిన ఈ వర్ణనలో ఈ రెండెత్తులూ ఉండటం విశేషం. తత్కాల కీచక భావరతానికి అనుగుణమైన భావచిత్రం ఈ పద్యంలో అమరటం అలంకారశిల్పం. (సంపా.)

ఉ. చుక్కలు తోడుతోడఁ దలచూపఁదొడంగె, మనోభవుండు వి
ల్లెక్కిడి చక్రవాకముల యిక్కలు రోయఁగఁజొచ్చె, నేల కెం
పెక్కుచు వచ్చె; దీవియల యేడ్తెఱ సోయగ మందె; సందడుల్
దక్కెఁ బురంబు వీథుల, మదం బొలసెన్ విట చిత్తవృత్తులన్. 319

ప్రతిపదార్థం: చుక్కలు= నక్షత్రాలు; తోడుతోడన్= వెంటనే; తలచూపన్+తొడంగెన్= కనిపించటం మొదలుపెట్టాయి; మనోభవుండు= మన్మథుడు; విల్లు+ఎక్కు+ఇడి= వింటిని ఎక్కుపెట్టి; చక్రవాకముల= చక్రవాక పక్షుల; ఇక్కలు= నివాసాలను;

రోయఁగన్+చొచ్చెన్= వెదకసాగాడు; నేల= భూమి; కెంపు+ఎక్కుచున్ వచ్చెన్= ఎఱ్ఱబారసాగింది; దీవియల+ఏడ్తెఱ= దీపాల విజృంభణం; సోయగము+అందెన్= అందగించింది; సందడుల్= గొడవలు (శబ్దాలు); తక్కెన్= తగ్గాయి, పురంబు వీథులన్= నగర వీథులలో; విటచిత్తవృత్తులన్= విలాసకాంద్ర మనస్సులలో; మదంబు+ఒలసెన్= మద్యం సేవించటంవల్ల ఆనందం కలిగింది.

తాత్పర్యం: చుక్కలు ఒక్కొక్కటే మెరుస్తూ మొగాలు బైటపెడుతున్నాయి. మన్మథుడు విల్లు ఎక్కుపెట్టి చక్రవాకాలుండే చోట్లను వెదక నారంభించాడు. నేలంతా ఎరుపెక్కుతూ వచ్చింది. దీపాలకాంతి సోయగాన్ని సంతరించుకొన్నది. పురవీథులలో జనుల సందడి తగ్గింది. విటుల మనఃప్రవృత్తులలో మదభావం విరిసింది.

విశేషం: 1. అలం: స్వభావోక్తి, సూర్యు డస్తమించి చంద్రు డుదయించే లోపల ఉండే సంధ్యా సమయాన్ని సహజసుందరంగా, ధ్వని బంధురంగా తిక్కన వర్ణించాడు. చుక్కలు తోచటం, చక్రవాకాల జంటలు కళ్ళుకనపడక, దగ్గరున్నా విరహవేదన పడటం (అందుకే మన్మథుడు వాటిని బాణాలతో కొట్టుండాలి), సంధ్యారుణ కాంతితో భూమి ఎఱ్ఱబడటం (అంటే ఇంకా చీకటితో నల్లబడలేదని భావం), దీపాల సోయగం, పురవీథులు నిశ్శబ్దం కావటం, క్రమంగా విటులు మదించి విజృంభించటం - అనేవి ఆ సంధ్యాసమయంలో జరుగుతున్న పరిణామాన్ని క్రమంగా సూచిస్తూ తిక్కనప్రకృతిపరిశీలనప్రజ్ఞను ప్రకటిస్తున్నాయి. 2. ఇందులో విటుల మదభావం పేర్కొనబడింది. ఇది సంచారి భావం. మద్యం సేవించటం వలన కలిగేది మదమని భరతుడు; మద్యం వలన కలిగిన ఆనంద సమ్మోహాల మిశ్రమం మదమని సింగభూపాలుడు; మద్య సేవనం వలననేకాక ఐశ్వర్యం, విద్య, ఆభిజాత్యం, ఉత్తమ స్త్రీ పరిష్వంగ సంభోగాలు మొదలైన వాటివలన కూడా ఏర్పడే భావం మదమని శారదాతనయుడు. ఇవి ఉత్తమ మధ్యమాధమ భేదాలతో మూడు రకాలు. తరుణ మదం (యౌవనం వలన ఏర్పడే మదం) ఉత్తమం; మధ్యమదం (మద్యం వలన ఏర్పడే మదం) మధ్యమం; అవకృష్టమదం (అల్పులమదం) అధమం అని భరత శాస్త్రం. కొన్ని మహాభారత ప్రతులలో 'మదంబు' అనే పాఠానికి బదులు 'ముదంబు' అనే పాఠం కనబడుతున్నది. 'మద'మనే పాఠమే సందర్భోచితం. విటులకు మదం సహజం కాని, ముదం కాదు. 3. ప్రకృతి వర్ణనాన్ని మానవ ప్రకృతి వ్యంజకంగా చేయటం తిక్కన నేర్పరితనం. కీచకుడు కూడా విటశేఖరుడు. అతడు వలపుమద్యం వలన మదభావాన్ని పొంది ఉన్నాడు. అతడు మనసులో కోరుకొనే సంధ్యాకాలం ఆతడి యెదుట ధ్వనిమయంగా తారసిల్లింది. మెరుస్తున్న క్రీగంటి చూపులు, కొనగోళ్ళు నక్షత్రాలుగా చెప్పటం కవిసమయం. అవి తలలెత్తి తోస్తున్నాయి. అట్లాగే చక్రవాకాల జంటలను వక్షోజాల జంటగానూ (వాటి మధ్య మన్మథ బాణం తాకేటట్లుగానూ) చెప్పుతారు. నేల (క్షేత్రం - భార్య - యోని) రాగరంజితం కావటం, దీపాల కాంతి వంటి నగల కాంతులు రంజిల్లటం, పురవీథులు - పురమంటే శరీరం, వీథులు అంటే కళామార్గాలు అలజడి లేకుండా అనుకూలంగా ఉండటం. ఇవన్నీ గమనిస్తే ఏ ఉత్తమ విటుడిలోనైనా తరుణమదం తురంగలిస్తుంది. కీచకుడి మనసులో శారదాతనయుడు చెప్పినట్లు ఉత్తమ స్త్రీ పరిష్వంగ సంభోగ భావజన్యమైన మదం ధ్వనిమయం. (సంపా.)

వ. పదంపడి జారచోరజనంబుల మనంబు లలరం జంద్రాస్తమయం బగుటయు. 320

ప్రతిపదార్థం: పదంపడి= తరువాత క్రమంగా; జారచోరజనంబుల= వ్యభిచారుల, దొంగల; మనంబుల= మనస్సులు; అలరన్= సంతోషించగా; చంద్ర+అస్తమయంబు+అగుటయున్= చంద్రుడు క్రుంకగా.

తాత్పర్యం: వెంటనే జారచోరుల మనస్సులకు ఆహ్లాదం కలిగేటట్లు చంద్రుడు క్రుంకగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. పెనుమి ట్టిది పల్లం బిది। యనకుండఁగ నోలమును బయలు నొక్కటిగాఁ

గనువిచ్చుటయును మోడ్చుట। యును సరిగాఁ దమము పర్వె నుర్విం దోడ్తోన్. 321

ప్రతిపదార్థం: ఇది, పెనుమిఱ్ఱు= ఇది పెద్ద మిట్ట; ఇది పల్లంబు= ఇది గుంట; అనకుండఁగన్= అనటానికి వీలులేని విధంగా; ఓలమును= మరుగు ప్రదేశమూ; బయలున్= బయలూ; ఒక్కటిగాన్= ఒకేరకంగా; కనువిచ్చుటయును= వికసించటం; మోడ్చుటయును= ముడుచుకొనటం; సరి+కాన్= సమానం కాగా; ఉర్విన్= భూమిపై; తోడ్తోన్= వెంటవెంటనే; తమము= చీకటి; పర్వెన్= వ్యాపించింది.

తాత్పర్యం: ఇది ఎత్తు, ఇది పల్లం అని చెప్పలేనట్లుగా, లోపలా బయటా ఒకటే విధంగా, కళ్ళు తెరిచినా మూసినా ఒకటే విధంగా ఉండేటట్లు చీకటి క్రమంగా నేలను క్రమ్మేసింది.

భీమకీచకులు నర్తనశాలలోఁ గలసికొనుట (సం. 4-21-38)

వ. అప్పు డా కృశోదరి వృకోదరుకడకుం జని సమయం బయ్యె ననవుడు. 322

ప్రతిపదార్థం: ఆ కృశ+ఉదరి= చిక్కిన నడుము కలది (ఆ ద్రౌపది); వృక+ఉదరుకడకున్+చని= తోడేలు ఉదరంవంటి ఉదరం కలవాడు (తోడేలు ఆకలి కంటె ఆకలి గలవాడు) ఐన భీముడివద్దకు వెళ్ళి; సమయంబు+అయ్యెన్+అనవుడున్= సమయం అయిందని చెప్పగా.

తాత్పర్యం: అప్పుడు ద్రౌపది భీముడి వద్దకు వెళ్ళి సమయం అయిందని చెప్పగా.

తే. అతఁడు పెండ్లికిఁ బిలిచినయట్లు వికచ। హృదయుఁడై తలచీర యాయితము సేసి
ద్రుపదనందనఁ జూచి 'నాతోన వెనుక। నల్ల నంతంత నరుగుదె' మ్మని కడంగి. 323

ప్రతిపదార్థం: అతఁడు= భీముడు; పెండ్లికిన్+పిలిచిన+అట్లు= పెండ్లికి పిలిచినట్లు; వికచహృదయుఁడు+ఐ= వికసించిన మనస్సు కలవాడై; తలచీర= తలపాగా; ఆయితము+చేసి= సవరించుకొని; ద్రుపదనందనన్+చూచి= ద్రౌపదిని చూచి; నా తోన్+అ వెనుకన్= నా వెంట; అల్లన్+అంతన్+అంతన్= మెల్లగా దూరదూరంగా; అరుగు+తెమ్ము+అని= రమ్మని; కడంగి= పూని ముందుకు నడచి.

తాత్పర్యం: భీముడు పెళ్ళికి పిలిచినట్లు సంతోషించి, తలపాగా చుట్టుకొని ద్రౌపదిని తన వెనుక అనుసరిస్తూ కొంచెం దూరం దూరంగా మెల్లగా రమ్మని కోరి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: లోకోక్త్యలంకారం. పెళ్ళికి పిలిచినట్లు- అనేది జాతీయం. ఆనందంగా వెళ్ళటానికి సంకేతం. కీచకుడిని సంహరించటానికి భీము డెంత గాఢంగా ఉత్సాహపడుతున్నాడో ఒక్కసారి తన హృదయ వికాసం ప్రదర్శించటంలో ప్రకటితమౌతున్నది. 'తలచీర' అనేది ఆనాటి పురుషుల వస్త్రధారణను తెలియజేస్తున్నది. తలపాగాను చుట్టుకొనటం అలవాటు. 'చీర' అంటే కేవలం కోక అనే అర్థంలో కాక వస్త్రం అనే అర్థంలో తీసికొనాలి.

చ. గమనమువీఁక వేతొక వికారము పుట్టక సంగరోత్సవో
ద్యమరభసాతిరేకము బయల్పడు టించుకలేక రోషసం
భ్రమ మొకయింతయైనఁ బరభావనిరూప్యముగాక ద్రౌపదీ
రమణుఁడు వోయె విక్రమధురంధరతం దగ నాట్యశాలకున్. 324

ప్రతిపదార్థం: గమనము వీఁకన్= పోవటంలోని ఉత్సాహంలో; వేఱొక వికారము= క్రొత్త మార్పు; పుట్టక= జనించక; సంగర+ఉత్సవ+ ఉద్యమరభస+అతిరేకము= యుద్ధానికి పోయే పండుగ జరుపుకొనే ప్రయత్నంలోని వేగాధిక్యం; బయల్పడుట= బయటపడుట; ఇంచుకలేక= కొద్దిగా కూడా లేకుండా; రోషసంభ్రమము= కోపంతో కూడిన తొట్రుపాటు; ఒక ఇంత+ఐనన్= కొంచెం కూడా; పరభావ నిరూప్యము+కాక= ఇతరుల మనస్సులచే తెలియదగినది గాక; ద్రౌపదీరమణుఁడు= భీముడు; విక్రమధురంధరతన్= పరాక్రమ నిర్వహణతో; నాట్యశాలకున్= వర్తనశాలకు; తగన్+పోయెన్= సముచితంగా వెళ్ళాడు.

తాత్పర్యం: ద్రౌపదీ రమణుడైన భీముడు తన నడకలో భేద మేమీ లేనట్లుగా, యుద్ధానికి పోయే ఉత్సాహం కొద్దిగా కూడా బయటపడకుండా, తన కోపావేశం బయటవారు తెలిసికొనలేకుండా గంభీర పరాక్రమమూర్తి వహించి నర్తనశాలకు వెళ్ళాడు.

విశేషం: ద్రౌపదీరమణుడనే విశేషణం భీముడి అంతరంగాన్ని ధ్వనిస్తున్నది. సరి అయిన కాలంలో శక్తిమంతంగా ప్రత్యర్థిని ఎదుర్కొనటానికి తగిన మానసిక సమాహిత సంకల్పాన్ని వికార విరహితమైన భీముడి గంభీర పరాక్రమమూర్తి వ్యక్తం చేస్తున్నది. అతడి మూర్తి తుఫానుకు ముందు కానవచ్చే ప్రకృతి ప్రశాంతతవలె కానవస్తున్నది.(సంపా.)

వ. చని వివేకరహితు హృదయంబునుం బోలెఁ దమోదూషితంబును, విదగ్ధ వనితా ప్రేమంబునుం బోలె దుర్నిరూపంబును, ఘోరాటవీ భాగంబునుం బోలె నిర్మనుష్యంబును, గాపురుష లక్ష్మీ విలాసంబునుం బోలె ననుపయోగ్యంబును, ననభ్యస్త శాస్త్రంబునుం బోలె దుర్గమంబును, స్వప్నలబ్ధపదార్థంబునుం బోలె నదృష్టి గోచరంబును, విషమ కావ్యంబునుం బోలె నస్పష్టాలంకారంబును, బాలిశు రాజ్యంబునుం బోలె జారచోర హృద్యంబునునైన యా నర్తనాగారంబు ముఖభాగ స్థలంబుసేరి. 325

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; వివేకరహితు హృదయంబునున్+పోలెన్= తెలివితక్కువ వాడి మనస్సువలె; తమస్(ః)+దూషితంబును= చీకటిచేత నిందించబడినదీ, (తమోగుణంచేత, అజ్ఞానం చేత చెడినదీ); విదగ్ధ వనితా ప్రేమంబునున్+పోలెన్= ప్రౌఢనాయిక ప్రేమవలె; దుర్ నిరూపంబును= తెలియరానిదీ; ఘోర+అటవీ భాగంబునున్+పోలెన్= భయంకరమైన అరణ్యంవలె; నిర్+మనుష్యంబును= మనుష్యులు లేనిదీ; కాపురుష లక్ష్మీ విలాసంబునున్+పోలెన్= నీచపురుషుడి సంపద యొక్క అతిశయంవలె; న+ఉపయోగ్యంబునున్= ఉపయోగించటానికి వీలులేనిదీ; న+అభ్యస్తశాస్త్రంబునున్+పోలెన్= చదువబడని శాస్త్రంవలె; దుర్గమంబును= చొరబడరానిదీ; స్వప్నలబ్ధ పదార్థంబునున్+పోలెన్= కలలో లభించిన వస్తువువలె; అదృష్టిగోచరంబును= కంటికి కనిపించనిదీ; విషమ కావ్యంబునున్+పోలెన్= కష్టమైన గ్రంథంవలె; అస్పష్ట+అలంకారంబును= స్పష్టంగా తెలియని అలంకారాలు గలదీ; బాలిశురాజ్యంబును+పోలెన్= మూర్ఖుడి రాజ్యంవలె; జారచోరహృద్యంబును= విటులకు, దొంగలకు ఇష్టమైనదీ; ఐన ఇనటువంటె; ఆ నర్తన+అగారంబు= ఆ నాట్యశాలయొక్క; ముఖభాగస్థలంబు+చేరి= ముందరి ప్రదేశం చేరి.

తాత్పర్యం: తెలివితక్కువవాడి హృదయంవలె చీకటితో కలిషితమైనదీ, ప్రౌఢ నాయిక ప్రేమవలె నిరూపించలేనిదీ, భయంకరారణ్యంవలె మనుష్యులు లేనట్టిదీ, నీచపురుషుడి సంపద వలె ఉపయోగరహితమైనదీ, చదువబడని శాస్త్రం వలె చొరరానిదీ, కలలోని వస్తువు వలె కంటికి కనిపించనిదీ, కష్టమైన కావ్యంవలె అలంకారాలు స్పష్టం కానిదీ, దుష్టుడి రాజ్యం వలె జారులకూ, చోరులకూ సంతోషం కలిగించేదీ అయిన నర్తనశాల ముందరిభాగాన్ని చేరాడు.

విశేషం: 1. అలం: ఉపమ, శ్లేష. కన్ను పొడుచుకొన్నా కనబడని చీకటిలో నర్తనశాలను స్పష్టంగా చూచినట్లు వర్ణించటం సముచితం కాదు. కాని, ఆ ప్రదేశం ఒక మహాయుద్ధానికి రంగం కాబోతున్నది. అంతా చీకట్లో, ఆ భవనగర్భంలో జరుగబోతున్నది. అట్టి

భవనాన్ని గురించి భౌతికంగా కాక భావనామయంగా వర్ణించి చెప్పటం ప్రకరణౌచిత్యం. భావనామయచిత్రాన్ని ఆర్థీ ఉపమానాలతో రూపుకట్టించటం, శ్లేషతో కూడిన సమానధార్మాలతో ఉపమేయోపమానాలను సమర్థించటం ఇందులో శిల్పం. ఉపమేయ, ఉపమాన ధర్మాలు వరుసగా ఇట్లా ఉంటాయి. తమము (చీకటి, తమోగుణం), దుర్నిరూపం (రూపం తెలిసికోలేనిది, ఇదమిత్థంగా తెలిసికొన లేనిది), నిర్మనుష్యం (మనుష్యులు సంచరించనిది, మనుష్యులు నివసించనిది), అనుపయోగ్యం (ఉపయోగించనిది; ఉపయోగానికి పనికిరానిది), దుర్గమంబు (వెళ్ళటానికి కష్టమైనది, దాటటానికి సాధ్యం కానిది), అదృష్టిగోచరంబు (కంటికి కనబడనిది, దృష్టిగోచరం కానిది. అస్పష్టాలంకారంబుఁ అర్థంకాని శబ్దార్థాలంకారాలు కలది, స్పష్టంగా కనబడని భవనాలంకారాలు కలది), జారచోరహృద్యంబు (జారులకు చోరులకు ఆకర్షణీయమైనది. జారులచేతచోరులచేత అందమైనది). 2. ఇటువంటి శైలి కాదంబరి, దశకుమార చరితంవంటి సంస్కృత కావ్యాలలో బాగా కనబడుతుంది. తిక్కన మిత్రుడు మూలఘటిక కేతన దండి దశకుమార చరిత్రను తెలుగుచేసి మిత్రుడికి అంకితమిచ్చాడు. తిక్కనకు కూడా దండి రచన మీద కొంత అభిమానం ఉండటంలో ఆశ్చర్యం లేదు. మొత్తానికి ఇది తిక్కన సహజశైలి కాదు. ప్రాచీన కవుల శైలులను కూడా యథావకాశంగా ప్రయోగించటం మహాకవిత్వ లక్షణాలలో ఒకటి. దానిని తిక్కన అక్కడక్కడ అద్భుతంగా, అయినా ఔచిత్యవంతంగా, నిర్వహిస్తాడు. అట్టి విశేషరచనకు ఇది ఒక ఉదాహరణం. (సంపా.)

క. కెలఁకులుఁ, బిఱింది దెసయుం, । గలయం బరికించి తన యఖండిత బాహా
బలగర్వమ యచ్చట ముం । గలిగా మదమత్తభద్రగజసదృశగతిన్. 326

ప్రతిపదార్థం: కెలఁకులున్= పక్కప్రదేశాలూ; పిఱింది దెసయున్= వెనకదిక్కూ; కలయన్+పరికించి= చక్కగా చుట్టూ చూచి; తన= తనయొక్క (భీముడి యొక్క); అఖండిత బాహాబలగర్వము+అ= తక్కువకాని భుజబలసమృద్ధియే; అచ్చటన్= నర్తనశాలలో; ముంగలి+కాన్= ముందుకాగా; మదమత్తభద్రగజసదృశగతిన్= మదించిన పట్టపు ఏనుగువలె నడుస్తూ,

తాత్పర్యం: భీముడు నర్తనశాల నాలుగు ప్రక్కల కలయ చూచి మొక్కవోని తన భుజబలమే సహాయంగా కలవాడై మదించిన పట్టపుటేనుగువలె నడుస్తూ వెళ్లాడు.

విశేషం: అలం: ఉపమ. భీముడి నడకను భద్రగజగమనంతో పోల్చడంతో జయం తథ్యమని సూచించటమైనది. నర్తనశాల ప్రవేశ ఘట్టాన్ని మూలాతిశయంగా తిక్కన చిత్రించాడు. మదంచేత మత్తిల్లిన భద్రగజంవలె నిస్సంకోచంగా లోపలికి ప్రవేశించాడట భీముడు! మదించినా భద్రతయందు శ్రద్ధ వహించిన వివేకం ప్రకటించా డతడు. అందువలననే నలుదిక్కులా కలయజూచి ఎవ్వరూ తనను చూడటం లేదని నిశ్చయించుకొన్నాడు. లోనికి ప్రవేశిస్తే తన బలమే తనకు రక్ష. ఏకైకవీరుడై విజృంభించాలి. ఆ సంగతిని తనలో తెలివికి తెచ్చుకొన్నాడు. వివేచనతో కూడుకొన్న విశిష్ట ప్రయత్నం విజయకారకం అనే ధైర్యంతో భద్రగజంవలె ముందుకు సాగాడు. (సంపా.)

శా. ధ్వాంతాకారితకుడ్యకుట్టిమ ఘనస్తంభావలీరూపముం,
బ్రాంతాది ప్రవిభాగ బోధ రహిత ప్రాగ్ద్వారముం, గాతర
స్వాంత త్రాసకరంబు నై, దురభివేశంబైన యా లోను ని
శ్చింతుండై సతికేలు వట్టికొని చొచ్చెన్ భీముఁ డత్యుగ్రతన్. 327

ప్రతిపదార్థం: ధ్వాంత+ఆకారిత= చీకటి రూపుకట్టినట్లుగా ఉన్న; కుడ్య= గోడలయొక్క; కుట్టిమ= నేలయొక్క; ఘనస్తంభ+ఆవలీ= పెద్ద స్తంభాల వరుస యొక్క; రూపమున్= రూపం కలదానినీ; ప్రాంత+ఆది= తుదిమొదళ్ళు, దగ్గరా దూరం మొదలైన; ప్రవిభాగ=

భేదం యొక్క; బోధ రహిత= తెలివిడి లేని (తెలియని); ప్రాక్+ద్వారమున్= ముందరి (సింహ) ద్వారం కలదీ; కాతరస్వాంత= భయపడే మనస్సుకలవారికి; త్రాసకరంబున్+ఐ= భయం కలిగించేదై; దురభివేశంబు+ఐన= చొరరానిదైన; ఆ లోను= ఆ నర్తనశాల లోపలి భాగంలో; నిశ్చింతుండు+ఐ= ఏ దిగులూ (ఏ అనుమానమూ) లేనివాడై; సతి కేలు= ద్రౌపది యొక్క చేయి; పట్టుకొని= అందికొని; భీముఁడు= అతి+ఉగ్రతన్= మిక్కిలి కోపంగా; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: చీకటి రూపుకట్టినట్లుగా మారిన గోడలూ, నేలపైభాగం, స్తంభాల వరుసా కల రూపంతో ఉన్నదానినీ, (భవనాంగాలను విడివిడిగా తెలిసికొనలేనంతగా చీకటిలో మునిగిపోయిన రూపం కలిగినదని భావం). తుది మొదళ్ళు విడమరచి తెలిసికొనలేని సింహద్వారం కలిగిందీ, (ముందు ద్వారం కూడా చీకట్లో స్పష్టంగా కనబడనిదీ అని భావం), పిరికివారి హృదయాలను చెదరగొట్టేదీ, చొరటానికి సాధ్యం కానిదీ అయిన నర్తనశాల లోపలిభాగంలోకి నిశ్చింతగా భీముడు భార్యచేయి పట్టుకొని అమితకోపంతో ప్రవేశించాడు.

విశేషం: ఈ వర్ణనం అమూలకం. ముఖద్వారం ద్వారా భీముడు నర్తనశాల లోపలిభాగంలోనికి ప్రవేశించే ఘట్ట మిది. ద్రౌపది చేయిపట్టుకొని మిక్కిలి భయం కలిగించే కోపభావంతో లోనికి ప్రవేశించాడు. లోపలంతా కటిక చీకటి. భవనాంగాలను, తుది మొదళ్ళను గుర్తించలేని చీకటి. పిరికివాళ్ళకు భయంకరంగా ఉండి చొరటానికి చొరనివ్వని చీకటి. తిక్కన ప్రకృతి వర్ణనను వాచ్యార్థ స్ఫూర్తికొరకు ఎంత వాడతాడో వ్యంగ్యార్థ దీప్తికొరకు అంత వాడతాడు. ఇందులో భావించదగిన అంశాలు-

1. వెనుకటి పద్యంలో మదమత్తగతి చెప్పబడింది. అది ఈ పద్యగతిలో చూపించబడింది. నర్తనశాల లోపలి భాగాన్ని నాలుగు సమాసాలతో వర్ణించాడు తిక్కన. ఉత్తరోత్తరాలు క్రమంగా చిన్నవైపోవటం విశేషం. అందులో కూడా ఒక క్రమవిన్యాసం కనపడుతుంది. అందులోకి భీముడు నిశ్చింతుడై ప్రవేశించి నడిచిన వైఖరిని 'ధ్వాంతాకారిత.. రూపమున్' అనే దీర్ఘసమాసం ధ్వనింపచేస్తున్నది. సింహద్వారాన్ని దాటుతున్న గతిలో సతి కేలువట్టి నడచినవైఖరి వ్యంజితమౌతున్నది. పిరికివాళ్ళకు భయం కలిగించే చోటికి అతడు అత్యుగ్రతతో వెళ్లాడనీ, దురభివేశమైన ఆ ప్రాంతంలో అవలీలగా ప్రవేశించాడనీ ధ్వని. నాలుగడుగులు వేయటం తెలుగు జాతీయం. భీముడు నాలుగడుగులు వేసినట్లు నాలుగు సమాసాలు. మొదట వేగంగా సాగి, క్రమంగా నెమ్మదిగా నడచిన వైఖరి భద్రతకు ప్రతీక. దీర్ఘాక్షర బహుళమైన పద్యగతి మందగతిని సూచిస్తూ నర్తనశాల వైశాల్యాన్ని కూడా ధ్వనింపజేస్తున్నది. కీచకుడు తప్పక వస్తాడనీ, అతడిని తప్పక జయిస్తాననీ నిశ్చయించిన భీముడు నిశ్చింతగా ముందుకు సాగాడనీ వ్యంగ్యం. 2. భీముడు విక్రమ గంభీరుడుగా నర్తనశాలవరకూ నిబ్బరంగా నడచి వచ్చాడు. ఇక చీకటింటిలో ప్రవేశించేటప్పుడు కార్యనిర్వహణకు తగిన 'అత్యుగ్రత' ను మనస్సులో నింపుకొన్నాడు. ఉగ్రత రౌద్రరస అనుభావం. రౌద్రం వలన శత్రుసంహారమే కార్యఫలం. నిశ్శబ్దమైన, భయంకరమైన అంధకారం మృత్యుసదృశ్యం. శత్రుసంహారరూపమైన కార్యం చీకటిలో ధ్వని. కీచకవధ అపూర్వంగా జరుగబోతున్నది. దాని నిర్వహణ భావనను భీముడికి అందించింది ఆ చీకటిరూపంగా తోచిన నర్తనశాలయే. ఇది గోడ, ఇది నేల, ఇవి స్తంభాలు అనే తేడా తెలియని ఆ వింత రూపం కీచకుడిని చంపటంలో అనుసరించవలసిన పద్ధతిని సూచించింది. వాడి కాళ్లూ, చేతులు, తల మొదలైనవాటిని అతడి శరీరంలో గ్రుచ్చి మహామాంసపిండం చేసి వింత చావు కల్పిస్తాడు. ఆ భావన ఈ మొదటి సమాసం స్ఫురింపచేసింది. ఇది మొదలు, ఇది తుద అని తెలియని ముఖద్వారం భీముడి వింత మల్లయుద్ధ వైఖరిని స్ఫురింపచేసింది. లోకభయంకరంగా, మరొకరు ఆ పద్ధతిలో యుద్ధం చేయలేరన్నట్లుగా గూఢంగా యుద్ధం చేయాలన్న అజ్ఞాతవ్రత దీక్షా స్పృహ చివర భీముడి మనస్సులో మెరిసింది. ఈ విధంగా చీకటిలో చీకటిగా తోచిన నర్తనశాల శత్రుసంభార విధాన సూచికగా భీముడి అంతరంగంలో స్ఫురించింది. ఇది తిక్కన వస్తురసధ్వని శిల్పం! (సంపా.)

వ. ఇట్లుసొచ్చి తతీయంజని మధ్యప్రదేశంబున విరాటనందన లీలాపర్యంకం బరసి కని, దాని కనతిదూరంబునం బాంచాలి నోసరిల నునిచి, తా నా తల్పంబున నుండె; నంతం గీచకుండు. 328

ప్రతిపదార్థం: ఇట్లు+చొచ్చి= ఈవిధంగా ప్రవేశించి; తటియన్+చని= లోపలికి వెళ్ళి; మధ్యప్రదేశంబునన్= నర్తనశాల నడిమిభాగంలో; విరాటనందన= ఉత్తరయొక్క; లీలాపర్యంకంబు= విలాసంగా పడుకొనే పాన్పును; అరసి కని= పరిశీలించి తెలిసికొని; దానికిన్+అనతి దూరంబునన్= దాని దగ్గరలో; పాంచాలిన్= ద్రౌపదిని; ఓసరిలన్+ఉనిచి= కనబడకుండా దాచి ఉంచి; తాను= భీముడు; ఆ తల్పంబునన్= ఆ పాన్పుపై; ఉండెన్= ఉన్నాడు; అంతన్= అప్పుడు; కీచకుడు.

తాత్పర్యం: భీము డా విధంగా ప్రవేశించి లోపలికి వెళ్ళి భవనమధ్యలో ఉత్తర పవళించే మెత్తని పాన్పును పరిశీలించి, తెలిసికొని, దానికి సమీపాన ద్రౌపదిని కనబడకుండా దాచి వుంచి, ఆ పాన్పుపై కూర్చున్నాడు. అప్పుడు కీచకుడు.

విశేషం: లీలాపర్యంకం - విలాసశయ్య (మెత్తని పాన్పు). రాజకుమార్తె నాట్యాభ్యాసంలో అలసినప్పుడు విశ్రాంతి తీసికొనే మంచం. అది ఇప్పుడు లీలాపర్యంకం (విలాసశయ్య)గా పనికి వస్తుందని భీముడు ఆ స్థలాన్ని నిశ్చయించాడు. అది భవనమధ్యభాగంలో ఉన్నది కాబట్టి రహస్యం బాగా రక్షించబడుతుంది. ఈ రెండూ స్థలనిర్దేశంలో ముఖ్యమైన అంశాలు. (సంపా.)

క. **కైసేసి మద వికారో। ల్లాసంబున మేను వొంగ లఘుగతి నుత్కం**
ఠాసవపానవిధాన। వ్యాసంగతరంగితాంతరంగుం డగుచున్. **329**

ప్రతిపదార్థం: కైసేసి= అలంకరించుకొని; మదవికార+ఉల్లాసంబునన్= మదభావం వలన కలిగిన వింత సంతోషంతో; మేను= శరీరం; పొంగన్= పొంగిపోగా; లఘుగతిన్= వేగంగా కొద్దిగా సేవించే పద్ధతిలో; ఉత్కంఠా= మదనోత్సాహం కొరకు; ఆసవ, పాన, విధానవ్యాసంగ= మద్యాన్ని సేవించే పద్ధతిలోని ఆసక్తి చేత; తరంగిత+అంతరంగుండు= ఉప్పొంగుతున్న మనస్సు కలవాడు; అగుచున్= ఔతూ.

తాత్పర్యం: అలంకరించుకొని, మదభావంతో కలిగిన వింతగా శరీరం ఉప్పొంగుతూ ఉండగా; కొద్దిగా వేగంగా ఉత్కంఠాసవాన్ని (మదనోద్రేకానికి పనికి వచ్చే మద్యాన్ని) సేవించటం వలన కోర్కెతో తరగలెత్తిన మనస్సు కలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఇందులోని మదభావం మద్యం వలన కలిగింది కాబట్టి కీచకుడు మధ్యమ ప్రవృత్తి కలవాడని ధ్వని. 'విధా+నవ్య+ఆసంగ= కొత్తదయిన మాలిని యొక్క సంగమము' అనే అర్థాన్ని జనహిత వ్యాఖ్య చెప్పింది. ఉత్కంఠా+ఆసవము= అనే సమాసాన్ని రూపకంగా శ్రీమున్నంగి శర్మ పరిష్కృత విరాటపర్వంలో చెప్పబడింది. (సంపా.)

శా. **సింగంబున్న గుహా నికేతమునకున్ శీఘ్రంబునన్ వచ్చు మా**
తంగంబుం బురుడించుచుం బవనపుత్ర స్వీకృతంబైన యా
రంగాగారము సేరవచ్చి మదిలో రాగంబు ఘూర్ణిల్ల నిం
తిం గాముం డిటఁ దేడె యింత కని యుద్వృత్తాంగజోన్మాదుఁడై. **330**

ప్రతిపదార్థం: సింగంబు= సింహం; ఉన్న గుహానికేతమునకున్= ఉన్న గుహానివాసంలోనికి; శీఘ్రంబునన్= త్వరగా; వచ్చు= వచ్చే; మాతంగంబున్= ఏనుగును; పురుడించుచున్= పోలుతూ; పవనపుత్ర స్వీకృతంబు+ఐన= భీముడు గ్రహించిన; ఆ రంగ+అగారము= ఆ నర్తనశాల; చేరన్+వచ్చి= లోపలికివచ్చి; మదిలోన్= మనస్సులో; రాగంబు= వలపు; ఘూర్ణిల్లన్= తిరుగాడగా (వేగిరపెట్టగా); ఇంతకున్= ఇప్పటికే; ఇంతిన్= సైరంధ్రిని; కాముండు= మన్మథుడు; ఇటన్+తేడె= ఇక్కడకు తీసికొనిరాడా?; అని= అని భావించి; ఉత్+వృత్త+అంగజ+ఉన్మాదుఁడు+ఐ= విజృంభించిన (పైకెగిసిన) వలపుపిచ్చి కలవాడై.

తాత్పర్యం: సింహం ఉన్న గుహానివాసానికి వేగంగా వచ్చే ఏనుగును అనుకరిస్తూ భీముడు అధిష్ఠించి ఉన్న ఆ నర్తనశాలను సమీపించి కీచకుడు మనస్సులో వలపు సుడులు తిరుగుతూ నినదిస్తూ ఉండగా 'ఇప్పటికే మన్మథుడు ఆ కాంతను ఇక్కడికి తెచ్చి ఉంటాడులే' అని భావించి, ఒడలు తెలియక విజృంభించే వలపుపిచ్చి రెచ్చినవాడై.

విశేషం: అలం: ఉపమానం. సింహం నివసిస్తున్న కొండగుహకు ఏనుగు వేగంగా వెళ్ళినట్లు భీముడున్న నర్తనశాలకు కీచకుడు వెళ్ళాడు. చక్కని ఉపమానం. అట్లా వేగంగా వెళ్ళటానికిగల కారణం? సింహం ఉన్నదని తెలిసా? తెలియకా? తెలియకే వెళ్ళుతున్నాడు. అక్కడ మన్మథుడు తెచ్చి ఉంచిన వనిత ఉంటుందని వెళ్ళుతున్నాడు. వలపులు మదిలో సుళ్ళు తిరిగి రాగాలు తీస్తున్నాయి. వలపు పిచ్చి (మోహోన్మాదం) మనసులో ఉవ్వెత్తున లేస్తున్నది. అంటే ఉత్తమ వనితను పొందబోతున్నానన్న మదభావం, ఇదివరకే అతడిలో జాగృతమై పొంగులు వారుతున్న తరుణమదం, మద్యమదాలకు ఉత్పోషకంగా ఉన్నది. అందువలనే మూడంచెల ఉన్మాదం ముయ్యేత్తుగా ఎగసింది. అది ఉన్మత్తావస్థయొక్క పరాకాష్ఠ. దానివలన వనితాసంభోగవాంఛతో అతడు శాలలో ప్రవేశించాడు. పై ఉపమానం రాబోయే గండాన్ని సూచిస్తున్నది. సింహం బారిన ఏనుగు పడి మరణిస్తుందని అలంకార ధ్వని. ఇది పఠితలు మాత్రమే ఊహించగలరు. మరి సింహబలుడికి ఈ సంగతి తెలియదు. అది విధివిలాసం. అతడు మదనోన్మాదంతో వనిత మాటను నమ్మి నర్తనశాలలో ప్రవేశించాడు. కీచకుడిపరంగా అది విటుడు సంకేతస్థలానికి సానురాగంగా వెళ్ళుతున్న శృంగార రసస్థితిని తెలుపుతుంది. అది ధర్మవిరుద్ధమని పఠితలు భావించటంవలన అది రసాభాసమౌతుంది. అయినా, అతడు వంచనకు గురి ఔతున్నాడన్న భావం కూడా పఠితలకు కలుగుతుంది. కావున అతడివైపు వారి సానుభూతి కలుగుతుంది. సామాజికుల హృదయాలలో అలంకారశిల్పంతో భీముడితో సహానుభూతినీ, కామావస్థ చిత్రణంలో కీచకుడియందు సానుభూతినీ చిత్రించి విరుద్ధభావాల విశిష్టశబలతతో రసోల్లాసాన్ని కలిగించే రచనాశిల్ప మిది. (సంపా.)

ఉ. స్వాంతము బాహుగర్వఘనసంతమసాంధము గాఁగ శంక యొ
క్కంతయు లేక కీచకుఁ డహంకృతి ముంగలి గాఁగ మండపా
భ్యంతరభూమిఁ జొచ్చి తతియంజని యారసి సెజ్జఁ గాంచి య
త్యంత ముదావహం బగుడు నందు రయంబునఁ గేలు సాఁచినన్. 331

ప్రతిపదార్థం: కీచకుఁడు= కీచకుడు; స్వాంతము= మనస్సు; బాహుగర్వ= భుజబలగర్వమనే; ఘనసంతమస+అంధము +కాఁగన్= చిమ్మచీకటివలన గ్రుడ్డిది కాగా; శంక+ఒక్క+అంతయున్ లేక= అనుమానం కొద్దిగా కూడా లేకుండా; అహంకృతి= అహంకారం; ముంగలి+కాఁగన్= ముందు నడవగా; మండప+అభ్యంతరభూమిన్= నాట్యశాల లోపలిభాగంలో; చొచ్చి= ప్రవేశించి; తతియన్+చని= సంకేతస్థలాన్ని సమీపించి; ఆరసి= పరిశీలించి; సెజ్జన్+కాంచి= పాన్పును చూచి; అతి+అంత ముద్+ ఆవహంబు+ అగుడున్= మిక్కిలి సంతోషం కలిగించేది కావటం చేత; అందున్= అందులో; రయంబునన్= త్వరగా; కేలు= చేయి; చాఁచినన్= చాచగా.

తాత్పర్యం: తన మనస్సు బాహుబలమనే చిమ్మచీకటిలో గ్రుడ్డిదైపోగా రవంతకూడా అనుమానం లేకుండా కీచకుడు అహంకారమే ముందు నడవగా నర్తనశాల మండపంలోని అంతర్భాగానికివెళ్ళి, సంకేతంగా ఏర్పరచుకొన్న చోటును సమీపించి, పరిశీలించి శయ్యను చూచి, మిక్కిలి సంతోషం కలుగగా వెంటనే తన చేతిని ఆ శయ్యమీదకు పోనిచ్చాడు (చాచాడు).

విశేషం: అలం: రూపకం, కావ్యలింగం. 'స్వాంతము బాహుగర్వఘనసంతమసాంధము గాఁగన్' అన్న చోట రూపకం, కావ్యలింగం అలంకారాలుగా రాణిస్తున్నాయి. కీచకుడు నర్తనశాలలోకి ప్రవేశించిన తరువాత సైరంధ్రి వచ్చి ఉంటుందని నమ్మాడు. కాని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వచ్చింది సైరంధ్రియేనా అని తెల్సుకొనే ప్రయత్నం ముందుగా చేయలేదు. దానికి కారణం లేకపోలేదు. తాను వస్తే, వచ్చింది కీచకుడేనా అని ఆమె కూడా అడగలేదు. ఆమెకు తనమీద అంత నమ్మకం. అందువలన తాను 'వచ్చింది నీవేనా?' అని చీకట్లో ఆమెను పలకరించి ధ్రువపరచుకొనలేదు. దీనికి అతడి బాహుబలగర్వమనే చీకటి కారణం. అందువలననే తనకు ఎదురయ్యే ప్రమాదాన్ని తెలిసికొనే వివేకం లేని గ్రుడ్డివాడయ్యాడు. తన అంతటివాడిని వలచి వచ్చిన మగువను గురించి భావించుకొంటూ తన గర్వమే మార్గదర్శిగా సాగిపోయి, సంకేతస్థలాన్ని గుర్తించి శయ్యను పసికట్టాడు. దానిపై ఆమె ఉన్న జాడలు లీలగా తోచాయి. మనస్సు సంతోషంతో పొంగిపోయింది. అప్పుడైనా పలకరించి ఎవరో తెలిసికొందామని అతడికి స్ఫురించలేదు. అతడి మనసు గ్రుడ్డిది కావటం చేత ఆమె కొరకు చేయి చాచాడు. (వస్తుజ్ఞానాన్ని చేతితో తెలిసికొనటం గ్రుడ్డివాడి లక్షణం) దీనికంతా కారణం బాహుగర్వఘన సంతసమత్వమే. ఇట్లా కీచకుడి చర్యలను సమర్థించటానికి తిక్కన కావ్యలింగాలంకారాన్ని ధ్వనిమయంగా వాడాడు. (సంపా.)

చ. **ఘనతర కోప వేగమునఁ గంపమునొందు నిజాంగకంబులం**
దనధృతి పెంపు సొం పచలితంబులఁ జేయ సమీరుకూర్మినం
దనుఁడు తదీయ చేష్టలును దద్వచనంబుల చొప్పు నేర్పడం
గను మతి నూరకుండె నవికార నిగూఢ నిజ ప్రకారుఁడై. **332**

ప్రతిపదార్థం: ఘనతర= మిక్కిలి గొప్పదైన; కోపవేగమునన్= తీవ్రమైన కోపంతో, కంపమున్+ఒందు= వణుకుతున్న; నిజ+అంగకంబులన్= తన అవయవాలను; తన ధృతి పెంపు సొంపు= తన ధైర్యగుణం యొక్క అతిశయ వైభవం; అచలితంబులన్= కదలనివాటివిగా; చేయన్= చేయగా; సమీరు కూర్మినందనుఁడు= వాయుదేవుడి ప్రియపుత్రుడు- భీముడు; తదీయచేష్టలను= అతడి చర్యలూ; తత్+వచనంబుల చొప్పున్= అతని మాటలతీరూ; ఏర్పడంగన్= తేటపడేటట్లు; కను మతిన్= చూద్దాములే అనే ఆలోచనతో; అవికార= వికారంలేని (ఎటువంటి కలతపాటు లేని); నిగూఢ నిజప్రకారుఁడు+ఐ= కప్పబడిన తన పద్ధతి కలవాడై (లేదా రహస్యమైన తన పద్ధతి కలవాడై); ఊరక+ఉండెన్= ఊరకున్నాడు.

తాత్పర్యం: భీముడు తీవ్రమైన కోపంతో అదురుతున్న తన శరీర అవయవాలను ధైర్యశక్తి వైభవంతో చిక్కబట్టుకొని ఆ కీచకుడి చేష్టలను, మాటలతీరును పరికిద్దామని అనుకొని తన గుట్టు బయటపడకుండా (తన సహజమైన ఉద్ధత స్వభావాన్ని దాచుకొని) ఎటువంటి కోపతాపాలకు గురికాకుండా ఊరక ఉండిపోయాడు.

విశేషం: అంతటి భీముడు ఈ విధంగా తన పద్ధతి మార్చుకొని నడుచుకొనటం విచిత్రంగా ఉంటుంది. ఇందువలన ఉద్ధతుడైన భీముడు ధీరుడైనాడు. అతడిలో కోపం విజృంభించాలంటే కీచకుడు ద్రౌపది పట్ల పలికే పలుకులూ, చేసే చేష్టలూ అతడికి తెలియాలి. అవి క్రోధభావ విభావాలు కావాలి. అందుకై ఈ మౌనం. ఈ సౌమ్య నిర్వికార వర్తనం. (సంపా.)

ఆ. **కీచకాధముండు కిమ్మీర వైరిపైఁ। గేలు సాఁచి యా విశాలనయన**
గాఁ దలంచి మేను గరుపాఱ నిట్లను। మదన ఘూర్ణమాన హృదయుఁ డగుచు. **333**

ప్రతిపదార్థం: కీచక+అధముండు= నీచుడైన కీచకుడు; కిమ్మీరవైరిపైన్= కిమ్మీరుడిని చంపిన భీముడిపై; కేలు+చాఁచి= చేయిసాచి; ఆ+విశాలనయన+కాన్= ఆ వనిత (సైరంధ్రి)గా; తలఁచి= తలపోసి; మేను గఱుపారన్= శరీరం పులకించగా; మదన ఘూర్ణమాన హృదయుఁడు+అగుచున్= మన్మథభావాలతో కలయబారిన మనస్సుగలవాడౌతూ; ఇట్లు+అనున్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: కీచకుడు భీముడి శరీరంపై చేయి వేసి, మాలిని అనుకొని (స్పర్శను అనుభవించి) గగుర్పాటు చెందిన శరీరం కలవాడై, మన్మథభావాలు మనస్సులో ఉప్పతిల్లగా ఇట్లా అన్నాడు.

చ. **'వనిత! మనోహరంబులగు వస్తువులెల్లను వేడ్కనేఁటి నీ**
కని నియమించి తెచ్చితిఁ బ్రియంబునఁ గైకొను; మెప్పు నంగనా
జనములు నన్నుఁజూచి మరు సాయకముల్ దమ చిత్తవృత్తు లేఁ
చినఁ గొనివచ్చి యిత్తురు విశిష్టధనంబులు నాకు లంచముల్. **334**

ప్రతిపదార్థం: వనిత!= ఓ మాలినీ!; మనోహరంబులు+అగు= అందమైన; వస్తువులు+ఎల్లను= వస్తువులన్నీ; వేడ్కన్+ఏఁటి= వేడుకగా ఏర్పరిచి; నీకున్+అని, నియమించి తెచ్చితిన్= నీ కొరకై ప్రత్యేకంగా ఎన్నికచేసి తీసికొని వచ్చాను; ప్రియంబునన్= ప్రీతితో; కైకొనుము= తీసికొనుము; ఎప్డున్= ఎప్పుడూ; అంగనాజనములు= స్త్రీలందరూ; నన్నున్+చూచి= నన్ను (కీచకుడిని) చూచి; మరుసాయకముల్= మన్మథ బాణాలు; తమ చిత్తవృత్తులు= తమ మనఃప్రవృత్తులను; ఏఁచినన్= బాధించగా; విశిష్టధనంబులు= విశేష ధనాలను; నాకున్ లంచముల్= నాకు లంచాలుగా; కొనివచ్చి= తీసికొని వచ్చి; ఇత్తురు= ఇస్తారు.

తాత్పర్యం: 'ఓ మాలినీ! నీకుగా మేలి వస్తువులను ఏర్పరచి, ప్రీతితో తెచ్చాను. తీసికొనుము. ఇదివర కెప్పుడూ స్త్రీలు నన్ను చూచిన తరువాత మన్మథుడు తన బాణాలతో వారి మనస్సులలో మరులు రేపగా వారు నా పొందుకోరి విలువైన ధనాలను లంచాలుగా తెచ్చి ఇస్తారు.

విశేషం: విటులు తాముకోరినవారిని వలపింపజేసికొనటానికి లంచాలు ఇవ్వటం సహజం. ఇక్కడ స్త్రీలు తనను వలచివస్తారని లంచాలిస్తారని కీచకుడు సగర్వంగా చెప్పుకొంటున్నాడు. ఇందువల్ల అతడి స్వరూపాభిమానమూ, ఆత్మస్తుతీ తెలుస్తున్నాయి.

సీ. **నాదు రూపంబు మనంబునఁ జిక్కిన। తరుణి ద క్కొరునేల సరకుసేయు?**
నాదు లావణ్యంబునకు నిచ్చ మెచ్చిన। యెలనాఁగ పైఁబడ కేల నిలుచు?
నా విలాసంబులు భావింపఁ బడసిన। యింతి పుష్పాస్త్రుచే నెట్లు బ్రదుకు?
నా వివేకమున కానందింపఁ గనిన యం। గన యెట్లు విరహాగ్నిఁ గ్రాఁగకుండు?

తే. **మెఱయ నా యాడుమాటలు దెఱవపిండు। నుల్లములకు నింపారెడు నురులు గావె?**
యిట్లు నీ వొక్కతవె నన్ను నేలుకొంటి। గాక మాట లింకేటికిఁ గమలవదన !' **335**

ప్రతిపదార్థం: కమలవదన!= పద్మం వంటి ముఖం గల ఓ వనితా!; నాదు రూపంబు= నా సౌందర్యం; మనంబున్+చిక్కినన్= మనస్సులో లగ్నమైన; తరుణి= స్త్రీ; తక్కు+ఒరునిన్= మరొకరిని; ఏల= ఎందుకు; సరకుసేయున్?= లెక్కపెట్టుతుంది?; నాదు లావణ్యంబునకున్= నా మేని నిగనిగలకు; ఇచ్చన్+మెచ్చిన= మదిలో మెచ్చుకొన్న; ఎలనాఁగ= స్త్రీ; పైన్+పడక+ఏల నిలుచున్?= పైన వచ్చి పడకుండా ఎట్లా నిలువగలుగుతుంది?; నా విలాసంబులు= నా శృంగారపు హొయలును గురించి; భావింపన్+పడసిన= ఆలోచించే అదృష్టం పొందిన; ఇంతి= స్త్రీ; పుష్ప+అస్త్రుచేన్= మన్మథునిచేత; ఎట్లు బ్రదుకున్?= ఎట్లా బ్రదుకుతుంది?; నా వివేకమునకున్= నా తెలివి తేటలకు; ఆనందింపన్+కనిన= సంతోషించగలిగిన; అంగన= స్త్రీ; విరహ+అగ్నిన్= విరహమనే

నిప్పులో; ఎట్లు+క్రాఁగక+ఉండున్?= వేగకుండా ఎట్లా ఉండగలుగుతుంది?; మెఱయన్= ప్రకాశించగా; నా+ఆడు మాటలు= నేను మాట్లాడే మాటలు; తెఱవపిండు= స్త్రీ సమూహంయొక్క; ఉల్లములకున్= మనస్సులకు; ఇంపారెడు= ప్రీతి కలిగించే; ఉరులు కావె= ఉచ్చులు (బంధాలు) కావా?; ఇట్లు= ఈ విధంగా; నీవు+ఒక్కతవె= నీవు ఒక్కదానివే; నన్నున్= (కీచకుడిని); ఏలుకొంటి(వి)గాక!= ఏలుకొన్నావు సుమా!; మాటలు+ఇంకన్+ఏటికిన్= ఇక ఇంతకంటె మాటలు ఎందుకు? (ఇక మీద మాటలతో కాలక్షేపం చేయటం ఎందుకు? (రతికి ఉపక్రమిద్దామని భావం).

తాత్పర్యం: నా సౌందర్యం చూచిన స్త్రీ నన్ను తప్ప మరొకరిని ఎందుకు లెక్కిస్తుంది? నా లావణ్యాన్ని చూచిన అంగన నాపైన పడిపోకుండా ఎట్లా ఉండగలదు? నా విలాసాలను చూచిన స్త్రీ మదనబాణాలకు గురి అయి ఎట్లా బతుకగలదు? నా తెలివితేటలు చూచి ఆనందించిన స్త్రీ విరహాగ్నిలో పడి వేగిపోకుండా ఎట్లా ఉండగలదు? నా మాటలు మగువల మనసులకు అందమైన గాలాలు! ఈ విధంగా నేనింతవరకూ వనితలనందరినీ ఆకర్షిస్తూ ఉన్నాను. కాని, ఇప్పుడు నీ వొక్కతెవే నన్ను ఆకర్షించి ఏలుకొన్నావు. ఇంతకంటె నేను ఇంక ఏమి చెప్పేది?' (అయినా ఇంకా మాటలతో పనేమిటి? చేతల కుపక్రమిద్దాం).

విశేషం: 1. కీచకుడి రూప, లావణ్య, విలాస, వివేక, సంభాషణలను చూచిన వనితలు వరుసగా ఇతరులను సరకుచేయరు. ఇతరులను మెచ్చుకోరు. ఇతరులను భావించరు. ఇతరుల వివేకానికి ఆనందించరు. కాగా, కీచకుడికే చిక్కుతారు. అతడినే కోరుతారు. అతడు దొరకకపోతే మన్మథబాణాలకు గురియై, చనిపోవాలనుకొంటారు; మదనాగ్నిలో పడి మ్రగ్గిపోతారు. అతడి మాటలు ఇంపైన ఉరులు. అతడు దొరికితే ఇంపునిస్తాయి. దొరకకపోతే చంపుతాయి. ఇవన్నీ వనితలను తన సౌందర్య విలాసాలతో ఏలుకొనే పద్ధతులని కీచకుడు ఆత్మస్తుతి చేసికొన్నాడు. 2. అంతగా వనితలను ఏలుకొన్న నన్ను ఏలుకొన్నదానవు నీవు-అని సైరంధ్రిని ప్రశంసించాడు. కీచకుడు. ఇవి ప్రియురాలిని ప్రసన్నురాలిని చేసికొనటానికి పలికే ప్రశంసోక్తులు. 3. 'మాటలింకేటికి కమలవదన!' అనే మాటలకు రెండు రకాల అర్థాలున్నాయి. ఇంతకంటె అతిశయోక్తులు ఎందుకని ఒక అర్థం. ఇంక మాట లెందుకు చేతలకు ఉపక్రమిద్దామని మరొక అర్థం. ఈ రెండవ అర్థాన్ని కూడా భావించి భీముడు ఉలిక్కిపడి ఉంటాడు. ఇక మాటలు తానే సాగించాడు చేతలకు ఊతలుగా. (సంపా.)

క. **అనవుడు మనమున నిస్సీ! యని, యుచిత నిగూఢభంగు లగు భాషణముల్**
తన ప్రియ వినిపించుట కి। ట్లనియెన్ మృదురీతి భీముఁ డాతనితోడన్. **336**

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా విని; భీముఁడు; మనమునన్= మనస్సులో; ఇస్సీ! అని= ఛీ! అనుకొని; ఉచిత= తగిన; నిగూఢ భంగులగు= రహస్య పద్ధతులలో; భాషణముల్= మాటలు; తన ప్రియన్= తన భార్య అయిన ద్రౌపదికి; వినిపించుటకున్= వినిపించటానికి; మృదురీతిన్= (స్త్రీవలె) కోమలమైన పద్ధతిలో; ఆతనితోడన్= కీచకుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ మాటలు విని భీముడు మనస్సున ఛీత్కరించుకొని, అప్పటికి తగినట్లుగా తన రహస్య పద్ధతికి అనువైన మాటలను తన ప్రియభార్య అయిన ద్రౌపదికి వినిపించేటట్లు సంతోషపెట్టాలని తలచి, (స్త్రీవలె) కోమలంగా కీచకుడితో ఇట్లా అన్నాడు.

తే. **'ఇట్టివాఁడవు గావున నీవు నిన్నుఁ। బొగడికొనఁదగు; నకట! నా పోల్కి యాఁడు**
దాని వెదకియు నెయ్యెడనైన నీకుఁ। బడయవచ్చునె యెఱుఁగక పలికితిట్లు. **337**

ప్రతిపదార్థం: ఇట్టివాఁడవు కావునన్= ఇటువంటివాడివి కాబట్టి; నీవు (కీచకుడు); నిన్నున్= నిన్నే; పొగడికొనన్+తగున్= పొగడుకొనటం సబబే; అకట!= ఔరా!; నా పోల్కి= నన్ను పోలిన; ఆఁడుదానిన్= స్త్రీని; వెదకియున్= వెదకినా కూడా; ఏ+ఎడన్+ఐనన్= ఎక్కడైనా; నీకున్+పడయవచ్చునె?= నీవు పొందగలవా?; ఎఱుఁగక= తెలియక; ఇట్లు పలికితి(వి)= ఇట్లా మాట్లాడావు.

తాత్పర్యం: 'ఇటువంటివాడివి కాబట్టి నిన్ను నీవే పొగడుకొనటం సమంజసమే. నావంటి స్త్రీ ఎక్కడ వెదకినా నీకు దొరకదు. తెలియక నీవు ఇట్లా మాట్లాడావు.

విశేషం: 1. అలం: వ్యాజోక్తి. ఇందులో మొదటి వాక్యం కాకువు వలన ఏర్పడే అధిక్షేపోక్తి. అందులోనూ వ్యాజోక్తి. పైకి స్తుతి చేస్తున్నట్లుగా ఉన్నా కాకువులో స్ఫురించేది నింద. ఇట్టివాడివి అన్నప్పుడు వ్యతిరేకధ్వని స్ఫురిస్తుంది. ఇంతటి అధికుడవని ప్రశంస, ఇంతటి అధముడవని నింద. ఆత్మప్రశంస ఉద్ధతుల లక్షణం. ఉదాత్తుల స్వభావం కాదని అధిక్షేపం. 2. అలం: వ్యతిరేకం. ఈ పద్యంలోని రెండవ వాక్యం హాస్యోక్తి. తనంతటివాడు లేడని చెప్పుకొన్న కీచకుడికి ప్రతిసమాధానం. 'నా పోల్కి ఆడుది' అనునప్పుడు ఉపమానం కంటె ఉపమేయం అధికంగా చెప్పే వ్యతిరేకాలంకార స్ఫూర్తి ఉన్నది. భీముడు సైరంధ్రి స్థానంలో కూర్చొని ఆడుదాని గొంతుతో మాట్లాడుతున్నాడు- ఇప్పటి 'మిమిక్రీ' (ధ్వన్యనుకరణం) వలె, చీకటిలో చూడలేక భీముడినే వలచినదానిగా భావించాడు కీచకుడు. అందువలన నావంటి వింతస్త్రీ నీ కెక్కడా దొరకదని హాస్యోక్తి. 'ఎఱుఁగక పలికి తిట్లు' అనే మాట జాతీయం. అమాయకంగా మాట్లాడావనీ. నా సంగతి తెలియక మాట్లాడావనీ అర్థాలు ఏర్పడతాయి. ఇదీ హాస్యోక్తియే. 3. ఈ అధిక్షేప హాస్యోక్తులు భీముడి పౌరుష ప్రవృత్తికి భిన్నంగా ఉండి వికృతిని స్ఫురింప చేస్తాయి. కాబట్టి ద్రౌపదికీ, పఠితలకూ హాస్యాన్ని కలిగిస్తాయి. ఈ హాస్యం శృంగార సంబంధమైన లలిత హాస్యం కాదు. శత్రువు మీద విసిరే అధిక్షేపరూప గంభీర హాస్యం. (Grim humour) ఈ హాస్యం ఒక్కసారి విరుచుకపడబోతున్న భీముడి రౌద్రాగ్నికి ధూమశిఖ వంటిది. (సంపా.)

క. నా యొడలు సేర్చినప్పుడ। నీ యొడలెట్లగునొ? దాని నీవెఱిఁగెదు; న
న్నే యబలలతోడిదిగాఁ। జేయఁదలంచితివి తప్పు సేసితి కంటే! 338

ప్రతిపదార్థం: నా ఒడలు+చేర్చిన+అప్పుడు+అ= నా శరీరంతో నీ శరీరం దగ్గర చేస్తే; నీ ఒడలు= నీ శరీరం; ఎట్లు+అగునొ?= ఎట్లా ఔతుందో; దానిన్= దానిని; నీవు+ఎఱిఁగెదు(వు)= నీవు తెలిసికొంటావు; నన్నున్+ఏ+అబలల తోడిదిగాన్= నన్ను మిగిలిన ఏ స్త్రీలతో సమానంగా; చేయన్+తలంచితివి= చేయాలనుకొన్నావో; తప్పు+చేసితి(వి)= తప్పుచేశావు; కంటే= చూచావా? (తెలుగులో తెలిసిందా? చూడు! అనే హెచ్చరికలకు సమానార్థకం).

తాత్పర్యం: నా శరీరంతో నీ శరీరం తగిలినప్పుడే నీ శరీరం ఏమవుతుందో అది నీవే తెలిసికొంటావు. నన్ను మిగిలిన సామాన్య స్త్రీలతో సమానంగా చేయదలచుకొన్నావో, తప్పు చేసినట్లే సుమా!

విశేషం: 1. ఇది శ్లేషగర్భితమైన వ్యంగ్యోక్తి. 'మాట లింకేటికిఁ గమలవదన!' అని 335వ పద్యంలో మదనకార్యోత్సాహాన్ని వ్యంగ్యంగా ప్రదర్శించిన కీచకుడి వాక్యానికి దీటుగా ప్రౌఢంగా భీముడు చెప్పిన మాట లివి. తెలుగు పలుకుబడుల వింత పోకడలు శృంగార రౌద్ర రసానుగుణంగా, శ్లేషమయంగా, వ్యంగ్యంగా ప్రయోగించే నేర్పు ఈ రచనలో రాణించింది. 'నా ఒడలు చేర్చునప్పుడు.' అనే వాక్యానికి నా శరీరంతో నీ శరీరం సంగమించేటప్పుడు-అని శృంగారపరమైన అర్థం. నా శరీరంతో ద్వంద్వయుద్ధం కొరకు నీ శరీరం తలపడ్డప్పుడు-అని రౌద్రరసపరమైన అర్థం. ఇది అర్థశ్లేష 2. 'నన్ను ఏ వనితల వంటిదానినిగానో భావించావా! తప్పు చేసిన వాడివే ఔతావు సుమా!' అన్నది వ్యంగ్యోక్తి (satire). నేను ఇతర సామాన్యవనితలవంటి దానను కాను. నీవు అట్లా భావిస్తే పొరపాటుపడ్డట్లే. ఈ వాక్యంలో తాను అసామాన్య వనిత నన్నట్లు ప్రకృతార్థం. కాని, నేను ఆడుదనం లేని ఆడుదానిని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆడుదానిగా అభినయిస్తున్న పురుషుడిని. నన్ను స్త్రీగా భావించి అందరి స్త్రీలవలెనే భోగింపదలచుకొంటే నీవు పొరపాటుపడ్డట్లే. అది పొరపాటు కాదు పరదారాగమన దోషం కూడా! దానికి తగిన ఫలం అనుభవిస్తావు-అని ఎత్తిపొడుస్తూ అన్నమాట! 3. మొదటి వాక్యం రౌద్రగర్భితం: రెండవ వాక్యం శృంగార జల్పితం. రెండూ వెరసి ఈ పద్యం గంభీర హాస్యరస వ్యంజకం. ఇక్కడ స్త్రీకి పర్యాయంగా అబలా శబ్దం కావడం గమనించదగింది. నన్ను బలం లేని స్త్రీనిగా ఎంచుతున్నావేమో, నేను సబలుడైన పురుషుడిని సుమా! అనడం కూడా ధ్వనితం. (సంపా.)

క. నను ముట్టి నీవు వెండియు। వనితల సంగతికిఁ బోవువాఁ డవె? యైనం
దను వేఁ బడసిన ఫలమే?। కనియెద విదె చిత్తభవవికారము లెల్లన్.' 339

ప్రతిపదార్థం: నీవు (కీచకుడు); ననున్+ముట్టి= నన్ను తాకి; వెండియున్= మళ్ళీ; వనితల సంగతికిన్= స్త్రీల పొందుకు; పోవువాఁడవె?= పోగలవా? (పోలేవు); ఐనన్= ఐనా; తనువు= శరీరం; ఏన్= నేను; పడసిన ఫలమే?= పొందిన ఫలమే?; ఇదె= ఇప్పుడే; చిత్తభవవికారములు+ఎల్లన్= మన్మథుని వికారాలన్నీ (మనసులో కలిగిన భావాలన్నీ); కనియెదవు= చూస్తావు.

తాత్పర్యం: నన్నొకసారి ముట్టుకొన్న తరువాత మరింక ఆడువారి పొందుకు నీవు పోగలవా? మరింక ఏ ఆడువారి ముచ్చటలోనూ ఆసక్తిని చూపబోవు. (నీవు మరే స్త్రీలనూ కోరబోవు అని ఒక అర్థం. ఆడువారి పొందుకు పోలేని స్థితిని (చావును) పొందుతావని గూఢార్థం). కాగా, నే నీ శరీరాన్ని పడసిన (పుట్టినందుకు) ఫలమూ, నీ మనసులో కలిగే మన్మథ భావాల ఫలమూ ఇప్పుడే చూడగలవు (అనుభవించగలవు).

విశేషం: ఈ పద్యంలో శ్లేషానుప్రాణితమైన చమత్కారోక్తి గంభీర హాస్య వ్యంజకంగా నిబంధించబడింది. పద్యంలోని కొన్ని పదాలకు శ్లేషార్థాలివి. ముట్టి= తాకి, ఎదుర్కొని, ఆక్రమించి; వనితల సంగతి= స్త్రీలను గురించి మాట్లాడటం, స్త్రీల కథల ప్రస్తావనలు, స్త్రీల తోడి స్నేహం; పొందు, సంగమం; చిత్తభవ వికారములు= మన్మథ వికారాలు, మనసులో పుట్టిన భావాలు; కనియెదవు= చూస్తావు, అనుభవిస్తావు; తనువు పడసిన ఫలం= జన్మ ఎత్తిన దానికి ఫలం, ఈ (స్త్రీగా నటించే) రూపం తాల్చినందుకు ఫలం నిన్ను చంపకపోతే నేను శరీరం ధరించినందుకు ఫలమేముంది-అని భావం; ఇదే= ఇప్పుడే, ఇదిగో చూడు అని కార్యోన్ముఖుడు అయ్యే చర్యను సూచించే పదం.

శ్లేష తాత్పర్యం: నన్ను తాకి (ఎదుర్కొని) నీవు మళ్ళీ ఆడవాళ్ళ పొత్తుకు పోతావా? (నీవు-చనిపోతావు), అట్లా అయితే నేనీ శరీరాన్ని ధరించిన ఫలాన్నే నీవు నీ మనసులో పుట్టిన భావాల ఫలంగా పొందగలుగుతావు. (భీముడు పుట్టినందుకు ఫలం శత్రు సంహారం; కీచకుడి మనస్సులో కలిగిన పరసతీసమాగమవికారాలకు ఫలం మరణం). (సంపా.)

మ. అనుచున్ గ్రక్కున లేచి రోషకఠినం బౌ హాస మా సూతు నె
మ్మన ముద్వేగముఁ బొందఁజేయ బలసామగ్రీసముజ్జృంభణం
బున వానిం దలవట్టి వంచుటయు నేపుం జేవయుం దోఁప వాఁ
డనుమానింపక బె ట్టదల్చికొని కోపాటోపదీప్తాంగుఁడై. 340

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; గ్రక్కునన్ లేచి= తటాలున లేచి; రోషకఠినంబు+ఔ= కోపంచేత భయంకరమైన; హాసము= నవ్వు; ఆ సూతు నెఱ+మనము= ఆ కీచకుడి నిండుమనస్సును; ఉద్వేగమున్+పొందన్+చేయన్= కలతపడేటట్లు చేయగా; బలసామగ్రీసముజ్జృంభణంబునన్= సమగ్రమైన బలాన్ని విజృంభింపజేసి; వానిన్= కీచకుడిని; తల+పట్టి వంచుటయున్= తలపట్టి

వంచగా; ఏపున్= గర్వం; చేవయున్= బలమున్నూ; తోఁపన్= తెలిసేటట్లు; వాఁడు= కీచకుడు; అనుమానింపక= వెనుకాడక, శంకించక; బెట్టు= గట్టిగా; అదల్చికొని= విడిపించుకొని; కోప+ఆటోపదీప్త+అంగుఁడు+ఐ= కోపంయొక్క తీవ్రత వలన మండిపడే శరీరం కలవాడై.

తాత్పర్యం: ఇట్లా అంటూనే తటాలున లేచి భీముడు కీచకుడి మనస్సు కలత చెందేటట్లు అట్టహాసం చేసి, తన భుజబలంచేత అతడి తలపట్టి వంచగా కీచకుడు బలపరాక్రమాలను కూడగట్టుకొని వెనుకాడకుండా గట్టిగా విడిపించుకొని తీవ్రమైన కోపంతో మండిపడుతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇది కీచకుడు ఊహించని పరిస్థితి. తలపట్టి వంచటంలో ఏదో ఘోరం జరగబోతున్నదనే అనుమానం కలిగింది. మదనవికారం గాలికి పోయింది. తన భుజ పరాక్రమంతో విజృంభించిన కోపం దాల్చాడు.

భీమసేనుఁడు కీచకుని సంహరించుట (సం.4-21-50)

వ. గంధర్వుం డను తలంపున. 341

తాత్పర్యం: గంధర్వుడనే ఆలోచనతో.

చ. పవనతనూజు బాహువులు పాణియుగంబునఁ బట్టి వీఁకమై
నవనిపయిం బడం దిగిచి యంగము జానుల నూఁదినం గడున్
జవమున దండ తాడిత భుజంగము భంగి సముత్థితాంగుఁడై
యవయవముల్ ప్రకోపరభసాతిశయంబునఁ బొంగ నుద్ధతిన్. 342

ప్రతిపదార్థం: పవన తనూజు బాహువులు= వాయు తనయుడైన భీముడియొక్క భుజాలు; పాణియుగంబునన్+పట్టి= రెండు చేతులతో పట్టుకొని; వీఁకమైన్= పరాక్రమంతో; అవనిపయిన్= నేలమీద; పడన్+తిగిచి= లాగి పడవేసి; అంగము= భీముడి శరీరం; జానులన్= మోకాళ్ళతో; ఊఁదినన్= అదమగా; కడున్+జవమునన్= అధికశక్తితో; దండతాడిత= కర్రతో కొట్టబడిన; భుజంగముభంగిన్= పామువలె; సముత్థిత+అంగుఁడు+ఐ= ఎగసిన శరీరం కలవాడై; ఉద్ధతిన్= గర్వంతో; అవయవముల్= అవయవాలు; ప్రకోపరభస+అతిశయంబునన్+పొంగన్= అధికమైన కోపవేగంతో ఉప్పొంగగా;

తాత్పర్యం: కీచకుడు భీముడి భుజాలను తన చేతులతో పట్టి బలిమితో లాగి నేలమీద పడవేసి అతడి శరీరాన్ని తన మోకాళ్ళతో అదుమగా, భీముడు కర్రదెబ్బతిన్న పామువలె చప్పున లేచి అధికమైన కోప సంరంభంవలన ఉప్పొంగిన సర్వశరీరావయవాలతో విజృంభించి గర్వంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ. మల్లయుద్ధంలోని భంగిమలను (పట్లు) మనోనేత్రాలకు చలనచిత్రంవలె గోచరించేటట్లు చేసిన వర్ణన మిది. భీముడు కీచకుడి తలపట్టి లాగి వంచాడు. అట్లా వంగిన కీచకుడికి భీముడి బాహువులు దగ్గరగా అందుతాయి. అందువలన కీచకుడు కూర్చున్న భీముడిని భుజాలు పట్టి బలంగా త్రోసి నేలమీదకు నెట్టి క్రింద పడవేసి, నడుముమీద మోకాళ్ళు పెట్టి అదిమాడు. ఇది కుస్తీలో మరొక పట్టు. అట్లా అదిమినప్పుడు నడుంమీద కర్రతో కొట్టితే తలతో తోకతో ఒక్కసారి విజృంభించి బుసకొట్టి ఎగిరే పామువలె భీముడు ఆ పట్టును అవలీలగా త్రోసి పైకి లేచాడు. భీముడికి కోపం రావాలంటే శత్రువు బలంగా అతడిని ఎదుర్కొనాలి. దానినిబట్టి అతడు శత్రువు బలాన్ని ఊహించి ప్రతిక్రియ మొదలుపెట్టుతాడు. ప్రస్తుతం కీచకుడి

దెబ్బకు భీముడి ఒడలంతా కోపాతిశయంతో ఉప్పొంగిపోయింది; గర్వం తలయెత్తింది. చర్య ప్రతిచర్యతోపాటు భావావస్థల పరిణామాన్ని కూడా చిత్రించటంతో యుద్ధం చైతన్యవంతంగా ఉంటుంది తిక్కన రచనలో. (సంపా.)

మ. మగుడం గీచకుఁ బట్ట వాఁడును బలోన్మాదంబునన్ బాహు గ
ర్వ గరిష్ఠుండగు నా హిడింబరిపుఁ దీవ్రక్రోధుఁడై పట్టి బె
ట్టుగఁ ద్రోపాడఁగ నిద్దఱున్ భుజబలాటోపంబుమై నొండొరున్
మిగులం జాలక కొంతసేపు వడి మేమేఁ బోరి రుగ్రాకృతిన్. 343

ప్రతిపదార్థం: మగుడన్= మళ్ళీ; కీచకున్+పట్టన్= కీచకుడిని పట్టుకోగా; వాఁడును= కీచకుడుకూడా; బల+ఉన్మాదంబునన్= పరాక్రమ గర్వంతో; బాహుగర్వగరిష్ఠుండు+అగు= భుజబలగర్వంతో గొప్పవాడైన; ఆ హిడింబ రిపున్= ఆ భీముడిని (హిడింబుడి శత్రువును); తీవ్రక్రోధుఁడు+ఐపట్టి= అధిక కోపంతో పట్టుకొని; బెట్టుగన్= మిక్కిలి; త్రోపాడఁగన్= తోయగా; ఇద్దఱున్= భీమకీచకులు; భుజబల+ఆటోపంబుమైన్= భుజాల బలం యొక్క ఆడంబరంతో; ఒండొరున్= ఒకరిని ఒకరు; మిగులన్+చాలక= మించిపోలేక; వడిన్= వేగంతో; మేమేన్= అనాయాసంగా; ఉగ్ర+ఆకృతిన్= భయంకరమైన ఆకారాలతో; కొంతసేపు= కొంచెంసేపు; పోరిరి= పోరాడారు.

తాత్పర్యం: భీముడు మరల కీచకుడిని బాహువులతో ఒకపట్టుపట్టాడు. బలోన్మాదంతో కూడిన ఆ కీచకుడు కూడా బాహుగర్వంగల వీరుల్లో శ్రేష్ఠుడైన భీముడిని తీవ్రమైన కోపంతో పట్టి గట్టిగా త్రోసినాడు. ఈ విధంగా వాళ్ళు భుజబలాధిక్యంలో ఒకరినొకరు మించజాలక భయంకర స్వరూపులై త్రోపులాడుతూ అనాయాసంగా కొంతసేపు పోరాడినారు.

విశేషం: మల్లయుద్ధంలో వీరులు బాహువులలో పరస్పరం శరీరాలను బిగియబట్టి కలియబడుతూ పరస్పర భుజబలాలను ప్రదర్శించటం సర్వసామాన్యం. మేమే - మేమెయి - అనాయాసంగా (సూ.ని.) భుజబలంతో ఇద్దరూ సమానస్థాయిలో ఉన్నారు. కాబట్టి పోరు అనాయాసంగానూ, భయంకరంగానూ సాగింది. సమయుద్ధం సాగిన ఘట్టమిది. (సంపా.)

వ. అట్టి యెడ. 344

తాత్పర్యం: ఆ సమయంలో.

క. తన యగపా టొరు లెఱుఁగుదు। రని సూతుఁడు సమయభంగ మగుటకు భీముం
డును గొంకుచుఁ జప్పుడు సే। యని గూఢ విమర్దనప్రహారములఁ దగన్. 345

ప్రతిపదార్థం: తన+అగపాటు= అక్కడి తన ఉనికి; ఒరులు= ఇతరులు; ఎఱుఁగుదురు+అని= తెలిసికొంటారని; సూతుఁడున్= కీచకుడూ; సమయ భంగము+అగుటకున్= అజ్ఞాతవాసం చెడిపోతుందని; భీముండును; కొంకుచున్= జంకుతూ; చప్పుడు +చేయని= శబ్దం కాని; గూఢవిమర్దన ప్రహారములన్= రహస్యంగా పొడిచే పిడికిటి పోట్ల దెబ్బలతో; తగన్= ఒప్పునట్లుగా.

తాత్పర్యం: ఆ సమయంలో తాను అటువంటి చోట ఉన్నానని ఇతరులు తెలిసికొంటారేమోనని కీచకుడూ, అజ్ఞాతవాస ప్రతిజ్ఞకు భంగం కలుతుందేమోనని భీముడూ లోలోన జంకుతూనే చప్పుడుకాని పిడికిటిపోట్ల దెబ్బలతో ఇద్దరికీ తగినట్లు (పోరసాగారు). (తరువాతి వచనంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇది మల్లయుద్ధంలో మూడవ పద్ధతి. ఇందులో ఇద్దరూ పిడికిళ్ళ పోట్లతో ద్వంద్వయుద్ధం సాగించారు. అయితే ఇద్దరికీ కారణాలు వేరైనా భయం ఒకటే ఉంది. ఒకరిది పరువునష్టం కలిగే భయం. మరొకరిది వ్రతభంగభయం. ఇట్లా ఇద్దరికీ ఉపయోగపడిన ఒక భయం వర్ణించబడింది.

వ. మల్లయుద్ధ నైపుణ్యంబు మెఱయం గడంగి. 346

తాత్పర్యం: కుస్తీపట్ల పోరులో నేర్పరితనం ప్రదర్శించాలని పూనుకొని.

సీ. తిగిచిన నడుగులు దెరలక యొండొరుఁ। గ్రమ్మఱఁ దిగుచుచుఁ గడిమి మెఱయఁ,
బొడిచిన వెస బీఱుపోవక యొండొరు। నందంద పొడుచుచు నవనిఁ బెట్టి,
యొత్తిన బెగ్గలం బొందక యొండొరు। బలువిడి నొత్తుచు నలవు మిగిలి,
యడఁగంగఁ బొదివిన నడిచిపా టించుక। యును లేక వీఁక నొండొరుల నడరి,

తే. యడఁగఁ బొదువుచు, నలుక యంతంత కగ్గ। లించి యాయముల్ నొంచి దోర్లీల నెఱపి
యుల్లసిల్లిన స్రుక్క కొండొరుల రౌద్ర। వృత్తి నొంచు చొండొరులకు వెక్కసముగ. 347

ప్రతిపదార్థం: తిగిచినన్= ఒకరి నొకరు లాగుకొనగా; అడుగులు తెరలక= పదాలు కదలక; ఒండొరున్= ఒకరి నొకరు; కడిమి మెఱయన్= పరాక్రమం ప్రకాశించగా; క్రమ్మఱన్+తిగుచుచున్= మళ్ళీ లాగుతూ; పొడిచినన్= పిడికిలితో కుమ్మగా; వెసన్= వేగంగా; బీఱు+పోవక= వెనుకంజ వేయకుండా; ఒండొరున్= ఒకరినొకరు; అందు+అంద= అనేక చోట్లలో; పొడుచుచున్= గుద్దులాడుతూ; అవనిన్+పెట్టి= నేలమీద పడవేసి; ఒత్తినన్= అదిమినప్పటికీ; బెగ్గలంబు= భయంతోడి తత్తరపాటు; ఒందక= పొందకుండా; ఒండొరున్= ఒకరికొకరు; బలువు+ఇడిన్= పరాక్రమంతో; ఒత్తుచున్= అదుముతూ; అలవు మిగిలి= కోపం హెచ్చి; అడగంగన్+పొదివినన్= లోబడేటట్లు పట్టుకోగా; అడిచిపాటు= లొంగిపోవటం; ఇంచుకయును లేక= కొంచెం కూడా లేకుండా; వీఁకన్= పరాక్రమంతో ఒండొరులన్+అడరి= ఒకరినొకరు అతిశయించి; అడఁగన్+పొదువుచున్= లోబరచుకొనేటట్లు పట్టుకొని; అలుక= కోపం; అంతకున్+అంతకున్= క్రమక్రమంగా; అగ్గలించి= అధికమై; అయముల్+నొంచి= మర్మస్థానాలు నొప్పించి; దోస్+లీల, నెఱపి= భుజశక్తి ప్రదర్శించి; ఉల్లసిల్లినన్= ప్రకాశించగా; స్రుక్కక= వెనుదీయక; ఒండొరులు+అ= ఒకరి నొకరే; రౌద్రవృత్తిన్= రౌద్రరసప్రవృత్తులతో; నొంచుచున్= బాధిస్తూ; ఒండు+ఒరులకున్= ఒకరికొకరికి; వెక్కసముగన్= సహింపరానట్లుగా (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఒకరిని ఒకరు లాగగా అడుగులు కదలకుండా గట్టిగా నిలబడుతున్నా నేర్పుమీద పరస్పరం లాగుతూ ఉండేవారు; ఒకరిని ఒకరు గడుసుగా పిడికిళ్ళతో పొడిచినా వెనుకాడక పరస్పరం అవే చోట్ల తిరిగి పొడుచుకొంటూ ఉండేవారు; ఒకరిని మరొకరు నేలమీద పడవేసి గట్టిగా ఒత్తినా భయపడక ఒకరినొకరు బలప్రయోగంతో ఒత్తుతూ ఉండేవారు; కోపం పెరిగి ఒకరి నొకరు లోబడేటట్లు క్రమ్మి పట్టుకొన్నా లొంగుబాటు ఏమాత్రం లేకుండా పౌరుషంతో ఒకరినొకరు అణచుకొనటానికి యత్నించేవారు. కోపం అంతకంతకూ పెరుగుతూ ఉండగా విజృంభించి ఆయువు పట్టులను బాధించి భుజబలాన్ని ప్రదర్శించి పొంగిపోయేవారు; ఎన్ని విధాలైనా ఒకరి కొకరు తగ్గేవారు కాదు. ఒక్కొక్కరిలో ఆయా సమయాలలో కలిగే రౌద్రరస మనఃప్రవృత్తులచేత ఇరువురూ ఒకరికి మరొకరు అసాధ్యులై పోరేవారు.

విశేషం: అలం: స్వభావోక్తి.

క. కదియుచుఁ బాయుచుఁ బట్టుచు। నదలుచుచుం బడుచు లేచు చడఁగుచు వడిగొం
చొదవెడుకినుకం గడు బె। ట్టిదముగఁ బెనఁగిరి చలంబు డింపక కడిమిన్. 348

ప్రతిపదార్థం: కదియుచున్= సమీపిస్తూ; పాయుచున్= తొలగుతూ; పట్టుచున్= పట్టుకొంటూ; అదలుచుచున్= అదిలించుకొంటూ; పడుచున్+లేచుచున్= పడుతూ లేస్తూ; అడఁగుచున్= లోబడుతూ; వడి+కొంచున్= వేగాన్ని చూపుతూ; ఒదవెడు కినుకన్= కలిగే కోపంతో; కడుబెట్టిదముగన్= మిక్కిలి భయంకరముగా; కడిమిన్= బలంతో; చలంబు డింపక= పట్టుదల వదలకుండా; పెనఁగిరి= పోరాడారు.

తాత్పర్యం: దగ్గరికి వస్తూ, దూరం పోతూ, పట్టుతూ, వదలుతూ, భయపెట్టుతూ, అదలిస్తూ, పడుతూ, లేస్తూ, తగ్గుతూ, వేగంగా విజృంభిస్తూ, పెరిగే కోపంతో పట్టుదలలు వీడకుండా పరాక్రమంతో మిక్కిలి భయంకరంగా పోరాడారు.

విశేషం: అలం: స్వభావోక్తి. తెలుగు పదాల పోహళింపుతో కుస్తీపట్ల మెలకువలన్నిటినీ దేశీయంగా వర్ణించాడు తిక్కన. శబ్దాల సహాయంతో పిడిగుద్దుల సవ్వడిని మన చెవులకు వినిపించేటట్లు చేశాడు. పద్యం చదివే తీరులో చదివితే మల్లయుద్ధంవలెనే ఉంటుంది.

ఆ. ఇవ్విధమున నేచి యిరువురుఁ బెద్దయుఁ। బ్రొద్దు పోర వాయుపుత్రు బలము
దోడుతోడఁబెరుఁగఁదొడఁగె నాకీచకా। ధమునిలావు పిదపఁ దఱుఁగఁజొచ్చె. 349

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ రకంగా; ఏచి= విజృంభించి; ఇరువురున్= భీమకీచకులు; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; పోరన్= యుద్ధం చేయగా; వాయుపుత్రుబలము= భీముడిశక్తి; తోడుతోడన్= అంతకంతకు; పెరుఁగన్+తొడఁగెన్= అధికం కాసాగింది; ఆ కీచక+అధముని లావు= ఆ నీచుడైన కీచకుడి శక్తి; పిదపన్= పిమ్మట; తరుఁగన్+చొచ్చెన్= తగ్గిపోసాగింది.

తాత్పర్యం: ఈ విధంగా పరాక్రమంతో ఒకరితో నొకరు చాలాసేపు పోరాడగా భీముడి భుజశక్తి క్రమంగా పెరుగసాగింది. ఆ నీచుడైన కీచకుడి శక్తి క్రమంగా తగ్గసాగింది.

ఉ. దాని నెఱింగి యెంతయు నుదగ్రత నా బకవైరి గ్రక్కునన్
వాని నడంగఁబట్టి పడవైచి మహోగ్రత నాక్రమించెఁ బం
చానన మేణముం బొదువున, ట్లతఁ డూర్జితశక్తి నుద్భటుం
డై నెగసెన్ సమీరసుతు నల్కకుఁ బ్రాఁ కిడినట్లు వీఁకతోన్. 350

ప్రతిపదార్థం: దానిన్+ఎఱింగి= అది తెలిసికొని; ఎంతయున్= ఎంతో; ఉదగ్రతన్= కోపంతో; ఆ బకవైరి= ఆ (బకాసురుడి శత్రువు) భీముడు; గ్రక్కునన్= వెంటనే; వానిన్= కీచకుడిని; అడంగన్+పట్టి= అణిగేటట్లు పట్టుకొని; పడన్+వైచి= పడద్రోచి; మహా+ఉగ్రతన్= మిక్కిలి పరాక్రమంతో; పంచాననము= సింహం; ఏణమున్= జింకను; పొదువు+అట్లు= పట్టుకొన్నట్లు; ఆక్రమించెన్= పట్టుకొన్నాడు; అట్లు= ఆవిధంగా; సమీరసుతు= భీముని యొక్క; అల్కకున్= కోపానికి; వీఁకతోన్= పరాక్రమంతో; ప్రాఁకు+ఇడినట్లు= ప్రాకటానికి ఆధారాన్ని అందించినట్లు; అతఁడు= కీచకుడు; ఊర్జితశక్తిన్= మిక్కిలిబలంతో; ఉద్భటుఁడు+ఐ= పరాక్రమవంతుడై; ఎగసెన్= పైకి ఎగిరాడు.

తాత్పర్యం: కీచకుడు బలహీనపడటం తెలిసికొని భీముడు సింహం జింకమీద పడి వెంటనే దానిని నేలమీద పడవేసి భయంకరంగా దానిని మొత్తం ఎట్లా ఆక్రమిస్తుందో అట్లా పరాక్రమంతో పొదివి పట్టాడు. భీముడి కోపలతకు ప్రాకు పెట్టినట్లుగా కీచకుడు తన శక్తినంతా పెంచి పరాక్రమాన్ని ప్రదర్శించి పెనగి పైకి లేచాడు.

విశేషం: అలం: ఉపమ. బలాబలాలను సూచించేవి సింహం జింకల ఉపమానాలు. కీచకుడు పట్టుతప్పించుకొని పైకి లేవటం భీముడి కోపానికి ఆధార స్తంభాన్ని నిలిపినట్లైనది. కోపాన్ని లతగా రూపించి ధ్వనిమయం చేశాడు తిక్కన.

క. **నెగయునెడ నగ్గమైనను। బిగియారుచుఁ బిఱుఁదుసనినఁ బిడికిటఁ గొఱసం**
దిగడు బెడిదముగఁ బొడిచెం। బగతుఁడు గను మిడిసి నేలఁబడి తన్నికొనన్. **351**

ప్రతిపదార్థం: నెగయు+ఎడన్= పైకిలేచేటప్పుడు; అగ్గమైనను= లోబడినప్పటికీ; బిగి+ఆరుచున్= బిగువు కలవాడై; పిఱుఁదు+చనినన్= వెనుకకు పోగా; పగతుఁడు= శత్రువైన కీచకుడు; కనుమిడిసి= కనుగ్రుడ్లు బయటకివచ్చి; నేలన్+పడి= నేలమీదపడి; తన్నికొనన్= తన్నుకొనేటట్లు; పిడికిటన్= పిడికిలితో; కొఱసంది= ఆయువు పట్టును; కడుబెడిదముగన్= మిక్కిలి కఠినంగా; పొడిచెన్= పొడిచాడు.

తాత్పర్యం: కీచకుడు పైకెగసినప్పుడు లోబడినా కూడా, ఆ లోపల బిగువుగలవాడై వెనకకుబోయి తప్పించుకొనచూచినా భీముడు మిక్కిలి కోపంతో పిడికిలి పట్టి అతడి ఆయువుపట్టులో దారుణంగా పొడిచాడు. అంతటితో కీచకుడు కనుగ్రుడ్లు బయటికి వచ్చి నేలమీదపడి తన్నుకొన్నాడు.

ఆ. **పల్లవ ప్రసూన ఫలభరితంబగు। మ్రాను గూలఁద్రోచు మత్తగజము**
పోలె వివిధ రత్నభూషణభూషితుం। డైన సూతుఁ గూల్చె ననిలసుతుఁడు. **352**

ప్రతిపదార్థం: పల్లవ ప్రసూన ఫలభరితంబు+అగు= చిగుళ్ళు, పూలు, పండ్లతో నిండినదైన; మ్రాను= చెట్టు; కూలన్+త్రోచు= కూలత్రోసే; మత్తగజము పోలెన్= మదించిన ఏనుగువలె; వివిధ రత్న, భూషణ భూషితుండు+ఐన= అనేక రత్నాభరణాలతో అలంకరించబడినవాడైన; సూతున్= కీచకుడిని; అనిలసుతుఁడు= భీముడు; కూల్చెన్= పడగొట్టాడు.

తాత్పర్యం: పల్లవపుష్పఫలభరితమైన వృక్షాన్ని అవలీలగా మదపుటేనుగు కూలద్రోసినట్లుగా, వివిధ రత్నాలంకార శోభితుడైన కీచకుడిని భీముడు పడగొట్టాడు (చంపాడు).

విశేషం: అలం: ఉపమ, ఉపమేయాలు- అనిలసుతుడు, వివిధ రత్న భూషణభూషితుడు అయిన సూతుడు; ఉపమానాలు-మత్తగజం, పల్లవ ప్రసూన ఫలభరితమైన మ్రాను, సమానధర్మం కూలద్రోయటం, కూలిపోయిన చెట్లకు పల్లవాదులు ఎట్లా శోభనీయవో పడిపోయిన (చనిపోయిన) కీచకుడికి ఆభరణాలు అలంకారాలు కావు. అయినా అతడు పడినా లేదా చచ్చినా వివిధ ఆభరణధారణశీలుడే. అనిలసుతుడు చెట్టును కూల్చినట్లు చెప్పటం ఔచిత్యం. కీచకు డంటే వెదురుబొంగు వంటివాడు. అనే అర్థం కూడా భావనారమణీయం. (సంపా.)

చ. **వికృతపుఁ జావు సంప మది వేడుక పుట్టినఁ గిట్టిపట్టిమ**
స్తకమును బీన దీర్ఘ భుజశాఖలుఁ బాదయుగంబు మేనిలో
నికిఁ జొర నుగ్గుగాఁ దుఱిమి నించిన గ్రంతలతిత్తియైన కీ
చకు ధరణీస్థలిం జదిపి చక్కని ముద్దగఁ జేసెఁ దుష్టుఁ డై. **353**

ప్రతిపదార్థం: వికృతము+చావు= ఏవగింపు కలిగించే చావు; చంపన్= చంపటానికి; మదిన్ వేడుక పుట్టినన్= మనసులో కోరిక కలుగగా; కిట్టి= దగ్గరకు వెళ్ళి; పట్టి= పట్టుకొని; మస్తకమును= తలను; పీనదీర్ఘభుజశాఖలు= బలిసిన పొడవైన కొమ్మలవలె ఉండే చేతులును; పాదయుగంబు= రెండు పాదాలను; మేనిలోనికిన్+చొరఁగాన్= శరీరం లోపలికి చొచ్చుకొని పోయేటట్లు;

నుగ్గుగాన్+తుటిమి= చూర్ణంగా చేసి తురిమి; నించినన్= నింపగా; క్రంతల తిత్తి+ఐన= రంధ్రాలు ఉండే సంచిగా; కీచకున్= కీచకుడిని; ధరణీస్థలిన్= నేలమీద; చదిపి= నలిపి; తుష్టుండు+ఐ= సంతోషించినవాడై; చక్కని ముద్దగన్= గుండ్రటి ముద్దగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: కీచకుడిని వికారంగా చంపాలని కోరికపుట్టి భీముడు అతడిని సమీపించి అతడి కళేబరాన్ని పట్టుకొని, తల, చేతులు, పాదాలు మొండెంలోకి జొచ్చుకొనేటట్లు దూర్చి, చిల్లులుపడిన నిండు సంచీవలెఉన్న శవాన్ని నేలమీద పడవేసి నలిపి, మనసు(లోని కసి) తీర గుండ్రని మాంసపు ముద్దగా చేశాడు.

విశేషం: 1. పరసతీగతమైన మన్మథ వికారాలకు నెలవైన అతడికి వికారపు చావు సముచితమైన ఫలమని భీముడు భావించాడు. కీచకుడి శరీరాన్ని ఒక మాంసపు ముద్దగా మార్చదలచాడు. తలనూ, చేతులనూ, కాళ్ళనూ విరిచి మొండెంలో గ్రుచ్చి సందుల తిత్తిగా మార్చాడు. దానిని భూమి మీద పెట్టి మర్దించి ముద్దగా చేశాడు. ఇది అసామాన్యమైన సంహారం. గంధర్వులెవ్వరో దివ్యశక్తులతో చేసినట్లు జనులు భావిస్తారు. భీముడి ప్రహారపు గుర్తులు దేహంమీద కనపడవు. చూచేవాళ్ళకు అసహ్యంగా ఉండి భయం వేస్తుంది. జుగుప్స కలుగుతుంది. ఆ వికారపు మృత్యువును కల్పించటంలో భీముడి ప్రతీకార వాంఛ. కసి, కోపం కూడా తోడ్పడ్డాయి. పైపెచ్చు ఎంత వికారంగా చంపితే ద్రౌపది అంత వినోదంగా హర్షిస్తుందనే గూఢవాంఛ కూడా హేతువు కావచ్చును. ఏమైనా, వీరకృత్యం అద్భుతంగా ముగిసింది. రౌద్రకర్మ బీభత్సాన్ని సృష్టించింది. భీమ యత్నం ఫలించింది. భీముడి ప్రకృతి, కీచకుడి వికృతి, ద్రౌపది సుకృతి చూచినవారు భీముడివలెనే తృప్తులౌతారు. 2. 'తుష్టుండై' అనే పదం సరళాదేశంతో 'దుష్టుండై' అని వినబడుతుంది. తిక్కన కావాలనే అట్లా చివర వాడడని చాలామంది పేర్కొంటారు. 'దుష్టుండై అనే పాఠాంతరం కూడా ఉన్నది. కాని, దాని నెవ్వరూ పరిగణించరు. 'తుష్టుండై' అన్నది వాచ్యం. 'దుష్టుండై' అనేది ధ్వని. భీముడు అట్లా చంపి ఆనందించాడు. అది దౌష్ట్యం అని భావించేటట్లు ఉన్నది. అట్లా భావించటానికి పరితల మనసులలో కీచకుడి పట్ల కొంత సానుభూతి ఏర్పడాలి. తిక్కన అటువంటి సానుభూతిని కలిగించాడు. అయినా భీముడిలో అందరూ సహానుభూతిని పొందుతారు. ఈ రసచర్చను భీమ నాయకత్వ నిర్ణయంలో ద్రౌపదిచేత చేయించి తిక్కన వ్యాఖ్యానించాడు. (సంపా.)

క. తన కడిమికలిమి నచ్చియు । మనమునఁ దలఁ కడర సూతు మరణంబు గనుం
గొనుటకుఁ దల్లడపడు ప్రియ । వనిత కతని చావు సెప్పి వడిఁ దన్మాత్రన్. 354

ప్రతిపదార్థం: తన కడిమి కలిమి= తన బలాధిక్యం; నచ్చియున్= నమ్మికూడా; మనమునన్= మనస్సులో; తలఁకు= భయం; అడరన్= అతిశయించగా; సూతుమరణంబు= కీచకుడి చావు; కనుఁగొనుటకున్= చూడటానికి; తల్లడపడు= చలించే; తన ప్రియవనితకున్= తన ప్రియురాలైన ద్రౌపదికి; అతని చావు+చెప్పి= అతడి మరణంగూర్చి చెప్పి; వడిన్= వేగంగా; తత్+మాత్రన్= ఆక్షణంలోనే.

తాత్పర్యం: భీముడి బలంమీద నమ్మకం కలిగినప్పటికీ, కీచకుడిని చంపగలడో, లేడో అనే భయంతో కీచకుడి చావు చూడటం ఎప్పుడా? అని తొందరపడుతున్న ద్రౌపదికి కీచకుడు చచ్చాడని చెప్పి వెంటనే. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: తాము చేసిన ఘనకార్యం ఆత్మీయులు చూస్తే సంతోషం. అందుకే భీముడు ద్రౌపదిని పిలిచి చూపించాలనుకొన్నాడు.

చ. అనలము గూఢ యత్నమున నయ్యెడకుం గొనివచ్చి దానిఁ జ
య్యన వెలుఁగొందఁజేయుటయు నచ్చెరువున్ భయముం బ్రియంబునున్
బెనఁగొనఁగాఁ గనుంగొనియె భీతమృగేక్షణ భీము డాయఁగాఁ
జని కడు నక్కజంబయిన చందమునం బడియున్న పీనుఁగున్. 355

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనలము= నిప్పు; గూఢ యత్నమునన్= రహస్యమైన ప్రయత్నంతో; ఆ+ఎడకున్= అక్కడకు; కొనివచ్చి= తీసికొని వచ్చి; దానిన్+చయ్యనన్= దానిని వెంటనే; వెలుఁగొందన్+చేయుటయున్= వెలిగించగా; అచ్చెరువున్= ఆశ్చర్యం; భయమున్= భయమున్నూ; ప్రియంబునున్= ప్రీతియున్నూ; పెనఁగొనఁగాన్= ముప్పిరిగొనగా; భీతమృగ+ఈక్షణ= భయపడిన లేడి కన్నులవంటి కన్నులుగల ద్రౌపది; భీమున్= భీముడిని; డాయఁగాన్= సమీపించగా; చని= వెళ్ళి; కడున్+అక్కజంబు+అయిన= మిక్కిలి వింత అయిన; చందమునన్= పద్ధతిలో; పడి+ఉన్న= పడిఉన్న; పీనుఁగున్= శవాన్ని; కనుఁగొనియెన్= చూచింది.

తాత్పర్యం: రహస్యంగా భీముడు నిప్పును తీసికొని వచ్చి వెలిగించగా ద్రౌపది భయసంభ్రమాశ్చర్య ప్రియములు పెనగొనగా విచిత్రంగా పడిఉన్న శవాన్ని చూచింది.

విశేషం: భీతమృగేక్షణ - సార్థకమైన విశేషణం. మృతి చెందిన కీచకుడి శవాన్ని చూడటానికి ఆసక్తి, భయం, ఆనందం అనే మూడు భావాల లక్షణం ఆ విశేషణంలో వ్యంగ్యం. ఆమెకు కీచకుడు చనిపోయాడన్న వార్త ఆశ్చర్యాన్ని కలిగించింది. అతడి పీనుఁగును చూడవలసివచ్చినందుకు భయం కలిగింది. శత్రుపీడ వదిలిందన్న వాస్తవం తెలిసినందుకు ప్రియభావం ఆమె చూపులలో పెనగొన్నది. (సంపా.)

ఉ. **చూచుచుఁ జేరి వ్రేల్మిడుచుచుం దలయూఁచి విలక్షచిత్తయై**
యా చపలాక్షి ముక్కుపయి నంగుళముం గదియించి 'దీనికై
కీచక! యింత సేసితి, సుఖిత్వముఁ బొందుదుగాక! యింక న
ట్లేచిన నిట్లు గా కుడుగునే?' యనుచున్ వెఱఁగందుచుండఁగన్. **356**

ప్రతిపదార్థం: ఆ చపల+అక్షి= ద్రౌపది; చూచుచున్= చూస్తూ; చేరి= దగ్గరగా వచ్చి; వ్రేల్+మిడుచుచున్= వ్రేళ్ళు విరుస్తూ; తల+ఊఁచి= తలూపి; విలక్షచిత్త+ఐ= అబ్బురపడిన మనస్సుతో; ముక్కుపయిన్= ముక్కుమీద; అంగుళమున్= వ్రేలు; కదియించి= వేసికొని; కీచక!= ఓ కీచకా!; దీనికై= ఇందు కొరకై; ఇంత+చేసితి(వి)= ఇంత చేశావు; సుఖిత్వము= శాంతిని; పొందుదుగాక!= పొందుతావుగాక!; ఇంకన్= ఇంకా; అట్లు+విజృభిస్తే; ఇట్లు= ఇట్లా; కాక= కాకుండా; ఉడుగునే?= మానుతుందా?; అనుచున్= అని అంటూ; వెఱఁగు+అందుచుండఁగన్= ఆశ్చర్యపడుతూ ఉండగా.

తాత్పర్యం: చూస్తూ దగ్గరకు వెళ్ళి మెటికలు విరుస్తూ, తల ఊపి, ఆశ్చర్యపడిన మనస్సుతో ద్రౌపది ముక్కుమీద వేలు వేసికొని ఇట్లా అన్నది- 'కీచకా! దీనికొరకేనా ఇంత చేశావు? ఇకనైనా శాంతంగా ఉండుము. అట్లా విజృంభిస్తే, (నన్ను బాధిస్తే) నీకు ఇట్లా జరుగకపోదు' అని అంటూ ఆశ్చర్యపడుతూ ఉండగా.

విశేషం: స్త్రీలు మెటికలు విరవటం గ్రామీణ వాతావరణంలో సహజం. 'విలక్ష చిత్తయై' అనే పాఠానికి 'విదగ్ధ చిత్తయై' 'విషణ్ణ చిత్తయై' అనే పాఠాంతరాలు ఉన్నాయి. ఆ రెండింటికంటె ప్రస్తుతపాఠమే ప్రకరణోచితం.

క. **'పూనిక నెఱపితి సతి యవ। మానముఁ బరితాపభరము మాన్చితి నిపు డి**
ట్లే' నని మదిఁ బొంగెడు పవ। మానసుతుం డిట్టులనియె మానినితోడన్. **357**

ప్రతిపదార్థం: పూనిక= నిశ్చయించిన ప్రయత్నం; నెఱపితిన్= నెరవేర్చాను; సతి+అవమానమున్= భార్యయొక్క అవమానాన్ని; పరితాపభరమున్= దుఃఖభారాన్ని; ఇపుడు+ఇట్లు+ఏను= ఇప్పుడు ఈ విధంగా నేను; మాన్చితిన్+అని= పోగొట్టానని; మదిన్=

మనస్సులో; పొంగెడు= సంతోషించే; పవమానసుతుఁడు= వాయుసుతుడైన భీముడు; మానినితోడన్= ద్రౌపదితో; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'నేను అనుకొన్న పని నెరవేర్చాను. భార్య అవమానాన్నీ, దుఃఖభారాన్నీ పోగొట్టాను' అనుకొంటూ మనస్సులో ఉప్పొంగే భీముడు ద్రౌపదితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇక్కడ ద్రౌపదికి మానిని-అనే మాట వాడటం అద్భుతం. ఆమె అభిమానధనురాలు. భారతం మొత్తం కథ ఆమె అభిమానానికి దెబ్బ తగలటంతో నడుస్తుంది. మొదట వస్త్రాపహరణం, ఆ తర్వాత ఆమెకు జరిగిన అనేకావమానాలు అభిమాన ధనురాలి మనస్సును గాయపరిచాయి. అందుకే ఇక్కడ తిక్కన్న 'మానిని' అని సాభిప్రాయంగా వాడాడు.

శా. **'చింతాశల్యము వాసెనే? భుజబలోత్సేకంబు నీ కెక్కనే?**
శాంతిం బొందెనె రోషపావకుఁడు? దుశ్చారిత్రునిం జూచితే?
సంతోషించితె? యిట్లు గాక, బ్రదుకన్ శక్యంబె? దుర్వృత్తి నీ
చెంతం జేరినయట్టివీరులకు నాచేతం బయోజాననా!' **358**

ప్రతిపదార్థం: పయోజ+అననా!= పద్మంవంటి ముఖంగల ఓ ద్రౌపదీ!; చింతాశల్యము= దుఃఖము అనే ముల్లు; పాసెనే?= తొలగిపోయిందా?; భుజబల+ఉత్సేకంబు= (నా) బాహుబలంయొక్క ఆధిక్యం; నీకున్+ఎక్కెనే?= నీ మనసు కెక్కిందా? (నచ్చిందా?); రోషపావకుఁడు= రోషమనే అగ్ని; శాంతిన్+పొందెనె?= శాంతించాడా?; దుస్+చారిత్రునిన్= చెడు నడవడిగల కీచకుడిని; చూచితే?= చూచావా?; సంతోషించితె?= సంతోషించావా?; ఇట్లు+కాక= ఈ విధంగా కాకుండా; దుర్వృత్తిన్= చెడుప్రవర్తనతో; నీచెంతన్+చేరిన+అట్టి= నీదగ్గరకు చేరినటువంటి; వీరులకున్= యోధులకు; నాచేతన్= నా చేతిలో; బ్రదుకన్ శక్యంబె!= బ్రతకటం సాధ్యమా?

తాత్పర్యం: 'ఓ పద్మముఖీ! గుండెలో ములికి వంటి నీ దుఃఖం తీరిందా? నా బలోద్రేకం నీ మనసు మెచ్చిందా? నీ కోపాగ్ని శాంతించిందా? దుష్టుడైన కీచకుడి భంగపాటు చూచావుకదా? సంతోషం కలిగిందా? దుర్బుద్ధితో నీ పొందుకొరే వీరులకు నా చేతిలో చావు తప్పదు. అది అంతే!'

విశేషం: తిక్కన దృశ్యశ్రవ్య - ఉభయకావ్యశిల్ప ప్రౌఢిని ప్రదర్శించే పద్య మిది. తిక్కన నర్తనశాలలో 'విక్రమ ధురంధరతన్' ప్రవేశించే భీముడిని 'ద్రౌపదీరమణు'డని పేర్కొన్నాడు. ద్రౌపదిని రమింపచేసేవాడు (సంతోష పెట్టేవాడు) అనేది భీముడికి బిరుదంగా ఇచ్చాడు. కీచకుడిని సంహరించే సంరంభమంతా రమణి మనసును రంజింపజేయటానికే అని తాత్పర్యం. దానిని ఈ పద్యం రమణీయంగా ప్రదర్శిస్తున్నది. భీముడు ద్రౌపదిని ఐదు ప్రశ్నలు అడుగుతున్నాడు. అవి నాటకంలోని 'పంచావస్థలకు' సంబంధించినవి. కీచకుడు కామభావోద్ధతుడై తనకు మానభంగం చేస్తాడేమోననే చింత ద్రౌపది హృదయంలో గుచ్చుకొన్న బాణపు ముక్కవలె బాధపెట్టుతూ ఉండేది. దానికి అతడి మరణమే మందని ద్రౌపది నిశ్చయం. ఇప్పు డామెకు ఆ బాధ తొలగిపోయిందా? అని మొదటి ప్రశ్న. సమస్యకు బీజం వంటి అంశం ఆరంభమై ఫలించిందికదా? అని ఆ ప్రశ్న పరమార్థం. ఆ బీజం ఫలించాలంటే తీవ్ర ప్రయత్నం కావాలి. అది భీముడు ప్రదర్శించిన 'భుజబలోత్సేకం' నిర్వహించింది. అది ఆమె మనసు మెచ్చేటట్లు సాగిందా? అని అడిగాడు. ప్రయత్నావస్థ ప్రశంసాపాత్రంగా సాగిందని ధ్వని. కీచకుడు చేసిన అవమానానికి తగిన ప్రతీకారం తీసికొనాలని ద్రౌపది పగ, అది అగ్నివలె ఆమె హృదయాన్ని దహిస్తూ ఉండేది. అది ప్రాప్త్యాశ (ఫలం సిద్ధిస్తుందో లేదో అనే తీవ్ర సంశయంతో కూడిన అనిశ్చిత స్థితి) వంటిది. అది చల్లారిందా అని అడిగాడు. ఆ దుర్గార్గుడి స్థితి చూచావా? అన్న

ప్రశ్న 'నియతాప్తి'ని (కార్యావరోధాలైన అపాయాలన్నీ తీరి కోరిక సిద్ధించే దృఢనిశ్చయం) సూచిస్తున్నది. కీచక మరణం నియతాప్తికి నిండు ఫలం. చివరకు 'సంతోషించితె! అని అడిగాడు. ద్రౌపదీ రమణుడి వీరకార్యానికి ఫలం ప్రియురాలి హృదయప్రమోదం. భీముడి దృష్టిలో ద్రౌపది సంతోషమే కార్యఫలం. ఇవి ద్రౌపది నడుగుతున్న ప్రశ్నలే అయినా తిక్కన కీచకవధ ఘట్టాన్ని ఒక నాటకంగా నిర్వహించిన శిల్పప్రౌఢిని పఠితకు జ్ఞాపకం చేస్తూ, నాటకంలోని పంచసంధులలోనిని అర్థప్రకృతులవలన కలిగే పంచ విధావస్థలు సముదాత్తంగా పఠితల మనస్సులకు ఆహ్లాదం కలిగించేటట్లుగా నిర్వహించబడ్డాయని తెలిసికొన్నారా? అని అడుగుతున్న ప్రశ్నల వలె కనబడుతున్నాయి. ఆ ప్రశ్న లడుగుతున్నది కార్యనిర్వాహకుడైన నాయకుడు. ద్రౌపది సహృదయస్థానీయురాలుగా నిలిచింది. అందువలన ప్రశ్నలు కథాపరంగా, రసపరంగా కూడా ఉభయతారకంగా ఉన్నాయి.(ఈ అంశానికి సమాధానంగా ద్రౌపది నాయికవలె, సహృదయస్థానీయ వలె 360వ పద్యం చెప్పటం గమనించదగింది.) ఈ పద్యంలోని చివరి వాక్యం ద్రౌపదీరమణుడే అనగలడు. భార్యమీద ఈగవాలితే ఓర్చుకొనలేని ప్రణయప్రతాపమూర్తి భీముడు. ఆ మాటలు అంటున్నప్పుడు భీముడు 'ద్రౌపదీ రమణుడే' కాదు 'సింహబలమర్దనుడు'గా (359 పద్యం) కూడా ద్రౌపదికి తోచాడట! ఈ రెండూ తిక్కన భీమనాయకుడి కిచ్చిన సార్థకమైన బిరుదాలు. కీచకవధ ఘట్టంలోని నాటకీయ లక్షణాలను ధ్వనిమయం చేసే పంచప్రశ్నోపనిషత్తు వంటి దీ పద్యం ! (సంపా.)

క. అనిన విని సింహబల మ। ర్దను నవలోకించి ద్రుపదరాజతనయ యి
ట్లనుఁ దన మనమున నిండా। రిన సమ్మోదంబు వెలివిరిసి బెరయంగన్. 359

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విని; ద్రుపదరాజ తనయ= ద్రౌపది; సింహబలమర్దనున్= కీచకుడిని చంపిన భీముడిని; అవలోకించి= చూచి; తన మనమునన్= తన మనస్సులో; నిండారిన= నిండిన; సమ్మోదంబు= సంతోషం; వెలివిరిసి= వెల్లివిరిసి; బెరయంగన్= వ్యాపించగా; ఇట్లు+అనున్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అతడి మాటలు విని కీచకుడిని మర్దించిన భీముడిని చూస్తూ ద్రౌపది మనస్సు సంతోషంతో వెల్లివిరియగా ఇట్లా అన్నది.

విశేషం: 'సింహబలమర్దనుడు' అనేది ఇప్పటినుండి భీముడికి సరిపోతుంది. సింహబలుడి వింత చావు మర్దనపరాక్రమానికి మహనీయమైన సాక్షి. అంతకు ముందు 'బకమర్దనుడు'. ఇప్పుడే కీచకుడిని చంపాడు. తగిన పదప్రయోగం చేశాడు తిక్కన.

సీ. 'కొలువు లోపల నిన్న కోప మట్లెత్తినఁ। దలఁకక నిలిచిన ధైర్యమహిమ,
నేఁ డిందుఁ జనుదెంచి నిర్వికారతఁ బ్రజ। కన్నులు గప్పిన గౌరవంబు,
మనవారిలోన నొక్కని నైనఁ బిల్వ కు। త్సాహంబు సేసిన సాహసంబు,
లోకదుర్జయుఁ డగు నీ కీచకునిని వ్రే। ల్మిడి రూపుమాపిన కడిమిసొంపు

తే. సూడఁ, దలపోయ. మెచ్చ, సంస్తుతి యొనర్ప। నా తలంబె? నీ యుత్తమనాయకత్వ
మెఱిఁగి నినుఁ గొనియాడ నే నెంతదాన?। మహిత విస్మయానంద నిర్మగ్న నైతి'. 360

ప్రతిపదార్థం: నిన్న= క్రిందటి రోజున; కొలువులోపలన్= సభలో; కోపము= కోపం; అట్లు+ఎత్తినన్= ఆవిధంగా కలిగినా (అంతప్రళయంగా పొంగివచ్చినా); తలఁకక= చలించకుండా; నిలిచిన= నిలబడిన; ధైర్యమహిమ= ధీరగుణం యొక్క ఆధిక్యం; నేఁడు= ఈరోజు; ఇందున్+చనుదెంచి= ఇక్కడికి వచ్చి; నిర్వికారతన్= ఏ విధమైన కలతపాటు లేకుండా; ప్రజ కన్నులు కప్పిన=

జనుల కళ్ళను గుడ్డతో కట్టినట్లుగా ఎవ్వరికీ తెలియకుండా కార్యం నిర్వహించిన; గౌరవంబు= కార్యభారం, గొప్పతనం; మనవారిలోనన్= పాండవులలో; ఒక్కనిన్+ఐనన్= ఒక్కరిని కూడా; పిల్వక= పిలవకుండా; ఉత్సాహంబు+చేసిన= పరాక్రమించిన; సాహసంబు= అసాధ్యమైన కార్యాలను సాధించే తెంపు; లోకదుర్జయుఁడు+అగు= లోకులకు జయించశక్యంకానివాడు అగు; కీచకునిన్= కీచకుడిని; వ్రేల్మిడిన్= చిటికెలో; రూపుమాపిన= (రూపం గుర్తించలేనంతగా వింతగా); చంపిన; కడిమి సొంపు= పరాక్రమ వైభవం; చూడన్= చూడటానికి, తలపోయన్= తలపోయటానికి; మెచ్చన్= మెచ్చటానికి; సంస్తుతి+ఒనర్పన్= పొగడటానికి; నా తలంబె?= నాకు శక్యమా?; నీ ఉత్తమనాయకత్వము= నీ శ్రేష్ఠమైన నాయకత్వాన్ని (ధీరోదాత్త నాయక స్వభావాన్ని); ఎఱిఁగి= తెలిసికొని; నినున్+కొనియాడన్= నిన్ను పొగడటానికి, ఏను+ఎంతదానన్?= నే నెంతదానిని?; మహిత= గొప్పదైన; విస్మయ+ఆనంద నిర్మగ్నన్+ఐతిన్= ఆశ్చర్యంతోకూడిన, ఆనందంలో మునిగిపోయిన దాని నైనాను.

తాత్పర్యం: 'నిన్న విరటుడి కొలువులో అంత ప్రళయంగా కోపోద్రేకం కలిగినా కలతపడకుండా నిగ్రహించుకొని నిలిచిన నీ ధీర స్వభావ మహిమ చూడ నా తరమా? (అపూర్వమని భావం.) ఈరోజు నర్తనశాలకు ప్రజల కన్నులు కప్పి (ఎవ్వరికీ తెలియకుండా) ఎటువంటి సంకోచం లేకుండా వచ్చిన నీ కార్యభార నిర్వహణ సామర్థ్యం (గొప్పతనం) తలపోయ నా తరమా? మనవారైన పాండవులలో ఒక్కరిని కూడా సహాయానికి పిలవకుండా ఒంటరిగా అపూర్వ కార్యసాధన కొరకు ఉత్సాహాన్ని ప్రకటించి చేసిన నీ సాహసం మెచ్చుకొనటం నా తరమా? లోకంలో ఎవ్వరికీ సాధ్యుడు కాని కీచకుడిని క్షణంలో రూపం గుర్తుపట్టలేనంత ఘోరంగా చంపిన నీ పరాక్రమ విలాసం కీర్తించటం నా తరమా? నీ ఉత్తమనాయకత్వలక్షణాల నన్నింటిని తెలిసికొని కీర్తించటానికి నేనెంతదానిని? అమితమైన ఆశ్చర్యంలో ఆనందంలో మునిగిపోయాను.

విశేషం: అలం: ఉదాత్తం, యథాసంఖ్యం. విరాటపర్వంలోని గొప్ప పద్యాలలో ఇది ఒకటి. అందుకు కారణాలు అనేకాలు. కొన్ని: 1. తిక్కన భారతం ప్రబంధమండలి. అందులో కీచకవధ ఒక ప్రబంధం. దృశ్య ప్రబంధ లక్షణాలను గర్భీకరించుకొన్న శ్రవ్య ప్రబంధం. కాబట్టి అందులో ఉభయ కావ్య ప్రౌఢి పాటించే శిల్పం ఉంటుంది. ఒక నాయకుడు, ఒక కార్యం. ఒక ప్రధానరసం అనేవి ప్రబంధ లక్షణాలు. అవన్నీ ఈ ఘట్టంలో నిర్వహించబడ్డాయని సూచించే ధ్వనిమయ రచన ఇది. 2. కార్యం నిర్వహించేది నాయకుడు. రసాన్ని అనుభవించేది సహృదయుడు. నాయకుడు భీముడు. కార్యం కీచక సంహారం. అద్భుతానుప్రాణితమైన వీరరసం రసం. ద్రౌపది శ్రోత్ర, ప్రేక్షక స్థానీయురాలై సహృదయ రసానంద స్థితిని వ్యక్తం చేస్తూ మన మహానుభూతికి పాత్రురాలైంది. అందువలన ఆమె మాటలు సహృదయ స్పందనలు. 3. కావ్య వస్తువులో కార్యసాధన దశలను సూచించే పంచసంధు లుంటాయి. అవి అయిదు అర్థప్రకృతులు- అయిదు అవస్థలు క్రమంగా కలియటం వలన రూపొందుతాయి. వాటిని తిక్కన ఈ పద్యంలో సూచించాడు. అముఖసంధి- బీజం+ఆరంభం. కొలువులో కీచకుడి చేత ద్రౌపది అవమానింపబడిన దృశ్యాన్ని భీముడు చూచి కోపించటం బీజం. వాడిని చంపాలని క్రోధావేశాన్ని ప్రకటించడం ఆరంభం. ఆరంభించిన కార్యాన్ని చివరివరకూ నిర్వహించే అసమాన ధైర్యం నాయకుడు ప్రదర్శించే మొదటి లక్షణం. ఇవి సీసపద్యం మొదటి పాదంలో సూచించబడ్డాయి. (ఆ) ప్రతిముఖసంధి-బిందువు+యత్నం, నీటి మీది నూనె బిందువువలె పలు రకాలుగా విస్తరించే కార్యం కీచకవధ వ్యూహం. అజ్ఞాతవాస నిలయం భంగం కాకుండా, ప్రజలకు తెలియకుండా, ద్రౌపదీ భీముల సంబంధం బహిర్గతం కాకుండా, ధర్మరాజుకు తెలియకుండా, కార్యం భగ్నం కాకుండా, ద్రౌపదిని ఇతరులు శంకించకుండా కార్యం జరిపే ఉపాయం నర్తనశాల సంకేత స్థల నిర్ణయం. దానిని రూపొందించి గుట్టుగా నిర్వహించే యత్నం చేయటం ప్రతిముఖ సంధి లక్షణం. దానిని నిర్వహించటంలో గౌరవం భీముడిదే. గౌరవం అంటే గురుభావం (నాయకత్వం) భారాన్ని వహించే భావం, మర్యాద కాపాడటం, గొప్పతనం, కీర్తి అనే అర్థాలు ఏర్పడతాయి. ఇవన్నీ నాయక కార్యనిర్వహణ దక్షతను తెలిపేవే. (ఇ) గర్భసంధి- పతాక+ప్రాప్త్యాశ. ద్రౌపది ఆడిన వలపు

నాటకం. దాని వలన కలిగిన కీచక విరహదశ ఉపకథాగౌరవాన్ని పొంది పతాకగా స్ఫురిస్తుంది. కీచక సంహారం ఎట్ల చెయ్యాలనే యోచన. కథ ఏ విధంగా మలుపు తిరుగుతుందో అనే ఉత్కంఠ కీచక ప్రవేశ ఘట్టంలో నాయక ప్రతినాయకు లిద్దరూ రెండు మార్గాలలో ప్రదర్శిస్తారు. దానితో గర్భసంధి నిబ్బరంగా సాగింది. దానివలన భీముడు ఏకవీరుడై, అసాధ్యమైన కార్యాన్ని సాధించే సాహస ప్రవృత్తిని ప్రదర్శించి నాయక లక్షణాన్ని నిరూపించుకొన్నాడు. (ఈ) విమర్శ సంధి- ప్రకరి+నియతాప్తి, భీముడు సంకేతస్థలంలో స్త్రీవలె శయ్యమీద కూర్చుండి. స్త్రీకంఠంతో విచిత్ర సంభాషణం చేయటం ప్రకరి వంటిది. కీచకుడు సంకేత స్థలానికి రాగా గూఢమర్దనక్రియతో అతడిని సంహరించటానికి పూనుకొని, వికృతపుచావు కలిగించిన భీమ పరాక్రమ సౌందర్యం కార్యనిర్వహణసమర్థంగా ప్రకాశించింది. ఇది నాయక శ్రేష్ఠ లక్షణం. (ఉ) నిర్వహణ సంధి- కార్యం+ఫలాగమం- కీచకవధను కళ్ళారా చూపించటం కార్యం. ప్రియురాలి మనస్సును ఆనందపరచటం ఫలాగమం. ఫలాగమం ఇందులో ఫలవంతంగా ప్రదర్శించబడింది. భీముడు 358వ పద్యంలో అడిగిన అయిదు ప్రశ్నలకు ద్రౌపది ఇచ్చిన అయిదంచెల సమాధాన మిది. (5) ఉత్తమ నాయకుడు. చతుర్విధనాయకులలో ఉత్తముడైన ధీరోదాత్తుడు, లేదా ఉత్తముడైన నాయకుడు అని అర్థం. (6) భీముడు సహజంగా ఉద్ధతుడే. అయినా ధర్మం చేత, ధర్మరాజు చేత అనుశాసితుడు కాబట్టి ఇక్కడ ధీరోదాత్తుడే. అతడు మొదట రౌద్రాన్ని ప్రదర్శించినా దానిని ధర్మరాజు నియంత్రించటం వలన వీరంగా నిర్వహించాడు. వీరం జనకరసం. అద్భుతం జన్యరసం. అద్భుత కార్యోత్సాహం భీముడిలో వీరరసాన్ని ఆవిష్కరించింది. దానిని చూచిన ద్రౌపదిలో తద్భావనం వలన, దర్శనం వలన అద్భుతరసాన్ని కలిగించింది. అది సహృదయులకు ఆలోచనామృతమై కావ్యరసమై అనుభూతిలో ముంచివేసింది. ఈ రససూత్ర వ్యాఖ్యానమే ఈ పద్యం. (సంపా.)

క. అను పలుకులు కర్ణరసా। యనము లగుడు నయ్యుధిష్ఠిరానుజుఁడు ముదం
బునఁ దేలిఁ ' యింకఁ దడయం। జన'దని ద్రౌపదికిఁ జెప్పి చయ్యన నేఁగెన్. 361

ప్రతిపదార్థం: అనుపలుకులు= అనే మాటలు; కర్ణరసాయనములు+అగుడున్= చెవికి ఇంపైనవి కాగా; ఆ+యుధిష్ఠిర+అనుజుఁడు = ధర్మజుడి తమ్ముడైన భీముడు; ముదంబునన్+తేలి= సంతోషంలో తేలియాడి; ఇంకన్+తడయన్+చనదు+అని= ఇకమీద ఆలస్యం చేయటం మంచిది కాదని; ద్రౌపదికిన్+చెప్పి= ద్రౌపదితో చెప్పి; చయ్యనన్+ఏఁగెన్= త్వరగా వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ మాటలు చెవి కింపుకాగా భీముడు సంతోషంతో ఉప్పొంగిపోయి 'ఇక ఇక్కడ ఆలస్యం చెయ్యటం మంచిది కాదు' అని ద్రౌపదిని హెచ్చరించి, వెంటనే వెళ్ళిపోయాడు.

విశేషం: కర్ణరసాయనములు అనే మాట శ్రవ్యకావ్యరస సూచన. యుధిష్ఠిరానుజుఁడు - అనే విశేషణం భీముడిని ధీరోదాత్తుడిగా చెప్పటమే కాకుండా, భీముడు ధర్మరాజుకు అనునాయకుడనీ, అతడి ప్రయత్నం వలన జరిగిన ఈ వీరకార్యం నాయకుడి ప్రధాన రసమైన ధర్మవీరానికి అంగమై, పోషకమై ఉంటుందనీ సహృదయులు భావించటానికి అనువుగా అమరింది. (సంపా.)

క. అనిన విని 'కీచకుఁడు స। చ్చిన పిమ్మటఁ బుట్టినవ్విశేషము లెల్లన్
విను వేడుక మనమలరెడు। ననఘా! యేర్పడఁగఁ జెప్పు' మనుటయుఁ బ్రీతిన్. 362

ప్రతిపదార్థం: అనినన్= అని వైశంపాయనుడు చెప్పగా; విని= జనమేజయుడు విని; అనఘా!= ఓ పుణ్యలక్షణుడవైన మహానుభావా!; కీచకుఁడు+చచ్చిన పిమ్మటన్= కీచకుడి మరణానంతరం; పుట్టిన= కలిగిన; ఆ+విశేషములు+ఎల్లన్= ఆ విషయాలు అన్నీ; వినువేడుకన్= వినాలనే కోరికతో; మనము+అలరెడున్= మనస్సు ఒప్పారుతున్నది; ఏర్పడఁగన్= ఆ విషయాలు తేటపడేటట్లు; ప్రీతిన్= ఆసక్తికరంగా; చెప్పుము+అనుటయున్= చెప్పుమనగా.

తాత్పర్యం: జనమేజయుడికి వైశంపాయనుడు కీచకవధ ఘట్టం చెప్పగా విని, ఆ తరువాత జరిగిన వివరాలు ఆసక్తికరంగా చెప్పుమని జనమేజయమహారాజు అడుగగా, (తరువాతి ఆశ్వాసంలోని వచనం(2)తో అన్వయం.)

విశేషం: భారత కథ జనమేజయమహారాజుకు వైశంపాయనమహర్షి చెప్పాడు. ఆ విషయం ఇక్కడ స్మరించుకోవాలి.

ఆశ్వాసాంతము

చ. **పరమ కృపావిధేయ! నిరుపాధిక చిన్మయ కాయ ! గాఢ వి**
స్తరనిగమైకవేద్య! గుణతత్త్వ వికార నియత్యభేద్య ! సం
స్మరణ నిరస్త తాప! ఘన సంసృతి సంతమస ప్రదీప! ని
ష్ఠుర భుజసార దానవ నిషూదన! భక్తజన ప్రమోదనా! **363**

ప్రతిపదార్థం: పరమ కృపావిధేయ!= గొప్ప దయతో భక్తులకులోనైనవాడా!; నిరుపాధిక చిన్మయకాయ!= ఉపాధిలేని జ్ఞాన రూపమైన+స్వరూపం కలవాడా!; గాఢ విస్తరనిగమ!+ఏకవేద్య= మిక్కిలి విస్తరమైన వేదాల వలననే తెలియదగినవాడా!; గుణతత్త్వవికారనియతి+అభేద్య!= సత్త్వ, రజస్, తమోగుణాల మాయచే, నియమంచేత భేదింపరానివాడా!; సంస్మరణ నిరస్తతాప!= స్మరించడం చేత అధికమైన తాపాన్ని పోగొట్టేవాడా!; ఘన సంసృతి సంతమసప్రదీప!= గొప్ప సంసారమనే చీకటిని పోగొట్టటంలో ఉత్తమ దీపమైనవాడా!; నిష్ఠుర భుజసారదానవ నిషూదన!= కఠినమైన బాహుబలంగల రాక్షసులను చంపినవాడా!; భక్తజన ప్రమోదనా!= భక్తులకు సంతోషం కలిగించేవాడా!

తాత్పర్యం: అపారమైన దయతో భక్తులకు విధేయుడవై ఉండేవాడా! నిర్గుణ జ్ఞానస్వరూపా! విస్తార వేదవిద్య చేత తెలియదగినవాడా! సత్త్వరజస్తమోగుణ నియమాలచేత భేదించరానివాడా! స్మరించినంతమాత్రాననే పాపాలు పోగొట్టేవాడా! సంసారమనే చీకటిని పోగొట్టే శ్రేష్ఠమైన దీపమా! బాహుబలంతో రాక్షసుల మట్టుపెట్టినవాడా! భక్తజనానందదాయకా! హరిహరనాథా!

విశేషం: అలం: అంత్యానుప్రాసం, రూపకం.

క. **చతురానందమయా। దు। ర్గతిరో గోద్గమ చికిత్సకా! భువన భవ**
స్థితి సంహారకరా! నిర్వృతి పణ్యాపణ పదారవిందవికాసా ! **364**

ప్రతిపదార్థం: చతుర్+ఆనందమయా!= నాలుగు విధాలైన (అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాలతో కూడిన ఆనందమయ స్వరూపుడా! లేదా చతురమైన నేర్పుతోడి ఆనందంతో నిండినవాడా!; దుర్గతిరోగ+ఉద్గమ చికిత్సకా!= దారిద్ర్యం అనే రోగం యొక్క పుట్టుకకు వైద్యం చేసేవాడా!; భువనభవస్థితి సంహారకరా!= లోకాల యొక్క సృష్టి స్థితి లయ కారకుడా!; నిర్వృతి పణ్య+ఆపణ= మోక్షమనే అమ్మదగిన వస్తువునకు అంగడి అయిన; పద+అరవింద వికాసా!= పాదపద్మాలచేత శోభించేవాడా!)

తాత్పర్యం: పరమానంద స్వరూపా! దుర్గతి అనే రోగాన్ని పోగొట్టే వైద్యుడా! లోకంలో సృష్టి స్థితి లయాలను చేసేవాడా! నిశ్రేయస మనే వస్తువునకు అంగడివంటి పాదపద్మాలచేత శోభించేవాడా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: రూపకం. ఉపమ. తిక్కన మోక్షగామి. ఆయనకు మోక్షప్రదాతగా హరిహరనాథుడు దర్శనమిచ్చాడు.

మాలిని. సురపతి ధృతచూడా శోభిరత్నాంశు వీచి
స్ఫురణ సుభగపాదాంభోజ సంచారకేళీ
పరిచయ కలనాలబ్ధవ్యయాతీత సౌఖ్యో
త్తర మునిజన హృన్మా ద్యన్మరాళ ప్రతానా! 365

ప్రతిపదార్థం: సురపతి= దేవేంద్రుడిచేత; ధృత= ధరించబడిన; చూడా= కిరీటంలో; శోభి= ప్రకాశించే; రత్న+అంశువీచిస్ఫురణ= మణుల కాంతుల కిరణాల ప్రకాశం చేత; సుభగ= మనోహరమైన; పాద+అంభోజ= పాదపద్మాలలో; సంచారకేళీ= తిరిగే క్రీడలో; పరిచయ కలనా= అభ్యాసం చేయటం చేత; లబ్ధ= పొందబడిన; వ్యయ+అతీత= నాశాన్ని అతిక్రమించిన; సౌఖ్య= సుఖంచేత; ఉత్తర= అధికములైన; మునిజనహృద్= మునుల హృదయాలనెడి; మాద్యత్+మరాళ ప్రతానా!= ఆనందించే ఉత్తర హంసల సమూహం కలవాడా!

తాత్పర్యం: దేవేంద్రుడు నమస్కరించడం చేత అతడి కిరీటంలోని రత్నకాంతులు తరంగాలవలె ఒప్పుతూ వున్న నీ పాదకమలాలను చేరి పరమసుఖాన్ని పొందిన మునుల హృదయాలనే రాజహంసలు కల దేవా! హరిహరనాథా!

విశేషం: అలం: రూపకం. ఈ వృత్తంలోని ప్రతి పాదంలోనూ న-న-మ-య-య అనే గణాలు వరుసగా ఉంటాయి. తొమ్మిదవ అక్షరం యతి మిత్రస్థానం. ప్రాసనియమం ఉన్నది.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున విరాటపర్వంబునందు ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది శుభకరమైన ఉభయకవిమిత్ర బిరుదాంచితుడు, కొమ్మనామాత్యుడు పుత్రుడు, పండితులను గౌరవించేవాడు (పండితులచేత పూజించబడేవాడు) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారత విరాటపర్వంలో ద్వితీయాశ్వాసం.

విరాటపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

విరాటపర్వము - తృతీయాశ్వాసము

శ్రీత్వ శివాత్వాలంబన। తత్త్వాశ్లేషాత్త శబలతా సంగత క

ర్తృత్వాదికలీలాత్త మ। హత్త్వాహంకారభావ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీత్వ= లక్ష్మీభావానికీ; శివాత్వ= పార్వతీభావానికీ; ఆలంబన= ఆధారమైన; తత్త్వ= (హరిహరాత్మకమైన) బ్రహ్మతత్త్వంయొక్క; ఆశ్లేష= కలయికచేత; ఆత్త= పొందబడిన; శబలతా= అనేకత్వంతో; సంగత= కూడిన; కర్తృత్వ+ఆదిక= కర్తృత్వం, భోక్తృత్వం మొదలైన ధర్మాల; లీలా= విలాసంచేత; ఆత్త= పొందబడిన; మహత్త్వ+అహంకారభావ!= మహత్త్వం, అహంకారం అనే భావాలు కలవాడా!; హరిహరనాథా!

తాత్పర్యం: లక్ష్మీపార్వతుల భావాలకు ఆధారమైన హరిహరనాథ బ్రహ్మతత్త్వంతో ఏర్పడిన కూడికతో కలిగిన అనేకత్వంతో కూడిన కర్తృత్వం మొదలైన ధర్మాల విలాసం చేత పొందబడిన మహత్త్వాహంకారాలు కలవాడా! హరిహరనాథా!

విశేషం: అలం: యథాసంఖ్యం. 1. "ఏకమేవాऽద్వితీయం బ్రహ్మ" అని ఉపనిషత్తులు. హరిహరనాథుడు వస్తుతః ఏక పరబ్రహ్మతత్త్వమే, అద్వితీయుడే. అతడికి కర్తృత్వ భోక్తృత్వాలూ, మహత్త్వాహంకారాలూ ఉండవు. కాని, పరమాత్మ సృష్టి కున్ముఖుడైనప్పుడు తనలోనే సగభాగాన్ని స్త్రీత్వశక్తిగా మార్చి లోకాన్ని నిర్మిస్తాడు. ఇది అతడి విలాసం. హరిహరనాథుడే ద్వంద్వరూపుడైనాడు. అందువలన ఇచ్ఛాశక్తి అయిన లక్ష్మికీ, క్రియాశక్తి అయిన పార్వతికీ తానే ఆధారభూతుడై జ్ఞానశక్తిగా వెలుగుతున్నాడు. ఇట్లా పరబ్రహ్మతత్త్వమే బహురూపాలు తాల్చటానికి పూర్వకర్మలు కారణం కాదు. ఆయన కారణజన్ముడు కావటం చేత స్వేచ్ఛా ప్రవృత్తితో బహుత్వాన్ని భజిస్తాడు. దానితో లీలా విలాసరూపాలైన మహత్త్వాహంకారాలు ఆయనలో రాణిస్తాయి. పరమాత్మకు అవి లీలామాత్రాలే కాని కర్మబద్ధాలు కావని తాత్పర్యం.

2. "హరిహరనాథ తత్త్వాంతర్గతమగు హరితత్త్వము శ్రీత్వమునకును. హరతత్త్వము శివాత్వమునకును ఆలంబన మగుచున్నది. ఇట్టి హరిహరతత్త్వ సంబంధము చేతనే యేకరూపుడగు పరమేశునికి స్వగతభేదమగు శబలత్వము కల్గినదని చెప్పి తత్ప్రక్రియను "మహత్త్వాహంకారభావ!" అను పదముచే వివరించెను. లేదా- 'శబలత్వ' సంగతిచే గల్గిన కర్తృత్వాదికము గలవాఁడా! అని వేరు పదముగాఁ జెప్పి 'లీలా..భావా!'అనునది పృథక్పదముగానైనను గ్రహింప నొప్పును. విలాసముచేఁ బొందఁబడిన మహత్త్వాహంకారభావము గలవాడా! అని తదర్థము." (ఒరుగంటి నీలకంఠశాస్త్రి- హరిహరనాథతత్త్వము. పు.85)

3. "శ్రీత్వ= శ్రీశబ్ద ప్రవృత్తి నిమిత్త శ్రవణీయత్వరూప శ్రీదేవీ ధర్మము: శివాత్వ= మంగళప్రదత్వరూప శివాశబ్ద ప్రవృత్తి నిమిత్త పార్వతీధర్మము ఇవియే; ఆలంబన= పట్టుగాఁగల; తత్త్వ= స్త్రీ వ్యక్తులయొక్క; శ్రీయన గౌరినాఁ బరఁగు చెల్వయొక్క అని భావము; ఆశ్లేష= కౌఁగిలింతలచే; ఆత్త= పొందబడిన; శబలతా= చిత్రవర్ణముతో; సంగత!= కూడినవాఁడా!; కర్తృత్వ= (పాలన) కర్తృత్వము; ఆదిక= సంహార కర్తృత్వము మొదలగు; లీలా= విలాసములచే; ఆత్త= పొందబడిన; మహత్త్వ= మహిమయు; అహంకారభావ= అహంకార తత్త్వమును గలవాఁడా!; హరిహరనాథా!= హరిహర స్వరూపుడవగు ఓ దేవా! అని యీ సంబోధనల కర్థము" (పళ్ళెపూర్ణప్రజ్ఞాచార్యులు - విరాటపర్వము. తృతీయాశ్వాసము టిప్పణి.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

4. "ఈ పద్యములోని నాల్గవ పాదమునఁ బ్రాసలోఁ బడిన 'మహత్త్వా' అను చోటఁ గల తకారము ద్విత్వతకారము గనుక 'ప్రాసః సర్వేషాం చై వ స్యాత్' అను నియామానుసారము తక్కిన మూఁడు ప్రాసలను గూడా వస్తుతః అని ఏక తకారములే యైనను ఛందోనియమభంగ పరిహారార్థము 'అనచిచ' అను సూత్రము చేత 'త'కారమునకు వైకల్పికముగా ద్విత్వము చేసికొని ప్రాసవ్యత్యాసమును సవరించుకొనవలెను. (పళ్ళె పూర్ణప్రజ్ఞాచార్యులు).

5. ఉ.వి. సంశోధిత ముద్రిత ప్రతి 'మహత్త్వ'లో ద్విత్వతకారాన్ని మాని తకారాన్నే గ్రహించింది. (సంపా.)

ఉపకీచకులు ద్రౌపదిం దమ యన్న శవంబుతోఁ గట్టి దహింపం గొనిపోవుట (సం.4-21-62)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియెఁ - బవనతనయుం డట్లు సని మహానసమందిరంబు పరిసరంబున శరీరప్రక్షాళనంబు సేసికొని, యనులేపనంబున నసృగ్గంధం బుడిపికొని, కృతకృత్యుండై, శయ్యాతలంబునం గూర్చుండె; నిట యాజ్ఞసేనియుం భీమసేనుం డింతకు వంట యింటికిం బోయి నిశ్చింతంబున నుండునని నిశ్చయించి, నర్తనశాల వెలువడి కావలివారలం బిలిచి. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు; జనమేజయునకున్+ఇట్లు+అనియెన్= వైశంపాయన మహర్షి జనమేజయ చక్రవర్తితో ఈ విధంగా అన్నాడు; పవనతనయుండు= భీమసేనుడు; అట్లు= ఆ విధంగా; చని= వెళ్ళి; మహానస మందిరంబు పరిసరంబునన్= వంట ఇంటి సమీపంలో; శరీర ప్రక్షాళనంబు+చేసికొని= ఒడలు కడిగికొని; అనులేపనంబునన్= మైపూతతో; అసృక్+గంధంబు= నెత్తుటి వాసనను; ఉడిపికొని= పోజేసికొని; కృతకృత్యుండు+ఐ= తాను చేయదగినపని చేసిన వాడై; శయ్యాతలంబునన్= పడకమీద; కూర్చుండెన్= కూర్చున్నాడు; ఇట= ఇక్కడ, నాట్యమందిరంలో; యాజ్ఞసేనియున్= ద్రౌపదియు; భీమసేనుండు; ఇంతకున్= ఈసరికి; వంట+ఇంటికిన్+పోయి= వంటింటికి వెళ్ళి; నిశ్చింతంబునన్= ఏ చింతా లేకుండా; ఉండును+అని= ఉంటాడని; నిశ్చయించి= నిర్ణయించి; నర్తనశాల వెలువడి= నర్తనశాల నుండి బయటకు వచ్చి; కావలి వారలన్+ పిలిచి= కావలివారిని పిలిచి.

తాత్పర్యం: వైశంపాయన ఋషి జనమేజయుడితో ఇట్లా అన్నాడు. భీమసేను డా విధంగా వెళ్ళి (కీచక వధానంతరం) వంటింటిచేరువలో తన ఒడలి కంటుకొని ఉన్న నెత్తురు శుభ్రంగా కడిగికొని, మైపూతతో దాని వాసన రాకుండా చేసికొని, పని ముగించుకొన్నవాడై తన పడక మీద కూర్చున్నాడు. ఇక అక్కడ- నర్తనశాలనుండి ద్రౌపది వెల్వడి, ఈ సరికి భీమసేనుడు వంటయింటికి వెళ్ళి నిశ్చింతగా ఉంటాడనే నమ్మకంతో కావలివాండ్రను పిలిచి.

విశేషం: 1.వ్యాసభారతంలో ఈ వివరాలన్నీ లేవు. తిక్కన దీని నొక వ్యూహంగా చిత్రించాడు. ద్రౌపదీ భీముల చర్యలు ఫలానుమేయాలుగా (ఫలితాన్ని బట్టి ఊహించగలిగిన రహస్య చర్యలుగా) వర్ణించాడు. ఎట్లాగంటే- 1. ద్రౌపదిని వెంటబెట్టుకొని వచ్చిన భీముడు కీచక వధానంతరం అతడి వింత శవాన్ని ఆమెకు చూపి, సంతోషపెట్టి, ఆమెను వెంట బెట్టుకొని పోక ఒంటరిగా త్వరగా వెళ్ళిపోయాడు. ఎందుకు? అనే ప్రశ్న పఠిత కేర్పడుతుంది.

2. భీముడు వేగంగా స్నానం చేశాడు. అయినా రక్తపువాసన పూర్తిగా పోయి ఉండకపోవచ్చును. అందుకే మైపూత పూసికొన్నాడు. నిశ్చింతగా శయ్యమీద పడుకొని నిద్రించకుండా, కూర్చుండిపోయాడు. ఎందుకు? భీముడు తన కర్తవ్యం ముగించాడు. ఆ తరువాత ద్రౌపది కూడా మరొక కర్తవ్యాన్ని నిర్వహించవలసి ఉన్నది. అతడు కృతార్థు డయ్యాడు. ఆమె కూడా కృతార్థురాలు కావాలి. అందుకు ఆమె అక్కడ ఆగింది. భీముడు వంటయింటికి పోయి నిశ్చింతగా ఉండటానికి వీలైనంతసేపు కిమ్మనకుండా అక్కడే ఉన్నది. ఆ తరువాత తన చర్య ప్రారంభించింది. అంటే పఠితలకు తెలియని రహస్యవ్యూహం ఒకటి ఉన్నదన్న మాట.

3. నర్తనశాల వెలువడి కావలివారిని పిలిచింది. ఇది చాలా ప్రమాదంతో కూడిన సాహస చర్య. భీముడివలె తానూ రహస్యంగా అంతఃపురానికి పోయి ఉంటే కథ తెల్లవారేదాకా నిద్రపోయి ఉండేది. కాని తెల్లవారేసరికే కొన్ని పనులు పూర్తి కావాలని వారి వ్యూహం. ఈ చర్యవలన ద్రౌపది కొన్ని ఇబ్బందులకు గురికాక తప్పదు. కావలివారికి ఆమె చెప్పటం వలన కలిగే కథార్థాలు అనేకం. ఆమె ఆ సమయంలో నర్తనశాలకు ఎందుకు వచ్చింది? కీచకుడు అక్కడికే ఎందుకు వచ్చాడు? అది వారి సంకేతస్థలం అయి ఉండాలి. సైరంధ్రీ కీచకులు పరస్పరం కూడబలుక్కొనే అక్కడికి వచ్చి ఉండాలి. సైరంధ్రి పరపురుషుల పొత్తు కోరదు. అది ఆమె స్వభావం. కాని, దానికి విరుద్ధంగా ఆమె రంకుటాలు వలె వ్యవహరించింది. ఆమె రహస్య వర్తనానికి ఆమె భర్తలైన గంధర్వులు కోపించి మిండగాడైన సింహబలుడిని చంపి ఉంటారు. మరి, ఆమె నేమీ చేయలేదు. దానికి కారణ మేమిటి? ఆమెను కీచకుడు బలవంతంగా తెచ్చి బలాత్కారం చేయబోయాడేమో! అందువలన గంధర్వపతులు అతడిని చంపారేమో! ఇటువంటి వంద ప్రశ్నలు విన్నవారి మనసులలో తలెత్తుతాయి. అట్లా ఆశ్చర్యానుమానాలనూ, భయభ్రాంతులనూ, ఒక అసందిగ్ధ పరిస్థితినీ కల్పించటం ద్రౌపది వ్యూహంలోని అంతరార్థమై ఉండవచ్చును. ఇటువంటి కథార్థాలన్నింటినీ పఠితల ఊహలకు వదలి కథాగతిలో ఉత్కంఠను పోషించటం వస్తుధ్వనిలో భాగమైన కథాకథనశిల్పం. (సంపా.)

క. 'నా పతులగు గంధర్వుల। చేపడి మృతిఁబొందె వీఁడె సింహబలుం; డీ
పాపాత్మునిఁ జూడుఁడు దు। ర్వ్యాపారఫలంబుఁగాంచె' నని పలుకుటయున్. 3

ప్రతిపదార్థం: సింహబలుండు= కీచకుడు; వీఁడె= ఇతడే; నా పతులు+అగు గంధర్వుల= నా భర్తలయిన గంధర్వులకు; చేపడి= చిక్కి; మృతిన్+పొందెన్= చనిపోయాడు; దుర్వ్యాపార= చెడునడవడికి; ఫలంబున్= ఫలితాన్ని; కాంచెన్= పొందాడు; ఈ పాపాత్మునిన్= ఈ దుర్మార్గుడిని; చూడుఁడు= చూడండి; అని పలుకుటయున్= అని అనటమున్నూ.

తాత్పర్యం: 'నా భర్తలయిన గంధర్వుల చేత చిక్కి, తన చెడు నడవడిక ఫలితాన్ని పొందిన ఈ పాపాత్ముడైన సింహబలుడిని మీరు చూడండి' (అని సైరంధ్రి అనగానే.)

విశేషం: పరిపరివిధాలుగా సాగే ప్రజల ఆలోచనలను తన కనుకూలంగా మలచే కిటుకు ఈ పద్యంలో ప్రదర్శించింది. ఈ కందపద్యంలోని ప్రతి పలుకూ, ఆ మాటల కూర్పులోని వరుసా ఎంతో సార్థకమైనవి. అల్పాక్షరాలలో అనల్పార్థ రచన. 'నన్ను అభిమానించే భర్తలు గంధర్వులు. వారికి నామీదనున్న ప్రేమ అపారం. వారి శక్తి అమోఘం. వారిచేతిలో పడ్డాడు కాబట్టే సింహబలుడు చచ్చాడు. చూడండి. ఎట్లా చచ్చాడో? అది గంధర్వుల చేతిలోని వింతచావు. అతడి చావు వాడు తెచ్చుకొన్నదే. వాడు పాపాత్ముడై పరదారను కోరి, వెంటనే ఆ పాపఫలాన్ని పొందాడు. అటువంటి చెడుపనులు చేస్తే చావుగాక మరే ఫలితం కలుగుతుంది?' అని దోషమంతా కీచకుడిదే అని చెప్పి, **'అత్యుత్కటైః పుణ్యపాపైః ఇహైవ ఫల మశ్నుతే'** అనే న్యాయాన్ని అనుసరించి, చేసిన మహాపాపానికి ఫలితం కీచకుడు ఇప్పుడే పొందాడనే కర్మసిద్ధాంతంతో వారికి నచ్చజెప్పింది. వాళ్ళలో గమనించదగిన అంశమేమంటే- కావలివారందరూ ద్రౌపది చెప్పినట్లే విన్నారు. ఆమెవలెనే ఆలోచించారు. దానికి ఈ మాటలు కారణం. కాగా, ఉపకీచకులు వచ్చిన తరువాత సన్నివేశం మారుతుంది. వారు ద్రౌపది దృక్పథంతో కాక కీచక పక్షంగా ఆలోచిస్తారు. ఈ ఘట్టంలో మూడు రకాల వారున్నారు. వ్యూహంతో మాట్లాడే ద్రౌపది, ద్రౌపదివలె ఆలోచించే కావలివారు, వారివలెనే ఆలోచించే బంధువులూ, విరాటాదులు, కీచకుడిని సమర్థిస్తూ పలికే ఉపకీచకులు. పఠితలకు ద్రౌపది వ్యూహం వాచ్యం కాలేదు. కాబట్టి ఆశ్చర్యంతో అందరి వెంటా నడుస్తుంటారు. ఉత్కంఠకు ఊపిరి పోసే సహజోక్తి చమత్కారం ఈ పద్య శిల్పం. (సంపా.)

ఆ. వారు సంభ్రమించి వడిఁ గోల దివియలు। గొనుచు నులివు మిగులఁ గూడఁబాఱి
నృత్తశాలఁ జొచ్చి రత్తఱి నా కల। కల మెఱింగి కీచకవ్రజంబు. 4

ప్రతిపదార్థం: వారు= ఆ కావలివారు; సంభ్రమించి= తొట్రుపడి; వడిన్= శీఘ్రంగా; కోల దివియలు= దివిటీలు; కొనుచున్= తీసికొని; ఉలివుమిగులన్= మ్రోత అతిశయించగా (కలకలము ఎక్కువకాగా); కూడన్+పాఱి= కలసి పరుగెత్తి; వృత్తశాలన్= నర్తనశాలలోనికి; చొచ్చిరి= ప్రవేశించారు; ఆ+తఱిన్= ఆ సమయాన; కీచక వ్రజంబు= కీచకుల గుంపు; ఆ కలకలము+ఎఱింగి= ఆ కోలాహలం విని.

తాత్పర్యం: కావలివా రా మాటలు విని వేగిరపడి త్వరత్వరగా కాగడాలు పట్టుకొని పెద్దగా అరుస్తూ అందరూ కలిసి నర్తనశాలలోనికి ప్రవేశించారు. అప్పుడు వాళ్ళు చేసిన కోలాహలాన్ని విని కీచకుల గుంపు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: సైరంధ్రి మాటలు విన్న కావలివారిలో మొదట సంభ్రమం కలిగింది. తమకు తెలియకుండా ఇంత ఘోరం ఇంత సమీపంలో జరిగిందంటే వారికి అనేకరకాలైన భయాలు కలిగాయి. అందుకే అంత తొట్రుపాటు. చీకటిలో జరిగిన ఆ దృశ్యాన్ని చూడటానికి దివిటీలు పట్టుకొని సాగారు. గంధర్వులో దయ్యాలో భూతాలో ఉన్న చోటికి నిశ్శబ్దంగా పోవటం భయం కాబట్టి పెద్ద పెద్దగా కేకలు పెట్టుతున్నారు. ఒంటరిగా పోవటం మంచిది కాదని అందరూ కలిసి గుంపుగా బయలుదేరి నర్తనశాలలో జాగ్రత్తగా ప్రవేశించారు. వాళ్ళు చేసిన కలకలం ఎంత దంటే- ఉపకీచకులు తెలిసికొని వచ్చేటంతటిది. ఉపకీచకులు ఎక్కడున్నారు? అనే ప్రశ్న మరొకటి. ఇది సింహబలుడి వ్యూహరచనకు సంబంధించిందిగా తోస్తుంది. అన్న ఎక్కడికి ఎప్పుడు వెళ్ళుతున్నా అంగరక్షకులుగా ఉపకీచకులు వెంట ఉంటారన్నమాట! సైరంధ్రి కిచ్చిన మాట ప్రకారం ఒంటరిగా సంకేతస్థలానికి సింహబలుడు వచ్చాడు. అతడి వెంట రహస్యంగా అనుసరిస్తూ తమ్ములు వచ్చారు. సందర్భోచితంగా చీకట్లో కొంత దూరంగా రహస్యంగా నిలిచిపోయారు. వారు మాటలు వినబడే దూరంలో లేరు; కేకలు వినబడే దూరంలో ఉన్నారు. అందుకే సైరంధ్రి మాటలు వారికి వినబడలేదు. కావలి వారి కేకలు వినబడి వచ్చారు. మూలంలో కావలివారందరూ ముందుగా నర్తనశాలలోకి వెళ్ళి ఆ వింతశవాన్ని చూచి అబ్బురపాటు చెందారు. వారు బహుశః కీచకుడి బంధువులకూ ఉపకీచకులకూ తెలియపరిచారేమో! వారందరూ ఆ క్రమంలో బిలబిలా పరుగెత్తికొని వచ్చారట! ఇది మూలంలో కూడా ఊహించుకొనదగిన అంశమే. అయితే ఇక్కడ కావలివారి కలకలం విని మొదట ఉపకీచకులు వెంటనే వచ్చారనీ, ఆ తరువాత (వారి వలన తెలిసికొని) బంధువులందరూ ఒక్కసారి గుంపుగా వచ్చారనీ తిక్కన చెప్పాడు. ఆ నడిరేయి కీచకమరణవార్త దావానలంవలె వ్యాపించిన తీరు భావనారమణీయం. (సంపా.)

చ. **కడు వెస వచ్చి రూపఱినకాయము నున్నతెఱంగుఁ జూచి బి**
ట్టడలు మనంబులం గదిరి హా యనువారును, జోద్యమంది మ్రా
న్పడియెడువారు, నగ్రజునిపైఁ బడి మూర్ఛలఁ బొందువారు న
య్యెడ కరుగంగ నోర్వక మహిం బెఱచోఁ బలవించువారు నై. **5**

ప్రతిపదార్థం: కడువెసన్+వచ్చి= మిక్కిలి వేగంగా వచ్చి; రూపు+అఱిన= ఆకారం (గుర్తించలేనంతగా) నశించిన; కాయము+ఉన్న తెఱంగున్= శరీరమున్న తీరును; చూచి= చూచినవారై; బిట్టు+అడలు మనంబులన్= మిక్కిలి చెదరిన మనసులతో; కదిరి= అతిశయించి; హా+అనువారును= భయంతో హా! అని అనేవారున్నూ; చోద్యము+అంది= ఆశ్చర్యపడి; మ్రాన్పడియెడువారును= (ఆశ్చర్యపడి) కదలకుండా ఉన్నవారున్నూ; అగ్రజునిపైన్+పడి= అన్న అయిన కీచకుడి మీద పడి; మూర్ఛలన్+పొందువారున్= మూర్ఛపోయేవారున్నూ; అ+ఎడకున్= ఆ చోటికి; అరుగంగన్+ఓర్వక= వెళ్లలేక; మహిన్= భూమిమీద; పెఱచోన్= వేఱొకచోట; పలవించువారున్+ఐ= దుఃఖించే వారున్నూ అయి.

తాత్పర్యం: (ఉపకీచకులు) చాలా వేగంగా వచ్చారు. గుర్తుపట్టలేనంతగా వింతచావు చచ్చిన తమ అన్న కీచకుడి శరీరం తీరు చూచారు. గుండెలు అదిరిపోయేట్లు ఎలుగెత్తి 'హా'అని ఆక్రోశించారు. ఆశ్చర్యంతో కొయ్యబారిపోయారు. అన్న శవంమీద పడి మూర్ఛ పోయారు. భయానకంగా ఉన్న ఆ శవప్రాంతానికి పోలేక దూరంగా ఉండి నేలమీదపడి పొర్లుతూ శోకాలు పెట్టారు.

విశేషం: అలం: అంత్యానుప్రాస. 1. కీచకుడంటే ఉపకీచకులకు ప్రాణం. వింతచావు చచ్చిన అతడిని చూచి వారు పొందిన శోకావస్థలను తిక్కన రసోద్విగ్నంగా వర్ణించాడు. వారు వేగంగా వచ్చారు. గుర్తుపట్టలేనంతగా రూపం కోల్పోయి మాంసపు ముద్దగా పడి ఉన్న ఆ తీరు చూచి మొదట బాగా భయపడ్డారు. వారి గుండెలు గుభేలుమన్నాయి. ఊహించని ఆ వింతచావును చూచి బావురుమన్నారు. ఇట్లా అయినవారు ఆత్మీయులూ కావచ్చును. కొంతమంది ఆశ్చర్యపోయి చేష్టలు దక్కి కొయ్యబారి నిలుచున్నారు. వీరు అధీరులై ఉండవచ్చును. కొందరు శవం మీద పడి ఏడ్చి మూర్ఛపోయారట! వీరు అవేశపరులు. ఉద్విగ్నులు కావచ్చును. కొందరు శవాన్ని సమీపించలేక దూరంగా నేలమీద పడి రోదిస్తున్నారట! వీరు భీరువులు కావచ్చును. సామాన్యంగా చనిపోయినవారిని చూడటానికి వచ్చే ఆత్మీయులలో కానవచ్చే నాలుగు రకాల వారి ప్రవృత్తులకు సమయోచితంగా ప్రకరణోచితంగా తిక్కన ఈ పద్యంలో ఆవిష్కరించాడు. అంత్యానుప్రాసను వారి శోకవృత్తికి అనుగుణంగా అనుసంధించి శబ్దాలంకారౌచిత్యాన్ని పోషించాడు.

2. బంధువులలోనే ఉపకీచకులు కూడా ఉన్నట్లు వ్యాసుడు కలిపి చెప్పాడు. తిక్కన విడమరచి క్రమంగా వివరించాడు. కథకు కావలసింది కావలివారి కన్నీరు కాదు. బంధువుల పలవరింపులు కావు. ఉపకీచకుల శోకావస్థలే. భావికార్యం వారివలననే సాగాలి. శవాన్ని చూడగానే ఆత్మీయులు బావురుమని దుఃఖించాలి. దానితో కొంత శోకపుపొంగు తగ్గి తేలికపడతారు. ఆ తరువాత ఓదార్పుమాటలతో తేరుకొంటారు. ఉపకీచకుల స్థితి కూడా అటువంటిదే.

3. మూలంలో. **"సర్వే సంహృష్టరోమాణః సంత్రస్తాః ప్రేక్ష్య కీచకమ్ । తథా సర్వాంగ సంభుగ్నం కూర్మం స్థల ఇవోద్ధృతమ్"** (సం.4-22-2) అని ఉన్నది. కీచకుడి శవాకారం అవయవాలన్నీ చూర్ణమై నేలమీదకు ఊడ్వబడిన తాబేలు వలె ఉన్నదట! మంచి ఉపమానం. తిక్కన దీనిని గ్రహించలేదు. ఎందువలన అంటే మూలంలో చూచేవారికి గగుర్పాటు కలిగింది. తిక్కన వర్ణించదలచుకొన్నది గగుర్పాటు కాదు. భయవిహ్వలమైన హాహాకారం (రోదనం), ఆశ్చర్యంతో కలిగే స్తంభం, ఆర్తివలన కలిగే మూర్ఛ, వియోగాన్ని భరించలేక నేలపైబడి తన్నుకొనటం వంటి శోక సాత్త్విక భావాలు. అందుకే ఈ పద్యం. తిక్కనది రసాభ్యుదయ దృష్టి. (సంపా.)

వ. ఉన్నంత బంధుజనంబులు గూడంబాఱి కీచక శవంబు గనుంగొని. 6

ప్రతిపదార్థం: ఉన్న+అంతన్= ఉపకీచకులు ఆ విధంగా ఉండగా; బంధుజనంబులు= బంధువులందరూ; కూడన్+పాఱి= కలసి పరుగెత్తి; కీచక శవంబున్+కనుంగొని= కీచకుడి శవాన్ని చూచి.

తాత్పర్యం: ఉపకీచకులు ఆ విధంగా ఉండగా బంధువులందరూ కలిసి పరుగెత్తికొని వచ్చి కీచకుడి శవాన్ని చూచారు.

ఉ. 'మానవకోటి నిట్టి విసుమానపుఁ జీనుఁగు లైనవారి నెం
దైనను గంటిమే? యకట! యాఱడి వమ్మయిపోయె; దుర్జయం
బైన బలంబు గానితెరువై తన కిత్తఱిఁ దోడు గాద; యు
క్కీని మనంబు కీడు పరికించునె? క్రొవ్వినఁ జేటు తప్పునే?'. 7

ప్రతిపదార్థం: మానవకోటిన్= మానవసమూహంలో; ఇట్టి= ఈ విధమైన; విసుమానము+పీనుఁగులు; వింత కలిగించే శవాలుగా; అయినవారిన్= మారినవారిని; ఎందున్+ఐనను= ఎక్కడనైనా; కంటిమే?= చూచామా?; అకట!= అయ్యో!; ఆఱడివమ్ము+ అయిపోయెన్= నిందతో కూడుకొన్న పనికిమాలిన చావైపోయింది; దుర్జయంబు+ఐన బలంబు= జయించరాని బలం; కానితెరువు+ఐ= చెడుదారినిబట్టి; ఇత్తఱిన్= ఈ సమయాన; తనకున్+తోడుకాదు+అ= తనకు సహాయపడకుండా పోయింది; ఉక్కిని మనంబు= మూర్ఖుడి మనస్సు; కీడున్= హానిని; పరికించునె?= గమనిస్తుందా?; క్రొవ్వినన్= గర్విస్తే; చేటుతప్పునే?= నాశనం తప్పుతుందా? (తప్పదనిభావం).

తాత్పర్యం: 'మానవ లోకంలో ఇంతటి వింతపీనుగులుగా మారిన వారిని ఎక్కడైనా చూచామా? (ఇంత వరకు చూడలేదు). అయ్యో! ఎంతటి అప్రతిష్ఠతో కూడుకొన్న పనికిమాలిన చావు వచ్చింది! ఎవ్వరూ జయించలేని ఈతడి అంతటి బలం కూడా చెడుదారిన పడి, సమయం వచ్చినప్పుడు తనకు తోడుపడకుండా పోయింది. మూర్ఖుడి మనస్సు రాబోయే కీడును పరికించదు. గర్వించిన మనసు చేటును తప్పించుకొనలేదు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. బంధువులు తమ్ములవలె దుఃఖించరు. విస్తుపోతారు. విచారిస్తారు. వివేచిస్తారు. విచక్షణను, విజ్ఞతను ప్రదర్శిస్తారు. ఇంత వింతపీనుగులైనవారిని మానవులలో ఎక్కడైనా చూచామా? అని తమ లోకజ్ఞానాన్ని నెమరు వేసికొంటూ కొందరు విస్తుపోయారు. చచ్చి కీర్తిశేషులౌతారు కొందరు. చచ్చి జాలిని సంపాదిస్తారు కొందరు. పాపం కీచకుడు పాపిష్ఠిచావు, పనికిమానిన చావు చచ్చాడే అని కొందరు విచారించారు. బలం ఎంత ఉన్నా చెడుదారిన పడటంతో అది అతడికి తోడు రాలేకపోయిందని ధర్మాధర్మ వివేచన చేశారు కొందరు. మూర్ఖుడి మనసు కీడును పరికించదని ఉచితానుచితవిచక్షణ కలవారన్నారు. గర్వించినవారికి చేటు తప్పదని విజ్ఞులు తీర్పు చెప్పారు. విచక్షణులు విజ్ఞులు అనుకొన్న మాటలు సాధారణ ధర్మాలుగా భాసించి అవి అర్థాంతరన్యాసాలంకార స్ఫూర్తిని ప్రకటించాయి. కీచకుడి మరణవార్త ప్రజలలో ఎన్ని విధాలుగా భావించబడుతుందో బంధువుల వ్యాఖ్యలచేత ధ్వనింప చేయటం కావ్య శిల్పం. తిక్కన లోకజ్ఞత. (సంపా).

వ. అనుచు దాయం జని. 8

తాత్పర్యం: అంటూ దగ్గరకు పోయి.

తే. 'కరము లెయ్యవి? శిర మేది? గాళు లెచటఁ। జొచ్చె? గంధర్వవరులచేఁ జచ్చువార
లెల్ల నిట్టుల యగుదురో? యితనితోడి । యలుకఁ జేసిరో? యిది కడు నక్కజంబు'. 9

ప్రతిపదార్థం: కరములు+ఏ+అవి?= చేతు లేవి?; శిరము+ఏది?= తల ఎక్కడ ఉన్నది?; కాళులు+ఎచటన్= కాళ్ళు ఎక్కడ; చొచ్చెన్= దూరాయి (కాళ్ళెక్కడికి పోయాయి?); గంధర్వవరులచేన్= గంధర్వ శ్రేష్ఠులచేత; చచ్చువారు+ఎల్లన్= చనిపోయేవారందరూ; ఇట్టుల+అగుదురో?= ఈ విధంగానే ఔతారా?; ఇతనితోడి= ఇతడి మీద; అలుకన్+చేసిరొ?= కోపంతో ఇట్లా చేశారేమో!; ఇది= ఈ చావు; కడు+అక్కజంబు= మిక్కిలి ఆశ్చర్యం కలిగించేదిగా ఉన్నది.

తాత్పర్యం: 'చేతు లేవి? తల ఏది? కాళ్ళెక్కడికి పోయాయి? (వీటిని విడిగా ఎక్కడా గుర్తించలేకపోతున్నాం). గంధర్వ వీరుల చేతులలో చచ్చేవాళ్ళంతా ఈ విధంగానే ఔతారేమో! లేక ఇతడిమీద ప్రత్యేకంగా బాగా కోపించి ఇట్లా చేశారేమో! కాకపోతే ఈ చావు ఇంత ఆశ్చర్యకరంగా ఉంటుందా?

విశేషం: గంధర్వపతులు చంపారని ద్రౌపది పలికిన మాటల ప్రభావంతో కీచకశవాన్ని చూస్తున్న ఏకగ్రీవంగా ఆశ్చర్యపోతూ అనుకొన్న మాట ఇది. మూలభారతంలో కాగడాలు పట్టుకొని వెళ్ళిన కావలివారు అనుకొన్న మాటలివి-

"పాణి పాద విహీనం తు దృష్ట్వా చ వ్యథితా భవన్
నిరీక్షన్తి తతః సర్వే పరం విస్మయ మాగతాః
అమానుషం కృతం కర్మ తం దృష్ట్వా వినిపాతితమ్
క్వాస్య గ్రీవా క్వ చరణౌ క్వ పాణీ క్వ శిర స్తథా

ఇతి స్మ తం పరీక్షన్తే గన్ధర్వేణ హతం తదా" (4-21-66-67) ఈ తాత్పర్యాన్ని అందరూ కలిసి అనుకొన్నట్లు సన్నివేశం చివర చెప్పటం తిక్కన కూర్పులోని నేర్పు. ఈ మాటలు భావికథకు బాటలు వేశాయి. ఎట్లాగంటే, గంధర్వులు చీకట్లో ఏకాంతంగా చంపారు. వా రట్లాగే చంపగలరు. వారి భార్యను కూడా అట్లాగే రక్షించుకొనగలరు. పది మంది కలిసి ఉన్నప్పుడు వారు రాలేదు. తెల్లవారితే ఏమౌతుందో? అని భావించారు. నలుగు రున్నప్పుడే కార్యం చక్కబెట్టుకొనాలనుకొన్నారు. అంతటి మహాబలుడి వింత శవాన్ని ప్రజలందరూ చూస్తే అతడి పరువుపోతుంది. నింద మిగులుతుంది. అందువలన ఉపకీచకులు సింహబలుడిని తెల్లవారేసరికి శ్మశానంలో దహనం చేయాలని అప్పుడే శవయాత్రకు సిద్ధం చేశారు. రాజమర్యాదలతో పోవలసిన కీచక శవం రహస్యంగా దొంగ యాత్ర చేయవలసి వచ్చింది. ఈ విధంగా కథ సాగటానికి కారణం ద్రౌపది అర్ధరాత్రే కీచకవధను కావలివారికి చెప్పటం అని గ్రహించి పఠితలూ ఆశ్చర్యపోతారు. (సంపా.)

వ. అని వెండియు బహుప్రకారంబులం బలుకుచు శోకవిస్మయ పరీత చేతస్కులయి యున్నంత నొక యుపకీచకుండు నిజ సహోదరులం జూచి. 10

ప్రతిపదార్థం: అని, వెండియున్= ఇంకా; బహుప్రకారంబులన్= అనేక విధాలుగా; పలుకుచున్= మాట్లాడుతూ; శోక విస్మయ పరీతచేతస్కులు+అయి= దుఃఖంతో, ఆశ్చర్యంతో నిండిన మనస్సు కలవారయి; ఉన్న+అంతన్= ఉన్న సమయంలో; ఒక ఉపకీచకుండు; (వారిలో) ఒకానొక ఉపకీచకుడు; (కీచకుడి తమ్ములలో ఒకడు); నిజసహోదరులన్+చూచి= తన తోబుట్టినవారిని చూచి.

తాత్పర్యం: అని, ఇంకా అనేకవిధాలుగా అనుకొంటూ శోకంతో, ఆశ్చర్యంతో నిండిన మనస్సులతో వారంతా ఉన్న సమయంలో ఒక ఉపకీచకుడు తన సోదరులనందరినీ చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'మన మెంత పనవి పిలిచిన। వినవేర్చునె సింహబలుఁడు? వేగమ యితనిం
గొని పోవఁగ వలయుంగా'। కని యందఱఁ దేర్చె ననునయా లాపములన్. 11

ప్రతిపదార్థం: మనము= మనం (ఉపకీచకులం); ఎంత పనవి పిలిచినన్= ఎంతగా రోదిస్తూ పిలిచినప్పటికినీ; సింహబలుఁడు= కీచకుడు; వినన్+నేర్చునె?= వినగలడా?; వేగము+అ= శీఘ్రంగా; ఇతనిన్= కీచకుడిని; కొనిపోవఁగన్+వలయున్+కాక= తీసికొని పోవాలి, అంతే (అగ్ని సంస్కరణం కొరకు తీసికొని పోవాలని భావం); అని= అంటూ; అందఱన్= ఉపకీచకులనందరినీ; అనునయ+ఆలాపములన్= ఓదార్పు మాటలతో; తేర్చెన్= ఓదార్చాడు (దుఃఖం నుండి తేరుకొనేటట్లు చేశాడు.)

తాత్పర్యం: 'మనం శోకిస్తూ ఎంత పిలిచినా అవన్నీ సింహబలుడు వినగలుగుతాడా? (ప్రస్తుతం శోకించటం కాదు కర్తవ్యం. ఈ రహస్యపు చావు అందరికీ తెలియక ముందే) ఇతడిని వేగంగా శ్మశానానికి తీసికొని పోవాలి. (అది ప్రస్తుత కర్తవ్యం)' అని అంటూ అందరినీ తగిన ఊరడింపు మాటలతో శోకంనుండి తేరుకొనేటట్లు చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మూలంలో అక్కడున్న వారందరూ కలిసి తీసికొన్న నిర్ణయంగా చెప్పబడింది. తెలుగులో ధీరుడైన ఒక ఉపకీచకుడు పలికిన మాటలుగా చెప్పబడ్డాయి. ఇది లోకపు తీరుకు దగ్గరగా ఉన్నది. ఎవరింట్లో అయినా పెద్దవాడు పోతే అందరూ గుండెపగిలి, కుప్పగూలి రోదిస్తూ ఉంటారు. ఎవరో ఒకరు, లేదా కొందరు ధైర్యంతో ముందుకు వచ్చి, కర్తవ్యాన్ని జ్ఞాపకం చేసి, వారిని ఓదారుస్తారు. అట్లాగే, పేరు లేని ఉపకీచకుడిని తిక్కన పెద్దరికంతో నిలబెట్టి, లోకమర్యాదను కాపాడటంతోపాటు కీచక శవయాత్రకు మార్గం తెరచి కథకు గతి కల్పించాడు. (సంపా.)

ఉ. సూతులు దాని కియ్యకొనుచుం దమ యన్నకు నగ్ని యేర్చు వా
రై తగ వాచరించునెడ నల్లన ద్రౌపది 'వీరి చందముల్
చూతముగాక' యంచు నొకచోఁ దమ చేరువ నున్నఁ గాంచి, సం
జాత మహోగ్రకోపులయి చారువిలోచనఁ బట్టి క్రూరతన్. 12

ప్రతిపదార్థం: సూతులు= (సూత వంశానికి చెందిన) ఉపకీచకులు; దానికిన్= ఆ సలహాకు; ఇయ్యకొనుచున్= ఒప్పుకొంటూ; తమ+అన్నకున్= తమ అన్న అయిన కీచకుడికి; అగ్ని+ఏర్చువారు+ఐ= దహన సంస్కారం కొరకు అగ్గిని మండించే ఉద్దేశ్యంకలవారై; తగవున్= దానికి తగినట్లు; ఆచరించు+ఎడన్= చేసే సమయంలో; ద్రౌపది; అల్లనన్= నెమ్మదిగా; వీరి చందముల్= ఈ ఉపకీచకుల చేష్టలను; చూతము+కాక= చూద్దామని; అంచున్= అనుకొంటూ; ఒకచోన్= ఒకచోట; తమ చేరువన్= తమకు సమీపంలో; ఉన్నన్= ఉండగా; కాంచి= చూచినవారై; సంజాత= పుట్టుకొనివచ్చిన; మహా+ఉగ్రకోపులు+ఐ= మిక్కిలి భయంకరమైన కోపం కలవారై; చారువిలోచనన్= అందమైన చూపులుగలదానిని (ద్రౌపదిని); క్రూరతన్= కరకుతనంతో; పట్టి= పట్టుకొని.

తాత్పర్యం: ఆ ఉపకీచకుడు చెప్పిన దానికి మిగిలినవారంతా అంగీకరించారు. తమ అన్న అయిన సింహబలుడికి అగ్నిసంస్కారం చేయ తలపెట్టి, దానికి తగిన ప్రయత్నాలు చురుకుగా చేయ మొదలుపెట్టారు. ద్రౌపది ఆ ఉపకీచకుల చేష్టలను చప్పుడు లేకుండా గమనించి, ముందేమి జరుగుతుందో చూద్దామన్న ఆసక్తితో వారి దగ్గరగానే ఒకచోట నిలబడి ఉన్నది. ఆమెను ఉపకీచకులు చూచారు. ఒక్కసారిగా వారి మనసులో భయంకరమైన కోపం పెల్లుబికింది. ఆమెను కసితో, కరకుదనంతో పట్టుకొని. (తరవాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అంతమంది కూడినా, అంత జరుగుతున్నా ద్రౌపది అక్కడినుండి పోలేదు. అందులోని అంతరార్థం ఆలోచనామృతం. కీచకుడి చావుతో ఆమెకు తృప్తి లేదు. అతడి శవయాత్ర సాగేంతవరకూ చూచి పీడ వదిలిందని సంతోషించాలని అక్కడే ఒకచోట ఒదిగి నిలబడి ఉన్నది. ఆమె బాధితగా చెప్పుకొన్నది. కాబట్టి అందరూ జాలి చూపుతా రనుకొన్నది. ఆమె గంధర్వుల భార్యనని భయపెట్టింది కాబట్టి, ఎవ్వరూ ఆమె నేమీ చేయటానికి సాహసించరని భావించింది. అందుకే అందరితో కలిసి నిర్భయంగానే ఉపకీచకుల చర్యలు గమనిస్తూ నిలబడింది. ఆమెను ఉపకీచకులు చూచారు. అన్న చావుకు ఆమెయే కారకురాలని నిర్ణయించుకొని ఆగ్రహోదగ్రులయ్యారు. గంధర్వుల నేమీ చేయలేని ఆ ఉపకీచకులు తమ కోపాన్ని ఆ కోమలిపై తీర్చుకొందామనుకొన్నారు. అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను కన్నారా చూస్తున్న ద్రౌపది నిజంగా అప్పుడు 'చారులోచన'యే. అయితే ఏం? క్రూరులైన ఉపకీచకులు ఆమెను నిర్దయులై ముట్టడించారు. బంధించారు. ప్రజలనుండి జాలి పొందుతాననుకొన్న ద్రౌపది ఉపకీచకులనుండి క్రోధాన్ని ఎదుర్కొన వలసి వచ్చింది. ఇది ఊహించని మలుపు.

2. సమీపంలోని ఒక స్తంభాన్ని కౌగిలించుకొని ఉండగా కీచకులు చూచి రెచ్చిపోయారని వ్యాసభారతం, అందులో కూడా ఆమె వేచి ఉండటానికి కారణం తెలియదు. తిక్కన ద్రౌపదికి మాత్రం అక్కడ జరుగుతున్న కథను కళ్ళారా చూచి, నోరారా తన భర్తలకు చెప్పి, మనసరారా సంతోషించాలనే కసితో కూడిన కోర్కె తప్ప మరొకటి కానరాదు. అది భీమ వ్యూహంలో

భాగమా? కాదా? అన్నది ఆలోచించదగింది. భీముడు శయ్యమీద కూర్చున్నాడే కాని నిద్రించలేదు. ద్రౌపది జరిగిన కథంతా తనకు వచ్చి చెప్పితే కాని నిద్ర పోగూడదని వ్యూహం కాబోలు! ఏమైనా భీముడి సాహసం సార్థకమైనది. ద్రౌపది సాహసం ప్రమాదానికి గురి అయింది. భీముడికి మరల పనిబడింది. ఈసారి నూటైదుగురు కీచకులను మట్టుపెట్టవలసిన సన్నివేశం ముంచుకొని రాబోతున్నది. కథ ఉత్కంఠతో ఊగిపోతున్నది. (సంపా.)

క. పెడకేలు గట్టి 'పాపపుఁ । బొడవగు నిది గాదె యితనిఁ బొడ వడఁగించెన్!
గెడకూడఁ దీని నీతని । యొడలిపయిం బెట్టి కాల్చు టుచితం బరయన్.' 13

ప్రతిపదార్థం: పెడకేలు+కట్టి= చేతులు వెనుకకు విఱిచికట్టి; పాపము+పొడవు+అగు= పాపిష్ఠిరూపంకల; ఇది= ఈ సైరంధ్రి; కాదె= కదా; ఇతనిన్= ఈ కీచకుడిని; పొడవు+అడఁగించెన్= చంపింది (రూపులేకుండా చేసింది); కెడగూడన్= ప్రక్కలో ఉండగా (అనగా కలిపి జతగా ఉండునట్లు); ఈతని ఒడలిపయిన్+పెట్టి= ఈతడి శరీరం మీదపెట్టి; దీనిన్= ఈ సైరంధ్రిని; కాల్చుట= తగులబెట్టటం; అరయన్= పరిశీలించగా; ఉచితంబు= తగును.

తాత్పర్యం: ద్రౌపది చేతులను వెనుకకు త్రిప్పి కట్టారు. 'పాపిష్ఠి రూపం కలిగిన ఇదేగా ఈతడిని మట్టుపెట్టింది! (ఈమె పాపపు అందానికి ఆకర్షితుడై అతడు ఈ చావు చచ్చాడు). కాబట్టి ఇతడితో ఈమెను కలిపి కట్టి, దహనం చేయటం యుక్తమైన పని.' (అని నిర్ణయించారు).

విశేషం: సింహబలుడు ఆ రూపవతిని పొందుదామని కోరుకొన్నాడు. కాని, ఈ శరీరంతో పొందలేకపోయాడు. ఇతడి ఆశ అడియాసగానే మిగిలిపోయింది. ఈ పాపిష్ఠిది సుఖాన్ని ఇవ్వకుండానే మోసగించి, భర్తలచేత చంపించింది కాబట్టి ఇతడి శవంమీద ఈమెను పెట్టి దహనం చేస్తే లోకాంతరంలోనైనా అతడు సంతోషిస్తాడని వారి ఊహ. బ్రతికి సాధించలేనిది చచ్చి సాధించగలడనే సామెత వలె ఉపకీచకులు భావించి ఆమెకు సహగమనంవంటి దురవస్థను కల్పించారు. ఇది ద్రౌపదికి ప్రబలమైన విపత్తు. (సంపా.)

వ. అని విరాటున కెఱింగించి చేయువారై, యంతకుమున్న యీ వృత్తాంతం బంతయు విని సంక్షుభిత హృదయుండై యున్న యతనిపాలికిం బోయి. 14

ప్రతిపదార్థం: అని విరాటునకు+ఎఱింగించి చేయువారై= ఆ విధంగా విరాటుడికి తెలిపి చేద్దామని నిశ్చయించి; అంతకుమున్న+అ= అంతకు ముందే; ఈ వృత్తాంతంబు+అంతయున్ విని= ఈ విషయమంతా విని (అనగా కీచక వధనంతావిని); సంక్షుభిత హృదయుండు+ఐ; ఉన్న= కలత చెందిన మనసుతో ఉన్న; అతని పాలికిన్+పోయి= ఆ విరటుని వద్దకు వెళ్లి.

తాత్పర్యం: తమ నిర్ణయాన్ని రాజైన విరాటుడికి తెలిపి అమలు చేయాలని బయలుదేరారు. అంతకుముందే ఆ వృత్తాంతాన్ని (చారుల వలన) విని విరాటుడు కలతపడ్డ హృదయంతో బాధపడుతున్నాడు. అప్పుడు వారు అతడి దగ్గరికి పోయి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: కీచకవధ వృత్తాంతం కార్చిచ్చువలె రాజభవనమంతా చుట్టివేసింది. కాపలావారు రాజుకు చెప్పారు. అయితే, విరాటుడు ఇతర బంధువుల వలె నర్తనశాలకు రాలేదు. సుదేష్ణ అన్నను చూడాలని వేగిరపడలేదు. కాని, జరిగినదానికి వారిరువురూ లోలోన కుమిలిపోతున్నారు. ఏమి చేయాలో తోచక కలతపడుతున్నారు. ఇంతలో ఉపకీచకులు తమ నిరంకుశ నిర్ణయాన్ని రాజుకు

మర్యాదగా తెలిపిపోదామని వచ్చారు. అనుమతిస్తే మర్యాదగా ఉంటుంది. లేదా రాజాజ్ఞను వారు పట్టించుకొనరు. సింహబలుడి ఉద్ధతి అతడి తమ్ముల రూపంలో బుసకొట్టుతున్నది. సన్నివేశం గంభీరంగా సాగుతున్నది. (సంపా.)

తే. **'ఎల్లభంగుల సైరంధ్రి నేము సింహ। బలునితోఁ జంపువారమై తలఁచి నీకు**
నెఱుఁగఁ జెప్పంగ వచ్చితి; మీవు నింత। వట్టు మన్నన మాకు నీ వలయు' ననిన. **15**

ప్రతిపదార్థం: ఏము= మేము; ఎల్లభంగులన్= అన్ని విధాలుగా, ఏ విధంగానైనా; సింహబలునితోన్= కీచకుడితో కలిపి; సైరంధ్రిన్= సైరంధ్రిని; చంపువారము+ఐ= చంపటానికి; తలఁచి= నిశ్చయించుకొని; నీకున్; ఎఱుఁగన్+చెప్పంగన్= తెలుపటానికి; వచ్చితిమి= వచ్చాము; ఈవున్= నీవు; మాకున్= మాకు; ఇంత+పట్టు= ఈ మాత్రం; మన్ననన్= గౌరవాన్ని (గౌరవప్రదంగా, కాదనకుండా అంగీకరించటాన్ని); ఈవలయున్= ఇవ్వాలి; అనినన్= అని అనగా.

తాత్పర్యం: 'ఏ విధంగానైనా సరే (అన్ని విధాలా ప్రయత్నం చేసి) సైరంధ్రిని సింహబలుడితో కలిపి దహనం చేసి చంపాలని ఆలోచించాం. దానిని నీకు తెలపటానికి వచ్చాం. నీవు ఈ మాత్రం మమ్మల్ని అనుమతించాలి' అని ఉపకీచకులు అడుగగా. (తరువాతి గద్యంతో అన్వయం.)

విశేషం: ఇది సవినయంగా మనవి చేయటం కాదు. దబాయించి అనుమతి అడిగి పుచ్చుకొనటం. (సంపా.)

వ. **అతండును దన మనంబున 'నియ్యుపకీచకుల చందంబు సూడ నేను వారించితి నేనియు నుడుగం గలవారుగా రని (యు గంధర్వులు బలవంతులు గావునఁ దద్రక్షితయైన సైరంధ్రి కపాయంబు వొంద'దని) యు నూహించి, వారలం గలయం గనుంగొని 'యట్లకాక మీకుం బోలిన తెఱంగు సేయుం' డనిన నదియ యనుమతిగాఁ గైకొని సరభసంబునం జనుదెంచి.** **16**

ప్రతిపదార్థం: అతండును= ఆ విరాటుడు కూడ; తన మనంబునన్= తన మనసులో; ఈ+ఉప కీచకుల చందంబు+చూడన్= ఈ ఉపకీచకుల పద్ధతి చూడగా; ఏను వారించితిన్+ఏనియున్= నేనడ్డుకొన్నప్పటికీ; ఉడుగన్+కలవారు+కారు= ఆగేవారు కారు; అనియున్= అనిన్నీ; గంధర్వులు బలవంతులు కావునన్= గంధర్వులు బలం కలవారు కాబట్టి; తద్+రక్షిత+ఐన= వారిచే కాపాడబడేదైన; సైరంధ్రికి; అపాయంబు+పొందదు= ప్రమాదం కలుగదు; అనియున్= అనుకొని; ఊహించి= తలచుకొని; వారలన్+కలయన్+కనుంగొని= వారి నందరినీ కలయచూచి; అట్లు+అ+కాక= అట్లే కానీయండి; మీకున్+పోలిన తెఱంగు= మీకు తోచిన విధంగా; చేయుండు+అనినన్= చేయండి అని అనగా; అది+అనుమతి కాన్+కైకొని= దానినే ఆమోదంగా తలచుకొని; సరభసంబునన్+చనుదెంచి= తొందరగా వచ్చి.

తాత్పర్యం: విరాటుడు కూడా తన మనసులో ఇట్లా ఊహించాడు; ' ఈ ఉపకీచకుల పద్ధతి చూస్తే నేను వద్దన్నా వీరు మానేటట్లు లేదు. గంధర్వులా- బలవంతులు కాబట్టి సైరంధ్రికి అపాయం కలుగకపోవచ్చును.' అనుకొన్నాడు. ఎదుట ఉన్న ఉపకీచకుల నందరినీ కలయచూచాడు. 'అట్లాగే, మీకు తోచినవిధంగా చేయండి' అన్నాడు. అదే ఆయన అనుమతిగా పరిగణించి వేగంగా బయలుదేరి వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: విరాటుడి హృదయంలోని ధర్మసంఘర్షణ సహజంగా అనిపిస్తుంది. కీచకులు ధూర్తులు. రాజశాసనాన్ని మన్నించరు. మన్నించనివారిని మందలింపజూస్తే మాట నిలవదు. అయితే, సైరంధ్రి అంతఃపుర వనిత. ఆమెను కీచకుడితో కలిపి దహించటానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంగీకరించటం అంతఃపుర ధర్మం కాదు. అట్లని కీచకుడిని సమర్థించలేడు. అతడు అంతఃపురధర్మాన్ని ధిక్కరించి సైరంధ్రిని అవమానించినా వారించలేకపోయాడు. కీచకుడిని తాను దండించ లేకపోయినా గంధర్వులు దండించారు. ధర్మాన్ని గంధర్వులే నిలుపుతున్నారు. తనను కాపాడుతున్నారు. తనను కాదని కీచకుడు బాగుపడలేదు. ఉపకీచకులూ అంతే. అందువలన గంధర్వులమీద ధర్మరక్షణ భారముంచి ఉపకీచకులను వారి కర్మకు వారే బాధ్యులయ్యేటట్లు చేయటమే అప్పటికి అనువైన పని అని భావించి వారి చర్యలకు విరాటుడు తల ఊపాడు. విరాటుడు అంత బలవంతుడు కాకపోవచ్చును. కాని వివేకజ్ఞుడు. (సంపా.)

ఉ. **'అంగజరాగమత్తుఁడగు నన్నకు నిమ్మెయినైనఁ బ్రీతిసే**
యంగలవార, మీ జఱభి యాతనితోడన తీఱుఁగాక' యం
చుం గొనిపోయి దైన్యమున సూతునిపీనుఁగు మీఁదఁ బాండుపు
త్రాంగనఁ బెట్టి, కట్టిరి దయాపరివర్జితచిత్తవృత్తులై. **17**

ప్రతిపదార్థం: అంగజరాగమత్తుఁడు+అగు= మన్మథుడి వలన కల్గిన మోహంతో మదించిన; అన్నకున్= తమ అన్న అయిన కీచకుడికి; ఈ+మెయిన్+ఐనన్= ఈ విధంగానైనా; ప్రీతిచేయన్+కలవారము= ఇష్టమైన పని చేయగలం; ఈ జఱభి= ఈ కులట (లంజె); ఆతని తోడన్= ఆ కీచకుడితోనే; తీఱున్+కాక= చనిపోయితీరాలి; అంచున్+కొనిపోయి= అని చెప్పుతూ తీసికొనిపోయి; దయాపరివర్జిత చిత్తవృత్తులు+ఐ= దయచేత విడువబడిన మనస్సులు కలవారై-అంటే కఠినచిత్తులై; పాండుపుత్ర+అంగనన్= పాండవుల ఇల్లాలిని (ద్రౌపదిని); దైన్యమునన్= దీనంగా; సూతుని పీనుఁగుమీదన్= కీచకుడి శవం మీదనే; పెట్టికట్టిరి= పెట్టి కట్టారు.

తాత్పర్యం: 'మన్మథావేశంతో ఉన్మత్తుడైన మన అన్నకు ఈ విధంగానైనా సంతోషపెట్టుదాం. ఈ రంకుటాలు అతడితోపాటే అంతం కావాలి' అని అంటూ పాండవపత్ని అయిన ద్రౌపదిని కొనిపోయి దీనంగా కీచకుడి పీనుగుమీద ఉంచారు. నిర్దయచిత్తులై ఆమెను ఆ పీనుగుతో కలిపి కట్టారు.

విశేషం: సింహబలుడిది మదనోన్మాదమైతే, ఉపకీచకులది మదోన్మాదం. ప్రేతాత్మలను తృప్తిపరచే ప్రక్రియగా సైరంధ్రిని అతడితో కలిపి దహించటానికి పూనుకొన్నారు. ఉపకీచకులకు గంధర్వభయం ఉన్నట్లు లేదు. అంతమంది గుమికూడిన చోటికి వారు రారని వారి విశ్వాసం కావచ్చును. లేదా సింహబలుడిని సంహరించిన గంధర్వుల ఆట సైరంధ్రిని దహించటంతో కట్టుతుందని భావించవచ్చును. ఏది ఏమైనా తమతో కూడిన అన్నను చంపినదానిని అతడితో కలిపి చంపటమే ప్రతీకారం-ఇటువంటి భావాలు ఉపకీచకుల చర్యలకు ప్రేరకాలు. (సంపా.)

చ. **అశుచియుఁ గష్టుఁడున్ లఘువునైన నిజాగ్రజుమేనితోడ ని**
త్య శుచియుఁ బుణ్యశీలయు నుదాత్తయు నాఁ జను నింతిఁ గొంచుఁ గ
ర్కశమతిఁ గీచకుల్ బహుముఖంబుల బాంధవ విప్రలాపముల్
దిశ లద్రువం జెలంగఁ గరదీపనికాయము ప్రజ్వరిల్లఁగన్ **18**

ప్రతిపదార్థం: అశుచియున్= అపవిత్రుడున్నూ; కష్టుఁడున్= పాపియున్నూ; లఘువున్= అల్పుడూ, చులుకనైనవాడున్నూ; ఐన= అయినటువంటి; నిజ+అగ్రజుమేనితోడన్= తమ అన్న శరీరంతో; నిత్యశుచియున్= ఎల్లప్పుడూ పవిత్రురాలుగా (పరిశుద్ధురాలుగా); పుణ్యశీలయున్= పాపమంటే ఎరుగని స్వభావం కలది; ఉదాత్తయున్+నాన్= ఉత్తమస్త్రీ అనగా; చను= ఒప్పారే; ఇంతిన్= స్త్రీని (ద్రౌపదిని); కొంచున్= తీసికొనిపోతూ; కర్కశమితిన్= కఠినమైన మనసుతో; కీచకుల్= ఉపకీచకులు; బహుముఖంబులన్=

అనేక విధాలుగా; బాంధవ= కీచకుడి బంధువుల; విప్రలాపముల్= రోదనలు; దిశలు+అద్రువన్= దిక్కులదిరేటట్లు; చెలంగన్= వ్యాపించగా; కరదీపనికాయము ప్రజ్వరిల్లఁగన్= చేదివ్వటీలు వెలుగుతూ ఉండగా.

తాత్పర్యం: కఠినాత్ములైన ఉపకీచకులు అపవిత్రుడూ, దుష్టుడూ, అల్పుడూ అయిన తమ అన్న శవంతో కలిపి, నిత్య పవిత్రురాలు, పుణ్యస్వభావురాలు, ఆదర్శవర్తనురాలు అని ప్రసిద్ధికెక్కిన ఆ యిల్లాలిని తీసికొనివెళ్ళి బంధువుల ఏడ్పులూ, పెడబొబ్బలూ అనేక విధాలుగా పెచ్చుపెరిగి దిక్కులు పిక్కటిల్లుతూ ఉండగా, కాగడాల గుంపులు ధగధగ వెలుగుతూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: పరికరం, విషమం. విశేషణం సాభిప్రాయమైతే పరికరాలంకారం. ఈ పద్యంలో కీచకుడికీ, ద్రౌపదికీ వాడిన మూడు విశేషణాలూ సాభిప్రాయాలు. అననురూపాలైన వాటికి సంబంధం చెప్పటం విషమం. అందులో యథాసంఖ్యం కూడా ఉన్నది. అతడు సదా అపవిత్రుడు, ఆమె నిత్య పవిత్రురాలు; అతడు కష్టుడు, ఆమె పుణ్యశీల; అతడు అల్పుడు, ఆమె ఉదాత్త; వారిద్దరూ విరుద్ధ గుణాల వారు. వారిని కలిపి కట్టటం విషమం. ఈ వ్యాఖ్య చేస్తున్నది కవి. ఉపకీచకులకు ఈ పరిజ్ఞానం లేదు. వారు చేస్తున్నపని అనౌచిత్యం. దానిని తిక్కన ఎత్తిచూపుతున్నాడు. ఉపకీచకులపట్ల పఠితలకు ఏవగింపు కలిగించే అలంకారాలను తిక్కన ప్రయోగించాడు. వారి వధార్హతను పరోక్షంగా ధ్వనింపజేశాడు. (సంపా.)

క. పితృవణము దెసకుఁ జన న । య్యతివ భయభ్రాంతచిత్తయై బాష్పజలో
ద్గతి మొగముఁగప్ప నిట్లని । యతిరావముగా నొనర్చె నాక్రందనమున్. 19

ప్రతిపదార్థం: పితృవణము= శ్మశానం- వల్లకాడు; దెసకున్= దిక్కుకు; చనన్= పోగా; ఆ+అతివ= ఆ స్త్రీ (సైరంధ్రి); భయభ్రాంతచిత్తఐ= భయంతో కలతపడిన మనసు కలదై; బాష్పజల+ఉద్గతి+మొగము కప్పన్= కన్నీటివేగం ముఖాన్ని కప్పగా; అతిరావముగాన్= పెద్ద కంఠస్వరంతో ఎలుగెత్తి పెద్దగా అరుస్తూ, ఆక్రందనమున్= రోదనాన్ని; ఇట్లు+అని= ఈ విధంగా (ముందు చెప్పే విధంగా); ఒనర్చెన్= చేసింది.

తాత్పర్యం: శ్మశానం వైపునకు వెళ్ళుతూ ఉండగా ఆమె భయంవలన కలతబారిన మనస్సుతో, కన్నీరు పొంగి ముఖాన్ని కప్పివేస్తూ ఉండగా బిగ్గరగా ఎలుగెత్తి ఇట్లా రోదనం చేసింది.

విశేషం: స్త్రీకి మానభంగ, ప్రాణభంగ భీతులు ఉండటం సహజం. అందులో మానభంగ భీతి తీరింది. ఇప్పుడు ప్రాణభంగ భీతి ఏర్పడింది. కీచకుడు మానభంగం చేయబోయి ప్రాణాలు కోల్పోయాడు. ఉపకీచకులు ప్రాణభంగం చేయబోతున్నారు. మానభంగం ప్రాణభంగం కంటె గొప్పదనటంలో అనుమానంలేదు. కాని, ప్రాణభంగం సర్వధర్మభంగం కలిగిస్తుంది. ఉపకీచకుల అవివేకం వలన ధీరురాలైన ద్రౌపది కూడా ప్రాణాలు కోల్పోతానేమోనని రోదించింది. అయినా పెద్దగా రోదించటం అనే ఆమె చేష్టకు రెండంచులున్నాయి. అది అసహాయతవలన ఏర్పడిన ఆర్తి కావచ్చును. తన దీనస్థితిని తన పతులకు వినిపించేటట్లు చేయాలని చేసే చివరిప్రయత్నం కావచ్చును. గ్రుడ్డిలో మెల్ల ఏమంటే- వారు ఆమె చేతులు కాళ్ళు కట్టివేశారే కాని నోరు కట్టివేయలేదు. అదొక్కటే ఆయుధం ఆమెకు మిగిలింది. గొంతెత్తితే వినిపించుకొనటానికి భీముడింకా మేల్కొనే ఉన్నాడు. ఆమె గొంతు అతడికి వినబడాలి. అందుకే అంత పెద్దగా ఆక్రందనం! ఇది ఒక అంచున అనాథ ఆర్తనాదం. మరొక అంచున భీమ పునర్విజృంభణానికి శంఖారావం. (సంపా.)

ఆ. 'అనదనైతి నిచట; నాలి కుయ్యాలింపుఁ । డ కట! మీరు గలుగ నాక్రమించి
నన్నుఁ గట్టి సూతనందను లిమ్మెయి । వెఱపులేక భంగపఱుచువారు. 20

ప్రతిపదార్థం: అకట!= అయ్యో; ఇచటన్= ఇక్కడ; అనదన్+ఐతిన్= దిక్కులేనిదానినైనాను; ఆలి= ఇల్లాలియొక్క; కుయ్యి+ఆలింపుఁడు= మొరను వినండి; మీరు+కలుగన్= మీరుండగానే; సూతనందనులు= సూతుడి కొడుకులైన ఉపకీచకులు; నన్నున్+ఆక్రమించి= నన్ను చుట్టుముట్టి; కట్టి= కట్టివేసి; వెఱపు లేక= భయం లేకుండా; ఈ+మెయిన్= ఈ విధంగా; భంగము+పఱుచువారు= అవమానం చేస్తున్నారు.

తాత్పర్యం: 'దిక్కులేని దాననుగా నేను ఇప్పుడు చేసే ఆక్రందనాన్ని వినండి. మీరుండగానే ఉపకీచకులు నన్ను చుట్టుముట్టి, కట్టివేసి భయంలేకుండా అవమానం చేస్తున్నారు.

విశేషం: ఆక్రందనం చేసే ఆడుది చిన్న చిన్న వాక్యాలే మాట్లాడుతుంది. తన దీనస్థితిని చెప్పుకొంటుంది. ఆ దురవస్థను వర్ణిస్తుంది. దానికి సంబంధించిన కథలు బాధగా పేర్కొంటుంది. ఇది లోక స్వభావం. దానిని స్వభావోక్తిగా తిక్కన ప్రతిపదసార్థకంగా నిర్వహించాడు. ద్రౌపది మాటలు దీనోక్తులే కాదు. భీముడి కందించే సమాచారోక్తులు కూడా. 'ఇక్కడ నేను అనాథ నయ్యాను' అంటే- ఇప్పుడు నేను రక్షకులు లేని దాననయ్యాను. నాథుడు పోయిన ఆడదానిని సహగమనానికి తీసికొని పోయేటట్లుగా తీసికొని పోబడుతున్నాను. నా ప్రయత్నం ఇక్కడ విఫలమైపోయింది. నాకు రక్షకుడు (నాథుడు) కావాలి-అని మొదటి హెచ్చరిక. ఆలి కుయ్యి ఆలింపుడు; అబల అయిన ఇల్లాలి ఆక్రందనం వినండి. దయచూపండి మీ ఇల్లాలిని-అని సామాన్యార్థం. ఒంటరిగా చిక్కిన ఇల్లాలు సహాయం కొరకు చేసే దీనాలాపంగా దీనిని గ్రహించండి-అని భీమపరంగా అర్థం. అకట! అని నిరాశ ప్రకటించటంలో పరిస్థితియొక్క తీవ్రతను తెలుపటం పరమార్థం. మీరుండగా నన్ను చుట్టుముట్టి పట్టి పాడెకు కట్టి ఉపకీచకులు భయం లేకుండా నన్ను భంగపరుస్తున్నారు అనే మాటలు జరుగుతున్న కథను స్మరిస్తూ విలపిస్తున్నట్లుగా, భీముడికి వాస్తవ స్థితిని నివేదించుకొన్నట్లూ తెలుస్తుంది. అంతేకాదు. భీముడికి కోపం తెప్పించేటట్లు చెప్పే పద్ధతి కూడా ఇందులో ఇమిడి ఉన్నది. మీరు ఉన్నారని చెప్పినా లక్ష్యం చేయకుండా నన్ను పట్టి బంధించారు. అంటే, మీరంటే భయం లేకుండా నన్ను భంగపరుస్తున్నారు. ఈ శత్రు తిరస్కారాన్ని మీరు సహించగలరా? నేను భంగపడటం మీరు సహించగలరా? నేను భంగపడితే మీరు భంగపడ్డట్లు కాదా? ఇటువంటి అర్థాలు వచ్చి భీముడిలో రౌద్రోద్రేకం రేకెత్తించటం ఆ వాక్యాల ప్రయోజనం. ఇది వారి వ్యూహంలో భాగమని భావించినా ఆమె మాటలు సహజంగా ఉండి సానుభూతిని కలిగిస్తున్నాయి. ఇది తిక్కన రచనా శిల్పం! (సంపా.)

ఉ. **ఆనతవైరి యో జయ! మహాద్భుతవిక్రమ యో జయంత! దు**
ర్మానవిఘూర్ణమానరిపుమర్దన యో విజయాభిధాన! తే
జోనిహతాహిత ప్రకటశూర గుణప్రతిభాస యో జయ
త్సేన! విరోధి బాహుబల జృంభణభంజన యో జయద్బలా! **21**

ప్రతిపదార్థం: ఆనతవైరి= నమస్కరించిన శత్రువులు కలవాడా, శత్రువులను పాదాక్రాంతులను చేసినవాడా!; ఓ జయ!= జయుడనే పేరుగలవాడా!; మహా+అద్భుత విక్రమ= ఆశ్చర్యం కలిగించే శౌర్యం కల; ఓ జయంత!= ఓ జయంతుడనే పేరున్నవాడా!; దుర్మాన= దురభిమానంతో; విఘూర్ణమాన= ఊగులాడే; రిపు= శత్రువులను; మర్దన= చంపువాడా; ఓ విజయ+అభిధాన!= విజయుడనే పేరు కలవాడా!; తేజో నిహత= (నీ) తేజస్సుతో పడగొట్టబడిన; అహిత= శత్రువులకు; ప్రకట= స్పష్టం చేసిన; శూరగుణప్రతిభాస= శౌర్యగుణంతో వెలుగుతున్నవాడా!; ఓ జయత్సేన= ఓ జయత్సేనుడనే పేరున్నవాడా!; విరోధి= శత్రువుల; బాహుబల= భుజబలం యొక్క; జృంభణ= అతిశయాన్ని; భంజన!= నాశనం చేసేవాడా!; ఓ జయద్బలా!= ఓ జయద్బల నామధేయుడా! (అని సైరంధ్రి అరుస్తూ ఉండింది).

తాత్పర్యం: శత్రువులను పాదాక్రాంతులను చేసికొన్న జయుడా! మహాద్భుత విక్రమశాలివైన జయంతుడా! దురభిమానులైన శత్రువులను మర్దించిన విజయా! తేజోబలంతో శత్రువులను పడగొట్టిన ఓ జయత్సేనా! భుజబలంతో విజృంభిస్తున్న శత్రువులను నాశనం చేసిన ఓ జయద్బలా!

విశేషం: 1. గంధర్వ పతులను అయిదుగురిని ఎలుగెత్తి పిలుస్తున్నట్లు చిత్రించిన ఈ పద్యం మూల శ్లోకభావానికి ముచ్చటైన విస్తృతి. మూలంలోని శ్లోకం ఇది-

"జయో! జయన్తో! విజయో! జయత్సేనో! జయద్బల! (4-22-12) ఇందులో పేర్కొన్న అయిదుపేర్లూ పాండవులు అజ్ఞాతవాసంలో తమలో తాము పిలుచుకొనే రహస్య సంకేతాలు. వాటిని మొదటిసారీ, చివరిసారీ వాడింది ఈ ఘట్టంలోనే. ఇది అంత అత్యవసర పరిస్థితి అని ధ్వని. మూలశ్లోకంలో పిలుపే ముఖ్యం. తెలుగులో పిలుపే కాదు, వారి తలపు శత్రువులకు వెరపు కలిగించటం కూడా ముఖ్యం. అందువలన పేర్లెంత ముఖ్యమో వారి గుణవిశేషణాలు అంత ప్రధానం. జయుడు ధర్మరాజు- ఎంతటి శత్రువైనా అతడికి తలవంచి నమస్కరిస్తాడు. జయంతుడు భీముడు- మహాద్భుత పరాక్రమశాలి. విజయుడు అర్జునుడు- ఎంతటి దురహంకారులనైనా మర్దించే మహావీరుడు. జయత్సేనుడు నకులుడు- శత్రువులను చంపి శౌర్యగుణాన్ని ప్రదర్శించేవాడు. జయద్బలుడు సహదేవుడు- విరోధి బాహుబాలాల విజృంభణాన్ని భంజించేవాడు. ఇందులో నలుగురు శత్రువులను చంపేవారు. మొదటివాడు మాత్రం శత్రువుల నమస్కారాలు గ్రహిస్తూ ఉంటాడు. శత్రువులు తమ కపకారం తలిస్తే గంధర్వులు చంపుతారనీ, శరణు వేడితే అనుగ్రహిస్తారనీ నిగ్రహానుగ్రహ సమర్థులైన శూరులనీ శత్రువులకు హెచ్చరిక! భర్తలకు ప్రశంస. అది అప్పుడు అవసరం!

2. ద్రౌపది భర్తలందరినీ పేరుపేరున పిలిచినా పలికేది భీముడొక్కడే! అందువలన అయిదుగురి విశేషణాలూ భీమనాయకుడికి వర్తించేవిగా కూడా ఉండటం విశేషం.

3.భారత కావ్యనాయక నిరూపణంలోనూ, రససమన్వయంలోనూ ఉన్న ఒక శిల్ప రహస్యాన్ని ఈ పద్యం ధ్వనిస్తున్నది. ధర్మజుడు ధర్మవీరుడు. భీమాదులు యుద్ధవీరులు. అనునాయకులైన భీమాదుల వీర రౌద్రరసకార్యాలన్నీ ధర్మజుడి ధర్మవీరానికి అంగాలై పోషకాలుగా నిలుస్తాయనీ, ఆయా సందర్భాలలో కార్యసాధకులు భీమాదులైనా ఫలభోక్త ధర్మరాజనీ విశేషణాలు ధ్వనిస్తున్నాయి.

4.చిన్న సమాసంతో మొదలై క్రమంగా పొడుగైన విశేషణాలలో సాగిన ఈ పద్యగతి కాహళ సంధించిన విధంగా ద్రౌపది రోదించిన స్ఫూర్తిని కలిగించటం తిక్కన సహజ పద్యరచనా శిల్పం. (సంపా.)

సీ. **తొడఁగిన పని చలం బెడపక యతి దుష్క। రంబైనఁ గడతేర్చు ప్రభువులార!**
పెనఁగిన వైవస్వతునినైనఁ గడిమిమై। వ్రేల్మిడిఁ బరిమార్చు వీరులార!
శరణార్థియగు దుష్ట శాత్రవునైనను। గరుణ రక్షించు సత్పురుషులార!
యర్థికిఁ బ్రాణంబు లైనను దాఁపక। తమకించి యిచ్చు నుదారులార!

తే. **నాథులార! గంధర్వ రత్నంబులార। నన్ను నుపకీచకులు తమ యన్న శవము**
నందు బంధించికొని వెస నరుగుచున్న। వారు; రక్షింప వేగ రావలయు మీరు. **22**

ప్రతిపదార్థం: తొడఁగినపని= మొదలుపెట్టిన పనిని; చలంబు+ఎడపక= పట్టుదల వదలకుండా; అతిదుష్కరంబు+ఐనన్= మిక్కిలి కష్టమైనప్పటికిని; కడతేర్చు= పూర్తిచేసే; ప్రభువులార!= రాజులారా!; పెనఁగినన్= పోరాడితే; వైవస్వతునిన్+ఐనన్=

యముడిని అయినా; కడిమిమైన్= పరాక్రమంతో; వ్రేల్మిడిన్= చిటికలో; పరిమార్చు= సంహరించే; వీరులార!= శూరులారా!; శరణ+అర్థి+అగు= శరణు వేడినవాడైన; దుష్టశాత్రవున్+ఐనన్= దుర్మార్గుడైన శత్రువునైనప్పటికిని; కరుణన్= దయతో; రక్షించు= కాపాడే; సత్పురుషులార!= మంచివారయిన పురుషులారా!; అర్థికిన్= దేహీ అన్నవాడికొరకు; ప్రాణంబులు+ఐనను= (మీ) ప్రాణాలైనా; దాఁపక= దాచుకొనకుండా; తమకించి= త్వరపడి; ఇచ్చు= ఇచ్చే; ఉదారులార!= దాతలార!; నాథులార!= భర్తలారా!; గంధర్వరత్నంబులార!= గంధర్వశ్రేష్ఠులారా!; నన్నున్= నన్ను (సైరంధ్రిని); ఉపకీచకులు= ఉపకీచకులు; తమ+ అన్న శవమునందున్= తమ అన్న అయిన కీచకుని శవంతో; బంధించికొని= కట్టివేసికొని; వెసన్+అరుగుచున్నవారు= వేగంగా వెళ్ళుతున్నారు; రక్షింపన్= కాపాడటానికి; మీరు= (గంధర్వులైన) మీరు; వేగన్= త్వరగా; రావలయున్= రావాలి.

తాత్పర్యం: మిక్కిలి కష్టమైనప్పటికిని మొదలుపెట్టిన పనిని పట్టువదలకుండా పూర్తి చేసే ప్రభువులారా! పోరాటంలో యమధర్మరాజునైనా పరాక్రమంతో చిటికెలో చంపగల వీరులారా! దుర్మార్గుడయిన శత్రువునైనా శరణువేడితే చాలు దయతో కాపాడే దయామయులారా! దేహీ అన్న వానికి (మీ) ప్రాణాలైనా దాచుకొనకుండా ఇచ్చే దాతలైన నాథులారా! గంధర్వశ్రేష్ఠులారా! (ఈ) ఉపకీచకులు నన్ను తమ అన్న అయిన కీచకుడి శవంతో కట్టి వేగంగా తీసికొనిపోతున్నారు. మీరు త్వరగా వచ్చి నన్ను కాపాడాలి.

విశేషం: అలం: యథాసంఖ్యం. తిక్కన ఔచిత్య పోషణకు ఈ సీసపద్యం ఒక అమూల్యోదాహరణం. మూలంలో ద్రౌపది ఇట్లా పలికింది;

> 'యేషాం జ్యాతల నిర్ఘోషో విస్ఫూర్జిత మివాశనేః।
> వ్యశ్రూయత మహాయుద్ధే భీమఘోష స్తరస్వినామ్॥
> రథఘోషశ్చ బలవాన్ గన్ధర్వాణాం తపస్వినామ్।
> తే మే వాచం విజానన్తు సూతపుత్రా నయన్తి మామ్। (4-22-13,14)

ఈ శ్లోకాల్లో గంధర్వుల పిడుగుపాటుల వంటి అల్లెత్రాటి మ్రోతల, భయంకర రథఘోషల ప్రసక్తి ఉన్నది. ఉపకీచకులను చంపటానికి రథాలలో వచ్చి, కోదండాలతో యుద్ధం చేయాలనే సూచన అందులో గోచరిస్తుంది. దానిని తిక్కన వదిలాడు. అది అజ్ఞాతవాసంలో, అందులోనూ నగరంలో అర్ధరాత్రంలో సాధ్యం కాదు. అందువలన అన్యథా కల్పనతో ఒక గొప్ప పద్యం రచించాడు. అదే ఈ సీసం.

2. ఈ సీసపద్యంలో ఒక క్రమాలంకారం ఉన్నది. ఎత్తుగీతిలోని నాలుగు అంశాలకూ, సీసపద్యంలోని నాలుగు పాదాలకూ క్రమంగా అన్వయించే భావసౌజాత్యం ఉన్నది. అదే ఇందులోని అందం.

3. ఆమె మొదట గంధర్వశ్రేష్ఠులుగా పిలువబడుతున్న భర్తలను ప్రస్తావించింది. ఆరంభించిన కార్యాన్ని ఎంత దుష్కరమైనా, చివరి వరకు సాగించి ఫలాన్ని సాధించే ప్రభువులు (నామీద అధికారం ఉన్నవారు. నన్ను పాలించేవారు)గా నిరూపించుకొనండని వారిని హెచ్చరించింది. ఆపైన ఉపకీచకుల దురంతాన్ని చెప్పింది. యుద్ధంలో మృత్యుదేవతనైనా పరాక్రమంతో పరిమార్చగల వీరులారా! ఉపకీచకులను చంపకుండా విడవబోకండి అని హెచ్చరించింది. మూడవ మాటగా-నన్ను రక్షించాలి అని కోరింది. అందుకే దుష్టులైన శత్రువులైనా రక్షించుమని కోరితే కరుణ చూపిస్తారు మీరు. నేను మీ భార్యను, పతివ్రతను- నేను కోరితే రక్షించరా? అని ప్రార్థించింది. నాలుగవ మాటగా- వేగంగా రమ్మని పిలిచింది. ఎందుకంటే, కోరేవారికి వారు ప్రాణాలను సైతం ఇవ్వటానికి తొందరపడతారట! ఆ తొందరనే తనపట్ల చూపించుమన్నది. పద్యమంతా చదివితే కార్యసాధనకు అనుగుణంగా భర్తల గుణగణాలను ఒక క్రమంలో ప్రశంసిస్తూ ప్రస్తుత కర్తవ్యాన్ని ప్రబోధించినట్లున్నది. ద్రౌపది విషాదంలో కూడా విజ్ఞతను కోల్పోని విదుషీమణి. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీముఁడు ఉపకీచకులం జంపి ద్రౌపదిని విడిపించుట (సం.4-22-16)

చ. అని పలవించు నయ్యెలుఁగు లాపవమానతనూజుఁ డేర్పడన్
విని, మది 'నాదు వల్లభకు వీండ్రును గ్రమ్మఱ నింతసేసిరే!'
యనుచు సరోష సంభ్రమత నాయితమై వెసఁబాఱి వప్ర లం
ఘన మొనరించె గుప్తముగ గ్రక్కున ముట్టెడుదానికిం దగన్. 23

ప్రతిపదార్థం: అని= ఆవిధంగా అంటూ; పలవించు= పలవరించే; ఆ+ఎలుఁగులు= ఆ కూతలు; ఆ పవమానతనూజుఁడు= వాయునందనుడైన ఆ భీముడు; ఏర్పడన్ విని= స్పష్టంగా విని; మదిన్= తన మనసులో; నాదు వల్లభకున్= నా ప్రియురాలికి; వీండ్రును= ఈ ఉపకీచకులుకూడా; క్రమ్మఱన్= మరల; ఇంత+చేసిరే!= ఇంతపని చేశారా!; అనుచున్= అనుకొంటూ; సరోషసంభ్రమతన్= కోపంతో కూడిన తొందరతో; ఆయితము+ఐ= సిద్ధమై; వెసన్+పాఱి= శీఘ్రంగా పరుగెత్తి; గ్రక్కునన్= త్వరగా; ముట్టెడు దానికిన్= శత్రువులను ఎదుర్కొనటానికి; తగన్= తగునట్లుగా; గుప్తముగన్= రహస్యంగా; వప్రలంఘనము= కోట ప్రాకారాన్ని దూకటం; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: ఆ విధంగా (వేర్వేర వరుసగా వెల్వడిన) ఆమె మొరలను భీమసేనుడు స్పష్టంగా విని, తన మనస్సులో(తన ప్రియురాలికి) 'వీరు (ఉపకీచకులు) మళ్ళీ ఇంతపని చేశారే' అని కోపోద్రేకంతో ఊగిపోతూ యుద్ధానికి సిద్ధమై శీఘ్రంగా పరుగెత్తి వారితో తలపడటానికి రహస్యంగా కోట ప్రాకారాన్ని దూకాడు.

విశేషం: 1. ద్రౌపది రోదనలు భీముడి చెవులబడ్డాయి. అతడికి రోషం పొంగుకొని వచ్చింది. 'నా భార్యయెడల వీళ్ళు కూడా ఇంత చేస్తారా? అని మనసులో మండిపడ్డాడు. నా భార్య అనటంలో అనురాగం. వీళ్ళు కూడా అనటంలో కీచకుడివలెనే వీళ్ళు కూడా అనే కోపభావం, నేను లెక్కచేయని అల్పులైన వీళ్ళు కూడా అనే తృణీకారభావం, వీరు మరలా ఇంత చేశారే అనటంలో వీరు కీచకుడివలెనే తమను చంపదగినంత పని చేశారే! అని ఆశ్చర్యభావం. వీరు మరల ద్రౌపదికి ఇంత భంగపాటు కలిగించారే! అని రోషభావం ప్రకటించాడు. 'ఇంత' అనే మాటలో అతడి కోపమంతా వ్యంగ్యం. శత్రుకృత అపకారం భీముడి మనస్సులో యుద్ధానికి పూనుకొనే క్రోధాన్ని రేకెత్తించింది. మరల పోరుకు సిద్ధమయ్యాడు. క్షణం వృథా కాకుండా వేగంగా పరుగెత్తాడు. వేగంగా, రహస్యంగా శ్మశాన ప్రాంతం చేరే అడ్డత్రోవ త్రొక్కాడు. అడ్డంగా ప్రాకారం వస్తే గుట్టుగా దూకి పరుగెత్తాడు. ఉపకీచకులు చేరవలసిన శ్మశానప్రాంతానికి వారి కంటె ముందే చేరి ఎదురుదాడి చేయాలని నిశ్చయించాడు. భీముడి కోపవేగంతో పాటు అతడి కార్యవేగం కూడా పెరిగింది. పద్యరచన కూడా దానికి తగినట్లు చిన్న చిన్న పదాలతో వేగంగా సాగింది.

2. 'వీండ్రును గ్రమ్మర నింత సేసిరే!' అనే మాట కథాపరంగా శిల్పరహస్యాన్ని ధ్వనింప చేస్తున్నది. కీచకుడే ఒక ఉత్కంఠ దశను (Climax)ను సృష్టించాడు. ఇప్పుడు ఉపకీచకులు కూడా ఆ ఉత్కంఠపై మరొక ఉత్కంఠను(Anti-climax) కలిగించారని భావం. తిక్కన రచనలో విరాటపర్వ తృతీయాశ్వాస ప్రబంధానికి ఇదొక ఉదాత్తారంభం. (వివరాలకు పీఠిక చూడండి). 'క్రమ్మఱన్' అన్నప్పుడు భీముడు ద్రౌపది వేసికొన్న రహస్య వ్యూహం తిరగబడేటట్లు ఇంత ప్రతిఘటన చేశారే! అని ఆశ్చర్యపడ్డాడని కూడా చెప్పవచ్చును.

3. 'గుప్తముగన్' (అంటే రహస్యంగా) భీముడు ఈ పని అంతా చేశాడని తిక్కన పేర్కొన్నాడు. ఇది అజ్ఞాతవాస నియమభంగం కాకుండా అని తాత్పర్యం. వ్యాసుడి రచనలో దీనికిభిన్నమైన సన్నివేశం ఉన్నది. ద్రౌపది రోదన వినగానే భీముడు పడకమీది నుండి ఎగిరి దూకాడు.

"అహం శృణోమి తే వాచం త్వయా సైరంధ్రి భాషితమ్

తస్మాత్ తే సూతపుత్రేభ్యో భయం భీరు న విద్యతే' (4-22-16) అని అతడు కూడా ఎలుగెత్తి సమాధానమిస్తూ ధైర్యం చెప్పినట్లున్నది. ఇది ఉచితం కాదు. అతడు అనుకొంటే బాగుంటుందే కాని అరిస్తే రసాభాసమౌతుంది. అందరూలేస్తారు. కార్యభంగమౌతుంది. అందువలన తిక్కన ఈ మాటలను గ్రహించక రహస్యాన్ని రక్షించాడు. ఔచిత్యాన్ని పోషించాడు. (సంపా.)

తే. **ఇట్లు లంఘించి పోయి పరేతభూమి । యొద్ద నలుదిక్కులును జూచి యొక్క యున్న**
తావనీజంబు వెఱికి రౌద్రాతిరేక । మడర భుజశిఖరంబునయం దమర్చి. **24**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ చెప్పినట్లుగా; లంఘించిపోయి= కోటగోడ దూకిపోయి; పరేతభూమి+ఒద్దన్= శ్మశానం దగ్గర; నలుదిక్కులును+చూచి= నాలుగు దిక్కులు చూచి (అనగా కలయచూచి); ఒక్క+ఉన్నత+అవనీజంబు= ఒక పెద్ద చెట్టును; పెఱికి= త్వరగాపైకిలాగి; రౌద్ర+అతిరేకము+అడరన్= కోపాతిశయం కలుగగా; భుజశిఖరంబునన్+అందున్+అమర్చి= భుజంమీద పెట్టుకొని.

తాత్పర్యం: ఈ విధంగా ప్రాకారం మీదుగా దూకిపోయి శ్మశానం దగ్గరకు చేరి నాలుగు దిక్కులా కలయచూచి ఒక పెద్ద చెట్టును తొందరగా పెఱికి రౌద్రాతిశయంతో భుజంమీద పెట్టుకొని.

విశేషం: భీముడు నిరాయుధుడుగా ఉన్నప్పుడు శత్రువులపై దాడి చేయవలసివస్తే అతడెన్నుకొనే సహజమైన ఆయుధం ఒక ఎత్తైన చెట్టు, గద తరువాత ఆయనకు వృక్షమంటే అంత అభిమానం. దానినే గదగా త్రిప్పి ఫలితాలను సాధించగలడు. అలనాడు విరాటసభలో, ఈనాడు శ్మశాన ప్రాంతంలో శత్రు మర్దనం కొరకు చెట్లనే పెరకబూనటం విశేషం! అయితే ఇప్పుడు భీముడు వంటల వాడుగా ఉండటం కూడా ఈ అలవాటుకు తోడ్పడింది. శ్మశాన వృక్షాన్ని బుజాన పెట్టుకొని ఆ ప్రాంతంలో నిలవటం మరొక విశేషం! వల్లకాటిలో వెలసిన యమధర్మరాజు వలె ఉంటాడు. చీకట్లో చూచేవారికి గుండెలు గుభేలుమంటాయి. సందర్భానికి తగిన ఆంగికాభినయం నాటకీయతకు మెరుగుపెట్టుతుంది. (సంపా.)

మ. **వికట భ్రూకుటి ఘోర ఫాలకలిత స్వేదోద్భటుండుం, జల**
ద్వికృతోష్ఠద్వయుఁడుం, బ్రవర్ధన దశావిర్భావ సంభావితాం
గకుఁడుం, జిత్త విదాహదోహల సమగ్రక్రోధ వేగుండు నై
బకవిధ్వంసకుఁ డయ్యెడన్ నిలిచె శుంభన్మూర్తి విస్ఫూర్తితోన్. **25**

ప్రతిపదార్థం: వికట భ్రూకుటి= వికారమయిన బొమముడి వలన; ఘోర= భయంకరమయిన; ఫాల= నుదుటి భాగాన; కలిత= కూడిన; స్వేద+ఉద్భటుండున్= మిక్కుటమైన చెమట చేత శూరుడైన వాడునూ; చలత్= కదలుతున్న (కోపంతో వణుకుతూ ఉన్న); వికృత+ఓష్ఠద్వయుఁడున్= వికారమయిన పెదవుల జంట కలవాడున్నూ; ప్రవర్ధన దశా+ఆవిర్భావ సంభావిత+అంగకుఁడున్= బాగా పెరుగుతున్న స్థితియొక్క పుట్టుకచేత చక్కగా తెలియబడిన శరీరం కలవాడున్ను; చిత్తవిదాహ= మనసును ఉడుకెక్కించే; దోహల= ఉత్సాహంతో; సమగ్ర= నిండైన; క్రోధవేగుండును+ఐ= కోపతీవ్రత కలవాడునూ అయి; ఆ+ఎడన్= అక్కడ; బక విధ్వంసకుఁడు= బకుడనే రాక్షసుడిని చంపినవాడైన భీముడు; శుంభత్+మూర్తి విస్ఫూర్తితోన్= భయంకరాకారంతో; నిలిచెన్= నిలిచాడు.

తాత్పర్యం: వంపులు తిరిగిన కనుబొమలతో భయంకరంగా మారిన నుదుటిమీద బాగా చెమటపట్టిన శూరుడూ, కంపిస్తూ విడ్డూరంగా కనబడుతున్న పెదవుల జంట కలవాడూ, కోపావేశంతో ఉప్పొంగే దశలను స్పష్టంగా ప్రదర్శిస్తున్న శరీరం కలవాడూ, మనస్సు మండే ఉత్సాహంతో నిండైన క్రోధోద్రేకాన్ని ప్రకటిస్తున్నవాడూ అయిన బకాసుర విధ్వంసకుడైన భీముడు ఆ సమయంలో అక్కడ చూడ భయంకరమైన ఆకారంతో నిలబడ్డాడు.

విశేషం: అలం: ఉదాత్తం. భీముడు ఉగ్రుడయ్యాడు. కోపతీవ్రత వలన అతడికి సాత్త్వికోదయమైనది. తిక్కన భీముడి కోపరూపాన్ని తన ముద్రతో నిలపటం పరిపాటి. 'వికటభ్రూకటి' అనే ఎత్తుగడ రౌద్రరసవిస్ఫూర్తిని ప్రకటించే ప్రారంభం. కనుబొమలు వంపులుగా తిరగటం వలన నుదురు ఘోరంగా (భయంకరంగా) కనబడటం మొదటి దశ. ఇది క్రోధావిర్భావాన్ని సూచిస్తుంది. నుదురు మీద దట్టంగా చెమట పట్టటం శత్రువులు చేస్తున్న ఆగడాన్ని సహించలేని ఉద్వేగాన్ని ప్రకటిస్తుంది. అప్పుడు అతడు ఉద్భటుడివలె (ఉద్ధతుడివలె) కనపడతాడు. అతడి రెండు పెదవులూ వింతగా చలిస్తాయి. ఈ సాత్త్వికభావం ప్రతీకారభావ తీవ్రతను ప్రకటిస్తుంది. వెంటనే అతడి శరీరం దశలవారీగా ఉప్పొంగుతుంది. అభినయరీత్యా భీముడిలోని కోపం అనే సంచారి భావం క్రోధం అనే స్థాయిగా మారే దశావిస్ఫూర్తిని అది ప్రదర్శిస్తుంది. హృదయం మండటం శత్రుసంహారం చేసే దమనశక్తియొక్క పరిపూర్ణావిష్కారం. దాని బకవిధ్వంసకు డనే విశేషం సార్థకం. బకుడనే రాక్షసుడిని చంపినప్పుడు ఎంత భీకరంగా ఉన్నాడో ఇప్పుడూ అట్లాగే ఉన్నాడని ఒక అర్థం. ఎదుటపడిన వారిని చంపిగాని వదలని ఉగ్రతతో ఉన్నాడని మరొక అర్థం. బకము అంటే కొంగ. ఆ అర్థం అట్లా ఉంచితే వ్యుత్పత్త్యర్థం ప్రకారం. "బకతి కుటిలో భవతీతి వా బకః. బక కౌటిల్యే; కుటిలమై ఉండేది" (గురుబాలప్రబోధిక) అని ఏర్పడి, కుటిలురైన ఉపకీచకులను పూర్తిగా ధ్వంసం చేయాలనే దృఢ సంకల్పంతో ఉన్నవాడని మరొక విశేషార్థం-ప్రస్తుతానికి పనికివచ్చే బలమైన అర్థం మనకు స్ఫురిస్తాయి. శుంభత్+మూర్తితో నిలిచాడనటం భీముడు పరిపూర్ణ క్రోధభావావతారంగా కనబడే రూపవిస్ఫూర్తితో నిలిచి ఉన్నాడని భావం. భీముడి రౌద్ర విభావ విస్ఫూర్తిని వికాస దశలతో చిత్రించిన భావచిత్ర మిది. ఉదాత్తాలంకారంతో ఉదాత్తమైనది. నాటకీయకతకు నాణ్యమైన ఉదాహరణమైనది.

2. క్రోధరసానుకూలంగా శబ్దార్థ గుణమైన ఓజస్సు ఇందులో పోషించబడింది. ఇందులో గాఢబంధరూపమైన శాబ్దికమైన ఓజస్సు అర్థప్రౌఢిని ప్రదర్శించే అర్థగుణమైన ఓజస్సుకు పోషకం కావటం తిక్కన రచనాశిల్పం. (సంపా.)

వ. తదనంతరంబ. 26

తాత్పర్యం: ఆ మీదట.

ఆ. సూతుశవముతోడ నేతెంచు నెరవులు । దవ్వు దవ్వులన యుదగ్రరూప
కలితుఁడైన భీముఁ గనుఁగొని నడవక । నిలిచి దంత నంతఁ గలఁగఁబాటి. 27

ప్రతిపదార్థం: సూతుశవముతోడన్= కీచకుడి శవంతో; ఏతెంచు= వస్తూ ఉన్న; నెరవులు= అనుచరులు; దవ్వుదవ్వులను+అ= దూరదూరంగానే; ఉదగ్రరూప కలితుఁడు+ఐన= భయంకరమైన ఆకారం కలిగిన; భీమున్= భీముడిని; కనుఁగొని= చూచి; కలఁగన్+పాటి= కలతచెంది; నడవక= నడవలేక, ముందుకు అడుగువేయలేక; అంతన్+అంతన్= అంతంత దూరాననే; నిలిచిరి= నిలిచిపోయారు.

తాత్పర్యం: కీచకుడి శవం వెంట అనుసరించి వస్తున్న ఉపకీచకులు ఎదుట భయంకరాకారంతో నిలబడి ఉన్న భీముడిని దూరదూరాలనుండే చూచి గుండె లవిసిపోగా అడుగులు ముందుకు సాగక ఎక్కడివారు అక్కడే ఆగిపోయారు.

మ. 'ఇదె గంధర్వులు వచ్చి ముట్టికొనిరిం కెట్లొక్కొ! యంచున్ భయం
బొదవం బల్లములందు డాఁగియు, సమీపోర్వీజముల్ ప్రాఁకియుం,
జెదరం బాఱియు, నీరు సొచ్చియును, నిశ్చేష్టం బదద్వంద్వముల్
గుదివడ్డం బెగడొందియున్ భరిత సంక్షోభాత్ములై రత్తఱిన్'. 28

ప్రతిపదార్థం: ఇదె గంధర్వులు వచ్చి ముట్టికొనిరి= ఇదిగో గంధర్వులు వచ్చి చుట్టుముట్టారు; ఇంకన్+ఎట్లు+ఒక్కొ!= ఇక ఎట్లాగో, ఇకమీద ఏమవుతుందో; అంచున్= అని అంటూ; భయంబు+ఒదవన్= భయం కలుగగా, పల్లములందున్ +డాఁగియున్ = లోతట్లలో (గుంటలలో) దాగికొనీ; సమీప+ఉర్వీజముల్ ప్రాఁకియున్= దగ్గరనున్న చెట్ల మీదకు ప్రాకిపోయీ; చెదఱన్+పాఱియున్= అటూ ఇటూ చెల్లాచెదరుగా పరుగెత్తియూ; నీరుచొచ్చియును= నీళ్ళలో (మునిగి) దాగీ; నిశ్చేష్టన్= కదలికలు లేక కొయ్యబారి; పదద్వంద్వముల్= రెండు పాదాలూ; గుదివడ్డన్= కట్టువడగా, స్తంభించగా; బెగడొందియున్= భయపడియు; ఆ+తఱిన్= ఆసమయంలో; భరిత సంక్షోభ+ఆత్ములు+ఐరి= కలతతో నిండిన మనస్సులు కల వారైనారు.

తాత్పర్యం: 'అరుగో గంధర్వులు (సైరంధ్రి భర్తలు) వచ్చి మనలను చుట్టుముట్టారు. ఇక వారిబారి నుండి తప్పించుకొనటం ఎట్లాగో ఏమో!' అంటూ మనసులో భయం పెచ్చురేగగా, కలతపాటు క్రమ్ముకోగా ఉపకీచకులు పల్లపు ప్రాంతాలలో దాగుకొన్నారు. సమీపంలో ఉన్న చెట్లమీదకు ఎగబ్రాకారు. చెల్లాచెదురుగా పరుగెత్తారు. నీటిలో మునిగి కూర్చున్నారు. భయంతో నిశ్చేష్టులై కాళ్ళాడక స్తంభించిపోయారు.

విశేషం: భీముడి రూపం భయంకరం. అతడిని చూచిన ఉపకీచకులకు భయం ముంచుకొని వచ్చింది. చెట్టును భుజంమీద పెట్టుకొని నిలుచున్న భీముడు యముడివలె వారికి అనిపించాడు. రారనుకొన్న గంధర్వులు వచ్చారనుకొన్నారు. కనబడింది ముందున్న ఒక్కడే కాని మిగిలిన నలుగురూ తమను నాలుగువైపులా క్రమ్ముకొని ఉన్నారని గజగజలాడారు. ధీరులు కారు కాబట్టి ఎదురు నిలవలేకపోయారు. ప్రాణాలు కాపాడుకొనే పాట్లుపడ్డారు. చావంటే అన్న చావే జ్ఞాపకం వచ్చే ఉపకీచకులకు గంధర్వుల చేతిలో చావు మూడిందంటే ఎంత భయమో ఊహించవచ్చును. వీలైన రహస్య ప్రాంతాల్లో దాగి ఉండిపోయారు. కనీసం వారందరు కలిసి ఒక సంఘటిత ప్రయత్నం చేయలేదు. గొర్రెల మూకవంటి అనుచరులే వారు. నాయకులు కారు. వారి నాయకుడైన సింహబలుడు చనిపోవటంతో వారిలో సంఘటిత భావం లోపించింది. చెల్లాచెదరయ్యారు. అన్నను ఆ రాత్రే దహించాలనుకొనటం, రాజు అనుమతి పొందటం, సైరంధ్రిని కీచకశవానికి అంటగట్టి శ్మశానానికి తీసికొని రావటం మొదలైన అంశాలు అవివేకులూ గోలచేసే రౌడీమూకలూ చేసే చేష్టలే కాని వీరోచిత కార్యాలు కావు. ఇవి పఠితలకు హాస్యం కలిగించవచ్చును కాని, భీముడికి అవహేళనాత్మకమైన కోపావేశాన్ని కలిగిస్తాయి. ప్రతీకారం చేయలేని పగవారిని చెట్టుతో బాది చంపితే చాలు. ప్రతిఘటన లేని విజయాన్ని అవలీలగా సాధించవచ్చును. గంధర్వ భయం భీముడి పనిని తేలికచేసింది. (సంపా.)

ఉ. సూతులు భీతులై ద్రుపదసూతి సమేతముగాఁగ నగ్రజ
ప్రేతమువైచి, వీటి దెసఁ బెల్లుగఁ బాఱఁ దొడంగినన్ వడిన్
వాతసుతుండు ముట్టికొని వారి బడల్పడ వ్రేసి యందఱం
జేతులతీఁట వో నుఱుము సేసె విశృంఖల విక్రమంబునన్. 29

ప్రతిపదార్థం: సూతులు= ఉపకీచకులు; భీతులు+ఐ= భయపడినవారై; ద్రుపదసూతి సమేతముగాఁగన్= ద్రౌపదితో కూడా; అగ్రజప్రేతమున్= తమయన్న కీచకుడి శవాన్ని; వైచి= నేలమీద పడవేసి; వీటిదెసన్= ఊరివైపునకు; పెల్లుగన్= మిక్కిలిగా;

పాఱన్+తొడంగినన్= పరుగిడ సాగగా; వడిన్= వేగంగా; వాతసుతుండు= వాయుకుమారుడు భీమసేనుడు; ముట్టికొని= తాకి; వారిన్= ఆ ఉపకీచకులను; బడల్పడన్+వ్రేసి= చావగొట్టి; అందఱన్= వారందరిని; చేతుల తీఁట+పోన్= చేతి దురద పోయేటట్లుగా; విశృంఖల విక్రమంబునన్= అడ్డులేని పరాక్రమంతో; నుఱుము+చేసెన్= నుగ్గునుగ్గు చేశాడు.

తాత్పర్యం: ఉపకీచకులు భయపడి ద్రౌపదితో కూడా తమ అన్న శవాన్ని క్రింద జారవిడిచి ఊరిదిక్కుగా వేగంగా పరుగెత్తసాగారు. భీమసేనుడు మిక్కిలి వేగంగా వారిని వెన్నంటి తాకి చేతుల దురద తీరేటట్లుగా వారిని చావమోది అదుపులేని ఆవేశంతో వారినందరినీ నుగ్గునుగ్గు చేశాడు.

విశేషం: 1. పరుగెత్తే శత్రువులపై సుడిగాలివంటి దాడి చేసి వారిని చంపటం ఇందులోని విశేషం. తిక్కన భీముడిని వాయుసుతుడని పేర్కొన్నాడు. వాయుసుతుడు కాబట్టే క్రమ్ముకున్నాడు. ఉపకీచకులు ప్రాణాలను (ప్రాణవాయువులను) రక్షించుకొందామని శవాన్ని క్రింద పారవేసి పరుగెత్తారు. (వాయుతనయుడు వారి ప్రాణాలు తీశాడు) అంటే వారు ఆరంభించిన కార్యాన్ని వదలి పెట్టారన్నమాట. వారు పురం వైపు దారి పట్టారు. వెంటనే భీముడు వారిని చుట్టుముట్టాడు. దొరికిన వారిని దొరికనట్లు, వీలైన విధంగా చెట్టును తిప్పుతూ, దానితో చుట్టుతూ విశృంఖలంగా వీరవిహారం చేశాడు. ఉపకీచకులను చావమోదాడు. అంతటితో కసి తీరక చేతుల తీట తీరేటట్లు వారిని నుగ్గునుగ్గు చేశాడు. అంటే- భీముడు కీచకుడిని ముద్ద చేశాడు. ఉపకీచకులను నుగ్గు చేశాడు.

2. చేతుల తీట తీరేటట్లు-అని లోకోక్తి, యుద్ధంలో శత్రువులను చంపాలనే అభిలాష తీరేంత వరకు అని అర్థం. ఉపకీచకులను చంపి ఊరుకొనకుండా, వారిని వృక్షంతో బాది నుగ్గుచేసి, గంధర్వులు చంపే పద్ధతి విచిత్రమని లోకానికి చాటి చెప్పాడు. విరాటుడు కూడా కీచకోపకీచకులను గంధర్వులే రూపుమాపారని నమ్మింది ఇందువలననే. (చూడు 30వ వచనం) (సంపా.)

వ. ఇవ్విధంబున నూటయేవు రుపకీచకులను సమయించి శమిత క్రోధుండై వచ్చి, పాంచాలికి బంధ మోక్షంబు గావించి, 'యింక నిశ్చింతంబున సుదేష్ణ మందిరంబునకుం జను'మని యవ్వెలందిని వీడుకొలిపి, తానును వేఱొక మార్గంబున మహానస గృహంబున కరుగుదెంచెఁ; దత్సమయంబున విరాటుండు కీచకానుజులు గంధర్వులచేత నిరవశేషంబుగా మృతిం బొందిరని విని, చకితచేతస్కుం డగుచు సహోదర మరణ శోకా యత్తచిత్త యయిన జీవితేశ్వరి నుచితాలాపంబుల ననునయించి యిట్లనియె. 30

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; నూట+ఏవురు= నూటయిదుమంది; ఉపకీచకులను; సమయించి= చంపి; శమిత క్రోధుండు+ఐ= శాంతించిన కోపం కలవాడై; వచ్చి= దగ్గరకు వచ్చి; పాంచాలికిన్+బంధమోక్షంబు+కావించి= ద్రౌపది కట్లూడదీసి; ఇంకన్= ఇకమీద; నిశ్చింతంబునన్= ఏ చింత లేకుండా; సుదేష్ణ మందిరంబునకున్+చనుము= సుదేష్ణ అంతః పురానికి వెళ్ళుము; అని= అంటూ; ఆ+వెలందిన్= ఆమెను (ద్రౌపదిని); వీడుకొలిపి= పంపి; తానును= తాను (భీముడు)కూడా; వేఱు+ఒకమార్గంబునన్= ఇంకొకదారిలో; మహానస గృహంబునకున్= వంట యింటికి; అరుగుదెంచెన్= వచ్చాడు; తద్+సమయంబునన్= ఆ సమయంలో; విరాటుండు= విరాటుడు; కీచక+అనుజులు= కీచకుడి తమ్ములు; గంధర్వుల చేతన్= గంధర్వులచేత; నిరవ శేషంబుగాన్= శేషం లేకుండా; మృతిన్+పొందిరి+అని విని= చనిపోయారని విని; చకితచేతస్కుండు+ అగుచున్= భయపడిన మనస్సు కలవాడౌతూ; సహోదర మరణ= తోబుట్టువుల చావు వలన; శోక+ఆయత్తచిత్త+అయిన= దుఃఖానికి అధీనమైన మనస్సు కలిగి ఉన్న; జీవిత+ఈశ్వరిన్= తన భార్యను (సుదేష్ణను); ఉచిత+ఆలాపంబులన్= తగిన మాటలతో; అనునయించి= ఓదార్చి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా ఉపకీచకులను చంపి, కోపం శాంతించగా చల్లబడి, భీముడు ద్రౌపది కట్లూడదీసి, నిశ్చింతగా 'సుదేష్ణ మందిరానికి పొ'మ్మని చెప్పి ఆమెను వీడుకొలిపాడు. తాను మరొకదారిలో వంటయింటికి చేరాడు. అపుడు విరాటుడు కీచకుడి తమ్ములు గంధర్వుల చేత నిశ్శేషంగా చనిపోయారని విని కంపించిన మనస్సుతో, తోబుట్టువుల చావుకు అమితంగా శోకిస్తున్న తన ఇల్లాలిని తగిన మాటలతో ఓదార్చి ఇట్లా అన్నాడు.

ఆ. 'చంద్రవదన! యింక సైరంధ్రి నిచ్చోటు । వాపవలయు నేమిభంగినైనఁ;
గాన నాదు పలుకుఁగాఁ జెప్పు వెడలుట । కనుగుణముగ నమ్మృగాక్షితోడ. 31

ప్రతిపదార్థం: చంద్రవదన!= ఓ చంద్రముఖీ!; ఇంకన్= వెంటనే; ఏమిభంగిన్+ఐనన్= ఏ ఉపాయంతోనైనాసరే; సైరంధ్రిన్; ఈ+చోటున్+పాపవలయున్= అంతఃపురంనుండి తొలగించాలి; కానన్= అందువలన; ఆ+మృగ+అక్షితోడన్= లేడి కన్నుల వంటి కన్నులుగల ఆ సైరంధ్రితో; వెడలుటకున్+అనుగుణముగన్= వెళ్ళుటకు తగినట్లుగా; నాదు పలుకుఁగాన్= నా మాటగా; చెప్పు= చెప్పుము.

తాత్పర్యం: 'ఓ చంద్రముఖీ! వెంటనే సైరంధ్రిని ఏదో ఒక సాకుతో ఈ చోటు నుండి పంపివేయాలి. అందుకు తగిన విధంగా ఆమెతో నా మాటలుగా చెప్పుము.

విశేషం: విరాటుడు సైరంధ్రి నేవిధంగానైనాసరే అంతఃపురం నుండి వెంటనే పంపివేయాలని నిర్ణయం తీసికొనటానికి రెండు కారణాలు కనబడుతున్నాయి. 1. అంతవరకు రాజ్యంలో కీచకుడు ఎదురులేనివాడుగా ఉండేవాడు. ఇప్పుడు అతడినీ, అతడి తమ్ములనూ తన భర్తలచేత అపూర్వంగా చంపించి సైరంధ్రి ఎదురులేని శక్తిగా రూపొందింది. ఇక ఆమె ఆడింది ఆట కాగలదు. ఆమె మాటను కాదనటానికి విరాటుడికి వీలులేకపోవచ్చును. 2. పోగా, నిన్న కీచకుడు సైరంధ్రిని తన యెదుటే అవమానించినప్పుడు ఆమె తనకు మొరపెట్టుకొన్నది. తా నేమీ చేయలేకపోయాడు. ఆమె తనను తానే రక్షించుకొన్నది. ఈనాడు మరల సభకు వచ్చి నలుగురిలో తనకు ఆమె నగుబాట్లు తెస్తుందేమో అని భయం. ఈ రెండింటినీ విరాటుడు బైటపెట్టడు. అంతే కాదు, సైరంధ్రితో ఎదుటపడి మాట్లాడే ధైర్యం అతడికి లేదు. అందువలన ఆమెను భార్య ద్వారా వదిలించుకొందామని యత్నించాడు. సుదేష్ణ సైరంధ్రికి యజమానురాలు కాబట్టి ఆమె ఆ పని చేయాలని కోరాడు. అయితే ఆమె సంవత్సరకాలం సైరంధ్రీ వృత్తితో ద్రౌపదిని ఉంచుకొంటానని మాట ఇచ్చింది. ఆ మాట తప్పుతుందేమో అని సుదేష్ణ అనుమానించవచ్చునని విరాటుడు- అది తన ఆజ్ఞగా చెప్పుమన్నాడు. అన్నిటి కంటె రాజాజ్ఞ దాటరానిది. దానిని వాడుకొంటున్నాడు విరాటుడు. దానిని సమర్థించుకొనటానికి మరి రెండు కారణాలు (రెండు పద్యాలలో) చెప్పవలసి వచ్చింది. ఇవి రాణిని ఒప్పించటానికి అనువైన కారణాలు. విరాటుడు కూడా తెల్లవారేసరికే భార్యను ఓదార్చటం, సైరంధ్రిని సాగనంపటం చేయాలని యత్నించటం అతడి భయాందోళనలను తెలుపుతున్నది. గంధర్వ భయం రాజ్యాన్ని ఎంత కుదిపివేసిందో తెలియటానికి విరాటుడే సాక్ష్యం. (సంపా.)

ఆ. పురుషు లా లతాంగి పొరువునఁ బోయినఁ । జేటువచ్చుఁ గానఁ జెప్ప నేను
వెఱతు; నాఁడువారు వెరవుతో మృదువచో । రచనఁ జెప్పు టరయ నుచిత వృత్తి. 32

ప్రతిపదార్థం: పురుషులు= మగవారు; ఆ లతా+అంగి పొరువునన్+పోయినన్= ఆ అందగత్తె ప్రక్కన నడిచినా; చేటువచ్చున్= అపాయం వస్తుంది; కానన్= కాబట్టి; ఏను= నేను; చెప్పన్+వెఱతున్= స్వయంగా చెప్పటానికి భయపడుతున్నాను; ఆఁడువారు= స్త్రీలు; వెరవుతోన్= ఉపాయంతో; మృదువచస్ (ః)+రచనన్= మెత్తని మాటల కూర్పుతో; చెప్పుట= చెప్పటం; అరయన్= చూడగా; ఉచిత వృత్తి= తగిన పద్ధతి.

తాత్పర్యం: ఆ అందగత్తెప్రక్కకు మగవారు పోతే ప్రమాదం వస్తుంది. కాబట్టి నేను చెప్పటానికి భయపడుతున్నాను. స్త్రీలయితే మెత్తని మాటల నేర్పుతో ఉపాయంగా చెప్పుతారు. అదే సరైన పద్ధతి. (సైరంధ్రిని వెడలనంపటానికి సుదేష్ణ తగినదని భావం.)

విశేషం: సుదేష్ణకు నచ్చచెప్పే యత్నంలో విరాటుడు పేర్కొన్న మొదటి హేతు విది. జరిగిన కథను సమీక్షిస్తే మగవారు ఆ మగువను సమీపిస్తే చాలు-ప్రమాదం వచ్చేటట్లున్నది. కాబట్టి తాను ఆమెకు ముఖాముఖి చెప్పనన్నాడు. ఇది భర్త ప్రాణాల మీద గౌరవమున్న సుదేష్ణకు తప్పక నచ్చుతుంది. పురుషుల పొత్తే ప్రమాదమైతే, పరుషంగా పలికితే మరెంత ప్రమాదమో! అందువలన విరాటుడు తాను ఆమెను వెళ్ళిపొమ్మని చెప్పలేనని తన భయాన్ని బయటపెట్టాడు. ఆమీద సుదేష్ణనే స్వయంగా చెప్పుమని నిర్దేశించకుండా నిపుణంగా ఆడువారందరిమీదా పెట్టి మాట్లాడాడు. ఆడువారికి ఆడువారే అనువుగా, మృదువుగా కోపం రాకుండా అంగీకరించేటట్లు నచ్చచెప్పకలుగుతారు. కాబట్టి ఆ నేర్పరితనాన్ని ప్రయోగించుమన్నాడు. అంటే-సుదేష్ణ స్వయంగాగానీ, మరొకరి ద్వారాగానీ, లేక సమష్టిగాగానీ ఆ కార్యాన్ని నిపుణంగా పూర్తి చేయాలని విరాటుడి సంకల్పం. ఈ హేతువు వలన కార్యభారం సుదేష్ణమీద ఉంచటం జరిగింది. (సంపా.)

ఉ. **ఆ కమలాక్షి రూప మహిమాతిశయంబు మనోహరంబు; భో**
గైక పరాయణుల్ పురుషు; లంగజుఁ డప్రతికార చేష్టిత
స్వీకృత లోకుఁ; డట్లగుటఁ జేటు పురంబునవారి కెప్పుడుం
గా కెటు లుండు? నిట్టి యవగాఢపుఁ బొత్తు మనంగ వచ్చునే?' **33**

ప్రతిపదార్థం: ఆ కమల+అక్షి రూప మహిమ+అతిశయంబు మనోహరంబు= ఆ కలువకంటియొక్క రూప వైభవంయొక్క గొప్పతనం మనసులను హరించేది (చూచువారిని ఆకర్షించే అందమైనది); పురుషులు= మగవారు; భోగ+ఏకపరాయణుల్= విషయ సుఖాలను మరిగేవారు; అంగజుఁడు= మన్మథుడు; అప్రతికార చేష్టిత స్వీకృతలోకుఁడు= అడ్డులేనిచేష్టచేత లోకాన్ని (ప్రపంచాన్ని) లోగొన్నవాడు; అట్లు+అగుటన్= అందుచేత; పురంబున వారికిన్= ఈ నగరవాసులకు; ఎప్పుడున్= ఏ సమయంలోనైనా; చేటు+కాక+ఎటులు+ఉండున్?= కీడు కలుగకుండా ఎట్లా ఉంటుంది?; ఇట్టి= ఈవిధమైన; అవగాఢము+పొత్తున్= ప్రమాదంతో కూడిన స్త్రీయొక్క స్నేహంతో; మనంగవచ్చునే?= బ్రతుకవచ్చునా?

తాత్పర్యం: ఆ కలువకంటి రూపమా- చూచేవారిని ఆకర్షించేటంత అందమయింది. మగవారా- భావోద్రేకులు. మన్మథుడా- అడ్డం లేని చేష్టతో లోకాన్ని లోగొన్నవాడు. అందువలన ఈ నగరవాసులకు ఏ సమయంలోనైనా చేటు కలుగకుండా పోదు. ఇటువంటి ప్రమాదకరమైన స్త్రీ పొత్తుతో బ్రతుకగలమా?'

విశేషం: సైరంధ్రిని తత్క్షణం పంపివేయటానికి హేతువును ఈ పద్యంలో చెప్పాడు విరాటుడు. ఆమెది ప్రమాదకరమైన పొత్తు. అది ప్రాణాంతకం కాబట్టి వెంటనే పరిత్యాజ్యం అని చెప్పాడు. దానికి తర్కబద్ధమైన సమర్థనం చేయటం విశేషం. ఆమె పొత్తు వలన మూడు రకాల ప్రమాదాలను ఎదుర్కొనవలసివస్తుందని అతడి వాదన. (1) ఆమె అందం చూచినవారి మనస్సులను ఆకర్షిస్తుంది. (2) పురుషులు సామాన్యంగా భోగపరాయణులు కాబట్టి ఆమె అందం బారిన పడే ప్రమాదం ఉన్నది. (3) ఒకసారి ఆమె వలన ఆకర్షితులైతే చాలు-మన్మథుడు వారిమీద తిరుగులేని దాడి చేస్తాడు. వారు ఆమెకు దాసులు కాకమానరు. గంధర్వుల చేతులలో చావకమానరు. కాబట్టి ఆ చేటు మన నగరవాసుల కందరికీ తప్పదేమో! అందువలన సైరంధ్రితోడి ప్రమాదకరమైన పొత్తును కొనసాగిస్తే మరిన్ని చావులు చూడవలసి వస్తుంది. కాబట్టి వెంటనే ఆమెను సాగనంపటం మంచిదని తేల్చి చెప్పాడు. ఈ మాటలు విన్న సుదేష్ణ అనుమాన మేదీ లేకుండా విరటుడి ఆజ్ఞను పాటించక తప్పదు. అందుకే మారుమాటాడక ఆమె అంగీకరించబోతున్నది తరువాతి పద్యంలో. (సంపా.)

క. అని నిశ్చయించి పలికిన । విని కేకయరాజపుత్త్రి విభు తలఁపు మనం

బునకుఁ బ్రియం బగుటయుఁ గై। కొని యాపని యట్లచేఁతకుం బూనెఁ దగన్. 34

ప్రతిపదార్థం: అని నిశ్చయించి పలికినన్= అని నిర్ణయించి పలుకగా; కేకయ రాజపుత్రి= సుదేష్ణ; విని= విన్నదై; విభుతలంపు= తన భర్తయొక్క భావం; మనంబునకున్= తన మనసుకు; ప్రియంబు+అగుటయున్= ప్రీతి కల్గించేదికాగా; ఆ పని+కైకొని= ఆ పనిచేయబూని; అట్లు+అ చేఁతకున్= ఆ విధంగా చేయటానికి; తగన్= తగినట్లుగా; పూనెన్= పూనుకొన్నది.

తాత్పర్యం: (విరటుడు) ఆ విధంగా నిర్ణయించి చెప్పగా సుదేష్ణ విని, తన భర్త తలపు మనసుకు ప్రీతి కల్పించగా, సైరంధ్రిని పంపివేయటానికి తగిన పూనికను వహించింది.

క. అంతం గుంతీనందన । కాంతా చింతా మహాంధకారముతో న

త్యంతంబు మచ్చరించెనొ । సంతమసం బనఁ బ్రభాత సమయం బయ్యెన్. 35

ప్రతిపదార్థం: అంతన్= ఆ మీదట; కుంతీనందన కాంతా= పాండవుల పత్నియైన ఆ అందగత్తె యొక్క; చింతా= దుఃఖమనే; మహా+అంధకారముతోన్= పెనుచీకటితో; సంతమసంబు= నిండు చీకటి; అత్యంతంబు= మిక్కిలి; మచ్చరించెనొ= వైరముకొన్నదో, పోటీపడిందో; అనన్= అన్నట్లుగా; ప్రభాత సమయంబు+అయ్యెన్= తెల్లవారువేళ అయింది.

తాత్పర్యం: పాండవపత్ని అయిన ద్రౌపదికి కలిగిన దుఃఖమనే పెంజీకటితో గాఢాంధకారం మిక్కిలి వైరం పూనిందా అన్నట్లు తెల్లవారే సమయ మయింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ద్రౌపది చింత అనే మహాంధకారంతో రాత్రిచీకటి మాత్సర్యంతో పోటీపడిందా అన్నట్లు సాగింది. కీచక ఉపకీచకుల వలన ఏర్పడిన ఉపద్రవాల వలన కలిగిన చింత అంధకారం వంటిదైనా అది క్రమంగా తొలగిపోయింది. చీకటి కూడా రాత్రంతా తన ప్రతాపాన్ని చూపించినా చివరకు తెల్లవారింది. చింతతో చీకటి పోటీ పడి తానే ముందుగా తొలగిపోదామని పరుగెత్తుతున్నట్లున్నది. కాని, ఈ సందర్భంలో ఇది భావనారమణీయం. కీచకుడి శవంతో దహనం కాగలిగిన ప్రమాదం నుండి ద్రౌపది తప్పుకొన్నది. ఇంకా అంతఃపురానికి చేరలేదు. అంతకంటె ముందే చీకటి తొలగిపోయి తెల్లవారింది. ఈ సన్నివేశంలోని ఈ అర్థాన్ని ప్రకృతిపరంగా వ్యాఖ్యానించటం తిక్కన వర్ణనాశిల్పం. పాత్రల ప్రకృతిసహజ ప్రకృతితో పొందే కాలపరమైన సమన్వయం ఇందులో రమణీయం. (సంపా.)

వ. పదంపడి పద్మినీ ప్రమోద సంపత్కరుం డగు నరుణకిరణుం డుదయించె; నట మున్న పాంచాలి సచేలస్నానంబుసేసి, రాగాది వికార నిరాసనంబునం బ్రసన్నయయిన బుద్ధియుంబోలె సింహబల ప్రభృతి కీచక విధ్వంసనంబునం దెలివొంది మంద మందయానంబునం బురంబు సొచ్చి రాజవీథి నరుగు దెంచునప్పుడు. 36

ప్రతిపదార్థం: పదంపడి= ఆమీద; పద్మినీ= తామరలకు; ప్రమోద సంపత్కరుండు= సంతోషమనే సంపదను కలిగించేవాడు; అగు= అయిన; అరుణ కిరణుండు= సూర్యుడు (ఎర్రని కిరణాలు కలవాడు); ఉదయించెన్= ఉదయించాడు (సూర్యోదయమైనది); అటు+అ; మున్ను+అ= అంతకుముందుగానే (సూర్యు డుదయించటానికి ముందే); సచేల స్నానంబు +చేసి= కట్టుగుడ్డలతో స్నానంచేసి (శవాన్ని చూచినా తాకినా సచేలస్నానం చేయటం ఆచారం); రాగాది వికార= మోహం

మొదలైన వికార చేష్టలను; నిరాసనంబునన్= నిరసించటం చేత; ప్రసన్న+అయిన= నిర్మలమయిన; బుద్ధియున్+పోలెన్= బుద్ధివలె; సింహబల ప్రభృతి కీచక విధ్వంసనంబునన్= సింహబలుడు మొదలైన కీచకులను నాశనం చేయటం వలన; తెలివి+ఒంది= తేరుకొని; మందమందయానంబునన్= నెమ్మది నెమ్మదిగా సాగే నడకతో; పురంబు+చొచ్చి= నగరంలోనికి; రాజవీథిన్= రాచబాటలో; అరుగుదెంచు+అప్పుడు= వస్తున్నపుడు.

తాత్పర్యం: ఆ తరువాత- పద్మాలనే ఉత్తమ జాతి స్త్రీలకు పరమాహ్లాదాన్ని కలిగించే ఎర్రని కిరణాల సూర్యుడు తూర్పున ఉదయించాడు. అంతకుముందే ద్రౌపది శవాన్ని తాకిన దోషం పోవాలని సచేలస్నానం చేసింది. సింహబలుడు మొదలుకొని కీచకులందరూ చనిపోవటంతో రాగద్వేషాలు తొలగి నిర్మలమైన బుద్ధివలె ద్రౌపది తేరుకొన్నది. మెల్లమెల్లగా నడుస్తూ నగరంలోకి ప్రవేశించి రాజవీథిలో వస్తూ ఉండగా, (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. సింహబల ప్రభృతి కీచక విధ్వంసనం వలన తెలివొందిన ద్రౌపది-ఉపమేయం. రాగాది వికార నిరాసనంబునం బ్రసన్నమయిన బుద్ధి - ఉపమానం. పోలెన్= ఉపమావాచకం. భౌతికవస్తువులను భావద్రవ్యాలతో పోల్చటం విశేషం. ఉపమాలంకార సాదృశ్యం వలన కీచకుడు రాగదోషం వంటివాడనీ. ఉపకీచకులు వివిధ వికారాల వంటివారనీ ధ్వని. వాటిని నిగ్రహించగలిగేది బుద్ధి. రాగాదులు అణగిన తరువాత బుద్ధి నిర్మలంగా, ప్రసన్నంగా ఉంటుంది. ద్రౌపదిని ప్రసన్నబుద్ధితో పోల్చటం ఆమె హృదయప్రసన్నతను ధ్వనింపచేయుటం. సచేల స్నానం అశౌచ నివారణకు చేస్తారు. ద్రౌపది చేసిన ఇప్పటి సచేల స్నానం అరణ్యాజ్ఞాతవాసక్లేశాల నుండి ఆమెకు కలిగిన విముక్తిని ధ్వనింపచేస్తున్నది. రాజవీథిలో నెమ్మదిగా నడవటం త్వరలో ఆమెకు కలిగే రాజయోగానికి ధ్వని. (సంపా.)

సీ. **'మన కీచకుల కెల్ల మారియై పుట్టిన । సుదతి పోయెడు' నని చూచువారు;**
'నద్దిరా! నీకుఁ గ్రొ వ్వణుగదేఁ జూతుగా' కని తలసూపక యడఁగువారు;
నలవోకఁ గనుఁగొని యంతరంగము బిట్టు । బెదర మాఱుమొగంబు పెట్టువారు;
నెదురుగా వచ్చిన నెంతయేనియు దవ్వు । గలుగ వేఱొక త్రోవఁ దొలఁగువారు

తే. **ముట్టఁబడి మేనఁ గంపంబు పుట్ట నొదిగి । యుండువారుఁ, గరంబున నుదర మప్ప**
ళించి 'యమ్మరొ! రక్కసి' యంచు నుల్ల । ములుకువారునై పురజనంబులు తలంకి. **37**

ప్రతిపదార్థం: మనకీచకులకున్+ఎల్లన్= మన కీచకులందరికీ; మారి+ఐ పుట్టిన= మృత్యువుగా అవతరించిన; సుదతి= అందగత్తె అయిన స్త్రీ; పోయెడున్+అని చూచువారున్= పోతూ వున్నదని చూచేవారున్నూ; అద్దిరా!= అదేరా!; నీకున్+క్రొవ్వు+అణుగదేన్= పొగరు అణగకపోతే; చూతు(వు)గాక= ఆమెను చూస్తావులే; అని= అంటూ; తల+చూపక= తలలెత్తి చూడక; అడఁగువారున్= ఒదిగి దాగి ఉండేవారున్నూ; అలవోకన్= నెమ్మదిగా; కనుఁగొని= చూచి; అంతరంగము= మనస్సున; బిట్టుబెదరన్= మిక్కిలి భయపడగా; మాఱుమొగంబు పెట్టువారున్= ప్రక్కకు మొగం త్రిప్పుకునేవారు; ఎదురుగా వచ్చినన్= ఎదురైతే; ఎంత+ఏనియున్= దవ్వు+కలుగన్= మిక్కిలి దూరం ఏర్పడేటట్లు; వేఱొకత్రోవన్= మరొక బాటలో; తొలఁగువారున్= తప్పుకొనిపోయేవారున్నూ; ముట్టన్+పడి= తాకబడి; మేనన్= ఒడలిలో; కంపంబు పుట్టన్= వణకు పుట్టగా; ఒదిగి+ఉండువారున్; అణిగి వుండేవారున్నూ; కరంబునన్= చేతితో; ఉదరము+అప్పళించి= పొట్టమీద చరచుకొని; అమ్మరొ!= ఓ యమ్మో!; రక్కసి+అంచున్= రాక్షసి అంటూ; ఉల్లము+ఉలుకువారున్+ఐ= గుండెలు అదిరే వారై; పురజనంబులు= నగరంలోని జనులు; తలంకి= భయంతో వణికిపోయి.

తాత్పర్యం: (విరటుడి పట్టణంలోని జనులు సైరంధ్రిని చూచి పొందిన అదురుపాటు ఈ పద్యంలో వర్ణించబడింది). 'మన కీచకులందరికీ మృత్యువై పుట్టిన ఆ అందగత్తె ఈమె' అని చూచేవారు కొంతమంది; 'నీ కొవ్వు కరగకపోతే ఆమె దిక్కుచూడు' అని చూచేవాడిని వారిస్తూ మొగం తప్పించి దాగి ఉండిపోయేవారు కొందరు! అలవోకగా చూచి మనస్సులో మిక్కిలి బెదరి మారుమొగం పెట్టేవారు కొందరు; పొరపాటున ఆమె శరీరం తగులగా ఒడలిలో వణకు పుట్టి అణగి ఉండేవారు కొందరు; 'అమ్మో! ఈమె రాక్షసి' అని పొట్టబాదుకొని గుండెలదరి పోయేటట్లు భయపడేవారు కొందరు- ఈ విధంగా ఆ నగర ప్రజలు హడలిపోయి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 1. రాజవీథిలో ద్రౌపది దూరం నుండి దగ్గరౌతూ ఉండగా ఆయా దశలలో ఆయా సమీప ప్రజలు ఏవిధంగా భయపడి స్పందించారో, ప్రవర్తించారో చలనచిత్రంలోవలె ప్రదర్శించిన అందమైన పద్య మిది. కీచకోపకీచకుల వధ వృత్తాంతం, దానికి కారణమైన సైరంధ్రిని గురించిన వివరాలు ప్రజలలో తెల్లవారేసరికే గుప్పుమన్నాయి. అందువలన ఆమెను గురించి అనేక విధాలుగా వ్యాఖ్యానించారు. ఆమెను చూచి అనేక విధాలుగా భయాన్ని ప్రదర్శించారు. ద్రౌపది దూరంగా కనబడింది. 'అదుగోరా! మనకీచకులను చంపిన మారి వస్తున్నది' అని అంటూ ఆసక్తిగా చూచారు. ఇది మొదటిదశ. ద్రౌపది మరికొన్ని అడుగులు సమీపించింది. ఒకడు అట్లాగే ఆశ్చర్యంతో చూస్తూ నిలిచిపోగా 'ఏమిరా, పొగరుపోతుగా ఉన్నావు? అలాగే చూస్తూ ఎదురుగా ఉంటే నీ పరువు కూడా మిగలదు' అంటూ మరొకడు తల పైకెత్తకుండా చాటున దాక్కొన్నాడు. ఇది రెండవ దశ. ద్రౌపది మరికొంత దగ్గరగా వచ్చింది. అనుకోకుండా కొందరు చూచారు. అంత దగ్గరలో చూచేవారికి గుండెలు చెదిరిపోయాయి. అంతే, మొగం తప్పించి ప్రక్కకు పోయారు. ఇది మూడవ దశ. ద్రౌపది ఎదురుపడింది. మాటా పలుకూ లేకుండా ప్రక్కత్రోవలు పట్టి దూరదూరంగా తొలగిపోవటం మొదలుపెట్టారు. ఇది నాలుగవ దశ. ద్రౌపది శరీరం కొందరికి తగిలింది. ఇంకేముంది? మేను గజగజ వణకటంతో వారు కుదించుకొని కుప్పకూలిపోయారు. ఇది ఐదవ దశ. ద్రౌపదిని సవివరంగా చూచారు. (చచ్చాం రా! బాబూ! అన్నట్లు) కడుపు మీద చరచుకొని 'ఓయమ్మో! రాక్షసి'! అని గుండె లవిసేటట్లుగా అరుస్తూ తల్లడిల్లిపోయారు. ఇది ఆరవ దశ. 2. ఈ పద్యంలోని దీనస్థితి దర్శనీయం. నగరవాసులు భయంతో వింత చేష్టలు చేస్తున్నారు. నిజానికి వారి పక్షాన అవి భయభావ వ్యంజకాలు. కాని, ద్రౌపది అంత భయపడవలసిన వ్యక్తి కాదని పఠిత హృదయం చెప్పటంతో వారి చేష్టలన్నీ వికృతులుగా అనిపించి హాస్యాన్ని కలిగిస్తాయి. భయం పుట్టవలసిన చోట హాస్యం కలగటం రసాభాసం కావాలి. కాని, ఇక్కడ భయంలో హాస్యం లేదా (Grim Humour) ధ్వనిమయం. (సంపా.)

చ. **పులిఁ గనుఁగొన్న లేడులునుబోలె విభీతిఁ గలంగఁబాఱ న**
న్నెలఁతుక యంతరంగమున నిండిన హాస్యరసంబు మోముపై
వెలి విరియంగనీక చని వేచి మహానసశాల వాకిటన్
నిలిచిన భీమసేనుఁ గని నెయ్యు మెదం జిగురొత్తుచుండఁగన్. **38**

ప్రతిపదార్థం: పులిన్+కనుఁగొన్న లేడులును+పోలెన్= పులిని చూచిన లేళ్ళవలె; విభీతిన్+కలంగన్+పాఱన్= భయంతో పరుగెత్తగా; ఆ+నెలఁతుక= ఆమె (ద్రౌపది); అంతరంగమునన్= మనస్సులో; హాస్యరసంబు= వికారాలవలన కలిగిన నవ్వుయొక్క అనుభవాన్ని; మోముపైన్= ముఖంమీద; వెలి విరియంగన్+ఈక= బయటపడనీయకుండా; చని= వెళ్ళి; వేచి= కాచుకొని; మహా నసశాల వాకిటన్= వంట ఇంటి వాకిట; నిలిచిన భీమసేనున్+కని= నిలిచి ఉన్న భీముడిని చూచి; ఎదన్= మనస్సులో; నెయ్యము= స్నేహం, ఆత్మీయత; చిగురు+ఒత్తుచుండఁగన్= మొలకెత్తుతూ ఉండగా (కలుగుతుండగా).

తాత్పర్యం: పులిని చూచిన లేళ్ళవలె తనను చూచి భయంతో కలతపడి పరుగెత్తుతున్న విరటుడి పురప్రజలను చూచి ద్రౌపది మనసులో పరిహాసం నిండుకొనగా అది వెలికి తెలియనీయకుండా వెళ్ళి, వంటింటి వాకిట కాచుకొని నిలుచున్న భీమసేనుడిని చూచి మనసులో ప్రేమ చిగురొత్తుతూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. పులిని చూచిన లేళ్ళవలె ద్రౌపదిని చూచిన ప్రజలను పోల్చటం వలన వారి భయవిహ్వలత్వం వ్యంగ్యం. (సం.పా)

క. **తన యంతన యటువలుకుచుఁ । జను విధమున నతని దిక్కు చక్కని చూడ్కిం**
గనుఁగొనక ద్రుపదనృప నం । దన యిట్లను నిజ కృతార్థతం దెలుపుటకున్. **39**

ప్రతిపదార్థం: ద్రుపదనృపనందన= ద్రౌపది; తన+అంతన్+అ= తనలో తానే; అటు+పలుకుచున్= ఏదో గొణుగుతూ మాటాడుకొంటూ; చనువిధమునన్= పోతున్నట్లుగా; అతని దిక్కున్= భీముడి వైపు; చక్కని చూడ్కిన్+కనుఁగొనక= సూటిగా చూచే చూపుతో చూడక (సూటిగా చూడకుండా ప్రక్కకు చూస్తూ); నిజకృతార్థతన్+తెలుపుటకున్= తన ధన్యతను తెలియజేయటానికి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ద్రౌపది తన ధన్యతను (కృతార్థతాభావాన్ని) తెలపాలని భావించి అతడివైపు (భీమసేనుడి వైపు) సూటిగా చూడకుండా తనలో తాను ఏదో మాట్లాడుకొంటున్నట్లుగా అభినయిస్తూ ఇట్లా పలికింది.

విశేషం: 1. ద్రౌపది మాన ప్రాణ సంరక్షకుడు భీముడు. అతడు తన కర్తవ్యాన్ని అద్భుతంగా, రహస్యంగా నిర్వహించి, ఏమీ తెలియని వాడివలె వంటిఇంటి వాకిట్లో నిలబడి భార్య యోగక్షేమాలు ఇంకా విచారిస్తున్నాడు. భద్రంగా ఇంటికి చేరుతున్న వైఖరిని గమనిస్తున్నాడు. ఆమె ఆవైపు వచ్చింది. అతడిని చూచింది. ప్రేమతో, కృతజ్ఞతాభావంతో మనసు నిండిపోయింది. ఆ భావాలను బయటపడి చెప్పటానికి వీలు లేదు. అందువలన తనలో తాను ఏదో మాట్లాడుకొంటున్నట్లుగా అభినయిస్తూ, భీముడివైపు సూటిగా చూడకుండా మొగం ప్రక్కకు పెట్టి తన మనోభావాలను పైకి చెప్పింది. చూచేవారికీ, వినేవారికీ ఎటువంటి అనుమానం కలుగకుండా వ్యవహరించే జాగ్రత్త ఆమెలో కనబడుతున్నది.

2. ఇప్పుడు 'కృతజ్ఞత' చెప్పటం అనే అర్థంలో పూర్వం 'కృతార్థతను ప్రకటించటం' అనేవారు. (సంపా.)

తే. **'కీచకులదెసఁ బుట్టిన కిల్బిషంబు । పాచి నన్ను రక్షించిన పరమ ధర్మ**
రతికి గంధర్వ పతికి నిరంతరంబు । భక్తి యుక్తిమైఁ బ్రణమిల్లి బ్రదుకుదాన.' **40**

ప్రతిపదార్థం: కీచకుల దెసన్= కీచకుల వలన; పుట్టిన= కలిగిన; కిల్బిషంబు పాచి= ప్రమాదాన్ని తొలగించి; నన్ను రక్షించిన; పరమధర్మరతికిన్= ఉత్తమ ధర్మంలో ఆసక్తి కలవాడికి; గంధర్వపతికిన్= గంధర్వుడి రూపంలో ఉన్న భర్తకు (గంధర్వ శ్రేష్ఠుడికి అని పైకి తోచే అర్థం); నిరంతరంబు= ఎల్లప్పుడు; భక్తియుక్తిమైన్= భక్తితో కూడుకొన్న భావంతో; ప్రణమిల్లి= నమస్కారం చేసి; బ్రదుకుదానన్= బ్రతుకుతాను (జీవితాంతం భక్తితో సేవిస్తూ ఉంటాను అని భావం).

తాత్పర్యం: కీచకుల వలన కలిగిన ప్రమాదాన్ని తొలగించి నన్ను కాపాడిన పరమ ధర్మమూర్తికి గంధర్వపతికి (గంధర్వుడి రూపంలో ఉన్న నాథుడికి) జీవితాంతం సదా భక్తిభావంతో నమస్కరిస్తూ బ్రతుకుతాను.

విశేషం: భీముడు చేసిన ఉపకారం ద్రౌపది మానాన్ని కాపాడి గౌరవాన్నిచ్చింది. ప్రాణాన్ని కాపాడి జీవితాన్ని ఇచ్చింది. ఇట్లా యోగక్షేమాల నిచ్చిన గంధర్వపతికి (గంధర్వరూపంలో ఉన్న నాథుడికి) జీవితాంతం భక్తితో సేవలు చేస్తూ ఋణం తీర్చుకొంటాను అని ఆమె తనివితీర పలికి, తన మనసులోని మమకారాన్నీ, ప్రశంసాభావాన్నీ, భక్తిప్రవత్తులనూ ప్రదర్శించింది. ఈ మాటలు విన్న ప్రజలకు ఆమె గంధర్వపతితో చెప్పుకొంటున్నట్లుంటాయి. అన్యాపదేశంగా తన నుద్దేశించి చెప్పుతున్నదని భీముడు గ్రహించగలడు. పఠితలు రెండర్థాలనూ గ్రహించి ప్రమోదిస్తారు. (సంపా.)

వ. అనిన విని యనిలనందనుండు నిగూఢవచన చాతుర్యధుర్యుండై యిట్లనియె. 41

ప్రతిపదార్థం: అనినన్+విని= అని ఆమె చెప్పగా విని; అనిలనందనుండు= వాయుదేవుడి పుత్రుడైన భీమసేనుడు; నిగూఢ వచన చాతుర్య ధుర్యుండు+ఐ= రహస్యమైన మాట నేర్పు భావాన్ని వహించినవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ద్రౌపది మాటలు విని ఎదుటివారికి తెలియకుండా రహస్యంగా మాట్లాడే నేర్పుతో భీముడు ఇట్లా అన్నాడు.

విశేషం: భీముడు గూఢోక్తి చాతుర్యాన్ని ప్రదర్శించబోతున్నాడు. పైకి సాధారణ సంభాషణగా తోస్తూ నిర్దిష్ట వ్యక్తికి ఉద్దిష్టమైన అర్థం తోచేటట్లు మాట్లాడటం గూఢోక్తి. (సంపా.)

చ. 'అతివ! యపాయముం బొరయు నప్పుడు గావక తక్కనేని నా
పతి పతియే? తలంప మగ పాడియె? లోకము పాడియే? భవ
త్పతు లిటు లాచరించుట గదా భవదీయ మనోనువర్తన
స్థితి కుచితంబు; వారల నుతింపఁగ నేల నిసర్గవృత్తులన్?' 42

ప్రతిపదార్థం: అతివ!= ఇంతీ!; అపాయమున్+పొరయు+అప్పుడు= ప్రమాదం కలిగేటప్పుడు; కావక తక్కెన్+ఏనిన్= కాపాడక వెనుకంజ వేస్తే; ఆ పతి పతియే?= ఆ మగడు మగడేనా? (కాదని భావం); తలంపన్= ఆలోచించగా; మగపాడియె?= అది పౌరుషమా?; లోకము పాడియే= (అది) లోకధర్మమా?; భవత్+పతులు= నీ భర్తలు; ఇటులు+ఆచరించుటగదా!= ఇట్లా చేయటమే కదా!; భవదీయ మనస్(ః)+అనువర్తన స్థితికిన్= నీ మనసునకు అనుగుణంగా నడచుకొనటానికి; ఉచితంబు= తగిన తీరు; నిసర్గ వృత్తులన్= సహజమైన నడవడి గల వారైన; వారలన్= ఆ భర్తలను; నుతింపఁగన్+ఏల?= (కాబట్టి ప్రత్యేకంగా వారిని) పొగడటం ఎందుకు?

తాత్పర్యం: 'ఇల్లాలు అపాయంలో చిక్కుకొన్నప్పుడు ఆదుకొనకుండా ఉండే మగడు మగ డనిపించుకొంటాడా? (కాదని భావం). ఆలోచిస్తే అది పౌరుషమేనా? లోకధర్మమేనా? (కాదని భావం). కాబట్టి నీ భర్తలు ఇట్లా చేయటం నీ మనోభీష్టానికి అనుగుణంగా నడుచుకొనటమే కదా! అది వారి కర్తవ్యం. వారు చేయవలసిన పని చేసి తమ సహజ ప్రవర్తనను ప్రదర్శించారు. దీనికి వారిని ఇంతగా పొగడటం ఎందుకు?'

విశేషం: 1. భారతదేశంలో భార్యాభర్తల మధ్య ఉండే నైతిక సంబంధాన్ని తెలియచెప్పే ఒక రుచిరార్థ సూక్తి ఇది. భరించేవాడు భర్త అని సంప్రదాయం. భార్యను రక్షించుకొనటం యజమానుడి ధర్మం, మానవధర్మం, వీరధర్మం, లోకధర్మం. భార్య ప్రమాదంలోపడితే గృహస్థుల ధర్మమే ఆపదలో చిక్కుకొన్నట్లు. ఆమెను ఏవిధంగానైనా రక్షించాలి. అది ఆత్మోద్ధరణమే ఔతుంది. ఈ తత్త్వంతెలిసి భార్యను ఆపదలో నుండి రక్షించినవాడు భర్త అనే పదానికి అర్హుడౌతాడనీ, లేకపోతే కాడనీ

మొదట అన్నాడు భీముడు. ఆతరువాత అది మగవాడుగా చేయవలసిన ధర్మం (పురుష ధర్మం); సాటి మనిషిగా చేయవలసిన ధర్మం (మానవధర్మం, లోకధర్మం) అని పేర్కొన్నాడు. ఇన్ని రకాలుగా బాధ్యులైన భర్తలకు భార్యలను రక్షించే పనులు అవశ్యకర్తవ్యాలౌతాయే కాని, లోకోద్ధరణకు చేసే పనులు కావు. కాబట్టి వారిని ప్రత్యేకంగా ప్రశంసించవలసిన అవసరంలేదని భీముడు పలికాడు. ఇది సాధారణంగా ఎవరు విన్నా అనుమానం కలగని మాటల తీరు.

2. భీముడు కీచక వధ చేయటం ద్రౌపది మానప్రాణసంరక్షణం చేసి, ఆమె మనసును కుదుటపరిచి రంజింప చేయటానికే అని గూఢంగా చెప్పటం ఇందులోని అంతరార్థం. అది అతడికి సహజంగా ఉన్న కర్తవ్యమని కూడా చెప్పటం విశేషం. ప్రత్యేకంగా తనను పొగడవద్దని వారించటం అతడి ధీరోదాత్త లక్షణం. అట్లా బహిర్గతంగా ప్రశంసలు చేస్తే వినేవారికి అనుమానం రావచ్చుననీ, అది అజ్ఞాతవాసవ్రతానికి భంగం కలిగించవచ్చుననీ గూఢమైన హెచ్చరిక!

3. భార్య అన్యాపదేశంగా మాట్లాడింది. భర్త గూఢంగా సమాధానం చెప్పాడు. ఆమె గంధర్వుల మీద పెట్టి ఏమైనా మాట్లాడే అవకాశం ఉన్నది. మరి భీముడి కా అవకాశం లేదు. అందువలన గూఢోక్తి అతడికి శరణ్యమైపోయింది. సతీ పతుల మాటలు ఒకరికొకరికి దీటుగా ఉన్నట్లు చిత్రించటం తిక్కన నేర్పరితనం.

4. ఆ పతి పతియే ఒకే మాట (పతి) ద్విరుక్తమైనా, తాత్పర్య భేదం ఉంటే అది లాటానుప్రాస మనబడుతుంది. ఇక్కడ రెండవ పతికి విశిష్టుడైన పతి అని తాత్పర్యం. (సంపా.)

ద్రౌపది యర్జునునితో సల్లాసంబు సేయుట (సం. 4-23-17)

తే. **ఇట్లు దమ్ము నిరూపింప నితర జనము। లకు నశక్యంబుగాఁగ సల్లాపరసము**
ననుభవించుచు నల్లనల్లన లతాంగి। యరిగె నర్తన మండపోపాంతమునకు. **43**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తమ్మున్= తమను (అనగా పాండవులను); నిరూపింపన్= గుర్తించటానికి; ఇతర జనములకున్= పెరవారికి; అశక్యంబు కాఁగన్= సాధ్యం కానట్లు; సల్లాపరసమున్= మాటల మాధుర్యాన్ని; అనుభవించుచున్= పొందుతూ; అల్లనన్+అల్లనన్= నెమ్మదినెమ్మదిగా; లతా+అంగి= తీగవలె సన్నని శరీరంగల సుందరాంగి (సైరంధ్రి); నర్తన మండప+ఉపాంతమునకున్= నాట్యశాలవద్దకు; అరిగెన్= వెళ్ళింది.

తాత్పర్యం: ఈ విధంగా తమ రహస్యం బయల్పడకుండా ఇతరులు గుర్తించటానికి సాధ్యం కాకుండా మాటాడే మాటల మాధుర్యాన్ని ఆనందంతో అనుభవిస్తూ (సైరంధ్రి) నర్తనశాల వద్దకు వెళ్ళింది.

వ. **చని విరాట కన్యకల యాటఁ జూచు చందంబున నందుఁ బురందరనందనుం గనుంగొను నప్పాంచాలి నాలోకించి, యతండునుం దారును దదభిముఖంబుగా వచ్చి యక్కన్నియ లిట్లనిరి.** **44**

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; విరాట కన్యకల ఆటన్+చూచు చందంబునన్= విరటుని కూతురుల నాట్యం చూచే విధంగా (చూచే మిషతో); అందున్= ఆ చోట; పురందరనందనున్+కనుంగొను+ఆ+పాంచాలిని= అర్జునుడిని చూస్తూ ఉన్న ఆ ద్రౌపదిని; ఆలోకించి= చూచి; అతండును= అర్జునుడూ; తారును= తామును (విరటుడి కన్యలును); తద్+అభిముఖంబుగన్ వచ్చి= ఆమె కెదురుగా వచ్చి; ఆ+కన్నియలు= ఆ కన్యలు; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: ఆ విధంగా వెళ్ళి నర్తనశాలలో విరాటుడి కన్యల ఆట చూచే నెపంతో అర్జునుడిని చూస్తున్న పాంచాలిని చూచి, ఆ కన్యలు అర్జునుడితో కలిసి ఆమె కెదురుగా వచ్చి ఇట్లా అన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. 'కీచకకోటిచేత నొక కీడును బొందక వచ్చితమ్మ? ని
న్వేచిన దుర్మదుండు జమునిం గొలువం జనెనమ్మ? యంతఁ బో
కేచిన సూతు లీయొడలి కింత యపాయ మొనర్తురమ్మ? వే
కాచి విరోధులం దునుమఁగా నిటు ముట్టుదురమ్మ నీ పతుల్?' 45

ప్రతిపదార్థం: కీచక కోటిచేతన్= కీచకుల సమూహం వలన; ఒక కీడును పొందక= ఒక ప్రమాదం కూడా లేకుండా; వచ్చితి(వి)+అమ్మ?= వచ్చినావా తల్లీ!; నిన్+వేచిన= నిన్ను బాధపెట్టిన; దుర్మదుండు= దురహంకారి అయిన కీచకుడు; జమునిన్+కొలువన్+చనెనమ్మ?= యముడిని సేవించటానికి (యమలోకానికి) వెళ్లాడా? (చనిపోయాడా అని భావం); అంతన్+పోక= అంతటితో ఆగకుండా, ఆ తరువాత; ఏచిన సూతులు= విజృంభించిన ఉపకీచకులు; ఈ+ఒడలికిన్= (ఇంత సుకుమారమైన) నీ శరీరానికి; ఇంత+అపాయము= ఇంతటి (సహించరాని) కీడును; ఒనర్తురు+అమ్మ?= చేస్తారా?; నీ పతుల్= నీ భర్తలు; వేకాచి= వెంటనే కాపాడి; తునుమఁగాన్= చంపటం కొరకు; ఇటు ముట్టుదురమ్మ?= ఈ విధంగా (ఇంత అద్భుతంగా) వారిని ముట్టడిస్తారా?

తాత్పర్యం: 'కీచకుల సమూహం వలన ఏ కీడూ పొందకుండా తిరిగి వచ్చావా తల్లీ! నిన్నావిధంగా బాధించిన ఆ దురహంకారి అయిన కీచకుడు యమలోకానికి చేరాడా? అంతటితో ఆగక ఉపకీచకులందరూ కలిసి సుకుమారమైన ఇటువంటి నీ శరీరానికి అంతటి దారుణమైన అపాయాన్ని కలిగించటానికి చూస్తారా? నీ భర్తలు వెంటనే శత్రువులను క్రమ్ముకొని చంపి ఇంత త్వరగా నిన్ను రక్షించుకొంటారా?'

విశేషం: 1. ఇది ఆశ్చర్యమనే భావాన్ని అచ్చంగా ఆవిష్కరించిన పద్యం. అంతఃపురకన్యలకు అప్పటికే అన్ని విషయాలు తెలిసిపోయాయి. రాత్రి నర్తనశాలలో అంత గొడవ జరిగినా సూర్యోదయానికల్లా మరల నాట్యాభ్యాస కార్యక్రమాలు మొదలయ్యాయి. కవి చెప్పినట్లు సూర్యోదయానికే ప్రకృతి అంతా ప్రసన్నమయిపోయింది. కీచకుల బారినపడిన వనిత క్షేమంగా తిరిగి వస్తుందనే నమ్మకం ఎవరికీ లేదు. అట్లాగే ఆ కన్యలూ అనుకొన్నారు. కాని, సైరంధ్రి బయటపడి వచ్చింది. అదీ ఆశ్చర్యం, వారు వార్తలు విన్న క్రమం తోచేటట్లు తిక్కన ప్రశ్నల క్రమం అమర్చటం పద్యరచనా శిల్పం. దీనిని తరువాతి వచనంలో తిక్కన సూచించాడు. మొదట విన్న వార్త కీచకులందరూ సైరంధ్రి కారణంగా సామూహిక మరణం చెందారు అని. దానిమీద మొదటి ప్రశ్న వేశారు. ఆ తరువాత సింహబలుడి చావునూ, ఆ తరువాత ఉపకీచకుల చావునూ వివరంగా విన్నారు. రెండు ప్రశ్నలూ ఆ వరుసలోనే వేశారు. చివరకు గంధర్వపతులు ప్రదర్శించిన అద్భుత పరాక్రమాన్ని గురించీ, భార్యను రక్షించుకొన్న విధానాన్ని గురించీ విన్నారు. ఆ విషయమే అడిగారు. విశేష మేమంటే, ఈ ప్రశ్నలు విషయం తెలిసి, జరిగినదానికి ఆశ్చర్యపడుతూ అడిగిన ప్రశ్నలేకాని, వాటిని వివరించుమని అడిగినవి కావు. ఆ వీథిలో భయపడి దూరంగా పరుగెత్తిన నగర ప్రజలనూ చూచాం. నాట్యశాలలో దగ్గరికి వచ్చి, అప్యాయంగా గుమిగూడి గౌరవంగా ప్రశ్నలు వేస్తున్న రాచకన్నెలనూ చూస్తున్నాం. సమతౌల్యాన్ని దర్శిస్తున్నాం. పద్యరచనలోని సమత అనే గుణం సందర్భశుద్ధిని పోషిస్తున్నది.

2. 'వచ్చితమ్మ, జనెనమ్మ, ఒనర్తు రమ్మ, ముట్టుదురమ్మ'- వీటిలోని 'అమ్మ' మాతృవాచకం కాదు. సూ. తద్ధర్మ భూతక్రియ లార్యార్థ పరకంబులయి ప్రశ్నార్థకంబు లగు, (ప్రౌఢ, క్రియ). వచ్చితమ్మ - వచ్చితి(వి)+అమ్మ= వచ్చితి(వి) భూతక్రియ. దీనికి 'అమ్మ' పరముకాఁగా ప్రశ్నార్థకమైనది. వచ్చితమ్మ - వచ్చావా? అని అర్థం. (సంపా.)

వ. అని తారు మున్ను విన్న కీచక వృత్తాంతంబున కనుగుణంబుగా నుపచారంబులు పలుకుచుండ నా బృహన్నల సైరంధ్రి కిట్లనియె. 46

ప్రతిపదార్థం: అని= అంటూ; తారు= తాము; మున్ను విన్న= ఇది వరకు విన్నట్టి; కీచక వృత్తాంతంబునకున్= కీచకుల కథకు; అనుగుణంబు+కాన్= తగినట్లుగా; ఉపచారంబులు= ఓదార్పు మాటలు; పలుకుచున్+ఉండన్= మాటాడుతుండగా; ఆ బృహన్నల; సైరంధ్రికిన్+ఇట్లు+అనియెన్= సైరంధ్రితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ కన్యలు తాము విన్న కీచకుల వృత్తాంతానికి తగినట్లు సైరంధ్రికి ఓదార్పు మాటలు చెప్పుతూండగా బృహన్నల సైరంధ్రితో ఇట్లా అన్నాడు.

క. **'ఆ పాపాత్ముల నీచ। వ్యాపార క్రమము, వార లందఱు మృత్యు**
ప్రాపితులైన తెఱంగును। నీ పలుకుల నెఱుఁగవలయు నెలఁతుక చెపుమా!' **47**

ప్రతిపదార్థం: నెలఁతుక!= ఓ వనితా!; ఆ పాప+ఆత్ములు= ఆ దుర్మార్గుల; వ్యాపార క్రమము= చేష్టల వరుస; వారలు+అందఱున్= వారందరూ; మృత్యుప్రాపితులు+ఐన తెఱంగును= మృత్యువును పొందించబడిన పద్ధతియు; నీ పలుకులన్= నీ మాటల వలన; ఎఱుఁగవలయున్= తెలిసికొనవలెను; చెపుమా!= చెప్పవలయును సుమా!

తాత్పర్యం: ఆ దుర్మార్గుల చేష్టలను, వరుసగా వారందరూ చంపబడిన తీరునూ నీ నోట విని తెలిసి కొనగోరుతున్నాను. నీ వా వివరాలు చెప్పుతావా?

విశేషం: కీచకోపకీచకుల సంహారం కొన్ని క్షణాల క్రితమే జరిగింది. లోకానికి వార్తలు తెలిసాయి కాని, వివరాలు తెలియవు. అందుకు అర్జునుడు ఆమెనే స్వయంగా అడిగాడు. ఇదివరలో భీముడు కూడా అట్లాగే అడిగాడు. ఈ ప్రశ్న వినగానే శ్రోతలకు మరొక అంశం స్ఫురిస్తుంది. ద్రౌపది తన కథను మిగిలిన భర్తలకు కూడా చెప్పుకొందామని బయలుదేరిన ట్లనిపిస్తుంది. అటువంటి ప్రయత్నాన్ని మానుమని భీముడు సూచించాడు. మరి శ్మశానం నుండి అంతఃపురానికి చేరవలసిన ద్రౌపది నర్తనశాలకు ఎందుకు వచ్చినట్లు? నిన్నటి రాత్రి సంకేతస్థలాన్ని ఆ ఉదయం సంతోషస్థలంగా పునర్దర్శించి పోవటానికా? తిక్కన ఆ సంగతిని కప్పిపుచ్చి కళాశిల్పాన్ని ప్రదర్శించాడు. (సంపా.)

వ. **అనిన విని సైరంధ్రి సాభిప్రాయంబుగా బృహన్నల కిట్లనియె.** **48**

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విన్నదై; సైరంధ్రి; స+అభిప్రాయంబుగాన్= అభిప్రాయ గర్భితంగా; బృహన్నలకున్= బృహన్నలతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: అనగా విని సైరంధ్రి సాభిప్రాయంగా బృహన్నలతో ఇట్లా అన్నది.

విశేషం: సాభిప్రాయంగా మాట్లాడటమంటే మాటలలో మనసులోని మర్మాన్ని పొదివి గోప్యంగా చెప్పటం. (సంపా.)

తే. **'కన్నియల కాట గఱపుచు నున్న నీకు। నకట! సైరంధ్రి యిప్పు డేమయ్యెనేని**
ఖేద మెద నించుకయు లేమిఁగాదె సస్మి। తాననంబుతో నన్నిటు లడుగుటెల్ల.' **49**

ప్రతిపదార్థం: కన్నియలకున్= కన్యలకు; ఆట+కఱపుచున్= నాట్యాలు నేర్పుతూ; ఉన్న నీకున్= ఉన్నటువంటి నీకు; అకట!= అయ్యో!; సైరంధ్రి, ఇప్పుడు+ఏమి+అయ్యెన్+ఏనిన్= సైరంధ్రి ఇపు డేమైపోయినా; ఖేదము= దుఃఖం; ఎదన్= మనసులో; ఇంచుకయున్= ఒకింత అయినా; లేమిన్+కాదె= లేనందువలన కదా; సస్మిత+ఆననంబుతోన్= చిరునవ్వుతో కూడిన

మొగంతో; నన్నున్= నన్ను; ఇటులు+అడుగుట+ఎల్లన్= ఈ విధంగా అడగటమంతా (అని వ్యంగ్యంగా సైరంధ్రి అర్జునుడితో అన్నది).

తాత్పర్యం: 'కన్యలకు నాట్యం నేర్పుతూ కాలం గడిపే నీకు సైరంధ్రి యేమైపోయినా చీమకుట్టినంత బాధ కూడా లేకపోబట్టే కదా ఇట్లా నవ్వుమొగంతో విషయాలన్నీ నన్నడుగుతున్నావు. అయ్యో! ఏమనాలి నిన్ను?'

విశేషం: బృహన్నల పరంగా ఒక అర్థం అర్జునుడిపరంగా మరొక అర్థం స్ఫురిస్తూనే, అందులో ద్రౌపది మనోగతమైన ఒక అభిప్రాయం తొంగి చూస్తూ ఉండటం ఈ పద్య రచనలోని శిల్పం. రసధ్వనికి రమణీయోదాహరణం! (1) బృహన్నలపరంగా తోచే భావం- 'నీవు బృహన్నలవు. కన్నెలకు ఆటపాటలు చెప్పటం తప్ప నీకు ప్రపంచం పట్టుతుందా? సైరంధ్రి ఏమైపోతే ఏం? నీ కేమి దిగులు? నే నే మౌతానని? నీ కెవ్వరి కష్టసుఖాలూ పట్టవు. అందుకే నవ్వుతూ నన్నిట్లా అడుగుతున్నావు. అయ్యో! ని స్నేమనేది?-అని అధిక్షేపంగా పలికినట్లు స్ఫురిస్తుంది. (2) అర్జునపరంగా తోచేభావం- 'ఎంత ఆశ్చర్యం! కన్యలకు ఆటపాటలు నేర్పుతూ ఉన్నావు నిశ్చింతగా. సైరంధ్రిగా ఉన్న నాకు ఏమైతే ఏమయిందిలే? ఇప్పుడు అంతా కుదుటపడిందని మనసులో దిగులు ఆవంత కూడా లేకుండా ఉన్నావు. అందుకే నవ్వుతూ తీరికగా అన్ని విషయాలూ చెప్పుమని తేరగా అడుగుతున్నావు. ఇప్పుడు దిగులు పడేది ఏమీ లేదు కాబట్టి నీవు నవ్వుతూనే ఉండుము. కన్యలకు నాట్యాలు నేర్పుతూనే నిశ్చింతగా ఉండుము. ఇంతకంటె నే నేమి చెప్పాలి?' అని వ్యంగ్యోక్తిగా పలికినట్లు స్ఫురిస్తుంది.

3. ద్రౌపది మనసులోని మాట; 'దురదృష్టవశాత్తూ జగదేకవీరుడైన అర్జునుడు పేడివాడై కన్యాజనుల నడుమ ఉండిపోయాడు. ఆ మాట అనుకొంటేనే విచారం వేస్తుంది. సైరంధ్రిగా ఉన్న నాకు ఏ కష్టం వచ్చినా అర్జునుడికి ఏర్పడిన ఈ అనుపపత్తి జ్ఞాపకానికి వచ్చి నన్ను బాధించేది. కాని, ఇప్పుడు ఆ బాధ ఆవంత కూడా లేదు. ఆ లోపాన్ని భీమసేనుడు తీర్చాడు. అన్నదమ్ములలో ఎవరు నన్ను కాపాడినా అందరూ ఆనందిస్తారు. తామే ఆ పని చేసినట్లు మురిసిపోతారు. అందుకే అర్జునుడు నగుమోముతో నాతో మాట్లాడుతూ విశేషాలన్నీ వినాలని కోరుకొంటున్నాడు. పాపం! నా మీద ఎంత ప్రేమ!' అని నర్మోక్తిగా పలికినట్లు తోస్తుంది. (సంపా.)

వ. అనిన బృహన్నల యిట్లనియె. 50

తాత్పర్యం: ఆమె మాటలు విని బృహన్నల ఇట్లా బదులు పలికాడు.

క. 'నీ వలుగులఁ బడుటకు దుః। ఖా వేశము నొందెనే నిరర్థక మగు ని
య్యేవపుఁ బుట్టువు పుట్టిన। నా వగ పెవ్వరికి నెక్కు నలినదళాక్షీ! 51

ప్రతిపదార్థం: నలినదళ+అక్షీ!= తామర రేకుల వంటి కన్నులు కలదానా!; నీవు+అలుగులన్+పడుటకున్= నీవు చీకాకులో చిక్కుకొన్నందుకు; దుఃఖ+ఆవేశమున్= దుఃఖముతో కూడిన ఉద్వేగాన్ని; ఒందెన్+ఏన్= పొందినప్పటికీ; నిరర్థకము+అగున్= పనికిరానిది ఔతుంది; ఈ ఏవము+పుట్టువు+పుట్టిన= ఈ అసహ్యకరమైన పేడి రూపాన్ని (పుట్టుకను) పొందిన; నా వగపు= నా దుఃఖం; ఎవ్వరికిన్= ఎవ్వరికి; ఎక్కున్?= పట్టుతుంది?

తాత్పర్యం: 'పద్మదళాక్షీ! నీవు చీకాకులలో చిక్కుకొన్నావని తెలిసి దుఃఖావేశాన్ని పొందినా ప్రయోజనం లేని ఈ పనికిమాలిన పుట్టుక పుట్టినందుకు నేను మనసులో పడే వేదన ఎవరికి పట్టుతుంది?

విశేషం: ద్రౌపది సాభిప్రాయంగా మాట్లాడితే, అర్జునుడు 'గుప్త సాభిజ్ఞానంగా' (చూడు 53వ వచనం) పలుకుతున్నాడు. పైకి కనబడే అర్థం కంటే వక్త చెప్పదలచుకొన్న రహస్య సందేశం సంకేతంగా సాగే సంభాషణ గుప్తసాభిజ్ఞాన సంభాషణ. ఈ పద్యంలో దానిని వివేచించటం కవితాశిల్ప సమీక్ష. (1) పైకి తోచే భావం- బృహన్నలపరంగా- 'సైరంధ్రీ! నే నెప్పుడూ కన్యలకు ఆటపాటలు నేర్పటంతోనే ప్రొద్దులు పుచ్చుతానన్నావు నిజమే. నేను పుట్టిన పేడి పుట్టుక అటువంటిది. ఎవరూ నన్ను పిలువరు, గౌరవించరు. నేను స్త్రీగా పరిగణింపబడతాను కాబట్టి యుద్ధాదులకు పనికిరాను. అందువలన తగుదునమ్మా అని నీకు కలిగిన కష్టాలను గట్టెక్కించటానికి వచ్చే వీలు లేదు. అది నా దురదృష్టం. నీ కెంత సహాయపడాలని లోన ఉన్నా, నా అసమర్థత నన్ను నాట్యశాలలోనే కట్టి పడ వేస్తున్నది. నా మనసులోని ఈ బాధ ఎవరికి పట్టింది? నీవుకూడా ఆ విషయం పట్టించుకొనక అధిక్షేపిస్తున్నావు. నే నేమి చేసేది?' అని తన పేడితనాన్ని నిందించుకొంటూ సైరంధ్రిపట్ల సానుభూతి ప్రకటించినట్లు మాట్లాడాడు.

(2) అర్జునపరంగా - 'ద్రౌపదీ నీవు కష్టాలు పడుతుంటే నాకు దుఃఖావేశం కలుగుతుంది. కాని, శత్రువుల మీద ప్రతీకారం తీసికొనటానికి నా ఆకారం అడ్డం వస్తుంది. నా ప్రయత్నం ఈ అజ్ఞాతవాసంలో నిరర్థకం. ఈ పేడి రూపంతో మెలసినందుకు లోలోన కుములుతూ, ఆ బాధ మరచిపోవటానికి నర్తనశాలలోనే కాలం గడుపుతూ ఉంటాను. నేను సదా మనసులో పడే ఈ మూగబాధ ఎవరికి పట్టింది? నీకూ పట్టినట్లు లేదు. నా నవ్వు వెనుక ఎంత దిగులుందో, అయినా దానిని బైటపెట్టకుండా ఎట్లా నవ్వుతూ తిరుగుతున్నానో నీవూ గ్రహించినట్లు లేదు' అని ద్రౌపది చేసిన అధిక్షేపానికి బదులుగా లలితమైన అధిక్షేపంతో సమాధానం చెప్పాడు.

(3) అర్జునుడి మనసులోని బాధ- ఊర్వశి శాపం వలన కలిగిన నపుంసకత్వం సంవత్సరం ముగిస్తే కాని వీడదు. ధర్మజాదుల వేషాలు మారాయికాని శరీర స్వభావాలు, బలపరాక్రమాదులు మారలేదు. అర్జునుడి స్థితివేరు. అందువలన పేడి రూపంలో అతడు పౌరుష కార్యాలను నిర్వహించలేడు. ఈ లోపం వలన ద్రౌపదికి తగిన రక్షను కలిగించలేకపోయినందుకు అర్జునుడు మనసులో కుమిలిపోతూ ఉంటాడు. దానిని గుప్తంగా తన మాటలలో పాదివి చెప్పాడు. ద్రౌపది మాటలలోని మొదటి భాగానికి సమాధానం చెప్పి, రెండవ భాగానికి రాబోయే పద్యంలో అర్జునుడు చెప్పబోతున్నాడు. (సంపా.)

క. నీతోడి పరిచయము లే। దే? తలపోయఁగ ననింద్య వెందును; నీ వి
ట్లాతుర వగుటకు నా మది। నే తాపము లేదు? నైజ మెఱుఁగవు కంటే!' 52

ప్రతిపదార్థం: నీతోడి పరిచయము లేదే?= నీతో పరిచయము నాకు లేదా? తలపోయఁగన్= యోచించగా; ఎందున్= ఎక్కడ చూచినా; నీవు అనింద్యవు= నీవు దోషం లేనిదానవు; ఇట్లు= ఈ తీరున; ఆతురవు+అగుటకున్= బాధపడటానికి; నా మదిన్= నా మనసులో; ఏ తాపము లేదు?= ఎటువంటి బాధ లేకున్నది? (అనగా బాధ ఉన్నది); నైజము+ఎఱుఁగవు= నిజం తెలియలేవు; కంటే= గుర్తించావా? (అనగా గుర్తింపలేకున్నావని భావం).

తాత్పర్యం: నీతో (నాకు) పరిచయం లేదా? యోచించగా నీవెట్టి దోషం లేనిదానవు; ఇట్లా నీవు బాధపడుతున్నందుకు నా మనసులో బాధ లేదనుకొన్నావా? నీవు నిజాన్ని గుర్తించటం లేదు.'

విశేషం: ఈ పద్యంలో కాకువు వలన గుప్తసాభిజ్ఞానార్థాన్ని తిక్కన సాధించటం విశేషం.

(1) బృహన్నలపరంగా: 'ఓ సైరంధ్రీ! నీతో నాకు పరిచయం లేదు. అందువలననే నీ గురించి అంతగా ఆలోచించను (పట్టించుకోను). అయినా నీవు ఏతప్పూ చేయనిదానివి. అందువలన నీవు పరిస్థితుల ప్రభావం వలన ఎన్ని తిప్పలు పడుతున్నా నాకు పరితాపం కలగదు. ఈ సత్యం నీవు తెలియకుండా మాట్లాడుతున్నావు సుమా!' ఇది లౌకికోక్తి.

(2) అర్జునపరంగా- 'ఓ ద్రౌపదీ! నాకు నీతో పరిచయం ఇప్పటిదా? ఎన్ని విధాల ఆలోచించినా నీవు నిందించదగినదానివి కావు. అందువలన నీవు ఈ విధంగా బాధలు పడుతుంటే నా మనస్సు ఎన్ని రకాల బాధల ననుభవించటం లేదు? అయినా ఈ వాస్తవాన్ని నీవు గుర్తించవు గదా!' ఇది లలితమైన అధిక్షేపోక్తి.

(3) మనసులోని మాట: 'నీతో నా కున్న దీర్ఘకాల పరిచయం వలన నీ కెన్ని ఇబ్బందులు ఎదురైనా చివరకు అనింద్యవుగా నీవు బయటపడతావని తెలుసు. నీవు ఎన్ని రకాల బాధలు పడితే నేనూ అన్ని రకాలుగా మనసులో వేదన పడతాను. నీమీద ఉన్న నా ప్రేమ అటువంటిది. ఇది సహజం. తెచ్చిపెట్టుకొన్నది కాదు.' ఇది గూఢాభిజ్ఞానోక్తి, ద్రౌపది మాటలకు దీటైన సమాధానం చెప్పాడు. అర్జునుడు. (సంపా.)

వ. అని తాను నిజసహోదరుల యట్లపోలె వేషాంతరంబు దాల్చిన యంతియకాక యూర్వశి యిచ్చిన శాపం బనుభవించుటకు శరీరాంతర పరిగ్రహంబు చేయుటం జేసి రిపుమర్దనంబు తనకు వెరవు గాకునికి గుప్తసాభిజ్ఞానంబుగాఁ దెలిపిన బలసూదనసూను పలుకులు విని పాంచాలి యంతస్స్మిత కమనీయ కపోల యగుచు నిట్లనియె. 53

ప్రతిపదార్థం: అని= అంటూ; తాను; నిజ సహోదరుల+అట్లపోలెన్= తన సోదరుల వలె; వేష+అంతరంబున్= మారువేషాలను; తాల్చిన+అంతియకాక= తాల్చినంతమాత్రమే కాకుండా; ఊర్వశి+ఇచ్చిన శాపంబు+అనుభవించుటకున్= ఊర్వశి ఇచ్చిన శాపాన్ని అనుభవించటానికై; శరీర+అంతర పరిగ్రహంబు చేయుటన్+చేసి= రూపాంతరాన్ని స్వీకరించటం వలన (అనగా పేడిరూపాన్ని పొందటం చేత); రిపుమర్దనంబు= శత్రుసంహారం; తనకున్; వెరవు+కాక+ఉనికిన్= తగిన పద్ధతి కాకపోవటం చేత; గుప్త స+అభిజ్ఞానంబుగాన్= రహస్యంగా చెప్పబడిన సంకేతంతో కూడుకొన్నదిగా; తెలిపినన్= తెలుపగా; బలసూదనసూను పలుకులు విని= ఇంద్రసుతుడైన అర్జునుడి మాటలు విని; పాంచాలి= ద్రౌపది(సైరంధ్రి); అంతస్+స్మిత= పైకి కనపడని ముసిముసినవ్వుతో; కమనీయ కపోల+అగుచున్= చూడముచ్చటయిన చెక్కిళ్ళు కలది ఔతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: అర్జునుడు తన తోబుట్టువుల మాదిరిగా మారువేషం మాత్రమే కాకుండా ఊర్వశీ శాపం వలన మారు శరీరాన్ని పొందినందున (పురుషుడు పేడివాడిగా మారటం వలన) శత్రువులను చంపటం పరిపాటి కాదని గోప్యంగా తన మనోగతాన్ని సాంకేతికంగా తెలుపగా అతడి మాటలకు లోనవ్వులతో వెలుగొందే చెక్కిళ్ళతో ద్రౌపది ఇట్లా పలికింది.

ఆ. 'అట్లకాక యింత యననేల? నీ మది । తెఱఁగుఁ గొంత యేను నెఱుఁగకున్న
దానఁగాను; నగరఁ దగవుమై నీవు వ । ర్తించుటయ కరంబు ప్రియము నాకు.' 54

ప్రతిపదార్థం: అట్లకాక= అది సరే!; ఇంత+అనన్+ఏల?= ఇంతగా చెప్పటం ఎందుకు?; నీ మది తెఱఁగున్= నీ మనస్తత్వం; కొంత= కొద్దిగా; ఏనున్= నేనునూ; ఎఱుఁగక+ఉన్నదానన్+కాను= తెలియని దానను గాను; నగరన్= నగరిలో; తగవుమైన్= ఉచితరీతిలో (బృహన్నలా స్థితికి తగిన విధంగా); నీవు వర్తించుట+అ= నీవు మసలటమే; నాకు; కరంబు ప్రియము= మిక్కిలి ఇష్టం.

తాత్పర్యం: 'అది సరే, నీ గురించి ఇంతగా చెప్పటం ఎందుకు? నీ మనసు నాకు తెలియదా? నగరిలో (అంతః పురంలో) సముచితంగా నీవు నడచుకొనటమే. నాకు చాలా ఇష్టం.'

విశేషం: ద్రౌపది అర్జునుడితో ఔపచారికంగా మాట్లాడింది. ఇందులో పైకి సైరంధ్రి మాటలతీరులో, లోన ద్రౌపది పలికిన తీరు స్ఫురించటం గమనార్హం. సైరంధ్రిపరంగా- 'ఓ బృహన్నలా! నీ వన్నమాట నిజమే. అందువలన నీ వింతగా చెప్పవలసిన పని లేదు. నీ మనసు నాకు కొంత తెలియకుండా లేదు. అయినా నీ వెప్పుడూ రాచనగరిలో నీ ఉద్యోగధర్మంలో మసలుతూ ఉండటమే నాకు సంతోషం కలిగిస్తుంది.'

2. ద్రౌపది పరంగా'. 'నాథా! నీవన్నది కాదనలేనిది. దానిని ఇంతగా విస్తరించి చెప్పాలా? నీమనసుతీరు నేను కొంతైనా తెలియనిదాననుకాను కదా! నీవు కోపోద్రేకంతో నా కొరకు బయటపడకుండా అంతఃపురాలలోనే వర్తిస్తూ ఉండటం నాకు అనుకూలం. కోరినప్పుడెల్లా చూచుకొనవచ్చును. ఇట్లా ఉండటమే నాకు చాలాఇష్టం.'

3. అర్జునుడు చెప్పుమన్న విషయాల ప్రసక్తే రాలేదు. ఆమె దాటవేసింది. దానికి కారణాలు రెండుగా భావించవచ్చును. ఆమె అర్జునుడికొరకు వచ్చినట్లులేదు. రాజకన్యలకొరకు వచ్చింది. వారందరి ఆదరాభిమానాలను పొందింది. తాను ఒంటరిగా అంతఃపురంలోనికి పోకుండా వారిని వెంటపెట్టుకొని పోదలచింది. ఎందువలన? సుదేష్ణ సైరంధ్రిని నలుగురిలో ఏమీ నిందించలేదు. నిందిస్తే సమర్థించేవారి అండఉంటుంది. ఇదీ ఆమె వ్యూహం. అయితే నర్తనశాలలో అర్జునుడిని చూడటం కూడా ఆమెకు అనుషంగిక ఫలమే. అతడికి వివరాలు చెప్పితే ఆమె ఉద్విగ్నురాలౌతుంది. అతడు కూడా ఆవేశం పొందవచ్చును. ఆవేశంలో వారి సంబంధాలు బయటపడవచ్చును. అందువలన జరిగిన కథ చెప్పటంలేదు. అందువలన ఆమె మాటల తీరే మార్చి సందర్భాన్ని ఉక్తిచమత్కారాలతో రక్తికట్టించింది. మరొక అంశం. భీముడు అడిగితే జరిగిన కథే చెప్పింది ద్రౌపది. అది భీముడిలో కార్యోత్సాహం పొంగించటానికి ప్రత్యక్ష కారణమైనది. ఇప్పుడటువంటిది అర్జునుడిపట్ల అవసరంలేదు. అందుకే నగరిలో నడయాడటమే ప్రస్తుతానికి మంచిదని హితవు చెప్పి ముసిముసినవ్వుల చెక్కిళ్ళతో ముందుకు సాగిపోయింది. (సంపా.)

వ. అనుచుం గన్యకాజన పరివృతయై యరిగి యంతఃపురంబు సొచ్చి సహోదర మరణ శోకాతురయగు కైకేయి కడకుం జనునప్పుడు. 55

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; కన్యకాజనపరివృత+ఐ= కన్యల సమూహంతో కమ్ముకోబడినదై; అరిగి= వెళ్ళి; అంతఃపురంబు+చొచ్చి= రాణి అంతఃపురంలో ప్రవేశించి; సహోదర మరణ= తోబుట్టువుల చావుకు; శోక+అతుర+అగు= దుఃఖంతో బాధపడుతున్న; కైకేయి కడకున్= (కేకయ వంశానికి చెందిన) సుదేష్ణ వద్దకు; చను+అప్పుడు= పోయేటప్పుడు.

తాత్పర్యం: అంటూ, కన్నియలందరూ తనను చుట్టి వెంటరాగా అంతఃపురములోనికి ప్రవేశించింది. తన తోబుట్టువుల చావుకు బాగా శోకిస్తున్న సుదేష్ణవద్దకు వెళ్ళేటప్పుడు.

సీ. ముదమున నెలమి సొంపొదవి నెమ్మొగమునఁ। దోఁపంగ వచ్చినఁ ద్రోచి త్రోచి,
లలి నుల్లసిల్లుచు లలితలోచనదీప్తు। లడర నుంకించిన నాఁగి యాఁగి,
సంతసంబున బాలిశము లగు చెయ్వులు। దొడరఁ జూచినఁ జేయ కుడిగి యుడిగి,
మనమున నుబ్బుమై మాట నాలుకకు రాఁ। గడఁగిన నాడక కడపి కడపి.

తే. ధీరయై యిట్లు సమ్మదపూరమునకు। గఱువతన మను బలితంపుఁ గట్ట వెట్టి
వెలఁది యెఱుఁగనియదివోలె వికృతిలేక। యల్ల నెప్పటియట్టుల యరుగుటయును. 56

ప్రతిపదార్థం: ముదమునన్= సంతోషముతో; ఎలమి సొంపు+ఒదవి= ప్రీతి అధికమై; నెఱ+మొగమునన్= నిండైన ముఖమునందు; త్రోపంగన్+వచ్చినన్= కానుపించరాగా; త్రోచి త్రోచి= తప్పించి తప్పించి, ప్రక్కకు నెట్టి, మరింత నెట్టి; లలిన్= విలాసంతో; ఉల్లసిల్లుచున్= ఉప్పొంగిపోతూ; లలిత= అందమైన; లోచనదీప్తులు= కంటివెలుగులు; అడరన్= అతిశయించటానికి; ఉంకించినన్=ప్రయత్నించగా; ఆఁగి+ఆఁగి= ఆపుకొని; సంతసంబునన్= సంతోషంతో; బాలిశములు+అగు చెయ్వులు= బాల్యచేష్టలు; తొడరన్+చూచినన్= తలయెత్తబోగా; చేయక= వాటిని ప్రదర్శించక; ఉడిగి+ఉడిగి= మానుకొని, గట్టిగా నిగ్రహించుకొని; మనమునన్+ఉబ్బుమైన్= మనసులోని సంతోషాతిశయంతో; మాట= ఉల్లాసపు మాట; నాలుకకు రాన్ +కడఁగినన్= నాలుక మీదకు రాబోగా; ఆడక= పలుకక; కడపి కడపి= తప్పించి, తప్పించి; ధీర+ఐ= ధైర్యవతి అయి; ఇట్లు= ఈ ప్రకారంగా; సమ్మద పూరమునకున్= సంతోష ప్రవాహానికి; గఱువతనము+అను= గాంభీర్యమనే; బలితము+కట్ట= బలమైన అడ్డుకట్టను (నిగ్రహాన్ని); పెట్టి= నిలిపి; వెలఁది= సైరంధ్రి; ఎఱుఁగని+అది+పోలెన్= ఏమీ తెలియనిదానివలె; వికృతి లేక= ఎటువంటి మార్పు లేకుండా; ఎప్పటి+అట్టులు+అ= ఎప్పటి మాదిరిగానే; అల్లన్= మెల్లగా; అరుగుటయును= వెళ్ళుతుండగా.

తాత్పర్యం: సంతోషంవలన కలిగిన ప్రీతి ఒక అందాన్ని కలిగించి నిండుముఖంలో కనబడేటట్లు పైకి త్రోసికొని వస్తుంటే ద్రౌపది దాన్ని ప్రక్కకు ప్రయత్నపూర్వకంగా నెట్టింది. విలాసాలతో విలసిల్లే అందమైన కన్నుల కాంతులు ఉల్లాసంతో ముందుకు రాగా వాటిని యత్నించి ఆపుకొన్నది. వెర్రి సంతోషంతో పసిపిల్లవలె ఎగురుదామని చేష్టలు చెలరేగబోగా వాటిని బలవంతాన మానుకొన్నది. మనసులో పొంగేసంతోషంతో వేడుకమాటలు నాలుక మీద నాట్యం చేయటానికి రాబోగా వాటిని ప్రయత్నించి దాటవేసింది. ఈవిధంగా ధీరురాలై సంతోష ప్రవాహానికి గాంభీర్యమనే అడ్డుకట్టవేసి, అప్పటి సంతోషాతిశయ భావ వికారా లేవీ తోచకుండా, ఏమీ తెలియని అమాయకురాలివలె ఎప్పటి మాదిరిగా అంతఃపురంలోకి పోయింది.

విశేషం: అలం: రూపకం. సుదేష్ణ శోకంతో క్రుంగుతున్నది. సైరంధ్రి హర్షంతో పొంగుతున్నది. రాణి ఎదుట హర్షాన్ని ప్రదర్శించటం ఉచితం కాదు. ఇద్దరికీ విభావం ఒక్కటే- కీచకుల మరణం. సైరంధ్రి ధీరురాలు కాబట్టి నిగ్రహశక్తి ప్రదర్శించింది. సంతోషం మనసులో పుట్టి ముఖంలో, కళ్ళలో, చేష్టలలో, మాటలలో వ్యక్తం ఔతుంది. ఆ నాలుగింటికీ నాలుగు స్థాయిలలో ఉన్న హర్షాతిశయం కారణమవుతుంది. ఆ నాలుగు దశలను నాలుగు విశిష్ట యత్నాలలో నిగ్రహించుకొనవలసివస్తుంది. ఆ ప్రయత్నకృత నిగ్రహ ప్రవృత్తిని తిక్కన ద్విరుక్తితో ధ్వనింపచేశాడు. సంతోష ప్రవాహానికి అడ్డుకట్ట వేయటంలో రూపకాన్ని రూపొందించాడు. ఆమె భావనిగ్రహశక్తితో వికారరహితమైన ధీరస్థితిని ప్రదర్శించింది. సుదేష్ణ అధీరురాలుగానూ, సైరంధ్రి ధీరురాలుగానూ నిలవటం కథాగతిలో వంచనపై సాధించిన విజయస్ఫూర్తిని ప్రదర్శిస్తున్నది. (సంపా.)

క. **భయశోకంబులు తనదు హృ। దయమునఁ బిరిగొన విరాట ధరణీనాథ**
ప్రియ సంభావనసేసి వి। నయపూర్వము గాఁగ ద్రుపదనందనకుఁ దగన్. **57**

ప్రతిపదార్థం: విరాట ధరణీనాథప్రియ= విరాటరాజు యొక్క అనుంగు భార్య; భయశోకంబులు= భయం, దుఃఖం; తనదు హృదయమునన్= తన మనస్సులో; పిరిగొనన్= పెనవేసికోగా; ద్రుపదనందనకున్= ద్రౌపదికి; తగన్= తగునట్లుగా; వినయపూర్వముగాఁగన్= అణకువతో; సంభావన+చేసెన్= గౌరవం చేసింది.

తాత్పర్యం: సైరంధ్రిని చూడగానే సుదేష్ణ భయ శోకభావాలు తన హృదయంలో పెనగొనగా ఆమెను వినయపూర్వకంగా పలుకరించింది.

విశేషం: సైరంధ్రి గంధర్వపతుల సతి. వారిచేత కీచకుల నందరినీ ఒక్కరాత్రిలో చంపించింది. అందువలన భయం కలిగింది. ఆమెను చూడగానే సోదరులైన కీచకుల మృతి జ్ఞాపకంవచ్చి శోకంకలిగింది. సైరంధ్రి అంటే భయం పెరిగింది. ఆమెకు కోపంరాకుండా పనిసాగించాలి. విరటుడి ఆనతి ఆమెకువినిపించాలి. బైటకుపంపించాలి. అందువలన వినయంగా, గౌరవంగా ఆమెను పిలిచింది. భయపెట్టేవాళ్ళకు అందరూ అడుగులకు మడుగులొత్తటం లోకసహజమే. సుదేష్ణ ఆతీరునే నడిచింది. (సంపా.)

వ. ఇట్లు సంభావించి యత్తరుణిం దన పరిసరంబున నునిచికొని తదీయ వదనం బవలోకించి. 58

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; సంభావించి= గౌరవించి; ఆ+తరుణిన్= ఆమెను (సైరంధ్రిని); తన పరిసరంబునన్= తన ప్రక్కనే; ఉనిచికొని= నిలుపుకొని; తదీయ వదనంబు+అవలోకించి= ఆమె యొక్క ముఖంవైపు చూచి.

తాత్పర్యం: సుదేష్ణ ఆ విధంగా గౌరవించి సైరంధ్రిని తన ప్రక్కనే కూర్చుండజేసి ఆమె ముఖం వైపు చూచి (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: సుదేష్ణ చెప్పబోయే విషయం పరుషమైనది. దాన్ని పరుషంగా చెప్పటం అప్పుడు ఉచితం కాదు. బలవంతులైన మిత్రులనైనా, శత్రువులనైనా నయవినయాలతోనే జయించాలి. అందువలన ఆమెను అప్యాయంగా ప్రక్కనబెట్టుకొని మాట్లాడబోతున్నది. విప్రుల మనస్సు నవ్యనవనీత సమానం. మాట దారుణాఖండల శస్త్రతుల్యం. క్షత్రియులలో అది విపరీతం అని నన్నయ్య చెప్పినట్లు సుదేష్ణ మాట మెత్తన, చేత కఠినం. (సంపా.)

తే. 'నీవు చక్కనిదానవు నెలఁత! ధైర్య । రహితచిత్తులు మగవారు; రాజు దీనిఁ
దలఁచి భయమంది నిన్ను నీ వలచు నెడకు । నరుగునట్లుగఁ బ్రార్థించి యనుపు మనియె.' 59

ప్రతిపదార్థం: నెలఁత!= ఓ వనితా!; నీవు చక్కనిదానవు= నీవా-అందగత్తెవు; మగవారు ధైర్యరహితచిత్తులు= పురుషులా-ధైర్యం (నిగ్రహం) లేని మనసు కలవారు (నిన్ను చూచి మనసు చలించేవారు); రాజు= రాజుగారు (విరటుడు) దీనిన్+తలఁచి= దీనిని ఆలోచించి; భయము+అంది= భయపడి; నిన్నున్= నిన్ను; నీవలచు+ఎడకున్= నీకిష్టం వచ్చినచోటికి; అరుగునట్లుగన్= వెళ్ళే విధంగా; ప్రార్థించి= వేడుకొని-బ్రతిమిలాడి; అనుపుము+అనియెన్= పంపివేయుమన్నాడు.

తాత్పర్యం: 'సైరంధ్రీ! నీవా- అందగత్తెవు. మగవారా- చిత్తస్థైర్యం లేనివారు. రాజైన విరటుడు ఈ అంశాన్ని బాగా ఆలోచించి భయపడి, నిన్ను నీకు నచ్చిన చోటికి వెళ్ళుమని ప్రార్థనాపూర్వకంగా చెప్పి పంపుమన్నాడు.'

విశేషం: సుదేష్ణ చెప్పిన తీరు సునిశితంగా ఉన్నది. సూటిగా ఘాటుగా ఉన్నా సున్నితంగా కూడా ఉన్నది. 'భార్యా రూపవతీ శత్రుః' అని ఒక సూక్తి ఉన్నది. ఇక్కడ 'దాసీ రూపవతీ శత్రుః' అన్నట్లయింది. సైరంధ్రి అందగత్తె అట! అది ఒకప్పుడు గుణం. ఇప్పుడు మహాదోషమయింది. ఎందువలన? మగవారు చిత్తచాంచల్యం కలవారు కాబట్టి. మగవారిని శాసించలేని రాణి సైరంధ్రినే శాసించగలదు. కాగా, ఆమె అందాన్ని ఆశించి కీచకులందరూ చనిపోయారు. ఆ సంగతి సుదేష్ణ చెప్పదు. అది గతార్థం. వ్యంగ్యం. ఇకముందు మరెందరో మగవారు ఆ త్రోవన పోయే అవకాశం ఉన్నదని రాజుగారు బాగా ఆలోచించి సైరంధ్రిని పంపివేయటమే ఉపాయమని నిశ్చయించారు. ఇది రాజాజ్ఞ. అంతఃపురం దానికి దాసోహం అనవలసిందే. ద్రౌపదిని ఒక సంవత్సరంపాటు సైరంధ్రీ వృత్తిలో ఉంచుకొంటామని మాట ఇచ్చిన మాట నిజమే. కాని, జనహితాన్ని కోరి మధ్యలోనే పంపవలసి వస్తున్నది. వ్యక్తి ధర్మం కంటె సంఘ ధర్మం గొప్పది. కాబట్టి నీవు నీ అంతట నీవే వెళ్ళిపోయేటట్లు ప్రార్థించుమన్నాడు.

ఇది వెళ్ళగొట్టటం కాదు. నీ అంతట నీవే వెళ్ళిపోవటంగా గ్రహించుమని నిపుణంగా, మృదువుగా సుదేష్ణ చెప్పింది. సమయానికి తగినట్లు మాట నేర్పరితనం ప్రదర్శించటం ఆమెకు సహజ గుణమే. (సంపా.)

వ. అని తన మనంబునం గదిరిన యనుజ వియోగతాపం బుత్కటం బగుటయు వెండియు నిట్లనియె. 60

ప్రతిపదార్థం: అని; తన మనంబునన్= తన మనసులో; కదిరిన= కలిగిన; అనుజవియోగతాపంబు= తోబుట్టువుల మరణ వియోగం వలన కలిగిన బాధ; ఉత్కటంబు+అగుటయున్= ఎక్కువ కాగా; వెండియున్= ఇంకను; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: అని తన హృదయంలో సోదరవియోగబాధ అధికంకాగా సుదేష్ణ మరల ఇట్లా అన్నది.

క. 'బిరుదు గల మగలు గలరని । తరమిడి చంపింపఁ జూచెదవు; జనములు నీ
పొరువునఁ బో వెఱతురు, మా । పురమును రాష్ట్రంబు వెడలి పొమ్మెందైనన్.' 61

ప్రతిపదార్థం: బిరుదు+కల= పేరున్న; మగలు= భర్తలు; కలరు+అని= ఉన్నారని; తరమిడి= వరుస పెట్టి; చంపింపన్+చూచెదవు= చంపించటానికి ప్రయత్నిస్తున్నావు; జనములు= మనుష్యులు; నీ పొరువునన్= నీ ప్రక్కన; పోన్= నడవటానికి; వెఱతురు= భయపడతారు; మా పురమును= మా నగరాన్ని; రాష్ట్రంబును= (మా) దేశాన్ని; వెడలి= గడచి; ఎందు+ఐనన్+పొమ్ము= ఎక్కడికైనా వెళ్ళుము.

తాత్పర్యం: 'బిరుదున్న భర్త లున్నారని వరుసపెట్టి అందరినీ చంపించటానికి ప్రయత్నిస్తున్నావు. మనుష్యులు నీ జాడలో నడవటానికే భయపడుతున్నారు. మా నగరాన్నీ, మా దేశాన్నీ వదిలి ఎక్కడికైనా వెళ్ళిపొమ్ము.'

విశేషం: విరటుడు తెలుపుమన్న మాటలు చెప్పిన తరువాత తనమాటలుగా సుదేష్ణ పలుకుతున్నదిది. ఇందులో రెండు అభియోగాలున్నాయి. ఒక ఆజ్ఞ ఉన్నది. బలవంతులైన భర్తలతో వరుసబెట్టి పురుషులను చంపించటం హత్యానేరం. ప్రజలు ఆమెను సమీపించటానికే భయపడటం - ప్రజాక్షేమంలేని అశాంతి పరిస్థితిని దేశంలో కలిగించిన నేరం. కాబట్టి మొదటి నేరంవలన నగరాన్నీ, రెండో అభియోగంవలన దేశాన్నీ వదలిపోవాలని రాణి ఆజ్ఞాపించింది. ఇది పరోక్షంగా దేశబహిష్కారం వంటిది. సైరంధ్రిచేసిన నేరానికి మరణదండనమే వేయవచ్చును. కాని, దయదలచినట్లు మాట్లాడింది. కాని, లోపల అటువంటి దండనంవలన రాజుకే ముప్పుకలుగవచ్చునని భయపడింది. ఏమైనా సాహసించివెళ్ళుమని అనగలిగింది. బలవంతాన పంపించే ధైర్యంమాత్రం సుదేష్ణకులేదు. సైరంధ్రి ఆమె ఆజ్ఞను మన్నిస్తుందా? అన్నది ప్రశ్న. (సంపా.)

వ. అనిన విని విరాటవల్లభకు సైరంధ్రి యిట్లనియె. 62

తాత్పర్యం: అట్లనగా విని, విరటుడి భార్యఅయిన సుదేష్ణతో సైరంధ్రి ఈవిధంగా అన్నది.

ఉ. 'ముందటియట్ల యింకఁ బదుమూఁడు దినంబుల మాత్రకున్ భవ
న్మందిరవాస మియ్యకొనినం గడతేఱు మదీయవాంఛ; యం
తం దగఁ దోఁచి మత్పతు లుదాత్తమతిన్ భవదీయ వాంఛితం
బుం దలకొల్పఁ జాలుదు; రపూర్వ మనఃప్రమదంబు సేకుఱున్. 63

ప్రతిపదార్థం: మొందటి+అట్లు+అ= ఇంతకు ముందువలెనే; ఇంకన్= ఇక మీద; పదుమూఁడు దినంబుల మాత్రకున్= పదమూడురోజులు మాత్రమే; భవత్+మందిరవాసము= మీ భవనంలో ఉండటానికి; ఇయ్యకొనినన్= అంగీకరిస్తే; మదీయవాంఛ= నా కోరిక; కడతేఱున్= తీరుతుంది; అంతన్= ఆ మీద; మత్పతుల్= నా భర్తలు; తగన్+తోఁచి= తగినట్లుగా కనిపించి; ఉదాత్తమతిన్= ఉదారమైన మనస్సుతో; భవదీయ వాంఛితంబున్= నీ కోరికను; తలకొల్పన్+చాలుదురు= చేయగలరు; (అందు వలన) అపూర్వమనస్+ప్రమదంబు= ఇదివరకెన్నడూ పొందని విశేష సంతోషం; చేకుఱున్= మీకు కలుగుతుంది.

తాత్పర్యం: 'ఇంతవరకున్న విధంగానే ఇంకొక్క పదమూడు రోజులు మాత్రం నీ మందిరంలో ఉండటానికి ఒప్పుకొంటే చాలు, నా కోరిక తీరుతుంది. ఆ మీద నా భర్తలు సముచితంగా కనిపించి, ఉదారబుద్ధితో మీ కోర్కెను తీర్చగలరు. దానివలన ఇదివర కెన్నడూ కలుగని సంతోషం మీకు కలుగుతుంది.

విశేషం: 1. సుదేష్ణ చేసిన అభియోగాలకూ, ఆజ్ఞకూ తగిన సమాధానం చెప్పి ఆమెచేతనే ఔననిపించుకొనేటట్లు చేసే మాట నేర్పరితనం ద్రౌపది (సైరంధ్రి) ప్రదర్శిస్తున్నది. మొదటిదీ, తీవ్రమైనదీ అయిన అభియోగం - బలవంతులైన భర్తలతో లోకులను చంపించటం. పదమూడు రోజులు ఆమెను పూర్వం వలెనే అంతఃపురంలో ఉంచుకొంటే ఆమె కోరిక పూర్తిగా సఫలమౌతుందట! అట్లా చేస్తే గంధర్వులు తమ తమ రూపాలతో వారికి కనపడతారట. వారు ఉదారంగా వరా లిస్తారట. సుదేష్ణా విరాటుల కోర్కెలు తీరుతాయట! అపూర్వమైన మనఃప్రీతి కలుగుతుందట! భయంతో వణికిపోతున్న రాజకుటుంబానికి గంధర్వుల దర్శనం, రక్షణ వరప్రదానంగా లభిస్తాయట! పదమూడు రోజులు ఓపిక పడితే వారి కన్నీ శుభాలే కలుగుతాయట! ఇది సుముఖమైన సూచన. ఈ మాటల వెనుక పైకి మెత్తని బెదరింపు కూడా ఉన్నది. 'నన్ను మీ రిప్పుడే బహిష్కరిస్తే నాకు బాధ కలుగుతుంది. నా గంధర్వ భర్తలకు ఆగ్రహం వస్తుంది. వారు మీ కంటికి కనపడకుండానే మారణహోమం సృష్టించవచ్చును. వారు ఉగ్రమతులైతే మీ కోరిక తీరకపోగా మీకు అపూర్వమైన అపాయం కూడా సిద్ధించవచ్చును'- అని ఆ వ్యతిరేకవ్యంగ్యంలోని గూఢార్థం. సైరంధ్రి కోర్కెను మన్నిస్తే గంధర్వులు రాజ్ఞీ రాజుల కోర్కెలను తీర్చి వరాలిస్తారు, లేదా వరుసపెట్టి చంపుతారు. మీరు హితం కోరుకొంటారో, హతం కావాలనుకొంటారో తేల్చుకొనండి!-అని గూఢమైన బెదరింపు చేసింది సైరంధ్రి.

2. సైరంధ్రి మాటలను అర్థవంతంగా ప్రయోగించింది. 1. మందిరవాసం పదమూడు రోజులూ ఎక్కడికి పోకుండా నీ అంతఃపురంలోనే నీ పర్యవేక్షణలోనే ఉండటానికి అంగీకరిస్తే అని భావం. 2. కడతేఱున్= చివరిదాకా ముగుస్తుంది, ఫలిస్తుంది అని అజ్ఞాతవాస నియమ ప్రసక్తిని స్ఫురింపజేసింది. 3. తగన్+తోఁచి= అనే మాటలు ఎంతో సముచితాలు. గంధర్వులుగా చెప్పబడుతున్న తన భర్తలు అజ్ఞాతవాస నియమానంతరం తమకు సహజమైన పాండవుల ఆకారాలతో మీ ముందు బయలు మెరసి కనబడతారనీ, మీముందు ప్రత్యక్షమౌతారనీ ధ్వని. 4. భవదీయ వాంఛితంబు దలకొల్పజాలటం-సుదేష్ణ కోరికను నెరవేరుస్తారట. ఇది ఇప్పుడు కోరిన కోరికా? లేక అప్పుడు కోరే కోరికా? 'వాంఛితం' తగిన మాట! అప్పుడు కూడా నన్ను బహిష్కరిస్తే అట్లాగే చేస్తారు. లేదా మీరు మాటమార్చి మంచి కోరికలు కోరుకుంటే వరాలుగా ఇస్తారు అని భావం. 5. అపూర్వ మనః ప్రమదం- గంధర్వ దర్శన స్పర్శన సంభాషణ అనుగ్రహాలు పొందటం వలన కలిగే అద్భుతమైన ఆనందం మీకు కలుగుతుందని ప్రస్తుతార్థం. ఉత్తరా వివాహం వలన మీకు అపూర్వ సంతోషం కలుగుతుందని భావి కథార్థం స్ఫురిస్తున్నాయి. వస్తుధ్వనికి విలువైన ఉదాహరణం ఈ పద్యం, (సంపా.)

క. **కృత మెఱుఁగుదు, రుపకార । వ్రతమున వర్తింతు, రెపుడు వదలరు, కరుణా**
న్వితు, లీ నరపతికి శుభ । ప్రతిపాదకు లగుదు రేమిభంగుల నైనన్. 64

ప్రతిపదార్థం: కృతము+ఎఱుఁగుదురు= చేసిన మేలును గుర్తిస్తారు (కృతజ్ఞులు); ఉపకార వ్రతమునన్= (ఇతరులకు) మేలు చేసే నియమంతో; వర్తింతురు= ప్రవర్తిస్తారు; ఎపుడున్= ఏ సమయంలోనూ; వదలరు= ఉపకారగుణాన్ని వదిలిపెట్టరు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(మానరు); కరుణా;+అన్వితులు= దయగలవారు; ఏమిభంగులనైనన్= ఏవిధంగానైనా; ఈ నరపతికిన్= ఈ రాజుకు (విరటుడికి); శుభప్రతిపాదకలు+అగుదురు= మంచి చేసే వారౌతారు.

తాత్పర్యం: ఎవరైనా మేలు చేస్తే దానిని నా భర్తలు కృతజ్ఞతతో గుర్తిస్తారు. పరులకు ఉపకారం చేయాలనే దీక్షతోనే ప్రవర్తిస్తారు. ఆ నియమాన్ని ఎప్పుడూ వదలరు. స్వభావరీత్యా వారు దయామయులు. ఏవిధంగానైనా సరే ఈ విరాటుడికి వారు మేలు చేసేవారే ఔతారు.

విశేషం: ఇందులో పాండవులను గురించి చెప్పిన ప్రతి వాక్యమూ సుదేష్ణా విరాటుల హృదయాలలో ఉండే అనుమానాలను సమూలంగా తీసివేసేదే. 1. రాజదంపతులు తమకు చేసిన ఉపకారాన్ని గుర్తుంచుకొని కృతజ్ఞత ప్రకటిస్తారు. అందువలన రాజకుటుంబానికి వారు కృతజ్ఞతాబద్ధులు కాబట్టి అపకారం చేయరు. 2. పరులకు ఉపకారం చేయటం వారి జన్మవ్రతం. అది వారువద్దన్నా వదలరు. కాబట్టి మీరుకాదన్నా వారు మీకు ఉపకారం చేస్తారు. 3. వారికి ఎవరిమీదా కోపంలేదు. పగలేదు. పైపెచ్చు దయను చూపటమే వారి నైజం. కాబట్టి మీకు వచ్చే అపాయ మేమీ లేదు. 4. ఈ పదమూడు రోజులూ మీరు నన్నూ వారినీ మన్నిస్తే మీకు ఎన్నిరకాలుగా మేలుచేయడానికి వీలుందో అన్ని రకాలుగా చేసి, శుభాలు కలిగిస్తారు. కృతజ్ఞత, ఉపకారగుణం, పట్టుదల, దయామయత్వం, పరహిత భావం - అనేవి పాండవ గుణాలుగా ద్రౌపది పరోక్షంగా పేర్కొన్నది. ఇవన్నీ రాబోయే కథలో దక్షిణ, ఉత్తర గోగ్రహణ ఘట్టాలలో, ఉత్తరా వివాహ ఘట్టంలో పాండవులు ప్రదర్శించబోయే ఉదాత్త గుణాలే. కాబట్టి ద్రౌపది మాటలలో భావికథార్థధ్వని ఉన్నది. సుదేష్ణను సుముఖురాలుగా చేసికొనే సూక్తి నైపుణ్యం ఉన్నది. ఆమె చేసిన అభియోగాలను త్రిప్పికొట్టే తీర్పరితనం ఉన్నది. (సంపా.)

వ. కావున. **65**

తాత్పర్యం: కనుక.

క. సైరంధ్రి యిట్టు లనుటకుఁ। గారణము దలంప నేమిగా నోపునొ? యం
చారసి బహుప్రకార వి। చారములకుఁ జొచ్చు టుడుగు సరసిజవదనా! **66**

ప్రతిపదార్థం: సరసిజవదనా!= పద్మంవంటి ముఖంకలదానా! సుదేష్ణా!; సైరంధ్రి+ఇట్టులు+అనుటకున్= సైరంధ్రి ఈ విధంగా అనటానికి; తలంపన్= ఆలోచించగా; కారణము= హేతువు; ఏమి+కాన్+ఓపునొ?= ఏమై ఉంటుందో?; అంచున్= అంటూ; ఆరసి= విచారించి; బహుప్రకార= అనేక విధాలైన; విచారములకున్= యోచనలకు; చొచ్చుట= లోనుకావటం; ఉడుగు= మానుము.

తాత్పర్యం: ఓ సుదేష్ణా! సైరంధ్రి ఇట్లా అనటానికి కారణ మేమై ఉంటుందా? అని అనుమానించి అనేక రకాలుగా ఆలోచించటం మానుకొమ్ము.

విశేషం: సుదేష్ణ మనిషికాదు. లోగుట్టు మనిషి, లోతు మనిషి, అందువలన సైరంధ్రిమాటలను నమ్మకపోవచ్చును. అనుమానం కలగటం ఆ సమయంలో సహజం కూడా. సైరంధ్రి తన కనుకూలంగా జిత్తులమారి ఎత్తులు వేస్తున్నదేమో అని అనుమానించవచ్చును. అందువలన విశ్వాసాన్ని కలిగించేటట్లు ఈ మాటలన్నది. సుదేష్ణ మనస్తత్త్వం తెలిసినదానివలె కీలెరిగి వాతపెట్టినట్లు ద్రౌపది మాట్లాడింది. (సంపా.)

క. ఇది యేమియైన నేమగు?। మది నా కీ చింతయేల? మన్నన యెల్లం
దుదిఁ జెఱుపక ప్రార్థన సే। యుదుఁగా కని నిశ్చయించు టుచితమె నీకున్?' **67**

ప్రతిపదార్థం: ఇది= ఈ సైరంధ్రి; ఏమి+ఐనన్+ఏమి+అగున్?= ఏమయిపోతే నాకేమి?; మదిన్= మనసులో; నాకున్= నాకు (సుదేష్ణకు); ఈచింత= సైరంధ్రిని గూర్చిన ఈ విచారం; ఏల?= ఎందుకు?; తుదిన్= ఈ చివరి దశలో; మన్నన+ఎల్లన్= ఇంత వరకూ చూపిన గౌరవమంతా; చెఱుపక= ఉన్నట్లుండి చెడగొట్టక; ప్రార్థన+చేయుదున్+కాక= (ఇక్కడ నుండి వెడలి పొమ్మని మెత్తగా) వేడుకొందునుగాక; అని= అనుకొని; నిశ్చయించుట= నిర్ణయం గైకొనడం; నీకున్+ఉచితము+ఎ?= నీకు తగునా? (తగదని భావం).

తాత్పర్యం: ఈ సైరంధ్రి ఏమైపోతే నాకేమి? ఈమెను గురించిన విచారం నాకెందుకు? ఇంతకాలం ఈమెను గౌరవంగా చూచాను. ఈ చివరి దశలో ఆ గౌరవానికి భంగం కల్గించకుండా ఈమెను ఇక్కడ నుండి వెళ్ళిపొమ్మని నెమ్మదిగా వేడుకొందును గాక' అని నీలో నీవే నిర్ణయించుకొన్నావే! అమ్మా! ఇది నీకు తగునా?'

విశేషం: అంతగా అభిమానించి ఆదరించిన సైరంధ్రిని అంత త్వరగా వదిలించుకొనాలని భావించడం న్యాయమా? అని ప్రశ్నించింది. స్నేహపురస్సరంగా తన మాటను మన్నించుమని సైరంధ్రి సుదేష్ణను కోరింది. (సంపా.)

చ. **అనిన సుదేష్ణ యిట్లనియె 'నంతవునంతకు మద్గృహంబునం**
దునికికి సమ్మతించితి; నిజోచితవృత్తిఁ జరింపు; నాదు నం
దనుల మదీయ వల్లభు నుదాత్తమతిం బరికించికొమ్ము; నీ
మనమున కెట్టు లూఱట సమస్తము నట్టుల చేసెదం దగన్.' **68**

ప్రతిపదార్థం: అనినన్= అని (సైరంధ్రి) అనగా; సుదేష్ణ ఇట్లు+అనియెన్= సుదేష్ణ ఈ విధంగా అన్నది; అంత+అవు+అంతకున్= నీవు కోరిన గడువు అయ్యేంత వరకూ (పదమూడు రోజులు ముగిసేంత వరకు మాత్రమే); మత్+గృహంబునందున్= నా భవనంలో; ఉనికికిన్= ఉండటానికి; సమ్మతించితిన్= ఒప్పుకొన్నాను; నిజ+ఉచితవృత్తిన్= నీకు తగిన ప్రవర్తనతో; చరింపు= నడుచుకొమ్ము; నాదు నందనులన్= నా కుమారులను; మదీయ వల్లభున్= నా భర్తను; ఉదాత్తమతిన్= పెద్ద మనసుతో; పరికించికొమ్ము= చూచుకొమ్ము (రక్షించుమనే అర్థంలో గౌరవంగా వాడిన క్రియ); నీ మనమునకున్= నీ మనసుకు; ఎట్టులు= ఏవిధంగా; ఊఱట= తృప్తియో; సమస్తము= అన్నింటిని; అట్టులన్= ఆ విధంగానే; తగన్= తగునట్లుగా; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: సైరంధ్రి మాటలు విని సుదేష్ణ ఇట్లా పలికింది. 'నీవన్న గడువు ముగిసేంతవరకు నా మందిరంలో నీవుండటానికి సమ్మతిస్తున్నాను. నీవు నీ వృత్తికి తగిన పనులలో వ్యవహరిస్తూ ఉండిపొమ్ము. నా కొడుకులనూ, నా భర్తనూ పెద్ద మనసుతో కనిపెట్టి రక్షిస్తూ ఉండుము. నీ మనస్సు ఊరట కలగటానికి ఏవేవి అవసరమో అన్నిటినీ నీవు కోరినట్లు తగినట్లు అమరుస్తాను.'

విశేషం: సైరంధ్రి మాటలకు సుదేష్ణ మెత్తబడి మాట్లాడింది. గడువుకు ఒప్పుకొన్నది. సైరంధ్రీవృత్తిలో తన ఇంట్లో మామూలుగా ఉంటూ స్వేచ్ఛగా తిరుగుమన్నది. అంతేగాక తన కొడుకులనూ, భర్తనూ చల్లగా చూచుకొనే భారం కూడా ఆమెదే అని బాధ్యత ఒప్పగించింది. అంటే, గంధర్వులు వారి మీద చేయి చేసికొనకుండా చూచుకునే భారం ఆమెకే వదిలిపెట్టింది. ఆమె మనసుకు నచ్చిన తీరుగా అన్నీ అమరుస్తానన్నది. దానితో ద్రౌపది లక్ష్యం సమగ్రంగా సాధించబడింది. ఇవి అమాయకంగా, అలవోకగా, సుదేష్ణ పలికిన మాటలైనా, పలికించింది తిక్కన. అందువలన ప్రతివాక్యంలోనూ అర్థగౌరవం ధ్వనిమయంగా

ప్రకాశిస్తున్నది. 'అంటే - నీ గడువు పూర్తయ్యేంతవరకు? పదమూడు రోజులా? అజ్ఞాత వాసవత్సరమా? ఆలోచిస్తే రెండూ. పదమూడు రోజులలో అజ్ఞాతవాస నియమం పూర్తి కానున్నదని కాలసూచన వ్యంగ్యం. ఉత్తరుడినీ, విరాటుడినీ రక్షించే బాధ్యత సైరంధ్రి చేతిలో పెట్టటంలో భావి కథార్థ ధ్వని ఉన్నది. ఉత్తరుడు ఉత్తర గోగ్రహణ సందర్భంగా సారథిని కోరినప్పుడు బృహన్నలను ఒప్పించి సారథిగా పంపిన గౌరవం సైరంధ్రిదే. ఉత్తరుడిని అర్జునుడి ద్వారా రక్షించి విజయాన్ని విరటుడికి సాధించిపెట్టిన ఘనత సైరంధ్రిదే. ధర్మరాజును పాచికతో విరాటుడు కొట్టినప్పుడు అతడి రక్తం నేలమీద పడకుండా ఆదుకొని విరాటరాజ్యం కరువు కాటకాలలో పడకుండా రక్షించింది సైరంధ్రియే. భావికథను ఇంతగా గర్భీకరించుకొన్న వాక్యాలు సుదేష్ణ తెలిసి పలికినవి కావు. తిక్కన తెలివితో పలికించినవి. (సంపా.)

క. అని యూఱడిల్లఁ బలికిన । విని తొల్లిటియట్ల యుచితవృత్తి ద్రుపద నం
దన యుండె; నట్టియెడ ని । ట్లని మ్రోసిరి జనులు పురమునందును భూమిన్. 69

ప్రతిపదార్థం: అని+ఊఱడిల్లన్= అని ఉపశమించేటట్లు; పలికినన్= మాట్లాడగా; విని= విని; తొల్లిటిన్+అట్లు+అ= వెనుకటి మాదిరిగానే; ఉచితవృత్తిన్= తగిన పద్ధతితో; ద్రుపదనందన= ద్రౌపది; ఉండెన్= ఉన్నది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; జనులు= ప్రజలు; పురమునందును= నగరంలోనూ; భూమిన్= దేశమంతటా; ఇట్లు+అని= ఈ విధంగా; మ్రోసిరి= టమటమా వేసినట్లు మాట్లాడుకోసాగారు.

తాత్పర్యం: అని సైరంధ్రి మనసు కుదుటపడేటట్లు సుదేష్ణ పలికింది. ద్రౌపది ఎప్పటివలెనే తన వృత్తిలో తాను సముచితంగా మసలుతున్నది. ఆ సమయంలో జనులందరూ పట్టణమంతా, ప్రపంచమంతా వ్యాపించేటట్లు ఈ విధంగా అనుకొనసాగారు.

చ. 'విరటు మఱంది కీచకుఁడు విక్రమ దుర్దముఁ, డన్యసైన్య భీ
కర మహనీయమూర్తి, బలగర్వ సముద్ధత చిత్తుఁ, డెందు నె
వ్వరు సరిలేరు వీని కన వాలిన దండి మగండు; సూడ న
చ్చెరు వగు చావు చచ్చె; నటుసేసిన వారట యెట్టి వీరులో! 70

ప్రతిపదార్థం: విరటు మఱంది= విరటుడి బావమరది; కీచకుఁడు= కీచకుడనేవాడు; విక్రమ దుర్దముఁడు= శౌర్యంతో అణచటానికి వీలులేనివాడు; అన్యసైన్య= శత్రువుల సేనలకు; భీకరమహనీయమూర్తి= భయంకరమైన గొప్ప ఆకారం కలవాడు; బలగర్వ సముద్ధతచిత్తుఁడు= బలగర్వాలతో విర్రవీగే మనసుకలవాడు; ఎందున్= ఎక్కడగాని; వీనికిన్+ఎవ్వరు సరిలేరు= వీడికి దీటైనవారు ఎవ్వరూ లేరు; అనన్= అనగా; వాలిన= ప్రసిద్ధికెక్కిన; దండిమగండు= మేటివీరుడు; చూడన్= పరికించగా; అచ్చెరువు+అగు= ఆశ్చర్యకరమైన; చావు చచ్చెన్= చావు చచ్చాడు; అటు+చేసినవారు+అట!= ఆ విధంగా చేసిన (చంపిన) వారట!; ఎట్టివీరులో!= ఎంతటి వీరులో కదా!

తాత్పర్యం: 'విరాటుడి బావమరది కీచకు డనేవాడు ఇతరులకు జయించరాని పరాక్రమం కలవాడు. శత్రుసేనలకు భయం కలిగించే బలం కలవాడు. వీడికెక్కడా ఎవ్వరూ దీటైనవారులేరనే పేరుపొందిన మేటివీరుడు. అటువంటివాడు చూపరులకు ఆశ్చర్యం కలిగించే వింతచావు చచ్చాడు. మరి అతడిని అట్లా చంపినవారు ఎవరో? ఎటువంటి జగజెట్టులో!

తే. సింహబలుఁడు గంధర్వులచేత నొక్క। సతికిఁగా నిట్లు ఘోరంపుఁ జావు చచ్చె;
నకట! రిత్తకు రిత్త మత్స్యావనీశు। లావు గోల్పోయె; సూతకులంబు పొలిసె.' 71

ప్రతిపదార్థం: సింహబలుఁడు= కీచకుడు; గంధర్వులచేతన్= గంధర్వులచేత; ఒక్క సతికిన్+కాన్= ఒక స్త్రీ కొరకై; ఇట్లు= ఈ విధంగా; ఘోరము+చావు చచ్చెన్= భయంకరమైన చావు చచ్చాడు; అకట!= అయ్యో!; రిత్తకురిత్త= వ్యర్థంగా; మత్స్య+అవనీశు= మత్స్యదేశపు రాజయిన విరటుడియొక్క; లావు= బలం; కోల్పోయెన్= పోయింది; సూతకులము= సూతుల వంశం; పొలిసెన్= నశించింది.

తాత్పర్యం: సింహబలుడైన కీచకుడు ఒక ఆడుదాని కొరకై గంధర్వుల చేతిలో పడి భయంకరమైన చావు చచ్చాడు. అయ్యో! దానితో మత్స్యరాజు బలం కోల్పోయాడు. సూతవంశం నశించింది.'

వ. ఇవ్విధంబునం బ్రవర్తిల్లు జనవాదంబు గ్రమక్రమంబున సమస్తదేశంబుల నెరసి చెల్లుచుండె; నట్టియెడ. 72

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; ప్రవర్తిల్లు= వ్యాపించే; జనవాదంబు= లోకుల మాటలు; క్రమక్రమంబునన్= వరుసగా; సమస్త దేశంబులన్= అన్ని దేశాలలో; నెరసి= వ్యాపించి; చెల్లుచున్+ఉండెన్= చెలామణిలో ఉండింది; అట్టి+ఎడన్=ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా జనుల మాటలు క్రమక్రమంగా అన్ని దేశాలలోను వ్యాపించి చెలామణి ఔతున్నాయి. అప్పుడు.

దుర్యోధనుని వేగులవారు పాండవుల వెదకి కానక వచ్చుట. (సం.4-24-5)

ఉ. పాతకియై సుయోధనుఁడు పాండుతనూజులు సల్పుచున్న య
జ్ఞాత విధి వ్రతంబు కలుషంబుగఁ జేయఁదలంచి పంచినన్
భూతలమెల్లఁ జూచి మును వోయెడు నప్పుడు చెప్పుకొన్న సం
కేతపుఁ జోటఁ గూడఁబడి ఖేదముఁ బొందుచుఁ జారు లందఱున్. 73

ప్రతిపదార్థం: సుయోధనుఁడు= దుర్యోధనుడు; పాతకి+ఐ= పాపాత్ముడై; పాండు తనూజులు= పాండురాజు కుమారులు; సల్పుచున్న= చేస్తున్న; అజ్ఞాతవిధివ్రతంబు= తమ్ము ఇతరులు గుర్తింపరానట్లు జరుపుతున్న దీక్షను; కలుషంబుగన్+చేయన్+తలంచి= చెడిపోయేటట్లు చేయబూని; పంచినన్= పంపగా; భూతలము+ఎల్లన్+చూచి= ప్రపంచమంతా వెదకి; చారులు+అందరున్= వేగులందరూ; మును= ముందు; పోయెడు+అప్పుడు= బయలుదేరి వెళ్ళేటప్పుడు; చెప్పుకొన్న= ఏర్పాటు చేసికొన్న; సంకేతము+చోటన్= గుర్తుగా అనుకొన్న ప్రదేశంలో; కూడన్+పడి= కలసికొని; ఖేదమున్+పొందుచున్= దుఃఖపడుతూ.

తాత్పర్యం: దుర్మార్గుడగు సుయోధనుడు పాండవుల అజ్ఞాతవాసనియమాన్ని భంగపరిచేటట్లు చేయదలచి వేగులను పంపాడు. వారు ప్రపంచమంతా చుట్టివచ్చి తమ మొదటి సంకేతస్థలానికి చేరికొని తమ వైఫల్యానికి దుఃఖపడుతూ.

వ. మగుడి వచ్చి హస్తిపురంబు చొత్తెంచి. 74

తాత్పర్యం: (వేగులు) తిరిగి వచ్చి, హస్తినాపురి ప్రవేశించి.

సీ. **వరుస నేనుంగులు గురిసిన దాన ధా। రావలి దగు కలయంపి గాఁగ,**
రాజులసందడి రాసిన తొడవులు। మురిసి రాలిన పొడి ముగ్గుగాఁగఁ,
గాంతల సంకుల గతిఁ ద్రెస్సి తొరఁగిన। హారముల్ పుష్పోపహారములుగ,
నేమేమ యని యొలినెత్తిన పరదేశి। దొరల పావడములు తోరణముగ,

తే. **సహజమైన యలంకార మహిమ నతిశ। యిల్లి మహనీయ వైభవ మెసక మెసఁగ**
వఱలు నరపతి మందిర ద్వారభూమి। సేర నరిగి యా వేగులవారు ప్రీతి. 75

ప్రతిపదార్థం: వరుసన్= వరుసగా; ఏనుంగులు= ఏనుగులు; కురిసిన= కార్చిన; దానధారా+ఆవలి= మదజలధారలు; తగు కలయంపి కాఁగన్= తగునట్లు చల్లిన కల్లాపి కాగా (కల్లాపిచల్లినట్లుకాగా); రాజుల సందడిన్ రాసిన తొడవులు= రాజుల గుంపుల రాకపోకలలో ఒరసికొన్న నగలు; మురిసి= చిట్లి; రాలినపొడి= క్రింద రాలినపొడి; ముగ్గుకాఁగన్= ముగ్గులు కాగా (రంగవల్లులు తీర్చినట్లు కాగా); కాంతల సంకులగతిన్+త్రెస్సి= అందగత్తెలగు ఆడువారి ఒత్తిళ్ళ నడకలకు తెగి; తొరఁగిన హారముల్= పడినదండలు; పుష్ప+ఉపహారములుగన్= పూలమాలలుకాగా; ఏము+ఏము+అ+అని= మేము మేము అని (మేం ముందు పోవాలి మీకంటె మేం ముందు పోవాలి అనే పోటీలతో); ఓలిన్= వరుసగా; ఎత్తిన= పైకెత్తి పట్టిన; పరదేశిదొరల= విదేశరాజులయొక్క; పావడములు= వస్త్రాలు, కానుకలు; తోరణముగన్= (మంగళప్రదమైన) తోరణాలు కాగా; సహజము+ఐన= స్వభావసిద్ధమైన; అలంకార మహిమన్= అలంకారాల శోభతో; అతిశయిల్లి= మించి; మహనీయ వైభవము= గొప్పదైన సంపద; ఎసకము+ఎసఁగన్= ఎక్కువకాగా; వఱలు= ఒప్పుతున్న; నరపతి= రాజుయొక్క (దుర్యోధనుడి యొక్క); మందిరద్వారభూమి= నగరి వాకిటి చోటు; ఆ వేగులవారు= ఆ వేగులు; ప్రీతిన్= ఆసక్తితో; చేరన్+అరిగి= చేరుకొని,

తాత్పర్యం: దుర్యోధనుడి మందిర సింహద్వార ప్రాంతం - ముంగిలి - చూడముచ్చటగా శోభిల్లుతున్నది. వరుసగా నిలిచిఉన్న మదించిన ఏనుగుల శరీరాలనుండి స్రవించిన మదజల ధారలు ఇంటిముందు కల్లాపి చల్లారా అన్నట్లుగా రాణించాయి. గుంపులు గుంపులుగా వస్తున్న రాజుల ఆభరణాలు రాచుకొనటంవలన నేలమీద రాలిన పొడులు కల్లాపిచల్లిన నేలమీద ముగ్గుపెట్టారా అన్నట్లుగా శోభించాయి. మరొకవైపు ఆడువారు కూడా దొమ్మిగా త్రోసికొని రావటంతో వారి హారాలు తెగి నేలమీద రాలాయి. అవి పూలచెండ్ల అలంకారాలు అమర్చారా అన్నట్లు రాణించాయి. విదేశ ప్రభువులు మేమంటే మేమంటూ త్రోసికొంటూ పైకెత్తుకొని తెస్తున్న వస్త్రాలూ, కానుకలూ మొదలైనవి ద్వారానికి కట్టిన మంగళతోరణాలా అన్నట్లు అమరాయి. ఈ విధంగా సహజమైన అలంకార శోభతో మించి ప్రకాశించే గొప్పదైన రాజవైభవం అతిశయించగా హంగుగా ఒప్పారుతున్న ఆ రాజమందిర ద్వార ప్రాంగణానికి వేగులవారు వేడుకతో చేరారు.

విశేషం: 1. అలం: ఉత్ప్రేక్ష. ఉపమాన తాదాత్మ్యాన్ని ఉపమేయంలో సంభావించటం ఉత్ప్రేక్ష. ఈ పద్యంలో వర్ణించింది రాజారాజ మందిర ప్రాంగణం. అది సామాన్యుల ప్రాంగణాల కంటె విశిష్టంగా ఉన్నది. మహనీయ వైభవ ద్యోతకంగా ఉన్నది. దీనిని తిక్కన ఉత్ప్రేక్షాలంకారంలో వర్ణించి వస్తువును ఉజ్జ్వలం చేశాడు. గృహస్థుల ముంగిట్లో ఉదయం కల్లాపి చల్లుతారు. ఇది గృహస్థులు కల్పిస్తే కలిగే అలంకారం. మరి దుర్యోధనుడి సింహద్వారం ఎదుట ఏనుగుల మదజలం కలిగిన తడి ఆయన

కావాలని చేసికొన్నది కాదు. ఆయన వైభవమే ఆయన ప్రాంగణానికి ఆ సహజాలంకారాన్ని సమకూర్చింది. ఉపమేయమైన మదజలంలో ఉపమానమైన కలయంపి స్వభావం సంభావించబడింది. ఇట్లాగే మిగిలిన అంశాలకు కూడా అన్వయం చెప్పుకొనాలి. రాజుల నగల రత్నాల పొడి ముగ్గుగానూ, కాంతల హారాలు పూలగుత్తులుగానూ, పరదేశరాజుల కానుకలు ద్వారతోరణాలుగానూ సంభావించటం ఇందులోని అలంకార వైభవం.

2. దుర్యోధనుడికి సహజంగా ఏర్పడిన అలంకారాలవలన మహనీయ రాజ్య వైభవం ప్రకాశిస్తున్నదని ధ్వని. తిక్కన దుర్యోధన సార్వభౌముడి భవన ముఖద్వార వైభవాన్ని వర్ణించి ప్రబంధోచిత వర్ణనం చేశాడని చెప్పటం కావ్యలక్షణం. దానివలన సాధించిన వ్యంగ్య వైభవాన్ని సమాలోచించటం శిల్ప లక్షణం. ఇందులో అలంకార ధ్వని వస్తు ధ్వనిని పోషిస్తున్నది. ఆ మహనీయ వైభవం గల ముంగిట్లో నిలిచినవారు వేగులవారు. పాండవులను గుర్తించలేక ఖిన్నులై తిరిగి వచ్చిన దుర్యోధనుని గూఢచారులు. ఈ సన్నివేశం చూచిన భావుకుడు ఆ మహనీయ వైభవమంతా పాండవులనుండి దుర్యోధనుడు దోచుకున్నదే అన్న ఊహ కలుగుతుంది. అజ్ఞాతవాసవ్రతం పూర్తయితే ఈ వైభవం ఎవరి దౌతుంది? అనే ప్రశ్న కలుగుతుంది. కథ క్రొత్త మలుపు తిరిగే తరుణంలో ఈ వర్ణనం ముఖద్వారంగా తోస్తుంది. ఇది వస్తుధ్వని.

3. తెలుగువారి ముంగిట్లో మెరిసే హంగులను రారాజు ముంగిట్లో జ్ఞాపకం చేయించాడు తిక్కన. కలయంపి, ముగ్గు, పూలగుత్తులు, తోరణాలు తెలుగు ముంగిళ్ళ వెలుగు దివ్వెలు. తిక్కన భారతానికి కల్పించే తెలుగుదనంలో ఇదొక జిలుగు మాత్రమే. కురిసిన, మురిసి రాలిన, త్రెస్సి తొరగిన, ఒలినెత్తిన, పరదేశి దొరలు మొదలైన తెలుగు పదాల పొందిక తెలుగు దేశీయతకు దిక్కు. (సంపా.)

వ. సముచితంబుగాఁ బ్రవేశించి. 76

తాత్పర్యం: (వేగులు) తగు విధంగా (నగరిలో) ప్రవేశించి.

తే. ద్రోణ గాంగేయ భానుమత్సూను కృప సు। శర్మ దుశ్శాసనులు సర్వ సైన్యపతులు
నార్య జనములుఁ గొలువ మహార్హకాంచ। నోన్నతాసనమునఁ గొలువున్నవాని. 77

ప్రతిపదార్థం: ద్రోణ= ద్రోణాచార్యుడూ; గాంగేయ= భీష్ముడూ; భానుమత్సూను= సూర్యపుత్రుడు కర్ణుడూ; కృప= కృపాచార్యుడూ; సుశర్మ= సుశర్మా; దుశ్శాసనులు= దుశ్శాసనుడూ; సర్వసైన్యపతులు= సేనాపతులందరూ; ఆర్యజనములు= పెద్దలూ; కొలువన్= సేవించగా; మహార్హ= మిక్కిలి విలువగల; కాంచన= బంగారపు; ఉన్నత+ఆసనమునన్= గొప్ప ఆసనం మీద; కొలువు+ఉన్నవానిన్= సభతీరి ఉన్నవాడిని.

తాత్పర్యం: ద్రోణ, భీష్మ, కర్ణ, కృప, సుశర్మ, దుశ్శాసనాదులూ, సేనాపతులూ, పెద్దలూ సేవించగా బంగారపు ఉన్నతాసనం మీద కూర్చుండి సభ తీరి ఉన్నవాడిని.

స్రగ్ధర.

మౌళిస్రక్సంగ రంగ న్మధుకరపటలీ మానసా కృష్టి విద్యా
శాలి స్ఫారాబ్జరేఖాంజలి పుట ఘటనాచారు ఫాలస్థల క్ష్మా
పాలశ్రేణీ విశా లాంబక కుముదవనీ బాంధవాయత్తచంద్ర
శ్రీలీలాగాఢ కాంతి స్మితవదనరుచి స్ఫీతు నాగేంద్ర కేతున్. 78

ప్రతిపదార్థం: మౌళిస్రక్= తల యందలి పైనున్న పూలమాలలు; సంగ= ఆసక్తి చేత; రంగత్= క్రీడిస్తున్న; మధుకరపటలీ మానస= తుమ్మెదల పిండు యొక్క మనస్సులను; ఆకృష్టి= ఆకర్షించుట అనెడి; విద్యాశాలి= నేర్పరితనంతో ప్రకాశించే; స్ఫార= ప్రకాశవంతమగు; అబ్జరేఖా= పద్మములనెడి; అంజలిపుట= దొప్పలవంటి దోసిళ్ళను; ఘటనా= కూర్చుటచేత; చారు= అందమైన; పాలస్థల= నుదురుభాగంకల; క్ష్మాపాలశ్రేణీ= (సామంత) రాజుల వరుసల యొక్క; విశాల= వెడల్పయిన; అంబక= నేత్రాలనెడి; కుముదవనీ= కలువల సమూహానికి; బాంధవ= బంధుత్వమునకు; ఆయత్త= సిద్ధపడిన; చంద్రశ్రీ లీలా= చంద్రుడివలె శోభావిలాసముచేత; గాఢ= దట్టమైన; కాంతి= వెలుగుగల; స్మిత= చిరునవ్వుతోడి; వదనరుచిస్ఫీతున్= ముఖకాంతితో శోభిల్లేవాడిని; నాగేంద్రకేతున్= సర్పరాజధ్వజుడైన దుర్యోధనుడిని.

తాత్పర్యం: శిరస్సులందు ధరించిన పూల సరులలోని పూదేనెకై తిరుగాడుతున్న తుమ్మెదలను భ్రమపెట్టజాలినట్లున్న కేల్మోడ్పులను నెన్నుదుట కీలించిన సామంతరాజులు విశాలనేత్రా లనెడు కలువ మొత్తాలకు వెన్నెలను పోలు చిరునగవుగల చంద్రుడివంటి ముఖంతో ప్రకాశించే వాడిని, నాగేంద్రుడి గుర్తుగల కేతనం కలవాడిని దుర్యోధనుడిని. (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: అలం: భ్రాంతిమంతం, రూపకం. మూలాతిరిక్తమైన ఈ రాజరాజు వైభవ వర్ణనం ఓజోగుణంతో, ఉదాత్తాలంకారంలో భాసిస్తూ దుర్యోధనుడి రాజ్యగర్వాన్ని ప్రదర్శిస్తున్నది. తిక్కనగారి దీర్ఘ సంస్కృత సమాస ఘటితమైన ధారామధురమైన రచనాశక్తిని ప్రకటిస్తున్నది. ఎప్పుడో కాని తిక్కన ఇటువంటి పద్యాలు రచించడు. స్రగ్ధరావృత్తానికి ప్రతిపాదంలోనూ వరుసగా - మ,ర,భ, న, య, య, య గణాలుంటాయి. ఎనిమిదో అక్షరం, పదునైదవ అక్షరం యతిస్థానాలు. ప్రాసం విధాయకం. (సంపా.)

వ. కని జయజయశబ్దపూర్వంబుగా సాష్టాంగ దండ ప్రణామంబు సేసి. 79

ప్రతిపదార్థం: కని= చూచి; జయజయశబ్దపూర్వంబుగాన్= జయజయశబ్దాలతో; సాష్టాంగ దండ ప్రణామంబు+చేసి= సాగిలపడి నమస్కారాలు చేసి.

తాత్పర్యం: చూచి జయజయ శబ్దాలతో సాగిలబడి నమస్కారాలు చేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మొగిచిన చేతులు ముందల । నిగిడించి నితాంత వినయ నిరతిం జారుల్
తగ విన్నవించి రిట్లని । జగతీశ్వరునకు నిజ ప్రచారం బెల్లన్. 80

ప్రతిపదార్థం: మొగిచిన= జోడించిన; చేతులు= హస్తాలు; మున్+తలన్= తలకు ముందు భాగమైన నెన్నుదురుపై; నిగిడించి= జోడించి నిలిపి; చారుల్= వేగులు; ఇట్లు+అని= చెప్పబోవునట్లుగా; నిజప్రచారంబు+ఎల్లన్= తాము సాగించిన సంచారమంతటిని; జగతీ+ఈశ్వరునకున్= ప్రభువైన సుయోధనుడికి; నితాంత వినయ నియతిన్= మిక్కిలి వినయశీలంతో; ఇట్లు+అని= ఈ విధంగా; తగన్+విన్నవించిరి= తగునట్లు మనవి చేశారు.

తాత్పర్యం: వేగులు చేతులెత్తి నుదుట ఉంచి నమస్కరించి తాము సాగించిన సంచార విశేషాలనన్నిటినీ మిక్కిలి వినయభావంతో సుయోధనుడికి ఈ విధంగా విన్నవించారు.

క. 'దేవర యానతిఁ బాండవు । లేవురు ద్రౌపదియు నున్న యెడ యే మరయం
గా వెదలి వారు సనిన మ । హావిపినంబులకుఁ దొలుత నరిగితిమి వెసన్. 81

ప్రతిపదార్థం: దేవర+ఆనతిన్= రాజుగారి ఉత్తరువు ప్రకారం; పాండవులు+ఏవురున్= అయిదుగురు పాండవులూ; ద్రౌపదియున్= ద్రౌపదీ; ఉన్న+ఎడన్= ఉన్నచోటును; అరయంగాన్= తెలిసికొనటానికి; ఏము= మేము; వెడలి= వెళ్ళి; తొలుతన్= ముందుగా; వారు+చనిన= వారు వెళ్ళిన; మహావిపినంబులకున్= కీకారణ్యాలకు; వెసన్= వేగంగా; అరిగితిమి= వెళ్ళాం.

తాత్పర్యం: 'దేవరవారి ఆదేశంతో పాండవు లైదుగురు ద్రౌపదితో కలిసి వెళ్ళిన కారడవులను మేము గుర్తించి ముందుగా వాటిలో వెదకటానికి వేగంగా వెళ్ళాం.

వ. అందు. 82

తాత్పర్యం: ఆ అరణ్యాలలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. పరఁగు పొదరు పొదరు, పల్లంబు పల్లంబు । ప్రాను ప్రాను, దుర్గమంపుఁ జోటు
దుర్గమంపుఁ జోటు, దొన దొన, గుహ గుహ । యాదిగాఁగ నెందు నరసి యరసి. 83

ప్రతిపదార్థం: పరఁగు= అక్కడ ఉన్న; పొదరు పొదరు= అన్ని పొదలూ; పల్లంబు పల్లంబు= అన్ని పల్లపు ప్రాంతాలు; ప్రాను ప్రాను= అన్ని చెట్లూ (చెట్టు చెట్టును); దుర్గమము+చోటు= అడుగిడరాని చోటులు; దొనదొనన్= కొండల మీది నీటి దొరువులూ; గుహ గుహ= అన్ని కొండ గుహలును; ఆది+కాఁగన్= మొదలైన; ఎందున్= ఎక్కడెక్కడో ఉన్న చోట్లలో; అరసి అరసి= వెదకి వెదకి, బాగా వెదకి.

తాత్పర్యం: కనబడిన పొదరిళ్ళన్నీ ఒక్కొక్క దానిగా గాలించాం. పల్లపుప్రాంతాలన్నింటినీ దిగి చూచాం. చెట్టు చెట్టుకూ తిరిగి ఎక్కి చూచాం. చొరటానికి వీలులేని చోట్లలో కూడా చొరబడి వెదికాం. నీటి పడియలన్నింటినీ పరిశీలించాం. కొండ గుహలలో దూరి గాలించాం. ఇటువంటి వెన్నో చోట్లలో తిరిగి తిరిగి, వెదకి వెదకి ప్రయత్నించాం.

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం. పొదరు పొదరు, ప్రాను ప్రాను వంటి చోట్ల ప్రయోగించిన ఆమ్రేడితాలు వేగుల వేగాన్నీ వెదకిన చోటునే మరల మరల వెదకి ధ్రువపరచుకొన్న వైనాన్నీ ధ్వనింపచేస్తున్నవి. అరసి యరసి- ఇక్కడ ద్విరుక్తి అత్యంతార్థమున నైనది- ప్రౌఢ; శబ్ద - 112 సూ. (సంపా.)

వ. ఒక్క యెడ నరదంబు లరిగిన చొప్పు గాంచి దాని వెంబడిం జని చని. 84

ప్రతిపదార్థం: ఒక్క+ఎడన్= ఒకచోట; అరదంబులు= తేరులు; అరిగిన= పోయిన; చొప్పు= జాడను; కాంచి= చూచి (గుర్తించి); దాని వెంబడిన్= దాని వెంట; చని చని= చాలా దూరం పోయి.

తాత్పర్యం: ఒకచోట రథాలు పోయిన జాడ గమనించి, దాని వెంట మేము కూడా చాలా దూరం వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. కేవలసూతుల తోడన । పోవుట గని వానిఁ జేరఁ బోవక యవి యిం
కే వంకఁ బోవునొకో! యను । భావనఁ బోయితిమి వానిపజ్జన యేమున్. 85

ప్రతిపదార్థం: కేవల సూతులతోడన్= కేవలం సారథులతో మాత్రమే; పోవుటన్+కని= (ఆ తేరులు) వెళ్ళటం చూచి; వానిన్+చేరన్+పోవక= వాటిని సమీపించకుండా; అవి= ఆ తేరులు; ఇంకన్+ఏవంకన్= ఇక నీ దిక్కునకు; పోవునొకొ! అను భావనన్= వెళ్ళునో అనే తలపుతో; వానిపజ్జన్+అ= వాని ప్రక్కనే; ఏమున్= మేముకూడా; పోయితిమి= వెళ్ళాము.

తాత్పర్యం: సారథులతో మాత్రమే పోతున్న ఆ రథాలను చూచాం. వాటి దగ్గరికి పోకుండా అవి ఎటువైపు పోతాయో గమనిస్తూ వాటి వెంట రహస్యంగా అనుసరించాం.

వ. అవియును ద్వారకా నగరంబున కరిగిన. 86

తాత్పర్యం: ఆ రథాలు ద్వారకా నగరానికి చేరగా.

క. అందుల నుండుదు రను నా । సం దెల్లముగాఁగఁ బెక్కు చందంబుల ము
ట్టం దిరిగి తడవి కుంతీ । నందనులం గాన లేక నానా భంగిన్. 87

ప్రతిపదార్థం: అందులన్= ఆచోట (ద్వారకలో); ఉండుదురు+అను+ఆసన్= ఉంటారనే ఆశతో; తెల్లముకాఁగన్= స్పష్టమయ్యేటట్లుగా; పెక్కుచందంబులన్= అనేక రకాలుగా; ముట్టన్+తిరిగి= కడముట్ట తిరిగి; తడవి= వెదకి; నానాభంగిన్= అనేక విధాలుగా; కుంతీనందనులన్+కానన్‌లేక= కుంతీకుమారులైన పాండవులను గుర్తించలేక.

తాత్పర్యం: ఆ ద్వారకలో ఉంటారనే ఆశతో అనేక విధాలుగా కడముట్ట తిరిగి వెదకి పాండవులను గుర్తించలేకపోయాం. (తరువాతి వచనంతో అన్వయం).

వ. విచ్చి పోయి సమస్త దేశంబులుం గలయం గ్రుమ్మరి, కొండొకయు నుపేక్షలేక వెరవుతోడిదకాఁ బరికించుచు. బయలనునాలస్యంబు దక్కియోలంబునట్ల శోధించుచుఁ గీడయిన నుదాసీనత యుడిగి మేలి చందంబునం భావించుచు, వివిధ ప్రకారంబు లయిన బహు ప్రదేశంబులు రోసి, కౌంతేయులం గానక సంకేత స్థలంబునం గూడికొని, మా వర్తించిన తెఱంగు దేవరకు నెఱింగించి, యట దివ్యచిత్తంబున నవధరించిన భంగి సేయువారమై చనుదెంచితిమి; మాకుం జూడఁ బాండవులు పొడ వడంగి లేకపోయిరిగాని యీ లోకంబున నునికి గలిగిన నగపడకుండ నేర; రిది యిక్కార్యంబు నున్నరూపు; మఱియొక్క విశేషంబునం బ్రియం బంది వచ్చితిమి; చిత్తగింపుము. 88

ప్రతిపదార్థం: (నానాభంగిన్= అనేక విధాలుగా); విచ్చిపోయి= విడిపోయి; సమస్త దేశంబులున్ కలయన్+క్రుమ్మరి= అన్ని దేశాలలో కలయ తిరిగి; కొండొకయున్= ఒక్కింతకూడా; ఉపేక్షలేక= అశ్రద్ధ చేయకుండా; వెరవుతోడిద కాన్= ఉపాయంతో; పరికించుచున్= పరిశీలిస్తూ; బయలను= బహిరంగప్రదేశాలలోనూ; ఆలస్యంబు+తక్కి= ఆలస్యం లేకుండా; ఓలంబు అట్లు+అ= రహస్య ప్రదేశాలలో వెదకినట్లుగానే; శోధించుచున్= వెదకుతూ; కీడు+అయినన్= ఇబ్బంది కలిగినా; ఉదాసీనత= అలసత; ఉడిగి= వదిలి (సోమరితనం వదిలి); మేలిచందంబునన్+భావించుచున్= మంచి పద్ధతులను తలపోస్తూ; వివిధ ప్రకారంబులు+అయిన బహు ప్రదేశంబులు రోసి= అనేక విధాలుగా అనేక స్థలములలో వెదికి; కౌంతేయులన్+కానక= పాండవులను చూడలేక; (గుర్తించలేక) సంకేతస్థలంబునన్= రహస్యస్థలంలో; కూడికొని= కలిసికొని; మా వర్తించిన తెఱంగు=

మేము తిరిగిన పద్ధతిని; దేవరకున్= ప్రభువులకు; ఎఱింగించి= తెలిపి; అట= తరువాత; దివ్యచిత్తంబునన్= దేవరవారి మనసులో; అవధరించిన భంగిన్= తోచినరీతిగా; చేయువారము+ఐ= నడుచుకొనటానికి; చనుదెంచితిమి= వచ్చిచేరాం; మాకున్+చూడన్= మేము పరిశీలింపగా; పాండవులు పొడవు+అడంగి లేకపోయిరి= పాండవులు రూపుమాసిపోయినట్లున్నారు; కాని= కాకుండా; ఈ లోకంబునన్+ఉనికి కలిగినన్= ఈ లోకంలో బ్రతికి ఉన్నట్లయితే; అగపడకుండనేరరు= కనబడకపోరు; ఇది ఈ+కార్యంబు+ఉన్న రూపు= ఇది ఈ ప్రయత్నంలో తేలిన ఫలితాంశం (యథార్థం); మఱియొక్క విశేషంబునన్+ప్రియంబు+అంది వచ్చితిమి= ఇంకొక్క విశేషంతో సంతోషపడి వచ్చాం; చిత్తగింపుము= దానిని వినుము.

తాత్పర్యం: (మేము) అనేక రకాలుగా విడిపోయి అనేక దేశాలలో తిరిగి ఒకింత కూడా అలసత్వం లేకుండా ఉపాయాలతో మార్గాంతరాలతో ఆలస్యం లేక రహస్యంగా వెదకుతూ కష్టనష్టా లెదురైనా సోమరితనం లేక మేలుగా తగిన ఆలోచనలు చేసికొంటూ అనేక స్థలాలలో అనేక విధాలుగా వెదకి పాండవులను చూడలేక తిరిగి సంకేత స్థలానికి చేరుకొన్నాం. మేము చేసిన ప్రయత్నాల నన్నింటిని ప్రభువులకు తెలిపి ఆమీద మీ ఆనతి ప్రకారం వర్తించుకొందామని వచ్చాం. మాకు చూడ - పాండవులు రూపు మాసిపోయి ఉంటారు. బ్రతికి ఉంటే కనబడకుండా పోరు. ఇది ఇందులో ఉన్న యథార్థం. అయితే ప్రియమైన మఱొక విశేషం విని సంతోషంతో వచ్చాం. దానిని చిత్తగించండి.

సీ. **మత్స్యదేశాధీశు మఱఁదిఁ గీచకునిఁ బు। ణ్యోజ్జ్వలాకృతి యగు నొక్క వనిత**
కతమున నడురేయి గంధర్వు లతిరహ। స్య ప్రకారంబునఁ జంపి; రదియు
నక్కజం బాయుధవ్యవహార మేమియు। లేదు, శిరంబు కా ల్గేలు డొక్క
లోనికిఁ జొరఁద్రోచి పీనుంగు ముద్దగాఁ। జేసివైచిరి దుష్టచిత్తులైన

తే. **యతని తమ్ముల నొక్కరినైనఁ దప్పి। పోవనీక యా రాత్రియ పొదివి చిత్ర**
నిహతిఁ దెగఁజూచి యనిరూపణీయ దుర్ని। వారవృత్తిమై నరిగిరి కౌరవేంద్ర! **89**

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర= ఓ కురురాజా! (దుర్యోధనా!); మత్స్యదేశ+అధీశుమఱఁదిన్+కీచకునిన్= మత్స్యదేశానికి రాజయిన విరటుని బావమరది కీచకుడిని; పుణ్య+ఉజ్జ్వల+ఆకృతి+అగు= పుణ్యం చేత వెలుగొందే అందమైన ఆకారం కలిగినదైన; ఒక్క వనిత= ఒక యింతి; కతమునన్= కారణంగా; నడురేయి= అర్ధరాత్రివేళ; గంధర్వులు= గంధర్వులు; అతిరహస్య ప్రకారంబునన్= మిక్కిలి రహస్యమైన రీతిలో; చంపిరి= చంపారు; అదియున్+అక్కజము= అదికూడా ఆశ్చర్యకరం; ఆయుధవ్యవహారము+ఏమియున్ లేదు= ఆయుధాల వినియోగం ఏమాత్రమూ లేదు; శిరంబు కాల్+కేలు= తల, కాళ్ళూ చేతులు; డొక్కలోనికిన్= కడుపులోనికి; చొరన్+త్రోచి= చొచ్చుకొనేటట్లుగా కుక్కి; పీనుంగున్= శవాన్ని; ముద్దగాన్= ముద్దగా; చేసివైచిరి= చేసివేశారు; దుష్టచిత్తులు+ఐన= దురాత్ములైన; అతని తమ్ములన్= వాని తమ్ముళ్ళను; ఒక్కరిన్+ఐనన్+ తప్పిపోనీక= ఒకరిని కూడా తప్పించుకొని పోనీయకుండా; ఆ రాత్రి+అ= ఆ రాత్రిలోనే; పొదివి= క్రమ్ముకొని; చిత్రనిహతిన్= వింతగా చంపటంతో; తెగన్= చావగా; చూచి= చూచి; అనిరూపణీయ= ఇదమిత్థమని, నిరూపించటానికి సాధ్యం కాని; దుర్నివారవృత్తిమైన్= అడ్డుకొన సాధ్యంకానట్లు; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ఓ కౌరవేంద్రా! మత్స్యదేశపురాజైన విరటుడి బావమరది కీచకుడిని, పవిత్రమూర్తి అయిన ఒక సుందరాంగి కారణంగా అర్ధరాత్రి వేళ గంధర్వులు అతి రహస్య పద్ధతిలో చంపారు. ఆ చంపటం కూడా

ఆశ్చర్యకరంగా చంపారు. ఆయుధాలతో పనిలేకుండా చేసిన ఆ యుద్ధంలో తల, కాళ్ళు, చేతులు డొక్కలోనికి చొప్పించి పీనుగును ముద్దగా చేసివేశారు. దుర్మార్గులయిన కీచకుడి తమ్ముళ్ళను కూడా వదలకుండా క్రమ్ముకొని ఒక్కడు కూడా మిగలకుండా వింత చావులు చచ్చేటట్లు చంపారు. వా రెట్లా చంపారో ఇదమిత్థమని నిరూపించటానికి సాధ్యం కానిరీతిలో చంపి, నివారింప వీలుకొని విధంగా ఆ గంధర్వులు వెడలిపోయారు.

వ. విరాటుండు పగతుండు గావునఁ దదీయవ్యసనం బెఱిఁగింపవలయు నని విన్నవించితి; మది యట్లుండె; బాండవులనన్వేషించుపని యిటమీఁదంజిత్తగించు తెఱంగానతిచ్చునది, యనిన విని 'యట్ల చేయుదము గాక!' యని వారలఁ బోవం బనిచి, కొంతసేపు చింతాక్రాంతుండై, య మ్మహీకాంతుండు మంత్రులం జూచి యిట్లనియె. 90

ప్రతిపదార్థం: విరాటుండు= విరాటరాజు; పగతుండు+కావునన్= విరోధి కనుక; తదీయ= అతడియొక్క; వ్యసనంబు= కష్టం; ఎఱిఁగింపవలయున్+అని= తెలియచేయవలెనని; విన్నవించితిమి= విన్నపం చేశాము; అది అట్లు+ఉండెన్= అది ఆ విధంగా ఉండగా; పాండవులన్+అన్వేషించుపని= పాండవులను వెదకుపని; ఇటమీఁదన్= ఇకపై; చిత్తగించు తెఱంగు= తెలిపే పద్ధతి; ఆనతి+ఇచ్చునది= ఉత్తర్వు చేయవలసింది; అనినన్+విని= అనగా విని; అట్లు+అ చేయుదము+కాక= ఆ విధంగానే చేద్దాము గాక; అని= అంటూ; వారలన్= వేగులను; పోవన్+పనిచి= వెళ్ళుటకు ఉత్తర్వుచేసి; కొంతసేపు= ఒకింతకాలం; చింతాక్రాంతుండు+ఐ= ఆలోచనలో మునిగినవాడై; ఆ+మహీకాంతుండు= ఆ రాజు (దుర్యోధనుడు); మంత్రులన్+చూచి= తన మంత్రులను చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: విరాటుడు శత్రువు కనుక అతడికి ఏర్పడిన బాధను (మీకు) తెలుపవలెనని విన్నవించాము. అది అట్లా ఉండగా, ఇకముందు పాండవులను గూర్చి వెదికే విషయంలో తగిన ఉత్తరువు లివ్వవలసింది' అని అనగా 'అట్లే చేస్తాములే' అని వేగులను పంపి దుర్యోధనుడు కొంతసేపు గాఢంగా ఆలోచనలో మునిగి, ఆ తరువాత, తన మంత్రులతో ఈ విధంగా అన్నాడు.

తే. 'సమయ సముచిత కృత్యంబు చక్కఁ జేసి । పాండవులు రాజ్యమున కాసపడకమున్న
యరసి యెఱిఁగి యరణ్యంబు నందుఁ దొంటి । యట్ల యిడుమలఁ గుడువఁ బో నడుపవలయు. 91

ప్రతిపదార్థం: పాండవులు= పాండవులు; సమయ సముచిత కృత్యంబు= (అరణ్య అజ్ఞాతవాస) ప్రతిజ్ఞకు ఉచితమైన పనులు; చక్కన్+చేసి= నెరవేర్చి; రాజ్యమునకున్+ఆసపడకమున్న+అ= రాజ్యానికై ఆశింపకముందే; అరసి= వెదకి; ఎఱిఁగి= తెలిసికొని; అరణ్యంబునందున్= అడవులలో; తొంటి+అట్లు+అ= వెనుకటి మాదిరిగానే; ఇడుమలన్= కష్టాలను; కుడువన్= అనుభవించగా; పోన్+అడుపన్వలయున్= పోయేటట్లు చేయాలి.

తాత్పర్యం: 'పాండవులు తాము చేసిన ప్రతిజ్ఞ ప్రకారం అరణ్య అజ్ఞాతవాసాలను ముగించుకొని మరల రాజ్యం కొరకు ఆశపడకముందే, వారిని వెదకి గుర్తించి, పూర్వంవలె అరణ్యాజ్ఞాతవాసరూపకష్టా లనుభవింప చేయవలసిందే.

క. ఎఱుఁగుట దుర్ఘట; మెవ్విధి । నెఱుఁగంగా వచ్చు? మీర లెల్లను మీమీ
యెఱిఁగిన చందంబున నా । కెఱిఁగింపుఁడు వారి వెదకి యెఱుఁగు తెఱంగుల్.' 92

ప్రతిపదార్థం: ఎఱుఁగుట దుర్ఘటము= తెలిసికొనుట కష్టం; ఏ+విధిన్+ఎఱుఁగంగాన్ వచ్చున్?= ఏ విధంగా తెలిసికొనవచ్చునో; మీరలు+ఎల్లను= మీరందరూ; మీమీ+ఎఱిఁగిన చందంబునన్= మీకు మీకు తెలిసిన పద్ధతితో; వారిన్= పాండవులను; వెదకి; ఎఱుఁగు= గుర్తించే; తెఱంగుల్= ఉపాయాలను; నాకున్+ఎఱిఁగింపుఁడు= నాకు తెలియజేయండి.

తాత్పర్యం: పాండవులను తెలిసికొనటం అశక్యం. ఏ విధంగా వారిని వెదకి తెలిసికొనవచ్చునో మీరందరూ మీకు తోచిన ఉపాయాలను నాకు తెలియజేయండి.'

విశేషం: ఈ పద్యంలో 'ఎఱుఁగు' అనే పదాన్ని అయిదుసార్లు వాడటంవలన పాండవులను గుర్తించాలన్న తహతహ దుర్యోధనుడి కెంతగా ఉన్నదో వ్యక్తమవుతున్నది. పంచపాండవులనూ గుర్తించి తిరిగి అరణ్యాలకు పంపాలనే కసి కూడా ఆ అయిదు శబ్దాలలో ధ్వనిస్తున్నది. (సంపా.)

వ. అనిన రాధేయుం డిట్లనియె. 93

తాత్పర్యం: అని అనగా కర్ణు డీ విధంగా అన్నాడు.

ఆ. 'వివిధ దుర్నిరూప వేషముల్ గైకొని । నిఖిల దిశలయందు నిపుణవృత్తి
నెఱుఁగునట్లుగా ననేకులఁ బుచ్చిన । నెల్లి నేఁటిలోన నెఱుఁగఁబడరె?' 94

ప్రతిపదార్థం: వివిధ దుర్నిరూపవేషముల్= గుర్తించటానికి వీలుకాని అనేక వేషాలను వేసికొని; నిఖిల దిశల+అందున్= అన్ని దిక్కులలోనూ; నిపుణవృత్తిన్= నేర్పరితనంతో; ఎఱుఁగునట్లుగాన్= తెలిసేటట్లుగా; అనేకులన్+పుచ్చినన్= అనేకులను పంపితే; ఎల్లి నేఁటిలోనన్= రేపో నేడో; ఎఱుఁగన్+పడరు+ఎ?= గుర్తింపబడరా?

తాత్పర్యం: 'ఇతరు లెవ్వరూ గుర్తించ వీలులేని వేషాలు వేసికొని నేర్పుగా పాండవులను గుర్తించగల వేల మంది వేగుల వేషగాండ్రను దేశం నలుమూలలా పంపితే రేపో నేడో వారిని గుర్తించలేరా?'

క. అను పలుకులు విని దుశ్శా । సనుఁ డేమియు సరకుగొనక సమదవిలాసా
ననుఁడై నిజాగ్రజన్మునిఁ । గనుఁగొని యిట్లనియె గాఢ గర్వ స్ఫూర్తిన్. 95

ప్రతిపదార్థం: అను పలుకులు= అనే మాటలు; విని= విని; దుశ్శాసనుఁడు= దుశ్శాసనుడు; ఏమియున్ సరకు కొనక= ఏమాత్రంలెక్కచేయక; సమదవిలాస= గర్వంతో, సంతోషంతో (కూడుకొన్న); ఆననుఁడు+ఐ= ముఖం కలవాడై; నిజ+ అగ్రజన్మునిన్+కనుఁగొని= తన అన్నను చూచి; గాఢగర్వస్ఫూర్తిన్= దట్టమైన గర్వం ఉట్టిపడగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: (కర్ణుడు) అన్న మాటలను విన్న దుశ్శాసనుడు ఏమాత్రమూ లెక్కచేయక నిర్లక్ష్య భావంతో గల ముఖంతో తన అన్న మొగం చూచి దట్టమైన అహంకారం ఉట్టిపడగా ఇట్లా అన్నాడు.

చ. 'వలవదు రోయఁ బాండవుల; వా రొక యూఱట లేని త్రిమ్మటన్
బల మఱి వన్య సత్త్వముల పాల్పడి చచ్చినచోటఁ బూరియు

న్మొలవదె యింత! కిం కిట మనోముద మస్థలితంబు గాఁగ వి

చ్చలవిడి రాజ్యలక్ష్మిఁ దగు చందమునం గొనియాడు మున్నతిన్.' **96**

ప్రతిపదార్థం: పాండవులన్= పాండవులను; రోయన్= వెదుక; వలవదు= పనిలేదు; వారు= పాండవులు; ఒక+ఊరట లేని= ఏమాత్రమూ విరామం లేని; త్రిమ్మటన్= తిరుగుట వలన; బలము+అఱి= శక్తి ఉడిగి; వన్యసత్త్వముల పాల్పడి= అడవిలోని క్రూరమృగాలకు చిక్కి; చచ్చిన చోటన్= చనిపోయినచోట; ఇంతకున్= ఈపాటికి; పూరియున్= గడ్డి కూడా; మొలవదె?= మొలకెత్తి ఉండదా?; ఇంకన్+ఇటన్= ఇక ఇక్కడ; మనస్(ః)+ముదము= మనస్సంతోషం; అస్థలితంబు+కాఁగన్= దృఢం కాగా; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; రాజ్యలక్ష్మిన్= రాజ్యసంపదను; తగు చందమునన్= తగిన విధంగా; ఉన్నతిన్= గొప్పగా; కొనియాడుము= కీర్తించుము.

తాత్పర్యం: 'పాండవులను వెదకవలసిన పనే లేదు. వారు విరామమంటూ లేకుండా తిరిగి తిరిగి, బలం తరిగి, క్రూరమృగాల పాలబడి చచ్చి ఉంటారు. వారు చచ్చినచోట ఇప్పటికి గడ్డి కూడా మొలిచి ఉంటుంది. కాబట్టి ఇకమీద హృదయాహ్లాదం తరగకుండా స్వేచ్ఛగా తగినరీతిలో రాజ్యసంపదను అనుభవించుము.'

విశేషం: పాండవులు చనిపోయి ఉంటారని భావించిన దుశ్శాసనుడు అపరిణతబుద్ధి కలవాడని తనంతట తానే ప్రకటించుకొన్నాడు. అతడు గర్వాంధుడు. అన్నను మెప్పించటమే అతడి ధ్యేయం. వాస్తవం కంటె అతడి మనసులోని కోర్కెను పరోక్షంగా బయటపెట్టుకొన్నాడు. అతడి మాటలు విజ్ఞులైన ద్రోణాదులకు నవ్వు తెప్పించాయంటే ఆశ్చర్యం లేదు. (సంపా.)

వ. అనిన విని దరహసితవదనుం డగుచుఁ గుంభసంభవుం డిట్లనియె. **97**

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విని; దరహసితవదనుండు= చిరునవ్వుతోడి మొగం కలవాడు; అగుచున్= ఔతూ; కుంభసంభవుండు= ద్రోణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని చిరునవ్వు మొగంతో ద్రోణుడు ఇట్లా అన్నాడు.

విశేషం: ఈ దరహాసం పరిహాస సూచకం. (సంపా.)

ఉ. క్షాత్రసమగ్రు, లార్యనుత గౌరవదీప్తులు, వర్ణనీయ సౌ

భ్రాత్రు, లుదాత్త దైవబలభవ్యులు, దివ్యసమాను, లా పృథా

పుత్రులు; వారి నాపదలు వొందునె? యోపిన నింకనైన నీ

ధాత్రిఁ గడంగి యారయు విధంబులు సెప్పుఁడు నేర్పు లేర్పడన్.' **98**

ప్రతిపదార్థం: ఆ పృథాపుత్రులు= కుంతీ కుమారులైన ఆ పాండవులు; క్షాత్రసమగ్రులు= క్షత్రియగుణమైన శౌర్యంతో నిండినవారు; ఆర్యనుతగౌరవదీప్తులు= పెద్దలచేత పొగడబడిన గౌరవం, తేజస్సు కలవారు, గౌరవం చేత ప్రకాశించేవారు; వర్ణనీయ= కీర్తించదగిన; సౌభ్రాత్రులు= ఉత్తమమైన సోదరభావం కలవారు; ఉదాత్త దైవబల భవ్యులు= గొప్ప దైవబలంచేత క్షేమం కలవారు; దివ్యసమానులు= దేవతలతో సమానమైనవారు; వారిన్= పాండవులను; ఆపదలు+పొందునె?= ప్రమాదాలు పొందుతాయా? ఓపినన్= సామర్థ్యం ఉంటే; ఇంకన్+ఐనన్= ఇకముందైనా; ఈ ధాత్రిన్= ఈ లోకంలో; కడంగి= ప్రయత్నించి;

ఆరయువిధంబులు= గుర్తించే మార్గాలను (ఉపాయాలను); నేర్పులు+ఏర్పడన్= మీ నైపుణ్యాలు తెలిసేటట్లు; చెప్పుఁడు= చెప్పండి.

తాత్పర్యం: 'పాండవులు క్షత్రియుల కుండవలసిన ఉత్తమగుణాలన్నీ దండిగా ఉన్నవారు. పెద్దలు కీర్తించే గౌరవంతో వెలుగొందేవారు. నోరారా పొగడదగిన సోదరప్రేమ కలవారు. మేలైన దైవబలంతో ప్రకాశించే పుణ్యాత్ములు. దేవతలతో తులతూగేవారు. వారికా ఆపదలు కలిగేది? అది అసంభవం. మీకు చేతనైతే ఇకమీదనైనా ఈ లోకంలో వారున్న చోటును వెదకి గుర్తించే ఉపాయాలను మీ నేర్పులు ఏర్పడేటట్లు చెప్పండి.'

విశేషం: 1. అలం: కావ్యలింగం, పరికరం. కుంతీ కుమారులంటే ధర్మజ, భీమార్జునులే అయినా ఆ మాట పాండవుల కందరికీ ఛత్రిన్యాయంతో వర్తిస్తుంది. ఆ అర్థాన్ని ఈ పద్యం సమర్థిస్తున్నది కూడా. ఇందులో పాండవులకు వాడిన విశేషణాలు అయిదు. పంచ పాండవులకు సామాన్య గుణాలుగా పంచ లక్షణాలుంటాయన్నది సార్థకోక్తి. అవి వారికి ఆపదలు కలుగవని ధ్రువీకరించటానికి హేతువు లవుతున్నాయి. అందువలన కావ్యలింగాలంకారం. విశేషణాలు సాభిప్రాయాలు కాబట్టి పరికరాలంకారం. క్షత్రియగుణం క్షాత్రం "క్షతాత్ త్రాయతే ఇతి క్షత్రః, తస్యాపత్యం క్షత్రియః- క్షత్రము వలన రక్షించువాడు కనుక క్షత్త్రుడు, వాని యపత్యము గనుక క్షత్రియుడు"అని గురుబాల ప్రభోధిక. ఎదుటివారిని నాశనం నుండి రక్షించే క్షత్రియుడు తాను నాశనం కాడు. ఆత్మహత్య చేసికొనడు. పైపెచ్చు క్షత్రియగుణాలన్నీ పూర్తిగా కలవారైన పాండవులు చావటం కల్ల. వారు పెద్దలచేత కీర్తించబడే గౌరవం, తేజస్సు కలవారు కాబట్టి మేధావులు వారిని లోకంలో పెట్టుకొని రక్షిస్తారు. వారి సోదర ప్రేమ భేదాలకు అతీతం కాబట్టి వారిలో వారు పోట్లాడుకొని చావకపోగా, ఒకరి కొకరు తోడుగా ఉండి స్వీయ రక్షణ చేసికొనగలరు. వారికి పురుషయత్నంతోపాటు దైవబలం కూడా దండిగా ఉన్నది. కాబట్టి వారికి దేవుడే యోగక్షేమాలు చూస్తాడు. ఇక పోగా, చివరకు వారే దేవతల వంటివారు. వారు మానవుల వలె చావరు. దైవశక్తులతోఅడ్డంకులను అధిరోహించ గలుగుతారు- అని ద్రోణుడు అన్నాడు. పాండవులు ఎట్టిపరిస్థితులలోనూ కష్టాలుపడలేక చనిపోయే బలహీనులుకారని తర్కసహంగా చెప్పాడు. వారిని కనుగొనలేని అసమర్థులు కౌరవులే అని వ్యంగ్యంగా అధిక్షేపించాడు. తెలివితేట లుంటే ఉపాయాలు చెప్పండని అవహేళన చేశాడు. వస్తుతత్త్వం తెలిసి వివేచించే వివేకం కౌరవులకు, విశేషించి దుశ్శాసనుడికి లేదని ద్రోణుడి ఆక్షేపణ. దుశ్శాసనుడి ప్రతిభ కౌరవులకు ప్రతినిధిగా నిలవటం శోచనీయం. ద్రోణుడీమాటలనటంలో పాండవ పక్షపాతంకంటె వాస్తవనిరూపణమే ముఖ్యం. (సంపా).

భీష్ముఁడు దుర్యోధనునితో ధర్మరాజు సుగుణంబులఁ జెప్పుట (సం. 4-27-1)

వ. అనిన నాతని మాట లాదరించి భీష్ముం డిట్లనియె. 99

ప్రతిపదార్థం: అనినన్= అనగా (ద్రోణుడు అట్లనగా); ఆతనిమాటలు+ఆదరించి= ద్రోణుడి మాటలను గౌరవించి; భీష్ముండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ ద్రోణుడి మాటలను గౌరవించి భీష్ము డిట్లా అన్నాడు.

ఉ. 'నల్లవొ! నిక్క మాడె నృపనందను ముందట ద్రోణుఁ డొక్కఁడుం;
దెల్లము; వారు బాహుబల ధీబల దైవబలంబు లొప్ప వ
ర్తిల్లుదు; రమ్మహాత్ముల కరిష్టము లేమిట నెందు నేల పా
టిల్లెడు? వారిఁ గాన్పను గడింది తదీయ మహానుభావతన్. 100

ప్రతిపదార్థం: నల్లవొ!= ఆహా! (ప్రశంసనీయం); ద్రోణుఁడు+ఒక్కఁడున్= ద్రోణుడొక్కడే; నృపనందనుముందటన్= రాజకుమారుడి ముందు (దుర్యోధనుడి ముందు); నిక్కము+ఆడెన్= నిజం చెప్పాడు; తెల్లము= ఇది నిజం; వారు= పాండవులు; బాహుబల, ధీబల, దైవబలంబులు= భుజబలం, బుద్ధిబలం, దైవబలం; ఒప్పన్= ప్రకాశించగా; వర్తిల్లుదురు= నడచుకొనేవారు; ఆ+మహాత్ములకున్= ఆ గొప్పవారికి; అరిష్టములు= అపాయాలు; ఏమిటన్= వేటి వలన; ఎందున్= ఎక్కడనైనా; ఏల= ఎందువలన; పాటిల్లెడున్?= కలుగుతాయి?; తదీయ= వారియొక్క; మహానుభావతన్= గొప్పతనము వలన; వారిన్= పాండవులను; కాన్పను= కనుగొనటం (గుర్తించటం); కడింది= కష్టం (సాధ్యంకాదు).

తాత్పర్యం: 'అహా! రాజుముందు ద్రోణు డొక్కడే నిజం చెప్పాడు. అది స్పష్టం. పాండవులు బాహుబలం, బుద్ధిబలం, దైవబలం కలిగి వ్యవహరిస్తారు. అటువంటి మహాత్ములకు ఆపదలు ఎక్కడినుండి, ఎందుకు, ఎట్లా వస్తాయి? వారు మహానుభావులు కాబట్టి వారిని గుర్తించడం అసాధ్యమే ఔతుంది.

విశేషం: అరిష్టమంటే రిష్టము (శుభం) కానిది. అశుభం; కీడు; కష్టం. అది మానవులకు స్వేచ్ఛవలనగాని, పరేచ్ఛవలనగాని, అనిచ్ఛవలనగాని ఏర్పడవచ్చును. స్వయంకృత దోషాల వలన కలిగిన అశుభాలను, కష్టాలను అధిగమించటానికి దేహబలం కావాలి. పాండవులు మాయాద్యూత ఫలంగా అరణ్యాజ్ఞాతవాసాలు నిర్వహించారు. వారికి అటువంటి దేహబలం ఉన్నది. శత్రువుల వలన కాని, ఇతర కారణాల వలనగాని, సైంధవ, కీచకుల వలనగాని ఏర్పడే కష్టాలను దేహబలంతోపాటు బుద్ధిబలాన్ని కూడా ఉపయోగించి తరించారు. ఇక ఎవరి ప్రేరణ లేకుండా దైవికంగా కలిగే కష్టాలు అనిచ్ఛారిష్టాలు. పాండవులకు యక్షప్రశ్నల ఘట్టం వంటివి. వాటిని బుద్ధిబలంతో, దైవబలంతో తరించ గలిగారు. అందువలన పాండవులు అరిష్టత్రయాన్ని అధిగమించగలవారు. అటువంటివారిని మహాత్ములంటారు. త్రివిధ బలాలను తమ శక్తియుక్తులుగా మార్చుకొని ప్రవర్తనలో ప్రదర్శించగలిగినవారిని మహానుభావు లంటారు. మహానుభావులు తమ మహిమతో ఎదుటివారిచేత గుర్తించబడక గుప్తంగా ఉండగలరు. అందువలన వారిని అజ్ఞాతవాసంలో గుర్తించటం అసాధ్యం అని భీష్ముడు తర్కబద్ధంగా వివరించాడు. ద్రోణుడు పాండవులను మహావ్యక్తులుగా చెప్పగా, భీష్ముడు వారిని మహాత్ములుగా, మహానుభావులుగా అభివర్ణించాడు. వారికి ఆపదలు రావనీ, వారిని గుర్తించటం సాధ్యం కాదనీ స్పష్టంగా ఇద్దరూ చెప్పారు. వీరిద్దరూ విజ్ఞులు. (సంపా.)

క. వారలును వీరలును నా । కారయఁగా నొక్కరూప యైనను గార్యం
బీ రెఱిఁగింప వలయునని । కౌరవపతి నన్ను నడిగెఁ గాన యితనికిన్. 101

ప్రతిపదార్థం: వారలును= పాండవులున్నూ; వీరలును= కౌరవులున్నూ; అరయఁగాన్= చూడగా; నాకున్= నాకు; ఒక్కరూపు+అ= ఒక్కమాదిరివారే, సమానులే; ఐనను= అయినప్పటికిని; కార్యంబు= చేయవలసినపని; ఈరు+ఎఱిఁగింపన్, వలయున్= మీరు తెలియజేయాలి; అని= అంటూ; కౌరవపతి= దుర్యోధనుడు; నన్నున్+అడిగెన్= నన్నడిగాడు; కాన= కనుక; ఇతనికిన్= ఇతడికి (దుర్యోధనుడికి).

తాత్పర్యం: పాండవులూ కౌరవులూ నాకు సమానులే. అయినప్పటికి చేయవలసిన పనిని గూర్చి నన్నడిగినాడు కాబట్టి దుర్యోధనుడికి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఈ పద్యంలో భీష్ముడి అంతస్సంఘర్షణ వ్యక్తమౌతున్నది. పాండవులను గుర్తించటానికి ఉపాయం అడుగుతున్నాడు దుర్యోధనుడు. ఉపాయం చెప్పితే పాండవులకు అపాయం. భీష్ముడికి కౌరవ, పాండవు లిద్దరూ పౌత్రులే కాబట్టి బంధుత్వంలో సమానులే. ఇద్దరి మేలు కోరేవాడు పితామహుడు. కాని, ఒకరి మేలు మరొకరికి కీడు కాకూడదని భావించేవాడు. కాగా ఇన్నాళ్ళకు దుర్యోధనుడు ఈ దుష్టయత్నం చేస్తున్నట్లు పెద్దల ముందు పెట్టాడు. వేగులు విఫలులైనా ప్రయత్నాలను

ముందుకు సాగించాలని సంకల్పించి హితుల సలహాలు అడిగాడు. తెలిసిన విషయం చెప్పకపోతే నరకం వస్తుందని పెద్దల సూక్తి (చూడు ఆది. 1.136). అందువలన చెప్పదలచుకొన్నాడు. అయినా మహానుభావులైన పాండవులను గుర్తించటం అసాధ్యం అనే వాస్తవాన్ని అతడు కాదనటం లేదు. (సంపా.)

క. కలరూ పెఱిఁగింపంగా । వలయుం; జెప్పెద మదీయ వచనములు హితం
బులు గాఁగ నిశ్చయ స్థితిఁ । దలఁచి యనుష్ఠింప బుద్ధి దలకొను నేనిన్. 102

ప్రతిపదార్థం: కలరూపు= ఉన్నస్థితిని, వాస్తవాన్ని; ఎఱిఁగింపంగాన్+వలయున్= తెలియజెప్పవలసి ఉన్నది; మదీయ వచనంబులు= నా మాటలు; హితంబులు+కాఁగన్= మేలు కలిగించేవిగా; నిశ్చయస్థితిన్+తలఁచి= నమ్మకంగా భావించి; అనుష్ఠింపన్= ఆచరింపగా; బుద్ధి= మనసు; తలకొనునేనిన్= పుట్టినట్లయితే (ఆచరించాలని బుద్ధిపుట్టితే); చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: అడిగాడు కాబట్టి తెలిసిన వాస్తవాన్ని తెలియచెప్పాలి. నా మాటలు హితం చేకూర్చేవిగా భావించి తప్పక ఆచరిస్తే నేను చెప్పగలను.

విశేషం: హితుడుగా, పితామహుడుగా ఉన్నమాట ఉన్నట్లుగా చెప్పటం కర్తవ్యం. అది దుర్యోధనుడికి హితంగా తోస్తుందనే నమ్మకం లేదు. అయినా దుర్యోధనుడు నిశ్చయబుద్ధితో తన సలహాలను పాటిస్తాడనే భీష్ముడు చెప్పటం ఆరంభించాడు. నిజానికి భీష్ముడి ఉపాయమే భావికథాగతికి దోహదం కాబోతున్నదని ధ్వని. (సంపా.)

సీ. బ్రాహ్మణభక్తియుఁ, బరహిత శక్తియు । నిర్మల మతియును, నీతి రతియు,
సత్యభాషణమును, సాధుపోషణమును । జిరవితరణమును, సేవ్యగుణము,
సన్మార్గరక్షయు, నున్మత్తశిక్షయు । నంచితోదయముఁ, గృపాతిశయము,
బంధు సంప్రీతియు, భవ్య విభూతియు । శాస్త్రోపగమము, నస్ఖలితదమము

తే. సజ్జన స్తవనీయ సౌజన్యములును । ధర్మసంచిత బహు ధన ధాన్యములును
గలుగు నక్షీణ పుణ్యదోహలుఁడు ధర్మ । సూనుఁ డున్న దేశంబున మానవులకు. 103

ప్రతిపదార్థం: అక్షీణ పుణ్యదోహలుఁడు= అక్షయమైన పుణ్యాన్ని సాధించటంలో ఉత్సాహం కలవాడైన; ధర్మసూనుఁడు= ధర్మజుడు; ఉన్న దేశంబునన్= ఉండే ప్రాంతంలో (దేశంలో); మానవులకున్= ప్రజలకు; బ్రాహ్మణభక్తియున్= బ్రాహ్మణుల మీద భక్తీ; పరహితశక్తియున్= ఇతరులకు మంచిచేసే శక్తీ; నిర్మల మతియును= స్వచ్ఛమైన బుద్ధీ; నీతిరతియున్= నీతియందాసక్తీ; సత్యభాషణమును= నిజం మాట్లాడటమూ; సాధుపోషణమును= మంచివారిని (పండితులను) ఆదరించటమూ; చిరవితరణమును= చాలాకాలం నిలిచే దానమూ; సేవ్యగుణము= సేవించదగిన గుణమూ; సత్+మార్గరక్షయున్= మంచి నడవడికను కాపాడుటయూ; ఉన్మత్త శిక్షయున్= మదించిన దుర్మార్గులను శిక్షించుటయూ; అంచిత+ఉదయమున్= ఒప్పిదమైన అభ్యుదయమూ? కృపా+అతిశయమున్= మిక్కిలి దయగలిగి ఉండటమున్నూ; బంధుసంప్రీతియున్= బాంధవుల మీద అభిమానమూ; భవ్యవిభూతియున్= శుభకరమైన ఐశ్వర్యమూ; శాస్త్ర+ఉపగమమున్= శాస్త్రానుగుణమైన నడవడీ; అస్ఖలితదమము= జారిపోని ఇంద్రియ నిగ్రహమూ; సజ్జన స్తవనీయ= మంచివారిచేత కీర్తింపదగిన; సౌజన్యములును= మంచితనమున్నూ; ధర్మసంచిత= న్యాయంగా సమకూర్చబడిన; బహుధనధాన్యములును= పెక్కు ధనాలు, ధాన్యాలున్నూ; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: ధర్మరాజు నశించని పుణ్యాలను సాధించిన మహానుభావుడు. అత డే దేశంలో ఉంటే ఆ దేశ ప్రజలు పుణ్యవ్రతులుగానే ఉంటారు. వారు బ్రాహ్మణులయందు భక్తీ, ఇతరుల సేవ చేసే శక్తీ, నిష్కల్మషమైన బుద్ధీ, నీతివర్తనంలో అనురక్తీ, నిజం పలకటం, మంచివారిని గౌరవించటం, చాలా కాలం నిలిచే దానాలు చేయటం, సద్గుణశీలం, సన్మార్గ రక్షణం, దుష్టశిక్షణం, న్యాయమైన అభ్యుదయం, దయావేశం, బంధుజనాభిమానం, మాననీయ వైభవం, శాస్త్ర విజ్ఞానం, జారిపోని ఇంద్రియ నిగ్రహం, మంచివారు మెచ్చుకొనే మంచితనం, న్యాయార్జితాలైన బహువిధ ధనధాన్యాల సంభారం కలిగి ఉంటారు.

విశేషం: 1. మహాత్ముడైన ధర్మరాజు మహానుభావుడు. అతడిని భౌతికంగా గుర్తించటం అసాధ్యం. అతడి ఆత్మనిష్ఠమైన మహా గుణాలు అనుభావాలుగా అభివ్యక్తమై ప్రజలలో ప్రవహిస్తాయి. మహానుభావుల ఆత్మవిభూతి ప్రజలలో గుణవిభూతిగా ప్రసరిస్తుంది. మహాపురుషుడి ప్రభావం ప్రకృతిమీద ప్రతిఫలిస్తుంది. ఆ ప్రతిభవలన చైతన్యాన్ని గుర్తించగలిగితే దాని మూలమైన ధర్మరాజు ఉనికిని పసికట్టవచ్చునని భీష్ముడి ప్రబోధం. ఏ దేశంలో ధర్మరాజు ఉన్నా దానికి అతడు ఆత్మ. అతడి ప్రభావం ఆ దేశ శరీరమైన ప్రజల మీద తప్పకుండా కనబడుతుంది. దేహగుణాన్ని బట్టి దేహితత్త్వాన్ని తెలిపే ప్రస్థానం చెప్పాడు భీష్ముడు. 2. మహానుభావుడి ప్రభావం వలన మానవులు అష్టాదశ గుణాలను పొందుతారు. ఈ సీసపద్యంలో మొత్తం పదునెనిమిది గుణాలు చెప్పబడ్డాయి. బ్రహ్మసంఖ్యలో ఉన్న ఈ మహనీయ గుణాలు ధర్మజుడి యొక్క అక్షీణపుణ్యఫలాలు. విశేష మేమంటే- ఒక మహానుభావుడి వ్యక్తిత్వం మానవ ప్రకృతుల మీద వేసే ప్రభావాన్ని ఈ పద్యంలో వర్ణించి, పశు పక్ష్యాది జంతు జీవజాలం మీద పడే ప్రభావాన్ని రాబోయే పద్యంలో చెప్పుతున్నాడు. (సంపా.)

క. **మఱియును నొక్క విశేషం । బెఱిఁగించెద; నతని యున్న యెడ గోధనముల్**
మెఱుఁగెక్కి పాఁడి నేమిం । గొఱఁతవడక యుండఁజేపి కురియుచు నుండున్ 104

ప్రతిపదార్థం: మఱియునున్= ఇంకను; ఒక్క విశేషంబు+ఎఱిఁగించెదన్= ఒక విశేషాన్ని తెలుపుతాను; అతని+ఉన్న+ ఎడన్= ఆ ధర్మజుడున్నచోట; గోధనముల్= ఆవులనెడి సంపదలు; మెఱుఁగు+ఎక్కి= వన్నె గలిగిఅధికమై; పాఁడిన్= పాడిలో; ఏమిన్+కొఱతపడక= ఏ విధంగానూ తక్కువకాకుండా; ఉండన్= ఉండగా; చేపి= పొదుగున చేపువచ్చి; కురియుచున్+ఉండున్= (పాలధారలను) వర్షిస్తూ ఉంటాయి (అనగా పొదుగుల నుండి ధారాపాతంగా పాలు కురిపిస్తూ ఉంటాయని భావం.)

తాత్పర్యం: మరొక విశేషం చెప్పుతాను వినుము. ధర్మరాజు ఉన్నచోట ఆవులనెడి సంపదలు ఎప్పుడూ అభివృద్ధి చెందుతుంటాయి. ఆవులు పొదుగులు చేపి పాలు ధారలుగా కురుస్తాయి. పాడి ఎప్పుడూ తరగకుండా ఉంటుంది.

విశేషం: 1. ధర్మరాజు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలో గోసంపద పెరుగుతుంది. పాడిపంటలు పరవళ్ళు త్రొక్కుతుంటాయి. మనుష్యుల ప్రవర్తనను పరిశీలించి తెలిసికొనేదానికంటె ఇటువంటి పశువుల ప్రవర్తనను చూచి తెలిసికొనటం సులభం. దుర్యోధనుడు సద్గుణధనుడు కాడు. అందువలన పశువుల గుణాలను గుర్తించి అయినా ధర్మజుడి జాడను పసిగట్టగలడని భావించి, అధమపక్షంగా భీష్ముడు దీనిని చివర చెప్పాడు. దుర్యోధనుడి తలకెక్కే దిదే. ఈ సూచనే గోగ్రహణ యుద్ధాలకు తరువాత కథలో దారితీసింది. భావి కథాగతికి బీజాన్ని నాటాడు భీష్ముడు.

2. భారతీయులకు గోవు వేదధర్మప్రతీక. పొదుగు సంస్కృతి ప్రతీక. నాలుగు పాలపీకల ద్వారా కురిసే క్షీరధారలు చతుర్విధ పురుషార్థ సాధన ప్రవృత్తులు. పాలు భారతీయ జీవన విధానం. దానిని వేడి చేయటం ఆధ్యాత్మిక చింతనతో జీవితాన్ని ఆముష్మికపరం చేయటం. మీగడ ఆధ్యాత్మిక ప్రవృత్తి, పెరుగు లౌకికాధ్యాత్మిక ప్రవృత్తుల అభేదరూపమైన ఘనః

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రవృత్తి, దానిని చిలకటం సాధన చతుష్టయం. పైకి తేరే వెన్న - నవనీతం - జీవన వేదాంత ఫలమైన మోక్షజ్ఞానం. వెన్నను తినటం మోక్షానుభవం - అని శ్రీకృష్ణుడి దివ్యచరితం చెప్పే ప్రతీకాత్మక ప్రబోధం. భాగవతంలో కృష్ణు డెక్కడుంటే అక్కడ గోసంపద అభివృద్ధి చెందుతుంది. ఇది యాదవదేశ లక్షణం. అట్లాగే భారతంలో ధర్మరా జెక్కడ ఉంటే ఆ లక్షణాలే కనబడతాయి. ఇది అతడిని కనుగొనడానికి కీలకం- అని భీష్ముడు విశేషాన్ని చెప్పాడు. ఆ మాట వెనుక, గోసంపద వెనుక భారతీయ సంస్కృతిపరమైన వేదాంత స్పృహ అవసరం. తాత్పర్యమేమంటే- మహానుభావత్వంలో ధర్మజుడు శ్రీకృష్ణుడివంటివాడని భీష్ముని ప్రతిపాదనలోని ధ్వని. (సంపా.)

వ. కావున నిట్టి దేశం బిప్పు డెయ్యది యగు నందుఁ గుంతీ తనయుల నరయం బనుపవలయు' ననినఁ గృపాచార్యుం డిట్లనియె. 105

ప్రతిపదార్థం: కావునన్= అందువలన; ఇట్టిదేశంబు+ఇప్పుడు+ఏ+అది+అగున్= ఈ విధమైన గుణాలు కలిగిఉన్న దేశం ఇప్పుడేది అయి ఉంటుందో; అందున్= ఆ దేశంలో; కుంతీ తనయులన్= కుంతీకుమారులను (పాండవులను); అరయన్= చూడగా; పనుపన్+వలయున్= పంపవలెను; అనినన్= అనగా; కృపాచార్యుండు+ఇట్లు+అనియెన్= కృపాచార్యు డిట్లా అన్నాడు.

తాత్పర్యం: కాబట్టి, అటువంటి లక్షణాలున్న దేశం ఇప్పు డేదో ముందు గుర్తించి, అందులో పాండవులను వెదికించాలి' అని భీష్ముడు పలికిన తరువాత కృపాచార్యుడు ఇట్లా అన్నాడు.

క. 'అరయఁగ నయ్యెడు తెఱఁగుల । నరయుట కార్యంబు; వారి నాలస్యము లే
కరయునది; పెక్కు భంగుల । నరసినఁ దోఁచెదరుగాక! యది యట్లుండెన్. 106

ప్రతిపదార్థం: అరయఁగన్= గుర్తింపగా; అయ్యెడు= అగునట్టి; తెఱఁగులన్= పద్ధతులతో; అరయుట= వెదకటం; కార్యంబు= చేయదగినపని; వారిన్= పాండవులను; ఆలస్యము లేక= జాగు చేయకుండా; అరయునది= వెదకవలసింది; పెక్కుభంగులన్= అనేక విధములుగా; అరసినన్= వెదకినచో; తోఁచెదరు+కాక= కనుపిస్తారులే; అది+అట్లు+ఉండెన్= దానిని ఆ విధంగా ఉండనిండు.

తాత్పర్యం: 'పాండవులను వెదకే పద్ధతులను పరిశీలించటం ప్రస్తుత కర్తవ్యం. ఆలస్యం కాకుండా ఆ పని జరగాలి. పెక్కు రకాలుగా వెదకింప చేస్తే తప్పక దొరికి తీరుతారు. ఆ సంగతి అట్లా ఉంచుదాం.

విశేషం: కృపాచార్యుడు పాండవులను వెదకటానికి వేయివిధాలుగా మెరుగులుదిద్ది వేగంగా కావాలని నొక్కి చెప్పుతున్నాడు. (సైరంధ్రి పదమూడు రోజుల గడువు ప్రసక్తి చేసి ఉన్నది కాబట్టి) అజ్ఞాతవాసం ముగియటానికి కాలం సమీపించిందని అతడి అభిప్రాయంగా గ్రహించవచ్చును. ఆలస్యమైతే అమృతం కూడా విష మౌతుందని అతడి హెచ్చరిక! (సంపా.)

ఉ. వారలు పూనినట్ల వనవాసము సల్పిరి, వీరు వేచి త
మ్మారయఁగా బయల్పడని యట్లుగ నుండెడు వత్సరంబునుం
జేరువ చేరువల్ గడచెఁ; జిత్తములుం గలుషంబు లమ్మహా
వీరుల కీ నృపాలునెడ, వీరికి నూరక యున్కి గర్జమే? 107

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వారలు= పాండవులు; పూనిన+అట్లు+అ= పూనుకొన్న విధంగా (శుభం ప్రకారం); వనవాసము= అరణ్యావాసం; సల్పిరి= చేశారు; వీరు= కౌరవులు; వేచి= ఆగి ఉండి; తమ్ముఁన్= తమను; ఆరయఁగాన్= గుర్తించగా; బయల్పడని+అట్లు= బయటపడని విధంగా (తెలియరాని విధంగా); ఉండెడు= ఉండవలసిన; వత్సరంబునున్= సంవత్సరం కూడా; చేరువ చేరువల్= దరిదాపుగా; కడచెన్= అయిపోవచ్చింది; ఆ+మహావీరులకున్= ఆ గొప్పవీరులకు; ఈ నృపాలు+ఎడన్= ఈ రాజుమీద; చిత్తములున్= మనసులు కూడా; కలుషంబులు= కోపంతోకూడి ఉన్నవి; వీరికిన్= ఈ కౌరవులకు; ఊరక+ఉన్కి= ఊరకుండటం; కర్జమే?= కార్యమేనా? (అనగా ఊరుకోరాదని).

తాత్పర్యం: పాండవులు మాట ప్రకారం వనవాసం చేశారు. అజ్ఞాతవాసవత్సరం కూడా దాదాపుగా అయిపోయింది. ఆ మహావీరులకు మనసున రాజుమీద కోపం బాగా ఉన్నది. కనుక వీరు ఊరకుండటం కార్యం కాదు.

క. అలుచైనను బగతుని దెసఁ । దలఁపు గలుగవలయుననిన, దర్పోజ్జ్వల దో
ర్బలు లగు కౌంతేయుల మన । మెలమి కలిమి నచ్చి యిట్టు లేమఱ నగునే? 108

ప్రతిపదార్థం: అలుచు+ఐనను= సామాన్యుడైనా; పగతునిదెసన్= శత్రువుని గూర్చి; తలఁపు= యోచన; కలుగన్+వలయున్= ఉండాలి; అనినన్= అనగా (అని పెద్దలు చెప్పగా); దర్ప+ఉజ్జ్వల దోర్బలులు= గర్వంతో వెలుగొందే భుజబలమున్నవారు; అగు= అయిన; కౌంతేయులన్= కుంతీకుమారులైన పాండవులను; మనము= మనం; ఎలమిన్= సంతోషంతో; కలిమి= సంపదను; నచ్చి= నమ్మి; ఇట్టులు+ఏమఱన్+అగునే?= ఈ విధంగా ఉపేక్షించవచ్చునా?

తాత్పర్యం: పగవాడు అల్పుడైనా అతడిపట్ల జాగరూగత కలిగి ఉండాలి అంటారు. కాగా, పాండవులు గర్వంతో కూడిన భుజబలం కలవారు. మనం మన సంపదల పెంపు మీది నమ్మకంతో వారిని గురించి ఆలోచించక ఉపేక్షించటం తగునా? (తగదని భావం).

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. కృపాచార్యుడు పాండవాన్వేషణ ప్రసక్తితోపాటు, పాండవులు బయలువెడలిన తరువాత ఎదుర్కొనవలసిన అంశాలపై దృష్టిసారించి సలహా లివ్వటం గమనించదగింది. అజ్ఞాతవాసకాలం దాదాపు ముగిసింది. కాబట్టి అన్వేషణ ప్రయత్నంతో పాటు అనంతర కార్యక్రమాన్ని గురించి ఆలోచించటం అవశ్యమని సలహా చెప్పాడు. (సంపా.)

చ. మన బలమెంత యంతయు సమగ్ర సముద్యమ దుర్ధరంబుగా
మును మును గూర్చి, తోడుపడు మూఁకలకుం దగుమైఁ గ్రమ క్రమం
బున నెఱిఁగించి రాఁబనిచి, భూరి సముజ్జ్వల సైన్య జృంభణం
బున వెరవొంది యున్కి కురుభూపతి కిప్పటికార్య మారయన్. 109

ప్రతిపదార్థం: మన బలము+ఎంత= మన సైన్యమెంత ఉన్నదో; అంతయున్= ఆ సైన్యమంతా; సమగ్ర= నిండైన; సముద్యమ= ప్రయత్నంతో; దుర్ధరంబుగాన్= అణచటానికి వీలులేనట్లుగా; మునుమునుకూర్చి= ముందుగానే సమకూర్చుకొని; తోడుపడు= (మనకు) సహాయంగా వచ్చే; మూఁకలకున్= సేనలకు; తగుమైన్= తగినరీతిగా; క్రమక్రమంబునన్= వరుసగా; ఎఱిఁగించి= తెలిపి; రాన్+పనిచి= రమ్మని ఉత్తరువుచేసి; భూరి= విస్తారమైన; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశించే; సైన్య జృంభణంబునన్= సేనల మోహరింపుతో; వెరవు+ఒంది= ఉపాయము గలిగి; ఉన్కి= ఉండటం; కురుభూపతికిన్= దుర్యోధనుడికి; ఆరయన్= పరిశీలించగా; ఇప్పటి కార్యము= ఇపుడు చేయదగిన పని.

తాత్పర్యం: మన సైన్యమునంతటిని విరోధుల కసాధ్యంగా సిద్ధం చేసి, సహాయంగా వచ్చే సైన్యాలకు క్రమక్రమంగా తగిన విధంగా తెలిపి, వారు వచ్చేటట్లుగా ఉత్తర్వులిచ్చి విస్తారమైన సైన్య సమీకరణం చేసి, అతిశయించి అప్రమత్తంగా ఉండటమే ఇప్పుడు కురురాజు చేయవలసిన పని.

విశేషం: ఒకవేళ పాండవులు అజ్ఞాతవాస వ్రతానంతరం హస్తినాపురంమీద దాడి చేస్తే వచ్చే విపత్తును ముందుగానే ఊహించి సైన్య సమీకరణం తత్క్షణ కర్తవ్యమని రాజనీతిని సూచించాడు కృపాచార్యుడు. (సంపా.)

ఆ. **పాండురాజసుతులు బాసమై నడవడి । గడచి కయ్యమునకుఁ గాలుద్రవ్వ**
కున్న యట్టులైన నన్నరనాథుతో । సంధిసేయు టొప్పు సముచితముగ. 110

ప్రతిపదార్థం: పాండురాజసుతులు= పాండవులు; బాసమైన్= మాటప్రకారం; నడవడి= నడతను (అనగా అజ్ఞాతవాసపు నియమమును అని భావం); కడచి= దాటి; (పూర్తిచేసి); కయ్యమునకున్= యుద్ధానికి; కాలుత్రవ్వకున్న+అట్టులు+ఐనన్= యుద్ధానికి సిద్ధపడకపోతే; ఆ+నరనాథుతోన్= ఆ రాజుతో (ధర్మజుడితో); సముచితముగన్= తగినవిధంగా; సంధిచేయుటన్= సంధిచేసికొనటం; ఒప్పున్= తగును.

తాత్పర్యం: పాండవులు చేసిన బాసల ననుసరించి నడుచుకొని గడువును పూర్తిచేసికొన్న తరువాత యుద్ధానికి సిద్ధం కాకుండా ఉంటే ధర్మరాజుతో దుర్యోధనుడు శాంతితో సంధిచేసికొనటం ఉచితం.

విశేషం: పాండవులు అజ్ఞాతవాసం పూర్తిచేసి యుద్ధ ప్రయత్నాలు చేయకపోతే సంధి చేసికొనటం మేలని కృపాచార్యుడి సూచన. అజ్ఞాతవాసంలో ఉన్న పాండవులను గుర్తించటం సాధ్యం కాని పని అని చెప్పక చెప్పుతూనే తరువాతి ప్రయత్నాలను గురించి సలహా లివ్వటం ఇతడి మాటలలోని మర్మం. (సంపా.)

క. **ఏచి చలంబున నొంటికిఁ । జూచిన, నప్పటికి మనకుఁ జూడం గార్యం**
బే చందంబునఁ దెఱఁగగు । నా చాలుట కోర్వవలయు; నది యట్లుండెన్. 111

ప్రతిపదార్థం: ఏచి= విజృంభించి; చలంబునన్= అసూయతో (పట్టుదలతో); ఒంటికిన్+చూచినన్= ఒకే పక్షానికి మ్రొగ్గితే (ఏకపక్షంగా ఆలోచించి యుద్ధానికి సిద్ధమైతే); అప్పటికిన్= ఆ సమయానికి; మనకున్= మనకు; చూడన్= చూడగా; కార్యంబు= జరుగవలసిన పని; ఏ చందంబునన్= ఏవిధంగా; తెఱఁగు+అగున్= అనువుగా ఉంటుందో (సంధికి వీలుగా ఉంటుందో); ఆ చాలుటకున్= ఆ తీరుకు; ఓర్వవలయున్= సిద్ధపడాలి; అది అట్లు+ఉండెన్= అది అట్లా ఉండనీ.

తాత్పర్యం: పాండవులు సంధిని కాదని పట్టుదలతో ఒంటికాలిమీద లేవాలని చూస్తే (యుద్ధం చేయాలని పూనుకొంటే), అప్పటికి మన దృష్టిలో ఏ పద్ధతి మంచిదని తోస్తే ఆ విధంగా సిద్ధపడాలి. అది అట్లా ఉండనీ.

విశేషం: పాండవులు సంధికి అంగీకరించకుండా ఏకపక్షంగా యుద్ధాన్ని ప్రకటిస్తే అప్పటి వ్యూహం అప్పుడు చేసికొనవచ్చునని కృపాచార్యుడు చెప్పాడు. అటువంటి పరిస్థితి రాగూడదనీ, రాదనీ అతడు భావించినట్లున్నాడు. అయినా కీడెంచి మేలెంచుమన్నట్లు మాట్లాడాడు. 'అది అట్లా ఉండనీ' - అనేది కృపాచార్యుడి పాత్రోచిత పదవిన్యాసంగా తిక్కన కూర్చాడు. అనేక ప్రతిపాదనలు ఒకేసారి చేసేటప్పుడు ఈ మాటలు తరుచుగా అనటం లోకసామాన్యం. (సంపా.)

క. వారలు లేరట పో, పెఱ। వారలఁ దగు భంగి మనకు వశ్యులఁ జేయన్
భూరి బలయుతుల మగుటయుఁ। గారణమను టనుమతంబు గాదే మనకున్.' 112

ప్రతిపదార్థం: వారలు= పాండవులు; లేరు+అటపో= అక్కడ లేరనే అనుకో; పెఱవారలన్= ఇతర శత్రువులను; తగు భంగిన్= తగిన విధంగా; మనకున్+వశ్యులన్+చేయన్= మనకు లొంగేటట్లు చేయటానికి; భూరిబలయుతులము+అగుటయున్ కారణము= విస్తారమైన సైన్యబలం కలవారం కావటం కూడా ఒక కారణం; అనుట= అనటం; మనకున్= మనకు; అనుమతంబు కాదే?= అంగీకారం కాదా? (అంగీకారమే అని భావం.)

తాత్పర్యం: ఒకవేళ పాండవులు లేరనే అనుకొందాం. (చనిపోయారని భావిద్దాం). అప్పుడు (వారిని సమర్థించే) శత్రురాజులను తగినవిధంగా వశం చేసికొనాలన్నా మనకు అపార బలసంపద ఉన్నదనే కారణాన్ని లోకానికి చాటవలసిన అవసరం ఉంటుం దనుకొనటం అందరికీ ఆమోదయోగ్యమే ఔతుంది.'

విశేషం: కృపాచార్యుడు పాండవుల అన్వేషణ యత్నంలో తలయెత్తే పూర్వాపరాలను చర్చించి, తగిన వ్యూహాలను సూచించాడు. ఇతడి మాటలలో ప్రస్తుతానికి పనికివచ్చే ఉపాయాలకంటె భవిష్యత్తుకు పనికివచ్చే సూచనలే ఎక్కువగా ఉన్నాయి. (సంపా.)

తే. ఇవ్విధంబునఁ దమ తమ యెఱుఁగు తెఱఁగు। లందఱును జెప్ప విని కురునందనుండు
దగ విచారించి కార్యంబు తెగువ గాంచి। యెలమి వారలఁ గనుఁగొని యిట్టు లనియె. 113

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఇట్లాగు; అందఱును= అక్కడున్న వారందరూ; తమ తమ ఎఱుఁగు తెఱఁగులు= తమకు తెలిసిన పద్ధతులను; చెప్పన్+విని= చెప్పగా విని; కురునందనుండు= దుర్యోధనుడు; తగన్ విచారించి= బాగా యోచించి; కార్యంబు తెగువన్+కాంచి= ముందు చేయవలసిన పని తీరును నిశ్చయించి; ఎలమిన్= ప్రీతితో; వారలన్= కొలువులోనివారిని; కనుఁగొని= చూచి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కృపాచార్యుడివలెనే సభలోనివారు తమకు తోచిన పద్ధతులన్నిటిని చెప్పగా విన్నాడు దుర్యోధనుడు. బాగా యోచించి చేయవలసిన కార్యాన్ని నిశ్చయించి సభలోని వారందరినీ ఉద్దేశించి ఇట్లా అన్నాడు.

విశేషం: సూచన లివ్వటం మంత్రుల, హితుల కర్తవ్యం. దానిని కూలంకషంగా ఆలోచించి తగిన నిర్ణయం తీసికొనటం రాజు కర్తవ్యం. ఆ రాజు చేసే నిర్ణయానికి తిరుగుండదు. (సంపా.)

ఆ. 'సింహబలుఁడు భీమసేనుండు శల్యుండు। హలధరుఁడు సమాన బలమువార,
లొండొరులను గెలుచు నుత్సాహమును గల। రుద్ధతులును బాహుయుద్ధపరులు. 114

ప్రతిపదార్థం: సింహబలుఁడు= కీచకుడు; భీమసేనుండు= భీముడు; శల్యుండు= శల్యుడు; హలధరుఁడు= బలరాముడు; సమానబలము వారలు= సమానమైన బలం ఉన్నవారు; ఒండొరులను గెలుచు= ఒకరినొకరు గెలవాలి అనే; ఉత్సాహమును +కలరు= పూనికకూడా కలవారు; ఉద్ధతులును= గర్వితులు కూడా; బాహుయుద్ధపరులు= భుజయుద్ధంలో ఆసక్తి కలవారు.

తాత్పర్యం: 'కీచకుడు, భీమసేనుడు, శల్యుడు, బలరాముడు - ఈ నలుగురూ సమాన బలం కలవారు. ఒకరినొకరు జయించుకొనవలెనని ఉత్సాహపడే గర్విష్ఠులు, మల్లయుద్ధప్రియులు.

విశేషం: ఈ పద్యపు ఎత్తుగడలోనే దుర్యోధనుడి నిశ్చయం ధ్వనిస్తున్నది. 'సింహబలుడు' చనిపోయిన వృత్తాంతం చారులు చెప్పిన చివరి విశేషం. మిగతావారు అసలు దానిని పట్టించుకొనలేదు. దుర్యోధనుడు స్వయంగా గదాయుద్ధ, మల్లయుద్ధ నిపుణుడు. అందువలన సమస్యలోని ఆయువును పట్టుకొన్నాడు. తన నిర్ణయాన్ని తొందరపడకుండా, తర్కసహంగా, సభాసదులు అంగీకరించేటట్లు ప్రతిపాదిస్తున్నాడు. అందులో మొదటి అంశం ప్రసిద్ధ - జగదేక మల్లుల ప్రసక్తి. అందులో మొదట సింహబలుడిని పేర్కొన్నాడు. ఆ తరువాత భీముడిని చెప్పాడు. మూలంలో కూడా అధికపాఠంగా ఒక శ్లోకం దీనికి ఆలంబనగా కనబడుతున్నది.

"బలదేవశ్చ భీమశ్చ మద్రరాజశ్చ వీర్యవాన్
చతుర్థః కీచక స్తేషాం పంచమం నానుశుశ్రుమః"

ఇందులోని వరుస వేరు. బలరాముడు, భీముడు, శల్యుడు, ఆ తరువాత నాలుగవ వాడు కీచకుడు. చతుర్థుడు అంటే నాల్గవ వాడనీ, నాల్గవ కులం వాడనీ చెప్పవచ్చును. అందువలన కాబోలు అతడిని మూలంలో చివర చెప్పాడు. తెలుగులో అతడే మొదట నిలిచాడు. ఈ నలుగురూ తప్ప అయిదోవాడు లేడట! వారు ఉద్ధతులట! ఒకరి నొకరు గెలవాలని ఉత్సాహపడుతూ ఉంటారట! దీనిని బట్టి చూస్తే కీచకుడి వింతచావుకు భీముడు హేతువని ఊహించటం సహజం. ఒక ప్రతిపాదనలో హేతువు, వివరణ, వితర్కం, అనుమానం, నిశ్చయం అనే అయిదు దశలుంటాయి. దుర్యోధను డందులో హేతువు నీ పద్యంలో చూపించాడు. (సంపా.)

క. ఈ నలువుర భుజశక్తుల। తో నెనయఁగఁజాలునట్టి దోర్బల మెందుం
గానము కావున వీరల। లోనన యొండొరుల కని గెలుపు సమకూరున్. 115

ప్రతిపదార్థం: ఈ నలువుర భుజశక్తులతోన్= ఈ నలుగురి భుజబలాలతో; ఎనయఁగన్+చాలు+అట్టి= సరిపోలతగినట్టి; దోర్బలము= భుజబలం; ఎందున్= ఎక్కడాకూడా; కానము= చూడం; వీరలలోనన= ఈ నలుగురిలోనే; ఒండొరులకున్= ఒకరికొకరికి; అనిన్= యుద్ధంలో; గెలుపు సమకూరున్= జయం కలుగుతుంది.

తాత్పర్యం: ఈ నలుగురి భుజబలాలతో సరితూగజాలే భుజబలం మరెక్కడా కనబడలేదు కాబట్టి యుద్ధంలో ఈ నల్గురిలోనే ఒకరిమీద ఒకరు గెలవటం సాధ్యమౌతుంది.

విశేషం: ఆ నలుగురిలోనే ఒకరిమీద ఒకరికి విజయం సాధ్యం అనే కీలకమైన వివరణం హేతువును బలపరుస్తున్నది. ఇది దుర్యోధనుడి నిశ్చయ ప్రతిపాదనలో రెండవ దశ. (సంపా.)

ఉ. తక్కినవార లాతనికి దవ్వుల చోటులవారు; వాయుజుం
డొక్కఁడ యింక సింహబలు నుద్ధతి మాన్చిన మాన్చువాఁ; డతం
డక్కడ నిల్చెఁ గావలయు; నాసతి ద్రౌపది గాఁగ నోపు; వే
ఱొక్కరుఁ డాజిఁ గీచకుల నోర్వఁగఁ జాలమి మీ రెఱుంగరే? 116

ప్రతిపదార్థం: తక్కినవారలు= మిగిలినవారు (శల్యుడు, బలరాముడు); ఆతనికిన్= ఆ సింహబలుడికి; దవ్వులచోటులవారు= దూరప్రదేశాలలో ఉన్నారు; ఇంకన్= ఇకపోగా; వాయుజుండు+ఒక్కఁడు+అ= వాయునందనుడు (భీముడు) ఒక్కడే; సింహబలు +ఉద్ధతిన్= కీచకుడి గర్వాన్ని; మాన్చినన్ మాన్చువాఁడు= అణచవలసి వస్తే అణచగలిగినవాడు; అతండు= ఆ భీముడు;

అక్కడన్= ఆ నగరంలో; నిల్చెన్+కావలయున్= ఉండి ఉండవచ్చును; ఆ సతి= ఆ ఇల్లాలు; ద్రౌపది కాఁగన్+ఓపున్= ద్రౌపదియై ఉండవచ్చును; వేఱు+ఒక్కరుఁడు= (భీముడు కాక) మరొకడు; ఆజిన్= యుద్ధంలో; కీచకులన్= కీచకుల నందరినీ; ఓర్వఁగన్+చాలమిన్= ఓడించలేకపోవటాన్ని; మీరు+ఎఱుఁగరే?= మీకు తెలియదా?

తాత్పర్యం: శల్య బలరాములు ఆ సింహబలుడికి సుదూరప్రాంతాలలో ఉన్నారు. భీమసేను డొక్కడే ఆ సింహబలుడి గర్వాన్ని అవసరం వస్తే అణచగలవాడు. అతడు ఆ విరటుడి పట్టణంలో ఉండి ఉంటాడు. ఆ ఇల్లాలు ద్రౌపది అయి ఉంటుంది. భీముడు కాక మరొక్కడు యుద్ధంలో కీచకులనందరినీ ఒక్కసారిగా మట్టుపెట్టలేడన్న సంగతి మీకూ తెలుసు.

విశేషం: ఇందులో సహేతుకమైన వితర్కం ఉన్నది. బలరాముడు, శల్యుడు అక్కడ ఉండటానికి వీలు లేదు. పరిశేషన్యాయంతో భీముడే అక్కడ ఉండి ఉండాలి. ఒక ఇల్లాలు కారణంగా కీచకుడు, ఉపకీచకులు వింతచావు చచ్చారన్న వార్త. ఆ ఇల్లాలు పాండపత్నియే అయి ఉండాలి. ఆమె జగదేకసుందరి కావటం దాన్ని బలపరుస్తున్నది. ఆమెను రక్షించటం కొరకు భీముడు కీచకులనందరినీ ఒక్కసారిగా చంపి ఉండాలి. అట్లా చంపగలగటం అతడికే సాధ్యం కాబట్టి, అక్కడ ఉన్నవాడు భీముడే అని వితర్కించి అందరినీ ఒప్పించాడు రారాజు. (సంపా.)

క. **గంధర్వు లను నెపంబున । నంధతమసగూఢవృత్తి ననిలసుతుఁడు గ**
ర్వాంధమతియైన సూతు స । బాంధవముగఁ జంపెఁ గాక, పరులకు వశమే? **117**

ప్రతిపదార్థం: అనిలసుతుఁడు= వాయుపుత్రుడైన భీముడు; గంధర్వులు+అను నెపంబునన్= గంధర్వులనే మిషతో; అంధ తమస= కన్నుపొడుచుకున్నా కనబడని చీకటిలో; గూఢవృత్తిన్= తెలియరాని రహస్య ప్రవర్తనతో; గర్వ+అంధమతి+ఐన సూతున్= పొగరుతో కన్నుగానని కీచకుడిని; సబాంధవముగన్= బంధువులతో సహా; చంపెన్+కాక= చంపి ఉంటాడు; పరులకున్= ఇతరులకు; వశమే?= అది సాధ్యమా? (కాదని భావం).

తాత్పర్యం: భీముడే గంధర్వుల మిషతో చిమ్మచీకట్లో రహస్య పద్ధతిలో గర్వాంధుడైన కీచకుడిని బంధువులతో సహా చంపి ఉంటాడు. అతడికిగాక ఇతరులకు ఆ పని సాధ్యమా?

విశేషం: ఇందులో భీముడే గంధర్వుల పేరుతో కీచకులను సంహరించి ఉంటాడనీ, అది అతడికే సాధ్యమనీ తార్కిక అనుమానాన్ని ప్రతిపాదించాడు. ఇది నిశ్చయానికి ముందున్న నాల్గవ దశ. (సంపా.)

వ. **పితామహుం డుపదేశించిన లక్షణంబు లద్దేశంబున గలిగి యుండునని విందుము; పాండవులు ప్రచ్ఛన్న వేషంబున విరటు ప్రోల వసియించినవారు గావలయు; నతండును బ్రతిభటుం డయి భంగించుచుండుం; గావున నతని పయి నెత్తిపోయి తదీయ గోధనంబుల గ్రహించిన ధర్మతనయుండును దమ్ములు నడ్డపడం బఱతెంతు; రయ్యవసరంబున మనము సమయ భంగంబు చెప్పి వారలం గ్రమ్మఱఁ బండ్రెండు వత్సరంబులు వనవాసంబు సలుపంబుత్తు; మట్లైన నప్రతిహతంబుగాఁ జితురంతభూచక్రం బాక్రమించి కీర్తనీయులమై వర్తిల్లుదుము; కుంతీనందను లందులేక తక్కిన మత్స్యపతి సమస్త వస్తువులను జూఱగొంద; మదియును లాభంబ; యెల్లభంగుల నిప్పటి కిదియె కార్యంబు; మీకు నందఱకుం జూడఁబోలునేని దీని కనురూపం బగు**

నుద్యోగంబు సేయుం 'డనినఁ ద్రిగర్తాధీశ్వరుండగు సుశర్మ తొలుతఁ గర్ణ దుశ్శాసనులతోఁ గొండొక ప్రసంగించి వారల యనుమతి నవనీపతితో నిట్లనియె. 118

ప్రతిపదార్థం: పితామహుండు= తాత (భీష్ముడు); ఉపదేశించిన లక్షణములు= తెలియజెప్పిన గుర్తులు; ఆ+దేశంబునన్+కల్గి ఉండున్+అని= ఆ విరటుడిదేశంలో ఉన్నాయని; విందుము= వింటున్నాము; పాండవులు; ప్రచ్ఛన్న వేషంబునన్= రహస్యమగు వేషంతో; విరటుప్రోలన్= విరటుని నగరంలో; వసియించిన వారు కావలయున్= నివసిస్తూ ఉండి ఉంటారు; అతండును= ఆ విరాటుడు కూడా; ప్రతిభటుండు+ఐ= మనకు విరోధి అయి; భంగించుచున్+ఉండున్= అవమానిస్తూ ఉంటాడు; కావునన్= కనుక; అతని పయిన్= అతడి మీదకు; ఎత్తిపోయి= దండెత్తిపోయి; తదీయ గోధనంబులన్ గ్రహించినన్= అతడి పశుసంపదలను లోబరుచుకొంటే; ధర్మతనయుండును+తమ్ములున్= ధర్మరాజూ, అతని తమ్ములూ; అడ్డపడన్= అడ్డగించటానికి; పఱతెంతురు= వస్తారు; ఆ+అవసరంబునన్= ఆసమయంలో; మనము; సమయభంగంబుచెప్పి= అజ్ఞాతవాస నియమం మధ్యలోనే భంగమై పోయిందని నిరూపించి; వారలన్= పాండవులను; క్రమ్మఱన్= మరల; పండ్రెండు వత్సరంబులు= పండ్రెండేండ్లు; వనవాసంబు +చలుపన్= అరణ్యవాసం చేయడానికి; పుత్తము= పంపుదాము; అట్లు+ఐనన్= ఆవిధంగా అయితే; అప్రతిహతంబుగాన్= అడ్డులేకుండా; చతుః+అంతభూచక్రంబు+ఆక్రమించి= నాలుగు దిక్కుల భూమివలయాన్ని ఆక్రమించుకొని; కీర్తనీయులము+ఐ= పొగడదగిన వారంగా; వర్తిల్లుదుము= ఉంటాము; కుంతీనందనులు= పాండవులు; అందున్+లేక= అక్కడలేకుండా; తక్కినన్= తొలగిపోయినచో; మత్స్యపతి= మత్స్యదేశపు రాజుయొక్క; సమస్త వస్తువులను= అన్ని వస్తువులను (సంపదనంతటిని); చూఱగొందము= కొల్లగొట్టుదాము; అదియును= అదికూడా; లాభంబు+అ= లాభమే; ఎల్లభంగులన్= అన్ని విధాలుగా; ఇప్పటికిన్= ఈ సమయానికి; ఇదియె= ఇదే; కార్యంబు= చేయదగినపని; మీకున్+అందఱకున్+చూడన్+పోలున్+ఏని= మీరందరూ పరిశీలించగా ఇది తగిన కార్యమని అనిపిస్తే; దీనికిన్+అనురూపంబు+అగు= దీనికి తగిన; ఉద్యోగంబు= ప్రయత్నం; చేయుండు= చేయండి; అనినన్= అని అనగా; త్రిగర్త+అధీశ్వరుండు+అగు= త్రిగర్త దేశపురాజు అయిన; సుశర్మ= సుశర్మ అనేవాడు; తొలుతన్= ముందుగా; కర్ణదుశ్శాసనులతోన్= కర్ణుడితోను, దుశ్శాసనుడితోను; కొండొక ప్రసంగించి= కొంత మాటలాడి; వారల అనుమతిన్= వారి ఆమోదంతో; అవనీపతితోన్= రాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: తాతగారైన భీష్ముడు తెల్పిన గుర్తులు అన్నీ విరటుడి దేశంలో ఉన్నవని వింటున్నాము. మారువేషాలతో పాండవులు విరాటనగరంలో నివసిస్తూ ఉన్నారేమో! విరాటుడు కూడా మనకు విరోధివలె నడచుకొంటూ మనలను ధిక్కరిస్తూ ఉంటాడు. కాబట్టి అతడి మీదికి దండెత్తిపోయి, అతడి గోసంపదను గ్రహిస్తే ధర్మరాజు, అతడి తమ్ములూ మనలను అడ్డగించటానికి వస్తారు. అపుడు వారి అజ్ఞాతవాస నియమం భంగమైపోయిందని తెలియచెప్పి పాండవులను మరల పన్నెండేండ్లు వనవాసంచేయటానికి పంపుదాము. అట్లయితే అడ్డులేకుండా ఈ భూవలయాన్నంతా ఆక్రమించుకొని అపారకీర్తిని అందుకొందాము. వా రక్కడ లేకుంటే విరాటుడి సంపదనంతా కొల్లగొట్టుదాము. అది కూడా మనకు లాభమే. అన్ని విధాలుగా మన మిప్పటికి చేయదగిన పని ఇదే. మీరందఱు దీని నంగీకరిస్తే దీని కనుగుణంగా ప్రయత్నం చేయండి' అని దుర్యోధనుడు పలుకగా త్రిగర్తదేశాధీశ్వరుడైన సుశర్మ లేచి కర్ణదుశ్శాసనులతో ముందుగా మంతనాలాడి వారి అనుమతి పొంది దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇందులో దుర్యోధనుడు తీర్పువంటి నిశ్చయాన్ని ప్రకటించాడు. దానికి అనువుగా చారుల వార్తను, భీష్ముడి సూచనలను ఉపపత్తులుగా పేర్కొన్నాడు. తన వ్యూహం సఫలమైనా, విఫలమైనా లాభదాయకంగా ఉంటుందని నిరూపించాడు. పాండవులు నియమం పూర్తి కాకుండానే బయటపడే బలమైన కారణాన్ని కల్పించి చూపాడు. పాండవులను వధించకుండా

మరల అరణ్యాజ్ఞాత వాసాలు చేయించేటట్లు చెప్పి, పెద్దలు కాదనకుండా చేశాడు. అజ్ఞాతవాసం జనపదంలోనే సాగుతుంది. కాబట్టి విరాటనగరం వారున్న స్థలంగా నిర్ణయించాడు. అజ్ఞాతవాసం భగ్నం చేయటం ధర్మవిరుద్ధం కాదని సూచించాడు. మత్స్యపతి మీద దాడికి సహజ శత్రుత్వాన్ని సహజ కారణంగా చెప్పాడు. ఫలితంగా నిశ్చింతగా విశాల రాజ్యాన్ని పాలించటాన్ని నిర్ధారించాడు. సమర్థమైన వ్యూహాన్ని పన్ని సభలో అంగీకారానికి ఉంచాడు. నిజానికి అతడి నిర్ణయం ఎవ్వరూ కాదనటానికి వీలులేనంత పటిష్ఠంగా ఉన్నది. అతడి వాద నైపుణ్యం అంత బలంగా ఉన్నది. ఇక ఎవరైనా మాట్లాడితే దానికి అనుకూలంగా పలుకవలసిందే కాని ప్రతికూలత పనికిరాదు. అట్లా పలికినా దుర్యోధనుడు వినడు. అది అందరికీ తెలుసు. అందువలననే స్వార్థంతో పాటు ప్రభువు పరమార్థాన్ని కూడా సాధింపదలచుకొన్న సుశర్మ లేచాడు. రాజుతో సూటిగా మాట్లాడే సాన్నిహిత్యం లేనివాడైన సుశర్మ కర్ణ దుశ్శాసనులతో తన మనసులో మాట చెప్పి, వారి అనుమతితో రాజుతో చెప్పటానికి పూనుకొన్నాడు. అట్లా చేయటం సేవాధర్మం కూడా (విరా.1.127). (సంపా.)

క. 'కేకయ సాల్వులు తోడుగ । నా కీచకుఁ డాజి నన్ను నపజితుఁ జేసెం;
జాకుండమున్న యొకపరి । నా కాతని తోడ భండనము లేదయ్యెన్. 119

ప్రతిపదార్థం: కేకయ సాల్వులు తోడుగన్= కేకయులు సాల్వులు సాయంరాగా; ఆ కీచకుఁడు; ఆజిన్= యుద్ధంలో; నన్నున్= నన్ను; అపజితున్+చేసెన్= ఓడించాడు; చాకుండమున్న+అ= వాడు చావటానికి ముందే; ఒకపరి= ఒక్కమారు; నాకున్= నాకు; ఆతనితోడన్= అతడితో (కీచకుడితో); భండనము= యుద్ధం; లేదు+అయ్యెన్= కలుగలేదు.

తాత్పర్యం: 'కేకయ సాళ్వుల సహాయంతో కీచకుడు యుద్ధంలో న న్నోడించాడు. కాని, అతడు చచ్చేలోగా వాడితో ఒకమారు కూడా యుద్ధం చేసే అవకాశం నాకు కలుగలేదు.

ఉ. భంగముతోడ నున్న ననుఁ బంపు విరాటునిమీఁద; భూమికిం
జెంగట నుండు నా దయిన జీతపు టూళ్ళును; సంతతంబు వా
నిం గడు గాసిసేయు నతనిం జెఱుపం దఱి యయ్యె; ముట్టి స
ప్తాంగముఁ జూఱఁదెచ్చెద నహంకృతి యెల్ల నడంచి వచ్చెదన్. 120

ప్రతిపదార్థం: భంగముతోడన్+ఉన్న= ఓటమి వలన కలిగిన అవమానంతో ఉన్న; ననున్= నన్ను; విరాటునిమీఁదన్= విరాటుడిపైకి; పంపు= యుద్ధానికి పొమ్మని ఆజ్ఞాపించుము; భూమికిన్+చెంగటన్= దేశానికి దగ్గరగా; నాదయిన జీతము+ఊళ్లును= నా జీతగాళ్ళున్న (మాన్యాలకిచ్చిన) ఊళ్ళు; ఉండున్= ఉన్నాయి; సతతంబున్= ఎల్లప్పుడు; వానిన్= ఆ గ్రామాలను; కడున్ గాసి+చేయున్= మిక్కిలి కష్టపెట్టుతాడు; అతనిన్= ఆ విరటుడిని; చెఱుపన్= నశింప చేయటానికి; తఱి= సమయం; అయ్యెన్= అయింది, వచ్చింది; ముట్టి= దాడిచేసి; సప్తాంగమున్= స్వామి, అమాత్యుడు, మిత్రుడు, కోశం, రాష్ట్రం, దుర్గం, సైన్యం అనే ఏడు అంగాలతో ఉండే రాజ్యాన్ని; చూఱన్+తెచ్చెదన్= కొల్లగొట్టి తెస్తాను; అహంకృతి+ఎల్లన్= అతడి గర్వమంతటినీ; అడంచి= పోగొట్టి; వచ్చెదన్= వస్తాను.

తాత్పర్యం: ఓటమితో క్రుంగిపోయే నన్ను విరాటుడి మీదికి పంపుము. విరాట దేశానికి సమీపంలో నా రాజ్యపు పొలిమేరలలో ఉండే వాళ్ళకు ఇచ్చిన జీతాల గ్రామాలున్నాయి. విరాటుడు ఆ ఊళ్ళపైబడి పీడిస్తూ ఉంటాడు. ఇప్పు డతడిని మట్టుపెట్టే సమయం వచ్చింది. నేను విరాటనగరాన్ని ముట్టడిస్తాను. ఆ రాజ్యంలోని సప్తాంగాలనూ కొల్లగొట్టి తీసికొని వస్తాను. అతడి గర్వాన్ని అణచి తిరిగివస్తాను.

ఆ. ఉద్దవిడిన పసుల నూఁచముట్టుగఁ దెత్తు। నతఁడు వెనుకవచ్చి యడ్డుపడిన
చోటఁ బాండురాజు సూనుల నరయుదు। నెల్ల భంగి దీని కేన తగుదు.' 121

ప్రతిపదార్థం: ఉద్దవిడిన్+అ= వెంటనే; పసులన్= పశువులను; ఊఁచముట్టుగన్+తెత్తున్= నిశ్శేషంగా తీసికొనివస్తాను; అతఁడు= ఆ విరాటుడు; వెనుకన్+వచ్చి= ఆవులను వెన్నంటి వచ్చి; అడ్డుపడినచోటన్= అడ్డగించిన చోట; పాండురాజుసూనులన్+అరయుదున్= పాండురాజు కుమారులను గుర్తిస్తాను; ఎల్లభంగిన్= అన్ని విధాలా; దీనికిన్= ఈ పనికి; ఏను+అ తగుదున్= నేనే తగుదును.

తాత్పర్యం: వెంటనే గోవులను నిశ్శేషంగా మరలించి తెస్తాను. విరటుడు వెనుబాటున వచ్చి అడ్డుపడినప్పుడు పాండవులను గుర్తిస్తాను. దీనికి నేనే తగిన వాడను.'

వ. అనవుడుఁ గర్ణుం డిట్లనియె. 122

తాత్పర్యం: (సుశర్మ) అట్లా అనగానే కర్ణుడు ఈ విధంగా పలికాడు.

క. 'బరవసముమైఁ ద్రిగర్తే। శ్వరుఁ డిట్లను టుచిత; మింక జననాయకుఁ డె
ప్పరుసున నానతి యిచ్చెను। దొర లేమని రట్లచేయఁ దుదిఁ గార్య మగున్.' 123

ప్రతిపదార్థం: బరవసముమైన్= ధైర్యంతో; త్రిగర్త+ఈశ్వరుఁడు= త్రిగర్తరాజగు సుశర్మ; ఇట్లు+అనుట= ఈ విధంగా మాట్లాడటం; ఉచితము= న్యాయంగా ఉన్నది; ఇంకన్= ఇక; జననాయకుఁడు= రాజు; ఏ+పరుసునన్= ఏ రీతిగా; ఆనతి+ఇచ్చెన్= ఉత్తరువిస్తాడో; దొరలు+ఏమనిరి= పెద్దలు ఏమాంటారో; అట్లు+అ= ఆ మాదిరిగానే; చేయన్= చేసినట్లయితే; తుదిన్= తుదకు (ఆఖరుకు); కార్యము+అగున్= పని ఔతుంది.

తాత్పర్యం: 'త్రిగర్తరాజు ధైర్యంతో ఈ విధంగా పలుకటం ఉచితంగా ఉన్నది. రాజు ఎట్లా ఆజ్ఞాపిస్తే, పెద్దలు ఎట్లా అంటే ఆ విధంగా చేయటమే చివరకు కర్తవ్యం అవుతుంది.'

విశేషం: సుశర్మ అభ్యర్థనను కర్ణుడు బలపరిచాడు. కాని, తుదినిర్ణయాన్ని రాజుకూ, పెద్దలకూ వదలిపెట్టాడు.

చ. అను నినసూనుమాట విని యందఱఁ గన్గొని పెద్దలెల్ల ని
న్ననుమతిసేయ సైన్యముల నన్నిటిఁ బన్నఁగఁ బంపు; రెండుమై
ల నడత; మీ త్రిగర్తుల బలంబుల ముందటఁ బంచి, వానిపో
యిన మఱునాఁడు పోద' మనియెం గురునాథుఁడు దుస్ససేనుతోన్. 124

ప్రతిపదార్థం: అను+ఇనసూనుమాట విని= అని చెప్పుతున్న సూర్యపుత్రుడి (కర్ణుడి) మాట విని; అందఱన్+కన్గొని= అందరను చూచి; పెద్దలు+ఎల్లన్= (సభలోని) పెద్దవారందరూ; నిన్నున్+అనుమతిచేయన్= నీకు తమ అంగీకారాన్ని తెలుపగా; సైన్యములన్+అన్నిటిన్= సైన్యాలన్నిటిని (చతురంగబలాలను); పన్నఁగన్+పంపు= సిద్ధం చేయటానికి ఆజ్ఞాపించుము; రెండు మైలన్+నడతము= రెండు విధాలుగా సైన్యాలను నడుపుకుంటూ వెళ్ళుదాము; ఈ త్రిగర్తుల బలంబులన్= ఈ త్రిగర్తదేశ

సైన్యాలను; ముందటన్= ముందుగా; పంచి= పంపి; వానిపోయిన మఱునాఁడు= అవి వెళ్ళినరెండవరోజున; పోదము= మనం సైన్యాలతో పోదాము అని; కురునాథుఁడు= దుర్యోధనుడు; దుస్ససేనుతోన్= దుశ్శాసనుడితో; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: కర్ణుడి మాటలు విని దుర్యోధనుడు అందరిని కలయచూచాడు. ఆ తరువాత దుశ్శాసనుడితో ఇట్లా అన్నాడు. 'సభలోని పెద్దలందరూ నీ కనుమతి ఇచ్చారు. చతురంగ బలాలను సన్నద్ధం చేసి రెండు విధాలుగా నడపాలి. ఈ త్రిగర్త దేశపు సైన్యాలు ముందుగా బయలుదేరి పోవాలి. మఱునాడు మనం సైన్యాలతో పోదాము.'

విశేషం: కర్ణుడు సుశర్మకోర్కెను మన్నించుమని దుర్యోధనుడితో అన్నాడు. పెద్దల అనుమతిని కూడా పరిగణనలోకి తీసికొనుమన్నాడు. కర్ణుడి సలహా రారాజుకు నచ్చింది. సభలో ఉన్నవారందరినీ కలయచూచాడు. మరెవ్వరూ మాట్లాడలేదు. అది వారి అనుమతిగా లెక్కగట్టాడు. అతడి చూపులే అతడి మాటలు. కర్ణుడి మాటలే అతడి మాటలు. వారిద్దరి స్నేహం అటువంటిది. ఆజ్ఞ సుశర్మకు కాదిచ్చింది, దుశ్శాసనుడికి. అతడు దుర్యోధనుడి సైన్యాధిపతి. సుశర్మ సామంతుడు. అందువలన సామంతుడితో సూటిగా మాట్లాడలేదు- అది రారాజు రాజదర్పం. రారాజు చురుకుగా ఆలోచించాడు. సైన్యాల దాడి ద్విముఖంగా సాగాలని నిర్ణయించాడు. ఒకటి సుశర్మ రాజ్యం వైపు నుండి, రెండవది కురురాజ్యం వైపు నుండి, మొదటి దాడి జరిగిన రెండవ రోజు రెండవ దాడి. (సంపా.)

చ. **అనుటయు ఫాలభాగ కలితాంజలియై యతఁ 'డట్ల చేయువాఁ**
డ' ననిన, మేదినీశుఁడు దృఢం బగు నిశ్చయ మెల్లవారుఁ గై
కొనుటకుఁ గార్య బోధమునకుం దగఁ జుట్టుల నున్న వారలం
గనుఁగొని యాదరాధిక సగౌరవ భావనతోడ నిట్లనున్. **125**

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఫాలభాగ= నుదుటిపై; కలిత= చేర్చబడిన; అంజలి+ఐ= చేతులు జోడించి దండంపెట్టినవాడై; అతఁడు= ఆ దుశ్శాసనుడు; అట్లు+అ చేయువాఁడన్= ఆ విధంగానే చేస్తాను; అనినన్= అని అనగా; మేదినీ+ఈశుఁడు= రాజయిన దుర్యోధనుడు; దృఢంబు+అగునిశ్చయము= గట్టి నిర్ణయాన్ని; ఎల్లవారున్+కైకొనుటకున్= అందరూ తీసికొనటానికి; కార్యబోధమునకున్= చేయవలసినపనికి సంబంధించిన తెలివిడికి; తగన్= తగునట్లుగా; చుట్టులన్= తన చుట్టుప్రక్కల; ఉన్నవారలన్= ఉన్నవారిని; కనుఁగొని= చూచి; ఆదర+అధిక సగౌరవ భావనతోడన్= మిక్కిలి మర్యాదతో గౌరవంతో కూడిన భావనతో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని దుర్యోధను డనగానే దుశ్శాసనుడు నుదుటిమీద చేతులు జోడించి వినయంతో 'అట్లాగే చేస్తాను' అని అన్నాడు. ఆ తరువాత దుర్యోధనుడు తన గట్టి నిర్ణయం అందరికీ అర్థం కావాలనీ, చేయవలసిన కార్యక్రమం స్పష్టంగా కావాలనీ భావించాడు. తన చుట్టూ ఉన్న ముఖ్యులందరినీ మిక్కిలి ఆదరగౌరవాలతో చూస్తూ ఇట్లా అన్నాడు.

విశేషం: వెనుకటి పద్యంలో దుర్యోధనుడు సైన్యాలు రెండుగా నడవాలని, రెండు రోజులలో సాగాలని స్థూలమైన ఆదేశం ఇచ్చాడు. దాన్ని కార్యాచరణలో పెట్టే పద్ధతిని ఇందులో వివరిస్తున్నాడు. వెనుకటిది ఆజ్ఞ, ఇప్పటిది ఆచరణ సూచకమైన వివరణ (Action Plan). ఇవి వ్యూహ నిర్వాహకులకు తెలియాలని చెప్పాడు. పఠితలకు కూడా అవసరమే. రాజు యుద్ధాలు చేసేటప్పుడు ఇచ్చే ఆజ్ఞల, వివరణల విశేషాలు తిక్కనకు కొట్టినపిండి. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. 'మున్ను సుశర్మ దాను బలముం జని గోవులఁ బట్టుఁ; బట్టినన్
వెన్నడి వచ్చు మత్స్య పృథివీపతి సేనల నెల్లఁ గొంచు శౌ
ర్యోన్నతి సూపువాఁడయి; సముద్ధతిమై నిట వేఱ కౌరవుల్
కొన్నిటిఁ బట్టఁ గయ్యమునకుం బఱతెంతురు పాండునందనుల్. 126

ప్రతిపదార్థం: మున్ను= ముందుగా; సుశర్మ= సుశర్మ; తాను= తానూ; బలమున్+చని= సైన్యమునూ వెళ్లి; గోవులన్+పట్టున్= ఆవులను ముట్టడిస్తాడు; పట్టినన్= ఆవులను పట్టుకొంటే; వెన్నడి= వెన్నంటి; మత్స్యపృథివీపతి= విరాటుడు; సేనలన్+ఎల్లన్= సైన్యాలనన్నింటిని; కొంచున్= వెంటబెట్టుకొని; శౌర్య+ఉన్నతిన్= తన పరాక్రమాతిశయాన్ని; చూపువాఁడు+అయి= ప్రదర్శించే వాడుగా; వెన్నడి= వెంబడించి; వచ్చున్= వస్తాడు; సముద్ధతిమైన్= పటాటోపంతో; ఇటన్= ఇక్కడా; వేఱ= వేఱుగా; కౌరవుల్= కౌరవులు; కొన్నిటిన్+పట్టన్= కొన్నిటిని (ఆవులను) పట్టుకొనగా; పాండునందనుల్= పాండవులు; కయ్యమునకున్= యుద్ధానికి; పఱతెంతురు= వస్తారు.

తాత్పర్యం: ముందుగా సుశర్మ తన బలంతో వెళ్ళి గోవులను పట్టుకొంటే విరాటుడు (తన) సైన్యమంతటిని తీసికొని తన పరాక్రమాతిశయాన్ని ప్రకటించాలని వెనువెంటనే కయ్యానికి వస్తాడు. అపుడు మన కౌరవులు ఆర్భాటంగా వేరుగా ఇక్కడ కొన్ని గోవులను ముట్టడిచేస్తే (గత్యంతరం లేక) పాండవులే యుద్ధానికి తరలివస్తారు.

విశేషం: సుశర్మను ఎదుర్కొనటానికి తన సైన్యాన్నంతా తీసికొని విరాటుడు పోయిన తరువాత నగరంలో కౌరవసైన్యాన్ని ఎదుర్కొనే వీరులు లేకపోవచ్చును. అప్పుడు కౌరవులు వేరొకప్రక్క గోవులను ముట్టడిస్తే పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్నా కృతజ్ఞతాబద్ధులై, ధర్మరక్షావేశంతో కౌరవులతో యుద్ధానికి తలపడవచ్చునని దుర్యోధనుడి వ్యూహం. ఇందు ఎంత కుటిలత్వం ఉందో, అంత నేర్పరితనం ఉంది. పాండవులను బైటపెట్టే ఉపాయం వారు చేయగల యుద్ధమే అని దుర్యోధనుడి నిశ్చయం. అది సత్యం కూడా. (సంపా.)

ఉ. కందువ సెప్పి యొక్కెడఁ ద్రిగర్తులు దాడికిఁ గూడువారు; మీ
రందఱు వేఱ యొక్కయెడ నాజికి సేనల గూర్పుఁ; డెల్ల వాఁ
డుం దనవారిఁ దోకొని కడున్ రభసంబునఁ గూడి వార్తకున్
ముందఱఁబోయి గోధనము ముట్టుకొనన్ వలయున్ మహోగ్రతన్.' 127

ప్రతిపదార్థం: కందువ+చెప్పి= జాడతెల్పి; ఒక్క+ఎడన్= ఒకానొక చోట; త్రిగర్తులు=త్రిగర్త దేశీయులు; దాడికిన్+కూడువారు= యుద్ధం చేయటానికి చేరతారు; మీరు+అందఱున్= మీరంతా; వేఱయొక్కయెడన్= వేరొకచోట; సేనలన్= సైన్యములను; ఆజికిన్+కూర్పుఁడు= యుద్ధానికి సన్నద్ధం చేయండి; ఎల్లవాఁడున్= ప్రతివాడూ; తనవారిన్+తోకొని= తనవాళ్ళను వెంటబెట్టుకొని; కడున్ రభసంబునన్= మిక్కిలి తొందరగా; కూడి= చేరి; వార్తకున్ ముందఱన్+పోయి= మాటకంటె (వర్తమానం చేరిన దానికంటె) ముందుగా పోయి; మహా+ఉగ్రతన్= మిక్కిలి భయంకరంగా; గోధనమున్= పశుసంపదను; ముట్టుకొనన్ వలయున్= చుట్టుముట్టాలి.

తాత్పర్యం: దాడికి పూనుకొని త్రిగర్తసేనలు ఒక సంకేతస్థలంలో గుమికూడుతాయి. మీరందరూ వేరొక చోట యుద్ధానికి సిద్ధంగా సేనలను సమీకరించండి. అందరూ ఎవరి సైన్యాలను వారు వెంట పెట్టుకొని మిక్కిలి వేగంగా, వార్త లందేదానికంటె ముందుగానే అక్కడికి పోయి గోధనాన్ని మిక్కిలి భయంకరంగా చుట్టుముట్టాలి.'

విశేషం: గోగ్రహణ యుద్ధవ్యూహం నిశ్చయమైంది. చారులవలన ఈ వార్తలు విరటుడికి చేరకపూర్వమే గోగ్రహణం సాగాలని దుర్యోధనుడి ఆజ్ఞ. సన్నద్ధంగా లేని శత్రువును రహస్యంగా, వేగంగా చుట్టుముట్టే గూఢవ్యూహంగా సాగాలని రారాజు కోర్కె 'వార్తకంటె పూర్వం దండెత్తిపోయి గోధనాన్ని చుట్టుముట్టాలి' అన్న ఆజ్ఞలోని అంతరార్థం అదే. (సంపా.)

వ. అని చెప్పి వెండియు సుశర్మం జూపి. 128

తాత్పర్యం: అని పలికి సుశర్మవైపు చూపి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'బహుళాష్టమి నీతఁడు స । న్నహనముతోఁ బసులఁ బట్టు, నవమిని మన గో
గ్రహణ'మని నిశ్చయించిన । నహికేతను పలుకులకు మహాహ్లాదమునన్. 129

ప్రతిపదార్థం: బహుళ+అష్టమిన్= కృష్ణపక్షంలోని ఎనిమిదవ రోజున (అష్టమీ తిథినాడు); ఈతఁడు= ఈ సుశర్మ; సన్నహనముతోన్= సంసిద్ధతతో; పసులన్+పట్టున్= ఆవులను పట్టుకొంటాడు; నవమిని= నవమినాడు; మన గోగ్రహణము= మనం చేసే గోవుల ముట్టడి; అని నిశ్చయించినన్= అని నిశ్చయించగా; అహికేతను పలుకులకున్= సర్పధ్వజుడి (దుర్యోధనుడి) మాటలకు; మహా+ఆహ్లాదమునన్= మిక్కిలి సంతోషంతో.

తాత్పర్యం: 'ఈ కృష్ణపక్షంలోని అష్టమినాడు సుశర్మ సన్నాహంతో గోవులను పట్టుకొంటాడు. మనం నవమినాడు పట్టుకొందాం' అని దుర్యోధనుడు నిర్ణయించాడు. ఆ మాటలకు ఉప్పొంగిపోయి. (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: భండార్కర్ సంస్థ ప్రచురించిన సంస్కృత భారతంలో సుశర్మ, దుర్యోధనుల గోగ్రహణం సప్తమి, అష్టమిలలో జరగాలని చెప్పినట్లున్నది. మరికొన్ని ప్రతులలో అష్టమి, నవమిలలో జరుగవలెనని ఉన్నది. తిక్కన దక్షిణాదిప్రతిని అనుసరించినట్లున్నాడు. విజయదశమినాటికి విజయుడు విజయాన్ని సాధించవలసి ఉండటం చేత, ఉత్తర గోగ్రహణ యుద్ధం ఒక రోజు యుద్ధం మాత్రమే కావటం చేత, అష్టమి, నవమిలు విజయతిథులు కాకపోవటంచేత తిక్కన ఈ పాఠాన్ని గ్రహించి, సుశర్మ, దుర్యోధనులకు భావియుద్ధంలో జరుగబోయే పరాజయాన్ని ధ్వనింపచేశాడు. (సంపా.)

వ. సమస్త పరిజనంబులును సముద్యుక్తులై; రట్టి సమయంబున. 130

ప్రతిపదార్థం: సమస్త పరిజనంబులును= సేవకులందఱును; సముద్యుక్తులైరి= సన్నద్ధులైరి; అట్టి సమయంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: (దుర్యోధనుడి) పరివారమంతా యుద్ధానికి సిద్ధమయ్యారు. ఆ సమయంలో.

ఆ. పాండురాజసుతులుఁ బాంచాలియును దమ్ము । నొరు లెఱుంగకుండఁ దిరుగవలయు
దుష్కరంపుటేఁడు దుదిసేరఁబాఱె, నె । వ్వరును దీనిఁ దలఁప వలను లేర. 131

ప్రతిపదార్థం: పాండురాజ సుతులున్= పాండురాజు కుమారులున్నూ; పాంచాలియును= ద్రౌపదియున్నూ; తమ్మున్+ఒరులు+ఎఱుఁగకుండన్= ఇతరులు తమను గుర్తించకుండగా; తిరుగన్‌వలయున్= తిరుగవలసిన; దుష్కరము+ఏఁడు= కష్టమయిన సంవత్సరకాలం; తుది చేరన్+పాఱెన్= పూర్తికావచ్చింది; ఎవ్వరును= ఎవరుకూడా; దీనిన్= ఈ విషయాన్ని; తలఁపన్= ఆలోచించేందుకు; వలనులేరు+అ= పూనుకొనలేకపోయారు.

తాత్పర్యం: పాండవులూ ద్రౌపదీ తమను ఇతరులు గుర్తించకుండా జరిపే అజ్ఞాతవాసమనే గడ్డుకాలం పూర్తి కావచ్చింది. ఆ విషయాన్ని ఎవ్వరూ ఆలోచించనే లేదు.

సుశర్మ దక్షిణ గోగ్రహణంబు చేయుట (సం.4-20-27)

వ. సుశర్మయు నేలినవాని పనిఁ బూని జోడు పక్కెర కైదువు బిరుదు రవణంబు మొదలైన సవరణంబులం జూడ నక్కజంబుగాఁ గూడి, పరదేశం బాపోశనంబు గొనం దమకించు తన బలంబుల గజిబిజి యుడిపికొని, గోగణంబుల యగపా టూహించి, జతనంబుతో నడచుచుండియు వెసఁ గుందక వేగిరంపుఁ బయనంబు లయ్యును బ్రజల నోలాకుపడనీక, యెత్తెడుచోట్లను విడిదలల యందును లోనుగా నిస్సాణాదులైన యుద్భట చిహ్నంబులు ప్రకటింపక దాడిమెయిం జని, వేగులవారివలన విరాటు తొఱ్ఱులున్న యెడ యెఱింగి, గ్రద్దనం గదుపులఁ గార్చిచ్చు చందంబునం బొదివి వెలిచిన. 132

ప్రతిపదార్థం: సుశర్మయున్= సుశర్మకూడా; ఏలినవానిపనిన్= రాజుగారి పనిని (దుర్యోధనుడిపనిని); పూని= అంగీకరించి; జోడుపక్కెర కైదువు= రెండు ప్రక్కల పదును గల కత్తిని; బిరుదు రవణంబు= పరాక్రమ ప్రశంసను తెలిపే సూచికలైన పతకాలు మొదలైన; సవరణంబులన్= పరికరాలతో; చూడన్= చూడగా; అక్కజంబు+కాన్= ఆశ్చర్యకరంగా; కూడి= కూడుకొన్నవాడై; పరదేశంబు= శత్రువులదేశాన్ని; ఆపోశనంబు+కొనన్= అపోశనం పట్టగా, తమకించు= ముందుకు దూకే; తన బలంబులన్= తన సైన్యాలయొక్క; గజిబిజి= తొందరపాటును; ఉడిపికొని= నిలుపుకొంటూ; గోగణంబుల= పశువులయొక్క; అగపాటు+ఊహించి= కనిపించటాన్ని తలచుకొని; జతనంబుతోన్= ప్రయత్నంతో; నడచుచున్+ఉండియున్= నడుస్తున్నప్పటికీ; వెసన్+కుందక= వేగంతో వెనుకపడకుండా; వేగిరము+పయనంబులయ్యునున్= వడివడిగా సాగే ప్రయాణాలు అయినను; ప్రజలను= జనాలను; ఓలాకు పడనీక= శ్రమపడనీక; ఎత్తెడు చోట్లను= దండెత్తే స్థలాలలోనూ, విడిదలల+అందును= విడిదిచేసే స్థలాలలోను (విశ్రాంతి తీసికొనేచోట్ల); లోనుగాన్= రహస్యంగా; నిస్సాణాదులు+ఐన= భేరులు, డప్పులు వంటి చర్మవాద్య విశేషాలు మొదలైన; ఉద్భట చిహ్నంబులు= పెద్ద పెద్ద యుద్ధాల గుర్తులు; ప్రకటింపక= బయలుపడనీక; దాడిమెయిన్+చని= దబ్బాటున దండెత్తే పద్ధతి (మెరుపు దాడి)గా వెళ్ళి; వేగులవారివలనన్= గూఢచారుల వలన; విరాటు తొఱ్ఱులు+ఉన్నయెడ= విరాటుడి ఆవులున్న చోటు; ఎఱింగి= తెలిసికొని; గ్రద్దనన్= శీఘ్రంగా; కదుపులన్= పసులను; కార్చిచ్చు చందంబునన్= దావానలం మాదిరిగా; (అడవిలో నాలుగు దిక్కులా అలముకొన్న మంటవలె); పొదివి= క్రమ్ముకొని; వెలిచినన్= తోలగా.

తాత్పర్యం: సుశర్మ కూడా దుర్యోధన మహారాజు చెప్పిన పని చేయాలని పూనుకొన్నాడు. ఇరుప్రక్కల పదనూ, రెక్కలూ ఉన్న బిరుదుగల కత్తినీ రవళిస్తున్న అలంకారాలు మొదలైన పరికరాలతో కూడుకొని ఆశ్చర్యాన్ని కల్గించే విధంగా శత్రు దేశాన్ని ఒక్కసారే పుడికిటి నీరు త్రాగినట్లుగా ఆక్రమిద్దామని (మ్రింగివేద్దామని) ముందుకు దూకుతున్న తన సైన్యం దుందుడుకుతనాన్ని అదుపులో పెట్టుతూ, ఆవుల దర్శనం తలచుకొంటూ, ప్రయత్నంతో నడుస్తున్నప్పటికీ వెనుకడుగు వేయకుండా, వడివడిగా ప్రయాణాలు సాగిస్తున్నా ప్రజలకు అలజడి కలుగనీయకుండా దండెత్తే స్థలాలలోను, విశ్రాంతికై విడిది చేసే చోటులలోను డప్పులూ, డమరుకాలు వంటి చర్మవాద్యాల ధ్వనుల ఆర్భాటాల వలన దాడి గుర్తులు బయటపడకుండా జాగ్రత్తపడుతూ, మెరుపుదాడి పద్ధతిలో వెళ్ళి, వేగుల వలన విరాటుడి గోవులుండే చోటు తెలిసికొని, త్వరగా పసులను సమీపించి దావానలం మాదిరిగా పొదువుకొని, తోలాడు.

విశేషం: జోడు, పక్కెర, కైదువు, బిరుదు రవణంబు మొదలైన సవరణంబులన్= అనే సమాసానికి జోడు= కవచం; పక్కెర= గుఱ్ఱాలకు, ఏనుగులకు పైనవేసే రక్షాకవచాలు; కైదువు= కత్తి మొదలైన ఆయుధాలు; బిరుదు రవణంబు= వీరుల సామర్థ్యాన్ని తెలిపే గుర్తుల వంటి ఆభరణాలు; మొదలు+ఐన= మొదలుగాగల; సవరణంబులన్= వాహనాల అలంకారాలను అని అర్థం కూడా చెప్పవచ్చును. ఆపోశనం (ఆపః+అశనం) విప్రులు భోజనం చేసే ముందు మంత్రపూర్వకంగా చేసే జలపానం. (సంపా.)

శా. **కూడంబాఱి సముద్ధతిం గడఁగి తద్గోపాలకుల్ మూఁక ల**
ల్లాడం దాఁకి, నిశాతసాయక పటు వ్యాపార ఘోరంబుగా
నీడం బోక పెనంగినం గని, త్రిగర్తేశుండు చే వీచుడుం
గ్రీడాఘాత నిరూఢి నాశ్వికులు వారిం దున్మి తూఁటాడినన్. 133

ప్రతిపదార్థం: తద్+గోపాలకుల్= ఆ గోవులను రక్షించేవారు; కూడన్+పాఱి= కలిసి ముందుకు సాగి; సముద్ధతిన్= దర్పంతో; కడఁగి= పూనుకొని; మూఁకలు= సైనికులు; అల్లాడన్=చీకాకు పడేటట్లు; తాఁకి= ఎదుర్కొని; నిశాత= వాడి అయిన; సాయక= బాణాల; పటు= దృఢమైన; వ్యాపార= ప్రయోగాలచేత; ఘోరంబుగాన్= భయంకరంగా; ఈడన్+పోక= వెనుకంజవేయక; పెనంగినన్+కని= యుద్ధం చేయగా చూచి; త్రిగర్త+ఈశుండు= త్రిగర్తదేశానికి రాజైన సుశర్మ; చేయి+వీచుడున్= చేయెత్తి (యుద్ధం చేయండి అన్నట్లు) ఊపగా; అశ్వికులు= గుఱ్ఱాల సైనికులు; క్రీడాఘాత నిరూఢిన్= ఆట ఆడినట్లు విలాసంగా శత్రువులను దెబ్బతీసే నేర్పరితనంతో; వారిన్= ఆ పసుల కాపరులను; తున్మి తూఁటాడినన్= ఖండించి బాధించగా.

తాత్పర్యం: ఆ ఆవుల కాపరులందరూ ఏకమై సాగి దర్పంతో పూనుకొని సైనికు లల్లాడగా ఎదుర్కొన్నారు. వాడి బాణములను భయంకరంగా ప్రయోగిస్తూ వెనుకకు అడుగిడకుండా యుద్ధం చేయసాగారు. (అపుడు) త్రిగర్తరాజయిన సుశర్మ చేయి వీచగా, గుఱ్ఱపు సైనికు లా పసుల కాపరులను ఆటలలో చెండాడిన నేర్పరితనంతో తునాతునకలు చేసి బాధించగా, (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: విరాటుడి గోపాలకులు వీరులు కూడా. కలిసికట్టుగా ఎదుర్కొనటంలో సంఘీభావంతో కూడిన ధైర్యం, గర్వంతో పోరి సైనికులను గగ్గోలు పెట్టించే పరాక్రమం కలవారు. కాని, వారు అశ్వారూఢులు కాకపోవటంచేత సుశిక్షితులైన ఆశ్వికుల ధాటికి ఆగలేకపోయారు. కాని, వారి ధర్మం వారు యథాశక్తి నిర్వహించారు. (సంపా.)

వ. **వారలలోన.** 134

తాత్పర్యం: ఆ గోపాలకులలో.

చ. **అసదుగఁ దాఁకి మేనఁ దఱచై పారి నెత్తురు గ్రమ్ము పోటులన్**
వస మఱి తూలుచుండియును వారని భీతిఁ బదంబులం గడున్
వెస కలిమిం బురంబునకు వేగమె కొందఱు పాఱి, మత్స్యనా
థు సభకు నేఁగి, దీనదశతోఁ బ్రణమిల్లుచు నార్తమూర్తులై. 135

ప్రతిపదార్థం: కొందఱు= కొంతమంది (గోపాలురు); అసదుగన్= ఘోరంగా (తీవ్రంగా); తాఁకి= ఎదిరించి; మేనన్= ఒంటిమీద; తఱచు+ఐ= ఎక్కువగా; పొరిన్= ఎక్కువగా; నెత్తురు క్రమ్మపోటులన్= నెత్తురు చిమ్మే దెబ్బల (గాయాల)తో; వసము+అఱి= వశం తప్పి; తూలుచుండియును= తూలిపడుతున్నా; వారని భీతిన్= వదలని భయంతో; పదంబులన్= కాళ్ళయందు; కడున్= మిక్కిలి; వెసకలిమిన్= వేగం కలుగగా; పురంబునకున్= విరాటుడి రాజధానికి; వేగమె= వడివడిగా; పాఱి= పరుగెత్తి; మత్స్యనాథు సభకున్+ఏఁగి= విరటుడి ఆస్థానానికి వెళ్ళి; దీనదశతోన్= దీనావస్థతో; ప్రణమిల్లుచున్= వంగి వంగి నమస్కారాలు చేస్తూ; ఆర్తమూర్తులు+ఐ= దుఃఖించే ఆకారాలు కలవారై (ఆకారం తాల్చిన దుఃఖం వంటివారై).

తాత్పర్యం: కొందరు గోపాలురు ఎంతకైనా తెగించి ఎదిరించి పోరాడారు. వారి శరీరాల మీద నెత్తురు ధారలుగా చిమ్మే పెద్ద పెద్ద గాయాలు తగిలాయి. వారి మేనులు పట్టుతప్పి తూలుతున్నప్పటికీ, అడుగులు తడబడుతున్నప్పటికీ, ఆగని భయంతో వేగం తెచ్చుకొని నగరానికి వడివడిగా పారిపోయి, మత్స్యమహారాజు సభకు చేరి, వినయంగా వంగి దండాలు పెట్టుతూ, రూపుకట్టిన దుఃఖభావాలవలె దీనంగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **కారణ మెయ్యది యగు నొకొ! వీరల దురవస్థ కనుచు వెఱఁగందెడు నా**
భూరమణుఁడు సభయును విన। నీరెలుఁగు దలంకఁ బల్కి రిట్లని గోపుల్. **136**

ప్రతిపదార్థం: వీరల= ఈ పసుల కాపరులయొక్క; దురవస్థకున్= దుఃస్థితికి; కారణము= హేతువు; ఏ+అది; అగున్+ఒకొ!= ఏమై ఉంటుందో; అనుచున్= అనుకొంటూ; వెఱఁగు+అందెడు= ఆశ్చర్యపడుతున్న; ఆ భూరమణుఁడు= ఆ రాజున్నూ (విరటుడు); సభయును= సభలోనివారూ; వినన్= వినేటట్లు; గోపుల్= గోపాలకులు; ఈరు+ఎలుఁగు= హీనస్వరం; తలంకన్= వణకుతూ ఉండగా; ఇట్లు+అని= ఈ విధంగా; పల్కిరి= పలికారు.

తాత్పర్యం: ఈ పసుల కాపరులు ఏ కారణంగా ఈ దురవస్థపాలైనారో అంటూ ఆశ్చర్యపడుతున్న విరాటుడూ, సభలోనివారూ వినేటట్లుగా వణుకుతున్న సన్నని గొంతులతో ఆ గోపాలకులు ఈ విధంగా అన్నారు.

చ. **'హయ రథ దంతి సంతతి నిరంతర దుర్దమలీలఁ బేర్చి నే**
ల యవిసి మూఁగినట్లగుబలంబులతోడఁ ద్రిగర్తు లెంతయున్
రయమున గోవులం బొదివి, రక్షకు లొక్కట నార్చి తాఁకినన్
భయదమహాస్త్ర శస్త్ర పటుపాత పరంపరఁ దున్మి యుద్ధతిన్. **137**

ప్రతిపదార్థం: హయరథదంతి సంతతి= గుర్రాల, తేరుల, ఏనుగుల సమూహాలు; నిరంతర దుర్దమలీలన్= అడ్డగించటానికి వీలులేని విధంగా; పేర్చి= విజృంభించి; నేల+అవిసి మూఁగినట్లు+అగు= భూమిని చీల్చుకొని గుంపులు కట్టి బయటికి వచ్చినట్లుగా తోచిన; బలంబులతోడన్= సైన్యంతో; త్రిగర్తులు= త్రిగర్తదేశంవారు; ఎంతయున్ రయమునన్= ఎంతో వేగంగా; గోవులన్+పొదివి= ఆవులను క్రమ్ముకొని; రక్షకులు= గోరక్షకులు; ఒక్కటన్= ఒక్కుమ్మడిగా; ఆర్చి= బొబ్బలుపెట్టి; తాఁకినన్= ఎదిరించగా; భయద= భయం పుట్టించే; మహా+అస్త్ర= గొప్పవైన మంత్రబాణాలతో; శస్త్ర= బాణాలతో, కత్తులతో; పటుపాత= కొట్టిన గట్టిదెబ్బలయొక్క; పరంపరన్= వరుసలతో; తున్మి= చంపి; ఉద్ధతిన్= దూకుడుతనంతో.

తాత్పర్యం: 'గుర్రాలతో, రథాలతో, ఏనుగులతో కూడిన సేనతో ఎదురులేని విధంగా విజృంభించి నేల ఈనినట్లు సుశర్మ బలాలు వేగంగా వచ్చి, పసులను క్రమ్ముకొనగా, గోపాలురందరూ కలసి ఒక్కపెట్టున బొబ్బలు పెట్టుతూ

ఎదురుదాడి చేశారు. త్రిగర్తులు గర్వాతిశయంతో వారిమీద పుంఖానుపుంఖాలుగా అస్త్రశస్త్రాలు ప్రయోగించి చంపి (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం.

క. **గోవులకు వెనుక యై వెసఁ। బోవుచునున్నారు; కడవఁబోవక యుండం**
బోవలయు నడ్డపడియెడు। దీవసమెదఁ గలిగెనేని దేవర! కడఁకన్.' **138**

ప్రతిపదార్థం: దేవర!= ఓ ప్రభువా!; గోవులకున్ వెనుక+ఐ= పసులకు వెనుక భాగాన; వెసన్= వేగంగా; పోవుచున్+ఉన్నారు= పోతూ ఉన్నారు; అడ్డపడియెడు దీవసము= అడ్డగించే దమ్ము; ఎదన్+కలిగెన్+ఏనిన్= మనసులో ఉంటే; కడఁకన్= పూనికతో, పౌరుషంతో; కడవన్+పోవక+ఉండన్= మన పొలిమేరలు దాటిపోక పూర్వమే; పోవలయున్= పోవాలి.

తాత్పర్యం: ప్రభూ! త్రిగర్తులు గోవులను తరలించుకొని వాటి వెనుక భాగంలో తరుముకొంటూ వేగంగా వెళ్ళిపోతున్నారు. వారిని అడ్డుకొనవలెననే ధైర్యం మనకుంటే, వారు మన పొలిమేరలు దాటిపోక పూర్వమే, ప్రయత్నపూర్వకంగా పౌరుషంతో ఎదుర్కొనాలి.'

వ. **అనిన విని విరాటుం డదరిపడి.** **139**

తాత్పర్యం: అనగా విని విరాటుడు (ఆశ్చర్యంతో, భయంతో) అదిరిపడి. (తరువాతి పద్యంతో అన్వయం.)

శా. **'ఏమీ నిక్కమె! మున్నెఱుంగఁడె త్రిగర్తేశుండు? మద్గోధన**
స్తోమంబుం గొనిపోవు తెంపునకు నుద్యోగించెనే? మేలుమే;
లామై తోడనె పోవుఁగాక!' యని వీరాలాపముల్ వల్కి యు
ద్దామ క్రోధ శిఖాకలాప వికటోద్య ద్భ్రూకుటి స్ఫూర్తియై. **140**

ప్రతిపదార్థం: ఏమీ! నిక్కమె?= ఏమీ! ఇది నిజమా?; త్రిగర్త+ఈశుండు= త్రిగర్త దేశానికి రాజైన సుశర్మ; మున్ను+ఎఱుంగఁడె?= ఇదివఱకు తెలియడా?; మత్+గోధనంబున్= నా గోసంపదను; కొనిపోవు తెంపునకున్= తీసికొనిపోయే సాహసానికి; ఉద్యోగించెనే?= ప్రయత్నించాడా; మేలు మేలు= మంచిది మంచిది; ఆ+మైతోడనె= ఆవిధంగానే; పోవున్+కాక= పోతాడులే (చస్తాడులే); అని= అంటూ; వీర+ఆలాపముల్= పౌరుష వాక్యాలు; పల్కి= మాటలాడి; ఉద్దామ= తీవ్రమయిన; క్రోధశిఖాకలాప= కోపాగ్ని జ్వాలల సమూహాల చేత; వికట= వంపులుగా; ఉద్యత్= పైకెత్తబడిన; భ్రూకుటి స్ఫూర్తి+ఐ= బొమముడి ఆకారం కలవాడై.

తాత్పర్యం: 'ఏమిటి! మీరు చెప్పుతున్నది నిజమేనా? ఆ త్రిగర్తపతి ఇదివరలో మనచేత తిన్న దెబ్బ గుర్తుంచుకొనలేదా? (ఎరుగడా?). ఇప్పుడు నా గోధనాన్ని దొంగిలించే సాహసానికి పూనుకొన్నాడా? మంచిది మంచిది. అత డట్లాగే పోతాడులే! (వాడికి కాలం మూడింది)' అని పౌరుష వాక్యాలు పలుకుతూ మనసులో అణచుకోలేని కోపాగ్ని చెలరేగి జ్వాలలు చిమ్ముతూ ఉండగా వంపులుగా భయంకరంగా లేస్తున్న కనుబొమల కదలికను ప్రకటిస్తూ, (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: రూపకం. కనుబొమల వికార విచలనం క్రోధభావ ప్రకటనం. (సంపా.)

విరటుఁడు సుశర్మమీఁద యుద్ధం చేయఁబోవుట (సం.4-30-8.)

చ. **సచివులఁ జూచి 'యిప్పుడ వెసన్ మన మెయ్యక తక్కినం బశు**
ప్రచయము తప్పిపోవుఁ; దుది భంగము సేఁగియు వచ్చుఁగాక మీ
రుచిత విధాన సత్వరత నుద్ధతయోధ సమగ్రవాహినీ
ప్రచలిత భూమి భాగముగఁ బన్నఁగఁ బంపుఁడు దండనాథులన్.' **141**

ప్రతిపదార్థం: సచివులన్+చూచి= మంత్రులవైపు చూచి; ఇప్పుడు+అ= ఇప్పుడే; వెసన్= వెంటనే; మనము+ఎయ్యక= మనము వెంబడించకక; తక్కినన్= మానితే; పశుప్రచయము= గోసమూహం; తప్పిపోవున్= మనసుండి దూరమైపోతుంది; తుదిన్= చివరకు; భంగము= అవమానం; సేఁగియున్ వచ్చున్= ఆపద కూడా వస్తుంది; కానన్= అందువలన; మీరు+ఉచిత విధానన్= మీరు తగినట్లుగా; దండనాథులన్= సేనాపతులను; సత్వరతన్= త్వరగా; ఉద్ధత+యోధ+సమగ్రవాహినీ+ప్రచలిత భూమి భాగముగన్= గర్వితులైన వీరులతో నిండిన సైన్యము వలన కంపించే భూభాగం కలుగునట్లుగా చేసి; పన్నఁగన్= యుద్ధానికి సిద్ధమయ్యేటట్లు; పంపుఁడు= ఆజ్ఞాపించండి.

తాత్పర్యం: విరాటుడు మంత్రులను చూచి ఇట్లా అన్నాడు: 'మన మిప్పుడే ఆ సేనలను వెంబడించకపోతే మన పశువుల మందలు మనకు దక్కవు. చివరకు అవమానం, ఆపద కూడా రావచ్చును. కాబట్టి, మన సేనాపతులను పిలిపించండి. తగిన పద్ధతులతో వెంటనే బలగర్వంతో కూడుకొన్న వీరులతో నిండిన సైన్యాలను మోహరించి, భూభాగం దద్దరిల్లేటట్లు యుద్ధానికి సిద్ధమయ్యేటట్లు ఆజ్ఞాపించండి.'

వ. **అని నియోగించి.** **142**

తాత్పర్యం: అంటూ ఆజ్ఞాపించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

శా. **యాన ప్రక్రమ సూచకంబు లగు తూర్యంబుల్ దిశాపాటన**
ధ్వానస్స్వైరవిహార కల్పిత సముద్ర క్షోభముల్గా ధరి
త్రీ నాథుండు రణోచితోద్యమము సంధిల్లంగ శస్త్రాస్త్రవ
ర్మానీతిక్రమ దక్షులం బనిచె నయ్యై వారికిం గ్రక్కునన్. **143**

ప్రతిపదార్థం: యాన= యుద్ధ ప్రయాణపు; ప్రక్రమ సూచకంబులు= ప్రారంభాన్ని సూచించేటట్లు; తూర్యంబుల్= వాద్యాల మ్రోతలు; దిశాపాటన= దిక్కులను చీల్చునట్టి; ధ్వాన= శబ్దం యొక్క; స్వైర, విహార కల్పిత= స్వేచ్ఛావిహారంచేత కల్గించబడిన; సముద్రక్షోభముల్+కాన్= సముద్రపు అల్లకల్లోల శబ్దంగా; ధరిత్రీనాథుండు= రాజగు విరాటుడు; రణ+ఉచిత= యుద్ధానికి తగిన; ఉద్యమము= ప్రయత్నం; సంధిల్లంగన్= చేకూరగా; ఆ+ఐవారికిన్=ఆయా వీరులకు; శస్త్ర+అస్త్ర వర్మ= శస్త్రముల అస్త్రముల, కవచాల; ఆనీతిక్రమదక్షులన్= తెచ్చే పద్ధతులలో నేర్పుకలవారిని; గ్రక్కునన్= వెంటనే; పనిచెన్= ఆయా పనుల మీద పంపాడు.

తాత్పర్యం: ప్రయాణ సూచనలయిన తూర్యనాదాలు దిక్కులు పిక్కటిల్లేటట్లు విచ్చలవిడిగా మ్రోగాయి. స్వేచ్ఛా విహారంతో ఆ నాదం అల్లకల్లోలమయిన సముద్ర ఘోషగా అనిపించింది. విరాటుడు యుద్ధోచిత ప్రయత్నాలు సమకూర్చుకొంటూ ఆయాయోధులకు శస్త్రాస్త్రాలను, కవచాలను తేవటంలో నేర్పరులయినవారిని వెంటనే ఆయా పనులమీద పంపాడు.

ఉ.
సారథిఁ జూచి 'నీవు రభసంబునఁ బూన్పుము ఘోటకంబులం
దేరఁ; దదీయ వర్మము లతిస్ఫుట బంధముఁగాఁగ బెట్టు; నీ
వీరవచోవిలాసములు విందుము ము; న్ని దె వచ్చెఁ గయ్యఁ; మే
పారఁగఁ జూపు నీ దగు నహంకృతికిం దగు ధైర్య మియ్యెడన్.' **144**

ప్రతిపదార్థం: సారథిన్+చూచి= రథసారథివైపు చూచి; నీవు రభసంబునన్= నీవు తొందరగా; తేరన్= రథమందు; ఘోటకంబులన్+పూన్పుము= గుఱ్ఱాలను కట్టి సిద్ధం చేయుము; తదీయ= వాటియొక్క; వర్మములు= కవచాలను (అనగా వాటి అలంకారాలను); అతి స్ఫుటబంధము కాఁగన్= మిక్కిలి దృఢంగా కట్టబడినవిగా; పెట్టు= ఉంచుము; మున్ను= ఇదివరలో; నీ వీరవచోవిలాసములు విందుము= నీ పౌరుష, వచనాలు ఎప్పుడూ వింటూ ఉంటాం; కయ్యము= యుద్ధం; ఇదె వచ్చెన్= ఇదిగో వచ్చింది; ఈ+ఎడన్= ఇపుడు; నీదగు అహంకృతికిన్= నీ గర్వానికి; ధైర్యము= తగిన మగటిమిని; ఏపారఁగన్= అతిశయించగా; చూపు= చూపించుము.

తాత్పర్యం: (విరటుడు) రథసారథిని చూచి ఇట్లా అన్నాడు; 'నీవు త్వరగా గుఱ్ఱాలకు కవచాలంకారాలు గట్టిగా తొడిగి వాటిని రథానికి కట్టి సిద్ధం చేయుము. నీ వెప్పుడూ పౌరుషాలు పలుకుతూ ఉండగా వింటూ ఉంటాము. ఇదిగో యుద్ధం వచ్చింది. నీ గర్వానికీ ధైర్యానికీ తగిన మగటిమిని చూపే సమయం వచ్చింది.'

ఉ. **అని పనిచి తానును యోధవీరోచిత ప్రకారంబున సింగారంబు సత్వరంబుగాఁ జేసికొని ఖచిత కాంచన బిందు సందోహంబగు సన్నాహంబు వెట్టికొని, విరచితాలంకార చక్రంబును బద్ధపరికర కూబరాక్షయుగాద్యవయవంబును బ్రతికల్పిత తురంగంబును సన్నివేశిత వివిధాయుధంబును సన్నద్ధ సారథికంబును నైన రథంబెక్కి గోగణ హరణ ప్రదేశంబు పశు పాలకులం దెలియ నడుగుచు వెడలునప్పు డమ్మత్స్యపతి యనుజన్ముండు.** **145**

ప్రతిపదార్థం: అనిపనిచి= అంటూ పంపి (ఆజ్ఞాపించి); తానును= తానుకూడ; యోధవీర+ఉచిత ప్రకారంబునన్= యుద్ధవీరుడికి తగిన విధంగా; సింగారంబు= అలంకారం; సత్వరంబుగాన్+చేసికొని= వడిగా చేసికొని; ఖచిత+కాంచన+బిందు సందోహంబు= చెక్కిన బంగారు చుక్కల సమూహం కల; సన్నాహంబు= కవచం;పెట్టికొని= ధరించి; విరచిత= విశేషంగా చేసిన; అలంకార చక్రంబును= అలంకారాలు గల చక్రాలు కలదీ; బద్ధ= సిద్ధంగా చేసి కట్టబడిన; పరికర= (యుద్ధానికి అవసరమయ్యే) వస్తువులు; కూబర= బండినొగలును; అక్ష= ఇరుసు; యుగ= కాడి; ఆది= మొదలగు; అవయవంబును= భాగాలుకలదీ; ప్రతికల్పిత= చక్కగా కూర్చబడిన; తురంగంబును= గుఱ్ఱాలుకలదీ; సన్నివేశిత= సిద్ధంగా ఉంచబడిన; వివిధ+ఆయుధంబును= అనేక ఆయుధాలు కలదీ; సన్నద్ధసారథికంబును= సిద్ధమైఉన్న సారథి కలదీ; ఐన= అయినట్టి; రథంబున్= తేరు; ఎక్కి; గోగణహరణ= ఆలమందలను దొంగిలించిన; ప్రదేశంబు= చోటును; పశుపాలకులన్= అలకాపరులను; తెలియన్+అడుగుచున్= అడిగి తెలిసికొంటూ; వెడలు+అప్పుడు= బయలుదేరేటప్పుడు; ఆ+మత్స్యపతి= ఆ విరటుడి యొక్క; అనుజన్ముండు= తమ్ముడు.

తాత్పర్యం: విరాటుడు ఆ విధంగా అందరినీ ఆజ్ఞాపించి తాను కూడా యుద్ధవీరుడికి ఉచితమైన విధంగా అలంకారాన్ని వెంటనే చేసికొన్నాడు. బంగారు చుక్కలు చెక్కిన కవచాన్ని ధరించాడు. అలంకరించిన రథం సిద్ధం చేయబడింది. దానికి పలురకాల అలంకారాల వన్నెలతో చక్రాలు ఒప్పారుతున్నాయి. యుద్ధానికి కావలసిన పరికరాలు కూర్చబడ్డాయి. నొగలు, ఇరుసు, కాడి మొదలైన అంగాలు అమర్చబడ్డాయి. గుర్రాలు కట్టబడ్డాయి. వివిధాయుధాలు సమకూర్చబడ్డాయి. సారథి నొగలెక్కి సిద్ధంగా ఉన్నాడు. విరాటుడు సిద్ధమైన రథాన్ని ఎక్కాడు. గోగ్రహణం జరిగిన ప్రదేశాన్ని పశుపాలకులను అడిగితెలిసికొంటూ ఆవైపు విరాటుడు పయనం సాగించాడు. అప్పుడు అతడి తమ్ముడు. (తరువాతి పద్యంతో అన్వయం).

శా. లోకస్తుత్య విభూతి నన్యపృతనాలుంటాక బాహా బల
శ్రీకల్మిన్ రథ దంతి ఘోటక భటశ్రేణీ సముద్దాంత సే
నా కల్పధ్వజ విభ్రమంబున సుహృద్య ప్రోద్యముండై శతా
నీకుం దుద్ధతి నేఁగుదెంచె నఖిలానీకంబు నుప్పొంగఁగన్. 146

ప్రతిపదార్థం: శతానీకుండు= శతానీకుడు; లోకస్తుత్య విభూతిన్= లోకం చేత కీర్తించదగిన వైభవంతో; అన్యపృతనాలుంటాక= శత్రు సైన్యాలను దోచుకొనే; బాహాబల శ్రీకల్మిన్= భుజబల సంపద కలిగి ఉండటం చేత; రథ దంతి ఘోటక భట శ్రేణీ సముద్దాంత= రథాలూ; ఏనుగులూ, గుర్రాలూ, కాల్బలాలూ అనే చతురంగబలాల వరుసలచేత అణచటానికి వీలుకాని; సేనా= సేనలకు; ఆకల్ప= అలంకారమైన; ధ్వజ విభ్రమంబునన్= పతాకవిజృంభణంతో; సుహృద్యప్రోద్యముండు+ఐ= మిక్కిలి మదికింపైన ప్రయత్నం కలవాడై; ఉద్ధతిన్= గర్వంతో; అఖిల+అనీకంబున్= సేనాసమూహమంతా; ఉప్పొంగఁగన్= ఉత్సాహపడగా; ఏఁగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: ప్రపంచమంతటా పొగడ్తనందుకొన్న శక్తితో శత్రుసేనలకుత్తుకలను ఉత్తరించగల భుజబల సంపదతో చతురంగ బలాలతో సాటిలేని మేటి సేనకు అలంకారప్రాయంగా ఉండే ఉన్నతకేతనాల విలాసంతో, ఆకర్షణీయంగా కనబడే యుద్ధ ప్రయత్నాల శోభతో సేనలన్నీ ఉప్పొంగగా శతానీకుడు గర్వరేఖతో రంగప్రవేశం చేశాడు.

విశేషం: విరాటుడి తమ్ములలో పెద్దవాడు శతానీకుడు. పేరులోనే సైన్యవిస్ఫూర్తి కలవాడు. అతడి సైన్యంలో చతురంగబలానికి సమప్రాధాన్యం కనబడుతుంది. అతడు ఓజోగుణ విశిష్టుడైనట్లు ఈ పద్యంలో పోషించబడిన ఓజోగుణం ధ్వనింపజేస్తున్నది. గాఢబంధత్వం అనే శబ్దగుణమైన ఓజస్సును, అర్థప్రౌఢి అనే అర్థగుణమైన ఓజస్సును సమదృష్టితో ఈ పద్య రచనలో తిక్కన రాణింపజేశాడు. (సంపా.)

ఉ. ఆతని తమ్ముఁడైన మదిరాశ్వుడు కర్ణ ఝుళంఝుళా సము
ద్ధూత బలోత్థరేణు పరిధూసరితాంబరమైన వారణ
వ్రాతము గొల్చి రాఁ గడఁగి వచ్చె సముజ్జ్వల హేమవర్మని
ర్యాత రుచిచ్ఛటా పటల రంజిత హేతి మహోగ్ర సైన్యుఁడై. 147

ప్రతిపదార్థం: ఆతని తమ్ముఁడు+ఐన= ఆ శతానీకుడి తమ్ముడైన మదిరాశ్వుడనేవాడు; కర్ణఝుళంఝుళాసముద్ధూత= చెవుల యొక్క ఘల్లు ఘల్లుమనే శబ్దాల చేత విసరికొట్టబడిన; బల+ఉత్థ= సైన్యంచేత పైకి లేచిన; రేణుపరిధూసరిత= ధూళితో

బూడిదరంగు కలదిగా చేయబడిన; అంబరము+ఐన= ఆకాశప్రాంతం కల; వారణవ్రాతము= ఏనుగుల సమూహం; కొల్చిరాన్= సేవిస్తూ రాగా; సముజ్జ్వల= ప్రకాశిస్తున్న; హేమవర్మ= బంగారు కవచం నుండి; నిర్యాత= వెలికివచ్చే; రుచి+ఛటా= కాంతుల కిరణాల; పటల= సమూహాలచేత; రంజిత= పూయబడిన; హేతి= ఆయుధాల చేత; మహా+ఉగ్రసైన్యుఁడు+ఐ= భయంకరమైన సేనకలవాడై; కడఁగి+వచ్చెన్= పూనికతో వచ్చాడు.

తాత్పర్యం: శతానీకుడి తమ్ముడు మదిరాశ్వుడు. అతడికి గజసేన మెండు. ఏనుగులు చెవులాడిస్తుంటే కలిగే ఝుళంఝుళనాదాలు పిక్కటిల్లాయి. ఆ గజబలం నడుస్తూ ఉంటే రేగిన దుమ్ము ఆకాశాన్ని బూడిదరంగుగా మార్చివేస్తూ ఉండింది. అంతటి గజబలం వెంటరాగా, తన బంగారు కవచంనుండి వెలువడే కాంతి కిరణాల గుంపులు కత్తులమీద పడి వాటిని పసిడివన్నెలతో వెలిగించివేస్తున్నాయి. అటువంటి సైనికవీరులు వెంట రాగా యుద్ధం చేసే పూనికతో మదిరాశ్వుడు వచ్చాడు.

విశేషం: అలం: అతిశయోక్తి. మూలంలో మదిరాశ్వుడి పేరు మదిరాక్షుడుగా ఉన్నది. ఇతడి సైన్యంలో గజదళం ఎక్కువ. అది అతడి ప్రత్యేకత. దానిని అర్థవ్యక్తి అనే గుణంతో తిక్కన స్ఫుటీకరించాడు. అర్థవ్యక్తిత్వం శబ్దగుణమైన అర్థవ్యక్తి. "కర్ణఝుళంఝుళాసముద్ధూత బలోత్థరేణు పరిధూసరితాంబరమైన" మొదలైనచోట్ల శబ్దార్థవ్యక్తి స్పష్టం. ఈ పద్యరచనలో గజసేనా బల ప్రత్యేకతను "వస్తుస్వభావస్ఫుటత్వం" అనే అర్థగుణంతో తిక్కన వ్యక్తీకరించాడు. (సంపా.)

తే. **అతని యనుజుండు సూర్యదత్తాహ్వయుండు । సమద సైనిక నానాస్త్ర శస్త్ర బహుళ**
దీప్తిజాలక ప్రతిహత దినకరాంశు। రాజియై చనుదెంచె సంరంభ మెసఁగ. **148**

ప్రతిపదార్థం: అతని+అనుజుండు= మదిరాశ్వుడి తమ్ముడు; సూర్యదత్త+ఆహ్వయుండు= సూర్యదత్తుడనే పేరు కలవాడు; సమద= మదించిన; సైనిక= సైనికుల యొక్క; నానా+అస్త్రశస్త్ర= పెక్కురకాలైన అస్త్రశస్త్రాల యొక్క; బహుళదీప్తిజాలక= పెక్కు వెలుగుల గుంపుల చేత; ప్రతిహత= నిరోధించబడిన; దినకర+అంశురాజి+ఐ= సూర్యకిరణాల సమూహం కలవాడై; సంరంభము+ఎసఁగన్= ఆటోపం అతిశయించగా; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: మదిరాశ్వుడి తమ్ముడి పేరు సూర్యదత్తుడు. మదించిన సైనికుల అనేక రకాల అస్త్రశస్త్రాల విస్తారమైన వెలుగులు సూర్యకిరణాల ప్రకాశాన్ని తలదన్నుతున్నట్లుండగా ససైన్యుడై త్వరత్వరగా అట్టహాసంగా యుద్ధరంగానికి వచ్చాడు.

విశేషం: అలం: అతిశయోక్తి. సూర్యదత్తుడనే పేరులోనే కాంతిగుణం ఉన్నది. అతడి సైన్యాల శస్త్రాస్త్రాల కాంతులు సూర్యకాంతిని కూడా తలదన్నేటట్లున్నాయన్న అతిశయోక్తి కాంతిని కాంతిమంతం చేస్తున్నది. దానికి తగినట్లు తిక్కన బంధౌజ్జ్వల్యం, దీప్తరసత్వం అనే లక్షణాలు గల శబ్దార్థగుణరూపమైన కాంతిగుణాన్ని పోషించటం ఔచిత్యం. (సంపా.)

ఉ. **తెల్లని జోడు పెట్టుకొని తీవ్రగతిం జనుదెంచె మత్స్య భూ**
వల్లభు నగ్ర నందనుఁడు వైరి మదాపహ విక్రమ ప్రకా
రోల్లసితుండు వన్యబల ముద్ధతిఁ గొల్చు మృగేంద్రరేఖ శో
భిల్లుచు నుండ శంఖుఁడు విభీషణ శంఖనినాద మొప్పఁగన్. **149**

ప్రతిపదార్థం: వైరిమద= శత్రువుల గర్వమును; అపహ= పడగొట్టు; విక్రమప్రకార= శౌర్యగతితో; ఉల్లసితుండు= శోభించేవాడు; మత్స్యభూవల్లభు= విరటుని యొక్క; అగ్రనందనుఁడు= పెద్దకుమారుడు; శంఖుఁడు= శంఖుడనేవాడు; తెల్లనిజోడు పెట్టుకొని= తెల్లని కవచం తొడుగుకొని; వన్యబలము= అరణ్యంలోని మృగాల సమూహం; ఉద్ధతిన్+కొల్చు= దర్పముతో సేవించే; మృగేంద్రురేఖ= మృగరాజైన సింహం యొక్క స్థితి; శోభిల్లుచున్+ఉండన్= ప్రకాశిస్తూఉండగా; విభీషణ శంఖనినాదము= మిక్కిలి భయంకరమైన శంఖధ్వని; ఒప్పఁగన్= తగిన విధంగా; తీవ్రగతిన్= మిక్కిలి వేగంగా; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: విరాటుడి పెద్ద కుమారుడు శంఖుడనేవాడు తెల్లని కవచం ధరించి భయంకరమైన శంఖ నినాదం చేస్తూ, వన్యమృగాలు కొలువగా వచ్చే మృగరాజైన సింహంయొక్క ఠీవితో, శత్రువుల గర్వాన్ని హతమార్చే శౌర్యంతో ప్రకాశిస్తూవున్నవాడై, తెల్లని తీవ్రమైన గమనంతో వచ్చాడు.

విశేషం: అలం: ఉపమ. విరాటరాజు పెద్ద కొడుకు శంఖుడు. సైన్యబలం విరటుడిది కావటంతో ఇతడికి స్వీయబలమే ఆధారం. మృగాల మీదకు లంఘించే సింహంవలె శత్రుసైన్యాలమీద దాడి చేసేపరాక్రమం అతడి ప్రత్యేకత. అతడి శంఖారావం విభీషణం. అది సింహగర్జనవంటిది. అర్థవ్యక్తి అనే శబ్దార్థగుణాలు పాత్రోచిత స్వభావ వ్యక్తిత్వం ధ్వనించేటట్లు రచించడం తిక్కన గుణవద్రచనా శిల్పం. (సంపా.)

వ. **మఱియు ననేక యోధవీరులు వివిధ వాహనారూఢులై గాఢసన్నాహంబులగు నిజవ్యూహంబులతో నేతెంచు చుండిరి; విరాటుండు బలంబులం గూర్చికొను తలంపునం బురబహిరంగణంబునం గొండొకసేపు నిలిచె; నట్టి సమయంబున ధర్మతనయుం డనిలతనయ మాద్రీతనయుల 'నంతంతం బొడసూపి నిలువుం'డని నిపుణంబుగా నియోగించి, తానును మత్స్యమహీవల్లభు నల్లనఁజేరి యిట్లనియె.** **150**

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకనూ; అనేక యోధవీరులు= పెక్కురు యుద్ధవీరులు; వివిధ వాహన+ఆరూఢులు+ఐ= అనేకవిధములైన వాహనాలెక్కివచ్చినవారై; గాఢసన్నాహంబులు+అగు= గట్టి యుద్ధపుటేర్పాట్లు కలిగిన; నిజవ్యూహంబులతోన్= తమ తమ సేనల పన్నాగాలతో; ఏతెంచుచున్+ఉండిరి= వస్తూఉన్నారు; విరాటుఁడు= విరటుడు; బలంబులన్= సైన్యాలను; కూర్చుకొను తలంపునన్= సిద్ధం చేసికొనే యోచనతో; పురబహిరంగణంబునన్= ఊరిబయట; కొండొకసేపునిలిచెన్= కొంతకాలం నిలిచాడు; అట్టిసమయంబునన్= అటువంటి వేళలో; ధర్మతనయుండు= ధర్మరాజు; అనిల తనయు= భీమసేనుడిని; మాద్రీతనయులన్= నకుల సహదేవులను; అంతంతన్+పొడ+చూపి= అక్కడక్కడ కనబరచుకొని; నిలువుండు+అని= అగుడని; నిపుణంబుగాన్= నేర్పరితనంతో; నియోగించి= ఉండుటకు ఉత్తర్వు చేసి; తానును= తానుకూడా; మత్స్యమహీవల్లభున్= విరాటరాజును; అల్లనన్= మెల్లగా; చేరి= దగ్గరై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనేక యుద్ధవీరులు నానా వాహనాలను ఎక్కి, దృఢసన్నాహాలతో తమ తమ ఎత్తుగడలతో వస్తున్నారు. విరాటుడు సేనలను కూర్చుకొనే యోచనలతో ఊరి బయట కొంతసేపు నిలిచాడు. ఆ సమయంలో ధర్మరాజు; భీమ నకుల సహదేవులను అక్కడక్కడ తమ్ము 'కనబరచుకొని నిలువు'డని నేర్పుగా ఉత్తర్వు చేసి, తాను కూడా విరటుడి యొద్దకు తిన్నగా చేరి ఇట్లా అన్నాడు.

చ. **'ఒక ఋషిచేత నాయుధ సముత్కర మెల్లను సప్రయోగమం**
త్రకముగ నభ్యసించి సమరంబునకుం గొఱయైనవాఁడ; గో

ప్రకరములన్ మరల్చుటకు బంధులు నీవును బోవ నాకు నిం

టికడన యున్కిపాడియె? ఘటింపఁగఁ బంపు రథంబు సయ్యనన్.' 151

ప్రతిపదార్థం: ఒక ఋషిచేతన్= ఒకానొకఋషి వలన; ఆయుధ సముత్కరము+ఎల్లను= అస్త్రాల, శస్త్రాల సమూహమంతటినీ; ప్రయోగసహిత మంత్రకముగన్= మంత్రపూర్వకంగా ప్రయోగించేందుకు; అభ్యసించి= నేర్చుకొని; సమరంబునకున్= యుద్ధానికి; కొఱ+ఐనవాఁడన్= ఉపయోగపడేవాడిని; గోప్రకరములన్= ఆలమందలను; మరల్చుటకున్= తిరుగదోలుకొనివచ్చుటకు; బంధులు= బంధువులు; నీవును= (రాజయిన) నీవును; పోవన్= పోగా; నాకున్= నాకు; ఇంటికడన= ఇంటివద్దనే; ఉన్కి= ఉండటం; పాడియె?= ధర్మమా?; చయ్యనన్= వెంటనే; రథంబు= తేరును; ఘటింపఁగన్= సిద్ధంచేయగా; పంపు= ఆజ్ఞాపించుము.

తాత్పర్యం: ఓ రాజా! ఒకానొక ఋషి మూలాన శస్త్రాస్త్ర ఆయుధ ప్రయోగాదులను మంత్ర సహితంగా అభ్యసించాను. యుద్ధానికి సమర్థుడనైన వాడను. ఆలమందలను మరల్చుటకు బంధువులతో నీవు వెళ్ళగా నే నిచ్చటనే ఉండటం న్యాయమా? కనుక వేగమే నాకొరకు రథాన్ని సన్నద్ధం చేయించుము.

విశేషం: కంకుడు సన్న్యాసివేషంలో ఉన్నాడు. కాబట్టి ఋషి వలన అస్త్రశస్త్రాలను సమంత్రకంగా అభ్యసించినట్లు చెప్పటం బాగా అతికింది. అస్త్రాలు మంత్ర సహితమైన బాణాలు, మంత్రాలకు ఋషులు, ఛందస్సులు, దేవతలు, ప్రయోగ, ఉపసంహారణ విధానాలు మొదలైనవి ఉంటాయి. సైన్య సమీకరణ కొరకు ఊరిబయట నిలువబడిన విరాటుడికి కంకుభట్టు తనంతట తాను అస్త్ర విద్యా కోవిదుడనని పరిచయం చేసికొనటం, రాజు యుద్ధానికి పోతున్నప్పుడు అతడి సేవలో ఉన్న తాను కూడా రాజుకు సేవ చేయటం ధర్మమని చెప్పటం విరాటుడికి నచ్చాయి. అంతేకాక కంకుభట్టును చూచిననాటినుండి అపారగౌరవం కలవాడు విరాటుడు. అతడు చక్రవర్తి కాదగినవాడనే అభిప్రాయం కలిగి ఉన్నవాడు. తగిన సమయానికి తగిన విధంగా ధర్మజుడు పలుకటం ప్రకరణోచిత్యం, శత్రువీరుల చేతిలో విరాటుడు ఓడిపోతే పాండవాజ్ఞాతవాసం భగ్నమౌతుంది. కాబట్టి తమను రక్షించే ప్రభువును రక్షించుకొనటం ధర్మరాజు ధర్మనీతి. అందులో కృతజ్ఞతాది లక్షణాలు బయటకు కనబడే ఉత్తమ సేవాగుణాలు. (సంపా.)

క. అనిన విని యియ్యకొను న । మ్మనుజాధీశ్వరునితోడ మఱియు నతం డి

ట్లనుఁ, బవనతనయుఁ గవలం । గొని సమరంబునకుఁ బోవఁ గోరెడు మదితోన్. 152

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విని; ఇయ్యకొను= ఒప్పికొనినట్టి; ఆ+మనుజ+అధీశ్వరునితోడన్= ఆ విరాటరాజుతో; మఱియున్= ఇంకను; అతండు= ఆ ధర్మజుడు; పవనతనయున్= వాయునందనుడైన భీముడిని; కవలన్+కొని= అమడలయిన నకుల సహదేవులను పిలుచుకొని; సమరంబునకున్= యుద్ధానికి; పోవన్+కోరెడు= వెళ్ళటానికైకోరే; మదితోన్= మనస్సుతో; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటున్నాడు.

తాత్పర్యం: అనగా విని ఇష్టపడిన ఆ రాజుతో ధర్మజుడు ఇంకా భీమసేనుడిని నకుల సహదేవులను తీసికొని యుద్ధానికి వెళ్ళవలెననే అభిప్రాయంతో ఇట్లా అన్నాడు.

విశేషం: యుద్ధంలో పాల్గొనటానికి వీలున్న వాళ్ళందరినీ విరాటుడు పిలుస్తున్నాడు. దండులో చేర్చుకొనటానికి ఊరిబయట నిలుచున్నాడు. పాండవులలో యుద్ధం చేయగలవారు ప్రస్తుతం కంకుడు, వలలుడు, దామగ్రంథి, తంత్రీపాలుడు అనే పేర్లతో విరాటుడికి పరిచయమైన ధర్మజ, భీమ, నకుల, సహదేవులు. వీరు సేవలలో ప్రవేశించేటప్పుడు సమయం వస్తే యుద్ధాలలో

పాల్గొంటామని చెప్పారు కూడా. దానిని తగిన సమయంలో జ్ఞాపకం చేసి, వారికి కూడా యుద్ధంలో సహాయం చేసే అవకాశం కలిగించాలని సంకల్పించటం ధర్మరాజు వ్యూహం. చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలన్న నీతిని ధర్మరాజు పాటించాడు. (సంపా.)

సీ. **'మన వలలుండు లావున బంటుతనమున । జను లెఱుఁగఁగ సడిసన్నవాఁడు;**
మంచిమగండు దామగ్రంథి యసమసం । గ్రామకేళీ గాఢ కౌతుకుండు,
వినుము, తంత్రీపాలుఁడును దుర్దమారాతి । మర్దనచాతుర్య మహిత భుజుఁడు;
మున్నును వీరలు ముువ్వర కడఁకల । కొలఁదు లే నెఱుఁగుదుఁ గొంతకొంత;

తే. **యెక్కఁదగునట్టి యరదంబు లిచ్చి వీరి । ననికిఁ దోకొనిపోక కార్యంబు నాకుఁ**
జూడ!' ననవుడు మేదినీశుండు హర్ష । నిర్భరాత్మకుఁ డై శతానీకుఁ జూచి. 153

ప్రతిపదార్థం: మన వలలుండు= మనవాడయిన ఈ వలలుడు (భీముడు); లావునన్= బలంలో; బంటుతనమునన్= పరాక్రమంలో; జనులు+ఎఱుంగఁగన్= ప్రజలు తెలిసేటట్లుగా; సడి+చన్నవాఁడు= పొగడ్తగన్నవాడు (అనిందు్యడు); మంచిమగండు= మేటి వీరుడైన; దామగ్రంథి= దామగ్రంథి అనే పేరుతో పిలువబడేవాడు (నకులుడు); అసమ= సాటిలేని; సంగ్రామకేళీ= యుద్ధక్రీడలో; గాఢకౌతుకుండు= దృఢమయిన ఆసక్తి ఉన్నవాడు; వినుము= ఇంకను వినుము; తంత్రీపాలుఁడును= తంత్రీపాలుడు కూడా (సహదేవుడును); దుర్దమ= గెలువరాని; అరాతిమర్దన= శత్రుసంహారంలో; చాతుర్య= నేర్పుగల; మహితభుజుఁడు= గొప్ప భుజబలమున్నవాడు; మున్నును= ఇదివరకుకూడా; వీరలు ముువ్వర= వీరి ముగ్గురి యొక్క; కడఁకల= పరాక్రమాలయొక్క; కొలఁదులు= శక్తులు; కొంతకొంత= ఒక్కింత ఒక్కింత; ఏన్+ఎఱుఁగుదున్= నాకు తెలియును; ఎక్కన్+తగునట్టి= ఎక్కటానికి తగిన; అరదంబులు+ఇచ్చి= తేరులనిచ్చి; వీరిన్= ఈ ముువ్వరను; (అనగా వలలుడిని దామగ్రంథి, తంత్రీపాలురను); అనికిన్= యుద్ధానికి; తోకొనిపోక= పిలచుకొనిపోవటం; నాకున్+చూడన్= నాకు చూడగా; కార్యంబు= చేయవలసినపని; అనవుడున్= అనగా; మేదినీ+ఈశుండు= రాజు విరాటుడు; హర్షనిర్భర+ఆత్మకుఁడు+ఐ= సంతోషంతో నిండిన మనసు కలవాడై; శతానీకున్+చూచి= శతానీకుడిని చూచి.

తాత్పర్యం: 'ఓ రాజా! మన వలలుడు బలంలోనూ, పరాక్రమంలోనూ మహావీరుడు, ప్రజల పొగడ్తలందినవాడు. మేటివీరుడైన దామగ్రంథి సాటిలేని యుద్ధక్రీడలో ఆసక్తికలవాడు. వినుము. తంత్రీపాలుడు శత్రు సంహార చాతుర్యంగల భుజబలం కలవాడు. ఇదివరకు ఈ ముువ్వరకున్న శక్తులను ఇంచించుక నే నెఱుగుదును. వీ రధిష్ఠించదగిన రథాలను ఒసగి యుద్ధానికి వీరిని పిలిచికొనిపోవటం తగినపనిగా నాకు తోస్తున్నది' అని కంకుడు (ధర్మజుడు) అనగా విరాటుడు సంతసం నిండిన మనస్సుతో శతానీకుడిని చూచి. (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: భీమ నకుల సహదేవులను (వలల, దామగ్రంథి, తంత్రీపాలురను) పరిచయం చేసేతీరు ధర్మరాజు అర్థవ్యక్తి గుణసామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నది. 'మన వలలుడు' అన్న మాట చనువును, అభిమానాన్నీ తెలిపే పలుకు. కంకుడి తరువాత విరాటుడికి బాగా పరిచయమైనవాడు వలలుడు. అతడు బలంలో పౌరుషంలో ప్రజలలో బాగా పేరుమోసి ఉన్నాడు. అతడిని వెంట తీసికొని పోవటం విరాటుడి బలానికే బలంగా ఉంటుందన్నట్లు చెప్పాడు. అతడు రక్షగా ఉండదగిన శక్తి. ఇక దామగ్రంథి అశ్వశిక్షకుడు. సహజంగా మేటి వీరుడు. యుద్ధాలంటే సంబరపడేవాడు. అశ్వసేనకు తరిఫీదునిచ్చే ఆ ప్రధానోద్యోగిని

మరచిపోతే ఒక అశ్వయుద్ధనిపుణుడిని విస్మరించినట్లే. అందువలన అతడి సాయం అవసరం. ఇక తంత్రీపాలుడు గోరక్షకుడు. అతడూ శత్రువులను మర్దించటంలో అనుభవమున్న భుజబలుడు. పైపెచ్చు శత్రువులు ఆక్రమించింది గోగణాన్ని. దాని కధిపతి తంత్రీపాలుడు. తన అధీనంలో ఉన్న గోవులను ఆక్రమించిన శత్రువులను మర్దించగల అతడికి అవకాశం కలిగించటం అవసరం అని చెప్పినట్లయింది. ఆ ముగ్గురిని గురించి కంకుడికి స్వయంగా తెలుసు. వారు రథికులుగా యుద్ధంలో పాల్గొనదగినవారని కంకుడి హితవు. ఈ ముగ్గురి సహాయం అప్పట్లో విరాటుడికి ఎంతో అవసరం. పెరట్లో ఉన్న కల్పవృక్షాలను జ్ఞాపకం చేసినట్లు ఉన్నవి కంకుడి మాటలు. అందుకే విరాటుడు 'హర్షనిర్భరాత్ము'డైనాడు. తన తమ్ముడైన శతానీకుడిని చూచి అభిమానంతో, రాజగౌరవంతో వారి వారి యోగ్యతలకు తగిన రథాల నిప్పించుమని ప్రత్యేకంగా పేర్కొన్నాడు. కంకుభట్టు సలహాతో విరాటుడు కృతార్థుడైనట్లున్నాడు. ఆ తరువాత సైనికుల సమీకరణకు అతడు ప్రయత్నించినట్లు కూడా లేదు. అవసరం కూడా లేదు. చేరవలసిన ఈ రథికులు ముగ్గురూ సహాయకులుగా చేరటానికే విరాటుడు ఊరి బయట నిలిచినట్లున్నది కథ. ఊరి బయటనే ఈ ముగ్గురూ ఒకచోట కనబడటానికి వీలున్నది కూడా. వారు ఉద్యోగాలలో చేరిందీ, యుద్ధోద్యోగంలో చేరిందీ అదే రంగం కావటం నాటకీయమైన రామణీయకం. (సంపా.)

వ. కంక వలల దామగ్రంథి తంత్రీపాలురం జూపి యిట్లనియె. 154

తాత్పర్యం: కంక, వలల, దామగ్రంథి, తంత్రీపాలురను చూపి ఇట్లా అన్నాడు.

మ. 'రథముల్ మంచివి గాఁగ నాలు గతిశీఘ్రవ్యాప్తి సత్త్వంబులం
బ్రథితంబైన తురంగమోత్కరము సంగ్రామార్హ చాపంబు ల
శ్లథవర్మంబులు వీరికిమ్ము; రణలీలాదక్షతన్ మన్మనో
రథముం దీర్పఁగ వీర లోపుదురు దోర్గర్వం బఖర్వంబుగన్.' 155

ప్రతిపదార్థం: రథముల్= తేరులు; మంచివి+కాఁగన్= శ్రేష్ఠమైనవిగా (ఎన్నికచేసి); నాలుగు= నాలుగింటిని; అతి శీఘ్రవ్యాప్తి సత్త్వంబులన్= మిక్కిలి వేగంగా పోవటంలోను, బలంలోనూ; ప్రథితంబు+ఐన తురంగమ+ఉత్కరము= ప్రసిద్ధి కెక్కిన గుర్రాల సముదాయాన్నీ; సంగ్రామ+అర్హచాపంబులు= యుద్ధానికి తగిన విండ్లను; అశ్లథవర్మంబులు= చీల్చటానికి వీలులేని గట్టి కవచాలను; వీరికిన్+ఇమ్ము= కంక, వలల, దామగ్రంథి, తంత్రీపాలురనే వీరి కీయవలసింది; రణలీలాదక్షతన్= యుద్ధంచేసే నేర్పుతో; దోర్గర్వంబు= భుజగర్వం; అఖర్వంబుగన్= మొక్కపోకుండా; మత్+మనోరథమున్+తీర్పఁగన్= నా కోరిక నెరవేర్చటానికి; వీరలు+ఓపుదురు= వీరు సమర్థులు.

తాత్పర్యం: నాలుగు మంచి రథాలను ఎన్నిక చేయండి; వేగమూ శక్తీ కలిగిన మేలి గుర్రాలను ఆ రథాలకు పూన్చవలసింది; యుద్ధానికి తగిన ధనుస్సులను, చీల్చుటకు వీలులేని గట్టి కవచాలను కంక, వలల, దామగ్రంథి, తంత్రీపాలురనే వీరికి ఈయవలసింది. యుద్ధక్రీడా దక్షులుగా నా కోరికను నెరవేర్చగల శక్తి, మొక్కవోని భుజబలం కళ వీరికున్నది.

విశేషం: కంక, వలల, దామగ్రంథి, తంత్రీపాలుర బలపరాక్రమాల మీద విరటుడి కేర్పడిన నమ్మకం ఈ పద్యంలో ధ్వనించింది. ఇది భావి కథార్థధ్వని కూడా. (సంపా.)

వ. అనిన నతం'డట్ల చేయుదు'నని వారలం దోడ్కొని చని సమస్తంబును సన్నద్ధంబు గావించి, యంగరాగ మాల్యాంబరాభరణంబుల నలంకృతులం జేసినం గైకొని, తమయంతవట్టునుం గూడుకొని సూతకృత్యంబులకుం దార చాలి, రథంబులు దోలికొని చనుదెంచిరి; తదనంతరంబ. 156

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అతండు= ఆ శతానీకుడు; అట్లు+అ చేయుదున్+అని= ఆ విధంగానే చేస్తానని; సమస్తంబును= అన్నిటిని; సన్నద్ధంబు+కావించి= సిద్ధంచేసి; అంగరాగమాల్య+అంబర+ఆభరణంబులన్= శరీరాలంకారానికి అవసరమైన మైపూతలు, దండలు, దుస్తులు, నగలు మొదలగువాటితో; అలంకృతులన్+చేసినన్= అలంకరించబడినవారినిగా చేయగా; కైకొని= తీసికొని (స్వీకరించి); తమ అంత+పట్టున్+కూడుకొని= తామందరూ కలసి; సూతకృత్యంబులకున్= సారథులు చేసే పనికి కూడా; తారు+అ చాలి= తామే తగినవారై; రథంబులు= రథాలను; తోలికొని= తోలికొంటూ; చనుదెంచిరి= వెళ్ళారు; తదనంతరంబు+అ= ఆమీదట.

తాత్పర్యం: ఆ శతానీకు డట్లే చేస్తానని వారిని తీసికొనిపోయి, అన్నిటిని సిద్ధంచేసి అంగరాగాదులచేత అలంకరించబడినవారినిగా చేయించగా వారు స్వీకరించారు. తామంతా కలిసి సారథి పనులు తామే చూచుకొంటూ కంక, వలల, దామగ్రంథి, తంత్రీపాలురు వెళ్ళారు. ఆ తరువాత.

విశేషం: సారథులను సమకూర్చుమని విరటు డనలేదు. ధర్మరాజాదులు కోరలేదు. అప్పటికే సారథుల కొరత ఏర్పడిందేమో! ఏమైనా రథిక సారథ్య ధర్మాలను స్వయంగా నిర్వహించుకొనే మేటి వీరులు పాండవులు. (సంపా.)

సీ. గంధ దంతావళ కర్ణమారుతహతిఁ । గాంతారములు చాఁపకట్టువడఁగ,
రథ ఘోషమునఁ బ్రతిరవమిచ్చునద్రులు । భయమున వాపోవు భంగి నుండఁ,
దురగ ఖురోద్ధూత ధూళి దన్బెరసిన । వననిధి పిండలివండు గాఁగ,
బహుళపదాతి దుర్భరభార మడరిన । నురగకూర్మంబు లొండొదంటిఁ బొంద

తే. సైన్యముల నడిపించె నుత్సాహలీల । యతిశయిల్లంగ సంరంభ మగ్గలింప
బరవసము మిక్కుటంబుగఁ బసులు సన్న । జాడఁ గై కొని యమ్మత్స్యజనవిభుండు. 157

ప్రతిపదార్థం: గంధ దంతావళ కర్ణమారుతహతిన్= మదపుటేనుగుల యొక్క చెవులు విసరుటచే కలిగిన గాలి తాకిడికి; కాంతారములు= అడవులు; చాపకట్టు+పడఁగన్= చాపచుట్టవలె పడిపోగా, రథఘోషమునన్= తేరుల శబ్దానికి, ప్రతిరవము+ఇచ్చు= బదులుపలుకే (పలుకురాయివలె ప్రతిధ్వనించే); అద్రులు= కొండలు; భయమునన్= భయంచేత; వాపోవుభంగిన్+ఉండన్= దుఃఖిస్తు బిగ్గరగా అరుస్తూవున్నట్లుండగా; తురగ= గుర్రాలయొక్క; ఖుర= గొరిజలచేత; ఉద్ధూత= రేగగొట్టబడిన; ధూళి= దుమ్ము; తన్+బెరసినన్= తన్ను కప్పగా; వననిధి= సముద్రం; పిండలివండుకాఁగన్= చిక్కని బురదకాగా, బురదముద్దకాగా; బహుళ= విస్తారమైన; పదాతి= కాల్బలాల యొక్క; దుర్భర= భరించరాని; భారము= బరువు; అడరినన్= ఎక్కువ కాగా; ఉరగకూర్మంబులు= భూమిబరువును మోస్తున్న ఆదిశేషువూ (పాము), ఆది కూర్మం (తాబేలూ); ఒండొంటిన్+పొందన్= ఒకదానికొకటి చేరగా; ఆ+మత్స్య జనవిభుండు= ఆ విరాటరాజు; ఉత్సాహలీల అతిశయిల్లంగన్= సంతసం ఎక్కువకాగా; సంరంభము+అగ్గలింపన్= ఆటోపం అతిశయించగా; బరవసము= ధైర్యం; మిక్కుటంబుగన్= అతిశయంకాగా; పసులు= ఆవులు; చన్నజాడన్= వెళ్ళిన బాటను; కైకొని= పొంది; సైన్యములన్= సేనలను; నడిపించెన్= ముందుకు సాగేటట్లు నడిపించాడు.

తాత్పర్యం: మదపుటేనుగుల చెవిగాలుల దెబ్బచేత అరణ్యాలు చాపకట్టగా పడ్డాయి. రథఘోషల చేత ప్రతిశబ్దమిచ్చే కొండలు భయంచేత అరుస్తూ దుఃఖించేటట్లుగా ఉండినవి. గుర్రాల కాలిగిట్టలచేత ఎగదన్నబడిన దుమ్ము కప్పుకొనగా సముద్రం బురదముద్ద అయింది. గొప్ప కాల్బలం యొక్క భరించరాని బరువుచేత అతిశయింపగా ఆదిశేషుడూ, ఆదికూర్మమూ ఒకదానినొకటి తాకినవి. ఇట్లా విరాటరాజు ఉత్సాహం ఎక్కువకాగా, ఆటోపం అతిశయించగా, ధైర్యంతో, ఆవులు వెళ్ళిన మార్గాన్ని గుర్తించి సైన్యాలను నడిపించాడు.

విశేషం: అలం: అతిశయోక్తి, యథాసంఖ్యం. సీసపద్య పాదాలు నాలుగింటిలో వర్ణించిన గజ, రథ, తురగ, పదాతుల (చతురంగబలాల) విజృంభణం అతిశయంగా చెప్పి, ఎత్తుగీతిలో నాలుగు రకాలుగా నడిపించిన పద్ధతులతో క్రమంగా అన్వయింపచేయటం అతిశయోక్తి యథాసంఖ్యాలంకారాల సార్థక ప్రయోగం. ఏనుగుల చెవులగాలికి అడవులు చాపకట్టుగా పడేటట్లు నడపటం ఉత్సాహం అతిశయించటం వలన సాధ్యపడింది. రథఘోషకు కొండలు మారుమ్రోగి, దుఃఖిస్తున్నట్లుండటం సైన్యసంరంభం అతిశయించటం వలన ఏర్పడింది. గుర్రాల గిట్టల తాకిడి వలన రేగిన దుమ్ము సముద్రాన్ని బురదముద్ద చేయటం పరాక్రమ పారవశ్యంతో అశ్వసేనలను నడపటం వలన ఏర్పడింది. పశువులు పోయిన బాట కనబడటంతో బహుళ పదాతి సేన వేగంగా నడిచింది. ఆ నడక వేగానికి ఏర్పడిన భూభారాన్ని ఆదిశేషుడూ, ఆదికూర్మమూ కలిసి మోయవలసి వచ్చింది. చతురంగబల ప్రభావాన్ని వర్ణించే ఈ పద్యంలో బలాలగతుల వలన ఏర్పడిన సైన్యోత్సాహాన్ని క్రమదశలలో వర్ణించటం ఈ పద్య శిల్ప విశేషం. విరాటుడి నాయకత్వం విజయసూచకమని ధ్వని. చతురంగబల మర్దనంలో పాండవ వీరచతుష్టయ పరాక్రమం పరోక్షంగా ధ్వనింపజేయటం ఆలోచనామృతం.(సంపా.)

వ. ఇట్లు చని కూడముట్టిన. 158

తాత్పర్యం: ఈ విధంగా వెళ్ళి వెన్నంటి తాకగా, (తరువాతి పద్యంతో అన్వయం.)

క. విరటు బలంబుఁ द्रిగర్తే। శ్వరు బలముం జెలఁగ నార్చి వడిఁ దాఁకె భయం
కరనాద మేదురములగు। శరనిధు లొండొంటిఁ దాఁకుచందం బమరన్. 159

ప్రతిపదార్థం: విరటుబలంబున్= విరటుడి సైన్యమూ; త్రిగర్త+ఈశ్వరుబలమున్= త్రిగర్తరాజైన సుశర్మయొక్క సైన్యమూ; చెలఁగన్= ఉత్సాహంతో; ఆర్చి= సింహనాదాలు చేసి; వడిన్= తొందరగా; భయంకరనాదమేదురములు+అగు= గొప్పశబ్దాలతో దట్టమయిన; శర నిధులు= సముద్రాలు; ఒండొంటిన్= ఒకదానినొకటి; తాఁకుచందంబు= ఢీకొన్న విధంగా; అమరన్= ఒప్పగా; తాఁకెన్= ఎదుర్కొనగా.

తాత్పర్యం: విరటుడి సైన్యం, సుశర్మ సైన్యం పెచ్చుపెరిగి సింహనాదాలతో శీఘ్రంగా ఎదుర్కొన్నాయి. ఆ తాకిడి - సముద్రాలు ఒకదానితో మరొకటి భయంకర శబ్దాలతో ఘర్షణ పడ్డట్లుగా ఉన్నది.

విశేషం: అలం: ఉపమ.

మ. గుణరావంబుఁ గృపాణ ఘట్టన రవక్షోభంబునుం, గింకిణీ
క్వణన వ్యావృత హేషితస్వనములున్, ఘంటా నినాదాత్త పో
షణ నానాపటు బృంహిత ధ్వనియు, శశ్వద్గాఢమై పేర్చినన్
రణనం బించుక దోఁప లేద బహుతూర్యశ్రేణి నా సేనలన్. 160

ప్రతిపదార్థం: గుణరావంబు= అల్లెత్రాటిశబ్దమూ; కృపాణ= కత్తుల యొక్క; ఘట్టనరవ= రాపిడి వలన కలిగిన శబ్దం వలని; క్షోభంబునున్= కలతయూ; కింకిణీక్వణన= మువ్వల శబ్దాలచేత; వ్యావృత= వ్యాపించిన; హేషిత స్వనములున్= గుఱ్ఱాల సకిలింత చప్పుడులున్నూ; ఘంటానినాద= ఘంటల శబ్దాలతో; ఆత్త= పొందబడిన; పోషణ= పెంపుగల; నానాపటు బృంహితధ్వనియున్= అనేకములయిన ఏనుగుల ఘీంకారశబ్దాలున్నూ; శశ్వత్+గాఢమై పేర్చినన్= స్థిరమై దట్టమై విజృంభించగా; ఆ సేనలన్= ఆ సైన్యాలలో; బహుతూర్యశ్రేణిన్= అనేకాలైన వాద్యాల (నాదాల) వరుసలలోని; రణనంబు= ధ్వని; ఇంచుక= కొద్దిగా కూడా; తోఁపలేదు+అ= వినిపించనేలేదు.

తాత్పర్యం: జ్యానాదాలు, కత్తుల ఘట్టనంచే కలత చెందించే శబ్దాలు, మువ్వల సవ్వడులతో వ్యాపించే గుఱ్ఱాల సకిలింతలు, ఘంటా నినాదాలతో గూడిన అనేక విధాలైన ఏనుగుల ఘీంకారశబ్దాలు కలిసి కోలాహలంగా విస్తరించే సరికి, ఆ సేనలో పెక్కువరుసలలో మ్రోగుతున్న తూర్యధ్వనులు కొద్దిగాకూడా వినిపించలేదు.

విశేషం: చతురంగ బలాలు చేసే సవ్వడి తూర్యనాదాల ధ్వని కంటె మించిందని చెప్పే ఈ వర్ణనం విశిష్టం. తూర్యనాదాలు సైన్యాలకు ఉత్సాహ ప్రేరకాలు. వాటి పని లేకుండానే సహజమైన ఉత్సాహాన్ని సేనలు ప్రదర్శిస్తున్నాయని ధ్వని. (సంపా.)

విరాట సుశర్మల సైన్యంబు సంకులంబుగాఁ బోరుట (సం.4-31-1)

వ అట్టి సమయంబున. 161

తాత్పర్యం: అటువంటి సమయంలో.

సీ. ఒండొంటితోఁ దాఁకి మండెడునవియును, । జిందముల్ పొడిపొడి సేయు నవియు.
గట్టి మైమఱువులు దట్టముల్ గావించు । నవియును, నెఱను నోనాడునవియు,
నెట్టుపైఁ బడి మేని నెగయించునవియును । దల నేల డొల్లంగఁ దాఁకు నవియు,
నిరుమెయిఁ దొలిచి బె ట్టిలఁ దూఱు నవియును, । నలువుర నేవుర నాఁటు నవియు.

తే. నైన శరములు గనుఁగొని యాడి యాడి । నారదుఁడు పిచ్చలింపంగ వీరకేళి
సలిపె నుద్ధతిమై ధనుర్బలము లడరి । లావు వెరవును నెఱయఁ జలంబు మెఱయ. 162

ప్రతిపదార్థం: ఒండొంటితోన్+తాఁకి= ఒకదానితో ఇంకొకటి ఢీకొని (ఒరసికొని); మండెడు+అవియును= మండుతున్నవీ; చిందముల్ పొడిపొడి+ చేయునవియున్= శంఖాలను పొడిపొడిగా చేసేవీ; గట్టిమైమఱువులు= దృఢమైన కవచాలను; దట్టముల్ కావించు నవియును= సళ్లుపడేటట్లు చేసేవీ; నెఱను నోనాడునవియున్= మర్మస్థానాలను బాధించేవీ; నెట్టుపైన్+పడి= మిక్కిలిగా మీదపడి; మేనికిన్= శరీరాన్ని; ఎగయించునవియును= ఎగురగొట్టేవీ; నెఱచు నోనాడునవియును= మర్మస్థానాలను బాధించేవీ; నెట్టుపైన్+పడి= మిక్కిలిగా మీదపడి; మేనిన్= శరీరాన్ని; ఎగయించునవియును= ఎగురగొట్టేవీ; తలనేలడొల్లంగన్+తాఁకునవియున్= తల భూమిమీద దొర్లేటట్లుగా గ్రుచ్చుకొనేవీ; ఇరుమెయిన్+తొలిచి= రెండు శరీరాలను చీల్చుకొని; బెట్టు= తీవ్రంగా; ఇలన్+తూఱు+అవియును= నేలమీద దూసుకు పడేవీ; నలువురన్+ నల్గురిని; ఏవురన్= అయిదుగురను; నాటు+అవియున్+ఐన= గ్రుచ్చుకొనేవిగా అయిన; శరములు= అమ్ములను; కనుఁగొని= చూచి; నారదుఁడు= నారద మహర్షి; అడి ఆడి= ఆనందంతో

నాట్యం చేసి చేసి; పిచ్చలింపంగన్= అతిశయిచేటట్లు; ఉద్ధతిమైన్= దర్పంతో; ధనుర్బలములు= ధనుస్సును పట్టిన సైనికులు; అడరి= అతిశయించి; లావు= బలం; వెరవును= ఉపాయాన్ని; నెఱయన్= ప్రకటించేటట్లు; చలంబు= మాత్సర్యం; మెఱయన్= అతిశయించగా; వీరకేళి= వీరవిహారం; సలిపెన్= చేశాయి.

తాత్పర్యం: (యుద్ధరంగంలో) ఒకదానినొకటి ఒరసికొని మండుతున్నవీ, శంఖాలను పొడిపొడి చేసేవీ, గట్టి కవచాలను చీల్చేవీ, మర్మస్థానాలను బాధించేవీ, తలలు నేలమీద పడి దొర్లేటట్లు చేసేవీ, మేని రెండు వైపులా తొలిచి చీల్చేవీ, నలుగురినీ, అయిదుగురినీ ఒకేసారి గ్రుచ్చి చంపేవీ అయిన బాణాల భంగిమలను చూచి నారదుడు ఆనందంతో నాట్యం చేయగా విలుకాండ్రు గర్వంతోకూడిన వింటి నేర్పుతో బలాన్నీ, ఉపాయాన్నీ, మాత్సర్యాన్నీ ప్రదర్శిస్తూ వీరవిహారం చేశారు.

విశేషం: అలం: ఉల్లేఖం, యథాసంఖ్యం, అంత్యానుప్రాసం. ఇందులో విలుకాండ్రు బాణప్రయోగ విద్యాతో రణరంగంలో వీరవిహారం చేసిన తీరును ఉల్లేఖంగా వర్ణించాడు తిక్కన. వీరకేళిలో నాలుగు రకాలైన అంశాలున్నాయి. 1. ఉద్ధతితో అడరటం. 2. లావు మెరయటం, 3. వెరపు మెరయటం. 4.చలం మెరయటం. ఉద్ధతితో ప్రయోగించే వీరకేళిలో బాణాలు పరస్పరం రాపిడిపడి మంటలు క్రక్కుతాయి. శంఖాలను నుగ్గు నుగ్గు చేస్తాయి. బలంతో కొట్టే బాణాలు కవచాలను చీలుస్తాయి. శరీర మర్మావయవాలను ఛేదిస్తాయి. ఉపాయంతో వేసే బాణాలు మీదబడి శరీరాలను బంతులవలె ఎగురవేస్తాయి; తలలను నేలకు పడవేస్తాయి. మాత్సర్యంతో వేసే బాణాలు శరీరాలను తొలుచుకుంటూ పోయి నలుగురినీ, అయిదుగురినీ ఒకేసారి చంపివేస్తాయి. ఉత్తరోత్తరాలు బలీయాలుగా చెప్పబడే ఈ బాణాల ప్రయోగ విధానాలు సారాలంకారస్ఫూర్తిని కలిగిస్తూ యథాసంఖ్యాలంకారాన్ని బలపరుస్తున్నాయి. ఉల్లేఖాలంకారం బాణ ప్రయోగ నైపుణ్యాన్ని పలురకాలుగా శ్లాఘించేది. అట్లా శ్లాఘిస్తున్నట్లు నైపుణ్యాన్ని చూచి నారదుడు నాట్యం చేసినట్లు చెప్పటం విశేషం. నారదుడు కలహప్రియుడు. ఊరక కలహం ఏర్పడితే ఆయన నాట్యం చేయడు. వీరకేళిలో కలహతీవ్రత గోచరిస్తేనే ఆనందనాట్యం చేస్తాడు. వీరకేళి తారస్థాయిని చేరితే దానిని వర్ణించగల కవిసమయం నారదనాట్యమే. అది దాని ఉత్కృష్టతకు చిహ్నం. విలుకాండ్ర వీరకేళిని విస్తృతవృత్తమైన సీసంలో వర్ణించటం ఛందశ్శిల్పం. అందులో అంత్యానుప్రాసాలంకారంతో బాణ ప్రయోగ ధ్వని పౌనఃపున్యాన్ని తిక్కన ధ్వనింపజేశాడు. (సంపా.)

వ. అప్పుడు సుభటులు గడంగి. 163

తాత్పర్యం: ఆ సమయంలో సుశిక్షితులయిన సైనికులు పూనుకొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. ఏటుల మ్రొగ్గువారిఁగని యించుక కొంకక యర్మ్ము పెంపునం
పోటుల వాతఁ బోవు భటపుంగవులన్ మది మెచ్చుచున్ వడిన్
వ్రేటులఁ గ్రీడ సల్పి, పృథివిం బడు వీరులఁ ద్రొక్కి కొంచు నె
చ్చోటులనైన నగ్గలికఁ జొత్తురు నెత్తురు వఱ్ఱు సేయుచున్. 164

ప్రతిపదార్థం: ఏటుల= బాణాలదెబ్బలతో; మ్రొగ్గువారిన్= కూలేవారిని; కని= చూచి; ఇంచుక= కొద్దిగా కూడా; కొంకక= జంకకుండా; అర్మ్ముపెంపునన్= ఎదుటివారిని ఆక్రమించాలనే ఉత్సాహంతో; పోటుల= దెబ్బల; వాతన్= బారికి; పోవు= ఎదురయ్యే; భటపుంగవులన్= మేటి సైనికులను; మదిన్మెచ్చుచున్= మనసులో మెచ్చుకొంటూ; వడిన్= త్వరగా; వ్రేటులన్+క్రీడ= దెబ్బలతోఆట; సల్పి= చేసి; పృథివిన్+పడువీరులన్= భూమి మీద పడే వీరులను; త్రొక్కికొంచున్= తొక్కుకొంటూ; నెత్తురువఱ్ఱు చేయుచున్= రక్తాన్ని ప్రవాహంగా చేస్తూ; ఏ+చోటులన్+అయినన్= ఎక్కడైనా; అగ్గలికన్+చొత్తురు= శౌర్యంతో ప్రవేశిస్తారు.

తాత్పర్యం: సుశిక్షితులైన భటులు తమ ఆయుధాల దెబ్బలతో నేలకు ఒరిగిపోయేవారిపట్ల కొంచెంకూడా జాలి చూపించరు. అయితే ఎదుటివారిని ఎదుర్కొనాలని విజృంభించి తమ పోట్లకు గురియైన మేటి సైనికులను చూచి మెచ్చుకొంటారు. వడివడిగా యుద్ధంచేసి తమ ఆయుధాల దెబ్బలకు నేలమీద పడిపోయిన వీరులను త్రొక్కుకుంటూ, నెత్తురు ఏరులు పారేటట్లు చేస్తూ ఉత్సాహంతో ఏచోటికైనా వారు ముందుకు సాగిపోతారు.

సీ. ఒక్కఁడు పెక్కండ్ర కెక్కిన విచ్చియుఁ । బొదివి చెఱొకపోటు వొడుచు నెడలుఁ,
బలువు రొక్కనిమీఁదఁ బఱపిన సైరించి । నళికి పైఁ బెట్టక నిలుచు నెడలు,
దళము దళంబుతోఁ దాఁకి యగ్గలికమై । నీడఁబోవక వ్రేటులాడునెడలు,
నోహరి సాహరి నుయ్యాలచేరుగా । వెనుకొంచుఁ దెరలుచుఁ బెనఁగునెడలు

ఆ. నై యనేకభంగి నాశ్వికసేనలు । బొమ్మ లాడినట్లు పోరుచుండె
నమరగణము సిద్ధ సమితియు వేడుకఁ । జదల నిలిచి చూచి సంస్తుతింప. 165

ప్రతిపదార్థం: ఒక్కఁడు= ఒకడు; పెక్కండ్రకున్= అనేకులను; ఎక్కినన్= ఎదుర్కొనగా; విచ్చియున్= (వారు) చీలిపోయి కూడ; పొదివి= (మరల) క్రమ్ముకొని; చెఱి+ఒకపోటు= ఒకరొకరూ ఒక్కొక్క పోటు; పొడుచు= పొడుచునట్టి; ఎడలున్= ప్రదేశాలూ; పలువురు= చాలామంది; ఒక్కనిమీఁదన్= ఒకడిపై; పఱపినన్= వేగంతో వచ్చిపడగా; సైరించి= ఓర్చుకొని; అళికి= జంకి; పైన్+పెట్టక నిలుచునెడలు= పైకిపోక నిలిచే చోటులు; దళము దళంబుతోన్+తాఁకి= గుఱ్రాల సైన్య విభాగం మరొక గుఱ్రాల సైన్య విభాగంతో తలపడి; అగ్గలికమైన్= ఎక్కువగా; ఈడన్+పోవక= వెనుకంజవేయక; వ్రేటులాడు+ఎడలున్= దెబ్బలాడే తావులు; ఓహరిసాహరిన్= నేనంటే నేనంటూ (అహమహమికతో); ఉయ్యాలచేరుగాన్= ఊయలతాడువలె (తాడు ఉయ్యాలవలె); వెనుకొంచున్= వెనుకకు ఒరుగుతూ; తెరలుచున్= ముందుకు దూసుకొని వస్తూ; పెనఁగు+ఎడలున్= పెనగులాడే ప్రదేశాలు; ఐ= అగుచు; అనేక భంగిన్= నానా విధాలుగా; ఆశ్వికసేనలు= గుఱ్రపు రౌతుల సేనలు; అమరగణమున్= దేవతల సమూహాలూ; సిద్ధ సమితియున్= సిద్ధుల సమూహాలూ; చదలన్= ఆకసంలో; నిలిచి= నిలబడి; వేడుకన్= కుతూహలంతో; చూచి= చూచి; సంస్తుతింపన్= కీర్తించగా; బొమ్మలు+ఆడినట్లు= బొమ్మలు ఆడినట్లుగా; పోరుచున్+ఉండెన్= యుద్ధం చేస్తున్నాయి.

తాత్పర్యం: ఒక అశ్వికుడు పలువురు అశ్వికుల మీదకు దూసుకొని వస్తే ఆ గుంపు చీలిపోయి ఆ అశ్వికుడి పోటు నుండి రక్షించుకొని, అంతలో ఆ చీలిపోయిన గుంపులు ఒక్కటై ఆ అశ్వికుడిని రెండు వైపుల నుండి దాడి చేసి పోట్లాడే ఘట్టాలూ, పలువురు అశ్వికులు ఒకడి మీదకు దాడి చేయగా అతడు దానికి ఓర్చుకొని, జంకి దూరంగా పోకుండా, అక్కడే స్థిరంగా నిలిచి అందరితో పోరు చేసే ఘట్టాలూ, ఒక అశ్వసైన్య విభాగం మరొక అశ్వసైన్య విభాగంమీద దాడి చేసి పోరు తీవ్రంగా సాగించినా ఏ విభాగమూ వెనుదీయకుండా పరస్పరం క్రుమ్ము లాడుకొనే ఘట్టాలూ, అశ్వసేనలు పరస్పరం ఢీకొని, మేమంటే మేము అనే పెనుగులాటలో ఉయ్యాలత్రాడువలె ఒకసారి వెనుకకు ఒదుగుతూ, మరొకసారి ముందుకు పొడుచుకొని వస్తూ పోట్లాడే ఘట్టాలూ ఏర్పడి రకరకాలుగా బొమ్మలాట లాడినట్లు అశ్వికసేనలు యుద్ధం చేశాయి. ఆ యుద్ధాన్ని ఆకాశంలో దేవతలు, సిద్ధులు గుంపులు గుంపులుగా కూడి నిలిచి ఆసక్తికరంగా చూస్తూ ప్రశంసించారు.

విశేషం: అలం: ఉపమ. అశ్వసేనలు యుద్ధం చేసే తీరును కళ్ళకు కట్టేట్లు వర్ణించాడు తిక్కన. మిట్టమీద నిలబడి మైదానంలో జరుగుతున్న గుఱ్రాల రౌతుల పోరును చూస్తే ఆకాశంలో నిలబడిన దేవతలకు వలెనే మనకూ కనపడేటట్లు విహంగవీక్షణంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(Areal view) దర్శింప చేశాడు కవి. ఇందులో ప్రధాన లక్షణం- అశ్వసేనలు మేము గొప్పంటే మేము గొప్ప అని నిరూపించుకొనటానికి యుద్ధం చేయటం! అందువలన ఒకసారి ఒకవైపు సేన వెనుకాడినట్లు కనబడుతుంది. మరొకసారి మరొకవైపు సైన్యం వెనకాడిన ట్లౌతుంది. వెనుకబడిన సేనను మరొక సేన పోటెత్తుతున్నట్లుగా ఉంటుంది. దూరం నుండి చూస్తే గుర్రాల దండుల కదలిక ఊయల ముందుకూ వెనక్కూ ఊగుతున్నట్లు అందంగా కనపడుతుంది. ఇది మూడు రకాలుగా ఉంటుంది. ఒక రౌతు పలువురితో ఢీకొన్నప్పుడు పలువురు ఒక రౌతును చుట్టుముట్టినప్పుడు. ఒక సేనలోని విభాగం మరొక సేనలోని విభాగంతో ముఖాముఖి తలపడ్డప్పుడు. ఈ మూడూ ప్రత్యేకంగా చూచినా, సామూహికంగా చూచినా ఊయల ఊగినట్లుండటమే కాకుండా బొమ్మలాడినట్లుంటాయట! బొమ్మలాడటం అంటే పిల్లలు గుర్రాల బొమ్మలు పెట్టుకొని పోట్లాటల ఆట ఆడినట్లు కదలిక లున్నాయని ఒక అర్థం. బొమ్మలాట లాడేవారు బొమ్మలను ఆడించినట్లు ఉన్నాయని మరొక అర్థం ఏర్పడుతుంది. ఎక్కుట, విచ్చుట, పొదువుట, పోటు పొడుచుట, ఎడలుట, పఱచుట, పైఁబెట్టుట, తాకుట, వీడఁబోవుట, వ్రేటులాడుట, ఉయ్యాల చేరుగా వెనుకొనుట, తెరలుట, పెనఁగుట మొదలైనవన్నీ యుద్ధభంగులను తెలుగులో చెప్పగల దేశిపదసంపద, తిక్కన కాలం నాటి యుద్ధ పదజాలం, పరిభాష ఇందులో తొణకిసలాడుతున్నది. (సంపా.)

వ. ఒక్కయెడ. 16

తాత్పర్యం: ఒకచోట.

ఉ. ఒండొరు మీఱు కోర్కిమెయి నొక్కట బాసలవారు సొచ్చినన్
రెండయి పాయ యిచ్చిన యరిప్రకరంబులు వేఱువేఱ యు
ద్దండ భుజాబలం బలరఁ దాఁకిన సంగడిఁ బాఱుచుండఁగా
గం డమరంగ నిల్చి చెలికాండ్రయి క్రమ్మఱ వత్తు రిద్దఱున్. 167

ప్రతిపదార్థం: బాసలవారు= 'నన్ను గెలిచేవారెవరైనా ఉంటే నాతో ద్వంద్వ యుద్ధానికి రండి, ఇదే నా సవాలు!' అని ప్రతిజ్ఞలు చేసే వీరులు; ఒక్కటన్= ఒకచోట; ఒండొరున్= ఒకరిపై మరొకరు; మీఱుకోర్కి మెయిన్= మించాలనే కోర్కెతో; చొచ్చినన్= ఒకరి మీదకు ఒకరు సూటిగా బాణం వలె చొచ్చుకొని పోతూ ఉండగా; అరి ప్రకరంబులు= శత్రువులసమూహాలు; రెండు+అయి= రెండుగా చీలి; పాయ+ఇచ్చినన్= దారినివ్వగా; ఉద్దండ, భుజా, బలంబు= మేటి బాహువుల బలం; అలరన్= ఒప్పారగా; వేఱు వేఱ= విడివిడిగా; తాఁకినన్= ఎదుర్కొనగా; సంగడిన్= సమీపంలో ఉన్నవారు; పాఱుచున్+ఉండఁగాన్= భయంతో పరుగెత్తుతూ ఉంటే; గండు+అమరంగన్= పౌరుషం ప్రకాశించేటట్లు; నిల్చి= రణరంగంలో యుద్ధంమాని నిలువబడి; ఇద్దఱున్= ఇరువురూ; చెలికాండ్రు+అయి= స్నేహితులై; క్రమ్మఱన్= తిరిగి; వత్తురు= వస్తారు.

తాత్పర్యం: ఆ రణరంగలో ఒకచోట ఒకరిమీద ఒకరు గెలుపు సాధిద్దామని వీరు లిద్దరు ద్వంద్వయుద్ధం చేసే వైఖరి గోచరిస్తుంది. ప్రతిజ్ఞలు చేసిన ఇద్దరు వీరులు ఒకరిమీదికి మరొకరు కాలుదువ్వి పోరుకు సిద్ధం కాగా రెండు వైపులా ఉన్న శత్రుసేనలు రెండుగా చీలి వారికి బాసటనిలిచి పోరుకు వీలు కల్పించాయి. వారిద్దరూ ఎవరికి వారు తమ మేటి భుజబలం ప్రకాశించేటట్లు ఢీకొని పోరాడసాగారు. అప్పుడు ప్రక్కన ఉన్న సేనలు భయపడి దూరంగా తొలగిపోయాయి. దానిని చూచి తమ పరాక్రమం ప్రకటితమయ్యేటట్లు ఠీవిగా నిలబడి, ఆ తరువాత స్నేహితుల వలె ఇద్దరూ కలిసి తిరిగి వచ్చేవారు.

సీ. కరశీకరంబులుఁ గరట గళద్దాన । తోయంబులును ధరాధూళి మ్రింగఁ,
బొడవుల సడిసన్న యొడళులడెక్కియ । మ్ముల పెంపు గగనంబు గొలఁదివెట్ట
బృంహిత ధ్వనులును బృథుల ఘంటావళీ । రవములు దిక్కుల నవులఁద్రోవ
రోషారుణాక్షుల రుచులును సిందూర । కాంతియు రవి దీప్తిఁ గ్రమ్మఱింప

తే. జోదు లొక్కట వా లంపసోన గురియ । రౌద్ర రస మాకృతులఁ దాల్చి రణ మొనర్చు
కరణి నత్యుగ్రముగఁ గరి ఘటలు గడఁగి । కలను పీనుంగు పెంటగాఁ గలయ బెరసె. 168

ప్రతిపదార్థం: కరశీకరంబులున్= ఏనుగుల తొండాల నుండి పుట్టే మదజలపు తుంపరలును; కరటగళత్+దానతోయంబులును= ఏనుగుల చెక్కిళ్ళ నుండి జారే మదజలాల జల్లులును; ధరాధూళిన్= భూమి మీది దుమ్మును; మ్రింగన్= మింగివేయుగా (అనగా నేలమీది దుమ్మును అణచివేయగా); పొడవులన్= ఔన్నత్యంలో, ఎత్తులో; సడి+చన్న= అపకీర్తిలేని, కీర్తిగాంచిన; ఒడళుల= శరీరాల; డెక్కియమ్ముల పెంపు= టెక్కెముల యొక్క ఆధిక్యము; గగనంబున్+కొలఁది+పెట్టన్= ఆకాశాన్ని పరిమితంచేయగా; బృంహితధ్వనులును= ఘీంకార శబ్దాలూ; పృథుల ఘంటావలీరవములు= (ఏనుగుల ఉభయ పార్శ్వాలలో వ్రేలాడదీసే గంటలు) పెద్దపెద్ద గంటల వరుసల చప్పుడులూ; దిక్కులన్= దిక్కులను; అవులన్ త్రోవన్= ఆవలికి నెట్టివేయగా; రోష= కోపంతో; అరుణ= ఎఱ్ఱనయిన; అక్షుల= చూపుల యొక్క; రుచులును= కాంతులూ; సిందూరకాంతియున్= ఏనుగుల నెన్నుదుట దిద్దే సిందూరం యొక్క చెంగావిరంగూ; రవిదీప్తిన్= సూర్యకాంతిని; క్రమ్మఱింపన్= వెనుకకు మరలించగా (ఓడించగా); జోదులు= వీరులు; ఒక్కటన్= ఒక్కుమ్మడిగా; వాలు+అమ్ము+సోన= వాడి అయిన బాణాల వాన; కురియన్= కురిపించగా; రౌద్రరసము; ఆకృతులన్+తాల్చి= వివిధ ఆకారాలుగా రూపొంది; రణము+ఒనర్చు= యుద్ధం చేస్తున్న; కరణిన్= విధంగా; అతి+ఉగ్రముగన్= మిక్కిలి భయంకరంగా; కరిఘటలు= ఏనుగుల గుంపులు; కడఁగి= పూనుకొని; కలను= యుద్ధభూమి; పీనుంగు పెంట+కాన్= పీనుగుల కుప్పగా మారేటట్లు; కలయన్+బెరసెన్= కలియబడ్డాయి (ఢీకొన్నాయి, పోట్లాడాయి).

తాత్పర్యం: ఏనుగుల తొండాల నుండి పుట్టే మదజలాల తుంపరలూ, చెక్కిళ్ళ నుండి జారే మదజలాల వానలూ భూమి మీది దుమ్మును అణచివేయగా, ఎత్తయిన ఏనుగుల శరీరాలూ, పొడవైన టెక్కెముల ఔన్నత్యము ఆకాశాన్ని కించపరచగా, ఆ ఏనుగుల ఘీంకారాలూ, వాటి ఉభయ పార్శ్వాలలో వ్రేలాడే పెద్ద పెద్ద గంటల నినాదాలూ దిక్కులను ఆవలకు నెట్టివేయగా, కోపంతో ఎఱ్ఱబడిన కన్నుల కాంతులూ, సిందూరపు చెంగావి కాంతులూ సూర్యుడి వెలుగును వెలవెలపోయేటట్లు చేయగా, యుద్ధవీరులు వాడి అయిన బాణాల వాన కురియించగా రౌద్రరసమే రూపాలు ధరించి, యుద్ధం చేస్తున్నట్లుగా ఏనుగుల గుంపులు విజృంభించి రణరంగాన్ని పీనుగుల కుప్పగా మార్చి కలియబడ్డాయి.

విశేషం: అలం: అతిశయోక్తి. రౌద్రరసం ఆకృతి తాల్చినట్లున్న ఏనుగులను నాట్య పరిభాష కనుగుణంగా వర్ణించటం తిక్కన ప్రదర్శించిన నాటకీయత, నటులలో వలెనే జంతువులలో కూడా రసభావముద్రలు ఉంటాయని తిక్కన ఈ పద్యంలో ప్రపంచించాడు. ఉత్సాహభావాన్ని ప్రదర్శించే సాత్త్వికభావం మదజలస్రావం. అది దుమ్మును అణచేంతగా కురిసిందనటం అతిశయోక్తి. ఏనుగులు రౌద్రభావంతో మేనులు పెంచి గర్వంగా నిలబడతాయి. వాటి ఆకారాలు ఆకాశాన్ని కొలుస్తున్నట్లున్నా యనటం అతిశయోక్తి. రౌద్రభావాలు మానవులలో వీరాలాపాలతో ప్రకటితమైనట్లు ఏనుగులలో ఘీంకారాలతో, ఘంటాధ్వనులతో ప్రకటితమౌతాయి. రౌద్రభావం వలన కన్నులూ, నెన్నుదురులూ ఎఱ్ఱబడటం సహజం. అట్లాగే ఏనుగుల కళ్ళూ, సిందూరకాంతితో

నొసళ్ళూ ఎర్రని కాంతులు వెదచల్లాయి.సైనికులు బాణాలు గుప్పించగా రౌద్రం మూర్తికట్టినట్లు ఉగ్రంగా ప్రలయతాండవం చేసి ఏనుగుల గుంపులు రణరంగాన్ని పీనుగుల కుప్పలతో నింపివేశాయి. ఇది రుద్రకర్మ, ఈ విధంగా గజసైన్యాన్ని రౌద్రవీరులుగా వర్ణించి రసశిల్పాన్ని చిత్రించిన కళా ఖండం ఈ పద్యం. (సంపా.) పద్యంలోని 'దెంచెనముల' అనే పాఠం కంటె 'డెక్కియముల' అనే పాఠం మేల్తరం.

ఉ. అక్కజమైన శౌర్యమును నద్భుత సంపద నొందు శక్తులుం
జిక్కని మేనులున్ మొనకుఁ జెల్వగు కైదువులుం దగంగ ను
క్కెక్కిన యట్టి మేటి మగ లించుక వారణలేక ఖేచరు
ల్వెక్కస మంద నొచ్చియుఁ జలింపక పోరిరి పెక్కుభంగులన్. 169

ప్రతిపదార్థం: అక్కజము+ఐన శౌర్యమునున్= ఆశ్చర్యం కలిగించే పరాక్రమాన్ని; అద్భుత సంపదన్+ఒందుశక్తులున్= ఆశ్చర్యకరమైన వైభవాన్ని పొందే సామర్థ్యాలూ; చిక్కని మేనులున్= దృఢమైన శరీరాలున్నూ; మొనకున్= సేనకు; చెల్వు+అగు= అందాన్ని చేకూర్చే; కైదువులున్= ఆయుధాలున్నూ; తగంగన్= తగినట్లుగా; ఉక్కు+ఎక్కిన+అట్టి= మదం అతిశయించిన; మేటిమగలు= గొప్పవీరులు; ఇంచుక= ఒకింత; వారణలేక= అడ్డులేకుండా; ఖేచరుల్= ఆకాశాన విహరించే దేవతలు; వెక్కసము+అందన్= అబ్బురపడేటట్లు; నొచ్చియున్= యుద్ధంలో గాయాలు ఏర్పడి బాధలు పడుతూ కూడా; చలింపక= జంకకుండా; పెక్కుభంగులన్= అనేక విధాలుగా; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: మదించిన మేటి వీరులు అబ్బురమైన పరాక్రమాన్నీ, అద్భుతశక్తి సంపదనూ, దిట్టమైన శరీరాలనూ, సేనకే అందాన్ని చేకూర్చే ఆయుధాలనూ కలిగి, దేవతలు కూడా చూచి ఆశ్చర్యపడేటట్లు, శరీరాలకు దెబ్బలు తగిలి బాధ కలిగిస్తున్నా లెక్కచేయకుండా అనేక విధాలుగా యుద్ధం చేశారు.

సీ. నొగనొగతోఁ దాఁకి పగులంగ నరదంబుఁ। బఱపి యా తేరిపై కుఱుకువారు.
రథ్యముల్ వడ్డ విరథులయ్యు నసి ముద్గ। రాదుల నడరి పోరాడువారు,
సారథి నొచ్చినఁ దేరును గడపుచు। నేయుచుఁ గయ్యంబు సేయువారు,
నరదంబుపైవ్రాలి యాలోన దెలిసి త। న్నేసినాతనిఁ బడ నేయువారు

తే. నగుచు రథికనికాయంబు లడరి యప్ర। మత్త నిజచిత్తవృత్తులై మగతనంబు
ఘోరమూర్తులు గైకొని పోరునట్లు। సలిపె సంగ్రామకేళి సంకులముగాఁగ 170

ప్రతిపదార్థం: రథిక నికాయంబులు= రథికుల సమూహాలు; అడరి= విజృంభించి; నొగ= తమ తేరి కాడి (ముందుభాగం); నొగతోన్= మరొక తేరు కాడితో; తాఁకి= ఢీకొని; పగులంగన్= పగిలిపోయేటట్లుగా, విరిగిపోగా; అరదంబున్= ఆ రథాన్ని; పఱపి= వేగంగా తోలి; ఆ తేరిపైకిన్= ఎదుటివారి రథం మీదికి; ఉఱుకు వారున్= పరుగెత్తి దూకే వారున్నూ; రథ్యముల్= రథానికి పూన్చిన గుర్రాలు; పడ్డన్= చనిపోగా; విరథులు+అయ్యున్= రథంలేనివారు ఐనప్పటికీ; అసి, ముద్గర+ఆదులన్= కత్తి, గుదియ మొదలైన ఆయుధాలతో; అడరి= విజృంభించి; పోరాడువారున్= యుద్ధం చేసేవారున్నూ; సారథి= రథం నడిపే సూతుడు; నొచ్చినన్= చనిపోగా; తేరును= రథాన్ని; కడపుచున్= తామే తోలుకొంటూ; కయ్యంబు+చేయువారున్= యుద్ధం చేసేవారున్నూ;

అరదంబుపైన్= రథంమీద; వ్రాలి= మూర్ఛపోయి; ఆలోనన్= అంతలోనే; తెలిసి= తేరుకొని, ఒడలు తెలిసి; తన్నున్+ఏసిన+ఆతనిన్= తనను బాణంతో కొట్టినవాడిని; పడన్+ఏయువారున్= పడగొట్టేవారున్నూ; అగుచున్= ఔతూ; అప్రమత్త= ప్రమాదపడని; నిజచిత్తవృత్తులు+ఐ= తమ మనప్రవత్తులు కలవారై; మగతనంబు= పౌరుషమే; ఘోరమూర్తులు= భయంకరమైన ఆకారాలను; కైకొని= తాల్చి; పోరు+అట్లు= యుద్ధం చేస్తున్నట్లు; సంకులము+కాఁగన్= చీకాకు పడేటట్లు; సంగ్రామకేళి= యుద్ధ క్రీడ; చలిపెన్= చేశారు.

తాత్పర్యం: రథికులు యుద్ధక్రీడ ప్రదర్శిస్తూ సంకులయుద్ధం చేశారు. ఒకరిపై ఒకరు దాడిచేసినప్పుడు తమరథం నొగలు ఎదుటి రథం నొగలకు గట్టిగాతాకి విఱిగిపోయేటట్లుగా వేగంగా తోలి, ఎదుటి రథం మీదికి దూకేవారు. రథాలకు కట్టిన గుఱ్ఱాలు కూలిపోతే విరథులైనా యుద్ధం మానకుండా కత్తులూ కటారులూ తీసికొని పోరాడేవారు. రథసారథి చనిపోతే తామే సారథ్యం చేసికొంటూ పోరును ఆపకుండా కొనసాగించేవారు. శత్రువులు కొట్టే బాణాల దెబ్బలకు రథంమీద స్పృహతప్పి పడిపోయినా, అంతలోనే తేరుకొని లేచి తనపై దాడి చేసిన వారిని తిప్పికొట్టి పడగొట్టేవారు-ఈ విధంగా ఏమరుపాటులేని చిత్తవృత్తులతో జాగరూకులై, పౌరుషమే భయంకరాకారాలు ధరించి పోరు చేస్తున్నదా అన్నట్లు ఆ రథికులు యుద్ధక్రీడలతో సంకుల సమరం చేశారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, అంత్యానుప్రాసం. ఏ యుద్ధాన్ని వర్ణించినా తిక్కన ఒక క్రమాన్ని, ప్రణాళికను పాటించటం మనం గమనిస్తాం. ఇందులో రథికుల సంకులసమరం వర్ణ్యవస్తువు. రథాలు ముందుగా నొగలతో ఢీకొంటాయి. నొగలు విరిగిపోతే గుఱ్ఱాలు పట్టుకోల్పోయి విరోధుల చేతిలో చనిపోతాయి. నొగలూ, గుఱ్ఱాలూ కూలిపోతే సారథి కుప్పకూలుతాడు. శత్రువుల చేతిలోపడి చనిపోతాడు. ఆ తరువాత చలనం లేని రథాలమీది రథికుడు దెబ్బతింటాడు. మూర్ఛపోతాడు. అయినా తేరుకొని వేరు రథాలమీదకైనా పోయి పోరు సాగిస్తాడు. ఇందులో రథాలూ, రథాంగాలూ శిథిలమైపోయినట్లు వర్ణించిన తిక్కన రథికులు ప్రాణాలు కోల్పోయినట్లు వర్ణించలేదు. అది విశేషం. ఆ వర్ణన పాండవుల యుద్ధఘట్టంలో చేస్తాడు. అదీ రహస్యం. అంత్యానుప్రాసం రథికుల సమబల సంకులత్వాన్ని సూచిస్తున్నది. (సంపా.)

వ. ఇ ట్లిరువాఁగును నరవాయి గొనక పెనంగుచుండ. 171

ప్రతిపదార్థం: ఇట్లు+ఇరువాఁగును= ఈ విధంగా రెండు పక్షాల వారును; అరవాయి+కొనక= జంకకుండా (సందేహించకుండా); పెనంగుచుండన్= యుద్ధం చేస్తూ ఉండగా.

తాత్పర్యం: పై విధంగా రెండు వైపుల సైన్యాలూ వెనుకాడకుండా పోరు సాగిస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. భీకరబాణ వర్షముల పెల్లున వైరులు పెల్లగిల్ల మౌ
ర్వీకృత గర్జితంబు పృథివీ వియదంతరమెల్ల నిండ ను
గ్రాకృతి కల్ప సంక్షయ మహాభ్రముచందము నొందుచున్ శతా
నీకుఁడు దాఁకెఁ గంకటమణిద్యుతి విద్యుదుపాంతకాంతియై. 172

ప్రతిపదార్థం: భీకరబాణవర్షముల పెల్లునన్= భయంకరమైన బాణాల వానలయొక్క ఆధిక్యం చేత; వైరులు= శత్రువులు; పెల్లగిల్లన్= చెల్లాచెదరైపోగా; మౌర్వీకృతగర్జితంబు= అల్లెతాటిని మీటటం వలన గలిగే గర్జన వంటి శబ్దం; పృథివీ, వియత్+అంతరము+ఎల్లన్= భూమ్యాకాశాల మధ్యలో ఉన్న ప్రాంతమంతా; నిండన్= నిండగా; ఉగ్ర+ఆకృతిన్= భయమును

కల్గించే ఆకారంతో; కల్ప సంక్షయ= ప్రళయకాలంలోని; మహా+అభ్రము= పెనుమేఘం; చందమున్= విధమును; ఒందుచున్= పొందుతూ; శతానీకుఁడు= విరటుడి తమ్ముడయిన శతానీకుడు; కంకట+మణిద్యుతి= కవచం యొక్క మణుల కాంతులనెడి; విద్యుత్+ఉపాంతకాంతి+ఐ= మెరుపుతీగలకాంతికి దగ్గరైన కాంతి కలవాడయి; తాఁకెన్= ముట్టడించాడు.

తాత్పర్యం: విరటుడి తమ్ముడైన శతానీకుడు భయంకరమైన బాణవర్షంతో శత్రువులు పెల్లగిలిపోగా, ధనుష్టంకార శబ్దం భూమ్యాకాశాల నడిమిభాగం నిండగా, ప్రళయకాల భయంకర మేఘం వలె తన కవచానికి పొదిగిన రత్నాల కాంతులు మెరుపు తీగల కాంతివలె మిరుమిట్లు గొలుపుతూ ఉండగా (శత్రువులను) ఎదుర్కొని ముట్టడించాడు.

విశేషం: అలం: రూపకానుప్రాణితమైన ఉపమ. శతానీకుడు ప్రళయకాలమేఘంతో పోల్చబడ్డాడు. అతడి అల్లెత్రాటిమ్రోత మేఘ గర్జగానూ, కవచ మణికాంతి మెరుపుల కాంతిగానూ శోభిల్లగా, అతడు బాణాలవర్షం కురిపించాడు. ప్రళయకాల మేఘస్వభావాన్ని తలపించాడు. ఉపమ రూపకానుప్రాణితం కావటం అలంకారశిల్పం. (సంపా.)

తే. **అతఁడు నానాప్రకార శస్త్రాస్త్ర నిహతి। నతుల విక్రమ విభవ మనర్గళముగ**
యోధసారథి యుగ్యసంయుతము గాఁగ। నూఱు రథములు వ్రేల్మిడి నుగ్గుచేసె. **173**

ప్రతిపదార్థం: అతఁడు= ఆ శతానీకుడు; నానాప్రకార= పలు రకాలైన; శస్త్ర+అస్త్రనిహతిన్= బాణాల, మంత్రసహిత బాణాల దెబ్బలతో; అతుల= సాటిలేని; విక్రమ= పరాక్రమం యొక్క; విభవము= ఐశ్వర్యం; అనర్గళముగన్= అడ్డులేని రీతిగా; యోధ= వీరులతో; సారథి= సారథులతో; యుగ్యసంయుతముకాఁగన్= గుర్రాలతో కూడా; నూఱు రథములున్= నూరు తేరులను; వ్రేల్మిడిన్= చిటికె వేసినంతకాలంలోగా; నుగ్గుచేసెన్= పొడిచేశాడు.

తాత్పర్యం: ఆ శతానీకుడు అనేక శస్త్రాస్త్రాలను ప్రయోగించి, సాటిలేని పరాక్రమ సంపదతో అడ్డులేని రీతిగా పోరి వీర రథికులతో, సారథులతో, గుర్రాలతో కూడిన నూఱు రథాలను క్షణకాలంలో పొడి పొడి చేసివేశాడు.

విశేషం: శతానీకుడు శత్రుసేనలోని రథికులను, రథాలను నుగ్గు చేశాడు. చతురంగ సేనలలో ఒక్కొక్కరు ఒక్కొక్క అంగాన్ని చంపి ధ్వంసం చేయటం ఈ యుద్ధంలోని విశేషం. (సంపా.)

మ. **మదిరాశ్వుండు కడంగి యన్నకు బలోన్మాదంబు రెట్టింప స**
ప్రదర జ్యా లతికాక్రియా సమభిహారక్రీడనం బప్పుడొ
ప్పిదమై యోగ వియోగ సంధులు నిరూపింపంగరాకుండఁ గ
ర్ణ దళోపాంతము వింతసేయ నడరెన్ రౌద్రంబు శోభిల్లఁగన్. **174**

ప్రతిపదార్థం: మదిరాశ్వుండు= మదిరాశ్వుడు; కడంగి= పూనుకొని; అన్నకున్= శతానీకుడికి; బల+ఉన్మాదంబు రెట్టింపన్= బలగర్వం ఇబ్బడి అయ్యేటట్లుగా; సప్రదర= బాణంతో కూడిన; జ్యాలతికా= లతవంటి నారియొక్క; క్రియా= బాణం తొడగటం, విడవటం అనే కార్యం యొక్క; సమభిహార+క్రీడనంబు= ఎడతెరిపిలేని చేష్టల ఆట; అప్పుడు= ఆ సమయంలో; ఒప్పిదము+ఐ= తగు విధంగా; యోగ వియోగసంధులు= బాణాలను ఎక్కుపెట్టడం, విడవటం అనే వాటి మధ్య ఉండే విరామాలు; నిరూపింపఁగన్= వేరుపరచి చెప్పటానికి; రాకుండన్= వీలుకాకుండగా; కర్ణదళ+ఉపాంతము= చెవి సమీప ప్రదేశం; వింత+చేయన్= ఆశ్చర్యం కలిగించగా; రౌద్రంబు= రౌద్రరసం; శోభిల్లఁగన్= ప్రకాశించగా; అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: మదిరాశ్వుడు తన అన్న శతానీకుడు ప్రదర్శించిన బలోన్మాదాన్ని ఇనుమడింప జేసేటట్లు మనోజ్ఞంగా ధనుర్విద్యా ప్రదర్శనం చేశాడు. అల్లెత్రాడు ఆకర్ణాంతంగా లాగి బాణాలు తొడుగుతూ, ప్రయోగిస్తూ ఉన్నా, ఆ రెండు క్రియలకూ మధ్య ఉండే విరామం ఎవరికీ తోచకుండా చెవిదగ్గరే నిరంతరాయంగా జ్యాలతను అద్భుతంగా నిలుపుతూ రౌద్రరసం రాణించేటట్లు బాణవిద్యను ప్రదర్శించాడు.

క. **అడరివడి రథచతుశ్శతి । పొడిసేసి, పరాక్రమం బపూర్వంబై యే**
ర్పడఁ గరిహయ నరనికరము । బడలుపడం దఱిమె నలి నభశ్చరు లార్వన్. **175**

ప్రతిపదార్థం: అడరి= అతిశయించి; వడిన్= త్వరగా; రథచతుశ్శతి= నన్నూరుతేరులను; పొడి+చేసి= నుగ్గుగాచేసి; పరాక్రమంబు= ప్రతాపం; అపూర్వంబు+ఐ= అబ్బురపాటు కలిగించేదై; ఏర్పడన్= వెల్లడికాగా; కరి= ఏనుగుల; హయ= గుర్రాల; నరనికరము= కాల్బలాల సమూహాలు; బడలుపడన్= శ్రమనందగా; నభశ్చరులు= దేవతలు; ఆర్వన్= బిగ్గరగా కీర్తించగా; తఱిమెన్= తరిమి కొట్టాడు.

తాత్పర్యం: ఆ మదిరాశ్వుడు విజృంభించి వేగంగా నాలుగువందల రథాలను నుగ్గునుగ్గు చేశాడు. అబ్బురపాటు కలిగించే ప్రతాపం ప్రకటించి ఆకాశాన దేవతలు గొప్పగా మెచ్చుకొనేటట్లు ఏనుగుల, గుర్రాల, పదాతుల సమూహాలను బాధించి తరిమికొట్టాడు.

విశేషం: చతురంగ బలాలను క్రమంగా మర్దించటం ఇందులో విశేషం.

ఉ. **మండలచారియై రథ మమానుషవిక్రమలీల నొప్ప ను**
ద్దండ భుజాబలంబు ప్రథితంబుగ నత్తఱిఁ దాఁకి సూర్యద
త్తుం డనివార్య శౌర్యగుణ ధుర్యుఁడు వీఁడ యనంగఁ బేర్చి వే
దండ ఘటావిపాటనవిదగ్ధతఁ బొల్చె రణాంగణంబునన్. **176**

ప్రతిపదార్థం: సూర్యదత్తుండు= సూర్యదత్తుడు; రథము= తేరును; మండలచారి+ఐ= గుండ్రంగా తిరిగే దానిగా చేసి; అమానుష విక్రమలీలన్= మానవాతీతమయిన శౌర్యంతో; ఒప్పన్= తగిఉండగా; ఉద్దండ భుజాబలంబు= భయంకరమైన భుజబలం; ప్రథితంబుగన్= ప్రఖ్యాతితో; ఆ+తఱిన్= ఆ సమయంలో; తాఁకి= ముట్టి; అనివార్య= అడ్డుకొన వీలుకాని; శౌర్యగుణధుర్యుఁడు= వీరగుణంలో నేర్పరియైనవాడు; వీఁడు+అనంగన్+పేర్చి= వీడే సుమా అనగా విజృంభించి; వేదండ ఘటా= ఏనుగుల సైన్యాన్ని; విపాటన= నాశనం చేయటంలో; విదగ్ధతన్= నేర్పుతో; రణ+అంగణంబునన్+పొల్చెన్= యుద్ధరంగంలో ప్రకాశించాడు.

తాత్పర్యం: ఆ సమయంలో సూర్యదత్తుడు రథాన్ని మండలచారిగా తిప్పుతూ సాటిలేని పరాక్రమంతో తాకి ఎదురులేని శౌర్యంలో మేటి వీరుడు వీడే సుమా అన్నట్లు మదపుటేనుగుల సైన్యాన్ని నాశనం చేసే నేర్పరితనంతో యుద్ధరంగంలో వెలుగొందాడు.

ఉ. **అప్పుడు శంఖుఁ డెంతయుఁ బ్రియంబునఁ బెండ్లికిఁ బోవునట్లు మో**
మొప్పఁగ నస్త్రశస్త్రముల యుల్లసనంబున శత్రునేత్రముల్
కప్పఁగఁ జీఁకటుల్ రణముఖంబు సమస్తముఁ దానయై రథం
బుప్పర వీథిఁ దోలికొని యుగ్రగతిం బఱతెంచి తాఁకినన్. **177**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; శంఖుఁడు; ఎంతయున్= మిక్కిలి; ప్రియంబునన్= ప్రీతితో; పెండ్లికిన్+పోవునట్లు= పెండ్లికి పోతున్నట్లుగా; మోము+ఒప్పఁగన్= ముఖం ప్రకాశించగా; అస్త్రశస్త్రములు= బాణాలయొక్క, మంత్రసహిత బాణాలయొక్క, ఉల్లసనంబునన్= ఉల్లాసంతో; శత్రునేత్రముల్= విరోధుల కన్నులు; చీఁకటుల్+కప్పఁగన్= మిరుమిట్లు కొలుపగా; రణముఖంబు= యుద్ధభూమి ముందుభాగం; సమస్తమున్= అంతా; తాను+అ+ఐ= తానే అయి; రథంబు= తేరును; ఉప్పరవీథిన్= ఆకాశమార్గంలో; తోలికొని= తోలుకొంటూ; ఉగ్రగతిన్= భయంకరరీతిలో; పఱతెంచి= వచ్చి; తాఁకినన్= ఎదుర్కొనగా.

తాత్పర్యం: అప్పుడు విరటుడి కొడుకు శంఖుడు పెండ్లికి వెళ్ళుతున్నట్లు ముఖం వెలుగొందగా అస్త్రశస్త్రాల కాంతులు ఎదుటి వైరుల కన్నులను మిరుమిట్లు కొలిపి చీకట్లు క్రమ్మేటట్లు చేయగా యుద్ధరంగమంతా తానే అయి, తన తేరును ఆకాశమార్గంలో వేగంగా తోలికొని వచ్చి భయంకరంగా ఎదుర్కొనగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: అతిశయోక్తి.

తే. **మందరాచల చటుల విమర్దనమున । ఘూర్ణమానమై గాఢ సంక్షోభ మెసఁగఁ**
దలఁకు జలనిధి నాఁ ద్రిగర్తక్షితీశు । బలము తిరుగుడువడియె సంకులముగాఁగ. **178**

ప్రతిపదార్థం: మందర+అచల= మందర పర్వతం యొక్క; చటుల= తీవ్రమైన; విమర్దనమునన్= చిలకటం వలన; ఘూర్ణమానము+ఐ=సుళ్ళు తిరుగునట్లయిన; గాఢ= మిక్కిలి; సంక్షోభము++ఎసఁగన్= కల్లోలమొప్పగా; తలఁకు= చలించే; జలనిధి నాన్= సముద్రమో అన్నట్లు; త్రిగర్తక్షితి+ఈశుబలము= సుశర్మసేన; సంకులము+కాఁగన్= తికమకపడి; తిరుగుడు పడియెన్= కలతపడింది.

తాత్పర్యం: మందరపర్వతం చేత మథించబడటం వలన సుళ్ళు తిరుగుతూ అల్లకల్లోలమయిన సముద్రమా అన్నట్లు సుశర్మ సైన్యం తికమకచెంది కలతపడింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. **అయ్యవసరంబునం దక్కిన దొరలును దలపడి యతిభీమంబుగా సంగ్రామంబు సేయం దొడంగిన.** **179**

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= అట్టి సమయంలో; తక్కిన దొరలును= మిగిలిన సామంతులు కూడా; తలపడి= ఎదుర్కొని; అతిభీమంబుగాన్= మిక్కిలి భయంకరంగా; సంగ్రామంబు చేయన్+తొడంగినన్= యుద్ధం చేయ మొదలిడగా.

తాత్పర్యం: ఆ సమయంలో మిగిలిన సామంతులు కూడా ఎదుర్కొని మిక్కిలి భయంకరంగా యుద్ధం చేయటానికి మొదలుపెట్టగా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **అనుజ తనూజ మంత్రి సుభటాప్తజనంబుల పోరు చూచి నె**
మ్మనమునఁ బొంగి మై పెనిచి మత్స్యమహీరమణుండు సారథిం
గనుఁగొని 'యల్ల కంటె మొనఁ గ్రాలుచునున్నత్రిగర్తనాథు కే
తనమున చక్కటిన్ మన రథంబు వెసం జన నిమ్ము' నావుడున్. **180**

ప్రతిపదార్థం: మత్స్యమహీరమణుండు= మత్స్యదేశ ప్రభువైన విరాటుడు; అనుజ= తమ్ముల యొక్కయు; తనూజ= కుమారుడి యొక్కయు; మంత్రి= మంత్రుల యొక్కయు; సుభట= సుశిక్షితులయిన సైనికులయు; ఆప్తజనంబుల= ఆత్మీయులయు; పోరు= యుద్ధాన్ని; చూచి; నెఱ+మనమునన్= తన నిండు మనసులో; పొంగి= ఉప్పొంగి; మైన్+పెనిచి= తన శరీరాన్ని పెంచి (ఉత్సాహపడి); సారథిన్+కనుఁగొని= తన సారథిని చూచి; అల్లకంటె?= అదిగో చూచావా?; మొనన్= సేన మొదట్లో; క్రాలుచున్+ఉన్న= ప్రకాశిస్తున్న; త్రిగర్తనాథున్= సుశర్మయొక్క; కేతనమున చక్కటిన్= ధ్వజం ఉన్న చోటికి; మన రథంబు= మన తేరును; వెసన్= త్వరగా; చనన్+ఇమ్ము= పోనిమ్ము; నావుడున్= అనగా.

తాత్పర్యం: విరాటుడు తన తమ్ముల, కుమారుడి, మంత్రుల, సుశిక్షితులైన సైనికుల, ఆప్తుల యుద్ధాన్ని చూచి, అంతరంగంలో ఉప్పొంగి, ఉత్సాహంతో మేను పెంచి, సారథిని చూచి, 'ఆ సేన మొదట్లో వెలుగొందుతున్న సుశర్మ కేతనాన్ని చూచావా? దాని దగ్గరికి మన తేరును పోనిమ్ము' అనగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **అగ్గలిక నతఁడు హయముల । పగ్గంబులు సడల విడిచి పటురయమున నా**
మొగ్గరము దఱియఁ బఱపిన మ్రగ్గెను రథపంచశతము మత్స్యాధిపుచేన్. **181**

ప్రతిపదార్థం: అతఁడు= విరటుడి సారథి; అగ్గలికన్= ఉత్సాహంతో; హయముల పగ్గంబులు= గుర్రాల పగ్గాలు; సడలన్+విడిచి= వదులుగా విడిచి; పటురయమునన్= మిక్కిలి వేగంతో; ఆ మొగ్గరము= ఆ వ్యూహమును (సేనను); తఱియన్= సమీపించేటట్లు; పఱపినన్= పరువెత్తించగా; మత్స్య+అధిపుచేన్= విరాటుడిచేత; రథపంచశతము= అయిదువందల రథాలు; మ్రగ్గెను= కూలిపోయాయి.

తాత్పర్యం: విరటుడి సారథి గుఱ్ఱాల పగ్గాలను వదలి మిక్కిలి వేగంతో ఆ సైన్యాన్ని చేరేటట్లు వాటిని పరుగెత్తించగా విరాటుడు ఐదునూర్ల రథాలను కూల్చివేశాడు.

మ. **అవనీనాయకుఁ జూచి యేచి నలి వీరావేశ దుర్దాంతమై**
కవిసెం గుంత భుశుండి తోమర గదా ఖడ్గాది శస్త్రాస్త్ర తీ
వ్ర విహారంబు విరోధి దుర్విషహ సంరంభంబుగా నొక్కపె
ట్ట వడిం దద్బల మెల్ల నారదుఁడు వేడ్కం గుంచె సారింపఁగన్. **182**

ప్రతిపదార్థం: అవనీనాయకున్+చూచి= రాజును చూచి; (విరటుడిని చూచి); తద్బలము+ఎల్లన్= ఆ సైన్యమంతా; ఏచి= విజృంభించి; నలిన్= మిక్కిలి; వీర+ఆవేశ= వీరోద్వేగంతో; దుర్దాంతము+ఐ= అణచటానికి వీలుకానిదై; కుంత, భుశుండి, తోమర, గదా, ఖడ్గ+ఆది= ఈటెలు, తోమరాలు, గదలు, కత్తులు మొదలైన; శస్త్ర+అస్త్ర= బాణములతోను, మంత్ర సహిత బాణాలతోను, తీవ్రవిహారంబు= వేగంగా చేసే సంచారం; విరోధి= శత్రువులకు; దుర్విషహ= సహించటానికి శక్యంకాని; సంరంభంబు+కాన్= అట్టహాసం కాగా; నారదుఁడు= నారదమహర్షి; కుంచె= తన కుంచెను; వేడ్కన్= కుతూహలంతో; సారింపఁగన్= ఆడించగా; ఒక్కపెట్టు+అ= ఒక్కుమ్మడిగా; వడిన్= వేగంగా; కవిసెన్= ఎదిరించింది.

తాత్పర్యం: తమ రాజైన విరాటుడి ఉత్సాహాన్ని చూచి సైన్యమంతా విజృంభించి, తిరుగులేని ఉత్సాహాతిశయంతో కుంతాలు, భుశుండులు, తోమరాలు, గదలు, ఖడ్గాలు మొదలైన శస్త్రాస్త్రాలతో తీవ్రవిహారం చేస్తూ, శత్రువులకు సాధ్యంకాని అట్టహాసంతో ఎదుర్కొన్నది. ఆ సన్నివేశాన్ని చూచి కలహప్రియుడైన నారదుడు చేతితో కుంచె ఆడిస్తూ నాట్యంచేశాడు.

విశేషం: భుశుండి=జాలను చిమ్ము చర్మమయమగు ఆయుధము. సూ.రా.ని.

వ. ఇవ్విధంబున విరాటుండు తానును సేనయుం జేయం గలవారును, బరవసంబు సేసి యొక్కుమ్మడి నడరుటయుం, దెరలి మరలిన నిజసైన్యంబు దైన్యంబు గలయం గనుంగొని, కోపాటోపంబునం గెంపుగదురు లోచనంబులుం బెంపొలయు భుజశిఖరంబులుం గలిగి తానుం దమ్ముండును సంగడంబుగాఁ గోల్తలసేసి రథసమూహంబుతో విరాటవ్యూహంబు నెదురుకొని. 183

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; విరాటుండు= విరాటరాజు; తానును; సేనయున్+చేయన్+కలవారును= తానూ, సేనా, యుద్ధం చేయగలవారున్నూ; బరవసంబు+చేసి= ధైర్యంచేసి (సాహసించి); ఒక్క+ఉమ్మడిన్= ఒక్కసారిగా; అడరుటయున్= విజృంభించగా; తెరలి=కలగి; మరలిన= వెనుతిరిగిన; నిజసైన్యంబు= తన సేన; దైన్యంబు= దీనత్వాన్ని; కలయన్+కనుంగొని= సమీక్షించి; కోప+ఆటోపంబునన్= ఎక్కువ అయిన కోపంతో; కెంపు+కదురులోచనంబులు= ఎర్రనైన కన్నులు; పెంపు+ఒలయు= గొప్పవిఅగు; భుజశిఖరంబులున్+కలిగి= ఎత్తయిన భుజాలు కలిగి; సుశర్మ తానున్+తమ్ముండును= సుశర్మ తానూ తన తమ్ముడూ; సంగడంబు+కాన్= ఉమ్మడిగా; కోల్తల+చేసి= సన్నాహం చేసి; రథసమూహంబుతోన్= రథాల గుంపుతో; విరాట వ్యూహంబున్= విరాటుడు పన్నిన యుద్ధవ్యూహాన్ని; ఎదురుకొని= ఎదుర్కొని.

తాత్పర్యం: ఈ విధంగా విరటుడూ తానూ, తన సైన్యమూ, యుద్ధం చేయగల యోధులూ ధైర్యంతో ఒక్కుమ్మడిగా విజృంభించారు. ఆ ధాటికి ఆగలేక వెనుతిరిగి పరుగెత్తే తమ సైన్యాల దీనావస్థను తెలిసికొని, కోపాతిశయంతో ఎరుపెక్కిన కన్నులతో, బలమైన భుజాలను కలిగి ఉన్న సుశర్మ తమ్ముడితో కలిసి ఉమ్మడిగా సన్నాహం చేసి రథాలతో వచ్చి విరాటుడి యుద్ధవ్యూహాన్ని ఎదుర్కొని.

క. బలవిక్రమములు మెఱయఁగఁ । దలపడి రథ దంతి హయ పదాతి చయంబుల్
కలను సుడివడఁగఁ దామర । కొల నేనుఁగు సొచ్చినట్లు గురువుగఁ జొచ్చెన్. 184

ప్రతిపదార్థం: బలవిక్రమములు మెఱయఁగన్= బలం శౌర్యం ప్రకాశించగా; తలపడి= ఎదుర్కొని; రథ, దంతి,హయ, పదాతి చయంబుల్= రథ గజ తురగాలూ కాల్బలాలూ; కలను= యుద్ధంలో; సుడి+పడఁగన్= సుళ్ళు తిరుగగా; తామర కొలను= తామరలున్న సరస్సులను; ఏనుఁగు+చొచ్చినట్లు= ఏనుగు ప్రవేశించిన విధంగా; గురువుగన్= దర్పంతో; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: ఏనుగు తామరపూలున్న సరోవరంలో దర్పంతో ప్రవేశించి దానిని కలచివేసినట్లు సుశర్మ యొక్క చతరంగబలం బలపరాక్రమాలు ప్రకాశించగా తలపడి యుద్ధరంగాన్ని సంక్షోభపరచింది.

విశేషం: అలం: ఉపమ.

ఉ. ఏలినవానిఁ గాంచి, మొనలెల్లను నెంతయు దర్ప మెక్కి యా
భీల నిశాత హేతిరుచి భీకరలీల నెదిర్చి, మత్స్య భూ
పాలక సైన్యరాజిఁ దలపడ్డ మహోగ్రతఁ బేర్చి, యా సమి
త్కేళి వియచ్చర ప్రతతికిన్ వెఱఁగందఁగఁ జేసె నెంతయున్. 185

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఏలినవానిన్+కాంచి= రాజును చూచి; మొనలు+ఎల్లను= సైన్యాలన్నీ; దర్పము+ఎక్కి= గర్వం ఎక్కువై; ఆభీల= భయంకరంగా; నిశాతహేతి రుచిన్= వాడి అయిన కత్తియొక్క కాంతితో; భీకరలీలన్= భయంకరంగా; ఎదిర్చి= ఎదుర్కొని; మత్స్య భూపాలక= విరటుడి యొక్క; సైన్యరాజిన్= సేనాసమూహాన్ని; తలపడ్డన్= ఎదుర్కొనగా; మహా+ఉగ్రతన్+పేర్చి= భయంకరంగా విజృంభించి; ఆ సమిత్+కేళి= ఆ యుద్ధక్రీడ; వియత్+చరప్రతతికిన్= దేవతల సమూహానికి; ఎంతయున్= ఎంతగానో; వెఱఁగు= ఆశ్చర్యాన్ని; అందఁగన్+ చేసెన్=పొందేట్లు చేసింది.

తాత్పర్యం: తమ రాజును చూచి త్రిగర్త సైన్యాలన్నీ గర్వంతో విజృంభించి వాడికత్తుల కాంతితో భయంకరంగా విరటుడి సేనాసమూహాన్ని ఎదిరించాయి. మహత్తర విజృంభణంతో కూడిన ఆ యుద్ధక్రీడ దేవతలు కూడా ఎంతో ఆశ్చర్యపడుతూ చూచేటట్లు చేసింది.

తే. **కడిమి మెఱయంగఁ బోరు త్రిగర్తనాథు। రథముఁ గనుఁగొని కడఁగి విరాటవిభుఁడు**
వరవునకు నల్గినట్టుల సరకుగొనక। యతుల రభసాతిరేకత నతనిఁ దాఁకె. **186**

ప్రతిపదార్థం: కడిమి= పరాక్రమం; మెఱయంగన్= ప్రకాశించగా; పోరు= యుద్ధం చేసే; త్రిగర్తనాథురథమున్= సుశర్మయొక్క తేరును; విరాటవిభుఁడు= విరాటరాజు; కనుఁగొని= చూచి; కడఁగి= పూనుకొని; వరవునకున్= సేవకుని మీద; అల్గినట్టుల= కోపగించినట్లు; సరకుగొనక= లెక్కచేయక; అతుల= సాటిలేని; రభస+అతిరేకతన్= వేగాతిశయంతో; అతనిన్= ఆ సుశర్మను; తాఁకెన్= ఎదిరించాడు.

తాత్పర్యం: పరాక్రమంతో యుద్ధం చేస్తున్న సుశర్మ ఎక్కివస్తున్న తేరును చూచిన విరాటుడు పూనికతో సేవకుడి మీద అలిగిన విధంగా అతడిని లెక్కసేయక మిక్కిలి వేగంగా ముట్టడించాడు.

విశేషం: అలం: ఉపమ.

విరాటుఁడు సుశర్మమీఁదఁ దన రథంబు తోలించి పోరుట (సం.4-31-17)

వ. **ఇట్లు దలపడి.** **187**

తాత్పర్యం: ఈ విధంగా ఎదుర్కొని.

మ. **పటువేగంబగు శాతభల్లచయ సంపాతంబునన్ మింట మి**
క్కుటమై మంట ధగద్ధగద్ధగ యనం గోపంబు రూపంబులై
చటులక్రీడఁ జరించు నట్లిరువురున్ శౌర్యోన్నతిం బోరి రు
త్కట దర్పోద్ధతులై పరస్పర జయాకాంక్షం బ్రచండంబుగన్. **188**

ప్రతిపదార్థం: పటువేగంబు+అగు= మిక్కిలి వేగంతో కూడినదైన; శాత= వాడి అయిన; భల్లచయ= బల్లెముల సమూహంయొక్క; సంపాతంబునన్= పడటంవలన; మింటన్= ఆకాశంలో; మంట= అగ్నిజ్వాల; మిక్కుటము+ఐ= అధికమై; ధగద్ధగద్ధగ+అనన్= ధగధగమండుతుండగా; కోపంబు రూపంబులు+ఐ= కోపం ఆకారాలను ధరించి; చటులక్రీడన్= తీవ్రమైన ఆటలో; చరించునట్లు= తిరిగే విధంగా; ఇరువురున్= ఇద్దరున్నూ (విరాట సుశర్మలు); శౌర్య+ఉన్నతిన్= వీరాధిక్యంతో; ప్రచండంబుగన్= భయంకరంగా; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: విరాట సుశర్మలు ఒకరిపై ఒకరు మిక్కిలి వేగంగా వాడి అయిన బల్లెములను వేయగా, అవి ఆకాశంలో ధగధగమండుతూ ఉండగా, వారిరువురూ మూర్తీభవించిన కోపాలా అన్నట్లు తీవ్రమయిన యుద్ధక్రీడలో విహరిస్తూ పరాక్రమాతిశయంతో గర్వాహంకారాలతో ఒకరిని ఒకరు జయించాలన్న కోరికతో భయంకరంగా పోరాడారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. **తదవసరంబున నొక్కటఁ । బది యమ్ములు తొడి త్రిగర్తపతి వక్షంబున్**
వదనంబు నేసి విరటుఁడు । మదమునఁ దురగములనేసి మఱియుఁ బదింటన్. **189**

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; విరటుఁడు= విరాటరాజు; ఒక్కటన్= ఒకమారుగా; పది+అమ్ములు= పదిబాణాలను; తొడి= తొడిగి; త్రిగర్తపతి వక్షంబున్= సుశర్మ యొక్క రొమ్మునూ; వదనంబున్= మొగాన్నీ; ఏసి= కొట్టి; మదమునన్= పొగరుతో; మఱియున్= ఇంకను; పదింటన్= పది బాణాలతో; తురగములన్= గుర్రాలను; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: ఆ సమయంలో విరటుడు ఒకేమారు పది బాణాలను తొడిగి త్రిగర్తరాజైన సుశర్మ రొమ్ముమీదా, మొగంమీదా ప్రయోగించాడు. అంతేకాకుండా గర్వంతో ఇంకా పదిబాణాలతో అతడి గుర్రాలను కొట్టాడు.

క. **ఇంచుకయు నీడఁబోవక । కాంచన పుంఖప్రకాండ కాంతి స్ఫాయ**
త్పంచాశద్బాణంబులు । నించె నతఁడు మత్స్య మేదినీపతి మేనన్. **190**

ప్రతిపదార్థం: అతఁడు= ఆ సుశర్మ; ఇంచుకయున్= కొంచెం కూడా; ఈడన్+పోవక= వెనుకాడకుండా; కాంచన= బంగారు; పుంఖప్రకాండ= తోకలుగల బాణాల సమూహంయొక్క; కాంతి= కాంతులచేత; స్ఫాయత్= ప్రకాశిస్తున్న; పంచాశత్+బాణంబులు= ఏబదిబాణాలు; మత్స్యమేదినీపతిమీఁదన్= విరటుడిమీద; నించెన్= నింపాడు.

తాత్పర్యం: ఆ సుశర్మ ఏమాత్రం జంకకుండా బంగారు తోకల బాణాల సమూహాలు కాంతులు విరజిమ్ముతుండగా విరటుడిమీద ఏబది బాణాలను ప్రయోగించాడు.

తే. **దొరలు తలపడ్డ నాహవదోహలమున । నుభయ బలములుఁ దమకించి యోర్వలేక**
కలయబెరసి భూ రేణువు కతన రాత్రి । గాకమున్న యొండొరులుఁ గానరైరి. **191**

ప్రతిపదార్థం: దొరలు= రాజులు; తలపడ్డ= ఎదుర్కొనగా; ఆహవ= యుద్ధంమీది; దోహలమునన్= ఉత్సాహంతో; ఉభయ బలములున్= రెండు (వైపుల) సేనలు; తమకించి= త్వరపడి; ఓర్వలేక= నిగ్రహించుకొనలేక; కలయన్+బెరసి= కలయబడి; భూరేణువు కతనన్= నేలదుమ్ము లేవటం వలన; రాత్రి కాకమున్న+అ= రాత్రి కాకముందే (చీకటి పడకముందే); ఒండు+ ఒరువులన్= ఒకరినొకరు; కానరు+ఐరి= గుర్తించలేకపోయారు.

తాత్పర్యం: తమ రాజులు ఎదుర్కొనగా, సమధికోత్సాహంతో యుద్ధంలో ఇరువైపు సేనలు ఆగబట్టలేక ఎదుర్కొనగా రేగిన మట్టి, దుమ్ము వలన రాత్రికాకముందే చీకటి పడ్డట్లయి ఒకరిని మరొకరు చూడలేకపోయారు.

క. క్షతములఁ బెల్లు తొరఁగు శో। ణితము రజఃపటల మడఁచి నెఱపిన నరుణ
ద్యుతిఁ దమము వాపు వేకువ। గతిఁ దత్సమయం బతి ప్రకాశత నొప్పెన్. 192

ప్రతిపదార్థం: క్షతములన్= గాయాలనుండి; పెల్లు= ఎక్కువగా; తొరఁగు= కారే; శోణితము= నెత్తురు; రజపటలమున్= దుమ్ము సమూహాలను; అడఁచి= అణగించివేసి; నెఱపినన్= ప్రసరింపజేసిన; అరుణద్యుతిన్= ఎర్రని కాంతితో; తమము= చీకటిని; పాపు= పోజేయు; వేకువ గతిన్= వేగుజామువలె; తద్+సమయంబు= ఆ సమయం; అతి ప్రకాశతన్+ఒప్పెన్= మిక్కిలి వెలుగుతో విలసిల్లింది.

తాత్పర్యం: సైనికుల గాయాల నుండి విస్తారంగా కారిన నెత్తురు మట్టి దుమ్మును అణచివేసి నెరపివేయగా కానవచ్చిన ఎర్రని వెలుగు కల ఆ సమయం చీకటిని పోగొట్టే వేగుజామువలె మిక్కిలి వెలుగుతో ఒప్పారింది.

విశేషం: అలం: ఉపమ.

ఉ. దానికిఁ జిత్తవృత్తులు ముదంబునఁ బొందఁగ, మేను లుబ్బఁగా
సేనలు రెండు నుద్భట విజృంభణతన్ వివిధాస్త్ర ఘట్టన
ధ్వానము దిక్కులం బరఁగఁ దాఁకి రణం బొనరించె; నత్తఱిన్
భానుఁడు పశ్చిమాద్రిఁ గనుపట్టెఁ దలిర్చిన మావిమో కనన్. 193

ప్రతిపదార్థం: దానికిన్= ఆ ప్రకృతికి (వెలుగునకు); చిత్తవృత్తులు= మనోవ్యాపారాలు; ముదంబునన్+పొందఁగన్= సంతోషం అనుభవించగా; మేనులు+ఉబ్బఁగాన్= ఒడళ్ళు ఉప్పొంగగా; సేనలు రెండున్= ఇరువైపుల సేనలూ; ఉద్భట విజృంభణతన్= అధికమైన పూనికతో; వివిధ= అనేకములైన; అస్త్ర ఘట్టన ధ్వానము= మంత్ర సహిత బాణాలు ఘర్షణపడటం వలన కలిగే చప్పుడు; దిక్కులన్+పరఁగన్= దిక్కులలో వ్యాపించగా; తాఁకి= ఎదుర్కొని; రణంబు+ఒనరించెన్= యుద్ధం చేశాయి, ఆ+తఱిన్= ఆ సమయంలో; భానుఁడు= సూర్యుడు; పశ్చిమ+అద్రిన్= పడమటి కొండపై; తలిర్చినన్= చిగిర్చిన; మావిమోక+అనన్= మామిడి మొక్కేమో అన్నట్లుగా; కనుపట్టెన్= కనిపించాడు.

తాత్పర్యం: ఆ ప్రకృతికి (వెలుగునకు) మనసులు రంజిల్లి శరీరాలు ఉప్పొంగగా ఇరువైపుల సేనలు విజృంభించి అనేక అస్త్రాల రాపిడివల్ల కలిగిన చప్పుళ్ళు దిక్కులు పిక్కటిల్లచేయగా ఎదురు యుద్ధాలకు పూనుకొని పరస్పరం ఆర్భాటంతో పోరు చేశారు. ఆ సమయంలో పడమటి కొండమీద సూర్యుడు ఒక మామిడి మొక్క చిగిర్చిందా అన్నట్లు కనిపించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. అస్తమిస్తున్న సూర్యుడిని కెంజాయ మామిడి మొక్కగా ఉత్ప్రేక్షించటం కమనీయం. (సంపా.)

క. సమరంబున భటులు కడున్। శ్రమమొందిరి, తమము గవిసినంగాని సము
ద్యమ సంరంభ ముడుగ, రిది। సమయం బని తొలఁగినట్లు సవితృఁడు గ్రుంకెన్. 194

ప్రతిపదార్థం: సమరంబునన్= యుద్ధంలో; భటులు= సైనికులు; కడున్= మిక్కిలి; శ్రమము+ఒందిరి= అలసట చెందారు; తమము కవిసినన్+కాని= చీకటి క్రమ్మితేకాని; సముద్యమ సంరంభము= ప్రారంభించిన యుద్ధ ప్రయత్నపు ఆర్భాటాన్ని; ఉడుగరు=

మానరు; ఇది సమయంబు+అని= ఇదే తగిన వేళయని; తొలఁగినట్లు= తొలగిపోయినట్లుగా; సవిత్రుఁడు= సూర్యుడు; గ్రుంకెన్= అస్తమించాడు.

తాత్పర్యం: సైనికులు యుద్ధంలో బాగా అలసిపోయారు. చీకటి పడితేకాని వీరు తమ యుద్ధోత్సాహాన్ని మానరు. కాబట్టి ఇదే తగిన సమయం అని తొలగిపోయినట్లు సూర్యుడు అస్తమించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. తదనంతరంబ. 195

తాత్పర్యం: ఆ తరువాత.

క. మఱిమఱి చీఁకటియప్పుడు । నఱిమఱి భటు లుడుగ కదరి యని సేయంగా
నెఱసి తమ మెల్లయెడఁ గ్రి । క్కిఱిసిన మఱి పాసి నిలిచి రింతను నంతన్. 196

ప్రతిపదార్థం: భటులు= సైనికులు; మఱిమఱి చీఁకటి+ అప్పుడున్= మసక మసక చీకటిగా ఉన్నప్పుడు కూడా; అఱిమఱి= కొద్దిగా కూడా; ఉడుగక= వెనుకాడక; అదరి= పెచ్చుపెరిగి; అనిన్+చేయంగాన్= యుద్ధం చేస్తుండగా; నెఱసి= కమ్ముకొన్న; తమము= చీకటి; ఎల్ల+ఎడన్= అంతటను; క్రిక్కిఱిసినన్= దట్టంకాగా; మఱి= అప్పుడు; పాసి= తొలగి; ఇంతనున్+అంతన్= ఇక్కడా అక్కడా; నిలిచిరి= నిలిచిపోయారు.

తాత్పర్యం: మసకచీకట్లు క్రమ్మినవేళలోకూడా భటులు వెనుకాడకుండా యుద్ధం చేశారు. క్రమంగా చిమ్మచీకట్లు క్రమ్మటంతో ఇక గత్యంతరంలేక యుద్ధం మాని అక్కడక్కడా (ఎక్కడివారక్కడ) నిలిచిపోయారు.

వ. ఇట్లుభయ సైనికులు సాంద్ర సంతమసంబునం జేయునది లేక సంగ్రామంబు దక్కి తమకం బెక్క నొక్కింత సే పూరకున్నంత. 197

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఉభయ సైనికులు= రెండు పక్షాల సైనికులు; సాంద్ర సంతమసంబునన్= దట్టమయిన చీకటిలో; చేయునది లేక= చేసే దేమీ లేక; సంగ్రామంబు+తక్కి= యుద్ధం ఆపివేసి; తమకంబు+ఎక్కన్= ఉత్కంఠ ఎక్కువకాగా; ఒక్కింత సేపు= కొద్దిసేపు; ఊరక+ఉన్న+అంతన్= ఊరకుండగా.

తాత్పర్యం: దట్టమయిన చీకటిలో ఇరువర్గాల సేనలు చేసే దేమీ లేక యుద్ధం మాని కొంతసేపు ఊరకుండవలసిరాగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తన మనుమలు పాండుతనయు । లనిసేఁతకు వేడ్కసేయు టాత్మఁ గని తమం
బున వారు మెఱయ రని వ । చ్చిన క్రియ శశి పూర్వశైలశిఖరం బెక్కెన్. 198

ప్రతిపదార్థం: తనమనుమలు= తన మనుమలు; పాండుతనయులు= పాండుకుమారులు (పాండవులు); అని+చేఁతకున్= యుద్ధం చేయటానికి; వేడ్క+చేయుట= ఆస పడటం; ఆత్మన్+కని= మనసులో గ్రహించి; తమంబునన్= చీకటిలో; వారు=

పాండవులు; మెఱయరు+అని= ప్రకాశించరని; వచ్చిన క్రియన్= తాను వచ్చినట్లుగా; శశి= చంద్రుడు; పూర్వశైలశిఖరంబు= ఉదయాచల శిఖరాన్ని; ఎక్కెన్= ఎక్కాడు (ఉదయించాడు).

తాత్పర్యం: తన మనుమలైన పాండవులు యుద్ధం చేయాలనే ఉత్సాహంతో ఉన్నారని మనసులో గ్రహించి, చీకట్లో వారు ప్రకాశించరని తనంతటతా తాను వచ్చాడా అన్నట్లు చంద్రుడు తూర్పుకొండమీద ఉదయించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. పాండవులు చంద్రవంశరాజులు. చంద్రుడు వారి వంశ పురుషుడు కాబట్టి వారి యోగక్షేమం కోరటం అతడి ధర్మం. పాండవు లింకా యుద్ధం చేయటం మొదలుపెట్టలేదు. కాబట్టి వారి కోర్కెను తీర్చటానికై కాంతిని ప్రసాదించే ఉద్దేశంతో చంద్రుడు ఉదయించాడు. తిక్కన సూర్యోదయ సూర్యాస్తమయ చంద్రోదయ వర్ణనలను కాలసూచకాలుగా, కథాసూచకాలుగా నిర్వహించాడు. ఇది భావి కథా సూచకమైన వర్ణనం. ఇకపై పాండవులు యుద్ధంలో పాల్గొంటారని ధ్వని. (సంపా.)

క. వెలుఁగు గని కడఁగి యిరువాఁ। గులుఁ బోరికిఁ జొచ్చె; మత్స్య కుంజరుఁడును న
గ్గలమగు మగఁటిమి సొంపునఁ। దలపడియె సుశర్మతోడఁ దదనుజు తోడన్. 199

ప్రతిపదార్థం: వెలుఁగు+కని= వెలుతురును (వెన్నెలను) చూచి; కడఁగి= ప్రయత్నంతో; ఇరువాఁగులు= రెండు ప్రక్కల సేనలు; పోరికిన్+చొచ్చెన్= యుద్ధానికి ప్రారంభించారు; మత్స్యకుంజరుఁడును= మత్స్యదేశపు రాజు (విరాటుడు); అగ్గలము+అగు= అతిశయించిన; మగఁటిమిసొంపునన్= పరాక్రమ సంపదతో; సుశర్మతోడన్; తద్+అనుజు తోడన్= అతడి తమ్ముడితోనూ; తలపడియెన్= యుద్ధానికి పూనుకొన్నాడు.

తాత్పర్యం: వెలుగు కానరాగా ఇరువాగులవారు యుద్ధానికి తలపడ్డారు. విరటుడు అతిశయించిన శౌర్యంతో సుశర్మనూ, అతడి తమ్ముడినీ ఎదుర్కొని యుద్ధానికి తలపడ్డాడు.

చ. తలపడి పోర వారి యరదంబు లనేకము లొక్క పెట్ట యి
ట్టలపు రయంబునం బొదివి డాసెఁ గడంగి వడిం ద్రిగర్తనా
థులు నిరుతేరుఁ దద్రథముతోఁ గదియించి తదీయ సారథిన్
బలువిడిఁ గూల్చి రథ్యముల ప్రాణములుం గొని రుగ్రమూర్తులై. 200

ప్రతిపదార్థం: తలపడి పోరన్= ఎదుర్కొని యుద్ధం చేయగా; వారి+అరదంబులు+అనేకములు= వారి తేరులు పెక్కులు; ఒక్క పెట్ట= ఒక్కుమ్మడిగా; ఇట్టలము+రయంబునన్= మిక్కిలి వేగంగా; పొదివి= క్రమ్ముకొని; డాసెన్= సమీపించాయి; కడంగి వడిన్= ప్రయత్నంతో వేగంగా; త్రిగర్తనాథులు= త్రిగర్తదేశపు రాజులు (సుశర్మ, అతడి తమ్ముడు); ఇరుతేరున్= (తమ) రెండు తేరులను; తద్+రథముతోన్= ఆ విరాటుడి తేరుతో; కదియించి= తాకించి (తగిలించి); తదీయ సారథిన్= అతడి సారథిని; బలువిడిన్+కూల్చి= శౌర్యంతో చంపి; ఉగ్రమూర్తులు+ఐ= భయంకరాకారులై; రథ్యముల= గుర్రాల; ప్రాణములన్= ప్రాణాలను; కొనిరి= తీసికొన్నారు.

తాత్పర్యం: ఆ విధంగా విరాటుడు ససైన్యంగా యుద్ధం చేస్తూ ఉండగా సుశర్మ, అతడి తమ్ముడూ అనేక రథికులతో కలిసి, ఒక్కపెట్టున వేగంగా విరాటుడిని క్రమ్ముకొని ఎదుర్కొని ఇరుప్రక్కల తమ రథాలను అతడి తేరుతో తగిల్చి భయంకరంగా సారథిని హతమార్చి, గుర్రాలను చంపారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇవ్విధంబున విరాటుండు విరథుం డగుటయు. **201**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; విరాటుండు= విరాటుడు; విరథుండు+అగుటయున్= తేరులేనివాడుకాగా,

తాత్పర్యం: విరాటుడు ఇట్లా తేరు లేనివాడు కాగా, (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. అతిరభసంబుమై నడరి యాతనిఁబట్టి, సుశర్మ పెల్చ నా
ర్చి తన రథంబుపై నిడి, యశేష బలంబులు నల్దెసన్ భయ
ద్రుతగతిఁ బాఱినన్ విజయదుందుభు లొక్కట మ్రోయ విక్రమో
ద్ధతి విభవంబునన్ మది ముదం బొలయన్ మరలెన్ మహోద్ధతిన్. **202**

ప్రతిపదార్థం: అతిరభసంబుమైన్= మిక్కిలి వేగంతో; అడరి= విజృంభించి; ఆతనిన్+పట్టి= ఆ విరటుడిని పట్టుకొని; సుశర్మ; పెల్చన్+ఆర్చి= పెద్దగా సింహనాదం చేసి; తన రథంబుపైన్+ఇడి= తన తేరుమీద పెట్టుకొని; అశేషబలంబులు= విస్తారమగు సైన్యాలు; నల్దెసన్= నాలుగు దిక్కులకు; భయద్రుతగతిన్+పాఱినన్= భయం వలన కలిగిన వేగమైన గమనంతో పర్వెత్తగా; విజయదుందుభులు= విజాయాన్ని సూచించే నగారాలు; ఒక్కటన్ మ్రోయన్= ఏకధాటిగా శబ్దం చేయగా; విక్రమ+ఉద్ధతి, విభవంబునన్= శౌర్యదర్పాధిక్యంతో; మదిన్= మనసులో; ముదంబు+ఒలయన్= సంతోషమొప్పగా; మహా+ఉద్ధతిన్= మిక్కిలి దూకుడుతో; మరలెన్= తిరిగి వెళ్ళనారంభించాడు.

తాత్పర్యం: సుశర్మ మిక్కిలి వేగంతో విజృంభించి విరాటుడిని పట్టుకొన్నాడు. బిగ్గరగా సింహనాదం చేసి అతడిని తన రథం మీదికి తెచ్చి ఉంచాడు. ఆ దృశ్యం చూచి అధిక సంఖ్యలో ఉన్న బలాలన్నీ భయంతో నలుదిక్కులా త్వరితగతిని పరుగెత్తాయి. విజయం కలిగినందుకు గుర్తుగా దుందుభులు ఒక్కసారిగా మ్రోసినాయి. పరాక్రమ గర్వవైభవంతో మనస్సు ఉప్పొంగగా సుశర్మ విశేషదర్పంతో తిరిగి వెళ్ళనారంభించాడు.

వ. అట్టియెడ ధర్మతనయుం డనిలనందను నవలోకించి సత్వరంబగు చిత్తంబుతో మత్స్యవిభుని వలను
సూపుచు నిట్లనియె. **203**

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; ధర్మతనయుండు= ధర్మజుడు; అనిలనందనున్= భీముడిని; అవలోకించి= చూచి; సత్వరంబు+అగు చిత్తంబుతోన్= తొందరతో గూడిన మనసుతో; మత్స్యవిభుని వలను చూపుచున్= విరటుని దిక్కుచూపుతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఆ సమయాన తొందరపడే మనసుతో భీమసేనుడిని చూచి విరాటుడి వైపు చూపుతూ ఇట్లా అన్నాడు.

తే. 'ఇతని యాశ్రయమున మనమెల్ల బ్రదికి । యున్నవారము గావున నుగ్ర రిపుల
పాలువడకుండ విడిపింపఁ బాడి యితని । నెయిదు మెయిదుము రథరయ మెసకమెసఁగ. **204**

ప్రతిపదార్థం: ఇతని+ఆశ్రయమునన్= ఇతడి రక్షణలో; మనము+ఎల్లన్ బ్రదికి+ఉన్నవారము= మనమందరం బ్రతికి ఉన్నాము; కావునన్= అందువలన; ఉగ్రరిపుల= భయంకర శత్రువుల యొక్క; పాలన్+పడకుండన్= బారిన పడకుండా; విడిపింపన్+పాడి=

విడిపించటం ధర్మం; రథరయం= రథవేగం; ఎసకము+ఎసఁగన్= అతిశయించగా; ఇతనిన్= ఇతడిని (విరటుడిని); ఎయిదుము+ఎయిదుము= తొందరగా వెంబడించుము.

తాత్పర్యం: 'ఈ విరటుడు ఆధారంగా మనమంతా బ్రదికి ఉన్నాము. కాబట్టి భయంకరులయిన శత్రువుల పాలబడకుండా ఇతడిని విడిపించటం ధర్మం. నీ రథవేగం అతిశయించేటట్లు వెంబడించుము. వడివడిగా వెంబడించుము'.

విశేషం: అవసరం వచ్చేదాక ధర్మరాజు నోరు విప్పలేదు. ఇప్పుడు తమ కాశ్రయ మిచ్చిన రాజు శత్రువుల పాలబడ్డాడు. అతడిని రక్షించుకొనకపోతే తమ ఇంటిని తామే కూల్చుకొన్నట్లవుతుంది. రాజరక్షణే ఆత్మరక్షణ. అది అవశ్య కర్తవ్యం. కాబట్టి అంత తొందర. 'నీ రథవేగాన్ని హెచ్చించి శత్రువుల వెంటపడు' మని భీముడిని తొందరపెట్టాడు. ద్విరుక్తి ఆదుర్దాను, కృతజ్ఞతను, ధర్మానురక్తిని వ్యక్తం చేస్తుంది. (సంపా.)

చ. **అనవుడు మేను పెంచుచు మహాబలనందనుఁ డప్పు డన్న కి**
ట్లను 'నిదె సాలవృక్షము; రయంబున దీన నరాతిసేన డొ
ల్ల నడిచి, యీ సుశర్ముని బలంబుఁ జలంబును మాన్పి, యవ్విరా
టుని విడిపించెదన్ రణపటుత్వము వైరులు పిచ్చలింపఁగన్. 205

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా విని; మహాబల నందనుఁడు= వాయుపుత్రుడైన భీముడు; మేను పెంచుచున్= (వీరావేశంతో) శరీరాన్ని పెంచుతూ; అప్డు= ఆ సమయంలో; అన్నకున్+ఇట్లు+అనున్= అన్నతో (ధర్మజుడితో) ఈ విధంగా అంటున్నాడు; ఇదె= ఇదిగో, ఆ కనపడేదే; సాలవృక్షము= మద్దిచెట్టు; దీనన్= ఈ చెట్టుతో; రయంబునన్= వేగంగా; అరాతిసేనన్= వైరిసేనను; డొల్లన్+అడిచి= చావమోది; ఈ సుశర్ముని బలంబున్= ఈ సుశర్మయొక్క సైన్యాన్ని; చలంబును= మాత్సర్యాన్నీ; మాన్పి= పోగొట్టి; రణపటుత్వము= నా యుద్ధశక్తిని; వైరులు= శత్రువులు; పిచ్చలింపఁగన్= కొనియాడగా; ఆ+విరాటుని= ఆ విరాటుడిని; విడిపించెదన్= విడిపిస్తాను.

తాత్పర్యం: అనగా విని భీముడు వీరావేశంతో శరీరాన్ని ఉబ్బిస్తూ అన్నతో అప్పు డిట్లా అన్నాడు; 'అదుగో! ఆ కనపడేదే మద్దిచెట్టు (అని చూపించి చెప్పి), దానిని పెరికి వేగంగా త్రిప్పుతూ శత్రుసేనలను చావమోది, ఆ సుశర్మ బలాన్ని అణగించి, నా యుద్ధ పరాక్రమాన్ని విరోధులు కూడా మెచ్చుకొనేటట్లు విరాటుడిని విడిపిస్తాను.

తే. **నీవుఁ దమ్ములు నొక్కెడ నిలిచి చూచు । చుండుఁ 'డని పల్కుటయుఁ బుయిలోట తోడఁ**
గీచకారాతిఁ దప్పకచూచి నగుచు । నతని కిట్లని చెప్పె ధర్మాత్మజుండు. 206

ప్రతిపదార్థం: నీవున్, తమ్ములున్= ఓ ధర్మజా! నీవూ, తమ్ములు నకుల సహదేవులూ; ఒక్క+ఎడన్= ఒకప్రక్క; నిలిచి చూచుచున్+ఉండుఁడు= నిలిచి చూస్తూ ఉండండి; అని పల్కుటయున్= అనగానే; ధర్మ+ఆత్మజుండు= ధర్మరాజు; పుయిలోటతోడన్= సంశయంతో; కీచక+అరాతిన్= కీచకుల శత్రువైన భీముడిని; తప్పక చూచి= సూటిగా చూచి; నగుచున్= నవ్వుతూ; అతనికిన్= ఆ భీముడితో; ఇట్లు+అని చెప్పెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీవూ తమ్ముళ్ళూ ఒక ప్రక్కగా నిలిచి చూస్తూ ఉండండి' అని భీము డనగానే ధర్మరాజు సందేహంతో కీచకవైరి అయిన భీముడిని సూటిగా చూచి నవ్వుతూ ఈ విధంగా చెప్పాడు.

విశేషం: భీముడి ఆవేశం చూడగానే ధర్మరాజుకు అనుమానం వేసింది అతడు అన్నంత పనీ చేస్తాడని. అందుకే భీముడిని చూపులతో ఆపాడు. అట్లా సూటిగా కళ్ళలోకి చూస్తే ఎంతటి మహాబలనందనుడైనా ఆగిపోవలసిందే. చూపులతో వారించి పెదవులతో నవ్వాడు ధర్మరాజు. ఆ నవ్వులో ఆప్యాయత, అధిక్షేపం, అనునయం, వివేకం, సౌజన్యం తొణికిసలాడాయి. భీముడు ఆవేశంతో అజ్ఞాతవాస నియమాన్ని మరచిపోయి మాట్లాడుతున్న పొరపాటును ధర్మరాజు సరిచేయబోతున్నాడు. చేదుమాట కూడా తియ్యనినవ్వులో పొదివి చెప్పగల నిపుణుడు ధర్మరాజు. (సంపా.)

క. 'తరువు వెసఁ బెఱికికొని నీ । వురవడిమైఁ గవిసితేని నుభయబలము న
చ్చెరువందుచుఁ జూచి వృకో । దరుఁడ వగుట యెఱుఁగకున్నె! తద్విధ మేలా? 207

ప్రతిపదార్థం: తరువు= చెట్టును; వెసన్= శీఘ్రంగా; పెఱికికొని= పెళ్లగించి తీసికొని; నీవు+ఉరవడిమైన్+కవిసితి(వి)+ఏనిన్= నీవు తొందరగా కవ్వుకొన్నట్లయితే; ఉభయబలమున్= రెండు వైపులనున్న సైన్యం; అచ్చెరువు+అందుచున్+చూచి= అబ్బురపాటుతో చూచి; వృకోదరుఁడవు+అగుట= భీముడవగుట; ఎఱుఁగక+ఉన్నె?= తెలియకుంటుందా?; తద్+విధము+ఏలా!= అట్టి పద్ధతి ఎందుకు?

తాత్పర్యం: 'ఓ భీమసేనా! నీవు చెట్టును పెరికికొని శీఘ్రంగా కవ్వుకొంటే ఇరువాగుల సైన్యం ఆశ్చర్యంగా చూచి నీవు భీమసేనుడ వని గుర్తించకుండా ఉంటుందా? అందువలన ఆ పద్ధతి వద్దు.

విశేషం: మద్దిచెట్టుతో శత్రువుల పీచమణచటం భీముడి ప్రత్యేకశైలి. ఎప్పుడు కోపం వచ్చినా ప్రక్కనున్న చెట్టువైపు చూడటమో, చూపించటమో అతడి ధోరణి. దానిని అప్పుడనుసరిస్తే భీమసేనుడని అందరూ తేలికగా గుర్తిస్తారు కాబట్టి మరొక పద్ధతిని అనుసరించుమని ధర్మరాజు హితవు. దూరదృష్టి గల దర్శకుడు ధర్మరాజు. (సంపా.)

వ. కవలు నీకుఁ జక్రరక్షకులుగా లోకసామాన్యంబులైన చాప కృపాణ గదాదులగు నాయుధంబుల విరోధివధం
బాపాదించి వేవేగ విరాటు విడిపింపుము.' 208

ప్రతిపదార్థం: కవలు= నకుల సహదేవులు; నీకున్= నీకు; చక్రరక్షకులు+కాన్= నీ తేరునకు కాపుదల వారుగా; లోకసామాన్యంబులు+అయిన= లోకంలో సాధారణాలయిన; చాప, కృపాణ, గదా+ఆదులు+అగు= విండ్లు, కత్తులు, గదలు మొదలయిన; ఆయుధంబులన్= ఆయుధాలతో; విరోధి= శత్రువులయొక్క; వధంబు+ఆపాదించి= చంపుటను చేసి; విరాటున్= విరాటుడిని; వేవేగన్= మిక్కిలి శీఘ్రంగా; విడిపింపుము= వదలింపుము.

తాత్పర్యం: నకుల సహదేవులను నీ రథచక్ర రక్షకులుగా చేసికొని, అందరికీ అందుబాటులో ఉండే విండ్లు, కత్తులు, గదలు మొదలైన సాధనాలతో విరోధి వధ చేసి త్వరగా విరాటుడిని విడిపించుము.

చ. అను పలు కంకుశంబున క్రియం గుదియించిన నిల్చి, భూరుహం
బున దెస వోక, మత్తగజపుంగవు చందమునన్ సమీరనం
దనుఁడు శరీర దోలన విధా పరిశోభిత విక్రమోద్యమం
బున విలసిల్లి యిట్టు లను భ్రూకుటి ఫాల మలంకరింపఁగన్. 209

ప్రతిపదార్థం: అనుపలుకు= అన్నమాట; అంకుశంబున క్రియన్= (మదపుటేనుగునకు) అంకుశంవలె; కుదియించినన్= క్రుంగదీయగా; నిల్చి= నిలిచిపోయి; సమీరనందనుఁడు= వాయుపుత్రుడైన భీముడు; భూరుహంబున దెస+పోక= చెట్టుదిక్కుకు (వైపుకు) పోకుండా; మత్తగజ పుంగవు చందమునన్= మదపుటేనుగు మాదిరి; శరీర దోలన విధా= శరీరాన్ని విదిలించే విధానం చేత; పరిశోభిత= ప్రకాశించిన; విక్రమ+ఉద్యమంబునన్= పరాక్రమ ప్రయత్నంతో; విలసిల్లి= ఒప్పారి; భ్రూకుటి= బొమముడి; ఫాలము+అలంకరింపఁగన్= నుదురును అలంకరించగా; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మజుడి మాట అంకుశపుపోటు మాదిరిగా తనను క్రుంగదీయగా ఆగి, భీమసేనుడు చెట్టు దిక్కుకు పోకుండా నిలిచి, మదించిన మగఏనుగువలె శరీరాన్ని విదిలించుకొని, పరాక్రమోత్సాహంతో విలసిల్లుతూ కోపంతో ముడివడిన కనుబొమలు నెన్నుదురు భాగానికి వన్నె తేగా ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ. మదించిన మగ ఏనుగుతో భీముడిని పోల్చటం, ధర్మరాజు మాట అంకుశంగా చెప్పటం, ఏనుగు పోరుకు విజృంభించేముందు ఒడలు విదిల్చినట్లుగా భీముడు శరీరాన్ని కదల్చటం, చెట్టువైపు పోకుండా శత్రువులవైపు పోవటం ఉపమాలంకార వైభవం. భీముడికి కోపోద్రేకం కలిగిందంటే కనుబొమలు ముడిపడతాయి. అది అతడి ముఖానికే ఒక అందం. (సంపా.)

క. **'మీ పనిచినట్ల చేసెద। నేపారిన వైరిబలము నెల్లను బాహా**
టోపమున నోర్చి మత్స్యమ। హీపతి విడిపించి తెచ్చి యిచ్చెద మీకున్'. **210**

ప్రతిపదార్థం: నీ పనిచిన+అట్ల చేసెదన్= మీ ఉత్తరువు ప్రకారం చేస్తాను; ఏపారిన= విజృంభించిన; వైరిబలమున్= శత్రుసేనను; ఎల్లను= అంతటిని; బాహా+ఆటోపమునన్= భుజబలంతో; ఓర్చి= ఓడించి; మత్స్యమహీపతిన్= విరాటరాజును; విడిపించి; మీకున్= మీకు; తెచ్చి+ఇచ్చెదన్= తీసికొనివచ్చి ఇస్తాను.

తాత్పర్యం: 'మీ ఉత్తరువు మేరకు చేస్తాను. విజృంభించిన వైరిసేనను నా భుజబలంతో ఓడిస్తాను. విరాటుడిని విడిపించి తెచ్చి మీకు అప్పగిస్తాను'.

వ. **అనిన విని కౌంతేయాగ్రజుండు సంతసిల్లి తమయంతపట్టునుం గూడుకొని.** **211**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతి కుమారులలో పెద్దవాడగు ధర్మరాజు; సంతసిల్లి= సంతోషపడి; తమ+అంత పట్టునున్+కూడుకొని= తమవారినందరినీ కలుపుకొని.

తాత్పర్యం: ఆ మాటలు విని ధర్మరాజు సంతోషించి తమవారినందరిని కలుపుకొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: చిత్ర మేమంటే- విరాటుడు ఓడిపోగా అతడి తమ్ముళ్ళూ, కొడుకూ, బంధువులూ ప్రభువును రక్షించుకొనే బాధ్యతను స్వీకరించలేదు. ధర్మరాజు స్వయంగా తీసికొన్నాడు. ఇది ఎవరూ కోరింది కాదు. రాజును విడిపించే బాధ్యత భీముడిమీద పెట్టి తాను ముందుగా రథ మెక్కి, తన తమ్ములనూ, సేనలనూ తన వెంట కూర్చుకొని ముందుకు సాగాడు ధర్మరాజు. శ్రేయోభిలాషిగా చైతన్యవంతుడైన ధర్మరాజు ఆ సేనలో రాజు తరువాత రాజంతటివాడుగానూ, రాజును విముక్తి చేయగల ఆపద్బాంధవుడుగానూ తన పాత్రను ఉదాత్తంగా నిర్వహించాడు. (సంపా.)

పాండవులు సుశర్మ నోడించి విరాటుని విడిపించుట (సం. 4-32-26)

తే. తాను మున్నుగ శాత్రవసేనమీఁద । రథము లొక్కటఁ బఱపిరి పృథివి యద్రువ;
నుఱక యేచి త్రిగర్తులు నుద్ధతముగఁ । జెలఁగి మార్కొని పొదివి సంకులముగాఁగ. 212

ప్రతిపదార్థం: మున్నుగన్= ముందుగా; తాను= తాను (ధర్మరాజు) ఉండి; శాత్రవసేనమీఁదన్= విరోధి సైన్యం మీదకు; పృథివి= భూమి; అద్రువన్= అదరగా; రథములు= తేరులు; ఒక్కటన్+ పఱపిరి= ఒక్కసారిగా (మూకుమ్మడిగా) నడిపించారు; ఏచి= విజృంభించి; త్రిగర్తులు= త్రిగర్త దేశీయులు; ఉఱక= జంకకుండా; ఉద్ధతముగన్= గర్వంతో; చెలఁగి= పెచ్చుపెరిగి; మార్కొని= ఎదుర్కొని; సంకులము+ కాఁగన్= దొమ్మిపోరు అయ్యేటట్లు; పొదివి= క్రమ్ముకొని;

తాత్పర్యం: ధర్మరాజు తాను ముందుండి రథాలన్నీ ఒక్కసారిగా శత్రుసేనలమీద భూమి కంపించేటట్లు దాడి చేశాడు. త్రిగర్త దేశీయులు కూడా గర్వంతో విజృంభించి ఎదురుతిరిగి ధర్మరాజు సైన్యాన్ని చుట్టుముట్టి దొమ్మియుద్ధం సాగించారు.

క. ఏయుచుఁ బొడుచుచు వ్రేయుచు । డాయుచు నుద్వృత్తిఁ దఱుముటయుఁ బొడిసేసెన్
వాయుసుతుఁడు రథముల నిరు । వేయిటి రథి రథ్య సూత వితథంబులుగన్. 213

ప్రతిపదార్థం: ఏయుచున్= బాణాలు వేస్తూ; పొడుచుచున్= శూలాలతో పొడుస్తూ; వ్రేయుచున్= కత్తులతో, గదలతో కొట్టుతూ; డాయుచున్= దగ్గరకు చేరుతూ; ఉద్వృత్తిన్+తఱుముటయున్= గర్వాతిశయంతో తరుముతూ ఉండగా; వాయుసుతుఁడు= భీముడు; రథి= రథంలో ఉన్న వీరులు; రథ్య= గుఱ్ఱాలు; సూత= సారథులు; వితథంబులుగన్= వ్యర్థములయ్యేటట్లు; రథములన్+ఇరువేయిటిన్= రెండు వేల రథాలను; పొడి+చేసెన్= నుగ్గు నుగ్గు చేశాడు.

తాత్పర్యం: త్రిగర్త రథికులు బాణాలు ప్రయోగిస్తూ, శూలాలతో పొడుస్తూ, కత్తులతో నరుకుతూ, గదలతో బాదుతూ ధర్మరాజాదులను సమీపిస్తూ మదాతిశయంతో సేనలను తరుముతూ వస్తున్నారు. భీముడు ఆ శత్రువీరులలోని రథికులూ, గుఱ్ఱాలూ, సారథులూ నేలకూలేటట్లు రెండు వేల రథాలను నుగ్గు నుగ్గు చేశాడు.

విశేషం: మద్దిచెట్టును మాని రథంమీద సాగివచ్చిన భీముడు రథికుడుగా తన పరాక్రమాన్ని ప్రదర్శించి చూపాడు. (సంపా.)

తే. ఏడు నూఱు రథంబులనేపు మాపె । నకులుఁ డప్పుడు మున్నూటి నామ మడఁచె
నతని యనుజుండు; గుంతీసుతాగ్రజుండు । రథిక ముఖ్యుల వేవురఁ బృథివిఁ గూల్చె. 214

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; నకులుఁడు= నకులుడు; ఏడునూఱురథంబులన్= ఏడువందల తేరులను; ఏపుమాపెన్= ధ్వంసం చేశాడు; అతని+అనుజుండు= అతడి తమ్ముడు సహదేవుడు; మూఁడు+నూటిన్= మూడు వందల రథాలను; నామము+అడఁచెన్= పేరు లేకుండా చేశాడు; కుంతీసుత+అగ్రజుండు= కుంతికుమారులలో పెద్దవాడయిన ధర్మరాజు; రథికముఖ్యులన్= రథికులలో ముఖ్యులను; వేవురన్= వేయిమందిని; పృథివిన్+కూల్చెన్= నేలకూల్చాడు. (అనగా చంపెను).

తాత్పర్యం: అప్పుడు నకులుడు ఏడునూర్ల తేరులను నాశనం చేశాడు. అతడి తమ్ముడైన సహదేవుడు మూడు వందల రథాలను ధ్వంసం చేశాడు. ధర్మరాజు రథిక శ్రేష్ఠులను వేయిమందిని చంపాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: తమ్ములు రథాలను విరుగగొట్టుతుంటే ధర్మరాజు రథికులను చంపుతున్నా డనటం విశేషం. తాత్పర్యంలో రెండూ ఒకటే. భీముడు రెండువేల రథాలను, ధర్మరాజు ఒకవేయి రథాలను, నకులుడు ఏడువందల రథాలనూ, సహదేవుడు మూడువందల రథాలనూ ధ్వంసం చేశారు. ఆ రథసంఖ్యలు వారి బలాల కొలమానాలు. (సంపా.)

వ. అతండు మఱియును. 215

తాత్పర్యం: ఆ ధర్మరాజు అంతటితో ఆగక. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. తఱిమి సుశర్మఁ గిట్టి యతి దారుణ భంగి రణంబు సేయ, వాఁ
డుఱక నిశాత సాయకము లొక్కమొగిం బది మేనియందుఁ గ్రి
క్కిఱియఁగఁ జేసి నాలుగిట నేసెఁ దురంగములన్; యుధిష్ఠిరుం
డఱిముఱిఁ జంపె సారథిఁ దదశ్వములన్ వరబాణపాణియై. 216

ప్రతిపదార్థం: తఱిమి= తరుముకొనిపోయి; సుశర్మన్= సుశర్మను; కిట్టి= సమీపించి; అతి దారుణభంగిన్= మిక్కిలి భయంకరమైన రీతిలో; రణంబు+చేయన్= యుద్ధం చేయగా; వాఁడు= సుశర్మ; ఉఱక= జంకక; నిశాత సాయకములు= వాడి అయిన బాణాలు; ఒక్కమొగిన్= ఒక్కసారిగా; పది= పదింటిని; మేని+అందున్= (ధర్మరాజు యొక్క) శరీరంలో; క్రిక్కిఱియఁగన్+చేసి= దట్టంగా గ్రుచ్చుకొనేటట్లు నాటి; నాలుగిటన్= నాలుగు బాణాలతో; తురంగములన్= తేరి గుర్రాలను; ఏసెన్= కొట్టాడు; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అఱిముఱిన్= వెంటనే; వరబాణపాణి+ఐ= శ్రేష్ఠమైన బాణాలు చేతియందు కలవాడై; సారథిన్= సుశర్మ రథసారథిని; తద్+అశ్వములన్= అతడి తేరి గుర్రాలను; చంపెన్= చంపాడు.

తాత్పర్యం: ధర్మరాజు సుశర్మను వెంటాడి తరిమి, ఎదుర్కొని భయంకర పద్ధతిలో యుద్ధం చేస్తూ ఉండగా, సుశర్మ వెనుకాడక పది వాడి బాణాలను ఒక్కసారిగా ఒక్కచోటే క్రిక్కిరిసి గ్రుచ్చుకొనేటట్లు ధర్మరాజు యొక్క శరీరంలో నాటాడు. నాలుగు బాణాలతో అతడి తేరి గుర్రాలను కొట్టాడు. ధర్మరాజు ఊరుకోక వెంటనే బలమైన బాణాలను సంధించి సుశర్మ రథసారథినీ, గుర్రాలనూ చంపాడు.

వ. అయ్యవసరంబున మత్స్య మహీనాథుండు జనితోత్సాహుండై. 217

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; మత్స్య మహీనాథుండు= మత్స్యదేశరాజయిన విరాటుడు; జనిత+ఉత్సాహుండు+ఐ= పుట్టిన ఉత్సాహం కలవాడై.

తాత్పర్యం: ఆ సమయంలో విరాటుడు లేని ఉత్సాహం తెచ్చుకొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ఆ సుశర్మ తేరియందున్న ఘనగదా । దండ మెత్తికొని యుదగ్రవృత్తి
జరఠదేహుఁ డయ్యుఁ దరుణ వయస్కున । ట్లవని కుఱికి పోయి యతని వ్రేసె. 218

ప్రతిపదార్థం: ఆ సుశర్మ= ఆ సుశర్మయొక్క; తేరి+అందున్+ఉన్న= తేరులోఉన్నట్టి; ఘన= పెద్దదయిన; గదాదండము+ఎత్తికొని= దండం వంటి పెద్ద గదను తీసికొని; ఉదగ్రవృత్తిన్= గర్వంతో; జరఠదేహుఁడు+అయ్యున్= ముసలివాడైనా; తరుణవయస్కునట్లు= పడుచు వయస్సుగల వాడివలె; అవనికిన్+ఉఱికి= భూమిమీదకు దూకి; పోయి= వెళ్ళి; అతనిన్+వ్రేసెన్= సుశర్మను కొట్టాడు.

తాత్పర్యం: ఆ సుశర్మ యొక్క రథంలో ఉన్న ఒక గదాదండాన్ని తీసికొని, ముసలివాడైనా యువకుడివలె ముందుకు నిర్భయంగా నేలమీదికి దూకి, సుశర్మను సమీపించి అతడిని ఆ గదతో మోదాడు.

క. అట్టి సమయమునఁ గరువలి । పట్టి త్రిగర్తేశు రథముపై కుఱికి వెసం
బట్టికొని, యతనిఁ బెడగే । ల్గట్టి పెలుచ నార్చెఁ దద్బలము పెల్లగిలన్. 219

ప్రతిపదార్థం: అట్టిసమయమునన్= ఆ సమయంలో; కరువలిపట్టి= వాయుసూనుడయిన భీముడు; త్రిగర్త+ఈశు రథముపైకిన్+ఉఱికి= సుశర్మయొక్క తేరి మీదకు దూకి; వెసన్+పట్టికొని= శీఘ్రంగా పట్టుకొని; అతనిన్+పెడకేల్+కట్టి= అతడి చేతులు విరిచి వెనుకకు కట్టి; తద్+బలము= ఆ సుశర్మసేనలు; పెల్లగిలన్= త్రుళ్ళిపడగా; పెలుచన్= పెద్దగా; ఆర్చెన్= అరచాడు.

తాత్పర్యం: అప్పుడు భీముడు సుశర్మతేరిమీదకు దూకి, శీఘ్రంగా పట్టుకొని, అతడి చేతులు వెనుకకు విరిచి కట్టి పెద్దగా సింహనాదం చేశాడు. అందు కా సుశర్మ సేనలు త్రుళ్ళిపడ్డాయి.

వ. ఇట్లు సుశర్మంబరాజితుం జేసినఁ జక్రరక్షకుండైన శోణాశ్వుండు మొదలుగా నాప్త భృత్య వర్గంబు, ననుజుండైన సుశర్మ లోనైన బంధు జనంబులు నాదిగాఁ గల పరివారంబు పలాయన పరాయణం బగుటయు, వెనుకొని యెయిది గోధనవర్గంబు మరల్చి, కరి తురగ రథంబులం దలమీఱి పొదివి తెచ్చి, యన్నపాలికి వచ్చి తాను మున్ను త్రిగర్తేశు రథంబు కడ నిలువ నియోగించియున్న తమ్ములం గూర్చుకొని, తమ యంతవట్టును నొక్కట విరాటునకుం బొడసూపిన. 220

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సుశర్మన్= సుశర్మను; పరాజితున్+చేసినన్= ఓడించగా; చక్రరక్షకుండు+అయిన శోణాశ్వుండు= అతడి చక్రరక్షకుడైన శోణాశ్వుడనేవాడు; మొదలుగాన్= మొదలుకొని; ఆప్తభృత్యవర్గంబు= ఆప్తులయిన సేవకుల సముదాయం; అనుజుండు+ఐన= తమ్ముడైన; సుశర్మలోనైన బంధుజనంబులున్= సుశర్మ మొదలగు బంధువులు; ఆదిగాన్+కల పరివారంబు= మొదలయిన సేవక బృందం; పలాయన పరాయణంబు+అగుటయున్= పరిగెత్తిపోవటంలో ఆసక్తికలది కాగా; వెనుకొని= వెన్నంటి తఱిమి; ఎయిది= అందుకొని; గోధనవర్గంబు= పశుసంపద సముదాయాన్ని; మరల్చి= త్రిప్పి; కరి, తురగ, రథంబులన్+తలమీఱి= ఏనుగులనూ, గుర్రాలనూ, తేరులనూ దాటి ముందుకు వచ్చి; పొదివి తెచ్చి= చుట్టుముట్టి తీసికొని వచ్చి; అన్న పాలికిన్ వచ్చి= ధర్మజుడి ఒద్దకు వచ్చి; తాను మున్ను= ఇదివరకు తాను; త్రిగర్తేశురథంబుకడన్= సుశర్మ తేరు దగ్గర; నిలువన్+నియోగించి ఉన్న= ఉండండని ఉత్తర్వు చేసి ఉన్న; తమ్ములన్+కూర్చుకొని= తమ్ములను కలుపుకొని; తమ +అంత+పట్టును= తమవారందరూ; ఒక్కటన్= ఒకచోట ఒక్కటిగా నిలిచి; విరాటునకున్+పొడచూపినన్= విరటునకు కనిపించగా.

తాత్పర్యం: ఈ విధంగా భీముడు సుశర్మను ఓడించగా, అతడి చక్రరక్షకుడయిన శోణాశ్వుడూ మొదలైన ఆప్త సేవకులూ, తోబుట్టువయిన సుశర్మ మొదలైన బంధువులూ పలాయనం చిత్తగించగా వారిని వెన్నంటి తరిమి పట్టుకొని వచ్చి, పశుసంపదను మరల్చి చతురంగబలాలను అతిక్రమించి ముందుకు పోయి వాటిని చుట్టుముట్టి తీసికొని తమ అన్న వద్దకు వచ్చి, తా నిదివరలో త్రిగర్తేశుడి తేరివద్ద ఉండండని నియోగించిన తమ్ములను వెంట తీసికొని వచ్చి ఒక్కటిగా గుమికూడి విరాటుడికి కనపడ్డాడు.

క. ఆదరము సంభ్రమంబును । మోదంబును దన మనమున ముప్పిరిగొన నా
భూదయితుఁడు వివిధప్రియ । వాదంబుల గారవించె వారల నెల్లన్. 221

ప్రతిపదార్థం: ఆ, భూ, దయితుఁడు= ఆ రాజు విరాటుడు; తన మనమునన్= తన హృదయంలో; ఆదరము= గౌరవం; సంభ్రమంబును= తొట్రుపాటూ; మోదంబును= సంతోషమూ; ముప్పిరిగొనన్= ముప్పేటగా ముంచుకొనిరాగా; వివిధ ప్రియ వాదంబులన్= పలురకాల ప్రియ సంభాషణలతో (మేలి మాటలతో); వారలన్+ఎల్లన్= వారందరిని; గౌరవించెన్= ఆదరించాడు.

తాత్పర్యం: గౌరవం, తొట్రుపాటూ, సంతోషం తన మనసులో ముప్పేటగా పెనవేసికొని పైకి పొంగగా విరటుడు అనేకవిధాల ప్రీతిగొల్పే మాటలతో వారి నందరిని ఆదరించాడు.

వ. ఇట్లు సంభావించి పాండవాగ్రజు నవలోకించి. 222

ప్రతిపదార్థం: ఇట్లు సంభావించి= ఈ విధంగా గౌరవించి; పాండవ+అగ్రజున్+అవలోకించి= పాండుకుమారులలో పెద్దవాడైన ధర్మరాజును చూచి.

తాత్పర్యం: ఈ విధంగా గౌరవించి, విరాటుడు ధర్మరాజును చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'మానముఁ బ్రాణముఁ గాచితి । దీనికి సరిగాఁగ నీ మదికిఁ బ్రియ మెసఁగం
గా నాకుఁ జేయనయ్యెడు । దాని నెఱుఁగఁగాన మత్పదము గైకొనవే! 223

ప్రతిపదార్థం: మానమున్= అభిమానాన్ని; ప్రాణమున్= ప్రాణాన్ని; కాచితి(వి) కాపాడావు; దీనికిన్+సరికాఁగన్= దీనికి సరిపోయేటట్లు (దీటుగా); నీ మదికిన్= నీ మనస్సుకు; ప్రియము+ఎసఁగన్= ప్రీతి కలిగేటట్లు; నాకున్+చేయన్+అయ్యెడుదానిన్= నేనుచేయదగిన దానిని; ఎఱుఁగన్= తెలిసికొనలేకపోతున్నాను; కానన్= కావున; మత్+పదము+కైకొనవే= నా పదవిని (రాజపదవిని) స్వీకరించుము.

తాత్పర్యం: 'నీవు నా మాన ప్రాణాలను కాపాడావు. దానికి సరితూగేటట్లు, నీ మనస్సుకు ప్రీతి కలిగించేటట్లు ఏమి చేయాలో దానిని నేను నిర్ణయించుకొనలేకపోతున్నాను. కాబట్టి నా రాజపదవినే నీకు సమర్పించుకొంటాను. స్వీకరించుము.

విశేషం: 'నాకుఁ జేయనయ్యెడు దాని నెఱుఁగఁగానన్' అనే వాక్యం కృతజ్ఞతాబద్ధమైన హృదయంతో, వినయంతో మెలికలు తిరుగుతూ విరాటుడు పలికిన తీరును తెలుపుతున్నది. 'నేను నీవు చేసిన మేలుకు తగిన మేలు చేయలేను. అది నా ఎరుకలో లేదు' అన్నట్లు చెప్పాడు. విరాటుడు సరళ హృదయుడు. కోపం వచ్చినా, సంతోషం వచ్చినా, కృతజ్ఞత పొంగివచ్చినా అరమరికలు లేకుండా పలుకుతాడు. మానాన్నీ, ప్రాణాన్నీ ఇచ్చినవాడు గురుతుల్యుడు, దైవతుల్యుడు. అతడికి సర్వస్వం సమర్పించుకొనటమే సమంజసం. విరాటుడు రాజపదవి నిస్తే అతడి స్థితి ఏమిటి? (పాండవ) దాసుడే కావాలి. కంకుడు ధర్మరాజని తెలియకపోయినా అతడికి సర్వస్వం దానం చేయదలచిన విరాటుడు అచ్చమైన వినయశీలి. (సంపా.)

తే. ఒడలు సిరియును నాకు నీయొసఁగినవియ । కానఁ దగ సమర్పించెదఁ; గరుణ నీవు
సమ్మతించి యిమ్మత్స్య దేశంబుఁ గావు । పంచి పనిగొని నన్ను రక్షించికొనుము.' 224

ప్రతిపదార్థం: ఒడలున్= శరీరమూ; సిరియును= సంపదా; నాకున్+ఈవు+ఒసఁగినవి+అ= నాకు నీవిచ్చినవే; కాన= కనుక; తగన్= తగునట్లుగా; సమర్పించెదన్= ఇస్తాను; కరుణన్= దయతో; నీవు సమ్మతించి= నీ విష్టపడి; ఈ+మత్స్యదేశంబున్+కావు(ము)= ఈ మత్స్యదేశాన్ని కాపాడుము; పంచి= ఆజ్ఞాపించి; పనిగొని= సేవలందికొని; నన్ను రక్షించికొనుము= నన్ను కాపాడుకొనుము.

తాత్పర్యం: ఈ నా శరీరము, సంపదా నీ విచ్చినవే కనుక నీకే సమర్పిస్తాను. నీవు సమ్మతితో ఈ మత్స్యరాజ్యాన్ని స్వీకరించి, రక్షించుము. నన్ను నీ వాడిగా మన్నించి ఆజ్ఞాపించి కాపాడుము'.

విశేషం: ఇది శరణాగతివంటి మాట. (సంపా.)

వ. అనిన విని యజాతశత్రుం డతని కిట్లనియె. 225

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు ఆ విరాటుడితో ఇట్లా అన్నాడు.

చ. 'మనుజవరేణ్య! నావలని మన్నన యట్టిదకాదె; శత్రు మ
ర్దన మొనరించి మత్స్య నగరంబున కుత్సవ ముల్లసిల్ల నీ
చనుటయు నాకుఁ దేజమును సంపదయుం గరిమంబుఁగాక, యి
ట్లనఁ దగునయ్య? యే నిచట నైనది యేటిది? యింత యేటికిన్?' 226

ప్రతిపదార్థం: మనుజవరేణ్య!= ఓ పురుష శ్రేష్ఠుడా, రాజా!; నావలని మన్నన= నాయందలి గౌరవం; అట్టిది+కాదె!= అట్టిదేకదా; శత్రుమర్దనము+ఒనరించి= శత్రుసంహారం చేసి; మత్స్యనగరంబునకున్= మత్స్యభూపాలుడి రాజధానికి; ఉత్సవము+ఉల్లసిల్లన్= సంతోషం కలుగగా; నీ చనుటయు= నీవు వెళ్ళుటయే; నాకున్= నాకు; తేజమును= శక్తినీ; సంపదయున్= ఐశ్వర్యం; గరిమంబున్+కాక= గొప్పదనంగానీ; ఇట్లు+అనన్+తగునఅయ్య!= ఈ విధంగా అనవచ్చునా?; ఏన్+ఇచటన్+ఐనది+ఏటిది?= నేను ఇక్కడ చేసింది ఏముంది?; ఇంత+ఏటికిన్?= ఇంత ఎందుకు?

తాత్పర్యం: 'ఓ విరాటరాజా! నామీద మీకున్న గౌరవం అటువంటిది సుమా! శత్రుసంహారం చేసి విజయోత్సాహంతో మత్స్యదేశ రాజధానికి నీవు తిరిగి పోవటంకంటే వేరే తేజస్సూ, సంపదా, గొప్పదనం మరేమి ఉంటుంది? నీవు ఇట్లా అనవచ్చునా? నే నిక్కడ నీకు చేసింది ఏమున్నది? ఇంత చిన్నపనికి ఇంతగా నీవు చెప్పవలెనా?'

విశేషం: 'ఏ నిచట నైనది యేటిది? యింత యేటికిన్?' అనే గ్రాంథిక భాషలోని వాక్యాలు వ్యావహారికతను ముద్రించుకొన్నవి. తిక్కన వాక్యాలలో ఇట్టివి కోకొల్లలు. (సంపా.)

క. అను పలుకులకును విస్మయ । మును సంతోషమును జిత్తమునఁ బెనఁగొన నా
జనపతి ధర్మతనూభవుఁ । గనుఁగొని యిట్లనియె మఱియు గౌరవ మెసఁగన్. 227

ప్రతిపదార్థం: అను పలుకులకును= ధర్మరా జనే మాటలకు; విస్మయమును= ఆశ్చర్యాన్నీ; సంతోషమును= ఆనందాన్నీ; చిత్తమునన్+పెనఁగొనన్= మనసులో పెనవేసికొనగా; ఆ జనపతి= ఆ రాజు (విరాటుడు); ధర్మతనూభవున్+కనుఁగొని= ధర్మరాజును చూచి; గౌరవము+ఎసఁగన్= గౌరవం అతిశయించగా; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మజుడి మాటలకు ఆశ్చర్యం. సంతోషం పెనగొనగా విరాటరాజు ధర్మరాజును చూచి గౌరవంతో మరల ఈ విధంగా అన్నాడు.

క. 'ఉపకారమొ, బంటుతనమొ । కృపయో, పెంపో. సమగ్ర కీర్తి ప్రియమో,
రిపుదుస్సహమగు నీ రణ । నిపుణతకుం గారణంబు నెయ్యమొ, యెఱుఁగన్. 228

ప్రతిపదార్థం: రిపు= వైరులకు; దుస్సహము+అగు= భరించరానిదైన; నీ నిపుణతకున్= నీ నేర్పరితనానికి; కారణంబు= కారణం; ఉపకారమొ?= సాయమో?; బంటుతనమొ= వీరత్వమో?; కృపయో?= దయయో?; పెంపో?= గొప్పదనమో?; సమగ్రకీర్తి ప్రియమో?=నిండయిన కీర్తిమీది ప్రీతియో?; నెయ్యెమొ?= స్నేహమో?; ఎఱుఁగన్= ఏదో తెలిసికొనలేకున్నాను.

తాత్పర్యం: 'శత్రువులకు అసాధ్యమైన నీ నైపుణ్యాన్ని ఇప్పుడు ప్రదర్శించటానికి కారణం ఏమై ఉంటుందా? అని ఆలోచిస్తున్నాను. నాకు ఉపకారం చేయాలనే ఉదారభావమా? వీరాన్ని ప్రదర్శించుకొందామనే పౌరుషభావమా? దయను చూపిద్దామనే మెత్తని హృదయమా? లేక అది నీ సహజమైన గొప్పతనమేనా? లేదా మనిద్దరి నడుమ ఉన్న స్నేహమా? వీటిల్లో కారణ మేదై ఉంటుందో తెలిసికొనలేకపోతున్నాను.

విశేషం: విరాటుడి వితర్కం సహజంగా ఉన్నది. కాని, ధర్మరాజు ఇతమిత్థమని చెప్పలేని అజ్ఞాతవాస నియమం గూఢంగా పఠితల హృదయాలలో స్ఫురించి తృప్తిని కలిగిస్తుంది. కథలో ఉత్కంఠను రేకెత్తిస్తుంది. (సంపా.)

ఉ. మంటయుఁ బోని శాత్రవసమాజము నించుక యేని శంకలే
కంటఁగఁ దాఁకి, వెండి తెగటార్చె మహాద్భుతశక్తిశాలి యీ
వంటలవాని చేసిన యవార్య పరాక్రమ మొండుచోటులం
గంటిమె? వింటిమే? యితఁడ కాఁడె వెసన్ గెలిపించె న న్ననిన్. **229**

ప్రతిపదార్థం: మంటయున్+పోని= మంటవంటి; శాత్రవ సమాజమున్= వైరిసమూహాన్ని; ఇంచుక ఏని శంకలేక= ఒకింతకూడా జంకు లేకుండా; అంటఁగన్‌తాఁకి= ముట్టడివేసి; వెండి= మఱియు; తెగటార్చెన్= చంపివేశాడు; మహా+అద్భుత శక్తిశాలి= మిక్కిలి ఆశ్చర్యం కలిగించే బలశాలి; ఈ వంటలవాని చేసిన= ఈ వంట వాడు చేసిన; అవార్య పరాక్రమము= అడ్డుకొనరాని పరాక్రమం; ఒండుచోటులన్+కంటిమో?= వేఱొకచోట చూచామా?; వింటిమే?= విన్నామా?; ఇతఁడు+అ కాఁడె= ఇతడేకదా; వెసన్= త్వరగా; అనిన్= యుద్ధంలో; గెలిపించెన్= (నన్ను) గెలిపించాడు.

తాత్పర్యం: మంటను తలపించే శత్రుసమూహాన్ని ఏమాత్రం జంకులేకుండా వెంటనంటి నాశనం చేశాడు. మహాశ్చర్యాన్ని కలిగించే ఈ వంటవాడి అవార్యమయిన పరాక్రమాన్ని మరెక్కడా చూచి, విని ఎరుగం. యుద్ధంలో ఇతడే కదా నన్ను ఇంత త్వరగా గెలిపించగలిగాడు.

విశేషం: అలం: ఉపమ. శత్రువులను మంటలతో పోల్చటం వలలుడి పట్ల సార్థకం. వంటలవాడు మంటలను నియంత్రించగలడు. మూలంలోకంటె భీమప్రశంస తిక్కన రచనలో విశిష్టం. భీమనాయక మీ ఘట్టం అనిపించేటట్లు ఉన్నాయి ఈ మాటలు. (సంపా.)

క. కంధరములు దెగి తలలు వ। సుంధర నతిపక్వ తాల సుభగఫలాళి
బంధురత రాలు దామ। గ్రంథి పగఱమీఁదఁ గినిసి కవిసిన యెడలన్. **230**

ప్రతిపదార్థం: దామగ్రంథి= దామగ్రంథి పేర మెలగుతున్న నకులుడు; పగఱమీఁదన్= శత్రువులమీద; కినిసి= కోపించి; కవిసిన+ఎడలన్= యుద్ధానికి పూనుకొన్నప్పుడు; కంధరములు= శత్రువుల కంఠాలు; తెగి= (అతడి ఆయుధం వలన) తెగి; తలలు= వారి తలలు; అతిపక్వ= బాగాపండిన; తాలసుభగఫల+ఆళీ= అందమైన తాటిపండ్ల సమూహాల; బంధురతన్= సాంద్రతతో; వసుంధరన్= నేలపై; రాలున్= రాలుతాయి.

తాత్పర్యం: దామగ్రంథి కోపించి శత్రువులమీద దాడిచేస్తే, వారి కంఠాలు తెగి తలలు అందంగా పండిన తాటిపండ్ల వరుసల వలె విరివిగా నేలమీద రాలుతాయి.

విశేషం: అలం: ఉపమ. తలలను తాటికాయలతో పోల్చటం కవిసమయం. జాతీయం. (సంపా.)

క. ఎక్కడఁ జూచినఁ దానై । యక్కజమగు కడిమికలిమి నరిసేనఁ గరం
బుక్కణఁ దంత్రీపాలుం । డొక్కఁడ పొలియించె నీ రణోత్సాహమునన్. 231

ప్రతిపదార్థం: తంత్రీపాలుండు= తంత్రీపాలుడనే పేరనున్న సహదేవుడు; ఈ రణ+ఉత్సాహమునన్= ఈ యుద్ధ ప్రయత్నంలో; ఎక్కడన్+చూచినన్= ఎటుచూచినప్పటికిని; తాను+ఐ= తానుగా; అక్కజము+అగు కడిమి కలిమిన్= ఆశ్చర్యకమైన పరాక్రమమనే ఐశ్వర్యంతో (శక్తి సంపదతో); అరిసేనన్= వైరిసేనను; కరంబు+ఉక్కు+అఱన్= మిక్కిలి పొగరు అణగేటట్లు; ఒక్కఁడు+అ= ఒకడే; పొలియించెన్= సంహరించాడు.

తాత్పర్యం: యుద్ధోత్సాహంతో తంత్రీపాలు డొక్కడే ఎటుచూచినా తానుగా కనబడి ఆశ్చర్యం కల్గించేటట్లు శత్రుసేనలను ఈ యుద్ధంలో సంహరించాడు.

క. ఈ నలువురు తక్కఁగ మన । సేనల నొక్కరునినైనఁ జేడ్పడని భటుం
గానం జెలి కెడరైనం । బూని తగులు నతఁడచూవె పురుషుం డెందున్. 232

ప్రతిపదార్థం: ఈ నలువురు తక్కఁగన్= ఈ నల్గురు తప్ప; మన సేనలన్= మన సేనలలో; ఒక్కరున్+ఐనన్= ఒక్కడనైనను; చేడ్పడని= దెబ్బలు తినని (గాయాలులేని); భటున్+కానము= సైనికుడిని చూడము; చెలికిన్= మిత్రుడికి; ఎడరు+ఐనన్= ఆపదకలిగితే; పూని= పూనుకొని; తగులు+అతండు+అ= ఆదుకొనేవాడే; ఎందున్= ఎక్కడైనా; పురుషుండు= మగవాడు, మానవుడు; చూవె= సుమా!

తాత్పర్యం: ఈ నలుగురు తప్ప మన సేనలలో ఒక్కరైనా గాయం తగలని భటుడిని మనం చూడం. మిత్రుడికి ఆపద కలిగినప్పుడు తనంతట తాను పూనుకొని అతడిని ఆదుకొనేవాడే నిజమైన మానవుడు సుమా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. విరాటుడికి అడగకుండానే తమంతట తామే కష్టంలో ఆదుకొన్న ధర్మజ. భీమ, నకుల, సహదేవులే ఇక్కడ ఉత్తమ పురుషులు. (సంపా.)

ఉ. కావున మీకు దంతి హయ కాంచన రత్న విభూషణంబులున్,
దేవనితంబినీజన సదృక్ష మృగాక్షులు నాదిగాఁగ నా
నావిధ వైభవంబులు మనంబుల వాంఛలకుం దగంగ నీ
కే విధి నీఁగువాఁడ ఋుణ? మెయ్యది యేనియు వేఁడుఁ డిచ్చెదన్.' 233

ప్రతిపదార్థం: కావునన్= అందువలన; మీకున్= మీకు; దంతి, హయ, కాంచన రత్న, విభూషణంబులున్= ఏనుగులు, గుర్రాలు, బంగారం, నవరత్నాలు, నగలు; దేవ నితంబినీజన= దేవతా స్త్రీలకు, అప్సరఃకాంతలకు; సదృక్ష= తుల్యలయిన; మృగ+అక్షులున్= లేడి కన్నుల వంటి కన్నులుగల స్త్రీలు; ఆది కాఁగన్= మొదలుగా; నానావిధవైభవంబులు= వివిధ సౌఖ్యాలూ; మనంబుల వాంఛలకున్ తగంగన్= మనస్సులలోని కోరికలకు అనుగుణంగా; ఈక= ఇవ్వకుండా; ఋణము= అప్పు; ఏ విధిన్+ఈఁగు వాఁడన్= ఏ ప్రకారం తీర్చుకోగలను; ఏ+అది+ఏనియున్, వేఁడుఁడు+ఇచ్చెదన్= ఏదైనా కోరుకొనండి ఇస్తాను.

తాత్పర్యం: అందువలన మీకు ఏనుగులు, గుర్రాలు, నవరత్నాలు, ఆభరణాలు, దేవతాస్త్రీలను పోలిన అందగత్తెలు మొదలైన వివిధ భోగాలను మీ మనసుల్లోని కోరికల కనుగుణంగా ఇవ్వకుండా ఏ ప్రకారంగా మీ ఋణం తీర్చుకొనగలను? మీ రేదైనా కోరుకొనండి ఇస్తాను'.

క. అనవుడుఁ బాండుతనూభవు । 'లనఘా! యి ట్లెంతయుం బ్రియంబున సంభా
వన సేసితి; మా కిది యా । ధనము వడయుదానికంటెఁ దక్కువె? చెపుమా! 234

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; పాండు తనూభవులు= పాండురాజు కుమారులు (ధర్మజ, భీమ, నకుల సహదేవులు); అనఘా!= ఓ పుణ్యమూర్తీ!; ఇట్లు+ఎంతయున్+ప్రియంబునన్= ఈ విధంగా ఎంతో ప్రియంగా; సంభావన చేసితి(వి)= గౌరవించావు; మాకున్= మాకు; ఇది= ఈ గౌరవం; ఆ ధనము= ఆ ఐశ్వర్యం; పడయుదానికంటెన్= పొందేదానికన్నను; తక్కువె చెపుమా= తక్కువా? చెప్పుము.

తాత్పర్యం: విరాటుడు అట్లా అనగానే పాండవులు ఇట్లా బదులు పలికారు. 'ఓ పుణ్యాత్ముడా! మమ్ములను ఈ రీతిగా ఎంతో ప్రీతిగా పలికి గౌరవించావు. నీవు మా కివ్వదలచుకొన్న ఆ ధనంకంటె ఇది తక్కువా? చెప్పుము.

విశేషం: ఉపకారం ప్రతిఫలాన్ని కోరదు. పాండవులు మాటలే మూటల కంటె విలువైనవని ఉత్తమ సంస్కారాన్ని ప్రదర్శించారు. (సంపా.)

ధర్మరాజు సుశర్మను సపరివారంబుగా విడిపించుట (సం.4-32-46)

క. మ మ్మెరవుగాఁ దలంచి యియ్యెడ నిట్టట్టన వలవదు; పురంబున కరిగి యయ్యెడ నీ కెట్లు ప్రియం బట్లు
మన్నింపు' మని; రందుఁ గంకుండు మఱియు నిట్లనియె. 235

ప్రతిపదార్థం: మమ్మున్+ఎరవుగాన్+తలంచి= మమ్మ వేరుగా భావించి; ఈ+ఎడన్= ఇక్కడ; ఇట్టు+అట్టు+అనవలవదు= ఇట్లనీ అట్లనీ అనవద్దు; పురంబునకున్+అరిగి= నగరానికి వెళ్ళి; ఆ+ఎడన్= అక్కడ; నీకున్+ఎట్లు ప్రియంబు= నీ కే విధంగా ప్రీతియో; అట్లు= ఆ ప్రకారంగా; మన్నింపుము= గౌరవించుము; అనిరి= అన్నారు; అందున్= వారిలో; కంకుండు= కంకుభట్టు (ధర్మజుడు); మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: మమ్ములను పరాయివారిగా పరిగణించి ఇక్కడ ఇది ఇట్లా, అది అట్లా అనీ ఔననీ కాదనీ పలకవద్దు. నగరానికి చేరిన తరువాత అక్కడ నీ కెట్లా ఇష్టమైతే అట్లా గౌరవించుము' అన్నారు. వారిలో కంకుడు ఇంకా ఈ విధంగా అన్నాడు.

క. 'తగ నొక్కటి వేఁడెద నిను । జగతీశ్వర! యిచ్చు టొప్పు; సరథగజాశ్వం
బుగ విడిచిపుచ్చు మిప్పుడ । త్రిగర్తపతి; నిదియ నాకుఁ బ్రియ మెబ్బంగిన్. 236

ప్రతిపదార్థం: జగతీ+ఈశ్వర!= మహారాజా!; తగన్= సముచితంగా; నినున్= నిన్ను; ఒక్కటి వేఁడెదన్= ఒకటి కోరుతాను; సరథ గజ+అశ్వంబుగన్= రథాలతోను, ఏనుగులతోను, గుర్రాలతోను; ఇప్పుడు+అ= ఇపుడే; త్రిగర్త పతిన్= సుశర్మను; విడిచిపుచ్చుము= వదిలివేయుము; ఇది+అ= ఈ పనియే;నాకున్, (ధర్మరాజుకు); ఏ+భంగిన్= ఏవిధంగా చూచినా; ప్రియము= ప్రీతిని (ఇష్టమును); ఇచ్చుట+ఒప్పున్= ఇచ్చినట్లౌతుంది.

తాత్పర్యం: 'ఓ విరాటరాజా! నేను ఒకటి సముచితంగా కోరుతున్నాను, వినుము. దానిని నెరవేర్చటం మంచిది. సుశర్మను చతురంగబలాలతో సహా ఇప్పుడే విడుదల చేయుము. ఇదే నాకు అన్ని విధాలా ప్రీతిని కలిగిస్తుంది.

విశేషం: ధర్మరాజు శాసించగల స్థానంలో ఉన్నా అర్థిస్తున్నాడు. అజ్ఞాతవాసవ్రత ప్రభావం. అతడు వేషంలో అజ్ఞాతంగా ఉన్నా గుణంలో అజ్ఞాతంగా లేడు. (సంపా.)

వ. **మన నగరంబునకు జంఘాలురం బంపుము; పురంబున వారలువోయి భవద్విజయ ఘోషం బాచరించి, శోభనధ్వజోన్నయనంబును, మంగళతూర్యనాదంబులును, బరస్పర గంధ సలిల సేచనంబులును, గీతవాద్య నృత్తంబులును నాదిగాఁగల వివిధ శుభాచారంబులం బ్రవర్తింప నియోగింప వలయు' ననిన, విరాటుండును బనిచినం గాలరులు వేగునంతకు వీటికిం జని గెలుపు ప్రకటించి, పట్టణాలంకరణ ప్రముఖ నిఖిలభద్ర విధానంబులు చేయించి; రిట పాండవులును మత్స్య మహీవల్లభుండును సమస్త సేనాసమేతులై విభవం బెసఁగ విలసిల్లుచు, లజ్జావనతాననుం డగు సుశర్మ సపరిచ్ఛదంబుగా విడిచి పుచ్చి, గుత్తులకొలందికిఁ గృత్తంబులయి పడియున్న పాదంబుల వలనం గెందలిరుల సెజ్జల చందంబులగు చోట్లును, దునిసి చిక్కువడియున్న యూరు కాండంబుల వలన మదగజంబులు సొచ్చిన కదలీ వనంబులుం బోని యెడలును, బ్రోవులు గొనియున్న ప్రేవుల వలన లావుగల యంచపిండు పేరాఁకలి నఱిముఱిం బెఱికినఁ గుఱుకులు గట్టిన మృణాళ నాళంబుల నొప్పు కమలాకరోద్దేశంబులఁ గ్రేణిసేయు ప్రదేశంబులును, నంగుళీయకరుచు లడర నెఱిం జాఁగి పడియున్న బాహుదండంబుల వలన నురగ నివాసంబుల ననుకరించు తలంబులును, గీలాలజాలంబులపయిందేలుచు నవ్వినట్లున్న శిరంబులవలన వికచారవింద దీర్ఘికల విడంబించు తావులును, నవయవ భేదంబు లడంగునట్లుగాఁ దుత్తునియలై పడియున్న గాత్రంబుల వలనం గృతాంత మహానసశాలలపగిది నొప్పునట్లును గల పొలికలను గలయం గనుంగొనుచు వెడలి, చంద్రికాసుందరం బగు నొక్క సైకతస్థలంబున నారాత్రి పుచ్చిరని చెప్పిన విని, 'మఱునాఁటి వృత్తాంతం బె ట్లయ్యెనో!' యని సాదరంబుగా నవలోకించిన.** **237**

ప్రతిపదార్థం: మన నగరంబునకున్= మన ముఖ్యపట్టణానికి; జంఘాలురన్+పంపుము= వేగంగా నడచేవారిని పంపుము; వారలు+పోయి= వారువెళ్లి; పురంబునన్= నగరంలో; భవత్+విజయఘోషంబున్= నీ విజయవార్తను చాటింపుచేసే పనిని; ఆచరించి= చేసి; శోభనధ్వజ+ఉన్నయనంబును= విజయధ్వజాలను నిలువబెట్టటం; మంగళతూర్యనాదంబులును= మంగళవాద్యాలను మ్రోయించటం; పరస్పర= ఒకరినొకరు; గంధసలిల సేచనంబులును= శ్రీగంధం కలిపిన నీటిని చల్లుకొనటం; గీతవాద్యనృత్తంబులును= పాటలు పాడుతూ, వాద్యాలను వాయిస్తూ, నాట్యములు చేయటం; ఆదిగాన్+కల= మొదలయిన; వివిధ శుభ+ఆచారంబులన్= ప్రవర్తింపన్+నియోగింపవలయున్= అనేక శుభకార్యాలను చేసేటట్లు ఉత్తరువు చేయాలి; అనన్= అనగా; విరాటుండును= విరాటుడుకూడా, పనిచినన్= అట్లాగే ఆజ్ఞలు జారీ చేయగా; కాలరులు= పదాతిదళాలు; వేగునంతకున్= తెల్లవారేసరికి; వీటికిన్+చని= నగరానికి వెళ్ళి; గెలుపు ప్రకటించి= జయవార్తను చాటి; పట్టణ+అలంకరణ ప్రముఖ= నగరాన్ని సింగారించటం మొదలైన; నిఖిలభద్ర విధానంబులు= మంగళ కార్యాలన్నింటినీ; చేయించిరి= చేయించారు; ఇట= ఇక ఇక్కడ; పాండవులును= పాండవులూ; మత్స్య మహీవల్లభుండును= మత్స్యదేశపురాజయిన విరాటుడూ; సమస్త సేనా సమేతులై= సేనలన్నిటితో కూడి; విభవంబు+ఎసఁగన్= సంపద అతిశయించగా; విలసిల్లుచున్= ప్రకాశిస్తూ; లజ్జ= సిగ్గుతో; అవనత+అననుండు+అగు= తలవంచిన వాడయిన; సుశర్మ= సుశర్మను; సపరిచ్ఛదంబుకాన్= సేవకులతో సహా; విడిచిపుచ్చి= వదలిపెట్టి; గుత్తులకొలందికిన్= చీలమండలం వరకు; కృత్తంబులు+ అయి= నరకబడి; పడి ఉన్న= నేలపై పడివున్న; పాదంబులవలనన్= పాదాల వలన; కెంపు+తలిరుల= ఎఱ్ఱ చిగుళ్ల; సెజ్జల చందంబులు+ అగుచోట్లును= శయ్యలతీరు వలె ఉన్న స్థలాలున్నూ; తునిసి= తునిగిపోయిన; చిక్కు+పడి+ఉన్న= చిందరవందరగా చిక్కుపడి ఉన్నట్టి; ఊరుకాండంబులవలనన్=

తొడల సమూహాల వలన; మదగజంబులు+చొచ్చిన= మదపు టేనుగులు ప్రవేశించిన; కదలీవనంబులున్+పోని+ఎడలును= అరటితోటలను పోలిన చోటులున్నూ; ప్రోవులు+కొని+ఉన్న= కుప్పలు కుప్పలుగా పడి ఉన్న; ప్రేవుల వలనన్= పేగులతో; లావుకల అంచపిండు= బలిసిన హంసల సమూహం; పేరు+ఆఁకలిన్= మిక్కిలి ఆకలితో; అటిముటిన్+పెరికినన్= తొట్రుపాటుతో లాగగా; కుఱుకులు+కట్టిన= కుప్పలు కుప్పలుగా పడిన; మృణాళనాళంబులన్= తామరతూడులతో; ఒప్పు=ఒప్పారే; కమలాకర+ఉద్దేశంబులన్= తామరకొలనులున్న చోటులను; క్రేణిచేయు= పరిహసించే; ప్రదేశంబులును= చోటులున్నూ; అంగుళీయక రుచులు+అడరన్= చేతి ఉంగరాల కాంతులు అతిశయించగా; నెఱిన్+చాఁగిపడిఉన్న= వరుసగా సాగిలపడి ఉన్నట్టి; బాహుదండంబుల వలనన్= కర్రలవంటి చేతుల వలన; ఉరగనివాసంబులన్= పాముల ఉనికిపట్టుఐన పాతాళలోకాన్ని; అనుకరించు= అనుసరించే; తలంబులును= చోటులును; కీలాల జలంబుల పయిన్+తేలుచున్= నెత్తురనెడి నీళ్లపైన తేలియాడుతూ; నవ్వినట్లు+ఉన్న= నవ్వినట్లుతోస్తున్న శిరంబులవలనన్= తలలవలన; వికచ+అరవింద= విరిసిన తామరలున్న; దీర్ఘికలన్ విడంబించు= దిగుడుబావులను అనుకరించే; తావులును= చోటులున్నూ; అవయవభేదంబులు+అడంగునట్లుగాన్= ఈశరీరావయవాలు ఇవి అని తేడా తెలిసికొనలేనంతగా; తునియలు+తునియలు+ఐ పడి+ఉన్న= ముక్కలు ముక్కలుగా పడివున్న; గాత్రంబులవలనన్= శరీరాలవలన; కృతాంతమహానసశాలలపగిదిన్= యముడి వంటసాలల వలె; ఒప్పు+అట్లును= అందగిస్తూ; కల= ఉన్నట్టి; పొలికలను= యుద్ధభూమిని; కలయన్+కనుంగొనుచున్=అంతటా తిరిగి చూస్తూ; వెడలి= వెళ్ళి; చంద్రికా సుందరంబున్+అగు= వెన్నెల కాయటం వలన అందమయిన; ఒక్క సైకతస్థలంబునన్= ఒకానొక ఇసుకతిన్నెమీద; ఆ రాత్రి పుచ్చిరి= ఆ రాత్రి+గడిపారు; అని చెప్పినన్= అని చెప్పగా; విని= విన్నవాడై; మఱునాఁటి వృత్తాంతంబు+ఎట్లు+అయ్యెనో= మఱునాటికథ ఏమైనదో; అని= అంటూ; సాదరంబుగాన్ అవలోకించినన్= ఆసక్తిగా చూడగా.

తాత్పర్యం: మన నగరానికి వేగంగా పోగలవారిని పంపుము. వారు నగరానికి చేరి నీ విజయవార్తను చాటింపు చేయించాలి. విజయధ్వజాలను ఎత్తించాలి. మంగళవాద్యాలను మ్రోయింపచేయాలి. సుగంధజలాలను ప్రజలు ఒకరిపై మరొకరు చల్లుకొనేటట్లు వేడుకలు జరిపించాలి' అని కంకుడు కోరాడు. విరాటుడు దాని కంగీకరించి దూతలను నగరానికి పంపాడు. వారు తెల్లవారేసరికి విజయవార్తను చాటించారు. పట్టణాన్ని అలంకరించటం మొదలుగా గల అనేక శుభాలంకారాలు చేయించారు.

ఇక ఇక్కడ పాండవులూ, విరాటుడూ కలిసి సేనలన్నిటితో కూడి, వైభవంగా విలసిల్లుతున్నారు. లజ్జతో తలవంచుకొని ఉన్న సుశర్మను సపరివారంగా విడుదల చేశారు. యుద్ధభూమిని నలువైపులా తిరిగి చూచారు. అనేక ప్రాంతాలు వారికి బీభత్స రమణీయంగా కనిపించాయి.

గిలకల వరకు తెగిపడి ఉన్న సైనికుల పాదాల వలన కొన్ని చోట్లు చిగురాకు పాన్పుల వలె కనిపించాయి. తెగి చిందరవందరగా పడి ఉన్న సైనికుల తొడల గుంపుల వలన, మదించిన ఏనుగులు ప్రవేశించి పాడు చేసిన అరటి తోటలవలె కొన్ని చోట్లు గోచరించాయి. కుప్పలు కుప్పలుగా పడి ఉన్న సైనికుల ప్రేగులను చూస్తే పెద్ద పెద్ద హంసల గుంపులు పేరాకలితో గబగబా తామరతూండ్లను పెరికి కొరికి కుప్పలు పోసిన సరోవరప్రదేశాలవలె కొన్ని చోట్లు కనుపట్టాయి. వ్రేలి ఉంగరాల రత్నకాంతులు వెదచిమ్ముతుండగా పొడుగ్గా పడి ఉన్న బాహుదండాల వలన సర్పాలు నివసించే పాతాళలోకం వలె కొన్ని ప్రాంతాలు చూపట్టాయి. నెత్తురనే నీటిమీద తేలుతూ నవ్వుతున్నట్లున్న సైనికుల తలలవలన వికసించిన తామరలున్న దిగుడుబావులవలె కొన్ని ప్రాంతాలు కనిపించాయి. ఇవి ఈ అవయవాలు అని గుర్తించ లేనంతగా తునాతునకలై ఉన్న సైనికుల శరీరాలు పడి ఉన్న దృశ్యం యముడి వంట శాల వలె ఒప్పారుతూ కంటబడింది. అటువంటి దృశ్యాల నన్నింటినీ చూస్తూ కొంత దూరం పోయి, వెన్నెల కాయటం వలన మనోహరంగా ఉన్న ఇసుక తిన్నెల ప్రాంతంలో వారందరూ ఆ రాత్రి గడిపారు.

ఈ కథను వైశంపాయనుడు జనమేజయుడితో చెప్పగా, జనమేజయుడు ఆసక్తికరంగా ఆ కథకుడివైపు చూస్తూ 'ఆ మరునాటి కథ ఎట్లా సాగిందో? చెప్పు' మని అడిగాడు.

విశేషం: అలం: ఉపమ, వృత్త్యనుప్రాసం. భయానక బీభత్స రసదృశ్యాలను శబ్దార్థాలంకారాలతో రమణీయభావనామయం చేసి రమ్యతరం చేయటం తిక్కన కావ్యకళాశిల్పం. (సంపా.)

ఆశ్వాసాంతము

చ. అపరిమిత ప్రకార! వినిరస్త సమస్త వికార! షట్ప్రమా
ణపరమదూర! గాఢ భజనక్రమ గత్యనుభావ్య పార! దే
వ పితృపథప్రవర్తన వివర్జన నిర్మలచిత్త చోర! శాం
తిపరమహాత్మ! సంసరణ తీర! నిరంజన భక్తరంజనా! 238

ప్రతిపదార్థం: అపరిమితప్రకార!= (ఆయన జగత్స్వరూపుడు కాబట్టి) పరిమితి (హద్దు) లేని భేదాలున్నవాడా!; వినిరస్త, సమస్త, వికార!= నిరసించిన అన్ని వికారాలున్నవాడా!; షట్+ప్రమాణపరమదూర!= ఆరు రకాలైన ప్రమాణాలకు అందనివాడా!; గాఢ భజన క్రమ గత్యనుభావ్యపార!= దృఢమైన భక్తి భజన విధానం వలన కలిగిన జ్ఞానం వలన పొందగల్గిన గమ్యం కలవాడా!; దేవపితృపథప్రవర్తన!= దేవతలకు, పితరులకు దారి చూపేవాడా! (హరి దేవతలకు, హరుడు పితరులకు దారిచూపేవారు); వివర్జన నిర్మలచిత్తచోర!= త్యాగం వలన స్వచ్ఛమైన వారి మనసులను హరించేవాడా!; శాంతిపరమహాత్మ!= శాంతితో కూడిన గొప్పదైన ఆత్మ(హృదయం) కలవాడా!; సంసరణతీర!= సంసార (సాగరానికి) ఆవలి ఒడ్డువంటివాడా!; నిరంజన భక్తరంజనా!= సుఖదుఃఖాలకు అతీతులైన భక్తులకు సంతోషం కలిగించేవాడా! (లేదా - నిరంజన! = సంగరహితుడా!; భక్తరంజనా!= భక్తులకు ఆనందం కలిగించేవాడా!).

తాత్పర్యం: అనేక రూపభేదాలు కలవాడా!; సర్వవికార విరహితుడా! షట్ప్రమాణాలకు అతీతుడవైనవాడా! దృఢమైన భక్తితో క్రమంగా తెలియదగిన అనుభవానికి గమ్యమైనవాడా! దేవమార్గాలనూ, పితృమార్గాలనూ ప్రవర్తింపజేసేవాడా! త్యాగశీలం వలన పవిత్రమైన చిత్తాలను దోచుకొనేవాడా! శాంతిరూపమైన గొప్ప ఆత్మ కలవాడా! సంసార సాగర తీరం వంటివాడా! విరక్తులైన భక్తులకు ఆనందాన్ని అందించేవాడా! హరిహరనాథా!

విశేషం: అలం: అంత్యానుప్రాసం. 1. ఈ ఆశ్వాసాంత సంబుద్ధులన్నీ హరిహరనాథుడికి అన్వయించుకొనే బహువ్రీహి సమాసాలే. 2. శాంతి పర మహాత్మ సంసరణ తీర! అని సంబోధించవచ్చును కూడా. అంటే - శాంతిపరమైన మహాత్ములకు సంసార సముద్రతీరంవంటి వాడా! అని భావం. 3. షట్ ప్రమాణాలు: 1. ప్రత్యక్షం 2. అనుమానం 3. ఉపమానం 4. శబ్దం 5. అర్థాపత్తి 6. అనుపలబ్ధి.

క. విజ్ఞానానంద రసా। భిజ్ఞ హృదయ కమల హంస! భీమ దురిత మ
ర్మజ్ఞ! వివిధాభిధానా! యజ్ఞాత్మకరూప! నిశ్చ లావ్యయ దీపా! 239

ప్రతిపదార్థం: విజ్ఞాన+ఆనందరస= పరమేశ్వరుడి విజ్ఞానరూపమైన ఆనందరసమును; అభిజ్ఞ= తెలిసిన పండితుల యొక్క; హృదయ= హృదయాలనే; కమల= పద్మాలకు; హంస!= రాజహంసవంటివాడా!; (హంసస్సోహం సోహంహంసః అని పరాత్పరుడిని అద్వైతులు అహం+స; అనీ, సః+అహం అనీ వర్ణిస్తారు); భీమ దురిత= భయంకరమైన పాపాల యొక్క; మర్మజ్ఞ= రహస్యం తెలిసినవాడా! (అనగా భయంకరమైన పాపాలను పోగొట్టే రహస్యం తెలిసినవాడని భావం); వివిధ+అభిధానా!= పెక్కు పేర్లు కలవాడా!; యజ్ఞాత్మకరూప!= యజ్ఞమే స్వరూపంగా కలవాడా!; నిశ్చల+అవ్యయదీపా!= కదలిక లేని తరుగని వెలుగైన ఆకారం కలవాడా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పరమేశ్వరుడి విజ్ఞాన రూపమగు ఆత్మానందరసమును తెలిసిన పండితుల మనఃపద్మాకరంలో విహరించే హంసవంటివాడా! భయంకరమైన పాపాలను తొలగించే రహస్యం తెలిసినవాడా! పెక్కు పేర్లతో పిలువబడేవాడా! యజ్ఞస్వరూపా! చలనం, నాశనం లేని ప్రకాశస్వరూపం కలవాడా! హరిహరనాథా!

విశేషం: అలం: రూపకం, ఉపమ, అంత్యానుప్రాసం.

మాలిని.

> **త్రిజగదవననిత్యక్రీడనోద్యత్ప్రమోదా!**
> **రజనిచర విఘాతారంభ లీలా వినోదా!**
> **భజన నిరత సౌఖ్యప్రాప్తి జాగ్రత్ప్రసాదా!**
> **నిజతను విభవత్వోన్మీల నాచ్ఛిన్న నాదా!** 240

ప్రతిపదార్థం: త్రిజగత్+అవన= ముల్లోకాలను కాపాడటమనే; నిత్యక్రీడన+ఉద్యత్+ప్రమోదా!= నిరంతరకేళి వలన కలుగుతున్న ఆనందం కలవాడా!; రజనిచర= రాక్షసులను; విఘాత= చంపటాన్ని; ఆరంభలీలా వినోదా!= ప్రారంభించటం అనే ఆట వలన కలిగే సంతోషం కలవాడా!; భజన= ప్రార్థనచేయటం వలన కలిగే; నిరత= ఎడతెగని (శాశ్వతమైన); సౌఖ్యప్రాప్తి= సుఖమును భక్తులకు పొందించటంలో; జాగ్రత్+ప్రసాదా!= ఎల్లప్పుడు మేల్కొని సిద్ధంగా ఉంటూ అనుగ్రహాన్ని అందించే వాడా!; నిజతను తన శరీరం యొక్క; విభవత్వ= మహిమను; ఉన్మీలన= వికసింపచేసే; అచ్ఛిన్న= భిన్నంకాని, అఖండమైన; నాదా!= శబ్దం కలవాడా? (ఓంకారరూపా!).

తాత్పర్యం: మూడు లోకాలను రక్షించే నిత్యక్రీడవలన ఉదయిస్తున్న ఆనందం కలవాడా! రాక్షససంహారాన్ని ఆరంభించే లీలలతో సంతోషించేవాడా! సేవించి కీర్తించేవారికి సదా సౌఖ్యాన్ని కలిగించే ఫలాన్ని అందించటంలో ఏమరుపాటులేని అనుగ్రహబుద్ధి కలవాడా! హరిహరాత్మకమైన నిజ రూప వైభవాన్ని వికసింపజేసే అఖండనాదరూపమైన ఓంకారం కలవాడా! హరిహరనాథా!

విశేషం: అలం: అంత్యానుప్రాస. మాలినీ వృత్తంలోని ప్రతిపాదంలోనూ న,న,మ,య,య అనే గణాలు వరుసగా ఉంటాయి. తొమ్మిదవ అక్షరం యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది. (సంపా.)

గద్యము

> **ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున విరాట పర్వంబునందుఁ దృతీయాశ్వాసము.**

తాత్పర్యం: ఇది శ్రీమంతులైన ఉభయ కవులకు మిత్రుడు, కొమ్మనామాత్యుడి పుత్రుడు, పండితులను ఆరాధించి ప్రకాశించేవాడు (పండితులు చేసే ఆరాధనం వలన వెలుగొందేవాడు) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలోని విరాటపర్వంలో మూడవ ఆశ్వాసం.

విరాటపర్వంలో తృతీయాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

విరాటపర్వం - చతుర్థాశ్వాసము

శ్రీమద రేఖ విషాద వి । రామాహిత గాఢ శమధురా నిర్భర ని

ష్ఠా మర్దిత వివిధ వికా । రామల చేతో నివాస! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= సంపదవలన కలిగిన; మదరేఖ= మదగర్వంయొక్క; విషాద= దుఃఖంయొక్క; విరామ= విశ్రాంతిచేత (లేకపోటంవలన); ఆహిత= కలిగిన; గాఢ= దట్టమైన (అధికమైన); శమ= శాంతియొక్క; ధురా= భారంతో; నిర్భర= నిండిన; నిష్ఠా= స్థితిచేత; మర్దిత= మర్దించబడిన, (పోగొట్టబడిన); వివిధ= పెక్కురకాలైన; వికార= వికారాలు కలిగి ఉండటం చేత; అమల= మలినంలేని (నిర్మలం అయిన); చేతస్= మనస్సులో; నివాస!= నివసిస్తూ ఉండేవాడా!; హరిహరనాథా!= హరి+హరుడు అనేపేరుగల ఓ స్వామీ!

తాత్పర్యం: సంపదవలన సహజంగా కలిగే గర్వంగానీ, ఆపదలవలన వచ్చే దుఃఖంగానీ లేకుండా, పరమశాంతభావంతో కూడిన స్థితిచేత ఎన్నో రకాల వికారాలను నశింపజేసికొన్నవాడి మనస్సులో నివసించే ఓ హరిహరనాథా!

విశేషం: ఈ పద్యం శ్రీకారంతో ఆరంభించబడింది. అది తెలుగుకవుల అలవాటు (సంప్రదాయం). ప్రతి ఆశ్వాసం మొదటి పద్యం శ్రీకారంతో మొదలవుతుంది. అది మంగళకరం అని మనవారి భావం. ఈ పద్యంలో తిక్కన మహాకవి కొన్ని పదాలను ప్రయోగించి, ప్రస్తుత కథకు అన్వయాన్ని సూచించాడు. ఇది మహాకవుల మార్గం. దీనినే 'వస్తునిర్దేశం' అంటారు. 'శ్రీమదరేఖ' అనే ప్రయోగం దుర్యోధనుడి ఐశ్వర్యగర్వాన్నీ, 'విషాదవిరామ' అనే ప్రయోగం ఆపదలలో కూడా దుఃఖాన్ని పొందని అర్జునుడి ధీరస్వభావాన్నీ, 'శమధురా' ప్రయోగం ఆతడి శాంతస్వభావాన్నీ, 'నిష్ఠామర్దిత' ప్రయోగం అర్జునుడి నిష్ఠనూ, ఆతడు కురుసేనలను మర్దించేవిధానాన్నీ సూచిస్తాయి.

ఉత్తర గోగ్రహణము (సం. 4-33-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 2

తాత్పర్యం: హరిహరనాథ దేవా! వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజుతో ఇట్లా అన్నాడు.

క. సూర్యోదయావసరమున । దుర్యోధనుబలము ప్రబల దోర్బల లీలా

ధుర్యగతి నడచె భీష్మా । చార్య రవి సుతాది యోధ సంఘోద్భటమై. 3

ప్రతిపదార్థం: సూర్య= సూర్యుడియొక్క; ఉదయ= పొడుపుయొక్క; అవసరమునన్= సమయంలో (ప్రొద్దుపొడుపుతోనే); దుర్యోధను= రారాజైన దుర్యోధనుడి యొక్క; బలము= సైన్యం; భీష్మ= భీష్ముడు; ఆచార్య= ద్రోణుడు; రవిసుత= కర్ణుడు; ఆది= మొదలైన; యోధ= వీరులయొక్క; సంఘ= సమూహంతో; ఉద్భటము+ఐ= అతిశయించినదై; ప్రబల= అధికమైన; దోస్+బల= భుజబలంయొక్క; లీలా= విలాసంయొక్క; ధుర్య= భారం వహించిన; గతిన్= విధంగా; నడచెన్= నడిచింది.

తాత్పర్యం: ప్రొద్దుపొడుపుతోనే దుర్యోధనుడి సేన భీష్ముడూ, ద్రోణుడూ, కర్ణుడూ మొదలైన మహావీరులతో కలిసి, పరాక్రమంతో విరాటరాజు నగరం వైపుగా సాగింది.

విశేషం: భీష్ముడు కురుపితామహుడు. ద్రోణుడు కురుపాండవులకు గురువు. 'కర్ణుడు అర్జునుడికి దీటు' అని దుర్యోధనుడి నమ్మకం. పైగా 'కర్ణుడు లేని భారతమా' అని ప్రసిద్ధి. అందుకే భీష్మ, ద్రోణ, కర్ణులను ప్రధానంగా చెప్పి, మిగిలిన వీరులను 'ఆది' పదంతో తిక్కన సూచించాడు.

వ. ఇట్లు నడచి మత్స్యనగరంబున కనతి దూరంబున విరాటు పశుగణంబులం బొదివె; నట్టియెడ ద్రుక్కడి మూఁకలు సని యెక్కడెక్కడ యని తలపడినం గృపాశ్వత్థామ శకుని దుశ్శాసన కర్ణ వికర్ణ దుర్ముఖ ప్రముఖ రథిక జనంబులు గోపాల వర్గంబు ననర్గళ ప్రసారంబగు శరాసారంబునం గప్పినం గని కౌరవబలం బగుట యెఱింగి, బెగ్గలించి గవాధ్యక్షుండు రథంబు దోలికొని యాక్రోశించుచుం బురంబున కరుగుదెంచి రాజ మందిర ద్వారంబుఁ జొచ్చి రథావతరణంబు సేసి యంతఃపురంబున నున్న భూమింజయుం గాంచి ససంభ్రమంబుగా నిట్లనియె. 4

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నడచి= పోయి; మత్స్యనగరంబునకున్= మత్స్యరాజధానికి; అనతి దూరంబునన్= సమీపంలో; విరాటు పశుగణంబులన్= విరాటరాజుయొక్క ఆవులమందను; పొదివెన్= పట్టుకొన్నది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ద్రుక్కడిమూఁకలు= చిన్నవయిన సేనలు; చని= వెళ్ళి; ఎక్కడ+ఎక్కడ+అని; తలపడినన్= ఎదిరించగా; కృప= కృపాచార్యుడు; అశ్వత్థామ; శకుని; దుశ్శాసన; కర్ణ; వికర్ణ; దుర్ముఖ; ప్రముఖ= మొదలైన; రథికజనంబులు= రథాలపై నిలిచి యుద్ధంచేసే (వీరుల) సమూహాలు; గోపాల= ఆవులనుకాసేవారియొక్క; వర్గంబున్= గుంపును; అనర్గళ= ఎదురులేని; ప్రసారంబు+అగు= వ్యాపించటం కలదైన; శర= బాణాలు అనే; ఆసారంబునన్= వర్షంతో; కప్పినన్= కప్పగా; కని= చూచి; కౌరవబలంబు+అగుట= కౌరవుల సైన్యమని; ఎఱింగి= తెలిసికొని; బెగ్గలించి= భయపడి; గవాధ్యక్షుండు= (గో+అధ్యక్షుండు) గోపాలకులకు పెద్ద అయినవాడు; రథంబు; తోలికొని; ఆక్రోశించుచున్= పెద్దగా అరుస్తూ; పురంబునకున్= నగరానికి; అరుగుదెంచి= వచ్చి; రాజమందిర ద్వారంబు+చొచ్చి= రాజభవనంయొక్క ముఖద్వారంగుండా లోనికివెళ్ళి; రథ+అవతరణంబు+ చేసి= రథాన్ని దిగి; భూమింజయున్= ఉత్తరుడిని; కాంచి= దర్శించి; స, సంభ్రమంబుగాన్= తొందరతో, భయంతో, తొట్రుపాటుతో కూడినవాడై; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా సాగిన కురుసైన్యం విరాటనగరానికి దగ్గరలో, ఆ రాజు ఆవులమందను పట్టుకొన్నది. ఆ సమయానికి అక్కడ ఉన్న స్వల్పమైన సైన్యం కౌరవసైన్యాన్ని ఎదిరించింది. కృపుడు మొదలైన మహావీరులంతా బాణవర్షంతో ఆవుల కాపరులను ముంచెత్తారు. గవాధ్యక్షుడు దానిని కురుసేనగా గమనించి, వెంటనే రథమెక్కి, కేకలు వేస్తూ నగరానికి పోయి రాజుగారి మందిరం ముందు రథాన్ని దిగి, అంతఃపురంలో ఉన్న ఉత్తరుడిని చూచి భయంతో, తొట్రుపాటుతో ఇట్లా అన్నాడు.

విశేషం: మత్స్యదేశం పశుసమృద్ధికి పేరు. రాజయిన విరటుడికి ప్రత్యేకించి చాలా ఆవులమందలు ఉండేవి. ఆ మందలను కాపాడటానికి ఎంతోమంది కాపరులూ, వారికి అండగా కొంతసేనా ఉండేది. ఈ అల్పసేన తొలుత కౌరవసేనను ఎదిరించింది. ఆవులకాపరులకు ఒక పెద్ద ఉండేవాడు. ఆతడే గవాధ్యక్షుడు. ఇది సగౌరవమయిన పదవి. అందుకే ఆతడు రథం మీద ఉత్తరుడి దగ్గరికి వచ్చాడు. అతని మాటతీరులోనూ ఒక పెద్దరికం కనిపిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. 'ధరణీచక్రము సంచలింపఁగ సముద్దాంతంబులై గ్రక్కునం
గురుసైన్యంబులు వచ్చి ముట్టికొనియెన్ గోవర్గమున్; వేగమై
మరలం దెచ్చుటకుం గడంగుము; రిపుక్ష్మాపాలలోకంబు నీ
శరజాలంబులపాలు సేయుము భుజోత్సాహంబు శోభిల్లఁగన్. 5

ప్రతిపదార్థం: ధరణీచక్రము= భూమండలం; సంచలింపఁగన్= ఎక్కువగా కంపించేటట్లుగా; సముద్దాంతంబులు+ఐ= బాగా నియమించబడ్డవై; గ్రక్కునన్= ఉన్నట్టుగా ఉండి; కురుసైన్యంబులు వచ్చి= కౌరవసేనలు వచ్చి; గోవర్గమున్= ఆవులమందలను; ముట్టికొనియెన్= చుట్టుముట్టాయి; మరలన్+తెచ్చుటకున్= (ఆలమందలను) మరలించి తోలుకొని రావటానికి; వేగము+ఐ= త్వరగా (వెంటనే); కడంగుము= ప్రయత్నించుము; భుజ= భుజాలయొక్క; ఉత్సాహంబు= పరాక్రమం; శోభిల్లఁగన్= ప్రకాశించేటట్లుగా; రిపు= శత్రువులైన; క్ష్మాపాల= రాజులయొక్క; లోకంబున్= సమూహాన్ని; నీ= నీయొక్క; శర= బాణాలయొక్క; జాలంబుల= సమూహాల యొక్క; పాలు+చేయుము (పాలుసేయుము)= వశంచేయుము.

తాత్పర్యం: భూమి దద్దరిల్లిపోయేట్లుగా కురుసేనలు వచ్చి అకస్మాత్తుగా విరుచుకుపడి మన ఆవులమందలను ముట్టడించాయి. నీవు వెంటనే మందను మళ్ళించటానికి ప్రయత్నించాలి. నీ భుజబలంతో శత్రువులను బాణసమూహానికి గురిచేయుము.

ఆ. తేరుఁ బూన్పఁ బంపు; తెప్పింపు దృఢ తను । త్రాణ, ముగ్రచాప బాణ పూర్ణ
తూణ ఘనగదాసి తోమర చక్రాదు । లనువుగా నొనర్పు మతి రయమున. 6

ప్రతిపదార్థం: తేరున్= రథాన్ని; పూన్పన్= గుర్రాలను కట్టటానికి; పంపు= ఆజ్ఞాపించుము; దృఢ= గట్టిదైన; తనుత్రాణము= కవచాన్ని; తెప్పింపు= తెప్పించుము; ఉగ్రచాప= (భయంకరమైన) చేపగల విండ్లు; బాణ= బాణాలతో; పూర్ణ= నిండిన; తూణ= అమ్ములపొదులూ; ఘన= గొప్పవైన; గదా= గదలూ; అసి= చిన్నకత్తులూ; తోమర= తోమరాలూ; చక్ర= చక్రాలూ; ఆదులు= మొదలైనవాటిని; అనువుగాన్= తగినట్లుగా; అతిరయమునన్= మిక్కిలి వేగంగా; ఒనర్పుము= సమకూర్చుము.

తాత్పర్యం: వెంటనే రథాన్ని సిద్ధం చేయించుము. మంచికవచాన్ని తెప్పించుము. బలమైన విండ్లూ, అమ్ములపొదులూ, పెనుగదలూ, కత్తులూ, తోమరాలూ, చక్రాలూ మొదలైన ఆయుధాలూ త్వరగా సిద్ధం చేయించుము.

విశేషం: పద్యం ఎత్తుగడే, అప్పటి పరిస్థితినీ, తొందరనూ సూచిస్తూ ఉన్నది. అట్లాగే, 'ఉగ్రచాపబాణ పూర్ణ తూణ ఘనగదాసి తోమరచక్రాదులు' అనే ప్రయోగం కూడా ఆ సమయానికి కావలసిన వస్తుసామగ్రినీ, పరిస్థితి తీవ్రతనూ సూచిస్తూ ఉన్నది. పద్యంనడకలో పరిస్థితి ఎట్లాంటిదో సూచించటం మహాకవుల లక్షణం.

చ. విరటుఁడు నిన్ను నెప్డుఁ బదివేవురముందటఁ జెప్పుఁ బాహువి
స్ఫురితుఁడు, శౌర్యశాలి, కులభూతి విశేష విధాయకుండు, భూ
భరణ విశారదుండు, జనభవ్యతపఃఫలసంభవుండు, కా
తర పరిరక్షకుం డనుచు; దానికి నీడుగఁ జేయు మిత్తతిన్'. 7

ప్రతిపదార్థం: విరటుఁడు= (నీ తండ్రి అయిన) విరాటరాజు; ఎప్డు= ఎల్లప్పుడూ; బాహు విస్ఫురితుఁడు= భుజబలంతో ప్రకాశించేవాడు; శౌర్యశాలి= పరాక్రమంతో ఒప్పేవాడూ; కుల= వంశానికి; భూతి= ఐశ్వర్యాన్ని; విశేష= ఎక్కువగా; విధాయకుండు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కలిగించేవాడు (కులానికి అన్ని విధాలా పేరు ప్రతిష్ఠలను తెచ్చేవాడు అని భావం); భూ= భూమియొక్క (రాజ్యాన్ని); భరణ= భరించటంలో; విశారదుండు= నేర్పుకలవాడు (రాజ్యభారాన్ని మోయడంలో సమర్థుడు అని భావం); జన= ప్రజలయొక్క; భవ్య= శ్రేష్ఠమైన; తపస్= తపస్సుకు; ఫల= ఫలితంగా; సంభవుండు= పుట్టినవాడు; కాతర= భయపడ్డవారిని; పరిరక్షకుండు= బాగా కాపాడేవాడు; అనుచున్= పై విధంగా అంటూ; నిన్నున్= నిన్నుగురించి; పదివేవురముందటన్= పదివేలమంది ఎదుట (కొలువులో); చెప్పున్= చెప్పేవాడు; దానికిన్+ఈడుగన్= (మీ తండ్రి చెప్పే) దానికి తగ్గట్లుగా; ఈ+తఱిన్= ఈ (ఆపద) సమయంలో; చేయుము= చేయవలసింది.

తాత్పర్యం: నీ తండ్రి అయిన విరాటరాజు- నీవు భుజబలం ఉన్నవాడివనీ, పరాక్రమశాలివనీ, వంశానికి వన్నె తెస్తావనీ, రాజ్యపాలనలో సమర్థుడివనీ, మత్స్యదేశ ప్రజల తపస్సుకు ఫలితంగా నీవు పుట్టావనీ, దీనులను రక్షించేవాడివనీ పదివేలమందిలో చెప్పుతుంటాడు. ఈ కష్టసమయంలో నీవు దానికి తగినట్లుగా ప్రవర్తించుము'.

విశేషం: ఉత్తరుడిని పొగడి, ఆతడి గొప్పతనాన్ని గుర్తుచేసి, ఆవులమందను మళ్ళించేందుకు పూనుకొనేటట్లు చేయటమే గోపాలకుల పెద్దయొక్క లక్ష్యం. అందుకే ఆతడు ఉత్తరుడిని గూర్చి విరటుడు చెప్పుకొన్నట్లు పొగడింది.

క. **అని కాంతాజనములలోఁ । దను నగ్గించుటయుఁ బొంగి దర్పోద్ధతి ని**
ట్లను నుత్తరుండు దన మన । మున సంగర కౌతుకంబు ముడివడుచుండన్. 8

ప్రతిపదార్థం: అని; కాంతాజనములలోన్= (అంతఃపురంలో ఉండే) స్త్రీ జనంలో; తనున్= తనను; అగ్గించుటయున్= పొగడగా; ఉత్తరుండు= ఉత్తరుడు; పొంగి= ఉప్పొంగి; దర్ప+ఉద్ధతిన్= గర్వంయొక్క అతిశయంతో; తన= తనయొక్క; మనమునన్= మనసులో; సంగర= యుద్ధసంబంధమైన; కౌతుకంబు= ఉత్సాహం; ముడి+పడుచుండన్= పొడసూపుతూ ఉండగా (క్రమంగా అతిశయించి); ఇట్లు= ఇట్లా; అనున్= అంటున్నాడు.

తాత్పర్యం: అంతఃపురంలో ఆడవాళ్ళ నడుమ ఉన్న తనను, గోపాలకులపెద్ద పెద్దగా పొగిడేసరికి ఉత్తరుడు ఉప్పొంగిపోయి, మనసులో రణసంబంధమైన ఉత్సాహం పుట్టగా, గర్వంతో ఇట్లా అన్నాడు.

విశేషం: ఉత్తరకుమారుడు పెద్ద వీరుడు కాదు. అట్లని పిరికివాడూ కాడు. మామూలు మనిషికన్నా కొంతనయం. గోపాలకులపెద్ద ఆడవాళ్ళ ఎదుట పొగడటంతో ఉత్తరుడిలో కొంత రణకుతూహలం పుట్టింది. నిజానికి ఈ కౌతుకం తాత్కాలికమే! సహజమైనది కాదు. కనుక ఉత్తరుడి ఉత్సాహం పొగడ్త ప్రభావంతో కలిగింది.

భూమింజయుండు గోవుల విడిపింపఁ గౌరవులతోఁ బోరుటకుఁ బోనెన్నుట. (సం. 4-34-1)

ఉ. **'ఎత్తునఁ గొందుఁ గౌరవుల నెల్లను మార్కొనిరేని; గోవులం**
దెత్తు ముహూర్త మాత్రమునఁ; దేరికి సారథి లేమిఁ జేసి నా
చిత్తమునన్ విచారదశ చెందెడు; నెవ్వఁడు గల్గునొక్కొ నా
కిత్తఱి 'నేఁ గదా కడప నెంతయు నేర్తు రథం' బనం బురిన్. 9

ప్రతిపదార్థం: మార్కొనిరి+ఏని= ఎదిరిస్తే; కౌరవులన్+ఎల్లన్= కౌరవుల నందర్నీ; ఎత్తునన్+కొందున్= ఒకే ఎత్తులో జయిస్తాను; ముహూర్తమాత్రమునన్= ఒకే ఒక ముహూర్తకాలంలో (పన్నెండు క్షణాలకాలంలో లేక రెండు గడియల కాలంలో); గోవులన్= ఆవులను; తెత్తున్= తోలుకొని తెస్తాను; తేరికిన్= రథానికి; సారథి= నడిపేవాడు; లేమిన్+చేసి= లేకపోవటం చేత; నా=

నాయొక్క; చిత్తమునన్= మనస్సులో; విచారదశ= దిగులుతో కూడిన పరిస్థితి; చెందెడున్= కలుగుతూ ఉన్నది; రథంబు= రథాన్ని; కడపన్= తోలటానికి; నేన్+కదా= నేనుకదా; ఎంతయున్= మిక్కిలి; నేర్తున్= ఓపుదును; అనన్= అనటానికి; పురిన్= పట్టణంలో; నాకున్= నాకు; ఈ+తఱిన్= ఇప్పుడు; ఎవ్వఁడు= ఏ మనిషి; కల్గును+ఒక్కొ!= దొరకుతాడో కదా!

తాత్పర్యం: 'కౌరవులు ఎదిరిస్తే చిటికెలో జయిస్తాను. క్షణాలలోనే ఆవులను మళ్ళిస్తాను. అయితే రథసారథి లేకపోవటంతో మనస్సు కలత పడుతూ ఉన్నది. 'నేను రథాన్ని సమర్థంగా నడుపుతాను' అనేవాడు ఇప్పుడు నాకు ఎవడు దొరకుతాడో!

విశేషం: 'ఎత్తునఁగొందు' మంచిప్రయోగం. తిక్కన తెలుగు నుడికారానికి ఇది గుర్తు. ఎత్తు-పై ఎత్తు మొదలైన మాటలు యుద్ధంలో 'ఎత్తులు' వేయటాన్నీ, చదరంగం ఆటనూ సూచిస్తాయి. తిక్కన రాజ్యతంత్రం, యుద్ధతంత్రంపై ప్రయోగం వలన సూచించబడింది. 'ఎత్తు' అంటే ఉపాయం అనీ అర్థమే. కాగా ఒకే ఉపాయంతో ఎదుటివాడి ఆటను కట్టించటం, యుద్ధంలో ఓడించటం అన్నమాట.

క. **తగు సారథి దొరకొనినం । బగతుర భంజించు టెంతపని? కదుపుల ద**
వ్వుగఁ గొని పోదురొకో! యి । ట్లగునె? కలండేని సూతు నరయుం డెందున్. **10**

ప్రతిపదార్థం: తగు= తగినటువంటి; సారథి= రథాన్ని నడిపేవాడు; దొరకొనినన్= (దొరకు+కొను)= దొరికితే; పగతురన్= పగవాళ్ళను (శత్రువులను); భంజించుట= చంపటం; ఎంతపని= అదేమంత పెద్దపనికాదు; కదుపులన్= ఆవులమందలను; దవ్వుగన్= దూరంగా; కొనిపోదురు+ఒకో!= తోలుకొనిపోతారేమో!; ఇట్లు= ఇట్లాఉంటే; అగునె?= పని జరుగుతుందా? ఎందున్= పట్టణంలో ఎక్కడైనా; కలండు+ఏని= ఉంటే; సూతున్= సారథిని; అరయుండు= వెదకండి.

తాత్పర్యం: తగిన సారథి దొరికితే శత్రువులను జయించటం ఎంతపని? ఆవులమందలను దూరంగా తోలుకొనిపోతారో ఏమో! అట్లాగే అయితే, పని ఎట్లా జరుగుతుంది? నగరంలో ఎక్కడైనా సారథి దొరకుతాడేమో చూడండి.

చ. **కురుపతి భీష్మ కర్ణ కృప కుంభజముఖ్యులు మత్సముద్యమ**
స్ఫురణము చూచి పార్థుఁడను బుద్ధిఁ గలంగఁగ బెట్టు గిట్టి సం
గరమున నోర్చి యేఁ బసుల గ్రమ్మఱఁ దేరకయున్న నన్ను భూ
వరుఁడు సుహృజ్జనంబుఁ బరివారముఁ జిత్తములందు మెత్తురే?' **11**

ప్రతిపదార్థం: కురుపతి= దుర్యోధనుడు; భీష్మ= భీష్ముడు; కర్ణ= కర్ణుడు; కృప= కృపాచార్యుడు; కుంభజ= ద్రోణాచార్యుడు; ముఖ్యులు= మొదలుగా గలవారు; మత్= నాయొక్క; సముద్యమ= ప్రయత్నంయొక్క; స్ఫురణము= విజృంభణాన్ని; చూచి; పార్థుఁడు= అర్జునుడు; అను= అనెడి; బుద్ధిన్= భావంతో; కలంగఁగన్= కలతపడిపోయేటట్లు; బెట్టు= ఎక్కువగా; కిట్టి= ఎదిరించి; సంగరమునన్= యుద్ధంలో; ఓర్చి= ఓడించి; ఏన్= నేను; పసులన్= ఆవులను; క్రమ్మఱన్= మరలా; తేరక+ఉన్నన్= తోలుకొనిరాకపోతే; నన్నున్= నన్ను; భూవరుఁడు= రాజైన విరాటుడూ; సుహృద్+జనంబున్= స్నేహితులూ; పరివారమున్= సేవకులూ; చిత్తములందున్= మనస్సులలో; మెత్తురే?= మెచ్చుకుంటారా?

తాత్పర్యం: దుర్యోధనుడూ, భీష్ముడూ, కర్ణుడూ, కృపాచార్యుడూ, ద్రోణాచార్యుడూ మొదలైనవారంతా యుద్ధంలో నా పరాక్రమాన్ని చూచి, అర్జునుడే అని భ్రమించి, బెదిరిపోయేట్లు ఎదిరించి, వాళ్ళందరినీ జయించి మందలను మళ్ళించుకొని రాకపోతే నన్ను రాజూ, స్నేహితులూ, పరివారమూ మెచ్చుతారా?'

వ. అనునప్పుడు తత్ప్రదేశంబున నునికిం జేసి. 12

తాత్పర్యం: (ఉత్తరుడు పై విధంగా) అనేటప్పుడు అక్కడ ఉండటంవలన.

క. విని, ద్రుపద ధరణిపతినం । దన సామర్షాపహాస తరళ హృదయ యై
చని, తద్వృత్తాంతము మె । త్తని పలుకులఁ జెప్పె నింద్రతనయునితోడన్. 13

ప్రతిపదార్థం: ద్రుపద ధరణిపతి= ద్రుపదమహారాజుయొక్క; నందన= కూతురు; (ద్రౌపది); విని= ఉత్తరుడి మాటలు ఆలకించి; స+అమర్ష= కోపంతోనూ; అపహాస= ఎగతాళితోనూ; తరళ= చలిస్తున్న; హృదయ+ఐ= మనస్సు కలదై; చని= వెళ్ళి; ఇంద్రతనయునితోడన్= ఇంద్రుడి కుమారుడైన అర్జునుడితో; తద్+వృత్తాంతము= ఆ విషయం (ఉత్తరుడు అనుకొన్న విషయం); మెత్తని పలుకులన్= మృదువైన మాటలతో; చెప్పెన్= చెప్పింది.

తాత్పర్యం: ఉత్తరుడు తనను అర్జునుడితో పోల్చుకొనేసరికి, ద్రౌపదికి అమర్షం, అపహాసం కలిగాయి. అందుకే ఆమె ఆ విషయాన్ని అర్జునుడితో చెప్పింది.

విశేషం: మూలభారతంలో వ్యాసుడు ఒక్క అమర్షభావాన్నే చెప్పాడు. కాని తిక్కన అమర్షానికితోడు అపహాసం కూడా ద్రౌపదికి కలిగినట్లు చెప్పాడు. ఇదే తిక్కన ప్రత్యేకత. పైగా ఈ సమయంలో అర్జునుడిని ప్రవేశపెట్టాలి. అందుకే వ్యాసుడూ, తిక్కనా ఇట్లా ద్రౌపది అర్జునుడికి చెప్పడం ద్వారా (సంభాషణతో) నిర్వహించారు. ఇది ఒక రచనా శిల్పం.

వ. అతండు నజ్ఞాతవాస వత్సరం బతీతంబగుట నిరూపించి, పాంచాలి కిట్లనియె. 'నీవు పోయి వారలతో నిట్లనుము 'మన బృహన్నలకు సారథ్యంబుసేయు సామర్థ్యంబు గలదు; దొల్లి ఖాండవ దహనంబునం బాండవ మధ్యమునకు సారథియై యతని చిత్తంబు వడసె; మఱియుఁ బెక్కెడలం దదీయంబగు రథంబు గడపఁ దానయై యుండు; నేను నెఱుంగుదుం, దత్సాహాయ్యంబునం గురుసైన్యంబుల జయింప వచ్చుటకు సంశయంబు వల దనుము. వా రేమనిరేని మఱియుం దగనాడి నన్నుం బిలిపించునట్టి తెఱంగు గావింపు' మన 'నట్లచేయుదు' నని సైరంధ్రి యుత్తరయున్న యెడకుం బోయి. 14

ప్రతిపదార్థం: అతండున్= ఆ అర్జునుడున్నూ; అజ్ఞాతవాస, వత్సరంబు= అజ్ఞాతవాసపు సంవత్సరం; అతీతంబు= దాటినది; అగుటన్= అవటం; నిరూపించి= నిర్ధారించి; పాంచాలికిన్= ద్రౌపదికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; నీవు; పోయి; వారలతోన్; ఇట్లు+అనుము; మన బృహన్నలకున్; సారథ్యంబు+చేయు= రథంనడిపే; సామర్థ్యంబు+కలదు= శక్తి ఉన్నది; తొల్లి= పూర్వం; ఖాండవ, దహనంబునన్= ఖాండవమనే అడవిని కాల్చటంలో; పాండవ మధ్యమునకున్= పాండుపుత్రులలో నడిమివాడైన అర్జునుడికి; తాను+అ+ఐ= తానే సారథియై; అతని, చిత్తంబు+పడసెన్= అతడి మనస్సును ఆకట్టుకొన్నాడు; మఱియున్; పెక్కు+ఎడలన్= అనేక సమయాలలో; తదీయంబు+అగు= అతడిదైన; రథంబు; కడపన్= నడపటానికి; సారథి+ఐ; ఉండున్; ఏనున్= నేను కూడా; ఎఱుంగుదున్= ఎరుగుదును; తద్+సాహాయ్యంబునన్= అతడి సహాయంతో;

కురుసైన్యంబులన్= కౌరవ సేనలను; జయింపన్+వచ్చుటకున్= గెలవటానికి; సంశయంబు= సందేహం; వలదు= వద్దు; అనుము; వారు= ఉత్తరాదులు; ఏమి+అనిరి+ఏని= ఏమన్నా అంటే; మఱియున్+తగన్+ఆడి= తగినట్లు మాటాడి; నన్నున్; పిలిపించునట్టి; తెఱంగు= విధం; కావింపుము= చేయుము; అనన్= అనగా; అట్లు+అ= ఆ విధంగానే; చేయుదున్; అని; సైరంధ్రి; ఉత్తర; ఉన్న; ఎడకున్= చోటికి; పోయి.

తాత్పర్యం: అర్జునుడు ద్రౌపదితో అజ్ఞాతవాస సంవత్సరం ముగిసినట్లు నిర్ణయించి ఇట్లా అన్నాడు. 'మన బృహన్నలకు సారథ్యం చేసే నేర్పు ఉన్నదనీ, ఇంతకుముందు ఖాండవవనాన్ని దహించటంలో అర్జునుడికి సారథియై ఆతడి మెప్పు పొందాడనీ, ఇంకా ఎన్నో సమయాలలో కూడా ఆతడి రథానికి సారథిగా ఇతడే ఉండిఉంటాడనీ, నాకు తెలుసనీ అతడి సహకారం ఉంటే కురుసైన్యాన్ని గెలవడంలో అనుమానం లేదనీ, నీవు వెళ్ళి వాళ్ళతో చెప్పుము. ఇంకా వాళ్ళేమైనా అంటే, తగినట్లు మాట్లాడి, ఎట్లాగైనా నన్ను పిలిపించేటట్లు చేయుము' అని చెప్పగానే అట్లాగే చేస్తానంటూ సైరంధ్రి ఉత్తరదగ్గరకు వెళ్ళి.

చ. **'జనపతినందనుండు తగు సారథి నారయుచున్నవాఁ డెఱిం**
గిన పని సెప్పఁగా వలయుఁ, గ్రీడి మనంబున మెచ్చునట్టి నే
ర్పును భుజశక్తియుం గలిగి రూఢికి నెక్కిన సూతవృత్తి మై
నని సడిసన్న యేడ్తెఱ బృహన్నలకుం గల దంబుజాననా! **15**

ప్రతిపదార్థం: అంబుజ+ఆననా!= పద్మంవంటి ముఖాన్ని కలిగిన ఉత్తరా!; జనపతినందనుండు= రాజకుమారుడైన ఉత్తరుడు; తగుసారథిన్= తనకు తగిన సారథికొరకు; ఆరయుచున్నవాఁడు= వెదకుతున్నాడు; ఎఱింగిన పని= తెలిసిన విషయం; చెప్పఁగా వలయున్= చెప్పాలి; క్రీడి= అర్జునుడు; మనంబునన్= మనస్సులో; మెచ్చునట్టి= మెచ్చుకొనే; నేర్పును= నైపుణ్యాన్నీ; భుజశక్తియున్= బాహుబలాన్నీ; కలిగి; రూఢికిన్+ఎక్కిన= పేరు కెక్కిన; సూతవృత్తిమైన్= సారథ్యంతోపాటు; (సూతకులంవాళ్ళే రథసారథులుగా ఉండేవాళ్ళు); అనిన్= యుద్ధంలో; సడి+చన్న= మచ్చలేని; ఏడ్తెఱ= చాతుర్యం; బృహన్నలకున్; కలదు= ఉన్నది.

తాత్పర్యం: 'తామరపూవువంటి అందమైన ముఖం కలిగిన ఉత్తరా! ఇప్పుడు రాకుమారుడైన ఉత్తరుడు తగిన సారథికొరకు వెదకుతున్నాడు. తెలిసిన విషయాన్ని చెప్పాలి కనుక చెప్పుతున్నాను. అర్జునుడు మెచ్చుకొనే నేర్పూ, బాహుబలంతోపాటు సారథ్యంలో ప్రావీణ్యమూ, యుద్ధంలో మచ్చలేని పరాక్రమమూ మన బృహన్నల కున్నాయి.

విశేషం: బృహన్నలను తనకు రథసారథిగా చేసికొనుమని చెప్పి ఉత్తరుడిని ఒప్పించటానికి ద్రౌపది ఉత్తర ద్వారా ప్రయత్నించడం చాలా ఉచితంగా ఉన్నది. ఉత్తరుడు రాకుమారుడు. నేరుగా ఆతడికి చెప్పటంకన్న, అతడికి ముద్దులచెల్లె లయిన ఉత్తరతో చెప్పించటం, పని నెరవేరటానికి సులువైన మార్గం. అందుకే ద్రౌపది ఉత్తరను పిలుచుకొని, ఉత్తరుడి దగ్గరకు వెళ్ళింది. ఇది ద్రౌపది బుద్ధికుశలతనే కాక, ఆమె ఉదాత్త మనస్తత్త్వాన్నీ, కార్యకరణ నైపుణ్యాన్నీ తెలుపుతుంది.

తే. **అర్జునునకు ఖాండవ దహనాదులైన । విక్రమము లా బృహన్నల వెరవు లావు**
గాదె! జయ మొనరించె లోకంబు లెఱుఁగ । నువిద! దీని నెఱింగింత ముత్తరునకు'. **16**

ప్రతిపదార్థం: అర్జునునకున్= అర్జునుడికి; ఖాండవ= ఖాండవం అనే పేరున్నవనాన్ని; దహన= కాల్చివేయటం; ఆదులు+ఐన= మొదలైన; (ఖాండవవనాన్ని దహించడం ఒక గొప్పపని. అందువలన దీనినే ముందు చెప్పటం జరిగింది); విక్రమములు= పరాక్రమాలు; లోకంబులు= అన్నిలోకాలు; ఎఱుఁగన్= తెలిసికొనేటట్లు; ఆ బృహన్నల= ఆ బృహన్నలయొక్క; వెరవు= ఉపాయమూ; లావు= బలమూ; కాదు+ఎ= కదా!; జయము+ఒనరించెన్= జయాన్ని కలిగించాయి; ఉవిద!= వనితా! (ఉత్తరా!); దీనిన్= ఈ సంగతిని; ఉత్తరునకున్= ఉత్తరకుమారుడికి; ఎఱింగింతము= తెలుపుదాం.

తాత్పర్యం: ఓ ఉత్తరా! ఖాండవవనాన్ని కాల్చటం మొదలైన సమయాలలో బృహన్నల ఉపాయమూ, బలమూ మాత్రమే అర్జునుడికి జగత్ప్రసిద్ధమైన విజయాన్ని కలిగించాయి. దీనిని ఉత్తరుడికి చెప్పుదాము.'

విశేషం: అగ్నిహోత్రుడి అభ్యర్థనతో అర్జునుడు ఖాండవవనాన్ని దహించాడు. అది ఇంద్ర రక్షితం. అందుకే ఇంద్రాది దేవతలు అర్జునుడితో పోరాడి విజితులయ్యారు. కృష్ణుడు అర్జునుడికి బాసటగా ఉన్నాడు. 'లోకంబు లెఱుఁగ' అనే ప్రయోగంవలన, ఖాండవాన్ని దహించి విజయాన్ని పొందిన అర్జునుడి కీర్తి, ముల్లోకాలలో ప్రాకింది అని తెలుస్తుంది. అందుకే తిక్కన 'లోకంబులు' అనే బహువచనాన్ని ప్రయోగించాడు.

క. అని యమ్ముదితయుఁ దానును । జని యతనికి నత్తెఱంగు సముచితముగఁ జె
ప్పిన నక్కుమారవరుఁ డి । ట్లనియెం బాంచాలితోడ నల్లన నగుచున్. 17

ప్రతిపదార్థం: అని= పై విధంగా ద్రౌపది చెప్పి; ఆ+ముదితయున్= సంతోషించినది అయిన ఆ ఉత్తరా; తానును= తాను (ద్రౌపది); చని= వెళ్ళి; అతనికిన్= ఉత్తరుడికి; ఆ+తెఱంగు= ఆ సంగతి; సముచితముగన్= తగినరీతిగా; చెప్పినన్= తెలియజెప్పగా; ఆ+కుమారవరుఁడు= కుమారులలో శ్రేష్ఠుడైన ఆ ఉత్తరుడు; పాంచాలితోడన్= ద్రౌపదితో; అల్లనన్= సన్నగా; నగుచున్= నవ్వుతూ; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ద్రౌపది పై విధంగా ఉత్తరకు బృహన్నల సంగతిని చెప్పి, తానూ ఉత్తరా వెళ్ళి ఉత్తరుడితో చెప్పగా, ఆతడు చిరునవ్వు నవ్వి ద్రౌపదితో ఇట్లా అన్నాడు.

విశేషం: 'అల్లన నగుచున్' అనే ప్రయోగంవలన, ఉత్తరుడి మనోభావం తెలుస్తుంది. పేడిని చూస్తేనే నవ్వు వస్తుంది. అట్లాంటప్పుడు 'ఇట్లాంటివాడినా సైరంధ్రి సారథిగా సూచించింది' అన్న ఒక ఎగతాళి, తక్కువ భావం, ఒక లెక్కలేనితనం, మొదలైన భావాలేకాక, ఆఖరుకు తనకు పట్టిన గతి ఇదా! అన్న విచారం కూడా తెలుస్తుంది. తరువాతి పద్యంలో ఇది మరింత స్పష్టంగా తెలుస్తుంది. నవ్వు మనస్సులో ఉన్న భావానికి ప్రతీక. అందులో తిక్కన నవ్వులు ఎన్నో భావాలను స్ఫురింపచేస్తాయి. ఇదీ తిక్కన ప్రత్యేకత.

పాంచాల దేశపు రాజైన ద్రుపదుడి కూతురు కనుక, ద్రౌపదికి 'పాంచాలి' అనే పేరు వచ్చింది.

ఈ మాటలను, సైరంధ్రిచేత అర్జునుడు ఉత్తరుడికి చెప్పించినట్లు మూలంలో లేదు. సైరంధ్రి తానే ఉత్తరుడితో చెప్పినట్లున్నది. ఈ సన్నివేశ కల్పన తిక్కనగారిది.

తే. 'అకట సైరంధ్రి! నన్ను నిట్లాలి గొనఁగ । నేల? చక్కఁగఁ గనువిచ్చి యేను బేడిఁ
జూడరోయుదు; రణమున సూతకృత్య । భరముఁ దాల్చుట కెమ్మెయిఁ బనుచువాఁడ? 18

ప్రతిపదార్థం: అకట సైరంధ్రి!= అయ్యో సైరంధ్రీ!; నన్నున్= నన్ను; ఇట్లు= ఇట్లా; ఆలిగొనఁగన్+ఏల?= ఎగతాళి చేయటం ఎందుకు?; ఏను= నేను; పేడిన్= పేడివాడిని; చక్కఁగన్+కనువిచ్చి= బాగా కండ్లు తెరిచి; చూడన్= చూడటానికే; రోయుదున్= ఏవగించుకొంటాను; (అట్లాంటప్పుడు) రణమునన్= యుద్ధంలో; సూతకృత్యభరమున్= రథాన్ని తోలే బరువును; తాల్చుటకున్= మోయటానికి; ఏ+మెయిన్= ఏ విధంగా; పనుచువాఁడన్?= నియమిస్తాను?

తాత్పర్యం: సైరంధ్రీ! నన్ను ఎందుకు ఇట్లా హేళన చేస్తావు? బాగా కండ్లు తెరిచి పేడిని చూడటానికే అసహ్యించుకొంటానే! అట్లాంటప్పుడు యుద్ధంలో తేరు నడపటానికి పేడిని నేను ఎట్లా నియమిస్తాను?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. కైముత్యం చేత అర్థసంసిద్ధి అయితే కావ్యార్థాపత్తి. కైముత్యం అంటే- కిముత అనే దాని భావం. పేడిని చూడటానికే అసహ్యించుకునేటప్పుడు రథసారథిగా చేసికొనటం గూర్చి చెప్పే దేముంది? (సంపా.)

వ. అదియునుంగాక. 19

తాత్పర్యం: అదీకాక.

చ. కురుబల మేఁగుదెంచెనట గోవుల బిట్టుఱఁబట్ట; దానిపైఁ
బరిగొని శౌర్యసంపదయు బాహుబలంబును జూపఁబూని యే
నరిగెద నట్టె; తేరికి బృహన్నల సారథియైన దీని న
వ్వరె? పురిలోన నింత కఱవా? రథచోదకు లింత యేటికిన్.' 20

ప్రతిపదార్థం: గోవులన్= ఆవులను; బిట్టు+అఱన్= ఉద్ధతి పోయేటట్లు; పట్టన్= పట్టుకొనటానికి; కురుబలము= కౌరవుల సైన్యం; ఏఁగుదెంచెన్+అట= వచ్చిందట; దానిపైన్= ఆ కురుసేనమీద; పరిగొని= చుట్టుముట్టి; శౌర్య= పరాక్రమం అనే; సంపదయున్= సంపదను; బాహు= భుజములయొక్క; బలంబున్= బలాన్ని; చూపన్+పూని= చూపించటానికి; ఏను= నేను; అరిగెదనట్టె= పోతున్నానట; (ఇటువంటి ముఖ్యమైన సమయంలో) తేరికిన్= నా రథానికి; బృహన్నల (పరోక్షంగా-ఒక పేడివాడు); సారథి+ఐనన్= సారథి అయితే; దీనిన్= ఈ చిత్రమైన విషయానికి; నవ్వరె?= నవ్విపోరా?; ఇంత+ఏటికిన్= ఇంత ఎందుకు? రథచోదకులు= రథం నడిపేవాళ్ళు; పురిలోనన్= పట్టణంలో; ఇంత కఱవా?= ఇంత అరుదా?

తాత్పర్యం: ఆవులను పట్టుకొనటానికి కురుబలం వచ్చిందట! అందుచేత పట్టుదలతో దానిపై పరాక్రమాన్ని చూపటానికి పోతున్నానట! ఈ సమయంలో నా రథానికి బృహన్నల సారథి అయితే అందరూ నవ్వుతారు. ఇంతదాకా ఎందుకు? నగరంలో సారథులే ఇంత కరువయ్యారా!'

విశేషం: బృహన్నలను సారథిగా చేసికొనుమని సైరంధ్రి చెప్పటం ఉత్తరుడికి అవమానంగా తోచింది. ఆవులను ముట్టడించింది కురుసైన్యంగాని, సామాన్యమైన సైన్యం కాదు. అంతటి సైన్యాన్ని ఎదిరించటానికి తనంతటివాడు వెళ్ళుతున్నాడు. ఇట్లాంటి సమయంలో బృహన్నల సారథ్యం వహిస్తే, లోకం అంతా నవ్విపోదా? అని ఉత్తరుడి భావం. దీన్నే 'అట' అనే శబ్దంతో మహాకవి తిక్కన ఉత్తరుడి మనోభావానికి అద్దం పట్టినట్లు స్ఫురింపచేశాడు.

వ. అనిన విని సైరంధ్రి యతని కిట్లనియె. 21

తాత్పర్యం: ఆ మాటలను వినిన సైరంధ్రి ఉత్తరుడితో ఇట్లా అన్నది.

ఉ. 'కౌరవసేన గాదు త్రిజగంబులు నొక్కట నెత్తి వచ్చినం
దేరు బృహన్నలా వశగతిం జరియించిన గెల్వ వచ్చుఁ; ద
ద్వీరగుణంబు సొంపు పృథివీవరనందన! ము న్నెఱుంగుదుం;
గారణజన్మమై తను వికారము వచ్చినఁ బెంపు దప్పునే?' 22

ప్రతిపదార్థం: పృథివీ= భూమికి; వర= భర్తయైన రాజు యొక్క; నందన!= కుమారా!, రాజకుమారా!; కౌరవసేన+కాదు= ఒక్క కురుసేనయే కాదు; త్రిజగంబులున్= ముల్లోకాలూ (స్వర్గ, మర్త్య, పాతాళాలు); ఒక్కటన్= ఒకేసారిగా; ఎత్తి వచ్చినన్= దండెత్తి వచ్చినాకానీ; తేరు= రథం; బృహన్నలా వశగతిన్= బృహన్నలకు స్వాధీనమైన నడకతో; చరియించినన్= నడిస్తే; గెల్వవచ్చున్= జయించవచ్చు; తత్= ఆ బృహన్నలయొక్క; వీరగుణంబు= పరాక్రమంయొక్క విధం; సొంపు= ఆధిక్యం (అందం అనీ); మున్ను= ఇంతకుముందు; ఎఱుంగుదున్= (నేను) ఎరుగుదును; కారణ= ఏదో ఒక కారణంవలన; జన్మము+ఐ= పుట్టిన (కలిగిన); తను= శరీరంలో; వికారము వచ్చినన్= మార్పురాగానే; పెంపు= ఆధిక్యత; తప్పునే?= లేకుండా పోతుందా?

తాత్పర్యం: 'రాజకుమారా! కురుసైన్యమే కాదు, ముల్లోకాలూ ఒకే మారు మీద పడ్డా సరే, రథం బృహన్నలకు వశమై సాగితే చాలు, గెలుపు తప్పదు. ఆతడి పరాక్రమం, నాకు ఇంతకుముందే బాగా తెలుసు. ఏ కారణం వలననో దేహంలో ఏదో కొద్దిమార్పు కనిపించగానే సహజంగా ఉన్న పరాక్రమం తగ్గిపోతుందా?'

విశేషం: 'బృహన్నలా వశగతిన్'- బృహన్నల సంస్కృతంలో పుంలింగంగానూ, తెలుగులో స్త్రీలింగ శబ్దంగానూ ప్రయోగించబడింది. అందుకు 'బృహన్నలా వశగతిన్' - ఉదాహరణం. ఈ ప్రయోగంతో తిక్కన భావ్యర్థ (ముందు రాబోయే కథను) సూచన చేశాడని పండితుల భావన. తేరు బృహన్నలకు వశమై నడిస్తే - అని పై ప్రయోగానికి అర్థం. దీనినిబట్టి బృహన్నల సారథే కావాల్సిన పని లేదనీ, రథికుడైనా కావచ్చునీ, ముందు కథలో బృహన్నలే అర్జునుడై రథికుడైనాడనీ, 'జనహిత' వ్యాఖ్యా పండితుల అభిప్రాయం ఉచితంగానే ఉన్నది. మూల భారతంలో మాత్రం 'సారథి అయితే' - (యదివై సారథిస్స్యాత్) అనే ఉన్నది. కనుక పై పండితుల అభిప్రాయానికి తిక్కన ప్రయోగమే ఆధారం.

వ. అనవుడు. 23

తాత్పర్యం: అనగానే (ద్రౌపది పైవిధంగా చెప్పగానే).

క. మన మురియాడుచు నుండఁగఁ । దన కొరు లప్పటికి లేమి ధరణీశ్వరనం
దనుఁడు బృహన్నలఁ బిలువం । బనుచుట కొడఁబడిన పలుకు వలుకుటయుఁ దగన్. 24

ప్రతిపదార్థం: మనము= మనస్సు; ఉరియాడుచున్+ఉండఁగన్= ఊగిసలాడుతూ (సందేహిస్తూ) ఉండగా; తనకున్= తనకుకూడా; ఒరులు= (బృహన్నల కాక) వేరేవారు; అప్పటికిన్= ఆ సమయానికి; లేమిన్= లేకపోవటంతో; ధరణీశ్వర= రాజుయొక్క; నందనుఁడు= కుమారుడు (ఉత్తరుడు); బృహన్నలన్= బృహన్నలనే; పిలువన్= పిలవటానికి; పనుచుటకున్= ఆజ్ఞాపించటానికి; ఒడఁబడిన= ఒప్పుకొన్న; పలుకు= మాట; తగన్+పలుకుటయున్= తగినట్లు పలుకగా.

తాత్పర్యం: బృహన్నలను సారథిగా చేసికొనేందుకు మనస్సు ఒకపక్క అనుమానిస్తున్నా, అప్పటికి వేరేవాళ్ళు లేకపోవడంతో ఉత్తరుడు ఆతడినే పిలవటానికి విధిలేక ఒప్పుకొన్నట్లు చెప్పాడు.

వ. సైరంధ్రి దెసఁ గనుంగొని 'యేను బోయి తోడ్కొని వచ్చెద' నని పూని. 25

తాత్పర్యం: ఉత్తరుడు అట్లా అన్నప్పుడు, ఉత్తర సైరంధ్రి వైపు చూచి, 'నేను పోయి బృహన్నలను పిలుచుకొని వస్తాను' అని బయలుదేరింది.

సీ. అడుగుల నునుఁగాంతి నయ్యెడఁ బద్మరా । గంబుల నెలకట్టు కరణినొప్పఁ,
బాలిండ్లు దను వెడ వ్రాలింపఁ జెన్నొందు । నసదుఁ గౌఁదీఁగె యల్లాడుచుండఁ,
దఱి వేచి వెనువెంటఁ దగులు కామాంధ కా । రములీలఁ గ్రొవ్వెద కొమరుమిగులఁ,
గర్ణభూషణ మౌక్తిక ప్రభాడోలన । మీక్షణ దీప్తుల నినుమడింప'

తే. నందియల మొరపంబున కరుగుదెంచి । ప్రోది రాయంచ రయమునఁ బోవు నవ్వి
ధంబు దగ నభ్యసించు చందమునఁ దోన । చనఁగ నుత్తర నర్తనశాల కరిగె. 26

ప్రతిపదార్థం: (బృహన్నల ఉండే నర్తనశాలలోకి ఉత్తర పోయే విధాన్ని ఈ పద్యంలో తిక్కన మహాకవి వర్ణించాడు.) అడుగుల= పాదాలయొక్క; నును= నిగనిగలాడే; కాంతిన్= కాంతితో; ఆ+ఎడన్= ఆచోట; పద్మరాగంబుల= పద్మరాగాలు అనే మణులయొక్క; నెలకట్టు= కట్టడపునేల (భూమి) (గోడ); కరణిన్= వలె; ఒప్పన్= అందగించగా (ప్రకాశించగా); పాలిండ్లు= స్తనాలు; తనున్= తనను (ఉత్తరను); వెడ= అల్పంగా; వ్రాలింపన్= ముందుకు వంగేటట్లు చేయగా; చెన్ను+ఒందు= అందగించే; అసదు= సన్నమైన; కౌను+తీఁగె= తీగవంటి నడుము; అల్లాడుచుండన్= ఊగిసలాడుతూ ఉండగా; తఱి వేచి= సమయం చూచి; వెనువెంటన్+తగులు= వెంబడించే; కామ+అంధకారము= కామం అనే చీకటి; లీలన్= వలె; క్రొత్త+వెద= కొప్పు; కొమరు మిగులన్= అందాన్ని అతిశయింపచేయగా; కర్ణభూషణ= చెవి కమ్మల్లో ఉండే; మౌక్తిక= ముత్యాలయొక్క; ప్రభా= కాంతుల యొక్క; డోలనము= ఊగిసలాటలు; ఈక్షణ= చూపులయొక్క; దీప్తులన్= వెలుగులను; ఇనుమడింపన్= రెట్టింపు చేస్తుండగా; అందియల= కాలి అందెలయొక్క; మొరపంబునకున్= సవ్వడికి; అరుగుదెంచి= వచ్చి; ప్రోది రాయంచ= పెంపుడు రాజహంస; రయమునన్= వేగంగా; పోవు= వెళ్ళే; ఆ+విధంబు= ఆ తీరును; తగన్= తగినరీతిగా; అభ్యసించు చందమునన్= నేర్చుకొంటున్నట్లుగా; తోన్+అ= వెంబడే; చనఁగన్= వెళ్ళగా; ఉత్తర= రాకుమారి ఉత్తర; నర్తనశాలకున్= నాట్యశాలకు; అరిగెన్= పోయింది.

తాత్పర్యం: రాకుమారి ఉత్తర అడుగుల ఎఱ్ఱటికాంతివలన ఆమె అడుగువేసిన నేల పద్మరాగమణులు పొదిగినట్లు ప్రకాశించింది. (పద్మరాగమణులు ఎరుపురంగులో ఉంటాయి). చనుకట్టు బరువుకు ఆమె దేహం ముందుకు వాలుతూ ఉన్నది. ఆ బరువుకు ఆమె సన్ననైన నడుము ఊగిసలాడుతూ ఉన్నది. సందుచూసికొని వెంటాడిన కామాంధకారంవలె, ఆమెకొప్పు నల్లటికాంతితో నిగనిగలాడుతూ ఉన్నది. ఒయ్యారపునడకవలన ఆమె చెవుల కమ్మలు వెనక్కూ ముందుకూ ఊగులాడుతూ కన్నులయొక్క కాంతులను ఇనుమడింపచేస్తూ ఉన్నాయి. కాలి అందెల సవ్వడికి ఆమె పెంపుడు రాయంచ ఆమె నడకలో ఉండే ఒయ్యారాన్నీ, వేగాన్నీ నేర్చుకొనాలని వచ్చినట్లుగా వెంట నడిచింది. ఆ రీతిగా ఉత్తర నర్తనశాలకు వెళ్లింది.

విశేషం: 1. అలం: ఉత్ప్రేక్ష, తద్గుణం, అనుగుణం. 'అడుగుల నునుఁగాంతి... నెలకట్టు కరణినొప్ప' అనే సీసపద్య చరణంలో తద్గుణం, ఉత్ప్రేక్ష. ఆ ఎడ స్వగుణమైన తెలుపును (?) విడిచిపెట్టి అడుగుల నునుఁగాంతిని (ఎరుపును) స్వీకరించింది కాబట్టి తద్గుణాలంకారమని చెప్పవచ్చును. అంతటిలో ఊరుకొనక అది పద్మరాగాల నెలకట్టా అన్నట్లు ఉన్న దనటంచేత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉత్ప్రేక్ష కూడా. ఉత్ప్రేక్ష తద్గుణం చేత అనుప్రాణితమవుతున్నది. 'తటివేచి... కొమరు మిగుల' అనే పాదంలో ఉత్ప్రేక్ష 'కర్ణ మౌక్తిక .... ఇనుమడింప' అనే చరణంలో అనుగుణం, 'అందియ... చనఁగ' - అనే చోట ఉత్ప్రేక్ష. రాయంచకు గమనవేగం ఉండదు. ఉత్తర బృహన్నల కడకు ఉత్సాహంతో, వేగంగా వెళ్ళుతున్నది. అందుచేత రాయంచ ఆ వేగాన్ని నేర్చుకొనాలని ఆమె వెనుకనే వెళ్ళుతున్నది అనే చోట ఉత్ప్రేక్ష- అనే అలంకారాలు ఉన్నాయి. ద్రౌపది సైరంధ్రిగా సుదేష్ణ మందిరంలో ప్రవేశించినప్పుడు ఆమెను వర్ణించిన సీసపద్యం (1.308) వంటిదే ఈ పద్యం. ఇది దాని సమాంతర రచనాశిల్పం. తిక్కనకు ఇటువంటి వర్ణనలంటే ఇష్టం. కథ వేగంగా నడువవలసిన చోటకూడా తిక్కన ఇటువంటి వర్ణనలతో ఒక్కొక్కసారి అందంగా నడిపిస్తాడు. (సంపా.)

2. అందమైన సన్నివేశాన్ని కవులు తప్పక వర్ణిస్తారు. అందులోనూ సమర్థులైన తిక్కనవంటి మహాకవుల సంగతి సరేసరి. ఉత్తర నర్తనశాలకు వెళ్ళటం ఒక ప్రధానమైన సన్నివేశం. బృహన్నలగా ఉన్న అర్జునుడు అజ్ఞాతవాసం నుంచి బయటపడటానికి ఇది చక్కటి అవకాశం. కాబట్టి ఇది ముఖ్యమైన సందర్భం. దీనికి ఉత్తర ఒక కారణం. అందుకే తిక్కన ఉత్తరను వర్ణించింది. అసలు వర్ణించేవాడే కవి. (వర్ణయతి కవయతీతి కవిః) ఈ పద్యంలో తిక్కన, ఉత్తర బాహ్యసౌందర్యాన్నీ- అంటే శారీరక సౌందర్యాన్నీ, తరువాతి పద్యంలో ఆమె ఆంతర సౌందర్యాన్నీ, అంటే మానసిక సౌందర్యాన్నీ వర్ణించాడు. సామాన్యంగా కవులు బాహ్యాన్నే వర్ణిస్తారు. కాని తిక్కన బాహ్యాన్నీ, ఆంతరాన్నీ కూడా వర్ణిస్తాడు.

ఆ. మెఱుఁగు మొగిలు సొచ్చు తెఱఁగున నాట్యమం । దిరము సొచ్చి తనదు గురువు కడకు
నరిగి నెమ్మి నిట్టు లను నింతి ప్రార్థనా । వినయ సంభ్రమములు పెనఁగొనంగ. 27

ప్రతిపదార్థం: మెఱుఁగు= మెఱుపుతీగ; మొగిలు+చొచ్చు తెఱఁగునన్= మబ్బులోకి చొచ్చుకొని పోయేరీతిగా; ఇంతి= ఉత్తర; నాట్యమందిరము+చొచ్చి= నాట్యాన్ని నేర్పించేశాలలో ప్రవేశించి; తనదు= తనయొక్క; గురువు= గురువైన బృహన్నల; కడకున్= సమీపానికి; అరిగి= వెళ్ళి; ప్రార్థనా= వేడుకోవటం; వినయ= వినయం (అణకువ); సంభ్రమములు= తత్తరపాటు (అనే భావాలు); పెనఁగొనంగన్= పెనవేసికోగా; నెమ్మిన్= ప్రీతితో, నెమ్మదిగా (గురుభావంతో); ఇట్టులు= ఇట్లా; అనున్= అన్నది.

తాత్పర్యం: మెఱుపుతీగ మబ్బులో దూరినట్లుగా రాకుమారి ఉత్తర నాట్యమందిరం ప్రవేశించి, గురువుగారైన బృహన్నల వద్దకు వెళ్ళి, వేడుకోలు, అణకువ, తత్తరం ముప్పేటగా పెనవేసికోగా ఈ విధంగా అన్నది.

విశేషం: అలం: ఉపమ. నర్తనశాలను మేఘంవలె, అందులోకి ప్రవేశించిన ఉత్తరను మెఱుపుతీగగా తిక్కన వర్ణించాడు. మెరుపు ఎక్కడున్నా మెరుపే. మెరుపు ఉండే తావు మేఘం. మెరుపువంటి ఉత్తర నాట్యం నేర్చుకొనే మందిరం అది. అందులో ప్రవేశించే ఆమె నడకలోని హొయలు ఎంత నాట్యసుందరంగా ఉంటాయో తిక్కన వెనుకటి సీసపద్యంలో చెప్పాడు. మెరుపువలె బయట మెరసిన ఉత్తర లోనికి వెళ్ళికూడా మెరుస్తుంది. ఆ మెరుపు ఆమె పలికే ప్రతిభావంతమైన మాటల తీరు. పైమెరుపు లోమెరుపుగా చిత్రించటంలో ఉపమాలంకారాన్ని ఊతగా తీసికొని తిక్కన ధ్వనింపచేశాడు. (సంపా).

గురువుగారిని సమీపించి, మాట్లాడటానికి ముందు ఆమెలో పెనవేసికొన్న 'ప్రార్థన' మొదలైన భావాలు ఆమె మానసిక సౌందర్యానికి సంబంధించినట్టివి. ప్రార్థనా వినయాలు గురుభక్తి వలన, సంభ్రమం తత్క్షణ కార్యస్థితి వలన. ఈ మహార్థాన్ని 'అంతటివీ మెఱుగు మొగిలు సొచ్చు' - ప్రయోగంలో మహాకవి భావింపచేశాడు. ఇది సార్థకం అయిన పోలిక. పైకి మామూలు పోలికవలెనే కనిపించినా, నిదానంగా చూస్తే ఎంతో లోతైన అర్థంతో నిండి ఉన్నది. అంధకార బంధురంగా మబ్బువలె నల్లగా ఉండే నాట్య మందిరంలోకి మెరుగు వంటి మేనిఛాయగల ఉత్తర ప్రవేశించినదనటం సముచితం, సుందరం అయిన భావం.

క. **'ఇచ్చట నొకకయ్యంబునఁ । జచ్చె మదీయాగ్రజన్ముసారథి; తగువాఁ**
డెచ్చోట లేమి నాతం । డచ్చు పఱుపఁడయ్యె నీ క్రియకు నొండొకనిన్. **28**

ప్రతిపదార్థం: ఇచ్చటన్= ఇక్కడ; ఒక కయ్యంబునన్= ఒక యుద్ధంలో; మదీయ= నాయొక్క; అగ్రజన్మ= అన్నగారైన ఉత్తరుడియొక్క; సారథి= రథసారథి; చచ్చెన్= మరణించాడు; తగువాఁడు= (తిరిగి) తగిన సారథి; ఎచ్చోటన్+లేమిన్= ఎక్కడా లేకపోవటంతో; ఆతండు= మా అన్న; ఈ క్రియకున్= ఈ పనికి (రథాన్ని తోలే పనికి); ఒండు+ఒకనిన్= వేరేవాడిని; అచ్చుపఱుపఁడు+అయ్యెన్= ఏర్పాటు చేయలేదు.

తాత్పర్యం: 'మా అన్నగారి సారథి ఒక యుద్ధంలో చచ్చిపోయాడు. తనకు సరిపోయేవాడు దొరక్కపోవటంతో మళ్ళీ ఎవడినీ నియమించలేదు.

విశేషం: ఉత్తర తెలివితేటలూ, చురుకుదనం, ముందుచూపూ ఇందులో బాగా తెలుస్తాయి. తాను బృహన్నలతో చెప్పదలచుకొన్న విషయాన్ని ఆరంభించటంలోనే ఉత్తర తెలివిని చూపింది. సారథి విషయంగా తాను వచ్చినట్లు మొదట్లోనే ఉత్తర గురువుకు సూచించింది. తన అన్న సారథి చచ్చిన సంగతి బృహన్నలకు ఎందుకు? ఆతడితోనే ముందు పని ఉన్నది కనుకనే చెప్పింది. ఒక సారథి పోతే మరొకడిని నియమించుకొనటం సామాన్యమైనపని. తగినవాడు దొరకలేదనీ, అందుకే మరొకడిని నియమించలేదనీ, ఉత్తర బృహన్నలకు ముందుగానే చెప్పింది. ఒక సారథి పోతే మరొకడిని నియమించుకొనటం సామాన్యమైనపని. తగినవాడు దొరకలేదనీ, అందుకే మరొకడిని నియమించలేదనీ, ఉత్తర బృహన్నలకు ముందుగానే చెప్పింది. సారథి లేని కారణాన్నీ (చావటం), వేరేవాడిని పెట్టుకొనకపోవటానికీ (తగువాడు లేకపోవటంవలన) హేతువును ఉత్తర జాగ్రత్తగా, బృహన్నల అడుగకుండానే చెప్పింది. దీని తరువాతి వచనంలో ఉత్తర అసలు సంగతిని బయటపెట్టింది. కనుక, అసలు విషయాన్ని చెప్పటానికి ముందు, ఆ విషయానికి సంబంధించిన దానిని సూచనగా ఉత్తర చెప్పింది. ఇది కార్యసాధకుల లక్షణం. దీనిని ఉత్తర ద్వారా మహాకవి ప్రదర్శించాడు.

వ. **అది యట్లుండె; నేఁడు కౌరవులు పసులం బట్టిరని కూయి వచ్చిన, నన్న సన్నద్ధుఁడై వెనుకం దగుల సమకట్టి, సారథ్యంబు సేయువాఁడు లేమికి విషాదంబు నొందిన, నీ కందువ సైరంధ్రి సెప్పినం బ్రియంబంది నిన్నుఁ దోడ్తేర నన్నుఁ బనిచిన, నేనును నీ పాల నాకుఁ జనవు గలుగుటంజేసి,'యెల్ల విధంబులం దెత్తు' నని పూని వచ్చితి; నీవును నా పలుకులు కుఱుచసేయక, నీ పెంపునుం బ్రకటంబుగా నయ్యుత్తరకుమారునకు రథంబు గడప నియ్యకొని, యి య్యాపదఁ దలఁగ వలయు, నిట్లొడంబడక తక్కుట నా వలని వాత్సల్యంబు గొఱంతపఱుచుట' యనిన నమ్ముద్దియ పలుకులు ముద్దు సేసి.** **29**

ప్రతిపదార్థం: అది, అట్లు+ఉండెన్= అది అట్లా ఉండగా; నేఁడు= ఇవ్వేళ; కౌరవులు; పసులన్+పట్టిరి+అని= ఆవులను బందీచేశారని; కూయి= మొరపెట్టుకొంటూ వచ్చిన వార్త; వచ్చినన్= రాగా; అన్న= అన్న అయిన ఉత్తరుడు; సన్నద్ధుఁడు+ఐ= యుద్ధానికి సిద్ధపడి; వెనుకన్+తగులన్= కౌరవసేనలను వెన్నంటి తరమటానికి; సమకట్టి= పూనుకొని; సారథ్యంబు, చేయువాఁడు= రథాన్ని నడిపేవాడు; లేమికి= లేకపోవటంచేత; విషాదంబున్+ఒందినన్= విచారాన్ని పొందగా; నీ కందువ= నీ యొక్క నేర్పరితనం గురించి; సైరంధ్రి, చెప్పినన్; ప్రియంబు+అంది= సంతోషించి; నిన్నున్= (బృహన్నలను); తోడు+తేరన్= వెంటతీసికొనిరావటానికి; నన్నున్+పనిచినన్= నన్ను పంపగా; ఏనును= నేను కూడా; నీ పాల= నీ చెంత; నాకు; చనవు; కలుగుటన్+చేసి= దగ్గరి పరిచయం ఉండటంచేత; ఎల్ల విధంబులన్= అన్ని విధాలా (తప్పకుండా); తెత్తున్= తీసికొని వస్తాను;

అని, పూని, వచ్చితిన్= అని మాట ఇచ్చి వచ్చాను; ఈవును= నీవుకూడా; నా పలుకులు= నా మాటలు; కుఱుచ+చేయక= తక్కువ పరచక (లెక్కచేయక); నీ పెంపునున్= నీ గొప్పతనం కూడా; ప్రకటంబుగాన్= బయటపడేటట్లు; ఆ+ఉత్తర కుమారునకున్; రథంబు, కడపన్+ఇయ్యకొని= రథం నడపటానికి అంగీకరించి; ఈ+ఆపదన్= ఈ కష్టాన్ని; తలఁగన్+వలయున్= తప్పించాలి; ఇట్లు+ఒడంబడక= ఈ విధంగా అంగీకరించకుండా; తక్కుట= మానుకొనటం; నా వలని, వాత్సల్యంబు+ కొఱంత పఱుచుట= నాపట్ల అనురాగం (వత్సలభావం) తక్కువ చేయటమే; అనినన్= అని అనగా; ఆ+ముద్దియ= ఆ ముద్దరాలు-ఉత్తరయొక్క; పలుకులు= మాటలకు; ముద్దు+చేసి= ముచ్చటపడి ఆదరించి.

తాత్పర్యం: ఆ విషయం అట్లా ఉండగానే, ఇప్పుడు కౌరవులు ఆలమందలను పట్టుకొన్నారనే వార్త వచ్చింది. మా అన్న ఉత్తరుడు పోరాడటానికి తయారై సారథి చిక్కకపోవటంతో దిగులుపడి ఉండగా, సైరంధ్రి నీ నేర్పును తెలిపింది. అందుకు సంతోషించి, అన్న నిన్ను తీసికొని రావటానికి నన్ను పంపాడు. నాకూ నీ వద్ద చనవు ఉండటంవలన 'ఎట్లాగైనా తీసికొని వస్తా' నని చెప్పి వచ్చాను. నా మాటలను నిర్లక్ష్యం చేయకుండా, నీ గొప్పతనం బయటపడేటట్లు ఉత్తరుడికి సారథి కావటానికి అంగీకరించి, ఈ ఆపదనుంచి కాపాడాలి. నీవు దీనికి ఒప్పుకొనకపోతే నా మీద నీకు వాత్సల్యం కొరవడినట్లే' అని అన్నది. అర్జునుడికి ఉత్తర మాటలు ముద్దుగా అనిపించాయి.

విశేషం: ఉత్తర సారథివిషయాన్ని వెనుక పద్యంలో కొంతచెప్పి, ఈ వచనంలో బృహన్నలతో మరికొంత చెపుతుంది. ఉత్తర మాటలలో పొందిక, వినయం, ఎదుటివాడిని ఒప్పించే నేర్పు కనిపిస్తాయి. బృహన్నల కాదని చెప్పలేని పరిస్థితిని ఆమె 'చనువు' కారణంగా కల్పించింది. దానికితోడు గురుశిష్యులమధ్య నున్న వాత్సల్యాన్ని సాధనంగా చేసికొన్నది. ఇందులో ఉత్తరలో వయసుకు మించిన మానసిక పరిణతి కనిపించింది. తిక్కన పాత్రపోషణలో ఇది ఒక శిల్పరీతి.

క. నగుచు బృహన్నల యిట్లను । 'జగతీశ్వర పుత్త్రి! నాకు సారథ్యము నే
ర్పు గలదె? నీ మాటకు నే । మిగులంగా వెఱతుఁ; బొదము మీఁ దట్లుండెన్. 30

ప్రతిపదార్థం: బృహన్నల; నగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు; జగతీ+ఈశ్వర= రాజుయొక్క; పుత్త్రి!= కుమారీ! (ఉత్తరా!); నాకున్= నాకు; సారథ్యము నేర్పు= రథాన్ని తోలటంలో నేర్పు; కలదె?= ఉన్నదా?; నీ మాటకున్= నీవు చెప్పిన మాటకు; నేన్= నేను; మిగులంగాన్= దాటటానికి; వెఱతున్= భయపడుతున్నాను; పొదము= పొమ్ము, పద; మీఁదు= భవిష్యత్తు; అట్లు+ఉండెన్= అట్లా ఉన్నదేమో!

తాత్పర్యం: నవ్వుతూ బృహన్నల ఉత్తరతో ఇట్లా అన్నాడు- 'ఓ రాకుమారీ! సారథ్యం చేసే నేర్పు నా కున్నదా? నీ మాట దాటటానికి నాకు భయంగా ఉన్నది. సరే, పద, అట్లా జరగాలని ఉందేమో?'

విశేషం: బృహన్నల నిజానికి తనను సారథిగా ఎప్పుడు పిలుస్తారా? అని ఎదురుచూస్తూ ఉన్నాడు. ఉత్తర తనను ఆమె అన్న పిలువమన్నట్లు వచ్చి పిలిచింది. ఇది ఆతడికి లోపల సంతోషమే. కాని, పైకి మాత్రం 'నాకు సారథ్యంలో నేర్పు ఉందా? నీ మాట కాదనటానికి భయపడుతున్నాను. భవిష్యత్తు అట్లా ఉందేమో?' అనే మాటలు పలుకటం, ఆతడి సందర్భశుద్ధిని తెలుపుతుంది. సారథిగా వెళ్ళటం బృహన్నలకూ అవసరమే! ఆతడు దీనిని ఒక అవకాశంగా తీసికొన్నాడు.అందుకే, దేవుడిమీద బరువువేసినట్లు 'మీఁదట్లుండెన్' అని అంటూ ఒప్పుకొన్నాడు. 'నీ మాటకు నే మిగులంగా వెఱతు' అనటంలో ఉత్తరపై ఉన్న వాత్సల్యం కూడా స్పష్టపడుతుంది. ఉత్తర అభ్యర్థన కారణంగా, బృహన్నల ఆమెతో తరువాత పద్యంలో 'నీ కొరకు ఏ పనైనా చేసి, నీకు సంతోషాన్ని కలిగిస్తా' నని అంటాడు. 'మీదెట్లుండెన్' అనే పాఠాంతరం కొన్ని ప్రతులలో ఉన్నది.

క. భవదీయ ప్రార్థనచేఁ । దివిరి పరమ దుష్కరములు దీర్చియయిన ను
త్సవ మొనరించెద సార । థ్య విధం బొకఁ డనఁగ నేల యంబుజవదనా!' 31

ప్రతిపదార్థం: అంబుజవదనా!= పద్మంవంటి ముఖం గల ఉత్తరా!; భవదీయ= నీయొక్క; ప్రార్థనచేన్= అభ్యర్థనతో; సారథ్య విధంబు= సారథ్యం అనే పని; ఒకఁడు= ఒకటే; అనఁగన్+ఏల?= అనటం ఎందుకు?; తివిరి= ప్రయత్నంతో; పరమదుష్కరములు= మిక్కిలి కష్టంతో సాధించే పనులు; తీర్చి+అయినన్= నెరవేర్చి అయినా; ఉత్సవము+ఒనరించెదన్= సంతోషాన్ని కలిగిస్తాను.

తాత్పర్యం: ఓ ఉత్తరా! నీవు నన్ను వేడుకొన్నావు గనుక రథసారథ్యం ఒకటే ఏమిటి? ఎంత కష్టమైనా, ఏ పనైనా చేసి నీకు సంతోషాన్ని కలిగిస్తాను.'

విశేషం: బృహన్నల మాటలలో (సారథ్యవిధంబొకఁ డనఁగ నేల?) తాను సారథిగానే కాక, రథికుడిని అవుతాననే భావం కూడా తోస్తుంది. 'భవదీయ ప్రార్థనచే' అన్న ప్రయోగంవలన ఉత్తర మీద ఆతడికున్న అభిమానం ఎట్లాంటిదో తెలుస్తుంది. 'తివిరి పరమ దుష్కరములు తీర్చి అయిన నుత్సవ మొనరించెద' అనే మాటలలో కూడా ఆతడి శిష్యవాత్సల్యం ప్రత్యేకంగా తెలుస్తూ ఉన్నది.

వ. అనుచు సంగీతనిలయంబు వెలువడి సలీలంబుగా మెత్త మెత్తన నడతెంచు మత్తశుండాలంబునుం బోలె. 32

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; సంగీత నిలయంబున్= ఆ నర్తనశాలనుండి; వెలువడి= బయటకు వచ్చి; సలీలంబుగాన్= విలాసంతో; మెత్త మెత్తన= మెల్ల మెల్లగా; నడతెంచు= నడచివచ్చే; మత్తశుండాలంబునున్+పోలె= మదించిన ఏనుగువలె.

తాత్పర్యం: పై విధంగా అంటూ, నాట్యశాల నుండి విలాసంతో మదించిన ఏనుగువలె నడుస్తూ. (ముందు పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

ఉత్తరుఁడు బృహన్నలను దనకు సారథిగాఁ జేసికొనుట (సం. 4-35-10)

తే. అరుగుదెంచు బృహన్నల నంత నంతఁ । గని నృపాలసుతుం డను గారవమునఁ
'గౌరవులతోడఁ గయ్యంబు గలిగె నాకుఁ । గడఁగి నేఁడు రథ మ్మీవు గడపవలయు. 33

ప్రతిపదార్థం: అరుగుదెంచు= వస్తూఉన్న; బృహన్నలన్; అంతన్+అంతన్= అల్లంతదూరంలోనే; కని= చూచి; నృపాలసుతుండు= రాజకుమారుడైన ఉత్తరుడు; గారవమునన్= ఆదరభావంతో; అనున్= అంటాడు; నాకున్= నాకు; కౌరవులతోడన్= కౌరవులతో; కయ్యంబు= యుద్ధము; కలిగెన్= వచ్చింది; కడఁగి= పూని; నేఁడు= ఇప్పుడు; రథమ్ము= రథాన్ని; ఈవు= నీవు; కడపవలయున్= నడపవలసింది.

తాత్పర్యం: అల్లంత దూరాననే బృహన్నలను చూచి ఉత్తరుడు గారవంతో 'కౌరవులతో నాకు కయ్యం వచ్చింది. నీవు నాకు రథాన్ని తోలాలి' అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: బృహన్నలను అల్లంతదూరాన్నించే చూచి, తన అవసరాన్ని తెలపటం, ఉత్తరుడి ఆత్రాన్ని తెలుపుతుంది. కౌరవులతో ఎందుకు యుద్ధం వచ్చిందో తానుగా ఉత్తరుడు బృహన్నలకు చెప్పలేదు. ఇది ఉత్తరుడి రాచరికపు గాంభీర్యాన్నీ, ఆతడి ఆరంభశూరత్వాన్నీ సూచిస్తుంది.

క. వే రమ్ము; మై మఱువుఁ దొడి । తే రెక్కుము; దప్పఁ గ్రుంకఁ దీఱదు నీకున్;
సైరంధ్రి సెప్పె నీదగు । బీరమ్మును బెంపులావు వెరవును మాకున్.' 34

ప్రతిపదార్థం: వే= వేగంగా; రమ్ము= రా; మై మఱువున్= కవచాన్ని (శరీరాన్ని మఱుగుపరిచేది); తొడి= తొడిగి; తేరు= రథం; ఎక్కుము; నీకున్= నీకు; తప్పన్+క్రుంకన్= తప్పించుకొనటానికి, మానటానికి; తీఱదు= కుదురదు; నీది+అగు= నీయొక్క; బీరమ్మును= వీరత్వాన్నీ (పరాక్రమాన్నీ); పెంపు= గొప్పతనాన్నీ (ఘనతనూ); లావున్= బలాన్నీ; వెరవును= ఉపాయాన్నీ (నేర్పునూ, చాతుర్యాన్నీ); మాకున్= మాకు; సైరంధ్రి; చెప్పెన్= (ఇదివరకే) చెప్పింది.

తాత్పర్యం: 'త్వరగా రావాలి. కవచాన్ని ధరించి రథాన్ని ఎక్కాలి. తప్పించుకొనాలనుకుంటే నీకు వీలుపడదు. నీ పరాక్రమాన్నీ, గొప్పతనాన్నీ, బాహుబలాన్నీ, సారథ్యంలో చాతుర్యాన్నీ గురించి మాకు సైరంధ్రి ముందే చెప్పింది.'

విశేషం: ఉత్తరుడు 'మాకు' అని అనడంలో, రాచరికపు మర్యాద, గౌరవం తెలుస్తాయి. ఉత్తరుడి విషయంలో ఈ పదం ముందుకథలో ఎగతాళికి భాజనం అయింది. 'బీరము, పెంపు, లావు వెరపు' - ఈ గుణాలు వీరులకు అవసరం. రథికుడికే కాక సారథికీ అవసరమే. సారథి తెలివితేటల మీద కొంతవరకు రథికుడి విజయం ఆధారపడుతుంది. సమర్థులైన సారథులు కొందరు రథికుల మాన ప్రాణాలను కాపాడారు. కనుక యుద్ధంలో సారథి చాలా ప్రధానం అయినవాడు. ఆతడు కేవలం రథాన్ని మాత్రమే నడపడు. క్లిష్టసమయంలో రథికుడికి 'ఉపాయాన్ని' సూచించి,ఆతడి విజయానికి సహకరిస్తాడు. అందుకే తిక్కన మహాకవి బృహన్నలకు పైలక్షణాలు ఉన్నాయని సైరంధ్రి ద్వారా ఉత్తరుడికి చెప్పించాడు.

చ. అనుటయు, 'నాట పాట గల యప్పటికిన్ ననుఁ గోరి పిల్వఁబం
చినఁ దగుఁగాక; సంగరము సేఁతకు సారథి గమ్ము, రమ్ము, నీ
వను టుచితంబె? యెల్లెడల నారసి బాహుబలాఢ్యుఁడైన యొ
క్కని రథ మేడ్తెఱం గడపఁగా నియమింపుము రాజనందనా!' 35

ప్రతిపదార్థం: అనుటయున్= (పైవిధంగా ఉత్తరుడు) అన్న వెంటనే; రాజనందనా!= ఓ రాకుమారా!; ఆటపాట= నాట్యం, సంగీతం; కల+అప్పటికిన్= ఉండినప్పుడు (నాట్యసంగీత సంబంధంగా); ననున్= నన్ను కూడా; కోరి= కోరుకొని; పిల్వన్= పిల్వటానికి; పంచినన్= ఆజ్ఞాపించగా; తగున్+కాక= సరిపోతుందిగాని; సంగరము+చేఁతకున్= యుద్ధపుపనికి (యుద్ధాన్ని చేసేందుకు); సారథి+కమ్ము= సారథిగా ఉండుము; రమ్ము= రమ్మని; నీవు= నీవు; అనుట= అనటం; ఉచితంబు+ఎ?= న్యాయమేనా?, తగునా?; ఎల్ల+ఎడలన్= అన్నిచోట్లా; ఆరసి= బాగా వెదకి; బాహుబల+ఆఢ్యుఁడు+ఐన= భుజబలంలో గొప్పవాడైన; ఒక్కనిన్= ఒక సమర్థుడిని; రథము= రథాన్ని; ఏడ్తెఱన్= నేర్పుతో; కడపఁగాన్= నడపటానికి; నియమింపుము= ఆజ్ఞాపించుము.

తాత్పర్యం: 'రాకుమారా! ఏదైనా ఆటపాట విషయమైతే నన్ను రమ్మంటే సరిపోతుంది కానీ, యుద్ధానికి పోతూ సారథి కావాలి, రా! అని పిలవడం బాగుందా? (పట్టణంలో) అంతా వెదకి, బలవంతుడూ, సమర్థుడూ అయిన ఒకడిని సారథిగా ఏర్పాటు చేసికొనుము'.

విశేషం: ఉత్తరుడు విధిలేక, తనకు ఇష్టంలేకపోయినా, సైరంధ్రి మాటమీద, బృహన్నలను సారథిగా చేసికొనటానికి ఒప్పుకొన్నట్లు, బృహన్నలకు తెలుసు. అది మనసులో పెట్టుకొని, బృహన్నల ఇప్పుడు ఉత్తరుడిని కొంచెం ఉడికించటానికి పైపద్యంలో చెప్పినట్లు అంటాడు. ఇంకా ఎక్కువగా అడిగించుకొనటానికీ, పిలుస్తూనే పోయి ఒప్పుకొనటం వలన లోకువ అవుతుందనీ, తన అవసరం బాగా తెలియాలనీ కూడా బృహన్నల అట్లా అంటాడు. నాట్యాచార్యుడిగా తన పరిస్థితిని తెలిపి, బలవంతం చేయించుకొని ఒప్పుకొనాలని కూడా ఆత డట్లా అంటాడు. ఇది సంభాషణలో ఒక గొప్ప ఔచిత్యం.

వ. అనిన విని వైరాటి కిరీటి కిట్లనియె. 36

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; వైరాటి= విరాటరాజు కుమారుడు (ఉత్తరుడు); కిరీటికిన్= అర్జునుడితో (కిరీటం గలవాడు కిరీటి); ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: (బృహన్నల యొక్క) ఆ మాటలను విని ఉత్తరుడు ఇట్లా అన్నాడు.

ఉ. 'ఖాండవ మేర్చునప్పుడు తగన్ రథచోదక వృత్తి సల్పి; యా
ఖండలసూతికిన్ జయము గల్గ నొనర్చిన యట్టి బుద్ధియున్
దండితనంబు నీ యెడన తక్కెనె? నా దెస మైత్రి పెన్పు; మిం
కొండొక మాట దక్కుము, రణోత్సహనం బొనరింపు గ్రక్కునన్.' 37

ప్రతిపదార్థం: ఖాండవము+ఏర్చునప్పుడు= ఖాండవం అనే వనాన్ని కాల్చేటప్పుడు; తగన్= తగినవిధంగా; రథ= రథంయొక్క; చోదకవృత్తి= తోలేపనిని; సల్పి= నెరవేర్చి; ఆఖండల సూతికిన్= దేవేంద్రుడి కుమారుడైన అర్జునుడికి; జయము+కల్గన్= విజయం చేకూరేటట్లు; ఒనర్చిన+అట్టి= చేసిన సమయంలోఉన్న; బుద్ధియున్= తెలివీ; దండి తనంబున్= పరాక్రమమూ; నీ+ఎడన్+అ (నీ యెడన)= నీ యందే; తక్కెనె?= పోయాయా?; నా దెసన్= నాపై; మైత్రి= స్నేహాన్ని; పెన్పుము= ఎక్కువ చేసికొనుము; ఇంకన్= ఇంకా (ఇప్పుడుకూడా); ఒండు+ఒక మాట= వేరేమాట (బదులుమాట); తక్కుము= విడిచిపెట్టుము; గ్రక్కునన్= వెంటనే; రణ+ఉత్సహనంబు+ఒనరింపు= యుద్ధానికి ఉత్సహించుము (యుద్ధానికి సంసిద్ధం కమ్ము అని అర్థం).

తాత్పర్యం: 'ఖాండవ దహనంలో అర్జునుడికి సారథిగా ఉండి, ఆతడికి విజయాన్ని కల్గించినప్పటి తెలివితేటలూ, పరాక్రమం ఇప్పుడు మాత్రమే తగ్గాయా? నా మీద స్నేహాన్ని పెంచుకొమ్ము. యుద్ధానికి తయారుగా ఉండుము. నాకు మరోమాట చెప్పవద్దు'.

విశేషం: బృహన్నలకు సారథ్యంలో మంచి సామర్థ్యం ఉన్నట్లు మొదట సైరంధ్రి ఉత్తరకూ, తరువాత ఉత్తరుడికీ చెప్పింది. దాన్ని నమ్మిన ఉత్తరుడు, బృహన్నలను, ఖాండవదహనంలో అర్జునుడికి నీవల్లనే విజయం కలిగిందని ఇందులో అంటాడు. అదీ తనకు బాగా తెలిసినదానివలె; పైగా ప్రశంసించాడు కూడా. విధిలేక ఒప్పుకొన్న సంగతి బయటకు రానీక, ఉత్తరుడు అనటం ఉచితమే!

తే. అనిన, నాతని మాటకు నడ్డమాడ । వెఱచినట్టి తెఱంగు భావించి యల్ల
నియ్యకొనుటయు; నమ్మనుజేంద్రసుతుఁడు । దృఢ తను త్రాణ మతనికిఁ దేరఁ బనిచె. 38

ప్రతిపదార్థం: అనినన్= ఉత్తరుడు పైవిధంగా అన్నప్పుడు; అడ్డము+ఆడన్+వెఱచినట్టి= ఎదురుచెప్పటానికి భయపడ్డ; తెఱంగు= విధానాన్ని; భావించి= నటించి; అల్లన్= మెల్లగా; ఇయ్యకొనుటయున్= ఒప్పుకొనగా; ఆ+మనుజ+ఇంద్ర సుతుఁడు= ఆ రాజకుమారుడైన ఉత్తరుడు; అతనికిన్= బృహన్నలకు; దృఢ= గట్టిదైన; తను త్రాణము= కవచాన్ని; తేరన్= తీసికొనిరావటానికి; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: ఉత్తరకుమారుడి మాటలకు ఎదురు చెప్పటానికి జంకినట్లు జంకి, బృహన్నల తిన్నగా ఒప్పుకొన్నాడు. వెంటనే ఉత్తరుడు బృహన్నలకు గట్టి కవచాన్ని తీసికొనిరమ్మని ఆజ్ఞాపించాడు.

క. తెప్పించి తొడుగు మీ వని । యొప్పించిన, నిట్టునట్టు నొఱవలుగా మైఁ
గప్పికొని, యా బృహన్నల । యప్పుడు నగుపించె నచటి యబలాజనమున్. 39

ప్రతిపదార్థం: తెప్పించి= (కవచాన్ని) తెప్పించి; ఈవు= నీవు; తొడుగుము= తొడుగుకో; అని= అని చెప్పి; ఒప్పించినన్= అంగీకరించేటట్లు చేయగా; ఆ బృహన్నల; ఇట్టున్+అట్టున్= ఇటూ అటూ; ఒఱవలుగాన్= తారా్మరుగా, తలక్రిందులుగా; మైన్= ఒంటిపైన; కప్పికొని= వేసికొని; అప్పుడు= ఆ సమయంలో; అచటి= అక్కడ ఉన్న; అబలాజనమున్= ఆడవాళ్ళను; నగుపించెన్= నవ్వించాడు.

తాత్పర్యం: ఉత్తరుడు గట్టి కవచాన్ని తెప్పించి తొడుక్కోమని బృహన్నలకు ఇస్తే దాన్ని ఆతడు క్రింది భాగం పైకీ, పైభాగం క్రిందికీ వచ్చేటట్లు తలక్రిందుగా ఒంటిపైన కప్పుకొని, అక్కడి ఆడవాళ్ళను నవ్వించాడు.

విశేషం: తాను అమాయికుడను - అని నిరూపించేందుకు బృహన్నల ఇట్లా చేశాడు. పైగా ఇంతకుముందు, 'ఆటపాట విషయంగా పిలిపిస్తే బాగుంటుంది గాని, యుద్ధం చేయటానికి సారథిగా ఉండమంటే ఏం బాగుటుంది' అనీ బృహన్నల ఉత్తరుడితో (35పు) అనిఉన్నాడు. దానికి తగినట్లు, ఇప్పుడు కవచాన్ని తొడుక్కొనేటప్పుడు కూడా ఏమీ తెలియనట్లు తలక్రిందులుగా బృహన్నల తొడుక్కొన్నాడు.

క. ఉత్తరుఁడు సత్వరంబుగఁ । దత్తనువున మఱువు దొడిగి తానును హృద్యో
దాత్తంబగు కంకట మిడి । చిత్తము పసిఁ గ్రమ్మఱింపఁ జిడిముడిపడఁగన్. 40

ప్రతిపదార్థం: ఉత్తరుఁడు= ఉత్తరకుమారుడు; సత్వరంబుగన్= తొందరగా; తద్+తనువునన్= ఆ బృహన్నల దేహానికి; మఱువు= కవచాన్ని; తొడిగి= తానే తొడిగి; తానును= తానూ; హృద్య+ఉదాత్తంబు+అగు= మనోహరం, గొప్పదీ అయిన; కంకటము+ఇడి= కవచాన్ని తొడిగి; చిత్తము= ఆలోచన (మనసు); పసిన్= పశువులను (ఆవులను); క్రమ్మఱింపన్= వెనక్కు మళ్ళించటానికి; చిడిముడిపడఁగన్= త్వరపడగా (ముందు వచనంతో అన్వయం).

తాత్పర్యం: (బృహన్నల, కవచాన్ని తలక్రిందులుగా తొడుక్కొంటే) ఉత్తరుడు వెంటనే బృహన్నల శరీరానికి ఆ కవచాన్ని సరిగా తొడిగి, రమణీయమూ, ఉదాత్తమూ అయిన మరొక కవచాన్ని తానూ తొడుక్కొని, ఆవులను మళ్ళించటానికి మనసు తొందరించగా.

విశేషం: బృహన్నల కవచాన్ని తలక్రిందులుగా తొడుగుకొంటే, ఉత్తరుడే దానిని స్వయంగా ఆతడికి తొడిగాడు. రాకుమారుడై ఉండి కూడా సారథికి కవచాన్ని తొడగటం ఏమిటి? అనే సందేహానికి - 'ఉత్తరుడి అవసరం అటువంటిదిలే' అని

సర్దుకొనవచ్చును. కాని, కవచాన్నే తొడుక్కొనటం తెలియని బృహన్నల ఎట్లా సారథ్యం చేస్తాడనే అనుమానం కూడా ఉత్తరుడికి రాలేదు. పైగా బృహన్నల, కవచాన్ని తొడుక్కొనే తీరుతో ఆడవాళ్ళని నవ్వించాడు. అందరితోపాటు ఉత్తరుడూ నవ్వుకొనే ఉంటాడు. ఉత్తరుడి మనసంతా 'పసిఁగ్రమ్మఱింప చిడిముడి' (ఆవులను మళ్ళించటానికి తొందర) పడుతూ ఉన్నది. ఆ తొందరలో ఆతడికి ఆ అనుమానం వచ్చిఉండదు. మరి ఈ సన్నివేశాన్ని కవి ఎందుకు చిత్రించినట్లు? దీనికి ఇట్లా సమాధానం చెప్పుకొనవచ్చును?

వికృతమైన ఆకారంవలనా, చేష్టలవలనా హాస్యం పుట్టుతుంది. అర్జునుడు వికృతాకారుడైన బృహన్నలగా ఉన్నాడు. ఆ వికృతత్వానికి తోడు, కవచాన్ని 'ఒఱవలుగా' (తలక్రిందులుగా) తొడుక్కొనడం జరిగింది. అందుకే అక్కడ హాస్యం పుట్టింది. కనుకనే అట్లా జనం నవ్వింది. హాస్యాన్ని పుట్టించటానికే కవి ఇట్లా వర్ణించాడు.

వ. బృహన్నల నవలోకించి. 41

తాత్పర్యం: బృహన్నలను చూచి (ఉత్తరుడు ఇట్లా అన్నాడు.)

క. 'హయములఁ బూన్పుము రథమున, । రయమున సిడమెత్తు; మిపుడ రావలయును గో
చయము గొని, యస్మదీయ వి । జయ మభినందింపఁ బురముజను లెదురుకొనన్.' 42

ప్రతిపదార్థం: హయములన్= గుర్రాలను; రథమునన్= రథానికి; పూన్పుము= కట్టుము; రయమునన్= తొందరగా (వెంటనే); సిడము+ఎత్తుము= జెండాను కట్టుము; అస్మదీయ= మాదైన; విజయము= విజయాన్ని; అభినందింపన్= పొగడటానికి; పురము జనులు= పట్టణంలో ఉన్న ప్రజలు; ఎదురుకొనన్= ఎదురువచ్చేటట్లు; గోచయము= ఆవులమందను; కొని= తోలుకొని; ఇపుడు+అ= ఇప్పుడే (ఏమాత్రం ఆలస్యం లేకుండా); రావలయును= తిరిగిరావాలి.

తాత్పర్యం: 'రథానికి గుర్రాలను కట్టుము. తొందరగా ధ్వజాన్ని నిలుపుము. పౌరులందరూ నా విజయాన్ని పొగడి స్వాగతం చెప్పేవిధంగా వెంటనే ఆవులను తోలుకొని రావాలి'.

విశేషం: పురజనులంతా తన విజయాన్ని ప్రశంసిస్తూ, మందను మళ్ళించుకొని వచ్చినందుకు స్వాగతం చెప్పాలని అనుకొనటం ఉత్తరుడి శక్తికి మించిన పనే అయినా, అప్పటికి అది ఆతడికి తెలియదు కనుక, అట్లా అనుకొనటమే ఉచితం. అట్లా అనుకొనటంలో, ఆతడి పనితొందరా, ఆసక్తి, ఆశయం తెలుస్తాయి. అంతే కాదు, అది భావిశుభసూచనం, శుభశకునం కూడా.

తే. అనిన 'నీ వేమి పనిచిన నట్ల చేయ । వలయు; నీ వున్నయెడ నుండవలయు; నీవు
సన్న దెసఁ జనవలయు; నా శక్తి యెఱిఁగి । పంచి పనిగొని కడిమిమైఁ బగఱ గెలుము.' 43

ప్రతిపదార్థం: అనినన్= అనగా (పైవిధంగా ఉత్తరుడు అనగా దానికి బృహన్నల); నీవు= నీవు; ఏమి= దేనిని; పనిచినన్= నియమిస్తే; అట్లు+అ= అట్లాగే; చేయవలయున్= చెయ్యాలి; నీవు+ఉన్న+ఎడన్= నీవు ఉండేచోటనే (నీవు ఎక్కడుంటే అక్కడ); ఉండవలయున్= ఉండాలి; నీవు= నీవు; చన్నదెసన్= పోయిన పక్కకు; చనవలయున్= (నేనూ) పోవాలి; నా= నా యొక్క; శక్తి= సామర్థ్యాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; పంచి= ఆజ్ఞాపించి; పనిగొని= పనిచేయించుకొని; కడిమిమైన్= పరాక్రమంతో; పగఱన్= పగవాళ్ళను; గెలుము= గెలవవలసింది.

తాత్పర్యం: ఉత్తరుడి మాటలకు బృహన్నల ఇట్లా అన్నాడు: 'నీ వేమి చెప్పితే అదే చేయాలి; నీ ఉండేచోటనే ఉండాలి. నీవు పోయిన చోటికే పోవాలి. నా శక్తి ఎంతో తెలిసికొని నన్ను నియమించి నాతో పనిచేయించుకొని పగవాళ్ళను జయించుము.'

విశేషం: నీ వేమి పనిచిన-చనవలయు-అనే మాటలలో, సారథిగా తాను ఎట్లా ఉండాలో బృహన్నల చెప్పుకొన్నాడు. పైకి వినయంగా చెప్పుకొన్నట్లున్నా, లోతుగా చూస్తే బృహన్నల మాటలలో హేళన కూడా ఉన్నట్లు తోస్తుంది. నీవు ఒంటిగా యుద్ధానికి పోలేవనీ, నే నుంటేనే నీకు విజయం కలుగుతుందని కూడా బృహన్నల మాటలలో ధ్వనిస్తుంది. 'నా శక్తి యెఱింగి', అనటంలో, తనశక్తికి మించకుండా ఏవైనా పనులు చేయడానికి ఆజ్ఞాపించుమని, మామూలుగా పైకి కనిపించే అర్థం. ఇందులో నిగూఢం అయిన అర్థం కూడా ఉన్నది. నా శక్తిని గమనించి, నేను ఎంతటివాడినో తెలిసికొనగలిగితే, నీకు విజయం తప్పక కలుగుతుందనీ అర్థమే! నా విషయంలో జాగ్రత్త అని కూడా ధ్వని.

వ. అని పలుకుచు మనంబున ముదం బొదవ నా ధనంజయుండు. 44

ప్రతిపదార్థం: అని పలుకుచున్= అని అంటూ; మనంబునన్= హృదయంలో; ముదంబు+ఒదవన్= సంతోషం కూడగా; ఆ ధనంజయుండు= ఆ అర్జునుడు.

తాత్పర్యం: పై విధంగా అంటూ, మనస్సులో సంతోషం కలుగగా ఆ అర్జునుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇన్నాళ్ళుగా కౌరవులమీద నున్న కసి తీర్చుకొనటానికి కొంతవరకైనా అవకాశం చిక్కింది కదా అని అర్జునుడికి సంతోషం కలిగింది. అదీ మనసులోనే; పైకి కనిపించదు.

క. కాంచనమాలాలంకృత । చంచత్తను లీల మెఱయ జవనాశ్వములం
బూంచి రథంబున మణిమయ । పంచాననకేతు వెత్తె బంధుర భంగిన్. 45

ప్రతిపదార్థం: కాంచన= బంగారంతో చేయబడ్డ; మాలా= దండలతో; అలంకృత= అలంకరించబడ్డ; చంచత్= ప్రకాశించే; తను= శరీరంయొక్క; లీల= విలాసం; మెఱయన్= శోభిల్లుతున్న; జవన+అశ్వములన్= వేగంగా పోయే గుర్రాలను; రథంబునన్= రథానికి; పూంచి= కట్టి; బంధుర= దట్టమైన; భంగిన్= పద్ధతిలో; మణిమయ= మణులతో నిండిన (మణులను పొదిగిన); పంచానన= సింహం ఆకారంలోఉన్న; (వెడల్పుగల మొగం ఉండేది కనుక, సింహానికి పంచాననం అనే పేరు వచ్చింది); కేతువు= జెండాను; ఎత్తెన్= పైకెత్తి కట్టాడు (ఎగురవేశాడు).

తాత్పర్యం: బంగారు దండలు వేయటంవలన మెరిసిపోయే వేగవంతాలైన జాతిగుర్రాలను రథానికి కట్టి, నవరత్నాలు పొదిగిన సింహకేతనాన్ని రథానికి కట్టాడు.

విశేషం: వీరులకు యుద్ధానికి పోవటమంటే పెళ్ళికి పోవటమే. అందుకే అలంకరించుకొంటారు. అట్లాగే రథాన్నీ, గుర్రాలనూ, ఏనుగులనూ రకరకాలైన మణులు పొదిగిన ఆభరణాలతో అలంకరిస్తారు. ఆ పద్ధతే ఇప్పుడు ఆవులనూ, ఎద్దులనూ పట్టెడలతో అలంకరించటంలో ఉన్నది.

వ. ఇట్లు సన్నాహంబు మెఱసిన సారథిం జూచి యుత్తరయుం జెలులు నిట్లనిరి. 46

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సన్నాహంబు మెఱసిన= యుద్ధానికి సిద్ధంగాఉన్న; సారథిన్+చూచి; ఉత్తరయున్, చెలులున్= ఉత్తరా, ఆమె చెలికత్తెలూ; ఇట్లు+అనిరి= ఇట్లా పలికారు.

తాత్పర్యం: ఈ రకంగా యుద్ధానికి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్న సారథి అయిన బృహన్నలను చూచి ఉత్తరా, ఆమె చెలికత్తెలూ ఇట్లా అన్నారు.

క. 'కురువీరుల గెలిచి తదం । బరములలోఁ జిత్రవర్ణ భాసురములుగాఁ
దర మెఱిఁగి లోచనోత్సవ । కరములుగా బొమ్మపొత్తికలకుం దెండీ.' 47

ప్రతిపదార్థం: కురువీరులన్= కౌరవవీరులను; గెలిచి= జయించి; తద్+అంబరములలోన్= వారు ధరించిన గుడ్డలలో (తలపాగాలలో); చిత్రవర్ణభాసురములు+కాన్= రంగురంగులు వెలుగొందేవిగా; తరము+ఎఱిఁగి= వాసిని తెలిసికొని (నాణ్యతను గుర్తించి); లోచన+ఉత్సవకరములుగాన్= కంటికింపుగా ఉండే (వస్త్రాలను); బొమ్మపొత్తికలకున్= బొమ్మలకు కట్టే గుడ్డలకొరకు; తెండీ= తీసుకొనిరండి.

తాత్పర్యం: 'కురువీరులను జయించి, వాళ్ళ తలపాగాలలో రంగురంగులతో వెలుగొందేవాటినీ, కన్నులపండుగగా ఉండేవాటినీ, వాసి తెలిసి, బొమ్మపొత్తికలకు తీసికొని రండి.'

విశేషం: చిన్న పిల్లలు ఆడుకొనే తాటాకు, కొయ్య, లక్క మొ॥ బొమ్మలకు కట్టే రంగురంగు గుడ్డలను బొమ్మపొత్తికలు అంటారు. ఇవి పట్టు. ఉన్ని, నూలు మొదలైన రకరకాల గుడ్డలు. ఘనమైన కురువీరుల తలపాగాలు విలువైనవిగా, అందమైనవిగా ఉంటాయి. కనుకనే ఉత్తర మొదలైన బాలికలు వాటిని అపురూపమైనవిగా అనుకొనటంవలన వాటిని తెమ్మని చెప్పారు. లోకోత్తర వీరులైన కౌరవుల తలపాగాలను కేవలం బొమ్మపొత్తికలకై తెమ్మనటం ఎంతో గొప్ప అనీ, అదీ తన అన్నచేత తెప్పించుకొనటం ఆతడి పరాక్రమానికి ఒక గుర్తుగా ఉంటుందనీ ఉత్తర భావించింది.

క. అనుడు బృహన్నల యిట్లను, । 'జనపాలకనందనుండు జయలక్ష్మిం జే
కొనునటె! చీరలు దెచ్చుట । పనియే! యటు సూడుఁ, డెల్ల భంగులఁ దెత్తున్.' 48

ప్రతిపదార్థం: అనుడున్= (ఉత్తరా, చెలికత్తెలూ పైవిధంగా) చెప్పగానే; బృహన్నల; ఇట్లు+అను= ఇట్లా అన్నాడు; జనపాలక నందనుండు= రాకుమారుడు అయిన ఉత్తరుడు; జయలక్ష్మిన్= విజయం అనే లక్ష్మిని; చేకొనును+అటె!= చేపడతాడట!; చీరలు= వస్త్రాలు (బొమ్మపొత్తికలు); తెచ్చుట= తీసికొనిరావటం; పనియే?= అదొక పెద్దపనా?; అటు+చూడుఁడు= అట్లే చూస్తూఉండండి (క్షణంలో); ఎల్లభంగులన్= ఎట్లాగైనా; తెత్తున్= తెస్తాను.

తాత్పర్యం: ఉత్తరా, చెలికత్తెలూ పైవిధంగా అన్నదానికి బృహన్నల ఇట్లా అన్నాడు- 'రాకుమారుడు విజయలక్ష్మిని చేపడతాడట! బొమ్మపొత్తికలు తేవటం అంత పెద్దపనా? అట్లాగే చూస్తూ ఉండండి, చిటికెలో వాటిని తప్పక తీసికొని వస్తాను'.

విశేషం: తలపాగాలను కోసి తీసికొనిరావటం అంటే వాళ్ళతలలను తెచ్చినట్లే! వీరుడికి తలపాగా చాలా విలువైనది. అట్లాగే, రథానికి కేతనం (జెండా) కూడా అట్లాంటిదే. జెండా కూలడమంటే ఆ వీరుడు కూలడమే! అందుకే ఉత్తర కురువీరుల తలపాగాలను తెమ్మన్నది. 'రాకుమారుడైన ఉత్తరుడు జయలక్ష్మిని చేపడతాడట. నేను చీరలను తేవటం ఎంత?' అని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనటంలో బృహన్నలలోని పరిహాసకుశలత కనబడుతుంది. ఇందులో రాకుమారుడు జయం పొందేమాట ఎట్లా ఉన్నా (యుద్ధం చేసే విషయం), తాను కౌరవుల వస్త్రాలను తెస్తాననే సూచన కూడా ఉన్నది.

వ. అనుచు ధనుస్తూణీర కృపాణ ముద్గరాది వివిధ సాధనంబులు రథంబుపైఁ బదిలంబుగా నిడి నొగలెక్కి పగ్గంబుల స్రుక్కుసక్కంజేయ, నుత్తరుండును బసులం బట్టిన దెస గోపాలకు నడిగిన, వాఁడు పితృవణంబువలనని చెప్పిన వినుచు, రథారోహణంబు సేసి, వెడలి, పౌరవృద్ధ పుణ్యాంగనా భూసుర సమూహంబులు బృహన్నలం జూచి 'తొల్లి ఖాండవ దహనంబున నర్జునునకు నీ కతంబున నయిన మాంగల్యం బెట్టి దట్టిద భవత్సాహాయ్యంబున భూమింజయున కయ్యెడు' మని దీవించి సేసలు సల్లం బురంబు నిర్గమించి, నిరర్గళపరాక్రముం డయిన యా ఫల్గును నైపుణంబున వల్గ దశ్వంబగు రథంబు రయంబునకు మెచ్చుచుం బరేతనిలయ ప్రాంత ప్రదేశంబు సేరం జని. 49

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; ధనుస్+తూణీర కృపాణ ముద్గర+ఆది= విల్లు, అమ్ములపొది, కత్తి, ఇనుపగుదియ మొదలైన; వివిధ= అనేకరకాలైన; సాధనంబులు= యుద్ధానికి అవసరమైన పరికరాలు; రథంబుపైన్= రథంమీద; పదిలంబుగాన్= భద్రంగా; ఇడి= ఉంచి; నొగలు= సారథి కూర్చుండే తొట్టివలె ఉండేచోటు; ఎక్కి; పగ్గంబుల= పగ్గాల; స్రుక్కు= చిక్కుముడి; చక్కన్+చేయన్= సరిజేయగా(విప్పగా); ఉత్తరుండును; పసులన్+పట్టిన దెస= గోగ్రహణం జరిగిన దిక్కుఏది అని; గోపాలకున్+అడిగినన్= ఆవుల కాపరిని (అధికారిని) ప్రశ్నించగా; పితృవణంబు, వలను+అని= శ్మశానం ఉండే దిక్కు-అంటే ఉత్తర దిక్కు అని; చెప్పినన్= చెప్పగా; వినుచున్= వింటూ; రథ+ఆరోహణంబు+చేసి= రథాన్ని ఎక్కటంచేసి; వెడలి= బయలుదేరి; పౌర= పురజనులు (పౌరులు); వృద్ధ= వృద్ధులు; పుణ్య+అంగనా= ముత్తైదువులు; భూసుర= బ్రాహ్మణులయొక్క; సమూహంబులు= గుంపులు (మొత్తాలు); బృహన్నలన్+చూచి= బృహన్నలను చూచి; తొల్లి= పూర్వం; నీకతంబునన్= నీవు కారణంగా; ఖాండవదహనంబునన్= ఖాండవవనాన్ని కాల్చినప్పుడు; అర్జునునకున్; అయిన= కలిగిన; మాంగల్యంబు= శుభం; ఎట్టిది+అట్టిది+అ= ఎట్లాంటిదో అట్లాంటిదే; భవత్+సాహాయ్యంబునన్= నీ యొక్క సహాయంతో; భూమింజయునకున్= ఉత్తరుడికి; అయ్యెడు+అని= అవుతుంది అని; దీవించి= ఆశీర్వదించి; సేసలు= అక్షతలు; చల్లన్= చల్లగా; పురంబు= నగరం; నిర్గమించి= దాటి బయటికివచ్చి; నిరర్గళ= అడ్డులేని; పరాక్రముండు+అయిన= పరాక్రమం కలవాడయిన; ఆ, ఫల్గును, నైపుణంబునన్= ఆ అర్జునుడి నేర్పరితనం వలన; వల్గత్+అశ్వంబు= ముందుకు ఉరికే గుర్రాలతో కూడింది; అయిన; రథంబు, రయంబునకున్= రథంయొక్కవేగానికి; మెచ్చుచున్= పొగడుతూ; పరేతనిలయ= శ్మశానంయొక్క; ప్రాంత= సమీపంలోఉన్న; ప్రదేశంబు= చోటు (తావు); చేరన్+చని= సమీపించి.

తాత్పర్యం: పై విధంగా ఉత్తరతో, చెలికత్తెలతో చెప్తుతూ, బృహన్నల విండ్లను, అమ్ములపొదులనూ, కత్తులనూ, ఇనుపగుదియలు మొదలైన ఎన్నో ఆయుధాలను రథంలో పెట్టి, నొగలపై కూర్చొని, పగ్గాల చిక్కుముడులను విడదీశాడు. ఆ లోపల ఉత్తరుడు పశువులను కౌరవులు ఏ దిక్కులో పట్టుకొన్నారని గోపాలకులపెద్ద ద్వారా తెలిసికొని, శ్మశానంవైపుగా బయలుదేరాడు. పురజనులు, పెద్దలు, ముత్తైదువలు, బ్రాహ్మణులు బృహన్నలను చూస్తూ 'ఇంతకు ముందు ఖాండవాన్ని దహించేటప్పుడు నీ వలన అర్జునుడికి ఏ శుభం కలిగిందో, అట్లాంటి శుభమే ఇప్పుడు కూడా నీవలన ఉత్తరుడికి కలగాలి' అని దీవిస్తూ, అక్షతలు చల్లారు. ఉత్తరుడు నగరాన్ని దాటి, బృహన్నల సారథ్యనైపుణ్యంతో కూడిన రథవేగాన్ని పొగడుతూ, శ్మశానానికి సమీపంగాఉన్న చోటుకు చేరి. (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **అభినవ జలధర శ్యామంబు లగునెడ । లాకు జొంపంబుల ననుకరింప,**
సాంధ్యరాగోపమచ్ఛాయంబులగు పట్లు । కిసలయోత్కరములఁ గ్రేణి సేయ,
రాజమరాళ గౌరములగు చోటులు । తఱచుఁ బూఁ బొదల చందంబు నొంద,
హారిద్రరుచి సమానాకృతులగు తావు । లడరెడు పుప్పొడులట్లు మెఱయఁ,

తే. **గలయ నెగసి ధరాధూళి లలితవనము । దివికి నలిఁగాఁపు వోయెడు తెఱఁగు దాల్ప**
గోగణము ముంగలిగ నేల గోడివడఁగ । నడచు కౌరవరాజు సైన్యంబుఁ గనియె. 50

ప్రతిపదార్థం: (ముందుకు సాగిపోతున్న కౌరవుల మహాసైన్యాన్ని ఒక ఉద్యానవనంతో పోల్చి తిక్కన మహాకవి ఈ పద్యంలో రమణీయంగా వర్ణించాడు.) అభినవ= క్రొత్తదైన; జలధర= మేఘంవలె (జలాన్ని ధరించింది కనుక మేఘం అని భావం); శ్యామంబులు+అగు= నల్లనైన; ఎడలు= తావులు; ఆకుజొంపంబులన్= ఆకుల గుబురులను; అనుకరింపన్= అనుసరించగా (పోలినాయి అని భావం); సాంధ్యరాగ+ఉపమచ్ఛాయంబులు+అగుపట్లు= సాయంకాలపు ఎరుపురంగుతో పోల్చదగిన కాంతిగల తావులు; కిసలయ+ఉత్కరములన్= చిగుళ్ళ మొత్తములను; శ్రేణి+చేయన్= గేలిచేయగా; రాజమరాళ= రాజహంసలవలె; గౌరములు+అగు= తలుపైన; చోటులు= స్థలాలు; తఱచు= దట్టమైన (అరుదైన); పూ+పొదలచందంబున్+ఒందన్= పూలపొదరిళ్ళవలె ఉండగా; హారిద్ర= పసుపుపచ్చరంగుయొక్క; రుచి= కాంతితో; సమాన+ఆకృతులు+అగు= సమానమైన ఆకారం ఉన్న; తావులు= ప్రదేశాలు: అడరెడు= వ్యాపించే; పుప్పొడులట్లు= పుప్పొళ్ళవలె; మెఱయన్= శోభిల్లగా; కలయన్+ఎగసి= కలిసి పైకి ఎగిరి; ధరా= నేలపైఉన్న; ధూళి= దుమ్ము (అనే పుప్పొడి); లలితవనము= రమణీయం అయిన ఒక ఉద్యానవనం; దివికిన్= స్వర్గలోకానికి; నలిన్= మెల్ల మెల్లగా (క్రమంగా); కాఁపు+పోయెడు= వలసపోతున్న; తెఱఁగు+తాల్పన్= రీతిగా ఉండగా; గోగణము= ఆవులమందకు; ముంగలిగన్= ముందర ఉన్న; నేల= భూమి; గోడి+పడఁగన్= క్రుంగిపోగా; నడచు= నడుస్తున్న; కౌరవరాజు= కురురాజైన దుర్యోధనుడియొక్క; సైన్యంబున్= సేనను; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: ఆవులమంద వెనకాల వెళుతున్న కురుసైన్యాన్ని ఉత్తరుడు కనుగొన్నాడు. ఆ మహాసైన్యం నడుస్తూవుండగా లేచిన రంగురంగుల ధూళి అందమైన ఉద్యానవనంవలె ఉండి స్వర్గలోకానికి వలసపోతున్నదేమో అనేటట్లు అలరారింది. సైన్యం పోతూ ఉన్నప్పుడు రేగిన దుమ్ము రంగురంగుల ప్రదేశాలమీదుగా పైకిలేస్తూ ఉన్నది. మేఘంవలె ఉన్న నల్లటి ప్రదేశాలనుండి లేచిన దుమ్ము ఆకుగుబుర్లవలె ఉన్నది. సాయంకాలపు ఎఱుపువలె ఎర్రగా ఉండే తావులనుంచి లేచిన దుమ్ము చిగుళ్ళ గుంపులవలె ఉన్నది. రాయంచలవలె ఉన్న తెల్లటి తావులమీదుగా లేచిన ధూళి, గుబురైన పూలపొదరిళ్ళవలె ఉన్నది. పసుపుపచ్చని తావులలో లేచిన దుమ్ము అలా కలిసి పైకెగసిన ఆ ధూళియొక్క దృశ్యం వెరసి పుప్పొడివలె ఉన్నది. ఒక ఉద్యానవనం స్వర్గలోకానికి వలసపోతూ ఉన్నట్లుంది. ఆ సైన్యం నడుస్తూ ఉంటే ముందున్న నేల కుంగిపోతున్నట్లుగా ఉన్నది. అట్లా ఉన్న మహాసైన్యాన్ని ఉత్తరుడు చూచాడు.

విశేషం: 1. 'నానారసాభ్యుదయోల్లాసి విరాటపర్వ' మనే ప్రశంసకు దోహదకారి అయిన సన్నివేశాలలో ఇది ఒకటి. ఉత్తరుడిలో ఉత్సాహం ఉరకలెత్తుతున్నది. ఆ స్థానంలో భయం పరవళ్ళుత్రొక్కే సన్నివేశం ఇక్కడ మొదలు కావాలి. అందుకు ఉత్సాహప్రేరకమైన విభావం భయానకంగా భావించబడాలి. ఈ ఘట్టంలో ఒక యుద్ధవీరుడు సైన్యాన్ని వీరదృష్టితో చూడాలి. అతడు వీరుడు కాకపోతే భీరదృష్టితో చూస్తాడు. కాని, ఆ రెండు దృష్టులకూ ఎదుట నిలిచే విభావం ఒకటిగానే ఉండాలి.ఇది రసశిల్పం. ఇక్కడ మూలచిత్రణం ఒక తీరుగా ఉన్నది. తిక్కన తీర్చిన తీరు మరొక రకంగా ఉన్నది. మూలంలో సైన్యం, దానివలన రేగిన దుమ్ము-అనే రెండంశాలు విడిగా వర్ణించబడ్డాయి.

శ్లో. "తదనీకం మహత్ తేషాం విబభౌ సాగరోపమమ్,
సర్పమాణ మివాకాశే వనం బహులపాదపమ్.
దదృశే పార్థివో రేణుర్జనితస్తేన సర్వతా,
దృష్టిప్రణాశో భూతానాం దివస్పృక్ కురుసత్తమ॥ (4-36-18)

ఆ మహాసైన్యం మొదట సముద్రంవలె కనపడింది. ఆ తరువాత దట్టమైన చెట్లతో కూడుకొన్న అడవి ఆకాశం వైపు ప్రాకుతున్నట్లు తోచింది. ఇది అత్యంత సుందరమైన ఉపమానం. అలలతో కదులుతున్నా అనంతంగా కనపడేది సముద్రం. ఇది సేనయొక్క బాహుళ్యాన్ని చెప్పేది. అయితే అది ముందుకు సాగుతున్నది. ఉత్తరుడు వెనుకనుండి చూచాడు. అనంతమైన సముద్రం ఆకాశాన్ని ముద్దుపెట్టుకొన్నట్లే ఉంటుంది. అయితే చతురంగసేన ఎత్తుపల్లాలుగా ఉండటంచేత పరిశీలించి చూస్తే అది సముద్రంగానే కాక, నడుస్తున్న అరణ్యంవలె ఉన్నది. అది ఆకాశంవైపు ప్రాకుతూ వెళ్ళుతున్నట్లుండటం సహజం. ఈ ఉపమానం సేనకు సంబంధించింది. మూలంలో దుమ్ముకూడా వర్ణించబడింది. ఆ దుమ్ము చూచేవారి దృష్టిని క్రమ్మివేస్తున్నది (నాశనం చేస్తున్నది). ఆకాశందాకా వ్యాపిస్తున్నది. మూలంలో దుమ్మును చూచి సైన్యాన్ని భావనం చేసిన తీరులేదు. సైన్యం కలిగించినంతగా దుమ్ము ఒక భావనను రేకెత్తించలేదు. మూలంలో సైన్యదర్శనానికున్న ప్రాముఖ్యం దుమ్ముకు లేదు. మూలంలో తిక్కన గమనించిన అంశం ఒకటి ఉన్నది. దృష్టినాశం చేయగలిగినంతటి దుమ్ము నిజంగా భూమ్యాకాశాలు వ్యాపించి ఉంటే సైన్యం కనపడుతుందా? దుమ్మే కనపడుతుందా? దుమ్మును చూచి సైన్యాన్ని ఊహించుకొనాలా? లేక, సైన్యాన్నీ దుమ్మునూ చూచినట్లు వర్ణించాలా? అన్న ప్రశ్న ఏర్పడుతుంది. తిక్కన దుమ్మును చూచి భయపడి, అంతభయానకమైన దుమ్మును రేపిన మహాసైన్య మహత్త్వాన్ని ధ్వనిమయంగా భావించి, ఆ తరువాత దర్శించి ఉత్తరుడు భయపడినట్లు చిత్రించి సహజశిల్పాన్ని ప్రదర్శించాడు. మూలంకంటే తన రచనను శిల్పసుందరం చేశాడు. అందువలన తెలుగులో సేన ముందు కనపడదు. సముద్రోపమానం వినపడదు. చెట్లతో కూడుకొన్న అడవి మూలంలో సైన్యం. తెలుగు దుమ్మే ఆ అడవిగా ఉత్ప్రేక్షించబడింది. ఆకాశానికి ఎగురుతున్న దుమ్మే తిక్కనలో వర్ణ్యవస్తువై నిలిచింది. దుమ్ము సైన్యానికి వ్యంజకమైన ద్రవ్యం. దుమ్ము వెనుక ఉన్న సైన్యం కనపడినా అది అలంకార ధ్వనిచే మరింత ఆస్వాదయోగ్యమౌతున్నది. దుమ్ము సైన్యగర్వచిహ్నం. తెలుగులో దివికి పోయేది దుమ్మే. సైన్యం కాదు. ఇది వస్తుధ్వని. మూలంకంటె ఇది సూక్ష్మతరం.

2. అలం: సీసపద్యపాదాలలో సర్వవస్తుమయ- ఉపమ; ఎత్తుగీతిలో-ఉత్ప్రేక్ష. క్రొక్కారు మేఘాలవలె నల్లగా ఉన్న దుమ్ము వనంలోని చెట్ల ఆకుల గుంపులను అనుకరిస్తున్నదట! సాంధ్యారుణచ్ఛాయలలో ఉన్న దుమ్ము చిగురాకులతో పోలి ఉన్నదట! రాజహంసలవలె తెల్లగా ఉన్న ధూళి పూపొదరిళ్ళవలె ఉన్నదట! పసుపురంగువన్నెతో ఉన్న దుమ్ము పుప్పొడివలె మెరిసిపోయిందట! ఇవన్నీ కలిసి ఎగిరితే నేలదుమ్ము అనే ఉద్యానవనం ఆకాశానికి వలసపోతున్నదా అన్నట్లు ఉన్నదట! ఉత్సాహం నుండి భయపరిణామానికి అనువైన అలంకారధ్వనిని కలిగిస్తుంది. ఈ విధంగా అలంకార ధ్వనిని రసధ్వనికి పోషకంగా నిబంధించటం రసాభ్యుదయ శిల్పం.

3. రంగంమీద ఇరువురు వీరులున్నారు, 1. అర్జునుడు, 2. ఉత్తరుడు. ఆ దృశ్యాన్ని అర్జునుడు వీరుడివలె దర్శించి ఉత్సాహాన్ని పొందుతాడు. అర్జునుడి పరాక్రమ ప్రభావంచేత ఆ సేన నిజంగా స్వర్గానికి పోయేటట్లు ఉన్నదని ధ్వని. ఉత్తరుడు భీరునివలె చూచాడు. అతడి కది భయానక విభావంవలె గోచరిస్తుంది. విభిన్న రసాల విశిష్ట వివేచనాన్ని అందించే అందమైన విభావచిత్రణ. ఇందులోని సేనను తిక్కనభాషలో చెప్పాలంటే భీకర రమణీయం. ఉత్తరుడికి భీకరం. అర్జునుడికి రమణీయం. సహృదయులకు భీకర రమణీయం.

4. తిక్కన అలంకార శిల్పం భావనాగంభీరం. లలితవనం దివికి వలసపోతున్నదో అన్నట్లున్నది. దివికి పోయే వనం కొమ్మలపైకి ఉండి వేళ్ళు క్రిందకు ఉండేటట్లు వెళ్ళుతుందా? కొమ్మలు క్రిందకు ఉండి వేళ్ళు పైకి ఉన్నట్లుగా వెళ్ళుతుందా?

అనే మీ మాంస వస్తుంది. తిక్కన కల్పవృక్షం వలెనే ఈ వనాన్ని భావనం చేశాడు. తలక్రిందులై మూలాలు దివివైపు ఉన్నాయి. చెట్ల కొమ్మలు భువివైపు ఉన్నాయి. అందుకే మనకు కనపడేవి క్రమంగా ఆకులూ, చిగుళ్ళూ, పూలూ, పుప్పొడులూ మాత్రమే. కొమ్మలూ, మొదలూ, వేళ్ళూ కనపడవు. దివికి వలసపోయే వనాన్ని సర్వవస్తు విషయ సమగ్రంగా ఉపమించటం కవిబ్రహ్మకే సాధ్యం. తిక్కన శిల్పపు తెనుగుతోటలో మెరిసే దివ్య లలితవనం ఈ పద్యం!

5. 'దివికి నరిగాఁపు వోయెడు' - అనే పాఠం కొన్ని ప్రతులలో ఉన్నది. (సంపా.)

ఉత్తరుఁడు కురుసైన్యంబు గనుంగొని భయభ్రాంతుం డగుట (సం. 4-36-8)

క. **కని యుత్తరుండు గరుపా । టీన మేనును, దలఁకు మనము, టిచ్చవడిన చూ**
పును నై, తొట్రుపడుచు, ని । ట్లనియె, దిగులు సొచ్చి యా బృహన్నలతోడన్. **51**

ప్రతిపదార్థం: కని= (ఉద్యానవనంవలె నడుస్తున్న) కురుసేనను చూచి; ఉత్తరుండు; గరుపాటీన= గగుర్పాటుచెందిన; మేనును= శరీరమూ; తలఁకు మనమున్= (భయంతో) చలించే మనస్సూ; టిచ్చవడిన= తెల్లబోయిన; చూపును= చూపూ; ఐ= అయి; తొట్రు+పడుచున్= తడబడుతూ; దిగులు+చొచ్చి= దిగులుపడి; ఆ బృహన్నలతోడన్= సారథిగా ఉన్న ఆ బృహన్నలతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఉత్తరుడు కురుసేనను చూచి, గగుర్పాటుతోకూడిన దేహంతో, చలించిపోయే మనస్సుతో, నిలిచిపోయిన చూపుతో, తొట్రుపాటుతో, దిగులుతో తన సారథి అయిన బృహన్నలతో ఇట్లా అన్నాడు.

విశేషం: ఉత్తరుడికి మొదట మనస్సులో కలిగిన భయంవలన చూపులలో, దేహంలో వికారం కలిగింది. పైన చెప్పిన మానసిక, శారీరక సంబంధాలైన వికారాలు, భయానకరసాన్ని స్పష్టంచేశాయి. ఇందులో, ఉత్తరుడికి కలిగిన, మానసిక, శారీరకమైన భయభ్రాంతభావాన్ని తిక్కన చిత్రించాడు. ఈ భయానికి కారణాలను ఉత్తరుడు తరువాతి పద్యాలలో చెప్పాడు.

శా. **'భీష్మద్రోణ కృపాది ధన్వినికరాభీలంబు, దుర్యోధన**
గ్రీష్మాదిత్య పటుప్రతాప విసరాకీర్ణంబు, శస్త్రాస్త్ర జా
లోష్మస్ఫార చతుర్విధోజ్జ్వల బలాత్యుగ్రం బుదగ్రధ్వజా
ర్చిష్మత్త్వాకలితంబు సైన్య మిది యేఁ జేరంగ శక్తుండనే? **52**

ప్రతిపదార్థం: భీష్మ= భీష్ముడూ; ద్రోణ= ద్రోణాచార్యుడూ; కృప= కృపాచార్యుడూ; ఆది= మొదలుగాగల; ధన్వి= విలుకాండ్ర యొక్క; నికర= సమూహంతో; ఆభీలంబు= భయాన్ని కలిగించేది; దుర్యోధన= దుర్యోధనుడు అనే; గ్రీష్మ+ఆదిత్య= ఎండాకాలపు సూర్యుడియొక్క; పటు= తీవ్రమైన; ప్రతాప= తేజస్సుయొక్క; విసర= ప్రసారంతో; ఆకీర్ణంబు= విస్తరించిందీ; శస్త్ర= శస్త్రాలయొక్క (మానవులు తయారుచేసినవి); అస్త్ర= అస్త్రాలయొక్క (మంత్రాలతో ప్రయోగించేవి); జాల= మొత్తం (అనే); ఊష్మ= తాపంయొక్క; స్ఫార= విస్తరించటం ఉన్న; చతుర్విధ= నాలుగు రకాలైన; ఉజ్జ్వల= కాంతిమంతమైన; బల= సైన్యంతో; అతి+ఉగ్రంబు= ఎక్కువ భయాన్ని కలిగించేదీ; ఉదగ్ర= పైకి ఎత్తబడ్డ; ధ్వజ= జెండాలు అనే; అర్చిష్మత్త్వ= అగ్నిశిఖలతో; ఆకలితంబు= బాగా కూడుకొన్నట్టిదీ (అయిన); సైన్యము+ఇది= ఈ సైన్యం; ఏన్= నేను; చేరంగన్= చేరటానికి (దాని దగ్గరికి పోవటానికి); శక్తుండనే?= శక్తి ఉన్నవాడినా? (తగినవాడినా?).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'భీష్ముడూ, ద్రోణుడూ, కృపుడూ మొదలైన మహావీరులతో ఈ సైన్యం చాలా భయంకరంగా ఉన్నది. దుర్యోధనుడు అనే వేసవికాలపు సూర్యుడి తాపంతో తీవ్రంగానూ, శస్త్రాస్త్రాలు అనే వేడిమి వ్యాపించింది గానూ, రథ, గజ, తురగ, పదాతులు అనే చతురంగ బలాలతో ఉగ్రంగానూ ఉన్నది. రథాలకు పైన కట్టిన జెండాల రెపరెపలు అగ్నిదేవుడు తన నాలుకలను అల్లార్చుతున్నట్లున్నాయి. అంత భయంకరమైన సైన్యాన్ని నేను చేరగలనా? (అంటే చేరలేనని భావం).

విశేషం: 1. అలం: రూపకం. తిక్కన విరాటపర్వంలో రచించిన గొప్ప పద్యాలలో ఇది ఒకటి.

2. ఈ పద్య రచనా శిల్పాన్ని గురించి, సందర్భౌచిత్యాన్ని గురించి, రసనిర్వహణ ప్రౌఢిని గురించి, నాటకీయతను గురించి డాక్టర్ పాటిబండ మాధవశర్మగారి వ్యాఖ్య గమనించదగింది.

"రూపక దిదృక్షువై ప్రేక్షాగృహమునం దాసీనుడై చిత్రవర్ణ రమణీయమైన యవనికను దిలకించుచు తద్రామణీయక పరవశుడై వినోదించుచున్న సామాజికుడు ఆకస్మిక యవనికా తిరస్కరణమున ప్రత్యక్షమైన భయంకర దృశ్యమును దిలకించి యెట్టి యనుభవములు పొందునో ఈ సన్నివేశము నిరూపించుచున్నది. లలిత వనరూపమైన యవనిక ప్రదర్శింపబడనున్న రూపకము శృంగారరస ప్రధానమన్న సూచన చేయును. తీవ్ర రసాస్వాదనానుకూల సుకుమార మధురచిత్తవృత్తిని సామాజికునియందు ఉన్నిద్రము చేయును. యవనికాపసర్పణమున శృంగార వ్యంజక దృశ్యము సామాజికునకు ఇష్టము. భయానకదృశ్య ప్రత్యక్షముచే రసభంగమై సామాజికుని చిత్తము ఉద్విగ్నమగును.

ఈ ఘట్టమున ఉత్తరుడు తనకు దాను సామాజిక స్థానీయుడు. సామాజికునకు నటస్థానీయుడు. ప్రకృతిభీరువయ్యు కృతక ధీరతతో బయలుదేరిన ఉత్తరునకు తానేదో చూడబోవుచున్నట్లు లేదు. ఆ చూడబోవునదియు వినోదప్రాయమే యని యాతని భావన. ధూళితెర తొలగినప్పటికి వాని భ్రాంతి తొలగినది. అచింతితోపనతమైన భయంకర దృశ్యము అతని చిత్తమందలి సుకుమార మధురవృత్తిని భంజించి పరుషదీప్తవృత్తిని ప్రవేశపెట్టినది. ఆకస్మికమైన అతని భయావేశము చిత్తమున వర్తించి సూటిగా గాత్రమున ప్రవర్తించినది. అటుపిమ్మటగాని వాగ్రూపమున ప్రవర్తింపలేదు.

ఆకస్మిక కురుసేనా దర్శనమున భయావిష్టుడైన ఉత్తరుడు బృహన్నలతో పలికిన వాక్యాలే ఈ పద్యము. ధూళీపటలమున చిత్రవర్ణ కిసలయకుసుమాది సుందర వస్తూత్ప్రేక్షచే వసంతర్తు భావన చేయుచున్న యుత్తరునకు తదపసర్పణమున ఆకస్మిక గ్రీష్మర్తు దర్శనమగుట పద్యార్థమున సులక్ష్యమగుచున్నది. దుర్యోధనుడు గ్రీష్మాదిత్యుడుగా శస్త్రాస్త్రజాలము ఊష్మస్ఫూర్తిగా, ఉదగ్రధ్వజములు అర్చిష్మత్త్వముగా రూపొంది, కురుసేన ఉత్తరునకు దావాగ్ని విజృంభణముగా భాసించెను. ఆతని భావన యందలి లలితవనము ఆ దావాగ్నియందు దగ్ధమైపోయెను. భీష్మ, గ్రీష్మ, ఊష్మ, అర్చిష్మత్ శబ్దములు భయంకరమైన గ్రీష్మమున ఊష్మలమైన అర్చిష్మద్విజృంభణమును సువ్యక్తము చేయుచున్నవి. పద్యమంతటను నిండారి ప్రాసస్థానమున ప్రతిష్ఠపొందిన ఊష్మాక్షరములు కురుసేనయందు ఆరోపింపబడిన అర్చిష్మదూష్మలతను సుష్ఠుగా వ్యంజించుచున్నవి. రషణవర్ణములు మూర్ధన్యములు, మూర్ధమునకు అధిదేవత అగ్ని గనుక ఈ వర్ణములు ఆగ్నేయములు. శ్రోతృచిత్త సంతాపజనకములు.

ఉత్తరుని చిత్తస్థాయియైన భీతి పద్యారంభాక్షరమైన 'భీ' చేతను, వడియం దావృత్తమైన 'భీ' చేతను చమత్కారముగా వ్యంజింపబడుచున్నది. ఇదియొకవిధమైన భావముద్రాలంకార మనదగును.

"రౌద్ర దర్శనాదిభి రనర్థాశంకనం భయమ్". ఆత్మవినాశహేతువగు రౌద్రవస్తు సాక్షాత్కారమున జీవుడు ఆత్మరక్షాతత్పరుడై యుపాయాన్వేషణ చేయును. "త్రస్త చిత్త విక్షోభో భీరోర్థ్వోరేక్షణాదినా." భయము నీచప్రకృతి. ఘోరవస్తు దర్శనమున భీరువు చిత్తమున గలుగు భయము త్రాసము. అది క్షోభాత్మకము. ఆత్మరక్షణార్థము ఉపాయాన్వేషణ చేసి, అది లభించనప్పుడు భీరువునకు గల్గు వికారము విషాదము.

"ఉపాయాభావజన్మా తు విషాదస్సత్త్వసంక్షయః,
నిశ్వాసోచ్ఛ్వాసహృత్తాప సహాయాన్వేషణాదికృత్."

సత్త్వసంక్షయమువలన మనస్సు వివిధముగా ప్రకంపితమగును. మనోదార్ఢ్యము సడలుటచే సర్వాంగములు శిథిలమగును. హృదయము తప్తమగును. ఉచ్ఛ్వాసనిశ్వాసములు ఉష్ణముగా ధారాళముగా వెడలును. ఈ లక్షణములన్నియు ఉత్తరుని వాక్యమున సులక్ష్యములగుచున్నవి.

ఇ ఈలు ఉదాత్త స్వరములు. పాదత్రయప్రారంభములందును యతిస్థానములందును నివిష్టములైన ఇ, ఈ, ఏలు ఉత్తరుడు ఈ వాక్యమును ఉచ్చైస్స్వరమున ఉచ్చరించెనని వ్యక్తము చేయుచున్నవి.

భయానకస్థాయియైన భయము జన్మించుటకు 'వికృతరవసత్త్వాది దర్శనము' ఒక కారణముగా భరతముని పేర్కొనెను. ఈ యభిప్రాయమునే జగన్నాథ పండితరాయలు "వ్యాఘ్రాది దర్శనజన్మా" అని మరింత స్పష్టము చేసెను. శత్రుసేనా దర్శన జన్మమైన ఉత్తరుని భయము శార్దూల విక్రీడిత వృత్తరూపమును ధరించి, సహృదయుని హృదయమున భయభావముయొక్క ఝటిత్యుద్బోధకు సహకరించుట గుర్తింపదగియున్నది.

తిక్కనగారు ఉత్తరునినోట పలికించిన ఈ పద్యము వర్ణ్యవస్తు స్వరూప స్వభావవ్యంజకమై అర్థానురూపముగను, వక్తృచిత్తవృత్తి వ్యంజకమై రసానుసారముగను నిర్మింపబడి పరమోత్తమమైన శిల్పమునకు ఆశ్రయమగుచున్నది." (తిక్కన కవితా వైభవము: యువభారతి ప్రచురణ: (1974) పు.21-23) - (సంపా.)

క. అకృతాస్త్రుఁడ, బాలుఁడఁ గా । ర్ముక విద్యా ప్రౌఢిమై నిరూఢులయిన యీ
శకుని జయద్రథ దుర్ముఖ । వికర్ణ కర్ణాది యోధ వీరుల కెదురే! 53

ప్రతిపదార్థం: అకృత+అస్త్రుఁడన్= అస్త్రవిద్యలో నేర్పులేనివాడిని; బాలుఁడన్= బాలుడిని; కార్ముక విద్యా= వింటి సంబంధమైన (బాణ) విద్యతో; ప్రౌఢిమైన్= నైపుణ్యంలో; నిరూఢులు= పేరుకెక్కినవారు; అయిన= అయినటువంటి; ఈ= ఈ కనబడుతున్న; శకుని= శకునీ; జయద్రథ= సైంధవుడూ; దుర్ముఖ= దుర్ముఖుడూ; వికర్ణ= వికర్ణుడూ (దుర్యోధనుడికి వీళ్ళు తమ్ముళ్ళు); కర్ణ= కర్ణుడూ; ఆది= మొదలైన; యోధ వీరులకున్= వీరులైన యోధులకు; ఎదురే= సమానమా? (ఎదిరించేవాడినా?).

తాత్పర్యం: విలువిద్యలో నైపుణ్యం లేనివాడిని, బాలుడిని బాణవిద్యలో ఎంతో గట్టివారైన ఈ శకునీ, సైంధవుడూ, దుర్ముఖుడూ, వికర్ణుడూ, కర్ణుడూ మొదలైన మహావీరులకు సమానంగా నేను ఎదురు నిలుస్తానా? (నేను వాళ్ళను ఎదిరించలేనని తాత్పర్యం.)

క. ఇట్టగు టెఱుఁగక వచ్చితి । మెట్టొకో! మనభంగి; వీర లిందఱును గడున్
బెట్టిదులు; మనకు మార్కొను । నట్టి కొలఁది గాదు; భీతి యడరెడుఁ దోడ్తోన్. 54

ప్రతిపదార్థం: ఇట్టు+అగుట= ఇట్లా అవుతుంది అని; ఎఱుఁగక= తెలియక; వచ్చితిమి= ఇక్కడికి వచ్చాము; మనభంగి= మనపరిస్థితి; ఎట్టు+ఒకొ?= ఎట్లా ఉందో, ఏమో?; వీరలు= ముందు చెప్పిన వీరులు; ఇందఱును= ఇంతమందీ కూడా; కడున్= మిక్కిలి; బెట్టిదులు= గొప్పశూరులు; మనకున్= మనకు; మార్కొనునట్టి= (వాళ్ళను) ఎదిరించే; కొలఁది+కాదు= శక్తి చాలదు; తోడ్తోన్= వెనువెంటనే; భీతి= భయం; అడరెడున్= కలుగుతూ ఉన్నది.

తాత్పర్యం: ఇక్కడ ఈ రకంగా ఉంటుందని తెలియకవచ్చాము. ఇంక మనకు ఏ గతి పడుతుందో? వీళ్ళంతా వీరాధివీరులు. మనం వాళ్ళను ఎదిరించలేము. అంతేకాక భయం కలుగుతూ ఉన్నది.

ఉ. **కౌరవసేనఁ జూచి వడఁకం దొడఁగెన్ మదితోన మేను; నీ**
వూరక పోవుచున్కి యిది యొప్పునె? యిప్పటి భంగిఁ జూచిన
న్వీరల నేను మార్కొనమి నిశ్చయ, మట్లగుటన్ రయంబునన్
దేరు మరల్పు, ప్రాణములు దీపన మున్ వినవే బృహన్నలా!'. 55

ప్రతిపదార్థం: కౌరవసేనన్= కౌరవులయొక్క సైన్యాన్ని; చూచి= చూచినవెంటనే; మదితోన= మనస్సుతోపాటు; మేను= శరీరంకూడా; వడఁకన్+తొడఁగెన్= వణికిపోతూ ఉన్నది; నీవు= నీవు (నీవేమో); ఊరక పోవుచున్+ఉన్కి= ఊరకనే రథాన్ని తోలుకుపోతుండటం (నా సంగతి పట్టించుకోకుండా నీ పాటికి నీవు అదేపనిగా రథాన్ని తోలుకొని పోతూ ఉండటం- అని భావం); ఇది= ఇట్లా చేయటం (రథాన్ని తోలుకొనిపోవటం); ఒప్పునె?= సరిపోతుందా?; ఇప్పటి భంగిన్= ఇప్పటి ఈ పరిస్థితిని; చూచినన్= చూచినట్లైతే; వీరలన్= కౌరవవీరులను; నేను= నేను; మార్కొనమి= ఎదిరించకపోవటం; నిశ్చయము= నిజమైన విషయం; అట్లు+అగుటన్= అట్లా కావటంవలన (ఎదిరించకపోవటంవలన); రయంబునన్= శీఘ్రంగా (వెంటనే); తేరు= రథం; మరల్పు= వెనక్కు తిప్పు; బృహన్నలా!= ఓ బృహన్నలా!; ప్రాణములు= ప్రాణాలు; తీపు+అనన్= తియ్యగా ఉంటాయని; మున్= ముందునుండి; వినవే?= వినలేదా?

తాత్పర్యం: కురుసేనను చూస్తూనే మనస్సూ దాంతోపాటు శరీరమూ వణికిపోతూ ఉన్నాయి. నీ వేమో నీ పాటికి హద్దూపద్దూ లేకుండా రథాన్ని తోలుకుపోతూనే ఉన్నావు. ఇది బాగుందా? ఈ పరిస్థితిలో నేను, వీళ్ళను ఎదిరించటం జరగనిపని. కనుక బృహన్నలా! రథాన్ని వెంటనే వెనక్కు తిప్పు. ప్రాణం అంటే తీపి అన్న విషయాన్ని నీవు ఇంతకుముందు వినలేదా?'

వ. **అనిన దరహసిత వదనుం డగుచు శతమఖతనయుం డతని కిట్లనియె.** 56

ప్రతిపదార్థం: అనినన్= అనగా; దరహసితవదనుండు= చిరునవ్వుముఖం కలిగినవాడు; శత= నూరు; మఖ= యాగాలను చేసినవాడు-ఇంద్రుడియొక్క; తనయుండు= కుమారుడు; (ఇంద్రుడి కుమారుడు అర్జునుడు- ప్రస్తుతం బృహన్నల-అని నామధేయం). అతనికిన్= ఉత్తరుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కురుసేనను చూచి భయంతో వణికిపోతూ ఉన్న ఉత్తరుడు అన్న మాటలకు చిరునవ్వుతో అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: ఉత్తరుడు ఎంత అమాయకుడో ఈ పద్యంలో తెలుస్తుంది. అందుకే అర్జునుడికి చిరునవ్వు. ఆ నవ్వులో ఉన్న రహస్యం ఉత్తరుడికి అర్థం కాదు. కారణం- ఆతడు భయభ్రాంతుడు కావటమే!

చ. **'అసదృశలీలఁ బొల్చు రథికావలి మీఁదఁ జనంగ వెఱ్ఱినే**
మసలక యామిషంబు గొని మార్గము వట్టిన తుచ్ఛసైన్యమున్
వెసఁ జని ముట్టి గోధనము వేగ మరల్తము గాక; యిమ్మెయిం
బసు లటు వోవఁగా మరలఁ బాడియె నీకు నరేంద్రనందనా! **57**

ప్రతిపదార్థం: నరేంద్ర!= రాజుయొక్క; నందనా!= కుమారా! (రాజకుమారా!); అసదృశ= సాటిలేని; లీలన్= విధంగా; పొల్చు= ఒప్పారు; రథిక+ఆవలి= వీరుల మొత్తం; మీఁదన్= పైకి; చనంగన్= పోవటానికి; వెఱ్ఱినే?= పిచ్చివాడినా?; మసలక= ఆలస్యంలేకుండా; ఆమిషంబున్+కొని= ఆహారాన్ని (ఆవులమందను) తీసికొని; మార్గము+పట్టిన= (తిరుగు) దారిబట్టిన; తుచ్ఛ= అల్పమైన; సైన్యమున్= సేనను; వెసన్+చని= వేగంగా పోయి; ముట్టి= చుట్టుముట్టి; గోధనమున్= ఆవులు అనే ధనాన్ని; వేగన్= వెంటనే (త్వరగా); మరల్తముకాక!= మళ్ళిద్దాం సుమా!; ఈ+మెయిన్= ఇట్లా; పసులు= ఆవులు; అటుపోవఁగాన్= ఆ రకంగా వెళ్ళిపోతూ ఉంటే, (పరాయివారు అట్లా తోలుకొని పోతూ ఉంటే); మరలన్= వెనక్కు తిరిగిపోవటం; నీకున్= నీకు; పాడియె?= న్యాయమేనా?.

తాత్పర్యం: 'సాటిలేని ఆ కురుసైన్యంపైకి పోవటానికి నేను ఏమైనా పిచ్చివాడినా? కాకుంటే ఆవులమందలను తోలుకుపోయే ఆ కొద్దిపాటి సైన్యాన్ని ఎదిరించి, పశువులను మళ్ళిద్దాం. ఆవులను ఇట్లా వాటిపాటికి వాటిని వదలిపెట్టి, వెనక్కు వెళ్ళుదాం- అని అనటం నీకు ధర్మం కాదు. (కనుక ముందుకే పోదామని భావం).

ఉ. **అంతిపురంబులోనఁ గల యంగన లెల్లను నెమ్మనంబులన్**
సంతసమందఁగాఁ బసులఁ జయ్యనఁ దెచ్చెద నంచుఁ బూని, నీ
వెంతయు మేటివై, యరదమెక్కి రయంబున వచ్చి, యిచ్చటన్
దంతితురంగ సద్భటకదంబముఁ జూచి కలంగు టొప్పునే!' **58**

ప్రతిపదార్థం: అంతిపురంబులోనన్= అంతఃపురంలో; కల= ఉన్నట్టి; అంగనలు+ఎల్లను= ఆడవాళ్ళంతా; నెమ్మనంబులన్= నిండుమనస్సులతో; సంతసము+అందఁగాన్= సంతోషపడే విధంగా; పసులన్= ఆవులను; చయ్యనన్= వెంటనే; తెచ్చెదన్= తెస్తాను; అంచున్= అని చెప్పి; పూని= పూనుకొని; నీవు= నీవు; ఎంతయున్ మేటివి+ఐ= పెద్దవీరుడవై; అరదము+ఎక్కి= రథమెక్కి; రయంబునన్= వేగిరంగా; వచ్చి= ఇక్కడికి వచ్చి; ఇచ్చటన్= (ఇప్పుడు) ఇక్కడ; దంతి= ఏనుగులయొక్క; తురంగ= గుర్రాలయొక్క; సత్+భట= శ్రేష్ఠమైన కాల్బలంయొక్క; కదంబమున్= మొత్తాన్ని; చూచి= చూచిన తర్వాత; కలంగుట= కలతచెందటం (భయపడడం); ఒప్పునే?= సరిపోతుందా?

తాత్పర్యం: అంతఃపురంలో ఉన్న ఆడవాళ్ళంతా ఉబ్బిపోయేటట్లు, ఇప్పుడే మందలను మళ్ళించుకొని వస్తానంటూ మహావీరుడివలె నీవు రథాన్నెక్కి వచ్చి, ఏనుగులనూ, గుర్రాలనూ, బంటులనూ చూసి బెదిరి, వెనక్కు పోతానంటావా? ఇట్లా బెదరటం నీకు తగుతుందా?'

విశేషం: ఉత్తరుడికి రోషం కలిగించటానికి బృహన్నల ఇట్లా ఎత్తిపొడుపు, ఎగతాళి మాటలతో ఉడికించాడు.

ఆ. **అనిన పలుకులకు బృహన్నలఁ గనుఁగొని । యెలుఁగు వడఁక నాతఁ డిట్టు లనియెఁ**
'బసుల దయ్య మెఱుఁగుఁ బడఁతుల సంతోష । మేల నాకు? ననికిఁ జాల నేను.' **59**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనిన పలుకులకున్= (ఉత్తరుడు) అనిన మాటలకు; బృహన్నలన్= బృహన్నలను; కనుఁగొని= చూచి; ఎలుఁగు వడఁకన్= కంఠస్వరం వణుకుతుండగా; ఆతఁడు= ఉత్తరుడు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; పసులన్= పశువులసంగతి; దయ్యము+ఎఱుఁగున్= దేవు డెరుగు; పడఁతుల= ఆడవాళ్ళయొక్క; సంతోషము= ఆనందం; ఏల నాకు?= నా కెందుకు?; నేను= నేనుమాత్రం; అనికిన్= యుద్ధానికి; చాలన్= సరిపోను (సమర్థుడను కాను).

తాత్పర్యం: బృహన్నల అన్న మాటలకు, ఉత్తరుడు గొంతు వణుకుతూ ఉండగా, 'పశువుల మాట దేవు డెరుగు, ఆడవాళ్ళ సంతోషం నా కెందుకు? నేను మాత్రం యుద్ధం చేయలేను' అని అన్నాడు.

విశేషం: ఒక పనిని సాధించాలని పోయినప్పుడు, అనుకోని ఒక ఆపద ఎదురైతే అసలుపనిని విడిచిపెట్టిపోవటం సామాన్యుల లక్షణం. ఉత్తరుడూ సామాన్యుడే! ఆతడికీ, పై పరిస్థితే ఎదురైంది. అందుకే, ఆతడు పసులను మళ్ళించుకొని వస్తానని ఆడవాళ్ళముందు చెప్పి వచ్చినా, కౌరవసేనను చూచాక పుట్టిన భయంవలన 'పసుల సంగతి దేవు డెరుగు' అని అంటాడు. అంటే ప్రాణాలతో ఉంటే చాలు, అని భావం. అసామాన్యుడైన అర్జునుడు ముందు పద్యంలో ఉత్తరుడిని ఎంత ఎగదోసినా, ఆతడు క్రిందికే పడతాడు. 'పసుల దయ్య మెఱుఁగు' అన్నది మంచి లోకోక్తి.

వ. అనవుడు. **60**

తాత్పర్యం: పై విధంగా ఉత్తరుడు అనగానే.

చ. 'తన భుజశక్తియున్ రిపుల దర్పము నేర్పడఁ జూచి చూచి యె
ట్లును దెగకున్నఁబోక యిది లోకము చక్కటి; శూరులైన దీ
నిని మది మెచ్చ; రీ బలము నీదెస దేఱియుఁ జూడ; దింతకున్
మును భయహేతువైన విధముం దగఁ జెప్పుము నాకు నిత్తఱిన్. **61**

ప్రతిపదార్థం: తన= తనయొక్క; భుజశక్తియున్= బాహుబలాన్నీ; రిపుల= శత్రువులయొక్క; దర్పమున్= శక్తినీ; ఏర్పడన్= వేరువేరుగా (ప్రత్యేకంగా); చూచి చూచి= బాగా పరిశీలించి; ఎట్లును= ఏ రకంగానూ; తెగక+ఉన్నన్= వీలుకాకపోతే; పోక= (తిరిగి) వెళ్ళిపోవటం; ఇది= వెళ్ళటం అనే ఇది; లోకము= లోకం (ప్రపంచం)యొక్క; చక్కటి= తీరు; శూరులు+ఐనన్= వీరులైతే; దీనిన్= (పైన చెప్పిన) దీనినికూడా; మది మెచ్చరు= ఒప్పుకోరు; ఈ బలము= ఈ కురుసేన; నీ దెస= నీ పక్క; తేఱియున్+చూడదు= తేరిపారచూడటం కూడా లేదు. (నీ తట్టు అసలు సరిగ్గా కన్నెత్తి చూడలేదని భావం); ఇంతకున్= అసలు ఇంతకూ; మును= ఏమీకాకముందే; భయ= భయానికి; హేతువు+ఐన= కారణం అయిన; విధమున్= విధాన్ని; తగన్= తగినట్లు (నిజంగా); నాకున్= నాకు; ఈ+తఱిన్= ఈ సమయంలో; చెప్పుము= తెలియచెప్పుము.

తాత్పర్యం: 'తనబలాన్నీ, ఎదుటివాడి బలాన్నీ గమనించి చూచి, కొంతసేపైనా పోరాడి, ఎటూ వీలుకాకపోతే, తిరిగివెళ్ళటం లోకంలో మామూలు. వీరులైనవాళ్ళు దీన్ని ఒప్పుకోరు. ఇంతదాకా, కురుసేన నిన్ను సరిగ్గా కూడా చూడనే లేదు. ఇంతకూ నీకు ఇంత భయం కలిగే దానికి ఏమిటి కారణం? చెప్పుము.

సీ. దెసలు బీఁటలు వాఱ దివురు చిందంబుల । కోలాహలఁములకుఁ గుదియఁ బడక,
యురవడి సేనలు దెరలఁ బైఁ దోఁతెంచు । ధూళి పెల్లడరినఁ దూల పోక,
చతురంగబల మతిసాంద్రతఁ గవిసిన । యగ్గలికమునకు బెగ్గడిలక,
శస్త్రాస్త్రములు రథ్య సారథి వర్మాంగ । తతి నాటు తఱచునఁ దల్లడిలక,

తే. **బహువిధంబులఁ బగతుర బరవసమున । నిత్తెఱంగునఁ గలుగు క్రందెల్ల నోర్చి**
నిల్చి గెల్చిన సత్కీర్తి నెగడుఁ గాక । దవ్వు దవ్వుల నిట్లైన నవ్వరెట్లు?' **62**

ప్రతిపదార్థం: దెసలు= దిక్కులు; బీఁటలు+పాఱన్= పగుళ్ళు వారేటట్లు; తివురు= మారుమ్రోగే; చిందంబుల= శంఖాలయొక్క; కోలాహలములకున్= పెద్ద పెద్ద శబ్దాలకు; కుదియన్+పడక= కూలబడిపోకుండా; ఉరవడిన్= వేగంతో (ఒత్తిడి, ఆర్భాటంతో); సేనలు= సైన్యాలు; తెరలన్= విజృంభించగా; పైన్= పైకి; తోఁతెంచు= రేగుతున్న; ధూళి= దుమ్ము; పెల్లు+అడరినన్= మిక్కిలిగా వ్యాపిస్తే; తూలపోక= తూలిపడిపోకుండా; చతురంగబలము= నాలుగు రకాలుగా ఉన్న సైన్యం, (రథ, గజ, తురగ, పదాతులు); అతి= అధికమైన; సాంద్రతన్= దట్టంగా (నిబిడంగా); కవిసినన్= చుట్టూ మూగగా; అగ్గలికమునకున్= (సైన్యంయొక్క) ఆర్భాటానికి (విజృంభణకు); బెగ్గడిలక= భయపడక; రథ్య= గుర్రాలయొక్క; సారథి= సారథియొక్క; వర్మ= కవచాల యొక్క; అంగతతిన్= దేహంలో ఉన్న అవయవాల సముదాయంలో; శస్త్ర+అస్త్ర= మానవులు నిర్మించిన బాణాలు మొదలైన శస్త్రాలూ, మంత్రాలతో ప్రయోగించే ఆగ్నేయాస్త్రం మొదలైన అస్త్రాలూ; నాటు= (శరీరంలో) గుచ్చుకొనటం యొక్క; తఱచునన్= ఆధిక్యానికి; తల్లడిలక= బెదిరిపోక; బహు= అనేకమైన; విధంబులన్= విధాలుగా; ఈ+తెఱంగునన్= ఈ రకంగా; కలుగు= (యుద్ధ సమయంలో) ఎదురయ్యే; క్రందు+ఎల్లన్= ఉపద్రవం అంతా; ఓర్చి= ఓర్చుకొని, (సహించి); బరవసమునన్= పరాక్రమంతో; నిల్చి= (యుద్ధభూమిలో గట్టిగా) నిలబడి; పగతురన్= పగవాళ్ళను; గెల్చినన్= జయిస్తేనే; సత్కీర్తి= మంచిపేరు; నెగడున్= కలుగుతుంది (వస్తుంది; నిలబడుతుంది); కాక= పై రీతిగా కాక; దవ్వుదవ్వులన్= దూరదూరంగానే ఉండి (సైన్యానికి); ఇట్లు+ఐనన్= ఇట్లా బెదిరి పారిపోదామంటే; నవ్వరు+ఎట్లు?= ఎట్లా నవ్వకుండా ఉంటారు? (లోకులు).

తాత్పర్యం: దిక్కులు పగుళ్ళువారేటట్లు మారుమ్రోగే శంఖాల ధ్వనులకు బెదిరిపోకుండా, ఆర్భాటంతో సైన్యాలు విజృంభించినప్పుడు రేగిన దుమ్ముకు తూలిపడకుండా, చతురంగబలాలు ముమ్మరంగా కమ్మినప్పుడు భయపడకుండా, శత్రువీరులు ప్రయోగించిన రకరకాలైన శస్త్రాలతో, అస్త్రాలతో, గుర్రాలూ, సారథీ కూలిపోయినా, కవచం బద్దలుబద్దలుగా చీలిపోయినా, బాణాలు శరీరావయవాలలో లోతుగా గుచ్చుకొన్నా, తల్లడిల్లకుండా, యుద్ధరంగంలో ఎదురయ్యే ఉపద్రవాన్నంతా తట్టుకొని, ధైర్యంతో నిలిచి శత్రువులను జయిస్తేనే, మంచి పేరు ప్రతిష్ఠలు వస్తాయికానీ, సైన్యం నీ పక్క చూడకుండా, ఇంకా దూరదూరంగానే ఉండగా, ఇట్లా పరుగెత్తి పోతానంటే (తిరిగిపోతే) నవ్వరా?'

చ. **అను దివిజేంద్ర నందనున కమ్మనుజేంద్ర తనూజుఁ డిట్లనున్**
'వినుము! త్రిగర్తవాహినులు విక్రమసంపద సొంపు మీఱ, గో
ధనములఁ బట్టినం, బతి యుదగ్రత సైన్యము లెన్ని యన్నియుం
గొని యటు వోయెఁ, గాన మనకుం బురి బాసట లేర యెవ్వరున్. **63**

ప్రతిపదార్థం: అను= పై విధంగా అనే; దివిజ+ఇంద్రనందనునకున్= ఇంద్రుడి కుమారుడైన అర్జునునకు (బృహన్నలకు); ఆ+మనుజేంద్ర= ఆ రాజు (విరటుడి) యొక్క; తనూజుఁడు= కుమారుడు (ఉత్తరుడు); ఇట్లు+అనున్= ఈ విధంగా అంటున్నాడు; వినుము= బృహన్నలా! వినవలసింది; త్రిగర్త= త్రిగర్తదేశపు రాజైన సుశర్మయొక్క; వాహినులు= సేనలు; విక్రమసంపద= పరాక్రమంయొక్క సంపద; సొంపుమీఱన్= అధికమయ్యేటట్లు; గోధనములన్= ఆవులు అనే ధనాన్ని; పట్టినన్= పట్టుకోగా; పతి= రాజు (విరాటుడు); ఉదగ్రతన్= విజృంభణంతో; సైన్యములు= సేనలు; ఎన్ని+అన్నియున్= ఎన్ని ఉన్నాయో అన్నిటికీ; కొని= తీసికొని; అటు+పోయెన్= అక్కడికే పోయాడు; కానన్= అందువలన; మనకున్= మనకు; పురిన్= నగరంలో; ఎవ్వరున్= ఎవ్వరుకానీ; బాసట= సహాయానికి; లేరు+అ= లేనేలేరు.

తాత్పర్యం: ఆ రకంగా పలికిన అర్జునుడితో ఉత్తరుడు ఇట్లా అన్నాడు 'త్రిగర్తదేశానికి రాజైన సుశర్మ సైన్యాలు మన గోధనాన్ని దక్షిణంవైపున ముట్టడించాయి. అందుకు మా తండ్రి విరాటరాజు నగరంలో ఉండే అన్ని సైన్యాలనూ తీసికొని ఆతడిపైకి దండెత్తిపోయాడు. కనుక, నగరంలో మనకు సహాయంగా రావడానికి ఎవరూ లేరు.

తే. ఒంటిఁ దలపడి కురుసేన నోర్చువాఁడ । నే? యిదేటికి వెడమాట లిట్టు లాడ?
వారు గానక ముందఱఁ దేరు దోలు । కొని రయంబునఁ బురి కరుగుటయ నీతి.' 64

ప్రతిపదార్థం: ఒంటిన్= ఒంటరిగా; తలపడి= ఎదిరించి; కురుసేనన్= కౌరవసైన్యాన్ని; ఓర్చువాఁడనే?= జయించగలవాడినా?; వెడమాటలు= పనికిమాలిన మాటలు; ఇట్టులు+ఆడన్= ఇట్లా మాట్లాడటం; ఇది; ఏటికి?= ఎందుకు?; వారు= ఆ కురువీరులు; కానక ముందఱన్= చూడకమునుపే; తేరు= రథాన్ని; తోలుకొని= నడుపుకొని; రయంబునన్= శీఘ్రంగా (వెంటనే); పురికిన్= నగరానికి; అరుగుట+అ= పోవటమే; నీతి= యుద్ధంలో నీతి.

తాత్పర్యం: నేను ఒంటిగా కౌరవసైన్యాన్ని ఎదిరించి జయించగలనా? ఎందుకీ తెలివిమాలిన మాటలు? వాళ్ళు మనలను చూడటానికి ముందే రథాన్ని తిప్పుకొని వెనక్కు వెళ్ళిపోవటమే నీతిమార్గం.'

విశేషం: చేతనైతే పోరాడటమో, లేకపోతే సంధిచేసికొనటమో యుద్ధంలో నీతి. కాని ఉత్తరుడి దృష్టిలో, సైన్యాన్ని చూస్తూనే పారిపోవటం నీతి. తన భయాన్ని కప్పిపుచ్చుకొని సమర్థించుకొనాలని, ఆతడు నీతి విషయాన్ని బృహన్నలతో ప్రస్తావించాడు.

వ. అనినం బార్థుండు పార్థివనందనున కిట్లనియె. 65

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పార్థుండు= పృథ (కుంతి) కుమారుడు అర్జునుడు; పార్థివ నందనునకున్= రాకుమారుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఉత్తరుడు పై విధంగా అనగా, అర్జునుడు ఆ రాకుమారుడితో ఇట్లా అన్నాడు.

క. 'వెగడొంది యిట్లు వలుకఁగ । నగునే? పగతురు ప్రమోద మందఁగఁ బసులన్
దిగవిడిచి, పురజనంబులు । తెగడంగా మగిడిపోక దీనత గాదే! 66

ప్రతిపదార్థం: పగతురు= పగవారు; ప్రమోదము+అందఁగన్= సంబరపడేటట్లు; వెగడు+ఒంది= భయపడి; ఇట్లు= ఇట్లా; పలుకఁగన్= మాట్లాడటానికి; అగునే?= అగునా (సరిపోతుందా?); పురజనంబులు= పట్టణంలో ఉన్న జనాలు; తెగడంగాన్= దూషించేటట్లు; పసులన్= పశువులను; దిగవిడిచి= వదలిపెట్టి; మగిడిపోక= తిరిగిపోవటం; దీనత కాదే!= పిరికితనం కాదా?

తాత్పర్యం: 'శత్రువులు పొంగిపోయేటట్లు బెదిరిపోయి, ఈ విధంగా మాట్లాడవచ్చా? పురంలో అంతమందీ తిట్టేవిధంగా, ఆవులను వాటిపాటికి వాటిని వదలివేసి, వెనక్కు పోవటం పిరికితనం కాదా!

వ. అట్లుంగాక. 67

తాత్పర్యం: అంతేకాక, (ఇంకా అర్జునుడు చెప్పుతున్నాడు)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. **నను సైరంధ్రి గడంగి పేర్కొనియె, దానం బెంపుమైఁ బిల్చి, తో**
డని తోడ్తెచ్చితి వీవు, బంటుతన మ ట్లగ్గించి పౌరాలి దీ
వన లిచ్చెం, దుదిఁ బోయి కౌరవులు గోవర్గంబు గొంపోవఁగాఁ
గని యేఁ గ్రమ్మఱి రిత్తవోదునె? భయోత్కంపంబు నీ కేటికిన్? **68**

ప్రతిపదార్థం: ననున్= నన్ను; సైరంధ్రి; కడంగి= పూనుకొని (అదే పనిగా ప్రత్యేకించి); పేర్కొనియెన్= పేరెత్తిచెప్పింది; దానన్= అందువలన; పెంపుమైన్= పెద్దగా, గొప్పగా; పిల్చి= రమ్మని పిల్చి; ఈవు= నీవు; తోడు+అని= జతగా ఉంటానని; తోడ్తెచ్చితివి= తీసికొనివచ్చావు; పౌర+ఆలి= పురజనుల సమూహం; బంటుతనము= (నీయొక్క) వీరత్వాన్ని (పరాక్రమాన్ని); అట్లు= ఆ విధంగా (ఎక్కువగా); అగ్గించి= పొగడి; దీవనలు+ఇచ్చెన్= ఆశీస్సులు అందించింది; తుదిన్+పోయి= చివరకు వచ్చి; కౌరవులు; గో= ఆవులయొక్క; వర్గంబున్= సమూహాన్ని; కొంపోవఁగాన్= తోలుకొనిపోగా; కని= చూచి; ఏన్= నేను; క్రమ్మఱి+రిత్త+పోదునె?= వెనక్కు మళ్ళి, వ్యర్థంగా వెళ్ళిపోతానా?; భయ+ఉత్కంపంబు= భయంతో పుట్టిన వణుకు; నీకున్+ఏటికిన్?= నీకు ఎందుకు?

తాత్పర్యం: (సారథి లేడని నీవు బాధపడుతూ ఉంటే) నా విషయాన్ని సైరంధ్రి నీకు వివరంగా చెప్పింది. ఆమె చెప్పిన దానిని విని, నీవు నన్ను చాలా మర్యాదగా పిలిచి తోడుగా తెచ్చుకొన్నావు. మనం బయలుదేరేవేళ, పురజనులంతా నీ (మన) పరాక్రమాన్ని పొగడి, దీవించి పంపారు. ఇంతదాకా వచ్చి, ఇప్పుడు శత్రువులైన కౌరవులకు మందలను వదలివేసి, ఊరకనే వెనక్కుపోతానా? నీకు భయం వద్దు. (నేనుండగా నీవు భయపడవద్దని తాత్పర్యం).

విశేషం: ఊరకనే నేను తిరిగిపోతానా? నీకు భయం వద్దు- అన్నభావం, ముందు కథలో జరగబోయే అర్జునుడి విషయాన్ని సూచిస్తుంది.

తే. **చిత్తవృత్తి యొక్కించుక చిక్కఁ బట్టు, । మిపుడ కౌరవ సైనికు లెల్లఁ జూచి**
వెఱఁగు పడ వేగమును లావు వెరవు మెఱయఁ । గదుపుఁ బెట్టించి పోదము క్రమ్మఱంగ.' **69**

ప్రతిపదార్థం: చిత్తవృత్తి= మనస్సుయొక్క చంచలమైన పోకడను; ఒక్క+ఇంచుక= కొద్దిగా; చిక్కఁబట్టుము= అణచుకొమ్ము, (నిగ్రహించుకొమ్ము); కౌరవసైనికులు+ఎల్లన్= కురుసేనమొత్తం; చూచి= మనలనుచూసి; వెఱఁగుపడన్= ఆశ్చర్యంతో భయపడేటట్లు; వేగమును= (పనిలో) వేగం; లావు= బలాన్ని; వెరవు= ఉపాయాన్ని; మెఱయన్= బయటపడే విధంగా; కదుపున్= ఆవులమందను; పెట్టించి= విడిపించి; ఇపుడు+అ= ఇప్పుడే; క్రమ్మఱంగన్= తిరిగి; పోదము= వెళ్ళిపోదాం.

తాత్పర్యం: మనస్సును కొద్దిగా అదుపులో పెట్టుకొమ్ము. కౌరవసైన్యం అంతా ఆశ్చర్యంతో బెదిరిపోయేవిధంగా, కార్యంలో వేగాన్నీ, బలాన్నీ, ఉపాయాన్నీ చూపి, మందను విడిపించుకొని వెంటనే తిరిగి పోదాం.'

వ. **అనుచు వివ్వచ్చుండు గడంగి తేరు వోవనిచ్చుటయు, నాననంబు పల్లటిల్ల, మానసంబు దల్లడిల్ల నా భూవల్లభు కుమారుండు.** **70**

ప్రతిపదార్థం: వివ్వచ్చుండు= అర్జునుడు; కడంగి= పూనుకొని; తేరు= రథం; పోవనిచ్చుటయున్= ముందుకు నడపుకొనిపోగా; భూవల్లభు కుమారుండు= రాజకుమారుడైన ఉత్తరుడు; ఆననంబు= ముఖం; పల్లటిల్లన్= (దైన్యంతో) వెలవెలబోగా; మానసంబు= మనస్సు; తల్లడిల్లన్= అల్లల్లాడగా (చలించగా).

తాత్పర్యం: పై విధంగా అంటూ అర్జునుడు రథాన్ని తోలుకొనిపోతూంటే, ముఖం వెలవెలబోగా, మనస్సు తల్లడిల్లగా ఉత్తరుడు (ఇట్లా అన్నాడు).

క. 'దవ్వుల విఱిగినఁ బౌరులు । నవ్వుదురటె! మేలు మేలు! నను నాఁగకు, నీ
క్రొవ్వఱుగదేనిఁ దలపడు । మెవ్విధిఁ జనితేని' యనుచు నెత్తిన భీతిన్. 71

ప్రతిపదార్థం: దవ్వులన్= దూరంనుండి; విఱిగినన్= పారిపోతే; పౌరులు= పురజనులు; నవ్వుదురు+అటె!= నవ్వుతారట!; మేలు మేలు!= బాగు బాగు; ననున్= నన్ను; ఆఁగకు= ఆపవద్దు; నీ= నీయొక్క; క్రొవ్వు+అఱుగదేనిన్= కొవ్వు అణగకపోతే; తలపడుము= ఎదిరించుము; ఏ+విధిన్+చనితి(వి)+ఏని= నీవు ఏ విధంగా పోతే నాకేం? (నీతో నాకు సంబంధం లేదని భావం); అనుచున్= అని అంటూ; ఎత్తిన= పొంగివచ్చే (ఎక్కువైన); భీతితోన్= భయంతో.

తాత్పర్యం: 'దూరాన్నుండి వెనక్కు తిరిగిపోతే పౌరులు నవ్వుతారట! (నవ్వితే నవ్వనీ అని భావం). బాగుంది. నన్ను మాత్రం ఆపకు. నీ పొగరు అణగకపోతే నీవే ఎదిరించుము. నీవు ఎట్లా పోయినా నాకేం ఫరవాలేదు' అని అంటూ భయంతో (తరువాతి పద్యంతో అన్వయం).

క. శరములు శరాసనము న । య్యరదముపై డిగ్గవిడిచి యతి రభసమునన్
ధరణికి లంఘించి వెసం । బురిదెసకును లజ్జ వీటిఁ బోవం బాఱెన్. 72

ప్రతిపదార్థం: శరములు= బాణాలూ; శర+ఆసనమున్= ధనుస్సూ; ఆ+అరదముపైన్= ఆ రథంపైనే; డిగ్గవిడిచి= వదలివేసి; అతి రభసమునన్= ఎక్కువైన కంగారువలన; ధరణికిన్= నేలమీదికి; లంఘించి= వేగంగా దూకి; లజ్జ= సిగ్గు; వీటిన్+పోవన్= నష్టపోగా; పురిదెసకును= పట్టణం దిశగా; పాఱెన్= పరుగుదీశాడు.

తాత్పర్యం: బాణాలనూ, వింటినీ తేరుమీదనే పడవేసి, ఉత్తరుడు కంగారుతో బెంబేలుపడి నేలపైకి దూకి, సిగ్గువిడిచి, పట్టణం వైపు పరుగుదీశాడు.

వ. ఇట్లు పాఱినం దనమనంబునం గుత్సించుచు బీభత్సుండు యుగ్యంబుల పగ్గంబుల నొగల ముడిచి రథంబు డిగ్గనుఱికి లంబకేశభారుండును, నాందోళిత రక్తాంబర యుగళాంచలుండును నగుచు వెనుకంబఱచు సమయంబున, నిలిచి కనుంగొను కౌరవబలంబునందు. 73

ప్రతిపదార్థం: ఇట్లు+పాఱినన్= ఇట్లా పారిపోగా; కుత్సించుచున్= ఏవగించుకొంటూ; బీభత్సుండు= అర్జునుడు; యుగ్యంబుల= గుర్రాలయొక్క; పగ్గంబులన్= పగ్గాలను; నొగలన్= నొగకట్టెకు; ముడిచి= ముడివేసికట్టి (దూముడివేసి); రథంబు డిగ్గన్+ఉఱికి= రథంమీదినుండి క్రిందికి దూకి; లంబ= వ్రేలాడుతున్న (పొడవైన); కేశ= వెంట్రుకలయొక్క; భారుండును= బరువుకలిగినవాడూ, (వ్రేలాడేపొడవైనకేశపాశం ఉన్నవాడు); ఆందోళిత= ఊగులాడుతున్న; రక్త+అంబర= ఎర్రటి వస్త్రాలయొక్క; యుగళ+అంచలుండును= జంటయొక్క అంచులున్నవాడూ; (ఎర్రటి రెండు పంచెల అంచులు రెపరెపలాడుతున్నాయి అని భావం); అగుచున్= ఔతూ; అతని వెనుకన్= ఉత్తరుడి వెంట; పఱచు సమయంబునన్= పరుగెత్తేటప్పుడు; నిలిచి= నిలువబడి; కనుంగొను= చూచే; కౌరవబలంబునందున్= కౌరవులసేనలో.

తాత్పర్యం: ఉత్తరుడు ఆ విధంగా పరుగుదీయగా, అర్జునుడు తన మనస్సులో ఏవగించుకొంటూ గుర్రాల పగ్గాలను నొగలకు కట్టి, దిగి, ఉత్తరుడి వెనువెంట పరుగుదీశాడు. అప్పుడు పొడవైన కేశభారాన్నీ ఎర్రటి పంచెల అంచుల రెపరెపలనూ గమనించిన కురుసేనలో. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. అజ్ఞులు కొంద అప్పుడపహాసము సేయుచు గూఢరూప రే
ఖాజ్ఞత లేమిఁ దద్వికృత కాయము మీఁదను దృష్టులు నిల్పఁగాఁ;
బ్రాజ్ఞులు మూర్తి సౌమ్యతయు, బాహుల దీర్ఘతయున్, భటత్వ త
త్త్వజ్ఞతయున్, గతిస్ఫురదుదాత్తతయుం గని సంశయంబుతోన్. 74

ప్రతిపదార్థం: అజ్ఞులు= అజ్ఞానులు (తెలియనివాళ్ళు); కొందఱు= కొద్దిమంది; అప్పుడు; గూఢ= నిగూఢమైన (రహస్యమైన); రూపరేఖాజ్ఞత= రూపురేఖలను తెలిసికొనగలిగిన తెలివి; లేమిన్= లేకపోవటంవలన; అపహాసము+చేయుచున్= ఎగతాళిచేస్తూ; తద్+వికృత= ఆ బృహన్నలయొక్క వికారమైన; కాయముమీఁదను= శరీరంపైన; దృష్టు= చూపులు; నిల్పఁగాన్= నిలిపిచూడగా; ప్రాజ్ఞులు= బాగా తెలిసినవారు; మూర్తి= ఆ ఆకారంలోని; సౌమ్యతయున్= సత్త్వగుణం వలన కలిగిన శాంతభావాన్నీ; బాహుల= చేతులయొక్క; దీర్ఘతయున్= పొడుగుదనాన్నీ (ఆజానుబాహువులు అనుట); భటత్వ= పరాక్రమంయొక్క; తత్త్వజ్ఞతయున్= తత్త్వాన్ని తెలిసికొనటాన్నీ; (వీరుల స్వభావాన్ని తెలిసికొనగలగడం); గతి= నడకలో; స్ఫురత్+ఉదాత్తతయున్= కనిపించే గాంభీర్యాన్నీ (హుందాతనం); కని= చూచి; (గమనించి); సంశయంబుతోన్= అనుమానంతో.

తాత్పర్యం: తెలియనివాళ్ళు కొంతమంది ఆ బృహన్నలయొక్క నిగూఢంగా ఉన్న రూపురేఖలను సరిగ్గా తెలిసికొనలేక అవహేళన చేస్తూ ఆతడి వికారరూపంపై చూపులు నిలిపారు. తెలిసిన వాళ్ళు మాత్రం ఆ రూపంలో ఉండే అందాన్నీ, ఆజానుబాహువుల లక్షణాన్నీ, వీరుల మనస్సులను తెలిసికొనే సామర్థ్యాన్నీ, నడకలో ఒక గాంభీర్యాన్నీ చూచి అనుమానిస్తూ (ఈవిధంగా అనుకొంటున్నారు). అర్జునుడిని ముందుచూచినవాళ్ళకు ఈతడు అర్జునుడేనా అనే సందేహం వచ్చిందన్నమాట.

తే. 'ఆఁడు చందంబుఁ బురుష సమాకృతియును । గలిగియున్నవి' యొప్పు నూష్మలత సొంపు
వికృత వేషావృతంబులై వెలయ కితఁడు । నివుఱు గవిసిన మెఱయని నిప్పువోలె. 75

ప్రతిపదార్థం: ఆఁడు చందంబున్= ఆడమనిషితీరూ; పురుష= మగవాడియొక్క; సమాకృతియును= ఆకారమూ; కలిగి+ఉన్నవి= కలిగి ఉన్నవి; ఊష్మలత= పరాక్రమం; సొంపు= అందం; వికృతవేష+ఆవృతంబులు+ఐ= వికారమైన వేషంతో కప్పిపుచ్చబడ్డవై; ఇతఁడు= ఈ వ్యక్తి; నివుఱు= బూడిద; కవిసినన్= కప్పగా; మెఱయని= ప్రకాశించని; నిప్పు+పోలె= నిప్పువలె; వెలయక= బయటపడక; ఒప్పున్= ఉన్నాడు.

తాత్పర్యం: 'ఆడా, మగా రూపాలు రెండూ కనపడుతున్నాయి. తీవ్రతా, శౌర్యమూ, కోమలత్వం, వికారమైన ఆకారంవలన బయటికి తెలియక, ఇతడు బూడిద గప్పిన నిప్పువలె మరుగులో ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ. 'నివుఱు గవిసిన మెఱయని నిప్పు' లోకోక్తి. ఏదో కారణంవలన సహజమైన శక్తి మరుగుపడ్డప్పుడు, ఇట్లాంటి లోకోక్తిని వాడుతారు. తిక్కన లోకోక్తులు చాలా ప్రసిద్ధాలు. తగిన సమయంలో తగిన లోకోక్తిని వాడటం మహాకవుల లక్షణం. అందులోనూ తిక్కన లోకోక్తులు దేశీయతకు మారు పేరు. 'వెలయు నితఁడు' అనే పాఠాంతరం కొన్ని ప్రతులలో ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. బాహుల చాయయున్, గమన భంగియు, నర్జుననట్లు; దీన సం
దేహము లే దితండు తన తేజము డాఁపఁగ మత్స్యభూమి భృ
ద్గేహమునందుఁ బేడి యనఁ గీడ్పడి యుండెనొ? కాక యీ కురు
వ్యూహముతోడి కయ్యమున కొండొకరుం డిటు లొంటి వచ్చునే? 76

ప్రతిపదార్థం: బాహుల చాయయున్= (పొడుగైన) ఆ చేతుల తీరూ; గమన= నడకయొక్క; భంగియున్= తీరూ; అర్జునున్+అట్ల= అర్జునుడివి మాదిరిగానే ఉన్నాయి; దీనన్= ఈ విషయంలో; సందేహము లేదు= అనుమానం లేదు; ఇతండు= (ఈ పరుగెత్తే) వ్యక్తి; తన తేజము= తన తేజస్సును (పరాక్రమాన్ని); డాఁపఁగన్= దాచుకొనటానికి; మత్స్యభూమిభృత్= మత్స్యరాజ్యాన్ని భరించేవాడైన (మత్స్యదేశానికి రాజైన) విరాటుడియొక్క; గేహమునందున్= ఇంటిలో (కొలువులో); పేడి+అనన్= పేడివాడిగా; కీడ్పడి+ఉండెనొ?= అణగిమణగిఉన్నాడేమో?; కాక= కాకుంటే; ఈ కురువ్యూహముతోడి= ఈ కురుసైన్యంతో; కయ్యమునకున్= యుద్ధానికి; ఒండు+ఒకరుండు= వేరొకడు; ఇటులు= ఇట్లా; ఒంటి= ఒంటరివాడుగా; వచ్చునే?= వస్తాడా? (రాలేడు అని భావం).

తాత్పర్యం: ఆ చేతుల తీరూ (ఆజానుబాహులు అని భావం), నడక పద్ధతీ, అర్జునుడివలెనే ఉన్నాయి. ఏమీ సందేహం లేదు. తన తేజాన్ని మరుగుపరచటానికి విరాటరాజు కొలువులో పేడివాడిగా అణగి ఉన్నట్లున్నాడు. కాకుంటే, ఈ కౌరవసైన్యంతో పోరాడటానికి వేరే వా డెవడైనా అయితే ఈ రకంగా ఒంటరిగా వస్తాడా! (రాలేడని తాత్పర్యం.)

విశేషం: అర్జును+అట్లు+అ= అర్జును+న్+అట్లు+అ= ఇది షష్ఠీ సమాసం. షష్ఠీ సమాసంబునం దుకార ఋకారంబుల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు. (బాలవ్యాకరణం - సంధిపరిచ్ఛేదం - సూత్రం 34).

చ. విరటుఁడు దక్షిణంబునకు వీరుల సారథులన్ నిజాజికై
పురిఁ గల వారినెల్లఁ గొనిపోయిన, నొండులు లేమిఁ జేసి యు
త్తరుఁడిట వచ్చుచుండి, యరదంబు దగం గడపంగ నెవ్వరుం
దొరకొనకున్నఁ దా నితనిఁ దోడ్కొని వచ్చినవాఁడు సూడఁగన్. 77

ప్రతిపదార్థం: చూడఁగన్= చూడగా; విరటుఁడు= విరాటరాజు; నిజ+ఆజికిన్+ఐ= తన యుద్ధానికి; దక్షిణంబునకున్= దక్షిణదిశకు; వీరులన్= వీరులనూ; సారథులన్= రథసారథులనూ; పురిన్+కలవారిని= పట్టణంలో ఉండే వాళ్ళను; ఎల్లన్= అందరినీ; కొనిపోయినన్= తీసికొనిపోగా; ఒండులు= వేరేవారు; లేమిన్+చేసి= లేనందువలన; ఉత్తరుఁడు; ఇటవచ్చుచున్+ఉండి= ఇక్కడికి వస్తూ; అరదంబున్= రథాన్ని; తగన్= తగినట్లు (బాగా); కడపంగన్= తోలటానికి; ఎవ్వరున్= ఎవరూ కానీ; దొరకొనకున్నన్= చిక్కకపోతే (లభించకపోతే); తాను= ఉత్తరుడు; ఇతనిన్= ఈ వ్యక్తిని; తోడ్కొని వచ్చినవాఁడు= తీసికొనివచ్చాడు.

తాత్పర్యం: ఆలోచించగా దక్షిణంపక్క యుద్ధానికి పోతూ విరాటరాజు నగరంలో ఉన్న వీరులనూ, సారథులనూ మొత్తంగా తీసికొనిపోగా, ఇంకెవ్వరూ లేకపోవటంతో ఉత్తరుడు ఇక్కడికి వస్తూ, సారథిగా ఎవరూ దొరక్కపోవటంతో ఇతడిని తీసికొనివచ్చా డనిపిస్తుంది.

చ. పరి సనుదెంచి గోగణముఁ బట్టె ననన్ విని, పిన్నగాన మీఁ
దరయక రాజనందనుఁ డహంకృతిమైఁ బఱతెంచి, సైన్య వి
స్ఫురణముఁ జూచి, భీతిఁ దనబుద్ధి గలంగినఁ బాఱఁ జొచ్చె; ని
ప్పురుషుని శౌర్యసంపదయు భూరిబలంబు నెఱుఁగఁ డేమియున్.' 78

ప్రతిపదార్థం: పరి+చనుదెంచి=(కురు) సేన వచ్చి; గోగణమున్= ఆవులమందను; పట్టెన్+అనన్+విని= పట్టుకొన్నదని విని; పిన్న+కాన= పసివాడు కనుక (అజ్ఞాని అని భావం); మీఁదు+అరయక= ముందు ఆలోచన లేకుండా; రాజనందనుఁడు= రాజకుమారుడైన ఉత్తరుడు; అహంకృతిమైన్= అహంకారంతో; పఱతెంచి= వచ్చి; సైన్య= సైన్యంయొక్క; విస్ఫురణమున్= ఆర్భాటాన్ని (విజృంభణాన్ని); చూచి= గమనించి; భీతిన్= భయంతో; తన= తనదైన; బుద్ధి= మనస్సు; కలంగినన్= కలతపడగా (చెదిరిపోగా); పాఱన్+చొచ్చెన్= పరుగెత్తుతున్నాడు; ఈ+పురుషుని= (తాను వెంబడితెచ్చుకొన్న) ఈ వ్యక్తి యొక్క; శౌర్యసంపదయున్= పరాక్రమం అనే ధనమూ (అధికమైన పరాక్రమం అని భావం); భూరి= గొప్పదైన; బలంబున్= బలమూ; ఏమియున్+ఎఱుంగఁడు= ఏ కొంచెంగూడా ఎరుగడు.

తాత్పర్యం: సైన్యం ఆవులను పట్టుకొన్నదని విని, పసివాడు గనుక, వెనకా ముందూ ఆలోచించకుండా, కేవలం గర్వంతో ఉత్తరుడు తానేమో వచ్చాడు కాని, ఈ సైన్యంయొక్క విజృంభణాన్ని చూచి మనసు చెదరి, బెదరి పరుగుతీస్తున్నాడు. ఈ పురుషుడి పరాక్రమం, శక్తీ, ఇతడికి ఏమీ తెలియవు.'

వ. అనుచు నిశ్చయరహిత హృదయులగుచుండ శుండాలరయ లీలాసమరేఖంబగు గమనంబునం బురుహూత పుత్త్రుండు పదశత మాత్ర ప్రదేశ పలాయితుండైన భూమింజయు నెయిది పట్టికొనిన నతండు. 79

ప్రతిపదార్థం: నిశ్చయరహిత హృదయులు= ఇది ఫలానా అనే నిర్ణయం లేని మనస్సులు కలవాళ్ళు; అగుచున్+ఉండన్= ఔతూ ఉండగా; శుండాల= ఏనుగుయొక్క; రయ= వేగంయొక్క; లీలా= విలాసంతో; సమరేఖంబు+అగు= సమమైన; గమనంబునన్= నడకతో; పురుహూత= దేవేంద్రుడియొక్క; పుత్త్రుండు= కుమారుడైన అర్జునుడు; పదశతమాత్ర ప్రదేశ= నూరు అడుగుల దూరం మాత్రమే; పలాయితుండు+ఐన= పరుగెత్తినవాడయిన; భూమింజయున్= ఉత్తరకుమారుడిని; ఎయిది= వెంబడించి; పట్టికొనినన్= పట్టుకోగా; అతండు= ఉత్తరుడు.

తాత్పర్యం: (కురుసేనలో) పైవిధంగా అనుకొంటూ, ఎటూ నిశ్చయించుకొనలేకున్నారు. ఆలోపల అర్జునుడు గజగమనంతో నూరు అడుగులదూరంలోనే ఉత్తరుడిని వెంబడించి పట్టుకోగా, ఆ ఉత్తరుడు (ఇట్లా అంటాడు).

విశేషం: మూలభారతంలో ఈ సన్నివేశంలో అర్జునుడు ఉత్తరుడి జుట్టు పట్టుకొన్నట్లున్నది. కాని, తెలుగులో తిక్కన, 'ఎయిది'- అంటే 'వెంబడించి' పట్టుకొన్నట్లు మార్పుచేశాడు. బహుశః 'జుట్టు పట్టుకొనటం' అంత ఉచితంగా ఉండదని తిక్కన భావమై ఉంటుంది.

సీ. వెల వెలఁ బాఱుచు వెగడొందుఁ, బెదవుల । తడియాఱ నెంతయుఁ దల్లడిల్లుఁ,
జల్లన నంగంబు లెల్ల నిండఁ జెమర్చుఁ, । బదములుఁ గరములుఁ గుదియ వడఁకు,
హృదయంబు తటతట నదరంగఁ బెలుకుఱు, । దీన దృష్టుల మోముఁ దేఱి చూచు,
నెలుఁగు గద్గదికఁ దొట్రిల నేడ్చు, విడుమని । ప్రార్థించు మాటఁ గీడ్పాటు దోఁప,

తే. 'నిష్కశతశుద్ధ హేమంబు నిర్మలోజ్జ్వ । లాష్ట వైడూర్యములుఁ దురగాఢ్య రథముఁ
గరటి దశకంబు నొకయూరుఁ బురము సొచ్చి । నపుడ యిచ్చెద నీ' కను నార్తుఁ డగుచు. 80

ప్రతిపదార్థం: వెల వెలన్+పొఱుచున్= వెలవెలబోతూ (ముఖంలో వికాసంలేకుండా); వెగడు+ఒందున్= భయపడతాడు; పెదవుల= పెదవుల యొక్క; తడి+ఆఱన్= తేమ ఆరిపోగా (నోరు ఎండిందని భావం); ఎంతయున్= ఎక్కువగా; తల్లడిల్లున్= అల్లల్లాడిపోతాడు (భయంతో); చల్లనన్= (శరీరం) చల్లబడగా; అంగంబులు+ఎల్లన్= అవయవాలన్నీ; నిండన్= నిండగా; చెమర్చున్= చెమటలు కక్కుతాడు; పదములున్= కాళ్ళూ; కరములున్= చేతులూ; కుదియన్+వడఁకున్= కూలబడగా వణికిపోతాడు; హృదయంబు= గుండె; తటతటన్+అదరంగన్= దడదడమంటూ అదిరిపోగా (కొట్టుకొంటుండగా); పెలుకుఱున్= భయపడతాడు; దీన= దిగులుతో కూడిన; దృష్టులన్= చూపులతో; మోమున్= (ఎదురుగా ఉన్న అర్జునుడి) మొగాన్ని; తేఱిచూచున్= (పిచ్చిగా) ఎగాదిగా చూస్తాడు; ఎలుఁగు= గొంతు (కంఠస్వరం); గద్గదికన్= బొంగురుపోయిన స్వరంతో; తొట్రిలన్= తడబడేటట్లు; ఏడ్చున్= ఏడుస్తాడు; మాటన్= మాటలో; కీడ్పాటు= సన్నని స్వరంతో కూడిన తడబాటు; తోఁపన్= కనిపించేటట్లు; విడుము+అని= వదలిపెట్టుమని; ప్రార్థించున్= వేడుకొంటాడు; ఆర్తుఁడు+అగుచున్= దీనుడై; పురము= నగరాన్ని; చొచ్చినపుడు+అ= చేరగానే; నీకున్= నీకు; నిష్కశతశుద్ధ హేమంబు= నూరు బంగారునాణాల రూపంలోఉన్న శుద్ధమైన బంగారాన్ని; నిర్మల+అష్ట వైడూర్యములున్= స్వచ్ఛమై, ప్రకాశవంతమైన ఎనిమిది వైడూర్యమణులూ; తురగ+ఆఢ్య= గుఱ్ఱాలతోకూడిన; రథమున్= రథమూ; కరటి దశకంబున్= పది ఏనుగులూ; ఒక+ఊరున్= ఒక గ్రామాన్ని; ఇచ్చెదన్= ఇస్తాను; అనున్= అంటాడు.

తాత్పర్యం: ఉత్తరుడి మొగం తెల్లబోయింది. భయంతో నోట్లో తేమ ఆరిపోతూ ఉన్నది. ఒళ్ళంతా చల్లబడి ముచ్చెమటలు పోస్తున్నవి. కాళ్ళూ చేతులూ గడగడ వణికిపోతున్నాయి. గుండె దడదడమంటూ కొట్టుకొంటున్నది. దిగులుపడ్డ చూపులతో ఎదురుగాఉన్న అర్జునుడి మొగాన్ని తేరిపారచూచాడు. గొంతు బొంగురుపోయి తడబడుతూ ఉన్నది. ఏడుస్తూ కూడా ఉన్నాడు. విడిచిపెట్టుమని అర్జునుడిని దీనంగా వేడుకొంటున్నాడు. మాటలో దిగులు బాగా కనబడుతూ ఉన్నది. ఈ పరిస్థితిలో ఉత్తరుడు అర్జునుడితో 'నగరానికి వెళ్ళుతూనే నీకు నూరు బంగారు నాణాల చొక్కమైన బంగారాన్నీ, మంచివి ఎనిమిది వైడూర్యాలనూ, గుఱ్ఱాలు కట్టి సిద్ధంగా ఉన్న రథాన్నీ, పది ఏనుగులనూ, ఒక ఊరినీ ఇస్తాను, నన్ను వదిలిపెట్టుము' అని అంటూ వేడుకొంటున్నాడు.

విశేషం: అలం: స్వభావోక్తి. ఎక్కువగా భయపడ్డ మనిషి, శారీరకంగా, మానసికంగా ఎట్లాంటి మార్పుకు గురి ఔతాడో, ఇందులో తిక్కన మహాకవి చాల సహజంగా చిత్రించాడు. మనోభావాన్నిబట్టి, శారీరకంగా మార్పు కనిపిస్తుంది. ఇక్కడ ఉత్తరుడి మనస్సులో నిండిన భావం భయం. దాని ప్రభావమే, ఆతడి శరీరంలో వచ్చిన మార్పు. ఈ సందర్భంలో, మూలభారతంలో, తేటగీతి పద్యంలోని విషయం మాత్రమే చెప్పబడ్డది - అదీ సూచనగా. అట్లాంటి దాన్ని తిక్కన సీసపాదాలలో పెంచి, సహజంగా చిత్రించి, భయభ్రాంతుడైన ఉత్తరుడి ఆకారాన్ని పాఠకుల మనో నేత్రాలకు కనిపింపజేశాడు. సమయానికి తగిన వర్ణన, అప్పటి దృశ్యాన్ని సహృదయులకు కన్నులకు కట్టినట్లు చేస్తుంది. ఇది అందరు కవులకూ వీలుకాదు. కేవలం మహాకవులకే సాధ్యం అవుతుంది.

క. 'నాతోడి ప్రేముడిం గడు । నాతురయై యెదురుచూచు నంబకుఁ జేతః
ప్రీతిగఁ జని యాయమఁ బొడ । సూతుం బోనీఁ గదే విశుద్ధచరిత్రా!' 81

ప్రతిపదార్థం: నాతోడి ప్రేముడిన్= నాపై ప్రేమతో; కడున్ ఆతుర+ఐ= ఎక్కువ దిగులు కలదై; ఎదురుచూచు= ఎదురుచూస్తూ ఉండే; అంబకున్= మా అమ్మకు; చేతస్= మనస్సుకు; ప్రీతిగన్= సంతోషం కలిగేటట్లు; చని= వెళ్ళి; ఆయమన్= ఆమెను; పొడసూతున్= చూస్తాను; వి+శుద్ధ= మిక్కిలి స్వచ్ఛమైన; చరిత్రా!= వంశం కలవాడా! (ప్రవర్తన కలవాడా); పోనీఁగదే?= నన్ను పోనీయవా?

తాత్పర్యం: 'విశుద్ధమైన చరిత్ర కలిగిన ఓ బృహన్నలా! నా మీద ప్రేమతో, దిగులు కలదై నా కొరకు ఎదురుచూచే మా అమ్మ మనస్సుకు సంతోషం కలిగేటట్లు నేను వెళ్ళి ఆమెను చూస్తాను. నన్ను పోనీ!'

విశేషం: తనకు భయంగా ఉన్నదని చెప్పినంత మాత్రాన, బృహన్నల పోనీయడని, తన మీద ప్రేమతో తనకొరకు దిగులుతో ఎదురుచూచే తల్లికి సంతోషాన్ని కలిగించటానికైనా తనను వదిలిపెట్టుతాడని ఉత్తరుడి నమ్మకం, ఆతడి అమాయికత్వం. తనపై కాకున్నా, తన తల్లిపై ఉన్న గౌరవంతోనో, భయంతోనో వదులుతాడని ఆశ. ఉత్తరుడి తల్లి రాణికదా! ఇది మనోభావ వేత్తలైన మహాకవులకే సాధ్యం.

అర్జునుఁ డుత్తరునిఁ దనకు సారథిఁగాఁ జేసికొనుట : (సం. 4-36-41)

వ. అని మఱియు నానావిధ దీనాలాపంబులం బ్రార్థించుచుండం బార్థుండు నగుచు నతనిం దేరు సేరం దెచ్చి. 82

ప్రతిపదార్థం: అని= అంటూ; మఱియున్= ఇంకా; నానావిధ= పలురకాలైన; దీన+ఆలాపంబులన్= దీనమైన పలుకులతో; ప్రార్థించుచున్+ఉండన్= వేడుకొంటూ ఉండగా; పార్థుండు= అర్జునుడు (పృథకుమారుడు); నగుచున్= నవ్వుతూ; అతనిన్ = ఆ ఉత్తరుని; తేరు+చేరన్+తెచ్చి= రథం దగ్గరికి (బలవంతంగా) తీసికొనివచ్చి.

తాత్పర్యం: ఆ విధంగా ప్రార్థించి ఇంకా ఎన్నో రకాల దీనమైన మాటలతో వేడుకొంటూ ఉండగా, అర్జునుడు ఉత్తరుడిని, రథం దగ్గరికి బలవంతంగా తీసికొని వచ్చి.

విశేషం: ఉత్తరుడు ఎంత ప్రార్థించినా వినకుండా, బృహన్నల అతడిని బలవంతంగా ఎట్లాగో రథం దగ్గరికి తీసికొనివచ్చి తరువాత పద్యంలో ధైర్యాన్ని నూరిపోసి, ఆతడి భయాన్ని పోగొట్టుతాడు.

చ. 'వెఱవకు మన్న! పోటు కురువీరులతోడ నశక్యమేని, న
తెఱఁగది యేల నీ? కుడుగు; తేరికి సారథి గమ్ము నాకుఁ జి
చ్చుఱ పిడుగెట్టులట్టడరి శూరుల మొత్తము నుగ్గు సేసెదం;
బఱపెద సేన, రాజు ధృతిఁ బాపెద, గోవులఁ గ్రమ్మఱించెదన్.' 83

ప్రతిపదార్థం: వెఱవకుము+అన్న!= అన్నా! భయపడవద్దు; ('అన్న అన్నది ప్రేమపూర్వకంగా పెద్దలు, చిన్నవాళ్ళను పిలవటం. ఇది తెలుగుదేశీయమైన సంబోధనం); నీకున్= నీకు; కురువీరుల తోడన్= కౌరవ వీరులతో; పోటు= యుద్ధం; అశక్యము+ఏని= సాధ్యం కాకపోతే; ఆ+తెఱఁగు+ఏల+నీకు?= ఈ విషయం నీకు ఎందుకు? (నీకు వద్దు అనిభావం); ఉడుగు= విడిచిపెట్టుము; నాకున్= నాకు; తేరికి= రథానికి; సారథి+కమ్ము= సారథిగా ఉండుము; చిచ్చుఱపిడుగు+ఎట్టులు+అట్టు+అడరి= చిచ్చరపిడుగువలె (భయంకరంగా) చెలరేగి (విజృంభించి); శూరులమొత్తమున్= వీరుల సమూహాన్ని (అందరినీ); నుగ్గు+చేసెదన్= పొడి పొడిగా

చేస్తాను; సేనన్= సైన్యాన్ని; పఱపెదన్= పారతోలుతాను; రాజు= రాజైన దుర్యోధనుడి యొక్క; ధృతిన్+పాపెదన్= ధైర్యాన్ని (నమ్మకాన్ని) పోగొడతాను; గోవులన్= ఆవులను; క్రమ్మఱించెదన్= మళ్ళిస్తాను.

తాత్పర్యం: 'నాయనా! ఉత్తరకుమారా! నీవు భయపడకుము, నీకు కురువీరులతో యుద్ధం చెయ్యటం చేతకాకపోతే, వద్దులే ఊరుకో! నా రథానికి సారథిగా మాత్రం ఉండుము. అగ్గిపిడుగువలె కురువీరులందరినీ పిండిపిండి చేసి, సైన్యాన్ని తరిమి, రాజు ధైర్యాన్ని నాశనం చేసి, ఆవులను మళ్ళిస్తాను.'

క. **అనుచు నొడఁబాటు లేకు । న్నను, నయ్యుత్తరుని నొగల నడుకొన నిడి, తా**
నును రథ మెక్కి రథికుఁ డయి । చనియె నరుఁడు జమ్మి సేర సమ్మదలీలన్. **84**

ప్రతిపదార్థం: అనుచున్= పైన చెప్పిన విధంగా అంటూ; ఒడఁబాటు= ఇష్టం; లేక+ఉన్నను= లేకపోయినప్పటికీ; ఆ+ఉత్తరునిన్= భయపడిన ఆ ఉత్తరుడిని; నొగలన్= నొగలమీద (రథం ముందుప్రక్క); నడుకొనన్+ఇడి= కంపిస్తూ ఉండగా కూర్చొనబెట్టి; తానును= తానూ; రథము+ఎక్కి= రథాన్ని ఎక్కి; నరుఁడు= అర్జునుడు; రథిఁకుడు+అయి= రథాన్ని ఎక్కి యుద్ధాన్ని చేసేవాడయి (ప్రధానుడయి); సమ్మదలీలన్= సంతోషంతో కూడిన విలాసంతో; జమ్మి చేరన్= జమ్మిచెట్టు దగ్గరికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అని అంటూ, అతడికి ఇష్టంలేకపోయినా ఉత్తరుడిని నొగలమీద కుప్పకూలవేసి, అర్జునుడు తానుకూడా రథాన్ని ఎక్కి, రథికుడై సంతోషంతో జమ్మిచెట్టువద్దకు వెళ్ళాడు.

వ. **ఇట్లు సవ్యసాచి నిక్షిప్తాయుధంబయిన శమీవృక్ష సమీపంబున కరుగు నవసరంబునం గ్లీబరూపచ్ఛన్నుండయ్యును బ్రస్ఫురణ విశేష భీషణుం డగు నతనిం గనుంగొని కౌరవసైనికులు గలంగిన మనంబులతోడ నివ్వెఱపడి యుండ, వారలం గనుంగొని, తోఁచు నుత్పాతంబుల నాలోకించి, గురుం డిట్లనియె.** **85**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; సవ్యసాచి= అర్జునుడు; నిక్షిప్త= నిక్షేపించబడ్డ (ఉంచబడ్డ); ఆయుధంబు+అయిన= ఆయుధాలను కలిగినది అయిన; శమీవృక్ష సమీపంబునకున్= జమ్మిచెట్టు దాపునకు; అరుగు= పోయే; అవసరంబునన్= సమయంలో; క్లీబరూప= నపుంసక రూపంతో; ఛన్నుండు+అయ్యును= ఆవరించబడ్డ (కప్పబడ్డ) వాడైనా; ప్రస్ఫురణ= మంచి రూపంయొక్క; విశేష= ఆధిక్యంతో (ప్రత్యేకతతో); భీషణుండు= భయాన్ని కలిగించేవాడు; అగు= అయిన; అతనిన్= బృహన్నలను (అర్జునుడిని); కౌరవసైనికులు; కనుంగొని= చూచి; కలంగిన= కలతపడిన; మనంబులతోడన్= హృదయాలతో; నివ్వెఱపడి= ఆశ్చర్యాన్ని పొంది; ఉండన్= ఉండగా; వారలన్+కనుంగొని= ఆ సైనికులను చూచి; తోఁచు= కనపడునట్టి; ఉత్పాతంబులన్= అపశకునాలను (ఉపద్రవాలను); ఆలోకించి= చూచి; గురుండు= ద్రోణుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అర్జునుడు ఆయుధాలు దాచిఉంచిన శమీవృక్షం వద్దకుపోయే సమయంలో, నపుంసకరూపంలో ఉన్నా ఆకారవైభవంతో ఇతరులకు భయంకలిగిస్తున్న అతడిని చూచి కౌరవసైనికులు మనస్సులలో కలతపడ్డారు. అపశకునాలు తోచాయి. వాటిని చూచి ఆ సైనికులనుద్దేశించి ద్రోణుడు ఇట్లా అన్నాడు.

విశేషం: అపశకునాలు అపజయానికీ, కార్యహానికీ, ఆపదలకూ సూచన అని నమ్మకం. వీటిని గూర్చి శకునశాస్త్రం విపులంగా వివరించింది. ఏదైనా ముఖ్యమయిన పనిమీద వెళ్ళేటప్పుడూ, ప్రయాణాలలోనూ, యుద్ధాలకు బయలుదేరిపోయేటప్పుడూ, ఇంకా ఎక్కడికైనా వెళ్ళేటప్పుడూ, సంప్రదాయాలను పాటించేవాళ్ళు శకునం చూచుకోనిదే కాలు కదపరు. వీటిపై నమ్మకం లేని వాళ్ళ సంగతి ఇక్కడ ప్రస్తావనకు రాదు. శకునాన్ని పాటించటం ముందుకాలం నుండి ఉన్నదే!

క. 'మాసె నభోమణి; నక్కలు । కూసెం; గలయంగ దెసలకుం బలుచాయల్
సేసెం బఱమొయిళు లడరి; । మ్రోసెం దమయంతఁ దూర్యము లపధ్వనులై. 86

ప్రతిపదార్థం: నభోమణి= ఆకాశానికి మణి అయినవాడు (సూర్యుడు); మాసెన్= మాసిపోయి కాంతి తగ్గినవాడయ్యాడు; నక్కలు= నక్కలు; కూసెన్= హీనం, వికృతం అయిన గొంతులతో అరిచాయి (కూశాయి); దెసలకున్= దిక్కులకు (నాలుగు పక్కలా); కలయంగన్= నిండగా (వ్యాపించగా); పఱమొయిళులు= పెనుమబ్బులు; అడరి= విజృంభించి; పలు= పలురకాలైన; చాయల్+సేసెన్= రంగులను కలిగించాయి; తూర్యములు= యుద్ధ సంబంధాలైన భేరి మొదలైన వాద్యాలు; అపధ్వనులు+ఐ= అపస్వరాలు కలిగినవై; తమ+అంతన్ మ్రోసెన్= వాటి కవే మ్రోగాయి.

తాత్పర్యం: 'సూర్యుడు సహజంగా ప్రకాశించకుండా మందగించిన కాంతితో ఉన్నాడు. నక్కలు దీనంగా కూశాయి. పెను మబ్బులు దిక్కులలో వ్యాపించి వింత వింత రంగులను నింపాయి. తూర్యాలు మొదలైన వాద్యాలు ఎవరూ తాకకుండానే వాటి కవే వికారంగా అపస్వరాలతో మ్రోగాయి.

విశేషం: గురువైన ద్రోణాచార్యుడు కనిపించే ఉపద్రవాలను చెప్పుతున్నాడు. తూర్యం మొదలైన వాద్యాలు 'తమయంత' మ్రోగడమే కాక, నిష్కారణంగా బద్దలైపోవడం కూడా ఉన్నది. దాన్నీ ఇందులో భావించుకొనాలి. గురుడు తరువాతి పద్యంలో కూడా, ఉపద్రవాలనే చెప్పుతున్నాడు.

క. ఇగ్గజములు మిన్నకయును । మ్రొగ్గెడు; నుత్తమ తురంగములు బాష్పజలం
బగ్గలము విడుచుచున్నవి; । తగ్గెడుఁ గారణము లేక తడఁబడి పడగల్. 87

ప్రతిపదార్థం: ఈ+గజములు= ఈ ఏనుగులు; మిన్నకయును= ఊరకనే; మ్రొగ్గెడున్= వాలిపోతున్నాయి (సత్తువలేక నీరసించి కూలబడిపోవడం); ఉత్తమ= ఉత్తమజాతికి చెందిన; తురంగములు= గుర్రాలు; బాష్పజలంబు= కన్నీటిని; అగ్గలము= ఎక్కువగా (ఎడతెగక); విడుచుచున్నవి= వదలుతున్నాయి; పడగల్= (రథాలకు పైనగట్టిన) ధ్వజాలు; తడఁబడి= చిందరవందరై; కారణము లేక= ఏకారణం లేకుండా (గాలికి జెండాలు కదలవచ్చు, 'కారణం లేక' అనడం వలన ఏ కొంచెం గాలితాకు లేకుండానే తడబడుతూ ఉన్నవై); తగ్గెడున్= క్రిందికి దిగుతున్నాయి (కట్టిన చోటునుండి దిగజారటం అని భావం).

తాత్పర్యం: బలమైన ఏనుగులు నీరసంగా అకారణంగా ముందుకు తూలిపోతున్నాయి. జాత్యశ్వాలు నిరంతరం కన్నీటిని కారుస్తున్నాయి. కేతనాలు చిందరవందరై క్రిందికి వాలిపోతున్నాయి.

విశేషం: ద్రోణాచార్యుడు ఈ పద్యంలో ఏనుగుల, గుర్రాల, జెండాల విషయాలను మూడింటిని చెప్పాడు. 'ఏ కారణం లేక' - అన్నది పైవాటికి మూలం. అదే ముందు పద్యంలో చెప్పబోయే ఉపద్రవాలకు కూడా ఆధారం.

క. దగ్ధము లైనట్టులు స । మ్యగ్ధైర్యము లెడలె; మండె నాయుధ చయముల్;
దిగ్ధూమం బెసఁగె; నసం । దిగ్ధము మనకాజి యగుట; దీనికిఁ దగఁగన్. 88

ప్రతిపదార్థం: దగ్ధములు+ఐన+అట్టులు= తగులబడ్డట్లుగా; సమ్యక్+ధైర్యములు= గట్టి ధైర్యాలు; ఎడలెన్= లేకుండా పోయాయి; ఆయుధ= రకరకాల ఆయుధాలయొక్క; చయముల్= సమూహాలు; మండెన్= భగభగ మండిపోయాయి; దిగ్ధూమంబు (దిక్+ధూమంబు)= నాలుగుదిక్కులనిండా పొగ; ఎసఁగెన్= వ్యాపించి కమ్ముకొన్నది; మనకున్= మనకు; ఆజి+అగుట= యుద్ధం జరగటం; అసందిగ్ధము= అనుమానం లేదు (తప్పదు - అనటం); దీనికిన్= ఈ పరిస్థితికి; తగఁగన్= తగిన రీతిగా. (ముందుకు అన్వయం).

తాత్పర్యం: ధైర్యం తగలబడ్డట్లు నశించింది. ఆయుధాలు ఊరకనే మండిపోతున్నాయి. (సూర్యుడి వేడికి కాదు). దిక్కులలో పొగ కమ్ముకొన్నది. ఇంక మనకు యుద్ధం తప్పదు. కనుక దీనికి తగ్గట్లు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఆయుధాలు వాటికవే మండటం యుద్ధానికి సూచన. గురుడు అనుభవజ్ఞుడు. కనుకనే దీన్ని గమనించి, తన వీరులను యుద్ధానికి సంసిద్ధంగా ఉండండని హెచ్చరించాడు. పెద్దలూ, విజ్ఞులూ అయినవాళ్ళు రాబోయే ప్రమాదకరమైన పరిస్థితి గమనించి హెచ్చరించటం పరిపాటి. ఈ విషయాలను గురువుగారి ద్వారా చెప్పించటంలో మహాకవి ఎంతో ఔచిత్యాన్ని పాటించాడు.

క. మొన లొఁఅపుగఁ దీర్చికొనుఁడు; । దనతన వాహనము లాయుధము లెల్ల జనం
బును ననువు సేసికొనుఁ; డో । పిన యంతయుఁ గాచికొనుఁడు బెదరక పసులన్.' 89

ప్రతిపదార్థం: మొనలు= సేనలు; ఒఅపుగన్= నేర్పరితనంతో; తీర్చికొనుఁడు= అమరించుకొనండి; ఎల్ల జనంబును= అన్ని రకాలవాళ్ళు; తనతన= వాళ్ళవాళ్ళయొక్క; వాహనములు= గుఱ్ఱాలు, ఏనుగులు, రథాలు మొదలైన వాహనాలు; ఆయుధములు= యుద్ధానికి కావలసిన రకరకాల ఆయుధాలను; అనువు+చేసికొనుఁడు= అనుకూలంగా సిద్ధం చేసికొనండి; బెదరక= భయపడక; ఓపిన+అంతయున్= చేతనైనంతవరకు; పసులన్= ఆవులను; కాచికొనుఁడు= కాపాడుకొనండి.

తాత్పర్యం: సేనలను తగినరీతిగా తీర్చుకొనుడు. మీ మీ వాహనాలను, ఆయుధాలను అందరూ సిద్ధంగా ఉంచుకొనండి. చేతనైనంతవరకు భయం లేకుండా ఆవులను కాపాడుకొనండి.'

వ. అని చెప్పి తానప్పు డర్జును నెఱింగినవాఁడు గావున నతనికి నజ్ఞాతవాస సమయభంగం బగునో యను భయంబున సురనదీసూను వదనంబు వీక్షించి సన్నవాఱ నిట్లనియె. 90

ప్రతిపదార్థం: అని, చెప్పి; తాను= ద్రోణుడు; అప్పుడు; అర్జునున్; ఎఱింగినవాఁడు= తెలిసినవాడు; కావునన్= కాబట్టి; అతనికిన్= అర్జునుడికి; అజ్ఞాతవాస= అజ్ఞాతవాసంయొక్క; సమయ= ప్రతిజ్ఞ; భంగంబు+అగున్+ఓ= భంగం అవుతుందేమో; అను, భయంబునన్= అనే భయంతో; సురనదీ= దేవనది అయిన గంగానదియొక్క; సూను= కుమారుడైన భీష్ముడియొక్క; వదనంబు= ముఖాన్ని; వీక్షించి= చూచి; సన్నవాఱన్= మెల్లగా (ఎవరికీ వినబడకుండా); ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ద్రోణాచార్యుడు పైవిధంగా సైనికులను హెచ్చరిక చేసి, అర్జునుడిని బాగా తెలిసినవాడు కావటంవలన, ఆతడి ఒక ఏడు అజ్ఞాతవాస ప్రతిజ్ఞకు ఎక్కడ భంగం కలుగుతుందో అనే భయంతో, భీష్ముడి మొగంవైపు చూచి మెల్లగా ఇట్లా అన్నాడు.

విశేషం: గురువైన ద్రోణాచార్యులకు ప్రియశిష్యుడైన అర్జునుడిమీద ఉన్న వాత్సల్యం ఇందులో తెలుస్తుంది. ఇది మామూలు విషయమే. ఇంతకన్నా లోతైన విశేషం కూడా ఇందులో ఉన్నది. గురు పితామహాదులు ధర్మనిష్ఠులు. పాండవులు ధర్మాభిరతులు; ధర్మ స్వరూపులు. గురువైన ద్రోణుడికీ, పితామహుడైన భీష్ముడికీ ధర్మంపై పక్షపాతం. అదే పాండవులపైనా ఉన్నది. ధర్మాత్ములైన పాండవులు ఎక్కడ అర్జునుడి తొందరపాటువలన అజ్ఞాతవాస ప్రతిజ్ఞకు భంగం కలిగితే, మరలా అరణ్య అజ్ఞాతవాస క్లేశాన్ని పొందవలసి వస్తుందో అనే భయంతో, ద్రోణుడు భీష్ముడితో మెల్లగా ఆ విషయాన్ని ముందుపద్యంలో అంటున్నాడు.

చ. 'వెరవరి గాక వీఁడు కురువీరులకుం బొడ సూపువాఁడె? య
చ్చెరు, వొక భ్రూనిపేర నిట సేరఁగ వచ్చుచునున్నవాఁ; డహం
కరణమ కాని యొండొకటి గానఁడు; మూర్తివిశేష మారయన్
సురపతి యట్ల; వీని మదిచొప్పది యెట్లొ యెఱుంగ నయ్యెడున్.' 91

ప్రతిపదార్థం: వీఁడు= ఆ వస్తున్నవాడు; వెరవరి+కాక= ఉపాయం తెలిసిన వాడు కాకుండా; కురువీరులకున్= కౌరవ వీరులకు; పొడచూపు వాఁడె?= కనిపించవచ్చునా?; అచ్చెరువు= వింతగా ఉన్నది; ఒక భ్రూని పేరన్= ఒకానొక చెట్టు పేరుతో (అర్జునవృక్షం); ఇట= ఇక్కడికి; చేరఁగన్= చేరేటట్లు; వచ్చుచున్+ఉన్న వాఁడు= వస్తూ ఉన్నాడు; అహంకరణము+అ+కాని= అహంకారం ఒక్కటే గాని; ఒండు+ఒకటి= వేరే ఏదీ; కానఁడు= గమనించడు; మూర్తి= ఆకారంయొక్క; విశేషము+ఆరయన్= అతిశయాన్ని చూస్తే; సురపతి+అట్లు+అ= ఇంద్రుడివలెనే! (ఉన్నాడు); వీని= వీడియొక్క; మది= మనస్సుయొక్క; చొప్పు= తీరు (ఇతడి ఆలోచనా విధం); అది ఎట్లు+ఒ= అదేమో? (ఎలా ఉన్నదో); ఎఱుంగనయ్యెడున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: 'వీ డెవడో ఉపాయం లేకుండా కౌరవులకు కనపడవచ్చా? గర్వం ఒక్కటే కనపడుతూ ఉంటుంది. చాలా వింతగా ఉన్నది. చెట్టు పేరుతో ఇక్కడికి వస్తున్నాడు. ఆకారం మాత్రం ఇంద్రుడివలెనే ఉన్నది. కాని వీడి మనసులో ఏముందో తెలిసికొనాలి.'

విశేషం: ఈ పద్యానికి పైది సామాన్యభావం. ద్రోణుడు భీష్ముడితో అనదలుచుకొన్న భావం ఇది. తన అహంకారం ఒక్కటే కారణంగా, అర్జునుడు ఆలోచన లేకుండా కౌరవుల ఎదుటికి వస్తున్నాడే! అజ్ఞాతవాస ప్రతిజ్ఞ భంగం కాదా? ఇతడు కారణంగా పాండవులు అందరు మళ్ళీ చిక్కులలో పడతారేమో? ఇంద్రుడి ప్రసక్తితో ఇతడు అర్జునుడే అన్నది నిజం అని ద్రోణుడి భావం. దానినే భీష్ముడికి తెలుసునో తెలియదో అని గురుడు సూచించాడు.

క. అనిన విని యెఱిఁగికొని యా । తని మది సందియము మాన్పఁదలఁచి నరేంద్రుం
గనుఁగొనుచు నతనితోఁ జె । ప్పిన భంగి నిగూఢ వృత్తి భీష్ముఁడు వలికెన్. 92

ప్రతిపదార్థం: అనినన్= ద్రోణుడు పైవిధంగా చెప్పగా; విని= భీష్ముడు విని; ఎఱిఁగికొని= ద్రోణుడి మాటలలో ఉన్న నిగూఢమైన విషయాన్ని గ్రహించి; ఆతని= ఆ గురువైన ద్రోణాచార్యుడియొక్క; మది= మనస్సులో ఉన్న; సందియము=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనుమానం; మాన్పన్+తలఁచి= పోగొట్టాలని ఎంచి; నర+ఇంద్రున్= రాజైన దుర్యోధనుడిని; కనుఁగొనుచున్= చూస్తూ; అతనితోన్= ఆ రాజుతో; చెప్పిన భంగిన్= చెప్పిన విధంగా (నెపంతో); నిగూఢ వృత్తిన్= గుట్టుగా; పలికెన్= చెప్పాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు చెప్పిన దానిని విని, భీష్ముడు దానిలో ఉన్న రహస్యమైన అర్థాన్ని గమనించి, ద్రోణుడి మనస్సులో ఉన్న అనుమానాన్ని పోగొట్టాలని దుర్యోధనుడి వైపు చూస్తూ ఆతడితో చెప్పినట్లుగా నిగూఢంగా ఇట్లా అన్నాడు.

విశేషం: ద్రోణుడు తన సందేహాన్ని వెలిబుచ్చింది భీష్ముడితో; కాని భీష్ముడు చెప్పింది దుర్యోధనుడికి. అదే ఇందులోని విశేషం. ఇందులో భీష్ముడి సమయస్ఫూర్తి, ఉచితజ్ఞత బాగా తెలుస్తాయి. ద్రోణుడు భీష్ముడితో అర్జునుడి విషయాన్ని, నిగూఢంగా (చెట్టుపేర మనిషి) అన్నప్పుడు అక్కడ దుర్యోధనుడు ఉన్నాడు. ఆతడు రాజు. పక్కన ఉన్న రాజును కాదని ద్రోణుడికి నేరుగా చెప్పటం బాగుండదు. అందువలన భీష్ముడు, దుర్యోధనుడిని అడ్డుపెట్టుకొని ద్రోణుడికి బదులిచ్చాడు. అదీ అటు రాజుకూ, ఇటు గురువుకూ ఇద్దరికి సమాధానంగా ఉండేటట్లు చెప్పాడు. రాజుకు కావలసిన విషయం గురుడి సందేహాన్ని తీర్చే విషయం, రెండూ భీష్ముడి సమాధానంలోనే ఉన్నాయి. అదీ భీష్ముడి సామర్థ్యం!

సమర్థులైన, అనుభవజ్ఞులైన, ఎంతో లోతైన ఇద్దరు పెద్దల మధ్య ఎందరున్నా, వారికి తెలియని అంతరార్థం, అందవలసిన వాళ్ళకు అందుతుంది. ఇది తిక్కన సంభాషణ ప్రతిభా విశేషం. తెలుగు పలుకులకు ఎంత నిగూఢత, పదునూ ఉన్నదో అది అంతా తిక్కన సంభాషణలలో ఉన్నది. ఇది అందరి కవులకూ అందదు. క్రింది పద్యంలో ఇది ఎక్కువగా వివరించబడుతుంది.

క. 'తలఁపఁగ రిపులకు నిమ్మగు । కొలఁది గడచి వచ్చితిమి; యకుంఠిత బాహా
బలము నెఱపఁ దఱియయ్యెను । జలింపవల దింక మనకు శత్రులవలనన్.' 93

ప్రతిపదార్థం: తలఁపఁగన్= నిదానంగా ఆలోచిస్తే; రిపులకున్= శత్రువులకు; ఇమ్ము+అగు= అనుకూలమైన; కొలఁది= హద్దును; (చోటును); కడచి= దాటి; వచ్చితిమి= వచ్చాము; అకుంఠిత= మొక్కవోని; బాహాబలము= భుజబలం; నెఱపన్= చూపుటకు; తఱి= సమయం (అవకాశం); అయ్యెను= వచ్చింది; శత్రులవలనన్= శత్రువుల వలన; మనకున్= మనకు; ఇంకన్= ఇక; చలింపవలదు= బెదిరిపోవలసిన అవసరం లేదు; (ఇది రాజుకు సంబంధించిన అర్థం).

తాత్పర్యం: 'శత్రువులకు అనుకూలమైన చోటును దాటాం. (మనకు అనుకూలం కాని చోటును దాటాం అని). ఇంక మన బాహుబలాన్ని చూపవలసిన సమయం వచ్చింది. శత్రువులకు ఇంక మనం భయపడవలసిన పనిలేదు.'

(ద్రోణుడికి అందవలసిన అర్థం కిందివిధంగా ఉన్నది.)

ప్రతిపదార్థం: తలఁపఁగన్= బాగా పరిశీలిస్తే (లెక్కవేసి చూస్తే); రిపులకున్= శత్రువులైన కౌరవులకు, ఇమ్ము+అగు= అనుకూలమైన; కొలఁది= గడువును (కాల పరిమితిని); కడచి వచ్చితిమి= దాటి వచ్చాం. (అజ్ఞాతవాస సమయం దాటింది అని భావం); (కనుక); అకుంఠిత బాహాబలము= మొక్కవోని పరాక్రమాన్ని; నెఱపన్= ప్రదర్శించటానికి; తఱి+అయ్యెను= సమయం వచ్చింది; శత్రులవలనన్= శత్రువులైన కౌరవుల వలన; మనకున్= మనకు; (భీష్మద్రోణులు పాండవ పక్షపాతులు గనుక); ఇంకన్= ఇక; చలింపన్ వలదు= భయపడవలసిన పనిలేదు.

తాత్పర్యం: 'శత్రువులకు అనుకూలంగా ఉన్న అజ్ఞాతవాస సమయం కడచిపోయింది. అఖండమైన తన బాహుబలాన్ని ప్రదర్శించటానికి (అర్జునుడికి - ప్రకృత - అర్థాన్ని బట్టి) ఇదే సమయం. ఆతడు అజ్ఞాతవాస సంబంధమైన విషయంగా శత్రువులకు జంకవలసిన అవసరం లేదు.'

విశేషం: ఎంతమంది చుట్టూ ఉన్నా, ఎవరికి అందవలసిన అర్థాన్ని వాళ్ళకు అందేటట్లు చేయడం, సంభాషణ శిల్పంలో ఒక అంశం. నాటకంలో ఈ ప్రక్రియ బాగా రక్తి కట్టుతుంది. ఇద్దరు నటులకు మధ్య ఎందరున్నా, వాళ్ళు చెప్పుకొనదలచుకొన్న విషయం వాళ్ళకు మాత్రమే అర్థమయ్యేట్లు వాళ్ళు చెప్పుకుంటారు. ఇటు శ్రవ్యంలోను, అటు దృశ్యంలోను ఈ విధానం ఉన్నది. నిత్యజీవితంలోనూ ఎప్పుడూ ఇది ఎదురౌతూనే ఉంటుంది.

వ. **అనవుడు నాచార్యుం డయ్యర్థంబు గనికొని పార్థునకు సమయ భంగంబు వలని సంకటంబు లేకునికి మనంబునం బ్రియంబంది మొగంబునం దోఁపనీక పుయిలోట దక్కి యిట్లనియె.** **94**

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; (భీష్ముడు చెప్పగానే); ఆచార్యుండు= ద్రోణుడు; ఆ+అర్థంబున్= ఆ అర్థంలో ఉన్న రహస్యాన్ని; కనికొని= గమనించి (కనిపెట్టి); పార్థునకున్= అర్జునుడికి; సమయ భంగంబువలని= నియమం భగ్నమయ్యేదానిపట్ల; సంకటంబు= ఇబ్బంది, అనుమానం; లేక+ఉనికిన్= లేకపోవటంతో; మనంబునన్= హృదయంలో; ప్రియంబు+అంది= సంతోషించి; మొగంబునన్+తోఁపనీక= (ఆ సంతోషాన్ని) ముఖంమీద కనపడనీయకుండా; పుయిలోట= సంకోచం; తక్కి= విడిచిపెట్టి; ఇట్లు+అనియెన్= ఇట్లు అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడి మాటలలోని అంతరార్థాన్ని గమనించి, అర్జునుడికి అజ్ఞాతవాసం భంగం కాలేదని మనస్సులో సంతోషించి, దానిని పైకి కనపడనీయకుండా అనుమానాన్ని విడిచి ద్రోణుడు ఇట్లా అన్నాడు.

శా. **'సింగం బాఁకటితో గుహాంతరమునం జేడ్పాటుమై నుండి మా**
తంగ స్ఫూర్జిత యూథ దర్శన సముద్యత్క్రోధమై వచ్చు నో
జం గాంతార నివాసఖిన్నమతి నస్మత్సేనపై వీఁడె వ
చ్చెం గుంతీసుత మధ్యముండు సమరస్థేమాభిరామాకృతిన్. **95**

ప్రతిపదార్థం: సింగంబు= సింహం; ఆఁకటితోన్= ఆకలితో; గుహ+అంతరమునన్= గుహలోపల; చేడ్పాటుమైన్+ఉండి= దిగులుతో ఉండి (కష్టపరిస్థితిలో ఉండి); మాతంగ= ఏనుగులయొక్క; స్ఫూర్జిత= ప్రకాశిస్తూ ఉన్న; యూథ= సమూహం యొక్క; దర్శన= చూడటం చేత; సముద్యత్= పైకి వస్తున్న (విజృంభిస్తున్న); క్రోధము+ఐ= కోపం గలిగినట్టిదై; వచ్చు+ఓజన్= వచ్చేరీతిగా; కాంతార= అడవియందు; నివాస= నివాసం ఉండడం చేత; ఖిన్నమతిన్= దుఃఖాన్ని పొందిన మనస్సుతో; అస్మద్= మనయొక్క; సేనపైన్= సైన్యం పైకి; వీఁడె= ఆ వచ్చేవాడే; కుంతీసుత మధ్యముండు= కుంతీదేవి కొడుకులలో (పాండవులలో) నడిమివాడైన అర్జునుడు; సమరస్థేమ+అభిరామ+ఆకృతిన్= యుద్ధంలో స్థిరం, మనోహరం అయిన ఆకారంతో; వచ్చెన్= (దగ్గరికి) వచ్చాడు.

తాత్పర్యం: సింహం ఆకలిగొని గుహలో చాలాకాలం నివాసం ఉండి, ఉన్నట్టుండి బయటికి వస్తూ, ఏనుగుల గుంపును చూస్తే మితిమీరిన కోపంతో ఎట్లా మీదికి దూకుతుందో, అట్లాగే అర్జునుడు అరణ్యావాసం వలన ఎంతో బాధపడి, మన సేనమీదికి, యుద్ధంలో స్థిరంగా నిలిచే ఆకారంతో ఇప్పుడే వచ్చాడు.

విశేషం: అలం: ఉపమ. అర్జునుడు పన్నెండు సంవత్సరాలు అరణ్యావాసం చేసి అలిసిపోయాడు. ఇన్నేండ్లు కౌరవులతో ఆతడికి యుద్ధం లేదు. వీరుడికి యుద్ధం లేకపోవటం ఒక ఆకలి వంటిది. ఆకలితో ఉన్నవాళ్ళకు కోపం ఎక్కువ. అట్లాంటి అర్జునుడిని, ఎంతో కాలం ఆకలితో అలమటిస్తూ, గుహలో దిగులుగా ఉన్న సింహంతో కవి పోల్చాడు. ఆ సింహం బయటపడింది. వెంటనే దానికి ఎదురుగా మదించిన ఏనుగుల గుంపు కనబడింది. అదే కురుసైన్యం. ఏనుగులకూ సింహానికీ సహజవైరం. సింహం కలలో వస్తేనే ఏనుగు చస్తుంది. కౌరవులకూ, పాండవులకూ ఉండే వైరం కూడా అట్లాంటిదే!

అర్జునుడంటే ద్రోణుడికి ప్రాణం. ఎంతో కాలానికి తన ప్రియశిష్యుడైన అర్జునుడు ఆచార్యుడికి వీరమూర్తిగా కనిపించాడు. దీనితో ద్రోణుడి సంతోషం, ఉత్సాహం కట్టలు తెంచుకొన్నాయి. అందుకే 'వీఁడె వచ్చెన్' - అని అన్నది. ఆ వచ్చేవాడు, 'కుంతీసుత మధ్యముండు'- అట. కుంతి కొడుకులు నిజానికి ముగ్గురే. వాళ్ళలో నడిమివాడు భీముడు. కాని కుంతి అట్లా అనుకొనలేదు. మాద్రీపుత్రులైన నకుల, సహదేవులనూ తన సొంతకొడుకులు అనే అనుకొన్నది. అందుచేత కౌంతేయులన్నా పాండవులన్నా ఒక్కటే! కాగా, ఐదుమందిలో మధ్యవాడూ అర్జునుడే. ఇట్లా అని వ్యాసుడే అన్నాడు. దాన్నే తిక్కన పాటించాడు.

'కుంతీసుత మధ్యముండు'- అయిన అర్జునుడు, 'సమర స్థేముడట; అభిరామమైన ఆకారం గలవాడట.' ఇది గురువైన ద్రోణుడు అర్జునుడి యుద్ధనైపుణ్యాన్ని మెచ్చుకొనటమే! విద్య నేర్పిన గురువుకు, విద్యాపారంగతుడైన శిష్యుడు ఎంతో కాలానికి కనిపిస్తే, కలిగే ఆనందమే ఇక్కడ ద్రోణుడికీ కలిగింది. అందుకే 'వీఁడె'- అని గురువు అన్నాడు. అంటే, 'మావాడే'- అని భావం. ఈపదం గురువుకు, అర్జునుడి మీద ఉండే వాత్సల్యాన్నీ, మమకారాన్నీ సూచిస్తుంది.

అర్జునుడి పరాక్రమంమీద ద్రోణుడికి ఎనలేని నమ్మకం, అంతకు మించిన అభిమానం ఉన్నది. ఇతడిని ఎవరూ జయించలేరు అనే భావాన్ని తరువాతి పద్యంలో గురువు వెలిపుచ్చాడు. ఇదీ గురువుకు శిష్యుడి మీద ఉన్న వాత్సల్యాన్నే తెలుపుతుంది. 'వీఁడె వచ్చెం గుంతీసుత మధ్యముండు' - ఈ వాక్యం సరిగా నాలుగోపాదం ప్రాసస్థానంలో ముగిసింది. ఆ వాక్యంలో వచ్చినవా డెవడో ముందు చెప్పక, శ్రోతల ఆసక్తిని రేపుతూ ఒక్కసారిగా 'కుంతీసుత మధ్యముండు' అన్నాడు. అతడి కొక విశేషణం చేర్చాడు. అది వినగానే శ్రోతల గుండెలలో దడ పుట్టుతుంది. ఇది ఒక రచనా శిల్పం.

ఉ. **ఈతనితోడి కయ్యమున కియ్యకొనందగు వార లస్మదీ**
యాతత సేనలోఁ గలుగు టారయ సంశయ; మెల్లభంగి గో
వ్రాతనివర్తనంబు సుకరంబ కిరీటి; కితండు రుద్రునిం
బ్రీతునిఁ జేసె నా వినమె! పెంపెసలారెడు బాహుసంపదన్.' **96**

ప్రతిపదార్థం: ఈతనితోడి కయ్యమునకున్= వస్తూ ఉన్న ఆ అర్జునుడితో పోరాటానికి; ఇయ్యకొనన్+తగువారలు= ఒప్పుకొనగలవాళ్ళు (వచ్చేవాళ్ళు); ఆరయన్= ఎంత బాగా వెదికిచూచినా; అస్మదీయ= మనదైన; ఆతతసేనలోన్= ఇంత పెద్ద సైన్యంలో (కూడా); కలుగుట= ఉండటం; సంశయము= అనుమానమే! (లేరు అని భావం); ఎల్లభంగిన్= అన్ని విధాలా; కిరీటికిన్= అర్జునుడికి; గోవ్రాత= ఆవులమందయొక్క; నివర్తనంబు= మళ్ళించటం; సుకరంబు+అ= చాలా సులువే!; ఇతండు= ఈ అర్జునుడు; పెంపు+ఎసలారెడు= పేరుకెక్కిన; బాహుసంపదన్= భుజబలపరాక్రమంతో; రుద్రునిన్= శివుడిని; ప్రీతునిన్+చేసెన్= సంతోషపెట్టాడు; నాన్= అనగా; వినమె!= విని ఉన్నాము గదా!

తాత్పర్యం: ఈతడితో యుద్ధానికి పూనుకొనేవాళ్ళు, మన సేనలో ఎవరైనా ఉన్నారా?- అన్నది అనుమానమే! ఏ విధంగా చూచినా, అర్జునుడికి ఆవులమందను మలుపుకోవటం సులువే. ఆతడు తన పరాక్రమంతో ఆ రుద్రుడిని కూడా మెప్పించాడని విన్నాం కదా!'

విశేషం: దీనికి ముందు పద్యంలో ద్రోణుడు అర్జునుడిపై చూపిన వాత్సల్యమే, ఇందులో మరింత కనిపిస్తుంది. ఇది గురువు శిష్యుడి విక్రమాన్ని స్తుతించటమే! గురుశిష్యుల అనుబంధం ఇట్లాంటిది. అరణ్యావాససమయంలో అర్జునుడు ఇంద్రకీల పర్వతంమీద శివుడిని గూర్చి ఘోరతపస్సు చేసి, మల్లయుద్ధంలో ఆ మహాదేవుడిని జయించి, మెప్పుగా పాశుపతాస్త్రాన్ని పొందాడు. ఈ కథ ఆధారంగా, సంస్కృతంలో భారవి మహాకవి కిరాతార్జునీయం అనే కావ్యాన్ని వ్రాశాడు. అట్లాగే ఈ కథా సన్నివేశాన్ని గ్రహించి, ఒక కావ్యంగా కాక, శ్రీనాథుడు హరవిలాసంలోనూ, ధూర్జటికవి శ్రీకాళహస్తీశ్వరమాహాత్మ్యంలోనూ రసవంతమైన కావ్యఖండాలుగా మలిచారు.

వ. అను పలుకు లాకర్ణించి కర్ణుండు కటకటంబడి కుంభసంభవున కిట్లనియె. 97

ప్రతిపదార్థం: అను, పలుకులు= అని అన్నమాటలు; ఆకర్ణించి= విని; కటకటంబడి (కటకటన్+పడి)= బాధతో కోపించి; కర్ణుండు; కుంభసంభవునకున్= కడవనుంచి పుట్టినవాడైన ద్రోణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'మన పెద్ద సేనలో అర్జునుడితో పోరాడేవాళ్ళున్నారా! ఇది సందేహమే!' అని ద్రోణుడు అన్న మాటలను విని, బాధతో, కోపంతో కర్ణుడు ఇట్లా అన్నాడు.

విశేషం: అర్జునుడి పేరు అంటేనే అసలు సరిపోని కర్ణుడికి ద్రోణుడు తన శిష్యుడిని గురించి చేసిన పరాక్రమం ప్రశంసలు, ఎంతో బాధనూ, కోపాన్నీ కలిగించాయి. దాని ఫలితంగా, అంతగొప్పవాడైన అస్త్రవిద్యా గురువైన ద్రోణుడిని ముందు పద్యంలో కర్ణుడు ఆక్షేపిస్తాడు. అంతేకాక, ద్రోణుడు చేసిన 'ప్రశంస' కురువీరులలో పెద్ద చర్చకు హేతువైనది.

ఉ. 'పాండవ పక్షపాతమునఁ బల్కుదు నోరికి వచ్చినట్లు, ని
న్నొండన రామిఁ జేసి; యిది యొప్పునె? కౌరవసేన కెల్ల నొ
క్కండవ మేటి; వీ బలము గర్వముఁ గుందఁగ నిట్లు శత్రుదో
శ్చండిమ కోహటించితి; నిజంబునకున్ నరుఁ డింత యెక్కుడే? 98

ప్రతిపదార్థం: నిన్నున్+ఒండు+అనరామిన్+చేసి= ఎవరూ నిన్ను ఏమీ అనకూడదు గనుక; పాండవ= పాండవులపై; పక్షపాతమునన్= అభిమానంతో (ఒక పక్షంమీదనే అభిమానాన్ని చూపటం); నోరికి వచ్చినట్లు= నోటికి ఏ మాటవస్తే ఆ మాట (ఇష్టం వచ్చినట్లు, ఇది జాతీయం); పల్కుదు(వు)= మాట్లాడుతున్నావు; ఇది= ఇట్లా మాట్లాడడం; ఒప్పునె?= సరిపోతుందా? (తగునా?); కౌరవసేనకున్+ఎల్లన్= కురుసైన్యానికంతటికీ; ఒక్కండవు+అ= నీవు ఒక్కడివే; మేటివి= అధికుడివి; ఈ బలము= ఈ బలమూ; గర్వమున్= పొగరూ; కుందఁగన్= కుంగిపోగా; ఇట్లు= ఈ రకంగా; శత్రుదోస్+చండిమకున్= శత్రువుయొక్క బాహుబలంయొక్క తీవ్రతకు; ఓహటించితి(వి)= భయపడి మాట్లాడావు; నిజంబునకున్= నిజానికి; నరుఁడు= అర్జునుడు; ఇంత+ఎక్కుడే?= (నీవు చెప్పినంత) గొప్పవాడా?

తాత్పర్యం: 'నిన్ను ఎవరూ ఏమీ అనకూడదు. అందుకే నీవు పాండవులమీద పక్షపాతంతో, నోటికి ఏమివస్తే అదంతా వాగుతూ ఉన్నావు. ఇది సరి కాదు. కురుసేన మొత్తానికీ నీవే మొనగాడివా? బలమూ, గర్వమూ కుంగిపోయేటట్లు (నిరుత్సాహంగా) శత్రువుల పరాక్రమానికి భయపడుతూ నీవు అంటున్నావు. అసలు అర్జునుడు నీవనుకొన్నంత గొప్పవీరుడా? (కాదు అని సారాంశం.)

విశేషం: శత్రువైనా సరే, అతడు పరాక్రమశాలి అయితే పొగడటం అసలైన వీరుడి లక్షణం. అందుకే ద్రోణుడు అర్జునుడిని ప్రశంసించాడు. అందులో అర్జునుడు తనకు ప్రియశిష్యుడు, ధర్మబద్ధుడు. ఈ వీరధర్మాన్ని కర్ణుడు అపార్థం చేసికొన్నాడు. దానికి కారణం కర్ణుడిలో ఉన్న ఈర్ష్య. తాను అర్జునుడికి సమానమైన ఉజ్జీ అని ఆతడి భావన. దుర్యోధనుడి భావమూ అదే! అందుకే గురువు అంతటివాడిని అంతలంతలు మాటలను కర్ణుడు అనగలిగాడు. అదే ఆతడి వ్యక్తిత్వం. కర్ణుడూ మహావీరుడేకాని, ఆతడిని అసూయ ఆవరించబట్టి, అర్జునుడి విషయంలో గురుడు చేసిన పొగడ్తను ఓర్చుకొనలేకపోయాడు. అందుకే ముందు పద్యంలో కర్ణుడు తన పరాక్రమాన్ని గూర్చి చెప్పుకొన్నాడు.

ఆ. అతఁడు వచ్చెనేని, నస్మచ్ఛిలీముఖ । పాతచలిత హృదయపద్మఁ జేసి,
వెగడు పఱిచి, యోధవీరుల కెల్ల ను । త్సవ మొనర్తు బాహుదర్ప మొప్ప.' 99

ప్రతిపదార్థం: అతఁడు= ఆ అర్జునుడు; వచ్చెన్+ఏనిన్= వచ్చినట్లయితే (ఒకవేళ వస్తే); బాహు= భుజాలయొక్క; దర్పము+ఒప్పన్= గర్వం అతిశయించేటట్లుగా; అస్మత్= నా యొక్క; శిలీముఖ= బాణాలయొక్క; పాత= పడటంవలన; చలిత= కదలిపోయిన (అదిరిన); హృదయ పద్మున్= పద్మం వంటి హృదయం కలిగినవాడినిగా; చేసి= చేసి; వెగడుపఱిచి= బెదరగొట్టి; యోధవీరులకున్+ఎల్లన్= మహావీరులందరికీ; ఉత్సవము+ఒనర్తున్= సంతోషాన్ని చేస్తాను (కలిగిస్తాను).

తాత్పర్యం: నిజంగా అర్జునుడే ఒకవేళ ఇక్కడికి వస్తే, పరాక్రమంతో నా బాణాలను ఆతడిపై గుప్పించి, హృదయం చెదిరిపోయేటట్లు ఆతడిని భయపెట్టి, మన కురువీరులందరికీ ఆనందాన్ని కలిగిస్తాను.'

వ. అనిన విని సుయోధనుండు రాధేయున కిట్లనియె. 100

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విని; సుయోధనుండు= దుర్యోధనుడు (సుఖంగా యుద్ధం చేసేవాడు. మంచి ఉపాయంతో గదాయుద్ధం చేస్తాడు); రాధేయునకున్= రాధయొక్క కుమారుడైన కర్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కర్ణుడి మాటలను విన్న దుర్యోధనుడు కర్ణుడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'తప్పఁ బలికి తీవు; చెప్పెద విను; మితఁ । డర్జునుండ యేని నడవి కేఁగి
భ్రాతృయుతము గాఁగఁ బండ్రెండు వత్సర । ములును నంద నిలువ వలయు మగుడ. 101

ప్రతిపదార్థం: ఈవు= నీవు; తప్పన్+పలికితి(వి)= పొరపాటుగా అన్నావు; చెప్పెదన్= నేను చెప్తుతాను; విను= వినుము; ఇతఁడు= ఈ వచ్చేవాడు; అర్జునుండు+అ+ఏనిన్= అర్జునుడే అయితే; భ్రాతృయుతము+కాఁగన్= తన సోదరులతో కూడా; మగుడన్= తిరిగి; అడవికిన్+ఏఁగి= అడవికి పోయి; పండ్రెండు వత్సరములును= పన్నెండేండ్లు; అందున్+అ= ఆ అడవిలోనే; నిలువవలయున్= ఉండాలి.

తాత్పర్యం: 'ఓ కర్ణా! నీవు మాట్లాడింది సరిగాదు. నేను చెప్తుతాను వినుము. వచ్చేది అర్జునుడే అయితే అన్నదమ్ముళ్ళతో మళ్ళీ అడవికి వెళ్ళి పన్నెండేండ్లు అక్కడే ఉండాలి.

విశేషం: కర్ణుడు, తన బాణపాతంతో అర్జునుడిని చెదరగొట్టి, వీరులను ఆనందపరుస్తానని ముందు పద్యంలో అన్నదానికి దుర్యోధనుడు ఏదో సులువైన ఉపాయం చెప్పినట్లుగా పై విధంగా అంటాడు. దీనినిబట్టి ఆతడికి అజ్ఞాతవాసం లెక్క

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తెలియదని అనిపిస్తుంది. దుర్యోధనుడి లెక్కప్రకారం అజ్ఞాతవాసం పూర్తికాలేదని అనుకొనాలి. కాని, పూర్తి అయింది. దీని చర్చ (232వ పద్యంలో) భీష్ముడి ద్వారా జరుగుతుంది.

క. ఒరుఁడయ్యేనేని మామక । శరాసన క్షిప్త దీప్తసాయక పంక్తిం
బరిమార్చెద వ్రేల్మిడి న । చ్చెరువుఁ బ్రమోదంబు నొంది సేనలు వొగడన్.' 102

ప్రతిపదార్థం: ఒరుఁడు+అయ్యేనేనిన్= అర్జునుడు కాక వేరేవాడు అయితే; సేనలు= సైన్యాలు (నాలుగురకాల సేనలు); అచ్చెరువున్= ఆశ్చర్యమూ; ప్రమోదంబున్= సంతోషమూ; ఒంది= పొంది; పొగడన్= అగ్గించేటట్లు; మామక= నా యొక్క; శర+అసన= వింటినుంచి (బాణాలను త్రోసేది); క్షిప్త= విసిరివేయబడ్డ; దీప్త= ప్రకాశించిన; సాయక= బాణాలయొక్క; పంక్తిన్= వరుసతో (ఎడతెగకుండా అని భావం); వ్రేల్మిడిన్= ఒక్కచిటికెలో; పరిమార్చెదన్= చంపుతాను.

తాత్పర్యం: ఆ వచ్చేది అర్జునుడు కాక వేరేవాడైతే మన సేన అంతా ఆశ్చర్యంతో, సంతోషంతో ప్రశంసించేరీతిగా నా బాణాలతో ఒక్క చిటికెలో రూపు మాపుతాను'.

విశేషం: దుర్యోధనుడు పై రెండు పద్యాలలో చెప్పిన దానినిబట్టి అర్జునుడైతే అన్నదమ్ముళ్ళతో అడవికి పోతాడు. వేరే వాడైతే తన బాణ పరంపరతో చంపుతానని అనటం కనిపిస్తుంది. ఇంతకూ ఆ వచ్చేవాడు ఎవడైనా ఫరవాలేదనీ, ఆతడివలన సమస్యే లేదని దుర్యోధనుడి అభిప్రాయం.

క. అనుపలుకులకును భీష్ముం । డును ద్రోణుఁడు ద్రోణసూనుఁడును గృపుఁడును మే
లని యియ్యకొనిరి హృదయా । ననురూపములైన తెలివు లాస్యముఁ బొందన్. 103

ప్రతిపదార్థం: అనుపలుకులకును= దుర్యోధనుడు కర్ణుడితో చెప్పిన మాటలకు; భీష్ముండును; ద్రోణుఁడును; ద్రోణసూనుఁడును= ద్రోణుడి కుమారుడైన అశ్వత్థామా; కృపుఁడును= కృపాచార్యుడూ (ద్రోణుడి బావమరది); హృదయ= మనస్సుకు; అనను రూపములు+ఐన= సరిపడని (ఇష్టంలేని); తెలివులు= వికాసాలు (కాంతులు); ఆస్యమున్+పొందన్= ముఖంపైకి రాగా; మేలు+అని= మంచిది అని; ఇయ్యకొనిరి= ఒప్పుకొన్నారు.

తాత్పర్యం: పై విధంగా మాట్లాడిన దుర్యోధనుడి మాటలకు భీష్ముడూ, ద్రోణుడూ, అశ్వత్థామా, కృపాచార్యుడూ మంచిది - అని ఒప్పుకొన్నారు. కాని, వాళ్ళ మొగాలలో మాత్రం మనస్సులకు ఇష్టంగాని ఒక వెల్లదనం కనబడింది.

విశేషం: పై నలుగురు విశిష్ట వ్యక్తులు, పెద్దలు. వయస్సునూ, గుణాన్నిబట్టి భీష్ముడూ; పై రెంటికితోడు గురుత్వ లక్షణాన్నిబట్టి ద్రోణుడూ; కులాన్నీ, విద్యనూబట్టి అశ్వత్థామా; కురుపాండవులకు ప్రాథమిక విద్యా గురుత్వాన్నిబట్టి, కులాన్నిబట్టి కృపాచార్యుడూ- పెద్దలు. దుర్యోధనుడి మాటలు నిజానికి వాళ్ళకు సరిపోలేదు. పైగా వెగటుగా కూడా ఉన్నాయి. కాని, ఆతడు రారాజు. మొగమోటానికి పైకి బాగుంది - అని అన్నారు అంతే. అందుకే వాళ్ళ అనిష్టత వాళ్ళ మొగాలలో కనబడింది.

సంస్కృత మూలభారతంలో పై నలుగురూ దుర్యోధనుడి పరాక్రమాన్ని ప్రశంసించినట్లు మాత్రమే ఉన్నది. అయితే తిక్కన ఆ ప్రశంస వెనుక ఉన్న నిగూఢమైన అర్థాన్ని, 'హృదయాననురూపములైన తెలివు లాస్యముఁ బొందన్' అని వివరించాడు.

మనస్తత్త్వాలను చిత్రించడంలో తిక్కన తరువాతే తక్కిన కవులు. మూలానికి మెరుగుపెట్టటంలో ఇది ఒక పద్ధతి.

అర్జునుఁడు శమీవృక్ష నిక్షిప్తంబైన గాండివంబు గొనుట (సం. 4-38-1)

వ. అట్టియెడ శమీవృక్ష సమీపంబున నరదంబు నిలుపంబంచి పార్థుం డుత్తరున కిట్లనియె. 104

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; శమీవృక్ష= జమ్మిచెట్టుయొక్క; సమీపంబునన్= దాపులో; అరదంబు= రథం; నిలుపన్= నిలుపటానికి; పంచి= ఆజ్ఞాపించి; పార్థుండు= అర్జునుడు; ఉత్తరునకున్+ఇట్లు+అనియెన్= ఉత్తరునితో ఈవిధంగా పల్కినాడు.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడు, జమ్మిచెట్టు దగ్గర రథాన్ని ఆపుమని ఉత్తరుడితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: రెండు వైపుల వాళ్ళ విషయాలను మార్చి మార్చి ఒక దాని తర్వాత మరొకదానిని నడపటం నాటకీయశైలి. తిక్కనలో ఉన్న ప్రధాన లక్షణం ఇదే! ఇంతసేపూ పాఠకుడి మనస్సు కౌరవులమీదనే తిరుగుతూ ఉన్నది. ఇప్పుడు అర్జునుడూ, ఉత్తరుడి మీదికి మళ్ళింది. కథాంశాలను సమదృష్టితో నడపడం మహాకవుల లక్షణం. దానిని నాటకీయంగా కండ్లకు కట్టినట్లు చిత్రించటం తిక్కన ప్రత్యేకత. సన్నివేశం మళ్ళీ మారేదాకా, పాఠకుడి దృష్టి అర్జునుడిమీదా, ఉత్తరుడి మీదనే పారాడుతుంది.

క. 'ఇన్నగమునందు గాండివ । మున్నది; యదిగాని మద్భుజోద్రేక విలా
సోన్నతి కోర్వవు పెద్దయు । నన్నువ లీవిండ్లు కుఱుచ లలఁతి బలంబుల్. 105

ప్రతిపదార్థం: ఈ+నగము నందున్= ఈ చెట్టు మీద; గాండివము= గాండీవం అనే పేరున్న విల్లు; ఉన్నది= ఉంది; అదికాని= అదైతే గాని; మత్+భుజ+ఉద్రేక= నాయొక్క భుజాల ఉద్రేకానికీ; విలాస+ఉన్నతికిన్= విలాసంయొక్క ఔన్నత్యానికీ, (ధనుస్సును పట్టటంలో ఉన్న ఠీవికీ); పెద్దయున్+అన్నువలు= చాలా స్వల్పాలైనవీ; కుఱుచలు= పొట్టివీ; అలఁతిబలంబుల్= ఎక్కువ గట్టివి కానివీ; (అయిన) ఈ విండ్లు= (నీవు తెచ్చిన) ఈ ధనుస్సులు; ఓర్వవు= తట్టుకోలేవు.

తాత్పర్యం: 'ఈ జమ్మిచెట్టుమీద గాండీవం ఉన్నది. కురుచవీ, అల్పబలం గలవీ, తక్కువకానివీ అయిన ఈ ధనుస్సులు నా భుజబల పరాక్రమంయొక్క ఆర్భాటానికి తట్టుకోలేవు. అందువలన గాండీవమే నాకు తగిన విల్లు.

క. ఇవి నీ తెగకోలఁదివి; వీ । రవినోదము నప్పు డధిక రభసము లగు మ
ద్వివిధాటోపములకుఁ జా । లవు; విల్లది నూఱువేల లావరయంగన్. 106

ప్రతిపదార్థం: ఇవి= నీవు తెచ్చిన ఈ విండ్లు; నీ తెగకోలఁదివి= నీ బలానికి తగినవి, (తెగ అంటే, అల్లెత్రాటిని ఎక్కుపెట్టటం); వీరవినోదము+అప్పుడు= వీరవినోదం చేసేటప్పుడు (వీరుడి వినోదం యుద్ధం. కనుక యుద్ధం చేసేటప్పుడు అని భావం); అధిక= మిక్కిలి ఎక్కువైన; రభసములు+అగు= అత్యధికమైన వేగంతో తిరిగే; మత్+వివిధ+ఆటోపములకున్= నాయొక్క అనేక విధాలైన విన్యాసాలకు; చాలవు= నిలువలేవు; అరయంగన్= బాగా చూస్తే; విల్లు+అది= ఆ విల్లు (గాండీవం); నూఱువేల లావు= లక్షవిండ్ల బలం కలిగింది.

తాత్పర్యం: ఈ విండ్లు నీబలానికి సరిపోతాయి. వీరవినోద సమయంలో అతి రభసంగా తిరిగే నా భుజాలు చేసే రకరకాలైన విన్యాసాలకు తట్టుకోలేవు. ఆ గాండీవం లక్ష ధనుస్సులతో సమానం. (అది తనకు కావాలనీ, కనుక తెమ్మనీ అర్జునుడి భావం).

క. వీనిఁ గొని గట్టి మైమఱు । వేనుంగును మఱియు నెట్టి వేనియుఁ దునియం
గా నేయ నగునె? కైదువు । లేని యలవు కలిమి పోర లెస్సె యున్నే? 107

ప్రతిపదార్థం: వీనిన్+కొని= బలంలేని ఈ విండ్లను తీసికొని; గట్టి= దృఢమైన; మైమఱువు= కవచాన్ని గానీ; ఏనుంగును= ఏనుగును గానీ; మఱియున్= ఇంకా; ఎట్టివి+ఏనియున్= ఎట్లాంటి వాటినిగానీ; తునియంగాన్+ఏయన్+అగునె= ముక్కలు చేయటానికి వీలవుతుందా?; పోరన్= యుద్ధంలో; కైదువు లేని= ఆయుధం లేనట్టి; అలవు కలిమి= బలసంపద; లెస్స+ఐ+ఉన్నే?= బాగై ఉంటుందా? (ఉండదని భావం).

తాత్పర్యం: ఈ విండ్లతో గానీ, ఆయుధాలతో గానీ, గట్టిదైన కవచాన్ని గానీ, ఏనుగును గానీ, ఇంకా ఇతరమైన వాటిని గానీ చీల్చివేయలేము. యుద్ధంలో ఆయుధం లేకుండా శక్తి నైపుణ్యాన్ని చూపటం లెస్సగా ఉండదు కదా!

వ. కావున నిమ్మహీరుహం బెక్కి యమ్మహనీయ చాపంబు దెచ్చి యిమ్ము; ధర్మజ భీమార్జున నకుల సహదేవులు దమ దమ సమస్తాయుధంబులుఁ గూడంగట్టి యిందుఁ బెట్టిన వా; రాకట్ట విడిచి యందు గాండీవంబు వుచ్చికొని తక్కటియవి యెప్పటియట్ల బంధింపు, 'మని చెప్పి శవాకారంబున నున్న శస్త్రాస్త్ర సంచయంబు సూపిన భూమింజయుం డతని కిట్లనియె. 108

ప్రతిపదార్థం: ఈ+మహీరుహంబు= ఈ చెట్టు; ఎక్కి; ఆ+మహనీయ చాపంబు= ఆ గొప్పదైన ధనుస్సు; తెచ్చి+ఇమ్ము; ధర్మజ, భీమ+అర్జున, నకుల, సహదేవులు; తమ, తమ; సమస్త+ఆయుధంబులున్= అన్ని ఆయుధాలను; కూడన్+కట్టి= ఒకటిగా కలిపికట్టి; ఇందున్+పెట్టినవారు= ఈ చెట్టుమీద భద్రంగా ఉంచారు; ఆ కట్ట= ఆ మూట; విడిచి= విప్పి; అందున్= దానిలోనుండి; గాండీవంబు; వుచ్చికొని= పైకి తీసికొని; తక్కటి+అవి= మిగిలినవి; ఎప్పటి+అట్లు+అ= మునుపు ఉన్నట్లుగానే; బంధింపుము= కట్టుము; అని, చెప్పి; శవ+ఆకారంబునన్+ఉన్న= పీనుగు రూపంలో ఉన్న; శస్త్ర+అస్త్ర+సంచయంబు= శస్త్రాలయొక్క, అస్త్రాలయొక్క సమూహాన్ని; చూపినన్= చూపగా; భూమింజయుండు= ఉత్తరుడు; అతనిన్= అర్జునుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కనుక ఈ జమ్మిచెట్టెక్కి మహిమోపేతమైన ఆ గాండీవాన్ని తెచ్చి ఇమ్ము. ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు వారివారి ఆయుధాలను కలిపి కట్టగట్టి ఈ చెట్టుమీద పెట్టారు. ఆ కట్ట విప్పి, గాండీవాన్ని మాత్రం తీసికొని, తక్కినవాటిని అట్లాగే కట్టగా కట్టుము' అని శవంవలె ఉన్న ఆయుధాల మోపును చూపాడు. అప్పుడు ఉత్తరుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

క. 'పీనుఁగు నంటఁగఁ దగునే । భూనాథ తనూజుఁ డనక, వుయిలోడక, న
న్నీ నీచపుఁ బనిఁ బనుపం । గా నీకుం దగునె? పాపకర్మము గాదే!' 109

ప్రతిపదార్థం: పీనుఁగున్= శవాన్ని; అంటఁగన్+తగునే= తాకవచ్చా?; భూనాథ తనూజుఁడు+అనక= రాజుయొక్క కుమారుడు అని అనుకొనకుండా; వుయిలోడక= అనుమానం లేక (వెనుకాడక); నన్నున్= రాజకుమారుడను అయిన నన్ను; ఈ నీచపు పనిన్= తుచ్ఛమైన ఈ పని చేసేదానికి; పనుపన్+కాన్= నియమించేదానికి; నీకున్= నీకు; తగునె?= న్యాయమేనా?; పాపకర్మముకాదు+ఏ?= పాపపు పని కాదా?

తాత్పర్యం: 'శవాన్ని తాకమంటావా? నేను రాజుకుమారుడను అని అయినా సంకోచించకుండా, నన్ను ఇటువంటి నీచమైన పనికి ఆజ్ఞాపించటం బాగుందా? ఇది పాపం కాదా?'

వ. అనిన విని ధర్మనందనానుజుం డత్యాదరంబున. 110

ప్రతిపదార్థం: అనినన్= అని ఉత్తరుడు పలుకగా; విని; ధర్మనందన= ధర్మరాజుయొక్క; అనుజుండు= తమ్ముడు (అనుసరించి పుట్టినవాడు - తమ్ముడు); అతి+ఆదరంబునన్= మిక్కిలి మర్యాదతో.

తాత్పర్యం: ఉత్తరుడి మాటలను విని అర్జునుడు మిక్కిలి ఆదరంతో (ఇట్లా అన్నాడు).

విశేషం: ధర్మనందనానుజుండు - అనే మాటను అర్జునుడికి వాడడం వలన, అర్జునుడు, ఉత్తరుడిని అధర్మకార్యాన్ని చెయ్యమనలేదు అని అనుకొనాలి.

ఆ. 'మనుజు లంటకుండ మఱువడఁ జేసిన । యస్త్ర శస్త్ర సంచయంబు గాని,
శవము గాదు, మత్స్య జనపాలతనయ! యే । నట్టి దైనఁ బనుతునయ్య నిన్ను? 111

ప్రతిపదార్థం: మత్స్య= మత్స్యదేశానికి; జనపాల= రాజైన విరాటుడి యొక్క; తనయ!= కుమారుడా!; మనుజులు= పాండవులు కాక ఇతరులైన మానవులు; అంటకుండన్= తాకకుండా ఉండేదానికి; మఱువడన్+చేసిన= దాచిపెట్టిన; అస్త్రశస్త్ర= అస్త్రాలయొక్క, శస్త్రాలయొక్క; సంచయంబు కాని= మోపుమాత్రమే కాని; శవము కాదు= పీనుగు కాదు; అట్టిది+అయినన్= అటువంటి (అది) శవమే అయితే; నిన్ను= రాజకుమారుడివైన నిన్ను; ఏను= నేను; పనుతున్+అయ్య?= నియమిస్తానా? (నియమించను అని భావం).

తాత్పర్యం: 'అది పాండవులు కాక, ఇతరులు తాకకుండా మరుగుపరిచిన ఆయుధాల మోపుమాత్రమే కాని, అది శవం కాదు. అట్లాంటిదే అయితే ఆ పనికి నిన్ను ఆజ్ఞాపిస్తానా?'

విశేషం: ఉత్తరుడు తనను రాకుమారుడిగా చెప్పుకొన్నదానికి తగినట్లుగా, అర్జునుడు కూడా ఉత్తరుడిని 'మత్స్యజనపాల తనయ!', అని అనటం గమనించదగ్గది. ఇక్కడి 'మనుజులు' అన్న మాటకు, సామాన్యులు అనికూడా చెప్పుకొనవచ్చును. సామాన్యమానవులు ఆయుధాలకట్టను తాకకుండా ఉండటానికి, దాన్ని పాండవులు శవంవలె తయారుచేశారు. ఇక్కడ ఉత్తరుడు పరాయివాడు గదా! అన్న సందేహం రావచ్చును. బృహన్నల రూపంలో ఉన్న అర్జునుడే ఆయుధాలకట్టను విప్పుమన్నాడు గనుక, ఆ సందేహానికి తావు లేదు. పనుతునయ్య - "ఒక్కొకచోఁ దద్ధర్మక్రియ యార్యార్థపరకంబయి వ్యతిరేకవ్యంజక ప్రశ్నార్థకంబగు" - ప్రౌఢవ్యాకరణం. క్రియాపరిచ్ఛేదం. సూ. 4. పనుతునయ్య - పనుతునా? పనుప నని భావం.

క. నమ్ముము కైదువు మోపగు, । జమ్మి వెసం బ్రాఁకి విడిచి చాపము నాకం
ది' మ్మనుఁడుఁ జేయునది లే । కమ్మగ్గుం దమ్మహీజ మలసత నెక్కెన్. 112

ప్రతిపదార్థం: కైదువు= ఆయుధాలయొక్క; మోపు+అగున్= కట్టయే కాని; (శవం కాదనుట); నమ్ముము= నా మాట నమ్ము; జమ్మి= జమ్మిచెట్టును; వెసన్+ప్రాఁకి= వెంటనే ప్రాకి; విడిచి= ఆ ఆయుధాల మోపును విప్పి; చాపము= గాండీవం; నాకున్=

నా చేతికి; అంది+ఇమ్ము= అందించుము; అనుడున్= అని చెప్పగానే; ఆ+ముగ్ధుండు= ఆ అమాయకుడైన ఉత్తరుడు; చేయునది లేక= విధి లేక; (ఏమీ ఎదురు చెప్పలేక); ఆ+మహీజము= ఆ జమ్మిచెట్టు; అలసతన్= మెల్లమెల్లగా; ఎక్కెన్= ఎక్కాడు.

తాత్పర్యం: ఉత్తరకుమారా! నా మాట నమ్ముము. అది ఆయుధాల మోపే. (శవం కాదు). వెంటనే జమ్మిచెట్టునెక్కి, మోపు విప్పి, ఆ గాండీవాన్ని నాకు అందించుము' అనగానే ఆతడు చేసేది లేక మెల్లగా జమ్మిచెట్టు ఎక్కాడు.

విశేషం: ఈ పద్యంలో తిక్కన మహాకవి ఉత్తరుడి నిగూఢమైన మనోభావాన్ని చిత్రించాడు. ఉత్తరుడికి తాను రాజకుమారుడిని అనే ఆత్మాభిమానం ఉన్నది. అందుకే ఆతడు శవాకారంగా ఉన్న ఆయుధాల కట్టను విప్పడానికి వెనుకాడాడు. అంతేగాక, తనను రాజకుమారుడు అని కూడా చూడకుండా ఆ నీచపు పని చేయుమంటావా? అని అర్జునుడితో అన్నాడు. కనుకనే అర్జునుడు, ఆ కట్ట శవం కాదనీ, ఆయుధాల మోపే అనీ, తనమాట నమ్ముమనీ అంటాడు. అయినా ఉత్తరుడి మనస్సులో ఏదో అనుమానం ఉన్నది. కనుకనే అర్జునుడు 'జమ్మి వెసం బ్రాకి' - అంటే, ఉత్తరుడు, 'అలసత'తో (నిదానంగా) చెట్టు ఎక్కాడు. దీనివలన, అర్జునుడు చెప్పినపని చేయటం ఉత్తరుడికి ఇష్టంలేదని తేలింది. కాని, ఆతడికి వేరేదారి లేదు. నిస్సహాయస్థితిలో ఆతడు చెట్టెక్కాడు. ఈ పరిస్థితిలో ఇది చాలా సూక్ష్మమైన మనోభావం. దీనిని మహాకవి తిక్కన 'అలసత నెక్కెన్' అనే ప్రయోగంలో సూచించాడు.

2. అందిమ్ము- అంది+ఇమ్ము; క్త్వార్థ కేకార సంధి కొందరికి సమ్మతం కాదు (బాలవ్యాకరణం). కాని ప్రౌఢవ్యాకరణం ఇప్రత్యయాంతావ్యయానికి సంధి కనపడుతున్నదని ఈ భారత ప్రయోగాన్నే ఉదాహరించింది. కవిసంశయకర్త అయిన అడిదము సూరకవి ఇటువంటి ప్రయోగాలను మరికొన్నింటిని చూపించాడు. కొందరు 'అందించు' అనే ధాతులపల్లవంమీద అందిమ్ము అనే రూపం ఏర్పడుతుందని చెప్పారు.

వ. ఇ ట్లుత్తరుండు సమారూఢ శమీవృక్షుం డగుటయు, నరదంబు పయి నిలుచుండి పాండవమధ్యముండు
'వేవేగ విడువు' మనవుడు నతండు నాయుధ సంచయ బంధం బెడలించిన. 113

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఉత్తరుండు; సమారూఢ= ఎక్కబడిన; శమీవృక్షుండు= జమ్మిచెట్టు కలవాడు; అగుటయున్; పాండవ మధ్యముండు= అర్జునుడు; అరదంబు పయిన్= రథంమీద; నిలుచుండి= నిలువబడి; వేవేగన్= త్వరగా; విడువుము= విడదీయుము; అనవుడున్= అనగా; అతండున్= ఉత్తరుడు; ఆయుధ= ఆయుధాల యొక్క; సంచయంబు= సమూహం యొక్క (కట్టయొక్క); బంధంబు= తాడుముడిని; ఎడలించినన్= విప్పగా.

తాత్పర్యం: ఉత్తరుడు పై విధంగా జమ్మిచెట్టు ఎక్కాడు. అర్జునుడు రథం మీద నిలుచుండి, 'త్వరత్వరగా కట్ట విప్పుము' అని అన్నాడు. ఉత్తరుడు ఆ మోపు విప్పగా (తరువాతి పద్యంతో అన్వయం).

క. మెఱసి యుదయించు గ్రహముల । తఱచు ప్రభలఁ గ్రేణిసేసి దశదిశలం గ్రి
క్కిఱిసి వెడలె నా, విండ్లన్ । మెఱుఁగులు, నృపతనయు దృష్టులు మిఱుమిట్లు గొనన్. 114

ప్రతిపదార్థం: మెఱసి= మెరుస్తూ; ఉదయించు గ్రహముల= ఉదయించే గ్రహాలయొక్క; తఱచు= దట్టమైన; ప్రభలన్= వెలుగులను; క్రేణి+చేసి= తిరస్కరించి; దశదిశలన్= పది దిక్కులలో; క్రిక్కిఱిసి= పిక్కటిల్లి; నృపతనయు= ఉత్తరుడి యొక్క; దృష్టులు= చూపులు; మిఱుమిట్లు+కొనన్= కన్నులు మిక్కిలి చెదిరేటట్లు; ఆ విండ్లన్= ఆ ధనుస్సుల నుండి; మెఱుఁగులు వెడలెన్= కాంతులు వచ్చాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఉదయించేటప్పటి గ్రహాల నిబిడమైన కాంతులను మించిన కాంతులు పదిదిక్కులలో వ్యాపించి, ఉత్తరుడి చూపులను చెదరగొట్టుతూ ఆ విండ్లనుండి వెలువడ్డాయి.

విశేషం: అలం: ఉపమ.

వ. అట్టియెడ నయ్యాయుధంబులు. 115

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో (ఉత్తరుడికి మిరుమిట్లు గొలుపుతూ); ఆ+ఆయుధంబులు= కట్ట విప్పగా కనపడిన ఆ ఆయుధాలు.

తాత్పర్యం: ఆ సమయంలో ఆ ఆయుధాలు.

క. పెనుబాముల చందంబున । నునికికి భయమంది వడఁకు నుర్వీశసుతుం
గని తగుమాటలఁ గుంతీ । తనయుఁడు వెఱ వాపుటయు, నతం డచలితుఁడై. 116

ప్రతిపదార్థం: పెను+పాముల చందంబునన్= పెద్దపెద్ద పాముల వలె; ఉనికికిన్= ఉండేదానికి (ఉండడం వలన); భయము+అంది= భయపడి; వడఁకు= వణకిపోతూ ఉన్న; ఉర్వీశసుతున్= రాకుమారుడైన ఉత్తరుడిని; కని= చూచి; కుంతీ తనయుఁడు= అర్జునుడు; తగు మాటలన్= భయాన్ని పోగొట్టేదానికి తగిన మాటలతో; వెఱ= భయాన్ని; పాపుటయున్= పోగొట్టగా; అతండు= ఉత్తరుడు; అచలితుఁడు+ఐ= చలించనివాడై (ధైర్యం గలవాడై).

తాత్పర్యం: ఉత్తరుడి చూపులకు ఆయుధాలు పెద్దపెద్ద పాములవలె కనపడటంతో, ఆతడు భయంతో వణికిపోయాడు. దానిని గమనించిన అర్జునుడు తగిన మాటలతో ఆతడి భయం పోగొట్టాడు. దానితో ఆతడు ధైర్యంతో. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

వ. పొదుపు విరియందట్టి కనుంగొని నిరూపించి, 'సారథీ!' యని సవ్యసాచిం బిలిచి యిట్లనియె. 117

ప్రతిపదార్థం: పొదుపు= మోపు; విరియన్+తట్టి= కట్ట సళ్ళు పోయేదానికి తట్టుతూ విప్పి; కనుంగొని= చూచి; నిరూపించి= ఏర్పరచి; సారథీ!= రథాన్ని నడిపేవాడా!; అని; సవ్యసాచిన్= అర్జునుడిని; పిలిచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆయుధాల కట్టను విప్పి, చూచి, ఏర్పరచి తెలిసికొని, 'సారథీ!' అని బృహన్నలను పిలిచి ఉత్తరుడు ఇట్లా అన్నాడు.

విశేషం: చెట్టు ఎక్కినా, తాను రథికుడను-అనే ఉత్తరుడు అనుకొంటున్నాడు. అందుకే బృహన్నలను, 'సారథీ!' అని పిలిచింది. అంటే ఉత్తరుడిలో రాజసభావం తగ్గలేదన్నమాట. 'సారథీ!' అన్న సంబోధనతోనే కవి హాస్యాన్ని చిందించాడు.

క. 'ఇది యొక చాపము విస్మయ । మొదవించుచుఁ గొండచిలువయొకొ నాఁ దగి యు
న్నది, ఖచిత కనక కమల స । ముదయద్యుతి సముపగూహనోజ్జ్వల మగుచున్. 118

ప్రతిపదార్థం: ఇది= ఇది (ఉత్తరుడికి, మిగిలిన ధనుస్సులలో ప్రత్యేకంగా కనపడినట్టిది); ఒక చాపము= (అన్నిటివలె ఉండనట్టి) ఒక ధనుస్సు; విస్మయము+ఒదవించుచున్= ఆశ్చర్యాన్ని గొలుపుతూ; కొండచిలువ+ఒకొ నాన్= కొండచిలువేమో అనే విధంగా; ఖచిత= పొదగబడ్డ; కనక కమల= బంగారు పద్మాలయొక్క; సముదయ= గుంపుయొక్క; ద్యుతి= కాంతియొక్క; సమ్+ఉపగూహన= ఎక్కువైన ఆవరణంతో; ఉజ్జ్వలము+అగుచున్= మిక్కిలి ప్రకాశిస్తూ; తగి+ఉన్నది= గొప్పగా ఉన్నది.

తాత్పర్యం: 'ఈ విల్లు (మిగిలిన విండ్లలో ప్రత్యేకంగా ఉన్నది) ఆశ్చర్యాన్ని కలిగిస్తూ, కొండచిలువవలె ఉన్నది. దీనిమీద బంగారు పద్మాలు పొదగబడ్డాయి. ఆ విల్లు కాంతి అంతటా క్రమ్ముతూ ఉన్నది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. దీనిం బాండవులయం దెవ్వరు ధరియింతు?' రని మఱియు బహు విధంబులగు నాయుధంబు లుపలక్షించి వేఱు వేఱ వాని చందంబు లుపన్యసించి, 'యివి యెవ్వ రెవ్వరి' వని యడిగిన నర్జునుం డిట్లనియె.119

ప్రతిపదార్థం: పాండవులయందున్= పాండవులలో; దీనిన్= ఈ చాపాన్ని; ఏ+వారు= ఎవరు; ధరియింతురు?= తాలుస్తారు; అని= అని అడిగి; మఱియు; బహువిధంబులు+అగు= పెక్కురకాలైన; ఆయుధంబులు= ఆయుధాలను; ఉపలక్షించి= బాగా పరిశీలించి చూచి; వేఱువేఱన్= విడివిడిగా; వాని= ఆ ఆయుధాల యొక్క; చందంబులు= విధములు; ఉపన్యసించి= వర్ణించిచెప్పి; ఇవి= ఈ ఆయుధాలు; ఎవ్వరివి+ఎవ్వరివి+అని= ఎవ్వరెవ్వరివని; అడిగినన్= అడుగగా; అర్జునుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: (కొండచిలువవలె ఉండే) ఈ వింటిని పాండవులలో ఎవరు ఉపయోగిస్తారు?' అని ఉత్తరుడు అడిగాడు. ఇంకా ఆ చెట్టుమీద ఉన్న ఎన్నో ఇతర ఆయుధాలను చూచి, వేరువేరుగా ఆ ఆయుధాలను గూర్చి వివరించి, వీటి నన్నిటినీ ఎవరెవరు ధరిస్తారో చెప్పుమని ఉత్తరుడు అడుగగా, దానికి అర్జునుడు ఇట్లా చెప్పాడు.

తే. 'తొలుత నీవు న న్నడిగిన దొడ్డ విల్లు । గాండివము, ఫల్గునున కేడుగడయు నదియ;
సమరమున దేవదానవ సమితినైన । గెలుచు నశ్రమమున దానివలన నతఁడు. 120

ప్రతిపదార్థం: తొలుతన్= మొట్టమొదట; ఈవు= నీవు; నన్నున్= నన్ను; అడిగిన= అడిగినట్టి; దొడ్డవిల్లు= పెద్దవిల్లు; గాండివము= గాండీవం అనే పేరుగల ధనుస్సు; అది+అ= అదే; ఫల్గుననకున్= అర్జునుడికి; ఏడుగడయున్= ఆధారం (రక్షణ); దానివలనన్= ఆ ధనుస్సు వలననే; అతఁడు= అర్జునుడు; సమరమునన్= యుద్ధంలో; దేవ= దేవతలయొక్క; దానవ= రాక్షసులయొక్క; సమితిన్+ఐనన్= సమూహాన్ని అయినా; అశ్రమమునన్= శ్రమలేకుండా (తేలికగా); గెలుచున్= గెలుస్తాడు.

తాత్పర్యం: 'మొట్టమొదట నీవు నన్ను అడిగిన ఆ ధనుస్సు గాండీవం. అదే అర్జునుడికి ఆధారం. అతడు దాని ప్రభావంతోనే దేవ, దానవ సమూహాలను కూడా అలవోకగా జయిస్తాడు.

విశేషం: ఏడుగడ= (ఏడు, కడ) ఏడు విధాలైన దిక్కు. 1. గురువు, 2. తల్లి, 3. తండ్రి, 4. పురుషుడు, 5. విద్య, 6. దైవం, 7. దాత.

క. **ఆద్యపురుషోపలాలిత । ముద్ద్యోతిత రోచిరుద్గమోగ్రం బరి ని**
ర్భేద్యము దివ్యజనన మన । వద్యం బిది కార్ముకైక వరము గుమారా! **121**

ప్రతిపదార్థం: కుమారా!= ఓ ఉత్తరకుమారా!; ఇది= ఈ గాండీవం అనే పేరుగల విల్లు; ఆద్యపురుష+ఉపలాలితము= పూర్వులచేత (బ్రహ్మ మొదలైన వారిచేత) ధరించబడిందీ; ఉద్ద్యోతిత రోచిస్+ఉద్గమ+ఉగ్రంబు= మిక్కిలి ప్రకాశించే కాంతుల యొక్క ప్రసారంతో భయాన్ని కలిగించేదీ; అరి= శత్రువులకు; నిర్భేద్యము= విరుగగొట్టటానికి వీలుకానిదీ; దివ్యజననము= దివ్యమైన (మహిమతో కూడిన) పుట్టుక కలదీ (అగ్నిలో పుట్టింది); న+అవద్యంబు= నిందించరానిది (దోషం లేనిది); కార్ముక+ఏకవరము= ధనుస్సులలో సాటిలేని మేటి.

తాత్పర్యం: ఉత్తరకుమారా! ఈ గాండీవాన్ని పూర్వమహాపురుషులైన బ్రహ్మ మొదలైన వాళ్ళు ధరించారు. ఆ వింటి కాంతులు ఎంతో భయంకరమయినవి. ఎంతటి శత్రువులైనా, దానిని విరుగగొట్టలేరు. దివ్యమైన పుట్టుక కలది, ఏ లోపం లేనట్టిది. ధనుస్సులన్నింటిలో ఇది ఎంతో శ్రేష్ఠమైనది.

వ. **ఇమ్మహనీయ చాపంబు బ్రహ్మ శతసహస్ర వర్షంబులు, ప్రజాపతి చతుష్షష్టి సహస్ర వర్షంబులు, నింద్రుండు పంచాశీతి హాయనంబులు, సోముండు పంచశతాబ్దంబులు, వరుణుండు శతశరత్సమితియుఁ గ్రమంబున ధరియించిరి; వరుణుచేత నగ్నిదేవుండు వేడుకపడి పుచ్చుకొని పదంపడి ఖాండవ దహనంబున నద్భుత కర్మంబునకు మెచ్చి వివ్వచ్చున కిచ్చె; నతండును నఱువదేనేండ్లు ధరియింపంగలవా; డిట్లిది త్రిలోక పూజ్యమహిమ నొప్పుచుండు.** **122**

ప్రతిపదార్థం: ఈ+మహనీయ చాపంబు= ఈ గొప్పదైన ధనుస్సు; బ్రహ్మ; శతసహస్రవర్షంబులు= లక్షయేండ్లు; ప్రజాపతి; చతుష్షష్టి= అరవైనాలుగు; సహస్ర వర్షంబులున్= వేల యేండ్లున్నూ; ఇంద్రుండు= ఇంద్రుడు; పంచాశీతిహాయనంబులు= ఎనభైఐదు ఏండ్లు; సోముండు= చంద్రుడు; పంచశతాబ్దంబులు= ఐదువందల యేండ్లు; వరుణుండు; శతశరత్= నూరు సంవత్సరాల యొక్క; సమితియున్= సమూహం; క్రమంబునన్= వరుసగా; ధరియించిరి= ధరించారు; అగ్నిదేవుండు= అగ్ని; వేడుకపడి= ముచ్చటపడి; వరుణుచేతన్= వరుణదేవుడి నుండి; పుచ్చుకొని= తీసికొని; పదంపడి= తరువాత; ఖాండవ దహనంబునన్= ఖాండవవనాన్ని కాల్చటంలో (చూపిన); అద్భుత కర్మంబునకున్= ఆశ్చర్యాన్ని కలిగించిన పనికి; మెచ్చి= ప్రశంసించి; వివ్వచ్చునకున్+ఇచ్చెన్= అర్జునుడికి ఇచ్చాడు; అతండును= ఆ అర్జునుడు కూడా; అఱువది+ఏను+ఏండ్లు= అరవై అయిదేండ్లు; ధరియింపన్+కలవాఁడు= తాల్చగలుగుతాడు; ఇట్లు= ఈ విధంగా; ఇది= గాండీవం; త్రిలోక పూజ్యమహిమన్= మూడులోకాల్లో పూజించదగిన మహిమతో; ఒప్పుచున్+ఉండున్= ప్రకాశిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: ఉత్తరకుమారా! ఈ గాండీవాన్ని బ్రహ్మ లక్షసంవత్సరాలు ధరించాడు. ఆ తరువాత ప్రజాపతి అరవైనాలుగు వేల సంవత్సరాలూ, ఇంద్రుడూ ఎనభైఐదేండ్లు, చంద్రుడు ఐదువందల సంవత్సరాలు, వరుణుడు నూరేండ్లు చేపట్టారు. గాండీవం యొక్క మహిమకు ఎంతో ఇష్టపడి, అగ్నిదేవుడు వరుణదేవుడి దగ్గర నుండి దానిని తీసికొన్నాడు. ఖాండవవనాన్ని కాల్చే సమయంలో అర్జునుడి శౌర్యానికి మెచ్చి, అగ్ని ఆ వింటిని అతడికి కానుకగా ఇచ్చాడు. అట్లాంటి ఈ గాండీవాన్ని అర్జునుడు అరవైఐదేండ్లు ధరిస్తాడు. ఈవిధంగా, ఈ గాండీవం ముల్లోకాలలో పూజింపదగిన మహిమతో ప్రకాశిస్తూ ఉన్నది.

విశేషం: చివరకు అర్జునుడు అగ్నిదేవుడి ఆజ్ఞతో గాండీవాన్ని సముద్రంలో విడుస్తాడు.

సీ. నీలోత్పలచ్ఛాయ నెరసి సౌవర్ణ వృ । షావళి నొప్పు బాణాసనంబుఁ,
దాళప్రమాణ సుందరమునై భర్మశా । ఖామృగాంచితమగు కార్ముకంబుఁ,
దీవ్రకృశాను సందీప్తాకృతియుఁ గన । త్కనక మత్స్యంబులుఁ గలుగు ధనువుఁ,
మెఱుఁగారు సారంబు మెఱయు కాంచనమయూ । రముల శోభిల్లు చాపమును వరుసఁ

ఆ. బాండవాగ్రజుండుఁ, బవనపుత్రుఁడు, నకు । లుండుఁ దదనుసంభవుండుఁ బట్టు
నవి కుమార! య గ్గవాజిన కోశమ । హాశరంబు పార్థునదియ చూవె! 123

ప్రతిపదార్థం: నీల+ఉత్పల+ఛాయ= నల్ల కలువల యొక్క కాంతితో; నెరసి= ఒప్పి; సౌవర్ణవృష+ఆవళిన్+ఒప్పు= బంగారుతో చేయబడ్డ ఎద్దుల సమూహంతో ప్రకాశించే; బాణ+ఆసనంబున్= విల్లును (ధర్మజుడిది); తాళప్రమాణ= తాటిచెట్టంత పొడుగ్గా ఉండి; సుందరమున్+ఐ= సుందరంగా ఉన్న; భర్మ, శాఖామృగ+అంచితము+అగు= బంగారు కోతులతో ప్రకాశించే; కార్ముకంబున్= ధనుస్సు (భీముడిది); తీవ్ర= తీవ్రమైన (మండుతూ ఉండే); కృశాను= అగ్నివలె; సందీప్త+ఆకృతియున్= ప్రకాశించే ఆకారమూ; కనత్= శోభిల్లుతున్న; కనకమత్స్యంబులున్ కలుగు ధనువున్= బంగారు చేపలు చెక్కిన విల్లు (నకులుడిది); మెఱుఁగారు, సారంబు= వన్నెకెక్కిన గట్టితనం; మెఱయు= మెరుస్తూఉన్న; కాంచన= బంగారుతో చేసిన; మయూరములన్= నెమళ్ళతోనూ; శోభిల్లు= వెలుగొందే; చాపమును= విల్లు (సహదేవుడిది); వరుసన్= క్రమంగా; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజూ; పవనపుత్రుఁడు= వాయుకుమారుడైన భీముడూ; నకులుండు= నకులుడు; తద్= ఆ నకులుడి యొక్క; అను= అనుసరించి; సంభవుండు= పుట్టినవాడైన (తమ్ముడు) సహదేవుడూ; పట్టునవి= ధరించేవి; కుమార!= ఓ ఉత్తరకుమారా!; ఆ+గో+అజినకోశ= (ఆ+గవాజినకోశ) ఆ ఎద్దుయొక్క తోలు ఒరలోనున్న; మహాశరంబు= గొప్పదైన బాణం; పార్థు+అది+అ చూవె= అర్జునుడిదే చూడు!

తాత్పర్యం: బంగారు ఎద్దులను అందంగా చెక్కిన, నల్లకలువల కాంతులతో ప్రకాశించే ధనుస్సును ధర్మరాజు ధరిస్తాడు. తాటిచెట్టంత పొడుగ్గా ఉండి, బంగారు కోతులు చెక్కబడిన వింటిని భీమసేనుడు ఉపయోగిస్తాడు. అగ్నివలె వెలుగుతూ, బంగారు చేపలు పొదిగిన వింటిని నకులుడు చేపడతాడు. బంగారు నెమళ్ళతో చాలా గట్టిగా ఉన్న ధనుస్సును సహదేవుడు ధరిస్తాడు.ఎద్దుతోలు ఒరలో ఉన్న ఆ పెద్దబాణం అర్జునుడిది!

విశేషం: వీరులు వారివారి ధనుస్సుల మీద తమ ఇష్టాలను బట్టి (మనస్తత్త్వాన్ని బట్టి) కొన్ని గుర్తులను నిలుపుకొంటారు. అంతేకాక ధనుస్సులమీద, బాణాలమీద వీరుల పేర్లుకూడా చెక్కుతారు. వృషభం ధర్మానికి గుర్తు. ధర్మానికి మారుపేరైన ధర్మరాజు అందుకే తన ధనుస్సుమీద వృషభాలను చిత్రించుకొన్నాడు. భీముడు ఉద్రేకస్వభావం కలవాడు. పైగా ఉన్నతమైన ఆకారం కలవాడు. అవసరాన్నిబట్టి చెట్లతోనే యుద్ధం చేస్తాడు. అందుకే ఆతడి ధనుస్సు తాటిచెట్టంత ఉన్నది. ఆంజనేయుడు, భీముడూ-ఇద్దరూ వాయుపుత్రులే. అందుకే కోతులను మమకారంతో తన ధనుస్సు మీద నిలుపుకొన్నాడు. నకులుడు చాలా చురుకైనవాడు. ఎక్కువ చలనశీలం కలవాడు. కనుకనే సంపత్కరాలైన చేపల్ని తన ధనుస్సుమీద చిత్రించుకొన్నాడు. సహదేవుడు చాలా కోమలమైన వాడు. అందమైనవాడు. అందుకే నెమళ్ళను ఇష్టంగా తన వింటిపైన అలంకరించాడు. అర్జునుడి గాండీవం మీద బంగారు పద్మాలు చెక్కబడ్డాయి. పద్మం సౌభాగ్యానికీ, దైవత్వానికీ చిహ్నం. కృష్ణ భక్తుడైన అర్జునుడికి పద్మాలు చెక్కిన గాండీవం తగింది. పద్మం లక్ష్మికి, విష్ణువుకు సంబంధించింది. అందుకే మహావీరులు, ధర్మ స్వరూపులు అయిన పాండవులు తమతమ విండ్లను వారి మనఃప్రవృత్తులను బట్టి అలంకరించుకొన్నారు.

క. ఎద్దెసలం దనరుచులు స । ముద్దీప్తము లగుచునుండ, నుజ్జ్వల మగు న
యుద్ధండ గదాదండము । పెద్దయు నెడ మెచ్చి పట్టు భీముఁడు పోరన్.' 124

ప్రతిపదార్థం: ఏ+దెసలన్= అన్ని దిక్కులలో; తన= తనయొక్క; రుచులు= వెలుగులు; సమ్+ఉత్+ దీప్తములు+అగుచున్+ ఉండన్= బాగా ప్రకాశిస్తూ ఉండగా; ఉజ్జ్వలము+అగు= కాంతిమంతమైన; ఆ+ఉద్దండ గదాదండము= ఆ గొప్పదైన గద; భీముఁడు= భీమసేనుడు; పెద్దయున్= ఎక్కువగా; ఎడ= మనస్సులో; మెచ్చి= ఇష్టపడి; పోరన్= యుద్ధంలో; పట్టున్= ధరిస్తాడు.

తాత్పర్యం: తన కాంతులు అన్నిదిక్కులలో వ్యాపిస్తూ ఉండగా, అమితంగా ప్రకాశించే ఆ గదాదండాన్ని భీముడు ఎంతో ఇష్టపడి చేపట్టుతాడు.'

అర్జునుఁ డుత్తరునకుఁ ద న్నెఱింగించుట (సం. 4-39-1)

వ. అనిచెప్పి మఱియు బాణ కృపాణ తనుత్రాణాదు లగు వివిధ సాధనంబులు వేఱువేఱ నిరూపించి గ్రక్కున నెఱింగించె; నప్పుడు మూఢాత్ముండగు నయ్యుత్తరుండు పాండవోత్తము నెఱుంగమి నిట్లనియె. 125

ప్రతిపదార్థం: అని, చెప్పి; మఱియున్= ఇంకా; బాణ= బాణాలు; కృపాణ= కత్తులు; తనుత్రాణ= కవచాలు (శరీరాన్ని రక్షించేవి); ఆదులు+అగు= మొదలైనవి; వివిధ సాధనంబులు= పలురకాలైన యుద్ధ పరికరాలను; వేఱు, వేఱు+అ= విడివిడిగా; నిరూపించి= ఏర్పరచి (తెలిసేటట్లు చేసి); గ్రక్కునన్= తొందరగా; ఎఱింగించెన్= పరిచయం చేశాడు; అప్పుడు= ఆ సమయంలో; మూఢ+ఆత్ముండు+అగు= మూర్ఖుడైన; ఆ+ఉత్తరుండు= ఆ ఉత్తరకుమారుడు; పాండవ+ఉత్తమున్= పాండవులలో శ్రేష్ఠుడైన అర్జునుడిని; ఎఱుంగమిన్= తెలియకపోవటం చేత; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: పాండవుల ఆయుధాల విషయాన్ని అర్జునుడు ఉత్తరుడికి చెప్పి, ఇంకా అమ్ములు, కత్తులు, కవచాలు మొదలైన వాటిని విడివిడిగా తొందర తొందరగా వివరించాడు. ఇంత చెప్పినా కానీ, మూర్ఖుడైన ఆ ఉత్తరుడు అర్జునుడిని తెలిసికొనలేక, అతడితో ఇట్లా అన్నాడు.

క. 'ఈ యెడ ని ట్లిమ్మహనీ । యాయుధములు పెట్టి యెచటి కరిగిరి మన కౌం
తేయులు బృహన్నలా! తగ । నీ యెఱిఁగిన యంతవట్టు నిక్కము సెపుమా!' 126

ప్రతిపదార్థం: బృహన్నలా!= ఓ బృహన్నలా!; మన కౌంతేయులు= కుంతీ కుమారులైన మన పాండవులు; ఈ+ఎడన్= ఈ చోట (ఈ జమ్మిచెట్టు మీద); ఇట్లు= ఈవిధంగా; ఈ+మహనీయ+ఆయుధములు= మహిమతో కూడిన ఈ ఆయుధాలు; పెట్టి= దాచిపెట్టి; ఎచటికిన్= ఎక్కడికి; అరిగిరి= వెళ్ళారు; తగన్= తగినట్లు; నీ+ఎఱిఁగిన+అంత వట్టు= నీకు తెలిసినంత వరకు; నిక్కము= నిజాన్ని; చెప్పుమా!= చెప్పుము.

తాత్పర్యం: 'బృహన్నలా! మహిమోపేతమైన ఈ ఆయుధాలను ఈచెట్టుమీద భద్రంగా దాచిపెట్టి మనపాండవులందరూ ఎక్కడికి పోయారో నీకు తెలిసినంతవరకు నిజం చెప్పవా?'

విశేషం: మన కౌంతేయులు- అనే మాటలో ఒక ఆత్మీయత ఉన్నది. అది ఎట్లా ఉన్నదో తరువాతి వచనంలో తెలుస్తుంది.

వ. అని సస్నేహంబును, సగౌరవంబును, సవిషాదంబునుంగా మఱియును. 127

ప్రతిపదార్థం: అని= అని పలికి; సస్నేహంబును= స్నేహంతో కూడింది; సగౌరవంబును= గౌరవంతో కూడింది; సవిషాదంబునున్+ కాన్= దుఃఖంతో కూడినదిగా; మఱియును= ఇంకా ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఉత్తరుడు పైవిధంగా చెప్పి, పాండవులపై స్నేహంతో, గౌరవంతో, దుఃఖంతో ఇట్లా అన్నాడు.

విశేషం: స్నేహం, గౌరవం, విచారం అనేవి ఉత్తరుడి మనస్సులో కలిగాయి. ఈ విషయం ఇంకా వివరంగా ముందు పద్యాలలో కనిపిస్తుంది.

క. 'ఏ నమ్మహానుభావుల । మేనల్లుఁడ; వార లార్యమిత్రులు, శత్రు
క్ష్మా నాయక గర్వ తమో । భానులు, బంధుహిత కార్య పరతంత్రాత్ముల్. 128

ప్రతిపదార్థం: ఏను= నేను; ఆ+మహానుభావుల= ఆ మహాత్ములయొక్క; మేన+అల్లుఁడన్= మేనల్లుడిని; వారలు= గొప్పవారైన ఆ పాండవులు; ఆర్య= పూజ్యులైన; మిత్రులు= స్నేహితులు; శత్రు= శత్రువులైన; క్ష్మానాయక= రాజులయొక్క; గర్వ= అహంకారం అనే; తమోభానులు= కారుచీకటికి సూర్యులు (అహంకారం నల్లటిది అనీ, కనుక చీకటితో పోల్చి, దాన్ని పోగొట్టే సూర్యులు పాండవులు అని భావం); బంధు= చుట్టాలకు; హిత= మేలుచేసే; కార్య= పనులలో; పరతంత్ర= నిమగ్నమైన; ఆత్ముల్= మనస్సులు గలవాళ్లు.

తాత్పర్యం: 'మహానుభావులైన పాండవులకు నేను మేనల్లుడిని. వాళ్ళు నాకు పూజ్యులైన మిత్రులు. శత్రురాజుల గర్వం అనే చీకటిని పోగొట్టే సూర్యులవంటివారైన ఆ పాండవులు బంధువులకు మేలు చేసేవారు.

విశేషం: ఉత్తరుడు పాండవులకు తాను మేనల్లుడిని అని చెప్పుకొనటంలో చుట్టరికపు సంబంధమైన స్నేహం, ఆర్యమిత్రులు- అని చెప్పుకొనటంలో వారిపై ఆతడికి ఉన్న అపారమైన గౌరవభావం కనిపిస్తాయి. ఉత్తరుడికి పాండవులను గురించిన విషాదభావం ముందు పద్యాలలో స్పష్టమవుతుంది.

తే. అయ్యుధిష్ఠిరుఁ డెచ్చట నడఁగి యున్న । వాఁడొ? భీముని పార్థుని వర్తనంబు
లెయ్యెడల నేమి చందంబులయ్యె? నక్క । టా విధాతృండ! కవ లెందు దాఁగి రొక్కొ? 129

ప్రతిపదార్థం: ఆ+యుధిష్ఠిరుఁడు= ఆ ధర్మరాజు; ఎచ్చటన్= ఎక్కడ; అఁడగి+ఉన్నవాఁడొ= అణగిఉన్నాడో (దాగినాడో); భీముని= భీమునియొక్క; పార్థుని= అర్జునుడియొక్క; వర్తనంబులు= నడవడికలు; ఏ+ఎడలన్= ఎక్కడ; ఏమి చందంబులు+అయ్యెన్= ఎట్లా ఉన్నాయో; అక్కటా!= అయ్యో!; విధాతృండ!= హతవిధీ!; కవలు= నకులుడు, సహదేవుడు; ఎందున్= ఎక్కడ; దాఁగిరి+ఒక్కొ?= దాగినారో కదా?

తాత్పర్యం: ధర్మరాజు ఎక్కడ ఒదిగినాడో, భీముడు, అర్జునుడు ఎట్లా ఉన్నారో, అయ్యో దైవమా! నకులుడూ, సహదేవుడూ ఎక్కడ మరుగుపడి ఉన్నారో కదా!

క. భూపాల వల్లభాజన । దీపిక యనఁ జాలు ద్రౌపదికి నెయ్యెడలం
దేపాటులు వాటిల్లెనొ? । కాపురుషులవలన నిట్టి కాఱియ పుట్టెన్. 130

ప్రతిపదార్థం: భూపాల= రాజులయొక్క; వల్లభాజన= భార్యల (రాణుల) సమూహానికి; దీపిక= దీపంవంటిది; అనన్+చాలు= అని చెప్పదగినట్టి; ద్రౌపదికిన్= ద్రుపదరాజు కూతురైన ద్రౌపదీదేవికి; ఏ+ఎడల+అందున్= ఏ చోట్లలో; ఏ పాటులు= ఏ చిక్కులు (కష్టాలు); పాటిల్లెనొ?= కలిగినాయో?; కాపురుషుల వలనన్= దుష్టులైన కౌరవులవలన; ఇట్టి= ఇటువంటి; కాఱియ పుట్టెన్= కష్టం వచ్చింది.

తాత్పర్యం: లోకంలో మహారాణులందరికీ దీపం వంటి ద్రౌపదికి ఎక్కడ ఎటువంటి చిక్కులు వచ్చాయో? ఆమెకు దుష్టులైన ఆ కౌరవుల వలననే ఇటువంటి ఆపద వచ్చింది.

క. **కపట ద్యూత మొనర్చిన । నృపతియు దుర్యోధనాది నీచుల వలఁ బా**
ఱి పడియెఁ గడుఁ బెక్కిడుమల । రిపుమర్దన వీర్యభుజ గరిష్ఠుం డయ్యున్. 131

ప్రతిపదార్థం: కపట= మోసంతో కూడిన; ద్యూతము+ఒనర్చినన్= జూదాన్ని ఆడటం వలన; నృపతియున్= రాజైన ధర్మరాజు కూడా; రిపు= శత్రువులయొక్క; మర్దన= మర్దనంగల; వీర్య= పరాక్రమంచేత; భుజ= భుజబలంచేత; గరిష్ఠుండు+అయ్యున్= గొప్పవాడైనా (సమర్థుడైనా); దుర్యోధన+ఆది= దుర్యోధనుడు మొదలైన; నీచుల= నీచులయొక్క; వలన్= వలలో; పాఱి= చిక్కుకొని; కడున్= మిక్కిలి; పెక్కు= అనేకరకాలైన; ఇడుమలన్+పడియెన్= కష్టాలు పడ్డాడు.

తాత్పర్యం: శత్రువులను నాశనం చేసే సామర్థ్యం ఉండీ కూడా రాజైన ధర్మరాజు, దుర్యోధనుడు మొదలైన నీచుల వలలో పడి, మాయాద్యూతాన్ని ఆడి, ఓడి, ఇన్ని కష్టాలు పడ్డాడు.

క. **వినఁబడ రెచ్చోటను దమ । వినుత మహీరాజ్య మహిమ విడిచి చనుట, నే**
మని వినియెదనో నీచే?' ననుడు నతం డిట్టులనియె నాతని తోడన్. 132

ప్రతిపదార్థం: (పాండవులు-అని అనుకోవాలి) తమ= తమయొక్క; వినుత= నుతించబడిన (పేరుకెక్కిన); మహీరాజ్య= పృథివీసామ్రాజ్యంయొక్క; మహిమ= వైభవాన్ని; విడిచి= త్యజించి; (వదలిపెట్టి); చనుటన్= (అడవులకు) వెళ్ళటం వలన; ఏ+చోటను= ఏచోట్లో కూడా (ఎక్కడా గానీ); వినఁబడరు= వినబడటం లేదు. (తెలియటం లేదు); నీచేన్= (ఇప్పుడు) నీవలన; ఏమి+అని= వారిని గూర్చి ఏ మాటను; వినియెదనో= వింటానో కదా!; (అని) అనుడున్= ఉత్తరుడు అనగా; అతండు= ఆ బృహన్నల రూపంలో ఉండే అర్జునుడు; ఆతనితోడన్= ఆ ఉత్తరుడితో; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సుప్రసిద్ధమయిన తమరాజ్య వైభవాన్ని వదలేసి, వెళ్ళిపోవడంతో, పాండవుల మాటే ఎక్కడా వినబడటం లేదు. ఇప్పుడు నీవలన వాళ్లను గురించి ఏమాట వింటానో?' అని ఉత్తరుడు అన్నదానికి, అర్జునుడు ఉత్తరుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: పై పద్యాలలో ఉత్తరుడికి పాండవులమీదా, ద్రౌపదీమీదా ఉన్న నిజమైన ఆవేదనా, ఆదుర్దా కనిపిస్తాయి.

వ. **'వారలకు వగవ వలవదు; విధివశంబున వచ్చిన యాపదకు నోర్చి బాసతప్పక తారును బాంచాలియు నొక్కటఁ బండ్రెండేండ్లు వనంబున వసియించి పదుమూఁడగునేఁ డజ్ఞాతవాసంబు సలుప వలయుట నిట వచ్చి మనవీట నవ్యాపన్నులై యున్నవారు. వినుము వారి నెఱింగించెద. 133**

ప్రతిపదార్థం: వారలకున్= పాండవులను గురించి; వగవ వలవదు= దుఃఖపడవద్దు; విధివశంబునన్= విధి (తలరాత) కారణంగా; వచ్చిన, ఆపదకున్= కలిగిన కష్టానికి; ఓర్చి= సహించి; బాస, తప్పక= చేసికొన్న ఒప్పందం పొల్లుపోకుండ; తారును= ఆ పాండవులున్నూ; పాంచాలియున్= ద్రౌపదికూడా; ఒక్కటన్= కలిసి; పండ్రెండు+ఏండ్లు= పన్నెండేళ్ళు; వనంబున వసియించి= అడవులలో ఉండి; పదుమూఁడు+అగు+ఏఁడు= పదమూడవ ఏడు; అజ్ఞాతవాసంబు= రహస్యంగా నివసించటం; చలుపవలయుటన్= చేయాలి కనుక; ఇట వచ్చి= ఇక్కడకు వచ్చి; మన వీటన్= మన నగరంలో; అవ్యాపన్నులు+ఐ= ఆపద లేనివారై; ఉన్నవారు= ఉన్నారు; వారిని= పాండవులను; ఎఱింగించెదన్= తెలుపుతాను; వినుము.

తాత్పర్యం: (ఉత్తరకుమారా!) వాళ్ళను గురించి నీవు ఆలోచించవలసిన పనిలేదు. విధివశాత్తు కలిగిన కష్టాలను ఓర్చుకొని, తమ బాసను తప్పకుండా పాండవులూ, పాంచాలీ అడవులలో పన్నెండు సంవత్సరాలుండి, పదమూడో ఏడు అజ్ఞాతవాసాన్ని పూర్తి చేసికొనేందుకు ఇక్కడికే వచ్చి, మన నగరంలోనే ఏ అపాయం లేకుండా ఉన్నారు. వారెవరెవరో నీకు చెప్పుతాను; వినుము.

క. కంకుఁడు ధర్మసుతుఁడు; వల । లాంకుఁడు భీముండు; కవలు హయశిక్షక గో
కింకరులు; సెప్పఁ దొడఁగితి । నింకఁ గొఱంత వెట్ట నేల? యే నర్జునుఁడన్. 134

ప్రతిపదార్థం: కంకుఁడు= కంకుభట్టు అనే పేరుతో ఉన్నవాడు; ధర్మసుతుఁడు= ధర్మరాజు; వలల+అంకుఁడు= వలలుడు అనే పేర ఉన్నవాడు; భీముండు= భీమసేనుడు; కవలు= నకులసహదేవులు; హయశిక్షక, గోకింకరులు= అశ్వాలను శిక్షించేవాడూ, గోవులను పాలించేవాడూ; చెప్పన్+తొడఁగితిన్= చెప్పటానికి పూనుకొన్నాను (కనుక); ఇంకన్= ఇంకా (దీని తర్వాత); కొఱంత పెట్టన్= మిగిలించేది; ఏల?= ఎందుకు?; (ఇంత చెప్పాక దాచేది ఎందుకు అని అర్థం); ఏను= నేను; అర్జునుఁడన్= అర్జునుడిని.

తాత్పర్యం: కంకుభట్టు అనే పేరుతో ఉన్నవాడే ధర్మరాజు. వలలుడు అనే పేరుతో వంటలవాడుగా ఉన్నవాడే భీముడు. గుఱ్ఱాలను శిక్షిస్తూ, వాటిని కాపాడుతూ ఉన్నవాడే నకులుడు. గోవులను పాలించేవాడే సహదేవుడు. ఇంతెందుకు? నేనే అర్జునుడిని.

తే. అధిపనందన! మాలిని యనఁగఁ బరఁగు । కాంత ద్రౌపది; దానికై కాదె సింహ
బలునిఁ దమ్ముల గంధర్వపతులు సంపి । రనఁగఁ జంపె మహోగ్రత ననిలసుతుఁడు.' 135

ప్రతిపదార్థం: అధిపనందన!= రాకుమారుడవైన ఉత్తరకుమారా!; మాలిని+అనఁగన్= మాలిని అనబడుతూ; పరఁగుకాంత= ఉండే స్త్రీ; ద్రౌపది= ద్రుపదరాజు కూతురైన ద్రౌపది; దానికిన్+ఐ+కాదె= దానికొరకే కదా; (ఆమె కారణంగా); గంధర్వపతులు= ఆమె భర్తలైన గంధర్వులు; సింహబలునిన్= సింహంయొక్క బలంతో సమానం అయిన బలంఉన్న కీచకుడిని; తమ్ములన్= ఆ కీచకుడి తమ్ములను (ఉపకీచకులను); చంపిరి+అనఁగన్= చంపినారనే నెపంతో; అనిలసుతుఁడు= వాయువు కుమారుడైన భీముడు; మహా+ఉగ్రతన్= మహాఘోరంగా; చంపెన్= చంపాడు.

తాత్పర్యం: ఉత్తరకుమారా! మాలిని అనబడే ఆమె ద్రౌపది. ఆమె కారణంగానే భీమసేనుడు కీచకుడినీ, ఉపకీచకులనూ, మాలిని భర్తలైన గంధర్వులు చంపారనే మిషతో భయంకరంగా చంపాడు.'

వ. అనిన విని భూమింజయుండు సంభ్రమాశ్చర్య సంశయంబులు మనంబున ముప్పిరి గొనం దప్పక చూచి, సవ్యసాచికి వెండియు నిట్లనియె. 136

ప్రతిపదార్థం: అనినన్, విని= అనగా విని; భూమింజయుండు= ఉత్తరుడు; సంభ్రమ+ఆశ్చర్య+సంశయంబులు= తొట్రుపాటూ, అబ్బురం, సందేహాలూ; మనంబునన్= మనస్సులో; ముప్పిరి+కొనన్= పైమూడు భావాలూ పెనవేసికొని పోగా; తప్పకచూచి= అదే పనిగా కన్నులార్పకుండా చూచి; సవ్యసాచికిన్= అర్జునుడికి (రెండుచేతులతో బాణాలను వేసేవాడు); వెండియున్= మరలా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు పాండవులనూ, ద్రౌపదినీ గురించి వివరించి చెప్పగా ఆ మాటలను విని ఉత్తరుడు తొట్రుపాటు, ఆశ్చర్యం, సందేహం- అనే ఈ మూడు మనోభావాలూ ముప్పేటగా తనలో పెనవేసికొనగా తదేకంగా చూచి ఆతడు తిరిగి అర్జునుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఊహించని ఒక విషయాన్ని హఠాత్తుగా విన్నప్పుడు సామాన్యులకు తొట్రుపాటు కలుగుతుంది. దానితోపాటు ఆశ్చర్యం కలుగుతుంది. ఇది నిజమా? అనే సందేహం ఆ తర్వాత కలుగుతుంది. ధీరులు దానిని నిగ్రహించుకొంటారు. అధీరులైన ఉత్తరుడివంటివాళ్ళు దానిని ఆంగికంగా చూపిస్తారు.

క. 'చిరకీర్తి ప్రియుఁడగు న । న్నరునకుఁ బది గలవు భవ్యనామములు మనో
హరముగ నవి సెపుమా యొం । డరయక యే నమ్మెదను బృహన్నల! నిన్నున్.' 137

ప్రతిపదార్థం: బృహన్నల!= ఓ బృహన్నలా!; చిర= శాశ్వతమైన; కీర్తి= కీర్తియందు; ప్రియుఁడు+అగు= ఆసక్తిగలవాడైన; ఆ+నరునకున్= ఆ అర్జునుడికి; భవ్య= శుభకరాలైన; నామములు= పేర్లు; పది+కలవు= పది ఉన్నాయి; ఒండు+అరయక= దేనినీ చూడకుండా (వెంటనే అని భావం); మనోహరముగన్= మనస్సును ఆకర్షించేటట్లు (అభిమానంతో, గౌరవంతో కూడిన భావం); అవి+ చెపుమా= వాటిని చెప్పుము; నిన్నున్= నిన్ను; ఏన్= నేను; నమ్మెదను= (అప్పుడు అర్జునుడివి అని) నమ్ముతాను.

తాత్పర్యం: శాశ్వతమైన కీర్తిని ఆశించే ఆ అర్జునుడికి పది పేర్లున్నాయి. ఆ పేర్లు మంగళకరాలైనట్టివి. నీవు వెంటనే వాటిని చెప్పితే అప్పుడు నేను దేన్నీ అనుమానించకుండా, నీవే అర్జునుడివి అని నమ్ముతాను. కనుక వాటిని చెప్పుము.

విశేషం: నలుగురు పాండవులనూ, ద్రౌపదినీ గురించి బృహన్నల వివరించి చెప్పినప్పటికీ ఎదుట ఉన్నవాడే అర్జునుడు అని ఉత్తరుడు గ్రహించుకోలేకపోయాడు. ఇది కేవలం ఉత్తరుడి అజ్ఞానమే. అందుకే, అర్జునుడికి ఉన్న పదిపేర్లనూ చెప్పుమని అడిగాడు. ఉత్తరుడికి బృహన్నలపై నమ్మకం కుదరలేదు. కారణం వికృతమైన ఆతడి రూపం.

వ. అనుటయు నతండు సస్మితాననుం డగుచు, 'నర్జునుండు, ఫల్గునుండు, పార్థుండు, కిరీటి, శ్వేతవాహనుండు, బీభత్సుండు, విజయుండు, జిష్ణుండు, సవ్యసాచి, ధనంజయుండు నను నివి పదియును నా పేళ్ళనవుడు, నుత్తరుండు పాండవమధ్యమున కిట్లనియె. 138

ప్రతిపదార్థం: అనుటయున్= (ఉత్తరుడు పదిపేర్లను చెప్పుమని) అని అడుగగా; అతండు= అర్జునుడు; స+స్మిత= చిఱునవ్వుతో కూడిన; ఆననుండు+అగుచున్= ముఖం గలవాడై; అర్జునుండు; ఫల్గునుండు; పార్థుండు; కిరీటి; శ్వేతవాహనుండు; బీభత్సుండు; విజయుండు; జిష్ణుండు; సవ్యసాచి; ధనంజయుండు - అను ఇవి; పదియును= పదికూడా; నా పేళ్ళు= నా పేర్లు; అనవుడున్= అనగా విని; ఉత్తరుండు= ఉత్తరకుమారుడు; పాండవమధ్యమునకున్= అర్జునుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: ఉత్తరుడు అర్జునుడి పదిపేర్లనూ చెప్పుమనగానే, ఆతడు, చిరునవ్వుతో 'అర్జునుడూ, ఫల్గునుడూ, పార్థుడూ, కిరీటి, శ్వేతవాహనుడూ, బీభత్సుడూ, విజయుడూ, జిష్ణుడూ, సవ్యసాచి, ధనంజయుడూ అనే ఈ పదీ నా పేర్లు' అని చెప్పాడు. అప్పుడు ఉత్తరుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

క. 'ఏమి కతంబున నిట్టీ । నామంబులు సంభవిల్లె నరునకు? నవి చే
తో మోదంబుగఁ జెప్పుము । నీమది తత్తద్విధంబు నిశ్చితమేనిన్.' 139

ప్రతిపదార్థం: ఇట్లు= (నీవు చెప్పినట్లుగా); ఈ నామంబులు= ఈ పేర్లు; నరునకున్= అర్జునుడికి; ఏమి కతంబునన్= ఏమి కారణంగా; సంభవిల్లెన్?= వచ్చాయి?; నీ మదిన్= నీ మనస్సులో; తద్+తద్+విధంబు= ఆయా రీతి అంతా; నిశ్చితము+ఏనిన్= స్పష్టంగా (ఖచ్చితంగా) తెలిస్తే; అవి= ఆ విశేషాలు; చేతస్+మోదంబుగన్= మనస్సుకు సంతోషాన్ని కలగజేసేటట్లుగా; చెప్పుము= చెప్పవలసింది.

తాత్పర్యం: నీవు ఇంతకుముందు చెప్పిన పదిపేర్లూ అర్జునుడికి ఏకారణం వలన వచ్చాయో, నీకు ఖచ్చితంగా తెలిస్తే నాకు సంతోషాన్నిచ్చేటట్లుగా చెప్పుము.

విశేషం: ఇంతకుముందు, అర్జునుడికి పదిపేర్లు ఉన్నాయనీ, వాటిని చెప్పితే, నీవే అర్జునుడివి అని నమ్ముతానని ఉత్తరుడు అర్జునుడితో అన్నాడు. అందుకు ఆతడు తనకున్న పది పేళ్ళనూ చెప్పాడు. అయినా ఉత్తరుడికి నమ్మకం కలగలేదు. కనుకనే, ఆ పది పేర్లూ రావటానికి కారణం ఏమిటి? అని అర్జునుడిని అడిగాడు. ఇంకా అర్జునుడిని గుర్తించలేకపోవటం, కేవలం ఉత్తరుడి అమాయకత్వమే.

వ. అనుటయు 'నట్ల చేయుదు' నని యతం డిట్లనియె. 140

తాత్పర్యం: పదిపేళ్ళకూ కారణాన్ని అడిగిన ఉత్తరుడికి 'అట్లాగే చేస్తాను (చెప్పుతాను)' అని ఉత్తరుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఈ క్రింది పద్యం నుండి వరుసగా 8 పద్యాలలో, ఉత్తరుడికి తన పదిపేర్లనూ, అవి వచ్చిన కారణాలనూ వివరిస్తాడు.

ఆ. 'ధరణి యెల్ల గెలిచి తగ ధనంబులు గొని । యునికి నే ధనంజయుండ నైతి;
నెట్టివారినైన నెదిరినఁ బోర జ । యంబు గొనుట విజయుఁ డండ్రు నన్ను. 141

ప్రతిపదార్థం: ధరణి+ఎల్లన్= భూమినంతటినీ; గెలిచి= జయించి; తగన్= తగిన విధంగా; (ఆయా రాజుల సంపదను బట్టి); ధనంబులు+కొని+ఉనికిన్= అన్ని రకాలైన ధనాలను గ్రహించి ఉండటంచేత; నేన్= నేను; ధనంజయుండన్+ఐతిన్=

ధనంజయుడు అనే పేరు కలవాడిని అయ్యాను; ఎట్టివారిన్+ఐనన్= ఎంత బలవంతులనైనా; ఎదిరినన్= పోరాడితే; పోరన్= యుద్ధంలో; జయంబు+కొనుటన్= జయాన్ని సాధించటం వలన; నన్నున్= నన్ను; విజయుఁడు= విజయుడు; అని; అంద్రు= అంటారు.

తాత్పర్యం: భూమినంతటినీ జయించి, ధనాన్ని పొందటంవలన నేను ధనంజయుడిని అయ్యాను. ఎంత బలవంతులు నన్ను ఎదిరించినా నేను యుద్ధంలో జయాన్ని సాధించటంతో, నన్ను అందరూ విజయుడు అని అంటారు.

తే. **తెలుపులగు వాహనములు నాతేర సమర । భూములం దెప్డు నియతిమైఁ బూన్కిఁ జేసి**
శ్వేతవాహన నామవిఖ్యాతి నాకు । సకలజన సమ్మతంబుగ సంభవించె. **142**

ప్రతిపదార్థం: సమర భూములందున్= యుద్ధంచేసే ప్రదేశాల్లో; ఎప్డున్= ఎల్లప్పుడూ; నా= నాయొక్క; తేరన్= తేరుకు (రథానికి); తెలుపులు+అగు= తెల్లనైన; వాహనములు= గుర్రాలు; నియతిమైన్= తప్పకుండా (నియమంగా); పూన్కిన్+చేసి= పూన్చటం వలన (కట్టటం వలన); నాకున్= నాకు; శ్వేతవాహన నామ విఖ్యాతి= శ్వేతవాహనుడు అనే పేరు గలవాడనే కీర్తి; సకలజన= సమస్త జనానికీ; సమ్మతంబుగన్= ఇష్టం అయ్యేటట్లు (ఒప్పుకోలుతో); సంభవించెన్= వచ్చింది.

తాత్పర్యం: యుద్ధరంగంలో నేను ఎల్లప్పుడూ నా రథానికి ఒక నియమంగా తెల్లటిగుర్రాలనే కట్టుతాను కనుక, అందరికీ సమ్మతంగా నాకు శ్వేతవాహనుడు అనేపేరు కలిగింది.

చ. **రవి యుదయించు నట్లు సమరంబున నా తలమీఁదఁ గాంతి మూ**
ర్తి వెలుఁగు నింద్రుఁ డిచ్చిన కిరీట మభేద్యమహోగ్ర సుస్థిర
త్వ విభవ రూఢిమై; జనులు దానన నన్నుఁ గిరీటి నామ సం
స్తవన విశేష పాత్రముగ సమ్మతిఁ జేసిరి మాత్స్యనందనా! **143**

ప్రతిపదార్థం: మాత్స్య= మత్స్యదేశానికి చెందిన రాజుయొక్క; నందనా!= కుమారా! (ఉత్తరకుమారా!); సమరంబునన్= యుద్ధంలో; నా= నాయొక్క; తలమీఁదన్= తలపైన; రవి= సూర్యుడు; ఉదయించునట్లు= పుట్టినట్లుగా; కాంతిమూర్తిన్= వెలుగురూపుతో; (సూర్యుడు ఉదయించేటప్పుడు పుట్టే అందమైన, ఆకర్షణీయమైన మంచి కాంతిరూపంతో అన్నమాట); ఇంద్రుఁడు= దేవేంద్రుడు; ఇచ్చిన కిరీటము= బహుమానంగా ఇచ్చిన కిరీటం; అభేద్య= భేదించరానిది (యుద్ధాల్లో శత్రువులచేత విరుగగొట్టరానిది); మహా+ఉగ్ర= ఎక్కువ భయంకరం అయిందీ; (ఆ కిరీట కాంతుల తీవ్రతకే కొందరు శత్రువులు మూర్ఛపోయి, మృతిచెందుతారు. అందుకే అది మహోగ్రం అయింది). సుస్థిరత్వ= మిక్కిలి దృఢమైనది (ఎట్లాంటి బాణాల తాకిడికీ అది కట్టుకదలదు - అని భావం); విభవ= పైన చెప్పిన అభేద్యం, ఉగ్రం, సుస్థిరం - అనే మూడురకాలైన వైభవంతో; రూఢిమైన్= పేరుకెక్కి; వెలుఁగున్= ప్రకాశిస్తుంది; జనులు= లోకంలో ఉన్న జనులు అందరూ; దానన్+అ= అందుకే; నన్నున్= నన్ను; కిరీటి= కిరీటి అనే; నామ= పేరుతో; సంస్తవన= స్తుతించేదానికి; విశేష= ఎక్కువైన; పాత్రముగన్= యోగ్యత ఉన్నవాడిగా (ప్రశంసకు అర్హుడినిగా); సమ్మతిన్+చేసిరి= అంగీకరించారు.

తాత్పర్యం: దేవేంద్రుడు (నా పరాక్రమానికి మెచ్చి) ఇచ్చిన కిరీటం యుద్ధంలో నా శిరస్సుమీద ప్రకాశిస్తూ ఉంటుంది. అది ఉదయించే సూర్యకాంతులతో నా తలమీద విరాజిల్లుతూ ఉంటుంది. ఆ కిరీటం అభేద్యం, భయంకరం, సుస్థిరం అయినట్టిది. అందుకే నన్ను లోకమంతా 'కిరీటి' అని కీర్తిస్తుంది.

తే. **వీరులకుఁ జూడ బీభత్స విధము గలుగు । నట్టి కార్యంబు సేఁతకు నెట్టి సమర**
భంగులను దడఁబడక బీభత్స సేయ; । దాన బీభత్సుఁ డను నభిధాన మయ్యె. **144**

ప్రతిపదార్థం: ఎట్టి= ఎలాంటి చిక్కులతో కూడిన; సమరభంగులను= యుద్ధరీతులలో కూడా; వీరులకున్= వీరులైన వాళ్ళకు; చూడన్= చూడటానికి; బీభత్సవిధము= అసహ్యకరమైన పద్ధతి; కలుగునట్టి= కలిగేటటువంటి; కార్యంబు= పనిని; చేఁతకున్= చేసేదానికి; తడఁబడక= తత్తరపాటులేక; బీభత్స+చేయన్= బీభత్సాన్ని పుట్టించను; దానన్= దానివల్ల (నాకు); బీభత్సుఁడు+అను= బీభత్సుడు అనే; అభిధానము+అయ్యెన్= పేరు కలిగింది.

తాత్పర్యం: ఎటువంటి చిక్కు సమస్యలతో కూడిన యుద్ధ సమయాలలోనూ తడబడకుండా, శత్రువీరులు ఏవగించుకొనే పనిని చేయను. కనుకనే బీభత్సుడు అనే పేరు నాకు వచ్చింది.

విశేషం: బీభత్సం చేయవలసినప్పుడు కూడా బీభత్సాన్ని సృష్టించకుండా, తత్తరపాటు లేకుండా యుద్ధం చేస్తాడు కనుక అర్జునుడికి బీభత్సుడు అనే పేరు వచ్చింది. ఈ పేరు దేవతలలో, మనుషులలో ప్రసిద్ధమైనది అని మూలం. తిక్కన 'దేవ మనుష్యేషు' అన్నదాన్ని తీసికొనలేదు.

క. **భండనమున నిరుగేలను । గాండీవముఁ దివియ నేర్పు గలిగిన నందు**
ద్దండ మగు సవ్యకరము ప్ర । చండతఁ బరఁగుదును సవ్యసాచి యనంగన్. **145**

ప్రతిపదార్థం: భండనమునన్= యుద్ధంలో; ఇరు కేలను= రెండుచేతులతో; గాండీవమున్= గాండీవం అనే ధనుస్సును (అల్లె త్రాటిని); తివియన్= లాగేదానికి; నేర్పు+కలిగినన్= నైపుణ్యం ఉన్నా; అందున్= ఆ రెండు చేతులలోనూ; ఉద్దండమగు= మిక్కిలి బలంతో కూడిన (దృఢమైన); సవ్యకరము= ఎడమచేతి యొక్క; ప్రచండతన్= తీవ్రతవలన; సవ్యసాచి+అనంగన్+పరఁగుదును= సవ్యసాచి అనే పేరుతో పిలవబడతాను.

తాత్పర్యం: యుద్ధంలో ఏ చేతితోనైనా అల్లెత్రాటిని లాగుతాను. కానీ ఆ లాగడంలో ఎడమచేయి వాటం తీవ్రంగా ఉంటుంది. కనుక నన్ను సవ్యసాచి అని అంటారు.

విశేషం: లోకంలో మామూలుగా కుడిచేతికే బలం ఎక్కువ. ఏపని చేసేదానికైనా కుడిచేతి వాటం సులువుగా, దృఢంగా ఉంటుంది. కాని, అర్జునుడి విషయంలో, ఎడంచేతికే వాటం ఎక్కువ. నిజానికి కుదురుకుంటే, కుడిచేతికన్న ఎడంచేతికి బలం ఎక్కువ. అయితే పట్టు కుదరాలి. అర్జునుడికి ఆ వాటం కుదిరింది. అందుకే తిక్కన 'సవ్యకరము ప్రచండత' అని అన్నాడు. కాని, మూలంలో సవ్యసాచి అనేపేరు కలగటానికి కారణం ఇట్లా ఉన్నది. **"ఉభౌ మే దక్షిణౌ పాణీ గాణ్డీవస్య వికర్షణే తేన దేవమనుష్యేషు సవ్యసాచీతి మాం విదుః"** (సం. 4-39-17) నా చేతులు రెండూ గాండీవాన్ని లాగటంలో దక్షిణములు (సమర్థములు) కాబట్టి నన్ను దేవమనుష్యులలో సవ్యసాచి అంటారు.

తే. **ధరణి దుర్లభమగు నవదాతవర్ణ । మారఁ గలుగుట నర్జునుఁ డండ్రు నన్ను;**
ఫల్గునాహ్వయ ముత్తర ఫల్గునీ వి । శిష్టకాల సంజననతఁ జేసి గలిగె. **146**

ప్రతిపదార్థం: ధరణిన్= భూమిమీద; దుర్లభము+అగు= లభించని (అరుదైన); అవదాత వర్ణము= నిర్మలం అయిన వర్ణం (తెలుపు); ఆరన్+కలుగుటన్= నిండా ఉండటం వలన; నన్నున్= నన్ను; అర్జునుఁడు= అర్జునుడు (అని); అండ్రు=

అంటారు; ఉత్తరఫల్గునీ= ఉత్తరఫల్గునీ నక్షత్రంతో కూడిన; విశిష్టకాల= విశేషమైన కాలంలో (సంధికాలంలో); సంజననతన్+చేసి= పుట్టటం చేత; ఫల్గున+ఆహ్వాయము= ఫల్గునుడు అనే నామం; కలిగెన్= కలిగింది.

తాత్పర్యం: సామాన్యంగా ఎవ్వరికీ కలుగని అవదాత వర్ణం నా శరీరానికి ఉండటం వలన నన్ను అర్జునుడు అని అంటారు. ఉత్తరఫల్గునీ విశిష్టకాలంలో పుట్టటంతో నాకు ఫల్గునుడు అనే పేరు వచ్చింది.

విశేషం: 1. అర్జునుడనే పేరు రావటానికి కారణం మూలంలో ఇట్లా చెప్పబడింది - **"పృథివ్యాం చతురన్తాయాం వర్ణో మే దుర్లభః సమః। కరోమి కర్మశుక్లం చ తేన మామర్జునం విదుః"** (సం. 4-39-18) మొత్తం భూమిలో నావర్ణంతో సమానమైన వర్ణం దుర్లభం. నేను పరిశుద్ధమైన పనిని చేస్తాను. కాబట్టి నన్ను అర్జునుడంటారు' - అని. ఉత్తరఫల్గునీ విశిష్టకాలం అంటే, పూర్వఫల్గునీ, ఉత్తరఫల్గునీ నక్షత్రాల నడిమి కాలం.

2. **"ఉత్తరాభ్యాం చ పూర్వాభ్యాం ఫల్గునీభ్యాం మహం దివా, జాతో హిమవతః పృష్ఠే తేన మాం ఫల్గునం విదుః" (సం. 4-39-14)** అని మూలం. నేను ఫల్గునీనక్షత్రకాలంలో హిమవంతుడి పృష్ఠభాగంలో పగలు పుట్టాను కాబట్టి నన్ను ఫల్గును డంటారు.

క. అని మొన మార్కొని వ్రణ మేఁ। గనుఁగొన ధర్మజుని మేనఁ గావింపఁగ న
య్యనిమిషులుఁ జాల రెవ్వరుఁ। జెనకినఁ బరిమార్తుఁ గాన జిష్ణుఁడ నైతిన్. 147

ప్రతిపదార్థం: అనిమొనన్= యుద్ధాగ్రమునందు; మార్కొని= ఎదిరించి; ఏన్= నేను; కనుఁగొనన్= చూస్తూఉండగా (నాకంటి ఎదురుగా అని భావం); ధర్మజుని= ధర్మరాజు యొక్క; మేనన్= శరీరంమీద; వ్రణము= గాయాన్ని; కావింపఁగన్= చేసినట్లైతే; ఎవ్వరున్+చెనకినన్= ఎవరు ఎదిరించినా; పరిమార్తున్= (వాళ్ళను) చంపుతాను; ఆ+అనిమిషులున్+చాలరు= (ఆ పరిస్థితిలో నన్ను ఎదిరించటానికి) దేవతలు కూడా సమర్థులు కాలేరు; కానన్= అందువలన; జిష్ణుఁడన్+ఐతిన్= జిష్ణుడిని అయ్యాను.

తాత్పర్యం: నాకంటి ముందర ఎవరైనా కానీ యుద్ధంలో ధర్మరాజు శరీరానికి గాయం కలిగిస్తే, వాళ్ళను చంపుతాను. ఆ సమయంలో దేవతలు కూడా నాకు అడ్డు తగలలేరు. దీనివలనే నాకు జిష్ణుడు అనే పేరు వచ్చింది.

క. పృథ యను పేరు మదంబకుఁ। బ్రథితంబై యునికిఁ జేసి పార్థుఁడ నైతిన్;
వృథయుఁగఁ బలుకుదునే? యవి। తథవచనుండైన ధర్మతనయు ననుజుఁడన్. 148

ప్రతిపదార్థం: పృథ+అను= పృథ అనే; పేరు= నామం; మత్+అంబకున్= మా అమ్మకు (కుంతీదేవికి); ప్రథితంబు+ఐ= ప్రసిద్ధమై; ఉనికిన్+చేసి= ఉండటంచేత; పార్థుఁడను+ఐతిన్= పార్థుడిని అయినాను; అవితథ= వ్యర్థంకాని, సత్యసమ్మతమైన; వచనుండు+ఐన= పలుకులు కలవాడైన; ధర్మతనయు= ధర్మరాజుయొక్క; అనుజుఁడన్= తమ్ముడిని; వృథయుఁగన్= వ్యర్థంగా (అసత్యంగా); పలుకుదునే?= చెప్పుతానా?

తాత్పర్యం: మా అమ్మ కుంతీదేవికి పృథ అనే పేరు లోకంలో ప్రసిద్ధికెక్కింది. పృథయొక్క కొడుకును కాబట్టి పార్థుడిని అయ్యాను. సత్యశీలుడైన ధర్మరాజు తమ్ముడిని అబద్ధం చెప్పుతానా?

వ. ఈ పది పేళ్ళును నివి కారణంబులుగాఁ బ్రకాశంబులయ్యెఁ; సకలసుర నికరంబు లడ్డపడినం బుండరీకాక్ష సహాయుండనై ఖాండవం బేర్చి నప్పుడు మెచ్చి భద్రమూర్తులైన రుద్ర విరించులు సన్నిధి సేసినం బెన్నిధిఁ గన్న

పేద చందంబున సంభ్రమించు నాకుం గరుణించి కృష్ణుండను నేకాదశ నామంబును, నప్రతిహత బాణంబులు నొసంగిరి. వారల యనుమతి నింద్రాదులయిన విబుధులును వివిధంబులగు దివ్యాస్త్రంబు లిచ్చిరి; పదంపడి గీర్వాణులకు నోర్వరాని యట్టివారి, వరదాన గర్వితుల నివాతకవచు లనియెడు దైతేయుల మాతలి సారథికంబగు నైంద్రస్యందనం బెక్కి యొక్కండన మూఁడు కోట్ల నిర్జించితి. దుర్జయులగు హిరణ్యపుర నివాసుల నఱువది వేవుర దేవారాతుల వారాశి తీరంబునం బరిమార్చితి; నప్పుడు ప్రీతుండై గిరిభేది కిరీటం బొసంగె; దేవసంఘంబు శంఖంబిచ్చె; నది కతంబుగా నచ్చిందంబు దేవదత్తం బనంబరఁగె. మఱియు నెయ్యెడల నెవ్వరు దొడరినం బొలివోని బలిమి కలిమి వెలుంగుదు. గాంధారీ నందనుండు గంధర్వరాజు చేతం బట్టువడిన యప్పుడు పదునాలుగువేల గంధర్వుల జయించి యతని విడిపించితి, నీ వోడకు; మీ కూడిన కురుబలంబుల గెలిచి, కర్ణ, గాంగేయ, కృప, ద్రోణ, ద్రౌణి, దుర్యోధనులు కనుంగొనుచుండఁ గదుపులం గ్రమ్మఱించెద' నని సత్వరంబుగాఁ జెప్పిన, విని యుత్తరుండు చిత్తంబున నద్భుత హర్షంబులు వొదువ వ్రాను డిగ్గనుఱికి, సర్వాంగ సంగతోర్వీ తలంబగు దండప్రణామం బాచరించి, చేతులు మొగిచి నిలిచి యిట్లనియె. 149

ప్రతిపదార్థం: ఇవి, కారణంబులు, కాన్= ఈ కారణాలుగా; ఈ పది పేళ్ళును= ఈ పది పేర్లున్నూ; ప్రకాశంబులు+అయ్యెన్= ప్రసిద్ధికెక్కాయి; సకల= సమస్తమైన; సుర= దేవతలయొక్క; నికరంబులు= సమూహాలు. (దేవతలలో 16 జాతి భేదాలు - మొత్తం 33 కోట్లమంది); అడ్డపడినన్= ఎదురు నిలిచినప్పటికీ; పుండరీక+అక్ష= (తెల్ల తామరల వంటి కన్నులు గలిగినవాడు) కృష్ణుడియొక్క; సహాయుండను+ఐ= సహాయం కలవాడినై; ఖాండవంబు+ఏర్చినప్పుడు= ఖాండవమనే వనాన్ని కాల్చినపుడు; మెచ్చి= మెచ్చుకొని; భద్రమూర్తులు+ఐన= మంగళకరమైన ఆకారాలు కలవారైన; రుద్ర+విరించులు= శివుడూ, బ్రహ్మదేవుడూ; సన్నిధి+చేసినన్= ప్రత్యక్షంకాగా; పెన్నిధిన్= గొప్పనిధిని; కన్న= చూచిన; పేద, చందంబునన్= పేదవాడివిధంగా; సంభ్రమించు= వేగిరపడుతున్న; నాకున్+కరుణించి= నన్ను దయచూచి; కృష్ణుండు+అను= కృష్ణుడు అనే; ఏకాదశనామంబును= పదకొండో పేరు; అప్రతిహత= తిరుగులేని; బాణంబులు= బాణాలను; ఒసంగిరి= ఇచ్చారు; వారల= వారియొక్క; అనుమతిన్= ఆజ్ఞచేత; ఇంద్ర+ఆదులు+అయిన= ఇంద్రుడూ మొదలైన; విబుధులును= దేవతలుకూడా; వివిధంబులు+అగు= పలురకాలైన; దివ్య+అస్త్రంబులు= మహిమతో ప్రకాశించే అస్త్రాలు; ఇచ్చిరి= ఇచ్చారు; పదంపడి= ఆ తర్వాత; గీర్వాణులకున్= దేవతలకు కూడా; ఓర్వరాని+అట్టివారిన్= ఓడించటానికి సాధ్యం కానట్టివారిని; వరదాన= వరం ఇవ్వటంవలన; గర్వితులన్= గర్వించినవారిని; నివాతకవచులు అనియెడు; దైతేయులన్= రాక్షసులను; మాతలిసారథికంబు+అగు= మాతలి సారథిగా ఉన్న; (మాతలి దేవేంద్రుడి సారథి. ఇది దేవకార్యం గనుక, ఇంద్రుడు తన రథాన్నీ, సారథినీ అర్జునుడికి ఇచ్చాడన్న మాట); ఐంద్ర= ఇంద్ర సంబంధం అయిన; స్యందనంబు+ఎక్కి= రథాన్ని ఎక్కి; ఒక్కండను+అ= ఒక్కడినే; మూఁడుకోట్ల= మూడుకోట్లమందిని; నిర్జించితిన్= జయించాను; దుర్జయులు+అగు= జయించటానికి వీలుకానివారైన; హిరణ్యపుర నివాసులన్= హిరణ్యపురంలో నివసించేవారిని; అఱువది వేవురన్= అరవైవేలమందిని; దేవ+అరాతులన్= దేవతలకు శత్రువులైనవారిని- రాక్షసులను; వారాశి తీరంబునన్= సముద్రం గట్టున; పరిమార్చితిన్= చంపాను; అప్పుడు= ఆ సమయంలో; గిరిభేది= ఇంద్రుడు; (ఒకప్పుడు కొండలకు రెక్కలుండేవి. దానితో అవి గర్వించి, పట్టణాలపై వాలి నాశనం చేసేవి. అందువలన వాటి రెక్కలను ఇంద్రుడు తన వజ్రాయుధంతో విరుగగొట్టాడు. అందువలన ఆతడికి 'గిరిభేది' అనే పేరు వచ్చింది); ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; కిరీటంబు+ఒసంగెన్= కిరీటాన్ని ఇచ్చాడు; దేవసంఘంబు= దేవతల సమూహం; శంఖంబు+ఇచ్చెన్= శంఖాన్ని ఇచ్చింది; అది కతంబుగాన్= అది కారణంగా; ఆ+చిందంబు= ఆ శంఖం; దేవదత్తంబు+అనన్+పరఁగెన్= దేవదత్తమని పిలువబడింది; మఱియున్= అంతేకాక; ఏ+ఎడలన్= ఎక్కడగానీ; ఎవ్వరు+తొడరినన్= ఎవరు ఎదిరించినా; పొలివోని= తరగని; బలిమి= బలంయొక్క; కలిమిన్= సంపదచేత; వెలుంగుదున్= ప్రకాశిస్తాను; గాంధారీ నందనుండు= గాంధారి కుమారుడైన దుర్యోధనుడు;

గంధర్వరాజు చేతన్= గంధర్వులకు రాజైన చిత్రసేనుడిచేత; పట్టు+పడిన+అప్పుడు= బందీ అయినప్పుడు; పదునాలుగు వేల గంధర్వులన్= పద్నాలుగు వేలమంది గంధర్వులను; జయించి= గెలిచి; అతనిన్= దుర్యోధనుడిని; విడిపించితిన్= బంధంనుండి విముక్తుడిని చేయించాను; నీవు+ఓడకుము= నీవు భయపడవద్దు; ఈ కూడిన= ఇక్కడ చేరిన; కురుబలంబులన్= కురుసేనలను; గెలిచి; కర్ణ= కర్ణుడు; గాంగేయ= భీష్ముడు (గంగ కొడుకు); కృప= కృపాచార్యుడు; ద్రోణ= ద్రోణుడు; ద్రౌణి= ద్రోణుడి కుమారుడైన అశ్వత్థామ; దుర్యోధనులు; కనుంగొనుచున్+ఉండన్= చూస్తూ ఉండగా; కదుపులన్= ఆవులమందలను; క్రమ్మఱించెదన్= మరలిస్తాను; అని; సత్వరంబుగాన్+చెప్పినన్= తొందర తొందరగా చెప్పగా; ఉత్తరుండు; విని; చిత్తంబునన్= మనస్సునందు; అద్భుత+హర్షంబులు= ఆశ్చర్యం, సంతోషం; పొదువన్= పొదివికొనగా (చుట్టగా); ద్రుమాను= జమ్మిచెట్టు; డిగ్గన్+ఉఱికి= త్వరగా దిగి; సర్వ+అంగ+సంగత+ఉర్వీతలంబు+అగు= అన్ని అంగాలు నేలకు తాకేటట్లు; దండప్రణామంబు= కర్రవలె చేసిన నమస్కారం- (చక్కటి కర్రను నేలమీద పెట్టినప్పుడు, అది సమంగా నేలకు తాకుతుంది. అట్లాగే మనిషి నేలపై ఎనిమిది అవయవాలూ తాకేటట్లుగా చేసే నమస్కారం, సాష్టాంగ దండప్రణామం); ఆచరించి= చేసి; చేతులు మొగిచి= చేతులు జోడించి; నిలిచి= నిలువబడి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఈ కారణాలతో పదిపేర్లూ నాకు వచ్చాయి. కృష్ణుడి సహాయంతో, దేవతలంతా ఎదిరించినా, ఖాండవ వనాన్ని దహించేటప్పుడు, మెచ్చుకొని, మంగళ రూపాలుగల శివుడూ, బ్రహ్మదేవుడూ ప్రత్యక్షమయ్యారు. అప్పుడు పెద్ద నిధి చిక్కిన పేదవాడివలె నేను సంతోషించాను. వారు దయతో 'కృష్ణుడు' అనే పదకొండో పేరుతోపాటు, దివ్యాలైన బాణాలను కూడా ఇచ్చారు. వారి ఆజ్ఞతో, దేవేంద్రుడూ మొదలైన దేవతలంతా ఎన్నెన్నో దివ్యాస్త్రాలను అనుగ్రహించారు. ఆ తరువాత దేవతలకే జయించటానికి వీలుకాని నివాత కవచులు అనే రాక్షసులను, ఇంద్రుడి రథంమీద, మాతలిని సారథిగా చేసికొని వెళ్ళి, ఒంటరిగా మూడుకోట్లమందిని చంపాను. అట్లాగే, హిరణ్యపురంలో ఉండే అరవైవేలమంది రాక్షసులను కూడా, సముద్రం గట్టున చంపాను. దానికి ఇంద్రుడు మెచ్చుకొని కిరీటాన్ని ఇచ్చాడు. దేవతలంతా కలిసి శంఖాన్ని బహూకరించారు. కనుకనే ఆ శంఖానికి దేవదత్తం అనే పేరు వచ్చింది. ఎక్కడ ఎవరు నన్ను ఎదిరించినా, తరగని బలంతో వెలుగుతాను. గాంధారి కుమారుడైన దుర్యోధనుడు గంధర్వరాజు చిత్రసేనుడి చేతిలో చిక్కి బందీ అయినప్పుడు, పద్నాలుగువేలమంది గంధర్వులను జయించి, ఆతడిని విడిపించాను. నీవు భయపడవద్దు. ఇక్కడ చేరిన కౌరవసైన్యాన్ని గెలిచి, కర్ణుడూ, భీష్ముడూ, ద్రోణుడూ, కృపాచార్యుడూ, అశ్వత్థామా, దుర్యోధనుడూ చూస్తూఉండగానే, ఆవుల మందలను మళ్ళిస్తాను' అని అర్జునుడు అన్నాడు. ఆ మాటలను విన్న ఉత్తరుడు ఆశ్చర్యాన్నీ, సంతోషాన్నీ పొందాడు. గబగబా చెట్టు దిగి ఆతడు అర్జునుడికి సాష్టాంగ దండప్రణామం చేసి, చేతులు జోడించి నిలబడి ఈ విధంగా పలికాడు.

విశేషం: అర్జునుడు ఇన్ని విధాల వివరించాక, ఉత్తరుడికి బృహన్నలపై ఆతడే అర్జునుడు అనే నమ్మకం కలిగింది. ఇది తరువాతి పద్యంలో, 'సమ్మోహము పాసె' అనే మాట వలన తెలుస్తుంది.

ఉత్తరుఁడు బృహన్నల నర్జునుఁగా నెఱుంగుట (సం. 4-39-21)

ఉ. **'బాహు సమగ్ర శత్రు మదభంజన శౌర్య! సమస్తలోక చే**
తోహర మూర్తి! నీ విటులు దోఁచుట నాకుఁ బ్రసన్న విస్ఫుర
ద్దేహముతోడ భాగ్యమయ దేవత సన్నిధిసేఁత గాదె; స
మ్మోహము పాసెఁ; జిత్తము ప్రమోద రసత్వముఁ బొంది పొంగెడున్. **150**

ప్రతిపదార్థం: బాహు= బాహువులయొక్క బలంతో; సమగ్ర= నిండిన; శత్రు= శత్రువులయొక్క; మద= మదాన్ని (గర్వాన్ని); భంజన= నాశనంచేసే; శౌర్య!= పరాక్రమం కలవాడా!; సమస్తలోక= లోకంలో ఉన్న అందరియొక్క; చేతస్= మనస్సులను; హర= హరించివేసే (ఆకర్షించే); మూర్తి!= ఆకారం (రూపం) కలవాడా!; నీవు= (అంతటి) నీవు; ఇటులు= ఇట్లా; తోఁచుట= కనపడటం; నాకున్= నాకు; ప్రసన్న= ప్రశాంతమైన (స్వచ్ఛమైన); వి+స్ఫురత్= ఎక్కువగా ప్రకాశించే; దేహముతోడన్= శరీరంతో; భాగ్యమయదేవత= అదృష్టరూపం అయిన దేవత; సన్నిధి+చేఁతన్+కాదె!= ఎదుట నిలవడమే కదా! (ప్రత్యక్షం కావటమే కదా!); చిత్తము= నాయొక్క మనస్సు; సమ్మోహము+పాసెన్= మోహాన్ని వదిలింది (మనస్సు వ్యామోహ రహితం అయింది అన్నమాట); చిత్తము; ప్రమోదరసత్వమున్= ఆనందమనే రసాన్ని; పొంది= అనుభవించి; పొంగెడున్= ఉప్పొంగుతూఉన్నది. (మనస్సులో వ్యామోహం ఎప్పుడైతే నశించిందో, అప్పుడే ఆనందరసాన్ని అనుభవించటం జరిగింది. దాని ఫలితంగా మనస్సు ఉప్పొంగింది- అని).

తాత్పర్యం: 'సమగ్రమైన బాహుబలంతో ఉన్న శత్రువులయొక్క మదాన్ని అణిచివేసే పరాక్రమం కలవాడా! లోకులకు మనోహరంగా కనిపించే ఆకారం కలవాడా! అర్జునా! నాకు నీవు ఈ రకంగా ప్రత్యక్షం కావటం ఎట్లా ఉన్నదంటే, నా భాగ్యదేవతే ప్రసన్నమైన రూపంతో నా యెదుట నిలిచినట్లే ఉన్నది. నా మనస్సులో ఉన్న వ్యామోహం నశించటం వలన నాకు పరమానందంగా ఉన్నది.

విశేషం: ఇది- ఉత్తరుడు అర్జునుడిని స్తుతించటమే! ఉత్తరుడి దృష్టిలో అర్జునుడు ఒక దైవమే! ఆతడికి అర్జునుడిపై ఉన్న భక్తిప్రపత్తులు, గౌరవం అటువంటివి. అర్జునుడు పాండవుల విషయాన్ని సమగ్రంగా వివరించాక, ఉత్తరుడికి మనస్సు నిర్మలం అయింది. దానితో, పాండవులను గూర్చిన విచారం ఉత్తరుడికి తొలగిపోయింది. మనస్సుకు స్తిమితం చిక్కింది. అందుకే ఆతడి భ్రాంతి తొలగింది. దాని ఫలితమే, ఆతడికి కలిగిన ఆనంద రసస్థితి. ఈ విషయాన్ని తిక్కన రసానుకూలంగా వర్ణించి, ఉత్తరుడి మనోభావాన్ని సముచితంగా చిత్రించాడు.

క. ని న్నెఱుఁగక యే నే మే । నన్న పలుకులెల్ల మఱచి యాశ్రిత రక్షా
సన్నద్ధ భావ మేర్పడ । నన్నుం గృపఁ జూడవే సనాథుఁడ నగుదున్.' 151

ప్రతిపదార్థం: నిన్నున్+ఎఱుఁగక= నీవుఅని తెలిసికొనలేక; ఏను= నేను; ఏమి+ఏని= ఏమయినా; అన్న= అన్నట్టి; పలుకులు= మాటలు; ఎల్లన్= అన్నిటినీ; మఱచి= మనసులో గుర్తుంచుకొనక; ఆశ్రితరక్షాసన్నద్ధ భావము= ఆశ్రయించినవాళ్ళను కాపాడటానికి పూనుకొనే మనస్తత్వం; ఏర్పడన్= స్పష్టమయ్యే విధంగా; నన్నున్= నన్ను; కృపన్= దయతో; చూడవే= చూడవా!; సనాథుఁడన్+అగుదున్= (నేను) రక్షించేవాడొకడు ఉన్నవాడిని అవుతాను (అనాథుడను కాను).

తాత్పర్యం: (మొదట్లో) నిన్ను తెలిసికొనలేక; ఎవరో అనుకొని, అన్నమాటలను (అహంకారంగా తేలిగ్గా అన్న మాటలను) మనసులో పెట్టుకోక, మరిచిపోయి, నిన్ను ఆశ్రయించిన దీనులైన వాళ్ళను కాపాడటానికి ఎట్లా పూనుకొంటావో, అట్లాంటి భావంతో, దయతో నన్ను కూడా చూడుము. దానితో నేను దిక్కున్నవాడిని ఔతాను.'

విశేషం: దీనికి ముందు పద్యంలో, అర్జునుడిని తెలిసికొన్న ఉత్తరుడు ఆతడి పరాక్రమాదికాన్ని స్తుతించి, ఈ పద్యంలో తాను అర్జునుడిని ఆశ్రయించినట్లూ, తనను రక్షించుమంటూ క్షమించుమని ప్రార్థించాడు. దీనితో అర్జునుడు ఉత్తరుడికి ప్రసన్నుడయ్యాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అన వినుచుఁ దేరు డిగి గ్ర । క్కునఁ గౌఁగిటఁ జేర్చె విరటుకొడుకును గుంతీ
తనయుఁడు సమ్మదమునఁ దన । కనుఁగవఁ గడు నశ్రువారి కడలుకొనంగన్. 152

ప్రతిపదార్థం: అనన్+వినుచున్= ఉత్తరుడు అన్న మాటలను వింటూ; కుంతీ తనయుఁడు= కుంతీదేవి కుమారుడైన అర్జునుడు; తేరు డిగి= రథం దిగి; సమ్మదమునన్= ఆనందంతో; తన= తనయొక్క; కను+కవన్= రెండుకండ్లలో; కడున్= మిక్కిలి; అశ్రువారి= కన్నీరు; కడలుకొనంగన్= రాగా (స్రవించగా); విరటుకొడుకును= విరాటరాజు కుమారుడైన ఉత్తరుడిని; గ్రక్కునన్= వెంటనే; కౌఁగిటన్+చేర్చెన్= కౌగిట్లోకి తీసికొన్నాడు (కౌగిలించుకొన్నాడు అని భావం).

తాత్పర్యం: ఆశ్రితభావంతో ఉత్తరుడు అన్న మాటలను విన్న అర్జునుడు, రథంమీద ఉన్నవాడల్లా క్రిందికి దిగి, కండ్లవెంట ఆనందబాష్పాలు కారుతూ ఉండగా, ఉత్తరుడిని ప్రియమార కౌగిలించుకొన్నాడు.

విశేషం: ఇక్కడ తిక్కన ఉత్తరుడియొక్క, అర్జునుడియొక్క మనోభావాలను చిత్రించాడు. ముందుపద్యంలో ఉత్తరుడు అర్జునుడిని క్షమాపణ కోరుతూ సంప్రార్థనను చేశాడు. దానికి ఇందులో అర్జునుడు ఆతడికి ప్రసన్నుడై ఆశ్లేష (కౌగిలింత) రూపమైన ఆత్మీయతను ప్రదర్శించాడు. ఆ భావానికి 'అశ్రువారి కడలుకొనటం' సూచన.

వ. ఇట్లు సమాలింగితుండై. 153

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సమాలింగితుండు+ఐ= బాగుగా (మనసారా) కౌగిలించుకొనబడినవాడై.

తాత్పర్యం: ఉత్తరుడు అర్జునుడిచేత కౌగిలించుకొనబడినవాడై.

చ. 'మనము కలంకదేఱె రిపుమర్దన విక్రమ! యెక్కు తేరు; నీ
ఘనభుజశక్తి ప్రాపున నఖండిత శౌర్య మహోన్నతుండనై
యనిమొన సారథిత్వము మహత్త్వము వైరులు మెచ్చఁ జూపెదన్
ననుఁ బనిగొమ్ము, లెమ్ము, కురునాథు నదల్పు, మరల్పు గోవులన్. 154

ప్రతిపదార్థం: రిపు మర్దన విక్రమ!= శత్రువులను మర్దించే (చంపే) పరాక్రమంఉన్న అర్జునా!; మనము= నాయొక్క మనస్సు; కలంక+తేఱెన్= స్వచ్ఛం అయింది (మలినం లేకుండా నిర్మలంగా ఉన్నదని భావం); తేరు= రథం; ఎక్కు= ఎక్కవలసింది; నీ= నీయొక్క; ఘన= గొప్పదైన; భుజశక్తి= భుజబల పరాక్రమం యొక్క; ప్రాపునన్= ఆశ్రయంతో; అఖండిత (న+ఖండిత)= భంగంలేని, తరిగిపోని; శౌర్య= పరాక్రమంతో; మహా+ఉన్నతుండను+ఐ= ఎంతో గొప్పవాడినై; వైరులు మెచ్చన్= శత్రువులు కూడా మెచ్చేటట్లుగా; అనిమొనన్= యుద్ధ ముఖంలో; సారథిత్వము= రథాన్ని తోలటంయొక్క; మహత్త్వము= ఘనత, (చాతుర్యం); చూపెదన్= చూపిస్తాను; ననున్= నన్ను; పని+కొమ్ము= ఆజ్ఞాపించుము; లెమ్ము= బయలుదేరుము; కురునాథున్= దుర్యోధనుడిని; అదల్పు= అదలించుము (పారదోలుము); గోవులన్= ఆవులను; మరల్పు= మళ్ళించవలసింది.

తాత్పర్యం: 'అర్జునా! (నీ దర్శనంతో) నా మనస్సు ప్రసన్నంగా ఉన్నది. నీ భుజాల రక్షణలో నేను గొప్పవాడినై, శత్రువులు కూడా పొగిడే రీతిగా రథాన్ని తోలుతాను. ఇంక (ఆలస్యం లేకుండా) లెమ్ము! నేను ఏమిచేయాలో ఆజ్ఞాపించుము! దుర్యోధనుడిని తరిమివేసి, ఆలమందలను మళ్ళించుము!

విశేషం: 'ఎక్కు తేరు', 'పనిగొమ్ము', 'లెమ్మ', 'అదల్పు', 'మరల్పు' పదాలలో ఉత్తరుడి మహోత్సాహం కనిపిస్తుంది. ఆవులను మళ్ళింపజేయాలనే తొందరా కనిపిస్తుంది. బృహన్నలే అర్జునుడు అనే నిశ్చయం కలగటమే ఈ ఉత్సాహానికి మూలం.

క. మనమునఁ గోరుదు నే న । ర్జునునకు సమరమున రథ్యచోదక భావం
బునఁ బని సేయవలయు నని । యనిశము; విధికరుణ నాకు నది సిద్ధించెన్.' 155

ప్రతిపదార్థం: నేను= నేను; అర్జుననకున్= అర్జునుడికి; సమరమునన్= యుద్ధంలో; రథ్య= గుర్రాల యొక్క; చోదకభావంబునన్= తోలటంలో (సారథ్యంలో); పని+చేయవలయున్+అని= పనిచేయాలని; అనిశమున్= ఎల్లప్పుడూ; మనమునన్= నా మనస్సులో; కోరుదును= కోరుకొంటాను; విధి కరుణన్= విధియొక్క దయతో (దేవుడి దయతో); నాకున్= నాకు (ఉత్తరుడికి); అది= రథాన్ని తోలటం అనే కోరిక; సిద్ధించెన్= ప్రాప్తించింది.

తాత్పర్యం: యుద్ధంలో అర్జునుడికి రథసారథిగా ఉండాలని నేను ఎప్పుడూ మనసులో కోరుకొంటూ ఉంటాను. దేవుడి దయవలన ఇప్పుడు నాకు అది ప్రాప్తించింది.'

విశేషం: మొదట రథికుడుగా బయలుదేరి వచ్చిన ఉత్తరుడు పరిస్థితి మారిన దానివలన సారథిగా మారాడు. దానికి ఆతడు ఎంతో సంతోషపడ్డాడు; పైగా అది (సారథి కృత్యం) తన చిరకాల వాంఛ అనీ, దేవుడి దయవలన అది సిద్ధించిందనీ ఉత్తరుడు అన్నాడు. దీనివలన ఉత్తరుడు మానసికంగా ఎంతో ఎదిగినట్లు తెలుస్తుంది. ఈ విషయం ముందు ఇంకా స్పష్టమవుతుంది.

వ. అని పలుకు నుత్తరు నత్యాదరంబునం జూచి సవ్యసాచి యతని కిట్లనియె. 156

ప్రతిపదార్థం: అని పలుకు= పైవిధంగా పలుకుతూఉన్న; ఉత్తరున్= ఉత్తరకుమారుడిని; అతి+ఆదరంబునన్= ఎక్కువ మన్ననతో; చూచి; సవ్యసాచి= అర్జునుడు; అతనికిన్= ఉత్తరుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: పై రీతిగా చెప్పే ఉత్తరుడిని అర్జునుడు ఎంతో ఆదరంతో చూచి ఆతడితో ఈ రకంగా అన్నాడు.

మ. 'ప్రియ మక్షీణము నాకు నీ దెస; మదిన్ భీతిప్రదోద్వేగ సం
శయముల్ సేరఁగ నీను నీకు; ఘనరక్షా కల్పనా బుద్ధి ని
శ్చయ సంపాదిని నాదు దృష్టి; నిను నశ్వవ్రాతముం జోఁక గా
లియు రానీను; తృణీకరింపు రిపుదోర్లీలాసముల్లాసమున్.' 157

ప్రతిపదార్థం: నాకున్= నాకు; నీదెసన్= నీవైపు (నీమీద); ప్రియము= ప్రేమ, ఇష్టం; అక్షీణము (న+క్షీణము)= క్షీణించిపోనిది (ఎక్కువైనది); మదిన్= మనసులో; నీకున్= నీకు; భీతిప్రద+ఉద్వేగ= భయాన్ని కలిగించే ఆవేశమూ; సంశయముల్= అనుమానమూ; చేరఁగన్+ఈను= చేరనీయను; నాదు= నాయొక్క; దృష్టి= చూపు; ఘన= ఎక్కువయిన; రక్షా= రక్షణను; కల్పనా= కల్పించే; బుద్ధిన్= ఆలోచనలో; నిశ్చయ= నిశ్చయాన్ని (దృఢనిర్ణయాన్ని); సంపాదిని= కలిగించేది; నినున్= నిన్నూ; అశ్వ= గుర్రాలయొక్క; వ్రాతమున్= సమూహాన్నీ; చోఁకన్= సోకటానికి (తాకటానికి); గాలియున్ రాన్+ఈను= గాలిని గూడా దగ్గరికి చేరనీయను. (మీద ఈగ వాలనీయను వంటిదే ఇదీ కూడా); రిపుదోస్(ః)+లీలా+సం+ఉల్లాసమున్= శత్రువుల భుజాలయొక్క విలాసంయొక్క ఉద్రేకాన్ని (శత్రువుల బలాధిక్యమును); తృణీకరింపు= చులకన చేయుము (లెక్క చేయవద్దు).

తాత్పర్యం: '(ఉత్తరకుమారా!) నాకు నీమీద ఉన్న ప్రేమ తరగనట్టిది. భయమూ, ఆవేశమూ, సందేహమూ నీకు రానివ్వను. నా దృష్టి అంతా నీకు రక్షణ కల్పించటంలోనే లగ్నమయి ఉంటుంది. నిన్నూ, గుర్రాలనూ తాకటానికి గాలిని కూడా సోకనివ్వను. (కనుక) నీవు శత్రువులయొక్క పరాక్రమాన్ని ఏమాత్రం లెక్కచేయ నవసరం లేదు.'

విశేషం: ఉత్తరుడు తనపై చూపిన భక్తి గౌరవాలకు అర్జునుడు ఆతడిని కౌగిలించుకొని, పైవిధంగా ధైర్యాన్ని చెప్పాడు. అందులో, సారథి అయిన ఉత్తరుడినీ, గుర్రాలనూ, గాలిని కూడా తాకనీయనని అంటాడు. దానివలన, రథికుడైనవాడికి రథ్యాలనూ (గుర్రాలనూ); సారథినీ రక్షించుకొనవలసిన బాధ్యత ఉందనీ సూచించబడింది. సమర్థుడైన రథికుడే సారథినీ, గుర్రాలనూ రక్షించుకొనగలుగుతాడు.

వ. అనిన విని భూమింజయుండు సవినయంబుగా నిట్లనియె. 158

తాత్పర్యం: అర్జునుడు పైవిధంగా మాట్లాడిన తరువాత, ఉత్తరుడు, వినయంతో కూడినవాడై ఈవిధంగా అన్నాడు.

క. 'నిను నర్జునుండని యెఱిం । గిన యంతన పాసె నెల్ల కిల్బిషములు; నీ
తను వేల షండభావం । బునఁ బొందెనొ యెఱుఁగవలయుఁ బుంస్త్వాభరణా! 159

ప్రతిపదార్థం: నినున్= నిన్ను; అర్జునుండు+అని= అర్జునుడు అని; ఎఱింగిన+అంతన్+అ= తెలిసికొన్న వెంటనే; ఎల్ల= అన్ని రకాలైన; కిల్బిషములున్= దోషాలు (మానసికాలైన); పాసెన్= పోయాయి; పుంస్త్వ+ఆభరణా!= పురుషత్వానికి అలంకారమైన వాడా! (ఓ అర్జునా!); నీతనువు= నీ ఈశరీరం; ఏల= ఎందుకు; షండభావంబునన్+పొందెనొ?= పేడితనాన్ని పొందిందో? (నపుంసకుడివిగా ఎందుకు ఉన్నావు? - అని); ఎఱుఁగవలయున్= నాకు తెలియాలి.

తాత్పర్యం: 'అర్జునుడివి అని నీవు నాకు తెలిసినప్పుడే, (మానసికాలైన) నా వ్యథలు, పాపాలు అన్నీ పోయాయి. పురుష శ్రేష్ఠుడా! నీకు ఈ పేడిరూపం ఎట్లా కలిగిందో తెలిసికొనాలని ఉన్నది.

విశేషం: అలం: పరికరం. పేడిరూపం ఎందుకు వచ్చిందో చెప్పవలసింది అని అనకుండా ఉత్తరుడు, 'ఎఱుంగవలయున్' అని అన్నాడు. ఇది చాలా సున్నితమైన విషయం. అందుకే ఉత్తరుడు 'నీవు చెప్పుము' అని నేరుగా అడగలేదు. 'ఎఱుంగవలయున్' అనడంలో తాను అడగకుండా, అర్జునుడే చెప్పాలి అని ఉత్తరుడి భావం. తిక్కన ప్రయోగించిన 'పుంస్త్వాభరణా!' అనే విశేషణం సాభిప్రాయం. 'ఏదో కారణంగా ఇట్లా ఉన్నావనీ' ధ్వని. భయాలు మొదలైనవి మానసిక రోగాలు. సహజంగా అంత శూరుడు కాని ఉత్తరుడు కురుసేనను చూచి బెదిరాడు. ఇప్పుడు అర్జునుడు అని నిశ్చయం అయ్యాక ఉత్తరుడి మనస్సులో ఉన్న భయం, ఆందోళన, సంకోచం మొదలైన 'కిల్బిషాలు' పోయినాయని భావం. కాబట్టి అలంకారం పరికరం.

చ. అనవుడు నాతఁ డిట్లను, 'మదగ్రజుపంపున బ్రహ్మచర్య వ
ర్తనకయి పూర్వశాపవిహితంబగు రూపముఁ దాల్చి యేకహా
యన పరిపాలనీయ మగునట్టి వ్రతంబు సమాప్తిఁ బొందఁ జ
ల్పిన జతనంబు లోకులకుఁ బేడితనంబయి తోఁచె నిమ్మెయిన్. 160

ప్రతిపదార్థం: అనవుడున్= పైవిధంగా ఉత్తరుడు అనగానే; ఆతఁడు+ఇట్లు+అనున్= అర్జునుడు ఇట్లా అంటున్నాడు; మత్= నాయొక్క; అగ్రజు= అన్న అయిన ధర్మరాజుయొక్క; పంపునన్= ఆజ్ఞతో; బ్రహ్మచర్య వర్తనకయి= బ్రహ్మచర్యాన్ని

నడపటానికి; పూర్వ= పూర్వం; శాప= శాపంచేత (ఊర్వశి వలన వచ్చిన శాపం); విహితంబు+అగు= విధించబడ్డ; రూపమున్= ఆకారాన్ని; తాల్చి= ధరించి; ఏక= ఒకటైన; హాయన= సంవత్సరంపాటు; పరిపాలనీయము= ఆచరించదగింది; అగునట్టి= అయినటువంటి; వ్రతంబు= నియమం; సమాప్తిన్+పొందన్= ముగించటానికి; చల్పిన= చేసినట్టి; జతనంబు= ప్రయత్నం; లోకులకున్= లోకానికి; ఈ+మెయిన్= ఈ రీతిగా; పేడితనంబు+అయితో(చెన్= నపుంసకత్వంగా వ్యక్తమయింది.

తాత్పర్యం: అర్జునుడు ఉత్తరుడితో తనకు పేడిరూపం ఎట్లా వచ్చిందో చెప్పుతున్నాడు. 'మా అన్న ధర్మరాజు యొక్క ఆజ్ఞ మేరకు బ్రహ్మచర్యవ్రతాన్ని పూని, ఇంతకుముందు ఊర్వశి కారణంగా వచ్చిన శాప సంబంధమైన రూపాన్ని తాల్చి, సంవత్సరం పాటు ఆచరించాల్సిన వ్రతాన్ని పూర్తిచేసే ప్రయత్నమే లోకానికి ఇలా పేడిరూపంగా తోస్తూ ఉన్నది.

విశేషం: అర్జునుడు, తన అన్న ధర్మరాజు ఆనతో, పాశుపత మహాస్త్రాన్ని సంపాదించటానికి ఇంద్రకీలపర్వతం మీద ఇంద్రుడిని గురించి తపస్సు చేశాడు. ఇంద్రుడు ప్రత్యక్షమై, శివుడిని గూర్చి తపస్సు చేయుమని ఆదేశించాడు. అర్జునుడు అట్లాగే చేశాడు. శివుడు మాయా కిరాతవేషంలో వచ్చి, అర్జునుడితో పందికొరకు పోరాడి, మెచ్చి, ప్రత్యక్షమై, పాశుపతాన్ని అనుగ్రహించాడు. ఆ సందర్భంలో ఇంద్రుడు దేవగణాలతో వచ్చి అర్జునుడిని మెచ్చి, అమరావతికి తీసికొనిపోయాడు. అక్కడ అర్జునుడిని పరీక్షించటానికి ఇంద్రుడు ఊర్వశిని సాలంకృతగా ఆతడి వద్దకు పొమ్మంటాడు. ఆమె అర్జునుడి వద్దకు వచ్చి, తన కోరికను తెలిపింది. దానికి ఆతడు 'తల్లీ!' అని పిలిచి, తమ వంశకర్త అయిన పురూరవుడికి ఆమె భార్య అనీ, కనుక తనకు తల్లి అనీ, నిరాకరించాడు. పైగా అప్సరసలందరూ ఇంద్రుడి కాంతలు కనుక, ఇట్లా కూడా 'నీవు నాకు తల్లివే!' అని అర్జునుడు ఆమెకు బుద్ధి చెప్పాడు. దానికి ఆమె నపుంసకుడివి కమ్మని శపించింది. అర్జునుడు విచారించగా తండ్రి అయిన ఇంద్రుడు ఇది భయపడవలసిన విషయంకాదనీ, ముందు అజ్ఞాతవాసంలో ఈ శాపమే వరంగా ఉంటుందనీ ఓదార్చి, వరాలిచ్చి కొడుకు నిగ్రహాన్ని ప్రశంసించి పంపాడు. ఈ కథ ఆంధ్ర మహాభారతం ఆరణ్యపర్వం ప్రథమాశ్వాసంలో ఉన్నది.

వ. అదియును నిటమీ(ద లేదనిన(బ్రమోదమాన మానసుండయి, మత్స్యపతిసూనుండు పాండుసూనున కిట్లనియె. 161

ప్రతిపదార్థం: అదియును= ఆ పేడిరూపం కూడా; ఇటమీ(దన్= ఇకమీద; లేదు+అనినన్= ఉండదు అనగానే; ప్రమోద మాన= సంతోషిస్తున్న; మానసుండు= మనస్సు కలవాడు; అయి; మత్స్య= మత్స్యదేశానికి; పతి= రాజు అయిన విరాటుడి యొక్క; సూనుండు= కుమారుడైన ఉత్తరుడు; పాండుసూనునకున్= పాండురాజు కుమారుడైన అర్జునుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇంక ఆ పేడిరూపం (తనకు) లేదు' అని చెప్పగా,ఉత్తరుడు ఆనందంతో అర్జునుడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'ఇట్లు తెలియ(జెప్పుటెల్ల నాదెస దయ । పెంపుతోడి కూర్మి పేర్మి(గాదె!
యింక సురలకైన శంకింతునే? భవ । ద్బాహువప్రగుప్తి బలుపు గలుగ. 162

ప్రతిపదార్థం: ఇట్లు= పైవిధంగా; తెలియన్+చెప్పుట+ఎల్లన్= బాగా తెలిసేటట్లు చెప్పటం అంతా (ఎందుకంటే); నాదెసన్= నాపై; దయ=దయయొక్క; పెంపుతోడి= ఆధిక్యంతో కూడిన (ఎక్కువైన); కూర్మి పేర్మిన్= ప్రేమయొక్క అతిశయంతో; కాదె!= కాదా!; ఇంకన్= ఇప్పటినుండి; భవత్= నీయొక్క; బాహు= బాహువులు అనే; వప్ర= ప్రహరి (ప్రాకారం) యొక్క;

గుప్తిన్= రక్షణతో; బలుపు కలుగన్= బలం రాగా; సురలకున్+అయినన్= దేవతలకు అయినా; శంకింతునే?= అనుమానిస్తానా? (జంకుతానా?).

తాత్పర్యం: 'ఈ విధంగా నీవు నాకు స్పష్టంగా చెప్పటం, నాపైన దయాతిశయంతో కూడిన అభిమానంతోనే కదా! ఇక ముందు నీ బాహువులు అనే ప్రాకారం రక్షిస్తూ ఉండగా, బలాన్ని పొంది, దేవతలకైనా భయపడకుండా ఉంటాను. (అంటే కౌరవసేన సంగతి చెప్పనక్కరలేదని భావం).

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. 'భవద్బాహు వప్రగుప్తి బలుపుగలుగ', అనే రూపక ప్రయోగం వలన ఉత్తరుడిలో సమాశ్రిత భావం అర్జునుడి బల ప్రశంస, అభ్యర్థన, ఆత్మవిశ్వాసం, క్రొత్త ఉత్సాహం వంటి భావాలు కలిగినట్లు తెలుస్తున్నది.

వ. నాకుం బని యెయ్యది పనుపు 'మనిన నతండును' గాండీవంబును, గాంచన పుంఖంబులగు బాణంబులు గల తూణీర యుగళంబును, మదీయ తను త్రాణ కృపాణంబులును బుచ్చికొని తక్కిన వాని నెప్పటి భంగిన కట్టి పెట్టి ర' మ్మని నియోగించిన, నాతండు నట్ల చేయుటయు, నమ్మహాత్ముండు నియాతాత్ముండయి యధి దేవతలకుం బ్రాణమిల్లి, భక్తితోడ దివ్యకోదండాదులగు సాధనంబులు గైకొని, సవిశేషస్ఫూర్తి యగు మూర్తి నత్యంత దర్శనీయత్వంబు నొందె. 163

ప్రతిపదార్థం: నాకున్= నాకు; పని+ఎయ్యది?= పని ఏమి? (ఏ పనిచేయాలి); పనుపుము+అనినన్= ఆజ్ఞాపించుము అని అనగా; అతండును= అర్జునుడు కూడ; గాండీవంబును= గాండీవం అనే పేరున్న వింటినీ; కాంచన= బంగారుతో కూడిన; పుంఖంబులు+అగు= పింజలు కలవైన (బాణాల పిడిభాగం బంగారంతో అలంకరిస్తారు. పేర్లు కూడా చెక్కుతారు); బాణంబులు కల= బాణాలు ఉన్న; తూణీర= అమ్ముల పొదులయొక్క; యుగళంబును= జంటను; మదీయ= నాయొక్క; తను= శరీరాన్ని; త్రాణ= రక్షించేది (కవచాన్ని); కృపాణంబులును= కత్తులునూ; పుచ్చికొని= తీసికొని; (చెట్టుపైన ఉన్న ఆయుధాల మొత్తంలో పైవి మాత్రం తీసికొని); తక్కినవానిన్= మిగిలిన వాటిని; ఎప్పటి భంగిన్+అ= ముందున్న విధంగానే; కట్టిపెట్టి= కట్టగా కట్టి; రమ్ము+అని నియోగించినన్= రావలసింది అని ఆజ్ఞాపించగా; ఆతండు= ఉత్తరుడు; అట్లు+అ చేయుటయున్= అర్జునుడు చెప్పినట్లే చేయగా; ఆ+మహాత్ముండు= ఆ అర్జునుడు; నియత+ఆత్ముండు+అయి= నియమించిన మనస్సు కలవాడై (మనోనిగ్రహంతో); అధిదేవతలకున్= ఆయా ఆయుధాలకు అధిపతులైన దేవతలకు; (ఆయుధాల్ని ప్రయోగించాలంటే, ఆయా ఆయుధాల అధిదేవతల అనుగ్రహం కావాలి. అవి అన్నీ మంత్ర మహితాలు); ప్రణమిల్లి= నమస్కరించి; భక్తితోడ= భక్తిభావంతో; దివ్య= ప్రకాశిస్తూ, మహిమతో కూడిన; కోదండ+ఆదులు+అగు= ధనుస్సు మొదలైనవగు; సాధనంబులు= యుద్ధానికి సంబంధించినవాటిని (ఆయుధాలను); కైకొని= స్వీకరించి; స+విశేషస్ఫూర్తి= ఏదో విశేషం (ప్రత్యేకతతో) కూడిన కాంతి ఉన్నట్టిది; అగు=ఐన; మూర్తిన్= రూపంతో; అతి+అంత= మిక్కిలి; దర్శనీయత్వంబున్= చూడతగిన లక్షణం; ఒందె= పొందె.

తాత్పర్యం: ఇప్పుడు నేను ఏం పనిచేయాలో నన్ను ఆజ్ఞాపించుము' అని ఉత్తరుడు అనగానే, అర్జునుడు 'గాండీవాన్నీ, బంగారుతో అలంకరించిన పిడులున్న బాణాలతో నిండిన రెండు అమ్ములపొదులనూ, కవచాన్నీ, కత్తినీ తీసికొని, తక్కినవాటిని అట్లాగే కట్టిపెట్టి రావలసింది' అని అంటే ఉత్తరుడు అట్లాగే చేశాడు. మహాత్ముడైన ఆ అర్జునుడు ఆయా ఆయుధాలకు సంబంధించిన దేవతలకు భక్తితో మ్రొక్కి, ఆయుధాలను గ్రహించి, ఎంతో కాంతిమంతమైన దివ్యరూపంతో దర్శనీయంగా ఉండె. (తరువాతి పద్యంతో అన్వయం).

క. బలరిపుఁ డిచ్చిన కుండల । ములు నుష్ణీషంబుఁ జిత్తమున భక్తి మెయిం
దలఁప నవి వచ్చె; వెంద్రుక । లలవడగాఁ బాచి ముడిచె నమర దృఢముగన్. 164

ప్రతిపదార్థం: బల= బలుడు అనే పేరుగల రాక్షసుడియొక్క; రిపుఁడు= శత్రువైనవాడు ఇంద్రుడు; ఇచ్చిన= ఇచ్చినటువంటి; కుండలములన్= చెవులకు పెట్టుకొనే ఆభరణాలు (వలయాలు); ఉష్ణీషంబున్= తలపాగా; చిత్తమునన్= మనస్సులో; భక్తిమెయిన్= భక్తితో; తలఁపన్= తలచుకొనగానే; అవి= ఆ కుండలాలూ, తలపాగా; వచ్చెన్= వచ్చాయి; వెంద్రుకలు= జుట్టును; అలవడఁగాన్= తగినట్లుగా; పాచి= పాయలు పాయలుగా చిక్కుదీసి; దృఢముగన్= గట్టిగా; అమరన్= కుదురుకొనే రీతిగా; ముడిచెన్= ముడివేసికొన్నాడు (అర్జునుడు).

తాత్పర్యం: దేవేంద్రుడు ప్రసాదించిన కుండలాలనూ, తలపాగానూ అర్జునుడు తన మనస్సులో అనుకొనగానే వచ్చాయి. అప్పుడు ఆతడు తన జుట్టును సవరించుకొని, వాటిని అమరించుకొన్నాడు.

విశేషం: కుండలాలూ, ఉష్ణీషం మొదలైన అర్జునుడి వస్తువులన్నీ దివ్యాలు కనుక, అవి అవసరం అయినప్పుడు తలచుకొనగానే ఆతడికి స్వాధీనాలౌతాయి. ఉష్ణీషం అంటే శిరోవేష్టనం (తలగుడ్డ) లేదా కిరీటం. ఉష్ణాన్ని పోగొట్టేది ఉష్ణీషం.

క. తలచుట్టు చుట్టెఁ; గుండల । ములు వెట్టెను; ద్రిండు గాఢముగఁ గట్టెఁ; గరం
బుల వలయంబులు గనుఁగొని । యెల నవ్వొలయంగ నెక్కె నేడ్తెఱ రథమున్. 165

ప్రతిపదార్థం: తలచుట్టు= తలపాగాను; చుట్టెన్= చుట్టుకొన్నాడు (అర్జునుడు); కుండలములు= కుండలాలను; పెట్టెను= పెట్టుకొన్నాడు; ద్రిండు= దట్టీని; గాఢముగన్= గట్టిగా బిగించి; కట్టెన్= కట్టుకొన్నాడు; కరంబుల= చేతులయొక్క; వలయంబులు= కటకాలు (గాజులు); కనుఁగొని= చూచి; ఎల+నవ్వు+ఒలయంగన్= చిరునవ్వుతో; ఏడ్తెఱన్= అతిశయంతో; రథమున్= రథాన్ని; ఎక్కెన్= ఎక్కాడు.

తాత్పర్యం: తలపాగా బాగా అమరించి చుట్టుకొని కుండలాల్ని ధరించి, దట్టి బిగించి, చేతులకు ఇంకా అలాగే వున్న గాజుల్ని చూచుకొని అర్జునుడు చిరునవ్వుతో, రథాన్ని ఎక్కాడు.

విశేషం: అర్జునుడికి 'ఎలనవ్వు' (చిరునవ్వు) కలిగింది. దానికి కారణం ఆతడి చేతులకున్న శంఖవలయాలు. అంటే శంఖాల వలె ఉన్న గాజులు. వాటిని స్త్రీలు వేసికొంటారు. బృహన్నలకు తగినట్లు ఆతడు అప్పటికి వాటిని వేసికొన్నాడు. కాని, ఇంకా ఉన్నాయే - అని తన చేతులను తాను చూచికొని అర్జునుడు నవ్వుకొన్నాడు.

వ. అట్టి యెడ వరదాన మహానుభావంబునం జేసి. 166

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; వర= వరాన్ని; దాన= ఇవ్వటం వలన కలిగిన; మహా+అనుభావంబునన్+చేసి= గొప్ప మహిమతో.

తాత్పర్యం: ఇంద్రుడు వరాన్ని ఇవ్వటం వలన కలిగిన ప్రభావంతో ఆ సమయంలో.

క. పెట్టక కట్టక మౌళిం । బుట్టిన క్రియ దీధితులు నభోభాగంబున్
ముట్టి వెలుంగఁగ నింద్రుని । పట్టి కిరీటంబు పొలిచెఁ బ్రస్ఫురితంబై. 167

ప్రతిపదార్థం: పెట్టక= తనకు తానై పెట్టుకొనకుండా; కట్టక= తానై తలపై కట్టుకొనకుండా; మౌళిన్= శిరస్సుపైన; పుట్టిన క్రియన్= మొలిచిన రీతిగా; దీధితులు= వెలుగులు; నభస్(ః)+భాగంబున్= ఆకాశాన్ని; ముట్టి= తాకి (ఆకాశం అంతా నిండి); వెలుంగఁగన్= ప్రకాశించగా; ఇంద్రుని= దేవేంద్రుడి యొక్క; పట్టి= కుమారుడైన అర్జునుడియొక్క; కిరీటంబు= కిరీటం; ప్రస్ఫురితంబు+ఐ= మిక్కిలి కాంతితో నిండి; పొలిచెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: తానై తలమీద పెట్టక, తనకు తానుగా తలకు కట్టక, తలమీదే మొలిచినట్లు తన కాంతులను ఆకాశం అంతా విరజిమ్ముతూ అర్జునుడి కిరీటం ప్రస్ఫుటంగా ప్రకాశించింది.

విశేషం: అర్జునుడి కిరీట కాంతులకే కొందరు సైనికులు మూర్ఛపోతారు. అది అంత ప్రభావంతో కూడింది. అట్లాగే, అల్లెత్రాటి ధ్వనితో కొందరూ, దేవదత్త శంఖధ్వానంతో కొందరూ, కపిధ్వజం సింహనాదానికి కొందరూ, ఇట్లా చాలా సైన్యం మూర్ఛపోతుంది. ఇది అంతా అర్జునుడు యుద్ధం చేయకముందే జరుగుతుంది. అర్జునుడి యుద్ధ పరికరాలు అన్నీ వరప్రసాదాలు.

వ. ఇవ్విధంబున సన్నద్ధుండై యతిరథశ్రేష్ఠుండు రథం బెక్కి యం దాయుధంబులు పదిలంబుగా నిడి, తనుత్రాణ తలత్రాణంబులు తాల్చి, కవదొనలం బూని, గాండీవంబుఁ బుచ్చికొని యెక్కువెట్టి, ముష్టి నలవరించి గుణధ్వని సేసిన. 168

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= పైన చెప్పినట్లు; సన్నద్ధుండు+ఐ= సంసిద్ధం అయినవాడై; అతిరథ= అతిరథులలో; శ్రేష్ఠుండు= శ్రేష్ఠమైనవాడు అయిన అర్జునుడు; రథంబు+ఎక్కి; అందు=ఆ రథంలో; ఆయుధంబులు=ఆయా ఆయుధాలను; పదిలంబుగాన్+ఇడి= జాగ్రత్తగా ఉంచి; తనుత్రాణ= కవచాన్ని (తనువును-అంటే-శరీరాన్ని కాపాడేదాన్ని); తల= కరతలాన్ని (అరచేతిని); త్రాణంబులు= రక్షించేది (అరచేతి కవచం); తాల్చి= ధరించి; కవ= రెండైన; దొనలన్= అమ్ములపొదుల (జంటను); పూని= తాల్చి; గాండీవంబున్+పుచ్చికొని= గాండీవాన్ని తీసికొని; ఎక్కు+పెట్టి= అల్లెత్రాడు బిగించి; ముష్టిన్+అలవరించి= పిడికిటితో గట్టిగా పట్టి; గుణధ్వని= అల్లెత్రాటి ధ్వని (ధనుష్టంకారం); చేసినన్= చేయగా.

తాత్పర్యం: అర్జునుడు పైవిధంగా యుద్ధానికి సంసిద్ధమై, రథాన్ని అధిరోహించి, ఆయుధాలను భద్రంగా రథంలో పెట్టుకొని, కవచాలనూ, అమ్ములపొదులనూ ధరించి గాండీవాన్ని ఎక్కుపెట్టి, అల్లెత్రాటిని మోగించగా.

తే. పక్షి మృగజాతు లెల్లను బ్రమసి యిట్టు । నట్టుఁ గలగొనఁ జెదరె; వృక్షాళి యదరెఁ;
గురుబలంబును బెదరె; నంబరము దిశలు । బూరటిల్లంగఁ దొడఁగెఁ దదారవమున. 169

ప్రతిపదార్థం: తద్+ఆరవమునన్= ఆ అల్లెత్రాటి ధ్వని వలన; పక్షి= పక్షులయొక్క; మృగ= మృగాలయొక్క; జాతులు+ఎల్లను= జాతులు అన్నీ; (నానారకాల పక్షులూ, మృగాలూ); బ్రమసి= భ్రమించి (దిక్కు తెలియక); ఇట్టున్+అట్టున్= ఇటు అటూ; కలగొనన్= కలతచెందేటట్లు; చెదరెన్= చెదిరిపోయాయి; వృక్ష+ఆళి= చెట్ల గుంపు; అదరెన్= అదిరింది (ఊగింది); కురుబలంబును= కౌరవసేన కూడా; బెదరెన్= బెదిరిపోయింది; అంబరము= ఆకాశం; దిశలు= దిక్కులూ; బూరటిల్లంగన్+తొడఁగెన్= (ఆ శబ్దంతో) నిండి మారుమ్రోగసాగాయి.

తాత్పర్యం: అర్జునుడు చేసిన ఆ ధనుష్టంకారం వలన అన్నిరకాల పక్షులూ, మృగాలూ కలత చెంది చెల్లాచెదరయ్యాయి. చెట్లు అన్నీ కుదుళ్ళతో ఊగిపోయాయి. కౌరవసేన కూడ బెదిరిపోయింది. అల్లెత్రాటి ధ్వనితో ఆకాశం, దిక్కులూ నిండి మారుమ్రోగిపోయాయి.

వ. తదనంతరంబ యగ్నిదేవుం దలంచిన, నతండును దన వరంబున మున్న కలిగి విశ్వకర్మ నిర్మితంబును, మాయామయంబును, వానరాకారంబును నగు మహోగ్ర కేతనంబును, తదాశ్రితంబులైన వికృతాభీల నానావిధ భూతంబులఁ బుత్తెంచిన, నుదాత్త చిత్తుండయి యుత్తరు సింహపతాక శమీవృక్షంబునం బెట్టించి, నిజ ధ్వజంబు రథంబునం గట్టించి, దివ్యంబు గావున దేవదత్తంబు చిత్తజ్ఞత్వంబున సన్నిధి సేసిన సవినయంబుగాఁ గైకొనియె; నక్కుమారుండును నాయితంబై నొగలెక్కి పగ్గంబు లమర్చికొని యగ్గలిక తోడం దురంగంబుల యంగంబులు తొడయుచు వాని జవసత్త్వంబులు వేఱు వేఱ వర్ణించిన. 170

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; అగ్నిదేవున్+తలంచినన్; అతండును= అగ్నిదేవుడు కూడా; తన వరంబునన్= తన వరంచేత; మున్ను+అ= అంతకు మునుపే; కలిగి= సిద్ధంగా ఉండి; విశ్వకర్మ= విశ్వకర్మ అనే దేవశిల్పి చేత; నిర్మితంబును= నిర్మించబడిందీ; మాయామయంబును= మాయతో కూడిందీ; వానర+ఆకారంబును= కోతివంటి రూపం కలిగిందీ; అగు= ఐన; మహా= గొప్పదైన; ఉగ్ర= భయంకరమైన; కేతనంబును= ధ్వజం ఉన్నట్టిదీ; తద్+ఆశ్రితంబులు+ఐన= దాని నాశ్రయించిన; వికృత= వికారంబులయిన; ఆభీల= భయంకరాలైన; నానావిధ= అనేక రకాలైన; భూతంబులన్= భూతాలను; పుత్తెంచినన్= పంపగా; ఉదాత్త చిత్తుండు+అయి= ఉప్పొంగిన మనస్సు కలవాడై; ఉత్తరు= ఉత్తరకుమారునియొక్క; సింహపతాకన్= సింహం గుర్తుగల జెండాను; శమీ వృక్షంబునన్+పెట్టించి= జమ్మిచెట్టుమీద పెట్టించి; నిజ= తనయొక్క; ధ్వజంబున్= కేతనాన్ని (కపిధ్వజాన్ని); రథంబునన్= రథానికి; కట్టించి; దివ్యంబు+కావునన్= దేవతామహిమ కలది కాబట్టి; దేవదత్తంబు= దేవదత్తమనే శంఖం; చిత్తజ్ఞత్వంబునన్= మనసులో ఉన్నదాన్ని తెలిసికొన్నట్లు (సంకల్పమాత్రం చేతనే); సన్నిధి+చేసినన్= ఎదుటికి రాగా; సవినయంబుగాన్= వినయంతో కూడి; కైకొనియెన్= తీసికొన్నాడు; ఆ+కుమారుండును= ఆ ఉత్తరకుమారుడు కూడా; ఆయితంబు+ఐ= సిద్ధమై; నొగలు+ఎక్కి; పగ్గంబులు+అమర్చికొని; అగ్గలిక తోడన్= ఆధిక్యంతో; తురంగంబుల= గుర్రాలయొక్క; అంగంబులు= అవయవాలు; తొడయుచున్= నిమురుతూ; వాని= ఆ గుర్రాలయొక్క; జవసత్త్వంబులు= వేగాన్నీ, బలాన్నీ; వేఱువేఱ= వేరువేరుగా; వర్ణించినన్= వివరించగా.

తాత్పర్యం: ఆ తరువాత అర్జునుడు అగ్నిని మనసులో ధ్యానించాడు. అప్పుడు అగ్నిదేవుడు అర్జునుడికి మునుపే వరంగా ఇచ్చినట్టిదీ, దేవశిల్పి అయిన విశ్వకర్మ నిర్మించిందీ, మాయతో కూడిందీ, కోతి ఆకారంగా ఉండేదీ అయిన ధ్వజాన్ని పంపించాడు. దాన్ని ఆధారం చేసికొని ఉన్న భయంకరాలైన ఎన్నో భూతాలను కూడా పంపించాడు. అర్జునుడు ఉత్తరుడి సింహపతాకాన్ని జమ్మిచెట్టు మీద పెట్టించాడు. తన కపికేతనాన్ని రథానికి కట్టించాడు. అర్జునుడి మనస్సంకల్పాన్ని గ్రహించి, దేవదత్తం ఎదుటికి వచ్చింది. అర్జునుడు వినయంతో ఆ దివ్యమైన శంఖాన్ని గ్రహించాడు. అప్పుడు ఉత్తరకుమారుడు తయారై నొగలెక్కి పగ్గాలను చేత పట్టుకొని గుర్రాలను నిమురుతూ వాటి వేగాన్నీ, బలాన్నీ వేరువేరుగా వివరించాడు.

అర్జునుఁ డుత్తరసారథికంబైన రథంబెక్కి దేవదత్తంబు పూరించుట (సం. 4-41-1)

చ. 'తడవగుదెంచె; జమ్మికిఁ బ్రదక్షిణవృత్తిగఁ దేరు వోవని;
మ్మెడ గలుగంగఁ బోయెఁ బసు; లిప్పుడ కూడుద' మన్న నాతఁడున్
నడపఁ దొడంగుడున్ మనమునన్ రణకౌతుక ముల్లసిల్లఁగాఁ
బిడుగుల పిండు బిట్టులియు పెల్లునఁ బార్థుఁడు శంఖ మొత్తినన్. 171

ప్రతిపదార్థం: తడవు+అగుదెంచెన్= (ఇప్పటికే) ఆలస్యం అయింది; జమ్మికిన్= జమ్మిచెట్టుకు; ప్రదక్షిణ వృత్తిగన్= కుడివైపుచుట్టూ తిరిగే విధంగా (ప్రదక్షిణం చేసిన రీతిగా); తేరు= రథాన్ని; పోవనిమ్ము= పోనిమ్ము; పసులు= పశువులు (ఆవులు); ఎడ+ కలుగంగన్= దూరంగా; పోయెన్= వెళ్ళిపోయాయి; ఇప్పుడు+అ= వెంటనే; కూడుదము= (పసువులను) కలిసికొనాలి; అన్నన్= అనగానే; ఆతఁడున్= ఆ ఉత్తరకుమారుడు కూడా; నడపన్+తొడంగుడున్= నడపటానికి మొదలు పెట్టగానే; పార్థుఁడు= అర్జునుడు; మనమునన్= మనస్సునందు; రణ= యుద్ధ సంబంధం అయిన; కౌతుకము= ఉత్సాహం; ఉల్లసిల్లఁగాన్= ఎక్కువగా కలుగగా; పిడుగులు= పిడుగుల యొక్క; పిండు= సమూహం; బిట్టు+ఉలియు పెల్లునన్= ఎక్కువైన ధ్వనియొక్క ఆధిక్యంతో; శంఖము= దేవదత్తం అనే తన శంఖాన్ని; ఒత్తినన్= ఊదగా (పూరించగా).

తాత్పర్యం: అర్జునుడు ఉత్తరుడితో 'ఇప్పటికే ఆలస్యం అయింది. రథాన్ని జమ్మిచెట్టుకు ప్రదక్షిణంగా నడుపుము. పసులు దూరం వెళ్లాయి. మనం వెంటనే వాటిని చేరుకొనాలి' అని అనగానే ఆతడు రథాన్ని నడపటం మొదలుపెట్టాడు. ఆ సమయంలో అర్జునుడు రణ సంబంధం అయిన మహోత్సాహంతో పిడుగుల గుంపు తీవ్రంగా ధ్వనించినట్లు, గొప్పగా దేవదత్తాన్ని పూరించాడు.

విశేషం: అర్జునుడు దేవదత్తాన్ని పూరిస్తే, సమస్త ప్రకృతిలో వచ్చిన మార్పును మహాకవి తరువాతి పద్యంలో అభివర్ణిస్తున్నాడు.

మ. **కలఁగెం దోయధి సప్తకంబు; గిరివర్గం బెల్ల నూటాడె, సం**
చలతం బొందె వసుంధరావలయ; మాశాచక్ర మల్లాడెఁ; గొం
దల మందెం ద్రిదశేంద్రు పట్టణము; పాతాళంబు ఘూర్ణిల్లె; నా
కులమయ్యెన్ గ్రహతారకాకులము; సంక్షోభించె నవ్వేధయున్. **172**

ప్రతిపదార్థం: తోయధి సప్తకంబు= ఏడు సముద్రాలూ; కలఁగెన్= కలత చెందాయి (కల్లోలం చెందాయి); గిరివర్గంబు+ఎల్లన్= కులపర్వతాల సమూహం అంతా; ఊటాడెన్= ఊగిసలాడింది; వసుంధరావలయము= భూమండలం; సంచలతన్+పొందెన్= కదలాడింది (సంచలించింది); ఆశాచక్రము= దిక్కులు అనే చక్రం; అల్లాడెన్= అల్లల్లాడిపోయింది; త్రిదశ+ఇంద్రుపట్టణము= దేవతలకు రాజైన దేవేంద్రుడి పట్టణం అయిన అమరావతి; కొందలము+అందెన్= కలత చెందింది (దిగులుపడింది); పాతాళంబు= భూమికి క్రిందనున్న లోకం (రసాతలం); ఘూర్ణిల్లెన్= క్షోభించింది; గ్రహతారకాకులము= గ్రహాలయొక్క, నక్షత్రాలయొక్క మొత్తం; ఆకులము+అయ్యెన్= కలత చెందింది; ఆ+వేధయున్= ఆ బ్రహ్మదేవుడు కూడా; సంక్షోభించెన్= మిక్కిలి క్షోభించిపోయాడు.

తాత్పర్యం: అర్జునుడు దేవదత్తాన్ని పూరించగా ఏడు సముద్రాలూ అల్లకల్లోలం అయ్యాయి. ఏడు కులపర్వతాలూ ఊగిపోయాయి. భూచక్రం అంతా కంపించింది. దిక్కుల సమూహం అల్లల్లాడింది. అమరావతి దిగులుపడింది. పాతాళం క్షోభించింది. గ్రహ నక్షత్రాలు తల్లడిల్లి వాటి వాటి గతులు తప్పాయి. ఆఖరికి ఆ బ్రహ్మకూడా కదిలిపోయాడు.

విశేషం: ప్రకృతిని అంతా ముందు చెప్పి, చివరలో దానికి కారకుడైన వేధ పరిస్థితిని కవి వర్ణించడం వలన, అర్జునుడు పూరించిన దేవదత్తం ధ్వని సమస్త బ్రహ్మాండం వ్యాపించింది - అని భావించాలి. అందుకే, భూలోకం, పాతాళం, అమరావతి (స్వర్గలోకం) అల్లకల్లోలం అయినట్లు వర్ణించబడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. అపుడు నిశ్చేష్టితంబులై హయము లవనిఁ । జాఁపకట్టుగఁ బడియె; మత్స్యక్షితీశ
నందనుండును నొగలపై వ్రందినట్లు । మ్రొగ్గతిలఁ జాఁగి బలితంపు మూర్ఛఁ బొందె. 173

ప్రతిపదార్థం: అపుడు= అర్జునుడు దేవదత్తాన్ని పూరించినప్పుడు; హయములు= గుఱ్ఱాలు; నిశ్చేష్టితంబులు+ఐ= కదలిక లేనివై; (కొయ్యబారినవై); అవనిన్= నేలమీద; చాఁపకట్టుగన్+పడియెన్= చాపచుట్టవలె పడ్డాయి; మత్స్యక్షితి+ఈశ= మత్స్యదేశం రాజైన విరాటుడి యొక్క; నందనుండును= కుమారుడైన ఉత్తరుడు కూడా; నొగలపైన్= సారథి కూర్చుండే చోటులో (రథానికి ముందుప్రక్క); వ్రందినట్లు= చనిపోయినట్లు; మ్రొగ్గతిలన్+చాఁగి= బోరగిలబడి సాగినట్లు; బలితము+మూర్ఛన్= గాఢమైన మూర్ఛను; పొందెన్= పొందాడు.

తాత్పర్యం: ఆ సమయంలో రథానికి కట్టిన గుఱ్ఱాలు చాపకట్టుగా కుప్పకూలాయి. ఉత్తరుడు రథం నొగలపైన ముందుకు బోర్లాపడి తెలివిదప్పి పడిపోయాడు.

చ. కనుఁగొని ఫల్గునుండు తురగంబుల వాగెలు వట్టి యెత్తి, త
త్తనువులు నూల్కొనన్ నివిరి, తత్పరతం దగ మత్స్యభూమిభృ
త్తనయుని నూఁదిపట్టి, వికృతంబగు రూపము చక్కఁజేసి, నె
మ్మన మొకభంగిఁ దేర్చి, గరిమంబుగఁ గౌఁగిటఁ జేర్చి, యిట్లనున్. 174

ప్రతిపదార్థం: ఫల్గునుండు= అర్జునుడు; కనుఁగొని= చూచి (అప్పటి స్థితిని); తురగంబుల= గుఱ్ఱాలయొక్క; వాగెలు= పగ్గాలు (కళ్ళెపు త్రాళ్ళు); పట్టి+ఎత్తి= పట్టుకొని గుఱ్ఱాలను పైకెత్తి; తద్= ఆ బెదరిన గుఱ్ఱాలయొక్క; తనువులు= దేహాలను; నూల్కొనన్= సర్దుబాటు అయ్యేటట్లు; నివిరి= చేతితో మెల్లగా నిమిరి; తత్పరతన్= ఆసక్తితో; తగన్= తగురీతిగా; మత్స్యభూమి భృత్= మత్స్యదేశాన్ని భరించినవాడైన విరాటుడియొక్క; తనయునిన్= ఉత్తరుడిని; ఊఁది పట్టి= పడిపోకుండా పట్టుకొని; వికృతంబు+అగు= వికారాన్ని పొందిన; రూపము= ఆకారాన్ని; చక్కన్+చేసి= సరిచేసి; నెమ్మనము= (ఉత్తరుడియొక్క) మనస్సును; ఒక భంగిన్= ఒక రకంగా; తేర్చి= ఓదార్చి; గరిమంబుగన్= గొప్పగా (ప్రగాఢంగా); కౌఁగిటన్+చేర్చి= కౌగిలించుకొని; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ పరిస్థితిని గమనించిన అర్జునుడు, గుఱ్ఱాల కళ్ళెపు త్రాళ్ళను పట్టి పైకెత్తి, వాటికి కొంత కదలికను కలిగించి, ఒళ్ళు నిమిరి, ఉత్తరుడిని కూడా పైకెత్తి, ఆతడి భయవికారరూపాన్ని పోగొట్టి, మనస్సులో ఉన్న కలతను, భయాన్ని తీర్చి, చేతికొలది కౌగిలించుకుంటూ, ఉత్తరుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అర్జునుడు గుఱ్ఱాలకూ, ఉత్తరుడికీ చైతన్యాన్ని కలిగించి, భయాన్ని పోగొట్టాడు. ఉత్తరుడికి ఇంకా ధైర్యం చెప్పటానికి ఇట్లా అన్నాడు.

తే. 'శంఖ భేరీ రవంబులు, సామజముల । బృంహితంబులు వింతలే పృథుల సైన్య
పరిచయోదాత్తులగు నరపాల సుతులఁ? । కెలమిఁ బొందుము దీనికి నింత యేల?' 175

ప్రతిపదార్థం: పృథుల= పెద్దవైన; సైన్య= సేనలయొక్క; పరిచయ= పరిచయంతో; ఉదాత్తులు= గొప్పవారు; అగు= అయిన; నరపాలసుతులకున్= రాకుమారులకు; శంఖ= శంఖాలయొక్క; భేరీ= నగారాలయొక్క; రవంబులు= పెద్ద పెద్ద ధ్వనులు; సామజముల= ఏనుగులయొక్క; బృంహితంబులు= ఘీంకారధ్వనులు; వింతలే?= కొత్తవా? (కావు); దీనికిన్+ఇంత+ఏల?= ఈ కొంచెమునకే ఇంత చేయాలా?; ఎలమిన్= సంతోషాన్ని; పొందుము= పొందుము.

తాత్పర్యం: 'ఎంతో పెద్ద పెద్ద సేనలను చూచి, వాటితో బాగా పరిచయం ఉన్న రాజకుమారులకు ఇటువంటి శంఖనాదాలూ, భేరుల భాంకారాలూ, ఏనుగుల ఘీంకారాలూ కొత్తవా? ఏమి? ఇది చాలా సామాన్య విషయం. దీని కింతగా భయపడాలా? మనస్సును చిక్కబట్టుకొని సంతోషంతో ఉండుము.'

విశేషం: ఉత్తరుడు రాకుమారుడే. ఆతడూ ఇదివరలో శంఖధ్వానాలనూ, గజఘీంకృతులనూ, భేరీ భాంకారాలనూ వినని వాడేమీ కాదు. అవి అన్నీ సాధారణమైనవి. ఆతడు ఇప్పుడు విన్న అర్జునుడి శంఖధ్వని సమస్త ప్రకృతినే మూర్ఛపడేటట్లు చేసింది. అందుకే తాను భరించలేనని ఆతడు తరువాతి పద్యంలో అంటున్నాడు.

చ. **అనవుడు మత్స్యరాజసుతుఁ డాతని కిట్లనుఁ 'దొల్లి శంఖ ని**
స్వనములు విందు, భేరుల రవంబులు విందుఁ, గరీంద్ర బృంహిత
ధ్వనులును విందు, నద్భుత విధంబుగ ని ట్లవి యెల్లఁ జిత్తమో
హన మొనరింపఁ జాలునె! మహానినదం బిది యోర్వవచ్చునే? 176

ప్రతిపదార్థం: అనవుడున్= పైవిధంగా అర్జునుడు అనగానే; మత్స్యరాజ సుతుఁడు= ఉత్తరుడు; ఆతనికిన్= అర్జునుడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; తొల్లి= ఇంతకుముందు; శంఖ= శంఖాలయొక్క; నిస్వనములు= ధ్వనులు; విందున్= విని ఉన్నాను; భేరుల= నగారాలయొక్క; రవంబులు= మ్రోతలు; విందున్= విని ఉన్నాను; కరి+ఇంద్ర= శ్రేష్ఠమైన ఏనుగులయొక్క; బృంహిత= ఘీంకారాల; ధ్వనులును= శబ్దాలను; విందున్= విన్నాను; అవి+ఎల్లన్= అవి అన్నీ; ఇట్లు= ఇప్పటి శంఖ ధ్వనివలె; అద్భుత విధంబుగన్= అబ్బురాన్ని గలిగించేటట్లుగా; చిత్త= మనస్సును; మోహనము= మూర్ఛపోయేటట్లు; ఒనరింపన్+చాలునె!= చేయ కలిగినాయా!; ఇది= ఇప్పటి నీ శంఖారవం; మహా= చాలా గొప్పదైన; నినదంబు= ధ్వని; ఓర్వన్+వచ్చునే= (దీన్ని) ఓర్చుకొనవచ్చునా? (సహించటానికి సాధ్యం కాదని భావం).

తాత్పర్యం: ఉత్తరుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు : 'నేను ఇంతకు ముందు శంఖ నాదాలను విన్నాను. భేరీ భాంకృతులనూ విన్నాను. గజాల ఘీంకారాలనూ విన్నాను. అయితే ఇదివరకు నేను విన్న ఆ శబ్దాలన్నీ ఇప్పటి ఈ శంఖ ధ్వానంవలె ఆశ్చర్యాన్ని కలిగిస్తూ, మనస్సును మూర్ఛిల్లజేయలేదు. ఇది ఒక మహారవం. సహించటానికి సాధ్యం కానిది.

చ. **చెవు లవిసెన్, దిశల్ దిరిగెఁ, జిత్తము నీరయిపోయె నాకు నీ**
రవమున; నిమ్మహోగ్ర కపిరాజు పతాకయుఁ జూడ్కిఁ జీఁకటుల్
గవియఁగఁ గ్రాలెడున్, భవదఖండిత తేజము పర్వి యాత్మకున్
వివశతఁ జేయుచున్నయది, విహ్వల భావము మాననేర్చునే?' 177

ప్రతిపదార్థం: నాకున్= నాకు; ఈ రవమునన్= ఈ శంఖ ధ్వనివలన; చెవులు+అవిసెన్= చెవులు పగిలిపోయాయి (చిల్లులు పడ్డాయి); దిశల్+తిరిగెన్= దిక్కులు తిరిగిపోయాయి (మతి తప్పటం వలన దిక్కులు తారుమారయ్యాయి అని భావం); చిత్తము= మనస్సు; నీరయిపోయెన్= నీరుగారిపోయింది (దిగజారింది); ఈ మహా+ఉగ్ర కపిరాజు పతాకయున్= మిక్కిలి భయంకరం అయిన వానరాకారంలో ఉన్న ఈ జెండా; చూడ్కిన్= నా చూపులో; చీఁకటుల్+కవియఁగన్= చీకట్లు క్రమ్మే విధంగా; క్రాలెడున్= వెలుగుతూ ఉన్నది; భవత్+అఖండిత= నీదైన యెడతెగని; తేజము= తేజస్సు; (కాంతి); పర్వి= బాగా

వ్యాపించి; ఆత్మకున్= నా మనస్సుకు; వివశతన్= పరవశత్వాన్ని (మూర్ఛను); చేయుచున్+ఉన్న+అది= కలిగిస్తూ ఉన్నది; విహ్వల భావము= నాయొక్క భయంతో కూడిన భావం; మానన్+నేర్చునే?= పోతుందా?

తాత్పర్యం: నీవు పూరించిన ఈ శంఖ నినాదంతో చెవులు తూట్లుపడి అవిసిపోయాయి. దిక్కులు గిరగిర తిరిగి, ఏది ఏ దిక్కు - అని తెలియకుండా మతిభ్రమ కలుగుతూ ఉన్నది. మనస్సు నీరుగారిపోయింది. నీ కపికేతన కాంతులు నా చూపులలో చీకట్లను నింపుతూ ఉన్నవి. చూడటానికి వీలుకాని (దుర్నిరీక్ష్యమైన) నీ తేజం నాకు పరవశత్వాన్ని కలిగిస్తూ ఉన్నది. ఇంక నా భయం ఎట్లా పోతుంది?' (ఒంటినిండా భయం పట్టుకొన్నదని భావం).

క. అన విని తగు మాటల నా। తని కొందలపాటు పాండుతనయుండు క్రమం
బున డిందుపఱిచి యరదము। సనఁగా నెఱిఁగించి పట్టె శంఖము మఱియున్. 178

ప్రతిపదార్థం: అనన్= ఉత్తరుడు పైవిధంగా అనగా; పాండుతనయుండు= అర్జునుడు; విని= విని; తగుమాటలన్= అప్పటి పరిస్థితికి తగిన మాటలతో; ఆతని= ఉత్తరుడియొక్క; కొందలపాటు= దుఃఖం; (కలత, భయం); క్రమంబునన్= క్రమక్రమంగా; డిందు పఱిచి= పోగొట్టి; అరదము= రథం; చనఁగాన్= పోయేటట్లు; ఎఱిఁగించి= తెలియజేసి; మఱియున్= తిరిగీ; శంఖము పట్టెన్= శంఖాన్ని పూరించాడు.

తాత్పర్యం: అర్జునుడు ఉత్తరుడి మాటలు విని, తగిన మాటలతో ఆతడిలో నిండిన భయాన్ని క్రమంగా పోగొట్టి, రథాన్ని నడపుమని చెప్పి, మరల శంఖాన్ని పూరించాడు.

విశేషం: భయంతో ఉన్న మనిషికి భయాన్ని పోగొట్టటానికి తగిన మాటలను చెప్పటం, ఓదార్చటం లోక సహజం. పైగా ఆ భయాన్ని ఒకేసారిగాక, క్రమంగా పోగొట్టటం కూడా సహజమే! అందుకే కవి, ఉత్తరుడి 'కొందలపాటును', 'క్రమంబున డిందుపఱిచి' అని అన్నాడు. మొదటిసారి శంఖాన్ని పూరించినపుడు అర్జునుడు ఉత్తరుడికి చెప్పలేదు. కాని, ఉత్తరుడి పరిస్థితిని గమనించిన అర్జునుడు చెప్పి మళ్ళీ శంఖాన్ని పూరించాడు. అంటే ఉత్తరుడు దేవదత్తధ్వానానికి అలవాటుపడ్డాడు. ఇక ఉత్తరుడికి శంఖధ్వానం వలన భయంలేదు; అది అలవాటైంది. అందుకే కవి 'పట్టె శంఖము మఱియున్' అని అన్నది.

వ. ఇత్తెఱంగున నయ్యుత్తర కుమారు ధీరుంగావించుకొని పాండవవీరుండు రథనేమి నిస్వన జ్యానాద మేదురం
బగు శంఖారవంబు సెలంగ నడచు సమయంబున నాచార్యుండు దుర్యోధనున కిట్లనియె. 179

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఆ+ఉత్తరకుమారున్= ఆ ఉత్తరకుమారుడిని; ధీరున్+కావించుకొని= ధీరుడిని చేసికొని; పాండవవీరుఁడు= శూరుడైన అర్జునుడు; రథ= రథంయొక్క (చక్రాలయొక్క); నేమి= అంచుయొక్క (చక్రానికి చుట్టూ ఉండే ఇనుప పట్టా); నిస్వన= శబ్దంతోనూ; జ్యా= అల్లెత్రాటి యొక్క; నాద= ధ్వనితోనూ; మేదురంబు+అగు= దట్టమైన (పోషించబడ్డ); శంఖారవంబు= శంఖనాదం; చెలంగన్= ధ్వనించగా; నడచు= ముందుకువెళ్ళే; సమయంబునన్= వేళలో; ఆచార్యుండు= ద్రోణుడు; దుర్యోధనునకున్= దుర్యోధనునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: పై విధంగా అర్జునుడు ఉత్తరుడికి ధైర్యాన్ని కలిగించి, అతడిని బాగా తయారు చేసికొని, రథచక్రాల ధ్వనినీ, అల్లెత్రాటి ధ్వనినీ, శంఖధ్వనినీ పెంపు చేసికొంటూ ముందుకు పోయే సమయంలో, ద్రోణుడు దుర్యోధనుడితో (అనుమానంతో) ఇట్లా అన్నాడు.

విశేషం: రథనేమి నిస్వనం, జ్యానాదం - వీటితో దట్టమైన శంఖధ్వనిని విన్న ద్రోణుడికి ఆతడు అర్జునుడు అనే అనుమానం స్పష్టమైంది. అందుకే ఆచార్యుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

సీ. **'శ్రవణ పుటంబులు వ్రయ్యంగఁ దాఁకి సం । క్షోభంబు గావించె గుణము మ్రోఁత;**
బ్రహ్మాండ భాండంబు పగిలించి భూత ని । శ్చైతన్య మొనరించె శంఖ రవము;
గగనభాగం బెల్లఁ గప్పి క్రాలుచు బెగ । డడరించె నుగ్రంపుఁ బడగపఱపు;
మిఱుమిట్లు గొని చూడ్కి పఱివోవ వెలిఁగి ప । రి భ్రాంతి సేసెఁ గిరీట కాంతి;

తే. **తెల్ల మిది గాండివంబును దేవదత్త । మును గపిధ్వజమును వాసవుని వరమునఁ**
గన్న మకుటంబు నగు; వేఱ కొన్ని యైన । నుజ్జ్వలాద్భుత భంగులై యున్నె యిట్లు! 180

ప్రతిపదార్థం: గుణము= అల్లెత్రాటియొక్క; మ్రోఁత= ధ్వని; (దీన్నే ధనుష్టంకారం అనీ అంటారు); శ్రవణ పుటంబులు= దొప్పలవంటి చెవులు; వ్రయ్యంగన్= బద్దలయ్యేటట్లు; తాఁకి= ఆ అల్లెత్రాటి శబ్దం తాకి (సోకి); సంక్షోభంబు+కావించెన్= కలత పెట్టింది; శంఖరవము= శంఖనాదం; బ్రహ్మాండ= ఈ బ్రహ్మాండం అనే; భాండంబు= కుండను; పగిలించి= పగులగొట్టి; భూత= ప్రాణులను; నిశ్చైతన్యము= కదలిక లేనివాటినిగా (ప్రాణరహితంగా); ఒనరించెన్= చేసింది; ఉగ్రము+పడగ (ఉగ్రంపుఁ బడగ)= భయంకరం అయిన ఆ కపిధ్వజంయొక్క; పఱపు= వ్యాప్తి (పరచుకొనటం); గగనభాగంబు+ఎల్లన్= ఆకాశం అంతటా; కప్పి= చుట్టుకొని (వ్యాపించి); క్రాలుచున్= వెలుగుతూ; బెగడు+అడరించెన్= ఎక్కువ భయాన్ని కలిగించింది; కిరీట= దేవేంద్రుడు ఇచ్చిన మణికిరీటం యొక్క; కాంతి= దివ్యమైన వెలుగు; మిఱుమిట్లు+కొని= మిఱుమిట్లు గొలిపి; చూడ్కి పఱివోవన్= చూపులు వెనుదిరిగేటట్లు; (చూపులు ముందుకు పోవాలి. కానీ చూపులు తట్టుకోలేనంత వెలుగు ముందువైపు ఎదురైంది గనుక, అవి వెనక్కే మళ్ళినాయి); వెలిఁగి= ప్రకాశించి; పరిభ్రాంతి+చేసెన్= మిక్కిలి భ్రమను కలిగించింది. (దిక్కు తెలియకుండా చేసింది అని భావం); గాండివంబును= గాండీవమూ; దేవదత్తమును= దేవదత్తమూ; కపిధ్వజమును= వానరాకారంలో ఉన్న కేతనమూ; వాసవుని= ఇంద్రుడియొక్క; వరమునన్+కన్న= వరంతో పొందిన; మకుటంబును+అగు= కిరీటమూ అయి ఉంటాయి; ఇది= ఈ విషయం; తెల్లము= స్పష్టం; వేఱ+కొన్ని+ఐనన్= పైన చెప్పిన గాండీవం మొదలైనవికాక, వేరేవి అయితే; ఇట్లు= ఈ రకంగా; ఉజ్జ్వల+అద్భుతభంగులు+ఐ= ఇంత తేజస్సుతో కూడిన ఆశ్చర్యకరాలైన విధానాలతో; ఉన్నె!= ఉంటాయా!

తాత్పర్యం: 'ధనుష్టంకారం, చెవుల గూబలను పగులగొట్టుతూ ఉంది. శంఖనాదం బ్రహ్మాండాన్ని బదాబదలుగా బ్రద్దలుగొట్టి జీవకోటికి కదలిక లేకుండా చేస్తూఉన్నది. కపికేతనం వ్యాపించి, ఆకాశాన్ని అంతా కాంతులతో నింపి, భయాన్ని కలిగిస్తున్నది. అనుమానం లేదు. ఇవి గాండీవమూ, దేవదత్తమూ, కపికేతనమూ, ఇంద్రుడు ప్రసాదించిన కిరీటమూ అయి ఉంటాయి. ఇది స్పష్టం. అవికాక, వేరేవి అయితే, ఇట్లాంటి ఆశ్చర్యకరాలైన తేజోరీతులై ఉండవు.

విశేషం: రెండవసారి అర్జునుడు దేవదత్తాన్ని పూరించాడు. అప్పుడే అది కౌరవసైన్యం దాకా ప్రాకటం, ద్రోణుడు గుర్తు పట్టటం జరిగింది. తన ప్రియ శిష్యుడైన అర్జునుడి ఆధిక్యాన్ని సూచించటానికే గురువు దుర్యోధనుడితో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. దీని తర్వాతి పద్యంలో కూడా, 'వచ్చేది అర్జునుడు, తగిన వీరులను సిద్ధం చేయు' మని గురుడు దుర్యోధనుడితో అంటాడు. ఇది గమనించ తగ్గది.

ఉ. అచ్చెరువైన విక్రమము నగ్గలికన్ సమరంబు గోరి యీ
వచ్చుచునున్నవాఁడు బలవద్రిపుభీషణబాహుఁ డైన వి
వ్వచ్చుఁడ; యింక మిన్నక వివాదము సేసినఁ బోవ; దియ్యెడం
బొచ్చెము లేని బల్మగలఁ బోరి కమర్పుము దర్పమేర్పడన్.' 181

ప్రతిపదార్థం: అచ్చెరువు+ఐన= ఆశ్చర్యాన్ని కలిగించే; విక్రమము+అగ్గలికన్= ప్రతాపాతిశయంతో (అత్యధికమైన పరాక్రమంతో); సమరంబు+కోరి= యుద్ధాన్ని కోరుకొని; ఈవచ్చుచున్+ఉన్నవాఁడు= ఈ వస్తున్నవాడు; బలవత్= బలవంతులైన; రిపు= శత్రువులకు; భీషణ= భయంకరం అయిన; బాహుఁడు+ఐన= బాహువులు కలవాడైన (భుజ పరాక్రమం గలవాడైన); వివ్వచ్చుఁడు+అ= అర్జునుడే! (అనుమానం లేదన్నమాట); ఇంకన్= అర్జునుడు వస్తూ ఉన్నాగానీ; మిన్నక= ఊరకనే (వ్యర్థంగా); వివాదము+చేసినన్= వాదులాడుకొంటూ ఉంటే; ఈ+ఎడన్= ఈ సమయంలో; పోవదు= కుదరదు (పని తీరిపోదు); దర్పము+ఏర్పడన్= (పౌరుషం) గర్వం బయటపడేట్లుగా; పొచ్చెములేని= తక్కువగాని (మనస్సులలో మచ్చలేని); బల్+మగలన్= మేటి వీరులను; పోరికిన్= యుద్ధానికి; అమర్పుము= (ఆలోచించి) అమరించు (ఏర్పాటు చేయుము). (అమరించటం అంటే, బాగా ఏరి, కోరి, తగినవాళ్ళను తయారుచేయటం అని భావం).

తాత్పర్యం: ఆశ్చర్యాన్ని కలిగించే అత్యధికమైన బాహుబల పరాక్రమంతో యుద్ధాన్ని కోరుకొంటూ ఆ వచ్చేది అర్జునుడే కాని, వేరేవాడు కాడు. ఆతడి పరాక్రమం శత్రువులకు చాలా భయంకరం అయింది. ఈ సమయంలో ఊరకనే వాదులాడుకొంటూ ఉంటే కుదురదు. అర్జునుడిని ఎదిరించటానికి మంచి బలవంతులైన వీరులను ఏర్పాటు చేయవలసింది'.

వ. అని కృపాశ్వత్థామాది యోధముఖ్యుల నవలోకించి. 182

ప్రతిపదార్థం: అని= పైవిధంగా ద్రోణుడు దుర్యోధనుడితో చెప్పి; కృప= కృపాచార్యుడూ; అశ్వత్థామ= తన కుమారుడైన అశ్వత్థామా; ఆది= మొదలైన; యోధ= వీరులలో; ముఖ్యులన్= ప్రధానులైనవాళ్ళను; అవలోకించి= చూచి.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు పైవిధంగా దుర్యోధనుడితో చెప్పి, కృపాచార్యుడూ, అశ్వత్థామా, మొదలైన మహావీరులను చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'మనమొనల దుర్నిమిత్తము । లనేకములు పుట్టఁ దొడఁగె; నట్లగుట జయం
బనుమానం; బొక కార్యము । వినుఁడా! మీకెల్లఁ జూడ వెరవగు నేనిన్. 183

ప్రతిపదార్థం: మన= మనయొక్క; మొనలన్= సేనలలో; దుర్నిమిత్తములు= దుశ్శకునాలు (అపశకునాలు); అనేకములు= ఎన్నో; పుట్టన్+తొడఁగెన్= పుట్టుతూ ఉన్నాయి (కనిపిస్తున్నాయి); అట్లు+అగుటన్= ఆ రకంగా జరగటం వలన, (అపశకునాలు పుట్టటం వలన); జయంబు= విజయం; అనుమానంబు= సందేహమే! (అపశకునాలు పుట్టటం వలన జయం కలగటం అనుమానం అని భావం); మీకున్+ఎల్లన్= మీ అందరికీ; చూడన్= చూడటానికి; వెరవు+అగునేనిన్= తగిందిగా ఉంటే (బాగుంటే); ఒక కార్యము= ఒక ఆలోచన లేక ఒక పని (ఉపాయం); వినుఁడా= అందరూ వినండి!

తాత్పర్యం: మన వైపున ఉన్న సైన్యంలో రకరకాల అపశకునాలు తోస్తూఉన్నాయి. కనుక మనకు విజయం కలగడం అనుమానమే. కానీ, మీకందరికీ సమ్మతమయితే మనం చేయవలసిన పనిని ఒకదాన్ని చెప్పుతాను, వినండి.

విశేషం: సైన్యంలో అపశకునాలు తోచడం అరిష్ట సూచకం. దానివలన జయం కలుగదు. దీన్నే ద్రోణుడు, 'జయం బనుమానంబు' అని అన్నాడు. కనుక కురుసేనకు ఇది కష్ట పరిస్థితి. ఈ పరిస్థితిలో రాజునూ, సేననూ, మందలనూ కాపాడుకొనాలి. ఎలా? అందుకే ద్రోణుడు, గురువుగా, అనుభవజ్ఞుడుగా, తనకు తోచిన ఆలోచనను నలుగురికీ చెప్పాలి. అది ఆయన బాధ్యత. అందుకే ద్రోణుడు తన ఉపాయాన్ని ముందు పద్యంలో చెప్పబోతాడు. దానికి ముందుగా, ఈ పద్యంలో ఉన్న పరిస్థితిని వివరించి, తన ఆలోచన 'అందరికీ సరిపోతేనే వినండి' అని గురుడు అన్నాడు.

ఉ. ముందర రాజుఁ బుచ్చి, బలముల్ గలయంబడి గోవ్రజంబులన్
దందడి పెట్టకుండఁ బిఱుఁదన్ నడిపింపఁగఁ బంచి, గట్టిమై
నందఱు నింతకున్ వెనుకయై మొనలేర్చి చనంగ, నెప్పు సం
క్రందనసూతి డగ్గఱియెఁ, గయ్యము సేయుట కప్పు డిమ్మగున్.' 184

ప్రతిపదార్థం: ముందరన్= ముందు దిక్కులో; రాజున్= రాజైన దుర్యోధనుడిని; పుచ్చి= పంపి; బలముల్= సైన్యాలు; కలయన్+పడి= కూడా వెళ్ళి (కలిసి వెళ్ళి); గో= ఆవులయొక్క; వ్రజంబులన్= సమూహాలను (మందలను); దందడి+పెట్టకుండన్= తొందర పెట్టకుండా (ఒత్తిడి చేయకుండా); పిఱుఁదన్= వెనుకభాగంలో; నడిపింపఁగన్= నడిపించటానికి; పంచి= నియమించి; అందఱున్= వీరులందరూ; గట్టిమైన్= దిట్టతనంతో (పటిష్ఠంగా); ఇంతకున్= ముందు చెప్పినవాటికి (రాజుకూ, ఆవులకూ, సేనకూ); వెనుక+ఐ= వెనుకభాగంలో ఉండి; మొనలు+ఏర్చి= సేనలను తీర్చికొని; చనంగన్= పోతే; ఎప్డు= ఏ సమయంలో; సంక్రందన సూతి= దేవేంద్రుడి కుమారుడైన అర్జునుడు; డగ్గఱియెన్= దాపునకు వచ్చాడో (ఆ సమయంలోనే); అప్పుడు; కయ్యము+ చేయుటకున్= యుద్ధం చేయటానికి; ఇమ్ము+అగున్= వీలు చిక్కుతుంది.

తాత్పర్యం: మొట్టమొదట రాజైన దుర్యోధనుడిని పంపించి, తరువాత సైన్యాలు ఆతడి వెంట కలిసిపోయి, మందలను ఆర్భాటంతో భయపెట్టక, చెదరిపోనీక, వెనుక నడిపించే విధంగా నియమించి, ఆ తరువాత, మనం అంతా సైన్యాలను తీర్చుకొని పోతూఉంటే, అప్పుడు అర్జునుడు మనమీదికి వస్తే, వెనక్కు మళ్ళుకొని ఆతడితో యుద్ధం చేయవచ్చును.'

విశేషం: ద్రోణాచార్యుడు సూచించిన ఈ ఏర్పాటులో ఎంతో నైపుణ్యం కనిపిస్తుంది. దీనివలన ఆచార్యుడి వ్యూహరచనా కౌశలం తేటతెల్లమవుతుంది. ముందుగా రాజును పంపాలి - అని గురుడి ఉపాయం. దీనివలన రాజుకు ప్రమాదం ఉండదు. ఆతడిని వెన్నంటి సేనలుంటాయి. అవి రాజుకు రక్షణ. తరువాత గోగణం ఉంటుంది. రాజూ, సేనా, మందా - ఇట్లా సాగుతుంది. ముందు సేనపోతూఉంటే, ఆవులను వెనుక గోపాలకులు తోలుకొని వస్తారు. చివరగా, అపారసైన్యంతో భీష్మద్రోణాది మహావీరులంతా మందకు వెనుక కాపుగా వెళ్ళుతుంటారు. ఒకవేళ అప్పుడు అర్జునుడు వస్తే, భీష్మ ద్రోణాదులు తదితరులు వెనక్కు మళ్ళి యుద్ధం చేస్తారు. దానివలన ఎంతో ఆలస్యం అవుతుంది. ముందు పోయే మందా, సేనా, రాజూ పోతూనే ఉంటారు. అంటే ఒకపక్క యుద్ధం జరుగుతూ ఉన్నా, మందపాటికి మంద, హస్తినాపురం వైపు పోతూనే ఉంటుంది. దీనివలన ఎటుతిరిగీ, రాజూ, ఆవులమందా సులువుగా, నిరపాయంగా పట్టణం చేరుతుంది - అని ఆచార్యుడి ఉపాయం. కానీ, ఈ ఏర్పాటును అర్జునుడు మొదట్లోనే గ్రహించి, గురుడి ఉపాయాన్ని భగ్నం చేశాడు. కనుకనే మంద పట్టుబడుతుంది.

వ. అనిన విని సుయోధనుండు భీష్మ కృప కర్ణ వికర్ణుల దెసం గనుంగొని 'మున్నునుం జెప్పితిన కాదె! జూదంబునం బరాజయం బొంది, పాండునందనులు పండ్రెండు వత్సరంబులు వనంబున వసియింపను, బదుమూఁడగు నేఁడు జనపదంబున మన మెఱుంగకుండఁ జరియింపనుం బూని కాదె భూమి వెలువడిరి; యా పదుమూఁ

డవ యేఁటి కొలంత గలుగం బార్థుండు దన్నెఱింగించి కొనియె నేని నెప్పటియట్ల వనవాసంబునకుం జనవలయు; నిది మనము మోహంబునం గానమి నొండె; వారు లోభంబున వచ్చుట నొండె నగుం గావున నెక్కువ దక్కువలు నిరూపించి భీష్ములు దీని నిశ్చయింప నర్హులు; రిత్త యుత్తరుండ కాక గాండీవియు నగుట మన కార్యంబు సఫలంబు; సుశర్మ నక్కడ గోవులం బట్టం బనిచి యిక్కడ మనమును బట్టుట మత్స్యనగరంబునం గౌంతేయులున్నవారని శంకించి వారలు కూయి వచ్చినం గనుటకుం గాదె? యిట్లు నిశ్చయించి చేసిన పనికి నిపుడు విచారం బేల?' యని పలికి వెండియు నిట్లనియె. 185

ప్రతిపదార్థం: అనినన్ విని= ద్రోణుడు చెప్పగా విని; సుయోధనుండు= దుర్యోధనుడు; భీష్మ, కృప, కర్ణ, వికర్ణులదెసన్+కనుంగొని= భీష్మ కృప కర్ణ వికర్ణుల వైపు చూచి; మున్నునన్= ఇంతకు ముందు కూడా; చెప్పితిని+అ కాదె!= చెప్పాను కదా!; పాండు నందనులు= పాండవులు; జూదంబునన్= జూదంలో; పరాజయంబు+ఒంది= ఓడిపోయి; పంద్రెండు వత్సరములు= పన్నెండేండ్లు; వనంబునన్= అడవిలో; వసియింపను= నివసించటానికి; పదుమూఁడగునేఁడు= పదమూడో ఏడు; జనపదంబునన్= జనులు నివసించే ప్రాంతంలోనే; మనము= కౌరవులు; ఎఱుంగకుండన్= తెలిసికొనకుండా; చరియింపనున్= వర్తించటానికి; పూనికాదె= ప్రతిన చేసే కదా!; భూమి వెలువడిరి= రాజ్యానికి దూరమయ్యారు; ఆ, పదుమూఁడవ ఏఁటి కొలంత= ఆ పదమూడో సంవత్సరంలో ఇంకా మిగిలి ఉన్న ఆ కాలం; కలుగన్= ఉండగా; పార్థుండు= అర్జునుడు; తన్ను= తనను; ఎఱింగించికొనియె నేనిన్= తనంతట తానే బయటపెట్టుకొన్నట్లయితే (ఇతరులు గుర్తించేటట్లు బైటపడినట్లయితే); ఎప్పటి అట్లు+అ= ఎప్పటి వలెనే; వనవాసంబునకున్= అడవులలో నివసించటానికి; చనన్+వలయున్= వెళ్ళాలి; ఇది= ఈవిషయం; మనము= కౌరవులపక్షంలోనివారలం; మోహంబునన్= వ్యామోహంతో; కానమిన్+ఒండె= గమనించకపోవటంచేతనైనా కావాలి లేదా; వారు= పాండవులు; లోభంబునన్= అత్యాశతో; వచ్చుటన్+ఒండెన్+అగున్= రావటంచేతనైనా కావాలి; కావునన్= కాబట్టి; భీష్ములు= భీష్ములవారు; ఎక్కువ, తక్కువలు= తేడాలు; నిరూపించి= తేల్చిచెప్పి; నిశ్చయింపన్= నిర్ణయం చేయటానికి; అర్హులు= తగినవారు; రిత్త+ఉత్తరుండు+అ, కాక= కేవలం ఉత్తరుడే కాకుండా; గాండీవియున్= అర్జునుడు కూడా; అగుట= కావటం వలన; మన కార్యంబు= మన ప్రయత్నం; సఫలంబు= ఫలవంతమైనది; సుశర్మను; అక్కడ= దక్షిణ దిక్కున; గోవులన్+పట్టన్+పనిచి= ఆవులను పట్టుకొనటానికి పంపి; ఇక్కడ= ఉత్తర దిక్కున; మనమును= మనం కూడా; పట్టుట= ఆవులను మళ్ళించటం; మత్స్యనగరంబునన్= మత్స్యరాజు రాజధానిలో; కౌంతేయులు= పాండవులు; ఉన్న, వారు+అని= ఉంటారని; శంకించి= అనుమానించి; వారలు= పాండవులు; కూయి వచ్చినన్= రక్షణగా వస్తే; కనుటకున్+కాదె!= కనుక్కొనాలనే కదా!; ఇట్లు= ఈ విధంగా; నిశ్చయించి= నిర్ణయించి; చేసిన పనికిన్= కావాలని చేసిన ఈ పనికి; ఇపుడు= ఈ సమయంలో; విచారంబు+ఏల?= దిగులుపడటం ఎందుకు?; అని, పలికి; వెండియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు చెప్పిన మాటలను విని దుర్యోధనుడు భీష్ముడిని, కృపుడిని, కర్ణుడిని, వికర్ణుడిని చూచి ఇట్లా అన్నాడు- 'నేను ఇంతకు మునుపే చెప్పాను కదా! పాండవులు జూదంలో పరాజయాన్ని పొంది, పన్నెండు ఏండ్లు అడవులలో ఉండటానికీ, పదమూడవ సంవత్సరం వేరే రాజ్యంలో ఎక్కడైనా మన కంటబడకుండా ఉండటానికీ ప్రతిన చేసి, దాని ప్రకారమే కదా రాజ్యాన్ని వదలివెళ్ళారు? పదమూడో ఏడు ఇంకా ముగియకుండానే, అర్జునుడు బయటపడ్డాడు. కనుక అనుకొన్నమాట ప్రకారం తిరిగి అడవులకు పోవాలి. ఇది మోహం వలన మనం చూడకపోవటమో, లేక లోభంతో వాళ్ళే బయటపడటమో అయి ఉంటుంది. ఇందులోని వ్యత్యాసాలను నిర్ణయించి వివరించటానికి భీష్ములవారే తగినవారు. కేవలం ఉత్తరుడే కాకుండా, ఆతడి వెంట అర్జునుడు కూడా రావటం వలన మన పని నెరవేరినట్లే. దక్షిణంవైపు గోవులను పట్టటానికి సుశర్మను పంపి, ఈ ఉత్తరదిక్కులో ఉన్న విరాటనగరంలో పాండవులు ఉన్నారనే సందేహంతోనే కదా మనం ఇక్కడికి వచ్చాం. పైగా, ఆవులను కాపాడటానికి

పాండవులు ఒకవేళ వస్తే, కనిపెట్టాలనే కదా మన ప్రయత్నం! ఇంత ఆలోచించి చేసిన కార్యానికి తిరిగి విచారించటం దేనికి?' అని ఇంకా ఈవిధంగా అంటున్నాడు.

విశేషం: దీనివలన దుర్యోధనుడి మనసులోని అభిప్రాయం తెలుస్తున్నది.

ఉ. **'అర్జునుఁడైన నేమి? సురలైనను నేమగు? విద్విషచ్ఛిదో**
పార్జితమైన గోగణముఁ బట్టితి; మెవ్వరు వచ్చిరేని వి
స్ఫూర్జిత బాహుసంపదలు సూపుద మొండొరు మీఱి నిర్మలా
త్యూర్జిత కీర్తికారణ రణోద్ధతి; వెల్వెలఁ బాఱ నేటికిన్? 186

ప్రతిపదార్థం: అర్జునుఁడు+ఐనన్+ఏమి?= అర్జునుడు అయితే మాత్రం ఏమి?; సురలు+ఐననున్+ఏమి+అగున్= దేవతలైతే మాత్రం ఏమవుతుంది?; విద్విషత్+ఛిదా+ఉపార్జితము+ఐన= శత్రువులను చీల్చటానికి (ఛేదించటానికి) సంపాదించిన; గో= ఆవులయొక్క; గణమున్= మందను; పట్టితిమి= పట్టుకొంటిమి; ఎవ్వరు వచ్చిరి+ఏనిన్= ఎవ్వరు వచ్చినప్పటికీ; నిర్మల+అతి+ఊర్జిత కీర్తికారణ రణ+ఉద్ధతిన్= స్వచ్ఛమూ, మిక్కిలిదృఢమూ అయిన కీర్తికి హేతువైన యుద్ధంయొక్క ఔద్ధత్యంతో; ఒండు+ఒరున్ (ఒండొరున్)= ఒకరినొకరు; మీఱి= అతిశయించి; విస్ఫూర్జిత= ప్రకాశించే (పేరుకెక్కిన); బాహుసంపదలు= భుజ పరాక్రమాలు (బాహువుల సంపద అంటే, బాహువులయొక్క బలం); చూపుదము= ప్రదర్శిద్దాం; వెల్వెలన్+పాఱన్= వెలవెలపోవటం; ఏటికిన్= ఎందుకు? (అవసరం లేదు అని భావం).

తాత్పర్యం: 'అర్జునుడే అయితే ఏం? దేవతలైతే నేం? ఏమవుతుంది? శత్రువులను చీల్చటానికి సంపాదించిన పసువుల మందలను పట్టినాము. కీర్తికి కారణం అయిన యుద్ధంలో ఒకర్ని మించి మరొకరం భుజపరాక్రమాన్ని ప్రదర్శిద్దాం. ఎవరు వచ్చినా సరే, మనం వెలవెలబోవాల్సిన పని లేదు.

విశేషం: 'విద్విషచ్ఛిదోపార్జితమైన గోగణముఁ బట్టితిమి' అని దుర్యోధనుడు అంటాడు. ఇక్కడ శత్రువులను 'ఛేదించటానికి', అనే అర్థాన్ని, 'ఛిదా' శబ్దానికి చెప్పుకొన్నా, 'శత్రువుల రహస్యాన్ని ఛేదించడం' అని కూడా గ్రహించవచ్చును. 'విద్విషత్+ఛిదా+ఉపార్జితము' అనే పాఠాంతరం కూడా ఉన్నది. శత్రువులను ఛేదించి సంపాదించుకొనబడింది - అని అర్థం.

చ. **మనసుల నూలుకొల్పి, యనుమానము లెల్లను బాచి, యేచి వా**
హనములు నాయుధంబులును నాయిత మయ్యెడు భంగిఁ జేయుచున్
మొనలకు హెచ్చుగా మనము మున్నుగడంగినఁ గాక శత్రులం
గనుఁగొని యిట్టు లొండొరు మొగంబులు సూచుచునున్నఁ బోవునే? 187

ప్రతిపదార్థం: మనసులన్= అందరూ వారివారి మనస్సులను; నూలుకొల్పి= కుదురుపరుచుకొని; అనుమానములు+ఎల్లను= సందేహాలను అన్నిటినీ; పాచి= వదలిపెట్టి; ఏచి= అతిశయించి (విజృంభించి); వాహనములున్= ఎన్నో రకాలైన వాహనాలూ; ఆయుధంబులును= రకరకాల ఆయుధాలూ; ఆయితము+అయ్యెడు భంగిన్= సమకూర్చే పద్ధతిలో; చేయుచున్= చేస్తూ (ప్రోత్సహిస్తూ); మొనలకున్= సేనలకు; హెచ్చుగాన్= అధికంగా; (ఉన్నతంగా); మనము= మనమందరం; మున్ను= ముందుగానే; కడంగినన్+కాక= పూనుకుంటేనే కాని (సరిపోతుంది కాని); శత్రులన్= శత్రువులను; కనుఁగొని= చూచి; ఇట్టులు= ఈ విధంగా; ఒండు+ఒరు+మొగంబులు= ఒకరి మొగాలను మరొకరు; చూచుచున్+ఉన్నన్+పోవునే= చూస్తుంటే సరిపోతుందా?

తాత్పర్యం: మనసులలో కోపతాపాలు లేకుండా, అందరూ భయాలూ, సందేహాలూ విడిచి, వాహనాలూ, ఆయుధాలూ సిద్ధం చేసికొని, సేనలకు ముందుండి ముందుగా మనమే ఎదిరిస్తే మంచిది. అంతేకాని శత్రువును చూసి ఈ విధంగా ఒకరి ముఖం మరొకరు చూచుకొంటూ ఉంటే బాగుంటుందా?

దుర్యోధనుఁడు ద్రోణాచార్యుల నధిక్షేపించుట (సం. 4-42-20)

ఆ. హరుల హేషితములు ననుకూల వాయు సం। చారములును మనకు జయము కలిమిఁ
దెలుపుచున్నయవి; యుధిష్ఠిరానుజుఁ డొక్కఁ। డీ బలంబు గెలువ నెట్లు నేర్చు? 188

ప్రతిపదార్థం: హరుల= గుర్రాలయొక్క; హేషితములున్= సకిలింపులూ; అనుకూల= అనుకూలమైన దిశనుంచి; వాయు= గాలియొక్క; సంచారములును= వీచటములునూ; మనకున్= మనకు; జయము కలిమిన్= జయం కలగటాన్ని; తెలుపుచున్నయవి= తెలుపుతూ (సూచిస్తూ) ఉన్నాయి; యుధిష్ఠిర+అనుజుఁడు= ధర్మరాజు తమ్ముడైన అర్జునుడు; ఒక్కఁడు= ఒక్కడే; ఈ బలంబున్= ఇంత పెద్ద కురుసేనను; ఎట్లు= ఏ విధంగా; గెలువన్ నేర్చున్?= గెలువగలుగుతాడు?

తాత్పర్యం: గుర్రాలు సకిలించడం, గాలి అనుకూలంగా ప్రసరించడం వలన మనకు జయం కలుగుతుందని తెలుస్తున్నది. అర్జునుడు ఒక్కడే ఇంత పెద్ద కురుసైన్యాన్ని ఎట్లా గెలుస్తాడు?

విశేషం: దుర్యోధనుడు తనకే జయం కలుగుతుందని నిశ్చయంగా అంటున్నాడు. దానికి ఆతడు చూపిన కారణాలు రెండు: హయహేషలూ, అనుకూల వాయుప్రసారం- మొదటిది; అర్జునుడు ఒక్కడే ఇంత పెద్ద కురుసేనను గెలవలేడు అనటం రెండోది. కానీ, దుర్యోధనుడి ఊహ సరికాదు. కారణం, కురుసేనలో ఇదివరకే ఎన్నో ఉత్పాతాలు పుట్టినట్లు ద్రోణుడు ముందే చెప్పాడు. అట్లాగే, అర్జునుడు ఉత్తరుడికి తన పేళ్ళను తెలిపేటప్పుడు, ఆతడు ఒక్కడే కాలకేయ నివాతకవచులనూ, హిరణ్యపుర రాక్షసులనూ, వేల లక్షల సంఖ్యల్లో ఉన్న వాళ్ళను పరిమార్చానన్నాడు. ఇది దుర్యోధనుడికీ తెలుసు. కానీ, అహంకారాదులు అడ్డువచ్చాయి. అందుకే ఆతడు అర్జునుడి శక్తిని అనుమానించాడు; తక్కువ చేశాడు.

క. ఎవ్వరు వినినను దీనికి। నవ్వుదురని యెఱుఁగఁ డకట! నా యెదురెదురన్
వివ్వచ్చుఁ జూపి సేనలు। క్రొవ్వఱఁ బలుపలుకులిట్లు ద్రోణుఁడు పలికెన్. 189

ప్రతిపదార్థం: ఎవ్వరు= ఎవ్వరైనా; వినినను= వింటే (తన మాటలను); దీనికిన్= తాను మాట్లాడే మాటలకు; నవ్వుదురు+అని= నవ్వుతారని; ఎఱుఁగఁడు= తెలియలేదు; అకట!= అయ్యో!; నా= నాయొక్క; ఎదురు+ఎదురన్= ఎట్టఎదుట (నేరుగానే); వివ్వచ్చున్+చూపి= (నా శత్రువైన) అర్జునుడిని చూపించి (గొప్పగా); సేనలు= నా సైన్యాలు; క్రొవ్వు+అఱన్= నీరసపడేటట్లుగా (నిరుత్సాహపడేట్లుగా); ద్రోణుఁడు= ఈ ద్రోణుడు (ఏకవచనం, నిందార్థకం); పలు పలుకులు= అనవసరమైన మాటలు (పనికిరాని మాటలు); ఇట్లు= ఇట్లా; పలికెన్= మాట్లాడాడు.

తాత్పర్యం: ఈ ద్రోణుడు తన మాటలను ఎవరైనా వింటే నవ్వుతారని కూడా తెలిసికొనలేడు. నా ఎదుటనే అర్జునుడిని చూపించి, నా సేనలు నీరుగారేటట్లు ఇట్లా పనికిరాని మాటలు చాలా పలికాడు.

తే. రోష మొండెను రాజ్యాభిలాష మొండెఁ। గాక యీతని రాకకుఁ గారణంబు
పెఱ యెఱుంగము; యెదిరిని బెద్దఁ జేసి। పూని వంది విధంబునఁ బొగడ నేల? 190

ప్రతిపదార్థం: రోషము+ఒండెను= రోషం కానీ; రాజ్య+అభిలాషము+ఒండెన్= రాజ్యం కోరిక గానీ; కాక= కాకపోతే; ఈతని= ఈ అర్జునుడియొక్క; రాకకున్= ఇక్కడికి ఇట్లా రావటానికి; కారణంబు= హేతువు; పెఱ= వేరొకటి; ఎఱుంగము+అ= తెలియలేము కదా! (ఏది ఎలా అయినా); ఎదిరిని= ఎదుటివాడిని (శత్రువును); పెద్దన్+చేసి= గొప్పవాడిగా చేసి (గొప్పవాడు కాకపోయినా); పూని= అదే పనిగా పూనుకొని; వందివిధంబునన్= వైతాళికుడివలె; పొగడన్+ఏల?= ప్రశంసించటం (స్తోత్రం చేయటం) ఎందుకు?

తాత్పర్యం: అర్జునుడు ఇట్లా రావటానికి, ఆతడిలో ఉన్న రోషంగానీ, రాజ్యకాంక్షగానీ కారణం అయి ఉంటుంది. కాకుంటే వేరే కారణం ఏదీ కనిపించదు. ఏది ఏమైనా, పగవాడిని గొప్పవాడిని చేసి, భట్రాజువలె ఈరీతిగా ఇంతగా పొగడటం ఎందుకు?

వ. **ఆచార్యులైన వారలు కార్యంబు దవ్వులం గనియెడు వారు గాన కయ్యంబు తెఱంగు వారల నడుగ వలవదు; బుద్ధిమంతు లిండ్లకడనుండి భోజనావసరంబుల, నాయుధ శ్రమ సమయంబుల, నీతిశాస్త్ర గోష్ఠీకాలంబుల నుచితాలాపంబులు పలుకుదురు గాని పోట్లాడెడువారు గారు; వారిం గలనం గలసి నిలువనీక పిఱిందిదెస నిలిపిన మనకు వారు విజయంబు గోరుచుండుదు; రది లెస్స' యనిన విని యశ్వత్థామ యతని కిట్లనియె.** **191**

ప్రతిపదార్థం: ఆచార్యులు+ఐన వారలు= గురువులైనవారు; కార్యంబు= పనిని; దవ్వులన్+కనియెడు వారు= పనిలోనికి దిగకుండా ఎడంగా ఉండి చూచేవారు (పనిచేయకుండా పైకి మాటలు చెప్పేవారు); కాన= కాబట్టి; కయ్యంబు తెఱంగు= యుద్ధంయొక్క తీరు; వారలన్= వారిని; అడుగవలవదు= అడుగవద్దు; బుద్ధిమంతులు= తెలివికలవారు; ఇండ్లకడన్+ఉండి= ఇంటివద్దే ఉండి; భోజన+అవసరంబులన్= భుజించే సమయాలలో; ఆయుధ శ్రమ సమయంబులన్= రకరకాల ఆయుధాలకు సంబంధించిన విద్యను అభ్యసించేటప్పుడు; నీతిశాస్త్ర= నీతిశాస్త్రానికి సంబంధించిన; గోష్ఠీకాలంబులన్= చర్చ జరిగేటప్పుడు; ఉచిత+ఆలాపములు= తగిన మాటలు; పలుకుదురు కాని; పోట్లాడెడువారు కారు= యుద్ధం చేసేవాళ్ళు కారు; వారిన్= వారిని; కలనన్= యుద్ధంలో; కలసి నిలువనీక= కలిసి ఉండనీయకుండా; పిఱిందిదెసన్= వెనుక పక్క; నిలిపినన్= ఉంచితే; వారు= ఆచార్యులు; మనకున్= మనకు (దుర్యోధనాదులకు); విజయంబు= జయం; కోరుచున్+ఉండుదురు= కోరుతూ ఉంటారు; అది లెస్స= అదియే మంచిది; అనినన్, విని= అనగా విని; అశ్వత్థామ; అతనికిన్= దుర్యోధనుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆచార్యులైన ద్రోణులవారు పనిని దూరంగా ఉండి చూస్తారు. అందువలన యుద్ధానికి సంబంధించిన విషయాన్ని వారిని అడుగరాదు. ఇంట్లో భోజనం చేసేటప్పుడూ, ఆయుధవిద్యను అభ్యసించేటప్పుడూ, నీతిశాస్త్ర చర్చలలోనూ మాట్లాడమంటే చాలా బాగా మాట్లాడుతారు. అంతేకాని, వారు యుద్ధం చేసేవారు కాదు. కనుక ఆచార్యులను మనతోపాటు యుద్ధంలో కలవనీయకుండా, మనకు వెనకభాగంలో ఉంచితే మన విజయాన్ని కోరుతూ ఉంటారు. అదే మంచిది' అన్న దుర్యోధనుడి మాటలకు అశ్వత్థామ అతడితో ఇట్లా అన్నాడు.

ఉ. **'కావలివారిఁ దోలి, యెసకంబున గోవులఁ బట్టికొంటి నం**
చీ వెడమాట లేల ధరణీశ్వర! యింతకుమున్న వీటికిం
బోవవు, శత్రునే పుడిపి పోయెడు వాఁడవు గావు నీవు; సై
న్యావలి యైనఁ జేడ్పడక యాతల కెయ్యుట లేదు నేనియున్. **192**

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= ఓ రాజా!; కావలివారిన్+తోలి= కేవలం ఆవులను కావలిగాచేవాళ్ళను పారదోలి; ఎసకంబునన్= ఎంతో గొప్పగా (అతిశయంతో); గోవులన్= ఆవులను; పట్టికొంటిని+అంచున్= పట్టుకొన్నానంటూ; ఈ= ఈ విధమైన; వెడ= పనికిరాని; మాటలు+ఏల= మాట లెందుకు?; ఇంతకున్+మున్న+అ= ఇంతకుముందే (ఇంకా); వీటికిన్+పోవవు= నీ ఊరు చేరుకోలేదు (ఇల్లు చేరలేదు); శత్రు+ఏపు= శత్రువుయొక్క ఆధిక్యాన్ని (విజృంభణాన్ని); ఉడిపి= పోగొట్టి; పోయెడువాండవు+కావు నీవు= పోతున్నవాడివీ కావు నీవు; సైన్య+ఆవలి+ఐనన్= సేనా సమూహం అయినా; చేడ్పడక= దెబ్బతినకుండా; ఆతలకున్= ప్రక్కకు (అవతలికి- దూరంగా); ఎయ్యుట లేదు నేనియున్= తొలగి అయినా పోలేదు (ప్రమాదస్థలాన్ని అయినా కనీసం దాటిపోలేదు).

తాత్పర్యం: 'కేవలం ఆవులను కాచేవాళ్ళను బెదిరించి తరిమి, మందలను పట్టుకొన్నానని ఏమో గొప్పగా పనికిరాని మాటలు మాట్లాడుతున్నావు. రాజా! ఇంకా నీవు ఇల్లు చేరలేదు. దానికి తోడు, శత్రువుల ఆర్భాటాన్ని అణచిన వాడివీ కావు. కనీసం, నీ సేనలైనా దెబ్బతినకుండా ప్రమాదస్థలాన్నుండి దూరంగానైనా పోలేదు.

క. సమరమున గెల్చి, యొరు రా । జ్యము గొనియును సుజనుఁ డిట్టు లాడఁడు; సిరి జూ
దమునఁ గొని రజ్జు లేటికి? । సమయం బరుదెంచెఁ దొంటిచందము గలదే! 193

ప్రతిపదార్థం: సమరమునన్+గెల్చి= యుద్ధంలో గెలుపొంది; ఒరు= ఇతరులయొక్క; రాజ్యమున్= రాజ్యాన్ని; కొనియును= గ్రహించి కూడా; సుజనుఁడు= సజ్జనుడైనవాడు; ఇట్టులు= ఈ రీతిగా; ఆడఁడు= మాట్లాడడు; సిరిన్= రాజ్యాన్ని (సంపదను); జూదమునన్+కొని= జూదంలో (మోసంతో) తీసికొని; రజ్జులు+ఏటికిన్?= గొప్పలు (నిందా వాక్యాలు) ఎందుకు?; సమయంబు+అరుదెంచెన్= ఇప్పుడు సమయం వచ్చింది; తొంటి= పూర్వపు; చందము కలదే!= విధానం వీలు కాదు (మోసం చేయటానికి ఇది జూదం కాదు; యుద్ధం అని భావం).

తాత్పర్యం: ఎంతో గొప్పగా యుద్ధంలో జయించి, రాజ్యాన్ని పొందినవాడు కూడా నీవలె మాట్లాడడు. మోసపు జూదంలో రాజ్యాన్ని సంగ్రహించి, నోటికి వచ్చిన దుర్భాషలను మాట్లాడుతావా? ఇప్పుడు సమయం వచ్చింది. ముందువలె జూదం ఆడాలంటే కుదరదు.

ఉ. పాండవవీరులం గలన బాహుబలంబున నోర్చియే సము
ద్దండత నీవు దొల్లి ద్రుపదక్షితిపాత్మజఁ గొల్వులోనికిం
దెండని పుచ్చి? తద్దెసకుఁ దెచ్చుట సౌబలు నీతిఁ గాదె? యా
తండ మరల్చుఁ గాక సముదగ్రత వచ్చు విరోధి నిప్పుడున్. 194

ప్రతిపదార్థం: పాండవ వీరులన్= మహావీరులు అయిన పాండవులను; కలనన్= యుద్ధంలో; బాహు= భుజములయొక్క; బలంబునన్= పరాక్రమంతో; ఓర్చియే!= జయించేనా! (కాదు-అని); తొల్లి= ఇదివరలో; నీవు= నీవు; సముద్దండతన్= కాఠిన్యంతో (క్రౌర్యంతో); ద్రుపదక్షితిప= ద్రుపద మహారాజుయొక్క; ఆత్మజన్= కూతురైన ద్రౌపదిని; కొల్వులోనికిన్= సభలోకి; తెండు+అని పుచ్చితి= తీసికొని రమ్మని పంపావు; తద్+దెసకున్= ఆ స్థితికి; తెచ్చుట= తీసికొని రావటం; సౌబలు= శకునియొక్క; నీతిన్+కాదె!= కుటిలనీతిచేత కదా!; ఇప్పుడున్= ఇప్పుడునూ; సముదగ్రతన్= ఎంతో విజృంభణంతో; వచ్చు విరోధిన్= పైకి వస్తున్న శత్రువును; ఆతండు+అ= ఆ శకునే; మరల్చున్+కాక!= వెనక్కు మళ్ళిస్తాడులే!.

తాత్పర్యం: ఎంతో దుర్మార్గంతో, క్రూరుడివై నీవు ఇదివరలో ద్రౌపదిని నిండుసభలోకి తీసికొనిరమ్మని నీ తమ్ముడిని పంపింది పాండవు లందరినీ జయించేనా? ఆ శకుని కుటిలనీతితో కాదూ! కనుక మీదికి దూసికొనివచ్చే ఆ శత్రువును కూడా ఇప్పుడు ఆ శకునే వెనక్కు మళ్ళిస్తాడులే!

వ. అబ్భంగి నవమానింపం బడినవాఁడు గావున ధార్తరాష్ట్రకుల ధూమకేతు వగు కపికేతనుండు దోఁచె; నీకు దుర్మదంబున ద్రోణాచార్యుల నధిక్షేపింపవచ్చు నంతియకాక దేవదానవుల కయినను దుర్జయుండగు నర్జుననకుం దలసూప వచ్చునే! నయ విక్రమంబుల నతిలోకుండగు నతని నెవ్వరికేనియుం బొగడవలయు ననినం బుత్రనిర్విశేషుండగు నిజ ప్రియ శిష్యుని నగ్గించుట గురునకుం గొఱంతయె? యింక సిగ్గుమాలి రణంబు సేసెనేనియు ద్రోణుండు సేయుంగాని యే నిట్టి దాని కోర్వ; నదియునుం గాక. 195

ప్రతిపదార్థం: ఆ+భంగిన్= ఆరీతిగా; అవమానింపఁబడినవాఁడు కావునన్= అవమానించబడ్డాడు కాబట్టి; ధార్తరాష్ట్ర= ధృతరాష్ట్రుడి కొడుకులయొక్క; కుల= వంశానికి (నూరుమందికి); ధూమకేతువు= తోకచుక్క; కపి కేతనుఁడు= వానరాన్ని జెండామీద నిలుపుకొన్నవాడు (హనుమంతుడిని తన ధ్వజంమీద అర్జునుడు నిలుపుకొన్నాడు); తోఁచెన్= తటస్థించాడు; నీకు= దుర్యోధనుడికి; దుర్మదంబునన్= బాగా కొవ్వుబట్టి మదించటంచేత; ద్రోణ+ఆచార్యులన్= ద్రోణుడిని; అధిక్షేపించవచ్చున్= ఎద్దేవ చేయవచ్చును; అంతియకాక= అంతేకాని; దేవదానవులకున్+ఐనను= దేవతలకు, దానవులకు అయినా; దుర్జయుండు+ అగు+అర్జుననకున్= జయించటానికి శక్యముకాని వీరుడైన అర్జునుడికి; తల+చూపవచ్చునే?= ఎదురుపడవచ్చునా? నయ విక్రమంబులన్= నీతిలోనూ, పరాక్రమంలోనూ; అతిలోకుండు+అగు= లోకాతీతుడైన; అతనిన్= అర్జునుని; ఎవ్వరికిన్+ ఏనియున్= ఎవ్వరికైనా; పొగడవలయున్+అనినన్= పొగడక తప్పదనగా; పుత్ర నిర్విశేషుండు+అగు= కొడుకుతో సమానుడైనవాడైన; నిజప్రియ శిష్యునిన్= తన ప్రియమైన శిష్యుని; అగ్గించుట= పొగడటం; గురునకున్= ఆచార్యుడికి, ద్రోణుడికి; కొఱంతయె?= తక్కువా? (తప్పా?); ఇంకన్= ఇన్నిమాటలన్నతరువాత; సిగ్గుమాలి= సిగ్గులేక; ద్రోణుండు; రణంబు= యుద్ధం; చేసెన్+ఏనియున్= చేస్తే; చేయున్+కాని= చేస్తాడేమో కాని; ఏను= నేను; ఇట్టి దానికిన్= ఇటువంటి దానికి; ఓర్వన్= సహించలేను; అదియునున్+కాక= అంతేకాక.

తాత్పర్యం: అట్లా అవమానించబడినవాడు కనుకనే, కౌరవుల కులానికి తోకచుక్క అయిన కపికేతనుడు వచ్చాడు. నీవు మదించి గురువైన ద్రోణుడిని నిందించావు కానీ, దేవతలకూ, దానవులకూ కూడా జయించరాని అర్జునుడి ఎదుటికైనా పోగలవా? రాజనీతిలోనూ, బాహుబల విక్రమంలోనూ అతిలోకుడైన అర్జునుడిని ఎవరైనా పొగడాల్సిందే! అట్లాంటప్పుడు, తనకు పుత్రుడితో సమానుడైన ప్రియశిష్యుడైన అర్జునుడిని పొగడటం గురువైన ద్రోణుడి తప్పా? ఇంత జరిగాక కూడా, ఒకవేళ సిగ్గు విడిచి ఆ ద్రోణుడే యుద్ధంచేస్తే చేయనీ కాని, నేను మాత్రం దీన్ని ఓర్చుకొనలేను. అంతేకాక... (ముందరికి అన్వయం).

విశేషం: 'ధార్తరాష్ట్రకుల ధూమకేతువు'- రూపకాలంకారం. ధూమకేతువు అంటే తోకచుక్క. అది రాజుకూ, దేశానికీ అరిష్టసూచకం. అంటే, నీకు వినాశం తప్పదని అశ్వత్థామ మాటలలో ధ్వని.

క. ప్రళయాంతకుండు బడబా । నలమును మృత్యువును నెదిరినం గొఱఁతవడన్
నిలిపినను నిలుపు; మార్కొని । చెలఁగిన నరుశరము లనవశేషము సేయున్. 196

ప్రతిపదార్థం: ప్రళయ+అంతకుండు= ప్రళయకాలంలో ఉన్న యముడూ; బడబానలమును= సముద్రంలో పుట్టిన బడబ అనే పేరుగల అగ్నీ (చాలా భయంకరం అయింది); మృత్యువును= మృత్యుదేవతనూ; ఎదిరినన్= ఎదిరించితే; కొంఁత+పడన్= కొంత తక్కువగా మిగిలించి; నిలిపినను నిలుపున్= నిలుపవచ్చును. (ఒకవేళ నిలిపితే నిలపవచ్చును); (కాని) మార్కొని= ఎదిరించి; చెలఁగినన్= విజృంభిస్తే; నరు= అర్జునుడియొక్క; శరములు= బాణాలు; అనవశేషము+చేయున్= ఏమాత్రం మిగిలించకుండా సర్వనాశనం చేస్తాయి.

తాత్పర్యం: యముడూ, బడబాగ్ని, మృత్యువూ చెలరేగితే, ఎదిరించిన వారలను అంతా నాశనం చేయకుండా, కొంతైనా మిగిలిస్తే మిగిలించవచ్చును. కానీ అర్జునుడి అమోఘాలైన బాణాలు మాత్రం, ఏమీ మిగలనీయకుండా సర్వనాశనం చేస్తాయి.

విశేషం: యముడూ, బడబాగ్నీ, మృత్యువూ మూడూ ఏమాత్రం తప్పనివి, నిశ్శేషంగా నాశనం చేసేవే! అయినా అవి కొంత మిగిలిస్తాయేమో కానీ, అర్జునుడి బాణాలు ఏమాత్రం మిగిలించక సర్వనాశనం చేస్తాయి - అని అనటంలో, అర్జునుడి బాణాలు పైవాటికన్నా భయంకరం అయినవని భావం.

ఆ. కుటిలబుద్ధు లిచటఁ గొనవు; నెట్టన ఘన । దోర్బలంబు మెఱసి తొడర వలయు;
నతఁడు గాండివమున నడ్డసాళులు వైవఁ; । డురుల నంపవాన గురియుఁ గాని. 197

ప్రతిపదార్థం: ఇచటన్=ఇక్కడ (యుద్ధభూమిలో); కుటిల బుద్ధులు= కపటమైన ఆలోచనలు (మోసాలు); కొనవు= పనికిరావు; నెట్టన= తప్పక; ఘన= గొప్పదైన; దోస్(ః)= బాహువులయొక్క; బలంబు= బలాన్ని; మెఱసి= ప్రకాశింపచేసి (చూపి); తొడర వలయున్= ఎదిరించాలి; అతఁడు= ఆ అర్జునుడు; గాండివమునన్= గాండీవంతో; ఉరులన్= ఉర్లిపోయేట్లు, నేల కూలేటట్లు; అమ్ము+వాన= బాణాలవాన; కురియున్+కాని= కురిపిస్తాడు కాని; అడ్డసాళులు= పాచికలు; వైవఁడు= వేయడు.

తాత్పర్యం: ఇక్కడ నీ కపటబుద్ధులు పనికిరావు. నిజమైన భుజబలాన్ని చూపి, ఎదిరించి నిలబడాలి. ఆ వచ్చే అర్జునుడు గాండీవంతో తనను తాకినవాళ్ళపై నేల కూలేటట్లు ఎడతెగక బాణవర్షాన్ని కురిపిస్తాడే కానీ, మోసంతో పాచికలను విసరడు.

విశేషం: అలం: ప్రతిషేధం. తన తండ్రి అయిన ద్రోణుడిని దుర్యోధనుడు నిందించాడని రోషించిన అశ్వత్థామ, ఆతడిని ఎత్తిపొడుపుతో, హేళనగా మాట్లాడుతూ, అర్జునుడి పరాక్రమాన్ని ప్రశంసిస్తూ, తనదైన వ్యక్తిత్వాన్ని నిలుపుకొన్నాడు.

'డరులనంపవాన' - ఈ పాఠాంతరం పెక్కు ప్రతులలో ఉన్నది.

క. విను మట్టులు గాకున్నం । దన గోవుల వెనుక మత్స్యధరణీశుఁడు వ
చ్చిన మార్కొందుము; నరుఁ డే । పున ముట్టిన నతని పొంతఁ బోదుమె? యధిపా!' 198

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; వినుము= (నా అభిప్రాయం) వినవలసింది; అట్టులు= అట్లా; కాక+ఉన్నన్= కాకుండా పోతే; తన= తనవైన; గోవుల వెనుకన్= ఆవుల వెంట; మత్స్యధరణీశుఁడు= విరాటరాజు; వచ్చినన్= వస్తే; మార్కొందుము= ఎదిరిస్తాం; (అలా కాక); నరుఁడు= అర్జునుడే; ఏపునన్+ముట్టినన్= విజృంభించి పైకి వస్తే; అతని పొంతన్= ఆ నరుడి సమీపానికి అయినా; పోదుమె?= పోతామా? (పోము అని భావం).

తాత్పర్యం: ఓ రాజా! నా అభిప్రాయాన్ని వినుము. అట్లా కాక ఆవులవెంట విరాటరాజే వస్తే మేము ఎదిరిస్తాం. అర్జునుడైతే మాత్రం మేము ఆ ప్రక్కకు కూడా పోము.'

విశేషం: అర్జునుడి ఆధిక్యాన్ని అశ్వత్థామ బాహాటంగా అంగీకరించి, తన అభిప్రాయాన్ని రాజైన దుర్యోధనుడికి చెప్పాడు. ఇది ఒకరకంగా రాజుపై తిరగబడటమే కాక బెదిరింపు కూడ. యోధులలో ప్రధానుడైన అశ్వత్థామే ఇట్లా అంటే, రాజుకు దిగులు పట్టుకొంటుంది. అశ్వత్థామ మాటలు కర్ణుడికి కోపాన్ని కలిగించాయి. అందుకే ఆతడు యోధులందరితో తరువాత ఇట్లా అంటాడు. ఈ విధంగా విభిన్న మనస్తత్త్వాలను ఒకేమారు నిర్వహించటంలో తిక్కన అద్వితీయుడు.

వ. అనిన విని, రాధేయుండు సక్రోధుండై యోధవీర లోకంబు నాలోకించి. 199

ప్రతిపదార్థం: అనినన్+విని= అశ్వత్థామ దుర్యోధనుడితో చెప్పగా విని; రాధేయుండు= కర్ణుడు (రాధ పెంచుకొన్నవాడు); సక్రోధుండు+ఐ= కోపంతో కూడినవాడై; యోధ= యోధులయొక్క; వీర= వీరులయొక్క; లోకంబున్= సమూహాన్ని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అశ్వత్థామ మాటలను విన్న కర్ణుడు (దుర్యోధనుడిని నిందించాడు అనే) కోపంతో, యోధులనూ, వీరులనూ అందరినీ చూచి (ఇట్లా అన్నాడు).

చ. 'వడిగొని గోగణంబుఁ బొదువం బఱతెంచితి రెల్లవారు ము
న్నొడఁబడి పాండునందనుల యున్నెడ యిమ్మెయిగాన వేఁడి; యి
ప్పుడు నరుఁ గాంచి మీ రతని పోటు నుతించుచు భీతి నిట్లు వా
విడిచి యనేక భంగిఁ బృథివీపతి వీఱిఁడిఁ జేయు టొప్పునే? 200

ప్రతిపదార్థం: పాండు నందనుల= పాండురాజు కుమారులైన పాండవులయొక్క; ఉన్న+ఎడ= ఉండే చోటును; ఈ+మెయిన్= ఈరీతిగా; కానన్+వేఁడి= చూడాలని కోరి; ఎల్లవారు= అందరూ; మున్ను+ఒడఁబడి= ముందే ఒప్పుకొని; వడిగొని= తొందరగా; గోగణంబున్= ఆవులమందను; పొదువన్= పట్టుకొనేందుకు; పఱతెంచితిరి= అందరూ వచ్చినారు; ఇప్పుడు= ఇంత జరిగాక ఇప్పుడు; నరున్+కాంచి= అర్జునుడిని చూచి; మీరు= మీరందరూ; అతని పోటు= అర్జునుడి పరాక్రమాన్ని; నుతించుచున్= పొగడుతూ; భీతిన్= బెదరుతో; ఇట్లు= ఇట్లా; వాయి+విడిచి= నోరు విప్పి (గట్టిగా); అనేక భంగిన్= ఎన్నో రకాలుగా; పృథివీపతిన్= రాజును; వీఱిఁడిన్+చేయుట= పిచ్చివాడిని చేయటం; ఒప్పునే?= బాగుందా?

తాత్పర్యం: 'పాండవులు ఉండే చోటును తెలిసికొనటానికి, ఈ విధానాన్ని అందరూ ఒప్పుకొని, త్వరత్వరగా ఆవులమందను గ్రహించేందుకు వచ్చి, తీరా ఇప్పుడు అర్జునుడిని చూచి బెదురుతో, గొంతెత్తి ఆతడి ప్రతాపాన్ని పొగడుతూ రాజైన దుర్యోధనుడిని ఆఖరికి వెర్రివాడిని చేయటం బాగాలేదు.

చ. వెఱచితిరేని నిల్వుఁ; డొకవీరున కొక్కఁడ చాలుఁ గాక యెం
దఱు వలయుం? గపిధ్వజము దవ్వుల వ్రేల్మిడిఁ ద్రుంచి వైచెదం;
బఱపెదఁ దత్పిశాచములు; భగ్నము సేసెదఁ దేరు; సారథిన్
నెఱఁకులు నొంచెదం; బొదులు నించెద నర్జును గాత్రశాలలోన్. 201

ప్రతిపదార్థం: వెఱచితిరి+ఏనిన్= ఒకవేళ భయపడినట్లు అయితే; నిల్వుఁడు= మీరు రాకుండా నిలవండి; ఒక వీరునకున్+ ఒక్కఁడు+అ= ఒక్క వీరుడికి ఒక్క వీరుడే; చాలున్+కాక= సరిపోతాడు గానీ; ఎందఱు వలయున్?= ఎంతమంది కావాలి? దవ్వులన్= దూరం నుండే; వ్రేల్మిడిన్= త్రుటిలో (చిటికె లోపల); కపి ధ్వజమున్= అర్జునుడియొక్క కపికేతనాన్ని; త్రుంచి వైచెదన్= క్రింద పడగొట్టుతాను; తత్= ఆ జెండాను చుట్టి ఉన్న; పిశాచములన్= భూతాలను; పఱపెదన్= తరిమివేస్తాను; తేరు= రథం; భగ్నము+చేసెదన్= విరిచి వేస్తాను (విరుగకొట్టుతాను); సారథిన్= సారథిని; నెఱకులు నొంచెదన్= మర్మస్థానాలను (ఆయువుపట్లను) నొప్పిస్తాను; అర్జును= అర్జునుడియొక్క; గాత్ర= శరీరం అనే; శాలలోన్= ప్రదేశంలో; పొదులు= అమ్ములు పెట్టే పొదుల్నే (బాణ సమూహాలను); నించెదన్= నింపుతాను. (కొన్ని పొదుల బాణాలు అని భావం).

తాత్పర్యం: మీకు భయంగా ఉంటే మీరు రావద్దు, నిలిచి పొండి. ఒక వీరుడికి ఒక్కడు కాక ఎంతమంది కావాలి? అర్జునుడి కపికేతనాన్ని దూరంనుండే చిటికెలో నేల పడగొడతాను. దానిని ఆశ్రయించుకొని ఉన్న భూతాల సమూహాలను తరిమివేస్తాను. అర్జునుడి రథాన్ని విరుగగొట్టుతాను. సారథి ఆయువుపట్లను నొప్పిస్తాను. అర్జునుడి దేహం అనే శాలలో బాణాల సమూహాలను నింపుతాను.

విశేషం: 'ముందుపద్యంలో అందరూ చేరి, రాజును వెర్రివాడిని చేస్తున్నారా? ఇది సమంజసమా?' అని కర్ణుడు అశ్వత్థామ మొదలైన వాళ్ళను ఆక్షేపించి, ప్రస్తుత పద్యం నుండి, 205వ పద్యం దాకా తన ప్రతాపాన్నీ, అర్జునుడితో సమానత్వాన్నీ చెప్పుకొంటూ, దుర్యోధనుడికీ తనకూ ఉన్న సంబంధాన్ని కూడా వ్యక్తం చేస్తాడు. పైమాటలలో కర్ణుడి వ్యక్తిత్వం స్పష్టపడుతుంది. పాత్రల మాటలద్వారా వాళ్ల వ్యక్తిత్వాన్ని సూచించడం తిక్కన లక్షణం.

2. అలం: రూపకం - గాత్రశాలలోన్ - గాత్రమనెడిశాలలో. 'సారథిన్ నెఱకుల నొంచెదన్' - సారథియొక్క నెఱకులు - అని షష్ఠిరావలసి ఉండగా, సారథిన్ నెఱకులు - అని ద్వితీయ అయింది. "క్రియాన్వయంబున రెండు పదంబులకు స్వస్వామి సంబంధంబు గలచో సంబంధిపదంబు షష్ఠికి ద్వితీయయునగు" - ప్రౌఢవ్యాకరణం, కారకపరిచ్ఛేదం. సూ.23.

చ. **జ్యాఘోషం బతిభీషణం బయి, దిశాచక్రంబు నిండన్, శర**
వ్యాఘాతంబున శాత్రవుండు వికలస్వాంతుండుగా, నారద
శ్లాఘాపాత్రమునై; యనర్గళ భుజాసంరంభతన్ రౌద్రరే
ఖా ఘోరాకృతి యేన చూపెద; నశంకం జూడుఁడీ యేర్పడన్. **202**

ప్రతిపదార్థం: జ్యా= అల్లెత్రాటియొక్క; ఘోషంబు= ధ్వని; అతి= మిక్కిలి; భీషణంబు+అయి= మిక్కిలి భయంకరమై; దిశాచక్రంబు= దిగ్వలయం, దిక్కుల సమూహం అంతా; నిండన్= నిండిపోగా (వ్యాపించగా); శర= బాణాలయొక్క; వి+ఆఘాతంబునన్ వ్యాఘాతంబునన్= ఎక్కువైన దెబ్బలతో (పెద్ద పెద్ద దెబ్బలతో); శాత్రవుండు= శత్రువైన అర్జునుడు; వికల= చెదిరిన (కలత చెందిన); స్వాంతుండు+కాన్= మనసుగలవాడు కాగా; నారద= నారదమహర్షియొక్క; శ్లాఘా= ప్రశంసకు; పాత్రమును+ఐ= అర్హమై (నారదుడికి కలహమే భోజనం. కనుక కలహం వస్తే ఆతడికి భోజనం దొరికినట్లే); అనర్గళ= అడ్డులేనట్టి; భుజా= బాహువులయొక్క; సంరంభతన్= సంరంభంతో (ఉద్రేకంతో); రౌద్రరేఖా= రౌద్రరసాన్ని సూచించే; ఘోర= భయంకరమైన; ఆకృతి= స్వరూపాన్ని; ఏను+అ= నేనే; చూపెదన్= చూపిస్తాను; అశంకన్= అనుమానం లేకుండా; ఏర్పడన్+చూడుఁడీ= బాగా చూస్తూ ఉండండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నా యొక్క అల్లెత్రాటి ధ్వని భీకరమై దిగ్వలయంలో వ్యాపించే రీతిగా, నా బాణాల దెబ్బలతో శత్రువైన అర్జునుడు కలతపడేటట్లుగా, నారదుడు ఆనందించేటట్లుగా, ఎదురులేని నా బాహుపరాక్రమంతో, రౌద్రరసం రూపాన్ని పొందినట్లు నేను చూపుతాను. అందరూ అనుమానం లేకుండా నన్ను చూస్తూ ఉండండి.

విశేషం: తనకు సమానులనూ, తనకంటె ఎక్కువైన వాళ్ళనూ కూడా లెక్కించక, కేవలం తాను ఒక్కడే వీరుడైనట్లు కర్ణుడు పైవిధంగా వీరులందరితో చెప్పాడు. ఇందులో, స్వోత్కర్ష, పరనిందా, ఒక లెక్కలేనితనం కనిపిస్తాయి. ఇవి కర్ణుడి మనస్తత్త్వాన్ని బాగా ప్రతిఫలింపచేస్తున్నవి. పైమాటలలో ఒకరకంగా, కర్ణుడి ఆత్మాభిమానమూ కనిపిస్తుంది.

క. క్రోధజ్వాలలు నిగుడ, వి । రోధి బలేంధనముఁ బొదువు క్రూరతమై దు
స్సాధమగు నర్జునాగ్నిని । సాధించెద నేన పూని శరవర్షమునన్. 203

ప్రతిపదార్థం: క్రోధ= కోపం అనే; జ్వాలలు= మంటలు; నిగుడన్= వ్యాపించగా; విరోధి= శత్రువుయొక్క; బల+ఇంధనమున్= సేన అనెడు కట్టెలను; పొదువు= చుట్టుకొనే; క్రూరతమైన్= క్రౌర్యంతో; దుస్సాధము+అగు= సాధించటానికి వీలుకానట్టి; అర్జున+అగ్నిని= అర్జునుడు అనే అగ్నిని; నేను+అ= నేనే (నేను ఒక్కడినే); పూని= (ఎంత కష్టమైనా) ప్రయత్నించి; శర= బాణాలు అనే; వర్షమునన్= వానతో; సాధించెదన్= సాధిస్తాను (చల్లారుస్తాను).

తాత్పర్యం: కోపం అనే మంటలతో చుట్టూ అలుముకొంటూ, శత్రువుయొక్క బలం అనే ఇంధనాన్ని (మండటానికి అవసరమైన పదార్థాన్ని), చుట్టుముట్టే క్రౌర్యంతో, సాధించటానికి వీలుపడనట్టి అర్జునుడు అనే భయంకరమైన అగ్నిని, నా బాణాలవర్షంతో నేనే చల్లార్చివేస్తాను. (అగ్నిని రూపుమాపుతాను - నాశనం చేస్తాను అని భావం).

విశేషం: అలం: రూపకం. ఇందులో అర్జునుడికీ అగ్నికీ అభేదం చెప్పబడింది. ఆ పోలిక చెప్పింది కూడా కర్ణుడే! క్రోధం ఎఱ్ఱటిది - దానిని కవులు మంటలతో పోలుస్తారు. వ్యాపించటం మంటల లక్షణం. పరాక్రమాన్ని అగ్నితో కవులు ఉపమిస్తారు. అర్జునుడు అనే అగ్నిని చల్లార్చటానికి ఎవ్వరూ వద్దనీ, తన బాణవర్షంతో తా నొక్కడే దానిని చల్లార్చుతాననీ, అది కష్టసాధ్యమే అనీ కర్ణుడు అంటాడు. తనకు శత్రువైన అర్జునుడి పరాక్రమాన్ని కర్ణుడు ప్రశంసించాడు. ఇందులో ఒక రహస్యం ఉన్నది. శత్రుబలాన్ని పొగిడి, అంత గొప్పవాడిని జయిస్తాను అని అనటం కర్ణుడి ఆధిక్యం తెలియటానికే! ఇది కూడా, కర్ణుడు తనను తాను పొగడుకొన్నట్లే అవుతుంది.

కవులు ఇటువంటి పద్ధతిని పాటించటం సహజమే. రామాయణంలో కూడా వాల్మీకి రావణ పరాక్రమాన్ని వర్ణింపజేసి, అట్లాంటివాడిని సంహరించిన రాముడి పరాక్రమాన్ని వర్ణించకనే వర్ణించినట్లు చిత్రించాడు. ఇది ఒక శిల్పం.

వ. పాండవమధ్యముండు పదుమూఁడు వత్సరంబులు పూఁచి పట్టి కయ్యంబునకు వచ్చె; నతని లావును బీరంబును లోకంబునకు నెక్కియున్న యవి; యేనును గురుసేనయందు శక్తి శౌర్యంబులు గలవాఁడన పోలె వర్తించెదం, గావున నే మిరువురము నొండొరులకు బాహుబల విలాసంబును, విక్రమ క్రీడా కౌశలంబును బ్రకటించుట యుచితంబు గాదె' యని వెండియు నిట్లనియె. 204

ప్రతిపదార్థం: పాండవమధ్యముండు= అర్జునుడు; పదుమూఁడువత్సరంబులు= పదమూడేండ్లు; పూఁచిపట్టి= ఎంతో ఉద్యమించి; కయ్యంబునకున్= యుద్ధానికి; వచ్చెన్= వచ్చాడు; అతని= అర్జునుని యొక్క; లావును= బలమూ; బీరంబును= పరాక్రమమున్నూ;

లోకంబునకున్= జనానికి; ఎక్కియున్న+అవి= నచ్చి ఉన్నాయి (ప్రశస్తమైనవి); ఏనును= నేనూ; కురుసేన+అందున్= కౌరవసేనలో; శక్తిశౌర్యంబులు= బలపరాక్రమాలు; కలవాఁడన్+అపోలెన్= కలిగినవాడివలెనే; వర్తించెదన్= నడుచుకొంటాను; కావునన్= కాబట్టి; ఏము+ఇరువురమున్= మేమిద్దరమూ (అర్జునుడూ+కర్ణుడూ); ఒండొరులకున్= ఒకరికొకరు; బాహుబల= భుజబలంయొక్క; విలాసంబును= విలాసాన్నీ; విక్రమ= పరాక్రమం అనే; క్రీడా= ఆటలోని; కౌశలంబును= నైపుణ్యాన్నీ; ప్రకటించుట= ప్రదర్శించుట; ఉచితంబు+కాదె= తగినది కాదా?; అని; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పదమూడేండ్లు అర్జునుడు ఎంతో ప్రయత్నం చేసి ఈనాడు కయ్యానికి వచ్చాడు. ఆతడి బలం, పరాక్రమం లోకంలో పేరుకెక్కినట్టివే! నేను కూడా కురుసేనలో బలపరాక్రమాలు కలిగినట్లే నడుచుకొంటున్నాను. కనుక మేమిద్దరం, ఒకరికొకరు భుజబలాన్నీ, పరాక్రమాన్నీ ప్రదర్శించుకొనటం ఉచితంగా ఉంటుంది' అని ఇంకా కర్ణుడు ఇట్లా అంటున్నాడు.

విశేషం: ఈ క్రింది పద్యంలో కర్ణుడు అర్జునుడితో పోరాడటంలో ఉన్న కారణాలను వివరిస్తున్నాడు. ఈ కారణాలను గమనిస్తే కర్ణుడి వ్యక్తిత్వం బాగా తెలుస్తుంది.

సీ. **'అనుదినంబును నంతకంతకుఁ బెరిఁగెడి । యధిపతి మన్నన యప్పుఁ దీర్ప,**
నర్జును నోర్చెద ననిలోన నే నని । యతనితోఁ బలికిన ప్రతిన నెఱపఁ,
గర్ణార్జునులయందు ఘనుఁ డెవ్వఁడగు నొక్కొ । యను జనంబుల సందియంబు మాన్ప,
జమదగ్నిసుత కృపాశ్రయమునఁ బడసిన । విలువిద్య కలరూపు వెలయఁ జేయఁ

ఆ. **గనుట నేఁడు పుణ్యదిన మయ్యె నాకు; మీ । కెల్లఁ బోరు సూడ నిష్టమేనిఁ**
జూడుఁ; డట్లు గాక వేడుక లేదేని, । సంతసమునఁ బసుల జాడఁ బొండు.' **205**

ప్రతిపదార్థం: అనుదినంబునున్= రోజురోజూ; అంతకు+అంతకున్= ఉండేకొద్దీ; పెరిఁగెడి= పెరిగిపోతున్న; అధిపతి= రాజైన సుయోధనుడియొక్క; మన్నన= ఆదరణ అనే; అప్పున్= ఋణాన్ని; తీర్పన్= తీర్చటానికీ; నేను= నేను; అనిలోనన్= యుద్ధంలో; అర్జునున్= అర్జునుడిని; ఓర్చెదన్= ఓడిస్తాను; అని= అంటూ; అతనితోన్= ఆ దుర్యోధనుడితో; పలికిన= మాట్లాడిన; ప్రతిన= ప్రతిజ్ఞ; నెఱపన్= నెరవేర్చటానికీ; కర్ణ+అర్జునులయందున్= కర్ణుడు, అర్జునుడు - అనే మా ఇద్దరిలో; ఘనుఁడు= అధికుడు; ఎవ్వఁడు= ఎవడు; అగును+ఒక్కొ= అవుతాడో; అను= అనేటటువంటి; జనుల= జనుల (లోకుల) యొక్క; సందియంబు= అనుమానం; మాన్పన్= పోగొట్టటానికీ; జమదగ్ని= జమదగ్ని అనే మహర్షియొక్క; సుత= కుమారుడైన పరశురాముడియొక్క; కృపా+ఆశ్రయమునన్= కరుణయొక్క ఆశ్రయంతో (దయవలన లభించిన ఆదరణతో); పడసిన= సంపాదించిన (పొందిన); విలువిద్య= ధనుర్విద్యయొక్క; కలరూపు= నిజమైన రూపాన్ని; వెలయన్+చేయన్+కనుటన్= ప్రకటించకలగటం వలన; నాకున్= నాకు; నేఁడు= ఈదినం; పుణ్యదినము= పవిత్రమైన దినం (పండుగ దినం); అయ్యెన్= అయింది; మీకున్= మీకు; ఎల్లన్= అంతమందికీ; పోరు= యుద్ధాన్ని (మా ఇద్దరి యుద్ధాన్ని); చూడన్= చూడటం; ఇష్టము+ఏనిన్= ఇష్టమయితే; చూడుఁడు= చూడండి; అట్లు+కాక= చూడటం ఇష్టంలేకపోతే; వేడుక= ఉత్సాహం; లేదు+ఏనిన్= లేనట్లైతే; సంతసమునన్= సంతోషంతో; పసుల= పసులయొక్క; జాడన్= దారిని (ఆవులు వెళ్ళిన దారిన); పొండు= పోండి.

తాత్పర్యం: 'దినదినానికీ అంతకంతకూ పెరిగిపోయే ప్రభువైన దుర్యోధనుడి ఆదరణ అనే అప్పు తీర్చుకొనటానికీ; నేను అర్జునుడిని యుద్ధంలో జయిస్తానని రాజుతో చేసిన ప్రతిన నెరవేర్చుకొనటానికీ, మా ఇద్దరిలో (కర్ణార్జునులలో)

అధికుడు ఎవడో అను సందేహంతో ఉండే లోకుల అనుమానాన్ని పోగొట్టటానికీ, జమదగ్ని కుమారుడైన పరశురాముడి దయవలన కలిగిన ఆశ్రయంతో పొందిన విలువిద్యయొక్క నిజరూపం ఏమిటో తెలపటానికీ, తగిన అవకాశం నాకు చిక్కింది. కనుక ఈ దినం నాకు చాల పవిత్రమైన దినం. మా ఇద్దరి పోరాటాన్ని మీరందరూ చూడాలని ఇష్టపడితే చూడవచ్చును, అట్లాకాక, చూడాలనిపించకపోతే, ఆవులు పోయినదారినే పోండి.'

విశేషం: కర్ణుడు పైన చెప్పిన కారణాలలో మొదటిది- ఆతడి కృతజ్ఞతాభావానికి నిదర్శనం. కేవలం అర్జునుడికి పోటీగానే కర్ణుడిని దుర్యోధనుడు గౌరవించాడు. దానిని నిరూపించుకొనటానికి ప్రయత్నించవలసిన బాధ్యత కర్ణుడికి ఉన్నది. అందుకే ఆతడు దానిని గొప్పగా చెప్పుకొన్నాడు. తాను చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకొనగలగటం రెండవ కారణం- మూడో కారణం, ఆతడి విశ్వాసాన్ని తెలుపుతుంది. నాలుగోది- ఆతడి పరాక్రమాన్ని సూచిస్తుంది. ఇవన్నీ తరువాత కేవలం ప్రగల్భాలుగానే మిగిలిపోతాయి.

వ. అనిన నమ్మాటలు విని కృపాచార్యుం డతని కిట్లనియె. 206

ప్రతిపదార్థం: అనినన్= ఆ విధంగా పలుకగా; ఆ+మాటలు= కర్ణుడియొక్క ఆ మాటలు; విని; కృపాచార్యుఁడు; అతనికిన్+ఇట్లు+ అనియెన్= ఆ కర్ణుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కర్ణుడు మాట్లాడిన మాటలను విన్న కృపాచార్యుడు ఆతడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'కయ్యమునక యెపుడుఁ గాలు ద్రవ్వుదు, కార్య । గతికిఁ జొరవు; నీతియుతులు సమర
మధమ సాధనముగ నాడుదు రర్థ సం । సిద్ధిఁ బొందు తెఱఁగు సేయు నెడల. 207

ప్రతిపదార్థం: కయ్యమునకున్+అ= పోట్లాటకే; ఎపుడున్= ఎల్లప్పుడూ; కాలు+త్రవ్వుదు(వు)= తయారౌతావు; (ఆబోతు మరొకదాన్ని చూచి, కాలితో నేలను తవ్వుతుంది. దానివలన రెండోదానికి రోషం వస్తుంది. కనుక కాలుత్రవ్వు అంటే, ప్రేరేపించుట అనీ అర్థమే); కార్యగతికిన్+చొరవు= పనితీరు ఎట్లా ఉందో గమనించి దాన్ని సాధించేదానికి ప్రయత్నించవు అని భావం; అర్థ= ప్రయోజనంయొక్క; సంసిద్ధి పొందు= సిద్ధిని (చివరి ఫలితాన్ని) పొందే; తెఱఁగు= విధానాన్ని (పద్ధతిని); చేయు+ఎడలన్= ఆచరించే సమయాలలో; నీతియుతులు= రాజనీతి తెలిసినవారు; సమరము= యుద్ధాన్ని; అధమసాధనముగన్= నీచమైన ఉపాయంగా; ఆడుదురు= చెప్తారు.

తాత్పర్యం: 'నీవు ఎప్పుడు చూచినా పోట్లాటకే కాలుదువ్వుతూ ఉంటావు. అంతకుమించి కార్యం తీరును గమనించి, దాన్ని సాధించటానికి నీ బుద్ధి పనిచేయదు. ప్రయోజనాన్ని సాధించుకొనే కార్యనిర్వహణలో యుద్ధం ఒక నీచమైన సాధనం అని రాజనీతి తెలిసిన పెద్దలు చెప్తారు.

విశేషం: సామం, దానం, భేదం, దండోపాయం - అని రాజులకు నాలుగు సాధనాలుంటాయి. మొదటి మూడు ఫలించనప్పుడు, చివరిదైన దండోపాయం (యుద్ధం) తప్పదు. ఆ స్థితిలోనే దాన్ని ఉపయోగించాలి. కాని, కర్ణుడు, అట్లాకాక, అయినదానికీ, కానిదానికీ కయ్యానికే కాలుదువ్వుతాడు. దానినే కృపాచార్యుడు చెప్పింది.

క. అగు దేశకాల బల యుత । ముగఁ జేసిన పోర నర్థములు; మోఱకులై
తెగఁ బాఱి తమ్ము నెదిరిని । వగవక తొడరుటలఁ గీడు వర్తిల్లుఁ దుదిన్. 208

ప్రతిపదార్థం: దేశ= దేశమూ; (ప్రాంతం); కాల= సమయం; బల= బలం (సైన్యం-శక్తిసామర్థ్యాలు); యుతముగన్= కూడుకొన్నట్లు (పై మూటినీ కుదిరించుకొని); చేసిన పోరన్= చేసిన పోరాటంలో (యుద్ధంలో); అర్థములు+అగున్= ప్రయోజనాలు కలుగుతాయి; (దేశ, కాల, బలాలను గమనించక); మోఱకులు+ఐ= మంచిచెడ్డలు తెలియని మూర్ఖులై; తెగన్+పాఱి= మోటుగా సాహసించి; తమ్మున్= తమనూ; ఎదిరిని= పగవాడిని (శత్రువును); వగవక= అంచనా వేసికొనక; తొడరుటలన్= ఎదుర్కొనటంచేత; తుదిన్= కడకు; కీడు= అపాయం (చేటు); వర్తిల్లున్= కలుగుతుంది.

తాత్పర్యం: దేశాన్నీ, కాలాన్నీ, బలాన్నీ సమకూర్చుకొని చేసిన యుద్ధంలో విజయం సిద్ధిస్తుంది. అట్లాకాక, మూర్ఖత్వంతో, సాహసంతో తననూ, శత్రువునూ అంచనా వేసికొనక, పోరాడితే చివరకు చేటు మూడుతుంది.

విశేషం: యుద్ధానికీ, దాని విజయానికీ; దేశ, కాల, బలాలకు సంబంధించిన ఆనుకూల్యం అవసరం. దేశం అంటే తనదికాక వేరే దేశం కావచ్చును, లేదా ప్రాంతం కావచ్చును. ఆ ప్రాంతం రాజుతో యుద్ధానికి తలపడేటప్పుడు, ఆ ప్రాంతం (దేశం) తనకు ఎప్పుడు అనుకూలమో (శీతోష్ణస్థితులవలన) గ్రహించుకొనాలి. అంతేకాక, ఇంకా అక్కడ తన అవసరాలకు సరిపడే వస్తు సౌకర్యాలున్నాయా లేవా చూసికొనాలి. ఇది దేశీయమైన గమనిక.

తరువాత కాలసంబంధం అయిన ఆనుకూల్యాన్ని చూడాలి. కాలం అంటే సమయం. ఇది చాలా ప్రధానం. ఏ పనికీ కాలం అనుకూలించాలి. యుద్ధం అనేది చాలా పెద్ద కార్యం. ఏ కాలంలోని యుద్ధం తనకు అనుకూలం, ఏసమయం శత్రువుకు అనుకూలం అన్నదానిని గమనించటం కాలగమనిక.

బలం అంటే సైన్యం. తన బలం ఎంతో, ఎదిరి బలం ఎంతో తెలిసికొనాలి. దీనినే బాగా అంచనా వేసికొనాలి. అప్పుడే విజయం లభిస్తుంది.

వ. అక్కిరీటి యొక్కరుండ కాఁడె యని తలంతు మేని. 209

ప్రతిపదార్థం: ఆ+కిరీటి= ఆ అర్జునుడు; ఒక్కరుండ కాఁడె= ఒక్కడే కదా; అని తలంతుము+ఏనిన్= అని అనుకొందామంటే.

తాత్పర్యం: ఆ అర్జునుడు ఒంటరివాడే కదా అని మనం అనుకొన్నామంటే, (ముందుకు అన్వయం).

విశేషం: అర్జునుడు ఒంటరిగా ప్రదర్శించిన ఆతడి పరాక్రమ సన్నివేశాలను కృపాచార్యుడు కర్ణుడితో వివరిస్తున్నాడు.

సీ. శక్రాది సురలతో సంగ్రామ మొనరించి । ఖాండవం బేర్చె నొక్కరుఁడ కాఁడె!
యాదవ బలమెల్ల నాఁగఁ ద్రోచి సుభద్రఁ । గడిమిమైఁ దెచ్చె నొక్కరుఁడ కాఁడె!
దిగ్విజయంబునఁ దేజంబు చేసె ని । క్కురువంశమునకు నొక్కరుఁడ కాఁడె!
బలముతో గంధర్వపతి నోర్చి విడిపించెఁ । గౌరవేశ్వరుని నొక్కరుఁడ కాఁడె!

ఆ. అని నివాత కవచులను దానవుల నాతఁ । డొక్కరుండ కాఁడె యుక్కు మడఁచె;
నమరులకు నజేయులగు కాలకేయుల । నొక్కరుండ కాఁడె యొడిచెఁ గర్ణ! 210

ప్రతిపదార్థం: కర్ణ!= ఓ కర్ణా!; శక్ర+ఆది= ఇంద్రుడు మొదలైన; సురలతోన్= దేవతలతో; సంగ్రామము+ఒనరించి= యుద్ధాన్ని చేసి; ఖాండవంబు+ఏర్చెన్= ఖాండవవనాన్ని కాల్చింది; ఒక్కరుఁడ+కాఁడె!= ఒక్కడే కదా!; యాదవబలము+ఎల్లన్= యాదవులయొక్క సైన్యాన్ని అంతా; ఆఁగన్+త్రోచి= ఆగిపోయేటట్లు వెనక్కు తోసేసి (కమ్ముకొని); సుభద్రన్= బలరామకృష్ణుల

చెల్లెలైన సుభద్రను; కడిమిమైన్= పరాక్రమంతో; తెచ్చెన్= తెచ్చింది; ఒక్కరుఁడ కాఁడె?= ఒక్కడే కదా?; దిగ్విజయంబునన్= అన్ని దిక్కులను జయించటంతో; ఈ= ఈయొక్క; కురువంశమునకున్= కురువంశానికి; తేజంబుచేసెన్= తేజస్సు కలిగించాడు. (కులాన్ని వెలిగించాడు- కీర్తి తెచ్చాడు అన్నమాట); ఒక్కరుఁడ కాఁడె?= ఒక్కడే కదా!; బలముతోన్= సైన్యంతో ఉన్న; గంధర్వపతిన్= గంధర్వరాజైన చిత్రసేనుని; ఓర్చి= ఓడించి; కౌరవ+ఈశ్వరునిన్= కౌరవరాజైన దుర్యోధనుడిని; విడిపించెన్= విడిపించింది; ఒక్కరుఁడ కాఁడె?= ఒక్కడే కదా!; అనిన్= యుద్ధంలో; నివాతకవచులు+అను దానవులను= నివాతకవచులు అనే పేరున్న రాక్షసులను; ఆతఁడు= ఆ అర్జునుడు; ఒక్కరుండ కాఁడె!= ఒక్కడే కదా!; ఉక్కుమడఁచెన్= చంపివేశాడు; అమరులకున్= దేవతలకు; అజేయులు+అగు= జయించటానికి సాధ్యంకానట్టి; కాలకేయులన్= కాలకేయులనే రాక్షసులను; ఒక్కరుండ కాఁడె= ఒక్కడే కదా; ఓడిచెన్= ఓడించాడు.

తాత్పర్యం: ఓ కర్ణా! అర్జునుడు ఒంటరివాడు కదా అని అనుకొంటున్నావేమో! ఇంద్రుడు మొదలైన దేవతలందరితో యుద్ధం చేసి ఖాండవాన్ని అర్జునుడు ఒక్కడే గదా దహించింది? సాటిలేని పరాక్రమంతో యాదవసైన్యాన్ని అంతా ఆపి, సుభద్రను తీసికొని వచ్చింది ఒక్కడే కదా? నాలుగు దిక్కులూ జయించి ఈ కురువంశానికి పేరు తెచ్చింది ఆతడు ఒక్కడే కదా? అమితమైన సైన్యంతో వచ్చిన గంధర్వరాజైన చిత్రసేనుడిని జయించి, కురుపతి అయిన దుర్యోధనుడిని విడిపించింది అర్జునుడు ఒక్కడే కదా? భయంకరమైన యుద్ధం చేసి, నివాతకవచులను నాశనం చేసింది అర్జునుడు ఒక్కడే కదా? అట్లాగే దేవతలకే సాధ్యపడని కాలకేయులు అనే దానవులను సంహరించింది ఆ అర్జునుడు ఒక్కడే కదా?

విశేషం: అలం: ఉదాత్తం, అంత్యానుప్రాసం. అర్జునుడి పరాక్రమాన్ని నిరూపించే ఆరు సన్నివేశాలను కృపాచార్యుడు కర్ణుడికి వివరించాడు. అర్జునుడి పరాక్రమ నిరూపణకు ఈ ఆరు సన్నివేశాలూ చాలా ప్రధానం అయినవి. అందుకే కృపాచార్యుడు కర్ణుడికి వీటినే చెప్పింది. పైవాటిని గమనించి అయినా కర్ణుడు తగ్గుతాడేమోనని కృపుడి భావం. ఇన్ని సన్నివేశాలలో ఒంటరిగా గెలిచిన విజయుడు, ఇప్పుడు కూడా గెలుస్తాడని సూచన! 'అజేయులు' అనే పదం 'అజయ్యులు' అనే అర్థంలో వాడబడింది. (అజేయులు= జయింపదగనివారు; అజయ్యులు= జయింపశక్యం కానివారు)

ఈ క్రింది పద్యంలోనూ ద్రౌపది స్వయంవర సందర్భాన్ని పురస్కరించుకొని, కృపాచార్యుడు కర్ణుడికి, అర్జునుడి ఒంటరి పరాక్రమాన్ని గురించే వివరిస్తున్నాడు.

ఉద్యోగపర్వం ప్రథమాశ్వాసంలోని 299వ పద్యంలోకూడా తిక్కన 'అజయ్యులు' అనటానికి బదులుగా 'అజేయులు' అని ప్రయోగించాడు. '...నిజానుజన్ము లక్షీణ పరాక్రముల్, సుతు లజేయులు'- ఇతి యతిస్థానం కూడా.

క. **భూవరులెల్లను నొక్కట । ద్రోవదికై తొడరి యతనితోఁ బెనఁగి కడుం**
జేవ సెడి పోవు నప్పుడు, । నీ వచ్చట గలవొ లేవొ నిక్కము చెపుమా! **211**

ప్రతిపదార్థం: భూవరులు+ఎల్లనున్= రాజులందరూ; ఒక్కటన్= ఒకేమారు; (ఒక పర్యాయం అనే అర్థాన్ని కూడా కొందరు చెప్పారు. ఇది నిస్సారమైన అర్థం. కనుక, 'ఒకేమారు; ఒక్కుమ్మడి' అనే అర్థమే గ్రహించబడింది); ద్రోవదికై= ద్రౌపదికొరకు; తొడరి= పూనుకొని (ప్రయత్నించి); అతనితోన్= అర్జునుడితో; పెనఁగి= యుద్ధం చేసి; కడున్+చేవ+చెడి= ధైర్యాన్ని, శక్తిని కోల్పోయి; పోవునప్పుడు= పరాజితులై పరుగెత్తి పోయేటప్పుడు; నీవు= నీవు; అచ్చటన్= ఆ చోట; కలవొ?లేవొ?= ఉంటివా? లేవా?; నిక్కము+అ= నిజాన్నే; చెపుమా!= చెప్పాలి సుమా!

తాత్పర్యం: రాజులందరూ ఒకేసారి ద్రౌపదికొరకు పూనుకొని, అర్జునుడితో పోరాడి, చివరకు ధైర్యాన్ని కోల్పోయి పారిపోయేటప్పుడు కర్ణా! నీవు అక్కడ ఉన్నావా? లేవా? నిజం చెప్పుము.

విశేషం: పాండవులలో ఒక్కరొక్కరే, ఒక్కొక్క దిక్కును ఎదురులేని పరాక్రమంతో జయించారనీ, పనికిరాని గర్వం నీ కెందుకు అనీ, కృపుడు కర్ణుడిని ఈ క్రింది పద్యంలో అధిక్షేపిస్తూ ఉన్నాడు.

చ. **కుంతీనందను లొక్కఁ డొక్కఁడ రిపుక్షోభంబు సంధిల్ల దు**
ర్దాంత స్వైర పరాక్రమంబులు మహోత్సాహంబునం జేసి; ర
త్యంతోదగ్రతఁ బల్కె దీ విచట బాహాశక్తి యిమ్మేదినీ
కాంతుం డియ్యకొనంగఁ బూనితి వృథా గర్వంబు నీ కేటికిన్? **212**

ప్రతిపదార్థం: కుంతీనందనులు= కుంతీదేవి కుమారులైన పాండవులు; ఒక్కఁడు+ఒక్కఁడు+అ= ఎవడికి వాడే (విడివిడిగా); రిపు= శత్రువులకు; క్షోభంబు= కలత; సంధిల్లన్= కలిగేటట్లు; మహా+ఉత్సాహంబునన్= అధికమైన ఉత్సాహంతో; దుర్దాంత= అణచటానికి వీలులేని (ఎదురులేని); స్వైర= స్వేచ్ఛతో కూడిన (స్వతంత్రమైన- ఎవరికీ స్వాధీనం కానట్టి); పరాక్రమంబులు= పౌరుషాలు (ప్రతాపాలు); చేసిరి= చూపారు; ఈవు= నీవు; ఇచటన్= ఇక్కడ; బాహాశక్తి= భుజబలాన్ని గురించి; అతి+అంత= మిక్కిలి; ఉగ్రతన్= తీవ్రంగా (గొప్పగా); పల్కెదు= చెప్పుతున్నావు; ఈ+మేదినీ కాంతుండు= రాజైన ఈ దుర్యోధనుడు; ఇయ్యకొనంగన్= మెచ్చుకోగా; పూనితి= యుద్ధం చేయటానికి పూనుకొన్నావు; వృథా= అనవసరమైన (పనికిరాని); గర్వంబు= అహంకారం; నీకున్= నీకు; ఏటికిన్?= ఎందుకు?

తాత్పర్యం: పాండవులలో ఎవరికి వారే ఒక్కరొక్కరుగా ఎంతో ఉత్సాహంతో శత్రువులకు సంక్షోభాన్ని కలిగించి, ప్రతాపాన్ని చూపి, దిగ్విజయం చేశారు. ఇక్కడ నీవేమో భుజ విక్రమాన్ని గురించి ఎంతో గొప్పగా చెప్పుకొంటున్నావు. ఈ రాజు నిన్ను మెచ్చుకొని నీవు చెప్పేది వింటున్నాడు. కర్ణా! నీకు పనికిరాని గర్వం ఎందుకు?

తే. **ఏచి మున్నీరు చేయీఁత నీఁద, నగ్ని । నుఱుక, వాసుకి కోఱలు పెఱుకఁ గడఁగి**
నట్లు గాదె రాధేయ! నీ వర్జునునకుఁ । బోర నెక్కటి మార్కొనఁ బూను టరయ!. **213**

ప్రతిపదార్థం: రాధేయ!= ఓ కర్ణా! (రాధ పెంపుడు కొడుక!); నీవు= నీవు; అర్జుననకున్= అర్జునుడిని; పోరన్= పోరాటంలో (యుద్ధంలో); ఎక్కటి= ఒంటరిగా; మార్కొనన్= ఎదిరించటానికి; పూనుట= పూనుకొనటం; అరయన్= చూడగా; ఏచి= విజృంభించి (చెలరేగి); మున్నీరు= సముద్రం; చేయీఁతన్= చేతి ఈతతో (వేరే ఆధారం ఏదీ లేకుండా); ఈఁదన్= ఈదటానికీ; అగ్నిన్= నిప్పులో; ఉఱుకన్= దూకటానికీ; వాసుకి= సర్పరాజైన వాసుకియొక్క; కోఱలు పెఱుకన్= కోరలు పీకివేయటానికి; కడఁగిన+అట్లుకాదె?= ప్రయత్నించినట్లే కదా?

తాత్పర్యం: ఓ కర్ణా! నీవు ఒక్కడవే అర్జునుడిని ఎదిరిస్తాను - అని అనటం ఎట్లా ఉన్నదంటే- చేతి ఈతతో సముద్రాన్ని ఈదుదామని అనుకొనటంవలె, నిప్పులలో దూకటంవలె, సర్పరాజైన వాసుకి కోరలను పెరకాలని అనుకొనటంవలె ఉన్నది.

విశేషం: అలం: మాలోపమ. పైన చెప్పిన మూడు పనులు అసాధ్యాలు అయినట్టివి. ఎవ్వడు కానీ కేవలం చేయూతతో, అంతు తెలియని సముద్రాన్ని దాటటంగానీ, నిప్పులలో నేరుగా దూకటంగానీ, మహా భయంకరుడైన వాసుకి అనే సర్పరాజు కోరలను పీకటంగానీ చేయలేడు. అటువంటి అసాధ్యమైన పనులను చేయగలిగితే, అర్జునుడిని ఎదిరించవచ్చును అని భావం. ఆ పనులను చేయటం సాధ్యం కాదు కనుక, అర్జునుడిని జయించటం వీలుకాదని ధ్వని.

పైమాటలలో, కృపాచార్యుడికి అర్జునుడిపై ఉన్న వాత్సల్యం, ప్రేమ, విశ్వాసం, ఆదరాలే కాక, కర్ణుడిపై ఉన్న నిరాదరణా, అనిష్టతా, రాజును పెడదారి పట్టించకుండా యుక్తియుక్తంగా హితం చెప్పే తీరూ మొదలైన భావాలు కూడా తెలుస్తాయి.

క. బలుగాలిఁ బేర్చు దావా । నల మొక్కరుఁ డార్పఁ బోయినను దీఱునె? నీ
చల ముడుగు; సాహసమునం । గలదే మేలెట్లు? నధిపుఁ గావఁగ వలదే? 214

ప్రతిపదార్థం: బలు= బలమైన (పెద్దదైన); గాలిన్= గాలితో (ఝంఝూమారుతంతో); పేర్చు= అతిశయించిన (చెలరేగిన); దావ= అడవి సంబంధమైన; అనలము= అగ్నిని; (దావాగ్నిని); ఒక్కరుఁడు= ఒంటరిగా ఒక్కడే; ఆర్పన్+పోయినను= చల్లార్చటానికి పోతే; తీఱునె?= సరిపోతుందా? (ఆరిపోతుందా?); నీ= నీయొక్క; చలం= పట్టుదల; ఉడుగు(ము)= విడిచిపెట్టుము; సాహసమునన్= దుస్సాహసంతో; మేలు కలదు+ఏ= మంచి కలుగుతుందా?; ఎట్లు= ఏ రకంగానైనా; అధిపున్= రాజైన దుర్యోధనుడిని; కావఁగన్ వలదే?= కాపాడుకొనాలి కదా!

తాత్పర్యం: కర్ణా! పెనుగాలితో పెచ్చుపెరిగి చెలరేగే దావానలాన్ని ఒక్కడు ఎంత ప్రయత్నించినా ఆర్పగలుగుతాడా? నీ పట్టుదల విడిచిపెట్టుము. (ఆలోచన లేని) నీ సాహసంతో మంచి జరుగదు. ఎట్లాగైనా ముందు రాజును కాపాడుకొనాలి కదా!

విశేషం: అలం: దృష్టాంతం. అర్జునుడిని ఝంఝూమారుతంతో కూడిన దావానలంతో కృపాచార్యుడు పోల్చాడు. ఝంఝూమారుతంతో అగ్ని ఎక్కువగా వ్యాపిస్తుంది. అగ్నికి వ్యాపించే గుణం సహజం. దానికితోడు దానికి మిత్రమైన గాలి కూడా చేరింది. అందులో అది మామూలు గాలి కాదు; ఝంఝూమారుతం. ఇంక చెప్పాల్సిందేముంది? అగ్ని చెలరేగి, అడవినంతా కాలుస్తుంది. అట్లాగే అర్జునుడు, గాలితో కూడిన అగ్నివలె చెలరేగి వస్తున్నాడు. ఇంక ఏమీ మిగలదు. కనుక రాజునైనా కాపాడుకొనాలి అని - అందుకే కృపుడు అన్నది.

తే. కురువిభుండును భీష్ముండు గురుఁడు గురుత । నూభవుండును నీవు నేనును గడంగి
కూడుకొని తాఁకుదము, గాక క్రీడితోడ । నొంటి మార్కొనవశమె ముక్కంటికైన?' 215

ప్రతిపదార్థం: కురువిభుండును= కౌరవరాజైన దుర్యోధనుడూ; భీష్ముండు= కురుపితామహుడైన భీష్ముడూ; గురుఁడు= గురువైన ద్రోణాచార్యుడూ; గురుతనూభవుండును= గురువు కుమారుడైన అశ్వత్థామా; నీవున్= నీవూ (కర్ణుడు); నేనును= నేనూ (కృపాచార్యుడిని); కడంగి= బాగా ప్రయత్నించి (సులువుగా కాదనుట); కూడుకొని= కలసి; తాఁకుదము= (అందరం కలిసి) ఎదిరిద్దాం; కాక= మనం అందరం ఒకటిగా కలిసి కాక, ఎవడికి వాడుగా ఎదిరిస్తే; ముక్కంటికిన్+ఐనన్= ఆ పరమేశ్వరుడికైనా; క్రీడితోడన్= అర్జునుడితో; ఒంటిన్= ఒంటరిగా; మార్కొనన్+వశమె?= పోరాడటం సాధ్యం అవుతుందా?

తాత్పర్యం: కురుపతి అయిన దుర్యోధనుడూ, పితామహుడు అయిన భీష్ముడూ, ఆచార్యుడైన ద్రోణుడూ, అశ్వత్థామా, నీవూ, నేనూ అందరం కలిసి అర్జునుడిని ఎదిరించుదాం. మనమంతా కలిసి కాక, విడివిడిగా ఆతడిని ఎదిరించాలంటే, ఆ ముక్కంటికే శక్యం కాదు, ఇంక మన కెట్లా వీలవుతుంది?'

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. కిరాతార్జునీయ కథను ఈ సందర్భంలో అన్వయించుకొనాలి. అర్జునుడి బలానికి మెచ్చిన శివుడు పాశుపతాస్త్రాన్ని అనుగ్రహించాడు.

కర్ణుఁడు కృపాచార్యు నధిక్షేపించి పలుకుట (సం. 4-46-1)

క. **అని పలికిన సంరంభం। బున నినసుతుఁ డిట్టులను 'రిపులయెడఁ జిత్తం**
బున నీవు ప్రియము గలుగుటఁ। గనికని నినుఁ దోడు పిలువఁగాఁ బతి బేలే! **216**

ప్రతిపదార్థం: అని పలికినన్= కృపాచార్యుడు పైవిధంగా చెప్పగా; ఇనసుతుఁడు= సూర్యుడి కుమారుడైన కర్ణుడు; సంరంభంబునన్= ఆర్భాటంతో (సరభసంగా); ఇట్టులు+అనున్= (కృపుడితో) ఇట్లా అంటాడు; రిపుల యెడన్= శత్రువుల పైన; చిత్తంబునన్= (నీ) మనస్సులో; నీవు= నీవు; ప్రియము+కలుగుటన్= అభిమానం (ప్రేమ) కలిగి ఉన్నావని; కనికని= బాగా చూచి(తెలిసి) కూడా; నినున్= శత్రువులపై ప్రేమ ఉన్న నిన్ను; తోడు= తోడుగా (కూడా); పిలువఁగాన్= రమ్మని పిలిచినదానికి; పతి= రాజైన ఈ దుర్యోధనుడు; బేల+ఏ!= అమాయికుడే!

తాత్పర్యం: కృపాచార్యుడు పైవిధంగా కర్ణుడిని మందలిస్తే దానికి కర్ణుడు సంరంభంతో ఇట్లా అంటున్నాడు. 'నీవు మనస్సులో శత్రువులమీద అభిమానం ఉండేవాడివని బాగా తెలిసికూడా, నిన్ను తోడుదెచ్చుకొన్న రాజైన దుర్యోధనుడు, ఏమైనా అమాయికుడే!

విశేషం: కర్ణుడు, కృపాచార్యుడిని ఆక్షేపిస్తూనే, దుర్యోధనుడి అమాయకత్వాన్నీ సూచించాడు. అమాయకత్వం మంచితనంలో ఒక భాగం. అందువలన కర్ణుడు దుర్యోధనుడి మంచితనాన్ని కూడా ప్రశంసించాడు. రాజు మంచివాడు, అమాయకుడు కాబట్టే నీవంటి వాళ్ళ (శత్రు పక్షపాతం ఉండేవాళ్ళ) ఆటలు సాగుతున్నాయనీ ధ్వని. అసలు కర్ణుడి మాటలలో ప్రధానంగా, పెద్దలను నిరసించటం, నిందించటం వంటి భావాలు చాలా వ్యక్తమవుతాయి. ఇవన్నీ, కర్ణుడి అహంకారాన్నే సూచిస్తాయి. అంతేకాక, తానొక్కడే నిజంగా రాజుక్షేమాన్ని కోరేవాడు - అనే అభిప్రాయం గోచరించేటట్లు చేస్తాయి. ఇది ఆతడి మనస్తత్వం. తిక్కన మహాకవి. కర్ణపాత్రను ఎంతో సూక్ష్మంగా పరిష్కరించాడు.

క. **ఏలిన వాని ధనంబులు। బాలురు బంధువులుఁ దారు బ్రదికిన దినముల్**
వేలారిచి తిం; డ్రాతని। యోలముగని పిదప భీతి నొదుఁగుదు రాజిన్. **217**

ప్రతిపదార్థం: ఏలినవాని= పాలించే రాజుయొక్క; ధనంబులు= సొమ్ములూ; బాలురు= పిల్లలూ; బంధువులున్= చుట్టాలూ; తారు= తమరూ; బ్రదికినదినముల్= బ్రదికున్నంతదాకా (చచ్చేవరకూ); వేలారిచి= సమృద్ధిగా; తింద్రు= తింటారు; ఆతని= ఆ రాజుయొక్క; ఓలము+కని= కష్టాన్ని చూసి; పిదపన్= తరువాత; ఆజిన్= యుద్ధంలో; భీతిన్= భయంతో; ఒదుఁగుదురు= (దొంగగా) ముడుచుకొంటారు (తప్పించుకొంటారు);

తాత్పర్యం: పిల్లలూ, చుట్టాలూ, తామూ బ్రదికినంతవరకూ రాజుగారి ధనాన్ని కావలసినంతగా తింటారు. ఆ రాజుకే ఆపద వస్తే యుద్ధంలో భయంతో వెనక్కు ఒదిగి తప్పుకొంటారు.

విశేషం: ఇందులో కర్ణుడు, పరోక్షంగా కృపాచార్యుడినే కాక, ద్రోణుడు మొదలైన వాళ్ళను కూడా ఆక్షేపిస్తున్నాడు. సమయం వచ్చినప్పుడు చల్లగా జారుకొంటారనీ, శత్రువులపై మనసులో అభిమానాన్ని నిలుపుకొంటారనీ, చాలా నీచంగా కర్ణుడు కృపాదులను ఆక్షేపించాడు. ఈ తరువాతి పద్యంలో కూడా, ప్రత్యేకించి కృపాచార్యుడిని ఇంకా నిందించాడు.

క. జన్నములు సేయునెడఁ బ । క్వాన్నంబులు గుడుచుచుండు; మధిపతి నిన్నున్
జన్నియ విడిచె రణముతఱి; । మిన్నక కినువడక పొమ్ము మీగృహమునకున్. 218

ప్రతిపదార్థం: జన్నములు+చేయు+ఎడన్= యాగాలు చేసేచోట; పక్వ+అన్నంబులు= వండిన అన్నాలు; కుడుచుచున్+ఉండుము= తింటూ ఉండుము; రణముతఱిన్= యుద్ధంవచ్చిన సమయంలో; అధిపతి= రాజు (దుర్యోధనుడు); నిన్నున్= నిన్ను; జన్నియవిడిచెన్= ఆబోతువలె వదిలాడు; మిన్నక= ఊరికే; కినువు+పడక= కోపగించుకొనక; మీ= మీయొక్క; గృహమునకున్+పొమ్ము= ఇంటికి వెళ్ళుము.

తాత్పర్యం: యజ్ఞాలు జరిగే చోటికి వెళ్ళి, తృప్తిగా బాగా వండిన భోజనాలను తింటూ ఊరకనే కూర్చో. రాజు, నిన్ను యుద్ధంలో ఆబోతును విడిచినట్లు విడిచిపెట్టాడు. అనవసరంగా కోపపడక, ఇంటికి వెళ్ళుము.

విశేషం: గ్రామాలలో ఆబోతును విడుస్తారు. దానిని ఎవరూ ఏమీ అనరు. అది ఎవరి పొలాలలో పైర్లు మేసినా కొట్టరు. అంటే దానికి అడ్డు లేదు. దానిని పవిత్రంగా చూస్తారు. కర్ణుడి దృష్టిలో కృపాచార్యుడు ఆబోతు. రాజు యుద్ధంలో ఆతడిని విచ్చలవిడిగా విడిచాడని కర్ణుడి నింద. రాజే నిన్ను అట్లా వదిలేశాడు కనుక ని న్నేమీ అనరాదు అని కర్ణుడు మరోచోట అంటాడు. ఇది కర్ణుడి మాన్య తిరస్కారానికీ, ఆతడి అహంకారానికీ నిదర్శనం.

తే. ఏను విల్లందుకొనిన నీరేడు భువన । ములును వడవడ వ డఁకు; నా యలఘు బాహు
బలముఁ దలఁపక పలికితి; పార్థుఁ డనఁగ । నెంతవాఁ డొక్కరథికున కింత యేల?' 219

ప్రతిపదార్థం: ఏను= నేను; విల్లు= ధనుస్సు; అందుకొనినన్= చేతికి తీసికొనగానే; ఈరు+ఏడు(ఈరేడు)= రెండేడులు (7+7); పద్నాలుగు అయిన; భువనములును= లోకాలు కూడా; వడవడ వడఁకున్= గడగడలాడుతూ వణికిపోతాయి; నా= నా యొక్క; అలఘు= లఘువుకాని (అధికమైన); బాహుబలమున్= భుజశక్తి; తలఁపక= ఆలోచించక; పలికితివి= అట్లా అన్నావు; పార్థుఁడు= అర్జునుడు; అనఁగన్+ఎంతవాఁడు= అంటే ఎంతవాడు?; ఒక్క= ఒక్కడైన; రథికునకున్= రథంపైనుండి యుద్ధంచేసే వీరుడికి; ఇంత+ఏల?= ఇంతగా అనుకొనాలా? (భయపడాలా? ఏమి?)

తాత్పర్యం: నేను విల్లును చేపట్టితే ఈ పదునాలుగు భువనాలూ గడగడ వణకిపోతాయి. నా భుజబలాన్ని లెక్కించకుండా అట్లా పలికావు. అర్జును డంటే ఎంత? ఒక రథికుడు. అంతేకదా! అతడిని గురించి ఇంతగా ఎందుకు భయపడాలి?'

వ. అనియె; నిత్తెఱంగున నందఱుఁ బలుకు పలుకులెల్ల వినుచు గాంగేయుండు కౌరవేశ్వరు నుద్దేశించి ధర్మార్థ సంగతంబును సువిహితంబుగా నిట్లను; 'ద్రోణాచార్యుండు నీతి పథంబునం బలికె, నాచార్యతనయు వచనంబు లుచితంబులు; కృపాచార్యుం డాడిన చందంబును దెఱంగువడియున్నయది; మన్ననగల మానిసియగుట నంగ రాజునకు సంగరపాటవంబు మాటలు దగుంగాక; మాన్యుల నధఃకరింపనగునే?' యని వెండియు. 220

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; ఈ+తెఱంగునన్= ఈవిధంగా; అందఱున్= అందరూ; పలుకు పలుకులు+ఎల్లన్= పలికే మాటలను అన్నింటినీ; వినుచున్= వింటూ; గాంగేయుండు= గంగ కుమారుడైన భీష్ముడు; కౌరవ+ఈశ్వరున్= కురురాజైన దుర్యోధనుడిని; ఉద్దేశించి= గురించి; ధర్మ+అర్థ+సంగతంబును= ధర్మప్రయోజనంతో కూడింది; సువిహితంబుగాన్= బాగా స్పష్టమయ్యేటట్లు; (కూడుకొనేట్లు); ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; ద్రోణ+ఆచార్యుండు= ఆచార్యుడైన ద్రోణుడు; నీతి పథంబునన్= నీతి మార్గంలోనే; పలికెన్= మాట్లాడాడు; ఆచార్యతనయు వచనంబులు= ద్రోణాచార్యుడి కొడుకైన అశ్వత్థామ మాటలు; ఉచితంబులు= యోగ్యమైనవి; కృపాచార్యుఁడు= ఆచార్యుడైన కృపుడు; ఆడిన చందంబును= పలికిన పద్ధతి; తెఱంగు+పడి, ఉన్న+అది= మంచి పద్ధతిలో సాగి ఉన్నది; మన్నన గల మానిసి+అగుటన్= రాజుయొక్క ఆదరం పడసిన మనిషి కావటంచేత; అంగరాజునకున్= కర్ణుడికి; సంగరపాటవంబు, మాటలు= యుద్ధప్రగల్భాలు; తగున్+కాక= తగినవి కావచ్చు; మాన్యులన్= గౌరవించదగినవారిని; అధఃకరింపన్+అగునే?= తక్కువ చేయవచ్చునా?; అని= అనిపలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: పైవిధంగా కర్ణుడు అన్నాడు. ఇట్లా అందరూ అన్ని రకాలుగా మాట్లాడిన మాటలన్నీ భీష్ముడు వింటూ, దుర్యోధనుడితో ధర్మప్రయోజనం కలిసివచ్చేటట్లుగా ఇట్లా అన్నాడు. 'ఆచార్యుడైన ద్రోణుడు నీతి పద్ధతిలో మాట్లాడాడు. అశ్వత్థామ పలుకులూ ఉచితమైనవే! కృపాచార్యుడు పలికిన పద్ధతీ సవ్యంగానే ఉన్నది. కర్ణుడు, రారాజుమన్ననకు పాత్రుడైన మనిషి కాబట్టి యుద్ధ చాతుర్యంతో కూడిన మాటలను మాట్లాడటం తగివుంది. కాని, గౌరవించదగిన వాళ్ళను తక్కువచేసి మాట్లాడవచ్చా?' అని అంతటితో ఆగక ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: ద్రోణుడూ, అశ్వత్థామా, కృపాచార్యుడూ, కర్ణుడూ మాట్లాడిన మాటలలో వారివారి మనస్తత్త్వాలు తెలిశాయి. పైవారి మాటలలోని అసలు సారాన్ని భీష్ముడు విశ్లేషణాత్మకంగా విమర్శనాదృష్టితో రాజుకు వివరించాడు. ఇది భీష్ముడి వ్యక్తిత్వాన్ని నిరూపిస్తుంది. కురుపితామహుడిగా, రాజనీతిజ్ఞుడుగా భీష్ముడు పైవారి సంభాషణలను పరామర్శించి, ఎవరితప్పూ లేదని అంటూ, కర్ణుడు మాత్రం, మాన్యులను తక్కువచేసి, అవమానించి మాట్లాడటం సమంజసమౌతుందా? అని దుర్యోధనుడితో అన్నాడు. దీనివలన, ధర్మపరమైన భీష్ముడి సూక్ష్మదృష్టి అవగతం అవుతుంది.

తరువాతి పద్యంలో కూడా భీష్ముడు, కర్ణుడి మాటలనే విమర్శిస్తాడు. అట్లాగే తరువాతి రెండు పద్యాలలోనూ భీష్ముడు కర్ణుడి మనస్తత్త్వాన్ని రాజుతో విమర్శిస్తాడు. ద్రోణుడూ, అశ్వత్థామా, కృపుడూ ముగ్గురూ అర్జునుడిని ప్రశంసిస్తారు. ఆ ముగ్గురినీ కర్ణుడు ఆక్షేపిస్తాడు. వీళ్ళలో వీళ్ళు మనస్పర్థలతో వాదించుకొంటూ ఉంటే చివరలో భీష్ముడు, పై ముగ్గురినీ మెచ్చుకొని, కర్ణుడిని తీవ్రంగా విమర్శించటం (అదీ రాజుతో) జరిగింది. ఇన్నిరకాల మనోభావాలను తిక్కన సూక్ష్మంగా చిత్రించి, వారి వ్యక్తిత్వాలను తీర్చిదిద్దాడు. ఇదే ఆయన ప్రత్యేకత.

ఆ. **'నేల ప్రొద్దెఱింగి చాలుమానిసి రణో। ద్యమ మొనర్చి కాక, తగినవారి**
చెవికిఁ జేదుగాఁగ నవమాన వాక్యంబు। లుడుగ కిట్లు పలుకు టొప్పు నెట్లు? **221**

ప్రతిపదార్థం: నేల= దేశమూ; ప్రొద్దు= కాలమూ; ఎఱింగి= తెలిసికొని; చాలు మానిసి= సమర్థుడైన మనిషి; రణ+ఉద్యమము= యుద్ధానికి సంబంధించిన ప్రయత్నం; ఒనర్చి+కాక= చేస్తే కాని; తగినవారి చెవికిన్= యోగ్యులైనవాళ్ళ చెవులకు; చేఁదు+కాఁగన్= వెగటుగా (కటువుగా); ఉడుగక= వెనుకాడక; ఇట్లు= ఈ రకంగా; అవమాన వాక్యంబులు= అగౌరవమైన మాటలు; పలుకులు= మాట్లాడటం; ఎట్లు+ఒప్పున్?= ఎట్లా కుదురుతుంది? (ఏం బాగుంటుంది?).

తాత్పర్యం: 'దేశాన్నీ, కాలాన్నీ గమనించిన సమర్థుడైనవాడు యుద్ధం చేయటానికి తగినట్లు ప్రయత్నం చేస్తే సరిపోతుంది, కాని, యోగ్యులైనవారి చెవికి కటువుగా, అమర్యాదగా మాట్లాడటం మాత్రం తగదు.

విశేషం: ఇందులో కర్ణుడు దేశ, కాలాల్ని తెలియనివాడనీ, యోగ్యులైన ద్రోణుడు మొదలైన మాన్యులను అవమానంగా మాట్లాడటం తగదనీ భీష్ముడు దుర్యోధనుడికి చెప్పుతున్నాడు.

క. బీరము లావును మిగులఁగ । వైరులు తతియైనఁ దొడర వచ్చినచోటన్
దూరమున వెరవుతోడి వి । చారము గలుగు టిది దగదె సద్బుద్ధులకున్. 222

ప్రతిపదార్థం: బీరము= పరాక్రమమూ; లావును= బలమూ; మిగులఁగన్= అధికం కాగా; వైరులు= శత్రువులు; తతి+ఐనన్= సమయం వస్తే; తొడరవచ్చిన= ముట్టడించటానికి వచ్చినట్టి; చోటన్= తావులో; దూరమునన్= దూరంలో ఉండగానే; వెరవుతోడి= ఉపాయంతో కూడిన; విచారము= ఆలోచన; కలుగుట= కలగటం; సత్+బుద్ధులకున్= జ్ఞానం కలిగినవాళ్ళకు (తెలివైనవాళ్ళకు); ఇది= ఈ కలగటం; తగదె!= తగిందే కదా!

తాత్పర్యం: బలం, ప్రతాపం అతిశయించేటట్లు శత్రువులు చుట్టుముట్టినప్పుడు తెలివిగలవాళ్ళు, దూరంగా ఉండగానే, ఉపాయంతో, ఆ శత్రువులను గూర్చి ఆలోచించటం మంచిదే కదా!

విశేషం: ఈ పద్యంలో కూడా భీష్ముడు ద్రోణాదుల మాటలను సమర్థిస్తూ, కర్ణుడి పద్ధతిని విమర్శిస్తున్నాడు. అంతేగాక, కర్ణుడికి తుదిమొదలు తెలీదనీ అంటున్నాడు. ఇందులో ద్రోణాదుల రాజనీతి కౌశలం కూడా సూచించబడింది. తెలివైన ద్రోణాదులు శత్రువును గూర్చి దూరాన్నించే ఆలోచించారనీ, వారు మహాత్ములనీ భీష్ముడి అభిప్రాయం.

ఆ. అరుల గుణములైన నగ్గింతు రెప్పుడుఁ । గలయ బెరసినపుడు కలితనంబు
మెఱయుదురు మహాత్ము; లెఱుఁగఁడు తుదిమొద । లెట్టివారి నితఁడు బెట్టు పలుకు. 223

ప్రతిపదార్థం: మహాత్ములు= మహిమగలవారు (గొప్పవారు); అరుల= శత్రువులయొక్క; గుణములు+ఐనన్= గుణాలను అయినా; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; అగ్గింతురు= పొగడుతారు; కలయ బెరసినపుడు= కలియబడినప్పుడు (పోట్లాడినప్పుడు); కలితనంబు= సామర్థ్యాన్ని; మెఱయుదురు= ప్రకాశింపజేస్తారు; ఇతఁడు= ఈ కర్ణుడు; తుది+మొదలు= ఒకవిషయం యొక్క మంచిచెడ్డలు; (ఆద్యంతాలు); ఎఱుఁగఁడు= తెలిసికొనడు (తెలియదు); ఎట్టివారిన్= ఎంతటి వాళ్ళనైనా (ఎంత గొప్పవాళ్ళనైనా); బెట్టు పలుకున్= కఠినంగా మాట్లాడతాడు.

తాత్పర్యం: మహాత్ములైన వాళ్ళు ఉదారంగా, శత్రువుల గుణాలను కూడా పొగడుతారు. పోరాటంలో పరాక్రమాన్ని చూపుతారు. ఈ కర్ణుడు తుదిమొదలు ఎరుగడు. ఎంత గొప్పవాళ్ళను గురించి అయినా దురుసుగా మాట్లాడతాడు.

విశేషం: ఇందులో పితామహుడైన భీష్ముడు కర్ణుడిని కేవలం ఒక అహంకారిగా, అజ్ఞానిగా భావించి మాట్లాడాడు.

వ. ఆచార్యులైన వారలు పూజా వాక్యంబుల కర్హులు గాక గర్హించుటకు విషయంబె?' యనుచుఁ గృపాశ్వత్థామల కరంబులకు నిజపాణి పుటంబులు సాఁచి యిట్లనుఁ 'బని చాలినంత గలదు; వివ్వచ్చుండు వచ్చుచున్నవాఁడు; విరోధంబునకు సమయంబు గాదు; మనమందఱముం గూడికొని కయ్యంబు సేయుదము; బలవద్వ్యసనంబు నందు భేదంబు గలుగు టొప్పదని బుధులు సెప్పుదురు; వేదంబు లొక్కవలనను, ధనుర్వేదం బొక్కవలనను, గల మీయట్టి మహానుభావు లెందునుం గలరె? కురుబలంబున కొకటి పుట్టినం బ్రసిద్ధులరు గావున నది మీతలన నిలుచు; నట్లగుటం జేసి. 224

ప్రతిపదార్థం: ఆచార్యులైనవారలు= పూజించదగిన గురువులు; పూజావాక్యంబులకున్+అర్హులు= పూజించటానికి తగిన మాటలకు; అర్హులు+కాక= యోగ్యులుకాక; గర్హించుటకున్= నిందించటానికి; విషయంబె?= ఆధారం అయిన వారా? (కాదు); అనుచున్= అంటూ; కృప+అశ్వత్థామల, కరంబులకున్= కృపాచార్యుడియొక్క, అశ్వత్థామయొక్క చేతులకు; నిజపాణి పుటంబులు= తన చేతి ముందు భాగాలను; చాఁచి= ముందుకు చాచి (స్నేహాదరచిహ్నంగా చేయికలిపి); ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; పని, చాలిన అంత= చేయవలసిన పని కావలసినంతగా (ఎంతో); కలదు= ఉన్నది; విన్వచ్చుండు= అర్జునుడు; వచ్చుచున్+ఉన్నవాఁడు= వస్తున్నాడు; విరోధంబునకున్= మనస్పర్థలకు; సమయంబు కాదు= తగిన కాలం కాదు; మనము+అందఱమున్+కూడికొని= మనందరం ఏకమై; కయ్యంబు+చేయుదము= యుద్ధం చేద్దాం; బలవత్+ వ్యసనంబునందున్= బలవంతులైనవాళ్ళతో విరోధంవలన కలిగిన సమస్యలో (కష్టంలో); భేదంబు= విభేదం (అంతఃకలహం); కలుగుట= ఏర్పడటం; ఒప్పదు+అని= మంచిదికాదని; బుధులు= పండితులు; చెప్పుదురు= చెప్పుతారు; వేదంబులు= వేదాలు; ఒక్కవలనను= ఒక ప్రక్కనూ; ధనుర్వేదంబు= విలువిద్యకు సంబంధించిన వేదం; ఒక్కవలనను= మరొకవైపునను; గల= ఉన్న (అంటే ఉభయ వేదమార్గాలలో పండితులని భావం); మీ+అట్టి; మహానుభావులు= మీవంటి గొప్పవారు; ఎందునున్+కలరె?= ఎక్కడైనా ఉన్నారా? (లేరని భావం); కురుబలంబునన్= కౌరవసైన్యంలో; ఒకటి, పుట్టినన్= ఏదైనా ఒకటి (కీడు) కలిగితే; ప్రసిద్ధులరు, కావునన్= కీర్తి కెక్కినవారు కాబట్టి; అది= ఆ బాధ్యత; మీ తలన్+అ= మీ మీదే; నిలుచున్= పడుతుంది; అట్లు+అగుటన్+చేసి= కాబట్టి.

తాత్పర్యం: ఆచార్యులైన పెద్దలు గౌరవవాక్యాలకే అర్హులు కాని, నిందకు కాదు' అని అంటూ భీష్ముడు కృప, అశ్వత్థామల చేతులను తన అరచేతులను చాపి తాకుతూ, ఇట్లా అన్నాడు. 'ఎంతో పని ఉన్నది, అదుగో అర్జునుడు వస్తున్నాడు. ఇది విరోధానికి సమయం కాదు, మనం అందరం కలిసి పోరాడుదాం. బలవంతుడైన శత్రువుతో పోరాడవలసినప్పుడు అంతఃకలహం మంచిది కాదు - అని పెద్దలైన పండితులు అంటారు. వేదాన్నీ, ధనుర్వేదాన్నీ అభ్యసించిన మీవంటి మహానుభావులు ఎక్కడైనా ఉన్నారా? కురుసైన్యంలో ఏదైనా సంభవిస్తే, మీరు ప్రధానులు కనుక, అది పరిష్కరించే బాధ్యత మీదే కనుక. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: పెద్దలైన ద్రోణాదులు కర్ణుడి మాటలకు ఎక్కడ నొచ్చుకుని కోపిస్తారో అనే జంకుతో, భీష్ముడు అంతటివాడు, వాళ్ళను వినయపూర్వకంగా ప్రార్థించటం ఇందులో ప్రధాన విషయం. 'కురుసైన్యంలో ఏదైనా జరగరానిది జరిగితే, అది మీమీదికే వస్తుంది' అని భీష్ముడు ద్రోణాదులను హెచ్చరించినట్లు, బ్రతిమిలాడినట్లు కూడా అనిపిస్తుంది. బ్రహ్మజ్ఞాన సంపన్నుడైన భీష్ముడు పూజ్యులైన ఆచార్యులను క్షమించండని తరువాతి పద్యంలో ప్రార్థిస్తాడు. ఇది భీష్ముడి వినయానికీ, విధేయతకూ, పూజ్యులపై ఉన్న భక్తిగౌరవాలకూ నిదర్శనం. అంతేగాక, 'బలవద్వ్యసనంబునందు భేదంబు గలుగు టొప్పదని బుధులు సెప్పుదురు' అనే మాటలలో ఆయన రాజనీతి, తత్త్వజ్ఞత వ్యక్తం అవుతాయి. ఈ వచనంలోనే కాక, తరువాతి కందపద్యంలో కూడా భీష్ముడు ద్రోణాదులను బ్రతిమాలటం ఉన్నది. ఈ సందర్భంలో భీష్ముడు చొరవ తీసికొనకపోతే పరిస్థితి వేరుగా ఉండేదే. అందుకే మంచి అదనులో ఆయన దిగాడు. పరిస్థితి సర్దుబాటు అయింది.

క. క్షమియింప వలయు, నొకఁ డెఱుఁ । గమి నేమే నన్న నంతఁ గటకటఁ బడి భూ
రమణుని కార్యస్థితి చి । త్త ములం దెడ సేయునట్టి తరమే మీరల్?' 225

ప్రతిపదార్థం: క్షమియింప వలయున్= క్షమించాలి (అభ్యర్థన); ఒకఁడు= ఒకానొక; మనిషి (అజ్ఞాని); ఎఱుఁగమిన్= తెలియనితనంతో; ఏమి+ఏన్+అన్నన్= ఏమైనా అన్నట్లు అయితే; అంతన్= అంతలోనే; (అప్పుడే-వెంటనే); కటకటన్+పడి= బాధపడి కోపగించి; భూరమణుని= రాజైన దుర్యోధనుడి యొక్క; కార్యస్థితి= పని తీరును; చిత్తములందున్= మనస్సులలో; ఎడ+చేయు+అట్టి= దూరం చేసేటి (వదలి పెట్టేటి); తరమేమీరల్?= తరహా వారా మీరు? (కాదని భావం).

తాత్పర్యం: క్షమించాలి. తెలియక ఒకడు ఏదో అంటే, అప్పుడే మీరు కోపించి, రాజు పని నిర్వహించే బాధ్యతను విడిచిపెట్టేటంతటి వారా?' (అంటే- అంత తక్కువవారా?- కారు అని భావం).

విశేషం: ఈ పద్యంలోనూ భీష్ముడు ద్రోణాదులను క్షమించండని ప్రార్థించి, మహోన్నతమైన ఆయన వ్యక్తిత్వాన్ని చూపుతున్నాడు. భీష్ముడి దృష్టిలో కర్ణుడు ఒక అనామకుడు, అజ్ఞాని. అందుకే అటువంటి వాడి మాటలను పట్టించుకొనవద్దని, రాజుపనిని చెడగొట్టవద్దని అనటం.

వ. అనిన విని వార లిట్లనిరి. 226

ప్రతిపదార్థం: అనినన్, విని= పైవిధంగా భీష్ముడు ప్రార్థించగా విని; వారలు= కృపాదులు; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: భీష్ముడు, కర్ణుడి తరపున క్షమించుమని కృపాదులను ప్రార్థించగా, అందుకు వారు ఇట్లా బదులు పలుకుతున్నారు.

క. 'క్షమియింప నెవ్వరము? భూ । రమణుని కార్యమున కెవ్వరము? ద్రోణుల చి
త్తము శాంతి వొందఁ జేయుట । మముఁ దెలచుట; యిట్టు లేల మాకొలఁదులకున్?' 227

ప్రతిపదార్థం: క్షమియింపన్+ఎవ్వరము?= క్షమించటానికి మేము ఎవ్వరం?; భూరమణుని= రాజైన దుర్యోధనుడి యొక్క; కార్యమునకున్= పనికి; ఎవ్వరము= మే మెవ్వరము? (మాకేమి సంబంధం)?; ద్రోణుల= ద్రోణులవారియొక్క; చిత్తము= మనస్సు; శాంతి+పొందన్+చేయుట= శాంతింపచేయటం; మమున్= మమ్ములనుకూడా; తెలచుట= మన్నించుటయే; మాకొలఁదులకున్= మాఅంత చిన్నవాళ్ళకు; ఇట్టులు+ఏల?= ఇంత (మర్యాద) ఎందుకు?

తాత్పర్యం: 'క్షమించటానికి మే మెవరం? రాజకార్యాన్ని నెరవేర్చటానికి మే మెంతవారం? ద్రోణులవారి మనస్సు శాంతిస్తే చాలు. మేమూ శాంతించినట్లే! మాబోటివాళ్ళకు ఇంత పెద్ద మర్యాద ఎందుకు?

విశేషం: కర్ణుడి నోటి దురుసుతనానికి, ఎక్కడ రాజకార్యం చెడిపోతుందో అనే అనుమానంతో, భీష్ముడంతటివాడు, కృపాశ్వత్థామలను క్షమించుమని వేడుకొంటాడు. పైఇద్దరికన్నా, భీష్ముడు జ్ఞానవయోవృద్ధుడు, తపస్వి, పైగా కురుపితామహుడు. అట్లా వేడుకొన్న భీష్ముడితో వారు క్షమించేందుకు మే మెవరం?' అని అంటూ ద్రోణుడితో ముడిపెడతారు. అంటే ద్రోణుడు ముందుగా శాంతించాలనీ, ఆతడు ప్రసన్నుడైతే, తమది ఏమీ లేదనీ అంటారు. పైగా తమంత చిన్నవాళ్ళకు అంత మర్యాద ఎందుకు?- అని కూడా వారు భీష్ముడితోనే అంటారు. ఇందులో ఒకవైపు ఎత్తిపొడుపు కనిపించినా, మరోప్రక్క, 'మీఅంత పెద్దలు మాఅంత చిన్నవాళ్ళను ఇంత బ్రతిమిలాడాలా? ద్రోణులను శాంతపరచండి. చాలు' అనే ధ్వని కూడా ఉన్నది.

'ద్రోణులు' అనే బహువచన ప్రయోగంతో ద్రోణులపై పూజ్యభావం సూచితం. అంతేగాక, ఆతడి ఆచార్యకత్వాన్నీ, దాని ప్రాధాన్యాన్నీ కూడా సూచించినట్లే అయింది. ఇది అంతా మనస్తత్త్వాలకు సంబంధించింది. తిక్కన వంటి మనస్తత్త్వవేత్త తెలుగులో అరుదు. ఆయన ప్రతిపాదించిన ప్రతి భావం పాత్రయొక్క మనస్సును తెలిపేదిగానే ఉంటుంది.

వ. అనిన విని, గాంగేయ కర్ణులం గూర్చికొని కురుపతి గురునిం బ్రార్థించి యశ్వత్థామను వేఁడికొని కృపాచార్యులం దేర్చినం, బ్రసన్నుండయి యోధవీరులం గలయం గనుంగొని ద్రోణాచార్యుం డిట్లనియె.228

ప్రతిపదార్థం: అనినన్, విని= కృపుడూ, అశ్వత్థామా భీష్ముడితో పైవిధంగా చెప్పగా విని; గాంగేయ= గంగానందనుడైన భీష్ముడినీ; కర్ణులన్= కర్ణుడినీ; కూర్చికొని= కలుపుకొని; కురుపతి= కురురాజైన దుర్యోధనుడు; గురునిన్= ద్రోణుడిని; ప్రార్థించి= వేడికొని; అశ్వత్థామను; వేఁడికొని= బ్రతిమిలాడి; కృపాచార్యులన్; తేర్చినన్= ప్రసన్నుడిని చేసికొనగా; ప్రసన్నుండు+అయి= సుముఖుడై; ద్రోణ+ఆచార్యుండు; యోధవీరులన్= పరాక్రమవంతులైన వీరులను; కలయన్+కనుంగొని= కలయచూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ మాటలను విని దుర్యోధనుడు భీష్ముడినీ, కర్ణుడినీ కూడ దీసికొని గురువైన ద్రోణుడిని ప్రార్థించాడు. అశ్వత్థామను బ్రతిమిలాడి వేడుకొన్నాడు. కృపుడిని శాంతింపచేశాడు. అప్పుడు ఆచార్యుడైన ద్రోణుడు సంతృప్తిచెంది, ప్రసన్నుడై, వీరులను అందరినీ కలయచూచి ఈ రకంగా అన్నాడు.

తే. **'అలుక భీష్ముని పలుకుల యపుడ పోయె; । మీఁది కార్యంబు నడపుఁడు మీర; లింక**
మోహ సాహసములఁ గురుముఖ్యు దెసకుఁ । గీడు రాకుండఁ దగఁ బరికింప వలయు. 229

ప్రతిపదార్థం: అలుక= (నా) కోపం; భీష్ముని= భీష్ముడియొక్క; పలుకులన్= మాటలతోనే; అపుడు+అ= అప్పుడే; పోయెన్= పోయింది; మీరలు= మీరు; ఇంకన్= ఇకముందు; మీది కార్యంబు= ముందుపని; నడపుఁడు= నడిపించండి; మోహసాహసములన్= వ్యామోహంతోకానీ, సాహసంతోకానీ; కురుముఖ్యు దెసకున్= దుర్యోధనుడికి; కీడు రాకుండన్= అపాయం రాకుండా; తగన్= తగునట్లు; పరికింపవలయున్= బాగా చూడాలి.

తాత్పర్యం: 'నా కోపం భీష్ముడి మాటలతోనే తొలగిపోయింది. మీరు ఇంక కావలసిన ముందు పని నడపండి. వ్యామోహంతో, సాహసంతో రాజైన దుర్యోధనుడికి అపాయం రాకుండా చూడాలి.

విశేషం: భీష్ముడి మాటలతోనే నా కోపం పోయింది - అని ద్రోణుడు అనడంలో, బ్రాహ్మణుల కోపం క్షణికం అని, అది తాటాకు మంటవంటిది అని తెలుస్తుంది. 'ఆచార్యుండు నీతి పథంబునం బలికె' అన్నది భీష్ముడి మొదటి మాట. ఆ మాటతోనే ద్రోణుడు తన కోపం పోయింది - అని అన్నాడు. ఇది మూలభారతంలో ఉన్నది. కానీ తిక్కన భీష్ముడి మొదటి మాట అని అనకుండా, భీష్ముడి పలుకులతోటే తన అలుక తీరిందని ద్రోణుడు అన్నట్లు చెప్పాడు. సంస్కృతంలో సూక్ష్మంగా చెప్పబడిన భావాన్ని, తిక్కన తెలుగుతనానికి తగినట్లు సామాన్యదృష్టితో చెప్పాడు. తెలుగువారికి ఇదే సహజమైన విధానం.

క. **వాసవనందనుఁ డెంతయు । గాసిలి యున్నాఁడు, మనలఁ గని యించుకయుం**
దా సైరణ సేయఁడు, గను । మోసము లే కొక్క మొగిన ముసరఁగ వలయున్. 230

ప్రతిపదార్థం: వాసవ= ఇంద్రుడియొక్క; నందనుఁడు= కుమారుడైన అర్జునుడు; ఎంతయున్= ఎక్కువగా; గాసిలి+ ఉన్నాఁడు= బాధతో ఉన్నాడు; మనలన్+కని= మనలను చూచి; తాన్= తాను; ఇంచుకయున్= ఏ కొంచెం అయినా; సైరణ+చేయఁడు= ఓర్చుకోడు (సహించడు); కను మోసము లేక= ఏమరుపాటు లేకుండా (ప్రమత్తత లేకుండా); ఒక్క మొగిన్+అ= ఒక్కటేసారి (అందరూ ఒక్కుమ్మడిగా); ముసరఁగన్+వలయున్= ఏమాత్రం సందు లేకుండా చుట్టుకోవాలి.

తాత్పర్యం: అర్జునుడు చాలా గాసిచెంది మనమీదికి వస్తున్నాడు. ఆతడు మనలను ఏమాత్రం ఓర్చుకోడు. కనుక, ఏమాత్రం ఏమరుపాటు లేకుండా మనం అందరం, ఒకేసారి అర్జునుడిని చుట్టుముట్టాలి.

విశేషం: పైమాటలలో అర్జునుడిపై ద్రోణుడికి ఉన్న అభిప్రాయం ఎటువంటిదో వ్యక్తం అవుతుంది. ఒకవైపు వాత్సల్యం, మరోవైపు లోకోత్తరవీరుడనే అభిమానం కూడా తోస్తున్నాయి.

వ. అప్పుడు కురుపతి సమయకాల విషయంబుగా నాడిన మాటయుం గలదు; దాని నిరూపించియున్నరూపు గాంగేయుండు సెప్ప నర్హుఁ' డనిన నతండు దుర్యోధనున కిట్లనియె. 231

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కురుపతి= దుర్యోధనుడు; సమయ= ప్రతిజ్ఞకు (అజ్ఞాతవాస ప్రతిజ్ఞకు) (సంబంధించి); కాల విషయంబుగాన్= వ్యవధియొక్క పరిసమాప్తిని గురించి; ఆడినమాటయున్= పలికిన పలుకు కూడా ఉన్నది; దానిన్, నిరూపించి= దానిని తేటపరిచి; ఉన్న రూపు= ఆ అజ్ఞాతవాసంయొక్క కాలనిర్ణయాన్నిగురించిన వాస్తవాన్ని; గాంగేయుండు= భీష్ముడు; చెప్పన్= తేల్చి చెప్పటానికి; అర్హుఁడు= యోగ్యుడు; అనినన్= అనగా; అతండు= భీష్ముడు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఇంతకుముందు అజ్ఞాతవాససమయాన్ని గురించి ఒకమాట చెప్పాడు. దాన్ని సరిగ్గా నిర్ణయించి, యథార్థాన్ని వివరించటానికి భీష్ముడే అర్హుడు' అని ద్రోణుడు అనగా దానికి భీష్ముడు, దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: తన లెక్కప్రకారం పదమూడు సంవత్సరాలూ పూర్తికాకనే, అంటే అజ్ఞాతవాసం ముగియకుండానే, అర్జునుడు తమ ఎదుటికి వస్తున్నాడని దుర్యోధనుడు భావించాడు. అందుకే ద్రోణుడు, ఈ విషయాన్ని భీష్ముడిద్వారా చెప్పిస్తున్నాడు. భీష్మ ద్రోణాదులకు అజ్ఞాతవాసం ముగిసింది అని తెలుసు. కాని, దుర్యోధనాదులకు లెక్క కుదరనందున, లెక్కించే పద్ధతిలో తేడావలన, అజ్ఞాతవాసం పూర్తి కాలేదనిపించింది. ఆ సందేహాన్ని ద్రోణుడు భీష్ముడిద్వారా తీరుస్తున్నాడు.

భీష్ముఁ డర్జును నజ్ఞాతవాస వత్సరవ్యాప్తి నిష్కర్షించుట (సం. 4.47.1)

సీ. 'రెండవ యేఁట నొక్కం డధిమాస; మి । ట్లెక్కిన యన్నెల లెల్లఁ గూర్చి
కొనఁ బదుమూఁడు హాయనములు దప్పక । నిన్నటి తోడన నిండె; నంత
యెఱిఁగియ తమపూన్కి యెల్లను దీర్చితి । మని పొడసూపె నర్జునుఁడు నేఁడు;
పాండుపుత్త్రులు ధర్మపరులు; ధర్మాత్మజుం । డేరి కధిష్ఠాత వారు ధర్మ

తే. పథము దప్పుదురే?; యన్నిపాటులట్లు । పడిన వారలు దఱియంగఁ బాఱనేర్తు
రెట్లు? తమకించి నీతి విహీన వృత్తిఁ । దమకు నొకకీడు వచ్చు విధంబుఁ గాఁగ. 232

ప్రతిపదార్థం: రెండవ+ఏఁటన్= రెండో ఏడాదిలో; ఒక్కండు= ఒక్కటి; అధిమాసము= అధికమాసం, (ఎక్కువమాసం); ఇట్లు= ఈ రకంగా (రెండేండ్లకు ఒకటి లెక్కన); ఎక్కిన= పెరగగా (ఎక్కువ కాగా); ఆ+నెలలు= ఆ అధికమాసాలు; ఎల్లన్+ కూర్చికొనన్= అన్నిటినీ కలుపుకొంటే; పదుమూఁడు= పదమూడైన; హాయనములు= సంవత్సరాలు; తప్పక= నిశ్చయంగా; నిన్నటితోడన్+అ= నిన్నటితోనే; నిండెన్= పూర్తి అయ్యాయి; అంత= దీనిని అంతా; ఎఱిఁగి+అ= తెలిసికొనియే; తమపూన్కి= తమదైన ప్రతిజ్ఞ; ఎల్లను= అంతా (పూర్తిగా); తీర్చితిమి+అని= నెరవేర్చామని; అర్జునుఁడు= అర్జునుడు; నేఁడు= ఈనాడు; పొడసూపెన్= కనపడ్డాడు; పాండుపుత్త్రులు= పాండురాజు కుమారులైన పాండవులు; ధర్మపరులు= ధర్మమే ప్రధానంగా కలిగినవాళ్ళు (ధర్మంవైపే ఉండేవాళ్ళు); ధర్మ+ఆత్మజుండు= యమధర్మరాజు కుమారుడైన ధర్మరాజు; ఏరికిన్= ఎవ్వరికీ;

అధిష్ఠాత= నాయకుడో (నియమించేవాడో); వారు= ఆ ధర్మరాజు అధీనంలో ఉండే పాండవులు; ధర్మపథము= ధర్మమార్గాన్ని; తప్పుదురే?= తప్పుతారా?; అన్ని పాటులు= అన్ని అగచాట్లు (కష్టాలు); అట్లు= ఆ రకంగా; పడినవారలు= అనుభవించినవాళ్ళు; తమకున్= తమకే; ఒక కీడు= ఒక అపాయం; వచ్చు విధంబుగాఁగన్= వచ్చేరకంగా; తమకించి= మత్సరించి (తొందరపడి అని); నీతివిహీన వృత్తిన్= నీతిమాలిన నడవడికతో; ఎట్లు= ఎట్లా; తఱియంగన్+పాఱన్+నేర్తురు?= సమీపించగలుగుతారు?

తాత్పర్యం: రెండేండ్లకు ఒకమారు అధికమాసం వస్తుంది. పదమూడేళ్ళలోగా ఇలా వచ్చిన అధిక మాసాలన్నిటినీ లెక్కించి కలుపుకుంటే, నిన్నటితోనే గడువు పూర్తి అవుతుంది. దీనిని బాగా తెలిసే, అర్జునుడు తమ ప్రతిన పూర్తిగా నెరవేర్చామని ఇప్పుడు కనిపించాడు. పాండవులు ధర్మపరులు. ధర్మరాజు ఎవరికి పెద్దగా ఉంటాడో వాళ్ళు ధర్మమార్గాన్ని తప్పరు. అన్ని పాట్లు పడ్డ పాండవులు తమకు అపాయం కలిగే రీతిలో తొందరపడి నీతిని విడిచి ఎట్లా మనమీదికి వస్తారు? రారు అని తాత్పర్యం.

విశేషం: ధర్మాచరణ విషయంలో పాండవులపై, ప్రత్యేకించి ధర్మరాజుపై భీష్ముడికి ఉన్న నమ్మకం ఇందులో తెలుస్తుంది. పాండవులు ధర్మాన్ని తప్పరనీ, ఇలా ధర్మాన్ని అతిక్రమించే వారైతే జూదం రోజుననే తెగించి ధర్మాన్ని వదిలేసి పోరాడేవారనీ భీష్ముడు ముందు పద్యంలో వివరించాడు.

ఉ. **అట్టిద యైన నాఁడ తఱియంబడి మూర్ఖతనంబు సేయరే?**
నెట్టన ధర్మపాశముల నిల్చిరి; కాలము వేచియుండి; ఱిం
కెట్టును వారు గొంత తమ యేడ్తెఱ సూపక మాననేర్తురే?
ముట్టఁగ వచ్చిరేని మనముం దగ నోర్తముగాక దానికిన్. **233**

ప్రతిపదార్థం: అట్టిది+అ+ఐనన్= అటువంటిదే అయితే (ధర్మాన్ని అట్లా దాటాలనుకుంటే); నాఁడు+అ= ఆ రోజే (జూదం ఆడిననాడే); తఱియంబడి= తెగించి; మూర్ఖతనంబు+చేయరే?= మూర్ఖత్వంతో ఎదురు తిరిగి యుద్ధం చేసేవారే గదా!; నెట్టన= గట్టిగా (పూర్తిగా); ధర్మపాశములన్= ధర్మం అనే త్రాళ్ళతో; నిల్చిరి= కట్టుబడి నిలబడ్డారు; కాలము వేచి+ఉండిరి= అనుకూలమైన కాలం (సమయం) కొరకు ఎదురుచూచారు; ఇంకన్+ఎట్టును= ఇంక ఏరకంగా అయినా; వారు= పాండవులు; తమ= తమయొక్క; ఏడ్తెఱ= పరాక్రమం; కొంత= కొద్దిగానైనా; చూపక= ప్రదర్శించక; మాననేర్తురే?= మానగలరా?; ముట్టగ వచ్చిరి+ఏని= చుట్టుముట్టటానికి వస్తే; దానికిన్+తగన్= అందుకు తగినట్లుగా; మనమున్= మనము కూడా; ఓర్తము+కాక!= ఎదిరిస్తాంగాక!

తాత్పర్యం: పాండవులు ధర్మాన్ని అట్లా అతిక్రమించాలనుకొంటే, జూదం ఆడిన రోజుననే తెగించి మూర్ఖత్వంతో యుద్ధం చేసి ఉండేవారు. పాండవులు ధర్మపాశాలకు పూర్తిగా కట్టుబడి నిలిచారు. అనుకూలమైన కాలంకొరకు ఎదురుచూచారు. ఇంక వారు ఏ రకంగానైనా పరాక్రమాన్ని కొంతైనా చూపకపోరు. మనలను వారు ముట్టడిస్తే అందుకు తగినట్లు మనమూ ఎదిరిద్దాం.

విశేషం: ఈ పద్యంలో కూడా భీష్ముడు పాండవుల ధర్మనిరతినీ, ధర్మదీక్షనూ గురించే చెప్పాడు. సమయంకొరకు ఎదురుచూచిన పాండవులకు, ప్రస్తుతం వారి ప్రతిజ్ఞ ముగిసిందనీ, ఇప్పుడు సమయం వచ్చిందనీ, కనుక, వీలైనంతవరకూ పరాక్రమాన్ని ప్రదర్శించకపోరనీ, వారు ముట్టడిస్తే మనం తగినట్లు ఎదిరించాలనీ భీష్ముడు దుర్యోధనుడికి హితం చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తు మనంగరాదు; రా
లచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వ నేర్చునే?
హెచ్చగుఁ గుందగుం దొడరు టెల్ల విధంబుల కోర్చు; టట్లుగా
కిచ్చఁ దలంచి యొక్కమెయి నిత్తఱిఁ బొందగు చేఁతయుం దగున్.' 234

ప్రతిపదార్థం: వచ్చినవాఁడు= (ఇప్పుడు మనమీదికి దండెత్తి) వచ్చినట్టివాడు; ఫల్గునుఁడు= అర్జునుడు; అవశ్యము= తప్పకుండా; గెల్తుము+అనంగన్+రాదు= గెలుస్తాము అని చెప్పలేము; రాలచ్చికిన్+ఐ= రాజ్యలక్ష్మికొరకై; పెనంగినన్= పోరాడితే; బలంబులు= సైన్యాలు; రెండును= ఇరువైపులు; గెల్వన్+నేర్చునే?= గెలువగలవా?; హెచ్చు+అగున్+కుందు+అగున్= ఎక్కువ కావచ్చును (గెల్వవచ్చును), తక్కువ కావచ్చును (ఓడవచ్చును); (కనుక); తొడరుట= ఎదిరించటం; ఎల్లవిధంబులకున్= జయాపజయాలలో దేనికయినా; ఓర్చుట= ఓర్చుకొనటమే (కర్తవ్యం); అట్లుగాక= ఆ రకంగా కాక; ఇచ్చన్+తలంచి= మనసులో ఆలోచించి; ఒకమెయిన్= ఒక విధంగా; ఈ+తఱిన్= ఈ సమయంలో; పొందు+అగు చేఁతయున్= సంధి కుదిరే కార్యం కూడా; తగున్= తగిందే.

తాత్పర్యం: ఇప్పుడు మనపైకి దండెత్తి వచ్చినవాడు అర్జునుడు. మనమే తప్పక జయిస్తామని చెప్పలేము. రాజ్యలక్ష్మికొరకు పెనుగులాడితే రెండు బలాలూ గెలువలేవు కదా! జయం కలుగవచ్చును, కలుగకపోవచ్చును. ఇప్పుడు మనం చేయగలిగిందల్లా ఏమి వచ్చినా ఓర్చుకొనటమే. అంతేకాక ఒకరకంగా ఇప్పుడు సంధి చేసికొనటం కూడా మంచిపనే!'

విశేషం: ఈ పద్యం తెలుగునాట బాగా ప్రచారంలో ఉన్నది. 'వచ్చినవాఁడు ఫల్గునుఁడు' అనడం ఒక లోకోక్తి. అంటే వచ్చినవాడు సామాన్యుడు కాడు - అని భావం. భీష్ముడి మనోభావం దీనివలన తెలుస్తుంది. ఈ పరిస్థితిలో కూడా 'సంధి మంచిది' అని భీష్ముడి అభిప్రాయం. అంతేగాక, దుర్యోధనుడికి సూచన కూడ. 'వచ్చినవాడు ఫల్గునుఁడు' అనడంలో ఒక బెదరింపు. జాగ్రత్త- అని సూచన ఉన్నది. పోరాడితే గెలుస్తామో లేదో అనే సందేహాన్ని వెలిపుచ్చడంలో భీష్ముడి రాజనీతి తెలుస్తుంది. అందుకే ఏమివచ్చినా ఓర్చుకొనాలి - అని హితం కూడా ఆయన చెప్పాడు. గెలుపు నిశ్చయం కానప్పుడు అన్ని విధాలా సంధి మేలు అని సలహా. ఇన్ని భావాలకు సమాశ్రయం అయిన ఈ పద్యం తిక్కన ప్రతిభావిశేషజన్యమే. అసలు పద్యం ఎత్తుగడే ఉదాత్తంగా ఉన్నది. 'సంప్రాప్తోహి ధనంజయః' అన్న భావాన్ని తిక్కన, తెలుగుతనానికి అనుకూలంగా తీర్చాడు. ఇది మూలంకన్నా ఎక్కువ అర్థస్ఫూర్తిని కలిగిస్తున్నది. భీష్ముడంతటివాడి అనుభవపూర్వకమైన ఇటువంటి సూచనను కూడా దుర్యోధనుడు గమనించలేదు. ఇది తరువాతి వచనంలో, పద్యంలో స్పష్టపడుతుంది. ఈ పద్యమే యథాతథంగా ఉద్యోగపర్వ తృతీయాశ్వాసంలో 85వదిగా పునరుక్తం కావటం గమనార్హం.

వ. అనిన విని కురుపతి దరహసిత వదనుం డగుచు నిట్లనియె. 235

ప్రతిపదార్థం: అనినన్, విని= (భీష్ముడు చెప్పిన మాటలను) విని; కురుపతి= దుర్యోధనుడు; దర= కొంచెమైన; హసిత= నవ్వుతో కూడిన; వదనుండు+అగుచున్= ముఖం కలిగినవాడై (చిఱునవ్వుతో కూడిన మొగం గలవాడై); ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్మపితామహుడి మాటలను విన్న దుర్యోధనుడు చిఱునవ్వుతో కూడిన ముఖంతో ఇట్లా అన్నాడు.

ఆ. 'మనకుఁ బాండురాజ తనయ వర్గమునకు । నెట్లు పొందు గలుగు? నేను రాజ్య
భాగ మీను; సమరభంగిక విక్రమ । నిరతిఁ బూను; టిదియ నిశ్చయంబు.' 236

ప్రతిపదార్థం: మనకున్= మనకు (భీష్ముడిని కలుపుకొని); పాండురాజ= పాండురాజుయొక్క; తనయ= కుమారులయొక్క; వర్గమునకున్= సమూహానికీ (పాండవులకూ); ఎట్లు= ఏ రకంగా; పొందు+కలుగున్?= సంధి కుదురుతుంది?; ఏను= నేను (అహంకారపూర్వకమైన శబ్దం); రాజ్యభాగము= రాజ్యంలో భాగాన్ని; ఈను= ఇవ్వను (నిశ్చయార్థకం); విక్రమ= పరాక్రమంయొక్క; నిరతిన్= ఎక్కువ ఆసక్తితో (పరాయణత్వంతో); సమరభంగికిన్+అ= యుద్ధ పద్ధతికే; పూనుట= పూనుకొనటమే; ఇది+అ= ఇదే; నిశ్చయంబు= నా నిర్ణయం.

తాత్పర్యం: మనకూ పాండవులకూ సంధి ఏరకంగా ఏర్పడుతుంది? నేను వాళ్ళకు రాజ్యంలో భాగాన్ని ఇవ్వను. అంతేకాక యుద్ధంలో పరాక్రమాన్ని చూపటానికే నిర్ణయించాను.

విశేషం: దుర్యోధనుడు తన నిర్ణయాన్ని కచ్చితంగా భీష్ముడికి చెప్పాడు. భీష్ముడు సంధిని సూచించాడు. దాన్ని దుర్యోధనుడు చిరునవ్వుతో నిరాదరించాడు. తిక్కన ఇక్కడ దుర్యోధనుడి వ్యక్తిత్వాన్ని సూచించాడు.

వ. అనిన నయ్యిరువుర వచనంబు లాకర్ణించి గురుం డిట్లనుఁ, 'గార్యగతియును గయ్యంబు భంగియు భూపతి కంటె మిగులం గనియెడు వారులే, రయినను నా యెఱింగిన యంత నొక్క తెఱంగు సెప్పెద; నీ బలంబున నాలవ పాలుగొని మహీపాలుండు సత్వరంబుగా ముందర పోవలయు; నంతియసేన తదనంతరంబ కదుపులం బొదివికొని చనవలయుఁ; దక్కటి సగంబుతో మనము నిలిచి మోహరించి యల్లనల్ల నరుగవలయుఁ; గవ్వడి యెయ్యెడం గవిసె నయ్యెడన తలపడ వలయు; నిట్లైన మానవేశ్వరుండు సురక్షితంబుగా సందడింబడక నడచు; గోవులు నిన్నేలం గడచు; మనమును ధనంజయునకుం జాలిన యప్పుడ యటఁ దోడుపడ నెవ్వరు గలిగినను వారికిం జాలి నిలుత' మనిన, విని, సురనదీసూనుండు దాని కియ్యకొని రాజన్యునకు సైన్యంబుఁ బంచి యిచ్చి, పుచ్చి, పసులకుం దోడగు భాగంబునుం బంచి, యున్నంత వట్టు చతురంగంబుల నియతి సేసికొని, యాచార్యుండు నడుమను, గృపాచార్యుండు వలపటను, నాచార్యపుత్త్రుండు దాపటం, గర్ణుండు ముందట, వికర్ణ దుశ్శాసన శకుని సైంధవ సోమదత్త బాహ్లిక భూరిశ్రవః ప్రభృతి యోధ వీరులెల్ల నెడనెడం గలయ నిలుచునట్లుగా మోహరించి, మహోత్సాహంబున సన్నాహ సౌందర్యంబు నొంది, తాలధ్వజం బెత్తించి, మెఱసి తాను వెనుకయయి నడిపించుచుండె; నట్టి సమయంబున. 237

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+ఇరువుర= ఆ ఇద్దరియొక్క; వచనంబులు= మాటలు; ఆకర్ణించి= విని; గురుండు= గురువైన ద్రోణాచార్యుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; కార్యగతియును= పనితీరూ; కయ్యంబు భంగియున్= యుద్ధవిధానం; భూపతికంటెన్= రాజుకంటె; మిగులన్+కనియెడువారు= ఎక్కువగా చూడగలవాళ్ళు; లేరు; అయినను= అయినా; నా+ఎఱింగిన+అంతన్= నాకు తెలిసినంతవరకూ; ఒక్కతెఱంగు= ఒక పద్ధతి; చెప్పెదన్= చెప్తాను; ఈ బలంబునన్= ఈ సైన్యంలో; నాలవపాలు, కొని= నాలుగవభాగం తీసికొని; మహీపాలుండు= రాజు, దుర్యోధనుడు; సత్వరంబుగాన్=

వెంటనే, వేగంగా; ముందర పోవలయున్= ముందుభాగంలో వెళ్లాలి; అంతియసేన= అంతేసేన; తద్+అనంతరంబు+అ= దాని తరువాత; కదుపులన్= ఆలమందలను; పొదివికొని= క్రమ్ముకొని; చనవలయున్= వెళ్ళాలి; తక్కటి సగంబుతోన్= మిగిలిన సగంపాలు సైన్యంతో; మనము= మనమందరం; నిలిచి= రంగంలో నిలువబడి; మోహరించి= ఒక వ్యూహంగా మారి; అల్లన్+అల్లన్= మెల్లమెల్లగా; అరుగవలయున్= కదలిపోతుండాలి; కవ్వడి= అర్జునుడు; ఏ+ఎడన్= ఏ ప్రదేశంలో; కవిసెన్= డీకొంటాడో; ఆ+ఎడన్+అ= ఆ ప్రదేశంలోనే; తలపడన్+వలయున్= ఎదిరించాలి; ఇట్లు+ఐనన్= ఈ విధంగా జరిగితే; మావన+ఈశ్వరుండు= రాజు, దుర్యోధనుడు; సురక్షితంబుగాన్= లెస్సగా కాపాడబడినవాడై; సందడిన్+పడక= అలజడి పడకుండా; నడచున్= సాగిపోగలడు; గోవులు= ఆవులు కూడా; ఈ+నేలన్= ఈ దేశపు పొలిమేరలు; కడచున్= దాటిపోతాయి; మనమును= మనంకూడా; ధనంజయునకున్= అర్జునుడికి; చాలిన+అప్పుడు+అ= ఎవ్వరైనా ఎదురు నిల్వగానే; అటన్= ఆ చోట; తోడుపడన్+ఎవ్వరు+కలిగినన్= సహాయపడటానికి ఎవరు ఉన్నా; వారికిన్= ఆ విధంగా ఎదిరించినవారికి; చాలి= సామర్థ్యంతో; నిలుతము= నిలుద్దాం; అనినన్; విని; సురనదీ సూనుండు= గంగాపుత్రుడు- భీష్ముడు; దానికిన్= ద్రోణుడి ప్రతిపాదనకు; ఇయ్యకొని= అంగీకరించి; రాజన్యునకున్= రాజుకు; సైన్యంబు, పంచి+ఇచ్చి= సైన్యాన్ని పంచి ఇచ్చి; పుచ్చి= పంపించి; పసులకున్= ఆవులకు; తోడు+అగు, భాగంబున్= తోడుగా ఉండే సైన్యభాగాన్ని కూడా పంచి; ఉన్నంత+పట్టు= ఉన్నంతలో; చతురంగంబులన్= సైన్యంలోని నాలుగు అంగాలను (రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలం); నియతి+చేసికొని= తగినట్లుగా నియమించుకొని; ఆచార్యుండు= ద్రోణుడు; నడుమను= మధ్యభాగంలోనూ; కృపాచార్యుండు; వలపటను= కుడిప్రక్కను; ఆచార్యపుత్త్రుండు= ద్రోణుని కొడుకైన అశ్వత్థామ; దాపటన్= ఎడమ ప్రక్కను; కర్ణుండు; ముందటన్= ముందుభాగంలో; వికర్ణ, దుశ్శాసన, శకుని, సైంధవ, సోమదత్త, బాహ్లిక, భూరిశ్రవస్, ప్రభృతి= వికర్ణుడు, దుశ్శాసనుడు, శకుని, సైంధవుడు, సోమదత్తుడు, బాహ్లికుడు, భూరిశ్రవసుడు మొదలైన; యోధవీరులు+ఎల్లన్= పరాక్రమంగల వీరులందరూ; ఎడన్+ఎడన్= అక్కడక్కడ (తగినంత దూరంలో); కలయన్ నిలుచునట్లుగాన్= కొంచెం దూరంగా ఉన్నా కలిసి యుద్ధం చేసేటట్లుగా; మోహరించి= వ్యూహంపన్ని; మహా+ఉత్సాహంబునన్= యుద్ధం చేయాలన్న తీవ్రమైన ఉత్సాహంతో; సన్నాహ, సౌందర్యంబున్= యుద్ధానికి సిద్ధపడటంలో గోచరించే అందాన్ని; ఒంది= పొంది (వీర సౌందర్యంతో); తాలధ్వజంబు+ఎత్తించి= తాటిచెట్టు గుర్తుగల జెండాను రథంమీద ఎగిరేటట్లుచేసి; మెఱసి= ప్రకాశించి; తాను= భీష్ముడు; వెనుక+అయి= సైన్యానికి చివరగా (వెనుకగా); అయి= ఉండేటట్లుగా ఉంటూ; నడపించుచున్+ఉండెన్= ముందుకు సాగిస్తూ ఉన్నాడు; అట్టి, సమయంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: భీష్మదుర్యోధనుల మాటలను విన్న ద్రోణుడు ఇట్లా అన్నాడు: 'పనితీరూ, యుద్ధవిధానం రాజుకంటె ఎక్కువగా తెలిసినవాళ్ళు లేరు. కాని, నాకు తోచినంతలో ఒక మార్గాన్ని చెప్పుతాను. మనసైన్యంలో నాలుగో భాగాన్ని తీసికొని రాజు ముందు నడవాలి. అంతే సేన (అంటే నాలుగోవంతు) ఆవులను చుట్టి తరువాత నడవాలి. తక్కిన సగంతో, మనం ఒకవ్యూహంగా ఏర్పడి మెల్లగాపోతూ ఉందాం. ఎక్కడ అర్జునుడు ఎదిరిస్తే అక్కడే మనమూ ఎదిరిద్దాం. ఇట్లాగైతే, రాజు ఇబ్బందిపడకుండా ముందుకు పోతాడు. ఆవులూ ఈ నెలవు దాటిపోతాయి. అర్జునుడిని ఎదిరించటానికి మనం సమర్థుల మయినప్పడే, అతడికి తోడుపడటానికి ఎవరు ఉన్నా, వారిని కూడా ఎదుర్కొనటానికి సామర్థ్యం ఉన్నప్పుడే మనం అందరం కలిసి నిలబడాలి' అని అనగా, భీష్ముడు విని అంగీకరించి, గురుడు చెప్పినట్లు, రాజైన దుర్యోధనుడికి నాలుగోవంతు సైన్యాన్నిచ్చి పంపించి, ఆవులవెంట రక్షణగా ఉండవలసిన నాలుగోవంతు సైన్యాన్నీ పంచి, తక్కిన అర్ధభాగం సైన్యాన్ని, చతురంగ బలాలతో ఉన్నదానిని, ఎక్కడెక్కడ ఉండాలో నియమించి, ఏర్పరచి, మధ్యలో గురుడూ, కుడివైపు కృపుడూ, ఎడంవైపు గురుసుతుడైన అశ్వత్థామా,

ముందర కర్ణుడూ ఉండగా వికర్ణుడూ, దుశ్శాసనుడూ, శకునీ, సైంధవుడూ, సోమదత్తుడూ, బాహ్లికుడూ, భూరిశ్రవుడూ మొదలైన యోధవీరులందరూ అక్కడక్కడ నిలబడేట్లుగా వ్యూహాన్ని నిర్మించి, నిలిచి, ఉత్సాహంతో అంతా సిద్ధం చేసి, తనయొక్క తాలధ్వజాన్ని నిలిపి, వీరసౌందర్యమూర్తిగా భీష్ముడు వెనుక ఉండి సైన్యాన్ని నడుపుతూ వుండే సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: భీష్ముడూ, ద్రోణుడూ వంటి అనుభవజ్ఞులు అర్జునుడిని ఎదిరించటానికి పన్నిన వ్యూహ విశేషం ఇందులో వివరించబడింది. అర్జునుడు అంటే వీళ్ళందరూ ఎంత జాగరూకతతో ఉన్నారో ఈ వచనం వలన అర్థం అవుతుంది.

చ. అరుదుగ నిట్టు లొక్కనికి నంతబలంబునకున్ మహోగ్ర సం
గర మగుడున్ మనం బతుల కౌతుక మొంది కనుంగొనన్ సురే
శ్వరుఁడు సుదర్శనంబనఁ బ్రశంసకు నెక్కు విమానమెక్కి యం
బరగతి వచ్చె దేవముని పంక్తులు సిద్ధగణంబుఁ గొల్వఁగన్. 238

ప్రతిపదార్థం: అరుదుగన్= ఆశ్చర్యాన్ని కలిగించేట్లు; ఇట్టులు= ఇట్లా; ఒక్కనికిన్= ఒక్క వీరుడికి; అంత బలంబునకున్= అంత ఎక్కువైన సైన్యానికీ; మహా+ఉగ్రసంగరము+అగుడున్= మిక్కిలి భయంకరం అయిన యుద్ధం జరుగుతూంటే; మనంబు= మనస్సులో; అతుల= సాటిలేని; కౌతుకము+ఒంది= కుతూహలాన్ని పొంది; కనుంగొనన్= చూడటానికి; సుర+ఈశ్వరుండున్= దేవేంద్రుడూ; దేవముని పంక్తులున్= దేవతలూ, మునుల సమూహాలూ; సిద్ధగణంబున్= సిద్ధుల సమూహమూ; కొల్వఁగన్= సేవిస్తూ ఉండగా; సుదర్శనంబు+అనన్= సుదర్శనం అనే పేరుతో; ప్రశంసకున్+ఎక్కు= పేరుకెక్కిన; విమానమున్+ఎక్కి= విమానాన్ని అధిరోహించి; అంబరగతిన్= ఆకాశమార్గంలో; వచ్చెన్= వచ్చి నిలిచాడు.

తాత్పర్యం: అపూర్వంగా ఆశ్చర్యకరంగా ఒక్క వ్యక్తికీ, అంతులేని బలానికీ మధ్య ఘోరసంగ్రామం జరుగుతుందని ఎంతో కుతూహలంతో చూడటానికి, దేవతలూ, ఋషులూ, సిద్ధులూ సేవిస్తుండగా, దేవేంద్రుడు సుదర్శనం అనే విమానం ఎక్కి ఆకాశమార్గంలో వచ్చి నిలిచాడు.

విశేషం: అర్జునుడు ఒంటరివాడు. అనంతమైన కురుబలంతో ఆతడు పోరాడబోతాడు. ఇది ఆశ్చర్యకరమైన విషయం. అంతేగాక, ఇంద్రుడికి తన కుమారుడైన అర్జునుడి పరాక్రమాన్ని కనులారా చూడాలనీ కుతూహలం ఉన్నట్లు సూచన.

వ. అ ద్దివ్యయానరత్నంబునందు. 239

ప్రతిపదార్థం: ఆ+దివ్య= ఆ దివ్యమైన; యాన= వాహనాలలో; రత్నంబు+అందున్= శ్రేష్ఠమైనదానిలో.

తాత్పర్యం: ఆ దివ్యమైన శ్రేష్ఠమైన విమానంలో.

తే. స్వర్గమున నున్న రాజులుఁ జక్రవర్తు । లును యథోచిత ఛత్రంబులును నిజార్హ
చామరంబులుఁ జెలువొందఁ జారులీలఁ । గొలిచియుండిరి వేడ్కలు కొనలు నిగుడ. 240

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: స్వర్గమునన్+ఉన్న= స్వర్గంలో ఉన్న; రాజులున్= రాజులూ; చక్రవర్తులును= సార్వభౌములును; యథా+ఉచిత= వారికి తగిన; ఛత్రంబులును= గొడుగులూ; నిజ+అర్హచామరంబులున్= తమకు ఉచితమైన వింజామరలూ; చెలువు+ఒందన్= అందగించగా; చారులీలన్= మనోహరమైన విలాసంతో; వేడ్కలు= కోర్కెలు; కొనలు నిగుడన్= కొనలు సాగేటట్లు; కొలిచి+ఉండిరి= సేవిస్తూ ఉన్నారు.

తాత్పర్యం: స్వర్గలోకంలో ఉన్న రాజులూ చక్రవర్తులూ ఉచితమైన ఛత్రాలూ చామరాలూ ప్రకాశించగా, విలాసంతో, కోర్కెలు తీగె సాగుతుండగా దేవేంద్రుడిని సేవించి ఉన్నారు.

క. **పాండుమహీపాలుం డా । ఖండలు చేరువన పెద్దగద్దియ నమరీ**
మండలి వీచోపు లిడఁగ । నుండి కనుంగొనుచు నుండె నుజ్జ్వల భంగిన్. **241**

ప్రతిపదార్థం: పాండు మహీపాలుండు= పాండురాజు; అమరీ= దేవతాస్త్రీలయొక్క; మండలి= సమూహం; వీచోపులు+ఇడఁగన్= వింజామరలు వీచుతూ ఉండగా; ఆఖండలు= దేవేంద్రుడియొక్క; చేరువన= ప్రక్కనే; పెద్దగద్దియన్= పెద్దదైన సింహాసనంపైన; ఉజ్జ్వలభంగిన్+ఉండి= ప్రకాశమానమైన రీతిలో కూర్చొని; కనుంగొనుచున్+ఉండెన్= చూస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: పాండురాజు, అప్సరసలు వింజామరలు వీస్తుండగా, ఇంద్రుడి ప్రక్కనే మరో పెద్ద సింహాసనం మీద కూర్చొని ఉజ్జ్వలరీతిలో చూస్తున్నాడు.

విశేషం: మూలభారతంలో ఇంద్రుడు ఒక్కడే ఉన్నట్లుంది కాని, ప్రక్కన పాండురాజున్నట్లు లేదు. ఇది తిక్కన కల్పన.

వ. **అంత.** **242**

తాత్పర్యం: దివ్య విమానంలో ఇంద్రుడి ప్రక్కన పాండురాజు ఉండి చూస్తుండే సమయంలో.

సీ. **దేవదత్తాభీలరావంబు వెసఁ గర్ణ । ముల దీటుకొన, లేట మొగము పడుచు,**
రథనేమి దళిత ధరాధూళి యంగంబు । లెల్లఁ గప్పఁగ వెలువెల్ల నగుచు,
బహుళ కపిధ్వజ ప్రభలు లోచనములు । మిఱుమిట్లు గొనఁ బర్వ మేడుపడుచు,
నుద్ఘటాకార సముద్ధతి మనము లు । త్తలపాటు దోఁపంగఁ దల్లడిలుచు

తే. **నడచు కౌరవరాజు సైన్యంబుఁ గదిసెఁ । దీఁగ దిగిచినగతిఁ దనతేరు మెఱయ**
రయముమైఁ జని ప్రళయ భైరవ సహస్ర । గర్జనోదగ్ర తర్జనుఁ దర్జునుండు. **243**

ప్రతిపదార్థం: దేవదత్త+ఆభీల రావంబు= దేవదత్తం (శంఖం) యొక్క భీకరమైన శబ్దం; వెసన్= వెంటనే (శబ్దం పుట్టిన వెంటనే); కర్ణములన్= చెవులలో; దీటుకొనన్= నిండిపోయినప్పుడు; లేట మొగము పడుచున్= పెడమొగాన్ని పెడుతూ (మొగం ప్రక్కకు త్రిప్పుకుంటూ); రథ= రథంయొక్క; నేమి= చక్రం అంచుతో (పట్టాతో); దళిత= చీల్చబడిన (రేగిన); ధరా= భూమియొక్క; ధూళి= సన్నటి దుమ్ము; అంగంబులు+ఎల్లన్= శరీరంయొక్క అన్ని అవయవాలను; కప్పఁగన్= కప్పివేయగా;

వెలు వెల్లన్+అగుచున్= వెలవెలబోతూ (కాంతివిహీనమై); బహుళ= అధికమైన; కపిధ్వజ= కపి కేతనంయొక్క; ప్రభలు= కాంతులు; లోచనములు= కండ్లు; మిఱుమిట్లు+కొనన్= చీకట్లు కమ్మేటట్లుగా; పర్వన్= వ్యాపించగా; మేడుపడుచున్= భ్రమపడుతూ (మోసపోతూ- కనపడనందున); ఉద్భట+ఆకార+సముద్ధతిన్= భయంకరమైన (శత్రువులకు); (ఉదాత్త గంభీరం అయిన) రూపం యొక్క ఆర్భాటానికి; మనములు= (సైనికుల) మనస్సులు; ఉత్తలపాటు+తోఁపంగన్= దిగులు కలుగగా; తల్లడిలుచున్= బెదురుతో వణికిపోతూ; నడచు= నడిచే (సాగిపోతున్న); కౌరవరాజు సైన్యంబున్= కురురాజైన దుర్యోధనుడియొక్క సేనను; ప్రళయ= ప్రళయకాలంలోని; భైరవ= రుద్రులయొక్క; సహస్ర= వేయిమందియొక్క; గర్జన= గర్జనంవలె; ఉదగ్ర= భయంకరమైన; తర్జనుఁడు= బెదరింపుకలవాడు; (అయిన) అర్జునుండు; తన= తనయొక్క; తేరు= రథం; తీఁగ తిగిచిన గతిన్=మెఱపుతీగ సాగినట్లుగా (మెఱుపు మెరసినట్లు); మెఱయన్= మెరుస్తూండగా; రయము మైన్+చని= మిక్కిలి వేగంగా పోయి; కదిసెన్= దగ్గరికి వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ సమయంలో అర్జునుడి దేవదత్త శంఖం యొక్క భయంకరమైన రావం ప్రళయకాలంలో వెయ్యిమంది భైరవులు ఒకేమారు ఘోరంగా గర్జించినట్లు - మార్మోగుతుండగా, ఆయన రథం మెరుపుతీగలాగా ప్రకాశిస్తూ మహావేగంతో దూసుకొని వచ్చి కౌరవసేనను సమీపించింది.

ఆ భయంకర శంఖధ్వనికి కురుసైన్యం అంతా పెడమొగం పెట్టింది. ఆ రథచక్రాల అంచులనుండి పైకెగసిన ధూళి సైనికుల దేహాలను పూర్తిగా ఆవరించింది. అందువల్ల ఆ సైన్యం వెలవెలపోతూ ఉన్నది. ఆ కపికేతనం యొక్క కాంతులు మిఱుమిట్లు గొల్పుతుండగా చూడజాలక సైనికులు చీకట్లు క్రమ్మినట్లుగా భ్రమపడి అలాగే నిలిచారు. ఉదాత్త గంభీరమై శత్రుభీకరమైన అర్జునుడి ఆకారంయొక్క ఆటోపానికి కౌరవసేనలు మనస్సుల్లో తల్లడిల్లిపోయారు.

విశేషం: శబ్దంద్వారా, అర్థంద్వారా వర్ణించవలసిన వస్తువును కన్నులకు కట్టినట్లు ఉదాత్తంగా చిత్రించటం మహాకవుల లక్షణం. 'తీఁగ తిగిచినరీతి' - ప్రయోగం ఈ పద్యానికి ఆయువు. ఇందులో అర్జునుడి కాంతిమత్త్వలక్షణం నిరూపితం.

వ. ఇవ్విధంబునఁ గురుబలంబులఁ గ్రోశద్వయంబునం గూడముట్టి క్రీడి తలయెత్తి చూచి యుత్తరున కిట్లనియె. **244**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; కురుబలంబులన్= కౌరవ సైన్యాలను; క్రోశద్వయంబునన్= రెండు క్రోసుల దూరంలోనే; కూడముట్టి= సమీపించి; క్రీడి= అర్జునుడు; తల+ఎత్తి, చూచి= తలపైకెత్తి చూచి; ఉత్తరునకున్+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా కౌరవసైన్యాన్ని రెండుకోసుల దూరంలోనే చేరి, అర్జునుడు తలపైకెత్తి చూచి, ఉత్తరుడితో ఇట్లా అన్నాడు.

చ. 'ఇది యొక పెద్ద గట్టిమొన; యీ మొనముందట గోగణంబుతో
నది యొక యల్పసైన్య; మట యాతల వేఱొక కొంతసేన య
ల్లదె; యిటు పంచిపెట్టఁ జను నంతటిలోన వృథాభిమాన దు
ర్మద బహుభాషియైన కురురా జెచటం జనుచున్నవాఁడొకో! **245**

ప్రతిపదార్థం: ఇది= ఈ కనిపించే సేన; ఒక పెద్దగట్టి మొన= ఎక్కువ సంఖ్యతో కూడిన బలమైన సైన్యం; ఈ మొనముందటన్= ఈ సైన్యానికి ముందుభాగంలో (అగ్రభాగంలో); గో= ఆవులయొక్క; గణంబుతోన్= సమూహంతో; అది+ఒక+అల్ప సైన్యము= అది ఒక చిన్నసేన; అట= అక్కడ; ఆతల= ఆపైన (అవతల); అల్లదె= ఆ కనిపించేదే; వేఱు+ఒక= వేరైన; కొంతసేన= మరికొంత సైన్యం; ఇటు= ఈ రకంగా; పంచిపెట్టన్= భాగాలుగా చేయబడి; చను= వెళ్లుతున్న; అంతటిలోనన్= ఈ సేనా విభాగాలు అన్నిటిలోనూ; వృథా+అభిమాన+దుర్మద= పనికిమాలిన అభిమానంతో (దురభిమానంతో), చెడ్డ గర్వంతో; బహుభాషి+ఐన= అధిక ప్రసంగి అయిన (అతివాగుడుకాడైన); కురురాజు= దుర్యోధనుడు; ఎచటన్= ఎక్కడ; చనుచున్నవాఁడు+ఒకో!= పోతున్నాడో కదా!

తాత్పర్యం: '(ఓ ఉత్తరకుమారా!) ఇది ఒక పెద్దబలమైన సైన్యం. దానికి ముందు ఆవులమందతో కొద్దిపాటి సేన నడుస్తున్నది. దానికి అవతల తట్టు ఇంకా కొంతసైన్యం ఉన్నది. ఈ రకంగా భాగాలుగా చేయబడి సాగుతూ ఉండే సేనలలో, మిక్కిలి దురభిమానీ, అధిక ప్రసంగీ (బహుభాషి) అయిన ఆ సుయోధనుడు ఎక్కడ ఉన్నాడో!

విశేషం: భీష్మద్రోణాదులైన పెద్దలు ఎంతో ఆలోచించి, రాజును రక్షించటానికి, సైన్యాన్ని వ్యూహంగా నిర్మించారు. వ్యూహాన్ని నిర్మించగలిగినవాడే అందులో ప్రవేశించగలుగుతాడు. ఇది యుద్ధవిద్యలో ఉండే రహస్యం. ద్రోణుడు పన్నిన ఈ వ్యూహాన్ని, అర్జునుడు రెండుక్రోసుల దూరాన్నించే చూచి గమనించి, ఉత్తరుడికి వివరించాడు. శత్రువుల సైనిక ప్రణాళికను, అర్జునుడు చూస్తూనే గ్రహించి, రాజును పట్టుకొనాలని, ఆతడిని కనిపెట్టటానికి ప్రయత్నిస్తున్నాడు. ఇది అర్జునుడి బుద్ధిసూక్ష్మతకూ, సామర్థ్యానికీ నిదర్శనం.

క. అరయుదముగాని యిమ్మో। హరమునకును డాపలించి యరదముఁ బోని
మ్ముఱవడి; నతనిక యుఱికెద। నరుదుగ నెబ్భంగి నెవ్వ రడ్డం బైనన్. 246

ప్రతిపదార్థం: అరయుదము గాని= చూద్దాం కానీ; ఈ+మోహరమునకును= వ్యూహాత్మకమైన ఈ సైన్యానికి; డాపలించి= ఎడమప్రక్కగా, అనగా వాళ్ళకు ఎడమవైపున ప్రదక్షిణంగా; ఉఱవడిన్= ఒరవడితో (శీఘ్రంగా); అరదము= రథం; పోనిమ్ము; ఏ+భంగిన్= ఏవిధంగానైనా; ఎవ్వరు+అడ్డంబు+ఐనన్= ఎవరు అడ్డుపడ్డా; అరుదుగన్= ఆశ్చర్యాన్ని కలిగించేటట్లు; అతనికిన్+అ= అతడికొరకే (రాజైన దుర్యోధనుడి కొరకే); ఉఱికెదన్= దూకుతాను.

తాత్పర్యం: రాజు ఎక్కడున్నాడో చూద్దాం. రథాన్ని, ఈ సేనకు ఎడమవైపుగా పోనీ! ఎవరు అడ్డుపడ్డా, నేను, రాజుమీదికే దూకుతాను.

విశేషం: భీష్ముడు, ద్రోణుడు రాజును రక్షించటానికి వ్యూహాన్ని పన్నగా, వారి ఉద్దేశాన్ని భగ్నం చేయటానికి అర్జునుడు రాజునే పట్టుకొనాలని అంటున్నాడు. ఇది రాజనీతి. సైన్యంతో పనిలేదు. రాజుతోనే పని. ఎంతో సైన్యాన్ని నాశనం చేసే బదులు, రాజును ఒక్కడిని బంధిస్తే, విజయం కలిగినట్లే. అందుకే అర్జునుడు రాజు ఎక్కడున్నాడో చూడాలని అన్నదీ; అందుకే రథాన్ని సేనకు ఎడంప్రక్క పొమ్మన్నదీ.

ఉ. ఆతఁడు సిక్కెనేని బలమంతయు విచ్చు; మరల్పవచ్చు గో
వ్రాతము; నట్లయైన సుకరంబుగ నంతట నెల్లఁ దీఱు; నీ
యాతత సేనయం దతని నారసి కానకయున్న వీరి ని
ట్లీతల డించి యా కదుపు నెయ్దుఁగఁ బోదము గాక వ్రేల్మిడిన్. 247

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ దుర్యోధనుడు; చిక్కెనేని= దొరికినట్లైతే; బలము+అంతయున్= సేన అంతా; విచ్చున్= చెదిరిపోతుంది; గోవ్రాతమున్= ఆవులమందనూ; మరల్పవచ్చున్= మళ్ళించవచ్చును; అట్లు+అ+ఐనన్= అట్లాగైతే; అంతటన్= అంతతో; సుకరంబుగన్= సులువుగా; ఎల్లన్+తీఱున్= అంతా తీరిపోతుంది (కార్యం అంతా తీరుతుంది); ఈ+ఆతత= ఈ విశాలమైన; సేనయందున్= సైన్యంలో; అతనిన్= ఆ రాజైన దుర్యోధనుడిని; ఆరసి= బాగా పరిశీలించి చూచి; కానక+ఉన్నన్= (ఒకవేళ) కనుక్కోలేకపోతే; వీరిన్= ఈ పెద్దసేనలోని వాళ్ళను; ఇట్లు= ఈ విధంగా (ఇట్లాగే-ఉన్నదాన్ని ఉన్నట్లుగానే); ఈతలన్= ఈచోటనే; (ఇక్కడనే); డించి= వదలివేసి; వ్రేల్మిడిన్= వేగంగా (వెంటనే); ఆ కదుపున్= ఆ మందను; ఎయ్దఁగన్= చేరేందుకు (సమీపించటానికి); పోదము+కాక!= వెళ్ళుదాం సుమా!

తాత్పర్యం: ఒకవేళ రాజైన దుర్యోధనుడు చిక్కితే సైన్యం అంతా విచ్చిపోతుంది. ఆవులను మళ్ళించవచ్చును. అట్లాగైతే, మనం చేయాల్సిన పని సులువుగా ముగిసిపోతుంది. ఇంత పెద్దసైన్యంలో రాజును కనుగొనలేకపోతే, ఈ సైన్యాన్ని ఇక్కడే వదలివేసి, మందను చేరటానికి పోదాం.

విశేషం: రాజును పట్టుకొనటం మొదటి పని. దానివలన సైన్యం భయంతో చెదిరిపోతుంది. అందువలన ఆవులమందను సులువుగా పట్టుకొనవచ్చును. ఒకవేళ ఇది జరగకపోతే (రాజు దొరక్కపోతే) రాజును వెతికే ప్రయత్నం మాని, నేరుగా మందవైపే వెళ్ళి ముట్టడించటం రెండో పని. దీనివలన ఆవులమందను పట్టుకొనవచ్చును. ఇంతకూ గోవులను మళ్ళించటం ఇక్కడ ప్రధానం. అది పై రెండువిధాలా జరుగుతుంది. అయితే, మొదటిపనివలన కార్యం కొంత సులువు అవుతుంది; రెండోపనివలన కొంత పనిభారం. ఏమైనా ఆవులను మళ్ళించాలి. ఇది అర్జునుడి సంకల్పం.

క. విచ్చి చనకుండఁ బసులం । దెచ్చుట మునుమున్న వలయు తెఱఁగా పనికిం
జొచ్చి యది చక్కఁ బెట్టఁగ, । నచ్చోటన దాయ మనకు నగపడెడు బలే! 248

ప్రతిపదార్థం: విచ్చి= చెదిరిపోయి; చనకుండన్= పరుగెత్తకుండా; పసులన్+తెచ్చుట= ఆవులను మళ్ళించటం; మునుమున్న= మొట్టమొదట; వలయు తెఱఁగు= చేయవలసిన విధం (చేయదగిన పని); ఆ పనికిన్+చొచ్చి= ఆ పనికి పూనుకొని; అది చక్కఁబెట్టఁగన్= ఆ పని చేయగా; ఆ+చోటన్+అ= ఆ చోటులోనే (అక్కడే); దాయ= శత్రువైన దుర్యోధనుడు; మనకున్+అగపడెడున్= మనకు కనబడతాడు; బలే!= ఇది చాలా బాగుంది!

తాత్పర్యం: మొట్టమొదట, ఆవులు చెదిరిపోయి పారిపోకుండా మళ్ళించాలి. ఆ పని చేస్తూ ఉంటే రాజైన సుయోధనుడు మనకు అక్కడే కనపడవచ్చును. ఈ ఆలోచన చాలా బాగుంది.'

విశేషం: రాజును వెదకుతూ ఉండిపోతే, ఆతడు దొరక్కపోగా వృథా కాలయాపన అవుతుంది. కనుక ఆవులమందనే ముట్టడిస్తే, అక్కడే రాజుంటే కనిపిస్తాడు. (అట్లాగైతే అటు రాజునూ, ఇటు మందనూ పట్టుకోవచ్చును) ఇది బలేగా ఉంటుంది అని అర్జునుడి ఆలోచన.

క. అనిన విని, యుత్తరుం డ । మ్మొన వలపటఁ బెట్టి యరదమును బోవఁగ ని
చ్చిన సరస కరిగి కవ్వడి । కనువిచ్చి బలంబునెల్లఁ గలయఁగఁ జూచెన్. 249

ప్రతిపదార్థం: అనినన్= అర్జునుడు పైవిధంగా చెప్పగా; విని= విని; ఉత్తరుండు= సారథి అయిన ఉత్తరుడు; ఆ+మొనన్= ఆ సేనను; వలపటన్+పెట్టి= కుడివైపున ఉంచి; అరదమును= రథాన్ని; పోవఁగనిచ్చినన్= పోనివ్వగా; సరసకున్+అరిగి=

సమీపానికి పోయి; కవ్వడి= అర్జునుడు; కనువిచ్చి= కండ్లు తెరిచి (బాగా); బలంబున్+ఎల్లన్= సేననంతటినీ; కలయఁ గన్+చూచెన్= కలయ చూచాడు.

తాత్పర్యం: అర్జునుడు అనిన మాటలను విని ఉత్తరుడు ఆ కౌరవసైన్యాన్ని కుడివైపు ఉంచి, అంటే దానికి ఎడమ ప్రక్కగా రథాన్ని తోలాడు. అపుడు అర్జునుడు సమీపానికి పోయి, సేనను అంతటినీ బాగా కలయ చూచాడు.

వ. ఇట్లు గనుంగొని, మధ్య దక్షిణ వామాగ్ర పశ్చిమోత్తర భాగంబుల నిట్టిట్టి వారలు నడచుచున్న వారని సారథితో నేర్పడం బలికి, 'వీరలలో నురగకేతనుండు లేఁడతఁడు గోవులం గొనిపోవ నోపు; నిరామిషంబైన యీ సేనతో నని సేయం బని లేదు; వీర లెయిది యడ్డపడి తడవు సేయకుండునట్లుగా; ముట్టికొని పసులన్ బెట్టించి, దొరయును నేల గడవం బోవక యుండఁ బొదువవలయు' నని చెప్పి యతని నద్దెసకుఁ దేరు వఱుపం బనిచి, గురుకృప గాంగేయులకుఁ జరణ సమీప స్థలంబుల నిలువ రెండును, కర్ణాభ్యర్ణ ప్రదేశంబులం జన రెండునుగా నాలుగేసి యమ్ము లేసిన, నా సవ్యసాచిం జూచి యాచార్యుండు పరిసరవర్తులగు నాప్తజనంబులతో నల్లన 'యర్జునుం డింత యొప్పియుండునే!' యని యగ్గించి వెండియు. 250

ప్రతిపదార్థం: ఇట్లు+కనుంగొని= ఈవిధంగా సైన్యాన్ని బాగా పరిశీలించి చూచి; మధ్య= నడిమిభాగంలో; దక్షిణ= దక్షిణంవైపున; వామ= ఎడంపక్క; అగ్ర= ముందువైపు; పశ్చిమ= పడమటిదిక్కున; ఉత్తర భాగంబులన్= ఉత్తరంవైపులలో; ఇట్టి+ఇట్టివారలు= ఇట్లాంటిట్లాంటివారు; నడుచుచు+ఉన్నవారు+అని= నడుస్తున్నారని; సారథితోన్= సారథి అయిన ఉత్తరుడితో; ఏర్పడన్+పలికి= స్పష్టంగా తెలిపి; వీరలలో= ఈ వీరులలో; ఉరగ కేతనుండు= పాముగుర్తు జెండాగా కలవాడు (దుర్యోధనుడు); లేఁడు; అతఁడు; గోవులన్= ఆవులను; కొనిపోవన్+ఓపు= తీసికొని (తోలుకొని) పోతూ ఉండవచ్చును; నిరామిషంబు+ఐన= లాభములేని; ఈ+సేనతోన్; అని= యుద్ధం; చేయన్+పని, లేదు= చేయవలసిన అవసరంలేదు; వీరలు+ఎయిది= వీళ్ళు సమీపించి; అడ్డపడి= అడ్డువచ్చి; తడవు+చేయక+ఉండునట్లుగాన్= ఆలస్యం కలిగేటట్లు చేయకుండా ఉండేటట్లుగా; ముట్టికొని= చుట్టుముట్టి; పసులన్+పెట్టించి= ఆవులను వెనుకకు మళ్ళించి; దొరయును= రాజైన దుర్యోధనుడు కూడా; నేల+కడవన్+పోవక, ఉండన్= ఈ రాజ్యపు పొలిమేర దాటిపోకుండా; పొదువ వలయున్= చుట్టుముట్టాలి; అని, చెప్పి; అతనిన్= ఉత్తరుడిని; ఆ+దెసకున్= ఆ దిక్కుకు; తేరు, పఱుపన్+పనిచి= రథం పోనిమ్మని చెప్పి; గురు, కృప, గాంగేయులకున్= ద్రోణుడికీ, కృపాచార్యుడికీ, భీష్ముడికీ; చరణ, సమీప, స్థలంబులన్= పాదాల దగ్గరి తావులలో; నిలువన్= నిలబడేటట్లు (నాటుకొని నిలబడేటట్లు); రెండును= రెండు (బాణాలను); కర్ణ+అభ్యర్ణ ప్రదేశంబులన్= చెవులకు దగ్గరగా (సోకీసోకనట్లుగా); చనన్= పోయేటట్లుగా; రెండునుగాన్= రెండు (బాణాలు)గా; నాలుగు+ఏసి, అమ్ములు+ఏసినన్= నాలుగేసి బాణాలు వేయగా; ఆచార్యుండు= ద్రోణుడు; ఆ+సవ్యసాచిన్= ఆ అర్జునుడిని; చూచి= గమనించి; పరిసరవర్తులు+అగు= చుట్టువారైన; ఆప్తజనంబులతోన్= దగ్గరివారితో; అల్లనన్= మెల్లగా; అర్జునుఁడు+ఇంత+ఒప్పి+ఉండునే?= అర్జునుడు ఎంత ఉచితంగా వ్యవహరించాడు? లేదా - అర్జునుడు ఇంత ఉచితజ్ఞుడై ఉంటాడా? (ఎంత ఉచితజ్ఞుడో అని భావం); అని, అగ్గించి= అని పొగడి; వెండియున్= మరల.

తాత్పర్యం: సైన్యాన్ని అంతా అర్జునుడు కలయజూచి, నడుమా, దక్షిణానా, ఎడంవైపూ, ముందూ, పడమటా, ఉత్తరానా, ఫలానావాళ్ళు పోతున్నారని ఉత్తరుడికి వివరించి, 'వీరందరిలో దుర్యోధనుడు కనిపించటంలేదు, ఒకవేళ, ఆతడు ఆవులను తోలుకుపోతూ ఉండి ఉంటాడు. రాజు లేని ఈ సేనతో మనకు యుద్ధం అనవసరం. ఈ

సైనికులంతా మనకు అడ్డుపడి ఆలస్యం కలిగించకుండా శీఘ్రంగా మందలను మళ్ళించి, రాజు ఈ నేల సరిహద్దు దాటకుండా ఆతడిని మనం పట్టుకొనాలి' అని అంటూ, ఉత్తరుడికి ఆ దిశగా రథాన్ని నడపుమని చెప్పి, గురువైన ద్రోణుడికీ, కృపుడికీ, భీష్ముడికీ పాదాల ముందరి ప్రదేశంలో నాటుకొనేటట్టుగా రెండేసి అమ్ములూ, చెవులను సోకీసోకనట్లుగా రెండేసి బాణాలూ వేశాడు. అప్పుడు ఆ అర్జునుడిని చూచి, ద్రోణాచార్యుడు, తన ప్రక్కన ఉన్న సన్నిహితులతో 'అర్జునుడు ఎంత ఉచితంగా నడుచుకొన్నాడు!' అని పొగడి, మరీ ఇట్లా ప్రశంసించాడు.

ద్రోణాచార్యుఁ డర్జునుం జూచి ప్రశంసించుట (సం. 4-48-3)

మ. 'విలసద్గాండివ చాలనోద్ధతి కనద్విద్యుల్లతాలీలగా
నలఘుస్ఫార కపిధ్వజ ధ్వని సముద్యద్గర్జ చందంబుగా;
జలదాకారతనొందెఁ దే రితఁడు పర్జన్యాకృతిం బొల్చె; దో
ర్బలతీవ్రారి నిదాఘ దుర్విషహ గర్వస్ఫూర్తి నిర్మూర్తిగాన్. 251

ప్రతిపదార్థం: విలసత్= ప్రకాశిస్తున్న (అతిశయిస్తున్న); గాండివ= గాండీవంయొక్క; చాలన= కదలికలో (త్రిప్పటంలో); ఉద్ధతి= తీవ్రత; కనత్= ప్రకాశించే; విద్యుత్+లతాలీలగాన్= మెఱుపుతీగవలె కాగా; అలఘు= ఎక్కువైన; స్ఫార= కాంతిమంతమైన; కపిధ్వజ= కపికేతనంయొక్క; ధ్వని= నాదం (పటపటధ్వని); సముద్యత్+గర్జ చందంబుగాన్= వెలువడే ఉరుములా కాగా; తేరు= రథం; జలద+ఆకారతన్+ఒందెన్= మేఘంయొక్క రూపాన్ని పొందింది; ఇతఁడు= ఈ అర్జునుడు; దోర్బల= బాహువులబలంతో; తీవ్ర= భయంకరం అయిన (దట్టమైన); అరి= శత్రువులనే; నిదాఘ= ఎండాకాలంయొక్క; దుర్విషహ= సహించటానికి వీలుకానట్టి; గర్వస్ఫూర్తి= గర్వంయొక్క స్ఫురణ (విలాసం); నిర్మూర్తి+కాన్= రూపంలేనట్లు (నశించేటట్లుగా); పర్జన్య+ఆకృతిన్= వర్షాధిదేవతగు దేవేంద్రుడి వలె; పొల్చెన్= వెలిగాడు.

తాత్పర్యం: 'అర్జునుడి గాండీవంయొక్క కదలిక మెఱుపుతీగెవలె, కపికేతనంయొక్క ధ్వని మేఘంయొక్క ఉరుమువలె ఉండగా, అర్జునుడి రథం మేఘంవలె ఉంది. అర్జునుడు ఇంద్రుడివలె ఉన్నాడు. కనుక, శత్రువు లనే వేసవి గర్వం పూర్తిగా నశించింది. శత్రువుల బాహుబలం వేసవివలె ఉందనీ, అర్జునుడు వర్షాధిపతి అయిన దేవేంద్రుడివలె ఉన్నాడనీ భావం.

విశేషం: అలం: ఉపమ. శత్రువు ఎంత తీవ్రమైన వేసవివలె ఉన్నా, అర్జునుడి పరాక్రమం అనే వానవలన అది చల్లబడుతుందని విశేషభావం. వర్షాధిపతి ఇంద్రుడు. ఆతడి కుమారుడు అర్జునుడు. కనుక అర్జునుడు వర్షరూపాన్ని ధరించాడు. ఆతడి రథమే మేఘాకారంలో ఉంది.

వ. ఇప్పుడు నాకుఁ బ్రణామంబులుగాఁ బాదంబుల మొదలంబడ రెండమ్ములేసి, పెద్దకాలంబేనిఁ బాసియున్నవాఁడు గావునఁ గుశల ప్రశ్నంబుగాఁ జెవులు సోఁకియు సోఁకములుగా రెండమ్ములేసె' నని పలికి వెండియు నిట్లనియె. 252

ప్రతిపదార్థం: ఇప్పుడు= ఈ సమయంలో; నాకున్+ప్రణామంబులు+కాన్= నాకు నమస్కారములు చేస్తున్నట్లుగా; రెండు+అమ్ములు= రెండు బాణాలు; పాదంబుల, మొదలన్+పడన్= పాదాలముందర పడేటట్లు; ఏసి= ప్రయోగించి; పెద్దకాలంబు+ఏనిన్=

ఎంతోకాలంగా; పాసి+ఉన్నవాఁడు, కావునన్= నన్ను వదలి దూరంగా ఉన్నాడు కాబట్టి; కుశల ప్రశ్నంబుగాన్= క్షేమంగా ఉన్నారా? అని అడుగుతున్నట్లుగా; రెండు+అమ్ములు= రెండు బాణాలు; చెవులు, సోఁకియున్, సోఁకములు+కాన్= చెవులకు తాకీ తాకనట్లు; ఏసెన్= ప్రయోగించాడు; అని, పలికి= అని మాట్లాడి; వెండియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు నాకు నమస్కరించినట్లుగా ఇప్పుడు రెండు బాణాలను నా పాదాల ముందరవేసి, ఎంతోకాలం విడిచి దూరంగా ఉన్నాడు కనుక, కుశలాదికాన్ని అడిగినట్లుగా, చెవులకు తాకీ తాకనట్లు రెండు బాణాలు వేశాడు' అని ద్రోణుడు ఇంకా ఈ విధంగా అన్నాడు.

క. **'ఇడుమలఁ బదుమూఁడేండ్లుం । బడి, కడుఁ గోపించి వచ్చె బలువిడి నీ క**
వ్వడి దఱియ నుఱికి వడి ని । ప్పుడ యిమ్ముఖ ప్రోవు నెల్లఁ బొరిగొనెడు బలే! **253**

ప్రతిపదార్థం: పదుమూఁడు+ఏండ్లున్= పదమూడు సంవత్సరాలూ; ఇడుమలన్+పడి= కష్టాలను అనుభవించి; కడున్= మిక్కిలి; కోపించి= (కోపంపొంది) కోపంతో; ఈ కవ్వడి= ఈ అర్జునుడు; బలువిడిన్+వచ్చెన్= ఆవేశంతో వచ్చాడు; తఱియన్+ఉఱికి= దగ్గరికి పోయి; వడిన్= శీఘ్రంగా; ఇప్పుడు+అ= ఇప్పుడే; ఈ+ముఖప్రోవున్+ఎల్లన్= ఈ స్వల్పమైన ఈ సేననంతా, ఈ పెంటకుప్పనంతా; పొరిగొనెడున్= నాశనం చేస్తాడు; బలే! (ప్రశంసార్థకం).

తాత్పర్యం: 'అడవులలో పదమూడు సంవత్సరాలు కష్టాలు అనుభవించి, కోపంతో అర్జునుడు ఎంతో ఆవేశంతో వచ్చాడు. ఇప్పుడే సమీపించి ఈ అల్పసేనలమీదికి దూకి వాటిని నాశనం చేసేటట్లున్నాడు.

తే. **విపినవాసంబు, నజ్ఞాత విధము వర్త । నంబు, గడపి నవాభ్యుదయంబు నొంది**
రాత్రిఁ బుచ్చి తోఁతెంచు మార్తాండు మాడ్కిఁ । జూడ నుజ్జ్వలుండగుచు నర్జునుఁడు పొలిచె.' **254**

ప్రతిపదార్థం: విపినవాసంబున్= అరణ్యవాసమూ; అజ్ఞాత= అజ్ఞాతవాసంయొక్క; విధము= విధానానికి తగిన; వర్తనంబు= ప్రవర్తన; కడపి= పూర్తిచేసి; నవ= క్రొత్తదైన; అభ్యుదయంబున్+ఒంది= ఉదయాన్ని (అభివృద్ధిని) పొంది; రాత్రిన్+పుచ్చి= రాత్రికాలాన్ని గడిపి; తోఁతెంచు= ఉదయించేటటువంటి; మార్తాండు మాడ్కిన్= సూర్యుడి వలె; చూడన్= చూడటానికి; ఉజ్జ్వలుండు+అగుచున్= ప్రకాశంతో నిండినవాడై; అర్జునుఁడు; పొలిచెన్= వెలుగుతున్నాడు.

తాత్పర్యం: అరణ్య, అజ్ఞాతవాసాలను రెంటినీ ముగించి, ఎంతో అభివృద్ధి చెంది, అర్జునుడు, రాత్రిని గడిపి నూతనంగా ఉదయించే సూర్యుడివలె తేజోమూర్తిగా కనిపిస్తున్నాడు.'

విశేషం: అలం: ఉపమ. అర్జునుడు, అరణ్య, అజ్ఞాతవాసాల వలన కష్టాలుపడి, తరువాత అభ్యుదయాన్ని పొంది, ఉదయించే సూర్యుడివలె ఉన్నాడని ద్రోణుడి ప్రశంస. ఎంతోకాలం ఒక వ్యక్తి ఎన్నో కష్టాలుపడి, గట్టిపడి, కష్టాల తరువాత క్రొత్త ఉత్సాహంతో, సరిక్రొత్త శక్తితో ఉంటాడనే విషయాన్ని, తిక్కన ఈ పద్యంలో సూచించాడు. కష్టాల తర్వాత వ్యక్తికి క్రొత్త తేజస్సు వస్తుందనీ, ఆతడు ఉదయ సూర్యుడివలె ఉంటాడనీ కవి భావన. ఇది జీవితంలో సహజం. దీనిని కవి అర్జునుడి ద్వారా తెలిపాడు.

వ. అనియెఁ; గృపాచార్య భీష్ములు పార్థుబాణపాత ప్రకారంబులు ప్రణామ కుశల ప్రశ్నంబులుగ నంతరంగంబులం గనికొని సంతసిల్లిరి; ధనంజయుండును దక్కినవారికి దుర్నిరీక్షుండగుచు నమ్మోహరంబు దెస ననాదరంబు సేసి గోవుల పజ్జం బోవుచుండె; నతనిం జూచి సురనదీసూనుండు కురువీరులతో నిట్లనియె. 255

ప్రతిపదార్థం: అనియెన్= అని ద్రోణు డన్నాడు; కృపాచార్య, భీష్ములు= కృపాచార్యుడూ, భీష్ముడూ; పార్థు, బాణపాత, ప్రకారంబులు= అర్జునుడియొక్క బాణాలు పడిన పద్ధతులు; ప్రణామ, కుశల, ప్రశ్నంబులుగన్= నమస్కారం చేయటంగా, క్షేమ సమాచారాలు అడుగటంగా; అంతరంగంబులన్= హృదయాలలో; కనికొని= గమనించి; సంతసిల్లిరి= ఆనందించారు; ధనంజయుండును= అర్జునుడుకూడా; తక్కినవారికిన్= మిగిలినవారికి; దుర్నిరీక్షుండు+అగుచున్= తేరిపార చూచేందుకు వీలుకానివాడు ఔతూ; ఆ+మోహరంబు, దెసన్= ఆ సైన్యంవైపు; అనాదరంబు+చేసి= నిరాదరణచూపించి; గోవుల పజ్జన్= ఆవులవైపు; పోవుచున్+ఉండెన్= పోతూ ఉన్నాడు; అతనిన్+చూచి= అర్జునుడిని చూచి; సురనదీసూనుండు= గంగానదీ పుత్రుడు, భీష్ముడు; కురువీరులతోన్= కౌరవసేనలోని వీరులతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని ద్రోణుడు అన్నాడు. కృపాచార్యుడూ, భీష్ముడూ అర్జునుడు ప్రయోగించిన బాణాలతీరులలో ఉన్న నమస్కార, కుశలప్రశ్నలు అనేవాటిని మనస్సులలోనే గమనించి సంతోషించారు. మిగిలినవాళ్ళకు అర్జునుడు తేరిపార చూడరానివాడై, ఆ సైన్యాన్ని అనాదరం చేసి (రాజు లేడు కనుక), ఆవులను సమీపించటానికి పోతున్నాడు. ఆ అర్జునుడిని చూచి, పితామహుడైన భీష్ముడు ఈ రకంగా అన్నాడు.

క. 'చిరకాలమునకుఁ గంటిమి । నరు; నక్కట! వీఁడు సజ్జనప్రియుఁడు సుహృ
త్పరతంత్రుఁడు బాంధవహితుఁ । డరిభీకరుఁ డిట్టి వార లవనిం గలరే! 256

ప్రతిపదార్థం: చిరకాలమునకున్= ఎంతో కాలానికి; నరున్= అర్జునుడిని; కంటిమి= చూచాము; అక్కట!= ఆహా! (ఆశ్చర్యార్థకం); వీఁడు= ఈ అర్జునుడు (మనుమడు కనుక ప్రేమపూర్వక పదం - వీడు); సజ్జనప్రియుఁడు= సుజనులకు ఇష్టమైనవాడు; సుహృద్+పరతంత్రుఁడు= స్నేహితులకు స్వాధీనం అయినవాడు (స్నేహ ప్రధానుడు); బాంధవ= చుట్టాలకు; హితుఁడు= మేలు కూర్చేవాడు; అరి= శత్రువులకు; భీకరుఁడు= భయంకరుడు; ఇట్టివారలు= ఇట్లాంటి (అరుదైన) వాళ్ళు; అవనిన్= భూమిలో (లోకంలో); కలరే!= ఉన్నారా!

తాత్పర్యం: 'ఎంతో కాలానికి అర్జునుడిని చూచాం. వీడు సజ్జనులకు ప్రియుడు, మిత్రులకు స్నేహశీలి, బంధువులకు హితుడు, శత్రువులకు భీకరుడు. ఇట్లాంటివాళ్ళు భూమిపై ఉన్నారా! (లేరని భావం).

విశేషం: ఇందులో భీష్ముడు అర్జునుడి గుణగుణాలను కొనియాడుతూ, ఆతడి వ్యక్తిత్వానికి మురిసిపోయి, 'ఇట్లాంటివాళ్ళు భూమిలో ఉంటారా!' అని ఆశ్చర్యపడుతూ, గర్విస్తున్నాడు. అర్జునుడిపై పితామహుడికి ఉన్న వాత్సల్యం ఎట్లాంటిదో వ్యక్తమవుతుంది.

క. మనచూడ్కికి వ్రేఁగయి యీ । తని యతులిత మూర్తి యత్యుదాత్తతఁ గడు నొ
ప్పిన యది గంటిరె! జగమె । ల్లను నేలఁగఁ దగు సముజ్జ్వలత యూహింపన్. 257

ప్రతిపదార్థం: మన= మనయొక్క; చూడ్కికిన్= చూపునకు; వ్రేఁగు+అయి= బరువై (దుర్భరమై); ఈతని= ఈ అర్జునుడి యొక్క; అతులిత= సాటిలేని; మూర్తి= ఆకారం; అతి+ఉదాత్తతన్= మిక్కిలి ఉదాత్తతతో (గొప్పతనంతో); కడున్= ఎక్కువగా; ఒప్పిన+అది= విలసిల్లుతూ ఉన్నది; ఊహింపన్= ఆలోచిస్తే; జగము+ఎల్లను= లోకాన్ని అంతటినీ; ఏలఁగన్+తగున్= పాలించతగిన; సముజ్జ్వలత= తేజస్సు (సామర్థ్యం); కంటిరె!= చూచారా!

తాత్పర్యం: అర్జునుడి కాంతిమంతమైన రూపం, మన చూపులకు బరువై, చూడరానిదై ఎంత ఉదాత్తంగా ఉన్నదో చూచారా! ఆ తేజస్సు లోకాలనే ఏలదగింది.

విశేషం: ఈ పద్యంలో భీష్ముడు, కురుకులాలంకారుడైన అర్జునుడి తేజస్సును ప్రశంసిస్తున్నాడు. అంటే రూపాన్నీ, సామర్థ్యాన్నీ అగ్గిస్తున్నాడు. ముందు పద్యంలో గుణాలను నుతించాడు. భీష్ముడంతటి వాడినే అర్జునుడి తేజశ్శాలిత అచ్చెరువుపరిచింది!

క. వెనుక దెస వచ్చి కదిసియుఁ । దనరథముఁ దొలంగ నిచ్చి, తఱియఁబడుట కొ
ల్లని తలఁపు కలిగి, క్రేఁగం । టన మనలం జూచుచుం గడచి యట నడచెన్. 258

ప్రతిపదార్థం: వెనుక దెసన్ వచ్చి= వెనక పక్కగా వచ్చి; కదిసియున్= సమీపించికూడా; తన రథమున్= తన రథాన్ని; తొలంగనిచ్చి= తొలగిపోనిచ్చి (తప్పించి); తఱియన్+పడుటకున్= ఎదుర్కొనటానికి (సమీపించేందుకు); ఒల్లని= ఇష్టంలేని; తలఁపు= ఆలోచన (భావం); కలిగి; క్రేఁగంటన్+అ= కడ కంటితోనే; మనలన్= మనలను; చూచుచున్= చూస్తూ; కడచి= దాటి; అట నడచెన్= ముందుకు పోతున్నాడు.

తాత్పర్యం: వెనక నుండి వచ్చినా, తన రథాన్ని తప్పించి తొలగ తోలించి, మనలను ఎదిరించటానికి మనసులేక కేవలం ఓరచూపులతోనే మనవైపు చూస్తూ, దాటిపోతూ ఉన్నాడు.

విశేషం: ఇందులో భీష్ముడు అర్జునుడి రాజనీతి, యుద్ధనీతులనూ, పెద్దల యెడ ఆతడికి గల గౌరవభావాన్నీ ప్రశంసిస్తున్నాడు. ఇందులో అర్జునుడి ఉదాత్తభావం కూడా వ్యక్తం అవుతుంది. ఇట్లాంటి సూక్ష్మమైన మనోధర్మాలను తిక్కన చాల గొప్పగా చిత్రిస్తాడు.

క. మొనఁ గలయఁ జూచి యూరక । చను టధిపతి నరసి తా నిచటఁ గానక యా
తని పజ్జ నరుగు తెఱఁగగు; । ననుమానము లేదు, క్రోధ మగ్గలము మదిన్. 259

ప్రతిపదార్థం: మొనన్= సైన్యాన్ని; కలయన్+చూచి= అంతా పరికించి; ఊరక చనుట= (యుద్ధం చేయకుండా) ఊరకనే వెళ్ళిపోవటం; అధిపతిన్+అరసి= రాజైన దుర్యోధనుడిని వెదకి; తాన్= అర్జునుడు; ఇచటన్= ఇక్కడ; కానక= చూడక; ఆతని పజ్జన్= ఆ దుర్యోధనుడి వైపుగా; అరుగు తెఱఁగు+అగున్= పోయే తీరు అయి ఉంటుంది; అనుమానము లేదు= సందేహం లేదు; మదిన్= అర్జునుడి మనస్సులో; (దుర్యోధనుడిపై), క్రోధము= కోపం (ద్వేషం); అగ్గలము= అధికం.

తాత్పర్యం: (అర్జునుడు) సైన్యాన్ని అంతా పరిశీలించి కలయ చూచి, యుద్ధం చేయకుండా ఊరకనే పోవటం చూస్తే, రాజును వెదికి ఆతడు కనిపించకపోగా, ఆతడికొరకు ఆ వైపుగా పోవటమే అయి ఉంటుంది. అనుమానం లేదు. వీడికి (అర్జునుడికి) దుర్యోధనుడంటే చాలా కోపం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: రాజును పట్టుకొనాలన్న అర్జునుడి మనస్సులో ఉన్న రహస్యాన్ని, ఆతడి పితామహుడైన భీష్ముడు ఊహించి, నిర్ణయించాడు. పైగా, దుర్యోధనుడిపై అర్జునుడికి కోపం ఎక్కువ అని అర్జునుడి మనస్సును పితామహుడు తెల్పటం విశేషం.

చ. మనకును గౌరవేంద్రునకు మధ్యముఁ జొచ్చిన యేని నాతఁ డ
ర్జునునకు నొంటి సాలఁ; డని రుద్రుఁడు నెక్కటి మార్కొనంగ లేఁ
డనిన నొరుండు శక్తుఁడె? రయంబు మెయిన్ మన మెల్ల నిప్పుడా
తనికడ సేరఁగాఁ జనుట దప్పినఁ గార్యము దప్పు నెంతయున్. 260

ప్రతిపదార్థం: (భీష్ముడు అంటున్నాడు); మనకును= మనకూ; కౌరవ+ఇంద్రునకున్= దుర్యోధనుడికీ; మధ్యమున్+చొచ్చిన+ఏనిన్= నడుమ ప్రవేశిస్తే; ఆతఁడు= ఆ దుర్యోధనుడు; అర్జుననకున్= అర్జునుడికి; ఒంటిన్= ఒంటరిగా; చాలఁడు= సరిపోడు (సమర్థుడు కాడు); అనిన్= యుద్ధంలో; రుద్రుఁడున్= శివుడు కూడా; ఎక్కటిన్= ఒంటిగా; మార్కొనంగన్+లేఁడు= ఎదిరించలేడు; అనినన్= అంటే; ఒరుండు= ఇతరుడు (శివుడికంటే వేరైనవాడు- సామాన్యుడు); శక్తుఁడె?= శక్తి గలవాడా? (సమర్థుడా); రయంబు మెయిన్= శీఘ్రంగా; మనము+ఎల్లన్= మనం అందరం (సైన్యంతో కూడా); ఇప్పుడు= ఈ సమయంలో; ఆతనికడన్= ఆ దుర్యోధనుడి దగ్గరికి; చేరఁగాన్+చనుట= చేరబోవటం; తప్పినన్= తప్పిపోతే; ఎంతయున్= ఎంతైనా; కార్యము= పని (రాజరక్షణ, +గో గ్రహణం); తప్పున్= తప్పిపోతుంది (చెడిపోతుంది).

తాత్పర్యం: మనకూ, రాజైన దుర్యోధనుడికీ నడుమ అర్జునుడు ప్రవేశిస్తే, ప్రమాదం. దుర్యోధనుడు ఒక్కడూ అర్జునుడిని ఎదిరించేందుకు చాలడు. ఆ రుద్రుడు కూడా యుద్ధంలో ఒంటిగా ఎదిరించలేడంటే వేరేవాళ్ళు ఎదిరించగలరా? వెంటనే మనం అంతా ఇప్పుడే దుర్యోధనుడి దగ్గరికి వెళ్ళకపోతే మొత్తం పనే భంగం అయిపోతుంది. పని చెడిపోతుంది.

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. 'జొచ్చెనయేని' - అనే పాఠాంతరం కొన్ని ప్రతులలో ఉన్నది.

ఆ. వాసవాత్మజుండు వసుధేశనందను । ముట్టికొనిన నొకటి పుట్టెనేని
మన ప్రయోజనంబు మఱి యేమి? పసులవి । యేటి? కొండు ధనము లెల్ల నేల?' 261

ప్రతిపదార్థం: వాసవ+ఆత్మజుండు= దేవేంద్రుడి కుమారుడైన అర్జునుడు; వసుధ+ఈశ= రాజైన ధృతరాష్ట్రుడియొక్క; నందనున్= కుమారుడైన దుర్యోధనుడిని; ముట్టికొనినన్= ముట్టడిస్తే (పట్టుకొంటే); ఒకటి పుట్టెనేని= ఏమైనా వస్తే (జరగరానిది ఏదైనా జరిగితే); మన= మనయొక్క; ప్రయోజనంబు= ఉపయోగం; మఱి+ఏమి?= ఏముంది? (ఇంతమందిమి మనం ఉండి లాభమేమి? వ్యర్థం అనుట); (ఏదైనా జరగరానిది జరిగిన తరువాత); పసులు అవి+ఏటికిన్?= ఆవు లెందుకు?; ఒండు= ఇతరమైన; ధనములు= సంపదలు; ఎల్లన్= సమస్తం; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: వాసవనందనుడైన అర్జునుడు దుర్యోధనుడిని పట్టుకొంటే, ఏదైనా జరిగితే, ఇంతమందిమి మనం అంతా ఉండీ ఏమి లాభం? ఆ పరిస్థితిలో ఆవు లెందుకు? తక్కిన సంపదలు అన్నీ ఎందుకు?' (వ్యర్థం అని సారాంశం.)

విశేషం: అర్జునుడి చూపంతా రాజుపైనే ఉన్నదనీ, కనుక మనం అందరం ఎట్లాగైనా రాజును కాపాడుకొనాలనీ, అట్లా జరగక, ఒకవేళ జరగరానిదే జరిగితే మనం ఉండి నిరుపయోగమే అనీ, ఆ తరువాత, ఆవు లెందుకు? ఇతర సంపద లెందుకు?- అని భీష్మ పితామహుడి ప్రబోధం. అందుకే ఆయన అందరినీ రాజుకు దగ్గరగా వెళ్ళాలని అంటున్నాడు. అనుభవశాలి కనుక రాగల హానిని పసిగట్టి భీష్ముడు హెచ్చరించాడు. ఇది చాలా ఉచితంగా ఉన్నది.

వ. అని పలికి, బలంబుఁ బురికొల్పికొని యతండు రాజరక్షణ తత్పరత్వంబున నరదంబు సత్వరంబు సేసిన, సేనాపతిం గని సైనికనికాయంబులుం గడంగి చనందొడంగె; నిప్పాట నమ్మేటిమొనయును వెసం బోవ గోవుల కావలి మూఁకయు వానిం దటిమికొని యతిరయంబున నరుగం దానును గెలనఁ గ్రోశద్వయ మాత్రంబు నడచి పురుహూతపుత్త్రుం డుత్తరున కిట్లనియె. 262

ప్రతిపదార్థం: అని పలికి; బలంబున్= సేనను; పురికొల్పికొని= ప్రోత్సాహపరిచి; అతండు= భీష్ముడు; రాజ= రాజుయొక్క; రక్షణ తత్పరత్వంబునన్= కాపాడాలనే ఆసక్తితో; అరదంబు= రథాన్ని; సత్వరంబు= వేగవంతం; చేసినన్= చేయగా; సేనాపతిన్+కని= సేనాధికారి అయిన భీష్ముడిని చూచి; సైనిక= సేనలయొక్క; నికాయంబులు= సమూహాలు; కడఁగి= పూని; చనన్+తొడంగెన్= పో సాగాయి; ఈ+పాటన్= ఈ విధంగా; ఆ+మేటి= ఆ పెద్దదైన; మొనయును= సైన్యంకూడా; వెసన్= వేగంగా; పోవన్= సాగుతూ ఉంటే; కావలి మూఁకయున్= రక్షక సైన్యంకూడా; వానిన్= ఆవులను; తటిమికొని= తరుముకొంటూ; అతిరయంబునన్= మిక్కిలివేగంగా; అరుగన్= వెళ్ళగా; పురుహూత= ఇంద్రుడియొక్క; పుత్త్రుండు= కుమారుడైన అర్జునుడు; తానును= తాను కూడా; కెలనన్= దాని ప్రక్కనే; క్రోశద్వయ మాత్రంబు= రెండుకోసుల దూరం; నడచి= వెళ్ళి; ఉత్తరునకున్= ఉత్తరకుమారుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: పై విధంగా పలికి భీష్ముడు, సైన్యాన్ని ప్రోత్సాహించి, రాజును కాపాడాలనే ఆసక్తితో రథాన్ని సమాయత్తం చేసి తొందరిస్తే, సేనాపతిని చూచి సైన్యం అంతా శీఘ్రంగా సాగుతూ ఉన్నది. ఆవిధంగా ఆ పెద్దసైన్యం పోతూవుండగా అపుడు ఆవులరక్షణకున్న సైన్యంకూడా ఆవులను తరుముకొని పోవసాగింది. అపుడు అర్జునుడు వాటి ప్రక్కనే రెండు కోసుల దూరం వెళ్ళి, ఉత్తరుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: తమ వ్యూహరహస్యాన్ని ప్రతివీరుడైన అర్జునుడు గ్రహించి, రాజును పట్టుకొనాలని ప్రయత్నిస్తున్నాడని భీష్ముడు గ్రహించి, ఆత్రంతో సైన్యాన్ని అంతా రాజరక్షణకే మళ్ళించాడు. ఇందులో పలువురి ఆలోచనాశక్తిని ఒక్కడే గమనించి, దానికి ప్రతిక్రియ చేసేందుకు పూనుకొనటం కనిపిస్తుంది. కనుక దీనివలన అర్జునుడి బుద్ధికుశలత ఎట్లాంటిదో తెలుస్తుంది.

మ. 'ఇదె గోవర్గము సేర వచ్చితిమి, పోనింకేల? సైన్యంబులుం
గదియన్ వే చనుదెంచె; రెంటినడుమంగాఁ జొచ్చి యీ వచ్చు ను
న్మద వీరావలికిన్ భుజావిభవ విన్యాసంబు గాన్పించి మా
న్పెద గర్వంబు, మరల్చెదం బసుల; నాచేఁ జిక్కు రా జెమ్మెయిన్.' 263

ప్రతిపదార్థం: ఇదె= ఇదుగో; గోవర్గము= ఆవులమందను; చేరన్+వచ్చితిమి= సమీపించటానికి వచ్చాం; పోన్+ఇంకన్+ఏల?= ఇంకా ముందుకు పోవటం ఎందుకు? (అనవసరం అని భావం); సైన్యంబులున్= సేనలుకూడా; కదియన్ వే, చనుదెంచెన్=

వేగంగా దగ్గరికి వచ్చాయి (మనతో పోరాడటానికి); రెంటి= రెండింటియొక్క; నడుమంగాన్= మధ్యలో; చొచ్చి= ప్రవేశించి; ఈ వచ్చు= ఈ వస్తూ ఉన్న; ఉన్మద= మదించిన; వీర+ఆవలికిన్= వీరసమూహానికి; భుజావిభవ= భుజ పరాక్రమంయొక్క; విన్యాసంబు= విలాసం (యుద్ధ విన్యాసం); కాన్పించి= ప్రదర్శించి; గర్వంబు= పొగరును; మాన్చెదన్= మాపుతాను; పసులన్= ఆవులను; మరల్చెదన్= మళ్ళిస్తాను; ఏ+మెయిన్= ఏ రకంగానైనా; రాజు= రాజైన దుర్యోధనుడు; నాచేన్= నా చేతికి; చిక్కున్= చిక్కుతాడు.

తాత్పర్యం: '(ఉత్తరకుమారా!) ఇదుగో మంద దగ్గరికి వచ్చేశాం. మనం ఇంకా ముందుకు పోవలసిన పని లేదు. సైన్యాలు మనలను ఎదిరించటానికి దగ్గరగా వచ్చేస్తున్నాయి. రెంటికీ నడుమ దూరి, గర్వంతో నిండిన ఈ వీరులకు నా పరాక్రమాన్ని చూపించి, వాళ్ళ గర్వాన్ని అణిచివేస్తాను, మందను మళ్ళిస్తాను. ఎట్లాగైనా రాజైన దుర్యోధనుడు నాచేతికి చిక్కుతాడు.

యుద్ధారంభము (సం. 4-48-12)

క. అనుటయు, విరాటతనయుఁడు । మొన కడ్డము గాఁగఁ దూర్పుమొగమై రథముం
గొని కట్టెదిరికిఁ బోయినఁ । దన మూఁపులు రెండు నపుడు దలకుం గడవన్. 264

ప్రతిపదార్థం: అనుటయున్= అర్జునుడు అట్లా అనగానే; విరాటతనయుఁడు= ఉత్తరుడు; మొనకున్+అడ్డముగాఁగన్= సైన్యానికి అడ్డంగా; తూర్పుమొగము+ఐ= తూరుపుదిశగా మొగంచూపి; రథమున్+కొని= రథాన్ని నడుపుకొని; కడు+ఎదిరికిన్+పోయినన్= సేనలకు ఎదురుగా వెళ్ళగా; (విజయుడు); తన మూఁపులు= తనయొక్క బుజాల మొదళ్ళు (గూడలు); రెండును= రెండూ; అపుడు= ఆ సమయంలో; తలకున్+కడవన్= తలను దాటిపోగా. (ముందుకు అన్వయం).

తాత్పర్యం: అర్జునుడు అట్లా అనగానే, ఉత్తరుడు సేనకు అడ్డంగా, తూర్పుదిశగా రథాన్ని పోనిచ్చాడు. రథం, సేన ఎట్ట ఎదుటికి వచ్చి నిలిచింది. అప్పుడు అర్జునుడికి రణోత్సాహంతో ఒళ్ళు ఉప్పొంగి, బుజాల మొదళ్ళు తలను తగిలాయి. ('బుజాలు మూడుకావడం' అంటే ఇదే!)

వ. తేరు సమ్ముఖంబు సేయించి పేరు వాడి క్రీడి కరతలం బెత్తి 'నిలు నిలు' మని యదల్చిన ఘోషంబు తోడన వెడలు నిశిత శర పరంపరల దట్టంపుఁ బఱపున నంబరంబు నీరంధ్రం బగుటయుఁ దదంధకారంబును భయతిమిరంబునుం గలసి గుండియ లవిసి కురుబలంబు లెదురు నడవను మఱలం బఱవను మఱచి, వెఱచఱచి హరితనయ హస్తలాఘవప్రశస్తి దక్కందక్కిన చేష్టలు దక్కియుండె; నతండు గోవుల వెనుకం బోవు నల్పబలంబు బెదరి తూర్పు దెసకుం జెదరునట్లుగా నరదంబుఁ బఱపించి తెఱపి సూపి వెలిచీర సారించి దేవదత్తంబు పూరించినం గేతుకపి గర్జిల్లం, దదీయ భూతంబు లార్వ, మౌర్వీ రవంబును, రథనినదంబును, బ్రతిపతాకినీ తుములంబును, గగనంబునం బొగడు నమరుల యెలుంగులును నొక్కటఁ జెలంగ సముదిత సాంద్ర సంరావంబు రోదసీ కుహరంబు నిండిన, నొండొండ తోఁకమట్ట లెత్తుకొని నేలమట్టవియుచు నద్రువం బసులు వెసం దిరిగి మున్ను వివ్వచ్చుండు వచ్చిన జాడ గైకొని దక్షిణదిశకుఁ గెరలు వొడుచుచుం దెరలం బాటిన. 265

ప్రతిపదార్థం: తేరు= రథాన్ని; సమ్ముఖంబు+చేయించి= ఎదురుగా నిలబెట్టించి; పేరు వాడి= తన పేరును గట్టిగా చెప్పుకొని; క్రీడి= అర్జునుడు; కరతలంబు+ఎత్తి= అరచేతిని పైకెత్తి; నిలు నిలుము+అని= నిలబడు, నిలబడు మని; అదల్చినన్= అదిలించిన; ఘోషంబు= గొప్పశబ్దం; తోడన్+అ= వెంబడే; వెడలు= బయలుదేరు; నిశితశర పరంపరలు= వాడి అయిన బాణాలయొక్క సమూహాలు; దట్టము+పఱపునన్= దట్టంగా వ్యాపించటంతో; అంబరంబు= ఆకాశం; నీరంధ్రంబు= సందు లేనట్టిది; అగుటయున్= కాగా; తద్+అంధకారంబును= ఆ చీకటీ; భయతిమిరంబును= భయం అనే చీకటీ; కలసి= ఒక్కటై; గుండియలు+అవిసి= గుండెలు పగిలిపోయి; కురుబలంబులు= కౌరవ సేనలు; ఎదురు నడవను= ఎదురు పోవటం; మఱలన్+పఱవను= తిరిగి పరుగెత్తటం; మఱచి= మరచిపోయి; వెఱచఱచి= భీతిల్లి; హరి= దేవేంద్రుడియొక్క; తనయ= కుమారుడైన అర్జునుడియొక్క; హస్తలాఘవ= చేతిని త్రిప్పటంలోని (బాణప్రయోగంలోని) నేర్పుయొక్క; ప్రశస్తి తక్కన్= పొగడటం తప్ప; తక్కిన చేష్టలు= మిగిలిన చేష్టలు; తక్క+ఉండెన్= లేకుండా నిలిచి ఉండిపోయినవి; అతండు= అర్జునుడు; గోవుల, వెనుకన్+పోవు= ఆవుల వెంట పోయే; అల్పబలంబు= స్వల్పమైన సైన్యం; బెదరి= భయపడి; తూర్పు దెసకున్= తూరుపు దిక్కుకు; చెదరునట్లుగాన్= పారిపోయేటట్లు; అరదంబున్= రథాన్ని; పఱపించి= తోలించి; తెఱపి+చూపి= కొంత సందు చూపి; వెలిచీర= తెల్లటిగుడ్డను; సారించి= ఊపి; దేవదత్తంబు, పూరించినన్= దేవదత్తమనే శంఖాన్ని పూరించగా; కేతుకపి= జెండాపైన ఉన్న కపిరాజు; గర్జిల్లన్= సింహనాదం చేయగా; తదీయ భూతంబులు= ఆ ధ్వజానికి సంబంధించిన ఇతర భూతాలు; ఆర్వన్= అరవగా; మౌర్వీ= అల్లెత్రాటి యొక్క; రవంబును= ధ్వనీ; రథ నినదంబును= రథంయొక్క చప్పుడున్నూ; ప్రతి= శత్రువులయొక్క; పతాకినీ= సేనయొక్క; తుములంబును= సందడీ; గగనంబునన్= ఆకాశంలో; పొగడు= కీర్తించే; అమరుల= దేవతల; ఎలుంగులును= గొంతులు (కంఠనాదాలు); ఒక్కటన్= ఒక్కటిగానేర్పడి; చెలంగన్= వ్యాపించగా; సముదిత+సాంద్ర+సంరావంబు= పుట్టిన దట్టమైన కోలాహలం; రోదసీ కుహరంబు= భూమి ఆకాశం - ఈ రెండింటి నడిమి భాగం అనే గుహ అంతటా; నిండినన్= నిండగా; ఒండు+ఒండ= క్రమక్రమంగా; తోఁకమట్టలు= తోకల మొదళ్ళను; ఎత్తుకొని= పైకెత్తుకొని; నేలమట్టు= నేలయొక్క కుదురు; అవియుచున్= పగులుతూ; అద్రువన్= కంపించగా; పసులు= ఆవులు; వెసన్= వెంటనే; తిరిగి= వెనుకకు తిరిగి; మున్ను= అంతకుముందు; విష్వచ్చుండు= అర్జునుడు; వచ్చిన జాడ= వచ్చిన దిక్కు; కైకొని= తీసికొని, అనుసరించి; దక్షిణ దిశకున్= దక్షిణదిక్కుకు; కెరలు+పొడుచుచున్= విజృంభిస్తూ; తెరలన్+పాఱినన్= వడిగా పరుగెత్తగా.

తాత్పర్యం: అర్జునుడు రథాన్ని ఎదురుగా నిలబెట్టించి, తన పేరును గట్టిగా చెప్పుకొంటూ, అరచేతిని పైకెత్తి నిలునిలుమని అరిచాడు. అలా బిగ్గరగా ఘోషిస్తూ పదునైన బాణాలను విడిచాడు. ఆకాశమంతా బాణాలు వ్యాపించి, చీకటి నిండిందా! అని అనిపించింది. అంతేగాక, బాణాల చీకటికి తోడు, భయం అనే చీకటీ వ్యాపించి, కౌరవసేనకు గుండె పగిలింది. ముందుకు పోవాలో, వెనక్కు వెళ్ళాలో తెలియలేదు. సేనలు భయంతో భ్రాంతి చెందాయి. ఆ స్థితిలో సైనికులు అర్జునుడి హస్తలాఘవాన్ని మాత్రం పొగడుతూ నిలిచిపోయారు. వాళ్ళు తక్కిన చేతలను విస్మరించారు. ఆ సమయంలో అర్జునుడు ఆవుల వెనుక పోయే కొద్దిపాటి సైన్యం చెదిరి తూర్పుదిశగా పరుగెత్తేటట్లు రథాన్ని తోలుమని, కొంత ఎడం చూపి తెల్లగుడ్డను ఊపి దేవదత్తాన్ని పూరించాడు. వెంటనే ఆ అల్పసైన్యం భీతితో చెదరి తూర్పుదిశగా పోయింది. అప్పుడే జెండాపై కపిరాజు గర్జించాడు. పతాకాన్ని ఆశ్రయించి ఉన్న భూతగణాలు అన్నీ ఒక్కమారు అరిచాయి. గాండీవంయొక్క అల్లెత్రాటి మ్రోతా, రథచక్రాల ఘోషా, శత్రు సైన్యాల సందడీ, ఆకసంలో పొగడుతూ ఉండే దేవతల కంఠరావం, అన్నీ ఒకేమారు విజృంభించాయి. ఆ ధ్వని భూమ్యాకాశ మధ్యభాగమంతటా నిండిపోయింది. ఆవులు తోకలను పైకెత్తుకొని, నేల బీటలువారేటట్లు వెనక్కు మళ్ళి, అర్జునుడు వచ్చిన దారి పట్టి దక్షిణంగా పరుగెత్తాయి.

క. గోవులతోఁ బొదువం బడి । పోవుచునున్నట్టి గోపపుంజంబు తదీ
యావసరంబున సరభస । మై వాని పిఱుందఁ దిరిగి యమ్మెయిఁ బఱచెన్. 266

ప్రతిపదార్థం: గోవులతోన్= ఆవులతో కూడా; పొదువన్+పడి= జతకూర్చబడి, అనుబంధించబడి; పోవుచున్+ఉన్నట్టి= పోతూ ఉన్న; గోపపుంజంబు= గోపాలుర మొత్తం; తదీయ+అవసరంబునన్= ఆ సమయంలో; సరభసమై= తొట్రుపాటుతో; వాని= ఆవులయొక్క; పిఱుందన్+తిరిగి= వెనుకకే మళ్ళుకొని; ఆ+మెయిన్= అట్లాగే (ఆవులు పోయిన వైపునకే); పఱచెన్= పరుగెత్తింది.

తాత్పర్యం: ఆవులతో అనుబంధించబడి సాగిపోతూ ఉన్న గోపాలకుల గుంపు కూడా అప్పుడు ఆవుల వెంటబడి, తొందరగా పరుగులు తీసింది.

ఆ. అప్పు డర్జునుండు దప్పక చూచి 'యీ । బలము పసుల కడ్డపడక యుండ
నెడ సొరంగ వలయు నిట యెయ్యికొను' మని । పనిచె మత్స్యభూమిపాలసుతుని. 267

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; అర్జునుండు= అర్జునుడు; తప్పక చూచి= (సైన్యాన్ని) బాగా పరిశీలించి కనుక్కొని; ఈ బలము= ఈ సేన; పసులకున్= ఆవులకు; అడ్డపడక+ఉండన్= అడ్డు రాకుండా (పసువులను మళ్ళించకుండా); ఎడ+చొరంగ వలయున్= నడుమకు చేరాలి; ఇట= ఈ వైపునకు; ఎయ్యికొనుము+అని= తరుముకొని వెళ్ళుమని; మత్స్యభూమి పాల= విరాటరాజుయొక్క; సుతునిన్= కుమారుడైన ఉత్తరుడిని; పనిచెన్= నియమించాడు.

తాత్పర్యం: ఆ సమయంలో అర్జునుడు సైన్యాన్ని అంతా చక్కగా శోధించి, 'ఈ సేన మన ఆవులకు అడ్డురాకుండా మధ్యగా మనం పోవాలి. కనుక ఈ వైపునకు తరుము' మని ఉత్తరుడిని ఆజ్ఞాపించాడు.

క. పనిచిన నాతఁడు నమ్మెయిఁ । జన నిచ్చె రథంబు; గోపసంఘముఁ 'దిరమై
కొనిపొండు పసుల నోడక' । యని తా నెలుఁ గిచ్చి వీటికై నూల్కొలిపెన్. 268

ప్రతిపదార్థం: పనిచినన్= పైవిధంగా ఆజ్ఞాపించగా; ఆతఁడున్= ఆ ఉత్తరుడు కూడా; ఆ+మెయిన్= అదే విధంగా; రథంబు= రథాన్ని; చనన్+ఇచ్చెన్= పోనిచ్చాడు; ఓడక= భయపడక; పసులన్= గోవులను; తిరము+ఐ= గట్టిగా (ధైర్యంగా); కొనిపొండు= తోలుకొని పొండి- అని; తాను= అర్జునుడు; గోపసంఘమున్= గోపకుల గుంపును; ఎలుఁగు+ఇచ్చి= గొంతిచ్చి (కేకవేసి); వీటికై= నగరానికి; నూల్కొలిపెన్= ప్రేరేపించాడు.

తాత్పర్యం: అర్జునుడు చెప్పినట్లుగా ఉత్తరుడు రథాన్ని పోనిచ్చాడు. 'ఏ భయం లేకుండా, ధైర్యంగా ఆవులను తోలుకొని పొండి' అని గోపకులను కేకవేసి, అర్జునుడు పట్టణం వైపుగా పొమ్మని వారికి చెప్పాడు.

వ. అట్టి సమయంబున. 269

తాత్పర్యం: ఆ సమయంలో. (ముందుకు అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కరితురగ సమితిఁ గార్కొని । కురువీరుల మొనలు మొగులు కొమరునఁ గవియన్
శరవేగంబున నరుఁ డు । ద్ధుర మారుత చండభంగి దోఁపఁ దెరల్చెన్. 270

ప్రతిపదార్థం: కరి= ఏనుగులయొక్క; తురగ= గుర్రాలయొక్క; సమితిన్= సమూహంతో; కార్కొని= నల్లబారి; కురువీరుల= కౌరవవీరులయొక్క; మొనలు= సైన్యాలు; మొగులు= మేఘంయొక్క; కొమరునన్= విధంగా (మేఘంవలె); కవియన్= చుట్టుముట్టగా; నరుఁడు= అర్జునుడు; శర వేగంబునన్= బాణ వేగంతో (రివ్వున బాణం పోయినట్లు); ఉద్ధుర= తీవ్రమైన; మారుత= గాలియొక్క (ఝంఝామారుతంయొక్క); చండభంగి= భయంకరమైన రీతి; తోఁపన్= అనిపించేటట్లు; తెరల్చెన్= చెదరగొట్టాడు.

తాత్పర్యం: ఏనుగులతో, గుర్రాలతో నల్లబారిన కురుసేనలు చెలరేగి అర్జునుడిని మేఘాలవలె కమ్ముకొన్నాయి. అప్పుడు అర్జునుడు, శరవేగంతో, తీవ్రమైన సుడిగాలివలె ఆ మబ్బులను చెదరగొట్టాడు.

విశేషం: అలం: ఉపమ.

క. కదిసిన బలములు విచ్చినఁ । గదుపులఁ జెదరంగ నీక గాండీవి వెసం
బొదివి యట కడపె; నవియును । గొదగొని తమపాలము సొచ్చె గోపాలురతోన్. 271

ప్రతిపదార్థం: కదిసిన= మీదికి వచ్చిన (చుట్టుముట్టిన); బలములు= సేనలు; విచ్చినన్= చెదిరిపోగా; గాండీవి= అర్జునుడు; కదుపులన్= ఆవులను; చెదరంగనీక= చెదిరిపోనీయకుండా; వెసన్+పొదివి= వేగంగా మందగా చేర్చి; అట= అటు; కడపెన్= తోలాడు; అవియున్= ఆ ఆవులుకూడా; గొదగొని= ఉత్సహించి (విజృంభించి); గోపాలురతోన్= ఆలకాపరులతో; తమ= తమదైన (విరాటరాజ్యంయొక్క); పొలము+చొచ్చెన్= పొలిమేరలో అడుగుపెట్టాయి.

తాత్పర్యం: ఆ రకంగా తనపైకి చుట్టుముట్టిన సైన్యాలు చెదిరిపోగా, వెంబడే అర్జునుడు ఆవులగుంపును కకావికలు కానీయక, ఆ వైపునకు మళ్ళించాడు. ఆ ఆవులు కూడా చెలరేగి, ఆలకాపరులతో తమ పొలిమేరలో ప్రవేశించాయి.

వ. అని చెప్పిన విస్మయంబు నొంది. 272

తాత్పర్యం: పై విధంగా చెప్పగా, వినిన జనమేజయుడు ఆశ్చర్యంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. 'పసులు పట్టువడిన పదపడి నరుఁ డెద్ది । యాచరించెఁ ? గౌరవాధినాథుఁ
డేమి సేసె? బలము లెట్లయ్యె? భీష్మాది । వీరు లెవ్విధంబు వార లైరి?' 273

ప్రతిపదార్థం: పసులు= గోవులు; పట్టు+పడిన= పట్టుబడిన; పదపడి= తర్వాత; నరుఁడు= అర్జునుడు; ఎద్ది+ఆచరించెన్= ఏం చేశాడు?; కౌరవ+అధినాథుఁడు= దుర్యోధనుడు; ఏమి+చేసెన్= ఏం చేశాడు?; బలములు= సేనలు; ఎట్లు+అయ్యెన్?= ఏమయ్యాయి?; భీష్మ+ఆదివీరులు= భీష్ముడు మొదలైన వీరులు; ఏ+విధంబువారలు+ఐరి?= ఏం చేశారు?

తాత్పర్యం: 'అర్జునుడు ఆవులను పట్టుకొన్నతరువాత ఏం చేశాడు? దుర్యోధనుడు ఏం చేశాడు? సేనల సంగతి ఏమయింది? భీష్ముడు మొదలైన మహావీరులంతా ఎట్లా ఉన్నారు?'

వ. అనవుడు. **274**

తాత్పర్యం: అని అనగానే.

విశేషం: ఇంతటితో నాలుగో ఆశ్వాసం కథ ముగిసింది. తరువాత ఆశ్వాసాంత పద్యాలు మూడున్నాయి. వీటిలో తిక్కన ఇష్టదైవమైన హరిహరనాథుడి వర్ణనే ఉంటుంది. తిక్కన భారతభాగాన్ని ఆ దేవుడికే అంకితం ఇచ్చాడు.

ఆశ్వాసాంతం

మ. నవతాదూర! పురాణతానుపగతా! నానాత్వ సంశోభితా!
వివిధత్వాపగమోజ్జ్వలా! బహుకళావిర్భావశాలీ! సము
ద్భవ రాహిత్య నిరూఢ! సూక్ష్మతర సంభాసా! మహాస్థూల మూ
ర్తి విశేషా! నిరుపాధికా! గుణమయా! ధీవర్తకా! నిష్క్రియా! **275**

ప్రతిపదార్థం: నవతాదూర!= కొత్తదనానికి దూరమైన వాడా! (కొత్తదనం లేనివాడా); పురాణతా+అనుపగతా!= పాతదనం లేనివాడా! (కొత్త, పాతలకు అతీతమైనవాడా); నానాత్వ సంశోభితా!= ఎన్నో రూపాలతో వెలిగేవాడా!; వివిధత్వ+అపగమ+ఉజ్జ్వలా!= అనేకత్వం నశించి వెలిగేవాడా! (ఏకరూపంతో ప్రకాశించేవాడా! - అని భావం); బహుకళా+ఆవిర్భావశాలీ!= అనేకములైన కళలయొక్క పుట్టుకతో శోభిల్లేవాడా!; సముద్భవ= పుట్టుకయొక్క; రాహిత్య నిరూఢ!= లేకపోవటం వలన, పేరు కెక్కిన వాడా!; సూక్ష్మతరసంభాసా!= మిక్కిలి సూక్ష్మమైన రూపంతో ప్రకాశించేవాడా!; మహా= గొప్పదైన; స్థూల= పెద్దదైన; మూర్తి= ఆకారంతో; విశేషా!= విశేషమైన వాడా! (అంతటా వ్యాపించిన రూపం కలవాడా!); నిరుపాధికా!= ఉపాధి లేనివాడా! (నిర్గుణుడు అని); గుణమయా!= త్రిగుణాలు కలవాడా! (సగుణుడు); ధీ= బుద్ధిని; వర్తకా!= ప్రవర్తింప చేసేవాడా!; నిష్క్రియా!= క్రియలేని వాడా!.

తాత్పర్యం: కొత్తపాతలు రెండూ లేనివాడా! వివిధ నామరూపాలతో వెలుగొందేవాడా! ఏకత్వంతో భాసిల్లేవాడా! జన్మరహితుడా! అనేక కళలయొక్క ఆవిర్భావంతో శోభిల్లేవాడా! సూక్ష్మ, స్థూల రూపాలను ధరించినవాడా! నిర్గుణ, సగుణాత్మకా! సమస్త బుద్ధులను ప్రవర్తింపజేసేవాడా! ప్రవృత్తి, నివృత్తి రూపా!

విశేషం: అలం: విరోధాభాసం. ఇందులో పరస్పర విరుద్ధాలైన విషయాలు భగవంతుడైన హరిహరనాథుడిలో ఉన్నట్లు తిక్కనమహాకవి వర్ణించాడు. ద్వంద్వాత్మకమైన సమస్తం భగవద్రూపమే - అనే పరమసత్యాన్ని నిరూపించటానికే మహాకవి ఇట్లా అభివర్ణించాడు. ఇది ఒక విలక్షణత్వాన్ని సంతరించుకొన్న వర్ణనావిధానం.

క. అంతఃకరణ చతుష్టయ । శాంతి సముద్యద్వివేక సంపద్వేద్యా!
చింతాతంతు త్రుటనా । త్యంత విగదద్గైక భజన తత్పర హృద్యా! **276**

ప్రతిపదార్థం: అంతఃకరణ చతుష్టయ= నాలుగు రకాలైన అంతఃకరణాలయొక్క; శాంతి= శాంతితో; సముద్యత్= పుట్టిన; వివేక= విజ్ఞానం అనే; సంపద్= సంపదతో; వేద్యా!= తెలిసికొనదగినవాడా!; చింతా= చింత అనే; తంతు= దారాన్ని; త్రుటనా=

తెంచివేయడంలో; అతి+అంత= మిక్కిలి; విదగ్ధ= నేర్పుకలవాళ్ళకీ; ఏకభజనతత్పర= పరమాత్మను సంసేవించడంలోనే రక్తులైన వాళ్ళకూ; హృద్యా!= హృదయంగమం అయినవాడా!

తాత్పర్యం: నాలుగురకాలైన అంతఃకరణాలయొక్క శాంతతతో పుట్టిన విజ్ఞానంతో తెలిసికొనదగినవాడా! చింత అనే త్రాటిని తెంచడంలో చాతుర్యం ఉన్న జ్ఞానులకూ, పరమాత్మను నిరంతరం సేవించే భక్తులకూ మనోహరుడవయిన హరిహరనాథదేవా!

విశేషం: అలం: అంత్యానుప్రాసం. మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం - అనేవి నాలుగు అంతఃకరణాలు. కార్యభేదాలను అనుసరించి, ఒక్కటే అయిన అంతరింద్రియం నాలుగురకాలుగా మారింది. ఇవి (వీటి ధర్మాలు) నశిస్తేనే కాని, శాంతి కలుగదు. దానివలన జ్ఞానం ఉద్భవిస్తుంది. అది నిజమైన జ్ఞానం. అంటే జ్ఞానులకు భగవంతుడు తెలుస్తాడు. ఇది జ్ఞాన మార్గం. నిరంతర సేవవలన భక్తులకు భగవంతుడు గోచరిస్తాడు. ఇది భక్తిమార్గం. అధికారి భేదాన్ని బట్టి భగవంతుడు గోచరం అవుతాడు. ఇక్కడ తిక్కన మహాకవి జ్ఞాన, భక్తి మార్గాలను నిరూపించాడు. అంతేకాక, 'చింత' అనే తాటిని త్రెంచాలి- అనటంలో వైరాగ్యభావం వ్యక్తం. అందువలన భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను మహాకవి సూచించాడు.

మాలిని:

ప్రణమదవన విద్యాప్రౌఢ! సంరూఢ కాంతి । ప్రణుత చరణ పద్మా! పద్మజాదిత్య సత్పో
షణ చతుర! దయావిస్ఫారితాలోక! లోకాపణ నిపుణ జనాంచద్భక్తి విక్రీతమూర్తీ! **277**

ప్రతిపదార్థం: ప్రణమత్= నమస్కారం చేసేవాళ్ళను; అవన= కాపాడటం అనే; విద్యా= విద్యలో; ప్రౌఢా!= సమర్థుడా! (పటిష్ఠమైన వాడా!); సంరూఢ= మిక్కిలి స్ఫుటమైన; కాంతి= తేజంతో; ప్రణుత= స్తుతించబడ్డ; చరణపద్మా!;= పద్మాలవంటి పాదాలు కలిగినవాడా! పద్మజ= పద్మంలో పుట్టిన బ్రహ్మనూ; ఆదిత్య= సూర్యుడినీ; సత్పోషణచతుర!= బాగా పోషించటంలో నేర్పు కలవాడా! (బ్రహ్మదేవుడు సృష్టికీ, సూర్యుడు కాలానికీ ప్రతీకలు. హరిహరనాథదేవుడు ఆ రెంటికీ అధినాయకుడు. సృష్టి-మిగతా స్థితిలయాలకూ సూచకమే. అంటే ఆ దేవుడు త్రికార్యాలకు నాథుడని భావం. అట్లాగే కాలస్వరూపుడు - అనీ ధ్వని); దయా= కరుణతో; విస్ఫారిత+ఆలోక!= మిక్కిలి వికసించిన కండ్లు (చూపులు) కలిగినవాడా!; లోక= ప్రపంచం అనే; ఆపణ= అంగడిలో; నిపుణజన= నేర్పరులైన భక్తజనులయొక్క; అంచత్= అలరారుతున్న; భక్తి= భక్తిచేత; విక్రీత= అమ్ముడుపోయిన; మూర్తీ!= ఆకృతి కలిగినవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథ దేవా! నీకు నమస్కారం చేసేవాళ్ళను కాపాడేవాడా! అత్యధికమైన కాంతితో వెలిగే పాదపద్మాలు కలవాడా! సృష్టికర్త అయిన బ్రహ్మనూ, కాలస్వరూపుడైన ఆదిత్యుడినీ కూడా పోషించేవాడా! దయతో వికసించిన చూపులు కలవాడా! ప్రపంచం అనే అంగట్లో భక్తుల భక్తిభావానికి అమ్ముడుపోయినవాడా! మీకు నమస్కారం.

విశేషం: అలం: ముక్తపదగ్రస్తం.

గద్యము:

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీ మహాభారతంబున విరాటపర్వంబునందుఁ జతుర్థాశ్వాసము.

తాత్పర్యం: ఇది ఉభయకవి మిత్రుడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, పండితుల సేవతో రాణించేవాడూ అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలోని విరాటపర్వంలో నాల్గవ ఆశ్వాసం.

విరాటపర్వంలో చతుర్థాశ్వాసం సమాప్తం

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

విరాటపర్వము - పంచమాశ్వాసము

శ్రీ సంపాదన చాతు । ర్యా! సేవ్య పదారవింద! యౌగిక విద్యో
ద్భాసిత మూర్తి మయాత్మ! వ్యాస సమాసైక రూప! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ సంపాదన చాతుర్యా!= లక్ష్మీదేవిని సంపాదించుకొనటంలో నేర్పరితనం కలవాడా! (హరి); శ్రీ= విషాన్ని; సంపాదన= పొందటంలో; చాతుర్యా!= చాతుర్యం కలవాడా!; (హర); (దేవతలు రాక్షసులు పాలసముద్రాన్ని చిలికే సందర్భంలో పుట్టిన లక్ష్మీదేవిని విష్ణువు, విషాన్ని శివుడు పొందినట్లు పురాణగాథ; మరొక అర్థంలో - భక్తులకు ఐశ్వర్యాన్ని ఇవ్వటంలో నేర్పు కలవాడా! అనీ, శ్రీశబ్దం మోక్ష వాచకం కావటంచేత భక్తులకు మోక్షాన్ని సంపాదించటంలో చాతుర్యం కలవాడా! అనికూడా చెప్పవచ్చు); సేవ్యపద+అరవింద!= సేవించ దగిన పద్మాల వంటి పాదాలు కలవాడా!; యౌగిక విద్యా= సాంఖ్య కర్మ యోగాదుల వలన కలిగిన జ్ఞానం చేత; ఉత్+భాసిత= మిక్కిలి ప్రకాశింప జేయబడిన; మూర్తిమయ+ఆత్మ!= ఆకారమే స్వరూపంగా కలిగినవాడా!; వ్యాస= వ్యష్టిగాను; సమాస+ఏకరూప= సమష్టిగానూ ఉండి ఒకేరూపు కలిగినవాడా! (హరిహరులు ఇద్దరూ భిన్నరూపం కలిగిన వారైనప్పటికీ ఒకే రూపాన్ని పొంది హరిహరనాథుడుగా ఐనవారని భావం); హరిహరనాథా!= హరిహరనాథుడవైన స్వామీ!

తాత్పర్యం: లక్ష్మీదేవిని లేదా విషాన్ని పొందటంలో నేర్పరితనం కలవాడా! (భక్తులకు సంపదను, లేదా మోక్షాన్ని సంపాదించి ఇవ్వటంలో చాతుర్యం కలవాడా! అని కూడా అర్థం); సేవించదగిన పాద పద్మాలు కలిగినవాడా! సాంఖ్య కర్మ యోగాదుల చేత కలిగిన జ్ఞానంతో ప్రకాశింపజేయబడిన ఆకారం కలవాడా! భిన్నరూపుడ వయ్యు ఏకరూపాన వెలసినవాడా! హరిహరనాథా! - చిత్తగించవలసింది.

విశేషం: ఇది ఆశ్వాసారంభ పద్యం. కృతిపతి అయిన హరిహరనాథుడిని సంబోధిస్తూ చెప్పినట్టిది. ఇందులోని ప్రతి విశేషణం అటు హరికీ, ఇటు హరుడికీ, ఇరువురూ కలిసిన హరిహరనాథుడికీ అన్వయించటం విశేషం. అలం: శ్లేష.

అర్జునుఁ డుత్తరునకుఁ గౌరవవీరుల వేఱువేఱ నిరూపించి చెప్పుట (సం. 4-49-1)

వ. **దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నివ్విధంబున విరోధివర్గం బుక్కు దక్కి వెక్కసపడి చూచుచుండ నిరర్గళ భుజార్గళ సంరంభ విజృంభణంబు శోభిల్లఁ బసులం బెట్టించి యనతిదూరవర్తియగు కౌరవచక్రవర్తిదెసం గనుంగొని ధనంజయుండు భూమింజయు నక్కడఁ దేరు వఱుపం బనుప నప్పళించు నప్పుడు కురువీరులు గూడుకొని మూఁడువేల రథంబులతోడను గాంగేయకర్ణు లొక్కొక్కరుండు వేయింటి తోడను దలకడచి రాజున కడ్డపడి కవ్వడిదిక్కు మొగంబుగాఁ దిరిగి; రట్టియెడఁ గదుపులు పట్టువడుటకు నిట్టూర్పు నిగిడించుచు మగిడి మనుజపతియు ననుజసహితుండై సహస్రస్యందనములతోడ వెన్ను దన్ని నిలిచె; నంతఁ దక్కటి బలంబులు నెయిదికొని యమ్మెయిన దళంబుగాఁ గవిసిన.** 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ హరిహరనాథదేవా!; వైశంపాయనుండు; జనమేజయునకున్= జనమేజయ మహారాజుకు; ఇట్లు+ అనియెన్= ఈ రీతిగా అన్నాడు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; విరోధివర్గంబు= శత్రువుల సమూహం; ఉక్కు+తక్కి= చేవచెడి; వెక్కసము+పడి= బాధపడి; చూచుచున్+ఉండన్= చూస్తూ ఉండగా; నిరర్గళ= అడ్డులేని; భుజా+అర్గళ= గడియల వంటి భుజాలయొక్క; సంరంభ విజృంభణంబు= ఆటోపము యొక్క వికాసం విజృంభించటం; శోభిల్లన్= ప్రకాశించగా; పసులన్= ఆవులను; పెట్టించి= వెనుకకు మరలించుమని ఆజ్ఞాపించి; అనతి దూరవర్తి+అగు= కొంచెం దూరంలో ఉన్న; కౌరవ చక్రవర్తి దెసన్= దుర్యోధనుడి వైపు; కనుంగొని= చూచి; ధనంజయుండు= అర్జునుడు; భూమింజయున్= ఉత్తరుని; అక్కడన్= ఆ ప్రదేశానికి; తేరు+పఱుపన్= రథం తోలటానికి; పనుపన్= ఆజ్ఞాపించగా; అప్పళించు+అప్పుడు= చరిచినప్పుడు; కురువీరులు= కురుసైన్యములోని వీరులు; కూడుకొని= కలిసికొని; మూడువేల రథంబుల తోడను= మూడువేల రథాలతో; గాంగేయ కర్ణులు= భీష్ముడూ, కర్ణుడునూ; ఒక్కొక్కరుండు= ఒక్కొక్కరును; వేయింటి తోడను= వేయిరథాలతోనూ; తల కడచి= ముందుకు వచ్చి; రాజునకున్= దుర్యోధనునకు; అడ్డుపడి= అడ్డంగా నిలిచి; కవ్వడి దిక్కు మొగంబుగాన్= అర్జునుడి వైపు ముఖ ముండేటట్లుగా; తిరిగిరి= వెనుకకు తిరిగి నిలిచారు; అట్టి+ఎడన్= అటువంటి సమయంలో; కదుపులు= ఆవులమందలు; పట్టు+పడుటకున్= అర్జునునకు వశమైపోవటానికి; నిట్టూర్పు నిగిడించుచున్= నిట్టూరుస్తూ; మగిడి= వెనుకకు మరలి; మనుజపతియున్= దుర్యోధనుడును; అనుజ సహితుండు+ఐ= తమ్ములతో కూడినవాడై; సహస్ర స్యందనంబులతోడన్= వేయిరథాలతో; వెన్నుదన్ని= వెనుక; నిలిచెన్= నిలిచాడు; అంతన్= అంతట; తక్కటి బలంబులున్= తక్కిన సేనలు కూడా; ఎయిదికొని= దగ్గరకు చేరి; ఆ+మెయిన్+అ= ఆవిధంగానే; దళంబుగాన్= సేనగా; కవిసినన్= తాకగా.

తాత్పర్యం: హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయున కిట్లని చెప్పాడు. ఇట్లా శత్రువులు బలం తగ్గిపోయి, ఆశ్చర్యంతో చూస్తుండగా, తన బాహు పరాక్రమం అడ్డులేకుండా విజృంభించగా, అర్జునుడు పశువులను తోలుకొనిపొమ్మని వెనుకకు మళ్ళించి, కొద్దిదూరంలో ఉన్న దుర్యోధనుడివైపు చూచి, ఉత్తరుడితో అక్కడికి రథాన్ని నడపుమని చప్పట్లు కొట్టి చెప్పగా, కౌరవవీరులందరూ కలిసి మూడువేల రథాలతోనూ, భీష్మకర్ణులు చెరొక వెయ్యిరథాలతోనూ, సేనముందు నిలిచిన దుర్యోధనుడికి దగ్గరగా వెళ్ళి అతడికీ అర్జునుడికీ మధ్య ఆగి, అర్జునుడి వైపు తిరిగారు. అప్పుడు, గోగణాన్ని గోపాలురు వశం చేసికొని తోలుకొని పోవటం చూచి నిట్టూరుస్తూ, దుర్యోధనుడు తమ్ములతో కలిసి వెయ్యిరథాలతో అర్జునుడిని ఎదిరిస్తున్నట్లు ఎదురుగా నిలువబడ్డాడు. అంతటిలో తక్కిన సేనలన్నీ చేరుకొని ఒక పెద్దసేనగా మోహరించగా.

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం.

క. **కనుఁగొని యెలనవ్వొలయు వ । దనమున గరువంపుఁ జెన్ను దలకొనఁగా న**
ర్జునుఁడు విరాటసుతున కి । ట్లనుఁ గేవల వీరరసమయాత్మకుఁ డగుచున్. **3**

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; ఎలనవ్వు+ఒలయు= చిరునవ్వు కల; వదనమునన్= ముఖమందు; గరువము+చెన్ను= గర్వరేఖ; తలకొనఁగాన్= కలుగగా; అర్జునుఁడు; కేవల+వీర రసమయ+ఆత్మకుఁడు+అగుచున్= అచ్చమైన వీర రసమయమైన హృదయం కలవాడై; విరాట సుతునకున్= ఉత్తరుడితో; ఇట్లు+అనున్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: ఆ మోహరించిన సేనను చూచి అర్జునుడు చిరునవ్వు నవ్వుతూ, ముఖంలో గర్వరేఖ వెలుగగా, వీర రసమయుడై ఉత్తరుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అర్జునుడు 'కేవల వీర రసమయాత్మకు'డయ్యాడనటం సాభిప్రాయం. ఉత్తర గోగ్రహణం ఒక ప్రబంధం వంటిది. అందులో నాయకుడు అర్జునుడు. అతడి నాశ్రయించిన స్థాయి ఈ ప్రబంధంలో అంగిరసం. ఏకైకవీరుడైన అర్జును నాశ్రయించి వర్తించేది కేవల వీరరసమని కావ్య రసపరమైన అర్థం. అచ్చమైన వీరరసం మనస్సులో నిండగా, ఆ రసమే ఆకారంగా నిలిచిందా అన్నట్లు, వీరరసముద్రలో నిలువబడి, చూచేవారికి వీరరస విభావం వలె ప్రకాశిస్తూ, శత్రువిజయోత్సాహాన్ని ప్రదర్శించే ప్రసంగం చేయబోతున్నాడని నాట్య రసపరమైన అర్థం. తిక్కన నాటకీయతలో ఇట్టి వర్ణన ఒక కళారేఖ. (సంపా.)

సీ. **'కాంచనమయ వేదికా కనత్కేతనో । జ్జ్వల విభ్రమమువాఁడు కలశజుండు;**
సింహ లాంగూల భూషిత నభోభాగ కే । తు ప్రేంఖణమువాఁడు ద్రోణసుతుఁడు;
కనక గోవృష సాంద్రకాంతి పరిస్ఫుట । ధ్వజ సముల్లాసంబువాఁడు కృపుఁడు;
లలితకంబుప్రభాకలిత పతాకా వి । హారంబువాఁడు రాధాత్మజుండు;

తే. **మణిమయోరగ రుచిజాల మహితమైన । పడగవాఁడు కురుక్షితిపతి; మహోగ్ర**
శిఖరఘన తాళతరువగు సిడమువాఁడు । సురనదీసూనుఁ; డేర్పడఁ జూచికొనుము. **4**

ప్రతిపదార్థం: కాంచన మయ= బంగారంతో చేయబడిన; వేదికా= అరుగుతో; కనత్+కేతన= ప్రకాశించే జెండాతో; ఉజ్జ్వల= ప్రకాశించే; విభ్రమమువాఁడు= విలాసం కలవాడు; కలశజుండు= ద్రోణుడు; సింహలాంగూల= సింహముయొక్క తోకతో; భూషిత= అలంకరించబడిన; నభస్(ః)+భాగ= ఆకాశప్రదేశం కల; కేతు= జెండాయొక్క; ప్రేంఖణమువాఁడు= కదలికలు కలవాడు; ద్రోణసుతుఁడు= అశ్వత్థామ; కనక= బంగారుతో చేసిన; గోవృష= ఆబోతుయొక్క; సాంద్రకాంతి= దట్టమైన కాంతితో; పరిస్ఫుట= మిక్కిలి స్పష్టమైన; ధ్వజ= జెండాయొక్క; సముల్లాసంబువాఁడు= రెపరెపలు కలవాడు; కృపుఁడు= కృపాచార్యుడు; లలిత= అందమైన; కంబు= శంఖముయొక్క; ప్రభా= కాంతితో; కలిత= కూడిన; పతాకా= జెండాయొక్క; విహారంబువాఁడు= విహారం కలవాడు; రాధా+ఆత్మజుండు= కర్ణుడు; మణిమయ= మాణిక్యమయమైన; ఉరగ= పాముయొక్క; రుచిజాల= కాంతి పుంజంచేత; మహితము+ఐన= గొప్పదైన; పడగవాఁడు= జెండా కలవాడు; కురుక్షితిపతి= దుర్యోధనుడు; మహా+ఉగ్ర= చాలా భయంకరమైన; శిఖరఘన= శిఖరం గలిగిన గొప్పదైన; తాళతరువు+అగు= తాడిచెట్టు ఐన; సిడమువాఁడు= జెండా కలవాడు; సురనదీ సూనుఁడు= దేవనది కొడుకు భీష్ముడు; ఏర్పడన్= విశదంగా; చూచికొనుము= చూచి గుర్తుంచుకొనుము.

తాత్పర్యం: 'ఉత్తరకుమారా! చూడుము. బంగారు వేదిక గుర్తుగా ఎగిరే జెండా రథంమీద ఉన్నవాడు ద్రోణుడు. ఎగురుతున్న జెండాపై సింహముతోక ఉన్నవాడు అశ్వత్థామ. కృపాచార్యుడు బంగారు ఆబోతు జెండా కల రథం మీద ఉన్నాడు. తెల్లని శంఖకాంతులు వెదజల్లుతున్న జెండా గల రథంమీద ఉన్నవాడు కర్ణుడు. మణులు పొదిగిన పాము జెండా కలవాడు దుర్యోధనుడు. పెద్ద భయంకరమయిన తాటిచెట్టు జెండా కలవాడు భీష్ముడు. వీరిని వేర్వేరుగా చూచి గుర్తుంచుకొమ్ము.

విశేషం: 1. యుద్ధరంగంతో ప్రత్యక్ష పరిచయమున్న తిక్కన తీర్చిదిద్దే యుద్ధఘట్టాలు మూలంలోకంటె సుశిక్షితంగా, సహజంగా రాణిస్తూ ఉంటాయి. యుద్ధారంభంలో సారథికి ప్రతివీరుల కేతనాలను పరిచయం చేస్తూ, ఆయా కేతనాలు గల రథాలలో ఆయా వీరులుంటారనీ, ఆ అంశాన్ని జాగ్రత్తగా గుర్తుంచుకొనుమని చెప్పటం ఆచారం కాబట్టి అర్జునుడు ఉత్తరకుమారుడిని హెచ్చరిస్తాడు. భావియుద్ధంలో ఫలాని వీరుడిపై రథం పోనిమ్మని ఆజ్ఞాపించగానే, సారథి తడవుకొనకుండా టెక్కెపు గుర్తును చూచి ఆవైపు రథం సాగించాలి. ఇది రణవ్యూహంలో ప్రాథమిక సూత్రం. దీనిని తిక్కన విడువకుండా వర్ణించాడు.

2. మూలంలో **"తేషామనీకాని బహూని గాఢం । వ్యూఢాని దృష్ట్వా బహులధ్వజాని"** (సం. 4-49-3) అనే పాదాన్ని ఆధారంగా చేసికొని ఈ సీసాన్ని నిర్మించాడు తిక్కన. అందులోకూడా ద్రోణుడితో మొదలుపెట్టి భీష్ముడితో ముగించాడు. దుర్యోధనుడి సేనకు ఇద్దరు పెద్దలూ రెండు పెద్ద దిక్కులు, అసాధ్యులు. వారిరువురిచేత రక్షితుడైన దుర్యోధనుడు సురక్షితుడని ధ్వని. అట్టి వ్యూహభేదనోత్సాహం అర్జునుడిని వీరరసమయాత్ముడిగా చేసింది.

3. ప్రాచీనకాలంలో వీరులు రథాలకు ధ్వజాల నుంచుకొనేవారు. ఒక్కొక్కరికి ఒక్కొక గుర్తు ఉండేది. ఆయా వీరులకు ధ్వజ చిహ్నంతో కలిపిన బిరుదం కూడా ఉండేది- భీష్ముడు తాళధ్వజుడు. అర్జునుడు కపిధ్వజుడు-ఇట్లా. రణరంగంలో రథికులను రథ ధ్వజాలతోనే గుర్తించాలి. అందువలన ఈ పద్యం సందర్భోచితం.

4. వీర రసానికి స్థాయి ఉత్సాహం. అర్జునుడు తన ముందున్న మహావీరులను గుర్తించి, అంతటివారిని జయించే మహోత్సాహాన్ని హృదయంలో పొంగించుకొంటున్నాడు. ఇది తిక్కన రసాభ్యుదయ పోషణ శిల్పంలో భాగం.

5. వీరుల పరిచయంలో ఉదాత్తాలంకారం ఉన్మీలించింది. ఈ పద్యంలో పేర్కొనబడిన ఆరుగురు- కౌరవసైన్యంలో ప్రసిద్ధ రథికులు. వారిని 'షడ్రథికులు' అని అంటారు. రథికులను ధ్వజకేతనాల గుర్తులతో పరిచయం చేయటం రథికసంప్రదాయాన్ని రక్షించిన సాహిత్య సంప్రదాయం. (సంపా.)

క. గురునకుఁ బ్రదక్షిణంబుగ । నరదముఁ బోనిత్త; మిమ్మహాపురుషు నెడం
బరిభవము వలవ; దీతఁడు । కురుకుల నృపతనయ శిక్షకుఁడు సు మ్మనఘా! 5

ప్రతిపదార్థం: అనఘా!= పాపము లేనివాడా! (మంచివాడా!); అరదమున్= రథమును; గురునకున్= ద్రోణాచార్యుడికి; ప్రదక్షిణంబుగన్= మన కుడిచేతి వైపున అతడుండేటట్లుగా; పోనిత్తము= వెళ్ళునట్లు చేద్దాము; ఈ+మహాపురుషు+ఎడన్= ఈ గొప్పవాడి విషయంలో; పరిభవము= తిరస్కారం (అవమానం); వలవదు= వద్దు; ఈతఁడు= ఈ ద్రోణాచార్యుడు; కురుకుల= కౌరవకులంలోని; నృపతనయ= రాజకుమారులకు; శిక్షకుఁడు సుమ్మ= విద్య నేర్పిన గురువు సుమా!

తాత్పర్యం: ఉత్తరకుమారా! మన రథాన్ని గురువుగారి రథానికి కుడివైపు నుండి పోనిమ్ము. గొప్పవారికి మనం కుడివైపు నుండి దారి ఇవ్వాలి. అది మర్యాద. అది ప్రదక్షిణ మౌతుంది. దానికి విపరీతమైతే అది వారి నవమానించినట్లు అవుతుంది. ఈ ద్రోణాచార్యుడు కౌరవకులంలోని రాజకుమారులందరికి ధనుర్విద్యలో శిక్షణ నిచ్చినవాడు.

క. శస్త్ర ప్రకార నిపుణుం, । డస్త్ర విదుఁడు, దూరపాతనాభీలుఁడు, వ
ర్చస్త్రాసిత రిపుఁడు, ధను । శ్శాస్త్రపరిజ్ఞానఘనుఁ డసదృశుఁడు శక్తిన్. 6

ప్రతిపదార్థం: శస్త్రప్రకార= ఆయుధ విధానంలో; నిపుణుండు= నేర్పరి; అస్త్రవిదుఁడు= అస్త్రవిద్య నెరిగినవాడు; (శస్త్రములనగా కత్తి, బాణం మొదలైన ఆయుధాలు; అస్త్రములంటే వారుణాస్త్రం, పర్జన్యాస్త్రం మొదలైన అస్త్రాలు); దూరపాతన= దూరంగా కొట్టటంచేత; ఆభీలుఁడు= భయంకరమైన వాడు; వర్చస్+త్రాసిత= వర్చస్సుచేత (చూచేసరికి భయం గొల్పు తేజస్సు చేత) భయపెట్టబడిన; రిపుఁడు= శత్రువులున్న వాడు; ధనుస్+శాస్త్ర పరిజ్ఞాన+ఘనుఁడు= ధనుర్విద్యలోని మెలకువ లెరిగిన గొప్పవాడు; శక్తిన్= బలంలో; అసదృశుఁడు= సాటిలేనివాడు.

తాత్పర్యం: ఆయుధాలు వాడటంలో నేర్పరి. అస్త్రాలు తెలిసినవాడు. దూరంగా ఉన్న లక్ష్యాన్ని కొట్టగలవాడు. అతడి ముఖ వర్చస్సు చూడగానే శత్రువులు హడలిపోతారు. ధనుర్విద్యా విజ్ఞానంలో గట్టివాడు. శక్తిలో అతడికి సాటి ఎవ్వరూ లేరు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ఈతనితోడి కయ్యమున కియ్యకొనం దగ; దేను దుష్పథ
ద్యూత జయోద్ధతుండగు సుయోధనునిం బరిమార్పఁ బోవుచో
శాతశరోత్కరం బితఁడు చక్కఁగ నేయునొ? నన్ను నేయఁడో?
చూతము; తాన ము న్ననికిఁ జొచ్చినఁ జొత్తముగాక పిమ్మటన్. 7

ప్రతిపదార్థం: ఈతని తోడి+కయ్యమునకున్= ఇతడితో యుద్ధానికి; ఇయ్యకొనన్+తగదు= అంగీకరించ రాదు; ఏను= నేను; దుష్పథ= అన్యాయమైన; ద్యూత= జూదంలో; జయ+ఉద్ధతుండు+అగు= జయంచేత పొగరెక్కిన వాడైన; సుయోధనునిన్= దుర్యోధనుడిని; పరిమార్పన్= చంపటానికి; పోవుచోన్= వెళ్ళునపుడు; ఇతఁడు= ద్రోణుడు; శాత= వాడియైన; శర+ఉత్కరంబు= బాణాల సముదాయాన్ని; చక్కఁగన్= బాగుగా; ఏయును+ఒ= వేస్తాడో; నన్నున్= నన్ను; ఏయఁడో= కొట్టడో; చూతము= చూద్దాం; తాను+అ= తానే; మున్ను= ముందుగా; అనికిన్= యుద్ధానికి; చొచ్చినన్= దిగితే; పిమ్మటన్= ఆ తరువాత; చొత్తము+కాక!= మనం కూడా దిగుదాం.

తాత్పర్యం: ఈ ద్రోణుడితో యుద్ధం ముందుగానే చేయకూడదు. మాయాద్యూతంలో నెగ్గి విర్రవీగే దుర్యోధనుడిని చంపటానికి వెళ్ళుతాను. అప్పు డితడు బాణాలతో నన్ను కొడతాడో, కొట్టడో చూద్దాం. తానే ముందు యుద్ధానికి దిగితే తరువాత మనమూ దిగుదాం.

విశేషం: తిక్కన సీసపద్యంలో ఎడనెడ క్రమాలంకారం ప్రయోగించటం కనబడుతుంది. కురువీరుల కేతనాలను వర్ణించిన 4వ సీసపద్యంలో తిక్కన క్రమం పాటించాడుకాని, క్రమాలంకారాన్ని ప్రయోగించలేదు. అయితే, తిక్కన ఒక పద్యంలో ఎంత శిల్పదృష్టి ప్రదర్శిస్తాడో, ఒక సన్నివేశంలో కూడా అంత క్రమశిక్షణతో కూడుకొన్న నిర్మాణ ప్రౌఢి ప్రదర్శిస్తాడు. పై సీసపద్యంలో చెప్పిన వీరుల వరుసలోనే వారి బలపరాక్రమ విశేషాలను వర్ణించటం, వారితో యుద్ధం చేసేటప్పుడు పాటించే వ్యూహాన్ని నిర్ణయించటం ఈ సన్నివేశంలో అర్జునుడు నిర్వహించినట్లు తిక్కన రచించాడు. ఆ వరుసలో ద్రోణుడిని గురించి మూడు పద్యాలు పలికించాడు. విలువిద్యకు ఆచార్యుడు బ్రహ్మస్థానం. అతడికి ప్రదక్షిణం చేయటం గురుపూజకు చిహ్నం. గురుగౌరవం వలన గురుప్రసాదం లభిస్తుంది. శత్రు సైన్యాధ్యక్షుడి నుండి దానిని పొందటం విజయానికి శుభారంభం. ద్రోణుడు శక్తిలో అసదృశుడు కాబట్టి అతడిని మొదటనే రెచ్చకొట్టకూడదు. శస్త్రాస్త్ర ప్రయోగ నిపుణుడు, దూర ప్రాంత లక్ష్యాలను సైతం అవలీలగా ఛేదించగలడు, చూస్తేనే భయం కలిగించే తేజస్సు కలవాడు, మూర్తీభవించిన ధనుర్వేదం వంటివాడు - అటువంటి శక్తిమంతుడితో అవినయంగా ప్రవర్తించటం వీరలక్షణం కాదు. అధర్మవర్తనుడైన దుర్యోధనుడిని ఓడించటం కార్యం. ఆ కార్యాన్ని ధర్మోత్సాహంతో అర్జునుడు నిర్వహించటానికి పూనుకొంటే ద్రోణుడు మిన్నకుంటాడో, ఎదుర్కొంటాడో తెలిసికొనకుండానే అతడితో యుద్ధానికి పూనుకొనటం ప్రమాదం. ద్రోణుడే యుద్ధం ప్రారంభిస్తే అర్జునుడు తిప్పికొట్టక తప్పదు. గురువుపట్ల అప్పు డది అవినయం కాదు. కేవల వీరరసమయాత్ముడు యుద్ధోత్సాహాన్ని ధర్మబద్ధంగా ప్రదర్శించాలి. దానికి ధర్మవ్యూహ విచికిత్స రసాభ్యుదయ హేతువుగా నిబంధించటం తిక్కన రచనా శిల్పం! వీరరసం అర్జునుడి భావనిష్ఠం. అది కార్యరూపంగా ప్రవహించటం రసాభ్యుదయ చిహ్నం. (సంపా.)

క. గురుపుత్త్రుఁడు తేజోనిధి; । సురాసురులకైనఁ దేఱి చూడ నరిది సం
గరమున నీతని; నీశ్వర । వరజనితుఁడు; మేటి కౌరవవ్యూహమునన్. 8

ప్రతిపదార్థం: గురుపుత్త్రుఁడు= అశ్వత్థామ; తేజోనిధి= తేజస్సునకు నిధియైనవాడు; సంగరమునన్= యుద్ధంలో; సుర+అసురులకున్+ఐనన్= దేవదానవులకైనా; ఈతనిన్= ఇతడిని; తేఱిచూడన్= తేరిపార చూడటానికి; అరిది= వీలుకాదు (కష్టం); ఈశ్వర వర= శివుని వరంచేత; జనితుఁడు= పుట్టినవాడు; కౌరవవ్యూహమునన్= కౌరవసేనలో; మేటి= గొప్పవాడు.

తాత్పర్యం: అశ్వత్థామ మా గురువుగారి పుత్రుడు, తేజశ్శాలి; ఈతడిని యుద్ధంలో దేవతలు రాక్షసులు సైతం కన్నెత్తి చూడలేరు. అంత భీకరంగా యుద్ధం చేయగలవాడు. శివుడి వరంవలన పుట్టాడు. కౌరవసేనలోని వీరులలో ఇతడే గొప్పవాడు.

క. **ధైర్యధనుఁ డితఁడు ద్రోణా । చార్యుల కెనవచ్చు దివ్యశరవిదుఁడు కృపా**
చార్యుఁడు; మత్పితృసఖుఁ డా । చార్యక మొనరించె మాకు శైశవముతఱిన్. **9**

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ కృపాచార్యుడు; ధైర్యధనుఁడు= ధైర్యమే ధనంగా కలవాడు; ద్రోణాచార్యులకున్= ద్రోణునికి; ఎనవచ్చు= సాటి వచ్చునట్టి; దివ్యశరవిదుఁడు= దివ్యాస్త్రవేత్త; కృపాచార్యుఁడు; మత్+పితృసఖుఁడు= నా తండ్రికి స్నేహితుడు; మాకున్= మా అందరికిని; శైశవము తఱిన్= చిన్నతనంలో; ఆచార్యకము= గురుత్వం; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: ఈ కృపుడు ధైర్యశాలి. అస్త్రవిద్యలో ద్రోణుడికి సాటి అయిన వాడు. ఈతడు మా తండ్రికి స్నేహితుడు; మా కందరికి చిన్నతనంలో విద్య నేర్పిన మహానుభావుడు.

విశేషం: ద్రోణుడిమీద భక్తి, కృపుడిమీద గౌరవం ప్రదర్శించాడు అర్జునుడు. విలువిద్యలో కృపుడు ద్రోణాచార్యుడి వంటివాడైనా, అతడు తన తండ్రికి మిత్రుడు కావటం విశేష గుణం. (సంపా.)

తే. **వీర లిరువురు మాన్యులు; వీరి తోడి । కయ్యమున కిప్డు మన మంత గాలుద్రవ్వ**
వలవ; దెచ్చోట నెదురుగా మెలఁగి రచట । మన రథం బల్లనల్లన చనఁగ నిమ్ము. **10**

ప్రతిపదార్థం: వీరలు+ఇరువురు= ఈ అశ్వత్థామ, కృపాచార్యులు ఇద్దరున్నూ; మాన్యులు= గౌరవించ దగినవారు; ఇప్డు= ఇప్పుడు; వీరితోడి కయ్యమునకున్= వీరితో యుద్ధానికి; మనమంత= మనమే ముందుగా (మనమంత మనంగా); కాలు+త్రవ్వ వలవదు= ప్రారంభించవద్దు; (కయ్యానికి కాలుద్రవ్వుట= ముందుగా యుద్ధానికి దిగుట); ఎచ్చోటన్= ఎక్కడ; ఎదురుగాన్= ప్రతిద్వంద్విగా; మెలఁగిరి= ఉంటారో; అచటన్= ఆ సమయంలో; మన రథంబు= మన రథాన్ని; అల్లన+అల్లన= మెల్లమెల్లగా (ప్రక్కలనుండి); చనఁగన్+ఇమ్ము= పోనిమ్ము.

తాత్పర్యం: వీరిద్దరు గౌరవించ దగినవారు. ముందుగా యుద్ధానికి వీరితో మనంత మనం దిగరాదు. వారెక్కడైనా యుద్ధానికి వస్తున్నారంటే ఆ ప్రక్కనుండి మన రథాన్ని పోనిమ్ము. (మనకు కావలసింది దుర్యోధనుడు కాని, వీరితో యుద్ధం కాదని భావం.)

విశేషం: 'వీర లిరువురు మాన్యులు'- అనే వాక్యంలో అర్జునుడు నిర్దేశించిన ఆ ఇద్ద రెవ్వరనే అంశంలో వ్యాఖ్యాతలు భిన్నాభిప్రాయాలను వెలిపుచ్చారు. వారు ద్రోణ కృపాచార్య లన్నారు కొందరు (గురువులిద్దరు). ద్రోణాశ్వత్థామలన్నారు కొందరు (గురువు, గురుపుత్రుడు). అవన్నీ సందర్భానికి కుదరవు. ఇక్కడ అశ్వత్థామ కృపాచార్యులనే గ్రహించాలి. ద్రోణుడు గురువు. అతడిమీది అపారమైన గౌరవంతో ముందుగా దాడి చేయకూడదని అర్జునుడు భావించాడు. ఆ తరువాత గౌరవార్హులైన ఇద్దరుగా అశ్వత్థామ కృపాచార్యులను పేర్కొన్నాడు. వారిమీద కూడా ముందుగా దాడిచేయకూడ దన్నాడు. మరొక విశేషం ఏమంటే - ద్రోణుడు యుద్ధానికి దిగితే అర్జునుడు ఆ తరువాత దిగుతాడు. కాని, అశ్వత్థామ కృపులు ఒకవేళ యుద్ధానికి సిద్ధమైనా వారినుండి తొలగిపోవాలని సారథికి (ఉత్తరుడికి) చెప్పటం గమనార్హం. తలపడితే గురువుతో తలపడతాడు. వీరిరువురిని ఉపేక్షిస్తాడు. అది అర్జును డా యా వీరులపట్ల చూపే ప్రతిస్పందన. దీనినిబట్టి ఆ యిరువురు అశ్వత్థామ కృపాచార్యులే కావాలి. మరొక రకమైన అన్వయం కుదురదు. (సంపా.)

శా. యోధాగ్రేసరుఁ డిద్ధతేజుఁడు, రణోద్యోగానురక్తుండు, దు
స్సాధ ప్రక్రమ బాహు వీర్యుఁడు, కురుక్ష్మాపాల వాల్లభ్య ల
క్ష్మీ ధామాత్ముఁడు, జామదగ్న్య కలిత శ్రేష్ఠాస్త్ర విద్యాఢ్యుఁ డీ
రాధేయుం డొక చీరికిం గొనఁడు వీరవ్రాతముం బోరులన్. 11

ప్రతిపదార్థం: యోధ+అగ్రేసరుఁడు= యుద్ధంచేసే వీరులలో శ్రేష్ఠుడు; ఇద్ధ తేజుఁడు= ప్రజ్వలించే తేజస్సు కలవాడు; రణ+ఉద్యోగ= యుద్ధ ప్రయత్నంలో; అనురక్తుఁడు= ఇష్టం కలవాడు; దుస్సాధ= సాధించటానికి వీలులేని; ప్రక్రమ= ప్రారంభంకల; బాహువీర్యుఁడు= భుజ పరాక్రమం కలవాడు; కురుక్ష్మాపాల= దుర్యోధనుడియొక్క; వాల్లభ్యలక్ష్మీ= ప్రేమ సంపదకు; ధామ+ఆత్ముఁడు= స్థానమైనవాడు; జామదగ్న్య= పరశురాముడి వలన; కలిత= పొందబడిన; శ్రేష్ఠ= గొప్పదైన; అస్త్రవిద్యా+ఆఢ్యుఁడు= అస్త్రవిద్యా సంపన్నుడు; ఈ రాధేయుండు= ఈ కర్ణుడు; పోరులన్= యుద్ధాలలో; వీరవ్రాతమున్= వీరుల సముదాయాన్ని; ఒక చీరికిన్+కొనఁడు= ఏ మాత్రమూ లెక్కచేయడు.

తాత్పర్యం: వీరాగ్రేసరుడు, యుద్ధప్రీతి కలిగినవాడు, అసాధ్యమైన భుజబలం కలవాడు. దుర్యోధనుడికి ప్రేమపాత్రుడు, పరశురాముడి వద్ద సకలాస్త్రాలను నేర్చినవాడు కర్ణుడు. ఇతడు యుద్ధంలో ఎటువంటి వీరులనైనా లెక్కచేయడు.

విశేషం: ద్రోణాది కురువీరులను కీర్తించే పద్ధతికీ, కర్ణ దుర్యోధనులను పరిచయం చేసే పద్ధతికీ భేదాన్ని పాటించటం తిక్కన రచనా శిల్పం. ఓజో మిశ్రితమైన ప్రసాద గుణం గల ఈ పద్యం కర్ణవీరగుణ కీర్తనం. అయితే, అర్జునుడికి కర్ణుడి పట్ల గల సహజ వైషమ్యం వలన అతడి స్తుతి అధిక్షేపాత్మకంగా భాసించవచ్చునని కొందరు వ్యాఖ్యానించారు. కాని, అది పొసగదేమో! (సంపా.)

క. శౌర్యాటోపంబున దో । ర్వీర్యంబున, నస్త్ర శస్త్ర విత్త్వమునను మా
త్సర్యంబు సేయు నాకును । దుర్యోధనుఁ డెపుడుఁ ద న్నెదురు సేయంగన్. 12

ప్రతిపదార్థం: దుర్యోధనుఁడు; శౌర్య+ఆటోపంబునన్= పరాక్రమాతిశయంలో; దోస్(ః)+వీర్యంబునన్= భుజ బలంలోను; అస్త్ర శస్త్ర విత్త్వమునను= అస్త్రాలను, శస్త్రాలను ఎరుగుటలోను; తన్నున్= కర్ణుడిని; నాకును= నాకు (అర్జునుడికి); ఎదురు+చేయంగన్= ప్రతిద్వంద్విని (పోటీ) చేయటంలో; ఎపుడున్= ఎల్లవేళలా; మాత్సర్యంబు= కిట్టనితనమును; చేయున్= చేయును.

తాత్పర్యం: శౌర్యం వలన కలిగే ఆటోపంలోకాని, భుజపరాక్రమంలోకాని, అస్త్రాలు, శస్త్రాలు తెలియటంలోకానీ, కర్ణుడిని నాకు పోటీదారుడిగా తయారుచేయటంలో దుర్యోధనుడు ఎల్లవేళలా మాత్సర్యం చూపుతూ ఉంటాడు.

విశేషం: పరాక్రమాతిశయంలో, భుజబలంలో, అస్త్రశస్త్ర పాండిత్యంలో అర్జునుడితో పోటీపడేవాడు కర్ణుడని దుర్యోధనుడి ధైర్యం. అది కారణంగా అతడు పాండవులతో మాత్సర్యం పెంచుకొన్నాడు. ఇది వాస్తవ కథనం. (సంపా.)

చ. అతిదృఢవేధి పేరుగలయట్టి మగండు రణంబు గల్గె నేఁ
డితనికి నాకుఁ దెల్లముగ నిట్టియెడం బరికించి చూడుమీ!
మతి గలఁగంగనీక యనుమానము వాయఁగ నీవు సాయకో
ద్ధతిఁ బ్రకటించుచో బహువిధంబుల నిద్దఱ తారతమ్యముల్. 13

ప్రతిపదార్థం: అతిదృఢవేధి= గట్టిగా లక్ష్యాన్ని కొట్టేవాడు; పేరుగల+అట్టి మగండు= కీర్తికల వీరుడు; నేఁడు= ఈరోజున; ఇతనికిన్+నాకున్= ఇతనికి నాకు; రణంబు= యుద్ధము; కల్గెన్= సంభవించినది; ఇట్టి+ఎడన్= ఇటువంటి సమయంలో; తెల్లముగన్= బాగా; పరికించి= పరీక్షించి; మతి= బుద్ధిని; కలఁగంగనీక= కలత చెందనియ్యక; అనుమానము= సంశయం; పాయఁగన్= పోయేటట్లుగా; సాయక+ఉద్ధతిన్= బాణాలు వేసే గర్వాన్ని; ప్రకటించుచోన్= ప్రకటించేటప్పుడు; బహువిధంబులన్= అనేకరీతులు; ఇద్దఱ తారతమ్యముల్= మా ఇద్దరిలోని భేదాన్ని; నీవు= నీవు (ఉత్తరుడా!); చూడుమీ!= గమనించుమా!

తాత్పర్యం: ఈ కర్ణుడు బాణాలతో లక్ష్యాలను గట్టిగా ఛేదించటం తెలిసినవాడు. గొప్ప వీరుడు, కీర్తి కలవాడు; ఇతడితో యుద్ధం నాకు నేటికి లభించింది. నీ విప్పుడు మనస్సు చెదరనీయక, అనుమాన మేమీ లేకుండా బాణ ప్రయోగంలో ఎవరు నేర్పరులో చూడుము. ఇంతేకాకుండా ఇంకా అన్ని విషయాలలోనూ ఎవ్వరు నేర్పరులో చూడుము. హెచ్చుతగ్గులు పరికించుము.

విశేషం: ఈ పద్యంలో అర్జునుడు ఉదాత్తుడైన వీరుడుగా చిత్రించబడ్డాడు. పరవీరనింద చేయని ఔదార్యం, స్వీయోత్కర్ష చేసికొనని ఔదాత్త్యం అర్జునుడిలో గోచరిస్తాయి. కలతపాటు లేకుండా, అనుమానం లేకుండా కర్ణార్జున యుద్ధ పరాక్రమాల తారతమ్యాన్ని అనేక విధాలుగా పరిశీలించి నిర్ణయించుమని ఉత్తరకుమారుడికి చెప్పాడు అర్జునుడు. అక్కడ తన పరాక్రమాతిశయాన్ని చెప్పుకొనలేదు. అది ధీరోదాత్తుడైన వీరుడి లక్షణం. (సంపా.)

క. ఈయన ననుఁ గని సైరణ । సేయం డితఁ డగ్గమైనఁ జిచ్చఱపిడుగై
పోయి పయిఁబడుదు; నీ వర । వా యించుక లేక పఱపవలయు రథంబున్. 14

ప్రతిపదార్థం: ఈయన= ఇతడు; ననున్+కని= నన్ను చూచి; సైరణ+చేయండు= సహించలేడు; ఇతఁడు= ఈ కర్ణుడు; అగ్గము+ఐనన్= అందుబాటైనచో; చిచ్చఱపిడుగు+ఐ= నిప్పులు చిమ్ము పిడుగై; పోయి= వెళ్ళి; పయిన్+పడుదున్= మీద పడతాను; నీవు= (ఉత్తరకుమారా!)నీవు; అరవాయి= సంకోచం; ఇంచుక లేక= కొద్దిగాకూడా లేకుండా; రథంబున్= రథాన్ని; పఱపవలయున్= తోలాలి.

తాత్పర్యం: ఇతడు నన్ను చూచి ఊరుకోడు. ఒకవేళ ఇతడు అందుబాటుగా వచ్చెనా, నిప్పుల పిడుగువలె ఇతడిపై పడతాను. నీ వేమాత్రం సంశయించక రథాన్ని నడపాలి సుమా!

విశేషం: కర్ణుడు అర్జునుడిని చూస్తే సహించలేడు. అతడు దూసుకొని వచ్చి దాడి చేస్తాడు. అతడిని అర్జునుడు కూడ సహించడు. అందువలన నిప్పుల పిడుగువలె ఒక్కసారి విరుచుకొని పడతాడట! ఊహించనివిధంగా ఒక్కసారి మీద పడి నుగ్గు నుగ్గు చేసే మెరుపు దాడి చేసేవాడిని 'చిచ్చఱ పిడుగు' అని అంటారు. ఇది తెలుగు జాతీయం. (సంపా.)

ఉ. ఉగ్రుఁ, డనూన మాన మహిమోన్నత చిత్తుఁ, డజయ్య విక్రమో
దగ్రుఁడు, హస్తలాఘవ సమన్వితుఁ డేయునెడన్, సమగ్ర కో
పాగ్రహబుద్ధి మా దెస, ననార్యుఁడు గార్యమునందు ధార్తరా
ష్ట్రాగ్రజుఁ డీతనిం గదిసినప్పుడు పండువు నాకు నుత్తరా! 15

ప్రతిపదార్థం: ధార్తరాష్ట్ర+అగ్రజుఁడు= ధృతరాష్ట్రుడి కొడుకులలో పెద్దవాడు (దుర్యోధనుడు); ఉగ్రుఁడు= భీకరమైనవాడు; అనూన= తక్కువకాని; మానమహిమ= అభిమానాతిశయంలో; ఉన్నతచిత్తుఁడు= గొప్పదైన మనస్సు కలవాడు; అజయ్య= జయింప శక్యముకాని; విక్రమ= పరాక్రమంతో; ఉదగ్రుఁడు= గొప్పవాడు; ఏయు+ఎడన్= బాణములు వేయుట యందు;

హస్తలాఘవ సమన్వితుఁడు= చేతిసులువు కలవాడు; మా దెసన్= మా పట్ల; సమగ్ర= పూర్తియైన; కోప+ఆగ్రహ= కోపం, పట్టుదలకల; బుద్ధి= మనస్సు కలవాడు; కార్యమునందున్= పనిపట్ల; అనార్యుఁడు= దుష్టుడు; ఉత్తరా!= ఉత్తరకుమారా!; ఈతనిన్= ఈ దుర్యోధనుడిని; కదిసిన+అప్పుడు= ఎదిర్చినప్పుడు; నాకున్= నాకు (అర్జుననుకు); పండువు= ఉత్సవం (వేడుకగా ఉంటుంది).

తాత్పర్యం: ధార్తరాష్ట్రులలో పెద్దవాడైన ఈ దుర్యోధనుడు ఎక్కువ అభిమానం కలవాడు. ఉన్నతమైన మనస్సు కలవాడు. జయించ శక్యంకాని పరాక్రమం కలిగిన గొప్పవాడు. బాణాలు వేయటంలో చేతిసులువు కలవాడు. కాని, మాపట్ల కోపబుద్ధి కలిగినవాడు. కార్యములందు దుష్టుడు. ఉత్తరకుమారా ఈ దుర్యోధనుడిని ఎదిర్చినపుడు నాకు పండుగే!

విశేషం: దుర్యోధనుడిని పరిచయం చేయటంలో అర్జునుడు ఒక ప్రత్యేకతను ప్రదర్శించాడు. సాధారణ ధర్మాలతోపాటు సాపేక్ష లక్షణాలను కూడ పేర్కొన్నాడు. అవి తెలుపు నలుపుల చిత్రాన్ని అందించాయి. అతడు స్వయంగా ఉగ్రుడు. పాండవులపట్ల కోపాగ్రబుద్ధి. సహజంగా అనూనమాన మహితోన్నత చిత్తుడు. కాని, కార్యములందు అనార్యుడు. బాణాలు వేసేటప్పుడు నేర్పుతో కూడిన హస్తలాఘవం కలవాడు. అయితే అర్జునుడి ఎదుట నిలువలేనివాడు. ఈ వైరుద్ధ్య గుణచిత్రణ మిందులోని వైచిత్రి. (సంపా.)

తే. అరసికొని యెన్నిభంగులనైన నితని, । తేరు మనబారి కగపడు తెఱఁగు గాంచి
యడరి బాసటయై యెవ్వ రడ్డపడిన । మెఱపు మెఱసిన చాడ్పునఁ దఱియఁ జొరుము. 16

ప్రతిపదార్థం: అరసికొని= తెలిసికొని; ఎన్ని భంగులన్+ఐనన్= ఎన్ని రీతులుగా నైనా; ఇతని తేరు= ఈ దుర్యోధనుడి రథం; మన బారికిన్= మనకు లక్ష్యమైన పరిధిలోనికి; అగపడు తెఱఁగు= కనిపించే విధం; కాంచి= చూచి; అడరి= విజృంభించి; బాసట+ఐ= సహాయమై; ఎవ్వరు= ఏ వీరులు; అడ్డ పడినన్= అడ్డం వచ్చినా; మెరపు మెరసిన చాడ్పునన్= తళుక్కున మెరపు మెరసినట్లు; తరియన్+చొరుము= దగ్గరకు సమీపించుము.

తాత్పర్యం: వెదకి చూచి యేరీతిగానైనా ఆ దుర్యోధనుడి రథాన్ని మనం కొట్టటానికి వీలుకలిగే పరిస్థితిని చూచి, విజృంభించి ఎవ్వరైనా సరే అడ్డువచ్చినప్పటికీ, కను మూసి తెరచినంతలో మెరుపు మెరిసినట్లుగా దుర్యోధనుడిని సమీపించుము.

విశేషం: అలం: ఉపమ.

క. అస్మత్పితామహుం డతి । విస్మయ జనన ప్రతాప విభవాగ్ని శిఖా
భస్మీభూత ప్రతిప । క్షస్మయ కాననుఁడు, ప్రథమగణ్యుఁడు బుద్ధిన్. 17

ప్రతిపదార్థం: అస్మద్+పితామహుండు= మా తాతగారు (భీష్ములవారు); అతి విస్మయజనన= మిక్కిలి ఆశ్చర్యం కల్గించే; ప్రతాపవిభవ= ప్రతాప వైభవమనే (ప్రతాపమంటే పేరు చెప్పిన వెంటనే ఎదుటివారు హడలిపోయేట్లు ఉండటం); అగ్నిశిఖా= అగ్నిజ్వాలచేత; భస్మీభూత= భస్మం అయిన; ప్రతిపక్ష= ఎదుటి పక్షంయొక్క; స్మయ= గర్వం అనే; కాననుఁడు= వనం కలవాడు; బుద్ధిన్= బుద్ధిలో; ప్రథమగణ్యుఁడు= ముందుగా లెక్కింపదగ్గవాడు.

తాత్పర్యం: మా తాత అయిన భీష్ముడు గొప్ప ప్రతాపం కలవాడు. శత్రుపక్షుల గర్వమనే అరణ్యాన్ని తన ప్రతాపమనే అగ్నిజ్వాలచేత భస్మీభూతం చేయగలవాడు. బుద్ధిలో మొదటివానిగా లెక్కించదగ్గవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. బహు మహితాయుధ విద్యా । రహస్య సంవేది, ధార్తరాష్ట్రులకును మా
కు హితంబ కోరు సముఁడై, । సహాయ మగు వారలకు నచటఁ దా ననికిన్. 18

ప్రతిపదార్థం: బహు= ఎక్కువ; మహిత= గొప్పవైన; ఆయుధ= ఆయుధాల; విద్యా రహస్య= విద్యా రహస్యాలను; సంవేది= బాగా ఎరిగినవాడు; ధార్తరాష్ట్రులకును= కౌరవులకు; మాకున్= మాకును (పాండవులకు); సముఁడు+ఐ= ఇరువురి యెడల సమానమైన అనురాగం కలవాడై; హితంబు+అ= హితమే; కోరున్= కోరతాడు; తాన్= ఆ భీష్ముడు; అచటన్= అచటనే (కౌరవుల వద్దనే); ఉనికిన్= ఉండటంచేత; వారలకున్= కౌరవులకు; సహాయము+అగున్= సహాయపడుతున్నాడు.

తాత్పర్యం: చాలా గొప్పవైన ఆయుధ విద్యా రహస్యాలు బాగా తెలిసినవాడు, కౌరవులకూ మాకూ సమంగా హితం కోరేవాడు. అక్కడ కౌరవుల వద్దనే ఉంటున్నందువలన వారికి సహాయపడతాడు.

క. వివిధము లగు లక్ష్యంబుల । నవలీలం దునియ నాట నవియఁగ నేయున్;
భువనైక ధన్వి నత్యు । గ్ర విచేష్టితు నోర్చెఁ బరశురాముం బోరన్. 19

ప్రతిపదార్థం: వివిధములు+అగు= పలురకాలైన; లక్ష్యంబులన్= కొట్టవలసిన లక్ష్యాలను; అవలీలన్= తేలికగా; తునియఁగన్= విరగ గొట్టేటట్లుగా; నాటన్= నాటేటట్లుగా; అవియఁగన్= పగిలేటట్లుగా; ఏయున్= బాణాలు వేస్తాడు; పోరన్= యుద్ధంలో; భువన+ఏక, ధన్విన్= లోకంలో శ్రేష్ఠుడైన విలుకాడైనవాడిని; అతి+ఉగ్ర= మిక్కిలి భయంకరమైన; విచేష్టితున్= క్రియగలవాడిని; పరశురామున్= పరశురాముడిని; ఓర్చెన్= ఓడించాడు.

తాత్పర్యం: అనేక రకాలైన లక్ష్యాలను మధ్యకు విరిగేటట్లుగా, నాటేటట్లుగా, పగిలేటట్లుగా సులువుగా బాణాలు వేయగలడు. ప్రపంచంలో శ్రేష్ఠుడైన విలుకాడూ, యుద్ధంలో అతిభయంకరుడూ అయిన పరశురాముడిని ఓడించిన మహావీరుడు.

క. శంతనునందను నరదము । పొంతం బోవలవ; దలుక పుట్టి యతఁడు భూ
కాంతునకు సైన్యమునకుం । జెంతలఁ జేరంగనీక సిలుగులఁ బెట్టున్.' 20

ప్రతిపదార్థం: శంతను నందను+అరదము= భీష్ముడి రథంయొక్క; పొంతన్= దరిదాపులకు; పోవలవదు= పోవద్దు; అతఁడు= ఆ భీష్ముడు; అలుక పుట్టి= కోపం వచ్చి; భూకాంతునకున్= దుర్యోధనుడికి; సైన్యమునకున్= సైన్యానికి; చెంతలన్+చేరంగనీక= దరిదాపులకు (మనలను) రానీయకుండా; సిలుగులన్+పెట్టున్= ఇబ్బందులు పెట్టగలడు.

తాత్పర్యం: భీష్ముడి రథం ఉన్న ప్రాంతానికి మన రథం పోనీయకుము. అతడికి కోపం వచ్చిందా- మనలను దుర్యోధనుడికి గాని, అతడి సైన్యానికి గాని దరిదాపులకు చేరనియ్యడు.'

విశేషం: భీష్ముడు పితామహుడు (తాత). ఆయనను గురించి నాలుగు కందపద్యాలు చెప్పాడు అర్జునుడు. భీష్ముడు ఆలోచనలో అగ్రగణ్యుడు. ఎంతటి శత్రువులనైనా భస్మం చేసికాని వదలనివాడు. అస్త్రవిద్యా రహస్యవేది. మనసు పాండవులమీద ఉన్నా కౌరవులలో ఉండి వారికి చేదోడుగా ఉండేవాడు. వివిధ లక్ష్యాలను తేలికగా భేదించగల గొప్ప విలుకాడు. పరశురామ శిష్యుడు. అతడివైపుపోతే అసలుకే మోసం వస్తుంది. అతడికి కోపం వచ్చిందా రాజువైపు అడుగు సాగనివ్వడు. అడ్డగించి ఇబ్బందులపాలు చేస్తాడు. కాబట్టి అతడికి దూరంగానే రథాన్ని సాగిస్తూ దుర్యోధనుడిని సమీపించాలని అర్జునుడి వ్యూహం. ఉత్తరోత్తరం బలీయం - అనే న్యాయాన్ని అనుసరించి కురువీరులందరిలో అజేయుడు భీష్ముడని ధ్వని. (సంపా.)

వ. అని యిట్లు వేఱు వేఱం జూపి, క్రమంబున నేర్పడం జెప్పి సవ్యసాచి సమరోన్ముఖుం డగు సమయంబున సస్మితుం డగుచు నశ్వత్థామ రవితనయు నవలోకించి యిట్లనియె. 21

ప్రతిపదార్థం: అని= పలికి; ఇట్లు= ఈరీతిగా; వేఱువేఱన్= వేర్వేరుగా (విడివిడిగా); చూపి= వీరులను కనబరచి; క్రమంబునన్= వరుసగా; ఏర్పడన్+చెప్పి= స్పష్టంగా తెలిసేటట్లు చెప్పి; సవ్యసాచి= అర్జునుడు; సమర+ఉన్ముఖుండు= యుద్ధానికి సిద్ధమైనవాడు; అగు సమయంబునన్= అయ్యే సమయంలో; అశ్వత్థామ; సస్మితుండు+అగుచున్= చిరునవ్వు కలవాడవుతూ; రవితనయున్= కర్ణుడిని; అవలోకించి= చూచి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు వీరులను విడివిడిగా చూపించి, ఇక యుద్ధానికి దిగేసమయంలో, అశ్వత్థామ కర్ణుడిని చూచి చిరునవ్వు నవ్వుతూ ఈ విధంగా అన్నాడు.

క. 'నిను నీవ పొగడికొని పలి । కిన పలుకులు పెక్కు గలవు; క్రీడి యనికి వ
చ్చినవాఁ డిదె పులివలె; మా । ర్కొన రాదే కర్ణ! సేనకుం బ్రియ మెసఁగన్. 22

ప్రతిపదార్థం: కర్ణ!= ఓ కర్ణా!; నినున్= నిన్ను; నీవు+అ= నీవే; పొగడికొని= స్తుతించుకొని; పలికిన= అన్న; పలుకులు= మాటలు; పెక్కు= ఎన్నో; కలవు= ఉన్నవి; క్రీడి= అర్జునుడు; అనికిన్= యుద్ధానికి; పులివలెన్= పులివలె భయం కొలిపేవిధంగా; ఇదె= ఇదిగో; వచ్చినవాఁడు= వచ్చాడు; సేనకున్= సైన్యానికి; ప్రియము= ప్రీతి; ఎసఁగన్= ఎక్కువయ్యేటట్లు; మార్కొనరాదే?= ఎదుర్కొన రాదా?

తాత్పర్యం: 'ఓ కర్ణా! ఇంతకు ముందు ఎన్నోసార్లు నిన్ను నీవు పొగడుకొన్నావు. అర్జునుడు పులివలె అదుగో వచ్చాడు. అతడిని ఎదుర్కొనుము. సైన్యం సంతోషిస్తుంది.

విశేషం: అలం: ఉపమ. కర్ణుడు తనను తానే ఎన్నోసార్లు పొగడుకొన్నాడు. మరొకరు పొగడటం ఉచితం. ఎవ్వరూ పొగడేవారు లేకపోవడం చేత తనను తానే పొగడుకొనవలసి వచ్చిందని అశ్వత్థామ చెప్పుతున్నాడు. కర్ణుడు తనను తాను పొగడుకొనే సందర్భంలో అర్జునుడిని మట్టుపెడతాను అని కొన్ని క్షణాలముందే కురువీరుల ముందు ప్రగల్భాలాడాడు (చూడండి. 4 ఆశ్వా. 200-205 ప.) అందుకే అశ్వత్థామ కర్ణుడిని చూచి, అదుగో అర్జునుడు పులివలె యుద్ధంలోకి ధైర్యంగా వచ్చాడు. పిల్లివలె కాదు- అని ఎత్తిపొడుస్తున్నాడు.

క. తలఁకు గలదేని శకునిం, । బిలిచి విచారింపఁ బొమ్ము; పృథివీపతి నీ
తలన తన కార్యఖడ్గం । బుల మోపెక్కించె; రిత్తవోవునె నీకున్? 23

ప్రతిపదార్థం: తలఁకు= భయం; కలదు+ఏని(న్)= ఉంటే; శకునిన్= శకునిని; పిలిచి= పిలిచికొని; విచారింపన్= ఆలోచించటానికి; పొమ్ము= వెళ్ళుము; పృథివీపతి= దుర్యోధనుడు; తన కార్య ఖడ్గంబుల= తన రాజకార్యాలయొక్క, యుద్ధాలయొక్క; మోపున్= భారాన్ని; నీ తలన్+అ= నీ మీదనే; ఎక్కించెన్= (విశ్వాసంతో) ఉంచాడు; నీకున్= నీకు; రిత్త+పోవునె?= (ఆ బాధ్యత) వృథా పోతుందా?

తాత్పర్యం: ఒకవేళ అర్జునుడి వలన నీకు భయం వేస్తే, శకునితో వెళ్ళి ఆలోచించుము. వెళ్ళుము. మన రాజు తన రాజకార్యాల, యుద్ధాల భారం నీ తలపై మోపాడు కదా! మరి నీకు తప్పుతుందా?'

విశేషం: అశ్వత్థామ మాటలు అక్షరాలా అధిక్షేపోక్తులే. కర్ణుడు ద్రోణాది వృద్ధులను కొన్ని క్షణాల క్రితం నిందించి పలికాడు. దుర్యోధనుడి యోగక్షేమం కోరే వీరుడు తానేనని చెప్పుకొన్నాడు. ఆ మాటలవలన కురువీరులలో రెండు పక్షాలు ఉన్నాయని స్పష్టమయ్యాయి. ఆ విభజనమనస్తత్వానికి మూలకారకుడు కర్ణుడని అశ్వత్థామ అభిప్రాయం. శిష్టచతుష్టయం (భీష్మ, ద్రోణ, కృపాశ్వత్థామలు) ఒక పక్షం. వీరు పాండవ పక్షపాతులుగా కర్ణుడు వ్యాఖ్యానించాడు. ఇక మిగిలినది దుష్ట చతుష్టయం (దుర్యోధన కర్ణ శకుని దుశ్శాసనులు). దుష్టచతుష్టయం దృష్టిలో పై శిష్ట చతుష్టయమే దుష్టచతుష్టయం. అందువలన బాహాటంగా వారిని నిందించటంలో కర్ణుడు ప్రధానపాత్ర నిర్వహిస్తుంటాడు. ఈ భూమికతో చూస్తే - అశ్వత్థామ అధిక్షేపోక్తులు అర్థవంతంగా ఉంటాయి. అర్జునుడు యుద్ధానికి వచ్చాడు. కాని, శిష్టచతుష్టయాన్ని వినయ గౌరవాలతో సంభావించి, కర్ణుడిని నిరాదరించి, దుర్యోధనుడిపై సూటిగా దాడి చేయబోతున్నాడు. అర్జునుడు తమపై బాణాలు గుప్పితే కాని శిష్టచతుష్టయం యుద్ధం ప్రారంభించేటట్లు లేదు. అది వారి ఆంతర్యం. దానిని భీష్మాదులు చెప్పరు. కాని, అశ్వత్థామ ఆవేశపరు డయినా, దానిని కప్పిపుచ్చి, తాము యుద్ధం ప్రారంభించక పూర్వమే నీవొక్కడివే అర్జునుడికి అడ్డు తగిలి - 'ఒక వీరున కొక్కఁడ చాలు గాక! యెందఱు వలయున్?' (4-201) అని పలికిన పౌరుష వాక్యాలను నిజం చేసికొనుమని హెచ్చరించాడు. అంతేకాదు- 'యుద్ధం బాణాల ఆటకాని, జూదపు పావుల ఆట కాదు. బాణాలతో గెలువలేని మీరు శకుని జూదాల ఆటతోనే గెలవటం అలవాటు. నీకు భయంగా ఉంటే ఆ శకుని సలహా పాటించుము'-అని అధిక్షేపించాడు. నిజమైన వీరుడికి ఈ మాటలు నిప్పులు మీద క్రుమ్మరించినట్లుంటాయి. కర్ణుడు అందుకే మండిపడ్డాడు. (సంపా.)

వ. అనిన విని యతండు క్రోధ ఘూర్ణమాన తారకుం డగుచు నిట్లనియె. 24

ప్రతిపదార్థం: అనినన్= అని పల్కగా; విని= విని; అతఁడు= ఆ కర్ణుడు; క్రోధ= కోపంతో; ఘూర్ణమాన= తిరుగుడుపడుతున్న; తారకుండు+అగుచున్= కనుపాపలు కలవాడౌతూ; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అశ్వత్థామ పైవిధంగా దెప్పిపొడవటంతో, కర్ణుడు కోపంతో కనుపాపలు కదులుతూ ఉండగా ఈ విధంగా అన్నాడు.

విశేషం: 'అనిన విని యతం డిట్లనియె'-అంటే చాలు. కాని, తిక్కన 'క్రోధ ఘూర్ణమాన తారకుం' డగుచు - అని అభినయాంశను విడవకుండా వర్ణించాడు. అది నాటకీయతలో భాగం. భరతనాట్యశాస్త్రంలో అన్ని రసాల వలెనే రౌద్రరసం కూడా ఆంగికం, నైపథ్యం, వాచికం అని మూడు విధాలుగా చెప్పబడింది. క్రోధం రౌద్రరసానికి స్థాయి భావం. దానికి ఆక్షేప వచనం విభావాలలో ఒకటి. కర్ణుడు ద్రోణాదుల పట్ల అవజ్ఞగా మాట్లాడాడు. ఉత్తములయందు అవజ్ఞ మానసికంగా ఉంటుంది. మిగిలినవారియందు వాచికమైన అవజ్ఞ నిందారూపంగా ఉంటుంది. కర్ణుడు వాచికమైన అవజ్ఞ చేశాడు. దానికి ప్రతిగా అశ్వత్థామ వాచికమైన ఆక్షేపం చేశాడు. దానికి కర్ణుడికి క్రోధం వచ్చింది. క్రోధాన్ని మూడు రకాలుగా శారదాతనయుడు భావప్రకాశంలో వివరించాడు - క్రోధం, కోపం, రోషం అని. అందులో క్రోధం- శత్రు, మిత్ర, ప్రియా, భృత్య, పూజ్యాదులను బట్టి అయిదు విధాలు. వాటిలో భృత్యులమీద కలిగే క్రోధంలో శిరఃకంపం, అక్షి విక్షేపం, వ్రేలితో బెదిరించటం, మరలిమరలి చూడటం అనేవి ఆంగికాభినయాలు. (వివరాలకు చూడండి : సాత్త్వికాభినయం - డాక్టర్ పి.ఎస్.ఆర్.అప్పారావు, ప. 484-485). కర్ణుడు క్రోధంతో కనుగ్రుడ్లు త్రిప్పాడని తిక్కన వర్ణన. ఇది క్రోధాభినయం. అందులోనూ అశ్వత్థామ పట్ల కర్ణుడికి గల అలక్ష్య (అగౌరవ) భావాన్ని వ్యంజింప చేయుటానికి తిక్కన భృత్యులమీద కలిగే క్రోధభావ చేష్టను ఎన్నుకొనటం గమనించదగిన అంశం. అభినయం కూడా తిక్కన రచనలో రస వ్యంజకమే. (సంపా.)

చ. 'తలఁకెడు వానికిన్ మగఁడ తానటె నన్నడఁకించు వాఁ? డిసీ
పలుకకు; భీతున ట్లొదుఁగఁ బాఱునె శూరుఁడు? నిన్ను నచ్చి యే
కలనికి వచ్చితిన్; నరుఁడ కాఁ డట వాసవుఁడైన నేమి నా
బలముఁ జలంబు నేరిమియు బంటుతనంబును నీవ చూడుమీ!' 25

ప్రతిపదార్థం: తలఁకెడు వానికిన్, మగఁడు+అ= భయపడేవాడికి మగడైనవాడే! (మగడు - తెలుగు జాతీయం. భయపడే వాడికి కొమ్ముకాసేవాడు అని భావం); తాన్= తానే (భయపడేవాడే); నన్నున్= (కర్ణుడిని); అడఁకించువాఁడు+అటె?= ఎగతాళి చేసేవాడా?; ఇసీ= ఛీ; పలుకకు= ఎక్కువగా మాట్లాడకుము (నోరు మూసుకొమ్మని భావం); శూరుఁడు= వీరుడు; భీతు+అట్లు= భయపడిన వాడివలె; ఒదుఁగన్+పాఱునె?= ప్రక్కకు ఒదిగి వేగంగా పరుగెత్తుతాడా?; నిన్నున్= అశ్వత్థామను; నచ్చి= నమ్మి; ఏన్= కర్ణుడు; కలనికిన్= యుద్ధానికి; వచ్చితిన్= వచ్చానా? (రాలేదని భావం); నరుఁడు+అ, కాఁడు= అర్జునుడే కాదు; వాసవుఁడు+ఐనన్+ఏమి?= ఇంద్రుడైనా లెక్కేమిటి; నీవు+అ= నీవే స్వయంగా; నా బలమున్+చలంబున్= నా బలాన్నీ, పట్టుదలనూ; నేరిమియున్= నేర్పరితనాన్నీ; బంటుతనంబును= పరాక్రమాన్నీ; చూడుమీ!= కళ్ళారా చూడు.

తాత్పర్యం: 'భయపడేవాడికి కొమ్ముకాసేవాడు తన సంగతి తెలిసికొనలేక నన్ను ఎగతాళి చేసేవాడా? (నీ మాటలు నాపట్ల అట్లా ఉన్నాయి). ఛీ! నీవు నాతో ఎక్కువగా మాట్లాడకుము. పరాక్రమవంతుడు ఎక్కడైనా పిరికివాడివలె ప్రక్కకు తప్పుకొంటూ పరుగెత్తుతాడా? నిన్ను నమ్మి నేను యుద్ధానికి వచ్చానా? (నా పరాక్రమం మీద నాకు గట్టి నమ్మకం ఉన్నది). అర్జునుడే కాదు (అతడి బాబు అయిన) ఇంద్రుడు వచ్చినా నాకేమి? నా బలాన్నీ, పౌరుషాన్నీ, నేర్పరితనాన్నీ, పరాక్రమాన్నీ నీవే కళ్ళారా చూద్దువు గాని.'

విశేషం: కర్ణుడు కోపంతో పల్కిన మాట లివి. అందుకే - ఈ పద్యంలోని వాక్యాలమధ్య వాచికాభినయగతమైన విరామాలు కనబడతాయి. ఒక్కొక్క వాక్యం ఒక్కొక్క సంచారి భావానికి వ్యంజకం. 'తలఁకు గలదేని'.... అని అశ్వత్థామ ఆక్షేపించాడు. దానికి ప్రతిగా 'తలఁకెడు వానికిన్ మగఁడ...' అని కర్ణుడు అధిక్షేపించాడు. సూటిగా అశ్వత్థామను సంబోధించకుండా ప్రథమ పురుషలో మొదటి వాక్యం పలికాడు. ఇది గర్వం అనే సంచారి భావ వ్యంజకం. ఛీ! నాతో మాట్లాడకు - అని చీదరించుకొనటం మధ్యమ పురుషలో సాగింది. ఇది అమర్ష చిహ్నం. శూరుడు భీరువు వలె ప్రక్కకొదిగిపోతాడా?- అన్న వాక్యం అశ్వత్థామ పరంగానే కాక అర్జునుడిపరంగా కూడా చేసిన అధిక్షేపం. ఇది గర్వభావ వ్యంజకం. 'నిన్ను నమ్మి నేను యుద్ధానికి రాలేదు' మదభావ సూచకం. నరుడినే కాదని, ఇంద్రుడినైనా ఎదురిస్తా ననటం అతని ఔద్ధత్య, ఉగ్రత, ఉత్సాహ భావ వ్యంజకం. ఈ పద్యంలో ఇటు అశ్వత్థామను ప్రత్యక్షంగానూ, అటు అర్జునుడిని పరోక్షంగానూ కర్ణుడు పరిహసించాడు. తలఁకెడువాడు కర్ణుడని అశ్వత్థామ అంటే.. తలఁకెడువాడైన అర్జునుడి కొమ్ము గాసేవాడు అశ్వత్థామ అని కర్ణుడన్నాడు. అర్జునుడు సైన్యం మీదకు సూటిగా రాకుండా ప్రక్కకు ఒదిగి వ్యూహం ప్రకారం దుర్యోధనుడిని పట్టుకొనటానికి పోతున్నాడు. కాని, అతడు 'భీతు నట్లొదుఁగఁ బాఱు శూరు' డని కర్ణుడి అధిక్షేపం. నిజానికి భయపడుతున్నవాడు అర్జునుడని, వాడిని తలదన్నినవాడు అశ్వత్థామ అనీ కర్ణుడి అవహేళన. అశ్వత్థామకు దీటైన ప్రతిసమాధాన మిది. అంతేకాదు, ఎంతటి వీరులనైనా చులకనగా మాట్లాడే కర్ణుడి స్వభావం మరొకసారి బయటపడింది. (సంపా.)

క. అని కడఁగు నినసుతునకు । మ్మును ద్రోణుఁడు ద్రోణనందనుఁడుఁ గృపుఁడును శాం
తనవుఁడుఁ గడఁగుట దుర్యో । ధనుఁ డవలోకించి యత్యుదగ్రతఁ గడఁగెన్. 26

ప్రతిపదార్థం: అని= పలికి; కడఁగు+ఇనసుతునకున్= (యుద్ధానికి) పూనుకొనే కర్ణునకు; మును= ముందుగా; ద్రోణుఁడున్= ద్రోణుడును; ద్రోణనందనుఁడున్= అశ్వత్థామయును; కృపుఁడును= కృపాచార్యుడూ; శాంతనవుఁడున్= భీష్ముడును; కడఁగుట= యుద్ధానికి పూనుకొనటం; దుర్యోధనుఁడు; అవలోకించి= చూచి; అతి+ఉదగ్రతన్= మిక్కిలి భయంకరంగా; కడఁగెన్= సిద్ధమయ్యాడు.

తాత్పర్యం: అట్లా పలికి యుద్ధానికి కర్ణుడు పూనుకొనటానికి ముందే ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు, భీష్ముడు సన్నద్ధమయ్యారు. అది చూచి దుర్యోధనుడు కూడా అత్యంతావేశంతో యుద్ధానికి సిద్ధమయ్యాడు.

విశేషం: ఈ పద్యంలో కదులుతున్న సైన్య వ్యూహాన్ని కన్నులకు కట్టేటట్టు చలనచిత్రంగా తిక్కన పరిచయం చేస్తున్నాడు. అర్జునుడు ఎవరిని కదిలించకుండా ముందుకు సాగాలనుకొన్నాడో ఆ నలుగురూ స్వీయ ప్రేరణతో దుర్యోధన రక్షణార్థం అర్జునుడిని అడ్డగించాలని సంకల్పించారు. అంతలో అశ్వత్థామ కర్ణుడిని అధిక్షేపించాడు. అతడిచేత ప్రేరితుడై కర్ణుడు తానే ముందు యుద్ధానికి సిద్ధమౌతున్నట్లు ముందుకు సాగాడు. కాని, అంతకంటే ముందే 'శిష్టచతుష్టయం' ముందుకు నడుస్తూ కనపడింది. కర్ణుడు వారి వెనుకవాడయ్యాడు. వారందరిని చూచి దుర్యోధనుడు రంగప్రవేశం చేశాడు. అర్జునుడు అనుకొన్నంత పనీ జరిగింది. గోవులు మరలిన ప్రదేశం ప్రస్తుత యుద్ధ రంగస్థలమయింది. కౌరవసేన నడిమి భాగాన్ని అర్జునుడు ఢీకొన్నాడు. అందువలన కౌరవసేన అతడి చుట్టూమూగి యుద్ధం చేసే అవకాశం కలిగింది. (సంపా.)

వ. ఇవ్విధంబున నయ్యేవురు దొరలును ధరణీశుండును సరభసంబుగా బరవసంబు సేసిన దుశ్శాసన దుష్ప్రహ దుర్ముఖ ప్రముఖ నిఖిల కురుకుమార నికాయంబును శకుని సైంధవ ప్రభృతి బంధు నివహంబును బాహ్లిక సోమదత్తాది సామంత నికురుంబంబును మఱియునుంగల వివిధ యోధ వీర నిచయంబును నొక్కటఁ గరటిఘటా ఘోటకఘట్ట రథయూధ పదాతి వితతి సంరంభ శుంభత్సేనా సమూహ సహితంబుగాఁ ద్రోచి నడచిన. 27

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈరీతిగా; ఆ+ఏవురు= ఆ అయిదుగురు; దొరలునున్= వీరులును; ధరణీశుండును= రాజైన దుర్యోధనుడును; సరభసంబుగాన్= తొందర తొందరగా; బరవసంబు+చేసినన్= ధైర్యం చేయగా, సాహసం చేయగా; దుశ్శాసన, దుష్ప్రహ, దుర్ముఖ ప్రముఖ= దుశ్శాసనుడు, దుష్ప్రహుడు, దుర్ముఖుడు మొదలైన; నిఖిల= సమస్తమైన; కురుకుమార= ధృతరాష్ట్రుని కుమారులయొక్క; నికాయంబునున్= సముదాయమున్నూ; శకుని, సైంధవ ప్రభృతి= శకుని, సైంధవుడు మొదలైన; బంధు నివహంబునున్= బంధువుల సముదాయమున్నూ; బాహ్లిక సోమదత్త+ఆది= బాహ్లికుడు, సోమదత్తుడు మొదలైన; సామంత= సామంతుల; నికురుంబంబును= సముదాయమున్నూ; మరియునున్+కల= ఇంకా ఉన్న; వివిధయోధ= పలురకాల యోధుల; వీరనిచయంబును= వీరుల సముదాయమున్నూ; ఒక్కటన్= ఒక్కటిగా; కరటి ఘటా= ఏనుగు గుంపులు; ఘోటకఘట్ట= గుర్రాల గుంపును; రథ= రథముల; యూధ= సమూహం; పదాతివితతి= కాల్బలము సముదాయముల; సంరంభ= హడావిడితో; శుంభత్= శోభిల్లు; సేనాసమూహ= సేనల సముదాయంతో; సహితంబుగాన్= కూడుకొని; త్రోచి= వేగంగా; నడచినన్= ముందుకు సాగగా.

తాత్పర్యం: ఈ రీతిగా ఆ అయిదుగురు వీరులు, రారాజు తొందరగా ధైర్యం చేసి ముందుకు పోయిన వెంటనే, దుశ్శాసనాది కౌరవకుమారులు, శకుని సైంధవాది బంధువులు, బాహ్లిక సోమదత్తాది సామంతులు, ఇంకా ఉన్న సేనాయోధులు, రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలం - అందరూ తొందరగా ఒక్కసారిగా ముందుకు త్రోసికొని వెళ్ళగా.

విశేషం: రారాజు యుద్ధానికి సాగగానే అతడి వెంట అతడి తమ్ములు, బంధువులైన శకుని సైంధవాదులూ, బాహ్లిక సోమదత్తాది సామంతులూ, వారి వెంట ఇతర వీరులూ చతురంగ బలాలతో దొమ్మిగా, వేగంగా తరుముకొంటూ నడిచారు. భీష్మాదులనుండి దుర్యోధనుడి వరకూ సాగిన వరుస ఒక క్రమశిక్షణతో సాగినట్లు పద్యాలలో చెప్పటం విశేషం. పద్యచరణ గణక్రమబద్ధత వారి సేనల గతిని సూచించింది. దుర్యోధనుడి సోదర బంధు సామంత మిత్రుల సన్నాహాలను వచనంలో చెప్పి, వారు 'త్రోసికొంటూ' నడిచిన వైఖరిని ధ్వనింప చేశాడు తిక్కన. ఈ త్రోవుడు నడకను సైన్యాలలో విరివిగా వర్ణించటం ఈ ఘట్టంలో గోచరిస్తుంది. (సంపా.)

చ. ధరణి వడంకె, ధూళి దివిఁ దన్నిన భానుని గానరాద, బం
ధుర వివిధప్రకార పటు తూర్యరవంబులఁ బొంగె దిక్కు లా
స్ఫురిత మహాయుధోగ్ర రుచిపుంజ విజృంభణ ఘోర మయ్యె నం
తరము సహస్రనేత్ర ముఖదైవత మండల దుర్నిరీక్షమై. 28

ప్రతిపదార్థం: ధరణి= భూమి; వడంకెన్= కంపించింది; ధూళి= పరాగం; దివిన్= ఆకాశంలో; తన్నినన్= ఎగయగా; భానునిన్= సూర్యుడిని; కానరాదు+అ= చూడటానికి వీలులేక పోయింది; బంధుర= ఒప్పిదమైన; వివిధప్రకార= నానారీతుల; పటు= గొప్పదైన; తూర్యరవంబులన్= వాద్యాల ధ్వనులతో; దిక్కులు= దిశలు; పొంగెన్= నిండినవి; ఆస్ఫురిత= ప్రకాశించే; మహాయుధ= గొప్ప ఆయుధాల; ఉగ్ర= భయంకరమైన; రుచిపుంజ= కాంతి సమూహాల; విజృంభణన్= చెలరేగటంతో; అంతరము= భూమ్యాకాశాల నడిమి చోటు; సహస్రనేత్రముఖ= దేవేంద్రుడు మొదలైన; దైవత= దేవతల; మండల= సముదాయానికి; దుర్నిరీక్షము+ఐ= చూడశక్యం కానిదై; ఘోరము+అయ్యెన్= (యుద్ధభూమి) భయంకరంగా తయారైనది.

తాత్పర్యం: భూమి కంపించింది. పైకి లేచిన దుమ్మువలన సూర్యుడు కానరాలేదు. అనేక రకాల వాద్యాలు మ్రోగించగా వచ్చిన ధ్వని దిక్కులు నిండింది. ఆయుధాల కాంతులతో ఆకాశం ఇంద్రాది దేవతలకే చూడశక్యం కాకుండా భయంకరంగా మారింది.

విశేషం: అలం: అతిశయోక్తి, పరికరాంకురం. పెద్ద సేన సందడిగా బయలుదేరితే ఎట్లా ఉంటుందో వర్ణించే ఈ వైఖరిలో అతిశయోక్తి అలంకారం ఉన్నది. భూమి వణకటం, రేగిన దుమ్మువలన సూర్యబింబం కానరాకుండా ఉండటం, తూర్యరవాలతో దిక్కులు దద్దరిల్లటం, వేయికళ్ళ వేలుపైన ఇంద్రుడు మొదలైన దేవతలకు అది చూడ శక్యం కానిది కావటం - అనే అంశాలు కౌరవసేన గొప్పతనాన్ని ధ్వనింప చేసే లక్షణాలుగా ఒకవైపు పైకి కనపడుతున్నా, అవన్నీ ఉత్పాతాలవంటివిగా తోస్తూ ఉండటం ఇక్కడ విశేషం. ఆ ఆర్భాటంలో విజయచిహ్నాలుగా ఉండేవి అశుభసూచకాలుగా కౌరవులకు తారసిల్లినట్లు చిత్రించబడ్డాయి. వేయికన్నులున్న ఇంద్రుడికి సైతం, దివ్యదృష్టిగల దేవతలకు సైతం చూడశక్యం కాలేదని వర్ణించటంలో విశేష్యాలు సాభిప్రాయాలు కావటం చేత పరికరాంకురాలంకారం వర్తిల్లింది. కౌరవసేనా విజృంభణంపై ఇంద్రాదుల అనుగ్రహం గాని, ప్రసన్న వీక్షణం గాని లేదనీ, వీరరసాధి దేవత అయిన ఇంద్రుడు చూడలేని ఆ సేన అపజయం పాలౌతుందనీ వ్యంగ్యం. సైన్య వీరోచిత వర్ణనం వలె కనబడే దీనిలో భావి కౌరవసేనా పరాభవం అలంకారధ్వని. (సంపా.)

అర్జునుఁడు కౌరవసైన్యంబుల నుఱుమాడుట.

వ. అట్టియెడ నుద్భటహాసోల్లాస భాసురముఖుం డగుచు శతమఖ తనయుండు. 29

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఉద్భట= పెద్దదైన; హాస= నవ్వుతో; ఉల్లాస= సంతోషంతో; భాసుర= ప్రకాశించే; ముఖుండు+అగుచున్= ముఖం కలవాడై; శతమఖ తనయుండు= ఇంద్రుని కుమారుడైన అర్జునుడు.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడు పెద్దగా నవ్వుతూ ఉల్లాసంతో కూడిన ముఖంతో.

విశేషం: 'ఉద్భట హాసోల్లాస భాసురమైన' అర్జునుడి ముఖం వీరరసోల్లాసాన్ని వ్యక్తీకరించే అనుభావం కల విభావం. ఉద్భటహాసం అంటే అట్టహాసం వంటిది. అర్జునుడిలో వికాసదశ పొందుతున్న వీరరస స్థాయి సూచక మిది. కౌరవసైన్యం మీద స్వీయ వ్యూహం ప్రకారం అర్జునుడు దాడి చేస్తున్నాడు. కౌరవుల చక్రవ్యూహాన్ని అవలీలగా భగ్నం చేశాడు. ఆలమందలను విడిపించాడు. వారికి క్రొత్త వ్యూహం కావలసి వచ్చింది. వజ్రవ్యూహం పన్నటానికి అనువుగా (చూడు. పద్యం 39) సైన్యాలను

మోహరిస్తున్నారు. పెక్కురు కలిసి ఒక్కడిని చుట్టుముట్టి ఓడించటం వజ్రవ్యూహ స్వభావం. కౌరవవీరు లందరుండి ఏ ప్రయత్నం చేయకుండానే గోధనాన్ని కోల్పోయి మొదటి అపజయాన్ని చవిచూచారు. ఇప్పు డందరూ ఏకమై రాజును రక్షించుకొనటానికి ఆర్భాటంగా ప్రయత్నించబోతున్నారు. దానిని గమనించిన అర్జునుడు శత్రువులను ప్రత్యక్షంగా ఎదుర్కొనే యుద్ధ క్రియావీరాన్ని ప్రయోగించబోతున్నాడు. ప్రతిఘటనపై ప్రతిక్రియ అర్జునుడి వీరరస వికాసంలో రెండవ దశ. దేవతలకు కూడా దుర్నిరీక్ష్యమైన సేనాటోపం అర్జునుడిలోని గర్వం అనే వీరరస అనుభవాన్ని నిద్రలేపింది. ఎదుటి వీరులను లెక్కచేయని భావం గర్వం. అందుకే అంతటి సైన్యాటోపాన్ని నిర్లక్ష్యంగా చూచాడు. వారందరికంటె తానే నేర్పరి అన్నట్లు ఒక పెద్ద నవ్వు నవ్వాడు. యుద్ధవీరంలో హర్ష, గర్వ, మోహాదులు సంచారి భావాలుగా రాణిస్తాయని రసార్ణవ సుధాకరం చెప్పింది (III. 237, 238). ఇక్కడ ఉద్భటహాసం - గర్వభావ వ్యంజకం, ఉల్లాసం - హర్షభావ సూచకం. ఈ రెండూ ముఖంమీద ప్రతిఫలిస్తే అది యుద్ధ వీరరస ముద్ర అవుతుంది. ఇది నాట్యాంశ పరిజ్ఞానానికి సంబంధించింది. దానిని సందర్భ సహితంగా తిక్కన చెప్పాడు. అంగాలన్నింటిలో ముఖం ముఖ్యమైనది. దానిని ఈ వచనంలో పరిచయం చేసి, అతడి కార్యశీలాన్ని తరువాతి పద్యంలో వర్ణించాడు తిక్కన. తిక్కన ఏ పాత్రలోనైనా నవ్వును-ఏ రకంగానైనా-వర్ణించాడంటే అది ఒక రసభావ వ్యంజకమైన అనుభావంగా ఉండటం ఆ మహాకవి రచనలో కానవచ్చే నాటకీయ రచనా శిల్పం. (సంపా.)

చ. గుణమున లస్తకంబునను గోటియుగంబునఁ గేలఁ దార భీ
షణముగ నుప్పతిల్లి రభసంబున రేఁగిన మాడ్కిఁ దీవ్ర మా
ర్గణనికరంబు లొక్కట నరాతి బలంబులఁ గప్పు, గాండివ
క్వణనము రోదసీకుహర కర్పరముం బగిలింప, నుగ్రతన్. 30

ప్రతిపదార్థం: గుణమునన్= నారియందును; లస్తకంబునను= ధనుర్మధ్యంలోను; కోటి యుగంబునన్= వింటి చివరల రెంటియందును; కేలన్= చేతులందు; తారు+అ= అవే (తామే అయి); భీషణముగన్= భయంకరంగా; ఉప్పతిల్లి= పుట్టి; రభసంబునన్= తొందరగా; రేఁగిన మాడ్కిన్= వ్యాపించినట్లుగా; తీవ్ర= వాడియైన; మార్గణ= బాణాలయొక్క; నికరంబులు= సముదాయాలు; ఒక్కటన్= ఒక్కసారిగా; అరాతి బలంబులన్= శత్రుసేనలను; కప్పున్= కప్పివేయగా; గాండివ= గాండివమనే ధనువుయొక్క; క్వణనము= ధ్వని; రోదసీకుహర= భూమ్యాకాశ మధ్యభాగ మనెడి; కర్పరమున్= కుండను; పగిలింపన్= బ్రద్దలయ్యేటట్లు చేయగా; ఉగ్రతన్= భయంకరంగా.

తాత్పర్యం: బాణాలు నారిలోనుండి, ధనుస్సుకు మధ్యభాగంలోనుండి, వింటికొపులలోనుండి, చేతులలోనుండి పుట్టుతున్నట్లుగా వచ్చి శత్రు సైన్యాన్ని కప్పివేశాయి. గాండీవ ధ్వనులు భూమ్యాకాశాల మధ్యభాగమనే భాండాన్ని పగులగొట్టగా, భయంకరత్వంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం : అలం: అతిశయోక్తి, ఉత్ప్రేక్ష. అర్జునుడు గాండీవధారి కావటం చేత గాండీవి అని పేరు వచ్చింది. దేవదత్తమైన ఆ గాండీవ ప్రయోగం ఒక అద్భుత వీరక్రీడ. దానిని తిక్కన ఈ పద్యంలో అలంకార సుందరంగా వర్ణించాడు. ఆకర్ణాంతం నారిని లాగితే గాండీవం గుండ్రని ఆకారంలో ప్రత్యక్షమౌతుంది. ఆ లాగటం నిరంతరాయంగా సాగటం చేత గాండీవ పరిధిరూప దర్శనం అవిచ్ఛిన్నంగా కలుగుతున్నది. అంటే వింటి వంగిన జాడలు గుర్తించలేనంత వేగంగా ఉన్నాయన్నమాట. కోదండమే ఆ స్థితిలో ఉంటే బాణాల ప్రయోగ క్రమం ఎట్లా ఉండాలి? తిక్కన దానిని అతిశయోక్తిగా వర్ణించాడు. వింటిని ఎడంచేత్తో మధ్యభాగంలో పట్టుకొన్నాడు అర్జునుడు. కుడిచేతితో వింటిని ఆకర్ణాంతం లాగాడు. చేతితో బాణాలు వదలుతున్నాడు. అతడు వీలును బట్టి రెండు చేతులా ప్రయోగించగలడు. అవిరామంగా సాగే ఆ క్రియలో బాణాలైతే వెలువడుతున్నాయి. కాని, అవి ఎక్కడినుండి వెలువడుతున్నాయో తెలిసికొన లేనంత అద్భుతంగా బయటపడుతున్నాయి. నారిలోనుండా? వింటి

నడుమ భాగంలోనుండా? వింటి కోపులనుండా? చేతులనుండా? - తెలిసికొనలేనంత వేగం. అన్నిచోట్ల నుండి బాణాలు పుట్టుతున్నట్లు ఊహ కలిగిస్తున్నాయి. (అతిశయోక్తి). ఆ గాండీవంనారి నిరంతరం చేసే ధ్వని బ్రహ్మాండ భాండాన్ని బ్రద్దలు చేస్తున్నదా అన్నట్లు ఉన్నది. (ఉత్ప్రేక్ష). గమనించదగిన మరొక విశేషమేమంటే - అంతటి కౌరవసైన్యం చేసే తూర్యనాదం దిక్కులను పొంగించింది. అర్జునుడు ఒక్కడు చేసే గాండీవ నారీనాదం బ్రహ్మాండ భాండాన్ని బ్రద్దలు చేసింది - అన్నట్లు చెప్పి ఉభయపక్ష బల తారతమ్యాన్ని అలంకారధ్వనితో ఆలోచనామృతం చేశాడు తిక్కన. (సంపా.)

క. తలపడి తలమీఱిన కా । ల్బలములఁ బొడిసేయు; మఱియుఁ బైపైఁ బీనుం
గులఁ ద్రొక్కికొనుచు వెస ముం । గలిమొనఁ గవియుటకు వేడ్క గడలుకొనంగన్. 31

ప్రతిపదార్థం: తలపడి= కలియబడి; తలమీఱిన= ఎదురుమీరి వచ్చిన; కాల్బలములన్= బంట్లసేనను; పొడి+చేయున్= నుగ్గు చేస్తాడు; మఱియున్= ఇంకా; పీనుంగులన్= శవాలను; త్రొక్కికొనుచున్= త్రొక్కుకొంటూ; పైపైన్= మీది మీదికి; వెసన్= వేగంగా; ముంగలిమొనన్= ముందున్న సేనను; కవియుటకున్= ఎదిరించటానికి; వేడ్క= ఉత్సాహం; కడలుకొనంగన్= ఎక్కువకాగా.

తాత్పర్యం: అర్జునుడు తన నెదిరించి వచ్చిన ఎదుటిసేనతో కలియబడి మీదికి వచ్చిన కాల్బలాన్ని నుగ్గు చేశాడు. చేసి, పీనుగులమీది నుండి ముందుకు పోయి ఇంకా సేన నెదిరించే ప్రయత్న మెక్కువ చేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం : యుద్ధవీరంలో వీరుని లక్షణాలను వివరిస్తూ శారదాతనయుడు తన భావప్రకాశంలో ఇట్లా పేర్కొన్నాడు- "యుద్ధంలో తాను ఒక్కడే అయినా, నిరాయుధు డయినా, యుద్ధోచిత పరికరాలు సరిగా లేకపోయినా, అనేకులతో యుద్ధ మొనరించవలసినా - భయం లేకపోవటం, యుద్ధ నిశ్చయంలో అహంభావంతో ఉండటం, శస్త్ర - అస్త్ర ఘాతాలు తగిలినా హర్షం వీడకుండా ఉండటం, యుద్ధం నుండి పలాయనం చేయకపోవటం, భీతులకు అభయమివ్వటం, శరణు పొందినవారి ఆర్తిని పోగొట్టటం - ఇట్టిది ఉదాత్తుల యుద్ధాత్మకమైన వీరం (సాత్త్వికాభినయం. పు. 493). యుద్ధవీర రసాభ్యుదయోల్లాస వర్ణనంలో నిష్ణాతుడైన తిక్కన దాని క్రమ వికాసదశలను ఈ ఘట్టంలో తీర్చిదిద్దిన శిల్పం గమనార్హం. కాల్బలాలను నుగ్గు చేసి, వారి శవాలమీదుగా రథాన్ని నడిపించి విరోధి వర్గాలను మట్టుపెట్టాలన్న ఉత్కటోత్సాహం ఇందులో ధ్వని. సహాయం లేకపోయినా యుద్ధం చేయాలన్న కోరిక అర్జునుడి వీరరసోల్లాస చిహ్నంగా తిక్కన తీర్చిదిద్దాడు. (సంపా.)

క. తన దృష్టియు ముష్టియుఁ దగు, । ననువున మున్నెత్తి యేయు; నతఁ డప్పుడు డిం
చినఁ గాయముల సపాటం । బునఁ బదియుఁ బదేను నుచ్చి పోయెం గోలల్. 32

ప్రతిపదార్థం: తన దృష్టియున్= తన చూపూ; ముష్టియున్= తన పిడికిలీ; తగు+అనువునన్= తగిన వీలుగా; మున్ను+ఎత్తి+ ఏయున్= ముందుగానే పూని బాణాలను ప్రయోగించాడు; అప్పుడు= ఆ సమయంలో; అతఁడు= అర్జునుడు; కోలల్= బాణాలు; డించినన్= దిగపడేటట్లు వేయగా; సపాటంబునన్= ఒక్కుమ్మడిగా; పదియున్+పది+ఏనున్= పది కాని, పదైదు కాని; కాయములన్= సైనికుల శరీరాలను; ఉచ్చిపోయెన్= (ఒకేసారి) దూసికొని పోయాయి.

తాత్పర్యం: అప్పుడర్జునుడు కంటితో లక్ష్యాన్ని చూస్తూ, బాణాలను పిడికిలితో సంధించి వేస్తూంటే (అవి) ఎదురుగా ఉన్న సైనికుల శరీరాలను పది పదేనింటిని ఒకే మట్టంలో దూసుకొని పోతూ ఉండేవి.

విశేషం : 1. ఒక వీరుడు పలువురు సైనికులతో యుద్ధం చేసేటప్పుడు మూకుమ్మడిగా వారిని చంపితే తప్ప విజయం సాధించటం సాధ్యం కాదు. ఇది యుద్ధక్రీడా రహస్యాలలో ఒకటి. అట్టి మూకుమ్మడి లక్ష్యభేదనం కొందరు వీరులకే సాధ్యం. ఒకే బాణంతో

అనేక మందిని ఒకేసారి చంపటం ఆ పద్ధతులలో ఒకటి. రామాయణంలో సప్తతాళాలను ఒకే అమ్ముతో కొట్టి రాముడు వాలి సంహార సామర్థ్యాన్ని సుగ్రీవుడి ముందు నిరూపించుకొన్నాడు. ఇక్కడ అర్జునుడు అటువంటి ప్రజ్ఞనే ప్రదర్శించాడు. ఒక లక్ష్యం (సైనికుని) మీద వేసిన బాణం సమాంతరంగా ఉన్న అనేక లక్ష్యాలను (సైనికులను) భేదించింది. ఒకేసారి అనేక సైనికులు కూలటానికి ఇది కీలకం. విరామం లేకుండా బాణాలు ప్రయోగించే అర్జునుడి పరాక్రమానికి సైనికులు మందలు మందలుగా హతులైపోయారు. యుద్ధరహస్యాలు తెలిసిన తిక్కన ఇటువంటి సూక్ష్మాంశాలను సైతం వివరించి చెప్పగల దిట్ట.

2. అన్ని ప్రతులలోను - 'ఏయునతఁ డప్పు డుడించిన కాయముల' అనియే కలదు. అతఁ డప్పుడు - డించినఁ గాయముల - అనునది లేదు. కాని ఉడించు' అనునది యే నిఘంటువులోను కానరాదు. ఉడిపుచ్చు ఉడివోవు మున్నగు వాని వలె గుగాగమమునకు లోపము విభాషగాన, - ఉడిగించు - ఉడించు అయిన దనుకొన వలయును. అప్పాదులకు, గగాగమలోపము విభాష కావున అప్పగించు - అప్పించు అయినట్లు - ఉడిగించు - ఉడించు అయియుండవచ్చును. ఉడించు= ఉడిగించు= ఉడుగఁజేయు. (సంపా.)

చ. ఉడుగక వెండియున్ సుభటు లొక్క మొగిన్ వెస నంటఁ దాఁకి క
వ్వడి పటుబాణ భాస్వదనివార్య సముద్ధతిఁ జేసి మంటలో
మిడుతలు సొచ్చిన ట్లయిన మేటిమగల్ గని యీడఁబోక బ
ల్విడి మఱియున్ వడిం బొదువ వ్రేల్మిడిఁ ద్రుంచె నతండు దోడుతోన్. 33

ప్రతిపదార్థం: ఉడుగక= మానక; వెండియున్= మరల; సుభటులు= యోధులు; ఒక్కమొగిన్= ఒక్కసారిగా; వెసన్= త్వరగా; అంటన్+తాఁకి= దగ్గరగా వచ్చి ఎదుర్కొని; కవ+వడి= అర్జునుడియొక్క; పటు= గట్టిదైన; బాణ= బాణాలయొక్క; భాస్వత్= ప్రకాశించే; అనివార్య= మరల్పలేని; సముద్ధతిన్+చేసి= విసురుచేత; మంటలోన్= మంటలో; మిడుతలు= మిడుతలు; చొచ్చినట్లు+అయినన్= ప్రవేశించినట్లుకాగా; కని= చూచి; మేటి మగల్= మహావీరులు; ఈడన్+పోక= వెనుదియ్యక; బల్విడిన్= పరాక్రమంతో; మఱియున్ వడిన్= మరింత వేగముతో; పొదువన్= క్రమ్మగా; అతండు= అర్జునుడు; తోడుతోన్= వెనువెంటనే; వ్రేల్మిడిన్= చిటికెలో; త్రుంచెన్= తెగగొట్టాడు (చంపాడు).

తాత్పర్యం: అయినా మానక, కొందరు వీరులు ఒక్కపెట్టున అర్జునుడి మీదికి తాకి, అతని బాణాగ్నికి మంటలో పడిన మిడుతలవలె చచ్చిపోయారు. అది చూచి, మహావీరులు వెనుదీయక మరింత మీదికి వచ్చి చుట్టుముట్టారు. వారిని కూడా అర్జునుడు వెన్వెంటనే త్రుంచివేశాడు.

విశేషం : అలం: ఉపమ. అర్జునుడు సాగిస్తున్న యుద్ధాన్ని తిక్కన ఒక క్రమంలో తీర్చిదిద్దాడని చెప్పటానికి ఈ పద్యం మరొక సాక్ష్యం. కురుసేనలో మొదట అర్జునుడిపై దాడి చేసినవారు 'కాల్బలములు' (పద్యం. 31), సామాన్య వీరులైన వీళ్లను ఒక్కొక బాణానికి పది పదునేనుమంది చొప్పున మట్టుపెట్టాడు. వారి తరువాత 'సుభటులు' (బాగా బలం కలిగి తరిఫీదయినవారు) ఎదుర్కొన్నారు. వారు కాల్బలాల వలె దూరంగా ఉండి యుద్ధం చేయలేదు. మెరుపుదాడిలో అర్జునుడిని సమీపించి అతడిమీద మూకుమ్మడిగా తలపడ్డారు. వారి మధ్య బాణాల కాంతితో వెలిగిపోతూ అనివార్యమైన విజృంభణంతో ఆ సుభటుల నందరిని అంతమొందించాడు. ఆ దృశ్యం అగ్నిలో మిడుతలు పడి కాలిపోతున్నట్లున్నదట! ఎంతటి చక్కని ఉపమానం! సుభటులు సోదిలోకి కూడా రాకుండా పోయారు. వారి తరువాత రంగంలోకి వచ్చినవారు మేటిమగలు! సైనికులలో మేటి వీరులు. నేటి కాలంలోని 'రిజర్వుడ్ ఫోర్సు' వంటివారు. వారు వెనకాడకుండా అర్జునుడిని చుట్టుముట్టారు. కాని, వారినీ క్షణంలో అతడు చంపాడు. కాల్బలంలోకూడా ఎన్ని తెగలుంటాయో, అవి శత్రువుమీద ఎట్లా తలపడతాయో కంటికి కట్టినట్లు స్వీయానుభవంతో తిక్కన చెప్పగలగటం ఆంధ్రమహాభారత రచన చేసికొన్న అదృష్టం. (సంపా.)

తే. అంతకంతకుఁ గదిసి సైన్యములు సుట్టు। ముట్టి శస్త్రాస్త్ర సంచయమున నభంబు
దీటు కొనునట్లు సేయఁ గిరీటి గాండి। వంబు పరిచాలనంబు దీవ్రంబు గాఁగ. 34

ప్రతిపదార్థం: సైన్యములు= సేనలు; అంతకున్+అంతకున్= అంతకంతకు; కదిసి= సమీపించి; చుట్టుముట్టి= చుట్టూరా వ్యాపించి; శస్త్ర+అస్త్ర సంచయమునన్= శస్త్రాల, అస్త్రాల సమూహంతో; నభంబు= ఆకాశం; దీటుకొనునట్లు= వ్యాపించేటట్లు; చేయన్= చేయగా; కిరీటి= అర్జునుడు; గాండివంబు= గాండీవంయొక్క; పరిచాలనంబు= అంతటా కదిలించటం; తీవ్రంబుకాఁగన్= ఎక్కువ కాగా.

తాత్పర్యం: సేన లింకా ఇంకా దగ్గరకువచ్చి చుట్టుముట్టి శస్త్రాలతో, అస్త్రాలతో ఆకాశం నిండేటట్లు చేశాయి. అప్పుడు అర్జునుడు గాండీవచాలనాన్ని తీవ్రం చేయగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం : అలం: అతిశయోక్తి. ఈ పద్యంలో వర్ణించబడినవి సైన్యాల సమూహాలు. అవి శస్త్రాస్త్రాలను ప్రయోగించగలవి. సామూహికంగా సమన్వయంతో సమరం చేయగలిగినవి. వారందరూ కలిసి తమ బాణాలతో ఆకాశాన్ని నింపారు. అర్జునుడిని బాణపంజరంలో బంధించాలని యత్నించారు. ఇది సంఘటితమైన, తీవ్రతరమైన, ప్రమాదకరమైన ఎత్తుగడ. దీనిని విధ్వంసం చేయాలంటే గాండీవ పరిచాలనం మరింత తీవ్రతరం కావలసిందే. అది సహజ ప్రతిక్రియ. ఈ ప్రతిక్రియ ప్రవర్తిల్లిన తీరును రాబోయే సీసపద్యం చలత్చిత్రంగా ప్రత్యక్షీకరిస్తున్నది. (సంపా.)

సీ. గోరఁ బోఁజిన మాడ్కిఁ గొన్నింటిఁ జక్కసాఁ। బాలుగా వ్రయ్యలు వాపి పాపి,
బాడిస నఱకిన భంగిఁ గొన్నింటిఁ దు। త్తునియలుగా బిట్టు త్రుంచి త్రుంచి,
వెస అంపమున నిడ్డవసిగఁ గొన్నిటి నిసు। మంతలుగా నుఱుమాడి యాడి,
పనివడి ఱోలఁ గొట్టినలీలఁ గొన్నింటిఁ। జిఱునుగ్గుగాఁ బొడి సేసి చేసి,

తే. యదరి పొదివిన బలము నానాయుధములఁ। బ్రతిహతంబులఁ గావించె నతిరయమున
నక్షత ధ్వజ సూత హయత్వ లస ద।ఫల్గురథవల్గనుం డగు ఫల్గునుండు. 35

ప్రతిపదార్థం: అడరి= అతిశయించి; పొదివిన= చుట్టుముట్టిన; బలము= సేన యొక్క; నానాయుధములన్= అనేకమైన ఆయుధాలను; అక్షత= దెబ్బతగులని; ధ్వజ= జెండా; సూత= సారథి; హయత్వ= గుర్రాలు కలుగుటచేత; లసత్= ప్రకాశించే; అఫల్గు= వ్యర్థంకాని; రథ= రథము యొక్క; వల్గనుండు+అగు= గమనం కలవాడైన; ఫల్గునుండు= అర్జునుడు; గోరన్= గోటితో; పోఁజిన మాడ్కిన్= చిక్కును తీసి నున్నగా సవర చేసినట్లుగా; కొన్నింటిన్= కొన్నిటిని; చక్క= చక్కగా; సాఁబాలుగాన్= నిలువున సగభాగంగా; నడిమికి; వ్రయ్యలు= ముక్కలుగా; పాపిపాపి= విడదీసి; బాడిసన్= బాడిసతో; నఱకినభంగిన్= చెక్కినట్లుగా; కొన్నింటిన్= కొన్నింటిని; తుత్తునియలుగాన్= ముక్కలుముక్కలుగా; బిట్టు= శీఘ్రంగా; త్రుంచి త్రుంచి= తెగగొట్టి; అంపమునన్= రంపంక్రింద; ఇడ్డ= ఉంచిన; వసిగన్= కొన చెక్కిన కొయ్యవలె; కొన్నిటిన్= కొన్నింటిని; ఇసుమంత(తు)లు గాన్= చిన్నచిన్న ఇసుక రేణువులుగా; వెసన్= వేగంగా; నుఱుమాడి+ఆడి= చీల్చి చీల్చి; పనివడి= అవసరము కలిగి; ఱోలన్= రోటిలో; కొట్టినలీలన్= దంచినట్లుగా; కొన్నింటిన్= కొన్నింటిని; చిఱునుగ్గుగాన్= చిన్న రవ్వవలె; పొడి చేసి చేసి= పిండివలె చేసి; అతిరయమునన్= చాలా వేగంగా; ప్రతిహతంబులన్= కొట్టబడిన వాటినిగా, ధ్వంసం చేయబడిన వాటినిగా; కావించెన్= చేసెను.

తాత్పర్యం: కౌరవసైన్యాలు అర్జునుడిని చుట్టుముట్టి నానాయుధాలతో అతడి ధ్వజాన్ని, సారథిని, గుర్రాలను, అక్షయ రథాన్నీ ధ్వంసం చేయటానికి పూనుకొన్నాయి. అప్పుడు అర్జునుడు ప్రతీకారంగా వారు ప్రయోగించిన ఆయుధాలలో

కొన్నింటిని గోటితో చిక్కును చీల్చినట్లుగా నిట్టనిలువుగా నడిమికి ముక్కలుగా చేసివేశాడు. కొన్నింటిని బాడిసతో నరికినట్లుగా తునకలు తునకలుగా మిక్కిలి చిన్న ముక్కలుగా నరికివేశాడు. కొన్నిటిని రంపపు పదును క్రిందపెట్టిన కొయ్యముక్కలవలె ఇసుక రేణువులంతగా మారేటట్లు మిక్కుటంగా నురుమాడాడు; కొన్నిటిని కావాలని రోట్లోపెట్టి దంచినట్లుగా నుగ్గునుగ్గయ్యే విధంగా పొడిచేసి వేశాడు. ఆ విధంగా వారి ఆయుధాల నన్నింటిని ధ్వంసం చేసి అర్జునుడు తన ధ్వజ, సూత, హయ, రథాలను మొక్కవోకుండ కాపాడుకొన్నాడు.

విశేషం : అలం: ఉపమ. మూకుమ్మడిగా దాడిచేసిన కౌరవసైనికులు అర్జునుడిని విరథుడిని చేయాలని యత్నించారు. ఆ ప్రయత్నంలో అనేకాయుధాలను వాడారు. వారికి లక్ష్యాలు నాలుగు- కేతనం, సారథి, గుర్రాలు, రథం. వాటిని ధ్వంసం చేయటానికి అనువైన నాలుగు రకాల ఆయుధాలనైనా వారు వాడి ఉంటారు. అర్జునుడు ఆయా తెగల ఆయుధాలను తన బాణ ప్రయోగంలోని ఆయా పద్ధతులను ప్రయోగించి నామరూపాలు లేకుండా చేశాడు. అందువలననే కాబోలు తిక్కన ఆయుధాల పేర్లను పద్యంలో చెప్పలేదు.

తిక్కన తన సీసాలలో పాదాలకూ ఎత్తుగీతికీ ఏదోరకమైన క్రమాన్వయాన్ని కల్పిస్తూ ఉండటం పరిపాటి. ఈ పద్యంలో కూడా దానిని అనుసంధించుకొనాలి. టెక్కాన్ని విరుగగొట్టాలని, జెండాను చింపాలని సైనికులు కొన్ని ఆయుధాలను ప్రత్యేకంగా ఉపయోగించి ఉంటారు. వారి ప్రయత్నానికి ప్రతీకారంగా వారి ఆయుధాలను గోళ్ళతో గోగునారను చీల్చినట్లుగానూ, నడిమికి విరిగేటట్లుగానూ ముక్కలు చేశాడు. సూతుడుతో సహా జెండా, గుర్రాలు, రథం క్షేమంగా నిలిచాయి. వారి ఆయుధాలు ప్రతిహతాలయ్యాయి.

సారథిని చంపటానికి నిలువునా నరకటానికి సైనికులు కొన్ని ఆయుధా లుపయోగించి ఉంటారు. వా రే పద్ధతిలో సారథిని చంపదలచారో ఆ పద్ధతిలోనే అర్జునుడు వారి ఆయుధాలను విరిచాడు. బాడిసతో నరికినట్లు వాటిని ముక్కలుముక్కలుగా త్రుంచి పారవేశాడు.

గుర్రాలను కత్తుల వంటి ఆయుధాలతో ముక్కలుగా చేయాలని సైనికులు పూనుకొన్నట్లున్నారు. వారికి తగిన ప్రతిక్రియ చేశాడు. రంపాలతో కొయ్యలను కోసి, ఇసుక రేణువుల వలె మారేటట్లు నురుమాడినట్లుగా ధ్వంసం చేశాడు.

రథాన్ని మోది నుగ్గు చేయాలని చూచిన సైనికుల ఆయుధాలను వారి యత్నానికి తగినట్లు రోట్లో పెట్టి దంచినట్లుగా ఇసుక రవ్వవలె మారేటట్లు పొడి పొడి చేసివేశాడు.

అర్జునుడు తనమీద దాడిచేసిన సైనికుల నేమీ చేయక, వారి ఆయుధాలను మాత్రమే ధ్వంసం చేసి, వారిని నిరాయుధులను చేశాడు. పాపి, పాపి; త్రుంచి, త్రుంచి; నురుమాడి ఆడి; పొడిచేసి చేసి- అని తెలుగు క్రియల నామ్రేడితంతో కలిపి వాడటంలో వేగంగా ఎన్నోసార్లు ఆ విధంగా చేశాడనే అర్థాన్ని కవి ధ్వనింప చేశాడు. విరిగిన ఆయుధాలను గురించి చెప్పిన సీసపద్య పాదాలలో అలతి అలతి తెలుగు పదాల జిలుగు రచన సార్థకంగా ఉన్నది. అక్షతమైన రథాన్ని 'అక్షత ధ్వజ సూత హయత్వ లసదఘల్గు రథ వల్గనుండు'- అనే అఖండ సమాసంలో వర్ణించటం ఉచితంగా ఉన్నది. సీసపద్యంలో అర్జునుడి వీరరసాభ్యుదయోల్లాసం గోచరిస్తుంది. మొదట ఆయుధాలను నడిమికి నరికాడు. ఆపైన తునియలు చేశాడు. అటుపైన ఇసుమంతలుగా నురుమాడాడు, ఆమీద చిరు నుగ్గునుగ్గుగా పొడిచేశాడు. ఉత్తరోత్తరాలు బలీయాలన్న న్యాయంతో మొదలుపెట్టినప్పటికంటె క్రమంగా కోపం పెరిగి, ఆయుధాలను విరవటంనుండి పొడిచేయటంగా విస్తరించింది. ఈ క్రమంలో వీరరస అభ్యుదయాన్ని భావంలోనూ, ఉల్లాసాన్ని చర్యలలోనూ తిక్కన ధ్వనింప చేశాడు. (సంపా.)

క. ఆ మెయిన వివిధ వర్మ। స్తోమం బఱువుల్కు సేసి సునిశిత బాణో
ద్దామ ప్రసార విభవ। శ్రీ మార్తుర కద్భుతంబు సేసెం గడిమిన్. 36

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆమెయిన్+అ= ఆ రీతిగానే; వివిధ= అనేకమైన; వర్మస్తోమంబు= కవచాల సముదాయాన్ని; అఱువుళ్ళు+చేసి= చిన్నచిన్న ముక్కలుగా చేసి; సునిశిత= వాడియైన; బాణ= బాణాల; ఉద్దామ= అతిశయించిన; ప్రసార= వ్యాపించుట యొక్క; విభవశ్రీ(న్)= వైభవ సంపదను; కడిమిన్= పరాక్రమ ప్రదర్శనతో; మార్తురకున్= శత్రువులకు; అద్భుతంబుగన్= ఆశ్చర్యం కల్గించేటట్లుగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ఆ రీతిగా అర్జునుడు సైనికులు ధరించిన పలురకాలైన కవచాలను చిన్న చిన్న ముక్కలుగా చేసి శత్రువులకు తన అతిశయించిన బాణప్రయోగసంపదను ప్రదర్శించి ఆశ్చర్యం కలిగేటట్లు చేశాడు.

విశేషం : కౌరవసైనికుల ఆయుధాలను నుగ్గుచేసి, వారి శరీరాలమీద ఉండే కవచాలను, వారి కెటువంటి గాయాలు కాకుండా చీల్చి, అర్జునుడు బాణప్రయోగ విద్యను ప్రదర్శించాడు. అంతకు పూర్వం పదిపదేను మంది సైనికులను ఒకే బాణంతో చంపగలిగిన ప్రజ్ఞను చూపిన అర్జునుడు ఇప్పుడు దానికి విరుద్ధమైన నేర్పును ప్రదర్శించాడు. శరీరానికి తగలకుండా కవచాలను మాత్రమే ఛేదించే ఆ కౌశలం సైనికులకు అద్భుతాన్ని కలిగించింది. అపూర్వ కార్యసాధనం చేసినప్పుడు నాయకుడిలో వీరరస స్ఫూర్తి కలుగుతుంది. దానిని చూచిన చూపరులకు అద్భుతం కలుగుతుంది. వీరం జనకరసం, అద్భుతం జన్యరసం. ఆ రసమర్యాద తెలిసిన తిక్కన జన్యజనకరసోల్లాసాన్ని ఇక్కడ సందర్భోచితంగా సంధించాడు. (సంపా.)

క. **గర్జద్గుణుఁడై పగతుర। జర్జరితాంగులుగఁ జేసె సాయకజాల**
స్ఫూర్జన చూపఱు వొగడఁగ। నిర్జరవరనందనుండు నిమిషార్థమునన్. **37**

ప్రతిపదార్థం: నిర్జర వర నందనుండు= దేవేంద్రుడి కొడుకు - అర్జునుడు; గర్జత్+గుణుఁడు+ఐ= ఉరుముతున్న నారి కలవాడై; సాయక+జాల+స్ఫూర్జన= బాణాల సమూహం యొక్క ప్రేలుడు; చూపఱు= చూచేవారు; పొగడఁగన్= పొగడగా; పగతురన్= శత్రువులను; నిమిష+అర్ధమునన్= అరనిమిషంలో; జర్జరిత+అంగులు+కాన్= తూట్లుపడిన శరీరాలు కలవారినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: అర్జునుడు నారిని గర్జింపచేస్తూ బాణ సమూహాల ప్రేలుటను ప్రేక్షకులు పొగడుతుండగా, శత్రువులను అరనిమిషంలో తూట్లు పడిన దేహాలు కలవారినిగా చేశాడు.

విశేషం : గాండీవి నిరంతర బాణాలతో ఒక అర నిమిషంలోనే ఆ సైనికుల శరీరాలను శిథిలం చేశాడు. అంటే - చంపకుండా గాయాలు చేసి ఒడలు గుల్ల చేశాడు. దీనిని ఒక వర్షాకాలంగా తిక్కన చిత్రించాడు. నిరవయవ రూపక స్ఫూర్తిని ప్రదర్శించాడు. అర్జునుడు నిర్జరపతి కుమారుడు కాబట్టి మేఘాధిపత్యం సహజ గుణం. అతడి గాండీవ గుణనాదం గర్జ. అంటే గాండీవమనే మేఘం చేసే ఉరుము. నారి మ్రోగినప్పుడెల్లా బాణాలు పిడుగులవలె పడుతున్నాయి. ఉరుములు ఉరమటం, పిడుగులు పడటం, పిడుగుపాటుతో శరీరం శిథిలం కావటం వర్షాకాలంలో ఒక క్షణంలోనే జరుగుతాయి. అట్లాగే అర్జునుడి బాణపాతం కూడా- అనే రమణీయ భావన తిక్కన కలిగించాడు. రకారజకార సంయుక్త వర్ణం ప్రాసస్థానంలో నిలిచి గాండీవ గర్జను స్ఫురింప చేస్తున్నది. ముందు పద్యంలో కవచాలు కోల్పోయిన వారు ఆశ్చర్యపడ్డారు. అప్పుడు వారి నోట మాటలు రాలేదు. ఇప్పుడు కూడా జర్జరిత శరీరులైన సైనికులు పలుకలేదు కాని, చూచేవారు మాత్రం ఆ అద్భుత కార్యాన్ని వేనోళ్ళ పొగిడారు. ఇది జన్యరసోల్లాసంలో మరొక సూక్ష్మ శిల్పం. (సంపా.)

శా. **శక్తిస్ఫార ధనంజయాయత భుజా సంరంభ గాండీవ ని**
ర్ముక్త క్రూర శరావలీ దళిత శత్రువ్రాతముల్ శోణితా
సిక్తాకారతఁ బొంది సాంద్రకుసుమశ్రేణీ వికాసోల్లస
ద్రక్తాశోక తరువ్రజంబుల క్రియన్ రంజిల్లి యొప్పెం గడున్. **38**

ప్రతిపదార్థం: శక్తి= శక్తిచేత; స్ఫార= అతిశయించిన; ధనంజయ= అర్జునుడి; ఆయత= పొడవైన; భుజా= భుజాల; సంరంభ= హడావిడితో; గాండీవ= గాండీవం నుండి; నిర్ముక్త= విడువబడిన; క్రూర= భీకరమైన; శర+ఆవలీ= బాణ పంక్తిచేత; దళిత= చీల్చబడిన; శత్రు= శత్రువుల; వ్రాతముల్= సముదాయాలు; శోణిత= రక్తంతో; ఆసిక్త= పూర్తిగా తడుపబడ్డ; ఆకారతన్= శరీరం కలగటాన్ని; పొంది= పొంది; సాంద్ర= దట్టమైన; కుసుమ= పూల; శ్రేణీ= పంక్తుల; విలాస= విలాసంతో; ఉల్లసత్= ప్రకాశించే; రక్త+అశోక= ఎర్ర అశోకా లనెడి; తరు= చెట్లయొక్క; వ్రజంబులక్రియన్= గుంపులవలె; రంజిల్లి= ఎర్రనై; కడున్= మిక్కిలి; ఒప్పెన్= ప్రకాశించాయి.

తాత్పర్యం: గొప్పశక్తి ఉన్న అర్జునుడి బాహువుల వేగంతో అతడి గాండీవం నుండి వెలువడిన భీకర బాణాల దెబ్బలకు శత్రువుల శరీరాలన్నీ రక్తమయమై ఎర్రగా మారిపోయాయి. అవి దట్టమైన పూలపంక్తులతో ఉల్లాసంగా ప్రకాశించే ఎర్ర అశోకవృక్షాల గుంపులవలె ఉన్నాయి.

విశేషం : అలం: ఉపమ. 1. అర్జునుడు తన గాండీవం నుండి ప్రయోగించిన వాడి బాణాలతో శత్రుసమూహాల శరీరాలను గాయపరిచి, వాటిని రక్తంతో తడిసిన వాటినిగా చేశాడు. గాయాలు తిన్న సైనిక శరీరాలు కూలిపోలేదు. అంటే సైనికులు చావలేదు. కాని, యుద్ధం చేయలేక వివశులై నిలిచిపోయారు. ఇది ఒక చిత్రమైన స్థిరచిత్రం. నిలబడి ఉన్న ఆ రక్తసిక్త సైనిక శరీరాలను చూస్తే ఆమూలాగ్రం ఎర్రని పూలతో ఒప్పారే రక్తాశోక వృక్షాల వలె ఉన్నారట. అపూర్వమైన ఉపమాలంకారం! భయానక బీభత్స రస విభావాలను ఆస్వాద యోగ్యంగా మార్చటానికి రమణీయోపమానాలను వాడటం తిక్కన యుద్ధవర్ణన శిల్పం. దాని కీ పద్యం హృద్యమైన ఉదాహరణం.తెలుగునాట బహుళ ప్రచారంలో ఉన్న పద్యం.

2. అశోక వృక్షాలలో బంగారు రంగులోనూ, రక్త వర్ణంలోనూ, కాటుకరంగులోనూ పూలుపూసే జాతులున్నాయి. అందులో రక్తాశోకాలను ఉపమానాలుగా తీసికొనటం ఔచిత్యం.

3. **"శౌర్యస్తవే నృపాదీనాం శార్దూలవిక్రీడితం మతమ్"** - అని క్షేమేంద్రుడు సువృత్త తిలకంలో చెప్పినట్లు, ఈ వృత్తం తనలోని వర్ణ్యవస్తువైన అర్జునుడి శౌర్యాన్ని తన రచన ద్వారా వ్యంజింప చేస్తున్నది. విసర్జనీయ, ఉపధ్మానీయ శషసాది పరక పూర్వగుర్వక్షర బాహుళ్యం చేత ఈ పద్యం ఓజోగుణంతో రాణించింది. జర్జరిత శరీరుల దైన్యం కాదు ఇందులో గమ్యమానమయింది. ఆ క్రియను సాధించిన వీరుడి వీరకృత్యాన్ని భావింపజేసే అలంకార ధ్వని. 36వ పద్యంలో వీరులే ఆశ్చర్యపడ్డారు. 37వ పద్యంలో చూపరు లాశ్చర్యపడ్డారు. ఇక ఈ పద్యం చదివి కావ్యపఠితలు ఆశ్చర్యపడతారు. ఈ మూడు పద్యాలలో సహృదయ రసవ్యంజక శిల్పాన్ని అశోక వృక్షంవలె విరగబూచిన పద్యం ఇది. రసోల్లాస శిల్పంలో ఇది ఉత్తమమని తిక్కన తీర్పు. (సంపా.)

చ. తదవసరంబునన్ దొర లుదగ్రతఁ ద్రోచిన వజ్రఘట్టముల్
మదమున నొక్కపెట్ట బలమర్దనుసూను రథంబు గ్రక్కునం
బొదివెఁ దురంగ కింకిణుల భూరిరవంబుఁ గరీంద్ర ఘంటికా
భ్యుదిత నినాదమున్ రథవరోత్థిత ఘోషము నుత్కటంబుగన్. 39

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ తరువాత; దొరలు= గొప్పరాజులు; ఉదగ్రతన్= గర్వంతో, భయంకరంగా; త్రోచిన= కవిసిన, త్రోసికొంటూ ఏర్పడిన; వజ్రఘట్టముల్= వజ్రమనే సైనికవ్యూహంగా ఏర్పడిన సమూహాలు; మదమునన్= గర్వంతో; ఒక్కపెట్టన్= ఒక్కసారిగా; బలమర్దను సూను= ఇంద్రుడి కుమారుడైన అర్జునుడి; రథంబు= రథాన్ని; తురంగ= గుర్రముల; కింకిణుల= చిరుగంటల; భూరిరవంబున్= పెద్ద ధ్వనియూ; కరి+ఇంద్ర= శ్రేష్ఠములైన ఏనుగుల; ఘంటికా= గంటలనుండి; అభ్యుదిత= బయలుదేరిన; నినాదమున్= మ్రోతయు; రథవర= పెద్ద (శ్రేష్ఠమైన) రథాలనుండి; ఉత్థిత= బయల్దేరిన; ఘోషమున్= చప్పుడును; ఉత్కటంబుగన్= అతిశయించగా; గ్రక్కునన్= వెంటనే; పొదివెన్= చుట్టుముట్టాయి.

తాత్పర్యం: అనంతరం గొప్ప గొప్ప యోధులందరూ గర్వాటోపంతో ఒకరినొకరు త్రోసికొంటూ వజ్రవ్యూహంగా ఏర్పడిన సమూహాలై గుర్రాల చిరుగంటల సవ్వడి, ఏనుగుల ఘంటల చప్పుడు, రథాల చక్ర ధ్వని ఎక్కువ కాగా ఒక్కసారిగా అర్జునుడి రథాన్ని చుట్టుముట్టారు.

విశేషం : కాల్బలాలలో చాలమంది గాయాలతో కదలలేని పరిస్థితి ఏర్పడగా సామంత ప్రభువులవంటి దొరలు రథ గజ తురగ దళాలతో వజ్రవ్యూహాలు నిర్మించుకొని అర్జునుడిని చుట్టుముట్టటానికి యత్నించారు. **"త్రిధా వ్యవస్థిత బలో వజ్ర ఇత్యభిధీయతే। సూచ్యా అల్పాన్ వజ్రేణ బహూన్ యోధయేత్".** వజ్రం - భేదించటానికి వీలులేని వ్యూహాలలో ఒకటి. త్రివిధ దళాలతో పన్నేది. కాబట్టి గుర్రాల కదలికలో వాటి చిరుగంటల చప్పుడు, ఏనుగుల సందడిలో వాటి గంటల నాదాలూ, రథాల పరుగులలో వాటి చక్రధ్వనులూ కలిగి ఒక మహాశబ్దం ఏర్పడింది. గమనించ తగిన అందమైన అంశమేమంటే - అర్జునుడి గుణం గర్జనం చేస్తుందట. అంగత్రయం చేసే నాదం ఉత్కట ఘోషంగా ఉన్నదట. ఈ శబ్ద తారతమ్యంతో బల తారతమ్యాన్ని రసికులు గుర్తించగలిగేటట్లు సన్నివేశాన్ని చిత్రించటం ఇక్కడి రామణీయకం. (సంపా.)

తే. **అట్టియెడ వేల్పు వచ్చినయట్ల మేను। పొంగ నలి రేఁగి పాండవ పుంగవుండు**
మత్స్యనృపనందనుని బలుమాట తోడి। యేపు సెవికిని జూడ్కికి నింపు నొసఁగ. **40**

ప్రతిపదార్థం: అట్టియెడన్= అప్పుడు; పాండవపుంగవుండు= పాండురాజు కుమారులలో శ్రేష్ఠుడైన అర్జునుడు; వేల్పు వచ్చినయట్ల= దేవత ఆవేశించినట్లుగా (పూనకం వచ్చిందా అన్నట్లు); మేను= శరీరం; పొంగన్= ఉబ్బగా; నలిరేఁగి= కోపంతో అతిశయించి; మత్స్యనృపనందనుని= ఉత్తరుడి యొక్క; బలుమాటతోడి= పొగడ్తతో; ఏపు= విజృంభణం; చెవికినిన్= చెవికినీ; చూడ్కికిన్= దృష్టికినీ; ఇంపు= సంతోషాన్ని; ఒసఁగన్= కలిగించగా.

తాత్పర్యం: అర్జునుడు దేవత ఆవేశించినట్లు శరీరం ఉప్పొంగగా విజృంభించి, ఉత్తరుడి పొగడ్త మాటలు వినటానికీ, చూడటానికీ ఇంపు కలిగించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం : అలం: ఉత్ప్రేక్ష. దొరలందరు ఒక్కుమ్మడిగా వజ్రవ్యూహాలతో తనను చుట్టుముట్టటానికి రావటం చూశాడు అర్జునుడు. బలవంతులైన శత్రువులను చూచినప్పుడు వీరుడికి మేను పొంగుతుంది. ఇది వీరోచిత సాత్త్విక భావం. అది దేవత ఆవేశించినప్పుడు కలిగే పూనకమా అన్నట్లు ఉన్నదట! అందువలన అది ఉత్ప్రేక్ష. వజ్రం - ఇంద్రాయుధం పేరు. ఆ పేరుగల వ్యూహం చూసినప్పుడు దేవతలే అర్జునుడిని ఆవేశించినట్లుండటం ఔచిత్యం. ఆ పూనకం చూచేసరికి ఉత్తర కుమారుడు దేవుడిని ప్రశంసించినట్లు అర్జునుడిని పొగిడాడట. ఆ మాటలు చెవులకు, చూపులకు సంతోషాన్ని కలిగించి రసోల్లాసాన్ని పెంచాయి. (సంపా.)

క. **మేదుర దీర్ఘతరం బగు। నాదం బెడతెగక గుణమునను వడి నిగుడం**
గోదండము సంతతవల। యోదాత్తస్ఫురణ వెలుఁగుచుండఁగ నేసెన్. **41**

ప్రతిపదార్థం: మేదుర= దట్టమైన; దీర్ఘతరంబు+అగు= ఎక్కువ పొడవైన; నాదంబు= ధ్వని; ఎడతెగక= మధ్యన ఆపులేక; గుణమునను= నారియందు; వడిన్= వేగంగా; నిగుడన్= వ్యాపించగా; కోదండము= విల్లు; సంతత= ఎల్లప్పుడును; వలయ= గుండ్రనిదై; ఉదాత్త స్ఫురణన్= గొప్ప ప్రకాశంతో; వెలుఁగుచుండఁగన్= వెలుగుతూ ఉండగా; ఏసెన్= బాణాలు వేసెను.

తాత్పర్యం: అర్జునుడి నారినుండి దట్టమైన పొడవైన నాదాలు ఎడతెగకుండా వస్తూ ఉండగా, విల్లు ఎప్పుడూ వలయాకారంతో ప్రకాశిస్తూ ఉండగా బాణాలను ప్రయోగించాడు.

విశేషం : అర్జునుడు గాండీవంతో నిరంతరంగా బాణాలు వేయటంచేత నిరంతరాయంగా గుణధ్వని దీర్ఘంగా వినిపిస్తున్నది. గాండీవం వలయంగానే (బాణం ఎక్కు పెట్టిన రూపంలోకి) ఉండిపోయింది. అది అతడికి పరివేషంగా భాసించిందని; అది అతడిలోని దేవతల పూనకానికి చిహ్నంగా ఉన్నదని చమత్కారం. రాబోయే పద్యంలో సూర్యుడివలె వర్ణించటానికి ఇది ప్రాతిపదిక. (సంపా.)

మ. ఒక మాత్రన్ వితతప్రసార నిబిడాత్యుగ్రాస్త్ర సంతానముల్
సకలానీకములందుఁ బర్వ నరు భాస్వన్మూర్తి శోభిల్లె దీ
ప్తికలాపంబులు లోక మంతటను విస్తీర్ణంబులై యౌగప
ద్యకృత వ్యాప్తి వెలుంగ నొప్పెసఁగు మార్తాండున్ విడంబించుచున్. 42

ప్రతిపదార్థం: ఒకమాత్రన్= రెప్పపాటుకాలంలో; వితత= ఎక్కువయిన; ప్రసార= వ్యాప్తిగల; నిబిడ= దట్టమైన; అతి+ఉగ్ర= మిక్కిలి భీకరాలైన; అస్త్ర సంతానముల్= అస్త్ర (మంత్ర సహిత బాణ) సముదాయాలు; సకల+అనీకములందున్= అన్నిసేనల పైనను; పర్వన్= వ్యాపించగా; నరు= అర్జునుడి యొక్క; భాస్వత్+మూర్తి= ప్రకాశించే శరీరం; దీప్తికలాపంబులు= కిరణ సముదాయాలు; లోకము+అంతటన్= లోకమంతా; విస్తీర్ణంబులు+ఐ= వ్యాపించినవై; యౌగపద్యకృత= ఒక్కసారిగా చేయబడిన; వ్యాప్తిన్= వ్యాపించటంచేత; వెలుంగన్= ప్రకాశించగా; ఒప్పు+ఎసఁగు= ఎక్కువగా అందగించే; మార్తాండున్= సూర్యుడిని; విడంబించుచున్= అనుకరిస్తూ; శోభిల్లెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: ఒక్కసారిగా అన్ని సైన్యాలపైనా దట్టమైన భయంకరమైన అస్త్రసముదాయాలను ప్రయోగిస్తూ తేజోమూర్తిగా కనబడుతున్న అర్జునుడు ఒక్కసారిగా కిరణాలన్నింటినీ లోకాలలో వ్యాపింపజేసి వెలిగే సూర్యుడి వలె ప్రకాశిస్తున్నాడు.

విశేషం : అలం: ఉపమ. అర్జునుడు మధ్యాహ్నసూర్యుడివలె ప్రకాశించాడు. సూర్యుడు ఒక్కసారిగా తన కిరణాలను లోకంమీద నలుదిక్కులా ప్రసరింపచేసి ప్రకాశించగలడు. అర్జునుడు గాండీవంనుండి ఒక్కసారిగా అస్త్రసముదాయాన్ని సైన్యాలన్నింటిమీదా ప్రయోగించి పరాక్రమంతో ప్రకాశించగలడు. ఇద్దరూ భాస్వన్మూర్తులే. అందువలన ఉపమానం సహజ రమణీయం. (సంపా.)

క. నరు లొరులు దృశ్యములపైఁ। బరఁగింపఁగఁ జూడ్కు లెట్లు వడుఁ దప్పక య
ప్పరుసున నరుఁ డేయు నిశిత। శరములు లక్ష్యములు దప్పి చన వించుకయున్. 43

ప్రతిపదార్థం: ఒరులు= ఇతరులయిన; నరులు= మనుష్యులు; దృశ్యములపైన్= చూడదగిన వస్తువులపై; పరఁగింపఁగన్= ప్రసరింపజేయగా; చూడ్కులు= దృష్టులు; తప్పక= తప్పకుండా; ఎట్లు= ఏరీతిగా; పడున్= పడునో; ఆ+పరుసునన్= ఆ రీతిగా; నరుఁడు= అర్జునుడు; ఏయు= వేయునట్టి; నిశితశరములు= వాడి అయిన బాణాలు; ఇంచుకయున్= కొద్దిగాకూడా; లక్ష్యములు తప్పి= గురిని తప్పి; చనవు= పోవు.

తాత్పర్యం: చూడదగిన వస్తువులపై సాధారణ మానవులు తమ చూపులను ప్రక్కకు తిప్పకుండా ప్రసరింప జేసినప్పుడు ఎట్లాగైతే గురితప్పవో, అట్లాగే అర్జునుడి బాణాలు కొద్దిగా కూడా లక్ష్య భేదనంలో గురితప్పవు.

విశేషం : అలం: ఉపమ. చూపులు లక్ష్యాలను ఎట్లా గురిగా చూస్తాయో, అర్జునుడి బాణాలు లక్ష్యాలను అట్లా భేదిస్తాయి అని భావం. ఇది గాండీవి లక్ష్యశుద్ధిని తెలుపుతున్నది. అనేక లక్ష్యాలమీద ఒకేసారి బాణాలు ప్రయోగించే అర్జునుడు ఎప్పుడూ లక్ష్యాన్ని తప్పలేదని చెప్పటం కవి హృదయం. మూలంలో ఈ భావమే వ్యతిరేక వ్యంగ్యస్ఫూర్తితో చెప్పబడింది.

"పతంత్యరూపేషు యథా చక్షూంషి న కదాచన, నాలక్ష్యేషు శరాః పేతుస్తథా గాండీవధన్వినః!" (సం.4-55-26) అమూర్తాలైన లక్ష్యాలమీద మానవదృక్కులు ఎట్లా ఎప్పుడూ పడవో అట్లాగే అర్జునుడి బాణాలు లక్ష్యాలు కాని వాటిమీద పడవు అని మూలం. మూలంలో కంటె తిక్కన రచనలో స్పష్టత ఎక్కువ. (సంపా.)

క. గజ ఘోటక రథ సూత। ధ్వజకంకట యోధగాత్ర తతియం దెచటన్
విజయ ధనుర్ముక్త శర। వ్రజములు దవులంగఁ, బడ కవారణ నిగుడున్. 44

ప్రతిపదార్థం: గజ= ఏనుగులు; ఘోటక= గుర్రాలు; రథ= రథాలు; సూత= సారథులు; ధ్వజ= జెండాలు; కంకట= కవచాలు; యోధ= యుద్ధవీరుల; గాత్ర తతియందున్= అవయవాలందు; ఎచ్చటన్= ఎక్కడైనా; విజయ= అర్జునుడియొక్క; ధనుస్+ముక్త= వింటినుండి విడువబడిన; శరవ్రజములు= బాణ సముదాయాలు; తవులంగన్= తగులగా; పడక= పడిపోక; అవారణన్= అడ్డులేనివై; నిగుడున్= గుచ్చుకొని అలాగే వుంటాయి.

తాత్పర్యం: అర్జునుడు వేసే బాణాలు ఏనుగులు, గుర్రాలు, రథాలు, సారథులు, జెండాలు, కవచాలు, యోధుల శరీరాలు మొదలైన వాటిపై ప్రయోగించినప్పుడు వాటిమీద తప్పనిసరిగా గుచ్చుకొని పడిపోక అలాగే ఉంటాయి.

చ. కవదొన లేల పూనునొకొ కవ్వడి నా వల; దుగ్రసంగరో
త్సవమున సవ్యపాణి నపసవ్యకరంబున మార్చి, మార్చి గాం
డివము ధరింపఁగా శర పటిష్ఠతయుం బొరిఁ జేయి మార్చి చూ
పు వెరవుతోన వీడ్వడక పొం దొడఁగూడెడు నెప్డు సూచినన్. 45

ప్రతిపదార్థం: కవ్వడి= అర్జునుడు; కవదొనలు= రెండమ్ములపొదులను; ఏల పూనునొకొ= ఎందుకు ధరిస్తాడో; నాన్, వలదు= అనవలదు; ఉగ్ర= భీకరమైన; సంగర= యుద్ధమందలి; ఉత్సవమునన్= వేడుకతో; సవ్యపాణిన్= ఎడమచేతిలోనికి; అపసవ్యకరంబునన్= కుడిచేతిలోకి; మార్చి మార్చి= పదే పదే మార్చుకొంటూ; గాండివము= విల్లును; ధరింపఁగాన్= ధరించటానికి; శర= బాణాలయొక్క; పటిష్ఠతన్= గట్టిగా ఉండటం; పొరిన్= మాటి మాటికి; చేయిమార్చి= చేతిని మార్చి; చూపు= దృష్టిని; వెరవుతోను+అ= సులువుతో; పొందు= కలయిక; ఎప్డు+చూచినన్= ఎప్పుడు చూచినా; వీడ్వడక= విడిపోక; ఒడఁగూడెడున్= కలిసి ఉంటుంది.

తాత్పర్యం: అర్జునుడు రెండమ్ముల పొదులను ఎందుకు ధరిస్తాడంటే, భీకరమైన యుద్ధం అతడికి వేడుక. అందులో కుడి ఎడమచేతులు మార్చి మార్చి గాండీవాన్ని ధరించేటప్పుడు, అందుకు అనువుగా బాణాలను ప్రయోగిస్తూ ఉన్న ఆయన ఎడమకుడి చేతుల ప్రయోగనైపుణ్యంసైతం ఏ మాత్రం తగ్గనిదై, ఎప్పుడు చూచినా మిక్కిలి పొందిక గలదిగా గోచరిస్తూ ఉంటుంది.

విశేషం : అర్జునుడు నిర్విరామంగా గాండీవాన్ని చాలనం చేయగలగటానికి కారణం అతడు కవ్వడి కావటం. కవ+వడి= రెండు చేతుల వడి కలవాడు. సవ్యసాచి అని కూడా పిలుస్తారు. కుడి ఎడమ చేతులలో దేనితో బాణం వేసినా ఒకే వేగాన్ని, సామర్థ్యాన్ని ప్రదర్శించగలగటం అతడి ప్రత్యేకత. అటువంటి విలుకాడు భారతకాలంలో మరొకడు లేడు. చుట్టూ మూగిన రాజులనందరినీ క్షణాలలో బాణాలతో కొట్టగలుగుతున్నాడంటే అతడు కవ్వడి కావటమే కారణం. కవ్వడికి కవదొన లుండటం అవసరం. సవ్యాపసవ్యకరాలతో బాణాలు వేసేటప్పుడు భుజాల ఇరువైపులా అమ్ములపొదు లుండకపోతే బాణప్రయోగం సుకరం కాదు. అంతేకాదు, అవి అక్షయ తూణీరాలు. ఎన్ని బాణాలు వేసినా అందులో బాణాలు తరగవు. అందుకే, అన్ని దిక్కులా అసంఖ్యాకాలైన బాణాలను ఒక్కొక్కసారి గుప్పుతాడు. కారణం ఆ కవదొనలు ఎప్పుడూ నిండుగా ఉంటాయి కాబట్టి. (సంపా.)

క. సమ విషమ వినిమ్నోన్నత । సమీప దూర స్థలములు సదృశములుగఁ జి
త్తము క్రియ నవిహత గతులను । సమరమహిం గ్రీడిరథము సను నవితథమై. 46

ప్రతిపదార్థం: సమ= సమమైనవి; విషమ= సమముగాలేనివి; వినిమ్న= పల్లములైనవి; ఉన్నత= మెరకైనవి; సమీప= దగ్గరివి; దూర స్థలములు= దూరముగా ఉన్న ప్రదేశాలు; సదృశములుగన్= సమానంగా; చిత్తముక్రియన్= మనస్సువలె, మనస్సుకు నచ్చినవిధంగా; సమరమహిన్= యుద్ధభూమిలో; క్రీడిరథము= అర్జునుడి రథం; అవిహతగతులను= అడ్డులేని గమనాలలో; అవితథము+ఐ= వ్యర్థముకాక, కుంటుపడకుండా; చనున్= వెళ్ళును.

తాత్పర్యం: అర్జునుడి రథం సమం, విషమం, పల్లం, మెరక, దగ్గర, దూరం అనే వ్యత్యాసం లేకుండా మనస్సువలె (అర్జునుడి మనస్సుకు అనుకూలంగా) యుద్ధరంగంలో ఏమీ అడ్డులేకుండా వివిధ గతులలో కుంటుపడకుండా సాగుతుంది.

విశేషం : అలం: ఉపమ, అతిశయోక్తి. ఇందులో 'చిత్తముక్రియన్' అనే పదానికి మనస్సువలె అనీ, మనోగతికి అనుకూలంగా అనీ అర్థాలు చెప్పవచ్చును. మనస్సును రథంతో పోల్చటం కవిసమయం. ఇక్కడ ఉపమాలంకారం ఉన్నది. మనస్సుకు ఎట్లా ఎత్తు పల్లాలు అడ్డం రావో రథానికి కూడా అట్లాగే రావు. మనోవేగం వంటి వేగమే రథానికి ఉన్నదని చెప్పటం కూడా విశేషమే. అందులో అతిశయోక్తి ఉన్నది. అయితే 'చిత్తముక్రియ చనున్' - అన్నప్పుడు సంకల్పానికి అనుగుణంగా పయనిస్తుందని కూడా అర్థం చెప్పవచ్చును. దివ్యరథాలకు అది సహజలక్షణం. వాటికి ఎత్తుపల్లాల తారతమ్యం కూడా ఉండదు. (సంపా.)

వ. వెండియు నతండు. 47

తాత్పర్యం: అంతేకాక, అర్జునుడు.

మ. బలమెల్లన్ వెఱ రెండుపాయలుగ శుంభద్వేగుఁడై చొచ్చి యా
వలగా నడ్డము వచ్చి నాలువుగ దుర్వారోద్ధతిం బోయి మూ
లల నానాశకలాకృతిం బొరయ లీలాయానదుర్దాంతుఁడై
వలయంబుల్ సని చించి చిక్కువఱుచున్ వైకల్య సంపాది యై. 48

ప్రతిపదార్థం: బలము+ఎల్లన్= సేన అంతా; వెఱన్= భయంతో; రెండు పాయలుగన్= రెండు భాగాలయ్యేటట్లు; శుంభత్+వేగుఁడు+ఐ= మెరయు వేగం కలవాడై; చొచ్చి= ప్రవేశించి; ఆవలగాన్= అవతల వైపునుండి; అడ్డమువచ్చి= అడ్డంగావచ్చి; నాలువుగన్= నాల్గు భాగాలుకాగా; దుర్వార= మరల్పరాని; ఉద్ధతిన్= ఆటోపంతో; పోయి= వెళ్ళి; మూలలన్= మూలలందు; నానా శకల+ఆకృతిన్= అనేక ముక్కల ఆకారాన్ని; పొరయన్= పొందగా; లీలాయాన= విలాసంగా వెళ్ళే నడకతో; దుర్దాంతుఁడు+ఐ= అణచ శక్యం కానివాడై; వలయంబుల్= గుండ్రంగా నడిచే గతులచేత; చని= వెళ్ళి; వైకల్యసంపాది+ఐ= వికలంగా చేసేవాడై; చించి= సైన్యాన్ని చీల్చి; చిక్కు+పఱుచున్= చిక్కుపెట్టాడు.

తాత్పర్యం: అర్జునుడు రథాన్ని అమితవేగంతో కౌరవసైన్య వ్యూహంలో చొచ్చుకొని పోయేటట్లు చేశాడు. ఆ సైన్యం రెండుగా చీలింది. ఆవలివైపు చేరి తిరిగి అడ్డంగా తిరిగి సాగి సైన్యవ్యూహాన్ని నాలుగు భాగాలుగా విడగొట్టాడు. మూలలలో ప్రవేశించి నాలుగు దిక్కుల రథాన్ని నడిపాడు. దానితో సైనికవ్యూహం ముక్కలు ముక్కలయింది. ఆ తరువాత రథాన్ని మండలాకారంగా గిరగిరా తిరిగించి శత్రు వ్యూహాలను చిక్కులకు గురిచేసి చెల్లాచెదరు చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం : "వజ్రం వజ్రేన భిద్యతే" - అని న్యాయం. వజ్రవ్యూహాలతో చుట్టుముట్టిన సేనలను వజ్రసంకల్పంతో చేసిన దాడితో అర్జునుడు చిన్నాభిన్నం చేశాడు. సాహసంతో నిలువునా, అడ్డంగా, మూలనుండి మూలలకు, వలయాకారంగా నిరాఘాటంగా తిరిగి వజ్రవ్యూహాన్ని చెల్లాచెదరు చేశాడు. అంతగా మూగిన రాజలోకం, అంతగా సన్నద్ధమైన గజాశ్వరథ సైన్యాలూ, అర్జునుడి రథధాటికి ఓర్చుకోలేక ప్రక్కకు ఒదిగి బాట లిచ్చి ఊరుకొన్నాయి. ఒక్కవీరుడు అడ్డులేకుండా విస్తృత సైన్యంలో విహరించటం విచిత్రంగా అందరూ చూస్తూ ఉండిపోయారు. అర్జునుడి వీరకృత్యానికి సైన్యం ఆశ్చర్యముద్రతో నిలిచిపోయినట్లయింది. (సంపా.)

వ. ఇవ్విధంబున నంబుధిలోన మహామత్స్యంబు విహరించు చందంబునఁ దదీయ రథంబు కౌరవసైన్యంబునందు సంచరించు నయ్యవసరంబున. 49

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; అంబుధిలోనన్= సముద్రంలో; మహామత్స్యంబు= పెద్దచేప (తిమింగలము); విహరించు చందంబునన్= తిరిగే రీతిగా; తదీయరథంబు= అర్జునుడి రథం; కౌరవసైన్యంబునందున్= కౌరవుల సేనలో; సంచరించు+ఆ+అవసరంబునన్= సంచరించే ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా ఒక పెద్దచేప సముద్రంలో విహరించే విధంగా అర్జునుడు తన రథంలో కౌరవసేనా మధ్యంలో సంచరిస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం : అలం: ఉపమ. సముద్రం వంటి కౌరవసేనలో తిమింగలం వంటి అర్జునుడి రథం అడ్డూ ఆపూ లేకుండా స్వేచ్ఛగా విహరించింది అని భావం. మత్స్య విహారంలో అడ్డులేనితనం, అవలీలగా విహరించే స్వభావం, చిత్ర విచిత్ర గతుల విన్యాసం సహజంగా ఉంటాయి. విజయుడి రథం కూడా అటువంటి విలాసాలను ప్రదర్శించటం గమనార్హం. సందర్భోచిత సార్థకోపమాలంకారం. (సంపా.)

ఆ. రత్నకేతనములు రాజిత శేఖరం। బులును రుచిరఘంటికలును బార్థు
బాణ నిహతిఁ దునిసి పడుఁ గౌరవులచేటు। దెలుప డుల్లు నుల్కములను బోలె. 50

ప్రతిపదార్థం: రత్నకేతనములు= రత్నాలు పొదిగిన జెండాకొయ్యలు; రాజిత= ప్రకాశించే; శేఖరంబులును= శిరోభూషణాలూ; రుచిర= అందమైన; ఘంటికలును= చిరుగంటలూ; పార్థు= అర్జునునియొక్క; బాణనిహతిన్= బాణాల దెబ్బలచేత; కౌరవుల చేటు= కౌరవుల కీడును; తెలుపన్= తెలుపటానికై; డుల్లు= రాలునట్టి; ఉల్కములను+పోలెన్= ఉల్కలవలె; తునిసిపడున్= తెగిపడుతున్నాయి.

తాత్పర్యం: రత్నకేతనాలు, ప్రకాశించే రాజుల శిరోభూషణాలు, అందమైన చిరుగంటలు అర్జునుడి బాణాల దెబ్బలకు - కౌరవులకు కీడును సూచించే ఉల్కాపాతాలవలె రాలిపడుతూ ఉన్నాయి.

విశేషం : అలం: ఉపమ. ఉల్కాపాతం అశుభ సూచనం. రత్నకేతనాలు పడటం రాజ్య పతనానికీ, శిరోభూషణాలు డొల్లటం రాజ పతనానికీ, చిరుగంటలు తెగిపడటం అశుభానికీ సూచనలు. వీటన్నింటిని ఉల్కాపాతాలుగా పోల్చటం వస్తు ధ్వని. (సంపా.)

క. నరు భల్లంబుల నగ్రిమ। చరణంబులుఁ ద్రెస్సి మ్రొగ్గ జవనాశ్వంబుల్
కరుణమెయి రాహుతులకున్। శరణం బగు మనుచు మ్రొక్కు చందం బొందెన్. 51

ప్రతిపదార్థం: నరు భల్లంబులన్= అర్జునుడి బల్లెములతో; అగ్రిమ చరణంబులున్= ముందుకాళ్ళు; త్రెస్సి= తెగి; మ్రొగ్గ= ముందుకు ఒరిగే; జవన+అశ్వంబుల్= మేలుజాతి గుర్రాలు; కరుణమెయిన్= దయతో; రాహుతులకున్= తమ రౌతులకు; శరణంబు+అగుము= రక్షకుడవు కమ్ము; అనుచున్= అంటూ; మ్రొక్కు చందంబు= (అర్జునుడికి) మ్రొక్కేడి రీతిని; పొందెన్= పొందాయి.

తాత్పర్యం: అర్జునుడి బల్లెముల తాకిడికి ముంగాళ్ళు తెగిపోగా జాతిగుర్రాలు ముందుకు మొగ్గాయి. అది ఎట్లా ఉన్నదంటే - 'ఓ అర్జునా! మా రౌతులకు దయతో శరణునిచ్చి కాపాడు' మని మ్రొక్కుతున్నవో అన్నట్లుగా ఉన్నది.

విశేషం : అలం: ఉత్ప్రేక్ష.

క. **దంతి ఘటాసంతానము। కుంతీసుతు నారసములఁ గూలినతఱి న**
త్యంతనిబిడాభ్రముల దివి। యెంతయు సొంపారు భంగి నిల సెలువొందెన్. **52**

ప్రతిపదార్థం: దంతి= ఏనుగుల; ఘటాసంతానము= గుంపుల సముదాయం; కుంతీసుతు= అర్జునుడి యొక్క; నారసములన్= బాణాలతో; కూలిన తఱిన్= నేలపై పడిపోయినప్పుడు; దివి= ఆకాశం; అత్యంత నిబిడ= మిక్కిలి దట్టమైన; అభ్రములన్= మేఘాలతో; ఎంతయున్= మిక్కిలి; సొంపారు భంగిన్= అందగించునట్లు; ఇల= భూమి; చెలువు+ఒందెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: ఏనుగుల గుంపుల సముదాయాలు అర్జునుడి వాడి బాణాలవలన నేలగూలినప్పుడు ఆ నేల దట్టమైన మబ్బులతో నిండి ఉన్న ఆకాశం వలె ఒప్పారింది.

విశేషం : అలం: ఉపమ. తిక్కన భయానక బీభత్స దృశ్యాలను రమణీయంగా ఆస్వాదయోగ్యం చేయటానికి సముచిత సుందరాలంకారాలను ఎన్నుకొంటాడు. అతడి ఆ కవితా శిల్పానికి ఈ అలంకారం ఒక ఉదాహరణం. (సంపా.)

క. **పలుపులుఁ గాండ్లుం బగ్గం। బులుఁ దన యస్త్రంబు లడరి పొడిచేసిన వి**
చ్చలవిడిఁ బాఱెడు రథ్యం। బుల నేయఁడు దివిజరాజపుత్రుఁడు కృపతోన్. **53**

ప్రతిపదార్థం: తన, అస్త్రంబులు= అర్జునుడి బాణాలు; పలుపులున్= తాళ్ళనూ; కాండ్లున్= కాడులను (కాడెలనూ); పగ్గంబులున్= గుర్రాల కళ్ళాలకు కట్టే తాళ్ళనూ; అడరి= విజృంభించి; పొడి+చేసినన్= నుగ్గుచేయగా; విచ్చలవిడిన్= ఇష్టంవచ్చినట్లు; పాఱెడు= పరుగెత్తే; రథ్యంబులన్= గుర్రాలను; దివిజరాజపుత్రుఁడు= అర్జునుడు; కృపతోన్= దయతో; ఏయఁడు= కొట్టడు.

తాత్పర్యం: అర్జునుడు తన బాణాలతో తాళ్ళు, కాడులు, పగ్గాలను నుగ్గుచేయగా రథాలను విడిచి పరుగెత్తే గుర్రాలను కొట్టకుండా దయతో విడిచిపెట్టివేశాడు.

విశేషం : వెన్నిచ్చి పరుగెత్తే వీరులనుగాని, జంతువులనుగాని యుద్ధంలో చంపకూడదు. ఆ విధిని అర్జునుడు పాటించి ఉదాత్తుడనిపించుకొన్నాడు. (సంపా.)

ఆ. **అర్జునాస్త్ర ఖండితాతపత్ర ధ్వజ। చామరములు గాలిఁ జదలఁ దూలఁ**
జిహ్నముల విభూతిఁ జెందంగఁ గడు నొప్పె। నప్పు డాడుచున్న యట్టు లచట. **54**

ప్రతిపదార్థం: అర్జున= అర్జునుడి యొక్క; అస్త్ర= అస్త్రములచేత; ఖండిత= తెగగొట్టబడిన; ఆతపత్ర= గొడుగులు; ధ్వజ= జెండాలు; చామరములు= వింజామరములును; గాలిన్= గాలిచేత; చదలన్= ఆకాశంలో; తూలన్= కదలగా; చిహ్నముల= రాజ చిహ్నల; విభూతిన్= సంపదను; చెందంగన్= పొందగా; ఆడుచున్న యట్టులన్= ఆడుతున్నట్లు; అప్పుడు; అచటన్= ఆ ప్రదేశంలో; కడున్= మిక్కిలి; ఒప్పెన్= ప్రకాశించాయి.

తాత్పర్యం: అర్జునుడి అస్త్రాలతో ఖండించబడ్డ గొడుగులు, జెండాలు, చామరాలు గాలిలో కదులుతూ రాజచిహ్నల సంపద గాలిలో ఆడుతున్నట్లుగా చూచేవారికి కనిపిస్తూ ప్రకాశిస్తున్నాయి.

క. ఒకమఱి కిరీటి కట్టెది । రికి నతిముఱిఁ బోయి రేని రెండవమా ఱి
య్యకొనుట కోర్వఁగ లేరై । రొకళ్ళుఁ గురురాజ సేన యోధులలోనన్. 55

ప్రతిపదార్థం: కిరీటి= అర్జునుడి; కడు+ఎదిరికిన్= ఎదుటికి; ఒకమఱి= ఒకసారి; అఱిముఱిన్= తొందరపాటుతో; పోయిరి+ఏనిన్= వెళ్ళినప్పటికీ; రెండవమాఱు= రెండవసారి; ఇయ్యకొనుటకున్= ఒప్పుకొనటానికి; కురురాజుసేన= దుర్యోధనుని సేనలోని; యోధులలోనన్= వీరులలో; ఒకళ్ళున్= ఒక్కరైనా; ఓర్వఁగ లేరు+ఐరి= తట్టుకొనలేకపోతున్నారు.

తాత్పర్యం: కౌరవసేనలోని వీరులు ఎవ్వరైనా ఒక్కసారి అర్జునుడి మీదికి తొందరపడి యుద్ధానికి వెళ్ళారా, అంతే. ఇక రెండవసారి వెళ్ళటానికి ఎవ్వరూ సాహసించటం లేదు.

విశేషం : కురువీరులకు అర్జునుడు సింహస్వప్నమయ్యాడు. ఇందులో అర్జునుడి పరాక్రమం వస్తుధ్వని. (సంపా.)

సీ. మండితధ్వజదండమండలంబులఁ గిట్టి । విటతాటనంబుగా విఱిచి విఱిచి,
చటులఖురోద్భటాశ్వ శ్రేణిఁ బొదివి ర । యంబునఁ దునిమి తూఁటాడి యాడి,
రాజిత బహువిధ రథ సమూహముఁ జొచ్చి । గలిబిలి యగునట్లు గలఁచి కలఁచి,
మదభర భీషణ మాతంగముల ముట్టి । చిందఱ వందఱ చేసి చేసి,

ఆ. పటు పదాతి చయముపై రౌద్రరస మహో । గ్రముగ నడరి నేలఁ జమరి చమరి
సవ్యసాచి బాణ సంఘంబు మత్తశుం । డాల ఘోరలీలఁ గేలి సలిపె. 56

ప్రతిపదార్థం: సవ్యసాచి బాణ సంఘంబు= అర్జునుడి బాణ సమూహం; మత్తశుండాల= మదించిన ఏనుగు యొక్క; ఘోరలీలన్= భయంకరమైన విలాసంతో; మండిత= అలంకరించిన; ధ్వజ= జెండాలయొక్క; దండమండలంబులన్= కర్రల సమూహాలను; విటతాటనంబుగాన్= తారుమారయ్యేటట్లుగా; విఱిచి, విఱిచి= బాగా విరిచివేసి; చటుల= చంచలమైన; ఖుర= గిట్టలతో; ఉద్భట= గొప్పవైన; అశ్వశ్రేణిన్= గుర్రాల వరుసలను; పొదివి= పట్టి; రయంబునన్= వేగంగా; తునిమి= నరికి; తూఁటాడి+ఆడి= ముక్కలుముక్కలుగా చేసి; రాజిత= ప్రకాశించే; బహువిధ= అనేక రకాలైన; రథ సమూహమున్= రథాల సమూహాన్ని; చొచ్చి= ప్రవేశించి; గలిబిలి+అగునట్లు= గజిబిజిగా; కలఁచికలఁచి= చిందరవందర చేసి; మద= మదంతో; భర= నిండిన; భీషణ= భీకరమైన; మాతంగములన్= ఏనుగులను; ముట్టి= చుట్టుముట్టి; చిందఱవందఱ= అస్తవ్యస్తం; చేసి చేసి; పటు= సమర్థమైన; పదాతి= కాల్బలముయొక్క; చయముపైన్= సముదాయంపై; రౌద్రరస= రౌద్రరసంచేత; మహా+ఉగ్రముగన్= ఎక్కువ భయంకరంగా; అడరి= అతిశయించి; నేలన్= భూమిపై; చమరి చమరి= రాచి రాచి; బాణ సంఘంబు= బాణాల సమూహం; కేలి= ఆట (యుద్ధక్రీడ); సలిపెన్= చేసింది.

తాత్పర్యం: జెండా కర్రలను తారుమారుగా చేసి విరుగగొట్టి, గొప్పవైన గుర్రాలను ముక్కలు ముక్కలుగా చేసి, రథాలను చిందరవందరగా చేసి, మదంతో నిండిన ఏనుగులను చుట్టుముట్టి అస్తవ్యస్తం చేసి, మహోగ్రమైన పదాతి దళాన్ని నేల రాచి, మదించిన ఏనుగు భయంకరంగా విహరించినట్లు అర్జునుడి బాణసముదాయం విలాసంగా ఆట ఆడుకొన్నట్లుగా యుద్ధ క్రీడ చేసింది.

విశేషం : అలం: ఉపమ. అర్జునుడు కురువీరసేనల నడుమ మదించిన ఏనుగు ఏ విధంగా దారుణంగా విధ్వంసకరంగా భయంకరంగా విహరిస్తుందో అట్లా విహరించి యుద్ధక్రీడ చేశాడు. శుండాలం అంటే తొండంతో నీటిని గ్రహించేది అని అర్థం. మదించిన ఏనుగు తన తొండాన్ని ఉపయోగించి ఎట్లా ధ్వంసకాండను నిర్వహిస్తుందో అట్లా అర్జునుడు గాండీవ వినిర్ముక్త బాణ సంఘాన్ని ఉపయోగించి కురువీరుల చతురంగ బలాలను నుగ్గు చేశాడు. ఇది చక్కని సామ్యం. ఇందులో అయిదు రకాలైన క్రియలు చెప్పబడ్డాయి. విరవటం, తూటాడటం, కలచటం, చిందరవందర చేయటం, చమరటం. ఈ క్రియలు ఏనుగు చేసే ధ్వంసక్రీడలు. అర్జునుడు చేసిన యుద్ధక్రీడలు. మదించిన శుండాలం తొండంతో ధ్వజ దండాలను విరుస్తుంది. అట్లాగే అర్జునుడు కేతనాలను విరుగగొట్టాడు. శుండాలం గుర్రాలను చుట్టుముట్టి తొండంతో ఎట్లా దానిని కలచివేస్తుందో అట్లాగే అర్జునుడు రథసైన్యం మధ్యలో ప్రవేశించి వలయాకారంగా తిరిగి వాటిని కలచి వేశాడు. మత్త శుండాలం మదించిన మాతంగాలను చుట్టుముట్టి తొండంతో కొట్టి చిందరవందర చేసినట్లుగానే అర్జునుడు కూడా బాణాలతో కొట్టి మదేభాలను కలతపరిచాడు. మతంగ మహర్షివలన పుట్టింది మాతంగం. ఆ శబ్దం ఉత్తమ వంశజులైన వీరులను, మేలిజాతి ఏనుగులను స్ఫురింపచేయటం విశేషం. శుండాలం రుద్ర సంబంధమైన రసావేశంతో (అంటే రుద్రుడివలె సంహారం చేసే భావావేశంతో) మహా భయంకరమైన తొండంతో మనుషులను పట్టి నేలకు కొట్టి రాచి చంపినట్లు అర్జునుడు మహా కోపావేశంతో గాండీవ పాండిత్యం ప్రదర్శించి పదాతులను బాణాలతో కొట్టి నేలపై పడి చనిపోయేటట్లు రాచిరంపాన పెట్టాడు. మదించిన శుండాలం ఎంత ఘోరమైన పద్ధతిలో విలయం చేస్తుందో అట్లాగే అర్జునుడు రౌద్రరస మహోగ్ర ప్రవృత్తితో శత్రుసేనలను చెండాడుతూ యుద్ధకేళిని అవలీలగా, విలాసంగా చేశాడని భావం. సవ్యసాచి శుండాలం వంటివాడనీ, అతడి బాణసంఘం తొండంవంటిదనీ ఇక్కడ గ్రహించాలి. ఏనుగు తిరిగిన తోట ఎట్లా ధ్వంసమౌతుందో అక్కడి సైన్య వ్యూహం అట్లా ధ్వంసమైన ఒక దృశ్యాన్ని భావుక మనోవీథిలో తిక్కన దర్శనీయంగా ప్రదర్శించాడు. (సంపా.)

ఉ. **శిక్షిత చిత్రసంగర విశేషములం బ్రతిహేతి ఖండనా**
దక్షత పెంపుసొంపునను దైవబలంబున నత్తఱిన్ సహ
స్రాక్షతనూజు సారథి రథాశ్వచయ ధ్వజముల్ పరాస్త్ర శ
స్త్రక్షతి లేక యొప్పెఁ గురుసైన్యము వెక్కస మంది బెగ్గిలన్. **57**

ప్రతిపదార్థం: శిక్షిత= నేర్పబడిన; చిత్ర= రకరకాలైన; సంగర= యుద్ధంలోని; విశేషములన్= విశేషక్రియలచేత; ప్రతిహేతి= శత్రువుల ఖడ్గాలయొక్క; ఖండనా= ఖండించటంలోని; దక్షత= సామర్థ్యంయొక్క; పెంపు సొంపునను= అభివృద్ధి వైభవంచేతను; దైవబలంబునన్= దైవబలంచేతను; ఆ+తఱిన్= అప్పుడు; సహస్ర+అక్షతనూజు= ఇంద్రుడి కొడుకైన అర్జునుడి యొక్క; సారథి= సారథియు; రథ= రథమున్నూ; అశ్వచయ= అశ్వముల సముదాయమున్నూ; ధ్వజముల్= జెండాలున్నూ; పర= శత్రువులయొక్క; అస్త్ర= మంత్రసహితమైన బాణాలయొక్క; శస్త్ర= బాణాలయొక్క; క్షతి= దెబ్బ; లేక= లేకుండా; కురుసైన్యము= కౌరవసేన; వెక్కసము+అంది= సహించలేక; బెగ్గిలన్= భయపడగా; ఒప్పెన్= ప్రకాశించాయి.

తాత్పర్యం: అర్జునుడు క్రమబద్ధంగా నేర్చిన విచిత్ర యుద్ధ శిక్షణ విశేషాలతో, శత్రువుల బాణాలను ఖండించే నేర్పుతో యుద్ధం చేస్తున్నాడు. ముఖ్యంగా దైవబలం ఉన్నందువలన శత్రువులు ప్రయోగించే అస్త్రాలవలన, శస్త్రాలవలన అతడి సారథికి, రథానికి, గుర్రానికి, జెండాలకు ఏరకమైన దెబ్బ తగలకుండా ఉండటం చూచి కౌరవసేనలోని వారు సహించలేక అసూయపడ్డారు, బాధపడ్డారు.

విశేషం : అలం: కావ్యలింగం. ఈ పద్యం వెనుకటి (56వ) పద్యానికి ప్రతిరూప (Contrast) శిల్పం. అందులో శత్రువీరుల విరిగిన రథాల వర్ణనం. ఇందులో చెక్కుచెదరని అర్జునుడి రథ వర్ణనం - భావుకుల మనస్సులలో వస్తుధ్వని నాశ్రయించి ఏకైక వీరుడైన అర్జునుడి పరాక్రమం ధ్వన్యమానం కావటం విశేషం. శత్రువులు చుట్టూ మూగి అస్త్రాలనూ, శస్త్రాలనూ ప్రయోగించి అర్జునుడిని విరథుడిని చేయటానికి వేయి విధాల యత్నించారట! కాని, అతడి రథం క్షేమంగా ఉండి, వారి రథాలే కూలిపోయాయి. వారు దానికి సహించలేకపోయారు. అసూయపడ్డారు. బాధకూడా పడ్డారు. శత్రువుల కా అవస్థలను కల్పించటమే విజయుడి వీరలక్షణం. అర్జునుడు తన రథాశ్వ ధ్వజసారథులను రక్షించుకొనటానికి కవి రెండు హేతువులను చెప్పాడు. 1. దక్షత 2. దైవబలం. దక్షత శిక్షణవలన పెంపొందుతుంది. శత్రువులు ప్రయోగించే ఆయుధాలను నేర్పుతో ధ్వంసం చేసినప్పుడు సొంపు మీరుతుంది. అర్జునుడి దక్షత సొంపుపెంపులను ప్రదర్శించింది. అది పురుష యత్నంయొక్క సామర్థ్యాన్ని తెలిపింది. పురుషయత్నం దైవానుకూల్యం వలన కాని సిద్ధించదు. అర్జునుడి రథం దేవ నిర్మితం, దైవరక్షితం. కపిధ్వజం మహిమాన్వితం. అందువలన మానవులకు దుర్భేద్యం. ఇవి అర్జునుడి రథం భగ్నం కాకుండా ఉండటానికి అమరిన హేతువులు. **"సమర్థనీయస్యార్థస్య కావ్యలింగం సమర్థనం"** అనే లక్షణం ప్రకారం విజయుని రథక్షేమాన్ని సమర్థిస్తున్న ఈ పద్యంలో కావ్యలింగాలంకారం శోభిస్తున్నది. (సంపా.)

క. **తేజోధనుఁ డగు నరుఁడు । ద్భ్రాజితగతి నడుమ మెఱసి బడబాగ్ని దళం**
బై జలనిధిఁ ద్రెక్కొనియెడు । నోజం గురుబలము పేర్మి యుడిపెం దోడ్తోన్. **58**

ప్రతిపదార్థం: తేజస్(ః)+ధనుఁడు+అగు= తేజస్సే ధనంగా కలవాడైన; నరుఁడు= అర్జునుడు; ఉద్భ్రాజిత= ప్రకాశించే; గతిన్= రీతిగా; నడుమన్= కౌరవసేన మధ్య; మెరసి= ప్రకాశించి; బడబా+అగ్ని= సముద్రంలో ఆడుగుర్రం ముఖాకారంలో ఆరకుండా మండే అగ్ని; దళంబు+ఐ= మిక్కుటమై; జలనిధిన్= సముద్రాన్ని; త్రెక్కొనియెడు+ఓజన్= త్రాగేవిధంగా; తోడ్తోన్= వెన్వెంటనే; కురుబలము= కౌరవసైన్యముయొక్క; పేర్మి= అతిశయాన్ని; ఉడిపెన్= పోగొట్టాడు.

తాత్పర్యం: తేజస్వి అయిన అర్జునుడు కౌరవసేన మధ్య ప్రకాశిస్తూ ఉంటూ, సముద్రంలో ఉండే బడబాగ్ని సముద్రజలాన్ని త్రాగేసినట్లుగా కౌరవసేన పెంపును తగ్గిస్తూ, వారి ఉత్సాహాన్ని, అతిశయాన్ని మాన్పేశాడు.

విశేషం : అలం: ఉపమ. శత్రుసేనల మధ్య చేరి అర్జునుడు వాటి బలుపును క్రమంగా తగ్గిస్తున్నాడు. ఈ అంశాన్ని తిక్కన అలంకార సుందరంగా చెప్పాడు. సముద్ర జలం పొంగి ప్రళయం రాకుండా దాని గర్భంలో ఆడు గుర్రపు ముఖాకృతిలో బడబాగ్ని నిరంతరం ప్రజ్వలిస్తూ సముద్రజలాలను త్రాగుతూ ఉంటుందని పురాణగాథ. అర్జునుడు కౌరవసేన అనే సముద్రం పెచ్చు పెరగకుండా చతుర్విధ సైన్యాలను మట్టుపెట్టుతున్నాడని ఉపమాన స్వారస్యం. బడబాగ్నివలె అర్జునుడు తేజస్వి కావటం (తేజోధనుడు), పైకి బాగా ప్రకాశంగా వెలుగుతూ కనబడటం (ఉద్భ్రాజిత గతి), నడుమ ఉండటం - అనే సామ్యగుణాలు కలిగిఉన్నాడు. లోకంలో అగ్ని చతుష్టయం ప్రసిద్ధం. అవి బడబాగ్ని, జఠరాగ్ని, గృహాగ్ని, వైద్యుతాగ్ని లేదా దావాగ్ని. (సంపా.)

తే. **కాలపక్వంబులైన లోకముల జముఁడు । బారిసమరెడు చాడ్పున మారిమసఁగి**
యుగ్రరూపుఁడై శౌర్యసమగ్ర బాహు । సంపదుద్దాముఁడగు క్రీడి చంపె రిపుల. **59**

ప్రతిపదార్థం: కాల= కాలంచేత; పక్వంబులు+ఐన= మరణానికి సిద్ధమైన; లోకములన్= జనులను; జముఁడు= యముడు; బారిసమరెడు చాడ్పునన్= చంపేటట్లుగా; శౌర్య= బలముతో; సమగ్ర= పూర్ణమైన; బాహు సంపద్= భుజబల సంపదతో; ఉద్దాముఁడు= అతిశయించినవాడైన; క్రీడి= అర్జునుడు; మారిమసఁగి= మిక్కిలి చెలరేగి; ఉగ్రరూపుఁడు+ఐ= భయంకరమైన రూపం కలవాడై; రిపులన్= శత్రువులను; చంపెన్= చంపాడు.

తాత్పర్యం: చనిపోయే కాలం దాపురించిన (కాలం పండిన, కాలం తీరిన) జనులను యముడు నిర్దయగా చంపునట్లుగా, పరాక్రమంతో నిండిన బాహుసంపదతో అతిశయించిన అర్జునుడు బాగా చెలరేగి భయంకరుడై శత్రురాజులను చంపాడు.

విశేషం : అలం: ఉపమ. అర్జునుడిని యముడితోనూ, సైనికులను కాలం తీరిన జీవులతోనూ పోల్చటం అర్థవంతంగా ఉన్నది. జీవులను యముడు ఎక్కడ ఉండి ఎప్పుడు ఎట్లా చంపుతాడో తెలియనట్లుగానే, అర్జునుడి చేతిలో సైనికులు ఎప్పుడు ఎట్లా చనిపోతున్నారో తెలిసికొనటం దుర్లభంగా ఉన్నదని అలంకార ధ్వని. అర్జునుడి శరవేగ పాండిత్యం గమ్యమానం. (సంపా.)

వ. **అట్టియెడ మున్ను తురంగమఖురాదులం దూలిన కెంధూళియుం, బైపయి నెగయఁ బరబలంబు నెత్తుట జొత్తిల్లుచు నుచ్చి చను వివ్వచ్చు నిశితశర పరంపరలు సైనిక శరీరంబులపై సుడిసి తడిసి రుధిర శీకర నికర వికీర్ణ రవికిరణ పరిణతం బగు సమీరణంబును, ధారాళ కరాళ రక్తపరిషిక్త విశ్వంభరా భాగంబునుం గలయం గెంపు సంపాదించి యకాలసంధ్య నావహించినం దదుచిత వ్యాపార పారంగతంబులై పొడసూపిన యుడుగణంబులుంబోలెఁ బొలుచు ధనంజయసాయక దళిత కుంజర కుంభ వికీర్ణ మౌక్తిక విసరంబుల వలనను, సముదీర్ణ మద వేగ దుర్నివార వారణ విదారణంబు లగు నర్జునాస్త్ర పాతంబుల బెదరి తేం ట్లెగయుట పొగలెగయుటయుం, బ్రతిభట బాణఘట్టనంబునం బాండవమధ్యము కాండ ప్రకాండంబుల నిబిడ జ్వాలలు నిగుడుట మంటయునుగా, మూర్తం బగు తదీయ క్రోధ దవానలంబు చటచ్చటాశబ్దంబుల చాడ్పునం జెలంగుచున్న యుధిష్ఠిరానుజు నతినిష్ఠుర భల్లభజ్యమాన బలవదరాతి ఖరాస్థి నిస్వనంబుల వలనను, దొట్టి తొట్టి యెడనెడ మడువులు గట్టు శోణితంబు నీట్కునందుఁబడి తేలాడు వెలిగొడుగులు పుండరీకంబులును, వింజామరలు మరాళ పుంజంబునునై కొలంకుల చందంబు నొంద వాని కెఱఁగెడు కొదమతుమ్మెదల పదుపుల పగిదిఁ దొరఁగు నాఖండలతనయ ఖండిత పరవీరకాలాయస నారాచ శకలంబులవలనను, గిరీటి శర పాటవ పరిస్ఫోటిత రిపు కపాల గళిత మస్తిష్క పలల పంకంబునను, నలుదెసల నంతంతఁ గదియం జాఁగి పడియున్న కృత్తకరచరణంబులను, వెదపదనికి రొంపిఁ గలంచి వరుజులు పదిలంబుగా నమర్చిన కేదారంబు తెఱంగు దోఁచుటకు నీడై చతురహలికుండు సల్లు పరువంపు మొలకల చెలువునఁ బెల్లు డుల్లు ఫల్గునాశుగ సంతాడన వికీర్ణ శత్రుశేఖర వజ్రవ్రజంబుల వలనను, సంగ్రామం బభిరామం బయ్యును ఘోరప్రకారం బయ్యె; నమ్మహాభయంకర సంకుల సమరంబున.** **60**

ప్రతిపదార్థం: అట్టియెడన్= అప్పుడు; మున్ను= ముందుగా; తురంగమ= గుర్రాల; ఖురాదులన్= డెక్కలు మున్నగు వాటిచేత; తూలిన= ఎగిరిన; కెంపు+ధూళియున్= ఎర్రని పరాగం; పైపయిన్= పైపైకి; ఎగయన్= ఎగురగా; పరబలంబు= శత్రువులయొక్క సేన; నెత్తుటన్= నెత్తురులో; జొత్తిల్లుచున్= తడిసి ఎర్రపడుతూ; ఉచ్చి= శరీరములో దూరి; చను= వెళ్లెడి; వివ్వచ్చు= అర్జునుడియొక్క;

నిశిత= వాడియైన; శర= బాణాలయొక్క; పరంపరలును= వరుసలున్నూ; సైనిక= భటులయొక్క; శరీరంబులపైన్= శరీరాలమీద; సుడిసి= చుట్టుకొని; తడిసి; రుధిర= రక్త; శీకర= బిందువులయొక్క; నికర= సముదాయంతోనూ; రవికిరణ= సూర్యకిరణాలతోనూ; పరిణతంబు+అగు= పక్వమైన; సమీరణంబును= గాలియున్నూ; ధారాళ= హెచ్చైన; కరాళ= భీకరమైన; రక్త= రక్తంతో; పరిషిక్త= తడుపబడిన; విశ్వంభరా భాగంబునున్= భూమిభాగమున్నూ; కలయన్= అంతటను; కెంపు= ఎర్రనిరంగు; సంపాదించి= కలిగి; అకాల= కానికాలాన; సంధ్యన్= సంధ్యా సమయాన్ని; ఆవహించినన్= కల్గజేయగా; తద్+ఉచిత= దానికి తగిన; వ్యాపార= పనిలో; పారంగతంబులు+ఐ= ఎగిరినవై; పొడచూపిన= కన్పట్టిన; ఉడుగణంబులున్+పోలెన్= నక్షత్ర సముదాయాల వలె; పొలుచు= ప్రకాశించెడి; ధనంజయ= అర్జునుడియొక్క; సాయక= బాణాలచేత; దళిత= చీల్చబడిన; కుంజరకుంభ= ఏనుగుల కుంభస్థలాల నుండి; వికీర్ణ= వెదచల్లబడిన; మౌక్తిక= ముత్యాలయొక్క; విసరంబువలనను= సముదాయము వల్లను; సముదీర్ణ= అతిశయించు; మదవేగ= మదముయొక్క వేగంచేత; దుర్నివార= నివారించరాని; వారణ= ఏనుగులను; విదారణంబులగు= బ్రద్దలుచేసే; అర్జున+అస్త్ర= అర్జునుడి అస్త్రాలయొక్క; పాతంబులన్= పడటానికి; బెదరి= భయపడి; తేంట్లు= తుమ్మెదలు; ఎగయుట= ఎగురుట; పొగలు; ఎగయుటయున్= ఎగురుటయున్నూ; ప్రతిభట= శత్రు భటులయొక్క; బాణ ఘట్టనంబునన్= బాణాలు ఒరసికొనటంచేత; పాండవమధ్యము= అర్జునుడియొక్క; కాండ= బాణాల; ప్రకాండంబుల= సముదాయాల; నిబిడజ్వాలలు= దట్టమైన మంటలు; నిగుడుట= ఎగయుట; మంటయును+కాన్= జ్వాలగాను; మూర్తంబు+అగు= మూర్తీభవించిన; తదీయ= అర్జునుడి సంబంధమైన; క్రోధ= కోపమనెడి; దవానలంబు= దావాగ్ని యొక్క; చటచ్చటా శబ్దంబుల చాడ్పునన్= చిటచిటమనే చప్పుడుల వలె; చెలంగుచున్+ఉన్న= వ్యాపిస్తున్న; యుధిష్ఠిర+అనుజు= ధర్మజుడి తమ్ముడైన అర్జునుడి యొక్క; అతి నిష్ఠుర= మిక్కిలి కఠినమైన; భల్ల= బల్లెములచేత; భజ్యమాన= పగులగొట్టబడుతున్న; బలవత్= బలవంతులైన; అరాతి= శత్రువులయొక్క; ఖర+అస్థి= గట్టివైన ఎముకల; నిస్వనంబుల వలనను= ధ్వనుల వలనను; తొట్టి తొట్టి= ప్రవహించి; ఎడన్+ఎడన్= అక్కడక్కడ; మడువులుకట్టు= చెరువులుగా తయారైన; శోణితంబు= రక్తము; నీళ్ళున్= నీళ్ళును; అందున్+పడి, తేలాడు= అందుపడి తేలియాడుతున్న; వెలిగొడుగులు= తెల్లని గొడుగులు; పుండరీకంబులును= తెల్లతామర పువ్వులును; వింజామరలు= చామరాలు; మరాళ పుంజంబున్= హంసల గుంపులును; అయి= మారి; కొలఁకుల చందంబునన్= సరస్సుల పోలికను; ఒందన్= పొందగా; వానికిన్= వాటిలోనికి; ఎఱఁగెడు= దిగునట్టి; కొదమ తుమ్మెదల= పడుచు తుమ్మెదలయొక్క; పదుపులపగిదిన్= సముదాయాలవలె; తొరఁగు= పడునట్టి; ఆఖండల తనయ= ఇంద్ర సుతుడైన అర్జునుడిచేత; ఖండిత= తెగగొట్టబడిన; పరవీర= శత్రువీరులయొక్క; కాల+అయస= నల్లని ఇనుపవైన; నారాచశకలంబుల వలనను= బాణాల ముక్కల వలన; కిరీటి= అర్జునుడియొక్క; శర= బాణాల; పాటవ= బలంచేత; పరిస్ఫోటిత= పగులగొట్టబడిన; రిపు= శత్రువుల; కపాల= తలపుర్రెలనుండి; గళిత= జారిన; మస్తిష్క= మెదడు; పలల= మాంసమనెడు; పంకంబునను= బురదవలనను; నలుదెసలన్= నాలుగు మూలలందును; అంతంతన్= మరింత; కదియన్= సమీపించగా; చాఁగిపడి+ఉన్న= సాగిలపడిఉన్న; కృత్త= నరుకబడిన; కరచరణంబులను= చేతులు, కాళ్ళచేతను; వెదపదనికిన్= ఎదకు పదనైన సమయానికి; రొంపి= బురద; కలంచి= కలియగొట్టి; వరుజులు= మడికి ఆయా చోట్ల ఏర్పరచిన చిన్న కట్టలు; పదిలంబుగాన్= జాగ్రత్తగా; అమర్చిన= కట్టియున్న; కేదారంబు తెరంగు= మాగాణి భూమిరీతి; తోఁచుటకున్= తోచుటకు; ఈడై= తగియుండి; చతురహలికుండు= నేర్పుకల రైతు; చల్లు= చల్లునట్టి; పరువంపు మొలకల చెలువునన్= మంచిగా పైకి వచ్చే అంకురాల రీతి; పెల్లుడుల్లు= ఎక్కువగా రాలెడి; ఫల్గున+ఆశుగ= అర్జునుడి బాణాలయొక్క; సంతాడన= దెబ్బలచేత; వికీర్ణ= విరజిమ్మబడిన; శత్రు= శత్రువులయొక్క; శేఖర= కిరీటములందలి; వజ్రవ్రజంబులవలనను= వజ్రాల సముదాయాల వలనను; సంగ్రామంబు= యుద్ధం; అభిరామంబు+అయ్యున్= అందంగా ఉన్నను; ఘోరప్రకారంబు= భయంకరమైనది; అయ్యెన్= ఐనది; ఆ+మహాభయంకర= మిక్కిలి భయముగొల్పునట్టి; సంకుల= రద్దీగా ఉన్న; సమరంబునన్= యుద్ధంలో.

తాత్పర్యం: ఆ సమయంలో మొదట గుర్రాల డెక్కలవలన పైకెగిరిన ధూళి ఎర్రగా ఉన్నది. అది తిరిగి నెత్తురులో కలిసిపోతుంది. అర్జునుడు వేసిన వాడి బాణాలు ఎదుటివాళ్ళను చీల్చుకొని వెళ్ళిపోతున్నాయి. వాళ్ళమీద తిరిగి రక్తబిందువులతో కలిసిన గాలి, రక్తంతో తడిసిన భూమి భాగమంతా కాలంకాని కాలంలో వచ్చిన సంధ్యవలె ఉండగా,

దానికి తగినట్లుగా నక్షత్రాలు వచ్చాయా అన్నట్లు అర్జునుడి బాణాలవలన పగిలిన ఏనుగుల కుంభస్థలాల నుండి జారిపడిన ముత్యాలు ప్రకాశిస్తున్నాయి. అదివరలో ఏనుగుల మీద వాలి ఉన్న తుమ్మెదలు బాణ ధ్వనికి పైకెగిరిపోగా అది పొగవలె, అర్జునుడి బాణాలు శత్రువుల బాణాలను రాచినప్పుడు పుట్టే మంటలు మంటలవలె కన్పడి, అర్జునుడి కోపం మూర్తీభవించి వచ్చినదా అన్నట్లు అనిపిస్తున్నవి. ఆ క్రోధాగ్ని చిటపటలవలె శత్రువుల బలమైన ఎముకలను చీల్చేటప్పుడు వచ్చిన చప్పుడా అనిపిస్తున్నది. అది అట్లా ఉండగా - రక్తం అక్కడక్కడ మడుగులు కట్టింది. దానిలో పడి తేలియాడే వెల్లగొడుగులు తెల్ల తామరపువ్వులవలెనూ, వింజామరలు హంసలవలెనూ ఉన్నందున ఆ మడుగులు సరస్సులవలె ఉన్నాయి. ఆ సరస్సుల్లోని ఆ పద్మాలమీదికి దూకే తుమ్మెదలవలె ఉన్నాయి నరికిన నల్లని బాణాల ముక్కలు. అర్జునుడి బాణాలతో తెగిన పుర్రెలలో నుండి మెదడు మాంసం జారిపడి అంతా బురద బురద కాగా, దాని కంతకూ మడిచుట్టూ గట్లువేసి మంచి రైతు విత్తగా మొలిచిన మొలకల వలె శత్రువుల కిరీటాలనుండి రాలిన వజ్రాలు కనిపిస్తున్నాయి. ఇదంతా చూడటానికి ముచ్చటగానే ఉన్నా అతి భయంకరంగా, ఎవరెవరిని ఏం చేస్తున్నారో తెలియనంత సమ్మర్దంగా సమరం సాగుతున్నది.

విశేషం : 1. అలం: ఉత్ప్రేక్ష, ఉపమ, వృత్త్యనుప్రాసం. భయానక బీభత్స దృశ్యాలను అలంకారంతో రమణీయం చేసి పఠితలకు ఆస్వాదయోగ్యం చేసే రసవిద్య తిక్కన సొంతం. దానిని శబ్దార్థాలంకారాల సాయంతో ఇక్కడ సాధించాడు.

2. ఈ ఘట్టంలో రణరంగంలో కనబడుతున్న నాలుగంశాలను తిక్కన వర్ణించాడు. మొదటిది - రక్తసిక్తమైన రణభూమి. అది సమయం గాని సమయంలో ఏర్పడిన సాయంసంధ్యాకాలంలోని ఆకాశమా అన్నట్లు రాణించింది. (ఉత్ప్రేక్ష). గుర్రాల గిట్టలతో రేగిన ఎర్రని దుమ్ము సంధ్యారుణ కాంతిగా, శత్రువుల శరీరాలనుండి పైకి చిమ్ముకొని వస్తున్న రక్తధారలలో తడుస్తూ కిరీటి బాణాలు సైనికులను చంపి వాటిమీద పడుతూ ఉంటే, రక్తపు బొట్ల కాంతులతో మెరుస్తున్న దృశ్యం సంధ్యాకాల సూర్యకిరణ కాంతిని తలపిస్తున్నది. బాణవేగం గాలిగా రాణిస్తున్నది. రక్తంతో బాగా తడిసిన నేలంతా సంధ్యాకాలంలో నల్లబారిన ఎర్రని రంగుతో నిండిన ఆకాశభాగం వలె ఉన్నది. అది పట్టపగలే అయినా రణభూమి సంధ్యాకాలమో అన్నట్లు రాణించింది. దానికితోడు ఏనుగుల కుంభస్థలాలు పగిలి వెలువడిన ముత్యాలు ఆ సంధ్యాకాలంలో నక్షత్రాలు మొలిచాయా అన్నట్లున్నాయట! బీభత్సంలో రమణీయ దర్శనం.

రెండవది: అర్జునుడు ఏనుగులను బాణాలతో ఖండిస్తున్నాడు. మదగజాల శరీరాలనుండి కారే మదజలాన్ని త్రాగుతూ ఉన్న తుమ్మెదలు బాణాల దెబ్బలకు పైకి ఎగిరాయి. అవన్నీ పొగవలె తోచాయి. అర్జునుడి బాణాలు వైరివీరుల బాణాలతో రాపిడి పొందటం వలన మంటలు రేగాయి. ఆ దృశ్యం అగ్నికీలలుగా తోచింది. బాణాల దెబ్బలకు శత్రువుల ఎముకలు పెటపెటా విరుగుతుంటే అవి కార్చిచ్చు వ్యాపించేటప్పుడు కలిగే చిటపట ధ్వనులవలె ఉన్నాయి. మొత్తంమీద రణరంగమనే అరణ్యంలో కార్చిచ్చు రేగిన దృశ్యం ఊహించటానికి అనువుగా ఉన్నది. భయానకంలో రమణీయ దర్శనం.

మూడవది: ఆ రణరంగం ఒక సరోవరమో అన్నట్లు కూడా ఉన్నదట. నెత్తురు మడుగులు నీళ్ళుగా, వాటిమీద తేలియాడే తెల్లని గొడుగులు తెల్లతామర పూలుగా, వింజామరలు హంసలుగా, బాణాల నల్లని ఇనుపముక్కలు సరోవరంలోని పద్మాలపై వాలుతూవున్న తుమ్మెదలలాగా తోచాయట! బీభత్సంలో రమణీయ దర్శనం.

నాల్గవది: రణభూమి రైతు వరినాట్లు వేసిన మాగాణిచేనుగా ఊహారమ్యంగా ఉన్నదట. అర్జునుడి బాణాలతో వీరుల పుర్రెలు పగిలి మెదడు మాంసం నేలమీద పడ్డదట! అది నీటికి తడిసి పదునైన మెత్తని మన్నువలె ఉన్నదట. తెగిపడిన సైనికుల కరచరణాదులు ఆ తడిచేలకు వేసిన కట్టలవలె ఉన్నాయట. శత్రు కిరీటాల నుండి రాలిన మణులు వరినాట్లా అన్నట్లు రాణించాయట. ఉత్ప్రేక్షాలంకారమే ఊహారమణీయత్వానికీ ఉత్తమ ఉపకరణమని తిక్కన భావించాడు. బీభత్సంలో రమణీయ దర్శనం. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. ఉఱక విరోధిసైన్యముల నుక్కుమడంగఁగ నుల్లసద్గతిం
బఱప రథద్విపాశ్వములు పాండవమధ్యము తేరి వీథియం
దఱవఱలై పడం గని భయంపడి యిద్దెస వచ్చెనేని న
త్తెఱఁ గయి పోమె యంచు నెడతెంపిగఁ గొందఱు పాయ వాఱఁగన్. **61**

ప్రతిపదార్థం: ఉఱక= లెక్కచేయక; విరోధి= శత్రువులయొక్క; సైన్యములన్= సేనలను; ఉక్కు= చేవ; మడంగఁగన్= చెడునట్లుగా; ఉల్లసత్+గతిన్= తేజస్వంతమైన గమనంతో; పఱపన్= తోలగా; రథ= రథాలు; ద్విప= ఏనుగులు; అశ్వములు= గుఱ్ఱాలున్ను; పాండవమధ్యము= అర్జునుడిని; తేరి వీథియందున్= రథ మార్గమందు; అఱవఱలు+ఐ= చిందరవందరై; పడన్= పడుటను; కని= చూచి; భయంపడి= భయపడి; ఈ దెసన్= ఈ వైపునకు; వచ్చెన్+ఏనిన్= వచ్చినచో; ఆ+తెఱఁగు= అదేరీతి (చచ్చుట); అయిపోమె= కామా?; అంచున్= అనుకొని; ఎడతెంపిగన్= దూరంగా; కొందఱు= కొంతమంది; పాయ+పాఱఁగన్= యుద్ధరంగాన్ని వదలి పరుగున పోగా.

తాత్పర్యం: ఈ రీతిగా అర్జునుడు విరోధి సైన్యాలను చిందర వందర చేస్తూ ఉండగా అతడి రథాన్ని అడ్డగించటానికి వెళ్ళిన వీరులు, ఏనుగులు, గుఱ్ఱాలు, రథాలు పడిపోవటాన్ని చూచిన కొందరు 'అటు వెళ్ళితిమా మనగతీ అంతే' అనుకొని యుద్ధం చేయటం మాని దూరంగా పారిపోగా, (తరువాతి పద్యంతో అన్వయం).

క. వాలమ్ములు దాఁక ధరన్। వ్రాలు భటులఁ జూచి యెదలు వడఁకఁగ మేనుల్
దూలఁగఁ దముఁ దాఁకకయును। నాలము సాలించి కొంద ఱవలఁ జనంగన్. **62**

ప్రతిపదార్థం: వాలు+అమ్ములు= వాడియైన బాణాలు; తాఁకన్= తగిలి; ధరన్= భూమియందు; వ్రాలు= పడిపోయే; భటులన్= బంటులను; చూచి= కనుగొని; ఎదలు= హృదయాలు; వడఁకఁగన్= వణకగా; మేనుల్= శరీరాలు; తూలఁగన్= తూలిపడగా; తమున్= తమ్ము; తాఁకకయునున్= ఎదిరించకయే; కొందఱు= కొంతమంది భటులు; ఆలము= యుద్ధం; చాలించి= మాని; ఆవలన్= మరొక వైపు; చనంగన్= పోగా.

తాత్పర్యం: వాడిబాణాలు తగిలి భటులు నేలమీద పడిపోవటం చూచి, గుండె దడదడలాడి శరీరాలు తూలిపడగా కొందరు భటులు అసలు ఎదురుపడటమే మాని దూరంగా పోగా, (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. 'ప్రొద్దు గ్రుంకిన మఱి కాని పోవఁ డొక్కొ। క్రీడి' యని కొంద ఱాజికి నీడఁబోవ
'బలమునెల్లను దెగటాఱఁ బఱపికాని। తక్కఁ డెట్టులు' ననుచుఁ గొందఱు చలింప. **63**

ప్రతిపదార్థం: కొందఱు; క్రీడి= అర్జునుడు; ప్రొద్దు= సూర్యుడు; గ్రుంకిన మఱికాని= అస్తమించిన తర్వాత కాని; పోవఁడు+ఒక్కొ= పోవడేమో; అని= అనుకొని; ఆజికిన్= యుద్ధానికి; ఈడన్+పోవన్= వెనుదీయగా; కొందఱు; బలమున్= సేనను; ఎల్లన్= అంతటిని; తెగటాఱన్= చనిపోవునట్లుగా; పఱపికాని= చేసికాని; ఎట్టులున్= ఎట్లైనను; తక్కఁడు= మానడు; అనుచున్= అనుకొంటూ; చలింపన్= హడలిపోగా.

తాత్పర్యం: కొందరేమో 'ఈ అర్జునుడు ప్రొద్దు గ్రుంకితే కాని విడిచిపోడేమోరా' అనుకొంటున్నారు. మరికొందరు సేనలన్నింటిని చంపికాని వదల' డనుకొంటూ హడలిపోగా, (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తరతరమ ప్రజలఁ దునిమెడు। నరు నప్పటి యెత్తికోలునకు సురవిద్యా
ధర ఖేచరులును భీతిం। బొరసిరి తమదెసకు నేమి పుట్టునొ యనుచున్. 64

ప్రతిపదార్థం: తరతరము+అ= స్థాయిలవారీగా; ప్రజలన్= సేనలను; తునిమెడు= చంపునట్టి; నరు= అర్జునునియొక్క; అప్పటి= ఆ సమయంలోని; ఎత్తి కోలునకున్= ప్రయత్నానికి; సుర= దేవతలు; విద్యాధర= విద్యాధరులు; ఖేచరులును= ఆకసంలో సంచరించే మరికొందరు దివ్యులు; తమదెసకున్= తమవైపునకు; ఏమి+పుట్టునొ= ఏ బాధ కల్గునో; అనుచున్= అని అనుకొంటూ; భీతిన్= భయంతో; పొరసిరి= ప్రవర్తించారు.

తాత్పర్యం: అర్జును డా రీతిగా వివిధ స్థాయిలలోని సైన్యాన్ని తునాతునకలుగా నరికివేస్తుంటే చూడటానికి వచ్చిన విద్యాధరాది దేవతలెల్లరు తమకు కూడా ఏమైనా ముప్పు వస్తుందేమో అని భయపడిపోయారు.

విశేషం : ఉత్తర గో గ్రహణంలో ఇంతవరకు అర్జునుడు చతుర్విధ సేనాబలాన్ని నురుమాడటమే గమనించాం. ఇంతవరకు భీష్మాదికురువీరులు కదలిరాలేదు. చతుర్విధ బలాలు చాలవరకు అర్జునుడితో చేసిన యుద్ధంలో చనిపోయాయి. ప్రతిఘటనం చెప్పుకో తగినంత లేని దొమ్మి యుద్ధం ఇంతవరకు సాగింది. దానిని సమయానుగుణంగా పార్థుడు ఎదుర్కొని విజయం సాధించాడు. గోవులను మరల్చాడు. (సంపా.)

క. తమ తమ యొద్ది బలంబులు। క్రమ విరళములైన దొరలు గాండివిపై ను
గ్రముగఁ దఱుముటయు నాతఁడు। సమరోల్లాసమున దివ్యశరతత్పరుఁడై. 65

ప్రతిపదార్థం: తమ తమ+ఒద్దిబలంబులు= తమవద్దనున్న సేనలు; క్రమ విరళములు+ఐనన్= క్రమంగా తగ్గగా; దొరలు= వీరులైన రాజులు; గాండివిపైన్= అర్జునుడి మీదికి; ఉగ్రముగన్= భయంకరంగా; తఱుముటయున్= తరుమగా; అతఁడు= ఆ అర్జునుడు; సమర+ఉల్లాసమునన్= యుద్ధం మీది వేడ్కతో; దివ్య= దివ్యమైన; శర= బాణ ప్రయోగంలో; తత్పరుఁడు+ఐ= ఆసక్తి కలవాడై.

తాత్పర్యం: వీరులు తమవద్ద నున్న సేనలు క్రమక్రమంగా తరిగిపోవటం చూచి, అర్జునుడి మీదికి భీకరంగా తమ సైన్యాలను ముందుకు తోస్తూ రాసాగారు. అప్పుడు అర్జునుడు కూడా యుద్ధంమీది వేడుకతో దివ్యశరాలను ఏయదలచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం : పలచబారిన సేనలతో మేటివీరులు రంగంలోకి దిగుతున్న దృశ్యం ఇక్కడ మొదలౌతున్నది. ఇకపై భీష్మాదులతో యుద్ధం చేయవలసివస్తుంది. అందుకే శస్త్రాలు చాలవు. అస్త్రాలను ప్రయోగించే ఆసక్తిని ప్రదర్శించాడు అర్జునుడు. (సంపా.)

సీ. ఆచార్యు డెబ్బది యమ్ముల, నాచార్య। పుత్త్రు నేడింటఁ, గృపునిఁ బదింట,
దుష్షహుఁ బండ్రెంట, దుశ్శాసనునిఁ బది। యేనింట, సౌబలు నెనిమిదింట,
నమరనదీసూను నఱువదింటను నేసి,। రవిసుతు రథ్యసారథుల నొంచి,
వర్మమంతయుఁ ద్రుంచివైచి మర్మాస్థి బం। ధములు భేదించి విక్రమము నెఱపి.

ఆ. యిట్లు దొరలు నొవ్వ నేసైఁ దనచేతి। కొలఁది సూపి క్రీడి సెలఁగి దేవ
దత్త మొత్తుటయును దత్సైన్యములు సెడ। విఱిగి పాఱె భీష్ముమఱువు సొచ్చె. 66

ప్రతిపదార్థం: ఆచార్యున్= ద్రోణాచార్యుడిని; డెబ్బది+అమ్ములన్= డెబ్భై బాణాలతోనూ; ఆచార్యపుత్త్రున్= ద్రోణపుత్రుడైన అశ్వత్థామను; ఏడింటన్= ఏడు బాణాలతోను; కృపుని= కృపాచార్యుడిని; పదింటన్= పది బాణాలతోనూ; దుష్ప్రహున్= దుష్ప్రహుని; పండ్రెంటన్= పండ్రెండు బాణములతోనూ; దుశ్శాసనునిన్= దుశ్శాసనుణ్ణి; పది+ఏనింటన్= పదిహేను బాణాలతోనూ; సౌబలున్= శకునిని; ఎనిమిదింటన్= ఎనిమిది బాణములతోనూ; అమరనదీసూనున్= గంగాపుత్రుడైన భీష్ముడిని; అరువదింటన్= అరువది బాణాలతోనూ; ఏసి= కొట్టి; రవిసుతు= సూర్యుని కుమారుడైన కర్ణుడి యొక్క; రథ్య= గుర్రాలను; సారథులన్= సారథిని; నొంచి= నొవ్వకొట్టి; వర్మము= కవచం; అంతయున్= అంతా; త్రుంచివైచి= ముక్కలు చేసి; మర్మ= ఆయువుపట్టులు; అస్థిబంధములు= బొమికలను అతుక్కునేటట్లు చేసేవి (కీళ్ళు); భేదించి= పగులగొట్టి; విక్రమము= పరాక్రమం; నెరపి= కనబరచి; ఇట్లు= ఈ రీతిగా; దొరలు= వీరులు; నొవ్వన్= బాధపడగా; ఏడ్తెఅన్= పరాక్రమంతో; తనచేతికొలఁది= తన భుజశక్తిని; చూపి= కనబరచి; క్రీడి= అర్జునుడు; చెలఁగి= సంతోషించి; దేవదత్తము= తన శంఖమును; ఒత్తుటయును= ఊదగా; తత్+సైన్యములు= ఆ కౌరవసేనలు; చెడవిరిగి= వికావికలై; పారి= పరుగెత్తి; భీష్మమఱువు= భీష్ముడి చాటునకు; చొచ్చెన్= చేరాయి.

తాత్పర్యం: అర్జునుడు ద్రోణుడిని డెబ్భై బాణాలతోనూ, అశ్వత్థామను ఏడు బాణాలతోనూ, కృపుడిని పది బాణాలతోనూ, దుష్ప్రహుడిని పండ్రెండు బాణాలతోనూ, దుశ్శాసనుడిని పదేను బాణాలతోనూ, శకునిని ఎనిమిది బాణాలతోనూ, భీష్ముడిని అరవై బాణాలతోనూ కొట్టి, ఆపైన కర్ణుడి గుర్రాలను, సారథిని బాధపడేటట్లు కొట్టి, సారథి కవచాన్ని తునాతునకలు చేసి, కీళ్ళు తొలగేటట్లుగా కొట్టాడు. ఇట్లా తన బలాన్ని చూపి దేవదత్తమనే శంఖం పూరించాడు. ఆ శబ్దానికి హడలిపోయిన సేనలన్నీ భీష్ముడి చాటుకు పారిపోయి తలదాచుకొన్నాయి.

విశేషం : 1.కురువీరులలో శిష్టచతుష్టయంలోని ముగ్గురిపై అర్జునుడు బాణాలు గుప్పించి ఊరుకొన్నాడు. దుష్టచతుష్టయంలో అతడి ప్రత్యర్థి కర్ణుడు. అందువలన అతడి రథ సారథులను బాణాలతో బాధించి రథాన్ని రక్షించుకొనలేని అతడి పరాక్రమాన్ని పరిహాసంపాలు చేశాడు. తన కడ్డు చెప్పలేని కర్ణుడిపై సవాలు విసిరినట్లుగా దేవదత్తాన్ని పూరించాడు. ఆ శబ్దానికి సైనికులందరూ బెదరి పరుగెత్తి భీష్ముడి మరుగున నిలిచారు. ఇది కర్ణుడికి మరొక అవమానం. కురుసేనను రక్షించ గలిగిన సామర్థ్యం భీష్ముడికే ఉన్నదని సైనికులే చెప్పారు. అర్జునుడు వారిచేత చెప్పించాడు. ప్రగల్భాలాడిన కర్ణుడి రథసారథిని, గుర్రాలను పార్థుడు బాధిస్తుంటే అందరూ ఊరకుండిపోయారు. కురువీరులలో కర్ణుడంటే ఎంతటి నిర్లిప్తభావం ఉన్నదో ప్రదర్శింప చేశాడు అర్జునుడు.

2.యుద్ధం ప్రారంభించేటప్పుడు, పెద్దలమీద బాధించని బాణాలు వేసినప్పుడు కూడా ఒక గౌరవభావాన్ని, ఒక మర్యాదక్రమాన్ని అర్జునుడు పాటించాడు. ఆచార్యుడు, అశ్వత్థామ, కృపుడు, ఈ వరుస తప్పలేదు. భీష్ముడిని కదిలించ దలచుకొనలేదు. ద్రోణాదులు కర్ణుడి పరాక్రమం తేలేంతవరకు ముందుకు వచ్చేటట్లు లేరు. మొదటి దెబ్బ అర్జునుడు కర్ణుడిపై కొట్టాడు. పౌరుషవంతుడైతే అతడు త్రిప్పికొట్టాలి. ద్వంద్వయుద్ధాన్ని కోరుతున్నట్లు కర్ణుడిని కొట్టి శంఖం పూరించాడు. దుశ్శాసనాదులు దుర్బలులు. కర్ణుడి వెనుక ఉండేవారు. అందుకే ఆ దొరలందరిని బాధించి తన బాణలాఘవాన్ని ప్రదర్శించి ఊరుకొన్నాడు. (సంపా.)

క. గాంగేయుఁ డవష్టంభో। త్తుంగతనుం డగుచు నిట్లు దూలిన కురు సే
నాంగంబులఁ బురికొలిపి సు। సంగతములు సేసె సమరసమ్ముఖములు గాన్. 67

ప్రతిపదార్థం: గాంగేయుఁడు= భీష్ముడు; అవష్టంభ= గర్వంచేత; ఉత్తుంగ= ఎత్తయిన; తనుండు+అగుచున్= శరీరం కలవాడై; ఇట్లు= ఈ రీతిగా; తూలిన= చెదరిన; కురుసేనా+అంగములన్= కౌరవసేనలోని రథ, గజ, అశ్వ, పదాతులను; పురికొలిపి= ప్రోత్సహించి; సుసంగతములు= బాగా చేరిక కలిగినవిగానూ; సమర సమ్ముఖములుగాన్= యుద్ధం చేయటానికి సంసిద్ధములైనవిగానూ; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: భీష్ముడు వారందరికి అండగా నిలబడి, వారందరిని ప్రోత్సాహపరచి, కలిపి, ఏకం చేసి, యుద్ధానికి సిద్ధమయ్యేటట్లు చేశాడు.

విశేషం : యుద్ధనిర్వహణలో భీష్ముడు సామర్థ్యాన్ని ప్రదర్శిస్తా డనటానికి- శిథిలమైన సైన్యాలను సమీకరించటం, వారిని యుద్ధానికి సిద్ధం చేయటం సాక్ష్యాలు. ఆయన క్షణాలలో తీసికొన్న చర్యలు ఆశ్చర్యజనకాలు. కురుసైన్యాలకు ఆయనమీద అంత నమ్మకం ఉండటం ధ్వని. (సంపా.)

వ. **ఇట్లు భగ్నబల సమాశ్వాసనోద్భాసి యగు భీష్ము భుజబలంబు ప్రాపున నేచి మాతంగ తురంగ స్యందన సందోహంబులతోఁ గుంభసంభవ కృపాశ్వత్థామ కర్ణ వికర్ణ ప్రముఖ నిఖిల యోధజనంబులు సుయోధను ముందటఁ బన్ని నిలిచినం జూచి, సవ్యసాచి ప్రత్యేక ప్రధన కుతూహలాయత్త చిత్తుం డగుచు నుత్తరున కిట్లనియె.** **68**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; భగ్న= చెల్లాచెదరైన; బల= సేనను; సమాశ్వాసన= ఓదార్చటంతో; ఉద్భాసి+అగు= ప్రకాశించే; భీష్ము= భీష్ముడి యొక్క; భుజబలంబు ప్రాపునన్= భుజాలయొక్క బలాల అసరాతో; మాతంగ= ఏనుగుల; తురంగ= గుర్రాల; స్యందన= రథాలయొక్క; సందోహంబులతోన్= సముదాయాలతో; కుంభ సంభవ= ద్రోణాచార్యుడు; కృప= కృపుడు; అశ్వత్థామ; కర్ణ, వికర్ణ ప్రముఖ= కర్ణుడు, వికర్ణుడు మొదలుగా గల; నిఖిల= సమస్తమైన; యోధజనంబులు= వీరులు; సుయోధను ముందటన్= దుర్యోధనుడి ముందు భాగాన; పన్ని= వ్యూహంగా ఏర్పడి; నిలిచినన్= నిలబడగా; సవ్యసాచి= అర్జునుడు; చూచి; ప్రత్యేక= ఒక్కొక్కరితో విడివిడిగా; ప్రధన= యుద్ధం చేయటంలో; కుతూహల+ఆయత్త= వేడుకకు వశమైన; చిత్తుండు+ఐ= మనస్సు కలవాడై; ఉత్తరునకున్= ఉత్తరుడితో; ఇట్లు= చెప్పబోయే రీతిగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: చెల్లాచెదరైన సేనను ఓదార్చి భీష్ముడు తన భుజబలంతోనూ, ఏనుగులు, రథాలు, గుర్రాల సందోహంతోనూ, ద్రోణ, కృప, వికర్ణాదులైన ప్రముఖ యోధజనంతోనూ దుర్యోధనుడి ముందుభాగంలో వ్యూహంగా పన్ని నిలబడగా, అది చూచిన అర్జునుడు వారిలో ఒక్కొక్కరితో యుద్ధం చేయటానికి కుతూహలం కలిగినవాడై ఉత్తరుడితో ఈ విధంగా అన్నాడు.

ఉ. **'కందము లప్పళించి తురగంబుల నించుక నిల్పు; వైరి సే**
నం దెలియంగఁ జూడుము ఘనప్రకరంబును బోలెఁ గాఱు కొం
చుం దఱచైన దంతి భట సుందరకేతన రాజి గ్రాలఁగా
ముందర గట్టిమై నిలిచి మోహర మున్నవిధంబు గాంచితే? **69**

ప్రతిపదార్థం: కందములు= గుర్రాల మూపులను; అప్పళించి= అరచేతితో కొట్టి; తురగంబులన్= గుర్రాలను; ఇంచుక= కొద్దిగా; నిల్పు= నిల్పుము; వైరిసేనన్= శత్రువుల సేనను; తెలియంగన్= బాగా తెలిసేటట్లుగా; చూడుము; ఘన= మేఘాలయొక్క; ప్రకరంబును+పోలెన్= సముదాయం వలె; కాఱుకొంచున్= ఎక్కువగా కమ్ముకొని; తఱచు+ఐన= దట్టమైన; దంతి= ఏనుగులు; భట= భటులతోను; సుందర= అందమైన; కేతనరాజి= జెండాల వరస; గ్రాలఁగాన్= ప్రకాశించగా; ముందరన్= ఎదుటి భాగాన; గట్టిమైన్= ధైర్యంతో; నిలిచి= ఎదిరించి నిలిచి; మోహరము+ఉన్న విధంబు= వ్యూహంగా ఏర్పడిన తీరును; కాంచితే?= గమనించావా?

తాత్పర్యం: 'ఉత్తరకుమారా! గుర్రాల మూపులను అరచేతితో తట్టి, కొంచెం ఆపు చేసి, ఎదుటి సేనను పరికించి చూడుము. వానకాలంలో మేఘాలు కారుకమ్మినట్లుగా ఏనుగులు, గుర్రాలు, భటుల జెండాలు ఎంతో అందంగా గుమికూడి, వ్యూహాన్ని పన్నినట్లుగా ఉన్నాయి.

విశేషం : అలం: ఉపమ.

ఆ. **కర్ణు కేతనంబు గ్రాలెడు నల్లదె। యాతఁ డాజికేళి కౌతుకమునఁ**
గడఁగి వచ్చుటయును గలిగియున్నది మున్న। తొడరవలయు నతనితోడ మనము.' **70**

ప్రతిపదార్థం: అల్లదె= అదిగో; కర్ణు= కర్ణుడియొక్క; కేతనంబు= జెండా; క్రాలెడున్= ప్రకాశిస్తున్నది; అతఁడు= ఆ కర్ణుడు; ఆజి= యుద్ధమనెడు; కేళి= క్రీడ అందలి; కౌతుకమునన్= వేడుకతో; కడఁగి= ప్రయత్నించి; వచ్చుటయును= రాకను; కలిగి+ఉన్నది= కనబడుతున్నది; మున్ను+అ= ముందుగానే; మనము; అతనితోడన్= ఆ కర్ణుడితో; తొడరవలయున్= ఎదిరించవలెను.

తాత్పర్యం: 'అదిగో కర్ణుడి జెండా ప్రకాశిస్తున్నది. అతడు యుద్ధమంటే ఆటగా ఉవ్విళ్ళూరిపోతున్నట్లు కనిపిస్తున్నది. మనం అంతకంటె ముందుగానే అతడిని ఎదిరించాలి.'

విశేషం : కౌరవసైన్యంలో కర్ణుడే ముందుగా అర్జునుడిని ఎదుర్కొనవలసిన ఒక చిత్రమైన సన్నివేశాన్ని అర్జునుడు కల్పించాడు. కురువీరులు కూడా అతడి పరాక్రమాన్ని పరిశీలించాలని ఎదురుచూస్తున్నారు. అందుకే అర్జునుడు ఉత్తరకుమారుడితో - అతడు రావటమే ఇంక మిగిలి ఉన్నదని అన్నాడు. వచ్చేలోగానే అతడిమీద దాడిచేయాలని అర్జునుడు సంకల్పించటం ఇక్కడ విశేషం. ఇది ముందు దాడి. (సంపా.)

వ. **అని మఱియును.** **71**

తాత్పర్యం: అని ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. **'రయమునఁ గిట్టి యీతని పరాక్రమలీల యడంచి నొంచి దు**
ర్జయుఁ డని నమ్మియున్న కురురాజునకున్ వగ పుట్టఁ జేసెదన్
హయములఁ బోవని' మ్మనుఁడు నాతఁడు నాతని లావు నచ్చి ని
ర్భయమునఁ దేరు వే నడపె భాస్కరసూతికి సమ్ముఖమ్ముగన్. **72**

ప్రతిపదార్థం: రయమునన్= వేగముగా; కిట్టి= సమీపించి; ఈతని= ఇతడియొక్క; పరాక్రమలీల= పౌరుష విలాసం; అడంచి= అణచి; నొంచి= నొప్పించి; దుర్జయుఁడు= (కర్ణుడు) జయింపశక్యం కానివాడు; అని= అనుకొని; నమ్మి+ఉన్న= నమ్ముకొనిఉన్న; కురురాజునకున్= దుర్యోధనుడికి; వగ= బాధ; పుట్టన్= పుట్టేటట్లు; చేసెదన్= చేస్తాను; హయములన్= గుర్రాలను; పోవనిమ్ము= పోనిమ్ము; అనుడున్= అనిన వెంటనే; ఆతఁడున్= ఉత్తరుడు కూడ; ఆతనిలావు= అర్జునుడి బలం; నచ్చి= తన మనస్సుకు నచ్చి; నిర్భయమునన్= భయం లేకుండా; తేరు= రథాన్ని; భాస్కరసూతికిన్= కర్ణుడికి; సమ్ముఖంబుగాన్= ఎదురుగా; వే= వేగంగా; నడపెన్= తోలాడు.

తాత్పర్యం: 'ముందుగా ఆ కర్ణుడిని సమీపించి బాణాలతో కొట్టి, యుద్ధం అంటే ఉన్న సరదా పోగొట్టి, కర్ణుడిని ఎవ్వరూ గెలవలేరని నమ్ముకొని ఉన్న దుర్యోధనుడికి బాధ పుట్టేటట్లు చేస్తాను. గుర్రాలను పోనిమ్ము' అన్నాడు అర్జునుడు.

ఉత్తరుడికి అర్జునుడి బలంమీద నమ్మకం కుదరటంతో తన కేమీ బాధ కలగదనే ధైర్యంతో నిర్భయంగా కర్ణుడి రథాని కెదురుగా తమ రథాన్ని పోనిచ్చాడు.

విశేషం : అర్జునుడు కర్ణుడిపై దాడి చేసే విధానాన్నీ, దానివలన సాధించదలచిన ప్రయోజనాన్నీ సారథికి వివరించటం యుద్ధ వీరోల్లాసం. అర్జునుడు ముందుగా కర్ణుడిని ద్వంద్వయుద్ధంలో ఎదుర్కొంటాడు. కర్ణుడు తన పరాక్రమాన్నంతా ప్రదర్శించి అర్జునుడిని ఓడించ ప్రయత్నించటం సహజం. అయినా, అర్జునుడు అతడి పరాక్రమాన్ని అణచి చూపించాలి. ఆపైన అతడి అసమర్థత బయటపడేటట్లు బాధించి వేధించాలి. కాని, చంపకూడదు. ఈ వ్యూహం ఎందుకంటే - కర్ణుడు దుర్జయుడు అని నమ్మే దుర్యోధనుడు - కర్ణుడి బండారం బయటపడటంతో - నిరాశా నిస్పృహలతో లోలోన దుఃఖించాలి. ఆ లక్ష్యాన్ని సాధించటం ఆ యుద్ధంలో మొదటి ప్రయోజనం. దుర్యోధన గర్వానికి ఆశామూలం కర్ణుడు. దానిని త్రెంచాలని అర్జునుడి వ్యూహం. అర్జునుడు అన్నంత పని చేయగలడని ఉత్తరుడికి నమ్మకం కుదిరింది. నిర్భయంగా రథాన్ని కర్ణుడిమీదికి కదను త్రొక్కించాడు. విజయం ఉత్తరుడి దృఢ సంకల్పంలో ధ్వనింపచేయబడింది. (సంపా.)

అర్జునుండు చిత్రాంగదప్రభృతి కురుకుమారుల నిర్జించుట (సం.4-49-7)

వ. **ఇవ్విధంబున వృషభంబున కాదికొను బెబ్బులియునుం బోలె రాధేయుదెస నడచు కవ్వడిం గని చిత్రాంగదుండును చిత్రరథుండును సంగ్రామజిత్తును దుష్ప్రహుండును జిత్రసేనుండును వివింశతియును దుర్ముఖుండును దుర్జయుండును వికర్ణుండును శత్రుంతపుండును దుశ్శాసనుండును లోనుగాఁ గల కురుకుమార వర్గంబు నిరర్గళ ప్రకారంబులగు రథ చిత్ర ప్రచారంబులు మెఱయ మొనకుం దలకడచి చటుల పటు బాణ వేణికా పరంపరలు నిగుడ నొక్క పెట్ట కవిసిన నతండును గుణధ్వని తంత్రీనాదంబుగా నావిండ్ల వారొత్తుకాఱుగా గాండీవంబు వీణగా వినోదంబు సలిపె; నట్టియెడ వికర్ణుండు.** **73**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; వృషభంబునకున్= ఎద్దునకు; ఆదికొను= ఎదురుపోయే; బెబ్బులియునున్+పోలెన్= పెద్దపులి వలె; రాధేయుదెసన్= కర్ణుడివైపు; నడచు= వెళ్ళేడి; కవ్వడిన్= అర్జునుడిని; కని= చూచి; చిత్రాంగదుండును; చిత్రరథుండును; సంగ్రామజిత్తును; దుష్ప్రహుండును; చిత్రసేనుండును; వివింశతియును; దుర్ముఖుండును; దుర్జయుండును; వికర్ణుండును; శత్రుంతపుండును; దుశ్శాసనుండును; లోనుకాన్+కల= మొదలైన; కురుకుమార వర్గంబు= కౌరవరాజ కుమారుల సమూహం; నిరర్గళ= అడ్డులేని; ప్రకారంబులు+అగు= రీతులుకల; రథ= రథాలయొక్క; చిత్ర= రకరకములైన; ప్రచారంబులు= గతులు; మెఱయన్= ఒప్పుగా; మొనకున్= యుద్ధానికి; తలకడచి= ఎదుటి ప్రదేశము దాటి; చటుల= చంచలమైన; పటు= సమర్థమైన; బాణ వేణికా= ప్రవాహం వంటి బాణాలయొక్క; పరంపరలు= వరుసలు; నిగుడన్= ఎక్కువకాగా; ఒక్కపెట్టు+అ= ఒక్కసారిగా; కవిసినన్= కలియబడగా; అతండును= అర్జునుడు కూడా; గుణధ్వని= నారియొక్క మ్రోత; తంత్రీ నాదంబుగాన్= తీగెల ధ్వనిగాను; ఆ విండ్లవారు= ఆ ధనుర్ధారులు; ఒత్తుకాఱుకాన్= సుతిపోయువారుగా; గాండీవంబు= గాండీవమనే ధనుస్సు; వీణగాన్= వీణగాను; వినోదంబు= ఆహ్లాదకర కృత్యమును; సలిపెన్= చేశాడు; అట్టి యెడన్= ఆ సమయంలో; వికర్ణుండు= వికర్ణు డనేవాడు.

తాత్పర్యం: ఈ రీతిగా ఎద్దుమీదికి పోయే బెబ్బులివలె కర్ణుడి వైపునకు వెళ్ళే అర్జునుడిని చూచి చిత్రాంగదుడు, చిత్రరథుడు, సంగ్రామజిత్తు, దుష్ప్రహుడు, చిత్రసేనుడు, వివింశతి, దుర్ముఖుడు, దుర్జయుడు, వికర్ణుడు, శత్రుంతపుడు, దుశ్శాసనుడు మొదలైన కురుకుమారులందరూ అడ్డులేని రీతిలో రకరకాలుగా రథాలను నడుపుకొంటూ యుద్ధభూమి

మొదటికి వచ్చి, బాణాలు వేయటం ప్రారంభించి గుప్పిస్తూ ఒక్కసారిగా మీదికి వచ్చేసరికి, అర్జునుడు నారి మ్రోత వీణాతంత్రుల నాదంగానూ, ధనుర్ధారులు శ్రుతివాద్య సహకారులుగానూ, గాండీవమే వీణగానూ, వినోద కాలక్షేపం చేస్తున్నట్లుగా యుద్ధం చేశాడు. అప్పుడు వికర్ణుడు.

విశేషం : అలం: ఉపమ, రూపకం. 1. ఈ రెండు అలంకారాలూ రెండు ప్రయోజనాల కొరకు తిక్కన వాడాడు. అర్జునుడు కర్ణుడి మీదకు పోవటం బెబ్బులి ఎద్దుమీదకు దూకటం వలె ఉన్నదన్నాడు. బెబ్బులి వేటకోసం ఎద్దుమీదికి పోయినట్లే, అర్జునుడు కసితో కర్ణుడిని వేటాడాలనే ముందుకు దూకాడు. అర్జునుడి దూకుడు, క్రౌర్యం, బాధ కలిగించాలన్న పగ - ఇవన్నీ ఈ ఉపమానంలో ధ్వనిస్తున్నాయి. అర్జునుడిని బెబ్బులితో పోల్చి, కర్ణుడిని వృషభరాజమని కూడా అనకపోవటం విశేషం. వారిరువురి పరాక్రమాలలో ఈ తారతమ్య పరిశీలనం అర్జునుడి చిత్తవృత్తిని వ్యంజింపచేస్తుంది.

2. చిత్రాంగదాది కురుకుమారులు అల్లెత్రాళ్ళు మ్రోగిస్తూ గాండీవికి అడ్డం పడ్డారు. అల్లెత్రాటి మ్రోత బాణప్రయోగాన్ని ధ్వనింప చేస్తుంది. పలువురు ఒక్కసారిగా గుమికూడి అర్జునుడిని ఎదిరించి బాణాలు వేస్తున్నారు. వారందరికీ ఒక్క గాండీవంతో అర్జునుడు సమాధానం చెప్పుతున్నాడు. కురుకుమారులందరూ చిన్నవాళ్ళు. వాళ్ళను దండించటం కాని, బాధించటం కాని, చంపటం కాని అర్జునుడి అభిమతం కాదు. అందువలన వినోదంగా, విలాసంగా వాళ్ళతో యుద్ధం చేసిన తీరును - వింటి నారీనాదం జంత్రవాద్య సమ్మేళనంగా ఉన్నదని తిక్కన రూపకాలంకారంలో వర్ణించాడు. అందులో ప్రధాన వాద్యం వీణ. అది గాండీవం. మిగిలిన వారి నారుల మ్రోతలు సహకార వాద్యాలుగా ఉన్నాయట. ఈ రూపకంలో అందరి బాణపాండిత్యం కంటె పార్థుడి బాణ చాతుర్యమే మిన్న అని అలంకారధ్వని. కర్ణుడిపై యుద్ధం విరోధ మూలమైన వీరం. కురుకుమారులపై యుద్ధం వినోద జనకమైన విలాసం. ఒకటి వీర రసాభ్యుదయ చిహ్నం. మరొకటి వీర రసోల్లాసానికి ఉదాహరణం. (సంపా.)

క. తల మీఱి నిశిత శరమం । డలిఁ గప్పెం బార్థు నుత్కట క్రోధమునన్
విలు విఱుగ నేసి యతనిం । దొలఁగంగాఁ జేసె నరుఁడు దోర్బలలీలన్. 74

ప్రతిపదార్థం: తలమీఱి= హద్దుమీరి; నిశిత= వాడియైన; శరమండలిన్= బాణ సముదాయం చేత; పార్థున్= అర్జునుడిని; ఉత్కట= ఎక్కువైన; క్రోధమునన్= కోపంతో; కప్పెన్= కప్పునట్లు చేశాడు. నరుఁడు= అర్జునుడు; దోర్బలలీలన్= బాహు పరాక్రమం యొక్క విలాసంతో; విలు= విల్లు; విఱుగన్= విరిగేటట్లుగా; ఏసి= కొట్టి; అతనిన్= వికర్ణుడిని; తొలఁగంగాన్= తొలగేటట్లు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ముందుకు వచ్చి వికర్ణుడు వాడియైన బాణాలతో అర్జునుడిని కప్పివేసేటట్లుగా కొట్టాడు. అర్జునుడు దానికి ప్రతిగా అతడి విల్లు విరుగగొట్టి, అతడిని యుద్ధభూమి నుండి దూరంగా పోయేటట్లు చేశాడు.

క. ఇంతయుఁ గనుఁగొనియును శ । త్రుంతపుఁ డోసరిల కాజిదోహల మలరం
గౌంతేయుతోడఁ దలపడి । వింత లయిన కూర్మ నఖర విశిఖము లేసెన్. 75

ప్రతిపదార్థం: ఇంతయున్= వికర్ణుడు యుద్ధంనుండి తొలగుటను; కనుఁగొనియును= చూచికూడా; శత్రుంతపుఁడు; ఓసరిలక= తొలగక; ఆజిదోహలము= యుద్ధముపై వేడుక; అలరన్= హెచ్చు కాగా; కౌంతేయుతోడన్= అర్జునుడితో; తలపడి= కలియబడి; వింతలు+అయిన= చిత్రములైన; కూర్మనఖర= తాబేటి గోళ్ళను పోలిన; విశిఖములు= బాణాలు; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: యుద్ధం చేయలేక వికర్ణుడు పారిపోవటం చూచికూడా శత్రుంతపుడనే వీరుడు అర్జునుడితో యుద్ధానికి సిద్ధపడి, తాబేటి గోళ్లను పోలిన వాడి బాణాలను వేశాడు.

వ. అర్జునుండును. 76

తాత్పర్యం: అర్జునుడు కూడా.

క. సూతుఁ బదింటను నైదిట। నాతని యంగంబు నొంచి యంత నిలువమిన్
శాతఘనశరము వే కొని। యాతల వెడలంగ నేసి యసువులఁ బాపెన్. 77

ప్రతిపదార్థం: సూతున్= సారథిని; పదింటన్= పది బాణములతోనూ; ఆతని+అంగంబున్= శత్రుంతపుని శరీరమును; ఐదిటన్= అయిదు బాణాలతో; నొంచి= నొచ్చునట్లు వేసి; అంతన్= అంతటితో; నిలువమిన్= అతడు నిలువనందున; శాత= వాడియైన; ఘన= గొప్పదైన; శరమున్= బాణమును; వే= వేగంగా; కొని= తీసికొని; ఆతల= ఆవలి ప్రదేశానికి; వెడలంగన్= వెడలేటట్లుగా; ఏసి= వేసి; అసువులన్= ప్రాణాలను; పాపెన్= పోగొట్టాడు.

తాత్పర్యం: పది బాణాలతో సారథిని, అయిదు బాణాలతో అతని శరీరాన్ని నాటేటట్లు కొట్టి, అతడు అంతటితో నిలువనందున, వాడి అయిన బాణం తీసికొని అవతలికి దూసుకొని పోయేటట్లు వేసి శత్రుంతపుడి ప్రాణాలు పోగొట్టాడు.

తే. ఇట్లు శత్రుంతపునిఁ ద్రుంచి యివ్విధమున। నొక్కఁ డొక్కఁడ తలపడు టుడుపఁ దలఁచి
వివిధ బాణపరంపర వెల్లిఁ గొలిపె। భయరసము వఱ్ఱు పెట్టునఁ బగఱు వాఱ. 78

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; శత్రుంతపునిన్= శత్రుంతపుడనే వీరుడిని; త్రుంచి= తెగగొట్టి, చంపి; ఈ+విధమునన్= ఈ ప్రకారంగా; ఒక్కఁడు+ఒక్కఁడు+అ= ఒక్కడొక్కడే; తలపడుట= తనతో యుద్ధం చేయటాన్ని; ఉడుపన్= మాన్పటను; తలఁచి= అనుకొని; భయరసము= భయమనెడి రసముయొక్క; వఱ్ఱు పెట్టునన్= ప్రవాహపు దెబ్బచేత; పగఱు= శత్రువులు; పాఱన్= పారిపోయేటట్లుగా; వివిధ= పలురకాలైన; బాణ పరంపరన్= బాణాల వరుసలను; వెల్లి= ప్రవాహంగా; కొలిపెన్= వేశాడు.

తాత్పర్యం: ఇట్లా శత్రుంతపుడిని తెగగొట్టి, ఈ రీతిగా ఒక్కొక్కడే తనమీదికి రాకుండా ఎన్నో బాణాలు వరుసగా పేర్చివేశాడు. భయరసం తాకిడికి శత్రువులు పారిపోయేటట్లు బాణాలను ప్రవాహం కట్టించాడు.

క. 'అందఱు రథికులు పఱవఁగ। నిం దేటికి మున్ను వచ్చి రిస్సీ' యని సం
క్రందనసుతు మార్కొనియెఁ ద। గం దెగి సంగ్రామజిత్తు గర్వోద్ధతుఁడై. 79

ప్రతిపదార్థం: రథికులు= రథం పైనుండి యుద్ధం చేసే మహావీరులు; అందఱున్= అందరూ; పఱవఁగన్= పారిపోగా; మున్ను= ముందుగా; ఇందున్= ఇక్కడికి; ఏటికి= ఎందులకు; వచ్చిరి= వచ్చారు; ఇస్సీ= ఛీ ఛీ; అని= అనుకొని; సంగ్రామజిత్తు= సంగ్రామజిత్తనే వీరుడు; గర్వ+ఉద్ధతుఁడు+ఐ= గర్వంచేత పొగరు కలవాడై; తగన్= తగునట్లు; తెగి= సాహసించి; సంక్రందన సుతున్= అర్జునుడిని; మార్కొనియెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: 'రథికులందరూ పారిపోగా, ఇక్కడి కస లెందుకు వచ్చారు? ఛాఛా!' అంటూ సంగ్రామజిత్తనే వీరుడు (కర్ణుడి తమ్ముడు) సాహసించి అర్జునుడిని ఎదుర్కొన్నాడు.

విశేషం : 'వచ్చి రిస్సీ! యని' ఉన్న పాఠమే మేలు, ఏలన, 'వచ్చితిస్సీ' అనే దానిలో 'వచ్చితి' ఉత్తమ పురుషక్రియ కాజాలదు. ఉత్తమ పురుషక్రియ అగుచో, వచ్చితినిస్సీ అని యుండవలసిందే! వచ్చితిస్సీ అనేదానికి వచ్చితివి+ఇస్సీ - అని మధ్యమ పురుష క్రియగా అర్థం చెప్పవలసి ఉంటుంది. ఆ అర్థ మిక్కడ పొసగదు కదా! అందుచేత వచ్చితిస్సీ - అని ప్రథమ పురుషగానే ఉండాలి.

వాళ్ళందరూ పారిపోవటానికా ముందుగా వచ్చారు! ఛీ! అని తాను గర్వంతో అర్జునుడిని తాకాడని భావం. తాను వాళ్ళందరికంటె గొప్పవాడిని అని అహంభావం. అందుచేతనే గర్వోద్ధతుఁడు. (సంపా.)

క. తలపడి వాలమ్ములు పై। నల వేర్పడ నినుచుటయును నలుక వొడమినం
దలఁ దునిమివైచె నాతని। బలసూదనసూనుఁ డొక్క పటుభల్లమునన్. 80

ప్రతిపదార్థం: తలపడి= కలియబడి; వాలు+అమ్ములు= వాడియైన బాణాలు; పైన్= అర్జునుడిపై; అలవు= ఉపాయం; ఏర్పడన్= ఏర్పడేటట్లుగా; నినుచుటయును= నింపినట్లు వేయగా; అలుక+పొడమినన్= కోపంరాగా; బలసూదన సూనుఁడు= అర్జునుడు; ఒక్క పటుభల్లమునన్= ఒక్క గట్టి బల్లెముతో; ఆతని తలన్= అతడి తలను; తనిమివైచెన్= తెగగొట్టాడు.

తాత్పర్యం: సంగ్రామజిత్తు అర్జునుడితో తలపడి వాడి అయిన బాణా లేయగా, అర్జును డీ చేతకానివాడా యుద్ధానికి రావటం? అన్నట్లు కోపించి ఒకే ఒక బల్లెంతో అతడి తల తెగగొట్టి వేశాడు.

విశేషం : ఈ వీరునిపేరు సంగ్రామజిత్తు. అంటే యుద్ధాలలో విజయం సాధించేవాడని అర్థం. అతడు అనేక బాణాలు అర్జునుడిపై గుప్పించాడు. ఏదో పొడిచేస్తాడనే దృశ్యం కల్పించాడు. అంతటి సంగ్రామజిత్తును ఒక్క బల్లెంతో అర్జునుడు తల తెగగొట్టి చంపాడు. ఆ చనిపోయినవాడు కర్ణుడి తమ్ముడు కావటం మరొక విశేషం. అర్జునుడి యుద్ధవీరం ఇందులో ధ్వని. (సంపా.)

తే. అపుడు రాధేయుఁ డిమ్మెయి ననుజుపాటుఁ। జూచి యేనుంగునకు సిళ్కు సూపినట్లు
కవిసి హయముల మత్స్యభూకాంతు తనయు। నేసి, పండ్రెండు శరముల నేసె నరుని. 81

ప్రతిపదార్థం: అపుడు; రాధేయుఁడు= కర్ణుడు; ఈ+మెయిన్= ఈ రీతిగా; అనుజు పాటున్= తమ్ముడు చనిపోవటం; చూచి= కళ్ళారా చూచి; ఏనుంగునకున్= ఏనుగునకు; సిళ్కు= అంకుశం; చూపిన+అట్లు= చూపిన రీతిగా; కవిసి= అర్జునుడిని ఎదుర్కొని; హయములన్= గుఱ్ఱాలను; మత్స్యభూకాంతు తనయున్= ఉత్తరుడిని; ఏసి= కొట్టి; నరునిన్= అర్జునుడిని; పండ్రెండు శరములన్= పన్నెండు బాణాలతో; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: అప్పుడు కర్ణుడు ఆ రీతిగా తన తమ్ముడు పడిపోవటం చూచి ఏనుగుకు అంకుశం చూపినట్లుగా కోపం వచ్చి అర్జునుడితో తలపడి గుఱ్ఱాలను, ఉత్తరుడిని బాణాలతో కొట్టి, అర్జునుడి మీదికి పన్నెండు బాణాలు వేశాడు.

విశేషం : అలం: ఉపమ. 'ఏనుగుకు సిళ్కు చూపినట్లు' అనే ఉపమానం చక్కని తెలుగు జాతీయం. (సంపా.)

ఉ. కేసరివిక్రముండు కపికేతనుఁ డత్తఱి వైరివీరసం
త్రాసకర ప్రకార మగు దర్ప మెలర్పఁగ బాణజాల వి
న్యాసమునన్ వెసం బొదివె నర్కసుతున్ గరుడుండు పాము ను
ద్భాసితపక్షుఁడై పొదువు భంగి సురావలి పిచ్చలింపఁగన్. 82

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= అప్పుడు; కేసరి విక్రముండు= సింహం వంటి పరాక్రమం కల; కపికేతనుండు= వానరం జెండాగా గల అర్జునుడు; వైరివీర= శత్రువులకు; సంత్రాసకర= భయం కలుగజేసే; ప్రకారము+అగు= విధానంకల; దర్పము= గర్వం; ఎలర్పఁగన్= వృద్ధికాగా; బాణజాల= బాణ పరంపరయొక్క; విన్యాసమునన్= వేయుటతో; వెసన్= వేగంగా; అర్కసుతున్= కర్ణుడిని; గరుడుండు= గరుత్మంతుడు; పామున్= పామును; ఉద్భాసిత పక్షుఁడు+ఐ= ప్రకాశించే రెక్కలు కలవాడై; పొదువు భంగిన్= ఆవరించినట్లుగా; సురావలి= దేవతల వరుస; పిచ్చలింపఁగన్= ఆశ్చర్యంతో ప్రశంసింపగా; పొదివెన్= ఆక్రమించాడు.

తాత్పర్యం: సింహపరాక్రముడైన అర్జునుడు శత్రువులకు భయంకలిగే విధంగా దర్పం కలిగి బాణాల పరంపర వేస్తూ కర్ణుడిని, గరుత్మంతుడు రెక్కలు విప్పి ఎగురుతూ పామును తన్ని ఆక్రమించినట్లే ఆక్రమించాడు. అది చూచి దేవతలు ఆశ్చర్యంతో ప్రశంసించారు.

విశేషం : అలం: ఉపమ. దీనిలో సింహపరాక్రముడని అర్జునుడిని చెప్పటం, వెనుకటి పద్యంలో కర్ణుని ఏనుగునకు సిళ్ళు చూపినట్లు చెప్పటం, ఇందులో గరుడుడు పామును పొదివినట్లు చెప్పటం వంటి ఉపమేయ ఉపమానాలస్వారస్యం ద్వారా అర్జునుడు గెలుస్తాడని కర్ణుడు ఓడిపోతాడని సూచించబడుతున్నది.

క. ఇరువురు వీరులు ని ట్లొం। డొరువులఁ దలపడుట సూచి యుత్కట మగు న
చ్చెరువాటుఁ గౌతుకంబు న। డర నూరక యుండె నయ్యెడం గురుసేనల్. 83

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ఇరువురు వీరులున్= కర్ణార్జును లిద్దరు వీరులున్నూ; ఒండొరువులన్= ఒకళ్ళతో ఒకళ్ళు; తలపడుట= కలియబడటం; చూచి; ఉత్కటము+అగు= ఎక్కువైన; అచ్చెరు+పాటున్= ఆశ్చర్యం; కౌతుకంబును= వేడుకయున్నూ; అడరన్= కలుగగా; కురుసేనల్= కౌరవసేనలు; ఆ+ఎడన్= అప్పుడు; ఊరక+ఉండెన్= ఊరకున్నాయి.

తాత్పర్యం: ఆ రీతిగా కర్ణార్జును లిద్దరు మహావీరులు తలపడేసరికి ఆశ్చర్యం, వేడుక కలిగి కౌరవసేనలోని వారందరూ యుద్ధం చేయకుండా చూస్తూ ఊరుకొన్నారు.

విశేషం : కర్ణార్జునులు అపూర్వంగా ద్వంద్వయుద్ధం చేస్తున్నారు. వారి యుద్ధవీర విభావాల వీరరసం వలన చూచేవారిలో అద్భుతరసం పుట్టినట్లు తిక్కన చిత్రించాడు. 'ఉత్కట మగు నచ్చెరువాటు'- అనే మాటలు ప్రేక్షకులలోని ఆశ్చర్యం ఉత్కటావస్థను - అంటే స్థాయి భావ స్థాయికి - చేరిందని తిక్కన ధ్వనింపచేశాడు. అద్భుతరసాన్ని 'స్తంభం' (కొయ్యబారిపోవటం) అనే సాత్త్వికభావంతో సైనికులు ప్రదర్శించారు. ఈ వర్ణనం రసధ్వనికి ఉదాహరణం. (సంపా.)

మ. ప్రళయాంభోధరముక్త సాంద్ర విసరత్పాషాణ వర్షంబు మి
క్కిలియై శైలముఁ గప్పునట్లు నరు నక్షీణాస్త్ర సంతాన మి
ట్టల మై కప్పినఁ దీవ్రమారుతము గాఢవ్యాప్తి జీమూత మం
డలిఁ బోలెన్ విరియించె భానుజుఁ డవష్టంభోజ్జ్వలాకారుఁడై. 84

ప్రతిపదార్థం: ప్రళయ= ప్రళయ కాలమందలి; అంభోధర= మేఘములచేత; ముక్త= విడువబడిన; సాంద్ర= దట్టంగా; విసరత్= ప్రసరించెడి; పాషాణ= రాళ్ళతోడి; వర్షంబు= వాన; మిక్కిలి+ఐ= ఎక్కువగా; శైలమున్= పర్వతమును; కప్పునట్లు= కప్పివేసేటట్లుగా; నరు= అర్జునుడియొక్క; అక్షీణ= క్షీణముకాని; అస్త్రసంతానము= బాణ సముదాయం; ఇట్టలము+ఐ= ఎక్కువై; కప్పినన్= కప్పగా; తీవ్రమారుతము= ఎక్కువైన గాలి; గాఢవ్యాప్తి= ఎక్కువగా వ్యాపించిన; జీమూత మండలిన్+పోలెన్= మేఘ సముదాయాన్నివలె; భానుజుఁడు= కర్ణుడు; అవష్టంభ= గర్వంతో; ఉజ్జ్వల= ప్రకాశించే; ఆకారుఁడు+ఐ= మూర్తి కలవాడై; విరియించెన్= విడిపోయేటట్లు చేశాడు.

తాత్పర్యం: ప్రళయకాల మేఘాలు దట్టంగా పాషాణ వర్షం కురిపించి కొండను కప్పివేసినట్లుగా అర్జునుడు అక్షయ బాణాల వర్షంతో కర్ణుడిని కప్పివేశాడు. కర్ణుడు గర్వంతో ప్రకాశించే రూపం కలవాడై, బాగా ఆకాశాన్ని కప్పివేసిన మబ్బులను పెనుగాలితో పటాపంచలు చేసినట్లుగా ఆ బాణవర్షాన్ని ఏమీ లేకుండా చేశాడు.

విశేషం : అలం: ఉపమ.

క. విల్లును దానును శిఖ రా। జిల్లఁగ వెలుఁగొందు వహ్ని చెలువంబున శో
భిల్లుటఁ గని కురుసైన్యము। లెల్లను దూర్యములు మ్రోయ నేడ్తెఱఁ జెలఁగెన్. 85

ప్రతిపదార్థం: విల్లును= ధనువును; తానును= కర్ణుడును; శిఖ= జ్వాల; రాజిల్లఁగన్= ప్రకాశించగా; వెలుఁగొందు= వెలుగునట్టి; వహ్నిచెలువంబునన్= అగ్ని మాదిరిగా; శోభిల్లుటన్= ప్రకాశించటాన్ని; కని= చూచి; కురుసైన్యములు= కౌరవసేనలు; ఎల్లను= అన్నియును; తూర్యములు= వాద్యాలు; మ్రోయన్= మ్రోయగా; ఏడ్తెఱన్= పరాక్రమంతో; చెలఁగెన్= ధ్వనిచేశాయి, అరిచాయి.

తాత్పర్యం: విల్లుతో కూడిన కర్ణుడు జ్వాలతో వెలుగొందే అగ్నివలె అందంగా వెలుగొందగా చూచి, కౌరవసేనలు వాద్యాలు మ్రోయించి అరిచాయి.

విశేషం : అలం: ఉపమ.

క. రవితనయు బాణములు వా। సవనందనుఁ బొదివినపుడు సంతోషముఁ,ద
ద్వివిధాస్త్రము లాతనిపైఁ। గవియ విషాదంబు నొందుఁ గౌరవసేనల్. 86

ప్రతిపదార్థం: రవితనయు బాణములు= కర్ణుని బాణాలు; వాసవ నందనున్= అర్జునుడిని; పొదివినప్పుడు= కప్పినప్పుడు; సంతోషమున్= ప్రీతినీ; తద్+వివిధ+అస్త్రములు= ఆ అర్జునుడి రకరకాల బాణాలు; ఆతనిపైన్= ఆ కర్ణుడిపైన; కవియన్= కప్పగా; విషాదంబున్= విచారాన్నీ; కౌరవసేనల్= కౌరవసేనలు; ఒందున్= పొందుతాయి.

తాత్పర్యం: కర్ణుడి బాణాలతో అర్జునుడు కప్పబడితే సంతోషం, అర్జునుడి బాణాలతో కర్ణుడు కప్పబడితే విచారాన్ని పొందుతున్నారు కౌరవసైనికులు.

విశేషం : అలం: పర్యాయం.

వ. ఇవ్విధంబున నేట్లాడుచుం గదిసి గాండీవి కర్ణున కిట్లనియె. 87

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ఏట్లాడుచున్= యుద్ధం చేస్తూ; కదిసి= సమీపించి; గాండీవి= అర్జునుడు; కర్ణునకున్= కర్ణుడితో; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా యుద్ధం చేస్తునే సమీపించి అర్జునుడు కర్ణుడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'సభలఁ బలుకు దీవు సరిలేరు నా కని;। యిదె రణంబు వచ్చె; నెల్లవారి
కెఱుఁగవచ్చు దీనఁ; బెఱచోట రజ్జైన। యట్లు పూరగింప నగునె యిచట? 88

ప్రతిపదార్థం: ఈవు= నీవు; నాకున్= నాతో; సరి= సమమైనవారు; లేరు+అని= లేరు అని; సభలన్= సభలయందు; పలుకుదు(వు)= పలుకుతావు; ఇదె= ఇదిగో; రణంబు= యుద్ధం; వచ్చెన్= సంభవించింది; దీనన్= దీనితో; ఎల్లవారికిన్= అందరికి; ఎఱుఁగవచ్చున్= తెలిసివస్తుంది; పెఱచోటన్= వేరొకచోట; రజ్జు+ఐన+అట్లు= బింకాలు పలికినట్లుగా; ఇచ్చటన్= ఇక్కడ యుద్ధంలో; పూరగింపన్+అగునె?= అట్లాగే ప్రేలవచ్చునా?

తాత్పర్యం: 'సభలలో నాకు సమమైన వారు లేరని బీరాలు పలుకుతూ ఉంటావు. ఇదిగో, మన ఇద్దరికి యుద్ధం వచ్చింది కదా! ఇప్పుడు చూపవచ్చును. దీనిలో ఎవరు గొప్పవారో అందరికి తెలుస్తుంది. అక్కడ వ్యర్థాలాపాలాడినట్లు ఇక్కడ కుదురుతుందా?

విశేషం : కర్ణుడు శక్తికి మించిన ప్రగల్భాలాడతాడని అశ్వత్థామ వంటి కురువీరులే కాక, అర్జునుడివంటి పాండవ వీరులు గూడా పరిహసించటం గమనించదగింది. (సంపా.)

క. మాటలు పె క్కాడితి వీ। పోటుమగలు వినఁగ నింకఁ బోవుట దగ దె
ప్పాటఁ; నదిగాక తమ్ముని। పాటును గన్నారఁ గంటి పాఱకు మింకన్. 89

ప్రతిపదార్థం: ఈ పోటుమగలు= ఈ యుద్ధవీరులు; వినఁగన్= వినుచుండగా; మాటలు= పలుకులు; పెక్కు= చాలా; ఆడితివి= అన్నావు; ఇంకన్= ఇక్కడిదాకా వచ్చాక; పోవుట= పారిపోవటం; ఎప్పాటన్= ఏరీతిగాను; తగదు= పనికిరాదు; అదిగాక= ఇంకా; తమ్ముని పాటును= తమ్ముడి చావును; కన్నారన్= కన్నులతో స్వయంగా; కంటి(వి)= చూచితివి; ఇంకన్= ఇకనైనా; పాఱకుము= పారిపోకుము.

తాత్పర్యం: కర్ణా! ఈ యుద్ధవీరులు వింటూ ఉండగా అనేక మాటలు మాట్లాడావు. ఇక్కడివరకూ వచ్చాక, ఇక పారిపోవటం ఏరీతిగానూ మంచిది కాదు. అంతే కాకుండా తమ్ముడి చావును స్వయంగా చూచావు. ఇకనైనా పారిపోవద్దు.

విశేషం : పోరు భారమైనప్పుడు రణరంగాన్ని వదలి పారిపోవటానికి కర్ణుడు వెనుకాడడు. అదే గుణం దుర్యోధనాదులకు కూడా ఉన్నది. ఇది ఉత్తమ వీరుల లక్షణం కాదు. దానిని పేర్కొని అర్జునుడు అధిక్షేపించాడు. ఇది భావికథార్థ సూచకం కావటం మరొక శిల్ప విశేషం. (సంపా.)

ఆ. పలుకవచ్చుఁగాక పలికిన యట్టుల। చేయ వచ్చు నెట్లు? దాయ! యెందుఁ
బోయె దట్లు ద్రుపదపుత్రికఁ బఱుపంగఁ। గాంచి నగిన ఫలముఁ గందు గాక! 90

ప్రతిపదార్థం: పలుకవచ్చున్+కాక= మాటలెన్నైనా చెప్పవచ్చును కాని; పలికిన+అట్టులు+అ= పలికినట్లే; చేయవచ్చున్+ఎట్లు?= ఎట్లా చేయ వీలౌతుంది?; దాయ!= శత్రువా!; ఎందున్= ఎక్కడికి; పోయెదు= పోతావు; అట్లు= ఆ రీతిగా; ద్రుపద పుత్రికన్= ద్రౌపదిని; పఱుపంగన్= చేయగా; కాంచి= చూచి; నగిన ఫలమున్= నవ్వినదానికి ఫలాన్ని; కందు+కాక= చూస్తావు (అనుభవిస్తావు) గాక!

తాత్పర్యం: ఎన్ని మాటలైనా చెప్పవచ్చును కాని చెప్పినట్లుగా చేయ వీలవుతుందా? ఎక్కడికి పోతావు? ఆ నాడు ద్రౌపదిని భంగపరిచినప్పుడు చూచి నవ్వినదానికి ఫలం పొందుతావుగాక!

విశేషం : అర్జునుడిలో రౌద్రం ప్రజ్వలించటానికి కారణాన్ని ఇందులో పేర్కొన్నాడు. అలనాడు కౌరవసభలో ద్రౌపదిని చూచి అవహేళనం చేసి పలికిన పలుకులు అర్జునుడి మనసులో ములుకుల వలె గ్రుచ్చుకొంటూ ఉండేవి. వాటిని ఇప్పుడు స్మరించుకొనటం వలన ప్రతీకార రూపమైన క్రోధోద్రేకం అతడిలో పెచ్చు పెరిగినట్లు ధ్వని. (సంపా.)

క. ఏ నపుడు ధర్మపాశా,। ధీనుఁడనై కోపమునకు దీకొనరింపం
గా నేరకున్న మెయిమెయిఁ। బో నయ్యెం గాక యింకఁ బొమ్మా యిచటన్.' 91

ప్రతిపదార్థం: అపుడు= ద్రౌపది భంగపాటును చూచి నీవు నవ్వినపుడు; ఏన్= నేను; ధర్మపాశ= ధర్మమనెడి (ధర్మరాజనెడి) త్రాటికి; అధీనుఁడను+ఐ= కట్టువడినవాడనై; కోపమునకున్= నాకు వచ్చిన కోపానికి; దీకు= ప్రేరణ; ఒనరింపంగాన్= చేయుటకు; నేరక+ఉన్నన్= వీలులేకపోయినందున; మెయిమెయిన్= ఏ బాధా లేకుండా; పోన్+అయ్యెన్+కాక= పోవటానికి వీలైంది కాక; ఇంకన్= ఇక ఇప్పుడు; ఇచటన్= ఈ యుద్ధంలో; పొమ్మా= పొమ్ము (చూద్దాము).

తాత్పర్యం: అప్పుడు ధర్మానికి కట్టుబడి వచ్చిన కోపానికి తగినట్లుగా చేయలేదు కనుక నీవు ఏ బాధా పొందకుండా తప్పించుకొనగలిగావు. కాని, ఇప్పుడు పో చూస్తాను.

విశేషం : అర్జునుడు ధర్మబద్ధుడై అనంతమైన క్రోధాన్ని నిగ్రహించుకొనగలడు. అవసరం వచ్చినప్పుడు దానిని ప్రదర్శించగలడు. అర్జునుడు రౌద్ర ప్రదర్శనం చేసినప్పుడు కర్ణుడు పారిపోయి ప్రాణం రక్షించుకొనటం ఒక పరిపాటిగా సాగుతూ వస్తున్నది. దానిని పేర్కొని అర్జునుడు అవహేళనం చేశాడు. శత్రువులను అవహేళనం చేయటం వీరరౌద్రరసాలలో వాచికాభినయవిశేషంగా ఒప్పారుతుంది. (సంపా.)

వ. అనిన విని రాధేయుం డిట్లనియె. 92

తాత్పర్యం: అనగా విని కర్ణుడు ఇట్లా అన్నాడు.

ఉ. 'అప్పుడు ధర్మహానికి భయంపడి నిల్చితివో? కడంకతో
నిప్పుడు వచ్చినాఁడ; విట యెల్లను జేయుదు గాక; యన్నపైఁ
దప్పు ఘటించి నీవు నొక తాలిమి గల్గినవాఁడవై నెపం
బొప్పినఁ జెల్లె; నీదు నిలుపోపును జూతము గాక యిచ్చటన్. 93

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ధర్మహానికిన్= ధర్మానికి హాని కల్గుతుందని; భయము+పడి= భయము చెంది; నిల్చితివో?= ఆగినావా?; ఇప్పుడు; కడంకతోన్= పూనికతో; వచ్చినాఁడవు= వచ్చావు కదా; ఇట= ఇక్కడ; ఎల్లను= అంతయు; చేయుదు(వు)గాక= చేయుదువుగాని; అన్నపైన్= అన్నగారిమీద; తప్పు= దోషం; ఘటించి= కూర్చి; నీవును= నీవు కూడ; ఒక తాలిమి కల్గినవాఁడవు+ఐ= ఓర్పు కలవాడివలె; నెపంబు= మిష; ఒప్పినన్= కుదర్చగా; చెల్లెన్= సరిపోయింది; నీదు= నీ యొక్క; నిలుపు+ఓపును= నిలుచు సామర్థ్యమును; ఇచ్చటన్= ఈ యుద్ధంలో; చూతము+కాక= చూస్తాంగాక.

తాత్పర్యం: 'అప్పుడు ధర్మహాని వస్తుందని భయపడి ఆగిపోయావా? ఇప్పుడు బాగా పూనికతో వచ్చావా? ఇప్పుడంతా చేసేద్దువు గాని, అన్నగారి మీద తప్పు పెట్టి, నీవు బాగా ఓర్పు కలవాడవైనట్లు చెప్పుతున్నావు. సరే, నాతోడి యుద్ధంలో నీ వేపాటి నిలుస్తావో ఇక్కడ చూద్దాం.

విశేషం : అర్జునుడి ధర్మనీతి అతడి అసమర్థతను సమర్థించుకొనే ఒక సాకుగా కర్ణుడు భావించాడు. తప్పు అన్నగారిమీద పెట్టి అర్జునుడు తప్పుకొంటున్నట్లు తలచాడు. నిజానికి అట్లా భావించటం కర్ణుడి శీలానికే చెల్లింది. (సంపా.)

క. సమయంబు నడపినను రా। జ్యము భాగం బీరె యెట్లు నను నాస నర
ణ్యమున వసించితి గాక ని। జమునకు నీయందు ధైర్యసారము గలదే? 94

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సమయంబు= ప్రతిజ్ఞ; నడపినను= నిర్వహించినచో; ఎట్లున్= ఏ విధంగానైనా; రాజ్యము భాగంబు= రాజ్యంలోని వాటాను; ఈరె?= ఇయ్యరా?; అను+ఆసన్= అనెడి ఆశతో; అరణ్యమునన్= అడవిలో; వసించితి+కాక= ఉన్నావుగాని; నిజమునకున్= యథార్థానికి; నీయందున్= నీకు; ధైర్యసారము= ధైర్యంలోని గట్టితనం; కలదే?= కలదా?

తాత్పర్యం: ఎట్లాగో ఒకవిధాన అన్నమాట ప్రకారం అరణ్యవాస, అజ్ఞాతవాసాలు చేస్తే వారే రాజ్యంలో భాగం ఇస్తారులే- అని అడవిలో ఉన్నావు కాని, నిజంగానే నీ కసలు ధైర్యం ఉన్నదా?

విశేషం : నియమం ప్రకారం అరణ్య అజ్ఞాతవాసాలు చేయటానికి కారణం శత్రువులను ఎదిరించలేని పాండవుల-లేదా-పార్థుడి అధైర్యమని కర్ణుడు ఆరోపించటం అతడి దుర్విదగ్ధత్వానికి నిదర్శనం. (సంపా.)

క. మును నీ వచట నచటఁ జే। సిన బంటుతనంబు లెల్లఁ జెప్పఁగ విందుం
గనినఁ గదా నమ్ముదు; నవి। యనుమానము నాకు నీ భయస్థితిఁ గనుటన్.' 95

ప్రతిపదార్థం: మును= మునుపు; నీవు; అచటన్+అచటన్= అక్కడక్కడ; చేసిన బంటుతనంబులు= చేసిన వీరకృత్యాలు; ఎల్లన్= అన్నియును; చెప్పఁగన్= జనులు చెప్పగా; విందున్= విన్నాను; అవి= వాటిని; కనినన్+కదా!= చూచినప్పుడు కదా!; నమ్మెదున్= నమ్మగలను; నీ భయస్థితిన్= భయపడే నీ స్థితిని; కనుటన్= చూడగా; నాకున్; అనుమానము= సందేహంగా ఉన్నది.

తాత్పర్యం: నీ విదివరలో ఏవో కొన్ని వీరోచిత కృత్యాలు చేశావని జనులు చెప్పికొంటుండగా విన్నాను. చూస్తే కాని నమ్మలేను. నీ కిప్పుడున్న ఈ భయస్థితిని చూస్తే నాకు నీవు చేశావని చెప్పేవన్నీ సందేహంగానే ఉన్నాయి.'

విశేషం : ఎంతటి వీరులనైనా లెక్కచేయని కర్ణుడి దురహంకారం ఈ మాటలలో గుబాళిస్తున్నది. అర్జునుడు అధిక్షేపోక్తులు పలకటం యుద్ధానికి భయపడి మాటాలాడటంగా కర్ణుడు భావించటం శోచనీయం. (సంపా.)

కర్ణార్జునుల ద్వంద్వయుద్ధము (సం. 4-55-14)

వ. అనుచు వాలమ్ములు గురిసిన నర్జునుండును గుపితుండై గాండీవవిక్షేప క్షోభిత నభోభాగుండగుచుం గానీను పై నానానిశిత విశిఖంబులు నినిచె; న ట్లయ్యిరువురును దేవాసుర సంగ్రామ సాదృశ్య విక్రమ ప్రక్రియం బొలిచి రట్టి సమయంబున. 96

ప్రతిపదార్థం: అనుచున్= అని పలుకుతూనే; వాలు+అమ్ములు= వాడిబాణాలు; కురిసినన్= కురిపించగా; అర్జునుండును= అర్జునుడు కూడా; కుపితుండు+ఐ= కోపించినవాడై; గాండీవ= గాండీవంయొక్క; విక్షేప= కదలికచేత; క్షోభిత= క్షోభపెట్టబడిన; నభోభాగుండు+అగుచున్= ఆకాశప్రదేశం కలవాడై; కానీనుపైన్= కర్ణుడిపై; నానా= అనేక రకాలైన; నిశిత= వాడియైన; విశిఖంబులు= బాణములు; నినిచెన్= నింపాడు; అట్లు= ఆ రీతిగా; ఆ+ఇరువురును= ఆ ఇద్దరును; దేవ+అసుర= దేవతలయొక్క, రాక్షసులయొక్క; సంగ్రామ= యుద్ధంతో; సాదృశ్య= పోలికగల; విక్రమ= పరాక్రమంయొక్క; ప్రక్రియన్= రీతిని; పొలిచిరి= ప్రకాశించారు; అట్టి సమయంబునన్= అప్పుడు.

తాత్పర్యం: అని కర్ణుడు పై విధంగా పలుకుతూనే వాడి బాణాలను కురిపించసాగాడు. అర్జునుడు కూడా యుద్ధప్రీతితో ఆకాశం దద్దరిల్లే విధంగా పెక్కురకాల వాడిబాణాలు ప్రయోగించాడు. దేవాసుర యుద్ధం వలె వారిరువురి యుద్ధం ప్రకాశిస్తున్నది. ఆ సమయంలో.

విశేషం: అలం: ఉపమ. దేవాసురులయుద్ధం పురాణప్రసిద్ధం. అందులో అంతిమ విజయం దేవతలదని గూఢం. కాబట్టి విజయుడి విజయం తథ్యమని ధ్వని. (సంపా.)

క. రవిదీప్తులు సొర నేరమిఁ । గవిసెం జీఁకట్లు, పవనుగమనం బడఁగెన్,
వివిధాస్త్రంబుల నంబర । మవిరళముగఁ బొదువఁబడుట నద్భుతభంగిన్. 97

ప్రతిపదార్థం: రవి= సూర్యుని; దీప్తులు= కాంతులు; చొరనేరమిన్= ప్రవేశించలేకపోవుటచేత; చీఁకట్లు= చీకటులు; కవిసెన్= వ్యాపించాయి; వివిధ+అస్త్రంబులన్= అనేక రకాలైన అస్త్రాలతో; అంబరము= ఆకాశం; అవిరళముగన్= సందులేకుండా; పొదువన్+పడుటన్= వ్యాపింపజేయబడటంచేత; అద్భుతభంగిన్= ఆశ్చర్యకరమైన రీతిలో; పవను+గమనంబు= వాయు సంచారం; అడఁగెన్= అణగిపోయింది.

తాత్పర్యం: అనేకాస్త్రాలు ఆకాశంనిండా వ్యాపింపచేయటంతో సూర్యకాంతులు ప్రవేశించలేనందున చీకట్లు వ్యాపించాయి. గాలిసంచార మాగిపోయింది.

ఉ. అప్పుడు కర్ణసైన్య మమరాధిపనందనుఁ జుట్టుముట్టఁ దే
రుప్పరవీథిమై వలయ మొప్ప వెసం బఱపించి క్రీడి పెం
గుప్పలుగా రథావలిని ఘోటతతిం గరిరాజిఁ గూల్చుచుం
దప్పక భానుసూను మెయిఁ దాఁకఁగ నేయుచు నుల్లసిల్లినన్. 98

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కర్ణసైన్యము= కర్ణుడిసేన; అమరాధిపునందనున్= అర్జునుడిని; చుట్టుముట్టన్= చుట్టూరా ముట్టడించగా; తేరు= రథం; ఉప్పరవీథిమైన్= ఆకాశమార్గంలో; వలయము+ఒప్పన్= గుండ్రంగా; వెసన్= వెంటనే; పఱపించి= నడిపించి; క్రీడి= అర్జునుడు; రథావలిని= రథాల పంక్తిని; ఘోటతతిన్= గుర్రాల సమూహాన్ని; కరిరాజిన్= ఏనుగుల పంక్తిని; కుప్పలుగాన్= రాసులు పడేటట్లుగా; కూల్చుచున్= చంపుతూ; తప్పక= మానక; భానుసూను మెయిన్= కర్ణుడి శరీరాన్ని; తాఁకఁగన్= తగిలేటట్లు; ఏయుచున్= కొట్టుతూ; ఉల్లసిల్లినన్= ప్రకాశించగా.

తాత్పర్యం: అప్పుడు కర్ణుడిసేన అర్జునుడిని చుట్టుముట్టింది. అర్జునుడు తన రథాన్ని ఆకాశంపై గుండ్రంగా నడిపిస్తూ, గుర్రాలను, ఏనుగులను, రథాలను కుప్పలు కుప్పలుగా చంపి పడవేస్తూ, కర్ణుడి శరీరానికి నాటుకొనేటట్లు బాణాలను వేస్తూ ప్రకాశించగా.

వ. రాధేయుండును. 99

తాత్పర్యం: కర్ణుడు కూడా.

క. తఱిమి పయి నడరుటయు విలు । విఱుగంగా నేసె నరుఁడు విక్రమలీలం
గొఱఁతవడనీక కర్ణుఁడు । మెఱుఁగు లడరుశక్తి సురలు మెచ్చఁగ వైచెన్. 100

ప్రతిపదార్థం: తఱిమి= తరుముకొని వచ్చి; పయిన్= మీదికి; అడరుటయును= అతిశయించి రాగా; నరుఁడు= అర్జునుడు; విలు= విల్లు; విఱుగంగాన్+ఏసెన్= విరిగేటట్లుగా బాణమేశాడు; కర్ణుఁడు; విక్రమలీలన్= పరాక్రమ విలాసంతో; కొఱఁతవడన్+ఈక= లోటు రానియ్యక; మెఱుఁగులు+అడరు= ఎక్కువగా ప్రకాశించే; శక్తిన్= శక్తి అనే ఆయుధాన్ని; సురలు= దేవతలు; మెచ్చఁగ(న్)= మెచ్చేటట్లుగా; వైచెన్= విసిరాడు.

తాత్పర్యం: కర్ణుడు మీది మీదికి రాగా అర్జునుడు అతడి విల్లు విరిగేటట్లు కొట్టాడు. కర్ణుడు పరాక్రమానికి లోటు రాకుండా మెరిసే శక్తిని అర్జునుడి మీదికి విసిరాడు.

ఆ. వైచుటయును సవ్యసాచియుఁ గౌరవుల్ । విస్మయంబుతోడి వెఱపు వొంద
నధికరయము మెఱయ నది పెక్కుదునియలు, । చేసె నంతరమున శితశరముల. 101

ప్రతిపదార్థం: వైచుటయును= వేయగా; సవ్యసాచియున్= అర్జునుడు కూడా; కౌరవుల్= కౌరవసేన; విస్మయంబుతోడి= ఆశ్చర్యంతోపాటు; వెరపు= భయమును; పొందన్= పొందగా; అధికరయము= మిక్కిలి వేగం; మెఱయన్= మెరయగా; అది= ఆ శక్తిని; శిత శరములన్= వాడిఅయిన బాణాలతో; అంతరమునన్= మధ్యలో; పెక్కు+తునియలు= చాలా ముక్కలు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: కర్ణుడు శక్తిని వేయగా, అర్జునుడు వాడిబాణాలతో కౌరవసేనలు ఆశ్చర్యంతో భయపడేటట్లు ఆ శక్తిని మధ్యలోనే ముక్కలు ముక్కలుగా చేశాడు.

వ. అట్టియెడ నినతనయు మన్నించు జోదులు దెగి పయిం బడినఁ గ్రోధారుణ నయన పల్లవితంబును దంత కాంతిస్తబకితంబును గుంభస్థల ఫలితంబును నగు తదీయ కరటి ఘటావికట విటపి పటలంబును నాత్మీయ విశిఖ వ్యాపార మహావాతంబునన్ బడలువడం గూల్చి చండమూర్తి దాల్చి శోభిల్లు బీభత్సుంగని యతండు బొమముడివడ నెక్కొని వేఱొక్క విల్లెత్తికొని. 102

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= అప్పుడు; ఇనతనయు(న్)= కర్ణుని; మన్నించు= ఆజ్ఞ పాటించే; జోదులు= వీరులు; తెగి= సాహసించి; పయిన్+పడినన్= మీదపడగా; క్రోధ= కోపంచేత; అరుణ= ఎర్రనైన; నయన= కళ్ళచే; పల్లవితంబును= చిగురు పుట్టినట్లున్నదియు; దంతకాంతి= పళ్ళకాంతిచేత; స్తబకితంబును= పూలగుత్తికలదిగా ఉన్నదియును; కుంభస్థల= కుంభస్థలంచేత; ఫలితంబును= పండ్లు కలిగినట్లున్నట్టియు; అగు= అయిన; తదీయ= ఆ వీరుల; కరటి ఘటా= ఏనుగుల యొక్క గుంపులనెడి; వికట= వంకరలైన; విటపిపటలంబున్= చెట్ల సముదాయమును; ఆత్మీయ= తనయొక్క; విశిఖవ్యాపార= బాణాలు వేయుట అనెడి; మహావాతంబునన్= పెనుగాలిచే; బడలు పడన్= క్రిందపడేటట్లు; కూల్చి= పడవేసి; చండమూర్తి+తాల్చి= తీవ్రమైన ఆకారం గలిగి; శోభిల్లు= ప్రకాశించెడి; బీభత్సున్= అర్జునుడిని; కని= చూచి; అతండు= కర్ణుడు; బొమముడివడన్= కోపముచేత కనుబొమలు చిట్లించి; నెక్కొని= సన్నద్ధుడై; వేఱు+ఒక్క= మరియొక; విల్లు+ఎత్తికొని= ధనువును తీసుకొని.

తాత్పర్యం: కర్ణుడి ఆజ్ఞపై నడిచే యోధులు సాహసించి అర్జునుడిమీద పడ్డారు. ఎర్రనికళ్ళు అనే చిగుళ్ళతో, కాంతిమంతములైన దంతాలనే పూలగుత్తులతో, కుంభస్థలాలనే పండ్లతో ఏనుగులు అనే పెద్దపెద్ద చెట్లుగా ఉన్న గజసేనను బాణాలనే పెనుగాలితో పడవేసి, అంత పని చేసినందుకు తీవ్రమైన ఆకారంతో ప్రకాశిస్తూ ఉన్న అర్జునుడి మీదికి కర్ణుడు మొగం చిట్లించుకొంటూ మరొక విల్లు తీసికొని.

విశేషం: అలం: రూపకం, వృత్త్యనుప్రాసం.

క. తురగముల నాలుగిట ను । త్తరు నాఱిట నెనిమిదిట రథముఁ బదిటను వా
నరు నఱువది శరముల న । న్నరు నంగంబులను బెలుచ నాఁటఁగ నేసెన్. 103

ప్రతిపదార్థం: తురగములన్= గుర్రాలను; నాలుగిటన్= నాల్గు బాణాలతోను; ఉత్తరున్= ఉత్తరుని; ఆఱిటన్= ఆరు బాణాలతోనూ; రథమున్= రథాన్ని; ఎనిమిదిటన్= ఎనిమిది బాణాలతోనూ; వానరున్= హనుమంతుడుగల జెండాను; పదిటను= పది బాణాలతోనూ; ఆ+నరు+అంగంబులను= ఆ అర్జునుడి అవయవాలను; అఱువది శరములన్= అరవై బాణాలతోనూ; పెలుచన్= అధికంగా; నాఁటఁగన్= నాటేటట్లు; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: కర్ణుడు మరొకవిల్లు తీసికొని గుర్రాలను నాల్గు బాణాలతోనూ, సారథియైన ఉత్తరుని ఆరు బాణాలతోనూ, రథాన్ని ఎనిమిది బాణాలతోనూ, హనుమంతుని గుర్తుగల జెండాను పది బాణాలతోనూ, అర్జునుడి అవయవాలపై నాటేటట్లుగా అరవై బాణాలతోనూ కొట్టాడు.

వ. ఇత్తెఱంగున. 104

తాత్పర్యం: ఈ రీతిగా.

సీ. రోషంబు భీషణరూపమై చెలువొంద । నతులకేతువు శిఖయై వెలుంగ,
శరజాలములు పటుజ్వాలలై నిగుడ న । ర్కతనూభవోగ్రాగ్ని ప్రజ్వరిల్ల,
నుద్ధతి సైఁపక యుజ్జ్వలదివ్యప । తాక మెఱుంగుగా దళిత ధరణి
రథనేమిరవము గర్జనముగ శరపరం । పరలు ధారలుగాఁగఁ బరఁగి యడరె,

ఆ. నర్జునాంబుదం బనన్యసామాన్య స । ముద్యమమున ముఖపయోరుహముల
కాంతి దఱిఁగి యపుడు కౌరవసేనా స । రోవరంబు దీనభావ మొంద. 105

ప్రతిపదార్థం: రోషంబు= కోపం; భీషణరూపము+ఐ= భయంకరమై; చెలువు+ఒందన్= ప్రకాశించగా; అతుల= సాటిలేని; కేతువు= జెండా; శిఖ+ఐ= జ్వాలయై; వెలుంగన్= వెలుగగా; శరజాలములు= బాణ సముదాయాలు; పటు= గొప్పవైన; జ్వాలలు+ఐ= మంటలై; నిగుడన్= వ్యాపించగా; అర్కతనూభవ= కర్ణుడనెడి; ఉగ్ర+అగ్ని= తీక్ష్ణమైన అగ్ని; ప్రజ్వరిల్లన్= ప్రజ్వలించగా; ఉద్ధతి= గర్వం; సైఁపక= సహించక; ఉజ్జ్వల= ప్రకాశించే; దివ్యపతాక= దివ్యమైన జెండా; మెఱుంగుగా(న్)= మెరుపుగానూ; దళితధరణి= చీల్చబడిన భూమి కల; రథనేమి= రథముయొక్క చక్రపు టంచులయొక్క; రవము= ధ్వని; గర్జనముగన్= ఉరుములుగానూ; శరపరంపరలు= బాణాల వరుసలు; ధారలుగాఁగన్= వానధారలుగానూ; పరఁగి= బయల్దేరి; అర్జున+అంబుదంబు= అర్జునుడనే మేఘం; అనన్యసామాన్య= ఇతరులకు చేయశక్యంకాని; సముద్యమమునన్= గొప్ప ప్రయత్నంతో; అపుడు= ఆ సమయాన; కౌరవసేనా సరోవరంబు= కౌరవులసేన యనెడి సరస్సు; ముఖ పయోరుహముల కాంతి= ముఖములనెడి పద్మాల కాంతి; తఱిఁగి= తగ్గి; దీనభావము= దైన్యాన్ని; పొందన్= పొందగా; అడరెన్= అతిశయించింది.

తాత్పర్యం: కర్ణుడు కోపంతో భయంకరుడై జెండాలు శిఖలవలె, బాణాలు మంటలవలె, ఉగ్రమైన అగ్ని అయి ప్రజ్వరిల్లగా, అతడి అతిశయాన్ని సహించలేక అర్జునుడు పతాకమే మెరుపు కాగా, రథచక్రాలధ్వని ఉరుములు కాగా, బాణపరంపరలే వానధారలు కాగా, తానే మేఘమై అనన్యసామాన్యంగా ఇతరులకు శక్యంకాని విధంగా కౌరవసేన అనే సరస్సు నందలి ముఖాలనే పద్మాలు వాడిపోయేటట్లుగా బాణధారలు కురిపించాడు.

విశేషం: అలం: సావయవ రూపకం. సూర్యుడి కుమారుడు అగ్నితోనూ, ఇంద్రుడి కుమారుడు మేఘుడితోనూ రూపించబడటం సార్థకం. (సంపా.)

క. వెండియు నుడుగక రవిసుతుఁ । డొండొండ నిశాతసాయకోత్కరము సము
ద్దండతఁ బై నించిన నా । ఖండల నందనుఁడు కెంపు కనుఁగవఁ గదురన్. 106

ప్రతిపదార్థం: వెండియున్= మరియు; రవిసుతుఁడు= కర్ణుడు; ఉడుగక= మానక; ఒండు+ఒండు+అ= క్రమక్రమంగా; నిశాత= వాడియైన; సాయక+ఉత్కరము= బాణ సముదాయాన్ని; సముద్దండతన్= తీవ్రంగా; పై నించినన్= అర్జునుడిపై వేయగా; ఆఖండల నందనుఁడు= అర్జునుడు; కనుఁగవన్= రెండు కన్నులందును; కెంపు= ఎరుపు; కదురన్= వ్యాపించగా.

తాత్పర్యం: కర్ణుడు అంతటితో మానక వాడి బాణాలను అర్జునుడి మీద నింపివేశాడు. అర్జునుడు కూడా కన్నులు ఎర్రబడగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. శిరము లలాటంబును గం । ధరమును బాహువులు నురము దండడి వ్రయ్యన్
గిరిపైఁ బిడుగులు దొరఁగెడు, । పరుసున దృఢదీప్త శాత భల్లము లేసెన్. 107

ప్రతిపదార్థం: శిరము= తల; లలాటంబును= నుదురును; కంధరమును= కంఠమును; బాహువులున్= చేతులును; ఉరము= రొమ్ము; దండడిన్= దొమ్మిగా; వ్రయ్యన్= నరుకుడుపడగా; గిరిపైన్= కొండమీద; పిడుగులు; తొరఁగెడు పరుసునన్= పడునట్లుగా; దృఢదీప్త= గట్టిగా ప్రకాశించే; శాత= వాడియైన; భల్లములు= బల్లెములు; ఏసెన్= వేశాడు.

తాత్పర్యం: తల, నొసలు, మెడ, చేతులు, రొమ్ము- ఇవిఅన్నీ ఒక్కసారిగా తెగిపోయేటట్లుగా కొండమీద పిడుగులు పడ్డట్లుగా గట్టి బల్లేలు అర్జునుడు వేశాడు.

విశేషం: అలం: ఉపమ.

క. అఱిముఱి నంగము లెల్లను । నుఱుముగ నిట్లడరు నర్జునుని యమ్ములకున్
వెఱచఱచి సూతపుత్రుఁడు । పఱచెఁ బుడమియద్రువ మత్స్యపతిసుతుఁ డార్వన్. 108

ప్రతిపదార్థం: అఱిముఱిన్= సంభ్రమంతో; అంగములు= అవయవాలు; ఎల్లను= అన్నియును; నుఱుముగన్= నుగ్గుగా; ఇట్లు+అడరు= ఈ రీతిగా విజృంభించే; అర్జునుని= అర్జునుడియొక్క; అమ్ములకున్= బాణాలకు; వెఱచఱచి= భయపడి; సూతపుత్రుఁడు= కర్ణుడు; పుడమి= భూమి; అద్రువన్= అదరగా; మత్స్యపతిసుతుఁడు= ఉత్తరుడు; ఆర్వన్= కేకలు పెట్టగా; పఱచెన్= (కర్ణుడు) పారిపోయాడు.

తాత్పర్యం: ఇట్లా వేగంగా తన అవయవాలన్నిటినీ అర్జునుడి బాణాలు నుగ్గుచేసేటప్పటికి భయపడిపోయి కర్ణుడు పారిపోయాడు. ఆ హడావిడికి భూమి అదిరింది. అది చూచి సంతోషంతో ఉత్తరుడు కేకలు పెట్టాడు.

విశేషం: మూలభారతంలో కర్ణు డీ సందర్భంలో రెండుసార్లు ఓడినట్లు చెప్పబడింది. అది కర్ణుడి ప్రయత్న విశేషాన్ని సూచిస్తుంది. కాని, తిక్కన కర్ణు డొక్కసారి ఓడినట్లే ఇక్కడ చిత్రించి సహజత్వాన్ని పోషించటమే కాక అర్జునుడి పరాక్రమాన్ని ధ్వనింపచేశాడు. (సంపా.)

వ. ఇట్లు కర్ణుండు గయ్యంబు విడిచి పాఱినఁ బార్థుండు దేవదత్తంబు పూరించి యుత్తరున కిట్లనియె.109

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; కర్ణుండు; కయ్యంబున్= యుద్ధమును; విడిచి= విడిచిపెట్టి; పాఱినన్= పారిపోగా; పార్థుండు= అర్జునుడు; దేవదత్తంబు= దేవదత్తమనే పేరుగల తన శంఖాన్ని; పూరించి= ఊది; ఉత్తరునకున్= ఉత్తరుడితో; ఇట్లు= చెప్పబోయేరీతిగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా కర్ణుడు యుద్ధరంగాన్ని విడిచిపెట్టి పారిపోగా, పార్థుడు దేవదత్తమనే శంఖాన్ని పూరించి ఉత్తరుడితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: రణోత్సాహం కలిగినప్పుడు, రణంలో విజయం సాధించినప్పుడు అర్జునుడు స్వీయ యుద్ధ వీరోల్లాసానికి చిహ్నంగా దేవదత్తం పూరించటం ఈ ఘట్టంలో గమనించగలం. (సంపా.)

క. **'వీఁ డొకఁడు కురుబలంబున । వాఁడిమగం డనఁగఁ జాలువాఁ డిట్టంగిం**
బోఁడిమి సెడియెను ద్రోణుల । వేఁడిమి యిట మనకు మునుము విక్రమమునకున్.' **110**

ప్రతిపదార్థం: కురుబలంబునన్= కౌరవసేనలో; వాఁడిమగండు= గొప్పవీరుడు; అనఁగన్+చాలువాఁడు= అనదగినవాడు; వీఁడు+ఒకఁడు= వీడొకడు; ఈ+భంగిన్= ఈ రీతిగా; పోఁడిమి= పరాక్రం; చెడియెను= చెడెను; ఇటన్= ఇక్కడ; మనకున్= మనకు; ద్రోణులవేఁడిమి= ద్రోణాచార్యుల వారి పరాక్రమం; విక్రమమునకున్= బలానికి; మునుము= అడ్డ, ఎదురు.

తాత్పర్యం: 'కౌరవసేనలో మహావీరుడని చెప్పుకొనదగిన వాళ్ళలో ఈ కర్ణ డొకడు. ఇత డిట్లా పారిపోయాడు కదా! ఇక ద్రోణాచార్యులవారి పరాక్రమం మనకున్న అడ్డు - ఎదురు'.

వ. **అనుచు వీరావేశంబునఁ గౌరవానీకంబు నాలోకించునప్పు డుత్తరుండు.** **111**

ప్రతిపదార్థం: అనుచున్= అని పల్కుతూ; వీర+ఆవేశంబునన్= వీరులకుండే ఆవేశంతో; కౌరవ+అనీకంబున్= కౌరవుల సేనను; ఆలోకించునప్పుడు= చూచే సమయాన; ఉత్తరుండు.

తాత్పర్యం: అంటూ వీరావేశంతో కౌరవసేనను చూస్తున్నా డర్జునుడు. అప్పుడు ఉత్తరుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. **'వెక్కసపాటు భీతియును విహ్వలభావము నొంది యిట్లను**
'న్మిక్కిలి యైన శౌర్యమును నిర్భరతేజము నంత కంత కి
ట్లెక్కెడులావుఁ జూచి మది యెంతయు బెగ్గిలె, మేను చేష్టలం
దక్కెఁ నశక్య మిం కిట రథవ్యవహారము నిర్వహింపఁగన్. **112**

ప్రతిపదార్థం: వెక్కసపాటున్= ఆశ్చర్యమూ; భీతియును= భయమూ; విహ్వల భావమున్= వివశత్వమును; ఒంది= పొంది; ఇట్లు= చెప్పబోవు రీతిగా; అనున్= అన్నాడు; మిక్కిలి+ఐన= గొప్పదైన; శౌర్యమును= పరాక్రమమున్నూ; నిర్భరతేజమున్= నిండు తేజస్సున్నూ; అంతకున్+అంతకున్= క్రమక్రమంగా; ఇట్లు= ఈ రీతిగా; ఎక్కెడు లావున్= హెచ్చుతున్న బలమున్నూ; చూచి; మది= మనస్సు; ఎంతయున్= మిక్కిలి; బెగ్గిలెన్= భయంతో చెదరిపోవుతున్నది; మేను= శరీరం; చేష్టలన్= కదలికలను; తక్కెన్= మానింది; ఇంకన్= ఇటుపై; ఇటన్= ఈ యుద్ధంలో; రథవ్యవహారము= రథ సారథ్యం; నిర్వహింపఁగన్= నిర్వహించటానికి; అశక్యము= శక్యం కాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆశ్చర్యం, భయం, ఒడలు వివశం కావటం కలిగి ఉత్తరు డిట్లా అన్నాడు- 'మీ పరాక్రమం, తేజస్సు యుద్ధ మవుతున్నకొద్దీ పెరుగుతున్నాయి. మీ బలం చూసేసరికి నా మనస్సు చెదరిపోతున్నది. నా శరీరం చెప్పినట్లు వినటం లేదు. ఇక రథసారథ్యం నిర్వహించటం నాకు అశక్యం.

ఆ. పుట్టినంతనుండి యిట్టివి యెన్నఁడుఁ। గాన నెందు; నట్లు గాన చోద్య
మంది యంతరంగ మవశతఁ బొందిన। కతన నింద్రియముల కడఁక దక్కె.' 113

ప్రతిపదార్థం: పుట్టిన+అంతనుండి= పుట్టినప్పటి నుండి; ఇట్టివి= ఇట్టి యుద్ధాలు; ఎన్నఁడున్= ఎప్పుడును; కానన్= చూడలేదు; అట్లుగానన్= అందువలన; చోద్యము+అంది= ఆశ్చర్యం కలిగి; అంతరంగము= మనస్సు; అవశతన్= వశము లేకపోవుటను; పొందినకతనన్= పొందటంవలన; ఇంద్రియముల కడఁక= ఇంద్రియాల పూనిక; తక్కె(న్)= తగ్గింది.

తాత్పర్యం: నేను పుట్టింది మొదలు ఇటువంటి యుద్ధాలు ఎప్పుడూ చూడలేదు. కనుక ఆశ్చర్యం వేసి నా మనస్సు పరవశమై, ఇంద్రియాలు చెప్పినట్లు చేయటం మానివేశాయి.'

విశేషం: అర్జునుడి అపూర్వ పరాక్రమ ప్రదర్శనం చూచిన ఉత్తరుడు ఆశ్చర్యాన్నీ, వివశత్వాన్నీ ప్రదర్శించాడు. జన్యజనక రస సంయోజన శిల్పరచన ఇది. ఉత్తరుడి భయం అర్జునుడి యుద్ధవీరాన్ని ధ్వనింపజేస్తున్నది. కాబట్టి ఇక్కడ రసధ్వని గమ్యమానం. (సంపా.)

తే. అనినఁ గొండొక న వ్వొలయంగఁ జూచి। యింద్రనందనుఁ డాతని కిట్టు లనియె
'నేను గలుగంగ నీకేమి యెలమి వాహ,। నముల కుబ్బుగ సంచోదనంబు సేయు.' 114

ప్రతిపదార్థం: అనినన్= అని పల్కగా; కొండొకనవ్వు= చిరునవ్వు; ఒలయంగన్= కలుగునట్లుగా; చూచి; ఇంద్రనందనుఁడు= అర్జునుడు; ఆతనికిన్= ఉత్తరుడితో; ఇట్టులు= ఈ రీతిగా; అనియెన్= పల్కాడు; నేను కలుగంగన్= నేనుండగా; నీకున్+ఏమి?= నీకేమి భయము?; ఎలమిన్= సంతోషంగా; వాహనములకున్= గుర్రాలకు; ఉబ్బుగన్= ఉత్సాహం కలిగేట్లు; సంచోదనంబు= రథం తోలటం; చేయు(ము)= సాగించుము.

తాత్పర్యం: అనగా, చిరునవ్వుతో అర్జును డన్నాడు- 'ఉత్తరకుమారా! నే నుండగా నీ కేమి భయం? హుషారుగా గుర్రాలను తోలుము.'

క. అనుటయు నాతఁడు దగ నూ। ల్కొనినం, దా నుదిత నినద కోదండుం డై
యనితర సులభోద్యమముగ। ధనంజయుం డిట్టులను నతనితో మఱియున్. 115

ప్రతిపదార్థం: అనుటయున్= అని పల్కగా; ఆతఁడు= ఉత్తరుడు; తగన్= తగునట్లు; నూల్కొనినన్= అంగీకరించగా; తాన్= అర్జునుడు; ఉదితనినద= ధ్వనిపుట్టిన; కోదండుండు+ఐ= ధనువు కలవాడై; అనితరసులభ= ఇతరులకు సులభంకాని; ఉద్యమమునన్= ప్రయత్నంతో; ధనంజయుండు= అర్జునుడు; అతనితోన్= ఉత్తరుడితో; మరియున్= ఇంకా; ఇట్టులు= ఈ రీతిగా; అనున్= పలికాడు.

తాత్పర్యం: అనగా, ఉత్తరుడు తగినట్లుగా అంగీకరించాడు. ఇక అర్జునుడు వింటి నారి మ్రోయించి, ఇతరు లెవ్వరూ చేయలేని పూనిక కలవాడై ఉత్తరుడితో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **'అరుణాశ్వంబులఁ బూనిన । యరదంబున వీఁడె నిడుపులగు చేతులు బం**
ధుర కంధరంబు వెడలుపు । టురమును నై ద్రోణుఁ డొప్పె నుత్తర కంటే?' **116**

ప్రతిపదార్థం: అరుణ+అశ్వంబులన్= ఎర్రని గుర్రాలను; పూనిన= కట్టిన; అరదంబునన్= రథమందు; వీఁడె= ఇదుగో; నిడుపులు+అగు చేతులు= పొడవైన చేతులు; బంధుర కంధరంబు= బలిష్ఠమైన మెడ; వెడలుపు+ఉరమునున్= వెడల్పైన రొమ్ము; ఐ= కలవాడై; ద్రోణుఁడు; ఒప్పెన్= ప్రకాశిస్తున్నాడు; కంటే?= చూచావా?

తాత్పర్యం: 'ఎర్రని గుర్రాలు కట్టిన ఆ రథంమీద పొడుగాటి చేతులు, బలమైన మెడ, వెడల్పైన రొమ్ము కలిగిన ద్రోణు డెట్లా ఉన్నాడో చూచావా?'

వ. **అని చూపి వెండియు నిట్లనియె.** **117**

ప్రతిపదార్థం: అని= ఇట్లు పలికి; చూపి= ద్రోణుడిని చూపి; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: అని చూపించి మరల ఇట్లా అన్నాడు.

ఆ. **'సకల కురుకుమార చాప శిక్షాచార్యుఁ, । డాజి దుస్సహుండు, సాంగవేద**
వేది, నీతిశాస్త్ర విదుఁడు దివ్యాస్త్ర కో । విదుఁడు, సుజన హితుఁడు, విమల బుద్ధి.' **118**

ప్రతిపదార్థం: సకల= సమస్తమైన; కురుకుమార= కురువంశ కుమారులకు (కౌరవ పాండవులకు); చాపశిక్షా= ధనుర్విద్య నేర్పటంలో; ఆచార్యుఁడు= గురువు; ఆజిన్= యుద్ధంలో; దుస్సహుండు= సహించ శక్యం కానివాడు; సాంగవేదవేది= షడంగాలతో కూడిన వేదాలను ఎరిగినవాడు; నీతిశాస్త్ర విదుఁడు= నీతిశాస్త్రం ఎరిగినవాడు; దివ్య+అస్త్ర కోవిదుఁడు= దివ్యాస్త్రాలను చక్కగా ఎరిగినవాడు; సుజనహితుఁడు= మంచివారికి హితుడైనవాడు; విమలబుద్ధి= నిష్కల్మషమైన బుద్ధి కలవాడు.

తాత్పర్యం: 'ద్రోణుడు కౌరవవంశ రాజకుమారులందరికి ధనుర్విద్య నేర్పిన గురువు; యుద్ధంలో సహించటానికి అశక్యమైనవాడు. వేదవేదాంగాలను నేర్చినవాడు, నీతిశాస్త్రజ్ఞుడు, దివ్యాస్త్రాలు తెలిసినవాడు, మంచివారికి హితం చేసేవాడు, నిష్కల్మషమైన బుద్ధి కలవాడు.'

విశేషం: ధనుర్విద్య నేర్పే గురువు కుండవలసిన లక్షణాలన్నీ ద్రోణుడి కున్నట్లు అర్జునుడు చెప్పటం విశేషం. వేదాలు నాలుగు: ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం. షడంగాలు : (ఆరు వేదాంగాలు) : శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం.

వ. **అని యగ్గించి.** **119**

తాత్పర్యం: అని పొగడి.

క. **'తన తనయుకంటె నెమ్మన । మున నాకుం గూర్చు భావమున, గురులకు మా**
ర్కొనియెదము; రాచధర్మం । బున కీడునఁ జేసి యింత పుట్టఁగ వలసెన్. **120**

ప్రతిపదార్థం: తన తనయుకంటెన్= తన కొడుకు అయిన అశ్వత్థామ కన్నను; నెమ్మనమునన్= మంచి మనస్సునందు; నాకున్= నాకు; భావమునన్= మనస్సునందు; కూర్చున్= ఇష్టపడతాడు; గురులకున్= గురువులకు; మార్కొనియెదము= ఎదుర్కొంటాము; రాచధర్మంబున కీడునన్+చేసి= రాజధర్మంలో ఉన్న చెడువలన; ఇంత పుట్టఁగ వలసెన్= ఇంత జరుగవలసి వచ్చింది.

తాత్పర్యం: 'తన కొడుకైన అశ్వత్థామ కన్నా మిన్నగా నన్నాదరించి చదువు చెప్పాడు. అటువంటి గురువుగారినే ఎదుర్కొనవలసి వస్తున్నది. ఇది రాజధర్మంలోని కీడు. దాని మూలాన ఇట్లా చేయవలసి వస్తున్నది.

విశేషం: ద్రోణుడు తన కుమారుడైన అశ్వత్థామకంటె శిష్యుడైన తన పట్ల అభిమానాన్ని అధికంగా చూపేవాడని అర్జునుడు పేర్కొనటంవలన ఆ గురుశిష్యుల ఆత్మీయ సంబంధం సూచించబడింది. ద్రోణుడు బ్రహ్మశిరోనామక మహాస్త్రాన్ని అర్జునాశ్వత్థామల కిరువురి కిచ్చినా, అశ్వత్థామకు ఉపసంహారం చెప్పలేదు. శిష్యుడికి మాత్రమే చెప్పాడు. అటువంటి వాత్సల్యమూర్తి అయిన గురుమూర్తిపై కోదండం ఎత్తవలసి వచ్చినందుకు అర్జునుడు విచారించాడు. కాని, రాజధర్మాన్ని అనుసరించి యుద్ధం చేయక తప్పటం లేదని పేర్కొన్నాడు. అర్జునుడి అంతస్సంఘర్షణను చిత్రించిన పద్య మిది. 'రాచధర్మము' అనే పాఠం కంటె 'రాజధర్మము' అనే పాఠం ఉచితమని కొందరంటారు. రాచధర్మము- వైరి సమాసం కాదు. సిరివల్లభుఁడు వంటి మిశ్ర సమాసం. ఉభయంబులు గూడినవి మిశ్రము. కేవల సంస్కృత శబ్దం (విభక్తి ప్రత్యయం చేరని సంస్కృత శబ్దం, వికృతి శబ్దంతో సమసించినచో - అది దుష్ట(వైరి) సమాసం. అనేక మాఱులు - అల్పదండు వంటిది. 'రాచగుణంబు పోవిడిచి రాజ్యము గోల్పడి'... రా.యు.కాం. ప్రయోగం. అక్కడ రాజ- అని మారిస్తే ప్రాసమైత్రి చెడుతుంది. (సంపా.)

చ. ఎదురుగఁ బోవ నిమ్ము రథ మీతని తేరికి' నన్న నాతఁడుం
బదిలముతోడ రథ్యముల పగ్గము లేడ్తెఱ నూలుకొల్పి యు
న్మదగతి నట్ల చేసిన నమానుషవిక్రముఁ డైన ద్రోణుఁడుం
గదిసి యిభం బిభంబుఁ జెనకం జనుదెంచిన లీల వచ్చినన్. **121**

ప్రతిపదార్థం: రథము= మన రథాన్ని; ఈతని తేరికిన్= ఈయన రథానికి; ఎదురుగన్= ఎదురుగా; పోవనిమ్ము= పోనిమ్ము; అన్నన్= అనగా; ఆతఁడున్= ఆ ఉత్తరుడును; పదిలముతోడన్= జాగ్రత్తగా; రథ్యముల= గుర్రాలయొక్క; పగ్గములు= త్రాళ్ళు (కళ్ళెములు); ఏడ్తెఱన్= పరాక్రమంతో; నూలుకొల్పి= అంగీకరింప జేసి; ఉన్మదగతిన్= గర్వంతో కూడిన రీతితో; అట్లు+అ చేసినన్= అర్జునుడు చెప్పినట్లు చేయగా; అమానుష విక్రముఁడు+ఐన= మనుష్యులకు మించిన పరాక్రమం కలవాడైన; ద్రోణుఁడున్= ద్రోణుడు కూడా; కదిసి= సమీపించి; ఇభంబు+ఇభంబున్= ఏనుగు ఏనుగును; చెనకన్= ఎదుర్కొనటానికి; చనుదెంచినలీలన్= వచ్చినట్లుగా; వచ్చినన్= రాగా.

తాత్పర్యం: మన రథాన్ని అతడి కెదురుగా పోనిమ్ము' - అనగానే ఉత్తరుడు మెల్లగా గుర్రాల పగ్గాలను లాగి చెప్పినట్లు చేశాడు. ద్రోణుడు మనుష్యులకు మించిన పరాక్రమం కలవాడు. అతడు కూడా తన రథాన్ని ఎదురుగా తోలించి ఏనుగు ఏనుగును తలపడటాని కొక్కచోటికి చేరినట్లు రాగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

వ. నరుఁడు నమస్కరించి గురున కిట్లనియె. **122**

తాత్పర్యం: అర్జునుడు తన గురువైన ద్రోణాచార్యులకు నమస్కరించి ఇట్లా అన్నాడు.

క. 'అడవులఁ బెద్దయుఁ గాలం । బిడుమలఁ గుడిచితిమి; మాకు నిది దఱి యని యి
ప్పుడు వచ్చితిమి; విపన్నుల । యెడఁ గృప సేయుటయ లెస్స; యీ రలుగకుఁడీ! 123

ప్రతిపదార్థం: అడవులన్= అడవులందు; పెద్దయున్+కాలంబు= చాలా కాలం; ఇడుమలన్= బాధలను; కుడిచితిమి= అనుభవించాము; మాకున్= మాకు; ఇది; తఱి= సమయం; అని; ఇప్పుడు= ఈ సమయంలో; వచ్చితిమి= వచ్చాము; విపన్నుల+ఎడన్= విపత్తును పొందినవారి పట్ల; కృప+చేయుట+అ= దయ చూపుటే; లెస్స= మంచిది; ఈరు= మీరు; అలుగకుఁడీ! = కోపించకండి.

తాత్పర్యం: 'ఆచార్యా! అడవులలో పెక్కు కష్టాలను అనుభవించి, ఇది తగిన సమయమని భావించి వచ్చాం. విపత్తు పొందినవారిపట్ల దయచూపుటే మంచిది. మీరు నాపట్ల కోపం ప్రదర్శించవద్దు.

అర్జునుఁడు ద్రోణాచార్యులతో యుద్ధంబు సేయుట (సం. 4-53-1)

క. మును వెఱతు నేయ మీరలు । నను నేసినఁ గాని' యనుడు నాకేశసుతున్
ధనురాచార్యుం డిరువది । సునిశిత బాణముల నేసెఁ జూపఱు వొగడన్. 124

ప్రతిపదార్థం: మీరలు= మీరు; ననున్= నన్ను; మును= ముందుగా; ఏసినన్+కాని= బాణాలతో కొట్టినగాని; ఏయన్= వేయుటకు; వెఱతున్= జంకుతాను; అనుడున్= అనగా; ధనున్+ఆచార్యుండు= ద్రోణాచార్యుడు; నాకేశసుతున్= అర్జునుడిని; ఇరువది సునిశితబాణములన్= ఇరవై వాడి బాణాలతో; చూపఱు= చూచేవారు; పొగడన్= కీర్తించగా; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: మీరు ముందుగా నన్ను బాణాలతో కొట్టితేనే కాని మీమీద బాణాలు వేయటానికి జంకుతున్నాను' అని అర్జునుడు అనగానే ద్రోణుడు చూచేవాళ్ళు పొగడే విధంగా అతడిపై ఇరవై వాడిబాణాలను వేశాడు.

ఆ. అర్జునుండు వాని నన్నింటి నడుమన । తునియ నేయుటయును ద్రోణుఁ డడరి
శతసహస్ర సంఖ్య శరములు గప్పిన । నతఁడు నతనిఁ గప్పెఁ బ్రతిశరముల. 125

ప్రతిపదార్థం: అర్జునుండు= అర్జునుడు; వానిన్+అన్నిటిన్= ఆ బాణాలనన్నింటిని; నడుమన్+అ= మధ్యలోనే; తునియన్= ముక్కలయ్యేటట్లు; ఏయుటయును= వేయగా; ద్రోణుఁడు; అడరి= అతిశయించి, విజృంభించి; శతసహస్రసంఖ్య శరములు= వందలు వేలుగా బాణాలు; కప్పినన్= కప్పగా; అతఁడున్= అర్జునుడును; అతనిన్= ద్రోణుడిని; ప్రతిశరములన్= ఎదురు బాణాలతో; కప్పెన్= కప్పివేశాడు.

తాత్పర్యం: అర్జునుడు ద్రోణుడి బాణాలను మధ్యలోనే త్రుంచి వేశాడు. దాంతో ద్రోణుడు విజృంభించి వందలు వేల బాణాలతో అర్జునుడిని కప్పివేశాడు. అర్జునుడు కూడా అట్లే ద్రోణుడిని ఎదురు బాణాలతో కప్పివేశాడు.

చ. అతిరథు లస్త్రశస్త్రవిదు లద్భుతబాహుబలుల్ పరాక్రమో
ర్జితయశు లిట్లు దాఁకి గురుశిష్యులు కౌరవసేనలోని భూ
పతిసుతకోటికిన్ వెఱఁగుపా టొనరించిరి బాణజాల సం
వృత గగనాంగణంబగు నవీన మహాహవ విక్రమంబునన్. 126

ప్రతిపదార్థం: అతిరథులు= రథారూఢులైన అనేకమంది రథికులైన, ధానుష్కులతో ఒకేసారి యుద్ధం చేయగలవారు; అస్త్రశస్త్రవిదులు= మంత్రసహిత బాణాలను, సామాన్య బాణాలను ప్రయోగించటం తెలిసినవారు; అద్భుత= ఆశ్చర్యకరమైన; బాహుబలుల్= బాహుబలం కలవారు; పరాక్రమ= పౌరుషంచేత కలిగిన; ఊర్జిత= గొప్పదైన; యశులు= కీర్తి కలవారు; గురుశిష్యులు= గురువును శిష్యుడును; ఇట్లు= ఈ రీతిగా; తాఁకి= ఎదుర్కొని; కౌరవసేనలోని= కౌరవుల సేనలో ఉన్న; భూపతిసుతకోటికిన్= రాజపుత్ర సముదాయానికి; బాణజాల= బాణాల సమూహమనెడి వలచేత; సంవృత= కప్పబడిన; గగన+అంగణంబు+అగు= ఆకాశమనేదానికి కలిగిన; నవీన= క్రొత్తరకపు; మహా+ఆహవ= ఘోరయుద్ధ మనెడి; క్రమంబునన్= పరాక్రమంతో; వెఱఁగుపాటు= ఆశ్చర్యాన్ని; ఒనరించిరి= కల్గజేశారు.

తాత్పర్యం: అతిరథులు, శస్త్రాస్త్రవేత్తలు, గొప్ప బాహుబలం కలవారు, కేవలం పరాక్రమంతోనే కీర్తిని సంపాదించిన వారూ అయిన ఆ గురుశిష్యులు ఒకరి నొక రెదుర్కొని శస్త్రాస్త్రాల సమూహంతో ఆకాశాన్నే కప్పివేయగా కౌరవసేనలోని కురుకుమారులందరూ ఆ ఇరువురి కొంగ్రొత్త పరాక్రమ స్ఫూర్తికి ఆశ్చర్యచకితులైపోయి నిలబడి చూడసాగారు.

విశేషం: జనకజన్యరసాలైన వీరాద్భుతాలను వరుసగా వీరుల నాశ్రయించి, ప్రేక్షకుల నాశ్రయించి జనించినట్లు వర్ణించి, రెండింటి అనుభవాలను పఠితలు పొందేటట్లు వర్ణించే పద్ధతి తిక్కన యుద్ధవర్ణనలలో సర్వసామాన్యం. (సంపా.)

వ. అట్టి యెడం గురుసైన్యంబు జనంబులు. 127

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో; కురుసైన్యంబు= కౌరవసేనలోని; జనంబులు= జనులు.

తాత్పర్యం: ఆ సమయంలో కౌరవసేనలో ఉన్న జనులు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'గురుఁ డొక్కరుండు దక్కఁగ । నరుఁడు గడఁగినపుడు మార్కొనం జాపధరుం
డొరుఁడు గలఁడె! మఱి వెదకిన । హరుఁడు గలం; డింకఁ గలుగు ననరా దెందున్. 128

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; కడఁగిన+అపుడు= తాకినపుడు; మార్కొనన్= ఎదుర్కొనటానికి; గురుఁడు= ద్రోణుడు; ఒక్కరుండు తక్కఁగన్= ఒక్కడు తప్పి; ఒరుఁడు= మరొక; చాపధరుండు= విల్లు పట్టినవాడు; కలఁడె= ఉన్నాడా?; మఱి= ఇంకన్; వెదకినన్= వెదుకగా; హరుఁడు= శివుడు; కలండు= ఉన్నాడు; ఎందున్= ఎక్కడైనా; ఇంకన్= ఇంక; కలుగున్+అనరాదు= ఉండుననటానికి వీలులేదు.

తాత్పర్యం: 'అర్జునుడు యుద్ధం చేయటానికి పూనుకొంటే అతడిని ఎదుర్కొనటానికి ద్రోణుడు తప్ప సమర్థుడైన ధనుర్ధారి మరెవ్వడు లేడు. బాగా వెదికితే శివు డుండ వచ్చును. అంతేకాని మరెక్కడా మరొక'రున్నారనటానికి వీలు లేదు.

క. ద్రోణుఁడు రయమున నేసిన । బాణము లెడతెగక యొక్క బాణమ పోలెన్
శ్రేణి యయి వోవఁ బార్థుఁడు । రేణువు గావించుఁ గంటిరే చిత్రగతిన్? 129

ప్రతిపదార్థం: ద్రోణుఁడు= ద్రోణాచార్యులు; రయమునన్= వేగంగా; ఏసిన= వేసిన; బాణములు= బాణాలు; ఎడతెగక= మధ్యలో విచ్ఛిత్తిలేక; ఒక్కబాణము+అ+పోలెన్= ఒకేబాణం వలెనే; శ్రేణి+అయి= పంక్తిగా; పోవన్= పోవగా; పార్థుఁడు= అర్జునుడు; చిత్రగతిన్= విచిత్రమైన పద్ధతిని; రేణువు= నుగ్గుగా; కావించున్= చేస్తున్నాడు; కంటిరే?= చూచారా?

తాత్పర్యం: ద్రోణుడు వేగంగా వేసే బాణాలు ఒకే బాణమా అన్నట్లు పంక్తిగా వెళ్ళుతూ ఉంటే అర్జునుడు వాటిని పొడిపొడి చేస్తున్నాడు. చూచారా ఈ విచిత్రాన్ని!

విశేషం: అలం: అతిశయోక్తి.

క. గురుశరములు సితపక్ష । స్ఫురణంబున నంచపిండు పొలుపు వహించెన్;
నరుబాణతతి ఘనావలి । కరణి మిగుల నొప్పె నల్లగఱుల చెలువునన్.' 130

ప్రతిపదార్థం: గురుశరములు= ద్రోణాచార్యుడి బాణాలు; సితపక్ష= తెల్లని రెక్కలయొక్క; స్ఫురణంబునన్= ప్రకాశంతో; అంచపిండు పొలుపు= హంసల సముదాయం వంటి అందాన్ని; వహించెన్= పొందాయి; నరు బాణతతి= అర్జునుడి బాణ సముదాయాలు; నల్లగఱుల= నల్లని రెక్కలయొక్క; చెలువునన్= ప్రకాశంతో; ఘన+ఆవలికరణిన్= మబ్బుల సముదాయం వలె; మిగులన్= మిక్కిలి; ఒప్పెన్= ప్రకాశించాయి.

తాత్పర్యం: తెల్లని రెక్కలు కట్టిఉన్న ద్రోణాచార్యుడి బాణాలు హంసల గుంపుల వలె ప్రకాశిస్తే, నల్లనిరెక్కలు కట్టి ఉన్న అర్జునుడి బాణాలు మేఘాల సముదాయంవలె ప్రకాశించాయి.'

విశేషం: అలం: ఉపమ. బాణాలకు వెనుక భాగంలో పక్షుల రెక్కలు కట్టటం పరిపాటి. అవి గాలికి ఎదురుగా దూసుకొనిపోవటానికి తోడ్పడతాయి. ద్రోణుడి బాణాలు తెల్లని పక్షుల రెక్కలతో రాణించటంతో అవి హంసలవలె భాసించాయి. అర్జునుడి బాణాలు నల్లని పక్షుల రెక్కలతో కూడి ఉండటంతో అవి మేఘాలవలె కనపడ్డాయి. హంసలు వర్షాకాలంలో విహరించలేవు. విహరించినా మనలేవు. అందువలన ద్రోణుడి బాణాలు వృథా కానున్నాయని అలంకారధ్వని. (సంపా.)

వ. అనుచుం గనుం గొనుచుండ. 131

ప్రతిపదార్థం: అనుచున్= అని పలుకుతూ; కనుంగొనుచున్+ఉండన్= చూస్తూ ఉండగా.

తాత్పర్యం: అట్లా పలుకుతూ చూస్తూ ఉండగా.

శా. శ్రావ్యంబై చెలఁగన్ గభీర మధుర జ్యానాద ముద్దామ వీ
రవ్యాపార నిరూఢతం బ్రతిశరారంభంబు మర్దించుచున్
సవ్యప్రౌఢి దృఢాపసవ్యగతి నాశ్చర్యంబుగా నేయుచున్
దివ్యాస్త్రంబులఁ బోరి రిద్దఱును సాదృశ్యం బదృశ్యంబుగన్. 132

ప్రతిపదార్థం: గభీర= గంభీరమైన; మధుర= వినసింపైన; జ్యానాదము= అల్లెత్రాడుల ధ్వని; శ్రావ్యంబు+ఐ= వినటానికింపైనదై; చెలఁగన్= ధ్వనించగా; ఉద్దామ= గొప్పదైన; వీర= వీరులయొక్క; వ్యాపార= క్రియలయందలి; నిరూఢతన్= నేర్పుతో; ప్రతిశర= ఎదుటివారి బాణాల యొక్క; ఆరంభంబు= పనిని; మర్దించుచున్= నాశనం చేస్తూ; సవ్యప్రౌఢిన్= ఎడమచేతి ప్రౌఢిమతోను; దృఢ+అపసవ్య= గట్టిదైన కుడిచేతియొక్క; గతిన్= గమనంతో; ఆశ్చర్యంబుగాన్= చూచేవారికి ఆశ్చర్యం కలిగేటట్లుగా; ఏయుచున్= కొట్టుతూ; ఇద్దఱును= ద్రోణార్జును లిరువురును; దివ్య+అస్త్రంబులన్= దివ్యమైన మంత్రావిష్ట బాణాలతో; సాదృశ్యంబు= పోలిక; అదృశ్యంబుగన్= కనబడకుండేటట్లుగా; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: ఆ ద్రోణార్జును లిరువురును వారి అల్లెత్రాడుల చప్పుడు శ్రావ్యంగా ఉండేటట్లు సవ్యాపసవ్యాలుగా బాణాలు ప్రయోగిస్తూ, ఇద్దరూ సమంగా ఉన్నారో, లేక, వారి నడుమ తేడా ఉన్నదో అనే తారతమ్యం తెలిసికొనటానికి వీలు లేనంతగా దివ్యాస్త్రాలతో యుద్ధం చేశారు.

విశేషం: అలం: అసంభవోపమ. 1. ఈ పద్యం తిక్కన శిల్పరమణీయ సృష్టికి ఒక చక్కని ఉదాహరణం. ఇందులో శ్రావ్యంగా మ్రోగింది గంభీర మధుర జ్యానాదం. ముద్రాలంకార సుందరంగా స్వీయ కవితాలక్షణాలను తిక్కన వ్యంజింప చేశాడు. తిక్కనది అర్థగుణ ప్రధానరచన. అది శ్రావ్యంగా, గంభీరంగా, మధురంగా మ్రోగిన గుణశబ్దాల వర్ణనం ద్వారా సూచించాడు. పృథక్పదత్వం శబ్దగుణ మాధుర్యం, ఉక్తివైచిత్ర్యం అర్థగుణ మాధుర్యం. మధురగుణానికి గాంభీర్యగుణం తోడుకావటంచేత అర్థప్రౌఢిని ప్రదర్శించే అర్థగుణమైన ఓజస్సు మాధుర్యానికి పోషకంగా నిలుపబడిందని సూచన. శ్రావ్యత ప్రసాద లక్షణం. బంధ శైథిల్యం అటు మాధుర్యాన్నీ, అర్థ వైమల్యం ఇటు ఓజోగుణాన్నీ పోషించే ఒక ప్రౌఢ గుణ సంవిధానం ఈ పద్యరచనకు జీవం.

2. ఈ పద్యం పరుషరసమైన వీరరస ప్రధానమైనా, బాణ ప్రయోగం గుణశబ్ద మాధుర్యం చేత శ్రావ్యమై చెలగటం చేత రచన సమాసభూయిష్ఠం కాక పృథక్పదత్వాన్నే వరించింది. ఇద్దరూ దివ్యాస్త్రాలను ప్రయోగించారు. ఒకరు దివ్యాస్త్రాన్ని ప్రయోగించగానే అది విజృంభించక పూర్వమే మరొకరు దానిని మర్దిస్తున్నారు. అందువలన అస్త్రాల ఆర్భాటంకంటె అల్లెత్రాటి శ్రావ్యనాదం నిరంతరంగా వినిపిస్తున్నది. అపూర్వంగా ఇద్దరు వీరులూ సవ్యాపసవ్యాలుగా బాణాలను సమబలంతో వేస్తున్నారు. అది నిజంగా అపూర్వం, ఆశ్చర్యకరం. వారిద్దరిని గానీ, వారిద్దరూ చేస్తున్న యుద్ధాన్నిగాని మరే ఉపమానంతో పోల్చాలని కవి భావించినా, ఆ ఉపమానమే అదృశ్యమై పోయిందని ఉక్తి వైచిత్ర్యం ప్రదర్శించాడు తిక్కన.

3. 'ఉద్దామ వీర వ్యాపార నిరూఢత'ను 'ప్రతిశరారంభంబు మర్దించటం'గా వర్ణించి అర్థవైమల్యాన్ని (అర్థగుణమైన ప్రసాదాన్ని) పోషించటం సవ్యప్రౌఢి, దృఢాపసవ్యగతి - అనటంలో సవ్యప్రయోగంలో ఎంత ప్రౌఢి ఉంటుందో, అపసవ్య ప్రయోగంలో కూడా అంత దృఢత్వం ఉండటం చూచేవారికి ఆశ్చర్యజనకంగా కనపడిన గుణమని - అర్థగుణమైన ఓజస్సును నిబంధించటం తిక్కన శిల్పం. గుణవద్రచనలో గుణధ్వనిని రసవ్యంజకంగా చిత్రించిన పద్యశిల్ప మిది. (సంపా.)

వ. ఇంద్రాగ్ని వాయు వరుణ దైవత్యంబులగు శరంబులు గురుం డేసిన, నరుండును దత్తద్దేవతాకంబు లగునంబ కంబులఁ బ్రతిహతంబులు సేయుచు వచ్చె; నయ్యిరువురుఁ బెల్లేయు సాయకంబు లంతరిక్షంబున దళంబై సంతమసంబు గలిగి యునికి నేబాణం బెక్కడఁ బాఱుటయుం దోఁప కుండె; నట్టియెడఁ గుంభసంభవు బలంబు సరభసంబుగా నతని కడ్డంబు సొచ్చిన వివ్వచ్చుండు వ్రేల్మిడిం బొడిసేసి సకేయూరంబు లగు బాహుదండంబులను సకుండలంబు లగు కర్ణపాశంబులను సకిరీటంబులగు శిరోభాగంబులను భూభాగం బలంకరించి యప్పు డావహిల్లిన రుధిరసాగరంబునకు రత్నాకరత్వం బలవరించె; నిట్లు దుర్జయుండగు నర్జునుండు సైన్యంబు దైన్యంబు నొందించుచు నాచార్యునకు భరంబుగ నేట్లాడుచున్నం జూచి గురుండు విస్మితుండై. 133

ప్రతిపదార్థం: ఇంద్ర+అగ్ని, వాయు, వరుణ, దైవత్యంబులు+అగు= ఇంద్రుడు, అగ్ని, వాయువు, వరుణుడు దేవతలుగా కలిగిన; శరంబులు= అస్త్రాలు; గురుండు= ద్రోణాచార్యుడు; ఏసినన్= వేయగా; నరుండును= అర్జునుడు కూడా; తద్+ తద్+దేవతాకంబులు+అగు= ఆయా దేవతలుకల; అంబకంబులన్= బాణాలతో; ప్రతిహితంబులు= త్రిప్పికొట్టబడినవిగా; చేయుచున్+వచ్చెన్= చేస్తూ ఉన్నాడు; ఆ+ఇరువురున్= ఆ ద్రోణార్జును లిరువురున్నూ; పెల్లు+ఏయు= ఎక్కువగా ప్రయోగిస్తున్న;

సాయకంబులు= బాణాలు; అంతరిక్షంబునన్= ఆకాశంలో; దళంబు+ఐ= ఒత్తుగా ఉండి; సంతమసంబు= కారుచీకటి; కలిగియునికిన్= కలిగిఉన్నందున; ఏ బాణంబు= ఏ బాణము; ఎక్కడన్= ఎక్కడికి; పాఱుటయున్= వెళ్ళుతున్నదీ; తోఁపకుండెన్= తెలియకున్నది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; కుంభసంభవు= ద్రోణుడియొక్క; బలంబు= సేన; సరభసంబుగాన్= తొందరగా; అతనికిన్= ద్రోణుడికి; అడ్డంబు= అడ్డంగా (రక్షగా); చొచ్చినన్= ప్రవేశించగా; వివ్వచ్చుండు= అర్జునుడు; వ్రేల్మిడిన్= వెంటనే; పొడి+చేసి= నుగ్గుచేసి; సకేయూరంబులు+అగు= భుజకీర్తులతో కూడిన; బాహు దండంబులను= కర్రలవంటి బాహువుల చేతను; సకుండలంబులు+అగు= కుండలాలతో కూడిన; కర్ణపాశంబులను= (పాశశబ్దము కర్ణపూర్వక మయినప్పుడు శోభార్థకము. కర్ణపాశః= సుకర్ణః) అందమైన చెవులచేతను; సకిరీటంబులు+అగు= కిరీటాలతో కూడిన; శిరోభాగంబులను= శిరస్సుల చేతను; భూభాగంబు= భూమిని; అలంకరించి= అలంకరించి; అప్పుడు= ఆ సమయంలో; ఆవహిల్లిన= ఏర్పడిన; రుధిరసాగరంబునకున్= రక్తమనెడి సముద్రానికి; రత్నాకరత్వంబు= రత్నాలకు నిధి అగుటను; అలవరించెన్= కల్గజేశాడు; ఇట్లు= ఈ రీతిగా; దుర్జయుండు+అగు= జయింప శక్యంకాని; అర్జునుండు= అర్జునుడు; సైన్యంబున్= సేనను; దైన్యంబున్+ ఒందించుచున్= దీనదశ కలదిగాచేస్తూ; ఆచార్యునకున్= గురువైన ద్రోణునకు; భరంబుగన్= బరువుగా; ఏట్లాడుచున్నన్= యుద్ధం చేస్తూఉండగా; చూచి= కన్గొని; గురుండు= ద్రోణుడు; విస్మితుండు+ఐ= ఆశ్చర్యం కలవాడై.

తాత్పర్యం: ద్రోణుడు ఇంద్ర, వరుణ, అగ్ని, వాయు దేవతాకములైన అస్త్రాలు ప్రయోగించగా, అర్జునుడు అవే దేవతాకములైన అస్త్రాలతో వాటిని త్రిప్పికొట్టాడు. వారిద్దరూ వేసే బాణాలు దట్టంగా ఉండటం మూలాన ఆకాశంలో కారుచీకట్లు క్రమ్ముకొని పోయి ఏ బాణం ఎటు వస్తున్నదో, ఎటు పోతున్నదో తెలియకుండా అయిపోయింది. అంతలో ద్రోణుడి సేనలు ద్రోణుడికి సాయంగా అడ్డంగా వచ్చాయి. అర్జునుడు వెంటనే ఆ సేనలను పీనుగు పెంటలు చేశాడు. భుజకీర్తులతో బాహువులు, కుండలాలతో చెవులు, కిరీటాలతో తలలు పడిపోయి అది రక్తసముద్రమైతే వీటితో రత్నాకరం కూడా అయింది. ద్రోణుడు అర్జునుడి యుద్ధం చూశాడు. తన సేన దైన్యం పొందింది. తనకా యుద్ధం బరువౌతున్నది. అర్జునుడు దుర్జయు డనిపించింది. ఆశ్చర్యపోయాడు.

విశేషం: అలం: పర్యాయం. **"పర్యాయో యది పర్యాయేణైక స్యానేక సంశ్రయః"**. ఒక వస్తువుకే ఒకదాని తరువాత మరొకటిగా అనేకాశ్రయాలను వర్ణిస్తే పర్యాయాలంకారం. ఇందులో అర్జునుడు సైనికులను బాణాలతో ఖండించగా వారి శరీరాంగాలు రక్తపుమడుగులలో పడి కేయూరాలు, కుండలాలు, కిరీటాలూ మొదలైన ఆభరణాలలో రాణిస్తున్నాయి. రక్తపుమడుగే సముద్రంగా ఉంటే, ఈ రత్నాభరణాలు ఆ సముద్రానికి రత్నాకరత్వాన్ని కలిగిస్తున్నాయని చమత్కారం. రుధిర సాగరం, మహాసాగరం, రత్నాకరం - అనే భావచిత్రాల చలనచిత్రాన్ని ఒకే స్థిరచిత్రంమీద దర్శింప చేసిన ఈ రచనాశిల్పం పర్యాయమనే అలంకారం వలన సాధించబడింది. జుగుప్సాకరమైన సన్నివేశాన్ని అలంకరించి ఆస్వాద సుందరంగా మార్చే శిల్ప మిది. తిక్కన 'అలంకరించి' అనే క్రియలో తన ముద్ర వేసికొన్నాడు. (సంపా.)

క. **'అర్జునుని నాహవంబున । నిర్జింపఁగ నగునె ఫాలనేత్రున కైనం?**
బర్జన్యసుతుఁడు శరవ । ర్షోర్జితమూర్తి యగు టరయ నుచితమ కాదే!' **134**

ప్రతిపదార్థం: అర్జునునిన్= అర్జునుడిని; ఆహవంబునన్= యుద్ధంలో; నిర్జింపఁగన్= జయించటానికి; ఫాలనేత్రునకున్+ఐనన్= శివుడికైనా; అగునె?= వీలగునా?; పర్జన్యసుతుఁడు= ఇంద్రుని కొడుకైన అర్జునుడు; శరవర్ష= బాణ వర్షంతో; ఊర్జితమూర్తి= దృఢమైన (సమృద్ధమైన) మూర్తికలవాడు; అగుట= అయి ఉండటం; అరయన్= చూడగా; ఉచితము+అ కాదే!= తగినదే కదా!.

తాత్పర్యం: 'అర్జునుడిని యుద్ధంలో శివుడైనా గెలువగలడా? అతడు పర్జన్యుని సుతుడు కనుక ఊర్జితమూర్తి అయి శరవర్షం కురిపించటం తగినట్లుంటున్నది కదా!'

విశేషం: అలం: పరికరాంకురం. ఇందులోని విశేష్యాలన్నీ సార్థకాలే. అర్జునుడు పర్జన్యసుతుడు. అంటే- మేఘాధిపతి అయిన ఇంద్రుడి కుమారుడు, అందువలననే అతడు 'శరవర్షోర్జితమూర్తి'. వర్షం అగ్నిని ఆర్పగలగటం సహజం. అందువలన అగ్నినే ఫాలనేత్రంగా కల ఈశ్వరుడు సైతం అర్జునుడితో యుద్ధం చేయడానికి భయపడతాడు. శివుడి తిరుగులేని ఆయుధం మూడవకంటి మంట. దానిని కూడా చల్లార్పగలిగిన పౌరుషం కలవా డర్జునుడని అలంకారధ్వని. పరికరాంకురం ఆ ధ్వనికి మూలమైనది ఈ పద్యంలో. (సంపా.)

వ. అని మఱియును దగిన పలుకుల నగ్గింప, నిలింపనికరంబు. 135

ప్రతిపదార్థం: అని= పలికి; మఱియును= ఇంకా; తగినపలుకులన్= తగిన మాటలతో; అగ్గింపన్= పొగడగా; నిలింప నికరంబు= దేవతల సమూహం.

తాత్పర్యం: ద్రోణు డింకా తగినట్లు పొగడుతూ ఉన్నాడు. అంతలో పైనున్న దేవతలు. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. 'ఇంతప్రొద్దు కిరీటి కట్టెదుర నిలువ । వెఱవ కున్నప్డు ద్రోణుండ వింటివాఁడు
నల్లవో తన యున్న సేనకు నొకండ । బలిమిఁ దలమీఁఱునే? యిట్లు నిలువ వలదె!' 136

ప్రతిపదార్థం: ఇంతప్రొద్దు= ఇంతసేపు; కిరీటికట్టెదురన్= అర్జునుడి ఎదుట; నిలువన్= నిల్చుటకు; వెఱవక+ఉన్నప్డు= భయపడనప్పుడే; ద్రోణుండు+అ= ద్రోణుడే; వింటివాఁడు= ధనుర్ధారి; తన+ఉన్న సేనకున్= తన సేనకు; ఒకండు+అ= ఒక్కడే; బలిమిన్= బలంతో; తలమీఁఱునే?= తలకు మించునా?; ఇట్లు= ఈ రీతిగా; నిలువవలదె?= ఎదురు నిలువద్దా?; అల్లవో= అదే, ఆశ్చర్యం!.

తాత్పర్యం: 'ఇంతసేపు అర్జునుడి ఎదుట నిలిచి పోరాటానికి భయపడకుండా ఉండటంచేత ద్రోణుడే విలుకాడు!. తన సేనకు తా నొక్కడే ముందు మీరుతాడు. ఇట్లా నిలువగలగాలి. ఇది ఆశ్చర్యం కలిగిస్తున్నది!.'

మ. అనుచుండం ద్రిదశేంద్రసూనుఁడు రయం బత్యంత ఘోరంబుగా
ఘనశాతోజ్జ్వల దుర్నివార విలసత్కాండంబులన్ ద్రోణు వా
హన సూతధ్వజ దేహముల్ వొదివె; ని ట్లస్త్రాబ్ధి నిర్మగ్నుఁ జే
సిన హాహా నినదంబు లొక్క మొగిఁ బేర్చెన్ సర్వసైన్యంబులన్. 137

ప్రతిపదార్థం: అనుచున్+ఉండన్= దేవతలు ఇట్లా అనుకొంటూ ఉండగా; త్రిదశ+ఇంద్ర సూనుఁడు= అర్జునుడు; రయంబు= వేగం; అత్యంత= మిక్కిలి; ఘోరంబుగాన్= తీవ్రం కాగా; ఘన= గొప్పవైన; శాత= వాడియైన; ఉజ్జ్వల= ప్రకాశించే; దుర్నివార= నివారించరాని; విలసత్= ప్రకాశించే; కాండంబులన్= బాణాలతో; ద్రోణు= ద్రోణుడియొక్క; వాహన= గుఱ్ఱాలను; సూత= సారథిని; ధ్వజ= జెండాను; దేహముల్= దేహమును; పొదివెన్= కప్పివేశాడు; ఇట్లు= ఈ రీతిగా; అస్త్ర+అబ్ధి= అస్త్రములనెడి సముద్రంలో; నిర్మగ్నున్= మునిగినవాడినిగా; చేసినన్= చేయగా; సర్వసైన్యంబులన్= అందరి సైన్యాలలోనూ; హాహా నినదంబులు= హాహాకారాలు, భయంతో నిండిన అరుపులు; ఒక్కమొగిన్= ఒక్కసారిగా; పేర్చెన్= అతిశయించాయి.

తాత్పర్యం: దేవత లట్లా అంటూండగానే అర్జునుడు మహావేగంగా, ఘోరంగా పెద్దవి, వాడివి, మరల్పలేనివి అయిన బాణాలతో ద్రోణుడి శరీరాన్ని, వాహనాలను, సారథిని, జెండాను అన్నిటిని కప్పివేశాడు. అది చూచి సేనలన్నీ ఒక్కసారిగా హాహాకారాలు చేశాయి.

విశేషం: అలం: రూపకం.

క. **ఈమెయి నిజజనకు భుజో। ద్దామబలము దోడుతోడఁ దఱుఁగుటయు రథ**
స్తోమంబుఁ దాను నశ్వ। త్థామ వెసం దాఁకె బాండుతనయుని తోడన్. **138**

ప్రతిపదార్థం: ఈమెయిన్= ఈ రీతిగా; నిజజనకు= తన తండ్రియొక్క; భుజ= భుజాల; ఉద్దామ= గొప్పదైన; బలము= పరాక్రమం; తోడుతోడన్= వెంబడిని; తఱుఁగుటయున్= తగ్గగా; రథస్తోమంబున్= రథాల సముదాయం; తానును= స్వయంగాను; అశ్వత్థామ; పాండుతనయుని తోడన్= అర్జునుడితో; వెసన్= వేగంగా; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: ఈ రీతిగా తన తండ్రి ద్రోణుడి భుజబలం వెంటవెంటనే తగ్గిపోవటం చూచిన అశ్వత్థామ తానే రథబలంతో కలిసి అర్జునుడిని ఎదుర్కొన్నాడు.

అర్జునుఁ డశ్వత్థామతో యుద్ధము సేయుట (సం. 4-53-65)

చ. **అతఁడును దీవ్రబాణముల నాతనిఁ గప్పుచు మాఱుకొన్న నా**
శతమఖవృత్ర సంగరము చందము దోఁచె వడిం జటచ్ఛటా
యిత రవ మప్డు వేణువుల నేర్చు దవానలు మ్రోఁత భంగి ది
క్తతిఁ బరఁగెన్ మహాద్భుతము కౌరవసేనకు నావహిల్లఁగన్. **139**

ప్రతిపదార్థం: అతఁడును= అశ్వత్థామ కూడా; తీవ్రబాణములన్= బలమైన బాణాలతో; ఆతనిన్= అర్జునుడిని; కప్పుచున్= కప్పివేస్తూ; మాఱుకొన్నన్= ఎదుర్కొనగా; ఆ శతమఖ వృత్ర సంగరము చందము= ఆ ఇంద్ర వృత్రాసురుల యుద్ధంరీతి; తోఁచెన్= స్ఫురించింది; అప్డు= అప్పుడు; వేణువులన్= బొంగు వెదుళ్ళను; ఏర్చు= దహించే; దవ+అనలు మ్రోఁత భంగిన్= దావాగ్ని ధ్వనివలె; దిక్తతిన్= దిక్కుల సమూహంలో; ఛటచ్ఛటా+ఆయిత రవము= చటచటమనే చప్పుడు; కౌరవసేనకున్= కౌరవుల సేనకు; మహత్+అద్భుతము= గొప్ప ఆశ్చర్యం; ఆవహిల్లఁగన్= కలుగునట్లుగా; పరఁగెన్= వ్యాపించింది.

తాత్పర్యం: ఎదుర్కొని అశ్వత్థామ తీవ్ర బాణాలతో అర్జునుడిని కప్పివేశాడు. వారి యుద్ధం ఇంద్ర వృత్రాసురుల యుద్ధాన్ని తలపించింది. ఆ యుద్ధంలో వచ్చిన చటచటమనే చప్పుడు దావాగ్నికి బొంగువెదుళ్ళు తగులబడుతుంటే వచ్చిన చప్పుడు వలె కౌరవసేనకు ఆశ్చర్యం కలిగే విధంగా దిక్కులంతటా వ్యాపించింది.

విశేషం: అలం: ఉపమ.

వ. **అట్టి యెడ.** **140**

తాత్పర్యం: అప్పుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **ఉఱక నరుండు ద్రోణసుతు యుగ్యములన్ వెస నొంచె; నాతఁడుం**
దెఱపి యొకింత గాంచి ఘనతీవ్రశరంబున నారిఁ ద్రుంచి, క
న్గిఱిపిన మాత్రలోన నతనిం బటుబాణ చతుష్కయుగ్మ మే
డ్తెఱఁ దొడి మౌర్విఁ గ్రమ్మఱ ఘటించునెడన్ వడి నేసి యార్చినన్. **141**

ప్రతిపదార్థం: నరుండు= అర్జునుడు; ద్రోణసుతు= అశ్వత్థామయొక్క; యుగ్యములన్= గుర్రాలను; వెసన్= వెంటనే; ఉఱక= లెక్కచేయక; నొంచెన్= నొప్పించాడు; ఆతఁడున్= అశ్వత్థామయును; ఒక+ఇంత= కొద్దిగా; తెఱపి= వ్యవధానం; కాంచి= చూచి; ఘన= గొప్పదైన; తీవ్ర= తీక్ష్ణమైన; శరంబునన్= బాణంతో; నారిన్= నారిని; త్రుంచి= తెంపి; కన్గిఱిపిన మాత్రలోనన్= కన్ను గీటినంతలోనే; అతనిన్= అర్జునుడిని; పటు= సమర్థమైన; బాణచతుష్కయుగ్మము= ఎన్మిది బాణములు; ఏడ్తెఱన్= విజృంభణంతో; తొడి= తొడిగి; మౌర్వి= నారి; క్రమ్మఱన్= మరల; ఘటించు+ఎడన్= కూర్చేటప్పుడు; వడిన్= వేగంగా; ఏసి= కొట్టి; ఆర్చినన్= కేకలుపెట్టగా.

తాత్పర్యం: అర్జునుడు వెంటనే అశ్వత్థామ గుర్రాలను నొప్పించాడు. అతడు కొంచెం సందు చూచుకొని వాడి బాణాలతో అర్జునుడి ధనుస్సు నారిని త్రుంచాడు. అర్జునుడు మరల నారిని బిగించుకొంటుండగా కనుగీటునంతలో ఎన్మిది బాణాలు సంధించి అతడిని వడిగా కొట్టి ఆర్వగా.

క. **'కురుసేనలోన ని ట్లె। వ్వరుఁ జేసినవారు లే; రవార్య భుజా వి**
స్ఫురణోదగ్రుండు గదే। గురుపుత్రుం' డనుచు నమరకోటి నుతించెన్. **142**

ప్రతిపదార్థం: కురుసేనలోనన్= కౌరవసేనలో; ఇట్లు= ఈ రీతిగా; చేసినవారు= చేసినవారు; ఎవ్వరున్= ఎవరును; లేరు; గురుపుత్రుండు= అశ్వత్థామ; అవార్య= వారింపరాని; భుజా= భుజములయొక్క; విస్ఫురణ+ఉదగ్రుండు= ప్రకాశంచేత గొప్పవాడు; కదే= కదా; అనుచున్= అని పల్కుతూ; అమరకోటి= దేవతల సమూహం; నుతించెన్= పొగడింది.

తాత్పర్యం: 'ఈ రీతిగా చేసినవారు కౌరవసేనలో ఎవరూ లేరు. అడ్డులేని భుజపరాక్రమం కలవాడు కదా ఈ అశ్వత్థామ' అని దేవతలు పొగడారు.

చ. **చిఱునగ వొప్ప గాండివము చెచ్చెర సజ్యము సేసి సేన లు**
క్కఱ రభసంబుమై నడరెఁ గవ్వడి ద్రౌణియు నీడఁబోక య
త్తఱిఁ దఱుమంగ నస్త్రములు దందడి మార్కొని మండుచుండెఁ జి
చ్చఱపిడుగుల్ వడిం దొరఁగు చాడ్పున నంబరవీథి నుగ్రమై. **143**

ప్రతిపదార్థం: కవ్వడి= అర్జునుడు; చిఱునగవు= చిరునవ్వు; ఒప్పన్= ప్రకాశించగా; గాండివము= గాండీవాన్ని; చెచ్చెరన్= వేగంగా; సజ్యము= నారితో కూడినదానిగా; చేసి; సేనలు= కౌరవసేనలు; ఉక్కు+అఱన్= బలం కోల్పోయేటట్లుగా; రభసంబుమైన్= తొందరగా; అడరెన్= విజృంభించాడు; ద్రౌణియున్= అశ్వత్థామకూడా; ఈడన్+పోక= వెనుదీయక; ఆ+తఱిన్= అప్పుడు; తఱుమంగన్= త్వరత్వరగా ప్రయోగింపగా; అస్త్రములు= బాణములు; దందడిన్= దొమ్మిగా; మార్కొని= ఎదుర్కొని; చిచ్చఱపిడుగులు= మంటలువెదజల్లే పిడుగులు; వడిన్= వేగంగా; తొరఁగు చాడ్పునన్= పడుతూవున్నట్లుగా; అంబరవీథిన్= ఆకాశంలో; ఉగ్రము+ఐ= భయంకరమై; మండుచున్+ఉండెన్= మంటలు మండుతున్నాయి.

తాత్పర్యం: అర్జునుడు వెంటనే చిరునవ్వుతో గాండీవపునారి బిగించగా సేనలశక్తి సన్నగిల్లింది. అశ్వత్థామ కూడా వెనుదియ్యక అస్త్రాలు వేయసాగాడు. అప్పుడు అవి మంటల పిడుగుల వలె ఆకాశవీధిలో ఒకదానితో ఒకటి ఎదుర్కొని మండుతూ ఉండినాయి.

విశేషం: అలం: ఉపమ.

వ. **ఇవ్విధంబున ధనంజయుండు రయంబున నేయ వేగంబున నేయు ద్రోణతనయు తూణీరంబులు శరశూన్యంబు లయ్యెఁ; దన తూణీరంబు లక్షయ బాణంబు లగుటం జేసి యంతకంతకు నతిశయిల్లు పెల్లున నేయుచు నధికుండగు నప్పాండవమధ్యముం గనుంగొని కృపాచార్యుండు సెంగటం దలమీఱిన.** **144**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ధనంజయుండు= అర్జునుడు; ఏయన్= బాణాలు ప్రయోగించగా; వేగంబునన్= వేగంతో; ఏయు= బాణాలు సంధించే; ద్రోణతనయు తూణీరంబులు= అశ్వత్థామయొక్క అమ్ములపొదులు; శరశూన్యంబులు= బాణాలు లేనివి; అయ్యెన్= అయ్యాయి; తన తూణీరంబులు= అర్జునుడి అమ్ములపొదులు; అక్షయబాణములు= క్షీణించని బాణాలు కలవి; అగుటన్+చేసి= అగుటవలన; అంతకున్+అంతకున్= క్రమక్రమంగా; అతిశయిల్లు పెల్లునన్= అతిశయించెడి ఉద్రేకంతో; ఏయుచున్= బాణాలు వేస్తూ; అధికుండు+అగు= మించినవాడైన; ఆ+పాండవ మధ్యమున్= ఆ అర్జునుడిని; కనుంగొని= చూచి; కృపాచార్యుండు= కృపుడు; చెంగటన్= ఎదురుగా; తలమీఱినన్= ఎదుర్కొనగా.

తాత్పర్యం: ఈ రీతిగా అర్జునుడు బాణాలు ప్రయోగించే వేగంతో అశ్వత్థామ కూడా బాణాలు వేస్తూ ఉంటే అతడి అమ్ములపొదిలోని బాణాలు ఖాళీ అయ్యాయి; అర్జునుడి అమ్ములపొదులు బాణాలు క్షీణించేవి కావు కనుక అత డంత కంతకు పెచ్చుపెరిగి బాణాలు వేస్తూ అశ్వత్థామను మించిపోయాడు. అది గమనించిన కృపుడు ఎదురుగా వచ్చి ఎదుర్కొనగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

అర్జునుఁడు కృపాచార్యునితో యుద్ధము సేయుట (సం. 4-52-1)

క. **గురుపుత్రుని రథము విడిచి । సరభసముగ నందు సవ్యసాచి గవియుడుం**
దిరమై యాతఁడు శితశర । పరంపరలు గురిసె నుగ్రబంధురగతులన్. **145**

ప్రతిపదార్థం: సవ్యసాచి= అర్జునుడు; గురుపుత్రుని రథము= అశ్వత్థామ రథాన్ని; విడిచి= విడిచిపెట్టి; అందున్= ఆ యుద్ధభూమిలో; సరభసముగన్= తొందరగా; కవియుడున్= ఎదుర్కొనగా; ఆతఁడు= కృపుడు; తిరమై= స్థిరంగా నిల్చి; శిత= వాడియైన; శర పరంపరలు= బాణాల వరుసలు; ఉగ్రబంధుర= భయంకరమైన; గతులన్= రీతులలో; కురిసెన్= కురిపించాడు.

తాత్పర్యం: కృపాచార్యుడు రాగా అర్జునుడు అశ్వత్థామ రథాన్ని విడిచిపెట్టి కృపుడిమీదికి పోగా, కృపుడు వాడి బాణాల పరంపరలు భయంకరంగా వివిధ రీతులలో కురిపించాడు.

వ. **పాండుపుత్రుండును జిత్రసంచారంబుల మెఱయుచు.** **146**

ప్రతిపదార్థం: పాండుపుత్రుండును= అర్జునుడు కూడా; చిత్రసంచారంబులన్= విచిత్రమైన రథగతులతో; మెఱయుచు(న్)= ప్రకాశిస్తూ.

తాత్పర్యం: పాండుపుత్రుడు కూడా విచిత్రమైన రథగతులతో ప్రకాశిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. పటు విశిఖపంక్తి యత్యు । త్కట రయమున నిగుడఁజేయఁగా నవ్విధ మూఁ
దుటయైన మండె దీప్తో । ద్భట భంగిఁ గృపానలంబు బలములు వొంగన్. 147

ప్రతిపదార్థం: పటు= గట్టివైన; విశిఖపంక్తి= బాణ పరంపర; అతి+ఉత్కట= మిక్కిలి ఎక్కువైన; రయమునన్= వేగంతో; నిగుడన్= వెడలేటట్లు; చేయఁగాన్= చేయగా; ఆ+విధము= ఆ రీతి; ఊఁదుట+ఐనన్= ఊదటం కాగా; కృపానలంబు= కృపుడనెడి అగ్ని; దీప్త= ప్రజ్వలించినదయి; బలములు= సేనలు; పొంగన్= సంతోషించగా; ఉద్భటభంగిన్= భయంకరమైన రీతిగా; మండెన్= రగిలింది.

తాత్పర్యం: అర్జునుడు బాణాలు నింపగా, అది ఊదరకొట్టినట్లయి సేనలు సంతోషించగా కృపుడనెడి అగ్ని మిక్కుటంగా రగిలింది.

విశేషం: అలం: రూపకం.

వ. ఇట్లు మండి శిఖిఁబోలెడి కనకలిప్త ఘనబాణంబు వనచర కేతువుం దాఁకించి వేఁడిమి సూపి వివిధాస్త్ర జ్వాలలు గవియించి దిక్కులు సెలంగ నార్చినం గోపంబున నాటోపంబు మిగిలి బలసూదనసూనుం డతని కేతనంబు దునిమి తరణి కిరణానుకార పారంగతంబు లగు నారాచంబులు దదీయాంగంబుల నినుపం దొడంగిన రథచక్రరక్షకు లగు చంద్రకేతుండును జిత్రాశ్వుండును మణిమంతుండును మంజుమౌళియు హేమవర్మయును సురథుండును సుషేణుండును నరిష్టుండును సుకేతుండును నుక్కు మెఱయ నొక్కటం దాఁకిన. 148

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; మండి= ప్రజ్వరిల్లి; శిఖిన్+పోలెడి= అగ్నివంటి; కనకలిప్త= బంగారుతో పూయబడిన; ఘన బాణంబు= గట్టిబాణం; వనచర కేతువున్= హనుమంతుడి గుర్తుగల జెండాను; తాఁకించి= తగిలేటట్లు కొట్టి; వేఁడిమి= తాపం; చూపి= చూపించి; వివిధ= పలు రకాలైన; అస్త్రజ్వాలలు= అస్త్రాలయొక్క మంటలు; కవియించి= కమ్ముకొని తగిలేటట్లు చేసి; దిక్కులు+చెలంగన్= దిక్కులు ధ్వనించేటట్లు; ఆర్చినన్= గట్టిగా అరవగా; కోపంబునన్= కోపంతో; ఆటోపంబు= పరాక్రమం; మిగిలి= ఎక్కువకాగా; బలసూదన సూనుండు= ఇంద్రుడి కొడుకు అర్జునుడు; అతని కేతనంబు= కృపుని జెండాను; తునిమి= విరుగగొట్టి; తరణి కిరణ= సూర్యకిరణాలను; అనుకార= అనుకరించటంలో; పారంగతంబులు+ అగు= ఒడ్డును తాకిన (ఆరితేరినవగు); నారాచంబులు= బాణాలు; తదీయ+అంగంబులన్= అతడి అవయవాలందు; నినుపన్= నాటించటానికి; తొడంగినన్= పూనుకొనగా; రథచక్రరక్షకులు+అగు= కృపుడి రథాన్ని రక్షించునట్టి; చంద్రకేతుండును; చిత్రాశ్వుండును; మణిమంతుండును; మంజుమౌళియు; హేమవర్మయును; సురథుండును; సుషేణుండును; అరిష్టుండును; సుకేతుండును; ఉక్కు= చేవ; మెఱయన్= ప్రకాశించేటట్లు; ఒక్కటన్= ఒక్కసారిగా; తాఁకినన్= ఎదుర్కొనగా.

తాత్పర్యం: కృపాచార్యుడను మండుతూ, అగ్నిలాగా ప్రకాశిస్తూవున్న బంగారు పూసిన బాణాలతో హనుమద్ధ్వజాన్ని కొట్టి ప్రతాపం ప్రదర్శించి, అనేక విధాల అస్త్రాల మంటలు రేగేటట్లు చేసి, దిక్కులు ప్రతిధ్వనించేటట్లుగా కేకవేశాడు. దానితో కోపంగా హడావిడిగా అర్జునుడు కృపుడి జెండాను విరుగగొట్టి సూర్యకిరణాలవంటి నారసాలను అతడి శరీరంలో వేయడానికి ప్రయత్నించేసరికి అతడి రథ చక్రరక్షకులుగా ఉన్న చంద్రకేతుడు, చిత్రాశ్వుడు,

మణిమంతుడు, మంజుమౌళి, హేమవర్మ, సురథుడు, సుషేణుడు, అరిష్టుడు, సుకేతుడు అనేవారు ఒక్కసారిగా అర్జునుడి నెదుర్కొన్నారు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. అన్ని వెడఁద వాతియమ్ము లద్భుతముగ । నొక్క ముష్టిఁ దొడిగి గ్రక్కనంగ
నతఁడు లీలఁ దునిమె నందఱ తలలును । ఘోరభంగి రక్తధార లెగయ. 149

ప్రతిపదార్థం: అన్ని= అన్ని; వెడఁదవాతియమ్ములు= వెడలుపైన ముఖాలు కల బాణాలు; అద్భుతముగన్= ఆశ్చర్యకరంగా; ఒక్కముష్టిన్= ఒక్క పిడికిలితోనే; తొడిగి= సంధించి; గ్రక్కనంగన్= శీఘ్రంగా; అతఁడు= ఆ అర్జునుడు; అందఱ తలలును= తనను ఎదుర్కొనిన వారందరి తలలను; ఘోర భంగిన్= ఘోరమైన రీతిలో; రక్తధారలు= రక్తముయొక్క ధారలు; ఎగయన్= పైకెగజిమ్మగా; లీలన్= హేలగా; తునిమెన్= నరికాడు.

తాత్పర్యం: కృపాచార్యుడి రథచక్రరక్షకు లెందరు వీరులు తనపై దాడి చేశారో అన్ని వెడలుపైన మొనలు గల పదునైన బాణాలను ఒకేసారి సంధించి అర్జునుడు ఆశ్చర్యకరంగా వారందరి తలలను రక్తధారలు పైకెగజిమ్మేటట్లుగా ఒక్కసారిగా నరికివేశాడు.

సీ. తునిమి, తోడన యొక్క సునిశిత శరమునఁ । గాఁడియు, రెంట నక్షములఁ ద్రుంచి,
హరుల నాల్గిటఁ జంపి, యాలంపు టెలుఁగుతో । నొగలు మూఁడమ్ముల నుగ్గుసేసి,
ధనువును సూతుని తలయుఁ జెఱొక్క ట । నఱికి, లోచనముల నవ్వు మెఱయఁ
గృపుని నాలోకించి క్రీడి తద్వక్షః స్థ । లంబునఁ గ్రూరభల్లంబు నాఁట

ఆ. హతరథుండు నిపతితాశ్వుండు సంఛిన్న । చాపుఁడును నికృత్త సారథియును
నయ్యు, నొచ్చియును, భుజార్గళ సంరంభ । మతిశయిల్ల శక్తి నతఁడు వైచె. 150

ప్రతిపదార్థం: తునిమి= విరుగగొట్టి; తోడన= వెంటనే; ఒక్క సునిశిత శరమునన్= వాడియైన ఒక్క బాణంతో; కాఁడియున్= కాడిని; రెంటన్= రెండు బాణాలతో; అక్షములన్= రథచక్రాల ఇరుసులను; త్రుంచి= నరికి; నాల్గిటన్= నాల్గు బాణాలతో; హరులన్= గుర్రాలను; చంపి= చంపి; ఆలంపు+ఎలుఁగుతోన్= సింహనాదంతో; నొగలున్= సారథి కూర్చుండే చోటును; మూఁడు+అమ్ములన్= మూడు బాణాలతో; నుగ్గుచేసి= పొడిచేసి; ధనువును= వింటిని; సూతుని తలయున్= సారథి తలను; చెఱి+ఒక్కటన్= చెరొక బాణంతో; నఱికి= తెగగొట్టి; లోచనములన్= కన్నులందు; నవ్వు మెఱయన్= నవ్వు ప్రకాశించగా; కృపునిన్= కృపాచార్యుడిని; ఆలోకించి= చూచి; క్రీడి= అర్జునుడు; తద్= అతడియొక్క; వక్షస్(ః)స్థలంబునన్= రొమ్ముమీద; క్రూరభల్లంబు= వాడి బాణం; నాఁటన్= నాటేటట్లు వేయగా; హతరథుండు= కొట్టబడిన రథం కలవాడు; నిపతిత+అశ్వుండున్= గుర్రాలు పడినవాడు; సంఛిన్న చాపుఁడును= ధనువు తెగగొట్టబడినవాడును; నికృత్త సారథియును= సారథి చంపబడినవాడును; అయ్యున్= అయినప్పటికీ; నొచ్చియును= బాధపడికూడ; భుజా+అర్గళ= గడియలవంటి భుజాలయొక్క; సంరంభము= గర్వం; అతిశయిల్లన్= ఎక్కువకాగా; అతఁడు= కృపుడు; శక్తిన్= శక్తి అనే ఆయుధాన్ని; వైచెన్= విసరివేశాడు.

తాత్పర్యం: అర్జును డందరి తలలు తెగగొట్టి, వెంటనే ఒక వాడిబాణంతో కాడిని, రెండు బాణాలతో బండి ఇరుసులను విరుగగొట్టి, గుర్రాలను నాలుగు బాణాలతో చంపి, మూడు బాణాలతో నొగలు నుగ్గుచేసి, ధనుస్సు

నొక బాణంతోను, సూతుడి తల నొక బాణంతోనూ నరికి, కళ్ళలో నవ్వు కనబడేటట్లుగా చూచి, కృపుడి రొమ్ముమీద తీక్ష్ణమైన బాణాన్ని నాటగా, రథం పోయి, గుఱ్ఱాలు పోయి, విల్లు విరిగిపోయి, సారథి చచ్చిపోయినా కూడా కృపుడు భుజబలంతో శక్తి అనే ఆయుధాన్ని అర్జునుడిమీదికి విసిరాడు.

ఉ. మండుచు వచ్చుదానిఁ బదిమార్గణముల్ గొని వేగ మొప్ప నా
ఖండల నందనుండు గడికండలు సేసినఁ జూచి యప్పు డా
తం డుడివోక లేక సమదంబున ఖడ్గము ఖేటకంబు ను
ద్దండతఁ గొంచుఁ దేరు డిగి తాఁ గవిసెన్ రయ ముల్లసిల్లఁగన్. 151

ప్రతిపదార్థం: మండుచున్= మంటలు కక్కుతూ; వచ్చుదానిన్= వచ్చే శక్తిని; పది మార్గణముల్= పది బాణాలు; కొని= తీసికొని; వేగము+ఒప్పన్= వేగం కలిగేటట్లుగా; ఆఖండల నందనుండు= ఆ అర్జునుడు; కడికండలు= ముక్కలు ముక్కలు; చేసినన్= చేయగా; చూచి; అప్పుడు; ఆతండు= కృపుడు; ఉడివోక= మానటం; లేక= చేయక; సమదంబునన్= మదంతో; ఖడ్గమున్= కత్తినీ; ఖేటకంబున్= డాలునూ; ఉద్దండతన్= గొప్పగా; కొంచున్= తీసికొంటూ; తేరు= రథం; డిగి= దిగి; తాన్= అతడు; రయము= వేగం; ఉల్లసిల్లఁగన్= ఒప్పగా; కవిసెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: మండుతూ వచ్చే శక్తిని అర్జునుడు పది బాణాలు తీసికొని అర్జునుడు ముక్కలు ముక్కలు చేశాడు. దానితో కృపుడు ఊరుకొనక గర్వంతో కత్తి, డాలు పుచ్చుకొని రథం దిగి అర్జునుడిని ఎదిరించాడు.

వ. ఇట్లు గవిసిన. 152

తాత్పర్యం: ఈ రీతిగా ఎదిరించగా.

క. పలకయు వాలును నింతిం । తలు దునియలు సేసె బాణతతిఁ బాండవుఁ డి
ట్టల మైన వెఱఁగుపాటున । నిలిచి కృపుఁడు ద్రోణపుత్రుని రథం బెక్కెన్. 153

ప్రతిపదార్థం: పాండవుఁడు= అర్జునుడు; బాణతతిన్= బాణముల సముదాయంతో; పలకయున్= డాలును; వాలునున్= కత్తియును; ఇంతింతలు= చిన్న చిన్న; తునియలు= ముక్కలుగా; చేసెన్= చేశాడు; కృపుఁడు; ఇట్టలము+ఐన= అధికమైన; వెఱఁగుపాటునన్= ఆశ్చర్యంతో; నిలిచి= ఉండి; ద్రోణపుత్రుని రథంబు= అశ్వత్థామ యొక్క రథాన్ని; ఎక్కెన్= ఎక్కాడు.

తాత్పర్యం: అర్జునుడు బాణాలతో కృపుడి కత్తిని, డాలును చిన్న చిన్న ముక్కలుగా ఖండించాడు. అధికమైన ఆశ్చర్యంతో కృపుడు అశ్వత్థామ రథమెక్కాడు.

ఆ. అప్పు డే పడంగి యన్ని సేనలు భీష్ము । రథము పొంత కొదిఁగె రౌద్రరస వి
నోది యైన యర్జునుఁడు ధనుశ్చాలన । దీప్తమూర్తి యగుచుఁ దిట్ట కుఱికె. 154

ప్రతిపదార్థం: అన్ని సేనలు= సేనలన్నియు; అప్పుడు= ఆ సమయంలో; ఏపు+అడంగి= విజృంభణం తగ్గి; భీష్మ రథము పొంతకున్= భీష్ముడి రథం వద్దకు; ఒదిఁగెన్= ఒదిగినవి; రౌద్రరస= రౌద్ర రసంతో; వినోది ఐన= వినోదము చేస్తున్న; అర్జునుఁడు; ధనుస్+చాలన= ధనుస్సు కదుపులో; దీప్తమూర్తి అగుచున్= ప్రకాశించే విగ్రహం కలవాడై; తిట్టకున్= సైన్యపు గుంపుమీదికి; ఉఱికెన్= ఉరికెను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అప్పుడు కౌరవ సేనలన్నీ భీష్ముడి రథం సమీపానికి పోయి ఒదిగి ఉండినాయి. రౌద్రరసంతో వినోదిస్తూవున్న అర్జునుడు అప్పుడు ధనుస్సు కదుపుతూ ఒక్క ఉదుటున ఆ సైన్యంమీది కురికాడు.

వ. ఇత్తెఱంగున నుఱక తతియ నుఱికిన. 155

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ రీతిగా; ఉఱక= లక్ష్యపెట్టక; తటియన్+ఉఱికినన్= సమీపించేటట్లు పరువెత్తగా.

తాత్పర్యం: ఆ విధంగా సైన్యం మీదికి లక్ష్యపెట్టకుండా పర్వెత్తగా.

క. బలములు దొరలుఁ బొదివి సం । కుల యుద్ధము సేయఁ గ్రోధ ఘోరాకృతి యై
యిలఁ బ్రోవుగఁ జతురంగం । బుల వ్రేల్మిడిఁ బాండురాజపుత్రుఁడు గూల్చెన్. 156

ప్రతిపదార్థం: బలములు= సేనలు; దొరలున్= రథికులును; పొదివి= చుట్టుముట్టి; సంకుల యుద్ధము= దొమ్మి యుద్ధం; చేయన్= చేయగా; క్రోధ= కోపంతో; ఘోర+ఆకృతి+ఐ= భయంకరమైన ఆకారం కలవాడై; ఇలన్= భూమిపై; చతురంగంబులన్= నాలుగు రకాల సేనాంగాలను; పాండురాజపుత్రుఁడు= అర్జునుడు; వ్రేల్మిడిన్= వెంటనే; ప్రోవుగన్= రాశిగా; కూల్చెన్= కూల్చాడు.

తాత్పర్యం: అప్పుడు సేనలు, రథికులు కలిసి ఒక్కసారిగా మీదబడి దొమ్మిగా యుద్ధం చేయగా అర్జునుడు క్రోధంతో భయంకరాకృతి కలవాడై ఆ చతురంగబలాలను ఒక్క క్షణకాలంలోనే కుప్పగా పడేటట్లు కూల్చాడు.

ఉ. చేతులతీఁట వో నిటు లశేషబలంబుల నుగ్గు సేసి మాం
సాతతపంక యై బహువిధాయుధమీనము లొప్పఁ జామర
వ్రాతము ఫేన భంగిగ నిరంతర వీరశిరస్సరోరుహ
స్ఫీత విభూతిఁ బొల్చు నది సేసె రణస్థలియందు నెత్తుటన్. 157

ప్రతిపదార్థం: చేతుల తీఁట= చేతుల దురద; పోన్= తీరేటట్లు; ఇటులు= ఈ రీతిగా; అశేష బలంబులన్= అపార సేనల నన్నింటిని; నుగ్గు+చేసి= పొడిచేసి; రణస్థలి+అందున్= యుద్ధభూమిలో; నెత్తుటన్= నెత్తుటి మడుగులో; మాంస+ఆతత పంక+ఐ= మాంసమనెడి అధికమైన బురద కలదై; బహువిధ= పలురకాలైన; ఆయుధ మీనములు= ఆయుధములనెడి చేపలు; ఒప్పన్= ప్రకాశించగా; చామర వ్రాతము= వింజామరల సముదాయం; ఫేన భంగిగన్= నురుగుగాను; నిరంతర= ఎడతెగని; వీర= వీరులయొక్క; శిరస్సరోరుహ= తలలనెడి పద్మాలయొక్క; స్ఫీత విభూతిన్= విస్తారమైన వైభవంతో; పొల్చునది= ప్రకాశించునట్టి నదిని; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: అర్జును డీ రీతిగా చేతుల దురద తీరేటట్లు సేనలన్నింటిని నుగ్గు నుగ్గు చేసి, మాంసమే బురదగా, ఆయుధాలే చేపలుగా, వింజామరలే నురుగుగా, వీరుల తలలే పద్మాలుగా ఒప్పే నదిని, యుద్ధభూమిలో నెత్తుటితో చేశాడు.

విశేషం: అలం: సావయవరూపకం, ఉపమ. చేతుల తీఁట - ఇది జాతీయం. శత్రువులను కొట్టాలి, హింసించాలి అనే తీవ్రమైన కోర్కె అని భావం. (లోకంలో చేతికి గజ్జివలన కలిగే దురద అని అర్థం.) (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. ఇట్లు కౌరవానీకంబు నెల్లఁ గలఁచి । యాడి భీష్ముని దెసఁ బోవు క్రీడిఁ దాఁకెఁ
గొండతోఁ దాఁకు తగరు నుద్దండ వృత్తి । దోఁప వృషసేనుఁ డాహవదోహలమున. 158

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; కౌరవ+అనీకంబున్+ఎల్లన్= కౌరవసేనల నన్నిటిని; కలఁచి= కలత చెందించి; ఆడి= ఆట ఆడినట్లుగా యుద్ధం చేసి; భీష్ముని దెసన్= భీష్ముడి వైపునకు; పోవు క్రీడిన్= పోవునట్టి అర్జునుడిని; వృషసేనుఁడు; ఆహవ దోహలమునన్= యుద్ధం చేసే వేడుకతో; కొండతోన్+తాఁకు= కొండతో ఢీకొనునట్టి; తగరు+ఉద్దండ వృత్తి= పొట్టేలు యొక్క గర్వ ప్రవృత్తి; తోఁపన్= తోచేటట్లుగా; తాఁకెన్= ఢీకొన్నాడు.

తాత్పర్యం: ఇట్లా కౌరవ సేనలన్నింటిని కలవరపరచి ఆటలాడినట్లుగా యుద్ధం చేసి, ఇక భీష్ముడివైపు పోదామనుకొనే అర్జునుడితో వృషసేనుడు యుద్ధం చేసే వేడుకతో కొండతో ఢీకొనే పొట్టేలువలె ఢీకొన్నాడు.

విశేషం: అలం: ఉపమ. కొండతో ఢీకొన్న తగరు పరిస్థితియే (వినాశమే) వృషసేనుడికి కూడ లభిస్తుందని అలంకార ధ్వని. (సంపా)

వ. విజయుండును. 159

తాత్పర్యం: అర్జునుడు కూడ.

తే. భల్ల మొక్కట నాతని విల్లు దునిమి । యైదు నారసములు వక్ష మాడ నేసి;
నతఁడు సైరింపరాని నొ వ్వడరుటయును । బెగ్గలంబున నరదంబు డిగ్గి పాఱె. 160

ప్రతిపదార్థం: భల్లము+ఒక్కటన్= ఒక బల్లెంతో; ఆతని విల్లు= వృషసేనుడి వింటిని; తునిమి= తెగగొట్టి; ఐదు నారసములు= ఐదు బాణాలు; వక్షము+ఆడన్= రొమ్మునకు నాటేటట్లు; ఏసెన్= కొట్టాడు; అతఁడు= వృషసేనుడు; సైరింపరాని నొవ్వు= సహించలేని బాధ; అడరుటయును= అతిశయించగా; బెగ్గలంబునన్= భయంతో; అరదంబున్+డిగ్గి= రథం దిగి; పాఱెన్= పరుగెత్తాడు.

తాత్పర్యం: ఒక్క బాణంతో అతడి వింటిని తెగగొట్టి, అయిదు బాణాలతో రొమ్ము నాటేటట్లు కొట్టగా, ఆ బాధ సహించలేక అతడు రథం దిగి పారిపోయాడు.

వ. అట్టియెడ దుశ్శాసన శకుని దుర్ముఖ వివింశతి వికర్ణులు దన్నుం బొదివికొనిన వారల రథరథ్య కేతు వర్మంబులు జర్జరితంబులుగా నేసి గాసిచేసిన నందఱుం గనుకనిఁ బఱవం దొడంగినఁ బార్థుండును బ్రహాసోల్లాస భాసుర ముఖుండగుచు నుత్తరుం గనుంగొని. 161

ప్రతిపదార్థం: అట్టిఎడన్= అటువంటి సమయంలో; దుశ్శాసన, శకుని, దుర్ముఖ, వివింశతి, వికర్ణులు= దుశ్శాసనుడు, శకుని, దుర్ముఖుడు, వివింశతి, వికర్ణుడు; తన్నున్= అర్జునుడిని; పొదివికొనినన్= చుట్టుముట్టగా; వారల= వారియొక్క; రథ= రథాలను; రథ్య= గుర్రాలను; కేతు= జెండాలను; వర్మంబులు= కవచాలను; జర్జరితంబులుగాన్= తూట్లు పడేటట్లుగా; ఏసి= కొట్టి; గాసి చేసినన్= బాధ కల్గించగా; అందఱున్= అందరును; కనుకనిన్= సంభ్రమంతో; పరవన్+తొడంగినన్= పారిపోవ ప్రారంభించగా; పార్థుండును= అర్జునుడును; ప్రహాస+ఉల్లాస= నవ్వుతో గూడిన ఉల్లాసంతో; భాసుర ముఖుండు+అగుచున్= ప్రకాశించే ముఖం కలవాడై; ఉత్తరున్= ఉత్తరుడిని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: అప్పుడు దుశ్శాసనుడు, శకుని, దుర్ముఖుడు, వివింశతి, వికర్ణుడు అర్జునుడిని చుట్టుముట్టారు. పార్థుడు వారి రథాలనూ, గుర్రాలనూ, టెక్కాలనూ, కవచాలనూ ముక్కలయ్యేట్లుచేసి బాధ కలిగించాడు. దానితో వారందరూ భయంతో పారిపోవనారంభించారు. అర్జునుడు నవ్వుతో, ఆహ్లాదంతో నిండిన మొగంతో ఉత్తరుడిని చూచి.

తే. **'కనకమయ తాల కేతువు క్రాలఁ జిర త । టిల్లతాలీలఁ గలిగి శోభిల్లు నంబు**
దంబుచాడ్పున సురనదీ తనయుఁ డున్న । వాఁడు చూచితె మత్స్యభూవరతనూజ! 162

ప్రతిపదార్థం: కనకమయ= బంగారు మయమైన; తాలకేతువు= తాటిచెట్టు జెండా; క్రాలన్= ప్రకాశించగా; చిర= చిర కాలమున్న; తటిత్+లతా లీలన్= మెరుపు యొక్క విలాసం; కలిగి శోభిల్లు= ఉండి ప్రకాశించెడి; అంబుదంబు చాడ్పునన్= మేఘంవలె; సురనదీ తనయుఁడు= భీష్ముడు; ఉన్నవాఁడు= ఉన్నాడు; మత్స్యభూవర తనూజ!= ఉత్తరా!; చూచితె?= చూచావా?

తాత్పర్యం: 'ఉత్తరా! బంగారు తాటిచెట్టు జెండాతో భీష్ముడు స్థిరమైన మెరుపుతో కూడి ఉన్న మేఘంవలె ప్రకాశిస్తున్నాడు చూచావా!

విశేషం: అలం: ఉపమ.

అర్జునుఁడు భీష్మునితో యుద్ధంబు సేయుట (సం. 4-56-1)

క. **బలువిడి మన దివ్యాస్త్రం । బుల చవి చూపంగ వలయుఁ బోనిమ్ము రథం**
బలసగతి నతనిదెస' కని, । పలికిన నతఁ డట్లు చేసెఁ బరమ ప్రీతిన్. 163

ప్రతిపదార్థం: బలువిడి= శీఘ్రంగా; మన= మనయొక్క; దివ్యాస్త్రంబుల చవి= దివ్యమైన అస్త్రాల రుచి; చూపంగ వలయున్= చూపించవలెను; రథంబు= రథాన్ని; అతడి దెసకున్= అతని వైపునకు; అలసగతిన్= మెల్లని నడకలతో; పోనిమ్ము= తోలుము; అని పలికినన్= అని పలుకగా; పరమ ప్రీతిన్= మిక్కిలి ప్రీతితో; అట్లు= ఆ రీతిగానే; అతఁడు= ఉత్తరుడు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: మన దివ్యాస్త్రాల నతడికి రుచి చూపాలి; మెల్లగా అతడి రథంవైపు మన రథాన్ని తోలు'మనగా ఉత్తరుడు మిగుల ప్రీతితో అట్లే చేశాడు.

విశేషం: తాతగారైన భీష్ముడివైపు పోవటానికి అర్జునుడు చెప్పిన కారణం ఆయనకు 'దివ్యాస్త్రాల చవి' చూపించాలని. 'రుచి చూపించటం' జాతీయం. అరణ్య అజ్ఞాతవాసకాలాలలో అర్జునుడు పాశుపతాస్త్రాది దివ్యాస్త్రాలను ఎన్నో సంపాదించాడు. ఇన్నేళ్ళ తరువాత మరల తాతగారిని మనుమడు కలుస్తున్నాడు. తాను సాధించిన అస్త్రాలను ఆయనకు (రుచి) చూపించి ఆయన మెప్పు పొందాలని అర్జునుడు ఆశపడ్డాడు. 'రుచి చూపించటం' అనే జాతీయం వీరవాచకంగా వాడబడింది కావున ఇక్కడ గౌరవవాచకం కాదు. భీష్ముడిపై బాణవిద్యలో తన ఆధిక్యాన్ని ప్రదర్శించటానికే అర్జునుడు ఢీకొనాలనుకొంటున్నది సత్యం. అది సందర్భోచితం కూడా. అయితే, ఆ సంకల్పంలో అహంకారం లేదన్న సంగతిని 'రథాన్ని అలసగతిలో పోని'మ్మని పలకటంలో ధ్వనిస్తున్నది. వీరవిక్రమ వినయగుణ సమన్వితుడిగా విజయుడిని చిత్రించిన పద్యరత్న మిది. (సంపా.)

ఉ. శాంతనవుండు నప్డు నిజశంఖము కౌరవరాజసైన్యముల్
సంతస మంద నొత్తుచు ససంభ్రమలీల నెదుర్కొనంగ దు
ర్దాంత భుజాబల ప్రకటదర్ప మెలర్ప నరుండు నొత్తె ది
గ్దంతినికాయ కర్ణపుట దారణ వృత్తము దేవదత్తమున్. 164

ప్రతిపదార్థం: అప్డు= అప్పుడు; శాంతనవుండున్= భీష్ముడు కూడా; నిజశంఖమున్= తన శంఖమును; కౌరవరాజ సైన్యముల్= దుర్యోధనుని సేనలు; సంతసమందన్= సంతోషం పొందగా; ఒత్తుచున్= ఊదుతూ; ససంభ్రమలీలన్= సంతోషముతోడి విలాసంతో; ఎదుర్కొనంగన్= ఎదిరించగా; దుర్దాంత= సహింపరాని; భుజాబల= భుజ పరాక్రమముయొక్క; ప్రకట= స్పష్టమైన; దర్పము= గర్వం; ఎలర్పన్= అతిశయించగా; నరుండున్= అర్జునుడును; దిగ్దంతి= దిగ్గజముల; నికాయ= సముదాయముయొక్క; కర్ణపుట= పుటముల వంటి చెవుల యొక్క; దారణ= బ్రద్దలు కొట్టటం అనెడి; వృత్తమున్= స్వభావం కలదైన; దేవదత్తమున్= దేవదత్తమనెడు తన శంఖమును; ఒత్తెన్= ఊదాడు.

తాత్పర్యం: అప్పుడు భీష్ముడు కురురాజ సేనల కానందం కలిగేటట్లుగా తన శంఖాన్ని పూరించి సంతోషంగా ఎదుర్కొనగా, అర్జునుడు సహించరాని భుజబలం ప్రకటించే గర్వంతో దిగ్గజాల చెవులు బ్రద్దలయ్యే ధ్వని గల దేవదత్తాన్ని ఊదాడు.

విశేషం: అలం: అతిశయోక్తి.

తే. మలసి ఱంకెలు వైచుచు మాఱుకొనిన । వృషభముల భంగి నక్కురువృషభు లిట్లు
సమదగతిఁ జేరునెడఁ జూచి రమరు లర్థి । ననిమిషత్వంబు దమ కప్పు డచ్చుపడఁగ. 165

ప్రతిపదార్థం: మలసి= ఉద్యమించి; ఱంకెలు వైచుచున్= రంకెలు వేస్తూ; మాఱుకొనిన= ఢీకొన్న; వృషభముల భంగిన్= ఆంబోతుల వలె; ఆ+కురు వృషభులు= ఆ కౌరవశ్రేష్ఠులు; ఇట్లు= ఈ రీతిగా; సమదగతిన్= మదంతో కూడిన గతితో; చేరు+ఎడన్= చేరునప్పుడు; అమరులు= దేవతలు; అనిమిషత్వంబు= రెప్పపాటు లేకపోవటం; అప్పుడు= ఆ ఇరువురి యుద్ధ కాలంలో; తమకున్= దేవతలకు; అర్థిన్= బాగుగా; అచ్చు పడఁగన్= కలిసిరాగా; చూచిరి= చూచారు.

తాత్పర్యం: ఆబోతులు రంకెలు వేస్తూ తిరుగుతూ ఒకదానితో ఒకటి ఢీకొన్నట్లుగా ఆ భీష్మార్జును లిరువురూ యుద్ధం చేయటానికి చేరగానే దేవతలు తమకు రెప్పపాటు లేకపోవటం ఆ సమయంలో చక్కగా కలిసివచ్చినట్లు అభిప్రాయపడుతూ ప్రీతితో చూచారు.

విశేషం: అలం: ఉపమ, విధి.

వ. ఇవ్విధంబునం గనుంగొనుచు వారలు దమలోన. 166

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; కనుంగొనుచున్= చూస్తూ; వారలు= దేవతలు; తమలోనన్= తమలో.

తాత్పర్యం: దేవతలు ఆ విధంగా చూస్తూ తమలో తాము (ఇట్లా అనుకొన్నారు).

క. 'మనలను దానవులను గడ । చినయవి భుజ బలము లస్త్రశిక్షా విధముల్
గొనియాడఁ గొలఁది గా దీ । తని నాతఁడ యతని నితఁడ తగుఁ జెనయంగన్'. 167

ప్రతిపదార్థం: భుజ బలములు= భుజాల పరాక్రమాలు; అస్త్రశిక్షా విధముల్= అస్త్రములను నేర్చిన విధాలు; మనలను= దేవతలను; దానవులను= రాక్షసులను; కడచిన+అవి= మించినవి; కొనియాడన్= పొగడుటకు; కొలఁది+కాదు= వీలుగాదు; ఈతనిన్= అర్జునుడిని; ఆతఁడు+అ= ఆ భీష్ముడే; అతనిన్= భీష్ముడిని; ఇతఁడు+అ= ఈ అర్జునుడే; చెనయంగన్= ఎదిరించటానికి; తగున్= తగి ఉన్నారు.

తాత్పర్యం: వీరిద్దరి పరాక్రమాలూ, అస్త్రాలు నేర్చిన రీతులూ మనలను, రాక్షసులను మించిపోయాయి. వీరిని ఇంతని కొనియాడలేము. ఇతని నతడే ఎదుర్కొనాలి, అతని నితడే ఎదుర్కొనాలి. ఈరీతిగా ఎదుర్కొనటానికి ఈఇద్దరే తగినవారు.

విశేషం: అర్జునుడూ భీష్ముడూ దేవదానవులకంటె అస్త్రశిక్షణలో మించారని ఉభయబలాలను అంచనా వేయగల దేవగణాలు నిర్ణయించటం విశేషం. తిక్కన వాడిన ఇతడు - అతడు అనే సర్వనామాలు సార్థకాలు. వారు నామాలతో వేరుగా కనపడ్డా- బలంలో సమంగా ఉన్నారని సర్వనామాలు ధ్వనిస్తున్నాయి. అందులో ఇతడు అర్జునుడు, అతఁడు భీష్ముడు. రాబోయే సీసపద్యంలో అతడు - భీష్ముడి పరంగా వాడటం గమనార్హం. ఇతఁడుగా పేర్కొన్న అర్జునుడు దేవతల అభిమానం చూరగొనటంచేత వారికి సన్నిహితుడని ధ్వని. (సంపా.)

సీ. **అనుచుండ సైన్యంబు లార్పులుఁ బెడ బొబ్బ । లును దూర్యనాదంబులును జెలంగఁ**
బేర్చి యొక్కుమ్మడి భీష్ము నగ్గింపంగ । నతఁడు నిశాత బాణాష్టకమునఁ
బడగపై హనుమంతు నొడలను బహుశరం । బుల నందుఁ జెలఁగెడు భూతములను
దశవిశిఖముల రథ్యములను సారథి । నేసె; వాసవియును నెసక మెసఁగు

తే. **నగ్గలిక గాండివంబు చక్రాకృతి ప్ర । కాశవహ్ని స్వరూపత గలిగి విడుపు**
తెఱపి గానంగ రాకుండ మెఱసి యొప్పు । సాంద్ర సాయకతతి నాకసంబు గప్పె. **168**

ప్రతిపదార్థం: అనుచున్+ఉండన్= అని పల్కుతుండగా; సైన్యంబులు= సేనలు; ఆర్పులు= కేకలు; పెడ బొబ్బలును= పెద్ద పెద్ద కేకలును; తూర్య నాదంబులును= దుందుభి మున్నగు వాద్యముల చప్పుళ్ళు; చెలంగన్= చెలరేగగా; పేర్చి= అతిశయించి; ఒక్క+ఉమ్మడిన్= ఒక్కసారిగా; భీష్మున్= భీష్ముడిని; అగ్గింపంగన్= కీర్తించగా; అతఁడు= భీష్ముడు; నిశాత= వాడిఅయిన; బాణ+అష్టకమునన్= ఎనిమిది బాణాలతో; పడగపైన్= జెండాపైనున్న; హనుమంతు+ఒడలను= హనుమంతుడి శరీరాన్ని; బహు శరంబులను= ఎన్నో బాణాలతోను; అందున్= ఆ జెండాపై; చెలఁగెడు= విజృంభించే; భూతములను= పిశాచాలను; దశ విశిఖములన్= పది బాణాలతో; రథ్యములను= గుర్రాలను; సారథిన్= ఉత్తరుని; ఏసెన్= కొట్టాడు; వాసవియును= అర్జునుడు కూడ; ఎసకమెసఁగు+అగ్గలికన్= పెచ్చుపెరిగే కోపంతో; గాండివంబు= గాండీవం; చక్రాకృతి= చక్రాకారంలో; ప్రకాశ వహ్ని స్వరూపతకలిగి= ప్రకాశంగల అగ్నిరూపం కలిగి; విడుపు తెఱపి= విడవటం, తెరపిగానుండటం; కానంగరాకుండన్= తెలియకుండా; మెరసి+ఒప్పు= మెరుస్తూ ఉండే; సాంద్ర= దట్టమైన; సాయక తతిన్= బాణ సముదాయంతో; ఆకసంబున్= ఆకాశాన్ని; కప్పెన్= కప్పివేశాడు.

తాత్పర్యం: దేవతలట్లా అంటుండగానే, సేనల ఆర్పులు, పెడబొబ్బలు ఒక ప్రక్క, దుందుభి మున్నగు వాద్యాల చప్పుళ్లు హెచ్చిపోయేటట్లు చేయగా, భీష్ముడు వాడియైన ఎనిమిది బాణాలతో జెండామీదనున్న హనుమంతుడిని, చాల బాణాలతో అందున్న భూతాలను, పది బాణాలతో గుర్రాలను, సారథిని కొట్టగా, అర్జునుడు హెచ్చిన కోపంతో గాండీవాన్ని చక్రాకృతిగా పెట్టి, అది అగ్నివలె ప్రకాశిస్తుండగా, విడవటం, పయనించటం, తాకటం తెలియరానంత వేగంగా బాణాలు వేసి ఆకాశం కప్పేశాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. **అర్జునుఁడు గవియించిన యంపమూడ । మంచు దళముగఁ గప్పిన మార్గణాంశు**
జాలముల వెస విరియించె శాంతనవ ప । తంగుఁ డుద్ద్యోతమాన ప్రతాప లీల. **169**

ప్రతిపదార్థం: శాంతనవ పతంగుఁడు= భీష్ముడనే సూర్యుడు; ఉద్ద్యోతమాన= ప్రకాశించే; ప్రతాపలీలన్= ప్రతాపముయొక్క విలాసంతో; అర్జునుఁడు; కవియించిన= కమ్ముకొనజేసిన; అంపమూడమంచు= బాణాలు అనెడి దట్టమైన మంచు; దళముగన్= దళసరిగా-ఎక్కువగా; కప్పినన్= కప్పివేయగా; మార్గణ+అంశు జాలములన్= బాణాలనెడి కిరణాల సముదాయంతో; వెసన్= వేగంగా; విరియించెన్= విడిపోయేటట్లు చేశాడు.

తాత్పర్యం: అర్జునుడు ఆకాశం నిండా కప్పిన బాణాలనే దట్టమైన మంచును భీష్ముడనే సూర్యుడు తన ప్రతాపమనే విలాసంతో ప్రసరింపజేసిన బాణాలనే కిరణాలతో విరిసిపోయేటట్లు చేశాడు.

విశేషం: అలం: రూపకం.

క. **అమరేంద్రతనయుఁ డుగ్రా । స్త్రములు వడిం గురియఁ గురియఁ దరమిడి వానిం**
దుమురుగఁ జేయుచు వచ్చెను । సమరోల్లాసంబు మెఱయ శంతనుసుతుఁడున్. **170**

ప్రతిపదార్థం: అమర+ఇంద్ర తనయుఁడు= అర్జునుడు; ఉగ్ర+అస్త్రములు= భయంకరమైన అస్త్రాలు; వడిన్= వేగంగా; కురియన్+కురియన్= కురిపించగా కురిపించగా; శంతను సుతుఁడున్= భీష్ముడును; వానిన్= ఆ బాణాలను; తరమిడి= వరుసగా; తుమురుగన్= తునియలుగా; చేయుచు వచ్చెను= చేస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు వేసే భీకరాస్త్రాలను వాటి వరుస ప్రకారం భీష్ముడు వాటిని ముక్కలు ముక్కలు చేస్తూ వచ్చాడు.

క. **అర్జునుఁడు దివ్యబాణ । స్ఫూర్జిత దోశ్శక్తి తనకుఁ జూపిన నతఁ డ**
త్యూర్జిత బలుఁడై నియమో । పార్జిత ఘోరాస్త్రవితతిఁ బ్రతిహతిఁ జేసెన్. **171**

ప్రతిపదార్థం: అర్జునుఁడు; దివ్య= దేవతా సంబంధమైన; బాణ= అస్త్రాలయొక్క; స్ఫూర్జిత= గొప్పదైన; దోస్+శక్తిన్= బాహుబలాన్ని; తనకున్= భీష్ముడికి; చూపినన్= చూపగా; అతఁడు= భీష్ముడు; అతి+ఊర్జిత= మిక్కిలి గొప్పదైన; బలుఁడు+ఐ= బలం కలవాడై; నియమ= నియమంగా; ఉపార్జిత= సంపాదించబడిన; ఘోర= భయంకరమైన; అస్త్ర= అస్త్రాలయొక్క; వితతిన్= సముదాయంచేత; ప్రతిహతిన్= ఎదురుదెబ్బ తీయటంద్వారా పనిచేయని వాటినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: అర్జునుడు భీష్మునిపై దివ్యాస్త్రాలను వేయగా - ఆ వేయటం తనకా దివ్యాస్త్రాలు వచ్చునని చూపటం కాబట్టి - భీష్ముడు తాను కూడా నియమ నిష్ఠలతో సంపాదించిన శక్తి కలవాడు కనుక- వాటిని వ్యర్థములయ్యేటట్లు చేశాడు.

విశేషం: అర్జునుడి దివ్యాస్త్రాలు దేవతలు మెచ్చి ఇచ్చినవి. భీష్ముడి దివ్యాస్త్రాలు వ్రతనియమాలతో సాధించినవి. ఒకరిది దైవదత్తమైన శక్తి, మరొకరిది మానుషమైన శక్తి. ఈ పద్యంలో ఈ వివేచన ధ్వని. (సంపా.)

క. కవ్వడి యెమ్మెయి నేసిన । నవ్విధమున నాశరంబు లన్నియు దౌ దౌ
దవ్వులన నిలువరింపఁగ । వివ్వచ్చుఁడు కినిసి యేసె విలు విఱుగంగన్. 172

ప్రతిపదార్థం: కవ్వడి= అర్జునుడు; ఏ+మెయిన్= ఏ రీతిగా; ఏసినన్= వేసినను; ఆ+విధమునన్= ఆ రీతిగా; ఆ శరంబులన్నియును= ఆ అస్త్రము లన్నింటిని; తాన్= తాను; దౌ దౌ దవ్వులన్+అ= దూర దూరాననే; నిలువరింపఁగన్= (ముందుకు రాకుండా) నిల్చునట్లు చేయగా; వివ్వచ్చుఁడు= అర్జునుడు; కినిసి= కోపించి; విలు= విల్లు; విఱుగంగన్= విరిగేటట్లు; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: అర్జును డేరీతిగా వేసినా భీష్ము డదే రీతిగా వాటినన్నిటిని దూరాననే నిల్చేటట్లు చేయడంతో కోపించి అర్జునుడు భీష్ముడి విల్లు విరుగగొట్టాడు.

విశేషం: అలం: సమం.

మ. తన కోదండము ఖండితం బగుడుఁ గ్రోధంబార మందాకినీ
తనయుం డప్డు సటా విలుంచన సముద్యత్క్రోధ సింహాకృతిన్
ధను వొం డుద్ధత లీల నెత్తికొని యస్త్రశ్రేణిఁ బర్వించె న
ర్జునుపైఁ దాఁకిరి చక్రరక్షకులు నార్పుల్ నింగి ముట్టన్ వడిన్. 173

ప్రతిపదార్థం: తన కోదండము= తన ధనుస్సు; ఖండితంబు+అగుడున్= తెగగొట్టబడింది కాగా; మందాకినీ తనయుండు= భీష్ముడు; అప్డు= ఆ సమయంలో; క్రోధంబున్= కోపం నిండగా; సటావిలుంచన= జూలు గట్టిగా లాగటం చేత; సముద్యత్= ఉద్యమించుతున్న; క్రోధ= కోపంగల; సింహ= సింహంయొక్క; ఆకృతిన్= ఆకారంతో; ఒండు ధనువు= మరొక విల్లు; ఉద్ధతలీలన్= ఔద్ధత్యంతో; ఎత్తికొని= తీసికొని; అర్జునుపైన్= అర్జునుడి మీద; అస్త్రశ్రేణిన్= బాణాల పరంపరను; పర్వించెన్= వ్యాపించేటట్లు వేశాడు; చక్రరక్షకులు= వ్యూహరక్షకులు; ఆర్పుల్= కేకలు; నింగి ముట్టన్= ఆకాశాన్ని అంటగా; వడిన్= వేగంగా; తాఁకిరి= దాడిచేశారు.

తాత్పర్యం: తన ధనుస్సు విరిగిపోయేటప్పటికి భీష్ముడు జూలు ఊడబెరికితే విజృంభించే సింహంవలె మహాకోపంతో మరోవిల్లు పుచ్చుకొని బాణాలు పరంపరగా అర్జునుడిపై వేశాడు. ఆయన వ్యూహరక్షకులు ఆర్పులు పెట్టుతూ అర్జునుడి మీదికి పోయి దాడి చేశారు.

విశేషం: అలం: ఉపమ. విలుంఠన పాఠం కంటె విలుంచన పాఠం మేలు. విలుంఠన= దొరలటం, విలుంచన= ఒలువటం.

చ. విజయుఁడు వారి నెల్ల నొక వ్రేల్మిడిఁ ద్రుంచియు, భీష్ము సాయక
వ్రజము నడంచియున్ రథము వాజుల నొంచియు, నాజికేళియం
దజిత విలాసముల్ మెఱయ నప్పుడు విస్మయ మందుచుండెఁ గుం
భజముఖ యోధ వీరతతి; ప్రస్తుతి సేసిరి సిద్ధఖేచరుల్. 174

ప్రతిపదార్థం: విజయుఁడు= అర్జునుడు; వారిన్+ఎల్లన్= వారందరిని; ఒక వ్రేల్మిడిన్= ఒక్క చిటికలో; త్రుంచియున్= చంపియు; భీష్ము= భీష్ముడి యొక్క; సాయక వ్రజమున్= బాణ సముదాయాన్ని; అడంచియున్= అణచివేసియు; రథమున్= భీష్ముడి రథమును; వాజులన్= గుర్రాలను; నొంచియున్= బాధించియు; ఆజి కేళియందున్= యుద్ధమనెడి క్రీడలో; అజిత=

జయించబడని; విలాసముల్= లీలలు; మెఱయన్= ప్రకాశించగా; అప్పుడు= ఆ సమయంలో; కుంభజముఖ= ద్రోణుడు మొదలైన; యోధవీర తతి= యోధులైన వీరుల సముదాయం; విస్మయము= ఆశ్చర్యాన్ని; అందుచున్+ఉండెన్= పొందుతున్నారు; సిద్ధఖేచరుల్= ఆకాశంలో సంచరించే సిద్ధులు మొదలైన దేవజాతులును; ప్రస్తుతి చేసిరి= పొగడారు.

తాత్పర్యం: అప్పు డర్జునుడు ఆ చక్రరక్షకుల నందరిని చంపి, భీష్ముడు వేసిన బాణాలను త్రుంచివేసి, ఆపైన భీష్ముడి రథాన్ని, గుర్రాలను ధ్వంసం చేసి ఎదుటివారికి జయించరానివాడై తనకు యుద్ధ మొక ఆటగా మెరయగా ద్రోణాది మహావీరులాశ్చర్యపోయారు. సిద్ధాది దేవతలు పొగడారు.

క. **కొండొకయెడఁ గని శాంతన । వుం డాఖండల తనూభవుని డా మూఁ పు**
ద్దండ భుజబలము మెఱయఁ బ్ర । చండాస్త్రక్షతము సేసె సరభసవృత్తిన్. **175**

ప్రతిపదార్థం: కొండొక= కొద్ది; ఎడన్= సందును; కని= చూచి; శాంతనవుండు= భీష్ముడు; ఆఖండల తనూభవుని= అర్జునుడి యొక్క; డామూఁపు= ఎడమ భుజంపై భాగాన్ని; ఉద్దండ భుజబలము= గొప్పదైన పరాక్రమం; మెఱయన్= ప్రకాశించగా; సరభసవృత్తిన్= శీఘ్రమైన రీతిని; ప్రచండ+అస్త్ర= తీవ్రమైన బాణంతో; క్షతము= గాయపడినదానినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: భీష్ము డీ మధ్యలో కాస్త సందు చూచుకొని అర్జునుడి యెడను మూపును తన బలం ప్రకాశించేటట్లుగా బాణంతో కొట్టాడు.

చ. **కినుక మనంబునం గదిరి క్రీడి పితామహువిల్లు వ్రేల్మిడిం**
దునిమి, నితాంత గాఢరయ దోర్విభవంబున నొండు విల్లు గై
కొనియెడు సందునన్ నినిచెఁ గ్రూరశరంబు లురంబునందు గ్ర
క్కున నతఁ డొల్లఁ బోయి రథకూబర మూఁతగ నిల్చె సోలుచున్. **176**

ప్రతిపదార్థం: క్రీడి= అర్జునుడు; కినుక= కోపం; మనంబునన్= మనస్సున; కదిరి= వ్యాపించి; పితామహు విల్లు= భీష్ముడి విల్లు; వ్రేల్మిడిన్= చిటికలో; తునిమి= ఖండించి; నితాంత= మిక్కిలి; గాఢ= గొప్పదైన; రయ= వేగం కల; దోస్+విభవంబునన్= బాహుబలసంపదతో; ఒండు విల్లు= మరొక ధనువును; కైకొనియెడు సందునన్= తీసికొనే మధ్యలో; క్రూరశరంబులు= ఘోరమైన బాణాలు; ఉరంబునందున్= రొమ్ముపై; నినిచెన్= నింపాడు; గ్రక్కునన్= వెంటనే; అతఁడు= భీష్ముడు; ఒల్లఁ బోయి= మూర్ఛపోయి; రథ కూబరము= రథమునొగ; ఊఁతగన్= ఆధారంగా; సోలుచున్= తూలుతూ; నిల్చెన్= ఆగాడు.

తాత్పర్యం: అర్జునుడికి మళ్ళీ కోపం రాగా భీష్ముడి ధనువు త్రుంచి, వేగంగా అతడు మరొక విల్లు పుచ్చుకొనే లోపల సందు చూచుకొని, తీవ్రమైన బాణాలను అతని రొమ్ముమీద కొట్టేసరికి, అతడు దిమ్మ తిరిగిపోయి, సోలిపోతూ రథమునొగ పట్టుకొని ఆగాడు.

క. **కనుఁగొని సూతుం డరదముఁ । గొనిపోయెం దొలఁగ నపుడు కుంతీతనయుం**
డనిఁ దనివి సనక గుంపులు । గొని యున్నెడ లరసెఁ గలయఁ గురుసైన్యములన్. **177**

ప్రతిపదార్థం: సూతుండు= సారథి; కనుఁగొని= భీష్ముడు సోలిపోవటం చూచి; అరదమున్= రథాన్ని; తొలఁగన్+కొనిపోయెన్= అక్కడి నుండి మరొక చోటికి తోలుకొని పోయాడు; అపుడు; కుంతీ తనయుండు= అర్జునుడు; అనిన్= యుద్ధంలో; తనివి+ చనక= తృప్తిపొందక; కురుసైన్యములన్= కౌరవసేనలలో; గుంపులుకొని= గుమిగూడి; ఉన్న+ఎడలు= ఉన్న చోటులను; కలయన్+అరసెన్= అంతటా వెదికాడు.

తాత్పర్యం: భీష్ముడి రథసారథి అతడి పరిస్థితి చూచి మరొక చోటికి రథం తోలుకొని పోయాడు. అప్పుడు అర్జునుడు కౌరవసేనలలో ఎక్కువమంది ఎక్కడ గుంపులు గూడి ఉన్నారా అని కలయ చూచాడు.

వ. ఇ ట్ల ట్టెత్తి చూచి గాండీవంబు దొడసి గుణంబు సారించి కవదొనలు బిగియించి. 178

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; అట్టు+ఎత్తి= మెడ పైకెత్తి; చూచి= పరికించి; గాండీవంబు= గాండీవమును; తొడసి= నిమిరి; గుణంబు= నారి; సారించి= బిగించి; కవదొనలు= రెండు అమ్ముల పొదులను; బిగియించి= గట్టిగా బిగించుకొని.

తాత్పర్యం: ఈ రీతిగా మెడ ఎత్తి నాల్గుప్రక్కలా పరికించి, గాండీవాన్ని సిద్ధంచేసి, నారి బిగించి, అంప పొదులను రెంటిని బిగించుకొని.

క. ఆచార్య సూర్యతనయ కృ । పాచార్య ప్రభృతి రథికు లందఱుఁ బ్రోవై
జూచుచు నుండఁగ నద్దెస । కేచి భుజాబలము మెఱయ నింద్రజుఁ డరిగెన్. 179

ప్రతిపదార్థం: ఆచార్య= ద్రోణుడు; సూర్యతనయ= కర్ణుడు; కృపాచార్య ప్రభృతి= కృపాచార్యుడు మొదలైన; రథికులు+అందఱున్= రథికులంతా; ప్రోవు+ఐ= గుమికూడి; చూచుచున్+ఉండఁగన్= చూస్తూ ఉండగా; ఆ+దెసకున్= ఆ వైపునకు; ఏచి= విజృంభించి; భుజాబలము= పరాక్రమం; మెఱయన్= ప్రకాశించగా; ఇంద్రజుఁడు= అర్జునుడు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ద్రోణుడు, కర్ణుడు, కృపుడు మున్నగు రథికులు గుమికూడి, ఇంకా ఎవరు మిగిలారని చూస్తున్నాడో, ఎవరిమీద పడతాడో అన్నట్లుగా నిలిచి చూస్తుండగా అర్జునుడు తన భుజబలం మెరయగా వారున్న వైపుకే వెళ్ళాడు.

వ. అప్పు డశ్వత్థామ కర్ణున కిట్లనియె. 180

తాత్పర్యం: అప్పుడు అశ్వత్థామ కర్ణుడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'వీఁడె వచ్చుచున్నవాఁడు పార్థుఁడు; మన । మేమి సేయువార? మీవు దక్క
నొరులు నిలువరింప నోపెడువారు లే; । రోట లేక తాఁకి యోర్వవలయు.' 181

ప్రతిపదార్థం: పార్థుఁడు= అర్జునుడు; వీఁడె= ఇదుగో; వచ్చుచున్+ఉన్నవాఁడు= మనవైపు వస్తున్నాడు; మనము= మనందరం; ఏమి+చేయువారము?= ఏమి చేయగలం?; ఈవు+తక్కన్= నీవు తప్ప; ఒరులు= ఇతరులు; నిలువరింపన్= అర్జునుడిని ఆపటానికి; ఓపెడువారు= సమర్థులైనవారు; లేరు; ఓట లేక= వెనుదియ్యక; తాఁకి= ఎదిరించి; ఓర్వవలయున్= ఓడించవలెను.

తాత్పర్యం: 'అదుగో అర్జునుడు మనవైపే వస్తున్నాడు. ఎవరి నేమి చేస్తాడో తెలియదు. నీవు తప్ప అతడిని నిలుపగలిగేవారు లేరు. నీవే వెనుబాటు లేక ఎదుర్కొని ఓడించాలి?'

విశేషం: అలం: వ్యాజస్తుతి

క. **అని తను నుల్లసమాడినఁ । గినిసి యినతనూజుఁ 'డేను గ్రీడి నిచట మా**
ర్కొను వీఁకఁ గన్నులారం । గనుఁగొనుమీ నిలిచి' యనుచుఁ గవిసెం బెలుచన్. **182**

ప్రతిపదార్థం: అని= ఈ రీతిగా; తనున్= తనను (కర్ణుని); ఉల్లసమాడినన్= పరిహాసం చేయగా; కినిసి= కోపించి; ఇనతనూజుఁడు= సూర్యసుతుడైన కర్ణుడు; ఏను= నేను; క్రీడిన్= అర్జునుడిని; ఇచటన్= ఈ యుద్ధంలో; మార్కొనువీఁకన్= ఎదిరించే పరాక్రమాన్ని; నిలిచి= నిలువబడి; కన్నులారన్= కన్నులనిండా; కనుఁగొనుమీ= చూడుమా; అనుచున్= అని పల్కుతూ; పెలుచన్= మిక్కిలి; కవిసెన్= ఎదిరించాడు.

తాత్పర్యం: అని తనను పరిహసించినందు కెంతో కోపించి, కర్ణుడు - 'నే నర్జునుడి నెదిరించటాన్ని కన్నులారా చూడు' మంటూ కోపంతో ఎదిరించాడు.

క. **దొరలును సుభటులుఁ గర్ణుని । యరదమునకు మున్న పొదివి; రర్జును నచటం**
గరి సొచ్చిన తుంగ మడువు । పరుసున మొన చాఁపకట్టు వడియె నతనిచేన్. **183**

ప్రతిపదార్థం: దొరలును= రథికులును; సుభటులున్= యోధులును; కర్ణుని+అరదమునకున్= కర్ణుడియొక్క రథానికి; మున్ను+అ= ముందుగా; అర్జునున్= అర్జునుడిని; పొదివిరి= చుట్టుముట్టారు; అచటన్= ఆ యుద్ధరంగంలో; కరి= ఏనుగు; చొచ్చిన= ప్రవేశించిన; తుంగ మడువు పరుసునన్= తుంగగడ్డి పెరిగి ఉన్న సరస్సువలె; మొన= ఎదుర్కొన్న సైన్యమంతా; అతనిచేన్= అర్జునుడిచేత; చాఁపకట్టు= చాపచుట్టగా, అందరూ ఒక్కసారిగా; పడియెన్= పడింది.

తాత్పర్యం: రథికులు, యోధులు కర్ణుడి రథానికి ముందుగానే అర్జునుడి నెదుర్కొన్నారు. అర్జునుడు వారినందరిని తుంగ బలిసిన మడుగులో ప్రవేశించిన ఏనుగు ఆ గడ్డినంతటిని త్రొక్కి పడవేసినట్లుగా వాళ్ళందరినీ లుంగ లుంగలుగా చాపచుట్టగా పడేశాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. **ఇవ్విధంబునఁ బోరెడు నింద్రతనయు । నుక్కులావును నంతంత కెక్కుడయ్యె**
నలసి మేనులు తూలాడ నిలిచి రంత । నంత నయ్యోధముఖ్యు లాహవము దక్కి. **184**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; పోరెడు= యుద్ధం చేస్తున్న; ఇంద్ర తనయు= అర్జునుడియొక్క; ఉక్కు= చేవయు; లావును= బలమును; అంతంతకున్= క్రమక్రమంగా; ఎక్కుడు= ఎక్కువ; అయ్యెన్= అయింది; ఆ+యోధముఖ్యులు= కౌరవసేనలోని ఆ యోధశ్రేష్ఠులు; అలసి= బడలిక చెంది; మేనులు= శరీరాలు; తూలాడన్= తూలిపోతూ ఉండగా; ఆహవము= యుద్ధం; తక్కి= మాని; అంతన్+అంతన్= దూర దూరంగా; నిలిచిరి= ఆగి ఉన్నారు.

తాత్పర్యం: ఇన్ని రకాలుగా యుద్ధంచేస్తున్న అర్జునుడికి ఉత్సాహం, బలం అంతకంతకు పెరుగుతున్నాయి. కౌరవవీరులు అలసిపోయి, శరీరాలు తూలిపోయి, యుద్ధం మానివేసి ఆ ప్రక్కకు, ఈ ప్రక్కకు దూరదూరంగా పోయి నిలిచారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్టియెడ నుత్తరుండు నరున కిట్లనియె. 185

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయాన; ఉత్తరుండు; నరునకున్= అర్జునునితో; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అప్పుడు సారథి అయిన ఉత్తరుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

చ. 'ఉడుకువ లేని కయ్యమున కోర్వఁగ వచ్చునె? నాకు డప్పి పు
ట్టెడు; నొకమాటు నాగ్రహము డింపవు నీవును; జక్కుసేసి ప
చ్చడి గలపంగ వెండియును జండితనంబున వచ్చి వచ్చి పో
రెడు మొన, లింకఁ జాల నొనరింప భవద్రథసూతకృత్యమున్.' 186

ప్రతిపదార్థం: ఉడుకువ లేని= విశ్రాంతి లేని; కయ్యమునకున్= యుద్ధానికి; ఓర్వఁగన్+వచ్చునె?= ఓర్చుకొనవచ్చునా?; నాకున్= నాకు; డప్పి= దాహము; పుట్టెడున్= పుట్టుతున్నది; నీవును; ఒక మాటున్= ఒక్కసారి కూడా; ఆగ్రహము= కోపం-ఆవేశం; డింపవు= తగ్గించుకొనవు; చక్కు+చేసి= ముక్కలుచేసి; పచ్చడి కలపంగన్= పచ్చడివలె చేసినను; వెండియును= మరల; మొనలు= సేనలు; చండితనంబునన్= క్రూరత్వంతో; వచ్చి వచ్చి= మీదికి వచ్చి; పోరెడున్= పోరుతున్నవి; ఇంకన్= ఇటుపై; భవత్= నీయొక్క; రథ= రథానికి; సూత కృత్యమున్= సారథ్యమును; ఒనరింపన్+చాలను= చేయలేను.

తాత్పర్యం: 'విరామం లేకుండా యుద్ధం చేస్తుంటే ఎట్లా సహించేది? నాకు దాహం వేస్తున్నది. నీవు ఒక్కసారైనా ఆగ్రహావేశం మానకున్నావు. సైనికులా - నీవు వారిని ముక్క ముక్కలు చేసి, పచ్చడి చేసినా, మొండితనంగా ఇంకా మీదమీదకు వస్తూనే ఉన్నారు. నేను మాత్రం ఇంక నీకు సారథ్యం చేయలేను.'

వ. అనిన విని కవ్వడి నవ్వుచు 'నేను గలుగ నీకు నోహటింప నేల? యంతియ; వలసినం దురంగంబులఁ దోడు గడపెద; నించుక సైరించి నిలువ వలయు; నెల్లపనులును జక్కనయ్యెఁ; రా జొక్కరుండు కొఱంత; యాతం డభిమాని; మనలం గని సరకుగొనఁ; డిప్పుడున్న చందంబు మనతోడం దలపడం గడంగుట దోఁచుచున్న యది; తమ్ములు నాప్తభృత్యులు నిరుగెలంకుల నగ్గలిక మెఱసి డగ్గఱి యున్న వా'రని కౌరవేశ్వరుని గట్టి మోహరంబు సూపి యతనిం బురికొల్పి యద్దిక్కు తేరు పోవనిమ్మనుటయు నతండును దలకొని యట్ల చేయ నడరి యెడనెడ నడ్డుపడు కురుబలములఁ జిఱునగవు నిగుడ మెఱుంగు వాలమ్ములఁ దొలంగ జడియుచుం గదిసిన, నమ్మేదినీవల్లభుండు. 187

ప్రతిపదార్థం: అనినన్= ఉత్తరు డట్లా పలుకగా; విని; కవ్వడి= అర్జునుడు; నవ్వుచున్= నవ్వుతూ; నేను కలుగన్= నేనుండగా; నీకున్= నీకు; ఓహటింపన్+ఏల?= వెనుదీయనేల?; అంతియ= అంతే; వలసినన్= కావలసినచో; తురంగంబులన్= గుర్రాలను; తోడు గడపెదన్= నీకు సహాయంగా నేను నడుపుతాను; ఇంచుక= కొద్దిగా; సైరించి= సహించి; నిలువ వలయున్= ఆగవలెను; ఎల్ల పనులును= యుద్ధపు పనులన్నియును; చక్కన్+అయ్యెన్= అనుకూలంగానే అయినవి; రాజు+ఒక్కరుండు= దుర్యోధను డొక్కడే; కొఱంత= మిగిలి ఉన్నాడు; ఆతండు= అతడు; అభిమాని= అభిమానం కలవాడు; మనలన్= మనలను; కని= చూచి; సరకు+కొనఁడు= లెక్కచేయడు; ఇప్పుడున్న చందంబు= ఇప్పుడాతడున్న తీరు; మనతోడన్= నాతో; తలపడన్= యుద్ధానికి పూనుకొనటానికి; కడంగుట= ప్రయత్నించటంగా; తోఁచుచున్న+అది= తోస్తున్నది; తమ్ములున్= తన తమ్ములైన

దుశ్శాసనాదులును; ఆప్తభృత్యులున్= ఆప్తులైన సేవకులును; ఇరు కెలంకులన్= రెండు ప్రక్కలందును; అగ్గలిక మెఱసి= ఎక్కువగా మెరసి; డగ్గఱి+ఉన్నవారు= దగ్గరగా ఉన్నారు; అని= పలికి; కౌరవేశ్వరుని= దుర్యోధనుడియొక్క; గట్టి మోహరంబు= గట్టిదైన వ్యూహాన్ని; చూపి= కనపరచి; అతనిన్= ఉత్తరుడిని; పురికొల్పి= ప్రేరేపించి; ఆ+దిక్కు= ఆ వైపునకు; తేరు= రథాన్ని; పోవనిమ్ము= పోనిమ్ము; అనుటయున్= అనగా; అతండును= ఉత్తరుడు కూడ; తలకొని= అంగీకరించి; అట్లు+అ చేయన్= అట్లే చేయగా; అడరి= అతిశయించి; ఎడనెడన్= మధ్యమధ్యలో; అడ్డపడు= అడ్డం వచ్చే; కురువీరులన్= కౌరవవీరులను కూడ; చిఱునగవు= చిరునవ్వు; నిగుడన్= వ్యాపించగా; మెఱుంగు వాలమ్ములన్= మెరిసెడి వాడి బాణాలతో; తొలంగన్= తొలగేటట్లు; జడియుచున్= జడిపిస్తూ; కదిసినన్= సమీపించగా; ఆ+మేదినీ వల్లభుండు= ఆ రాజు దుర్యోధనుడు.

తాత్పర్యం: ఉత్తరుడి మాటలు విని అర్జునుడు నవ్వుతూ - 'నే నుండగా నీకు భయమెందుకు? నా మాట నిజం. నమ్ముము. కావలసివస్తే రథసారథ్యంలో నేనూ కొంత సహాయం చేస్తాను. మరింక కొద్దిసేపు ఓపిక పట్టి నీవు ధైర్యంగా నిలబడాలి. అన్ని పనులు అనుకొన్నట్లుగానే సవ్యంగా జరిగాయి. ఇక ఆ దుర్యోధను డొక్కడే మిగిలి ఉన్నాడు. అతడు మిక్కిలి ఆత్మాభిమానం కలవాడు. మనలను చూచి లెక్కచేయడు. ఇపు డత డున్న తీరు గమనిస్తే మనతో యుద్ధానికి సిద్ధమౌతున్నట్లు తోస్తున్నది. అతడి తమ్ములు, ఆత్మీయులు, సేవకులు (సామంతులు) అతడికి రెండువైపులా (కుడిఎడమల) నిలిచి ఉత్సాహంతో ఉరకలెత్తుతున్నారు. చూడు' మని వాళ్ళనూ, కురురాజునూ, వారి గట్టి యుద్ధవ్యూహాన్ని చూపి, ఉత్తరుడిని ఉత్సాహపరచి, ఆ దిక్కుకు రథాన్ని పోనిమ్మన్నాడు అర్జునుడు. అతడు అట్లాగే చేశాడు. దుర్యోధనుడి వైపు వెళ్ళుతున్న అర్జునుడికి కురుబలాలు కొన్ని అడ్డువచ్చాయి. వాళ్ళను అతడు చిరునవ్వులు చిందిస్తూ అవలీలగా వాడిబాణాలతో బాది భయంతో ప్రక్కకు తొలగేటట్లు చేసి, హుటాహుటిగా రారాజును సమీపించాడు.

అర్జునుఁడు దుర్యోధనునితో యుద్ధంబు సేయుట (సం. 4-60-1)

క. **పులిఁ గోల వేసిన ట్టి । ట్టలపు రయంబునఁ గడంగుటయుఁ దద్వక్షః**
స్థలమునఁ గిరీటి రెండ । మ్ముల నాటఁగ నేసె బొమలు ముడివడుచుండన్. **188**

ప్రతిపదార్థం: పులిన్= పులిని; కోలన్= బాణంతో; వేసిన+అట్టు= వేసిన రీతిగా; ఇట్టలము+రయంబునన్= అధికమైన వేగంతో; కడంగుటయున్= సిద్ధంకాగా; కిరీటి= అర్జునుడు; తద్+వక్షస్+స్థలమునన్= ఆతడి రొమ్ముపై; రెండు+అమ్ములన్= రెండు బాణాలను; బొమలు= కనుబొమలు; ముడి+పడుచుండన్= కోపంతో ముడుచుకొనగా; నాటఁగన్= నాటేటట్లు; ఏసెన్= బాణాలతో కొట్టాడు.

తాత్పర్యం: బాణపు దెబ్బతిన్న పెద్దపులివలె అధికమైన వేగంతో యుద్ధానికి సిద్ధపడిన దుర్యోధనుడి రొమ్ముమీద మిక్కిలి కోపంతో కనుబొమలు ముడివడిన అర్జునుడు రెండు బాణాలు నాటేటట్లు వేశాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **క్షతములఁ బెల్లు దొరఁగు శో । ణిత ధారలు మదముగా వినిర్గళకరి యా**
కృతిఁ గవిసి యతం డేసెను । శతమఖసుతు ఫాలతలము శాతశరమునన్. **189**

ప్రతిపదార్థం: క్షతములన్= బాణపు దెబ్బలనుండి; పెల్లు= ఎక్కువగా; తొరఁగు= ప్రవహించే; శోణిత ధారలు= రక్తధారలు; మదముగాన్= మదజలం కాగా; వినిర్గళ= బయటికి వచ్చే; కరి+ఆకృతిన్= ఏనుగు వలె; కవిసి= ఎదుర్కొని; అతండు= ఆ దుర్యోధనుడు; శతమఖసుతు= అర్జునునియొక్క; ఫాలతలమున్= నెన్నుదురును; శాత శరమునన్= వాడి అయిన బాణంతో; ఏసెను= కొట్టాడు.

తాత్పర్యం: బాణపు దెబ్బలనుండి కారే రక్తం మదజలమా అన్నట్లు వెలువడి వచ్చే ఏనుగువలె దుర్యోధనుడు వచ్చి, అర్జునుడి నెదిరించి, అతడి నుదుటిమీద వాడిబాణంతో కొట్టాడు.

విశేషం: అలం: ఉపమ-రూపకానుప్రాణితం - శోణితధారలకునూ మదజలానికీ అభేదం.

తే. **రక్తధారలు వెడలంగ రశ్మి వెలుఁగఁ। బొలుచు బాలార్కు చాడ్పునఁ జెలువు మిగిలి**
ఫల్గునుండు ప్రతాప సంభరిత మూర్తి। యగుచు శరకిరణంబులు నిగుడఁ జేసె. **190**

ప్రతిపదార్థం: రక్తధారలు= రక్తముయొక్క ధారలు; వెడలంగన్= బయటికి రాగా; రశ్మి= కాంతి; వెలుఁగన్= ప్రకాశించగా; పొలుచు= ఒప్పారే; బాల+అర్కుచాడ్పునన్= లేతసూర్యుడి వలె; చెలువు మిగిలి= ఎక్కువగా అందగించి; ఫల్గునుండు= అర్జునుడు; ప్రతాప= ప్రతాపంతో; సంభరిత= నిండిన; మూర్తి, అగుచున్= శరీరం కలవాడై; శరకిరణంబులు= బాణాలనెడి కిరణాలు; నిగుడన్= వ్యాపించేటట్లు; చేసెను= చేశాడు.

తాత్పర్యం: మొగంనుండి రక్తధారలు కారుతూ ఉండగా కిరణాలతో ప్రకాశించే లేతసూర్యుని వలె అర్జునుడు ప్రతాపంతో వెలుగుతూ ఉన్నవాడై బాణాలనే కిరణాలను చక్కగా ప్రసరింపజేశాడు.

విశేషం: అలం: ఉపమ, రూపకానుప్రాణితం.

శా. **వానిం దీవ్రశరంబులం దునిమి గర్వం బెక్క నానాస్త్ర సం**
తానంబుల్ గురిసెన్ సుయోధనుఁడు దుర్దాంతాకృతిన్ గోత్రభి
త్సూనుండుం బటు సాయకోత్కరమునం జూపెన్ భుజాటోప మి
ట్లేనుం గేనుఁగుఁ దాఁకునట్లు సమరం బేపారఁగా నయ్యెడన్. **191**

ప్రతిపదార్థం: వానిన్= ఆ వచ్చు బాణములను; తీవ్ర శరంబులన్= వాడియైన బాణాలతో; తునిమి= ఖండించి; గర్వంబు+ ఎక్కన్= గర్వం అతిశయించి; నానా+అస్త్ర సంతానంబుల్= పలురకాలైన బాణ సముదాయాలను; సుయోధనుఁడు= దుర్యోధనుడు; కురిసెన్= కురిపించాడు; గోత్రభిత్సూనుండున్= అర్జునుడు కూడా; దుర్దాంత+ఆకృతిన్= సహించజాలని ఆకారంతో; పటు= గట్టివైన; సాయక= బాణాలయొక్క; ఉత్కరమునన్= సముదాయంతో; భుజ+ఆటోపము= భుజ విక్రమాన్ని; చూపెన్= ప్రదర్శించాడు; ఇట్లు= ఈ రీతిగా; ఏనుంగు; ఏనుంగున్= మరొక ఏనుగును; తాఁకు+అట్లు= ఎదిరించినట్లుగా; సమరంబు= యుద్ధం; ఏపారఁగాన్= హెచ్చు కాగా; ఆ+ఎడన్= అప్పుడు.

తాత్పర్యం: అర్జునుడు వేసిన బాణాలను దుర్యోధనుడు వాడి బాణాలతో మధ్యలోనే ఖండించి, గర్వంతో రకరకాల బాణాలు అర్జునుడిమీద వేశాడు. అప్పు డర్జునుడు భీకరాకారంతో తన పరాక్రమాన్ని చూపించాడు. ఇట్లా ఏనుగును ఏనుగు తాకినట్లుగా యుద్ధం ఘోరంగా సాగుతున్నది. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

తే. **హస్తిపురిఁ బేరు గల మదహస్తి నెక్కి । క్రాలు కావలి రథములు గవియుఁదేర**
నభ్రగజముపైఁ బర్జన్యుఁ డనఁగ నంప । వాన పరఁగ వికర్ణుండు వచ్చి తాఁకె. **192**

ప్రతిపదార్థం: హస్తిపురిన్= హస్తినాపురి పట్టణంలో; పేరుకల= ప్రసిద్ధికెక్కిన; మదహస్తిన్= మదపుటేనుగును; ఎక్కి; క్రాలు= ప్రకాశించే; కావలి రథములు= కాపలా ఉన్న రథాలు; కవియుఁదేరన్= సమీపించగా; అభ్రగజముపైన్= ఆకాశమందలి ఏనుగుపై (ఐరావతంమీద); పర్జన్యుఁడు+అనఁగన్= ఇంద్రుడా అన్నట్లుగా; అమ్ము+వాన= బాణవర్షం; పరఁగన్= వ్యాపించగా; వికర్ణుండు= వికర్ణుడు; వచ్చి తాఁకెన్= అర్జునుడిని ఎదిరించాడు.

తాత్పర్యం: హస్తినాపురంలో పేరు మోసిన మదపుటేనుగు నెక్కి, కావలిగా రథాలపై రథికులు రాగా - ఐరావతం మీద ఇంద్రుడు వచ్చాడా అన్నట్లు వికర్ణుడు వచ్చి బాణవర్షం కురిపిస్తూ అర్జునుడి నెదిరించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

ఉ. **వీఁక నెదిర్చి యిట్లు కురువీరులకుం బ్రమదం బొనర్చుచుం**
దాఁకినఁ గ్రోధవేగ సముదగ్రత నెఱ్ఱని చూడ్కిఁ జూచి పే
రాఁకలితోడ నున్న జమునాకృతి భీషణరేఖ యొప్పఁగా
వ్రేఁకని నారసంబుఁ దొడి క్రీడి కరిన్ దృఢముష్టి నేసినన్. **193**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; వీఁకన్= పరాక్రమంతో; ఎదిర్చి= ఎదిరించి; కురు వీరులకున్= కౌరవసేనలోని వీరులకు; ప్రమదంబు= సంతోషమును; ఒనర్చుచున్= కలిగిస్తూ; తాఁకినన్= ఎదిరించగా; క్రీడి= అర్జునుడు; క్రోధవేగ= కోపముయొక్క, వేగముయొక్క; సముదగ్రతన్= అతిశయంతో; ఎఱ్ఱని చూడ్కిన్= ఎర్రని చూపుతో; చూచి; పేరు+ఆఁకలి తోడన్= ఎక్కువ ఆకలితో; ఉన్న= ఉన్న; జము+ఆకృతిన్= యముడి ఆకారంతో; భీషణ రేఖ= భయంకరమైన వైఖరి; ఒప్పఁగాన్= ప్రకాశించగా; వ్రేఁకని= దుస్సహమైన; నారసంబున్= గొప్పగా శబ్దంచేసే నారసమనే పేరుగల బాణాన్ని; తొడి= తొడిగి; కరిన్= ఏనుగును; దృఢముష్టిన్= గట్టి పిడికిటితో పట్టి; ఏసినన్= వేయగా.

తాత్పర్యం: వికర్ణు డెదిరించే సరికి కౌరవవీరులందరు సంతోషించారు. అర్జునుడికి కోపం హెచ్చిపోయింది. అందువలన కన్ను లెఱ్ఱబడగా భయంకరంగా చూచాడు. ఆకలితో మీదపడే యముడివలె గొప్ప నారసాన్ని ఎక్కుపెట్టి లాగి వికర్ణుడి ఏనుగును తీవ్రంగా కొట్టాడు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. **ఫాలకుంభ సంధిఁ బడి వాలమున వెస । నుచ్చి పోవుటయును నుర్వి యద్రువఁ**
గూలె నగ్గజంబు కులిశ చండాహతిఁ । బడు మహానగంబు భంగి దోఁప. **194**

ప్రతిపదార్థం: ఫాలకుంభ సంధిన్= ఫాలానికీ కుంభస్థలానికి మధ్యభాగంలో; పడి= గ్రుచ్చుకొని; వెసన్= శీఘ్రంగా; వాలమునన్= తోకగుండా; ఉచ్చి పోవుటయునున్= దూసికొని పోగా; ఉర్వి= భూమి; అద్రువన్= అదరగా; ఆ+గజంబు= ఆ ఏనుగు; కులిశ= వజ్రముయొక్క; చండ+ఆహతిన్= తీవ్రమైన దెబ్బతో; పడు= పడునట్టి; మహానగంబు భంగిన్= పెద్ద కొండరీతి; తోఁపన్= తోచగా; కూలెన్= చచ్చిపడింది.

తాత్పర్యం: అర్జునుడు ప్రయోగించిన ఆ బాణం నుదుటికీ కుంభస్థలానికీ మధ్యభాగంలో గ్రుచ్చుకొని తోకవరకు వేగంగా దూసికొని పోగా, ఆ యేనుగు వజ్రపుదెబ్బకు పడిపోయిన పెద్ద కొండవలె నేల అదిరేటట్లు పడిపోయింది.

విశేషం: అలం: ఉపమ.

క. **అరుణ మణి మాలికా వి । స్ఫురణంబున దంతితనువు చూడఁగ నొప్పెన్**
ధరణిఁ బడియున్న బహుముఖ । పరిగత దావాగ్నిఁ బొల్చు పర్వతము క్రియన్. **195**

ప్రతిపదార్థం: దంతి తనువు= ఏనుగు శరీరం; అరుణమణి= కెంపులయొక్క; మాలికా= మాలయొక్క; విస్ఫురణంబునన్= ప్రకాశంతో; ధరణిన్= భూమిపై; పడి+ఉన్న= పడిపోయి ఉన్న; బహుముఖ= అనేక ముఖాలుగా; పరిగత= వ్యాపించిన; దావ+ అగ్నిన్= దావాగ్నితో; పొల్చు= ఒప్పే; పర్వతము క్రియన్= కొండవలె; చూడఁగన్= చూడటానికి; ఒప్పెన్= అమరింది.

తాత్పర్యం: ఎర్రని కెంపుల మాలతో ప్రకాశిస్తూ, పడివున్న ఆ ఏనుగు శరీరం పలుచోట్ల మంటలు మండే దావాగ్నితో వెలుగొందే పర్వతమో అన్నట్లు ఒప్పారింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. **ఇవ్విధంబున నేనుంగు పీనుంగైన వికర్ణుండు వెఱ చఱచి పఱచి వివింశతిరథం బెక్కె; నాలోనన యట్టి నారాచంబున రారాజు నురంబు నోనాట నేసినఁ గరీంద్రుండు వడుటయు నరేంద్రుండు నొచ్చుటయుం గని టిచ్చపడు రథికుల వివ్వచ్చుం డనర్గళ ప్రసారం బగు మార్గణాసారంబున ముంచిన వెగడుపడి విఱిగి పాఱి; రిత్తెఱంగునఁ దనచుట్టును బయలైన నయ్యురగకేతనుండును మరలె; నిట్లు దొరయును విఱిగి కలను వాసి కాలు ద్రోసిపోవుటయు, నతిరథ మహారథు లెల్లం జెల్లాచెద రగుటయుం జూచి సైన్యంబు లున్నవి యున్నచోటన తెరలి కనుకనిం బఱవం దొడంగిన.** **196**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ఏనుంగు పీనుంగు+ఐనన్= ఏనుగు చచ్చిపోగా; వికర్ణుండు= వికర్ణుడు; వెఱచఱచి= భయపడి; వివింశతి రథంబు= వివింశతియొక్క రథాన్ని; ఎక్కెన్= ఎక్కాడు; ఆలోనన్+అ= అంతలోనే; అట్టి నారాచంబునన్= అటువంటి బాణంతోనే; రాజరాజు+ఉరంబు= రాజరాజు దుర్యోధనుని రొమ్మును; నోన్= నొచ్చునట్లు; నాటన్= నాటునట్లు; ఏసినన్= వేయగా; కరీంద్రుండు= పెద్ద ఏనుగు; పడుటయున్= చావటము; నరేంద్రుండు= దుర్యోధనుడు; నొచ్చుటయున్= బాధపడటమున్నూ; కని= చూచి; టిచ్చపడు= ఆశ్చర్యపడెడి; రథికులన్= రథముపైనుండి యుద్ధం చేసేవారిని; వివ్వచ్చుండు= అర్జునుడు; అనర్గళ= అడ్డులేని; ప్రసారంబు+అగు= ప్రసారంకల; మార్గణ= బాణాలయొక్క; ఆసారంబునన్= జడివానలో; ముంచినన్= ముంచెత్తగా; వెగడుపడి= భయపడి; విఱిగి= బలం చెడి; పాఱిరి= పరుగెత్తారు; ఈ+తెఱంగునన్= ఈ రీతిగా; తనచుట్టును= తనకు చుట్టూ ఉన్న ప్రదేశం; బయలు+ఐనన్= ఎవ్వరును లేని ప్రదేశం కాగా; ఆ+ఉరగ కేతనుండును= ఆ దుర్యోధనుడును; మరలెన్= వెనుకకు తిరిగిపోయాడు; ఇట్లు= ఈ విధముగా; దొరయును= ప్రభువు కూడా; విఱిగి= బలం చెడి; కలను= యుద్ధరంగం; పాసి= వదలి; కాలుద్రోసి= నిలువక; పోవుటయున్= పారిపోగా; అతిరథ మహారథులు= గొప్ప గొప్ప రథికులు; ఎల్లన్= అందరును; చెల్లాచెదరు+అగుటయున్= అంతటా చెదరిపోవటమున్నూ; చూచి; సైన్యంబులు= సేనలు; ఉన్నవి ఉన్నచోటన్+అ= ఉన్నవి ఉన్నచోటనే; తెరలి= చెదరిపోయి; కనుకనిన్= సంభ్రమంతో; పఱవన్+తొడంగినన్= పారిపోవటానికి ప్రారంభించగా.

తాత్పర్యం: ఈ విధంగా ఏనుగు పీనుగై పోయేసరికి హడలిపోయి వికర్ణుడు పరుగెత్తి వివింశతి రథమెక్కాడు. అంతలో అర్జునుడు, అటువంటి బాణమే ఇంకొకటి దుర్యోధనుడి రొమ్ముమీద నాటేటట్లు వేయగా అతడు దెబ్బతిన్నాడు. అట్లా ఏనుగు చావటం, దుర్యోధనుడు దెబ్బతినటం చూసి తెల్లబోయారు రథికులు. అర్జునుడు వారిని అడ్డులేని బాణవర్షంలో ముంచెత్తాడు. వారు హడలిపోయి పారిపోయారు. ఆ రీతిగా తనచుట్టూ ఎవ్వరూ లేకపోయేసరికి దుర్యోధనుడు కూడా వెనుకకు తిరిగాడు. ఈవిధంగా ప్రభువు కూడా వెనుకకు మరలి, అతిరథ మహారథులందరూ చెల్లాచెదరయ్యేసరికి సేనలు ఉన్నవి ఉన్నచోటే చెదరిపోయి భయంతో పారిపోవటం ప్రారంభించాయి.

తే. **యూథపతితోడి దంతిసముత్కరంబు । వెనుకఁ దగిలెడు సింగంబు విధము దోఁప**
నార్పు నాదంబుగా నరుఁ డంటఁ దాఁకె । రాజుఁ దారును బాఱెడు రథిక వరుల. **197**

ప్రతిపదార్థం: యూథపతితోడి= ఏనుగుల గుంపుకు నాయకుడైన పెద్దఏనుగుతో కలిసి వెళ్ళుతున్న; దంతి సముత్కరంబు= ఏనుగుల మందయొక్క; వెనుకన్= వెనుక; తగిలెడు= తరిమి వెంబడించే; సింగంబు విధము= సింహముయొక్క రీతి; తోఁపన్= తోచగా; రాజున్= దుర్యోధనుడిని; తారును= తామును; పాఱెడు= పారిపోయే; రథిక వరులన్= రథిక శ్రేష్ఠులను; అంటన్= అంటేటట్లుగా; ఆర్పునాదంబుగాన్= ఆర్పులే సింహనాదంగా; నరుఁడు= అర్జునుడు; తాఁకెన్= దాడి చేశాడు.

తాత్పర్యం: యూథనాయకుడితో సహా ఏనుగుల మందను వెంబడించే సింహం వలె దుర్యోధనుడిని, అతడిని వెంబడించి పారిపోయే రథికవరులను అర్జునుడు ఆర్పులు పెట్టుతూ తరిమి వెంబడించి దాడి చేశాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **వెనుకొని కర్ణుని పెడతల । యును దుశ్శాసనుని వీఁపు నొక్కొక్క శరం**
బున నేసె నప్పు డయ్యిన । తనయుం డిట్లనియె నతిరథశ్రేష్ఠులతోన్. **198**

ప్రతిపదార్థం: వెనుకొని= వెనుకనే వెంబడించి; కర్ణుని పెడతలయును= కర్ణుడియొక్క తలప్రక్క భాగాన్ని; దుశ్శాసనుని వీపును= దుశ్శాసనుడి యొక్క వీపును; ఒక్కొక్క శరంబునన్= ఒక్కొక్క బాణంతో; ఏసెన్= కొట్టాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+ఇన తనయుండు= ఆ కర్ణుడు; అతిరథ శ్రేష్ఠులతోన్= అతిరథ శ్రేష్ఠులైన భీష్మ ద్రోణాదులతో; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: వెనుకనే వెంబడించి అర్జునుడు కర్ణుడి పెడతలను, దుశ్శాసనుడి వీపును ఒక్కొక్క బాణంతో కొట్టాడు. అప్పుడు కర్ణుడు భీష్మద్రోణాదులతో ఇట్లా అన్నాడు.

ఆ. **'కూడముట్టెఁ గ్రీడి కురువంశమున కెల్ల । మూలకంద మీ నృపాలుఁ డితని**
నిచటఁ గాచికొనుట యెల్ల పౌరుషములు । జేఁత; నిలిచి లావు సేయవలయు. **199**

ప్రతిపదార్థం: క్రీడి= అర్జునుడు; కూడన్= వెనుకవచ్చి కలిసికొని; ముట్టెన్= ముట్టడించాడు; ఈ నృపాలుఁడు= ఈ దుర్యోధనుడు; కురువంశమునకున్= కౌరవవంశానికి; ఎల్లన్= అంతకును; మూలకందము= మూలమైనవాడు; ఇచటన్= ఈ యుద్ధంలో; ఇతనిన్= ఈ దుర్యోధనుడిని; కాచికొనుట= రక్షించుకొనటం; ఎల్ల పౌరుషములున్= సకల పురుష ప్రయత్నాలూ; చేఁత= చేయటం; నిలిచి= ఆగి; లావు= బలం; చేయవలయున్= చూపాలి.

తాత్పర్యం: అర్జునుడు వెనుకనుండి మనలను వెంటాడి కొట్టుతున్నాడు. ఈ దుర్యోధనుడే కురువంశానికి మూలమైనవాడు. ఇక్కడ మనమందరం మన బలపౌరుషాలను ప్రదర్శించి ఇతడిని రక్షించుకొనాలి. ఇది మన కర్తవ్యం.

విశేషం: ఘోషయాత్రాఘట్టంలో చిత్రరథుడు దుర్యోధనుడిని సపరివారంగా బంధించి తీసికొనిపోయినట్లుగా అర్జునుడు కూడా చేస్తాడేమోనని భయపడిన కర్ణుడు అందరి సహాయాన్ని కోరుతున్నాడు. ప్రభురక్షణం సేవాధర్మమని ప్రబోధిస్తున్నాడు. ఇవి కర్ణుడి ప్రవృత్తికి తగిన మాటలు. (సంపా.)

క. అన వినుచుఁ గురుపితామహుఁ। డును ద్రోణుఁడు ద్రోణపుత్త్రుఁడును గృపుఁడును గ
ర్ణుని మాట సరకుసేయక। చనుచుండఁగ దీనవృత్తి జనపతి పలికెన్. 200

ప్రతిపదార్థం: అనన్= అని పలుకగా; వినుచున్= వింటూ; కురుపితామహుఁడును= భీష్ముడును; ద్రోణుఁడున్; ద్రోణపుత్రుఁడును= అశ్వత్థామయు; కృపుఁడును= కృపాచార్యుడును; కర్ణునిమాట= కర్ణుడు చెప్పిన మాటను; సరకుచేయక= లెక్కసేయక; చనుచున్+ఉండఁగన్= వెళ్ళుతూ ఉండగా; జనపతి= దుర్యోధనుడు; దీనవృత్తిన్= దైన్యంగా; పలికెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ పల్కులను వింటూ కూడా భీష్ముడు, ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు ఆతని మాటలను లెక్కచేయకుండా వెళ్ళిపోతూంటే, దుర్యోధనుడు దీనంగా ఇట్లా అన్నాడు.

విశేషం: భీష్మద్రోణాదులు కర్ణుడి మాటలను లక్ష్యం చేయకపోవటానికి మూడు కారణాలు కానవస్తున్నాయి. 1. వీరులలో భీష్మాదుల వలె అతడు ఉన్నత పదాధికారి కాడు. అందువలన ఆజ్ఞలు భీష్మాదులు పాటించరు. 2. కర్ణుడికి భీష్మాదులమీద గౌరవం లేదు. అతడిని ఆసరాగా చేసికొని దుర్యోధనుడు కూడా భీష్మాదులను లెక్కచేయడు. రారాజే స్వయంగా కర్ణుడి అసమర్థతను గుర్తించి స్వయంగా తమను కోరినప్పుడే సాయపడాలనే భావం వారి మనస్సులలో ఉండటం. 3. తానే అర్జునుడిని ఓడిస్తానని ప్రగల్భాలాడి, ఇప్పుడు అందరి సాయం కోరుతున్న కర్ణుడి బడాయిని, బండారాన్ని బయటపెట్టాలని భీష్మాదులు భావించటం. దుర్యోధనుడు ఆ సన్నివేశంలోని గాంభీర్యాన్ని గుర్తించాడు. 'అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు'- అనే సామెత నిజమైనట్లు దుర్యోధనుడు తానే వారిని ప్రార్థించటానికి పూనుకొన్నాడు. అసమర్థుల అహంకారం అవమానాలకు ఆలవాలమౌతుందని దుర్యోధనుడు నిరూపించాడు. అయితే ఈ వినయం అతడి చిత్తశుద్ధితో కూడింది కాదు, చిత్త పరిపాకం అసలే కాదు. గండం గట్టెక్కటానికి అనుసరించే జిత్తులమారి ఎత్తుగడ మాత్రమే. (సంపా.)

క. 'లోకంబు తోడివారుగ। మీకుం జనునయ్య? మగఁటిమికి గుఱిగాదే
నా కెడరైన యెడం దగఁ। జేకొని యది మీరు చక్కఁ జేయుట యరయన్.' 201

ప్రతిపదార్థం: లోకంబు తోడి వారుగన్= లోకంలోని సామాన్యుల వలె; మీకున్= మీకు కూడా; చనునయ్య?= తగునా?; నాకున్= నాకు; ఎడరు+ఐన ఎడన్= బాధ కల్గినపుడు; తగన్= తగినట్లుగా; చేకొని= తీసికొని; అది= దానిని; మీరు; చక్కఁజేయుట= బాధ కల్గకుండా చేయటం; అరయన్= ఆలోచించగా; మగఁటిమికిన్= పరాక్రమానికి; గుఱి కాదే?= లక్ష్యం కాదా?

తాత్పర్యం: 'ఎవరో బయటి లోకులవలె ఏమీ పట్టనట్లు వినకుండా వెళ్ళిపోవటం మీకు బాగుందా? రాజైన నాకు బాధ కలిగినపుడు దానిని మీ బాధ్యతగా స్వీకరించి, ఆ బాధను తొలగించటం మీ పరాక్రమానికి లక్ష్యం కాదా?'

విశేషం: దుర్యోధనుడి వేడికోలు పెద్దలను వేడుకొంటున్నట్లుగా లేదు. భీష్మాదుల ప్రవర్తనం సామాన్యులవలె (లోకుల తీరువలె) ఉన్నదట! కర్ణుడి తీరు రాజును రక్షించే సేవాధర్మాన్ని నిర్వహించే వీరుడివలె ఉన్నదట! భీష్మాదులు కర్ణుడివలె కాక అన్యులవలె వ్యవహరించటం న్యాయమా? అని అన్నాడు. ఇవి అధిక్షేపోక్తులవలె ఉన్న అభ్యర్థన వాక్యాలు. గూఢాభిమానులైన భీష్మాదులు ఆ మాటలకు విలువ నివ్వలేదు. రాజైన దుర్యోధనుడిని ఓదార్చినట్లుగా మొగమోటపు మాటలు పలికి తమదారిన తాము పోయారు. కర్ణుడు తనను ఉద్ధరించేది లేక, దుర్యోధనుడు చేసేది లేక వారి వెంటపడి పోసాగాడు. ఈ రీతిగా దుర్యోధనుడు కర్ణుడివలన రెంటికి చెడ్డ రేవడి అయినాడు. (సంపా.)

వ. అనిన విని వారలు వెనుకయై యాశ్వాస వచనంబులు పలుకుచుం బోవం బోవుచున్న యన్నరేంద్రు నెలుంగెత్తి పిలిచి పార్థుం డిట్లనియె. 202

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; వారలు= భీష్మ, ద్రోణ, అశ్వత్థామ, కృపులు; వెనుక+ఐ= వెనుకకు ఆగి దుర్యోధనునితో కలిసి; ఆశ్వాస వచనంబులు= ఓదార్పు మాటలు; పలుకుచున్= చెప్పుతూ; పోవన్= పోగా; పోవుచున్+ఉన్న= తానును పోతున్న; ఆ+నరేంద్రున్= ఆ దుర్యోధనుడిని; ఎలుంగు+ఎత్తి= పెద్ద కంఠస్వరంతో కేకపెట్టి; పిలిచి= కేకవేసి; పార్థుండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: దుర్యోధను డట్లా అనేసరికి భీష్మాదులు కాస్త వెనుకకు ఆగి దుర్యోధనుడితో కలిసికొని, అతడితో ఓదార్పు మాటలాడుతూ పోతుండగా దుర్యోధనుడూ పోతున్నాడు. అప్పు డర్జునుడు దుర్యోధనుడిని గట్టిగా కేకపెట్టి పిలిచి ఇట్లా అన్నాడు.

అర్జునుఁడు దుర్యోధను నుపాలంభించుట (సం. 4-60-15)

ఉ. 'క్షత్రియుఁ డోడునే? తగదు కౌరవరాజ! యొకండ నేఁ బృథా
పుత్రులలోనఁ బిన్న; నినుఁ బోరికిఁ బిల్వఁగ, మాని నాఁగ ని
ద్ధాత్రిఁ బ్రసిద్ధి కెక్కి బలదర్పసమగ్రుఁడవైన నీవు నీ
మిత్రులుఁ గూడ నిట్లయిన మెత్తురె? వత్తురె కొల్వ భూభుజుల్? 203

ప్రతిపదార్థం: క్షత్రియుఁడు= రాజవంశంలో పుట్టినవాడు; ఓడునే?= యుద్ధంలో ఓడిపోయి వెళ్లుతాడా?; తగదు= పారిపోవటం ఉచితం కాదు; కౌరవరాజ!= దుర్యోధనా!; నేన్= నేను; ఒకండన్= ఒక్కడను; పృథా పుత్రులలోనన్= కుంతియొక్క పుత్రులలో; పిన్న= చిన్నవాడను; నినున్= నిన్ను; పోరికిన్= యుద్ధానికి; పిల్వఁగన్= ఆహ్వానించగా; మాని= అభిమానవంతుడు; నాఁగన్= అనగా; ఈ+ధాత్రిన్= ఈ భూమిలో; ప్రసిద్ధికిన్+ఎక్కి= పేరుకెక్కి; బల= బలంతోను; దర్ప= గర్వముతోను; సమగ్రుఁడవు+ఐన= పరిపూర్ణుడవైన; నీవున్= నీవును; నీ మిత్రులున్+కూడన్= నీ మిత్రులైన కర్ణాదులును; ఇట్లు= ఈ రీతిగా ఓడిపోయి పారిపోయినవారు; అయినన్= అయితే; భూ భుజుల్= రాజులు; మెత్తురె?= మెచ్చుకొంటారా?; కొల్వన్= నిన్ను సేవించటానికి; వత్తురె?= వస్తారా?

తాత్పర్యం: ఓ దుర్యోధనా! నీవు కౌరవరాజువు. క్షత్రియుడైనవా డెవడైనా ఓడిపోయి పారిపోతాడా? ఇట్లా పారిపోవటం ఉచితం కాదు. నే నొక్కడను. అనగా నిస్సహాయుడను, నీవా పెద్ద సైన్యంతో మిత్రులతో ఉన్నావు. పైగా నేను కౌంతేయులలో చిన్నవాడను. నీవు కౌరవులలో అగ్రజుడవు. నాకన్న పెద్దవాడవు కూడా. నిన్ను యుద్ధానికి పిలుస్తూంటే రావటంలేదు. నీవా లోకంలో అభిమానధనుడవని చాల పేరు పొందావు. బలం గర్వం దండిగా ఉన్నవాడివైన నీవు,

నీ మిత్రులూ ఇట్లా (రణరంగం వదలి పారిపోయేటట్లు) అయితే రాజులు నిన్ను మెచ్చుకొంటారా? నిన్ను సేవించటానికి (నీ కొలువు చేయటానికి) ఇక వస్తారా?

విశేషం: 1. అలం: విషమం. "విషమం వర్ణ్యతే యత్ర ఘటనాననురూపయోః". అనురూపాలు కానివాటికి సంబంధం ఉన్నట్లు వర్ణించటం విషమాలంకారం. ఇది అధిక్షేపంలో అందంగా రాణిస్తుంది. కర్ణసహాయ మున్నదని అహంకరించే దుర్యోధనుడు వెన్నిచ్చి పారిపోతున్న తరుణంలో ఆతడి బండారాన్ని బట్టబయలు చేస్తూ వెక్కిరిస్తూ, గేలిచేస్తూ, అధిక్షేపిస్తూ మాట్లాడిన మాట లివి. ఈ పద్యం ప్రతిపద సార్థకం. ప్రతిపదం దుర్యోధన హృదయాన్ని బాధపెట్టేదే.

2. క్షత్రియుఁ డోడునే? - యుద్ధానికి వచ్చే క్షత్రియుడు విజయమో, వీరస్వర్గమో చేపట్టటానికి వస్తాడుకాని, వీరులు మెచ్చని పారిపోవటానికి రాడు. మానభంగం కంటె ప్రాణభంగం మేలనుకొంటాడు. దుర్యోధనుడు పేరుకు 'రారాజు' కాని, ఓడి తిరిగిపోవటానికి వెనుకాడని అధముడు అని భావం. పారిపోయినదానికంటె ప్రాణాలు వదలటం వీరలక్షణం అని ఎత్తిపొడుపు. (ఓడటం అంటే భయపడటం, ఓడిపోవటం, పారిపోవటం- అనే అర్థాలు ఇక్కడ చెప్పవచ్చును).

3. తగదు కౌరవరాజ! - కౌరవులకందరికీ రాజైన ఓ దుర్యోధనుడా! నీ పిరికిపందలక్షణం వలన వంశానికే అపకీర్తి వస్తుంది. కాబట్టి పారిపోబోకుము. వెనుదిరిగి ధీరుడివలె యుద్ధం చేసి వంశగౌరవం నిలువబెట్టుమని హెచ్చరిక. నీ తీరు వంశానికే కళంకం అని తిట్టు.

4. ఒకండన్= నేను ఒంటిగాడిని - అని ఒక అర్థం. నే నొకడినే ఇక్కడ వీరుడిని అని అధిక్షేపం. ఒకండన్= శ్రేష్ఠుడవని అర్థం. మహాసైన్యంతో ఉన్నవాడు దుర్యోధనుడు. అయినా ఒక్క రథికుడితో పోరలేని అసమర్థుడని ఎగతాళి.

5. 'పృథా పుత్రులలో నేను చిన్న' - కుంతీపుత్రులలో నేను చిన్నవాడిని - ఇది అధిక్షేపోక్తి. గాంధారేయులలో నీవు పెద్దవాడివి, కుంతీపుత్రులలో నేను చిన్నవాడిని. చిన్నవాడికి బెదరి పెద్దవాడు పారిపోవటం నవ్వులపాలయ్యే లక్షణం - అని ఒక అర్థం. పెద్దరికం వయసులో లేదు, పరాక్రమంలో ఉన్నది. 'కౌంతేయులలో చిన్నవాడు వస్తేనే నీవింతగా పారిపోతున్నావు; మరి మేమందరం కలిసివస్తే నీవేమౌతావు?' - అని ఎద్దేవ.

6. 'మాని నాఁగ నిద్ధాత్రిఁ బ్రసిద్ధి కెక్కి బలదర్ప సమగ్రుఁడవైన నీవు' - ఇది దుర్యోధనుడి కున్న ప్రశస్తి. ఇంత ప్రసిద్ధి కెక్కినవాడు ఆయా గుణాలను నిలువబెట్టుకొనాలి. మానం కలవాడు ప్రాణంకంటె మానమే శ్రేష్ఠమని భావించాలి. కాని, దుర్యోధనుడి కున్నంత ప్రాణభీతి మరొకడికి లేదు. అతడికి బలం కావాలి, దర్పం సాగాలి. ఆ రెండూ నిండుగా ఉంటే చాలు. ఆ రెంటినీ స్వయంగా రక్షించుకొనే శక్తిలేనివాడు. కర్ణాదిహితులూ, భీష్మాదివీరులూ పోషిస్తే రక్షిస్తే, అతడి మానం, బలం, దర్పం నిలుస్తాయి. అతడు ఇతరులమీద ఆధారపడిన వీరుడు. పరాశ్రిత పరాక్రమం వీరలక్షణం కాదు, మాని లక్షణం కాదు. అతడి మిత్రులైన కర్ణాదులు కూడా అటువంటి స్వభావం కలవారే.

7. 'నిముఁ బోరికిఁ బిల్వఁగ - నీవు, నీ మిత్రులుఁ గూడ నిట్లయిన మెత్తురె? వత్తురె? కొల్వ భూభుజుల్?'- యుద్ధానికి పిలిస్తే పారిపోయే నీకూ, నీ మిత్రులకూ లోకంలో కీర్తి ఎట్లా నిలుస్తుంది? కీర్తిలేని వీరుడు జీవచ్ఛవం - అని అధిక్షేపం.

8. 'మెత్తురె? వత్తురె? భూభుజుల్' - నిన్ను రాజులు, పరాక్రమవంతులు మెచ్చుతారా? నీతో చెలిమి చేస్తారా? నిన్ను సేవిస్తారా? అని అధిక్షేపించాడు. యుద్ధంలో విజయాన్ని సాధించలేని రాజు కీర్తిని కోల్పోతాడు. దానితో స్నేహితులు దూరమౌతారు. సామంతులు, ఆశ్రితులు స్వతంత్రులై రాజును త్యజిస్తారు. ఈ చివరిమాట ప్రత్యక్షసాక్ష్యంగా కనబడింది. భీష్మాదులు తొలగిపోతున్నారు. మరి కర్ణుడు దుర్యోధనుడి కొరకు కావలసివస్తే ప్రాణత్యాగం చేయటానికైనా సిద్ధపడ్డాడా? లేదు. అతడు రారాజును వదలి పారిపోవటానికి సిద్ధమైనాడు. పారిపోయే వీరులను ఆశ్రయించే పరాశ్రయ దీనస్థితి దుర్యోధనుడిదని అవహేళన చేశాడు విజయుడు.

9. అర్జునుడు వాడి బాణాలే కాక వాడి అయిన వాఙ్మయాస్త్రాలు కూడా ప్రయోగించగలడని ఈ పద్యం నిరూపిస్తున్నది. (సంపా.)

సీ. ఏనుంగు నెక్కి పె క్కేనుంగు లిరుగడ । రాఁ బురవీథులఁ గ్రాలఁ గలదె?
మణిమయంబైన భూషణ జాలముల నొప్పి । యొడ్డోలగంబున నుండఁ గలదె?
కర్పూర చందన కస్తూరికాదుల । నింపు సొంపార భోగింపఁ గలదె?
యతిమనోహర లగు చతురాంగనలతోడి । సంగతి వేడ్కలు సలుపఁ గలదె?

తే. కయ్యమున నోడి పాఱినఁ గౌరవేంద్ర । వినుము నా బుద్ధి; మరలి యీ తనువు విడిచి
సుగతి వడయుము తొల్లింటిచూఱ గలదె? । జూద మిచ్చట నాడంగరాదు సుమ్ము! 204

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= దుర్యోధనా!; కయ్యమునన్= యుద్ధంలో; ఓడి పారినన్= ఓడిపోయి పారిపోతే; ఏనుంగును+ ఎక్కి= ఒక యేనుగు మీదనెక్కి; పెక్కు+ఏనుంగులు= చాల ఏనుగులు; ఇరుగడన్= రెండు ప్రక్కలందును; రాన్= రాగా; పురవీథులన్= హస్తినాపుర వీథులందు; క్రాలన్+కలదె?= ప్రకాశించటానికి వీలుంటుందా?; మణిమయంబు+ఐన= మణులతో చేసిన; భూషణ జాలములన్= అలంకారాల సముదాయాలతో; ఒప్పి= ప్రకాశిస్తూ; ఒడ్డోలగంబునన్= నిండుకొలువులో; ఉండన్+కలదె?= ఉండటానికి వీలున్నదా?; కర్పూర= పచ్చకర్పూరం; చందన= మంచి గంధం; కస్తూరికా+ఆదులన్= కస్తూరి మొదలైనవాటితో; ఇంపు సొంపారన్= ఇష్టంగా, సొంపుగా; భోగింపన్+కలదె?= అనుభవించటానికి అవకాశం ఉన్నదా?; అతిమనోహరలు+అగు= మిక్కిలి సుందరులైన; చతుర= నేర్పరులైన; అంగనలతోడి= స్త్రీలతోడి; సంగతిన్= కూటమితో; వేడ్కలు= వేడుకలు; చలుపన్+కలదె?= చేయటానికి వీలుంటుందా?; నా బుద్ధి= నా సలహా; వినుము= చెవిని పెట్టుము; మరలి= వెనుకకు మరలి; ఈ తనువు= ఈ శరీరం; విడిచి= విడిచిపెట్టి; సుగతి= పుణ్యలోకం; పడయుము= పొందుము; తొల్లింటిచూఱ= వెనుకటి దోపిడీ; కలదె?= ఇప్పటికీ అలవాటులో ఉన్నదా?; ఇచ్చటన్= ఈ యుద్ధరంగంలో; జూదము+ ఆడంగన్ రాదు సుమ్ము!= జూదం ఆడటానికి వీలులేదు సుమా! (ఇక్కడ కపట ద్యూతంలో వలె మోసం చేయటానికి వీలులేదని భావం.)

తాత్పర్యం: ఓ కౌరవరాజా! యుద్ధంలో ఓడిపోతే, ఏనుగునెక్కి ప్రకాశిస్తూ రెండువైపులా ఎన్నో ఏనుగులు రాగా పురవీథులలో వెళ్ళగలవా? మణులు తాపిన భూషణాలు పెట్టుకొని నిండు సభలో కూర్చుండగలవా? కర్పూర, చందన, కస్తూరికాదులతో ఇష్టంగా భోగా లనుభవించగలవా? అందమైన సుందరులతో వేడుకగా కులుకగలవా? నేను చెప్పేది వినుము; వెనుకకు తిరిగి యుద్ధం చేసి, చెయ్యలేకపోతే శరీరం విడిచిపెట్టి అయినా పుణ్యలోకాలు పొందుము. ఇతరుల సొమ్ములను దోపిడీ చేసే నీ పూర్వపు అలవాటు (అవకాశం) ఇంకా ఉన్నదా? మునుపటి ఆటలు ఇప్పుడు సాగవు. ఇక్కడ యుద్ధరంగంలో జూదం మాత్రం ఆడే వీలు లేదు సుమా!'

విశేషం: 1. నలుగురిలో రారాజును నవ్వులపాలు చేస్తూ పలికిన అధిక్షేపోక్తుల రెండవభాగం ఈ పద్యం. యుద్ధరంగంలో పారిపోవటంవలన కలిగే ఫలితాలను వెనుకటి పద్యంలో వర్ణించి, హస్తినాపురం చేరిన తరువాత దుర్యోధనుడి బ్రదుకు ఎన్ని అవమానాలపాలై జీవచ్ఛవంగా తయారౌతుందో భావచిత్రాలతో ఒక చలనచిత్రాన్ని కల్పించి, అతడి మనస్సు చురచురమని రగిలి మండేటట్లు మాట్లాడాడు.

2. పట్టపు టేనుగు నెక్కి అనేక రాజులు వెంటరాగా హస్తినాపురి వీథులలో ఊరేగేటప్పుడు - దుర్యోధనుడు తానే కౌరవేంద్రు డనుకొనగలడా? అతడిని ఓడించిన పాండవుల అగ్రజుడే కౌరవేంద్రుడని ప్రజలు భావించరా? కాబట్టి ఓటమి వలన రాజధానిలో దుర్యోధనుడి రాచరికం ఒక నవ్వులాట కాగలదని భావం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

3. మణిమయ భూషణాలతో అలంకరించుకొని నిండుకొలువులో కూర్చున్నప్పుడు ఆ సంపదను భోగించే శరీరం శత్రువుల నుండి పారిపోయివచ్చినదనీ, ఆ సంపద శత్రువుల దయవలన తాను అనుభవిస్తున్నదనీ తాననుకొన్నా, సభ్యులనుకొన్నా అతడి ప్రభుత్వం దిష్టిబొమ్మ కాగలదని భావం.

4. సుగంధ ద్రవ్యాలతో భోగమయ జీవితం నడుపుతున్నప్పుడు శత్రువీరుల పరాక్రమం గుర్తుకు వస్తే దానిని మనసార భోగించగలడా? సుఖంలేని భోగం హస్తినాపురం వైభవం - అని ఎత్తిపొడుపు.

5. చతురాంగనలతో వేడ్కలు అనుభవించేటప్పుడు శత్రుకృతావమానం మనస్సులో మెదలి మన్మథ భోగానికి దూరం చేస్తుంది. సుఖంతోపాటు శాంతికూడా నశిస్తుందని భావం.

6. కయ్యంలో ఓడి పారిపోతే - నగరం, కొలువుకూటం, పురం, అంతఃపురం - అనే నాలుగు భాగాలలో కౌరవేంద్రుడు హస్తినాపురంలో అనుభవించే రాజభోగాలు సుఖాల నివ్వకపోగా - గుండెలో నిప్పులు చెరుగుతాయి. జీవితాన్ని దుర్భరం చేస్తాయి.

7. యుద్ధరంగంలో, రాజ్యభోగంలో గౌరవాన్ని పోగొట్టుకొని కూడా సిగ్గులేక కౌరవేంద్రుడనే పదవితో తిరిగిపోతున్న దుర్యోధనుడికి తగిన హితవు చెప్పాడు అర్జునుడు. అది విజయుడైన వీరుడు చెప్పే సలహా.

8. ఓడి తిరిగిపోయి రాజుగా చెలామణి కావటంకంటె చచ్చి వీరస్వర్గంలో గొప్పగా బ్రతకటం శ్రేష్ఠమని ఆ హితము. లేదా ఓడిన బ్రతుకు చావుకంటె హీనం - అని హెచ్చరిక.

9. దుర్యోధనుడు నైతికంగా కోల్పోయిన కౌరవేంద్ర లక్షణాలన్నీ అర్జునుడి విజయం ద్వారా పాండవులు పొందారు. ఇప్పుడు పాండవులది పరాక్రమ ధనం. ఇది కొల్లగొట్టలేని ధనం. పరాక్రమంతో కాకుండా వంచనతో పరుల సంపదలను హరించి, కౌరవేంద్రుడైన దుర్యోధనుడు కుటిలుడు. ఆతడి కౌటిల్యాన్ని ఎత్తిపొడిచాడు అర్జునుడు - అని. 'తొల్లింటి చూఱఁ గలదె?' అప్పటి దోపిడీగుణం - ఇంకా ఉన్నదా?

10. ఉంటే - 'జూద మిచ్చట ఆడంగరాదు సుమ్ము' - రణరంగంలో మాయాద్యూతం ఆడటం కుదరదు. ఇది చదరంగం కాదు- పావులు నడపటానికి, ఇది రణరంగం - ప్రాణాలతో చెలగాటం - అని హెచ్చరించాడు.

11. తాత్పర్యంగా సుయోధనుడు బ్రతకటం కంటె చావటం మేలనీ, అది యుద్ధంలో అయితే మంచిదనీ, లేదా ప్రాయోపవేశమైనా సముచితమనీ సూచించి దుర్యోధనుడిని మానసికంగా చంపినంత పని చేశాడు. జూదమాడటం దుర్యోధనుడి కళ అనీ, దోచుకొనటం అతడి స్వభావమనీ హెచ్చరించి అవి కౌరవేంద్రుడి లక్షణాలు కావనీ, యుద్ధం చేయటం, పరాక్రమార్జితాన్ని పరువంతో గ్రహించటం కౌరవేంద్ర లక్షణాలనీ, ఆ లక్షణాలు రారాజులో అంతరించాయనీ, పాండవులకవి దక్కాయనీ, ఉత్తర గోగ్రహణం పరోక్షంగా కౌరవులపై పాండవ విజయమనీ అధిక్షేపిస్తూ వ్యంగ్యంగా విజయుడు ప్రకటించాడు. (సంపా.)

వ. అని వెండియు. 205

తాత్పర్యం: అని ఇంకా (ఇట్లా అన్నాడు.)

క. 'నీ యట్టివాఁడు నిస్సీ! । పోయెడిదే యిట్లు? వోకు పోకు' మనుడు భూ
నాయకుఁడు మరలి పటుకో । పాయత్తతఁ ద్రొక్కఁబడ్డయహిగతిఁ గవిసెన్. 206

ప్రతిపదార్థం: నీ+అట్టివాఁడున్= నీవంటివాడు-రారాజు; ఇట్లు పోయెడిదే?= ఈ రీతిగా పారిపోవుటయేనా?; ఇస్సీ= ఛా, ఛా; పోకుము+పోకుము= పోవద్దు, పోవద్దు; అనుడున్= అనగా; భూనాయకుఁడు= దుర్యోధనుడు; మరలి= వెనుకకు మరలి; పటు= ఎక్కువైన; కోప+ఆయత్తతన్= కోపం వచ్చినవాడై; త్రొక్కఁబడ్డ= కాలితో త్రొక్కబడిన; అహిగతిన్= పామువలె; కవిసెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: 'నీవంటి రారాజు కూడా పారిపోయేదేనా? ఛీ ఛీ, పారిపోకు'-అనటంతో దుర్యోధనుడు తోక త్రొక్కిన త్రాచువలె కోపోద్రేకం వచ్చి వెనుకకు మళ్ళీ అర్జునుడి నెదుర్కొన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. **ఇట్లు కవిసి రథంబులం గడచి కవ్వడిం దలపడియె; భీష్మ ద్రోణాది యోధవీరులు నొక్కుమ్మడి మగిడి యధిపతి తోడన నిగిడి క్రీడియరదంబుఁ బొదివిరి; తక్కిన బలంబులు నంతకుమున్న కౌంతేయు దెస మరలి చూచుచుం బాఱుచునికిం జేసి యేలినవాఁ డఱుముటయును దొరలు తెగువకుం జొచ్చి తిరుగుటయుం గని తెంపుసేసి కూడికొని రభసంబునం జుట్టుముట్టి యతనిపైఁ గ్రందుకొన నడరె; నవ్విధంబున వివిధ వ్యూహంబు లగు బహుయోధయూధంబులు గురిసిన యనేకాస్త్ర శస్త్రంబులు నానాప్రకారంబులఁ గుప్పంగూరలుగాఁదొరఁగినం బెరిఁగిన శౌర్యసంరంభంబున విజృంభించి విజయుం డాశ్చర్య ధుర్య నిరతిశయ రయభరిత(భుజ)కరయుగళుం డయి రథరథ్య సారథి స్వాంగంబులు కాచికొని తన తోడంబుట్టువుల ప్రతిన లూహించి యొండుసేయ నొల్లక, సపరివారంబుగా ధార్తరాష్ట్రుల భంగపెట్టం దలంచి, యింద్రదైవత్యంబును సత్యసంపాతంబును నరాతిసైన్య దైన్య సంపాదనంబును నగు సమ్మోహనాస్త్రంబుం బ్రయోగించిన.** **207**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కవిసి= ఎదుర్కొని; రథంబులన్= తక్కినవారి రథములను; కడచి= దాటి; కవ్వడిన్= అర్జునునితో; తలపడియెన్= యుద్ధాన్ని ప్రారంభించాడు; భీష్మ ద్రోణ+ఆది= భీష్ముడు, ద్రోణుడు మొదలైన; యోధవీరులున్= వీరులైన యోధులుకూడ; ఒక్క+ఉమ్మడిన్= ఒక్కసారిగా; మగిడి= మరలి; అధిపతితోడన్+అ= దుర్యోధనుడితోనే; నిగిడి= నిలబడి; క్రీడి+అరదంబున్= అర్జునుడి రథాన్ని; పొదివిరి= చుట్టుముట్టారు; తక్కిన బలంబులు= తక్కిన సేనలు; అంతకున్+మున్న= అంతకు ముందుగానే; కౌంతేయుదెసన్= అర్జునుడివైపు; మరలి చూచుచున్= మళ్ళీచూస్తూ; పాఱుచున్+ఉనికిన్+చేసి= పరుగెత్తుతున్నందున; ఏలినవాఁడు= రాజు; అఱుముటయును= ఎదుర్కొనుటయు; దొరలు= రథికులు; తెగువకున్+చొచ్చి= సాహసించి; తిరుగుటయున్= వెనుకకు తిరుగుటయును; కని= చూచి; తెంపు+చేసి= సాహసించి; కూడికొని= కలిసికొని; రభసంబునన్= వేగంగా; చుట్టుముట్టి= చుట్టున ఉండి; అతనిపైన్= అర్జునుడిమీద; క్రందుకొనన్= వ్యాపించుటకు; అడరెన్= విజృంభించాయి; ఆ+విధంబునన్= ఆ రీతిగా; వివిధ= పలురకాలైన; వ్యూహంబులు+అగు= వేర్వేరుగుంపులుగా తీర్చబడియున్న; బహుయోధ యూధములు= చాలమంది యోధులు కల సేనలు; కురిసిన= వర్షంగా వేసిన; అనేక+అస్త్రశస్త్రంబులు= అనేకమైన అస్త్రములు, శస్త్రములును; నానా ప్రకారంబులన్= అనేక రీతులుగా; కుప్పం గూరలుగాన్= రాసులు రాసులుగా; తొరఁగినన్= పడిపోగా; పెరిఁగిన= వృద్ధి అయిన; శౌర్య సంరంభంబునన్= పరాక్రమముయొక్క ఉద్ధతితో; విజృంభించి= పెచ్చుపెరిగి; విజయుండు= అర్జునుడు; ఆశ్చర్యధుర్య= ఆశ్చర్యంతో నిండిన; నిరతిశయ= ఎక్కువగా అతిశయించిన; రయ= వేగముతో; భరిత= నిండిన; కరయుగళుండు+అయి= రెండుచేతులు కలవాడై; రథ= రథమును; రథ్య= గుర్రములును; సారథి= సారథిని; స్వాంగంబులు= తన అవయవాలు; కాచికొని= రక్షించుకొని; తన తోడంబుట్టువుల= తన సోదరులయొక్క; ప్రతినలు= ప్రతిజ్ఞలు; ఊహించి= స్మరించి; ఒండు= మరొక రీతిగా; చేయన్+ఒల్లక= చేయ నిచ్ఛగింపక; సపరివారంబుగాన్= పరివారంతో సహా; ధార్తరాష్ట్రులను= ధృతరాష్ట్ర కుమారులను; భంగము+పెట్టన్= అవమానించటానికి; తలంచి= తలచికొని; ఇంద్రదైవత్యంబును= ఇంద్రుడు దేవతగా కలది; సత్య సంపాతంబునున్= సత్యమైన ఫలితం కలది; అరాతి= శత్రువులయొక్క; సైన్య= సైన్యమునకు; దైన్య= దైన్యమును; సంపాదనంబునున్+అగు= చేకూర్చునదియు అయిన; సమ్మోహనాస్త్రంబును= సమ్మోహనమనే అస్త్రమును; ప్రయోగించినన్= వేయగా.

తాత్పర్యం: అట్లా ఎదుర్కొని మధ్యలోని రథాలను దాటి అర్జునుడితో తలపడ్డాడు దుర్యోధనుడు. దానితో భీష్మద్రోణాదులు ఒక్కసారిగా వెనుదిరిగి రాజుతోపాటుగా అర్జునుడి రథాన్ని చుట్టుముట్టారు. తక్కిన సేనలు అంత క్రితమే అర్జునుడివైపు చూస్తూ పరిగెత్తుతున్నాయి కనుక దుర్యోధనుడు తలపడటం, తక్కిన రథికులందరూ ఏదో ఒకటి అవుతుందని తెగించి వెనుకకు తిరగటం చూచి, తెగించి, కూడుకొని, చుట్టుముట్టాయి. ఇట్లా అనేక సేనలు ఒక్కసారిగా మీదికి వచ్చి అనేక అస్త్రశస్త్రాలు ప్రయోగిస్తుంటే అర్జునుడు విజృంభించి, ముందు తన రథాన్ని, గుర్రాలను, సారథిని, తనను రక్షించుకొంటూ, వారందరిని ఏమి చేయాలా? అనే ఆలోచనలో భీముని ప్రతిజ్ఞ జ్ఞాపకం వచ్చి దుర్యోధనుడిని అప్పుడు ఏమీ చేయకపోయినా, సపరివారంగా కౌరవులను అవమానపరచాలని అనుకొని, సమ్మోహనాస్త్రం ప్రయోగించాడు. ఆ అస్త్రానికి ఇంద్రుడు దేవత. ప్రయోగిస్తే విఫలం కాని దివ్యాస్త్రమది.

ఆ. ఆయుధములు విడిచి యంగముల్ సోలంగఁ । దలలు మెడలుఁ జక్క నిలువ కొఱగ
నెల్లవారు నెఱుక లెడలి చొక్కెక్కిని । ద్రాతిశయము గూరినట్టు లైరి. 208

ప్రతిపదార్థం: ఆయుధములు= చేతిలోని శస్త్రాలు; విడిచి= విడిచిపెట్టి; అంగముల్= శరీరాలు; సోలంగన్= తూలిపోగా; తలలు; మెడలున్= మెడలును; చక్కన్= బాగుగా; నిలువక= నిలబడక; ఒఱగన్= ప్రక్కకు ఒరిగిపోగా; ఎల్లవారున్= అందరును; ఎఱుకలు= జాగ్రదవస్థలో ఉండే తెలువులు; ఎడలి= తొలగిపోయి; చొక్కు+ఎక్కి= మత్తెక్కి; నిద్రా+అతిశయము= ఎక్కువనిద్ర; కూరినట్టుల= కూరుకొని వచ్చినట్లు; ఐరి= అయినారు.

తాత్పర్యం: ఆయుధాలు విడిచిపెట్టేశారు. శరీరాలు సోలిపోతున్నాయి; తలలు, మెడలు నిలవకుండా ఒరిగిపోయాయి. అందరూ స్పృహ తప్పి ఎక్కువ నిద్ర కూరుకొని వచ్చినట్లుగా అయిపోయారు.

విశేషం: అర్జునుడు దుర్యోధనాదులను చంపటానికి భీమాదులు చేసిన ప్రతిజ్ఞలు అడ్డం వచ్చాయి. కర్ణుడు వెన్నిచ్చి పారిపోవటం చేత అతడిని చంపటం రణధర్మం కాదు. ఇక మిగిలిన చర్య వారి తలపాగలను హరించటం. తలపాగలను తలలకే ప్రతీకలుగా భావించటం రణమర్యాద. దానికి అనుగుణంగా సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగించాడు అర్జునుడు. ఆ అస్త్రాన్ని అర్జునుడికి కుబేరుడిచ్చాడు. అది శత్రువుల ఓజస్సును, తేజస్సును హరించి నిద్రవంటి మైకంలో ముంచివేస్తుంది. దీనిని గాంధర్వాస్త్రమనీ, ప్రస్వాపనాస్త్రమనీ, మోహనాస్త్రమనీ కూడా పిలుస్తారు. సమ్మోహనాస్త్ర ప్రభావంవలన కౌరవవీరులందరూ శరీర ప్రజ్ఞను కోల్పోయారు. మొదట ఆయుధాలు చేతులలో నుండి జారాయి. దేహాలు తూలాయి. తలలు మెడలు ఒరిగాయి. ప్రజ్ఞ పోయింది, మత్తెక్కింది. గాఢనిద్ర (మత్తు) కూరుకొన్నది. అందరూ వివశులైనారు. దీనికి విరుగుడు ప్రజ్ఞాస్త్రం. అది ద్రోణ భీష్ములకు తెలుసు. వారిరువురూ ప్రయోగించలేదు. సమ్మోహనాస్త్రాన్ని మన్మథుడు ప్రయోగిస్తాడనే ప్రతీతి ఉన్నది. అది వేరు. యుద్ధరంగాలలో ప్రయోగించే సమ్మోహనాస్త్రం వేరు. మూలంలో సమ్మోహనాస్త్రం ప్రయోగించిన తరువాత అర్జునుడు బాణాలను ఆకాశంనిండా కప్పి, గాండీవజ్యారావంతో, దేవదత్త ధ్వానంతో వారి మనస్సులనూ దేహాలనూ సంక్షోభపరచినట్లు చెప్పబడింది. చచ్చిన పామును కర్రతో కొట్టినట్లున్న ఈ అంశాన్ని తిక్కన వదలిపెట్టినట్లున్నాడు. (సంపా.)

వ. అప్పుడు పాండవోత్తముం డుత్తర మాటలు దలంచి యుత్తరుం గనుంగొని. 209

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయాన; పాండవ+ఉత్తముండు= పాండవులలో ఉత్తముడైన అర్జునుడు; ఉత్తరమాటలు= తాము వచ్చేటప్పుడు ఉత్తర చెప్పిన మాటలు; తలంచి= జ్ఞప్తికి తెచ్చుకొని; ఉత్తరున్= ఉత్తరుని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడు ఉత్తర తనతో చెప్పిన మాటలను తలచుకొని, ఉత్తరుకుమారుడిని చూచి.

సీ. 'ఇక్కురుసైన్యంబు సొక్కు దక్కకమున్న । గ్రక్కునఁ జనుము; రారాజు ద్రోణ
తనయుండుఁ జుట్టిన తలచుట్లు నల్లని । యవి; సూతపుత్రు శిరోంబరంబు
పచ్చనియది; కుంభభవ కృపాచార్యుల । యుష్ణీషములు వెల్ల; లుఱక నీవు
దె మ్మింతవట్టును; దేవనదీసూనుఁ । డియ్యస్త్రమునకు మా ఱెఱుఁగుఁ గాన

ఆ. నతఁడు దెలిసియుండు; నాతని దెస వోకు' । మనిన మత్స్యరాజతనయుఁ డెలమి
దొలఁక నొగలఁ బగ్గములు గట్టి చని వాని । నెల్లఁ దెచ్చి యరద మెక్కుటయును. 210

ప్రతిపదార్థం: ఈ+కురుసైన్యంబు= ఈ కౌరవసేన; చొక్కు తక్కకమున్న+అ= మత్తు వదలకముందే; గ్రక్కునన్= వెంటనే; చనుము= వెళ్ళుము; రారాజు= దుర్యోధనుడు; ద్రోణతనయుండున్= అశ్వత్థామ; చుట్టిన తలచుట్లు= చుట్టుకొన్న తలపాగలు; నల్లని అవి= నల్లనివి; సూతపుత్రు= కర్ణుడియొక్క; శిరస్+అంబరంబు= తలపాగల; పచ్చని+అది; కుంభభవ= ద్రోణుడియొక్క; కృపాచార్యుల= కృపాచార్యుడియొక్క; ఉష్ణీషములు= తలపాగలు; వెల్లలు= తెల్లనివి; నీవు; ఉఱక= లక్ష్యపెట్టక; ఇంతవట్టును= ఇంతవరకు; తెమ్ము= తీసికొనిరమ్ము; దేవనదీసూనుఁడు= భీష్ముడు; ఈ+అస్త్రమునకున్= ఈ మంత్రబాణానికి; మాఱు= విరుగుడు; ఎఱుఁగున్= ఎరుగును; కానన్= అందుచేత; అతఁడు= భీష్ముడు; తెలిసి+ ఉండున్= తెలివి కలిగి ఉంటాడు; ఆతని దెస= ఆతని దిక్కునకు; పోకుము= పోవద్దు; అనినన్= అనగా; మత్స్యరాజతనయుఁడు= ఉత్తరుడు; ఎలమి తొలఁకన్= సంతోషం హెచ్చుకాగా; నొగలన్= సారథి కూర్చుండే చోట; పగ్గములు= గుర్రాల పగ్గాలను; కట్టి; చని= వెళ్ళి; వానిన్+ఎల్లన్= వాటినన్నింటిని; తెచ్చి= తీసికొని వచ్చి; అరదము= రథం; ఎక్కుటయును= ఎక్కగా.

తాత్పర్యం: 'ఈ కౌరవసేనకు మత్తు వదలక పూర్వమే వెంటనే నీవు వెళ్ళి వారి తలపాగలు తీసికొనిరమ్ము. దుర్యోధన, అశ్వత్థామల తలపాగలు నల్లనివి. కర్ణునిది పచ్చనిది. ద్రోణ, కృపాచార్యులవి తెల్లనివి. అంతవరకే తెమ్ము. భీష్ముడికి ఈ అస్త్రానికి విరుగుడు తెలుసు. కనుక తెలివిగానే ఉంటాడు. ఆయనవైపు పోవద్దు' అనగానే మహాసంతోషంతో ఉత్తరుడు గుర్రాలపగ్గాలు నొగలకు కట్టి, దిగి వెళ్ళి అవి తీసికొని వచ్చి రథం ఎక్కాడు.

విశేషం: కురువీరుల వస్త్రాలను బొమ్మపొత్తిళ్ళకుగా తెచ్చి యిమ్మని ఉత్తర బృహన్నలను ముద్దుగా కోరింది. 'చీరలు తేవటం ఏమంత పనిలే?' అని బృహన్నల (అర్జునుడు) మాట ఇచ్చాడు. ఆ వస్త్రా లేవి? అనే మీమాంస ఉన్నది. అర్జునుడు తలచుట్లు, శిరోంబరాలు, ఉష్ణీషాలు తెమ్మని ఉత్తరుడికి చెప్పాడు. యుద్ధాలలో తలపాగలు చుట్టుకొంటారా? శిరః కవచాలనో, కిరీటాలనో ధరిస్తారా? అని అనుమానం కలుగకమానదు. తిరిగివెళ్ళేటప్పుడు అర్జునుడు దుర్యోధనుడి కిరీటంలోని రత్నాలను డులిచి వెళ్ళివస్తున్నానని చెప్పాడట! తెలుగులో తలపాగలని చెప్పబడుతున్నప్పుడు కిరీటాలతోపాటు తలకట్లు కూడా ఉండి ఉండాలి. అవి ఉత్తమవీరులకే ఉంటాయి. వారి వారి అధికారాలను బట్టి, అభిమతాలను బట్టి ఆ వస్త్రాలకు వర్ణాలుకూడా ఉంటాయి. మహావీరులు ఉజ్జ్వలకిరీటాలు ధరించేటప్పుడు కుదుళ్ళలో గట్టిగా ఒత్తుకొనకుండా ఉండటానికీ, కుదుపులకు ఆగి నిలవటానికీ శిరస్త్రాణాలకు తోడుగా శిరోంబరాలను కూడా ధరించేవారు. ఇవి వీరులకు తప్ప సామాన్యులకు ఉండకపోవచ్చును. అందువలననే అయిదుగురి ఉష్ణీషాలనే తెమ్మని చెప్పాడు అర్జునుడు. భీష్ముడుకూడా ఉష్ణీషధారియే. కాని అవసరం లేదు కాబట్టి అతడి తలపాగా రంగు చెప్పలేదు. పాత్రల ప్రవృత్తులకు తగిన రంగులే తలపాగలకు ఉండటం విశేషం. తలపాగలు తీయాలంటే కిరీటాలు కూడా తీయాలి. అట్లా తీయటం శృంగభంగానికి గుర్తు. (సంపా.)

వ. 'ఈ రథబృందంబుల యిఱుకటంబు వెడలి నిలుత' మని కదలినం గిరీటిం దాఁకి గురుపితామహుండు
శరవర్షంబులు గురిసిన. 211

ప్రతిపదార్థం: ఈ రథబృందంబుల= ఈ రథ సముదాయాలయొక్క; ఇఱుకటంబు= ఇరుకుచోటును (దాటి); వెడలి= బయటికి వెళ్ళి; నిలుతము+అని= నిలుద్దామని; కదలినన్= కదలగా; కురుపితామహుండు= భీష్ముడు; కిరీటిన్= అర్జునుని; తాఁకి= ఎదిరించి; శరవర్షంబులు= బాణాల వానలు; కురిసినన్= కురిపించగా.

తాత్పర్యం: 'ఇక్కడ రథాలతో ఇరకాటంగా ఉన్నది. బయటపడి నిలుద్దా' మని అర్జునుడు కదలగానే భీష్ముడు అతడిపై బాణవర్షం కురిపించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **ఆతని రథ్యంబులఁ ద। త్సూతుని నొప్పించి సాంద్ర సునిశిత బాణ**
వ్రాతంబు మేన నించి పృ। థాతనయుఁడు నిలిపి వెడలె దర్పోజ్జ్వలుఁడై. **212**

ప్రతిపదార్థం: ఆతని= భీష్ముడియొక్క; రథ్యంబులన్= గుర్రాలను; తద్+సూతునిన్= అతడి సారథిని; నొప్పించి= నొవ్వగొట్టి; సాంద్ర= దట్టమైన; సునిశిత= వాడియైన; బాణవ్రాతంబు= బాణ సముదాయాన్ని; మేనన్= శరీరాన; నించి= నింపి; పృథాతనయుఁడు= అర్జునుడు; నిలిపి= ఆతడిని ఆపి; దర్ప+ఉజ్జ్వలుఁడు+ఐ= దర్పంతో ప్రకాశించేవాడై; వెడలెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ భీష్ముడి గుర్రాలను, సారథిని నొచ్చేటట్లు కొట్టి, ఆతడి శరీరాన మరికొన్ని వాడిబాణాలు నాటటంతో అతడు ఆగిపోయాడు. అప్పుడు దర్పంతో అర్జునుడు ప్రకాశిస్తూ వెళ్ళాడు.

వ. **ఇవ్విధంబున నరదంబుల యిఱుకటంబు గడచి యెడఁ గలుగ నిలిచి రాహు నిగ్రహ నిరాస భాసురుం డగు భానుండునుం బోలె వెలుంగుచున్నంత బలంబులు దెలిసిన.** **213**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; అరదంబుల= రథాలయొక్క; ఇఱుకటంబు= ఇరుకుగా ఉండేచోటును; కడచి= దాటి; ఎడ+కలుగన్= వ్యవధానం ఉండేటట్లుగా; నిలిచి= ఆగి; రాహు నిగ్రహ= రాహువుయొక్క బాధ; నిరాస= తొలగటం వలన; భాసురుండు+అగు= ప్రకాశించే; భానుండునున్+పోలెన్= సూర్యుడివలె; వెలుంగుచున్+ఉన్న+అంతన్= ప్రకాశిస్తూ ఉండగా; బలంబులు= సేనలు; తెలిసినన్= తెలివి రాగా.

తాత్పర్యం: ఈ రీతిగా రథాల సందులో నుండి బయటికి వెళ్ళి కొంచెం దూరంగా నిలబడి, గ్రహణకాలంలో ఏర్పడిన రాహు నిగ్రహం నుండి తొలగి ప్రకాశిస్తున్న సూర్యుడివలె అర్జునుడు ప్రకాశింపసాగాడు. అంతలో సేనలకు తెలివి వచ్చింది.

ఆ. **కౌరవేశ్వరుండు గనువిచ్చి దిక్కులు। గలయఁ జూచి పార్థుఁ గాంచి కడఁగి**
యడరఁ జూచుటయును నమరనదీసూనుఁ। డతని కిట్టు లనియె నల్ల నగుచు. **214**

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరుండు= దుర్యోధనుడు; కనువిచ్చి= కన్నులు తెరచి; దిక్కులు= చుట్టుప్రక్కలు; కలయన్= అంతటా; చూచి= పరికించి; పార్థున్= అర్జునుడిని; కాంచి= చూచి; కడఁగి= యుద్ధానికి పూని; అడరన్= విశదమయ్యేటట్లు; చూచుటయును= అనుకోగా; అమరనదీ సూనుఁడు= భీష్ముడు; అల్ల నగుచున్= ఇంచుకనవ్వుతూ; అతనికిన్= దుర్యోధనుడితో; ఇట్టులు= ఈ రీతిగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తెలివివచ్చి కన్నులు తెరచి నలువైపులా చూచి, అర్జునుడు కనబడగా, అతడిపై యుద్ధం చేయటానికి సిద్ధపడుతూ ఉండగా భీష్ముడు మెల్లగా నవ్వుతూ అతడితో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'ఇంత యెఱుంగవు సైన్యము। లింతవడిం దలల చీర లెఱుఁగక మోహా
క్రాంతంబులయ్యెఁ బని దెగుఁ। గౌంతేయుఁడు సొరఁడుగాని క్రౌర్యంబునకున్. 215

ప్రతిపదార్థం: ఇంత= జరిగినదంతా; ఎఱుంగవు= నీవు ఎరుగవు; సైన్యములు= సేనలు; ఇంతవడిన్= ఇంతసేపును; తలల చీరలు= తలపాగాలు; ఎఱుఁగక= ఎట్లా ఉన్నాయో! తెలియక; మోహ+ఆక్రాంతంబులు= మోహంచేత ఆక్రమించబడినవి; అయ్యెన్= అయ్యాయి; కౌంతేయుఁడు= అర్జునుడు; క్రౌర్యంబునకున్= క్రూరకర్మకు; చొరఁడు+కాని= పూనుకొనలేదు తప్ప; (పూనుకొన్నచో); పని= యుద్ధకర్మ; తెగున్= పూర్తి అయి ఉండేది. (అందరూ చనిపోయి ఉండేవారు.)

తాత్పర్యం: 'రాజా! నీవు జరిగినదంతా ఎరుగవుకాని, సైనికులు తలలు, తలగుడ్డలు తెలియకుండా మోహంతో పడిపోయారు. అర్జునుడు క్రూరంగా ప్రవర్తించలేదు. అట్లా ప్రవర్తించి ఉంటే మనపని అయిపోయి ఉండేది. అనగా మనలనందరిని చంపి ఉండేవాడు అని తాత్పర్యం.

విశేషం: 1. ఇందులో భీష్ముడు పలికిన వాక్యాలు రాచకొలువు మర్యాదకు అద్దం పట్టుతున్నాయి. సామాన్యంగా రాచకొలువులో రాజుకు అవమానం కలిగే మాటలు ఆయనను ఉద్దేశించి అనకూడదు. రాజుకు అస్వస్థత ఏర్పడితే పలుకరించటానికి పోయినవారు 'శత్రువులకు ఆరోగ్యం బాగాలేదని విన్నాను' అని అనటం మర్యాద. అట్లాగే భీష్ముడు అభిమానధనుడైన రారాజుకు అతడి దీనస్థితిని తెల్పటానికి బదులు 'ఇంత యెఱుంగవు సైన్యము లింతవడిం దలలచీర లెఱుఁగక మోహాక్రాంతంబులయ్యె' - అన్నాడు. నీవు అనటానికి బదులు సైన్యము లనటం మర్యాద. సైన్యాలన్నీ ఏ స్థితిలో ఉన్నాయో నీవూ ఆ స్థితిలోనే ఉన్నావు- అని ధ్వని. సమ్మోహనాస్త్ర ప్రభావానికి లొంగని భీష్ముడు ఈ విధంగా హెచ్చరించటం గమనార్హం.

2. మూర్ఛపోయిన వారిని చంపకుండా విడవటం ఉత్తమ యుద్ధవీరుడి లక్షణం. దానిని అర్జునుడు పాటిస్తాడా? లేదా? అని భీష్ముడు వేచిచూచినట్లున్నాడు. అర్జునుడు తలపాగలు తొలగించటంవరకే పరిమితమై, తలలు తీయకుండా ఉండటం అతడి దయాగుణానికి నిదర్శ'నమని భీష్ముడు వ్యాఖ్యానించటం దుర్యోధనుడికి కీలెరిగి వాతపెట్టిన వైఖరిగా తోస్తుంది.

3. పని+తెగున్= అనేది 'మన పని సరి' అనే జాతీయానికి ప్రతిరూపం. (సంపా.)

క. మెడ యొఱగఁ జేతికైదువు। వడ నిను నీ వెఱుఁగకున్న భంగి గనియుఁ గ
వ్వడి యూరకుండు నటె చె। ప్పెడు కొలఁదియె వాని కరుణపెంపు కుమారా! 216

ప్రతిపదార్థం: మెడ+ఒఱగన్= మెడ ఒరిగిపోగా; చేతికైదువు= చేతిలోని ఆయుధం; పడన్= పడిపోగా; నినున్= నిన్ను; నీవు+ ఎఱుఁగక+ఉన్న భంగిన్= నీవు తెలియని పరిస్థితిని; కనియున్= చూచికూడా; కవ్వడి= అర్జునుడు; ఊరకుండున్+అటె= ఏమీ చేయక ఊరకున్నాడట; కుమారా!= దుర్యోధనా!; వాని కరుణపెంపు= వాడి దయాతిశయం; చెప్పెడు కొలఁదియె= చెప్పనంతటిదా! (చెప్పలేనంతటిది.)

తాత్పర్యం: మెడ ఒరిగిపోయి, చేతిలో ఆయుధం జారిపోయి, నిన్ను నీవు తెలియని స్థితిలో ఉండటం చూచి కూడ అతడు ఏమీ చేయక వదలి వేశాడంటే అతడు ఎంత దయాఘనుడో వేరే చెప్పవలెనా దుర్యోధనా!

వ. అతండు మన ప్రాణంబులపై రా నొల్లక నిలిచిన మన మింతతట నిలుచుట కార్యంబు. 217

ప్రతిపదార్థం: అతండు= అర్జునుడు; మన ప్రాణంబులపైన్= మన ప్రాణాలమీదికి; రాన్+ఒల్లక= వచ్చుట కిష్టపడక; నిలిచినన్= ఆగగా; మనము; ఇంతతటన్= ఇంతటితో; నిలుచుట= ఆగుట; కార్యంబు= చేయదగిన పని.

తాత్పర్యం: అర్జునుడు మన ప్రాణాలు తీయకుండా వదలివేశాడు కనుక, మనంకూడా ఇంతటితో యుద్ధంమాట తలపెట్టకుండా ఉండటం మంచిది.

ఉ. మోహనబాణపాతమున ముందలచీర లెఱుంగ కున్న యీ
బాహుబలంబుతోఁ గడఁగి పార్థునిఁ దాఁకెడుబుద్ధి గ్రమ్మఱన్
సాహసవృత్తిఁ జేసి యవిచారతఁ బోయితిమేని వాఁడు పూ
ర్ణాహుతి సేయఁడే మనల నందఱ నొక్కట మార్గణాగ్నికిన్? 218

ప్రతిపదార్థం: మోహన బాణపాతమునన్= సమ్మోహనాస్త్రం వేయటంతో; ముందలచీరలు= ముందరి తలమీదనున్న గుడ్డలు; ఎఱుంగక+ఉన్నన్= తెలియక ఉండగా; ఈ బాహు బలంబుతోన్= కేవలం ఇటువంటి బాహుపరాక్రమంతోనే; కడఁగి= పూనుకొని; పార్థునిన్= అర్జునుడిని; తాఁకెడుబుద్ధిన్= ఎదుర్కొను తలంపుతో; క్రమ్మఱన్= మరల; సాహసవృత్తిన్+చేసి= తెగించే చిత్తవృత్తితో; అవిచారతన్= ఆలోచనలేకుండా; పోయితిమి+ఏనిన్= వెళ్ళితిమా; వాఁడు= ఆ అర్జునుడు; మార్గణ+అగ్నికిన్= బాణాలనే అగ్నికి; మనలన్= మనలను; అందఱన్= అందరిని; ఒక్కటన్= ఒక్కసారిగా; పూర్ణ+ఆహుతి= పూర్ణాహుతిని; చేయఁడే?= చేయడా?; (పూర్ణాహుతి అనగా హోమాలు చేసినప్పుడు చివరన మిగిలి ఉన్న నేతినంతను ఒక్కసారిగా హోమం చేయటం.)

తాత్పర్యం: అర్జునుని సమ్మోహనాస్త్ర ప్రయోగం వలన మనం తలగుడ్డ లెరుగకుండా ఉండే స్థితిలో పడి ఉండినాము. అలాంటప్పుడు మనకున్న కేవల బాహుబలాన్నే నమ్ముకొని, ఇంకా అతడిని అనాలోచితంగా చొరవగా ఎదిరిస్తే, ఇప్పుడు అతడు తన బాణాగ్నితో మనలనందరిని ఒక్కసారిగా, పూర్ణాహుతి చేసే విధంగా ఏమీ మిగలకుండా చంపి వేయడా?

విశేషం: 1. అలం: రూపకం, లోకోక్తి.

2. దుర్యోధనాదులు అంతటితో యుద్ధం ఆపితే ఉచితంగా ఉంటుంది - అనే తన అభిప్రాయానికి తగిన హేతువును భీష్ముడు చెప్పుతున్నాడు. సమ్మోహనాస్త్ర ప్రభావానికి లొంగి ఓజస్సును, తేజస్సును కోల్పోయి, తలగుడ్డలు పోయాయన్న సంగతిని కూడా గ్రహించలేని మైకంలో ఇంకా ఉండి, చేతులలోనుండి ఆయుధాలు జారి నేలమీద పడ్డాయన్న స్పృహకూడా లేకుండా మరల యుద్ధానికి పూనుకొనటం సాహసమౌతుంది. (జయించటం వీలుకాని దాని కొరకు చేసే మూర్ఖప్రయత్న మౌతుంది). అవిచార మూలకమైన అవివేక క్రియ అవుతుంది. ప్రాణాలతో వదలిపెట్టినా వదలిపోక, అవివేకంతో, అహంకారంతో మరల తనమీదకు దండెత్తితే కౌరవులను చంపటం తప్ప మరొక మార్గంలేదని భావించే స్థితిని మనమే కల్పించుకొంటాం- అన్నాడు. ఇది యజ్ఞంలో యజమానుడు సంపూర్ణ ఫలసిద్ధి కొరకు ఆత్మార్పణానికి ప్రతిగా పూర్ణాహుతిని అగ్నికి అర్పించటం వంటిది. దానితో యజ్ఞం సఫలం కావటం జరుగుతుంది. ఇది లోక న్యాయం. దీనిని ఆధారంగా చేసికొని తెలుగులో 'పూర్ణాహుతి చేయటం' అనే ఒక జాతీయం పుట్టింది. ఉన్నదంతా అగ్నిపాలు కావటం కాని, వృథా చేసికొనటం గాని, ఎవరైనా తనంతట తాను సర్వనాశనానికి పాల్పడటం కాని జరిగేటప్పుడు ఈ జాతీయాన్ని వాడతారు. దానిని ఉటంకిస్తూ, మనం మరలా దాడి చేస్తే బాణాగ్నిలో మనలనందరినీ, ఎవ్వరూ మిగలకుండా, మారణహోమం చేయడా?- అని భీష్ముడు హెచ్చరించాడు.

3. యజ్ఞం ముగిసేటప్పుడు చేసే పూర్ణాహుతిలో నేతితో తడిపిన కొబ్బరికాయ, పూలు, తాంబూలం వంటి మంగళ ద్రవ్యాలూ, నవరత్నాలవంటి విలువైన లోహాలూ మొదలైనవి పట్టుబట్టలో మూటకట్టి అన్నీ ఒక్కసారిగా అగ్నిలో మంత్రపూతంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సమర్పించటం పరిపాటి. దుర్యోధనుడి పునర్యుద్ధయత్నం అటువంటిదని భావం. ఒకవేళ అదే జరిగితే కౌరవుల జీవితాలే అంతటితో సమాప్తం కాగలవని హెచ్చరిక! అంత ఘాటుగా చెప్పితే తప్ప ఆ దురభిమాని మెదడు కెక్కదని భీష్ముడి తలంపు. (సంపా.)

వ. కావున. 219

తాత్పర్యం: అందుచేత.

క. మనదేశమునకుఁ బోదము । మన మల్లన తెరువు వట్టి; మత్స్యవిభుని గో
ధనముఁ గొని యతఁడు ప్రీతిం । జనుఁగా; కటు మనకు నంతచల మేమిటికిన్?' 220

ప్రతిపదార్థం: మనదేశమునకున్= మనదేశానికి; మనము; అల్లనన్= మెల్లగా; తెరువు+పట్టి= దారిపట్టి; పోదము= పోదాం; అతఁడు= అర్జునుడు; మత్స్యవిభుని= విరాటునియొక్క; గోధనమున్= గోవులనెడి ధనాన్ని; కొని= తీసికొని; ప్రీతిన్= సంతోషంతో; అటు= ఆ దారిన; చనున్+కాక= వెళ్ళుగాక; మనకున్= మనకుకూడ; అంత చలము= మిక్కిలి పట్టుదల; ఏమిటికిన్?= ఎందుకు?

తాత్పర్యం: మనదేశపు మార్గం పట్టి మెల్లగా మనం మనదేశానికి పోదాం. అర్జునుడు విరాటుడి గోవులను తోలుకుని అటుపోతాడు. కాకపోతే, మనకు మాత్రం అంత పట్టుదల ఎందుకు?'

దుర్యోధనుఁడు పరాజితుఁడై మరలి తన పురంబునకుఁ బోవుట (సం. 4-61-24)

వ. అని చెప్పిన పితామహు హితవచనంబు లాకర్ణించి సంగ్రామాతికామియుం గోపాటోపఘూర్ణమాన మానసుండు నగు నమ్మానవేశ్వరుండు నిట్టూర్పు నిగిడించి, యుద్రేకంబు దక్కి నిలిచెం; దక్కటివారలు నూర్జితంబగు నర్జునానలంబు నాలోకించి ధార్తరాష్ట్ర రక్షణ తాత్పర్యంబున శౌర్యంబు సాలించి, భీష్మవాక్య ప్రకారంబు సేసి; రిట్లుందఱు ముందర దమవచ్చిన వంకన తిరిగి యరుగుచున్నం గని కిరీటి శంఖరవ జ్యానాదంబులు సెలంగఁ గొండొకదవ్వు వెన్నడిం దఱిమి బిరుదులతోడి గొడుగులును, నడియాలంబులతోడి సిడంబులును వైపించుకొని తృప్తిం బొంది మరలువాఁడై యెల్లవారును వినం బెద్దయెలుంగునం బోయి వచ్చెద నని చెప్పి, గాంగేయ ద్రోణ కృపాచార్యులకుఁ బ్రణామబాణంబు లేసి వారి వీడ్కొనినవాఁడై, మిట్టకోలల రారాజుమకుటంబు మణులు డులిచి యతనికిం జెప్పినవాఁడై, యఖర్వబాహా గర్వ నిర్వహణంబు మెఱయ నప్పుడు మధ్యందినమార్తాండప్రచండుం డగుచుండఁ, గౌరవవీరు లతనిం దేఱి చూడనుం జాలక చని; రతండును జూపఱం దోలి నిలిచిన మదపుటేనుంగు చందంబున నిలిచి విరాటతనయున కిట్లనియె. 221

ప్రతిపదార్థం: అని చెప్పిన= అట్లు చెప్పిన; పితామహు వచనంబులు= భీష్ముడి మాటలను; ఆకర్ణించి= విని; సంగ్రామ+ అతికామియున్= యుద్ధము నెక్కువగా కోరేవాడును; కోప+ఆటోప= కోపంయొక్క ఆధిక్యంచేత; ఘూర్ణమాన= తిరుగుడు పడుతున్న; మానసుండున్+అగు= మనస్సు కలవాడునైన; ఆ+మానవ+ఈశ్వరుండు= ఆ దుర్యోధనుడు; నిట్టూర్పు= పెద్ద ఊర్పును; నిగిడించి= విడిచి; ఉద్రేకంబు= ఆవేశం; తక్కి= మాని; నిలిచెన్= ఉన్నాడు; తక్కటివారలు= మిగిలినవారు; ఊర్జితంబు+అగు= పెరిగిన; అర్జున+అనలంబున్= అర్జునుడనెడి అగ్నిని; ఆలోకించి= చూచి; ధార్తరాష్ట్ర= దుర్యోధనుడి

యొక్క; రక్షణ= రక్షించుట యందలి; తాత్పర్యంబునన్= ఆసక్తితో; శౌర్యంబు= పరాక్రమాన్ని; చాలించి= మాని; భీష్ము= భీష్ముడి యొక్క; వాక్యప్రకారంబు= మాటప్రకారం; చేసిరి; ఇట్లు= ఈ రీతిగా; అందఱున్= అందరును; మున్దర= ఇదివరకు; తమ వచ్చిన= తాము వచ్చిన; వంకన్+అ= వైపునకే; తిరిగి అరుగుచున్+ఉన్నన్= మరలి వెళ్ళుతూ ఉండగా; కని= చూచి; కిరీటి= అర్జునుడు; శంఖరవ= శంఖధ్వని; జ్యానాదంబులు= నారియొక్క ధ్వనులు; చెలంగన్= ధ్వనించగా; కొండొక దవ్వు= కొద్ది దూరం; వెన్నడిన్= వెన్నంటి; తఱిమి= తరుముకొని వెళ్ళి; బిరుదులతోడి= బిరుదులతో సహా; గొడుగులును= వెల్ల గొడుగులును; అడియాలంబులతోడి= ఆనవాళ్ళతోడి; సిడంబులును= జెండాలును; వైపించుకొని= పడవేసేటట్లు చేసి; తృప్తిన్= తృప్తిని; పొంది; మరలువాఁడు+ఐ= వెనుకకు మరలెడివాడై; ఎల్లవారును= అందరును; వినన్= వినునట్లుగా; పెద్ద+ఎలుంగునన్= పెద్ద కంఠధ్వనితో; పోయి వచ్చెదను+అని= పోయి వస్తానని; చెప్పి; గాంగేయ= భీష్ముడు; ద్రోణ= ద్రోణుడు; కృపాచార్యులకున్= కృపాచార్యునకును; ప్రణామ బాణంబులు= నమస్కారాన్ని తెలిపే బాణాలు; ఏసి= వేసి; వారిన్= వారిని; వీడ్కొనిన వాఁడై= సాగనంపినవాడై; మిట్టకోలలన్= తీక్షణ బాణాలతో; రారాజు= దుర్యోధనుడి యొక్క; మకుటంబు మణులు= కిరీటమందలి మణులు; డులిచి= రాలేటట్లు చేసి; అతనికిన్= దుర్యోధనుడితో; చెప్పినవాఁడై= వెళ్ళివస్తానని చెప్పి; అఖర్వ= అడ్డులేని; బాహాగర్వ= బాహువులయొక్క గర్వముయొక్క; నిర్వహణంబు= నెరవేర్చటం; మెఱయన్= ప్రకాశించగా; అప్పుడు= ఆ సమయాన; మధ్యందిన= మధ్యాహ్నపు వేళయందలి; మార్తాండ= సూర్యుడివలె; ప్రచండుండు= మిక్కిలి తీక్షణమైనవాడు; అగుచున్+ఉండన్= అగుచుండగా; కౌరవవీరులు= కౌరవసేనలోని వీరులు; అతనిన్= ఆ అర్జునుడిని; తేఱిచూడనున్+చాలక= తేరిపార చూడనైనా చూడలేక; చనిరి= వెళ్ళారు; అతండును= అర్జునుడును; చూపఱన్= చూచేవారిని; తోలి= పారద్రోలి; నిలిచిన= ఆగిన; మదము+ఏనుంగు చందంబునన్= మదించిన ఏనుగువలె; నిలిచి= ఆగి; విరాటతనయునకున్= ఉత్తరుడితో; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= పల్కినాడు.

తాత్పర్యం: అట్లా చెప్పిన భీష్ముడి హితవాక్యాలు విని, ఇంకా యుద్ధమే చెయ్యాలని ఉన్నా, కోపావేశంతో మనస్సుడికి పోతున్నా అంతకూ ఒక నిట్టూర్పు వదిలి నిలిచాడు. ఆవేశం తగ్గించుకొన్నాడు. తక్కిన వీరులు కూడా అర్జును డంతకంతకు పెచ్చుపెరిగిపోవటం చూచారు. ఎట్లాగైనా దుర్యోధనుడిని రక్షించటమే ముఖ్యం అనుకొన్నారు. పరాక్రమాన్ని, ఆవేశాన్ని ఒకప్రక్కకు నెట్టారు. భీష్ముడి మాటల ప్రకారం వచ్చిన దారినే పోవటం ప్రారంభించారు. అర్జునుడు వారిని చూచాడు. కొంతమేర తరిమాడు. వారి గొడుగులు ఊడగొట్టించాడు. జెండాలమీది ఆనవాళ్ళు తీయించాడు. అంతటితో తృప్తిపడి వారిని వదలివేసి మరలివెళ్ళుతూ తానింక పోయివస్తానని గట్టిగా ఒక కేకపెట్టి, భీష్మద్రోణ కృపాచార్యులకు నమస్కార బాణాలు వేసి వారికి వీడ్కోలు చెప్పి, వాడి బాణాలతో దుర్యోధనుడి కిరీటంమీద ఉన్న మణులను రాల్చి, అతడికి వెళ్ళి వస్తానని చెప్పి, సాటిలేని పరాక్రమంచేత మధ్యాహ్న సూర్యుడివలె చూడ శక్యం కాకుండా ఉండగా కౌరవసేనలు ఆతడి కేసి చూడలేకపోయారు. తమదారిన తాము పోవసాగారు. చూచేవారిని తరిమి నిలువబడి ఉన్న మదపుటేనుగువలె అర్జునుడు ఆగి ఉత్తరుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: రూపకం, ఉపమ. రణమర్యాదలలో ఉండే కొన్ని సాంకేతికాంశాలు ఇందులో తిక్కన నిపుణంగా పేర్కొన్నాడు. ఇష్టం లేకపోయినా, కష్టంగా ఉన్నా, పరిస్థితుల ప్రభావానికి లొంగి, ప్రాణాలతో వదలిపెట్టిన శత్రువు కల్పించిన ఒక మంచి అవకాశంగా భావించి, తనవారి ముఖాలనన్నింటినీ చూచి, మార్గాంతరం లేదని వారు ప్రకటించే హావభావాలను జీర్ణించు కొనలేకపోయినా, బలవంతాన మన్నించి, కటకటపడుతూ ఓడి తిరిగివెళ్లే అభిమానధనుడైన ఆడంబరవీరుడి అంతరంగ చిత్రణాన్ని దుర్యోధనుడి చర్యలలో నాటకీయంగా తిక్కన రూపు కట్టించాడు. శత్రువు ఓడి తిరిగిపోతుంటే విజేత ఊరకుండలేడు. తన విజయాన్ని చాటుకొని, ఎదుటివారిని అవహేళనం చేసే చర్యలకు పాల్పడటం యుద్ధాలలో సహజం. అర్జునుడు యుద్ధనీతి తెలిసినవాడు, వివేకవంతుడు కావటంచేత ఉచితాలైన అవహేళన చర్యలు మాత్రమే చేశాడు. అవి - శంఖం, అల్లెత్రాడు

మొదలైన వాటిని మ్రోగించి, మరలా ఎదిరిస్తారా? అని కవ్వించాడు. ఆ కవ్వింపులకు స్పందించక దుర్యోధనాదులు తిరిగి వెళ్ళుతున్నారు. కొంత దవ్వు వారిని వెంటనంటి తరిమాడు. అప్పటికీ చడీచప్పుడు లేదు. అంత పౌరుష రహితంగా వెళ్ళిపోతున్న కౌరవవీరుల గొడుగులు, ధ్వజాలు నేలపై వేయించాడు. అంటే బిరుదులు లేని పిరికిపందలని వారిని క్రియాత్మకంగా హేళనం చేశాడు. దానికి తల ఒగ్గి కౌరవులు కిమ్మనకుండా పోసాగారు. ఇక, వారు చచ్చిన పాములతో సమానం. అందువలన తృప్తిపడి తానూ తిరుగుమొగం పట్టాడు. అయితే, తాను వెళ్ళివస్తా నని చెప్పటం వీరధర్మం. కౌరవులు ఓడిపోయినవారు కాబట్టి, చెప్పాపెట్టకుండా పోవటం వారి నైజం. అర్జునుడు తాను యుద్ధాన్ని ముగిస్తున్నానని చెప్పే సూచనలు కొన్ని చేశాడు. భీష్మద్రోణాది శిష్టచతుష్టయానికి బాణాలతో నమస్కరించాడు. రారాజు ధరించే మణికిరీటంలోని కొన్ని మణులు రాలిపడేటట్లు బాణాలతో కొట్టి 'ఈ ఓటమి నీ తేజస్సుకే ఒక గ్రహణం' అన్నట్లు అవహేళనం చేస్తూ పంపాడు. పరిపూర్ణ విజయం సాధించిన విజయుడు మధ్యాహ్న సూర్యుడివలె ప్రచండుడుగా ప్రకాశించాడు. చూపరులను తోలి నిలిచిన మదపుటేనుగువలె ఏకైకవీరుడై నిలిచాడు. ఉగ్రుడైన అర్జునుడు ప్రచండసూర్యుడు; కోపాన్ని చల్లార్చుకొని విజయోత్సాహంతో నిలిచిన విజయుడు మదపుటేనుగు. ఇది అలంకార శిల్పం. (సంపా.)

ఆ. 'పసులు మరలె శత్రుబలములు పీనుంగు । పెంట లయ్యెఁ; రాజుఁ బెద్దదొరలుఁ
జీర లొలువఁ బడిరి; సిగ్గఱి బిరుదులు । వైచి; రింక మగుడవలదె మనకు. **222**

ప్రతిపదార్థం: పసులు= ఆవులు; మరలెన్= మన ఊరికి మళ్ళాయి; శత్రుబలములు= శత్రువుల సేనలు; పీనుంగు పెంటలు= చచ్చిన శవాల ప్రోవులు; అయ్యెన్= అయ్యాయి; రాజున్= దుర్యోధనుడును; పెద్దదొరలున్= గొప్ప వీరులైన రథికులును; చీరలు= వస్త్రాలు; ఒలువఁబడిరి= తీసివేయబడ్డారు; సిగ్గఱి= సిగ్గువదలి; బిరుదులు= పరాక్రమ చిహ్నాలను; వైచిరి= పడవేశారు; మనకున్= మనం; ఇంకన్= ఇటుపై; మగుడవలదె?= మరలవద్దా?

తాత్పర్యం: 'గోవులను మరల్చాం, శత్రుసేనలను పీనుగు పెంటలు చేశాం. దుర్యోధనుడివి, పెద్ద రాజులవి, వీరులవి తలగుడ్డలు లాగేశాం. వారి పరాక్రమ బిరుదాలను పడవేయించాం. ఇంక మనం కూడా వెళ్ళుదాం.

క. హయముల మరల్పు; మీ త । ల్లియు బంధులు నెడలు సంచలింప గుమురు గ
ట్టి యెదురుసూతురు; వారికిఁ । బ్రియముగ శీఘ్రమ్మునం బురికిఁ బోవలయున్.' **223**

ప్రతిపదార్థం: హయములన్= గుర్రాలను; మరల్పు= మరలించు; మీ తల్లియున్= మీ తల్లియును; బంధులున్= బంధువులును; ఎడలు= మనస్సులు; సంచలింపన్= కదలిపోయేటట్లు; గుమురు గట్టి= ప్రోవై; ఎదురు చూతురు= నీకై యెదురు చూస్తూ ఉంటారు; వారికిన్= వారందరికిని; ప్రియముగన్= ప్రీతికలిగేటట్లుగా; శీఘ్రమ్మునన్= వేగంగా; పురికిన్= నగరానికి; పోవలయున్= పోవాలి.

తాత్పర్యం: ఇంక గుర్రాలను మరల్చుము. మీ తల్లి, బంధువులు దడదడలాడే గుండెలతో నీకొరకు గుమిగూడి ఎదురు చూస్తుంటారు. వారికి ప్రీతి కలిగేటట్లుగా ఇంక మనం నగరానికి పోవాలి.'

వ. అనిన నతండును రథంబు మగిడించినం జని చని. **224**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అతండును= ఉత్తరుడు కూడ; రథంబు= రథాన్ని; మగిడించినన్= మరల్చగా; చనిచని= కొంతదూరం ప్రయాణించి.

తాత్పర్యం: అని అర్జునుడు పలుకగా ఉత్తరుడు విని రథాన్ని మరల్చి కొంతదూరం ప్రయాణం చేసి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **కాలు తక్కువ వారలు గలయఁ జెదరి । వెనుకఁ బడిపోవునెడఁ దన్నుఁ గని భయమున**
బ్రాణదానంబు వేఁడినఁ బార్థుఁ డభయ । హస్త మిచ్చుచు దయ పెనుపారఁ బలుకు. **225**

ప్రతిపదార్థం: కాలుతక్కువ వారలు= పరుగెత్తలేనివారు; కలయన్= మిక్కిలి; చెదరి= అటొకడు ఇటొకడు చెదరిపోయి; వెనుకన్+ పడి పోవు+ఎడన్= వెనుకబడిపోయేటప్పుడు; తన్నున్= అర్జునుని; కని= చూచి; భయమునన్= భయంతో; ప్రాణదానంబు= ప్రాణదానం చేయుమని; వేఁడినన్= ప్రార్థించగా; పార్థుఁడు= అర్జునుడు; అభయహస్తము= భయం లేదని తెల్పే హస్తాన్ని; ఇచ్చుచున్= చూపుతూ; దయ పెనుపారన్= దయ వృద్ధిపొందగా; పలుకున్= మాట్లాడాడు.

తాత్పర్యం: వేగంగా వెళ్ళలేని కొందరు సేనతోపాటు పారిపోలేక అటు ఇటు చెదరి వెనుకపడగా, వారు అర్జునుడిని చూచి భయపడి ప్రాణదానం చేయుమని కోరగా అభయహస్త మిచ్చి దయతో వారిని పలుకరించాడు.

వ. **ఇట్లు నానావిధ దీనదశా దందహ్యమాను లగు కృపణులం దన కృపామృతంబునం దడిపినం దేఱి వారు దీవించుచుం బ్రణమిల్లుచుం బొగడుచుం బోవుచుండ ధనంజయుండు భూమింజయుం జూచి.** **226**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; నానావిధ= పలురకాలైన; దీనదశా= దీనావస్థలతో; దందహ్యమానులు+అగు= దహింప బడుతున్న; కృపణులన్= దీనులను; తన= తనయొక్క; కృపా+అమృతంబునన్= దయ అనెడి అమృతంతో; తడిపినన్= తడుపగా; తేరి= తేరుకొని; వారు= ప్రాణాలతో వదలబడినవారు; దీవించుచున్= అర్జునుడిని ఆశీర్వదిస్తూ; ప్రణమిల్లుచున్= నమస్కరిస్తూ; పొగడుచున్= స్తుతిస్తూ; పోవుచున్+ఉండన్= వెళుతూ ఉండగా; ధనంజయుండు= అర్జునుడు; భూమింజయున్= ఉత్తరుని; చూచి.

తాత్పర్యం: ఈ రీతిగా పలురకాలైన దీనదశలతో దహించబడే దీనులను అర్జునుడు తన దయామృతంతో తడిపాడు. దానితో వారు తేరుకొని, అతడిని దీవించారు, నమస్కారాలు చేశారు, పొగిడారు. వారి దారిన వారు వెళ్ళారు. అప్పుడు అర్జునుడు ఉత్తరుడితో (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: రూపకం. ఉదాత్తుడైన అర్జునుడు ఎంతటి ధీరుడో, వీరుడో అంతటి కరుణామయుడు. (సంపా.)

ఆ. **'కురుబలంబు గెలిచి గోవులఁ గ్రమ్మఱఁ । దెచ్చు టెల్ల నీ యుదీర్ణ బాహు**
బలమకాఁగ నీవు పలుకుము; వెలిఁబుచ్చు । టుడుగు మధిపుపాల నొండు దెఱఁగు.' **227**

ప్రతిపదార్థం: కురుబలంబున్= కౌరవసేనను; గెలిచి= జయించి; గోవులన్= ఆవులను; క్రమ్మఱన్= మరలించి; తెచ్చుట= తీసికొని రావటం; ఎల్లన్= అంతయును; నీ= నీయొక్క; ఉదీర్ణ= గొప్పదైన; బాహుబలము+అ= పరాక్రమమే; కాఁగన్= అగునట్లు; నీవు; పలుకుము= చెప్పుము; అధిపుపాలన్= రాజుముందర; ఒండు+తెఱఁగు= మరొకవిధంగా; వెలిన్+పుచ్చుట= వెల్లడించటం; ఉడుగుము= మానుకొనుము.

తాత్పర్యం: 'కౌరవసేనను జయించి గోవులను మరలించటం నీ పరాక్రమంవలననే జరిగిందని చెప్పుము. రాజుముందు వేరొక రీతిగా ప్రకటించవద్దు.'

క. **అనవుడు 'నీచేసిన యీ । పని నాచేఁ గాకయునికి పతి యెఱుఁగఁడొకో!**
జనులు నిజము సేయుదురే । నిను నెఱిఁగింపకయ చెప్ప నేర్తునె పొసఁగన్.' **228**

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; నీ చేసిన+ఈ పని= నీవు చేసిన ఈ విజయం; నాచేన్= నా చేత; కాక+ఉనికి= కాకుండటం; పతి= రాజు-విరాటుడు; ఎఱుఁగఁడొకో!= ఎరుగడా?; జనులు= ప్రజలు; నిజము= యథార్థమని; చేయుదురే= చేయుదురా? (నమ్ముతారా?); నినున్= నిన్ను; ఎఱిఁగింపక+అ= తెలియజేయకయే; పొసఁగన్= పొసగునట్లు; చెప్పన్ నేర్తునె= చెప్పగలనా?

తాత్పర్యం: అని అర్జునుడు చెప్పగా ఉత్తరుడు 'కౌరవబలాన్ని జయించటం నాచేత కాదని రాజు ఎరుగడా? జనులు నిజాన్ని తెలిసికొనరా? నిన్నుగూర్చి చెప్పకుండా పొసగేటట్లు ఎట్లా చెప్పగలను?'

వ. అని యుత్తరుండు మఱియును. 229

తాత్పర్యం: అట్లా చెప్పి ఉత్తరుడు ఇంకా.

క. 'నీ వలచిన యప్పుడ ధా । త్రీవల్లభుఁ డెఱుఁగునట్టి తెఱఁగు నడపెదన్
దేవేంద్రపుత్ర! యే ననఁ । గా వేఱొక పేరు గలదె కార్యము నడపన్.' 230

ప్రతిపదార్థం: నీ వలచిన అప్పుడు+అ= నీవు కోరినప్పుడే; ధాత్రీవల్లభుఁడు= విరాటరాజు; ఎఱుఁగునట్టి= తెలియునట్టి; తెఱఁగు= విధం; నడపెదన్= నడిపిస్తాను; దేవేంద్రపుత్ర!= అర్జునా!; ఏననఁగాన్= నేననగా; కార్యము= చేయవలసిన పని; నడపన్= నడపటానికి; వేఱొకపేరు= మరొకపేరు; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: 'నీయిష్టం వచ్చినప్పుడే రాజునకు తెలిపే విధానం అనుసరిస్తాను. అర్జునా! కార్యం సరిగా నడపటానికి 'నేను' అనటం కన్న వేరే పేరుందా?'

వ. అను వచనంబు లియ్యకొనుచుం జని, శమీవృక్ష సమీపంబున నిల్చి, గాండీవాది సాధనంబులు పూర్వ ప్రకారంబున నిక్షేపింప నియోగించి, కపిధ్వజ దేవదత్త కిరీటాది దివ్యపరికరంబుల సవినయంబుగాఁ బ్రార్థించి యంతర్ధానంబు సేయించి యెప్పటి సింహపతాక రథంబున బంధింపం బనిచి విరాటతనయుండు నిజాయుధంబులు గైకొని రథికుండయి వచ్చునట్లుగాఁజేసి, తొంటిచందంబునం దలచీర యలవరించికొని సారథియై సవ్యసాచి నొగ లెక్కె; నట్టి సమయంబునఁ బురందరాది బృందారకులును దేవముని సిద్ధగంధర్వాదులును బాండుప్రముఖ రాజలోకంబును నాశ్చర్యహర్షాయత్తచిత్తులయి సమర విషయంబు లయిన మాటలాడుచు నిజనివాసంబుల కరిగి; రట నరుండు నుత్తరు నాలోకించి 'నీ విజయంబు పురంబున ఘోషింప గోపాలురం బుచ్చు' మనిన నతం డది దెఱంగుగాఁ గైకొని యట్ల చేయ, నిట్లు నిగూఢంబుగాఁ బట్టణంబునకుం జనుచుండ; నంతకు మున్న మత్స్యమహీవల్లభుం డాహవజయదర్పిత వాహినీ పరివృతుండై నగరంబు సొత్తెంచి. 231

ప్రతిపదార్థం: అను వచనంబులు= అనెడి మాటలు; ఇయ్యకొనుచున్= ఒప్పుకొనుచు; చని= వెళ్ళి; శమీవృక్షసమీపంబునన్= జమ్మిచెట్టు దగ్గర; నిల్చి= ఆగి; గాండీవ+ఆది= గాండీవం మున్నగు; సాధనంబులు= పరికరాలు; పూర్వప్రకారంబునన్= మునుపటి వలెనే; నిక్షేపింపన్= పెట్టుటకు; నియోగించి= పురమాయించి; కపిధ్వజ= హనుమంతుడి గుర్తు జెండాను; దేవదత్త= దేవత లిచ్చిన శంఖం; కిరీట+ఆది= కిరీటం మొదలైన; దివ్య= దేవతా సంబంధమైన; పరికరంబులన్= సాధనాలను;

సవినయంబుగాన్= వినయంతో కూడునట్లుగా; ప్రార్థించి= ప్రార్థనచేసి; అంతర్ధానంబు+చేయించి= కన్పడకుండేటట్లుచేసి; ఎప్పటి సింహపతాక= మునుపటి సింహధ్వజం; రథంబునన్= రథంపై; బంధింపన్= కట్టుటకు; పనిచి= పంపి; విరాట తనయుండు= ఉత్తరుడు; నిజ+ఆయుధంబులు= తన ఆయుధాలను; కైకొని= తీసికొని; రథికుండు+అయి= రథాన్ని ఎక్కిన వీరుడై; వచ్చునట్లుగాన్= పురానికి వచ్చేవాడినిగా; చేసి= ఆజ్ఞాపించి; తొంటి చందంబునన్= మునుపటి రీతిగా; తలచీర= తలగుడ్డ; అలవరించికొని= కట్టుకొని; సారథి+ఐ= రథం తోలేవాడుగా అయి; సవ్యసాచి= అర్జునుడు; నొగలు= సారథి కూర్చుండే ప్రదేశం; ఎక్కెన్= ఎక్కాడు; అట్టి సమయంబునన్= అటువంటి సమయంలో; పురందర+ఆది= దేవేంద్రుడు మొదలైన; బృందారకులును= దేవతలును; దేవముని= దేవర్షులు; సిద్ధ= సిద్ధులు; గంధర్వ+ఆదులును= గంధర్వులు మున్నగువారు; పాండుప్రముఖ= పాండురాజు మున్నగు; రాజలోకంబును= రాజసమూహమున్నూ; ఆశ్చర్య= వింతకూ; హర్ష+ఆయత్త= సంతోషానికీ అధీనమైన; చిత్తులు+అయి= మనస్సులు కలవారై; సమర విషయంబులు+అయిన+మాటలు+ ఆడుచున్= యుద్ధసంబంధమయిన మాటలు మాట్లాడుకొంటూ; నిజ నివాసంబులకున్= తమ తమ నివాస ప్రదేశాలకు; అరిగిరి= వెళ్ళారు; ఇటన్= ఇక్కడ; నరుండు= అర్జునుడు; ఉత్తరున్= ఉత్తరుడిని; ఆలోకించి= చూచి; నీ విజయంబు= నీ యొక్క విజయవార్తను; పురంబునన్= పట్టణంలో; ఘోషింపన్= చాటటానికి; గోపాలురన్= పసుల కాపరులను; పుచ్చుము+అనినన్= పంపు మనగా; అతండు= ఉత్తరుడు; అది= ఆ చెప్పటం; తెఱంగుగాన్= రీతిగా; కైకొని= స్వీకరించి; అట్లు+అ= అట్లే; చేయన్= చేయగా; ఇట్లు= ఈ విధంగా; నిగూఢంబుగాన్= ఎవరికిని తెలియకుండా; పట్టణంబునకున్= విరాట నగరానికి; చనుచున్+ఉండన్= వెళ్ళుచుండగా; అంతకున్+మున్ను+అ= అంతకంటె ముందుగా; మత్స్యమహీవల్లభుండు= విరాటరాజు; ఆహవజయ= యుద్ధ విజయంచేత; దర్పిత= గర్వించిన; వాహినీ= సేనతో; పరివృతుఁడు+ఐ= చుట్టబడినవాడై; నగరంబు= పట్టణంలో; చొత్తెంచి= ప్రవేశించి.

తాత్పర్యం: ఆ మాట లంగీకరించి వెళ్ళి జమ్మిచెట్టు దగ్గర ఆగి, గాండీవం మున్నగు పరికరాలను ఇదివరకటివలెనే దాచుమని ఆజ్ఞాపించి, కపిధ్వజం, దేవదత్తం, కిరీటం మొదలైన దివ్యపరికరాలను వినయంతో ప్రార్థించి అంతర్ధానం చేసి, మామూలుగా సింహధ్వజాన్ని రథానికి కట్టించి, ఉత్తరుడు తన ఆయుధాలను పుచ్చుకొని రథికుడుగా రథమెక్కి కూర్చునేటట్లుగా చేసి, తాను మునుపటివలె తలకు గుడ్డ కట్టుకొని సారథిగా నొగలపైకి ఎక్కాడు అర్జునుడు. అప్పు డీ యుద్ధం చూడటానికి వచ్చిన దేవేంద్రాదులు, దేవర్షులు, సిద్ధులు, గంధర్వాదులు, పాండురాజు మొదలైన రాజులు, అందరూ ఆశ్చర్యంతోను, సంతోషంతోను ఆ యుద్ధపు కబుర్లు చెప్పుకొంటూ తమ తమ నివాసాలకు వెళ్ళారు. ఇక్కడ అర్జునుడు 'నీ విజయం పట్టణంలో చాటింపుమని గోపాలురకు చెప్పి పంపు'మనగా అతడు అందుకు అంగీకరించి ముందుగా గోపాలురను పంపించాడు. ఈ రీతిగా నిగూఢంగా పట్టణానికి వెళ్ళుతూ ఉన్నారు. అక్కడ విరాటరాజు (దక్షిణ గోగ్రహణ యుద్ధంలో) గెలుపు వచ్చినందున గర్వించిన సేనతో నగరానికి వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. మందిరాభ్యంతరమున కానందలీలలఁ । బాండుపుత్రులుఁ దక్కటి బంధుజనులుఁ
దానుఁ జని విప్రులును వనితాజనంబు । సేస లొలుక సింహాసనాసీనుఁ డయ్యె. 232

ప్రతిపదార్థం: మందిర+అభ్యంతరమునన్= రాచనగరులో; ఆనందలీలలన్= ఆనంద విలాసాలతో; పాండుపుత్రులున్= పాండవులును; తక్కటి బంధుజనులున్= మిగిలిన బంధువులును; తానున్= విరాటుడు; చని= వెళ్ళి; విప్రులును= బ్రాహ్మణులూ; వనితాజనంబున్= స్త్రీలూ; సేసలు= దీవనప్రాలు; ఒలుకన్= వేయగా; సింహాసన= సింహాసనంలో; ఆసీనుఁడు= కూర్చున్నవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: రాజప్రాసాదంలోనికి పాండవులూ, తక్కిన బంధువులూ, తానూ ప్రవేశించారు. బ్రాహ్మణులూ, స్త్రీలూ దీవిస్తూ అక్షతలు చల్లుతూ ఉండగా విరాటరాజు సింహాసనంమీద కూర్చున్నాడు.

వ. ఇవ్విధంబునం దన విజయంబుఁ గొనియాడ వచ్చిన వారి నెల్ల నభినందించి 'యుత్తరుం డెచ్చట నున్న వాఁ?' డని యడిగి వారల వలనం గురునాథుండు భీష్మద్రోణ కర్ణ కృపాశ్వత్థామాది యోధవీరులు బెరసిన బలంబులతోడ నడచి యుత్తరంబునఁ బసులం బట్టిన నతండు బృహన్నల సారథింగాఁ గైకొని యొక్కరుండ కుయివోవుట విని విషాద వేదనా దోదూయమాన మానసుం డగుచు మంత్రుల మొగంబు సూచి యిట్లనియె. 233

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; తన విజయంబున్= తన జయమును; కొనియాడన్= పొగడటానికి; వచ్చిన వారిన్+ఎల్లన్= వచ్చిన అందరిని; అభినందించి= అభినందనం చేసి; ఉత్తరుండు= ఉత్తరుడు; ఎచ్చటన్= ఎక్కడ; ఉన్నవాఁడు?= ఉన్నాడు?; అని+అడిగి= అని ప్రశ్నించి; వారల వలనన్= వారు చెప్పగా; కురునాథుండు= దుర్యోధనుడు; భీష్మ= భీష్ముడు; ద్రోణ= ద్రోణుడు; కర్ణ= కర్ణుడు; కృప= కృపాచార్యుడు; అశ్వత్థామ+ఆది= అశ్వత్థామ మొదలైన; యోధవీరులు= వీరులైన యోధులు; బెరసిన= కూడిన; బలంబుల తోడన్; నడచి వచ్చి; ఉత్తరంబునన్= నగరానికి ఉత్తరంగా; పసులన్= గోధనాలను; పట్టినన్= ఆక్రమించగా-తోలికొని పోగా; అతండు= ఉత్తరుడు; బృహన్నల= బృహన్నలను; సారథిన్+కాన్= రథం తోలువాడిగా; కైకొని= స్వీకరించి; ఒక్కరుండు+అ= ఒక్కడే; కుయి+పోవుట= రక్షకు పోవటం; విని; విషాద= విచారంతో; వేదనా= బాధతో; దోదూయమాన= బాధపడుతున్న; మానసుండు+అగుచున్= మనస్సు కలవాడై; మంత్రుల= మంత్రులయొక్క; మొగంబు= ముఖాన్ని చూచి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఈ విధంగా తన విజయాన్ని పొగడటానికి వచ్చిన వారిని అభినందించాడు విరాటరాజు. ఇక 'ఉత్తరుడు ఎక్కడ ఉన్నా'డని ప్రశ్నించాడు. 'దుర్యోధనుడు - భీష్మ, ద్రోణ, కర్ణ, కృపాశ్వత్థామాది యోధ వీరులున్న సేనతో వచ్చి ఉత్తరాన ఉన్న గోవులను తోలుకొని పోతూ ఉంటే వాటిని మరల్చటానికని బృహన్నలను సారథిగా చేసికొని ఒక్కడే వెళ్ళా' డని చెప్పారు. అది వినేటప్పటికి విషాదం, వేదన కలిగాయి. విరాటుడు మంత్రుల ముఖాలు చూచి ఇట్లా అన్నాడు.

విరాటుఁ డుత్తరుఁడు గురుసైన్యంబు గెలువఁబోవుట విని చింతించుట (సం. 4-63-9)

చ. 'అసమున మీఁ దెఱుంగక మహాగ్రహవృత్తిఁ గడంగి చెచ్చెరం
బసులకుఁ గూయిగాఁ జనియెఁ బాపఁడు; కౌరవసేన యేడ? యొం
టి సనుట యేడ? నా కిది కడింది విచారము వుట్టె; సైన్యముల్
వెసఁ జని తోడు గావలయు వేగమ పంపుఁడు చాలునట్లుగన్.' 234

ప్రతిపదార్థం: పాపఁడు= చిన్నవాడు; అసమునన్= దర్పంతో; మీఁదు= పైన వచ్చేడిది; ఎఱుంగక= తెలియక; మహా+ఆగ్రహవృత్తిన్= ఎక్కువ కోప వర్తనంతో; కడంగి= పూనుకొని; చెచ్చెరన్= వెంటనే; పసులకున్= గోవులకు; కూయిగాన్= రక్షకుడుగా; చనియెన్= వెళ్ళాడు; కౌరవసేన= కౌరవుల సైన్యం; ఏడ?= ఎక్కడ; ఒంటి+చనుట= ఒంటరిగా వెళ్ళటం; ఏడ?= ఎక్కడ?; ఇది= ఇట్లా వెళ్ళటం; నాకున్= నాకు; కడింది= మిక్కిలి; విచారము= దుఃఖం; పుట్టెను= కల్గించింది; సైన్యముల్= సేనలు; వెసన్= వెంటనే; చని= వెళ్ళి; తోడు= సాయం; కావలయున్= కావలెను; చాలునట్లుగాన్= సరిపోవునంతగా; వేగము+అ= వేగమే; పంపుఁడు= పంపించండి.

తాత్పర్యం: 'పసివాడు గర్వంతో తర్వాత ఏమి జరుగుతుందో తెలియకుండా దురాగ్రహంతో గోవులకు బాధ కలిగిందని రక్షిద్దామని వెళ్ళాడు. కౌరవసేన ఎక్కడ? ఇతడు ఒంటరిగా వెళ్ళట మెక్కడ? ఇది నాకు చాలా బాధాకరంగా ఉన్నది. వెంటనే అతడికి సహాయం కావాలి. సరిపోవునంతగా సేనలను పంపించండి.'

చ. అనుటయుఁ గంకుఁ డిట్లనియె 'నక్కడ వచ్చి సుశర్మ యోడెఁ గా
వున నిట వీరికిన్ జయ మవున్; వెఱ పేటికి నీకు? నుత్తరుం
డని నొకరుండు నాకుము బృహన్నల సారథి గాన గెల్చు న
య్యనిమిషకోటినైన నతఁ డద్భుతవిక్రమజృంభణంబునన్.' 235

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; కంకుఁడు= కంకుభట్టు పేరుతో ఉన్న ధర్మరాజు; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= అన్నాడు; సుశర్మ= సుశర్మ అను రాజు; అక్కడన్= దక్షిణపు వైపున; వచ్చి= యుద్ధానికి వచ్చి; ఓడెన్= ఓడిపోయాడు; కావునన్= కనుక; ఇటన్= ఇక్కడను; వీరికిన్= వీరికికూడా; జయము= గెలుపు; అవున్= కలుగుతుంది; నీకున్= నీకు; వెఱపు= భయం; ఏటికిన్?= ఎందుకు?; అనిన్= యుద్ధంలో; ఉత్తరుండు= ఉత్తరుడు; ఒకరుండు= ఒక్కడే; నాకుము= అనకుము; సారథి= రథం తోలువాడు; బృహన్నల కానన్= బృహన్నల కనుక; అతఁడు= ఆ బృహన్నల; అద్భుత= ఆశ్చర్యకరమైన; విక్రమ= పరాక్రమంయొక్క; జృంభణంబునన్= విజృంభించటంతో; ఆ+అనిమిష కోటిన్+ఐనన్= ఆ దేవతా సముదాయాన్నైనాసరే; గెల్చున్= గెలుస్తాడు.

తాత్పర్యం: విరాటుడు అట్లా సందేహంతో పలుకగా కంకుభట్టు 'అటు దక్షిణపు వైపున దండెత్తి వచ్చి సుశర్మ ఓడిపోయాడు కదా! మనకు విజయం కలిగింది. ఇటు ఉత్తర గోగ్రహణ యుద్ధంలో కూడా మనవారికే విజయం కలుగుతుంది. నీ కెందుకు భయం? యుద్ధం చేసేవాడు ఒక్క ఉత్తరుడే అనుకొనకుము. సారథిగా బృహన్నల ఉన్నాడు గదా! అతడు అద్భుతమైన పరాక్రమం కలవాడు. విజృంభించెనా దేవతలను కూడ గెలువగలడు' అన్నాడు.

విశేషం: ధర్మరాజు మాటనేర్పరితనం ఇందులో మెరుస్తున్నది. అక్కడ, ఇట-శబ్దాలు దక్షిణ ఉత్తర దిశలు చూపిస్తూ చెప్పిన వాచికాభినయ విశేషాలు. అక్కడ సుశర్మ ఓడాడు. అతడు ఓడటానికి భీమాదుల సమష్టికృషి హేతువు. అందువలన విజయసాధకుల పేర్లు చెప్పటం అక్కడ రాజసభా మర్యాద కాదు కాబట్టి చెప్పలేదు. ఇట (ఉత్తర గోగ్రహణ ఘట్టంలో) వీరికి (బృహన్నలకు, ఉత్తరుడికి) విజయం తథ్యం అన్నాడు. ఇక్కడ ఓడిన వారి సంఖ్య అధికం, గెలిచినవారి సంఖ్య పరిమితం. అందువలన గెలిచే సంగతి చెప్పాడు. 'వీరికిన్' - అనే సర్వనామం సార్థకమని పేర్కొని, సారథితో కూడిన ఉత్తరుడిని పేర్కొన్నాడు. సామాన్యంగా యుద్ధంలో సారథిని రథికుడితో సాటిగా లెక్కించరు. ఇక్కడ ధర్మరాజు సారథిని రెండవవాడిగా గుర్తించటమే కాక, అతడు సారథి కాబట్టే రథికుడు గెలవగలుగుతాడని చెప్పాడు. అంతేకాక, సారథి అయినా రథికుడివలె అతడికి తోడ్పడతాడని సూచించాడు. 'ఉత్తరుండు అనిన్ ఒక్కరుండు అనకుము' అనటం ఉక్తి విశేషం. ఉత్తరుడు ఎప్పుడూ ఉత్తరస్థానంలోనే ఉంటాడు. పూర్వ (ప్రథమ) స్థానంలో అర్జునుడు ఉంటాడని ధ్వని. అర్జునుడు ప్రక్కన ఉండగా ఒక్కరుడుగా అంటే - ఏకైకవీరుడిగా ఉత్తరుడిని పరిగణించరాదని గూఢమైన అర్థం. చివరివాక్యంలో అతఁడు-అనే సర్వనామం అటు అర్జునుడికీ, ఇటు ఉత్తరుడికీ అన్వయించేటట్లు పలకటం ధర్మజుడి (కంకుడి) మాటనేర్పరితనం. దేవతలందరూ కలిసి వచ్చినా ఆశ్చర్యం కలిగించే పరాక్రమంతో ఓడించగలగటం అతడికే సాధ్యం అంటాడు. 'వారికిన్ జయమవున్' - అని మొదలుపెట్టిన ధర్మజుడు 'అతఁడు గెల్చున్' అని ముగించాడు. అది ఒక ముడి. విరాటునికి మాటల ముడి అర్థం కాదు. అందుకు కలత చెందుతాడు. మనసులో తపిస్తాడు తరువాతి పద్యంలో. (సంపా.)

చ. అన వినుచుం గలంగు హృదయంబునఁ దాపము నివ్వటిల్ల ని
ట్లను మఱియున్ విరాటుఁడు 'రణావనియందుఁ ద్రిగర్త సేనచే
ననయము నొచ్చినట్టి జనులందఱుఁ దక్కఁగ నేటుఁ బోటుఁ దాఁ
కని ఘనయోధకోటి సనఁగావలయున్ బలుపై రయంబునన్. 236

ప్రతిపదార్థం: అనన్= అనగా; వినుచున్= వింటూనే; కలంగు హృదయంబునన్= కలతచెందే హృదయంలో; తాపము= విచారం; నివ్వటిల్లన్= అతిశయించగా; మఱియున్= ఇంకా; ఇట్లు= ఈ రీతిగా; విరాటుఁడు= రాజు; అనున్= అన్నాడు; రణ+అవనిఅందున్= యుద్ధభూమిలో; త్రిగర్త సేనచేన్= త్రిగర్తదేశపు సైన్యంచేత; అనయమున్= మిక్కిలి; నొచ్చినట్టి= బాధపడిన; జనులు= సైనిక జనం; అందరున్= అందరున్నూ; తక్కఁగన్= తప్ప, మిగిలిన; ఏటున్= చావు దెబ్బలను; పోటున్= కత్తిపోటులను; తాఁకని= తగలని; ఘన= గొప్పవారైన; యోధకోటి= యుద్ధవీరుల సముదాయం; బలుపు+ఐ= బలంకలదై; రయంబునన్= వేగంగా; చనఁగావలయున్= వెళ్ళవలెను.

తాత్పర్యం: కంకుభట్టు మాటలు వింటూనే మనస్సు కలతచెందగా, తాపం పెరిగిపోగా విరాటుడు ఇట్లా అన్నాడు: 'యుద్ధంలో దక్షిణాన త్రిగర్తుల సైన్యంచేత బాగా బాధపడిన సైనికులు కాక, బాణాల కత్తుల బాధలను పొందని మిగిలిన యోధ సముదాయమంతా బలంగా, వేగంగా, వెనుదీయక వెంటనే యుద్ధానికి వెళ్ళాలి.

క. చని యక్కుమారుఁ డే మ । య్యెనో? యత్తెఱఁ గెఱిఁగి మనకు నెఱిగించుట పు
ట్టిన కార్యమునకుఁ దగియెడు । పని; యట విధి గెలువ వశమె బ్రహ్మకునైనన్. 237

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; ఆ+కుమారుఁడు= ఆ ఉత్తరకుమారుడు; ఏమి+అయ్యెనో?= యుద్ధంలో ఏమైనాడో?; ఆ+తెఱఁగు= ఆ విధం; ఎఱిఁగి= తెలిసికొని; మనకున్= మనకు; ఎఱిగించుట= అందించుట; పుట్టిన కార్యమునకున్= జరిగిన పనికి; తగియెడు= తగిన; పని= కర్తవ్యం; అటన్= అక్కడ; విధిన్= దైవాన్ని; బ్రహ్మకున్+ఐనన్= బ్రహ్మకైనా; గెలువన్= గెలుచుటకు; వశమె?= వశమా?

తాత్పర్యం: సేనలు అక్కడికి వెళ్ళి, అక్కడ ఉత్తరకుమారుడి పరిస్థితి ఎట్లా ఉన్నదో తెలిసికొని మనకు తెలపటం జరిగిపోయినదానికి ప్రస్తుత కర్తవ్యం. విధిని తప్పించుకొనటం బ్రహ్మకైనా వశం కాదు కదా!'

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ఉత్తరుడు రణరంగంలో ఏమైనాడో - అనటంలోనే అతడిమీద విరాటుడు అన్ని ఆశలూ వదలుకొన్నట్లు ధ్వనిస్తున్నది. అందుకే కాబోలు - 'ఘనయోధ కోటి' - కొడుకేమైనాడో తెలిసికొని చెప్పటానికే పంప తలపెట్టాడు. అంటే- వీరు రణభూమికి చేరేసరికి ఉత్తరుడు చచ్చిపడి ఉండవచ్చునన్న శంక ధ్వనిస్తున్నది. యోధులు యుద్ధం చేసే అవసరం ఉండదనే అతని ఊహ! బ్రహ్మకైనా విధిని తప్పించుకొనటం సాధ్యం కాదన్న అర్థాంతరన్యాసం ఆ ఊహను బలపరుస్తున్నది. (సంపా.)

వ. అనుచు నుత్తలపడు నయ్యవసరంబున నుత్తరుఁడు పుత్తెంచిన గోపాలురు పఱతెంచి యతనిం గాంచి. 238

ప్రతిపదార్థం: అనుచున్= అని పలుకుతూ; ఉత్తలపడు= బాధపడెడి; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; ఉత్తరుఁడు పుత్తెంచిన= ఉత్తరుడు పంపిన; గోపాలురు= పశుపాలకులు; పఱతెంచి= వచ్చి; అతనిన్= విరాటుని; కాంచి= చూచి.

తాత్పర్యం: అని బాధపడే సమయంలో ఉత్తరుడు పంపిన గోపాలురు పరుగెత్తుకొంటూ వచ్చి విరాటరాజును దర్శించుకొని.

చ. **'కురుబలమున్ జయించి మనగోవుల నెల్లను గ్రమ్మఱించి యు**
త్తరుఁ డిదె తాను సూతుఁడు నుదగ్రత వచ్చుచు నున్నవాఁడు; త
త్తురగరథధ్వజాలి నొక త్రుప్పుడు రాలదు; మమ్ముఁ బిల్చి వే
పురి నెఱిఁగింపుఁ డన్న నృపపుంగవ! వచ్చితి మేము' నావుడున్. **239**

ప్రతిపదార్థం: నృపపుంగవ!= రాజా!; ఉత్తరుఁడు= ఉత్తర కుమారుడు; కురుబలమున్= కౌరవసేనను; జయించి= గెల్చి; మనగోవులన్= మన ఆవులను; ఎల్లను= అన్నింటిని; క్రమ్మఱించి= మరల్చి; ఇదె= ఇదిగో; తాను= ఆ ఉత్తరుడును; సూతుఁడున్= సారథియును; ఉదగ్రతన్= గర్వంతో; వచ్చుచున్+ఉన్నవాఁడు= వస్తున్నాడు; తద్= అతడియొక్క; తురగ= గుర్రాలు; రథ= రథం; ధ్వజ+ఆలిన్= జెండా వగైరాలకు; ఒక త్రుప్పుడున్= త్రుప్పుపట్టిన ముక్కకూడా; రాలదు= ఊడదు; మమ్మున్= మమ్ములన్; పిల్చి= పిలిచి; వే= వెంటనే; పురిన్= పట్టణమందు; ఎఱిఁగింపుఁడు+అన్నన్= తెలుపండనగా; ఏము= మేము; వచ్చితిమి= వచ్చాం; నావుడున్= అనగా.

తాత్పర్యం: 'ఉత్తరుడు కౌరవసేనలను జయించి, మన గోవులను మళ్ళించి తాను, సూతుడితో కలిసి మహోత్సాహంతో వస్తున్నాడు. మమ్ములను పిలిచి వెంటనే వెళ్ళి పట్టణంలో తెలుపుమంటే వచ్చాము రాజా!' అని చెప్పారు.

తే. **అంతరంగంబు నిండి రెండలువులందు । వెడలు సంతోష పూరంబు విధము దోఁపఁ**
గన్నుఁగవ సమ్మదాశ్రులు గడలుకొనుచు । గండపులకాంకురములతోఁ గ్రమ్ముదేర. **240**

ప్రతిపదార్థం: అంతరంగంబు= మనస్సు; నిండి= నిండిపోయి; రెండు+అలువులందున్= రెండు తూములవెంట; వెడలు= వెళ్ళునట్టి; సంతోష పూరంబు= సంతోష ప్రవాహంయొక్క; విధము= రీతి; తోఁపన్= తోచేటట్లుగా; కన్నుఁగవన్= రెండు కన్నులవెంట; సమ్మద+అశ్రులు= ఆనందబాష్పాలు; కడలుకొనుచున్= వ్యాపిస్తూ; గండ= చెక్కిళ్ళయందు; పులక+అంకురములతోన్= పులకలతో; క్రమ్మతేరన్= కలిసి వ్యాపించగా.

తాత్పర్యం: ఆనందబాష్పాలు మనసంతా నిండిపోయి రెండు వరవల ద్వారా పైకి ప్రవహిస్తున్నాయా అన్నట్లుగా రెండుకన్నుల వెంట పొంగిపొర్లుతూ, చెక్కిళ్ళయందు పులకలతో కలిసి వ్యాపించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. అనుకోని విధంగా విన్న వింతవార్త వలన విరాటుడు హర్షాతిశయాన్ని పొందాడు. 'అశ్రువు' (కన్నీరు కారటం) అనే సాత్త్వికభావం ఇందులో వర్ణించబడింది. అది ఎట్లా భావించటానికి వీలుగా ఉన్నదంటే - నీటితో చెరువంతా కట్టలు పట్టేంతవరకు నిండగా, ఎక్కువైన నీరు కట్టలను త్రెంచకుండా బయటకు వెళ్ళటానికి మార్గాలు (వరవలు, తూములు, అలుగులు) అమరుస్తారు. వాటివెంట నీరు పారుతున్నదంటే చెరువు పొంగి పొర్లుతున్నదన్న మాట! అటువంటి చెరువును తలపించే విధంగా విరాటుడి హృదయం నిండి ఆనందబాష్పాలు, కన్నులనే తూములద్వారా పొంగిపొరలిపోతున్నాయని చక్కని దేశీయమైన ఉత్ప్రేక్ష. అద్భుతంతో సంతోషం ఉప్పొంగిన చిత్ర మిది. (సంపా.)

క. **'ఏమేమీ!' యని గోప । స్తోమముఁ బలుమాఱు నడుగుచున్ మెయి వొదలన్**
భూమీశుఁ డపుడు మంత్రుల । మోములు గనుఁగొని సగర్వమున నిట్లనియెన్. **241**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భూమీశుఁడు= విరాటరాజు; ఏమీ+ఏమీ!= ఏమిటేమిటి!; అని; గోపస్తోమమున్= గోపాలుర సమూహాన్ని; పలుమాఱున్= పెక్కు సార్లు; అడుగుచున్= ప్రశ్నిస్తూ; మెయి= శరీరం; పొదలన్= పొంగగా; అపుడు; మంత్రుల= మంత్రులయొక్క; మోములు= ముఖాలు; కనుఁగొని= చూచి; సగర్వమునన్= గర్వంతో; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: విరాటరాజు 'ఏమి టేమిటి! ఉత్తరుడు గెల్చాడా?' అని గోపాలురను పదేపదే అడుగుతూ, శరీరం ఉప్పొంగగా మంత్రులకేసి చూచి గర్వంగా ఇట్లా అన్నాడు.

విశేషం: నమ్మలేని విషయాన్ని విని ఆశ్చర్యపడి, దానిని నమ్మటానికి పడే తాపత్రయం ఇందులో వర్ణించబడింది. 'ఏమి టేమిటి?' అని మళ్ళీ మళ్ళీ అడిగి ఉత్తరుడి విజయవార్తను విరాటుడు విని, ధ్రువీకరించుకొన్నాడు. అసాధ్యమనుకొన్న యుద్ధాన్ని నిర్వహించి విజయాన్ని సాధించిన కొడుకు గొప్పతనాన్ని పరులు కొలువులో ప్రశంసిస్తుంటే 'పుత్రోత్సాహం' పొంగిన విరాటుడు వీరపుత్రుడిని కన్న ఒక తండ్రి పొందే సహజ గర్వాన్ని ప్రదర్శించాడు. తిక్కన నాటకీయ రచన కిది మచ్చుతునక. (సంపా.)

శా. **'వీటన్ వీథుల నెల్ల నేనుఁగులపై విస్ఫార ఘంటా ధ్వనిం**
జాటం బంపుఁడు పేర్మి నుత్తరుజయాశ్చర్యంబుఁ; బుణ్యాంగనా
కోటిం బుచ్చుఁ డెదుర్కొనంగ మహిత క్షోణీసుర వ్రాతమున్
ఘోటస్యందన వారణప్రతతులం గూడన్ సతూర్యంబుగన్. 242

ప్రతిపదార్థం: వీటన్= నగరంలో; వీథులన్= వీథులవెంట; ఎల్లన్= అన్ని చోట్లను; ఏనుఁగులపైన్= ఏనుగులమీద; విస్ఫార= వ్యాపించెడి; ఘంటాధ్వనిన్= గంట చప్పుడుతో; ఉత్తరు= ఉత్తరుడియొక్క; జయ+ఆశ్చర్యంబున్= జయమనెడి అద్భుతాన్ని; పేర్మిన్= సంతోషంతో; చాటన్= చాటి చెప్పటానికి; పంపుఁడు= పంపించండి; పుణ్యాంగనా కోటిన్= సువాసినీ బృందాన్ని; మహిత= గొప్పవారైన; క్షోణీసుర= బ్రాహ్మణులయొక్క; వ్రాతమున్= సముదాయాన్ని; ఎదుర్కొనంగన్= ఎదురుపోయి స్వాగతం చెప్పటానికి; ఘోట= గుర్రాలను; స్యందన= రథాలను; వారణ= ఏనుగులయొక్క; ప్రతతులన్= సముదాయాలను; సతూర్యంబుగన్= మంగళ వాద్యములతో కూడా; కూడన్ పుచ్చుఁడు= వెంట పంపించండి.

తాత్పర్యం: 'నగరమంతా వీథులన్నిటిలో అన్నిచోట్లా ఏనుగులమీద పెద్దగా వినిపించే గంటల చప్పుడుతో ఉత్తరుడి జయమనే అద్భుతాన్ని సంతోషంతో చాటటానికి పంపండి. సువాసినీ బృందాన్ని గొప్పవారైన బ్రాహ్మణులయొక్క సముదాయాన్నీ గుర్రాల, రథాల, ఏనుగుల సముదాయాలతో మంగళ వాద్యాలతో కూడి ఎదురు వెళ్ళి ఆహ్వానించటానికి పంపండి.

విశేషం: విరాటుడు దక్షిణ గోగ్రహణ యుద్ధంలో గెలుపొంది తిరిగివచ్చినప్పుడు విప్రులు, వనితలు అక్షతలు చల్లుతూ ఉండగా నగరంలో ప్రవేశించి, సింహాసనంమీద కూర్చుండి, అందరితో కలిసి ఆనందం పంచుకొని విజయోత్సవం చేసికొన్నాడు. ఇప్పుడు తన కొడుకైన ఉత్తరుడి విజయోత్సవాన్ని స్వయంగా నిర్వహించటానికి ఆజ్ఞాపించాడు. ఏనుగులమీద ఎక్కి గంటలు మ్రోగిస్తూ విజయఘోష చేయించాడు. ముత్తైదువులనూ, విప్రులనూ, చతురంగ సైన్యాలనూ మంగళవాద్యాలతో ఆహ్వానానికి ఎదురుకోలు పంపాడు. ఇవి విజయోత్సవాచారాలు. ఈ వేడుక నగరపు పొలిమేరల వరకు సాగిపోతుంది. అక్కడ ఆహ్వానం పలుకుతుంది. (సంపా.)

క. ఉత్తమ కన్యాజనములు । నుత్తరయును గంధమాల్యయుక్తముగఁ గుమా
రోత్తము నెదుర్కొనం దగు; । నత్తెఱఁగున సంఘటింపుఁ డభిరామముగన్.' 243

ప్రతిపదార్థం: ఉత్తమ కన్యాజనములు= శీలవతులైన కన్యలూ; ఉత్తరయును= ఉత్తర కూడా; గంధ= మంచి గంధంతో; మాల్య= పూలమాలలతో; యుక్తముగన్= కూడునట్లుగా; కుమార+ఉత్తమున్= ఉత్తముడైన ఉత్తరుడిని; ఎదుర్కొనన్= ఎదురుగా వెళ్ళి ఆహ్వానించటం; తగున్= ఉచితమైనది; ఆ+తెఱఁగునన్= ఆ రీతిగా; అభిరామముగన్= మనోహరంగా; సంఘటింపుఁడు= సమకూర్చండి.

తాత్పర్యం: ఉత్తములైన కన్యలూ, ఉత్తరా కలిసి గంధం, పూలమాలలు తీసికొని ఉత్తరకుమారుడికి ఎదురుగా పోయి ఆహ్వానించాలి. అట్లే ఏనుగులు, గుఱ్ఱాలు, రథాలు మంగళవాద్యాలవారితో కూడా పంపండి.'

విశేషం: ఉన్న ఆచారాలతోపాటు విరాటుడు మరొక క్రొత్త ఆచారాన్ని ప్రవేశపెట్టాడు. ఉత్తమ లక్షణాలు గల కన్యకలను ఎన్నికచేసి, వారిని రాజకుమారి అయిన ఉత్తరయొక్క నేతృత్వంలో నిలిపి, గంధమాల్యాదులైన మంగళద్రవ్యాలను తీసికొని వారందరూ ఎదురుపోయి ఆహ్వానించాలని ఆజ్ఞాపించాడు. 'అత్తెఱఁగున సంఘటింపుఁ డభిరామముగన్' - అన్న ఆదేశం - అపూర్వంగా అభిరామంగా వేడుక కొరకు సంఘటించబడుతున్న ఆచారమని స్పష్టం చేస్తున్నది. ఇందులో అంతఃపురకన్యలు పాల్గొనటం గమనార్హం. ఉత్తరుడిపట్ల ప్రత్యేకమైన అభిమానం అందులో ధ్వని. ఈ వేడుక నగరి వాకిటిదాకా సాగుతుంది. (సంపా.)

వ. అని నియోగించి గోపాలురకుం గట్ట నిప్పించి పుచ్చి, కంకు నాలోకించి 'నెత్తం బొక పలక యాడుదమే?' యని యుబ్బుమై మాటగాఁ బలికిన నతండు 'నీవు సుమాళంబున నున్నవాఁడవు; నేఁడు నీతోడ నాడి జయింప రాదు వెఱతు' ననిన విరాటుండు నగుచుఁ దత్ప్రదేశంబున మెలంగు సైరంధ్రిం గనుంగొని, సారెలు దెమ్మని పనిచి పలక ముందటికిఁ దిగిచికొనుచు 'నిందు ర'మ్మనవుడుఁ బాండవాగ్రజుండు 'జూదం బాడుట యెంత లెస్స!' యనుచుం జేరి యాడందొడంగునప్పుడు మఱియు నిట్లనియె. 244

ప్రతిపదార్థం: అని= ఇట్లు; నియోగించి= ఆజ్ఞాపించి; గోపాలురకున్= శుభవార్త చెప్పిన గోపాలురకు; కట్టన్+ఇప్పించి= వస్త్రాలు కట్టుకొనటానికి బహూకరించి; పుచ్చి= పంపి; కంకున్= కంకుభట్టును; ఆలోకించి= చూచి; నెత్తంబు= జూదం; ఒక పలక= ఒక ఆట; ఆడుదమే?= ఆడుదామా; అని= ఇట్లు; ఉబ్బుమై మాటగాన్= సంతోషంతో కూడిన మాటగా; పలికినన్= పల్కగా; అతండు= కంకుభట్టు; నీవు= రాజైననీవు; సుమాళంబునన్= హుషారుగా; ఉన్నవాఁడవు= ఉన్నావు; నేఁడు= ఈ రోజు; నీతోడన్= నీతో; ఆడి= జూదమాడి; జయింపన్‌రాదు= గెలువలేను; వెఱతును= జంకుతాను; అనినన్= అనగా; విరాటుండు= విరాటరాజు; నగుచున్= నవ్వుతూ; తత్ప్రదేశంబునన్= ఆ ప్రాంతంలో; మెలంగు= సంచరించెడి; సైరంధ్రిన్= సైరంధ్రిని; కనుంగొని= చూచి, సారెలు= పాచికలు; తెమ్ము+అని= తీసికొని రమ్మని; పనిచి= పంపి; పలక= పాచికలు వేయు బల్లను; ముందటికిన్= తన ముందరికి; తిగిచికొనుచున్= లాగికొంటూ; ఇందున్= ఇక్కడికి; రమ్ము= రా!; అనవుడున్= అనగా; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; జూదంబు+ఆడుట= జూదమాడటం; ఎంత లెస్స= ఎంత బాగు; అనుచున్= అని పలుకుతూ; చేరి= దగ్గరకు వచ్చి; ఆడన్= ఆడటానికి; తొడంగు+అప్పుడు= ప్రారంభించేటప్పుడు; మఱియున్= తిరిగి; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: విరాటరాజు మంత్రులను ఆ రీతిగా పురమాయించి, జయవార్త చెప్పినందుకు గోపాలురకు వస్త్రాలు బహూకరించి పంపి, కంకుభట్టును చూచి, 'ఒక్క పలక జూద మాడుదామా?' అనేసరికి అతడు 'నీవు ఈనాడు

మహా సంతోషంగా ఉన్నావు. ఇపుడు నీతో ఆడితే గెలవటం కష్టం. అది నా భయం' అన్నాడు. అయినా విరాటుడు అక్కడే తిరుగుతూ ఉన్న సైరంధ్రిని చూచి పాచికలు తెమ్మని ఆజ్ఞాపించాడు. ఈ లోగా జూదపు బల్లను దగ్గరగా తీసికొని ఇక్కడికి రమ్మని అనేసరికి కంకుభట్టు - 'జూదమాడటం అంటే ఇప్పుడు ఎంత బాగుంటుంది?' (బాగుంటుందా!- అని కాకువు) అంటూ చేరి ఆటను ప్రారంభిస్తూ ఇట్లా అన్నాడు.

విశేషం: రాజు యుద్ధంలో విజయం సాధిస్తే అధికారికమైన వేడుకలు జరుగుతాయి. అందులో ప్రజలు పాల్గొంటారు. ఇది ప్రజలకొరకు జరిపే వేడుక. ఇక రాజు తన సంతోషం కొరకు జరుపుకొనే వేడుకలు మరొక రకం. ఆ విధాన్ని ఈ వచనంలో కవి పేర్కొన్నాడు. శుభవార్తలు అందించినవారికి బహుమతు లివ్వటం ఒక వేడుక. అంతటితో ఆగలేదు. విరాటుడు ద్యూతప్రియుడు. మూలంలో -

"స్త్రియో గావో హిరణ్యం చ యచ్చాన్యద్వస్తు కించన ।
న మే కించిత్ త్వయా రక్ష్య మంతరేణాపి దేవితుమ్॥" (4-63-32)

అని ఉన్నది. విరాటుడికి స్త్రీలు, ఆవులు, బంగారం వంటి విలువైన ద్రవ్యాల కంటె జూదమంటే ఎంతో ఇష్టమట! ధర్మరాజు కంటె ద్యూతరతిలో విరాటుడు పది ఆకులు ఎక్కువ చదివాడు, కాబట్టే విజయోత్సవాన్ని స్నేహద్యూత క్రీడతో జరుపుకొనాలని కోరుకొన్నాడు. విరాటు డంతటితో ఆగలేదు. బలవంతాన కంకుభట్టును ఆటకు పిలిచాడు. సైరంధ్రి నడిగి సారెలు తెప్పించాడు. తానే స్వయంగా జూదపు పలకను ముందుకు లాగాడు. కంకుభట్టును తనకు ఎదురుగా ఆటకు కూర్చొనుమన్నాడు. ఈ దృశ్యమంతా ధర్మరాజుకు పూర్వం కౌరవసభలో సుహృద్ద్యూత రూపంలో సాగిన మాయాద్యూతాన్ని తలపునకు తెచ్చింది. అందువలననే - ఇటువంటి సమయంలో జూదం ఆడటం ఎంత బాగుంటుంది? - అని అంటూనే, కాకువుతో ఏం బాగుంటుంది? - అనే అర్థం ధ్వనింప చేశాడు. జూదంవలన ధర్మజుడు తాను పొందిన అవమానాలను గురించి మనస్సున భావిస్తూ ఒక స్నేహితుడు చెప్పినట్లుగా చెప్పి తన పూర్వస్మృతులను నెమరువేసికొన్నాడు. ఇది కౌరవులపై రణోత్సాహాన్ని ప్రదర్శించటానికి నాంది కాబోతున్న చిత్రమైన సన్నివేశం. ఆనాడు చేసిన శపథాలు కార్యరూపం తాల్చబోతున్న సంకేతం. (సంపా.)

ఆ. జూదమాడి ధర్మసూనుండు రాజ్యంబు । ననుజులను బ్రియాంగనను బణంబు
గాఁగ నొడ్డి యాడి కాఱియ పడఁడె? య । ట్లగుట దీనితోడి యర్థి కీడు. 245

ప్రతిపదార్థం: ధర్మసూనుండు= ధర్మరాజు; జూదము+ఆడి= ఈ జూదమాడియే; రాజ్యంబున్= రాజ్యాన్నీ; అనుజులను= తమ్ములనూ; ప్రియ+అంగనను= ప్రియమైన భార్యను; పణంబుగాఁగన్= పందెంగా; ఒడ్డి= కాసి; ఆడి= జూదమాడి; కాఱియన్= బాధను; పడఁడె!= పడలేదా?; అట్లు+అగుటన్= అట్టిది అయినందున; దీనితోడి+అర్థి= దీనితో మైత్రి (సంబంధం); కీడు= బాధ కల్గిస్తుంది.

తాత్పర్యం: ధర్మరాజు జూదమాడి రాజ్యాన్నీ, తమ్ములనూ, భార్యనూ పందెంకాసి బాధలు పడ్డాడు. కనుక ఈ జూదంమీద ఎక్కువ ఇష్టం చూపటం కీడుకే దారి తీస్తుంది.

విశేషం: ధర్మరాజు జూదంవలన తాను పొందిన కీడును పేర్కొంటూ, తన జీవితంలో తాను చేసిన తప్పును ఎవరూ చేయవద్దని హితవును ప్రథమపురుషలో మిత్రసమ్మితంగా చెప్పాడు. ప్రమాదాన్ని పరితాపంతో ప్రక్షాళనం చేసికొంటున్న ఒక నిర్వేద ప్రవృత్తి ధర్మజుడి చిత్తంలో తళుక్కున మెరిసింది. విరాటుడితో స్నేహద్యూతం కొనసాగిస్తున్న ధర్మజుడు ఆ ఆటలో ఆసక్తి లేని ఆణిముత్యం వలె పఠితలకు ప్రత్యక్షమౌతున్నాడు ఈ మాట లన్నప్పుడు. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి యాడుచుండు సమయంబున. 246

ప్రతిపదార్థం: అని పలికి= ఇట్లు అని; ఆడుచుండు= జూదమాడునట్టి; సమయంబునన్= సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా పలికి ధర్మరాజు జూదమాడుతున్న సమయంలో.

మ. నరనాథుండు ప్రమోదసంపదుదితోన్మాదంబుమై నిట్లనుం
'గురు సైన్యంబుల ముట్టి గెల్చి యెలమిన్ గోవర్గముం దెచ్చె; ను
త్తరు బాహాబల శౌర్యసారము లుదాత్తంబుల్ గదే! యెందు నె
వ్వరు నెక్కాలము నిట్టు సేసిరె కులైశ్వర్యం బవార్యంబుగన్?' 247

ప్రతిపదార్థం: నరనాథుండు= విరాటరాజు; ప్రమోద సంపద్= సంతోష సంపదతో; ఉదిత+ఉన్మాదంబుమైన్= కలిగిన ఒడలు తెలియనితనంతో; ఇట్లు= ఈ రీతిగా; అనున్= అన్నాడు; కురుసైన్యంబులన్= కౌరవసేనలను; ముట్టి= ముట్టడించి; గెల్చి= జయించి; ఎలమిన్= సంతోషంతో; గోవర్గమున్= ఆలమందలను; తెచ్చెన్= మరల్చి వచ్చాడు; ఉత్తరు= ఉత్తరకుమారుడి యొక్క; బాహాబల= బాహుబలం; శౌర్యసారములు= శ్రేష్ఠమైన వీర పరాక్రమాలు; ఉదాత్తంబుల్ కదే!= గొప్పవిగదా!; ఎందున్= ఎక్కడైనా; ఎవ్వరున్= ఎవరైనా; ఏ+కాలమున్= ఎప్పుడైనా; కుల+ఐశ్వర్యంబు= కులధనం, వంశమహిమ, వంశప్రతిష్ఠ; అవార్యంబుగన్= మరల్చరానిదిగా, ఇక ఎప్పటికీ కాదనటానికి వీలులేనట్లుగా; ఇట్టు= ఈ రీతిగా; చేసిరె?= చేశారా?

తాత్పర్యం: అప్పుడు విరాటుడి సంతోషం పెల్లుబికిన ఆవేశంతో ఒడలు తెలియక ఇట్లా అన్నాడు - 'కౌరవ సేనలను ముట్టడించి, జయించి, ఆవులను మళ్ళించుకొని వచ్చాడంటే మా ఉత్తరుడి బాహుబలం, పరాక్రమం ఎంత గొప్పవి? ఏ ప్రదేశంలోనైనా ఏ వ్యక్తి అయినా ఏ కాలంలోనైనా ఇట్లా కులధనాన్ని అవార్యంగా రక్షించారా? వంశప్రతిష్ఠను అప్రతిహతంగా నిలిపారా?' అని.

విశేషం: విరాటుడు అధికమైన సంతోషంవలన కలిగిన ఉన్మాదం అనే మానసికావస్థలో ఉండి మాట్లాడుతున్నట్లు తిక్కన సూచించాడు. మదం సంచారిభావం. ఉన్మాదం దశవిధ మన్మథావస్థలలో అందరూ అంగీకరించిన ఒక అవస్థ. శృంగారంలో నాయికాపరంగా చెప్పే లక్షణాన్ని ఇక్కడ విరాటుని పరంగా చెప్పుకొనాలి. భరత నాట్యశాస్త్రంలో ఉన్మాదమంటే -

"తత్సంశ్రితాం కథాం యుక్తే సర్వావస్థాగతాఽపి హి ।
పుంసః ప్రద్వేష్టి చాప్యన్యానున్మాదః సంప్రకీర్తితః ॥
తిష్ఠత్యనిమిష దృష్టి ర్దీర్ఘం నిఃశ్వసతి గచ్ఛతి ధ్యానమ్ ।
రోదితి విహారకాలే నాట్య మిదం స్యా త్తథోన్మాదే ॥ **(నా.శా. 12.185-186)**

నాయిక సర్వావస్థలయందూ నాయకుడికి సంబంధించిన కథలనే స్మరిస్తూ, ఇతరాలను ద్వేషించటం ఉన్మాదలక్షణం. ఇక్కడ విరాటుడు తన పుత్రుడైన ఉత్తరుడికి సంబంధించిన విజయోదంతాలనే స్మరిస్తూ ఉండటం ఉన్మాదావస్థ. దానికి వ్యతిరేకంగా కంకుభట్టు పలికినా అతడిని ద్వేషించటం ఆ అవస్థలోని విరాటుని ప్రవర్తనం. కనురెప్పపాటు లేకుండా నిలబడి ఉండటం, నిట్టూర్పులు నిగుడించటం, రోదించటంవంటి ఉన్మాద క్రియలు విరహంలో రాణిస్తాయి. మరి విరాటుడు ప్రదర్శించే ప్రమోదపరమైన ఉన్మాదంలో ఏదో ఆలోచిస్తూ ఉండటం సహజంగా ఉంటుంది. అందుకే ఉన్మాదావస్థలో ఉన్న విరాటుడు వ్యసనోన్మాదంతో జూదాన్ని ఆడుతున్నా ఆట ఆడుతున్నంతసేపూ కొడుకు ప్రదర్శించిన ప్రతాపాన్ని గురించే ఆలోచిస్తూ,

ప్రలాపిస్తున్నాడు. కాబట్టి విరాటుడి మాటలు, చేష్టలు ఉన్మాదావస్థను తెలిపేవిగా ఉండటం రసధ్వని. మత్తేభవృత్తం అతడి చిత్తవృత్తికి అనుగుణంగా అమరి ఛందశ్శిల్పాన్ని సంతరించి పెట్టింది. (సంపా.)

వ. అనిన విని కంకుం డతని కిట్లనియె. 248

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; కంకుండు= కంకుభట్టు; అతనికిన్= విరాటుడితో; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అనగా విని కంకుభట్టు విరాటుడితో ఈ విధంగా అన్నాడు.

చ. 'కురుపతి భీష్మ కర్ణ కృప కుంభజముఖ్య మహోగ్ర యోధ వి
స్ఫురణము నోర్వఁజాలి రణభూమి భుజాబల ముల్లసిల్ల ను
త్తరుఁడ జయించెనేని వసుధావర! యింతటికంటె నింక న
చ్చెరువును గల్గునే? ధరఁ బ్రసిద్ధికి నెక్కఁడె యాతఁ డొక్కఁడున్?' 249

ప్రతిపదార్థం: వసుధావర!= రాజా!; కురుపతి= దుర్యోధనుడు; భీష్మ= భీష్ముడు; కర్ణ= కర్ణుడు; కృప= కృపాచార్యుడు; కుంభజ= ద్రోణుడు; ముఖ్య= మొదలైన; మహా+ఉగ్ర= మిక్కిలి భయంకరమైన; యోధ= యోధులయొక్క; విస్ఫురణమున్= పరాక్రమాన్ని; ఓర్వన్+చాలి= సహించటానికి సరిపడి; రణభూమిన్= యుద్ధభూమిలో; భుజాబలము= పరాక్రమం; ఉల్లసిల్లన్= ప్రకాశింపగా; ఉత్తరుఁడు+అ= ఉత్తరుడే; జయించెనేనిన్= జయించినచో; ఇంతటికంటెన్= దీనికన్న; ఇంకన్= వేరుగా; అచ్చెరువును= ఆశ్చర్యమైన విషయం; ధరన్= భూమిలో; కల్గునే?= ఉంటుందా?; ఆతఁడు= ఉత్తరుడు; ఒక్కఁడున్= ఒక్కడే; ప్రసిద్ధికిన్= కీర్తికి; ఎక్కఁడె?= పొందడా?

తాత్పర్యం: 'విరాటరాజా! దుర్యోధన, భీష్మ, ద్రోణ, కర్ణ, కృపాది మహావీరుల పరాక్రమాన్ని ఎదిరించి వారినందరినీ ఓడించగలిగిన భుజబలాన్ని యుద్ధభూమిలో ఉత్తరకుమారుడే చూపినట్లయితే, ఇంతకన్నా గొప్ప ఆశ్చర్యం వేరే ఉంటుందా? లోకంలో అత డొక్కడే మహావీరుడుగా ప్రసిద్ధి కెక్కడా?'

విశేషం: కాకువుగా మాట్లాడిన ధర్మజుడి ఉక్తి వైచిత్రికి ఈ పద్యం రమణీయోదాహరణం. కురువీరులను ఉత్తరు డొక్కడే జయించాడా? జయిస్తే అది అద్భుతంగా చెప్పాలి. ఎందుకంటే ఉత్తరుడే ఏకైకవీరు డౌతాడు. ఈ భావాలనే విరాటుడు 241, 242వ పద్యాలలో నమ్మశక్యంగాని అద్భుతంగా ప్రకటించి ఉన్నాడు. కాని, క్రమంగా నమ్మి ఇప్పు డున్మాదావస్థకు చేరాడు ధర్మజుడు. 'ఉత్తరుడే నిజంగా జయించి ఉంటే!' - అని అనుమానంగా కాకువుతో అనేసరికి సత్యాన్ని గ్రహించే వివేకం ఉన్మాదంలో ఉండదు కాబట్టి అది తప్పక విపరీత ప్రభావం కలిగిస్తుంది. ధర్మరాజు నిపుణంగా కాకువును ప్రయోగించాడు. వ్యాజస్తుతి వంటి ప్రశంస చేశాడు. ధర్మజపరంగా ఇది స్తుతిచేత నింద. విరాటుని కది నిందచేత స్తుతి. (సంపా.)

తే. అనినఁ గటకటఁ బడి 'యిట్టులాడు టెల్ల । నతని విజయము సందియ మనుట గాదె?
యింతవట్టును సైరించి తీవు గాన; । యింక నీమాట లుడుగుము కంకభట్ట! 250

ప్రతిపదార్థం: అనినన్= అనగా; కటకటన్+పడి= బాధపడి; కంకభట్ట!= ఓ కంకభట్టా!; ఇట్టులు+ఆడుట= ఇట్లా మాట్లాడటం; ఎల్లన్= అంతయును; అతని విజయము= ఉత్తరుడి గెలుపు; సందియము+అనుట కాదె?= సందేహమనటమే కదా!;

ఈవుకాన= నీవు కాబట్టి; ఇంతవట్టును= ఇంతవరకు; సైరించితిన్= సహించాను; ఇంకన్= ఇటుపై; ఈ మాటలు= ఇట్టి మాటలు; ఉడుగుము= మానుము.

తాత్పర్యం: అనగా విరాటుడు బాధపడి, 'కంకభట్టా! నీ విట్లా మాట్లాడటం చూస్తే ఉత్తరుడు విజయాన్ని పొందటం సందేహమనే కదా నీ భావం? నీవు కాబట్టి ఇంతవరకూ ఇటువంటి మాటలన్నా సహించాను. ఇక మీదట ఇట్లా మాట్లాడకుము' అన్నాడు.

వ. అనుచు విరాటుండు గటంబు లదరఁ గన్నులఁ గెంపు గదురఁ బలుక చప్పు డగ్గలంబుగా నాడుచున్న సరకు సేయక యుధిష్ఠిరుండు వెండియు నిట్లనియె. 251

ప్రతిపదార్థం: అనుచున్= అని పలుకుతూ; విరాటుండు= విరాటుడు; కటంబులు= చెక్కిళ్ళు; అదరన్= వణకగా; కన్నులన్= కన్నులందు; కెంపు= ఎరుపు; కదురన్= వ్యాపించగా; పలుకచప్పుడు= జూదమాడేపలకయొక్క శబ్దం; అగ్గలంబుగాన్= అధికం కాగా; ఆడుచున్నన్= ఆట ఆడుతూ ఉండగా; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; సరకు+చేయక= లెక్కచేయక; వెండియున్= మరల; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అట్లా అంటూ ఉన్నపుడు విరాటుడి చెక్కిళ్ళు అదిరిపోతున్నాయి, కళ్ళు ఎరుపెక్కిపోతున్నాయి. నెత్తమాడే పలక చప్పుడు అధికమయ్యేటట్లు ఆడుతున్నాడు. అయినా లెక్కచేయకుండా ధర్మరాజు మరలా ఇట్లా అన్నాడు.

విశేషం: ఉన్మాదావస్థలో వచ్చే కోపంకూడా ఉద్ధృతంగా ఉంటుంది. అందుకే విరాటుడు నెత్తమాడే పలకచప్పుడు అమితంగా చేస్తున్నాడు. చెక్కిళ్ళు కదిలిస్తున్నాడు, కళ్ళు ఎరుపు చేస్తున్నాడు. ధర్మజుడు ధీరుడు, సత్యవ్రతుడు కాబట్టి దానిని లెక్కచేయలేదు. 'పలక'కు 'పలుక' అని రూపాంతరం ఉన్నది. అందువలన రెండు రూపాలూ సాధువులే. (సంపా.)

చ. 'కురుబల మేల దైత్యసురకోటులు వచ్చిన గెల్వరాదె యు
త్తరునకు నా బృహన్నల రథంబుపయిం బరవాహినీ భయం
కర భుజసారమున్ మెఱయఁగాఁ దటి గాంచితి నంచు విక్రమో
ద్ధురగతి నాజికేలినిరతుం డయి దుర్దమలీల నుండఁగన్.' 252

ప్రతిపదార్థం: కురుబలము+ఏల?= కౌరవసేనయే ఎందుకు?; దైత్య= రాక్షసులయొక్క; సుర= దేవతలయొక్క; కోటులు= సమూహాలు; వచ్చినన్= వచ్చినప్పటికిని; ఉత్తరునకున్= ఉత్తరుడికి; ఆ బృహన్నల= ప్రసిద్ధుడైన బృహన్నల; రథంబుపయిన్= రథం మీద; పరవాహినీ= శత్రుసేనకు; భయంకర= భయంకరమైన; భుజసారమున్= పరాక్రమసారం; మెఱయఁగాన్= ప్రకాశించగా; తటిన్= తగిన సందర్భాన్ని; కాంచితిన్+అంచున్= పొందానని; విక్రమ= పరాక్రమంయొక్క; ఉద్ధురగతిన్= అతిశయమైన రీతిలో; ఆజికేలిన్= యుద్ధమనే క్రీడలో; నిరతుండు+అయి= ఆసక్తి కలవాడై; దుర్దమలీలన్= అణచలేని విధంగా; ఉండఁగన్= ఉండగా; గెల్వ రాదె?= గెలవటం ఒక విశేషమా?

తాత్పర్యం: 'కౌరవసేన అన్న మాటేమిటి? కొన్ని కోట్ల దేవతలు, రాక్షసులు వచ్చినా, రథంమీద ఆ బృహన్నల శత్రుసేనాభీకరమైన పరాక్రమంతో ప్రకాశిస్తూ, సమయం దొరికిందని విజృంభించి యుద్ధాన్ని ఒక ఆటగా ఆడుతూ ఎవ్వరూ అణచలేని విధంగా ఉంటే ఉత్తరుడికి గెలుపు వీలుపడక ఏం చేస్తుంది.'

విశేషం: అలం: సమాధి. "సమాధిః కార్యసౌకర్యం కారణాంతర సన్నిధేః". కారణాంతరం వలన కార్యసౌకర్యం కలిగినట్లు వర్ణిస్తే సమాధి. ఉత్తరకుమారుడు కురువీరులే కాదు, దేవదానవకోటులు ఎదిరించినా జయాన్ని పొందక ఏంచేస్తాడు? - అని చెప్పి, దానికి కారణం జగదేకవీరుడైన బృహన్నల సారథ్యమని పేర్కొన్నాడు. కారణాంతరం వలన అందులోనూ పేడివాడైన రథసారథి వలన కార్యం సిద్ధించిందన్న ఈ వాక్యం విరాటుడికి కోపం కలిగించింది. నవ్వు తెప్పించింది. అసహనం పెంచింది. "హితం మనోహారి చ దుర్లభం వచః" - అని కదా కవిసూక్తి. (సంపా.)

వ. అనిన విని సక్రోధహాసోల్లాస వికృతాననుండై మత్స్యమహీనాథుండు. 253

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; మత్స్య మహీనాథుండు= విరాటరాజు; సక్రోధ= కోపముతో కూడిన; హాస+ఉల్లాస= నవ్వుయొక్క ఉల్లాసంతో; వికృత= వికారం కల్గిన; ఆననుండు+ఐ= ముఖం కలవాడై.

తాత్పర్యం: ఆ మాటలు వినేసరికి కోపం, కోపంతో నవ్వు, దాని ఉల్లాసం అన్నీ వచ్చి కలిశాయి. వాటితో ముఖం వికారంగా అయింది.

విశేషం: ఉత్తరుడి విజయానికి సారథి కారణమని చెప్పి కంకుడు తన కుమారుడిని కించపరచినందుకు విరాటుడికి తీవ్రమైన కోపం, తనకు విరుద్ధంగా మాట్లాడుతూ తనను సమర్థించుకొంటున్న కంకుభట్టు మీద అవజ్ఞతో కూడిన ఆగ్రహాన్ని తెలియజరిచే అట్టహాసం, క్రోధభావం వికసించటం చేత ఆ హావభావాల ఉల్లాసం, వాటివలన క్షణాని కొక విధంగా మార్పులు (వికారాలు) చెందుతున్న ముఖవైఖరులు - అన్నీ కలిసి విరాటుడిని రోషభీషణ క్రోధభావానికి విభావంగా నిలిపి, తిక్కన ఆంగికాభినయోల్లాసాన్ని చిత్రించాడు. (సంపా.)

ఉ. 'వింతలు సాల నీవలన వింటిమి; గాని, ధరిత్రి నెందు నే
మింతకు మున్ను సారథుల నెవ్వరిఁ జూడమె? వైరివీర దు
ర్దాంత భుజావిలాస మలరం దెగి పోరుల నస్త్ర శస్త్ర వి
క్రాంతిఁ గడంగు వారి?' నని కన్నుల నిప్పులు రాలుచుండఁగన్. 254

ప్రతిపదార్థం: నీ వలనన్= నీవు చెప్పగా; వింతలు= అద్భుతాలు; చాలన్= ఎక్కువగా; వింటిమి= విన్నాము; కాని= అయినా; ధరిత్రిన్= భూమి మీద; ఎందున్= ఎక్కడనూ; ఏము= మేము; ఇంతకున్+మున్ను= ఇంతకు పూర్వం; సారథులన్= రథం తోలేవారిని; ఎవ్వరిన్= ఎవ్వరిని; వైరివీర= శత్రువీరులయొక్క; దుర్దాంత= అణచలేని; భుజావిలాసము= భుజ పరాక్రమం; అలరన్= ఒప్పగా; తెగి= సాహసించి; పోరులన్= యుద్ధాలలో; అస్త్ర= మంత్రబాణాలయొక్క; శస్త్ర= బాణాద్యాయుధాల యొక్క; విక్రాంతిన్= పరాక్రమంతో; కడంగువారిన్= ప్రయత్నించేవారిని; చూడమె= చూడలేదా; అని; కన్నులన్= కన్నులనుండి; నిప్పులు రాలుచున్+ఉండఁగన్= నిప్పులు రాలుతూ ఉండగా.

తాత్పర్యం: 'నీవు చెప్పగా ఎన్నో ఆశ్చర్యకరమైనవి విన్నాను కాని, ఎక్కడైనా సారథులు శత్రువీరుల నణచే పరాక్రమం చూపి యుద్ధంలో అస్త్ర శస్త్ర విద్యా నైపుణ్యం కలిగినట్లు వినలేదే!' అంటూ కళ్ళ వెంట నిప్పులు రాలుతూ ఉండగా.

క. 'నా కొడుకు పోటుమాటలు। నీకేటికిఁ బొసఁగ నాడ నేరవు మౌర్ఖ్యో
ద్రేకమునఁ బలుకుచుండుట। మాకు సహింపంగరాదు మానుము విప్రా!' 255

ప్రతిపదార్థం: నా కొడుకు= నా కుమారుడి యొక్క; పోటుమాటలు= యుద్ధపుమాటలు; పొసఁగన్= పొసగేటట్లుగా; నీకున్= నీకు; ఏటికిన్= ఎందుకు; ఆడనేరవు= చెప్పలేవు; మౌర్ఖ్య= మూర్ఖత్వంవలని; ఉద్రేకమునన్= ఉద్రేకంతో; పలుకుచుండుట= మాట్లాడటం; మాకున్= నాకు; సహింపంగన్‌రాదు= ఓర్చుకొనటానికి వీలుపడదు; విప్రా!= ఓ బ్రాహ్మణుడా!; మానుము= మానవలసింది.

తాత్పర్యం: 'నా కొడుకు చేసిన యుద్ధానికి సంబంధించిన మాటలు నీ వెందుకు సముచితంగా మాట్లాడలేవు? మూర్ఖతవలని ఉద్రేకంతో నీ విట్లా మాట్లాడుతుంటే మేం సహించం. ఓ బ్రాహ్మణుడా! ఇక నీ మాటలు కట్టి పెట్టుము.'

క. అనినం జలమునఁ గుంతీ । తనయాగ్రజుఁ డిట్టు లనియె దరహాసం బా
ననమున ముసుఁగువడఁగ న । జ్జననాయకుతోడ ని ట్లశంకిత భంగిన్. 256

ప్రతిపదార్థం: అనినన్= విరాటుడు ఇట్లా పలుకగా; చలమునన్= పట్టుదలతో; కుంతీతనయ+అగ్రజుఁడు= ధర్మరాజు; దరహాసంబు= చిరునవ్వు; ఆననమునన్= ముఖమందు; ముసుఁగుపడఁగన్= ఆవరించగా; ఆ+జననాయకుతోడన్= ఆ విరాటరాజుతో; ఇట్లు= ఈ రీతిగా; అశంకిత భంగిన్= సంశయం లేని రీతిగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: విరాటుడు ఇట్లా పలుకగా ధర్మరాజు చిరునవ్వుతో విరాటుడితో నిస్సంశయంగా ఈ విధంగా అన్నాడు.

విశేషం: ధర్మజుడి మాటలు మూర్ఖత్వంతోనూ, ఉద్రేకంతోనూ పలికేవని విరాటుడు పేర్కొన్నాడు. అతడు స్వయంగా ప్రమోదోన్మాదంలో ఉండి మాట్లాడుతున్నాడు. నిజానికి అతడిదే మౌర్ఖ్యం, ఉద్రేకం. అది తెలిసికొనలేక మాట్లాడుతున్న అతడి అవివేకాన్ని గమనించి ధర్మరాజు చిరునవ్వు నవ్వాడు. అది ఎట్లా ఉన్నదంటే - ముఖానికి నవ్వు ముసుగు వేసికొన్నట్లు ఉన్నది. అది సాత్త్వికభావం. ఎదుటివారి అజ్ఞానాన్ని చూచి అవహేళనం చేస్తూ, అది పైకి కనపడకుండా నిగ్రహించుకొంటూ చేసే ఒక రకమైన గుంఫనమైన నవ్వు - ఆ దరహాసం. గంభీర స్వభావులు మాత్రమే ఇటువంటి నవ్వు నవ్వగలరు. (సంపా.)

ఉ. 'ఆహవకేళి వేడుక బృహన్నల చిత్తమునం దెలర్చినన్
సాహసవృత్తి నుత్తరుని సారథిఁగాఁ గొనిపోయి కౌరవ
వ్యూహము నోర్చి నీపసుల నొక్కఁడు దక్కక యుండ సత్వరో
త్సాహతఁ దెచ్చెఁ గావలయుఁ; దప్పదు నా పలు కట్లు చూడుమీ!' 257

ప్రతిపదార్థం: ఆహవకేళిన్= యుద్ధమనే ఆటలో; వేడుక= కోరిక; బృహన్నల చిత్తమునందున్= బృహన్నలయొక్క మనస్సులో; ఎలర్చినన్= కలుగగా; సాహసవృత్తిన్= చొరవగా; ఉత్తరునిన్= ఉత్తరకుమారుడిని; సారథిఁగాన్= రథం తోలేవాడిగా; కొనిపోయి= తీసికొని వెళ్ళి; కౌరవ వ్యూహమున్= కౌరవ సేనను; ఓర్చి= ఓడించి; నీ పసులన్= నీ గోవులలో; ఒక్కఁడు= ఒక్కటి కూడ; తక్కక+ఉండన్= మిగులకుండా (అన్నిటిని); సత్వర= త్వరతోడి; ఉత్సాహతన్= ఉత్సాహంతో; తెచ్చెన్= తీసికొని వచ్చాడు; కావలయున్= ఇదే జరిగి ఉంటుంది; నా పలుకు= నేను చెప్పిన మాట; తప్పదు= తప్పిపోదు, అబద్ధం కాదు; అట్లు= ఆ రీతిగా; చూడుమీ!= చూడుము.

తాత్పర్యం: 'బృహన్నల మనస్సులో యుద్ధమనే ఆట ఆడుకొనాలని వేడుక కలిగి ఉండాలి. అందుకు వీలుగా ఉత్తరుడిని సారథిగా చేసికొని వెళ్ళి కౌరవసేన నోడించి, ఒక్కటి కూడా చెదరిపోకుండా ఆవుల నన్నిటినీ మరలించుకొని వచ్చాడు. నా మాట పొల్లు పోదు. నీవే చూడుము!'

విశేషం: ధర్మరాజు ఈ మాటలు 'అశంకితభంగిన్' పలికాడు. నిస్సంశయంగా, నిర్భయంగా, నిశ్చయాత్మకంగా పలికాడని అర్థం. అర్జునుడే రథికుడై, ఉత్తరుడిని సారథిగా చేసికొని యుద్ధం సాగించి ఉండవచ్చునని ఊహించి చెప్పాడు. ధర్మజుడి మాట అబద్ధం కావటానికి వీల్లేదని బల్లగుద్ది చెప్పాడు. ఇక ముందు దానిని విరాటుడే తెలిసికొనగలడని సూచించి - మూర్ఖత్వం విరాటుడిదే అని గూఢంగా అధిక్షేపించాడు. అంత చెప్పినా సత్యాన్ని దర్శించలేని విరాటుడితో మరింత వాచ్యంగా చెప్పవలసివచ్చింది. (సంపా.)

క. అని యంతట నిలువక య । మ్మనుజేశ్వరు మొగముఁ జూచి మఱియును నతఁ డి
ట్లనుఁ 'బురములోనఁ జాటం । బనుపు బృహన్నల జయంబు భవ్యవిచారా!' 258

ప్రతిపదార్థం: అని= అట్లు పలికి; అంతటన్= అంతటితో; నిలువక= ఆగక; ఆ+మనుజేశ్వరు= ఆ విరాటరాజుయొక్క; మొగమున్= ముఖాన్ని; చూచి= పరికించి; అతఁడు= కంకుభట్టు; మఱియును= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; భవ్యవిచారా!= మంగళకరమైన ఆలోచన కలవాడా!; బృహన్నల జయంబు= బృహన్నలయొక్క విజయాన్ని; పురములోనన్= పట్టణంలో; చాటన్= చాటుటకు; పనుపు= ఆజ్ఞాపించుము.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా పలికి, అంతటితో ఆగకుండా విరాటుడి ముఖంకేసి చూస్తూ ఇట్లా అన్నాడు - 'నీకు మంచి ఆలోచన ఉంటే బృహన్నల విజయం సాధించాడని పట్టణంలో చాటించుము.'

విశేషం: 'నా కొడుకు పౌరుషాన్ని నీవెందుకు పొగడలేవు?' అని విరాటు డడిగిన ప్రశ్నకు అసలు సంగతి పైపద్యంలో సమాధానంగా చెప్పాడు. అయినా సత్యం గ్రహించలేని విరాటుడికి - విజయం సాధించింది ఉత్తరుడు కాదు, బృహన్నల అని చాటించుమని చెప్పాడు. బృహన్నలను పేడివాడిగానే తెలిసిన విరాటుడి కది అంగీకారం కాలేదు. విరాటుడు ధర్మరాజు వాక్యాలపై మోహావేశంతో ప్రామాణికత్వాన్ని కోల్పోయాడు. ఉన్మాదావస్థలో అత డింకా ఉండిపోయాడు. 'భవ్యవిచారా!' అన్న సంబోధనలోని అంతరార్థాన్ని గ్రహించలేకపోయాడు. (సంపా.)

విరాటుండు కంకుని సారెఁగొని వ్రేయుట (సం. 4-63-44)

ఆ. అనిన రౌద్రరసము మనమున నడరంగఁ । బడగ యెత్తు నురగపాలు రేఖ
నెనయు చేతిసారెఁ గొని వ్రేసెఁ బతి 'పేడి । గడన యుడుగు మన్న నుడుగ' వనుచు. 259

ప్రతిపదార్థం: అనినన్= అనగా; రౌద్రరసము= రౌద్రమనెడి రసం (మహా కోపం); మనమునన్= మనస్సులో; అడరంగన్= వ్యాపించగా; పడఁగ+ఎత్తు= పడగ విప్పునట్టి; ఉరగపాలు రేఖన్= సర్పరాజు రీతి; ఎనయు= పొందిన; చేతి= చేతిలోని; సారెన్+కొని= పాచిక తీసికొని; పతి= విరాటరాజు; పేడిగడన= పేడియైన బృహన్నలను పొగడిక చేయటం, కీర్తించటం; ఉడుగుము+అన్నన్= మానుమనగా; ఉడుగవు+అనుచున్= మానవనుచు; వ్రేసెన్= విసరికొట్టెను.

తాత్పర్యం: అనటంతో రౌద్రరస ముప్పొంగగా పడగ నెత్తిన సర్పరాజువలె చేయెత్తి చేతిలోని పాచికతో విరాటుడు 'ఆ పేడిగాడిని పొగడవద్దంటే మానవేం?' అని విసరికొట్టాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇవ్విధంబున వ్రేటువడి యజాతశత్రుం డలుక గదురని హృదయంబుతోడం బాంచాలి దెసం జూడ్కిమలఁగ నూరకుండె; నన్నారీరత్నంబును రయంబునం జేరి వ్రేటుగంటిం దొరఁగు రుధిరంబుఁ దన యుత్తరీయంబున మెత్తన యొత్తి యచ్చేరువ నున్న కనకకలశంబు జలంబులం గరతలంబు దడిపికొని తుడుచున్నప్పుడు మత్స్య మహీవల్లభుం 'డీశోణితంబు పైచీరం బట్టుటకుఁ గతం బేమి?' యని తన్నడిగిన నతని కిట్లనియె. **260**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; వ్రేటు+పడి= దెబ్బతిని; అజాతశత్రుండు= ధర్మరాజు; అలుక+కదురని= కోపంరాని; హృదయంబుతోడన్= మనస్సుతో; పాంచాలిదెసన్= ద్రౌపదివైపు; చూడ్కి= చూపు; మలఁగన్= ప్రసరించగా; ఊరకుండెన్= ఊరకున్నాడు; ఆ+నారీరత్నంబును= ఆ ద్రౌపదియూ; రయంబునన్= వేగంగా; చేరి= దగ్గరకు వచ్చి; వ్రేటుగంటిన్= దెబ్బతగిలిన గాయం వెంట; తొరఁగు= కారెడి; రుధిరంబున్= రక్తమును; తన ఉత్తరీయంబునన్= తన పైటతో; మెత్తన= మెల్లగా; ఒత్తి= అద్ది; ఆ+చేరువన్+ఉన్న= ఆ దగ్గరలో ఉన్న; కనక కలశంబు= బంగారు చెంబులోని; జలంబులన్= నీతితో; కరతలంబు= చేతిని; తడిపికొని= తడిపి; తుడుచు+అప్పుడు= గాయాన్ని తుడిచే సమయంలో; మత్స్యమహీవల్లభుండు= విరాటుడు; ఈ శోణితంబు= ఈతడి రక్తం; పైచీరన్= నీ పైటతో; పట్టుటకున్= అద్దటానికి; కతంబు+ఏమి?= కారణం ఏమిటి?; అని= ఇట్లు; తన్నున్= సైరంధ్రిని; అడిగినన్= అడుగగా; అతనికిన్= విరాటుడితో; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= పలికింది.

తాత్పర్యం: ఈ విధంగా పాచికతో దెబ్బతిని అజాతశత్రువు కనుక ధర్మజుడు మనస్సులో కూడా కోపగించుకొనక, సైరంధ్రి కేసి చూశాడు. ఆమె వెంటనే వెళ్ళి పైటతో ఆ రక్తం కారే గాయాన్ని ఒత్తింది. దగ్గరలో బంగారు చెంబులో ఉన్న నీటితో చేయి తడుపుకొని అతడి గాయం తుడిచింది. అప్పుడా పైటకంటిన రక్తం చూచి విరాటుడు 'ఈ రక్తం నీ పైటతో ఎందుకు అద్దావు?' అని ప్రశ్నించగా ఆమె ఇట్లా అన్నది.

విశేషం: 1. దెబ్బతిన్న ధర్మరాజు కోపగించలేదు. అజాతశత్రు వనిపించుకొన్నాడు. అతడి చిత్తవృత్తిని వ్యంజింపచేసే ఆ బిరుదాన్ని ఇక్కడ వాడటం సార్థకం. 2. రక్తం కారుతూ ఉంటే కంకుభట్టు సైరంధ్రివైపు చూచాడు. అది సన్న్యాసి చేసేపని కాదు. విరాటుడికి అదొక అనుమానం కలిగించింది. 3. సైరంధ్రి వెంటనే వెళ్ళి తన పైటతో అతడి గాయంనుండి కారుతున్న రక్తాన్ని తుడిచింది. నీటితో కడిగింది. సామాన్యంగా సైరంధ్రులు అన్యపురుషుల సేవ చేయరు. అది మరొక అనుమానానికి దారితీసింది. 4. వారిరువురికీ ఏదైనా సంబంధం ఉన్నదా? అనే అనుమానంతో విరాటుడు 'అతడి రక్తాన్ని నీ పైటతో ఎందుకు అద్దావు?' అని అడిగాడు. 5. ఈ సన్నివేశంలో సైరంధ్రి సుదేష్ణయొక్క అంతఃపురంలో ఉండవలసింది - మహారాజు మసలేచోట ఉండటం ఒక విశేషం. ధర్మరాజును ఒక కంట కనిపెట్టి ఉండటం మరొక విశేషం. ధర్మరాజు నిర్భయంగా రాజుతో మాట్లాడటం మరింత విశేషం. ఇవన్నీ అజ్ఞాతవాసకాలం తీరిందని పాండవులు భావించి బయటపడటానికి సిద్ధపడుతున్న వైఖరిని స్పష్టపరుస్తున్నాయి. 6. విరాటుడి ప్రశ్నకు ద్రౌపది చెప్పే సమాధానం ఎట్లా ఉంటుందో? అనే ఉత్కంఠ పఠితలలో తలెత్తుతుంది. (సంపా.)

తే. 'విమల వంశంబునను బుణ్యవృత్తమునను । వఱలు నీతని రక్తంబు వసుమతీశ!
ధరణిపై నెన్ని బిందువుల్ దొరఁగె నన్ని । వర్షములు గల్గు నిం దనావర్షభయము.' **261**

ప్రతిపదార్థం: వసుమతీశ!= విరాటరాజా!; విమల వంశంబుననను= కల్మషంలేని వంశంలోను; పుణ్యావృత్తముననను= మంచి నడవడితోనూ; వఱలు= ఒప్పే; ఈతని రక్తంబు= ఈతని రక్తం; ధరణిపైన్= భూమి మీద; ఎన్ని బిందువుల్= ఎన్ని చుక్కలు; తొరఁగెన్= కారునో; అన్ని వర్షములు= అన్ని సంవత్సరాలు; ఇందున్= ఈ దేశంలో; అనావర్షభయము= అనావృష్టి వలని భయం; కల్గున్= కలుగుతుంది.

తాత్పర్యం: 'ఓ రాజా! స్వచ్ఛమైన వంశంలో పుట్టి ధర్మంగా జీవించే ఇతడి రక్తపు బిందువు లెన్ని చుక్కలు భూమిమీద పడితే అన్నేళ్ళు ఈ దేశంలో అనావృష్టి కలుగుతుంది.'

విశేషం: ఇది ఒక చక్కని సూక్తివంటి పద్యం. స్వీయవర్తనానికి ఒక ధార్మికన్యాయాన్ని చూపుతున్న ద్రౌపది ప్రజ్ఞ ఇందులో ప్రదర్శితమయింది. ఇందులో ధర్మజుడి వంశం, శీలం చెప్పబడ్డాయి. నిర్మలత్వం చంద్రవంశ సూచకం, పుణ్యవృత్తం అతడి సార్థకనామ సూచకం. అటువంటివారిని బాధిస్తే భూమి బాధపడుతుందని హెచ్చరిక! అనావృష్టి రాజుల అధర్మవర్తనకు ఫలితంగా కలిగే ప్రకృతి సంక్షోభమని ఆమె వ్యాఖ్యానించింది. (సంపా.)

వ. **అని చెప్పి యుత్తమ ద్విజలోహితపాతం బెట్లునుం గీడు గావున నీకు నొకహాని పుట్టుటకుఁ జాలక యిబ్భంగిం జేసితి' నని వెండియుఁ గొండొక కీలాలంబు దొరఁగం దొరఁగం దుడుచుచుండె; నంత నట యుత్తరు నెదుర్కొనం బోయి.** **262**

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; ఉత్తమ= ఉత్తముడైన; ద్విజ= బ్రాహ్మణుడి యొక్క లేదా క్షత్రియుడి యొక్క; లోహిత= రక్తముయొక్క; పాతంబు= పడటం; ఎట్లునున్= ఎట్లైనా; కీడు= చెరుపు కలిగిస్తుంది; కావునన్= కాబట్టి; ఒక హాని= ఒక చెడుపు; పుట్టుటకున్= కలుగుటకు; చాలక= సహించక; ఈ+భంగిన్= ఈ రీతిగా; చేసితిన్+అని= చేశానని పలికి; వెండియున్= ఇంకను; కొండొక= ఇంచుక; కీలాలంబు= రక్తం; తొరఁగన్+తొరఁగన్= బాగా కారుతుండగా; తుడుచుచున్+ ఉండెన్= తుడుస్తూ ఉండిపోయింది; అంతన్= అంతలో; అట= అక్కడ; ఉత్తరున్= (వస్తున్న) ఉత్తరుడిని; ఎదుర్కొనన్= ఎదురుగా వెళ్ళితేవటానికి; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: అని చెప్పింది. ఇంకా 'ఉత్తముడైన ద్విజుడి నెత్తురు పడటం కీడు కాబట్టి, ఈ దేశంలో ఏదైనా కీడు కల్గటం నాకిష్టం లేక ఇట్లా చేశాను' అన్నది. ఇంకా రక్తం చుక్కలుగా కారుతున్నది. అవి క్రింద పడకుండా తుడుస్తూనే ఉన్నది సైరంధ్రి. అంతలో ఉత్తరుడి కెదురుగా వెళ్ళినవారు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఇక్కడ మరొక అనుమానం విరాటుడికి కలుగకుండా మాట నేర్పరితనం ప్రకటించింది సైరంధ్రిగా ఉన్న ద్రౌపది. కంకుభట్టు విమలవంశం వాడనీ, పుణ్యావృత్తం కలవాడనీ సైరంధ్రి కెట్లా తెలుసు? అనే ప్రశ్న రావచ్చును. ఆమె ద్రౌపదీదేవికి సైరంధ్రిగా సేవలందించిన విషయం చెప్పుకొనవలసి వస్తుంది. ఇప్పు డామాటలు అవసరం లేదు. అయితే లోకంలో ఒక సాధారణ ధర్మాన్ని అనుసరించి ఆ పని చేశానని సైరంధ్రి తన చర్యను సమర్థించుకొన్నది. సన్న్యాసి వేషంలో ఉన్న ధర్మజుడు (కంకుభట్టు) ద్విజుడు. పుట్టుక, ఉపనయనం - అనే రెండు జన్మ లెత్తగల అధికారం బ్రాహ్మణులకు, క్షత్రియులకు, వైశ్యులకు ఉన్నది కాబట్టి ద్విజశబ్దం ధర్మరాజుకు కూడా వర్తిస్తుంది. వారి రక్తం నేలమీద పడితే రాజుకు కీడు కలుగుతుందని ధర్మశాస్త్రాలు చెప్పుతున్నాయి కాబట్టి కంకుభట్టు మీది ప్రేమకంటే, ప్రభువుమీద ఉండే ఆదరాభిమానాలతో ఆ పని చేశానని గడుసుగా ద్రౌపది సమాధానం చెప్పింది. అనుమానానికి తావు లేకుండా చేసింది. రక్తం కారటం తగ్గేంతవరకు ధర్మజుడి సేవ చేసికొనే అవకాశం కలిగించుకొన్నది. (సంపా.)

క. మంగళ తూర్యరవములు సె । లంగఁగ మౌక్తిక విమిశ్ర లలితాక్షత వృ
ష్టిం గురిసిరి విప్రులుఁ బు । ణ్యాంగనలును భద్రవాక్చయంబులతోడన్. **263**

ప్రతిపదార్థం: మంగళ= మంగళకరాలైన; తూర్యరవములు= వాద్యధ్వనులు; చెలంగఁగన్= ధ్వనించగా; మౌక్తిక విమిశ్ర= ముత్యాలతో కూడిన; లలిత+అక్షత వృష్టిన్= మంచి అక్షతలనెడి వానను; విప్రులు= బ్రాహ్మణులు; పుణ్య+అంగనలును= పవిత్రురాండ్రైన ముత్తైదువలు; భద్ర, వాక్+చయంబులతోడన్= మంగళకరమైన వాక్కుల మొత్తాలతో; కురిసిరి= కురిపించారు.

తాత్పర్యం: మంగళవాద్యాలు మ్రోగుతుండగా బ్రాహ్మణులు, సువాసినులు వేదాశీస్సులు, మంగళ గీతాలతో ముత్యాలు కలిపిన అక్షతలను వర్షంవలె కురిపించారు.

విశేషం: అలం: రూపకం.

ఉ. అత్తతిఁ గన్యకాజన సహస్రముఁ దానును జేరి వేడ్కమై
నుత్తర చందనార్ద్ర కుసుమోత్కరమున్ నవరత్న సంచయో
దాత్త సువర్ణ పుష్పములు దండడి చల్లెఁ గిరీటిమీఁద న
య్యుత్తరుపైఁ బ్రమోదకలనోత్కట సంభ్రమ సంభృతంబుగన్. **264**

ప్రతిపదార్థం: ఆ+తతిన్= అప్పుడు; కన్యకా, జన, సహస్రమున్= వేయిమంది (పెక్కుమంది) కన్యకల సమూహమున్నూ; తానును= ఉత్తరయును; చేరి= దగ్గరకు వచ్చి; వేడ్కమైన్= వేడుకతో; ఉత్తర= ఉత్తరాకుమారి; చందన+ఆర్ద్ర= మంచి గంధంతో తడిపిన; కుసుమ+ఉత్కరమున్= పూల సముదాయాన్నీ; నవరత్న సంచయ= నవరత్నాల సముదాయాన్నీ; ఉదాత్త= గొప్పవైన; సువర్ణ పుష్పములు= బంగారు పువ్వులను; దండడిన్= విరివిగా; కిరీటిమీఁదన్= అర్జునుడి మీదను; ఆ+ఉత్తరుపైన్= ఆ ఉత్తరుడి మీదను; ప్రమోద కలనా= సంతోషంతో కూడిన; ఉత్కట= ఎక్కువైన; సంభ్రమ= వేగిరపాటుతో; సంభృతంబుగన్= నిండినట్లుగా; చల్లెన్= చల్లింది.

తాత్పర్యం: అప్పుడు ఉత్తర వేలమంది కన్యకాజనులు వెంటరాగా వేడుకతో మంచి గంధం కలిపిన పువ్వులున్నూ, నవరత్నాలు, బంగారు పువ్వులున్నూ, అర్జునుడిమీద, ఉత్తరుడిమీద సంతోషంతో కలిగిన సంబరంతో చల్లింది.

విశేషం: 1. రాజమందిరం వరకు బ్రాహ్మణులూ, పుణ్యాంగనలూ స్వాగతం పలికారు. ఆపైన ఉత్తర చెలికత్తెలతో కలిసి స్వాగతం పలికింది. ఒక రాచమర్యాద, మరొకటి గృహమర్యాద. వారందరిలో బృహన్నల మహిమ తెలిసిన వ్యక్తి ఉత్తర ఒక్కతే. అందువలన ఉత్తరుడి విజయానికి కారకుడైన బృహన్నలపై ముందుగా మంగళద్రవ్యాల నుంచింది. ఆపైన ఉత్తరుడిమీద చల్లింది. ఆమె ఉచితజ్ఞతకూ, సూక్ష్మబుద్ధికీ ఆ చర్య నిదర్శనం. బ్రాహ్మణులూ, ముత్తైదువులూ ముత్యాలు కలిపిన అక్షతలు చల్లితే, ఉత్తరా, చెలికత్తెలూ నవరత్నాలతో కూడికొన్న బంగారు పూలను చల్లారు. ఒకరు ఆదరంతో, మరొకరు అనురాగంతో చల్లారు. సత్కారం కూడా శక్తియుక్తులను బట్టి ఉంటుందని తిక్కన తన వర్ణనలో చిత్రించాడు.

2. నవరత్నాలు: ముత్యం, మాణిక్యం, వైడూర్యం, గోమేధికం, వజ్రం, పవడం, పుష్యరాగం, మరకతం, నీలం. (సంపా.)

ఉ. **తక్కటి వారలుం గని ముదం బలరారఁగఁ గౌఁగిలించుచున్**
మ్రొక్కుచు నాదటం దనదు మోముపయిం దనివోని చూడ్కులం
గ్రిక్కిఱియించుచుం బొదివి గెల్పు నుతింపఁగ రాజపుత్త్రుఁ డ
య్యెక్కుడుమాట కోరువక యిట్లను నర్హజనంబుతోఁ దగన్. **265**

ప్రతిపదార్థం: తక్కటి వారలున్= మిగిలిన వారును; కని= చూచి; ముదంబు= సంతోషంతో; అలరారఁగన్= ఒప్పగా; కౌఁగిలించుచున్= కౌగిలించుకొంటూ; మ్రొక్కుచున్= నమస్కరిస్తూ; ఆదటన్= తనివితీర; తనదు= తనయొక్క; మోముపయిన్= ముఖంమీద; తనివోని= తనివి తీరని; చూడ్కులన్= చూపులను; క్రిక్కిఱియించుచున్= ఎక్కువగా ప్రసరింపచేస్తూ; పొదివి= చుట్టుకొని; గెల్పు నుతింపఁగన్= విజయాన్ని స్తుతించగా; రాజపుత్త్రుఁడు= ఉత్తరుడు; ఆ+ఎక్కుడు మాటకున్= ఆ ఎక్కువైన మాటకు; ఓరువక= సహించక; అర్హజనంబుతోన్= తగినవారితో; తగన్= తగునట్లుగా; ఇట్లు= ఈ రీతిగా; అనున్= పల్కాడు.

తాత్పర్యం: మిగతా వచ్చినవారు కూడా ఉత్తరుడిని చూచి సంతోషంతో కౌగిలించుకొనేవారు, మ్రొక్కేవారు, తన ముఖాన్ని తనివి తీరనట్లుగా అదే పనిగా తెగచూస్తూ చుట్టుముట్టి జయమును కొనియాడుతూ ఉంటే, అది తనది కాదు కనుక ఆ ఎక్కువైన ప్రశంసలకు సహించలేక తగినవారితో తగినట్లుగా ఈ విధంగా అన్నాడు.

విశేషం: ఉత్తరుడిని అభినందించేవారు మూడు రకాలుగా ఉన్నట్లు తిక్కన చిత్రించాడు. 1. కౌగిలించుకొనేవారు-వీరు ఆత్మీయులు, బంధువులు. 2.ప్రీతితో మ్రొక్కేవారు - సామంతులు, చిన్నవారు, సేవకులు; 3. తనివితీరకుండా ముఖంవైపు చూస్తూ ప్రశంసించేవారు - పౌరులు, అభిమానులు. వారందరూ విజయుడు ఉత్తరుడని భావించి అభినందిస్తున్నారు. ఉత్తరుడు వాటిని స్వీకరించలేడు. కాదనలేడు. చిక్కులో పడ్డాడు. మనసులోని మథనను ఆగబట్టుకొనలేక తగినవారితో తగినరీతిగా ఈ విధంగా పలికాడు. అంటే దగ్గరివారితో జనాంతికంగా అన్న మాటల వంటివన్నమాట! ఇందులో ఉత్తరుడి చిత్తశుద్ధి వ్యక్తమౌతున్నది. (సంపా.)

చ. **'కురుబలమున్ జయించుటయు గోవులఁ దెచ్చుటయున్ బృహన్నలా**
స్ఫురిత భుజాబలంబునన చూవె; నిజం బిది; నాక యేల? యె
వ్వరికిని నెవ్వరిం గెలువ వచ్చున యిట్టి సహాయ సంపదం
బొరయక యున్న? మీ కెఱుఁగఁ బోలునె నాబ్రదు కెట్టి భంగియో?' **266**

ప్రతిపదార్థం: కురుబలమున్= కౌరవుల సేనను; జయించుటయున్= గెలవటమున్నూ; గోవులన్= ఆవులను; తెచ్చుటయున్= తీసికొని రావటమున్నూ; బృహన్నలా= బృహన్నలయొక్క; స్ఫురిత= ప్రకాశించు; భుజా= భుజములయొక్క; బలంబునన్+అ= బలం చేతనే; చూవె= సుమా!; ఇది= నేను చెప్పినది; నిజంబు= సత్యం; నాకున్+అ= నాకే; ఏల?= ఏమిటి?; ఎవ్వరికినిన్= ఎవరికైనా; ఎవ్వరిన్= ఎవ్వరినైనా; ఇట్టి= ఇటువంటి; సహాయసంపదన్= సహాయసంపత్తిని; పొరయకఉన్నన్= పొందనిచో; గెలువవచ్చున్+అ= గెలువ వీలగునా?; నా బ్రదుకు= నా జీవితం, నా బలం; ఎట్టిభంగియో= ఎటువంటిదయ్యేదో; మీకున్= మీకు; ఎఱుఁగన్+పోలునె?= తెలియ వీలగునా?

తాత్పర్యం: ఈ బృహన్నలయొక్క భుజబలం మూలాననే కౌరవసేనను గెల్వటం, ఆవులను మరలించి తీసికొని రావటం జరిగింది. నిజం. నా ఒక్కడి మాటేమిటి? ఎవరికైనా ఎవరినైనా ఇటువంటి సహాయ సంపత్తి లేకపోతే గెలువవీలవుతుందా? నా కా సహాయం లేకపోతే నా బ్రదు కేమయ్యేదో మీ కేమి తెలుసు?

విశేషం: ఉత్తరుడి కృతజ్ఞతాభావానికీ, నిజాయితీకి ఈ పద్యం తార్కాణం.

1. కురుబలాన్ని జయించటానికీ గోవులను మరలించటానికీ కారణం - 'బృహన్నలా స్ఫురిత భుజాబలము'-అంటే- బృహన్నల ప్రదర్శించిన భుజాబలమనీ, బృహన్నల రూపంలో తోచిన భుజాబలమనీ అర్థాలు. ఒక అర్థం సారథియొక్క నైపుణ్యాన్ని కీర్తించినట్లున్నది. రెండవది గూఢమైన విజయుడి పరాక్రమ ప్రశంస. ఈ రెండు అర్థాలు వచ్చేటట్లు పలికిన కాకువు ఆ వాక్య రచనా శిల్పం. ఇది కృతజ్ఞతాభావ సూచకం.

2. 'మీ కెఱుఁగఁ బోలునె నా బ్రదు కెట్టి భంగియో' - అనే పాఠానికి - 'మీ కెఱుఁగఁ బోలదె నా బ్రదు కెట్టి భంగియో' - అనే పాఠాంతరం ఉన్నది. 'నా బ్రదుకు ఎటువంటిదో మీకు తెలియదా?' అనే అర్థం పాఠాంతరంవలన ఏర్పడుతుంది. ఆ వాక్యం కంటె ఇప్పటి పాఠమే ప్రౌఢంగా ఉన్నది. 'ఆయన సహాయం లేకపోతే నా బ్రదు కేమయ్యేదో మీ కేమి తెలుసు?'- అనే వాక్యం తెలుగు జాతీయమైన అభివ్యక్తితో శక్తిమంతమైనది. మీ రెవ్వరూ ఊహించలేనంత సహాయం లభించటంవలననే నే నిట్లు బట్టకట్టి మీముందు నిలిచి ఉన్నానని భావనా రమణీయంగా ఉత్తరుడు ప్రౌఢంగా పలికాడు. ఇది అతడి నిజాయితీకి ఉదాహరణం. (సంపా.)

వ. అని సారథ్య ప్రశంసా ప్రకారంబుగా నక్కుమారుం డత్యుపచార వచనంబుల చందంబున సంక్రందననందను నుతించుచుం జనుదెంచి రాజమందిర ద్వారంబుఁ జేరు నవసరంబునఁ బ్రతిహారి ససంభ్రమగతిం జని భూవల్లభునకుం బ్రణమిల్లి భూమింజయ ప్రవేశంబు తెఱంగు విన్నవించిన, 'నా రథికసారథులం జూచు వేడ్క మనంబు వేగిర పెట్టెడు, నయ్యిరువురఁ నియ్యెడకుం జయ్యనఁ దోడితె'మ్మను విభుని పలుకులు విని ధర్మ తనయుండు పణిహారితో నల్లన యిట్లనియె. 267

ప్రతిపదార్థం: అని= ఇట్లు; సారథ్య= సారథ్యముయొక్క; ప్రశంసా ప్రకారంబుగాన్= ప్రశంస చేసినట్లుగా; ఆ+కుమారుండు= ఆ ఉత్తరకుమారుడు; అతి+ఉపచార= మిక్కిలి గౌరవాన్ని తెలిపే; వచనంబుల చందంబునన్= వాక్యాల రీతిలో; సంక్రందన నందనున్= అర్జునుడిని; నుతించుచున్= పొగడుతూ; చనుదెంచి= వచ్చి; రాజమందిర ద్వారంబున్= రాజమందిరం యొక్క ద్వారాన్ని; చేరు+అవసరంబునన్= చేరునప్పుడు; ప్రతిహారి= ద్వారపాలుడు; ససంభ్రమ గతిన్= తొందర కలిగిన నడకతో; చని= లోనికి పోయి; భూ వల్లభునకున్= విరాటరాజునకు; ప్రణమిల్లి= నమస్కరించి; భూమింజయ= ఉత్తరుడియొక్క; ప్రవేశంబు తెఱంగు= ప్రవేశించే విధానాన్ని; విన్నవించినన్= మనవి చేయగా; ఆ రథిక= రథికుడైన ఉత్తరుని; సారథులన్= సారథియైన బృహన్నలను; చూచువేడ్క= చూడవలెననే వేడుక; మనంబున్= మనస్సును; వేగిర పెట్టెడున్= తొందర పెట్టుతున్నది; ఆ+ఇరువురన్= ఆ ఇద్దరినీ; ఈ+ఎడకున్= ఇక్కడకు; చయ్యనన్= తొందరగా; తోడితెమ్ము+అను= కూడా ఉండి తీసికొనిరమ్ము అనెడి; విభుని= రాజుయొక్క; పలుకులు= మాటలు; విని; ధర్మనతయుండు= ధర్మరాజు; పణిహారితో= ద్వారపాలకుడితో; అల్లన= మెల్లగా; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: సారథి సారథ్యాన్ని ప్రశంసించినట్లుగా ఎక్కువ ఉపచార వచనాలతో అర్జునుడిని పొగడుతూ రాజమందిర ద్వారానికి చేరేసరికి ద్వారపాలకుడు లోనికి వెళ్ళి విరాటుడికి నమస్కరించి, ఉత్తరుడు ప్రవేశం చేస్తున్నాడని చెప్పగానే, విరాటుడు ఉత్తరుడినీ, బృహన్నలనూ చూడాలనే వేడుకలో ఉన్నాడు కనుక వారిద్దరిని వెంటనే ప్రవేశపెట్టుమన్నాడు. ధర్మరాజు ఆ మాటలు విని ఆ భటుడితో మెల్లగా ఇట్లా అన్నాడు.

క. 'ఇన్నెత్తురు గనుఁగొనిన బృ । హన్నల కోపించు నన్ను నతిభక్తిమెయిన్
మన్నించుఁ గాన; రాజుం । దన్ను విచారింప కేమి తప్పు దలఁచునో? 268

ప్రతిపదార్థం: ఈ+నెత్తురు= ఈ రక్తం; కనుఁగొనినన్= చూస్తే; బృహన్నల= బృహన్నల; కోపించున్= కోపపడతాడు; నన్నున్= నన్ను; అతిభక్తి మెయిన్= ఎక్కువ భక్తితో; మన్నించున్= గౌరవిస్తాడు; కానన్= కాబట్టి; రాజున్= రాజును; తన్నున్= తనను; విచారింపక= ఆలోచించక; ఏమి తప్పు= ఏమి దోషం; తలఁచునో?= చేయాలని అనుకొంటాడో?

తాత్పర్యం: 'బృహన్నల ఈ నెత్తురు చూస్తే కోపగించుకొంటాడు. అతడు నన్ను ఎక్కువగా గౌరవిస్తాడు. కనుక రాజుస్థాయి తనస్థాయి ఆలోచించకుండా ఏదైనా అపకారం చేయ తలపెట్టుతాడేమో!

విశేషం: మూలంలో కంకుభట్టు అన్నమాటలు ఇంతకంటె కొంత భిన్నంగా ఉన్నాయి. వ్యాసుడు ధర్మజుడిని సత్యవ్రతుడుగా పలికించాడు.

"ఏతస్య హి మహాబాహో వ్రతమేతత్ సమాహితమ్
యో మమాంగే వ్రణం కుర్యా చ్ఛోణితం వాపి దర్శయేత్
అన్యత్ర సంగ్రామగతా న్న స జీవేదసంశయమ్ ॥
న మృష్యాద్ భృశసంక్రుద్ధో మాం దృష్ట్వా తు సశోణితమ్,
విరాటమిహ సామాత్యం హన్యాత్ సబలవాహనమ్॥" **(4-63-53-54)**

"ఓ మహాబాహూ! బృహన్నల కొక వ్రతం ఉన్నది. ఎవడైనా నా శరీరంమీద గాయం చేసినవాడూ, రక్తం కారేటట్లు చేసినవాడూ, యుద్ధంలో తప్ప తక్కినచోట్ల బ్రతుకడు. కాబట్టి నెత్తురు కారుతున్న నా స్థితిని ఇప్పుడు చూచాడా కోపించి ఆవేశంతో విరాటుడిని మంత్రులతో సేనతో వాహనాలతో సహా చంపివేస్తాడు'' - ఈ మాటలు ద్వారపాలకుడికి చెప్పేవి కావు. వీటి వలన ఎన్నో ప్రశ్నలు రేకెత్తుతాయి. బృహన్నల ఆ వ్రతం పట్టటానికి కంకుభట్టు అతడి కేమౌతాడు? ఆ వ్రతం సంగతి కంకుభట్టు కెట్లా తెలుసు? అనే ప్రశ్నలు ముందు తలెత్తుతాయి. కంకుభట్టు వేషంలో ధర్మరాజు నిజం పలుకుతున్నాడనే సంతృప్తి మనకు కలిగినా అందులో సందర్భశుద్ధి కొరవైనదని కావ్యకళా శిల్ప మర్మజ్ఞులు భావిస్తారు. తిక్కన మార్చిన కంకుభట్టు మాటలు సముచితంగా ఉన్నాయి. 'అతిభక్తితో నన్ను బృహన్నల గౌరవిస్తాడు కాబట్టి నన్ను గాయపరచిన విరాటుడిని అతడు సహించక పోవచ్చును. ఆవేశంతో ఏదైనా అపచారం కూడా చేయవచ్చును'- అనే సంభాషణ చాలు. ఇది సందర్భోచిత్యానికి ఉదాహరణం. (సంపా.)

వ. ఇది లెస్సగాఁ దుడుచునంతకుఁ దదీయ ప్రవేశం బించుకవడి వారింపుము; పదంపడి రానిత్తు గాని; యంతకు నుత్తరుం డొక్కరుండ వచ్చునట్లుగాఁ జేయుము.' 269

ప్రతిపదార్థం: ఇది= ఈ నెత్తురు; లెస్సగాన్= బాగా; తుడుచునంతకున్= తుడిచేవరకు; తదీయ ప్రవేశంబు= బృహన్నల ప్రవేశం; ఇంచుకవడి= కొంచెం సేపు; వారింపుము= ఆపుము; పదంపడి= తర్వాత; రానిత్తుగాని= రానిచ్చెదవుగాక; అంతకున్= అంతవరకు; ఉత్తరుండు= ఉత్తరుడు; ఒక్కరుండు+అ= ఒక్కడే; వచ్చునట్లుగాన్= ప్రవేశించేటట్లుగా; చేయుము= చేయవలసింది.

తాత్పర్యం: ఈ నెత్తురు కారటం తగ్గేవరకు బృహన్నలను రానియ్యకుము. తర్వాత రప్పించవచ్చును. ముందుగా ఉత్తరుడిని లోపలికి ప్రవేశపెట్టుము.'

**క. అని చెప్పి హర్ష సంభ్రమ । మున నజ్జననాయకుండు మునుఁగుట నదియే
మని యడుగఁ దలంపమిఁ దన । కనువై కార్యము ఘటించి యతనిం బుచ్చెన్. 270**

ప్రతిపదార్థం: అని చెప్పి= ఇట్లు చెప్పి; ఆ+జననాయకుండు= ఆ విరాటరాజు; హర్షసంభ్రమమునన్= సంతోషంయొక్క సంబరంతో; మునుఁగుటన్= మునిగి ఉన్నందున; అది= ఆ మాట్లాడేది; ఏమని= ఏమిటని; అడుగన్+తలంపమిన్= అడుగదలచుకొనకపోవటంచేత; తనకున్= ధర్మరాజునకు; అనువు+ఐ= వీలై; కార్యము= పని; ఘటించి= సమకూర్చి; అతనిన్= ద్వారపాలకుడిని; పుచ్చెన్= పంపించాడు.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా చెప్పి, విరాటుడు సంతోష సంబరాలలో మునిగిపోయి ఉన్నందున, ఆ మాట్లాడుకొనేది ఏమిటని అడగదలచుకొనకపోవటం తనకు అనుకూలం కాగా ద్వారపాలకుడిని పంపించాడు.

విశేషం: ఈ వివరణ మూలంలో లేదు. రాజు ఒక ఆజ్ఞ ఇచ్చాడు. రథినీ, సారథినీ ప్రవేశపెట్టుమన్నాడు. ప్రక్కనున్న కంకుభట్టు సారథిని తప్పించి ఉత్తరకుమారుడినే ముందు ప్రవేశపెట్టుమన్నాడు. రాజు తరువాత అంతటి గౌరవం పొందుతున్న కంకుభట్టును శంకించలేదు ద్వారపాలకుడు. కాని, ప్రభువు అనుమతి లేనిది అతడి ఆజ్ఞ పాటించలేడు. విరాటుడు ప్రమోదోన్మాదంలో ఉండటంచేత కంకుభట్టు మాటను కాదనలేదు. అదే అతడి అనుమతిగా భావించి ద్వారపాలకుడు వ్యవహరించాడు. ఆశ్చర్యమేమంటే - ఉత్తరుడి వెంట సారథి రాలేదేమి? అని కూడా ప్రభువు ప్రశ్నించలేదు. అదికూడా ఉన్మాదావస్థలోని భాగమే. రాజుయొక్క ఉన్మాదావస్థను ఉపాయంగా వాడుకొన్న ధర్మజుడు నిపుణుడని ధ్వని. (సంపా.)

చ. **అతఁడును బార్థు నిల్పి, వినయంబున నుత్తరుఁ దోడి తెచ్చినం**
బితృచరణాంబుజంబులకుఁ బ్రీతి మెయిం బ్రణమిల్లె నాతఁ; డా
పతియును జక్కఁ జేర్చె గరుపాటెడు మేనును హర్ష బాష్ప సం
ప్లుత మగు నాననంబు నయి పుత్త్రునిఁ బెద్దయుఁ బ్రొద్దు కౌఁగిటన్. **271**

ప్రతిపదార్థం: అతఁడును= ద్వారపాలకుడు కూడ; పార్థున్= అర్జునుడిని; నిల్పి= ఆపి; వినయంబునన్= వినయంతో; ఉత్తరున్= ఉత్తరకుమారుడిని; తోడి తెచ్చినన్= తోడ్కొనిరాగా; ఆతఁడు= ఉత్తరుడు; పితృచరణ+అంబుజంబులకున్= తండ్రిగారి పాదపద్మాలకు; ప్రీతిమెయిన్= సంతోషంతో; ప్రణమిల్లెన్= నమస్కరించాడు; ఆ పతియును= ఆ విరాటరాజు కూడ; గరుపాటెడు= పులకించెడి; మేనును= శరీరం కలవాడునూ; హర్షబాష్ప= ఆనందాశ్రువులతో; సంప్లుతము+అగు= తడిసిన; ఆననంబున్+అయి= ముఖం కలవాడు అయి; పుత్త్రునిన్= కుమారుడిని; పెద్దయున్= చాల; ప్రొద్దు= కాలం; కౌఁగిటన్= కౌగిట్లో; చక్కన్= చక్కగా; చేర్చెన్= చేర్చాడు.

తాత్పర్యం: ద్వారపాలకుడు ధర్మరాజు చెప్పినట్లే అర్జునుడిని ఆపి, ఉత్తరుడిని లోపలికి తీసికొనిరాగా, ఉత్తరుడు తండ్రి పాదాలకు ప్రీతితో ప్రణామం చేశాడు. విరాటుడు సంతోషంతో ఒడలు పులకించగా, ఆనందాశ్రువులతో ముఖం తడుస్తుండగా అతడిని ఎంతోసేపు కౌగిట్లో చేర్చుకొన్నాడు.

వ. **ఇవ్విధంబున నాలింగితుండయి భూమింజయుండు పునః పునః ప్రణామంబు సేసి, కంకునిం గనుంగొని సగౌరవంబుగా నమస్కరించి, మొగంబుగంటి సూచి 'యిది యేమి?' యని యడిగిన.** **272**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ఆలింగితుండు+అయి= ఆలింగనం చేసికొనబడినవాడై; భూమింజయుండు= ఉత్తరుడు; పునఃపునః= మరలమరల; ప్రణామంబు= నమస్కారం; చేసి; కంకునిన్= ధర్మరాజును; కనుంగొని= చూచి; సగౌరవంబుగాన్= గౌరవంతో కూడినట్లుగా; నమస్కరించి= దండంపెట్టి; మొగంబుగంటి= మొగంమీద గాయాన్ని; చూచి; ఇది+ఏమి అని= ఇదేమిటని; అడిగినన్= అడుగగా.

తాత్పర్యం: అట్లా మరల మరల కౌగిలించుకొన్న తరువాత ఉత్తరుడు తండ్రికి తిరిగి తిరిగి నమస్కారాలు చేశాడు. కంకుడివైపు చూచి సగౌరవంగా నమస్కరించాడు. ముఖంమీద గాయం కనిపించింది. 'ఇ దేమిట'ని అడిగాడు.

విశేషం: 'ఇదేమిటి?' -అని ఉత్తరుడు వేసిన ప్రశ్న కీలకమైనది. తీగ కదిపితే డొంక కదులుతుందన్న సామెత ఇక్కడ ఋజువవుతుంది. విరాటుడు విజయ వృత్తాంతాన్ని గురించి ఇంకా అడుగనే లేదు. కంకుభట్టు స్థితిని చూచి ఉత్తరుడు ఆతురతతో ప్రశ్నించాడు. ఆ ప్రశ్న కంకుభట్టును ధర్మరాజుగా గుర్తించాడా? లేదా అన్నదానికి సంకేతం. గుర్తించినట్లా, ఆ గుర్తింపును గోప్యంగా ఉంచుతున్నట్లు ధర్మజుడు గ్రహించాడు. ఎందువల్లనంటే - అజ్ఞాతవాస వ్రతకాలం ముగిసింది కాబట్టి అర్జునుడు నిజవేషంతో బయటపడి యుద్ధం చేసి ఉండాలి; కాని, పేడివేషంతోనే తిరిగి వచ్చాడు. పేడివాడు అర్జునుడని ఉత్తరుడికి తెలిస్తే, కంకుభట్టు ధర్మరాజని తెలిసిపోయి ఉంటుంది. అది జరిగిందా? లేదా? అని తెలిసికొనటానికే ఉత్తరుడి ఏకాంత ప్రవేశం. ధర్మజుడు ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టగలడు. కంకుభట్టును ధర్మజు డని పేర్కొంటే కథ నొక విధంగా నడపాలి. లేదా, మరొకవిధంగా నడపాలి. అందుకొరకు ధర్మజుడు పన్నిన వ్యూహ మిది. అతడి లోతులు సాధారణంగా అంతుపట్టవు. (సంపా.)

క. **'ఏ నీ విజయము వొగడఁగఁ । దా నప్పుడు పేడిఁ బొగడె; దానం గోపం**
బూనిన సైరింపక నా । చే నడిచితి సారెఁ గొని విశృంఖలవృత్తిన్'. **273**

ప్రతిపదార్థం: ఏన్= నేను; నీ విజయము= నీయొక్క గెలుపును; పొగడఁగన్= పొగడగా; అప్పుడు; తాన్= కంకుభట్టు; పేడిన్= బృహన్నలను; పొగడెన్= పొగడాడు; దానన్= దానితో; కోపంబు= కోపం; ఊనినన్= పొందగా; సైరింపక= సహించలేక; నాచేన్= నా చేతితో; సారెన్= పాచికను; కొని= తీసికొని; విశృంఖల వృత్తిన్= అడ్డులేని రీతిగా; అడిచితిన్= కొట్టాను.

తాత్పర్యం: విరాటు డన్నాడు - 'నాయనా! నేను నీ విజయాన్ని పొగడుతూంటే, ఇతడు ఆ పేడి గెలిచాడని పొగడాడు. దానితో కోపం వచ్చి సహించలేక వెనుకాముందూ చూడకుండా నేనే పాచికతో కొట్టాను.

క. **అని పతి పలికిన విని నె । మ్మనమున భయ సంభ్రమములు మల్లడిగొన న**
మ్మనుజేంద్రనందనుం డి । ట్లను నత్యాదరము మెఱయ నాతనితోడన్. **274**

ప్రతిపదార్థం: అని= ఇట్లు; పతి= విరాటుడు; పలికినన్= పలుకగా; నెమ్మనమునన్= మనస్సులో; భయ సంభ్రమములు= భయం, తొందరయును; మల్లడిగొనన్= పెనవేసికొనగా; ఆ+మనుజ+ఇంద్ర నందనుండు= ఆ ఉత్తరుడు; అతి+ఆదరము= మిక్కిలి గౌరవం; మెఱయన్= కనపడగా; ఆతనితోడన్= తండ్రితో; ఇట్లు= చెప్పబోయే రీతిగా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: అని విరాటరాజు పలుకగా భయం, కంగారు మనస్సులో కలిగి ఉత్తరుడు మిక్కిలి గౌరవంతో తండ్రితో ఇట్లా అన్నాడు.

తే. **'తప్పు చేసితి రీ; రిట్లు దగునె? వీర । లేమిగతిఁ బల్కినను నది యెల్ల మనము**
గైకొనవలయుఁగా; కిట్లు గాదు కూడ । దని నిషేధించు టొప్పునె మనుజనాథ! **275**

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; ఈరు= మీరు; తప్పు= దోషము; చేసితిరి= చేసినారు; ఇట్లు= ఇట్లా కొట్టటం; తగునె?= ఉచితమా?; వీరలు= వీరు; ఏమిగతిన్= ఏ రీతిగా; పల్కిననున్= మాట్లాడినా; అది+ఎల్లన్= అదంతా; మనము= మనము; కైకొనవలయున్= అంగీకరించవలసిందే; కాక= అట్లుకాక; ఇట్లు= మీరు చెప్పినది; కాదు కూడదు= అవును కాదు; అని; నిషేధించుట= కాదనటం; ఒప్పునె?= తగునా?

తాత్పర్యం: 'ఎంత తప్పు చేశారు? వీరు ఏమి మాట్లాడినా మనం అంగీకరించవలసిందే కాని, కాదు కూడదు- అని నిషేధించటం ఉచితమా?'

వ. అని మఱియును. 276

తాత్పర్యం: అని పలికి ఇంకా.

క. 'సవినయముగఁ బ్రార్థింపుఁడు । పవిత్ర చారిత్రులైన పరమ ద్విజు లి
ట్లవమతులై కోపించిన । నవనీశుల కేల కల్గు నాయువు సిరియున్?' 277

ప్రతిపదార్థం: సవినయముగన్= వినయంతో కూడినట్లుగా; ప్రార్థింపుఁడు= ప్రార్థించండి; పవిత్ర చారిత్రులు+ఐన= పవిత్రమైన నడవడిక కల; పరమద్విజులు= ఉత్తమ బ్రాహ్మణులు (ఇక్కడ బ్రాహ్మణులని అసత్యం చెప్పకుండా ద్విజులని క్షత్రియ సాధారణ పదం వాడడం గమనించ దగింది); ఇట్లు= ఈ రీతిగా; అవమతులు+ఐ= అవమానించబడినవారై; కోపించినన్= కోపిస్తే; అవనీ+ఈశులకున్= రాజులకు; ఆయువు= ఆయుస్సు; సిరియున్= సంపదయున్నూ; ఏల= ఏ రీతిగా; కల్గున్?= కలుగుతాయి?

తాత్పర్యం: 'వినయంతో వారిని ప్రార్థించండి. ఇటువంటి పవిత్రమైన చరిత్రకలవారు కోపిస్తే రాజులకు ఆయుస్సు, సిరిసంపదలు ఎట్లా కలుగుతాయి?'

వ. అనిన విని యమ్మాటలు పాటిగాఁ బట్టి విరాటుండు భయ భక్తియుక్తంబుగా వేఁడికొనినఁ బాండవాగ్రజుండు నగుచు 'నాకు నలుక యెక్కడిది? యితండును గీడుతెరువువాఁడు గాఁ; డిదియొక్క కీడుప్రొద్దున నయ్యెం గాని' యని తాను రాజుదెసఁ బ్రసన్నుం డగుట తెలియునట్లుగా నుత్తరుతోడం బలికిన, నమ్మహీవల్లభుండు సంతసిల్లి, తదవసరంబునఁ బ్రవేశించి కాంచిన యా బృహన్నల నాదరించి నిజనందను నాలోకించి యిట్లనియె. 278

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= వినిపించుకొన్నవాడై; ఆ+మాటలు= ఆ మాటలు; పాటిగాన్+పట్టి= పాటించవలసినవిగా తీసికొని; విరాటుండు= విరాటరాజు; భయభక్తి= భయంతో, భక్తితో; యుక్తంబుగాన్= కూడినట్లుగా; వేఁడికొనినన్= ప్రార్థించగా; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; నగుచున్= నవ్వుతూ; నాకున్= నాకు; అలుక= కోపం; ఎక్కడిది?= ఎక్కడ వచ్చింది?; ఇతండును= ఈ విరాటుడు కూడా; కీడు తెరువువాఁడు= చెడు మార్గంలో నడిచేవాడు; కాఁడు; ఇది+ఒక్క కీడుప్రొద్దునన్= ఇది ఒక చెడుగడియలో; అయ్యెన్+కాని= అయినది కాని; అని= అని పలికి; తాను= ఆ ధర్మరాజు; రాజుదెసన్= విరాటుడిపట్ల; ప్రసన్నుండు+అగుట= అనుగ్రహించినట్లుగా; తెలియునట్లుగాన్= స్పష్టమయ్యేటట్లు; ఉత్తరుతోడన్= ఉత్తరుడితో; పలికినన్= పలుకగా; ఆ+మహీవల్లభుండు= ఆ విరాటుడు; సంతసిల్లి= సంతోషించి; తద్+అవసరంబునన్= ఆ సమయంలో; ప్రవేశించి= లోనికివచ్చి; కాంచిన= తనను దర్శించినట్టి; ఆ బృహన్నలను= ఆ అర్జునుడిని; ఆదరించి= గౌరవించి; నిజనందనున్= తన కుమారుడిని; ఆలోకించి= చూచి; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఉత్తరుడు అట్లా అనేసరికి ఆ మాటలు పాటించి విరాటుడు భయభక్తులతో ప్రార్థించగా, ధర్మరాజు 'నాకు అసలు కోపమే రాలేదే. ఇతడు కూడా చెడు త్రోవను పోయేవాడు కాడు. ఇవ్వేళే ఎందుకో ఒక చెడు గడియలో

ఇట్లా చేశాడు' అని అంటూ రాజుమీద అనుగ్రహించినట్లు ఉత్తరునకు తెలిసేటట్లుగా పలికాడు. అప్పుడు రాజు సంతోషించాడు. అప్పుడే లోనికి వచ్చి బృహన్నల రాజుగారిని దర్శించగా విరాటుడు అతడిని ఆదరించాడు. కొడుకువైపు చూచి ఇట్లా అన్నాడు.

విరాటుఁ డుత్తరుని సమరప్రకారం బడుగుట (సం. 4-64-12)

ఉ. 'ద్రోణుఁడు భీష్ముఁడుం గృపుఁడు ద్రోణసుతుండును గర్ణుఁడుం బశు
త్రాణ పరాయణత్వమున దర్ప సముజ్జ్వల భంగి నుల్లస
ద్బాణ పరంపరల్ గురియఁ బార్థివుఁడున్ వెనుదన్ని చూడ న
క్షీణ జవంబునం గవియు సేనకు మార్కొన నగ్గలించితే? 279

ప్రతిపదార్థం: ద్రోణుఁడు= ద్రోణుడును; భీష్ముఁడున్= భీష్ముడును; కృపుఁడున్= కృపాచార్యుడును; ద్రోణసుతుండును= అశ్వత్థామయును; కర్ణుఁడున్= కర్ణుడును; పశుత్రాణ= గోవులను రక్షించటంలో; పరాయణత్వమునన్= ఆసక్తితో; దర్ప= గర్వముయొక్క; సముజ్జ్వల భంగిన్= హెచ్చిన రీతిలో; ఉల్లసత్= ప్రకాశించే; బాణ పరంపరల్= బాణాల పంక్తులను; కురియన్= కురిపించగా; పార్థివుఁడున్= దుర్యోధనుడు కూడా; వెన్ను+తన్ని= వెనువెంట నిలిచి; చూడన్= చూస్తూ ఉండగా; అక్షీణ= క్షీణించని; జవంబునన్= వేగంతో; కవియు= మీదికి వచ్చే; సేనకున్= సైన్యానికి; మార్కొనన్= ఎదుర్కొనుటకు; అగ్గలించితే= అతిశయంగా ముందుకుపోగల్గితివా?

తాత్పర్యం: 'ద్రోణుడు, భీష్ముడు, కృపుడు, అశ్వత్థామ, కర్ణుడు - వీరందరూ పశువులను రక్షించాలనే పట్టుదలతో బాణాలవర్షం కురిపించగా, దుర్యోధనుడు వెంటనుండి చూస్తుండగా, మీదికి మహావేగంతో వచ్చే సేనలను ఎదుర్కొనటానికి ఉత్సహించావా?

ఉ. బాసట లేదు క్రొవ్వడర బంటుతనంబునఁ దాఁకితేనియుం
బాసినచోట వాయుఁ బెఱ పట్టుల వీరు లుదగ్రవృత్తిమై
మూసికొనంగ వత్తు రొక మోహర మమ్ముల ద్రుగ్గెనేని నా
సాసల నొక్కరుండ యను నాగ్రహవృత్తి బలంబు పైఁబడున్. 280

ప్రతిపదార్థం: బాసట లేదు= సహాయం లేదు; క్రొవ్వు+అడరన్= మదం వ్యాపించగా; బంటుతనంబునన్= పౌరుషంతో; తాఁకితి+ఏనియున్= ఎదుర్కొన్నప్పటికీ; పాసిన చోటన్= వదిలిన చోట; పాయున్= విడిపోవుట; పెఱ పట్టులన్= తక్కిన చోట్ల; వీరులు= యోధులు; ఉదగ్ర వృత్తిమైన్= విసురుగా; మూసికొనంగన్= ముట్టడించటానికి; వత్తురు= దగ్గరకు వస్తారు; ఒక మోహరము= ఒకరు చేసిన వ్యూహం; అమ్ములన్= బాణాలతో; ద్రుగ్గెనేనిన్= చనిపోతే; ఒక్కరుండు+అ= ఒక్కడే!; అను+ ఆగ్రహవృత్తిన్= అనెడి ఆగ్రహంతో; బలంబు= సేన; ఆస+ఆసలన్= అధికాశతో; పైఁబడున్= మీదపడుతుంది.

తాత్పర్యం: నీకు సహాయుడు లేడు. క్రొవ్వెక్కి తాకితే విడిచినచోట విడిచినట్లే ఉంటుంది. తక్కిన చోట్ల ఉన్న వీరులు కూడా వచ్చి అమాంతంగా మీద పడతారు. వాళ్ళను ఒకవేళ కొట్టగలిగితే ఒక్కడే అనే ఆగ్రహంతో తక్కిన సేనలు వచ్చి అధికాశతో మీద పడతాయి.

ఆ. **ఒకఁడు పరశురాము నోర్చినవాఁ; డొక్క। రుండు ధనువునకు గురుండు దాన;**
హరువరమునఁ బుట్టి యక్షీణ బల విక్ర। మముల నొక్కఁ డొప్పు మాఱు లేక. **281**

ప్రతిపదార్థం: ఒకఁడు= ఒక వీరుడు-భీష్ముడు; పరశురామున్= పరశురాముడిని; ఓర్చినవాఁడు= ఓడించినవాడు; ఒక్కరుండు= మరొక్కడు-ద్రోణాచార్యుడు; ధనువునకున్= ధనుర్విద్యకు; తాను+అ= తానే; గురుండు= గురువు; హరువరమునన్= శివుడి వరమున; పుట్టి; అక్షీణ= క్షీణించని; బల విక్రమములన్= బల పరాక్రమాలతో; ఒక్కఁడు= మరొకడు-అశ్వత్థామ; మాఱులేక= తన కెదురు లేక; ఒప్పున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: కౌరవసేన లోని వీరులలో ఒకడు పరశురాముడిని ఓడించినవాడు, ఒకడు స్వయంగా ధనుర్విద్యా గురువు. మరొకడు శివుడి వరాన పుట్టి క్షీణించని బలపరాక్రమాలతో ఎదురులేనివాడు.

విశేషం: పరశురాముడిని గెలిచినవాడు భీష్ముడు. (చూడు. ఉద్యోగ. 4-273-360). కురుపాండవులకు ధనుర్విద్యాచార్యుడు ద్రోణుడు. ద్రోణుడు సంతానం కొరకు శివుడిని గూర్చి తపస్సుచేసి, ఆ మహాదేవుడి వరం వలన రుద్రాంశ సంభూతుడైన అశ్వత్థామను పుత్రుడిగా పొందాడు. (చూడు. శివపురాణం శతరుద్రీయ సంహిత. సంహిత. 3. అధ్యా. 36. శ్లో. 6-14).

ఉ. **తక్కటి వారలున్ సురల దైత్యులనైనను బోర గెల్చువా**
రక్కురుసేన మేటిమగ లా ధృతరాష్ట్ర తనూజు లాజి నొ
క్కొక్కఁడ ధాత్రి యంతయును నోర్వఁగఁ జాలుదు రట్టివారి నీ
వెక్కటి దాఁకి నొవ్వకయు నెమ్మెయి గెల్చితి నాకుఁ జెప్పుమా! **282**

ప్రతిపదార్థం: తక్కటి వారలున్= మిగిలిన వారుకూడ; సురలన్= దేవతలను; దైత్యులన్+ఐనను= రాక్షసులనైనా; పోరన్= యుద్ధంలో; గెల్చువారు= గెల్వగల్గినవారు; ఆ+కురుసేనన్= ఆ కౌరవసేనలోని; మేటిమగలు= గొప్ప వీరులు; ఆ ధృతరాష్ట్ర తనూజులు= ఆ ధృతరాష్ట్రుడి పుత్రులు-కౌరవులు; ఆజిన్= యుద్ధంలో; ఒక్కొక్కఁడ= ఒక్కడొక్కడే; ధాత్రి= భూమిని; అంతయును= సమస్తాన్ని; ఓర్వఁగన్= ఓడించటానికి; చాలుదురు= సమర్థులు; అట్టివారిన్= అటువంటివారిని; నీవు; ఎక్కటిన్= ఒంటరిగా; తాఁకి= ఎదుర్కొని; నొవ్వకయున్= ఏమీ దెబ్బతగులకుండా; ఏ+మెయిన్= ఏ రీతిగా; గెల్చితి(వి)= జయించావు; నాకున్= నాకు; చెప్పుమా!= చెప్పుము!

తాత్పర్యం: మిగిలిన వారుకూడా దేవతలనైనా, రాక్షసులనైనా యుద్ధంలో గెలువగల మహావీరులు. ఆ ధృతరాష్ట్రుడి కొడుకులున్నారే వారు ఒక్కొక్కరు పృథివిని గెలువగల వీరులు. అటువంటి వారి సేనను నీ వొక్కడవు ఎదిరించి, శరీరం ఏమీ కందకుండా ఎట్లా గెల్చావో నాకు చెప్పుము.

ఉ. **గోవుల నెట్టు లాఁగితి? వకుంఠితవిక్రముఁడైన రాజరా**
జేవిధి మానభంగమున కెల్లను నోర్చి పలాయమానుఁడై
నీ విజయంబు సైఁచి ఘననిందకు నియ్యకొనంగఁ జాలెఁ? బు
త్రా! వెఱఁ గయ్యెడున్ రణవిధం బఖిలంబు నెఱుంగఁ జెప్పుమా!' **283**

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; గోవులన్= ఆవులను; ఎట్టులు= ఏ రీతిగా; ఆఁగితివి= ఆపితివి; అకుంఠిత= మొక్కవోని; విక్రముఁడు+ఐన= పరాక్రమం కలిగిన; రాజరాజు= దుర్యోధనుడు; ఏ విధిన్= ఎట్లు; మానభంగమునకున్= అభిమానం

పోవటానికి; ఎల్లను= పూర్తిగా; ఓర్చి= సహించి; పలాయమానుఁడు+ఐ= పారిపోతున్నవాడై; నీ విజయంబు= నీ గెలుపును; సైఁచి= సహించి; ఘన నిందకున్= గొప్పదైన నిందకు; ఇయ్యకొనంగన్= ఒప్పుకొనుటకు; చాలెన్= సమర్థుడయ్యాడు; వెఱఁగు= ఆశ్చర్యం; అయ్యెడున్= ఔతున్నది; రణవిధంబు= యుద్ధం జరిగిన విధం; అఖిలంబున్= సమస్తాన్ని; ఎఱుంగన్= నాకు తెలిసేటట్లు; చెప్పుమా!= చెప్పుము.

తాత్పర్యం: కుమారా! ఆవులను ఎట్లా మరలించగలిగావు? గొప్ప పరాక్రమం కల రాజరాజు మానభంగానికి సహించి పలాయనం చిత్తగించి, నీ గెలుపు అంగీకరించి, నిందకు ఎట్లా ఒప్పుకొనగలిగాడు? నా కాశ్చర్యం వేస్తున్నది. యుద్ధం ఎట్లా జరిగిందో వివరంగా చెప్పుము.'

విశేషం: యుద్ధం జరిగిన విధానాన్ని ఊహించుకొంటేనే విరాటుడికి భయంతో నిండిన ఆశ్చర్యం కలిగింది. ఆ యుద్ధం రాజరాజుతో. అతడు అకుంఠిత పరాక్రముడు. అభిమాన ధనుడు. ఓటమిని అంగీకరించనివాడు. అటువంటి వాడి అపార సైన్యాన్ని ఓడించి, ఆవులను మళ్ళించి, అతడిని పలాయనం చిత్తగించేటట్లు చేసిన ఆ యుద్ధం భయంకరంగా జరిగి ఉండాలి. అంతటి యుద్ధాన్ని గురించి, అందులో ఉత్తరుడు సాధించిన విజయాన్ని గురించి తెలిసికొనాలనే ఉత్కంఠ మూర్తి కట్టినట్లున్నది ఈ పద్యం. 'పుత్రా! వెఱఁగయ్యెడున్ । రణవిధం బఖిలంబు నెఱుంగఁ జెపుమా!' - అన్న వాక్యం కొసమెరుపుగా మెరిసిన పాత్రోచిత సందర్భోచిత వాక్య విన్యాస శిల్పానికి మచ్చుతునక. (సంపా.)

చ. **అనవుడు నాతఁ డిట్లనియె 'నక్కురుసేనల నేను గెల్వ; గో**
ధనమును నే మరల్ప; మన దైవబలంబునఁ జేసి దేవసం
జనితుఁడు నాఁగ నర్హమగు చందమువాఁడు మహాత్ముఁ డొక్కరుం
డని ననుఁ గాచెఁ; గౌరవుల నందఱ గెల్చి మరల్చె గోవులన్. **284**

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆతఁడు= ఉత్తరుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; ఆ+కురుసేనలన్= ఆ కౌరవసేనలను; నేను; గెల్వన్= గెలవలేదు; గోధనమును= ఆవుల మందలనే సంపదను; నేన్= నేను; మరల్పన్= మరలించలేదు; మన దైవబలంబునన్+చేసి= మనయొక్క దైవబలం వలన; దేవ సంజనితుఁడునాఁగన్= దేవతలకు పుట్టిన వాడువలె; అర్హము+అగు= తగిన; చందమువాఁడు= విధంకలవాడు; మహాత్ముఁడు= మహానుభావుడు; ఒక్కరుండు= ఒకడు; అనిన్= యుద్ధమందు; ననున్= నన్ను; కాచెన్= రక్షించాడు; కౌరవులన్= కౌరవులను; అందఱన్= అందరిని; గెల్చి= జయించి; గోవులన్= ఆవులను; మరల్చెన్= మరలించాడు.

తాత్పర్యం: అనగా ఉత్తరు డిట్లా అన్నాడు - 'ఆ కౌరవసేనలను నేను గెలవలేదు, ఆవులను మరల్చలేదు. మనకు దైవబలం ఉన్నది కనుక ఒక మహాత్ముడు, దేవాంశ సంభూతుడు వచ్చి యుద్ధంలో నన్ను కాపాడి, కౌరవుల నోడించి, ఆవులను మరలించాడు.

విశేషం: 228వ పద్యంలో 'నీ చేసిన యీ పని నాచేఁ గాక యునికి పతి యెఱుఁగఁడొకో! । జనులు నిజము సేయుదురే! నిను నెఱిఁగింపకయ చెప్ప నేర్తునె పొగడన్' - అని అన్నాడు అర్జునుడితో ఉత్తరుడు. తాను విజయం సాధించినట్లు చెప్పితే ఎవ్వరూ నమ్మరని తెలిసిన ఉత్తరుడు అర్జునుడని ఎవరూ గుర్తించకుండా గుప్తంగా అర్జునుడే విజయాన్ని సాధించినట్లు చెప్పాడు. దేవ సంజనితుడు - అనేమాట సార్థకం. దేవకులంలో పుట్టినవాడు, దేవతలకు లేదా దేవుడికి లేదా ఇంద్రుడికి పుట్టినవాడు అనే అర్థం వచ్చేటట్లు అర్జునుడిని సూచించాడు. అసత్యదోషం నుండి, కృతఘ్నతా పాపంనుండి తప్పించుకొన్నాడు.

మాటనేర్పరితనాన్ని ప్రకటించాడు. దేవసంజనితుడో అన్నట్లు ఉత్ప్రేక్షాలంకారంలో చెప్పటం ఔచిత్యం. 'అర్హమగు చందమువాఁడు'- అనే విశేషణంలో ఇప్పటి పేడిరూపంలో కాక సహజమైన ఉజ్జ్వల రూపంలో ఉన్నవాడని భావం. 'మహాత్ముఁడు' - ఇది తెలుగు జాతీయం. అద్భుత ప్రభావం కలవాడిని మహాత్ముడని పిలవటం తెలుగువారి నుడికారం. 'ఒక్కరుండు'- అనే మాట ఏకైకవీరుడై అనే అర్థాన్ని ప్రకటించింది. అత డొక్కడే మూడు పనులు చేశాడు. 1. ఉత్తరుడిని రక్షించాడు, 2. కౌరవులనందరిని గెలిచాడు, 3. ఆవులను మళ్ళించాడు. ఉత్తరుడు అద్భుతయుద్ధక్రీడను భావచిత్రంగా అందించాడు. (సంపా.)

వ. అత్తెఱంగు వివరించి విన్నవించెద నవధరింపుము. 285

ప్రతిపదార్థం: ఆ+తెఱంగు= ఆ విధానాన్ని; వివరించి= వివరంగా చెప్పి; విన్నవించెదన్= తమకు మనవి చేస్తాను; అవధరింపుము= వినవలసింది.

తాత్పర్యం: ఆ విధానాన్నంతా వివరంగా చెప్పి నీకు మనవి చేస్తాను. వినుము.

తే. ధూళి పెల్లుగ నెగయంగ నేల గోడి। వడఁగఁ జనుమూఁకఁ గని వడవడ వడంకి
పాఱు తేరంగ నమ్మహాభాగుఁ డప్పు। డోడ కోడకు మని నన్నుఁ గూడ వచ్చి. 286

ప్రతిపదార్థం: ధూళి= దుమ్ము; పెల్లుగన్= ఎక్కువగా; ఎగయంగన్= పైకి ఎగురగా; నేల= భూమి; గోడి+పడఁగన్= ఏటవాలుగా ఒక ప్రక్కకు వంగగా; చను= వెళ్ళేడి; మూఁకన్= సేనను; కని= చూచి; వడవడ వడంకి= గజగజ వణికి; పాఱు తేరంగన్= పరుగెత్తగా; ఆ+మహాభాగుఁడు= ఆ మహానుభావుడు; అప్పుడు= ఆ సమయాన; నన్నున్= నన్ను; ఓడకు+ఓడకుము+అని= భయపడకుమని; కూడన్+వచ్చి= కలిసి వచ్చి.

తాత్పర్యం: దుమ్ము హెచ్చుగా పైకి లేవగా నేల బరువుకి ఒక ప్రక్క కిందికి దిగిపోయేటట్లుగా వచ్చే సేనలను చూచి నేను గజగజ వణికి పారిపోతూంటే ఆ మహానుభావుడు వచ్చి, భయపడకు మని ధైర్యం చెప్పి, నన్ను కలిసికొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. పట్టుకొని మగుడం గొనిపోయి రథంబుపైఁ బెట్టిన నే నతని యాజ్ఞకు మిగులకుండితి. 287

ప్రతిపదార్థం: పట్టుకొని= నన్ను పట్టుకొని; మగుడన్= మరల; కొనిపోయి= తీసికొనివెళ్ళి; రథంబుపైన్= రథంమీద; పెట్టినన్= పెట్టగా; నేన్= నేను; అతని+ఆజ్ఞకున్= ఆతడు చెప్పిన దానికి; మిగులక+ఉండితిన్= అతిక్రమించకున్నాను.

తాత్పర్యం: నన్ను పట్టుకొని తీసికొనివెళ్ళి రథంమీద కూర్చుండపెట్టాడు. అతని ఆజ్ఞ కాదనలేకపోయాను.

ఉ. కౌరవసేన గోగణముఁ గైకొని పోవ నతండు ముట్టి యం
దారసి రాజుఁ గానక యుపాంతమునం దొలఁగించి వేగ నా
తే రట దోలి యడ్డపడి తీవ్రశరంబుల నబ్బలంబు దు
ర్వారరయంబు మాన్చి పశువర్గము నిద్దెస వెల్చె నార్చుచున్. 288

ప్రతిపదార్థం: కౌరవసేన= కౌరవులసైన్యం; గోగణమున్= ఆలమందను; కైకొనిపోవన్= తోలుకొనిపోగా; అతండు= ఆ దివ్యపురుషుడు; ముట్టి= ముట్టడించి; అందున్= అందులో; ఆరసి= వెదకి; రాజున్= రాజును-దుర్యోధనుడిని; కానక=

చూడక-కనబడనందున; ఉపాంతమునన్= సమీపమందు; తొలఁగించి= మరలించి; వేగన్= వేగంగా; నా తేరు= నా రథాన్ని; అటన్= అక్కడికి; తోలి= తోలినవాడై; అడ్డపడి= వారికి అడ్డంవెళ్ళి; తీవ్రశరంబులన్= వాడియైన బాణాలతో; ఆ+బలంబు= ఆ సేనయొక్క; దుర్వార= వారింపరాని; రయంబు= వేగం; మాన్చి= మాన్పి; పశువర్గమున్= ఆవుల మందను; ఈ+దెసన్= ఈ వైపునకు; ఆర్చుచున్= కేకలు వేస్తూ; వెల్చెన్= తోలాడు, మరలించాడు.

తాత్పర్యం: మన ఆవులమందను కౌరవసేన తోలుకొనిపోతూ ఉంటే అతడు అడ్డంవెళ్ళి అక్కడ దుర్యోధనుడు లేకపోగా రథాన్ని మరొకవైపు మళ్ళించి ఆ సేనకు అడ్డుపడి వాడిఅయిన బాణాలతో ఆ సేన వేగాన్ని ఆపి కేకలువేస్తూ ఆవుల మందలను ఇటు మరలించాడు.

ఆ. చెదరకుండఁ బసులఁ బొదివి యించుకమేర । యిక్క దరుఁగుదెంచి యెలమి మగిడి
కడచి పోవుచున్న కౌరవపతి ముట్ట । నడరినంత సేన లతనిఁ గూడె. 289

ప్రతిపదార్థం: చెదరక+ఉండన్= చెదిరిపోకుండా; పసులన్= ఆవులను; పొదివి= కమ్ముకొని; ఇంచుక మేర= కొద్దిమేర; ఇక్కడన్= ఇటువైపు; అరుగుదెంచి= వచ్చి; ఎలమిన్= ఉత్సాహంతో; మగిడి= తిరిగి; కడచిపోవుచున్+ఉన్న= దాటుకొనిపోతున్న; కౌరవపతిన్= దుర్యోధనుడిని; ముట్టన్= ఆక్రమించుటకు; అడరిన+అంతన్= ప్రయత్నించునంతలో; సేనలు= కౌరవసేనలు; అతనిన్= ఆ దివ్యపురుషుడిని; కూడెన్= చుట్టుముట్టాయి.

తాత్పర్యం: గోవులు చెదరిపోకుండా చుట్టు కావలికాసి కొంచెంసేపు ఇక్కడ ఉండి, మరల అక్కడికి వెళ్ళి ఉత్సాహంగా దాటుకొనిపోయే దుర్యోధనుడిని అడ్డగించేటంతలో సేనలు ఆ దివ్యపురుషుడిని చుట్టుముట్టాయి.

మ. కురురాజున్ సబలంబుగాఁ గవిసినన్ ఘోరాహవం బయ్యెఁ; నం
దరదంబుల్ నుఱుమయ్యె, నశ్వములు నుగ్గయ్యెం, గరివ్రాతముల్
ధర దంతంబుల యూఁతగా నొఱగె, నుద్యద్బాహుదృప్యద్భటో
త్కరముల్ తిట్టినయట్లు గూలెఁ గలయం దద్బాణపాతంబులన్. 290

ప్రతిపదార్థం: కురురాజున్= దుర్యోధనుడును; సబలంబుగాన్= సేనతోకూడి; కవిసినన్= ఎదుర్కొనగా; ఘోర= భయంకరమైన; ఆహవంబు= యుద్ధం; అయ్యెన్= అయింది; అందున్= ఆ కౌరవసేనలో; అరదంబుల్= రథాలు; నుఱుము+అయ్యెన్= ముక్కలు ముక్కలు అయ్యాయి; అశ్వములు= గుర్రాలు; నుగ్గు+అయ్యెన్= పిండి అయ్యాయి; కరివ్రాతముల్= ఏనుగుల గుంపులు; ధరన్= భూమిపై; దంతంబుల= దంతములే; ఊఁతగాన్= ఆధారంగా; ఒఱగెన్= వాలిపోయాయి; ఉద్యత్= ఉద్యమిస్తున్న; బాహు= భుజాలతో; దృప్యత్= గర్విస్తున్న; భట= సైనికుల యొక్క; ఉత్కరముల్= సమూహాలు; తద్+బాణ= ఆ దివ్యపురుషుడి బాణాల యొక్క; పాతంబులన్= దెబ్బలతో; కలయన్= నాల్గువైపులందు; తిట్టిన+అట్లున్= శపించినట్లుగా; కూలెన్= నేలకొరిగాయి, చనిపోయాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు కూడా సేనతో సహా ఎదురు తిరిగాడు. దానితో యుద్ధం ఘోరంగా జరిగింది. దానిలో రథాలు పిండి అయిపోయాయి. గుర్రాల నుగ్గు అయిపోయాయి. ఏనుగులు దంతాలు ఆధారంగా నేలమీదికి ఒరిగిపోయాయి. భుజబలంతో గర్వించిన సైనికులు ఆయన బాణాల దెబ్బలకు శపించినట్లుగా నాలుగు మూలలా పడిపోయారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. శత్రుంతపాదు లగు నృప । పుత్రులుఁ బేరు గల యోధపుంగవులును ద
చ్చిత్ర శరనిహతి సంగర । ధాత్రిఁ బడిరి వారి నెన్నఁ దడవై యుండున్. 291

ప్రతిపదార్థం: శత్రుంతప+ఆదులగు= శత్రుంతపుడు మున్నగు; నృపపుత్రులున్= రాజకుమారులును; పేరుగల= కీర్తిగల; యోధపుంగవులును= వీరశ్రేష్ఠులును; తద్= ఆ దివ్యపురుషుడి యొక్క; చిత్ర= విచిత్రమైన; శరనిహతిన్= బాణాల దెబ్బతో; సంగరధాత్రిన్= యుద్ధభూమిలో; పడిరి= పడిచచ్చారు; వారిన్= వారినందరిని; ఎన్నన్= లెక్కపెట్టటానికి; తడవు+ఐ= ఆలస్యమై; ఉండున్= ఉంటుంది. (అంటే - ఆలస్యమౌతుందని భావం).

తాత్పర్యం: శత్రుంతపుడు మున్నగు రాజకుమారులు, ఇంకా పేరెక్కిన యోధశ్రేష్ఠులు ఆ దివ్యపురుషుడు వేసిన విచిత్రమైన బాణపు దెబ్బలకు యుద్ధభూమిలో పడిపోయారు. వారందరినీ లెక్కపెట్టి చెప్పాలంటే చాలా ఆలస్యం అవుతుంది.

తే. మొనలు దెరలినఁ గర్ణుండు ముంచి తాఁక । నమ్మహావీరుఁ డాతనితమ్ముఁ జంపి
హరుల నొప్పించి సూతు నో నాడ నేసి । యంగముల బాణములు నించి యతనిఁ బఱపె. 292

ప్రతిపదార్థం: మొనలు= సేనలు; తెరలినన్= పారిపోగా; కర్ణుండు= కర్ణుడు; ముంచి= అతిశయించి; తాఁకన్= ఎదుర్కొనగా; ఆ+మహావీరుఁడు= ఆ దివ్యవీరుడు; ఆతని తమ్మున్= ఆ కర్ణుడి తమ్ముడిని; చంపి= చంపేసి; హరులన్= గుర్రాలను; నొప్పించి= బాధకల్గేటట్లు కొట్టి; సూతున్= సారథిన్; నోనాడన్= నొచ్చేటట్లుగా; ఏసి= వేసి; అంగములన్= అవయవాలందు; బాణములు; నించి= నింపి; అతనిన్= కర్ణుడిని; పఱపెన్= పారిపోయేటట్లు చేశాడు.

తాత్పర్యం: సేనలు పారిపోయేసరికి కర్ణుడు అతిశయించి ఎదుర్కొన్నాడు. ఆ మహావీరుడు అప్పుడు అతని తమ్ముడిని చంపి, అతడి గుర్రాలను కొట్టి, సారథికి బాధ కలిగేటట్లు కొట్టి, అతడి శరీరంమీద బాణాలు వేసేసరికి అతడు పారిపోయాడు.

క. గురుఁడు తలపడిన నతఁ డ । చ్చెరువుగ దివ్యాస్త్రవితతిఁ జిక్కువఱిచి త
ద్వరసుతుఁడుఁ గృపుఁడుఁ దాఁకినఁ । దెరలిచి భీష్మునకుఁ గవిసె దృఢరభసమునన్. 293

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణుడు; తలపడినన్= ఎదుర్కొనగా; అతఁడు= ఆ మహావీరుడు; అచ్చెరువుగన్= ఆశ్చర్యంగా; దివ్య+అస్త్రవితతిన్= దివ్యమైన అస్త్రాల సముదాయంతో; చిక్కువఱిచి= బాధకల్గించి; తద్+వరసుతుఁడున్= ఆయన కుమారుడు-అశ్వత్థామయు; కృపుఁడున్= కృపాచార్యుడును; తాఁకినన్= ఎదుర్కొనగా; తెరలిచి= పరుగెత్తించి; భీష్మునకున్= భీష్ముడిని; దృఢ= గట్టి; రభసమునన్= వేగంతో; కవిసెన్= ఎదిరించాడు.

తాత్పర్యం: ద్రోణుడు ఎదిరించగా ఆశ్చర్యం కలిగేటట్లు ఎన్నో దివ్యాస్త్రాలు వేసి అతడినే చిక్కులలో పడేశాడు. ఆపైన అశ్వత్థామ, కృపుడు ఎదిరించారు. ఆ దివ్యపురుషుడు దెబ్బకు వారిని పారిపోయేటట్లు చేసి, మహావేగంతో భీష్ముడిని ఎదిరించాడు.

మ. అతనిం దీవ్రశరంబులం బొదివి నానాస్త్రంబు లేసెన్ నదీ
సుతుఁడుం దత్సమయంబునం గినియ నా శూరుండు చాపంబు ద్రుం
చి తదీయాంగము నొంచినన్ వివశుఁడై చేడ్పడ్డచో సూతుఁ డు
ద్గత భీతిం దొలఁగంగఁ దోలె రథముం దత్ప్రాణరక్షార్థియై. 294

ప్రతిపదార్థం: నదీసుతుఁడున్= భీష్ముడుకూడా; అతనిన్= ఆ దివ్యపురుషుడిని; తీవ్రశరంబులన్= తీవ్రమైన బాణాలతో; పొదివి= చుట్టుముట్టి; నానా+అస్త్రంబులు= అనేక రకాలైన అస్త్రాలను; ఏసెన్= వేశాడు; తద్+సమయంబునన్= ఆ సమయంలో; కినియన్= కోపించగా; ఆ శూరుండు= ఆ దివ్యపురుషుడు; చాపంబు= ధనుస్సును; త్రుంచి= తెగగొట్టి; తదీయ+అంగము= అతడి శరీరం; నొంచినన్= నొప్పి కలిగేటట్లుచేయగా; వివశుఁడు+ఐ= వశం తప్పి; చేడ్పడ్డచోన్= బాధను పొందగా; సూతుఁడు= సారథి; ఉద్గత= బయలుదేరిన; భీతిన్= భయంతో; రథమున్= రథాన్ని; తద్= ఆ భీష్ముడియొక్క; ప్రాణ= ప్రాణాలయొక్క; రక్షా+అర్థి+ఐ= రక్షణను కోరినవాడై; తొలఁగంగన్= తొలగేటట్లు; తోలెన్= తోలాడు.

తాత్పర్యం: భీష్ముడిపై బాణాలు వేయగా భీష్ముడు ఆ సమయంలో కోపంతో దివ్యాస్త్రా లెన్నో వేశాడు. అపుడు ఆ దివ్యపురుషుడు భీష్ముడి ధనుస్సు విరిచి, అతడి శరీరానికి నొప్పికలిగేటట్లు కొట్టగా, భీష్ముడు వశం తప్పినవాడై బాధపడగా సారథి అతడి ప్రాణరక్షణకై రథాన్ని మరొకచోటికి తప్పించాడు.

క. తమ తమ బలములతో ని । ట్లమిత భుజావీర్యులైన యా రథికవరుల్
గ్రమమునఁ దలపడి యోడిన । సమరవిహారమునఁ దనివి సనక యతండున్. 295

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అమిత= మితంలేని; భుజా వీర్యులు+ఐన= భుజపరాక్రమం కల; ఆ రథికవరుల్= ఆ రథిక శ్రేష్ఠులు; తమతమ బలములతోన్= వారి వారి సేనలతో; క్రమమునన్= వరుసగా; తలపడి= ఎదిరించి; ఓడినన్= ఓడిపోగా; అతండున్= ఆ దివ్యవీరుడుకూడ; సమరవిహారమునన్= యుద్ధమందు విహరించటంలో; తనివి+చనక= తృప్తిపొందక.

తాత్పర్యం: అమితమైన పరాక్రమం కల ఆ రథికశ్రేష్ఠులు వారివారి సేనలతో వరుసగా ఎదుర్కొని ఓడిపోగా, ఆ దివ్యపురుషుడు యుద్ధవిహారంలో ఇంకా తనివితీరక.

మ. ధరణీనాథుఁడు దానుఁ దమ్ములును దుర్దాంతోద్ధతిం గూడి మో
హర మత్యూర్జితభంగి నేర్చికొని యుద్యద్విక్రమం బొప్ప బం
ధుర సంరంభత నున్నఁ జూచి బలవద్దోఃస్తంభలీలా భయం
కర రేఖా వలమానచాపుఁ డయి వీఁకం దాఁకె నాసేనతోన్. 296

ప్రతిపదార్థం: ధరణీనాథుఁడు= రాజు - దుర్యోధనుడు; తాను= అతడును; తమ్ములును= అతడి తమ్ములును; కూడి= కలిసికొని; దుర్దాంత= అణచలేని; ఉద్ధతిన్= గర్వంతో; అతి+ఊర్జిత భంగిన్= బాగా బలంకలిగినరీతిలో; మోహరము= వ్యూహమును; ఏర్చికొని= తయారుచేసి; ఉద్యత్+విక్రమంబు= అతిశయిస్తున్న పరాక్రమం; ఒప్పన్= ప్రకాశించగా; బంధుర= రమ్యమైన; సంరంభతన్= హడావిడితో; ఉన్నన్= ఉండగా; చూచి= కలయజూచి; బలవత్= బలంకల; దోఃస్తంభ= స్తంభాలవంటి బాహువులయొక్క; లీలా= విలాసంతో; భయంకర రేఖా= భీతిగొల్పేరీతిగా; వలమాన= త్రిప్పుతున్నట్టి; చాపుఁడు+అయి= ధనుస్సుకలవాడై; ఆ సేనతోన్= ఆ కౌరవసేనతో; వీఁకన్= ఉత్సాహంతో; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడూ, అతని తమ్ములూ కలిసి చాలా గొప్పగా ఎవ్వరూ జయించలేని రీతిలో ఒక వ్యూహం మోహరించుకొనగా ఇతడు తన భుజబల విలాసంతో ధనుస్సును చిత్రంగా త్రిప్పుతూ ఆ సేనతో ఢీకొన్నాడు.

క. కౌరవపతి యనుజన్ముల । దూరమునన్ విశిఖనిహతిఁ దొలఁగ జడియుచుం
జేరి వికర్ణునికరి నొక । నారసమునఁ గూల్చి కదిసి నరపతి నేసెన్. 297

ప్రతిపదార్థం: కౌరవపతి= దుర్యోధనుడి యొక్క; అనుజన్ములన్= తమ్ములను; దూరమునన్= దూరంగా; విశిఖ నిహతిన్= బాణపు దెబ్బతో; తొలఁగన్= తొలగేటట్లుగా; జడియుచున్= త్రోయుచు; చేరి= సమీపించి; వికర్ణుని కరిన్= వికర్ణుడి ఏనుగును; ఒక నారసమునన్= ఒక బాణంతో; కూల్చి= చంపి; కదిసి= సమీపించి; నరపతిన్= దుర్యోధనుడిని; ఏసెన్= బాణాలతో నొప్పించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడి తమ్ములను దూరంనుండే బాణపుదెబ్బలకు హడలిపోయి పారిపోయేటట్లుగా కొట్టి, వికర్ణుడి ఏనుగును ఒక బాణంతో చంపి, దుర్యోధనుడు నొచ్చేటట్లుగా బాణాలు వేశాడు.

తే. రాజు నొచ్చిన విఱిగిరి రథికవరులు । విభుఁడు దోడన తిరిగె, నవ్వీరుఁ; డపుడు
దోలి యా చిక్కుమూఁకలతోడఁ గూడ । నతని దవ్వుల నడవికి నడిచి మగిడె. 298

ప్రతిపదార్థం: రాజు= దుర్యోధనుడు; నొచ్చినన్= బాధపడగా; రథికవరులు= రథిక శ్రేష్ఠులు; విఱిగిరి= వెనుదిరిగిరి; విభుఁడు= దుర్యోధనుడు; తోడన్+అ= వెంటనే; తిరిగెన్= వెనుదిరిగాడు; ఆ+వీరుఁడు= ఆ దివ్యపురుషుడు; అపుడు= ఆ సమయంలో; తోలి= పారద్రోలి; ఆ చిక్కుమూఁకలతోడన్+కూడన్= ఆ మిగిలిన సేనలతో కూడా; అతనిన్= ఆ దుర్యోధనుడిని; దవ్వులన్= దూరంగా; అడవికిన్= అడవిలోనికి; అడిచి= పంపించి; మగిడెన్= మరలాడు.

తాత్పర్యం: రాజుకు దెబ్బతగలటంతో రథికులందరూ వెనుదిరిగారు. వెంటనే రాజు వెనుదిరిగాడు. ఆ దివ్యపురుషుడు అప్పుడు మిగిలిన సేనతో సహా అతడిని చాలదూరం తరిమి అడవిలోనికి పంపించి తిరిగివచ్చాడు.

వ. ఇది యమ్మహాపురుషు చేసిన విధం' బనిన విని యచ్చెరువంది విరాటుండు. 299

ప్రతిపదార్థం: ఆ+మహాపురుషు= ఆ దివ్యపురుషునియొక్క; చేసిన విధంబు= చేసినరీతి; ఇది= ఈ విధమైనది; అనినన్= అనగా; విని; అచ్చెరువు= ఆశ్చర్యం; అంది= పొంది; విరాటుండు= విరాటరాజు.

తాత్పర్యం: ఆ దివ్యపురుషుడు ఈ విధంగా చేశాడు' అనటంతో విని విరాటరాజు ఆశ్చర్యంపొంది.

ఆ. 'ఆతఁ డెవ్వఁ డొక్కొ! యమ్మహాత్మునిఁ గనుం । గొనఁగఁ గౌఁగిలింప వినయ మొప్ప
నర్ఘ్యపాద్యవిధుల నర్చింప భక్తిసం । యుక్తి నెపుడుఁ గొలిచి యుండవలయు. 300

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ దివ్యపురుషుడు; ఎవ్వఁడు+ఒక్కొ= ఎవడోకదా; ఆ+మహాత్మునిన్= ఆ మహాత్ముని; కనుంగొనఁగన్= చూడగా; కౌఁగిలింపన్= కౌగిలించుకొనగా; వినయము+ఒప్పన్= వినయం ఒప్పారేటట్లుగా; అర్ఘ్య= చేతులు కడిగికొనే నీరు; పాద్య= పాదాలు కడిగికొనే నీరు; విధులన్= ఇట్టి విధులతో; అర్చింపన్= పూజించగా; భక్తి సంయుక్తిన్= భక్తితో కూడి; ఎపుడున్= ఎప్పుడును; కొలిచి+ఉండన్+వలయున్= సేవిస్తూ ఉండవలెను.

తాత్పర్యం: 'అతడు ఎవడోకాని ఆ మహాత్ముడు కనిపిస్తే కౌగిలించుకొనాలి, వినయంగా అర్ఘ్యపాద్యాదు లిచ్చి పూజించాలి. భక్తితో ఎప్పుడూ ఆయనను కొలవాలి.

క. **ఎచ్చోట నున్నవాఁ డతఁ? డిచ్చోటికి నేల రాఁడొ! యిప్పు?' డనుడుఁ దా**
నచ్చట నంతర్హితుఁడై। యిచ్చఁ జనియెఁ; దోఁచు నేఁటి యెల్లిటిలోనన్. **301**

ప్రతిపదార్థం: అతఁడు= ఆ దివ్యపురుషుడు; ఏ+చోటన్+ఉన్నవాఁడు?= ఎక్కడ ఉన్నాడు?; ఈ+చోటికిన్= ఇక్కడికి; ఇప్పుడు; ఏల రాఁడొ= ఎందుకు రాడో!; అనుడున్= అనగా; తాన్= అతడు; అచ్చటన్= ఆ యుద్ధభూమిఅందే; అంతర్హితుఁడు+ఐ= అంతర్ధానమైనవాడై; ఇచ్చన్= తన ఇష్టం వచ్చినట్లు; చనియెన్= వెళ్ళాడు; నేఁటి యెల్లిటిలోనన్= ఈ రోజు, రేపటిలో; తోఁచున్= కనిపిస్తాడు.

తాత్పర్యం: అతడు ఎక్కడ ఉన్నాడు? ఇప్పుడు ఇక్కడికి ఎందుకు రాడు?' అని విరాటుడు అనగా ఉత్తరుడు 'అతడు అక్కడనే అంతర్ధానమై తన ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళాడు. ఈ రోజుకాని, రేపుకాని ఇక్కడ కనిపించవచ్చును.

ఉ. **దేవకుమారకుండ యగుఁ దేజము చందము చూడ; నాతఁ డీ**
గోవులఁ గ్రమ్మఱించుటకుఁ గూడినయంతియ కాదు; నాకు సం
భావన సేయు వత్సలతభంగులఁ దా మనవంశ మంతయుం
గావను బ్రోవనుం దలఁపు గల్గుట దెల్లము సేసె నెంతయున్'. **302**

ప్రతిపదార్థం: తేజము చందము= తేజస్సుయొక్క రీతి; చూడన్= చూడగా; దేవకుమారకుండు+అ= దేవతల కుమారుడే; అగున్= అగును; ఆతఁడు= ఆ దివ్యపురుషుడు; ఈ గోవులన్= వారు తోలుకొనిపోయే గోవులను; క్రమ్మఱించుటకున్= మరల్చటానికి; కూడిన+అంతియ కాదు= నాతో చేరినవాడు మాత్రమే కాదు; నాకున్= ఉత్తరునకు; సంభావన+చేయు= గౌరవించు; వత్సలత= వాత్సల్యం యొక్క; భంగులన్= రీతులతో; తాన్= తాను; మన వంశము= మన వంశమును; అంతయున్= అంతను; కావనున్+ప్రోవనున్= రక్షించి పాలించటానికి; తలఁపు= అభిప్రాయం; కల్గుట= ఉండటం; ఎంతయున్= మిక్కిలిగా; తెల్లము+చేసెన్= స్పష్టం చేశాడు.

తాత్పర్యం: అతని తేజస్సుయొక్క రీతి చూస్తే దేవతల కుమారుడే అనిపిస్తుంది. అతడు ఈ గోవులను మరల్చటం కొరకేకాదు వచ్చింది, నా మీద ఎంతో ఆదరం, వాత్సల్యం చూసి, మన వంశాన్ని అంతటిని రక్షించే తలంపు తనకు ఉన్నదని ఎంతగానో స్పష్టంచేశాడు.'

వ. **అని చెప్పి యుత్తరుం డతనిం బ్రమోదాయత్తచిత్తుం జేసె; నట్టి సమయంబునఁ గౌంతేయాగ్రజుండు ముఖ ప్రాంతంబు పై చీర చెఱంగునం బొదివికొని ధనంజయునిఁ జక్కం జూడక యుండె; విరాటుండు కిరీటి పరాక్రమంబు క్రమంబున నిట్లు దనతనయునివలన వినియునుం దెలియక యెప్పటి నపుంసకత్వ బుద్ధితోడన సంభావించి పోవం బనిచిన, బృహన్నలయును 'జతురంబుగాఁ బలికి; తిదియ తెలుపు తెఱంగు; ధర్మనందనునకు నింతకు మిక్కిలి యెఱింగింపకుండునది' యని వైరాటితో నల్లన చెప్పచుం జనియె; నజ్జననాయకుండును గంకునిం బొమ్మని, యుచితపరివారపరివృతుండయి భూమింజయు**

నంతిపురంబునకుం దోడ్కొని యరిగి సుదేష్ణాసందర్శన సమాచరణంబు నడపి, యతం డడుగఁ ద్రిగర్తపతి నోర్చిన తెఱం గెఱింగించె; నట నరుండు నాట్యశాలకుం బోయి. 303

ప్రతిపదార్థం: అనిచెప్పి= ఈ విధంగా చెప్పి; ఉత్తరుండు= ఉత్తరుడు; అతనిన్= విరాటుని; ప్రమోద+ఆయత్త= సంతోషానికి అధీనమైన; చిత్తున్= మనస్సు కలవాడినిగా; చేసెన్= చేశాడు; అట్టి సమయంబునన్= అటువంటి సమయంలో; కౌంతేయ+అగ్రజుండు= ధర్మరాజు; ముఖప్రాంతంబుపైన్= ముఖం దాపులను; చీర చెఱంగునన్= గుడ్డ చివరతో; పొదివికొని= కప్పుకొని; ధనంజయునిన్= అర్జునుడిని; చక్కన్= సూటిగా; చూడక+ఉండెన్= చూడకుండా ఉండిపోయాడు; విరాటుండు= విరాటరాజు; కిరీటి పరాక్రమంబు= అర్జునుడి పరాక్రమాన్ని; క్రమంబునన్= వరుసగా; ఇట్లు= ఈ రీతిగా; తన తనయునివలనన్= తన కొడుకు ద్వారా; వినియున్= వినికూడా; తెలియక= తెలిసికొనలేక; ఎప్పటి= మునుపటి; నపుంసకత్వ బుద్ధితోడన్+అ= పేడియనే జ్ఞానంతోనే; సంభావించి= గౌరవించి; పోవన్+పనిచినన్= వెళ్ళుటకు అనుమతి ఇయ్యగా; బృహన్నలయును= బృహన్నలకూడా; చతురంబుగాన్= నేర్పుగా; పలికితి(వి)= చెప్పితివి; ఇది+అ తెలుపు తెఱంగు= ఇదే తెలుపటానికి తగినరీతి; ధర్మనందనునకున్= ధర్మరాజునకు కూడా; ఇంతకున్ మిక్కిలి= ఇంతకంటె ఎక్కువగా; ఎఱింగింపక+ఉండునది= చెప్పకూడదు; అని; వైరాటితోన్= ఉత్తరుడితో; అల్లనన్= మెల్లగా; చెప్పుచున్= పలుకుతూ; చనియెన్= వెళ్ళాడు; ఆ+జన నాయకుండును= ఆ విరాటరాజుకూడా; కంకునిన్= కంకుభట్టును; పొమ్ము+అని= వెళ్ళుమని; ఉచిత= తగిన; పరివార= భటులతో; పరివృతుండు+అయి= కూడినవాడై; భూమింజయున్= ఉత్తరుడిని; అంతిపురంబునకున్= అంతఃపురానికి; తోడ్కొని అరిగి= వెంటబెట్టుకొనివెళ్ళి; సుదేష్ణా= సుదేష్ణయొక్క; సందర్శన సమాచరణంబున్= దర్శనం చేసే క్రియను; నడపి= నిర్వర్తించి; అతండు= ఉత్తరుడు; అడుగన్= అడుగగా; త్రిగర్తపతిన్= త్రిగర్తదేశ రాజును; ఓర్చినతెఱంగు= ఓడించిన విధమును; ఎఱింగించెన్= తెలిపాడు; అటన్= అక్కడ; నరుండు= అర్జునుడు; నాట్యశాలకున్= నాట్యశాలకు; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: విరాటరాజు అడిగిన దానికి ఉత్తరుడు ఆ విధంగా చెప్పి సంతోషాన్ని కలిగించాడు. అప్పుడు ధర్మరాజు ముఖాన్ని గుడ్డతో కప్పుకొని, అర్జునుడిని సూటిగా చూడకుండానే ఉండిపోయాడు. విరాటరాజు అర్జునుడి పరాక్రమం ఉత్తరుడు ఎంత చెప్పినా (అది అక్కడి బృహన్నల పరాక్రమమని) తెలిసికొనలేకపోయాడు. బృహన్నల మునుపటి 'పేడి' వలెనే భావించి వెళ్ళుమని అనుమతించాడు. వెళ్ళుతూ అర్జునుడు ఉత్తరుడితో మెల్లగా ఇట్లా అన్నాడు - 'నీవు చాలా నిపుణంగా మాట్లాడావు. నీవు చెప్పవలసిన పద్ధతి ఇదే. ధర్మరాజుతో కూడా ఇంతకన్న ఎక్కువగా చెప్పకూడదు'- అని మెల్లగా మాట్లాడుతూ వెళ్ళాడు. విరాటుడు ఉత్తరుడిని తీసికొని, కొద్ది పరివారంతో సుదేష్ణ అంతఃపురానికి వెళ్ళి ఆవిడను చూచి, ఉత్తరుడు అడుగగా త్రిగర్త దేశాధిపతిని ఎట్లా జయించాడో చెప్పాడు. అక్కడ బృహన్నల నాట్యశాలకు వెళ్ళి.

అర్జునుఁ డుత్తరకు బొమ్మపొత్తికలుగాఁ గురువీరుల శిరోంబరంబు లిచ్చుట

తే. **చెలులుఁ దానును నుత్తర యెలమిఁ దన్నుఁ। గాంచుటయుఁ బ్రీతి యెసలార గారవించి**
'బొమ్మపొత్తిక లడిగితి కొమ్ము! యింద'। యనుచు నిచ్చెఁ దాఁ దెచ్చిన యంబరములు. 304

ప్రతిపదార్థం: ఉత్తర= ఉత్తరాకుమారి; చెలులున్= చెలికత్తెలును; తానును= తానుకూడా; ఎలమిన్= సంతోషంతో; తన్నున్= బృహన్నలను; కాంచుటయున్= చూడగా; ప్రీతి= ఇష్టం; ఎసలారన్= అతిశయించగా; గారవించి= గౌరవించి; బొమ్మపొత్తికలు= బొమ్మలకు అలంకరించే వస్త్రాలు; అడిగితి(వి)= అడిగావు; ఇందము= ఇదిగో; కొమ్ము!= తీసికొనుమా!; అనుచున్= అని పలుకుతూ; తాన్= బృహన్నల; తెచ్చిన అంబరములు= తెచ్చిన వస్త్రాలను; ఇచ్చెన్= ఇచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఉత్తర చెలికత్తెలూ తానూ కలిసి బృహన్నలను చూడటానికి రాగా, అతడు ప్రీతితో గౌరవించి, 'నేను యుద్ధానికి వెళ్ళేటప్పుడు బొమ్మపొత్తికలు తెమ్మన్నావు కదా! తెచ్చాను. ఇంద ఇవిగో, తీసికొమ్ము' అని తాను తెచ్చిన తలపాగ గుడ్డలు ఆమెకు ఇచ్చాడు.

విశేషం: ఇంద, ఇందము-అనే దేశిపదాలు ఇదిగో తీసికొమ్ము అనే అర్థంలో అప్యాయంగా అనేవి. ఇంద అనే పదం తమిళంలో కూడా ఇదే అర్థంలో ఉన్నది. కాబట్టి కొమ్మ! ఇంద= అంటే ఓ యువతీ! ఇదిగో తీసికో! అని కూడా అర్థం చెప్పవచ్చును. మూలంలో బృహన్నల విరాటుడి అనుమతితో బొమ్మపొత్తికలను ఉత్తరకు బహూకరించినట్లు ఉన్నది. ఆ కథనానికి ఒక ప్రయోజనం ఉన్నది. శత్రువీరుల తలపాగలు విజయ చిహ్నాలు. వాటిని విరాటునికి తెలిసేటట్లు ప్రకటించటం అందులోని గడుసుదనం. తిక్కన ఈ చర్యను మార్చాడు. బృహన్నలకూ ఉత్తరకూ నడుమ ఉన్న గురుశిష్యవాత్సల్య సంబంధానికి చిహ్నంగా మాత్రమే భావించాడు. మూలంలోనిది రాజకీయం; తిక్కన రచనలోనిది ఆత్మీయం. (సంపా.)

వ. ఇవ్విధంబునఁ గృతకృత్యుం డయి యథాపూర్వంబుగా మజ్జన భోజనంబులు సలిపి, ధర్మతనయు నివాసంబునం దేకాంత స్థలంబునఁ దా రేవురును ద్రౌపదియును గూడఁబడునట్టి తెఱంగు సంఘటించి, సమాగమ సముచిత ప్రకారంబు నడపి, గోగణ నివర్తనంబును రణప్రవర్తనంబును నన్యోన్య విదితంబులైన యనంతరంబ యగ్రజు నుద్దేశించి బీభత్సుండు భీమసేనున కిట్లనియె. 305

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; కృత్యకృత్యుండు+అయి= అర్జునుడు చేయవలసిన పని చేసినవాడై; యథాపూర్వంబుగాన్= పూర్వంవలెనే; మజ్జన= స్నానం; భోజనంబులు= భోజనం చేయటం; చలిపి= చేసి; ధర్మతనయు నివాసంబునందున్= ధర్మరాజు నివాసంలో; ఏకాంత స్థలంబునన్= రహస్య స్థలంలో; తారు= తాము-పాండవులు; ఏవురును= అయిదుగురును; ద్రౌపదియునున్= ద్రౌపదికూడ; కూడఁబడునట్టి తెఱంగు= కలిసికొనే విధం; సంఘటించి= సమకూర్చి; సమాగమ= సమావేశానికి; సముచిత ప్రకారంబు= తగిన రీతి; నడపి= చేసి; గోగణ= గోవుల మందలయొక్క; నివర్తనంబును= మరలింపున్నూ; రణప్రవర్తనంబును= యుద్ధంచేసిన ప్రకారమున్నూ; అన్యోన్య విదితంబులు+ఐన= పరస్పరం ఒకరి కొకరికి తెలుపుకొనిన; అనంతరంబు+అ= తర్వాతే; అగ్రజున్+ఉద్దేశించి= ధర్మరాజు విషయమై; బీభత్సుండు= అర్జునుడు; భీమసేనునకున్= భీముడితో; ఇట్లు= చెప్పబోయే ప్రకారంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఈ రీతిగా చేయవలసిన పనినంతా అర్జునుడు చేసేసినవాడై, పూర్వంవలె స్నానం, భోజనం చేసి, ధర్మరాజు నివాసంలోని ఒక రహస్యస్థలంలో తాము, పాండవులు ఐదుగురునూ, ద్రౌపదీ కలిసికొనే విధానాన్ని సమకూర్చి, సమావేశ మర్యాదలు పాటించి, ఉత్తర గోగ్రహణంలో ఆవులను మరల్చిన విధానాన్నీ, దక్షిణ గోగ్రహణంలో యుద్ధం జరిగిన పద్ధతినీ పరస్పరం చెప్పుకొన్నారు. ఆ తరువాత అర్జునుడు ధర్మరాజును గురించి భీముడితో ఇట్లా అడిగాడు.

విశేషం: 305 నుండి 313వ పద్యం వరకు ఉన్న కథాభాగం అమూలకం.

క. 'మొగ మొప్పదు నా దెస నీ। జగతీనాథునకు; నే విచారించియునుం
దగ దీనికిఁ గారణ మిది। యగు నని యేర్పఱుపనేరనయ్యెద నెట్లున్.' 306

ప్రతిపదార్థం: ఈ జగతీనాథునకున్= ఈ ధర్మరాజునకు; నా దెసన్= నా వైపు; మొగము= ముఖం కనపరచటం; ఒప్పదు= ఇష్టంగా లేదు; ఏన్= నేను; విచారించియునున్= ఆలోచించికూడా; దీనికిన్= ఇట్లా చేయటానికి; తగన్= తగినటువంటి; కారణం= హేతువు; ఇది అగును+అని= ఇది కాగలదని; ఎట్లున్= ఏ రీతిగాను; ఏర్పఱుప నేరన్+అయ్యెదన్= నిర్ణయించలేకపోతున్నాను.

తాత్పర్యం: 'ఈ మన అన్నగారు నా వైపు సరిగా మొగమెత్తి చూడనే లేదు. దీనికి కారణం ఏమి అయి ఉంటుందా? అని ఎంత ఆలోచించినా దీనికి కారణ మిది అని నిర్ణయించలేకపోతున్నాను.'

వ. అనిన విని యుధిష్ఠిరుం డతని కిట్లనియె. 307

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అతనికిన్= అర్జునుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

క. 'ఒం డేమియు లేదు; విరా । టుం డాత్మతనూజుఁ బొగడుడును దుర్దమ దో
ర్దండత గల్గు బృహన్నల । యుండఁ గొఱఁత యేమి పగఱ నోర్చుట కంటిన్. 308

ప్రతిపదార్థం: ఒండు= వేరు కారణం; ఏమియున్= ఏదియును; లేదు; విరాటుండు= విరాటరాజు; ఆత్మతనూజున్= తన కొడుకును; పొగడుడును= పొగడగా; దుర్దమ= అణచలేని; దోర్దండత= భుజబలం; కల్గు= కల్గిన; బృహన్నల ఉండన్= బృహన్నల ఉండగా; పగఱన్= శత్రువులను; ఓర్చుటకున్= ఓడించటానికి; కొఱఁత= లోటు; ఏమి= ఏమిటి; అంటిన్= అన్నాను.

తాత్పర్యం: 'ఆఁ మరేమీ లేదు. ఆ విరాటుడు తన కొడుకును పొగడుతూ ఉంటే, మహాబలశాలి బృహన్నల ఉండగా శత్రువులను జయించటానికి లోటేమిటి? అన్నాను.

ఆ. అనినఁ బేడిఁ బొగడె దని యవివేకి యై । కోప మడర సారెగొని యతండు
వ్రేసె నెత్తు రపుడు వెడలఁబోయినఁ జీరఁ । గప్పికొంటి నీవు గానకుండ.' 309

ప్రతిపదార్థం: అనినన్= నేను అట్లనగా; పేడిన్= నపుంసకుని; పొగడెదు= పొగడుతున్నావు; అని= పలికి; అవివేకి+ఐ= వివేకం లేనివాడై; అతండు= విరాటుడు; కోపము+అడరన్= కోపం ఎక్కువకాగా; సారెన్= పాచికను; కొని= తీసికొని; వ్రేసెన్= కొట్టాడు; అపుడు= ఆ సమయంలో; నెత్తురు; వెడలన్+పోయినన్= కారబోగా; చీరన్= గుడ్డతో; నీవు; కానకుండన్= చూడకుండుటకై; కప్పికొంటిని= కప్పుకొన్నాను.

తాత్పర్యం: అనేసరికి 'పేడిని పొగడుతావా?' అని చేతిలో పాచిక తీసికొని కోపంతో నన్ను కొట్టాడు. దానితో నెత్తురు కారితేను, అది నీ కంటపడకుండా ఉండాలని గుడ్డతో కప్పుకొన్నాను. అంతే.'

క. అని చెప్పి గంటి సూపిన । ననిలతనూభవుఁడు కనలి 'యా దుష్టాత్ముం
దనయాది బంధుయుతముగ । ననిచెద జముప్రోలి' కనియె నంగము వొంగన్. 310

ప్రతిపదార్థం: అని చెప్పి= ఇట్లా పలికి; గంటి= గాయం; చూపినన్= చూపగా; అనిల తనూభవుఁడు= భీముడు; కనలి= కోపించి; ఆ దుష్టాత్మున్= ఆ దుర్మార్గుడిని; తనయ+ఆది= సుతులు మొదలుకొని; బంధుయుతముగన్= బంధువులతో కూడా; జముప్రోలికిన్= యముడి నగరానికి; అనిచెదన్= పంపుతాను అని; అంగము= శరీరం; పొంగన్= కోపంతో ఉబ్బగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని పలికి గాయం చూపించాడు ధర్మరాజు. అది చూచి భీముడు కోపించి, శరీరం పొంగగా 'ఆ దుర్మార్గుడిని తనయులతో బంధువులతో సహా యమలోకానికి పంపించివేస్తాను' అన్నాడు.

వ. కిరీటియుం గోపించి. 311

తాత్పర్యం: అర్జునుడు కూడ కోపగించుకొని.

క. 'తన కొలఁది యెఱుంగని యి । మ్మనుజాధము నిపుడ పట్టి మర్దింపక త
క్కినఁ గాదు; వీని రాజ్యము । నిను నంతయుఁ జేరుఁగా!' కనియె ధర్మజుతోన్. 312

ప్రతిపదార్థం: ధర్మజుతోన్= ధర్మరాజుతో; తనకొలఁది= తన శక్తి; ఎఱుంగని= తెలియని; ఈ+మనుజాధమున్= ఆ మానవాధముడిని; ఇపుడు+అ= ఇప్పుడే; పట్టి= పట్టుకొని; మర్దింపక= చంపకుండా; తక్కినన్= మానినచో; కాదు= కుదురదు; వీని రాజ్యము= ఈ విరాటుని రాజ్యం; అంతయున్= సమస్తమున్నూ; నినున్= నిన్ను; చేరున్+కాక!= చెందుగాక!; అనియెన్= అని పలికాడు.

తాత్పర్యం: అప్పుడు కోపించి అర్జునుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు - 'తన శక్తి ఎంతో తెలియని అధముడు విరాటుడు. వీడిని పట్టి చంపితే కాని రోగం కుదురదు. వీడి రాజ్యం అంతా నీకే చేరుతుంది' అన్నాడు.

చ. అనవుడు నాతఁ డిట్టులను 'నక్కట! యింతకు ముంద రేమియున్
మనల నెఱుంగఁ; డవ్విభుని మాటునఁ బూనిక దీర్చికొంటి; మా
తని కొక యెగ్గు సేఁత యుచితంబె? యెఱింగెడునట్లు గాఁగఁ బో
యినఁ గనియున్ దురుద్ధతి వహించినఁ జూతముగాక పిమ్మటన్.' 313

ప్రతిపదార్థం: అనవుడున్= అనిన తర్వాత; ఆతఁడు= ధర్మరాజు; ఇట్టులు= ఈ రీతిగా; అనున్= అన్నాడు; అక్కట!= అయ్యో!; ఇంతకున్+ముందరః= ఇంతకు పూర్వం; మనలన్= మనలను; ఏమియున్= ఏమీకూడా; ఎఱుంగఁడు= తెలియడు; ఆ+విభుని= ఆ రాజుయొక్క; మాటునన్= చాటున; పూనిక= ప్రతిజ్ఞ; తీర్చికొంటిమి= పూర్తిచేసికొన్నాం; ఆతనికిన్= ఆ రాజుకు; ఒక+ఎగ్గు+చేత= ఒక కీడుచేయటం; ఉచితంబె?= తగునా?; ఎఱింగెడున్+అట్లుకాఁగన్= తెలిసే విధంగా; పోయినన్= మనం వెళ్ళినచో; కనియున్= చూచికూడా; దురుద్ధతి= చెడు గర్వం; వహించినన్= పూని ఉన్నట్లయితే; పిమ్మటన్= తరువాత; చూతముగాక!= చూద్దాంలే!

తాత్పర్యం: అనటంతో ధర్మరాజు అన్నాడు- 'అయ్యో! అతడు మనం ఎవరమో ఎరుగడు కదా! కాక, అతడి దగ్గర చేరి మన ప్రతిజ్ఞ నెరవేర్చుకొన్నాం. అంటే మనం కృతజ్ఞత చూపవలసినవాడు అతడు. అటువంటివాడికి కీడు తలపెట్టటం ఉచితం కాదు. అతడికి మనం ఎవరమో తెలిసేటట్లు వెళ్ళుదాం. అప్పుడు కూడా గర్వానికి పోయాడా అప్పుడు చూద్దాం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి వారల కుందు మాన్పి 'యిది యట్ల కాక యొండు దగునే?' యనుచుఁ దక్కినవారి దెసయుం గనుంగొనిన నెల్లవారు నుపశమించిరి; తదనంతరంబ తమ్ము నెఱింగించు తెఱంగు దలపోసి వారందఱు విరాటు కొలువు కూటంబునకుం బోయి బయలు మెఱసి యుండువారుగా నిశ్చయించి, యా రాత్రి గడపి వేగుటయుం గృతస్నాను లయి పాండుసూనులు సమయ విహితాచారంబులు నడపి యుచిత ప్రకారంబున. 314

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; వారలకుందు= వారల బాధను; మాన్పి= తగ్గించి; ఇది= ఈ పని; అట్ల= అట్లే చేయటం మంచిది; కాక= అట్లాకాకుండా; ఒండు= మరొకరీతిగా - ఆతడిని చంపటం; తగునే?= ఉచితమా?; అనుచున్= అని పలుకుతూ; తక్కిన వారి దెసయున్= మిగతా వారివైపు కూడా; కనుంగొనినన్= చూడగా; ఎల్లవారున్= అందరును; ఉపశమించిరి= శాంతించారు; తదనంతరంబు+అ= అటు తర్వాత; తమ్మున్= తమను; ఎఱింగించు తెఱంగు= తెలియజేసే విధం; తలపోసి= ఆలోచించి; వారు= పాండవులు; అందరున్= అందరును; విరాటు= విరాటుడియొక్క; కొలువుకూటంబునకున్= సభాస్థలికి; పోయి= వెళ్ళి; బయలు మెఱసి= ప్రకటమై; ఉండు వారుగాన్= ఉండేటట్లుగా; నిశ్చయించి= నిశ్చయం చేసికొని; ఆ రాత్రి+కడపి= ఆ రాత్రి గడిపి; వేగుటయున్= తెల్లవారగా; కృతస్నానులు+అయి= స్నానం చేసినవారై; పాండు సూనులు= పాండవులు; సమయ విహిత= ఆ కాలానికి తగిన; ఆచారంబులు= సంధ్యావందనాది నిత్యకృత్యాలు; నడపి= నిర్వర్తించి; ఉచిత ప్రకారంబునన్= తగిన రీతిగా.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా చెప్పి వారి కోపం, తాపం తగ్గించాడు. ఈ పని ఇట్లాగే చెయ్యాలి. అంటే 'ప్రస్తుతానికి క్షమించి, మనం ఎవరమో తెలిశాక కూడా గర్వం చూపితే అప్పుడు చూడవచ్చు'- అన్నదే బాగుంది అని అందరూ అంగీకరించారు. శాంతించారు. ఇక తాము ఎట్లా బయటపడాలి? తాము పాండవుల మని యే రీతిగా తెల్పితే బాగుంటుంది? అని ఆలోచించారు. విరాటుడి కొలువుకూటంలోనికి వెళ్ళి బయటపడటమే మార్గం అని నిశ్చయించుకొన్నారు. రాత్రి గడిచింది. తెల్లవారుజాముననే లేచారు. స్నానాలు సంధ్యావందనాది నిత్యకృత్యాలు సముచితంగా తీర్చికొన్నారు.

క. తెలుపులగు చీరలను బూఁ । తలఁ బువ్వుల నొప్పి రాజతనయానుగుణో
జ్జ్వల మాననీయ వేషము । లలవడఁ గూడుకొని నగరి కరిగిరి ప్రీతిన్. 315

ప్రతిపదార్థం: తెలుపులు+అగు చీరలను= తెల్లని బట్టలతోను; పూఁతలన్= మై పూతలతోను; పువ్వులన్= పువ్వులతోను; ఒప్పి= అందంగా; రాజతనయ= రాజకుమారులకు; అనుగుణ= తగినట్టి; ఉజ్జ్వల= ప్రకాశించే; మాననీయ= గౌరవించదగిన; వేషములు= వస్త్రాది వేషాలు; అలవడన్= సరిపడగా; కూడుకొని= ఆరుగురును కలిసి; ప్రీతిన్= సంతోషంతో; నగరికిన్= రాచనగరుకు; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: తెల్లని వస్త్రాలు, గంధపు పూతలు, పూలమాలలు ధరించారు. రాజకుమారు లనుకొనటానికి తగిన గౌరవాస్పదమైన వేషాలతో ఆరుగురూ కలిసికట్టుగా రాచనగరికి సంతోషంగా వెళ్ళారు.

విశేషం: పాండవులు మూడు రోజుల తరువాత బయలు మెరసినట్లు మూలభారతం చెప్పింది (4.70.1). అజ్ఞాతవాసం పూర్తి అయిన తరువాత, పాండవుల వివరాలు ఉత్తరుడికి తెలిసిన తరువాత, అర్జునుడు తన పేడిరూపాన్ని ఒకసారి ఉపసంహరించుకొన్న తరువాత, వ్రతకాలం పూర్తి అయినదని భీష్మాదులు నిశ్చయించిన తరువాత కాలహరణం వలన సాధించే ప్రయోజన మేమీ లేదని తిక్కన ఈ మార్పు చేసి ఉంటాడు. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. చని ధర్మసుతుఁడు సింహా । సనమున భీమాదు లాత్మసముచిత రుచిరా
సనముల సభాస్థలిం గయి । కొని పంచాగ్నులును బోలెఁ గూర్చున్నంతన్. 316

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; ధర్మసుతుఁడు= ధర్మరాజు; సింహాసనమునన్= సింహాసనం పైన; భీమాదులు= భీముడు మొదలైన తక్కిన నలుగురు అన్నదమ్ములును; ఆత్మసముచిత= తమకు తగిన; రుచిర= ప్రకాశించే; ఆసనములన్= ఆసనములందు; సభాస్థలిన్= కొలువు కూటంలో; కయికొని= అంగీకరించి; పంచ+అగ్నులును పోలెన్= అయిదు అగ్నిహోత్రాల వలె; కూర్చున్నంతన్= కూర్చున్నంతలో.

తాత్పర్యం: ఆ విధంగా వెళ్ళి ధర్మరాజు సింహాసనం మీద కూర్చున్నాడు. తక్కినవారు వారికి తగిన మంచి ఆసనాల మీద కూర్చున్నారు. అలాగ అయిదుగురు అయిదు అగ్నిహోత్రాలవలె కూర్చొనియుండగా, అంతలో.

విశేషం: అలం: ఉపమ. పాండవులు తేజోదీప్తులతో శత్రుభయంకరంగా వెలిగిపోతున్న స్ఫూర్తి పంచాగ్నుల ఉపమానంతో స్ఫురిస్తున్నది. అరణ్య అజ్ఞాతవాసాలు ఒక మహాయజ్ఞం వంటివి. యజ్ఞంలో చెప్పబడే పంచాగ్నులు ఇవి. 1.దక్షిణాగ్ని, 2.గార్హపత్యాగ్ని, 3.ఆహవనీయాగ్ని, 4.సభ్యాగ్ని, 5.ఆవసధాగ్ని, తపస్సులలో పంచాగ్నుల నడుమ నిలిచి చేసే తపస్సు ప్రసిద్ధం. నాలుగు దిక్కులలో నాలుగు అగ్నులు, పైన సూర్యుడు కలిగి పంచాగ్ను లనబడతాయి. ధర్మరాజు సూర్యకల్పుడు. మిగిలినవారు అగ్నితుల్యులని భావించవచ్చును. (సంపా.)

తే. వేడ్కఁ దొడి పూసి కట్టి యవ్విరటుఁ డుత్త । రుండు దోఁ జనుదేరఁ గొల్వుండు బుద్ధి
నచటి కేతెంచి కని విస్మయంబు నొంది । యెల్లిదంబుగఁ దలఁచుచు నిట్టు లనియె. 317

ప్రతిపదార్థం: ఆ+విరటుఁడు= ఆ విరాటరాజు; వేడ్కన్= వేడుకతో; తొడి= భూషణాలు తొడుగుకొని; పూసి= గంధపుపూత పూసికొని; కట్టి= వస్త్రాలు కట్టుకొని; ఉత్తరుండు= ఉత్తరుడు; తోన్= కూడా; చనుదేరన్= రాగా; కొల్వు+ఉండుబుద్ధిన్= కొలువుతీరుద్దామని; అచటికిన్= కొలువుకూటానికి; ఏతెంచి= వచ్చి; కని= అక్కడి దృశ్యం చూచి; విస్మయంబున్= ఆశ్చర్యాన్ని; ఒంది= పొంది; ఎల్లిదంబుగన్= చులకనగా; తలఁచుచున్= అనుకొంటూ; ఇట్టులు= ఈ రీతిగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ విరాటరాజు వేడుకగా ఆభరణాలతో అలంకరించుకొని, గంధపుపూతలు పూసికొని, విలువైన వస్త్రాలు కట్టుకొని, ఉత్తరుడు కలసిరాగా కొలువు తీరుద్దామని కొలువుకు వచ్చాడు. అక్కడి దృశ్యం చూసేసరికి ఆశ్చర్యపడ్డాడు. వారిని చులకనగా తలుస్తూ ఇట్లా అన్నాడు.

క. 'ఇది యేమి కంక! నీ వు । న్మదవృత్తిని శంక దక్కి మా గద్దియపైఁ
బదిలంబుగఁ గూర్చుండితి । వదియునుగా కిపుడు డిగ వహంకారమునన్.' 318

ప్రతిపదార్థం: కంక!= ఓ కంకుభట్టూ!; ఇది+ఏమి?= ఇదేమిటి?; నీవు; ఉన్మదవృత్తినిన్= ఎక్కువ గర్వం కల్గిన రీతితో; శంక తక్కి= జంకులేకుండా; నా గద్దియపైన్= నా సింహాసనంపై; పదిలంబుగన్= భద్రంగా; కూర్చుండితివి= కూర్చున్నావు; అదియునున్+కాక= అట్లు కూర్చుండటమే కాక; ఇపుడున్= నేను వచ్చిన తరువాత కూడా; అహంకారమునన్= గర్వంతో; డిగవు= పీఠంనుండి దిగవు.

తాత్పర్యం: 'ఇదేమిటి కంకుభట్టూ! సాధువృత్తి కలవాడవు, గర్వంతో నా సింహాసనంపై కూర్చున్నావు. నేను వచ్చినా దిగకుండా అహంకారంతో అట్లాగే కూర్చున్నా వేమిటి?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని మందహాసంబు సేసి సంక్రందన నందనుం డతని కిట్లనియె. 319

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; సంక్రందన నందనుండు= అర్జునుడు; మందహాసంబు+చేసి= చిరునవ్వునవ్వి; అతనికిన్= విరటుడితో; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అనగా విని చిరునవ్వు నవ్వుతూ అర్జునుడు ఇట్లా అన్నాడు.

సీ. 'నడదీవియలు సేసె నగరికి మాణిక్య । మకుటముల్ పూనిన మనుజపతులఁ,
దగునాజ్ఞ సూయాణముగ నొనరించె మం । చిగ నేల నాలుగు చెఱఁగులకును,
బ్రీతార్థిజనుల సచేతన త్యాగ ధ్వ । జములుగా నన్ని దేశముల నిలిపె,
దిక్కులన్నింటను దెలుపారు పూఁత గా । వించె నుజ్జ్వల యశోవిభ్రమంబు,

తే. రాజసూయాధ్వర ప్రవర్తకుఁడు, నిత్య । సత్యభాషా మహావ్రతశాలి, పాండు
రాజ దుగ్ధ పయోనిధిరాజు ధర్మ । రాజు సుమ్ము మత్స్యావనీరమణ! యితఁడు. 320

ప్రతిపదార్థం: మత్స్య+అవనీరమణ!= మత్స్యదేశరాజా-విరాటా!; మకుటముల్= కిరీటములు; పూనిన= ధరించిన; మనుజపతులన్= రాజులను; నగరికిన్= పట్టణానికి; నడదీవియలు= నడుస్తున్న దివ్విటీలుగా; చేసెను= చేశాడు; నేల= భూమిని; నాలుగు చెఱఁగులకును= నాల్గు చివరలకును; తగు+ఆజ్ఞ= తగిన ఆజ్ఞ; సూయాణముగన్= శత్రుభయంకరమైన దండయాత్రగా; మంచిగన్= బాగుగా; ఒనరించెన్= చేశాడు; ప్రీత= ప్రీతిపొందిన; అర్థిజనులన్= యాచకులను; సచేతన= సజీవమైన; త్యాగధ్వజములుగాన్= త్యాగానికి జెండాలుగా-చిహ్నాలుగా; అన్ని దేశములన్= దేశాలన్నింటియందు; నిలిపెన్= నిలిపాడు; ఉజ్జ్వల= ప్రకాశించే; యశోవిభ్రమంబు= కీర్తి విలాసాన్ని; దిక్కులు+అన్నింటను= అన్నిదిక్కులందును; తెలుపారు= తెల్లని; పూఁతన్= పూతగా; కావించెన్= చేశాడు; రాజసూయ+అధ్వర= రాజసూయమనే యజ్ఞాన్ని; ప్రవర్తకుఁడు= చేసినవాడు; నిత్య= ఎల్లపుడు; సత్యభాషా= నిజం మాట్లాడటం అనే; మహావ్రతశాలి= గొప్పవ్రతంతో ప్రకాశించేవాడు; పాండురాజు= పాండురాజనెడి; దుగ్ధపయోనిధి= పాలసముద్రానికి; రాజు= చంద్రుడివంటివాడు; ఇతఁడు= ఈ నీ సింహాసనంపై కూర్చున్న ఇతడు; ధర్మరాజు సుమ్ము!= ధర్మరాజు సుమా!.

తాత్పర్యం: 'విరాటరాజా! ఈ నీ సింహాసనం మీద కూర్చునవాడు ధర్మరాజు సుమా! అత డెట్టివా డంటే-ఆయన నగరంలో కిరీటాలు ధరించిన మహారాజులే నడిచే దివ్వెలు; ఆయన ఇచ్చే ఆజ్ఞలే నేల నాలుగు దిక్కులా చేసే దండయాత్రలు; కోరిన కోర్కెలు తీర్చినందున ప్రీతిపొందిన యాచకులే అన్ని దేశాలలోనూ ఆయన యొక్క త్యాగాన్ని తెలిపే జెండాలు; ఆయన కీర్తితో దిక్కులన్నీ తెల్లగా పూతపూసినట్లు ఉన్నాయి. రాజసూయయాగం చేసినవాడు, నిత్య సత్యవ్రతం కలవాడు, పాండురాజవంశమనే పాలసముద్రంలో ఉదయించిన చంద్రుడు.

విశేషం: 1. అలం: రూపకం, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, యథాసంఖ్యం (క్రమాలంకారం), పరికరాంకురం.

2. అజ్ఞాతవాస వ్రతానంతరం బయలు మెరసిన ధర్మరాజు వర్ణన మిది. తిక్కన సీసపద్యంలో వర్ణించాడు. సామాన్యంగా సీసపద్యంలో మొదటి నాలుగు పాదాలకూ ఎత్తుగీతిలో చెప్పే విశేషాలకూ క్రమాలంకార బంధురంగా అన్వయాన్ని అనుసంధించటం తిక్కన సహజస్వభావం. ఆ విధంగా ఈ పద్యాన్ని అన్వయించుకొనాలి. 'విరాటరాజా! ఇతడు ధర్మరాజు సుమా!' అని నిర్దేశిస్తూ చెప్పిన ఫలితాంశం ఈ పద్య తాత్పర్యం. దానిని చివర చెప్పి కథనంలో, వర్ణనంలో ఉత్కంఠను పోషించటం రచనాశిల్పం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

3. సీస పద్యపాదాలు నాలుగూ ఒక మహాపురుషుడిని పరిచయం చేస్తున్నట్లు అలంకార బంధురంగా, ధ్వని సుందరంగా సాగాయి. నగరితో మొదలై దిక్కుల నన్నింటనూ వ్యాపించిన కీర్తిమూర్తిని వికాసవిస్ఫూర్తితో అర్జునుడు పరిచయం చేస్తున్నాడు. అన్నీ ధ్వనిమయమైన భావ చిత్రాలే. వాటిని రూపొందించటానికి రూపక, ఉత్ప్రేక్ష, అతిశయోక్తులనే అర్థాలంకారాలను ప్రయోగించాడు.

4. మొదటి చరణంలో రూపకోత్ప్రేక్షా స్ఫూర్తి. అతడు - మాణిక్యాలు పొదిగిన మకుటాలు ధరించిన మహారాజులను తన ముంగిట్లో తిరుగుతున్న దివ్వెలుగా చేసినవాడట! వర్ణిస్తున్న అర్జునుడి భావనలో అది రూపకాలంకారం. వినే విరటుడికి అది ఉత్ప్రేక్ష. మహారాజుల చేత సేవలు చేయించుకొనేవాడు చక్రవర్తి. అటువంటివారు షట్చక్రవర్తులున్నారు. వారిలో ఎవరు? వారితో తూలతూగే 'రాజసూయాధ్వర ప్రవర్తకుడు' అతడు. ఎత్తుగీతిలోని మొదటి విశేషణం మొదటి పాదతాత్పర్యంలోని ధ్వని సంకేతం. అయినా అతడు ధర్మరాజు - అనే నిశ్చితజ్ఞానం ఏర్పడదు. విరాటుడు అద్భుతరసమగ్నుడై ఉంటాడు.

5. రెండవ చరణంలో కూడా అదే అలంకార వైభవం. అతడు ఇచ్చే ఆజ్ఞ ఔచిత్యంతో కూడి ఉంటుందట. అది నేల నాలుగు చెరగులకు హితాన్ని చేకూరుస్తుందట. ఆతడి మాట ఎంతమంచిగా ఉన్నా దాని ప్రభావం దండయాత్ర చేసినట్లుగా దడపుట్టిస్తుందట! దానికి కారణం - ధర్మజుడన్నమాట అయి తీరుతుంది కాబట్టి, ఆ మహిమ, అతడికి 'నిత్య సత్య భాషామహావ్రత' శీలం వలన ఏర్పడింది. ఎత్తుగీతిలో రెండవ విశేషణం ఈ సత్యం చెప్పింది. అటువంటి మహిమ గలవారు హరిశ్చంద్రాది మహారాజులున్నారు. వారిలో ఎవరైనా అయి ఉండవచ్చునన్న భావం ఏర్పడే అవకాశం ఉన్నది. ఉత్కంఠ విరాటుడిలో పోషించబడుతూనే ఉన్నది.

6. సీసపద్యపు మూడవపాదంలో కూడా రూపకోత్ప్రేక్షల విన్యాసం అలంకార సౌందర్యం. అర్థించేవారి కోరికలు తీర్చటం ధర్మజుడి జీవితవ్రతం. దానివలన లాభపడిన వారు అన్ని దేశాలలోనూ నిండి ఉన్నారు. వారు అతడి కీర్తికి నడుస్తున్న త్యాగధ్వజాలుగా గోచరిస్తున్నారు. మహాదాత అయిన అతడు శిబిచక్రవర్తి వంటి వారిలో ఎవరై ఉంటారు? అనే అనుమానం ఏర్పడవచ్చును. ఎత్తుగీతిలో పాండుమహారాజనే పాలసముద్రానికి చంద్రుడివంటి వాడని అర్జునుడు పరిచయం చేశాడు. అంతటి కీర్తి ఉన్న పాండురాజును తలదన్నిన కీర్తి కలవాడు పాండురాజుపుత్రుడు అని తెలిసిందే కాని, పాండవులలో ఎవరో బోధపడలేదు. ఉత్కంఠ ఇంకా ఊపిరి పోసుకొంటూనే ఉన్నది.

7. నాలుగవ పాదంలో రూపకాతిశయోక్తి రమణీయంగా అమరింది. అతడి నిర్మలమైన కీర్తి వైభవం దిక్కుల కన్నింటికీ పూసిన తెల్లని పూతగా అమరిందట! దిగంత విశ్రాంత కీర్తి. అతడెవరో ప్రాచీనవ్యక్తి కాడు, పురాణపురుషుడు కాడు, సమకాలీన సమ్రాట్టు. సార్థక నామధేయుడు 'ధర్మరాజు' ఇతడు - అని స్థిరీకరించటమైనది.

8. 'ధర్మరాజు' - అనే పదంలో ఉండే శ్లేషచమత్కారాన్నంతా పద్యంలో పరచి చెప్పిన ఈ వర్ణనం అర్థవ్యక్తి అనే శబ్దార్థ గుణ స్వభావం సుందరం. ఇందులో అర్థవ్యక్తి హేతుత్వం ఉన్నది. వస్తు స్వభావ స్ఫుటత్వం ఉన్నది. అతడు రాజు. రాజైనవాడి మహత్త్వం రాజసూయాధ్వర నిర్వహణంలో నిగ్గుతేలుతుంది. అతడి ఆజ్ఞను రాజులందరూ భయభక్తులతో పాటించినప్పుడు సార్థకమౌతుంది. చంద్రుడైన రాజుకు అమృత ప్రదానం స్వభావం. అందుకే ఈ ధర్మరాజుకు త్యాగరూపమైన దానం సహజ లక్షణం. 'త్యాగేనైకే అమృతత్వ మానశుః' - అన్న సూక్తి ధర్మరాజుపట్ల సార్థకం. రాజు అంటే ప్రకాశించేవాడు. ధర్మరాజు కీర్తితో ప్రకాశించి నలుదిక్కులా కాంతులు నింపేవాడు. అతడు ధర్ముడు. ధర్ముడంటే యముడనీ ధర్మరూపుడనీ అర్థం. ధర్మమంటే దానగుణమని కూడా విశేషం. అందువలననే ధర్మరాజంటే భూతలంలోని రాజులకందరికీ ప్రాణభయం. అర్థులకందరికీ ప్రాణదానం. అందరూ అతడిని కీర్తించేవారే. ఈ విధంగా నామసార్థక్యాన్ని వ్యాఖ్యానించే పద్యమిది. పరికరాంకురాలంకార ప్రకాశం కూడా ప్రస్తుతమౌతున్నది. (సంపా.)

9. ఈ పద్యంలోని రసశిల్పాన్ని గురించి డాక్టర్ పాటిబండ మాధవశర్మగారి మాటలివి- "క్రమక్రమముగా నెక్కి శిఖరము ముట్టిన విరాటుని ఆశ్చర్యము పద్యాంతమందలి 'ఇతఁడు' అన్నమాటను విని, అర్జునుడు వ్రేలుపెట్టి చూపినచోట

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సింహపీఠమున ధర్మరాజును దర్శించినంత పరమాద్భుత రసముగా పరిణమించినది. ప్రతిచరణోపాంత విరామముచే గీత పాదములు ఎదురునడక నడచి యాశ్చర్యమును పోషించుచున్నవి. యతిప్రాసములందు వైచిత్రి లవమేనియు లేని యీ పద్యము శబ్దచ్ఛందోఽలంకార రహితమయ్యు నిర్మాణ సౌష్ఠవముచే పద్య మెట్టి ఫలము నిర్వహింపగలదో నిరూపించుచున్నది. తిక్కనగారి రసవత్కావ్య నిర్మాణ ప్రక్రియకు ఇట్టి నాటకీయ పద్యరచన ఒక ప్రాణము.'' (తిక్కన కవితావైభవం; యువభారతి ప్రచురణ. పుట. 30)

ఉ. ఈతఁ డజాతశత్రుఁడు మహిం దగ దిగ్విజయంబు సేసె, వి
ద్యాతిశయార్థి వాసవుమహాసన మైనను నెక్క నర్హుఁ డు
ద్ద్యోతితమూర్తి కౌరవకులోద్వహుఁ, డార్యనికాయ సంతత
ఖ్యాతచరిత్రుఁ డీచిఱుత గద్దియకుం దగఁడే నరేశ్వరా!' 321

ప్రతిపదార్థం: నర+ఈశ్వరా!= విరాటరాజా!; ఈతఁడు= ఈ కూర్చున్నవాడు; అజాతశత్రుఁడు= ధర్మరాజు; మహిన్= భూమండలమున; తగన్= తగినట్లుగా; దిక్+విజయంబు= దిక్కులన్నిటిని జయించుటను; చేసెన్= చేశాడు; విద్యా+అతిశయ+అర్థి= విద్యయొక్క వికాసాన్ని కోరేవాడు; వాసవు= దేవేంద్రుడి యొక్క; మహా+ఆసనము+ఐనను= సింహాసనమునైనను; ఎక్కన్= అధిష్ఠించుటకు; అర్హుఁడు= తగినవాడు; ఉద్ద్యోతితమూర్తి= ప్రకాశించెడి స్వరూపం కలవాడు; కౌరవకుల= కురు చక్రవర్తియొక్క కులమును; ఉద్వహుఁడు= ఉద్ధరించినవాడు; ఆర్యనికాయ= సజ్జనుల సముదాయంలో; సంతత= ఎల్లప్పుడును; ఖ్యాత= ప్రఖ్యాతికల; చరిత్రుఁడు= నడవడి కలవాడు; ఈ చిఱుత గద్దియకున్= ఈ చిన్న సింహాసనానికి; తగఁడే?= కూర్చుండ తగడా?

తాత్పర్యం: ఓ విరాటరాజా! ఇత డెవ రనుకొన్నావు? అజాతశత్రువు! భూమండలం అంతా దిగ్విజయం చేశాడు. విద్యావంతుడు, దేవేంద్రుడి సింహాసనమైనా అధిష్ఠించటానికి అర్హుడు. ప్రకాశమానమైన రూపం కలవాడు, కౌరవకుల శ్రేష్ఠుడు, సజ్జనులలో ఖ్యాతిగన్నవాడు ఈ చిన్నసింహాసనం ఎక్కటానికి తగడా?'

విశేషం: 1. అలం: ఉదాత్తం, కావ్యలింగం. "ఉదాత్త మృద్ధిశ్చరితం శ్లాఘ్యం వాన్యోపలక్షణమ్''. శ్లాఘనీయమైన సమృద్ధిని గాని, మహాపురుషుని చరితం గాని ఉపలక్షణంగా వర్ణిస్తే ఉదాత్తాలంకారం. "సమర్థనీయస్యార్థస్య కావ్యలింగం సమర్థనమ్''. ఈ పద్యంలో వర్ణ్యవస్తువు ధర్మజుడి ఉద్దాత్త శీలం. ఇందులో సమర్థనీయాంశం - అంతటి 'ఖ్యాత చరిత్రుడు ఈ చిఱుత గద్దియకు తగడా?'

2. ఈ పద్యంలో ప్రతిపదం, వాక్యం సార్థకం. (1) ఈతడు అజాతశత్రుడు. అంటే ఎవరి యందూ శత్రుభావం లేనివాడని భావం. ఆ గద్దెమీద కూర్చున్నవాడు మిత్రుడే కాని, శత్రువు కాడని అర్థం. (2) అతడు భూమిపై దిగ్విజయం చేసినవాడు- అందువలన రాజులందరి నమస్సు లందుకొనినవాడు. వారి సింహాసనాల మీద కూర్చుండే అధికారమున్నవాడు. రాజులకే రాజు అయినవాడు సామంతరాజు కూర్చుండే గద్దెపై కూర్చుండటానికి అభ్యంతరం ఉండదు. (3) ఉన్మదవృత్తి, అహంకారం- అనే గుణాలవలన కంకుడు తన గద్దెనెక్కి కూర్చున్నాడని విరాటుడి అభియోగం. ఆ కూర్చున్నవాడు విద్యాతిశయం చేత వినయగుణ సంపన్నుడు, ఉచితజ్ఞుడు, వివేకధనుడు కాబట్టి సంస్కారవంతుడనీ, విజ్ఞత వలననే తెలిసికొనగలిగిన విద్వాంసుడనీ పలికి, విరాటుడికంటె విజ్ఞుడైన ధర్మరాజు ఆ చిరుగద్దెకు మించిన పండితుడని పార్థుడు పలికాడు. (4) అతడు త్రిలోకాధిపతి అయిన ఇంద్రుడి సింహాసనం ఎక్కగలవాడట! అర్జునుడు ఇంద్రుడి అర్ధ సింహాసనం ఎక్కాడు. ధర్మజుడు నిండు సింహాసనం ఎక్కగలిగిన వాడని ధ్వని. అటువంటి ధర్మరాజుకు మత్స్యరాజ్య సింహాసనం చిరుగద్దెయే ఔతుందనటంలో ఆశ్చర్యం లేదు. (5) ప్రకాశంలో, వంశగౌరవంలో, ఉత్తమ చరిత్రంలో-సమకాలీన ప్రభువులలో

ఆదర్శప్రాయుడని మిగిలిన మూడు విశేషణాలూ చెప్పుతున్నాయి. మరి ఈ చిరుతగద్దెపై కూర్చున్నవాడు ఒకప్పుడు సామ్రాజ్య సింహాసనంపై కూర్చున్నవాడు. ఇకముందు కూర్చొనదగినవాడు. ఆ అర్హతను తన యోగ్యతతో పొందినవాడు. దాని నెరిగినవాడెవడైనా ధర్మజుడు ఈ గద్దెమీద కూర్చొనటాన్ని అంగీకరిస్తాడని భావం.

3. ధర్మజుడే ఈ సింహాసనం మీద కూర్చుండ దగినవాడని విరాటుడికి వ్యంగ్యమైన హెచ్చరిక! ఒకప్పటి ధర్మజుడి హితుడు, సామంతుడు విరాటుడు. ధర్మజుడు బయలుమెరసిన తరువాత ఆ గద్దెకంటె పెద్దగద్దె ఆ నగరంలో లేదు. అందువలన దానిమీద కూర్చున్నాడు. ఒకవేళ ఆ సత్యాన్ని గుర్తించకపోతే ఆ గద్దెను తనదే చేసికొనగలడు. అయినా, అది ఆయనకు చిన్నగద్దెయే. అతడు దిగ్విజయ సార్వభౌముడైనా విద్యావంతుడు. అజాతశత్రువు- ఈ సంగతి గమనించు మనే వ్యంగ్యధిక్కారం కూడా ఈ ప్రశంసలో అంతర్వాహినిగా గోచరిస్తుంది.

4. 'విద్యాతిశయార్థి' - అనే పాఠానికి 'వీర్యాతిశయార్థి' - అనే పాఠాంతరం ఉన్నది. ఈ సందర్భంలో దిగ్విజయం చేసినవాడు సహజంగా వీర్యాతిశయార్థి అయి ఉంటాడు. అయితే అతడు ఉన్మదవృత్తిని, అహంకారాన్ని ప్రదర్శించవచ్చును. విరాటుడి అభియోగంలో ఆ రెండు గుణాలూ ఉన్నాయి. ఆ దుర్గుణాలను అధిగమించగల గుణం విద్యాతిశయమే. జ్ఞానార్థిత్వం ముముక్షు లక్షణం. ఆ తాత్పర్యాన్ని ధ్వనింపజేసే ప్రస్తుత పాఠమే ఉత్తమం. (సంపా.)

అర్జునుఁడు విరాటునకుఁ దమ్మెఱింగించుట (సం. 4-65-1)

వ. అనిన విని యతండు విస్మయ సంశయంబులు మనంబునం బెనంగొన 'నితండు ధర్మతనయుండయేని భీమార్జున నకుల సహదేవులుం బాంచాలియు నేరి?' యని యడిగినఁ గవ్వడి యిట్లనియె. 322

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; అతండు= విరాటుడు; విస్మయ= ఆశ్చర్యమూ; సంశయంబులు= సంశయమునూ; మనంబునన్= మనస్సులో; పెనంగొనన్= పెనవేసికొనగా-కలుగగా; ఇతండు= ఈ కూర్చున్నవాడు; ధర్మతనయుండ+ఏనిన్= ధర్మరాజే అయినచో; భీమ= భీముడు; అర్జున= అర్జునుడు; నకుల= నకులుడును; సహదేవులున్= సహదేవుడును; పాంచాలియున్= ద్రౌపదియును; ఏరి?= ఏరి వారు?; అని అడిగినన్= అని ప్రశ్నించగా; కవ్వడి= అర్జునుడు; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని విరాటుడు ఆశ్చర్యం, సంశయం కలుగగా, 'ఇతడు ధర్మరాజైతే మరి భీమార్జున నకుల సహదేవులు, ద్రౌపది ఏరి?' అని అడిగాడు. అప్పుడు అర్జునుడు ఇట్లా అన్నాడు.

చ. 'వలలుఁ డనంగ నీ నగర వంటలవాఁ డయి నిల్చి, వేడ్కకుం
బులిఁ గరిఁ గేసరిం దొడరి పోరఁగఁ బంచినఁ బోరు, జెట్టి మ
ల్లుల విఱుచుం గడంగి ప్రబలుం డనఁగాఁ జరియించుచుండు వి
చ్చలవిడి; భీముఁ డీతఁ డవిషహ్య పరాక్రమదుర్దముం డనిన్. 323

ప్రతిపదార్థం: వలలుఁడు+అనంగన్= వలలుడనే పేరుతో పిలువబడుతూ; నీ నగరన్= నీ రాచనగరిలో; వంటలవాఁడు+ అయి= వంటచేసేవాడై; నిల్చి= ఉండి; వేడ్కకున్= వేడుకకై; పులిన్= పులిని; కరిన్= ఏనుగును; కేసరిన్= సింహమును; తొడరి= ధిక్కరించి; పోరఁగన్= యుద్ధం చేయటానికి; పంచినన్= పంపగా; పోరు= యుద్ధం చేస్తాడు; కడంగి= పూనుకొని; జెట్టి మల్లులన్= శూరులయిన కుస్తీపట్టేవారిని; విఱుచున్= ఓడిస్తాడు; ప్రబలుండు+అనఁగాన్= గొప్పబలం కలవాడని చెప్పుకొనగా; విచ్చలవిడిన్= యథేచ్ఛగా; చరియించుచున్+ఉండున్= సంచరించేవాడు; ఈతఁడు భీముఁడు= ఇతడు భీముడు; అనిన్= యుద్ధమున; అవిషహ్య= సహించరాని; పరాక్రమ= బలం కలుగుటచేత; దుర్దముండు= అణచుటకు శక్యం కానివాడు.

తాత్పర్యం: 'మీ నగరిలో వలలుడు అనే పేరుతో వంటలవాడుగా ఉండి, మీ వేడుక కోసం పెద్దపులిని, ఏనుగును, సింహాన్ని ఎదుర్కొని ఓడించి, మల్లులు వస్తే వారిని గెల్చి మహాబలశాలిగా పేరు పొందినవాడే భీముడు. ఇతడు మహాపరాక్రమశాలి కనుక ఎవ్వరూ ఇతడిని యుద్ధంలో జయించలేరు.

తే. బక మహాసురు నిర్జించి బ్రాహ్మణులకు । బ్రీతిఁ గావించెఁ, గిమ్మీరు పే రడంచి
వనము నిష్కంటకము సేసె; ఘను హిడింబుఁ । గూల్చి యాతని చెలియలిఁ గొనియె నితఁడు. 324

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ భీముడు; బకమహాసురున్= బకుడనే గొప్ప రాక్షసుడిని; నిర్జించి= గెలిచి; బ్రాహ్మణులకున్= బ్రాహ్మణులకు; ప్రీతిన్= సంతోషాన్ని; కావించెన్= చేశాడు; కిమ్మీరున్= కిమ్మీరుడనే రాక్షసుడిని; పేరు+అడంచి= చంపి; వనమున్= అడవిని; నిష్కంటకము= బాధలేనిదానిగా; చేసెన్= చేశాడు; ఘనున్= గొప్పవాడైన; హిడింబున్= హిడింబాసురుడిని; కూల్చి= చంపి; ఆతని చెలియలిన్= అతడి చెల్లెలైన హిడింబిని; కొనియెన్= పెండ్లాడాడు.

తాత్పర్యం: ఇతడు బకాసురుడిని చంపి బ్రాహ్మణులకు ప్రీతి చేశాడు. కిమ్మీరుడిని చంపి వనంలో బాధలేకుండా చేశాడు. హిడింబాసురుడిని చంపి, అతడి చెల్లెలిని పెండ్లాడాడు.

విశేషం: భీముడు చంపిన ముగ్గురురాక్షసులు లోకప్రసిద్ధులు. వారిలో తరతమ భేదాన్ని బట్టి వారిని చంపినవాడుగా భీముడికి పేరు వచ్చింది. ఆ రాక్షసులలో బల ప్రాచుర్యాన్ని బట్టి బకుడు, కిమ్మీరుడు, హిడింబుడు అనే వరుసలో పేర్కొన తగినవారు. అర్జునుడు బలగౌరవాన్ని పరిగణించి ఆ వరుసలోనే చెప్పటం విశేషం. బకాసురవధ ఆదిపర్వంలో (6.298-305), కిమ్మీరవధ ఆరణ్యపర్వంలో (1.107-121), హిడింబాసుర వధ ఆదిపర్వంలో (6.203-218) చెప్పబడి ఉన్నాయి. (సంపా.)

క. నీ మెచ్చువారువంబులఁ । దా మచ్చిగ నరయు నిత్యతాత్పర్యమునన్
దామగ్రంథి యనఁగ నొక । నామము ధరియించె నితఁడు నకులుం డధిపా! 325

ప్రతిపదార్థం: అధిపా!= విరాటరాజా!; ఇతఁడు= ఈ కూర్చున్నవాడు; నీ మెచ్చు= నీవు మెచ్చునట్టి; వారువంబులన్= గుర్రాలను; తాన్= తాను; మచ్చిగన్= మచ్చికతో; నిత్య= ఎల్లపుడును; తాత్పర్యమునన్= ఆసక్తితో; అరయున్= రక్షిస్తాడు; దామగ్రంథి+అనఁగన్= దామగ్రంథి అనే; ఒక నామము= ఒక పేరు; ధరియించెన్= పెట్టుకొన్నాడు; ఇతఁడు= ఈయన; నకులుండు= నకులుడు.

తాత్పర్యం: ఓ విరాటరాజా! ఇతడు - నీవు మెచ్చిన గుర్రాలను ఎక్కువ ఆసక్తిగా రక్షిస్తూ దామగ్రంథి అనే పేరుతో ఉన్నటువంటి వాడు- నకులుడు.

క. శత్రునృప కాలకూటము । మిత్రామృతవృష్టి బుధసమీహిత సిద్ధి
క్షేత్రము సజ్జన సంస్తుతి । పాత్ర మితఁడు మాద్రి తొలుతపట్టి నరేంద్రా! 326

ప్రతిపదార్థం: నరేంద్రా!= విరాటరాజా!; శత్రునృప= శత్రువులైన రాజులకు; కాలకూటము= కాలకూట విషం వంటివాడు; మిత్ర= మిత్రులకు; అమృత వృష్టి= అమృతవర్షం వంటివాడు; బుధ= పండితులకు; సమీహిత= కోరికలయొక్క; సిద్ధిక్షేత్రము= సిద్ధిని పొందే ప్రదేశం; సజ్జన= మంచివారికి; సంస్తుతి= పొగడ్తకు; పాత్రము= తగినవాడు; ఇతఁడు= ఈ కూర్చున్నవాడు; మాద్రి తొలుతపట్టి= మాద్రికి పెద్దకొడుకు - నకులుడు.

తాత్పర్యం: ఓ రాజా! ఈతడు శత్రువులకు కాలకూటం వంటివాడు. మిత్రులకు అమృతవర్షం వంటివాడు. పండితులకు కోరికలు సిద్ధిపొందే ప్రదేశం, సజ్జనులకు స్తుతిపాత్రమైనవాడు, మాద్రి పెద్దకొడుకు - నకులుడు.

విశేషం: అలం: ఉల్లేఖం.

క. **నీ పాలికి వచ్చి నిఖిల । గోపాలక ముఖ్యవృత్తిఁ గొలువు వడసి తం**
త్రీపాలుఁ డనఁగ మత్స్య । క్ష్మా పాలక! మెలఁగు వీఁడె సహదేవుండున్. **327**

ప్రతిపదార్థం: మత్స్యక్ష్మాపాలక= విరాటరాజా!; నీ పాలికిన్= నీ వద్దకు; వచ్చి= చేరి; నిఖిల= సమస్తమైన; గోపాలక= గోవులను పాలించేవారిలో; ముఖ్య వృత్తిన్= ముఖ్యుడైన ఉద్యోగంలో; కొలువు= సేవ; పడసి= పొంది; తంత్రీపాలుఁడు+అనఁగన్= తంత్రీపాలుడనే పేరుతో; మెలఁగు= ఉన్నట్టి; వీఁడె= ఇదుగో ఇతడే; సహదేవుండున్= సహదేవుడు.

తాత్పర్యం: రాజా! నీ వద్దకు వచ్చి, గోపాలురలో ముఖ్యుడుగా ఉద్యోగం పొంది, తంత్రీపాలుడనే పేరుతో ఉన్నవాడు ఇతడే సహదేవుడు.

క. **సుకుమార మానసుఁడు, గొం । తికిఁ బ్రాణము ప్రాణ మితఁడు, తేజో గణ్యుం**
డకుటిలుఁడు రాజనీతి । ప్రకారసంవేది వంశపావనుఁడు నృపా!' **328**

ప్రతిపదార్థం: నృపా!= ఓ విరాటరాజా!; సుకుమార మానసుఁడు= సున్నితమైన మనస్సు కలవాడు; గొంతికిన్= కుంతీదేవికి; ప్రాణము ప్రాణము= ప్రాణానికి ప్రాణమైనవాడు; ఇతఁడు; తేజస్+గణ్యుఁడు= గొప్ప తేజస్సుచే గణింపదగినవాడు; అకుటిలుఁడు= మోసం లేనివాడు; రాజనీతి ప్రకార= రాజనీతి విధాలను; సంవేది= ఎరిగినవాడు; వంశపావనుఁడు= వంశమును పవిత్రం చేసినవాడు.

తాత్పర్యం: రాజా! ఇతడు చాలా సున్నితమైన మనస్సు కలవాడు; కుంతికి ప్రాణ సమానుడు, గొప్ప తేజస్సు కలవాడు, రాజనీతిజ్ఞుడు, వంశమును పవిత్రం చేసినవాడు.'

వ. **అని యిట్లు ధర్మజ భీమ నకుల సహదేవులం గ్రమంబునం జూపి చెప్పి మఱియు నిట్లనియె.** **329**

ప్రతిపదార్థం: అని= పలికి; ఇట్లు= ఈ రీతిగా; ధర్మజ= ధర్మరాజును; భీమ= భీముడిని; నకుల= నకులుడిని; సహదేవులన్= సహదేవుడిని; క్రమంబునన్= క్రమంగా; చూపి= కూర్చున్నవారిని చూపి; చెప్పి= వారి విషయం చెప్పి; మఱియున్= ఇంకా; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఇట్లు ధర్మరాజ, భీమ, నకుల, సహదేవులను, కూర్చున్నవారిని చూపించి చెప్పాడు. ఇంకా ఇట్లా అన్నాడు.

క. **'విను సైరంధ్రీ వేషం । బున మాలిని యనఁగఁ బరఁగి పూతచరిత్రం**
బునఁ గేకయ భూవరనం । దనకడ మెలఁగు సతి ద్రుపదతనయ మహీశా! **330**

ప్రతిపదార్థం: మహీశా!= రాజా!; విను= వినుము; సైరంధ్రీ వేషంబునన్= ఇతరుల ఇంటిలో కారణాంతరమున ఉండే పతివ్రత వేషంలో; మాలిని+అనఁగన్= మాలిని అనే పేరుతో; పరఁగి= ఒప్పి; పూత= పవిత్రమైన; చరిత్రంబునన్= నడవడితో; కేకయ భూవర నందనకడన్= సుదేష్ణ వద్ద; మెలఁగుసతి= ఉండెడి పతివ్రత; ద్రుపద తనయ= ద్రౌపది.

తాత్పర్యం: 'రాజా! సైరంధ్రీ వేషంలో మాలిని అనే పేరుతో కళంకం లేని నడవడికతో సుదేష్ణ వద్ద ఉండే ఆమె ద్రౌపది.

క. **ఆ చపలాక్షికిఁ గా మన । కీచకు లందఱను రాత్రి గీటడఁచె రహ**
స్యోచిత విధమున గంధ । ర్వాచరణము పేర భీముఁ డతి భీమముగాన్.' **331**

ప్రతిపదార్థం: ఆ చపలాక్షికిన్+కాన్= ఆ వనితకై; మన కీచకులు+అందఱను= మన కీచకుల నందరిని; రాత్రి= రాత్రివేళ; రహస్య= రహస్యానికి; ఉచిత= తగిన; విధంబునన్= రీతిగా; గంధర్వ= గంధర్వులయొక్క; ఆచరణము పేరన్= చర్య అనే పేరుతో; భీముఁడు= ఈ భీమసేనుడు; అతి భీమముగాన్= మిక్కిలి భయంకరంగా; గీటు+అడఁచెన్= చంపాడు.

తాత్పర్యం: ఈమె నిమిత్తంగానే మన కీచకులందరినీ రహస్యంగా ఈ భీముడే - గంధర్వులు చేశారనే పేరుతో - అతి భయంకరంగా చంపేశాడు.'

విరాటునకు భీముఁ డర్జును నెఱింగించుట (సం. 4-66-1)

వ. **అనియె; నప్పుడు వృకోదరుండు.** **332**

ప్రతిపదార్థం: అనియెన్= అని పలికాడు; అప్పుడు= అంతట; వృకోదరుండు= భీముడు.

తాత్పర్యం: అని అర్జునుడు చెప్పగా భీముడు అందుకొని.

సీ. **'షండరూపమునఁ బ్రచ్ఛన్నుఁడై వచ్చి, క । న్నియలకు నెల్లను నృత్తగీత**
వాద్యనైపుణ మనవద్య శిక్షావిధి । నలవరించుచు బృహన్నల యనంగఁ
బరఁగు నీతండు బీభత్సుండు సుమ్మని । చూపి, యమ్మత్స్యరాజునకుఁ జెప్పి
వెండియుఁ బలుకు 'నాఖండలు నోడించి । ఖాండవ మేర్చె, నాతండు దన్ను

తే. **గారవించిన నెక్కటి కాలకేయ । వర్గములఁ బరిమార్చె, నివాత కవచ**
సంఘముల నోర్చె, గంధర్వసమితి గెలిచి । ధార్తరాష్ట్రాగ్రజుని చెఱఁ దలఁగె నితఁడు.' **333**

ప్రతిపదార్థం: షండరూపమునన్= పేడిరూపంలో; ప్రచ్ఛన్నుఁడు+ఐ= గూఢంగా ఉండి; వచ్చి= ఇక్కడికి వచ్చి; కన్నియలకున్= కన్యలకు; ఎల్లను= అందరికిని; నృత్త= నృత్యం; గీత= పాటలు; వాద్య= వాద్యముల యందలి; నైపుణము= నేర్పు; అనవద్య= దోషరహితమైన; శిక్షావిధిన్= నేర్పే విధానంలో; అలవరించుచున్= నేర్పుతూ; బృహన్నల+అనంగన్= బృహన్నల అనే పేరుతో; పరఁగు+ఈతండు= ఒప్పునట్టి ఇతడు; బీభత్సుండు సుమ్ము= అర్జునుడు సుమా; అని చూపి= అని అతడిని చూపించి; ఆ+మత్స్య రాజునకున్= ఆ విరాటరాజుకు; చెప్పి; వెండియున్= మరల; పలుకున్= ఇట్లా అన్నాడు; ఆఖండలున్= ఇంద్రుడిని; ఓడించి= గెలిచి; ఖాండవము= ఖాండవ వనమును; ఏర్చెను= కాల్చాడు; ఆతండు= ఇంద్రుడు; తన్నున్= అర్జునుడిని; గారవించినన్= గౌరవించగా; ఎక్కటి= ఒంటరిగా; కాలకేయ వర్గములన్= కాలకేయులనే రాక్షసుల సమూహాన్ని; పరిమార్చెన్= చంపాడు; నివాత కవచ సంఘములన్= నివాత కవచులు అనే రాక్షస సముదాయాన్ని; ఓర్చెన్= ఓడించాడు; గంధర్వ సమితిన్= గంధర్వుల సంఘాన్ని; గెలిచి= జయించి; ధార్తరాష్ట్ర+అగ్రజుని= దుర్యోధనుడియొక్క; చెఱన్= బందీతనాన్ని; ఇతఁడు= ఈ అర్జునుడు; తలఁగెను= తొలగించాడు.

తాత్పర్యం: 'పేడిరూపంలో ఎవరికీ తెలియకుండా ఇక్కడికి వచ్చి, కన్యలకు నాట్యం, పాటలు, వాద్యాలలోని నేర్పును దోషం లేకుండా నేర్పుతూ, 'బృహన్నల' అనే పేరుతో ఉన్నటువంటి ఇతడు అర్జునుడు సుమా!' అని విరాటుడికి అతడిని చూపించాడు. ఇంకా ఇట్లా అన్నాడు - 'ఇతడు ఇంద్రుడిని ఓడించి ఖాండవవనాన్ని అగ్నికి అప్పగించాడు. ఇంద్రుడు గౌరవించగా అసహాయశూరుడుగా ఒక్కడే కాలకేయులను చంపాడు. నివాతకవచులను ఓడించాడు. గంధర్వులను ఓడించి, దుర్యోధనుడిని విడిపించాడు.'

విశేషం: తిక్కన నాటకీయ రచనా శిల్పానికి ఈ పద్యం ఒక మంచి ఉదాహరణం. దానికి కారణాలు అయిదు. 1.మూలంలో అర్జునుడే తననుగూడ విరాటుడికి పరిచయం చేసికొంటాడు. అందులో వినయం మాత్రమే వెలుగు చూపుతుంది. ఆ తరువాత ఉత్తరుడు అతడిని ప్రశంసిస్తాడు. అర్జునుడు ధీరోదాత్తుడు, స్వాభిమాని. అతడు స్వయంగా పరిచయం చేసికొనటం రాజమర్యాద కాదు, వీరమర్యాద కాదు. కాబట్టి, భీముడు పరిచయం చేసినట్లు చేసిన తిక్కనకల్పన ప్రకరణౌచిత్యపోషకంగా ఉన్నది. 2.పాండవులు బయలు మెరసిన ఈ రంగంలో ప్రధానపాత్రలన్నీ మాట్లాడితే సన్నివేశం చైతన్యవంతంగా ఉంటుంది. అందువలన భీమపాత్రకు సంభాషణ కల్పించాడు తిక్కన. 3.అర్జునుడు ధర్మజాదులను పరిచయం చేయటంలో కొన్ని మర్యాదలు పాటించాడు. ధర్మజుడిని ఒక సీసపద్యంలో, ఉత్పలంలోనూ, భీముడిని ఒక వృత్తంలో, ఒక తేటగీతిలోనూ, నకుల సహదేవులనూ, ద్రౌపదినీ - ఒక్కొక్కరినీ రెండు కంద పద్యాలలోనూ పరిచయం చేశాడు. అందరిలో భీముడిని-అతడి వీరకృత్యాలను ప్రత్యేకించి చెప్పుతూ వర్ణించాడు. భీముడు అర్జునుడిని పరిచయం చేయటంలో అతడు తన పరిచయంలో వాడిన పద్ధతినే ఉపయోగించాడు. ఒక సీసపద్యాన్ని సమవిభక్తం చేసి అజ్ఞాతవ్రత వేషాన్నీ, అర్జున పరాక్రమ విశేషాలనూ సమంగా పంచి వర్ణించాడు. ఒక పద్యం రెండు పద్యాలవలె పలికాడు. విజయ వీరకార్యాలను ప్రధాన వివక్షాదృష్టితో వరుసగా చెప్పాడు. అది భీమ పరిచయంలో అర్జునుడు పాటించిన పద్ధతికి ప్రతిబింబం. 4.అర్జునుడి వీర గాథలలో మొదట పేర్కొనదగింది - ఇంద్రుడిని జయించిన గాథ - ఖాండవ దహనం (ఆది.8.232-331); ఆ తరువాత వరుసగా-ఇంద్ర శత్రుసంహారం - కాలకేయులను చంపిన విజయగాథ (ఆరణ్య.4.78-87) నివాత కవచుల వధ - (ఆరణ్య.4.53-77). చివర చెప్పదగింది ఘోషయాత్రలో గంధర్వ విజయం, దుర్యోధనుడి బంధవిముక్తి (ఆరణ్య.5.415-427). 5.విరాటపర్వంలో మహాయుద్ధవీరులు - భీముడు, అర్జునుడు. వీరిరువురు ఒకరినొకరు పరిచయం చేసికొనటం కథార్థ సంవిధానంలో ఒక నాటకీయ రచనా శిల్పం. 6.తిక్కన నృత్త గీత వాద్య శబ్దాలను వాడడం. నృత్తం - నృత్య నాట్య విభాగానికీ, గీతం-గాత్ర సంగీత విభాగానికీ, వాద్యం-జంత్రవాద్య విభాగానికీ ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అంగవిన్యాస ప్రధానమైనది నృత్తమని, భావ ప్రధానమైనది నృత్యమని, రస ప్రధానమైనది నాట్యమనీ నాట్య సంప్రదాయం చెప్పుతున్నది. అయితే పూర్వకాలంలో దశరూపకాల నన్నంటిని రూపకశబ్దంతో, నాటక శబ్దంతో సాధారణంగా పేర్కొన్నట్లే, నృత్య, నాట్యశబ్దాల వలన స్ఫురించే అంశాలను కూడా మొదట్లో నృత్తంగానే పేర్కొనే పరిపాటి ఉన్నది. డా.పి.యస్.అప్పారావుగారి ఈ పరిశీలన గమనించదగినది- "నృత్త-నాట్య-నృత్యములను గూర్చి ప్రాచీనాధునిక విమర్శకులు అనేక విధములుగా వ్రాసినారు. నేడు నాట్య శబ్దము 'నృత్య' మునకు 'నృత్య' (dance) మనియే అర్థము. నాట్య శాస్త్రమునందు 'నృత్య'మను పదము లేదు. అభినవగుప్తుడు కూడ దీనిని వాడినట్లు కన్పట్టదు. (మూలమునందు కన్పట్టు 'నృత్య' మనెడి పాఠములు సరికావు. అట్లు కన్పట్టు ప్రతిపదమునకును క్రింద 'నృత్త' మను పాఠాంతరములుండుట గమనించవలెను). ఇంక నాట్యశాస్త్రము నందు నృత్త, నాట్య పదములే కలవు. ఈ నృత్తము నాట్యము కంటె చాల ప్రాచీనమైనది.' (నాట్యశాస్త్రము- పు. 19.20). తిక్కన కాలం వాడైన జాయపసేనాని 'నృత్త రత్నావళి' అనే పేర నాట్యశాస్త్రగ్రంథం వ్రాయటం గమనార్హం. కాబట్టి తిక్కన వాడిన 'నృత్త' మనే పదం నృత్యశాఖకు ప్రాతినిధ్యం వహించే ప్రాచీన పారిభాషిక పదమని గ్రహించాలి. (సంపా.)

వ. **అనిన విని యద్భుతరసాక్రాంతం బగు నంతరంగంబునం గలుగు సందేహావేశంబు వినయ సంభ్రమంబుల నిగుడనీకునికిం జేసి చిక్కువడి యున్న నిజజనకునకు నర్జునుం జూపి యుత్తరుం డిట్లనియె.** **334**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; అద్భుతరస= ఆశ్చర్యంతో; ఆక్రాంతంబు+అగు= ఆక్రమించబడిన; అంతరంగంబునన్= భావోద్రేకంగల మనస్సులో; కలుగు= పుట్టునట్టి; సందేహ+ఆవేశంబు= సందేహం వలని ఆవేశం; వినయ= వినయాన్ని; సంభ్రమంబులన్= తొట్రుపాటును; నిగుడనీక+ఉనికిన్+చేసి= కలుగనియ్యకుండటంచేత; చిక్కువడి+ఉన్న= కలతచెంది ఉన్న; నిజ జనకునకున్= తన తండ్రికి; అర్జునున్= అర్జునుడిని; చూపి= చూపించి; ఉత్తరుండు= ఉత్తరుడు; ఇట్లు= చెప్పబోయే రీతిగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా విరటుడు విన్నాడు. ఆశ్చర్యం మనస్సు నావరించింది. మనస్సులో కలిగే సందేహావేశం వినయాన్నీ, తొట్రుపాటునూ కలగనీయకపోవటంతో చిక్కుపడుతున్న తండ్రితో ఉత్తరుడు అప్పుడు అర్జునుడిని చూపిస్తూ ఇట్లా చెప్పాడు.

తే. **'ఈతఁ డింతకు మీకుఁ దన్నెఱుఁగఁ జెప్ప । వలవదని నియమించినఁ దెలియఁ బలుక**
నలికి; యొక దేవసన్నిభుం డంటిఁ గాని । నిన్న యంతయుఁ దాఁ గదా నిర్వహించె! 335

ప్రతిపదార్థం: ఈతఁడు= ఈ ముందున్న అర్జునుడు; ఇంతకున్= ఇంతవరకు; మీకున్= తమకు; తన్నున్= తనను; ఎఱుఁగన్= తెలిసేటట్లు; చెప్పవలదు+అని= చెప్పవద్దని; నియమించినన్= నన్ను ఆపుచేసిన మూలాన; తెలియన్= తెలిసేటట్లుగా; పలుకన్= చెప్పటానికి; అలికి= జంకి; ఒక దేవసన్నిభుండు= ఒకానొక దేవతా సమానుడు; అంటిన్= అన్నాను; కాని= కాక; నిన్న= నిన్నటి యుద్ధం; అంతయున్= అంతా; తాన్+కదా= తానేకదా; నిర్వహించెన్!= నిర్వహించాడు!

తాత్పర్యం: 'ఇతడు నీకు చెప్పవద్దని నన్ను నియమించిన మూలాన చెప్పటానికి జంకి, ఎవరో ఒక దేవసమానుడని చెప్పాను గాని, నిన్నటి యుద్ధంలో అంతా నిర్వహించింది ఈయనే కదా!

చ. **ఒకరుఁడ తాను భీతి వెగడొందెదు రెండవ యేను నెట్టకే**
లకుఁ ననుఁ దేర్చునప్పుడు బలంబులతోఁ గురురాజు సూడ దా
నికి మది శంక లేమి మహనీయ పరాక్రముఁడైన యీ కిరీ
టికిఁ జనుఁ గాక యివ్విధము డెప్పర మన్యుల కోర్వ వచ్చునే? 336

ప్రతిపదార్థం: తాను= అర్జునుడు; ఒకరుఁడు+అ= ఒక్కడే; భీతిన్= భయంచేత; వెగడు+ఒందెడు= భయపడే; రెండవ+ఏనున్= రెండవ వాడనైన నేను; ఎట్టకేలకున్= అతి కష్టంతో; ననున్= నన్ను; తేర్చునప్పుడు= ఓదార్చునపుడు; బలంబులతోన్= సైన్యాలతో; కురురాజు= దుర్యోధనుడు; చూడన్= చూడగా; దానికిన్= ఆ చూచినదానికి; మదిన్= మనస్సులో; శంకలేమి= సంశయం లేకపోవటం చేత; మహనీయ పరాక్రముఁడు+ఐన= గొప్ప పరాక్రమం కలవాడైన; ఈ కిరీటికిన్= ఈ అర్జునుడికే; చనున్+కాక= తగును గాని; ఈ+విధము= ఈ రకమైన; డెప్పరము= ఆపద; అన్యులకున్= ఇతరులకు; ఓర్వవచ్చునే?= సహించదగునా?

తాత్పర్యం: తాను ఒక్కడే. భయంతో నేను వణకుతూ ఉంటే, చిట్టచివరకు ఎట్లాగో నన్ను అతిశ్రమతో ఓదార్చేటప్పుడు సేనలతో సహా దుర్యోధనుడు చూస్తుంటే, తనకు ఏమీ మనస్సులోనైనా సందేహం లేకుండా ఉండటం గొప్ప పరాక్రమం కల ఈ అర్జునుడికే చెల్లింది కాని, అంతటి ఆపదను ఎవరు ఓర్చుకొనగలరు?

చ. తము నెఱింగించి యల్ల నుచిత ప్రియభాషల నన్ను సూత కృ
త్యమునకుఁ జొన్ప, నేను బ్రమదంబున నప్పటి కియ్యకొంటి లో
కము సమరంబులట్ల యని; కయ్యము తీవ్రతకుం దగంగ ర
థ్యములఁ జరింపఁ జేఁత భరమై తుదిఁ బల్మఱు నోహటించితిన్. 337

ప్రతిపదార్థం: తమున్= తమను; ఎఱింగించి= తెలియజెప్పి; అల్లన్= మెల్లగా; ఉచిత= తగిన; ప్రియ= ఇష్టమైన; భాషలన్= మాటలతో; నన్నున్= నన్ను; సూత కృత్యమునకున్= సారథ్యానికి; చొన్పన్= ప్రవేశపెట్టగా; నేను; ప్రమదంబునన్= సంతోషంతో; లోకము సమరంబులు+అట్ల+అని= లోకంలో జరిగే యుద్ధాల వంటిదే అని; అప్పటికిన్= ఆ సమయాన; ఇయ్యకొంటిన్= ఒప్పుకొన్నాను; కయ్యము= యుద్ధం యొక్క; తీవ్రతకున్= ముమ్మరానికి; తగంగన్= తగునట్లుగా; రథ్యములన్= గుర్రాలను; చరింపన్= నడిచేటట్లు; చేఁత= చేయటం; భరము+ఐ= బరువై, దుస్సహమై; తుదిన్= చివరలో; పల్మఱున్= చాలాసార్లు; ఓహటించితిన్= వెనుదీశాను.

తాత్పర్యం: తా మెవరో నాకు చెప్పి, తగినట్లు ప్రియోక్తులాడి నన్ను సారథిగా ఉండుమన్నాడు. లోకంలో జరిగే అన్ని యుద్ధాలవంటిదే అని అప్పటికి ఒప్పుకొన్నాను కాని, యుద్ధం తీవ్రమైన కొలదీ, దానికి తగినట్లు గుర్రాలను నడపటం నా శక్తికి మించిపోయి చివరకు చాలాసార్లు వెనుదీశాను.

క. మొగ మోడఁ డితఁడు కౌరవ । జగతీశుఁడు విఱిగినపుడు జవమున వెనుకం
దగిలి 'యిది జూద మాడఁగ । నగునెడఁగా దఱుమ వలయు' ననియె నతనితోన్.' 338

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ అర్జునుడు; మొగమోడఁడు= ఎదురుగా మాట్లాడటానికి జంకడు; కౌరవ జగతీ+ఈశుఁడు= దుర్యోధనుడు; విఱిగినపుడు= పారిపోయేటప్పుడు; జవమునన్= వేగంగా; వెనుకన్+తగిలి= వెంటబడి తరిమి; ఇది= ఈ సమయం; జూదమాడఁగన్= జూదము ఆడటానికి; అగు+ఎడ= తగిన సమయం; కాదు; అఱుమ వలయున్= ఎదిరించవలెను అని; అతనితోన్= దుర్యోధనుడితో; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ అర్జునుడు ఎంతటి మాటనైన ముఖాన్నే అనటానికి జంకడు. ఎందుచేతనంటే, దుర్యోధనుడు పారిపోతూ ఉంటే వెంటబడి తరుముతూ 'రాజా! ఇది జూదమాడే సమయం కాదు, ఎదుర్కొనాలి' అని దెప్పి పొడుస్తూ అన్నాడు.'

ఆ. అనిన నతఁడు వెఱపు నత్యాదరంబును । సంతసంబు మానసమున బెరయ
నవయవముల సంభ్రమావేశ మేర్పడ । గారవమున విజయుఁ గౌఁగిలించె. 339

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అతఁడు= విరాటుడు; వెఱపును= భయమును; అతి+ఆదరంబును= మిక్కిలి గౌరవమును; సంతసంబున్= సంతోషమును; మానసమునన్= మనస్సులో; బెరయన్= వ్యాపించగా; అవయవములన్= అవయవాలలో; సంభ్రమ+ఆవేశము= సంతోషాతిశయం; ఏర్పడన్= కలుగగా; గారవమునన్= గౌరవంతో; విజయున్= అర్జునుడిని; కౌఁగిలించెన్= కౌగిలించుకొన్నాడు.

తాత్పర్యం: అని చెప్పటంతో విరాటుడికి భయం, మిక్కిలి గౌరవం, సంతోషం మనస్సులో వ్యాపించాయి. అవయవాలలో సంబరంతో ఆవేశం కలిగింది. గౌరవంతో అర్జునుడిని కౌగిలించుకొన్నాడు.

క. వినయంబు మిగులఁ గుంతీ । తనయాగ్రజు పాదపీఠతలమున ఫాలం
బును బొందఁ జాఁగి మ్రొక్కి య । తని కౌఁగిలి వడసె సమ్మదము దళుకొత్తన్. 340

ప్రతిపదార్థం: వినయంబు= వినయము; మిగులన్= ఎక్కువకాగా; కుంతీతనయాగ్రజు= ధర్మరాజుయొక్క; పాదపీఠతలమునన్= పాదపీఠ ప్రదేశంలో; ఫాలంబును= నుదురు; పొందన్= ఉండేటట్లుగా; చాఁగి= సాష్టాంగపడి; మ్రొక్కి= ప్రణామం చేసి; సమ్మదము= సంతోషం; తళుకు+ఒత్తన్= మెఱయఁగా; అతని కౌఁగిలి= ధర్మరాజు కౌగిలిని; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: విరాటుడు ఎక్కువ వినయంతో ధర్మరాజు పాదపీఠానికి నుదురుభాగం తాకేటట్లు సాగిలపడి మ్రొక్కాడు. ధర్మరాజు అతడిని లేవదీసి కౌగిలించుకొన్నాడు.

ఆ. ప్రీతి నలుమడింప భీమునిఁ గవల నా । లింగనంబు సేసి యంగకములఁ
బులక లెగయఁ గేలు దల మోడ్చి ధర్మజు । నాననమున దృష్టి యడర నిలిపె. 341

ప్రతిపదార్థం: ప్రీతి= సంతోషం; నలుమడింపన్= నాల్గురెట్లు కాగా; భీమునిన్= భీముడిని; కవలన్= నకుల సహదేవులను; ఆలింగనంబు+చేసి= కౌగిలించుకొని; అంగకములన్= అవయవములందు; పులకలు= రోమాంచములు; ఎగయన్= పైకిరాగా; కేలు= చేతులు; తలన్= తలపై; మోడ్చి= జోడించి; ధర్మజు ఆననమునన్= ధర్మరాజుయొక్క ముఖంపై; దృష్టి అడరన్= దృష్టి వ్యాపించేటట్లుగా; నిలిపెన్= నిలిపాడు.

తాత్పర్యం: సంతోషం నాలుగురెట్లు కాగా భీముడిని, నకుల సహదేవులను విరాటుడు కౌగిలించుకొన్నాడు. చేతులు తలపై జోడించి, ధర్మరాజుముఖంమీద దృష్టి నిలిపాడు.

ఉ. అత్తఱి లేచి వచ్చి తన యన్నలఁ దమ్ములఁ గానిపించె న
య్యుత్తరు నర్జునుండు; దగ వొందఁగ నప్పుడ పిల్వఁ బంచె మా
త్స్యోత్తముఁ డార్యమిత్ర సచివోత్కర సోదరవర్గపుత్రకో
దాత్త భటాదియోగ్యుల ముదంబునఁ బాండవ దర్శనార్థమై. 342

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= ఆ సమయంలో; అర్జునుండు= అర్జునుడు; లేచివచ్చి= ఆసనం నుండి లేచివచ్చి; తన అన్నలన్= తన అన్నలైన ధర్మరాజు, భీములను; తమ్ములన్= తమ్ములైన నకుల సహదేవులను; ఉత్తరున్= ఉత్తరుడికి; కానిపించెన్= చూపించాడు; తగవు+ఒందఁగన్= మర్యాదప్రకారం; మాత్స్య+ఉత్తముఁడు= విరాటుడు; అప్పుడు+అ= అప్పుడే; ఆర్య= పెద్దలు; మిత్ర= మిత్రులు; సచివ+ఉత్కర= మంత్రుల సముదాయం; సోదర వర్గ= సోదరుల సముదాయం; పుత్రక= పుత్రులు; ఉదాత్త= గొప్పవారైన; భట+ఆది= భటులు మున్నగు; యోగ్యులన్= యోగ్యత కలవారిని; పాండవదర్శన+అర్థము+ఐ= పాండవుల దర్శనం నిమిత్తమై; ముదంబునన్= ప్రీతితో; పిల్వన్= పిల్చుటకు; పంపెన్= పంపాడు.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడు లేచివచ్చి తన అన్నలను, తమ్ములను ఉత్తరునకు చూపాడు. విరాటుడు మర్యాద ప్రకారం అప్పుడే మిత్రులను, మంత్రులను, సోదరులను, పుత్రులను, ఉన్నత భటులను- ఇంకా యోగ్యులైన వారందరిని పాండవులను దర్శించటంకొరకు పిలిపించాడు.

వ. ఇట్లు సమస్తజన సమేతంబుగా ధర్మతనయ సేవా తత్పరుండై తదనుమతి సముచిత రుచిరాసనంబున నుండి విరాటుం డంతఃపురవర్తులం బిలిచి యంతయు సుదేష్ణ కెఱింగింపం బనిచి, పాంచాలిం దగిన తెఱంగున గారవించునట్లు గావించె; నట్టియెడ ధనంజయుం డతని కిట్లనియె. 343

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సమస్తజన= ప్రజలందరితో; సమేతంబుగాన్= కూడుకొని; ధర్మతనయ= ధర్మరాజుయొక్క; సేవా= సేవించుటలో; తత్పరుండు+ఐ= ఆసక్తి కలవాడై; తద్+అనుమతిన్= ఆ ధర్మరాజుయొక్క అనుమతితో; సముచిత= తగిన; రుచిర= ప్రకాశించే; ఆసనంబునన్= ఆసనంపై; ఉండి= కూర్చుండి; విరాటుండు= విరాటుడు; అంతఃపుర= అంతఃపురంలో; వర్తులన్= ఉన్నవారిని; పిలిచి; అంతయున్= జరిగిందంతయు; సుదేష్ణకున్= దేవిఅగు సుదేష్ణకు; ఎఱింగింపన్= తెలియజేయటానికి; పనిచి= ఆజ్ఞాపించి; పాంచాలిన్= ద్రౌపదిని; తగిన తెఱంగునన్= తగిన విధంగా; గారవించునట్లు= గౌరవించే విధంగా; కావించెన్= చేశాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ధనంజయుండు= అర్జునుడు; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా తన పరిజనులందరితో సహా ధర్మరాజును సేవించదలచి, ధర్మరాజు అనుమతిమీద తగిన ఆసనంపై కూర్చుండి, విరాటుడు రాణివాసంలో ఉండేవారిని పిలిచి, జరిగిందంతా సుదేష్ణకు తెలియచెప్పుమని చెప్పి, ద్రౌపదిని తగినరీతిగా గౌరవించే ఏర్పాట్లు చేశాడు. అప్పుడు అర్జునుడు ఇట్లా అన్నాడు.

తే. 'చాల దుస్తరమైన యజ్ఞాతవాస । వత్సరంబు భగద్గర్భవాస గుప్తి
వలనఁ గడపితి మతి సుఖావాప్త చిత్త । వృత్తి నేము నిర్భయులమై విందులట్ల.' 344

ప్రతిపదార్థం: ఏము= మేము; చాలన్= మిక్కిలి; దుస్తరము+ఐన= దాటలేని; అజ్ఞాతవాస వత్సరంబు= అజ్ఞాతవాసం చేయవలసిన సంవత్సరం; భవత్= మీయొక్క; గర్భవాస= కడుపులో ఉన్నట్లుగా; గుప్తివలనన్= రహస్యంగా ఉండటం వలన; అతిసుఖ= మిక్కిలి సుఖాన్ని; ఆవాప్త= పొందబడిన; చిత్తవృత్తిన్= మనోవృత్తితో; నిర్భయులము+ఐ= భయంలేనివారమై; విందులు+అట్లు+అ= బంధువులవలెనే, అతిథులవలెనే; కడపితిమి= గడిపాము.

తాత్పర్యం: 'ఏ విధంగా గడుపుతామా అనుకొన్న ఈ అజ్ఞాతవాస సంవత్సరాన్ని మీ ఇంట్లో గర్భంలో ఉన్నట్లే సుఖంగా ఉండి ఎవరికీ తెలియకుండా బంధువులవలె గడిపాము.'

విశేషం: అలం: ఉపమ. 1. తిక్కన రచనలో తెలుగు జాతీయాలను సంస్కృతీకరించటం, సంస్కృత పదబంధాలను తెలుగుచేయటం తరచుగా కనబడుతుంది. 'నీ కడుపులో పెట్టుకొని రక్షించావు' - అన్న తెలుగు జాతీయానికి సంస్కృతీకరణం 'భవద్గర్భవాసగుప్తి' అనే సమాసం. గర్భవాసం అంటే మూలగృహమనీ, అంతఃపురమనీ, రాజమందిరమనీ భావం. పాండవుల అజ్ఞాతవాస ఉద్యోగాలన్నీ రాజమందిరానికే పరిమితమై ఉండటం చేత గర్భగుడి వంటి గర్భగృహంలోనే ఉన్నారు. కాబట్టి రహస్యం రక్షించబడిందని భావం. ఈ జాతీయం కృతజ్ఞతాభావాన్ని తెలుపుతుంది. ఈ సందర్భంలో మూలశ్లోకం ఇది- **"ఉషితాః స్మ మహారాజ! సుఖం తవ నివేశనే, అజ్ఞాతవాసముషితా గర్భవాస ఇవ ప్రజాః"** (4.66.10) గర్భవాసంలోని బిడ్డలవలె గుప్తంగా, రక్షణతో జీవించామని చెప్పినట్లు మూలంలో ఉండగా తిక్కన బిడ్డలవలె అనే ఉపమానం తీసివేసి జాతీయాన్ని ఉంచాడు. దానివలన మీరు కడుపులో పెట్టుకొని రక్షించగా రహస్యంగా రక్షణతో ఉండగలిగాం - అనే భావం ఏర్పడింది. అది కారణంగా పాండవులు నిర్భయంగా విందువలె అత్యంత సుఖావాసచిత్తవృత్తితో కాలం గడిపారట. గోప్యతకు గర్భవాసం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పోలిక. జీవించటానికి విందులు ఉపమానం. విందు - అంటే అతిథి, బంధువు. పాండవులు విరటుడి కొలువులో అతిథులుగా ఉండి, బంధువులుగా బయటపడతారు. తెలియనివారైనా దేవుళ్ళవలె గౌరవింపబడేవారు అతిథులు, అభ్యాగతులు. 'అతిథి దేవోభవ' అని న్యాయం. మూలంలో గుప్తికి మాత్రమే ఉపమ. తెలుగులో గుప్తికి, తృప్తికి కూడా ఉపమ అలంకరించబడింది. (సంపా.)

వ. అనిన విని విరాటుం డతని కిట్లనియె. 345

ప్రతిపదార్థం: అనినన్= అని; విని; విరాటుండు= విరాటరాజు; అతనికిన్= అర్జునుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అనగా విని విరాటుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

ఉ. 'ఏనన వేఱ యొక్కఁడనె? యిట్లనఁగాఁ దగునయ్య? యిమ్మెయిం
గానన దేశవాసములఁ గాఁటియ కోర్చి యడంగి యుండి మీ
పూనిక దీర్చి మీ రెలమిఁ బొందుట యెల్లను బుణ్యదేవతా
నూన దయాసమృద్ధి నను నొందుట గాదె సురేంద్రనందనా!' 346

ప్రతిపదార్థం: సురేంద్రనందనా!= అర్జునా?; ఏన్+అనన్= నేననగా; వేఱ= వేరుగా; ఒక్కఁడనె= పైవాడనా?; ఇట్లు= ఈ రీతిగా; అనఁగాన్= పలుకగా; తగునయ్య?= తగునా?; ఈ+మెయిన్= ఈ విధంగా; కాననదేశ= అడవి ప్రదేశంలో; వాసములన్= నివాసాలతో; కాఁటియకున్= బాధకు; ఓర్చి= సహించి; అడంగి+ఉండి= ఎవ్వరికీ తెలియకుండా అణగిఉండి; మీ పూనిక= మీ ప్రతిజ్ఞను; తీర్చి= చెల్లించి; మీరు; ఎలమిన్= సంతోషము; పొందుట= పొందగల్గుట; ఎల్లను= అంతయును; పుణ్య= పుణ్యంవల్ల సమకూడినట్టి; దేవతా= దేవతలయొక్క; అనూన= తక్కువకాని; దయా= దయయొక్క; సమృద్ధి= అతిశయం; ననున్= నన్ను; ఒందుట కాదె= పొందటమే కదా!

తాత్పర్యం: 'అర్జునా! నే నంటే వేరే పైవాడనా? అట్లా మాట్లాడటం నీకు ఉచితంగా ఉన్నదా? మీరు అడవిలో బాధలుపడి, అజ్ఞాతంగా ఇక్కడుండి అన్నమాట చెల్లించుకొని సంతోషంతో ఉన్నారంటే అదంతా నా పుణ్యం, దేవతల అనుగ్రహం మూలాననే కదా!'

వ. అని పలికి ధర్మనందనుం జూచి. 347

తాత్పర్యం: అని చెప్పి, ధర్మరాజును చూచి.

చ. 'ధరణియుఁ బట్టణంబు హయదంతి రథంబులు గోవులున్ భటో
త్కరము నమాత్యవర్గమును గాఁ గలరాజ్య మితండ యేలు; ని
ర్భరమున నేనుఁ బుత్రులును బంధులుఁ దమ్ములుఁ గొల్చి యుండెదం
గరిపురి కెత్తునట్టిపని గల్గిన నోపిన యంత సేసెదన్.' 348

ప్రతిపదార్థం: ధరణియున్= భూమియు; పట్టణంబు= పట్టణం; హయ= గుర్రాలు; దంతి= ఏనుగులు; రథంబులు= రథాలు; గోవులున్= ఆవులును; భట+ఉత్కరమున్= సైనికుల సముదాయం; అమాత్యవర్గమును+కాన్= మంత్రుల సముదాయంగా; కల= ఉన్న; రాజ్యము= నా రాజ్యాన్ని; ఇతండు+అ= ఈ ధర్మరాజే; ఏలున్= పరిపాలిస్తాడు; నేనున్= నేనును; పుత్రులును= నా కొడుకులును; బంధులున్= నా బంధువులును; తమ్ములున్= నా తమ్ములును; నిర్భరమునన్= నిబ్బరంగా; కొల్చి= సేవించి; ఉండెదన్= ఉంటాను; కరిపురికిన్= హస్తినాపురి పట్టణం మీదకు; ఎత్తు+అట్టిపని= దండెత్తవలసిన అవసరం; కల్గినన్= కల్గితే; ఓపిన+అంత= నాకు శక్తి ఉన్నంతవరకు; చేసెదన్= (సహాయం) చేస్తాను.

తాత్పర్యం: 'ఈ రాజ్యం, పట్టణం, ఏనుగులు, గుర్రాలు, రథాలు, గోవులు, భటులు, మంత్రులు - ఈ రాజ్యాన్నంతా ధర్మరాజే పరిపాలిస్తాడు. నేను, నా పుత్రులు, బంధువులు, తమ్ములు - అందరమూ నెమ్మదితో ఇతడిని కొలిచి ఉంటాం. హస్తినాపురం మీదికి దండెత్తవలసివస్తే నా శక్తికొలది ఉన్నంతవరకు నేను సాయం చేస్తాను.'

చ. అన విని యుత్తరుండు తగ నజ్జనపాలకుతోడ నిట్లను
'న్మన కొక రాజ్యముం గలదె? నన్నును నిన్నును నిన్న మొన్న వీ
రనితరసాధ్య శత్రు విజయంబునఁ గాచినయప్డు గల్గఁ జే
సినయది దక్క; దాని మఱి సెప్పఁగ నేటికి నింత వింతగన్? 349

ప్రతిపదార్థం: అనన్= అనగా; విని; ఉత్తరుండు= ఉత్తరుడు; తగన్= తగినట్లుగా; ఆ+జనపాలకుతోడన్= ఆ విరాటుడితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; మనకున్= నీకు-నాకు; ఒక రాజ్యమున్= ఇది అని ఒక రాజ్యం కూడ; కలదె?= ఉన్నదా?; నన్నునున్= నన్ను; నిన్నును= నిన్ను; నిన్న మొన్న= నిన్న మొన్న జరిగిన యుద్ధంలో; వీరు= ఈ పాండవులు; అనితరసాధ్య= ఇతరులకు సాధ్యంకాని; శత్రు= శత్రువులను; విజయంబునన్= విజయంతో; కాచిన+అప్డు= రక్షించినప్పుడు; కల్గన్+చేసిన అది+తక్క= మనకు ఉండేటట్లు చేసిందే తప్ప; దానిన్= ఆ రాజ్యాన్ని గూర్చి; ఇంత వింతగన్= ఇంత క్రొత్తగా; చెప్పఁగన్= చెప్పటం; ఏటికిన్= ఎందుకు?

తాత్పర్యం: ఆ మాటలు విని ఉత్తరుడు రాజుతో ఇట్లా అన్నాడు: 'మనకంటూ ఇప్పుడు ఒక రాజ్యం ఉన్నదా? నిన్నటి మొన్నటి యుద్ధంలో ఇతరులు సాధించలేని శత్రువులను జయించి నిన్నూ నన్నూ రక్షించి నిలబెట్టింది వీరే! ఈ రాజ్యమంతా మనకు దక్కించింది వీరే కదా! మరి వీరిచ్చిన దానినే మరల వీరికిస్తానని ఇంతగా వింత కలిగేటట్లు క్రొత్తగా చెప్పట మెందుకు?

విశేషం: మూలంలో ఈ మాటలు విరాటుడే అన్నట్లు ఉన్నది. తిక్కన ఉత్తరుడి నోట పలికించి ఔచిత్యాన్ని పాటించాడు. మాటలలో, వాక్యాల విన్యాసంలో తెలుగువారి పలుకుబడి బాగా వినబడుతున్నది. 'మన కొక రాజ్యముంగలదె?' - ఇది వ్యావహారిక వాక్యానికి ఛందోమయ గ్రాంథిక రూపం. తిక్కన తెలుగు వాక్య శిల్పి. (సంపా.)

వ. అది సిద్ధం బట్ల చెల్లుం గాక! యించుక విశేషంబు గలదు; వినుము. 350

ప్రతిపదార్థం: అది= రాజ్యం వారిదే అన్నది; సిద్ధంబు= ఇదివరకే ఏర్పడి ఉన్నది; అట్లు+అ= అది అట్లే; చెల్లున్+కాక!= చెల్లుగాక; ఇంచుక= కొద్దిగా; విశేషంబు= విశేషం; కలదు= ఉన్నది; వినుము.

తాత్పర్యం: రాజ్యం వారిదే అన్నది సిద్ధమే. అది అట్లే చెల్లుతుంది. ఇంకో విశేషం ఉన్నది, వినుము.

చ. సవినయ వృత్తిఁ గొల్వ మిట చన్న దినంబుల వీరు నీఱుపైఁ
గవిసిన నిప్పులట్ల యధికంబగు తేజము దోఁప కున్కి; న
ట్టి విధము సాపరాధతను డెందము లూఱటఁ బొంది యుండ నే
రవు మన; కట్లు గానఁ దగఁ బ్రార్థన సేయుట యుక్త మిత్తఱిన్. 351

ప్రతిపదార్థం: చన్న దినంబులన్= కడచిన రోజులలో; ఇట= ఇక్కడ; వీరు= ఈ పాండవులు; నీఱు= భస్మము; పైన్= పైన; కవిసిన= కప్పిన; నిప్పులు+అట్లు= నిప్పులవలె; అధికంబు+అగు= ఎక్కువైన; తేజము= తేజస్సు; తోఁపక+ఉన్కిన్= కనిపించకుండా ఉండటంచేత; సవినయవృత్తిన్= వినయంతో కూడిన నడతతో; కొల్వము= సేవించము; అట్టి విధము= అట్టి రీతి; సాపరాధతను= అపరాధంతో కూడి ఉండటంచేత; మనకున్= మనకు; డెందములు= హృదయాలు; ఊఱటన్= బాధనుండి తేరుకొనటం; పొంది+ఉండనేరవు= పొందిఉండలేవు; అట్లుకాన= ఆ కారణంతో; తగన్= తగినట్లు; ఈ+తఱిన్= ఈ సమయంలో; ప్రార్థన+చేయుట= ప్రార్థించటం; యుక్తము= తగినది.

తాత్పర్యం: వీరు జరిగిపోయిన రోజులలో 'నివురు గప్పిన నిప్పుల' వలె తమ తేజస్సు కప్పిపుచ్చికొని ఉన్నందున మనం వినయగుణంతో వీరిని సేవించలేకపోయాం; మనకు వీరి గొప్పతనం తెలియక అపరాధం చేసి ఉన్నాము. దాని వలన మన మనస్సులు బాధపడుతున్నాయి. మనకు ఊరట కలిగేటట్లు ఇప్పుడు మనం వీరిని ఆ తప్పులన్నీ క్షమించండని ప్రార్థన చేయటం సమంజసం.

విశేషం: అలం: ఉపమ.

వ. అదియునుం గాక. 352

తాత్పర్యం: అంతేకాక.

క. ధనవర్గంబులు వీరి । చ్చినయవి; యట్లగుట వేడ్క సేయవు; తగ నూ
తన మగు కానిక యీవల । యును వే తోడ్తేరఁ బనుపు ముత్తరఁ బ్రీతిన్.' 353

ప్రతిపదార్థం: ధన వర్గంబులు= ధన సముదాయాలు; వీరు= ఈ పాండవులు; ఇచ్చినవి; అట్లు= ఆ రీతిగా; అగుటన్= కావటంచేత; వేడ్క+చేయవు= ఇష్టం కలుగజేయవు; తగన్= తగినట్లు; నూతనము+అగు= క్రొత్తదైన; కానిక= కానుక; ఈ వలయును= ఇయ్యవలెను; ప్రీతిన్= ప్రీతితో; ఉత్తరన్= ఉత్తరను; వే= వేగంగా; తోడ్తేరన్= తోడు తెచ్చుటకు; పనుపుము= ఆజ్ఞాపించుము.

తాత్పర్యం: ధనములన్నీ వీరిచ్చినవే కనుక వాటిని వారి కిస్తే వారికి ఇష్టంగా ఉండదు. కనుక క్రొత్త కానుక ఏదైనా ఇవ్వాలి. వెంటనే సంతోషంగా ఉత్తరను తోడు తీసికొని రమ్మని ఆజ్ఞాపించవలసింది.'

వ. అనిన విని మత్స్యమహీవల్లభుండు మనంబలర మంత్రుల మొగంబు సూచి 'కుమారికనలంకరించుకొని తెం' డని నియోగించిన, వారును బ్రియంబునం జని తత్కార్యశ్రవణ సంప్రీతయగు సుదేష్ణ యనుమతంబున. 354

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; మత్స్యమహీవల్లభుండు= విరాటరాజు; మనంబు= మనస్సు; అలరన్= సంతోషించగా; మంత్రుల మొగంబు= మంత్రులయొక్క ముఖాలను; చూచి= చూచి; కుమారికను= ఉత్తరను; అలంకరించుకొని= అలంకరించి; తెండు+అని= తీసికొనిరమ్మని; నియోగించినన్= ఆజ్ఞాపించగా; వారునున్= వారు కూడ; ప్రియంబునన్= ఇష్టంతో; చని= వెళ్ళి; తద్+కార్య= ఆ శుభకార్యముయొక్క; శ్రవణ= వినటంచేత; సంప్రీత+అగు= ప్రీతిపొందిన; సుదేష్ణ= సుదేష్ణయొక్క; అనుమతంబునన్= అనుమతితో.

తాత్పర్యం: ఉత్తరుడు అట్లా అనగానే విని విరాటుడు మనస్సులో సంతోషించి మంత్రుల ముఖాలను చూచి, ఉత్తరను అలంకరించి తీసికొని రమ్మని ఆజ్ఞాపించాడు. వారు సంతోషంతో లోపలికి వెళ్ళి, ఆ విషయం చెప్పగా విని సంతోషించిన సుదేష్ణ అనుమతితో.

క. పదనికి రాఁ బులు గడిగిన । మదనాస్త్రము రేఖ గలిగి మానినిమెయి సె
న్నొందవఁ గయిసేసి రప్పుడు । ముదితా జనములు ప్రమోదమున లలితముగన్. 355

ప్రతిపదార్థం: పదనికిరాన్= పదును వచ్చేటట్లుగా; పులు+కడిగిన= మాలిన్యం కడిగివేసిన; మదన+అస్త్రము= మన్మథుడి బాణంయొక్క; రేఖ= అందం; కలిగి= ఉండి; మానిని= ఉత్తరయొక్క; మెయి= శరీరం; చెన్ను+ఒదవన్= అతిశయించిన అందం కలిగేటట్లుగా; అప్పుడు= ఆ సమయంలో; ముదితా జనములు= స్త్రీ జనాలు; ప్రమోదమునన్= సంతోషంతో; లలితముగన్= సుందరంగా; కయిసేసిరి= అలంకరించారు.

తాత్పర్యం: పదను వచ్చేటట్లుగా మాలిన్యం కడిగివైచిన మన్మథుడి అస్త్రంవలె అందగించియున్న ఉత్తరయొక్క శరీరానికి ఇంకా అందం వచ్చేటట్లుగా స్త్రీలు సంతోషంతో అలంకరించారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

విరాటుని మంత్రు లుత్తరను బాండవుల యొద్దకుఁ దోడ్తెచ్చుట (సం. 4-66-27)

వ. ఇట్లు శృంగారంబు సేసిన యమ్ముద్దియకు ముక్తాఫల ప్రాలంబ మాలికలతోడి గొడుగు వట్టించి యత్యాదరంబున నయ్యమాత్యులు తోడ్తేర ధారాధర నికర మనోహరయగు పర్జన్యలక్ష్మియుంబోలె వచ్చుచున్నం గని విరాటుం డెదురు వోయి పురోహితులును బంధుజనంబులుం దానునుం బొదివికొని పాండవాగ్రజు నగ్రభాగంబునకుం దెచ్చి యచ్చెలువ నిలిపి, సపరివారంబుగా దండప్రణామంబు సేసి, చేతులు మొగిడ్చి యిట్లనియె. 356

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; శృంగారంబు+చేసిన= అలంకరించిన; ఆ+ముద్దియకున్= ఆ ఉత్తరకు; ముక్తాఫల= ముత్యాలయొక్క; ప్రాలంబ మాలికలతోడి= వ్రేలాడే మాలలు కల; గొడుగు= గొడుగు; పట్టించి= పట్టేటట్లు చేసి; అతి+ఆదరంబునన్= మిక్కిలి ప్రేమతో; ఆ+అమాత్యులు= ఆ మంత్రులు; తోడ్తేరన్= తోడుకొనిరాగా; ధారాధరనికర= మబ్బుల సముదాయంతో; మనోహర+అగు= అందమైన; పర్జన్యలక్ష్మియున్+పోలెన్= వానకాలపు లక్ష్మివలె; వచ్చుచున్నన్= వస్తూ ఉంటే; కని= చూచి; విరాటుండు= విరాటరాజు; ఎదురు+పోయి= ఎదురుగా వెళ్ళి; పురోహితులును= బ్రాహ్మణ పురోహితులును; బంధు జనంబులున్= బంధువులును; తానునున్= (విరాటుడును); పొదివికొని= చుట్టుముట్టి; పాండవ+అగ్రజు= ధర్మరాజుయొక్క; అగ్రభాగంబునకున్= సమక్షమునకు; తెచ్చి= తీసికొనివచ్చి; ఆ+చెలువన్= ఆమెను; నిలిపి= ఉంచి; సపరివారంబుగాన్= పరివారంతో సహా; దండప్రణామంబు+చేసి= దండము వలె చాగిలి పడి నమస్కారం చేసి; చేతులు= చేతులను; మొగిడ్చి= దగ్గరగా మొగ్గవలె పెట్టి; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా సింగారించి, ముత్యాల దండలు వ్రేలాడే మాలికలుగా కట్టిన గొడుగు పట్టించి, ఎక్కువ ప్రేమతో ఆ మంత్రులు తోడుతో తీసికొని రాగా, మబ్బులతో మనోహరమైన వర్షాకాల లక్ష్మివలె వస్తూ ఉన్న ఉత్తరను చూచి విరాటుడు ఎదురుగా వెళ్ళి, పురోహిత బ్రాహ్మణులు, బంధువులు, తాను చుట్టుకొని ధర్మరాజు ఎదుటికి తీసికొని వచ్చి ఆపి, పరివారమూ తానూ సాష్టాంగ దండప్రణామాలు చేసి చేతులు జోడించి ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **'ఎఱుఁగమి చీఁకటి నీ పె । ద్దఱికంబు దలంప; నేమి తప్పు గలిగినన్**
మఱచి దయఁ జూడు; మిట్లం । దఱు నీకుం బనులు సేయఁ దగుదురు వీరల్.' **357**

ప్రతిపదార్థం: ఎఱుఁగమి= అజ్ఞానమనే; చీఁకటిన్= అంధకారంచేత; నీ పెద్దఱికంబు= నీ గొప్పతనాన్ని; తలంపను= తలపలేదు; ఏమి తప్పు= ఏ దోషం; కలిగినన్= చేసినను; మఱచి= మరచిపోయి; దయన్= దయతో; చూడుము= కటాక్షించుము; ఇట్లు= ఈ విధంగా; వీరల్= వీరు; అందఱున్= అందరును; నీకున్= నీకు; పనులు= చెప్పిన పనులు; చేయన్+తగుదురు= చేయటానికి తగినవారు, (అంటే చేస్తారని భావం.)

తాత్పర్యం: 'అజ్ఞానమనే చీకటిలో నీ గొప్పతనం తెలియలేక ఏ తప్పులు చేసినా క్షమించి, అవి మరచిపోయి మమ్ము కటాక్షించుము. వీరందరు ఇకమీద నీ సేవలు చేస్తారు.'

విశేషం: అలం: రూపకం.

వ. **అని నిజానుజ తనూజులం జూపి, మఱియును.** **358**

ప్రతిపదార్థం: అని= పలికి; నిజ= తనయొక్క; అనుజ= తమ్ములను; తనూజులన్= కొడుకులను; చూపి= చూపించి; మఱియును= ఇంకను.

తాత్పర్యం: అట్లని తన తమ్ములను, కొడుకులను చూపాడు. ఇంకా ఇట్లా అన్నాడు.

క. **'ఇమ్ముద్దియ నర్జునునకు । ని మ్మీపని బంధుజనుల కిందఱకుఁ గడున్**
సమ్మత; మెల్ల ప్రజకు నే । నిమ్మెయి నినుఁ జేరి బ్రతుకు టిష్టం బధిపా!' **359**

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధర్మరాజా!; ఈ+ముద్దియన్= ఈ కన్యను; అర్జుననకున్= అర్జునుడికి; ఇమ్ము= ఇయ్యవలసింది; ఈ పని= ఇట్లా ఇవ్వటం; బంధు జనులకున్= బంధువులకు; ఇందఱకున్= ఈ అందరికి; కడున్= మిక్కిలి; సమ్మతము= ఇష్టం; ఎల్ల ప్రజకున్= ప్రజలందరికిని; నేను; ఈ+మెయిన్= ఈ రీతిగా; నినున్= నిన్ను; చేరి= ఆశ్రయించి; బ్రతుకుట= జీవించటం; ఇష్టంబు= ఇష్టం.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఈ కన్యను అర్జునుడికి ఇమ్ము. అట్లా ఇవ్వటం బంధుజను లందరికి సమ్మతమైనదే. నేను నిన్ను చేరి బ్రతకటం మా ప్రజలందరికీ ఇష్టం.'

క. అని పలికిన విని కుంతీ । తనయాగ్రజుఁ డింద్రసుతువదన మాలోకిం
చిన నాతఁ డిట్టులను న । మ్మనుజేంద్రుఁడు వినుచునుండ మత్స్యాధిపుతోన్. 360

ప్రతిపదార్థం: అని పలికినన్= అని చెప్పగా; విని; కుంతీ తనయ+అగ్రజుఁడు= ధర్మరాజు; ఇంద్రసుతు= అర్జునుడి యొక్క; వదనము= ముఖాన్ని; ఆలోకించినన్= చూడగా; ఆతఁడు= అర్జునుడు; ఆ+మనుజ+ఇంద్రుఁడు= ఆ ధర్మరాజు; వినుచున్+ ఉండన్= వినుచుండగా; మత్స్య+అధిపుతోన్= విరాటుడితో; ఇట్టులు= ఈ రీతిగా; అనున్= పలికాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని ధర్మరాజు అర్జునుడి ముఖంవైపు చూచాడు. అర్జునుడు ధర్మరాజు వింటూ ఉండగా విరాటుడితో ఇట్లా అన్నాడు.

క. 'ఈ కన్నియఁ గోడలిఁగా । గైకొనియెదఁ గాని యిది దగ దుచితవృత్తిన్
నాకడన యబల మెలఁగుట । లోకము శంకించు నన్ను లోలాత్మునిఁగన్. 361

ప్రతిపదార్థం: ఈ కన్నియన్= ఈ ఉత్తరను; కోడలిన్+కాన్= నాకు కోడలుగా; కైకొనియెదన్= స్వీకరిస్తాను; కాని= అంతేకాని; ఇది= నేనే స్వీకరించటం; తగదు= పనికిరాదు; ఉచిత వృత్తిన్= తగిన రీతిలో; అబల= ఉత్తర; నాకడన= నా వద్దనే; మెలఁగుటన్= మెలగినందున; లోకము= లోకులు; నన్నున్= నన్ను; లోల+ఆత్మునిగన్= చంచలమైన మనస్సు కలవాడినిగా; శంకించున్= సందేహిస్తారు.

తాత్పర్యం: 'ఈ ఉత్తరను నేను కోడలుగా స్వీకరిస్తాను కాని భార్యగా చేసికొనను. ఈమె నావద్ద తగినరీతిగా మెలగింది. అందుచే లోకులు నన్ను చంచలమైన స్వభావం కలవాడినిగా సందేహిస్తారు.

వ. అదియునుం గాక నృత్తగీతాదులయెడ ని క్కోమలికి గురుండనైన నాకు నివ్విధంబు ధర్మంబు గాదు కావున. 362

ప్రతిపదార్థం: అదియునున్+కాక= అదీకాక; నృత్త గీత+ఆదులయెడన్= నాట్యం-పాటలు మొదలైన వాటిపట్ల; ఈ+కోమలి= ఈ కన్యకకు; గురుండను+ఐన నాకున్= గురువునైన నాకు; ఈ+విధంబు= ఈమెను పెండ్లాడటం; ధర్మంబు+కాదు= ధర్మం కాదు; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: అదీకాక ఈమెకు నాట్యం, పాటలు మొదలగువాటికి నేను గురువును. కావున ఈమెను పెండ్లాడటం ధర్మం కాదు. కాబట్టి. (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. హరి మేనల్లుఁడు, బాహువీర్య పటు శౌర్యస్ఫూర్తి త్రైలోక్య సుం
దరుఁ, డాచార పవిత్రుఁ, డంచిత కళాదక్షుం, డుదారుండు, కా
తర సంరక్షకుఁ, డార్య సమ్మతుఁడు, విద్యా వైభవోల్లాసి, య
త్యురుతేజుండు వరించుఁ గాక యభిమన్యుం డీ సరోజాననన్.' 363

ప్రతిపదార్థం: హరి మేనల్లుఁడు= కృష్ణుడికి చెల్లెలి కొడుకు; బాహువీర్య= భుజబలంతోను; పటు= గొప్పదైన; శౌర్యస్ఫూర్తి= శౌర్యంతోను ప్రకాశించేవాడు; త్రైలోక్య సుందరుఁడు= మూడు లోకాలలోను సుందరుడైనవాడు; ఆచార= నడవడిలో; పవిత్రుఁడు= పవిత్రమైనవాడు; అంచిత= గొప్పవైన; కళా= కళలలో; దక్షుండు= సమర్థుడు; ఉదారుండు= ఔదార్యం కలవాడు;

కాతర= భయం కలవారిని; సంరక్షకుఁడు= సంరక్షించేవాడు; ఆర్యసమ్మతుఁడు= పెద్దలకు ఇష్టమైనవాడు; విద్యావైభవ= విద్యలయొక్క వైభవంతో; ఉల్లాసి= ప్రకాశించేవాడు; అతి+ఉరు= చాల విశాలమైన; తేజుండు= తేజస్సు కలవాడు; అభిమన్యుండు= అభిమన్యుడు; ఈ సరోజ+ఆననన్= పద్మం వంటి ముఖంకల ఈ ఉత్తరను; వరించున్ కాక!= వివాహం చేసికొంటాడు గాక!

తాత్పర్యం: మా అభిమన్యుడు ఈమెను వివాహం చేసికొంటాడు. అతడు ఎట్టివాడు అనగా - శ్రీకృష్ణుడికి సాక్షాత్తు మేనల్లుడు. సుభద్ర కొడుకు. బాహు పరాక్రమం, శౌర్యం కలవాడు. మూడు లోకాలలోనూ సుందరమైనవాడు. పవిత్రమైన ప్రవర్తన కలవాడు. కళాకౌశలం కలవాడు. ఉదారుడు. భయం కలవారిని రక్షిస్తాడు. పెద్దలకు ఇష్టంగా ఉంటాడు. విద్యావైభవం కలవాడు. గొప్ప తేజస్సు కలవాడు.'

విశేషం: 1. అలం: ఉదాత్తం, రూపకం. అభిమన్యుడు ఉత్తమ నాయకుడనీ, ఉత్తమ వరుడనీ పరిచయం చేసే విశిష్ట పద్యమిది. అర్జునుడి కొడుకు అతడికంటె ఘనుడన్నంతగా చెప్పటం ఇందులో ధ్వని.

"త్యాగీ, కృతీ, కులీనః, సుశ్రీకో రూపయౌవనోత్సాహీ

దక్షోఽనురక్తలోక స్తేజో వైదగ్ధ్య శీలవాన్ నేతా" - అని సాహిత్య దర్పణం నాయక లక్షణాలను పేర్కొన్నది. వారికి మేనల్లుడు కావటం ఆయన కబ్బిన కులీనత్వం. సుశ్రీకత్వం (మహాభాగ్యం. ఇది గుణప్రధానమైన మహాభాగ్యం); బాహువీర్యపటుశౌర్యస్ఫూర్తి - దక్షత్వ సూచకం. త్రైలోక్య సుందరుడు కావటం రూపవత్త్వ లక్షణం. ఆచార పవిత్రుడు కావటం శీల లక్షణం. అంచిత కళాదక్షత్వం వైదగ్ధ్య లక్షణం. ఉదారత్వం త్యాగి లక్షణం. కాతర సంరక్షణ స్వభావం ఉత్సాహలక్షణం. ఆర్య సమ్మతుడు కావటం లోకానురక్తుడైనవాడి లక్షణం. విద్యావైభవోల్లాసిత్వం - 'విద్యా దదాతి వినయం' అనే న్యాయంలో సుకృతి యొక్క లక్షణం. అత్యురుతేజుడు అనే విశేషణం అతడి తేజస్వితకు సూచకం. అతడి తేజస్విత అతడిని సూర్యుడివలె భాసింప చేస్తున్నది. రూపకాలంకార స్ఫూర్తితో అతడు సూర్యుడు కాబట్టే సరోజానన అయిన ఉత్తరను గ్రహించటానికి అర్హుడని ధ్వని. వారిరువురికీ ఈడూజోడూ, ఆనుకూల్యం అనురాగం కుదిరినవని అర్జునుడి నిర్ణయం. ఉదాత్త వర్ణనం. ఉదాత్తాలంకారంలో ఉండటం, అనురూప దాంపత్యాన్ని రూపకంలో ధ్వనింపజేయటం అలంకార శిల్పం.

2. అభిమన్యుడిలో ఉత్తమ వరుడి లక్షణాలు సూచించబడ్డాయని కొందరు విమర్శకులు భావించారు. "కన్యా వరయతే రూపం, మాతా విత్తం, పితా శ్రుతమ్, బాంధవాః కుల మిచ్ఛన్తి, మృష్టాన్న మితరే జనాః" అని లోకోక్తి. అందరూ మెచ్చుకొనే అన్ని గుణాలూ ఉండటం చేత అభిమన్యుడు ఆదర్శ వరుడని ధ్వని. అయితే ఈ వర లక్షణాలు సామాన్య లక్షణాలే. అభిమన్యుడి లక్షణాలు వీరోచిత లక్షణాలనీ, జగదేకవీరుడైన అర్జునుడు ఎన్నిక చేసిన లక్షణాలనీ గ్రహించటం ఉచితం. అన్నింటికంటె గొప్ప అదృష్టం ఆతడు 'హరిమేనల్లుడు' కావటం. శ్రీకృష్ణుడి పరిపూర్ణ కటాక్షం అతడి మీద ఉన్నది. ఆ విశేషణంలో తిక్కన సుభద్రా వివాహంలోనూ, పాండవ వంశాంకుర రక్షణంలోనూ శ్రీకృష్ణుడు నిర్వహించిన, నిర్వహించబోయే దివ్యపాత్రను పఠితల చేత భావింప చేసే ధ్వని గమ్యమానం! (సంపా.)

వ. అనిన విని మత్స్యమహీకాంతుం డత్యంత సంతుష్టాంతరంగుండై. 364

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; మత్స్యమహీకాంతుండు= విరాటరాజు; అత్యంత= మిక్కిలి; సంతుష్ట= సంతోషించిన; అంతరంగుండు+ఐ= మనస్సు కలవాడై.

తాత్పర్యం: అనేటప్పటికి విని విరాటుడు మహా సంతోషంతో.

తే. 'అర్జునుని వియ్య మనియెడు నంతకంటెఁ । గడవఁ బెంపు నా కెయ్యది? కార్యనిశ్చ
యంబు ధర్మతనూభవుం డానతిచ్చు । వాఁడు; మనమెల్లఁ గావించు వార మదియు.' 365

ప్రతిపదార్థం: అర్జునుని= అర్జునుడితో; వియ్యము+అనియెడు అంతకంటెన్= వియ్యం పొందటం అనేదానికంటె; కడవన్= కడచుటకు; పెంపు= అభివృద్ధి; నాకున్= నాకు; ఎయ్యది= ఏముంటుంది? ధర్మతనూభవుండు= ధర్మరాజు; కార్యనిశ్చయంబు= కార్యంయొక్క నిశ్చయాన్ని; ఆనతి+ఇచ్చువాఁడు= ఆజ్ఞాపించేవాడు; అదియున్= దానిని; మనము+ఎల్లన్= మనం అందరం; కావించు వారము= చేసేవాళ్ళం.

తాత్పర్యం: 'అర్జునుడితో వియ్యమందటం కంటె కావలసింది ఏమున్నది? ధర్మరాజు కార్యనిశ్చయం చేస్తే, మనమంతా దానిని ఆచరణలో పెట్టుదాం.'

ఆ. **అనుడు నతని కిట్టు లనుఁ బాండవాగ్రజుం । 'డింద్రతనయుఁ డుచిత మెఱిఁగి పలికె;**
నిట్లు సేయువార; మిప్పుడు చుట్టాల । కెల్లఁ జెప్పిపుచ్చుఁ డీశుభంబు.' 366

ప్రతిపదార్థం: అనుడున్= అనిన వెంటనే; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; అతనికిన్= విరాటునకు; ఇట్టులు= ఈ రీతిగా; అనున్= అన్నాడు; ఇంద్రతనయుఁడు= అర్జునుడు; ఉచితము= ధర్మమును; ఎఱిఁగి= తెలిసి; పలికెన్= మాట్లాడాడు; ఇట్లు= అర్జునుడు చెప్పినట్లే; చేయువారము= చేద్దాం; ఇప్పుడు= ఇప్పుడే; ఈ శుభంబు= ఈ శుభవార్తను; చుట్టాలకున్= బంధువులకు; ఎల్లన్= అందరికి; చెప్పి పుచ్చుఁడు= చెప్పి పంపండి.

తాత్పర్యం: అట్లనగా ధర్మరాజు ఆ విరాటుడితో ఈ విధంగా అన్నాడు- 'అర్జునుడు ధర్మం తెలిసి మాట్లాడాడు. అతడు చెప్పినట్లే చేద్దాం. ఇప్పుడే ఈ శుభవార్తను చుట్టాలకందరికి తెలిసేట్టు చెప్పి పంపండి.'

వ. **అని నిశ్చయించి పలికిన విరాటుండును 'గౌరవాన్వయ సంబంధంబున మాత్స్యవంశంబు పావనం బయ్యె' నని పలుకుచు ధర్మజ భీమార్జున నకుల సహదేవులకుఁ గ్రమంబున నుత్తరఁ బ్రణామంబు చేయించిన, వారు దీవించి యంతఃపుర గమనంబునకు ననుజ్ఞసేయ, నచ్చెలువ నెచ్చెలులుం దానును దత్సమయసముచితపరివార పరివృతయై యరిగిన యనంతరంబ, మౌహూర్తికుల రావించి లగ్న నిరూపణంబు సేసి యాదవ పాంచాలాది బంధుజనంబుల నెల్లఁ బెండ్లికిం బిలువ రెండు దెఱంగుల వారును గాలరులం బనిచి; రజాతశత్రుండును విరటు గారవించి తా రతనిపాల నజ్ఞాతవాసంబు సుఖవృత్తి నడపికొనుట వాక్రుచ్చి పలికి, యతని గుణంబులు గొనియాడి 'నీవు మాకు వాసుదేవునట్ల కాక సామాన్య బంధుండవే?' యని సంభావించి, వినయ నిభృతుం డగు నతనిం దిగిచి పునఃపున రాలింగనంబు సేసిన, నతండును ససంభ్రమ పరిజన సముపనీయ మానంబు లగు నానా విధోపకరణంబులం గౌంతేయుల వివిధోపచారంబు లాచరించి, మహార్హ మజ్జన భోజనంబులు నడపె; నంత, నక్కడ దుర్యోధనుండు నిజపురంబునకుం జనిచని నడుమ విడిసిన యెడం గర్ణశకుని దుశ్శాసనుల దుర్మంత్రంబుఁ బట్టి గాంగేయుని వచనంబు లప్రమాణంబులు సేసి, ధర్మతనయుం డసత్యంబున కియ్యకొనమి యెఱింగి యాతనిపాలికి దూతం బుత్తెంచిన, వాఁడు నేతెంచి కాంచి యిట్లనియె. 367**

ప్రతిపదార్థం: అని= అట్లు; నిశ్చయించి= నిశ్చయం చేసి; పలికినన్= చెప్పగా; విరాటుండును= విరాటరాజు కూడ; కౌరవ+ అన్వయ= కౌరవ వంశంతో; సంబంధంబునన్= ఇచ్చి పుచ్చుకొనే సంబంధంతో; మాత్స్యవంశంబు= తమ మత్స్యరాజ వంశం; పావనంబు= పవిత్రమైనది; అయ్యెను+అని= అయిందని; పలుకుచున్= చెప్పుతూ, ధర్మజ= ధర్మరాజుకు; భీమ= భీముడికి;

అర్జున= అర్జునుడికి, నకుల= నకులుడికి; సహదేవులకున్= సహదేవుడికి; క్రమంబునన్= జ్యేష్ఠానుక్రమంగా; ఉత్తరన్= ఉత్తరచేత; ప్రణామంబు= నమస్కారం; చేయించినన్= చేయించగా; వారు= ఆ పాండవులు; దీవించి= ఆశీర్వదించి; అంతఃపుర గమనంబునకున్= అంతఃపురంలోకి వెళ్ళటానికి; అనుజ్ఞచేయన్= అనుమతించగా; ఆ+చెలువ= ఆ ఉత్తర; నెఱ+చెలులున్= చెలికత్తెలును; తానును= (ఉత్తరయు); తత్సమయ= ఆ సమయానికి; సముచిత= తగిన; పరివార= పరివారంతో; పరివృత+ఐ= చుట్టుకొనబడినదై; అరిగిన అనంతరంబు+అ= వెళ్ళిన తర్వాత; మౌహూర్తికులన్= ముహూర్తం నిర్ణయించే దైవజ్ఞులను; రావించి= రప్పించి; లగ్న నిరూపణంబు= లగ్నం ఎప్పుడో నిరూపించుటను; చేసి; యాదవ= యాదవులు; పాంచాల+ఆది= పాంచాలురు మొదలైన; బంధు జనంబులను= బంధువులను; ఎల్లన్= అందరిని; పెండ్లికిన్= పెళ్ళికి; పిలువన్= పిలువటానికి; రెండు తెఱంగులవారును= ఆడపెళ్ళివారు, మగపెళ్ళివారును; కాలరులన్= కాలి బంట్లను; పనిచిరి= పంపారు; అజాత శత్రుండును= ధర్మరాజు కూడ; విరటున్= విరాటరాజును; గారవించి= గౌరవించి; తారు= తాము; అతని పాలన్= అతనివద్ద; అజ్ఞాతవాసంబు= అజ్ఞాతవాసాన్ని; సుఖవృత్తిన్= సుఖమైన వృత్తితో; నడపికొనుట= వెళ్ళించుటను; వాక్రుచ్చి పలికి= ఉద్దేశించి చెప్పి; అతని గుణంబులు= విరాటుడి మంచి గుణాలు; కొనియాడి= పొగడి; నీవు= (విరాటుడు); మాకున్= (పాండవులకు); వాసుదేవు+అట్లు+అ= శ్రీకృష్ణుడివలె; కాక= అట్లుగాక; సామాన్య బంధుండవే?= సామాన్యమైన బంధువువా?; అని సంభావించి= అని గౌరవించి; వినయ= వినయంతో; నిభృతుండు+అగు+అతనిన్= నిండిన అతడిని; తిగిచి= దగ్గరకు లాగికొని; పునఃపునః+ఆలింగనంబు= మళ్ళీ మళ్ళీ కౌగలించుకొనుట; చేసినన్= చేయగా; అతండును= విరాటుడు కూడా; ససంభ్రమ= సంబరంతో, త్వరతో కూడిన; పరిజన= పరిజనులచేత; సముపనీయ మానంబులు+అగు= తీసికొని రాబడుతున్న; నానావిధ= అనేక విధాలైన; ఉపకరణంబులన్= పరికరాలతో; కౌంతేయులకున్= పాండవులకు; వివిధ+ ఉపచారంబులు= పలురకాల ఉపచారాలు; ఆచరించి= చేసి; మహా+అర్హ= గొప్పవారికి తగిన; మజ్జన= స్నానం; భోజనంబులు= భోజనాలు; నడపెన్= చేయించాడు; అంతన్= అంతట; అక్కడన్= దుర్యోధనుడి వైపున; దుర్యోధనుండు= సుయోధనుడు; నిజపురంబునకున్= తన పట్టణానికి; చనిచని= వెళ్ళుతూ; నడుమన్= మధ్యలో; విడిసిన+ఎడన్= విడిదిచేసిన చోటున; కర్ణ= కర్ణుడియొక్క; శకుని= శకునియొక్క; దుశ్శాసనుల= దుశ్శాసనుడియొక్క; దుర్మంత్రంబున్+పట్టి= చెడు ఆలోచనల ననుసరించి; గాంగేయుని= భీష్ముడి యొక్క; వచనంబులు= మాటలు; అప్రమాణంబులు= ప్రమాణం కానివాటినిగా; చేసి= లెక్కించి; ధర్మతనయుండు= ధర్మరాజు; అసత్యంబునకున్= అబద్ధం ఆడటానికి; ఇయ్యకొనమి= ఒప్పుకొనకపోవటం; ఎఱింగి= తెలిసి; ఆతనిపాలికిన్= అతడివద్దకు; దూతన్= దూతను; పుత్తెంచినన్= పంపగా; వాఁడును= వాడుకూడ; ఏతెంచి= వెళ్లి; కాంచి= చూచి; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఇట్లా నిశ్చయం చేసి చెప్పగా, విరాటుడు 'కౌరవవంశంతో సంబంధం వలన మా మత్స్యవంశం పవిత్రమైన'దని అంటూ ఉత్తరచేత ధర్మరాజ భీమ అర్జున నకుల సహదేవులకు క్రమంగా ప్రణామం చేయించాడు. వారు దీవించి అంతఃపురంలోనికి వెళ్ళు మని అనుమతించారు. ఆమె చెలికత్తెలతో అప్పటికి తగిన పరివారంతో లోనికి వెళ్ళింది. అప్పుడు దైవజ్ఞులను రప్పించారు. లగ్న నిర్ణయం చేయించారు. యాదవులు, పాంచాలురు మొదలైన బంధువులను అందరినీ పెళ్ళికి పిలవటం కొరకు ఉభయవర్గాలవారును బంటులను పంపారు. ధర్మరాజు విరాటరాజును గౌరవించి, 'మేము మీవద్ద సుఖంగా అజ్ఞాతవాసం నడపికొన్నాం' అని అతని సుగుణాలు పొగడి, 'మాకు శ్రీకృష్ణు డెంతో నీవును అంతే కాని సామాన్య బంధుడవు కావు' అని, వినయంతో నిండిన అతడిని ఎత్తి మళ్ళీ మళ్ళీ కౌగిలించుకొన్నాడు. అతడు పరిజనంచేత ఉపచారాలు చేయించటానికి పరికరాలు తెప్పించి వారికి ఎన్నో ఉపచారాలు చేశాడు. మహారాజులకు ఉచితమైన దివ్యస్నాన భోజనాలు ఏర్పాటు చేయించాడు. ఇక అక్కడ దుర్యోధనుడు అంచెలంచెలుగా ప్రయాణించి నగరం చేరుకొంటూ దారిలో విడుదలలో కర్ణ, శకుని, దుశ్శాసనుల దురాలోచనల ననుసరించి, భీష్ముడి మాటలను ప్రమాణాలుగా మన్నించక, ధర్మరాజు అసత్యం ఆడడు కనుక, అతడి దగ్గరికి దూతను పంపాడు. ఆ దూత వెళ్ళి ధర్మరాజును దర్శించి ఇట్లా అన్నాడు.

తే. **'వాలి యజ్ఞాత వాస సంవత్సరంబు । నిండకుండంగ మున్న పార్థుండు బయలు**
మెఱసి సమయంబు దప్పె; నీ వెఱిఁగి దీని । కేది తగు నది సేయుము మేదినీశ!' **368**

ప్రతిపదార్థం: మేదినీ+ఈశ!= ధర్మరాజా!; వాలి= అతిశయించి (పూని); అజ్ఞాతవాస సంవత్సరంబు= అజ్ఞాతవాసం చేయవలసిన సంవత్సరం; నిండక+ఉండంగన్= పూర్తికావటానికి; మున్ను+అ= ముందుగానే; పార్థుండు= అర్జునుడు; బయలు మెఱసి= బయటికి స్పష్టంగా వచ్చి; సమయంబు= శపథమును; తప్పెన్= తప్పాడు; నీవు; ఎఱిఁగి= తెలిసికొని; దీనికిన్= ఈ వచ్చినదానికి; ఏది తగును= ఏది చేస్తే తగినపనో; అది+చేయుము= దానిని చేయుము.

తాత్పర్యం: 'ధర్మరాజా! మీ అజ్ఞాతవాస సంవత్సరం పూర్తికాక మునుపే అర్జునుడు బయటపడ్డాడు. నీవు లెక్కచూచి తెలిసికొని, ఏది ఉచితమో దానిని చేయవలసింది.'

వ. **అని పునర్వనవాసకరణంబు దోఁప నాడిన నవ్వి, యధిష్ఠిత సత్యవ్రతుం డయిన యుధిష్ఠిరుం డతని కిట్లనియె.** **369**

ప్రతిపదార్థం: అని= ఇట్లు; పునర్వనవాస= తిరిగి వనవాసం; కరణంబు= చేయటం; తోఁపన్= తోచేటట్లుగా; ఆడినన్= పలుకగా; నవ్వి= పరిహాసం చేసి; అధిష్ఠిత సత్యవ్రతుండు+అయిన= సత్యవ్రతం పట్టిన; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అతనికిన్= ఆ దూతతో; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అని తిరిగి వనవాసం చేయాలని తోచేటట్లు దూత పలుకగా సత్యవ్రతనిష్ఠుడైన ధర్మరాజు నవ్వి ఆ దూతతో ఇట్లా అన్నాడు.

క. **'నిండె సమయాబ్దములు; నిం । కొం డనలే; దిపుడ చని సుయోధనుతో భీ**
ష్మండును గురుఁడును వినఁగా । నిండె; ననుము నిండె నిండె నిక్కంబునకున్.' **370**

ప్రతిపదార్థం: సమయ= పందెం కాచి శపథం చేసిన; అబ్దములున్= సంవత్సరాలు; నిండెన్= పూర్తి అయ్యాయి; ఇంకన్= ఇక; ఒండు= మరొకటి; అనన్= అనటానికి; లేదు= ఏమీ లేదు; ఇపుడు+అ= ఇప్పుడే; చని= వెళ్ళి; సుయోధనుతోన్= దుర్యోధనుడితో; భీష్ముండును= భీష్ముడును; గురుఁడును= ద్రోణుడును; వినఁగాన్= వింటూ ఉండగా; నిండెను= నిండినవి; అనుము= అని చెప్పుము; నిక్కంబునకున్= నిజానికి; నిండెన్+నిండెన్= ముమ్మారు నిండినవి.

తాత్పర్యం: 'శపథం చేసినట్లుగా పదమూడేళ్ళు నిండాయి. ఇంకొకటి చెప్పటానికి ఏమీ లేదు. ఇప్పుడే వెళ్ళి నీవు దుర్యోధనుడితో భీష్ముడు, ద్రోణుడు వింటుండగా నిండాయని చెప్పుము. నిజానికి నిండాయి, నిండాయి; ముమ్మాటికి నిండాయి.'

చ. **అని తగఁ జెప్పి పుచ్చఁ జని యాతఁడు తప్పక చెప్పె; నంతయున్**
విని ధృతరాష్ట్రసూనుఁడు వివేకవిహీనత నాఁటి రాత్రి కొ
ల్వున గురు భీష్మ కర్ణ కృపులుం దనతమ్ములు నుండ ధర్మనం
దనునకు దూతఁ బుచ్చిన విధంబు ప్రకాశము సేయ కిట్లనున్. **371**

ప్రతిపదార్థం: అని= ఇట్లు; తగన్= తగినట్లు; చెప్పి పుచ్చన్= చెప్పిపంపగా; ఆతఁడు= ఆ దూత; చని= వెళ్ళి; అంతయున్= జరిగిందంతా; తప్పక= విడువక; చెప్పెన్= చెప్పాడు; విని; ధృతరాష్ట్ర సూనుఁడు= దుర్యోధనుడు; వివేక విహీనతన్= వివేకం లేకపోవటంచేత; నాఁటిరాత్రి= ఆ రాత్రి; కొల్వునన్= సభలో; గురు= ద్రోణుడు; భీష్మ= భీష్ముడు; కర్ణ= కర్ణుడు; కృపులున్= కృపుడును; తన తమ్ములున్= తనయొక్క తమ్ములును; ఉండన్= ఉండగా; ధర్మనందనునకున్= ధర్మరాజువద్దకు; దూతన్= దూతను; పుచ్చిన విధంబు= పంపిన రీతిని; ప్రకాశము+చేయక= స్పష్టపరచక; ఇట్లు= ఈ రీతిగా; అనున్= పలికాడు.

తాత్పర్యం: అని తగినట్లుగా చెప్పి పంపగా దూత వచ్చి దుర్యోధనుడికంతా చెప్పాడు. అది విని దుర్యోధనుడు ఆ రాత్రి కొలువులో భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, కృపుడు, తన తమ్ములు ఉండగా, ధర్మరాజు వద్దకు దూతను పంపిన విషయం చెప్పకుండా ఇట్లా అన్నాడు.

ఆ. 'మనము మోసపోయి యనిమిషపతి సూతి । తోడఁ బోడిచితిమి యదోషవృత్తి;
నతఁడు సమయకాల మంతయుఁ గడచిన । వచ్చెనో యెఱుంగ వలయు నిజము.' 372

ప్రతిపదార్థం: మనము= కౌరవులము; మోసపోయి= మోసగించబడి; అనిమిషపతి సూతితోడన్= అర్జునుడితో; అదోషవృత్తిన్= దోషంలేని విధంగా; పొడిచితిమి= యుద్ధం చేశాం; అతఁడు= ఆ అర్జునుడు; సమయకాలము= పందెంలో శపథం పట్టిన కాలం; అంతయున్= పూర్తిగా; కడచినన్= కడిచిన తర్వాత; వచ్చెనో= వచ్చాడా; నిజము= సత్యం; ఎఱుంగవలయున్= తెలిసికొనవలయును.

తాత్పర్యం: 'మనం మోసపోయి, నిర్దోషంగా ఆ అర్జునుడితో యుద్ధం చేశాం. అసలు అతడు పదమూడేళ్ళు అయ్యాక వచ్చాడా? అన్నది నిజం తెలిసికొనాలి.'

క. అనిన విని 'యేటి మాటలు । వినువారలు నగరె? యేను వివ్వచ్చుఁడు న
చ్చినయపుడ తెలుపనే? వల । దనుమానము; సమయకాల మట మును కడచెన్.' 373

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ఏటి మాటలు?= ఇవేమి మాటలు? వినువారలు= వినెడివారు; నగరె?= నవ్వరా?; ఏను= నేను; వివ్వచ్చుఁడు= అర్జునుడు; వచ్చినఅపుడు+అ= వచ్చినపుడే; తెలుపనే?= తెలుపలేదా?; అనుమానము= సందేహం; వలదు= వద్దు; సమయకాలము= నియమితమైన కాలం; ఆట మును= అప్పటికి పూర్వమే; కడచెన్= కడచిపోయింది.

తాత్పర్యం: అనగా విని 'ఇవేం మాటలు? వినేవారు నవ్వరా? నేను అర్జునుడు వచ్చినప్పుడే చెప్పాను. అనుమానం అక్కర్లేదు. అప్పటికి ముందే నియమితకాలం గడచిపోయింది' అని భీష్ముడు పలికాడు.

క. అనవుడు భీష్ముని పలుకులు । విని యందఱు సమ్మతించి 'వెరవిఁడియే ఫ
ల్గునుఁ?' డనిరి; పతియుఁ బురికిం । జనియెను మఱునాఁడు విరళ సైన్యంబులతోన్. 374

ప్రతిపదార్థం: అనవుడున్= అనిన తర్వాత; భీష్ముని పలుకులు= భీష్ముడు చెప్పిన మాటలు; విని; అందఱున్= కొలువులోని వారందరు; సమ్మతించి= అంగీకరించి; ఫల్గునుఁడు= అర్జునుడు; వెరవిఁడియే?= తెలివి తక్కువవాడా?; అనిరి= అన్నారు; మఱునాఁడు= ఆ తరువాతిరోజున; పతియున్= దుర్యోధనుడును; విరళ సైన్యంబులతోన్= తక్కువ సేనతో; పురికిన్= నగరానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ విధంగా పలికిన ఆ భీష్ముడి మాటలను అందరూ సమ్మతించారు. 'అర్జునుడు అంత తెలివితక్కువ వాడా-సమయం నిండకుండా రావటానికి?' అన్నారు. ఆ మరునాడు దుర్యోధనుడు పరిమిత సేనతో హస్తినాపురికి వెళ్ళాడు.

శ్రీకృష్ణుఁడు బలదేవాదులతోఁ బాండవులఁ జూడవచ్చుట (సం.4-67-19)

వ. ఇవ్విధంబునం బ్రకాశులై పాండునందనులు శమీవృక్ష నిక్షిప్త సమస్త సాధనంబులుఁ బూజాపూర్వకంబుగాఁ దెచ్చుకొని, యుపప్లావ్యంబున వసియించి, మత్స్యమహీనాథుండు పంపుసేయం బెంపు మిగిలి పౌర జానపద సమానీత నానావిధోపహారంబులు గైకొనుచు, బహురత్నంబులకు భాజనంబులై మహనీయ విభూతి శోభిల్లుచున్నంత, వాసుదేవుండు బలభద్ర పురస్సరంబుగా సాత్యకి సమేతుండై సుభద్రాభిమన్యులం దోడ్కొని, కృతవర్మయుఁ బ్రద్యుమ్నుండును సాంబుండును యుయుధానుండును రుక్మిండును నక్రూరుండును నింద్రసేనాది పాండవ సారథులును రథారూఢులై కొల్చిరా, మఱియు ననేక యాదవ కుమారులును గరితురగ స్యందన నిబిడంబు లగు బలంబులతోడ నిరుగెలంకుల నడవం జనుదెంచి. 375

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; ప్రకాశులు+ఐ= బయటపడి; పాండునందనులు= పాండవులు; శమీవృక్ష= జమ్మిచెట్టుపై; నిక్షిప్త= దాచబడిన; సమస్త= సకలమైన; సాధనంబులున్= పరికరాలను; పూజాపూర్వకంబుగాన్= ముందు పూజచేసి; తెచ్చుకొని= తాముండేచోటికి తెచ్చుకొని; ఉపప్లావ్యంబునన్= ఉపప్లావ్యమనే చోట; వసియించి= నివాసముండి; మత్స్యమహీనాథుండు= విరాటరాజు; పంపు+చేయన్= ఆజ్ఞాపించగా; పెంపు మిగిలి= మిక్కిలి అభివృద్ధిగా ఉండి; పౌర= పట్టణ ప్రజలచే; జానపద= పల్లెటూరివారిచే; సమానీత= తీసుకురాబడిన; నానావిధ= పలురకాలైన; ఉపహారంబులు= కానుకలు; కైకొనుచున్= స్వీకరిస్తూ; బహు రత్నంబులకున్= అనేకవిధాలైన రత్నాలకు; భాజనంబులు+ఐ= పాత్రములై; మహనీయ= గొప్పదైన; విభూతిన్= ఐశ్వర్యంతో; శోభిల్లుచున్+ఉన్నంతన్= శోభిస్తున్న సమయంలో; వాసుదేవుండును= శ్రీకృష్ణుడు కూడా; బలభద్ర పురస్సరంబుగాన్= బలరాముడు ముందుగా; సాత్యకి సమేతుండు+ఐ= సాత్యకితో కూడినవాడై; సుభద్రా+అభిమన్యులన్= సుభద్రను, అభిమన్యుడిని; తోడ్కొని= కూడా తీసికొని; కృతవర్మయున్= కృతవర్మ; ప్రద్యుమ్నుండును= ప్రద్యుమ్న కుమారుడును; సాంబుండును= సాంబుడును; యుయుధానుండును= యుయుధానుడును; రుక్మిండును= రుక్మిడును; అక్రూరుండును= అక్రూరుడును; ఇంద్రసేన+ఆది= ఇంద్రసేనుడు మొదలైన; పాండవ సారథులును= పాండవులయొక్క సారథులును; రథ+ఆరూఢులు+ఐ= రథాలను ఎక్కినవారై; కొల్చిరాన్= సేవిస్తూ రాగా; మఱియును= ఇంకను; అనేక= చాలమంది; యాదవ కుమారులును= యాదవులలో యువకులును; కరి= ఏనుగులతో; తురగ= గుర్రాలతో; స్యందన= రథాలతోను; నిబిడంబులు+అగు= దట్టమైన; బలంబులతోడన్= సేనలతో; ఇరుకెలంకులన్= రెండు ప్రక్కలందును; నడవన్= నడవగా; చనుదెంచి= వచ్చి.

తాత్పర్యం: ఈ రీతిగా పాండవులు బయటపడి, జమ్మిచెట్టుమీద దాచిన సమస్త సాధనాలను పూజచేసి తెచ్చుకొని ఉపప్లావ్యంలో నివాసం పెట్టారు. విరాటుడు ఆజ్ఞాపించగా ఎక్కువ అభివృద్ధితో నాగరకులు, జానపదులు తెచ్చిన కానుకలు పుచ్చుకొని బహురత్నాలు కలిగి గొప్ప ఐశ్వర్యంతో శోభిల్లుతున్నారు. శ్రీకృష్ణుడు, బలరాముడు, సాత్యక్యాదులతో కలిసి, సుభద్రను, అభిమన్యుడిని తోడుకొని కృతవర్మ, ప్రద్యుమ్నుడు, సాంబుడు, యుయుధానుడు, రుక్మిడు, అక్రూరుడు, ఇంద్రసేనాది పాండవ సారథులు - వీరందరు రథారూఢులై రాగా, ఇంకా అనేక యాదవ కుమారులూ ఏనుగులు, గుర్రాలు, రథాలతో నిండిన సేనలూ ఇరుప్రక్కలా సేవిస్తూ రాగా వచ్చి, (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఉపప్లవ్యం అని మూలం. (సం.4-67-14) విరాటనగర సమీపంలో ఉండే ఉపనగరం, పాండవులకు విడిదిగా విరాటుడు కల్పించిన పట్టణం. ఇక్కడినుండి- పాండవుల తాత్కాలిక యుద్ధరాజధానిగా ఉపప్లావ్యం భారతకథలో ప్రసిద్ధికెక్కింది. (సంపా.)

తే. **భవ్యవిభవంబుతో నుపప్లావ్యపురము । చొచ్చి సంభ్రమమునఁ బాండుసుతులు తనకు**
నెదురు వచ్చిన నాహ్లాద మెసక మెసఁగఁ । దత్సమాగమ యోగ్య విధంబు నడపె. **376**

ప్రతిపదార్థం: భవ్య= గొప్పదైన; విభవంబుతోన్= వైభవంతో; ఉపప్లావ్యపురము= ఉపప్లావ్యం అనే పురం: చొచ్చి= ప్రవేశించి; సంభ్రమమునన్= సంతోషంతో; పాండుసుతులు= పాండవులు; తనకున్= శ్రీకృష్ణుడికి; ఎదురు వచ్చినన్= ఎదురుగా రాగా; ఆహ్లాదము= సంతోషం; ఎసకము+ఎసఁగన్= హెచ్చుకాగా; తత్సమాగమ= వారితో కలియుటకు; యోగ్య= యోగ్యమైన విధంబు= రీతిని; నడపెన్= చేశాడు.

తాత్పర్యం: మహావైభవంగా ఉపప్లావ్యపురం ప్రవేశించగా, పాండవులు సంబరంతో ఎదురు రాగా సంతోషం అతిశయించగా వారితో కలయికకు యోగ్యమైన పద్ధతిగా మర్యాదలు నడిపాడు.

వ. **బలదేవ ప్రముఖులకును దదీయ సందర్శన సముచిత సమాచారంబు లొనర్చి సుభద్రాభిమన్యులం బాంచాలి పాలికిం గొనిపోవ నభ్యంతర జనంబుల నియోగించి.** **377**

ప్రతిపదార్థం: బలదేవ ప్రముఖులకును= బలరాముడు మొదలైన వారికి; తదీయ= వారిని; సందర్శన= దర్శించినపుడు; సముచిత= తగినటువంటి; సమాచారంబులన్= సదాచారాలను; ఒనర్చి= చేసి; సుభద్రా+అభిమన్యులన్= సుభద్రను, అభిమన్యుని; పాంచాలి పాలికిన్= ద్రౌపది వద్దకు; కొనిపోవన్= తీసికొని వెళ్ళటానికి; అభ్యంతర జనంబులన్= రాణివాసం వారిని; నియోగించి= ఆజ్ఞాపించి.

తాత్పర్యం: బలరాముడు మొదలైనవారికి, వారి వారిని మొదటిసారి కలిసి ఆహ్వానించే సందర్భాలలో జరుపవలసిన ఉచిత మర్యాదలను సక్రమంగా జరిపించి, సుభద్రను, అభిమన్యుడిని పాంచాలి వద్దకు తీసికొనిపోవటానికి అంతఃపుర పరివారానికి తగిన ఆజ్ఞల నిచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **లలిత మణిమయ విభూషణ । ములు రుచిరాంబరములును బ్రమోద మెదల ని**
ట్టలముగ హరి కుంతీపు । త్రుల కెల్లను నిచ్చి పిదప ద్రోవది కిచ్చెన్. **378**

ప్రతిపదార్థం: లలిత= అందమైన; మణిమయ= మాణిక్యమయమైన; విభూషణములు= నగలు; రుచిర= ప్రకాశించెడి; అంబరములును= వస్త్రాలను; ప్రమోదము= సంతోషం; ఎదలన్= హృదయాలలో; ఇట్టలముగన్= ఎక్కువ కాగా; హరి= కృష్ణుడు; కుంతీ పుత్రులకున్= పాండవులకు; ఎల్లను= అందరికి; ఇచ్చి; పిదపన్= తరువాత; ద్రోవదికిన్= ద్రౌపదికి; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: అందమైన మాణిక్యమయమైన అలంకారాలు, వస్త్రాలు, సంతోషం హృదయాలలో అతిశయించగా పాండవుల కందరికీ ఇచ్చి, తర్వాత ద్రౌపదికి ఇచ్చాడు.

వ. ఇట్లు కట్టనిచ్చి వేఱు వేఱ రథకరితురగ దాసదాసీ జనంబుల నొసంగి పద్మనాభుండు పాండవులుం దానునుం గలసి సంతసంబున నలరారుచుండెఁ; దదనంతరంబ. 379

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; కట్టన్+ఇచ్చి= కట్టుటకు వస్త్రాదికములు ఇచ్చి; వేఱువేఱన్= వేరువేరుగా; రథ= రథాలను; కరి= ఏనుగులను; తురగ= గుర్రాలను; దాసదాసీ జనంబులను= దాసులను, దాసీల సమూహాలను; ఒసంగి= ఇచ్చి; పద్మనాభుండు= శ్రీకృష్ణుడు; పాండవులున్= పాండవులును; తానునున్= స్వయంగాను; కలసి= కూడికొని; సంతసంబునన్= సంతోషంతో; అలరారుచుండెన్= ఒప్పారుతూ ఉన్నాడు; తదనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు వారికి వస్త్రాదికములు ఇచ్చి, ప్రత్యేకంగా రథాలు, ఏనుగులు, గుర్రాలు, దాసదాసీ జనాలను ఇచ్చి, పాండవులు, తాను కలిసి సంతోషంతో హాయిగా ఉన్నారు. ఆ తరువాత.

సీ. ద్రుపదభూవిభుఁడు పుత్రులుఁదానుఁ జతురంగ । బలములతో వచ్చి పాండుసుతులఁ
గాంచి వారలు తన్నుఁ గరము సంప్రీతిమై । గారవింపఁగ నుండెఁ, గాశిరాజు
శైబ్యుండుఁ బదపడి సైన్య సమేతులై । చనుదెంచి ధర్మనందనుని చేయు
సత్కారముల గాఢ సమ్మదంబునఁ బొంది । రవ్విరాటుండును నంతవట్టు

తే. వారలకు; దత్తదుచిత ప్రకారములఁ బ్రి । యంబుఁ దలకొన సంవిధానంబు సేసె
మఱియు బహుదేశముల బంధు మాన్య మిత్ర । వర్గములు వేడ్కఁ బెండ్లికి వచ్చెఁ గలయ. 380

ప్రతిపదార్థం: ద్రుపద భూవిభుఁడు= ద్రుపదరాజు; పుత్రులున్= పుత్రులును; తానున్= తను స్వయంగాను; చతురంగ బలములతోన్= రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలములతో; వచ్చి= ఉపప్లావ్యం చేరి; పాండుసుతులన్= పాండవులను; కాంచి= చూచి; వారలు= ఆ పాండవులు; తన్నున్= ద్రుపదుడిని; కరము= మిక్కిలి; సంప్రీతిమైన్= ప్రీతితో; గారవింపఁగన్= గౌరవించగా; ఉండెన్= ఉన్నాడు; కాశిరాజు; శైబ్యుండున్= శైబ్యుడును; పదపడి= తర్వాత; సైన్య సమేతులై= సేనలతో కూడినవారై; చనుదెంచి= వచ్చి; ధర్మనందనుని చేయు= ధర్మరాజు చేయునట్టి; సత్కారములన్= సన్మానాల చేత; గాఢ= ఎక్కువైన; సమ్మదంబునన్= ప్రీతితో; పొందిరి= అనుభవించారు; ఆ+విరాటుండును= ఆ విరాటరాజు కూడ; అంత+పట్టు= అంతవరకు; వారలకున్= వారందరికి; తత్తదుచిత ప్రకారములన్= వారికి వారికి తగిన రీతులలో; ప్రియంబు= ఇష్టం; తలకొనన్= కలుగగా; సంవిధానంబు= సమకూర్చటం; చేసెన్= చేశాడు; మఱియున్= ఇంకా; బహు దేశముల= అనేక దేశములకు సంబంధించిన; బంధు= బంధువుల; మాన్య= పూజ్యులైన; మిత్ర= మిత్రుల; వర్గములు= సముదాయాలు; వేడ్కన్= వేడుకతో; పెండ్లికిన్= అభిమన్యుడి పెళ్లికని; కలయన్= కలియకూడుటకు; వచ్చెన్= వచ్చాయి.

తాత్పర్యం: ద్రుపదరాజు అతడి పుత్రులతో రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలాలతో ఉపప్లావ్యం చేరి పాండవులను చూచాడు. ఆ పాండవులు ద్రుపదుడిని మిక్కిలి ప్రీతితో గౌరవించారు. తరువాత కాశిరాజు, శైబ్యుడూ సైన్యంతో వచ్చి, ధర్మరాజు చేసిన సన్మానాలను ఎక్కువ ప్రీతితో పొందారు. ఆ విరాటరాజు కూడ అంతవరకు వారందరికి, వారికి వారికి తగిన రీతులలో, ఇష్టం కలిగేటట్లుగా సమకూర్చాడు. ఇంకా అనేక దేశాలకు సంబంధించిన చుట్టాలు, పూజ్యులు, స్నేహితుల సముదాయాలు వేడుకతో అభిమన్యుడి పెళ్ళికి వచ్చారు.

వ. ఇవ్విధంబున రెండు దెఱంగుల చుట్టంబులు నైన భూపతులు తమ తమ విభవంబులు మెఱసి వచ్చియుండ విరాటుండు పురంబున నుత్సవంబు సాటించిన. 381

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; రెండు+తెఅంగుల= ఇరుప్రక్కల; చుట్టంబులున్+ఐన= బంధువులయిన; భూపతులు= రాజులు; తమ తమ విభవంబులు= తమ తమ సంపదలు; మెఅసి= ప్రకాశించగా; వచ్చి+ఉండన్= వచ్చి విడుదులలో ఉండగా; విరాటుండు= విరాటరాజు; పురంబునన్= తన పట్టణంలో; ఉత్సవంబు= వివాహోత్సవాన్ని; చాటించినన్= చాటింపు వేయగా.

తాత్పర్యం: ఈ విధంగా రెండు పక్షాల చుట్టాలయిన మహారాజులు తమ తమ వైభవం ప్రదర్శిస్తూ వచ్చి విడిది ఇండ్లలో ఉన్నారు. విరాటరాజు నగరంలో వివాహమహోత్సవం చాటింపు వేయించాడు.

క. కలువడములు మణితోరణ । ములుఁ గట్టిరి, క్రముక కాండ మోచా స్తంభం
బులు నాటిరి, కుంకుమమునఁ । గలయ నలికి ముగ్గులిడిరి కర్పూరమునన్. 382

ప్రతిపదార్థం: కలువడములు= కలువల దండలు; మణితోరణములు= మణులతో తోరణములు; కట్టిరి= కట్టినారు; క్రముక కాండ= పోకస్తంభములు; మోచాస్తంభంబులు= అరటిస్తంభాలు; నాటిరి= పాతారు; కుంకుమమునన్= కుంకుమతో; కలయన్+అలికి= అంతటా బాగుగా అలికి; కర్పూరమునన్= కర్పూరపు పొడితో; ముగ్గులు= ముగ్గులు; ఇడిరి= పెట్టారు.

తాత్పర్యం: కలువ పూలదండలు, మణితోరణాలు కట్టారు. పోకచెట్ల స్తంభాలు, అరటి స్తంభాలు పాతారు. కుంకుమతో కలయ నలికి, కర్పూరంతో ముగ్గులు పెట్టారు.

క. వివిధాలంకరణంబుల । నవకాంతి వహించి పట్టణంబు వివాహో
త్సవ మాధవలక్ష్మి కి లలి । త వనంబై యెలమి కలిమి తావల మయ్యెన్. 383

ప్రతిపదార్థం: వివిధ= అనేక విధాలైన; అలంకరణంబులన్= అలంకారాలతో; నవకాంతిన్= కొత్తవైన కాంతిని; వహించి= పూని; పట్టణంబు= విరాటుడి పట్టణం; వివాహ+ఉత్సవ మాధవ లక్ష్మికిన్= వివాహ సంబంధమైన ఉత్సవమనే మాధవ లక్ష్మికి; లలిత వనంబు+ఐ= ఉద్యానవనమై; ఎలమి కలిమి= సంతోష సంపదకు; తావలము= స్థానం; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: అనేక విధాల అలంకారాలతో ఒక క్రొత్త శోభ కలిగి ఆ పట్టణం వివాహ మహోత్సవమనే వసంత లక్ష్మికి ఉద్యానవనమై ఉండి సంతోషానికి స్థానమైనది.

విశేషం: అలం: రూపకం.

ఉ. తాను సుదేష్ణయున్ సుతులుఁ దమ్ములు బంధులు గంధమాల్య నా
నా నవరత్న భూషణమనః ప్రియ మాంగలిక ప్రసాధనా
నూన విభూతి మత్స్యవిభుఁ డుజ్జ్వలలీల వహించి భూమిదే
వానయనాది కృత్యపరులైన జనంబుల గారవించుచున్. 384

ప్రతిపదార్థం: మత్స్యవిభుఁడు= విరాటుడు; తాను; సుదేష్ణయున్= దేవియైన సుదేష్ణయును; సుతులున్= కుమారులును; తమ్ములు= తమ్ములును; బంధులు= బంధువులును; గంధ= గంధములు, మాల్య= పూలమాలలు; నానా= అనేకరీతులా; నవరత్న= నవరత్నాలు పొదిగిన; భూషణ= అలంకారాలు; మనఃప్రియ= మనోహరమైన; మాంగలిక= మంగళకరమైన; ప్రసాధన= అలంకారాలయొక్క; అనూన= సంపూర్ణమైన; విభూతిన్= వైభవంతో; ఉజ్జ్వల లీలన్= ప్రకాశించే విలాసాన్ని;

వహించి= కలిగి; భూమిదేవ= బ్రాహ్మణుల యొక్క; ఆనయన+ఆది= తీసికొని వచ్చుట మున్నగు; కృత్యపరులైన= పనులందు ఆసక్తి కలవారైన; జనంబులన్= జనులను; గారవించుచున్= గౌరవిస్తూ.

తాత్పర్యం: విరాటుడు తన దేవిఅయిన సుదేష్ణతో కలిసి, కుమారులు, తమ్ములు, బంధువులు, వెంటరాగా గంధములు, పూలమాలలు, అనేక రకాల నవరత్నాలు పొదిగిన ఆభరణాలు, మనోహరమైన, మంగళకరమైన అలంకారాలయొక్క సంపూర్ణమైన వైభవంతో ప్రకాశించే విలాసాలను ప్రదర్శిస్తూ, బ్రాహ్మణులను తీసికొని రావటం మొదలగు పనులందు ఆసక్తికల జనులను గౌరవిస్తూ.

వ. గరువంపు సంభ్రమంబులతోడ నిజమందిరంబునందు. 385

ప్రతిపదార్థం: గరువంపు= గర్వంతో కూడిన; సంభ్రమంబులతోడన్= వేగిరపాటులతో; నిజమందిరంబునందున్= తన రాజ మందిరంలో.

తాత్పర్యం: దర్పంతో, ఆనందంతో కూడిన సంబరాలతో తన మందిరంలో.

సీ. అమల రత్న ప్రదీపావలి మెఱుఁ గిడఁ। బనిచి మణిస్తంభ పంక్తిఁ గ్రొత్త
జిగి దఱు కొత్తునట్లుగఁ దొడయించి వి। చిత్ర వితానముల్ చెలువు మిగులఁ
గట్టించి నూత్న ముక్తాదామములతోడఁ। గుసుమ మాలిక లెడఁ గ్రుచ్చి వ్రేలఁ
గీలింప నియమించి కేవల మంగళ। భూరుహపల్లవ తోరణములు

తే. సంఘటింప నియోగించి చందనమునఁ। బరిణయాగార మలుకంగఁ బాణియాణి
గలుగు ముత్తియముల మ్రుగ్గుగా నొనర్పఁ। జతుర పుణ్యాంగనా జనతతిఁ బొనర్చె. 386

ప్రతిపదార్థం: అమల= స్వచ్ఛమైన; రత్న= రత్నాలనెడి; ప్రదీప+ఆవలిన్= దీప పంక్తికి; మెఱుఁగు+ఇడన్= మెరుగుపెట్టుటకు; పనిచి= ఆజ్ఞాపించి; మణిస్తంభ= మణిమయమైన స్తంభాలయొక్క; పంక్తిన్= పంక్తికి; క్రొత్త జిగి= క్రొత్తకాంతి; తళుకొత్తునట్లుగన్= కలిగేటట్లుగా; తొడయించి= చేయించి; విచిత్ర= రంగురంగుల; వితానముల్= చాందినీలు; చెలువు మిగులన్= ఎక్కువ అందం కల్గునట్లుగా; కట్టించి= వ్రేలగట్టేటట్లుచేసి; నూత్న= క్రొత్తవైన; ముక్తాదామములతోడన్= ముత్యాల దండలతో; కుసుమ మాలికలు= పూలమాలలు; ఎడన్+గ్రుచ్చి= మధ్యమధ్యన గ్రుచ్చి; వ్రేలన్= వ్రేలాడేటట్లు; కీలింపన్= కట్టుటకు; నియమించి= పురమాయించి; కేవల= కేవలం; మంగళ భూరుహ= మంగళకరమైన చెట్లయొక్క; పల్లవ తోరణములు= చిగుళ్ళ తోరణాలు; సంఘటింపన్= సమకూర్చుటకు; నియోగించి= ఆజ్ఞాపించి; చందనమునన్= మంచి గంధంతో; పరిణయ+ఆగారము= పెళ్ళియిల్లు; అలుకంగన్= అలికేటట్లుగా; పాణి+ఆణి= ముత్తైపునీరును, వజ్రువయును; కలుగు ముత్తియములన్= కలిగిన ముత్యాలను; మ్రుగ్గుగాన్= ముగ్గుగాను; ఒనర్పన్= అమర్చటానికి; చతుర= నేర్పరులైన; పుణ్యాంగనా= పుణ్యస్త్రీ; జనతతిన్= జనుల సముదాయాన్ని; పొనర్చెన్= పురమాయించాడు.

తాత్పర్యం: స్వచ్ఛమైన రత్న దీపాలకు మెరుగు పెట్టించాడు. మణిస్తంభాలకు క్రొత్త కాంతి వచ్చేటట్లు చేయుమన్నాడు. రంగు రంగుల చాందినీలు అందంగా కట్టించాడు. క్రొత్త ముత్యాల దండలు, పూలదండలు కలిపి మధ్య మధ్య అవీ ఇవీ ఉండేటట్లు వ్రేలాడ దీయించాడు. కేవలం మంగళకరమైన మామిడి మున్నగు చెట్ల చిగురుటాకుల తోరణాలు కట్టించాడు. మంచి గంధంతో పెళ్ళి యిల్లు అలికి, ఆణిముత్యాలతో ముగ్గులు పెట్టటానికి సువాసినులను పురమాయించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఉత్తరాభిమన్యుల వివాహం శాస్త్రోక్తంగా జరిగిందని మూలం. **"తతో వివాహో విధివద్ వవృధే మత్స్యపార్థయోః"** "(4-72-27) మత్స్యపార్థుల యింట వివాహమైనదని స్థూలంగా చెప్పిన అంశాన్ని తిక్కన తనకాలం నాటి రాజమర్యాదలతో జరిగిన వివాహంగా వర్ణించాడు. అష్టవిధ వివాహాలలో (బ్రాహ్మం, ప్రాజాపత్యం, ఆర్షం, దైవం, గాంధర్వం, ఆసురం, రాక్షసం, పైశాచం) ఈ వివాహం ప్రాజాపత్యం, వధువును వస్త్రాదులచే ఆచ్ఛాదించి సాలంకృతకన్యగా చేసి, ఈమెతో సహధర్మచారిత్వాన్ని నిర్వహించుమని వరునకు చెప్పి ఇచ్చే (కన్యాదానం చేసే) వివాహం ప్రాజాపత్యం. ఈ వివాహంలో కన్యాదాత ఇంట్లో అలంకృత కల్యాణమంటపంలో అలంకృత కన్యాదానం జరుగుతుంది. దానికి నాందిగా కల్యాణమంటపాలంకార శోభ ఈ పద్యంలో వర్ణించబడింది. రత్నదీపాలు, మణిస్తంభాలు, చిత్రవిచిత్రాలైన చాందినీలు, ముత్యాలతో నిండిన పూలమాలల అలంకరణలు, మామిడి మొదలైన చెట్ల పల్లవాల తోరణాలు, మంచిగంధంతో అలకటాలూ, ముత్యాల ముగ్గులూ విరాటరాజు వైభవ చిహ్నలు, పుణ్యాంగనలు అలంకరించటం శుభసూచన. వివాహవేదికను సీసపద్యంలో వర్ణించి దాని ఔన్నత్యాన్నీ, వైశాల్యాన్నీ కూడా తిక్కన ధ్వనింపజేశాడు. (సంపా.)

క. వైదిక లౌకిక విధి సం। పాదిత వివిధార్హ వస్తుభరితత్వమునన్
వేదిక పాలు పగునట్లుగ। మోదమునఁ బురోహితుండు మునుకొని చేయన్. 387

ప్రతిపదార్థం: పురోహితుండు= పురోహితుడు; వైదిక= వేదోక్తమైన; లౌకిక= లోకరీతికి సరిపోయే; విధి= నియమాల ప్రకారం; సంపాదిత= సేకరించబడిన; వివిధ= పలురకాలైన; అర్హ= తగిన; వస్తు= వస్తువులతో; భరితత్వమునన్= నిండి ఉండటంతో; వేదిక= కళ్యాణవేదిక; పాలుపు+అగునట్లుగన్= అందంగా ఉండేటట్లుగా; మునుకొని= ప్రయత్నించి; మోదమునన్= సంతోషంతో; చేయన్= చేయగా.

తాత్పర్యం: పురోహితుడు వైదికమైన లౌకికమైన విధి విధానాల ప్రకారం కావలసిన వస్తువులన్నీ సేకరించి నింపి, పెళ్ళి వేదికను అందంగా అమర్చాడు.

క. ఉత్తర నలంకరింప ను। దాత్తాభరణాది వస్తుతతి యొసఁగి నరేం
ద్రోత్తముఁడు నేర్పు గల చెలి। కత్తియలం బుచ్చెఁ బ్రీతి కడలుకొనంగన్. 388

ప్రతిపదార్థం: నరేంద్ర+ఉత్తముఁడు= విరాటుడు; ఉత్తరన్= ఉత్తరను; అలంకరింపన్= అలంకరించటానికి; ఉదాత్త= గొప్పదైన; ఆభరణ+ఆది= అలంకారాలు మొదలైన; వస్తుతతి= వస్తు సముదాయము; ఒసఁగి= ఇచ్చి; నేర్పుకల= నైపుణ్యంకల; చెలి= కత్తియలన్= చెలికత్తెలను; ప్రీతి= సంతోషం; కడలు కొనంగన్= వృద్ధి పొందగా; పుచ్చెన్= పంపాడు.

తాత్పర్యం: విరాటరాజు ఉత్తరను అలంకరించటానికి మంచి ఆభరణాలు, ఇంకా తగిన సామగ్రి ప్రీతితో ఇచ్చి, నేర్పుకల చెలికత్తెలను పంపాడు.

విశేషం: విరాటుడు సాలంకృత కన్యాదానం శాస్త్ర సమ్మతంగా చేయవలె కాబట్టి కన్యను అలంకరించండని నిపుణలైన చెలికత్తెలను నియోగించాడు. కల్యాణం కొరకు చేయించిన క్రొత్త నగలతో అలంకరించి, **"కన్యాం కనక సంపన్నాం కనకాభరణైర్యుతాం । దాస్యామి విష్ణవే తుభ్యం బ్రహ్మలోక జిగీషయా"** - అని కన్యాదానం చేయటానికి రంగం సిద్ధం చేయించాడు. (సంపా.)

అభిమన్యుని వివాహ మహోత్సవము (సం.4-67-31)

వ. ఇట్లు వైవాహిక వర్తన సంవిధాన సావధానుం డగు మత్స్యమహీనాథుండు మౌహూర్తికాది శిష్టజనులు పరివేష్టింప నుండి 'లగ్నం బాసన్నం బగుచు వచ్చె' నని ధర్మతనయున కెఱింగింపం బనిచిన, నతండు ననుజతనుజసహితంబుగా నలంకృతుండై, వివిధ ప్రసాధన శోభితులగు సమస్తబంధు జనంబులం గూర్చికొని యభిమన్యునకు శృంగారంబు సేయించి భద్రగజారూఢుం జేసికొని యేనుంగులం బేరుగలవారువంబులను మట్టపుదట్టంబు సేసికొని పుణ్యాంగనా జనంబులతోడం గూడి, మణిగణంబులు నంబర నికరంబులు పుష్పపుంజంబులు ఫలప్రచయంబులు లోనుగాఁ గల యోగ్యవస్తువుల విస్తరిల్లిన క్రంత నడవ మంగళతూర్య నాదంబులు విప్రాశీర్వాదంబులు మాగధ గానంబులు వందిజన వాక్య సంతానంబులుఁ జెలంగ వాసుదేవ పురస్సరంబుగా విరాటుమందిరంబున కేతెంచి శంఖజయ ఘంటా పణవాది నిక్వణంబులతోడ నెదుర్కొని చల్లుసేసలు గైకొనుచుం జొత్తెంచిన. 389

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వైవాహిక= వివాహ సంబంధమైన వర్తన= ప్రవర్తనలను; సంవిధాన= సమకూర్చుకొనటంలో; సావధానుండు+అగు= శ్రద్ధ కల్గిన; మత్స్యమహీనాథుండు= విరాటుడు; మౌహూర్తిక+ఆది= జ్యోతిష్కులు మొదలైన; శిష్టజనులు= శిష్టులైన జనులు; పరివేష్టింపన్= చుట్టూఉండగా; ఉండి; లగ్నంబు= పెండ్లిసుముహూర్తం; ఆసన్నంబు+అగుచున్= దగ్గరౌతూ; వచ్చెనని= వస్తున్నదని; ధర్మ తనయునకున్= ధర్మరాజుకు; ఎఱిఁగింపన్= తెలియజేయటానికి; పనిచినన్= పంపగా; అతండునున్= ధర్మరాజు కూడ; అనుజ తనుజ సహితంబుగాన్= తమ్ములతో కొడుకులతో కూడా; అలంకృతుండు+ఐ= అలంకరించబడినవాడై; వివిధ= పలురకాలైన; ప్రసాధన= అలంకారాలతో; శోభితులు+అగు= శోభిస్తున్న; సమస్త= సకలమైన; బంధుజనంబులన్= బంధువులను; గూర్చికొని= సమకూర్చికొని; అభిమన్యునకున్= పెండ్లికొడుకైన అభిమన్యుడికి; శృంగారంబు+చేయించి= అలంకారం చేయించి; భద్రగజ= మేలుజాతి ఏనుగుపై; ఆరూఢున్= అధిష్ఠించిన వాడినిగా; చేసికొని= చేసి; ఏనుంగులన్= ఏనుగులను; పేరుగల= వాసికెక్కిన; వారువంబులను= గుర్రాలను; మట్టపుదట్టంబు= సమంగా గట్టిగా; చేసికొని; పుణ్య+అంగనా జనంబులతోడన్+కూడి= ముత్తైదువుల సమూహాలతో కూడికొని; మణి గణంబులు= మణుల సముదాయాలు; అంబర నికరంబులున్= వస్త్రాల సముదాయాలును; పుష్ప పుంజంబులున్= పూలరాశులు; ఫలప్రచయంబులు= పండ్ల గుంపులు; లోనుగాన్+కల= మొదలైన; యోగ్యవస్తువులన్= తగిన వస్తువులతో; విస్తరిల్లిన= విస్తారంగా ఉన్న; క్రంత= సారె; నడవన్= నడిపించుచు; మంగళతూర్య నాదంబులు= మంగళవాద్యాల ధ్వనులు; విప్ర= బ్రాహ్మణులయొక్క; ఆశీర్వాదంబులు= దీవెనలు; మాగధగానంబులు= మాగధులయొక్క పాటలు; వందిజన= స్తుతి పాఠకులయొక్క; వాక్య సంతానంబులున్= వాక్య సముదాయాలును; చెలంగన్= ధ్వనింపగా; వాసుదేవ పురస్సరంబుగాన్= వాసుదేవుడు ముందు నడుస్తూ ఉండగా; విరాటు మందిరంబునకున్= విరాటుడి ఇంటికి; ఏతెంచి= వచ్చి; శంఖ= శంఖాలయొక్క; జయ ఘంటా= జయకరమైన గంటలయొక్క; పణవ+ఆది= పణవం మొదలుగా గల వాద్యాలయొక్క; నిక్వణంబులతోడన్= శబ్దాలతో; ఎదుర్కొని= ఎదురుగా వచ్చి; చల్లు సేసలు= చల్లెడి అక్షతలు; కైకొనుచున్= స్వీకరిస్తూ; చొత్తెంచినన్= ప్రవేశించగా.

తాత్పర్యం: ఈ విధంగా విరాటరాజు వివాహానికి కావలసిన వస్తువులను సేకరించటం మొదలైన పనులలో శ్రద్ధగా ఉండి జ్యోతిష్కులు మొదలైన శిష్ట జనులు చుట్టూరా ఉండగా, లగ్నం సమీపిస్తున్నది రమ్మని కబురంపగా ధర్మరాజు, తమ్ములు అలంకరించుకొని, అభిమన్యుడిని అలంకరింపజేసి, బంధువులందరూ అలంకరించుకొని కలిసి రాగా, అభిమన్యుడిని భద్రగజంపై కూర్చోబెట్టి, ఏనుగులను, గుర్రాలను పరిమితంగా వెంటనిడికొని, పుణ్యాంగనల సమూహం వెంటరాగా, మణులు, వస్త్రాలు, పండ్లు మొదలైన కావలసిన వస్తువులన్నీ వెంటపెట్టుకొని, శ్రీకృష్ణుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందు నడుస్తూ ఉండగా మంగళవాద్య ధ్వనులు, బ్రాహ్మణులయొక్క ఆశీర్వాదాలు, వందిమాగధుల జయ జయధ్వనులు, స్తుతి పాఠాలు హోరెత్తగా విరాటుడి మందిరానికి వచ్చారు. ఇక్కడ శంఖాలు, జయ గంటలు, పణవం మొదలైనవి మ్రోగిస్తూ సేసలు అక్షతలు చల్లుతూ పెళ్ళివారు ఎదురు వచ్చారు. ఆ రీతిగా వారు పెండ్లిమందిరాన్ని ప్రవేశించగా; (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: తెలుగునాట కానవచ్చే కొన్ని వివాహ మర్యాదలు ఈ వచనంలో వర్ణించబడ్డాయి. మగపెళ్ళివారు విడిదిలో ఉంటారు. ప్రస్తుతం ఉపప్లావ్యంలో పాండవులున్నారు. ముహూర్త పత్రికను లేదా లగ్నపత్రికను కన్యాదాత పెళ్ళికొడుకు తండ్రికి లేదా వారి ఇంటి పెద్దకు సవినయంగా పంపుతాడు. ఆ మర్యాద ననుసరించి విరాటుడు ధర్మరాజుకు లగ్నపత్రికను (లగ్నవార్తను) పంపాడు. దానిని గ్రహించి ధర్మరాజు బంధువు లందరితో కూడి, పెళ్ళికొడుకును మంగళకరమైన ఆభరణాలతో అలంకరించి, భద్రగజం మీద ఎక్కించుకొని, వివాహ సామగ్రిని వెంటబెట్టుకొని, మంగళవాద్యాలూ, బ్రహ్మణాశీస్సులు మొదలైన మంగళనాదాలను వింటూ భగవంతుడైన శ్రీకృష్ణుడిని ముందుపెట్టుకొని ఊరేగుతూ కన్యాదాత ఇంటికి కదలివచ్చాడు. ఇది పెండ్లికొడుకు పెళ్ళికి పోయే ఊరేగింపు. ఇందులో మగపెళ్లివారి వైభవం ప్రదర్శితమౌతుంది. ధర్మరాజు వైపు వివాహ వైభవం సాత్త్వికం. భగవద్విభూతి ప్రధానంగా ప్రకాశించింది. మగపెళ్ళివారిని కన్యాదాత ఎదురుపోయి సగౌరవంగా తన ఇంటికి తీసికొని రావాలి. **"సాలంకారాం మమ సుతాం కన్యాం దాస్యామి తే (ద్విజ) పాణిం గృహ్ణీష్వ, సాగ్నిష్ట్వం గచ్ఛస్వ, ఆగచ్ఛ మద్గృహమ్'-** (ఇది స్నాతకవ్రతం చివర ద్విజవరుడిని ఆహ్వానించే శ్లోకం), క్షత్రియులు కూడ ద్విజులేకాబట్టి, తరలివచ్చిన పెండ్లికొడుకును ఈ విధమైన ఆహ్వానంతో గౌరవిస్తారు. తన కన్యను పాణిగ్రహణం చేయుమని వరుడిని కోరటం ఈ వివాహాంగ పరమతాత్పర్యం. తిక్కన పాణిగ్రహణోత్సవాన్ని పదిలంగా వర్ణించదలచాడు కాబట్టి ఈ మర్యాదను శాస్త్రోక్తంగా నిర్వహించాడు. (సంపా.)

క. విరటుఁడు సంభ్రమమును నా। దరమును భక్తియును నాత్మఁ దలకొనఁ బూజా
పరుఁడై సమయ సముచితా। చరణంబులు నిర్వహించె సమ్మదలీలన్. 390

ప్రతిపదార్థం: విరటుఁడు= విరాటరాజు; సంభ్రమమును= సంతోషం, తొందర; ఆదరమును= గౌరవమును; భక్తియును= భక్తికూడ; ఆత్మన్= మనస్సులో; తలకొనన్= కలుగగా; పూజాపరుఁడు+ఐ= పూజచేసేవాడై; సమయ= వేళకు; సముచిత= తగిన; ఆచరణంబులు= పనులు; సమ్మద లీలన్= సంతోషంతో; నిర్వహించెన్= నిర్వహించాడు.

తాత్పర్యం: విరాటరాజు సంతోషం, ఆదరం, భక్తి - ఇవన్నీ మనస్సులో కలిసిపోగా పూజచేసేవాడై సమయానికి తగిన పనులన్నింటినీ సంతోషంతో నిర్వహించాడు.

విశేషం: కన్యాదానం జరిగేంతవరకు వేదికమీద కన్యాదాతకు ప్రాధాన్యముంటుంది. అతడే అక్కడ కర్త, వివాహయజ్ఞానికి ఏ లోపం లేకుండ, రాకుండ నిర్వహించాలి. అందుకే విరాటుడికి ఆ సంభ్రమం, ఆ ఆదరం, ఆ భక్తి. అతడు వరపూజా పరుడైనాడు. సముచిత విధులను సంతోషంతో నిర్వహించాడు. ఆ విధులు మధుపర్కం, మహాసంకల్పం, చూర్ణిక మొదలైనవి, వరుడికి, పెద్దలకు మధుపర్కం- తేనె బెల్లంతో కూడిన పదార్థాన్ని పెట్టి నూతన వస్త్రాదులను సమర్పించాలి. దానిని మధుపర్కం అంటారు. ఆ తరువాత మహాసంకల్పం చేస్తాడు. కన్యాదాత, సమస్త పుణ్య నదీనద సహితమైన బ్రహ్మాండంలో అంతవరకూ తెలిసికానీ, తెలియకగానీ చేసిన మహాపర్వతాల వంటి పాపాలు నశించి, తనకు శాశ్వత బ్రహ్మలోక ప్రాప్తి కలగాలని కన్యాదానం చేస్తున్నానని సంకల్పం చేయటం మహాసంకల్పం. సమస్త గురు, దేవతా, మహర్షి పతివ్రతానదీ సుగంధ వృక్ష పర్వత శాస్త్ర జ్యోతిషాదులన్నీ కలిసి అనుకూల ఫలాల నివ్వాలని గ్రహాలను ప్రార్థించటం చూర్ణిక, కన్యాదానం చేయటానికి పూర్వం కన్యాదాత నిర్వహించే శాస్త్రోక్త కార్యకలాపమిది. ఇటువంటివాటిని 'సమయ సముచితాచరణము' లని తిక్కన సూచించాడు. (సంపా.)

తే. విహిత పరిపాటితో విప్రవృద్ధ జనులు । పుణ్యకర్మ పరంపరఁ బూని నడుప
నర్థిఁ గృష్ణ యుధిష్ఠిర పార్థ మత్స్య । వరులు దెరయొద్ద న వ్వధూవరుల నిలిపి. 391

ప్రతిపదార్థం: విహిత= తమకు విహితమైన; పరిపాటితోన్= సంప్రదాయం ప్రకారం; విప్ర= బ్రాహ్మణులు; వృద్ధ జనులు= పెద్దలును; పుణ్య= మంగళకరమైన; కర్మ పరంపరన్= క్రియా కలాపాలను; పూని= పూనుకొని, నడుపన్= జరిపించగా; అర్థిన్= ప్రేమతో; కృష్ణ= శ్రీకృష్ణుడు; యుధిష్ఠిర= ధర్మరాజు; పార్థ= అర్జునుడు; మత్స్యవరులు= విరాటుడును; తెర ఒద్దన్= తెర దగ్గర; ఆ+వధూ వరులన్= ఆ వధూవరులను; నిలిపి= ఉంచి.

తాత్పర్యం: రాజోచిత సంప్రదాయంతో విప్రులూ వృద్ధులూ పుణ్యక్రియా కలాపం నిర్వర్తించగా, కృష్ణుడు, ధర్మరాజు, అర్జునుడు, విరాటుడు తెర దగ్గర వధూవరులను నిలిపి.

విశేషం: తెలుగు వారిళ్ళలో జరిగే పెళ్ళిళ్ళలో తెరపట్టటం ఒక విశిష్ట ఆచారం. ఇది వేదంలో చెప్పబడి ఉండకపోవచ్చును. తిక్కన గారు అందుకే అన్నారు. విప్రులు, వృద్ధులు కొన్ని విహితమైన పరిపాటులు (ఆచారాలు) పుణ్యకర్మ పరంపరలుగా పెళ్ళిళ్ళలో పాటిస్తుంటారట! వాటిల్లో తెరపట్టటం, జీలకర్ర బెల్లం పెట్టటం తెలుగునాట ముఖ్యమైనవి. వాటి తాత్పర్యం ఆచార నిష్ఠం కావటం విశేషం. వధూవరులు వివాహంలో మొదట స్పర్శనం, ఆ తరువాత దర్శనం చేయాలని ఆచారం. వారిరువురి బ్రహ్మరంధ్ర స్థానాలను జీలకర్ర బెల్లంతో కలిపిన మంగళద్రవ్యంతో స్పృశిస్తారు. అది సజాతీయ స్పర్శగా వారి తనువులకు జీవితాంతం సుఖాన్ని కలిగించే ఉత్తేజాన్నీ, ఉత్సాహాన్నీ కలిగిస్తుంది. ఈ కార్యం జరిగేటప్పుడు తెర అడ్డంగా ఉంటుంది. ఆ తెర పట్టేవారు పెద్దవారు. ఈ ఘట్టంలో ఒకవైపు కృష్ణుడు, యుధిష్ఠిరుడు, అర్జునుడు నిలిచి పట్టుకొన్నారు. మరొకవైపు మత్స్యవంశశ్రేష్ఠులు పట్టుకొన్నారు. చూపులు చూపులు కలిసెడి శుభవేళ సుముహూర్తం. కొందరు ప్రథమ స్పర్శనం ముహూర్త మంటారు. తిక్కన జీలకర్ర బెల్లాన్ని పెట్టించినట్లు లేదు. తెరపట్టించి తీయించాడు. అంటే స్పర్శనం కంటె దర్శనమే శుభముహూర్తమని అతడి నిశ్చయం. విశేషమేమంటే- ఉత్తరాభిమన్యులు అంతవరకు ఒకరిని గురించి మరొకరు విన్నారే కాని, చూచుకొనలేదు. అది వారి జీవితంలో ప్రథమ దర్శన శుభవేళ. ప్రథమ దర్శనం కావ్యరసపరంగా రతిభావోద్దీపకమైన రసకేతనం. దానిని ఎగురవేయించి, దాని విలాసాలను వర్ణించి వైశిష్ట్యాన్ని ప్రదర్శించాడు తిక్కన సోమయాజి. (సంపా.)

వ. సాంవత్సరిక దత్త కాల కళావిశేషంబుల మంగళతూర్యంబులు చెలంగ నత్తెర యెత్తించిన. 392

ప్రతిపదార్థం: సాంవత్సరిక= దైవజ్ఞుడిచే; దత్త= ఇయ్యబడిన; కాలకళా= కాలంలోని భాగంయొక్క; విశేషంబులన్= విశేషమందు, శుభ లగ్నమున; మంగళతూర్యంబులు= మంగళవాద్యాలు; చెలంగన్= మ్రోగగా; ఆ+తెర= ఆ తెరను; ఎత్తించినన్= ఎత్తించగా.

తాత్పర్యం: అప్పుడు జ్యోతిష్కుడు దగ్గరుండి గుణించి శుభలగ్న సమయాన్ని సరిగా తెల్పగా మంగళవాద్యాలు మ్రోగగా, ఆ తెరను ఎత్తించారు.

విశేషం: చూర్ణికాదులు ముగిసిన తరువాత జ్యోతిష్కులు ముహూర్తం ఆసన్నమైనదని నిశ్చయించి. **"అయం ముహూర్త స్సుముహూర్తోஉ స్తు"** అని ప్రకటిస్తూ **"తత స్సుముహూర్తే కన్యాం దృష్ట్వా"** - అని నిర్దేశించి తెరను తొలగిస్తారు. అప్పుడు వరుడు **"అఘోరచక్షుః"**- అనే మంత్రంతో కన్యను చూడాలి. ఆ మంత్రానికి తాత్పర్యమిది - "ఓ వధువా! భయంకరమగు కన్నులు లేని దానివై, భర్తను చంపని దానివై, భర్తకు, మఱదులకు శుభము కూర్చుము. ప్రసన్నమైన మనస్సు గలదానవై సువర్చస్సు గలదానివగుము. జీవించిన సంతానమును గనుచు, దైవపూజ చేయుచు, ప్రశస్తురాలవై, నా బంధువులకు, నా

పశుసంపదకు సుఖము గూర్చుదానవై యుండుము." (అడ్డుగా వైచిన తెరను తీసివైచి) వధూవరు లిట్లు సంకల్పింతురు. (తిరిగి ప్రాణాయామం చేసి) ఈ శుభతిథియందు దంపతులమైన మన ఇద్దఱకు ఆయువు, వర్చస్సు, యశస్సు, బలము, అభివృద్ధి పొందుటకొఱకు మనమిద్దఱము కర్మలు చేయవలయును. సంతానం గూడ గనవలయును." (వివరాలకు చూడండి; చర్ల గణపతిశాస్త్రి గారి - 'ఉపనయన వివాహవిధి'). ఇటువంటివి తెరయెత్తించిన క్రియలో ధ్వనిస్తున్నాయి. తిక్కన వైదిక వివాహ కర్మలలో, ఆచారాలలో కావ్యకళకు ఉపకరించినవాటినే వివరించి రచించటం గమనార్హం. (సంపా.)

ఉ. వీనులఁ దియ్య మెక్క మును విన్కిఁ బరస్పర రాగవృత్తి లో
నూనినఁ జూచు వేడుకల నువ్విళు లూరెడు నెమ్మనంబు ల
చ్చో నొక యింత సేపు నెడసొచ్చుట కోర్వక యుండ నున్న య
మ్మానినియుం గుమారుఁడును మారవికారము లంకురింపఁగన్. 393

ప్రతిపదార్థం: మును= ముందుగా; విన్కిన్= వినటంచేత; వీనులన్= చెవులకు; తియ్యము= ఇష్టం; ఎక్కన్= కలుగగా; పరస్పర= అన్యోన్యమైన; రాగ వృత్తిన్= అనురాగ ప్రవృత్తితో; లోన్+ఊనిన= లోపల ఉన్న; చూచు వేడుకలన్= చూడాలనే వేడుకలతో; ఉవ్విళులూరెడు= ఉవ్విళ్లూరుతున్న; నెమ్మనంబులు= నిండు మనసులు; అచ్చోన్= అప్పుడు; ఒక+ఇంతసేపు= కొంచెంసేపు కూడ; ఎడ+చొచ్చుటకున్= ఎడమగుటకు; ఓర్వకుండన్+ఉన్న= సహించలేకున్న; ఆ+మానినియున్= ఆ ఉత్తరయు; కుమారుఁడును= అభిమన్యుడును; మార వికారములు= మన్మథుడి వలన కలిగే వికారాలు; అంకురింపఁగన్= పుట్టగా.

తాత్పర్యం: ముందుగా ఒకరిని గురించి మరొకరు వినటంతో చెవుల ద్వారా (వినుకలి) ప్రేమ కలిగింది. లోలోపల పరస్పరం అనురాగంతో చూడాలనే కోరికలు కలిగాయి. దానితో కొంచెంసేపు ఆలస్యానికి కూడా తట్టుకోలేని మనస్సులతో వధూవరు లున్నారు. వారి మనస్సులలో మన్మథభావాలు పుట్టాయి.

వ. అన్యోన్యావలోకనంబు చేయునప్పుడు. 394

ప్రతిపదార్థం: అన్యోన్య= ఒకరినొకరు; అవలోకనంబు= చూచుకొనటం; చేయునప్పుడు= చేసే సమయంలో.

తాత్పర్యం: వధూవరులు ఒకరినొకరు చూచుకొనే సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. వరుచూడ్కి ముద్దియ వదనంబుపైఁ బాఱి । తివుటమై నునుఁగాంతితీపు గ్రోలు,
సుందరీ రత్నంబు చూపు మనోహరు । నడుగుల యొప్పుపై నల్ల నడరుఁ,
బతివిలోకనములు పడఁతుకమైఁదీవఁ । గలయంగఁ బలుమఱు మెలఁగుచుండు,
వెలఁది కటాక్షముల్ విభునిపైఁ గ్రమమున । నెగసి మోమున సోఁకి మగుడ వచ్చు.

తే. నొండొరువుల లేఁ జెమటల నూని, వ్రేఁగు । పడిన చాడ్పున నవయవ భంగులందుఁ
దగిలి మఱుపునఁ దడయు నిద్దఱ విశాల । నయన దీప్తులు నెఱుకువ బయలుపడఁగ. 395

ప్రతిపదార్థం: వరుచూడ్కి= వరుడి దృష్టి; ముద్దియ= పెండ్లికూతురియొక్క; వదనంబుపైన్= ముఖంమీద; పాఱి= ప్రసరించి; తివుటమైన్= కోరికతో; నునుఁ గాంతి తీపు= నునుపైన కాంతిలోని మాధుర్యాన్ని; క్రోలున్= త్రాగుతుంది; సుందరీరత్నంబుచూపు= ఉత్తర చూపు; మనోహరున్= భర్తయొక్క; అడుగుల+ఒప్పుపైన్= పాదాల అందంపై; అల్లన్=

మెల్లగా; అడరున్= వ్యాపిస్తుంది; పతివిలోకనములు= అభిమన్యుడి చూపులు; పడఁతుక= ఉత్తరయొక్క; మైఁదీవన్= తీగెవంటి శరీరంమీద; కలయంగన్= అంతటా; పలుమఱు= చాలసార్లు; మెలఁగుచున్+ఉండున్= తిరుగుతున్నాయి; వెలఁది కటాక్షముల్= ఉత్తర క్రీగంటి చూపులు; విభునిపైన్= భర్తపై; క్రమమునన్= క్రమంగా; ఎగసి= పైకి ప్రసరించి; మోమునన్= ముఖమందు; సోఁకి= తాకి; మగుడ+వచ్చున్= మరలివస్తాయి; ఒండొరువుల= పరస్పరం; లేఁత+చెమటలన్= చిరు చెమటలను; ఊని= వహించి; వ్రేఁగుపడిన చాడ్పునన్= బరువెక్కినవా అన్నట్లు; అవయవ భంగులందున్= అవయవాల సొగసు తీరులలో; తగిలి= తగుల్కొని; మఱుపునన్= పరవశభావంలో; ఇద్దఱ= ఇద్దరియొక్క; విశాల= విశాలమైన; నయన దీప్తులున్= నేత్ర కాంతులును; ఎఱుకువ= అనురాగం; బయలుపడఁగన్= పైకి తెలిసిపోగా; తడయున్= ఆలసిస్తున్నవి, సంకోచిస్తున్నవి.

తాత్పర్యం: వరుడి దృష్టి పెండ్లికూతురి ముఖంమీద వ్రాలి కోరికతో మనుపైన కాంతిలోని మాధుర్యాన్ని తాగుతున్నది. ఉత్తర చూపు భర్తయొక్క అందమైన పాదాలపై మెల్లగా వ్యాపిస్తున్నది. అభిమన్యుడి చూపులు ఉత్తరయొక్క తీగవంటి శరీరం మీద చాలాసార్లు కలయ తిరుగుతూ ఉన్నాయి. ఉత్తర క్రీగంటి చూపులు భర్తపై క్రమంగా పైకి ప్రసరించి ముఖాన్ని తాకి తిరిగి, వస్తూ ఉన్నాయి. ఉభయుల మనోగతమైన వలపులు వారిచేష్టల వలన ఒకరికొకరికి తెలిసిపోయేటట్లు బయటపడగా ఆ వధూవరుల శరీరాలపై లేతచెమటలు పుట్టాయి. వారి విశాలమైన కన్నుల కాంతులు బరువెక్కినట్లయి ఉభయుల శరీరావయవాల సొగసుల తీరులలో ఆసక్తిపడి వేగంగా ముందుకు సాగలేక పారవశ్యంలో నెమ్మదిగా నిలుస్తూ కదులుతున్నాయి.

విశేషం: అలం: రూపకం, ఉత్ప్రేక్ష, స్వభావోక్తి, "భరతాన్వయుడైన పరీక్షిత్తు జన్మకు హేతువైన ఉత్తరాభిమన్యుల కల్యాణమునకు భారత కథయందు గల ప్రాముఖ్యమును గుర్తించిన తిక్కనగారు ఈ ఘట్టమును అత్యంతాభినివేశముతో నిర్వహించిరి. మూలభారతమున రెండు శ్లోకములలో సంగ్రహింపబడిన యీ కల్యాణఘట్టమును తిక్కనగారు ఇరువది పద్యముల వరకు విస్తరించి వ్రాసినారు. తెలుగునాట జరుగు పెండ్లి తంతు సాంగముగా వర్ణించినారు. తెర యెత్తించి ఉత్తరాభిమన్యులు పరస్పరావలోనము చేసిన తెరగు ఈ పద్యమున పరమ సుందరముగా వర్ణింపబడినది. ఈ పద్యము వస్తురసాలంకార ధ్వనులకు గని.

వరుడైన యభిమన్యుని చూపు ముగ్ధయగు ఉత్తరముఖముపై వ్యాపించి లావణ్య మాధుర్యము క్రోలును - అనుటవలన అభిమన్యుని చూపునందు భ్రమరత్వము, ఉత్తర ముఖమునందు పద్మత్వము, లావణ్యమునందు మకరందత్వము వ్యంగ్యములై రూపకాలంకారము ధ్వనించుచున్నది. సుందరియగు ఉత్తర చూపు మనోహరుడగు నభిమన్యుని పాదముల యందముపై మెల్లమెల్లగా వ్యాపించును - అనుటవలన ఉత్తర చూపులందు భ్రమరీత్వము. అభిమన్యుని పాదములందు పద్మత్వము వ్యంగ్యములై మరియొక రూపకాలంకారము ధ్వనించుచున్నది. ఉత్తర తలవంచుకొని పాదములనే చూచినది. అందువలన ఆమె లజ్జ, పతిభక్తి యను సంచారిభావములు ధ్వనించుచున్నవి. 'చూపు' అను ఏకవచనము వలన నూత్నవధూవరుల సంకోచము వ్యక్తమగుచున్నది. అభిమన్యుని చూపులు ఉత్తర మైఁదీవయం దంతటను పలుమారు సంచరించును - అనుటవలన మైఁదీవయను రూపకబలముచే ఉత్తర సర్వాంగములందును పుష్పత్వారోపము వ్యంగ్యము. ఉత్తర కడకంటి చూపులు అభిమన్యుని మీద క్రమముగా ప్రాకి మొగమును స్పృశించి మరలివచ్చును - అనుటవలన ఉత్తర పతిదేవతాత్వము, దర్శన కుతూహలము, లజ్జా సంకోచములు వ్యంగ్యములు. 'చూపులు' అను బహువచన ప్రయోగము వలన వధూవరుల పరస్పర పునఃపునర్దర్శనాభిలాష. ఈషల్లజ్జా శైథిల్యము వ్యంగ్యములు. ఒండొరుల శరీరములందలి చిరుచెమట వలన బరువెక్కినవా యన్నట్లు ఆయా అవయవముల సొగసు తీరులందు తగిలి పరవశములై నిలిచి ఇరువురి విశాలనయన దీప్తులు వారి మనస్సులందలి ప్రేమ రహస్యమును బట్టబయలు చేయును - అనుటవలన, పునఃపునరవలోకనములు కారణముగా ఇరువురి మేనులందు స్వేదము అను సాత్త్వికభావోదయమైన దనియు, రతిపారవశ్యమున సంకోచ అజ్ఞాభావములు మరచిరనియు భావము. బెదురుచూపులు నిలుకడ చూపులైనవి. బెదురు చూపులు తరచు చూపులైనవి. నవ వధూవరుల గుట్టు బట్టబయలైనది.

శ్రవణమువలన నుదయించిన రతి దర్శనమువలన ఉద్దీపితమై, అనుభావ సాత్త్విక సంచారి భావములచే పుష్టమై రసనీయస్థితి చేరుకొనుచున్నది. చాటుచూపుల వర్ణనయందలి రూపకములు ధ్వని రూపకములు. బాహాటపు చూపుల వర్ణనమందలి ఉత్ప్రేక్ష వాచ్యము అగుటయు ఒక సున్నితమైన శిల్పమే. "(డాక్టర్ పాటిబండ మాధవశర్మ - తిక్కన కవితా వైభవము - యువభారతి ప్రచురణ) (సంపా.)

వ. తదనంతరంబ. 396

తాత్పర్యం: ఆ తరువాత.

తే. ఒండొరుల దోయిళుల నినుపొందఁ జేయు। నక్షత ప్రకరంబు లన్యోన్యమస్త
కములఁ బోసిరి మందార కల్పలతలు। విరులగముల నొండొంటిపైఁ గురియునట్లు. 397

ప్రతిపదార్థం: ఒండొరుల= ఒకరొకరియొక్క; దోయిళులన్= దోసిళ్ళలో; ఇనుపొందన్+చేయు= అందగించెడి; అక్షత ప్రకరంబులు= తలంబ్రాలు; అన్యోన్య మస్తకములన్= పరస్పరం తలలపై; మందార కల్పలతలు= మందారవృక్షం, కల్పలతయు; విరుల= పూల యొక్క; గములన్= సమూహాన్ని; ఒండొంటిపైన్= ఒకదానిపైఒకటి; కురియునట్లు= వర్షించుకొన్నట్లుగా; పోసిరి= పోసికొన్నారు.

తాత్పర్యం: తలంబ్రాలు ఒకరి దోసిలినుండి ఇంకొకరి దోసిలిలో పోసి అందగించే వాటిని పరస్పరము తలపై పోసికొన్నారు. అది మందార వృక్షమూ, కల్పలతా పూలు వికసించగా ఒకదానిపై నొకటి కుప్పలు కుప్పలుగా పూలవాన కురిపించుకొన్నట్లున్నది.

విశేషం: 1. అలం: ఉపమ. మందారం వృక్షం (పుంలింగంకాబట్టి) వరుడికీ, కల్పలత (స్త్రీలింగం కాబట్టి) వధువుకూ తగిన ఉపమానాలు. తలచిన కోర్కెలన్నీ తీర్చే కల్పవృక్ష లతలే తమ మీద పరస్పరం పూలను క్రుమ్మరించుకొన్నట్లు తలంబ్రాలు వరుడూ, వధువూ పోసికొన్నారు. కామపురుషార్థ సాధన సమర్థమైన ఈ వివాహకాండకు, ఆయా మంత్ర తాత్పర్యాలను ఈ ఉపమాలంకారం వ్యంగ్యంగా సూచిస్తున్నది.

2. పెండ్లిలో తలంబ్రాలు పోసుకొనటాన్ని ఆర్ద్రాక్షతారోపణం అంటారు. అంటే తడిసిన అక్షతలను తలపై ఉంచటం అన్నమాట! ఆ ప్రక్రియను వివరిస్తూ చర్ల గణపతిశాస్త్రిగా రిట్లా పేర్కొన్నారు. "ఆర్ద్రాక్షతలను ముందు వధువు, పిదప వరుడు ఉంచవలెను. వరుడు, పాలను వధువు దోసిలి యందు తుడిచి రెండుసార్లు బియ్యముంచి, రెండు సార్లు అభిఘారము చేయవలెను. ఆ వరుని దోసిలిని వధువు దోసిలిపైన ఉంచి నీరుగల కలశము తీసికొని బ్రాహ్మణులతో గూడ కపిలగోవును స్మరింప జేయవలయును. కలిగించెడి శక్తిని ప్రసాదించు అగ్ని, వరుణాది దేవతలను గ్రహములను ప్రార్థించవలెను. ఆపై వరుడు వధువు శిరస్సున అక్షతలు పోయవలెను. రెండవసారి వరుని శిరస్సున ముందుగా పోయవలెను. మూడవసారి మొదట వధువు శిరస్సున పోయవలెను. నాలుగవసారి పరస్పరము ఒక్కసారిగా పోసికొనవలయును." (ఉపనయన వివాహవిధి). (సంపా.)

చ. లలితతనూ విలాసముల లజ్జకతంబునఁ జేసి మున్ను వి
చ్చలవిడిఁ బట్టఁగా వెరవు సాలక యోరలువాఱుచూపులన్
లలిఁ దలఁబ్రాలు పోయునెడలం దగ వొందిన నూలుకొల్పి యి
మ్ములఁ బచరింతు రొండొరుల మోహనమూర్తులపై వధూవరుల్. 398

ప్రతిపదార్థం: లలిత= కోమలమైన, సుందరమైన; తనూ విలాసములన్= శరీరాల హొయలను; లజ్జ కతంబునన్ చేసి= సిగ్గు కారణంగా; మున్ను= ఇంతకు ముందు; విచ్చలవిడి= యథేచ్ఛగా; పట్టఁగాన్= చూడటానికి; వెరవు+చాలక= అవకాశం చాలక; ఓరలు+పాఱు= ప్రక్కలకు వెళ్ళెడి; చూపులన్= చూపులను; లలిన్= తనివితీర; తలఁబ్రాలు పోయుఎడలన్= తలంబ్రాలు పోసికొనేటప్పుడు; తగ ఒందినన్= వీలు కలుగగా; నాలుకొల్పి= నిలిపి; ఇమ్ములన్= విరివిగా; ఒండొరుల= ఒకరినొకరి; మోహనమూర్తులపైన్= మోహము కలిగే అందమైన శరీరాలపై; వధూవరుల్= ఆ పెండ్లికూతురు, పెండ్లికొడుకును; పచరింతురు= ప్రసరింపజేస్తున్నారు.

తాత్పర్యం: ఆ వధూవరులు సహజమైన సిగ్గుకారణంగా కోమలములూ, సుందరములూ అయిన తమ శరీరాల అందమైన హొయలను ఓరచూపులతోనే తప్ప విచ్చలవిడిగా చూచుకొనలేకపోయారు. అయితే, తలంబ్రాలు పోసికొనే సమయంలో మాత్రం ఒకరు మరొకరి మోహనమూర్తిని ప్రీతితో చూచే అవకాశం దొరకటం చేత తనివిదీర విరివిగా చూచుకొన్నారు.

విశేషం: అలం: ప్రహర్షణం.

తే. **చిత్తమున గాఢరాగంబు చేతఁ జూపు । తెఱఁగు దోఁపఁ గెంపారెడు తీఁగబోఁ డి**
మృదులపాణిఁ గుమారుండు మెలపుమై గ్ర । హించెఁ బల్లవాలంబి మత్తేభలీల. **399**

ప్రతిపదార్థం: చిత్తమునన్= మనస్సులోని; గాఢ రాగంబు= గాఢమైన అనురాగాన్ని; చేతన్= చేతితో; చూపు తెఱఁగు= చూచే రీతి; తోఁపన్= తోచేటట్లు; కెంపారెడు= ఎర్రగా ఉన్న; తీఁగబోఁడి= తీగవంటి శరీరంగల ఉత్తరయొక్క; మృదులపాణిన్= మృదువైన హస్తమును; కుమారుండు= అభిమన్యుడు; మెలపుమైన్= మృదువుగా; పల్లవ+ఆలంబి= చిగురును పట్టిన; మత్తేభలీలన్= మదగజం విలాసంతో; గ్రహించెన్= పట్టుకొన్నాడు.

తాత్పర్యం: అభిమన్యుడు మనస్సులో ఉన్న గాఢమైన అనురాగాన్ని చేతితో ప్రదర్శిస్తున్నాడా అన్నట్లు ఎర్రగా ఉన్న ఉత్తరయొక్క మృదువైన హస్తమును మదగజము చిగురును పట్టినట్లుగ మృదువుగా గ్రహించాడు.

విశేషం: అలం: ఉపమ, ఉత్ప్రేక్ష. ఇచట మృదులపాణి - గ్రహించె - అని పాణిగ్రహణం జరిగిందని చక్కగా సూచన జరిగింది.

వ. **ఇట్లు పాణిగ్రహణం బాచరించి.** **400**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాణిగ్రహణంబు= హస్తమును పట్టుకొనుటను; ఆచరించి= చేసి.

తాత్పర్యం: ఈ విధంగా వారు పాణిగ్రహణం చేసికొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: తలంబ్రాలు పోసికొన్న తరువాత వరుడు వధువు యొక్క చేతిని గ్రహించి "గృహ్ణామి తే" మొదలైన మంత్రాలు చదువుతాడు. కొందరీపాణిగ్రహమే ముహూర్తమని భావిస్తారు. తెలుగునాట మంగళసూత్ర ధారణం వివాహంలో ముఖ్యవిధి. అది ఈ ఘట్టంలో పేర్కొనలేదు. మూలానికి విరుద్ధం కాని తెలుగుదనమే తిక్కన చొప్పించినట్లున్నది. (సంపా.)

క. **పెనుఁగుదుట నిడిన చూతం । బును నవమాలికయుఁ బోలెఁ బొలుపొంది రతం**
డును నమ్ముగ్ధయు నేకా । సనమున నున్నపుడు నూత్న సౌభాగ్యమునన్. **401**

ప్రతిపదార్థం: పెనుఁగుదుటన్= పెద్దపాదులో; ఇడిన= ఉంచిన; చూతంబును= మామిడి మొక్కయును; నవమాలికయున్+పోలెన్= నవమల్లికగా లతవలె; అతండును= అభిమన్యుడును; ఆ+ముగ్ధయున్= ఆ ఉత్తరయును; ఏకాసనమునన్= ఒకే ఆసనంపై; ఉన్నపుడు= కూర్చున్నపుడు; నూత్న= కొత్తదైన; సౌభాగ్యమునన్= అందంతో; పొలుపొందిరి= ప్రకాశించారు.

తాత్పర్యం: పెద్ద కుదుటిలో పెట్టిన మామిడియొక్క నవమల్లికాలత వలె ఒకే ఆసనం మీద కూర్చున్నపుడు ఆ అభిమన్యుడూ, ఉత్తరా క్రొత్త శోభతో ప్రకాశించారు.

సీ. **కోర్కులు గెడఁ గూడుకొని పార మేదిన। చిత్తంబు లూఱటఁ జిగురులొత్తఁ**
బులకాంకురములకుఁ దలతాఁకుడై యిరు। మేనను మవ్వంబు మిగిలి పొదలఁ
దఱి వేచి చనఁబోయి తడఁబడి మార్గతి। పడిచూపు లాదట బయలుపఱుపఁ
జెమటల తావులు తమలోనఁ గలసి వే। ఱొక్క సౌరభమయి చొక్కుసేయ.

తే. **గాఢ సంస్పర్శ భంగులు గలుగునట్టి। హోమ సమయ కృత్యంబుల నొదవి సౌఖ్య**
రసము వెన్నిట్ట పొరింబొరి గ్రమ్ముదేర। సమ్మదాంబుధిఁ దేలిరి సతియుఁ బతియు. **402**

ప్రతిపదార్థం: కోర్కులు= కోరికలు; కెడన్= ప్రక్కను; కూడుకొని= కలిసి; పారము= అంతమున; ఏదిన= చేరిన; చిత్తంబులు= మనస్సులు; ఊఱటన్= ఉపశమించటంతో; చిగురులు+ఒత్తన్= చిగిర్చగా; పులక+అంకురములకున్= గగుర్పాటులకు; తలతాఁకుడు+ఐ= పట్టక; ఇరుమేనను= రెండు శరీరాలందును; మవ్వంబు= ఉత్సాహం; మిగిలి= ఎక్కువై; పొదలన్= వ్యాపించగా; తఱి= తగిన సమయం; వేచి= ప్రతీక్షించి; చనన్+పోయి= వెళ్ళబోయి; తడఁబడి= తడబాటు చెంది; మార్గతి= మరొక మార్గం; పడి= పొంది; చూపులు= దృష్టులు; ఆదటన్= ఆసక్తిని; బయలుపడఁగ= వ్యక్తం చేయగా; చెమటల తావులు= చెమటల వాసనలు; తమలోనన్= వాటిలో అవి; కలసి= కలిసి; వేరొక్క సౌరభము+అయి= మరొక పరిమళమై; చొక్కు+చేయన్= పారవశ్యము కల్గించగా; గాఢ= దృఢమైన; సంస్పర్శ= స్పర్శయొక్క; భంగులు= రీతులు; కలుగునట్టి= కల్గిన; హోమ= హోమంచేసే; సమయ= వేళ అందలి; కృత్యంబులన్= పనులందు; సౌఖ్యరసము= సుఖానుభూతి; ఒదవి= కలిగి; పెన్నిట్ట (పెను+నిట్ట) పెద్ద ప్రవాహమై; పొరిన్+పొరిన్= మాటిమాటికి; క్రమ్మదేరన్= ఆక్రమించగా; సతియున్= ఉత్తరయును; పతియున్= అభిమన్యుడును; సమ్మద+అంబుధిన్= సంతోషమనెడి సముద్రంలో; తేలిరి= మునిగి తేలారు.

తాత్పర్యం: కోరికలన్నీ దగ్గరకు చేరుకొని తీరం చేరి విశ్రాంతిగా పుట్టుకొస్తున్నాయి. మేని పులకింతలు ఒక శరీరంలో పట్టక రెండు శరీరాలలో కూడా విస్తరించటంతో ఉత్సాహం పెరిగిపోయింది. చూపులు సమయం చూచుకొని వెళ్ళబోయి, తడబడిపోయి మరొక దారిపట్టి ఆసక్తిని వ్యక్తం చేస్తున్నాయి. చెమటలు కలిసిపోయి హోమద్రవ్యవాసనలతో కలిసి ఒకానొక సుగంధాన్ని వెదజల్లుతున్నాయి. హోమాలు చేసేటప్పుడు దగ్గరగా గాఢంగా స్పర్శ కలిగి వచ్చిన సౌఖ్యం ప్రవాహంగా పెరిగి మాటిమాటికి వ్యాపించగా ఆ దంపతులు ఇరువురు సంతోష సముద్రంలో మునిగి తేలారు.

విశేషం: అలం: స్వభావోక్తి, రూపకం. 1. పాణిగ్రహణానంతరం ప్రధానహోమం, లాజహోమం, జయాదిహోమాదులు వధూవరుల చేత చేయిస్తారు. అందులో గార్హస్థ్య ధర్మంలో ఆలుమగలు చేయవలసిన ధర్మాల నన్నింటిని అగ్నిసాక్షిగా మంత్రసహితంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతీకాత్మకంగా చేయిస్తారు. అందువలన ప్రక్కప్రక్క నుండే వధూవరుల శరీరాలు అంగాలు పరస్పరం గాఢ స్పర్శకు లోనౌతూ ఉంటాయి. ప్రప్రథమంగా లభించే ఆ గాఢ సంస్పర్శ భంగులు కలిగించే అనుభావ, సాత్త్విక విభావాలను తిక్కన ఒక క్రమ విన్యాసంలో ఈ సీసపద్యంలో వర్ణించాడు. ఒకొక్కసారి మనసులో కోరికలు మోసులెత్తగా కావాలని ఇద్దరూ దగ్గరగా ఒత్తుకొని కూర్చుండగా కోరికలు తీరినట్లు ఏదో తృప్తి మనసులలో మొలకెత్తితే వారి మనసులలో సౌఖ్యరసం ప్రవాహంగా ఉదయించినట్లు సంతోషించారు. నిరంతర స్పర్శవలన వారి శరీరాలపై పులకలు మరల మరల మొలిచి తబ్బిబ్బు చేయగా మేనులు మెత్తపడి మరింత కలుసుకొనటానికి పూనుకోగా సౌఖ్యరసం మాటిమాటికీ పెల్లుబికింది. ఇరువురూ సమయం చూచి చూపులు కలుపుకొనటానికి ప్రయత్నించి కూడా లజ్జచేత తడబాటుపడి పక్కచూపులు సారించి మనసులోని అనురాగాన్ని బయటపెట్టుకొంటూండగా వారి సౌఖ్యరస ప్రవాహం విస్తరించింది. తమ లోగుట్టులు తమంతతట తామే బయట పెట్టుకొనటం వలన స్వేదం సాత్త్వికభావంగా అంకురించింది. ఇరువురి చెమటల తావులూ కలిసి ఒక వింత సుగంధాన్ని కలిగిస్తూ ఉంటే స్వేదగంధసంగమం వారిని సౌఖ్యరసాంబుధిలో ఓలలాడింపజేసింది. నాలుగురకాల స్పర్శభంగుల నాశ్రయించి వారి సౌఖ్యరసం పుట్టి, క్రమంగా ఏరై, మాటిమాటికీ పొంగి, వరదగా వ్యాపించి, సముద్రంవలె సమృద్ధమైనదని ధ్వని.

2. ఉత్తమజాతి దంపతుల రతి భావజన్యస్వేదం కూడా పరిమళవంతంగా ఉంటుందని కామశాస్త్రకారుల అభిప్రాయం. అగ్నికార్యం చేసేటప్పుడు కలిగే వేడివలన కూడా స్వేదం కలుగవచ్చును. అది శ్రమవలని స్వేదం. తిక్కన స్పర్శసౌఖ్యంవలన కలిగే సాత్త్వికభావమైన స్వేదాన్నే వర్ణించాడు. (సంపా.)

వ. **ఇవ్విధంబున వివాహంబు నిర్వహించి మత్స్యమహీనాథుండు మణిభూషణంబులు రుచిరాంబరంబులుఁ గర్పూరాది సుగంధ ద్రవ్యంబులుఁ దాంబూలంబుల తోడి పళ్లెరంబులుఁ బచరించి పాండవులకు వాసుదేవ పూర్వకంబుగాఁ గట్టనిచ్చి, పురోహిత ప్రకరంబునకు నిప్పించి, యాజ్ఞసేనీ సుభద్రలకు సనురూపాభరణ పరిధానంబు లంతఃపురవర్తు లైన యర్హ జనంబులచేతం బుచ్చి, సౌభద్రునకు భద్రసామజసప్తశతియును, లోకోత్తర తురంగ దశ సహస్రంబును, సలక్షణ గోపంచలక్షయు, రథంబులు రెండు వేలును, దాసదాసీ జనంబు లక్షయు, మఱియు నానా ప్రకారంబు లగు ధనంబులు నరణం బిచ్చె: నమ్మహనీయ మహోత్సవంబు మంగళ సంవిధాన సావధాన పుణ్యాంగనలవలనను, నృత్త గీతాది వైచిత్ర్య మనోహర వారనారీజనంబుల వలనను, వినూత్న రత్నమయ భూషణాది దీప్తవేష విరాజమాను లగు కుమారుల చతుర పరిహాసాది విలాసంబుల వలనను, బ్రభూత విభవ విభ్రాజితు లగు రాజసూనుల మాననీయ గరిమలలిత విహార విశేషంబులవలనను. బాంచాలయాదవ కేకయాది బాంధవ మహిత మహిమాంచిత సంచరణంబుల వలనను, నానంద నిష్యంది పాండునందన సౌహార్దంబు వలనను మత్స్యమనుజపతి మందిరంబు పరమ సంపద్భరితంబై యుండె' నని చెప్పిన విని వైశంపాయనునితో జనమేజయుండు.** **403**

ప్రతిపదార్థం: మత్స్యమహీనాథుండు= విరాటుడు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; వివాహంబు= పెళ్ళిని; నిర్వహించి= జరిపి; మణిభూషణంబులు= మణులు పొదివిన అలంకారాలను; రుచిర+అంబరంబులున్= ప్రకాశించే వస్త్రాలను; కర్పూర+ఆది= కర్పూరం మొదలైన; సుగంధ ద్రవ్యంబులున్= పరిమళ ద్రవ్యాలను; తాంబూలంబుల తోడి= తాంబూలాలున్న; పళ్లెరంబులన్= పళ్ళెములందు; పచరించి= ఉంచి; పాండవులకున్= పాండవులకు; వాసుదేవ పూర్వకంబుగాన్= శ్రీకృష్ణునకు ముందుగాను;

కట్టన్+ఇచ్చి= కట్టుకొనటానికి కానుకలుగా ఇచ్చి; పురోహిత ప్రకరంబునకున్= బ్రాహ్మణుల సముదాయానికి; ఇప్పించి= బహుమతు లిప్పించి; యాజ్ఞసేనీ= ద్రౌపదికి; సుభద్రలకున్= సుభద్రకును; అనురూప= తగిన; ఆభరణ= నగలను; పరిధానంబులు= వస్త్రాలను; అంతఃపుర వర్తులు+ఐన= రాణివాసంలో ఉండునట్టి; అర్హజనంబులచేతన్= తగిన జనులచేత; పుచ్చి= పంపించి; సౌభద్రునకున్= అభిమన్యుడికి; భద్రసామజ= భద్రగజములు; సప్తశతియును= ఏడువందలున్నూ; లోకోత్తర= మేలుజాతివైన; తురంగ= గుర్రాలు; దశ సహస్రంబును= పదివేలును; సలక్షణ= మంచి లక్షణాలు గల; గోపంచలక్షయున్= అయిదులక్షల గోవులను; రథంబులు= రథాలు; రెండువేలును; దాసదాసీ జనంబు= దాసులు, దాసీలు; లక్షయున్= ఒక్క లక్షమందిని; మఱియున్= ఇంకా; నానా ప్రకారంబులు+అగు= అనేక రకాలైన; ధనంబులును= ధనములను; అరణంబు= అల్లుడి కిచ్చే ద్రవ్యం; ఇచ్చెన్= ఇచ్చాడు; ఆ+మహనీయ= ఆ గొప్పదైన; మహా+ఉత్సవంబు= గొప్ప ఉత్సవం; మంగళ సంవిధానం= మంగళకర ద్రవ్యాలను సమకూర్చటంలో; సావధాన= శ్రద్ధకల; పుణ్యాంగనల వలనను= సువాసినుల చేతను; నృత్తగీత+ఆది= నాట్యం, గానం మొదలైన; వైచిత్ర్య= అద్భుతమైన; మనోహర= అందమైన వారనారీ= వేశ్యాస్త్రీల; జనంబులవలనను= సముదాయం వలన; వినూత్న= క్రొత్తదైన; రత్నమయ= రత్నాలతో చేసిన; భూషణ+ఆది= నగలు మొదలైన వాటిచేత; దీప్త= ప్రకాశించిన; వేష= వేషంతో; విరాజమానులు+అగు= ధగధగలాడే; కుమారుల= రాజయువకులయొక్క; చతుర= నేర్పుగల; పరిహాస+ఆది= వేళాకోళాలు మున్నగు; విలాసంబుల వలనను= సరదాలతోను; ప్రభూత= ఎక్కువైన; విభవ= సంపదతో; విభ్రాజితులు+అగు= ప్రకాశించే; రాజసూనుల= రాజకుమారులయొక్క; మాననీయ= గౌరవించదగిన; గరిమ= గొప్పవయిన; లలిత= అందమైన; విహార విశేషంబుల వలనను= రకరకాల విహారాల వలన; పాంచాల= పాంచాల దేశీయులు; యాదవ= యాదవ వంశీయులు; కేకయ+ఆది= కేకయ దేశీయులు మున్నగు; బాంధవ= బంధువులతో; మహిత= గొప్పదైన; మహిమ+అంచిత= మహిమచేత గొప్పది అగు; సంచరణంబుల వలనను= విహారాలచేతను; ఆనందనిష్యంది= ఆనందం స్రవించే; పాండునందన= పాండవులయొక్క; సౌహార్దంబువలనను= మంచిమనస్సు కలిగి ఉండటం వలన; మత్స్యమనుజపతి మందిరంబు= విరాటుడి గృహం; పరమ= గొప్పదైన; సంపద్+భరితంబు+ఐ= సంపదతో నిండినదై; ఉండెనున్= ఉండింది; అని చెప్పినన్= అని చెప్పగా; విని; వైశంపాయనునితోన్= వైశంపాయన మహర్షితో; జనమేజయుండు= జనమేజయమహారాజు.

తాత్పర్యం: విరాటరాజు ఈ రీతిగా ఉత్తరాభిమన్యుల వివాహం నిర్వహించాడు. మణిభూషణాలు, మంచివస్త్రాలు, కర్పూరం మొదలైన పరిమళ ద్రవ్యాలు, తాంబూలాలు పెట్టిన పళ్ళెంలో పెట్టి ముందుగా శ్రీకృష్ణుడి కిచ్చి. తరువాత పాండవుల కిచ్చాడు. పురోహితులందరికీ ఇచ్చాడు. ద్రౌపదికి, సుభద్రకు తగిన ఆభరణాలు, వస్త్రాలు అంతఃపుర జనులచేత ఇప్పించాడు. ఇక అభిమన్యుడికి భద్రగజాలు ఏడువందలు, జాతిగుర్రాలు పదివేలు, సలక్షణమైన గోవులు అయిదులక్షలు, రథాలు రెండువేలు, దాసదాసీ జనం లక్ష - ఇవిగాక ఇంకా రకరకాల ధనాలు అరణంగా ఇచ్చాడు. ఆ కల్యాణ మహోత్సవం అంత గొప్పగా జరిగిందంటే కారణం - ఎక్కడ ఏవి సమకూర్చాలో అట్లా శ్రద్ధగా చేసిన సువాసినులు, ఆట పాటలతో అందరినీ అలరించే వేశ్యాజనం, రత్నాభరణాలు పెట్టుకొని మంచివేషంతో నేర్పుగా పరిహాస విలాసాలు చేసిన రాజకుమారుల విహారాలు, పాంచాల, యాదవ, కేకయాది బంధువుల సంచారాలు, పాండవుల ఆనందం వెల్లివిరిసే సౌహార్దం-వీటి అన్నిటితో విరాటుడి మందిరం సర్వసంపత్సమృద్ధం అయింది. అనగా విని జనమేజయుడు వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: అంత్యానుప్రాస.

క. 'కుంతీనందను లట్ల । త్యంత విభవ మెసఁగఁ బరిణయము చేసి సుహృ
త్సంతోషోజ్జ్వలులై తద । నంతర మెబ్భంగి నడచి?' రనవుడుఁ బ్రీతిన్. 404

ప్రతిపదార్థం: కుంతీనందనులు= పాండవులు; అట్లు= ఆ రీతిగా; అత్యంత విభవము= ఎక్కువ వైభవం; ఎసఁగన్= ఎక్కువ కాగా; పరిణయము= వివాహం; చేసి= జరిపి; సుహృత్= స్నేహితులయొక్క; సంతోష+ఉజ్జ్వలులు+ఐ= సంతోషంతో ప్రకాశించేవారై; తదనంతరము= ఆ పిమ్మట; ఏ+భంగిన్= ఏ రీతిగా; నడచిరి?= ప్రవర్తించారు?; అనవుడున్= అని ప్రశ్నించిన తరువాత; ప్రీతిన్= ప్రీతితో.

తాత్పర్యం: 'పాండవులు ఆ విధంగా వివాహం అత్యంత వైభవంగా జరిపించి, మిత్రులకు సంతోషం కలిగించి, తరువాత ఏ రీతిగా ప్రవర్తించారు?' అని అడుగగా అతడు ప్రీతితో. (ఇట్లా అన్నాడని తరువాతి ఉద్యోగపర్వం ప్రథమాశ్వాసంలోని పద్యంతో అన్వయం).

ఆశ్వాసాంతము

చ. అమృతమయాత్మ! భక్తిసుగమానుభవోజ్జ్వల దివ్యవర్త్మ! ష
ట్సమయ గతానుభావ! పురుష త్రయతా వివృత స్వభావ! ని
ర్మమ హృదయైకవాస! మునిరంజన నిత్యవిలాస! దోష సం
గమ వినికర్తనా! పరమ గౌరవ ధుర్య పద ప్రవర్తనా! 405

ప్రతిపదార్థం: అమృతమయ= అమృతమయమైన; ఆత్మ!= ఆత్మకలవాడా!; భక్తిసుగమ= భక్తిచేత సులభమైన; అనుభవ= అనుభవంతో; ఉజ్జ్వల= ప్రకాశించే; దివ్యవర్త్మ!= దివ్యమైన మార్గం కలవాడా!; షట్సమయ= ఆరు మతాలను-ఆరు సమయాలను; గత= పొందిన; అనుభావ!= ఆశయం కలవాడా! (షట్సమయగతానుభావ-శైవ, వైష్ణవ, శాక్త, సౌర, వైదిక, సౌగతము లనెడి ఆరు సిద్ధాంతాలయందును తెలియబడే ప్రభావం కలవాఁడా! లేదా- సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక పూర్వోత్తర మీమాంసలనెడి దర్శనషట్కంచేత తెలియబడే ప్రభావం కలవాఁడా! లేదా షట్సమయ- షట్కాలములయందును - అరుణోదయ, సూర్యోదయ, సంగవ, మధ్యాహ్న, సాయం, అర్ధరాత్రములందలి ఆరాధనంచేత భక్తులచే పొందబడు అనుభవం కలవాడా!); పురుష త్రయతా= బ్రహ్మవిష్ణుమహేశ్వరులనెడి ముగ్గురు పురుషులగుటతో; వివృత= వివరించబడిన; స్వభావ!= సృష్టి, స్థితిలయముల స్వభావం కలవాడా!; నిర్మమ= మమకారంలేని; హృదయ= హృదయమే; ఏకవాస= ముఖ్యమైన నివాసంగా కలవాడా!; మునిరంజన= మునులను రంజింపజేసే; నిత్యవిలాస!= నిత్యమైన విలాసాలు కలవాడా!; దోష= దోషాలతోడి; సంగమ= సంబంధాన్ని; వినికర్తనా!= కత్తిరింపజేసేవాడా!; పరమ= మిక్కిలి; గౌరవధుర్య= గౌరవభావంకల; పద= పదవియందు; ప్రవర్తనా!= ప్రవర్తించేవాడా!

తాత్పర్యం: అమృతమయమైన ఆత్మ కలవాడా! భక్తి సులభమైన అనుభవం కల దివ్యమార్గం కలవాడా! ఆరు మతములందున్న అభిప్రాయం కలవాడా! ముగ్గురు పురుషులుగా వివరించబడిన స్వభావం కలవాడా! మమకారం లేని హృదయమే నివాసంగా కలవాడా! మునులను రంజింపజేసే నిత్య విలాసాలు కలవాడా! దోష సంబంధాన్ని ఛేదించేవాడా! గొప్ప గౌరవం కల పదవియందు ప్రవర్తించేవాడా! హరిహరనాథా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: అంత్యానుప్రాస. ఈ పద్యంలో హరిహరనాథస్వామిని పరతత్త్వంగా తిక్కన దర్శించి కీర్తిస్తున్నాడు. షట్సమయాలు= ఆరు సిద్ధాంతాలు- శైవ, వైష్ణవ, శాక్త, సౌర, వైదిక, సౌగత సిద్ధాంతాలు; ఆరు దర్శనాలు- సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, పూర్వోత్తర మీమాంస దర్శనాలు; పురుషత్రయం= బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు.

క. దుర్వహ పటుతాపత్రయ। నిర్వాపణ కరణ, బోధ నిర్మలజన హృ
త్పర్వాచరణ, మహాసుర। గర్వహరణ! తత్త్వ సంప్రకాశనకరణా! 406

ప్రతిపదార్థం: దుర్వహ= వహింపరాని; పటు= గొప్పదైన; తాపత్రయ= మూడు తాపములను; నిర్వాపణకరణ= పోగొట్టటంలో పనికలవాడా!; బోధ= జ్ఞానంతో; నిర్మల= స్వచ్ఛమైన; జన= జనులయొక్క; హృద్= మనస్సులకు; పర్వ+ఆచరణ= పండుగ చేసేవాడా!; మహా+అసుర= గొప్ప రాక్షసుల; గర్వ+హరణ!= గర్వాన్ని పోగొట్టేవాడా!; తత్త్వ= పరబ్రహ్మతత్త్వాన్ని; సంప్రకాశన= ప్రకాశింపచేయటంలో; కరణా!= ముఖ్యసాధనమైనవాడా!

తాత్పర్యం: వహించలేని తాపత్రయాలను అణచే పనిగలవాడా! జ్ఞానంతో నిర్మలమైన జనుల హృదయాలకు ఆనందం కలిగించేవాడా! గొప్ప రాక్షసుల గర్వం పోగొట్టేవాడా! పరబ్రహ్మతత్త్వాన్ని ప్రకాశింపజేసే ప్రయోజనం కలవాడా! హరిహరనాథా!

విశేషం: అలం: అంత్యానుప్రాస. ఇందులో హరిహరనాథుడిని సగుణుడిగా భావించి తిక్కన కీర్తించాడు. 1. తాపత్రయం; ఆధ్యాత్మిక. ఆధిదైవిక. ఆధిభౌతిక రూపాలైన తాపాలు. 'నిర్వాపణ నిపుణ' అనే పాఠానికి బదులు 'నిర్వాపణ కరణ' అనే పాఠం గ్రహించబడింది. అయినను 'నిర్వాపణ నిపుణ' - అనే పాఠమే కవి హృదయసమ్మతంగా గోచరిస్తూవుంది.

మాలిని:

నిగమ కుసుమ గంధోన్మేష భూతాభిధానా!
సగుణ విగుణ లీలా! సౌమ్య సాక్షిత్వ నానా
జగదవన పిధాన స్థైర్య దత్తావధానా!
నగశరధి నివాసా నంద సంస్తూయమానా! 407

ప్రతిపదార్థం: నిగమ= వేదాలనెడి; కుసుమ= పుష్పాలయొక్క; గంధ= సువాసనయొక్క; ఉన్మేషభూత= వికాస రూపమయిన; అభిధానా!= పేరు కలవాడా!; సగుణ= ఉత్తమ గుణాల యొక్కయు; విగుణ= విరుద్ధ గుణాలయొక్కయు; లీలా!= విలాసాలు కలవాడా!; సౌమ్య= శాంతమనే గుణంతో; సాక్షిత్వ= సాక్షీభావం అనే గుణంతో; నానాజగత్= అనేక లోకాలయొక్క; అవన= రక్షించటం; పిధాన= లయం చేయటం; స్థైర్య= స్థిరభావంతో ఉంచటం (పాలనం) అనే మూడు పనులలో; దత్త+అవధానా!= నెలకొల్పబడిన శ్రద్ధ కలవాడా!; నగ= పర్వతం మీదను (హరపక్షాన); శరధి= సముద్రంలోనూ (హరిపక్షాన); నివాస= నివసించటం చేత; ఆనంద= సంతోషం కలవాడవని; సంస్తూయమానా!= (భక్తుల చేత) బాగా కీర్తించబడేవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! వేదాలనే పూలకు సువాసనవంటి వేదాంతతత్త్వమే పేరుగా కలవాడా! సద్గుణాలనూ, దుర్గుణాలనూ విలాసాలుగా కలవాడా! సృష్టి స్థితి లయాలవంటి జగద్వ్యాపారాలను శాంతుడవై, సాక్షీభూతుడవై శ్రద్ధతో గమనిస్తూ ఉండేవాడా! హరుడవై పర్వతంమీదా, హరివై సముద్రంలోనూ నివసించటం చేత ఆనందిస్తూ ఉంటావని భక్తులచేత విశేషంగా కీర్తించబడేవాడా!

విశేషం: అలం: రూపకం, అంత్యానుప్రాసం. ఇందులో హరిహరనాథమూర్తిని కీర్తించాడు. ఆనందశబ్ద ముద్రితంగా ఈ పద్యాన్ని రచించాడు. మాలినీవృత్తానికి ప్రతిపాదంలో వరుసగా న, న, మ, య, య అనే గణాలుంటాయి. తొమ్మిదవ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది.

గద్యము:

ఇది శ్రీమదుభయకవిమిత్ర, కొమ్మనామాత్యపుత్ర, బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున విరాటపర్వంబునందు సర్వంబును పంచమాశ్వాసము.

విరాటపర్వము సమాప్తము.

తాత్పర్యం: ఇది మంగళకరమైన ఉభయకవిమిత్రుడనే బిరుదం కలవాడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, పండితులను ఆరాధిస్తూ (పండితులచేత ఆరాధింపబడుతూ) ప్రకాశించేవాడూ అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలో అయిదవ ఆశ్వాసంతో పూర్తయిన విరాటపర్వం.

విరాటపర్వంలో అయిదవ ఆశ్వాసం సమాప్తం.

విరాటపర్వం సర్వం ముగిసింది.

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 7

ఉద్యోగపర్వము

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

శ్రీ ముదివర్తి కొండమాచార్యులు

ప్రధాన సంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Udyogaparvamu of Tikkana Somayaji
Vol.VII.

Commentary by
Dr. Jonnalagadda Mrityunjaya Rao- 1,2 Cantos
Sri Mudivarthi Kondamacharyulu- 3,4 Cantos

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Series No.606
First Edition : August 2000
First Re-print : 2006

Second Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D. Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్పైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

ఉద్యోగ పర్వం ధర్మానికి జయం అనే నానుడిని సార్థకం చేసే భారతంలో ఉద్యోగానికి ఆరంభ ఘట్టమని చెప్పవచ్చు. సామాన్యంగా విరాట, ఉద్యోగ పర్వాలనుకలిపి పారాయణం చేయడం, వ్యాఖ్యానించడం ఆనవాయితీగా ఉన్నప్పటికి తిరుమల తిరుపతి దేవస్థానాలు తిక్కన విరాట పర్వాన్ని సవ్యాఖ్యానంగా గోదావరి పుష్కరాలలో విడుదల చేయడం జరిగింది. ఇప్పుడు కృష్ణా పుష్కరాలకు ముందు ఉద్యోగ పర్వాన్ని విడుదల చేయడం జరుగుతున్నది.

ఉద్యోగ పర్వం ఒక విధంగా మహా భారత పాత్రల అంతరంగాల వివరణ పర్వం. ఇక్కడ సమరమో, సంధానమో అనే చర్చ జరిగింది. ధర్మరాజు, భీముడు మున్నగు వారి మనస్తు మూలాన్ని ప్రకటించే ఘట్టం. దానికి తోడు ద్రౌపది మున్నగువారి మనసును కూడ తెరిచిపెట్టేందుకు అవకాశం. ఈ మధ్యలో ఆవలిగట్టుపైన దుర్యోధనాది దుష్ట చతుష్టయం, కుంతి, విదురుడు, ధృతరాష్ట్రుడు, గాంధారి, భీష్మద్రోణుల అంతరంగం కూడ స్పష్టమౌతోంది. మరొకవైపు కర్ణ భేదనము, కుంతీ కర్ణ సంవాదము మొదలైనవి ముఖ్య ఘట్టాలిందున్నాయి. అన్నిటికంటే ముఖ్యమైంది పరమాత్ముని అతి మానుషలీలాచేష్టితాలైన పరస్పర విరుద్ధ విపరీత శక్తులను శ్రీ కృష్ణుడు తన కార్యంలో అనగా ధర్మసంస్థాపనలో వినియోగించుటకు పన్నే పన్నాగం అంటే ఆయన సర్వ శ్రేష్ఠ రాజ కార్య దురంధరత్వం గురు లఘు విన్యాసాలతో ఇందు నిరూపించబడింది. అందువలననే ఉద్యోగపర్వం పాఠకుల మనస్సులను లెస్సగా ఆకట్టుకుంటుంది.

ముఖ్యంగా ధృతరాష్ట్రుడి సభలో సంధిసమకూర్చడానికి వచ్చిన పరమాత్మను పట్టి బంధించడానికి దుర్యోధనాదులు ప్రయత్నించినపుడు ఆయన విశ్వరూపాన్ని ప్రకటించడం, దాన్ని ధృతరాష్ట్రుడు విశేష జ్ఞాన దృష్టితో చూడడం జరుగుతుంది. మరల తాను అంధుడు కావాలను కోవడం అతడి మానసిక పరిస్థితిని విస్ఫుటంగా తెలియజేస్తుంది. తిక్కన సోమయాజి వ్యాసులవారిని అనుసరించి అనువదించినా తెలుగులో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన మహాకృతిని వ్రాసి ఆంధ్రులకు మహోపకారం చేశారు. దానికి వ్యాఖ్యానాన్ని డా. జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారు, మహాకవి ముదివర్తి కొండమాచార్యులవారు రచించి భారతార్థాన్ని ఆంధ్రులకు సుగమం చేశారు. వారికి ధన్యవాదములు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు వ్యాఖ్యాన సహిత మహాభారతానికి ప్రధాన సంపాదకులుగా శ్లాఘ్యమైన కృషి చేస్తున్నారు. ఆయన సంతరించిన విశేషవివరణలు, పీఠికలు, కథాసంగ్రహాలు ఆంధ్రమహాభారత పరమార్థాన్ని, స్పష్టంగా, సరళంగా తెలియజేస్తున్నాయి. అందుకు వారికి నమోవాకాలు.

అనతి కాలంలోనే ప్రతులన్నీ చెల్లిపోయిన కారణంగా పుస్తకాన్ని పునర్ముద్రిస్తున్నాము (2006). ఎప్పటిలాగే చదువరులు ఉద్యోగపర్వాన్ని ఆదరాభిమానాలతో స్వాగతిస్తారని ఆశిస్తున్నాము.

కార్యనిర్వహణాధికారి,
తి.తి. దేవస్థానములు,తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీవేంకటేశ్వరస్వామి వారి దివ్యానుగ్రహంతో తిరమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహనిర్మాణం, పోతన భాగవత ప్రధమ స్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 -' 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జులై11 తేదీన హైదరాబాదు బాలాజి భవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అర సున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్లవేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను."

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్పురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్లవేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ" కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిగమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగాపర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీమధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జులై3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్దారెడ్డి గారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక"ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥కె. సర్వోత్తమరావు	**శ్రీడి. నాగసిద్దారెడ్డి (కన్వీనర్**

సలహాసంఘం

ఆచార్య తూమాటిదొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీకాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిని అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జులై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీడి. నాగసిద్దారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీస్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలో ని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్లకొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పండ్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి, విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి''.

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిని పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాష్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదక మండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంపాదకమండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు — శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య — డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
డా॥ కె.జె. కృష్ణమూర్తి — డా॥ కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే. — డా॥ బిరుదురాజు రామరాజు
అన్నమాచార్య ప్రాజెక్ట్‌డైరెక్టర్, తి.తి.దే. — డా॥ ఎం. కులశేఖరరావు
ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి, తి.తి.దే. — డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25 వ తేదిన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలుల లోని సభ్యులయొక్క సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటా లన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్త పాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ఇప్పుడు ప్రథమ సంపుటం - ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం - సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి. సుబ్బారావుగారి తరువాతి కార్యనిర్వహణాధికారి అయిన డా॥ పి.కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారు వచ్చిన తక్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణను గూర్చి ఆసక్తితో గమనిస్తూ అన్ని విధాల సహకరించి ఆది సభా పర్వాల విడుదలకు ఏర్పాటు చేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాల నిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ ప్రణాళిక వ్యాఖ్యా సహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. తరువాతి సంపుటాలు సైతం త్వరలోనే వెలుగుచూడ నున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారతం' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన సహృదయులు డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారికి అనేక ధన్యవాదాలు. తిరుమల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. సాహిత్య ప్రీతి కలవారైన తి.తి.దేవస్థానం సంయుక్తకార్యనిర్వహణాధికారి శ్రీ ఆర్. అప్పారావు, ఐ.ఏ.ఎస్., గారికి వందనములు.

సంబంధిత విభాగాధిపతిగా నూతనముగా వచ్చి సలహామండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన డా॥ పి. రంగారావు, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయ సహకారలందించిన తదితర అధికార గణానికి నమస్సులు. ఈ ప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధాన పాత్ర వహించిన - వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదక మండలి, సలహా మండలి) యందలి విద్యావేత్తలు ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు - ఈ విద్వాంసులందరికి నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి.దేవస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడం వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్‌కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానికపండితవర్యుల ఒక ఉప సంఘం (ఎడిటోరియల్‌సెల్) నిర్మాణానికి సిఫారసు చేస్తే దేవస్థానం ఆమేరకు ఎడిటోరియల్ కమిటీలో ఉన్న **డా॥ కె. సర్వోత్తమరావు, స్థానికులైన విద్వాంసులు, పండితవరేణ్యులు శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీముదివర్తి కొండమాచార్యులు** గారలతో ఎడిటోరియల్ సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈ సెల్ ఉపకారం మరువరానిది. వీరు వర్క్‌షాపువలె నిర్వహింపబడుతున్న కవిత్రయ మహాభారత యజ్ఞంలో పాలుపంచుకుంటున్నారు. ఆ కారణంగానే ఆరణ్యపర్వం మొదలుకొని తక్కినపర్వాలు త్వరితంగా వెలువరించగలుగుతున్నాం.

"సప్తగిరి" సంపాదకులుగా ఉండి, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి ప్రముఖ పాత్ర వహించిన కీ.శే. కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె. రాధారమణ, డాక్టర్ ఎ. సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి.ఎన్. శ్రీనివాసన్ గారికి, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్ది పాఠకులకు అతి తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయ అధికారి శ్రీ ఐ. పార్వతీశ్వర రావు గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ఎన్.ఎస్. రామమూర్తి
కన్వీనర్
సంపాదకుడు - సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి

అధ్యక్షులు

శ్రీ అజేయ కల్లం, ఐ.ఎ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకులు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం,

సంపాదక మండలి సభ్యులు

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆచార్య ఎం. బుద్ధన్న

డా॥ పి. రంగారావు, పౌరసంబంధాధికారి
(ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ మేడసాని మోహన్, డైరెక్టర్
అన్నమాచార్య ప్రాజెక్టు, (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద, కార్యదర్శి,
ధర్మప్రచార పరిషత్తు (ఎక్స్ అఫిషియో సభ్యులు)

కన్వీనర్

డా॥ ఎన్.ఎస్.రామమూర్తి,

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా. 1,2
4. డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్నశాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	ఆను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	ఆను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఆను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది.	–	ఆదిపర్వం
సభా.	–	సభాపర్వం
ఆర.	–	ఆరణ్యపర్వం
విరా.	–	విరాటపర్వం
ఉద్యో.	–	ఉద్యోగపర్వం
భీష్మ.	–	భీష్మపర్వం
ద్రోణ.	–	ద్రోణపర్వం
కర్ణ.	–	కర్ణపర్వం
శల్య.	–	శల్యపర్వం
సౌప్తి.	–	సౌప్తికపర్వం
స్త్రీ.	–	స్త్రీ పర్వం
శాంతి.	–	శాంతిపర్వం
అను.	–	అనుశాసవికపర్వం
అశ్వ.	–	అశ్వమేధపర్వం
ఆశ్ర.	–	ఆశ్రమవాసపర్వం
మౌస.	–	మౌసలపర్వం
మహా.	–	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	–	స్వర్గారోహణపర్వం
సం.	–	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	–	సంస్కృత మహాభారతము
అను.	–	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	–	ప్రధాన సంపాదకుడు
క.	–	కందపద్యం
వ.	–	వచనం
ఆ.	–	ఆటవెలది
తే.	–	తేటగీతి
సీ.	–	సీసం
ఉ.	–	ఉత్పలమాల
చ.	–	చంపకమాల
మ.	–	మత్తేభవిక్రీడితం
శా.	–	శార్దూలవిక్రీడితం
ఆశ్వా.	–	ఆశ్వాసం
క్రీ.శ.	–	క్రీస్తుశకం
య.	–	యగణం
మ.	–	మగణం
త.	–	తగణం
ర.	–	రగణం
జ.	–	జగణం
భ.	–	భగణం
న.	–	నగణం
స.	–	సగణం
ల.	–	లఘువు
గ.	–	గురువు
అలం.	–	అలంకారం
సం.	–	సంవత్సరం
మొ.	–	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పీఠిక

[పీఠిక విషయసూచిక:-1. **ఉద్యోగపర్వం ఉత్కంఠాపర్వం- పు.2✱ 2. నాలుగు ఉపాయాలు: నాలుగు ఆశ్వాసాలు-పు.2✱** (1) సామోపాయం: ప్రథమాశ్వాసం- పు.2✱ (2)దానోపాయం: ద్వితీయాశ్వాసం-పు.4✱ (3)భేదోపాయం: తృతీయాశ్వాసం-పు.6✱ (4)దండోపాయం: చతుర్థాశ్వాసం-పు.8✱ **3.ఉద్యోగపర్వం షాడ్గుణ్య ప్రయోగరంగం-పు.8✱** (1)సంధి-పు.10✱ (2)విగ్రహం-పు.11✱ (3)ఆసనం-పు.12✱ (4)సంశ్రయం-పు.12✱ (5)ద్వైధీభావం-పు.12✱ (6)యానం-పు.13✱ **4.రాయబారాల చదరంగం ఉద్యోగపర్వం-పు.13✱** (1)ధర్మరాజు కొరకు హితులు సాగించిన పురోహిత దౌత్యం-పు.15✱ (2)ధర్మరాజును గురించి ధృతరాష్ట్రుడు చేసిన అమాత్యదౌత్యం-పు.16✱ (3)ధర్మరాజే ధర్మనీతి కొరకు చేసిన రాయబారం శ్రీకృష్ణదౌత్యం-పు.17✱ (4)అహంకారి చేపట్టిన అధిక్షేపదౌత్యం ఉలూకుడి రాయబారం-పు.19✱ **5.తిక్కన రచన: నాటకీయత-పు.19✱** (1)అంకాలుగా గోచరించే సభలు-పు.20✱ (2)రంగాలుగా గోచరించే సమావేశాలు-పు.25✱ (3)దృశ్యాలుగా గోచరించే సన్నివేశాలు-పు.33✱ (4)చతుర్విధాభినయం-పు.38✱ (అ)ఆంగికాభినయం-పు.39✱(ఆ)ఆహార్యాభినయం-పు.40✱(ఇ)వాచికాభినయం-పు.40✱ (ఈ)సాత్త్వికాభినయం-పు.41✱ **6.ఉద్యోగపర్వం-శిల్పానుశీలనం-పు.42✱**(1)ఉపన్యాసశిల్పం-పు.45✱(2)ద్రుపద పురోహితుడు ప్రత్యక్ష ప్రమాణవాది-పు.46✱(3)సంజయుడు అనుమాన ప్రమాణవాది-పు.46✱(4)శ్రీకృష్ణుడు ఆప్తవాక్యప్రమాణవాది-పు.47✱ (5)ధర్మరాజు సమన్వయవాది-పు.51✱ (6)పాత్రోచిత తర్కవైఖరులు- పు.52✱ **7.ఉపాఖ్యానశిల్పం- పు.52✱ 8.మరికొన్ని విశేషాలు -పు.54✱ 9.ఉద్యోగపర్వం: అంతరార్థం- పు.56✱** (1)ఉపప్లావ్యనగర సమావేశం- పు.57✱(2)శ్రీకృష్ణుడి సహాయక ఘట్టం-పు.57✱(3)శల్యుడు కౌరవపాండవులకు ఇరువురికీ సహాయం చేయటం-పు.58✱(4)పాండవ కౌరవ బల సమీకరణం-పు.58✱(5)శ్రీకృష్ణుడి రాయబారం-పు.59✱(6)ధృతరాష్ట్రుడి సభలో శ్రీకృష్ణుడి విశ్వరూప ప్రదర్శనం-పు.59✱(7)శ్రీకృష్ణుడు కర్ణుడిని దుర్యోధనుడినుండి విడదీయటానికి యత్నించటం- పు.60✱(8)కర్ణుడిని పాండవులలో చేర్చటానికి కుంతీప్రబోధం-కర్ణుడి తిరస్కారం- -పు.61✱**10.కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం- పు.62✱**]
[**11.ఉద్యోగపర్వ కథాసారం-పు.64✱**]

ఉ. 'సారపు ధర్మమున్ విమలసత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁబాఱినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్షసేసి రది వారల చేటగుఁ గాని ధర్మ ని
స్తారక మయ్యు సత్య శుభదాయక మయ్యును దైవ ముండెడున్.' **(ఉద్యో.3.273)**

"భారతే సార ముద్యోగమ్" -అని ప్రసిద్ధి. మహాభారతంలో ఉద్యోగపర్వం సారవంతం. ఆ పర్వంలోని సారమంతా ఈ పద్యం.

"యత్ర ధర్మో హ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ,
హన్యతే ప్రేక్షమాణానాం హతా స్తత్ర సభాసదః". **(సం. 5.93.48)**

ధర్మం అధర్మంచేత, సత్యం అబద్ధంచేత చంపబడుతున్నప్పుడు ఎవరు కళ్ళొప్పగించి చూస్తూ ఉండిపోతారో, ఆ సభాసదులు నశిస్తారని వ్యాసభట్టారకుడు శ్రీకృష్ణుడినోట పలికించగా, దక్షు లుపేక్ష చేసినా, ధర్మాన్ని ఉద్ధరిస్తూ, సత్యానికి శుభాన్ని కలిగిస్తూ రక్షిస్తూ దైవం ఎల్లప్పుడూ ఉంటాడని తిక్కనసోమయాజి గోవిందుడినోట అదనంగా అనిపించి అద్భుతమైన ముగింపు నిచ్చాడు. అంతేకాదు. సత్యధర్మాలు అసత్యాధర్మాలచేత పీడించబడి లక్ష్యాలను సాధించలేని దీనస్థితికి చేరుతాయే కాని నశించవని తిక్కన తీర్పు. వాటిని ఉద్ధరించవలసిన బాధ్యత దైవాంశసంభూతులైన రక్షకులకు సహజంగా ఉంటుంది.

అది వారి ధర్మం, నిత్య సత్యం. దానిని విస్మరించే వారికి చావు తప్పదని వ్యాసభగవానుడు, కీడు తప్పదని తిక్కన సోమయాజి. మూలంలో ఈ ప్రభావం సభాసదులకు మాత్రమే పరిమితమైనట్లు స్ఫురిస్తుంది. తెలుగులో ఇది సార్వకాలీనమైన, సర్వజనీనమైన సత్యంగా వెలుగొందుతుంది. అంతేకాదు- వ్యాసవాక్యం నిష్ఠుర సత్యం. తిక్కన పద్యం నిర్మలసత్యం. వ్యాస భట్టారకుడి వ్యాఖ్య సభలకు ప్రాధాన్యమున్న సభాపర్వానికీ, ఉద్యోగపర్వానికీ వర్తించేటట్లు కనబడుతుంది. తిక్కనసూక్తి అష్టాదశపర్వాలనూ ఆవరించేదిగా వినబడుతుంది. ఈపద్యం ఉద్యోగపర్వసారమే కాదు; మహాభారత పరమార్థ సారం.

1. ఉద్యోగపర్వం ఉత్కంఠాపర్వం

"ఉద్యోగః పురుషలక్షణమ్"-అని ఒక సాధారణ సూక్తి. "ఉద్యోగినం పురుషసింహ ముపైతి లక్ష్మీః"-అని హితోపదేశసూక్తి. ప్రయత్నంచేయటం పురుషలక్షణం, ఉద్యోగియైన పురుషసింహుడిని లక్ష్మి చేరుతుంది. మహాభారతంలో పురుషసింహులు పాండవులు. వారు రాజ్యసంపదకోసం చేసే విశేషయత్నం ఉద్యోగపర్వ కథాంశం.

పంచమవేదమనీ, కావ్యేతిహాసమనీ పేరుపొందిన ఆంధ్రమహాభారతంలో విరాట-ఉద్యోగపర్వాలు కేంద్రబిందువులు. పద్ధెనిమిది పర్వాల భారత కథ ఒక త్రాసైతే, ఈరెండు పర్వాలూ త్రాసులో మొగ్గుచూపే ముల్లువంటివి. విరాటపర్వంలో పాండవులు అజ్ఞాతవాసాన్ని నిర్విఘ్నంగా నిర్వహించారు. పాండవులు బయలు మెరశారు. అభిమన్యుడికీ ఉత్తరకూ వివాహమయింది. పాంచాల యాదవాది దేశాధిపతులు వివాహశుభకార్యం ముగిసిన తరువాత పాండవుల భవిష్యత్కార్యక్రమాన్ని నిర్ణయించటానికి విరాటరాజు సభాభవనంలో ధర్మరాజువద్ద పెద్ద సభతీర్చారు. పాండవులు రెండవసారి జూదం ఆడినప్పుడు రాజ్యాధికారాన్ని పొంది ఉన్నారు. జూదంలో పెట్టిన నియమాలలో రాజ్యప్రసక్తి లేదు. కాబట్టి అరణ్యాజ్ఞాతవాసాలు ముగిసిన తరువాత పాండవులకు వారి రాజ్యభాగం రావటమే న్యాయం. దానికోసం ప్రయత్నం చేయాలని నిశ్చయించారు.

ఉద్యోగమంటే ప్రయత్నం. పాండవులకు న్యాయంగా రావలసిన రాజ్యభాగంకోసం చేసే ప్రయత్నం ఉద్యోగం. ఆ యత్నాన్ని వివరించే కథా భాగం ఉద్యోగపర్వం. రాజ్యయత్నం రాజనీతి నాశ్రయించి సాగాలి. రాజనీతిలో ఉపాయాలు నాలుగున్నాయి. అవి సామ, దాన, భేద, దండోపాయాలు. మొదటి మూడు విఫలమైతే చివర ప్రయోగించదగింది దండోపాయం- అంటే యుద్ధం. యుద్ధానికి సిద్ధమయ్యే సామదానభేదదండోపాయాలను సాగించటం రాజనీతి. దీనిని నిర్వహించటమే ఉద్యోగపర్వంలోని ప్రధానవస్తువు.

మహాభారతం ఒక మహానాటకమైతే విరాటోద్యోగ పర్వాలు అందులో గర్భసంధిగల భాగంవంటివి. అంటే- ఇంగ్లీషు డ్రామాలో క్లైమాక్స్ (climax) వంటివి. పాండవులు ఏ క్షణంలో గుర్తించబడతారో, ఎప్పుడు అజ్ఞాతవాస నియమం భంగం కాకుండా పూర్తవుతుందో-అని పఠిత ఉత్కంఠను పొందుతాడు విరాటపర్వం చదివేటప్పుడు. అందువలన ఆ పర్వం నానారసాభ్యుదయోల్లాసి. ఉద్యోగపర్వంలో పాండవులకు రాజ్యం దక్కుతుందా? దక్కదా?-అనే ఉత్కంఠ బలంగా కలుగుతుంది. మూడు రాయబారాలు సాగినా కథ ముడివీడదు. చివరకు యుద్ధమే శరణ్యమని నిశ్చయించేంతవరకు కథలో ఇదమిత్థమని చెప్పలేని ఒక అనిశ్చిత భావం ఉంటుంది. అందువలన ఉద్యోగపర్వం ఉత్కంఠాపర్వం.

2. నాలుగు ఉపాయాలు: నాలుగు ఆశ్వాసాలు

ఉద్యోగం ఉపాయాశ్రితం. పాండవోద్యోగంలో ప్రవర్తిల్లిన నాలుగు రకాల ఉపాయాలను వివరించేందుకా అన్నట్లు సహజంగా నాలుగు ఆశ్వాసాలు అమరి ఉండటం విశేషం.

(1). సామోపాయం: ప్రథమాశ్వాసం

ప్రథమాశ్వాసంలో పాండవ పక్షాన సామోపాయ ప్రయోగానికి ప్రయత్నం ప్రారంభమయింది. బలరాముడి మాటలలో అది సూచించబడింది.

చ. 'తమ సగపాలు గోలుపడి దానిన యిప్పుడు గోరు వీరికిన్
సముచితవృత్తి నిచ్చి తమసామున సంతసమంది యున్కి యు
క్తము ధృతరాష్ట్ర సూనునకు; దాన నపాయము లేకయుండుఁ; గో
ప ముడిగి వీరు సేయుదురు బాంధవ; మిజ్జగముం బ్రియంపడున్'. **(ఉద్యో. 1. 19)**

వ. 'కావున నిక్కార్యం బెడసేయక యొక్కరుం బనుపవలయు.......' **(ఉద్యో. 1.20)**

అరణ్యాజ్ఞాతవాసాల తరువాత పాండవులకు న్యాయంగా రావలసిన రాజ్యభాగాన్ని రాజైన ధృతరాష్ట్రుడు పిలిచి ఇవ్వాలా? లేక పాండవులే ఆక్రమించుకొనాలా? అన్నది సమస్య. ధృతరాష్ట్ర దుర్యోధనులు కుత్సితులు కాబట్టి పాండవులను పిలిచి భాగమివ్వరు. ధర్మరాజు బలప్రయోగంతో తన రాజ్యభాగాన్ని అధీనంలోకి తెచ్చికొనవచ్చును. కాని, పెదతండ్రి అనుమతిని కోరటానికే నిర్ణయించాడు. ధృతరాష్ట్రుడు పేరుకు ప్రభువైనా ప్రభుత్వం చెలాయిస్తున్నది దుర్యోధనుడు. అడిగితే అతడు అంగీకరించడు, తండ్రిచేత అంగీకరింపచేయడు. పాండవులు బలవంతులే అయినా ఒంటరిగా భీష్మాదులతో పోరి రాజ్యాక్రమణం చేయటం లోకులు మెచ్చేపని కాదు. అదీకాక సహాయ సహకారాలు తక్కువగా ఉన్నరాజు తాను బలవంతుడైనా యుద్ధానికి సిద్ధంకావటం రాజనీతికాదు. సామోపాయంతో కార్యసాధనం చేయటం సమంజసం. శ్రీకృష్ణ బలరామాదులు చెప్పిన సలహా అదే. ధర్మజుడు పెద్దల సలహాలను శిరసా వహించి సామోపాయానికి సమ్మతించాడు. ద్రుపద పురోహితుడిని రాయబారిగా పంపే ప్రయత్నానికి అనుమతించాడు.

ద్రుపదపురోహితుడి రాయబారం సామోపాయంలో ఉండదగినంత సౌమ్యంగా లేదని భీష్మాదులు భావించారు.

క. 'నీ వాక్యము విప్రస్వా । భావికమై యిట్లు శ్రుతికిఁ బరుషం బైనన్
భావింపఁ గార్యమున యం । దే విధమున సభకు నింత యిష్టంబగునే?' **(ఉద్యో. 1. 243)**

అని పితామహుడే వ్యాఖ్యానించాడు. రాజ్యభాగ ప్రసక్తితోపాటు పాండవ పౌరుష ప్రశంస దుర్యోధనాదుల కోపాగ్నికి ఆజ్యం పోసినట్లయింది. సామప్రయోగసాధనమైన సంధియత్నం విఫలమయింది. బ్రాహ్మణ వచనంకంటె కురుసభలో పాండవులనూ, పార్థపరాక్రమాన్నీ కీర్తించిన భీష్ముడి వాక్కులు కర్ణాదులను కలతపెట్టాయి. సభలో రభస జరిగేవరకు వచ్చింది. ధృతరాష్ట్రుడు పాండవదూతను సౌమ్యంగా వారించి, తానూ సామోపాయాన్ని ప్రయోగించనున్నట్లు ప్రతివ్యూహాన్ని ప్రకటించాడు.

ఉ. 'మంచిగ నేను బంధులును మంత్రిజనంబులుఁ బెద్దలున్ విచా
రించి సమస్త భూప్రజకుఁ బ్రీతిగ బిడ్డలపాలి కిప్డు పు
త్తెంచెద సౌమ్యు నొక్కరు; మదీయ మనోగతి వారిఁ గూడి వ
ర్తించు తెఱంగు గైకొనుట దెల్లము కౌరవజాతి కెంతయున్'. **(ఉద్యో. 1. 256)**

పాండవుల రాయబారం దుష్టచతుష్టయానికి అంగీకారం కాలేదు. మరి, ధృతరాష్ట్రుడు నిండుకొలువులో తేల్చి చెప్పకుండా, తానూ ఒక రాయబారం నడుపుతానని పూనుకొన్నాడు. అయితే, ఆ రాయబారం-విఫలమైన పాండవ సామోపాయాన్ని సఫలం చేయటానికా? సఫలమైన కౌరవయత్నాన్ని కప్పిపుచ్చుకొనటానికా? పాండవ ప్రయత్నాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిప్పికొట్టటానికా? సామోపాయాన్ని ప్రయోగించిన పాండవుల యత్నానికి ప్రతివ్యూహం పన్ని దాన్ని సమూలంగా కుప్పకూల్చటానికా? సభలో ఎవరికీ అంచనాలకు అందనట్లు నిపుణంగా మాట్లాడాడు ధృతరాష్ట్రుడు. ఏమైనా, ధర్మరాజు యుద్ధోద్యోగప్రగతిలో ఒకమెట్టు పైకెక్కటానికి బ్రాహ్మణుడి రాయబారం తోడ్పడింది.

ప్రథమాశ్వాసంలో సంజయుడి రాయబారంకూడా ఉండటం సమంజసం. సంజయుడి రాయబారం ధృతరాష్ట్రుడి వక్రరాజనీతిలో కుటిల సామోపాయానికి చక్కని నిదర్శనం. పాండవులు తమ రాయబారం ద్వారా సంధినీ, సహజీవనాన్ని కోరారు. అది లభించకపోతే సమరానికి సిద్ధమని ప్రకటించారు. దుర్యోధనుడు పాండవులతోడి సంధికి గాని, సహజీవనానికిగాని సమ్మతించడు. కాని, యుద్ధానికి కాలుదువ్వుతాడు. ధృతరాష్ట్రుడు కొడుకుమాటను కాదనలేడు; కాని, యుద్ధమంటే భయపడతాడు. కొడుకు కోరిక తీరాలి, కొడుకు యుద్ధంలో చావకుండ సుఖంగా ఉండాలి. దానికి మార్గం ఒక్కటే. ధర్మరాజు రాజ్యం కోరకూడదు, యుద్ధం చేయకూడదు. అతడిని శాంతచిత్తుడిగా మార్చి, సంపదలకు దూరంగా, సమరానికి విముఖంగా సాధువృత్తిలో జీవించేటట్లు బోధించాలి. మరొకమాటలో చెప్పాలంటే - ధర్మజుడు యుద్ధోద్యోగంలో మొదటి ఉపాయాన్ని - సామాన్ని ప్రయోగిస్తే, ధృతరాష్ట్రుడు ధర్మరాజు యుద్ధోద్యోగాన్నే పూర్తిగా మాన్పించి. శత్రువిజయాన్ని సౌమ్యంగా సాధించాలని యత్నించాడు. ఇది శుక్రరాజనీతిలోని వక్రసామోపాయం.

క. 'నెయ్యము వాటించి కడుం । దియ్య మెసఁగ నలుక లెల్లఁ దీఱునటులుగాఁ
గయ్యమను తలఁపు లోనుగ । నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగునన్'. (ఉద్యో.1.271)

ప్రయోగించిన ధృతరాష్ట్రుడి వక్రనీతి ధర్మరాజువద్ద వికటించింది. తండ్రి నీతిలోని అవినీతిని బట్టబయలుచేసి సంజయుడిని సర్దుమణిగేటట్లు చేశాడు యుధిష్ఠిరుడు.

క. 'ఎదిరిం దమయట్టుల కా । మదిఁ దలఁచినఁ బొసఁగుఁ గాక! మాకుం గుడు మిం
డిదె మీరు వ్రక్కఁ గొనుఁ డని । చదురడిచిన మనసుపొందు చక్కంబడునే!' (ఉద్యో.1.312)

సామోపాయంలో సత్రమనీతికి ధర్మరాజు, వక్రనీతికి ధృతరాష్ట్రుడు ప్రతినిధులుగా గోచరిస్తారు. న్యాయమైనా కౌరవులకు ఇష్టంలేని మాటలను కష్టం తోచేటట్లు చెప్పినందుకు బ్రాహ్మణుడి రాయబారం విఫలమైనదని భీష్మాదులు భావించారు. తేనెపూసిన కత్తులవంటి మాటలతో పాండవులకు నష్టం కలిగించే నయ వంచనా వాక్యాలను పలికి ధర్మజాదుల నిష్ఠురాలకు గురికావటం వలన సంజయుడి రాయబారం విఫలమైనదని కృష్ణాదులు భావించారు. విఫలమైన సామోపాయం పాండవులకు ప్రగతి సూచిక; కౌరవులకు దుర్గతి సూచిక! నాయక ప్రతినాయక పక్షాల సామోపాయ విఫల చిత్రణాల వలన ప్రథమాశ్వాసానికి నిండుదనం కలిగింది.

(2). దానోపాయం: ద్వితీయాశ్వాసం

శత్రువులు బలవంతులైనప్పుడు కాని, జయాపజయాలు సందిగ్ధావస్థలో ఉన్నప్పుడుగాని, యుద్ధంవలన కలిగే లాభంకంటె నష్టం అధికంగా ఉన్నప్పుడుగాని, సంధికుదుర్చుకొని శాంతిని పొందుదామనుకొన్నప్పుడుగాని, తాను తగినంత బలాన్ని సమీకరించుకొనలేనిస్థితిలో ఉన్నప్పుడుగాని సామాన్యంగా ప్రభువు దానోపాయాన్ని ప్రయోగిస్తాడు. అంతేకాదు, బలోన్నతికి కొంత సమయం కావలసివచ్చినప్పుడు కూడా దానాన్ని కాలయాపనకు ఒక అవకాశంగా రాజనీతిలో ప్రభువులు వాడుకొంటారు.

ఉద్యోగపర్వంలో ధర్మజుడు యుద్ధోద్యోగంలో ఒక భాగంలో దానోపాయాన్ని నిపుణంగా ప్రయోగించాడు. దీనిని గురించిన విచారమే ద్వితీయాశ్వాసకథా జీవితంగా వ్యాఖ్యానించ వచ్చును. ఉపప్లావ్యంలో విడిదిచేసి ఉన్న ధర్మరాజు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రస్తుతం రాజ్యసంపద లేనివాడు, కాని, బంధుసంపద కలవాడు. ధృతరాష్ట్ర దుర్యోధనులు పాండవరాజ్యాన్ని హరించి, వారికి మరల రాజ్యావకాశం కలిగించకుండా, దానిని శాశ్వతంగా అనుభవించాలని కుతంత్రాన్ని పన్నుతున్న కుత్సితులు, భౌతికంగా చూస్తే కౌరవులు రాజ్యసంపన్నులు, బలవంతులుగా కనబడతారు. రాజ్యం లేకపోయినా స్వీయబలంతో ఎంతటి రాజ్యాన్నైనా కబళించివేయగల సమర్థుడు ధర్మరాజు. అయినా ధర్మనీతితో రాజ్యాన్ని పొందాలని భావించే ధర్మమూర్తి. అతడు ప్రయోగించే దానోపాయం ఈ పరిస్థితులలో గడుసుగా ఉంటుంది. సంజయుడితో ధర్మరాజు ఇట్లా అన్నాడు-

క. 'రండని పిలువఁ బనిచి, పా । లిండని కొడుకులకుఁ జెప్పి, యింద్రప్రస్థం
బొండెను వేఱొక పట్టణ । మొండెను మా కిచ్చి యనుచు టుచితమ కాదే?' **(ఉద్యో. 1.327)**

పాండవులకు రావలసిన రాజ్యభాగాన్ని ధృతరాష్ట్రుడు గౌరవంగా ఇవ్వాలని కోరుతూ, ఇంద్రప్రస్థమే కాకపోతే, మరేపట్టణమైనా ఇవ్వవచ్చునని ధర్మరాజు అడిగాడు. పూర్వం పాండవుల కిచ్చిన రాజ్యభాగానికి రాజధాని ఇంద్రప్రస్థం. దానిని పాండవులు పునర్నిర్మాణంచేసి అభివృద్ధిచేశారు. అక్కడినుండి దిగ్విజయంచేశారు. అక్కడే రాజసూయం చేశారు. మయసభాది అపూర్వ నిర్మాణవైభవాన్ని దానికి కల్పించారు. అదే దుర్యోధనుడి అసూయకు ఆలంబనమయింది; పాండవసంపదను హరించే దుర్యోధనుడి దుర్నీతికి ఆ పట్టణసంపదే మూలహేతువయింది. ఒకవేళ ఆ సంపదను దుర్యోధనుడు పాండవులకు తిరిగి ఇచ్చే తెంపు ప్రకటించలేకపోతే, మరొక పట్టణమైనా ఇమ్మని ధృతరాష్ట్రుడిని కోరటం ఇందులోని తాత్పర్యం. అభివృద్ధిచెందిన రాజ్యాన్ని త్యాగంచేసి అభివృద్ధిచెందని మరొక ప్రాంతాన్ని కోరుకొనటంలో కొంత త్యాగరూపమైన దానోపాయం భాసిస్తుంది. ధర్మరాజు బలహీనుడై ఈ మాట అనలేదు. రాజనీతిలో భాగంగా ఆ ఉపాయాన్ని ప్రయోగించాడు. అతడా ప్రతిపాదన చేయటానికి ముందు దానిని ఎవరికీ చెప్పలేదు. ఎవరి సలహాకూడా తీసికొనలేదు. వినేవారు ఆశ్చర్యపడేటట్లు ప్రకటించాడు. అయినా అది ఫలించలేదు. శ్రీకృష్ణుడితో ఈ అంశాన్ని గురించి ఇట్లా ప్రస్తావించాడు.

క. 'ఇచ్చుటి బంధులు నీవును । నచ్చెరువడి వినుచునుండ నయిదూళులు మా
కిచ్చినను జాలునంటిని । బొచ్చెముగా దింతవట్టు పూర్ణము సుమ్మీ!' **(ఉద్యో. 3.11)**

ధర్మజుడు ప్రయోగించిన దానోపాయం ధృతరాష్ట్రుడి హృదయంలో కల్లోలాన్నీ, సంక్షోభాన్నీ సృష్టించింది. రాత్రిళ్ళు అతడు నిద్రపోలేకపోయాడు. విదురాదుల ప్రబోధాలను వింటూ వేదననుండి తేరుకొనాలని ప్రయత్నించాడు. కాని, అతడి హితులందరూ ధర్మజుడి రాజ్యభాగాన్ని గురించి ప్రస్తావించి, దానిని తిరిగి దానంచేస్తే, అతడికి మనశ్శాంతి లభిస్తుందనీ, కులక్షయం కాకుండా శుభం కలుగుతుందనీ బోధించారు. మచ్చుకు - విదురుడు విజ్ఞతతో చేసిన మందలింపు ధృతరాష్ట్రుడికి దిగ్భ్రాంతిని కలిగించింది.

ఉ. 'డక్కెను రాజ్యమంచు నకటా! యిటు దమ్ముని భాగ మీక నీ
వెక్కటి మ్రింగఁ జూచె; దది యెట్లుఱుగున్? విను; మీను లోలతన్
గ్రక్కున నామిషంబు చవి గాలము మ్రింగిన చాడ్పు నూవె; యి
ట్లుక్కివుఁడైన నీ కొడుకు నుల్లము నున్నటు లాడఁ గూడునే?' **(ఉద్యో. 2.52)**

తమ్ముడి భాగమైన రాజ్యాన్ని తిరిగి తమ్ముడి కొడుకులకు ఇవ్వటమే దానమనుకొన్నా, ధృతరాష్ట్రుడు అంత బాధపడవలసిన పనిలేదు. రాజ్యాన్ని దిగమ్రింగబూనటం అతడి అవివేకం, దుర్యోధనుడి ధూర్తలక్షణం. ఆహారమనుకొని గాలాన్ని మ్రింగిన చేప చందంగా పాండవరాజ్యభాగాన్ని హరించి కౌరవులు మృత్యువుపాలు కావద్దని హెచ్చరించాడు విదురుడు. న్యాయంగా తనకు రావలసిన రాజ్యభాగాన్ని కూడా దానోపాయంలో భాగంగా చేర్చి ధర్మరాజు సాగించే ధర్మనీతి శత్రువులకు ప్రాణసంకటంగా తయారుకావటం విశేషం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కౌరవులకున్న సైన్యసంపదను లెక్కించి, ధర్మజుడు ఏ ధైర్యంతో యుద్ధానికి సిద్ధం కాగలడని ధృతరాష్ట్రుడు విదురుడిని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు విదురుడు తలపట్టుకొన్నాడు. మూర్ఛపోయినంత బాధపడ్డాడు. అతడి అవివేకానికి ఆవేదన పడ్డాడు. చివరకు ఇట్లా అన్నాడు:

చ. 'వినుము నరేంద్ర! పాండుపృథివీపతి యగ్రసుతుండు సంధి సే
యన మదిఁ గోరు; మీరు తమ యయ్య సగంబును భూమి యీకత
క్కిన మతి కాని ముంద రొక కీడుఁ దలంపఁడు; మీ బలంబు నె
ల్లను మదిఁ జీరికిం గొనఁడు లావున నేలఁ గొసందలంచినన్'. **(ఉద్యో. 2.170)**

దండోపాయానికి ధర్మరాజు పూనుకొంటే కౌరవసైన్యం అతడి కొకలెక్కలోకి రాదని చెప్పి, వారి తండ్రిపాలు నేల వారికిచ్చి దానోపాయాన్ని గౌరవిస్తే దండోపాయందాకా దారితీయ నవసరముండదని హితవు చెప్పాడు విదురుడు. గ్రుడ్డిరాజుకు ఆ మాట రుచించలేదు.

అయినా, సంజయాదులు ధృతరాష్ట్రుడికి ఎన్నో హితవులు చెప్పారు. పాండవ బలపరాక్రమాలను నిరూపించి చెప్పారు. చివరకు ధర్మరాజును శరణువేడితే శాంతి లభిస్తుందని హెచ్చరిక చేశారు. ధృతరాష్ట్రుడు దిమ్మరపోయి రాజ్యభాగాన్ని ధర్మజుడి కిమ్మని కొడుకును కోరాడు (2.246). అతడు తృణీకరించాడు. అంతటితో అయిదూళ్ళ ప్రసక్తికూడా అడుగంటి పోయింది. వాడి సూదిమొనమోపినంత నేలకూడా ఇవ్వనని తేల్చి చెప్పిన దుర్యోధనుడి మొండితనం ధర్మజుడి దానోపాయాన్ని విఫలంచేసి, యుద్ధోపాయానికి దారిని సుకరం చేసింది.

ధర్మజుడి దానోపాయం శత్రువులకూటమిలో రేపిన సంచలనాన్ని సర్వాంగంగా చిత్రించిన కథాభాగం ద్వితీయాశ్వాసం!

(3). భేదోపాయం: తృతీయాశ్వాసం

సామోపాయాన్ని ప్రయోగించగల రాజు సమయజ్ఞుడై ఉండాలి. దాన ప్రయోగనిపుణుడు దక్షుడై ఉండాలి. భేదోపాయప్రయోక్త లోకజ్ఞుడైన నీతిజ్ఞుడై ఉండాలి. యుద్ధోపాయాన్ని నిర్వహించే రాజు వ్యూహకుశలుడై ఉండాలి. ధర్మరాజు ఉద్యోగపర్వంలో చతురుపాయ సమర్థుడుగా చిత్రించబడ్డాడు. అందులోనూ - తృతీయాశ్వాసం ధర్మజుడి భేదోపాయ ప్రయోగ పాండిత్యానికి ప్రజ్ఞాపతాక!

శాస్త్రబద్ధంగా ప్రయోగించే రాజనీతి ధర్మనీతిగా మారుతుంది. యుద్ధం తప్పదని తెలిసిన ధర్మరాజు, సమరాన్ని సరాసరి ప్రకటించకుండా సామదానభేదాలను ముందుగా ప్రయోగించాడు. దానిరూపమే రాయబారపు ప్రయత్నం. పురోహితుడి, సంజయుడి రాయబారాల నాధారంగా చేసికొని ధర్మరాజు నిపుణంగా సామదానోపాయాలను ప్రయోగించి, కౌరవుల దుర్నీతి వలన అవి విఫలమైనట్లు స్పృహను లోకంలో సృష్టించాడు. తృతీయాశ్వాసంలో సామదానరూపంగా పైకి కనబడుతూనే గూఢంగా సాగే భేదోపాయాన్ని సారించాడు. ఈ ఉపాయం పైకి స్నేహహస్తం చాచినట్లుంటుంది. లోన శత్రుశిబిరంలో భేదాన్ని ప్రయోగిస్తున్నట్లుంటుంది. దానిని ధర్మరాజు శ్రీకృష్ణుడి రాయబారం ద్వారా సాధింపదలచాడు. శ్రీకృష్ణుడితో ధర్మజుడు పలికిన మాటలు మెత్తని పులి పలికే ధర్మనీతి సూక్తులు. ఆ రాయబారం ఒక వ్యూహం. దాని ప్రవక్త ధర్మరాజు, ప్రయోక్త శ్రీకృష్ణుడు.

సంజయుడి రాయబారం వలన ధృతరాష్ట్రుడు రాజ్యభాగ మిచ్చేది లేదనీ, అతడు దుర్యోధనుడి వక్రబుద్ధిని మార్చలేడనీ స్పష్టమయింది. శకుని కర్ణాదులను నిలువరించలేడని తేలింది. అయితే, భీష్మాది కురువృద్ధులూ, ఆచార్యాది

విజ్ఞులూ, విదురాది ధర్మవేత్తలూ ధర్మజుడి ధర్మనీతి వర్తనాన్ని గ్రహించగలరు, హర్షించగలరు, సమర్థించగలరు, ధృతరాష్ట్ర దుర్యోధనాదులకు హితబోధ చేయగలరు. అయినా, వారి మాటలు దుర్యోధనాదులు వినరు. వారు యుద్ధాన్నే కోరుతారు. విజయం తమకే దక్కుతుందనీ, పాండవులు రణంలో నిహతులౌతారనీ వారి నమ్మకం. ధృతరాష్ట్రుడు కొడుకును కాదనలేడు; యుద్ధాన్ని సమర్థించలేడు. డోలాయమానచిత్తుడై సమస్యను పరిష్కరించలేక కటకట పడతాడు. కాబట్టి, ఆయనముందు యుద్ధసమస్యనే పెద్దదిగా చేసి భయపెట్టాలి. అప్పుడు యుద్ధంచేయాలని భావించే దుర్యోధన వర్గానికీ, వద్దని వాదించే గురుభీష్మాది వీరవర్గానికీ భేదం ఏర్పడుతుంది. ధృతరాష్ట్రుడు ఏదో ఒక పక్షం వహించవలసి వస్తుంది. లేదా యుద్ధంవలన కలిగే వంశనాశనానికి నాంది నాలపించవలసి వస్తుంది. నింద మోయవలసి వస్తుంది. అందువలన, యుధిష్ఠిరుడు శాంతివచనాలతో రాయబారాన్ని మొదలు పెట్టాడు.

అయిదూళ్ళడిగినా ఇవ్వని దుర్యోధనుడి దౌష్ట్యంవలన యుద్ధం తప్పనిసరి ఔతుంది. యుద్ధంవలన రాజ్యంలోని భాగమే కాదు మొత్తం రాజ్యం పాండవుల వశమౌతుంది. అంటే, ధృతరాష్ట్ర దుర్యోధనుల పాలన హస్తినలో అస్తమిస్తుంది. ఆ మాటలు కౌరవసభలో ప్రకటించి, తన ఉద్యోగాన్ని (ప్రయత్నాన్ని) భీష్మద్రోణాది వృద్ధ గురు జనానికీ, రాజులకూ, ప్రజలకూ తెలియచెప్పి, యుద్ధంవలన కలిగే అనర్థాలను వారికి వివరించుమన్నాడు ధర్మరాజు. యుద్ధంవలన కౌరవవీరుల నాశనమే కాక, ఇరువైపులకు చెందిన వీరులు మరెందరో ప్రాణాలు కోల్పోవచ్చును. ఆ యుద్ధక్రూరకర్మకు మూలం పగ. దుర్యోధనుడు మూర్తీభవించిన పగ. అతడు పగ చల్లార్చుకొని స్నేహంతో కలిసి ఉండటానికి అంగీకరిస్తేనే శాంతి. లేదా, అది అతడి దోషమే ఔతుంది; వంశనాశనానికీ, రక్త ప్రవాహాలకూ దారితీస్తుంది. ఈ విషయం కురుసభలో అందరిముందు చెప్పి, నేరమంతా కౌరవపక్షంలోనే ఉన్నదని నిరూపించటానికీ, పాండవులు దండోపాయం ప్రయోగించటానికీ కౌరవుల దుష్టవర్తనమే మూల కారణమని లోకానికి తెలియచెప్పటానికీ చేసే యత్నమే శ్రీకృష్ణుడి రాయబారం. సంజయుడు అన్నట్లుగా 'అధర్మం చేస్తున్నది ధృతరాష్ట్రుడూ, అతడి కొడుకులే' అని అందరూ నమ్మేటట్లు చేయటం ఈ రాయబారం వెనుక ఉన్న వ్యూహం. ఇది రాజనీతిలోని భేదోపాయ రహస్యం.

ఉద్యోగపర్వంలో రెండు సభలున్నాయి. ఒకటి- ఉపప్లావ్యంలో ధర్మరాజున్న సభ. రెండు- హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు కొలువుదీరిన కౌరవసభ. ఈ రెండు సభలలో నాయకులు వరుసగా ధర్మరాజు, దుర్యోధనుడు. ధర్మరాజుకు దైవ సమానుడు, హితుడు, స్నేహితుడు శ్రీకృష్ణుడు. అతడి నిర్ణయాన్ని ధర్మరాజు శిరసావహిస్తాడు. భీమాదులు ధర్మరాజు వాదంతో కొంత భేదించినా, అన్నగారిమాట జవదాటరు. సంధిచేసికొనటం వారికి అంతరాంతరాలలో ఇష్టంలేకపోయినా, సంధిజరిగే పరిస్థితులు కౌరవసభలో లేవని తెలిసినా, ధర్మరాజు చేసే ప్రయత్నాన్ని భీమాదులు సమర్థించారు. అందువలన పాండవసభలో ఐక్యత, నాయకత్వం స్థిరంగా ఉన్నాయి. దివ్యాదివ్యుడైన శ్రీకృష్ణుడి వ్యూహసారథ్యం వారి కెప్పుడూ ఉన్నది. పురుషకారం, దైవయత్నం రెండూ పాండవులకు సమకూరాయి.

పాండవసభలో ఉన్న సమైక్య ధర్మస్థితి హస్తినాపురంలోని కౌరవసభలో లేదు. దుష్టచతుష్టయం సంధికిష్టపడదు. ధృతరాష్ట్రుడు కొడుకును కాదనలేడు. పాండవ పక్షంలో శ్రీకృష్ణుడివలె కౌరవపక్షంలో పెద్దరికపు గౌరవాన్ని పొందే నాథుడు లేడు. భీష్మాదులు, ఒక్కొకసారి ధృతరాష్ట్రుడు కూడా దుర్యోధన తిరస్కారాలకు గురి ఔతూ ఉంటారు. సభలో ఉన్న సభ్యులలోకూడా ఏకాభిప్రాయం లేదు. కౌరవసభ ఐక్యతలేని విభిన్న శక్తుల వింత కూటమి; దైవానుకూల్యంలేని దర్పభూమి; ధర్మశక్తిలేని కార్యక్షేత్రం. శ్రీకృష్ణుడికి కౌరవసభలో జరిగే అవమానం దైవానికీ, ధర్మానికీ జరిగే అవమానం. దానివలన యుద్ధం, కౌరవనాశనం తథ్యం. పాండవులకు యుద్ధానంతరం లభించేది రాజ్యభాగమే కాదు, కౌరవమహాసామ్రాజ్యం. ఈ ఫలసిద్ధిని పొందటానికి సాగించే యుద్ధోద్యోగంలో- శ్రీకృష్ణుడి రాయబారం కౌరవసభలో, స్కంధావారంలో, వీరులలో భేదభావసృష్టి చేసే ప్రయోజనాన్ని సాధించింది. కాని, యుద్ధాన్ని మాన్పజాలకపోయింది. యుద్ధాన్ని వద్దన్న భీష్మాదులు కూడా యుద్ధాన్ని వారించలేకపోయారు. శ్రీకృష్ణుడు కర్ణుడికి జన్మరహస్యం చెప్పి పాండవపక్షంలోకి అతడిని రప్పించటానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యత్నించాడు. ఈ అంశం ధర్మరాజు లక్ష్యంలో లేనిది. శ్రీకృష్ణుడు స్వతంత్రించి యత్నించింది. అక్కడా భేదోపాయం బెడిసికొట్టింది. కాని, కుంతికి కర్ణుడిచ్చిన వరాలలో అది కొంత ఫలించింది. మొత్తంమీద శ్రీకృష్ణుడి రాయబారం భేదాన్ని సృష్టించి ఫలించింది; యుద్ధాన్ని మాన్పలేక విఫలమయింది. భేదోపాయ వైఫల్యమే దండోపాయానికి దారితీసింది. ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణుడు యుద్ధానికి ముహూర్తాన్ని ప్రకటించి వచ్చాడు. ధర్మరాజు శాస్త్రీయంగా సాగించిన యుద్ధోద్యోగంలోని దండోపాయాన్ని శ్రీకృష్ణుడు సమర్థనీయంగా ప్రదర్శించాడు.

ఈ తాత్పర్యమంతా ఈ క్రింది పద్యంలో ధర్మరాజు పొదివి చెప్పాడు.

మ. 'సుతువాఁడై వినయంబు సేకొనక యే చొప్పం దగం జెప్ప కా
ధృతరాష్ట్రుం డవినీతిఁ జేసినను సంధింపంగ రాదంచు వే
గ తెగంబాఱకు; తెంపు సేయునెడ లోకంబెల్ల మెచ్చం బ్రకా
శిత ధర్మస్థితి నొంది మా మనము నిశ్చింతంబుగాఁ జేయుమీ!' **(ఉద్యో. 3.25)**

ధర్మజుడు ఊహించినదంతా శ్రీకృష్ణుడు ఉజ్జ్వలంగా సాధించి పెట్టాడు.

(4). దండోపాయం: చతుర్థాశ్వాసం

ధర్మరాజు రాయబారం ద్వారా సాధింపదలచుకొన్న ఫలితాలకు పరిమితమైనది తృతీయాశ్వాసం. ఆ పరిధికి మించి శ్రీకృష్ణుడూ కుంతీ సాధించిన భేదోపాయాలను చతుర్థాశ్వాసంలో చెప్పటం ఔచిత్యం. పాండవవీరులు భయపడే భీష్మద్రోణాదులు శ్రీకృష్ణుడి రాయబారంవలన మెత్తబడ్డారు. కర్ణుడు ధర్మరాజుకు సింహస్వప్నంవలె మిగిలిపోయాడు. అర్జునుడి పాశుపతాస్త్రం ఉన్నా, దానిని అతడు ప్రయోగించడు. కర్ణుడి 'శక్తి' పార్థుడి ప్రాణాలను హరించే అవకాశం ఉన్నది. కర్ణుడు ధర్మజాదులను సంహరించే వీలున్నది. ఈ ఆపదనుండి తప్పించుకొనే ఉపాయాన్ని శ్రీకృష్ణుడూ కుంతీ సమకూర్చిపెట్టారు. ఇక యుద్ధోపాయాన్ని నిర్విఘ్నంగా ప్రయోగించవచ్చును. కార్యనిర్దేశం చేయుమని శ్రీకృష్ణుడిని ధర్మరాజు ప్రార్థించాడు.

ఉ. 'యుద్ధమ కాక కార్యమును నొండొకఁ డెద్దియుఁ గల్గ నేర్చునే?
బుద్ధులు సెప్పు వాక్యముల పోల వినం డన నేల? యట్టిచో
బద్ధునిఁ జేయఁజూచె ననుఁ బట్టి సుయోధనుఁ; డింక నయ్యసం
బద్ధునితోడి సంధికి నుపాయము నామతిఁ దోఁప దెమ్మెయిన్'. **(ఉద్యో. 4.88)**

అని శ్రీకృష్ణుడు యుద్ధమే తగిన కార్యమని నిశ్చయించాడు. యుద్ధోపాయం ప్రారంభమయింది. చతుర్థాశ్వాసమంతా యుద్ధసన్నాహ సంభారమే. ఉభయ పక్షాల బలాబల నిరూపణం జరిగింది. ఆయా వీరుల విశేషవృత్తాంతాలు చెప్పబడ్డాయి. కౌరవులు పంపిన ఉలూకుడి రాయబారం దుర్యోధనుడి దురహంకారాన్ని ప్రదర్శించింది. పాండవులలో రణోత్సాహాన్ని రెట్టింపుచేసింది. శ్రీకృష్ణు డిచ్చిన సమాధానం భావికథార్థ సూచకం; దుర్యోధన దుశ్శాసనులకు దైవశాపం.

తే. 'బవర మెల్లియ; బిరుదవై బరవసంబు । గలిగి చావుము; చావక తొలఁగరాదు;
కృష్ణ సారథికంబగు జిష్ణురథము । దొడరి నీ వెందుఁ జొచ్చినఁ దోన చొచ్చు'.

క. 'రిత్తలు రజ్జెడు వాఁడే । మత్తగజాయుత బలుండు మారుతి యని ను
ద్వృత్తుఁ డగు దుస్ససేనుని । నెత్తు రురము వ్రచ్చి త్రావు నీవుం జూడన్'. **(ఉద్యో. 4.203, 204)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'చావక తొలగరాదు' - అనేమాట దుర్యోధనుడు తొడలు విరిగి పడిపోయే దురవస్థను సూచిస్తున్నది. యుద్ధపంచకమంతా ఈ వాక్యంలో ధ్వనిస్తుంది. ఉద్యోగపర్వం ఊర్జితకథోపేతం!

3. ఉద్యోగపర్వంలో షాడ్గుణ్య ప్రయోగరంగం

రాజు రాజ్యాన్ని సంపాదించాలన్నా, స్వీయరాజ్యాన్ని రక్షించుకొనాలన్నా షడ్గుణాలను పాటించాలని రాజనీతిజ్ఞులంటారు. దీనినే షాడ్గుణ్యమని పిలుస్తారు.

"సంధిం చ విగ్రహం చైవ యాన మాసన మేవ చ
ద్వైధీభావం సంశ్రయం చ షడ్గుణాం శ్చింతయే త్సదా". **(మనుస్మృతి. 7.160)**

అని మనుస్మృతి చెపుతున్నది. సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సంశ్రయం- అనేవి షడ్గుణాలు. అవి ఇవే వరుసలో ప్రయోగించబడాలని చెప్పటంకంటె సమయానుకూలంగా వాటిని ప్రవర్తిల్లచేయాలని శాస్త్రం. మహాభారత శాంతి పర్వంలో రాజనీతి విశేషాలలో చతురుపాయాలతోపాటు షడ్గుణాలు కూడా చెప్పబడి ఉన్నాయి. (శాంతి.2.285). "సంధిర్నా విగ్రహోయాన మాసనం ద్వైధమాశ్రయః షడ్గుణాః" అని అమరకోశం. పాండవులు రాజ్యప్రాప్తికోసం, కౌరవులు రాజ్యరక్షణకోసం షాడ్గుణ్యాన్ని పాటించటం రాజనీతిలో భాగం. ఉద్యోగపర్వం షాడ్గుణ్య ప్రయోగరంగం.

కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో షాడ్గుణ్యానికి ఒక అధ్యాయమే కేటాయించాడు. (సప్తమాధికరణంలోని ప్రథమాధ్యాయం)

1. "షాడ్గుణ్యస్య ప్రకృతి మణ్డలం యోనిః"

(సంధి మొదలైన ఆరుగుణాలకు స్వామ్యాదులైన ఐదు ప్రకృతులూ, ద్వాదశరాజమండలమూ మూలకారణం).

2. "సంధి విగ్రహాసన యాన సంశ్రయ ద్వైధీభావాః షాడ్గుణ్యం ఇత్యాచార్యాః"

(సంధి, విగ్రహం, ఆసనం, యానం, సంశ్రయం, ద్వైధీభావం- ఇవి ఆరూ షాడ్గుణ్యం- అని ప్రాచీనాచార్యులు చెప్పారు).

3. "ద్వైగుణ్యమ్ ఇతి వాతవ్యాధిః, సంధి విగ్రహాభ్యాం హి షాడ్గుణ్యం సంపద్యతే ఇతి"

(సంధి, విగ్రహం- అనే రెండు గుణాలే ప్రధానమైనవి. ఎందువల్లననగా సంధివిగ్రహాల చేత షాడ్గుణ్యం ఏర్పడుతుంది. అనగా ఆసనం మొదలైన నాలుగు, సంధివిగ్రహాలచేతనే ఏర్పడతాయి గాని వాటిలోనే అంతర్గతాలు అని వాతవ్యాధి అనే ఆచార్యుడి అభిప్రాయం). (ఈ వాతవ్యాధి ఉద్ధవుడు కావచ్చును).

4. "షాడ్గుణ్య మేవైతదవస్థాభేదాత్ ఇతి కౌటిల్యః"

(అవస్థలలో (పరిస్థితులలో) భేదం ఉండటంచేత ఆరుగుణాలు వేరు వేరు. అందుచేత షాడ్గుణ్యాన్నే అంగీకరించాలని కౌటిల్యుడి అభిప్రాయం).

5. "తత్ర పణబన్ధః సంధిః అపకారో విగ్రహః ఉపేక్షణ మాసనమ్. అభ్యుచ్చయో యానమ్. పరార్పణం సంశ్రయః సంధివిగ్రహోపాదానం ద్వైధీభావ ఇతి షడ్గుణాః"

(వాటిలో - 'సంధి' అనగా ఒప్పందం కుదుర్చుకొనటం. అపకారం చేయటం 'విగ్రహం'. సంధిచేసికొనకుండా, అపకారం చేయకుండా ఉండటం- 'ఆసనం'. శక్తినీ దేశకాలాదులలో అభివృద్ధినీ సంపాదించటం 'యానం'. ఈ విధమైన అభివృద్ధి ఉన్నప్పుడే శత్రువుమీదికి దండెత్తి వెళ్ళటం కుదురుతుంది కావున దీనికి యానం అని పేరు పెట్టబడింది. యానం అనగా అర్థం- దండెత్తి వెళ్ళటం. శత్రువు బలవంతుడైనప్పుడు తనను వాడికి సమర్పించటం (లొంగిపోవడం) సంశ్రయం.

లేదా, సహాయం కోరి మరొక బలవంతుడిని ఆశ్రయించడం సంశ్రయం. సంధివిగ్రహాలు రెండింటిని నడిపించటం- అనగా ఒక శత్రువుతో సంధి చేసికొని రెండవ శత్రువుతో వైరం కొనసాగించడం ద్వైధీభావం. ఈ విధంగా గుణాలు ఆరు.)

శ్లో. "ఏవం షడ్భిర్గుణై రేతైః స్థితః ప్రకృతి మణ్డలే
పర్యేషేత క్షయాత్ స్థానం స్థానా ద్వృద్ధిం చ కర్మసు"

(ప్రకృతి మండలంలో ఉన్నరాజు ఈ విధంగా ఈ ఆరు గుణాలను అనుసరిస్తూ క్షీణదశనుండి స్థానాన్ని (నిలకడను), స్థానంనుండి (స్థానంద్వారా) తన కర్మలలో వృద్ధినీ సంపాదించటానికి ప్రయత్నించాలి.)

(అర్థశాస్త్రమ్- బాలానందిని వ్యాఖ్య- ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు.) **(పుట 544, 545, 550)**

ధర్మరాజు ధర్మనీతి వర్తనుడైన ఉదాత్తుడు. ధర్మం తప్పని రాజనీతి అతడి విధానం. తనకు రావలసిన రాజ్యభాగాన్ని బలప్రయోగంతో సంపాదించగలిగే శక్తియుక్తులు తనకున్నా ధర్మబద్ధమైన రాజనీతితో కూడిన విధానాన్ని అనుసరించి రాజులకు ఆదర్శప్రాయు డయ్యాడు. అతడు ఉద్యోగపర్వంలో నిర్వహించిన నీతివర్తనం షాడ్గుణ్య ప్రయోగానికి శాస్త్రసమ్మతమైన ఉదాహరణం.

షాడ్గుణ్యంలో సంధివిగ్రహాలకు ప్రధానపాత్ర ఉంటుందని ప్రాచీనులు పేర్కొన్నారు. మిగిలిన నాలుగు గుణాలూ వాటినుండి పుట్టి వాటిలోనే అంతర్భవిస్తాయని కొందరు భావించగా, ఆరు గుణాలకూ అవసరాన్నిబట్టి ప్రత్యేక ప్రతిపత్తి ఏర్పడవచ్చుననీ, వాటివలన ప్రత్యేక ప్రయోజనాలుకూడా సాధించవచ్చుననీ కౌటిల్యుడు పేర్కొన్నాడు. ధర్మరాజు సమయోచితంగా షడ్గుణాలను ప్రయోగించి సమర్థు డనిపించుకొన్నాడు. షడ్గుణప్రయోగంవలన ధర్మజుడు రెండు దశలను సాధించాడు. 1.క్షీణదశనుండి స్థానాన్ని సంపాదించటం. 2.స్థానంనుండి శత్రువుమీద దాడిచేయగల సామర్థ్యాన్ని పెంపొందించుకొనటం. ఈ రెండు దశలను ధర్మనీతి వర్తనం వలన సాధించటం విశేషం.

(1). సంధి:- ఉపప్లావ్యంలో శ్రీకృష్ణుడు నిండుసభలో ధర్మజుడి ధర్మప్రవృత్తిని ప్రతిపాదించి అతడి రాజనీతికి గల ప్రాతిపదికను తెలియపరచాడు.

తే. 'ధర్మమార్గంబు దప్పక తలఁపుఁ డొక్క తెఱఁగు, ధర్మువు దప్పి యుధిష్ఠిరుండు
వడయ నొడఁబడఁ డయ్యింద్రపదవియైన; । నుచితగతి నెంత వడసిన నుల్లసిల్లు'. **(ఉద్యో. 1.11)**

పాండవులు పితృధనమైన రాజ్యం అనుభవిస్తూ ఉండగా దానిని దుర్యోధనుడు కపటద్యూతం మిషగా అపహరించి అపకారం చేశాడు. ధర్మరాజు దిగ్విజయం చేసి తన రాజ్యానికి మహత్త్వాన్ని కల్పించుకొన్నాడు. చక్రవర్తిగా చెలామణి అయ్యాడు. కపటోపాయంతో దుర్యోధనుడు కాజేసిన రాజ్యాన్ని కపటమార్గంలో విగ్రహాన్ని ప్రదర్శించి సాధించవచ్చును. కాని, అత డామార్గాన్ని ఆశ్రయించటం లేదు. కాబట్టి, సంధి విగ్రహాలలో సంధి ఉపాదేయమయింది. అంతేకాక, పాండవులు-

క. 'అలఘుబల విక్రమోదా । త్తుల కైనను బలములేక దోర్గర్వముమై
గెలువఁగ వశమె? సహాయము । కలిమి ననంతంబులగు పగఱ సైన్యములన్?' **(ఉద్యో. 1.15)**

పాండవులు స్వీయబల సంపన్నులైనా, సహాయసంపత్తి లేకుండా బలవంతులైన శత్రువులతో కార్యసాధనం చేయటం కష్టం. అందువలన బలసమీకరణకైనా కొంత వ్యవధానం కావాలి. ఆలోగా సంధియత్నం చేయటం ఉత్తమమని నిర్ణయం తీసికొనటం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉపప్లావ్య సభలో సంధిని సమర్థించిన వారూ ఉన్నారు. సమరాన్ని సమర్థించిన వారూ ఉన్నారు. ఆ రెండు వర్గాలకూ నాయకులు- యాదవవీరులైన శ్రీకృష్ణ బలరాములూ, సాత్యకీ కావటం గమనించదగిన అంశం. అయితే, సాత్యకి శ్రీకృష్ణుడి అభిప్రాయాన్ని వ్యతిరేకించినా ఒక మధ్యేమార్గాన్ని ప్రతిపాదించాడు.

క. 'నా మతమునఁ గార్యము సం । గ్రామము సేయుటయ; యిట్లు గా కీలోనన్
సామవచనంబు లక్కురు । భూమీశ్వరుతోడ నాడఁ బుచ్చెద రేనిన్'.

ఉ. 'దైన్యము దక్కి దూత యుచితంబుగఁ బాండునృపాలు పాలు రా
జన్యవరుండు ధర్మజుఁడు సమ్మతి వేఁడెడు నన్నులోక సా
మాన్య విధిం దగంగ గరిమంబున నిచ్చినఁ బుచ్చికొంద; మ
న్యోన్య విరుద్ధభాషణము లాడినఁ దత్ఫల మాతఁ డందెడున్'. **(ఉద్యో. 1. 31, 32)**

ఈ అంశాన్ని ద్రుపదుడు సమర్థించాడు. సభ్యులందరూ అంగీకరించారు. ఫలితాంశమేమంటే- దుర్యోధనుడితో సామంగా మాట్లాడే రాయబారిని పంపాలి. కాని, అతడు దీనంగా రాజ్యాన్ని యాచించకూడదు. 'రాజపరమేశ్వరుడైన ధర్మరాజు తన రాజ్యభాగాన్ని తాను పొందటానికి అంగీకారాన్ని అర్థిస్తున్నాడు' అని మాత్రమే ఉండాలి. సంధియత్నం వలన ఆత్మాభిమానానికి ఏ మాత్రం తక్కువదనం రాకూడదు- అని నిశ్చయించారు. 'దుర్యోధనుడు అన్యోన్యవిరుద్ధ భాషణం చేస్తే ఎట్లాగూ జరుగబోయే యుద్ధంలో తగిన ఫలాన్ని అనుభవిస్తాడు'- అన్నాడు సాత్యకి. ఇందులో ఒక ధర్మసూక్ష్మం ఉన్నది. అరణ్యాజ్ఞాతవాసాలు పూర్తిచేసిన ధర్మరాజుకు రాజ్యభాగం న్యాయంగా సంక్రమించినట్లే. కాని, పెద్దల సమ్మతికోసం మర్యాదకు మారుపేరుగా రాయబారం నడపాలని నిర్ణయం.

మూలంలో సాత్యకి పలికిన మాటలలో ఈ తీర్పరితనం, నేర్పరితనం కానరావు. అతడు యశో వా, మృత్యుర్వా అన్నట్లు యుద్ధాన్నే ప్రతిపాదించాడు.

"నా ధర్మో విద్యతే కశ్చి చ్ఛత్రూన్ హత్వాఽఽతతాయినః॥
అధర్మ్య మయశస్యం చ శాత్రవాణాం ప్రయాచనమ్
హృద్గత స్తస్య యః కామ స్తం కురుధ్వ మతన్ద్రితాః॥
నిసృష్టం ధృతరాష్ట్రేణ రాజ్యం ప్రాప్నోతు పాణ్డవః
అద్య పాణ్డుసుతో రాజ్యం లభతాం వా యుధిష్ఠిరః
నిహతా వా రణే సర్వే స్వప్స్యన్తి వసుధాతలే॥". **(సం. 5.3.21, 22, 23)**

'క్రూరకర్ములైన శత్రువులను చంపటం అధర్మం కాదు. పగవారిని బిచ్చమెత్తటం ధర్మయుక్తం కాదు, కీర్తికరంకూడా కాదు. ధర్మరాజు మనసులో ఏముందో దానిని మెలకువతో సాధించండి. ధృతరాష్ట్రుడు మన్ననతో ఇచ్చే రాజ్యాన్నే ధర్మరాజు పొందుతాడు. ఆ విధంగా యుధిష్ఠిరుడు రాజ్యాన్ని పొందాలి. లేదా అందరూ యుద్ధంలో చచ్చి నేలపై దీర్ఘనిద్రపోవాలి!'- అన్నాడు.

తిక్కన మూలాన్ని చికిలిపెట్టి శిల్పం చేశాడు. షాడ్గుణ్యానికి అనువుగా సంభాషణలను సంస్కరించాడు. సంధిజరగాలి. కాని, రాజ్యాన్ని యాచిస్తున్నట్లు కాదు. తమ వాటాను మర్యాదగా పొందటానికి సమ్మతిని పొందటానికే. లేదా, యుద్ధం తప్పదని స్పష్టంచేయటానికే. అంటే - సంధి ప్రవర్తింపచేయటం 'సమ్మతి'కోసమే. సమ్మతించకపోతే విగ్రహాదులను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రయోగించవలసి వస్తుంది- అని హెచ్చరిక! ఇది తిక్కన చేసిన నిష్కర్ష. దీనిని సమర్థించిన ద్రుపదుడు కూడా సంధిలో మార్దవం, ప్రసన్నత అవసరం లేదని స్పష్టంచేశాడు.

క. 'మృదుభాషణముల దుర్జన । హృదయములు ప్రసన్నతామహిమఁ బొందునె? యె
ల్లిదముగఁ గొని యంతంతకు । మద మెక్కుం గాక దురభిమానము పేర్మిన్'. **(ఉద్యో. 1. 34)**

ద్రుపదుడు తన పురోహితుడి ద్వారా నడపదలచింది స్వాభిమానంతో కూడిన సంధికాని, క్షీణదశలోనుండి నిలకడకోసం ధర్మరాజు చేసే సవినయ సంధికాదని స్పష్టం చేశాడు. అయినా, సంధి చేస్తూనే, సైన్యసహాయ సాధన సాగించి సమర సన్నాహాన్ని చేసేయత్నం చేశారు పాండవులు. అంటే- ధర్మరాజు విగ్రహంలేని సంధిని మొదటి గుణంగా ఎన్నుకొన్నాడన్నమాట! (కొందరు విగ్రహమంటే సైన్యంతో శత్రువు నెదుర్కొనటం అని అర్థం చెపుతారు. అయినా సైన్యసాధన యుద్ధయత్నమే కాని ఎదురుదాడి కాదు). సంధివిగ్రహాలు జంటగా నడుస్తాయని భావించే ప్రాచీనాచార్యులకంటె, పరిస్థితులనుబట్టి షడ్గుణాలను విడివిడిగా ప్రయోగించ వచ్చుననే కౌటిల్యుడు అభిప్రాయాన్ని తిక్కన తెలుగు భారతంలో బలపరిచాడు. సంధి విఫలమైతే విగ్రహం. ఇది ధర్మజుడి ధర్మనీతి. అంతేకాదు, శత్రువు ముందుగా విగ్రహానికి తలపడితే తాను దానికి పైచేయిగా ఎత్తువేసి విరుగుడు పెట్టాలని భావించినట్లున్నాడు. ధర్మరాజు చర్యలు ఫలానుమేయాలు!

(2). విగ్రహం:- అపకారం చేయటం విగ్రహమని నిర్వచనం. దీనిని ధర్మరాజు స్వయంగా చేయడు. అయితే, రాజనీతిలో పరిస్థితుల ప్రభావంవలన దానిని ప్రయోగించక తప్పదు. అటువంటి సన్నివేశం ఉద్యోగపర్వంలో ఏర్పడింది. ద్రుపదపురోహితుడు రాయబారిగా హస్తినాపురం వెళ్ళాడు. అక్కడ పెద్దలతో పరిచయాలు పెంచుకొంటున్నాడు. ఆ సమయంలో కౌరవ పాండవుల అభ్యర్థనల మేరకు రాజులు ఆయా స్కంధావారలలో చేరుతూ ఉన్నారు. శల్యుడు ధర్మరాజుకు మాట ఇచ్చి, అతడి వైపు చేరటానికి విపుల సైన్యంతో బయలుదేరి యాత్రసాగిస్తున్నాడు. దుర్యోధనుడు ఆ అదను కనిపెట్టి చారులను పంపి, శల్యుడికి మార్గంలో వలసిన సౌకర్యాలన్నీ చేయించాడు. శల్యుడు ఆ సౌకర్యాలు చేయిస్తున్నది ధర్మరాజని భావించి, ఆ చారులకు వరాలనివ్వటానికి సిద్ధమయ్యాడు. అప్పుడు దుర్యోధనుడు రంగప్రవేశం చేసి, నిజాన్ని చెప్పి, వరంగా అతడి సహాయాన్ని కోరాడు. ఇచ్చిన మాట ప్రకారం దుర్యోధనుడికి సహాయం చేయటానికి అంగీకరించాడు. అయితే, ఆ సంగతి ధర్మరాజుకు చెప్పి వస్తానని ససైన్యుడై ఉపప్లావ్యానికి వెళ్ళాడు. అక్కడ జరిగినదంతా ధర్మరాజుకు చెప్పాడు. శత్రుకృత విగ్రహ ప్రయోగాన్ని గ్రహించిన ధర్మరాజు తిరిగి తానుకూడా విగ్రహంతోనే తిప్పికొట్టాడు. యుద్ధంలో శల్యుడు కర్ణసారథ్యం చేస్తూ, అతడి మనసు కలతపడి యుద్ధం చేయలేనట్లుగా పరుషవాక్యాలు పలికి అర్జునుడిని రక్షించాలని కోరాడు. అందుకు శల్యుడు అంగీకరించాడు. అలనాడు నిండుసభలో ద్రౌపదిని తూలనాడిన కర్ణుడు వధార్హుడని నిశ్చయించాడు. తాను కర్ణుడికి అపకారం చేయటానికి అంగీకరించాడు. దీని తాత్పర్య మిది- దుర్యోధనుడు సంధిచేయదలచలేదు కాబట్టి ధర్మరాజుకు అపకారం చేయతలపెట్టాడు. ధర్మరాజు అపకారం చేయకుండా సంధియత్నం మొదలుపెట్టినా, దుర్యోధనుడే అపకారం తలపెట్టినప్పుడు స్వీయరక్షణకోసం శత్రువుకు విగ్రహాన్ని (అపకారాన్ని) తలపెట్టాడు. ఇది దుర్యోధనుడి స్వయంకృతాపరాధ ఫలమే. అందువలన ధర్మరాజుకు దోషం లేదు. శల్యసహాయం పోవటంవలన తనకు కలిగే అపాయంకంటె, ఆరవప్రాణమైన కర్ణుడు చావటంవలన దుర్యోధనుడికి కలిగే అపకారం అపారం! అదే ధర్మజుడి విగ్రహ ప్రయోగ విశేషం.

(3). ఆసనం:- శత్రువు సమానబలం కలవాడై ఉంటే, అతడిని కదిలించకుండ, నిర్లిప్తంగా ఉంటూ, తన బలాన్ని క్రమంగా పెంచుకొని, అదనుచూచి అతడిపై దాడిచేయటం రాజనీతి. ఆ పరిస్థితులలో నిర్లిప్తంగా ఉండే స్థితిని ఆసనంగా పరిగణించాలి. ధర్మరాజుకు 'ఆసనం' అనే గుణాన్ని ప్రదర్శించటానికి అవకాశమే లేదు. ఎందువలన అంటే- అతడికి రాజ్యం

లేదు. క్షీణదశనుండి స్థానాన్ని (నిలకడను) పొందటానికి బంధువులు పట్టుబట్టి సాగించే ద్రుపదపురోహిత దౌత్యానికి అంగీకరించాడు. అది ధర్మరాజుకు ఒక స్థానాన్ని కలిగించింది. అంతేకాదు. ధర్మజుడి క్రోధాగ్ని ధృతరాష్ట్రుడి గుండెలో భయాన్ని రేపింది. ధర్మజుడి యుద్ధోద్యోగాన్ని రాజనీతితో భగ్నం చేయటానికి ధృతరాష్ట్రుడు సంజయుడి రాయబారంతో యత్నించాడు. ఆ రాయబారం ఫలిస్తే ధర్మజుడు సంధియత్నం చేయడు; కౌరవులకు అపకారం తలపెట్టడు. పోగా, క్రోధశాంతివలన మునివృత్తిని స్వీకరించి తనకు తానే అపకారం చేసికొంటాడు. ఇంతటి లోతైన వ్యూహం ధర్మరాజును ఆసనంలోకి త్రోసివేసేదే. కాని, ధర్మజుడు ఆ విపత్తునుండి తనను తాను రక్షించుకొన్నాడు. శ్రీకృష్ణు డందుకు సాయంచేశాడు. దానితో ధర్మరాజు సంజయుడి రాయబారాన్ని తిరస్కరించాడు. ధృతరాష్ట్రుడి వ్యూహాన్ని భగ్నంచేశాడు. గ్రుడ్డిరాజుకు నిద్రపట్టకుండా, దిక్కుతోచకుండా చేసి, అతడిని సంక్షోభంలో పడవేశాడు. 'మెత్తని పులి' అనిపించుకొన్నాడు.

(4). సంశ్రయం:- శత్రువుతో యుద్ధంచేయలేని రాజు తనను తాను కొంతకాలం రక్షించుకొనటానికి గాని, యుద్ధసన్నాహాలకోసం కొంతవ్యవధానం పొందటానికి గాని సంశ్రయగుణాన్ని ప్రయోగించటం రాజనీతి. ధర్మరాజు కీస్థితి లేదు. దుర్యోధనుడికి ఆ స్థితి రాలేదు. కాని, బంధుమిత్రుల కందరికీ ఆశ్చర్యం కలిగించేటట్లు ధర్మరాజు అర్ధరాజ్యానికి బదులు ఐదూళ్ళిస్తే చాలునని సంజయుడితో చెప్పాడు. ఇది ఒకవిధమైన లొంగుబాటు కాబట్టి సంశ్రయమే ఔతుంది. దీనికి దుర్యోధను డంగీకరించలేదు. దానివలన దుర్యోధనుడు అపకీర్తిపాలయ్యాడు. ధర్మరాజు కురువృద్ధుల సానుభూతిని పొందగలిగాడు. సంశ్రయాన్ని సాభిప్రాయంగా, సార్థకంగా, సమయోచితంగా వాడుకొన్న సమర్థుడు ధర్మరాజు.

(5). ద్వైధీభావం:- ధర్మరాజు నిర్వహించిన శ్రీకృష్ణుడి రాయబారం ద్వైధీభావానికి దివ్యోదాహరణం: ఇందులో సంధివిగ్రహాలు రెండూ ఒకేసారి సాగించటం జరిగింది.

ఉ. 'కావున శాంతిఁ బొందుటయ కర్జము; దా నది యట్టులుండె; శ్రీ
గావలె నంచుఁ బోరితము గామియుఁ గోరెద; మెల్లసొమ్ములుం
బోవుటయుం గులక్షయము వుట్టుటయున్ వెలిగాఁగ నొండుమై
నే విధి నైనఁ జక్కఁబడు టెంతయు నొప్పుఁ జుమీ జనార్దనా!' **(ఉద్యో. 3.22)**

ఈ పద్యం పై గుణానికి చక్కని నిదర్శనం. సంధివలన శాంతి పొందటం కర్తవ్యం. అయితే రాజ్య సంపదమాత్రం కావాలి. ఆ సంపద యుద్ధం జరగకుండా, కులక్షయం కాకుండా లభించాలి. దానికేదైనా విగ్రహం- అంటే భేదోపాయం- ప్రయోగించాలి. కార్యాన్ని సాధించాలి- అని ధర్మజుడి అభిప్రాయం. కౌరవసభలో ధృతరాష్ట్ర దుర్యోధనులు ప్రభుస్థానంలో ఉన్నవారు. వారిలో ధృతరాష్ట్రుడిని గౌరవిస్తూ సంధి జరుపుతున్నట్లు, గురుభీష్మాది వీరులతో మన్ననతో వర్తిస్తున్నట్లు, దుర్యోధనాదులతో వైరం సాగిస్తున్నట్లు శ్రీకృష్ణుడి రాయబారపు వైఖరి సాగటం ద్వైదీభావగుణ ప్రయోగప్రభావమే. దుర్యోధనుడిని సమర్థిస్తూ అతడి దుర్మార్గానికి దోహదకారి అయిన కర్ణుడితో చెలిమికట్టటానికి యత్నించటంకూడా ద్వైధీభావమే. శ్రీకృష్ణుడి రాయబారం అంత రమణీయంగా ఉండటానికి కారణం ధర్మజనీతిలోని ద్వైధీభావ ప్రదర్శనమే!

(6). యానం:- కౌరవులకు సైన్యసంఖ్యాబలం అధికంగా ఉన్నా, పాండవులు స్వీయబలంమీది విశ్వాసంతో, శ్రీకృష్ణుడి సహాయ సంపత్తితో యుద్ధాన్ని ప్రకటించగలిగారు. ఇక్కడ మరొక విషయం గమనించాలి. రాయబారాల ఘట్టాలలోనూ, రాయబారుల వార్తలను విని విశ్లేషించుకొనే చర్చాగోష్ఠులలోనూ కౌరవ పాండవబల తారతమ్య చర్చ విస్తారంగా సాగింది. భీష్ముడు సర్వసైన్యాధ్యక్షుడైన తరువాత విశదంగా ఈ అంశాన్ని వివరించటంకూడా జరిగింది. ఇవన్నీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాండవులు క్షీణదశనుండి మహోన్నత దశకు వృద్ధిచెందిన స్థితిని తెలుపుతున్నాయి. ఈ విధంగా ఉద్యోగపర్వంలో షాడ్గుణ్యం సర్వాంగ సుందరంగా, సమర్థంగా చిత్రించబడింది.

ఉద్యోగపర్వంలో ధర్మజుడి వర్తనాన్ని తెలిసికొనాలంటే ఈ క్రింది అర్థశాస్త్ర సూత్రం తెలియాలి-

శ్లో. "ఆత్మవాం స్త్వల్పదేశోఽపి యుక్తః ప్రకృతి సంపదా
నయజ్ఞః పృథివీం కృత్స్నాం జయత్యేవ న హీయతే॥" **(అర్థశాస్త్రమ్. 6 అధి. 1అధ్యా. చివరి శ్లో.)**

(ఆత్మవంతుడై ఉండి ప్రకృతి సంపదతో కూడిన, నీతి శాస్త్రవేత్తయైన రాజు చిన్న దేశం మాత్రమే కలవాడైనాకూడా సమస్తభూమిని జయించి తీరుతాడు. ఎప్పటికీ నశించడు). అయిదూళ్ళిచ్చినా చాలునని అడిగిన ధర్మరాజు హృదయంలోని రాజనీతి రహస్యం ఈ శ్లోకంలో ధ్వనిస్తుంది.

4. రాయబారాల చదరంగం ఉద్యోగపర్వం

ఉద్యోగపర్వం సంధియత్నంతో మొదలై యుద్ధయత్నంతో ముగుస్తుంది. సామదానభేదోపాయాలు సంధిలోనే ప్రవర్తిల్లుతాయి. అందులోనే విఫలమౌతాయి. సంధియత్నాలలో రాయబారాల పాత్ర బలంగా ఉంటుంది. అర్హతలనుబట్టి రాయబారాలు-లేక-దూతలు-మూడు విధాలని అర్థశాస్త్రం విశ్లేషించింది. "ఉద్ధృత మన్త్రో దూతప్రణిధిః అమాత్యసంపదోపేతో నిసృష్టార్థః, పాదగుణహీనః పరిమితార్థః అర్థగుణహీనః శాసనహరః" (అర్థశాస్త్రమ్. 16వ అధ్యాయం 12వ ప్రకరణం, సూత్రం-1.) (మంత్రం నిశ్చితమైన తరువాత దూతల ప్రయోగం జరగాలి. అమాత్యులకు ఉండే గుణసంపద అంతా ఉన్న దూత 'నిసృష్టార్థుడు'. అనగా కార్యభారం అంతా అతడిమీద విడిచివేయవచ్చునని అర్థం. నాల్గవవంతు గుణాలు తక్కువ ఉన్నవాడు 'పరిమితార్థుడు'. (పరిమితమైన ప్రయోజనం కలవాడు అనగా కొంతవరకే అతడికి కార్యభారం అప్పగించాలి). సగం గుణాలు లేనివాడు 'శాసనహరుడు' (అనగా రాజుపంపే వార్తలు తీసికొని వెళ్ళడానికి మాత్రమే తగినవాడు). (బాలానందిని వ్యాఖ్య ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు- పుట.61, 62).

మంత్రానికి తగిన దూతను ఎన్నుకొనటం రాజ్యతంత్ర రహస్యం. మంత్రం పంచాంగసహితం (అయిదంగాలతోకూడి ఉంటుంది). అవి - "కర్మణామారంభోపాయః. పురుష ద్రవ్య సంపత్, దేశకాల విభాగః । వినిపాత ప్రతీకారః, కార్యసిద్ధి రితి పంచాంగో మంత్రః". ఉద్దిష్ట కార్యాన్ని ఆరంభించటానికి అనువైన ఉపాయాన్ని నిర్ణయించటం, అంగబలాన్నీ, అర్థబలాన్నీ అంచనా వేసికొనటం, దేశకాల విభాగ వివేచనను గాఢంగా చేయటం, కార్యసాధనలో ఏర్పడే అవరోధాలకు, విఘ్నాలకు ప్రతిక్రియలను చేయటం, లక్షించిన కార్యాన్ని సాధించి ఫలాన్ని పొందటం- అనే అయిదంగాలనూ రాజనీతి చతురుడైన రాజు నిపుణంగా నిర్వహిస్తాడు. ఉద్యోగపర్వంలోని మంత్రనిర్వహణంలో ధర్మరాజు అగ్రగణ్యుడు; శ్రీకృష్ణుడు సాటిలేనివాడు. వీరిలో ఒకరు రాజు. మరొకరు దూత కావటం ఉద్యోగపర్వ విశేషం.

ఉద్యోగపర్వంలో నలుగురు దూతలు రాజకార్య నిర్వహణంలో తమ తమ పాత్రలను నిర్వహించారు. వారు - 1.ద్రుపదపురోహితుడు; 2.సంజయుడు; 3.శ్రీకృష్ణుడు; 4.ఉలూకుడు. ఈ దూతలను ప్రయోగించినవారు వరుసగా ద్రుపదుడు, ధృతరాష్ట్రుడు, ధర్మరాజు, దుర్యోధనుడు. దూతలనుబట్టి వారి నెన్నుకొన్న రాజుల యోగ్యతలు బయటపడతాయి. వారు నిశ్చయించిన మంత్రబలాలు కూడా వ్యక్తమౌతాయి.

రాజనీతి నిపుణుడైన రాజు మంత్రాన్నిబట్టి దూతలను మంత్రులనుండి కాని, పురోహితులనుండికాని ఎన్నుకొంటాడు.

శ్లో ''బ్రాహ్మణే నైధితం క్షత్రం మన్త్రి మన్త్రాభిమన్త్రితమ్
జయ త్యజిత మత్యన్తం శాస్త్రానుగమశస్త్రితమ్''. **(అర్థశాస్త్రమ్ 1 అధిక. 9వ అ. చి.శ్లోకం)**

గుణసంపన్నుడైన పురోహితుడిచేత వృద్ధిపొందబడింది, మంత్రియొక్క మంతనం అనే మంత్రంచేత పవిత్రీకృతమయిందీ అయిన దండనీతిని అనుసరించటం అనే శాస్త్రాన్ని పట్టిన క్షత్రియకులం మిక్కిలి అభివృద్ధి చెందుతుంది. దానిని ఎవరూ జయించలేరు- అని కౌటిల్యుడు పేర్కొన్నాడు. ఈ సూత్రం ఉద్యోగపర్వానికి అన్ని విధాలా అన్వయిస్తుంది. ఇందులోని దూతలు పురోహితుడు, మంత్రి, బంధువు, స్నేహితుడు మొదలైనవారు కావటం విశేషం!

అర్థశాస్త్రంలో అమాత్యపురోహిత గుణాలు స్పష్టంగా పేర్కొనబడి ఉన్నాయి. అమాత్య లక్షణాలు ''జానపదః, అభిజాతః, స్వవగ్రహః, కృతశిల్పః, చక్షుష్మాన్, ప్రాజ్ఞః, ధారయిష్ణుః, దక్షః, వాగ్మీ, ప్రగల్భః, ప్రతిపత్తిమాన్, ఉత్సాహ ప్రభావయుక్తః, క్లేశసహః, శుచిః, మైత్రః, దృఢభక్తిః, శీలబలారోగ్య సత్త్వ సంయుక్తః, స్తమ్భచాపల్య వర్జితః, సంప్రియః, వైరాణా మకర్తేత్యమాత్య సంపత్, అతః పాదార్థ గుణహీనౌ మధ్యమావరౌ''. (అర్థశాస్త్రమ్. నవమోఽధ్యాయః, పంచమ ప్రకరణమ్- మంత్రిపురోహితోత్పత్తిః పు.32)

అమాత్యుడు తనదేశానికి చెందినవాడు, మంచివంశంలో పుట్టినవాడు. పొరపాట్లను సులభంగా సరిదిద్ద దగినవాడు, శిల్పాలలో నేర్పరి, రాజుకు నేత్రంవంటిదైన అర్థశాస్త్రంలో పండితుడు, సహజబుద్ధి సంపన్నుడు, జ్ఞాపకశక్తి-లేదా-పట్టుదల కలవాడు, సమర్థుడు, వాక్చాతుర్యం కలవాడు, ప్రగల్భుడు(**bold**), సమయస్ఫూర్తి కలవాడు, ఉత్సాహమూ, ప్రభుశక్తీ ఉన్నవాడు, కష్టాలు సహించగలవాడు, శుచి అయినవాడు, స్నేహశీలుడు, దృఢమైన భక్తికలవాడు, శీలవంతుడు, ఆరోగ్యధైర్యాలు కలవాడు. మొండితనం, చాపల్యం లేనివాడు, అందరినీ ఆకట్టుకోగలవాడు, అనవసరమైన తగాదాలు సృష్టించనివాడు అయి ఉండాలి. ఈ గుణాలన్నీ కలవాడు ఉత్తముడు. వీటిలో నాల్గవవంతు లేనివాడు మధ్యముడు. సగం లేనివాడు అధముడు.

పురోహితుడి గుణాలు:- ''పురోహిత ముదితోదిత కులశీలం షడఙ్గే వేదే దైవే నిమిత్తే దణ్డనీత్యాం చ అభివినీతమ్. ఆపదాం దైవమానుషీణామ్ అథర్వభిరుపాయైశ్చ ప్రతికర్తారం కుర్వీత. తమాచార్యం శిష్యః పితరం పుత్రో భృత్యః స్వామిన మివ చాను వర్తేత''. (అర్థశాస్త్రమ్. పు. 33)

ఉన్నత కులసంజాతుడు, శీలవంతుడు, వేదవేదాంగాలనూ జ్యోతిషాది దైవసూచనలు గల శాస్త్రాలనూ తెలిసినవాడూ, శకునజ్ఞుడు, దండనీతిశాస్త్రజ్ఞుడు, దైవంవలన గాని, మానవులవలనగాని కలిగే ఆపదలను తొలగించగల అథర్వవేదమంత్ర ప్రయోగాలు గాని, ఇతరోపాయాలుగాని ప్రతిక్రియలుగా చేయగలవాడు పురోహితుడు. అన్ని పనులలోనూ అగ్రస్థానంలో ఉంచబడదగిన పురోహితుడిని- శిష్యుడు ఆచార్యుడినివలె, పుత్రుడు తండ్రినివలె, భృత్యుడు యజమానునివలె రాజు ఎప్పుడూ అనుసరించి ఉండాలి. (అర్థశాస్త్రమ్ పు.34).

(1). ధర్మరాజుకొరకు హితులు సాగించిన పురోహిత దౌత్యం

ద్రుపద పురోహితుడు దూతగా పంపదగిన యోగ్యత కలవాడు.

క. 'హితుఁడవు, మతిమంతుండవు, । చతురవచనకోవిదుఁడవు, సమయజ్ఞుఁడ, వు
న్నతవంశవర్ధనుఁడ, విం । గితవేదివి, నెచ్చెలివి, సుకృతి; వట్లగుటన్' **(ఉద్యో. 1.53)**

పాండవ దూతగా పంపటానికి పూనుకొన్నట్లు ద్రుపదుడు పేర్కొన్నాడు. అమాత్యలక్షణాలు కొన్ని కలిగి ఉన్న రాజపురోహితుడు ఈ దూత. ఇతడు ఉత్తమ పురోహిత దూత. ఇతడిని నియోగించినవాడు ద్రుపదుడు. అతడు నిర్వహింపదలచుకొన్నది బంధుకార్యం. పాండవులు అతడి అల్లుళ్ళు కావటంచేత అతడికి బంధుత్వంతోపాటు గురుత్వంకూడా ఉన్నది, బాధ్యతకూడా ఉన్నది. దూతను నియోగించి అతడిని వినియోగించుకొనే విధానాన్ని కూడా ద్రుపదుడు స్పష్టం చేశాడు.

క. 'ఇతఁడు మదీయాగ్ర పురో । హితుఁ; డితనికి నెల్లపనులు నెఱిఁగించి తగన్
ధృతరాష్ట్రు కడకుఁ బనుపుఁడు । చతుర వచన రచనఁ గఱపి సంప్రీతిమెయిన్.'

ఉ. 'ఆతని సమ్ముఖంబునఁ దదగ్రతనూజు కడన్ మరున్నదీ
జాతుని సన్నిధిం గలశసంభవు నొద్దఁ గ్రమోచితంబుగా
నీ తెఱఁ గిట్టు లాడుమని యేర్పడ నంతయుఁ జెప్పి పుచ్చఁగా
నీతిమెయిం దగం బలుక నెయ్యము లాభముఁ బెంపు జొప్పడున్'. **(ఉద్యో. 1.38, 39)**

అర్థశాస్త్రాన్ని అనుసరించి ద్రుపదపురోహితుడు శాసనహరుడివంటివాడు. కురుసభలో ఎవరెవరితో ఏయే విధంగా మాట్లాడాలో రాజు నిర్దేశించినట్లు అతడు మాట్లాడి ఫలితాంశం పరిస్థితులమీదనే వదలేవాడు. పాండవపక్షాన ఎటువంటి నిర్ణయం స్వయంగా తీసికొనే చొరవ అతడికి లేదు. రాజనీతి తెలిసినవాడు కాబట్టి అతడు నిపుణంగా మాట్లాడగలడు. ఆ మాటలవలన సాధించబడవలసిన ప్రయోజనాలు మూడు- 1. కౌరవపాండవుల మధ్య స్నేహం. 2. పాండవులకు రాజ్యలాభం. 3. పాండవులకు అభ్యుదయం. ఈ ఫలితాలు సాధించగలిగే చతురవచన రచనను పురోహితుడికి ధర్మరాజాదులు నేర్పాలని ద్రుపదుడు నిర్దేశించాడు. అంటే ద్రుపదపురోహితుడి శక్తి యుక్తులు స్వతంత్రదూతకార్యానికి సమర్థాలు కావని స్పష్టంచేశాడు. అతడికి కౌరవసభలో చేయవలసిన 'ఎల్లపను'లనుకూడా పూసగ్రుచ్చినట్లు చెప్పిపంపవలసి ఉంటుందని కూడా పేర్కొన్నాడు. అందువలన పురోహితదూత ఉత్తమ శాసనహరుడు.

దైన్యం లేకుండా, రాజ్యభాగాన్ని యాచిస్తున్నట్లు కాకుండా, ధర్మరాజు తన రాజ్యభాగాన్ని ఏలుకొనే హక్కును అమలు పరచుకొనటానికి ధృతరాష్ట్రుడి సమ్మతిని కోరుతున్నట్లుగా కురుసభలో దూత మాట్లాడాలి. ఇది లోకమర్యాదను పాటించే పద్ధతిలో సాగించే రాయబారం. దీనికి ధృతరాష్ట్రుడు సహజంగా, న్యాయపద్ధతి ననుసరించి సమ్మతి తెలపాలి. అందులో అవరోధాలు ఉండటానికి వీలులేదు. కాబట్టి గౌరవప్రదంగా పాండవభాగాన్ని అనుభవించటానికి వారిని ఆహ్వానించాలి లేదా అనుమతించాలి. దానికి భిన్నంగా ఎటువంటి అసంబద్ధపు మాటలు పలికినా దానికి ఫలితాలు ఎట్లా ఉంటాయో కూడా వారికి తెలియచెప్పాలి. ఆ తరువాత జరిగేది జరుగుతుంది. ఇదీ రాయబారపు స్వభావం. ఇందులో పాండవపక్షంలోని అభిప్రాయాలకు అనుగుణంగా పలుకుమని చెప్పిన పద్ధతిలో మాటలాడటమే దూతకార్యం. ఇది మర్యాదగా పంపుతున్న పాండవుల హెచ్చరిక. అంతేకాదు, పాండవులు స్వయంగా పంపేదేకాకుండా పాండవ హితులూ బంధువులూ స్నేహితులూ కలిసి పంపుతున్న హితవాక్యం. ఇందులో మంచిమాటలూ ఉంటాయి. మందలింపులూ ఉంటాయి. హితవూ ఉంటుంది. తగవూ ఉంటుంది. వినయమూ ఉంటుంది. వీరాలాపమూ ఉంటుంది. ఇందులో చెప్పటమే ముఖ్యం. కౌరవులు వినకపోతే వారి కర్మకు వారే బాధ్యులు. ఈ రాయబారంలో పాండవుల రాజ్యభాగానికి సంబంధించిన హక్కును భుక్తంచేసికొనే సమ్మతి కొరకు మర్యాదగా ధృతరాష్ట్రుడి ఎదుట ప్రస్తావించటం ముఖ్యం. వారి ప్రతిస్పందన అనుకూలమైతే స్నేహం, లాభం, అభ్యుదయం. విపరీతమైతే యుద్ధం, నష్టం, వంశనాశం ఏర్పడతాయి. ఈ తులనాత్మక అవగాహన కలిగేటట్లు కురుసభలో పలికి ధృతరాష్ట్రుడు తగిన నిర్ణయం తీసికొనేటట్లు చేయటం దూతకార్యం. ఇందులో దూతకు స్వాతంత్ర్యం

లేదు. చెప్పినట్లు చేయటమే కార్యం. రాయబారం వలన కలిగే ఫలితాలకు అతడు బాధ్యుడు కాడు. అయితే, నిర్దేశించిన పనులనుగాని, పలుకుమన్న మాటలుగాని వివేకంతో చేయాలి, చెప్పాలి. దానికి తగిన సంస్కారం ఉన్నవాడు ద్రుపదపురోహితుడు. అందుకే అతడు ఉత్తమ శాసనహరుడు.

ద్రుపదపురోహితుడి రాయబారం పాండవపక్షంలో ఉన్న పెద్దలందరి అభిప్రాయాల సారాంశంగా కనబడుతుంది. ప్రత్యేకంగా ధర్మరాజాదులు చెప్పి పంపిన మాటలు కావు. అయినా, అవి ధర్మరాజుయొక్క అంగీకారాన్ని పొందినవే. ద్రుపదపురోహితుడు కౌరవసభలో ఒక హితవరి, మధ్యవర్తి, పెద్దమనిషి, ఇంగితజ్ఞుడు, అభిమానధనుడు మాట్లాడుతున్నట్లుంటుంది. అయితే, ఆ మాటలన్నీ అతడివి కావు, పాండవ పక్షంలో ఉన్న పెద్దలమాటలు. ఈ అభిప్రాయం వీరిది అని ప్రత్యేకంగా పేర్కొనకుండా పలికిన సామూహిక సందేశసారాలు. అందువలన పురోహిత దూతకు ఆ మాటలలో ఎటువంటి కర్తృత్వ భోక్తృత్వాలు లేవు.

ఒక్కమాటలో చెప్పాలంటే ద్రుపదపురోహితుడి దౌత్యం పాండవహితులు ధర్మరాజు కొరకు నడిపిన రాయబారం! అతడు పలికిన తీరులో ఉన్న పారుష్యం బ్రాహ్మణ స్వభావంగా భీష్ముడికి తోచింది. అయినా, ఆ కరకుదనం ఆయనకు చెప్పి పంపిన వారిదే. దానిని కప్పిపుచ్చి దూతమీద పెట్టి మాట్లాడాడు భీష్ముడు. అది ధృతరాష్ట్రుడి మనసుకు రాపిడి కలిగించింది. కాని, అతడు పాండవులు రాజ్యభాగం అనుభవించే హక్కుకు 'సమ్మతి' ప్రకటించలేకపోయాడు. అందుకే సంజయుడి రాయబారం పంపవలసివచ్చింది. విరుద్ధభాషణం సభలో చేయకుండా రాయబారి ద్వారా పలకటం ధృతరాష్ట్రుడి రాజనీతి!

(2). ధర్మరాజుగురించి ధృతరాష్ట్రుడు చేసిన అమాత్యదౌత్యం

సంజయుడు ధృతరాష్ట్రుడి హితుడు, అమాత్యుడు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో చెప్పబడిన అమాత్యగుణాలన్నీ ప్రధానమంత్రికి ఉండదగినవి. సంజయుడు ప్రధానమంత్రి కాడు. సన్నిహితుడైన అమాత్యుడు, హితుడు, బంధువు, శాస్త్రోక్తంగా చెప్పాలంటే ప్రధానమంత్రి విదురుడికంటె కొన్నిగుణాలు తక్కువవాడని చెప్పాలి. అయినా బుద్ధిమంతుడు, విశ్వాసపాత్రుడు. అందువలననే దూతగా ధృతరాష్ట్రుడు ఎన్నుకొన్నాడు. అతడు సంజయుడి రాయబారం ద్వారా సాధింపదలచుకొన్న కార్యం పరిమితమైనది. దాన్ని స్పష్టంగా సంజయుడికి తెల్పాడు.

క. 'నెయ్యము వాటించి కడుం । దియ్య మెసఁగ నలుకలెల్లఁ దీఱునటులుగాఁ
గయ్య మనుతలఁపు లోనుగ । నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగుగాన్'. **(ఉద్యో. 1.271)**

ధర్మజుడి కోపాన్ని తగ్గించేటట్లు, అతడు యుద్ధం మాట మానేటట్లు, నిపుణంగా మాట్లాడాలి. ఆ మాటలలో స్నేహం, తియ్యదనం జాలువారాలి. వాటిని విన్న ధర్మరాజు కోపాన్ని మరచిపోయి 'శాంతి ప్రకారంబునం కార్యంబు నడపి, యొక్కటియై మనేటట్లు ఒడబరచాలి'- అనేది దౌత్యలక్ష్యం. ధర్మజుడు శాంతిస్తే రాజ్యభాగం ఇస్తాననలేదు; కౌరవులూ పాండవులూ ఒక్కటియై ఎట్లా ఉంటారో సూచించలేదు. అందువలన సంజయుడు ఆ అంశాలమీద మాట్లాడే వీలులేదు. వాటిని తేల్చి చెప్పకపోతే ధర్మజుడు శాంతించే అవకాశమే లేదు. అయినా, సంజయుడు మాట నేర్పరితనంతో ధర్మరాజును శాంతమూర్తిగా మార్చాలి. ధర్మజుడి మనసు మారితే చరిత్ర మారుతుంది. పాండవపక్షం అతడి ఆనతిని శిరసావహిస్తుంది. భీమాదులు ధర్మజవాక్యబద్ధులై ఉంటారు. శాంతుడైన ధర్మరాజులో రాజ్యకాంక్ష సమసిపోయే శమభావం మొనులెత్తాలి. అంటే- యుద్ధోత్సాహానికి మూలమైన రాజ్యకాంక్షను తొలగిస్తే ధర్మజుడు మునివృత్తిని స్వీకరించవలసిందే. జీవితాంతం అడవులలో తాపసజీవితం గడుపుకొంటూ ఉండవలసిందే. అదే ధృతరాష్ట్రుడు లక్షిస్తున్న పరిష్కారం. అదే ఆయన దృష్టిలో 'ఒకటియై ఉండటం'. ఈ పరిమిత ప్రయోజనం కొరకు రాయబారం చేసే సంజయుడు 'పరిమితార్థుడు'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్రుపదపురోహితుడి దౌత్యంలో ధృతరాష్ట్రుడు హితులచేత రెచ్చగొట్టబడిన ధర్మరాజును ఊహించాడు. అతడి కోరికను మన్నించటం గ్రుడ్డిరాజుకు ఇష్టంలేదు. అందువలన ధర్మరాజులో మానసిక పరిణామాన్ని తెస్తే యుద్ధోద్యోగమే ఆగిపోతుందని, అసలుకే మోసం తెచ్చే భేదనీతిని ప్రయోగించాడు. ఈ నీతి అందరికీ తెలిపి చేసింది కాదు. తన చుట్టుప్రక్కల ఉన్న మంత్రి మండలికీ, హితులకూ చెప్పిన తీరు వేరు. ఆ తరువాత సంజయుడికి ఏకాంతంలో బోధించిన విధం వేరు కావటంచేత ఈ రాయబారం అందరికీ తెలిసేటట్లు చేసినా, అందరి అభిప్రాయాలకూ ప్రాతినిధ్యం వహించదు. 'ధృతరాష్ట్ర డొక్కడూ రాజ్యభాగానికి అంగీకరిస్తే ఇతరులందరూ అంగీకరించినట్లే ఔతుం'దని ధర్మరాజు భావిస్తే, దానికి ప్రతిగా 'ధర్మరాజుకూడా శాంతిస్తే అందరూ శాంతించినట్లే ఔతుం'దని ధృతరాష్ట్రుడు దూతను ప్రయోగించాడు. సంజయదౌత్యంవలన సాధించబడేది ఏమీ ఉండదని తెలుసు. కాని, అదృష్టవశాత్తు ధర్మజుడు మారితే ఆపద తప్పుతుందని అనుకొన్నాడు ధృతరాష్ట్రుడు. అతడు చేసిన ఈ గూఢప్రయోగం (విగ్రహం) అతడికే కాక, అతడి పక్షం వారికంతా సుడిగుండంవలె చుట్టుకొంటుందని భావించలేకపోయాడు. ఒకవేళ రాయబారాన్ని సమగ్రస్ఫూర్తితో నిర్వహించుమని సంజయుడిని కోరి ఉన్నట్లయితే ఫలితం మరొకరకంగా ఉండేది. అట్లా కావటం ధృతరాష్ట్రుడి అభిమతం కాదు. అందుకే ఉత్తముడు కాని రాజుచేత ప్రయోగించబడిన సంజయుడు ఉత్తమదూత కాలేకపోయాడు. రాయబారం సఫలం కాదని సంజయుడికీ తెలుసు. కాని, సంధి యత్నంలో సామర్థ్యాన్ని ప్రదర్శిస్తే సహృదయుల సానుభూతిని పొందవచ్చునని తన ధర్మాన్ని శక్తివంచన లేకుండా నిర్వహించాడు. చివరకు ధర్మజుడి ప్రశంసల నందుకొన్నాడు కూడా!

క. 'ఎదురున్న రూపు వలుకఁగఁ । దుదిఁ గటకటఁ బడవు; నీవు దుర్ణయమును బె
ట్టిదమును, బెండును నగుపలు । కొదవదు నీ నాలుకకు నయోన్నత! యెపుడున్'.

క. 'నీ వొండె విదురుఁ డొండెను । గావలయుంగాక యిట్టి కార్యంబులకున్
రా వేఱ కలరె తగువా? । రీ వినయము నేర్పుగలదె యితరుల కెందున్?'. **(ఉద్యో. 1. 363,364)**

మొత్తం మీద సంజయ దౌత్యం ధర్మరాజును గురించి (ఉద్దేశించి) సాగించిన రాయబారమే.

(3). ధర్మరాజే ధర్మనీతి కొరకు చేసిన రాయబారం శ్రీకృష్ణ దౌత్యం

శ్రీకృష్ణుడు అమాత్యుడు కాడు; పరమాత్ముడు. పాండవులకు ఆరాధ్యదైవం. ఆత్మబంధువు. మార్గదర్శి. ఆయన తనంతట తానే హస్తినాపురానికి పోయి ధృతరాష్ట్రుడికి హితవు చెప్పి, కులక్షయం కాకుండా, సంధి కుదిరించి పాండవులకు రాజ్యలాభం కలిగిస్తానని ప్రకటించుకొన్నాడు. అతడు స్వయంగా నియోగించుకొన్న పెద్దమనిషి రాయబారి. కౌరవపాండవులకు హితంకోరే మధ్యవర్తి. అయినా, పాండవపక్షవర్తి, ధర్మపక్షపాతి. ఆయనకు ధర్మరాజు తన అభిప్రాయాన్ని చెప్పి, తమకు హితంజరిగేటట్లు సంధినడుపుమని ప్రార్థించాడు. శ్రీకృష్ణ డాయన ఆనతిని పాటిస్తానని మాటయిచ్చాడు. ఆయన ఆశించే ఫలితాలు సిద్ధించేటట్లు దౌత్యం చేస్తానని ధైర్యం చెప్పాడు. సంజయుడి వర్తమానం ప్రకారం శ్రీకృష్ణుడు ఉభయులు (కౌరవపాండవుల) శ్రేయోభిలాషిగా హస్తినకు వస్తున్నాడు. పాండవుల దృష్టిలో అతడు ధర్మరాజునియోగాన్ని నిర్వహించటానికి హస్తినకు వెళ్ళుతున్నాడు. మరి, పఠితల దృష్టిలో ఆయన యుద్ధాన్ని సిద్ధాంతీకరించటానికి హస్తినకు సర్వాధికారిగా చేరుతున్నాడు. ఆయనను రాయబారి అన్నదానికంటె హితవరి అని అనటం మేలు. అయినా, దుర్యోధనాదులైన కౌరవులందరూ అతడిని పాండవదూతగానే భావించారు, వ్యవహరించారు. అందువలన దూతకార్యంలో నియుక్తుడైన హితవరి సర్వాధికారి శ్రీకృష్ణుడు.

కౌటిల్యుడి అర్థశాస్త్రం ప్రకారం శ్రీకృష్ణుడు ప్రధానామాత్య లక్షణాలన్నీ సంతరించుకొన్న 'నిసృష్టార్థుడు'. దౌత్య లక్ష్యాలన్నింటినీ పేర్కొన్న ధర్మరాజు వాటిని సాధించే ఉపాయాలను కొన్ని సూచించాడే కాని, అన్నీ ఆయనకు వివరించి చెప్పలేదు. చివరకు-

క. 'మమ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు, । నెమ్మి యెఱుఁగు, దర్థసిద్ధి నెఱి యెఱుఁగుదు, వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు, । పొ మ్మెవ్వఁడ నీకు నేను బుద్ధులు సెప్పన్?' **(ఉద్యో. 3.34)**

అని శ్రీకృష్ణుడిపై సర్వకార్య నిర్వహణ భారాన్ని వదలివేశాడు. అర్జునాదులు శ్రీకృష్ణు డేనిర్ణయం చేస్తే దానినే శిరసావహిస్తామన్నారు. పురుషకారం, దైవానుకూల్యం రెండూ శ్రీకృష్ణుడే అని భావించారు. ఆయన తిమ్మిఅంటే తిమ్మి, బ్రహ్మి అంటే బ్రహ్మి ఔతుందని విశ్వసించారు. అందుకే సంధికై వెళ్ళిన శ్రీకృష్ణుడు యుద్ధాన్ని ప్రకటించి వచ్చాడు. శ్రీకృష్ణుడు సర్వస్వతంత్రుడైన పాండవదూత. ధర్మరాజుహృదయంలోని ధర్మనీతికి క్రియాశక్తి!

సర్వధర్మాభిజ్ఞుడైన శ్రీకృష్ణుడు దూతపాత్రను నిర్వహిస్తున్నప్పుడు దూత చేయవలసిన పనులన్నీ నిర్వహించి ఆ వృత్తికి ఒక ఆదర్శాన్ని కల్పించాడు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో దూత కార్యాలు ఇట్లా చెప్పబడ్డాయి.

శ్లో. "ప్రేషణం సంధిపాలత్వం ప్రతాపో మిత్రసంగ్రహః
ఉపజాపః సుహృద్భేదో దణ్డ గూఢాతిసారణమ్
బన్ధురత్నాపహరణం చారజ్ఞానం పరాక్రమః
సమాధిమోక్షో దూతస్య కర్మయోగస్య చాశ్రయః". **(అర్థశాస్త్రమ్. 1 అధికరణం. 16వ. అధ్యా. పు.68.)**

వార్తలు పంపటం, ఇతర రాజులతో తనస్వామి చేసికొన్న సంధులను గట్టిచేయటం, తన స్వామి గొప్పతనాన్ని చాటడం, మిత్రులను సంపాదించటం, కృత్యాదులను రెచ్చగొట్టడం శత్రువుల స్నేహితులలో భేదం కలిగించటం (వాళ్ళను విడదీయటం). సైన్యాన్నీ, గూఢపురుషుల్నీ శత్రురాజ్యంలోనికి ప్రవేశపెట్టడం, శత్రువుల బంధువులను, రత్నాలను అపహరించడం, రహస్య సమాచారాలు తెలిసికొనటం. పరాక్రమం చూపడం, సమాధిని (పూచీకత్తుకోసం పట్టుబడిన వాడు **Hostage**) విడిపించటం, రహస్యమైన ఉపాయాలు పన్నడం- ఇవి దూతలు చేయవలసిన పనులు. (వ్యాఖ్య: ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు. పు.68).

శ్రీకృష్ణుడు దూతగా ఈ పనులనన్నింటినీ కార్యసాధనకు అనువుగా నిర్వహించిన నిపుణుడు. శ్రీకృష్ణుడు హస్తినాపురానికి చేరే వార్తల ప్రసారం విస్తారంగా సాగింది. విదురాది పాండవ శ్రేయోభిలాషుల హృదయాలలో చెరగకుండా ఉన్న పాండవాభిమానాన్ని పక్షపాతంగా పరివర్తింపచేశాడు శ్రీకృష్ణుడు. కురుసభలో పాండవ ధర్మనీతిని, వారి పరాక్రమ విశేషాలను శత్రుభయంకరంగా పొగడి వారి గొప్పతనాన్ని చాటాడు. శ్రీకృష్ణుడి ఉపన్యాసం విన్న రాజులు పాండవ ధర్మవర్తనంమీద సానుభూతిని పెంచుకొన్నారు. దుర్యోధన దుర్నీతిని అంతరాంతరాలలో గర్హించారు. శ్రీకృష్ణుడు కర్ణాది దురభిమానులను రెచ్చగొట్టి కురుసభలో కల్లోలం సృష్టించాడు. దుర్యోధనుడి బహిఃప్రాణమైన కర్ణుడి జన్మరహస్యం చెప్పి భేదోపాయాన్ని ప్రయోగించాడు. హస్తినాపురంలో సమకూడిన శత్రు శిబిరాలలోని వీరుల తీరులను, వారి బలాబలాలను, రహస్యాలను తెలిసికొన్నాడు. దుష్టచతుష్టయం శ్రీకృష్ణుడిని లంచాలతో వశంచేసుకొనటానికీ, ఆహారంలో విషం పెట్టి చంపడానికీ, ఒంటరివాడిని చేసి బంధించి వధించటానికీ యత్నించగా, స్వీయప్రతాపాన్ని ప్రదర్శించి తనను తాను రక్షించుకొన్నాడు, చతుర్విధోపాయాలను యథావకాశంగా ప్రయోగించాడు. దూతకార్యాల నన్నింటినీ ప్రదీప్తంగా నిర్వహించిన శ్రీకృష్ణుడు ఉత్తమదూత! విశ్వరూపాన్ని ప్రదర్శించి ధృతరాష్ట్రుడిని అనుగ్రహించి దివ్యాదివ్యుడనిపించుకొన్న శ్రీకృష్ణుడు పాండవదూతయే కాక, ధర్మదూత అనిపించుకొన్నాడు. శ్రీకృష్ణుడివంటి దివ్యాత్ముడైన దూత న భూతో న భవిష్యతి.

ముగ్గురు దూతల ముచ్చటను ఒక్కచోట ముడివేస్తే ఇట్లా చెప్పవచ్చును.

1. ధర్మరాజు కొరకు హితులు చేపట్టిన రాయబారం పురోహిత దౌత్యం. పురోహితుడు 'శాసనహరుడు'.
2. ధర్మరాజు నుద్దేశించి ధృతరాష్ట్రుడు నడిపిన అమాత్యదౌత్యం సంజయదౌత్యం. సంజయుడు 'పరిమితార్థుడు'.

3. ధర్మరాజు స్వయంగా ధర్మనీతి కొరకు చేసిన రాయబారం శ్రీకృష్ణ దౌత్యం. శ్రీకృష్ణుడు - 'నిసృష్టార్థుడు'.

(4). అహంకారి చేపట్టిన అధిక్షేపదౌత్యం ఉలూకుడి రాయబారం

ఉద్యోగపర్వం చివర దుర్యోధనుడు దురహంకారంతో పాండవ ప్రతిజ్ఞలను అధిక్షేపిస్తూ ఉలూకుడితో పంపిన సందేశం ఆవేశ ప్రధానంగా, అధిక్షేపాత్మకంగా సాగింది. ఉలూకుడు వస్తుతః శాసనహరుడివంటి దూత. మర్యాదలేకుండా మాట్లాడినా, ఉలూకుడిని మర్యాదతో చూచి, మర్యాద తెలియని దుర్యోధనుడికి తగిన సమాధానాన్ని తిప్పి పంపిన పాండవపక్షం గౌరవాన్ని గడించింది. దుర్యోధనుడి అధిక్షేపం పాండవవీరులలో యుద్ధోత్సాహాన్ని ఇనుమడింపజేసింది.

రాయబారపు ఘట్టాలలో గమనించదగిన మరొక అంశం- ఏమంటే. ఉలూకుడు, పురోహితుడు, సంజయుడు రాయబారులుగా వెళ్ళేముందు వారి ప్రభువులు వారికి చెప్పిన మాటలు తిక్కన వివరించలేదు. కాని, శ్రీకృష్ణుడు హస్తినాపురికి వెళ్ళేముందు ఉపప్లావ్యంలో పాండవవర్గంవారందరూ తమ తమ అభిప్రాయాలు చెప్పారు. హస్తినలో కౌరవ ముఖ్యులందరూ ఆయనతో చర్చించారు. శ్రీకృష్ణుడు ఇక్కడా, అక్కడాకూడా విశదంగా మాట్లాడాడు. ఉత్తముడైన రాయబారిని చిత్రించటంలో పాటించవలసిన సమగ్రశిల్పం శ్రీకృష్ణుడి రాయబారానికే దక్కింది. అందుకు కారణం రాజు ఉదాత్తుడు కావటం, రాయబారి ఉత్తముడు కావటమే. అంతేకాదు భావికథకు పోషకమైనది శ్రీకృష్ణుడి రాయబారమే.

కాగా, ఆయా రాజులయెదుట రాయబారులు మాట్లాడిన తీరు తెన్నులను తీర్చిదిద్దటంలో తిక్కన కావ్యకళాశిల్పాన్ని కమనీయంగా పోషించాడు. మరేపర్వంలోనూ ఇంతటి రాజనీతి చర్చ కానరాదు, రూపకోచిత రసోల్లాసం రాణించదు; పాండవకౌరవ పరాక్రమ తులనాత్మక చర్చ ఇంతగా ప్రత్యక్షం కాదు. దానిని అనుశీలించటం ఉద్యోగపర్వ శిల్ప కళావైభవాన్ని దర్శించటం!

5. తిక్కన రచన : నాటకీయత

తిక్కన సోమయాజి 'ఉభయకవిమిత్రుడు'. సంస్కృతాంధ్రభాషలలో కవిత్వం చెప్పటంవలన, దృశ్యశ్రవ్య ప్రక్రియలను రచనలో పోషించటంవలన, మార్గదేశీ పద్ధతులను సమన్వయించటంవలన, నిర్వచన చంపూకావ్య ప్రక్రియలను నిర్వహించటంవలన, కావ్యాన్నీ ఇతిహాసాన్నీ సంవిధానం చేయటంవలన, తత్సమ ఆచ్ఛికపదాలను నిపుణంగా మేళవించటంవలన- ఇటువంటి కారణాలవలన తిక్కనకు 'ఉభయకవి మిత్రు'డనే బిరుదు సార్థకమైనది. పై లక్షణాలలో శ్రవ్యకావ్య ప్రక్రియలో దృశ్యస్వభావాన్ని పొందుపరచి చెప్పే కావ్యరచనా విధానాన్ని 'నాటకీయత' అని అంటారు.

కావ్యంలో నాటకీయత - రంగపరికల్పన, చతుర్విధాభినయ ప్రదర్శన, వర్ణన, రూపకోచిత కావ్యాంశాల సంవిధానం మొదలైన అంశాలమీద ఆధారపడి ఉంటుంది. ఒక సన్నివేశాన్ని కొన్ని రంగాలుగా చిత్రించటానికి వీలుంటే, వాటిని కల్పించి రూపక స్వభావాన్ని కావ్యంలో చొప్పించటం రంగపరికల్పన. అభినయం నాలుగు రకాలు. 1.ఆంగికం, 2.ఆహార్యం, 3.వాచికం, 4.సాత్త్వికం. తిక్కన ఈ నాల్గింటిని యథోచితంగా పాత్రల అభినయంలో వర్ణించి రసాన్ని రక్తికట్టించటం చతుర్విధాభినయ ప్రదర్శనం. కావ్యనాటకోచిత వర్ణన. పతాకాది రూపకోచిత అంశాలను కావ్యంలో సంవదించటం మరొక లక్షణం. వీటిని ఉద్యోగపర్వ శిల్పానుశీలనలో భాగంగా పరిశీలించటం ప్రస్తుతాంశం.

నాటకీయతకు నారుపోసినట్లుంటుంది ఉద్యోగపర్వం. కథలో సహజంగా అమరిన సభలూ, సమావేశాలూ, సన్నివేశాలూ, సంభాషణలూ నాటకీయతకు జీవితాన్ని కల్పించాయి. సభలు నాటకంలోని అంకాలవలె, సమావేశాలు రంగాలవలె, సన్నివేశాలు దృశ్యాలవలె, సంభాషణలు సంఘటనలవలె రాణించటం విశేషం. కథన వర్ణనలు పూలదండలోని దారంవలె, యక్షగానంలో సూత్రధారవచనంవలె అమరి నాటకీయతకు కావ్యకళా గౌరవాన్ని కలిగిస్తున్నాయి.

రాజనీతి ప్రధానమైన ఉద్యోగపర్వంలో వ్యర్థ సన్నివేశంగాని, సంభాషణంగాని లేదు. అందుచేత రచన చక్కగా చిక్కగా సాగింది. అర్థవంతంగా నడిచింది. ఆలోచనామృతంగా ఆస్వాదనీయ గౌరవాన్ని పొందింది. తిక్కనలోని మహాకవి మహామంత్రిగా ఉద్యోగంలో ఉన్మీలించాడు. ఉదాత్తమైన ఒక మహానాటకం వంటి గొప్పకావ్యం (ఉద్యోగపర్వం) తెలుగువారికి దక్కింది.

మహానాటకంలో పది అంకాలున్నట్లుగా ఉద్యోగపర్వంలో పదిసభలు అంకాలుగా చిత్రించబడ్డాయి. ప్రధానపాత్రలతో రసవత్తరమైన సంభాషణలతో ఏకదివస వృత్తం ప్రదర్శితమైతే అంకం. అట్లాగే ఉద్యోగపర్వంలోని సభారంగాలు పది అంకాలుగా ప్రకాశిస్తున్నాయి. వాటిని ఈ క్రింది విధంగా గుర్తించవచ్చును.

(1). అంకాలుగా గోచరించే సభలు

1. ఉపప్లావ్యంలోని ధర్మరాజు సభ	1. 6-50
2. ద్రుపదపురోహితుడి రాయబారం సాగిన ధృతరాష్ట్రుడి నిండుసభ.	1. 230-257
3. సంజయుడి రాయబారం నడిచిన ధర్మరాజు పేరోలగం.	1. 272-380
4. సంజయుడి పాండవసందేశాలు వినిపించిన ధృతరాష్ట్ర సభ.	2. 116-302
5. పాండవులు శ్రీకృష్ణుడికి తమ సందేశాలను వినిపించిన శ్రీకృష్ణమందిర సభ.	3. 5-129
6. శ్రీకృష్ణుడి రాకనుగురించి సమాలోచించిన ధృతరాష్ట్రుడి సభ	3. 148-172
7. శ్రీకృష్ణుడి రాయబారం సాగిన ధృతరాష్ట్ర మహాసభ	3. 247-411
8. శ్రీకృష్ణుడి తన రాయబారపు విశేషాలు తెలిపిన ధర్మరాజు సభ	4. 72-112
9. ఉలూకుడి రాయబారం సాగిన పాండవ స్కంధావారం	4. 817-210
10. భీష్ముడు కౌరవపాండవ వీరుల బలాబల నిరూపణం చేసిన స్వీయ స్కంధావార మందిర సభ	4. 211-425

దశాంక సదృశమైన ఈ సభాఘట్టాలలో మహానాటకంలోవలె ప్రతిరెండు (అంకాలవంటి) సభలలోనూ కలిసి, ఒక్కొక్క సంధి నిర్వహించబడుతూ మొత్తంమీద పంచసంధులు పోషించబడేటట్లు వస్తునిర్మాణం జరగటం ఈ పర్వ విశేషం. ఉపప్లావ్యనగరంలో ఉద్యోగానికి బీజావాపనం జరిగింది. ధృతరాష్ట్రుడి సభలో ద్రుపదపురోహితుడు దానిని కార్యారంభంగా మలచి ప్రదర్శించాడు. ముఖసంధి అక్కడ భాసించింది. ధృతరాష్ట్రుడు సంజయుడిని రాయబారిగా పంపటం, ఆ గ్రుడ్డిరాజుమనోగతాన్ని సంజయుడు ధర్మరాజు సభలో వివరించటం, దానిమీద ధర్మజాదులు ఆగ్రహాన్ని వ్యక్తం చేయటం, శ్రీకృష్ణుడు హస్తినకు పోయి శాంతియత్నం చేయటానికి ముందుకు రావటం బిందువువంటిది. ఆ బిందువే కార్యక్షేత్రమంతా నీటిపై తైలబిందువువలె వ్యాపిస్తుంది. ధృతరాష్ట్రుడి సభలో సంజయుడు పాండవసందేశాలను వినిపించటం, వాటిపై కౌరవవీరుల పరస్పర చర్చలు, తీవ్రవాదోపవాదాలు రేగటంవంటివి తీవ్రయత్నాన్ని సూచిస్తున్నవి. ప్రయత్న బిందు సంబంధం గలది ప్రతిముఖసంధి. పాండవులు సంధి సందేశాలను శ్రీకృష్ణుడికి వినిపించటంలోనూ సంధి జరగదనే అనుమానంతోనే చతుర్విధోపాయాలను సారించటంలోనూ ప్రాప్త్యాశ, శ్రీకృష్ణుడు హస్తినాపురంలో ప్రవేశించటంతో అక్కడ చెలరేగిన భావవైరుద్ధ్యాల సందడి, మహర్షులు సభకు రావటం వంటి సన్నివేశాలలో పతాక ప్రకాశించింది. ప్రాప్త్యాశా పతాకల సంబంధం కలది

గర్భసంధి. శ్రీకృష్ణుడి రాయబారపు ఘట్టం నియతాప్తిని సూచించింది. కర్ణాదుల వృత్తాంతాలు ప్రకరి గౌరవాన్ని సంతరించుకొన్నాయి. శ్రీకృష్ణుడు ధర్మరాజు సభలో కౌరవ సభావృత్తాంతాన్ని నివేదించిన ఘట్టంలో అవ(వి)మర్శసంధి స్ఫురించింది. క్రోధవ్యసనాదులచేత గర్భసంధిలో ప్రకాశించిన బీజార్థాలను గురించి చేయబడే పర్యాలోచనమే ఈ కథా ఘట్టంలో ప్రధానాంశం. అదే అవ(వి)మర్శసంధి. ఉలూక ప్రలాపాలు, పాండవవీరుల ప్రతిజ్ఞలు కార్యరూపంతాల్చే ఉత్సాహాన్ని ఉద్ధరింపజేశాయి. భీష్మవచనాలు యుద్ధ నిర్వహణంలో పాండవ విజయాన్ని సూచిస్తూ ముగిశాయి. దానితో యుద్ధోద్యోగ ఫలాగమం సూచించబడింది. ఈ విధంగా పది అంకాలవంటి సభారంగాలు సమగ్ర నాటక కార్యస్వరూపాన్ని ప్రత్యక్షంచేయగలిగాయి. ఇది నాటకీయతలోని వస్తు నిర్మాణ శిల్ప మహత్త్వం!

ధర్మరాజును 'మెత్తనిపులి'గా చిత్రించాడు తిక్కన. పైకి మెత్తగా కనపడినా లోన పులివంటి పౌరుషశాలి, గూఢాభిమాని. అవసరం వచ్చినప్పుడు క్రౌర్యంకూడా ప్రదర్శించగలడు. కౌరవులు చేసిన అపకారం ధర్మరాజుకు ఆగ్రహం కలిగించాలి. హింసకు దారితీయాలి, యుద్ధానికి ప్రేరణ కావాలి. కాని, అతడు 'వశీకృతచిత్తుడు'. యుధిష్ఠిరనామధేయుడైనా మనస్సును అదుపులో ఉంచుకోగలడు. సమయజ్ఞుడు. ఎప్పుడు ఆగ్రహించాలో తెలుసు, ఎప్పుడు అనుగ్రహించాలో తెలుసు. ఆగ్రహానుగ్రహాలను కూడా ధర్మబద్ధం చేయటం ధర్మరాజు ప్రవృత్తి.

ధర్మరాజు సహజంగా ఉభయాయత్తసిద్ధి. కార్యసాధనం స్వయంగా నిర్వహించుకొని ఫలసిద్ధి పొందేవాడు స్వాయత్తసిద్ధి. మంత్రుల సహాయంతో సాధించేవాడు సచివాయత్త సిద్ధి. తాను మంత్రులతో కలిసి సమష్టిగా కృషి చేసి ఫలాన్ని పొందేవాడు ఉభయాయత్త సిద్ధి. పాండవులు స్వయంగా బలవంతులైన నాయకులు. శ్రీకృష్ణుడు వారికి మిత్రుడు, గురువు, దైవం, మార్గదర్శకుడు. అయినా ఉద్యోగంలో వారికి సచివోత్తముడు. ధర్మజుడు ఇచ్ఛాశక్తి, భీమార్జునులు క్రియాశక్తులు, శ్రీకృష్ణుడు జ్ఞానశక్తి. ధర్మరాజు తన ఉద్యోగాన్ని శ్రీకృష్ణముఖంగా సాగించాడు. భీమార్జునులు ధర్మజుడిని బలపరిచారు. ఇచ్ఛాక్రియాశక్తులు జ్ఞానప్రకాశంతో ప్రవర్తిల్లుతాయి. ఈ తత్త్వాన్ని రాజనీతి నాశ్రయించి సాగే ఉద్యోగపర్వం వ్యాఖ్యానించి చెప్పింది. పై పది అంకాలవంటి సభలూ ఆ పరమార్థాన్నే ప్రదర్శిస్తున్నాయి. ఈ పర్వ కార్యతత్త్వ కరదీపిక శ్రీకృష్ణుడి వ్యాఖ్య!

ఆ. 'రోషమయ మహాతరువు సుయోధనుఁ; డురు । స్కంధ మందులోనఁ గర్ణుఁ డలరుఁ;
గొమ్మ సౌబలుండు; గుసుమ ఫలములు దు । శ్శాసనుండు; మూల శక్తి తండ్రి'.

ఆ. 'ధర్మజుండు ధర్మతరు; వర్జునుఁడు ఘన । స్కంధ; మనిలసుతుఁడు శాఖ; కవలు
పుష్పఫలము; లేను భూసురులును వేద । ములుఁ దదీయమైన మూలచయము'.

క. 'ఈరెంటియందు నరసి య । సారం బిది, గాఢసార సహితం బిది నా
నేరవలయు; నదియును గా । కేరూపం బయ్యెనేని నీ సేమిటికిన్'? **(ఉద్యో. 1.355-357)**

ఉద్యోగపర్వంలో ధర్మనిర్ణాయశక్తిగా శ్రీకృష్ణుడు పోషించబడటం పై సభాకార్యక్రమాలలో పాటించిన శిల్పం. ధర్మతరువుకు మూలబలాన్ని నిరూపించటం ఈ పర్వ పరమతాత్పర్యం. దానికి ప్రతిగా రోషమయ మహాతరువుకు మూలమైన, లోభశక్తి అయిన ధృతరాష్ట్రుడి బలహీనతను ప్రదర్శించటం కూడా పర్వకథార్థ ప్రయోజనమే. ఈ రెండింటి చిత్రణలో కానవచ్చే ప్రతిస్పర్ధి శిల్పం ప్రశంసనీయం.

1. ఉపప్లావ్య నగరంలోని ధర్మరాజుసభలో ఉద్యోగపర్వంలో నిర్వహించబడే కార్యసూత్రానికి నాందిపలికింది శ్రీకృష్ణుడే. అతడి ప్రతిపాదన ప్రాతిపదికగా బలరామసాత్యకి ద్రుపదాదుల ఆలోచన సాగింది. పురోహితుడి రాయబారం రూపొందింది. దానిని అంగీకరించి ధర్మరాజు శ్రీకృష్ణుడి ప్రయత్నాన్ని సమ్మతించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'ఎదిరిమతం బెఱుంగక యెట్టికార్యంబు నిశ్చయింప వెరవగునే? కావున నియ్యవసరంబునఁ దగిన మానిసి నందులకుం బుచ్చవలయు! దుర్యోధనుడు వీరికి రాజ్యంబుపాలిచ్చిన మేలగుఁగాక! తక్కిన నప్పటికిఁ బోలిన పని సూచుకొందము' (ఉద్యో. 1.17) అన్న శ్రీకృష్ణుడి వాక్యం ధర్మజుడి ధర్మనీతి వర్తనానికి మూలం; పాండవోద్యోగానికి ప్రారంభం.

2. ద్రుపదపురోహితుడు ధృతరాష్ట్రుడి సభలో భీమార్జున సాత్యక్యాదుల పరాక్రమాలను ప్రశంసించి చివరకు 'శ్రీకృష్ణుడు పాండవుల కండగా ఉండగా వారు అసాధ్యులయ్యా'రని కీర్తించాడు.

మ. 'వివిధోపాయ పరాయణుండు, రిపుదోర్వీర్యాపహారక్రియా
ప్రవణోద్యోగుఁడు, మంత్రరక్షణ కళా ప్రావీణ్య గణ్యుండు, ధై
ర్యవివేకాది గుణోత్తరుం, డఖిల విద్యాజాల సంవేది మా
ధవుఁ డా దిక్కటె! పాండవేయుల కసాధ్యం బెద్దియుం గల్గునే?' **(ఉద్యో. 1.240)**

ఇందులో శ్రీకృష్ణుడికి అయిదు విశేషణాలు వాడబడ్డాయి. పంచపాండవులకు ఆయా విశేషణాలు వరుసగా అన్వర్థం కాగలవిగాకూడా కనబడుతున్నాయి. వారి కాయా విశేషణాలు అబ్బటానికి ఆదిశక్తి శ్రీకృష్ణుడు. వాటిని అలవరచుకొని అసాధ్యు లనిపించుకొన్నారు వారు. శ్రీకృష్ణుడు సర్వశక్తి సంపన్నుడు కాబట్టే పంచపాండవుల విశిష్టగుణాలన్నీ తనయందే పండించుకొని పరిపూర్ణ రాజనీతి పురుషుడుగా రాణించాడు. పాండవులకు వాటి సిద్ధిని ప్రసాదించాడు. అంతటి మహిమగల వ్యక్తి కౌరవపక్షంలో లేడు. అస లాకాలంలోనే లేడు. శ్రీకృష్ణుడు నాయకులకే నాయకుడు. అతడు పాండవులకు సహాయకుడు.

3. సంజయ దౌత్యంలో దుర్యోధనాదులు రాజ్యం భోగించటానికే పుట్టారన్నట్లూ, వారిని మార్చటం కష్టమన్నట్లూ, వారివర్తనకు ఫలం వారనుభవిస్తారన్నట్లూ సరిపుచ్చి, ధర్మరాజు మాత్రం ఉత్తముడు కాబట్టి అతడికి 'రుధిరాభీలాన్నముకంటెను మేలగు భిక్షాన్నమైన మీ నడవడికిన్' అని నియోగించాడు. దానికి మండిపడిన ధర్మరాజు, ఉభయపక్షాలలో ధర్మాధర్మనిర్ణయం చేయదగిన మహాత్ముడు శ్రీకృష్ణుడే అని ప్రశంసించి, అతడి మాటే పాండవులకు వేదవాక్యమని ప్రకటించాడు.

'ఇది కర్తవ్యం బిది యకర్తవ్యం బని మనల శాసింప వాసుదేవుండు గలండు; మన కీ వితర్కం బేటికి? నితండు ధర్మాధర్మవిదులకు గురుండు, కార్యాకార్య నిరూపకులకు శిక్షకుం, డుచితానుచితజ్ఞులకుఁ బ్రదర్శకుం; డితని పంపున గాదె యదుభోజాంధక వృష్ణి సంజయ కేకయ ప్రభృతి భూపతి ప్రకరంబు ప్రశస్తపథంబునం బ్రవర్తిల్లుచున్నయది; విశేషించి మాకు నితని బుద్ధియ సమస్త పురుషార్థంబులకు మూలంబగుట నితని వచనం బవశ్యంబు నలంఘనీయంబు'. (ఉద్యో. 1.335)

శ్రీకృష్ణుడు బ్రాహ్మణుడిని రాయబారానికి పంపటానికి అంగీకరించాడు. పురోహితదౌత్యం ప్రవర్తిల్లింది కాని ఫలవంతం కాలేదు. సంజయుడి రాయబారం ధర్మరాజుకు ధర్మసంకటం తెచ్చిపెట్టింది. క్షత్రియులకు అహింసయా ధర్మం? శత్రువులను యుద్ధంలో సంహరించి రాజ్యాన్ని పాలించుటయా ధర్మం?- అన్న మీమాంస ఏర్పడింది; ఈ ప్రశ్న సంజయుడి రాయబారం వలననే ఏర్పడింది. ధర్మరాజు ధృతరాష్ట్రుడి పెద్దరికాన్ని తిరస్కరించి కౌరవపాండవుల కిరువురికీ శ్రీకృష్ణుడి హితవే శ్రేయస్కరమని ప్రతిపాదించాడు. సంజయుడి రాయబారం విఫలమయిన తరువాత మరల కార్యక్రమాన్ని సూచించవలసిన వ్యూహకర్త. బుద్ధిశక్తి శ్రీకృష్ణుడే కాబట్టి, ఆతడిని చూపించి భావికథాగతికి మార్గదర్శకుడిగా నియోగించాడు ధర్మరాజు. ఉపప్లావ్య సభలో

చెప్పిన కార్యానికి తరువాయి భాగం నిర్వహించవలసిన బాధ్యతను శ్రీకృష్ణుడిపై ఉంచాడు. ఉద్యోగ పర్వంలో ఇక శ్రీకృష్ణుడే కార్యనిర్దేశకుడని ధర్మరాజు నిశ్చయించటంతో ఈ పర్వంలో శ్రీకృష్ణుడిది కీలకస్థానమని స్పష్టమయింది. ప్రవర్తిల్లబోయే శ్రీకృష్ణుడి రాయబారానికి ఈ ప్రకటన భావికథార్థ సూచన!

4. సంజయుడు ధృతరాష్ట్రుడి సభలో, తాను జరిపిన సంధికార్య విశేషాలను తెలిపిన సందర్భంలో, ఆ గ్రుడ్డిరాజు పాండవ కౌరవ సేనల బలాబలాలను గురించి అనేక విధాలుగా వితర్కించాడు. అప్పుడు సంజయుడు ఇట్లా తేల్చి చెప్పాడు.

క. ‘ఆ సేనకు నీ సేనకు । వాసి యడిగె దీవు నన్ను; వసుదేవసుతుం
డా సేనఁ గలఁడు; తత్సము । నీ సేనం జూపుమా నరేశ్వర! నాకున్’.

క. ‘పలుమఱుఁ బాండుతనూజుల । కొలఁది వితర్కించెదవు; నిగూఢం బది; యేఁ
దెలియం బలికెద; వారికి । బలమును సత్త్వంబు హరియ పార్థివముఖ్యా!’ **(ఉద్యో. 2.308,313)**

శ్రీకృష్ణుడి రాయబారం ప్రవర్తిల్లేముందు సంజయుడు చేసిన ఈ ప్రశంస కౌరవులకు కనువిప్పు కలిగించే శంఖారావం. హస్తినకు రానున్న శ్రీకృష్ణుడికి ఇది ప్రస్తావన. శ్రీకృష్ణుడి దివ్యశక్తి సూచిక.

5. పాండవులు తమ అభిప్రాయాలను తెలిపి సంధికార్యం నిర్వహించుమని ప్రార్థించేటప్పుడు శ్రీకృష్ణుడిని పురుషకారదైవానుకూల్యాల నిర్దేశకశక్తిగా కీర్తించి, అతడిని దైవంగా భావించి ప్రశంసించారు. మచ్చుకు అర్జునుడి ప్రశంస.

ఉ. ‘నీ వొనరింపఁ బూనినపనిం గమలోదర! కీడు పుట్టునే?
కా వనినట్ల యుండి యవుఁ గార్యము; లట్లగుటం బ్రయత్న సం
భావనసేఁత పౌరుషము పద్ధతి; తత్ఫలసిద్ధి వొందుచో
దైవము దోడ్పడన్ వలయుఁ; దథ్యము రెండును నీ వినోదముల్’. **(ఉద్యో. 3.73)**

పాండవులకు పరమదైవమైన పురుషోత్తముడు చేపట్టిన పనివలన వారికి కీడు ఏర్పడదన్న విశ్వాసం ఉద్యోగపర్వ కార్యమూలం. చేపట్టిన కార్యం పైకి కానట్లుగానే కనపడుతున్నా ఆ పని పూర్తిగా అయిన ఫలితాలు పాండవుల కందుతాయి. అది శ్రీకృష్ణుడి దివ్యశక్తి. ఉద్యోగపర్వంలో సంధికార్యం విఫలమైనా పాండవుల ప్రయోజనాలన్నీ సాధించబడటం విశేషం. రాబోయే యుద్ధంలో విజయమార్గాలన్నీ భద్రంచేయబడ్డాయి. అవరోధాల కన్నిటికీ నివారణోపాయాలు నిగూఢంగా ప్రారంభించబడ్డాయి. అది శ్రీకృష్ణుడి దివ్యమహిమ. పురుషకారం ఎంతచేసినా దైవం అనుకూలించనిదే కార్యం సిద్ధించదు. శ్రీకృష్ణుడు దూత పాత్రలో సంధియత్నం చేసే నెపంగా ధర్మజుడి ధర్మనీతికి ఫలసిద్ధి కలిగేటట్లు కార్యనిర్వహణం చేయగలడని పాండవుల స్థిరవిశ్వాసం. అది శ్రీకృష్ణుడి దివ్యలీలావినోదం. దివ్యశక్తి మహిమ వినోదాలు శ్రీకృష్ణుడి దైవవ్యక్తిత్వ విభూతులు. వాటి ప్రదర్శనయే ఉద్యోగపర్వ తాత్పర్యం.

6. శ్రీకృష్ణుడు వస్తున్నాడన్న వార్త ధృతరాష్ట్రుడిలో, అతడి కుటుంబంలో, రాజధానిలో, సభామంటపంలో చిత్రమైన చైతన్యాన్ని జాగృతం చేసింది. వార్త వినగానే వృద్ధరాజుకు గలిగిన మొదటి స్పందన శ్రీకృష్ణుడి దివ్యవ్యక్తిత్వ స్ఫూర్తికి సూచిక! దుర్యోధనుడితో ఆత డన్నమాట లివి-

‘సర్వలోకాభిగమ్యుండగు నమ్మహానుభావునకు మన మభిగమ్యుల మైతిమి; మన కింతకంటెను బెంపెయ్యది? యతం డెవ్వరివలన సంతుష్టుం డయ్యె వారికి శుభంబున నెవ్వరిదెస ననాదరంబు సేసె వారికి నశుభంబు నగుట దప్పు; దతనికి వలయు పూజ లాచరించుటకు సంవిధానంబు సేయుము......’ (ఉద్యో. 3.149)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇది నాటకీయ పరిభాషలో గండమని చెప్పవచ్చును. ధృతరాష్ట్రుడి మాటలలో అతడి మనసులోని దివ్యచైతన్యం జాగృతమైన లక్షణం స్ఫుటంగా గోచరిస్తుంది. కౌరవసభలో శ్రీకృష్ణుడి దివ్యదర్శనం చేయగల దివ్యదృష్టిని పొందటానికి అర్హమైన సంస్కార బీజం ఈ వాక్యంలో ఉన్నది. శ్రీకృష్ణుడిని అనాదరం చేసినవారికి అశుభం కలుగుతుందని చెప్పినమాట అతడి అంతర్వాణి స్పందన భావికథార్థ సూచకమైన గండం!

7. శ్రీకృష్ణుడి రాయబారపు సభ హస్తినాపుర చరిత్రలోనే అపూర్వసన్నివేశం. లోకహితం కోరి ధర్మరక్షణ, దుష్టశిక్షణ చేయటానికి అవతరించిన నారాయణుడు శాంతి సందేశాన్ని ఇచ్చే దివ్యసభ. అందులో దివ్యులైన మహామునులున్నారు, భవ్యులైన భీష్మాదులున్నారు, మరెందరో పుణ్యాత్ములున్నారు. వారందరూ దైవీశక్తులు. దుర్యోధనాది దుష్టవర్గంలోని వారందరూ ఆసురీశక్తులు. వారి మధ్య పరమాత్మ రూపుడైన శ్రీకృష్ణుడు. ఆ మహాత్ముడు ఆయా ప్రవృత్తులు కలవారికి ఆయా రూపాలలో మనోగోచరమయ్యాడు. మచ్చుకు రెండు ఉదాహరణలు.

(1). సభాసదులు పుండరీకాక్షుడి దివ్యరూపాన్ని చూచి దైవీసంపన్నులవలె తన్మయత్వాన్ని చెందారు. ఇది సామూహిక సాధారణ స్పందన.

క. ‘అంబుద శుభగాత్రుం బీ । తాంబరధరుఁ గమలదళనిభాక్షున్ హరిఁ జూ
డంబడసి లోచనము లమ్మ । తం బానినమాడ్కి సమ్మదంబునఁ దేలన్’.

క. ‘ఆ కొలువువారు గర మచ । లాకృతి నొకపలుకు లేక యందఱు విం జం
బాఁ కిడిన కరణి నవశము । దాకారిత చిత్తవృత్తులై యుండంగన్’. **(ఉద్యో. 3.254, 255)**

(2) ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడిని విష్ణువుగా గుర్తించి పలికిన మాటలు.

క. ‘కరుణింపుము సంశ్రితభయ । హరణధురీణా! సహింపు మజ్ఞానంబున్;
శరణంబు వేడెద భవ । చ్చరణంబులు గనుఁగొనం బ్రసాదింపఁ గదే!’ **(ఉద్యో. 3.408)**

శ్రీకృష్ణుడి రాకను గురించి విన్నప్పుడు ధృతరాష్ట్రుడి అంతరాత్మ స్పందించిన విధంతో మొదలైన ఈ ఘట్టం అతడు ఆ పరమాత్ముడిని దర్శించి శరణువేడటంతో ముగియటం గమనిస్తే భావికథలో ఆసురీ ప్రవృత్తులలో ప్రాణాలతో మిగిలేది ధృతరాష్ట్రుడే అని అర్థమౌతున్నది. కురుసభలో శ్రీకృష్ణుడి దివ్యత్వం విశ్వరూపం తాల్చటం ఆ పాత్ర చిత్రణలో పరాకాష్ఠ.

8. శ్రీకృష్ణ డందించిన కౌరవసభాదౌత్యనివేదిక విని, వంశనాశనకారి అయిన యుద్ధసంకల్పం చేయటానికి ధర్మరాజు తటపటాయిస్తూ వితర్కిస్తూ ఉండగా అర్జునుడు ఈ విధంగా నిశ్చయించాడు.

ఆ. ‘(అనిన నట్ల కాక) యఖిల ధర్మజ్ఞాన । ఘనుఁడు మనకు నేడుగడయుఁ దాన
శౌరి నిశ్చయింప సంశయం బేటికి? । సంఘటింపుఁ డుగ్రసమరవిధము’. **(ఉద్యో. 4.93)**

శ్రీకృష్ణుడు చేసిన నిశ్చయాన్ని దైవనిర్ణయంగా భావించాడు ధర్మరాజు.

9. ఉలూకుడి రాయబారంలో దుర్యోధనుడు పాండవవీరుల నందరినీ అధిక్షేపించటమే కాక ప్రత్యేకంగా పార్థ శ్రీకృష్ణుల నుద్దేశించి ప్రగల్భాలు పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. 'మాయలు నింద్రజాలములు మాధవుఁ డిందును గొన్ని వన్నినన్
బాయవు రజ్జు లెప్పుడు నవారణ నీ వెటు లాడితేనియున్;
వేయును నేల? పార్థులును విష్ణులు వే పదివేలు వచ్చినం
జేయుదు మేము గయ్యు; మొక చీరియు సంపదఁ బంచియిత్తుమే?' (ఉద్యో. 4.201)

ఈ మాటలకు శ్రీకృష్ణుడే అధిక్షేపహాస్యం చేస్తూ ఇట్లా సమాధాన మిచ్చాడు.

తే. 'బవర మెల్లియ; బిరుదవై బరవసంబు । గలిగి చావుము; చావక తొలఁగరాదు;
కృష్ణ సారథికం బగు జిష్ణురథము । దొడరి నీ వెందుఁ జొచ్చినఁ దోన చొచ్చు'. (ఉద్యో. 4.203)

దుర్యోధనుడికి ఈ మాటలు 'యముని మహిషపు లోహఘంటలు'. దుష్టసంహార రూపుడైన శ్రీకృష్ణుడి రౌద్రహాసం.

10. భీష్ముడు కౌరవపాండవ బలనిరూపణం చేస్తూ నిరుపమానమైన అర్జున శ్రీకృష్ణ పరాక్రమాన్ని అద్భుతంగా పేర్కొన్నాడు.

మ. 'నరుఁ డీ మానమువాఁ డనంగ వశమే? నా కంతవా రెందు నె
వ్వరు లే; రింకను బుట్ట; రా పులికి దుర్వారోద్యముం డైన యా
హరియుం దోడటె! యేమి చెప్పుదు? నతం డా సేనలం గాచు నొ
క్కరుఁడుం గీ టడఁగించు నీ బలములన్ గాండీవదుర్దాంతుఁడై'. (ఉద్యో. 4.258)

ఇది యుద్ధపంచక రణయజ్ఞానికి నాందీ గీతి.

ఉద్యోగపర్వ మహానాటకంలో దైవీశక్తి శ్రీకృష్ణుడు. ధర్మశక్తి ధర్మరాజు. బలశక్తి భీముడు, వీరభక్తి శక్తి అర్జునుడు, సేవాశక్తి కవలు- ఈ తత్త్వాన్ని ప్రకటించటమే ఈ అంకాలవంటి సభారంగాల పరమార్థం.

(2). రంగాలుగా గోచరించే సమావేశాలు

ప్రసిద్ధపాత్రలు కొద్దికాలంపాటు సమావేశమై సారవంతంగా గానీ, ప్రయోజనవంతంగాగానీ, చమత్కారవంతంగా గానీ సంభాషణలు సాగించి కార్యసాధన ప్రగతికి తోడ్పడేవి రంగాలుగా పరిగణించవచ్చును. అటువంటివి మరొక పది ఉద్యోగపర్వంలో ఉజ్జ్వలంగా ప్రకాశిస్తూ నాటకీయ శిల్పానికి కాంతిని ప్రసాదిస్తున్నాయి. తిక్కన వాటిని తీర్చిదిద్దిన తీరు ప్రశంసనీయం. రంగాలవంటి సమావేశాలు ఈ క్రిందివి-

1. శ్రీకృష్ణుడు దుర్యోధనార్జునులతో జరిపిన సమావేశం.	1. 60-90
2. శల్య ధర్మజుల సమావేశం.	1. 104-216
3. కృష్ణద్వైపాయనుడు ధృతరాష్ట్ర దుర్యోధన సంజయాదులతో జరిపిన సమావేశం.	2. 305-331
4. శ్రీకృష్ణుడు కుంతీదేవితో జరిపిన సమావేశం.	3. 182-208
5. శ్రీకృష్ణుడి దుర్యోధన మందిర సమావేశం.	3. 209-228
6. శ్రీకృష్ణుడు కుంతిదేవి మందిరంలో జరిపిన సమావేశం.	4. 9-19

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

7. శ్రీకృష్ణుడు కర్ణుడితో రహస్యమంతనాలు చేసిన సమావేశం. 4. 29-53

8. కుంతీకర్ణుల సమావేశం. 4. 58-71

9. దుర్యోధనుడు ఆత్మీయులతో జరిపిన సమావేశం. 4. 133-141

10. దుర్యోధనుడు భీష్మమందిరంలో జరిపిన సమావేశం. 4. 143-162

1. పాండవులు యుద్ధసహాయం కొరకు వివిధదేశాల రాజులను ఉచిత పద్ధతులలో ఆహ్వానించారు. వారందరిలో శ్రీకృష్ణ సహాయాన్ని అర్థించే సంఘటన మహాభారతంలోనే మరపురాని ఘట్టంగా నిలిచిపోయింది. ధర్మజుడు కార్యాన్ని సంకల్పించి, అది పురుషకార ప్రధానమైతే, దానిని భీముడు నిర్వహించే అవకాశం కల్పిస్తాడు. దైవానుకూల్య ప్రధానమైతే అర్జునుడికి అవకాశం కలిగిస్తాడు. శ్రీకృష్ణ సహాయం దైవసహాయం కాబట్టి పార్థుడినే ద్వారకకు పంపించాడు. అటు దుర్యోధనుడుకూడా శ్రీకృష్ణునంతటి వాడిని సహాయం అడగటానికి దూతను పంపినదానికంటె తానే స్వయంగా పోవటం సముచితమని భావించి ద్వారకకు చేరాడు. అక్కడ శ్రీకృష్ణుడు పగటిపూట నిద్రిస్తున్నాడు. దుర్యోధనుడు అభిమానధనుడు కాబట్టి గోవిందుడి శయ్యవద్ద తలవైపు కూర్చున్నాడు. సహాయార్థియై వచ్చాడు కాబట్టి కృష్ణుడు మేల్కొనేంతవరకు మిన్నకున్నాడు. అర్జునుడు ఆ తరువాత వచ్చాడు. శ్రీకృష్ణుడి పాదాల సమీపంలో వినయభక్తి ప్రపత్తులు ఉట్టిపడేటట్లు నిలిచి ఉన్నాడు. శ్రీకృష్ణుడు నిద్రలేచి ముందుగా కనబడిన అర్జునుడిని పలకరించాడు. ముందువచ్చిన దుర్యోధనుడిని ఆ తరువాత యోగక్షేమాల నడిగాడు. సహాయం ఇద్దరికీ చేస్తానని మాట యిచ్చాడు. నారాయణాభిధానులైన గోపాలురు పదివేలమందిగల మూలబలాన్ని ఒకవైపూ, యుద్ధం చేయని తననొక్కడిని మరొకవైపూ భాగాలుగా ఉంచి, కోరుకొనే అవకాశం చిన్నవాడూ, అన్నచాటువాడూ అయిన అర్జునుడికి కల్పించాడు. అతడు ఆయుధంపట్టని శ్రీకృష్ణుడినే కోరుకొన్నాడు. దుర్యోధనుడు సంతోషించి పరిశేషన్యాయంతో నారాయణాఖ్య యాదవవీరులను గ్రహించి తిరిగివెళ్ళాడు. బలరాముడు యుద్ధంలో పాల్గొనని తేల్చి చెప్పాడు. అర్జునుడు శ్రీకృష్ణుడినే ఎందుకు కోరుకొన్నాడు?- అన్నది మహాభారత యుద్ధంలో హిమాలయమంత ప్రశ్న. అర్జునుడు యుద్ధంలో అన్యులసహాయం కోరడు. శ్రీకృష్ణుడు యుద్ధం చేస్తే అర్జునుడికి కీర్తి దక్కదు. శ్రీకృష్ణుడు కౌరవపక్షంలో చేరితే అతడికి ఎదురుపడ్డవాడు ఎండిపోతాడు కాబట్టి పాండవపక్షంలోనే ఉండాలి. అందుచేత సమరంచేయని శ్రీకృష్ణుడే పార్థుడికి సమ్మతుడౌతాడు. ఇవన్నీ ఇట్లా ఉండగా శ్రీకృష్ణుడిని రథసారథిగా చేసికొని యుద్ధం చేయాలని పార్థుడి మనసులోని కోరిక!

క. 'సారథ్యం బొనరింపు మ । పారకృపాలీల నెల్లభంగుల నా కీ
గౌరవమును జిరకాలము । గోరినయది; దీని నిమ్ము గుణరత్ననిధీ!' **(ఉద్యో. 1.88)**

అని కోరుకొన్నాడు. అడగటం ఒక ఆచారమన్నట్లు దుర్యోధనుడు వర్తిస్తే, అదికూడా ఒక కళ అని అర్జునుడు నిరూపించాడు. సహాయంచేయటం ఒక పరిపాటిగా దుర్యోధనుడు భావిస్తే, రాజనీతిగా నిర్వహించాడు శ్రీకృష్ణుడు. గోవిందుడు చతురోపాయ నిపుణు డనటానికి సాక్షిగా నిలిచే రంగం వంటి ఈ సన్నివేశం రత్నంవంటి ఉదాహరణ.

2. మహాభారతంలో కృష్ణసారథ్యం ఎంత ప్రశస్తమైనదో శల్యసారథ్యం అంత ప్రసిద్ధమైనది. ఒకటి భక్త రక్షణ కళాపారీణతకు బిరుదు పేరైతే, మరొకటి నయవంచన రూప విద్రోహచర్యకు మారుపేరు. శల్యుడు అశ్వహృదయం తెలిసిన విజ్ఞుడు. రథసారథ్యంలో శ్రీకృష్ణుడితో దీటైనవాడు. అందుకే దుర్యోధను డతడిని వంచనతో తనవైపు త్రిప్పుకొన్నాడు. శల్యుడు నిజాయితీపరుడు. అతడితీరును గమనించి ధర్మజుడు అతడిని తన కనుకూలంగా మలచుకొన్నాడు. కృష్ణసారథ్యంతో అర్జునుడు రణరంగంలో నిలిచినప్పుడు, దుర్యోధనుడు శల్యసారథ్యంతో కర్ణుడిని ప్రవేశపెట్టటం యుద్ధవ్యూహం. ఆ

తరుణంలో శల్యుడు హృదయశల్యాలవంటి మాటలతో కర్ణుడిని బాధించి, అర్జునుడికి పరోక్షంగా సహాయం చేయుమని ధర్మజుడు కోరాడు. సహజంగా కర్ణవిరోధి అయిన శల్యుడు కర్ణుడికే మృత్యుద్వారం చూపించే యమభటుడయ్యేటట్లు సన్నివేశాన్ని మలచుకొన్న ధర్మరాజు రాజనీతి కుశలుడు. భేదోపాయ మర్మజ్ఞుడు. ఈ ఘట్టం కర్ణపర్వంలోని ఒక విషాదాంత వీర చరిత్రకు కారణం కాబోతున్నది. అంతేకాదు, మహాభారత యుద్ధంలో వినవచ్చే కీలకమైన రహస్యపుటొప్పందాలతో ఇది ఒకటి. అందువలన ఇది రసవత్తరమైన రంగం.

3. కృష్ణద్వైపాయనుడు ప్రసన్నుడై సంజయుడిని తనకు బదులు ధృతరాష్ట్రుడికి వలసిన సలహాలివ్వటానికి నియోగించటం ఒక అపూర్వ సన్నివేశం. ఇకముందు సంజయుడు నిర్వహించే సార్థకమైన పాత్రకు ఇది శుభసూచన. సంజయ వ్యాసవాక్యతాత్పర్యాలు తత్త్వతః సమానార్థ బోధకాలని ఈ సన్నివేశం ధ్వనిస్తున్నది. సంజయవాక్యం:

సీ. 'పురుషోత్తముం డెల్లభువనంబులును దాన । యఖిల భూతాత్మకుండై విహార
లీల విచేష్టించు; నీ లోకముల మాయ । దొట్టి యొక్కొక మరి పుట్టి పెరిగి
కర్మానుచరణముల్ గైకొని వర్తించు; । శిష్టరక్షణమును దుష్టవిగ్ర
హంబును దనపను లగుటఁ బాండవుల నె । పం బిడుకొని ధర్మబాహ్యు లైన

తె. నీ తనూజుల నిక్కమ నిగ్రహింపఁ । దలఁచినాఁ డమ్మహాత్ముండు; తథ్య; మతని
నిట్టి చందంబువాఁ డని యెఱిఁగి యెవ్వ । రాశ్రయింతురు బ్రదుకుదు రట్టివారు'. **(ఉద్యో. 2.318)**

విష్ణువు శ్రీకృష్ణుడుగా అవతరించి శిష్టరక్షణకై పాండవులతో స్నేహంచేసి, దుష్టశిక్షణకై కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొనబోతున్నాడన్న సత్యం మహాభారతంలో ద్రష్టలైన ఋషులు చెప్పేవాక్యం. వ్యాసు డాతాత్పర్యాన్నే సంజయుడిచేత చెప్పించాడు. అయినా గ్రుడ్డిరాజు నమ్మీనమ్మనట్లు నడయాడాడు. గాంధారిచేత దుర్యోధనుడికి చెప్పించాడు. అతడు మౌనం వహించాడు. అప్పుడు వ్యాసుడే స్వయంగా నారాయణతత్త్వాన్ని వివరించాడు. అతడి నాశ్రయించుమని బుజ్జగించి చెప్పాడు. ఆ మహర్షిముందు ధృతరాష్ట్రుడు ఎంతో ఆసక్తితో వాసుదేవనామనిర్వచనాన్ని, అతడిని పొందే ఉపాయాన్ని చెప్పుమని వేడాడు. వ్యాసుడు సంజయుడిచేత వాటిని ప్రబోధింపజేశాడు. ధృతరాష్ట్రుడు వారి మాటలు విన్నట్లే విన్నాడు. శ్రీకృష్ణుడిని దర్శించాలన్న కోరికను ప్రకటించాడు. ఎదుటివారు అది నిజమని నమ్మేటట్లు మాట్లాడాడు.

క. 'నాకు నయనేంద్రియముగతి । లేకుండుట కంతవగపు లే; దఖిల మనో
జ్ఞాకారుఁడైన హరి నా । లోకింపం గానమికిఁ గలుగు వగ పెపుడున్'.

ఉ. 'ఆతనిఁ గన్నులారఁగ నహర్నిశముం గనుఁగొంచు నుండు వా
రే తప మాచరించిరొ? యుపేంద్రుని నాశ్రితవత్సలున్ విని
ర్ధూతకలంకు ధర్మనిరతుం గరుణాకరు సర్వలోక వి
ఖ్యాతుఁ బవిత్రమూర్తి శరణాగతరక్షకు నాశ్రయించెదన్'. **(ఉద్యో. 2.329,330)**

వ్యాసమహర్షిముందు వాసుదేవుడిని శరణు వేడుతానని మాటయిచ్చాడు. ఆయన అంతర్ధానం కాగానే అంతఃపురం చేరి దానిని మరచిపోయాడు. ధృతరాష్ట్రుడి ద్వంద్వ ప్రవృత్తికి ఈ రంగం దర్పణం వంటిది.

4. విదురునింట నివసిస్తున్న కుంతీదేవి పొందే మానసిక వేదనను తెలిసికొనటానికి వీలైన ఏకైక సన్నివేశం శ్రీకృష్ణుడు కుంతీదేవిని దర్శించిన రంగం. ఆమె వేదనకు ఈ క్రింది పద్యం దర్పణం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'బావ యొప్పం డను పలుకుల నే మగు । నాతని కొడుకుఁ గీడాడ నేల?
కురువృద్ధుఁ డగు బాహ్లికుని దూఱ నేటికి? । భీష్మునిపైఁ బ్రయి వెట్ట నగునె?
యిట్టి క్రూరులయింటి కిచ్చిన మనవారి । నందుఁ గా; కట్లు దా ననుట మేలె?
యర్జును పుట్టిన యప్పుడు 'వీఁడు లో । కములెల్ల గెల్చుపొగడ్త మొగులు

తే. 'ముట్టునట్టిద యగు; రణమున జయించుఁ; । గౌరవుల; సోదరులుఁ దాను భూరిరాజ్య
గౌరవముఁ బొందు' నని యశరీరవాణి । వలికె; నది దిట్టువడు గాక వలయు నేని'.

వ. 'ధర్మంబు గలుగునే నది నిక్కం బయ్యెడు; దాని కెల్లను నిర్వాహకుండవు నీవు గలవు గాదె'.

(ఉద్యో. 3.195, 196)

శ్రీకృష్ణుడు కుంతీదేవి నోదార్చే ఘట్టం ద్రౌపది నోదార్చిన ఘట్టాన్ని తలపిస్తుంది. అందువలన ఈ రంగం విలువైనది. కుంతి పాండవుల కిచ్చే సందేశాలు వీరమాత ప్రవృత్తికి తగినవి.

5. దుర్యోధనునింట జరిగిన సమావేశంలో విందుముచ్చట వచ్చింది. అది విందురాజకీయం. తనయింటికి శ్రీకృష్ణుడు వచ్చాడు కాబట్టి అక్కడే భోజనం చేయాలనీ, అట్లాచేస్తే పాండవకౌరవు లిరువురి యోగక్షేమం కోరి శ్రీకృష్ణుడు సంధినడుప వచ్చినట్లు స్పష్టమౌతుందనీ దుర్యోధనుడివాదం. శ్రీకృష్ణుడు తాను దూతననీ, దౌత్యం ముగిసేవరకూ ఇరుపక్షాల వారియిండ్లలో భుజించటం న్యాయం కాదనీ, ఒకవేళ విందు వికటిస్తే దుర్యోధనుడికి అపనింద రావచ్చునని వాదించాడు. 'నేను శత్రువునా?' అని ప్రశ్నించిన దుర్యోధనుడికి 'నీవు పాండవులకు శత్రువువి. నాకు పాండవులు ప్రాణాలవంటివారు. నా ప్రాణశత్రువు నాకు శత్రువే ఔతా'డని ఘంటాపథంగా చెప్పాడు. అంతేకాదు విందురాజకీయాన్ని నీతిబద్ధం చేసి వ్యాఖ్యానించాడు.

చ. 'ప్రియ మెసఁగం దగం బిలిచి పెట్టెడు కూ డది లెస్సకూడు; ద
క్కయ నయహీనతం దమకు నాపద యై నెడ నిట్టు నట్టు నే
మియు నన లేని కూ డెదిరి మేవడి యై చను; నీవు మాదెసం
బ్రియుఁడవు గావు, మాకు ధృతి పెంపఱ నాపద లే దొకింతయున్'. **(ఉద్యో. 3.222)**

విందు వికటిస్తే సంధి వికటించినట్లే. ఆ వికటించటానికి కూడా దుర్యోధనుడే హేతువని పేర్కొనటం శ్రీకృష్ణుడి నేర్పు.

6. సంధికార్యాన్ని ముగించుకొని తిరిగిపోతూ శ్రీకృష్ణుడు కుంతీదేవిని దర్శించాడు. అప్పు డామె పుత్రుల కందించిన సందేశాలు పౌరుషోపేతంగా ఉన్నాయి. మచ్చు కొకపద్యం.

ఉ. 'రాజుల కెందు నారయఁ బరాక్రమ జీవనవృత్తి దక్క నొం
డోజ నిషిద్ధ మంద్రు మును; లుత్తమసత్త్వులు వంశధర్మముల్
పూజితభంగిఁ జేయుదురు; బుద్ధివిహీనులు వానిఁ దక్కి ని
స్తేజపుఁగూటి కియ్యకొని దీనతఁ బొందుదు రంబుజోదరా!'. **(ఉద్యో. 4.14)**

ఆమె మాటలు భీష్మాదులకు ఆశ్చర్యం కలిగించాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. 'పలుకునె యిట్లు గొంతి; విని బమ్మెరపోయితి; మింత బెట్టిదం
బు లగునె మాట? లయ్యమయుఁ బుణ్యుఁడు గృష్ణుఁడు గార్యవాదముల్
వలికెడువార లిట్లు దెగఁ బాఱిరి; ధర్మజ వారిరాశికిం
జెలియలికట్ట వాసె; మనచే నగు కర్జముచంద మెట్టిదో!' **(ఉద్యో. 4.22)**

ధర్మజుడు యుద్ధ నిర్ణయాన్ని తీసికొనటానికి కుంతి పౌరుషోక్తులు కూడా దోహదం కాబోతున్నాయి. కుంతిలోసైతం మండుతున్న క్రోధాగ్నిని తెలిసికొనటానికి భీష్మాదులకు అవకాశం కలిగిన ఈ రంగం (సన్నివేశం) యుద్ధోద్యోగ పరిపోషకం!

7. ఉద్యోగపర్వంలోని రాజకీయపుటెత్తులలో మేటిగా పరిగణించబడేది శ్రీకృష్ణుడు కర్ణుడితో రహస్యమంతనాలు చేసి అతడి జన్మరహస్యం చెప్పే సన్నివేశరంగం. తెలుగులోని మహాభారత నాటకాలలో (విశేషించి తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగ నాటకంలో) ఈ రంగం హృదయంగమం. పాత్రల అంతర్వర్తనాల అసలురూపం బైటపెట్టే ఈ రంగం పాండవులు ప్రయోగించే భేదోపాయంలో భాగంగా శ్రీకృష్ణుడు స్వతంత్రించి ప్రయోగించింది. శ్రీకృష్ణుడి రాజనీతికి, కర్ణుడి ధర్మనీతికి ఇది మకుటాయమానమైన ఉదాహరణం.

శ్రీకృష్ణుడు దేవరహస్యంవంటి కర్ణుడి జన్మరహస్యాన్ని వాస్తవాన్ని ప్రకటిస్తున్నట్లు పూసగ్రుచ్చినట్లు సంగ్రహసుందరంగా చెప్పాడు. పాండవులు బంధుమిత్ర పరివారసమేతంగా కర్ణుడికి రాజ్యం పట్టంకట్టి సేవించగలరని నమ్మబలికాడు. రాజ్యాభిషిక్తుడైన కర్ణుడు అనుభవించే మహేంద్రవైభవాన్ని నూరురెట్లు చవులుపుట్టేటట్లు వర్ణించి ఆశ కల్పించాడు. ఆ తరువాత పాంచాల రాజపుత్రి కర్ణుడిని ఆరవ భర్తగా గ్రహించి వరుసగా ఏలుకొనేటట్లు ఒప్పిస్తానని హామీ ఇచ్చాడు. ఇన్ని అదృష్టాలు కలిసివచ్చిన పుణ్యాత్ముడుగా కర్ణుడిని అభివర్ణించి, అనుమానంలేకుండా పాండవపక్షంలో చేరుమని ఆహ్వానించాడు. ఆ పక్షంలో చేరితే కన్నతల్లి అయిన కుంతి సంతోషిస్తుందనీ సమస్త బంధుహిత వర్గాలవారు ఆనందిస్తారనీ ఉత్సాహపరిచాడు.

శ్రీకృష్ణుడి మాటలు అవాస్తవాలనటానికి వీలులేదు. కాని, ఆ సమయంలో అవి ఆచరణయోగ్యాలు కావని కర్ణుడు భావించాడు. కారణాలు వరుసగా నిజాయితీతో ఏకరువుపెట్టాడు. శ్రీకృష్ణుడు కర్ణుడిని వృద్ధజనోపసేవిగా, ధర్మసంవేదిగా కీర్తించాడు. దానికి చలించని కర్ణుడు కన్నతల్లి తనను గంగపాలుచేయగా, దరికిచేర్చి, పాలిచ్చి పెంచి, ఎన్నో కష్టాల కోర్చి పెద్దచేసి, ప్రేమతో చూస్తున్న పెంపుడు తల్లిదండ్రులను వదలిరావటం న్యాయమా? అని అడిగాడు. సూతదంపతులు కర్ణుడికి జాతకర్మాది సంస్కారాలు చేశారు. పెళ్ళిచేశారు. అట్టివారికి పుత్రుడు చేయవలసిన ఇహపర కర్మలను ఆచరించటం ధర్మంకాదా? అని ప్రశ్నించాడు. భార్యను, సంతతిని, బంధువర్గాన్ని వదలి పాండవులలో చేరటం ఉచితమా? అని సూటిగా అడిగాడు. అన్నింటికంటె మించి కర్ణుడి ఆరవప్రాణం దుర్యోధనుడు.

ఉ. 'సూతసుతుండు వీఁ డనక సూనుల తమ్ములకంటె నాకు సం
ప్రీతి యొనర్చి తేజమును బెంపును నాఁటికి నాఁటి కగ్గలం
బై తనరార నన్నుఁ దనయంతటి మానిసిఁ జేసియుండ నే
నే తగవూది యా కురుకులేశ్వరుఁ బాయుదు? ముట్ట వచ్చినన్'. **(ఉద్యో. 4.39)**

అని సర్వధర్మవేది అయిన శ్రీకృష్ణుడిని రాజనీతి పరంగా సమాధానం చెప్పమని అడిగాడు.

ఇక వీరనీతి ననుసరించి మరొక సూక్ష్మాంశాన్ని పేర్కొన్నాడు. కౌరవపాండవులలో మేటి విలుకాండ్రు కర్ణార్జునులని దుర్యోధనుడి తీర్పు. కర్ణుడు అర్జునుడిని యుద్ధంలో చంపి రాజ్యాన్ని నిష్కంటకం చేస్తాడని రారాజు నమ్మిక. దానిని వమ్ముచేయటం వీరనీతి కాదు. కర్ణార్జునులు సమవీరులు కావటంచేత ఎవరు ఎవరి పక్షం చేరినా వారికి అపకీర్తి వస్తుంది.

అందువలన కర్ణుడు కౌరవపక్షం వదలి పాండవపక్షంలో చేరటం కర్ణుడికే అపకీర్తి. కర్ణుడు అర్జునుడికి భయపడి యుద్ధారంభ సమయంలో పాండవపక్షంలో చేరాడని లోకం నిందిస్తుంది. అందువలన వ్యక్తి ధర్మాన్ని ఆశ్రయించి చూచినా అది న్యాయం కాదు.

ఇక లోకశ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఆలోచించినా శ్రీకృష్ణుడి ప్రతిపాదన ఆచరణయోగ్యం కాదు. తనకంటె పెద్దవాడు కర్ణుడని తెలిసిన ధర్మరాజు తాను రాజ్యానికి పట్టాభిషిక్తుడు కాడు. అది లోక శ్రేయస్కరం కాదు. ధర్మరాజువంటి ధర్మవీరుడు భూమిని శాశ్వతంగా పాలించాలి అని కర్ణుడు అంతరాంతరాలలో ఆశించాడు. అంతే కాదు కర్ణుడు యుద్ధాన్ని రణయజ్ఞంగా భావించాడు.

క. 'అనుజులు ఋత్విజులుగ నీ । పని యిటు సేయు మని నీ వుపద్రష్టవుగా
విను! కురుకుమార పశువిశ । సనమున రణయజ్ఞ మతఁడు సమ్మతిఁ జేయున్'. **(ఉద్యో. 4.45)**

అని చెప్పాడు. కర్ణుడి అంతరంగంలో ఉన్న ఆధ్యాత్మిక భావ మిది. కాని, తనను తనంతటివాడిగా చేసి గౌరవించిన దుర్యోధనుడికి ఋణం తీర్చుకొనటం సేవాధర్మం. కర్ణుడి కృతజ్ఞతాభావం అతడి వ్యక్తిత్వ సంస్కారానికి సంబంధించింది. దుర్యోధనుడికి సంతోషం కలిగే పనులు చేస్తూ, ఏవిధంగానైనా సరే అతడి చేత రాజ్యం ఏలిస్తూ ఉండటం అతడు కుదుర్చుకొన్న స్నేహసంధి నియమం. రాజనీతి బలి కోరింది. ధర్మనీతి కీర్తి నిచ్చింది- ఇది కర్ణుడి కథలోని విరుద్ధ ధర్మాల విపరీత ఫలం!

కర్ణుడి అంతరంగంలోని అవ్యక్తవేదన వినిపించే ఈ ఘట్టం పఠితకు విషాదమధురంగా ఉంటుంది.

8. కుంతీకర్ణుల సమావేశం మహాభారతకథలోనే పేరొందిన విషాద గంభీర దృశ్యం. అలనాడు కన్యగా కుంతి సూర్యుడి వరాన కర్ణుడిని కని గంగలో వదలిన తరువాత, మరల తల్లిగా అతడిని కలిసి మాట్లాడటం ఇదే మొదటిసారి. సూర్యుడు కర్ణుడి పుట్టుక కథను దేవరహస్యంగా కాపాడాడు. అయినా, అది సూచనగా కొందరికి తెలియకపోలేదు. కర్ణుడికి కూడా కొంత వినబడింది. కాని, బహిర్గతం కాలేదు. శ్రీకృష్ణుడు భేదోపాయ ప్రయోగంలోని భాగంగా కర్ణజన్మవృత్తాంతాన్ని ఆయనతో రహస్యంగా చెప్పాడు. ఆ తరువాత కుంతి పాండవ ప్రాణరక్షణార్థం కర్ణుడితో జన్మరహస్యాన్ని చెప్పటానికి ఉద్యుక్తురాలయింది. పరోక్షంగా ఇది కూడా యుద్ధోద్యోగంలో భాగంగా మారింది. అచ్చమైన వాత్సల్యంలో స్వార్థం, రాజనీతి ప్రవేశించి ఆమెను యమునాతీరం వరకు నడిపించాయి. దానికి దారితీసిన ఆమె ఆలోచన ఇది-

మ. 'తమవారిన్ సిరికై వధించు టిది సద్ధర్మంబె? యక్లేశకృ
త్యమె? తాఁ గయ్యము ద్రోణభీష్మకృప కర్ణాటోపముల్ మాన్పుట
ల్పములం దీఱునె? యందు నర్జుని యుల్లం బెప్పుడుం గ్రోధ దీ
ప్తము భీమాదులమీఁదఁ; దక్కొరుల కుత్సాహంబు లే దాజికిన్'. **(ఉద్యో. 4. 57)**

రాజ్యసంపదకొరకు బంధువులను పరస్పరం చంపుకొనటం ధర్మంకాదని భావించిన తీరు అటు పాండవులకూ, ఇటు కౌరవులకూ వర్తిస్తుంది. అయినా, సందర్భాన్నిబట్టి పాండవులకే అది ఎక్కువగా చెందుతుంది. అప్పు డున్న పరిస్థితులలో యుద్ధోద్యోగం చేయటం ఎన్నో ఇబ్బందులతో కూడిన పని. ఆ ఇబ్బందులలో ముఖ్యంగా పేర్కొనదగినవి- ద్రోణ, భీష్మ, కృప, కర్ణులను సంహరించగల ఉపాయాలను అన్వేషించటమే. ఆ యోధచతుష్టయంలో పాండవులను తీవ్రంగా వ్యతిరేకించేది కర్ణుడు. మిగిలినవారికి అతడి కున్నంత యుద్ధపిపాస లేదు. అందులోనూ కర్ణుడికి ధర్మరాజుమీదకంటె భీమాదులమీద కోపం ఎక్కువ. అర్జునుడిమీద అతడికి పగ అపారం. ఈ సంగతి తెలిసిన కుంతి-కౌరవవీరులలో కర్ణుడు శాంతిస్తే యుద్ధం ఆగిపోతుందనీ, ప్రాణహాని లేకుండా పాండవులకు రాజ్యం లభిస్తుందనీ, కర్ణుడు పాండవులతో కలిస్తే తన పుత్రులందరూ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఐకమత్యంతో స్నేహంగా బ్రతుకవచ్చుననీ, వారిని ఎదిరించగల వీరులు లోకంలో ఎవరూ ఉండరనీ భావించింది. దానికి ఒక వ్యక్తిగత రహస్యవ్యూహాన్ని ఆమె పన్నింది. కర్ణుడి జన్మరహస్యం అతడికి తెలిపి, పాండవులమీద సోదరస్నేహం పొంగులువారేటట్లు చేయాలని లక్షించింది. ఊహ వచ్చిన తరువాత మొట్టమొదటిసారి కర్ణుడిని 'కొడుకుఁగుఱ్ఱ' (చిన్ని నాన్నా!) అని పిలిచి ఏకాంతంగా తన మనసులోని మాట చెప్పింది. సూర్యుడు 'అది నిజ'మని ప్రకటించాడు. నిజం బయటపడింది.

అయితే, ఆమె మాటలతీరులో ఆర్ద్రతకంటె అవసరం ఎక్కువగా కనబడింది.

సీ. 'వినుము! సూతాన్వయంబున నీవు పుట్టుట । బొంఁ; కేను మా కుంతిభోజునింటఁ
గన్నియనాఁడు భాస్కరుని రావించితి । వరమంత్ర బలమున; వచ్చి యతఁడు
సంప్రీతి నొసగంగ జన్మించినాఁడవు । నాకుఁ; గావునఁ బాండునందనుండ
వగుదు ధర్మస్థితి; నట్టి నీ వితరులఁ । గొలువ నేటికిఁ గురుకులవరేణ్య!

తే. ధర్మతనయాదులైన నీ తమ్ములకును । ధార్తరాష్ట్రులకును నీవ తగు విభుండ;
వేలు మీ లోకమెల్ల; నీ కేల రాధ । కొడు కితం డను తక్కువ? కొడుకుఁగుఱ్ఱ!' **(ఉద్యో. 4. 59)**

ఈ మాటలలో ఒక క్రమం ఉన్నది. కర్ణుడి మనసు మార్చటానికి ఆభిజాత్యాన్ని మొదటి అంశంగా ఎన్నుకొన్నది. అది నాయకుల లక్షణాలలో మొదటిది కూడా. అందుకే కర్ణుడు సూతవంశంలో పుట్టటం అబద్ధంగా చెప్పింది. సూర్యవరప్రసాదంవలన కుంతికి పుట్టటం వలన ధర్మస్థితి ననుసరించి పాండునందనుడుగా పరిగణించబడతాడని పేర్కొన్నది. ఇక్కడ నీవు రాధేయుడవు కావని అనకుండా సూతకులజుడవు కావనటం విశేషం. కౌంతేయుడ వనకుండా పాండునందనుడవు అనటం విశేషం. పెంచిన తల్లికంటె, కన్నతల్లికంటె పోషించిన తండ్రీ, కన్నతల్లి భర్తా అభిజాత్యకారకు లౌతున్నారు. వారి వారసత్వగౌరవాలు పుత్రులకు రావటం కూడా ధర్మస్థితి. దీనిని మొదట చెప్పి, ఆపై కర్ణుడి సేవావృత్తిని ప్రస్తావించింది. పాండవులు కౌరవులవలె స్వతంత్రులు కాబట్టి ప్రభుత్వానికి అర్హులు కాని, సేవకవృత్తికి కాదని హెచ్చరించింది. ఆభిజాత్యంచేత కర్ణుడు పాండవాగ్రజు డౌతాడు. సేవావృత్తిని పరిత్యజించటంవలన దుర్యోధనుడికి దూరమౌతాడు. పాండవ కౌరవులలో కర్ణుడే పెద్దవాడు కావటంచేత 'కురుకులవరేణ్యు'డౌతాడు. కౌరవపాండవులందరూ కర్ణుడినే రాజుగా మన్నిస్తారు. అప్పుడు రాధేయుడనే పేరు మాసిపోతుంది. (పైకి చెప్పకపోయినా) కౌంతేయుడనే పేరు నిలుస్తుంది- అని కుంతి భావించింది. ఆభిజాత్యాన్నీ, అధికారాన్నీ ఎరగాచూపి రాధేయుడనే ప్రసిద్ధినుండి కౌంతేయుడనే ప్రసిద్ధస్థితికి రమ్మని కర్ణుడిని కోరింది. కుంతి మాటలలో శ్రీకృష్ణుడు చూపిన ఎరలకంటె ఎక్కువేమీ లేవు. ఆరవభర్తగా కర్ణుడిని స్వీకరించేటట్లు ద్రౌపదిని ఒప్పిస్తానని ఆడది కాబట్టి కుంతి అనలేకపోయింది. ఆమె మాట ప్రకారమే ద్రౌపది పంచపాండవులు పంచుకొన్న భిక్ష. ఆరవభాగం ఆమెకు అంగీకారమో కాదో తెలియబరచలేదు. శ్రీకృష్ణుడిది శుద్ధమైన రాజకీయపుటెత్తు. కుంతిది మమతతో కూడుకొన్న రాజనీతి పథకం.

అందుకే కర్ణుడు ఆమె మాటలకు కరిగి నీరైపోలేదు. సూర్యబింబంనుండి వెలువడిన వాక్యాలు వినికూడా తబ్బిబ్బైపోలేదు. ధీరమనఃప్రవృత్తితో తీర్పరితనంతో మాట్లాడాడు. మొదట ఆభిజాత్యాన్ని గురించి ఎత్తుకొన్నాడు. పుట్టుక ఎట్టిదైనా సంస్కారాలనుబట్టి అభిజాత్య గౌరవం నిర్ణయించబడుతుంది. ఇది లోకనీతి. కుంతి కర్ణుడిని కనినా, క్షత్రియ సంస్కారాలకు దూరంచేసింది. అందువలన ఆమెకు గాని, పాండువంశజులకుగాని ఇహపరలోకాలకు సంబంధించిన సుఖాలను కలిగించే అవకాశం అతడికి లేకుండా చేసింది. ఆమె చేసిన నేరం కారణంగానే కర్ణుడు సూత సంస్కారాలకు గురికావలసి వచ్చింది. ఇప్పుడు ఆ స్థితిని మార్చి కుంతీపుత్రుడని వెల్లడిచేసికొంటే సంస్కారాలు మారవు, సంసార పరిస్థితులు మారవు. అవి మారకుండా క్షత్రియుడని ప్రకటించుకొనటం హాస్యాస్పదం. ఆ దీనస్థితిని కల్పించింది కుంతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జగత్ప్రకాశకారకుడైన సూర్యుడి పుత్రుడిని చీకటిలోకి నెట్టిన నేరం ఆమెది. అది తెలిసివచ్చేటట్లు తేటతెల్లంగా మాట్లాడాడు కర్ణుడు. 'నీకుఁ బుత్రుఁడ నని వచ్చు టింకఁ బోలునె చెపుమా!'- అనే వాక్యంలో పోలదని చెప్పటమే పరమతాత్పర్యం.

కుంతీదేవి కర్ణజన్మాన్ని పరమరహస్యంగా అంతవరకు కాపాడి, యుద్ధానికి ముందు దానిని ప్రకాశంచేయటం అనేకమైన అపోహలకు దారితీస్తుంది. కర్ణుడి జీవితంలో ధర్మసంక్షోభం కలిగిస్తుంది. కడుపుతీపితో కొడుకు పుట్టుకను బైటపెట్టినా అది అతడికి కడుపుకోతగా పరిణమించే పరిస్థితికి దారితీయవచ్చునని కర్ణుడు తన జన్మ రహస్యప్రకటనాన్ని వారించాడు.

లోకంలో అర్జునుడి పరాక్రమకీర్తి అపారంగా వ్యాపించి ఉండగా కర్ణుడు కుంతికొడుకు నంటూ, భానుపుత్రుడనంటూ ప్రకటించుకొని అతడితో కలిస్తే, అతడికి భయపడి పోయాడని నిందిస్తారు. అంతేకాక, దుర్యోధనుడి మూలంగా ప్రసిద్ధికెక్కాడు కర్ణుడు. శత్రువిజయాన్ని సాధించిపెడతాడనే ఆశతో యుద్ధసాగరంలో అతడిని నావగా చేసికొని ముందుకు సాగుతున్న తరుణంలో దుర్యోధనుడిని నట్టేట ముంచటం ధర్మనీతి కాదని నిశ్చయించాడు. కౌరవుల తిండి తింటున్న భీష్మాదులే యుద్ధంలో పాల్గొంటుంటే కర్ణుడు తప్పించుకొనటం సబబుకాదు. అంతేకాక, యుద్ధారంభకాలంలో మిత్రులను వదలి వెళ్ళితే వారిని సాటిరాజులు మెచ్చుకోరు. కాబట్టి కర్ణుడు ఆభిజాత్యాన్ని, అధికారాన్ని తృణీకరించి సూతవంశాన్నీ సేవాధర్మాన్నీ రక్షింపదలచుకొన్నాడు. అంటే కుంతీ ప్రార్థనను తిరస్కరించటమే న్యాయమని నిశ్చయించాడన్నమాట!

కాని, కన్నతల్లి జన్మ కొక్కసారి కోరిన కోర్కెను తీర్చలేకపోయినా, ఆ కోరిక వెనుక ఆమె మనసులో ఉన్న కడుపుతీపినీ, దానిని తగిన సమయంలో వాడుకొని పాండవులకు మేలు చెయ్యాలనుకొన్న రాజనీతినీ, కాదనకుండా మాతృఋణం తీర్చుకొందామనుకొన్నాడు దానవీరుడు కర్ణుడు.

ఉ. 'నీ పలుకెంత వోలినను నిర్ణయ మిట్టిద కాని యొండులే;
దీపనిమీఁది భారమున నీ విట వచ్చితి గాన పాండవుల్
సేపడి రేనిఁ జంప; నఱసేయక చెప్పెద, సవ్యసాచిపైఁ
గోపముపెద్ద; వాఁడు సమకూరిన బిట్టుఱఁ జంపుదుం జుమీ!'

ఆ. 'సవ్యసాచిచేతఁ జచ్చుటయును గీర్తి । కరమ; యతఁడు లోనుగాఁగ నేవు,
రేను లోనుగాఁగ నేవురు గాని, నీ । కొడుకు లార్వు రనుట విడువు మింక'. **(ఉద్యో. 4. 68,69)**

మహాభారత చరిత్రను మార్చిన రహస్యపుటొప్పందాలలో ఇది ఒకటి. విశేషమేమంటే ఇటువంటి రహస్య సంధులు చేసికొన్న వీరులు కౌరవపక్షంలోనే ఎక్కువ. వారిలో కర్ణుడు, శల్యుడు ముఖ్యులు. వీరిరువురిమీద దుర్యోధనుడికి ఆశలు అధికం. అయినా, దుర్యోధనుడి కిచ్చిన మాటకు విఘ్నం రాకుండా వ్యక్తిగత ధర్మాలకు ప్రాధాన్యమిచ్చిన వీరులు వీరు. స్వీయధర్మం సేవాధర్మానికి తత్త్వతః, విరోధం కావచ్చును. లేదా బాధకం కావచ్చును. అయినా కుడిచేతి దానం కుడిచేతిదే, ఎడమచేతి దానం ఎడమచేతిదే. దుర్యోధనుడి బలశక్తి బీటలు వారిన చప్పుడు ఈరంగంలో బాగా వినబడుతుంది. ఇది కుంతి ధర్మరాజుకొరకు చేసే యుద్ధోద్యోగానికి సమకూరే విజయదుందుభి! 'కర్ణుడు లేని భారతం నీరసం' అన్నసూక్తికి ఈ రంగం మూలం!

9. పాండవులు యుద్ధానికి సిద్ధమై కురుక్షేత్రంలో విడిసి ఉన్నారన్న వార్తలు చారుల వలన వినికూడా, విననివాడివలె నటిస్తూ, ముఖంలో ఎటువంటి భావాలనూ ప్రదర్శించకుండా దుర్యోధనుడు ఆత్మీయులను పిలిపించి కొలువుతీర్చి ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'తన వచ్చిన కార్యము మన । మనుకూలతఁ జేయకున్న హరి యలుకమెయిన్
జని యప్పాండు తనూజులు । మనములఁ గిను కూనునట్టి మాటలు సెప్పన్'.

చ. 'మును మనచేత భంగపడి ముచ్చిరి యుండుటఁ జేసి పాండునం
దనులును నెత్తివత్తు రుచితంబుగ; సంగర మెట్లుఁ గల్గుఁ; బే
ర్చిన బహుసైన్యముల్ బయలఁ జేరఁ దగన్ విడియింత; మెల్లి దం
డని పురిఁ జాటఁ బంచి దొరలందఱకున్ బడిసేయుఁ డేడ్తెఱన్'. **(ఉద్యో. 4. 134, 135)**

ఈ మాటలు దుర్యోధనుడికి ఉండదగినంత రాజనీతి పరిజ్ఞానం లేనట్లు స్ఫురింపజేస్తున్నాయి. శత్రుబలాన్ని గురించి అంచనావేయగల శక్తి అతడి బుద్ధికి ఉన్నట్లులేదు. శ్రీకృష్ణుడి మాటలు పాండవులలో కోపం రేకెత్తింపజేయగా, ఇదివరకు పడినపాట్లను స్మరించుకొంటూ వారు యుద్ధానికి సిద్ధమై వస్తారని అలవోకగా చెప్పాడు. సన్నివేశాన్నిబట్టి దుర్యోధను డీమాటలు వాస్తవాలను కప్పిపుచ్చిమాట్లాడుతున్నాడనీ భావించవచ్చును. అవగాహనలేని ఆహవనీతిని ప్రయోగిస్తున్నాడనీ వ్యాఖ్యానించవచ్చును. తనమాటకు తిరుగులేదన్న అహంకారంతో వ్యవహరిస్తున్నాడనీ తలంచవచ్చును. ఏమైనా, ప్రతినాయకుడి అపరిణత యుద్ధనీతిని తెలిపే చిన్ని ఘట్టం ఈ రంగం.

10. దుర్యోధనుడు భీష్మమందిరంలో జరిపిన సమావేశం యుద్ధోద్యోగ రీత్యా ఎంతో ప్రాధాన్యాన్ని సంపాదించుకొన్నది. భారత వీరుల గుట్టుమట్టులు తెలిసిన మహావీరుడు భీష్ముడు. అతడు కౌరవసేనకు ప్రథమ సైన్యాధ్యక్షుడు. అతడి మాటలు పితామహశాసనాలవలె ఉంటాయి. శత్రుమిత్ర బలాబల నిరూపణం సైన్యాధ్యక్షుడి ప్రథమ కర్తవ్యం. అందులోనే జయాపజయాలు వస్తుధ్వని నాశ్రయించి ప్రకటితమౌతాయి. వాటిని సూచించే విలువైన రంగం ఇది.

సర్వసైన్యాధ్యక్ష పదవి చేపట్టటానికి భీష్ముడు షరతులు పెట్టాడు. ఇట్టివి పాండవపక్షంలో వినబడవు. కౌరవవీరులలో ఉన్న రవరవలకు అవి సంకేతాలు.

1. 'యుద్ధకార్యాలలో ఉన్న విషయాన్ని ఉన్నట్లుగా చెప్పాలి. మారుమాటలు పనికిరావు. నాకు కౌరవపాండవులొక్కటే. నేను మీతో కలిసి ఉంటున్నాను కాబట్టి యుద్ధానికి రమ్మంటే వస్తాను. అది ఉచితం కూడా.

2. మీరు కోరటంవలన సైన్యాధిపత్యాన్ని స్వీకరిస్తాను. ఒక అర్జునుడు తప్ప న న్నెదిరించి నిలిచే వీరులు లేరు. అర్జునుడు నాకంటె ఎక్కువ శరాలు కలిగి ఉండటంచేత అతడిని ఎదురొడ్డి నిలవలేను.

3. మిగిలినవారి నందరినీ యుద్ధంలో వధించగలను. అయితే, పాండురాజనందనులను మాత్రం నేను చేజేతుల చంపలేను. వారుకూడా నా మీద భయంకరంగా దాడిచేయరు.

4. అది అట్లుండగా మరొకమాట! ముందుగా కర్ణుడినిగాని, నన్నుగాని యుద్ధంచేయటానికి అనుమతించుము. అట్లా చేయకపోతే నేను సైన్యాధ్యక్ష పదవిని స్వీకరించను'.

ఈ మాటలు నిష్ఠురాలుగా కనపడినా నిజాయితీతో కూడుకొన్న నిజాలు. కర్ణు డిదివరకే భీష్ముడు కూలేంతవరకు ఆయుధం పట్టనని శపథం చేశాడు. దాని నతడు ఈ సందర్భంలో మరల పేర్కొన్నాడు. భీష్ముడు సర్వసైన్యాధ్యక్షు డైనాడు. ఈ సన్నివేశంలో పాల్గొన్న పాత్రలు మూడైనా మూడూ మొదట్లోనే హంసపాదం వేశాయి. భీష్ముడిని ఎన్నికచేయక తప్పదుకాబట్టి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుర్యోధనుడు సేనాధ్యక్షుడిగా చేశాడు. భీష్ముడు యుద్ధం చేయకతప్పదు కాబట్టి యుద్ధానికి ఒప్పుకొన్నాడు. కాని, అర్జునుడి ముందు తాను నిలువలేనన్నాడు. అతడిచేతిలో మరణిస్తా ననలేదు. కర్ణుడుండగా ఆయన యుద్ధం చేయనన్నాడు. భీష్ముడుండగా తాను యుద్ధం చేయనన్నాడు కర్ణుడు. దీనినిబట్టి ముందు పితామహుడు నాయకుడైనా అతడు మృతుడు కావటం తథ్యమని భావికథార్థధ్వని. మంగళారంభంగా సాగవలసిన ఈ రంగం అమంగళస్వరాలతో ఆరంభమైనది. కౌరవ పరాజయం తప్పదని సూచించబడింది. యుద్ధపర్వాలలో పాండవ విజయసూచనలు ప్రత్యర్థుల స్కంధావారంలోనే వినబడటంచేత యుద్ధోద్యోగం సఫలమైనదని స్పష్టమౌతున్నది.

(3). దృశ్యాలుగా గోచరించే సన్నివేశాలు

ఒకటిరెండు పాత్రలు ఒకసన్నివేశంలో తారసిల్లి ఏదైనా ప్రయోజనాన్ని సాధించే సంభాషణలను స్వల్పకాలంపాటు సాగించిన ఘట్టాన్ని దృశ్యంగా పరిగణించవచ్చును. అటువంటివి కూడా పది కనబడుతున్నాయి ఉద్యోగపర్వంలో.

1. శల్య దుర్యోధన సమావేశ సన్నివేశం.	1. 94-103
2. సంజయుడు ధృతరాష్ట్రుడితో రాయబారపు వృత్తాంతం చెప్పే సన్నివేశం.	2. 2-16
3. ధర్మరాజు ఆత్మీయులతో సభచేసిన సన్నివేశం.	3. 3-4
4. పాండవులు శ్రీకృష్ణుడిని సాగనంపే సన్నివేశం.	3. 133-144
5. శ్రీకృష్ణుడి హస్తినగర ప్రవేశ సన్నివేశం.	3. 174-180
6. శ్రీకృష్ణుడి విదురమందిర సన్నివేశం.	3. 229-244
7. సభానంతరం ధృతరాష్ట్రాదులతో శ్రీకృష్ణుడి సన్నివేశం.	4. 4-8
8. భీష్మద్రోణులు దుర్యోధనుడికి హితవు చెప్పిన సన్నివేశం.	4. 19-27
9. బలరాముడు తీర్థయాత్రలకు పోయే సన్నివేశం.	4. 165-173
10. రుక్మి ప్రగల్భాలాడిన సన్నివేశం.	4. 174-180

దృశ్యాలలో సంఘటన కెంత ప్రాధాన్యముంటుందో సంభాషణలకూ అంతే ప్రాముఖ్యముంటుంది. ముడివంటి ఒక సమస్య ముడిపడటమో, విడిపడటమో దృశ్యంలో గమనిస్తాం.

1. శల్య దుర్యోధన సమావేశం దుర్యోధనుడు ప్రయోగించిన నీతి కౌశలానికి ఫలంగా ఏర్పడింది. చారులు చేసిన సేవలకు మెచ్చి వరాలిద్దామనుకొన్న శల్యుడి ముందు దుర్యోధనుడు తారసిల్లి, అతడి సైన్య సహాయాన్ని పొందగలుగుతాడు.

క. 'సత్య సరస్వతి వగు; మౌ । చిత్య విశారదము నీదు చిత్తము; నియమౌ
దాత్త్యంబు మెఱయ నాకు న । మాత్యుఁడవై పూని నడవు మత్సైన్యంబున్'.

ఆ. 'తలఁపఁ బాండవులును ధార్తరాష్ట్రులు నీకు । నొక్కరూప; భక్తియుక్తిఁ జాల
నీవు నన్ను మాననీయుండు గాఁగ న । నుగ్రహించి తగఁ బరిగ్రహింపు'. **(ఉద్యో. 1. 95-96)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇవి దుర్యోధనుడు పలికిన మాటలా? అని ఆశ్చర్యం వేస్తుంది. ధర్మజుడి వాక్యసంస్కారం గుబాళిస్తున్న దిందులో. ధర్మరాజుకు సాయంచేయబోయే శల్యుడిని తనవైపు త్రిప్పుకొనటంలో దుర్యోధనుడు కార్యచాతుర్యంతో పాటు వాక్యచాతుర్యంకూడా చూపి సాత్త్వికుడివలె చెలువొందిన ఈ దృశ్యం అరుదైనది.

2. ఉపప్లావ్య నగరం నుండి తిరిగి వచ్చిన సంజయుడు, సంజవేళలో ధృతరాష్ట్ర మహారాజుకు దౌత్య ఫలితాంశాలపై ప్రాథమిక నివేదికను మౌఖికంగా సమర్పించిన ఈ సన్నివేశం కథలో కీలకమైనది. సంజయుడు సూత్రకారుడివలె కొన్ని వాక్యాలే మాట్లాడాడు. అందులోనూ ఈ క్రింది పద్యం బ్రహ్మసూత్రంవలె రాణించింది.

చ. 'అనయము పుట్టె జూదమున; యప్పుడ యెంతయుఁ జిచ్చు వెట్టి కా
ల్చినయది నీ యుపేక్షయ; వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మె
త్తని పులి; యెల్లవారలు నధర్మము నీపయిఁ బెట్టునంతకు
న్వినఁడును గానఁడుం; బిదప నీకును నాకు మరల్ప వచ్చునే?' **(ఉద్యో. 2.14)**

ఉద్యోగపర్వంలోని ధర్మరాజువ్యూహాన్ని సూత్రబద్ధం చేసిన గొప్ప పద్య మిది. దీని వ్యాఖ్యానమే ఈ పర్వకథాంశం. ఈ మాటలు విన్న ధృతరాష్ట్రుడు నిద్రపోలేదు. కథను నిద్రపోనివ్వలేదు. అంతటి చైతన్య బీజం ఈ సన్నివేశం.

3. సంజయుడు హస్తినాపురానికి తిరిగివెళ్ళిన మరునాడు ధర్మరాజు తన తమ్ములను, సుతులను, ఇష్టభృత్యవర్గాన్నీ పిలిచి తనయింట చిన్న సమావేశం ఏర్పరచి చేసి వారిముందు ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు.

క. 'మనము జనార్దను పాలికిఁ । జని కౌరవసభకు నతనిఁ జను మని ప్రార్థిం
చిన మేలు; బంధుహిత గురు । జనములతో రణము గాక సంప్రీతి యగున్'. **(ఉద్యో. 3.4)**

ఈ పద్యం శ్రీకృష్ణుడి రాయబారపు ఘట్టానికి ముందుమాట, లేదా నాందీవాక్యం. అల్పాక్షరాలలో అనల్పార్థం ఇమిడి ఉండే సారవంతమైన వాక్కు. ధర్మజుడి మాట సభ శిరసావహించింది. అందరూ కలిసి సామూహికంగా శ్రీకృష్ణమందిరానికి వెళ్ళారు. ఏకగ్రీవంగా తీసికొనే సభ తీర్మానాన్ని మరపించే ఈ దృశ్యం ధర్మజ నాయకత్వ దీప్తికి కరదీపిక!

4. హస్తినాపురికి బయలుదేరిన శ్రీకృష్ణుడితో పలికిన సాగనంపు మాటలలో ధర్మజుడు కుంతీదేవి ప్రసక్తితెచ్చి, ఆమెను దర్శించి రమ్మని ఆర్ద్రంగా అడిగాడు.

ఉ. 'వచ్చె జనార్దనుం డనినవార్తకుఁ బ్రాణము మేని కంతకున్
వచ్చిన సేదఁ దేఱుఁ గురువంశ పవిత్ర చరిత్ర గొంతి; నీ
వచ్చటి కేఁగి పాండవుల యందఱ మా ఱని చెప్పి మ్రొక్కుచున్
గ్రుచ్చియ కౌఁగిలించుకొని కుందిన చిత్తము నొవ్వి దీర్పుమీ!' **(ఉద్యో. 3.134)**

కుంతిపట్ల పాండవాగ్రజుడికున్న ఆదరాభిమానాలతో కూడుకొన్న ప్రేమ అపారం. 'కురువంశ పవిత్ర చరిత్ర'- అనే విశేషణం ఆ పాత్ర స్వభావ సర్వస్వం. శ్రీకృష్ణుడు కుంతిని దర్శించి కొడుకుల భక్తి తాత్పర్యాలను స్వయంగా అందజేస్తాడు. ఆమెవద్ద నుండి పాండవులకు యుద్ధోత్సాహం కలిగించే పౌరుష సందేశాలను తెచ్చి వినిపిస్తాడు. ధర్మరాజు యుద్ధాన్ని ప్రారంభించటానికి ఆ తల్లి సందేశం ఒక ప్రధాన కారణం. అందువలన ఈ దృశ్యం భావికథా జీవిత పరిపోషకం.

ఈ సన్నివేశంలోనే అర్జునుడు జనులు వినేటట్లు చెప్పుమని తన వీరసందేశం వినిపించాడు.

చ. 'జనులు వినంగ రాజ్యమున సాము గొనం గలవార మన్న యీ
జనపతి కార్యనిశ్చయము సమ్మతి గైకొని చేసినన్ సుయో
ధనుఁడును దమ్ములన్ సఖులు దానికి నేమును నియ్యకొందు; మొం
డనిన సుపుత్రమిత్రముగ నద్దెస నందఱుఁ గ్రొచ్చి పాఁతుదున్'. **(ఉద్యో. 3.142)**

కొసమెరుపుగా మెరిసే ఈ పద్యంలో పాండవ హృదయం స్పష్టంగా ప్రకాశించి ఒక మెరుగైన ముగింపును పాండవ సందేశ ఘట్టానికి సమకూర్చింది.

5. శ్రీకృష్ణుడు హస్తినాపురంలో ప్రవేశించి పురవీథులలో ఊరేగుతూ ధృతరాష్ట్ర మందిరానికి చేరిన ఘట్టం మనోహరమైన మధుర దృశ్యం. భారతంలో భాగవతం ప్రవేశించినట్లుంటుంది. రమ్యహర్మ్యాలపై నిలిచి పూలగుత్తులను చల్లుతూ శ్రీకృష్ణ మహిమలను కీర్తించే అంగనామణులు గోపికల కెందులోనూ తీసిపోనట్లు గోచరిస్తారు.

సీ. 'ప్రాణంబుతోఁ గూడ రక్కసి చన్నుల । పాలు ద్రావిన ప్రౌఢబాలుఁ డితఁడె!
వ్రేల్మిడిఁ జాణూరు విఱిచి లోకముల । మెచ్చించిన యా జగజెట్టి యితఁడె!
దుర్వృత్తుఁడగు కంసుఁ దునిమి యాతని తండ్రిఁ । బట్టంబు గట్టిన ప్రభు వితండె!
సత్యభామకుఁ బారిజాతంబుపైఁ గల । కోర్కిదీర్చిన రసికుం డితండె!

తె. వెన్నలును గోపికాచిత్తవృత్తములును । నరసి ముచ్చిల నేర్చిన హరి యితండె!
శ్రుతి శిరోభాగములఁ దన సుభగచరణ । సరసిజామోదమును గూర్చు చతురుఁ డితఁడె!'.

(ఉద్యో. 3.175)

మానవాకారంలో నున్న మాధవుడిని చూచిన మాన్యులు హస్తినాపురం ప్రజలు. ఆ ప్రజలను పాలించే సంస్కారం గ్రుడ్డిరాజుకు లేదనీ, మదాంధులైన దుర్యోధనాదులకు లేదనీ ధ్వని. (మిగిలిన వివరాలకు వ్యాఖ్య చూడండి).

6. హస్తినాపురంలోని విదుర మందిరం గంజాయి తోటలో ఉన్న తులసి వనం. అందులో ప్రవేశించిన తులసీదాముడు విదురుడితో సలిపిన సంభాషణలు శ్రీకృష్ణుడి రాయబారపు పరమార్థాన్ని ప్రపంచించే సారవచనాలు. కౌరవులు నిండు సభలో చేయ తలపెట్టిన దౌష్ట్యాన్ని గురించి శ్రీకృష్ణుడికి ఏకాంతంలో నివేదించి, మరునాటి కురుసభకు వెళ్ళవలదని సూచించాడు విదురుడు. దానికి శ్రీకృష్ణు డిచ్చిన సమాధానం రాజనీతి తిలకం. దుర్యోధనుడు వ్యర్థుడనీ తెలుసు. అతడిని సమర్థించే రాజులు పగను మనసులలో పెట్టుకొని సంధి కుదరనీయరనీ తెలుసు. అయినా ఉత్తములు ఊరకుండరాదు.

ఆ. 'పుడమి యెల్ల నొడ్డగెడవయి గజవాజి । యుతముగాఁ గడంగి యుగ్రమృత్యు
ముఖము సొరఁగఁ దివురు మూర్ఖత మాన్పుట । యధికమైన పుణ్య మనఘచరిత'. **(ఉద్యో. 3.238)**

శ్రీకృష్ణుడి రాయబారం ఈ దృష్టితో ఒక పుణ్యకర్మ. మానవులు పుణ్యంకాని పాపంకాని చేస్తూ చేస్తూ ఉండగా మధ్యలో అది విఫలమైనా, దాని ఫలితాన్ని అనుభవిస్తారని ధర్మవేత్త లంటారు. అది అట్లా ఉండగా ఈ యత్నం సామాజిక, కుటుంబ ధర్మాలను గౌరవించే శాంతియత్నం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. 'చుట్టములలోన నొప్పమి పుట్టినప్పు । డడ్డపడి వారితోడఁ గొట్లాడి యైనఁ
దాని నుడుపంగఁ జొరకున్న వానిఁ గ్రూర । కర్ముఁ డని చెప్పుదురు కర్మకాండవిదులు'. **(ఉద్యో. 3.242)**

క్రూరకర్ముఁ డనే నింద పడకుండా ఈ శాంతియాత్ర చేస్తున్నట్లు శ్రీకృష్ణుడు తన హృదయగీతను విదురుడికి వినిపించాడు. ధర్మజుడికి వినిపించింది ధర్మనీతిగీత; విదురుడికి వినిపించింది కర్మనీతిగీత. ఎవరికి, ఎప్పటికి ఎయ్యది ప్రస్తుతమో దానిని ప్రపంచించటం ఆ పురుషోత్తముడి లీలావిలాసం. శ్రీకృష్ణుడి రాయబారంలోని నైతికకోణాన్ని ఈ దృశ్యం ప్రదర్శించింది.

7. శ్రీకృష్ణుడి రాయబారపుసభ ముగిసింది. గాంధారి అంతఃపురానికి తిరిగి వెళ్ళింది. శ్రీకృష్ణుడు కుంతీగృహానికి బయలుదేరుతుండగా ధృతరాష్ట్రుడు చొరవతీసికొని తనయం దేమీ తప్పులేనట్లు శ్రీకృష్ణుడికి నివేదించుకొన్నాడు.

ఉ. 'వీరును బాండుపుత్రులును వేరము దక్కి పొసంగి మన్కికై
పోరిత మాడి యే నటులు బుద్ధులు సెప్పిన భంగియుం, గులా
చారము నిర్వహింపఁ బలుచందములం దగ దుఃఖపాటు నీ
కౌరవజాతికిం దెలిసెఁ గాదె గదాధర! నీదు సన్నిధిన్'.

తే. 'నీకు శుద్ధుండ నగుటయ నిఖిల బంధు । మిత్ర గురుజన కోటికి ధాత్రి కెల్ల
నంబుజాక్ష! నిర్దోషుండ వగుట; గాన । నా తెఱంగు నీ వెఱుఁగుట నాకుఁ జాలు'. **(ఉద్యో. 4.3,5)**

కౌరవులూ పాండవులూ కలిసి ఉండాలని సభలో కొడుకులకు ఎన్నో బుద్ధులు చెప్పాడట!, ఎంతో కష్టపడ్డాడట! వంశగౌరవాన్ని నిలపటానికి అనేక విధాలుగా శ్రీకృష్ణుడి సన్నిధిలో కృషిచేసినట్లు కౌరవజాతికి స్పష్టమయిందట! శ్రీకృష్ణుడు నిర్మలాత్ముడు కావటంచేత ధృతరాష్ట్రుడి నిర్దోషిత్వాన్ని గుర్తిస్తే బంధుమిత్రజనకోటి కూడా గుర్తించినట్లేనట! ఈ మాట లంటున్న ధృతరాష్ట్రుడు దేవుడిముందు తన నిజాయితీని నివేదించుకొంటున్నట్లున్నది. అయితే, తాను కళ్ళుమూసికొని మాట్లాడితే దేవుడుకూడా కళ్ళుమూసికొని వింటాడనీ, అందరూ కళ్ళుమూసికొని అంగీకరిస్తారనీ భావించాడు. కాని, నీతులు చెప్పటంతో తన బాధ్యత తీరిపోయిం దనటం బాధ్యతారాహిత్యం. తాను రాజై తీర్పు చెప్పలేక, పాండవులకు పాలీయలేక, సంధి జరగటానికి అనుకూలంగా సాహసించి ఒక్క అడుగు ముందుకు వేయలేక, తాను నిర్దోషినని చెప్పుకుంటున్న ధృతరాష్ట్రుడు దుర్యోధనుడికంటె దుర్మార్గుడు. అతడి ఉపేక్షయే అతడి వంశానికి ఊపిరికుట్టుగా దాపురించింది. శ్రీకృష్ణుడు అతడి వక్రనీతిని అధిక్షేపిస్తున్నట్లు, అక్కడున్న పెద్దలందరికీ ధృతరాష్ట్రుడిమాట లుట్టంకించి చెప్పి, అతడు ప్రధానవ్యక్తి కాడనీ, అతడేమీ చేయలేడనీ తేల్చి చెప్పిన తరువాత ఇక హస్తినాపురంలో ఉండటం నిరర్థకమని పలికి, ప్రస్థానం సాగించాడు. సంధియత్నానికి ధృతరాష్ట్రుడు పాడిన చరమగీతం ఈ దృశ్యం.

8. శ్రీకృష్ణుడు హస్తినాపురాన్ని విడిచిపోతున్న సందర్భంలో భీష్మద్రోణులు దుర్యోధనుడికి చివరిసారిగా హితవును ఇట్లా బోధించారు.

శా. 'మాకుం జూడఁగఁ బోలు కార్య మిది ధర్మప్రీతి నీ వేఁగి సు
శ్లోకుండైన యుధిష్ఠిరుం గని జనస్తుత్యంబుగా శాంతిమై
నీ కౌరవ్యుల నెల్లఁ గాచికొనవే యే పొప్పు; దెందుం దుదిన్
శోకం బొందక వేగమైఁ గదలి కృష్ణుం గూడఁ బోవే నృపా!'. **(ఉద్యో. 4. 24)**

ఈ హితవును దుర్యోధనుడు పెడచెవిని పెట్టాడు. దీనితో యుద్ధారంభానికి అడ్డంకు లేవీ లేకుండా పోయాయి. శాంతి విఫలం కావటానికి దుర్యోధనుడే కారకుడని కౌరవవీరులే నిశ్చయించినట్లు ఈ దృశ్యం బోధపరిచింది.

9. బలరాము డదృష్టవంతుడు. శ్రీకృష్ణు డంతటి తమ్ము డతడికున్నాడు. అందువలన భారమంతా ఆయనమీద ఉంచి నిశ్చింతగా జీవితం గడపటం, అప్పుడప్పుడూ శ్రీకృష్ణుడిమీద, బంధువులమీద తన పెద్దరికాన్ని చూపుతూ ఉండటం, ఆయనకు పరిపాటి. ఆ అలవాటులో భాగంగానే ధర్మరాజు సభకు వచ్చాడు. నిజానికి, ధర్మరాజు ఆయన సహాయం అడగలేదు. దుర్యోధనుడు అడిగాడు. అన్నదమ్ముల నడుమ జరిగే యుద్ధంలో పాల్గొనని బలరాముడు కచ్చితంగా చెప్పాడు. అందువలన ఎట్టి పరిస్థితులలోకూడా దుర్యోధనుడి వద్దకు పోలేదు. బలరాముడు యుద్ధంవలన కలిగే దారుణఫలితాలను వినలేక, చూడలేక తీర్థయాత్రకు పోదలచాడు. కాని, అతడి బహిఃప్రాణమైన శ్రీకృష్ణుడు ధర్మరాజాదుల పక్షంలో ఉన్నాడు. సంధికొరకు ప్రయత్నంచేసి దానిని కౌరవుల మూర్ఖతవలన సాధించలేకపోయాడు. యుద్ధం మొదలు కాబోతున్నది. శ్రీకృష్ణుడికి చెప్పిపోవాలని వచ్చాడు. కాని, ధర్మరాజు ప్రభువు కాబట్టి అతడిని కొలువులో కలిశాడు. బలరాముడికి పాండవులమీద జాలి. తమ్ముడు వారి పక్షంలో ఉండి వారిని యుద్ధంబారినుండి తప్పిస్తాడేమోనని ఆశించాడు. శ్రీకృష్ణుడికి సాధ్యంకానిది లేదని అతడివిశ్వాసం. సంధి కుదరలేదంటే శ్రీకృష్ణుడే సంధికి సుముఖుడు కాడేమో! అని అతడి ఊహ. దానికి కారణం గోవిందుడికి అర్జునుడిపై ఉండే మిక్కుటమైన మక్కువ- అని అతడి అనుమానం. ఇవన్నీ కలిసి అతడిని తీర్థయాత్రలకు పంపుతున్నాయి. ఈ ఒత్తిడితో ధర్మజుడిని దర్శించి, అతడిమీద జాలి చూపించబోయి, తన తమ్ముడిమీద చనువుగా చణుకులు విసిరాడు.

కౌరవపాండవులు క్రూరులై యుద్ధానికి దిగి బంధుమిత్రాదులకు ప్రాణహాని కలిగించటం దారుణకర్మగా గర్హించాడు బలరాముడు. ఇరుతెరగుల వారికీ సర్దిచెప్పి సంధిచేయుమని తానెన్నోసార్లు చెప్పినా శ్రీకృష్ణుడు పట్టించుకొనలేదని నొచ్చుకొన్నాడు. మాటల పొందికా, మన్ననా లేని కౌరవులకు ఏదో విధంగా నచ్చచెప్పి కార్యాన్ని చక్కజేసే బాధ్యత శ్రీకృష్ణుడికి ఉన్నదని భావించాడు. కాని, ఏదో కారణంవలన అతడు సంధి కుదిరించి ఉండడని అనుమానించాడు. ఉభయులకూ కావలసిన వాడైన శ్రీకృష్ణుడు అర్జునపక్షపాతి కాబట్టి పాండవులను వదలిపెట్టడని నిశ్చయించాడు.

ఉ. ‘కావున వీరికిం జయము గల్గుట నిశ్చయ మెల్ల భంగులం;
జావు నిజంబు వారికి; నసంశయమై యిటులుండ దీని నె
ట్లే వినఁ జూడ నేర్తు? దగ నింత ప్రవీణుల నేన చేసితిం
జూవె! సుయోధనుం బవనసూనుని నొండొరుఁ జంపఁ జూతునే?’ **(ఉద్యో. 4.171)**

శ్రీకృష్ణుడు పాండవ పక్షంలో ఉన్నందున పాండవులకు విజయం తథ్యమనీ, కౌరవులకు చావు తప్పదనీ నిస్సంశయంగా చెప్పాడు. చివరకు ఆయన బాధంతా తేల్చి చెప్పాడు. తన ప్రియశిష్యులైన దుర్యోధన భీముల నడుమ గదాయుద్ధం జరిగితే వారిరువురూ సమాన బలసంపన్నులు కాబట్టి ఉభయులూ చనిపోతారేమో అని శంకించాడు. ఆ విషాదాన్ని ఆయన చూడలేక తీర్థయాత్రలకు బయలుదేరాడు. బలరాము డెన్ని మాటలు మాట్లాడినా అటు ధర్మరాజు గాని, ఇటు కృష్ణుడు గాని కిమ్మనకుండా నమస్కరించి సాగనంపారు. ఆ నిశ్శబ్దంలో ఎంత ఔచిత్యముందో!

తమ్ముడైన శ్రీకృష్ణుడిని చనువుతో ఎన్నిమాటలన్నా, ఆయనచర్యలోని అంతరార్థం తెలిసికొనటం కష్టమని బలరాముడికి బాగా తెలుసు. అందుకే ‘హరి యెఱుఁగని చక్కటియుం । బురుషార్థము నా కెఱుంగఁ బోలునె?’ అని విజ్ఞుడుగా విన్నవించుకొన్నాడు. తమ్ముడు దేవుడని తెలిసికూడా తన పెద్దరికం చాటుకొనే భోళా పెద్దమనిషి బలరాముడు. అతడి పాత్ర చిత్రణాన్ని ఒక్కదృశ్యంలో పరిపూర్ణంగా చూపగలిగిన ఈ సన్నివేశం కడుసున్నితం.

10. గంభీరమైన యుద్ధ వాతావరణంలో రుక్మివృత్తాంతం ఒక చక్కని హాస్యవిరామం. రుక్మిణి అన్న అయిన రుక్మి విజయమనే దివ్య చాపం కలవాడు. కాని, చపలచిత్తుడు. అతడిని ఎవరూ యుద్ధానికి పిలవలేదు. అయినా, ససైన్యుడై ధర్మజుడి వద్దకు వచ్చి, సత్కారాలు పొంది అర్జునుడిని చూచి ప్రగల్భా లాడటం మొదలు పెట్టాడు.

'అర్జునా! యుద్ధం చేయటానికి నీకు భయంగా ఉంటే నాతో చెప్పుము. నాకు ఎదురుగా నిలబడగలిగిన వీరుడు లేడు. ఎటువంటి వీరుడినైనా యుద్ధంలో ఓడించి నీకు సాయంచేస్తాను!' అని అన్నాడు. రుక్మి నోడించి రుక్మిణిని తెచ్చి రాక్షస వివాహం చేసికొన్న శ్రీకృష్ణుడున్న సభలో ఆత డట్లా సిగ్గులేక మాట్లాడటం అందరికీ ఎబ్బెట్టుగా తోచింది. అర్జునుడు వెటకారంగా నవ్వి ఇట్లా అన్నాడు. 'గంధర్వరాజైన చిత్రరథుడిని గెలిచినప్పుడూ, విరాటరాజుగోవులను మరల్చి తెచ్చినప్పుడూ నీవెక్కడున్నావో తెలియక పిలవకపోవటం పొరపాటైపోయింది. ఇకముం దెప్పుడైనా నాకు తోడు వద్దువుగానిలే. అయితే, యుద్ధంలో నే నెవరి సహాయాన్నీ కోరను. అయినా విజయాలు కలుగుతున్నాయి. శ్రీకృష్ణుడు నాకు అండగా ఉన్నాడు. నేను భయపడవలసిన అవసరం లేదు. నాకు భయం తీర్చవలసిన అవసరం లే' దని రుక్మిని తృణీకరించాడు. అతడు వెళ్ళి దుర్యోధనుడిని అడిగాడు. అతడూ తిరస్కరించాడు. చివరకు రుక్మి తలవంచుకొని తన పట్టణానికి తిరిగిపోయాడు.

ఈ ఉదంతం వలన కౌరవపాండవు లిరువురూ మాటల పోటుగాళ్లను కాక యుద్ధవిశారదులనే సహాయసహకారాలకై అర్థించారనీ, పరాక్రమవంతులు కానివారు ప్రాధేయపడ్డా తమ పక్షాన చేర్చుకొనలేదనీ తెలుస్తున్నది. యుద్ధోద్యోగంలో అది ఒక ఉన్నత ప్రమాణం!

(4). చతుర్విధాభినయం

నాటకానికి చతుర్విధాభినయం జీవితం. కావ్యంలోని నాటకీయతకు చతుర్విధాభినయ వర్ణనం రసవదలంకారం. తిక్కన రచనలో అభినయ ప్రశంస క్షీరనీరన్యాయంగా కలసిమెలసి ఉంటుంది. విరాటపర్వం చతుర్విధాభినయ చంద్రాలోకం. షోడశ కళాపూర్ణుడైన చంద్రుడు శరత్కాలంలో ఎంత సమగ్రంగా ప్రకాశిస్తాడో విరాటపర్వంలో అభినయ చంద్రిక అంత పరిపూర్ణంగా విరాజిల్లింది. ఉద్యోగపర్వం అభినయ రీత్యా విరాటపర్వమంత విరాజమానం కాదు. అయితే అభినయాన్ని కావలసిన చోట సందర్భశుద్ధితో అనువుగా వాడుకొన్న జాగరూకత ఇందులో కనబడుతుంది. దానికి కారణం కూడా ఊహించవచ్చును. విరాటపర్వంలో పాండవులు వేషధారులు. అందువలన అభినయం వారికి లలితంగా, స్వభావ సుందరంగా ఉంటుంది. ఉద్యోగపర్వంలో రాజనీతి వర్తనం, పౌరుష ప్రవర్తనం ముఖ్యం. అందువలన లలితాభినయానికి పెద్దగా తావుండదు.

విరాటపర్వంలో ఆంగికానికీ ఆహార్యానికీ అవకాశం ఉన్నది. ఉద్యోగంలో తక్కువ. కీచకోదంతం విరాటపర్వంలో కీలకమైన పాత్ర నిర్వహించటం చేత సాత్త్వికాభినయానికి చక్కని అవకాశం దక్కింది. మొత్తానికి కీచకవధ ఘట్టం మినహాయిస్తే మిగిలిన ఘట్టాలలో కూడా అంతటి ముమ్మరమైన సాత్త్వికాభినయం కనబడదు. దక్షిణ ఉత్తర గోగ్రహణ ఘట్టాలలో వీరం పొంగులువారింది. క్రమంగా సాత్త్వికాభినయ వర్ణనం పలచబారింది. కొసమెరుపుగా ఉత్తరాభిమన్యుల వివాహ ఘట్టంలో సున్నితమైన సాత్త్వికం సొగసులు పోయింది. మరి ఉద్యోగ పర్వం కథ వేరు. ఇందులోనూ ద్రౌపదీ, కుంతీ మొదలైన స్త్రీ పాత్రలు ప్రవేశించిన ఘట్టాలలో సాత్త్వికం మృదువుగా మెరుస్తుంది. మిగిలిన చోట్ల అక్కడక్కడ కనబడుతుంది. విరాటపర్వంలో కంటె ఉద్యోగం వాచికాభినయంలో విస్తృతిని సంతరించుకొన్నది. ఉద్యోగపర్వంలో పాత్రలు తమ సంభాషణల ద్వారా తమ తమ అభిప్రాయాలనూ వ్యక్తిత్వాలనూ ప్రదర్శించుకొంటూ ఉంటాయి. పాత్రలు మాట్లాడిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మాటలకే ఇందులో ప్రాధాన్యం కాని ఆ మాటలాడుతున్నప్పుడు అవి ప్రదర్శించే హావభావాలకు అభినయ ముద్రలకు అంత ప్రాధాన్యం కనబడదు. ఎప్పుడో భావతీవ్రత పరమస్థితికి అందుకొన్నపుడు అభినయ రేఖను తిక్కన అరుదుగా చిత్రించాడు.

(అ). ఆంగికాభినయం

ఉద్యోగపర్వంలో తిక్కన నిర్వహించిన ఆంగికాభినయాన్ని స్థూలంగా సమీక్షిస్తే ఈ క్రింది అంశాలను గమనించవచ్చును.

1. పాత్రల ఆకార భంగిమల కంటె ప్రవర్తన భంగిమలకు తిక్కన ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇచ్చాడు. ఉదాహరణకు- దుర్యోధన అర్జునుల స్వభావాలను వారి ఆంగిక అభినయాలతో సహజంగా వ్యక్తం చేసిన తిక్కన తేటగీతి పద్యం

తే. 'అతఁడు పవడింప మును కౌరవాధినాథుఁ । డరిగి తలయంపిదెస నున్నతాసనమున
నుండెఁ; బదపడి కాల్కడయొద్ద కల్లఁ । జని వినమ్రుఁడై నిలుచుండె సవ్యసాచి'. **(ఉద్యో. 1.65)**

శ్రీకృష్ణుడి సన్నిధిలో ఉన్నతాసనంలో కూర్చున్న దుర్యోధనుడి అహంకారం, వినమ్రుడై నిలుచున్న సవ్యసాచి వినయం ఆ పాత్రల స్వభావాలకు సహజ సూచికలు. ఇటువంటి ఆంగికాభినయాలు ఉద్యోగపర్వంలో రసధ్వనికి పోషకాలుగా నిలుస్తాయి.

2. ఒక్కొక్క పాత్రకు ఆ పాత్రకు మాత్రమే సహజంగా గోచరించే ఆంగిక చేష్టను రంగంలో చిత్రించటం తిక్కన ప్రత్యేకత. ఉదాహరణకు- మద్రభూపాలుడైన శల్యుడు మిత్రులను కాని ఆత్మీయులను కాని కలిసినపుడు గాఢాలింగనం చేసికొనటం అలవాటు. సైన్య సహాయాన్ని కోరే మిషతో తనను కలిసిన దుర్యోధనుడిని సంభ్రమంతో గాఢాలింగనం చేసికొన్నాడు. ఈ ఆంగికాభినయంలో సంభ్రమం గౌరవ సూచకమే కాక కృతజ్ఞతా సూచకం కూడా. తన యుద్ధయాత్రలో దుర్యోధనుడు కల్పించిన సౌకర్యాలకు తన నిండు హర్షాన్ని తెలపటానికై నిండు కౌగిలింతను కల్పించాడు. హర్షాతిశయం కలిగినపుడు గాఢాలింగనం చేయటం శల్యుడి అలవాటు. ఈ అలవాటును ఆంగికాభినయంగా సన్నివేశంలో సందర్భోచితంగా వర్ణించి పాత్ర మనోగతభావాలను వ్యక్తం చేయటం తిక్కన శిల్పం.

ఇష్టం ఉన్నా లేకపోయినా, అన్నమాట ప్రకారం తన సహాయాన్ని అందిస్తానని దుర్యోధనుడికి మాట ఇచ్చిన శల్యుడు, ధర్మజుడి వద్ద సెలవు తీసికొని రావటానికీ బయలుదేరాడు. 'ఇచ్చినమాట తప్పవద్దనీ, వెంటనే తిరిగి రావా'లనీ కోరిన దుర్యోధనుడిని శల్యుడు మందహాసంతో ఆలింగనం చేసికొన్నాడు (ఉద్యో. 1.103). ఇక్కడ తిక్కన గాఢాలింగన ప్రసక్తి చేయలేదు. దరహాసాన్ని ప్రవేశపెట్టాడు. మొదటి కౌగిలింతలో ఉన్న గాఢత ఇందులో లేదు. దుర్యోధనుడి అదృష్టాన్ని చూచి నవ్వినట్లున్నది ఇక్కడి దరహాసం.

ఉపప్లావ్య స్కంధావారానికి చేరిన శల్యుడు, ధర్మరాజును అభినందించి పునరాలింగనం చేసినట్లు తిక్కన అభివర్ణించాడు (ఉద్యో. 1.104). యుధిష్ఠిరుడి మీద అతడికున్న అభిమానానికి ఈ పునరాలింగనం ఒక సంకేతం. ధర్మజుడి మనస్సు నొవ్వకుండా ఇంద్ర వృత్రాసుర వృత్తాంతాన్ని చెప్పి ధైర్యం చెప్పాడు. కర్ణుడి రథసారథ్యంలో విజయుడికి విజయం చేకూర్చేటట్లుగా రహస్యపు ఒప్పందం చేశాడు. ధర్మరాజునుండి విడిపోయినట్లు అతడు భావించకుండా ఉండేటట్లు నచ్చపలికాడు. తన రహస్య సహకారం అతడి కుంటుందని సూచిస్తున్నట్లుగా ధర్మరాజును గాఢతరంగా ఆలింగనం చేసికొన్నాడు. నిజానికి భౌతికంగా కౌరవపక్షంలో యుద్ధం చేస్తున్న శల్యుడు ధర్మరాజుకే విజయం చేకూరుస్తున్నాడు. ఈ రహస్యాన్ని కౌగిలింత అనే అలవాటును శల్యుడి పాత్రకు కలిగించి, ఆంగికాభినయంలో భాగంగా రచనలో చిత్రించి, నాటకీయతను తిక్కన పోషించాడు. ఇది ఒక విధమైన నిగూఢ అంతఃశిల్పం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక సన్నివేశంలో కార్యసాధన కొరకు ఒక్కొక్క పాత్ర ఒకరకమైన ఆంగికాభినయాన్ని పలుసార్లు ప్రకటిస్తున్నట్లు వర్ణించటం విశేషం. ఉదా॥ సంజయుడు ధృతరాష్ట్రుడి రాయబారిగా పాండవుల వద్దకు పోయినప్పుడు, వంగి వంగి నమస్కారాలు, సాష్టాంగ దండప్రణామాలు చేసినట్లు తిక్కన వర్ణించాడు. (చూడు. వివరాలకు ఉద్యోగం. 1.216, 1.272, 1.292, 1.303). పాండవులు రాజ్యభాగం కోరకుండా వారి మనస్సులు మెప్పించటమే అతడి రాయబారంలోని తాత్పర్యం. ఆ ప్రయోజనసాధనకై వినయాన్ని అతి వినయంగా ప్రదర్శించటం తిక్కన సంజయుడికి నేర్పిన అభినయం.

సమావేశాలకు, సభా చర్చలకు, వాదోపవాదాలకు, ఉపన్యాసాలకు, ఉపదేశాలకు, ఆలవాలమైన ఉద్యోగపర్వంలో వీరులుగా, నాయకులుగా చెలామణి అయిన పాత్రలు కొలువులలో మాట్లాడేటప్పుడు 'కలయం గనుగొని' మాట్లాడటం ఒక సభా మర్యాద రూపమైన ఆంగికాభినయాంశంగా తిక్కన తీర్చిదిద్దాడు. ఇది ఉద్యోగ పర్వమంతా కనబడే ప్రధానాంశం. (వివరాలకు చూడు. 1.6, 1.17, 1.307, 2.115, 3.130, 4.239 మొ.).

(ఆ). ఆహార్యాభినయం

ఉద్యోగపర్వంలో పాత్రల వస్త్రాద్యలంకరణాలు వర్ణించటం దాదాపు మృగ్యమే. వీరులను వర్ణించేటప్పుడు వారి ఆయుధాలను పేర్కొనటం భీమార్జునుల యందు ప్రచురంగా కనబడుతుంది. గాండీవధారియైన అర్జునుడు, గదాధారియైన భీముడు పలువురి చేత పలుమార్లు కీర్తింపబడతారు. శ్రీకృష్ణుడు చక్రధారి, కాని, యుద్ధంలో చక్రం పట్టనని ప్రతిజ్ఞ చేశాడు. రాజనీతిచక్రం పట్టాడు. అందువలన కాబోలు తిక్కన ఆతడి ఆంగిక ఆహార్య వైభవాన్ని మాత్రమే ఒక రమణీయమైన పద్యంలో వర్ణించాడు.

క. అంబుదశుభగాత్రుం బీ । తాంబరధరుఁ గమలదళనిభాక్షున్ హరిఁ జూ
డం బడసి లోచనము లమ్మృ । తం బానిన మాడ్కి సమ్మదంబునఁ దేలన్.' **(ఉద్యో. 3.254)**

నీలమేఘశ్యాముడు, పీతాంబరధరుడు, కమలదళాక్షుడు అనే విశేషణాలు శ్రీకృష్ణుడి దివ్యాదివ్యమూర్తిని ధ్వనింపజేసే అభినయ సంకేతాలు. ఈ నాలుగు విశేషణాలు ఉద్యోగ పర్వంలో మరే పాత్రకు వాడబడవు. శ్రీకృష్ణుడే శ్రీమన్నారాయణుడు అని ధ్వనింపజేసే ఈ పద్యం ఉద్యోగ పర్వానికే ఒక మణిదీపం.

ఆంగిక ఆహార్యాభినయ స్ఫూర్తితో వెలువడిన మరొక పద్యం కూడా కృష్ణ నామధేయురాలైన ద్రౌపదిని గురించి కావటం విశేషం.

ఉ. 'ద్రోవది బంధురం బయినక్రొమ్ముడి గ్రమ్మన విడ్చి వెండ్రుకల్
దా వలచేతఁ బూని యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలఁగ మనంబునఁ బొంగు విషాదరోషముల్
గావఁగ లేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై'. **(ఉద్యో. 3.114)**

విషాద రోషాలను వెలిగ్రక్కే ఆహార్యాభినయం ఇందులో ద్రోవది బంధురమైన క్రొమ్ముడి నాశ్రయించి సాగటం సార్థకం. ఆమె జడ నల్లనికాంతులతో మిలమిలలాడుతూ బుసకొట్టే మహాభుజంగమో అన్నట్లు వ్రేలాడటం ఆశ్చర్యకరమైన అభినయం. తెలుగు సాహిత్యంతో విషాద రోషాభినయానికి విశిష్టమైన ఆహార్యాభినయానికి ఉదాహరణం ఈ పద్యం.

(ఇ). వాచికాభినయం

ఉద్యోగపర్వంలో మూడింట రెండు పాళ్ళు సంభాషణలే ఉన్నాయి. పద్యనాటకాలలోని పాత్రలు పాడే పద్యాలవలె అనేక పద్యాలు ఉద్యోగం నిండా ఉజ్జ్వలంగా భాసిస్తున్నాయి. పద్యాలు పాత్రోచితంగా, సందర్భోచితంగా, రసోచితంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిక్కన రచించాడు. ఆయనే అక్కడక్కడ ఈ రహస్యాన్ని సూచించాడు కూడా. శ్రీకృష్ణుడు కౌరవసభలో రాయబారం జరుపుతూ ప్రదర్శించిన నేర్పరితనాన్ని ధర్మరాజుతో సంగ్రహంగా, విశ్లేషణాత్మకంగా పేర్కొన్నాడు. శ్రీకృష్ణుడి రాయబారాన్ని ప్రసిద్ధమైన తెలుగు పద్యాలతో తిక్కన నింపివేశాడు. అవి నాటకీయమైన శైలికి నాణ్యమైన ఉదాహరణాలు. ఆ పద్యాలలో కృష్ణుడు ప్రదర్శించిన వివిధ భావ దశలను ఆయన మాటల్లోనే ఈ విధంగా గమనించవచ్చును.

'...... ఏనును నాయోపినంత సామవాదంబు లాడితి; నారదాది మహామునులను సుయోధనునకు బుద్ధులు సెప్పునట్లు సేసితి; నేమిసెప్పినను నెంతటం బోకున్నం గినుక దెచ్చికొని జంకించియు భంగించియు ధిక్కరించియుఁ దృణీకరించియుం జూచితిఁ; గార్యంబు భగ్నం బగుట కొల్లక వెండియు శాంతవచనంబులు పలికితి; నతం డశక్తదుర్జనత సేయం జూచిన నమానుషంబు లగు వానం గొన్ని వెడమాయలం బన్ని పెక్కు పోకలం బోయితి; నెన్నిభంగుల సంధియ కావలయు నని పొరలం గల యంతయుం బొరలితి; నప్పాపాత్ముం డెట్లునుం జక్కంబడక తనచలంబుతోన పొట్టుపొర లయ్యుఁ గయ్యంబు వొడుచుం గాని యవశ్యంబును రాజ్యంబు పాలిచ్చువాఁడు గాఁడు; కౌరవులయెడ దండంబు దక్క నొండుపాయంబు లేదు; మీకుం బోలిన తెఱంగు సేయుండు'. (ఉద్యో. 4.33)

(ఈ). సాత్త్వికాభినయం

సాత్త్వికాభినయ వర్ణనలో తిక్కన అందెవేసిన చేయి. నాట్యశాస్త్ర మర్యాదలో సాత్త్వికాభినయానికి ఉన్న శక్తిస్థానాల నన్నింటిని విరాటపర్వంలో పరిణామక్రమస్ఫూర్తితో వర్ణించాడు. నానారసాభ్యుదయోల్లాసియైన విరాట పర్వంలో ఆ రచనా శిల్పం రక్తికట్టింది. విరాటపర్వంతో పోల్చి చూస్తే ఉద్యోగ పర్వంలో సాత్త్వికభావవర్ణనా వైచిత్రి తక్కువనే చెప్పాలి. ఎందరో పాత్రలు నానా భావ రసస్ఫోరకంగా మాట్లాడుతున్న సందర్భాలలో కూడా వారి సాత్త్వికాభినయాన్ని తిక్కన వర్ణించ లేదు. దానివలన వాచికాభినయానికి వాసి బాగా పెరిగింది. సూక్ష్మంగా పరిశీలించి చూస్తే ఒకటి రెండు విషయాలు గమనించవచ్చును.

1. సాత్త్విక సూచకంగా హాసాన్ని ఎడనెడ ప్రదర్శించటం. అందులోనూ కలకల నవ్వటం అనే అభినయాన్ని విశేషించి చెప్పటం.

(అ) శ్రీకృష్ణుడు ధర్మరాజుతో కౌరవులు చేసిన దుర్నయాలను పేర్కొంటూ దుష్టచతుష్టయం 'పుయిలోట దక్కి కలకల నవ్వుచుం బలికిన పలుకు లుగ్గడింప వచ్చునే' అని శ్రీకృష్ణుడు అన్నాడు (ఉద్యో. 3.37). శత్రుకృత అపహాస్యానికి సూచకం ఇక్కడి కలకల నవ్వటం.

(ఆ)క. 'వెఱ పెట్టిదియో యెన్నఁడు । నెఱుఁగని నీయట్టివాని కెవ్వరొకో యీ
పిఱికితన మింత యలవడఁ । గఱపినవా?'రనుచు శౌరి గలకల నవ్వెన్. **(ఉద్యో. 3.57)**

శ్రీకృష్ణుడి నవ్వు ఎగతాళి చేసేది కాదు ఎకసక్కెమాడేది.

(ఇ) కన్నీరు మున్నీరౌతున్న ద్రౌపదిని ఓదార్చటానికి ఉపాయంగా కలకల నవ్వును వాడిన వైనం విశిష్టం.

క. 'లలనా! యుడుగుము నీయే । డ్పుల కొలఁదియె కురునృపాల పుత్రకళత్రం
బులయేడ్పు? లింక వానిం । గలకల నవ్వుచు వినంగఁ గాలం బయ్యెన్.' **(ఉద్యో. 3.121)**

దుష్టచతుష్టయం కలకల నవ్వుతూ పాండవులను అవహేళన చేసిన దృశ్యాన్ని మరపించేటట్లు ఈ పద్యాన్ని నిర్వహించటం గమనించదగిన విషయం. కౌరవుల కళత్రాలు బావురుమని ఏడుస్తుంటే ఆ శోకనాదానికి ప్రతిగా ద్రౌపది కలకల నవ్వుతూ కసి తీర్చుకొనే ఒక భావచిత్రాన్ని కన్నుల ముందు రూపుకట్టించే కమనీయ పద్యశిల్ప మిది. ఉద్యోగపర్వం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గాంగేయుడు కలకల నవ్వటంతో ముగిసినట్లు చిత్రించటం కావ్యకళాశిల్పం. కర్ణుడు పాండవ సేనా సాగరాన్ని తన పరాక్రమ ప్రతాపంతో ఐదు రోజులలో ఇంకింప జేస్తానని శపథం చేసినపుడు భీష్ముడు కలకల నవ్వాడు. 'వట్టి మాటలు పలకటం కాదు గాండీవ గుణధ్వనికి ఎదురు నిల్చి పరాక్రమాన్ని ప్రదర్శించు' మని అపహసిస్తాడు. అంటే భీష్ముడు కలకల నవ్వటం భావికథార్థ సూచకం. పాండవ విజయ సంకేతం.

2. కలకల నవ్వటం అనుభావం ఔతుందా సాత్త్విక భావమౌతుందా అనే అనుమానం కొందరికి రావచ్చును. పై సన్నివేశాలలో కలకల నవ్వటం వివిధ భావస్థితులనే కాక మానసిక స్థితులను కూడ వ్యక్తం చేస్తున్నది. ఉద్యోగ పర్వంలో చాలా చోట్ల మానసిక స్థితి వ్యంజకాలైన అభినయాలనే వర్ణించాడు తిక్కన. అవి రసస్థితినందుకొన్న సాత్త్విక భావ దశలు. వాటిలో కావ్య నాటక మర్యాదలు రెండూ కలిసి కళామయంగా ప్రదర్శించబడ్డాయి. మచ్చుకు కొన్ని.

(అ) కౌరవ సభలో శ్రీకృష్ణుడి దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించిన సభాసదుల స్థితిని తిక్కన ఈ విధంగా వర్ణించాడు.

క. 'ఆ కొలువువారు గర మచ । లాకృతి నొక పలుకు లేక యందఱు వింజం
బాఁ కిడిన కరణి నవశ ము । దాకారిత చిత్తవృత్తులై యుండంగన్'. **(ఉద్యో. 3.255)**

ఈ పద్యంలోని చిత్తవృత్తి పరమాత్మను దర్శిస్తున్న మహర్షులు పొందే శాంతరసావస్థకు దీటుగా కనబడుతున్నది. శాంత చిత్తవృత్తులకే అటువంటి నిర్వికార మానసికావస్థ సాధ్యమౌతుంది. శ్రీకృష్ణుడి తేజోరూపం దర్శించిన భీష్మ విదుర ద్రోణ సంజయులు కన్నులు మూసికొన్నారట. అద్భుత భయానక రసాలు మనస్సులో నిండగా పుండరీకాక్షుడిని చూచి సాంద్రానందం పొందారట. (ఉద్యో. 3.405). ఇది కూడా అట్లాంటి బ్రహ్మానంద స్థితియే. ఆ తరువాత ధృతరాష్ట్ర విష్ణు దివ్య విజృంభణాన్ని దివ్యదృష్టితో చూచి ఆశ్చర్య రస నిమగ్నుడైనాడు (ఉద్యో. 3.410). ధృతరాష్ట్రుడు పొందింది, సాంద్రానంద స్థితి కాదు, ఆశ్చర్యమగ్న స్థితి. ఇట్లా పరిశీలిస్తే శాంత రసానందావస్థలను తిక్కన స్వయంగా అనుభవించి వాటిని ఆయా పాత్రల ద్వారా ప్రదర్శింపజేసినట్లున్నది.

(ఆ) వివిధ రసభావాలకు సంబంధించిన చిత్తావస్థలను సాత్త్విక స్ఫూర్తితో తిక్కన తేటతెల్లం చేశాడు. 'కినుక యెదఁగదురన్' (1.13), 'పరమానందంబు నొంది' (1.94), (వికచవదనుఁడగుచు' (1.99), 'మది వికాసముఁ బొందన్' (1.103, 1.276) 'చిత్తంబు కలఁత దేరె' (1.214), 'చిత్తంబు ప్రసన్నతం బొంద (3.132), 'గద్గద కంఠి' (3.100, 3.182), 'మోము విచ్చుచు' (3.207), 'మొగంబు రాజుచుండ' (4.25), 'దరహసిత వదనుండు' (3.58).

తిక్కనగారి సాత్త్విక భావ పరిణామ వర్ణన నైపుణ్యాన్ని తెలిసికొనటానికి గ్రుడ్డిరాజైన ధృతరాష్ట్రుడి హావభావాల చిత్రణం ఒక చక్కని ఉదాహరణం.

క. 'అన విని నిరుత్తరుం డయి । మనుజేంద్రుఁడు గొంతసేపు మ్రాన్పడి తలఁపుల్
పెనఁగొన నిద్రాహీనిం । దను వలయఁగ విదురుతోడఁ దా నిట్లనియెన్''. **(ఉద్యో. 3.53)**

జడపదార్థాలుగా భావింపబడే సూర్యచంద్రాదులను సైతం మానవీకరణం చేసి వారి చేత సాత్త్విక భావాలను ప్రదర్శింప చేయటం తిక్కన ప్రకృతి వర్ణనలో ప్రదర్శించే ప్రతిభ. మచ్చుకు.

తే. 'తనకులంబునఁ బుట్టిన ధార్తరాష్ట్రు । లన్నదమ్ములతో విగ్రహంబు గొనుట
కుమ్మలించి వివర్ణత నొందినట్లు । గంది యెంతయుఁ జెలువేదెఁ జందురుండు'. **(ఉద్యో. 2.107)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6. ఉద్యోగపర్వం - శిల్పానుశీలనం

మహాభారత విమర్శకులు ఉద్యోగపర్వాన్ని అనేక ముఖాలుగా సమీక్షించారు. నీతిశాస్త్రజ్ఞులకు నీతిశాస్త్రంగా మహాభారతం ప్రమాణంగా నిలవటానికి ప్రామాణికమైన ప్రయోగభాగంగా ఉద్యోగ పర్వాన్ని సంభావించారు. రాజనీతిలోని నీతిచాతుర్యం ఆరు రకాలుగా ప్రకాశిస్తూ ఉంటుంది.

1.వ్యూహాత్మకం 2.ప్రసంగాత్మకం 3.చతుర వచన రచనాత్మకం 4.ఉపన్యాసాత్మకం 5.క్రియాత్మకం 6.శాస్త్రబోధాత్మకం.

ఈ ఆరు లక్షణాలు ఉద్యోగపర్వంలో నిర్వహింపబడినా వాటిలో ప్రధానంగా ప్రసంగాత్మకాలూ ఉపన్యాసాత్మకాలూ పోషించబడ్డాయని విమర్శకులు భావించారు. రాజనీతిపరమైన ప్రసంగోపన్యాసాల శిల్పకళాలక్ష్మికి వజ్రకిరీటం వంటిది ఉద్యోగపర్వమని కీర్తించారు. ఈ పర్వానుశీలనంలో ఈ అంశమే మొదట ఎన్నదగింది.

ఆంధ్ర మహాభారతోపన్యాసాలలో ఉద్యోగపర్వాన్ని సమీక్షిస్తూ కీ.శే.నండూరి బంగారయ్యగారు ఈ అంశంమీద ప్రకటించిన కొన్ని అభిప్రాయాలు సాహితీ లోకంలో బాగా ప్రచారం చెందాయి. వాటిలో కొన్ని:

1. "ఉద్యోగ పర్వమున నన్నిటికంటెను మిక్కిలి మెచ్చుకొనదగినది వస్తుసంవిధాన చాతుర్యము. దీనినే వస్తు ప్రదర్శన శక్తి యని కూడా పేర్కొనవచ్చును. ఇందున్న రాయబారములకు గాని ప్రసంగములకు గాని సారాంశము తేల్చవలసివచ్చినచో మూడు వాక్యములలో జెప్పవచ్చును. "దుర్యోధనాదులు పాండవులపై నకారణముగ బగబూని శైశవము నుండియు బడరాని యిడుమలకు బాల్పరచిరి. అన్నిటికిని నోర్చుకొని పాండవులు శాంతాత్ములై తమ తండ్రి పాలు తమ కిచ్చినచో సంధియగునని వార్త పంపుచున్నారు. వారు తండ్రి పాలు వారి కిచ్చుట కంటెను న్యాయమేమున్నది?" కృష్ణుడే కానిండు. ఎవరు చెప్పిన వాక్యములకైన నింతే సారాంశము. అందుచే పర్వమునందలి వస్తువునంతను నించుమించుగఁ బునరుక్తి క్రింద జమకట్టుకొనవలసి యున్నది. కాని ఈ పునరుక్తిని ఏ మాత్రమును విసుగురానీకుండ ప్రపంచించుటలోనే ప్రదర్శన ప్రాగల్భ్యమున్నది." (పుట.150)

2. ఉద్యోగ పర్వంలోని ప్రసంగాల వంటివి మరే పర్వంలోనూ సాధారణంగా కనబడవు. వాటిని 1.పరస్పర ప్రసంగాలని, 2.ఉపన్యాసాలని రెండు విధాలుగా విభజించవచ్చును. వ్యక్తులు ఒకరితో ఒకరు మాట్లాడుకొనే ప్రసంగాలు, పరిమిత సంఖ్యలో కూడి మాట్లాడుకొనే ప్రసంగాలు ఒక రకమైతే, వేదికలపై నిలిచి చేసే ప్రసంగాలు ఉపన్యాసాలు మరొక రకం. అన్ని రకాలకూ ఆదర్శప్రాయమైన ఉదాహరణలు ఉద్యోగపర్వంలో లభిస్తాయి. ఈ అంశాన్ని కీ.శే.నండూరి బంగారయ్యగారి మాటలలో గమనిద్దాం.

"ఈనాడు పార్లమెంటరీ చర్చలలో నేమి, సమర ప్రచారమున నేమి, ఎలక్షనులలో నేమి, వక్తృత్వమున కొక ప్రత్యేక గౌరవమున్నది. దీని నొక కళగా నభ్యసించి యారాధించుచున్నాము. ఉపన్యాసము నెట్లు మొదలు పెట్టవలెనో క్రమముగా ప్రతిపాద్య విషయము నెట్లు విపులీకరించుకొనవలయునో ఈ యంశముల నన్నిటిని జాగరూకతతో కృషి చేసి సాధించుచున్నాము. భారతములో గూడ "సభలో నెట్లుపన్యసింప వలయును" అను ప్రశ్నకు సమాధానము లభ్యమగుచున్నది.

క. మనమునకుఁ బ్రియంబును హిత । మును బథ్యము తథ్యమును నమోఘము మధురం
బును బరిమితమును నగుపలు । కొనరఁగఁ బలుకునది ధర్మయుతముగ సభలన్.

ఈ గుణము లన్నింటికి లక్ష్య భూతములు కాదగియున్నవి సంజయ శ్రీకృష్ణుల యుపన్యాసములు. వాక్యోపవాక్యముల నిర్మాణమునందును, విషయ విభాగము నందును, వస్తు ప్రదర్శన శక్తియందును, నివి ప్రత్యేకముగా బరిశోధనార్హములు, ఉపన్యాసకళకు ఆదర్శముగ గ్రహించి వీని నారాధించినను నారాధింపవచ్చును." (పుట 158)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

3. ''ఈ యుద్యోగ పర్వమును బఠించుచుండగ నీనాటి యుద్ధ సన్నాహములు, ఈనాటి కపట ప్రచారములు, ఈనాటి యుపన్యాస నైపుణ్యము లన్నియు ప్రత్యక్ష మగుచుండును. అందుచేతనే ఈ పర్వము మన కింత యామోదదాయకముగ నున్నది.''

''ఇందలి (**Repartee**) సమాధాన నైపుణ్యమొకటి ప్రత్యేకముగా గణనీయము. ఎదుటివారి మనస్సులోని కౌటిల్యములను వారి వాక్కులలోని నక్కవినయములను గ్రహించి వాత పెట్టినట్లుగ సమాధానమిచ్చుట పలు తావుల గనవచ్చుచున్నది.

క. 'అనుజులు నీవును ద్రోవది । యును బుత్త్రచయంబు నున్న యోగక్షేమం
బున తెఱఁగారయఁ బుత్తెం । చె నితాంత స్నేహపూర్ణ చేతోవృత్తిన్'. **(ఉద్యో. 1.274)**

అని సంజయుడు ధృతరాష్ట్రుని పక్షమున పాండవుల క్షేమము విచారింపగా దానికి ధర్మరాజిచ్చిన సమాధానము.

క. 'ఆరాజు మాదెసంగల । కారుణ్యము కతమునను సుఖంబున ని ట్లు
న్నారము; నినుఁ బుత్తెంచిన । గారవమున నాదుమది వికాసముఁ బొందెన్.' **(ఉద్యో. 1.276)**

దీనిలోని భావమును సంజయుడు గ్రహింపక పోలేదు. మరల నీ యంశమును గూర్చి ధృతరాష్ట్రునితో ముచ్చటింప వలసి వచ్చినపుడు

క. 'వా రెల్లను భవదీయ । స్ఫారబలము గారణముగ సౌఖ్యంబున ను
న్నారమని పలుకుదురు; నిజ । మారయఁగా నట్లగాదె యది జననాథా!' **(ఉద్యో. 2.6)**

అని వ్యాఖ్యానించుచున్నాడు.

సంజయుని దుర్యోధనాదుల కుశలము నడుగుటలో ధర్మరాజు నిష్ఠురము నెంతో నిపుణముగ బ్రయోగించుచున్నాడు (ఆ.2.ప.277-281) అతని వాక్య విజృంభణము నంతను సంజయు డొక్కమాటలో గట్టివేయుచున్నాడు.

క. 'పొం దొందఁగ దలఁచితి వీ । విందుశిశిరమైన విమల హృదయంబున వా
రందఱకును సేమం బిట । ముందఱ లేకున్న నేఁడు మొదలుగఁ గలుగున్'. **(ఉద్యో. 1.283)**

కొన్ని కొన్ని స్వల్పాంశములను బెద్దగ కొనియాడుటయు, ప్రధానాంశమును దాచి పెట్టుటయు నిప్పటికి అప్పటి సామాన్య ధర్మమే.

ఉ. 'శాంతత బొంది కార్యము దెసన్ ధృతరాష్ట్రమహీశుఁ డాత్మ న
త్యంతముఁ దేటి న న్నిటఁ బ్రియంబునఁ బంపెడునప్డు నాకుఁ దే
రెంతయు వేడ్కఁ దాన వెర వేర్పడఁ జెప్పుచుఁ బన్నఁబంచె; ని
ట్లింత ఘటించెఁ బొందు; మన మీ పదనం దెలివొందఁగాఁ దగున్'. **(ఉద్యో. 1.293)**

ధృతరాష్ట్రుడు పాండవులకడకు బోవుచున్న సంజయుని రథమును స్వయముగ బన్నించినాడట. ఇదియొక గొప్పగ నాతడు గొనియాడుచున్నాడు. కాని పాలిచ్చుట గూర్చి యేమియు బలుకడు. అంతస్సారము శూన్యమైన ఈ యుపన్యాసము నొక్కమాటలో వాసుదేవుడు ఖండించుచున్నాడు.

క. ‘ఆ రాజు సేయు నెయ్యము । గారామును జెప్పె దీవు గడుఁదీపులుగా
వీరు దమపాలు వడయక । నేరిమి మాటలనె తీరనేర్తురె చెపుమా?’ **(ఉద్యో. 1.340)**

అసలు విషయమును గప్పిపుచ్చి అప్రధాన విషయములకు ప్రాధాన్యమిచ్చి మాటలాడుటయు నీ దొంగతనమును బట్టుకొని యెదిరి వారల్లరి చేయుటయు నేడే కాదు, నాడు గూడ గన వచ్చుచున్నది. దానినే మా ప్రాంతములలో నరచేతిలో తేనెవేసి మోచేతి వరకు నాకించుట యని వ్యవహరింతురు. ఈ నైపుణ్యమంతయు ప్రదర్శనశక్తిలోనే చేరును.

సంప్రదింపు సభలలోని ప్రసంగములలో పైగుణములు మాత్రమేగాక యిప్పటి **Symposiums** లోను పార్లమెంటరీ డిబేట్సులోను గానవచ్చు చర్చా నైపుణ్యము, ఒక మతమువా రిచ్చిన యుపన్యాసములోని ఒక్కొక్క యంశమునే గైకొని వరుసగా సమాధానమిచ్చు క్రమప్రకారమును ఇందు గానవచ్చుచున్నది. భారతము నందలి యుపన్యాసములను పరిశోధించినపుడు వాక్యోపవాక్యముల తార్కిక క్రమము (**Logical sequence**) లోగాని, అలంకారశోభ (**Rhetoric**) లోగాని, సమష్టియై గనవచ్చు స్నిగ్ధతాసంసిద్ధి (**Total finish**) లోగాని, విమర్శనాశక్తిలోగాని, వ్యాఖ్యాన పాటవములోగాని, సమాధాన నైపుణ్యములోగాని వక్తృత్వము ఎంతో యభివృద్ధినందిన దనుకొనుచున్న యీనాటి యుత్తమోపన్యాసముల కేమాత్రము దీసిపోవు. లాయడ్ జార్జి-(**Lloyd George**), విన్‌స్టన్ చర్చిల్ (**Winston Churchill**) మున్నగు నాధునిక మహావక్తల యుద్ధ సమయములందలి యుపన్యాసములను గైకొని సంజయ శ్రీకృష్ణుల యుపన్యాసములతో బోల్చి చూచినచో మనము భారతీయులమను పక్షపాత బుద్ధిని దూరముగా నుంచి విమర్శించినను కడపటివారిదే పైచేయియని నిర్ణయింపక తప్పదు.

శిల్ప విధానము (**Technique**) స్థూలదృష్టి కించుమించుగా నొక్కటిగానే కానవచ్చుచున్నను వ్యక్తుల తారతమ్యమును బట్టి వానిలో సూక్ష్మ వ్యత్యాస మేర్పడకపోదు. ఏ కళయైనను సరే కావ్య రచనయే కానిండు. ఉపన్యాస ప్రధానమే కానిండు, విమర్శనమే కానిండు వ్యక్తుల యనుభావముపై (**personality**) గాఢముగ నాధారపడియుండును. శ్రీకృష్ణుని యనుభావము వేరుగ వివరించి చెప్పనక్కరలేదు. ఇక సంజయుడు కూడ సామాన్య వ్యక్తి కాడు. జీవన్ముక్తుడై ఈశ్వర సాక్షాత్కృతి నందిన మహాపురుషుడు. (ద్వి. ఆ.319, 320) అందుచే వ్యక్తిగతమైన యీతని యనుభావమంతయు నాతని ప్రసంగములలో ప్రతిబింబించుచున్నది. కార్యమెట్లయినను సంఘటింపవలెను. నుదారభావముతో బాండవుల కడకు వచ్చినపుడు కౌరవుల పక్షమున మాటలాడినాడే కాని నిజమున కాతనికున్న ధర్మోత్సాహ మపారము. ఇది కౌరవుల సభలో పాండవుల కడ నడచిన వృత్తాంతమును గూర్చి యాతడు చేసిన నివేదనములో ప్రత్యక్షమగుచున్నది. సంజయ శ్రీకృష్ణులకున్న మాహాత్మ్యమును ధర్మోత్సాహమును వారి యుపన్యాసములకు నుజ్జ్వలమైన శక్తిని ప్రసాదించుచున్నవి. అతీత భూముల నుండియు, సమదర్శనము నుండియు నుదయించువారి యుపన్యాసములలో సంచరించు దివ్యశక్తి స్వార్థ పరత్వము తోడను, హింసాపంకిలమైన యుద్రేకము తోడను నాడిన లాయడ్ జార్జి, చర్చిల్ మున్నగు వక్తల సమరోపన్యాసములలో నెట్లు ప్రత్యక్షము కాగలదు? కొంత కాలమునకు పూర్వము జాతీయత (**Nationalism**) అనగా నేదో మహోన్నతమైన యాదర్శముగా గౌరవించుచుండిరి. కాని రెండు ప్రపంచ మహాసంగ్రామములు చెలరేగి దాని గుట్టు నంతను బయట పెట్టినవిగదా?” (పుటలు 163-166).

(1). ఉపన్యాస శిల్పం

పాండవ కౌరవ పక్షాలలో ప్రసిద్ధులైనవారందరూ ఉద్యోగపర్వంలో ఆయా సందర్భాలలో ఏదో రకంగా ఉపన్యసిస్తారు. కథ యుద్ధం వైపు నడుస్తున్నది కాబట్టి దానికి ఉన్ముఖంగా ఒకవైపు. ఉపశమనాత్మకంగా మరోవైపు తర్కబద్ధమైన వాక్య

సముదాయంతో స్వీయ తాత్పర్య ప్రతిపాదనం చేయడానికి పాత్రలు ప్రయత్నిస్తాయి. సత్య ప్రతిపాదన లక్ష్యంతో సాగే ఉపన్యాసానికి తర్కం అంతస్సూత్రం. ఎవరి తర్కం వారిదిగా కనబడుతున్న పాత్రల ఉపన్యాసాలలోనూ, ప్రసంగాలలోనూ తర్కశాస్త్ర ప్రమాణాలు ప్రతిఫలిస్తూనే ఉంటాయి. రాజనీతిశాస్త్రానికి అనుగుణమైన తర్కశాస్త్ర మర్యాదలు తొణికిసలాడుతూ ఉంటాయి. వాటిని వివిధ వాక్య విన్యాసాలలో ఉపన్యాస శిల్పంగా వెలువరించిన తిక్కన ప్రజ్ఞ ఉద్యోగపర్వానికి సాహిత్యోపాయనంగా లభించింది. రాజనీతిశాస్త్ర దృక్పథంతోకాని, తర్కశాస్త్ర దృక్పథంతోకాని ఉద్యోగపర్వాన్ని విస్తృతంగా వ్యాఖ్యానించవచ్చును. కాని, ఇక్కడ స్థాలీపులాక న్యాయంగా సమీక్షించటానికే వీలౌతుంది.

ప్రతిపాద్యాంశానికి లక్షణ పరిష్కారం చేస్తూ పదార్థ స్వరూప స్వభావాలను విశదీకరించడం తర్కశాస్త్ర పద్ధతి. తర్కం వాదాన్ని ఆశ్రయించి సాగుతుంది. అందువలన తర్కశాస్త్ర పద్ధతి వాదశైలి మీద ప్రధానంగా ఆధారపడిఉంటుంది. ఒక చిన్న విషయాన్నికానీ, ఒక పెద్ద విషయాన్నికానీ ఎంతగా విపులీకరిస్తే బాగుంటుందో, ఎంత సంగ్రహంగా చెబితే సరిపోతుందో వక్త తన వాదవిధానంలో నిర్ణయించుకొంటాడు. వాదంలో ప్రమాణం ఉండాలి. హేతువుండాలి. వాటిని ప్రయోగించే శక్తియుక్తులుండాలి. ఉద్యోగపర్వంలోని నాయక పక్షంలోని పాత్రలు హేతుబద్ధంగా మాట్లాడుతాయి. దుర్యోధనాదులు హేత్వాభాసను అమితంగా ఆశ్రయిస్తారు. ఈ భేదం వారి ప్రసంగాలలో ఉపన్యాసాలలో స్పష్టంగా కనబడుతుంది.

స్థూలంగా పరిశీలిస్తే ఉద్యోగపర్వంలోని దూతలు చేసే ఉపన్యాసాలు మూడు. వాటిలో ద్రుపద పురోహితుడి ఉపన్యాసం ప్రత్యక్ష ప్రమాణాన్ని ఆశ్రయించి సాగుతుంది. సంజయుడి రాయబారపు ప్రసంగం అనుమాన ప్రమాణం ప్రాతిపదికగా ప్రవర్తిల్లుతుంది. శ్రీకృష్ణుడి ఉపన్యాసాలు ఆప్తవాక్య ప్రమాణ ప్రాతిపదికగా ప్రకాశిస్తాయి. విశేషమేమంటే పంచపాండవులు, ద్రౌపది చేసే ఉపన్యాసాలలో జంటలు జంటలుగా ఒక్కొక్క ప్రమాణాన్ని ఆశ్రయించుకొని మాట్లాడుతారు. ఉదాహరణకు ద్రౌపది, సహదేవుడు ప్రత్యక్ష ప్రమాణవాదులు. భీముడు, అర్జునుడు అనుమాన ప్రమాణవాదులు. ధర్మజుడు, నకులుడు శబ్ద ప్రమాణవాదులు. ఈ విధంగా పాండవ పక్షం సాగించే ఉద్యోగపర్వకథాఘట్టం తర్కశాస్త్రజ్ఞులు తర్కశాస్త్రమని కీర్తించే విధంగా సాగుతుంది.

కౌరవపక్షంలో విపరీత తర్కం విశేషంగా ప్రకటితమౌతుంది. వారి వాదనలలో హేత్వాభాసతో కూడిన వితండవాదం గోచరమౌతుంది. అందులోను దుర్యోధనుడు ప్రత్యక్ష ప్రతికూల ప్రమాణవాది; కర్ణాదులు విపరీత అనుమాన ప్రమాణవాదులు. ధృతరాష్ట్రుడు ఆప్తవాక్య ప్రతికూలవాది. వ్యాసాదులు ప్రత్యక్ష ప్రమాణవాదులు. భీష్మాదులు అనుమాన ప్రమాణవాదులు. విదురాదులు శబ్ద ప్రమాణవాదులు. ఈ విధంగా కౌరవపక్షంలో తర్కవితర్క హేతువాద శక్తుల పరస్పర వైరుధ్య విలాసం ప్రకటితమౌతుంది. శాస్త్రం తెలిసిన వారు ఈ లోగుట్టులను విశ్లేషించుకొని ఉద్యోగపర్వంలోని ఉపన్యాసాలలో ప్రసంగాలలో ప్రదర్శితమయ్యే వైవిధ్యాన్ని, వైశిష్ట్యాన్ని తెలిసికొనగల్గుతారు. ఒకవేళ శాస్త్ర విశ్లేషణ తెలియకపోయినా అపూర్వ చమత్కార ప్రసంగ విన్యాసాల ప్రతిభా పరిమళాలను సహృదయులు ఆమోదించి సంతోషిస్తారు. సుప్రసిద్ధ న్యాయశాస్త్రవేత్త రఘునాథ శిరోమణి,

"విదుషాం నివహై రిహైకమత్యాత్
య దదుష్టం నిరటఙ్కి యచ్చ దుష్టమ్
మయి జల్పతి కల్పనాధినాథే
రఘునాథే మనుతాం తదన్యథైవ" (తత్త్వచింతామణి, వ్యాఖ్యాదీధితి, ఈశ్వరానుమానం చివర)

పండితులందరు కలసి నిర్దుష్టమని నిరూపించిన విషయాన్ని దుష్టంగానూ, వారు దుష్టమని నిరూపించినదాన్ని నిర్దుష్టంగానూ నిరూపించగలగటం తర్క పండితుడి ప్రజ్ఞ. ఉద్యోగపర్వంలో పాండవులు ఏది నిర్దుష్టమంటారో కౌరవులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దాన్ని దుష్టమంటారు. పాండవులు దేన్ని దుష్టమని పేర్కొంటారో కౌరవులు దాన్ని నిర్దుష్టమని నిరూపిస్తారు. ఈ తార్కికవాదబలమే ఇన్ని ఉపన్యాసాలకూ, ప్రసంగాలకూ మూలకందమై నిలవటం ఈ పర్వంలోని విశేషం.

(2). ద్రుపద పురోహితుడు ప్రత్యక్ష ప్రమాణవాది

1. పురోహిత దౌత్యానికి ప్రాతిపదిక ఉపప్లావ్యంలో శ్రీకృష్ణాదులు నిశ్చయించిన వ్యూహం. వారు అందరు వ్యక్తం చేసిన భావాలను ప్రత్యక్ష ప్రమాణాలుగా గ్రహించి కౌరవసభలో ప్రతిపాదించటమే పురోహితుడి కర్తవ్యం.

2. జరిగిన కథను ప్రత్యక్ష ప్రమాణంతో పూసగ్రుచ్చినట్లుగా చెప్పి కౌరవుల దుర్ణయాన్ని సభలో బట్టబయలు చేయటమే ఇతడి ఉపన్యాస ఆరంభ శిల్పం. ఉద్యోగపర్వంలోని ప్రథమాశ్వాసంలో 231వ పద్యం నుండి 241వ పద్యం వరకు సాగించిన అతడి ఉపన్యాసం వాస్తవాన్ని సమీక్షించి అవినీతిని నిందించి శ్రేయస్సును బోధించే సత్యప్రతిపాదన స్వభావం కలిగిన వాక్యజాతం. నిజాల నిప్పులను వెదజల్లినట్లు అతడి మాటలు నిష్ఠురంగానే ఉంటాయి. ఇది ప్రత్యక్ష ప్రమాణవాది ప్రసంగ స్వభావం. ఇదే స్వభావం సహదేవుడి వాక్యాలలో ద్రౌపది ఉపన్యాసంలో గోచరిస్తుంది. ప్రత్యక్ష ప్రమాణవాదుల ఉపన్యాస సంభాషణ శిల్పంలో ఒక సమాంతర రచనా శిల్పాన్ని తిక్కన పోషించాడు. ఇక వైవిధ్య దృష్టితో పరిశీలిస్తే బ్రాహ్మణవాక్యం నిర్వికారమైన నిష్ఠుర సత్యం. సహదేవుడి ప్రసంగం సాభిమాన సత్యావేశం. ద్రౌపది ఉద్వేగపూరిత ఉపన్యాసం ప్రత్యక్ష ప్రమాణాల నాధారంగా చేసికొని సాగిన రోషావేశపూరితమైన నిష్ఠుర ప్రసంగం. ప్రత్యక్షవాదుల వాక్యాలలో నిజాలతో కూడిన నిష్ఠురత నిండి ఉండటం వారి ఉపన్యాస శిల్పమని తిక్కన నిష్కర్ష.

(3). సంజయుడు అనుమాన ప్రమాణవాది

"అనుమితి కరణం అనుమానం పరామర్శ జన్యం జ్ఞానమ్ అనుమితిః". (తర్కసంగ్రహం పుట.57).

అనుమితి అనే యథార్థ అనుభవానికి అసాధారణ కారణమైనది అనుమానం. పరామర్శ వలన కలిగే జ్ఞానం అనుమితి అనబడుతుంది. తెలిసిన దానితో తెలియని మరో దానిని ఊహించటంలో తోడ్పడేది హేతువు. హేతువుకూ సాధ్యానికీ అవినాభావ సంబంధం ఉన్నప్పుడే కార్యం సాధించబడుతుంది. దానినే వ్యాప్తి అంటారు. దీనిని ధృతరాష్ట్రపరంగా, ధర్మరాజుపరంగా అన్వయించవచ్చును. ధృతరాష్ట్రుడు పురోహితుడి సందేశం వలన పాండవులు యుద్ధ ప్రయత్నంలో ఉన్నారనీ, ధర్మరాజు క్రోధమూర్తి అయి ఉన్నాడనీ తెలిసికొన్నాడు. "యత్ర యత్ర ధూమ స్తత్ర తత్ర అగ్నిః" అనే హేతువును పురస్కరించుకొని ద్రుపద పురోహితుడి వాక్యాలు ధూమరాశిగా భావించి ధర్మజుడి కోపమనే అగ్నిని ధృతరాష్ట్రుడు అనుమానించాడు. దానిని ఆర్పటానికి చేసే విశిష్ట రాజనీతి యత్నమే సంజయుడి రాయబారం. అనుమానం రెండు విధాలు. 1.స్వార్థానుమానం. 2.పరార్థానుమానం. తనకు స్వయంగా కల్గిన అనుమితికి కారణమైన అనుమానం స్వార్థానుమానం. ధృతరాష్ట్రుడు మంత్రులకు, హితులకు చెప్పకుండా ధర్మరాజును శాంతపరిస్తే అతడి క్రోధం వలన కలుగబోయే యుద్ధం సమసిపోతుందని భావించాడు. ఈ స్వార్థానుమానాన్ని సంజయుడి ద్వారా పరార్థానుమానంగా పరివర్తింపజేశాడు. పొగవలన అగ్ని ఉంటుందని నిశ్చయించుకొన్నవాడు తన వెంటనున్న మిత్రుడికి ఆ నిశ్చయాన్ని కల్గించడానికి ప్రయత్నిస్తాడు. ఆ విధంగా ధర్మజుడి క్రోధోపశాంతి కోసం దూతగా సంజయుడిని పంపుతాడు. ఇందులో ప్రధానంగా ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణం, ఉపనయం, నిగమనం అనే అయిదు అంగాలు ప్రయోగించబడుతూ ఉంటాయి. సంజయుడి రాయబారంలో తిక్కన ఈ అయిదంగాలనూ నిపుణంగా ప్రయోగించాడు. సంజయుడి రాయబారపు ఉపన్యాసంలో ఉన్న సంవిధానశిల్ప మిదే. స్వార్థానుమితి పరార్థానుమితులకు పరామర్శయే ప్రధాన స్వభావం. అందువలన సంజయుడి వాక్యాలలో పరామర్శయే ఉంటుంది కాని మరే పరమార్థ సాధనమూ ఉండదు. ఈ విషయాన్ని గమనించిన ధర్మరాజు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'ఆ రాజు మాదెసం గల । కారుణ్యము కతమునను సుఖంబున ని ట్లు
న్నారము; నినుఁ బుత్తెంచిన । గారవమున నాదుమది వికాసముఁ బొందెన్.' (ఉద్యో. 1.276)

అని ఎత్తిపొడిచాడు. జనార్దనుడు కూడ జంకు గొంకు లేకుండ ఈ విధంగా ఎత్తిపొడిచాడు.

క. 'ఆ రాజు సేయు నెయ్యము । గారామును జెప్పె దీవు గడుఁదీపులు గా
వీరు దమపాలు వడయక । నేరిమి మాటలన తీర నేర్తురె చెపుమా!' (ఉద్యో. 1.340)

సంజయుడి రాయబారాన్ని సమగ్రంగా సమీక్షిస్తే స్వార్థపరార్థ అనుమానాలు రాజనీతిపరమైన సామోపాయాన్ని ఆశ్రయించి లక్ష్యాన్ని సాధించటానికి ప్రయత్నించాయి. కాని, హేతుఫలసిద్ధి దానికి లేకపోవటంచేత అవి హేత్వాభాసంగా మిగిలిపోయాయి. నిశ్చయించబడిన సాధ్యం కల కార్యం స్వపక్షం అనబడుతుంది. నిశ్చిత సాధ్యాభావం కలది విపక్షం అనబడుతుంది. ధృతరాష్ట్రుడు స్వపక్షంగా ప్రారంభించినా సంజయుడి రాయబారం విపక్షంగా ముగిసింది.

ధర్మరాజాదులు కూడ సంజయుడి రాయబారం వలన రాజ్యప్రాప్తి సాధ్యమౌతుందని భావించారు. చివరకు సంజయుడు పొగ కాదనీ, రాజ్యప్రాప్తి అనే అగ్ని అనుమానించబడినా అది విపక్షమైపోయిందని తెలిసికొన్నారు. అనుమాన ప్రమాణాలతో సాగిన సంజయుడి రాయబారపుఘట్టం సఫలమౌతుందన్న ఆశతో మొదలై విఫలం కావటంతో ముగియటం వలన ఏర్పడిన పరామర్శ రూపమైన సంభాషణల చమత్కారం వైరుధ్య శిల్పంతో పోటాపోటీగా ఈ ఘట్టంలో రాణిస్తుంది. ఇది ఇందులోని వైచిత్ర్యం. ఇందులో మరొక విశేషమున్నది. సంధికార్యం వలన యుద్ధనీతిని శాస్త్రోక్తంగా ప్రదర్శించవచ్చునని భావించినా, ధర్మరాజు ఉపన్యాసం భీమార్జునులకు రుచించకపోయినా దానిని పరామర్శిస్తూ అంగీకరించారు. అందులో ధర్మజుడి స్వార్థానుమానం భీమార్జునులలో పరార్థానుమానంగా ప్రకాశించింది. దానివలన భీమార్జునులతో శ్రీకృష్ణుడు చేసిన సంభాషణలు చమత్కారవంతంగానూ రమ్యగంభీరంగానూ ఉండగల్గాయి. ఈ విధంగా స్వార్థానుమితి పరార్థానుమితిగా వ్యాపించి విపక్షంగా పరిణమించే ఘట్టంలోని పరామర్శ వాక్య చమత్కారాలకు ఉద్యోగపర్వం ఉదాత్త ఉదాహరణంగా నిలుస్తున్నది.

(4). శ్రీకృష్ణుడు ఆప్తవాక్యప్రమాణవాది

'ఆప్తవాక్యమ్ శబ్దః' 'ఆప్తస్తు యథార్థవక్తా' అని తర్క సంగ్రహం. ఆప్తుడి మాట శబ్ద ప్రమాణం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడేవాడు ఆప్తుడు. పాండవులకు అన్ని విధాలా ఆప్తుడు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుడి వాక్యమే పాండవులకు వేదవాక్యమని ధర్మరాజు సంజయుడి ముందు ప్రకటించాడు. "వాక్యమ్ ద్వివిధమ్, వైదికమ్ లౌకికం చేతి వైదిక మీశ్వరోక్తత్వాత్ సర్వమపి ప్రమాణమ్. లౌకికంతు ఆప్తోక్తం ప్రమాణమ్, అన్యదప్రమాణమ్" అని తర్క సంగ్రహం. శ్రీకృష్ణుడు దివ్యాదివ్యుడుగా పాండవులకు ఆప్తుడైనాడు. కృష్ణుడి వాక్యం పాండవులకు ఈశ్వరవాక్యం, ఆప్తవాక్యం కూడ. ఈ ఉభయ ప్రవృత్తులు ఉద్యోగపర్వంలోని శ్రీకృష్ణుడి ప్రసంగాలలో, ఉపన్యాసాలలో ప్రకటితమౌతూ ఉంటాయి. ఆ పాత్రలోని వాక్య చమత్కారమంతా ద్వివిధ వాక్య ప్రమాణాశ్రితమైన సంభాషణల మీదనే ఆధారపడి ఉన్నది. దీనిని సాంగంగా ఆవిష్కరించటమే శ్రీకృష్ణపాత్రలోని అంతరార్థం.

కౌరవసభలో శ్రీకృష్ణుడు చేసిన ఉపన్యాసం ఆప్తవాక్య ప్రమాణంతోనే చేసే తార్కిక వాక్య విన్యాసానికి చక్కని తార్కాణం. ఎత్తుగడయే దాన్ని ధ్వనింపజేస్తున్నది.

క. 'జననాథ! నీ యెఱుంగని । పనులు గలవె? యైనఁ దగవుఁ బరమ హితంబుం
దనవారికిఁ జెప్పన తగు । నని వచ్చితి భారతాన్వయము ప్రియ మొందన్.' (ఉద్యో. 3.257)

ఈ పద్యం ప్రత్యక్షర సార్థకం. ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడికి బంధువు కావచ్చును కాని, నిండుకొలువులో ఆయనను జననాథుడి గనే భావించి సంబోధిస్తున్నాడు. శ్రీకృష్ణుడు వచ్చిన కార్యం జనహితానికి సంబంధించినది. జనహితం తెలిసిన వాడే జననాథుడు. అందువలన ధృతరాష్ట్రుడు ధర్మస్వరూపం తెలిసినవాడు అయిన జ్ఞాని అయి ఉండాలి. అట్టి జ్ఞానం కలవాడై ఉండాలని ధృతరాష్ట్రుడిని హెచ్చరించాడు. 'నీ యెఱుంగని పనులు గలవె' అని గౌరవంగా మెచ్చుకోలు మాటతో అతడి మనసును మెత్తపరిచాడు. తెలిసినవాడికి తెలియచెప్పవలసిన అవసరమేముంటుంది? ఐనా శ్రీకృష్ణుడు పరమహితాన్ని కోరి భరతాన్వయం ప్రీతి పొందేటట్లు ఆప్తవాక్యాన్ని పలకటానికి వచ్చాడు. శ్రీకృష్ణుడి ఉపన్యాసం ఆప్తవాక్యమని తాత్పర్యం.

'ఆకాంక్షా యోగ్యతా సన్నిధిశ్చ వాక్యార్థ జ్ఞానహేతుః
పదస్య పదాంతర వ్యతిరేక ప్రయుక్తాన్వయాననుభావకత్వ మాకాంక్షా.'

అని వాక్యలక్షణాన్ని లాక్షణికులు చెప్పారు. వాక్యం ఆకాంక్షాదులతో కూడుకొని ఉంటుంది. అది ఒక వాక్యం కావచ్చును. ఒక తాత్పర్యాన్ని ప్రదర్శించే సంభాషణ కావచ్చును. ఉపన్యాసం కావచ్చును. చివరకు కావ్యమూ కావచ్చును. ఇక్కడ శ్రీకృష్ణుడి ఉపన్యాసం సలక్షణమైన వాక్యం.

వాక్యంలో ఉండవలసిన మొదటి లక్షణం ఆకాంక్ష. ఆకాంక్ష అంటే ఎందుకు? ఏమిటి? మొదలైన ప్రశ్నలతో జిజ్ఞాసను రేపి వాక్య తాత్పర్యాన్ని గ్రహించాలన్న ఉత్కంఠను కల్గించటం. శ్రీకృష్ణుడి ఉపన్యాసం ఆప్తవాక్యంగా ఆరంభమౌతూండగానే ఆతడు చెప్పబోయే తాత్పర్యాన్ని గురించి పై పద్యం శ్రోతలలో ఒక ప్రామాణిక భావాన్ని ప్రకటిస్తూ, ఆయన చెప్పబోయే ప్రతి మాటను అవధానంతో వినాలి అనే ఆసక్తిని రేకెత్తిస్తున్నది.

"అర్థాబాధా యోగ్యతా" అని యోగ్యత లక్షణం. శ్రీకృష్ణుడు చెప్పదలచుకొన్న పరమ తాత్పర్యానికి బాధ కలుగకుండా అర్థవివరణం చేయటం ఆప్తవాక్యంలోని యోగ్యత. ప్రతిపాదనం, వివరణం, వివేచనం, విమర్శనం, సంస్థాపనం అని యోగ్యతకు ఐదు లక్షణాలు భాసిస్తాయి.

క. 'క్షీరోదక గతిఁ బాండవ । కౌరవు లొడఁగూడి మనికి కార్యం బది నీ
వారసి నడపుము; వారన । వీరనఁ గురుముఖ్య! నీకు వేఱుం గలదే?' **(ఉద్యో. 3.258)**

శ్రీకృష్ణుడి ఉపన్యాసంలో ప్రతిపాదించబడుతున్న ప్రధాన తాత్పర్యమిదే. దానిని మూడు వాక్యాలతో ముడిపెట్టి ప్రతిపాదించాడు శ్రీకృష్ణుడు. 1. పాండవ కౌరవులు పాలు నీరువలె కలిసి ఉండటం ఈ ఆప్త వాక్యం సాధించే పరమార్థం. 2. ఆ పరమార్థాన్ని ధృతరాష్ట్రుడు లెస్సగా అమలు చేయటం. 3.పాండవ కౌరవులందరూ పెరవారనీ, తన వారనీ భావించకుండా ప్రవర్తించేటట్లు చూడటం వలన కురుముఖ్యుడుగా ధృతరాష్ట్రుడు తన బాధ్యతను నిర్వర్తించడం. శ్రీకృష్ణుడు చెప్పబోయే ఆప్తవాక్యంలోని ప్రతిపాద్యాంశం ఇదే.

కురుముఖ్యా! అని సంబోధించిన శ్రీకృష్ణుడు కౌరవ వంశ శ్రేష్ఠుడుగా చేయవలసిన కర్తవ్యాన్ని మొదట వివరించాడు.

చ. 'భరతకులంబు ధర్మమును బాడియు సత్యముఁ బొత్తుఁ బెంపునుం
గరుణయుఁ గల్గియుండు ననఁగా నుతిఁ గన్నది; యందు సద్గుణో
త్తరులరు నీవు నీయనుఁగుఁ దమ్ముఁడు నీ తనయుల్ యశోధురం
ధరశుభశీలు; రీ సుచరిత క్రమ మిప్పుడుఁ దప్పనేటికిన్?' **(ఉద్యో. 3.259)**

ఆప్తుడైన శ్రీకృష్ణుడు ఏదో ఒక పక్షాన్ని వహించకుండా వంశక్షేమాన్ని భావించటం విశేషం. వంశ క్షేమం ఆరు గుణాల మీద ఆధారపడి ఉన్నది. ధర్మాన్ని తెలిసికొనటం, న్యాయంగా వ్యవహరించటం, సత్యం తప్పకుండా ఉండటం, కలిసి మెలిసి ఉండే మైత్రిని పెంపొందించుకొనటం, అభ్యుదయాన్ని కోరటం, ప్రజలయందు కరుణభావాన్ని కలిగి ఉండటం, ఈ గుణాలను ధృతరాష్ట్ర పాండురాజుల తరం వరకూ ప్రభువులు పోషించుకొంటూ వచ్చారు. దాన్ని ధృతరాష్ట్రుడు భగ్నం చేయకుండా పాండవ కౌరవులు కలిసి ఉండేటట్లు చూడటం ధర్మం. పాండవులకు రావలసిన రాజ్యభాగం ఇవ్వటం న్యాయం. ఇదివరలో ధృతరాష్ట్రుడే పాండవుల కిచ్చిన మాట ప్రకారం పాండవ రాజ్యభాగాన్ని ఇచ్చి మన్నించటం సత్యం. పాండవ కౌరవుల మధ్య యుద్ధం రాకుండా వంశనాశనం కలగకుండా మైత్రిని పెంపొందించటం సాధించవలసిన పొత్తు. పాండవులు, కౌరవులు కలిసి ఉంటే వంశం బలోపేతంగా వర్ధిల్లుతుంది. ఈ అయిదు అంశాలు ఆచరణలోకి రావాలంటే ధృతరాష్ట్రుడు స్వార్థాన్నీ, కాపట్యాన్నీ, క్రౌర్యాన్నీ మాని కరుణ భావాన్ని ప్రదర్శించాలి. శ్రీకృష్ణుడు పలికిన ఈ మాటలలో కార్యాన్ని సాధించే వివరణం సూచించబడింది కాబట్టి ఆప్త వాక్యంలోని వివరణాంశ మిది.

వివరణం తరువాత శ్రీకృష్ణుడు నిపుణంగా వివేచనంతో విషయ విజ్ఞానాన్ని ధృతరాష్ట్రుడికి నివేదించాడు.

"ఈ వంశంబున కెల్ల నీవ కుదురు" అనే పద్యంలో పాండవ కౌరవులు కలిసి ఉండే కార్యాన్నీ తీర్చదగిన బాధ్యత వంశానికెల్లా కుదురైన ధృతరాష్ట్రుడిదే అని స్పష్టం చేశాడు. ఎవరికి మేలు జరిగినా, కీడు జరిగినా నిజానికి నష్టపోయేది ధృతరాష్ట్రుడేనని తేల్చి చెప్పాడు. బాగుపడదలచుకొంటే సద్భావంతో సమస్యను ఆలోచించుమన్నాడు. సద్భావమంటే త్రికరణశుద్ధి మనసులో పొత్తును కోరాలి. మాటలలో అది వెలువడాలి. చర్యలో అది కనబడాలి. ఈ మూడింటినీ ఏకం చేసి వంశాన్ని నిలుపుమని శ్రీకృష్ణుడు వివేచనాత్మకమైన వివేకాన్ని అందించాడు.

వివేచనాన్ని విన్న తరువాత ధృతరాష్ట్రుడికి యథార్థజ్ఞానం కలగాలి. అది కలగటానికి మూడు అవరోధాలు ఏర్పడవచ్చును.

"అయథార్థానుభవ స్త్రివిధః, సంశయ విపర్యయ తర్కభేదాత్" అని తర్క సంగ్రహం. అయథార్థానుభవం మూడు రకాలు. 1.సంశయం 2.విపర్యయం. 3.తర్కం. విరుద్ధములైన అనేక అంశాలను అన్వయించుకొని అవగాహన కలిగించే జ్ఞానం లేకపోవటం సంశయం. దానిని తొలగించటం ఆప్తవాక్యంలోని ఒక ముఖ్యలక్షణం.

'వినుము సుయోధనాదులగు వీరు సధర్ములుగాక...' 'కౌరవ పాండవుల్ తెఱఁగుఁ గైకొని శాంతతఁ బొందియున్కిమేల్' 'నీకు వలసినఁ దీర్పంగ నేరవచ్చు నధిప' 'అందు వృకోదరార్జునుల...' 'జగతిఁ గల జనపతులు నీ చరణపీఠ మర్థిఁ గొలువ...' అనే పద్యాలలో శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడి మనసులోని సంశయాలు తొలగిపోయేటట్లు సవిమర్శంగా మాట్లాడాడు. 'మిథ్యాజ్ఞానం విపర్యయమ్' అని విపర్యయానికి లక్షణం. విపర్యయాన్ని తొలగించటం ఆప్తవాక్య లక్షణం. ఆప్తవాక్యాన్ని గ్రహించటానికి అడ్డం పడే అవగుణం విపర్యయం. అది ధృతరాష్ట్రుడిలో పుష్కలంగా ఉన్నది. దానివలన అతడు సంకట పరిస్థితులలోబడి, ధర్మనిర్ణయాన్ని చేయలేక ఉపేక్షాభావాన్ని ప్రదర్శిస్తాడు. 'అనయము పుట్టె జూదమున యప్పుడ యంతయుఁ జిచ్చువెట్టి కాల్చినయది నీ యుపేక్షయ' (ఉద్యో. 2.14) అని సంజయుడు ఇదివరలోనే ఈ అంశాన్ని ధృతరాష్ట్రుడి మొగాన చెప్పాడు. ఇప్పుడు శ్రీకృష్ణుడు

క. 'నరనాథ! నీ వుపేక్షా । పరుఁడ వయినఁ గౌరవులక పాండవులక కా
దరయఁగ భూప్రజ కెల్లను । దురితం బొనరించినట్ల; తుదిఁ గీడు సుమీ!' **(ఉద్యో. 3.266)**

అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పి మిథ్యాజ్ఞానాన్ని తొలగించప్రయత్నించాడు. ఆ తరువాత తాను చెప్పదలచుకొన్న తాత్పర్యానికి అనుకూలమైన తర్కాన్ని సునిశితంగా ప్రదర్శించాడు. "వ్యాప్యారోపేణ వ్యాపకారోప స్తర్కః" అని తర్కాన్ని నిర్వచించింది తర్కసంగ్రహం. వ్యాప్యముంటే వ్యాపకమూ ఉండేది అనే ఆరోపం తర్కం. ఈ అంశానికి చక్కని ఉదాహరణలు-

క. 'కౌరవ పాండవులం దెవ్వారలకున్ జావు నొవ్వు వచ్చిన....'

ఉ. 'వీరును వారుఁ బండితులు...'

ఆ. 'అట్లుగాక యుండ నీ రెండు తెఱఁగుల...' **(ఉద్యో. 3.267,268,269)**

ఈ మూడు పద్యాలు శ్రీకృష్ణుడు ప్రతిపాదించ దలచుకొన్న ఉపన్యాస ఫలితాంశానికి తర్కబద్ధమైన జిజ్ఞాసను కల్పించేవి. అంతటి వీరులూ, పండితులూ అయినవారు యుద్ధంలో చనిపోతే ఎంత దారుణమో ఊహించుకొమ్మని చెప్పటం ఇక్కడ తర్కం. దానివలన మిథ్యాజ్ఞానం తొలగి యథార్థ జ్ఞానం ఏర్పడుతుంది.

వాక్యానికి వన్నె తెచ్చేది సన్నిధి. ''పదానా మవిలంబేనోచ్చారణం సన్నిధిః'' అని తర్కసంగ్రహం. విలంబనం లేకుండా వాక్యంలోనే వివిధాంశాలను చెప్పటం సన్నిధి. శ్రీకృష్ణుడి ఉపన్యాసంలో-

తే. 'పాండవులు దండ్రి సచ్చిన ప్రజలు వారి । నరసి ప్రోచితి శైశవ మాదిగాఁగ;
నడుమ నిష్కారణమ దిగవిడువఁ దగునె? । పారమొందంగ రక్షింపు గారవమున.' **(ఉద్యో. 3.271)**

ఈ పద్యం శ్రీకృష్ణుడి ఉపన్యాసంలోని అంశాలనన్నింటినీ అవిలంబంగా అన్వయించుకొనే తాత్పర్యానికి చక్కని అభివ్యక్తి. అంతే కాదు ధర్మరాజు శ్రీకృష్ణుడిని రాయబారిగా వెళ్ళుమని ప్రార్థిస్తూ

'ఆపద కడవం బెట్టఁగ నోపి... మాకీ పుట్టువునకుఁ బాండుక్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా!' అని పలికిన మాటలు ఇక్కడ అన్వయిస్తాయి. దీనిని కావ్య వాక్యార్థ సన్నిధి అని కూడ అనవచ్చును. పాండురాజు చనిపోతూ పాండవుల యోగక్షేమాలు చూడుమని ఎవరినీ ప్రార్థించలేదు. కాని, తండ్రి తరువాత తండ్రి అంతటి వాడు ధృతరాష్ట్రుడా? శ్రీకృష్ణుడా? వంశ మర్యాదను పాటిస్తే ధృతరాష్ట్రుడు. ఆప్త మర్యాదను పాటిస్తే శ్రీకృష్ణుడు. ఆప్తుడైన శ్రీకృష్ణుడు పాండవుల యోగక్షేమాలను చూచే బాధ్యతను చేపట్టాలని ధర్మజుడు మనవి చేసికొన్నాడు. దీనిని శ్రీకృష్ణు డంగీకరించాడు. మరి ధృతరాష్ట్రుడు వంశ మర్యాదను పాటించి వారి యోగక్షేమాలను చూడవలసినదిగా శ్రీకృష్ణుడు తేల్చి చెప్పాడు. కాని-

ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడి ఆప్త వాక్యాన్ని ప్రమాణంగా గ్రహించలేదు. పెదతండ్రిగా పాండవులకు చేయవలసిన న్యాయాన్ని అతడు భావించలేదు. వంశజులు వారి ధర్మాన్ని నిర్వహించక వంశధర్మానికి విఘాతం కల్పిస్తే, వారికి ఆప్తులైనవారు కూడ వారిని ధర్మమార్గంలో నడిపించలేకపోతే, ధర్మం వంచించబడినా నశించిపోదనీ దానిని దైవం రక్షిస్తాడని శ్రీకృష్ణుడు నిండుసభలో ప్రకటించాడు. ఇది ఆప్తవాక్యం చివర మెరిసే యథార్థ జ్ఞాన ప్రకాశం. ''వాక్యార్థజ్ఞానమ్ శబ్దజ్ఞానమ్'' అని తర్కసంగ్రహం. వాక్యం వలన కలిగిన పూర్ణవాక్యార్థ జ్ఞానమే శబ్దజ్ఞానం. దానికి ఉపకరణమైనది శబ్ద ప్రమాణం. శ్రీకృష్ణుడి ఉపన్యాసం శబ్ద ప్రమాణానికే ప్రమాణం.

శ్రీకృష్ణుడి రాయబారపు ఘట్టం ఆప్తవాక్య కల్పద్రుమంవలె ప్రకాశిస్తున్నది. పాండవులకు శ్రీకృష్ణోపదేశం ఆప్తవాక్యం. ఆయన కౌరవులకు గూడ ఆప్తవాక్య ప్రమాణ జ్ఞానాన్ని ప్రబోధించ ప్రయత్నించాడు. దాని కొఱకు అనేక విధాలుగా యత్నించాడు. ముందు తాను చెప్పాడు. నారదాది మహామునుల చేత చెప్పించాడు. భీష్మద్రోణాదుల చేత దుర్యోధన ధృతరాష్ట్రులకు చెప్పించి ఒప్పించటానికి ప్రయత్నం చేశాడు. చివరకు ధృతరాష్ట్ర, గాంధారులచేత కూడ దుర్యోధనుడికి శ్రీకృష్ణ వాక్య తాత్పర్యాన్ని పాటించుమని ప్రబోధింపజేశాడు. శ్రీకృష్ణుడు హస్తినాపురానికి పోయి ఆప్తవాక్య ప్రమాణవాదులనందరినీ జాగృతం చేసి, ప్రేరేపించి దుర్యోధనుడికి యథార్థజ్ఞానం కలిగించడానికి శతవిధాల యత్నించాడు. కాని, దుర్యోధనుడికి కర్ణుడి వాక్యమే ప్రమాణం. అందువలన సంధి కుదరలేదు. శ్రీకృష్ణుడు, కర్ణుడు వీరిరువురు ఆప్తవాక్య ప్రమాణవాదులు.

ఐతే ఒకరు యథార్థ జ్ఞానాన్నీ మరొకరు అయథార్థ జ్ఞానాన్నీ ఆశ్రయించారు. అయథార్థజ్ఞానలాభం వలన దుర్యోధనుడు నశిస్తాడు. యథార్థజ్ఞానం వలన పాండవులు విజయం సాధిస్తారు. ఈ తాత్పర్యాన్ని కావ్యశిల్పమయంగా చిత్రించటం తిక్కన నైపుణ్యం.

తర్కశాస్త్రంలో ఉపమాన ప్రమాణాన్ని కూడ పేర్కొంటారు. పదార్థ తత్త్వ జ్ఞానసాధనకు ఉపమానం బాగా తోడ్పడుతుంది. తెలిసిన వస్తువును సాదృశ్యంగా చూపించి మరొక వస్తువు తెలిపే ప్రమాణాన్ని ఉపమాన ప్రమాణం అంటారు. ఉద్యోగపర్వంలోని ఉపాఖ్యానాలు కొన్ని దానికి ఉదాహరణలుగా పేర్కొనవచ్చును. శల్యుడు పేర్కొన్న నహుష వృత్తాంతం, కణ్వుడు దుర్యోధనుడికి చెప్పిన గరుత్మంతుడి వృత్తాంతం ఇందుకు సాక్ష్యాలు.

(5). ధర్మరాజు సమన్వయవాది

ఉద్యోగ పర్వ తృతీయాశ్వాసంలోని ధర్మజుడి ఉపన్యాసం ఆప్తవాక్య ప్రమాణవాది మాట్లాడే తీరుకు మంచి నిదర్శనం. ధర్మరాజు ఉపన్యాసాన్ని విశ్లేషిస్తే ప్రత్యక్ష అనుమాన శబ్ద ప్రమాణాలను వరుసగా ప్రదర్శిస్తూనే ఆ మూడింటిలో ఆప్తవాక్య ప్రమాణం శ్రేష్ఠమైనదని నిరూపించిన వైఖరి కనబడుతుంది.

1. ధర్మరాజు శ్రీకృష్ణుడిని తండ్రి తరువాత అంతటి వాడిగా భావించి గౌరవించటం, పాండవులను ప్రద్యుమ్నాది కుమారులతో సమానంగా మన్నించుమని అభ్యర్థించటం, తమ ప్రయత్నంలో ఎటువంటి దోషం రాకుండా ప్రబోధించి రక్షించుమని కోరటం ఆప్తవాక్య ప్రమాణం గౌరవమున్న ధర్మరాజు స్వభావాన్ని తెలుపుతున్నాయి. ఆ తరువాత 'మా తండ్రి తలపును నాతని నందను చందంబు....'' (ఉద్యోగ. 3.9) అనే పద్యం నుండి ''అక్కట లాఁతులైనఁ బగతైనను జంపఁగఁ గోరనేల'' (ఉద్యో. 3.13) అనే పద్యం వరకు ధర్మరాజు యథార్థ విషయ కథనమే చేశాడు. ఈ మాటలు పల్కుతున్నప్పుడు ధర్మరాజు ప్రత్యక్ష ప్రమాణవాదిగా కన్పడుతాడు.

ఆ తరువాత 'క్షత్రధర్మమింత కష్టమగునె...' (ఉద్యో. 3.15) అనే పద్యం నుండి 'కావున శాంతిఁ బొందుటయ కర్జము' (ఉద్యో. 3.28) వరకు అనుమాన ప్రమాణ వాదిగా అత్యద్భుతంగా మాట్లాడాడు. 'మనమునఁ బక్షపాతగతి మాదెస మానుము' (ఉద్యో. 3.23) అనే పద్యం నుండి. 'ఎన్ని సంకటముల నెబ్భంగినెంతయు' (ఉద్యో. 3.26) వరకు ఆప్తవాక్య ప్రమాణవాదిగా అచ్చమైన నీతిని ప్రదర్శించాడు. ఆ తరువాత 'నీవు సుయోధను పాలికిఁ బోవఁగవలదు...' (ఉద్యో. 3.28) 'కుటిలమతు లవినీతులు క్రూరకర్ములు...' (ఉద్యో. 3.29) అను పద్యం వరకు తర్కాన్ని ప్రదర్శించాడు.

ఈ విధంగా ప్రత్యక్ష, అనుమాన, ఆప్తవాక్య, తర్క లక్షణాలను వరుసగా ప్రదర్శించి చివరకు వాటి నన్నింటిని ఆప్తవాక్య ప్రమాణ ప్రతిపాదనలో విలీనం చేసి తన సంవిధాన నైపుణ్యాన్ని ప్రకటించాడు.

ఆ. 'మేలుగాక నీకుఁ బోలినట్లయిన నం । దరిగి యేము వారు నర్థిఁ బొంది
యుండునట్లుగాఁగ నొడఁ బాటు గావింపు । మెల్లభంగి మనకు నిదియ లెస్స'. **(ఉద్యో. 3.33)**

క. 'మ మ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు, । నెమ్మి యెఱుఁగు, దర్థసిద్ధి నెఱి యెఱుఁగుదు, వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు; । పా మ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్?' **(ఉద్యో. 3.34)**

ధర్మరాజు తర్క ప్రమాణబద్ధంగా, ధర్మసమ్మతంగా, ధర్మనీతి వర్తనాన్ని తలపులలో, మాటలలో, చేతలలో ప్రదర్శించిన సమన్వయమూర్తి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(6). పాత్రోచిత తర్కవైఖరులు

ఉద్యోగపర్వంలో పాత్రలన్నీ ప్రసంగిస్తాయి. ఆ ప్రసంగాలు ఆ పాత్రల ప్రవృత్తులను ప్రదీప్తం చేస్తుంటాయి. యుద్ధోద్యోగానికి సంబంధించిన తమ అభిప్రాయాలను ప్రకటిస్తుంటాయి. వాటన్నింటిలో ఒక అంతర్గతమైన వాక్యశిల్పం (ఉపన్యాస శిల్పం లేదా సంభాషణ శిల్పం) కొట్టవచ్చినట్లుగా కన్పిస్తుంది. శ్రీకృష్ణుడి వంటి ప్రధాన పాత్ర నుండి ఉలూకుడి వంటి స్వల్ప పాత్ర వరకు మాటలతో రూపురేఖలు చిత్రించిన వైఖరి తిక్కనగారి నాటకీయ శిల్పం.

ఆయా పాత్రలు పాత్రోచితంగా, సందర్భోచితంగా ప్రదర్శించిన వాఙ్మయ శిల్పాన్ని ఆయా పద్యాల విశేషాంశాలలో విపులంగా వివరించడం జరిగింది. రసజ్ఞులు వాటిని పరిశీలించగలరు.

7. ఉపాఖ్యాన శిల్పం

ఉద్యోగపర్వంలో ఉపాఖ్యానాలు మూడున్నాయి. ఒకటి- శల్యుడు ధర్మరాజుతో చెప్పిన నహుషుడి కథ లేదా పురందర విజయోపాఖ్యానం. రెండు- కౌరవ సభలో కణ్వ మహర్షి దుర్యోధనుడితో చెప్పిన గరుత్మంతుడి ఉపాఖ్యానం. మూడు- భీష్ముడు దుర్యోధనుడికి చెప్పిన అంబోపాఖ్యానం. ఈ మూడింటినీ మూడు రకాల ప్రయోజనాలకు వాడటమే కాక మూడు రకాల కావ్య కళాశిల్పాలకు ప్రతినిధులుగా తిక్కన తీర్చిదిద్దాడు.

ఒకటి- శల్యుడు చెప్పిన కథ సందర్భాన్ని బట్టి, ప్రయోజనాన్ని బట్టి ప్రత్యేకతను సంతరించుకొన్నది. 'కథ చెప్పినవాడు శల్యుడు. అతడు ఉపచారప్రియుడు. తనను సేవించిన వారికి ఒడలు మరిచి వరాలు ఇవ్వగలిగినవాడు. అందువలన ధర్మజుడికి సాయం చేయవలసిన తాను దుర్యోధనుడికి సాయం చేసే పరిస్థితి కల్పించుకొన్నాడు. మాట దుర్యోధనుడికి ఇచ్చినా మనసు ధర్మరాజు కిచ్చినవాడు. సాయం దుర్యోధనుడికి చేసినా, హితం ధర్మరాజుకు చేయనెంచినవాడు. కౌరవ పక్షాన యుద్ధం చేస్తున్నా, స్వీయ రథికుడైన కర్ణుడిని కలతపరచి, అర్జునుడి విజయానికి తోడ్పడుతానని మాట ఇచ్చినవాడు. ఆపద్ధర్మంతో కౌరవ పక్షాన నిలిచినా, అంతరంగ ధర్మంతో పాండవ విజయానికి తోడ్పడినవాడు. ఒకవైపు కృష్ణుడు పార్థసారథియై పాండవులకు ప్రత్యక్షంగా సాయపడ్డాడు. మరొక వైపు శల్యుడు కర్ణసారథియై పాండవులకు పరోక్షంగా సాయపడ్డాడు. త్వరపడి మాట ఇవ్వటం మూలంగా ధర్మరాజుకు దూరమౌతున్నందుకు ధర్మజుడికి ఊరట కలిగించటానికై ఇంద్ర విజయోపాఖ్యానాన్ని చెప్పాడు. ఆ కథా ప్రయోజనాన్ని ఈ క్రింది మాటలలో స్పష్టం చేశాడు.

ఉ. 'కౌరవనాథుఁ డా నహుషుకైవడి నాశముఁ బొందు వాసవ
శ్రీరమణీయుఁడై జయము సేకొని ధర్మజుఁ డంబురాశివే
లా రశనా సముజ్జ్వల విలాస మనోహర మేదినీ వధూ
సారసమగ్ర భోగముల సన్నుతి కెక్కెడుఁ దానుఁ దమ్ములున్.' **(ఉద్యో. 1.210)**

శల్యుడు పరంపరగా విన్న ఒక ఇతిహాసాన్ని సందర్భోచితంగా, సార్థకంగా ఉపాఖ్యానంగా చెప్పాడు. ఆఖ్యానానికి తోడ్పడేది ఉపాఖ్యానం. వస్తుధ్వనిని ఆశ్రయించి ఈ ఉపాఖ్యానం పాండవ విజయాన్ని ధ్వనింపజేస్తుంది. వృత్రాసురుడితో పోరి, ఓడిపోయి అజ్ఞాతవాసంలో నివసించాడు ఇంద్రుడు. ధర్మరాజు కూడా దుష్టచతుష్టయ దుర్నీతికి గురియై, అరణ్య, అజ్ఞాత వాసాలను గడిపాడు. ఇంద్రుడి తరువాత ఇంద్ర పదవిని అలంకరించిన నహుషుడు, ఇంద్ర సామ్రాజ్య లక్ష్మినే కాక శచీదేవిని కూడా కోరాడు. దుర్యోధనుడు కూడా మాయాద్యూతంలో పాండవ రాజ్యాన్ని హరించి, ద్రౌపదిని అవమానాల పాలుచేశాడు. నహుషుడికి పాపం పండి సప్త ఋషుల శాపానికి గురై, కొండచిలువగా మారి రాజ్యభ్రష్టుడైనాడు. అట్లాగే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుర్యోధనుడు కూడ పాండవ రాజ్యభాగ మీయక అవినీతి పాలై, పూజ్యులను ఆప్తులను అవమానించి, రాజ్యభ్రష్టు డౌతాడని శల్యుడు సూచించాడు. ఇంద్రుడు దేవతల తేజస్సులను సమీకరించుకొని ఇంద్రపదవిని తిరిగి సాధించాడు. అట్లాగే ధర్మరాజు కౌరవులను ఓడించి, రాజ్యాన్ని త్వరలో తిరిగి పొందుతాడని శల్యుడు ఆకాంక్షించాడు. ఆశీర్వదించాడు. శత్రు సైన్యంలో చేరనున్న మహావీరుడైన శల్యుడు పాండవ విజయాన్ని వస్తుధ్వనిని ఆశ్రయించి భావికథార్థ సూచికగా చెప్పటం ఈ ఉపాఖ్యాన సార్థక్యం.

ప్రధానకథ కిది ఉపాంగమైనా ఆఖ్యానాన్ని ఉపమాన ప్రమాణంతో సమర్థిస్తున్న ఉపాఖ్యానం, దీని ప్రత్యేకత ఇది.

కణ్వమహర్షి దుర్యోధనుడికి చెప్పినది గరుత్మంతుడి వృత్తాంతం. పాండవ బలాన్ని, ప్రత్యేకించి నరనారాయణుల మహిమను తెలియక, దురహంకారంతో యుద్ధానికి తలపడి, అవమానం పొందిన దానికంటే, పాండవులతో కలిసి మెలసి ఉండటం మంచిదని హితవు చెబుతూ దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

క. 'అది వోలుఁ దన్ను నెదిరిని । మది నెఱుఁగక నిగ్రహించి మదమెత్తుట యొ
ప్ప; దహంకారం బొనరిం । పదె పౌరుషహానిఁ దొల్లి పక్షీంద్రునకున్.' (ఉద్యో. 3.289)

ఒకసారి మాతలికీ, గరుత్మంతుడికీ వాదు ఏర్పడింది. అన్నదమ్ముల మధ్య ఏర్పడిన ఆ తగాదాలో గరుత్మంతుడు ధిక్కరించి, మాతలిమీద మండిపడి విజృంభించాడు. దానికి వాసుదేవుడు కోపించి గరుత్మంతుడికి గర్వభంగం చేశాడు. ఈ కథలో అన్యాపదేశంగా దుర్యోధనుడికి హితబోధచేశాడు కణ్వుడు. ఉపాఖ్యానంలోని మాతలి వంటి వాడు ధర్మరాజు. అతడికి బలంతోపాటు న్యాయం కూడా తోడున్నది. ధర్మరాజుకు శ్రీకృష్ణుడి సాయం బలంగా ఉన్నది. గరుత్మంతుడి వంటివాడు దుర్యోధనుడు. అతడికి దేహబలం తప్ప, ధర్మబలం లేదు. అందువలన వాసుదేవుడి కోపానికి గురై అవమానాల పాలైనాడు. అట్లాగే దుర్యోధనుడు స్వీయబలంతో గర్వించి, ధర్మజుడితో యుద్ధం ప్రకటిస్తే, వాసుదేవుడి కోపానికి గురై నశించక తప్పదని వ్యంగ్యంగా సూచించాడు కణ్వుడు. ఇది ఉపమాన ప్రమాణంలో భాగం మాత్రమే. హితవును పెడచెవిని పెట్టిన దుర్యోధనుడికి నాశనం తప్పదని ఈ కథ నీతి చెబుతుంది.

క. 'బలవంతుల బలములు న । గ్గల మగుబల మెదురఁ గలుగఁగాఁ గీడ్పడు నే
కొలఁదుల వారికి గర్వము । నిలుచునె నయమార్గ వృత్తి నిలిచిన భంగిన్'. (ఉద్యో. 3.303)

కురుసభలో గుమికూడిన మునిజనులొక్కొక్కరూ చిన్నదో పెద్దదో ఏదో ఒక కథను చెప్పి, ఉపమాన ప్రమాణంతో దుర్యోధనుడికి ఉపదేశం నిర్వహించారు. జమదగ్ని మహర్షి దంభోద్భవుడి కథ చెప్పాడు. నారద మహర్షి గాలవుడి కథ చెప్పాడు. ఇట్లా మునులు చెప్పిన కథలన్నింటిలో ముక్తసరిగా చెప్పిన ఉపాఖ్యానం గరుత్మంతుడి కథ. ఆ తరువాత పేర్కొనదగినది గాలవుడి కథ. దంభోద్భవుడి కథ తిక్కన ఒక పద్యంలోనే కుదించివేశాడు. శల్యుడు చెప్పిన నహుషుడి కథ ఉపమానం కొరకు అయితే, మునులు చెప్పిన కథలు ఉపదేశం కొరకు. అందువలన ఉపాఖ్యాన శిల్పంలో వైవిధ్యం ఏర్పడింది.

భీష్ముడు చెప్పిన అంబోపాఖ్యానం ఆఖ్యానకం వంటిది. అంబ శిఖండిగా మారి భీష్ముడిపై ప్రతీకారం తీసికొనిరావటానికి పాండవ పక్షంలో నిలిచి ఉన్న వృత్తాంతాన్ని భీష్ముడే స్వయంగా చెప్పాడు. అంబ వృత్తాంతం భీష్ముడి చరిత్ర నుంచి పుట్టిందే. అతడి చర్యల వలన పెరిగిందే. అతడి నైష్ఠిక వ్రతం వలన ఎదురు తిరిగిందే. స్వయంవరంలో అంబను బలవంతాన తెచ్చి, ఆమె బ్రతుకుబాటను మార్చాడు భీష్ముడు. ఆమె హృదయాన్ని తెలిసికొని సాల్వుడి దగ్గరకు పంపి, ఔదార్యాన్ని ప్రకటించినా, సాల్వుడు ఆమెను గ్రహించకపోవటంతో ఆమె జీవితం విషాదభరితమైపోయింది. భీష్ముడి బ్రహ్మచర్య వ్రతం ఆమెను పెండ్లాడటానికి అడ్డం వచ్చింది. దానితో అంబ జీవితం అగమ్యగోచరంగా మారింది. ఆమె పరశురాముడిని ఆశ్రయించింది. పరశురాముడు భీష్ముడికి హితవు చెప్పాడు. భీష్ముడు ఆజన్మ బ్రహ్మచర్యవ్రతాన్ని విడవటానికి అంగీకరించలేదు. కాగా, వసువుల సాయంతో పరశురాముడిని ఓడించాడు. ధర్మదృష్టిలో భీష్ముడు విజయుడై నిలిచాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కాని, అంబ తోకత్రొక్కిన త్రాచువలె పగబూని భీష్మ సంహారానికి తపస్సు చేసింది. శిఖండిగా మారింది. భీష్ముడిని యుద్ధంలో చంపటానికి సమయం కొరకు ఎదురు చూస్తున్నది. పేడివాడితో యుద్ధం చేయనని భీష్మ ప్రతిజ్ఞ. దాని నాధారంగా చేసికొని అర్జునుడు శిఖండిని ముందుంచుకొని భీష్ముడిపై దాడిచేస్తే అతడు దుర్మరణం పొందక తప్పదు. సంకల్ప మరణం వరంగా పొందిన భీష్ముడికి అంబవలన అసమయ మరణం ఏర్పడే అవకాశం ఉన్నది. దానిని దుర్యోధనుడికి తెలియజెప్పటం కొరకు అంబ వృత్తాంతాన్ని భీష్ముడు వివరించాడు. 'పాండవ వీరులనందరినీ చంపగలను కానీ, ఒక్క శిఖండిని మాత్రం చంపలేను' అని ప్రకటించిన భీష్ముడి వాక్యాన్ని వివరించుమని అడిగినపుడు 'ఏ నా శిఖండిని౯ జంపమికి మూలంబు సాలంగలదు. తత్ప్రపంచంబంతయు వివరించెద నాకర్ణింపుము' అని దాదాపు 150 పద్యాల విస్తృతి గల కథను పేర్కొన్నాడు. ఈ కథలో భీష్ముడు కన్నది, విన్నది, మునులు వివరించింది అయిన మూడు రకాల కథ ముడిపడి ఉంటుంది. భీష్ముడి ఆత్మకథలోని అంతర్భాగంగాను, భీష్ముడి విషాదాంతానికి సూచికగాను, కౌరవ మహాసైన్యాధ్యక్షుడు చనిపోక తప్పదనే కథార్థసూచనానికి సంకేతంగాను ఈ ఉపాఖ్యానం చెప్పబడింది. ఇదే కథ కథకుడు చెబితే ఆఖ్యానమై ఉండేది. భీష్ముడు చెప్పటం మూలాన ఆఖ్యానకమైనది. అందులోనూ నారదుడు చెప్పిన అంబ వృత్తాంతం ఉపాఖ్యానంగా భాసిస్తున్నది. అందువలన ఈ కథ ఆఖ్యానక, ఉపాఖ్యాన, కథాశిల్పాల త్రివేణి సంగమం.

తిక్కన ఆయా కథల స్వభావాన్ని బట్టి కథన శిల్పాన్ని కూడా మార్చాడు. నహుషుడి కథ వర్ణనాత్మక కథాకథన ప్రధానం. గరుత్మంతుడి కథ, కథాకథన ప్రధానం. అంబోపాఖ్యానం కావ్యరూపక కథాశిల్ప ప్రధానం.

8. మరికొన్ని విశేషాలు

1. "మూలము నందలి సనత్సుజాతీయము తెలుగున నించుమించుగా లుప్తమైనట్లే యెంచవచ్చును. ఇందులకు గొందఱు తిక్కనను మహాపరాధిగా బరిగణించుచున్నారు. కాని, కావ్యరసదృష్టితో జూచినపుడు ఈ శాస్త్ర గ్రంథ మిక్కడ లేకుండుట వలన రసము. వస్తువు రెండును విక్షిప్తములు గాలేదు. శాస్త్ర భాగము నంతను శాంతి, అనుశాసనికము, అశ్వమేధము మున్నగు పర్వములలో విశదీకరింప వచ్చుననియు, అచ్చట నున్నచో వస్తుగమనము నరికట్టవనియు కావ్యరసతత్త్వవేత్తయగు తిక్కన నిర్ణయించుకొని యుండవచ్చును. కొంద ఱిది గుహ్యామైన యోగశాస్త్రము గావున నాతడు విడిచి పెట్టి యుండవచ్చునని యూహించుచున్నారు. "పరతత్త్వము ప్రసాదించునట్టి గూఢోక్తులను గ్రహించుచుండ" అను వాక్యభాగము వారి యీ వాదనకు జేయూతగా నున్నది. కాని, యోగశాస్త్రమును గూఢమని యెంచి విసర్జింపవలసివచ్చినచో పైన చెప్పిన మూడు పర్వములలో విస్తర భాగము లుప్తము కావలసినదే. భారతమున శాస్త్ర భాగమున చాల పునరుక్తి యున్నది. సనత్సుజాతీయము, భగవద్గీత, ఉత్తరగీత, అనుగీత మున్నగున వెన్నియో ఒక్కొక్కటి ప్రత్యేకముగ గైకొన్నప్పుడు ఎంతో మనోహరములగు గ్రంథరాజములే యయ్యును సమూహాముగ చేర్చి చూచినపుడు చాలా భాగము చెప్పినదే చెప్పుటయగుచున్నది. తిక్కన కేవలము "వేద భారవాహి"గా నందున ఆధ్యాత్మిక సంపద నంతయు గ్రంథముల మూలముననే గాకుండ అనుభవమున గూడ నాపోశనము పట్టిన వాడగుటచే శాస్త్రభాగము నాతడు పూర్ణముగ జీర్ణము చేసికొని వానిని ప్రత్యేకముగ కేటాయించి సమర సంరంభము ముగిసిన వెనుక శాంతియుతముగ గూర్చున్నప్పుడు ధర్మజాదుల ప్రసంగములలో క్రోడీకరించినాడు. ఇట్లగుటచే విషయ విభాగమునందును రసస్ఫూర్తి యందును గూడ నాంధ్ర మహాభారత మున్నత సోపానము లధిరోహించుచు మూలమును మించుచున్నది. దేనిని లోపముగ గొందఱు మనీషులు పరిగణింప జూచుచున్నారో అదియే తిక్కన విమర్శనా శక్తికిని, ఉచితజ్ఞతకును నిశితమైన తార్కాణముగా నాకు దోచుచున్నది." - నండూరి బంగారయ్యగారు. (ఆంధ్రమహాభారతోపన్యాసములు - తిక్కన - ఉద్యోగ పర్వము - పుట 148)

2. "ద్వితీయాశ్వాసమున నొక్కచో (107వ పద్యము మొదలు 115వ పద్యము వరకు) ప్రాతఃకాల వర్ణనమున్నది. దీనిని వర్ణించినను, వర్ణించకపోయినను కావ్య సౌందర్యమున కెట్టి లోపము రానేరాదు. వాల్మీకివలెగాని, కాళిదాసు వలె గాని ప్రకృతి తాదాత్మ్యము నొంది చేసిన వర్ణనము గాదిది. మధ్యకాలము నందలి సంస్కృత కవుల కృత్రిమ వర్ణనలతో

వియ్యమందుచున్నది. దీనినంత దోషముగా ఖండింపనక్కర లేదు గాని గుణముగా నెంచి పూజించుటకు మాత్రము బుద్ధి పుట్టకున్నది.'' - నండూరి బంగారయ్యగారు (ఆంధ్ర మహాభారతోపన్యాసములు - తిక్కన - ఉద్యోగపర్వము - పుట 149)

3. ''కావ్యతాస్ఫోరకముగనే గాక, సందర్భాలంకారములకై కూర్చిన వర్ణనలు పెక్కులు. అవి యిట్లుండును. 'తనకులంబునఁ బుట్టిన ధార్తరాష్ట్ర లన్నదమ్ములతో నిగ్రహంబు గొనుట కుమ్మలించి వివర్ణతఁ నొంది నట్లు గంది యెంతయుఁ జెలువేదెఁ జందురుండు'' ఇత్యాదిగాఁ జంద్రాస్తమయ, తారకోదయములు, చక్రవాక, శుకకోకిల భృంగవిహారములు, మలయానిల సంచారములు, సూర్యోదయ సూర్యాతప ప్రసారములు వర్ణించెను. 'కలయట్టి వివిధార్థములు విశేషంబుగఁ దగ నొసంగుండు సత్పాత్రములకు' అని శ్రీకృష్ణుడు కౌరవుల నుద్బోధించి పలికిన మాటలు, 'కోల్పులి వీఁకమై గొదగొని లేళ్ళకు నుఱుకు తెఱంగునఁ దఱియఁ జొచ్చి' 'ఇత్యాదిగా భీమసేనాదుల భుజాటోప విజృంభణములు, 'గాండీవ గుణరవం బొండొండఁ జెలఁగంగ, శరపరంపర లాకసంబు గప్ప' నని యర్జునుని యస్త్రపాండిత్యప్రాభవము, 'అగ్నికుండమున ద్రోణాచార్యునకు నాశమొనరించు దానికై యుద్భవించె' నని. ధృష్టద్యుమ్ను దొడ్డతనము, 'వక్షస్థలంబున వనమాల గ్రాలంగ వెలిమావు గెడలు వాగెలు ధరించి' అని అర్జున సారథియగు కృష్ణ వర్ణనము, 'ప్రాణంబుతోఁ గూడ రక్కసి చన్నుల పాలు ద్రావిన ప్రౌఢబాలుఁ డితఁడె' యని పురస్త్రీలు గోపాలు వర్ణించిన ఘట్టము ఇట్టివెన్నియో యిందు నచ్చుటచ్చుటఁ దమయున్కి జ్ఞప్తి చేయుచుండును. శ్రీకృష్ణుఁడు ప్రాకృతమూర్తిగా మొదలై పరమార్థ తత్త్వము వరకు వ్యాపించిన వివిధ రంగ విన్యాసములును యథాశక్తి సంవేద్యములుగాఁ జెప్పుట యిందులో గొప్పలో గొప్ప. తెలుగు బాసకు నిండుదనము గండతనము కరగించి పోతపోయుటలో నితఁడు సిద్ధహస్తుఁడు. మహాకవియైనవాఁడు మహామంత్రిగా మనసు పండిన లోకజ్ఞుఁడుగా నుండిన 'నిట్లుండు'ననుట యిందు ప్రతిపద్యమునఁ బ్రత్యక్షమగును. ఇంతయు తెలుగువారు చేసిన పుణ్యఫలమనుటలో నతిశయోక్తిలేదు.'' - గడియారము వేంకట శేషశాస్త్రిగారు. (ఆంధ్ర మహాభారతము-ఉద్యోగ పర్వము - పీఠిక 5 - పుట 28-29).

4. ''తిక్కనగారి భాషా ప్రాభవమపూర్వమైనది. ఆంధ్ర విద్వల్లోకము వేవిధముల ముక్తకంఠముగాఁ గొనియాడినది. కొంచెముగానైన దానిని రుచిచూచుట యుచితము. తిక్కనగారి పదకోశమునఁ జేరి ప్రజావదనములఁ బారాడు పదప్రయోగము లిట్టివి; వెసగలకాలరులు, వెలివీడు, కొట్టిన తిండికాఁడు, పవడించు, కొండుక, పల్లాయనంబువారు, ఒత్తొరువు, హోరాటము, అడియాసలు, కొఱతనుఱుకులు, పొంతువ, బెండు, వెడవెడయలుక, వాయోడు కూటువమూఁక, ఏలిమాటలు, ముక్కునవావి, చావడము, వేరిమి, క్రొత్తది, కోరడము, వేసరి, వాయపురజ్జులు, గూఢచర్య, కడవఁబడు, ఉవ్వెత్తుకొను, కవణము, లఘుసంచరణము, అడియరితనము, చక్కసగము, ఒట్టిన మంటలు, నమ్మిగ, చిడిముడిపడు, చిదురుపాలు, వీరమదము, పానుపడు, ఆతల-ఇత్యాదులు.'' (ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వము - పీఠిక - పుట. 29-30)

5. ''తిక్కనగారి పదబంధ విన్యాసము లిట్టివి: వారొకతల - నేనొకతల, నేలయొత్తికొన, పెట్టని కోటనీకు హరి, గొడ్డు వోయిన వారు, కుదుటఁ గూడవెట్టి కుడుచువారు, చెవులు చీములు కట్టు, ధర్మసూతి మెత్తని పులి, ఎరవయి నిల్చు, పతివోదురు, చిచ్చయినఁ బిడికిలింతము, అరచేతికిఁ దేరఁజాలు, ముక్కూరి వగచు, కడకొఱవులట్లు, ముకుఁద్రాటఁగాలు గ్రుచ్చు, పుడమి యెల్లనొడ్డగెడవయి, తోడు దొనలేని, బఱిపికొనిపోయి, నీకై పొరలితిమి, ఒక చాలు వాని బలుతీర్పు, వెఱగునఁ బుల్లవడు, ఒంటర మింటరములు, చీదకనుపడు, మీకభరము, విడిదల పయనములు, వెలలి బలరిపుఁడు, చిక్కని పోటు మానిసివి, అరవాయిగొను, పరివింటివాఁడు, అది ప్రాప్తకాలంబు, ఉక్కుఁగలఁడు, గద నేర్చు ముసురు కవిసి, తిట్లుపాట్లు, పాముల నెట్లట్ల, తూలపుచ్చు, అడుగుమాలిపోవు ఇత్యాదులు.'' (ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వము - పీఠిక - పుట. 30).

6. ''తిక్కనగారి వాక్యరచనాచాతురి యిట్టిది- మిముఁ జేరి నెగడు వాఁడ । కారుణ్యమున నిట నరసియుండుఁడు, తానైన నపుడు నీతిపథము విడిచె- మమ్మైన నిపుడు. చక్కని పథమున నడవుఁడనె, పిల్లిపట్టిన యీరువువేసియున్న, వీవు

చక్కనయి నిల్చుఁగాక, నా మోమున వ్రేలెడున్, విరిగిన బారసాప వచ్చునే వారు బ్రాహ్మణులె యేకీడైన సైరింపఁగన్, రథము రథము కదియ రానిచ్చి, దుఃఖములైనవి తెగు సమయము, మీమేనత్త నూఱడింపుము, పాలకడలి పొటయై యొప్పు మొనతలఁబడు, భూమి యొనర్చి పాండునృపపుత్త్రుల కిత్తునె, ధర్మజ వారిరాశిన్, జెలియలికట్టవాసె, పొట్టు పొరలయ్యుఁ గయ్యంబునాచు, ఉఱుకడ కేగి తోడుపడు, ఇంతలేక యాడు మెల్ల వినఁగ, తిగిచి కొనివచ్చునెడ, లభిమతం బిదికాకయుఁ గల్గెనేనియన్, బూని యొనర్తు, నెత్తురు నీరఁదేల్చు, కురుక్షితీశుఁడను బ్రహ్మకు వేయును నిండు, సర్వకురు సంతతికిన్, గలవాఁడు కాఁడె, నా మోమునన్ వ్రేలెడున్, విష్వచ్చుఁడు వెసవచ్చు గాండివంబును దానున్, అర్చిన మూరెఁడు నేర్చు, చేతుల తీటం బుత్తుము, విచార వివేకంబుల నాయెత్తు వత్తురె, గాలియును జిట్టాడంగ నీను, ఇది యిట్లయ్యె దక్కినది యట్లుండె, మనఁ బోవఁగరాదు, కైపెక్కి నట్టి తలఁపు, మాఱటనోరి దానను, ఒద్దియేఱు విడిసి - ఇత్యాదులు పరశ్శతములు." (ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వము - పీఠిక - పుట 30, 31)

7. "తిక్కనగారి యుపమానము లర్థాంతర న్యాసము లిట్టివి: మడుగుఁ జీరయందు మసి దాకినట్లు, మాకుం గుడు మిండు మీరు ప్రక్క గొనుఁడు, రోషమయ మహాతరువు, ధర్మతరువు, సాదు రేఁగెనేనిం దలపాలమునఁ గాని నిలువఁ బోఁడు, పాలలోఁ బడిన బల్లివిధంబున, నిప్పులు వేఁడిమి సెడినట్లు, వింజం బాఁకిడిన కరణి, విధిసేసినగతిఁ బడకయుండ శివునకు వశమే, కొండం గని తగరు దాఁకఁ గోరుటఁ గాదే, నిప్పులన్ బొరలినయట్లు, మీనంబు చవిఁ గాలము మ్రింగినయట్లు, నీళుల నగ్ని పుట్టిన యట్టిది, అట మిన్నందినయంత వానిపొడ వెంతన్నట్లు, మంటలో మిడుత లుదగ్రవృత్తి నుఱుకఁదలఁచినట్లు, నేవోసిన యగ్నిభంగి, కావి సెలయేఱుల తోడినగంబు లట్లు, పామున్న యింటిలో నున్నయట్లు, చిచ్చొడిం గట్టినయట్లు, గజంబు గజంబు పల్లవం బల్లన దెమల్చులీల, శ్రీరామోకాలొడ్డిన వాని విధము - ఇత్యాదులు పెక్కులు." (ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వము - పీఠిక - పుట. 31)

8. "తిక్కన గారి వ్యాకరణ విశేషము లిట్టివి: సురరాజ్యశ్రీ వాలింపఁగ, యోగక్షేమంబున తెఱఁగు, కాన తగంబొందుట, (ఇచ్చట కాన కళ) కాన నవశ్యము (ఇచ్చట కాన ద్రుతప్రకృతికము), వేగ తెగం బాఱుకు (ఇచ్చట వేగ కళ) జగంబులన్నిని, పోవఁగఁద్రోతున్ (త్రోచు ధాతువు), అట్టిదిం గలదె, ప్రాణానం గలుగంగ, సంధియ కావింపంబడిరి, మఱుకుమన్న ఎన్నఁడేని కృష్ణుని తోడనే జెప్పితి, భూరిశ్రవుం డతిరథంబుల మొదలి, జెట్టానజెట్లు, సుఖమున్న వారె, ఎల్లవెంట, సంభావింపుము. విదురునితో ప్రాణగొడ్డము, కూడదు నార, బోనాలు వేర్పింప, చంపుదమ యిర్వురము, ఇత్యాదులు మఱియుంగొన్ని." (ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వము - పీఠిక - పుట. 31)

9. తిక్కనగారి రచనలో రెండు మూడు ప్రౌఢ రచనా విన్యాసములు గూడ గనఁబడును. చూడుఁడు:-

"ఒకటి గొని, రెండు నిశ్చలయుక్తిఁ జేర్చిఁ మూఁటి నాల్గింటిఁ కడు వశ్యములుగఁ జేసి" "జ్ఞాతుల పోరితమును, గోవ్రాతము నాక్రమము, విప్ర వర్ణముచనవున్" "తుది రాజ్యమ్ము సగమ్ముగొ మ్మడవియందున్ బేరు వంచించియున్, పదుమూఁడేఁడుల నీవునుం దిరిగిరా, పాలీక పోవచ్చునే" ఇత్యాదులు దిక్సూచి ప్రాయములు. (ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వం - పీఠిక - పుట. 31)

9. ఉద్యోగ పర్వం - అంతరార్థం

అధ్యాత్మవిదులు మహాభారతాన్ని వేదాంతమని కీర్తిస్తారని నన్నయ భట్టారకుడు పేర్కొన్నాడు. అంతేకాక భారతీయ ఇతిహాసంలోని కథ ఆధ్యాత్మికమైన అంతరార్థాన్ని కూడా గలిగి ఉండాలని ప్రసిద్ధి. అందువలన మహాభారతం ఆధ్యాత్మికపరమైన సాధన మార్గాన్ని బోధించే వేదాంత గ్రంథంగా జిజ్ఞాసువులు భావిస్తారు.

1. ఉద్యోగం అంటే ఉత్+యోగం. ఉత్ అంటే ఉన్నతులైన సాధనా మనోవృత్తులతో, యోగం అంటే కలయిక, ఉద్యోగ పర్వంలో పాండవపక్షం సాత్త్విక వృత్తుల సమీకరణం. కౌరవపక్షం తామసిక వృత్తుల సమీకరణం. ఈ రెండు వృత్తులూ యుద్ధానికి తలపడి తమ తమ ఉన్నతులకు బలం చేకూర్చుకొనే యత్నం చేయటమే ఉద్యోగం అన్నమాట.

(1). ఉపప్లావ్య నగర సమావేశం:- ఉపప్లావ్య నగరంలో ధర్మజుడి సభలో శ్రీకృష్ణాదులు సమావేశమై ఉద్యోగ ప్రయత్నం ఆరంభించటం ఉన్నత సాత్త్విక మనోవృత్తుల సమీకరణం. అభిమన్యుడితో ఉత్తరకు వివాహమయింది. "అభితః మనుతే ఇతి అభిమన్యుః" అనే వ్యుత్పత్తిని ఆశ్రయించి అభిమన్యుడంటే అంతటా భగవంతుడిని భావించే సాధన అని అర్థం. ఉత్తర అంటే శ్రేష్ఠురాలైనదని అర్థం. ఉత్తరాభిమన్యుల వివాహం అంటే అంతటా భగవంతుడిని దర్శించే సాధకుడు సాగించే శ్రేష్ఠమైన సాధన. దీనినే "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనే ఆధ్యాత్మిక పరమ సాధన అంటారు. ఈ సాధనలో పంచసాత్త్విక వృత్తులకు తోడ్పడే ఇతర మనోవృత్తులే ఉత్తరాభిమన్యుల వివాహానికి హాజరైన రాజులుగా భావించాలి.

పంచ సాత్త్విక ప్రవృత్తులకు తోడ్పడే నిర్వృతి మనోవృత్తికి శ్రీకృష్ణుడు ప్రతీక. ముక్తిసాధనకు మరే విధమైన అడ్డంకులు కలిగించకుండా తామసికవృత్తి అంత తేలికగా లొంగదనే సత్యాన్ని గ్రహించి, యుద్ధం చేసి తామసిక వృత్తులను ఓడించటం కంటే గత్యంతరం లేదని నిర్ణయించుకొనటమే సాత్యకి మొదలగు రాజులు యుద్ధానికి సిద్ధపడాలన్న వాదనకు అంతరార్థం.

సాత్యకి అంటే సత్యాన్ని గ్రహించగల్గిన సాధకుడిలోని సత్యజ్ఞాన మనోవృత్తి. ద్రుపదుడు అంటే మూల ప్రకృతి. యుద్ధ సన్నాహాలు పూర్తి చేసిన తరువాతనే ద్రుపదుడు తన పురోహితుడితో రాయబారం పంపిద్దామన్నాడు. అంటే సాధకుడిలోని పంచసాత్త్విక వృత్తులపరమైన మూలసాత్త్వికప్రవృత్తి (ద్రుపదుడు), తామసిక వృత్తితో (దుర్యోధనుడితో) యుద్ధం తప్పదని అనుకొంటూ, యుద్ధానికి కావలసిన సాత్త్విక మనోవృత్తుల బలం (పాండవుల బలం) సమీకరించి ఉభయ పక్షాల బలం చూసికొని ఆపైన భవిష్యత్ క్షేమం కొరకు తామసిక మనోవృత్తులతో సఖ్యప్రయత్నం జరపాలని ద్రుపద ప్రయత్నంలోని అంతరార్థంగా మనం గ్రహించవచ్చును. శ్రీకృష్ణుడు ద్రుపదుడి సలహాను మెచ్చుకొన్నాడు. అంటే నిర్వృతి తత్త్వం శాంతి ప్రయత్నంతో ఉంటూ యుద్ధానికే మొగ్గుచూపిందని అంతరార్థం చెప్పాలి. మొత్తానికి ఈ ఘట్టంలో ఆధ్యాత్మిక సాధనపరంగా తేలిన తాత్పర్య మేమంటే - సాధకుడు తనలోని అన్ని వృత్తుల యొక్క పర్యాలోచనలను సాగించి, తామసిక వృత్తిని ఎదిరించి నెట్టివేసేందుకు తన ముక్తి సాధనలో తోడ్పడే మనోవృత్తులను కూడకట్టుకునేందుకు, గొప్ప యత్నం చేయాల్సి ఉంటుంది అని భావించి తత్సాధనకు పూనుకొంటాడు. ఇదే సాధకుడి ఆధ్యాత్మికపరమైన ఉద్యోగం.

(2). శ్రీకృష్ణుడి సాహాయ్యక ఘట్టం:- ఒకవైపు దుర్యోధనుడు మరొకవైపు అర్జునుడు శ్రీకృష్ణుడి సహాయాన్ని ఒకేసారి అర్థించారు. శ్రీకృష్ణుడు తన బలాన్ని ఒకవైపు, యుద్ధం చేయని తనను మరొకవైపు ఏర్పాటు చేసి క్రమంగా దుర్యోధనుడికి, అర్జునుడికి సమకూర్చాడు. పైకి కనబడే కథ ఇది. లోన అంతరార్థం ఈ విధంగా గోచరిస్తుంది. "తామసిక వృత్తి నిర్వృతి తత్త్వాన్ని తనకు తోడుగా ఉండాలని ఎప్పుడూ కోరదు. అట్లా కోరితే తామసిక వృత్తి నిర్వృతి తత్త్వం వలన తాను మఱుగునపడి పోవలసి వస్తుంది. అసలది దాని సమీపానికి పోనే పోదు. తామసిక వృత్తి ముక్తికి సంబంధించిన మనోవృత్తి కాదు. కాన అది, ముక్తి స్వరూపమే అయిన నిర్వృతి వృత్తిని తనకు సాయంగా ప్రక్కన ఉండటానికి సహించనే సహించదు. తానై దాని ప్రక్కన ఉండనే ఉండదు. తామసిక వృత్తి, ప్రవృత్తి తత్త్వాన్ని కోరుతుంది. కాని, నిర్వృత్తితత్త్వం దానికి కిట్టనే కిట్టదు కూడ. కృష్ణుడి యొక్క సైన్యం పదివేల సంఖ్యల గోపాలురను ఇంద్రియ సంబంధములైన ప్రవృత్తి వృత్తులుగా అంతరార్థం చెప్పుకోవాలి. గోశబ్దానికి ఇంద్రియమని అర్థం కాన గోపాలురంటే ఇంద్రియాలను పోషించే తామసిక వృత్తులు అని అర్థం. ఆ ఇంద్రియాలను పోషించే తామసిక ప్రకృతికి కావాలి అనే దానికి లభించా యన్నదే కృష్ణసైన్యం దుర్యోధనుడికి లభించిందన్న దానికీ, అందుకు దుర్యోధను డానందించాడన్నదానికీ అంతరార్థంగా భావించాలి. ఇతరులకు పరమాత్మ

తత్త్వాన్ని తెలియబడనీయకుండా ఆ పరమాత్మ తత్త్వం చుట్టూ ఆవరించి ఉండే మాయావరణ వృత్తులే గోపాలురైన కృష్ణసైనికులంటే. అర్జునుడు అంటే సాధకుడిలోని ఋజు ప్రవర్తనా సాత్త్విక వృత్తి. అది ముక్తిని కోరే వృత్తి కాన అది ముక్తి స్వరూపమేయైన నిర్వృతి తత్త్వాన్నే వాంఛిస్తుంది. అర్జునుడు శ్రీకృష్ణుడిని ఎన్నుకొన్నాడన్న దానికి అదే అంతరార్థం. కృష్ణుడు యుద్ధం చెయ్యడు, ఆయుధం పట్టడు, సాక్షి మాత్రంగా యుద్ధంలో ఉంటాడు. అయినా సరే, అర్జునుడు కృష్ణుడిని ఎంచుకొన్నాడు అంటే ముక్తిసాధనలో సాత్త్విక వృత్తులకు తామసిక వృత్తులు ఆవరించి అడ్డపడకుండా ఉండే జాగ్రత్త నిరంతరం వహిస్తూ ఉండాలి. నిర్వృతి తత్త్వం యొక్క పరిధిలో సాత్త్విక వృత్తులుంటే దేనితోనూ కలయిక అనేది లేక పరిశుద్ధములైన సాత్త్విక వృత్తులను తామసిక వృత్తులు ఎన్నటికీ కదల్పనే లేవు. సాత్త్విక వృత్తులలో ఏ కొంచెం లోపం ఉన్నా తామసిక వృత్తులకు సాత్త్విక వృత్తులను పూర్తిగా నాశనం చేసివేసే బలం వస్తుంది. కనుక సాత్త్విక వృత్తులు ఇంకొక వృత్తితో కలియకుండా ఉండటమే ముఖ్యాతిముఖ్యమైనది. కనుకనే నిర్వృతి తత్త్వాన్ని సాత్త్విక వృత్తులు కోటను ఆశ్రయించి ఉండునట్లు నిరంతరమూ ఆశ్రయించి ఉండటానికి కోరుతుంటాయి. నిర్వృతి తత్త్వం తమ్ము విడిచి పెట్టకుండా తమలో సాక్షి మాత్రంగా ఉంటేచాలు. నిర్వృతి మనోవృత్తితో చేరికవలననే తామసిక వృత్తులు సాత్త్వికవృత్తులను సమీపించలేవు. విడవకుండా తనలో ఉండటం తప్ప నిర్వృతి తత్త్వ మనోవృత్తి వేరే సాధనకు సాయం చేయనక్కర్లేదు. అదే, ఆయుధం పట్టి యుద్ధం చేయక సాక్షి మాత్రంగా ఉంటానన్న కృష్ణుడిని అర్జునుడు ఎంచుకోవడంలో ఉన్న రహస్యాన్ని మనం అంతరార్థపరంగా గ్రహించాల్సి ఉన్నది.

(3). శల్యుడు కౌరవ పాండవులకు ఇరువురకూ సహాయం చేయటం

మద్రదేశాధిపతి శల్యుడు. మద్ర (మత్+అర) శబ్దానికి అహంకార మమకార నాశక మనోవృత్తి అని అర్థం. శల్యుడు అంటే కప్ప, సరిహద్దు అనే అర్థాలున్నాయి. కప్ప అటు జలతీరం (సరిహద్దు)లోనూ ఇటు జలంలోనూ దూకుతూ ఉంటుంది. అట్లాగే శల్యుడు అటు సాత్త్విక వృత్తుల (పాండవుల) వైపూ, ఇటు తామసిక వృత్తులవైపూ దాట్లు వేసే మనోవృత్తి వంటి వాడు. ఇటువంటి మనోవృత్తిని 'శల్యవృత్తి' అని కూడా అంటారు. సహజంగా సత్త్వగుణం మీద ఆసక్తి ఉన్నా తామసగుణంమీద ఇష్టం లేకపోయినా శల్యవృత్తి దానికి సాయపడే దౌర్బల్యానికి లోనయింది. ఇటువంటి మనస్తత్త్వం సాధకులలో అప్పుడప్పుడు కలుగుతూ ఉంటుంది. అటువంటప్పుడు బహిరంగంగా తామసికం వైపు ఉంటూ సాత్త్విక విజయానికి తోడ్పడుతూ ఉండటం జరుగుతూ ఉంటుంది. ఇరువైపులకూ చేరికగా సరిహద్దులో ఉండి, రెండు వైపులకూ కప్పవలె అటూ ఇటూ కూడా దాట్లు వేస్తూనే సాత్త్విక విజయం చేకూర్చే శల్యవృత్తి వంటిది శల్య సహాయం.

(4). పాండవ కౌరవ సైన్య బల సమీకరణం

అంటే- సాత్త్విక తామసిక వృత్తుల స్వస్వబల సమీకరణ మన్న మాట! 1.ధృష్టకేతుడు, 2.జయత్సేనుడు, 3.జరాసంధి, 4.పాండ్యుడు, 5. నీలుడు, 6.ద్రుపదుడు, 7.విరాటుడు అనే రాజులు ఒక్కొక్కరు ఒక్కొక్క అక్షౌహిణి సేనతో పాండవ సేనలో చేరారు. అక్ష+ఉహినులు=అక్షోహిణులు. అంటే ఇంద్రియాలకు సంబంధించిన మనోవృత్తులు. సప్త+అక్షోహిణులు= అంటే సాధకుడి శరీరంలోని సాత్త్విక గుణాలుగల సప్త ధాతువులు. సప్తాక్షోహిణులకు ఏడుగురు నాయకులు. వారు ముక్తి సాధకుడిలోని సప్తసాత్త్విక లక్షణాలయిన 1.నిశ్చలత, 2.సర్వోత్కృష్టత, 3.శిథిలతారాహిత్యం, 4.జ్ఞానస్థితి, 5.అసంగతత్త్వం, 6.ప్రకృతి మూలస్థితి, 7.చైతన్యసుస్థిరస్థితి అనే వాటికి ప్రతీకలు. ఆ సప్తసాత్త్విక లక్షణాలు ముక్తిసాధన చేసే సాత్త్విక వృత్తులకు బలాన్నిస్తాయి. పాండవులకు ఏడక్షౌహిణుల సైన్యం సమకూరిందంటే అందులోని అంతరార్థ మిది.

కౌరవసేనలో 11 మంది రాజులు ఒక్కొక్క అక్షౌహిణీసేనతో చేరారు. వారు- 1.భగదత్తుడు, 2.భూరిశ్రవుడు, 3.శల్యుడు, 4.కృతవర్మ, 5.హార్దిక్యుడు, 6.జయద్రథుడు, 7.సుదక్షిణుడు, 8.కాంభోజరాజు, 9.బహురూపుడు, 10,11

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అవంతిరాజులిద్దరు. మొత్తం కౌరవసైన్యం పదకొండు అక్షౌహిణులు. సాధకుడిలోని ముక్తివృత్తులను నాశనం చేయ సంకల్పించి, దశేంద్రియాలూ, మనస్సు అనే ప్రకృతి తత్త్వాల్లోనూ ఉన్న తామసిక గుణానికి తోడ్పాటును అందించే మనోవృత్తులు పదకొండు అక్షౌహిణులుగా చెప్పబడ్డాయి. పదకొండుమంది అక్షౌహిణీపతులు పదకొండు ప్రవృత్తులకు ప్రతినిధులు. భగవద్దత్తమౌ జన్మకారణమైన కర్మవాసన (భగదత్తుడు). అహంకారంతో పేరుపొందాలనే అశాశ్వత కీర్తి కాంక్ష (భూరిశ్రవుడు), సాత్త్విక తామసిక వృత్తులకు మధ్యస్థితిలో ఉండే శల్య ప్రవృత్తి (శల్యుడు), సంచిత కర్మవలన కలిగే తామసిక ప్రవృత్తి (కృతవర్మ), వినాశకరమైన మనోవృత్తి (హార్దికుడు), జనన మరణ పరిభ్రమణాలుగల శరీరస్థితి (జయద్రథుడు), వివిధ వృత్తులతో గల భోగాసక్తత (సుదక్షిణుడు), సుఖాసక్తత (కాంభోజరాజు), చంచలత్వదృష్టి (బహురూపుడు), సుఖదుఃఖాది ద్వంద్వగుణాలు (అవంతి రాజద్వయం) అనే ప్రవృత్తులు అక్షౌహిణీపతులు. ఈ ప్రవృత్తులు తామసిక గుణంతో చెలిమి చేస్తూ సాధకుడిలోని ముక్తిసాధనను భ్రష్టం చేస్తూ నిత్యమూ ఘర్షణను సృష్టించే ఐహికపరమైన పదకొండు మనోవృత్తులు. ఇవి ముక్తిసాధనను నాశనం చెయ్యటానికి తామసవృత్తికి తోడ్పడతాయి అని అంతరార్థంగా గ్రహించాలి.

(5). శ్రీకృష్ణుడి రాయబారం

తామసిక వృత్తులను నిరోధించి నివృత్తి తత్త్వ ప్రబోధాన్ని సాధించటం శ్రీకృష్ణుడి రాయబారంలోని పరమార్థం. అయితే, తామసిక వృత్తుల నిరోధం యుద్ధంతో సాధించటమా? (అంటే సర్వతామసిక వృత్తులను నశింపచేయటమా లేక జ్ఞానంలో విలీనం చేయటమా?) లేక పంచేంద్రియాలలోని తామసిక వృత్తులను విఘ్నకారులు కాకుండా చేస్తే సరిపోదా? అన్న సులభ సాధనాభ్యాస విమర్శయే కౌరవులతో అయిదూళ్ళతో సంధియా? లేక యుద్ధమా? అన్న ఆలోచనలోని అంతరార్థం.

కొన్ని సాత్త్విక సాధనావృత్తులు సర్వతామసిక వృత్తులను వినాశం పొందించి తీరవలసిందే అని నిశ్చయించగా, మరికొన్ని పంచేంద్రియాలలోనూ తామసిక వృత్తులను లేకుండా చేస్తే సరిపోతుందనీ, ముక్తి పొందటానికి అదే చాలునని అభిప్రాయపడతాయి అన్నదే ధర్మరాజు సంధికి అంతరార్థం. ముక్తి మనోవృత్తి సర్వసంపూర్ణ ముక్తినే కాంక్షిస్తుందన్నది ద్రౌపది మాటల కంతరార్థం. నివృత్తి తత్త్వమైన శ్రీకృష్ణుడు కూడా అనగా పరమాత్మ వృత్తి కూడా సర్వసంపూర్ణ తామసిక నాశనాన్నే లోలోన అభిలషిస్తుంది.

సత్యం, శివం, సుందరం అనేవి నిర్గుణ పరమాత్మను చెప్పే పదాలు. సాధకుడిలో సత్యవృత్తి (సాత్యకి) కూడా తామసిక వినాశం వలననే ముక్తి యొక్క సంపూర్ణత సిద్ధిస్తుందని చెప్పుతుంది. జ్ఞానదీప్తి (సహదేవుడు) కూడా సర్వతామసిక వృత్తి యొక్క వినాశనాన్నే కోరుతుంది. ద్రౌపది, కృష్ణుడు, సాత్యకి, సహదేవుడు కేవలం యుద్ధాన్నే కోరారనటంలోని తాత్పర్య మిదే.

భీమార్జునులు యుద్ధమైనా సరే, సంధి అయినా సరే అన్నారంటే- అభయవృత్తీ, ఋజువృత్తీ రెండు మార్గాలలో కూడా ప్రవర్తించే వన్నమాట! యుధిష్ఠిరుడు మాత్రం కేవలం సంధినే కోరాడంటే యమనియమాది అష్టాంగ యోగవృత్తి శరీరంలో పంచేంద్రియ తామసికప్రవృత్తులను అణచివేసే వృత్తియేకాని, అది జ్ఞానంలో శక్తిగల వృత్తి కాదు. కాన, దానికి అయిదు ఇంద్రియాలలోనూ తామసిక వృత్తులు లేకపోతే సర్వసంపూర్ణ ముక్తి అదే సిద్ధిస్తుందని ధర్మరాజు సంధి యత్నంలోని అంతరార్థం.

సాధకుల ఇచ్ఛానుసారం ఎవరికి వారు ముక్తిసాధనలను ఎంచుకొని సాగించుకొంటారనే తత్త్వాన్ని చెప్పే కథాభాగమే- సంధియా? యుద్ధమా? అన్న చర్చ.

(6). ధృతరాష్ట్రుడి సభలో శ్రీకృష్ణుడి విశ్వరూప ప్రదర్శనం

"విదురుడు అంటే జ్ఞానం. కృష్ణుడు అంటే నిర్వృతితత్త్వం. నిర్వృతి తత్త్వం జ్ఞానంతో విడవకుండా కలిసియే ఉంటుందన్నదే కృష్ణుడు విదురునింట్లో మకాం చేశాడు, విదురునితో సభాభవనానికి వెళ్ళాడు అన్నదానికి అంతరార్థం.

తామసిక వృత్తులు, సాత్త్విక వృత్తులతో ఏదో విధంగా పొత్తుగా ఉంటే వాటి మనుగడ సాగుతుందనీ, తాత్కాలికంగా తామసిక వృత్తులు సాత్త్విక వృత్తులను అణచగలిగినా చిట్టచివరకు సాత్త్విక వృత్తులు ఎప్పటికైనా ముక్తిని సాధించియే తీరుతాయనీ, కృష్ణుడి రాయబారంలోని అంతరార్థ సారాంశంగా మనకు తెలుస్తున్నది. ధృతరాష్ట్రునకు దివ్యదృష్టి ప్రసాదించబడి కృష్ణునిచే విశ్వరూపం చూపించబడింది. అంతలో అది ఉపసంహరింపబడింది. అంటే సాధకునిలోనున్న మూల తామసిక వృత్తికి అంతలోనే నిర్వృతి తత్త్వం ఆవహించి జ్ఞానోదయం కల్గి అంతలోనే అంతర్హితమైంది అనేది అంతరార్థంగా భావించాలి. అంటే సాధకునిలోని తామసిక గుణానికి కూడా తాను జరుపుతున్న సాత్త్విక గుణ వినాశన కార్యంలో తన శక్తిమీద ధైర్యం సడలి పోతుండడమూ, అంతలోనే తిరిగి స్వశక్తి మీద విశ్వాసం కల్గుతూండడమూ, జరుగుతూంటుందని అర్థం. మనస్సుచే కల్పితములగు విషయములందు సంగము అనేది లేకపోవడమే దివ్యదృష్టి అంటే. ఈ దివ్యదృష్టితో దేహదృష్టి నష్టమౌతుంది. వివిధంగా ఉండే విశ్వమంతటినీ విరాట్‌స్వరూప భగవంతుని అవయవములుగా గ్రహించు జ్ఞానప్రాప్తియే విశ్వరూప సందర్శన యోగమంటే "విశతి పరమాత్మా అత్ర ఇతి విశ్వం" అని వ్యుత్పత్తిలో ప్రపంచ స్వరూపాన్ని పరమాత్మ స్వరూపంగా తెలిసికొనే జ్ఞానం పొందడం విశ్వరూప సందర్శనానికి అర్థం. ధృతరాష్ట్రునకు తన పుత్రుల దురాగత కృత్యాలవలన ముందు ముందు కలిగే నష్టం కండ్లకు కట్టినట్లు స్పష్టంగా కనిపిస్తున్నా దుర్యోధనుని మరలించలేకపోయాడంటే సాధకులలోని తమోగుణం తన ప్రవృత్తి వల్ల తనకు నష్టం కల్గుతుందని తనకు స్పష్టంగా అనిపించినా దానిని లెక్కచేయక అహంకార మమకారాల ప్రాబల్యంతో సహజమైన తామసిక వృత్తుల్ని వదలియుండలేడన్న సంగతిని సాధకులు గుర్తించాలి. ఎన్ని విధాల జ్ఞానప్రబోధం జరిగినా తామసిక వృత్తి తన సహజతత్త్వం విడవదన్నదే గాంధారీ విదుర భీష్మద్రోణాదులు చెప్పినా దుర్యోధనుడు వినలేదన్న దానికి అంతరార్థం. కృష్ణుణ్ణి దుర్యోధనాదులు బంధించే యత్నం చేసేరంటే తామసిక వృత్తులు నిర్వృతి తత్త్వం తమ్ము ఆవరిస్తే తమ ఉనికికే భంగం కల్గుతుంది కాన అది తమ్ము ఆవరించకుండా చేసికొనే తామసిక ప్రకృతి యొక్క ప్రబల ప్రయత్నంగా దానిని భావించాలి."

(7). శ్రీకృష్ణుడు కర్ణుడిని దుర్యోధనుడి పక్షం నుండి విడదీయటానికి చేసిన యత్నం

"కర్ణుని పాండవ పక్షంలో చేరడానికి కృష్ణుడు ఎన్ని విధాలుగానో యత్నించేడు. కర్ణుడు అంటే యోగమార్గంలోని పాక్షికంగా అమనస్కసుఖం అనుభవించే కుంభక ప్రాణాయామంగా మనం లోగడ అంతరార్థపరంగా చెప్పుకొని ఉన్నాం. సర్వసంపూర్ణమైన అమనస్కతయే నిర్వృతి తత్త్వం అలవడడానికి కారణం. నిర్వృతియే ముక్తి అంటే.

ముక్తితత్త్వం సాధించాలంటే సంపూర్ణమైన అమనస్కత కావాలి. ఆ అమనస్కత కుంభక ప్రాణాయామ ధ్యానం వల్ల కొంతసేపు మాత్రమే సిద్ధిస్తుంది. సాత్త్విక వృత్తులు మాత్రమే జ్ఞానమార్గంలో సర్వసంపూర్ణమైన అమనస్కతను సాధించగల్గుతాయి. అమనస్కతను స్థిరంగా నిల్పుకోవడానికి ఎక్కువ అభ్యాసం శ్రమ అవసరం. అయితే జ్ఞానమార్గంలో సాధించిన అమనస్కతయే సర్వ సంపూర్ణమైన, శాశ్వతమైన అమనస్కత అవుతుంది. కుంభక ప్రాణాయామంతో కల్గే అమనస్కత అసంపూర్ణమై అశాశ్వతమైనది మాత్రమే అవుతుంది. అది సులభంగా సాధ్యమయ్యేదే. సాధకులు యోగమార్గంలో కుంభకంతో అమనస్కతను అభ్యాసం చేసి ఆ అభ్యాసపాటవంవల్ల కుంభకం విడిచిన తర్వాత కూడ దానిని శాశ్వతంగా నిల్పుకొని సులభంగా ముక్తిని సాధించటం అనేది, యోగజ్ఞానమార్గాల రెండింటి యొక్క కలయిక వల్ల కల్గే ఫలితం. ఇది ముక్తి సాధకుల చేత అభ్యసింపబడుతుంది. ఈ సంగతి సాధకులకు తెల్పడమే కర్ణుణ్ణి పాండవులలో చేర్చడానికి కృష్ణుడు చేసిన ప్రయత్నానికి అంతరార్థం. నీవు కౌరవులలో ఉన్నా కుంతీపుత్రుడవుగా పాండురాజుకు కొడుకువే అవుతావనీ, పాండవులకు నీవు అన్నవౌతావనీ, ఆ కారణంగా నీకు రాజ్య పట్టాభిషేకం జరుపుతామనీ, ద్రౌపది ఆరవ భర్తగా నిన్ను వరిస్తుందని కృష్ణుడు కర్ణుని హెచ్చరించాడు. అంటే తమో వృత్తులతో (కౌరవులతో) కుంభకయోగం (కర్ణుడు) కలిసియున్నా పరంపరా సంబంధం వల్ల అది సాత్త్విక వర్గంలోనిదే అవుతుంది. కాన ముక్తిని కోరే పంచ సాత్త్విక వృత్తులతో (పాండవులతో) సోదరత్వం దానికి సిద్ధిస్తుందనీ, సాధకునిలోని ముక్తి తపన (ద్రౌపది) ముక్తి సాధనల్లో ఆరవ సూచనగా అంతరార్థం ఇందు గోచరిస్తుంది.

తామసిక వృత్తితో కాక కుంభక యోగం సాత్త్విక వృత్తుల చేరికతో అభ్యాసం సాగిస్తే కుంభకాన్ని విడిచినప్పుడు కూడ అమనస్కత సిద్ధించే వీలుంది. అలాగు సాత్త్విక వృత్తులతో కలవకపోతే కుంభక యోగంలోని పాక్షిక తామసిక గుణాన్ని జ్ఞానయోగంలోని ఋజువర్తనా వృత్తితో నాశం చేయడం జరగవలసి వస్తుంది- అని సాధకులకు తెలియచెప్పటమే కృష్ణుని పరుషోక్తులకు అంతరార్థం. కృష్ణుడు పాండవుల నివాసమైన ఉపప్లావ్యానికి చేరుకున్నాడు. 'ఉప' అంటే సమీపం అని అర్థం. ప్లవము అంటే తేలింపజేసేది తెప్ప అని అర్థం. ప్లావ్యం అంటే తేలింపజేయదగ్గది. తరింపజేసే సాధనా స్థితి అని అర్థం. ఆ స్థితి యొక్క సామీప్యంలో అనగా ముక్తి సామీప్యంలో సాత్త్విక వృత్తులున్నాయని అక్కడకు నిర్వృతి తత్త్వం చేరుకొంది అని కృష్ణుడు ఉపప్లావ్యానికి చేరాడన్నదానికి అంతరార్థం గ్రహించాలి."

(8). కర్ణుడిని పాండవులలో చేర్చటానికి కుంతీ ప్రబోధం: కర్ణుడి తిరస్కారం

"కుంతి అంటే 'కుంధీ' అని. అనగా సాధకునిలోని ఐహిక బుద్ధివృత్తి అనీ లోగడ చెప్పుకున్నాం. కర్ణుడు ఆమెకు సూర్యునివల్ల కల్గిన కుమారుడు కాన అతనిలో పిత్రంశంగా జ్ఞానదీప్తి, మాత్రంశంగా ఐహిక తామసిక వృత్తి కూడా చోటుచేసికొని ఉన్నాయి. కర్ణ పదానికి కుంభక యోగం అని అర్థం చెప్పుకొని ఉన్నాం. కుంభక యోగంలో వాయువును కుంభించి అమనస్కత కల్గినప్పుడు జ్ఞానదీప్తి, వాయువును విడిచివేసినపుడు ఐహిక తామస వృత్తి నిలిచి ఉంటాయి. కాన, కుంతి కర్ణుని ప్రబోధించిందంటే సాధకునిలోని కుంధీ వృత్తి అనగా ఐహిక భోగ వాంఛా వృత్తి కుంభకంలో పాక్షికంగా ఉండే ఐహిక వృత్తిని మేల్కొలిపే యత్నం చేసిందన్నమాట.

సూర్యుడు "తల్లి మాట ప్రకారం ఆచరింపుమని ప్రబోధించే"డంటే సాధకునిలోని కుంభకయోగంలోని అమనస్కతతో పాక్షికంగా ఉన్న జ్ఞానదీప్తి సాత్త్వికవృత్తితో కాక పాండవులతో కాక తామసిక వృత్తితో (దుర్యోధనునితో) చెలిమి చేస్తూంటుంది. కావటం వల్ల కుంభకంలో వాయు నిరోధంతో వున్నప్పుడు కల్గిన అమనస్క జ్ఞానదీప్తికి సుస్థిరత రాదనీ తామసిక వృత్తులతో కాక సాత్త్విక వృత్తుల (పాండవుల) పొత్తుతోనే దానికి సుస్థిరత ఏర్పడి ఫలితం కల్గుతుందని ఆ ప్రబోధంలో అంతరార్థపరంగా యోగజ్ఞాన మార్గాలలో సాధన చేసే సాధకులకు తెలియజెప్పటమే అని మనం స్పష్టంగా గ్రహించవచ్చు.

కర్ణుడు "అర్జునుడిని" తప్ప మిగిలిన యుధిష్ఠిర భీమనకుల సహదేవులను యుద్ధంలో తనను ఎంత హింసించినా తాను వారిని చంపను అన్నాడు. అర్జునుడు అంటే సాధకునిలోని ఋజువర్తనా సాధన. దానివల్ల కలిగే ఫలితము కూడా ఒక్కటే. రెండూ జ్ఞాన ప్రదాయకములైన సాధనలే కాక ఒకటి ఉంటే రెండవది ఉండనక్కరలేదు. ఉండదు కూడ 'ఒకటి జ్ఞానమార్గంలోనిది' రెండవది యోగమార్గం లోనిది అనే పేర్లకు సంబంధించిన భేదమే తప్ప రెండూ ఇచ్చే ఫలితం ఒక్కటే. జ్ఞాన ప్రబోధం, యోగ ప్రబోధం రెండూ ముక్తిని సిద్ధింపజేయడంలో ఒకటే గనుక ఒకటి వుంటే రెండవది ఉండే అవసరం లేదు. అట్లా రెండూ వుండడం సంభవమూ కాదని సాధకులకు తెలియజేయడమే కర్ణుడు చేసిన అర్జున వధ ప్రతిజ్ఞలోని అంతరార్థంగా గ్రహించాలి. అయితే కుంతి, కర్ణుని పాండవుల పక్షంలోనికి రమ్మన్నది అన్నదానికి అంతరార్థ ప్రయోజనం ఏముంది? అనే ప్రశ్న ఇచ్చట సాధకులకు కల్గవచ్చు. తామసిక వృత్తితో కలయికే లేకపోతే ఋజు ప్రవర్తనా వృత్తితో కుంభక వృత్తి ముక్తి సంపాదనలో సమానమే అవుతుంది. యోగమార్గంలో కుంభక సాధన చేసే సాధకులు సాత్త్విక గుణాసక్తులుగా ఉండాలని వ్యాసుడు అంతరార్థపరంగా సాధకులకు చేసిన హెచ్చరికగా ఈ కుంతీ ప్రబోధాన్ని మనం గుర్తించాల్సి ఉంది. యుధిష్ఠిరుడంటే యమనియమాది యోగ సాధన. భీముడు అంటే అభయ వృత్తి. నకులుడంటే ఐహిక భోగ నివృత్తి; సహదేవుడంటే జ్ఞానదీప్తి. ఈ వృత్తులు కుంభక వృత్తికి సహకారులే కాని బాధాకరములు కావు. కాన అవి కర్ణుని అనగా కుంభక యోగవృత్తిని బాధించవు. ఒకవేళ బాధించినా కుంభక వృత్తి వానిని నశింపజేయవలసిన పనిలేదు. ఈ విధంగా కుంభక వృత్తి కుంభకాన్ని విడిచినప్పుడు ఒక ఋజు ప్రవర్తనా వృత్తిని తప్ప మిగిలిన వానిని నశింపజేయకుండా జాగ్రత్త వహింపవచ్చునని చెప్పడమే యుధిష్ఠిరాదులను చంపనని కర్ణుడన్న దానికి అంతరార్థపరమైన అర్థం. జ్ఞాన మార్గంలోని

ఋజు వృత్తిని పొందటం శక్యం కాకపోతే సాత్త్విక గుణశక్తితో కుంభక యోగవృత్తి యొక్క అభ్యాసంతో దాని లోటు భర్తీ చేసుకోవచ్చుననీ, యోగమార్గంలోని కుంభక యోగవృత్తిని నిల్వరించుకోలేకపోతే జ్ఞానమార్గంలోని ఋజువర్తనా వృత్తిని చేపట్టి మిగిలిన నాలుగు సాత్త్విక వృత్తులతో కూడి కొంత ఫలితం పొందవచ్చుననీ చెప్పడమే కర్ణుడు చనిపోయి అర్జునుడున్నా, అర్జునుడు చనిపోయి కర్ణుడున్నా నీకు అయిదుగురు పుత్రులు ఎప్పుడూ ఉండనే ఉంటారని కర్ణుడు, తల్లికి చివరిమాటగా చెప్పినదానికి అంతరార్థం. నేడు తమోగుణం వదలక యోగమార్గంలో కుంభక యోగంతో కల్గిన పాక్షిక అమనస్కతా శక్తివల్ల అణిమాది ఐహిక సిద్ధులు సిద్ధింపజేసికొని కొందరు బాబాలు, యోగులు ప్రజలకు దైవశక్తులుగా వానిని నమ్మించి ముక్తిసాధనను పూర్తి చేయకుండా ఆత్మద్రోహానికి పాల్పడే వారిని దుర్యోధనునికి తోడ్పడిన సూతపుత్రునిగా రాధేయునిగా, వసుషేణునిగా ముక్తిమార్గదూరులుగా వేర్పడిన కర్ణనామధారులనుగా తెలిసికోవాలనే హెచ్చరికను కూడా ఇందు అంతరార్థపరంగా ముక్తి సాధకులు గ్రహించాలి.''

(ఉద్యోగపర్వం: అంతరార్థం - అనే ఈ అంశాన్ని కళాప్రపూర్ణ, సరస్వతీ కంఠాభరణ, తత్త్వార్థ ప్రబోధక, విద్వాన్ డా.వేదుల సూర్యనారాయణశర్మగారి 'అంతరార్థ మహాభారతము' (ముక్తిసాధనా మార్గము) నుండి కృతజ్ఞతలతో గ్రహించటమైనది.)

10. కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం

ఆదికావ్యమైన ఆంధ్రమహాభారతం తెలుగులో అవతరించి దాదాపు వెయ్యేళ్ళు ఔతున్నా, ఇంత వరకు దానికి సమగ్రవ్యాఖ్య వెలువడలేదు. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో కవిత్రయ మహాభారతానికి తెలుగులో శిష్టవ్యావహారిక భాషలో సరళ వ్యాఖ్య వెలువడటం ఆంధ్రావళి ఆనందించే అపూర్వమైన సాహిత్యోత్సవం. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు భారతీయ వైదిక ధర్మ ప్రచారమహోద్యమాన్ని చేపట్టి మహనీయంగా సాగిస్తున్నారు. అందులో ఈ పంచమ వేదవ్యాఖ్యాన ప్రణాళిక ఒక మహత్తర సారస్వత యజ్ఞం. ఏడుకొండల రాయడు మాత్రమే చేపట్టి, ధర్మరక్షణ కళాప్రావీణ్యంతో ఈ బృహత్తర ధర్మకార్యాన్ని ప్రజలకు ప్రసన్నంగా ప్రసాదించగలిగిన పరమ దయాళువు. ఆ దేవదేవుడి కృపాకటాక్షంతో పండితులు పదునెనిమిది పర్వాల ఈ దివ్య ప్రబంధ మండలిని పరిష్కరించి, ప్రతిపద్యానికి వ్యాఖ్యానం వెలయించి, సవిమర్శకమైన పీఠికలు సమకూర్చి, కథాసారాదులతో సర్వార్థ సాధకంగా సంతరించి, సర్వాంగ సుందరంగా ప్రచురించి, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారు చేసికొన్న వెలుగుల పుణ్యం. ఈ పవిత్ర మహత్తర ప్రయత్నానికి శ్రీతిరుమలేశుడి పక్షాన బాధ్యత వహించి అభ్యుదయపరంపరను విజయవంతంగా సమకూరుస్తున్న మాన్యులు, మహనీయులు టి.టి.డి బోర్డ్ ఛైర్మన్, సభ్యులు, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, సంపాదకులూ, వారి సహకారులూ, సంపాదక సలహా మండలుల సభ్యులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, ఎడిటోరియల్‌సెల్ సభ్యులూ, పలురకాలుగా ఈ కార్యక్రమంలో తోడ్పడుతున్న అధికార, అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటి. అది రెండు భాగాలుగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపుదిద్దుకొన్నది. విస్తృతమైన అరణ్యపర్వం మూడవ సంపుటిగా రెండు భాగాలలో ప్రచురించబడింది. మొదటిభాగం నన్నయ రచించిన అరణ్య పర్వభాగం. రెండవ భాగం ఎఱ్ఱాప్రెగ్గడ పూరించిన అరణ్య పర్వ శేషం. ఈ విధంగా అరణ్యపర్వం విభజించబడి ప్రచురించబడటం తెలుగులో ప్రథమం. ఇక నాల్గవ సంపుటిగా విరాటపర్వం వెలువడింది. ఇప్పటి ఈ అయిదవ సంపుటి ఉద్యోగపర్వం.

ఉద్యోగపర్వ వ్యాఖ్యానంలో ఇద్దరు మహాపండితులు, కవులు, విమర్శకులు పాల్గొన్నారు. మొదటి రెండాశ్వాసాలకు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారు, మిగిలిన రెండాశ్వాసాలకు శ్రీముదివర్తి కొండమాచార్యులుగారూ వ్యాఖ్యానం

వ్రాశారు. వీరిరువురూ ప్రసిద్ధ సాహిత్యాచార్యులూ, పరిశోధకులే కాక సహృదయశిఖామణులు, వ్యాకరణాలంకార శాస్త్ర నిష్ణాతులు. మీదు మిక్కిలి భారత తత్త్వ దర్శనం చేసిన మనీషులు. వారు ప్రతిభావంతమైన తమ వ్యాఖ్యానంతో ఉద్యోగపర్వాన్ని ఉజ్జ్వలంగా తీర్చిదిద్దారు. వారికి నా నమోవాకాలు.

తిక్కన సోమయాజి కవిత్వంలోని శిల్పకళావిశేషాలను సహృదయులకు అందుబాటులోకి తీసికొని రావటానికి అనువుగా నేను చాలా చోట్ల విశేష వ్యాఖ్యలు వ్రాసి వివరించాను. అవి 'సంపా'. అనే సంకేతాక్షరాలతో సూచించబడ్డాయి. ఉద్యోగ పర్వంలోని రాజనీతి విశేషాలు, రాయబారాల తీరులు, తిక్కన రచనలోని దృశ్యకావ్య వైఖరులు, కావ్యశిల్పానుశీలన సమీక్షలు. అంతరార్థ పరిశీలనలు మొదలైన అంశాలతో సవిమర్శకమైన పీఠికను సంతరించాను. ఉద్యోగపర్వ కథాసారాన్ని సమకూర్చాను. ఈ ప్రయత్నం ఆంధ్రావళి ఆమోదాన్ని పొందుతుందని ఆశిస్తున్నాను.

ఈ సంపుటి ఈ విధంగా రూపొందటానికి తోడ్పడిన మిత్రులు విద్వన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారికీ, శ్రీ కె.సత్యరామప్రసాద్ గారికీ, శ్రీ జి.రాధాకృష్ణగారికీ, శ్రీబాబుగారికీ, శ్రీమతి సుశీలా లక్ష్మీవిద్యానాథులకూ, డాక్టర్ వి.యస్.లక్ష్మికీ నా హార్దమైన కృతజ్ఞతలు.

పరమ కల్యాణ భద్రమూర్తి అయిన శ్రీ పద్మావతీ సహిత శ్రీవేంకటేశ్వరస్వామివారు వేదవేద్యుడు, వేదాంతగమ్యుడు, పరతత్త్వరూపుడు అయిన భక్త సులభుడు, సాహిత్య సంగీత ప్రియుడు, రసానందమూర్తి. ఆ స్వామికి ఈ పంచమ వేదం అక్షరమైన తోమాలసేవ. వ్యాఖ్యానం సుగంధపరిమళసేవ. ఉద్యోగ పర్వ విశేషాంశాలు ఉజ్జ్వలాలంకారసేవ. పీఠిక విరాణ్మూర్తికి మంగళ నీరాజనం. ఈ పర్వం స్వామివారికి సారస్వతమైన అక్షరార్చనం.

సత్య శివ సుందర రూపుడైన స్వామి దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యా సంపుటిని వాఙ్మయారాధనలోని భాగంగా పుణ్యపూజా కుసుమమంజరిగా సమర్పించుకొంటున్నాను. విశ్వ శ్రేయస్సును ప్రసాదించుమని స్వామిని వేడుకొంటున్నాను.

హైదరాబాదు
చిత్రభాను మహాశివరాత్రి
1-3-2003

జి.వి.సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు
కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉద్యోగపర్వ కథాసారం

ఉత్తరాభిమన్యుల వివాహానికి వచ్చిన రాజబంధువులందరూ ఉపప్లావ్యంలో సమావేశమైనారు. శ్రీకృష్ణుడు పాండవ కార్యార్థియై వారందరినీ ఇట్లా ప్రబోధించాడు.

పాండవోద్యోగం

'పాండవులు కపటద్యూతంలో రాజ్యసంపదనంతా కోల్పోయారు. పరాక్రమవంతులై ఉండి కూడా సత్యనిరతితో అరణ్యాజ్ఞాతవాసాలు పూర్తిచేశారు. పన్నెండేళ్ళ అరణ్యవాసంలో రాక్షసుల వలనా, క్రూరమృగాలవలనా ఎన్నో ఇబ్బందులకు గురి అయ్యారు. కష్టతరమైన పదమూడో యేడు ఎన్నోఆపద లెదుర్కొని ఎట్లా గట్టెక్కగలిగారో మీకందరికీ తెలిసిందే. ధర్మరాజు ధర్మమార్గం తప్పి ఇంద్రపదవిని కూడా ఆశించడు. పాండవులు పితృధనంగానే కాక, దిగ్విజయం చేసి సంపాదించుకొన్నారు వారి సామ్రాజ్యాన్ని. దాన్ని కపటద్యూతంలో ధార్తరాష్ట్రులు అపహరించారు. అయినా, ధర్మరాజు వారికి కీడు చేయ తలపెట్టడు. ఈ రెండు విధాలను మనం పరిశీలిస్తే ఈ రెండు తెగలవారూ రాజ్యాన్ని పంచుకొని అనుభవించటం తగిన కార్యమని అనిపిస్తున్నది. దీనిపై మీ అభిప్రాయాలు ప్రకటించండి. ముందుగా నా మాట చెపుతున్నాను - పాండవు లింతవరకూ శాంతులై సమయాన్ని పాటించారు. ఇకపై తమ పరాక్రమాన్ని ప్రదర్శించుకొనాలని భావిస్తున్నారు. వీరి తలపు తెలిస్తే దుర్యోధనుడు తన మిత్రులతో కలిసి యుద్ధానికి సిద్ధమౌతాడు. యుద్ధమన్న తరువాత తక్కువబలం ఉన్నవారిమీద ఎక్కువబలం ఉన్నవారి ప్రభావం కనబడుతుంది. పాండవు లెంత బలవంతులైనా సైన్యబలాన్ని, మిత్రబలాన్ని సమీకరించుకోక తప్పదు. అప్పుడు ఈ వైపునా, ఆ వైపునా రాజులకూటమి ఏర్పడక మానదు. దేవాసురుల యుద్ధంలోవలె కొందరు చనిపోవక తీరదు. కాబట్టి ఇక్కడి వారి తలపులు, అక్కడివారి తలపులు ఎట్లా ఉన్నాయో తెలియవు. కార్యనిశ్చయం చేయటం ఇప్పుడు కష్టం. అందువలన తగిన రాయబారిని పంపటం అవసరం. దుర్యోధనుడు రాజ్యభాగం ఇచ్చాడా సరి, లేదా అప్పటికి తగిన విధంగా నడచుకొనటం న్యాయం'.

శ్రీకృష్ణుడి మాటలను బలరాముడు సమర్థించాడు. కాని, సాత్యకి రాయబారపు యత్నాన్ని వ్యతిరేకించాడు. 'సంగ్రామమే అవశ్య కర్తవ్య' మన్నాడు. అయితే, ధర్మరాజు అంగీకరించి రాయబారం నడపదలచుకొంటే - దీనంగా రాజ్యాన్ని అడగకుండా గౌరవపురస్సరంగా వా రిస్తే పుచ్చుకొనే పద్ధతిలోనే మాటలు సాగాలి' అని ప్రతిపాదించాడు. సాత్యకి అభిప్రాయాన్ని ద్రుపదుడు బలపరిచాడు. 'దుష్టాత్ముడైన దుర్యోధనుడు మంచిమాటలతో రాజ్యభాగా న్నివ్వటానికి అంగీకరించడు. దుర్జనుల హృదయాలు మెత్తని మాటలతో ప్రసన్నమౌతాయా? భీష్మద్రోణులు పెద్దవారే కాని, కూటికొరకు వారి ననుసరిస్తారు. ధృతరాష్ట్రుడికి కొడుకుమీద వ్యామోహం పెద్దది. కర్ణుడా వట్టి తులువ. మిగిలిన వారందరూ దుర్యోధనుడే సద్బుద్ధి కలవా డని కీర్తిస్తారు. కాబట్టి అతడు దుర్వినీతుడై ఎప్పుడూ యుద్ధానికే కాలుదువ్వుతుంటాడు. ఈసమయంలో మనం బలాలను సేకరించుకొనాలి. పిలువదగిన రాజులకు పిలుపులు పంపించాలి. దుర్యోధనుడు కూడా తనవారిని తాను పిలుచుకొంటాడు. ముందు పిలిచిన వారికి సహాయం అందజేసే మర్యాద రాజలోకంలో ఉన్నది. మనం త్వరపడి శల్య కేకయ జరాసంధ తనయాదులను, వారిబంధు మిత్రులను మన వైపు చేర్చుకొనటం అవసరం' -అని చెప్పి ద్రుపదుడు తన పురోహితుడిని దూతగా ధృతరాష్ట్రుడి పాలికి పంపాలనీ, ఎవ రెవరితో ఏయే మాటలు ఎట్లా మాట్లాడాలో అతడికి వివరంగా చెప్పితే వాటి నాతడు నిర్వహిస్తాడనీ సూచించాడు.

వాసుదేవుడు 'ద్రుపదుడి మాటలు కూడ ఉచితంగా ఉన్నాయి. అట్లాగే చేయాలి' అని అంటూ - 'నాకు కౌరవులు పాండవులు సమానమే. వారిరువురు రాజ్యాన్ని పంచుకొని అనుభవిస్తే చూచి సంతోషిస్తాను. పెళ్ళికి వచ్చి చాలరోజులయింది. మా ఇళ్ళకు మేము పోవాలి. ద్రుపదు డందరికీ కావలసినవాడు, అన్నీ తెలిసినవాడు; అతడు ఎట్లా చేస్తే అట్లా కానివ్వండి. ఇరువురికీ స్నేహం కుదిరితే సంతోషం. లేదా, మమ్ములను పిలవ బంపండి; వచ్చి సాయం చేస్తాం' ఆపైన అర్జునుడి కోపాగ్ని వారిని చుట్టుముట్టక మానదు' - అని నిష్కర్షచేసి నిజనగరానికి బయలుదేరాడు.

విరటుడి ప్రేరణతో యుద్ధోద్యోగం పాండవపక్షంలో ప్రారంభమయింది. పాండవులు, విరాటరాజు, ద్రుపదుడు సైన్యాలతో ఊరివెలుపల గుడారా లెత్తించి తమ కనురక్తులైన రాజులవద్దకు తగిన దూతలను పంపారు. ఈ సంగతిని తెలిసికొన్న దుర్యోధనుడు కూడా తన బంధుమిత్రగణాలను సమీకరించటం మొదలు పెట్టాడు. ఇట్లా రెండువైపులా స్కంధావారాలు సైన్యాలతో సమృద్ధమౌతూ ఉన్నాయి.

ద్రుపద పురోహితుడి రాయబారం

ద్రుపదుడు ధర్మజుడి అనుమతితో వయోజ్ఞానవృద్ధుడైన పురోహితుడిని పిలిపించి ధృతరాష్ట్రుడి పాలికి దూతగా పంప నియోగించి ఇట్లా ప్రబోధించాడు - 'నీవు మతిమంతుడవు, చతురవచన కోవిదుడవు, సమయజ్ఞుడవు, హితుడవు కాబట్టి పాండవార్థమై నిన్ను ధృతరాష్ట్రుడి పాలికి దూతగా పంపుతున్నాను. అతడు పుత్రమమకారం కలవాడు; కుటిలుడు. అతడి వర్తనం, ధర్మజుడి శీలం రెండూ నీకు తెలుసు. పాండవులకు రాజ్యభాగం అడుగుతూ ధర్మనిష్ఠతో మాట్లాడితే అతడి అనుచరులందరూ ఆగ్రహిస్తారు. గురుభీష్మాదుల హృదయాలు యుద్ధంమీదకు పోకుండా, దుర్యోధనుడు సంధికంగీకరించేటట్లు నిపుణంగా మాట్లాడాలి. బంధువుల కందరికీ పాండవులు పడిన పాట్లను వివరిస్తూ, ఎవరికి నచ్చేవిధం వారిపట్ల అనుసరిస్తూ, నీవు చెప్పేదే మంచిమార్గమని వారందరూ భావించేటట్లు పలకాలి. అంతేకాదు, అక్కడి అందరి మనస్సులూ ఇక్కడ వ్రాలేటట్లు ఎన్నిఉపాయాలు దొరికితే అన్నీ ప్రయోగించాలి. కృష్ణాదుల వాదాలు నీవు విన్నావు కదా! వాటికి అనుకూలంగా పాండవులకు తేజోలాభం కలిగేటట్లు కార్యం నిర్వహించాలి. కురువృద్ధుల హృదయాలు గమనిస్తూ మసలుకొనాలి. నీ వాక్యసూత్రానికి సుయోధను డంగీకరించాడా - అదే అందరికీ సంతోషం కలిగిస్తుంది; ధర్మరాజుకు ప్రీతిని కలిగిస్తుంది. ఇక పోయిరా' అని హస్తినాపురికి పంపాడు. అతడు హస్తినాపురం వెళ్ళి కొన్నాళ్ళుండి ధృతరాష్ట్ర దుర్యోధన భీష్మాదులతో తగిన మాటలాడుతూ తగిన సమయంకొరకు ఎదురు చూచాడు.

ఆ సమయంలోనే ఇరుపక్షాలవారు వారివారి మిత్రులను సాయమడిగే యత్నాలు సాగిస్తున్నారు. దుర్యోధనుడు అన్యరాజన్యులను అడిగినట్లుగానే శ్రీకృష్ణుడి సహాయం అడగడానికి దూతను పంపటం ఉచితం కాదని తానే స్వయంగా వెళ్ళాడు. శ్రీకృష్ణుడు తన మందిరంలో శయనించి ఉన్నాడు. దుర్యోధనుడు వెళ్ళి తలవైపున ఉన్నపెద్దగద్దెమీద కూర్చున్నాడు. అదే సమయంలో అర్జునుడు కూడా వచ్చాడు. అతడు శ్రీహరిపాదాలచెంత వినమ్రుడై నిలువబడ్డాడు. కృష్ణుడు నిద్ర లేచి ముందుగా అర్జునుడిని చూచి పలుకరించాడు; ఆ తరువాత దుర్యోధనుడిని చూచి సంభావించాడు. ఇద్దరినీ వచ్చిన పనిని గూర్చి అడిగాడు. రాబోవు యుద్ధంలో తనకు సహాయం చేయు మని అడగటానికి వచ్చానని దుర్యోధనుడు పలికి, వచ్చిన వారిలో తానే మొదటివాడు కాబట్టి అడిగే అవకాశం మొదట కల్పించుమని కోరాడు.

శ్రీకృష్ణుడు అది కాదని, మొదట చూచినవాడు, చిన్నవాడు, అన్నచాటు వాడు అయిన అర్జునుడికి మొదట కోరుకొనే అవకాశం ఇచ్చాడు. తన బలాన్ని రెండు భాగాలు చేశాడు. నారాయణాఖ్యులైన పదివేలమంది గోపాలురు యుద్ధ నిపుణులు ఒకవైపు, ఆయుధం పట్టక యుద్ధం చేయక, సాయం చేసే తా నొక్కడూ ఒక్కవైపు ఏర్పరచాడు. ముందుగా అర్జునుడు శ్రీకృష్ణుడిని కోరుకొన్నాడు. దుర్యోధను డందుకు ఉప్పొంగి పోయి గోపాలురను తీసికొని వెడలి పోయాడు.

ఆ తరువాత సుయోధనుడు బలరాముడి సహాయాన్ని అర్థించాడు. అత డెవ్వరి పక్షాన పోరనని చెప్పాడు. ఆపైన కృతవర్మను కోరగా అక్షౌహిణీ సైన్యంతో అతడి పక్షాన చేరాడు.

పదివేల మంది నారాయణవీరులను కోరకుండా తన నొక్కని నెందుకు కోరుకొన్నావని శ్రీకృష్ణుడు అర్జునుని ప్రశ్నించాడు. అందుకు అత డిచ్చిన సమాధానం ఇది-

శ్రీకృష్ణా! నేను రణంలో ఎవరి సహాయాన్నీ తీసుకోను. నీవా ప్రసిద్ధుడవు. నీవు యుద్ధం చేస్తే నాకు పేరు రాదు. అంతేకాక నీ కెదురై విజయాన్ని సాధించటం దుర్లభం. విజయమూలమైన నీతోడు నాకుంటే చాలు. నీవు యుద్ధం

చేయకపోయినా సంతోషమే. అందువలననే నిన్ను కోరుకొన్నాను. ఓ మహాత్మా! నా రథానికి నీవు సారథివై నన్ను ముందుకు నడిపించు. అపారకృపారసం నా మీద చిలికి నాకీ వరం ప్రసాదించు. ఇది నా చిరకాలవాంఛితం. మన్నించు' అని పార్థుడు ప్రార్థించాడు.

'అర్జునా! నీ అభిమతం తీర్చటం నాకు ఆనందం. తప్పక నీ రథసారథ్యం నిర్వహిస్తాను. పార్థసారథి అనే పేరుతో ప్రసిద్ధిపొందుతాను' అని అనునయించి కిరీటిని తీసికొని ధర్మరాజు వద్దకు వెళ్ళి పాండవులకు కార్యాలోచనంలో మార్గదర్శిగా వ్యవహరించాడు మాధవుడు.

పాండవ దూతలు శల్య సహాయాన్ని కోరారు. అత డంగీకరించి పుత్రమిత్ర సేనాసమేతంగా బయలుదేరి ఉపప్లావ్యానికి అంచెలంచెలుగా యాత్ర సాగిస్తున్నాడు. దుర్యోధనుడు ప్రచ్ఛన్నంగా తనవారిచేత శల్య సైన్యానికి కావలసిన సౌకర్యాలన్నీచేయించాడు. దాని కతడు మెచ్చి పాండవదూతలే సహాయం చేస్తున్నారని భావించి వరమిస్తానని ప్రకటించాడు. సమయ మదేనని తెలిసికొని దుర్యోధనుడు శల్యుడి ముందుకు వచ్చి తన పక్షంలో చేరి యుద్ధం చేయుమని కోరాడు. దానికి కారణం-శల్యుడికి కౌరవపాండవు లిరువురూ సమానులేననీ, దుర్యోధనుడిని శల్యుడు ముందు చూచాడనీ పేర్కొన్నాడు. శల్యుడు దాని కంగీకరించాడు. కాని, ధర్మరాజుకు ఆ సంగతి చెప్పి వస్తానని ఉపప్లావ్యానికి వెళ్ళాడు. అతడికి జరిగిందంతా తెలిపాడు. ధర్మరాజు కూడా ఒక కోరిక కోరాడు. 'మాపక్షంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు సారథి. వారి పక్షంలో కర్ణుడి రథసారథిగా అశ్వహృదయం తెలిసిన నిన్నే కోరాలని భావించి ఉంటారు. కర్ణసారథ్యం వహించేటప్పుడు అర్జునుడికి విజయం కలిగేటట్లు సహాయం చేయాలని ప్రార్థించాడు ధర్మజుడు. శల్యుడు దానికి అంగీకరించాడు. కర్ణరథసారథ్యం చేసేటప్పుడు అతడి హృదయం వికలమయ్యేటట్లు మాట్లాడి పరోక్షంగా పార్థవిజయానికి దోహదం చేస్తానని వాగ్దానం చేశాడు. కాలం కలిసి రానప్పుడు ఇంద్రుడు సైతం కొంతకాలం అజ్ఞాతంగా ఉండవలసి వచ్చిందనీ, కాలం కలిసివచ్చినప్పుడు సంపదలు కలిసివస్తాయనీ, అంతవరకు ఓర్పుతో జీవించాలని ఇంద్రోపాఖ్యానాన్ని చెప్పి ధర్మరాజును ఊరడించి, ప్రోత్సహించాడు.

ఈ విధంగా కౌరవ పాండవులు బంధుమిత్రుల సహాయంతో సైన్యసమీకరణం చేసికొన్నారు. పాండవులకు ఏడక్షౌహిణులు, కౌరవులకు పదకొండు అక్షౌహిణులు చతురంగబలం సమకూరింది. రెండువైపులా స్కంధావారాలు రణోత్సాహంతో కయ్యానికి కాలుదువ్వుతున్నాయి.

కురుసభలో ద్రుపదపురోహితుడి దూతవాక్యం

ఈ వాతావరణంలో ధృతరాష్ట్రుడు ద్రుపదపురోహితుడి రాయబారాన్ని వినటానికి నిండుసభ తీర్చాడు. పురోహితుడు కౌరవేశ్వరుడికి, భీష్మాదులకు, దుర్యోధనాదులకు, సభాసదులకు అభివాదనం చేసి ఈ విధంగా ఉపన్యసించాడు.

'ధృతరాష్ట్ర పాండురాజులు సోదరులు కావటంచేత వారి వారి పుత్రులు తండ్రుల సంపదలను పొందటం మీకందరికీ ఉచితంగా తోస్తుందని భావిస్తాను. మొదటి రోజులలో వారిద్దరూ అట్లా ఉండటం కూడా మనకు తెలుసు. పాండవులు బాహుబలంతో రాజ్య వైభవాన్ని పొంది ఉండగా వంచనతో దానిని ధార్తరాష్ట్రులు గ్రహించిన విధం కూడా మీకు తెలుసు. ఈ పెద్దరాజు దీనికి అంగీకారం తెలిపాడు. ఇక ఏమని చెప్పేది?

నారీరత్నాన్ని సభలోకి ఆ విధంగా తెచ్చి అందరూ చూస్తుండగా చీరలు కుప్పలుపడేటట్లు విప్పి, సంపదలు హరించి, మహారణ్యంలో నివాసం చేసేటట్లు చేసి, తేలికగా మాట్లాడినప్పటికీ అన్నింటినీ సహించగలిగే పాండవులు ఈ సంధి ప్రయత్నం చేయటంలోని విలువను గమనించవచ్చును.

ధార్తరాష్ట్రుల వర్తనాన్నీ, పాండవుల వర్తనాన్నీ ఎటువంటి పక్షపాతం లేని బుద్ధితో వివేచించి ధృతరాష్ట్రుడికి మీరందరూ తగిన హితవు చెప్పండి.

పాండవులు కౌరవులతో పగను కోరటం లేదు. దానివలన ప్రజాక్షయం బాగా జరుగుతుంది కాబట్టి, దీనిని మీరు తేలికతనంగా తీసికొనవద్దు. వారు ధర్మపరులు కాబట్టి ఈ విధమైన న్యాయమార్గాన్ని అనుసరిస్తున్నారు.

అందున్నవి ఏడక్షౌహిణులు, ఇందుకూడినవి పదకొండు అక్షౌహిణులు అని బలగణాంకాలను గణిస్తారేమో! రణభూమిలో బాహుబలఘనుడు భీముడు, సాహసవీరుడు సాత్యకి వేయి అక్షౌహిణుల పెట్టు. గాండీవాన్ని చేపట్టి యుద్ధానికి సిద్ధమైన బీభత్సుడి పరాక్రమం అప్రతిహతం. అతడిని ఎదుర్కొనటం కొండను పొట్టేలు ఢీకొనటమే. అంతే కాదు, వివిధోపాయ నిపుణుడు, అఖిలవిద్యాజాల సంవేది అయిన మాధవుడు పాండవుల పక్షంలో ఉన్నాడు. ఇక వారికి అసాధ్యమనేది ఏముంటుంది? కాబట్టి, సమయం మించిపోకుండా, ఆ మహాత్ములను పిలిపించి హితం, ప్రియం రెండుపక్షాలవారికి కలిగేటట్లు భావించి న్యాయంగా కొంతరాజ్యం వారి కిచ్చి కలిసి ఉండటంలోనే కలదు సుఖం'.

ఈ విధంగా పలికిన పురోహితుడి సందేశం విని భీష్ముడు లేచి ఇట్లా అన్నాడు: 'పాండవులు ఎటువంటి ఆపదలు పొందకుండా ఉండటం అయ్యో! నిజంగా ఎంత అదృష్టం! శ్రీకృష్ణుడితో కలిసి, ధర్మమార్గాన్ని అనుసరించి, ప్రశాంతచిత్తాలతో ఇటువంటి సాధుమార్గాన్ని అనుసరించటం కూడా చాలమేలే! అయితే! ఓ రాయబారీ! నీ ఉపన్యాసం విప్రస్వభావంతో వినేవారికి పరుషంగా ఉండటం చేత నీ మాటలు కార్యరూపంలో పెట్టటానికి ఇష్టపడతారా? నియమానుసారులై పాండవులు పడిన పాట్లన్నీ లోకానికి తెలుసు. పుణ్యాత్ములను వేధించటం తగదు. వారికి కూడా రాజ్యంలో పాలిచ్చి ధృతరాష్ట్రుడు వారిని కూడా తన సుతులవలె చూచుకొనటం న్యాయం. అట్లా కాకపోతే ధర్మరాజు శాంతమూర్తిగా ఉంటాడేమో కాని అర్జునుడు ఊరుకొనడు. అతడు మోహరిస్తే ఎదురునిలిచే మగవాడున్నాడా ఈ లోకంలో?'

భీష్ముడి మాటలు కర్ణుడికి కోపం తెప్పించాయి. ఆవేశంతో అతడు ఇట్లా అన్నాడు.: 'అందరికీ తెలిసిన ఈ విషయాలను పదేపదే చెప్పటం దేనికి? జూదం దుర్యోధనుడి పక్షాన శకుని ఆడాడు. ధర్మరాజు ఓడిపోయాడు. ఇందులో తప్పేమి ఉన్నది? అరణ్యానికి వెళ్ళిన ధర్మజుడు సమయం ముగియకుండానే బయటపడి తండ్రిపాలు మాకు రావటం న్యాయమని గడుసరితనంతో అడగటం తప్పు. అంతేకాక విరటుడు, ద్రుపదుడు తమతమ సైన్యాలను తనకు సాయంగా చేర్చి యుద్ధానికి స్కంధావారాలను నిలిపి, ఇప్పుడు బలవంతంగా సగంభాగం కావాలని అడిగితే కురుపతి భయపడి ఇస్తాడా? అసలు ఇట్లా అడగటం న్యాయమేనా?' - అని గద్దించాడు. భీష్ము డామాటలకు కటకట పడ్డాడు.

'కర్ణా! నీవు బలే మొనగాడివయ్యా! ఎందుకు? వినేవాళ్ళు నవ్వేటట్లు పెద్దపెద్దమాటలు మాట్లాడతావు? అవక్రపరాక్రమశాలి అయిన అర్జునుడు నిన్న ఉత్తరగోగ్రహణయుద్ధంలో ఒక్కడే మనల్నందర్నీ ఓడించి గెల్చాడు. నీవు రణరంగంలో అతడిని గెలవలేవు కాని మనరాజు కొలువులో మాటలలో మాత్రం గెలుస్తావు. అర్జునుడు ఆవులవెంట తరుముతూ వస్తుంటే దుర్యోధనుడు పాండవుల అజ్ఞాతవాసకాలం ముగిసిందా లేదా అని నన్ను అడిగినప్పుడు నీవు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ వింటూ ఉండగా సమయం ముగిసిందని నేను చెప్పలేదా?' -అని కోపగించాడు.

మాటలు ముదురుతున్న ఆ తరుణంలో ధృతరాష్ట్రుడు కల్పించుకొని భీష్ముడిని భక్తితో బ్రతిమలాడి, కర్ణుడిని కసిరి, ద్రుపద పురోహితుడితో ప్రియ ముట్టిపడేటట్లు ఇట్లా అన్నాడు. 'నేనూ, బంధువులు, మంత్రులు, పెద్దలు బాగా ఆలోచించి సమస్తప్రజలకు ప్రీతికలిగేటట్లు బిడ్డలపాలికి ఒక సౌమ్యుడిని పంపుతాను. అతడు నా అభిప్రాయం ప్రకారం వారితో కలిసి చర్చించి ఇకముందు నడువవలసిన తీరును నిర్ణయించుకొనటం కౌరవజాతి కంతా స్పష్టమైన మార్గం. కాబట్టి ముందుగా నీవు వెళ్ళు' మని సగౌరవంగా సాగనంపాడు. పురోహితుడు ధర్మరాజుకు జరిగినదంతా నివేదించాడు.

సంజయుడి రాయబారం

ధృతరాష్ట్రుడు పుత్రవృద్ధామాత్యసహితంగా కొలువుతీర్చి సంజయుడిని పిల్చి ఇట్లా చెప్పాడు:-

'సంజయా! నీవు ఉపప్లావ్యంలో ఉన్న పాండవుల వద్దకు వెళ్ళి వాసుదేవ సహితంగా వారున్నప్పుడు కలిసి, వారి దుఃఖం ఏవిధంగా ఉపశమిస్తుందో ఆవిధంగా సముచితంగా మాట్లాడాలి. మీ తండ్రి మీరు వనవాసక్లేశాన్ని తరించి అభ్యుదయం పొందటం విని చాల సంతోషించి నన్నిక్కడకు పంపాడని ముందుగా చెప్పుము. ధర్మరాజు నిండుకొలువున్నప్పుడు

అతడిని దర్శించి అతడి తమ్ములకు, బంధువులకు సంతోషం కలిగించేటట్లు మాట్లాడుము; స్నేహాన్ని పాటించి తియ్యని మాటలతో కోపం తీరేటట్లు చేసి, ధర్మజుడు యుద్ధమని మనస్సులో తలంచకుండా ఉండేటట్లు శాంతవచనాలు పలుకుము; కలిసి ఉండేటట్లు యత్నించుము'- అని చెప్పి రథ మెక్కించి పంపాడు. సంజయుడు ఉపప్లావ్యం చేరి ముందుగా నరనారాయణులను దర్శించి తగురీతిగా మాట్లాడి, మరునాడు ధర్మరాజును నిండుకొలువులో కలిసికొన్నాడు. ధర్మజుడితో సంజయు డిట్లా మాట్లాడటం మొదలుపెట్టాడు:

'ధర్మజా! పుణ్యాత్ముడవైన నిన్ను చూచి నేను ధన్యుడనైనాను. మీతండ్రి ధృతరాష్ట్రుడు మీ రిక్కడున్నా రని విని అత్యంతస్నేహపూర్ణమైన హృదయంతో మీ అందరి యోగక్షేమాలు తెలిసికొనటానికి నన్ను పంపాడు' - ఆ మాటలకు ధర్మరా జిట్లా అన్నాడు:

'ఆ రాజుకు మాపట్ల ఉన్న దయ కారణంగా ఇట్లా సుఖంగా ఉన్నాం. నిన్ను పంపించిన మర్యాదకు నా మనస్సెంతో వికసించింది. ఆ మహారాజు పుత్రపౌత్రాదులతో క్షేమమే కదా! దేశంలో అరిష్టాలు లేకుండా శుభపరంపర కలుగుతున్నదా? ద్రోణకృపాశ్వత్థామలు కుశలమేనా? భీష్ముడు క్షేమమా? కౌరవు లాయనకు పెద్దతన మిచ్చి గౌరవిస్తారా? బ్రాహ్మణులకు నేను దానం చేసిన వృత్తులు నేటికీ చెల్లుతున్నాయా? ఎవరైనా దండెత్తి వచ్చినపుడు మా గాండీవిని, భీమసేనుడిని స్మరిస్తున్నారా? మొన్న ఘోషయాత్రలో గంధర్వుల ఉదంతాన్ని అప్పుడప్పుడు మనసులలో నెమరువేసికొంటున్నారా? పక్షపాతం లేకుండా ఆలోచిస్తే అక్కడి వీరులలో అర్జునుడి చేత మానాన్ని, ప్రాణాన్ని దక్కించుకొనని వారెవరున్నారు? సంజయా! ఆ దుర్యోధనుడి మందిరంలో కార్యానికీ, ఖడ్గానికీ నేనే తగుదునంటూ చాతుర్యాన్ని ప్రదర్శించే కర్ణుడి ఆర్యత్వం ఇంకా చెల్లుతూనే ఉన్నదా?' అన్నాడు. ధర్మజుడి మాటలలో అధిక్షేపం తొంగి చూచింది. సంజయుడు సవినయంగా ఇట్లా అన్నాడు:

'కురురాజు కొలువులో అవినీతులూ ఉన్నారు, నీతిమంతులూ ఉన్నారు. దురహంకారులూ ఉన్నారు. సత్త్వ సంపన్నులూ ఉన్నారు. వారిలో ఒకడు చెప్పిన మాట మరొకడు వినడు. వారి మాటకేం గాని, నా విన్నపాన్ని ముందు మన్నించుము. ధర్మజా! వెన్నెల వంటి తెల్లని చల్లని మనస్సుతో స్నేహం చేయాలని భావిస్తున్నావు నీవు. అదే అందరికీ క్షేమం. ఇంతవరకూ అది లేకపోయినా ఇకముందు తప్పకుండా ఉంటుందని మా ఆశ! ధృతరాష్ట్ర మహారాజుకు వార్ధక్యంచేత మనస్సు ఒక విధంగా ఉండదు. అందువలన కొడుకు గర్వాన్ని నాడు మాన్పలేక మనస్తాపం పొంది ఇప్పుడు శాంతుడైనాడు. వారి చేష్టలనన్నింటిని పుణ్యాత్ముడవైన నీవు సహించి అజాతశత్రువనే కీర్తిని పొందగలిగావు. పాప నాశకమైన సత్పురుష జీవన పద్ధతి గైకొన్నవారు హింసాపరులౌతారా? పాండుకుమారులు దుర్వారబలాఢ్యులైనప్పటికీ శాంతస్వభావులు కావటంచేత ఆగ్రహాన్ని ప్రకటించి అధర్మాన్ని ఆచరించరని లోకులందరూ మిమ్మల్ని గురించి భావిస్తున్నారు. నరవరా! మీ తమ్ములూ, వాసుదేవుడూ, ఆప్తులూ, బంధువులూ కూడి ఉన్నప్పుడు మీతో మీ తండ్రి చెప్పుమన్న మాటలు నీకు వినిపిస్తాను' - అన్నాడు సంజయుడు. ధర్మజుడు సంజయుడి మాటలలోని నాన్పుడు స్వభావానికి విసిగి అధిక్షేపాత్మకంగా అతడికి తమ్ములను, గోవిందుడిని చూపించి రాజేమని చెప్పుమన్నాడో త్వరగా నివేదించుమన్నాడు.

సంజయుడు కృష్ణుడికీ, భీమాదులకూ, పాంచాల మత్స్య భూపాలురకూ పేరుపేరున నమస్కరించి, ధర్మజుడి ముందు చేతులు ముడుచుకొని వినయంగా ఇట్లా మాట్లాడ నారంభించాడు -

'ధృతరాష్ట్ర భూపాలుడు ప్రశాంత చిత్తంతో నన్నిక్కడకు పంపేటప్పుడు నారథం దగ్గరికి తానే స్వయంగా వచ్చి ఎంతో ఆప్యాయంగా ఈ మాటలు చెప్పాడు. మీరు సావధానంగా వినండి. మీ వంటి ధర్మజ్ఞులు, శాంతులు, అయిన ప్రసిద్ధులు చులకనైన పనులు చేయటం ఏ విధంగానూ న్యాయమౌతుందా? ధర్మరాజా! మడుగు చీరలో మసి చేరినట్లు దుర్యోధనుడి వలన కురుకులం కల్మషమైపోయింది. అయితే, ఆ కల్మషాన్ని పాపగల సమర్థుడవు నీవే! ఓ దయామయా! యుద్ధం జరిగితే జయాపజయాలు ఏ వైపు కలిగినా అవి సుఖాన్ని కలిగించవు. రణరంగంలో బాలురను, వృద్ధులను, బంధువులను, గురువులను చంపిన తరువాత ఆ సుఖాలు మాత్రం దేనికి? నీకు హరి పెట్టని కోట; భీమార్జున సాత్యకి విరాటాదులు మహావీరులు. వీరందరూ యుద్ధ భూమిలో నిలిస్తే దేవతలే ఎదుర్కొనటానికి భయపడతారు. అయితే, ఆ వైపూ తక్కువవారు లేరు. ద్రోణ భీష్మ కృపాశ్వత్థామ కర్ణశల్యాదులు ఒక్కొక్కరు అజేయులు. వారందరు కలిసి వస్తే

పరమేశ్వరుడైనా జయించటం కష్టం. ఇటువంటి మీ ఉభయ పక్షాలకు అన్యోన్య కలహం మేలుకాదు. ఈ సభలో ఉన్న వాసుదేవాదుల కందరికీ చేతులెత్తి మ్రొక్కుతున్నాను. మీరందరూ అసూయ మాని, కరుణామయుడైన ధర్మరాజును క్రోధశాంతి పొందుమని కోరండి. యుద్ధాన్నుండి ఉపశమిస్తే భీష్మాదులు కూడా సంతోషిస్తారు. సర్వలోకం సమ్మతిస్తుంది.' అని ధర్మజుడి ఎదుట వినమ్రుడై నిలువబడ్డాడు. అపుడు ధర్మజు డిట్లా అన్నాడు -

'సంజయా! నా మాటలలో స్నేహమనేది ఒక్కటే నీ చెవులకు వినిపించింది. కయ్యము లేకుండా ఉండండని మమ్మల్ని నీవు కోరుతున్నావు. బాగానే ఉన్నది. కయ్యం లేకుండానే దానివలన కలిగే అర్థసిద్ధి చేకూరితే ఇక వేరే కయ్యం చేయవలసిన పనేముంటుంది? ధృతరాష్ట్ర మహారాజు ద్యూత సభలో తాను నీతి మార్గానికి నీళ్ళువదిలి వక్రంగా వ్యవహరించాడు. ఇప్పుడు మాకు మాత్రం ఋజుమార్గంలో నడవండని నీతులు చెపుతున్నాడు. తమవలెనే ఎదుటివారిని గూడా భావించాలి. అట్లాకాక - 'మాకు కుడుమిచ్చి మీరు ప్రక్క తీసుకోండి' అన్న సామెతగా వ్యవహరిస్తే పొందు కుదురుతుందా?

మేము సంపద లేనివారమై ఉంటే అశక్తులమని లెక్కకట్టి మమ్మల్ని పిలిచి, గౌరవించి, రాజ్య మిచ్చేంత వెర్రివాడా మహారాజు? అతడి సలహాదారుల బుద్ధిని, కొడుకు కోరికను మన్నిస్తాడు కాని, ధర్మాన్ని పరిగణిస్తాడా? ఎందుకు మీకీ వృథా ప్రయాసలు? మానండి. ఆయన చరిత్రం నీకూ మాకూ ఈ నాటి వింతయా? ఎన్నడైనా తగిన మాటలు చెప్పి కొడుకును మాన్పగలిగాడా? పై పెచ్చు విషం త్రాగినా అతడే వీరుడని నమ్ముతాడు. ఆనాడు జూదపు సిరి వద్దని పెద్ద లనలేదా? దానిని ఆయన పెడచెవిని పెట్టలేదా? ఇక ముందు కూడా ధృతరాష్ట్రుడు దుర్యోధన శకుని కర్ణాదులు తన నే వైపు నడిపిస్తారో ఆ మార్గాన్నే అనుసరిస్తాడు. ఆయన పద్ధతి మార్చుకొంటాడా?

నీవు ఉత్తముల పద్ధతిని గురించి ఉపన్యసించావు. నీకు ఆ దుర్యోధనుడి అవినయం అనివార్యమని తెలియదా? లేక తెలిసిన అజ్ఞానమా? అతడికి శ్రీకృష్ణుడంటే లెక్కలేదు. అర్జునునికి ఎదురుగా కర్ణుడున్నాడని నమ్మి అహంకరిస్తాడు. ద్రోణ భీష్మ కృపాశ్వత్థామ కర్ణ దుర్యోధనాదులు యుద్ధా లెట్లా ఆశాపాశాలో పూర్వం గ్రహించలేదా? బంధువుల పరాక్రమాలు తెలిసి కూడా చావును వరించి యుద్ధాన్ని కోరుతున్నారు. ఇక కపిధ్వజ కాంతులు వారిని అంధీభూతులను చేయక తప్పదు.

నీవు ముందుగా మమ్మల్ని పొగిడావు. ఆ తరువాత కౌరవులను గెలవటం అసాధ్యమన్నావు. నే నీ మాటకు అంగీకరించను. నీవు పక్షపాతం లేకుండా మాట్లాడి ఉండవలసింది. అది అట్లా ఉండనీ. అవమానాలు పొంది కూడా మేము ఓర్పును ప్రదర్శించాం. నీకూ ఈ వివరాలన్నీ తెలుసు. వాటి నన్నింటినీ మా తండ్రి తలంచి మా కెటువంటి కీడు రాకుండా, మేము మరొకవైపు పోకుండా, లోకం మెచ్చేటట్లు మమ్మల్ని తనవద్దకు పిలిపించుకొని, రాజ్యంలో భాగం మాకిమ్మని కొడుకుల కాజ్ఞాపించి, ఇంద్రప్రస్థాన్నో మరొక నగరాన్నో మాకు రాజధానిగా చేసి ఏలుకొమ్మనటం సముచితం కాదా!' అని కొంత రోషాతిశయంతో అన్నాడు ధర్మరాజు. సంజయుడు మరలా ఇట్లా సంభాషణ సాగించాడు.

'ధర్మజా! ఎదుటివారు ఎన్ని తప్పులు చేసినా వాటిని ప్రక్కకు త్రోచి ఓర్పును ప్రదర్శిస్తావు కాబట్టి, నీ విన్ని మాటలు అన్నా తనివి తీరక నీకు నేను ఇంకా మనవి చేస్తాను. నిజంగా నీ గొప్పతనమంతా నీ అహింసా ప్రవృత్తిలో, నీ మచ్చ లేని చరిత్రంలో ఉన్నది. ఒకవేళ కౌరవులు దుర్మార్గులై రాజ్య భాగం ఇవ్వకుండా మీకు అన్యాయం చేశారే అనుకొందాం. మీ నడవడికి రక్తపు కూడు కంటే భిక్షాన్నమే సముచితం. అది ఎట్లాగంటావా? రాజసూయాధ్వరం చేసి దేవతలను మెప్పించి శాంతి దాంతులతో సకల లోకాలు కీర్తించగా బ్రతికిన పుణ్యమూర్తివి నీవు. అట్టి నీ పవిత్ర చరిత్రం హింసా కళంకితం కావటం ఉచితం కాదు. అంతే కాదు. అలనాడు అవినయంతో మాయాద్యూతం కల్పించి అంతటి అవమానం చేసిన వారిని వారి గర్వం చెల్లేటట్లు చేసి లోకుల చేత వారు తిట్లు పడేటట్లు ఎందుకు చేశావు? ఓర్పే సంపదగా ఇంతవరకు అడవులలో ఇడుమల నెందుకు అనుభవించావు? ఇంత ఉత్తమ పథంలో సాగి, ఇప్పుడు క్రూర పద్ధతిలో ప్రవేశించి బంధువులను, గురువులను వెదకి వెదకి వధించటం సౌఖ్యమా? అది ఆర్యనింద్యం; అస్థిరం.

హాలాహలం వంటి కోపాన్ని మ్రింగుకొనటంలో ముందుగా శివుడిని చెప్పి తరువాత నిన్ను పేర్కొనాలి. అటువంటి వాడవు ఆ గుణాన్ని పాటించి అనంత కీర్తిని గడించాలి' అని ప్రబోధించాడు.

దానికి సమాధానంగా ధర్మరా జిట్లా అన్నాడు -

'సంజయా! నీవు పలికింది యథార్థమే. లోకంలో కొన్ని చర్యలు పైకి చూస్తే ధర్మాలవలె అనిపించినా చివరకు అధర్మాలై చెడిపోతాయి. కొన్ని అధర్మాలుగా గోచరిస్తూనే చివరకు ధర్మాలై రూపొందుతాయి. కాబట్టి నన్ను నిందించ దలచుకొన్నట్లయితే నేను చేస్తున్నది ధర్మమనో అధర్మమనో నిరూపించి మరీ దూషించుము. కోపాన్ని పోగొట్టుకొనాలి. అహింసయే ఉత్తమ ధర్మం - ఇవి ధర్మాలే కదా! వంశానికి కళంకం తెచ్చేవారు, లోక కంటకులు అయిన పాపాత్ములను నిర్మూలించటం కూడా ధర్మమని పెద్దలు చెప్పారు. అది అట్లా ఉండనీ. రాజులకు యుద్ధం చేయటం ధర్మమా? అధర్మమా? నీవే చెప్పుము.

మనందరికీ ఇది కర్తవ్యం, ఇది అకర్తవ్యం అని శాసించటానికి వాసుదేవు డున్నాడు. మన కీ వితర్కం దేనికి? ఇతడు ధర్మాధర్మవిదులకు గురుడు, కార్యాకార్య నిరూపకులకు శిక్షకుడు, ఉచితానుచితజ్ఞులకు ప్రదర్శకుడు, యదుభోజ అంధక వృష్ణి సంజయ కేకయ ప్రభృతులైన ప్రభువులందరూ ఆయన ఆజ్ఞ చొప్పున ధర్మమార్గంలో నడుస్తున్నారు. విశేషించి గోవిందుడి బోధయే సమస్త పురుషార్థాలకూ మూలం కావటం చేత అతడి మాట అవశ్యం అలంఘనీయం' - అని ధర్మరాజు పలుకగా శ్రీకృష్ణుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

'నే నెప్పుడూ పాండవుల మేలు కోరేవాడిని. ధృతరాష్ట్రుడు కూడా పుత్ర పౌత్రవంతుడు. అతడికి కూడా కీడెందుకు కలగాలని మనసులో అనుకొంటూ ఉంటాను. ఆ రాజు తెలివితో నిన్నిక్కడికి పంపి నిండుమనసుతో వీరి యోగ క్షేమాలు తెలిసికొనటం నాకెంతో సంతోషంగా ఉన్నది. నీవు సముచితంగా వచ్చి స్నేహం, ధర్మం వినయం తేట పడేటట్లు మాట్లాడటం కూడా నాకు సమ్మదాన్ని కలిగించింది. ఇట్లా అన్నీ కలిసికట్టుగా ఏర్పడినా ధర్మరాజు మాటలు చూడగా సంధి జరిగే పద్ధతి కనపడటంలేదు. అది అంతే.... దుర్యోధనుడు మత్తుడు. చివరకు అందరూ కలిసిఉండటం అనే మాట ఎట్లా కలుగుతుంది? ధృతరాష్ట్రుడి మనసు మనకందరికీ తెలుసు కదా! ఆ రాజు నెరపే స్నేహాన్నీ, ఒలక బోసే వాత్సల్యాన్నీ, నీ వెన్నో తియ్యతియ్యని మాటలలో చెప్పావు. బాగుంది. కాని, పాండవులు తమకు రావలసిన రాజ్యభాగం పొందకుండా వట్టి వట్టి నేర్పు మాటలతో సరిపుచ్చుకొంటారా?

పాండవులు పెద్దగా పట్టించుకొనకుండా శాంతులై కౌరవులతో కలిసి ఉండటానికి కోరుకొంటే మంచిదే. ఓర్పు దయ ప్రకటించటం న్యాయమే. అయితే, తమకు న్యాయంగా రావలసిన రాజ్య భాగం తండ్రి పంచి ఇవ్వలేదని తెంపు చేసి యుద్ధాన్ని వీరు ప్రకటించినా అది ద్రోహమౌతుందా? ఈవిధంగా అవమానాలు పడుతూ తలవంచి బ్రతికిన దానికంటే, ఉజ్జ్వలులై ఎదుర్కొనటమే మేలు. నాకు చూడ పాండవులకు యుద్ధమే శరణ్యంవలె కనబడుతున్నది. క్షత్రియులకు యుద్ధం ధర్మం. రాజులు ఇచ్చేవారే కాని వేడుకొనేవారు కారు. న్యాయార్జిత విత్తంతో జీవిస్తున్నప్పుడు అన్యాయంగా వారి ధనాన్ని ఎవరైనా అపహరిస్తే అప్పుడు శస్త్రాస్త్ర ధర్మాలను ఇంద్రాదులు చెప్పారు.

కౌరవులు క్రిందుమీదు లెరుగకుండా అధర్మమార్గాన నడిచేవారు. నీ విక్కడ చెపుతున్న ధర్మాలను కౌరవులకు కూడా చెప్పవద్దా? లోకంలో జూదా లాడలేదా? కౌరవులు తులువలు కాకపోతే ద్రౌపదిని నిండుసభలో పలువురు చూస్తూ ఉండగా పగపట్టి అంతగా అవమానిస్తారా? అప్పుడు భీష్మాదులైన పెద్దలందరూ నోరెత్తకుండా ఊరకున్నారు. అప్పుడు ధృతరాష్ట్రుడు నోరెత్తి తన కొడుకులను కోపగించి ఆ దుష్కృత్యాన్ని మాన్పినట్లైతే నా మనసే కాదు లోకులందరి మనసులూ సంతోషించి ఉండేవి. నిందిస్తూ నిండు కొలువులోకి జుట్టు పట్టుకొని దుశ్శాసనుడు ద్రౌపదిని లాక్కొని వచ్చి నిర్దయతో అవమానిస్తుంటే మామ ఆ సతి యేడ్పుకు ఎట్లా ఓర్చుకొన్నాడు? ఆ సన్నివేశాన్ని ఎట్లా సహించాడు? అంతగా సహించిన ఆ రాజు ఈ నాడు ఇంతగా వీరిని ప్రేమిస్తూ యోగక్షేమాలు తెలిసికొనటానికి నిన్ను ఇంతగా పంపాడు. ఇది ఎట్లా సాధ్యపడింది?

అలనాడు నిండు సభలో 'ఇది కూడదు' అని అడ్డుపడే వాడు లేక అందరూ ఊరుకుంటే ద్రౌపది తనను తాను రక్షించుకొనే అదను ఏర్పడింది కాబట్టి సభలో అవమానం తప్పింది. పాండవులు బ్రతికి పోయారు. లేకపోతే ఆ కీడు రాజకుమారులు సహించదగిందేనా? సంజయా! అప్పుడు కర్ణశూలాలుగా కర్ణుడన్నమాటలు నీవు వినలేదా!

'లే రిచట మగలు నీకును । వీరలు జూదమున వోడి విడిచిరి నిన్నున్;
వారిజలోచన! నీపైఁ । గూరిమి గల మగని వెదకి కొను మొరు ననఁడే?' **(ఉద్యో. 1.250)**

ఈ మాటలు నరుడి హృదయంలో ములుకులవలె గుచ్చుకొంటూ దుర్భర వేదనను కలిగిస్తున్నాయి. ఎప్పుడన్నా ఆ రాజు దీనికి చికిత్స చేయటానికి యత్నించాడా? ఆ దుశ్శాసనుడు పాండవులను గొడ్డువోయిన వారనీ, పౌరుషం లేనివారనీ అనరాని, వినరాని మాటలెన్నో అని కించపరిచాడు. వాటి కేవైనా పలికాడా ఆ రాజు? కాబట్టి ఈసంధి కార్యం సంఘటించటం అసంభవమని నేను భావిస్తున్నాను. అయినా -

పాండవులను ప్రార్థించి, హస్తినాపురానికి నేను వచ్చి, కౌరవులకు బుద్ధిగా చెప్పి, రాజ్యభాగాన్ని ఇప్పిస్తే, వారు మృత్యుపాశాలనుండి తప్పించుకొంటారు. అన్యాయం కాని నామాటలు వారు మన్నించారా సరి, లేక లెక్కలేకుండా వెక్కిరించారా వారు పాండవ బాణాగ్నితో కాదు, స్వీయలోభాగ్నిలోనే పడి మగ్గిపోతారు. నా తలపులో ఇరు పక్షాలవారి కలరూపు ఇటువంటిది -

'రోషమయ మహాతరువు సుయోధనుఁ, డురు । స్కంధ మందులోనఁ గర్ణుఁ డలరుఁ,
గొమ్మ సౌబలుండు, గుసుమ ఫలములు దు । శ్శాసనుండు, మూల శక్తి తండ్రి'.

'ధర్మజుండు ధర్మతరు; వర్జునుఁడు ఘన । స్కంధ, మనిల సుతుఁడు శాఖ, కవలు
పుష్పఫలము, లేను భూసురులును వేద । ములుఁ దదీయమైన మూల చయము.' **(ఉద్యో.1.355,356)**

ఈ రెండింటిలో సారవంతమైన దేదీ? కాని దేదీ? అని మనం విచారించాలి. అయినా వీరిద్దరి మధ్య అసూయ అనవసరం. వీరిరువురూ కలిసి ఉండటం ఉచితం. ఎట్లాగంటే - ధృతరాష్ట్రుడూ, అతడి పుత్రులూ అరణ్యం వంటివారు. అందులో పాండవులు సింహాల లాంటివారు. సింహాలు లేని వనాన్ని జనం నిర్భయంగా నరుకుతారు. వనగర్భంలో ఉండని సింహాలకు వేగంగా చేటు చేకూరుతుంది. కాబట్టి వీరిద్దరూ ఎల్లప్పుడూ కలిసి ఉండటం సమంజసం. ధృతరాష్ట్రుడు పాండవులను దరికి చేర్చి తన కొడుకులవలె చూచుకొంటే వారు శత్రుమర్దనానికి పనికి వస్తారు. తన సేవలకూ ఉపకరిస్తారు. నేను ఈ పని మీద హస్తినాపురానికి వస్తాను. ఆ రాజు నాయత్నానికి ఒప్పుకొన్నా సరే లేదా ఒప్పుకోకపోయినా సరే. దానిని బట్టి మేము వ్యవహరిస్తాం.'

కృష్ణుడి మాటలు వినిన సంజయుడు తాను వచ్చిన పని అయినదని తెలిసికొని ధర్మజాదుల వద్ద అనుమతి వేడుకొన్నాడు వెళ్ళటానికి. తాను మాట్లాడిన మాటలలో దగనివి ఏమీ లేవుకదా? అని ప్రశ్నించాడు. అందుకు ధర్మజు డిట్లా అన్నాడు - 'నీవిక పోయి రావచ్చును. ఇందరు వింటుండగా ఇంత వివరంగా నీవు మాట్లాడావు. నీ మాటలలో ఉచితములు కానివి ఉన్నాయా? అట్లా అని ఎవరంటారు? ఎదుటివారి స్థితిగతులను చెప్పటంలో నీవు ఎటువంటి ఇబ్బందులూ పడవు. అవినయాన్ని, కాఠిన్యాన్ని నీపలుకెప్పుడూ పొందదు. ఇటువంటి పనులు నిర్వహించటానికి నీవుగాని విదురుడు గాని తగినవారు' అని పేర్కొని కరిపురంలో ఉన్న పెద్దలకు, పిన్నలకు, రాజలోకానికి, పరివారానికి అనువైన సంభావనలను అందించాడు ధర్మరాజు. ధృతరాష్ట్రుడు నిండు కొలువుండగా కొన్ని మాటలు చెప్పమన్నాడు.

'ఓ పుణ్యాత్ముడా! నీ బలంచేతనే పాండవులు ఆపదలేమీ లేకుండా ఆప్త బంధువులతో కలిసి సుఖంగా ఉన్నారు. వారిని వారి తండ్రిగారి రాజ్య పీఠంమీద నిల్పి, ప్రభుత్వ మిచ్చి బాల్యంలో పోషించావు. ఇప్పుడే మాత్రం దయలేకుండా వారికి అహితం కావాలని కోరటం న్యాయమా? దానితో సంతోషించవద్దు. అంతకంతకు రాజ్యాశ పెరిగితే నిలువరించటం కష్టమౌతుంది. కాబట్టి శత్రువులందరు బెదరి చూడగా కలిసి ఉండటం మంచిది.'

మా తాత భీష్మాచార్యులతో ఇట్లా పలకండి -

'శంతనుడి వంశం అంతరించిపోకుండా నీవే నిలిపావు. అట్లాగే నీ అభిప్రాయాన్ని అనుసరించి నీ మనుమల కందరికీ పొందు కుదిర్చి, అధర్మ వృత్తికీ, చావుకూ వారిని దూరం చేయగలిగితే పండితులందరూ మెచ్చుకొంటారు.'

ఆ సమయంలో అచ్చటివారందరూ వినేటట్లు దుర్యోధనుడితో ఈ విధంగా చెప్పుము- 'బాహుబలాఢ్యులను బలహీనులవలె బయటకు పంపిన వెర్రితనం, చాలకాలం అడవులలో కొండలలో బాధలు పెట్టిన పరుసదనం, సభలో పాంచాలిని ఆ విధంగా తలపట్టి ఈడ్చిన తులువతనం- వీటి నన్నింటినీ ధర్మరాజు సహించాడు. నిజం. కురుకుమారులను రణరంగానికి బలిపెట్టబోకుము. ఇతరుల సొమ్ముకు ఆశపడబోకుము. వారి పాలు వారికిచ్చి కలిసి బ్రతకటం మంచిదనుము. మేము కలహాన్ని కోరకుండా పొందుకోరటం తనకే మేలవుతుంది. తన మనస్సులో ప్రజ్వలించే ఆశాజ్వాలను ఆర్పటానికి ఎవరూ ప్రయత్నం చేయరు. కాబట్టి నేను బుద్ధి చెప్పవలసి వచ్చింది. తన వద్ద ఉన్నంతమంది మహావీరులు మరెక్కడా లేనిమాట నిజం. మావైపు ధర్మం ఉన్నది. అఖిలలోక సేవితుడైన కృష్ణుడు మాకు రక్షగా ఉన్నాడు. కాబట్టి మమ్మల్ని గెలవటం తనకు సాధ్యం కాదు.

అది అట్లా ఉండనీ, నేను భీమసేనాదులకూ, తమకూ పెద్దవాడను కావటం చేత వీరూ, మీరూ నా ప్రార్థనను భంగం చేయకుండా శాంతి దాంతులను వహించి నన్ను అలజడి పెట్టకుండా యుద్ధం మాని ఎవరి సంపదలు వారు తీసికొని సుఖంగా ఉండటం మంచిది. అది పెద్దలకూ బుద్ధిమంతులకూ సంతోషం కలిగిస్తుంది. మాకు పెద్దగా రాజ్యభాగం ఇవ్వటానికి ఇష్టం లేకపోయినా కుశస్థలం, వృక్షస్థలం, వాసంతి, వారణావతం చాలు; కాదా ఎక్కడైనా పాండవులైదుగురు కలిసి ఉండటానికి వీలైన తావులు ఇస్తే చాలు; సర్వ శాంతి సమకూరుతుంది. బంధుమిత్ర పుత్ర గురు జనాదులతో అందరూ బ్రతికి సుఖంగా జీవించవచ్చును. ఇది నా అభిమతంగా ఆ మహాపురుషుడికి తెలియ జెప్పు' మని ధర్మజుడు విశదపరిచాడు.

సంజయు డందరికీ నమస్కరించి బయలుదేరాడు. అర్జునుడు అతడితో ఇట్లా అన్నాడు -

'సంజయా! నీవు మాకు బాలసఖుడవు. మాబాల్యం నుండి కౌరవ పాండవుల తీరు నీకు తెలియనిది కాదు. మా భీమసేనుడనే మత్తగజాన్ని నాడూ, నేడూ ధర్మజుడి దయాతిశయమనే అంకుశం నిలువరిస్తూ వస్తున్నది. లేకపోతే వారి ఆట ఎప్పుడో కట్టి ఉండేది. ఈ నయ విక్రమ విచార క్లేశాలు వారి కెందుకు?' అని సాధిక్షేపంగా పలికి సవ్యసాచి సగౌరవంగా సంజయుడిని హస్తినాపురానికి సాగనంపాడు.

సంజయుడి నివేదిక

సంజయుడు సంజవేళకు రాజధాని చేరాడు. అంతఃపురంలో ఉన్న ధృతరాష్ట్రుడికి తన రాక ఎరిగించాడు. సూత్రప్రాయంగా తన సంధియత్నాన్ని వినిపించాడు -

'అనయము పుట్టె జూదమున; యప్పుడ యెంతయు చిచ్చు వెట్టి కా
ల్చినయది నీ యుపేక్షయ; వశీకృత చిత్తుఁడు ధర్మసూతి మె
త్తని పులి; యెల్లవారలు నధర్మము నీ పయిఁ బెట్టునంతకు
న్వినఁడును గానఁడుం; బిదప నీకును నాకు మరల్పవచ్చునే?' **(ఉద్యో. 2.14)**

వివరంగా మరునాడు నిండుకొలువులో వినిపిస్తానని సంజయుడు తన నివాసానికి పోయాడు. సంజయుడి మాటలు ధృతరాష్ట్రుడిలో అలజడి రేపాయి. రాత్రి నిద్ర పట్టలేదు. విదురుడిని పిలిపించుకొని మనశ్శాంతికొరకు రాత్రంతా నీతులు చెప్పించుకొన్నాడు. 'ధర్మరాజును వదలిపెట్టబోకుము; దృఢమతితో కొడుకులకు, మంత్రులకు నచ్చచెప్పి పొందు కుదిరేటట్లు

సాధించుము. దానివలన ధర్మం, కీర్తి, లాభం కలుగుతాయి' - అని విదురుడు బోధించాడు. ధృతరాష్ట్ర డతడి మాటలకు అంగీకారాన్ని తెలిపాడు. అంతటితో మనశ్శాంతి కుదరక విదురుడి సంకల్పంతో సనత్సుజాతుడిని పిలిపించుకొని అతడివలన అధ్యాత్మ తత్త్వాలను శ్రవణం చేశాడు. అంతలో తెల్లవారింది.

ధృతరాష్ట్రుడు కొలువు తీర్చాడు. సంజయుడు తన రాయబారపు వృత్తాంతాన్ని పూసగ్రుచ్చినట్టు చెప్పటం ప్రారంభించాడు. ధృతరాష్ట్రుడు వివిధాంశాలను గ్రుచ్చిగ్రుచ్చి అడిగి వివరాలు తెలిసికొన్నాడు. అతడు వాసుదేవుడి అభిప్రాయాన్ని గురించి సంజయుడిని మొదట ప్రశ్నించాడు. శ్రీకృష్ణుడు సత్యభామా ద్రౌపదులు అర్జునుడు కలిసి ఏకాంత మందిరంలో ఉండగా సంజయుడిని లోనికి పిలిపించుకొన్నాడు. దానివలన వారికి ధృతరాష్ట్రుడి మీద ఉన్న అనురాగం వ్యక్తమౌతుందని చెప్పాడు. నరుడి తొడలపై పాదాలుంచి నారాయణుడు శయనించి ఉన్నాడనీ, సంజయుడిని చూచి ఇరువురూ వినయంతో పలకరించారనీ చెప్పాడు. వారిరువురు కలిసి ధర్మజుడి ఆజ్ఞలు పాటిస్తారట! వారిని కాదని ఎదుర్కొనటం యముడి శిరస్సు త్రెంచటమే కదా అని హెచ్చరించాడు.

అలుగుటయే ఎఱుగని అజాతశత్రుడు అలిగాడంటే నీళ్ళలో అగ్ని పుట్టిందన్నమాటే! ఆ అగ్ని ఆర్పే పద్ధతి లేదు. కాబట్టి నేర్పుతో మీరు పనులు సాగించుకొనాలని గోవిందుడు ధృతరాష్ట్రుడిని ప్రబోధించినట్లు సంజయుడు తెలియపరిచాడు. 'గాండీవి రథానికి సారథినై అశ్వాలను తోలుకొని వస్తున్నప్పుడు కపిధ్వజచ్ఛటలు చూచి మీరు మూర్ఛపోతారు; కిరీటి బాణాలు చవిచూచి విచ్చిపోతారు' అని కృష్ణుడు హెచ్చరించాడు. అప్పుడు భీష్మ ద్రోణుల ప్రాపును కర్ణుడి గర్వాన్ని నమ్ముకొని ఉన్న దుర్యోధనుడి దురదృష్టాన్ని స్మరిస్తూ నిశ్చేష్టుడ నయ్యానని సంజయుడు చెప్పాడు.

ఆ తరువాత ధృతరాష్ట్రుడు అర్జునుడి సందేశాన్ని వినిపించుమని అడిగాడు. సవ్యసాచి పాండవ వాసుదేవ పరాక్రమాలను పేరు పేరున వర్ణించి చెప్పిన విధానాన్ని వివరించాడు సంజయుడు. ఆ మాటలు విని భీష్ముడు దుర్యోధనుడితో ఇట్లా హితవు చెప్పాడు -

'పార్థ వాసుదేవులు కలిసి ఏ వైపుండి యుద్ధానికి వస్తారో ఆ వైపు హరుడు కూడా కన్నెత్తి చూడలేడు. నీవు నే నెన్ని హితవులు చెప్పినా వినవు. బహుశః కౌరవులకు చేటుకాలం దాపురించినట్లుంది. ఈనాడు నా హితవు వినకపోతే రేపు యుద్ధంలో వారు పడిరి వీరు పడిరి అనే మరణవార్తలే వినవలసిన కాలం రావచ్చును. నీకు శకుని కర్ణ దుశ్శాసనుల మాటలే చెవి కెక్కుతాయి. అవే నీకు ఎగ్గును కలిగిస్తాయి.' - అన్న మాటలు విని కర్ణుడు భీష్ముడిపై మండిపడ్డాడు. అప్పుడు ఉత్తర గోగ్రహణ సమయంలో కర్ణుడు అర్జునుడి చేత పొందిన పరాభవాన్ని భీష్ముడు జ్ఞాపకం చేశాడు. అర్జునుడి వంటి విలుకాడిని నేను భూతలంమీద చూడలేదని ప్రశంసించాడు.

భీష్ముడి మాటలు లెక్కచేయకుండానే ధృతరాష్ట్రుడు సంజయుడి వైపు తిరిగి ధర్మజుడి అభిప్రాయాన్ని గురించి అడిగాడు. ఒక్కమాటలో చెప్పాలంటే -

'వినుము నరేంద్ర! పాండు పృథివీపతి యగ్రసుతుండు సంధి సే
యన మదిఁ గోరు; మీరు తమ యయ్య సగంబును భూమి యీక త
క్కిన మఱి కాని ముంద రొక కీడుఁ దలంపఁడు; మీ బలంబు నె
ల్లను మదిఁ జీరికిం గొనఁడు లావున నేలఁ గొనం దలంచినన్.' **(ఉద్యో. 2.170)**

ధర్మరాజు భీమాదుల పరాక్రమాలను తెలిపిన పద్ధతిని కూడా సంజయుడు స్పష్టపరిచాడు. ధృతరాష్ట్రుడు భీమసేనాదుల బలాలను విని భయకంపితుడయ్యాడు. అతడి భయాన్ని తొలగించటానికి దుర్యోధనుడు తన వైపున్న వారి బలపరాక్రమాలను ప్రస్తుతించాడు. సంజయుడు పాండవ దివ్య శక్తులను వివరించాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు- 'కౌరవ వీరులు అసాధ్యులు కదా! వీరిని ఎట్లా సాధించగలమని పాండవులు భావిస్తున్నారో తెల్పు'మని అడిగాడు. సంజయుడు ఇట్లా బదులు చెప్పాడు -

'భీష్ముడు శిఖండి పాలపడతాడు. ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి పాలపడతాడు. రారాజూ అతని తమ్ములూ భీముడి పాలబడి ప్రాణాలు వదులుతారు; కుమారులందరు అభిమన్యుడి పాలు; శకుని, సైంధవుడు, అశ్వత్థామ, కర్ణుడు; మిగిలిన మహావీరులు సవ్యసాచి పాలు; కృతవర్మ సాత్యకి పాలు; శకుని ఉలూకాదులు నకుల సహదేవుల పాలు; శల్యుడు ధర్మరాజు పాలు - అని పాండవ పక్షంలో కృతనిశ్చయులై ఉన్నారని సంజయుడు స్పష్టం చేశాడు. 'ధర్మజుడు రాజై హరి జయంవైపు నడిపించగా సాగే పాండవ సైన్యాన్ని దుర్యోధనుడు లెక్కచేయడు. ఇక నాజన్మం దుఃఖభాజన మౌతుందో ఏమో' అని ధృతరాష్ట్రుడు ఖిన్నుడైనాడు. దుర్యోధనుడిని పాండవులతో సంధిచేయుమని సామవాక్యాలు చెప్పాడు. దానిని కాదని దుర్యోధనుడు తన బలపరాక్రమాలను కీర్తించుకొన్నాడు. అతడికి బాసటగా కర్ణుడు వీరవాక్యాలు పలికాడు. భీష్ముడు కర్ణుడి ప్రగల్భాలను నిందించాడు. దానికి కోపగించి భీష్ముడు కర్ణుడి ప్రవర్తనను ఖండించాడు. ఇతడా కౌరవులను రక్షించేది? అని అధిక్షేపించాడు. భీష్ముడి మాటలకు మండిపడి కర్ణుడు పితామహుడు యుద్ధంలో నేల గూలేంతవరకు తాను యుద్ధంలో పాల్గొనని అస్త్రసన్న్యాసం చేశాడు.

సంజయుడి సందేశాన్ని దుర్యోధనుడు పెడచెవిని పెట్టాడు. ధృతరాష్ట్రుడు విని మౌనంగా ఊరకున్నాడు. సభాసదులందరు దిగ్గునలేచి ఇళ్ళకు వెళ్ళిపోయారు. సంజయుడు మాత్రం తండ్రికొడుకుల ముందు సాక్షిగా నిలిచాడు.

ఆ తరువాత వ్యాసుడు ప్రసన్నుడై ధృతరాష్ట్రుడిని శ్రీకృష్ణుడి నాశ్రయించుమని ప్రబోధించాడు. దానికతడు అప్పటికి సుముఖతను ప్రకటించాడు.

శ్రీకృష్ణుడి రాయబారం : పాండవుల సందేశాలు

ఉపప్లావ్య నగరంలో ధర్మరాజు తమ్ములను, బంధువులను, ద్రౌపదిని వెంటబెట్టుకొని శ్రీకృష్ణుడి మందిరానికి వెళ్ళి కౌరవ సభకు అతడిని దూతగా పంపితే శుభం కలుగుతుందనే అభిప్రాయంతో ఇట్లా మనవి చేశాడు.

'మహాత్మా! ఆపదల నుండి రక్షించటానికీ, శుభములు కలిగించటానికీ ఈ జన్మకు పాండుభూపాలుడు నిన్ను చూపించి వెళ్ళాడు. మిత్రకార్యం చక్కజేసే సమయం వచ్చింది. నీవు కారణంగా అవినీతుడైన ఆ దుర్యోధనుడితో యుద్ధం లేకుండా మా వంతు రాజ్యాన్ని మేము పొందగలుగుతాం.' ఆ మాటలకు మాధవుడు సంతోషించి 'మీరు చెప్పినట్లే చేస్తాను' అని పేర్కొన్నాడు. అప్పుడు ధర్మరాజు ఇట్లా అన్నాడు.

'నిన్న సంజయుడు పలికిన మాటలను బట్టి మా తండ్రి ధృతరాష్ట్రుడి తలపు, దుర్యోధనుడి వైఖరి మనకు తెలిశాయి కదా! రాజ్య భాగం ఇవ్వకుండా మంచి మాటలతో మా అలుక తీర్చటానికి యత్నించారు. పదమూడేండ్లు మేము పడరాని పాట్లు పడి నియమం పాటించి వచ్చి ఉన్నా. కుల ధర్మాన్ని పాటింపదలచుకొనడా పెద్దరాజు. కొడుకు వక్రబుద్ధిని మాన్పలేడు. ఇంతకంటె మాకు వేరే కీడేమైనా ఉన్నదా? ఇక్కడి బంధువులు నీవు అబ్బురపడి వినేటట్లు మాకు అయిదూళ్ళిచ్చినా చాలని అన్నాను కదా! దానికీ వారు పూర్తిగా వ్యతిరేకమే. ఆ దుర్యోధనుడు ఆ మాత్రం అంగీకరించలేడా? ఔన్నత్యం లేకపోగా క్రూరత్వం ప్రదర్శిస్తే మరీ సహించలేం. సంపద నాకెందుకని అంటారా? నేను పోషించవలసిన చుట్టాలకు గ్రాసవాసోదైన్యాలు వస్తాయి. కాబట్టి సంపదను మే మిరువురం పంచుకొని అనుభవిస్తే సంతోషం కలుగుతుంది.

లోకంలో పెరవారైనా, పగవారైనా చంపుకోవాలనే ఎందుకు కోరతారో? మరొక మార్గమే లేదా? అది మంచిది కాదా? బంధుమిత్రులు కౌరవుల వైపున్నారన్న సంగతి గణించకుండా సంపద కొరకు వారిని వధించటం, దానివలన పాపాన్ని పొందటం అనే దురవస్థలను సహించవచ్చునా? శస్త్ర జీవితమే క్షత్రధర్మం. మేము మరొక ధర్మాన్ని ఆచరించరాదంటారు. అయినా వంశ నాశనం అభిమతం కాదు. కాబట్టి మా క్షత్రియ ధర్మ నిర్వహణం అత్యంత దుర్లభం. యుద్ధమైతే దానివలన అటు సంపద రావచ్చును లేదా ఇటు ప్రాణం పోవచ్చును. ఒక్కొక్కసారి పలువురు ఒక వీరుడి చేతిలో ఓడి పారిపోవటం సంభవించవచ్చును. బలవంతులు బలహీనుల చేత చెడటం కూడా సంఘటిల్లవచ్చును. రణరంగంలో జయాపజయాలు దైవాధీనాలు. పరాజయమైతే మరణం కంటె మనస్సును అధికంగా బాధిస్తుంది. పోరు లేని ఉపాయంతో శత్రువులను

కడతేర్చగలిగిన వాడు గుండె మీద చేయిపెట్టుకొని నిద్రించగలుగుతాడు. మనసులో పగ ఉంటే పాముున్న యింట్లో ఉన్నట్లుంటుంది. చిత్తశాంతి ఉండదు. కాబట్టి అధిక దీర్ఘ వైర వృత్తి ఎప్పుడూ తగదు.

'పగ యడఁగించు టెంతయు శుభం, బది లెస్స, యడంగునే పగం
బగ? వగగొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే? కడుం
దెగ మొదలెత్తిపోవఁ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు; నే
మిగతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు కేశవా!'. **(ఉద్యో. 3.21)**

కావున శాంతియే తత్క్షణ కర్తవ్యం. అది అట్లా ఉండగా సంపద కావాలనీ, యుద్ధం కాకూడదనీ మేం కోరుతున్నాం. మా సంపద కోల్పోకుండా కుల క్షయం కల్గకుండా మరొక పద్ధతిలో ఏ విధంగా చక్కబడినా అది మాకు నచ్చుతుంది. జనార్దనా! మా మీద పక్షపాత వైఖరి ప్రకటించవద్దు. ధర్మ నీతి వర్తనాలలో రెండువైపులా హితం అభ్యుదయం కలిగే విధాన్ని బోధించే విదురాది సజ్జనుల బుద్ధులకు నచ్చేటట్లు నిపుణంగానూ, భూపతులకందరికీ తెలిసేటట్లు పరుషంగానూ వక్తవ్యాంశాన్ని తెలియజెప్పుము.

రాజు అన్యాయంగా పరుషవాక్యాలు పలికినప్పటికీ వాటిని సహించి నిండుసభలో నిలిచి మాట్లాడుము. పెద్దల మాటలనూ, ప్రభువుల తలపులనూ మన్నించని దుర్యోధనుడి యెదుట కురువృద్ధుల తలపులను మనం గౌరవిస్తే జనులు మెచ్చుతారు. దుర్యోధనుడి పక్షం చేరి ధృతరాష్ట్రుడు అవినీతి చేసినప్పటికీ ఇక సంధి యత్నం సఫలం కాదని వెంటనే తిరిగి రాబోకుము. ధైర్యంతో జనులెల్లరూ తెలిసికొనేటట్లు మా అభిప్రాయాలను సభలో నిశ్చింతగా ప్రకటించుము. ఎన్ని సంకటాలు వచ్చినా ఎంత మనస్సు క్షోభించినా ఈ కార్యాన్ని నిర్వహించగలిగిన దక్షుడవు నీవే. నీ వే రకంగా ఈ కార్యాన్ని నడుపుతావో, అదే నాకు ప్రియమైనది.' ధర్మరాజు మాటలకు కృష్ణుడు ఇట్లా అన్నాడు.

'ధర్మనందనా! నీ మాట నిజం. ఆ ధృతరాష్ట్రుడు అట్టివాడే, తండ్రికి తగ్గకొడుకు దుర్యోధనుడు. నీ మనసులోని భావం నేను తెలిసికొన్నాను. అనుమానం పెట్టుకొనకు. వినదలచుకొంటే వినుము. నాకు నిజంగా కోపం వస్తే యుద్ధంలో నా కెదురు నిలిచి పోరాడే వాడు ఒక్కడూ లేడక్కడ కాబట్టి, నన్ను నిశ్చింతగా కౌరవ సభకు పంపుము. నేను వెళ్ళి రావటం వలన మేలు. అర్థసిద్ధి కలుగుతాయి. మనవైపు ఎటువంటి వంకపెట్టకుండా ఉండే స్థితి కలుగుతుంది.' కృష్ణుడి మాటలకు సంతుష్టుడై ధర్మరాజు కృతజ్ఞతా సూచకంగా అన్నమాట లివి-

'మేలగుగాక, నీ యిచ్చ వచ్చిన విధంగా వ్యవహరించి మేమూ వారూ కలిసి ఉండేటట్లు ఏ విధంగానైనా ఒప్పందం కుదిరించుము. మన కది మంచిది. నీకు మేము తెలుసు, వారు తెలుసు. హిత మేదో తెలుసు; సాధించవలసిన అర్థసిద్ధి తెలుసు; వాక్యపద్ధతి విశేషంగా తెలుసు, ఇంత తెలిసిన నీకు బుద్ధులు చెప్పటానికి నేనెవ్వరిని?' అని ఆప్యాయంగా అభినందించాడు.

శ్రీకృష్ణుడు ధర్మరాజుకు కౌరవులు చేసిన దుర్ణయాలను జ్ఞాపకంచేసి, ఆ సుయోధనుడు ఆయువున్నంతవరకు మీకు రాజ్యంలో ఆవంతభాగం పంచి ఇవ్వడు. కాబట్టి యుద్ధం తప్పదు. దానికి అనుగుణమైన శకునాలు ఎన్నో కనబడుతున్నాయి. కాబట్టి నీవు ఉత్సాహాన్ని తగ్గించుకొనవద్దు. చతురంగ బలాలను ఆయత్తం చేసికొంటూ, సాయం చేసే దొరలను పురి కొల్పుకొంటూ సమరానికి సన్నాహం సాగించుమని ప్రోత్సహించాడు.

పోరుకు ప్రోత్సాహం కలిగిస్తున్న పురుషోత్తముడిని చూచి భీముడు రోషంతో - 'ధర్మరాజు కోరుతున్నది శాంతిగాని యుద్ధం కా'దని జ్ఞాపకం చేశాడు. పాలూ నీరూవలె పాండవులూ కౌరవులూ కలిసి నివసిస్తూ ఉంటే దుర్యోధనుడు దుర్మార్గపు చేష్టలతో ఇంతపని చేశాడు. కులక్షయానికి కారకుడయ్యాడు. అది తప్పదు. అయినా నీవీ రాయబారి బిరుదంతో సాధ్యమైనంతవరకు సార్థక్యాన్ని సాధించుము. ఏ విధంగానైనా ప్రజలకు హితమయ్యేటట్లు సంధిని సాధించుము' అని నొక్కి చెప్పాడు.

భీముడు శాంతి వాక్యాలు మాట్లాడటం వినేవారికి ఆశ్చర్యం కలిగించింది. అతడి పౌరుషం ఆరిపోకూడదని భావించి గోవిందుడు అతడిని అధిక్షేపించాడు. యుద్ధమంటే భయపడి భీముడు శాంతిని కాంక్షిస్తున్నాడని పరాచకాలాడాడు. దానికి భీము డభిమానపడి శ్రీకృష్ణుడి నెద్దేవ చేశాడు. క్రుద్ధుడైన భీముడిని చూచి శ్రీకృష్ణుడు 'నీకు కోపం అలంకారమైనట్లు శాంతం కా'దని సర్ది చెప్పి యుద్ధోత్సాహాన్ని అతడిలో ఉరకలెత్తించేటట్లు చేశాడు.

అర్జునుడి అభిప్రాయాన్ని అడిగాడు గోవిందుడు. అత డిట్లా అన్నాడు.

'నీ వొనరింపఁబూనిన పనిం గమలోదర! కీడు పుట్టునే?
కావనినట్ల యుండి యవుఁ గార్యము; లట్లగుటం బ్రయత్న సం
భావన సేఁత పౌరుషము పద్ధతి; తత్ఫలసిద్ధి వొందుచో
దైవము తోడ్పడన్ వలయుఁ; దథ్యము రెండును నీ వినోదముల్.' **(ఉద్యో. 3.73)**

దానికి సమాధానంగా కృష్ణుడు - 'నేను సంధికొరకు ఓపినంత పురుషకారం చేస్తాను. దైవం చేత ఏమౌతుందో నాకు తెలియదు. అయినా, బాల్యంనుండి మీకు కీడు చేయాలని ఇన్ని పాపాలు చేసిన దుర్యోధనుడు ఇప్పుడు సంధి సందేశాన్ని అంగీకరిస్తాడని నేను అనుకోను' - అని ఖచ్చితంగా చెప్పాడు.

నకులుడు - వాసుదేవుడి వ్యక్తిత్వం సంధి జరగటానికి ఎంతో తోడ్పడుతుందనీ, గోగ్రహణం తరువాత కౌరవులు తప్పక మెత్తబడతారనీ ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. కాని, సహదేవుడు మాత్రం పౌరుషంతో సంధి యత్నాన్ని సమర్థించలేదు. సుయోధనుడు రాజ్యభాగాన్ని ఇస్తాడని విశ్వసించలేదు. సాత్యకి సహదేవుడి అభిమతాన్ని సమర్థించాడు. వారిద్దరి వీరాలాపాలను సభికులు విని ప్రశంసించారు.

చివరకు పాంచాలి కూడా తన అభిప్రాయాన్ని వాసుదేవుడికి తెలియపరిచింది. ఆమెకు ధర్మజుడి శాంతి వచనాలు దుఃఖాన్ని కలిగించాయి. గొంతు గద్గదమైపోయింది. అభిమానం అవమానాగ్నిచేత ప్రజ్వలితమైంది. అన్నతో ఆర్ద్రంగా ఇట్లా మొరపెట్టుకొన్నది.

'పద్మనాభా! నేను వరంవలన పుట్టాను. భరతవంశం మెట్టాను; పాండు భూపాలుడికి కోడలినైనాను. జనవంద్యులైన పాండవులను భర్తలుగా పొందాను; నీతి విక్రములైన పుత్రులను కన్నాను; అన్నదమ్ముల ప్రాపు గాంచాను, నేను ఇన్ని విధాలుగా ప్రసిద్ధి కెక్కాను. ఇవన్నీ ఒక యెత్తు. రాజసూయావభృథస్నానంతో పవిత్రమైన నా వేణిని ఒక అధముడు ఈ అయిదుగురూ చూస్తూ ఉండగా నిండు సభలో లాగి అవమానించాడు. ఆ సభలో ఏకవస్త్రనయిన నన్ను దుశ్శాసనుడు అట్లా అవమానిస్తూ ఉంటే, వీరు చిత్రపటాలవలె మిన్నకుండి పోతే ముకుందా! నిన్ను నేను విశ్వాసంతో స్మరించాను. ఆ సన్నివేశాన్ని సంధిసమయంలో మరువబోకుము' అని అంటూ

'ద్రోవది బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మున విడ్చి వెంట్రుకల్
దా వలచేతఁ బూని యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలఁగ మనంబునఁ బొందు విషాదరోషముల్
గావఁగలేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై' **(ఉద్యో. 3.114)**

గోవిందుడి ముందు బెట్టి - 'ఇవి దుశ్శాసనుడి వ్రేళ్ళకు తగిలి సగం తెగిపోగా మిగిలి ఉన్న శిరోజాలు. వీటిని నీవు సంధివచనాలు పలికేటప్పుడు మరచిపోబోకుము. నా క్రొమ్ముడిని పట్టి లాగిన ఆ దుర్మార్గుడు తన శరీరం రణరంగంలో ముక్కలు ముక్కలై గుర్తించటానికి వీలులేనంత దీనంగా చావాలి. అప్పుడు కాని నా గుండెలోని మంట చల్లారదు. నేనిన్ని కష్టాలు పడటానికి కారకుడైన ఆ రారాజు పీనుగును కన్నార చూడకపోతే ఆ భీమసేనుడి పెనుగద, ఆ సవ్యసాచి గాండీవం కాల్పనా?

'నెట్టన యిట్టి యల్క మది నిల్పితి రక్కసతాల్మిఁ జిచ్చొడిం
గట్టిన యట్లు; పెద్దయును గాలము దీనికి నాఱు టెన్నఁడుం
బుట్టదు; దుష్టనిగ్రహము పూని జగంబులు గాచునట్టి తో
బుట్టువు తీవ్ర తేజమునఁ బొల్చిన భర్తలుఁ గల్గ నచ్యుతా!'. (ఉద్యో. 3.118)

అని గొంతు వణుకుతూ ఉండగా ద్రౌపది ఏడ్చింది.

శ్రీకృష్ణు డామెను ఆదరంతో ఓదార్చాడు. కన్నీరు తుడిచి కూర్చుండబెట్టాడు. ఆమె పెన్నెఱి వేణిని ముడవటానికి ముదితలను ఆదేశించాడు. ఆప్యాయంగా ఆమె కిట్లా ధైర్యం చెప్పాడు.

'చెల్లీ! నే నుండగా నీకెందు కీ శోకం? ధర్మజుడు పంపగా, భీమార్జునులు వెంట రాగా నేను రణరంగంలో శత్రుక్షయాన్ని చేస్తాను. మరొక రకంగా జరిగే అవకాశంలేదు. దురాత్ములైన కౌరవులు రాజ్యం ఇస్తారా? తల్లీ! నీవేడ్చే రోజులు పోయాయి. కౌరవుల భార్యల యేడ్పులు విని నీవు కలకల నవ్వే రోజులు దగ్గర పడ్డాయి. యముడి మహిషపు లోహ ఘంటల వికృత నాదాన్ని వినాలని కుతూహల పడుతున్న కౌరవులకు సంధికార్య శాంతివచనాలు సంతోషాన్ని కలిగిస్తాయా? విధి లిఖితం అట్లాగే ఉన్నది. అది తప్పక జరిగి తీరుతుంది. నేను కూడా ప్రతిజ్ఞ చేసి చెపుతున్నాను - 'పాండవులు శత్రుసంహారంచేసి ఉజ్జ్వల పుణ్య లక్ష్మీ సమేతులై అధిక విభవాన్ని పొందుతారు. నీవు చూస్తావు; ఆలస్యం లేదు; ఇది నిజం' అని ఊరడిస్తూ పలికాడు.

ఆపైన కౌరవ పాండవులకు హితం చేయటానికి ధర్మరాజు పంపగా ధృతరాష్ట్రుడి వద్దకు రాయబారిగా పోతానని శ్రీకృష్ణుడు పయనమైనాడు. శ్రీకృష్ణు డా సాయంకాలానికి కుశస్థలం చేరాడు. ధృతరాష్ట్రుడికి వర్తమానం అందింది. భీష్మాదులను దుర్యోధనాదులను పిలిచి శ్రీకృష్ణుడి రాకను గురించి ఆలోచించాడు. శ్రీకృష్ణుడి రాక శుభప్రదమనీ' అతడి మనస్సుకు నచ్చే పని చేస్తే ఇహపరదాయకమనీ విదురాదులు చెప్పారు. పాండవులకు రాజ్యంలో సగభాగం ఇస్తే గోవిందుడు సంతోషిస్తాడని భీష్మాదులు సూచించారు. దుర్యోధనుడు ఈ రెండింటినీ కాదన్నాడు. భాగమిస్తే భయపడ్డామని అధిక్షేపిస్తారనీ, శ్రీకృష్ణుడికి లంచమిచ్చి వశపరచుకొన్నా, లేదా బంధించి వశం చేసికొన్నా పాండవ పక్షం వారందరూ రెక్కలు విరిగిన పక్షులవలె తనకు వశమైపోతారనీ దుర్యోధనుడు దుష్టభావనం చేశాడు. భీష్మాదులు దానిని గర్హించారు.

కౌరవసభలో శ్రీకృష్ణ సందేశం

మరునాడు శ్రీకృష్ణుడు హస్తినాపురికి వచ్చాడు. ప్రజలు అతడిని ఆసక్తితో చూచి పూలతో సేసలతో గౌరవించారు. మాధవుడు ధృతరాష్ట్ర మందిరంలో కురువీరులందరినీ దర్శించాడు. విదురునింట భోజనంచేశాడు. కుంతిని పలుకరించాడు. ధృతరాష్ట్రుడి నిండుకొలువులో జలదస్వర గంభీర స్వరంతో సకల జనులు, మహర్షులు సమ్మోదాంబుధిలో తేలేటట్లు మాట్లాడాడు.

'భరతకులంబు ధర్మమును బాడియు సత్యముఁ బొత్తుఁ బెంపునుం
గరుణయుఁ గల్గి యుండు ననఁగా నుతిఁ గన్నది; యందు సద్గుణో
త్తరులరు నీవు నీ యనుఁగుఁ దమ్ముఁడు నీ తనయుల్ యశోధురం
ధరశుభశీలు రీ సుచరిత క్రమ మిప్పుడుఁ దప్ప నేటికిన్?'

'ఈ వంశంబున కెల్ల నీవ కుదు; రిం దెవ్వారి చందంబు లె
ట్లై వర్తిల్లినఁ గీడు మేలుఁ దుది నీయం దొందెడుం గాన స
ద్భావం బారసి లోనిపొత్తు వెలివృత్తంబున్ జనస్తుత్యముల్
గావింపం దగు నీక యెవ్విధమునం గౌరవ్యవంశాగ్రణీ!'

'వినుము సుయోధనాదులగు వీరు సధర్ములు గాక కార్యము
ల్గానక మహార్థ సిద్ధి యెడలుం దమ కిట్లన కన్వయంబు వ
ర్తన మిది గాదు నాక బెడిదంపుఁదనంబున బంధుకోటికి
న్మనసులు నొవ్వఁగా నవగుణంబులకుం బుయిలోడ రేమియున్.'

'కౌరవ పాండవుల్ తెఱఁగు గైకొని శాంతతఁ బొంది యున్కి మే
లారయ నాకు నీకుఁ గులమంతకు నీ నృపకోటి కుర్వికిన్;
బోరితమైన నింతకును బుట్టు మహాపద; గావునన్ ధరి
త్రీరమణాగ్రగణ్య! గణుతించి యవశ్యముఁ బొం దొనర్పవే.' **(ఉద్యో. 3.259-262)**

శ్రీకృష్ణ సందేశం సభాసదులు శ్రవణానందంగా విన్నారు. పాండవులు చివరకు చెప్పుమన్న మాటలను వివరించాడు. చివరకు సర్వతాత్పర్యాన్ని క్రోడీకరించి ఇట్లా పేర్కొన్నాడు.

'సారపు ధర్మమున్ విమల సత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొంద లేక చెడఁబారిన దైన యవస్థ దక్షులె
వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుఁ గాని ధర్మని
స్తారక మయ్యు సత్యశుభదాయక మయ్యును దైవ ముండెడున్.' **(ఉద్యో. 3.284)**

అని సభాసదుల నుద్దేశించి పలికి, ధృతరాష్ట్రుడితో 'వారి తండ్రి పాలు వారి కిచ్చి, నీ పాలు నీవు పుత్ర పౌత్రులతో అనుభవిస్తూ సుఖంగా ఉండటం బంధుమిత్ర కోటి మెచ్చే తెర'గని పేర్కొన్నాడు. చివరకు -

'వారలు శాంత శూరులు భవచ్చరణంబులు గొల్వఁబూని యు
న్నా; రటుగాక మీకది మనంబున కప్రియమేని నింతకుం
బోరికి వచ్చుచుండుదురు భూవర! రెండు తెఱంగులందు నీ
కారయఁ బథ్యమేది యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా!' **(ఉద్యో. 3.284)**

శ్రీకృష్ణుడి గంభీరోపన్యాసం దుర్యోధనాదులను తప్ప మిగిలిన వారందరిని ఆకర్షించింది; అతడి వాదాన్ని ఏకగ్రీవంగా అంగీకరించేటట్లు చేసింది. నారదాది మహర్షులు, భీష్మాది కురువృద్ధులు, విదురాదులు దుర్యోధనుడిని సంధికంగీకరించుమని కోరారు. అతడు వారి అభిమతాలను తిరస్కరించాడు. దుర్యోధనుడు చిన్ననాటినుండి పాండవులకు నిష్కారణంగా తలపెట్టిన ఎగ్గులను శ్రీకృష్ణుడు ఏకరువు పెట్టి అధిక్షేపించాడు. కులపాంసనుడిని వధించి కులాన్ని రక్షించుకొనండని ప్రబోధించాడు. గాంధారి కొడుకుకు నీతులు చెప్పింది; ధృతరాష్ట్రుడు సుయోధనుడిని సంధి కొడబడుమని అనునయించాడు. ఎవరెన్ని చెప్పినా దుర్యోధనుడు వినక దుశ్శాసనాదులతో మంతనాలు సలిపి శ్రీకృష్ణుడిని నిండు సభలో బంధించి కారాగారంలో పడవేయాలని యత్నించాడు. అప్పుడు వాసుదేవుడు ధృతరాష్ట్రుడితో ఎలుగెత్తి 'నీకొడుకు నే నొంటరివాడనని బంధించ యత్నిస్తున్నా'డని ప్రకటించి దరహాసం చేశాడు. శ్రీకృష్ణుడు నిండుకొలువులో విశ్వరూప సందర్శనాన్ని ప్రసాదించాడు. ఆ తేజో రూపాన్ని జనం చూడలేక కన్నులు మూసికొన్నారు; నారదాదులు భీష్మ విదుర ద్రోణ సంజయులకు గోవిందుడు దివ్యదృష్టి నిచ్చాడు. వా రా దివ్యరూపాన్ని దర్శించి పరమానందాన్ని పొందారు. ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడిని ప్రార్థించి తానుకూడా దివ్యదృష్టిని పొంది దివ్యదర్శనం చేసికొన్నాడు. మరల ఇతరులను చూడకుండానే దివ్యదృష్టిని ఉపసంహరింప చేయుమన్నాడు. అట్లా చేసి శ్రీకృష్ణుడు సాత్యకితో కలిసి సభలోనుండి వెలుపలకు వచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

హస్తినాపురినుండి హరి ఉపప్లావ్యానికి బయలుదేరాడు. కుంతిని దర్శించాడు. కొడుకుల యోగక్షేమాలు తెలిపాడు. వారికి సందేశమిమ్మని ఆమెను అడిగాడు. 'క్షత్రియులు పరాక్రమార్జిత విత్తాన్ని అనుభవించాలి గాని, కందమూలాదులను కా'దని ఆమె చెప్పింది. ఆ నాడు కొలువులో ద్రౌపది పొందిన భంగపాటును మరువవద్దనీ, ప్రతీకారం తీర్చుకొని చిరకీర్తిని గడించుకొమ్మనీ, వీరమాతవలె సందేశం పంపింది.

శ్రీకృష్ణుడు కర్ణుడిని తన రథమెక్కించుకొని కొంతదూరం తీసికొనిపోయి అతడి జన్మవృత్తాంతం చెప్పి, పాండవులలో కలిసిపొమ్మని కోరాడు; పాంచాలి అతడిని ఆరవ భర్తగా అంగీకరిస్తుందని హామీ ఇచ్చాడు. కర్ణుడు కృష్ణుడికి తగిన సమాధానమిచ్చాడు. కుంతీదేవి తనను కనినప్పటికీ సూతపత్ని పెంచింది. అంతకాలం సూతపుత్రుడుగా ప్రసిద్ధి కెక్కి ఇప్పుడు కాదనటం పాలు పిండిన తరువాత పొదుగు కోసినట్లవుతుందని కర్ణుడు భావించాడు. కర్ణుడిని అర్జునుడికి ఎదురుగా నిలుపదగిన శక్తి అని దుర్యోధనుడి విశ్వాసం. అతడి విజయమంతా కర్ణుడిపై గల ఆశ మీదనే ఆధారపడి ఉన్నది. ఇప్పుడు పాండవ పక్షం వహిస్తే పార్థుడికి భయపడి వచ్చాడని అందరూ అంటారు. అంతేకాక నమ్మిన రాజును మోసం చెయ్యట మౌతుంది. కృతఘ్నత అవుతుంది. మరొకటి - యుద్ధానంతరం రాజు కాదగినవాడు ధర్మరాజు. కర్ణుడు తనకు అగ్రజుడని తెలిస్తే అతడు రాజ్యం స్వీకరించడు. ధర్మజుడూ, అతడి తమ్ములూ ఋత్విజులుగా, శ్రీకృష్ణుడు ఉపద్రష్టగా రణయజ్ఞంలో కురుకుమార పశు విశసనం చేస్తాడు' అని కర్ణుడు తన మనోగత భావాలను వ్యక్తం చేశాడు. రాబోయే యుద్ధంలో కర్ణార్జునులలో అర్జునుడిదే విజయమని శ్రీకృష్ణుడు ప్రకటించి, కర్ణుడిని ఇంటికి పంపి తాను ఉపప్లావ్యానికి చేరుకొన్నాడు.

కౌరవాన్వయ మహార్ణవం ఇంకిపోయేటంతగా ఏర్పడిన విపత్తును గురించి విదురుడు కుంతితో చెప్పి విచారించి వెళ్ళిపోయాడు. ఆమె ఈ విపత్తును తొలగించే మార్గంకొరకు ఏకాంతంగా ఆలోచించింది. రహస్యంగా కర్ణుడి వద్దకు వెళ్ళి అతడి జన్మ రహస్యాన్ని తెలిపి, సహోదర స్నేహాన్ని అతడి హృదయంలో పెంపొందింపజేసి, క్రమంగా యుద్ధ యత్నాలను విముఖం చేయవచ్చునని భావించింది. గంగానదికి అనుష్ఠానార్థం కర్ణుడు రాగా అతడిని కుంతి దర్శించింది. అత డామెకు నమస్కరించాడు. ఆమె అతడితో జన్మవృత్తాంతాన్ని వివరించి చెప్పింది. కుంతీకుమారు డగుటచేతనూ, పాండవ ధార్తరాష్ట్రుల కంటె పెద్దవాడు కావటం చేతనూ భూమికి తానే రాజు కాదగినవాడవని ప్రోత్సహించింది. ఆమె మాటలకు అతడు చలించలేదు. 'క్షత్రియ సంస్కారాలు చేయకుండా అప్పుడు నీటిలో ఆవిధంగా పారవేసి, ఈనాడు ఈ విధంగా పలకటం న్యాయమా! సూర్యానుగ్రహం వలన పుట్టిన నేను నింద్యుడను కాకపోయినా నా జన్మ రహస్యంగా ఉండిపోయింది. అది ఇప్పుడు ప్రకటనం చేయటం ఎంతవరకు మేలు? విజయ విక్రమం ప్రసిద్ధి చెంది ఉండగా నే నిప్పుడు పాండవులతో కలిస్తే భయపడి ఈ పని చేశాడని లోకులు నిందించరా? నాపై ఆశలు పెట్టుకొన్న దుర్యోధనుడిని ఈ తరుణంలో విడవటం న్యాయమా? కాబట్టి నేను దుర్యోధనుడి పక్షంలో ఉండి నీ కొడుకులతో యుద్ధం చేస్తా'నని అతడు సేవాధర్మపరాయణుడై పలికాడు. పాండవులలో ఒక్క పార్థుడు తప్ప మిగిలినవారు చేజిక్కినా వారిని చంపనని మాట ఇచ్చాడు. యుద్ధంలో కర్ణుడు గాని, అర్జునుడు గాని ఎవరో ఒకరు మిగులుతారు. అతడితో కలిసి కుంతీపుత్రులు అయిదుగురు కాగలరనీ ఆరుగురు ఎన్నడూ కారని హెచ్చరించాడు. ఆమె కర్ణుడిని కౌగిలించుకొని అదంతా విధివిలాసమని పేర్కొని, కర్ణుడి మాటల కంగీకరించి, అతడిని ఆశీర్వదించి నిజ నివాసానికి వెళ్ళిపోయింది.

యుద్ధ నిర్ణయం : సైన్యాల మోహరింపు

శ్రీకృష్ణుడు ఉపప్లావ్యంలో ధర్మరాజుకు హస్తినాపురి విశేషాలన్నింటినీ వివరించాడు. అప్పుడు 'మాకు ధర్మచ్యుతి లేకుండా భావి కార్యాన్ని నిశ్చయించు'మని నారాయణుడిని ధర్మరాజు ప్రార్థించాడు. అతడి నిర్ణయ మిది -

'యుద్ధమ కాక కార్యమును నొండొక టెద్దియుఁ గల్గ నేర్చునే?
బుద్ధులు సెప్ప వాక్యముల పోల వినండన నేల? యట్టిచో
బద్ధునిఁ జేయఁజూచె ననుఁ బట్టి సుయోధనుఁ; డింక నయ్యసం
బద్ధునితోడి సంధికి నుపాయము నా మతిఁ దోఁప దెమ్మెయిన్.' **(ఉద్యో. 4.88)**

శ్రీకృష్ణుడి నిర్ణయంతో యుద్ధం నిశ్చయమైనది. అతని సూచనపై ధృష్టద్యుమ్నుడు పాండవ సర్వ సైన్యాధ్యక్షుడుగా అభిషిక్తుడైనాడు. అట్లాగే అక్షౌహిణీపతులైన దండనాథులను శ్రీకృష్ణుడే నిర్దేశించాడు. కౌరవులతో యుద్ధం చేయటానికి కురుక్షేత్రంలో సైన్యాన్ని సంఘటించాలని నియమించాడు. శుభశకునాల మధ్య యుధిష్ఠిరుడి సైన్యం ఉత్సాహంతో కురుక్షేత్రానికి చేరింది.

దుర్యోధనుడు ద్రోణాదులను పదకొండు మందిని అక్షౌహిణీ పతులుగా చేశాడు. వారలను భీష్ముడికి చూపి అతడిని సర్వ సైన్యాధ్యక్షుడిగా అభిషేకించాడు. బలరాముడు తీర్థయాత్రలకు వెళ్ళాడు. భీష్ముడు కురు పాండవ వీరుల అంతరాలను తెల్పి కర్ణుడిని అర్ధరథుని గానూ, అర్జునుడిని సాటిలేని మహారథుడి గాను పేర్కొన్నాడు. భీష్ముడు తాను శిఖండిని చంపలేనని చెప్పాడు. దానికి కారణమైన అంబోపాఖ్యాన కథనంతా వివరించాడు. అయినను ఆ పాండవ సేనా సాగరం ఇంకిపోయేటట్లు యుద్ధం చేస్తానని సైన్యాన్ని ఉత్తేజపరిచాడు.

- జి.వి. సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
పాండవులు కృష్ణాదులంగూడి భావికార్యవిధానము నాలోచించుట	5 - 1 - 1	02
సాత్యకి దుర్యోధనుకడకు దూతం బంపఁగూడదని చెప్పుట	5 - 3 - 1	12
ద్రుపదుఁడు దన పురోహితుని దుర్యోధనుకడకు దూతగాఁ బంపుట	5 - 5 - 28	22
దుర్యోధనుండును నర్జునుండును శ్రీకృష్ణుని దర్శింపఁబోవుట	5 - 7 - 2	26
అర్జునుఁడు శ్రీకృష్ణునిం దనకు సహాయునిఁగాఁ గోరికొనుట	5 - 7 - 18	30
దుర్యోధనుండు శల్యసహాయంబు గోరుట	5 - 8 - 6	36
శల్యుఁడు పాండవులం జూడ నుపప్లావ్యంబునకు వచ్చుట	5 - 8 - 15	40
ఇంద్రుఁడు వృత్రాసురునితో యుద్ధంబు సేయుట	5 - 9 - 45	49
దేవతలు నహుషుని సురరాజ్యాభిషిక్తునిం జేయుట	5 - 11 - 21	54
ఇంద్రుండు నహుషుతేజోవిశేషంబు సూచి మఱుఁగువడుట	5 - 13 - 16	61
అగ్నిదేవుఁ డింద్రుని వెదకి బృహస్పతికిం దెలుపుట	5 - 15 - 27	67
అగస్త్యుఁ డింద్రునకు నహుషుభ్రష్టతఁ దెలుపుట	5 - 17 - 7	73
సాత్యక్యాదులు సేనాసమేతంబుగఁ బాండవులం జేరవచ్చుట	5 - 19 - 1	79
ద్రుపద పురోహితుని రాయబారము	5 - 29 - 1	83
ధృతరాష్ట్రుఁడు సంజయునిఁ బాండవులయొద్దకుఁ బంపుట	5 - 22 - 1	98
సంజయుఁ డుపప్లావ్యంబుననున్న పాండవులయొద్దకు వచ్చుట	5 - 22 - 39	102

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్వితీయాశ్వాసము

సంజయుఁడు ధర్మజుని సంధిపల్కులను ధృతరాష్ట్రునకుఁ దెల్పుట	5 - 32 - 1	154
ధృతరాష్ట్రునకు విదురుఁడు హితముపదేశించుట	5 - 33 - 16	167
సనత్సుజాతుఁడు ధృతరాష్ట్రునకు నధ్యాత్మతత్త్వంబుఁ జెప్పుట	5 - 41 - 2	200
ప్రాతఃకాలవర్ణనము	అమూలకము	203
సంజయుఁడు ధృతరాష్ట్రునితోఁ బాండవులతెఱంగు సెప్పుట	5 - 46 - 15 (5-58-3)	208
సంజయుండు ధృతరాష్ట్రునకుఁ గృష్ణుఁడు సెప్పినమాట లెఱింగించుట	5 - 58 - 18	213
సంజయుండు ధృతరాష్ట్రునకు అర్జునుఁడు చెప్పినమాట లెఱింగించుట	5 - 47 - 6	217
భీష్ముఁడు కర్ణునిదుర్ణయంబు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట	5 - 48 - 33	230
ధృతరాష్ట్రుండు భీమసేనాదులపరాక్రమంబు దలంచి దుఃఖించుట	5 - 50 - 1	239
దుర్యోధనుఁడు తండ్రితో స్వపక్షవీరుల సామర్థ్యంబు సెప్పుట	5 - 54 - 1	248
సంజయుఁడు దుర్యోధనునకు ధర్మరాజునిశ్చయం బెఱింగించుట	5 - 55 - 2	255
ధృతరాష్ట్రుఁడు దుర్యోధనునితో సంధిసేయుమని చెప్పుట	5 - 57 - 4	263
దుర్యోధనుఁడు తండ్రితోఁ దన బలపరాక్రమంబులు సెప్పుట	5 - 60 - 20	270
కర్ణుఁడు భీష్మునిపై రోషముచేత నస్త్రసన్న్యాసంబు సేయుట	5 - 61 - 13	279
కృష్ణద్వైపాయనుఁడు ధృతరాష్ట్రునియొద్దకు వచ్చుట	5 - 65 - 8	285

తృతీయాశ్వాసము

శ్రీకృష్ణుని రాయబారము	5 - 70 - 1	298
శ్రీకృష్ణుఁడు ధర్మరాజుతోఁ గౌరవులదుర్ణయంబు సెప్పుట	5 - 71 - 1	321
శ్రీకృష్ణుఁడు భీమసేనునిఁ గౌరవులతోడి యుద్ధమునకుఁ బురికొల్పుట	5 - 73 - 1	333
అర్జునుఁడు శ్రీకృష్ణునితోఁ దనయభిప్రాయంబు సెప్పుట	5 - 76 - 1	341
ద్రౌపది కృష్ణునితోఁ దన మున్నుపడిన భంగపాట్లు సెప్పుట	5 - 80 - 1	359
శ్రీకృష్ణుఁడు ద్రౌపది నూరార్చుట	5 - 80 - 43	374
శ్రీకృష్ణుఁడు నారదాదిమహామునులం గని సంభాషించుట	5 - 81 - 58	387
ధృతరాష్ట్రుండు విదురుతో శ్రీకృష్ణునిరాక సెప్పి సంతోషించుట	5 - 84 - 20	393
శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రుని మందిరంబునకుఁ బోవుట	5 - 87 - 1	401
శ్రీకృష్ణుఁడు కుంతీదేవి నూఱడించుట	5 - 88 - 89	417
శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో సంభాషించుట	5 - 89 - 1	421
శ్రీకృష్ణుఁడు విదురుతో సంభాషించుట	5 - 91 - 3	433
శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రునితో సంభాషించుట	5 - 93 - 1	442

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీకృష్ణుఁడు పాండవులు సెప్పినమాటలు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట	5 - 93 - 36	451
కణ్వుండు దుర్యోధనునితో గరుత్మంతునివృత్తాంతంబు సెప్పుట	5 - 95 - 1	464
దుర్యోధనుఁడు నారదాదిమునులమాటలు వినక నిరాకరించుట	5 - 122 - 1	476
భీష్మద్రోణులు దుర్యోధనునకు హితంబు సెప్పుట	5 - 123 - 1	483
శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో మున్నతండు సేసిన దుర్ణయంబు సెప్పుట	5 - 126 - 1	490
దుర్యోధనాదులు శ్రీకృష్ణునిం బట్టికొని చెఱంబెట్టఁదలంచుట	5 - 128 - 1	499

చతుర్థాశ్వాసము

శ్రీకృష్ణుండు కుంతియింటికిం జని యాయమతో మాటలాడుట	5 - 129 - 20	512
శ్రీకృష్ణుఁడు కర్ణునిఁ దనరథం బెక్కించుకొని కొన్ని రహస్యోక్తులు పలుకుట	5 - 138 - 1	519
కర్ణుఁడు శ్రీకృష్ణునకుఁ దగినయుత్తరంబు లిచ్చుట	5 - 139 - 1	524
కుంతీదేవి కర్ణునకు నతండు దనపుత్త్రుండగుట దెలుపుట	5 - 143 - 1	534
శ్రీకృష్ణుఁడు ధర్మరాజునకుఁ గౌరవసభం బుట్టిన విశేషంబులు దెలుపుట	5 - 145 - 1	540
ధృష్టద్యుమ్నాదులకు సేనానాయకత్వంబు నిర్ణయించుట	5 - 149 - 18	549
పాండవులు కౌరవులతోడి యుద్ధంబునకు వెడలుట	5 - 149 - 49	556
దుర్యోధనుఁడు ద్రోణప్రభృతుల సేనాపతులం జేయుట	5 - 152 - 27	566
బలరాముఁడు పాండవుల వీడ్కొని తీర్థయాత్రవోవుట	5 - 154 - 15	574
రుక్మి వృత్తాంతము	5 - 155 - 1	577
సంజయుండు ధృతరాష్ట్రుని కులూకుఁడు పాండవుల నాడినమాటలు సెప్పుట	5 - 157 - 1	582
భీష్ముఁడు గౌరవసేనలో నతిరథమహారథాదుల నిరూపణంబు సేయుట	5 - 162 - 15	592
భీష్ముఁడు గర్ణుని నర్ధరథుండని చెప్పుట	5 - 165 - 3	600
భీష్ముండు పాండవవీరులం దతిరథమహారథాదుల నిరూపించి చెప్పుట	5 - 166 - 14	607
భీష్ముఁడు దుర్యోధనున కంబోపాఖ్యానంబు సెప్పుట	5 - 170 - 1	615
పరశురాముఁ డంబం దోడుకొని భీష్మునియొద్దకు వచ్చుట	5 - 178 - 23	625
భీష్ముఁడు పరశురామునితో యుద్ధంబు సేయుట	5 - 180 - 18	631
భీష్మునకు వసువులు స్వప్నసాక్షాత్కారంబున మోహనాస్త్రంబిచ్చుట	5 - 184 - 1	637
నారదుఁడు భీష్మున కంబవృత్తాంతంబంతయుఁజెప్పుట	5 - 187 - 16	647
శిఖండి యక్షునివలనఁ బురుషత్వంబునొందిన వృత్తాంతము	5 - 192 - 20	656
స్థూలకర్ణునకుఁ గుబేరునివలన స్త్రీత్వము గలుగుట	5 - 193 - 39	660

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీగౌరీ పల్లవపుట । యోగాశ్రయ మంజరీ సముజ్జ్వల మూర్తీ !
యోగీంద్ర సంతతాంత । ర్యాగ పరీపాకరూప! హరిహరనాథా ! 1

ప్రతిపదార్థం: శ్రీగౌరీ= లక్ష్మీపార్వతులనెడి; పల్లవపుట= చిగురుటాకుల డొప్ప యొక్క; యోగ= సంబంధమునకు; ఆశ్రయ= ప్రాపైన; మంజరీ= పూలగుత్తివలె; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశించే; మూర్తీ!= స్వరూపంగలవాడా!; యోగి+ఇంద్ర= ఉత్తమోపాసకుల యొక్క; సంతత= ఎడతెగని; అంతర్యాగ= అంతర్యాగమనే ఒక ఉత్తమోపాసనము యొక్క; పరీపాకరూప!= ఫలరూపమయినవాడా!; హరిహరనాథా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! చిగురుటాకులతో గూడిన పూలగుత్తి వలె లక్ష్మీ పార్వతులతోగూడి మిక్కిలి ప్రకాశించె స్వరూపంగలవాడా! యోగిశ్రేష్ఠులు నిరంతరం చేసే అంతర్యాగమనే మహోపాసనకు ఫలమైన ఆకారం గలవాడా!

విశేషం: అలం: రూపకం. లక్ష్మీపార్వతులతో కూడిన హరిహరమూర్తి కేవలం హరిహరమూర్తికంటె సముజ్జ్వలతరమైనదని భావం.

'శివ శ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం,
న చే దేవం దేవో న ఖలు కుశలః స్పందితు మపి'. (సౌందర్యలహరి.1)

(శివుడు శక్తితో కూడినప్పుడే సకల కార్యనిర్వహణసమర్థు డవుతాడు. కానిచో కదలటానికి కూడా అసమర్థుడు.)

తిక్కన ఈ పద్యంలో పల్లవ-పుట-యోగ శబ్దాలతో అపూర్వమైన ఒక ఉత్తమోపాసనరహస్యాన్ని సూచించాడు. ఏదయినా దేవతామంత్రాన్ని ఉపాసించేటప్పుడు ఉపాసకుడు ఆ దేవతామంత్రాన్ని జపిస్తూ దేవతానుగ్రహాన్ని శీఘ్రంగాను, దృఢంగాను పొందాలంటే ఆ ప్రధాన దేవతామంత్రంతోపాటు తదనుకూలాలైన అంగమంత్రాలను గూడా జతచేసి జపించటం ఉపాసనా సంప్రదాయం. ఆ జత చేసే ప్రక్రియలు 1. పల్లవం, 2. సంపుటం, 3. యోజనం అని మూడు విధాలు. పల్లవ మంటే ప్రధాన మంత్రానికి తుదిని ఆ అంగమంత్రాన్ని సమకూర్చటం. సంపుటమంటే ప్రధాన మంత్రానికి తొలుతనే అంగమంత్రాన్ని సమకూర్చటం. యోజనమంటే ప్రధాన మంత్రానికి మొదటా చివరా కూడా అంగమంత్రాన్ని సమకూర్చటం. అట్లా సమకూర్చి జపిస్తే మంత్రశక్తి సముజ్జ్వలతరమై ఎంతటి ఫలాన్నైనా ఈయగల దేవతానుగ్రహం కలుగుతుందని శాస్త్ర హృదయం.

ప్రకృతం పరమేశ్వరరూప ప్రధానమంత్రానికి శ్రీదేవతాబీజాన్నీ, గౌరీదేవతా బీజాన్నీ పల్లవరూపంలోకాని, సంపుట రూపంలోకాని, యోజన రూపంలోకాని సమకూరిస్తే, ఆ పరమేశ్వరమూర్తి అంటే మంత్రం (మంత్ర ఏవ తు దేవతా) సముజ్జ్వలతర మవుతుందని భావం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరమేశ్వరుడు అంతర్యాగ పరీపాకరూపుడు. యాగమంటే దేవతాదుల నుద్దేశించి అగ్నిహోత్రంలో ఆజ్యాదిపదార్థాలను మంత్రపూర్వకంగా వేయటం. ఇది బాహ్యమనీ, అంతరమనీ రెండు విధాలు, బాహ్యయాగం ప్రసిద్ధమే. అంతర్యాగమంటే అంతఃకరణంచే భావించబడే పదార్థాలను అంతఃకరణమందే కల్పించబడే అగ్నిహోత్రంలో వేల్వటం. బాహ్యయాగాన్ని పరమేశ్వరార్పణ బుద్ధితో కావించి నిర్మలచిత్తుడైన తిక్కయజ్వ అంతర్యాగపు అతిశయం గ్రహించి పరమేశ్వరుడిని అంతర్యాగ పరీపాకరూపుడిగా ఇందులో సంబోధించాడు.

ఇట్లాగే తిక్కన శాంతిపర్వంలో కూడా-

'హృదయ వేదికయందు సమిద్ధమూర్తి । వెలుఁగుచుండు తేజమునందు వేల్చుఁ బ్రాణ
ములను; యాజి య ట్లంతరమున నొనర్చు । యాగమున వీతకల్మషుఁడై వెలుంగు'

అనటం గమనార్హం. బాహ్యోపకరణ విశేషాలతో చేయబడే యాగంవలెనే ఆంతరంగా శరీరంలో నిత్యమూ జరిగే వ్యాపారాలందే అపూర్వ భావనా విశేషంతో కావించబడటంచేత ఇది 'అంతర్యాగం' అనబడుతున్నది. ఈ అంతర్యాగానికి పూజాకుసుమాలు అహింస, ఇంద్రియనిగ్రహం, దయ, క్షమ, జ్ఞానాదులు. హోమ విషయంలో హుతవహుడు చైతన్యం, కుండం చిత్కుండం, హోమపదార్థం, హవ్యం - విశ్వం. ఈ అంతర్యాగానికి ఫలం

'ఇ త్యన్తర్యజనం కృత్వా సాక్షాద్బ్రహ్మమయో భవేత్,

న తస్య పాపపుణ్యాని జీవన్ముక్తో భవే ద్ధ్రువమ్'. అని చెప్పబడింది.

తిక్కన హరిహరనాథుడిని అటువంటి అంతర్యాగానికి ఫలస్వరూపుడిగా పేర్కొన్నాడు.

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా= ప్రభూ! ఇది కృతిపతియైన హరిహరనాథుడి సంబోధనం; వైశంపాయనుండు= ఆ పేరుగల వ్యాసశిష్యుడు; జనమేజయునకున్= పరీక్షిత్తు కొడుకైన జనమేజయుడనే పేరుగల మహారాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ప్రభూ! హరిహరనాథా! వ్యాసశిష్యుడైన వైశంపాయనముని జనమేజయమహారాజుతో ఈ విధంగా అన్నాడు.

విశేషం: వైశంపాయనుడు వ్యాసుడి శిష్యుడు, ముని, జనమేజయుడు ఉత్తరాభిమన్యుల కుమారుడైన పరీక్షిత్తు కొడుకు. వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పినట్లు తిక్కన హరిహరనాథుడితో భారత కథ చెప్పుతున్నాడు.

పాండవులు కృష్ణాదులంగూడి భావికార్య విధానము నాలోచించుట (సం. 5.1.1)

తే. ఎలమి నభిమన్యు పెండిలి యివ్విధమునఁ । జేసి, యుల్లాసలక్ష్మిఁ గైసేసి మత్స్య
మనుజపతి యన్వయంబు పావనము సేసి, । దినచతుష్టయానంతరమునఁ బ్రియమున. 3

ప్రతిపదార్థం: (తరువాతి వచనంలోని 'ధర్మతనయుండు' కర్త.) ఎలమిన్= సంతోషంతో; అభిమన్యుపెండిలి= అభిమన్యుడిపెళ్ళి; ఇవ్విధమునన్ (ఈ+విధమునన్)= ఈ రీతిగా; చేసి; ఉల్లాసలక్ష్మిన్= ప్రకాశమనే శ్రీని; కైసేసి= అలంకరించి, మత్స్యమనుజపతి అన్వయంబు= మత్స్యదేశాధీశుడైన విరాటుడియొక్క, వంశం; పావనము సేసి (పావనము+చేసి)= పవిత్రంచేసి; దినచతుష్టయ+అనంతరమునన్= నాలుగు దినముల తరువాత; ప్రియమునన్= ప్రీతితో.

తాత్పర్యం: ధర్మరాజు అభిమన్యుడి పెళ్ళి ఈ రీతిగా సంతోషంతో చేసి, ప్రకాశమనే సంపద అలంకారంగా శోభిల్లుతూ, విరాటుడి వంశాన్ని పవిత్రం చేసి, నాలుగు దినాలు కడచిన తరువాత ప్రీతితో.

విశేషం: అభిమన్యుడు అర్జునుడి కొడుకు. అతడికి విరాటుడి కూతురైన ఉత్తరతో పెళ్ళి జరిగింది. పాండవుల తోడి ఈ సంబంధం వలన విరాటుడి వంశం పావనమయింది.

వ. **ధర్మతనయుండు దమ్ములుం గొడుకులుం బరివేష్టించియుండ, విశాలరమణీయంబగు విరాటు కొలువు కూటంబున కరిగి యందు.** **4**

ప్రతిపదార్థం: ధర్మతనయుండు= యముడి కొడుకైన ధర్మరాజు; తమ్ములున్= భీమాదులైన తమ్ములు నలుగురూ; కొడుకులున్= ప్రతివింద్యాదులైన కొడుకులూ; పరివేష్టించి ఉండన్= చుట్టిఉండగా; విశాలరమణీయంబు+అగు= విశాలమూ, సుందరమూ అయిన; విరాటుకొలువుకూటంబునకున్= విరాటరాజు సభాభవనానికి; అరిగి= వెళ్లి; అందున్= ఆ కొలువులో.

తాత్పర్యం: ధర్మరాజు భీమాదులైన తమ్ములు నలుగురూ, ప్రతివింద్యాదులైన కుమారులూ చుట్టియుండగా విశాలమూ, సుందరమూ అయిన విరాటరాజు సభాభవనానికి వెళ్ళి అందులో (వచనం 6లోని 'ఉన్న' అనే దానితో అన్వయం).

విశేషం: ధర్మరాజు తమ్ములు భీమార్జుననకులసహదేవులు, కొడుకులు ప్రతివింద్యుడు, శ్రుతసేనుడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతకర్ముడు అనే ఉపపాండవులైదుగురూ, భీముడికొడుకు ఘటోత్కచుడూ, అర్జునుడి కొడుకు అభిమన్యుడు మొదలయినవారు. విరాటుడి కొలువు విశాలమైనది అంతేకాక అది రమణీయమైనది.

క. **విరటుఁడుఁ, బాంచాలుండును, । హరియును, రాముండు, వారి యనుజ తనూజుల్,**
పరిణయ సమాగతాఖిల । ధరణీశులు బలసియుండఁ, దద్దయు నెమ్మిన్. **5**

ప్రతిపదార్థం: విరటుఁడున్= విరాటరాజూ; పాంచాలుండును= పాంచాలదేశపురాజగు ద్రుపదుడూ; హరియును= శ్రీకృష్ణుడూ, రాముండు= బలరాముడూ; వారి= ఆ విరాటాదుల; అనుజతనూజుల్= తమ్ములూ, కొడుకులూ; పరిణయసమాగత+అఖిలధరణీ+ఈశులున్= వివాహానికి విచ్చేసిన ఎల్లరాజులూ; బలసి+ఉండన్= చుట్టుకొనిఉండగా; తద్దయున్= మిక్కిలి; నెమ్మిన్= ప్రీతితో.

తాత్పర్యం: విరాటుడూ, ద్రుపదుడూ, శ్రీకృష్ణుడూ, బలరాముడూ, వారి తమ్ములూ, కుమారులూ, వివాహానికి విచ్చేసిన రాజులందరూ పరివేష్టించిఉండగా, మిక్కిలి ప్రీతితో. (తరువాతి వచనంలోని 'ఉన్న' అనే దానితో అన్వయం.)

వ. **ఉన్నసమయంబున సభాసదులైన మానవేంద్రులు నానావిధంబులఁ గృష్ణ యుధిష్ఠిరులతో సంభాషణంబులు సేయుచుండఁ, బాండవకార్యార్థియై కృష్ణుండు తదీయ వచనంబులు వారించి, వారలఁ గలయం గనుంగొని యిట్లనియె.** **6**

ప్రతిపదార్థం: ఉన్నసమయంబునన్= ఆవిధంగా పరివేష్టించి ఉన్నవేళ; సభాసదులు+ఐన= సభ్యులైన; మానవేంద్రులు (మానవ+ఇంద్రులు)= రాజులు; నానావిధంబులన్= అనేకరీతుల; కృష్ణయుధిష్ఠిరులతోన్= కృష్ణుడితోను, ధర్మరాజుతోను; సంభాషణంబులు+చేయుచున్+ఉండన్= మాటలాడుతుండగా, కృష్ణుండు; పాండవకార్య+అర్థి+ఐ= పాండవుల పనిని కోరినవాడయి; తదీయవచనంబులు= వారి మాటలు; వారించి= ఆపి; వారలన్= వారిని; కలయన్+కనుంగొని= బాగుగా చూచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆవిధంగా వారందరూ కూడిఉన్న సమయంలో సభలోని రాజులు అనేకరీతులుగా కృష్ణుడితోనూ, ధర్మరాజుతోనూ మాటలాడుతుండగా, శ్రీకృష్ణుడు పాండవుల కార్యం కోరినవాడయి వారి మాటలను ఆపి, వారినందరినీ కలయ చూచి ఇట్లా అన్నాడు.

విశేషం: శ్రీకృష్ణుడు 'పాండవకార్యార్థియై' వారలఁ గలయం గనుంగొని' మాట్లాడి నట్లు చెప్పటం సార్థకం. ఉద్యోగపర్వానికి కార్యారంభాన్ని చేస్తూ, అక్కడ ఉన్న రాజలోకమంతా ఏకమై వర్తించేటట్లుగా పలుకుతున్నాడని ధ్వని. నిజానికి పలుకవలసింది ధర్మజుడు. కాని, వచ్చినవారందరూ వివాహ శుభకార్యంలో పాల్గొనటానికి వచ్చిన బంధుమిత్రులు. వారిని ధర్మజుడు ప్రత్యక్షంగా యుద్ధంలో సహాయం చేయండని కోరటం ఉచితం కాదు. అదిగాక పాండవుల అంతరాత్మ వంటివాడు కృష్ణుడు. దైవశక్తిగా వారిచేత భావించబడి పూజించబడేవాడు. అతడిది భవిష్యద్వాణి, తప్పక జరిగేమాట అని వారికి విశ్వాసం ఉన్నది. పాండవులకు శ్రీకృష్ణుడు మార్గదర్శి. మహర్షి, 'యోగక్షేమం వహామ్యహమ్' అని రక్షించే పరమాత్మ. శ్రీకృష్ణుడు ఉద్యోగపర్వంలో పాండవేతివృత్తంలో నిర్వహించే కీలకమైన పాత్రను కవి ఈ మాటల వలన ధ్వనింపచేశాడు.(సంపా.)

మ. 'కపటద్యూతమునందు సౌబలునిచేఁ గౌంతేయు లాత్మీయరా
జ్య పదభ్రంశముఁ బొంది, సత్యనిరతిన్ శక్తాత్ములై యుండియుం
గుపితస్వాంతులు గాక, తత్సమయ సంక్షోభంబు గాకుండఁగా,
విపినావాసము, గూఢచర్యయును గావింపం దలం పొప్పదే? 7

ప్రతిపదార్థం: కౌంతేయులు= కుంతీపుత్రులు-పాండవులు; కపటద్యూతమునందున్= మోసపుజూదంలో; సౌబలునిచేన్= శకునిచేత; ఆత్మీయరాజ్యపదభ్రంశమున్= తమదైన రాజ్యస్థానంనుండి జారుపాటును - స్వీయ రాజ్యభ్రష్టతను; పొంది; సత్యనిరతిన్= సత్యమునందలి అత్యంతాసక్తిచేత; శక్త+ఆత్ములు+ఐ+ఉండియున్= సమర్థులై ఉండికూడా; కుపితస్వాంతులు+ కాక= కోపించిన మనస్సులు కలవారు కాకుండా; తద్+సమయసంక్షోభంబు+కాక+ఉండఁగాన్= ద్యూత నియమానికి భంగం కలుగకుండేటట్లు; విపిన+ఆవాసమున్= అరణ్యావాసమూ; గూఢచర్యయును= రహస్యవర్తనమూ, (అజ్ఞాతవాసమూ); కావింపన్+ తలంపు= చేయాలనే ఆలోచన; ఒప్పదే?= తగదా? బాగుకదా!

తాత్పర్యం: 'పాండవులు జూదంలో శకుని కుటిలత్వం చేత తమ రాజ్యం కోలుపోయి, సమర్థులై ఉండి కూడా, సత్యంపై ఉండే అత్యంతాసక్తిచేత, కుపితమనస్కులుగాక, ద్యూత నియమానికి భంగం కలగకుండా, అరణ్యాజ్ఞాతవాసాలు చేయనెంచడం సముచితం కాదా?

విశేషం: సౌబలుడు (శకుని) గాంధారదేశాధిపతియైన సుబలుడి కొడుకు. గాంధారికి అన్న. దుర్యోధనాదుల మేనమామ. దుర్యోధనుడి పక్షాన ఇతడే ధర్మరాజుతో జూదం ఆడి మోసంతో అతడిని ఓడించాడు. కౌంతేయులంటే కుంతి కొడుకులే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అయినా, పాండవుల కందరికీ వర్తిస్తుంది. సమర్థులై ఉండికూడా, కోపం తెచ్చుకోక, ద్యూత నియమోల్లంఘనం చేయక, అరణ్యాజ్ఞాతవాసాలు చేయ నెంచడం పాండవుల సత్యనిరతికి నిదర్శనం. 'సత్యమేవ జయతే'- అనే న్యాయాన్ని అనుసరించి వారికి విజయం కలుగాలని ధ్వని.

ఆ. తలఁచినట్ల వ్రతము సలిపి యమ్మాడ్కిఁ బం । డ్రెండు వత్సరములు పాండవేయు
లకట! క్రూరసత్త్వ యాతుధానావలి । తోడఁ గాననమునఁ గూడి మనరె? 8

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; పాండవేయులు= పాండవులు; తలఁచినట్ల (తలఁచిన+అట్లు+అ)= అనుకొన్న విధంగానే; వ్రతముసలిపి= నియమం పాటించి; అమ్మాడ్కిన్ (ఆ+మాడ్కిన్)= ఆ రీతిగా; పండ్రెండువత్సరములు= పన్నెండేళ్ళు; కాననమునన్= అడవిలో; క్రూరసత్త్వయాతుధాన+ఆవలితోడన్= క్రూరమృగాలతోనూ, రాక్షససమూహంతోనూ; కూడి= కలిసి; మనరె= జీవించరా?

తాత్పర్యం: అయ్యో! పాండవులు అనుకొన్న విధంగానే నియమం పాటించి ఆ రీతిగా పన్నెండేళ్ల అడవిలో క్రూరమృగాలతోనూ, రాక్షస సమూహంతోనూ కలిసి జీవించలేదా?

విశేషం: సత్యధర్మ నిరతి వలన పాండవులు ఉదాత్తు లనిపించుకొన్నారు. కపటద్యూతంలో ధర్మజుడు దిగ్విజయం చేసి సంపాదించుకొన్న సంపదను కౌరవులు అపహరించారు. ఉద్ధతులు, కపటులు అనిపించుకొన్నారు. పాండవులు బలవంతులైనా వారిని కోపంతో మట్టుపెట్టలేదు. సమయ సంక్షోభాన్ని సృష్టించలేదు. సత్యాన్ని పాటించి, ధర్మాన్ని రక్షించారు. కాబట్టి 'ధర్మో రక్షతి రక్షితః' అనే న్యాయం వారిపట్ల వర్తిస్తుంది అని భావం. ధార్మికులను ధర్మం ధర్మపరుల సహాయరూపంగా సమకూడి రక్షిస్తుందని ధ్వని. శ్రీకృష్ణుడు తన ప్రతిపాదనకు తగిన ప్రాతిపదికను పద్యంలో బలంగా వేసి వాదకుశలు డనిపించుకొన్నాడు. (సంపా.)

క. పదపడి, దుస్తరమగు నీ । పదుమూఁడగునేఁడు గడవఁబడుట యరిది; త
మ్మెదు రెఱుఁగమికై యాపద । లొదవిన సైరించి; రిట్టి యునికియుఁ గలదే? 9

ప్రతిపదార్థం: పదపడి= పిమ్మట; దుస్తరము+అగు= దాటశక్యంకాని; ఈ పదుమూఁడగు+ఏఁడు= ఈ పదమూడో యేడు (అజ్ఞాతవాస సంవత్సరం); కడవన్+పడుట= దాటటం; అరిది= దుష్కరం; తమ్మున్= తమను; ఎదురు= శత్రువును, ఎఱుఁగమికై= తెలిసికొనకుండా ఉండటానికి; ఆపదలు= కష్టాలు; ఒదవినన్= కలిగినా; సైరించిరి= ఓర్చుకొన్నారు; ఇట్టి ఉనికియున్= ఇటువంటి జీవనం కూడా; కలదే= ఉన్నదా? (లేదని భావం.)

తాత్పర్యం: అరణ్య వాసానంతరం దాటశక్యం కాని అజ్ఞాతవాస సంవత్సరమైన ఈ పదమూడో యేడు గడపటం దుష్కరం. తమను శత్రువు తెలిసికోకుండా ఉండటానికి ఎన్ని ఆపదలు సంభవించినా వీళ్ళు సహించారు. ఇటువంటి బ్రదుకు ఉంటుందా?

విశేషం: తమను శత్రువు తెలిసికొంటే ద్యూతనియమం ప్రకారం మళ్ళీ పన్నెండేళ్ళు అరణ్యావాసం, ఒక యేడు అజ్ఞాతవాసం చేయాలి. అందుచేత అజ్ఞాతవాస సంవత్సరంలో ఎన్ని ఆపదలు వచ్చినా పాండవులు సహించారు. ఇంత కష్టపుబ్రదుకు ఎక్కడా ఉండదని భావం. పాండవుల పట్ల పారిషదుల సానుభూతిని సమకూర్చే సంభాషణ మిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మీరలు ధర్మజు వర్తన । గౌరవ మెఱుఁగుదుర కాదె? కావున నా గాం
ధారీ తనూభవులకును, । వీరలకును హితమగా వివేకప్రౌఢిన్. 10

ప్రతిపదార్థం: మీరలు= మీరు; ధర్మజు= ధర్మరాజుయొక్క; వర్తన గౌరవము= నడవడియొక్క గొప్పతనం; ఎఱుఁగుదురు+అ+కాదె!= తెలిసినవారే కదా!; కావునన్= కాబట్టి, ఆ గాంధారీ తనూభవులకును= గాంధారి కొడుకులైన ఆ కౌరవులకూ; వీరలకును= వీరికీ- పాండవులకూ; హితము+అ+కాన్= మేలు అయ్యే విధంగా; వివేక ప్రౌఢిన్= విచారణ సామర్థ్యంతో.

తాత్పర్యం: మీరు ధర్మరాజు సత్ప్రవర్తనం తెలిసినవారే కదా! కాబట్టి ఆ కౌరవులకూ, ఈ పాండవులకూ మేలు కలిగే విధంగా విచారణ శక్తితో (తరువాత పద్యంలోని 'తలఁపుఁడు' అనే క్రియతో అన్వయం.)

విశేషం: కౌరవ పాండవులకు ఉభయులకూ మేలు కలుగవలెనంటే బాగా విచారణ చేసే నేర్పు ఉండాల్సిందే.

తే. ధర్మమార్గంబు దప్పక తలఁపుఁ డొక్క । తెఱఁగు; ధర్మువు దప్పి యుధిష్ఠిరుండు
పడయ నొడఁబడఁ డయ్యింద్రపదవియైన; । నుచితగతి నెంత వడసిన నుల్లసిల్లు. 11

ప్రతిపదార్థం: ధర్మమార్గంబు; తప్పక= విడువక; ఒక్క తెఱఁగు= ఒక విధం; తలఁపుఁడు= ఆలోచించండి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ధర్మువు+తప్పి= అధర్మంగా; ఆ+ఇంద్రపదవి+ఐనన్= ఉన్నతమైన ఆ ఇంద్రపదవిని కూడా; పడయన్= పొందటానికి; ఒడఁబడఁడు= అంగీకరించడు; ఉచిత గతిన్= తగిన రీతిని; ఎంత+పడసినన్= ఎంత తక్కువ లభించినా; ఉల్లసిల్లున్= సంతోషిస్తాడు.

తాత్పర్యం: ధర్మమార్గం విడిచిపెట్టకుండా ఏదయినా ఒక విధం ఆలోచించండి. ధర్మరాజు అధర్మపద్ధతిన అత్యున్నతమైన ఆ ఇంద్రపదవి లభించినా అంగీకరించడు. సముచితమార్గంలో ఎంత తక్కువ లభించినా సంతోషిస్తాడు.

విశేషం: అలం: వినోక్తి. ధర్మరాజుకు ధర్మం ముఖ్యం. పదవి కాదు అని భావం.

వ. కావునఁ బాండవులకుఁ బితృధనంబగు రాజ్యంబుఁ గపటద్యూతంబున దుర్యోధనుఁ డపహరించుటయు, నది వీరలు దిగ్విజయంబుఁ జేసి యలవరించుకొన్న పదం బగుటయు; ధర్మసూను మహానుభావంబు విచారింపక ధార్తరాష్ట్రులు పరిభవించినం దెగి యితండు వారలకుం గీడు రోయమియు, నీరెండు దెఱంగుల వారికిం బంచి కుడువందగుటయుం దలపోసి, తగిన కార్యంబు సెప్పనర్హులు; రేనును నాకన్నంత సెప్పెద వినుండు. 12

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి, పాండవులకున్; పితృధనంబు+అగు= తండ్రి సొత్తు అయిన; రాజ్యంబున్; కపట ద్యూతంబునన్= మోసపుజూదంలో; దుర్యోధనుఁడు; అపహరించుటయున్= దొంగిలించటం; అది= ఆ రాజ్యం; వీరలు= వీరు (పాండవులు); దిగ్విజయంబున్+చేసి= దిక్కులను (ఆయాదిక్కులలోని రాజ్యాలను) గెలవటంచేత; అలవరించుకొన్న పదంబు= సంపాదించుకొన్న స్థానం; అగుటయున్= కావటం; ధర్మసూను మహానుభావంబు= ధర్మరాజు గొప్పతనం; విచారింపక= ఆలోచించక; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుడి కుమారులు-దుర్యోధనాదులు; పరిభవించినన్= అవమానించగా; తెగి= సాహసించి; ఇతండు= ధర్మరాజు; వారలకున్= కౌరవులకు; కీడు= హాని; రోయమియున్= తలపెట్టకపోవటం; ఈ రెండు తెఱంగులవారికిన్=

ఈ రెండు పక్షాలవారికీ; పంచి కుడువన్+తగుటయున్= విభజించుకొని అనుభవించతగి ఉండటం; తలపోసి= ఆలోచించి; తగిన కార్యంబు= తగిన కర్తవ్యం; చెప్పన్; అర్హులరు= తగినవారు; ఏను= నేను కూడా; నా కన్న+అంత= నేనెరిగినంత; చెప్పెదన్= చెపుతాను; వినుండు= వినండి.

తాత్పర్యం: కాబట్టి, పాండవులకు తండ్రి సొత్తయిన రాజ్యాన్ని మోసపు జూదంలో దుర్యోధనుడు అపహరించటమూ, అది వీరు దిక్కులను జయించి సంపాదించుకొన్నది కావటమూ, ధర్మరాజు మహానుభావం ఆలోచించక దుర్యోధనాదులు అవమానించినా సాహసించి ఈ ధర్మరాజు వాళ్ళకు ఎటువంటి హానీ చేయ తలపెట్టకపోవటమూ, ఈ రెండు పక్షాల వారికీ పంచుకొని అనుభవించదగింది అవటమూ విచారించి, తగిన కర్తవ్యం ఉపదేశించటానికి మీరు తగినవారు. నేను కూడా నేనెరిగినంతలో చెప్పుతాను వినండి.

విశేషం: ఈ మాటలలో శ్రీకృష్ణుడి వాక్నైపుణ్యం తెలుస్తున్నది. పాండవులకు రాజ్యం తండ్రి నుండి వచ్చినది. దానిని దుర్యోధనుడు అన్యాయపు జూదంలో అపహరించాడు. అది పాండవుల కష్టార్జితం. ధర్మరాజు ఎంతటి మహానుభావుడో తెలియక దుర్యోధనాదులు అవమానిస్తే, అతడు వాళ్ళకు కీడు తలపెట్టలేదు. రాజ్యం ఈ రెండు పక్షాలవారూ పంచుకొని అనుభవించదగింది. సభ్యులు సముచిత కర్తవ్యోపదేశం చేసే ముందు ఈ అంశాల నన్నిటినీ దృష్టిలో పెట్టుకొనాలి - అని శ్రీకృష్ణుడి హెచ్చరిక. శ్రీకృష్ణుడి మాటలలోని హేతుబద్ధత మెచ్చదగింది.

క. కుంతీతనయులు సమయము । శాంతతమై నడపి, తమ భుజాబలమును, దు
ర్దాంతోద్యమ శౌర్యము నెఱిఁ । గింతు మనుచు నున్నవారు గిను కెదఁ గదురన్. 13

ప్రతిపదార్థం: కుంతీ తనయులు= కుంతి కొడుకులు - పాండవులు; సమయము= (ద్యూత) నియమాన్ని; శాంతతమైన్= శాంతితో; నడపి= పాటించి; కినుక= కోపం; ఎదన్= హృదయంలో; కదురన్= అతిశయించగా; తమ భుజాబలమును= తమ భుజపరాక్రమమునూ; దుర్దాంత+ఉద్యమ శౌర్యమున్= నిగ్రహించవీలుకాని, పూనికగల పరాక్రమమునూ; ఎఱిఁగింతుము+ అనుచున్+ఉన్నవారు= తెలపాలనుకొంటున్నారు.

తాత్పర్యం: పాండవులు ద్యూత నియమాన్ని శాంతంగా పాటించి, కోపం హృదయంలో అతిశయించగా, తమ భుజబలాన్నీ, నిగ్రహించరాని పూనికతోకూడిన పరాక్రమాన్నీ కౌరవులకు చూపాలనుకొంటున్నారు.

విశేషం: జూదానికి ముందు చేసికొన్న నియమాన్ని శాంతంగానే పాటించారు పాండవులు. అంతవరకూ తమ హృదయాలలో అణచిపెట్టబడిన కోపం పెల్లుబికి అనివార్యమైన తమ పరాక్రమం ప్రదర్శించాలనుకొంటున్నారు. ఇది వారి ధర్మనిరతినీ, పరాక్రమాన్నీ సూచిస్తుంది. అంతదాకా వారు ఊరుకొనటం చేతగాక కాదు; ధర్మపరాయణులు అవటం వలన మాత్రమే.

క. వీరి తలం పెఱిఁగిన గాం । ధారీ తనయుఁడు సుహృద్వితానముఁ గూర్చుం,
'పోరఁ బరిమార్తుఁ గొంచెపు । వారై యున్నెడన' యని యవశ్యముఁ గడఁకన్. 14

ప్రతిపదార్థం: వీరి= ఈ పాండవులయొక్క; తలంపు= అభిప్రాయం; ఎఱిఁగిన= తెలిసిన; గాంధారీ తనయుఁడు= గాంధారి కొడుకు- దుర్యోధనుడు; కొంచెపువారై (కొంచెము+వారు+ఐ)= అల్పసంఖ్యాకులయి; ఉన్న+ఎడన్+అ= ఉన్నప్పుడే; పోరన్= యుద్ధంలో; పరిమార్తున్= చంపుతాను; అని; అవశ్యమున్= తప్పనిసరిగా; కడఁకన్= ప్రయత్నంతో; సుహృద్+వితానమున్= మిత్రుల సమూహాన్ని; కూర్చున్= సమకూర్చుకొంటున్నాడు.

తాత్పర్యం: ఈ పాండవుల అభిప్రాయం తెలిసిన దుర్యోధనుడు 'అల్పసంఖ్యాకులై ఉన్నప్పుడే శత్రువులను యుద్ధంలో చంపుతా'నని అనివార్యమైన పూనికతో మిత్రబృందాన్ని సమకూర్చుకుంటున్నాడు.

విశేషం: 'శత్రువు అల్పుడై ఉన్నప్పుడే సాధించాలి' అనే రాజనీతిని దుర్యోధనుడు పాటించి, పాండవులను యుద్ధంలో చంపటానికి మిత్రులను కూర్చుకొని సన్నద్ధుడవుతున్నాడు. ఇది ఆతడి యుద్ధనీతికి నిదర్శనం.

క. అలఘు బల విక్రమోదా। త్తుల కైనను బలము లేక దోర్గర్వముమై
గెలువఁగ వశమె, సహాయము। కలిమి ననంతంబు లగు పగఱసైన్యములన్? 15

ప్రతిపదార్థం: అలఘు బల విక్రమ+ఉదాత్తులకున్+ఐనను= అధిక బలపరాక్రమాలచేత గొప్పవారైన వారికి కూడా; సహాయము కలిమిన్= తోడ్పాటు ఉండటం చేత; అనంతంబులు+అగు= అంతం లేని; పగఱ సైన్యములన్= శత్రుసేనలను; బలము లేక= సైన్యం లేకుండా; దోర్గర్వముమైన్ (దోః+గర్వము+మైన్)= భుజబలగర్వంతో; గెలువఁగన్+వశమె= గెలువ శక్యమా? (కాదని భావం.)

తాత్పర్యం: ఎంతటి బలపరాక్రమ సంపద కలవారికైనా, సహాయసంపద కలిగిన అనంతమైన శత్రుసైన్యాన్ని, నిస్సహాయంగా కేవల భుజబలగర్వంతోనే గెలవటం సాధ్యమవుతుందా?

విశేషం: దుర్యోధనుడివలెనే, పాండవులు కూడా కేవలం తమ భుజబలాన్నే నమ్ముకొని కూర్చుండక, సహాయసంపద గలిగి అనంతమైన శత్రుసైన్యాన్ని గెలవడానికి మిత్రబలాల్ని కూర్చుకోవాలని శ్రీకృష్ణుడి సూచన.

క. కావునఁ బాండవ పక్షము। భూవల్లభకోటి యిచటఁ బ్రోవగు; నిమ్మై
నీ వీరులు, నా వీరులు। దేవాసురులట్ల యనికిఁ దెగుదురు గడిమిన్. 16

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; పాండవ పక్షము భూవల్లభకోటి= పాండవుల పక్షంలోని రాజుల సమూహం; ఇచ్చటన్= ఇక్కడ; ప్రోవు+అగున్= చేరుతుంది; ఇమ్మైన్ (ఈ+మైన్)= ఈ విధంగా; ఈ వీరులున్= పాండవవీరులూ; ఆ వీరులున్= ఆ కౌరవవీరులూ; దేవాసురులట్ల (దేవ+అసురుల+అట్లు+అ)= దేవతలు రాక్షసులు మాదిరిగానే; కడిమిన్= పరాక్రమంతో; అనికిన్= యుద్ధానికి; తెగుదురు= సాహసిస్తారు.

తాత్పర్యం: కాబట్టి, పాండవుల పక్షంలోని రాజుల సమూహం ఇక్కడ కూడుతుంది. ఈ రీతిగా పాండవ వీరులూ, కౌరవవీరులూ దేవతలు రాక్షసుల వలెనే పరాక్రమంతో యుద్ధానికి తెంపు వహిస్తారు.

విశేషం: అలం: ఉపమ, యథాసంఖ్యము. 'ఈ వీరులు నా వీరులు దేవాసురులట్ల' అనటంలోని క్రమాన్వయం చొప్పున పాండవులకు దేవతలతోనూ, కౌరవులకు అసురులతోనూ పోలిక సిద్ధిస్తున్నది. దేవాసుర యుద్ధంలో చివరికి దేవతలదే విజయం కాబట్టి, పాండవ కౌరవ యుద్ధంలో పాండవులదే విజయం అని శ్రీకృష్ణుడు సూచించినట్లయింది. దేవాసురయుద్ధంతో పోలికవలన భావి పాండవ కౌరవ యుద్ధం కూడా అతిభీకరంగా ఉండగలదని సూచన.

వ. ఇది యిక్కడి తెఱంగునకుఁ దోఁచిన తలం; పక్కడివారి చిత్తవృత్తి యెట్టిదగుట యెఱుంగ; మెదిరిమతంబెఱుంగక యెట్టికార్యంబు నిశ్చయింప వెరవగునే? కావున ని య్యవసరంబునం దగిన మానిసి నందులకుం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బుచ్చవలయు; దుర్యోధనుండు వీరికి రాజ్యంబు పా లిచ్చిన మేలగుఁగాక, తక్కిన నప్పటికిఁ బోలినపని సూచుకొంద'మని పలికిన విని బలదేవుం డియ్యకొని రాజలోకంబు నాలోకించి యిట్లనియె. 17

ప్రతిపదార్థం: ఇది; ఇక్కడి తెఱంగునకున్= ఇక్కడి పరిస్థితికి; తోఁచిన తలంపు= స్ఫురించిన అభిప్రాయం; అక్కడి వారి= అక్కడనున్న కౌరవులయొక్క; చిత్తవృత్తి= మనఃస్థితి; ఎట్టిదగుట (ఎట్టిది+అగుట)= ఎట్లా ఉన్నదీ; ఎఱుంగము= తెలియము; ఎదిరిమతంబు= ఎదుటివారి (శత్రువు) అభిప్రాయం; ఎఱుంగక= తెలిసికోకుండా; ఎట్టికార్యంబు= ఏపనినీ; నిశ్చయింపన్= నిర్ణయించడానికి; వెరవు+అగునే?= వీలవుతుందా?; కావునన్; ఇయ్యవసరంబునన్ (ఈ+అవసరంబునన్)= ఈ సమయంలో; తగిన మానిసిన్= అర్హుడైనవాడిని; అందులకున్= అక్కడికి- కౌరవసభకు; పుచ్చవలయున్= పంపాలి; దుర్యోధనుండు; వీరికిన్= పాండవులకు; రాజ్యంబుపాలు= రాజ్యభాగం; ఇచ్చినన్= ఇస్తే; మేలు+అగున్= మంచిది; కాక తక్కినన్= అట్లాకాకపోతే- రాజ్యభాగం ఇవ్వని పక్షంలో; అప్పటికిన్= ఆ సమయానికి; పోలినపని= తగిన కార్యం; చూచుకొందము= ఆలోచిద్దాం; అని; పలికినన్= పలుకగా; విని; బలదేవుండు= బలరాముడు; ఇయ్యకొని= సమ్మతించి; రాజలోకంబున్= రాజుల సమూహాన్ని; ఆలోకించి= చూచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇదీ ఇక్కడి పరిస్థితికి అనురూపమైన అభిప్రాయం. అక్కడి వారి మనఃస్థితి ఎట్లా ఉందో మనకు తెలియదు. ఎదుటివారి అభిప్రాయం తెలిసికొనకుండా ఏ కార్యాన్నీ నిశ్చయించటం మంచిదికాదు. కాబట్టి ఈ సమయంలో తగినవాడిని కౌరవసభకు పంపాలి. దుర్యోధనుడు వీరికి రాజ్యభాగం ఇస్తాడా మంచిది. ఇవ్వకపోతే ఏం చేయాలో ఆ సమయానికి చూచుకొందాం-' అని పలుకగా విని బలరాముడు దానికి సమ్మతించి రాజసమూహాన్ని చూచి ఇట్లా అన్నాడు.

విశేషం: శ్రీకృష్ణుడి మాటలు అతడి కార్యనిపుణత్వాన్ని సూచిస్తున్నాయి.

క. 'హరి వాక్యము వింటిరె? యిది । యిరు దెఱఁగుల జనములకును హితమును ధర్మో
త్తరమును నైయున్నది యీ । వెరవున శక్యంబు మనకు వీరలఁ దీర్పన్. 18

ప్రతిపదార్థం: హరివాక్యమున్= శ్రీకృష్ణుడు చెప్పినమాట; వింటిరె?= విన్నారా?; ఇది= ఈ వచనం; ఇరు+తెఱఁగుల జనములకును= రెండు పక్షాల జనులకూ; హితమును= మేలును; ధర్మోత్తరమునున్= ధర్మంచేత శ్రేష్ఠమైనదీ; ఐ+ఉన్నది= అయి ఉన్నది; ఈ వెరవునన్= ఈ ఉపాయాన; మనకున్; వీరలన్= ఈ కౌరవపాండవులను; తీర్పన్= సమాధానపరచటానికి; శక్యంబు= సాధ్యం.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు చెప్పింది విన్నారా? ఇది ఇరుపక్షాల వారికీ మేలయినదీ; ధర్మయుక్తమైనదీ అవడంచేత శ్రేష్ఠమైనదీ అయి ఉంది. ఈ మార్గంలో మనకు ఈ ఉభయుల్నీ సమాధానపరచడం సాధ్యం.

విశేషం: శ్రీకృష్ణుడి హితవులో హితం, ధర్మం రెండూ కలిసి ఉండటం చేత ఆ సలహా పాటిస్తే పాండవకౌరవులకు హితం కలుగుతుంది, ధర్మయుక్తంగా ఉండటం చేత లోకులందరూ సంతోషిస్తారని భావం, (సంపా.).

చ. తమ సగపాలు గోలుపడి దానిన యిప్పుడు గోరు వీరికిన్
సముచితవృత్తి నిచ్చి తమ సామున సంతసమంది యున్కి యు
క్తము ధృతరాష్ట్రసూనునకు; దాన నపాయము లేకయుండుఁ; గో
పముడిగి వీరు సేయుదురు బాంధవ; మిజ్జగముం బ్రియంపడున్. 19

ప్రతిపదార్థం: తమసగపాలు= తమ సగంభాగం; కోలుపడి= పోగొట్టుకొని; దానిన (దానిన్+అ)= దానినే; ఇప్పుడు; కోరువీరికిన్= కోరుకొంటున్న పాండవులకు; సముచిత వృత్తిన్= తగినరీతిగా ఇచ్చి; తమసామునన్= తమ సగం భాగంతో; సంతసము+అంది+ ఉన్కి= సంతోషపడి ఉండటం; ధృతరాష్ట్రసూనునకున్= ధృతరాష్ట్రుడి కొడుకు- దుర్యోధనుడికి; యుక్తము= తగినది; దానన్= దానిచేత; అపాయము లేక+ఉండున్= చెరుపు ఉండదు; వీరు= ఈ పాండవులు; కోపము+ఉడిగి= కోపం విడిచి; బాంధవము= చుట్టరికం; చేయుదురు= కొనసాగిస్తారు; ఇజ్జగమున్ (ఈ+జగమున్)= ఈ లోకం; ప్రియంపడున్ (ప్రియము+పడున్)= సంతోషిస్తుంది.

తాత్పర్యం: తమ సగం భాగం కోలుపోయి దానినే ఇప్పుడు కావాలంటున్న పాండవులకు సముచితంగా దానిని ఇచ్చి, తమ సగంతో తృప్తిపడి ఉండటం దుర్యోధనుడికి మంచిది. దానిచేత కీడు ఉండదు. పాండవులు కోపం విడిచి బంధుత్వం చూపుతారు. ఈ లోకం కూడా సంతోషిస్తుంది.

విశేషం: జూదంలో కోలుపోయింది రాజ్యంలోని తమసగపాలే కాబట్టి, దానిని పాండవులు కోరటం, కౌరవులివ్వడం, ఉన్నదాంతో తృప్తిపడటం దుర్యోధనుడికి మంచిదనీ, జరిగినదానిని మనసులో పెట్టుకొని పగ సాధించకుండా కౌరవులతో కలిసి జీవించటం పాండవులకు మంచిదనీ బలరాముడి అభిప్రాయం. ఇంతవరకూ బలరాముడు శ్రీకృష్ణుడి వాదాన్నే బలపరిచాడు.(సంపా).

వ. కావున నిక్కార్యం బెడసేయక యొక్కరుం బనుపవలయు; వాఁడునుం జని యభిమతంబు సాధించునప్పుడు. 20

ప్రతిపదార్థం: కావునన్; ఇక్కార్యంబు (ఈ+కార్యంబు)= ఈ పని; ఎడ+చేయక= ఆలస్యం చేయకుండా; ఒక్కరున్= ఒక్కడిని; పనుపవలయున్= పంపాలి; వాఁడునున్= ఆతడునూ; చని= వెళ్ళి; అభిమతంబు= అనుకొన్నది; సాధించు+అప్పుడు= సాధించేటప్పుడు.

తాత్పర్యం: కాబట్టి, ఈ పని ఆలస్యం కాకుండా ఒక్కణ్ణి అక్కడికి పంపాలి. అతడు కూడా వెళ్ళి, తాను అనుకొన్నది సాధించేటప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. మాట పొందెఱింగి, యోటమై నల్లన । చేరి, కౌరవేంద్రు చిత్తవృత్తి
కనుగుణంబుగాఁగ నానతుం డగుచుఁ బ్రా । ర్థించి యడుగకున్నఁ దెఱఁగుపడదు. 21

ప్రతిపదార్థం: మాటపొందు= మాటలపొందిక; ఎఱింగి= తెలిసి; ఓటమైన్= వినయంతో; అల్లన= మెల్లగా; చేరి= దగ్గరై; కౌరవేంద్రు (కౌరవ+ఇంద్రు)= కౌరవశ్రేష్ఠునియొక్క - దుర్యోధనుడియొక్క; చిత్తవృత్తికిన్= మనఃస్థితికి; అనుగుణంబు+ కాఁగన్= అనుకూలంగా; ఆనతుండు+అగుచున్= మిక్కిలి నమ్రతతో వంగినవాడు అవుతూ; ప్రార్థించి= వేడుకొని; అడుగక+ ఉన్నన్= అడగకపోతే; తెఱఁగు పడదు= చక్కబడదు.

తాత్పర్యం: మాటతీరు తెలిసి వినయంతో మెల్లగా చేరి దుర్యోధనుడి మనఃస్థితి కనుకూలంగా వినమ్రుడై వేడుకొని అడుగకపోతే వ్యవహారం చక్కబడదు.

విశేషం: రాయబారి అయినవాడు ప్రవర్తించవలసిన తీరు బలరాముడు బాగా వివరించాడు. బలరాముడి మాటలలో పాండవుల దైన్యమూ, కౌరవుల ఆధిక్యమూ ధ్వనిస్తున్నాయి.

వ. అది యెట్లనిన, ధర్మనందనుం డతని యుద్ధతికిం బుయిలోడి, మెయివడిగల నడవడిం బ్రవర్తిల్లుచుండియు, జూదంబు వెంట మోసపోయి, తొడరి చిక్కునం బడియె; అదియును నతం డక్షవిద్యాపాటవంబు దనకు మిగుల లేమింజేసియు, బంధుజనంబులు దన్ను వారించుటయుం, దా నాడుట మాని గాంధారరాజును నియమించినం, దత్కళా కౌశలంబునం బరిణతుండు గావున నా శకుని యాడి, యుధిష్ఠిరుం డొడ్డిన యొడ్డిమియు గెలుచుచు వచ్చె నట్లగుట, నాతని యందును గొఱంత లే; దిత్తెఱంగున వార లధర్మపరులని నిందింపరాకునికి కారణంబుగా వీరలు వుచ్చినమానిసి వినయంబుతోన యిక్కార్యంబు దీర్చికొని రావలయు' ననిన, సాత్యకి కోపించి యిట్లనియె. 22

ప్రతిపదార్థం: అది; ఎట్లు; అనినన్; ధర్మనందనుండు= ధర్మరాజు; అతని+ఉద్ధతికిన్= ఆ దుర్యోధనుడి గర్వానికి; పుయిలోడి= సంకోచించి; మెయివడి+కల నడవడిన్= సౌమ్యతగల ప్రవర్తనంతో; ప్రవర్తిల్లుచున్+ఉండియున్= నడచుకొంటూ ఉండీ; జూదంబువెంటన్= ద్యూతద్వారమున; మోసపోయి; తొడరి= తొట్రుపడి; చిక్కునన్+పడియెన్= కష్టం పొందాడు; అదియునున్; అతండు= ఆ దుర్యోధనుడు; అక్షవిద్యాపాటవంబు= ద్యూతకళయందు నేర్పు; మిగులన్= మిక్కిలి; లేమిన్+ చేసియున్= లేకపోవటంచేతను; బంధుజనంబులు= చుట్టాలు; తన్నున్= తనను (దుర్యోధనుడిని); వారించుటయున్= అడ్డగించటంవలనను; తాను+ఆడుటమాని= తాను ఆడటం మాని; గాంధారరాజును= గాంధారదేశపురాజును (శకునిని); నియమించినన్= ఏర్పాటుచేయగా; తద్+కళాకౌశలంబునన్= ఆ ద్యూతవిద్యయందలి నేర్పులో; పరిణతుండు= పండినవాడు- ఆరితేరినవాడు; కావునన్; ఆ-శకుని; ఆడి= జూదమాడి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఒడ్డిన= పందెం కాసిన; ఒడ్డిమియున్= పందెపు ద్రవ్యాన్ని, కావునూ; గెలుచుచున్ వచ్చెన్= గెలుస్తూ వచ్చాడు. అట్లు+అగుటన్= అట్లా కావడం చేత; ఆతనియందును= ఆ దుర్యోధనుడియందుకూడా; కొఱంత= తప్పు; లేదు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; వారలు= కౌరవులు; అధర్మపరులు+అని= అన్యాయపరులని; నిందింపరాక+ఉనికి= నిందించటానికి వీలులేకపోవటం; కారణంబు+కాన్= కారణం కావటంచేత; వీరలు= పాండవులు; పుచ్చినమానిసి= రాయబారిగా పంపే మనుష్యుడు; వినయంబు+తోన్+అ= అడకువతోనే; ఈ+కార్యంబు= ఈ రాయబారపుపనిని; తీర్చికొని రావలయున్= సాధించుకొనిరావాలి; అనినన్; సాత్యకి= శ్రీకృష్ణబలరాముల తమ్ముడు; కోపించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అది ఎట్లా అంటే - ధర్మరాజు ఆ దుర్యోధనుడి గర్వానికి సంకోచించి సౌమ్యంగానే ప్రవర్తిల్లుతూ, జూదంలో మోసపోయి, తొట్రుపాటుతో కష్టాలలో పడ్డాడు. అదికాక, దుర్యోధనుడు ద్యూతవిద్యలో ఎక్కువ నేర్పు లేకపోవటంచేతా, చుట్టాలు తనను వారించడంచేతా, తను ఆడటంమాని శకునిని నియమించాడు. ఆ శకుని ద్యూతవిద్యలో పండినవాడుకావటంచేత జూదమాడి ధర్మరాజు పందెంలో కాసిన పందెమెల్లా గెలుస్తూ రావటం వలన ఆ దుర్యోధనుడిలో కూడా తప్పులేదు. ఆ విధంగా కౌరవులు అన్యాయపరులని నిందించటానికి వీలుకాక పోవటం కారణంగా, పాండవులు పంపిన మనుష్యుడు వినయంతోనే ఈ రాయబారపు కార్యం సాధించుకొనిరావాలి.' ఆ మాటలు విని సాత్యకి కోపంతో ఇట్లా అన్నాడు.

విశేషం: దుర్యోధనుడు గదాయుద్ధంలో బలరాముడికి శిష్యుడు. అందుచేతనే అతడి మాటలలో శిష్యవాత్సల్యం కనిపిస్తున్నది. దుర్యోధనుడికి జూదం ఆడటం చేతకాకపోతే ధర్మరాజును జూదానికి పిలవటం ఎందుకు? అది తప్పుకాదా? తన బదులు శకునిని ఆడమనడం తప్పుకాదా? శకుని ద్యూతకళాకౌశలమే ధర్మరాజు ఓడిపోవడానికి కారణం అంటున్నాడు కాని, అతడు మోసం చేశాడు అనటం లేదు. అందుచేత కౌరవులలోనూ దోషం ఉన్నదనడానికి వీలులేదట. ఈ విధమైన బలరాముడి వాదం అతడికి దుర్యోధనుడిపైగల శిష్యవాత్సల్యాన్నే చాటుతున్నది. అది గ్రహించటంవలననే సాత్యకికి అతడిపై కోపం వచ్చింది.

సాత్యకి దుర్యోధనుకడకు దూతం బంపఁగూడదని చెప్పుట (సం. 5-3-1)

ఆ. 'ఇట్టు లాడఁదగునె? యిది నీక పోలు ని । న్నేమనంగ నేర్తు? నిత్తెఱంగు
పాడి గాఁగఁ బూని పలుకంగఁ జెవి యొడ్డి । యాదరించువారి నందుఁగాక! 23

ప్రతిపదార్థం: ఇట్టులు= ఈ విధంగా; ఆడన్+తగునె?= మాటాడవచ్చునా?; ఇది; నీకున్+అ= నీకే; పోలున్= తగును; ఈ+తెఱంగు= ఈ విధానం; పాడి+కాఁగన్= ధర్మంగా; పూని= ప్రయత్నించి; పలుకంగన్= పలికితే; చెవి+ఒడ్డి= చెవిఒగ్గి-శ్రద్ధతో; ఆదరించువారిన్= మన్నించేవాళ్ళను; అందున్+కాక= అంటానుగాని; నిన్నున్; ఏమి+అనంగన్+నేర్తున్?= ఏమి అనగలను?

తాత్పర్యం: 'ఇట్లా మాటాడవచ్చునా? ఇది నీ కొక్కడికే తగును. దుర్యోధనుడు చేసిన పద్ధతి ధర్మబద్ధమని నీవు ప్రయత్నించి అంటూంటే చెవి ఒగ్గి విని నిన్ను మన్నించేవాళ్ళను అంటానుగాని, నేను నిన్ను ఏమనగలను?

విశేషం: బలరాముడి వాదం దుర్యోధన పక్షపాతంతో కూడినదనీ, అది క్షంతవ్యం కాదనీ సాత్యకి అభిప్రాయం. అన్నవాడికంటె విన్నవాడు ఎక్కువ తప్పు చేసినవాడనే తెలుగుజాతీయం తలపునకువస్తుంది సాత్యకి మాటల్లో.

క. వేడుక పుట్టిన జూదం । బాడెనె ధర్మజుఁడు? వార లందఱుఁ దమలోఁ
గూడుకొని పిలిచి బలిమిన । యాడి కపట జయము గొనుట యది దగవగునే? 24

ప్రతిపదార్థం: ధర్మజుఁడు= ధర్మరాజు; వేడుక పుట్టినన్= కోరిక కలుగగా; జూదంబు; ఆడెనె?= ఆడినాడా?; వారలు+అందఱున్= వాళ్ళు అందరూ; తమలోన్+కూడికొని= తమలో తాము కూడి; పిలిచి; బలిమిన్+అ= బలవంతంగా; ఆడి= జూదం ఆడి; కపటజయము+కొనుట= మోసంతో గెలుపొందటం; అది; తగవు+అగునే?= న్యాయం అవుతుందా?

తాత్పర్యం: ధర్మరాజు వేడుక పడి జూదం ఆడినాడా? వాళ్ళు అందరూ - ముఖ్యంగా దుష్టచతుష్టయం - తమలో తాము కూడి ధర్మరాజును జూదానికి రమ్మని పిలిచి బలవంతంగా జూదం ఆడి మోసంతో గెలుపొందటం ధర్మం అనిపించుకొంటుందా?

విశేషం: సాత్యకి ఉన్నమాట అని, బలరాముడి మాటమార్పును బయటపెట్టాడు.

క. ధర్మతనూభవు దెస దు । ష్కర్మము రూపించిన సభ నొకండును మైమైఁ
బేర్మి సెడక పోనేర్చునె? । ధార్మికు లిం కెట్టివారు తథ్యం బరయన్? 25

ప్రతిపదార్థం: ధర్మతనూభవుదెసన్= ధర్మరాజుపక్షాన; దుష్కర్మమున్= దోషం; రూపించి= నిరూపించి; సభన్= సభలో; ఒకండును= ఒక్కడైనా; మైమైన్= సులభంగా; పేర్మి+చెడక-పోన్+నేర్చునె?= గౌరవం చెడగొట్టుకోకుండా ఉండగలడా?; తథ్యంబు+అరయన్= నిజం ఆలోచిస్తే; ధార్మికులు= ధర్మపరాయణులు; ఇంకన్+ఎట్టివారు?= ఇంతకంటె వేరుగా ఎట్లా ఉంటారు?

తాత్పర్యం: ధర్మరాజులో దోషం చూపించి సభలో ఏ ఒక్కడైనా సులభంగా గౌరవం కోలుపోకుండా ఉండగలడా? ఇక నిజానికి ధర్మరాజుకంటె ధార్మికులు ఎట్లా ఉంటారు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ధర్మరాజులో దోషనిరూపణ చేయటం ఎవరికైనా గౌరవభంగకారణమే అవుతుందని సాత్యకి అభిప్రాయం. అన్నగారని మోమోటపడకుండా సాత్యకి ఉన్నమాట కుండబ్రద్దలు కొట్టినట్లు అనటం మెచ్చదగింది.

చ. **పలికినచందముల్ నెఱపి పైతృకమై చను రాజ్యభాగ మి**
మ్ములఁ బడయం దలంచి బలముం జలమున్ నెఱపం గడంగు వీ
రలు నొరు వేడఁబోదురె? యరాతులు సాధుల మెత్తురే? రణం
బుల జయలక్ష్మిఁ జేకొనుటఁ బోలునె యొండొకరాజధర్మముల్? 26

ప్రతిపదార్థం: పలికినచందముల్= ముందు అనుకొన్న రీతులు; నెఱపి= చేసి; పైతృకము+ఐ= పితృ సంబంధమైనదయి; చను= ఒప్పు; రాజ్య-భాగము; ఇమ్ములన్= సుఖంగా; పడయన్+తలంచి= పొందనెంచి; బలమున్= పరాక్రమమూ; చలమున్= పట్టుదలా; నెఱపన్= ప్రకటించటానికి; కడంగువీరలున్= పూనుకొనే ఈ పాండవులు; ఒరున్= ఇతరుని; వేఁడన్+పోదురె?= యాచించబోతారా?; అరాతులు= శత్రువులు; సాధులన్= మంచివాళ్ళను; మెత్తురే?= మెచ్చుకుంటారా? రణంబులన్= యుద్ధాలలో; జయలక్ష్మిన్= విజయమనే సంపదను; చేకొనుటన్= పొందటంతో; ఒండొక= వేరొక రకమైన; రాజ-ధర్మముల్= క్షత్రియధర్మాలు; పోలునె?= సరిపోలుతాయా?

తాత్పర్యం: ముందర అనుకొన్న రీతిగా చేసి, తండ్రివలన సంక్రమించిన రాజ్యభాగం సంతోషంగా పొందాలని బలమూ, చలమూ చూపాలనుకొంటూ ఉన్న ఈ పాండవులు కూడా ఇతరులను యాచించబోతారా? శత్రువులు మంచివాళ్ళను మెచ్చుకొంటారా? యుద్ధాలుచేసి జయలక్ష్మిని పొందటంతో వేరే ఏ రాజధర్మాలైనా సరిపోలుతాయా?

విశేషం: ద్యూత నియమం పాటించిన తరువాత ఎవరి రాజ్యభాగం వాళ్ళు తీసికొనాలని ముందర అనుకొన్న మాటలు. వాటి ప్రకారం పాండవులకు ఇప్పుడు తమభాగం రావాలి. పైగా అది పిత్రార్జితమైన ఆస్తి అవటం చేత పాండవులకు దానిపై హక్కు ఉన్నది. కౌరవులు న్యాయం చేయకపోతే వీళ్ళు పరాక్రమమూ, పట్టుదలా చూపగలరు. అట్లాంటి వీరు ఇతరులను యాచించబోతారా? అట్లా యాచించి మంచిగా ఉంటే శత్రువులు మెచ్చుతారా? అయినా యుద్ధంలో జయలక్ష్మిని పొందడంతో పోలే రాజధర్మం ఇంకొకటి ఏముంది? న్యాయం తమ పక్షాన ఉండగా, తాము శౌర్యవంతులయి ఉండగా పాండవులు కౌరవులను యాచించనక్కరలేదు. యుద్ధం చేసి జయలక్ష్మిని సాధించి రాజధర్మం నెరపాలని సాత్యకి నిశ్చితాభిప్రాయం.

తే. **సముచితములగు మాటలఁ జక్కఁబడక । తక్కనేే, నుక్కివుం డగు ధార్తరాష్ట్రుఁ**
గ్రూరశరముల నే నియ్యకొలుపువాఁడ । నవని కౌంతేయులకు నిచ్చునట్లుగాఁగ. 27

ప్రతిపదార్థం: సముచితములు+అగు= మిక్కిలి తగిన; మాటలన్= మాటలతో; చక్కఁబడక= తిన్నబడక; తక్కనేన్= మానినట్లయితే; ఉక్కివుండు+అగుధార్తరాష్ట్రున్= కపటి అయిన దుర్యోధనుడిని; క్రూరశరములన్= క్రూరములైన బాణాలతో, ఏను= నేను; కౌంతేయులకున్= పాండవులకు; అవని= భూమి; ఇచ్చునట్లు+కాఁగన్= ఇచ్చేటట్లు; ఇయ్యకొలుపువాఁడన్= అంగీకరింపజేస్తాను.

తాత్పర్యం: మంచి మాటలతో చక్కబడకపోతే కపటిఅయిన దుర్యోధనుడిని నేను పరుషాలైన బాణాలతో పాండవులకు వారి భూభాగం ఇచ్చేటట్లు ఒప్పిస్తాను.

విశేషం: సాత్యకి వీరోచిత వాక్యాలు ప్రశంసనీయాలు.

క. భీమార్జునులకు రణమున । నే మగలును బ్రతియె? వీరు నేనును సైన్యో
ద్దాములమై నడచిన, నే । భూమీశులు నెదిరి బ్రదికిపోవం గలరే? 28

ప్రతిపదార్థం: భీమ+అర్జునులకున్= భీముడికీ, అర్జునుడికీ; రణమునన్= యుద్ధంలో; ఏ, మగలును= ఎట్టి వీరులైనా; ప్రతియె?= సాటియా?; వీరున్= ఈ భీమార్జునులూ; ఏనును= నేనూ; సైన్య+ఉద్దాములము+ఐ= సేనతో భయంకరులమై, నడచినన్= దండెత్తితే; ఏ-భూమి+ఈశులున్= ఏ రాజులైనా; ఎదిరి= ఎదిరించి; బ్రతికిపోవన్+కలరే?= బ్రతికిపోగలరా?

తాత్పర్యం: భీమార్జునులకు యుద్ధంలో వీరులెవరైనా సాటియా? వీరూ నేనూ సేనాసమేతులమై శత్రుభయంకరంగా యుద్ధభూమిలో నడిస్తే, ఏ రాజులైనా మమ్మల్ని ఎదిరించి బ్రదికిపోగలరా?

ఆ. కవలవారుఁ, గొడుకుగమియుఁ, బాంచాలవ । ర్గంబు, వృష్ణివరులుఁ గడఁగిరేని,
నొక్క మాత్రలోన నువ్వెత్తుగొనరె? దు । ర్యోధనాది శతము నుద్దవిడిన. 29

ప్రతిపదార్థం: కవలవారున్= నకుల సహదేవులూ; కొడుకు గమియున్= కొడుకుల సమూహమూ; పాంచాల,వర్గంబున్= పాంచాలదేశపు వీరుల సమూహమూ; వృష్ణి, వరులున్= వృష్ణివంశశ్రేష్ఠులూ; కడఁగిరి+ఏనిన్= యుద్ధానికి పూనినట్లయితే; ఒక్క-మాత్రలోనన్= ఒక రెప్పపాటుకాలంలోనే; దుర్యోధన+ఆది, శతమున్= దుర్యోధనుడూ మొదలైన నూరుగురునీ; ఉద్దవిడిన్+అ= శీఘ్రంగానే; ఉవ్వెత్తు కొనరె?= నిశ్శేషంగా చంపరా?

తాత్పర్యం: నకుల సహదేవులూ, కుమారుల సమూహం, పాంచాలదేశపు వీరులూ, వృష్ణివంశశ్రేష్ఠులూ యుద్ధసన్నద్ధులయితే, ఒక్క రెప్పపాటుకాలంలోనే దుర్యోధనాదులైన నూరుగురినీ శీఘ్రమే నిశ్శేషంగా నిర్మూలించరా?

క. ఈ మత్స్యపతి సహాయము । గా మాకుం దీర్పరాని కార్యము గలదే?
సామాద్యుపాయపరుఁ, డు । ద్దామ భుజాబలయుతుం డితఁడు కేవలుఁడే? 30

ప్రతిపదార్థం: ఈ, మత్స్యపతి= ఈ మత్స్యదేశపురాజు-విరాటుడు; సహాయము+కాన్= తోడుకాగా; మాకున్; తీర్పన్+రాని-కార్యము+కలదే?= సాధించరాని పని ఉన్నదా?; ఇతఁడు= ఈ విరటుడు; సామ+ఆది+ఉపాయ, పరుఁడు= సామ, దాన, భేద దండములనే నాలుగు ఉపాయాలూ కలవాడు; ఉద్దామ భుజా బల యుతుండు= భయంకరమైన భుజబలంతో కూడినవాడు; కేవలుఁడే?= సామాన్యుడా?

తాత్పర్యం: ఈ విరాటుడి తోడ్పాటుతో మాకు సాధించరాని కార్యం ఉన్నదా? సామ దాన భేద దండములనే నాలుగు ఉపాయాలూ కలవాడూ, భయంకరమైన భుజబలం గలవాడూ అయిన ఇతడు సామాన్యుడా?

క. నా మతమునఁ గార్యము సం । గ్రామము సేయుటయ; యిట్లుగా కీలోనన్
సామవచనంబు లక్కురు । భూమీశ్వరుతోడ నాడఁ బుచ్చెదరేనిన్. 31

ప్రతిపదార్థం: నా-మతమునన్= నా అభిప్రాయంలో; సంగ్రామము+చేయుట+అ= యుద్ధం చేయటమే; కార్యము= కర్తవ్యం; ఇట్లు+కాక= ఈరీతికాక; ఈ-లోనన్= ఈలోగా; ఆ+కురు-భూమి+ఈశ్వరుతోడన్= ఆ కురురాజుతో - దుర్యోధనుడితో; సామ వచనంబులు= శాంతవాక్కులు; ఆడన్= పలకటానికి; పుచ్చెదరు+ఏనిన్= పంపితే.

తాత్పర్యం: నా అభిప్రాయం ప్రకారం యుద్ధం చేయడమే కర్తవ్యం. అట్లా కాక, ఈ లోపల ఆ దుర్యోధనుడితో శాంతవచనాలు పలకటానికి ఎవరినైనా పంపితే - (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. **దైన్యము దక్కి దూత యుచితంబుగఁ బాండునృపాలుపాలు రా**
జన్యవరుండు ధర్మజుఁడు సమ్మతి వేఁడెడు నన్న, లోక సా
మాన్య విధిం దగంగ గరిమంబున నిచ్చినఁ బుచ్చికొందఁ; మ
న్యోన్య విరుద్ధభాషణము లాడినఁ, దత్ఫల మాతఁ డందెడున్. **32**

ప్రతిపదార్థం: దైన్యము+తక్కి= దీనత్వం విడిచిపెట్టి; దూత= రాయబారి; ఉచితంబుగన్= తగిన విధంగా; పాండు నృపాలు, పాలు= పాండురాజు భాగం; రాజన్యవరుండు, ధర్మజుఁడు= రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు; సమ్మతిన్= ఇష్టంతో; వేఁడెడున్+అన్నన్= కోరుతున్నాడు అన్నప్పుడు; లోక సామాన్య విధిన్= లోకంలో సాధారణంగా జరిగే న్యాయం చొప్పున; తగంగన్= సముచితంగా; గరిమంబునన్= గౌరవంగా; ఇచ్చినన్= ఇస్తే; పుచ్చికొందము= తీసికొందాం; అన్యోన్య, విరుద్ధ, భాషణములు+అడినన్= ఒకదానికీ, ఇంకొకదానికి పొంతనలేని విధంగా మాటలాడితే; తద్+ఫలము= దాని ఫలం; ఆతఁడు= ఆ దుర్యోధనుడు; అందెడున్= అనుభవిస్తాడు.

తాత్పర్యం: ఏమాత్రమూ దీనత్వం లేకుండా దూత సముచితంగా పాండురాజు రాజ్యభాగం రాజోత్తముడైన ధర్మరాజు ఇష్టంతో వేడుకుంటున్నా డన్నప్పుడు, లోకసాధారణమైన న్యాయం చొప్పున తగినట్లుగా, సగౌరవంగా ఆ దుర్యోధనుడు ఇస్తే తీసికొందాం. అట్లాకాక పరస్పర విరుద్ధంగా మాటలాడితే దాని ఫలం అతడు అనుభవిస్తాడు.

విశేషం: దూత దైన్యం వహించవలసిన పనిలేదు. అది పాండవులకు పైతృకమైన ఆస్తి. ధర్మరాజు సామాన్యుడు కాడు. రాజోత్తముడు. అతడు దానిని కోరుకొంటున్నాడంటే, మర్యాదగా ఇవ్వటం లోకసాధారణమైన న్యాయం. అట్లాకాక అడ్డదిడ్డంగా మాటలాడినాడా, దుర్యోధనుడు దాని ఫలం - యుద్ధమరణం - అనుభవిస్తాడు. ఇది వీరోచితమైన సాత్యకి హెచ్చరిక.

వ. **అనిన ద్రుపదుం 'డిది వోలు; బలదేవు మాట మాట గాదు. బలపరాక్రమవంతుండును, సహాయ సంపన్నుండును, దుష్టాత్ముండునునైన దుర్యోధనుండు ప్రియవచనంబుల రాజ్యంబు పాలిచ్చుట కియ్యకొనమి సిద్ధంబు; యుద్ధంబునంగాని చక్కంబడఁ' డని పలికి మఱియు నిట్లనియె.** **33**

ప్రతిపదార్థం: అనినన్= అని సాత్యకి అనగా; ద్రుపదుండు; ఇది= సాత్యకి మాట; పోలున్= ఒప్పుతుంది; బలదేవు మాట= బలరాముడాడిన మాట; మాట+కాదు= సరిఅయినమాట కాదు; బలపరాక్రమవంతుండును= బలమూ, పరాక్రమమూ కలవాడూ; సహాయ సంపన్నుండును= మిత్రరాజుల సహకారం కలవాడూ; దుష్ట+ఆత్ముండును= దుష్ట స్వభావం కలవాడూ; ఐన, దుర్యోధనుండు; ప్రియ-వచనంబులన్= ప్రీతిపూర్వకాలైన మాటలతో; రాజ్యంబు, పాలు+ఇచ్చుటకున్= రాజ్యభాగం ఇవ్వటానికి; ఇయ్యకొనమి= అంగీకరించకపోవటం, సిద్ధంబు= తప్పక జరిగేదే; యుద్ధంబునన్+కాని= యుద్ధంచేతగాని; చక్కంబడఁడు= సరిపడడు; అని-పలికి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని సాత్యకి పలుకగా ద్రుపదుడు విని 'సాత్యకి మాట సముచితంగా ఉన్నది. బలరాముడి మాట సమ్మతం కాదు. బలపరాక్రమాలు కలవాడూ, సహాయ సంపత్తి కలవాడూ, దుష్టస్వభావుడూ అయిన దుర్యోధనుడు ప్రీతిపూర్వక వచనాలకు రాజ్యభాగం ఇవ్వడానికి ఇష్టపడడు. అది తప్పదు. యుద్ధంవలనగాని అతడు సరిపడడు' అని పలికి, ఇంకా ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: దుర్యోధనుడు రాజ్యభాగం ఇవ్వడని ద్రుపదుడు ఖచ్చితంగా చెప్పడానికి కారణాలు మూడు. దుర్యోధనుడు బలపరాక్రమాలు కలవాడు. అతడికి మిత్రరాజుల సహకారం ఉంది. అయినా, మంచితనం ఉంటే ఇవ్వవచ్చును. అది లేదు- దుష్టుడు. బలదేవుడిమాట మాట కాదు. మొదటి 'మాట'కూ, రెండో 'మాట'కూ అర్థభేదం లేకున్నా, తాత్పర్య భేదం ఉన్నది. మొదటి మాటకు 'వాక్కు' అనీ, రెండో మాటకు 'సరియైన వాక్కు' అనీ తాత్పర్యం. అందుచేత అలంకారం లాటానుప్రాసం అనే శబ్దాలంకారం.

క. 'మృదుభాషణముల దుర్జన । హృదయములు ప్రసన్నతామహిమఁ బొందునె? యె
ల్లిదముగఁ గొని, యంతంతకు । మద మెక్కుంగాక దురభిమానముపేర్మిన్. 34

ప్రతిపదార్థం: దుర్జన-హృదయములు= దుష్టుల మనస్సులు, మృదుభాషణములన్= మెత్తటి మాటలతో; ప్రసన్నతామహిమన్= సామంజస్యం అనే గొప్పతనాన్ని; పొందునె?= పొందుతాయా?; ఎల్లిదముగన్+కొని= అసమర్థతగా భావించి; అంతకున్+అంతకున్= క్రమక్రమంగా; దురభిమానము-పేర్మిన్= దుర్గర్వం యొక్క అతిశయంచేత; మదము+ఎక్కున్+కాక= మత్తెక్కుతాయికాని.

తాత్పర్యం: 'దుష్టుల హృదయాలు మృదువచనాలతో సామంజస్యం పొందవు. మెత్తగా మాటలాడటం అసమర్థతగా భావించి, దుర్గర్వాతిశయంచేత క్రమక్రమంగా మత్తెక్కుతాయి.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ఇది సామాన్యాంశం. 'మృదుభాషణముల దుర్యోధనుడి హృదయం ప్రసన్నతా మహిమ పొందదు' అనే అధ్యాహారమైన విశేషాంశాన్ని సమర్థిస్తున్నది.

వ. అదియునుంగాక. 35

తాత్పర్యం: అంతేకాక.

తే. కూటికై ద్రోణభీష్ములు గుమతి యనక । యనుసరింతురు; ధృతరాష్ట్రుఁడును దనూజు
తృష్ణ నూనినవాఁడు; రాధేయు బోఁటి । తులువ లెల్లను నతని సద్బుద్ధి యండ్రు. 36

ప్రతిపదార్థం: ద్రోణభీష్ములు= ద్రోణుడూ, భీష్ముడూ; కుమతి+అనక= (దుర్యోధనుడిని) దుర్బుద్ధి అనకుండా; కూటికై= తిండికొరకు; అనుసరింతురు= అనుసరిస్తారు; ధృతరాష్ట్రుఁడును; తనూజు తృష్ణన్= కొడుకు మీద వ్యామోహం; ఊనినవాఁడు= వహించినవాడు; రాధేయు, బోఁటి, తులువలు+ఎల్లను= కర్ణుడివంటి దుష్టులందరూ; అతనిన్= ఆ దుర్యోధనుడిని; సత్+బుద్ధి= మంచి బుద్ధిగలవాడు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ద్రోణభీష్ములు దుర్యోధనుడిని దుర్బుద్ధి అని అనకుండా అతణ్ణి కూటి కొరకు అనుసరిస్తారు. ధృతరాష్ట్రుడు కూడా కొడుకు మీద వ్యామోహం కలిగి ఉంటాడు. కర్ణుడివంటి దుష్టులందరూ అతడిని మంచివాడంటారు.

వ. కావున నతండు దుర్వినీతుండైయుండు; నెల్లభంగుల సంగరంబు గాఁగలయది; యీ సమయంబున బలంబులంగూర్చికొని పిలువందగు రాజులం బిలిచి పుచ్చవలయు; సుయోధనుండును దొడాసపడి పుచ్చు; నుచితపరులగు నరపతులు దొలుతఁ జెప్పినవారిక సహాయత్వంబుఁ జేయంజూతురు; మనము వెసగల

కాలరుల వేగంబ పుచ్చి, శల్య కేకయ ధృష్టకేతు జరాసంధతనయ ప్రభృతు లయిన భూపతులకును, వారి వారి బంధు మిత్ర జనంబులకునునెఱింగించి పుచ్చుట కార్యం; బిది నాకుం బోలిన తెఱం' గని పలికి తన కెలన సముచితాసనంబున నున్న విప్రవరుం జూపి. 37

ప్రతిపదార్థం: కావునన్; అతండు= దుర్యోధనుడు; దుర్వినీతుండు+ఐ+ఉండున్= దుష్ప్రవర్తకుడై ఉంటాడు; ఎల్ల - భంగులన్= అన్నివిధాల; సంగరంబు= యుద్ధం; కాఁగల+అది= జరుగబోతుంది; ఈ-సమయంబునన్; బలంబులన్= సేనలను; కూర్చికొని= కూడగట్టుకుని; పిలువన్+తగు-రాజులన్= పిలువదగిన రాజులను; పిలిచి పుచ్చన్వలయున్= పిలువనంపాలి; సుయోధనుండును= దుర్యోధనుడుకూడా; తోడు+ఆసపడి= సహాయం ఆశించి; పుచ్చున్= పిలువనంపుతాడు; ఉచిత పరులు+అగు నరపతులు= ఉచితజ్ఞులైన రాజులు; తొలుతన్+చెప్పిన-వారికిన్+అ= మొదట కోరినవారికే; సహాయత్వంబున్= తోడ్పాటును; చేయన్+చూతురు= చేయాలని చూస్తారు; మనము; వెస+కల-కాలరులన్= వడిగల దూతలను; వేగంబు+అ= శీఘ్రంగా; పుచ్చి= పంపి; శల్య,కేకయ, ధృష్టకేతు, జరాసంధతనయ, ప్రభృతులు+అయిన= శల్యుడూ; కేకయుడూ; ధృష్టకేతుడూ; జరాసంధుడి కుమారుడూ మొదలుగాగల; భూపతులకును= రాజులకును; వారి, వారి, బంధు-మిత్ర జనంబులకును= వారి వారి చుట్టాలకూ, స్నేహితులకూ; ఎఱింగించి పుచ్చుట= తెలిపిపంపడం; కార్యంబు= కర్తవ్యం; ఇది; నాకున్+పోలిన తెఱంగు= నాకు తోచిన విధం; అని-పలికి; తన కెలనన్= తన ప్రక్క; సముచిత+ఆసనంబునన్= తగిన పీఠంపై; ఉన్న; విప్రవరున్= బ్రాహ్మణోత్తముడిని; చూపి.

తాత్పర్యం: కాబట్టి, ఆ దుర్యోధనుడు దుశ్చరితుడై ఉంటాడు. ఏ విధంగా చూసినా యుద్ధం జరుగబోతుంది. ఈ సమయంలో సేనలను సమకూర్చికొని పిలువదగిన రాజులను పిలువనంపాలి. దుర్యోధనుడు కూడా తోడ్పాటు నాశించి పిలువనంపుతాడు, ఉచితజ్ఞులైన రాజులు మొదట కోరినవారికే సహాయం చేయజూస్తారు. మనం వడిగల దూతలను శీఘ్రమే పంపి, శల్యుడూ, కేకయుడూ, ధృష్టకేతుడూ, జరాసంధకుమారుడూ మొదలయిన రాజులకు, వారి వారి చుట్టాలకూ స్నేహితులకూ తెలిపి పంపటం కర్తవ్యం. ఇదీ నాకు తోచిన విధం' అని పలికి తన ప్రక్కన సముచితాసనంమీద ఆసీనుడైన బ్రాహ్మణోత్తముడిని చూపి.

క. ఇతఁడు మదీయాగ్ర పురో । హితుఁ; డితనికి నెల్లపనులు నెఱిఁగించి తగన్
ధృతరాష్ట్రు కడకుఁ బనుపుఁడు । చతుర వచన రచనఁ గఱపి సంప్రీతిమెయిన్. 38

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ బ్రాహ్మణుడు; మదీయ+అగ్ర-పురోహితుఁడు= నా ప్రధాన పురోహితుడు; ఇతనికిన్; ఎల్ల పనులున్; ఎఱిఁగించి= తెలిపి; సంప్రీతి మెయిన్= సంతోషంతో; చతుర వచన రచనన్= నేర్పుగల మాటలాడటం; కఱపి= బోధించి; తగన్= ఒప్పేటట్లు; ధృతరాష్ట్రు కడకున్= ధృతరాష్ట్రుడి దగ్గరకు; పనుపుఁడు= పంపండి.

తాత్పర్యం: ఇతడు నా ప్రధాన పురోహితుడు. ఇతనికి చేయవలసిన పనులన్నీ తెలిపి, సంప్రీతితో నేర్పుగా మాటలాడటం బోధించి తగినట్లుగా ధృతరాష్ట్రుడి దగ్గరకు పంపండి.

విశేషం: అగ్రపురోహితుడిని పరిచయం చేసిన వాక్యాలు అర్థవంతాలు. పురోహితుడంటేనే రాబోయే హితాన్ని కోరేవాడు. అటువంటివారు ద్రుపదుడి కొలువులో ఎందరో ఉన్నారు. వారిలో అగ్రగణ్యుడు ఈ పురోహితుడు, సామాన్యంగా మంత్రులలో పురోహితుడు ఒకడుగా ఉండటం పరిపాటి. మంత్రి కావటం చేతనే ద్రుపదుడి ప్రక్కన ఉన్నతాసనం మీద అగ్ర పురోహితుడు

కూర్చున్నాడు. అతడిని పంపటం వలన భవిష్యత్తులో హితం జరుగుతుందని ద్రుపదుడి భావం. పురోహితుడిని రాయబారిగా పంపేటప్పుడు అతడు ఏయే పనులు ఏవిధంగా చేయాలో, ఏ విధంగా మాటలు పలకాలో కూడా చెప్పమన్నాడు ద్రుపదుడు. ఆ రెండూ నేర్పవలసిన వని చెప్పటం గమనార్హం. భావి కథలో పురోహితుడి రాయబారం విఫలం కావటానికి అతడి మాట నేర్పరితనంలో ఉన్న అప్రౌఢియే కారణమని స్పష్టం ఔతుంది. అందుకే ఈ అంశాన్ని తిక్కన బీజప్రాయంగా ఇక్కడ చెప్పించాడు. (సంపా).

ఉ. ఆతని సమ్ముఖంబునఁ దదగ్రతనూజుకడన్ మరున్నదీ
జాతుని సన్నిధిం గలశసంభవునొద్దఁ గ్రమోచితంబుగా
నీతెఱఁ గిట్టులాడుమని యేర్పడ నంతయుఁ జెప్పిపుచ్చఁగా
నీతిమెయిం దగం బలుక నెయ్యము లాభముఁ, బెంపుఁజొప్పడున్. 39

ప్రతిపదార్థం: ఆతని-సమ్ముఖంబునన్= ఆ ధృతరాష్ట్రుడి ఎదుట; తద్+అగ్ర తనూజు కడన్= అతడి పెద్ద కొడుకు - దుర్యోధనుడి దగ్గర; మరుత్+నదీ-జాతుని సన్నిధిన్= గాంగేయుడి సన్నిధానంలో; కలశసంభవు+ఒద్దన్= ద్రోణుడి వద్ద; క్రమ+ఉచితంబుగాన్= క్రమంగానూ, ఉచితంగానూ; ఈ-తెఱఁగు= ఈ విషయం; ఇట్టులు+ఆడుము+అని= ఇట్లా మాట్లాడుమని; ఏర్పడన్= స్పష్టంగా; అంతయున్; చెప్పి పుచ్చఁగాన్= చెప్పిపంపితే; నీతి మెయిన్= రాజనీతితో; తగన్= ఒప్పుగా; పలుకన్= పలుకగా; నెయ్యము= స్నేహమూ; లాభమున్= లాభమూ; పెంపున్= గౌరవమూ; చొప్పడున్= కలుగుతాయి.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రుడి ఎదుటా, అతడి పెద్దకొడుకైన దుర్యోధనుడి దగ్గరా, భీష్ముడి సన్నిధానంలోనూ, ద్రోణుడి వద్దా, క్రమంగానూ, ఉచితంగానూ ఈ విషయం ఇట్లా మాటాడుమని స్పష్టంగా అంతా చెప్పి పంపితే, ఇతడు రాజనీతితో ఒప్పుగా ఆ విధంగా పలికితే స్నేహమూ, లాభమూ, గౌరవమూ కలుగుతాయి.'

వ. అనిన వాసుదేవుండు 'పాంచాలపతి వచనంబు లుచితంబులయి యున్నయవి; యిబ్భంగిన చేయవలయు' నని పలికి' మఱియు నిట్లనియె. 40

ప్రతిపదార్థం: అనినన్; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; పాంచాల పతి వచనంబులు= ద్రుపదుడి మాటలు; ఉచితంబులు+అయి+ఉన్న+అవి= తగినవిగా ఉన్నాయి; ఈ+భంగిన్+అ= ఈ విధంగానే; చేయవలయున్+అని= చేయాలని; పలికి; మఱియున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని ద్రుపదుడు పలుకగా శ్రీకృష్ణుడు 'ద్రుపదుడి మాటలు ఉచితంగా ఉన్నాయి. ఈ విధంగానే చేయాలి' అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'కౌరవులకుఁ బాండవులకు । నారయ నే నొక్కరూప; యట్లగుటఁ దగన్
వారును వీరును దమతమ । నేరిమిమెయి ధరణి యేలి నెగడఁగఁ జూతున్. 41

ప్రతిపదార్థం: ఆరయన్= పరిశీలించగా; కౌరవులకున్; పాండవులకున్; నేను; ఒక్కరూపు+అ= ఒకలాటివాడనే; అట్లు+అగుటన్= అందుచేత; తగన్= ఒప్పుగా; వారును, వీరును= కౌరవులూ; పాండవులూ; తమ తమ నేరిమి మెయిన్= తమ తమ సామర్థ్యంతో, ధరణి+ఏలి= భూమిని పాలించి; నెగడఁగన్+చూతున్= ప్రసిద్ధి కెక్కాలని చూస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పరిశీలించి చూస్తే నేను కౌరవులకూ, పాండవులకూ ఒకలాటివాడనే. అందుచేత వాళ్ళూ వీళ్ళూ ఒప్పుగా ఎవరి సామర్థ్యం చొప్పున వాళ్ళు భూమినేలి ప్రసిద్ధి వహించాలని భావిస్తాను.

విశేషం: పాఠాంతరం : కౌరవులును బాండవులును నారయ నాకొక్కరూప.

తే. **పెండ్లికని పిల్వఁ బంచినఁ బ్రియముతోడ । నేఁగుదెంచితి; మిన్నాళ్ళు నెల్ల యొప్పి**
దములఁ జూచితి; మియ్యెడఁ దడవుగాఁగ । నిలువఁ దీఱదు పోయిరావలయు మాకు. **42**

ప్రతిపదార్థం: పెండ్లికిన్+అని= పెళ్ళికొరకని, పిల్వన్+పంచినన్= పిలువనంపితే; ప్రియముతోడన్= ప్రీతితో; ఏఁగుదెంచితిమి= వచ్చాము; ఇన్నాళ్ళున్= ఇన్నాళ్ళూ; ఎల్ల+ఒప్పిదములన్= అన్ని ముచ్చట్లూ; చూచితిమి; ఈ+ఎడన్= ఇక్కడ; తడవు+కాఁగన్= ఎక్కువకాలం; మాకున్; నిలువన్+తీఱదు= ఉండే తీరిక లేదు; పోయిరావలయున్.

తాత్పర్యం: పెళ్ళికని పిలిస్తే ప్రీతితో వచ్చాం. ఇన్నాళ్ళూ అన్ని ముచ్చట్లూ చూచాం. ఇక్కడ ఎక్కువ కాలం ఉండే తీరిక లేదు. మేము వెళ్ళిరావాలి'.

వ. **అని పలికి ద్రుపదు నాలోకించి 'మీరు మాకెల్లవారికి గురుస్థానంబు; మీ మాట యనిన ధృతరాష్ట్రుండు బహుమానంబు సేయు, మిమ్ము శాంతనవుండునుం గొనియాడు; మీయందు ద్రోణకృపాచార్యులు సఖ్యంబు వాటింతు; రట్లగుటం జేసి.** **43**

ప్రతిపదార్థం: అని; పలికి; ద్రుపదున్; ఆలోకించి= చూసి; మీరు; మాకున్ ఎల్లవారికిన్= మాకందరికీ; గురు-స్థానంబు= గురు సమానులు; మీ మాట+అనినన్= మీ మాట అంటే; ధృతరాష్ట్రుండు; బహుమానంబు+చేయున్= గౌరవిస్తాడు; మిమ్మున్; శాంతనవుండునున్= భీష్ముడునూ; కొనియాడున్= ప్రశంసిస్తాడు; మీయందున్; ద్రోణ-కృపాచార్యులు= ద్రోణుడూ, కృపాచార్యుడూ; సఖ్యంబు+పాటింతురు= మైత్రిని చూపుతారు; అట్లు+అగుటన్+చేసి= అందుచేత.

తాత్పర్యం: అని పలికి, ద్రుపదుడిని చూచి 'మీరు మాకందరికీ గురుస్థానీయులు. మీ మాట అంటే ధృతరాష్ట్రుడికి గౌరవం. మిమ్మల్ని భీష్ముడు కూడా ప్రశంసిస్తాడు. మీతో ద్రోణకృపాచార్యులు మైత్రిని కోరుతారు. అందుచేత. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **పాండవార్థమై యొక్కరుఁ బనుప మీక । భరము; మీ పలు కందఱపలుకు; మీరు**
తెఱఁగు పఱుపంగ మిగిలి యుద్రేకులైన । వార చెడువారు; విమలవిచారవిభవ! **44**

ప్రతిపదార్థం: విమల విచార విభవ!= నిర్మలమైన ఆలోచనా సంపదకలవాడా, ద్రుపదుడా!; పాండవ+అర్థము+ఐ= పాండవుల నిమిత్తం; ఒక్కరున్= ఒకరిని; పనుపన్= పంపటానికి; మీకున్+అ= మీకే-మీదే; భరము= భారం; మీ పలుకు= మీ మాట; అందఱ-పలుకు= అందరిమాట; మీరు; తెఱఁగు పఱుపంగన్= చక్కదిద్దగా; మిగిలి= అతిక్రమించి; ఉద్రేకులు+ఐన+వారు+అ= ఆవేశపడేవాళ్ళే; చెడువారు= చెడిపోయేవాళ్ళు.

తాత్పర్యం: నిర్మలమైన ఆలోచనా సంపదగల ద్రుపదరాజా!, పాండవుల పక్షాన ఒకరిని పంపే భారం మీదే. మీ మాటే అందరి మాట. మీరు ఒక పద్ధతిగా చేసినప్పుడు దాని నతిక్రమించి ఆవేశపడేవారే చెడిపోతారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పొందైన లెస్స; విరసపుఁ । గ్రం దయ్యెడు చందమైన, రాజుల నెల్లన్
ముందఱ రావించి క్రమం । బొందఁగ, మముఁ బిలువఁ బంపుఁ డొయ్యన పిదపన్. 45

ప్రతిపదార్థం: పొందు+ఐనన్= సంధి జరిగితే; లెస్స= మంచిది; విరసము+క్రందు+అయ్యెడు చందము+ఐనన్= అనిష్టమైన భేదం పుట్టేటట్టయితే; రాజులన్+ఎల్లన్= రాజులనందరినీ; ముందఱన్= ముందుగా; రావించి= రప్పించి; క్రమంబు+ఒందఁగన్= క్రమంగా; పిదపన్= తరువాత; మమున్; ఒయ్యన= ఒప్పుగా; పిలువన్+పంపుఁడు= పిలిపించండి.

తాత్పర్యం: సంధి జరిగితే మంచిది. ఒకవేళ అనిష్టమైన భేదం పుట్టేటట్లయితే, ముందుగా రాజులనందరినీ రప్పించి క్రమంగా తరువాత మమ్ములను ఒప్పుగా పిలిపించండి.

క. మీ పనుపున రాజ్యము పా । లీపాండు తనూభవులకు నీకున్న, భుజా
టోపభయంకరుఁ డర్జును । కోపానల మడరి ముట్టికొనదే వారిన్?' 46

ప్రతిపదార్థం: మీ-పనుపునన్= మీ నియోగం చొప్పున; రాజ్యము పాలు= రాజ్యభాగం; ఈ+పాండు తనూభవులకున్= ఈ పాండవులకు; ఈక+ఉన్నన్= ఇవ్వకపోతే; వారిన్= ఆ కౌరవులను; భుజ+ఆటోప, భయంకరుఁడు+అర్జును-కోప+అనలము= భుజబలగర్వంచేత భీకరుడైన అర్జునుడి యొక్క కోపం అనే అగ్ని; అడరి= విజృంభించి; ముట్టికొనదే?= ఆక్రమించదా?

తాత్పర్యం: మీ ఆజ్ఞ చొప్పున రాజ్యభాగం ఈ పాండవులకు ఇవ్వకపోతే, భుజబలగర్వంచేత భయంకరుడైన అర్జునుడి కోపాగ్ని విజృంభించి ఆ కౌరవుల్ని ఆక్రమించదా?'

విశేషం: కోపానలము= కోపమనే అనలం - రూపకాలంకారం.

చ. అని, గమనోన్ముఖుండయి మురాంతకుఁ డా ద్రుపదుండు ధర్మనం
దనుఁడు వృకోదరాదులగు తమ్ములు మత్స్యమహీవిభుండుఁ ద
న్ననుప, హలాయుధ ప్రభృతి యాదవలోకము తోడరా ముదం
బున నిజపట్టణంబునకుఁ బోయె సముజ్జ్వల వైభవంబునన్. 47

ప్రతిపదార్థం: అని, ముర+అంతకుఁడు= మురుడనే రాక్షసుడిని సంహరించినవాడు - శ్రీకృష్ణుడు; గమన+ఉన్ముఖుండు+అయి= వెళ్ళటానికి సిద్ధపడినవాడై; ఆ-ద్రుపదుండున్; ధర్మనందనుఁడున్= ధర్మరాజూ; వృకోదర+ఆదులు+అగు-తమ్ములున్= భీముడు మొదలుగాగల అతడి తమ్ములూ; మత్స్య మహీవిభుండున్= మత్స్యరాజైన విరాటుడూ; తన్నున్+అనుపన్= తనను సాగనంపగా; హల+ఆయుధ-ప్రభృతి, యాదవ లోకము= నాగలి ఆయుధంగా కలవాడు (బలరాముడు) మున్నగు యాదవుల సమూహం; తోడన్+రాన్=వెంటరాగా; ముదంబునన్= సంతోషంతో; సముజ్జ్వల వైభవంబునన్= మిక్కిలి ప్రకాశించే వైభవంతో; నిజపట్టణంబునకున్= తనదైన పట్టణానికి - ద్వారకకు; పోయెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు ప్రయాణ సన్నద్ధుడై, ఆ ద్రుపదుడూ, ధర్మరాజూ, భీమాదులైన అతడి తమ్ములూ, విరాటుడూ, తనను పంపగా, బలరామాది యాదవ సమూహం వెంట రాగా, సంతోషంతో, సముజ్జ్వల వైభవంతో తన పట్టణమైన ద్వారకకు వెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. వివాహ మహోత్సవంబునకు వచ్చిన తక్కటి రాజులును సంగ్రామ సన్నాహంబునకై తమ తమ పురంబులకుం జనిరి; తదనంతరంబ. 48

ప్రతిపదార్థం: వివాహమహత్(మహో)+ఉత్సవంబునకున్= వివాహమహోత్సవానికి; వచ్చిన; తక్కటి రాజులును= తక్కిన రాజులూ; సంగ్రామ సన్నాహంబునకై= యుద్ధ ప్రయత్నానికై; తమ, తమ, పురంబులకున్= తమ తమ నగరాలకు; చనిరి= వెళ్లారు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: వివాహమహోత్సవానికి వచ్చిన మిగిలిన రాజులందరూ యుద్ధప్రయత్నాలు చేసికొనటానికి తమతమ నగరాలకు వెళ్ళారు. ఆ తరువాత.

క. సమరమునకుఁ దగు నుద్యో । గమునఁ బ్రవర్తిల్లి రెలమిఁ గౌంతేయులు; మ
త్స్య మహీనాథుఁడు సన్నా । హము సేసెన్; ద్రుపదవిభుఁడు నాయిత మయ్యెన్. 49

ప్రతిపదార్థం: కౌంతేయులు= పాండవులు; ఎలమిన్= సంతోషంతో; సమరమునకున్= యుద్ధానికి; తగు+ఉద్యోగమునన్= తగిన ప్రయత్నంలో; ప్రవర్తిల్లిరి= ఉన్నారు; మత్స్య మహీనాథుఁడున్= మత్స్యదేశపురాజు-విరాటుడూ; సన్నాహము+చేసెన్= యుద్ధ సన్నద్ధుడయ్యాడు; ద్రుపద విభుఁడున్= ద్రుపదరాజుకూడా; అయితము+అయ్యెన్= యుద్ధ సంసిద్ధుడయ్యాడు.

తాత్పర్యం: పాండవులు సంతోషంతో యుద్ధానికి తగిన ప్రయత్నంలో ఉన్నారు. విరాటుడూ యుద్ధ సన్నద్ధుడయ్యాడు, ద్రుపదరాజు కూడా యుద్ధ సంసిద్ధుడయ్యాడు.

వ. ఇట్లు సన్నద్ధులై వెలివీడు విడిసి తమకు ననురక్తులైన రాజుల పాలికిం దగుదూతలం బుచ్చి; రట దుర్యోధనుండు వీరల చందంబు విని, తానును దన బంధుమిత్రగణంబైన రాజలోకంబు నెల్ల రావించిన. 50

ప్రతిపదార్థం: ఇట్లు, సన్నద్ధులు+ఐ= యుద్ధ సంసిద్ధులై; వెలివీడు విడిసి= వెలుపలి నగరులో విడిది చేసి, తమకున్+అనురక్తులు+ఐన= తమయందు అనురాగం గల; రాజుల పాలికిన్= రాజుల వద్దకు; తగు దూతలన్= తగిన దూతలను; పుచ్చిరి= పంపారు; అటన్= అక్కడ - హస్తినాపురంలో; దుర్యోధనుండున్; వీరల చందంబు= పాండవుల విధం; విని; తానును; తన, బంధు, మిత్ర, గణంబు+ఐన, రాజ, లోకంబున్+ఎల్లన్= తన చుట్టాల, స్నేహితుల సమూహమైన రాజుల సమూహాన్నంతనూ; రావించినన్= రప్పించగా.

తాత్పర్యం: ఇట్లా యుద్ధ సంసిద్ధులై వెలుపలి నగరులో విడిది చేసి, తమయందు అనురాగం గల రాజుల వద్దకు తగిన దూతలను పంపారు. అక్కడ హస్తినాపురంలో దుర్యోధనుడు పాండవుల ప్రయత్నాలను గురించి తెలిసికొని, తాను కూడా తన బంధువులూ మిత్రులూ అయిన రాజుల సమూహాన్నంతటినీ రప్పించగా.

క. ఇభ తురగ స్యందన గతి । రభసంబునఁ బృథివి యద్రువ రాఁ దొడఁగిరి భూ
విభులు నలుదిక్కులను లో । క భయంకరలీల నుభయకటకంబులకున్. 51

ప్రతిపదార్థం: ఇభ, తురగ, స్యందన, గతి, రభసంబునన్= ఏనుగులయొక్క, గుర్రాల యొక్క, రథాలయొక్క, గమనములయొక్క వేగంచేత; పృథివి= భూమి; అద్రువన్= అదరగా; భూ విభులు= రాజులు, నలు దిక్కులను= నాలుగు దిక్కులందును;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉభయ కటకంబులకున్= ఇద్దరి శిబిరాలకూ; లోకభయంకర లీలన్= లోకానికి వెరపు పుట్టించే విధంగా; రాన్+తొడఁగిరి= రా నారంభించారు.

తాత్పర్యం: ఏనుగుల గుర్రాల రథాల గమనవేగంతో భూమి అదరగా రాజులు నాలుగు దిక్కుల నుండి ఉభయుల శిబిరాలకూ లోకభీకరంగా రావటం మొదలుపెట్టారు.

ద్రుపదుఁడు తన పురోహితుని దుర్యోధనుకడకు దూతగాఁ బంపుట (సం. 5-5-28)

వ. అట్టి సమయంబున నజాతశత్రు ననుమతి వడసి పాంచాలపతి వయోజ్ఞానవృద్ధుండైన తన పురోహితుం గురుపతిపాలికిఁ బుచ్చువాఁడై యతని రావించి. 52

ప్రతిపదార్థం: అట్టి సమయంబునన్= అప్పుడు; పాంచాలపతి= పాంచాలదేశపురాజు ద్రుపదుడు; అజాతశత్రు+అనుమతి+ పడసి= ధర్మరాజుయొక్క అనుజ్ఞ పొంది; వయస్(ః)+జ్ఞాన-వృద్ధుండు+ఐన= వయస్సు చేతా, జ్ఞానంచేతా పెద్దవాడయిన; తన-పురోహితున్; కురుపతి-పాలికిన్= కురురాజైన ధృతరాష్ట్రుడి దగ్గరకు; పుచ్చు+వాఁడు+ఐ= పంపువాడై; అతనిన్; రావించి= రప్పించి.

తాత్పర్యం: అటువంటి సమయంలో ద్రుపదుడు ధర్మరాజు అనుజ్ఞ పొంది వయస్సుచేతా, జ్ఞానం చేతా పెద్దవాడయిన తన పురోహితుడిని ధృతరాష్ట్రుడి దగ్గరకు పంపగోరి అతడిని రప్పించి.

**క. 'హితుఁడవు, మతిమంతుండవు, । చతుర వచన కోవిదుఁడవు, సమయజ్ఞుఁడ, వు
న్నత వంశవర్ధనుఁడ, విం । గిత వేదివి, నెచ్చెలివి, సుకృతి వ ట్లగుటన్. 53**

ప్రతిపదార్థం: హితుఁడవు= ఆప్తుడవు; మతిమంతుండవు= బుద్ధిమంతుండవు; చతుర, వచన, కోవిదుఁడవు= నేర్పుగల మాటలయందు పండితుడవు; సమయజ్ఞుఁడవు= సమయం తెలిసినవాడవు; ఉన్నత, వంశ, వర్ధనుఁడవు= ఉన్నత వంశాన్ని పెంచేవాడవు; ఇంగిత వేదివి= హృదయభావం తెలిసికొనేవాడవు; నెచ్చెలివి= మిత్రుడవు; సుకృతివి= పుణ్యశాలివి; అట్లు+అగుటన్= అందుచేత.

తాత్పర్యం: నీవు ఆప్తుడవు, బుద్ధిమంతుడవు, నేర్పుగా మాటలాడటంలో పండితుడవు, సమయం తెలిసినవాడవు, ఉన్నత వంశాన్ని అభివృద్ధిపరిచేవాడవు, హృదయంలోని భావాన్ని తెలిసికొనేవాడవు. ప్రియమిత్రుడవు, పుణ్యాత్ముడవు. అందుచేత.

విశేషం: ఈ పద్యంలో పురోహితుడు రాయబారిగా నియుక్తుడు కాదగిన లక్షణాలున్నవాడిగా ద్రుపదుడు ప్రశంసించాడు. అతడు చేయవలసిన పనులు తరువాతి పద్యంలో చెప్పాడు. వాటికి తగిన గుణాలనే ఈ పద్యంలో పేర్కొనటం విశేషం. ఈ రెండు పద్యాల భావాలను కలిపి చెప్పితే ఈ విధంగా తాత్పర్య మేర్పడుతుంది. 1. నీవు హితుడవు కాబట్టి కర్తవ్యమైన ఈ పని నీకు చెప్పుతున్నాను. 2. నీవు మతిమంతుడవు కాబట్టి నీ వాపని చేయటం న్యాయం. 3. నీవు చతురవచన కోవిదుడవు కాబట్టి నీ వన్ని విధాల మాట నేర్పరితనాన్ని ప్రకటించి ఆ పనికి ప్రయత్నించాలి. 4. ఉన్నతవంశ వర్ధనుడవు కాబట్టి పాండవార్థం ధృతరాష్ట్రుడి వద్దకు నిన్ను పంపుతున్నాను. 5. ఇంగితవేదివి కాబట్టి నేర్పు ప్రకటించగలవు. 6. నెచ్చెలివి

కాబట్టి నా కార్యాన్ని నీ కార్యంగా భావించగలవు. 7. సుకృతివి కాబట్టి చేపట్టిన పనిని కృతార్థం చేయగలవు(తీర్పగలవు). ద్రుపదుడి కార్య కారణబద్ధమైన వాక్యరచన అతడి చతురవచన రచనను తెలుపుతున్నది. అల్లసాని పెద్దన తన మనుచరిత్రలో శ్రీకృష్ణదేవరాయలు తనను 'హితుఁడవు, చతురవచోనిధివి' అని ప్రశంసించినట్లు అవతారికలో పేర్కొన్నాడు. (మను. 1.15). తిక్కన చతుర వచన రచన ఆతడిని ప్రభావితం చేసినట్లున్నది. అది సహజం కూడా. తిక్కన 'కవిబ్రహ్మ', పెద్దన 'ఆంధ్ర కవితా పితామహుడు'. (సంపా.).

తే. **నాకుఁ గర్తవ్య మగుపని నీకుఁ జేయఁ। దగవుగావున నెల్లవిధములఁ బూని।**
పాండవార్థంబు ధృతరాష్ట్రుపాలి కరిగి। నేర్పువాటించి కార్యంబు దీర్పవలయు.' 54

ప్రతిపదార్థం: నాకున్; కర్తవ్యము+అగు పని= చేయదగినపని; నీకున్; చేయన్= చేయటం; తగవు= న్యాయం; కావునన్= కాబట్టి; ఎల్లవిధములన్= అన్నివిధాలా; పూని= ప్రయత్నించి; పాండవ+అర్థంబు= పాండవుల కొరకు; ధృతరాష్ట్ర-పాలికిన్= ధృతరాష్ట్రుడి దగ్గరకు; అరిగి= వెళ్ళి; నేర్పు+పాటించి= నేర్పు చూపి; కార్యంబు= పని; తీర్పవలయున్= నెరవేర్చాలి.

తాత్పర్యం: నేను చేయవలసి ఉన్న పని నీవు చేయటం న్యాయం కాబట్టి, అన్ని విధాలా ప్రయత్నించి పాండవుల కొరకు ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి నేర్పు చూపి కార్యం సాధించాలి.'

విశేషం: పై(53) పద్య విశేషాంశాన్ని గమనించండి.

వ. **అని చెప్పి యొడంబఱిచి యతనితో మఱియు నిట్లనియె. 55**

ప్రతిపదార్థం: అని; చెప్పి; ఒడంబఱిచి= ఒప్పించి; అతనితోన్; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి అంగీకరించేటట్లు చేసి అతడింకా ఇట్లా అన్నాడు.

క. **'విను కొడుకు గొన్న వేఁదుఱ। కొని కొట్టిన తిండికాఁడు కుటిలుం డతఁ; డా**
జనపతి చందము, ధర్మజు। ననుపమ శీలంబు నెఱుఁగు; దది యట్లుండెన్. 56

ప్రతిపదార్థం: విను; కొడుకు+కొన్న-వేఁదుఱు+అ= కొడుకుకు పట్టిన పిచ్చియే; కొని, కొట్టిన, తిండికాఁడు= పట్టిన పరమలోభి; అతఁడు; కుటిలుండు= కపటి; ఆ జనపతి చందమున్= ఆ రాజు విధమూ; ధర్మజు+అనుపమ శీలంబు= ధర్మరాజు సాటిలేని స్వభావమూ; ఎఱుఁగుదు+(వు)= తెలిసినవాడవు; అది+అట్లు+ఉండెన్= అది అట్లా ఉండనీ.

తాత్పర్యం: 'విను. ఆ ధృతరాష్ట్రుడు కొడుక్కు పట్టిన పిచ్చియే పట్టిన పరమలోభి. కపటి. ఆ రాజు విధమూ, ధర్మరాజు సాటిలేని స్వభావమూ ఎరుగుదువు. అది అట్లా ఉండనీ.

తే. **పుడమి పాలు పాండవులకు నడుగఁబోయి, । నీవు ధృతరాష్ట్రుతో ధర్మ నిష్ఠమైన**
యుచిత మాడిన, నందుఁ బోటొడ్డియున్న। దొరల భృత్యుల మనములు దిరుగఁబడవె? 57

ప్రతిపదార్థం: పుడమి-పాలు= భూభాగం; పాండవులకున్, అడుగన్+పోయి= అడగడానికి వెళ్ళి; నీవు; ధృతరాష్ట్రుతోన్; ధర్మ-నిష్ఠము+ఐన+ఉచితము+ఆడినన్= ధర్మంతో కూడుకొన్న ఉచితమైన మాట పలికితే; అందున్= కౌరవుల పక్షంలో; పోటొడ్డి+ఉన్న=

యుద్ధసన్నద్ధులైన; దొరల, భృత్యుల, మనములు= ప్రభువుల యొక్కయు, సేవకుల యొక్కయు మనస్సులు, తిరుగఁబడవె= వెనుకకు మరలవా?

తాత్పర్యం: పాండవులకు భూభాగం ఇమ్మని అడగటానికి వెళ్ళి నీవు ధృతరాష్ట్రుడితో ధర్మయుక్తమూ, సముచితమూ అయిన మాట పలికితే, కౌరవుల పక్షంలో ఉన్న రాజుల, సేవకుల మనస్సులు మన కనుకూలంగా మారిపోవా?

విశేషం: 'దొరల భృత్యుల మనములు దిరుగఁబడవె?' - దీనికి మూలం- 'భవాంస్తు ధర్మసంయుక్తం ధృతరాష్ట్రం బ్రువన్ వచః మనాంసి తస్య యోధానాం ధ్రువ మావర్జయిష్యతి.' 'నీవుధృతరాష్ట్రుడితో ధర్మయుక్తమైన మాట చెప్పి అతడి యోధుల మనస్సులను తప్పకుండా వశం చేసికొంటావు.' అనగా, అట్లా వశం చేసుకొనేటట్లు మాటాడాలని వేడికోలు. 'తిరుగఁబడవె? - అనే క్రియ సార్థకం. వారి వైపున్న మనస్సులు మనవైపు తిరుగబడవా? అనీ, యుద్ధం నుండి విముఖం కావా? అనీ రెండర్థాలు చెప్పుకొనవచ్చును.

క. గురుభీష్మాదుల మనములు । దురమునకుం జొరకయుండ దుర్యోధనుఁ డా
తురుఁడై యొడఁబఱుపఁగ ని । ప్పరుసున నెరవైన ఱిచ్చవడు బల మెల్లన్. 58

ప్రతిపదార్థం: గురు, భీష్మ+ఆదుల, మనములు= ద్రోణుడు, భీష్ముడు మున్నగువారి మనస్సులు; దురమునకున్= యుద్ధానికి; చొరక+ఉండన్= అంగీకరించకపోగా; దుర్యోధనుడు; ఆతురుఁడు+ఐ= వేగిరపాటుతో బాధపడినవాడయి; ఒడఁబఱుపఁగన్= అంగీకరింపచేయగా; ఈ+పరుసునన్= ఈ విధంగా; నెరవు+ఐనన్= సాధ్యపడితే; బలము+ఎల్లన్= సైన్యమంతా; ఱిచ్చ+పడున్= నిశ్చేష్టతను పొందుతుంది.

తాత్పర్యం: ద్రోణుడూ, భీష్ముడూ మొదలైనవారు యుద్ధానికి సుముఖత చూపకపోగా, దుర్యోధనుడు బాధపడి వారిని అంగీకరించేటట్లు చేయటం నీకు సాధ్యమయితే సైన్యమంతా ఆశ్చర్యంతో నిశ్చేష్టతను పొందుతుంది.

ఉ. పాండుతనూభవుల్ వడిన పాటులు బంధులకెల్లఁ దెల్పుచున్,
బండిత వృద్ధ సజ్జనుల పాలికిఁబోయి కులోచితంబు గా
కుండుట సూపి చెప్పుచుఁ, బ్రియోక్తులఁ దక్కటివారి 'నిట్లు మే
లొండొకచంద మొప్ప' దని యుల్లములం దలపోయఁ జేయుచున్. 59

ప్రతిపదార్థం: పాండు తనూభవుల్= పాండురాజు కొడుకులు పాండవులు; పడిన,పాటులు= పడ్డ కష్టాలు; బంధులకున్+ఎల్లన్= చుట్టాలకందరికీ; తెల్పుచున్= చెపుతూ; పండిత, వృద్ధ, సత్+జనులపాలికిన్= పండితులూ, పెద్దవారూ, మంచివారూ అయిన వారి దగ్గరికి; పోయి, కుల+ఉచితంబు= వంశానికి తగినది; కాక+ఉండుట+చూపి-చెప్పుచున్= కాకపోవటం నిరూపించి చెపుతూ; తక్కటివారిన్= తక్కినవారిని; ప్రియ+ఉక్తులన్= మంచి మాటలతో; ఇట్లు, మేలు= ఈ విధం మంచిది; ఒండొక, చందము= వేరు విధం; ఒప్పదు+అని= తగదని; ఉల్లములన్= మనస్సులలో; తలపోయన్+చేయుచున్= అనుకొనేటట్లు చేస్తూ.

తాత్పర్యం: పాండవులు పడ్డ కష్టాలు బంధువుల కందరికీ చెపుతూ, పండితులూ, వృద్ధులూ, సజ్జనులూ అయిన వారి దగ్గరికి వెళ్ళి 'ఇది వంశానికి తగినది కా'దని నిరూపించి చెపుతూ, తక్కినవారిని మంచిమాటలతో' ఈ విధం మంచిది, వేరే విధం మంచిది కాదు' అని మనస్సులలో అనుకొనేటట్లు చేస్తూ.

విశేషం: పురోహితుడు హస్తినాపురంలో సంప్రదించేవారిని ద్రుపదుడు వర్గీకరించిన విధం విశిష్టం. ముందు ధృతరాష్ట్ర దుర్యోధనాదులైన బంధువులతో, పండితు(గురువు)లైన కృపాచార్య ద్రోణాచార్యాదులతో, భీష్మ బాహ్లికాది వృద్ధులతో, సజ్జనులైన విదుర సంజయాదులతో ప్రతిపాద్యాంశం ఒకటే అయినా, వారి వారి ప్రవృత్తుల కనుగుణంగా ప్రవచించాలని భావం. (సంపా).

వ. మఱియు సమస్తజనంబుల మనంబుల నిక్కడ వ్రాలునట్టి యుపాయంబు లెన్నిగల వన్నియు నయ్యై తగవులమై నాచరించుచుఁజరియించునది; యిచ్చట విరాటు కొలువు కూటంబునం బుట్టిన కృష్ణాదుల సంవాదంబు తెఱంగును మన యెఱింగినయదియె; తదనురూపంబుగాఁ బలికి పాండవులకుఁ దేజోలాభంబు గావించుట కర్తవ్యంబు; నీవు కరినగరంబున వసియించి ధృతరాష్ట్ర ధార్తరాష్ట్ర గాంగేయ విదుర గురుకృపాదుల కడ కరిగి నానాఁటికి వారి వారి చిత్తంబుల తెఱంగెఱింగి ప్రవర్తింపుము; దైవగతిం జేసి నీయొడ్డిన సూత్రంబునకు సుయోధనుం డొడంబడియెనేనియు నదియ సకల జనసమ్మతంబయినవిధంబగు; దాన నజాతశత్రుండును బ్రీతుండగుఁ బోయి ర'మ్మని నిశ్చయంబు సేసిన, నమ్మహీసురవరుండు. 60

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకనూ; సమస్త జనంబుల, మనంబులున్= ఎల్లజనుల మనస్సులూ; ఇక్కడన్= పాండవులవైపున; వ్రాలు+అట్టి ఉపాయంబులు= చేరే ఉపాయాలు; ఎన్ని+కలవు= ఎన్ని ఉన్నాయో; అన్నియున్= అన్నీ; ఆ+ఆ+ఇ+తగవులమైన్= ఆయా పద్ధతుల ప్రకారం; ఆచరించుచున్= చేస్తూ; చరియించునది= ప్రవర్తించవలెను; ఇచ్చటన్= ఇక్కడ; విరాటు కొలువు-కూటంబునన్= విరాటుడి సభాభవనంలో; పుట్టిన= కలిగిన; కృష్ణ+ఆదుల, సంవాదంబు, తెఱంగును= కృష్ణుడూ మొదలయినవారి సంభాషణ విధమూ; మన+ఎఱింగిన+అది+ఎ= మనకు తెలిసినదే; తద్+అనురూపంబు+కాన్= దానికి తగినట్లుగా; పలికి; పాండవులకున్; తేజస్(ః)+లాభంబు= పరాక్రమ లాభం; కావించుట= చేకూర్చటం; కర్తవ్యంబు= చేయదగింది; నీవు; కరి నగరంబునన్= హస్తినాపురంలో; వసియించి= ఉండి; ధృతరాష్ట్ర, ధార్తరాష్ట్ర, గాంగేయ, విదుర, గురు కృప+ఆదుల; కడకున్= ధృతరాష్ట్రుడూ, అతడి కొడుకులైన దుర్యోధనాదులూ, భీష్ముడూ, విదురుడూ, ద్రోణుడూ, కృపుడూ మొదలయినవారిదగ్గరికి; అరిగి= వెళ్ళి; నాఁడు+నాఁటికిన్= క్రమక్రమంగా; వారి, వారి, చిత్తంబుల, తెఱంగు= ఆయా వీరుల మనోభావాల రీతిని; ఎఱింగి= తెలిసి; - ప్రవర్తింపుము= నడుచుకొమ్ము; దైవ-గతిన్+చేసి= అదృష్టవశంచేత; నీ+ఒడ్డిన-సూత్రంబునకున్= నీవు పన్నిన పన్నుగడకు; సుయోధనుండు= దుర్యోధనుఁడు; ఒడంబడియెన్+ఏనియున్= అంగీకరించాడా; అది+అ= అదే; సకల, జన, సమ్మతంబు+అయిన-విధంబు= అందరు జనులూ అంగీకరించే విధం; అగున్; దానన్= దానిచేత; అజాతశత్రుండును= ధర్మరాజుకూడా; ప్రీతుండు+అగున్= సంతోషిస్తాడు; పోయి-రమ్ము+అని= వెళ్లిరా అని; నిశ్చయంబు+చేసినన్= నిర్ణయించగా; ఆ+మహీసురవరుండు= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు.

తాత్పర్యం: ఇంకా, అందరి మనస్సులూ ఇక్కడికి చేరుకునే ఉపాయాలు ఎన్ని ఉన్నాయో అన్నిటినీ ఆయా విధాలుగా చేస్తూ వర్తించుము. ఇక్కడ విరాటుడి కొలువులో పుట్టిన కృష్ణాదుల మాటల తీరూ మనకు తెలిసిందే. దానికి తగ్గట్టుగా మాటాడి పాండవులకు బలం చేకూర్చటం నీవు చేయవలసిన పని. నీవు హస్తినాపురంలో ఉండి ధృతరాష్ట్రుడూ, అతడి కొడుకులైన దుర్యోధనాదులూ, భీష్ముడూ, విదురుడూ, ద్రోణుడూ, కృపాచార్యుడూ మొదలైనవారి దగ్గరికి వెళ్ళి, క్రమక్రమంగా వారి మనోభిప్రాయాలు తెలిసికొని ప్రవర్తించు. అదృష్టవశంచేత నీవు పన్నిన పన్నుగడకు దుర్యోధనుడు అంగీకరించాడా, అదే అందరికీ ఆమోదయోగ్యమైన విధం. దానివలన ధర్మరాజు కూడా సంతోషిస్తాడు. వెళ్లి రమ్మ' అని నిర్ణయించగా, ఆ ద్రుపద పురోహితుడు.

క. మును పాంచాలవిభుని వీ। డ్కొని ధర్మజు భీము నరు నకులు సహదేవుం
గని యనుమతుఁడై యందఱు। ననుపఁగ మన్ననలు వడసి యరిగెం బ్రీతిన్. 61

ప్రతిపదార్థం: మును= ముందుగా; పాంచాల విభునిన్= పాంచాల దేశపు రాజయిన ద్రుపదుడిని; వీడ్కొని= వెళ్ళి వస్తానని విడిచి; ధర్మజున్, భీమున్, నరున్, నకులున్, సహదేవున్= ధర్మరాజునీ, భీముడినీ, అర్జునుడినీ, నకులుడినీ, సహదేవుడినీ; కని= చూచి; అనుమతుఁడు+ఐ= వారిచేత అనుజ్ఞ ఇవ్వబడినవాడయి; అందఱున్= అందరూ; అనుపఁగన్= పంపగా; మన్ననలు+పడసి= సమ్మానాలు పొంది; ప్రీతిన్= సంతోషంతో; అరిగెన్= వెళ్లాడు.

తాత్పర్యం: ముందుగా ద్రుపదుడి దగ్గర సెలవు పుచ్చుకొని, తరువాత ధర్మజుడి, భీముడి, అర్జునుడి, నకులుడి, సహదేవుడి అనుజ్ఞపొంది, సమ్మానాలు పొంది, అందరూ సాగనంపగా సంతోషంతో వెళ్ళాడు.

దుర్యోధనుండును నర్జునుండును శ్రీకృష్ణుని దర్శింపఁబోవుట (సం. 5-7-2)

వ. అంత నక్కడ దుర్యోధనుండు, సకల రాజన్య సామాన్యంబుగా గోపాలదేవు పాలికి దూతం బుచ్చుట దగ వగునే?యని విచారించి. 62

ప్రతిపదార్థం: అంతన్; అక్కడన్= హస్తినాపురంలో; దుర్యోధనుండు; సకల, రాజన్య, సామాన్యంబు+కాన్= అందరి రాజులతోపాటు; గోపాల- దేవు పాలికిన్= శ్రీకృష్ణుడి దగ్గరికి; దూతన్= రాయబారిని; పుచ్చుట= పంపటం; తగవు+అగునే= మంచిదా; అని; విచారించి= ఆలోచించి.

తాత్పర్యం: 'అంతట హస్తినాపురంలో దుర్యోధనుడు రాజులందరి వద్దకువలెనే శ్రీకృష్ణుడి వద్దకు కూడా రాయబారిని పంపటం మంచిదా? అని ఆలోచించి.

క. వెరవుమెయిఁ దాన కతిపయ। పరిజన సహితముగ నరిగెఁ బటు తురగ గతి
స్ఫురణానుమోదలీలా। భరితుఁ డగుచు వేగిరంపుఁ బయనములఁ దగన్. 63

ప్రతిపదార్థం: తాను+అ= తానే; వెరవు-మెయిన్= ఉపాయంతో; కతిపయ, పరిజన, సహితముగన్= కొంతమంది పరిజనులతో; పటు, తురగ, గతి, స్ఫురణ+అనుమోద, లీలా, భరితుఁడు+అగుచున్= సమర్థములైన, గుఱ్ఱాల గమనం యొక్క ప్రకాశంయొక్క, సమ్మతితో కూడిన, విలాసంతో నిండిన వాడవుతూ; వేగిరము+పయనములన్= త్వరతో గూడిన ప్రయాణాలతో; తగన్= ఒప్పేటట్లు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఉపాయంతో, కొంతమంది పరిజనులను వెంటబెట్టుకొని, సమర్థములైన గుఱ్ఱాల వేగ విజృంభణను అనుమోదించే విలాసంతో కూడినవాడై, త్వరిత ప్రయాణాలతో తగినట్లుగా తానే వెళ్ళాడు.

విశేషం: 'వెరపు మెయిన్' అంటే ఉపాయంతో, నేర్పుతో అని అర్థాలు చెప్పవచ్చును. రాజనీత్యుపాయాన్ని ప్రయోగించే నేర్పని తాత్పర్యం ఏర్పడుతుంది. దుర్యోధనుడు శ్రీకృష్ణుడి వద్దకు స్వయంగా పోవాలని భావించటంలో భక్తిగాని, గౌరవంగాని, భయంకాని లేవు. శ్రీకృష్ణుడు యదుసింహుడు. అతడు పాండవపక్షపాతి. పైపెచ్చు బంధువు. పెద్దబలగం కలవాడు. అతడిఅన్న బలరాము డతడు ఎంత చెప్పితే అంత. పైపెచ్చు అర్జునుడికి బహిఃప్రాణం. అతడిని ముందుగా అడిగి తన వైపు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మళ్ళించుకొంటే పాండవ హితులలో భేదాన్ని కలిగించవచ్చునని ఊహ. భేదోపాయమే దుర్యోధనుడి ఊహకు దోహదం చేసింది. (సంపా.) దుర్యోధనుడి విలాసం అతడి రథాశ్వాల వేగానికి అనుగుణంగా ఉందన్నమాట.

వ. చని తదీయ పురప్రవేశంబు సేసె; నా దివసంబున ధనంజయుండును గోవిందుం గానవచ్చె నట్టియెడ. 64

ప్రతిపదార్థం: చని= వెళ్ళి, తదీయ, పుర, ప్రవేశంబు= ఆ కృష్ణుడిదైన నగరం యొక్క ప్రవేశం; చేసెన్; ఆ- దివసంబునన్= ఆ రోజున; ధనంజయుండును= అర్జునుడు కూడా; గోవిందున్= శ్రీకృష్ణుడిని; కానన్+వచ్చెన్= చూడడానికి వచ్చాడు; అట్టి+ఎడన్= అటువంటి సమయంలో.

తాత్పర్యం: వెళ్ళి ఆ శ్రీకృష్ణుడి నగరమైన ద్వారకలో ప్రవేశించాడు. ఆ రోజే అర్జునుడు కూడా శ్రీకృష్ణుడిని చూడటానికి వచ్చాడు. ఆ సమయంలో.

తే. అతఁడు పవడింప మును కౌరవాధినాథుఁ । డరిగి తలయంపి దెస నున్నతాసనమున
నుండెఁ, బదపడి కాల్కడ యొద్ద కల్లఁ । జని వినమ్రుఁడై నిలుచుండె సవ్యసాచి. 65

ప్రతిపదార్థం: అతఁడు= ఆ శ్రీకృష్ణుడు; పవడింపన్= శయనించి ఉండగా; మును= ముందు; కౌరవ+అధినాథుఁడు= కురురాజు - దుర్యోధనుడు; అరిగి= వెళ్ళి; తలయంపి దెసన్= తలాపి దిక్కున; ఉన్నత+ఆసనమునన్= ఎత్తయిన పీఠంపై; ఉండెన్; పదపడి= పిమ్మట; సవ్యసాచి= అర్జునుడు; కాలు+కడ+ఒద్దకున్= కాళ్ళకడవద్దకు; అల్లన్= మెల్లగా; చని= వెళ్లి; వినమ్రుఁడు+ఐ= మిక్కిలి విధేయత కలవాడై; నిలుచుండెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు శయనించి ఉండగా, ముందుగా దుర్యోధనుడు వెళ్ళి తలాపి దిక్కున ఉన్న ఉన్నత పీఠంమీద ఆసీనుడయ్యాడు. తరువాత వచ్చిన అర్జునుడు మెల్లగా కాళ్ళ కడకు వెళ్ళి మిక్కిలి వినయంతో నిలబడ్డాడు.

విశేషం: దుర్యోధనార్జునులు ఆ సమయంలో ప్రవర్తించిన తీరులు వారివారి స్వభావాలకు అనుగుణంగా ఉన్నాయి. దుర్యోధనుడు ఉద్ధతుడు; అర్జునుడు వినయపరుడు. తలనుండి కాళ్ళవరకు చూడటం శ్రీకృష్ణుడిని మానవుడిగా భావించి చూడటం - అది దుర్యోధనుడి దృక్పథం. పాదాలనుండి శిరస్సుదాకా చూడటం శ్రీకృష్ణుడిని మాధవుడిగా దర్శించటం - ఇది అర్జునుడి శరణాగత దృక్పథం.

వ. అంత. 66

ప్రతిపదార్థం: అంతన్= తరువాత.

క. మేలుకని కృష్ణుఁ డర్జును । నాలోకించి మఱి కౌరవాధిపుఁ గని త
త్కాలోచిత బహుమతిమైఁ । జాలఁ బ్రియం బిరువురకుఁ బ్రసన్నతఁ జేసెన్. 67

ప్రతిపదార్థం: కృష్ణుఁడు; మేలుకని= మేల్కొని; అర్జునున్; ఆలోకించి= చూచి; మఱి= తరువాత; కౌరవ+అధిపున్= కౌరవరాజును - దుర్యోధనుడిని; కని= చూసి; తద్+కాల+ఉచిత-బహుమతిమైన్= ఆ సమయానికి తగిన గౌరవంతో; ఇరువురకున్= అర్జున దుర్యోధనుల కిద్దరికీ; ప్రసన్నతన్= ఆదరంతో; చాలన్+ప్రియంబు+చేసెన్= ఎంతో ప్రీతిని కలిగించాడు.

తాత్పర్యం: కృష్ణుడు నిద్రలేచి అర్జునుడిని ముందు చూచి తరువాత దుర్యోధనుడిని చూచి, ఆ సమయానికి తగిన మర్యాదతో, వారిద్దరినీ ఎంతో ఆదరించి ప్రీతిని గలిగించాడు.

విశేషం: అర్జునుడు కాళ్ళకడ ఉండడంచేత కృష్ణుడు అతడిని ముందుగానూ, దుర్యోధనుడు తలాపి దిక్కున వెనక ఉండడం చేత అతడిని తరువాత చూడడం తటస్థించింది. అంతేకాదు, ఒకరిని ఆలోకించాడు; మరొకరిని చూచాడు. ఆ తేడాను ప్రీతితో కప్పిపుచ్చాడు. ఇరువురికీ ప్రసన్నుడైనట్లుగా ప్రవర్తించాడు.

వ. తదనంతరంబ. 68

తాత్పర్యం: ఆ పిమ్మటనే. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. వారలఁ జూచి కేశవుఁడు 'వచ్చిన కార్యము సెప్పు'డన్న న
క్కౌరవనాథుఁ డిట్లనియెఁ; 'గయ్యము సేయువగన్ సహాయముం
గోరి భవత్సకాశమునకుం జనుదెంచితి; మేము వీరు నీ
కారయ నొక్కరూప హృదయంబునఁ బేర్చిన బాంధవంబునన్. 69

ప్రతిపదార్థం: కేశవుఁడు= శ్రీకృష్ణుడు; వారలన్= ఆ దుర్యోధనార్జునులను; చూచి; వచ్చిన, కార్యమున్= వచ్చిన పని; చెప్పుఁడు+అన్నన్= చెప్పండి అనగా; ఆ+కౌరవ నాథుఁడు= ఆ కురురాజు-దుర్యోధనుడు; ఇట్లు+అనియెన్; కయ్యము+ చేయువగన్= యుద్ధం చేసే తలంపుతో; సహాయమున్= (నీ) తోడ్పాటును; కోరి; భవత్+సకాశమునకున్= నీ దగ్గరకు; చనుదెంచితిమి= వచ్చాము; ఏమున్= మేము కౌరవులమూ; వీరున్= పాండవులూ; నీకున్; ఆరయన్= చూడగా; హృదయంబునన్= మనస్సులో; పేర్చిన= అతిశయించిన; బాంధవంబునన్= చుట్టరికంచేత; ఒక్క రూపు+అ= ఒక్కటే.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు వాళ్ళిద్దరినీ చూచి 'మీరు వచ్చిన పని తెలుపండి' అనగానే, ఆ దుర్యోధనుడు ఇట్లా అన్నాడు. 'యుద్ధం చేసే తలంపుతో నీ తోడ్పాటును కోరి నీ దగ్గరికి వచ్చాము. కౌరవులమైన మేమూ, పాండవులైన వీరూ చూడగా, హృదయంలో నీకు బాగా దగ్గరచుట్టాల మవడంచేత, ఒక్కటే.

విశేషం: అర్జునుణ్ణి కలుపుకొని అతడి సంగతి కూడా దుర్యోధనుడు తానే చెప్పడం గమనించదగింది. అర్జునుడు కూడా తనలాగే కృష్ణ సహాయం కోసమే వచ్చి ఉంటాడని దుర్యోధనుడు సరిగానే ఊహించాడు.

క. ము న్నేను గానవచ్చితి । నిన్ను; సుజనులైనవారు నెమ్మిని మునుమున్
గన్నం దగఁ గైకొంద్రు; స । మున్నత సౌజన్య సారయుతుఁడవు నీవున్. 70

ప్రతిపదార్థం: ఏను= నేను; నిన్నున్; మున్ను= మొదట; కానన్+వచ్చితిన్= చూడవచ్చాను; సుజనులు+ఐన వారు= మంచివాళ్ళు; నెమ్మిని= ప్రీతితో; మునుమున్= మొట్టమొదట; కన్నన్= చూస్తే; తగన్= ఒప్పుగా; కైకొంద్రు= స్వీకరిస్తారు; ఆదరిస్తారు; నీవున్= నీవుకూడా; సమున్నత, సౌజన్య, సార యుతుఁడవు= మిక్కిలి గొప్పదైన మంచితనంయొక్క సారంతో కూడినవాడవు.

తాత్పర్యం: ముందుగా నేను నిన్ను చూడవచ్చాను. సత్పురుషులు మొట్టమొదట చూచినవాళ్ళను ప్రీతితో సముచితంగా ఆదరిస్తారు. నీవు కూడా ఎంతో మంచివాడవు.

విశేషం: నిన్ను చూడటానికి అర్జునుడికంటె ముందు నేను వచ్చాను. ముందు వచ్చిన వాళ్ళను సజ్జనులు ఆదరిస్తారు. నీవు సజ్జనుడవు' అని దుర్యోధనుడి సహేతుకమైన వాక్యాలకు ధ్వని 'అర్జునుడినికాక నీవు నన్నే స్వీకరించాలి. అప్పుడే నీ సౌజన్యం తెలుస్తుంది' అని.

వ. కావున లోకంబుపాడి విచారించి నాకుం దోడు గావలయు' ననిన వాసుదేవుం డిట్లనియె. 71

ప్రతిపదార్థం: కావునన్; లోకంబు, పాడి= లోకంలో ఉన్న న్యాయం; విచారించి= ఎంచి; నాకున్; తోడు+కావలయున్= సహాయపడాలి; అనినన్; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'కాబట్టి లోకంలో ఉన్న న్యాయాన్ని పాటించి నాకు నీవు సహాయపడాలి' అని దుర్యోధనుడనగా, శ్రీకృష్ణుడు అతడితో ఇట్లా అన్నాడు.

ఉ. 'నీ విట మున్న వచ్చితి;తిది నిక్కము; పార్థునిఁ దొల్తఁ గాంచితిం;
గావున మీకు నిద్దఱకు గౌరవ మొప్పఁగఁదోడుపాటు స
ద్భావము; దీనికిం దెఱఁగు దప్పకయుండఁగ నేర్పరించెదన్;
మీ వల పెట్టు లట్ల తగ నీవును నీతఁడు గోరికొం డొగిన్. 72

ప్రతిపదార్థం: నీవు; ఇటన్= ఇక్కడికి; మున్ను+అ= ముందే; వచ్చితి(వి); ఇది; నిక్కము= నిజం; పార్థునిన్= అర్జునుణ్ణి, తొల్తన్= మొదట; కాంచితిన్= చూశాను; కావునన్; మీకున్; ఇద్దఱకున్; గౌరవము+ఒప్పఁగన్= గౌరవం ఒప్పేటట్టు; తోడుపాటు= సహాయపడడం; సత్+భావము= మంచితనం; దీనికిన్= ఇందుకు; తెఱఁగు+తప్పక+ఉండఁగన్= పద్ధతి చెడకుండా ఉండేటట్లు; ఏర్పరించెదన్= విభాగం చేస్తాను; మీ - వలపు+ఎట్టులు+అట్లు+అ= మీ కోరిక ఎలా ఉన్నదో అలాగే; నీవునున్; ఈతఁడున్; తగన్= ఒప్పేటట్లు; ఒగిన్= క్రమంగా; కోరికొండు= కోరుకొనండి.

తాత్పర్యం: 'నీవు ఇక్కడికి ముందే వచ్చావు. ఇది నిజం. కాని నేను ముందుగా అర్జునుడిని చూచాను. కాబట్టి మీకు ఇద్దరికీ సగౌరవంగా సహాయపడడం మంచిది. ఇందుకు క్రమపద్ధతి చెడకుండా ఉండేటట్లు నేను ఒక విభాగం చేస్తాను. కనుక, నీవూ, ఇతడూ మీ మీ కోరికల ననుసరించి ఒప్పుగా క్రమంగా కోరుకొనండి.

విశేషం: తనను చూడటానికి ముందు వచ్చినవాడికీ, తను ముందు చూచిన వాడికీ న్యాయం జరిగే విధంగా ఏర్పాటు చేస్తానని శ్రీకృష్ణుడనటం అతడి ధర్మజ్ఞతకు నిదర్శనం.

క. నా పాటియ పదివేవురు । గోపాలురు గలరు సమరకోవిద బాహా
టోపాభిరామమూర్తులు, । చాపాద్యాయుధ కళా విశారదచిత్తుల్. 73

ప్రతిపదార్థం: సమర= యుద్ధంలో; కోవిద= పాండిత్యంకల; బాహా= భుజాలయొక్క; ఆటోప= గర్వంచేత; అభిరామ= మనోహరాలైన; మూర్తులు= ఆకారాలు కలవారూ; చాప= ధనుస్సూ; ఆది= మొదలయిన; ఆయుధకళా= యుద్ధవిద్యయందు; విశారద= నేర్పుగల; చిత్తుల్= మనస్సులు కలవారూ అయిన; పదివేవురు= పదివేలమంది; గోపాలురు= యాదవవీరులు; నా-పాటి+అ= నా యంతటివారే; కలరు.

తాత్పర్యం: యుద్ధపాండిత్యంకలిగి భుజబలగర్వం చేత మనోహరాలైన ఆకారాలు కలవారూ; విల్లూ మొదలయిన ఆయుధాల విద్యలో నేర్పుగల మనస్సులు గలవారూ అయిన పదివేలమంది వీరులైన గోపాలురు నాఅంతటివారే ఉన్నారు.

క. నారాయణాభిధానులు । వారలు గయ్యంబు సేయువా; రొక్కెడ నే
నూరక నిరాయుధ వ్యా । పారతమై నుండువాఁడఁ బరమాప్తుఁడనై. 74

ప్రతిపదార్థం: నారాయణ+అభిధానులు, వారలు= నారాయణ నామధేయులైనవారు; కయ్యంబు= యుద్ధం; చేయువారు= చేస్తారు; నేను; నిరాయుధ, వ్యాపారతమైన్= ఆయుధాలను ప్రయోగించకుండా; పరమ+ఆప్తుఁడన్+ఐ= మిక్కిలిహితుడనై; ఒక్క+ఎడన్= ఒకచోట; ఊరక, ఉండువాఁడన్= ఊరికే ఉంటాను.

తాత్పర్యం: నారాయణ నామధేయులైన ఆ గోపాలవీరులు యుద్ధం చేస్తారు. నేను ఆయుధాల జోలికి పోకుండా, మిక్కిలి హితుడనయి ఒకచోట ఊరకే ఉంటాను.

విశేషం: శ్రీకృష్ణుడి మహానుభావత తెలిసిన ఏ అర్జునుడో తప్ప లౌకికుడు మరెవ్వడైనా, కృష్ణుడిని కాక నారాయణ నామధేయులనే కోరుకొంటాడు. కృష్ణుడు ఒక్కడు, వాళ్ళు పదివేల మంది. కృష్ణుడు ఆయుధం ముట్టడు. వాళ్ళు భుజబల సంపన్నులు, సర్వాయుధ విద్యానిపుణులు. అటువంటప్పుడు చూస్తూ చూస్తూ కృష్ణుడిని ఎవడు కోరుకుంటాడు? దుర్యోధనుడంతే చేశాడు.

క. వా రొకతల, యే నొక తల; । యీ రెండు దెఱంగులందు నెయ్యది ప్రియ మె
వ్వారికిఁ జెప్పుఁడు; దొలితొలి । గోరికొనన్ బాలునికిఁ దగుం బాడిమెయిన్.' 75

ప్రతిపదార్థం: వారు= పదివేల మంది నారాయణ నామధేయులు; ఒక తల= ఒక పక్షం; ఏను= నేను ఒక తల= ఒక పక్షం; ఈ, రెండు-తెఱంగులందున్= ఈ రెండు విధాలలోను; ఏ+వారికిన్= ఎవరికి; ఏ+అది= ఏది; ప్రియము= ఇష్టమో; చెప్పుఁడు; తొలి తొలి= మొట్టమొదట; కోరికొనన్= కోరుకోవడానికి; పాడిమెయిన్= న్యాయప్రకారం; బాలునికిన్= చిన్నవాడికి; తగున్.

తాత్పర్యం: ఆ పదివేలమంది నారాయణ నామధేయులైన గోపాలకులు ఒక పక్షం. నేనొక్కడినీ ఒక పక్షం. ఈ రెండు విధాలలోనూ ఎవరికి ఏది ఇష్టమో చెప్పండి. మొట్టమొదట చిన్నవాడు కోరుకొనటం న్యాయం.'

అర్జునుఁడు శ్రీకృష్ణునిం దనకు సహాయునిఁగాఁ గోరికొనుట (సం. 5-7-18)

క. అని పలికి హరి కిరీటిం । గనుఁగొని 'కొండుకవు నీవు గావున, నీకున్
మును గోరఁ బాడి' యనవుడు । విని కృష్ణునిఁ గోరికొనియె విజయుం డెలమిన్. 76

ప్రతిపదార్థం: అని; పలికి; హరి= శ్రీకృష్ణుడు; కిరీటిన్= అర్జునుణ్ణి; కనుఁగొని= చూచి; నీవు; కొండుకవు= చిన్నవాడవు; కావునన్; నీకున్; మును= ముందు; కోరన్= కోరుట; పాడి= ధర్మం; అనవుడున్= అనగానే; విని; విజయుండు= అర్జునుడు; ఎలమిన్= సంతోషంతో; కృష్ణునిన్; కోరికొనియెన్.

తాత్పర్యం: అని పలికి శ్రీకృష్ణుడు అర్జునుడిని చూచి 'మీ ఇద్దరిలో నీవు చిన్నవాడవు కాబట్టి, ముందు నీవు కోరుకొనటం ధర్మం' అనగానే విని అర్జునుడు సంతోషంతో శ్రీకృష్ణుడిని కోరుకొన్నాడు.

విశేషం: 'ఎలమిన్' - శ్రీకృష్ణుడు తనకు సహాయపడటం అర్జునుడికి సంతోషప్రదం. 'విజయుండు' అనేపదం ఇందులో సాభిప్రాయంగా ప్రయోగించబడింది. (చూడు: 87వ వచనం).

ఆ. దాని కాత్మ బొంగి ధార్తరాష్ట్రుఁడు వారి । నపహరించికొనినయట్ల కాఁగఁ
దలఁచి, చెన్నుమీఱి, బలములఁ గైకొని । చనియెఁ బ్రీతి రాము సదనమునకు. 77

ప్రతిపదార్థం: దానికిన్= అర్జునుడు పదివేలమంది నారాయణులనుగాక కృష్ణుడిని కోరుకొన్నందుకు; ధార్తరాష్ట్రుఁడు= దుర్యోధనుడు; ఆత్మన్= మనస్సులో; పొంగి= సంతోషించి; వారిన్= ఆ నారాయణ నామధేయులను; అపహరించికొనిన+అట్లు+అ,కాఁగన్= అర్జునుడి ఏమరుపాటు వలన తాను దక్కించుకొన్నట్లుగానే; తలఁచి= ఎంచి; చెన్ను, మీఱి= కాంతి అతిశయించి; బలములన్= సేనలను; కైకొని= తీసికొని; రాము,సదనమునకున్= బలరాముడి ఇంటికి; ప్రీతిన్= సంతోషంతో; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అర్జునుడు పదివేలమంది గోపకులను కాక కృష్ణుడిని కోరుకొన్నందుకు దుర్యోధనుడు మనస్సులో పొంగి, ఆ గోపకులను తాను అనాయాసంగా దక్కించుకున్నట్లే ఎంచి, సంతోషంతో కాంతి అతిశయించి, తన సేనలను తీసికొని బలరాముడి ఇంటికి ఆనందంతో వెళ్ళాడు.

విశేషం: ముందు కోరుకొనే హక్కు అర్జునుడికి లభించింది. అతడెక్కడ పదివేలమంది గోపవీరులను తన్నుకుపోతాడో అని దుర్యోధనుడి భయం. అర్జునుడు ఆ వీరులనుగాక శ్రీకృష్ణుడిని ఒక్కడినీ కోరుకొన్నందుకు దుర్యోధనుడి సంతోషం అంతా ఇంతా కాదు. ఆ సంతోషంతో వికాసం అతిశయించింది. పదివేలమంది కాదు, నూరువేల మంది అయినా ఒక్క కృష్ణుడికి సాటి రారు. ఆ సంగతి అర్జునుడికి తెలుసు. మూఢ దుర్యోధనుడికి తెలియదు.

వ. చని యతనిం గని సమ్మానంబు వడసి తనవచ్చిన కార్యం బెఱింగించిన దుర్యోధనునకు బలదేవుం డిట్లనియె. 78

ప్రతిపదార్థం: చని= వెళ్ళి, అతనిన్= బలరాముడిని; కని= చూచి; సమ్మానంబు+పడసి= సత్కారం పొంది; తన వచ్చిన కార్యంబు= తాను వచ్చిన పని; ఎఱింగించినన్= తెలుపగా; దుర్యోధనునకున్; బలదేవుండు= బలరాముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: వెళ్ళి బలరాముడిని చూచి అతిథిసత్కారం పొంది, తాను వచ్చిన పని తెలుపగా, బలరాముడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

క. 'అభిమన్యు వివాహమునకుఁ । బ్రభువర్గం బెల్లఁ గూడఁబడియుండఁగ, నా
సభ నీకై యేఁ బలికితి; । నిభపురమున మాట వుట్ట దె ట్లీవు వినన్? 79

ప్రతిపదార్థం: అభిమన్యు, వివాహమునకున్= అభిమన్యుడి పెళ్ళికి; ప్రభు, వర్గంబు+ఎల్లన్= వచ్చిన రాజసమూహం అంతా; కూడఁబడి+ఉండఁగన్= సమావేశం కాగా; ఆ, సభన్= ఆ సభలో; ఏన్= నేను; నీకై= నీకొరకు; పలికితిన్= మాటాడాను; ఇభపురమునన్= హస్తినాపురంలో; ఈవు= నీవు; వినన్= వినేటట్లు; మాట+పుట్టదు+ఎట్లు?= మాట పుట్టలేదా?

తాత్పర్యం: 'అభిమన్యుడి పెళ్ళి సందర్భంగా వచ్చిన రాజులందరూ సమావేశమయినప్పుడు ఆ సభలో నేను నీ పక్షం పలికాను. నీవు హస్తినాపురంలో ఈ మాట వినలేదా?

వ. దానికిఁ గొంద అసహ్యపడి పాండవ పక్షపాతంబునం బ్రతికూలవచనంబులు వలికిన, నవి కృష్ణునకుఁ బ్రియంబులై యుండె నట్లగుటం జేసి. 80

ప్రతిపదార్థం: దానికిన్= అందుకు; కొందఱు; అసహ్యపడి= సహింపజాలక; పాండవ,పక్షపాతంబునన్= పాండవులమీది అభిమానంతో; ప్రతికూల,వచనంబులు+పలికినన్= వ్యతిరేకపు మాటలు పలుకగా; అవి= ఆ మాటలు; కృష్ణునకున్; ప్రియంబులు+ఐ+ఉండెన్= ఇంపులై ఉన్నాయి; అట్లు+అగుటన్+చేసి= అందుచేత.

తాత్పర్యం: నా మాటకు సైపలేక కొందరు పాండవులమీది పక్షపాతంతో వ్యతిరేకించి మాటాడగా, ఆ మాటలు శ్రీకృష్ణుడికి రుచించాయి. అందుచేత.

విశేషం: తన మాటకు అసహ్యపడిన కొందరు 'సాత్యకి ద్రుపదులు.' బలరాముడు వారి పేర్లు చెప్పలేదు.

తే. అతనిఁ బాసి యొక్కింత ప్రొద్దైన నిలువఁ। జాలమియు మూలముగ, విరసంపు మాట
లాడ నొల్లమి, నేమియు ననక యంత। నుండి యొక నిశ్చయమ్ముమై నున్నవాఁడ.' 81

ప్రతిపదార్థం: అతనిన్= ఆ కృష్ణుడిని; పాసి= విడిచి; ఒక్క+ఇంత-ప్రొద్దు+ఐనన్= కొంచెంసేపు కూడా; నిలువన్+చాలమియున్= ఉండలేకపోవటం; మూలముగన్= మొదటి కారణంగా; విరసము+మాటలు= అనిష్టములైన మాటలు; ఆడన్+ఒల్లమిన్= మాటాడటం ఇష్టంలేకపోవటం చేత; ఏమియున్+అనక= ఏమీ మాటాడకుండా; అంతనుండి= అది మొదలుకొని; ఒక, నిశ్చయమ్ముమైన్= ఒక నిర్ణయంతో; ఉన్నవాఁడన్= ఉన్నాను.

తాత్పర్యం: కృష్ణుడిని విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేకపోవటం మూలాన, విరసంగా మాటాడటం ఇష్టం లేకా, ఏమీ అనకుండా, అది మొదలుకొని నేను ఒక నిర్ణయం చేసికొన్నాను.'

వ. అది యెయ్యది యంటేని. 82

ప్రతిపదార్థం: అది= ఆ నా నిశ్చయం; ఏ+అది= ఏది; అంటి(వి)+ఏనిన్= అంటే-

తాత్పర్యం: ఆ నా నిశ్చయం ఏమిటని అడిగితే.

క. మీరును వారును జలమునఁ। బోరెదునెడ, నెద్ది యెట్లు వోయిన నెఱి నే
నూరకయుండుదుఁ; దో డె। వ్వారికిఁ బో; నింత నిక్కువం బెబ్భంగిన్.' 83

ప్రతిపదార్థం: మీరును; వారును= పాండవులును; చలమునన్= పట్టుదలతో; పోరెడు+ఎడన్= యుద్ధం చేసేటప్పుడు; ఎద్ది= ఏది; ఎట్లు+పోయినన్= ఎట్లాపోయినా - జయాపజయాలు ఎవరికైనా; నెఱిన్= తటస్థంగా; ఏను= నేను; ఊరక+ఉండుదున్= ఊరుకుంటాను; ఎవ్వారికిన్= ఎవరికీ; తోడు= సహాయం; పోను= పోవను; ఏ+భంగిన్= ఏవిధంగానైనా; ఇంత; నిక్కువంబు= నిజం.

తాత్పర్యం: మీరూ, వాళ్లూ పట్టుదలతో పోరాడేటప్పుడు, జయాపజయాలు ఎవరికైనా నేను తటస్థంగా ఊరుకుంటాను. ఎవరికీ సహాయం చేయను. ఏ విధంగానైనా ఇది నిజం.'

వ. అనిన విని, దుర్యోధనుండు దాని కియ్యకొని, సవినయంబుగా బలదేవుని వీడ్కొని, వాసుదేవు నామంత్రణంబుసేసి, కృతవర్మ పాలికిం జని, యాతం డొక్క యక్షౌహిణితోడఁ దన్నుఁగలయవచ్చువాఁడయి యూఱడం బలికినఁ బ్రియంబంది, నిజపురంబున కరిగెఁ; దదనంతరంబ కృష్ణుం డర్జునున కిట్లనియె. 84

ప్రతిపదార్థం: అనినన్; విని; దుర్యోధనుండు; దానికిన్; ఇయ్యకొని= అంగీకరించి; సవినయంబుగాన్= అణకువతో; బలదేవునిన్= బలరాముణ్ణి; వీడ్కొని= విడిచి; వాసుదేవున్= శ్రీకృష్ణుణ్ణి, ఆమంత్రణంబు+చేసి= వెళ్ళివస్తానని చెప్పి; కృతవర్మ పాలికిన్= కృతవర్మవద్దకు; చని; ఆతండు; ఒక్క+అక్షౌహిణి తోడన్= ఒక అక్షౌహిణి సేనతో; తన్నున్= తనను; కలయన్+వచ్చువాఁడు+అయి= చేరవచ్చువాడై; ఊఱడన్= ఊరట కలిగేటట్లు; పలికినన్= పలుకగా; ప్రియంబు+అంది= సంతోషించి; నిజపురంబునకున్= తన నగరానికి; అరిగెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= ఆ పిమ్మటనే; కృష్ణుండు; అర్జునునకున్; ఇట్లు+అనియెన్= ఇట్లాఅన్నాడు.

తాత్పర్యం: బలరాముడి మాటలు విని దుర్యోధనుడు అందుకంగీకరించి వినయపూర్వకంగా అతడిని వీడుకొని, కృష్ణుడిని మళ్ళీపలకరించి, కృతవర్మవద్దకు వెళ్ళి, అతడు 'ఒక అక్షౌహిణీ సేనతో నీకు తోడ్పడ వస్తా' నని ఊరట కలిగేటట్లు పలుకగా, సంతోషించి తన నగరానికి - హస్తినాపురానికి వెళ్లాడు. ఆ తరువాత కృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: కృతవర్మ భోజదేశాధిపతి, దుర్యోధనుడి పక్షంలో ఉండి పాండవులతో పోరాడినవాడు. అక్షౌహిణి- అక్ష+ఊహిని- గుణం వచ్చి అక్షోహిణి కావలసి ఉండగా, వృద్ధి వచ్చి అక్షౌహిణి అయింది. అక్షోహిణి అనే గుణం వచ్చిన రూపాన్ని కూడా తిక్కనే ఉద్యోగపర్వం 1-236లో ప్రయోగించాడు. 'సహస్రా, క్షోహిణు లట్లగుట మీరు సూడరె యెందున్'. అక్షౌహిణీ సేన అంటే- 21,870 రథాలూ, అన్నే ఏనుగులూ, ఏనుగులకు మూడు రెట్లు గుర్రాలూ, ఆ మూడూ కలిస్తే అయ్యేటంత మంది కాలిబంట్లూ గల సేన.

క. 'నారాయణ గోపాలుర । భూరిపరాక్రములఁ గురువిభుఁడు గొన, సంగ్రా
మారంభరహితు నన్నుం । గోరికొనుట నీకు మేలగునె తలపోయన్?' 85

ప్రతిపదార్థం: కురువిభుఁడు= కురురాజు-దుర్యోధనుడు; భూరిపరాక్రములన్= అధిక పరాక్రమవంతులను; నారాయణగోపాలురన్= నారాయణులనే పేరు గల గోపకులను; కొనన్= తీసికొనగా; సంగ్రామ+ఆరంభ, రహితున్+నన్నున్= యుద్ధప్రయత్నం లేని నన్ను, కోరికొనుట= కోరుకొనటం; తలపోయన్= ఆలోచించగా; నీకున్; మేలు+అగునె?= మంచిదా?

తాత్పర్యం: 'దుర్యోధనుడు అధిక పరాక్రమవంతులైన నారాయణ నామధేయులైన గోపకులను కోరుకొనగా, యుద్ధం చేయనంటున్న నన్ను కోరుకోవటం వలన ఆలోచించగా నీకు ఏ విధంగా మేలు కలుగుతుంది?'

క. అనుటయు, నాతఁడు హరి కి। ట్లను: 'నేను రణంబునకు సహాయం బొల్లన్;
విను, సుప్రసిద్ధుఁడవు నీ। వని సేసినఁ, బేరు నీక యగు నెప్పాటన్. 86

ప్రతిపదార్థం: అనుటయున్= అని కృష్ణు డనగానే; ఆతఁడు= అర్జునుడు; హరికిన్+ఇట్లు+అనున్= కృష్ణుడితో ఇట్లా అన్నాడు; నేను; రణంబునకున్= యుద్ధానికి; సహాయంబు= తోడ్పాటు; ఒల్లన్= అంగీకరించను; విను; సుప్రసిద్ధుఁడవు-నీవు= మిక్కిలి వాసికెక్కిన నీవు; అని+చేసినన్= యుద్ధం చేస్తే; ఏ+పాటన్= ఏవిధంగా నైనా; పేరు= కీర్తి; నీకున్+అ= నీకే; అగున్.

తాత్పర్యం: కృష్ణుడి మాటలు విని అర్జునుడు అతడితో ఇట్లా అన్నాడు. 'నేను యుద్ధానికి తోడ్పాటు కోరను. వినుము. మిక్కిలి ప్రఖ్యాతుడవైన నీవు యుద్ధం చేస్తే, ఏవిధంగా నైనా, పేరు నీకే వస్తుంది.'

విశేషం: ఈ మాటవలన అర్జునుడు ఎటువంటి అసహాయశూరుడో తెలుస్తుంది.

వ. నీ కెదురై జయంబు గొనరా; దట్లగుటం జేసి, విజయమూలం బగు నీతోడును వలయు; నీవు సమరంబు సేయకునికియుం బ్రియంబు కావున నిన్నుం గోరికొంటి' నని చెప్పి మఱియు నిట్లనియె. 87

ప్రతిపదార్థం: నీకున్; ఎదురు+ఐ= ప్రతిపక్షంలో ఉండి; జయంబు= గెలుపు; కొనన్+రాదు= పొందటం అశక్యం; అట్లు+అగుటన్+చేసి= అందుచేత; విజయమూలంబు+అగు= విజయానికి ప్రధాన కారణమైన; నీతోడును= నీ సహాయం కూడా; వలయున్= కావాలి; నీవు; సమరంబు+చేయక+ఉనికియున్= యుద్ధం చేయకపోవటం కూడా; ప్రియంబు= ఇష్టం; కావునన్; నిన్నున్; కోరికొంటిన్; అని; చెప్పి; మఱియున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ప్రతిపక్షంలో ఉంటే నిన్ను గెలవటం అశక్యం. అందుచేత విజయానికి ప్రధాన కారణమైన నీ తోడ్పాటు కావలసినదే. నీవు యుద్ధం చేయకుండా ఉండటం కూడా నాకిష్టమే. కాబట్టి నిన్ను కోరుకొన్నాను' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: కృష్ణుడు ప్రతిపక్షంలోనే ఉంటే తమకు గెలుపు అసాధ్యం. అందుచేత అతడు తమ పక్షంలోనే ఉండాలి. తమ పక్షంలో ఉండి కృష్ణుడు యుద్ధం చేస్తే, పేరు తనకు గాక అతడికి దక్కుతుంది. కృష్ణుడు యుద్ధం చేయనన్నాడు. కాబట్టి అది తన కిష్టం. ఇదీ అర్జునుడు కృష్ణుడిని కోరుకొనటానికి హేతువు. ఈ మాటలవలన ఉభయుల పరాక్రమాతిశయం విదితమవుతుంది.

క. 'సారథ్యం బొనరింపు మ। పారకృపాలీల నెల్లభంగుల నా; కీ
గౌరవమును జిరకాలము। గోరినయది; దీని నిమ్ము గుణరత్ననిధీ!' 88

ప్రతిపదార్థం: గుణ,రత్న,నిధీ!= గుణములనే రత్నాలకు నిధానమైనవాడా! కృష్ణా!; అపార కృప లీలన్= అంతులేని దయావిలాసంతో; ఎల్ల భంగులన్= అన్ని విధాలా; నాకున్; సారథ్యంబు; ఒనరింపుము= చేయుము; ఈ గౌరవమును= ఈ గౌరవం; చిరకాలము= ఎంతోకాలంగా; కోరిన+అది= కోరినట్టిది; దీనిన్= ఈ కోరికను; ఇమ్ము.

తాత్పర్యం: సద్గుణ రత్నాలకు నిధిఅయినవాడా, శ్రీకృష్ణా! నీవు అపారమైన దయతో అన్ని విధాలా నా రథానికి సారథ్యం చేయుము. ఈ గౌరవాన్ని నేను ఎప్పటినుండో కోరుకొంటున్నాను. నా కోరిక తీర్చుము.'

క. అనినఁ గిరీటికి హరి యి । ట్లను 'నీదగు కోర్కి దీర్చు టది నాకు వ్రతం
బనఘా! తగ సారథ్యం । బొనరించెద నీకు నసమయుద్ధక్రీడన్'. 89

ప్రతిపదార్థం: అనినన్; హరి= కృష్ణుడు; కిరీటికిన్= అర్జునుడికి; ఇట్లు+అనున్; అనఘా!= పాపరహితుడా! నీదు+అగు+కోర్కి= నీదయిన కోరిక; తీర్చుట= నెరవేర్చటం; అది; నాకున్; వ్రతంబు= నియమం; నీకున్; అసమ యుద్ధ-క్రీడన్= అసమానమైన యుద్ధకేళిలో; తగన్= ఒప్పేటట్లు; సారథ్యంబు; ఒనరించెదన్= చేస్తాను.

తాత్పర్యం: అనగా అర్జునుడితో కృష్ణుడు ఇట్లా అన్నాడు. 'పాపరహితుడా! నీ కోరిక తీర్చటం నాకు వ్రతం. అసమానమైన యుద్ధకేళిలో నేను నీకు సారథ్యం చేస్తాను.'

విశేషం: 'నీ కోరిక తీర్చటం నాకు వ్రతం' అనటంలో తప్పకుండా తీరుస్తాననీ, దానిని తాను పవిత్రకార్యంగా భావిస్తాననీ ధ్వని.

క. అని యూఱడించి, నరుఁ దో । డ్కొని, ధర్మతనూజునొద్దకుం బ్రియ మెసఁగం
జనుదెంచెం గార్యాలో । చనమును దగఁజేయు బుద్ధి శౌరి గడంకన్. 90

ప్రతిపదార్థం: అని, ఊఱడించి= ఓదార్చి; శౌరి= కృష్ణుడు; నరున్= అర్జునుడిని; తోడ్కొని= వెంటబెట్టుకొని; కార్య+ఆలోచనమును= కర్తవ్య విచారం; తగన్= ఒప్పేటట్టు; చేయుబుద్ధిన్= చేసే తలంపుతో; ధర్మతనూజు+ఒద్దకున్= ధర్మరాజు దగ్గరికి; ప్రియము+ఎసఁగన్= సంతోషం అతిశయించగా; కడంకన్= పూనికతో; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: అని ఓదార్చి కృష్ణుడు అర్జునుడిని వెంటబెట్టుకుని అనంతర కర్తవ్యం ఆలోచించే తలంపుతో ధర్మరాజు వద్దకు సంతోషాతిశయంతో, పూనికతో వచ్చాడు.

వ. అంత నట శల్యుపాలికిం బోయినదూత లతనిం గని సముచితాలాపంబుల సమరసహాయత్వంబునకుఁ గోరి పిలిచినం బ్రీతుండై యతండును బుత్త్రమిత్త్రసమేతంబుగా నానాసేనాతిసంకులంబుగాఁ గదలి పాండవు లున్నయెడకు నిత్యప్రయాణంబుల నడచు సమయంబున. 91

ప్రతిపదార్థం: అంతన్; అటన్= అక్కడ; శల్యుపాలికిన్= శల్యుడి వద్దకు; పోయిన దూతలు= వెళ్ళిన రాయబారులు; అతనిన్; కని; సముచిత+ఆలాపంబులన్= తగిన మాటలతో; సమరసహాయత్వంబునకున్= యుద్ధంలో తోడ్పడటానికి; కోరి; పిలిచినన్; అతండును; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడయి; పుత్త్ర,మిత్త్ర,సమేతంబుగాన్= కొడుకులతోను, స్నేహితులతోను; నానా-సేనా+అతిసంకులంబుగాన్= పెక్కు సంఖ్యలుగల సేనల మిక్కిలి సమ్మర్దంతో; కదలి; పాండవులు; ఉన్న+ఎడకున్= ఉన్నచోటికి; నిత్య-ప్రయాణంబులన్= ఎడతెగని పయనాలతో; నడచు సమయంబునన్= నడిచేటప్పుడు.

తాత్పర్యం: తరువాత అక్కడ శల్యుడి వద్దకు వెళ్లిన దూతలు అతడిని చూచి తగిన మాటలతో యుద్ధంలో తోడ్పడవలసినదిగా కోరి పిలువగా, శల్యుడునూ సంతోషించి పుత్రులతోనూ, మిత్రులతోనూ కూడి పెక్కు సేనలను తీసికొని కదలి పాండవులున్నచోటికి ఎడతెగని ప్రయాణాలతో నడిచేటప్పుడు.

దుర్యోధనుండు శల్యసహాయంబు గోరుట (సం. 5-8-6)

తే. **ఇంతయును విని కౌరవాధీశ్వరుండు । దక్షులగు నాప్తజనములఁ దత్క్షణంబ**
మద్రనాథుని చనియెడు మార్గమునకుఁ । బుచ్చి యెడనెడ నతుల విభూతి మెఱయ. 92

ప్రతిపదార్థం: కౌరవ+అధి+ఈశ్వరుండు= కురుపతి-దుర్యోధనుడు; ఇంతయును; విని; తద్+క్షణంబు+అ= ఆ క్షణమే; దక్షులు+అగు= సమర్థులైన; ఆప్తజనములన్= విశ్వాసపాత్రులైన జనులను; మద్రనాథుని, చనియెడు, మార్గమునకున్= శల్యుడు వెళ్ళేదారికి; పుచ్చి= పంపి; ఎడనెడన్= అక్కడక్కడ; అతుల విభూతి= సాటిలేని సంపద; మెఱయన్= ప్రకాశించగా.

తాత్పర్యం: దుర్యోధనుడు పాండవుల సహాయార్థం శల్యుడు వస్తున్నాడనే వార్త విని ఆ క్షణమే సమర్థులూ, విశ్వాసపాత్రులూ అయిన జనులను శల్యుడు వెళ్ళేదారికి పంపి, సాటిలేని సంపద మెరయగా అక్కడక్కడ. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. **అరుదారు మేలుక ట్లాయితం బై చూడ । నొప్పారి తను పగు చప్పరములుఁ,**
బరపైన చెలువంబు గరగరికయుఁ దియ్య । తెలి నీరుఁ గలిగిన దీర్ఘికలును;
బొడవైన మువ్వంచఁ బొలుచునట్లుగ నేనుఁ । గులకు గుఱ్ఱములకుఁ గొట్టములును,
ముందర బయలైన చందంబుఁ జతురాభి । మతమైన యాస్థానమండపములు

ఆ. **బియ్యములును, నేయుఁ, బెరుఁగును, గూరఁగా । యలును, వంటకట్టియలును, గడ్డి,**
కవణములును బెల్లుగా నొడఁగూర్చి ని । గూఢవృత్తిఁ దానుఁ గూడ నడచె. 93

ప్రతిపదార్థం: అరుదారు= అపురూపమైన; మేలుకట్లు= చాందినులు; ఆయితంబు+ఐ= సిద్ధమై; చూడన్+ఒప్పారి= చూడదగి; తనుపు+అగు= చల్లదనంచేత తృప్తిని కలిగించేవైన; చప్పరములున్= పందిరులూ; పరపు+ఐన= విశాలమైనట్టియు; చెలువంబున్= అందమూ; గరగరికయున్= నైర్మల్యమూ; తియ్య తెలి నీరున్= తీయనైన స్వచ్ఛమైన నీరూ; కలిగిన; దీర్ఘికలును= నడబావులూ; పొడవు+ఐన; మూఁడు+వంచన్= మూడు వంచలతో; పొలుచునట్లుగన్= ఒప్పేటట్టు; ఏనుఁగులకున్; గుఱ్ఱములకున్; కొట్టములును= చావళ్ళూ; ముందరన్= ముందు; బయలు+ఐన, చందంబున్= బయలుగల విధమూ; చతుర+అభిమతము+ఐన= సుందరమూ; సమ్మతమూ అయిన; ఆస్థానమండపములున్= సభామండపాలూ; బియ్యములును; నేయున్= నేయీ; పెరుఁగును; కూరగాయలును; వంటకట్టియలును; గడ్డి; కవణములును= గుర్రాలూ మొదలైనవాటికి వేసే ఉలవల దాణాలూ; పెల్లుగాన్= అధికంగా; ఒడఁగూర్చి= సమకూర్చి; నిగూఢవృత్తిన్= రహస్యమైన వర్తనంతో; తానున్+కూడన్= తనుకూడా, నడచెన్.

తాత్పర్యం: అపురూపాలైన చాందినులు సిద్ధమై చూడదగిన చల్లటి పందిళ్ళూ, విశాలమైన, అందమూ, నైర్మల్యమూ, తీయని తెల్లని నీరు కల నడబావులూ, పొడవైన మూడు వంచలు ఒప్పేటట్లు ఏనుగులకూ గుర్రాలకూ చావళ్ళూ, ముందు బయలు గలవై, సుందరములూ సమ్మతములూ అయిన ఆస్థానమండపాలూ, బియ్యాలూ, నేయీ, పెరుగూ, కూరగాయలూ, వంటకట్టెలూ, గడ్డీ, ఉలవల దాణాలూ అధికంగా సమకూర్చి రహస్యంగా తను కూడా నడిచాడు.

వ. ఇవ్విధంబున విడిదల పయనంపు సంపదలు వొంపిరివోవం దనకు సమకట్టిన సమస్త వస్తువుల యవైకల్యంబునకు శల్యుండు సంతుష్టాంతరంగుండై నిజపరిజనంబులం జూచి 'యిట్లు చతురంబుగా మనకు వలయువాని సంపాదించుటకుఁ బ్రవర్తకులైన యుధిష్ఠిరామాత్యు లెవ్వారు? వారలం దోడ్కొని రండు; వారలు ప్రసాదదానంబున కర్హు'లని పలుకు నవసరంబున, నటమున్న పలుదెఱంగులఁ బనులు సేయుచున్న తన పల్లాయనంబువారిలోఁ గలసి మఱువడియున్న కౌరవేశ్వరుం డమ్మాటలు విని, యతనికిం బొడసూప నిదియ సమయంబని సముచిత ప్రకారంబునఁ దన్నెఱింగించికొని వినయంబునఁ గనిన, నతండును సంభ్రమంబున గాఢాలింగనంబు సేసి కనకాసనంబున నునిచి, 'యింతయు నిమ్మహాత్ము నుద్యోగంబున నయ్యెం గావలయు' నని తలంచి విస్మయంబంది 'నీ కెయ్యది యిష్టంబు గోరు మిచ్చెద' ననిన, గాంధారీ నందనుండు పరమానందంబునం బొంది యిట్లనియె. 94

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; విడిదల, పయనము+సంపదలు= విడిదుల ప్రయాణపు సంపదలు; పొంపిరి+పోవన్= అతిశయించగా; తనకున్; సమకట్టిన= సమకూర్చిన; సమస్త-వస్తువుల+అవైకల్యంబునకున్= ఎల్ల వస్తువుల సంపూర్ణతకూ; శల్యుండు; సంతుష్ట+అంతరంగుండు+ఐ= సంతోషించిన మనస్సుకలవాడయి; నిజ పరిజనంబులన్+చూచి= తన పరిజనులను చూచి; ఇట్లు; చతురంబుగాన్= నేర్పుగా - మనోహరంగా; మనకున్; వలయువానిన్; సంపాదించుటకున్= సమకూర్చటానికి; ప్రవర్తకులు+ఐన= కారకులైన; యుధిష్ఠిర+అమాత్యులు= ధర్మరాజు మంత్రులు; ఏ+వారు?= ఎవరు?; వారలన్; తోడ్కొని,రండు= తీసికొని రండి; వారలు; ప్రసాద,దానంబునకున్= అనుగ్రహం ప్రసాదించటానికి; అర్హులు= తగినవారు; అని; పలుకు+అవసరంబునన్= పలికే సమయంలో; అట,మున్ను+అ= అంతకుముందే; పలు+తెఱంగులన్= అనేక విధాల; పనులు+చేయుచున్+ఉన్న= పనులు చేస్తున్న; తన, పల్లాయనంబు వారిలోన్= తన రౌతులలో (ఆప్తులలో - శ.ర.); కలసి; మఱువడి+ఉన్న= దాగిఉన్న; కౌరవ+ఈశ్వరుండు= కురుపతి- దుర్యోధనుడు; ఆ+మాటలు; విని; అతనికిన్= ఆ శల్యుడికి; పొడసూపన్= కనబడటానికి; ఇది+అ= ఇదే; సమయంబు+అని= అదనని; సముచిత-ప్రకారంబునన్= తగిన విధంగా; తన్నున్+ఎఱింగించికొని= తను ఫలానా అని చెప్పుకొని; వినయంబునన్= నమ్రతతో; కనినన్= చూడగా; అతండును; సంభ్రమంబునన్= గౌరవంతో; గాఢ+ఆలింగనంబు+చేసి= గట్టిగా కౌగిలించుకొని; కనక+ఆసనంబునన్= బంగారుపీఠంపై; ఉనిచి= ఉంచి; ఇంతయున్= ఇదంతా; ఈ+మహాత్ము+ఉద్యోగంబునన్= ఈ మహనీయుడి పూనికతో; అయ్యెన్+కావలయున్= జరిగింది కాబోలు; అని; తలంచి; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; నీకున్; ఎయ్యది= ఏది; ఇష్టంబు; కోరుము; ఇచ్చెదన్; అనినన్; గాంధారీ-నందనుండు= గాంధారి కొడుకు - దుర్యోధనుడు; పరమ+ఆనందంబునన్+పొంది= మిక్కిలి ఆనందించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా విడిదుల ప్రయాణాలకు సౌకర్యాలు ఎక్కువయ్యేటట్లు తనకు సమకూర్చిన ఎల్ల వస్తువుల సమగ్రతకూ శల్యుడు సంతోషించి తన పరిజనులను చూసి 'ఇట్లా మనోహరంగా మనకు కావలసిన వాటిని సమకూర్చటానికి కారకులైన ధర్మరాజు మంత్రు లెవరు? వారిని తీసికొని రండి. వారు మా అనుగ్రహానికి పాత్రులు' అని పలికే సమయంలో, అంతకుముందే అనేక విధాల పనులు చేస్తూన్న తన రౌతులలో కలసి దాగిఉన్న దుర్యోధనుడు ఆ మాటలు విని, అతడికి కనిపించటానికి ఇదే అదనని తగిన రీతిగా తనను తెలియపరచుకొని, నమ్రతతో చూడగా, శల్యుడును గౌరవంతో గట్టిగా కౌగిలించుకొని బంగారు పీఠంమీద కూర్చుండబెట్టి 'ఇదంతా ఈ మహనీయుడి పూనికవలన జరిగింది కాబోలు' అని ఎంచి ఆశ్చర్యపడి 'నీ కేమి కావాలో కోరుకొమ్మ' అనగా, దుర్యోధనుడు మిక్కిలి ఆనందించి ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'సత్యసరస్వతి వగు; మౌ । చిత్య విశారదము నీదు చిత్తము; నియమౌ
దాత్త్యంబు మెఱయ నాకు న । మాత్త్యుఁడవై పూని నడపు మత్సైన్యంబున్. 95

ప్రతిపదార్థం: సత్య,సరస్వతివి+అగుము= సత్యవచనుడివి కమ్ము; నీ+చిత్తము= నీ మనస్సు; ఔచిత్య, విశారదము= ఔచిత్యం తెలిసినట్టిది; నియమ+ఔదాత్త్యంబు= నియమపు ఒప్పిదం; మెఱయన్= ప్రకాశించగా; నాకున్; అమాత్త్యుఁడవు+ఐ= మంత్రివయి; పూని; మత్+సైన్యంబున్= నా సేనను; నడపు(ము)= నడిపించుము.

తాత్పర్యం: 'నీవు సత్యవచనుడివి కమ్ము. అన్న ప్రకారం చేయుము. నీ మనస్సు ఔచిత్యం తెలిసినట్టిది. నియమపు ఉదాత్తత ప్రకాశించేటట్లు' నాకు మంత్రివయి పూని నా సైన్యాన్ని నడిపించుము.

ఆ. తలఁపఁ బాండవులును ధార్తరాష్ట్రులు నీకు । నొక్క రూప; భక్తియుక్తిఁ జాల
నీవు నన్ను మాననీయుండు గాఁగ న । నుగ్రహించి తగఁ బరిగ్రహింపు.' 96

ప్రతిపదార్థం: తలఁపన్= ఆలోచించగా; నీకున్; పాండవులును; ధార్తరాష్ట్రులున్= ధృతరాష్ట్రుడి కొడుకులు - కౌరవులూ; ఒక్కరూపు+అ= ఒక్కరే, సమానులే; నీవు; నన్నున్; భక్తి యుక్తిన్= భక్తితో; చాలన్= ఎక్కువగా; మాననీయుండు+కాఁగన్= మన్నించదగినవాడుగా; అనుగ్రహించి; తగన్= తగినవిధంగా; పరిగ్రహింపు(ము)= స్వీకరించుము.

తాత్పర్యం: ఆలోచించగా నీకు పాండవులూ, కౌరవులూ ఒక్కటే. నీవు నన్ను భక్తితో మిక్కిలి మాన్యుడిగా అనుగ్రహించి స్వీకరించుము.'

చ. అనవుడు శల్యుఁ డియ్యకొని, 'యట్టిద కాదె, విభేదవృత్తి నా
మనమున లేదు; పాండవసమాజము మీరును నొక్కరూప కా
వున నిది లెస్సమాట దగవుం దలపోయఁగ; మున్ను ప్రీతిఁ గాం
చిన నిను నెమ్మిఁ గూడుటయ చేయుదు నిట్టుల యెల్లభంగులన్. 97

ప్రతిపదార్థం: అనవుడున్= అని దుర్యోధను డనినంతనే; శల్యుఁడు; ఇయ్యకొని= అంగీకరించి; అట్టిది+అ= అటువంటిదే; కాదె= కాదా; విభేదవృత్తి= పాండవులు; కౌరవులు వేర్వేరు అనే వ్యాపారం; నా, మనమునన్= నా మనస్సులో; లేదు; పాండవసమాజమున్= పాండవుల సమూహమూ; మీరునున్= మీరూ; ఒక్కరూపు+అ= ఒక్కటే; కావునన్; తగవున్= న్యాయం; తలపోయఁగన్= ఆలోచిస్తే; ఇది; లెస్సమాట= మంచిమాట; మున్ను= ముందు; ప్రీతిన్= ఆదరంతో; కాంచిన,నినున్= చూసిన నిన్ను; ఎల్లభంగులన్= అన్ని విధాలా; ఇట్టులు+అ= ఇట్లే; నెమ్మిన్= ప్రీతితో; కూడుట+అ, చేయుదున్= చేరటమే చేస్తాను.

తాత్పర్యం: అని దుర్యోధనుడనగానే శల్యుడు సమ్మతించి 'అటువంటిదే కాదా? నా మనస్సులో పాండవులు వేరు, కౌరవులు వేరు అనే భేదబుద్ధి లేదు. పాండవులూ మీరూ ఒక్కటే. కాబట్టి న్యాయం ఆలోచిస్తే ఇది మంచి మాట. ముందుగా నన్ను సాదరంగా చూడడానికి వచ్చిన నిన్ను ఈ రీతిగా అన్ని విధాలా ప్రీతితో చేరతాను.

ఉ. దానఁ గొఱంత లేఁ; దభిమతం బిది గాకయుఁ గల్గెనేనియుం
బూని యొనర్తు' నన్నఁ, గురుపుంగవుఁ డెంతయుఁ బొంగి 'నీవు స

మ్మానము సేసి నా కిటు లమాత్యుఁడవైన పదంబుకంటె మే
లై నుతికెక్కు కోర్కి యెటు లారసి చూచిన నొండు గల్గునే?' 98

ప్రతిపదార్థం: దానన్= ఆ విషయంలో - నిన్ను చేరే విషయంలో; కొఱంత,లేదు= లోపం లేదు; ఇది+కాకయున్= ఈ కోరిక కాకుండా; అభిమతంబు= వేరే కోరిక; కల్గెన్+ఏనియున్= ఉన్నప్పటికీ; పూని+ఒనర్తున్= ప్రయత్నించి చేస్తాను; అన్నన్= అని శల్యుడనగా; కురుపుంగవుఁడు= కురుశ్రేష్ఠుడు - దుర్యోధనుడు; ఎంతయున్+పొంగి= ఎంతో సంతోషించి; నీవు; సమ్మానము+చేసి= గౌరవం చేసి; నాకున్; ఇటులు= ఇట్లు; అమాత్యుఁడవు+ఐన-పదంబు కంటెన్= మంత్రివైన స్థానం కంటె; మేలు+ఐ= గొప్పదయి; నుతికిన్+ఎక్కు,కోర్కి= పొగడ్త కెక్కే కోరిక; ఎటుల+ఆరసి-చూచినన్= ఎట్లా పరిశీలించి చూచినా; ఒండు= ఇంకొకటి; కల్గునే?= ఉంటుందా?

తాత్పర్యం: నేను నిన్ను చేరే విషయంలో అనుమానం లేదు. ఇదికాక ఇంకా ఏదయినా కోరిక ఉంటే చెప్పు, దానిని కూడా తీరుస్తాను' అని శల్యుడనగా, దుర్యోధనుడు ఎంతో సంతోషించి 'నీవు గౌరవం చేసి నాకీ విధంగా మంత్రి వైనదానికంటె గొప్పదయి పొగడ్త కెక్కే కోరిక ఎట్లా పరిశీలించి చూచిన ఇంకొకటి ఉంటుందా?' (ఉండదని భావం.)

వ. అనిన విని, వికచవదనుం డగుచు మద్రేశ్వరుండు. 99

ప్రతిపదార్థం: అనినన్; విని; మద్ర+ఈశ్వరుండు= మద్ర దేశాధిపతి - శల్యుడు; వికచ,వదనుండు+అగుచున్= వికసించిన ముఖం కలవాడు అవుతూ.

తాత్పర్యం: అని దుర్యోధను డనగా విని శల్యుడు వికసించిన ముఖం కలవాడవుతూ.

క. 'చను నీవు హస్తి నగరం । బున; కేనును బాండుభూపపుత్త్రులఁ బ్రీతిం
గని యట వత్తు; నవశ్యం । బును వారలఁ జూడవలయుఁ, బోయెద' ననినన్. 100

ప్రతిపదార్థం: నీవు; హస్తినగరంబునకున్= హస్తినాపురానికి; చను(ము)= వెళ్ళుము; ఏనును= నేను కూడా; పాండుభూపపుత్త్రులన్= పాండురాజు కొడుకులను - పాండవులను; ప్రీతిన్= సంతోషంతో; కని= చూసి; అట వత్తున్= హస్తినాపురం వస్తాను; వారలన్= పాండవులను; అవశ్యంబును= తప్పకుండా; చూడవలయున్= చూడాలి, పోయెదన్+అనినన్= వెళ్ళుతాను అనగా.

తాత్పర్యం: 'నువ్వు హస్తినాపురానికి వెళ్ళు. నేను కూడా పాండవుల్ని ఇష్టంతో చూసి హస్తినాపురం వస్తాను. నేను తప్పకుండా వాళ్ళను చూడాలి. వెళ్ళుతాను' అనగా.

ఆ. 'అట్లకాక; వేగ మట వోయి మరలుండు; । వరము మఱవకుండవలయు ! మిమ్ముఁ ।
జేరి నెగడువాఁడఁ; గారుణ్యమున నిట । యరసి యుండుఁ'డనియెఁ గురువిభుండు. 101

ప్రతిపదార్థం: కురు-విభుండు= కురుపతి - దుర్యోధనుడు; అట్లు+అ-కాక= అలాగే; వేగము= శీఘ్రంగా; అట+పోయి= అక్కడికి వెళ్లి; మరలుండు+తిరిగి రండి; వరము= మీరు నాకిచ్చిన వరం; మఱవక+ఉండవలయున్= మరచిపోగూడదు; మిమ్మున్; చేరి; నెగడువాఁడన్= వర్ధిల్లుతాను; కారుణ్యమునన్= దయతో; ఇట+అరసిఉండుఁడు= ఈవైపు దృష్టి పెట్టండి; అనియెన్.

తాత్పర్యం: దుర్యోధనుడు 'అలాగే చేయండి. అక్కడికి వెళ్లి శీఘ్రంగా తిరిగి రండి. నాకు మీరిచ్చిన వరం మాట మరచిపోగూడదు. మీతో చేరి వర్ధిల్లుతాను. దయతో ఈ వైపు కనిపెట్టుకొని ఉండండి.

వ. అనవుడు. **102**

తాత్పర్యం: అనగానే.

క. దరహాసముతో మద్రే। శ్వరుఁ డాలింగనము సేసి, 'సందియపడ కీ
వరుగు' మని యనుప, నాతఁడు । కరిపురికిం జనియె మది వికాసముఁ బొందన్. **103**

ప్రతిపదార్థం: మద్ర+ఈశ్వరుఁడు= మద్రదేశరాజు - శల్యుడు; దరహాసముతోన్= చిరునవ్వుతో; ఆలింగనము+చేసి= కౌగిలించుకొని; సందియపడక= అనుమానించక; ఈవు= నీవు; అరుగుము= వెళ్ళుము; అని; అనుపన్= పంపగా; ఆతఁడు= ఆ దుర్యోధనుడు; మది= మనస్సు; వికాసమున్+పొందన్= వికసించగా, ఆనందపడగా; కరిపురికిన్= హస్తినాపురానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: శల్యుడు చిరునవ్వుతో దుర్యోధనుడిని కౌగిలించుకొని 'నువ్వు సందేహపడకుండా వెళ్ళుము.' అని పంపగా, అతడు మనస్సులో ఆనందించి హస్తినాపురానికి వెళ్ళాడు.

శల్యుఁడు పాండవులం జూడ నుపప్లావ్యంబునకు వచ్చుట (సం. 5-8-15)

వ. అంత శల్యుండు నుపప్లావ్యంబునకుం జని, స్కంధావారంబు దఱియం జొచ్చి, ధర్మనందనుని నివాసంబున కరిగిన, నతండు దమ్ములుం, దానును, ద్రౌపదీ సుభద్రలు, నభిమన్యు ప్రభృతి పుత్త్ర వర్గంబును నెదురువచ్చి, కృతప్రణాముండై, తోడ్కొనిపోయి, కాంచనాసనంబున నునిచి, యర్ఘ్యపాద్యంబు లిచ్చి, కుశలం బడిగిన, 'సర్వంబును గుశల సంపన్నంబ' యని వారల నందఱ నభినందించి, యుధిష్ఠిరుం బునరాలింగనంబు సేసి యిట్లనియె. **104**

ప్రతిపదార్థం: అంతన్; శల్యుండున్; ఉపప్లావ్యంబునకున్; చని; స్కంధావారంబు= సేనలబిడారం; తఱియన్+చొచ్చి= ప్రవేశించి; ధర్మనందను నివాసంబునకున్= ధర్మరాజు ఉన్నచోటికి; అరిగినన్= వెళ్ళగా; అతండు= ధర్మరాజు; తమ్ములున్; తానును; ద్రౌపదీ సుభద్రలున్; అభిమన్యు ప్రభృతి పుత్త్ర వర్గంబును= అభిమన్యుడు మొదలైన కుమారుల సమూహమూ; ఎదురు వచ్చి; కృతప్రణాముండు+ఐ= నమస్కరించినవాడయి; తోడ్కొనిపోయి= తీసికొనివెళ్లి; కాంచన+ఆసనంబునన్= బంగారుపీఠం మీద; ఉనిచి= కూర్చుండజేసి; అర్ఘ్య,పాద్యంబులు= పూజాద్రవ్యములు, కాళ్ళు కడుగుకొన నీళ్ళు; ఇచ్చి; కుశలంబు+అడిగినన్= క్షేమం అడుగగా; సర్వంబును= అంతా; కుశలసంపన్నంబు+అ= క్షేమంతో కూడినదే; అని; వారలన్+అందఱన్= వాళ్ళనందరినీ; అభినందించి= సంతోషపెట్టి; యుధిష్ఠిరున్= ధర్మరాజును; పునః+ఆలింగనంబు+చేసి= మళ్ళీ కౌగిలించుకొని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పిమ్మట శల్యుడు ఉపప్లావ్యపురానికి వెళ్ళి పాండవుల బిడారం ప్రవేశించి, ధర్మరాజు నివాసానికి వెళ్ళగా, ధర్మరాజూ, తమ్ములూ, ద్రౌపదీ, సుభద్రా, అభిమన్యుడూ మొదలైన కుమారుల సమూహమూ ఎదురేగారు. ధర్మరాజు అతడికి నమస్కరించి తీసికొని వెళ్ళి బంగరుపీఠంపై కూర్చుండబెట్టి, అర్ఘ్యపాద్యాదులిచ్చి,

క్షేమ మడుగగా, 'అంతా క్షేమమే' అని వాళ్ళనందరినీ అభినందించి, శల్యుడు ధర్మరాజును మళ్ళీ కౌగిలించుకొని ఇట్లా అన్నాడు.

క. 'జనరహితంబగు వనమున । ననుజన్ములు, ద్రుపదభూవరాత్మజయును, నీ
వును నింతకాల మలయక । యునికి కడున్ దుష్కరము, మహోదాత్తమతీ! 105

ప్రతిపదార్థం: మహోదాత్తమతీ!= మిక్కిలి గొప్ప మనస్సుకలవాడా, ధర్మరాజా!; జన-రహితంబు+అగు-వనమునన్= నిర్జనారణ్యంలో; అనుజన్ములున్= తమ్ములూ; ద్రుపద-భూవర+ఆత్మజయును= ద్రుపదరాజు కూతురు-ద్రౌపదీ; నీవునున్; ఇంత-కాలము; అలయక+ఉనికి= అశ్రమంగా ఉండడం - క్షేమంగా ఉండడం; కడున్= మిక్కిలి; దుష్కరము= కష్టసాధ్యం.

తాత్పర్యం: 'మిక్కిలి గొప్ప మనస్సుకల ధర్మరాజా! నిర్జనమైన అరణ్యంలో తమ్ములూ, ద్రౌపదీ, నీవూ ఇంతకాలం క్షేమంగా ఉండటం మిక్కిలి కష్టసాధ్యం.

ఆ. దానికంటె నరిది దలపోయ నజ్ఞాత । వాస ముజ్జ్వలాంగభాసమాను
లైన, మీకు; మీ దయాసూనృతాదుల । పెంపు మిమ్ముఁ గడవఁ బెట్టకున్నె? 106

ప్రతిపదార్థం: తలపోయన్= ఆలోచించగా; ఉజ్జ్వల+అంగ, భాసమానులు+ఐన, మీకున్= ప్రకాశించే శరీరాలతో ఒప్పే మీకు; అజ్ఞాతవాసము; దానికంటెన్= ఆ అరణ్యావాసం కంటె; అరిది= ఆశ్చర్యకరం; మీ,దయా,సూనృత+ఆదుల, పెంపు= మీ దయా, సత్యమూ మొదలైనవాటి అతిశయం; మిమ్మున్; కడవన్+పెట్టక+ఉన్నె= కష్టాలనుండి దాటించకుండా ఉంటుందా?

తాత్పర్యం: ఆలోచించగా, ప్రకాశించే శరీరాలతో ఒప్పే మీకు అజ్ఞాతవాసం ఆ అరణ్యావాసంకంటె మరీ కష్టం. దయా, సత్యమూ మొదలైన మీ గుణాల అతిశయం మిమ్ములను ఆపదలనుండి దాటించకుండా ఉంటుందా?

క. ఇమ్మహి యెల్లను నీ మది । యుమ్మలికకుఁ జాల నొచ్చె, నుర్వీవర! నీ
విమ్మెయి నిప్పు డఖిల దురి । తమ్ములుఁ గడచుటకు సమ్మదమ్మునఁ బొదలెన్.' 107

ప్రతిపదార్థం: ఉర్వీవర!= రాజా! (ధర్మరాజా!,) ఈ+మహి+ఎల్లను= ఈ భూమి అంతా; నీ,మది,ఉమ్మలికకున్= నీమనస్సులోని దుఃఖానికి; చాలన్= మిక్కిలి; నొచ్చెన్= బాధపడింది; నీవు; ఈ+మెయిన్= ఈ విధంగా; ఇప్పుడు; అఖిల, దురితమ్ములున్= అన్ని కష్టాలూ; కడచుటకున్= దాటినందుకు; సమ్మదమ్మునన్= సంతోషంతో; పొదలెన్= ఒప్పింది.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ భూప్రజలందరూ నీ మనోవేదనకు చాలా బాధపడ్డారు. ఇప్పుడు నీవు ఈ విధంగా కష్టాలన్నీ గట్టెక్కినందుకు వాళ్ళు ఆనందిస్తున్నారు.'

వ. అని యుచితసంభాషణంబులు సేసి, దుర్యోధనుండు తన్నుం గాంచిన విధంబును, నతండు ప్రార్థించిన తెఱంగును, దానికిఁ దా నియ్యకొనుటయుం జెప్పిన, ధర్మనందనుం డతని కిట్లనియె. 108

ప్రతిపదార్థం: అని; ఉచిత, సంభాషణంబులు+చేసి= తగిన మాటలాడి; దుర్యోధనుండు; తన్నున్; కాంచిన, విధంబునున్= చూసిన రీతీ; అతండు; ప్రార్థించిన,తెఱంగునున్= కోరినరీతీ; దానికిన్; తాను; ఇయ్యకొనుటయున్= సమ్మతించటమూ; చెప్పినన్= చెప్పగా; ధర్మనందనుండు= ధర్మరాజు; అతనికిన్= శల్యుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని తగిన మాటలాడి, దుర్యోధనుడు తనను ఆదరంతో చూచిన విధమూ, అట్లు చూచి ప్రార్థించిన విధమూ, దానికి తాను సమ్మతించటమూ చెప్పగా, ధర్మరాజు శల్యుడితో ఇట్లా అన్నాడు.

తే. **'మేలు సేసితి; రొక్కరి మెచ్చి వారి । కోర్కి దీర్చుట పెద్దల గుణమ కాదె?**
యది మదీయ చిత్తమునకు హర్షకరమ; । తివిరి యొక్కటి వేఁడెద నవధరింపు. 109

ప్రతిపదార్థం: మేలు+చేసితిరి= మంచిపని చేశారు; ఒక్కరిన్; మెచ్చి; వారికోర్కి= వారి కోరిక; తీర్చుట= నెరవేర్చటం; పెద్దల-గుణము+అ,కాదె= పెద్దవారి లక్షణమే కదా!; అది= మీరు చేసిన పని; మదీయ,చిత్తమునకున్= నా మనస్సుకు; హర్షకరము+అ= సంతోషదాయకమే; తివిరి= పూని; ఒక్కటి; వేఁడెదన్= కోరతాను; అవధరింపు(ము)= చిత్తగించుము.

తాత్పర్యం: 'మంచిపని చేశారు. ఒకరిని మెచ్చి వారి కోరిక తీర్చటం పెద్దవారి లక్షణమే కదా! అది నా మనస్సుకు ఆనందం కలిగించేదే. మిమ్మల్ని నేను ఒక్కటి కోరుకొంటాను. చిత్తగించండి.

విశేషం: 'మంచిపని చేశా'రంటూ ధర్మరాజు శల్యుడిని అభినందిస్తూనే ఎలా అతడిని తనకే సహాయపడేటట్లు చేసుకొంటున్నాడో చూస్తే, ధర్మరాజు రాజనీతిజ్ఞత, అతడి 'మెత్తనిపులితనం' ముందుచూపూ బోధపడతాయి. ఈ కోరిక వలన శల్యుడు తన పక్షంలో ఉన్నదానికంటె, పరపక్షంలో ఉండటమే ధర్మరాజుకు అధికతరమైన మేలు చేకూర్చింది.

వ. **పార్థునకుఁ గృష్ణుండు సారథ్యంబు సేయువాఁడై యున్నవాఁడు; కర్ణుండు పార్థుతో నెప్పుడు మచ్చరించుచునుండు; వీరిరువురకు సంగ్రామం బైనయప్పుడు కృష్ణునకుఁ బ్రతిసారథ్యం బొనరింప మీరకాని యక్కడం దక్కొరుండు లేఁడు; గావున, నవశ్యంబును మీకుం గర్ణసారథ్యంబు గర్తవ్యంబు గాఁగలయది; సమర సమయంబున నిరాకరించి పలికి కర్ణు చిత్తంబునకుం గలంకవుట్టించి పార్థు రక్షింపవలయు; నకృత్యంబని యనుమానింపక మత్ప్రార్థనంబున నెల్లభంగుల నివ్విధం బనుష్ఠించువా'రని యభ్యర్థించిన, సమ్మతించి శల్యుం డిట్లనియె. 110**

ప్రతిపదార్థం: పార్థునకున్= అర్జునుడికి; కృష్ణుండు; సారథ్యంబు; చేయువాఁడు+ఐ+ఉన్నవాఁడు= చేయబోతున్నాడు; కర్ణుండు; పార్థుతోన్; ఎప్పుడున్; మచ్చరించుచున్+ఉండున్= పోటీపడుతూ ఉంటాడు; వీరు+ఇరువురకున్= వీరిద్దరికీ; సంగ్రామంబు+ఐన+అప్పుడు= యుద్ధం సంభవించినప్పుడు; కృష్ణునకున్; ప్రతిసారథ్యంబు= సాటియైన సారథ్యం; ఒనరింపన్= చేయడానికి; మీరు+అ-కాని= మీరేకాని; అక్కడన్= కౌరవ పక్షంలో; తక్కు+ఒరుండు= ఇంకొకడు; లేఁడు; కావునన్; అవశ్యంబును= తప్పక; మీకున్; కర్ణ-సారథ్యంబు; కర్తవ్యంబు= చేయవలసినదిగా; కాఁగలయది= కాబోతుంది; సమర-సమయంబునన్= యుద్ధ సమయంలో; నిరాకరించి,పలికి= అనాదరించి పలికి; కర్ణుచిత్తంబునకున్= కర్ణుడి మనస్సుకు; కలంక= వ్యాకులత; పుట్టించి= కలిగించి; పార్థున్= అర్జునుడిని; రక్షింపవలయున్= కాపాడాలి; అకృత్యంబు+అని= చేయదగని పని అని; అనుమానింపక= సందేహించక; మత్+ప్రార్థనంబునన్= నా కోరికపై; ఎల్లభంగులన్= అన్ని విధాలా; ఈ+విధంబు; అనుష్ఠించువారు= చేస్తారు(మీరు తప్పక చేయాలి అని భావం); అని; అభ్యర్థించినన్= కోరగా; శల్యుండు; సమ్మతించి= అంగీకరించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడికి కృష్ణుడు సారథ్యం చేయబోతాడు. కర్ణుడు అర్జునుడితో ఎప్పుడూ పోటీపడుతూఉంటాడు. వీళ్ళకిద్దరికీ యుద్ధం జరిగినప్పుడు కృష్ణుడికి ప్రతిగా సారథ్యం చేయటానికి మీరు తప్ప అక్కడ ఇంకొకడు లేడు.

కాబట్టి మీకు తప్పక కర్ణ సారథ్యం కర్తవ్యం అవుతుంది. యుద్ధ సమయంలో మీరు అనాదరించి పలికి, కర్ణుడి మనస్సుకు కలత పుట్టించి అర్జునుడిని రక్షించాలి. ఇది అకార్యం అని సందేహించక నా ప్రార్థనపై ఏ విధంగానైనా సరే దీన్ని చేయాలి' అని ప్రాధేయపడగా శల్యుడు సమ్మతించి ఇట్లా అన్నాడు.

విశేషం: ధర్మరాజు ఎంత లెస్సగా ఊహించాడో చూస్తే అతడి దూరదృష్టి అవగతం అవుతుంది. దుర్యోధనుడి ఎత్తుకు పైఎత్తు వేసి ధర్మరాజు అతడిని చిత్తు చేశాడు. 'అకృత్యం బని యనుమానింపక' - తన కోరిక అకృత్యం అని ధర్మరాజుకు తెలుసు. అయితే రాజకీయాలలో కృత్యాకృత్యాలు లేకపోవటం ఎప్పుడూ ఉంది. ధర్మరాజువంటివాడు కూడా రాజకీయాలకు అతీతుడు కాడని తెలుస్తున్నది.

క. **'అగు నిది వోలును; నాకుం । దగ వట్టిద; 'కర్ణునకు రథంబు గడప నీ**
వగు' దని కోరిన కౌరవ । జగతీశ్వరు ప్రార్థనంబు సలుపఁగవలయున్. **111**

ప్రతిపదార్థం: అగును= అవును; ఇది+పోలును= ఇది యుక్తమే; నాకున్; తగవు= న్యాయం; అట్టిది+అ= అదే; కర్ణునకున్; రథంబు; కడపన్= నడపటానికి; నీవు; అగుదు(వు)+అని= తగుదువని; కోరిన,కౌరవ,జగతీ+ఈశ్వరు,ప్రార్థనంబు= కోరిన దుర్యోధనుడి కోరిక; సలుపఁగవలయున్= నెరవేర్చాలి.

తాత్పర్యం: 'అవును. నీవు చెప్పింది యుక్తం. నాకు న్యాయం అదే. కర్ణుడికి రథం నడపటానికి నీవు తగుదువని కోరితే దుర్యోధనుడి కోరిక నేను తీర్చవలసిందే.

క. **కర్ణుని సారథినైనను । నిర్ణయమున కేను బార్థునిం గాచెద; నా**
దుర్ణయవిచారు నెమ్మెయిఁ । గర్ణకఠోరంబు లాడి కలఁతుం బోరన్. **112**

ప్రతిపదార్థం: కర్ణుని సారథిన్+ఐనను= కర్ణుడికి సారథినైనా; ఏను= నేను; నిర్ణయమునకున్= నిశ్చయానికి; పార్థునిన్= అర్జునుడిని; కాచెదన్= రక్షిస్తాను; ఆ దుర్ణయ విచారున్= ఆ అవినీతిపరుడిని - కర్ణుడిని, ఏ+మెయిన్= ఏ విధంగానైనా; కర్ణకఠోరంబులు= చెవులకు కఠినములైన మాటలు; ఆడి= పలికి; పోరన్= యుద్ధంలో; కలఁతున్= కలచివేస్తాను.

తాత్పర్యం: నేను కర్ణుడికి సారథినైనా, నిజానికి అర్జునుడిని రక్షిస్తాను. అవినీతిపరుడైన ఆ కర్ణుడిని ఏ విధంగానైనా కర్ణకఠోరాలైన పలుకులు పలికి యుద్ధంలో కలవరపరుస్తాను.

విశేషం: ధర్మరాజు స్వార్థంతో కోరితే కోరాడు. మొదట దుర్యోధనుడికి సాయం చేస్తానని ఒప్పుకొన్న పెద్దమనిషి శల్యుడు. మళ్ళీ ధర్మరాజుకు ఇట్లా ఎందుకు మాటిచ్చాడు? దానికి కారణాలు రెండు. ఒకటి- శల్యుడు పాండవులకు దగ్గర బంధువు. నకుల సహదేవులకు మేనమామ. అతడికి పాండవులవైపే మొగ్గు. వారికి సహాయపడటానికే వస్తూండగా, తనకు దారిలో బ్రహ్మాండములైన ఏర్పాట్లు చేసినవాడు దుర్యోధను డని తెలిసికొని అతడికి సాయం చేస్తానని మాటిచ్చాడు. రెండోది- కర్ణుడు దుర్ణయపరుడు. కులం తక్కువవాడు. అతడికి తాను సారథ్యం వహించడం అవమానంగా భావించాడు. అందుచేత అతడు ధర్మరాజుకు ఆ విధమైన మాట ఇచ్చాడు.

తే. **దర్పమును దేజమును మాయఁ దలరఁ బలికి । చిక్కువఱిచిన, నేయంగఁ జేతులాడ**
కునికి, రాధాతనూజు నర్జునుఁడు తీవ్ర । బహుళ బాణపరంపర పాలుపఱుచు. **113**

ప్రతిపదార్థం: దర్పమును= గర్వమూ; తేజమును= పరాక్రమమూ; మాయన్= నశించేటట్లు; తలరన్= జంకేటట్లు; పలికి; చిక్కు+పఱిచినన్= కలతపెట్టితే; ఏయంగన్= కొట్టటానికి; చేతులు+ఆడక+ఉనికిన్= చేతులాడకపోవటం చేత; రాధాతనూజున్= రాధేయుడిని-కర్ణుడిని; అర్జునుఁడు, తీవ్ర= క్రూరములైన; బహుళ= అనేకములైన; బాణ,పరంపర,పాలు,పఱుచున్= బాణాలవరుసకు గురిచేస్తాడు.

తాత్పర్యం: బలగర్వమూ, తేజస్సూ నశించి జంకే విధంగా మాట లని కర్ణుడిని కలతపెట్టితే, బాణప్రయోగం చేయటానికి అతడికి చేతులాడకపోవడం వలన, కర్ణుడిని అర్జునుడు తీవ్రాలైన అనేక బాణాల పాలు చేస్తాడు.

చ. **ఇది యొకఁ డేల? నీవు మది నెయ్యదిగోరినఁ జేయువాఁ డ; నాఁ**
డదయత సూతసూతి సభ నాడినమాటకుఁ జాల నొచ్చి మా
హృదయము లెల్ల నీవలన నెంతయుఁ బక్షముసేయు; నక్కటా!
యదియునుగాక మీ పడిన యాపద లెవ్వరి నొవ్వఁజేయవే? **114**

ప్రతిపదార్థం: ఇది, ఒకఁడు+ఏల= ఇది ఒక్కటే కాదు; నీవు; మదిన్= మనస్సులో; ఏ+అది= ఏది; కోరినన్= కోరినా; చేయువాఁడన్= చేస్తాను; నాఁడు= ఆ వేళ, అదయతన్= నిర్దయత్వంతో; సూతసూతి= సూతపుత్రుడు-కర్ణుడు; సభన్= సభలో; ఆడిన-మాటకున్= పలికిన పలుకునకు; మా హృదయములు+ఎల్లన్= మా మనస్సులన్నీ; చాలన్+నొచ్చి= మిక్కిలి బాధపడి; నీవలనన్= నీమీద; ఎంతయున్= మిక్కిలి; పక్షము+చేయున్= పక్షపాతం వహిస్తాయి; అక్కటా!= అయ్యో!; అదియును+కాక= అదీ కాక; మీ, పడిన, ఆపదలు= మీరు అనుభవించిన కష్టాలు; ఎవ్వరిన్= ఎవరినైనా; నొవ్వన్+చేయవే?= నొప్పించవా?

తాత్పర్యం: ఈ ఒక్క కోరికే కాదు. నీవు మనస్సులో ఏది కోరినా, దానిని తీరుస్తాను. ఆ రోజున కురుసభలో సూతపుత్రుడు పలికిన మాటకు మా మనస్సులన్నీ మిక్కిలి నొచ్చి నీపై పక్షపాతం వహిస్తున్నాయి. అయ్యో! అదీకాక మీరు పడ్డపాట్లు ఎవరినైనా బాధించవా?

విశేషం: 'సూతసూతి సభ నాడిన మాటకు'- అప్పుడు కర్ణు డాడినమాట ఇది. ధర్మరాజు తన సర్వస్వం జూదంలో ఒడ్డి ఓడిపోయినప్పుడు ద్రౌపది కూడా అందులోనిదే కాబట్టి ఆమె ధర్మవిజిత. 'ఏకవస్త్రయై ఉండగా సభకు తీసికొనిరావచ్చునా? అన్నదానికి- భార్యకు దైవవిహితుండైన భర్త యొక్కరుండ'. ఇది యనేక భర్తృక గావున బంధకి యనంబడు; నిట్టిదాని విగతవస్త్రం జేసి తెచ్చిన ధర్మవిరోధంబు లేదు' - ఇవి వికర్ణుడి వచనాలను ప్రత్యాఖ్యానం చేస్తూ కర్ణుడు పలికిన పలుకులు. ఈ మాటలకు సభలోనివారంతా బాధపడ్డారు. కర్ణుడు దుర్ణయవిచారుడని శల్యు డనటం ఇందువల్లనే.

ఆ. **ఇట్లు పడితి ననుచు నెద నీవు వగవకు; । గారవమున నీ మనోరథమ్ము**
ఫలము నొందు నెల్లభంగుల; దేవత । లయినఁ బడుదు రొక్క యవసరమున. **115**

ప్రతిపదార్థం: ఇట్లు+పడితిన్+అనుచున్= ఇట్లా బాధలు పడ్డానంటూ; నీవు; ఎదన్= హృదయంలో; వగవకు= విచారపడకు; గారవమునన్= గొప్పగా; నీమనోరథమ్ము= నీ కోరిక; ఎల్లభంగులన్= అన్ని విధాలా; ఫలమున్+ఒందున్= ఫలిస్తుంది; ఒక్క+అవసరమునన్= ఒక్కొక్క సమయంలో; దేవతలు+అయినన్= దేవతలు కూడా; పడుదురు= కష్టాలు అనుభవిస్తారు.

తాత్పర్యం: ఇట్లా బాధలు పడ్డానంటూ నీవు మనస్సులో ఏమీ విచారపడకు. నీ కోరిక అన్నివిధాలా గొప్పగా ఫలిస్తుంది. ఒక్కొక్క సమయంలో దేవతలు కూడా కష్టా లనుభవిస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: కావ్యార్థాపత్తి, 'దేవతలయినఁ బడుదు రొక్క యవసరమున' అనటం వలన, ఇంక మీ విషయం వేరే చెప్పాలా? అనే అర్థం కైముత్యన్యాయంచేత సిద్ధిస్తున్నది కాబట్టి, అలంకారం కావ్యార్థాపత్తి.

క. వాసవుఁడు దొల్లి నిజకాం। తా సహితము గాఁగ నధికదైన్యము నొందెన్;
మీ సంపద పెద్దయె? విధి। సేసిన గతిఁ బడకయుండ శివునకు వశమే?' 116

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; వాసవుఁడు= ఇంద్రుడు; నిజకాంతా, సహితము+కాఁగన్= తన భార్యతో కూడా; అధిక దైన్యమున్+ఒందెన్= మిక్కిలి దీనత్వం పొందాడు; మీ, సంపద; పెద్దయె= ఎక్కువా?; విధి= దైవం; చేసిన గతిన్= నిర్ణయించిన విధంగా; పడక+ఉండన్= అనుభవించకుండా ఉండడానికి; శివునకున్= శివుడికైనా; వశమే= తరమా?

తాత్పర్యం: పూర్వం ఇంద్రుడు తన భార్యతో కూడా మిక్కిలి దీనత్వం పొందాడు. ఇంద్రుడి సంపదముందు మీ సంపద ఎంత? దైవం నిర్ణయించిన విధంగా అనుభవించకుండా ఉండడానికి శివుడికి కూడా శక్యం కాదు'.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం, కావ్యార్థాపత్తి, 'విధి సేసినగతిఁ బడకయుండ శివునకు వశమే?' అను సామాన్యాంశంచేత వాసవుడు కష్టాలు పడటం, పాండవులు పడడం అనే విశేషాంశాలు సమర్థించబడ్డాయి కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం. 'శివునకు వశమే' అనటం వలన మీకు అసలే వశం కాదు-అనే అర్థం సిద్ధిస్తున్నది కావున కావ్యార్థాపత్తికూడా.

వ. అనిన విని ధర్మనందనుం 'డింద్రుండు శచీసమేతంబుగా నట్టి దురవస్థ యేమికారణంబున నెత్తెఱంగున ననుభవించె?'నని యడిగిన, మద్రపతి 'దొల్లింటి యితిహాసంబు సెప్పెద వినుమ'ని యిట్లనియె; 'దేవతలయందు మాన్యుండై త్వష్ట యనుపేరం బరఁగువాఁడు వాసవునకుఁ గీడు దలంచి మూఁడుదలలవాని నొక్కని సృజియించి, విశ్వరూప నామధేయుం జేసిన, నతం డింద్రపదవిం గోరి ఘోరతపంబు సేయుచున్న, దానికి భయంబంది నిలింపపతి యప్సరః స్త్రీలఁ 'దత్తపోభంగంబు సేయుం' డని నియమించి పంచిన. 117

ప్రతిపదార్థం: అనినన్; విని; ధర్మనందనుండు; ఇంద్రుండు; శచీసమేతంబుగాన్= శచీదేవితోకూడా; అట్టి; దురవస్థ= దుస్స్థితి; ఏమి కారణంబునన్; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; అనుభవించెన్; అని; అడిగినన్; మద్రపతి= మద్రదేశపురాజు- శల్యుడు; తొల్లింటి= పూర్వపు; ఇతిహాసంబు= చరిత్ర; చెప్పెదన్; వినుము; అని; ఇట్లు+అనియెన్; దేవతలఅందున్; మాన్యుండు+ఐ= మన్నించతగ్గవాడయి; త్వష్ట+అనుపేరన్; పరఁగువాఁడు= ఒప్పేవాడు; వాసవునకున్= ఇంద్రుడికి; కీడు= హాని; తలంచి= ఎంచి; మూఁడు+తలలవానిన్; ఒక్కనిన్; సృజియించి= పుట్టించి; విశ్వరూప నామధేయున్+చేసినన్= విశ్వరూపుడనే పేరుగలవాడినిగా చేయగా; అతండు; ఇంద్ర పదవిన్= ఇంద్రత్వాన్ని; కోరి; ఘోర తపంబు+చేయుచున్+ఉన్నన్= భయంకరమైన తపస్సు చేస్తూఉండగా; నిలింపపతి= దేవతలరాజు - ఇంద్రుడు; దానికిన్; భయంబు+అంది= భయపడి; అప్సరస్+స్త్రీలన్= అచ్చరలను; తద్+తపస్(ః)+భంగంబు= వాడి తపస్సుకు విఘ్నం; చేయుండు+అని; నియమించి= ఏర్పాటు చేసి; పంచినన్= పంపగా.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు - 'ఇంద్రుడు శచీదేవితో కూడ అటువంటి దుస్థితిని ఏ కారణంగా, ఏ విధంగా అనుభవించాడు?' అని అడుగగా, శల్యుడు 'పూర్వపు చరిత్ర చెపుతా వినుము' అని ఇట్లా అన్నాడు. దేవతలలో ఆదరణీయుడై త్వష్ట అను పేరు గలవాడు ఇంద్రుడికి హాని తలపెట్టి, మూడుతలలవాడిని ఒకడిని పుట్టించి విశ్వరూపుడనే పేరు పెట్టాడు. అతడు ఇంద్రపదవిని కోరి ఘోరతపస్సు చేస్తుండగా, దానికి ఇంద్రుడు భయపడి వాడి తపస్సును చెరచండని అప్సరసలను ఆజ్ఞాపించి పంపగా.

క. వారి విలాసంబులను, వి। హారముల, విలోకనముల, నాలాపములన్
మారవికారం బాతనిఁ। జేరద; యన్నాకపతియు సి గ్గెదఁ గదురన్. 118

ప్రతిపదార్థం: వారి= ఆ అప్సరసల యొక్క; విలాసంబులను= ఒయ్యారాలచేతా; విహారములన్= క్రీడలచేతా; విలోకనములన్= చూపులచేతా; ఆలాపములన్= మాటలచేతా; మార వికారంబు= మన్మథ వికారం; ఆతనిన్= ఆ విశ్వరూపుడిని; చేరదు+అ; ఆ+నాకపతియున్= ఆ స్వర్గాధిపతియూ (ఇంద్రుడునూ); సిగ్గు; ఎదన్= హృదయంలో; కదురన్= అతిశయించగా.

తాత్పర్యం: ఆ అప్సరసల ఒయ్యారాలూ, క్రీడలూ, చూపులూ, మాటలూ ఆ విశ్వరూపుడికి మన్మథ వికారం కలిగించలేకపోయాయి. ఇంద్రుడు మిక్కిలి సిగ్గుపడి.

తే. తలరి యమ్మునిఁ దెగఁజూచి ధర్మరహితుఁ। డగుట, యెవ్వరు నెఱుఁగనియట్లు గాఁగ
నేఁడు గాలంబు గడపిన, నెఱిఁగి భూత। గణము లాక్రోశ మొనరింపఁగా నతండు. 119

ప్రతిపదార్థం: తలరి= చింతించి, వ్యాకులతచెంది; ఆ+మునిన్= ఆ మునిని; తెగన్+చూచి= వధించి; ధర్మరహితుఁడు+ అగుట= ధర్మహీనుడవడం; ఎవ్వరున్= ఎవరూ; ఎఱుఁగని+అట్లు+కాఁగన్= ఎరుగని అట్లుగా; ఏఁడు+కాలంబు= ఒక్క సంవత్సర కాలం; కడపినన్= కడపగా, భూత గణములు= భూత సమూహాలు; ఆక్రోశము+ఒనరింపఁగాన్= అరవగా; అతండు= ఆ ఇంద్రుడు.

తాత్పర్యం: దేవేంద్రుడు వ్యాకులపడి ఆ మునిని వధించి అధర్మపరు డవటం ఎవరూ ఎరుగనట్లు ఒక సంవత్సరకాలం గడపగా, భూతసమూహాలు ఆక్రోశించాయి. అప్పుడు ఇంద్రుడు.

వ. తన దుష్కర్మంబు ప్రకటంబగుటకు రోసి, యొక్కవిషమవ్రతం బాచరించి, సముద్ర తరు ధరణీ స్త్రీజనంబులయందు బ్రహ్మహత్య విభాగించి పెట్టి, నిజకల్మషంబుఁ బాపికొని, మునిగణ సేవితుండయి సముల్లాసంబునం బొంది యునికికిఁ ద్వష్ట కోపించి. 120

ప్రతిపదార్థం: తన దుష్కర్మంబు= తన దుష్కార్యం; ప్రకటంబు+అగుటకున్= అందరికీ తెలిసిపోవటానికి; రోసి= ఏవగించుకొని; ఒక విషమ వ్రతంబు= ఒక కఠోరమైన వ్రతం; ఆచరించి= చేసి; సముద్రతరుధరణీ స్త్రీజనంబులయందున్= సముద్రంలోనూ, చెట్లమీదా, నేలమీదా, స్త్రీలయందూ; బ్రహ్మహత్య= బ్రాహ్మణవధ వలన కలిగిన పాపం; విభాగించిపెట్టి= పంచిపెట్టి; నిజకల్మషంబున్= తన పాపమును; పాపికొని= పోగొట్టుకొని; మునిగణ సేవితుండు+అయి= మునుల సమూహంచేత సేవించబడినవాడయి; సముల్లాసంబునన్+పొంది+ఉనికికిన్= సంతోషంతో ఉన్నందుకు; త్వష్ట; కోపించి.

తాత్పర్యం: తన పాపకార్యం అందరికీ తెలిసిపోవటం వలన ఏవగించుకొని, ఒక కఠోరవ్రతం చేసి, ఆ బ్రహ్మహత్యా పాతకాన్ని, సముద్రంలోనూ, చెట్లలో, నేలమీదా, స్త్రీల యందూ విభజించిపెట్టి, తన పాపం పోగొట్టుకొని, మునుల సమూహంచేత సేవించబడుతూ సంతోషంతో ఉండడాన్ని చూచి త్వష్ట కోపించి.

తే. 'అనపరాధుఁ, దపోనిధి, నధికశాంతి। యుక్తుఁ జంపిన పాపాత్ము నుఱక పట్టి
మ్రింగఁ జాలెడు వాని, నుత్తుంగదేహు। నేను సృజియింతుఁ జూడుఁడీ యీ క్షణంబ.' 121

ప్రతిపదార్థం: అనపరాధున్= నిరపరాధుడినీ; తపస్(ః)+నిధిన్= తపోనిధిఅయిన వాడినీ; అధిక శాంతి యుక్తున్= మిక్కిలి శాంతగుణంతో కూడినవాణ్ణి; చంపిన పాప+ఆత్మున్= చంపిన పాపిని; ఉఱక= లెక్క లేకుండా; పట్టి= పట్టుకొని; మ్రింగన్+చాలెడు వానిన్= మ్రింగివేయగలవాడిని; ఉత్తుంగ దేహున్= మిక్కిలి ఎత్తైన శరీరం కలవాడిని; ఈ క్షణంబు+అ= ఇప్పుడే; ఏను= నేను; సృజియింతున్= పుట్టిస్తాను; చూడుఁడీ= చూడండి.

తాత్పర్యం: 'నిరపరాధుడూ, తపోనిధీ, అధికశాంతుడూ అయినవాడిని చంపిన పాపిని లక్ష్యపెట్టక పట్టుకొని మ్రింగివేయగలవాడిని నేను ఈ క్షణంలోనే పుట్టిస్తాను చూడండి.'

చ. **అనుచుఁ గడంగి నిష్ఠమెయి నగ్నిముఖం బొనరించి, వేలిమిం**
దనయు సృజించి, లోకవిదితంబుగ వృత్ర సమాఖ్య యిచ్చి 'మ
ద్వినుత తపోబలంబునఁ బ్రదీపిత తేజుఁడవై జయింపు నీ'
వని నియమించి పంచె నమరాధిపుతో సమరంబు సేయఁగన్. **122**

ప్రతిపదార్థం: అనుచున్; కడంగి= పూని; నిష్ఠమెయిన్= నియమంతో; అగ్ని ముఖంబు+ఒనరించి= అగ్ని సాధ్యాలైన కర్మలకు ముందు చేసే అంగకర్మ సముదాయం చేసి; వేలిమిన్= హోమమునందు; తనయున్= కుమారుడిని; సృజించి= పుట్టించి; లోక విదితంబుగన్= జగత్ప్రసిద్ధంగా; వృత్ర సమాఖ్య+ఇచ్చి= వృత్రుడనే పేరు పెట్టి; మత్+వినుత తపస్(ః)+బలంబునన్= నా పొగడబడే తపశ్శక్తిచేత; ప్రదీపిత తేజుఁడవు+ఐ= ప్రకాశించిన తేజస్సు గలవాడవై; నీవు; జయింపు(ము); అని; నియమించి= ఆజ్ఞాపించి; అమర+అధిపుతోన్= దేవరాజుతో-ఇంద్రుడితో; సమరంబు+చేయఁగన్= యుద్ధం చేయటానికి; పంచెన్= పంపాడు.

తాత్పర్యం: అంటూ పూని నియమంతో హోమం చేసి అగ్నికుండంలో కుమారుడిని పుట్టించి, జగత్ప్రసిద్ధంగా వృత్రుడనే పేరు పెట్టి 'నా గొప్ప తపశ్శక్తి చేత ప్రకాశించిన తేజస్సు గలవాడవై నీవు జయించుము' అని ఆజ్ఞాపించి, ఇంద్రుడితో యుద్ధం చేయటానికి పంపాడు.

ఇంద్రుఁడు వృత్రాసురునితో యుద్ధంబు సేయుట (సం. 5-9-45)

చ. **పనిచిన నాతఁడుం జనియె బాహుబలంబున నేచి; వాసవుం**
డని కెదురేఁగుదెంచె; నిటు లద్భుతసంగరమైనచోట న
య్యనిమిషనాథుఁ బట్టుకొని యంగద వృత్రుఁడు మ్రింగె, దేవత
ల్మనమున బెగ్గలింపఁగఁ జలంబు బలంబును జూపి యుగ్రుఁడై. **123**

ప్రతిపదార్థం: పనిచినన్= పంపగా; ఆతఁడున్= ఆ వృత్రుడు కూడా; బాహు బలంబునన్= భుజబలంతో; ఏచి= విజృంభించి; చనియెన్= వెళ్ళాడు; వాసవుండు= ఇంద్రుడు; అనికిన్= యుద్ధానికి; ఎదురు+ఏఁగుదెంచెన్= ఎదురువచ్చాడు; ఇటులు= ఇట్లా; అద్భుత సంగరము+ఐన చోటన్= ఆశ్చర్యకర యుద్ధం అయినప్పుడు; వృత్రుఁడు; దేవతల్; మనమునన్= మనస్సులో; బెగ్గలింపఁగన్= భయపడగా; చలంబున్= పట్టుదలా; బలంబును; చూపి; ఉగ్రుఁడు+ఐ= భయంకరుడై; ఆ+అనిమిషనాథున్= ఆ దేవరాజును - ఇంద్రుడిని; పట్టుకొని; అంగదన్= ఆకలితో; మ్రింగెన్= మ్రింగాడు.

తాత్పర్యం: పంపగా ఆ వృత్రుడునూ భుజబలంతో విజృంభించి వెళ్ళాడు. ఇంద్రుడు యుద్ధానికి ఎదురేగాడు. ఇట్లా ఆశ్చర్యకరమైన యుద్ధం జరిగినప్పుడు వృత్రుడు దేవతలు మనస్సులలో భయపడేటట్లు, పట్టుదలా, బలమూ చూపి భయంకరుడై ఆ ఇంద్రుడిని పట్టుకొని ఆకలితో మ్రింగాడు.

వ. ఇట్లు మ్రింగినం ద్రిదశగణంబులు దత్క్షణంబ యాదైత్యునకు నావులించునట్టి యాలస్యం బావహించిన. 124

ప్రతిపదార్థం: ఇట్లు, మ్రింగినన్= మ్రింగగా; తద్+క్షణంబు+అ= ఆ క్షణమే; త్రిదశ గణంబులు= దేవతల సమూహాలు; ఆ దైత్యునకున్= ఆ రాక్షసుడికి; ఆవులించు+అట్టి= ఆవులించే; ఆలస్యంబు= మాంద్యం; ఆవహించినన్= కలిగించగా.

తాత్పర్యం: ఇట్లా మ్రింగగానే దేవతలు ఆ క్షణమే ఆ రాక్షసుడికి ఆవులించే బడలిక కలిగించగా.

తే. అసురనాథుండు నలసత యడర నీల్గి । యావులించిన, నత్తఱి నమరవిభుఁడు
దన శరీరంబు సంకుచితంబు సేసి, । కడుజవంబునఁ గుప్పించి వెడల నుఱికె. 125

ప్రతిపదార్థం: అసుర నాథుండున్= రాక్షస ప్రభువూ; అలసత= మాంద్యం; అడరన్= అతిశయించగా; నీల్గి= ఒళ్ళు విరుచుకొని; ఆవులించినన్= ఆవులించగా; ఆ+తఱిన్= ఆ సమయంలో; అమర విభుఁడు= దేవతల రాజు- ఇంద్రుడు; తన శరీరంబున్; సంకుచితంబు+చేసి= ముడుచుకొని; కడు జవంబునన్= మిక్కిలి వేగంతో; కుప్పించి= దుమికి; వెడలన్+ఉఱికెన్= బయటికి ఉరికాడు.

తాత్పర్యం: రాక్షసరాజైన ఆ వృత్రుడునూ మాంద్యం అతిశయించి, ఒడలు విరుచుకొని ఆవులించగా, ఆసమయంలో ఇంద్రుడు తన శరీరాన్ని చిన్నదిగా చేసికొని మిక్కిలివేగంతో వెలుపలికి కుప్పించి దుమికాడు.

క. వెలలి బలరిపుఁడు చలమునఁ । గలహమునకుం జొచ్చె; వృత్రు ఘనబాహుబలం
బలవికి మీఱెను దండ్రి వి । మల తపమునఁ జేసి సురల మనములు దలఁకన్. 126

ప్రతిపదార్థం: బలరిపుఁడు= బలుడనే రాక్షసుడి శత్రువు- ఇంద్రుడు; వెలలి= వృత్రుని నోటినుండి; వెలికి వచ్చి; చలమునన్= పట్టుదలతో; కలహమునకున్= యుద్ధానికి; చొచ్చెన్= ప్రవేశించాడు- యుద్ధానికి పూనుకొన్నాడు; తండ్రి విమల తపమునన్+చేసి= తండ్రిఅయిన త్వష్టయొక్క నిర్మలమైన తపస్సుచేత; సురల మనములు= దేవతల మనస్సులు; తలఁకన్= భయపడగా; వృత్రు ఘనబాహుబలంబు= వృత్రాసురుడి గొప్పదైన భుజబలం; అలవికిన్ మీఱెను= ఇంద్రుడి శక్తికి మించినది.

తాత్పర్యం: ఇంద్రుడు వెలికి వచ్చి పట్టుదలతో వృత్రుడితో యుద్ధానికి దిగాడు. తండ్రిఅయిన త్వష్ట యొక్క నిర్మల తపస్సు కారణంగా, వృత్రుడి గొప్ప భుజబలం దేవతల మనస్సులు భయపడేటట్లు, ఇంద్రుడిశక్తికి మించినదయింది.

వ. ఇట్లధికబలుండైన వృత్రు నాటోపంబు సహింపంజాలక సురపతి దెరలి మరలి పఱచి మందరగిరి శిఖరంబున కరిగినం, గనుకనిం జని యనిమిషు లతనిం గూడుకొని, వృత్రవధోపాయంబు విచారించునెడ, నవ్వ్యాసవుండును దన మనంబున నిశ్చయించి. 127

ప్రతిపదార్థం: ఇట్లు; అధిక బలుండు+ఐన= మిక్కిలి బలం కలవాడయిన; వృత్రు+ఆటోపంబున్= వృత్రుడి విజృంభణను; సహింపన్+చాలక= ఓర్చుకొనలేక; సురపతి= ఇంద్రుడు; తెరలి= తొలగి; మరలి= వెనుకకు తిరిగి; పఱచి= పారి; మందరగిరి; శిఖరంబునకున్= మందర పర్వత శిఖరానికి; అరిగినన్= వెళ్ళగా; అనిమిషులు= దేవతలు; కనుకనిన్+చని= సంభ్రమంతో

వెళ్ళి; అతనిన్; కూడుకొని= కలిసికొని; వృత్రవధ+ఉపాయంబు= వృత్రుడిని చంపటానికైన ఉపాయం; విచారించు+ఎడన్= ఆలోచించేటప్పుడు; ఆ+వాసవుండును= ఆ ఇంద్రుడును; తన మనంబునన్= తన మనస్సులో; నిశ్చయించి= నిర్ణయించి.

తాత్పర్యం: ఈ విధంగా అమితబలం కల వృత్రుడి విజృంభణం తట్టుకోలేక ఇంద్రుడు తొలగి మరలి పారి మందర పర్వత శిఖరానికి వెళ్ళగా, దేవతలు సంభ్రమంతో వెళ్ళి అతడిని కలిసికొని వృత్రుడిని చంపే ఉపాయం ఆలోచించేటప్పుడు ఆ ఇంద్రుడు తన మనస్సులో నిర్ణయం చేసికొని.

క. 'హరిఁ గాంచి యతని చెప్పిన । పరమోపాయంబు సేసి బ్రతుకుద' మనినన్.
సుర లదియ కర్జమని య । మ్మురమర్దను కడకుఁ జనిరి మునులుం దారున్. 128

ప్రతిపదార్థం: హరిన్= విష్ణుమూర్తిని; కాంచి= చూచి; అతని చెప్పిన; పరమ+ఉపాయంబు= గొప్ప ఉపాయం; చేసి; బ్రతుకుదము; అనినన్; సురలు= దేవతలు; అది+అ= అదే; కర్జము+అని= కార్యమని; మునులున్+తారున్= మునులూ; తామూ; ఆ+మురమర్దను కడకున్= ఆ విష్ణువు దగ్గరికి; చనిరి.

తాత్పర్యం: 'విష్ణుమూర్తిని దర్శించి, అతడు చెప్పే ఉపాయాన్ని ఆచరణలో పెట్టి బ్రదుకుదాం' అనగా దేవతలు అదే కార్యమని మునులూ, తామూ కలిసి ఆ విష్ణుమూర్తిదగ్గరికి వెళ్ళారు.

వ. ఇట్లు దివిజానీకంబును పాకశాసనుం బురస్కరించుకొని 129

ప్రతిపదార్థం: ఇట్లు; దివిజ+అనీకంబును= దేవతల సమూహమూ; మునిలోకంబును= మునుల సమూహమూ, పాకశాసనున్= ఇంద్రుడిని; పురస్కరించుకొని= ముందుపెట్టుకొని.

తాత్పర్యం: ఈ విధంగా దేవతల సమూహమూ, మునుల సమూహమూ ఇంద్రుడిని ముందిడుకొని.

మ. చని యా దైత్యుతెఱంగు సెప్పి, 'యతులోత్సాహంబుమై నెప్పుడున్
దనుజవ్రాతము త్రు ళ్ళడంచి, దివిజేంద్రశ్రీవిలాసంబు పెం
పునఁ బొందించుట నీకు నైజము గదా, భూతేశ! ఘోరారిమ
ర్దన సంక్రీడ యొనర్పు లోకముల కత్యంతప్రమోదంబుగాన్.' 130

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; ఆ దైత్యుతెఱంగు+చెప్పి= ఆ రాక్షసుడి విధం చెప్పి; భూత+ఈశ!= భూతనాథా!; అతుల+ ఉత్సాహంబుమైన్= సాటిలేని వేడుకతో; ఎప్పుడున్= ఎప్పుడూ; దనుజవ్రాతము త్రుళ్ళు+అడంచి= రాక్షస సమూహం యొక్క గర్వం నశింపజేసి; దివిజ+ఇంద్రశ్రీ విలాసంబు= ఇంద్రుడి సంపదయొక్క విలాసం; పెంపునన్+పొందించుట= అభివృద్ధి చెందించడం; నీకున్; నైజము+కదా!= సహజం కదా!; లోకములకున్; అత్యంత ప్రమోదంబు+కాన్= మిక్కిలి సంతోషం అయ్యేటట్లు; ఘోర+అరిమర్దన సంక్రీడ= భయంకరులైన శత్రువులను నలగగొట్టడం అనే ఆట; ఒనర్పు(ము)= చేయుము.

తాత్పర్యం: వెళ్ళి ఆ రాక్షసుడి ప్రకారం చెప్పి, 'ఓ భూతనాథా! ఎంతో ఉత్సాహంతో ఎప్పుడూ రాక్షసుల గర్వం అణచి దేవేంద్రుడి లక్ష్మీ విలాసాన్ని అభివృద్ధి పొందించటం నీకు సహజం కదా! లోకాలకు మిక్కిలి ఆనందం కలిగేటట్లు భయంకర శత్రుసంహారక్రీడ చేయుము'- అని దేవతలు, మునులు విష్ణువును ప్రార్థించారు.

క. అనిన విని, 'యొకటి సెప్పెద । వినుఁ డాతనితోడ సమరవిభునకుఁ దగఁ బొం
దొనరింపుఁ; డొక్క సమయం । బున నడఁకువఁ గులిశధారఁ బొందెద నేనున్. 131

ప్రతిపదార్థం: అనినన్; విని; ఒకటి; చెప్పెదన్; వినుఁడు; ఆతని తోడన్= ఆ వృత్రునితో; అమర విభునకున్= దేవేంద్రుడికి; తగన్= ఒప్పుగా; పొందు+ఒనరింపుఁడు= మైత్రి చేయండి; ఒక్క సమయంబునన్= ఒక సమయంలో; నేనున్= నేనూ; అడఁకువన్= అణకువతో; కులిశధారన్= వజ్రాయుధపుటంచును; పొందెదన్.

తాత్పర్యం: అనగా విని 'ఒక్కటి చెపుతా వినండి. అతడితో దేవేంద్రుడికి సంధి చేయండి. ఒక సమయంలో నేనూ వజ్రాయుధపువాదరలో రహస్యంగా చేరి ఉంటాను.

వ. మదీయ తేజో విశేషంబున నప్పురుహూతున కుత్సాహంబు సంభవింపంగలయది. అప్పు డనాయాసంబునఁ బగతు వధియింప నగు'నని గదాధరుం డూఱడిలం బలికిన, బలసూదన ప్రముఖ నిఖిల సురలోకంబును సంతసిల్లి మగిడి వచ్చి వృత్రుకడకు మునిజనంబులం బుచ్చిన, వారునుం జని యతని కిట్లనిరి. 132

ప్రతిపదార్థం: మదీయ తేజస్(ః)+విశేషంబునన్= నాదైన తేజస్సు యొక్క అధిక్యం చేత; ఆ+పురుహూతునకున్= ఆ ఇంద్రుడికి; ఉత్సాహంబు; సంభవింపన్+కలయది= పుట్టుతుంది; అప్పుడు; అనాయాసంబునన్= అశ్రమంగా, శ్రమలేకుండా; పగతున్= శత్రువును; వధియింపన్+అగున్= చంపవచ్చును; అని; గదాధరుండు= కౌమోదకి అనే గదను ధరించేవాడు- విష్ణువు; ఊఱడిలన్+పలికినన్= ఓదార్పు కలిగేటట్లు పలుకగా; బలసూదన ప్రముఖ నిఖిల సుర లోకంబును= ఇంద్రుడూ మొదలైన ఎల్ల దేవతల సమూహమూ; సంతసిల్లి= సంతోషించి; మగిడి వచ్చి= తిరిగి వచ్చి; వృత్రుకడకున్= వృత్రుడి వద్దకు; ముని జనంబులన్= మునులను; పుచ్చినన్= పంపగా; వారును; చని; అతనికిన్; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: నా తేజోవిశేషంచేత ఆ ఇంద్రుడికి ఉత్సాహం పుట్టుకొస్తుంది. అప్పుడు అశ్రమంగా శత్రువును సంహరింపవచ్చును.' అని విష్ణువు ఊరట కలిగేటట్లు చెప్పగా, ఇంద్రాది సకలదేవతలూ సంతోషంతో తిరిగి వచ్చి వృత్రాసురుడి వద్దకు మునులను పంపారు. వారు వెళ్ళి అతడితో ఇట్లా అన్నారు.

క. 'భుజ బల దుర్జయుఁ డింద్రుం; । డజయ్యుఁడవు నీవు; నీకు నతనికి మీలో
విజయము దక్కదు; మీరే । చి జగంబులు నొవ్వ రణము సేయఁగనేలా? 133

ప్రతిపదార్థం: ఇంద్రుండు; భుజ బల దుర్జయుఁడు= భుజబలంచేత జయించ శక్యం కానివాడు; నీవున్= నువ్వు కూడా; అజయ్యుఁడవు= జయించరానివాడవు; మీలోన్; నీకున్; అతనికిన్; విజయము= గెలుపు; దక్కదు= లభించదు; మీరు; ఏచి= విజృంభించి; జగంబులు= లోకాలు; నొవ్వన్= బాధపడేటట్టు; రణము= యుద్ధం; చేయఁగన్+ఏలా= చేయడమెందుకు?

తాత్పర్యం: 'ఇంద్రుడు భుజబలం చేత జయించ శక్యం కానివాడు. నువ్వూ జయించరానివాడవే. మీ యిద్దరిలో ఎవరికీ గెలుపు లభించదు. మరి మీరు విజృంభించి లోకాలు బాధపడేటట్టు యుద్ధం చేయడ మెందుకు?

క. మైత్రీ సౌఖ్యముఁబోలునె । శాత్రవ మెమ్మెయిఁ దలంప? శక్రశ్రీకిం
బాత్రమవై యింపుగఁ ద । న్మిత్రుఁడవగు; మిదియ మేలు మీ యిద్దఱకున్.' 134

ప్రతిపదార్థం: ఎమ్మెయిన్(ఏ+మెయిన్)+తలంపన్= ఏ విధంగా ఆలోచించినా, శాత్రవము= శత్రుత్వం, మైత్రీ-సౌఖ్యమున్= స్నేహ సుఖాన్ని, పోలునె= పోలుతుందా?, శక్ర శ్రీకిన్= ఇంద్రుడి సంపదకు; పాత్రమవు+ఐ= యోగ్యుడవయి; ఇంపుగన్= ఆనందంగా; తన్మిత్రుఁడవు (తద్+మిత్రుఁడవు)= అతడి స్నేహితుడవు; అగుము; మీ+ఇద్దఱకున్= మీ ఇరువురకూ; ఇది+అ= ఇదే; మేలు= లాభం.

తాత్పర్యం: ఏ విధంగా ఆలోచించినా మైత్రీసౌఖ్యంతో శత్రుత్వం సాటికాదు. ఇంద్రుడి సంపదకు యోగ్యుడవై ఆనందంగా అతడి మిత్రుడవు కమ్ము. ఇదే ఉభయతారకం.

వ. అనవుడు వృత్రాసురుండు 'తేజంబువాసికి నాసపడియెడు మా యిరువురకు సఖ్యంబు సమకూర నేర్చునే?' యనుటయు నమ్మునులు' సత్పురుష సాంగత్యంబు సంభవించినఁ జేయమి నీతి గాదు. మహేంద్రుండు సకల లోక సమ్మత సద్భావుండుగావున నతనితోడి చుట్టఱికంబు మే'లనిన నొడంబడి యతండు వారల కిట్లనియె. 135

ప్రతిపదార్థం: అనవుడున్= అనినంతనే; వృత్ర+అసురుండు= వృత్రుడనే రాక్షసుడు; తేజంబు వాసికిన్= తేజస్సు యొక్క ఆధిక్యం కొరకు; ఆసపడియెడు మా+ఇరువురకున్= ఆశించే మా ఇద్దరికీ; సఖ్యంబు= స్నేహం; సమకూరన్+నేర్చునే?= లభించగలదా?; అనుటయున్; ఆ+మునులు; సత్+పురుష సాంగత్యంబు= మంచివారితో మైత్రి; సంభవించినన్= కలిగితే; చేయమి= చేయకుండా ఉండటం; నీతి+కాదు; మహేంద్రుండు; సకల లోక సమ్మత సత్+భావుండు= అన్ని లోకాలకూ సమ్మతమైన సద్భావం కలవాడు; కావునన్= కాబట్టి, అతని తోడి చుట్టఱికంబు= అతడి తోడి బంధుత్వం; మేలు= మంచిది; అనినన్; ఒడంబడి= సమ్మతించి; అతండు; వారలకున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగానే, వృత్రాసురుడు 'తేజోవిశేషంకొరకు ఆశించే మా ఇద్దరికి స్నేహం కుదరగలదా?' అంటే, ఆ మునులు 'సజ్జనమైత్రి లభించినప్పుడు చేయకపోవడం నీతి కాదు. మహేంద్రుడు లోకాలన్నీ సమ్మతించే సజ్జనత్వం కలవాడు. కాబట్టి అతడితో బంధుత్వం మంచిది,' అనగా, దానికి సమ్మతించి వృత్రుడు వారితో ఇట్లా అన్నాడు.

క. 'ఏ నొక్క తెఱఁగు సెప్పెద; । దానిం గాదనక చేసి తగ మీరలు సం
ధానము దృఢముగఁ జేయుం । డా నాకేశునకు నాకు నధికప్రీతిన్.' 136

ప్రతిపదార్థం: ఏను= నేను; ఒక్క తెఱఁగు= ఒక్క విధం; చెప్పెదన్; మీరలు; దానిన్; కాదు+అనక; చేసి; ఆ నాక+ఈశునకున్= ఆ స్వర్గ ప్రభువుకూ (ఇంద్రుడికీ); నాకున్; అధిక ప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; తగన్= ఒప్పేటట్టు; దృఢముగన్= గట్టిగా; సంధానము= సంధి; చేయుండు.

తాత్పర్యం: 'నేను ఒక పద్ధతి చెపుతాను. మీరు దానిని కాదనకుండా చేసి ఆ ఇంద్రుడికీ నాకూ మిక్కిలి సంతోషంతో ఒప్పుగా, దృఢంగా సంధి చేయండి.'

వ. 'అది యెయ్యది?' యనిన 'ఆర్ద్రం బగుదానను, శుష్కంబైన సాధనంబునను, దారువునం, బాషాణంబున, శస్త్రాస్త్రంబులం, దివంబున, రాత్రి యందును నేను వధ్యుండఁ గాకుండవలయు' ననిన, వారును దానికి నొడంబడి, యవ్వరంబు లొసంగి వృత్రవజ్రధరులకు మిత్రభావం బొనరించి, మగుడం జని, యత్తెఱంగు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వాసవున కెఱింగించి నిజనివాసంబుల కరిగిరి, సురనాథుండు సుఖంబుండి, పెద్దకాలంబునకుం దన మనంబునఁ బాయని వైరంబు సైరింపంజాలక, దామోదరుని పూనికయు, మునిజనంబు సేసిన సంధి విధంబును నిరూపించి, రిపుం బరిభవింప రంధ్రాన్వేషణంబు సేయుచుండి యొక్కనాఁడు. 137

ప్రతిపదార్థం: అది; ఎయ్యది= ఏది; అనినన్; ఆర్ద్రంబు+అగుదానను= తడిసిన దానిచేతను; శుష్కంబు+ఐన సాధనంబునను= ఎండిన పరికరం చేతను; తరువునన్= చెట్టుచేతను; పాషాణంబునన్= రాయిచేతను; శస్త్ర+అస్త్రంబులన్= శస్త్రాలచేతను; అస్త్రాలచేతను; దివంబునన్= పగటివేళా; రాత్రిఅందును; నేను; వధ్యుండన్+కాక+ఉండవలయును= చంపదగినవాడిని కాగూడదు; అనినన్; వారును; దానికిన్; ఒడంబడి= సమ్మతించి; ఆ+వరంబులు= ఆ వరాలు; ఒసంగి= ఇచ్చి; వృత్ర వజ్రధరులకున్= వృత్రుడికీ, ఇంద్రుడికీ; మిత్ర భావంబు= మైత్రి; ఒనరించి= చేసి; మగుడన్+చని= తిరిగిపోయి; ఆ+తెఱంగు= ఆ విధం; వాసవునకున్= ఇంద్రుడికి; ఎఱింగించి= చెప్పి; నిజనివాసంబులకున్= తమ తమ ఇండ్లకు; అరిగిరి= వెళ్లారు; సురనాథుండు= ఇంద్రుడు; సుఖంబు+ఉండి= సుఖంగా ఉండి; పెద్ద కాలంబునకున్= చిరకాలంగా; తన మనంబునన్= తన మనస్సులో; పాయని వైరంబు= తొలగని విరోధం; సైరింపన్+చాలక= సహించలేక; దామోదరుని పూనికయున్= విష్ణువు ప్రయత్నమూ; ముని జనంబు= మునుల సమూహం; చేసిన సంధి విధంబును; నిరూపించి= గ్రహించి; రిపున్= శత్రువును; పరిభవింపన్= అవమానించటానికి (ఓడించటానికి); రంధ్ర+అన్వేషణంబు+చేయుచున్+ఉండి= మార్గం వెదకుతూ; ఒక్కనాఁడు= ఒక రోజున.

తాత్పర్యం: 'అది ఏది?' అని అడిగితే, తడిసినదానిచేతగాని, ఎండినదానిచేతగాని, కర్రచేతగాని, రాయిచేతగాని, శస్త్రాలచేతగాని, అస్త్రాలచేతగాని, పగలుగాని, రాత్రిగాని నేను చావగూడదు' అనగా, వారును దాని కంగీకరించి, ఆ విధంగానే వరాలిచ్చి, వృత్రుడికీ, ఇంద్రుడికీ సంధి చేసి తిరిగి పోయి, ఆ ప్రకారం ఇంద్రుడికి చెప్పి తమ తమ యిండ్లకు వెళ్లిపోయారు. ఇంద్రుడు సుఖంగా ఉండి, చిరకాలంగా తన మనస్సులో తొలగని విరోధం సహించలేక, విష్ణుమూర్తి ప్రయత్నమూ, మునులు చేసిన సంధి విధానమూ గ్రహించి, శత్రువును ఓడించే మార్గాన్ని వెదకుతూ ఒక రోజున.

విశేషం: అమంత్రకములైన ఆయుధాలు శస్త్రాలు. సమంత్రకములైన ఆయుధాలు అస్త్రాలు. 'రంధ్రాన్వేషణ' జాతీయం. ఏదో దోషం కొరకు, సాకు కొరకు ప్రయత్నించటమని అర్థం.

చ. **జలనిధి తీరభూమిఁ దన శత్రుఁ గనుంగొని, 'వీని నిప్డు దో**
ర్బల మెసఁగంగ నాదు భిదురంబునఁ ద్రుంచెద; రాత్రిగాదు, తాఁ
దలఁప దివంబుగా; దిది యుదగ్రపరాక్రమ యోగ్య సంధ్య; నా
యలవుఁ జలంబుఁ జూప నెపమై తగు సాధన మెద్ది గల్గునో?' 138

ప్రతిపదార్థం: జలనిధి తీరభూమిన్= సముద్రపుటొడ్డున; తన శత్రున్= తన విరోధిఅయిన వృత్రుణ్ణి; కనుంగొని= చూసి; వీనిన్; ఇప్డు; దోర్బలము (దోస్(ః)+బలము)= భుజబలం; ఎసఁగంగన్= అతిశయించగా; నాదు భిదురంబునన్= నా వజ్రాయుధంతో; త్రుంచెదన్= వధిస్తాను; రాత్రి+కాదు; తలఁపన్= ఆలోచించగా; తాన్; దివంబు= పగలు; కాదు; ఇది= ఈ సమయం; ఉదగ్ర పరాక్రమ యోగ్య సంధ్య= మహా పరాక్రమానికి తగిన సంజవేళ; నా+అలవున్= నా బలమూ; చలంబున్= పట్టుదలా; చూపన్; నెపము+ఐ= కారణమై; తగు సాధనము; ఎద్ది= ఏది; కల్గునో?= కలుగుతుందో?

తాత్పర్యం: సముద్రతీరంలో తన విరోధియైన వృత్రుడినిచూసి 'ఇప్పుడు వీడిని భుజబలం అతిశయించగా, నా వజ్రాయుధంతో వధిస్తాను. ఇది రాత్రి కాదు, పగలు కాదు. మహాపరాక్రమం ప్రదర్శించటానికి తగిన సంధ్యా సమయం. నా బలాన్నీ, పట్టుదలనూ చూపటానికి కారణమై ఒప్పే సాధనం ఏది దొరుకుతుందో కదా!'

క. అని తలఁచుచు నచ్చట నొక । వననిధి ఫేనంబుఁ జూచి వాసవుఁ 'డార్ద్రం
బును శుష్కంబును గాదిది' । యనుచుం గులిశమునఁ గూర్చి యధికరయమునన్. 139

ప్రతిపదార్థం: అని; తలఁచుచున్; అచ్చటన్; ఒక వననిధి ఫేనంబున్= ఒక సముద్రపు నురుగును; చూచి; వాసవుఁడు= ఇంద్రుడు; ఇది; ఆర్ద్రంబును= తడిదీ; శుష్కంబును= ఎండినదీ; కాదు; అనుచున్; కులిశమునన్= వజ్రాయుధంతో; కూర్చి= జతపరిచి; అధిక రయమునన్= మిక్కిలి వేగంతో.

తాత్పర్యం: అని అనుకొంటూ ఇంద్రుడు అక్కడ ఒక సముద్రపు నురుగును చూచి 'ఇది తడిదీ కాదు, పొడిదీ కాదు-' అంటూ వజ్రాయుధంతో కూర్చి మిక్కిలి వేగంతో.

తే. దాన వృత్రుని వ్రేయ నత్తఱి మురారి । యందుఁ దగ సంక్రమించి, యయ్యసురఁ జంపె;
జిష్ణుఁ డతిభక్తి విష్ణుఁ బూజించె నాత్మ । నఖిలలోకంబులకు మోద మావహిల్లె. 140

ప్రతిపదార్థం: దానన్= దానిచేత; వృత్రునిన్; వ్రేయన్= కొట్టగా; ఆ+తఱిన్= ఆ సమయంలో; ముర+అరి= మురుడనే రాక్షసుడి శత్రువు - విష్ణువు; అందున్; తగన్= ఒప్పుగా; సంక్రమించి= ప్రవేశించి; ఆ+అసురన్= ఆ రాక్షసుడిని; చంపెన్; జిష్ణుఁడు= ఇంద్రుడు; అతి భక్తిన్= మిక్కిలి భక్తితో; విష్ణున్= విష్ణుమూర్తిని; ఆత్మన్= మనస్సులో; పూజించెన్= పూజించాడు; అఖిల లోకంబులకున్= ఎల్లలోకాలకూ; మోదము= సంతోషం; ఆవహిల్లెన్= కలిగింది.

తాత్పర్యం: దానితో వృత్రుడిని కొట్టటానికి పూనుకోగా, ఆ సమయంలో విష్ణువు అనువుగా ఆ సముద్రపు నురుగులో ప్రవేశించి ఆ రాక్షసుడిని సంహరించాడు. ఇంద్రుడు మిక్కిలి భక్తితో విష్ణుమూర్తిని మనస్సులో పూజించాడు. లోకాలన్నీ సంతోషించాయి.

వ. ఇవ్విధంబునం బగతుం బరిమార్చి పేర్చి యింద్రుండు నిజపురంబునకుం జనియె; మఱియును భూతసంఘం 'బిట్లు బ్రహ్మహత్య సేయందగునే?' యని యతని నిందించినం బ్రభుత్వ సంపద సెడుటయు. 141

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; పగతున్= శత్రువును; పరిమార్చి= చంపి; పేర్చి= విజృంభించి; ఇంద్రుండు; నిజపురంబునకున్= తన నగరానికి; చనియెన్= వెళ్ళాడు; మఱియును; భూత సంఘంబు= పంచభూతాలసమూహం; ఇట్లు; బ్రహ్మహత్య; చేయన్+తగునే?; అని; అతనిన్; నిందించినన్= నిందించగా; ప్రభుత్వ సంపద= రాజ్యశ్రీ; చెడుటయున్= నశించగా.

తాత్పర్యం: ఈ విధంగా శత్రువును సంహరించి విజృంభించి ఇంద్రుడు తన నగరానికి వెళ్ళాడు. కాని, పంచభూతాల సమూహం 'ఇట్లా బ్రహ్మహత్య చేయవచ్చునా?' అని అతడిని నిందించగా రాజ్యశ్రీ నశించింది.

విశేషం: 'భూతసంఘంబు' - అంటే పంచభూతాలు మొదలైనవి. ఇవి ప్రతిప్రాణీ చేసే పనికి సాక్షీభూతాలుగా ఉంటాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. నీచదశకు వచ్చి నిషధాచలంబున । కరిగి, సురవరేణ్యుఁ డడఁగియుండె;
నమరు లెల్లఁ గలఁగి, యన్యోన్యపీడన । భయముఁ బొంది కూడఁబాఱి, తమకు. 142

ప్రతిపదార్థం: సురవరేణ్యుఁడు= దేవశ్రేష్ఠుడు, ఇంద్రుడు; నీచ దశకున్, వచ్చి= నీచస్థితికి వచ్చి; నిషధ+అచలంబునకున్= నిషధ పర్వతానికి; అరిగి= వెళ్ళి; అడఁగి+ఉండెన్= దాక్కొన్నాడు; అమరులు+ఎల్లన్= దేవతలందరూ; కలఁగి= కలతచెంది; అన్యోన్య పీడన భయమున్= పరస్పరం బాధించుకొంటారనే భయం; పొంది; కూడన్+పాఱి= కూడుకొని; తమకున్.

తాత్పర్యం: ఇంద్రుడు నీచస్థితికి వచ్చి నిషధపర్వతానికి వెళ్ళి దాగుకొన్నాడు. దేవతలందరూ కలత చెంది తమను తాము బాధించుకొంటారనే భయం పొంది, కూడుకొని, తమకు.

క. కావలియై సురరాజ్య । శ్రీ వాలింపంగఁదగు విశేషంబున సం
భావితుఁడు నహుషుఁ డని చని, । యా విభుఁ గని తారు మునులు నతనికి నెమ్మిన్. 143

ప్రతిపదార్థం: కావలి+ఐ= రక్షకుడయి; సురరాజ్యశ్రీ= దేవ రాజ్య సంపద; పాలింపంగన్= కాపాడటానికి; తగు విశేషంబునన్= తగిన ఆధిక్యంతో; సంభావితుఁడు= కొనియాడబడేవాడు; నహుషుండు; అని; చని= వెళ్ళి; తారున్= తామూ (దేవతలూ); మునులున్= మునులూ; ఆ విభున్= ఆ ప్రభువును; కని= చూచి; అతనికిన్; నెమ్మిన్= ప్రీతితో.

తాత్పర్యం: రక్షకుడయి సురరాజ్యశ్రీని కాపాడడానికి తగిన గొప్పతనం కలవాడు నహుషుడని నిర్ణయించి, వెళ్ళి తామూ, మునులూ ఆ ప్రభువును చూచి అతడికి ప్రీతితో.

దేవతలు నహుషుని సురరాజ్యాభిషిక్తునిం జేయుట (సం. 5-11-21)

వ. పాకశాసను తెఱం గెఱింగించి. 144

ప్రతిపదార్థం: పాకశాసను తెఱంగు= ఇంద్రుడి వృత్తాంతం; ఎఱింగించి= తెలిపి.

తాత్పర్యం: ఇంద్రుడి వృత్తాంతం చెప్పి.

క. 'ర మ్మింద్రపదవి సేకొని । మ మ్మెల్లను నరయు' మనిన, మానవపతి, 'నా
కమ్మహిమకుఁ దగు మాహా । త్మ్యమ్ము గలదె? నన్ను నేల యలఁచెద?' రనినన్. 145

ప్రతిపదార్థం: రమ్ము; ఇంద్రపదవి; చేకొని= స్వీకరించి; మమ్ము+ఎల్లనున్= మమ్మల్ని అందరినీ; అరయుము= కాపాడుము; అనినన్; మానవపతి= రాజు-నహుషుడు; నాకున్; ఆ+మహిమకున్= ఆ గొప్పతనానికి; తగు; మాహాత్మ్యమ్ము= సామర్థ్యం; కలదె?= ఉన్నదా?; నన్నున్; ఏల; అలఁచెదరు= శ్రమపెట్టుతారు; అనినన్.

తాత్పర్యం: 'రమ్ము. ఇంద్రపదవిని స్వీకరించి మమ్మల్ని అందరినీ కాపాడుము' అనగా నహుషుడు 'నాకు అటువంటి మహాకార్యానికి తగిన సామర్థ్యం ఉన్నదా? నన్నెందుకు శ్రమపెట్టుతారు?' అనగా.

వ. అంత నిలువక యత్యంత ప్రార్థనంబు సేసి. 146

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అంతన్; నిలువక= ఆగక; అత్యంత ప్రార్థనంబు+చేసి= మిక్కిలి ప్రార్థించి.

తాత్పర్యం: అంతటితో ఆగక మరి మరి ప్రార్థించి. (తరువాతి పద్యంతో అన్వయం)

క. యమ వరుణాది త్రిదశులు । దమ దమ శక్తి ప్రభావ దర్పంబులు భూ
రమణునకుఁ బంచి యిచ్చిరి । ప్రమోద మెసఁగంగ మునిసభామధ్యమునన్. 147

ప్రతిపదార్థం: యమ వరుణ+ఆది త్రిదశులు= యముడూ, వరుణుడూ మొదలైన దేవతలు; ప్రమోదము+ఎసఁగంగన్= సంతోషం అతిశయించగా; మునిసభామధ్యమునన్= మునుల సభలో; తమ తమ శక్తి ప్రభావ దర్పంబులు= తమ తమ శక్తి సామర్థ్య గర్వాలు; భూ రమణునకున్= రాజుకు- నహుషుడికి; పంచి+ఇచ్చిరి= పంచిపెట్టారు.

తాత్పర్యం: యముడూ, వరుణుడూ మొదలుగా గల దేవతలు సంతోషంతో అతిశయించగా మునుల సమూహంలో తమ తమ శక్తిసామర్థ్యాల గర్వాలను నహుషుడికి పంచిపెట్టారు.

వ. ఇవ్విధంబున నిచ్చి, యధికబలసమన్వితుం గావించి తోడ్కొనిపోయి, పూజ్యంబగు దివిజరాజ్యంబున కభిషిక్తుం జేసిన, నతండును బరమ ధర్మపరుండై, కిన్నర కింపురుష గరుడ గంధర్వ సిద్ధ విద్యాధరాది సమస్త దేవయోనులవలనను దేజోభాగంబులు పుచ్చికొని మహానుభావుండై, దివ్యముని సేవ్యంబైన యద్దేవేంద్ర పదంబు సేకొని తుంబురు నారదాది వినోద పాత్రంబులును, రంభాద్యప్సరోగణంబులుం గొలువ నభిమతభోగంబు లనుభవించుచు, మదంబు మిగిలి మన్మథాధీనుండై వర్తిల్లుసమయంబున నొక్కనాఁడు. 148

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; ఇచ్చి; అధిక బల సమన్వితున్= ఎక్కువ బలంతో కూడినవాడిని, కావించి= చేసి; తోడ్కొనిపోయి= తీసికొనివెళ్ళి; పూజ్యంబు+అగు= పూజించదగినదైన; దివిజ రాజ్యంబునకున్= దేవతల రాజ్యానికి; అభిషిక్తున్+ చేసినన్= అభిషేకించబడిన వాడినిచేయగా; అతండును= ఆ నహుషుడును; పరమ ధర్మపరుండు+ఐ= మిక్కిలి ధర్మరతుడయి; కిన్నర కింపురుష గరుడ గంధర్వ సిద్ధ విద్యాధర+ఆది సమస్త దేవయోనుల వలనను= కిన్నరులూ, కింపురుషులూ, గరుడులూ, గంధర్వులూ, సిద్ధులూ, విద్యాధరులూ మొదలుగాగల ఎల్ల దేవతల జాతుల నుండీ; తేజస్(ః)+భాగంబులు; పుచ్చుకొని; మహానుభావుండు+ఐ= మహాత్ముడయి; దివ్య ముని సేవ్యంబు+ఐన= దేవతల చేతా, మునులచేతా సేవించదగిన; ఆ+దేవేంద్ర పదంబు+చేకొని= ఆ దేవేంద్ర పదవి స్వీకరించి; తుంబురు నారద+ఆది వినోద పాత్రంబులును= తుంబురుడూ, నారదుడూ మొదలైన వినోదం కలిగించేవారూ; రంభా+ఆది+అప్సరస్(ః)+గణంబులున్= రంభ మొదలైన అచ్చరల సమూహమూ; కొలువన్= సేవించగా; అభిమత భోగంబులు= ఇష్టసౌఖ్యాలు; అనుభవించుచున్; మదంబు మిగిలి= గర్వం అతిశయించి; మన్మథ+అధీనుండు+ఐ= మన్మథుడికి వశపడినవాడయి; వర్తిల్లు సమయంబునన్= ఉన్నసమయంలో; ఒక్కనాఁడు.

తాత్పర్యం: ఈ విధంగా ఇచ్చి, అమిత బలయుక్తుడిగా చేసి, తీసికొనివెళ్ళి పూజ్యమైన దేవరాజ్యాని కభిషిక్తుడిని చేయగా, ఆ నహుషుడు మిక్కిలి ధర్మరతుడై, కిన్నరులూ, కింపురుషులూ, గరుడులూ, గంధర్వులూ, సిద్ధులూ, విద్యాధరులూ మున్నగు ఎల్ల దేవతలనుండి తేజస్సుల అంశాలు పుచ్చుకొని మహాత్ముడై దేవతలూ, మునులూ సేవించే ఆ దేవేంద్ర పదవిని స్వీకరించి, తుంబురుడూ నారదుడూ మొదలయిన వినోదాన్ని కలిగించేవారూ, రంభ మొదలయిన అచ్చరల సమూహాలూ సేవిస్తూండగా, ఇష్టభోగా లనుభవిస్తూ, మదం అతిశయించి మన్మథవశుడయి ఉన్న సమయంలో ఒకనాడు.

తే. మహిత లావణ్యమున నసమాన యనఁగఁ । జనిన పౌలోమి యా నహుషునకు నయన
మార్గగోచర యగుటయు, మదన బాణ । భిన్న హృదయుఁడై, ధృతిఁబాయఁబెట్టి యతఁడు. 149

ప్రతిపదార్థం: మహిత లావణ్యమునన్= గొప్పదిఐన దేహకాంతియందు; అసమాన+అనఁగన్+చనిన= సాటిలేనిది అనదగిన; పౌలోమి= శచి; ఆ నహుషునకున్; నయన మార్గ గోచర+అగుటయున్= కన్నుల త్రోవలో కనబడినదికాగా(కంటికగపడగా); అతఁడు; మదన బాణ భిన్న హృదయుఁడు+ఐ= మన్మథ బాణాలచేత భేదింపబడిన హృదయం కలవాడయి; ధృతిన్= ధైర్యాన్ని; పాయన్+పెట్టి= కోలుపోయి.

తాత్పర్యం: గొప్పదిఅయిన మేనికాంతితో సాటిలేనిది అనదగిన శచీదేవి ఆ నహుషుడి కంటబడగా అతడు మదనపరవశుడయి, ధైర్యం కోలుపోయి.

విశేషం: పౌలోమి-పులోముడనే దానవుడి కూతురు. ఇంద్రుడు పులోముడిని సంహరించి, అతడి పుత్రిక అయిన శచిని పెండ్లాడాడు.

క. 'సురలోక రాజ్య పదవిన్ । గరిమంబున నున్న నన్నుఁ గవయం బరమా
దరలీలఁ జతురయగు నీ । సరసిజముఖి రామి యేమి చందమొ తలఁపన్?' 150

ప్రతిపదార్థం: సుర లోక రాజ్య పదవిన్= స్వర్గ రాజ్యాధిపత్యంలో; గరిమంబునన్= గొప్పతనంతో; ఉన్న; నన్నున్; కవయన్= కూడటానికి; చతుర+అగు= నేర్పరిఅయిన; సుందరిఅయిన; ఈ సరసిజముఖి= పద్మంవంటి ముఖంకల ఈమె; పరమ+ఆదర లీలన్= మిక్కిలి ఆదరంతో; రామి= రాకపోవటం; తలఁపన్= ఆలోచించగా; ఏమి చందమొ?= ఏమి కారణమో?

తాత్పర్యం: 'స్వర్గరాజ్యాధిపత్య పదవిలో మహావైభవంతో ఉన్న నన్ను కూడటానికి సుందరాంగిఅయిన ఈ పద్మవదన మిక్కిలి ఆదరంతో రాకపోవటానికి ఏమి కారణం అయి ఉంటుంది?'

క. అని యప్పొలఁతిం బిలిపిం । చిన, నదియును భయము నొంది, శీఘ్రము దేవే
జ్యుని సదనమునకు శరణం । బనుచుం జనుటయును వాసవాచార్యుండున్. 151

ప్రతిపదార్థం: అని; ఆ+పొలఁతిన్= ఆ కాంతను-శచిని; పిలిపించినన్= పిలిపించగా; అదియును= ఆమెయు; భయమున్+ ఒంది= భయపడి; శీఘ్రము+అ= వెంటనే; దేవ+ఇజ్యుని సదనంబునకున్= దేవగురువైన బృహస్పతి యింటికి; శరణంబు+ అనుచున్= శరణంటూ; చనుటయును= వెళ్ళగా; వాసవ+ఆచార్యుండున్= దేవగురుడునూ - బృహస్పతియూ.

తాత్పర్యం: అని ఆ శచీదేవిని పిలిపించగా, ఆమె భయపడి వెంటనే బృహస్పతి ఇంటికి శరణంటూ వెళ్ళగా ఆయన.

వ. పరమాదరంబున నద్దేవిని గారవించి 'నిన్ను నహుషు దుర్వినయంబుఁ బొరయకుండ నరయువాఁడ; నాఖండలుండు నా యత్నంబున నవశ్యంబును దడయక వచ్చు' నని యూఱడించిన. 152

ప్రతిపదార్థం: పరమ+ఆదరంబునన్= మిక్కిలి ఆదరంతో; ఆ+దేవిని= ఆ శచీదేవిని; గారవించి= గౌరవించి; నిన్నున్; నహుష దుర్వినయంబున్= నహుషుడి దుష్ప్రవర్తనను; పొరయక+ఉండన్= పొందకుండా; అరయువాఁడన్= రక్షిస్తాను;

ఆఖండలుండు= ఇంద్రుడు; నా యత్నంబునన్= నా ప్రయత్నంచేత; అవశ్యంబును= తప్పకుండా; తడయక= వెంటనే; వచ్చున్; అని; ఊఱడించినన్= ఓదార్చగా.

తాత్పర్యం: మిక్కిలి ఆదరంతో ఆ శచీదేవిని గౌరవించి 'నిన్ను నహుషుడి దుష్ప్రవర్తన బారిన పడకుండా కాపాడుతాను. ఇంద్రుడు నా ప్రయత్నంచేత తప్పక వెంటనే వస్తాడు' అని ఓదార్చగా.

క. అది యెల్ల నెఱిఁగి కోపం । బొదవఁగ నహుషుండు 'గురున కుచితమె యే న
మ్ముదితం బిలిపింపఁగఁ దన । సదనంబున నునుచు' టనియె సంక్షుభితుండై. 153

ప్రతిపదార్థం: అది+ఎల్లన్= అదంతా; ఎఱిఁగి= తెలిసి; కోపంబు+ఒదవఁగన్= కోపం పుట్టగా; నహుషుండు; సంక్షుభితుండు+ఐ= కలతపడినవాడయి; ఏను= నేను; ఆ+ముదితన్= ఆ ఇంతిని- శచిని; పిలిపింపఁగన్= పిలిపించగా; తన సదనంబునన్= తన ఇంటిలో; ఉనుచుట= ఉంచటం; గురునకున్= బృహస్పతికి; ఉచితమె?= తగునా?; అనియెన్.

తాత్పర్యం: అదంతా తెలిసి, కోపంతో నహుషుడు కలత చెంది 'నేను ఆ శచిని పిలిపిస్తే, తన ఇంటిలో ఉంచటం బృహస్పతికి తగునా?' అన్నాడు.

చ. అనుడు మునీంద్రులున్ సురలు 'నక్కట నీ మహనీయ గౌరవం
బునకుఁ బరాంగనం గవయుబుద్ధి జనించుట యీడుగాదు' నా
విని, 'మును పూని యిమ్మెయి వివేకము గౌతముభార్యఁ బాకశా
సనుఁ డెడఁ గోరుచోఁ గఱపఁ జాలర మీ రది యెట్లు సెప్పుఁడా!' 154

ప్రతిపదార్థం: అనుడున్= అనినంతనే; ముని+ఇంద్రులున్= మునిశ్రేష్ఠులూ; సురలున్= దేవతలూ; అక్కట= అయ్యో; నీ మహనీయ గౌరవంబునకున్= నీ మహా మహత్త్వానికి; పర+అంగనన్= పరస్త్రీని; కవయు బుద్ధి= కూడాలనే తలపు; జనించుట= పుట్టటం; ఈడు+కాదు= సరి కాదు; నాన్= అనగా; విని; మును= పూర్వం; పాకశాసనుఁడు= పాకుడనే రాక్షసుడిని చంపినవాడు- ఇంద్రుడు; గౌతముభార్యన్= గౌతమ ముని భార్యను - అహల్యను; ఎడన్= హృదయంలో; కోరుచోన్= కామించినప్పుడు; మీరు; పూని= ప్రయత్నించి; ఈ+మెయి వివేకమున్= ఈ విధమైన జ్ఞానం; కఱపన్+చాలరు+అ= బోధించలేకపోయారా?; అది+ఎట్లు+చెప్పుఁడా!= అది ఎట్లాగో చెప్పండి. (ఏ విధంగా సమర్థించుకొనగలరో చెప్పండి అనిభావం.)

తాత్పర్యం: అనగానే మునివరులూ, దేవతలూ 'అయ్యో! నీ మహామహత్త్వానికి పరస్త్రీని కూడాలనే తలంపు పుట్టటం తగదు' అనగా నహుషుడు విని 'పూర్వం ఇంద్రుడు గౌతమమహర్షిభార్యఅయిన అహల్యను హృదయంలో కామించినప్పుడు మీరు ప్రయత్నించి అతనికి ఇటువంటి జ్ఞానం బోధించలేకపోయారా? అది ఎట్లాగో చెప్పండి.'

విశేషం: ఇంద్రుడు గౌతముడి భార్యయైన అహల్యను కామించి అర్ధరాత్రి కోడియై గౌతమాశ్రమ సమీపంలో కూయగా, గౌతముడు తెల్లవారిన దనుకొని స్నానార్థం వెళ్ళాడు. అప్పుడు ఇంద్రుడు ఆశ్రమంలో ప్రవేశించి అహల్యను కూడాడు.

వ. అనుచు నతండు కోపించిన, భయంబుఁగొని వార లా పౌలోమి నతని పాలికిం దోడ్కొని వచ్చువారై పూని బృహస్పతికడకుం జని యద్దేవి వినుచుండ నిట్లనిరి. 155

ప్రతిపదార్థం: అనుచున్; అతండు= నహుషుడు; కోపించినన్; వారలు= ఆ మునులు, దేవతలు; భయంబున్+కొని= భయపడి; ఆ పౌలోమిన్= ఆ శచీదేవిని; అతని పాలికిన్= అతడి వద్దకు; తోడ్కొని వచ్చువారు+ఐ= తీసికొని రాగోరినవారయి; పూని= ప్రయత్నించి; బృహస్పతి కడకున్= బృహస్పతి దగ్గరకు; చని= వెళ్ళి; ఆ+దేవి= ఆ శచి; వినుచున్+ఉండన్= వింటూండగా; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: అంటూ నహుషుడు కోపపడగా, ఆ మునులు, దేవతలు భయపడి శచీదేవిని అతడి వద్దకు తీసికొని రావాలని పూని బృహస్పతి దగ్గరకు వెళ్ళి ఆ శచి వింటూండగా ఇట్లా అన్నారు.

క. 'నహుషుఁడు మహేంద్ర పదవీ । సహితుఁడు; శచికిన్ వరింపఁ జను నాతని; లో
కహితంబు గాఁగఁ బుచ్చుము । మహాత్మ! తచ్చిత్తమున యమర్షం బడఁగన్.' 156

ప్రతిపదార్థం: నహుషుఁడు; మహేంద్ర పదవీ సహితుఁడు= మహేంద్ర పదవితో కూడుకొన్నవాడు; ఆతనిన్; వరింపన్= కోరటానికి; శచికిన్; చనున్= తగును; మహాత్మ!= మహానుభావా; తద్+చిత్తమున+అమర్షంబు= అతడి మనస్సునందలి కోపం; అడఁగన్= పోయేటట్లు; లోకహితంబు+కాఁగన్= లోకశ్రేయస్సు అయ్యేటట్లు; పుచ్చుము= పంపుము.

తాత్పర్యం: 'నహుషు డిప్పుడు మహేంద్ర పదవీ సమన్వితుడు. అతడిని వరించటం శచికి సముచితం. మహానుభావా! అతడి మనస్సులోని కోపం పోయేటట్లు, లోకాలకు మేలుకలిగేటట్లు ఆమెను పంపుము.'

క. అనవుడు శోకం బడరఁగ । ననిమిషగురుఁ జూచి యిట్టులను శచి 'యటుపు
చ్చిన దూఱు రాదె? నను శుచి । యని మీ కొనియాడు టెల్ల నన్నృతము గాదే?'. 157

ప్రతిపదార్థం: అనవుడున్= అని దేవతలు, మునులనగా; శచి= శచీదేవి; శోకంబు= దుఃఖం; అడరఁగన్= పొంగిరాగా; అనిమిషగురున్= దేవతల గురువైన బృహస్పతిని; చూచి; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నది; ననున్= నన్ను; అటు పుచ్చినన్= ఆ నహుషుడున్న చోటికి పంపితే; దూఱు-రాదె= అపనింద కలుగదా! (పాపం కాదా? దోషం పుట్టదా?); ననున్= నన్ను; శుచి= పవిత్రురాలు; అని= అంటూ; మీ కొనియాడుట+ఎల్లన్= మీ పొగడటమంతా; అనృతము+కాదే!= కల్లబొల్లి (అబద్ధం)కాదా?

తాత్పర్యం: దేవతలు ఆ విధంగా అనగానే శచీదేవి దుఃఖంతో తల్లడిల్లుతూ బృహస్పతితో ఇట్లా పలికింది. 'నన్ను మీరు నహుషుడి వద్దకు పంపితే దోషం కాదా? నిందరాదా? పాపంకాదా? మీ రందరూ ఇన్నాళ్ళబట్టి పవిత్రురాల నని నన్ను పొగడటమంతా కల్లబొల్లి మాటలేనా?

వ. అనిన విని దరహసితవదనుం డగుచుఁ బురుహూత పురోహితుండు. 158

ప్రతిపదార్థం: అనినన్= అని శచీదేవి పలుకగా; పురుహూత పురోహితుండు= ఇంద్రుడి గురువు బృహస్పతి; విని; దరహసిత వదనుండు+అగుచున్= చిరునవ్వుతోడి ముఖం కలవాడవుతూ.

తాత్పర్యం: అని శచీదేవి పలుకగా బృహస్పతి విని చిరునవ్వు నవ్వుతూ.

క. 'నహుషుండు పనుచువాఁ డటె! । విహితానుష్ఠానపరులు వీ రటె! తా లో
కహితం బటె! యిది మనకున్ । మహనీయమ కాక యెట్లు మానఁగవచ్చున్?' 159

ప్రతిపదార్థం: నహుషుండు; పనుచువాఁడు+అటె!= ఆజ్ఞాపించే వాడట!; వీరు= ఈ మునులు, వేల్పులు; విహిత+ అనుష్ఠానపరులు+అటె!= విధిని ఆచరించడంలో ఆసక్తి కలవారట!; తాన్= అది; లోకహితంబు+అటె!= లోకానికి మేలట!; ఇది; మనకున్; మహనీయము+అ కాక= గొప్పపనేకాక; ఎట్లు మానఁగన్+వచ్చున్?= ఎట్లా మానగలం?

తాత్పర్యం: 'నహుషుడు ఆజ్ఞాపించేవాడట! ఈ మునులు, వేల్పులు విధిని ఆచరించటంలో ఆసక్తి కలవారట! అది లోకానికి మేలు కూర్చేదట! ఇంతటి గొప్ప పనిని మనం చేయకుండా ఎట్లా ఉండగలం!'

విశేషం: బృహస్పతి వారి మాటలను విపరీత లక్షణచేత అధిక్షేపించటం గమనించతగింది.

వ. అని యుల్లసం బాడి యనిమిషులను ఋషులను జూచి యిట్లనియె. 160

ప్రతిపదార్థం: అని; ఉల్లసంబు+ఆడి= ఎత్తిపొడిచి; అనిమిషులను= దేవతలను; ఋషులను= మునులనూ; చూచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ఎత్తిపొడిచి బృహస్పతి దేవతలనూ, మునులనూ చూచి ఇట్లా అన్నాడు.

తే. 'శరణు సొచ్చిన రక్షింపఁ జాలియుండి । కడపి పుచ్చిన నూర్ధ్వలోకములు దప్పు,
బుణ్యకర్మంబు లఫలతఁ బొందు ననఁడె । కమలగర్భుండు దొల్లి జగద్ధితముగ?' 161

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; కమలగర్భుండు= బ్రహ్మ; జగత్+హితముగన్= లోకశ్రేయస్సుగా; శరణు+చొచ్చినన్= శరణని వస్తే; రక్షింపన్+చాలి+ఉండి= కాపాడగలిగి ఉండీ; కడపి పుచ్చినన్= పొమ్మని పంపేస్తే; ఊర్ధ్వ లోకములు= పైలోకాలు - పుణ్యలోకాలు; తప్పున్= ఉండవు; పుణ్యకర్మంబులు= పుణ్యకార్యాలు; అఫలతన్+పొందున్= ఫలించవు; అనఁడె?= అనలేదా?

తాత్పర్యం: 'పూర్వం బ్రహ్మ లోకశ్రేయస్సు కాంక్షించి, శరణన్న వారిని కాపాడగలిగి ఉండీ పొమ్మని పంపేస్తే పుణ్యలోకాలు ఉండవనీ, పుణ్యకార్యాలు ఫలించవనీ అనలేదా?'

వ. అని యనురూపాలాపంబుల నిషేధింప, వార 'లట్లేనిఁ గర్తవ్యం బెయ్యది యూహింపు' మనిన, 'నద్దేవి నహుషుకడకుం జని సముచితంబుగాఁ దదీయ సాంగత్యంబున కెడవలికికొని వచ్చునది; యటమీఁద మన మందఱముం బురందరున కభ్యుదయం బగుతెఱంగాచరించువార' మనుటయు, వాచస్పతి వచనంబులకు సంతసించి సుర సంయమి సంఘంబు లరిగిన యనంతరంబ. 162

ప్రతిపదార్థం: అని; అనురూప+ఆలాపంబులన్= తగిన మాటలతో; నిషేధింపన్= త్రోసిపుచ్చగా; వారలు= ఆ మునులూ, దేవతలూ; అట్లు+ఏనిన్= అట్లా అయితే; కర్తవ్యంబు= చేయదగినది; ఎయ్యది= ఏదో; ఊహింపుము= ఆలోచించుము; అనినన్; ఆ+దేవి= ఆ శచి; నహుషు కడకున్= నహుషుడి వద్దకు; చని= వెళ్ళి; సముచితంబుగాన్= తగిన విధంగా; తదీయ సాంగత్యంబునకున్= అతనితో కలయికకు; ఎడ+పలికికొని వచ్చునది= వ్యవధి కావాలని చెప్పి రావాలి; అట మీఁదన్= ఆపై; మనము+అందఱమున్= మనమంతా; పురందరునకున్= ఇంద్రుడికి; అభ్యుదయంబు+అగు తెఱంగు= శుభం కలిగే విధం; ఆచరించువారము= చేద్దాము; అనుటయున్= అనగానే; సుర సంయమి సంఘంబులు= దేవతల, మునుల సమూహాలు; వాచస్పతి వచనంబులకున్= బృహస్పతి మాటలకు; సంతసించి= సంతోషించి; అరిగిన+అనంతరంబు+అ= వెళ్ళిన వెంటనే.

తాత్పర్యం: అని తగిన మాటలతో ప్రోత్సహించి ఇచ్చగా, వారు 'అట్లా అయితే కర్తవ్యమేదో ఆలోచించుము' అనగా, 'ఆదేవి నహుషుడి వద్దకు వెళ్ళి తగినట్లుగా అతడితోడి కలయికకు వ్యవధి కావాలని అడిగి రావాలి. తరువాత మనమందరం ఇంద్రుడికి అభ్యుదయం కలిగే విధం చేద్దాం' అనగా, దేవతల మునుల సమూహాలు బృహస్పతి మాటలకు సంతోషించి వెళ్ళారు. వెంటనే.

క. పౌలోమియు నా నహుషుని । పాలికిఁ జనుటయు, నతండు భావజ వికృతి
వ్యాలోల మానసుం డయి । లీలా సంభావనా లలిత ముఖుఁ డయ్యెన్. 163

ప్రతిపదార్థం: పౌలోమియున్= శచీదేవియూ; ఆ నహుషుని పాలికిన్= ఆ నహుషుడి వద్దకు; చనుటయున్= వెళ్ళగా; అతండూ= ఆ నహుషుడు; భావజ వికృతి వ్యాలోల మానసుండు+అయి= మన్మథ వికారంచేత సంచలించిన మనస్సు కలవాడయి; లీలా సంభావనా లలిత ముఖుఁడు= విలాస భావాలతో అందమైన ముఖం కలవాడు; అయ్యెన్.

తాత్పర్యం: శచీదేవియూ ఆ నహుషుడి వద్దకు వెళ్ళగా, అతడు మన్మథ వికారంచేత సంచలించిన మనస్సు కలవాడయి, విలాస భావ సుందరమైన ముఖం కలవాడు అయ్యాడు.

వ. అట్టియెడ. 164

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

ఉ. అల్లన యింతి యిట్లనియె 'నారసి వాసవు కల్మిలేమియుం
దెల్లముగా నెఱింగికొని తేఁకువలే కిట వచ్చు టొప్పు; నా
యుల్లము శంకితం బగుచు నుండఁగ వేగిరపాటు మేలె? నీ
వెల్ల నెఱుంగు; దిప్పు డెడ యిచ్చుట యుక్తము నాకుఁ జూడఁగన్. 165

ప్రతిపదార్థం: ఇంతి= స్త్రీ - శచి; అల్లన= మెల్లగా; ఇట్లు+అనియెన్; వాసవు కల్మి లేమియున్= ఇంద్రుడు ఉండటం; లేకపోవటం; ఆరసి= విచారించి; తెల్లముగాన్= స్పష్టంగా; ఎఱింగికొని= తెలిసికొని; తేఁకువ లేక= భయం లేకుండా; ఇట వచ్చుట+ఒప్పున్= ఇక్కడికి రావటం బాగుంటుంది; నా ఉల్లము= నా మనస్సు; శంకితంబు+అగుచున్+ఉండఁగన్= సందేహంతో భయపడుతూ ఉండగా; వేగిరపాటు= తొందరపడటం; మేలె?= మంచిదా?; నీవు; ఎల్లన్= అంతా; ఎఱుంగుదు(వు); నాకున్; చూడఁగన్; ఇప్పుడు; ఎడ= వ్యవధి; ఇచ్చుట; యుక్తము= మంచిది.

తాత్పర్యం: శచి అతనితో మెల్లగా ఇలా అన్నది. 'ఇంద్రుడు ఉన్నాడో లేడో బాగా విచారించి స్పష్టంగా తెలిసికొని నిర్భయంగా ఇక్కడికి రావటం బాగుంటుంది. నా మనస్సు శంకతో జంకుతూ ఉండగా తొందరపడటం మేలా? నీకంతా తెలుసు. ఇప్పుడు నాకు వ్యవధి ఇవ్వటం మంచిదని నా అభిప్రాయం'.

వ. అని యొడంబఱిచి కొండొకకాలం బెడ వలికికొని యింద్రాణియు మగుడం జనుదెంచె; నమరగణంబును మునిజన సహితంబుగ విష్ణుదేవు పాలికి రహస్యవృత్తిం బోయి, జిష్ణుని దురితంబు వాపుటఁ గోరిన, శౌరి కరుణాయత్తచిత్తుండై. 166

ప్రతిపదార్థం: అని; ఒడంబఱిచి= సమ్మతింపజేసి; కొండొక కాలంబు= కొంతకాలం; ఎడ+పలికికొని= వ్యవధి నడుగుకొని; ఇంద్రాణియున్= శచీదేవియు; మగుడన్+చనుదెంచెన్= మరలి వచ్చింది; అమర గణంబులును= దేవతా సమూహాలునూ; ముని జన సహితంబుగన్= మునిజనులతో కూడా; విష్ణుదేవు పాలికిన్= విష్ణుదేవుడి వద్దకు; రహస్య వృత్తిన్= రహస్య వ్యాపారంతో; పోయి; జిష్ణుని దురితంబు= ఇంద్రుడి బ్రహ్మహత్యాపాపం; పాపుటన్= పోగొట్టటం; కోరినన్= కోరగా; శౌరి= విష్ణుడు; కరుణా+ఆయత్తచిత్తుండు+ఐ= దయకు అధీనమైన మనస్సు కలవాడయి.

తాత్పర్యం: అని ఒప్పించి కొంతకాలం వ్యవధి అడిగి శచి తిరిగి వచ్చింది. దేవతలు మునులతో కూడా రహస్యంగా విష్ణుమూర్తి వద్దకు వెళ్ళి ఇంద్రుడి పాపం పోగొట్టుమని కోరగా, విష్ణువు దయాధీన మనస్కుడయి.

క. 'హయమేధంబున నాకుం । బ్రియ మొనరింపంగ వృత్రభేదికిఁ బుణ్యో
దయ మగు' నావుడు వారలు । రయమునఁ జని రందఱుం బురందరు కడకున్. 167

ప్రతిపదార్థం: హయమేధంబునన్= అశ్వమేధయాగంచేత; నాకున్; ప్రియము+ఒనరింపంగన్= సంతోషం కలిగిస్తే; వృత్ర భేదికిన్= ఇంద్రుడికి; పుణ్య+ఉదయము+అగున్= పుణ్యం కలుగుతుంది; నావుడున్= అనగానే; వారలు; అందఱున్; పురందరు కడకున్= ఇంద్రుడి దగ్గరకు; రయంబునన్= వేగంగా; చనిరి= వెళ్లారు.

తాత్పర్యం: 'అశ్వమేధయాగం చేసి నాకు ప్రీతి కలిగిస్తే ఇంద్రుడికి పుణ్యం లభిస్తుంది' అనగానే వారందరూ ఇంద్రుడి దగ్గరకు వేగంగా వెళ్ళారు.

ఇంద్రుండు నహుషు తేజోవిశేషంబు సూచి మఱుఁగువడుట (సం. 5-13-16)

క. చని యతని నశ్వమేధం । బునఁ గల్మషరహితుఁ జేయఁ బురుహూతుండుం
దన పురికి నరిగి నహుషుం । గని తత్తేజోవిశేషకంపితుఁ డయ్యెన్. 168

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; అతనిన్; అశ్వమేధంబునన్= అశ్వమేధ యాగంచేత; కల్మషరహితున్+చేయన్= నిష్పాపుడిని చేయగా; పురుహూతుండున్= ఇంద్రుడునూ; తన పురికిన్= తన పట్టణానికి; అరిగి= వెళ్ళి; నహుషున్+కని= నహుషుడిని చూచి; తద్+తేజస్(ః)+విశేష కంపితుఁడు= అతడి తేజస్సు యొక్క ఆధిక్యంచేత చలించినవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: వెళ్ళి, అతడిని అశ్వమేధయాగంచేత పాపరహితుడిని చేయగా, ఇంద్రుడు తన పట్టణానికి వెళ్ళి, నహుషుడిని చూచి అతని తేజోవిశేషానికి భయకంపితుడయ్యాడు.

వ. ఇట్లు వృత్రారి తన బ్రహ్మహత్య వాయుటయేకాని నహుషునంత బలంబు లేమింజేసి భయా కులితచిత్తుండై. 169

ప్రతిపదార్థం: ఇట్లు; వృత్ర+అరి= వృత్రుని శత్రువు - ఇంద్రుడు; తన బ్రహ్మహత్య= తన బ్రహ్మహత్యాపాపం; పాయుటయే కాని= పోగొట్టుకొనటమే కాని; నహుషు+అంత బలంబు= నహుషుడిబలం అంతబలం; లేమిన్+చేసి= లేకపోవటంచేత; భయ+ఆకులిత చిత్తుండు+ఐ= భయంచేత కలతచెందిన మనస్సు కలవాడయి.

తాత్పర్యం: ఈ విధంగా ఇంద్రుడు తన బ్రహ్మహత్యాపాతకం పోగొట్టుకొనటమేకాని, నహుషుడి కున్నంత బలం తనకు లేకపోవటంచేత భయంతో కలతచెందిన మనస్సు కలవాడై.

క. ఎందేనిఁ జనియె నాతని । సుందరియును నెమ్మనమున శోకోద్రేకం
బొంది 'పురందరుఁ డరిగిన । కందువ యే నిప్పు డెట్లు గాంతునొ?' యనుచున్. 170

ప్రతిపదార్థం: ఎందున్+ఏనిన్= ఎక్కడికో; చనియెన్= వెళ్ళాడు; ఆతని సుందరియును= ఆతని భార్యయైన శచియు; నెఱ+మనమునన్= నెమ్మదిలో; శోక+ఉద్రేకంబు= దుఃఖాతిశయం; ఒంది= పొంది; పురందరుఁడు= ఇంద్రుడు; అరిగిన కందువ= వెళ్ళినచోటు; ఏను= నేను; ఇప్పుడు; ఎట్లు; కాంతునొ?= కనుగొంటానో?; అనుచున్.

తాత్పర్యం: ఎక్కడికో వెళ్ళాడు. అతడి భార్యఅయిన శచీదేవి తన మనస్సులో దుఃఖాతిశయం పొంది 'ఇంద్రుడు వెళ్ళిన చోటు నే నిప్పు డెట్లా తెలిసికొంటానో అని అనుకొంటూ.

వ. నిశాసమయంబున నుపశ్రుతి నారాధించినఁ దదీయాధి దేవత 'నీ సత్యంబువలన నీ మగనిం గను'దని చెప్పి, యనంతరంబ సాకారయై పొడసూపినఁ బౌలోమి 'నీవెవ్వ?'రవని యడిగిన, నదియును 'భవత్పాతివ్రత్య సత్య శౌచంబులకుఁ బ్రియంబంది వచ్చితి; నుపశ్రుతి' నని చెప్పి, 'నీకుం బాకశాసనుం జూపెదర'మ్మని తోడ్కొని హిమవంతంబు నుత్తరంబున మంజుమంతంబను మహాశైలంబున కరిగి, దానియందు శతయోజన విస్తీర్ణంబైన యొక్క సరోవరంబు సొచ్చి, యచ్చట నుల్లసిల్లు పంచవర్ణ కమనీయంబులగు కమలంబులలో నొక్క నాళంబు భేదించి, ముందటఁ బ్రవేశించె; నింద్రాణియుం దోడన చని తదీయ తంతుమధ్యంబున సూక్ష్మరూపంబున నున్న సురపతిం గన్నంత, నయ్యుపశ్రుతి యదృశ్యం బగుటయు. 171

ప్రతిపదార్థం: నిశా సమయంబునన్= రాత్రివేళ; ఉపశ్రుతిన్= పలుకుల ద్వారా శుభాశుభాలను సూచించే దేవతను; ఆరాధించినన్= పూజించగా; తదీయ+అధిదేవత= ఆ ఉపశ్రుతికి సంబంధించిన అధిష్ఠానదేవత; నీ సత్యంబు వలనన్; నీ మగనిన్ కనుదు(వు)+అని చెప్పి= చూస్తావని చెప్పి; అనంతరంబు+అ= వెంటనే; స+ఆకార+ఐ= రూపంతో కూడినదై; పొడసూపినన్= ప్రత్యక్షంకాగా; పౌలోమి= శచి; నీవు+ఎవ్వరవు+అని+అడిగినన్= అదియును; భవత్+పాతివ్రత్య, సత్య, శౌచంబులకున్= నీ పాతివ్రత్యానికీ, సత్యానికీ, శుచిత్వానికీ; ప్రియంబు+అంది= సంతోషించి; వచ్చితిన్; ఉపశ్రుతిన్; అని చెప్పి; నీకున్; పాకశాసనున్= ఇంద్రుడిని; చూపెదన్, రమ్ము+అని= చూపిస్తారు రా అని; తోడ్కొని= వెంటబెట్టుకొని; హిమవంతంబు+ఉత్తరంబునన్= హిమవత్పర్వతానికి ఉత్తరంగా; మంజుమంతంబు+అను; మహత్ (మహా) శైలంబునకున్= మంజుమంతమనే పెద్ద పర్వతం దగ్గరకు; అరిగి= వెళ్ళి; దానియందున్; శత యోజన విస్తీర్ణంబు+ఐన= నూ రామడల వైశాల్యం కల; ఒక్క సరోవరంబు+చొచ్చి= ఒక కొలనిలో ప్రవేశించి; అచ్చటన్; ఉల్లసిల్లు= వికసించే; పంచ వర్ణ కమనీయంబులు+ అగు= అయిదు రంగులచేత అందమైనవగు; కమలంబులలోన్= పద్మాలలో; ఒక్క నాళంబున్= ఒక కాడను; భేదించి= చీల్చి; ముందటన్= ముందుగా; ప్రవేశించెన్; ఇంద్రాణియున్= శచీదేవియు; తోడన్+అ= వెంటనే; చని; తదీయ తంతు మధ్యంబున= దాని సూత్రం నడుమ; సూక్ష్మ రూపంబునన్= సూక్ష్మాకారంతో; ఉన్న; సురపతిన్= ఇంద్రుడిని, కన్న+అంతన్= చూచిన తరువాత; ఆ+ఉపశ్రుతి; అదృశ్యంబు+అగుటయున్= మాయం కాగా.

తాత్పర్యం: రాత్రివేళ ఉపశ్రుతిని పూజించగా, దాని అధిష్ఠాన దేవత 'నీ సత్యం వల్ల నీవు నీ భర్తను చూస్తా' వని చెప్పి, వెంటనే నిజాకారంతో ప్రత్యక్షం కాగా, శచీదేవి 'నీవెవ్వరవు?' అని అడిగింది. అది 'నేను ఉపశ్రుతిని. నీ పాతివ్రత్యానికీ శుచిత్వానికీ సంతోషించి వచ్చాను' అని చెప్పి, 'నీకు ఇంద్రుడిని చూపిస్తాను, రా' అని వెంట బెట్టుకొని హిమవంతానికి ఉత్తరంగా ముంజుమంత మనే పెద్ద పర్వతం వద్దకు వెళ్ళి, దానియందు నూరామడల

వైశాల్యంకల ఒక కొలనిలో ప్రవేశించి, అక్కడ వికసించిన అయిదు రంగుల సుందర పద్మాలలో ఒకదాని కాడను చీల్చి తాను ముందు ప్రవేశించింది. శచీదేవి కూడా వెంటనే వెళ్ళి దాని దారాల నడుమ సూక్ష్మరూపంతో ఉన్న ఇంద్రుడిని చూచింది. వెంటనే ఆ ఉపశ్రుతి మాయమైపోయింది.

విశేషం: భవత్పాతివ్రత్య శౌచంబులకు - అని వావిళ్ళవారి ప్రతి. 'ముంజివంత'మని మున్నంగి శర్మ పరిష్కృతమైన ప్రతిలోను, తెలుగు విశ్వవిద్యాలయప్రతిలోను ఉండగా, మంజుమంతమని వావిళ్ళ ప్రతి. ఔత్తరాహ దాక్షిణాత్య సంస్కృత భారత ప్రతులలో దేనిలోనూ ఆ పర్వతం పేరే లేదు. పైగా మూలంలో శచి హిమవంతం దాటి ఉత్తర పార్శ్వానికి వెళ్ళి, బహుయోజన విస్తృతమైన సముద్రాన్నీ, అందులో ఒక మహాద్వీపాన్నీ, అక్కడ నానా పక్షి సమన్వితమైన ఒక సరస్సునూ చూచినట్లు ఉన్నది.

'హిమవన్త మతిక్రమ్య ఉత్తరం పార్శ్వ మాగమత్,
సముద్రం చ సమాసాద్య బహు యోజన విస్తృతమ్.
ఆససాద మహాద్వీపం నానాద్రుమ లతా యుతమ్,
తత్రాపశ్యత్ సరో దివ్యం నానా శకునిభిర్యుతమ్. (ఉద్యోగ. 15-6,7.)

క. **పతిసన్నిధి వడసి మహా। ద్భుత మందెడు శచి తదీయ పూర్వ సుకర్మ**
స్తుతి సేయుచు నిలిచిన, నతఁ। డతివం గని సంభృతాదరాత్ముం డగుచున్. 172

ప్రతిపదార్థం: పతి సన్నిధి+పడసి= భర్త సన్నిధిని పొంది; మహత్(మహా)+అద్భుతము+అందెడు శచి= మిక్కిలి ఆశ్చర్యపడే శచి, తదీయ పూర్వ సుకర్మ స్తుతి+చేయుచున్= ఆతడి వెనుకటి మంచి పనుల పొగడ్త చేస్తూ; నిలిచినన్= ఉండగా; అతఁడు; అతివన్= స్త్రీని-భార్యను; కని, సంభృత+ఆదర+ఆత్ముండు+అగుచున్= సంపూర్ణమైన ఆదరంతో కూడిన మనస్సు కలవాడవుతూ.

తాత్పర్యం: భర్త సమీపానికి వెళ్ళిన శచీదేవి మిక్కిలి ఆశ్చర్యపడుతూ అతడి వెనుకటి సత్కర్మలను పొగడుతూ ఉండగా, అతడు భార్యను చూచి మిక్కిలి ఆదరంతో కూడిన మనస్సు కలవాడై.

ఉ. **'ఇచ్చట నేను నిల్చు టిది యెట్టు లెఱింగితి? నన్నుఁ గాన నీ**
వచ్చిన కార్య మేమి? యనవద్యగుణోత్తర ! చెప్పు' నావుడుం
బొచ్చెము లేక యా నహుషు పోయిన పోకలు, వానికిం దగం
జెచ్చెరఁ గాలయాపనము సేసిన భంగియుఁ జెప్పె దేవియున్. 173

ప్రతిపదార్థం: అనవద్య గుణ+ఉత్తర!= అనింద్యాలైన గుణాల చేత శ్రేష్ఠురాలా! శచీ!; నేను; ఇచ్చటన్; నిల్చుట+ఇది; ఎట్టులు+ఎఱింగితి(వి); నన్నున్; కానన్= చూడడానికి; నీ వచ్చిన కార్యము+ఏమి= నీవు వచ్చిన పని యేమిటి? చెప్పు(ము); నావుడున్= అనగానే; దేవియున్= శచీదేవియూ; ఆ నహుషు పోయిన పోకలున్= ఆ నహుషుడు ప్రవర్తించిన విధమూ; వానికిన్; తగన్= ఒప్పుగా, చెచ్చెరన్= శీఘ్రంగా; కాలయాపనము+చేసిన భంగియున్= కాలక్షేపం చేసిన విధమూ; పొచ్చెము లేక= కొరత లేకుండా; చెప్పెన్= చెప్పింది.

తాత్పర్యం: 'గుణవతులలో ఉత్తమురాలా! శచీ! నే నిక్కడ ఉన్నట్లు నీ కెలా తెలిసింది? నీవు నన్ను చూడవచ్చిన పనేమి? చెప్పుము' అనగానే శచీదేవి ఆ నహుషుడు పోయిన పోకడలూ, వాటికి ఒప్పుగా వెంటనే కాలక్షేపం చేసిన విధమూ పొల్లుపోకుండా చెప్పింది.

వ. చెప్పి, యుపశ్రుతి తెఱంగును నతని కెఱింగించి 'దేవా! నీ విత్తఱిం బ్రకాశుండవై, భవత్ప్రతాపంబున నహుషునకుఁ బరాభవం బొనరించి నన్ను రక్షింపక తక్కిన, నుక్కివుండగు నతని పాప నిశ్చయంబున నాపద వచ్చు' ననిన విని వల్లభకు దివిజవల్లభుం డిట్లనియె. 174

ప్రతిపదార్థం: చెప్పి; ఉపశ్రుతి తెఱంగును= ఉపశ్రుతి విధమూ; అతనికిన్; ఎఱింగించి= తెలిపి; దేవా!; నీవు; ఈ+తఱిన్= ఈ సమయంలో; ప్రకాశుండవు+ఐ= బయటపడి; భవత్+ప్రతాపంబునన్= నీ పరాక్రమం చేత; నహుషునకున్; పరాభవంబు= అవమానం; ఒనరించి= చేసి; నన్నున్; రక్షింపక తక్కినన్= కాపాడకపోతే; ఉక్కివుండు+అగు= కపటి అయిన; అతని పాప నిశ్చయంబునన్= అతని దుష్ట నిర్ణయం చేత; ఆపద వచ్చున్= కష్టం కలుగుతుంది; అనినన్; విని; దివిజ వల్లభుండు= దేవరాజు- ఇంద్రుడు; వల్లభకున్= భార్యకు - శచికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ రీతిగా చెప్పి, ఉపశ్రుతి వృత్తాంతం కూడా అతడికి తెలిపి, 'దేవా! నీ విప్పుడు వెలువడి నీ ప్రతాపంచేత నహుషుడిని అవమానించి నన్ను రక్షించకపోతే, వంచకుడైన అతడి దుష్ట నిర్ణయం చేత ఆపద సంభవిస్తుంది' అనగా విని ఇంద్రుడు భార్యతో ఇట్లా అన్నాడు.

క. 'ఆ నహుషు బాహుగర్వ మ। నూనంబై యున్నయది సముజ్జ్వల ముని స
మ్మాన ప్రవృద్ధ మగుటను;। దానం గాలంబు వేచెదను జయమునకున్. 175

ప్రతిపదార్థం: ఆ నహుషు బాహు గర్వము= ఆ నహుషుడి భుజబల గర్వం; సముజ్జ్వల ముని సమ్మాన ప్రవృద్ధము= మిక్కిలి ప్రకాశించే మునుల ఆదరంచేత ఎక్కువగా వృద్ధి పొందింది; అగుటన్= అవటం చేత; అనూనంబు+ఐ+ఉన్న+అది= అనల్పంగా ఉన్నది; దానన్= అందుచేత; జయమునకున్= విజయానికి; కాలంబు వేచెదను= సమయం కనిపెట్టుకొని ఉంటున్నాను.

తాత్పర్యం: 'ఆ నహుషుడి భుజబలగర్వం మునుల సముజ్జ్వలమైన ఆదరంచేత వృద్ధి పొంది ఉండటం చేత అనల్పంగా ఉన్నది. అందుచేత అతడిని జయించటానికి కొంతకాలం వేచి ఉన్నాను.'

చ. తఱి యగు నంతకున్ రిపునుదగ్రత సైఁచుట నీతి; నీవు నా
కఱపిన యట్ల చేయుము; తగం జని యాతనిఁ గాంచి 'నన్ను నె
త్తెఱఁగుననైనఁ బొందఁగ మదిం దలపోఁతయ కల్గెనేనిఁ గ్ర
చ్చఱ 'మునివర్గ వాహనుఁడవై చనుదె' మ్మను; మంతఁ దీఱెడున్. 176

ప్రతిపదార్థం: తఱి+అగు+అంతకున్= సమయం అయ్యేదాకా; రిపు+ఉదగ్రతన్= శత్రువుయొక్క ఉద్ధతిని; సైఁచుట= సహించటం; నీతి; నీవు; నా కఱపిన+అట్లు+అ= నేను చెప్పినట్లే; చేయుము; తగన్= ఒప్పుగా; చని; అతనిన్; కాంచి= చూచి; నన్నున్; ఏ+తెఱఁగునన్+ఐనన్= ఏ విధంగా నైనా; పొందఁగన్= కూడటానికి; మదిన్= మనస్సులో; తలపోఁత+అ= ఉద్దేశమే;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కల్గెన్+ఏనిన్= ఉంటే; క్రచ్చు+అఱన్= శీఘ్రంగా; మునివర్గ వాహనుఁడవు+ఐ= మునుల సమూహం వాహనంగా కలవాడవయి; చనుదెమ్ము= రమ్ము; అనుము; అంతన్+తీఱెడున్= దానితో సమసిపోతాడు, ఆపదతీరిపోతుంది.

తాత్పర్యం: 'సమయం వచ్చేదాకా శత్రుడి ఉద్ధతిని సహించి ఉండటం రాజనీతి; నీవు నేను చెప్పినట్లే చేయుము. నీవు ఒప్పుగా అతడిని చూచి 'నన్ను ఎట్లా అయినా పొందడానికే నీకు ఉద్దేశం ఉంటే, నీవు వెంటనే మునుల సమూహాన్ని వాహనం చేసికొని నా దగ్గరికి రమ్ము అనుము. దానితో వాడి పని అయిపోతుంది.

ఆ. అనిన 'నట్ల కాక' యని పతి వీడ్కొని, । యింతి నహుషుపాలి కేఁగుదెంచె;
నతఁడు దమక మడర నద్దేవిఁ బెద్దయు । నాదరించి యిష్ట మడుగుటయును. 177

ప్రతిపదార్థం: అనినన్; అట్లు+అ+కాక= అట్లాగే; అని; పతిన్= భర్తను; వీడ్కొని= విడిచి; ఇంతి= స్త్రీ - శచి; నహుషు పాలికిన్= నహుషుడి దగ్గరకు; ఏఁగుదెంచెన్= వచ్చింది; అతఁడు= నహుషుడు; తమకము= మోహం; అడరన్= అతిశయించగా; ఆ+దేవిన్= ఆ శచీదేవిని; పెద్దయున్= మిక్కిలి; ఆదరించి= సంభావించి; ఇష్టము+అడుగుటయును= కోరిక అడగ్గా.

తాత్పర్యం: అనగా 'అట్లాగే' అని భర్త దగ్గర సెలవుపుచ్చుకొని, శచీదేవి నహుషుడి దగ్గరకు వచ్చింది. నహుషుడు మోహం అతిశయించగా శచీదేవిని ఎంతో ఆదరించి తనపట్ల ఆమెకు గల కోరికను గురించి అడుగగా.

వ. ఇంద్రాణియు నిట్లనియె: 'మన నిరూపించిన సమయంబునకుఁ గొండొక తడవు గలదు. కాలం బగుటయు నిన్ను వరియించెద; నీవు మహాముని వాహనుండవు గావలయు. అది నాకుఁ బ్రియంబు; నీకు ననన్య సామాన్యం బైన యానంబు తేజోవిశేషకరం బగు' ననిన, నప్పలుకులకు నహుషుండు ప్రహర్షచిత్తుండై. 178

ప్రతిపదార్థం: ఇంద్రాణియున్= శచీదేవియూ; ఇట్లు+అనియెన్; మన నిరూపించిన సమయంబునకున్= మనం నిర్ణయించుకొన్న సమయానికి; కొండొక తడవు= కొంచెం వ్యవధి; కలదు; కాలంబు+అగుటయున్= సమయం కాగానే; నిన్నున్; వరియించెదన్= కోరతాను; నీవు; మహత్(మహా)+ముని వాహనుండవు కావలయున్= నీవు మహర్షులు వాహనంగా కలవాడవు కావాలి; అది; నాకున్; ప్రియంబు= ఇష్టం; నీకున్; అనన్య సామాన్యంబు+ఐన యానంబు= ఇతరులకు ఎవ్వరికీలేని వాహనం; తేజస్(ః)+విశేషకరంబు+అగున్= తేజస్సును అధికం చేసేది అవుతుంది. అనినన్; ఆ+పలుకులకున్= ఆ మాటలకు; నహుషుండు; ప్రహర్షచిత్తుండు+ఐ= మిక్కిలి సంతోషించిన మనస్సు కలవాడయి.

తాత్పర్యం: శచీదేవి ఇట్లా అంది. 'మనం ఏర్పరుచుకొన్న సమయానికి ఇంకా కొంచెం వ్యవధి ఉన్నది. సమయం అయినప్పుడు నిన్ను వరిస్తాను. నీవు మహర్షులు వాహనంగా కలవాడవు కావాలి. అది నాకు ఇష్టం. ఎవరికీ లేని వాహనం నీకు తేజస్సును వృద్ధి పొందిస్తుంది.' అనగా, ఆ మాటలకు నహుషుడు మిక్కిలి సంతోషించిన మనస్సు కలవాడయి.

ఆ. 'ఏను దక్క నొరుల కెవ్వరికైన న । వ్వాహనంబు నెక్క వశమె? నీకు
సమ్మతంబు గాఁగ సప్తర్షిగణము నా । యందలంబు మోవ నరుగుదెంతు.' 179

ప్రతిపదార్థం: ఏను+తక్కన్= నేను తప్ప; ఒరులకున్+ఎవ్వరికిన్+ఐనన్= ఇతరుల కెవరికైనా; ఆ+వాహనంబున్= ఆ వాహనాన్ని; ఎక్కన్+వశమే= ఎక్క తరమా? నీకున్; సమ్మతంబు+కాఁగన్= నీకు ఇష్టం అయ్యేటట్లు; సప్త+ఋషి గణము= ఏడుగురు మునుల సమూహం; నా+అందలంబున్= నా పల్లకీని; మోవన్= మోయగా; అరుగుదెంతున్= వస్తాను.

తాత్పర్యం: 'నేను తప్ప ఇతరుల కెవ్వరికైనా అటువంటి వాహనం ఎక్కటానికి సాధ్యమవుతుందా? నీకు ఇష్టం అయ్యేటట్లు సప్తర్షులు నా పల్లకీ మోస్తూండగా వస్తాను.'

క. అని వనితఁ బంచి, యప్పుడ । మునులం బిలిపించి; మౌర్ఖ్యమునఁ దనకున్ వా
హనముగఁ జేసి, యొకింతయు । ననుమానము లేక తిరిగె నతఁ డెల్లెడలన్. 180

ప్రతిపదార్థం: అని; వనితన్= స్త్రీని (శచిని); పంచి= పంపి; అప్పుడు+అ= వెంటనే; మునులన్; పిలిపించి; మౌర్ఖ్యమునన్= మూర్ఖత్వంతో; తనకున్; వాహనముగన్= వాహనంగా (పల్లకీ మోసేవారినిగా); చేసి; ఒక+ఇంతయున్= ఇంచుకైనా; అనుమానము లేక= సంకోచం లేకుండా; అతఁడు; ఎల్ల+ఎడలన్= అన్ని చోట్లా; తిరిగెన్.

తాత్పర్యం: అని శచిని పంపివేసి వెంటనే అతడు మునులను పిలిపించి, మూర్ఖత్వంతో వారిని తనకు వాహనంగా (వాహకులుగా) చేసికొని, కొంచెం కూడా సంకోచం లేకుండా అన్ని చోట్లా తిరిగాడు.

క. చని పౌలోమియు సురగురుఁ । గని 'నహుషుఁడు వేచియున్నకాలం బెడ లే;
దనిమిషనాథున కిత్తఱి । ననుగ్రహము సేయవలయు నవహితబుద్ధిన్. 181

ప్రతిపదార్థం: పౌలోమియున్= శచీదేవియు; చని; సురగురున్= దేవగురుడిని-బృహస్పతిని; కని; నహుషుఁడు; వేచి+ఉన్న కాలంబు= ఎదురు చూచే సమయం; ఎడ లేదు= దూరం లేదు; అనిమిషనాథునకున్= దేవేంద్రుడికి; ఈ+తఱిన్= ఇప్పుడు; అవహిత బుద్ధిన్= ఏకాగ్రమైన మనస్సుతో; అనుగ్రహము+చేయవలయున్= అనుగ్రహం చూపాలి.

తాత్పర్యం: శచీదేవి వెళ్ళి బృహస్పతిని చూచి 'నహుషుడు ఎదురు చూచే సమయం ఇంకెంతో దూరంలో లేదు. ఈ సమయంలో ఏకాగ్రమైన మనస్సుతో ఇంద్రుడిని అనుగ్రహించాలి.

వ. శరణాగతనైన నన్ను రక్షింపు, మనిన నతం డిట్లనియె. 182

ప్రతిపదార్థం: శరణ+ఆగతన్+ఐన నన్నున్= శరణు కొరకు వచ్చిన నన్ను రక్షింపుము; అనినన్; అతండు; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: శరణు కోరి వచ్చిన నన్ను రక్షించాలి' అనగా బృహస్పతి ఇట్లా అన్నాడు.

క. 'ఆ నహుషువలన నాపద । రా నీ; నాతనికి నాతురత గావింపం
బూని యొనర్చెద వేలిమి । దానను మునివాహనత గతస్థైర్యుఁ డగున్. 183

ప్రతిపదార్థం: ఆ నహుషు వలనన్= ఆ నహుషుడి నుండి; ఆపద; రానీను= రానివ్వను; ఆతనికిన్; ఆతురత= పీడ; కావింపన్= కలిగించటానికి; పూని= ప్రయత్నించి; వేలిమి= హోమం; ఒనర్చెదన్= చేస్తాను; దానను= ఆ హోమంచేతనూ; ముని వాహనతన్= మునులు వాహనంగా కలవాడవటం చేతా, గత స్థైర్యుఁడు+అగున్= పోయిన నిలకడ కలవాడవుతాడు.

తాత్పర్యం: 'ఆ నహుషుడి వలన నీకు ఆపద రానివ్వను; అతడికి ఆపద కలిగేటట్లు నేను ప్రయత్నించి హోమం చేస్తాను. దానివలనా, మునివాహనత్వం వలనా అతడు నిలకడ కోల్పోతాడు.'

క. వెరవున నీ పతి యునికియు । నరసెద'నని యూరడించి, యప్పుడ వైశ్వా
నరు నర్చితుఁ జేసి, పురం । దరు తెఱఁగుం జెప్పి యతనిఁ దడవం బనిచెన్. 184

ప్రతిపదార్థం: వెరవునన్= ఉపాయంతో; నీ పతి+ఉనికియున్= నీ భర్త ఉనికినీ; అరసెదన్= చూస్తాను; అని; ఊరడించి= ఓదార్చి; అప్పుడు+అ= వెంటనే; వైశ్వానరున్= అగ్నిని; అర్చితున్+చేసి= పూజించి; పురందరు తెఱఁగున్= ఇంద్రుడి విధం; చెప్పి; అతనిన్= ఇంద్రుడిని; తడవన్= వెదకడానికి; పనిచెన్= పంపాడు.

తాత్పర్యం: 'ఉపాయంతో నీ భర్త ఉన్న చోటు చూస్తాను' అని ఊరడించి, వెంటనే అగ్నిదేవుడిని పూజించి, ఇంద్రుడి వృత్తాంతం చెప్పి, అతడిని వెదకడానికి పంపాడు.

అగ్నిదేవుఁ డింద్రుని వెదకి బృహస్పతికిం దెలుపుట (సం. 5-15-27)

వ. పనిచిన వహ్నియు వనితా రూపంబునం జని మనోగతి యగుటంజేసి సర్వదిశలును, భూమ్యంతరిక్షంబులును, గిరివిపినంబులును గొండొక సేపునకుం గలయం జూచి, సంక్రందను నెందునుం గానక మగిడి వచ్చి, వాచస్పతికి నత్తెఱం గెఱింగించి, 'నాకు జలంబులు ప్రవేశింపరామి నంద పరికింపనేరనైతి; నప్పుల వలన నగ్నియు, బ్రాహ్మణుల వలన క్షత్రియ జాతియు, నశ్మంబుల వలన లోహంబును నుద్భవించె; వాని వాఁడిమి యెల్లయెడలనుంజెల్లుఁ; దమ తమ జన్మస్థానంబులయం దడంగుం, గావున నీళ్లు నాకు సంక్షయంబు సేయుట సుప్రసిద్ధం' బనిన విని యనిమిష గురుండు హవ్యవాహను నత్యంత గౌరవంబునం గనుంగొని. 185

ప్రతిపదార్థం: పనిచినన్= పంపగా; వహ్నియున్= అగ్నియూ; వనితా రూపంబునన్= స్త్రీరూపంలో; చని= వెళ్ళి; మనస్(ః)గతి+అగుటన్+చేసి= మనోవేగం కలవాడవటం చేత, సర్వ దిశలును= అన్ని దిక్కులూ; భూమి+అంతరిక్షంబులును= భూమీ, ఆకాశమూ; గిరి విపినంబులును= కొండలూ, అడవులూ; కొండొక సేపునకున్= కొంచెం సేపటిలో; కలయన్+చూచి= అంతటా చూచి; సంక్రందనున్= ఇంద్రుడిని; ఎందునున్= ఎక్కడా; కానక= చూడక; మగిడి వచ్చి= తిరిగి వచ్చి; వాచస్పతికిన్= బృహస్పతికి; ఆ+తెఱంగు+ఎఱింగించి= ఆ విధం చెప్పి; నాకున్; జలంబులు= నీళ్ళు; ప్రవేశింపన్+రామిన్= ప్రవేశించలేకపోవటం చేత; అందున్+అ= అందులోమాత్రమే; పరికింపన్+నేరన్+ఐతిన్= చూడలేకపోయాను; అప్పుల వలనన్= నీళ్లనుంచి, అగ్నియున్; బ్రాహ్మణులవలనన్; క్షత్రియ జాతియున్; అశ్మంబుల వలనన్= రాళ్ల వలన; లోహంబును; ఉద్భవించెన్= పుట్టాయి; వాని వాఁడిమి= వాటి ప్రతాపం; ఎల్ల+ఎడలన్= అన్ని చోట్లా; చెల్లున్= చెల్లుతుంది; తమ తమ జన్మ స్థానంబులయందున్= తమ తమ పుట్టిన చోట్ల; అడంగున్= నశిస్తుంది; కావునన్; నీళ్ళు నాకున్; సంక్షయంబు+ చేయుట= నాశనం కలిగించటం; సుప్రసిద్ధంబు= బాగా తెలిసినదే; అనినన్; విని; అనిమిష గురుండు= దేవ గురువు - బృహస్పతి; హవ్యవాహనున్= అగ్నిని; అత్యంత గౌరవంబునన్= మిక్కిలి గౌరవంతో; కనుంగొని= చూచి.

తాత్పర్యం: ఆ విధంగా బృహస్పతి పంపగా, అగ్ని స్త్రీవేషం ధరించి వెళ్ళి, మనోవేగం కలవాడవటం చేత అన్ని దిక్కులూ, భూమ్యాకాశాలూ, కొండలూ, అడవులూ కొంచెం సేపటిలోనే కలయజూచి, ఇంద్రుడిని ఎక్కడా కానక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిరిగి వచ్చి, బృహస్పతికి ఆ విధం చెప్పి, 'నాకు నీళ్ళల్లో ప్రవేశించటానికి అలవి కాకపోవటం చేత అందులో మాత్రం వెదకలేకపోయాను. నీళ్ళ వలన నిప్పూ, బ్రాహ్మణులవల్ల క్షత్రియులూ; రాళ్ళవలన లోహమూ పుట్టాయి. వాటి ప్రతాపం అన్ని చోట్లా చెల్లుతుంది కాని, తమ తమ పుట్టిన చోట్ల మాత్రం నశిస్తుంది. కాబట్టి నీళ్ళు నాకు నాశనం కలిగించటం మిక్కిలి ప్రసిద్ధమైనదే' అనగా విని బృహస్పతి అగ్నిదేవుడిని మిక్కిలి గౌరవంతో చూచి.

మ. 'సకల స్థావర జంగమంబులు భవత్సాన్నిధ్యమాత్రంబునన్
వికసిల్లుం; గ్రతు వైభవంబులుఁ, జతుర్వేదంబులున్ నీవ; పా
వక! నీయంద జలంబులుం గలిగె; విశ్వవ్యాప్తిమై నున్ననీ
కొకచో టెట్టు లగమ్య మయ్యె? నిను నీ వూహింపు పెంపారఁగన్. 186

ప్రతిపదార్థం: పావక!= అగ్నిదేవా!; సకల స్థావర జంగమంబులు= ఎల్ల అచరాలూ; చరాలూ; భవత్+సాన్నిధ్య మాత్రంబునన్= నీ సన్నిధి మాత్రం చేతనే; వికసిల్లున్= వికసిస్తాయి; క్రతు వైభవంబులున్= యజ్ఞ విభవాలూ; చతుర్వేదంబులున్= నాలుగు వేదాలూ; నీవు+అ= నీవే; నీ+అందున్+అ= నీయందే; జలంబులున్= నీళ్ళు కూడా; కలిగెన్= పుట్టాయి; విశ్వవ్యాప్తిమైన్+ఉన్న నీకున్= సర్వ వ్యాపనంతో ఉన్న నీకు; ఒక చోటు; ఎట్టులు= ఎట్లా, అగమ్యము+అయ్యెన్= చొరరానిది అయింది; పెంపు+ ఆరఁగన్= బాగా; నినున్; నీవు; ఊహింపు(ము).

తాత్పర్యం: 'అగ్నిదేవా! ఎల్ల అచరాలూ, చరాలూ నీ సన్నిధి మత్రం చేతనే వికసిస్తాయి. యజ్ఞ వైభవాలూ, నాలుగు వేదాలూ నీవే. నీళ్ళుసైతం నీయందే పుట్టాయి. జగద్వ్యాపకుడవైన నీకు ఒక చోటు చొరరానిది ఎట్లా అయింది? నిన్ను నీవు బాగా ఊహించుకో.

ఉ. ఏనును బ్రహ్మమంత్రముల నెంతయు నీ కభివృద్ధిఁ జేసెదం
గాన విశంకతన్ సలిలగామివి గ' మ్మనినం, గృశానుఁడుం
బూనిక నేఁగి వారినిధి భూరి నదీ సరసీ తటాక సం
తానము రోయుచుం జని శతక్రతుఁ డున్న సరోవరంబునన్. 187

ప్రతిపదార్థం: ఏనును= నేను కూడా; బ్రహ్మ మంత్రములన్= వేదమంత్రాలతో; నీకున్; ఎంతయున్= ఎంతో; అభివృద్ధిన్; చేసెదన్; కానన్; విశంకతన్= సంకోచం లేకుండా; సలిలగామివి+కమ్ము= నీళ్ళలో ప్రవేశించేవాడవు కమ్ము; అనినన్; కృశానుఁడున్= అగ్నియూ; పూనికన్= ప్రయత్నంతో; ఏఁగి= వెళ్ళి; వారినిధి భూరి నదీ సరసీ తటాకసంతానమున్= సముద్రాల, పెద్ద నదుల, సరస్సుల, కొలకుల సమూహాలను; రోయుచున్= వెదకుతూ; చని= వెళ్ళి; శతక్రతుఁడు= నూరుయజ్ఞాలు చేసినవాడు-ఇంద్రుడు; ఉన్న; సరోవరంబునన్= సరస్సులో.

తాత్పర్యం: నేను కూడా వేదమంత్రాలతో నీకు ఎంతో అభివృద్ధిని కలిగిస్తాను. కావున సంకోచం లేకుండా నీళ్ళలో ప్రవేశించుము'. అనగా అగ్ని కూడా ప్రయత్నంతో వెళ్ళి సముద్రాల, గొప్ప నదుల, సరస్సుల, కొలకుల సమూహాలు వెదకుతూ వెళ్ళి, ఇంద్రుడున్న సరస్సులో.

ఉ. అంబురుహంబులం గలయ నారసి చొచ్చి, యొకండు నాళసూ
త్రంబున నున్న యింద్రుఁ గని, రాగమునన్ గురునొద్ద కగ్ని శీ

ఘ్రంబున నేఁగుదెంచి, తన కన్నతెఱంగెఱిఁగింప, నాతఁ డు

ల్లంబున నుల్లసిల్లి, సురలన్ మునులం దగఁగూడి గ్రక్కునన్. **188**

ప్రతిపదార్థం: అంబురుహంబులన్= తామరపువ్వులను; కలయన్= అంతటా; ఆరసి= వెదకి; ఒకండు చొచ్చి= ఒక పద్మంలో ప్రవేశించి; నాళ సూత్రంబునన్= దాని కాడయొక్క దారంలో; ఉన్న, ఇంద్రున్; కని; అగ్ని; గురు+ఒద్దకున్= బృహస్పతి వద్దకు, రాగమునన్= ప్రీతితో, శీఘ్రంబునన్= వేగంగా; ఏఁగుదెంచి= వచ్చి; తన కన్నతెఱంగు+ఎఱిఁగింపన్= తాను చూచిన విధం తెలుపగా; ఆతఁడు= బృహస్పతి; ఉల్లంబునన్= మనస్సులో; ఉల్లసిల్లి= సంతోషించి; సురలన్= దేవతలనూ; మునులన్= మునులనూ; తగన్= ఒప్పుగా; కూడి= కలిసి; గ్రక్కునన్= శీఘ్రంగా.

తాత్పర్యం: తామరపువ్వులను అంతటా వెదకి, ఒకదానిలో ప్రవేశించి, దాని కాడ దారంలో ఉన్న ఇంద్రుడిని చూసి, అగ్ని ప్రీతితో బృహస్పతి వద్దకు శీఘ్రంగా వచ్చి, తాను చూచిన విధం తెలుపగా, అతడు మనస్సులో సంతోషించి దేవతలనూ, మునులనూ కూడి వెంటనే.

మ. **దివిజాధీశ్వరుపాలికిం జని, కృతార్థీభూతచేతస్కుఁడై,**

వివిధ స్తోత్ర పరంపరా చతుర వాగ్విన్యాసతం బ్రీతుఁ జే

సి, 'వరిష్ఠంబగు నీదు కృత్యము ననుష్ఠింపంగ నీ వుత్సహిం

పవు; నీ కేమి కొఱంత? వృత్రవధ యే పాపంబు రూపింపుమా?' **189**

ప్రతిపదార్థం: దివిజ+అధి+ఈశ్వరు పాలికిన్= దేవేంద్రుడి వద్దకు; చని= వెళ్ళి; కృతార్థీభూత చేతస్కుఁడు+ఐ= ధన్యమైన మనస్సుకల వాడయి; వివిధ స్తోత్ర పరంపరా చతుర వాక్+విన్యాసతన్= అనేకములైన స్తుతులయొక్క వరుసయందలి నేర్పుతో కూడిన మాటల రచనతో; ప్రీతున్+చేసి= సంతోషపెట్టి; నీవు; వరిష్ఠంబు+అగు= శ్రేష్ఠమైన; నీదు కృత్యమున్= నీ పనిని; అనుష్ఠింపంగన్= ఆచరించటానికి; ఉత్సహింపవు= యత్నించవు; నీకున్; ఏమి; కొఱంత= లోటు; వృత్ర వధ= వృత్రుణ్ణి చంపటం; ఏ పాపంబు?= ఏమి పాపకార్యం?; రూపింపుమా= నిరూపించుము.

తాత్పర్యం: ఇంద్రుడి వద్దకు వెళ్లి, కృతార్థమైన మనస్సు కలవాడయి, వివిధ స్తుతులలోని చతుర వాక్కులతో సంతోషపెట్టి, 'నీవు శ్రేష్ఠమైన నీ పనిని ఆచరించటానికి ఉత్సాహపడవు. నీ కేమి లోటు? వృత్రవధ పాపకార్యం ఎట్లా అయిందో చెప్పు.

క. **శరనిధి ఫేనంబున నా । హరి వొంది జగద్విరోధి యగు వృత్రునిఁ దాఁ**

బరిమార్ప, నీకు విజయము । దొరకొనియెం గాక, దీన దోసము గలదే?' **190**

ప్రతిపదార్థం: శరనిధి ఫేనంబునన్= సముద్రపు నురుగులో; ఆ హరి= ఆ విష్ణువు; పొంది= చేరి; జగత్+విరోధి+అగు= లోక కంటకుడైన; వృత్రునిన్; తాన్= తాను (విష్ణువు); పరిమార్పన్= చంపగా; నీకున్; విజయము= గెలుపు; దొరకొనియెన్+కాక= లభించింది కాని; దీనన్= దీనియందు, దోసము= దోషం - పాపం; కలదే?

తాత్పర్యం: సముద్రపు నురుగులో ఆ విష్ణువు చేరి లోక కంటకుడయిన వృత్రుడిని చంపగా నీకు విజయం లభించింది. ఇందులో నీ దోషం ఏమున్నది?'

విశేషం: వృత్రుడిని చంపినవాడు విష్ణువు కాని, నీవు కాదని ఇంద్రుడి నిర్దోషిత్వాన్ని సమర్థించిన తీరు బృహస్పతి మాటనేర్పును విశదీకరిస్తుంది. అతడు 'వాచస్పతి' కదా!

వ. అని సముచితంబుగా సంబోధించిన గురుని సంభాషితంబుల నిర్దోషితుండయి నిజరూపంబు వహించి, సకల సుమనోమునిసహితంబుగా నతని సంభావించి, జంభారి 'కర్తవ్యం బెయ్యది?' యని యడిగిన, నాచార్యుం 'డితం డెఱింగినను విస్పష్టంబుగా నహుషు వృత్తాంతంబంతయు వివరించెదం గాక' యని తలంచి యిట్లనియె. 191

ప్రతిపదార్థం: అని, సముచితంబుగాన్= తగినట్లుగా; సంబోధించిన= తెలియబరిచిన; గురుని= బృహస్పతియొక్క; సంభాషితంబులన్= మాటలచేత; నిర్దోషితుండు+అయి= పాపరహితుడై; నిజ రూపంబు= స్వస్వరూపం; వహించి= తాల్చి; సకల సుమనస్(ః)+ముని సహితంబుగాన్= ఎల్లదేవతలతోనూ; మునులతోనూ; అతనిని= ఆ బృహస్పతిని; సంభావించి= ఆదరించి; జంభ+అరి= జంభుడనే రాక్షసుడి శత్రువు - ఇంద్రుడు; కర్తవ్యంబు= చేయదగింది; ఎయ్యది= ఏది; అని; అడిగినన్; ఆచార్యుండు= గురుడు - బృహస్పతి; ఇతండు; ఎఱింగినను; విస్పష్టంబుగాన్= తేటతెల్లంగా; నహుషు వృత్తాంతంబు+ అంతయున్= నహుషుడి వృత్తాంతమంతా; వివరించెదన్+కాక= వివరించి చెపుతాను; అని; తలంచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని తగిన విధంగా తెలియజెప్పిన బృహస్పతి మాటల వలన పాపరహితుడై తన ఆకారం ధరించి, ఎల్ల దేవతలతో మునులతో కూడా అతడిని ఆదరించి, ఇంద్రుడు కర్తవ్యం చెప్పుమని అడుగగా, ఆచార్యుడు 'ఇతడికి తెలిసినా సుస్పష్టంగా నహుషుడి వృత్తాంతమంతా వివరిస్తా' నని యెంచి ఇట్లా అన్నాడు.

క. 'నాఁ డట్లు నీవు నీ దగు । పోఁడిమి సెడి యడఁగుటయును, భువనంబుల కె
వ్వాఁడును రక్షకుఁ డయ్యెడు । వాఁడిమగఁడు లేమిఁ ద్రిదశవర్గము మునులున్. 192

ప్రతిపదార్థం: నాఁడు= ఆరోజు; అట్లు= ఆ విధంగా; నీవు; నీది+అగు పోఁడిమి= నీ పరాక్రమం; చెడి= నశించి; అడఁగుటయును= క్రుంగగా; భువనంబులకున్= లోకాలకు; ఎవ్వాఁడును= ఎవడూ; రక్షకుఁడు+అయ్యెడు వాఁడిమగఁడు= రక్షకుడయ్యే గొప్పశూరుడు; లేమిన్= లేకపోవటంచేత; త్రిదశ వర్గమున్= దేవతల సమూహమూ; మునులున్= మునులూ.

తాత్పర్యం: అప్పుడు ఆ విధంగా నీవు నీ పరాక్రమం నశించి క్రుంగిపోతే, లోకాలకు ఎవడూ రక్షకుడైన గొప్ప శూరుడు లేకపోవడం చేత దేవతలూ, మునులూ.

ఉ. ఒండొరుచేతఁ బీడవడ నోపక రక్షకుఁ డైనవాని నా
ఖండలతుల్యు నేమిగతిఁ గాంతుమొకో?' యనుచున్న చోట, 'ను
ద్దండబలైక రక్ష్యము శతక్రతు రాజ్యము, దాని నేల న
న్యుండు సమర్థుఁడే?' యనుచు నొల్లరు దివ్యులలోన నెవ్వరున్. 193

ప్రతిపదార్థం: ఒండొరుచేతన్= ఒకరిచేత ఒకరు; పీడ+పడన్+ఓపక= బాధపడలేక; రక్షకుఁడు+ఐన వానిన్= కాపాడేవాడిని; ఆఖండలతుల్యున్= ఇంద్రుడితో సమానమైనవాడిని; ఏమి గతిన్= ఏ విధంగా; కాంతుము+ఒకో= పొందుతామో; అనుచున్+ఉన్న చోటన్; శతక్రతు రాజ్యము= ఇంద్రుడి రాజ్యం; ఉద్దండ బల+ఏక రక్ష్యము= మహాబలవంతుడిచేతనే రక్షించబడదగినది;

దానిన్; ఏలన్= పాలించటానికి; అన్యుండు= ఇతరుడు; సమర్థుఁడే= శక్తిమంతుడా; అనుచున్; దివ్యులలోన్= దేవతలలో; ఎవ్వరున్= ఎవరూ; ఒల్లరు= ఇష్టపడరు.

తాత్పర్యం: ఒకరిచేత ఒకరు బాధపడలేక ఇంద్రసమానుడైన రక్షకుడిని ఏ విధంగా పొందుతామో అంటూ ఉన్నచోట - 'ఇంద్రుడి రాజ్యం మహాబలవంతుడిచేతనే రక్షించబడదగినది. దానిని పాలించటానికి ఇతరుడు శక్తిమంతుడా?' అంటూ దేవతలలో ఎవ్వరూ ఇష్టపడలేదు.

వ. **అట్టి సమయయంబున మునిజనసహితంబుగ ననిమిషులు నహుషు కడకుం జని మనంబుల మనుజుం డను ననుమానంబు దక్కి యతని నింద్రపదవిఁ బరిపాలించుటకుం బ్రార్థించిన, నతండును దాను హీనబలుండననిశంకించినం, దమ తమ తేజంబుల యంశంబు లతని కొసంగి శక్తిమంతుం గావించి యభిషిక్తుం జేసిన.** **194**

ప్రతిపదార్థం: అట్టి సమయంబునన్= అటువంటి సమయంలో; అనిమిషులు= దేవతలు; ముని జన సహితంబుగన్= మునులతో కూడుకొని; నహుషు కడకున్; చని; మనంబులన్= మనస్సులలో; మనుజుండు+అను+అనుమానంబు+తక్కి= మనుష్యుడు అనే సంకోచం విడిచి; అతనిన్; ఇంద్ర పదవిన్; పరిపాలించుటకున్; ప్రార్థించినన్= కోరగా; అతండును= నహుషుడునూ; తాను; హీన బలుండన్+అని= బలహీనుడిని అని; శంకించినన్= అనుమానించగా; తమ తమ తేజంబుల+ అంశంబులు= తమ తమ తేజస్సుల భాగాలు; అతనికిన్; ఒసంగి= ఇచ్చి; శక్తిమంతున్= శక్తికలవాడిని; కావించి= చేసి; అభిషిక్తున్+చేసినన్= అభిషేకించగా.

తాత్పర్యం: అటువంటి సమయంలో మునులతో కూడా దేవతలు నహుషుడి వద్దకు వెళ్ళి, తమ మనస్సులలో అతడు మనుష్యుడనే శంక విడిచి, అతడిని ఇంద్రపదవిని స్వీకరించ ప్రార్థించగా, అతడునూ తాను బలహీనుడనని అనుమానించగా, వారు తమ తమ తేజస్సుల భాగాలు అతడి కిచ్చి సమర్థుడిని చేసి అభిషేకించగా.

క. **మహనీయ భవ త్పదవీ। మహితుండై నహుషుఁ డేచి, మదమున ధర్మ**
స్పృహ దక్కి, తన్ను నిప్పుడు। వహియింపఁగ సన్మునీంద్రవర్గముఁ బనిచెన్. **195**

ప్రతిపదార్థం: మహనీయ భవత్+పదవీ మహితుండు+ఐ= ఉన్నతమైన నీ పదవి చేత గొప్పవాడయి; నహుషుఁడు; ఏచి= విజృంభించి; మదమునన్= గర్వంతో; ధర్మ స్పృహ= ధర్మమునందు ఆసక్తి; తక్కి= విడిచి; ఇప్పుడు; తన్నున్; వహియింపఁగన్= మోయటానికి; సత్+ముని+ఇంద్ర+వర్గమున్= సన్మునిశ్రేష్ఠుల సమూహాన్ని - సప్తర్షులను; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: అత్యున్నతమైన నీ పదవిచేత గొప్పవాడై నహుషుడు విజృంభించి, గర్వంతో ధర్మంమీద ఆసక్తి విడిచి, ఇప్పుడు తనను మోయటానికి సప్తర్షులను నియోగించాడు.

ఆ. **ఇదియకాదు; మఱియు నెన్నియు దుర్విన। యములు గలవు; వాని కలసి నిన్ను**
వెదక వచ్చితిమి; వివేకహీనుండగు। నతనిఁ జెఱుప నిప్పు డవసరంబు. **196**

ప్రతిపదార్థం: ఇది+అ= ఇదే; కాదు; మఱియున్= ఇంకా; ఎన్నియున్= ఎన్నో; దుస్(ః)+వినయములు= చెడు నడవడులు; కలవు; వానికిన్; అలసి= బడలి; నిన్నున్; వెదకన్; వచ్చితిమి; వివేకహీనుండు+అగు+అతనిన్= జ్ఞానశూన్యుడైన అతడిని; చెఱుపన్= నశింపచేయటానికి, భ్రష్టుడిని చేయటానికి; ఇప్పుడు; అవసరంబు= తగిన సమయం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఇది ఒక్కటే కాదు, ఇంకా ఎన్నో దుర్మార్గాలు ఉన్నాయి. అతడితో పడిపడి బడలిపోయి నిన్ను వెతుక్కుంటూ వచ్చాము. వివేకశూన్యుడైన అతడిని పదవీభ్రష్టుడిని చేయటానికి ఇది తగిన సమయం.

వ. అది యెట్లంటేని వినుము. నాఁడు హరి పంపునం జేసిన యశ్వమేధంబున నీ వపగతకల్మషుండ వైనను, నహుషునకుఁ దేజోహాని లేమిం జేసి యతని నాక్రమింపరాదయ్యెఁ; నిప్పుడు మహామునుల నధఃకరించి యతండు నిస్తేజుండై యున్నవాఁడు. కావున నీ చేతం జెడు, నట్లగుటయుం దురగమేధ ఫలపరిపాకంబ; యింక నుత్సాహంబు సేయు'మనుచున్న సమయంబున యమ వరుణ కుబేరులు సోమసహితంబుగా నరుగుదెంచి పురందరుం గాంచిన, నతండు ప్రియంబంది, యప్పటి కార్యంబు తెఱంగు వారల కెఱింగించి, తగిన సంభాషణంబుల వారలఁ బ్రీతచేతస్కులం జేసి, దృష్టి విషయ దుస్సహుండైన నహుషు గెలుచు నుపాయంబు విచారించు నవసరంబున. 197

ప్రతిపదార్థం: అది; ఎట్లు+అంటి(వి)+ఏనిన్= ఎట్లా అంటే; వినుము; నాఁడు= అప్పుడు; హరి పంపునన్+చేసిన= విష్ణుమూర్తి ఆజ్ఞచేత చేసిన; అశ్వమేధంబునన్; నీవు; అపగత కల్మషుండవు+ఐనను= పోయిన పాపం కలవాడవైనను - పాపరహితుడవైనా; నహుషునకున్; తేజస్(ః)+హాని= తేజోనష్టం; లేమిన్+చేసి= లేకపోవటం చేత; అతనిన్; ఆక్రమింపన్+రాదు+అయ్యెన్= జయించ శక్యం కాకపోయింది; ఇప్పుడు; మహామునులన్= మహర్షులను; అధఃకరించి= తక్కువ చేసి - అవమానించి; అతండు; నిస్తేజుండు+ఐ= తేజోహీనుడై; ఉన్నవాఁడు; కావునన్; నీ చేతన్= నీ చేతిలో; చెడున్= నశిస్తాడు; అట్లు+అగుటయున్= అట్లా జరగటం కూడా; తురగమేధ ఫల పరిపాకంబు+అ= అశ్వమేధయాగం యొక్క ఫలితమే; ఇంకన్; ఉత్సాహంబు+ చేయుము= ఉత్సహించుము; అనుచున్+ఉన్న సమయంబునన్= అంటూన్న సమయంలో; యమ వరుణ కుబేరులు= యముడూ, వరుణుడూ, కుబేరుడూ, సోమ సహితంబుగాన్= చంద్రుడితో కూడా; అరుగుదెంచి= వచ్చి; పురందరున్= ఇంద్రుడిని, కాంచినన్= చూడగా; అతండు; ప్రియంబు+అంది= సంతోషించి, అప్పటి కార్యంబు తెఱంగు= అప్పటి కర్తవ్య విధానం; వారలకున్; ఎఱింగించి= తెలిపి; తగిన సంభాషణంబులన్= తగిన మాటలతో; వారలన్; ప్రీతి చేతస్కులన్+చేసి= సంతోషించిన మనస్సులు కలవారినిగా చేసి - సంతోషింపజేసి; దృష్టి విషయ దుస్సహుండు+ఐన నహుషున్= దృష్టి విషయంలో సహింప రానివాడైన నహుషుని; గెలుచు+ఉపాయంబు= గెలిచే ఉపాయం; విచారించు+అవసరంబునన్= ఆలోచించే సమయంలో.

తాత్పర్యం: అది ఎట్లా అంటే వినుము. అప్పుడు విష్ణుమూర్తి ఆజ్ఞచేత చేసిన అశ్వమేధయాగం వలన నీవు పాపరహితుడవైనా, నహుషుడి తేజస్సు నశించకపోవటంచేత, అతడిని జయించటానికి శక్యం కాకపోయింది. ఇప్పుడు అతడు మహర్షులను అవమానించి తేజస్సును కోల్పోయాడు. కాబట్టి నీ చేతిలో నశిస్తాడు. అట్లా జరగటం కూడా అశ్వమేధయాగఫలమే. ఇంక ఉత్సాహం చూపు' అంటున్న సమయంలో యముడూ, వరుణుడూ, కుబేరుడూ చంద్రుడితో కూడా వచ్చి ఇంద్రుడిని చూడగా, అతడు సంతోషించి, అప్పుడు కర్తవ్యమైన విధం వారికి చెప్పి, తగిన మాటలతో వారిని సంతోషపెట్టి, దృష్టివిషయంలో సహింపరాని నహుషుడిని గెలిచే ఉపాయం ఆలోచించే సమయంలో.

విశేషం: దృష్టి విష దుస్సహుండైన - ఈ పాఠం మున్నంగి శర్మ పరిష్కృత భారత ప్రతి లోనిది. ఇదే సంస్కృత భారత ప్రతులలోని పాఠానికి అనుగుణంగా ఉన్నది. 'తేజోహరం, దృష్టి విషం సుఘోరం మా త్వం పశ్యే ర్నహుషమ్.' ఉద్యోగ. 16-29. వావిళ్లవారి ప్రతిలోనూ, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిలోనూ 'దృష్టి విషయ దుస్సహుండైన' అనే పాఠం ఉన్నది. అది మూలానుగుణం కాకపోవటం చేత విడువబడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **'కష్టం డగు నా నహుషుఁడు । నష్టాత్మకుఁ డయ్యె; దివిజనాయక! నీ యు**
త్కృష్ట చరితమున సురలకుఁ । దుష్టిగ నిజరాజ్య సంగతుఁడ వగు' మనుచున్. 198

ప్రతిపదార్థం: దివిజ నాయక!= దేవేంద్రా!; కష్టుండు+అగు+ఆ నహుషుఁడు= పాపాత్ముడైన ఆ నహుషుడు; నష్ట+ఆత్మకుఁడు+ అయ్యెన్= చెడిపోయినవాడు అయ్యాడు; నీ+ఉత్కృష్ట చరితమునన్= గొప్పదైన నీ నడవడి చేత; సురలకున్= దేవతలకు; తుష్టిగన్= సంతోషం కలిగేటట్లు; నిజ రాజ్య సంగతుఁడవు= నీ రాజ్యంతో కూడినవాడవు; అగుము; అనుచున్.

తాత్పర్యం: 'పాపాత్ముడైన ఆ నహుషుడు నష్టపోయాడు. దేవేంద్రా! గొప్పదైన నీ చరితంచేత దేవతలకు సంతోషం కలిగేటట్లు నీవు నీ రాజ్యం స్వీకరించవచ్చును' అంటూ.

క. **మునివరుఁ డైన యగస్త్యుఁడు । నను దెంచిన, శతమఖుండు సమ్మతి నుచితా**
సన మిడి, యర్ఘ్యముఁ బాద్యము । నొనరిచి, యిట్లనియె సవినయోక్తి నతనితోన్. 199

ప్రతిపదార్థం: మునివరుఁడు+ఐన+అగస్త్యుఁడు= మునిశ్రేష్ఠుడైన అగస్త్యుడు; చనుదెంచినన్= రాగా; శతమఖుండు= నూరు యజ్ఞాలు కలవాడు - ఇంద్రుడు; సమ్మతిన్= ఇష్టంతో; ఉచిత+ఆసనము+ఇడి= తగిన పీఠం ఇచ్చి; అర్ఘ్యమున్= పూజాద్రవ్యాన్నీ; పాద్యమున్= కాళ్ళు కడుగుకొనడానికి నీరూ; ఒనరిచి= చేసి(ఇచ్చి); అతనితోన్; సవినయ+ఉక్తిన్= అడకువతో కూడిన మాటతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: మునిశ్రేష్ఠుడైన అగస్త్యుడు రాగా, ఇంద్రుడు అతడికి ఉచితమైన ఆసనమూ, అర్ఘ్యపాద్యాదులూ సగౌరవంగా ఇచ్చి, వినయపూర్వకంగా ఇట్లా అన్నాడు.

ఆ. **'అధిక విభవ మెసఁగ నసమాన శక్తి స । నాథుఁ డగుచునున్న నహుషుఁ డిప్పు**
డేమికతన భాగ్యహీనుఁడై యుజ్జ్వల । శ్రీ దొఱంగె మునివరేణ్య! చెపుమ.' 200

ప్రతిపదార్థం: మునివరేణ్య!= మునిశ్రేష్ఠుడా!; అధిక విభవము+ఎసఁగన్= మిక్కిలి వైభవం అతిశయించగా, అసమాన శక్తి సనాథుఁడు= సాటిలేని శక్తితో కూడినవాడు; అగుచున్+ఉన్న= అవుతూ ఉన్న, నహుషుఁడు, ఇప్పుడు; ఏమి కతనన్= ఏ కారణంచేత; భాగ్యహీనుఁడు+ఐ= నిర్భాగ్యుడై; ఉజ్జ్వలశ్రీ= ప్రకాశించే సంపద; తొఱంగెన్= కోలుపోయాడు; చెపుమ= చెప్పుము.

తాత్పర్యం: 'మునివరా! అగస్త్యా! ఎంతో వైభవం అతిశయించగా నిరుపమానమైన సామర్థ్యంతో కూడుకొని ఉండే నహుషుడు ఇప్పుడు ఏ కారణంచేత నిర్భాగ్యుడై ప్రకాశించే సంపదను కోలుపోయాడో చెప్పుము.'

అగస్త్యుఁ డింద్రునకు నహుషభ్రష్టతఁ దెలుపుట (సం. 5-17-7)

వ. **అనిన విని యమ్మునీంద్రుం డిట్లనియె; 'నన్నహుషుని మోచి వేసరుచున్న మును లతనికడ గోష్ఠీ వినోదంబుల నుండి 'బ్రాహ్మణంబు లయిన మంత్రంబులు గోసంప్రోక్షణంబునందుఁ జెప్పంబడియుండు; నవి నీకుఁ బ్రమాణ భూతంబు లగునే?' యని యడిగినం, బాపనిశ్చయుండై యతం' దమ్మంత్రంబులు ప్రమాణంబులు గా'వనిన నే నమ్మాట నిషేధించి, 'పూర్వాచార్యులచేత నభినందితంబులగు మంత్రంబులు నిందించుట యజ్ఞానం'బని**

వివాదంబు సేసితి; నతండు కోపించి మదీయ మస్తకంబు దన్నె; నతనిం గనుంగొని, పుణ్యహీనుండును, దేజోహాని దీనుండును నగుట యుపలక్షించి, 'నీవు పూజనీయులయిన మహామునుల నిన్ను వహింపం బనిచితి; వారలు గొనియాడు మంత్రంబులు గర్హించి; తదియునుంగాక నన్ను నవమానించితి; గావున నింద్రపద భ్రష్టుండవై బహుసంవత్సరంబులు భూలోకంబున నురగరూపంబున నుండు' మని శాపం బిచ్చి, పదంపడి యనుగ్రహించి, 'భవదీయవంశజాతుండయి యజాతశత్రుం డను పెంపుగలిగి యుధిష్ఠిరనామధేయుండైన యొక్క సత్పురుషుని సందర్శనంబున దురితంబులఁ బాసి పుణ్యలోకంబు వడయువాఁడ' వనినఁ, దత్క్షణంబ. 201

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ+ముని+ఇంద్రుండు= ఆ ముని శ్రేష్ఠుడైన అగస్త్యుడు; ఇట్లు+అనియెన్; ఆ+నహుషునిన్; మోచి= మోసి; వేసరుచున్+ఉన్న= బాధపడుతున్న; అతని కడన్= అతడి వద్ద; గోష్ఠీ వినోదంబులన్+ఉండి= ప్రసంగపు వేడుకలతో ఉండి; బ్రాహ్మణంబులు+అయిన మంత్రంబులు= బ్రాహ్మణములందలి మంత్రాలు (వేదమంత్రాలకు వ్యాఖ్యాన రూపమయినవి బ్రాహ్మణములు); గోసంప్రోక్షణంబునందున్= మంత్రజలంతో ఆవులను పవిత్రీకరించే సందర్భంలో; చెప్పంబడి+ ఉండున్; అవి; నీకున్; ప్రమాణ భూతంబులు+అగునే?= సమ్మదగినవి అగునా?; అని; అడిగినన్; పాప నిశ్చయుండు+ఐ= దుర్బుద్ధిఅయి; ఆ+మంత్రంబులు; ప్రమాణంబులు+కావు; అనినన్; నేను; ఆ+మాటన్; నిషేధించి= నిరాకరించి; పూర్వ+ ఆచార్యులచేతన్= ప్రాచీన గురువులచేత; అభినందితంబులు+అగు మంత్రంబులు= పొగడబడే మంత్రాలను; నిందించుట; అజ్ఞానంబు= తెలివి లేమి; అని; వివాదంబు+చేసితిన్= వాదించాను; అతండు; కోపించి; మదీయ మస్తకంబు= నా తల; తన్నెన్; అతనిన్; కనుంగొని= చూచి; పుణ్య హీనుండును= పుణ్యం పోయినవాడూ; తేజస్(ః)+హాని దీనుండును= తేజస్సు నశించటంచేత దుఃఖితుడూ; అగుట; ఉపలక్షించి= చూచి; నీవు; పూజనీయులు+అయిన= పూజ్యులైన; మహామునులన్= మహర్షులను; నిన్నున్; వహింపన్+పనిచితి(వి)= మోయటానికి నియోగించావు; వారలు; కొనియాడు= అభినందించే; మంత్రంబులు; గర్హించితి= నిందించావు; అదియునున్+కాక; నన్నున్, అవమానించితి(వి); కావునన్; ఇంద్రపద భ్రష్టుండవు+ఐ= ఇంద్ర స్థానంనుండి జారినవాడవయి; బహు సంవత్సరంబులు= పెక్కేండ్లు; భూ లోకంబునన్; ఉరగ రూపంబునన్= పాము రూపుతో; ఉండుము; అని; శాపంబు+ఇచ్చి; పదంపడి= తరువాత; అనుగ్రహించి= కరుణించి; భవదీయ వంశ జాతుండు+అయి= నీ వంశంలో పుట్టినవాడయి; అజాత శత్రుండు+అను పెంపు+కలిగి= అజాతశత్రుడు (పుట్టని శత్రువులు గలవాడు - శత్రువులులేనివాడు) అనే గొప్పతనం కలిగి; యుధిష్ఠిర నామధేయుండు+ఐ= యుధిష్ఠిరుడు (యుద్ధంలో స్థిరంగా ఉండేవాడు) అనే పేరుగలవాడయిన; ఒక్క; సత్పురుషుని సందర్శనంబునన్= మంచివాడి దర్శనం చేత; దురితంబులన్= పాపాలను; పాసి= విడిచి, పుణ్యలోకంబు+పడయువాఁడవు= పుణ్యలోకం పొందుతావు; అనినన్; తద్+క్షణంబు+అ= ఆ క్షణమే.

తాత్పర్యం: అనగా విని ఆ మునిశ్రేష్ఠుడైన అగస్త్యుడు ఇట్లా అన్నాడు. ఆ నహుషుడిని మోసి బాధపడుతున్న మునులు అతడి దగ్గర సల్లాపపు వేడుకలతో ఉండి 'బ్రాహ్మణములయిన మంత్రాలు గోసంప్రోక్షణంలో చెప్పబడి ఉన్నాయి. వాటిని నీవు నమ్ముతావా?' అని అడుగగా, దుర్బుద్ధిఅయిన అతడు 'ఆ మంత్రాలు నాకు ప్రమాణాలు కావు' అన్నాడు. నేను ఆ మాట నిరాకరించి 'పూర్వగురువులు అభినందించే మంత్రాలను నిందించడం అజ్ఞానం' అని వాదించాను. అతడు కోపించి నా తలను తన్నాడు. అతడిని చూచి, పుణ్యం పోయి, తేజస్సు నశించి దుఃఖితుడై ఉండటం గమనించి 'నీవు పూజ్యులైన మహర్షుల్ని నిన్ను మోయటానికి నియోగించావు, వారు కొనియాడే మంత్రాలను నిందించావు. అదీకాక నన్ను అవమానించావు. కాబట్టి ఇంద్రపదవినుండి భ్రష్టుడవై పెక్కేళ్ళు భూలోకంలో సర్పరూపంతో ఉండు.' అని శాపమిచ్చి, తరవాత అనుగ్రహించి 'నీ వంశంలో పుట్టి అజాతశత్రుడనే ప్రశస్తి కలిగి యుధిష్ఠిరుడనే పేరుగల ఒక సజ్జనుడి సందర్శనం చేత పాపాలు పోయి పుణ్యలోకం పొందుతావు' అనగా, ఆ క్షణమే.

క. స్వర్గ పరిభ్రష్టుండై । దుర్గతికిం బోయె నతఁడు; దుష్టాత్ములకున్
దౌర్గత్యము, సుజనులకు న । నర్గళ సద్గతియు నగుట యరుదే యెందున్?' 202

ప్రతిపదార్థం: అతఁడు= ఆ నహుషుడు; స్వర్గ పరిభ్రష్టుండు+ఐ= స్వర్గలోకం నుండి జారినవాడయి; దుర్గతికిన్= దుస్ స్థితికి; పోయెన్; ఎందున్= ఎక్కడైనా; దుష్ట+ఆత్ములకున్= దుర్మార్గులకు; దౌర్గత్యమున్= దుస్స్థితీ; సుజనులకున్= సజ్జనులకు; అనర్గళ సత్+గతియున్= అడ్డులేని సద్గతీ; అగుట; అరుదే?= ఆశ్చర్యమా?

తాత్పర్యం: ఆ నహుషుడు స్వర్గలోకం నుండి భ్రష్టుడై దుర్గతి చెందాడు. ఎక్కడైనా దుర్మార్గులకు దుర్గతీ, సన్మార్గులకు సద్గతీ కలగటం ఆశ్చర్యమా?'

విశేషం: ఇందులో విశేషం సామాన్యంచేత సమర్థింపబడుతోంది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

మ. అనినన్ దేవతలుం దపోధనులు నత్యానందముం బొంది; రా
మునిఁ బూజించె నమర్త్యనాథుఁడు మనోమోదంబు సంధిల్ల, న
య్యనురాగంబు చరాచరంబులకు హృద్యం బయ్యెఁ; సర్వాప్సరో
జనముం గౌశికుఁ గానవచ్చె సుభగైశ్వర్యంబు శోభిల్లఁగన్. 203

ప్రతిపదార్థం: అనినన్; దేవతలున్; తపోధనులు= తపస్సు ధనంగా కలవారు- మునులూ; అతి+ఆనందమున్+పొందిరి= మిక్కిలి ఆనందం పొందారు; అమర్త్య నాథుఁడు= సురరాజు- ఇంద్రుడు; మనస్(ః)+మోదంబు= మనస్సంతోషం; సంధిల్లన్= కలుగగా; ఆ మునిన్= ఆ మునిని- అగస్త్యుడిని; పూజించెన్; ఆ+అనురాగంబు= వారి ప్రేమభావం; చర+అచరంబులకున్= అజడాలకూ, జడములకూ; హృద్యంబు+అయ్యెన్= మదికింపు గొల్పింది. సర్వ+అప్సరస్(ః)+జనమున్= ఎల్ల అచ్చరల సమూహమూ; సుభగ+ఐశ్వర్యంబు= ఉదాత్తమైన ఐశ్వర్యం; శోభిల్లఁగన్= ప్రకాశించగా; కౌశికున్= ఇంద్రుడిని; కానన్+వచ్చెన్= చూడవచ్చింది.

తాత్పర్యం: అనగా, దేవతలూ మునులూ మిక్కిలి సంతోషించారు. ఇంద్రుడు ఆనందంతో ఆ అగస్త్యుణ్ణి పూజించాడు. వారిద్దరి ప్రేమ భావం స్వర్గంలోని చరాచరాలన్నింటికి సంతోషదాయకమయింది. ఉదాత్తమైన ఐశ్వర్యం ఒప్పగా అచ్చరలందరూ ఇంద్రుడిని చూడవచ్చారు.

క. తదనంతరంబ. 204

తాత్పర్యం: ఆ వెంటనే.

ఉ. పావకుఁ డాదిగా దిగధిపాలురుఁ, గిన్నర సిద్ధ సాధ్యులున్,
దేవగురుండుఁ దోన చనుదేరఁగ, వైభవ ముల్లసిల్ల, నై
రావణ దంతి నెక్కి యమరావతికిం జని, యింద్రుఁ డా శచీ
దేవియుఁ దాను మోదమునఁ దేలి రభీష్ట వినోద లీలలన్. 205

ప్రతిపదార్థం: పావకుఁడు+ఆదిగాన్= అగ్ని మొదలుగా; దిక్+అధిపాలురున్= దిక్పాలకులూ; కిన్నర సిద్ధ సాధ్యులున్= కిన్నరులూ, సిద్ధులూ, సాధ్యులూ; దేవగురుండున్= బృహస్పతీ; తోన్+అ= కూడానే; చనుదేరఁగన్= రాగా; వైభవము+ఉల్లసిల్లన్= వైభవం ప్రకాశించగా; ఐరావణ, దంతిన్+ఎక్కి= ఐరావతమనే ఏనుగు నెక్కి; అమరావతికిన్+చని; ఇంద్రుఁడు; ఆ శచీ

దేవియున్+తానున్= ఆ శచీదేవి; తనూ; అభీష్ట వినోద లీలలన్= కోరిన వేడుకల విలాసాలతో; మోదమునన్+తేలిరి= సంతోషంతో సుఖించారు.

తాత్పర్యం: అగ్నిదేవుడు మొదలుగాగల దిక్పాలకులూ, కిన్నరులూ, సిద్ధులూ, సాధ్యులూ బృహస్పతీ కూడా రాగా, వైభవం వెల్లివిరియగా, ఐరావతమనే ఏనుగు నెక్కి, అమరావతికి వెళ్ళి, ఇంద్రుడు ఆ శచీదేవితో ఇష్ట వినోద క్రీడలతో సంతోషంలో తేలియాడాడు.

విశేషం: అష్టదిక్పాలకులలో మొదటివాడు, తూర్పుదిక్కునకు అధిపతి ఇంద్రుడు. అతడిని చూడవచ్చినవారిలో ఇప్పుడు ఆగ్నేయదిక్కుకు అధిపతి అగ్ని. అతడు మొదలుగా మిగిలినవారు దక్షిణ దిగధిపతి- యముడు; నైఋతికి- నిరృతి; పశ్చిమానికి- వరుణుడు, వాయవ్యానికి- వాయువు, ఉత్తరానికి- కుబేరుడు; ఈశాన్యానికి- ఈశ్వరుడు అధిపతులు. (సంపా.)

వ. ఇవ్విధంబున మహానుభావుం డగు నమ్మహేంద్రుండు. 206

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; మహానుభావుండు+అగు= మహనీయుడైన; ఆ+మహేంద్రుండు= ఆ దేవేంద్రుడు.

తాత్పర్యం: ఈ రీతిగా మహానుభావుడైన ఆ దేవేంద్రుడు.

క. ఆజ్ఞాభంగం బయినం । బ్రాజ్ఞేతరునట్లు దుఃఖపడి యుండఁడె? తా
నజ్ఞాతవాసమును గా । లజ్ఞతఁ జలుపండె? యన్యులకు వగపేలా? 207

ప్రతిపదార్థం: ఆజ్ఞా భంగంబు+అయినన్= తన అధికారానికి భంగం కలుగగా; ప్రాజ్ఞ+ఇతరు+అట్లు= అప్రాజ్ఞుడివలె, అపండితుడివలె; దుఃఖము+పడి= దుఃఖించి; ఉండఁడె?= ఉండడా? తాను; అజ్ఞాత వాసమును= ఇతరులకు తెలియకుండా ఉండటం; కాలజ్ఞతన్= సమయజ్ఞతతో; చలుపండె?= చేయడా?; అన్యులకున్= ఇతరులకు; వగపు= దుఃఖం; ఏలా?= ఎందుకు?

తాత్పర్యం: తన అధికారానికి భంగం వాటిల్లినప్పుడు పామరుడివలె దేవేంద్రుడివంటివాడు దుఃఖం అనుభవిస్తూ ఉండలేదా? తాను కాలప్రభావాన్ని గుర్తించి అజ్ఞాతవాసం చేయడా? ఇతరులకు దుఃఖ మెందుకు?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. ఇంద్రుడే ఆ విధంగా ప్రవర్తించినప్పుడు ఇతరుల సంగతి చెప్పాలా? అని కైముత్యంచేత అర్థసంసిద్ధి కలుగుతున్నది కాబట్టి అలంకారం కావ్యార్థాపత్తి.

క. కావున మీ పడిన యరణ్యావాస క్లేశమునకు, నజ్ఞాత విధిన్
సేవకుల రైన దానికి । నోవకుఁడీ మీరు లఘుమనోవృత్తులరై.' 208

ప్రతిపదార్థం: కావునన్; మీరు; లఘు మనస్(ః)+వృత్తులరు+ఐ= అల్పబుద్ధి కలవారయి; మీ పడిన అరణ్య+ఆవాస క్లేశమునకున్= మీరు పడ్డ అరణ్యవాస కష్టానికీ; అజ్ఞాత విధిన్= ఇతరులచేత ఎరుగబడకుండా; సేవకులరు+ఐన దానికిన్= సేవకులయినందుకూ; నోవకుఁడీ= బాధపడకండి.

తాత్పర్యం: కాబట్టి మీరు అరణ్యవాస దుఃఖం అనుభవించినందుకూ, ఇతరులకు తెలియకుండా సేవకత్వం చేసినందుకూ మీరు అల్పబుద్ధితో నొచ్చుకొనకండి.'

వ. అని యిట్లు సెప్పి శల్యుండు సభాసదులం గలయం గనుంగొని. 209

ప్రతిపదార్థం: అని; ఇట్లు; చెప్పి; శల్యుండు; సభాసదులన్= సభ్యులను; కలయన్+కనుంగొని= బాగా చూచి.

తాత్పర్యం: అని ఈ విధంగా చెప్పి శల్యుడు సభలోఉన్న వారి నందరినీ బాగా చూచి.

ఉ. కౌరవనాథుఁ డా నహుషుకైవడి నాశముఁ బొందు; వాసవ
శ్రీ రమణీయుఁడై జయము సేకొని ధర్మజుఁ డంబురాశి వే
లా రశనా సముజ్జ్వల విలాస మనోహర మేదినీ వధూ
సార సమగ్ర భోగముల సన్నుతి కెక్కెడుఁ దానుఁ దమ్ములున్. 210

ప్రతిపదార్థం: కౌరవ నాథుఁడు= కురుపతి-దుర్యోధనుడు; ఆ నహుషు కైవడిన్= ఆ నహుషుడివలె; నాశమున్+పొందున్= నశిస్తాడు; ధర్మజుఁడు= ధర్మరాజు; వాసవ శ్రీ రమణీయుఁడు+ఐ= ఇంద్ర సంపదవంటి సంపదతో మనోహరుడయి; జయము+చేకొని= గెలుపొంది; తానున్+తమ్ములున్= తాను తమ్ములతో; అంబురాశి= సముద్రముయొక్క; వేలా= తీరం అనే; రశనా= మొలనూలుతో; సముజ్జ్వల= ప్రకాశించే; విలాస= లీలచేత; మనోహర= అందమైన; మేదినీ వధూ= భూమి అనెడు స్త్రీ యొక్క; సార= సారవంతములూ; సమగ్ర= సంపూర్ణములూ అయిన; భోగములన్= సౌఖ్యాలతో; సన్నుతికిన్+ ఎక్కెడున్= పొగడ్త కెక్కుతాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఆ నహుషుడివలె నశిస్తాడు. ధర్మరాజు ఇంద్రవైభవంతో విజయం సాధించి, తమ్ములతో సముద్ర తీరమనే మొలనూలి సముజ్జ్వల విలాసంచేత అందమైన భూమి అనే స్త్రీ యొక్క సారవంతాలైన సర్వభోగాలూ పొంది పొగడ్త కెక్కుతాడు.

విశేషం: అలం: ఉపమ. (కౌరవనాథుఁడా... నాశముఁబొందు); వేలా రశనా, మేదినీ వధూ అనే చోట్ల ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం.

వ. అని పలికి వెండియు నతండు పాండవాగ్రజున కిట్లనియె. 211

ప్రతిపదార్థం: అని; పలికి; వెండియున్= ఇంకా; అతండు= శల్యుడు; పాండవ+అగ్రజునకున్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికి శల్యుడు ధర్మరాజుతో ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'సౌఖ్యంబులు వొందు, జగ । త్ప్రఖ్యాతులుఁ జెందుఁ, దగఁ బురందర విజయో
పాఖ్యానము విన్నను, ద । ద్వ్యాఖ్యానము సేసినన్ జనావలి కనఘా! 212

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! ధర్మరాజా!; తగన్= ఒప్పుగా; పురందర+విజయ+ఉపాఖ్యానము= ఇంద్ర విజయ వృత్తాంతం; విన్నను= విన్నా; తద్+వ్యాఖ్యానము+చేసినన్= దానిని వ్యాఖ్యానించినా; జన+ఆవలికిన్= జనసముదాయానికి; సౌఖ్యంబులు+పొందున్= సుఖాలు కలుగుతాయి.; జగత్+ప్రఖ్యాతులున్= ప్రపంచకీర్తులూ; చెందున్= లభిస్తాయి.

తాత్పర్యం: 'అనఘా! ధర్మరాజా! సముచితంగా ఇంద్రవిజయకథ విన్నా, దానిని వ్యాఖ్యానించినా జనులకు సౌఖ్యాలు కలుగుతాయి. ప్రపంచ వ్యాప్తంగా కీర్తులు లభిస్తాయి.

క. మోహరము నడచుచుండఁగ । నీ హరి విజయంబు విను నరేంద్రుఁడు రిపు సం
దోహంబు గెల్చుటకు సం । దేహం బించుకయు లేదు ధీరవిచారా!' 213

ప్రతిపదార్థం: ధీర విచారా?= ధైర్యవంతమైన ఆలోచన కలవాడా! ధర్మరాజా!; మోహరము= యుద్ధం; నడుచుచున్+ ఉండఁగన్= జరుగుతుండగా; ఈ హరి విజయంబున్= ఈ ఇంద్ర విజయ వృత్తాంతాన్ని; విను నరేంద్రుఁడు= వినే రాజు; రిపు సందోహంబున్= శత్రువుల సమూహాన్ని; గెల్చుటకున్= గెలవటానికి; సందేహంబు= అనుమానం; ఇంచుకయున్+లేదు= కొంచెం కూడా లేదు.

తాత్పర్యం: ధర్మరాజా! యుద్ధం జరుగుతూ ఉండగా ఇంద్రవిజయమనే ఈ కథను విన్నరాజు శత్రుసమూహాన్ని గెలుస్తాడు. ఇందులో సందేహం ఏమాత్రమూ లేదు.'

విశేషం: ఇంద్రవిజయం విన్న ధర్మరాజు యుద్ధంలో శత్రువులను జయించటం తథ్యమని ధ్వని. ప్రాచీనకాలంలో ఇటువంటి విజయగాథలను యుద్ధశిబిరాల్లో వినిపించేసంప్రదాయం ఉన్నట్లు ఈ ఫలశ్రుతి వలన వెల్లడౌతున్నది. (సంపా.)

వ. అనిన విని ధర్మనందనుండు మద్రపతిం బ్రస్తుతించి 'మహానుభావా! భవదీయ భాషణ శ్రవణంబునఁ జిత్తంబు కలంక దేఱె' నని సంభావించి యతనికి సముచితంబులగు మజ్జన భోజనంబు లొనరించి, యనంతరంబ యతండు పయనంబునకు నుద్యోగించిన. 214

ప్రతిపదార్థం: అనినన్; విని; ధర్మనందనుండు= ధర్మరాజు; మద్రపతిన్= మద్రదేశరాజును-శల్యుడిని; ప్రస్తుతించి= బాగా పొగడి; మహానుభావా!= మహాత్మా!; భవదీయ భాషణ శ్రవణంబునన్= మీ మాటల వినికి చేత; చిత్తంబు= మనస్సు; కలంకదేఱెన్= ప్రసన్నత నొందింది; అని; సంభావించి= ఆదరించి; అతనికిన్; సముచితంబులు+అగు= మిక్కిలి తగినవైన; మజ్జన భోజనంబులు= స్నానమూ, భోజనమూ; ఒనరించి= చేసి; అనంతరంబు+అ= వెంటనే; అతండు= శల్యుడు; పయనంబునకున్= ప్రయాణానికి; ఉద్యోగించినన్= పూనుకొనగా.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు శల్యుడిని సన్నుతించి 'మహాత్మా! మీ మాటలు వినటం చేత నా మనస్సు తేరుకొన్నది.' అని మన్నించి అతడికి తగిన విధంగా స్నాన భోజనాలు ఏర్పాటుచేసి, వెంటనే అతడు ప్రయాణానికి పూనుకోగా.

విశేషం: సత్కథాశ్రవణం సంకటహరణం అని నీతి.(సంపా.)

ఆ. అతని ననుప నేఁగి యధిక సంప్రీతి నే । తెంచునప్పు డయ్యుధిష్ఠిరుండు
'రణములోన మీరు రాధేయుఁ బలుకుట । మఱవకుండవలయు మమ్ముఁ దలఁచి.' 215

ప్రతిపదార్థం: అతనిన్= శల్యుడిని; అనుపన్+ఏఁగి= సాగనంపటానికి వెళ్ళి; అధిక సంప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; ఏతెంచు+అప్పుడు= వచ్చేటప్పుడు; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; రణములోనన్= యుద్ధంలో; మీరు; మమ్మున్+

తలఁచి= మమ్మల్ని దృష్టిలో పెట్టుకుని; రాధేయున్+పలుకుట= కర్ణుడిని నిరుత్సాహపరుస్తూ మాటాడటం; మఱవక+ ఉండవలయున్= మరచిపోగూడదు.

తాత్పర్యం: శల్యుడిని మిక్కిలి సంతోషంతో సాగనంపటానికి వెళ్ళి వచ్చేటప్పుడు ఆ ధర్మరాజు 'యుద్ధంలో మీరు మమ్మల్ని దృష్టిలో పెట్టుకొని కర్ణుడిని నిరుత్సాహపరుస్తూ మాట్లాడటం మరచిపోగూడదు' అన్నాడు.

క. అనుటయు మద్రేశ్వరుఁ డా । తని నూఱడఁ బలికి గాఢతరముగ నాలిం
గన మొనరించి చనియె హ । స్తినాపురికి బలముతో నతిత్వరితగతిన్. 216

ప్రతిపదార్థం: అనుటయున్= అనినంతనే; మద్ర+ఈశ్వరుఁడు= మద్రదేశాధిపతి శల్యుడు; ఆతనిన్; ఊఱడన్+పలికి= ఓదార్పుగా పలికి; గాఢతరముగన్= మిక్కిలి గట్టిగా; ఆలింగనము+ఒనరించి= కౌగిలించుకొని; అతి త్వరిత గతిన్= మిక్కిలి శీఘ్రగమనంతో; బలముతోన్= సైన్యంతో; హస్తినాపురికిన్; చనియెన్.

తాత్పర్యం: అని ధర్మరాజు అనగానే శల్యుడు అతడికి ఊరట కలిగేటట్లు మాటాడి గట్టిగా కౌగిలించుకొని, అతి శీఘ్ర గమనంతో హస్తినాపురానికి సైన్యంతో వెళ్ళిపోయాడు.

విశేషం: ఒక్కొక్క పాత్రకు ఒక్కొక్క ప్రత్యేకమైన అలవాటు ఉన్నట్లు చిత్రించటం తిక్కన నాటకీయరచనా శిల్పంలో భాగం. శల్యుడు మైత్రితో ఎదుటివారిని కౌగిలించుకొనటం అతడి అలవాటు. మొదట రాగానే ధర్మజుడిని కౌగిలించుకొన్నాడు (104వ పద్యం). పోతూ ఇప్పుడు గట్టిగా కౌగిలించుకొన్నాడు. ఆ గాఢమైన కౌగిలింత ధర్మరాజుకు తప్పక అనుకూలంగా వ్యవహరిస్తానని వ్యక్తం చేసిన ఆంగికాభినయం. మాటలకంటె చేతలే ఒక్కొక్కసారి ఎంతో మాట్లాడతాయి.(సంపా.)

వ. అట్టి యవసరంబున. 217

తాత్పర్యం: ఆ సమయంలో.

సాత్యక్యాదులు సేనాసమేతంబుగఁ బాండవులం జేరవచ్చుట (సం. 5-19-1)

మ. సకలారాతి భయంకరుం డగుచు నుత్సాహంబు వాటించి, నే
లకు వ్రేఁ గయ్యెడుభంగి వచ్చె రణలీలాకౌతుకం బొప్పఁ దా
నొక యక్షౌహిణి తోడఁ, బాండవబలం బుల్లాసముం బొంద సా
త్యకి బాహాబలగర్వ నిర్వహణ విద్యాప్రౌఢి సంరూఢుఁడై. 218

ప్రతిపదార్థం: సాత్యకి; సకల+అరాతి భయంకరుండు+అగుచున్= ఎల్లశత్రువులకు వెరపు కలిగించేవాడవుతూ; ఉత్సాహంబు+ పాటించి= అభిలాష పూని; బాహా బల గర్వ నిర్వహణ విద్యా ప్రౌఢి సంరూఢుఁడు+ఐ= భుజ పరాక్రమ గర్వాన్ని నిర్వహించే విద్యయందలి నేర్పుచేత మిక్కిలి ప్రసిద్ధుడై; రణ లీలా కౌతుకంబు+ఒప్పన్= యుద్ధక్రీడయందలి వేడుక ఒప్పగా; పాండవ బలంబు= పాండవుల సేన; ఉల్లాసమున్+పొందన్= సంతోషపడగా; తాను; ఒక+అక్షౌహిణి తోడన్= ఒక అక్షౌహిణీ సేనతో; నేలకున్= భూమికి; వ్రేఁగు= భారము; అయ్యెడు భంగిన్= అయ్యే విధంగా; వచ్చెన్.

తాత్పర్యం: సాత్యకి సర్వశత్రు భీకరుడవుతూ, ఉత్సాహంతో, యుద్ధక్రీడయందలి వేడుక ఒప్పగా, పాండవసేన సంతోషించగా, భుజ పరాక్రమ గర్వాన్ని చూపే విద్యయందలి నేర్పుచేత ప్రసిద్ధుడై, ఒక అక్షౌహిణీ సేనను తీసికొని, భూమికి భారం కలిగే విధంగా వచ్చాడు.

విశేషం: అక్షౌహిణి - 21870 రథాలు, అన్ని ఏనుగులు, 65610 గుర్రాలు, 109350 కాల్బలం కలసేన.

వ. అంతం జేదిపతి యగు ధృష్టకేతుండును, జరాసంధనందనుండగు సహదేవుండును జెఱొక్క యక్షౌహిణి తోడం జనుదెంచిరి. సహోదరు లేవు రగు కేకయపతులు నేకాక్షౌహిణీ సమేతులై యేఁగుదెంచిరి; తదనంతరంబ. 219

ప్రతిపదార్థం: అంతన్; చేది పతి+అగు ధృష్టకేతుండును= చేది దేశరాజగు ధృష్టకేతుడూ; జరాసంధ నందనుండు+అగు సహదేవుండును= జరాసంధుడి కొడుకైన సహదేవుడూ; చెఱి+ఒక్క+అక్షౌహిణి తోడన్= ఒక్కొక్క అక్షౌహిణీ సేనతో; చనుదెంచిరి= వచ్చారు; సహోదరులు+ఏవురు+అగు కేకయపతులున్= సోదరు లయిన అయిదుగురు కేకయ పతులూ; ఏక+ అక్షౌహిణీ సమేతులు+ఐ= ఒక్క అక్షౌహిణీ బలంతో; ఏఁగుదెంచిరి= వచ్చారు; తద్+అనంతరంబు+అ= ఆ వెంటనే.

తాత్పర్యం: అంతట చేది దేశపురాజైన ధృష్టకేతుడూ, జరాసంధుడి కుమారుడైన సహదేవుడూ ఒక్కొక్క అక్షౌహిణీ సేనతో వచ్చారు. సోదరులైన అయిదుగురు కేకయపతులూ ఒక అక్షౌహిణీ బలంతో వచ్చారు. ఆ వెంటనే.

క. కొడుకులుఁ దానును గుఱ్ఱపు । దడములఁ, గరిఘటల; భట రథవ్రాతములం
బుడమి చలింపఁగ ద్రుపదుఁడు । గడు వేడుకఁ దోడు సూపెఁ గౌంతేయులకున్. 220

ప్రతిపదార్థం: ద్రుపదుఁడు; కొడుకులున్+తానును= కొడుకులూ; తానూ; గుఱ్ఱము+దడములన్= గుర్రపు సేనలతో; కరి ఘటలన్= ఏనుగుల గుంపులతో; భట రథ వ్రాతములన్= కాల్బంటుల, రథాల సమూహాలతో; పుడమి చలింపఁగన్= భూమి అదరేటట్లు; కడున్ వేడుకన్= మిక్కిలి సంతోషంతో; కౌంతేయులకున్= పాండవులకు; తోడు+చూపెన్= సహాయం కొరకు వచ్చాడు.

తాత్పర్యం: ద్రుపదుడు కొడుకులతో గుర్రపు దళాలతోనూ, ఏనుగుల గుంపులతోనూ, కాల్బంటుల రథాల సమూహాలతోనూ భూమి అదిరే విధంగా మిక్కిలి వేడుకతో పాండవులకు సహాయం చేయటానికి వచ్చాడు.

వ. అదియును నొక యక్షౌహిణికిం గలిగి యొప్పె; నయ్యవసరంబున ననుజ తనుజ సమేతుండును, బార్వతీయ మహీపాల సహితుండును నై యొక్క యక్షౌహిణి యొడ్డనంబు దీర్చి. 221

ప్రతిపదార్థం: అదియును= ఆ సేనయూ; ఒక+అక్షౌహిణికిన్+కలిగి+ఒప్పెన్= ఒక అక్షౌహిణి పరిమితి కలదై విలసిల్లింది; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; అనుజ తనుజ సమేతుండును= తమ్ములతోనూ, కొడుకులతోనూ కూడినవాడూ; పార్వతీయ మహీపాల సహితుండునున్+ఐ= పర్వతప్రాంత దేశాల రాజులతో కూడిన వాడూ అయి; ఒక్క+అక్షౌహిణి+ఒడ్డనంబు+ తీర్చి= ఒక అక్షౌహిణీ వ్యూహం సవరించి.

తాత్పర్యం: అదియూ ఒక అక్షౌహిణి అయి ఒప్పింది. ఆ సమయంలో తమ్ములతోనూ, కొడుకులతోనూ కూడినవాడూ, పర్వతప్రాంతీయులైన రాజులతో కూడినవాడూ అయి ఒక అక్షౌహిణీ వ్యూహం సవరించి.

**క. చిందముల మ్రోఁతఁ బగతుర । డెందంబులతోడ దిక్తటీసంధులు నం
దంద పగులంగఁ, గుంతీ । నందనులకుఁ దోడు మత్స్యనాథుఁడు సూపెన్. 222**

ప్రతిపదార్థం: చిందముల మ్రోఁతన్= శంఖముల ధ్వనులతో; పగతుర డెందంబుల తోడన్= శత్రువుల మనస్సులతో; దిక్+తటీ సంధులున్= దిక్ప్రదేశముల కలయికలు కూడా; అందంద= క్రమక్రమంగా; పగులంగన్= బ్రద్దలు కాగా; మత్స్య నాథుఁడు= మత్స్యదేశపు రాజయిన విరాటుడు; కుంతీ నందనులకున్= కుంతి కొడుకులకు-పాండవులకు; తోడు= సహాయం; చూపెన్.

తాత్పర్యం: శంఖధ్వనులచే శత్రుహృదయాలతోపాటు దిక్ప్రదేశాల సంధులు కూడా క్రమక్రమంగా పగులగా మత్స్య దేశాధీశుడైన విరాటుడు పాండవులకు సహాయుడై వచ్చాడు.

విశేషం: అలం: సహోక్తి. 'పగతురడెందంబులతోడ దిక్తటీసంధులు నందంద పగులంగ'. ఇక్కడ పగతురడెందములకూ, దిక్తటీ సంధులకూ సహభావం ఉన్నది కాబట్టి సహోక్తి.

వ. పాండ్యవిభుండు లోనుగాఁ బలుదెసలనుండి వచ్చిన బలం బొక్క యక్షౌహిణికిం గలిగి యొప్పె. 223

ప్రతిపదార్థం: పాండ్య విభుండు లోనుగాన్= పాండ్యదేశపు రాజు మొదలైన; పలు దెసలనుండి వచ్చిన బలంబు= అనేక దిక్కుల నుండి వచ్చిన సైన్యం; ఒక్క+అక్షౌహిణికిన్+కలిగి+ఒప్పెన్= ఒక అక్షౌహిణి అయి ఒప్పింది.

తాత్పర్యం: పాండ్యదేశాధిపతి మొదలుగా నానాదిశలనుండి వచ్చిన సైన్యం ఒక అక్షౌహిణి అయి ఒప్పింది.

**క. ఏ డక్షౌహిణు లిమ్మెయిఁ । గూడెం బాండునృపసుతులఁ గ్రూరాహవసం
క్రీడా వినోదమునకుం । దోడుపడం బూని యతి కుతూహల వృత్తిన్. 224**

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; ఏడు+అక్షౌహిణులు; క్రూర+ఆహవ సంక్రీడా వినోదమునకున్= ఘోరమైన యుద్ధం అనే క్రీడయందలి వేడుక కొరకు; అతి కుతూహల వృత్తిన్= మిక్కిలి సంతోషంతో; తోడుపడన్+పూని= సహాయపడటానికి పూని; పాండు నృప+సుతులన్= పాండురాజు కొడుకులైన పాండవులను; కూడెన్= కలిసాయి.

తాత్పర్యం: ఈ విధంగా ఏడు అక్షౌహిణులు ఘోరయుద్ధ క్రీడా వినోదం కొరకు మిక్కిలి కుతూహలంతో తోడ్పాటు చూపటానికి పూని పాండవులను కలిసాయి.

వ. ఇవ్విధంబునం గూడి పెరిఁగి యుధిష్ఠిరు సైన్యంబు గయ్యంబునకుం గాలు ద్రవ్వుచునుండె; నంత నక్కడం గిరాతకాంచన సైన్యనిచయంబులం గూర్చికొని, సమరంబునకు నమరి యొక్క యక్షౌహిణి గల భగదత్తుండు సుయోధనుం గలిసె; భూరిపరాక్రముండయిన భూరిశ్రవుండును, మహాబలుండయిన శల్యుండును నేకాక్షౌహిణీ సమేతంబుగా నేతెంచిరి; వారలయట్ల సన్నద్ధుఁడై కాంభోజనాథుండైన సుదక్షిణుండును యవనేశ్వరుండును వచ్చె; నత్తెఱంగున సమకట్టి జయద్రథ ప్రముఖులైన సింధు సౌవీర నరపతు లరుగుదెంచిరి; మాహిష్మతీ పతి యగు నీలుండు, యాదవవీరుం డగు కృతవర్మయు, నవంతీశ్వరులు సోదరులు నగు విందానువిందు లిరువురునుంగా నిన్నలువురు నొక్కొక్క యక్షౌహిణితోడఁ జనుదెంచిరి;

మఱియునుం బలుదెసల నుండి వచ్చి కూడిన వాహినులు మూఁ డక్షౌహిణులకుం గలిగె; ధార్తరాష్ట్రులకుఁ దోడు పడం బూనినయవి పదునొకం డక్షౌహిణు లయ్యెఁ; నట్టియెడ. 225

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; కూడి; పెరిఁగి= వృద్ధిపొంది; యుధిష్ఠిరు సైన్యంబు= ధర్మరాజు సైన్యం; కయ్యంబునకున్+ కాలు+త్రవ్వుచున్+ఉండెన్= యుద్ధానికి సిద్ధపడుతూఉండింది; అంతన్; అక్కడన్= కౌరవపక్షంలో; కిరాత కాంచన సైన్య నిచయంబులన్= కిరాతులనూ, బంగారాన్నీ, సేనా సమూహాలనూ, కూర్చికొని; సమరంబునకున్= యుద్ధానికి; అమరి= ఒప్పి; ఒక్క+అక్షౌహిణి+కల భగదత్తుండు= ఒక అక్షౌహిణీబలం ఉన్న భగదత్తుడు; సుయోధనున్= దుర్యోధనుడిని కలిసెన్; భూరి పరాక్రముండు+అయిన భూరిశ్రవుండును= మిక్కిలి పరాక్రమవంతుడయిన భూరిశ్రవుడూ; మహాబలుండు+అయిన శల్యుండును; ఏక+అక్షౌహిణీ సమేతంబుగాన్= ఒక అక్షౌహిణీతో కూడి; ఏతెంచిరి= వచ్చారు; వారల+అట్లు+అ= వారి వలెనే- అనగా ఒక అక్షౌహిణితో; సన్నద్ధుఁడు+ఐ= సంసిద్ధుడయి; కాంభోజ నాథుండు+ఐన= కాంభోజదేశపురాజయిన; సుదక్షిణుండు+ అను యవన+ఈశ్వరుండును= సుదక్షిణుడనే యవనపతియూ; వచ్చెన్; ఆ+తెఱంగునన్= ఆ రీతిగా; సమకట్టి= పూని (అనగా ఒక అక్షౌహిణితో); జయద్రథ ప్రముఖులు+ఐన= జయద్రథుడూ మొదలైన; సింధు సౌవీర నరపతులు= సింధుదేశపురాజూ, సౌవీరదేశపురాజూ; అరుగుదెంచిరి= వచ్చారు; మాహిష్మతీ పతి+అగు నీలుండున్= మాహిష్మతీ దేశరాజయిన నీలుడూ; యాదవ వీరుండు+అగు కృతవర్మయున్; అవంతి+ఈశ్వరులు= అవంతి దేశరాజులూ; సోదరులున్= సహోదరులూ; అగు; వింద+అనువిందులు+ఇరువురునున్+కాన్= అవంతి దేశాధీశులూ సహోదరులూ అయిన విందుడూ, అనువిందుడూ; ఈ+నలువురున్= ఈ నలుగురూ; ఒక్కొక్క+అక్షౌహిణి తోడన్; చనుదెంచిరి; మఱియునున్; పలు దెసలనుండి= అనేక దిక్కుల నుండి; వచ్చి; కూడిన వాహినులు= చేరిన సేనలు; మూఁడు+అక్షౌహిణులకున్+కలిగెన్= మూడు అక్షౌహిణులు అయ్యాయి; ధార్తరాష్ట్రులకున్= కౌరవులకు; తోడుపడన్+పూనిన+అవి= సహాయపడటానికి వచ్చినవి; పదునొకండు+అక్షౌహిణులు; అయ్యెన్; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ రీతిగా కూడి పెరిగి ధర్మరాజుసైన్యం కయ్యానికి కాలుత్రవ్వుతూ ఉన్నది. అంత అక్కడ-కౌరవపక్షంలో- కిరాతకులనూ, ధనాన్నీ, సైన్య సమూహాలను కూర్చుకొని, యుద్ధానికి సిద్ధపడి ఒక అక్షౌహిణీసేనతో భగదత్తుడు దుర్యోధనుడిని చేరాడు. అధిక పరాక్రమవంతు డయిన భూరిశ్రవుడూ, మహాబలుడైన శల్యుడూ ఒక అక్షౌహిణితో వచ్చారు. వారివలెనే ఒక అక్షౌహిణితో కాంభోజరాజయిన సుదక్షిణుడనే యవనపతి వచ్చాడు. అదే విధంగా ఒక అక్షౌహిణితో సిద్ధపడి జయద్రథుడూ మొదలుగాగల సింధు సౌవీర దేశాల రాజులు వచ్చారు. మాహిష్మతీ ప్రభువైన నీలుడూ, యాదవవీరుడైన కృతవర్మా, అవంతీశ్వరులూ సోదరులూ అయిన విందుడూ అనువిందుడూ అనే ఇద్దరూ కలిసి ఈ నలుగురూ ఒక్కొక్క అక్షౌహిణితో వచ్చారు. ఇంకా అనేక దిక్కుల నుండి వచ్చి చేరిన సేనలు మూడు అక్షౌహిణులయ్యాయి. కౌరవులకు ఈ విధంగా సహాయపడవచ్చినవి పదకొండు అక్షౌహిణులయినాయి. ఆ సమయంలో.

క. సవరణల నొప్పి, యనిఁ బాం । డవ బలముల మార్కొనం గడంగుచు, నత్యు
త్సవమునఁ బేర్చిన సేనల । కవకాశము లేదు విడియ హస్తిపురమునన్. 226

ప్రతిపదార్థం: సవరణలన్= యుద్ధపరికరాలతో; ఒప్పి; అనిన్= యుద్ధంలో; పాండవ బలములన్= పాండవుల సేనలను; మార్కొనన్= ఎదుర్కొనటానికి; కడంగుచున్= ప్రయత్నిస్తూ; అతి+ఉత్సవమునన్= మిక్కిలి సంతోషంతో; పేర్చిన= విజృంభించిన; సేనలకున్; హస్తిపురమునన్; విడియన్= విడిది చేయటానికి; అవకాశము లేదు= స్థలం లేదు.

తాత్పర్యం: యుద్ధపరికరాలతో ఒప్పి, యుద్ధంలో పాండవుల సేనలను ఎదుర్కొనడానికి ప్రయత్నిస్తూ మిక్కిలి సంతోషంతో విజృంభించిన సేనలకు హస్తినాపురంలో విడిది చేయటానికి స్థలం చాలలేదు.

క. నానాముఖముల విడియం। గా నియమించెను బలంబుఁ గౌరవపతి యా
సేనల దొరలకు నిలువఁగ। నైనను నెడ లేమి, నధిక హర్షం బెసఁగన్. 227

ప్రతిపదార్థం: కౌరవ పతి= కురురాజు - దుర్యోధనుడు; ఆ సేనల దొరలకున్= ఆ సేనల నాయకులకు; నిలువఁగన్+ ఐననున్= నిలవటానికి కూడా; ఎడ లేమిన్= స్థలం లేకపోవటం చేత; బలంబును= సైన్యాన్ని; నానా ముఖములన్= పెక్కుచోట్ల; విడియంగాన్= విడిది చేసేటట్లు; అధిక హర్షంబు+ఎసఁగన్= మిక్కిలి సంతోషం అతిశయించగా; నియమించెను= ఏర్పాటు చేశాడు.

తాత్పర్యం: ఆ సేనల నాయకులకు నిలవటానికి కూడా స్థలం లేకపోవటం వలన సంతోషం అతిశయించగా దుర్యోధనుడు సైన్యాన్ని పెక్కుచోట్ల విడిసేటట్లు ఏర్పాటు చేశాడు.

వ. ఇత్తెఱంగునం గురుజాంగలంబున, రౌహితకారణ్యంబున, మరుదేశంబున, నహిచ్ఛత్రంబునఁ, గాలకూటంబున, గంగాకూలంబున, వారణావతంబున, వటస్థానంబున విచ్చలవిడి విడిసి, ధనధాన్యాది సమస్త వస్తువుల కలిమింజేసి యెలమి మిగిలి యున్నంత. 228

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; కురుజాంగలంబునన్, రౌహితక+అరణ్యంబునన్, మరుదేశంబునన్, అహిచ్ఛత్రంబునన్, కాలకూటంబునన్, గంగాకూలంబునన్, వారణావతంబునన్; వటస్థానంబునన్; విచ్చలవిడి= స్వేచ్ఛగా; విడిసి; ధన ధాన్య+అది సమస్త వస్తువుల కలిమిన్+చేసి= ధనమూ, ధాన్యమూ మొదలయిన ఎల్ల వస్తువులూ ఉండటం చేత; ఎలమి మిగిలి= సంతోషం అతిశయించి; ఉన్న+అంతన్= ఉన్న తరువాత.

తాత్పర్యం: ఈ విధంగా కురుజాంగలంలోనూ, రౌహిత కారణ్యంలోనూ, మరుదేశంలోనూ, అహిచ్ఛత్రంలోనూ, కాలకూటంలోనూ, గంగాకూలంలోనూ (గంగాతీరంలోనూ), వారణావతంలోనూ, వటస్థానంలోనూ స్వేచ్ఛగా విడిసి, ధనమూ, ధాన్యమూ మొదలయిన వస్తువులన్నీ సమృద్ధిగా ఉండటంచేత సంతోషాతిశయంతో ఉండగా.

ద్రుపద పురోహితుని రాయబారము (సం. 5-29-1)

క. పాంచాల మహీవల్లభు। పంచిన భూదేవుఁ డుచితభంగి నగరి కే
తెంచి, ధృతరాష్ట్రుఁ బ్రీతిం। గాంచి, కృపద్రోణ విదుర గంగాసుతులన్. 229

ప్రతిపదార్థం: పాంచాల మహీవల్లభు పంచిన భూదేవుఁడు= పాంచాలదేశపురాజయిన ద్రుపదుడు పంపిన బ్రాహ్మణుడు; ఉచిత భంగిన్= తగిన విధంగా; నగరికిన్= పట్టణానికి- హస్తినాపురానికి; ఏతెంచి= వచ్చి; ధృతరాష్ట్రున్; ప్రీతిన్= ఇష్టంతో; కాంచి= చూచి(దర్శించి); కృప ద్రోణ విదుర గంగాసుతులన్= కృపుడినీ, ద్రోణుడినీ, విదురుడినీ, భీష్ముడినీ.

తాత్పర్యం: ద్రుపదుడు పంపిన పురోహితుడు తగిన విధంగా హస్తినాపురానికి వచ్చి ధృతరాష్ట్రుడిని ప్రీతితో చూసి, కృపద్రోణ విదుర భీష్ములను (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: ఈ పద్యం ఎత్తుగడ సాభిప్రాయం. వచ్చిన రాయబారి పాంచాల దేశాధీశుడు పంపిన దూత. ఆయన భూదేవుడైన పురోహితుడు. పంపినవాడు ద్రుపదుడు. కార్యం పాండవులది. స్వభావాన్ని బట్టి పురోహితుడు రాబోయే మేలు తెలిపేవాడు. ఆ తీరు చూస్తే ఈ రాయబారం మిత్రుడి హితబోధవలె ఉండే అవకాశం ఎక్కువగా ఉన్నదని సూచన. బ్రాహ్మణుడి మాటలలో ధర్మరాజు పంపిన సందేశం కంటె ద్రుపదుడు మొదలైన హితుల అభిప్రాయాలే ప్రతిఫలించే అవకాశం ఉన్నది. అందువలన ఈ రాయబారం చాలా సున్నితమైనది. (సంపా.)

వ. వారి వారి మందిరంబులకుం జని కని, సముచితాలాపంబులం బ్రసన్న చిత్తులం జేసి, దుర్యోధను సందర్శనం బును నిర్వర్తించి, నిత్య నిపుణారాధనంబున ధృతరాష్ట్రునభిముఖుం గావించి, యొక్క నాఁ డక్కౌరవేశ్వరు పేరోలగంబున సమస్త సేనాపతులం గలయం గనుంగొని యిట్లనియె. 230

ప్రతిపదార్థం: వారి వారి మందిరంబులకున్+చని= వారి వారి ఇళ్ళకు వెళ్ళి; కని= చూసి; సముచిత+ఆలాపంబులన్= తగిన మాటలచేత; ప్రసన్న చిత్తులన్+చేసి= సంతోషించిన మనస్సులు కలవారినిగా చేసి; దుర్యోధను సందర్శనంబును= దుర్యోధనుడి దర్శనం కూడా; నిర్వర్తించి= చేసి, నిత్య నిపుణ+ఆరాధనంబునన్= ఎడతెగని నేర్పుతోడి పూజనంచేత; ధృతరాష్ట్రున్; అభిముఖున్= అనుకూలుడిని; కావించి= చేసి; ఒక్క నాఁడు; ఆ+కౌరవ+ఈశ్వరు పేరు+ఓలగంబునన్= ఆ ధృతరాష్ట్రుడి నిండుకొలువులో; సమస్త సేనాపతులన్= ఎల్ల సేనానాయకులను; కలయన్+కనుంగొని= బాగుగా చూచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: వారి వారి ఇళ్ళకు వెళ్ళి చూచి, తగిన మాటలతో మనస్సులకు సంతోషం కలిగించి, దుర్యోధనుడి దర్శనం కూడా చేసికొని, నిరంతరం నేర్పుతో ఆరాధించి ధృతరాష్ట్రుడిని తనకు అనుకూలుడినిగా చేసికొని, ఒకనాడు ఆ ధృతరాష్ట్రుడి నిండు కొలువులో సేనానాయకుల నందరినీ బాగుగా చూచి ఇట్లా అన్నాడు.

విశేషం: హస్తినాపురంలో ద్రుపద పురోహితుడు కొన్నాళ్ళు గడిపినట్లున్నాడు. అతడికి సరాసరి రాజసభలో ప్రవేశం దొరికినట్లు లేదు. అతడు అంతవేగంగా కోరినట్లూ లేదు. పట్టణంలోని పెద్దలనందరినీ దర్శించాడు. వారితో సమయోచితంగా మాట్లాడి వారి మనస్సులకు సంతోషం కలిగించాడు. దుర్యోధనుడిని కూడా దర్శించాడు. ధృతరాష్ట్రుడి హృదయానికెక్కాలంటే ఎన్నో నేర్పులు ప్రదర్శించవలసి వచ్చింది. రాజుమెచ్చి తనకనుకూలుడయిన తరువాత సభలో అసలు సంగతి ప్రస్తావించాడు. అనుకూల పరిస్థితుల కొరకు దూతపడే శ్రమ ఇందులో వ్యక్తమౌతున్నది. (సంపా.)

సీ. 'ధృతరాష్ట్ర పాండుభూపతులు సహోదరు । లగుటయు, వారల యాత్మజులకుఁ
దమ తమ తండ్రుల ధనములు గైకొనఁ । దగుటయు, మీకు నందఱకుఁ జూడ
నుచితంబ కాదె? యట్లుండెఁ, దొల్లింటి చం । దంబును మనకుఁ దెల్లంబ కాదె?
ప్రాణగొడ్డము లగు పనుల వారలఁ దీర్పఁ । దలఁచినఁ, బున్నెంబు కలిమిఁ జేసి

తే. బాహుబల మొప్ప నిజరాజ్యపదవిఁ బొంది । యున్న, వంచనమెయి మహిఁ గొన్న తెఱఁగు
నెఱుఁగుదుర కాదె? దీనికి నెల్ల నియ్య । కొనియె నీ పెద్దరాజు నేమనఁగ నేర్తు? 231

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర పాండు భూపతులు= ధృతరాష్ట్రుడూ, పాండురాజూ; సహోదరులు+అగుటయున్= సోదరులు కావటమూ; వారల+ఆత్మజులకున్= వారి కొడుకులకు; తమ తమ తండ్రుల ధనములు; కైకొనన్+తగుటయున్= స్వీకరించతగి

ఉండటమూ; మీకున్+అందఱకున్; చూడన్; ఉచితంబు+అ కాదె!= న్యాయమే కదా!; అట్లు+ఉండెన్= విషయం అట్లా ఉండగా; తొల్లింటి చందంబును= పూర్వపు విధమూ; మనకున్; తెల్లంబు+అ కాదె!= స్పష్టమే కదా!; ప్రాణగొడ్డములు+అగు పనులన్= ప్రాణాపాయకరా లైన పనులతో; వారలన్=ఆ పాండవుల్ని; తీర్పన్+తలఁచినన్= చంపనెంచితే; పున్నెంబు కలిమిన్+ చేసి= పుణ్యం ఉండడం చేత; బాహు బలము+ఒప్పన్= భుజబలం ఒప్పగా; నిజరాజ్య పదవిన్+పొంది+ఉన్నన్= తమ రాజ్యపదవిని పొంది ఉండగా; వంచనమెయిన్= మోసంతో; మహిన్= భూమిని; కొన్న తెఱఁగున్= కాజేసిన విధమూ; ఎఱుఁగుదురు+అ+కాదె= మీకు తెలిసిందేకదా!; దీనికిన్+ఎల్లన్= దీనికంతకూ; ఇయ్యకొనియెన్= అంగీకరించాడు; ఈ పెద్దరాజున్= ఈ ధృతరాష్ట్రుణ్ణి, ఏమి+అనఁగన్ నేర్తున్?= ఏమనగలను?

తాత్పర్యం: 'ధృతరాష్ట్రుడూ, పాండురాజూ అన్నదమ్ములన్న విషయమూ, వాళ్ల కొడుకులకు తమ తమ తండ్రుల ఆస్తులు స్వీకరించదగిన విషయమూ మీకందరికీ చూడగా న్యాయమే కదా! అది అలా ఉండగా, పూర్వం జరిగినదంతా మనకు స్పష్టమేకదా! ప్రాణాలు తీసే పనులతో వాళ్లని చంపనెంచితే, పుణ్యం ఉండబట్టి, భుజబలంతో తమ రాజ్యపదవిని పొంది ఉండగా, మోసంతో భూమిని హరించిన విషయమూ మీరు ఎరిగినదే కదా! దీనికంతటికీ సమ్మతించాడు ఈ పెద్దరాజు, ఆయనను నేను ఏమనగలను?

విశేషం: 1. ద్రుపదుడు తన పురోహితుడికి కురుసభలో రాయబారిగా నిర్వహించవలసిన అంశాలను నిర్దేశించి పంపాడు. అందులో మొదటిది- 57వ పద్య తాత్పర్యం. అందులోనూ మూడు సూక్ష్మాంశాలున్నాయి. 1.పాండవులకు రాదగిన రాజ్యభాగాన్ని ముందుగా ప్రస్తావించాలి. 2. ఆ మాటలు ధర్మనిష్ఠంగానూ, ఉచితంగానూ ఉండాలి. ధృతరాష్ట్రుడికి తెలిసివచ్చేటట్లుండాలి. 3. ఆ మాటలు సభలో ఉన్న యుద్ధ వీరులైన రాజుల, సేనానుల మనసులు 'తిరుగబడేటట్లు' ఉండాలి. (ధృతరాష్ట్రుడికి వ్యతిరేకంగా, పాండవులకు అనుకూలంగా మారటం తిరుగబడటం). ఈ మూడు ప్రయోజనాలు సాధించటానికే విప్రుడు మాట్లాడటం మొదలుపెట్టాడు. అందుకే మొదట అన్నదమ్ముల బిడ్డలు వారి వారి రాజ్యసంపదలను పంచుకొని సుఖించటం అందరికీ ఆమోదయోగ్యమేకదా! అని పేర్కొన్నాడు. ఆ మాట ధృతరాష్ట్ర దుర్యోధనాదులకు సమ్మతం కాదు. అయినా, పాలుపంచుకొనటం 'మీకందరికీ ఆలోచిస్తే ఉచితంగా లేదా?' - అని సభ్యులైన వీరులను ప్రశ్నించాడు. వారు అంగీకరించినట్లు భావించాడు. ఆ అంశాన్ని స్థిరీకరించినట్లే మాటలు సాగించాడు. 'అట్లుండె' - అనే వాక్యం దాన్ని స్ఫురింపజేస్తుంది. ఇక రెండవ అంశం. న్యాయంగా పాండవులకు రావలసిన రాజ్యభాగాన్ని వారికి దక్కకుండా కౌరవులు చేసిన దుర్నయాలను పేర్కొన్నాడు. పాండవుల ప్రాణాలు తీసే లాక్షా గృహదహనం వంటి యత్నాలు ఒకఎత్తు. వాటినుండి తమ పుణ్యబలం చేత పాండవులు తప్పించుకొని బయటపడి రాజ్య వైభవంతో విరాజిల్లుతూ ఉండగా మోసంతో ఆ సంపదను హరించటం మరొక ఎత్తు. ఈ రెండూ పాండవులకు జరిగిన అన్యాయాలే, అధర్మాలే. వాటిని నొక్కిచెప్పి రెండవ ప్రయోజనం సాధించాడు. కొస మెరుపుగా మరొకమాట అన్నాడు. అది మూడవ ప్రయోజనం. వీటి నన్నింటిని ధృతరాష్ట్రుడు అంగీకరించాడు. అది అన్నింటికంటె అధికమైన అధర్మం. దాన్నేమనేది? అని అన్నాడు. ఈ మాట బ్రాహ్మణు డంటున్నా ద్రుపదుడి మాటలుగానే వ్యవహారంలో గ్రహించాలి. అయినా ధృతరాష్ట్రుడి సభలో అతడి సహాయకుల ఎదుట, అతడినే దోషిగా చేసి మాట్లాడటం కార్యసాధన కుపయోగించదు. కాని, ధర్మనిష్ఠంగా మాట్లాడినట్లుంటుంది. ద్రుపదపురోహితుడు తన ఉపన్యాసాన్ని ధర్మనీతితో మొదలుపెట్టాడే కాని, రాజనీతితో కాదు. ధర్మ ప్రతిపాదనం వలన సభ్యుల మనస్సులు తిరుగబడుతాయని భావించాడు.(సంపా.)

2. బ్రాహ్మణుడి మాటలు పచ్చినిజాలే అయినా, వినటానికి కటువుగా ఉన్నాయి. మొదలు పెట్టుతూనే ఆయన మాటలు వాళ్ళకు కోపం తెప్పించేవిగా ఉన్నాయి. అవి చేదుమాత్రలవలె ఉన్నాయి. 'నీ వాక్యము విప్రస్వాభావికమై యిట్లు శ్రుతికిఁ బరుషంబైనన్' అని ఇదే మాట భీష్ము డనటం గమనించదగింది.

శా. నారీరత్నము నట్లు దెచ్చి సభలోన న్వారలుం జూడఁగాఁ
జీరల్ ప్రోవులు గాఁగ నొల్చుటయు, లచ్చిం బుచ్చికోలున్, మహో
గ్రారణ్యస్థలి నిల్వఁబంచుటయు, దైన్యవ్యక్తిమై పల్కులున్
సైరింపం జను పాండవేయులకు నీ సంధిక్రమం బొప్పదే? 232

ప్రతిపదార్థం: నారీ రత్నమున్= వనితామణిని-ద్రౌపదిని; అట్లు= ఆ రీతిగా; సభలోనన్+వారలున్= సభలో ఉన్నవాళ్ళు; చూడఁగాన్= చూస్తుండగా; చీరల్, ప్రోవులు+కాఁగన్= కట్టువస్త్రాలు రాసు లయ్యేటట్లు; ఒల్చుటయున్= ఊడదీయటమూ; లచ్చిన్+పుచ్చికోలున్= సంపదను హరించటమూ; మహా+ఉగ్ర+అరణ్య స్థలిన్= మిక్కిలి భయంకరమైన అటవీ ప్రదేశంలో; నిల్వన్+పంచుటయున్= ఉండేటట్టు పంపటమూ; దైన్య వ్యక్తిమై పల్కులున్= దీనదశయొక్క స్పష్టతకల మాటలూ- దీనదశను స్పష్టీకరించే రీతి మాటలూ; సైరింపన్+చను పాండవేయులకున్= సహించగలిగిన పాండవులకు; ఈ సంధి క్రమంబు= ఈ సంధి కార్యక్రమం; ఒప్పదే?= తగదా?- తగినదే అని భావం.

తాత్పర్యం: స్త్రీరత్నమైన ద్రౌపదినిట ఆ రీతిగా తెచ్చి సభాసదులు చూస్తూఉండగా ఆమె కట్టుకొన్న చీరలు పోగుపడేటట్లు విప్పటం, సంపదను హరించటం, మహాభీకరాటవిలో ఉండేటట్లు పంపటం, అజ్ఞాతవాస సమయంలో తమ దీనదశను స్పష్టపరిచే రీతి తమ మాటలూ సహించగలిగిన పాండవులకు ఈ సంధి కార్యక్రమం తగినదే!

విశేషం: 'పాండుతనూభవుల్ పడిన పాటులు బంధుల కెల్ల' తెల్పుతూ పండితులూ, వృద్ధులూ, సజ్జనులూ ఇతడిమాటలే మేలు, మరొక పద్ధతి మంచిదికాదు' అని మనస్సులలో తలపోసేటట్లు మాట్లాడాలని ద్రుపదుడు తన పురోహితుడితో చెప్పాడు (59వ పద్యం). దానిని పురస్కరించుకొని పురోహితు డీ పద్యం పలికాడు. మొదట ద్రౌపదీ వస్త్రాపహరణ వృత్తాంతాన్ని ప్రస్తావించాడు. ప్రతిపదాన్నీ సాభిప్రాయంగా ప్రయోగించాడు. ద్రౌపది నారీరత్నం. గౌరవింపదగిన ఆమెను 'అట్లా' తెచ్చారట. దుశ్శాసనుడు ఆమెను జుట్టుపట్టుకొని లాక్కొంటూ సభకు తెచ్చిన ఆ వైఖరి నలుగురిలో పేర్కొనరానిది అని గర్హణ వ్యక్తం చేశాడు. సభ్యులందరూ చూస్తూఉండగా 'చీరలు ప్రోవులుగా' ఒలిచారట! ఆ మాటలో కౌరవుల దుష్టసంకల్పం, అది విఫలమైన తీరూ, ద్రౌపది పాతివ్రత్య మాహాత్మ్యం ధ్వని. సంపదను అన్యాయంగా లాగుకొనటం, అడవులకు పంపటం, ఆ పంపేటప్పుడు పాండవులను దుశ్శాసనాదులు దుర్భాషలాడటం- పేర్కొన్నాడు. హస్తినాపురంలో ఉన్నవారికి తెలిసినవి ఆ దురంతాలే. అయితే, ఈ పాండవుల పాట్లన్నీ సభ్యులలో సానుభూతి కలిగించటానికి చెప్పి, వాటిని సహించిన పాండవులు ప్రతీకారానికి దిగకుండా సంధికి పూనుకొనటంలో ఉన్న సామంజస్యాన్ని పేర్కొన్నాడు. సంధి ప్రయత్నం పాండవుల ధర్మప్రవృత్తికీ, సహనశీలానికీ, ఉదాత్తతకూ పతాక గుణంగా అభివర్ణించాడు. ద్రుపదుడి సూచనను తు-చ తప్పక పాటించాడు. (సంపా.)

క. వీరల వృత్తముఁ, బాండుకు । మారుల వర్తనముతెఱఁగు మాత్సర్యములే
కారసి, ధృతరాష్ట్రునకున్ । గారవమున బుద్ధిసెప్పఁగాఁ దగు మీకున్. 233

ప్రతిపదార్థం: వీరల వృత్తమున్= ఈ కౌరవుల ప్రవర్తనా; పాండు కుమారుల వర్తనము తెఱఁగున్= పాండవుల నడత తీరూ; మాత్సర్యము లేక+ఆరసి= పక్షపాతం లేకుండా పరిశీలించి; ధృతరాష్ట్రునకున్; గారవమునన్= ఆదరంతో; బుద్ధి+చెప్పఁగాన్, మీకున్, తగున్= తగును.

తాత్పర్యం: ఈ కౌరవుల ప్రవర్తనా, ఆ పాండవుల నడతతీరూ పక్షపాతం లేకుండా పరిశీలించి ధృతరాష్ట్రుడికి మీరు బుద్ధి చెప్పటం మంచిది.

విశేషం: ఈ పద్యంలో సభ్యులముందు ఒక కర్తవ్యాన్ని ఉంచాడు పురోహితుడు. కౌరవ పాండవుల ప్రవర్తనలను నిష్పాక్షిక బుద్ధితో విచారించి, న్యాయాన్ని ధృతరాష్ట్రుడిని గౌరవంగా తెలియచెప్పండన్నాడు. అంటే తన వాదాన్ని ఏకగ్రీవంగా సమర్థించండని కోరాడు. తిక్కన వాడిన 'బుద్ధి సెప్పఁగాఁదగున్' అనే వాక్యం సాభిప్రాయం. బుద్ధి చెప్పటం - అనే జాతీయాన్ని తెలుగులో గౌరవ సూచకంగా కంటె నిందావాచకంగానే ఎక్కువగా వాడుతున్నా మిప్పుడు. కాని, తిక్కన ఇక్కడ వాడిన తీరు ఉభయార్థకంగా ఉండటం విశేషం. అయితే, గారవమున బుద్ధి చెప్పండి అనటం చేత సభాగౌరవం కాపాడబడింది. బుద్ధి అంటే హితవు అనే అర్థం ఇక్కడ గ్రాహ్యం. గుణపాఠం చెప్పండి అనే అర్థం ఇక్కడ ఉద్దిష్టం కాదు. కాని, ఆ ధ్వని స్ఫురించటం ఆ మాటలోని బలం. ద్రుపద పురోహితుడి కీ వాదంలో నేరాలుచేసిన దుర్యోధనాదులకంటె, వారిని వారించకుండా నిర్లిప్తంగా ఉన్న ధృతరాష్ట్రుడే మూల దోషిగా నిరూపించటం పరమతాత్పర్యం. ఆ ప్రయోజనాన్ని, పరుషంగానైనా, సాధించాడు పురోహితుడు. (సంపా.)

తే. పాండవులు కౌరవులతోడి పగకు నొల్ల। రఖిల భూప్రజ నాశన మగుటఁజేసి
వార లస దని తలఁపంగ వలవ; దధిక। ధర్మపరులైన కతమునఁ దగవు నడచె. 234

ప్రతిపదార్థం: అఖిల భూ ప్రజ= ఎల్ల భూమియందలి ప్రజలూ; నాశనము+అగుటన్+చేసి= నశిస్తారు కాబట్టి; పాండవులు; కౌరవులతోడి పగకున్= కౌరవులతో వైరానికి; ఒల్లరు= ఇష్టపడరు; వారలు= పాండవులు; అసదు+అని= తక్కువ అని; తలఁపంగన్+వలవదు= భావించవద్దు; అధిక ధర్మపరులు+ఐన కతమునన్= మిక్కిలి ధర్మాత్ములు కావటం చేత; తగవు నడచెన్= మేలు జరిగింది.

తాత్పర్యం: ఎల్లభూమిలో ఉన్న ప్రజలు నశిస్తారు కాబట్టి పాండవులు కౌరవులతో వైరానికి ఇష్టపడరు. అట్లా అని వాళ్ళు బలహీనులని ఎంచవద్దు. మిక్కిలి ధర్మాత్ములు కావటంవలన ఒడంబడిక కొనసాగి న్యాయం నెరవేరింది.

విశేషం: 1. కౌరవపాండవుల ప్రవర్తనలలోని తారతమ్యాన్ని పై పద్యంలో నిరూపించి, వారిరువురి ఆలోచనలలో గల అంతరాన్ని ఇక్కడ పేర్కొంటూ పాండవుల ధర్మబద్ధమైన చిత్తవృత్తిని ప్రశంసించాడు పురోహితుడు. పాండవులు పగకు పూనుకొనకపోవటానికి కారణం ప్రజా నాశనాన్ని కోరని దయాప్రవృత్తియే. అంటే-కౌరవులు స్వార్థపరులు, పాండవులు లోకహిత పరాయణులు. లోకహితం కొరకు వారు తమసుఖాన్ని కూడా త్యాగం చేయగలరు. అయితే, ఈ దయాపరత్వాన్ని తక్కువతనంగా, బలహీనతగా భావించవద్దన్నాడు. పాండవులు మిక్కిలి ధర్మాత్ములు కాబట్టి లోకానికి మేలు జరిగింది. యుద్ధంకంటె అన్నివిధాలా ప్రజాహితకరమైన సంధి మేలని భావించే పాండవ ప్రవృత్తియే లోక శ్రేయస్సును కలిగిస్తుందని నిరూపించి చెప్పాడు పురోహితుడు. పాండవ సంధియత్నంలో ప్రధానాంశం ప్రజలయోగక్షేమమని సభలో చాటిచెప్పాడు.

2. ఉపన్యాసకళలో ఇదొక మెలకువ. ఒక విషయాన్ని సభ్యులముందు ప్రతిపాదించి, మీరే ఆలోచించి చూడండి - అని ప్రబోధించి, ఆ తరువాత ఎట్లా ఆలోచించాలో తానే చెప్పి ఎదుటివారిని ఒప్పించటం. తాను చెప్పినమాటలను సభ్యులు అంగీకరించేటట్లు చేయాలని పురోహితుడికి ద్రుపదుడు హితవు చెప్పాడు. అందుకే ఈ సంభాషణ శిల్పం. ఇది తిక్కన నాటకీయ రచనలో భాగం కూడా. (సంపా.)

వ. అందుఁ గూడినవి యే డక్షౌహిణు, లిందుఁ గూడినవి పదు నొకం డక్షౌహిణులని తలంతురేని వినుండు. 235

ప్రతిపదార్థం: అందున్= పాండవ పక్షంలో; కూడినవి; ఏడు+అక్షౌహిణులు; ఇందున్= కౌరవుల పక్షంలో; కూడినవి; పదునొకండు+ అక్షౌహిణులు; అని, తలంతురు+ఏనిన్= అని సంఖ్యా ప్రాచుర్యంతోనే ఆలోచించేటట్లయితే; వినుండు.

తాత్పర్యం: పాండవుల పక్షంలో కూడినవి ఏ డక్షౌహిణులు మాత్రమే, కౌరవుల పక్షంలో కూడినవి పదకొండు అక్షౌహిణులు కదా! అని అనుకొంటారేమో! వినండి.

విశేషం: పాండవ కౌరవుల బలతారతమ్యాన్ని చెప్పాడిందులో పురోహితుడు. బలాన్ని సంఖ్యలతోగాని, సారవంతమైన బలంతోగాని లెక్కించవచ్చును. పాండవుల సేనకంటె కౌరవుల సేన నాలుగు అక్షౌహిణులు అధికం. సంఖ్యాప్రాచుర్యమే ప్రమాణమని భావించవద్దని పురోహితుడి హెచ్చరిక. కౌరవులది వాపు, పాండవులది బలుపు. వాపుకంటె బలుపే గొప్పది అని చెప్పబోతున్నాడు పురోహితుడు. ఇతడి మాటలలో ప్రతిపాద్యాంశాన్ని స్పష్టంగా చెప్పే ప్రజ్ఞ కనపడుతుంది. కాని, అందులో మర్మంలేని ధర్మావేశం ఎక్కువ. (సంపా.)

క. బాహుబల ఘనుఁడు భీముఁడు, । సాహస రసికాత్ముఁ డయిన సాత్యకియు మహో
గ్రాహవభూమి సహస్రా । క్షౌహిణు; లట్లగుట మీరు గానరె యెందున్? 236

ప్రతిపదార్థం: బాహు బల ఘనుఁడు= భుజబలంలో గొప్పవాడు; భీముడున్; సాహస రసిక+ఆత్ముఁడు+అయిన సాత్యకియున్= సాహసాలలో ఆనందించే స్వభావం కలవాడైన సాత్యకీ; మహా+ఉగ్ర ఆహవ భూమిన్= మిక్కిలి ఘోరమైన యుద్ధరంగంలో సహస్ర+అక్షౌహిణులు= వేయి అక్షౌహిణులు; అట్లు+అగుట= అట్లా అవటం; ఎందున్= ఎక్కడైనా; కానరె?= చూడలేదా?

తాత్పర్యం: భుజ పరాక్రమంలో ఘనుడైన భీముడూ, సాహస కార్యాలలో ఆనందపడే స్వభావం గల సాత్యకీ మహాభయంకర యుద్ధభూమిలో వేయి అక్షౌహిణులన్న సంగతి మీరు ఎక్కడైనా సరే చూడలేదా?

విశేషం: 1. గురు భీష్మాదులు యుద్ధానికి విముఖులై దుర్యోధనుడిని యుద్ధ విముఖుడిని చేసేటట్లు ప్రయత్నించాలనీ, దానికి తగిన మాటలు మాటాడాలనీ ద్రుపదుడు తన పురోహితుడికి చెప్పాడు. (పద్యం 58). దానికి తగినట్లుగా పురోహితుడు భీమ, సాత్యకి, విజయ కృష్ణుల ప్రతాపాలను వర్ణించటం ఆరంభించాడు. బాహుబలఘనుడైన భీముడూ, సాహస రసికాత్ముడైన సాత్యకీ కలిస్తే వేయి అక్షౌహిణులతో సమానమని లెక్కకట్టి చెప్పాడు. పాండవుల బాహుబలానికి ప్రతీకలు భీమసాత్యకులు. ఇక ధనుర్బల, నీతిబలాలకు అర్జునుడూ, కృష్ణుడూ ప్రతినిధులని వరుసగా చెప్పుతున్నాడు. (సంపా.)

2. వావిళ్ళ ప్రతిలోనూ, తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిలోనూ ఈ పద్యం నాలుగోపాదం- 'సహస్రాక్షోహిణులట్లగుట మీరు నూడరె యెందున్' అనే పాఠం కనబడుతున్నది. మున్నంగి శర్మ ప్రతిలో 'సహస్రాక్షౌహిణు లట్లగుట మీరు గానరె యెందున్' అనే పాఠం మరికొన్ని ప్రతుల ననుసరించి స్వీకరింపబడింది. తిక్కన భారతంలో ఈ ఒక్క చోట తప్ప, ఎక్కడా 'అక్షోహిణి' అని ప్రయోగించలేదు. అక్షౌహిణి సాధువు. అక్షోహిణి అసాధువు. అందుచేత నేను మున్నంగివారి పాఠాన్నే స్వీకరించాను.

క. గాండీవధన్వు నాహవ । పాండిత్యముఁ దలఁప నతని భండనమున మా
ర్కొండు నని యొకఁడు గడఁగుట । కొండం గని తగరు దాఁకఁ గోరుట గాదే? 237

ప్రతిపదార్థం: గాండీవ ధన్వు+ఆహవ పాండిత్యమున్= గాండీవమనే ధనుస్సు కలవాడైన అర్జునుడి యొక్క యుద్ధ పాండిత్యం; తలఁపన్= ఆలోచిస్తే; అతనిన్; భండనమునన్= యుద్ధంలో; మార్కొండున్+అని= ఎదుర్కొంటానని; ఒకఁడు; కడఁగుట= పూనటం; కొండన్+కని= కొండను చూచి; తగరు= పొట్టేలు; తాఁకన్+కోరుట+కాదే?= ఎదురించటానికి కోరటమే కదా?

తాత్పర్యం: గాండీవి యుద్ధ నైపుణ్యాన్నిగూర్చి ఆలోచిస్తే ఆతడిని యుద్ధంలో ఎదుర్కొంటానని ఒకడు పూనుకొనడం, కొండను చూచి పొట్టేలు ఢీకొనటానికి సిద్ధపడటమే కాదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: నిదర్శన. ఇందులో 'అతని భండనమున మార్కొండునని యొకఁడు గడఁగుట' అనే ఉపమేయ వాక్యానికీ, 'కొండం గని తగరు దాఁకఁగోరుట' అనే ఉపమాన వాక్యానికీ ఐక్యారోపణం (అభేదం) చెప్పబడింది కాబట్టి నిదర్శన. కొండను పొట్టేలు ఢీకొంటే ఏం జరుగుతుందో యుద్ధంలో గాండీవిని ఢీకొన్నవాడికీ అదే జరుగుతుందని భావం.

క. ఆ బీభత్సుని భూరి భు । జా బలమును, దుర్నివార శౌర్యము, శర వి
ద్యా బహుళతయును బందికి । నై బవరముఁ జేసినట్టి హరుఁడ యెఱుంగున్. 238

ప్రతిపదార్థం: ఆ బీభత్సుని భూరి భుజా బలమును= ఆ అర్జునుడి అధికమైన బాహుపరాక్రమమూ; దుర్నివార శౌర్యమున్= అడ్డగించటానికి శక్యంకాని శూరత్వమూ; శర విద్యా బహుళతయును= బాణవిద్యలో ఆధిక్యమూ; పందికిన్+ఐ= పందికొరకు; బవరమున్+చేసిన+అట్టి= యుద్ధం చేసినట్టి; హరుఁడు+అ= ఈశ్వరుడే; ఎఱుంగున్= తెలియును.

తాత్పర్యం: ఆ బీభత్సుడి గొప్పదైన బాహుపరాక్రమమూ, అవార్య శౌర్యమూ, అస్త్రవిద్యాధిక్యమూ పంది కొరకు అతడితో యుద్ధం చేసిన ఈశ్వరుడికే బాగుగా తెలుసు.

విశేషం: అలం: పరికరాంకురం. ఇందులో అర్జునుడికి 'బీభత్స' శబ్దప్రయోగమూ, ఈశ్వరుడికి 'హర' శబ్ద ప్రయోగమూ సాభిప్రాయాలు కాబట్టి పరికరాంకురం. విశేష్యం సాభిప్రాయమైతే పరికరాంకురాలంకారం అవుతుంది. బీభత్సుడంటే యుద్ధంలో శత్రువీరులకు బీభత్సం కలిగించేవాడు కాబట్టి అర్జునుడని అర్థం. హర శబ్దానికి ప్రళయసమయంలో సర్వమూ హరిస్తాడు కాబట్టి ఈశ్వరుడని అర్థం. అర్జునుడి తపస్సును పరీక్షించగోరి శివుడు కిరాత వేషం ధరించి మూకుడనే రాక్షసుడిని వరాహంగా చేసి అర్జునుడివద్దకు వచ్చాడు. అర్జునుడు ఆ పందిని కొట్టాడు. ఈశ్వరుడూ కొట్టాడు. ఇది నాదంటే నాదని యిద్దరికీ వివాదం ఏర్పడింది. యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో అర్జునుడు చూపిన పరాక్రమానికి శివుడు మెచ్చి అతడికి పాశుపతాస్త్రం ఇచ్చాడు.

వ. అదియునుం గాక. 239

తాత్పర్యం: అదీకాక.

మ. వివిధోపాయ పరాయణుండు, రిపుదోర్వీర్యాపహారక్రియా
ప్రవణోద్యోగుఁడు, మంత్ర రక్షణ కళా ప్రావీణ్యగణ్యుండు, ధై
ర్య వివేకాది గుణోత్తరుం, డఖిల విద్యాజాల సంవేది మా
ధవుఁ డా దిక్కటె! పాండవేయుల కసాధ్యం బెద్దియుం గల్గునే? 240

ప్రతిపదార్థం: వివిధ+ఉపాయ పరాయణుండు= రకరకాల ఉపాయాలకు ఆశ్రయమైనవాడూ; రిపు దోస్(ః)+వీర్య+అపహార క్రియా ప్రవణ+ఉద్యోగుఁడు= శత్రువుల యొక్క బాహువుల పరాక్రమాన్ని తొలగించే కార్యంలో సమర్థమైన ప్రయత్నం కలవాడూ; మంత్ర రక్షణ కళా ప్రావీణ్య గణ్యుండు= ఆలోచనయొక్క రక్షణం అనే విద్య యందలి నేర్పుచేత గణించదగినవాడూ; ధైర్యవివేక ఆది గుణ+ఉత్తరుండు= ధైర్యమూ, వివేకమూ మొదలైన గుణాల చేత శ్రేష్ఠుడూ; అఖిల విద్యా జాల సంవేది= ఎల్ల విద్యల సమూహాన్ని బాగుగా తెలిసినవాడూ; అగు; మాధవుఁడు= కృష్ణుడు; ఆ దిక్కు+అటె!= ఆ పక్షమట! పాండవేయులకున్; అసాధ్యంబు= సాధించరానిది; ఎద్దియున్= ఏదయినా; కల్గునే?= ఉంటుందా?

తాత్పర్యం: అనేకములైన ఉపాయాలకు ఆశ్రయమైనవాడూ, శత్రువుల భుజబలం హరించే క్రియలో సమర్థమైన పూనిక కలవాడూ, మంత్ర రక్షణమనే విద్య యందలి నేర్పు చేత గణించదగిన వాడూ, ధైర్యమూ, వివేకమూ మొదలైన గుణాల చేత శ్రేష్ఠుడైన వాడూ, ఎల్ల విద్యల సమూహమూ తెలిసినవాడూ అయిన శ్రీకృష్ణుడు ఆ వైపున ఉన్నాడట! ఇంక పాండవేయులకు సాధ్యంకాని దేమయినా ఉంటుందా?

విశేషం: 1. అలం: కావ్యలింగం. 'పాండవేయుల కసాధ్యం బెద్దియుం గల్గునే' అనే సమర్థనీయమైన అంశం సమర్థించబడింది కాబట్టి ఇక్కడ కావ్యలింగం.

2. ఈ పద్యంలో వర్ణించబడిన మాధవుడు మానవాకృతిలో ఉన్న రాజనీతి. విజయమార్గంలో నడిచే ప్రభువుకు మొదట ఉండవలసింది వివిధోపాయాలను ప్రయోగించటంలో నేర్పరితనం.

"లభేత సామదానాభ్యాం కృత్యాంశ్చ పరభూమిషు,
అకృత్యాన్ భేదదణ్డాభ్యాం పరదోషాంశ్చ దర్శయేత్" (అర్థశాస్త్రమ్. 14 అధ్యా. పు. 56)

శత్రు రాజ్యాలలో ఉన్న కృత్యులను సామదానభేద దండోపాయాలతో తనవైపు త్రిప్పుకొనటం, అకృత్యులను భేదదండోపాయాలతో తనవైపు త్రిప్పుకొనటం, శత్రువుల దోషాలు వాళ్ళకు చూపుతూ ఉండటం - అనే అంశాలలో ప్రజ్ఞాధురీణుడు శ్రీకృష్ణుడు. అంటే రాజనీతిలోని చతుర్విధోపాయాలలో నిష్ణాతుడు.

శత్రువుల (భుజ) బలాన్ని హరించే క్రియలలో సమర్థుడైన వాడు రాజనీతిలో షాడ్గుణ్యం తెలిసినవాడని భావం. **"సంధి విగ్రహాసన యాన సంశ్రయ ద్వైదీభావాః షాడ్గుణ్యమ్ ఇత్యాచార్యాః"** - అని కౌటిల్యుడి అర్థశాస్త్రం. "వాటిలో 'సంధి'- అనగా ఒప్పందం కుదుర్చుకొనటం, అపకారం చేయటం 'విగ్రహం', సంధి చేసికొనకుండా, అపకారం చేయకుండా ఉండటం 'ఆసనం'. శక్తినీ, దేశకాలాదులలో అభివృద్ధిని సంపాదించడం 'యానం'. ఈ విధమైన అభివృద్ధి ఉన్నప్పుడే శత్రువు మీదికి దండెత్తి వెళ్ళటం కుదురుతుంది గాన దీనికి 'యానం' అని పేరుపెట్టబడింది. యానం అనగా దండెత్తివెళ్ళటం. శత్రువు బలవంతుడైనప్పుడు తనను వానికి సమర్పించుకొనటం 'సంశ్రయం'. సంధి విగ్రహాలు రెండింటినీ నడిపించటం 'ద్వైధీభావం'. ఈ విధంగా గుణాలు ఆరు. (కౌటిలీయమ్ అర్థశాస్త్రమ్ - ఆంధ్రవ్యాఖ్యాబాలానందినిలో - వ్యాఖ్యాత మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు- పు. 544 - 545). షాడ్గుణ్య ప్రయోగ విద్యానిపుణుడు శ్రీకృష్ణుడు.

రాజనీతిలో మంత్రం పంచాంగసహితం. **"కర్మణా మారంభోపాయాః పురుషద్రవ్యసంపత్, దేశకాల విభాగః వినిపాత ప్రతీకారః, కార్యసిద్ధి రితి పంచాఙ్గో మన్త్రః"** - అని అర్థశాస్త్రం. దీనిని బట్టి పనులు చేపట్టటంలో ఉపాయాలు ప్రయోగించటం, పురుషసంపదను ధన సంపదను పెంపొందించటం, దేశకాలాల విభాగాన్ని తెలియటం, విఘ్నాలకు ప్రతిక్రియలను ఆలోచించటం, కార్యసిద్ధి - అనే అయిదు అంగాలు గల మంత్రాన్ని రక్షించేకళలో ప్రావీణ్యం గలవారిలో శ్రీకృష్ణుడు ప్రథమగణ్యుడు.

ధైర్య వివేకాలు ధీరోదాత్తుల ఉత్తమగుణాలు. రాజనీతిలో ధైర్యంవలన సాహసం, దానివలన కార్యసాధనం ఏర్పడతాయి. వివేకంవలన ఎప్పుడెప్పుడేయే పనులు చేయవచ్చునో, చేయకూడదో నిర్దేశించటం కలుగుతుంది. దర్శకుడయ్యే నాయకుడికి ఉండవలసిన ఉత్తమగుణాలు కలవాడు శ్రీకృష్ణుడు.

'అఖిల విద్యాజాల సంవేది' - అనేది విశాలమైన అర్థాన్నిస్తుంది. ఇక్కడ రాజనీతికి సంబంధించిన విద్యలన్నీ నేర్చినవాడని చెప్పటం ప్రస్తుతం. **'ఆన్వీక్షికీ, త్రయీ, వార్తా, దణ్డనీతి శ్చేతి విద్యాః"** - అని అర్థశాస్త్రం. "పదార్థాల స్వరూపాన్ని యుక్తులచేత(హేతువుల చేత) పరీక్షించే విద్య ఆన్వీక్షికి(Philosophy), ఋగ్యజుస్సామవేదాలు 'త్రయి'. కృషి (వ్యవసాయం), పశుపాలన, వర్తకం వీటికి వార్త (Economics) అని పేరు. దండనీతి అంటే రాజనీతి (Political science), (అర్థశాస్త్రం. పు.13).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ అయిదు విశేషణాలను కలిపి చదువుకొంటే శ్రీకృష్ణుడు జంగమ రాజనీతి శాస్త్రమనటం స్పష్టం. అతడి చెప్పుచేతలలో వర్తించే పాండవులకు అసాధ్యమనేది లేదని తాత్పర్యం. (సంపా.)

ఆ. అదను దప్పకుండ నమ్మహాత్ముల నెమ్మిఁ । బిలువఁ బంచి, హితముఁ బ్రియము రెండు
పక్షములకు నగుట పాటించి తగవుమైఁ । గొంతభూమి యిచ్చి కూడి మనుఁడు.' 241

ప్రతిపదార్థం: అదను+తప్పక+ఉండన్= సమయం మించిపోకుండా; ఆ+మహాత్ములన్= మహనీయులైన ఆ పాండవులను; నెమ్మిన్= ప్రీతితో; పిలువన్+పంచి= పిలిపించి; హితమున్+ప్రియమున్= మేలూ, ప్రీతీ; రెండు పక్షములకున్= ఇరు పక్షాల వారికీ; అగుట పాటించి= అవటం ఆలోచించి; తగవుమైన్= న్యాయంతో; కొంతభూమి, ఇచ్చి; కూడి= కలిసి; మనుఁడు= బ్రతకండి.

తాత్పర్యం: సమయం మించిపోకుండా మహనీయులైన ఆ పాండవులను ప్రీతితో పిలిపించి, హితమూ, ప్రియమూ రెండు పక్షాలకూ కలిగేటట్లు చూచి న్యాయంగా వాళ్ళకు కొంతభూమి ఇచ్చి కలిసి బ్రతకండి.'

విశేషం: ఈ వాక్యాలు ఒక మిత్రుడు హితవు చెప్పుతున్నట్లున్నాయి. నిజాని కవి ద్రుపదుడి హితోక్తులే. అయినా అవి పాండవానుమతితో పలికినవి. దూతద్వారా పలికించినవి. ఒక విధంగా ఇది పాండవ ప్రత్యక్ష ప్రార్థన కాదు. పాండవులూ, వారి హితులూ బంధువులూ కలిసి సామూహికంగా చేస్తున్న అభ్యర్థన. ఇందులో మూడంశాలు ముక్తసరిగా పేర్కొనబడ్డాయి. 1.మహనీయులైన ఆ పాండవులను ప్రీతితో వెంటనే పిలిపించాలి. 2.రెండు పక్షాలకూ హితమూ, ప్రియమూ కలిగేటట్లు న్యాయంగా కొంతభూమిని పంచి ఇవ్వాలి. 3. ఈ రెండూ చేసి కలిసి బ్రతకాలి. ఈ మూడూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. వీటిలో ఏ ఒకటి తప్పినా మూడూ ముడిపడవు. (సంపా.)

చ. అనవుడు భీష్ముఁ డిట్లనియె 'నక్కట! భాగ్యముగాదె పాండునం
దను లొకయాపదం బడక ధర్మగతిం దగ నందఱున్ సుహృ
జ్జనులను గృష్ణునిం గలిసి సమ్మద మొందుటయుం బ్రశాంతిమై
మనముల నీసు దక్కి మృదుమార్గము వట్టుటయుం దలంపఁగన్. 242

ప్రతిపదార్థం: అనవుడున్= అన్నంతనే; భీష్ముఁడు; ఇట్లు+అనియెన్; అక్కట!= ఆహా!; తలంపఁగన్= ఆలోచించగా; పాండు నందనులు+అందఱున్= పాండవులు అందరూ; ఒక+ఆపదన్+పడక= ఏమీ ఆపద పొందక; ధర్మగతిన్= ధర్మమార్గంలో; తగన్= ఒప్పుగా; సుహృజ్జనులను (సుహృద్+జనులను)= మిత్రులనూ; కృష్ణునిన్, కలిసి; సమ్మదము+ఒందుటయున్= సంతోషించటమూ; ప్రశాంతిమైన్= అధికశాంతితో; మనములన్= మనస్సులందు; ఈసు= ఈర్ష్య; తక్కి= విడిచి; మృదు మార్గము+పట్టుటయున్= శాంతి మార్గం అవలంబించటమూ; భాగ్యము+కాదె!= అదృష్టం కదా!

తాత్పర్యం: ద్రుపద పురోహితుడు అట్లా అనగానే భీష్ము డిట్లా అన్నాడు: 'ఆహా! పాండవులు అందరూ ఎటువంటి ఆపదా చెందకుండా మిత్రులతోనూ, కృష్ణుడితోనూ కూడి సంతోషంగా ఉండటమూ, ప్రశాంతితో మనస్సులలో ఈర్ష్య విడిచి శాంతిమార్గం అవలంబించటమూ ఆలోచించగా అదృష్టం కదా!

విశేషం: ద్రుపద పురోహితుడు తన ఉపన్యాసాన్ని సభలోని పెద్దల నుద్దేశించే ప్రధానంగా సాగించాడు. దోషం రాజుమీద ఉంచాడు. ఇప్పుడు ఆ సభలో మారు పల్కవలసింది సభాసదుల పక్షాన కురుపితామహుడైన భీష్ముడే. ఇది సహజ సన్నివేశం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అయితే - ఇక్కడ ఒక ప్రశ్న. భీష్ముడి సమాధానం ధృతరాష్ట్రుడి సమాధానం కాదు. పాండవ మిత్రపక్షం పురోహితుడి ముఖాన పలికితే, హస్తినాపుర ప్రముఖుల పక్షాన, సభాపక్షాన భీష్ముడు పలుకుతున్నాడు. పాండవులు ఆపద పొందకుండా ఉన్నందుకూ, స్నేహితులతో శ్రీకృష్ణుడితో కలిసి ఉన్నందుకూ, ధర్మమార్గం తప్పకుండా ఉన్నందుకూ, శాంతచిత్తులై అసూయలు విడిచి సాధుమార్గంలో సాగుతున్నందుకూ తమ అందరి పక్షాన భీష్ముడు సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ఇవి ఔపచారికమైన మాటలే. (సంపా.)

క. నీ వాక్యము విప్ర స్వా । భావికమై యిట్లు శ్రుతికిఁ బరుషం బైనన్,
భావింపఁ గార్యమునయం । దే విధమున సభకు నింత యిష్టం బగునే ? 243

ప్రతిపదార్థం: నీ వాక్యము= నీ మాట; విప్ర స్వాభావికము+ఐ= బ్రాహ్మణ సహజమయి, ఇట్లు; శ్రుతికిన్= చెవికి - వినటానికి; పరుషంబు+ఐనన్= కష్టంగా ఉన్నా; భావింపన్= ఆలోచించగా; కార్యమున+అందున్= పని విషయంలో; ఏ విధమునన్= ఏ విధంగానైనా; సభకున్; ఇంత+ఇష్టంబు+అగునే?= ఇంత నచ్చుబాటు అవుతుందా!

తాత్పర్యం: నీ మాట బ్రాహ్మణ సహజమై, వినటానికి ఇట్లా కష్టమనిపించినా, ఆలోచిస్తే కార్యం విషయంలో మాత్రం ఏ విధంగా చూచినా సభకు ఎంతో నచ్చేదిగా ఉన్నది.

విశేషం: 1. నీ వాక్యము - అంటే నీవు చెప్పదలచుకొన్న దానిని చెప్పిన విధం. విప్రస్వాభావికం అంటే - బ్రాహ్మణ స్వభావోచితంగా అభివ్యక్తం అయిందని భావం. 'నిండుమనంబు నవ్యనవనీత సమానము పల్కు దారుణాఖండల శస్త్రతుల్యము'- అని బ్రాహ్మణవాక్కుకు నన్నయ తెచ్చిన ఒక ప్రసిద్ధి ఉన్నది. అదీగాక ఇక్కడ బ్రాహ్మణుడు ధర్మనీతి చెప్పాడు. రాజనీతిని జోడించలేదు. అందువలన వినటానికి పరుషంగా ఉన్నది. మా కరకుదనం చేత కుండబ్రద్దలు వేసినట్లు చెప్పటం వలన మాటలు ఆస్వాదమధురంగా లేవు. సంధిమాటలు సౌమ్యసుందరంగా, సాదరంగా సాగాలి. అయితే చెప్పే పద్ధతి రుచించకపోయినా, ఆచరణలో అది ఎట్లా అయినా, చెప్పిన విషయం సభను ఆకట్టుకొన్న దని అభినందించాడు. భీష్ముడు సభలో ఉన్న విపరీత వాతావరణాన్ని సౌమ్యంగా సుముఖంగా మార్చాడు. సత్యాన్ని సమయోచితంగా చెప్పాడు. అది భీష్ముడి పరిణత ప్రజ్ఞను ధర్మాభిముఖ్యాన్ని తెలుపుతున్నది. (సంపా.)

2. రాజకీయపుటెత్తులు చేతగాని బ్రాహ్మణులు శ్రుతి మధురంగా మాటలాడలేరు. ఉన్నది ఉన్నట్లు సూటిగా మాటలాడటమే వాళ్ళకు సహజం.

చ. సమయమ యూఁది, పాండవు లశక్తుల చాడ్పున నిందు నాఁడు బ
న్నము వడి చన్న దైన్యము, వనంబునఁ బడ్డ విషాదవేదనా
శ్రమము, విరాటు వీట లఘు సంచరణంబున దాఁగియున్న దుః
ఖమును జగం బెఱుంగదె? యకల్మషులం బఱుపంగఁ బాడియే? 244

ప్రతిపదార్థం: పాండవులు; సమయము+అ+ఊఁది= జూదానికి ముందు చేసికొన్న ఒప్పందాన్నే పట్టుకొని; అశక్తుల చాడ్పునన్= చేతకాని వాళ్ళవలె; ఇందున్= ఈ సభలో; నాఁడు= అప్పుడు; బన్నము+పడి= ఆపద పొంది; చన్న,దైన్యమున్= పొందిన దీనస్థితీ; వనంబునన్+పడ్డ= అడవిలో అనుభవించిన; విషాద, వేదనా, శ్రమమున్= విచారం వలన కలిగిన బాధ వలని బడలికా; విరాటు వీటన్= విరాటుడి నగరంలో; లఘు సంచరణంబునన్= తేలికైన (చులకనైన) ప్రవర్తనతో; దాఁగి+ఉన్న,

దుఃఖమును= అజ్ఞాతంగా ఉన్నప్పటి కష్టమూ; జగంబు= లోకం; ఎఱుంగదె; అకల్మషులన్= అపాపులను - మంచివారిని; పఱుపంగన్= బాధపెట్టటం; పాడియే?= ధర్మమా?

తాత్పర్యం: పాండవులు జూదానికి ముందు చేసికొన్న ఒప్పందాన్నే పట్టుకొని చేతకాని వాళ్ళవలె ఈ సభలో ఆనాడు భార్యా వస్త్రాపహరణ రూపమైన ఆపదవలన పొందిన దీనస్థితీ, అడవిలో పన్నెండేళ్ళపాటు అనుభవించిన కష్టాలూ, విరాటుడి నగరంలో అజ్ఞాతవాసం చేసినప్పటి దుఃఖమూ లోకానికి తెలియవా? అట్లాంటి సజ్జనులను బాధించటం న్యాయమా?

విశేషం: పురోహితుడు 232వ పద్యంలో పేర్కొన్న పాండవుల అవమానాలను, కష్టాలను భీష్ముడు కూడా స్మరించి వారిపట్ల సానుభూతిని వెల్లడించాడు, సభాసదులు ఆ అంశాలకు స్పందించేటట్లు ప్రకటించాడు. పాండవులను బాధించటం న్యాయమా? అని పురోహితుడి వలెనే భీష్ముడు సభనే ప్రశ్నించాడు. దీని కెవరు సమాధానం చెప్పాలి? (సంపా.)

క. పితృధన మగు పా లుచిత। స్థితి వారల కిచ్చి, నిర్విశేషుండై యీ
పతి లోకము మెచ్చఁగ నిజ। సుత నివహమునట్ల వారిఁ జూడఁగవలయున్. **245**

ప్రతిపదార్థం: ఈ+పతి= ఈ రాజు - ధృతరాష్ట్రుడు; లోకము, మెచ్చఁగన్= ప్రపంచం ప్రశంసించేటట్లు; నిర్విశేషుండు+ఐ= భేదభావం లేనివాడై; పితృధనము+అగు, పాలు= తండ్రి ఆస్తి అయిన వాటా; ఉచిత - స్థితిన్= తగిన విధంగా; వారలకున్= ఆ పాండవులకు; ఇచ్చి; నిజసుత నివహము+అట్లు+అ= తన కుమారుల సమూహం వలెనే; వారిన్= ఆ పాండవులను; చూడఁగన్+వలయున్= ఆదరించాలి.

తాత్పర్యం: ఈ ధృతరాష్ట్ర మహారాజు లోకం మెచ్చుకొనేటట్లు, భేదభావం లేనివాడై, తమతండ్రి ఆస్తిలోని వాటా సముచితంగా వాళ్ళ కిచ్చి వాళ్ళను తన కొడుకులవలెనే ఆదరించాలి.

విశేషం: ద్రుపదపురోహితుడి హితవును భీష్ముడు సమర్థించి, సభానుకూల్యాన్ని ప్రకటించాడు. (సంపా.)

వ. అట్లుం గాక. **246**

తాత్పర్యం: అంతేకాక.

చ. కడవఁగ జూదమాడి, యవుఁ గాదన నేరక, సత్యభాషణం
బెడలిన వచ్చు ధర్మగతిహీనత కోర్వక, రాజ్యహీనతం
బడుటకు నోర్చి, ధర్మజుఁడు పంచిన సైరణ సేసెఁ గాక క
వ్వడి నెఱ గిన్క కెట్టి మగవారును నోర్తురె యిజ్జగంబులన్?' **247**

ప్రతిపదార్థం: ధర్మజుఁడు= ధర్మరాజు; కడవఁగన్= కాలక్షేపం కొరకు; జూదము+ఆడి; అవున్+కాదు+అనన్, నేరక= అవునూ కాదూ అనలేక; సత్య భాషణంబు+ఎడలినన్= సత్యవాక్యం పోతే - నిజం చెప్పకపోతే; వచ్చు= కలిగే; ధర్మ గతి హీనతకున్= అధర్మానికి; ఓర్వక= సహించక; రాజ్య హీనతన్+పడుటకున్= రాజ్యనష్టం పొందటానికి; ఓర్చి= సహించి, పంచినన్= ఆజ్ఞాపించగా; సైరణ+చేసెన్+కాక= ఓర్పు వహించాడు కాని; కవ్వడి నెఱ+కిన్కకున్= అర్జునుడి పూర్ణాగ్రహానికి; ఇజ్జగంబులన్(ఈ+ జగంబులన్)= ఈ లోకాలలో; ఎట్టి మగవారునున్= ఎటువంటి శూరులైనా; ఓర్తురె?= ఓర్వగలరా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మరాజు కాలక్షేపం కొరకు జూదమాడి అవునసీ, కాదనీ అనలేక, నిజం చెప్పకపోతే కలిగే అధర్మానికి సహించక, రాజ్య నష్టానికి సహించి, తనను ఆజ్ఞాపిస్తే సహించాడు కాని, సవ్యసాచి పూర్ణాగ్రహానికి ఈ లోకాలలో ఎంతటి శూరులైనా ఓర్వగలరా?'

విశేషం: భీష్ముడు ధర్మరాజు సహనాన్ని ప్రశంసించాడు. ఆ వెంటనే ఊరుకోక కౌరవపాండవ బలాబల నిరూపణంలో పురోహితుడి అభిప్రాయాన్ని సమర్థించాడు. ఉత్తర గోగ్రహణ యుద్ధంలో అర్జునుడి పరాక్రమాన్ని ఉటంకించి, అతడితో ఎదురునిలిచి పోరాడగలిగిన శూరులు కౌరవులలో లేరన్నాడు. ఆ మాటకు కర్ణుడు అహంకరించి అడ్డుపడ్డాడు. రాయబారి మాటలు ప్రక్కకు పోయాయి. భీష్ముడి మాటలు రచ్చకెక్కాయి. (సంపా.)

వ. అనిన విని కర్ణుండు కనలి యిట్లనియె. 248

ప్రతిపదార్థం: అనినన్, విని, కర్ణుండు; కనలి= కోపించి, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని కర్ణుడు కోపించి ఇట్లా అన్నాడు.

విశేషం: అర్జునుడు కర్ణుడికి ప్రతిస్పర్థి. అతడిని భీష్ముడు పొగడటం వలన కర్ణుడికి కోపం వచ్చింది. మానవంతుడైన శూరుడు పరప్రకర్షను సహించలేడుకదా!

క. 'జనులెల్ల నెఱింగిన యీ । పని యేటికి నుగ్గడింపఁ బలుమఱు ? దుర్యో
ధనునకయి శకుని జూదం । బున మేదిని గెలిచె; ధర్మపుత్త్రుం డోడెన్. 249

ప్రతిపదార్థం: జనులు+ఎల్లన్= జనులందరూ; ఎఱింగిన, ఈ+పని; పలుమఱున్= పలుమార్లు; ఉగ్గడింపన్+ఏటికి?= అనటం ఎందుకు?; దుర్యోధనుని కయి= దుర్యోధనుడి కొరకు; శకుని, జూదంబునన్; మేదిని= భూమి, గెలిచెన్; ధర్మపుత్త్రుండు= ధర్మరాజు; ఓడెన్= ఓడాడు.

తాత్పర్యం: 'అందరికీ తెలిసిన ఈ విషయాన్ని మాటిమాటికీ అనటం ఎందుకు? దుర్యోధనుడి పక్షాన శకుని జూదం ఆడి రాజ్యం గెలిచాడు. ధర్మరాజు ఓడిపోయాడు.

ఆ. దీన నేమి తప్పు? కానకు నేఁగిన । యతఁడు సమయవృత్తి నాక్రమించి,
తండ్రిపాలు మాకుఁ దగునంచు, నడియరి । తనము సేసి రాక తప్పు గాక, 250

ప్రతిపదార్థం: కానకున్= అడవికి; ఏఁగిన+అతఁడు= వెళ్ళినవాడు; సమయవృత్తిన్+ఆక్రమించి= చేసికొన్న ఒప్పందం అతిక్రమించి; తండ్రి పాలు= తండ్రి భాగం; మాకున్; తగున్+అంచున్; అడియరితనము+చేసి,రాక= లోభ గుణంతో రావటం; తప్పు+కాక= తప్పుగాని; దీనన్= ఇందులో; ఏమి తప్పు?= తప్పేమిటి?

తాత్పర్యం: అడవికి వెళ్ళినవాడు చేసికొన్న ఒప్పందం అతిక్రమించి, మా తండ్రి ఆస్తిలో వాటా మాకు ఇవ్వాలంటూ లోభిత్వంతో రావటం తప్పుగాని, జూదం ఆడటంలో తప్పేమిటి?

విశేషం: కర్ణుడి వాదం ఎంత అధర్మంగా ఉన్నదో చూడవచ్చును. ధర్మరాజు ద్యూత సమయాన్ని ఏమి అతిక్రమించాడు? పన్నెండేళ్ళు అరణ్యవాసమూ, ఒక యేడాది అజ్ఞాత వాసమూ చేసి వచ్చాడు గదా? అదే కదా 'ద్యూత సమయం?' ద్యూత

సమయ నిర్వహణానంతరం తమవాటా తమ కివ్వాలనటం 'అడియరితన' మెట్లా అవుతుందో? 'అడియరితనం' అనే దానికి 'బానిసతనం' అనికాక, 'లోభిత్వం' అని అర్థం చెప్పబడింది. అది సూర్యరాయాంధ్ర నిఘంటువు ననుసరించినది.

క. **విరటుఁడు ద్రుపదుఁడుఁ దోడుగ । బరవసమున నెత్తి విడిసి బలిమి నడిగినం**
గురుపతియు వెఱచి యిచ్చునె । ధరలోఁ జక్క సగ? మిట్టి తగవులు గలవే?' **251**

ప్రతిపదార్థం: విరటుఁడున్, ద్రుపదుఁడున్; తోడుగన్= సహాయంగా; బరవసమునన్= ధైర్యంతో; ఎత్తి= పూని; విడిసి= దండెత్తి; బలిమిన్= బలవంతంగా; అడిగినన్= అడిగితే; కురుపతియున్= దుర్యోధనుడును; వెఱచి= భయపడిపోయి; ధరలోన్= భూమిలో; చక్క సగము= సరిసమం; ఇచ్చునె; ఇట్టి తగవులు+కలవే?= ఇటువంటి న్యాయపద్ధతులు ఎక్కడనైనా ఉన్నాయా?

తాత్పర్యం: విరాటుడూ, ద్రుపదుడూ సహాయులుగా పట్టుదలతో పూని దండెత్తి బలవంతంగా అడిగితే భయపడిపోయి దుర్యోధనుడు భూమిలో సరిసగం ఇస్తాడా? ఇటువంటి న్యాయాలు ఎక్కడైనా ఉన్నాయా?'

వ. **అనిన గాంగేయుండు గటకటంబడి కర్ణున కిట్లనియె.** **252**

ప్రతిపదార్థం: అనినన్; గాంగేయుండు= భీష్ముడు; కటకటన్+పడి= కోపంతో బాధపడి; కర్ణునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా భీష్ముడు కోపించి కర్ణుడితో ఇట్లా అన్నాడు.

చ. **చిక్కని పోటుమానిసి విసీ ! వినువారలు నవ్వ నేమిగా**
నెక్కుడు మాట లాడెదె? వహీన పరాక్రమశాలి యర్జును
డొక్కఁడ యార్వురన్ మనల నుగ్రరణంబున గెల్చె నిన్నఁ నేఁ
డిక్కడఁ బల్కులన్ గెలిచె దీ వతనిన్ మనరాజు కొల్వునన్. **253**

ప్రతిపదార్థం: చిక్కని, పోటుమానిసివి= గట్టి శూరుడవులే; ఇసీ= ఛీ; వినువారలు, నవ్వన్; ఏమిగాన్= ఎట్లుగా; ఎక్కుడు మాటలు+ఆడెదవు= అధికంగా మాటాడుతున్నావు?; అహీనపరాక్రమ శాలి+అర్జునుండు+ఒక్కఁడు+అ= తక్కువ కాని పరాక్రమంతో ఒప్పే అర్జునుడు ఒక్కడే; నిన్న; మనలన్, ఆర్వురన్= మనలను ఆరుగురిని; ఉగ్రరణంబునన్= భయంకరమైన యుద్ధంలో; గెల్చెన్; ఈవు= నీవు; నేఁడు; ఇక్కడన్; మన రాజు కొల్వునన్= మన రాజు సభలో; అతనిన్= అర్జునుడిని; పల్కులన్= మాటలలో; గెలిచెదు= గెలుస్తావు.

తాత్పర్యం: 'బలే మంచి శూరుడవులే, ఛీ ! వినేవాళ్ళు నవ్వేటట్లు ఇంత ఎక్కువగా ఎట్లా మాటలాడుతున్నావు? మహాపరాక్రమశాలి అయిన అర్జును డొక్కడే మనలను ఆరుగురినీ భయంకర యుద్ధంలో నిన్న గెలిచాడు, ఈ వేళ నీవు అతడిని ఇక్కడ మన రాజుసభలో మాటలలో గెలుస్తున్నావు.

విశేషం: చిక్కని పోటు మానిసివి - మంచి శూరుడవే-అని ఎగతాళి. నిన్న గో గ్రహణ సమయంలో అతడి చేతిలో అట్లా ఓడిపోయి ఈ వేళ ఇట్లా మాటాడుతున్నావంటే విన్నవాళ్ళు ఎవరైనా నవ్వుతారు. అతడు ఒక్కడే - మనలను ఆరుగురిని ఓడించాడు. అతడు గెలిచింది ఉగ్రరణంలో - నీవు గెలిచింది మనరాజు సభలో. అతడు గెలిచింది అస్త్ర శస్త్రాలతో; నీవు-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గెలిచింది మాటలతో-ఇదీ భీష్ముడు కర్ణుడిని పరిహసించిన విధం. ఉత్తర గోగ్రహణ యుద్ధంలో అర్జునుడు గెలిచిన ఆరుగురు వీరులు - 1.భీష్ముడు, 2.ద్రోణుడు, 3.కృపుడు, 4.అశ్వత్థామ, 5.కర్ణుడు, 6.దుర్యోధనుడు.

క. నరుఁ డాల వెనుక వచ్చినఁ, । గురురా జడుగంగ, నీవు, గురుఁడును, గృపుఁడున్
గురుసుతుఁడు వినఁగ, వారల । చిరసమయము దెగుట యేను జెప్పనె తెలియన్? 254

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; ఆల, వెనుకన్= ఆవుల వెనుక; వచ్చినన్= రాగా; కురు రాజు= దుర్యోధనుడు; అడుగంగన్= అడుగగా; నీవున్; గురుఁడును= ద్రోణుడునూ; కృపుఁడున్= కృపాచార్యుడూ; గురుసుతుఁడున్= గురు పుత్రుడయిన అశ్వత్థామా; వినఁగన్= వింటూండగా; వారల చిర సమయము= ఆ పాండవుల బహుకాల దీక్ష - (శపథం); తెగుట= ముగియటం; ఏను= నేను; తెలియన్+చెప్పనె?= తెలిసేటట్లు చెప్పలేదా?

తాత్పర్యం: అర్జునుడు ఆవులను మరలించుకొని పోవటానికి వాటి వెనువెంట వచ్చినప్పుడు దుర్యోధనుడు పాండవుల అజ్ఞాతవాస కాలపు లెక్క అడిగాడు. అప్పుడు నీవూ, ద్రోణుడూ, కృపుడూ, అశ్వత్థామా వింటూండగా లెక్కకట్టి, అది ముగిసిందని నేను స్పష్టంగా చెప్పలేదా?'

తే. అనిన, ధృతరాష్ట్రుఁ డాపగాతనయు భక్తి । ననునయించి, రాధేయునిఁ గినిసి, ప్రియము
దోఁపఁ దా నిట్టు లనియె నా ద్రుపద మనుజ । పతి పురోహితుతోడ సంభ్రమము లేక. 255

ప్రతిపదార్థం: అనినన్; ధృతరాష్ట్రుఁడు; ఆపగా తనయున్= నదీ పుత్రుడిని-భీష్ముడిని; భక్తిన్= భక్తితో; అనునయించి= బతిమాలి; రాధేయున్= కర్ణుడిని; కినిసి= కోపపడి; ఆ ద్రుపద మనుజపతి పురోహితుతోడన్= ఆ ద్రుపదరాజ పురోహితుడితో; సంభ్రమము లేక= వేగిరపాటు లేకుండా; ప్రియము+తోఁపన్= ప్రీతి కనబడేటట్లు; తాను; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: అని కర్ణుడనగా, ధృతరాష్ట్రుడు భీష్ముడిని భక్తితో బ్రతిమాలి ఓదార్చి, కర్ణుడిని కోపపడి, ఆ ద్రుపద పురోహితుడితో వేగిరపాటు లేకుండా, ప్రీతి కనబడేటట్లు ఇట్లా అన్నాడు.

ఉ. 'మంచిగ నేను బంధులును మంత్రిజనంబులుఁ బెద్దలున్ విచా
రించి, సమస్త భూ ప్రజకుఁ బ్రీతిగ, బిడ్డల పాలి కిప్డు పు
త్తెంచెద సొమ్ము నొక్కరు' మదీయ మనోగతి వారిఁ గూడి వ
ర్తించు తెఱంగు గైకొనుట దెల్లము కౌరవజాతి కెంతయున్. 256

ప్రతిపదార్థం: మంచిగన్= మేలయ్యేటట్లు; ఏనున్= నేనూ; బంధులును= చుట్టాలూ; మంత్రి జనంబులున్= మంత్రులూ; పెద్దలున్; విచారించి= ఆలోచించి; సమస్త భూ ప్రజకున్= ఎల్ల భూ ప్రజలకూ, ప్రీతిగన్= సంతోషం కలిగేటట్లు; ఇప్డు= ఇప్పుడు; సొమ్మ్యున్+ఒక్కరున్= మంచివాడిని ఒక్కడిని, బిడ్డల పాలికిన్= బిడ్డల దగ్గరకు- పాండవుల వద్దకు; పుత్తెంచెదన్= పంపుతాను; మదీయ మనస్(ః)+గతి= నా మనస్సుయొక్క రీతి; వారిన్= ఆ పాండవులను; కూడి= కలిసి; వర్తించు తెఱంగు+కైకొనుట= మెలగే పద్ధతిని అవలంబించటం; కౌరవ జాతికిన్= కురువంశీయుల కందరికీ; ఎంతయున్+తెల్లము= మిక్కిలి స్పష్టం.

తాత్పర్యం: 'మేలు కలిగేటట్లు నేనూ, బంధువులూ, మంత్రులూ, పెద్దలూ ఆలోచించి, భూజనుల కందరికీ సంతోషంగా, ఇప్పుడు మంచివాడిని ఒకడిని నా బిడ్డలైన పాండవుల వద్దకు పంపుతాను. నేను మనస్సులో ఆ పాండవులతో కూడి ఉండే మార్గాన్నే అవలంబిస్తా నన్న సంగతి కురువంశీయుల కందరికీ సుస్పష్టం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 1. కర్ణభీష్ముల వాగ్యుద్ధంతో కౌరవసభలో పాండవ పక్షం బలపడసాగింది. కర్ణుడికండగా దుర్యోధనుడు రంగంలోకి దిగినా భీష్ముడు సహించాడు. పైపెచ్చు సభ రసాభాస మౌతుంది. అందువలన ధృతరాష్ట్రుడు కల్పించుకొనక తప్పలేదు. భీష్ముడిని బ్రతిమిలాడాడు. కర్ణుడిని కోపగించాడు. ఆపైన తాను ద్రుపదపురోహితుడితో మాట్లాడాడు. పాండవులకు భాగమిస్తా ననలేదు కాని, పాండవుల వద్దకు దూతను పంపుతానన్నాడు. 'మా దూత నీవలె కాక, సౌమ్యంగా ఉంటా'డని ఎత్తిపొడిచాడు. పాండవులతో కూడి ఉండే మార్గాన్ని ఆలోచించి వర్తమానం పంపుతానన్నాడు. సభలో తన మర్యాద నిలుపుకొన్నాడు. (సంపా.)

2. నిజానికి ధృతరాష్ట్రుడి మనస్సు దుర్యోధనుడిని అనువర్తిస్తుందే తప్ప, తద్విరుద్ధంగా ప్రవర్తించాలని అనుకొనదు. పాండవులను కూడి ఉంటాననటం పైకి అనేమాట.

తే. **నీవు మున్నేఁగు' మని యతనికి విభూష । ణాంబరమ్ములతోఁ దమ్ములంబుఁ బెట్టి**
వీడుకోలిచ్చి పుచ్చిన, విప్రవరుఁడు । పాండు జనపాల తనయుల పాలి కరిగె. **257**

ప్రతిపదార్థం: నీవు; మున్ను+ఏఁగుము+అని= ముందుగా వెళ్ళుము అని; అతనికిన్; విభూషణ+అంబరమ్ములతోన్= ఆభరణాలతోను, వస్త్రాలతోనూ; తమ్ములంబున్+పెట్టి= తాంబూలం ఇచ్చి; వీడుకోలు+ఇచ్చి= సెలవిచ్చి; పుచ్చినన్= పంపగా; విప్ర - వరుఁడు= బ్రాహ్మణ శ్రేష్ఠుడు; పాండుజనపాల తనయుల పాలికిన్= పాండురాజు కొడుకుల వద్దకు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'నీవు ముందు పద' అని అతడికి ఆభరణాలతోను, వస్త్రాలతోను తాంబూలం ఇచ్చి, సెలవిచ్చి పంపగా, ద్రుపద పురోహితుడు పాండవుల వద్దకు వెళ్ళాడు.

వ. **ఇట్లు సని వారలఁ గని యతండు సముచిత సంభాషణంబులఁ దనపోయి వచ్చిన తెఱం గెఱింగించె; నిట ధృతరాష్ట్రుండును బుత్త్ర మిత్త్ర వృద్ధామాత్య సహితంబుగా నాస్థానాసీనుం డయి యుండి సంజయు రావించి యతని కిట్లనియె.** **258**

ప్రతిపదార్థం: ఇట్లు+చని= ఈ విధంగా వెళ్ళి; అతండు= ద్రుపద పురోహితుడు; వారలన్= ఆ పాండవులను; కని= చూచి; సముచిత సంభాషణంబులన్= తగిన మాటలతో; తన పోయి వచ్చిన తెఱంగు= తాను వెళ్ళి వచ్చిన విధం; ఎఱింగించెన్= తెలిపాడు; ఇటన్= ఇక్కడ; ధృతరాష్ట్రుండును; పుత్త్ర, మిత్త్ర, వృద్ధ+అమాత్య+సహితంబుగాన్= కొడుకులతోనూ, స్నేహితులతోనూ, పెద్దలతోనూ, మంత్రులతోనూ కలిసి; ఆస్థాన+ఆసీనుండు+అయి+ఉండి= సభాస్థానంలో కూర్చుండి; సంజయున్= సంజయుడిని; రావించి= రప్పించి; అతనికిన్= అతడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా ద్రుపద పురోహితుడు వెళ్ళి పాండవులను చూచి తాను వెళ్ళి వచ్చిన విధం తగిన మాటలతో తెలిపాడు. ఇక్కడ ధృతరాష్ట్రుడు కూడా పుత్రులతోనూ, మిత్రులతోనూ, పెద్దలతోనూ, మంత్రులతోనూ కూడి సభాస్థానంలో కూర్చొనిఉండి సంజయుడిని పిలిపించి అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం: సంజయుడు సూత కులజుడు, మంచివాడు. ఎప్పుడూ ధృతరాష్ట్రుడి వద్దనే ఉండి అతడికి ఉపచారాలు చేస్తూ ఉంటాడు. ముందు ముందు కురుక్షేత్ర సంగ్రామ వార్తలు ఎప్పటికప్పుడు ధృతరాష్ట్రుడికి చెపుతూ ఉంటాడు. యుద్ధభూమిలో ఎవ్వరికీ కనపడకుండా నిరపాయంగా ఉండగలిగే శక్తి ఇతడికి వ్యాసుడు అనుగ్రహిస్తాడు.

తే. 'పాండు నరపాల సుతు లుపప్లావ్యమునకు । వచ్చియున్నారు; నీ వేఁగి వాసుదేవ
సహితముగ వారిఁ గని, తద్విషాద మేమి । భంగి మాను నమ్మెయిఁ దగఁ బలుకవలయు.' 259

ప్రతిపదార్థం: పాండు నరపాల సుతులు= పాండురాజు కొడుకులు; ఉపప్లావ్యమునకున్= ఉపప్లావ్యమనే పురానికి; వచ్చి+ఉన్నారు; నీవు+ఏఁగి= నీవు వెళ్ళి; వారిన్; వాసుదేవ సహితముగన్= శ్రీ కృష్ణుడితో కూడా; కని, తద్+విషాదము= వారి దుఃఖం; ఏమి భంగిన్ మానున్= ఏ విధంగా పోతుందో; అమ్మెయిన్ (ఆ+మెయిన్)= ఆ రీతిగా; తగన్= ఒప్పుగా; పలుకవలయున్= మాట్లాడాలి.

తాత్పర్యం: 'పాండవులు ఉపప్లావ్య పురానికి వచ్చి ఉన్నారు. నీవు వెళ్ళి శ్రీకృష్ణుడితో కూడి ఉండగా వారిని చూచి, వారి దుఃఖం ఏ విధంగా తొలగి పోతుందో, ఆ విధంగా ఒప్పుగా పలకాలి.

ధృతరాష్ట్రుఁడు సంజయునిఁ బాండవుల యొద్దకుఁ బంపుట (సం. 5-22-1)

క. 'మీ యయ్య, మీరు వనవా । సాయాసము నిస్తరించి యభ్యుదయమునన్
డాయుట విని ముదితాత్ముం । డై యిట పుత్తెంచె నన్ను' ననుమీ మొదలన్. 260

ప్రతిపదార్థం: మొదలన్= మొదట; మీరు; వన వాస+ఆ యాసమున్= అరణ్య వాస దుఃఖాన్ని; విస్తరించి= దాటి; అభ్యుదయమునన్= అభివృద్ధితో; డాయుట= చేరటం; విని; మీ+అయ్య= మీ తండ్రి; ముదిత+ఆత్ముండు+ఐ= సంతోషించిన మనస్సు కలవాడై, నన్నున్; ఇట= ఇక్కడికి; పుత్తెంచెన్= పంపాడు; అనుమీ= అని చెప్పుము.

తాత్పర్యం: 'నీవు వెళ్ళగానే మొదట 'మీరు అరణ్యావాస దుఃఖాన్ని దాటి అభివృద్ధితో వచ్చారన్న సంగతి విని మీ తండ్రి సంతోషంతో నన్ను ఇక్కడికి పంపించా' డని పలుకుము.'

వ. అని చెప్పి, చుట్ల నున్న వారలతో నిట్లనియె. 261

ప్రతిపదార్థం: అని, చెప్పి; చుట్లన్+ఉన్న వారలతోన్= చుట్టూ ఉన్న వాళ్ళతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికి, తన చుట్టూ ఉన్నవాళ్ళతో ఇట్లా అన్నాడు.

క. 'దుర్యోధనుండు కార్యా । కార్యజ్ఞుఁడు గామి నిట్టి కలఁక గలిగెఁ గా
కార్యులు దృఢధైర్యులు రణ । ధుర్యులు నగు పాండుసుతులు దోషాన్వితులే? 262

ప్రతిపదార్థం: దుర్యోధనుండు; కార్య+అకార్యజ్ఞుఁడు+కామిన్= చేయదగినదేదో, చేయదగని దేదో తెలిసిన వాడు కాకపోవటం చేత; ఇట్టి,కలఁక= ఇటువంటి సంక్షోభం; కలిగెన్+కాక= పుట్టింది కాని; ఆర్యులున్= మంచివాళ్ళూ; దృఢధైర్యులున్= మంచి ధైర్యం కల వాళ్ళూ; రణ ధర్యులున్= యుద్ధ కార్యభారం వహించేవాళ్ళూ, యుద్ధ నిపుణులూ; అగు; పాండు సుతులు= పాండవులు; దోష+అన్వితులే= దోష సహితులా?

తాత్పర్యం: 'మా దుర్యోధనుడు కార్యాకార్యాలు తెలియనివా డవటం చేత ఇటువంటి సంక్షోభం పుట్టింది కాని, మంచివాళ్ళూ, మంచి ధైర్యవంతులూ, యుద్ధ నిపుణులూ అయిన పాండవులు దోషులా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: తన కొడుకే మంచి చెడ్డలు తెలిసినవాడు కాడనీ, పాండవులు నిర్దోషులనీ అనటం ధృతరాష్ట్రుడు పైకి అనే మాటలు. అవి అతడి మాట నేర్పును సూచిస్తాయి.

క. క్షీరోదకవృత్తి మనము । వారలునుం గలిసి బ్రదుకవలదే నెమ్మిన్?
వా రిడుమలఁ బడఁ దగియెడు । వారే? పితృభాగ మేలువారలు గారే? 263

ప్రతిపదార్థం: మనమున్; వారలునున్; క్షీర+ఉదక వృత్తిన్= పాలూ నీళ్ళూ వలె; కలసి; నెమ్మిన్= ప్రీతితో; బ్రదుకవలదే= బ్రతుకవద్దా?; వారు, ఇడుమలన్+పడన్+తగియెడు వారే?= వాళ్ళు కష్టాలు పడదగిన వాళ్ళా?; పితృ భాగము+ఏలు వారలు+ కారే= తమ తండ్రి వాటా అనుభవించ దగిన వాళ్ళు కారా?

తాత్పర్యం: మనమూ, వాళ్ళూ పాలూ నీళ్ళూ వలె కలిసిపోయి హాయిగా బ్రతుకవద్దా? వాళ్ళు కష్టాలు పడదగ్గవాళ్ళా? తమ తండ్రి వాటా అనుభవించదగిన వాళ్ళు కారా?

విశేషం: అలం: యథాసంఖ్యం. 'క్షీరోదక వృత్తి మనము వారలునున్ గలిసి-' క్షీరం మనం, ఉదకం వారు- యథాసంఖ్యం. ఈ అలంకారంలో కౌరవపాండవులు విడదీయరానట్లుగా కలియటమే ముఖ్యం కాని, వారిలో పాలవంటివారు గొప్పవారనీ, నీళ్ళవంటివారు తక్కువవారనీ భావించరాదు. కాగా ఎప్పుడైనా పాలలో నీళ్ళు కలవటం లోక ప్రసిద్ధి. ధృతరాష్ట్రుడు 'క్షీరోదకవృత్తి మనము వారలనుం గలిసి బ్రతుకవలదే?' అంటే - 'క్షీరోదకగతిఁ బాండవ కౌరవు లొడఁగూడి మనకి కార్యం'బని శ్రీకృష్ణుడు అన్నాడు (చూడు. ఉద్యో.3.258). ఈ సారాసార విచారం ఆ అలంకారంలో లేదనలేము. కాని, ఎవరి కనుకూలంగా వారు యథాసంఖ్యాలంకారాన్ని ప్రయోగించా రన్నది వాస్తవం. (సంపా.)

ఆ. మనల నింక నమ్మ రనృతాత్ము లన్యాయ । పరులు గర్వు లనుచుఁ బాండుసుతులు;
గూడి మనుట కియ్యకొన నేర; రైనను । ధర్మజుండు గలఁడు దగవు నడప,' 264

ప్రతిపదార్థం: మనలన్= మనలను; అనృత+ఆత్ములు= అసత్య పరులు; అన్యాయపరులు= అధర్మపరులు; గర్వులు= గర్వం కలవారు; అనుచున్; పాండుసుతులు= పాండవులు; ఇంకన్= ఇకమీదట; నమ్మరు; కూడి మనుటకున్= కలిసి బ్రతకటానికి; ఇయ్యకొనన్+నేరరు= ఒప్పుకొనజాలరు; ఐనను; తగవు నడపన్= ధర్మం నడపటానికి; ధర్మజుండు, కలఁడు.

తాత్పర్యం: మనలను అసత్యవాదులనీ, అధర్మపరులనీ, గర్విష్ఠులనీ అంటూ పాండవులు ఇకమీద విశ్వసించరు. మనతో కలిసి బ్రతకటానికి అంగీకరించజాలరు. అయినా, ధర్మం నడపటానికి ధర్మరాజున్నాడు.

వ. అని పలికి వెండియు. 265

తాత్పర్యం: అని పలికి ఇంకా.

మ. 'మన కీ కుండఁగ వచ్చునే? మనము దుర్మానంబు వాటించి యొ
ప్పని కార్యంబులు వట్టి వారికిఁ దగం బాలీక గర్వంబు లా
డిన, నిక్కంబగు నల్క నర్జునుఁడు గాండీవంబు మోపెట్టఁ గృ
ష్ణుని సారథ్యము నై జగత్త్రితయ సంక్షోభంబు గా కుండునే? 266

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మనకున్; ఈక+ఉండఁగన్, వచ్చునే?= ఇవ్వకుండా ఉండటానికి మనకు శక్యమా?; మనము; దుర్మానంబు= చెడుగర్వాన్ని; పాటించి= పూని; ఒప్పని కార్యంబులు+పట్టి= తగని పనులు చేసి; వారికిన్; తగన్= తగునట్లుగా; పాలు+ఈక= భాగం ఇవ్వక; గర్వంబులు+ఆడినన్= గర్వంగా మాటాడితే; నిక్కంబు+అగు+అల్కన్= నిజమైన కోపంతో; అర్జునుఁడు, గాండీవంబున్; మోపెట్టన్= ఎక్కుపెట్టితే; కృష్ణుని సారథ్యమున్+ఐ= దానికి తోడు శ్రీకృష్ణుడి సారథ్యం కూడా ఉండి; జగత్+త్రితయ సంక్షోభంబు+కాక+ఉండునే?= మూడులోకాలకు కలత సంభవించకుండా ఉంటుందా?

తాత్పర్యం: వారిభాగం వారికి ఇవ్వకుండా ఉందామన్నా మనకు శక్యం కాదు. మనం దురహంకారం పూని చేయగూడని పనులు చేసి వారికి సముచితంగా భాగం పంచిపెట్టక గర్వంగా మాటాడితే, నిజమైన కోపంతో అర్జునుడు గాండీవం ఎక్కుపెట్టగా, దానికి శ్రీకృష్ణుడి సారథ్యం కూడా తోడుకాగా ముల్లోకాలూ దద్దరిల్లకుండా ఉంటాయా?

తే. **అలఘు గదఁ బూంచికొని భీముఁ డతిరయమునఁ । గురుకుమారులపైఁ దీవ్రకోప మెసఁగఁ**
గవియు టాత్మ భావించినఁ గంప మడరు; । నిక్క మెవ్వరు మార్కొని నిలుచువారు? **267**

ప్రతిపదార్థం: భీముఁడు; అలఘు గదన్= పెద్ద గదను; పూంచి కొని= పట్టుకొని; అతి రయమునన్= మిక్కిలి వేగంతో; కురు కుమారులపైన్= కౌరవులమీద; తీవ్ర కోపము+ఎసఁగన్= తీవ్ర మైన కోపం అతిశయించగా; కవియుట= క్రమ్ముకొనటం; ఆత్మన్= మనస్సులో; భావించినన్= ఊహించుకుంటే; కంపము= వణకు; అడరున్= అధికమవుతుంది; నిక్కము= నిజంగా; ఎవ్వరు; మార్కొని= అతడిని ఎదుర్కొని; నిలుచువారు?= నిలువగలిగేవారు?

తాత్పర్యం: పెద్ద గద ధరించి భీముడు అమితవేగంతో తీవ్రమైన కోపం అతిశయించగా కౌరవులమీద పడటం మనస్సులో ఊహించుకొంటే వణకు పుట్టుకొస్తుంది. నిజంగా అతడిని ఎదిరించి నిలబడగలవారెవరు?

సీ. **కవ లగ్రజన్ముల కంటె నేమిటఁ గీడు? । ద్రుపదుఁ డల్పుండె? తత్సుతులు బాహు**
గర్వ సమగ్రులు గారె? విరాటుండు । నాతని తమ్ములు, నాత్మజులును
నసదులే? సాత్యకి యలఁతులఁ బోయెడు । వాఁడె? వృష్ణి కుమారవరు లనేకు
లట్టి యోధులు పోర నరవాయిఁ గొందురే? । పాండ్యుండుఁ, గేకయపతులు నాది

తే. **యైన బంధులు, మిత్త్రులు నగ్గలికలఁ । గొఱఁత వడియెడు వారె? యందఱను గెల్వ**
నోపినను రుద్రునకు నైన నోర్వరాని । ధర్మపుత్త్రు కోపమునకుఁ దలఁకవలదె?' **268**

ప్రతిపదార్థం: కవలు= నకుల సహదేవులు; అగ్ర జన్ములకంటెన్= అన్నగార్లకంటె; ఏమిటన్= ఎందులో; కీడు?= తక్కువ?; ద్రుపదుఁడు; అల్పుండె?= తక్కువ వాడా?; తద్+సుతులు= అతడి కొడుకులు; బాహు గర్వ సమగ్రులు+కారె?= భుజ బల గర్వంతో నిండినవారు కారా?; విరాటుండున్, ఆతని తమ్ములున్; ఆత్మజులునున్= కొడుకులూ; అసదులే?= తక్కువవారా? సాత్యకి; అలఁతులన్+పోయెడు వాఁడె?= తేలికగా పోయేవాడా?; వృష్ణి కుమార వరులు= వృష్ణివంశీయులైన కుమార శ్రేష్ఠులు; అనేకులు+అట్టి యోధులు= పెక్కుమంది అటువంటి యోధులు; పోరన్= యుద్ధంలో; అరవాయిన్+కొందురే?= జంకుతారా?; పాండ్యుండున్; కేకయ పతులున్= కేకయదేశపు రాజులూ; ఆది+ఐన బంధులున్= మొదలైన చుట్టాలూ; మిత్త్రులున్= స్నేహితులూ; అగ్గలికలన్= విజృంభించటంలో; కొఱఁత+పడియెడు వారె?= తక్కువ వాళ్ళా?; అందఱను గెల్వన్+ఓపినను=

వాళ్ళందరినీ గెలవగలిగినా; రుద్రునకున్+ఐనన్= రుద్రుడికి కూడా; ఓర్వరాని= ఓడించ తరం కాని; ధర్మపుత్త్రు కోపమునకున్= ధర్మరాజు కోపానికి; తలఁకవలదె?= వెరవవలదా?

తాత్పర్యం: నకుల సహదేవులు అన్నగార్లకంటె ఎందులో తక్కువ? ద్రుపదుడు తక్కువవాడా? అతడి కొడుకులు భుజబల గర్వం నిండినవాళ్ళు కారా? విరాటుడూ, అతడి తమ్ములూ, కొడుకులూ తక్కువ వాళ్ళా? సాత్యకి అంత తేలికగా పోయేవాడా? వృష్ణి వంశీయులైన కుమార శ్రేష్ఠులు, అటువంటి యోధులు అనేకులు యుద్ధంలో జంకుగొంటారా? పాండ్యరాజూ, కేకయదేశపు రాజులూ మొదలైన చుట్టాలూ, స్నేహితులూ విజృంభించటంలో తక్కువ తిన్నవాళ్ళా? అందరినీ ఓడించగలిగినా, రుద్రుడికి కూడా ఓడించటానికి శక్యం కాని ధర్మరాజు కోపానికి భయపడవలసిందే కదా!'

విశేషం: ధృతరాష్ట్రుడి మాటలను బట్టి అతడికి పాండవులమీద ప్రేమకంటె, వారంటే భయమే ఎక్కు వనిపిస్తుంది.

వ. అని పలికి సంజయుదిక్కు మొగంబై యెల్లవారును విన నిట్లనియె. 269

ప్రతిపదార్థం: అని, పలికి, సంజయు దిక్కు మొగంబు+ఐ= సంజయుడి కేసి చూచి; ఎల్లవారునున్= అందరూ; వినన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికి సంజయుడివైపు చూచి అందరూ వినేటట్లు ఇట్లా అన్నాడు.

తే. నీవు ధర్మజుపాలికి నెమ్మి నరుగు; । మతఁడు పేరోలగం బున్న యవసరమునఁ
గాన్పు; మతనికి ననుజవర్గంబునకును । బంధులకు నింపు పుట్టంగఁ బలుకు మచట. 270

ప్రతిపదార్థం: నీవు; ధర్మజు పాలికిన్= ధర్మరాజు దగ్గరకు; నెమ్మిన్= ప్రీతితో; అరుగుము= వెళ్ళుము; అతఁడు; పేరోలగంబు (పేరు+ఓలగంబు)+ఉన్న+అవసరమునన్= పెద్ద కొలువు తీర్చిఉన్న సమయంలో; కాన్పుము= కనిపించుము; అతనికిన్, అనుజ వర్గంబునకున్= తమ్ముల సమూహానికీ; బంధులకున్= చుట్టాలకూ; ఇంపు= సంతోషం; పుట్టంగన్= కలిగే విధంగా; అచటన్= అక్కడ; పలుకుము= మాటలాడుము.

తాత్పర్యం: నీవు ధర్మరాజు వద్దకు ప్రీతితో వెళ్ళుము. అతడు పెద్ద కొలువు తీర్చిన సమయంలో దర్శించుకొనుము. అతడికీ, ఆతడి తమ్ములకూ, బంధువులకూ సంతోషం కలిగే విధంగా అక్కడ మాటాడుము..

క. నెయ్యము వాటించి, కడుం । దియ్య మెసఁగ, నలుక లెల్లఁ దీఱునటులుగాఁ
గయ్య మను తలఁపు లోనుగ । నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగునన్. 271

ప్రతిపదార్థం: నెయ్యము+పాటించి= స్నేహం చూపి; కడున్= మిక్కిలి; తియ్యము+ఎసఁగన్= ప్రీతి అతిశయించగా; అలుకలు+ ఎల్లన్= కోపాలన్నీ; తీఱు+అటులు+కాన్= తొలగిపోయే విధంగా; కయ్యము+అను తలఁపు+లోనుగన్= యుద్ధాలోచన మొదలుగా; ఆ+యమ నందనుఁడు= ఆ ధర్మరాజు; మాను+అట్టి తెఱఁగునన్= విడిచిపెట్టే విధంగా.

తాత్పర్యం: స్నేహం పాటించి, మిక్కిలి ప్రీతి అతిశయించగా, కోపాలన్నీ తీరిపోయేటట్లు ఆ ధర్మరాజు యుద్ధాలోచనాదికం మానే విధంగా.

విశేషం: ధృతరాష్ట్రు డీ పద్యంలో సంజయుడి రాయబారం సాధించవలసిన ప్రధాన ప్రయోజనాన్నీ, అందులో పాటించవలసిన విధానాన్ని నిర్దేశించాడు. 1.స్నేహం పాటించాలి. 2.వారిలో మిక్కిలి ప్రీతి అతిశయించేటట్లు చేయాలి. 3.ధర్మరాజు మనసులో ఉన్న కోపాలన్నీ తీరిపోవాలి. 4.ధర్మరాజు యుద్ధాలోచనం మానుకోవాలి. 5.శాంతిమార్గంలో కార్యం సాధించాలి. చివరి లక్ష్యం ధర్మరాజు యుద్ధాలోచన మానటం. ఇందులో రాజ్యభాగ ప్రసక్తి లేదు. ధర్మరాజు విరక్తికే ప్రాధాన్యం ఉన్నది. ఇది అపూర్వమైన రాయబారం. రాజనీతికి రత్నపరీక్ష వంటిది. (సంపా.)

సంజయుఁ డుపప్లావ్యంబున నున్న పాండవులయొద్దకు వచ్చుట (సం. 5-22-39)

వ. శాంతి ప్రకారంబునం గార్యంబు నడపి యొక్కటియై మనుట యొడఁగూర్చి రమ్ము; రథం బెక్కి పొ' మ్మని తగినతెఱంగున వీడ్కొలిపిన, సంజయుండునుం జని, యుపప్లావ్యంబు సొచ్చి, మాధవు మందిరంబున కరిగి, యభ్యంతర వినోదంబుల నరసహితుండై యున్న యన్నారాయణునకుం దనరాక యెఱింగించి పుచ్చి, తగఁ బ్రవేశించి, భయభక్తివినయ సంభ్రమంబులు మెఱయ వారలం గాంచి, యమ్మహాత్ము లిరువుర సంభావనంబులును, సంభాషణంబులునుం బడసి సంప్రీతచేతస్కుండై, మఱునాఁడు ధర్మతనయు నొడ్డోల గంబున్న సమయంబు వేచి, సముచితంబుగా నతనిం గని సాష్టాంగంబుగాఁ బ్రణమిల్లిన, నతండుం బ్రియపూర్వకంబుగా నాదరించి తన సమీపంబున నునిచికొనినం గొలిచియుండి యతని కిట్లనియె. 272

ప్రతిపదార్థం: శాంతి ప్రకారంబునన్= శాంతి మార్గంలో; కార్యంబున్+నడపి= పనిని జరిపించి; ఒక్కటి+ఐ, మనుట= కలిసి బ్రతుకటం, ఒడన్‌కూర్చి రమ్ము= కలిగించి రావలసింది; రథంబు+ఎక్కి, పొమ్ము, అని; తగిన తెఱంగునన్= తగిన విధంగా; వీడ్కొలిపినన్= పంపగా; సంజయుండునున్, చని; ఉపప్లావ్యంబు+చొచ్చి= ఉపప్లావ్యపురం ప్రవేశించి; మాధవు మందిరంబునకున్ అరిగి= శ్రీకృష్ణుడి భవనానికి వెళ్ళి; అభ్యంతర వినోదంబులన్= అంతఃపురపు వేడుకలతో; నర సహితుండు+ఐ= అర్జునుడితో కూడినవాడై; ఉన్న+ఆ+నారాయణునకున్= ఉన్న ఆ శ్రీకృష్ణుడికి; తనరాక; ఎఱింగించి పుచ్చి= చెప్పి పంపి; తగన్+ప్రవేశించి= తగినట్లు ప్రవేశించి; భయ భక్తి వినయ సంభ్రమంబులు= భయమూ, భక్తీ, అడకువా, గౌరవమూ; మెఱయన్= ప్రకాశించగా; వారలన్, కాంచి; ఆ+మహాత్ములు+ఇరువుర= ఆ మహనీయు లిద్దరియొక్క; సంభావనంబులును= ఆదరములూ; సంభాషణంబులునున్= మాటలూ; పడసి= పొంది; సంప్రీత చేతస్కుండు+ఐ= సంతోషించిన మనస్సు కలవాడై; మఱునాఁడు; ధర్మ తనయు+ఒడ్డోలగంబు (ఒడ్డు+ఓలగంబు)+ఉన్న, సమయంబు వేచి= ధర్మరాజు నిండుకొలువుండే సమయం కాచుకొని; సముచితంబుగాన్= తగినరీతిని; అతనిన్= ధర్మరాజును; కని; సాష్టాంగంబుగాన్+ప్రణమిల్లినన్= సాష్టాంగంగా (ప్రధానాలైన ఎనిమిది శరీరావయవాలు నేలకు తాకేటట్లు) నమస్కరించగా; అతండున్= ధర్మరాజుకూడా; ప్రియ పూర్వకంబుగాన్= సంతోషపురస్సరంగా; ఆదరించి= గౌరవించి; సమీపంబునన్= దగ్గరగా; ఉనిచికొనినన్= ఉంచగా (ఉండేటట్లు కూర్చుండబెట్టుకొనగా); కొలిచి+ఉండి= సేవించి; అతనికిన్+ఇట్లు+అనియెన్= ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: శాంతిమార్గంలో కార్యం నడిపి కలిసి బ్రతకటాన్ని సాధించుకొని రమ్ము, రథమెక్కి వెళ్ళుము' అని తగిన విధంగా పంపగా, సంజయుడునూ వెళ్ళి, ఉపప్లావ్యపురం ప్రవేశించి, శ్రీకృష్ణుడి భవనానికి పోయి, అంతఃపురం ప్రవేశించి, అంతఃపురపు వేడుకలలో అర్జునుడితో కూడి ఉన్న ఆతడికి తన ఆగమనవార్త చెప్పి పంపి, ఒప్పుగా ప్రవేశించి, భయమూ, భక్తీ, వినయమూ ప్రకాశించగా వారిని చూచి, ఆ ఇద్దరి మహనీయుల మర్యాదలూ,

మన్ననలూ పొంది, సంతోషించిన మనస్సు కలవాడై మరునాడు ధర్మరాజు పెద్ద కొలువు తీర్చే సమయం కాచుకొని ఉండి, తగిన రీతిని ఆతడిని దర్శించి, సాష్టాంగ నమస్కారం చేశాడు. ధర్మరాజు ప్రీతి పురస్సరంగా ఆదరించి దగ్గర కూర్చుండ బెట్టుకొనగా సంజయుడు సేవించి అతడితో ఇట్లా అన్నాడు.

తే. **'భాగ్యమున నిన్నుఁ గనుఁగొనఁ బడసి నాదు । చూడ్కి చరితార్థ మయ్యెః నస్తోక పుణ్య**
ధనుఁడు మీ తండ్రి ధృతరాష్ట్ర ధరణినాథుఁ । డిందు మీ యున్కి విని, ప్రియ మెసకమెసఁగ. **273**

ప్రతిపదార్థం: భాగ్యమునన్= అదృష్టంచేత; నిన్నున్; కనుఁగొనన్+పడసి= చూడగలిగి; నాదు చూడ్కి= నా దృష్టి; చరితార్థము+ అయ్యెన్= సార్థక మయింది; అస్తోక పుణ్య ధనుఁడు= అనల్పమైన పుణ్యం ధనంగా గలవాడు(అగు); మీ తండ్రి ధృతరాష్ట్ర ధరణి నాథుఁడు= మీ తండ్రి అయిన ధృతరాష్ట్ర మహారాజు; ఇందున్= ఇక్కడ; మీ+ఉన్కి= మీరు ఉండటం; విని; ప్రియము= ప్రీతి; ఎసకము+ఎసఁగన్= అతిశయించగా.

తాత్పర్యం: 'అదృష్ట వశాన నిన్ను చూడగలగటం వలన నా దృష్టి సార్థకమయింది. అధిక పుణ్యధనుడైన మీ తండ్రి ధృతరాష్ట్ర మహారాజు మీ రిక్కడ ఉండటం విని, ప్రీతి అతిశయించగా.

విశేషం: సంజయుడు మాటలాడే తీరు ధర్మజుడికి ఆశాజనకంగా లేదు. ఆప్యాయంగా రాజ్యభాగమిచ్చి హస్తినాపురానికి పిలవటానికి సంజయుడు వచ్చినట్లు లేదు. అందువలన అతడు మాట్లాడే మాటలన్నీ కంటితుడుపు మాటలని ధర్మజుడు అంచనా వేయసాగాడు. సంజయుడు పొందకుండ మాట్లాడాలని యత్నించటం, ధర్మజుడు అతడికి అందకుండా మాట్లాడటం మొదలౌతున్నది. పైకి లోకమర్యాదకై మాటలాడుతున్నా, లోన ఒక గూఢమైన విరుద్ధార్థం స్ఫురించటం సంజయుడి సంభాషణ శిల్పం. అదృష్టవశాన నిన్ను చూడగలిగాననటం ఇది ఔపచారికం. నిన్ను మరల చూస్తానని అనుకొనలేదు. అదృష్టవశాన చూడగలిగాను - అని గూఢార్థం. నా దృష్టి సార్థకమయింది - ఇది లౌకికం. నిన్ను దర్శించటం వలన నా దృక్పథం ప్రయోజనంతో కూడినదయింది - ఇది గూఢార్థం. మీ తండ్రి మీరిక్కడ ఉన్నారని తెలిసి ప్రీతి చెందాడన్నాడు. పాండవులు క్షేమంగా ఉన్నారని తెలిసి సంతోషించాడని ప్రకృతార్థం. అయితే ధృతరాష్ట్రుడికి వాడిన విశేషణాలు ధర్మరాజును అధిక్షేపిస్తున్న భావాన్ని ధ్వనింపజేస్తాయి. రాజు అస్తోకపుణ్యధనుడట! ధరణినాథుడట! ఈ రెండింటిని కలిపి చదువుకొంటే ధృతరాష్ట్రుడు అపారపుణ్యధనుడు కాబట్టి ప్రభువై రాజ్యాన్ని పాలిస్తున్నాడనీ, అత డొక్కడే రాజనీ అర్థమేర్పడుతుంది. పరిశేషన్యాయంతో పుణ్యహీనులైన పాండవులు ఈ విధంగా రాజ్యహీనులై ఉపప్లావ్య నగరంలో ఉన్నందుకు తండ్రి ప్రీతి చెందాడనే విపరీతార్థం స్ఫురించే అవకాశం ఉన్నది. గూఢవ్యంగ్యార్థ ధ్వని కాకువు నాశ్రయించి ఈ పద్యంలో రాణించింది. (సంపా.)

క. **అనుజులు నీవును ద్రోవది । యును బుత్త్రచయంబు నున్న యోగక్షేమం**
బున తెఱఁ గారయఁ బుత్తెం । చె నితాంత స్నేహపూర్ణ చేతోవృత్తిన్.' **274**

ప్రతిపదార్థం: అనుజులున్= తమ్ములూ; నీవును; ద్రోవదియును= ద్రౌపదీ; పుత్త్ర చయంబున్= కుమారుల సమూహమూ; ఉన్న యోగక్షేమంబున తెఱఁగు= కుశలంగా ఉన్న విధం; ఆరయన్= తెలిసికొనటానికి; నితాంత స్నేహ పూర్ణ చేతస్(ః)+ వృత్తిన్= అధికమైన మైత్రితో నిండిన మనోవ్యాపారంతో; పుత్తెంచెన్= (నన్ను) పంపాడు.

తాత్పర్యం: తమ్ములూ, నీవూ, ద్రౌపదీ, నీ కొడుకులూ కులాసాగా ఉన్న విధం తెలిసికొనటానికి అధిక మైత్రితో నిండిన మనస్సుతో నన్ను పంపాడు.

విశేషం: 1. 'నితాంత స్నేహపూర్ణ చేతోవృత్తిన్' - అని ఎంతో గొప్పగా చెప్పి, పాండవులు యోగక్షేమాలతో ఉన్న విధం తెలిసికొని రమ్మని రాజు సంజయుడిని పంపినట్లు తెలిపాడు. అంత అనురాగం నిండిన వాడు శూన్యహస్తాలతో క్షేమాదులను తెలిసికొనటానికి పంపాడంటే- ఎంత మర్యాదగా ఉంటుందో, అంత ఎగతాళిగా ఉంటుంది. ధర్మజుడు మెత్తనిపులి. సంజయుడికి దీటుగా మాట్లాడి దెబ్బకు దెబ్బ తీయాలనుకొనటానికి ఈ మాటలే హేతువులయ్యాయి.

2. పాండవులకు 'ఇంపు పుట్టంగఁ బలుకు'మని (270 వ పద్యం) ధృతరాష్ట్రుడు చెప్పిన మాటలకు అనువుగా నెయ్యం, తియ్యం, ప్రీతి అతిశయించేటట్లు పాండవుల వద్దకు ధృతరాష్ట్రుడు తనను పంపాడని చెప్పనారంభించాడు. (సంపా.)

వ. అనిన సూతనందనునకు ధర్మనందనుం డిట్లనియె. 275

ప్రతిపదార్థం: అనినన్; సూతనందనునకున్= సూతపుత్రుడైన సంజయుడికి; ధర్మ నందనుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనిపల్కిన సంజయుడితో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. 'ఆ రాజు మా దెసం గల । కారుణ్యము కతమునను సుఖంబున ని ట్లు
న్నారము; నినుఁ బుత్తెంచిన । గారవమున నాదుమది వికాసముఁ బొందెన్. 276

ప్రతిపదార్థం: ఆ రాజు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; మాదెసన్+కల= మాయందు కలిగి ఉన్న; కారుణ్యము కతమునను= దయ కారణంగా; సుఖంబునన్= సుఖంగా; ఇట్లు+ఉన్నారము= ఇట్లా ఉన్నాం; నినున్, పుత్తెంచిన గారవమునన్= పంపిన వాత్సల్యం చేత; నాదు మది= నా మనస్సు; వికాసమున్+పొందెన్= సంతోషించింది.

తాత్పర్యం: 'ఆ ధృతరాష్ట్ర మహారాజుకు మా మీద ఉన్న దయచేత మేము ఇట్లా సుఖంగా ఉన్నాము. నిన్ను ఇక్కడకు పంపి చూపిన వాత్సల్యంచేత నా మనస్సు సంతోషించింది.

విశేషం: 1. ధర్మరాజు 'మెత్తని పులి' అనిపించే పద్యాలలో ఇది ఆణిముత్యం. ఈ పద్యంలో కాకువు నాశ్రయించి వ్యతిరేక వ్యంగ్యార్థం స్ఫురిస్తుంది. ఆ అర్థాన్ని ఇట్లా భావించవచ్చును. ఆ రాజుకు మా పట్ల ఉన్న దయ వలన ఇట్లా సుఖంగా ఉన్నాం - అన్నప్పుడు దయ-దయకాదు, కాపట్యం వలన అని అర్థం. ఇట్లు-అంటే ఈ విధంగా రాజ్యహీనులమై అని భావం; సుఖంగా - అంటే దుఃఖంగా అనీ, ఉన్నారమంటే-ఏదో ఇట్లా బ్రతుకు ఈడుస్తున్నాం అని భావం. తెలుగువారి వ్యవహారంలో దయ, ఇట్లు, సుఖంగా, ఉన్నాం - అనే మాటలు వ్యతిరేకార్థక ధ్వనికి వాడటం సర్వసామాన్యం. గౌరవవాక్యాలుగా పలికి, కాకువుతో అధిక్షేపంగా మార్చి, దెప్పిపొడుపు మాటలుగా వెలువరించిన ఈ పద్యం సంజయవాక్య రచనాశిల్పానికి ప్రతిస్పర్ధి శిల్పం. సంజయుడి వాక్యం ప్రౌఢం; ధర్మజుడి వాక్యం ప్రౌఢతరం. ఈ పద్యాన్ని తెలుగువారు లోకోక్తిగా వాడుకొంటారు.

2. 'నినుఁ బుత్తెంచిన గారవమున నాదుమది వికాసముఁ బొందెన్' - ఇది పైకి నిండుగా కనిపించే ప్రశంసావాక్యం. కాని దాని వెనుక ధర్మజుడి నిష్ఠురత్వం కూడా వ్యంగ్యంగా ధ్వనిస్తుంది. ద్రుపదపురోహిత రాయబారం విఫలమైన తరువాత, సంధి పొసగదని నిరాశ చెందుతున్న సమయంలో మాతండ్రి మిమ్ములను గౌరవంగా నా వద్దకు పంపటం వలన మనస్సు వికసించిందని ప్రకృతార్థం. ఎన్నో విషయాలు తెలిసి మనస్సు మరింత వివేకవంతమైనదని రెండో అర్థం. న్యాయమైన రాజ్యభాగాన్ని ఇవ్వకుండా, కర్ర విరుగకుండా, పాము చావకుండా ఎన్ని ఎత్తులు వేయవచ్చునో తెలిసికొని ధర్మజుడి బుద్ధి వికాసం పొందిందని గూఢార్థం. మూలంలోని ధర్మరాజువలె - 'చిర దిదం కుశలం భారతస్య । శ్రుత్వా రాజ్ఞః కురువృద్ధస్య సూత । మన్యే సాక్షా ద్దృష్ట మహం నరేంద్రం దృష్ట్వైత్వాం సంజయ ప్రీతి యోగాత్'' (సం. 5.23 .7) అనిఅనడు. సంజయుడు

రావటం సాక్షాత్తు ధృతరాష్ట్రుడు వచ్చినట్లే ఉన్నదనటం అతడి వినయసూచకం. తెలుగులో ధర్మరాజు అంత బయటపడేవాడు కాడు. (సంపా.)

3. ఆ రాజు - అని అనటం - సంజయుడు 273 పద్యంలో 'మీ తండ్రి ధృతరాష్ట్ర ధరణి నాథుఁడు' అని అన్నందుకు తిరిగి వడ్డింపు. తండ్రిగా కాక రాజుగా నిన్ను రాయబారిగా పంపాడు. ధృతరాష్ట్రుడికి మా పట్ల రాజ్యతంత్రమే కాని స్నేహతంత్రం లేదని అధిక్షేపం. ఇట్లు - అనేది అభినయ స్ఫోరక వాచకం. (సంపా.)

4. ధృతరాష్ట్రుడికి ధర్మరాజాదులపై ఏ మాత్రం వాత్సల్యం ఉందో అందరికీ తెలుసు. కాని, ధర్మరాజు ఇట్లా మాటలాడడంలో వ్యతిరేక లక్షణం గోచరిస్తుంది. 'సుఖంబున నిట్లున్నారము' అనడం కూడా అట్లాంటిదే.

క. అమ్మనుజేశ్వరునకు సే । మమ్మే? పుత్త్రకులు సుఖులె? మనుమలు సమ్మో
దమ్మునఁ బెరిఁగెదరే? నగ । రమ్ముల భూములను శుభపరంపర గలదే ? 277

ప్రతిపదార్థం: ఆ+మనుజ+ఈశ్వరునకున్= ఆ రాజుకు - ధృతరాష్ట్రుడికి; సేమమ్మే?= కుశలమా?; పుత్త్రకులు= కొడుకులు; దుర్యోధనాదులు; సుఖులె?= సుఖంగా ఉన్నారా?; మనుమలు; సమ్మోదమ్మునన్= సంతోషంతో; పెరిఁగెదరే?= పెరుగుతున్నారా? నగరమ్ములన్= పట్టణాలలోనూ; భూములను= జనపదాలలోనూ, పంటనేలలోనూ; శుభ పరంపర= మేళ్ళ వరుస, కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: రాజైన ధృతరాష్ట్రుడికి క్షేమమా? అతడి కొడుకులు దుర్యోధనాదులు కుశలురా? మనుమలు సంతోషంతో పెరుగుతున్నారా? పట్టణాలలోనూ జనపదాలలోనూ శుభపరంపర ఉన్నదా?

విశేషం: ధర్మరాజు క్షేమసమాచారము లడిగేటప్పుడు కూడా క్రమంతప్పడు. రాజునూ, రాజుకుటుంబాన్నీ మొదట ప్రస్తావించాడు. ఆ తరువాత ప్రజా కుటుంబాన్ని గురించి ప్రశ్నించాడు. ప్రజలను నాగరకులూ, జానపదులూ అని వింగడించాడు. వారి వారి నివాసస్థలాలైన నగరాలనూ, పంటభూములుగల జనపదాలనూ పరామర్శించాడు. అడిగే ప్రశ్నలలో క్రియాపదాలు కూడా సార్థకాలే. రాజు క్షేమమా? పుత్రులు సుఖులా? మనుమలు సంతోషంతో ఉన్నారా? ఈ మూడు పలకరింపులలో వారి వారి మనస్తత్త్వాలు ధ్వనిస్తున్నాయి.(సంపా.)

సీ. ద్రోణుండుఁ, గృపుఁడును, ద్రోణసుతుండును । సుఖమున్నవారె? సుశ్లోకుఁడైన
భీష్ముడు కుశలియే? పెద్దతనం బిచ్చి । యాతనిఁ గౌరవు లనుసరించి
మెలఁగుదురే? బ్రాహ్మణులకు మన్నన గల్గి । యుండునే? యే మర్థి నొసఁగి నట్టి
వృత్తులు సెల్లునే? యొత్తొరు వొందుల । వలనఁ బుట్టదుగదా? కలఁకు లందుఁ

తే. బుట్టినప్పడు గాండీవి భుజబలంబుఁ । దలఁతురే? భీమసేను గదా విహార
ముగ్గడింతురె? కవలు మహోగ్రరిపుల । భూము లంతంత కొత్తుట పొగడఁబడునె? 278

ప్రతిపదార్థం: ద్రోణుండున్; కృపుఁడును; ద్రోణ సుతుండును= అశ్వత్థామా; సుఖము+ఉన్నవారె?= సుఖంగా ఉన్నారా?; సుశ్లోకుఁడు+ఐన= కొనియాడబడే; భీష్ముండు; కుశలియే= క్షేమంగా ఉన్నాడా?; కౌరవులు; అతనిన్; పెద్ద తనంబు+ఇచ్చి= పెద్దరికం ఉంచి; అనుసరించి మెలఁగుదురే?= అనువర్తిస్తారా?; బ్రాహ్మణులకున్; మన్నన= ఆదరం; కల్గి+ఉండునే; మేము=

మేము; అర్థిన్= కోరికతో; ఒసఁగిన+అట్టి= ఇచ్చినటువంటి; వృత్తులు= జీవనోపాధులు; చెల్లనే?= కొనసాగుతున్నాయా? ఒత్తొరువు= సంపీడనము- బాధ; ఒండులవలనన్= ఇతరులనుండి; పుట్టదు+కదా?= కలుగదు కదా?; అందున్= అక్కడ; కలఁకులు= కలతలు; పుట్టిన+అప్పుడు= ఏర్పడినప్పుడు; గాండీవి భుజ బలంబు= అర్జునుడి బాహు పరాక్రమం; తలఁతురే?; భీమసేను గదా విహారము= భీముడి గదాయుధ క్రీడ; ఉగ్గడింతురె?= ప్రశంసిస్తారా?; కవలు= నకుల సహదేవులు; మహత్ (మహా)+ఉగ్ర రిపుల= మిక్కిలి భయంకరులైన శత్రువులను; భూముల+అంతంతకు= రాజ్యంలోని ప్రదేశాల చివరలకు; ఒత్తుట= తరిమివేయటం; పొగడన్+పడునె?= కీర్తించబడుతుందా?

తాత్పర్యం: ద్రోణుడూ, కృపుడూ, అశ్వత్థామా సుఖంగా ఉన్నారా? సుప్రసిద్ధుడైన భీష్ముడికి క్షేమమా? కౌరవులు అతడికి పెద్దరికం ఇచ్చి అనువర్తిస్తూఉంటారా? బ్రాహ్మణులకు ఆదరం ఉన్నదా? మేము కోరి వారి కిచ్చిన జీవనోపాధులు కొనసాగుతున్నాయా? ఇతరులనుండి ఏ బాధా పుట్టదు గదా? అక్కడ కలతలు పుట్టినప్పుడు వారు గాండీవి బాహుపరాక్రమం తలచుకొంటారా? భీముడి గదాయుధ క్రీడ ప్రశంసిస్తారా? నకుల సహదేవులు భయంకరులైన శత్రువుల భూములను క్రమక్రమంగా ఆక్రమించటం స్తుతించబడుతున్నదా?

విశేషం: కౌరవులు భీష్ముడి పెద్దరికం పరిగణించరనీ, తాము బ్రాహ్మణుల కిచ్చిన అగ్రహారాదికాలను వారు కొనసాగించరనీ, తన తమ్ముల పరాక్రమాన్ని వారు తలపెట్టుతూ ఉంటారనీ ధర్మరాజు విశ్వాసం. అందులోనుండి పుట్టిన ఈ ప్రశ్నలు వ్యంగ్యార్థ బంధురాలు.

మ. ఒకనాఁడా తమ ముందటం బలుమఱున్ హోరాటమై నేల యొ
త్తి కొనంగా బవరంబులన్ గెలువఁగాఁ దెల్లఁబుగాఁ జూచి పాం
డు కుమారాళి నుతింపకుండుదురె? యాటోపంబునన్ ఘోషయా
త్రకు గంధర్వులు వచ్చినప్పటి చరిత్రం బాత్మలం బాయునే? 279

ప్రతిపదార్థం: ఒకనాఁడా?= ఒక్కనాడుకాదు; తమముందటన్= తమ ఎదుట; పలుమఱున్= ఎన్నోసార్లు; హోరాటమైన్= ఆటో పంతో; నేల+ఒత్తికొనంగాన్= నేల ఒత్తుకొనేటట్లు; బవరంబులన్= యుద్ధాలలో; గెలువఁగాన్; తెల్లంబుగాన్+చూచి= కళ్ళారా చూచి; పాండు కుమార+ఆళిన్= పాండవుల సమూహాన్ని; నుతింపక+ఉండుదురె?= పొగడకుండా ఉంటారా?; గంధర్వులు; ఆటోపంబునన్= గర్వంతో పెద్దపెట్టున; ఘోష యాత్రకున్; వచ్చిన+అప్పటి చరిత్రంబు= వచ్చిన నాటి వృత్తాంతం; ఆత్మలన్+ పాయునే?= మనస్సుల నుండి పోతుందా? మరచిపోతారా?

తాత్పర్యం: ఒకనాడా! తమ ఎదుట ఎన్నోమార్లు ఆటోపంతో నేల క్రుంగిపోయే విధంగా యుద్ధాలు గెలవటం కళ్ళారా చూచి కౌరవులు పాండవులను ప్రశంసించకుండా ఉంటారా? గంధర్వులు పెద్దపెట్టున ఘోషయాత్రకు వచ్చిన ఆనాటి వృత్తాంతం మరచిపోతారా?

విశేషం: అరణ్య వాసకాలంలో పాండవులు ద్వైతవనంలో ఉండగా దుర్యోధనుడు వారిని చిన్నపుచ్చటానికి ఘోష యాత్ర నెపంతో సపరివారంతో వచ్చి చిత్రరథుడనే గంధర్వుడిచేత చావుదెబ్బలు తిని భీమార్జునులచేత రక్షించబడ్డ వృత్తాంతం ఇక్కడ స్మరించాలి. ఆ వృత్తాంతాన్నీ, పూర్వ విజయాలనూ హస్తినాపురంలో మరచిపోకుండా స్మరిస్తున్నారా?- అని ప్రశ్నించి ధర్మరాజు తాము కౌరవులకు చేసిన మేలును, తమ పరాక్రమ విశేషాలనూ గుర్తు చేసి గడుసుదనం ప్రకటించాడు.

క. వినుము మనము మధ్యస్థుల; । మని నర్జును నెదిరి, సంజయా! యిటము న్నె
వ్వనికిని మానముఁ బ్రాణం । బును దగఁ దక్కించుకొనఁగఁ బోలెనె చెపుమా! 280

ప్రతిపదార్థం: సంజయా!; వినుము, మనము; మధ్యస్థులము= మధ్యవర్తులం; అనిన్= యుద్ధంలో; అర్జునున్; ఎదిరి= ఎదుర్కొని; ఇటమున్ను= ఇంతకుముందు; ఎవ్వనికిని= ఎవడికైనా; మానమున్= గౌరవం; ప్రాణంబును= ప్రాణమూ; తగన్= చక్కగా; దక్కించు కొనఁగన్+పోలెనె= నిలుపుకొనటం సాధ్యపడిందా? చెపుమా.

తాత్పర్యం: సంజయా! వినుము. మనం మధ్యవర్తులం. యుద్ధంలో అర్జునుడిని మార్కొని ఇంతకుముందు ఎవరికైనా మానప్రాణాలు రక్షించుకొనగలగటం సాధ్యపడిందా? నీవే చెప్పుము.

విశేషం: మనము మధ్యస్థులం అనటంలో అర్జునుడు నా తమ్ముడు గదా అని పక్షపాతంతో మాటాడటం లేదని ధర్మరాజు సూచన. కౌరవులందరూ యుద్ధంలో అర్జునుడికి ఓడి మానప్రాణాలను దక్కించుకొన్నవారే. అందువలన పాండవులపట్ల కృతజ్ఞులై ఉండాలి. అట్లా ఉంటున్నారా? అని వ్యంగ్యంగా అడిగాడు ధర్మరాజు.

క. దుర్యోధను నింటం దగు । కార్యమునకు ఖడ్గమునకుఁ గలవాఁడై చా
తుర్యంబు మెఱయు కర్ణుని । యార్యత్వము సెల్లుచున్న యదియే నెమ్మిన్?' 281

ప్రతిపదార్థం: దుర్యోధను+ఇంటన్= దుర్యోధనుడి ఇంటియందు; తగు= ఒప్పే; కార్యమునకున్, ఖడ్గమునకున్= పేచీ పూచీలకు; కలవాఁడు+ఐ= ఉన్నవాడయి; చాతుర్యంబు మెఱయు= నేర్పు ప్రకటించే; కర్ణుని+ఆర్యత్వము= కర్ణుడి పెద్దరికం; నెమ్మిన్= బాగా; చెల్లుచున్+ఉన్న+అది+ఏ?= కొనసాగుతున్నదా?

తాత్పర్యం: దుర్యోధనుడి ఇంట్లో వచ్చే పేచీ పూచీలకు నే నున్నానంటూ నేర్పు ప్రకటించే కర్ణుడి పెత్తనం బాగా సాగుతున్నదా?

విశేషం: తెలుగుజాతీయం ఉట్టిపడే ఈ కర్ణుడినిగూర్చిన పలకరింపు ధర్మరాజు హృదయంలో ఉన్న గూఢామర్షాన్ని ధ్వనింపచేస్తున్నది. దుర్యోధనుడి ఇంట్లో - అన్నప్పుడు అది ఇల్లు మాత్రమే కాదు, దుర్యోధనుడి ఆంతరంగిక విషయాలలో కూడా అని భావం. కార్యానికీ ఖడ్గానికీ- తెలుగు జాతీయం. కార్యమంటే ఆలోచన; ఖడ్గమంటే యుద్ధం. దుర్యోధనుడి ఆలోచనలన్నీ కర్ణుడివే. కర్ణు డెప్పుడూ సమస్యలకన్నింటికీ యుద్ధమే పరిష్కారంగా భావిస్తాడు. దుర్యోధనుడు యుద్ధోన్ముఖుడు కావటానికి కర్ణుడి ప్రోత్సాహం ఒకవైపు. అతడి పరాక్రమం మీద దుర్యోధనుడికి ఉన్న విశ్వాసం మరొకవైపు కారణాలు కావటం కాదనలేని వాస్తవం. చాతుర్యం మెరసేటట్లు కర్ణుడి ఆర్యత్వం చెల్లుతున్నదా?- అన్నవాక్యం అధిక్షేపాత్మకం. కర్ణుడి చాతుర్యం దుర్యోధనుడిని మెప్పించటం కొరకు పడేపాట్లను సూచిస్తున్నది. ఆర్యత్వం వ్యతిరేకవ్యంగ్యం వలన అతడి దౌష్ట్యాన్ని ధ్వనింపచేస్తున్నది. ధర్మరాజు యోగక్షేమా లడిగిన వారందరూ హస్తినాపురంలో రాజనీతి నిర్ణయాలను తీసికొనటంలో ఏదో ఒక విధంగా పాలు పంచుకొనేవారే కావటం విశేషం. విదురాదుల ప్రసక్తి ధర్మరాజు తేలేదు. ఆయన మాట ఎవరూ పట్టించుకోరు కాబట్టి. కౌరవ నిర్ణయాలలో పాలు పంచుకొనే వారందరూ క్షేమమేకదా? వారి క్షేమానికి మూలకారణం అర్జునుడి వలన మానప్రాణాలు దక్కటమే కదా? ఈ సంగతి గుర్తుంచుకొనటమే క్షేమం-అని గడుసుగా హెచ్చరించటం ఈ మాటలోని ధ్వని. చిట్టచివరకు కర్ణుడిని గురించి అడగటంలో కూడా విశేషం ఉన్నది. అందరూ ఒక ఎత్తు. అత డొక్కడూ ఒక ఎత్తు. అందరూ క్షేమంగా ఉండటం అతడి ఆలోచన మీదా, అతడి యుద్ధప్రీతిమీదా, అతడి ఆర్యత్వం మీదా ఆధారపడి ఉన్నదని

హెచ్చరిక. 'కర్ణుడు లేనిది భారతం లే' దనే సామెత అందుకే పుట్టింది. ధర్మరాజు అడిగిన కుశల ప్రశ్నలు కౌరవులపై అతడి మనసులో ఉన్న రహస్యమైన క్రోధాగ్నిని ప్రకటించే వాఙ్మయ వ్యంగ్యాస్త్రాలు. (సంపా.)

వ. అనిన విని సంజయుండు సవినయంబుగా నిట్లనుఁ 'గురురాజునొద్ద నవినీతులు, నీతిమంతులు, సత్త్వసంపన్నులు, దురహంకారులు, మఱియు వివిధ ప్రకారులు నయి బెరసి యుండుదురు; వా రొకళ్ళొకళ్ళ మాటలం బోయెడువారు గారు; కావున వారి నంత యనం బనిలేదు; నా విన్నపంబు చిత్తగింపుము. 282

ప్రతిపదార్థం: అనినన్; విని; సంజయుండు; సవినయంబుగాన్= అడకువతో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; కురురాజు+ ఒద్దన్= దుర్యోధనుడి దగ్గర; అవినీతులున్= అవినయపరులూ; నీతిమంతులున్= నీతి యుక్తులూ; సత్త్వ సంపన్నులున్= సాత్త్వికులూ; దురహంకారులున్= దురభిమానులూ; మఱియున్= ఇంకా; వివిధ ప్రకారులున్= రకరకాల వాళ్ళు; అయి; బెరసి+ఉండుదురు= చేరి ఉంటారు; వారు; ఒకళ్ళు+ఒకళ్ళ మాటలన్+పోయెడువారు+కారు= ఒకరి మాట ఇంకొకరు వినిపించుకొనరు; కావునన్; వారిన్; అంత+అనన్+పని లేదు= అంతగా ప్రస్తావించ నక్కర లేదు; నా విన్నపంబు= నా మనవి; చిత్తగింపుము= శ్రద్ధగా వినుము.

తాత్పర్యం: అనగా విని సంజయుడు అణకువతో ఇట్లా అన్నాడు- 'దుర్యోధనుడి దగ్గర అవినయపరులూ, నీతిమంతులూ, సత్త్వగుణసంపన్నులూ, దురభిమానులూ - ఇంకా ఎన్నో రకాలవాళ్ళు చేరి ఉంటారు. వారు ఒకరిమాట ఇంకొకరు వినిపించుకొనరు. కాబట్టి వారిని గూర్చి ప్రస్తావించటం అనవసరం. నా మనవి శ్రద్ధగా ఆలకించుము.

విశేషం: 1. ధర్మరాజు కుశలప్రశ్నలు దాడి చేస్తున్నట్లున్నాయి. అందువలన సంజయుడు సవినయంగా సమాధానం చెప్పాడు. సముద్ర తరంగం పెల్లుబికి వస్తున్నప్పుడు తలవంచటమే నీతి. అందులోనూ రాయబారి వినయంగా వంగి ధర్మరాజు అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్లు పలికితే అతడిలోని ఉడుకు తగ్గుతుంది. అందుకే ధృతరాష్ట్రుడి కొలువులోని వారిలో అనేక విధాల వారున్నారనీ, వారందరూ ఒకరిమాట మరొకరు వినరనీ, వారిలో ఏకవాక్యత లేదనీ ఒప్పుకొన్నాడు. క్రమంగా ధృతరాష్ట్రుడి పుత్రాదులు అవినీతులనీ, ద్రోణభీష్మాదులు నీతిమంతులనీ, సత్త్వసంపన్నులనీ, కర్ణాదులు దురహంకారులనీ పేర్కొన్నట్లు స్పష్టం. అయితే వారిని గురించి పట్టించుకొనవలసిన అవసరం లేదనీ, ఈ ప్రస్తుతాంశం వారందరికీ సంబంధించినది కాదనీ సూచించాడు. తన విన్నపాన్ని వినుమని కోరాడు. (సంపా.)

2. సంజయుడు ఉన్న పరిస్థితి చెప్పి, తాను వచ్చిన అసలు విషయానికి వస్తున్నాడు.

క. పొందొందఁగఁ దలఁచితి నీ । విందు శిశిరమైన విమల హృదయంబున; వా
రందఱకును సేమం; బిట । ముందఱ లేకున్న, నేఁడు మొదలుగఁ గలుగున్. 283

ప్రతిపదార్థం: నీవు; ఇందు= ఇప్పుడు, ఇక్కడ; శిశిరము+ఐన విమల హృదయంబునన్= చంద్రుడివలె చల్లనైన నిర్మల హృదయంతో; పొందు+ఒందఁగన్+తలఁచితి(వి)= సంధి చేసికొనాలని అభిప్రాయ పడుతున్నావు; వారు+అందఱకును= వారి కందరికీ; సేమంబు= క్షేమమే (సేమంబు=క్షేమం); ఇట ముందఱన్= ఇంతకు ముందు; లేక+ఉన్నన్= లేకపోయినా; నేఁడు మొదలుగన్= ఈ వేళ మొదలుకొని; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: నీవు చంద్రుడి వలె చల్లనైన నిర్మల హృదయంతో సంధి చేసికొనదలచావు. వారి కందరికీ క్షేమం ఇంతకుముందు లేకపోయినా, ఈ వేళ మొదలుకొని కలుగుతుంది.

విశేషం: ధర్మరాజు సంధి కోరుతూండటం వలన దుర్యోధనాదులు ఇంకా క్షేమంగా ఉంటారు. యుద్ధమే వస్తే వాళ్ళకు నాశనం తప్పదు. ధర్మరాజును సుముఖుడిగా చేసికొనటానికి సంజయుడు ముందుగా అతడిని పొగడుతున్నాడు.

క. ధృతరాష్ట్ర భూపతికి వృ । ద్ధత కతమునఁ జిత్త మొక విధము గామి సుతో
ద్ధతి మాన్పఁడ నాఁడు; మనః । క్షతి పిదపం బుట్టి యిపుడు శాంతుం డయ్యెన్. 284

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర భూపతికిన్= ధృతరాష్ట్ర మహారాజుకు; వృద్ధతకతమునన్= ముసలితనం కారణంగా; చిత్తము= మనస్సు; ఒక విధము+కామిన్= ఒకే విధంగా లేకపోవటం చేత; నాఁడు= ఆ వేళ; సుత+ఉద్ధతి= కొడుకుల ఔద్ధత్యం; మాన్పఁడు+అ= మాన్పనే లేదు; పిదపన్= తరువాత; మనస్(ః)+క్షతి= మనస్తాపం; పుట్టి= కలిగి; ఇపుడు= ప్రస్తుతం; శాంతుండు+ అయ్యెన్= శాంతం కలవా డయ్యాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజుకు ముదిమివలన మనస్సు ఒకరీతిగా ఉండకపోవటం చేత అప్పుడు కొడుకుల ఔద్ధత్యం మాన్పనే లేకపోయాడు. తరువాత మనస్తాపం కలిగి ఇప్పుడు శాంతుడయినాడు.

విశేషం: దుర్యోధనుడు దుష్కార్యాలు చేయకుండా ధృతరాష్ట్రుడు వారించలేడా? అని ధర్మరాజు అడుగుతాడేమో అని, అతడి 'వృద్ధత' యే అందుకు కారణం అని సంజయుడు అన్నాడు. పశ్చాత్తాపం కలిగి ఇప్పుడు శాంతుడవటం వలననే, సంధికొరకు తనను రాయబారిగా పంపించాడని సంజయుడి మాట.

తే. ఇట్టి చందంబు లెల్లను నీవు పుణ్య । చిత్తవృత్తిమై సైఁచినఁ జెల్లివచ్చు;
నీ యజాతశత్రుత్వంబు నిఖిల లోక । విశ్రుతము గాదె, ధర్మప్రవీణహృదయ! 285

ప్రతిపదార్థం: ధర్మ ప్రవీణ హృదయ!= ధర్మంలో నేర్పుగల హృదయం గలవాడా! ధర్మరాజా!; ఇట్టి చందంబులు+ఎల్లనున్= ఇటువంటి రీతులన్నీ; ఈవు= నీవు; పుణ్య చిత్తవృత్తిమైన్= ధర్మ సహితమైన మనోవ్యాపారంతో-దయా హృదయంతో; సైఁచినన్= సహించినట్లయితే; చెల్లివచ్చున్= సమసిపోతాయి; నీ+అజాత శత్రుత్వంబు= శత్రువులు పుట్టనివాడు అనబడే నీగుణం- నీ అజాత శత్రుబిరుదం; నిఖిల లోక విశ్రుతము+కాదె!= అన్ని లోకాలకూ తెలిసిందికాదా?

తాత్పర్యం: ధర్మబద్ధమైన హృదయం కల ధర్మరాజా! ఇటువంటి దుర్మార్గాలన్నీ నీవు కరుణా మనస్కుడవై సహిస్తే చెల్లుబాటు అవుతాయి. నీ అజాతశత్రుత్వం అన్ని లోకాలకు తెలిసిందే కదా!

విశేషం: ధర్మరాజు ధర్మప్రవీణహృదయుడట. అతడు కరుణాహృదయంతో కౌరవుల అన్యాయాలను సహించి తన అజాత శత్రు బిరుదం సార్థకం చేసికొనాలట. ఎంతసేపూ సంజయుడి నోట ఇదే మాట. అజాతశత్రువంటే - పుట్టని శత్రువులు కలవాడని అర్థం. ధర్మరాజుకు దుర్యోధనాదులు శత్రువులు. మరి ఆ బిరుదం ఎట్లా సార్థకమవుతుంది? శత్రువులందు కూడా శత్రుత్వం భావించకపోతే ధర్మరాజు అజాతశత్రుడౌతాడు. అటువంటి ధర్మజుడి ప్రవృత్తి పుణ్యచిత్తవృత్తివలన, ధర్మప్రవీణమైన హృదయం వలన కలిగినట్లు సంజయుడు కీర్తించాడు. ధృతరాష్ట్రుడు లక్షించిన ప్రయోజనాలలో ముఖ్యమైనది- 'కయ్యమను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తలఁపు లోనుగ నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగుగన్' చేయటం. దాని కనుగుణంగా సంజయుడు ఈ మాటలన్నాడు. (సంపా.)

చ. జగముల నెల్లెడన్ దురిత సంతమసంబు జయింపఁ గోరి పా
ల్పుగఁ బరమేష్ఠి నిల్పిన వెలుంగు మహీసురు; లట్టి వారికిం
దగవు ఘటింప సత్పురుష దత్తములై చను జీవనంబు లెం
త గుమతులైన మార్తురె? పదంపడి యాయువు శ్రీయు నొల్లరే? 286

ప్రతిపదార్థం: మహీసురులు= బ్రాహ్మణులు; జగములన్+ఎల్ల+ఎడన్= లోకాలయందు అంతటా; దురిత సంతమసంబున్= పాప మనే అంధకారాన్ని; జయింపన్+కోరి= పారద్రోలగోరి; పరమేష్ఠి= బ్రహ్మ; పాల్పుగన్= ఒప్పుగా, నిల్పిన= నిలువబెట్టిన; వెలుంగు= ప్రకాశం; అట్టి వారికిన్= అటువంటి బ్రాహ్మణులకు; తగవు= న్యాయం; ఘటింపన్= కలగజేయడానికి; సత్+పురుష దత్తములు+ఐ= సుజనులచేత ఈయబడిన వయి; చను= ఒప్పునట్టి; జీవనంబులు= బ్రతుకు తెరువులు-వృత్తులు; ఎంత+కుమతులు+ఐనన్= ఎంతటి దుర్బుద్ధులయినా; మార్తురె?= నశింప జేస్తారా?; పదంపడి= తరువాత; ఆయువున్, శ్రీయున్= ఆయుస్సునూ, సంపదనూ; ఒల్లరే?= కోరరా?

తాత్పర్యం: బ్రాహ్మణులంటే - లోకాలలో అంతటా పాపాంధకారాన్ని పారద్రోలటానికని బ్రహ్మ చక్కగా నిలిపిన వెలుగే. అటువంటి వారికి సత్పురుషులు కల్పించిన జీవనోపాధులను ఎంతటి దుర్బుద్ధులయినా నశింపజేస్తారా? తరువాత ఆయుర్భాగ్యాలను కోరరా? (అట్లా లాక్కుంటే, వారు బ్రతుకరనీ, బ్రతికినా నిర్భాగ్యులవుతారనీ భావం.)

విశేషం: అలం: రూపకం. ధర్మరాజు అడిగిన ప్రశ్నల కన్నింటికీ ఒక్కొక్క దానికే సమాధానం చెప్పుకొంటూ వస్తున్నాడు సంజయుడు. 'ఏ మర్థి నొసఁగినట్టి వృత్తులు సెల్లునే?' అన్న ధర్మరాజు ప్రశ్నకు సమాధాన మిది. కౌరవులు నీవన్నట్లు దుర్మతులే కావచ్చును. కాని, బ్రాహ్మణులకు సత్పురుషు లిచ్చిన వృత్తులను అపహరించేటంత దుర్మార్గులు కారని సంజయుడి సమాధానం. దురిత - సంతమసంబు, వెలుంగు మహీసురులు - అనే చోట్ల ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం, ఈ పద్యంలోని అలంకారపు సొగసంతా అమూలకం.

ఉ. ఒక్కొకచోఁ గడంగి ప్రతియోధులు మార్కొనునప్పు డాత్మలన్
నెక్కొని మోములం బొడము నెవ్వగతోడ జనంబు లిట్టి యం
దక్కట! భీముఁ డైన, మన యర్జునుఁ డైనను, మాద్రి పుత్త్రులం
దొక్కరుఁడైన నీ పగఱ నుక్కడఁగింపరె యొక్క వ్రేల్మిడిన్? 287

ప్రతిపదార్థం: ఒక్కొక చోన్= ఒక్కొక్కప్పుడు; కడంగి= పూని; ప్రతియోధులు= శత్రువీరులు; మార్కొను+అప్పుడు= ఎదుర్కొన్నప్పుడు; జనంబులు= జనులు; ఆత్మలన్= మనస్సులందు; నెక్కొని= అతిశయించి; మోములన్= ముఖాలలో; పొడము= కనబడే; నెవ్వగ (నెఱ+వగ) తోడన్= అధిక దుఃఖంతో; అక్కట!= అయ్యో!; ఇట్టి+అందున్= ఇటు వంటి సందర్భాలలో; భీముఁడు+ఐనన్= భీముడయినా; మన+అర్జునుఁడు+ఐనను; మాద్రి పుత్త్రులందున్+ఒక్కరుఁడు+ఐనన్= మాద్రి కొడుకులైన నకుల సహదేవులలో ఏ ఒక్క డయినా; ఈ పగఱన్= ఈ శత్రువులను; ఒక్క వ్రేల్మిడిన్= ఒక్క చిటికలో; ఉక్కు+అడఁగింపరె?= మట్టుపెట్టరా?

తాత్పర్యం: ఒక్కొక్కప్పుడు పూని శత్రువీరులు ఎదుర్కొనినప్పుడు జనులు మనస్సులలో నిండి ముఖాలలో కనవచ్చే అమిత దుఃఖంతో 'అయ్యో! ఇటువంటప్పుడు భీముడయినా, మన అర్జునుడయినా, మాద్రి కొడుకులైన నకుల సహదేవులలో ఏ ఒక్కడైనా ఉంటే ఈ శత్రువులను ఒక్క చిటికలో రూపుమాపరా?- (తరువాతి పద్యంలోని 'అంద్రు' అనే క్రియతో అన్వయం.)

విశేషం: ఇది 'కలఁకులందుఁ బుట్టినప్పుడు గాండీవి భుజబలంబుఁ దలఁతురా? భీమసేను గదా విహార ముగ్గడింతురె? కవలు మహోగ్రరిపుల భూము లంతంత కొత్తుట పొగడఁబడునె?' అన్న ధర్మరాజు ప్రశ్నకు సమాధానం.

క. **వారొక యాగ్రహవృత్తిం । గూరి యధర్మంబు సేఁతకుం జాలరు; దు**
ర్వారబలు లయ్యుఁ బాండుకు । మారులు శాంతాత్ము' లంద్రు మనుజాధీశా ! **288**

ప్రతిపదార్థం: మనుజ+అధి+ఈశా!= రాజా!- ధర్మరాజా!; వారు= పాండవులు; ఒక ఆగ్రహ వృత్తిన్+కూరి= ఒక(తీవ్రమైన) కోప వ్యాపారాన్ని పొందినప్పటికీ; అధర్మంబు+చేఁతకున్+చాలరు= అధర్మం చేయటానికి ఓర్వరు; పాండు కుమారులు= పాండవులు; దుర్వార బలులు+అయ్యున్= వారించరాని పరాక్రమం కలవారయినా; శాంత+ఆత్ములు= శాంత స్వభావులు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: ధర్మరాజా! 'పాండవులకు మిక్కిలి కోపం వచ్చినా, అధర్మం చేయజాలరు. వారు అనివార్య పరాక్రమ వంతులయినా శాంతస్వభావు' లని ప్రజ లంటారు.

విశేషం: ప్రజలు మా పరాక్రమ విశేషాలను స్మరిస్తుంటారా? అని ధర్మరాజు అడిగాడు (పద్యం 278). దానికి సమాధానంగా పాండవుల శాంత స్వభావాన్ని ఈ విధంగా సంజయుడు మెచ్చుకొనటం వాళ్ళను తనకు ఉన్ముఖులనుగా చేసికొని తాను వచ్చిన పని సఫలం చేసికొనటానికే. సంజయుడి స్వకార్య నిర్వహణ సామర్థ్యం, ధర్మజుడి హృదయంలో కోపం కంటె శాంతం చోటు చేసికొనేటట్లు మాట్లాడే నేర్పు ప్రశంసనీయం.

క. **నలువురు తమ్ములు, భవదా । ప్తులుఁ గృష్ణుఁడు వినుచునుండ భూవర! నీ కేఁ**
గొలువునను విన్నవింపం । బలుకులు గల వవధరింపు పరిపాటి మెయిన్'. **289**

ప్రతిపదార్థం: భూవర!= రాజా! ధర్మరాజా!; నలువురు తమ్ములన్, భవత్+ఆప్తులున్= నీ ఆత్మీయులూ; కృష్ణుఁడున్; వినుచున్+ఉండన్= వింటూండగా; నీకున్; ఏన్= నేను; కొలువునను= సభలో; విన్నవింపన్= మనవి చేయటానికి; పలుకులు= మాటలు; కలవు= ఉన్నాయి; పరిపాటి మెయిన్= క్రమంగా; అవధరింపు(ము)= చిత్తగించుము.

తాత్పర్యం: 'ధర్మరాజా! నీ నలుగురు తమ్ములూ, నీ ఆత్మీయులూ, కృష్ణుడూ వింటూండగా నీకు నేను సభలో మనవి చేయవలసిన మాటలున్నాయి. వాటిని ఆనుపూర్విగా (మొదటనుండి చివరిదాకా) చిత్తగించుము.

విశేషం: ధృతరాష్ట్రుడు రాయబారపు మాటలను నిండుసభలో చెప్పుమన్నాడు. అందుకే సంజయుడు ధర్మరాజును అతడి నిండుసభలో మాట్లాడటానికి అనుమతి కోరాడు. సంజయుడికి సాధించే ప్రయోజనాన్ని చెప్పాడే కాని ధృతరాష్ట్రుడు మాట్లాడే మాటల తీరును చెప్పలేదు. సంజయుడు అందుకు సమర్థుడు. నిండుకొలువులో వినిపించే సంజయుడి సందేశంలోని మనసు ధృతరాష్ట్రుడిది, మాటలు సంజయుడివి. (సంపా.)

చ. అనవుడు 'వీరె తమ్ములును, నాప్తులుఁ, గృష్ణుఁడు; వీరె తక్కుకొ
ల్వునఁ గలయట్టి సర్వజనులున్ వినుచుండెద; రయ్య నిన్ను నే
మను మని పంచెఁ జెప్పు మది యంతయు నేర్పడ' నన్న, ధర్మనం
దను గరువంపుఁ బల్కుల విధంబునకున్ మదిలోన నుల్కుచున్. 290

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; తమ్ములునున్, ఆప్తులున్, కృష్ణుఁడున్; వీరె= ఇక్కడే ఉన్నారు; కొల్వునన్+కల+అట్టి తక్కు, సర్వ జనులున్= సభలో ఉన్న మిగిలిన ఎల్ల జనులూ, వీరే; వినుచున్+ఉండెదరు= వింటుంటారు; అయ్య= తండ్రి-ధృతరాష్ట్రుడు; నిన్నున్; ఏమి+అనుము+అని పంచెన్= ఏమి చెప్పుమని చెప్పిపంపాడో; అది+అంతయున్= దానినంతటినీ; ఏర్పడన్= స్పష్టంగా; చెప్పుము; అన్నన్= అనగా; ధర్మ నందను గరువంపుఁ బల్కుల (గరువము+పల్కుల) విధంబునకున్= ధర్మరాజుయొక్క సగౌరవపు (గడుసరి) పలుకుల రీతికి; మదిలోనన్= మనస్సులో; ఉల్కుచున్= భయపడుతూ.

తాత్పర్యం: అనగానే 'తమ్ములూ, ఆత్మీయులూ, కృష్ణుడూ ఇరుగో ఇక్కడే ఉన్నారు. సభలోని మిగిలిన జనులందరూ ఇరుగో వింటూంటారు. తండ్రి ఏమి చెప్పుమని నిన్ను ఇక్కడికి పంపించాడో అదంతా స్పష్టంగా చెప్పుము'- అనగా ధర్మరాజు గడుసరి మాటల తీరుకు మనస్సులో భయపడుతూ.

విశేషం: ధర్మరాజుమాటలు 'గరువంపుఁబల్కు'లని సంజయుడు భావించాడు. గరువము - అంటే గౌరవమనీ, నైపుణ్యమని, గడుసరి తనమనీ అర్థాలున్నాయి. ఈ మూడూ ఇక్కడ సార్థకాలే. రాయబారం నడుపుతున్నది ధర్మరాజుతో. కానీ, ఆ రాయబారి మాటలు తమ్ములూ, ఆప్తులూ, కృష్ణుడూ మొదలైనవారు వినేటట్లు నిండుసభలో చెప్పుతాననటం ధర్మరాజుకు చిరాకు కలిగించేమాట. అందుకే వ్యంగ్యంగా సభలో ఉన్న తమ్ములనూ, ఆప్తులనూ, శ్రీకృష్ణుడిని చేతితో చూపిస్తూ, ప్రత్యక్షసాక్ష్యంగా మాట్లాడుతున్నట్లనిపిస్తూనే, మీ నియమాలన్నీ సమకూరాయికదా! ఇక ధృతరాష్ట్ర డేమి కబురంపాడో చెప్పుము' అని అన్నాడు. నీ మాటలు నేను వినటంకంటె, మావారందరూ వినటం ముఖ్యం కదా! అట్లాగే చెప్పుము. అని వ్యంగ్యావహేళన ధ్వనిస్తుంది - అది గడుసరితనం. (సంపా.)

ఆ. సంజయుండు కృష్ణు సద్భక్తి నీక్షించి, । పవనపుత్త్రుఁ బార్థుఁ గవల ద్రుపద
తనయు సవినయమునఁ గనుఁగొని, ప్రీతిఁ బాం । చాలు మత్స్యధరణిపాలుఁ జూచి. 291

ప్రతిపదార్థం: సంజయుండు; కృష్ణున్; సత్+భక్తిన్= మంచి భక్తితో; ఈక్షించి= చూచి; పవన పుత్త్రున్= వాయు కుమారుడైన భీముడినీ; పార్థున్= అర్జునుడినీ; కవలన్= నకుల సహదేవులనూ; ద్రుపద తనయున్= ద్రుపద పుత్త్రుడైన ధృష్టద్యుమ్నుడినీ; సవినయమునన్= అడకువతో; కనుఁగొని= చూచి; పాంచాలున్= ద్రుపదుడినీ; మత్స్య ధరణి పాలున్= మత్స్య దేశపు రాజయిన విరాటుడినీ; ప్రీతిన్= సంతోషంతో; చూచి.

తాత్పర్యం: సంజయుడు కృష్ణుడిని సద్భక్తితో చూచి, భీముడినీ, అర్జునుడినీ, నకుల సహదేవులనూ, ధృష్టద్యుమ్నుడినీ వినయపూర్వకంగా చూచి, ద్రుపదుడినీ, విరాటుడినీ ప్రీతితో చూచి, - (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: ధర్మరాజు ఎవరెవరిని ప్రత్యేకంగా పేర్కొని చూపాడో వారందరినీ విశేషంగా గౌరవించటం సంజయుడి గడుసరితనం.

వ. 'సావధానులరై వినుం' డని పలికి, యుధిష్ఠిరుదెసకు మోడ్పుఁగేలు నిగిడించి యిట్లనియె. 292

ప్రతిపదార్థం: సావధానులరు (స+అవధానులరు)+ఐ= ఏకాగ్రత కలవారయి; వినుండు= వినండి; అని, పలికి; యుధిష్ఠిరు దెసకున్= ధర్మరాజువైపు; మోడ్పుగేలు (మోడ్పు+కేలు); నిగిడించి= అంజలి ఘటించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'సావధానంగా వినండి' అని పలికి ధర్మరాజుకు అంజలి ఘటించి ఇట్లా అన్నాడు.

ఉ. 'శాంతతఁ బొంది కార్యముదెసన్ ధృతరాష్ట్ర మహీశుఁ డాత్మ న
త్యంతముఁ దేఱి, న న్నిటఁ బ్రియంబునఁ బంచెడునప్డు నాకుఁ దే
రెంతయు వేడ్కఁ దాన వెర వేర్పడఁ జెప్పుచుఁ బన్నఁ బంచె ని
ట్లింత ఘటించెఁ బొందు; మన మీ పదనం దెలివొందఁగాఁ దగున్. 293

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రమహీ+ఈశుఁడు= ధృత రాష్ట్ర మహా రాజు; శాంతతన్+పొంది; శాంతం వహించి; కార్యము దెసన్= పని విషయంలో; ఆత్మన్= మనస్సులో; అత్యంతమున్= మిక్కిలి; తేఱి= ప్రసన్నుడయి; నన్నున్; ఇటన్= ఇక్కడికి; ప్రియంబునన్= ప్రీతితో; పంచెడు+అప్డు= పంపేటప్పుడు; ఎంతయున్, వేడ్కన్= ఎంతో వేడుకతో; తాన (తాను+అ)= తానే; వెరవు= నేర్పు; ఏర్పడన్+చెప్పుచున్= స్పష్టంగా చెపుతూ; నాకున్; తేరు= రథం; పన్నన్+పంచెన్= సిద్ధం చేయ నియోగించాడు; ఇట్లు= ఈ విధంగా; పొందు= పొత్తు; ఇంత, ఘటించెన్= ఇంతగా కూర్చాడు; ఈ+పదనన్= ఈ తరుణంలో; మనము; తెలివి+ఒందఁగాన్+తగున్= జ్ఞానం కలిగి ఉండటం మంచిది.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజు శాంతం వహించి, పని విషయంలో మనస్సులో మిక్కిలి ప్రసన్నత పొంది, నన్ను ఇక్కడికి ప్రీతితో పంపేటప్పుడు ఎంతో వేడుకతో తానే నేర్పు స్పష్టంగా బోధించి, నాకు రథం సిద్ధపరచ నాజ్ఞాపించాడు. అతడు ఈ విధంగా పొత్తు కొరకు ఇంత శ్రద్ధ వహించాడు. ఈ అదనులో మనం తెలివి కలిగి వ్యవహరించటం మంచిది.

విశేషం: ధృతరాష్ట్రుడు పాండవుల దగ్గరకు తనను పంపించిన విధం సంజయుడు చాలా వివరంగా వర్ణించి చెప్పాడు. ఆ పంపిన విధానంలో ఆయన ఆప్యాయత వ్యక్తమౌతున్నది. దానికి కారణాలు వరుసగా చెప్పాడు కూడా. పాండవులు అరణ్యాజ్ఞాతవాసాలు ముగించుకొని అభ్యుదయపథంలో ఉన్నారని తెలిసికొనటం వలన ఇదివరలో ఆయన పొందిన వేదననంతా మరచి ప్రశాంత చిత్తుడైనాడు. ఆ తరువాత తన కర్తవ్యమేమిటి? అని వితర్కించుకొని కార్యశీలు డయ్యాడు. తన కర్తవ్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకొన్నాడు. అందువలన తేరిన మనస్సుతో సంతోషంగా, ప్రీతితో నన్ను మీ వద్దకు పంపాడు. కాబట్టి ధృతరాష్ట్రుడు ఇంతగా మన పొత్తుకొరకు సన్నివేశాన్ని సంఘటించాడు. ఈ సందర్భాన్ని సద్వినియోగం చేసికొనటానికి మనం తెలివితో వ్యవహరించాలి - అని సూచించాడు. పొందుకావాలని కోరుకొంటున్న ధృతరాష్ట్రుడు దానికి ఏదైనా ఉపాయాన్ని చెప్పినట్లు సంజయుడు చెప్పడు. కాని, మనం, మనం అంటూ పూసుకొని మాట్లాడుతున్నాడు. (సంపా.)

క. చులుకని కార్యము సేయం। దలఁచుట మీ యట్టి సర్వధర్మజ్ఞులు శాం
తులు ననఁ బ్రసిద్ధులగు పె। ద్దలకుం దగ వగునె యెవ్విధంబునఁ జూడన్ ? 294

ప్రతిపదార్థం: మీ+అట్టి= మీవంటి; సర్వ ధర్మజ్ఞులున్; శాంతులున్= అన్నిధర్మాలూ తెలిసినవారూ; శాంత స్వభావులూ; అనన్; ప్రసిద్ధులు+అగు పెద్దలకున్= పేరుపడ్డ పెద్దలకు; చులుకనికార్యము= తేలికపని, అగౌరవపు పని; చేయన్+తలఁచుట= చేయాలనుకొనటం; ఏ+విధంబునన్+చూడన్= ఏ విధంగా చూచినా; తగవు+అగునె?= ధర్మం అవుతుందా?

తాత్పర్యం: అన్ని ధర్మాలూ తెలిసినవారూ, శాంతస్వభావులూ అని పేరుపడ్డ మీ వంటి వారికి ఏ విధంగా చూచినా లాఘవాన్ని కలిగించే పని చేయాలనుకొనటం, ధర్మమవుతుందా?

విశేషం: చులుకని కార్యము - నీచమైన పని - అంటే ఇక్కడ యుద్ధం.

ఆ. **మడుఁగుఁ జీరయందు మసి దాఁకినట్లు మీ । సత్కులమునఁ గల్మషంబు కౌర**
వేంద్రు కతనఁ బొందె; నింతయుఁ బాపంగ । నీవ నేర్తు, కార్యనిపుణహృదయ! **295**

ప్రతిపదార్థం: కార్య నిపుణహృదయ!= కార్య నిర్వహణంలో నేర్పుగల హృదయం కలవాడా-ధర్మరాజా!; మడుఁగు+చీర+అందున్= పరిశుద్ధ వస్త్రంలో; మసి, తాఁకిన+అట్లు= నల్లనిమసి అంటుకొన్నట్లు; మీ సత్+కులమునన్= మీ మంచి వంశంలో; కౌరవ+ ఇంద్రు కతనన్= దుర్యోధనుడి మూలంగా; కల్మషంబు= మచ్చ; పొందెన్= ఏర్పడింది; ఇంతయున్= ఇదంతా; పాపంగన్= పోగొట్టటానికి; నీవు+అ= నీవే; నేర్తు(వు)= చాలుదువు, సమర్థుడవు.

తాత్పర్యం: కార్య నిర్వహణంలో నేర్పు చూపే ధర్మరాజా! పరిశుద్ధమైన వస్త్రంలో మసి అంటుకొన్నట్లు మీ సద్వంశంలో దుర్యోధనుడి మూలాన మచ్చ ఏర్పడింది. దానిని పోగొట్టటానికి నీవే సమర్థుడవు.

విశేషం: అలం: ఉపమ. మడుఁగుఁజీరయందు మసి దాఁకినట్లు --- కల్మషంబు - అలంకారం ఉపమ. దాన్ని పోగొట్టే నైపుణ్యం, నీకే ఉన్నది. ఎందుచేతనంటే నీవు 'కార్య నిపుణ హృదయుడవు.' ఈ విశేషణం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరం. సంజయుడు ఇట్లా దుర్యోధనుడిని నిందించటం కూడా ధర్మరాజును తనకు ఉన్ముఖుడిని చేసికొనటానికే, ఇది సంజయుడి మాటనేర్పునూ, కార్య నిపుణ హృదయత్వాన్నీ కూడా తెలుపుతుంది.

చ. **అఖిల జనక్షయంబయి, జయాపజయంబులు రెండునుం దుదిన్**
సుఖములు గాని యీ పనికిఁ జొత్తురె యుత్తము? లట్లుఁగాక యా
నిఖిలసుఖంబు లేమిటికి నీవని వృద్ధజనంబు బాలురన్
సఖులను బంధులన్ గురులఁ జంపితయేని దయాపయోనిధీ! **296**

ప్రతిపదార్థం: దయా పయోనిధీ!= కరుణా సముద్రుడా! ధర్మరాజా!; అఖిల జన క్షయంబు+అయి= ఎల్ల జనుల నాశనమూ అయి; జయ+అపజయంబులు రెండునున్= గెలుపూ, ఓటమీ - ఈ రెండూ; తుదిన్= చివర - పర్యవసానంలో; సుఖములు+ కాని= లాభదాయకం కాని; ఈ పనికిన్= యుద్ధానికి; ఉత్తములు= సజ్జనులు; చొత్తురె?= పూనుకొంటారా?; అట్లున్+కాక= అదీకాక; నీవు; అనిన్= యుద్ధంలో; వృద్ధజనంబున్= ముసలివాళ్ళనూ; బాలురన్= పిల్లలనూ; సఖులను= మిత్రులనూ; బంధులన్= చుట్టాలనూ; గురులన్= గురువులనూ; చంపితయేనిన్ (చంపితివి+అ+ఏనిన్)= చంపినట్లయితే; ఆ నిఖిల సుఖంబులు+ఏమిటికిన్?= ఆ ఎల్ల సుఖాలూ ఎందుకు?

తాత్పర్యం: కరుణాసముద్రా! ధర్మరాజా! రాజులందరూ నశించి, పర్యవసానంలో జయాపజయాలు రెండూ లాభదాయకం కాని ఈ పనికి సజ్జనులు పూనుకొంటారా? అదీ కాక, నీవు యుద్ధంలో వృద్ధులనూ, పిల్లలనూ, మిత్రులనూ, బంధువులనూ, గురువులనూ చంపినట్లయితే ఆ సుఖాలన్నిటివలన ప్రయోజనం ఏముంటుంది?

విశేషం: అలం: పరికరం. సర్వజననాశనం కలిగించే యుద్ధానికి నీవు పూనుకోవు. ఎందుచేతనంటే నీవు 'దయాపయోనిధివి'. ధర్మరాజు విశేషణం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరం. 'జయాపజయంబులు రెండునుం దుదిన్ సుఖములుగాని'- యుద్ధంలో ఓడినవాడు పైకి ఏడుస్తాడు. గెలిచినవాడు లోపల ఏడుస్తాడు.

ఉ. పెట్టనికోట నీకు హరి; భీముఁడు నర్జునుఁడున్ రణంబునం
దొట్టిన మంట; లా కొలఁది యోధుల సాత్యకియున్, విరాటుఁడున్;
జుట్టపు మేరు, వుగ్రరణ శోభితుఁ డీ ద్రుపదుండు; నిన్ను ని
ట్టట్టనవచ్చునే సురలకైనను? నొల్లవు గాక చివ్వకున్. 297

ప్రతిపదార్థం: నీకున్= నీకు(ధర్మరాజుకు); హరి= కృష్ణుడు; పెట్టనికోట= సహజమైన రక్ష (చుట్టూ కట్టకపోయినా కోట కట్టినట్లు రక్ష కల్పించేవాడని భావం); భీముఁడున్; అర్జునుఁడున్; రణంబునందున్= యుద్ధంలో; ఒట్టిన మంటలు= ప్రజ్వలించే మంటలు; సాత్యకియున్; విరాటుఁడున్; ఆ కొలఁది, యోధులు+అ= ఆ పాటి వీరులే; చుట్టపు మేరువు (చుట్టము+మేరువు)= బంధువులలో మేరు సమానుడు; ఈ ద్రుపదుండున్; ఉగ్ర, రణ, శోభితుఁడు= భయంకర యుద్ధంలో ప్రకాశించేవాడు; చివ్వకున్= యుద్ధానికి; ఒల్లవు+కాక= ఇష్టపడవు కాని; నిన్నున్; సురలకున్+ఐననున్= దేవతలకయినా; ఇట్టట్టనవచ్చునే(ఇట్టు+అట్టు+అనన్+వచ్చునే)?= ఇట్లా అట్లా అనడానికి శక్యమా? (కదిలించటానికి వీలుందా?)

తాత్పర్యం: నీకు శ్రీకృష్ణుడు పెట్టనికోట, భీముడూ, అర్జునుడూ యుద్ధంలో ప్రజ్వలించే మంటలు, సాత్యకీ, విరాటుడూ ఆపాటి వీరులే. మేరు సమాన బంధువయిన ఈ ద్రుపదుడు కూడ భయంకర యుద్ధంలో ప్రకాశించేవాడు. యుద్ధానికి ఇష్టపడవు గాని దేవతలకయినా నిన్ను ఇట్లా అట్లా అనడానికి శక్యమా?

విశేషం: 1. అలం: రూపకం, కావ్యార్థాపత్తి, హరిపెట్టనికోట, భీముఁడు నర్జునుఁడున్ రణంబునం దొట్టినమంటలు-అలంకారం రూపకం. నిన్ను నిట్టట్టనవచ్చునే సురలకైనను-మానవులమాట చెప్పడం ఎందుకు? - అలంకారం కావ్యార్థాపత్తి. ఒల్లవుగాక చివ్వకున్- ధర్మరాజు యుద్ధం మానాలని సంజయుడు పదే పదే అనటం గమనార్హం. 'కయ్యమను తెఱఁగు లోనుగ నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగునన్' - అనికదా ప్రభువు కోరిక.

2. తిక్కన రచనలో సంజయుడు సూక్తిసుధాకరు డయ్యాడు. పాత్రల స్వభావాలను సూత్రప్రాయంగా చెప్పటంలో సంజయుడు దిట్ట. ఈ పద్యం అందుకు ఉదాహరణం. 'హరి మీకు పెట్టని కోట' చుట్టూ రక్షకొరకు కోట కట్టకపోయినా కోటవలె యుద్ధంలో నిలబడి రక్షించే దైవశక్తి శ్రీకృష్ణుడు. భీమార్జునులు యుద్ధంలో ఒట్టిన మంటలు. శత్రువులు సమీపించటానికి శక్యంకాని దావానల సన్నిభులు; దరిచేరితే దహించే దమనమూర్తులు, తేజోధనులు అని భావం. విరాటుడు చుట్టపు మేరువు - 'మేరు పర్వతం సర్వదేవతలూ వసించే బంగారుకొండ', కోరికలు తీర్చేకొండ. విరాటు డటువంటి స్నేహమూర్తి. తెలుగు జాతీయాలతో పాత్రలకు వెలుగు, దివ్వెలవంటి సూక్తి నిర్వచనా లిచ్చిన తెలుగు వెలుగు తిక్కన. (సంపా.)

వ. మఱియు నక్కడ. 298

తాత్పర్యం: ఇంక కౌరవ పక్షంలో.

ఉ. ద్రోణుఁడు, భీష్ముఁడుం, గృపుఁడు, ద్రోణసుతుండును గర్ణశల్యులుం
బ్రాణము లా సుయోధనుని పాలివ యండ్రు; నిజానుజన్ము ల
క్షీణపరాక్రముల్, సుతు లజేయులు; బాహ్లిక సోమదత్తు లా
స్థాణునకైన నోడరు; వశంబె జయింపఁగ వారి నేరికిన్? 299

ప్రతిపదార్థం: ద్రోణుఁడున్, భీష్ముఁడున్, కృపుఁడున్; ద్రోణ సుతుండును= ద్రోణుడి కొడుకైన అశ్వత్థామా; కర్ణ, శల్యులున్= కర్ణుడూ, శల్యుడూ; ప్రాణములు= తమ జీవితాలు; ఆ+సుయోధనుని పాలివి+అ+అంద్రు= ఆ దుర్యోధనుడివే అంటారు; నిజ+అనుజన్ములు= తన తమ్ములు; అక్షీణ పరాక్రముల్= తక్కువకాని (అధికమైన) పరాక్రమం కలవారు; సుతులు= కొడుకులు; అజేయులు= గెలువదగనివారు; బాహ్లిక, సోమదత్తులు= బాహ్లికుడూ, సోమదత్తుడూ; ఆ+స్థాణునకున్+ఐనన్= ఆ శివుడికి కూడా; ఓడరు= జంకరు; వారిన్, జయింపఁగన్= గెలవటానికి; ఏరికిన్= ఎవరికైనా, వశంబె?= తరమా?

తాత్పర్యం: ద్రోణుడూ, భీష్ముడూ, కృపుడూ, అశ్వత్థామా, కర్ణుడూ, శల్యుడూ తమ ప్రాణాలు ఆ దుర్యోధనుడివే అంటారు. తమ్ములు మిక్కిలి పరాక్రమవంతులు. కొడుకులు జయింపరాని వారు. బాహ్లికుడూ, సోమదత్తుడూ ఆ స్థాణుడికి కూడా జంకరు. వారిని జయించటం ఎవరికైనా శక్యమా?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. 'సుతు లజేయులు' - అజేయులంటే జయింపదగని వారు, అజయ్యులు - జయింపరాని వారు, సుతులజయ్యులు అని ఉండవలసింది. కాని, అప్పుడు యతి మైత్రికి భంగం కలుగుతుంది. సోమదత్తుడు బాహ్లికుడి కొడుకు. 'స్థాణునకైన నోడరు' - కావ్యార్థాపత్తి.

ఆ. అధిప! యిట్టి మీకు నన్యోన్య కలహంబు । నాకుఁ జూడ మే లనంగ రాదు;
రెండు పక్షములకుఁ బ్రియము హితంబును । నాత్మఁ గోరువారి నడిగి చూడు.' 300

ప్రతిపదార్థం: అధిప!= రాజా! - ధర్మరాజా!; ఇట్టి మీకున్= ఇటువంటి మీకు (కౌరవపాండవులకు); అన్యోన్యకలహంబు= పరస్పర యుద్ధం; నాకున్+చూడన్= నాకు చూడగా; మేలు+అనంగన్, రాదు= మంచిది అనగూడదు; రెండు పక్షములకున్= ఇరువైపులవారికీ; ప్రియమున్= సంతోషాన్నీ; హితంబునున్= మేలునూ; ఆత్మన్= మనస్సునందు; కోరువారిన్= ఆశించేవారిని; అడిగి-చూడు(ము).

తాత్పర్యం: ధర్మరాజా! ఇటువంటి మీరు ఒకళ్ళతో ఒకళ్ళు పోరాడటం వలన మేలు కలుగుతుందని నాకు అనిపించదు. ఇంకా రెండు పక్షాల వారికీ సంతోషాన్నీ, శ్రేయస్సునూ ఆకాంక్షించే వాళ్ళను అడిగి చూడుము.'

వ. అని పలికి సూతనందనుండు గొలువు గలయం గనుంగొని. 301

ప్రతిపదార్థం: అని, పలికి; సూతనందనుండు= సూతపుత్త్రుడు - సంజయుడు; కొలువు= సభ; కలయన్+కనుంగొని= అంతటా చూచి.

తాత్పర్యం: అని పలికి సంజయుడు సభ అంతటా చూపు సారించి.

ఉ. 'మ్రొక్కెద వాసుదేవునకు, మోడ్చెదఁ జేతులు సవ్యసాచికిం,
దక్కటి మిత్త్ర బాంధవ హిత ప్రియమంత్రి వయస్య కోటికిన్
స్రుక్కుచు విన్నవించెద నసూయలు దక్కి యనుజ్ఞ సేయుఁడీ
యిక్కరుణాకరున్ శరణ మే నిదె వేఁడెదఁ గ్రోధశాంతికిన్. 302

ప్రతిపదార్థం: వాసుదేవునకున్= కృష్ణుడికి; మ్రొక్కెదన్= నమస్కరిస్తాను; సవ్యసాచికిన్= కవ్వడికి - అర్జునుడికి; చేతులు మోడ్చెదన్= చేతులు జోడిస్తాను; తక్కటి, మిత్త్ర, బాంధవ, హిత, ప్రియ, మంత్రి, వయస్య, కోటికిన్= మిగిలిన మిత్త్రుల,

బంధువుల, హితుల, ప్రియుల, మంత్రుల, వయస్యుల సమూహానికి; స్రుక్కుచున్= అడగుతూ- సవినయంగా; విన్నవించెదన్= మనవి చేస్తాను; అసూయలు+తక్కి= కోపాలు విడిచి; అనుజ్ఞ+చేయుఁడీ= అనుమతించండి; ఈ+కరుణా+ఆకరున్= ఈ దయాళువును-ధర్మరాజును; క్రోధశాంతికిన్= కోపం ఉపశమించటానికి; ఏను= నేను; ఇదె= ఇప్పుడే; శరణము, వేఁడెదన్= శరణు వేడుతున్నాను.

తాత్పర్యం: 'కృష్ణుడికి మ్రొక్కుతాను, అర్జునుడికి చేతులు జోడిస్తాను, తక్కిన మిత్రుల, బంధువుల, హితుల, ప్రియుల, మంత్రుల, వయస్యుల సమూహానికి సవినయంగా మనవి చేస్తాను. కోపాలు మాని అనుమతించండి, ఈ దయాళుడైన ధర్మరాజును కోపోపశమనానికై నేను ఇదే శరణు వేడుతాను.'

విశేషం: 1. సంజయు రాయబారపు ఘట్టంలో పతాకస్థానమైన పద్యమిది. నాటకీయమైన సన్నివేశం. పరమేశ్వరుడి ముందు భక్తుడు ప్రణమిల్లి శరణు వేడుతున్నట్లు భక్తిభావ ప్రవృత్తితో సంజయుడు ధర్మరాజుకు ప్రణామం చేస్తూ పలికిన మాటలివి. ధర్మరాజును కరుణాకరుడని ప్రశంసించాడు. కాబట్టి శరణువేడినవారి కోర్కెను కాదనక తీర్చటం కరుణామయుడి కర్తవ్యం. సంజయుడు కోరింది క్రోధశాంతి. అంటే ధర్మరాజు క్రోధమూర్తి అయి ఉన్నాడనీ, ఆ క్రోధాన్ని ఆయన శాశ్వతంగా చంపుకొని శాంతమూర్తి కావాలనీ కోరుకొన్నాడు. ధర్మజు డా వరం ఇవ్వాలి.

2. అందుకు ఆ సభలోని ప్రముఖు లందరూ అసూయలు మాని ధర్మరాజుకు అనుజ్ఞ ఇవ్వాలట, అంటే ముక్తకంఠంతో, ఏకాభిప్రాయంతో ధర్మజ క్రోధశాంతిని సమర్థించాలని ప్రార్థన.

3. ధర్మరాజును అనుమతించవలసిన వారిలో అగ్రగణ్యుడు శ్రీకృష్ణుడు. అందుకే ఆయనకు ముందుగా మ్రొక్కులు చెల్లించటం, నారాయణుడి తరువాత నరుడు. అతడు పైపెచ్చు సవ్యసాచి, అతడికి చేతులు జోడించాడు. రెండు చేతుల వాడి కలవాడికి రెండు చేతులూ ఎత్తి నమస్కరించటం న్యాయమే. (తలమీద చేతులెత్తి నమస్కరించటం మ్రొక్కటం. ఇది దేవ గురుమూర్తుల పట్ల సమంజసం. చేతులు జోడించటం వినయ గౌరవ ప్రదర్శకం). మిగిలిన వారందరికీ వినయంగా విన్నవించుకొన్నాడు. వారి వారి అధికారాలకు అనుగుణంగా అణకువను ప్రదర్శించి సంజయుడు సభా మర్యాదలను పాటించాడు. అందరినీ అర్థించి ధర్మరాజును ప్రార్థించాడు.

4. "శత్రు కృతాపచారేణ మనః ప్రజ్వలనం క్రోధః"- అని ప్రతాపరుద్రీయం. ధర్మరాజు క్రోధం కౌరవకృతాపచారాల వలన కలిగిన మనః ప్రజ్వలనరూపం. అది రౌద్రమై శత్రుప్రతీకార సంహారాలను చేపట్టి, శత్రుపక్షంలో శోకం కలిగించటానికి పూనుకొంటుంది. అట్టి రౌద్రకర్మను ఉపశమించుకొనుమని ధర్మరాజును సంజయుడు వేడుకొన్నాడు. రౌద్రం అర్థసాధన ప్రధానం. ధర్మజుడి క్రోధం రాజ్య సంపదను సాధించే ప్రయోజనంతో వర్తిస్తుంది. దానిని మానుకొనుమని సంజయుడి ప్రార్థన. క్రోధానికి అసూయ పోషకశక్తి. అందువలన అసూయను వదలి ధర్మరాజుకు క్రోధశాంతికై అనుజ్ఞ ఇవ్వండి- అని సభ్యులందరికీ సంజయుడి అభ్యర్థన.

5. సంజయుడి అభినయం, అభ్యర్థన ఎవరికైనా అనుమానం కలిగిస్తాయి. దూత శరణువేడుతున్నాడంటే ధృతరాష్ట్రుడి దూతగా సంజయుడు వ్యవహరిస్తున్నాడా? తన సొంత పూచీతో ఆ పని చేస్తున్నాడా? అన్నది మొదటి అనుమానం. దూత శరణు వేడడు. అది మర్యాద కాదు. కాబట్టి సంజయుడిది సొంత అభినయమే. అంటే ఆ మాటలన్నీ సంజయుడి వినయ విలాసాలే. ధృతరాష్ట్రుడి ఆదేశాలు కావు. కాబట్టి వాటిని అధికారికంగా అంగీకరించవలసిన అవసరం లేదు. భక్తిభావముద్రితమైన సంజయుడి పలుకులు ధర్మరాజు యుద్ధ విరమణ రూపమైన క్రియను చేపట్టటానికి ప్రేరణలుగా పనిచేస్తాయి. నిజంగా ఆ

మాటలకు ధర్మజుడు కరగిపోయి, కరుణాకరుడై యుద్ధం మానివేస్తే గొప్ప విపత్తు ఏర్పడుతుంది. క్రోధోపశాంతి వలన రాజ్యసుఖం వదలుకొనటమే ఫలమౌతుంది. ఇంత లోతుగా వ్యూహం పన్ని, పైకి అమాయకంగా మాట్లాడుతూ ముందరికాళ్ళకు బంధం వేయాలని శరణువేడినట్లు నటించాడు సంజయుడు. ధర్మరాజు శత్రు మర్మజ్ఞుడు. కౌరవ వ్యూహంలోని కౌటిల్యాన్ని పసికట్టాడు. కాని, బయటపడలేదు. (సంపా.)

వ. అనుచుం బ్రణామపూర్వకంబుగాఁ బాండవాగ్రజు వదనంబునం జూడ్కినిలిపి, 'దేవా! యుపశమించుట లెస్స, యిమ్మెయికిం గురు పితామహుండును సంతసిల్లు; నాతనికనుమతంబయిన తెఱంగు సర్వలోకసమ్మతం బగు' నన విని ధర్మనందనుం డిట్లనియె. 303

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; ప్రణామపూర్వకంబుగాన్= నమస్కార పూర్వకంగా; పాండవ+అగ్రజు వదనంబునన్= ధర్మరాజు ముఖంలో; చూడ్కి= చూపు; నిలిపి= ఉంచి; దేవా!; ఉపశమించుట= శాంతించటం; లెస్స= మంచిది; ఈ+మెయికిన్= ఈ రీతికి; కురు పితామహుండును= భీష్ముడుకూడా; సంతసిల్లున్= సంతోషిస్తాడు; ఆతనికిన్= భీష్ముడికికూడా; అనుమతంబు+ అయిన తెఱంగు= సమ్మతమైన విధం; సర్వలోక- సమ్మతంబు+అగున్= అన్ని లోకాలకూ అంగీకారం అవుతుంది; అనన్ విని= అనగా విని; ధర్మనందనుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అంటూ నమస్కార పురస్సరంగా ధర్మరాజు ముఖంలో చూపు నిలిపి 'దేవా! శాంతించటం మంచిది. దీనికి భీష్ముడు కూడా సంతోషిస్తాడు. ఆతడికి సమ్మతమైన విధం అన్నిలోకాలకూ సమ్మతమవుతుంది' - అనగా విని ధర్మరాజు ఇట్లా అన్నాడు.

విశేషం: భీష్ముడు కూడా సంతోషిస్తా డనటం తాతగారిమీద ఉన్న భక్తి గౌరవాలకొద్దీ ధర్మరాజు తప్పకుండా ఉపశమిస్తాడనే ఆశతో.

ఉ. 'నెయ్యము దప్ప నొండొకటి నీ చెవి సోఁకెనె నాదు పల్కులం
దియ్యెడ? సంజయా! యనికి నెమ్మెయి నల్కెదు నీవు; మాకుఁ దాఁ
గయ్యము దక్కి మన్కి తగు కార్యము గా దాకొ? పోరితంబు లే
కయ్యెడు నర్థసిద్ధి వెడఁగైనను నొల్లక యొండు సేయునే? 304

ప్రతిపదార్థం: సంజయా!; అనికిన్= యుద్ధానికి; ఎమ్మెయిన్(ఏ+మెయిన్)= ఏదో ఒక విధంగా; నీవు; అల్కెదు(అల్కెదువు)= భయపడతావు; నాదు పల్కులందున్ (నా+పల్కుల+అందున్)= నా మాటలలో; నెయ్యము+తప్పన్= చెలిమికాక; ఒండొకటి (ఒండు+ఒకటి)= మరియొకటి; ఇయ్యెడన్ (ఈ+ఎడన్)= ఇప్పుడు; నీ చెవిన్+సోఁకెన్?= నీ చెవిని పడిందా?; మాకున్, తాన్; కయ్యము+తక్కి= యుద్ధం విడిచి; మన్కి= జీవించటం; తగు కార్యము+కాదు+ఒకొ!= తగిన పని కాదా?; పోరితంబు, లేక+అయ్యెడు+అర్థ సిద్ధి= యుద్ధం లేకుండా అయ్యే ప్రయోజన సిద్ధి (లేదా ధనప్రాప్తి); వెడఁగు+ఐనను= వెర్రివాడయినా; ఒల్లక= అంగీకరించక; ఒండు+చేయునే?= ఇంకొకటి చేస్తాడా?

తాత్పర్యం: 'సంజయా! యుద్ధానికి నీవు భయపడుతున్నావు, ఇప్పుడు నా మాటలలో చెలిమి కాక వేరొకటి నీ చెవిలో పడిందా? మాకు మాత్రం యుద్ధం లేకుండా జీవించటం తగిన పని కాదా? యుద్ధం లేకుండా ప్రయోజనం నెరవేరితే దానిని వెర్రివాడయినా కోరక ఇంకొకటి చేస్తాడా?

విశేషం: 1. సంజయుడి వాక్య నైపుణ్యం మీద ధర్మరాజు ఉక్తి చాతుర్యంతో ఎదురుదాడి మొదలుపెట్టాడు. అది అతడి గడుసరి తనం. అంతవరకు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న ఆతడు ఒక్కసారి విజృంభించాడు. ఈ పద్యంలో చెప్పే తాత్పర్యానికి ఎంత విశేషముందో, చెప్పే తీరుకు కూడా అంత వైశిష్ట్యం ఉన్నది.

2. శరణు వేడిన సంజయుడికి ధర్మరాజు సుముఖుడైనట్లే వాక్యం మొదలుపెట్టాడు. చెలిమి తప్ప మరొకమాట నానోట నీకు వినబడిందా? అని అన్నాడు. ఇది గుట్టు తెలిసి పలికినమాట. ఆప్యాయత ఒలకబోసేమాట! కాగా, క్రోధమే లేని నాలో క్రోధం ఉన్నట్లు ఈ విధంగా పలికా వెందుకు? నా ప్రవృత్తిని మసిపూసి మారేడుకాయ చేస్తావెందుకు? అని సంజయుడిని దెప్పిపొడిచాడు. సంజయుడి నాటకం బట్టబయలైనది. కౌరవులకే కాదు పాండవులకూ కయ్యం లేకుండానే ఉండాలని ఉన్నది- అని తనమీద వేసిన నేరాన్ని దులుపుకొని మాట్లాడాడు. చివరకు పలికినమాట కీలెరిగి పెట్టినవాత. యుద్ధం లేకుండానే అర్థసిద్ధి అయితే ఎంతటి వెర్రివాడైనా మరొక రకంగా ఎందుకు ప్రవర్తిస్తాడు? అని ఎదురు ప్రశ్న వేశాడు. ఇది చాలా లోతైన మాట. సంజయుడు కోరింది క్రోధోపశాంతి. శత్రువులు అర్థాన్ని హరించి అపకారం అవమానం చేయటం వలన దానిని మరల సంపాదించుకొనటానికి ప్రదర్శించే తీవ్రమనోభావం క్రోధం. యుద్ధం చేయకుండానే అర్థసిద్ధి కలిగితే క్రోధం ఉపశమిస్తుంది. లేదా అర్థంమీది తృష్ణ నశిస్తే శమిస్తుంది. ధర్మరాజు విరక్తుడై క్రోధాన్ని మానాలని సంజయుడి పన్నాగం. అర్థసిద్ధి కలిగితేనే క్రోధశాంతి కలుగుతుందని ధర్మరాజు ప్రతిసమాధానం. క్రోధశాంతికి అంగీకరించినా ధర్మరాజు సంజయుడి మార్గాన్ని అంగీకరించలేదు. శరణన్నవారిని కాదన్న దోషం ధర్మరాజుకు కలుగలేదు. అతడి యుక్తి చాతుర్యం అంత గొప్పది. (సంపా.)

3. 'యుద్ధం మాను, శాంతించు' అని మాటిమాటికీ సంజయుడు చెప్పిన దానికి ధర్మరాజు సూటిగా, స్పష్టంగా చెప్పిన సమాధానం ఇది. 'అర్థసిద్ధి' ముఖ్యమనీ, యుద్ధం చేయటం, మానటం దానిని బట్టి ఉంటుందనీ, అర్థసిద్ధి కాకపోతే యుద్ధం తప్పకపోవచ్చుననీ ధర్మరాజు మాటలలో ధ్వనిస్తున్నది.

క. జనులకు నెల్లను బథ్యము । లనఁగా, ధర్మానుగతములగు ననఁ బొగడం
జను పనులు సేయు భీమా । ర్జునులే దుష్కర్మములకు రోయని వారల్? 305

ప్రతిపదార్థం: జనులకున్+ఎల్లను= జనులకందరికీ; పథ్యములు+అనఁగాన్= మేలు చేసేవి అనిన్నీ; ధర్మ+అనుగతములు+ అగున్+అనన్= ధర్మాన్ని అనుసరించేవి అనిన్నీ; పొగడన్+చను= ప్రశంసించదగిన; పనులు, చేయు, భీమ+అర్జునులే= భీమార్జునులా; దుష్కర్మములకున్= చెడుపనులకు; రోయనివారల్?= అసహ్యించుకొననివారు?

తాత్పర్యం: జనులకందరికీ మేలు చేసేవి అనిన్నీ, ధర్మాన్ని అనుసరించేవి అనిన్నీ ప్రశంసించదగిన పనులు చేసే భీమార్జునులా చెడుపనులకు అసహ్యించుకొననివారు?

విశేషం: 'నేనే కాదు మా తమ్ములు భీమార్జునులు కూడా జనహిత ధర్మకార్యాలే చేస్తారు కాని యుద్ధం జోలికి' అనవసరంగా పోరు. దానిని అసహ్యించుకొంటారు' అని ధర్మరాజు తమ్ముల సంగతి కూడా చెప్పాడు.

క. మది సుఖము గోరి, దుఃఖం । బొదవం గల కార్యములకు నుత్సాహము సే
యుదు రొప్పని తృష్ణం బడి । చదు రేమియు లేని యట్టి జను లాతురులై. 306

ప్రతిపదార్థం: చదురు+ఏమియున్, లేని+అట్టి; జనులు= నేర్పు ఏ మాత్రమూ లేని జనులు; ఒప్పని, తృష్ణన్+పడి= తగని దప్పికి - దురాశకు లోఁబడి; ఆతురులు+ఐ= తొందరపడినవారయి; మది,సుఖము+కోరి= మనస్సంతోషం కోరి; దుఃఖంబు+ ఒదవన్+కల కార్యములకున్= దుఃఖం కలిగించే పనులకు; ఉత్సాహము+చేయుదురు= ఉత్సాహం చూపుతారు.

తాత్పర్యం: చతురత ఏ మాత్రమూ లేని జనులు తగని దురాశకు లోబడి తొందరపడినవారయి మనస్సంతోషం కోరి దుఃఖాన్ని కలిగించే పనులకు ఉత్సాహం చూపుతారు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. తాము చదురులేని జనులం కామనీ, తమకు ఒప్పని తృష్ణ లేదనీ, దుఃఖావహకార్యాలకు తాము చొరమనీ ధర్మరాజు అభిప్రాయం. పద్యంలో ఉన్నది సామాన్యాంశం. 'మేము అట్లాంటి వాళ్ళం కాము' అనేది విశేషాంశం. అది అధ్యాహార్యం. అది సమర్థించబడుతున్నది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

ఆ. యోగ్యతృష్ణ దారు, లుచితంపుఁ గొలఁదిమై । నడచినట్టివారు బెడిదములకు
నంత సొత్తు రెట్లు? సంతాపకారుల । కాక పెనఁకువలు సుఖంబు లగునె? 307

ప్రతిపదార్థం: యోగ్యతృష్ణన్= సముచితమైన ఆశతో; ఉచితంపుఁగొలఁదిమైన్ (ఉచితము+కొలఁదిమైన్)= తగిన విధంగా; దారులు= మార్గాలు; నడచినట్టివారున్= అనుసరించేవారూ; బెడిదములకున్= హింసాకృత్యాలకు; అంత+చొత్తురు+ఎట్లు?= అంతగా ఎట్లా పూనుకొంటారు?; పెనఁకువలు= యుద్ధాలు; సంతాపకారులు+అ కాక= అధిక దుఃఖాన్ని కలిగించేవే కాని; సుఖంబులు+అగునె?= సుఖ ప్రదాలు అవుతాయా?

తాత్పర్యం: సముచితమైన ఆశతో, తగిన విధంగా మంచి త్రోవల ననుసరించేవారు క్రౌర్యాలకు అంతగా ఎట్లా పూనుకొంటారు? యుద్ధాలు దుఃఖావహాలే కాని సుఖావహా లవుతాయా?

వ. భోగంబులు వలదా యని తలంతు మేని. 308

ప్రతిపదార్థం: భోగంబులు= సుఖాలు; వలదా= వద్దా; అని; తలంతుము+ఏనిన్= అనుకొంటే.

తాత్పర్యం: సుఖాలు వద్దా అని అనుకొంటే.

తే. వస్త్ర మాల్యానులేపనావసరములును, । జతుర తూర్య త్రయంబుల సమయములును,
నేమ వెలిగాఁగ మా తండ్రి కించు నెట్లు; । పుత్త్రుల పట్టి మమ్మేల పోవఁ ద్రోచు? 309

ప్రతిపదార్థం: వస్త్ర,మాల్య+అనులేపన+అవసరములును= వలువల, పూలమాలల, గంధపు పూతల వేళలూ; చతుర, తూర్య, త్రయంబుల; సమయములును= నేర్పరులయొక్క, నృత్త గీతవాద్యాల వేళలూ; ఏము వెలి+కాఁగన్= మేము దూరమైతే; మా తండ్రికిన్= మా తండ్రిఅయిన ధృతరాష్ట్రుడికి; ఇంచున్+ఎట్లు= ఎట్లా బాగుంటుంది?; పుత్త్రులన (పుత్త్రులన్+అ)= కొడుకులనే; పట్టి= పట్టుకొని; మమ్మున్+ఏల= మమ్ములను ఎందుకు; పోవన్+త్రోచున్?= పొమ్మంటాడు?

తాత్పర్యం: వస్త్రాలు కట్టుకొన్నప్పుడూ, పూలమాలలు ధరించినప్పుడూ, గంధపు పూతలు పూసికొన్నప్పుడూ, నేర్పరులు నృత్తగీత వాద్యాలు చేసేటప్పుడూ మేము దూరంగా ఉంటే మా తండ్రి ధృతరాష్ట్రుడికి ఏం బాగుంటుంది? అతడు కొడుకులనే పట్టుకొని మమ్మెందుకు పొమ్మంటాడు?

వ. అయినను నొకమాట సెప్పెద సమచిత్తుఁడవై విను' మని యిట్లనియె. 310

ప్రతిపదార్థం: అయిననున్= అయినప్పటికీ; ఒక - మాట, చెప్పెదన్; సమ చిత్తుఁడవు+ఐ= నిష్పక్షపాత బుద్ధి కలవాడవై; వినుము+అని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అయినా ఒక మాట చెపుతా నిష్పక్షపాతబుద్ధితో వినుము' అని ఇట్లా అన్నాడు.

క. తానైన నపుడు వక్రుం । డై నీతిపథంబు విడిచె నక్కట! పతి; మ
మ్మైనను జక్కని తెరువునఁ । బూని నడవుఁ డనుచు నిపుడు బుద్ధులు సెప్పెన్. 311

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; పతి= రాజు - ధృతరాష్ట్రుడు; తాను+ఐనన్= తానైతే; అపుడు; వక్రుండు+ఐ= కుటిలుడై; నీతి పథంబున్= నీతిమార్గాన్ని; విడిచెన్= వదలిపెట్టాడు; ఇపుడు; మమ్మున్+ఐనను= మమ్ములనయితే; చక్కని తెరువునన్= సన్మార్గంలో; పూని= ప్రయత్నించి; నడవుఁడు+అనుచున్= నడవండి అంటూ; బుద్ధులు+చెప్పెన్= బుద్ధులు చెపుతున్నాడు.

తాత్పర్యం: 'అయ్యో! ధృతరాష్ట్రుడు తానేమో అప్పుడు కుటిలుడై నీతిమార్గం విడిచిపెట్టాడూ! మమ్మల్నేమో 'సన్మార్గంలో ప్రయత్నించి నడవండి' అంటూ ఇప్పుడు బుద్ధులు చెపుతున్నాడూ! (ఇదేం న్యాయం?)

క. ఎదిరిం దమయట్టుల కా । మదిఁ దలఁచినఁ బొసఁగుఁ గాక, మాకుం గుడు మిం
డిదె మీరు వ్రక్కఁ గొనుఁడని । చదు రడిచిన మనసు పొందు చక్కం బడునే?' 312

ప్రతిపదార్థం: ఎదిరిన్= ఎదుటివాడిని; తమ+అట్టులు+అ+కాన్= తమవలెనే; మదిన్= మనస్సులో; తలఁచినన్= భావిస్తే; పొసఁగున్+కాక= కుదురుతుంది కాని; మాకున్; కుడుము+ఇండు= కుడుము కుడుమంతా ఇవ్వండి; ఇదె= ఇదిగో; మీరు; వ్రక్కన్= ముక్కను; కొనుఁడు= తీసికొనండి; అని; చదురు+అడిచినన్= తెలివితో నటిస్తూ మాటాడితే; మనసుపొందు= మనస్సుల కలయిక; చక్కన్+పడునే?= తిన్న నవుతుందా?, అనుకూలంగా పొసగుతుందా?

తాత్పర్యం: ఎదుటివారిని తమవలెనే మనస్సులో భావిస్తే కుదురుతుంది కాని 'మాకు మొత్తం కుడుమంతా ఇవ్వండి, ఇదిగో మీరు ముక్క పుచ్చుకోండి' అని పరిహాస మాడితే మనస్సులు చక్కగా కలుస్తాయా?'

వ. అని చూపి చెప్పి, వెండియు. 313

తాత్పర్యం: అని నిరూపించి చెప్పి ఇంకా. - (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. 'సంపద దక్కి యుండఁగ నశక్తు లనం జను మమ్ముఁ బిల్చి పూ
జింపఁగ నంత బేలె పతి? సెప్పెడు వారల బుద్ధి నాఁడ మ
న్నింపఁడ; యింక నేల యగు? నీ వడియాసల వచ్చి రిత్త గా
రింపక మాను; మాతని చరిత్రము నీకును మాకు వింతయే? 314

ప్రతిపదార్థం: సంపద+తక్కి+ఉండఁగన్= ఐశ్వర్యం పోయి ఉండగా; అశక్తులు+అనన్+చను మమ్మున్= బలహీనులుగా ఉన్న మమ్మలను; పిల్చి= ఆహ్వానించి; పూజింపఁగన్= పూజించటానికి; పతి= రాజు- ధృతరాష్ట్రుడు; అంత బేల+ఎ= అంత వెర్రివాడా?; చెప్పెడు వారల బుద్ధిన్= చెప్పేవాళ్ళ బుద్ధిని; నాఁడు+అ= అప్పుడే; మన్నింపఁడు+అ= ఆదరించనే లేదు; ఇంకన్+ ఏల+అగున్?= ఇంక ఎందుకు కుదురుతుంది?; నీవు, అడియాసలన్= వట్టి ఆశలతో; వచ్చి; రిత్త= ఊరికే; కారింపక

మానుము= బాధపెట్టకుము; ఆతని చరిత్రము= ఆ ధృతరాష్ట్రుడి నడత; నీకును= నీకూ; మాకున్= మాకూ; వింతయే?= క్రొత్తా?

తాత్పర్యం: ఐశ్వర్యం కోల్పోయి బలహీనులమై ఉన్న మమ్ములను ఆహ్వానించి పూజించడానికి ధృతరాష్ట్రుడు అంత వెర్రివాడా? చెప్పేవాళ్ళ బుద్ధిని అప్పుడే ఆదరించలేదు. ఇంక ఎందుకు కుదురుతుంది? నీవు లేనిపోని ఆశలు పెట్టుకొని వచ్చి మమ్ములను ఊరికే బాధపెట్టకుము. ఆతడి ప్రవర్తన నీకూ మాకూ క్రొత్తా?

క. తగు మాట లాంబికేయుం । డగు నని కైకొనునె యెన్నఁడైనను? గొడుకున్
మగఁటిమి గలఁ డనియెడు న । మ్మిగఁ జూచుచు నుండు విషము మ్రింగిన యేనిన్. 315

ప్రతిపదార్థం: ఆంబికేయుండు= అంబిక కుమారుడు - ధృతరాష్ట్రుడు; తగు మాటలు= మంచిమాటలు; అగును+అని= ఔనని; ఎన్నఁడు+ఐనను= ఎప్పుడయినా; కైకొనునె?= స్వీకరిస్తాడా? - వింటాడా?; కొడుకున్= కొడుకును- దుర్యోధనుడిని; మగఁటిమి= పరాక్రమం; కలఁడు+అనియెడు నమ్మిగన్= ఉన్నవాడు అనే నమ్మకంతో; విషమున్+మ్రింగిన+ఏనిన్= విషం మ్రింగినా; చూచుచున్+ఉండున్= చూస్తూ ఉంటాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు మంచిమాటలకు ఔనని ఎప్పుడైనా ఊ కొడతాడా? కొడుకైన దుర్యోధనుడిని పరాక్రమవంతు డనే (గుడ్డి) నమ్మకంతో, విషం మ్రింగినా, చూస్తూ ఊరుకొంటాడు.

క. జూదపుసిరి యాసపడం । గా దని విదురుండు సెప్పఁగా నప్పుడు క
ర్ణాదుల పలుకులు విని పతి । యాదరణము సేయకున్న, నంతన తీరున్. 316

ప్రతిపదార్థం: జూదము+సిరి= జూదం వలని సంపద; ఆసపడన్+కాదు+అని= ఆశించకూడదని; విదురుండు, చెప్పఁగాన్, అప్పుడు; పతి= రాజు- ధృతరాష్ట్రుడు; విని; కర్ణ+ఆదుల పలుకులు= కర్ణుడూ మొదలయిన వాళ్ళమాటలు; ఆదరణము+ చేయక+ఉన్నన్= ఆదరించకుండా ఉంటే; అంతన్+అ= దానితోనే; తీరున్= తీరిపోయేది.

తాత్పర్యం: జూదంవలన వచ్చే సంపద కొరకు ఆశపడకూడదని విదురుడు చెప్పగా విని, అప్పుడు కర్ణాదుల మాటలు ధృతరాష్ట్రు డాదరించకుండా ఉంటే, దానితో తీరిపోయేది.

క. ధృతరాష్ట్రుం డిట మీఁదను । సుతులును, శకునియును, సూతసుతుఁడును దను నే
గతి నడపించిరి వారల । మతము యనుష్ఠించుఁగాక మరలం బడునే? 317

ప్రతిపదార్థం: ఇటమీఁదను= ఇంకమీదట; ధృతరాష్ట్రుండు; సుతులును= కొడుకులూ (దుర్యోధన, దుశ్శాసనులు); శకునియును; సూత సుతుఁడును= కర్ణుడూ; తనున్= తనను; ఏ గతిన్+నడపించిరి= ఏ మార్గాన నడిపించారో; వారల మతము+అ= వాళ్ళ మతమే; అనుష్ఠించున్+కాక= ఆచరిస్తాడు కాని; మరలన్+పడునే?= దానికి విముఖు డవుతాడా?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఇంకమీదట తనను కొడుకులు దుర్యోధన దుశ్శాసనులూ, శకునీ, కర్ణుడూ ఏ విధంగా నడిపిస్తే ఆ విధంగానే నడిచి వారి మతమే ఆచరిస్తాడు కాని తద్విముఖు డవుతాడా?

విశేషం: ఈ పద్యంలో యత్తత్ప్రయోగం చేయబడింది. కాని 'ఏగతి నడపించిరి' అని యచ్ఛబ్దం మాత్రం ఉన్నది కాని, 'ఆ గతి....' అని తచ్ఛబ్ద ప్రయోగం లోపించింది. అయితే, వారలమతము అనే దానిలోనే తచ్ఛబ్ద భావం ఇమిడిఉంది. వారలమతము=

ఆ మతమే - ఆగతే. అది విశేషం. ఇంతవరకూ ధర్మరాజు చేసిన ధృతరాష్ట్ర మనస్తత్త్వ విశ్లేషణ అతడి పర మనస్తత్త్వ పరిజ్ఞానానికి నిదర్శనం, ఇక దుర్యోధనుడి మనస్తత్త్వాన్ని విశ్లేషిస్తాడు.

క. కార్యము తెఱఁ గిట్టిది; నీ । వార్య చరితమునకుఁ జొచ్చి యాడెదు; నీ కా
దుర్యోధను నవినయ మని । వార్యం బని యెఱుఁగరామి; వలనో, వెడఁగో? 318

ప్రతిపదార్థం: కార్యము తెఱఁగు+ఇట్టిది= ఇదీ కార్యస్వరూపం; నీకున్; ఆ దుర్యోధను+అవినయము= ఆ దుర్యోధనుడి యొక్క చెడునడవడి; అనివార్యంబు+అని= మాన్ప శక్యం కానిది అని; ఎఱుఁగన్+రామిన్= తెలియకపోవటం చేత; నీవు; ఆర్యచరితమునకున్+చొచ్చి= 'పెద్దమనిషి తరహాగా'; ఆడెద+వు= మాటాడుతున్నావు; వలనో= వివేకమో; వెడఁగో= అవివేకమో!

తాత్పర్యం: ఇదీ కార్యస్వరూపం. నీకు ఆ దుర్యోధనుడి చెడునడత మాన్ప శక్యం కానిదని తెలియకపోవటం చేత నీవు అట్లా పెద్ద మనిషితరహాగా మాటాడుతున్నావు. నీది వివేకం అనుకొనాలా? అవివేకం అనుకొనాలా?

క. చక్రధరు లెక్క గొనఁడు; ప । రాక్రమనిధి యర్జునునకు రాధేయ భుజా
విక్రమ మెదురుగఁ గొని, ని । ర్వక్రముఁ జేసికొనువాఁడు రాజ్యం బెల్లన్.' 319

ప్రతిపదార్థం: వాఁడు= అతడు - దుర్యోధనుడు; చక్రధరున్= సుదర్శనమనే చక్రాన్ని ధరించినవాడిని- కృష్ణుడిని; లెక్క+ కొనఁడు= లక్ష్యపెట్టడు; పరాక్రమ నిధి= పరాక్రమానికి నిధి అయిన; అర్జునునకున్; రాధేయ భుజా విక్రమము= కర్ణుడి బాహు పరాక్రమం; ఎదురుగన్+కొని= ప్రతిగా భావించి; రాజ్యంబు+ఎల్లన్= రాజ్యాన్ని అంతనూ; నిర్వక్రమున్+చేసికొనున్= చక్కబరుచుకొంటాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు చక్రాయుధుడైన శ్రీకృష్ణుడిని లెక్కించడు; పరాక్రమానికి నిధి అయిన అర్జునుడికి కర్ణుడి బాహుపరాక్రమాన్ని ప్రతిగా భావించి రాజ్యన్నంతనూ నిష్కంటకం చేసికొని, చక్కబరుచుకొనా లనుకొంటున్నాడు.'

విశేషం: అలం: పరికరం. 'చక్రధరున్' అనే కృష్ణ విశేషణం సాభిప్రాయంగా ప్రయుక్త మయింది కాబట్టి పరికరం.

వ. అని పలికి వెడవెడ యలుక వొడమిన, మఱియు నిట్లనియె. 320

ప్రతిపదార్థం: అని, పలికి, వెడవెడ= కొద్దిగా; అలుక+పొడమినన్= కోపం రాగా; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికి కొంచెం కోపం రాగా ఇంకా ఇట్లా అన్నాడు.

శా. 'చాపాచార్యుఁడు, భీష్ముఁడుం, గృపుఁడు, నశ్వత్థామయుం, గర్ణుఁడున్,
భూపశ్రేష్ఠుఁడుఁ దారు మున్నెఱుఁగరే పోరి? రెట్లుఁ గయ్యంబు లా
శాపాశంబులు చుట్ట; లా వెఱఁగియుం జావేఁడి మార్కొందు; రిం
తేపో! తమ్ముఁ గపిధ్వజప్రభల యంధీభూతులం జేయవే? 321

ప్రతిపదార్థం: చాప+ఆచార్యుఁడున్= ధనుర్గురువూ- ద్రోణుడూ; భీష్ముఁడున్, కృపుఁడున్; అశ్వత్థామయున్; కర్ణుఁడున్; భూప శ్రేష్ఠుఁడున్= రాజోత్తముడైన దుర్యోధనుడూ; తారు= తాము; మున్ను= పూర్వం; పోరు= యుద్ధం; ఎఱుఁగరే?= తెలియరా?; ఆశా పాశంబులు+చుట్టన్= ఆశలనెడి త్రాళ్ళు చుట్టుకోగా; ఎట్లున్= ఏ విధంగా నైనా; కయ్యంబులు= యుద్ధాలు - యుద్ధాలు

ఏ విధంగానైనా జరిగితీరతాయి; లావు= (మా) బలం; ఎఱిఁగియున్= తెలిసికూడా; చాన్+వేఁడి= చావగోరి; మార్కొందురు= ఎదుర్కొంటారు; ఇంతే పో= ఇదే నిశ్చయం; తమ్మున్= తమను; కపి ధ్వజ ప్రభలు+అ= (అర్జునుడి) కపిధ్వజం కాంతులే; అంధీభూతులన్= గ్రుడ్డివాళ్ళనుగా; చేయవు+ఏ?= చేయవా? చేస్తాయి అని భావం.

తాత్పర్యం: ద్రోణుడూ, భీష్ముడూ, కృపుడూ, అశ్వత్థామా, కర్ణుడూ, దుర్యోధనుడూ - వీరంతా మునుపు యుద్ధం ఎరుగరా? రాజ్యకాంక్ష మొదలైన ఆశలనే పాశాలు చుట్టుకుంటే, యుద్ధా లెట్లాగూ తప్పవు. వారు మా బలం ఎరిగికూడా చావగోరి ఎదుర్కొంటున్నారు. ఇదే నిశ్చయం! అర్జునుడి కపిధ్వజ కాంతులే తమను గ్రుడ్డివాళ్ళనుగా చేస్తాయి.

విశేషం: 1. అలం: రూపకం. ద్రోణాది వీరులంతా ఇదివరకు యుద్ధం ఎరుగరా? ఆ యుద్ధాలలో ఏం జరిగిందో వాళ్ళకు తెలియదా? ఆశలనే పాశాలు అనేచోట ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం.

2. కపిధ్వజప్రభలు అను సమాసమునకు అర్జునుడి పరాక్రమ ద్యుతులు అనికూడా అర్థం చెప్పవచ్చు.

క. మును మమ్ముఁ బొగడి, పదపడి । యని వారల గెలువ నరిది యని పొత్తుగఁ జె
ప్పిన మాటకు నే నొడఁబడ; । విను సంజయ! పక్షపాత వృత్తి విడువుమీ! 322

ప్రతిపదార్థం: సంజయా!; (విను)ము; మును= ముందు; మమ్మున్; పొగడి; పదపడి= తరువాత; అనిన్= యుద్ధంలో; వారలన్; గెలువన్= గెలవటానికి; అరిది= అశక్యం; అని; పొత్తుగన్= పొందికగా; చెప్పిన మాటకున్; ఏన్= నేను; ఒడఁబడన్= అంగీకరించను; పక్షపాత వృత్తిన్= ఒకేవైపు అభిమానం కలిగి ఉండటం; విడువుమీ= విడిచిపెట్టుము.

తాత్పర్యం: సంజయా! వినుము. ముందు మమ్ములను పొగడి, పిమ్మట వాళ్ళను యుద్ధంలో గెలవటం అసాధ్యం అని పొందికగా నీ వన్నమాట నేను అంగీకరించను. పక్షపాతబుద్ధి విడిచిపెట్టుము.

స్రగ్ధర.

గాండీవ జ్యారవం బుత్కట మయి పెలుచం గ్రమ్మినన్, భీము బాహా
దండం బేపారి శుంభద్గద జడియుచు రౌద్రంబుగాఁ దోఁచినన్, వే
దండ ద్వంద్వంబు మాడ్కిం దటిమి కవలు మాద్యద్గతిం దాఁకినం, జా
కుండం బోకుండఁ గౌరవ్యులకు వశమె బిట్టుల్కి మూర్ఛిల్లకుండన్? 323

ప్రతిపదార్థం: గాండీవ జ్యా రవంబు= గాండీవం అనే అర్జునుడి వింటియొక్క అల్లెత్రాటియొక్క ధ్వని; ఉత్కటము+అయి= తీవ్రమై; పెలుచన్= అధికంగా; క్రమ్మినన్= వ్యాపించినా; భీము బాహా దండంబు= భీముడియొక్క దండంవంటి బాహువు; ఏపు+ఆరి= విజృంభించి; శుంభత్+గదన్= ప్రకాశిస్తున్న; గదను; జడియుచున్= త్రిప్పుతూ; రౌద్రంబుగాన్= భయంకరంగా; తోఁచినన్= కనబడినా; కవలు= నకులసహదేవులు; వేదండ ద్వంద్వంబు మాడ్కిన్= ఏనుగుల జంటవలె; తటిమి= విజృంభించి; మాద్యత్+గతిన్= మత్తెక్కుతూఉన్న విధంగా; తాఁకినన్= మార్కొన్నా; కౌరవ్యులకున్= కౌరవసంబంధులకు; చాక+ఉండన్= చావకుండా ఉండటానికీ; పోక+ఉండన్= పారిపోకుండా ఉండటానికీ; బిట్టు+ఉల్కి= మిక్కిలి భయపడి; మూర్ఛిల్లక+ఉండన్= మూర్ఛపోకుండా ఉండటానికీ; వశమె?= తరమా?

తాత్పర్యం: అర్జునుడి గాండీవపు అల్లెత్రాటి ధ్వని అధికమయి మిక్కిలి వ్యాపించినా, భీముడి బాహుదండం విజృంభించి ప్రకాశిస్తున్న గదను త్రిప్పుతూ భయంకరంగా కనబడినా, నకుల సహదేవుల ఏనుగుల జంటవలె కలిసి మదించిన విధంగా మార్కొన్నా కౌరవసంబంధులకు చావకుండా, పారిపోకుండా, మిక్కిలి భయపడి మూర్ఛపోకుండా ఉండటానికి శక్యమా?

విశేషం: దీనికి మూలమైన సంస్కృత శ్లోకం -

> **"గాణ్డీవ విస్ఫారిత శబ్ద మాజా వశృణ్వానా ధార్తరాష్ట్రా ధ్రియన్తే ।**
> **క్రుద్ధస్య వ చే ద్భీమసేనస్య వేగాత్ సుయోధనో మన్యతే సిద్ధమర్థమ్ ॥**
> **ఇన్ద్రోఽప్యేత న్నోత్సహేత్తాత హర్తు మైశ్వర్యం నో జీవతి భీమసేనే ।**
> **ధనంజయే నకులే చైవ సూత, తథా వీరే సహదేవే మదీయే ॥** (సం. 5. 26. 14-15)

దీనితో పయి తెలుగుపద్యాన్ని పోలిస్తే తిక్కనమెలకువ విదితమవుతుంది.

'గాండీవజ్యా రావం కౌరవులు ఇప్పటిదాకా వినలేదు కాబట్టి బ్రదికిపోయారు. క్రుద్ధుడైన భీముడిని చూచేదాకా తనపూన్కి సాగిన దనే దుర్యోధనుడు నమ్మి ఉంటాడు. భీమార్జునులూ, వీరుడైన నకులుడూ, సహనశీలుడైన సహదేవుడూ సజీవులై ఉన్నంతవరకూ ఇంద్రుడు కూడా మా ఐశ్వర్యాన్ని హరించలేడు' - అని మూలశ్లోక భావం. ఇందులో పూర్వార్ధంలో భీమార్జునుల శౌర్యం గురించి చెప్పి, ఉత్తరార్ధంలో నకుల సహదేవులతోపాటు భీమార్జునులను మళ్ళీ పేర్కొన్నాడు వ్యాసుడు.

తిక్కన పద్యంలో ఈ పునరుక్తి లేదు. నలుగు రన్నదమ్ముల బలపరాక్రమాలనూ క్రమంగా ప్రకటించాడు తెలుగుకవి. అర్జును డని చెప్పకుండా 'గాండీవ జ్యారవ' మని మాత్రం చెప్పి అతడిని స్ఫురింపచేసిన తీరు బాగా ఉన్నది. అర్జునుడు శ్రవణ మాత్రభయంకరుడనీ, భీముడు దర్శనమాత్ర భయంకరుడనీ, నకుల సహదేవులు సంఘర్షణ మాత్ర భయంకరులనీ తారతమ్యాలను వ్యక్తీకరించిన విధం ప్రశంసనీయంగా ఉన్నది. కౌరవులు అర్జున, భీమ, నకుల, సహదేవుల పరాక్రమాలకు క్రమంగా చావకుండా, పారిపోకుండా, భయపడకుండా, మూర్ఛిల్లకుండా ఉండగలరా? అని క్రమాలంకారంలో చెప్పి వారి వారి బలాలను తిక్కన ధ్వనింపజేశాడు. 'స్రగ్ధరా' వృత్తం భావానుగుణంగానూ, సన్నివేశ సముచితంగానూ ఉన్నది. స్రగ్ధరలో నాలుగు పాదాలుంటాయి, ప్రతిపాదంలోనూ మ,ర,భ,న,య,య,య అనే గణాలుంటాయి. 1-8-15 అక్షరాలకు యతిమైత్రి, ప్రాసనియమం ఉంటుంది.

వ. కావున. 324

తాత్పర్యం: కాబట్టి.

చ. రణమున వారలన్ గెలువరా దను పల్కు లటుండనిమ్ము; స
ద్గుణుఁడవు నీవు వచ్చితి; ప్రకోపశమంబుగఁ బల్కి; తింకసై
రణ దగఁ జేయువారము; పరాభవ మొందియు మున్ను వారి దు
ర్గుణములు సైఁచు టీవు నొకకొంత యెఱుంగుదు వింతయేటికిన్? 325

ప్రతిపదార్థం: రణమునన్= యుద్ధంలో; వారలన్= ఆ కౌరవులను; గెలువన్+రాదు+అను పల్కులు= గెలవటానికి శక్యం కాదు అనే మాటలు; అటు+ఉండన్+ఇమ్ము= అట్లా ఉండనిమ్ము; సత్+గుణుఁడవు, నీవు= మంచి గుణాలు కలవాడవైన

నీవు; వచ్చితి(వి); ప్రకోపశమంబుగన్+పల్కితి(వి)= అధికమైన కోపం శాంతించేటట్లు పలికావు; ఇంకన్; తగన్= ఒప్పేటట్లు; సైరణన్+చేయువారము= సహనం చూపిస్తాం; మున్ను= పూర్వం; పరాభవము+ఒందియున్= అవమానం పొందికూడా; వారి దుర్గుణములు= వారి అవగుణాలు; సైఁచుట= సహించటం; ఈవున్= నీవుకూడా; ఒక కొంత= ఒకించుక; ఎఱుంగుదు(వు)= ఎరిగి ఉన్నావు; ఇంత+ఏటికిన్= ఇంతెందుకు?

తాత్పర్యం: యుద్ధంలో ఆ కౌరవులను గెలవటం అశక్యం అనే మాటలు అట్లా ఉండనీ. మంచివాడవు నీవు వచ్చావు. అధిక కోపం ఉపశమించేటట్లు మాటాడావు. ఇక మేము సహనం ఒప్పుగా వహిస్తాం. అవమానం పొందీ మునుపు మేము వాళ్ళ అవగుణాలు సహించి ఉండటం నీకూ కొంచెం తెలుసు. ఇంతెందుకు?

ఉ. ఇంకను నట్ల కాఁ దలఁపు; మే మొక కీడునకుం దొడంగ; మా
శంకలు దక్కు; మయ్యకు విచారము గల్గెనయేని, బాంధవం
బంకుర మొత్త, మా వలన నక్కటికం బొలయంగ, మమ్ము నే
వంకకుఁ బోవనీక, గరువంబు జగంబు ప్రశంస సేయఁగన్. 326

ప్రతిపదార్థం: ఇంకనున్= ఇకమీదట కూడా; అట్లు+అ= అట్లాగే; కాన్+తలంపుము= అవునని తలంచే; ఏము= మేము; ఒక కీడునకున్= ఒక అపకారానికి కూడా; తొడంగము= పూనుకొనము; ఆ శంకలు+తక్కుము= ఆ అనుమానాలు విడిచిపెట్టుము; అయ్యకున్= తండ్రి అయిన ధృతరాష్ట్రుడికి; విచారము= వివేకం (సరి అయిన ఆలోచన); కల్గెన్+అ+ఏనిన్= ఉంటే; బాంధవంబు= చుట్టరికం; అంకురము+ఒత్తన్= మళ్ళీ మొలకెత్తగా; మా వలనన్= మామీద; అక్కటికంబు= కనికరం; ఒలయంగన్= కలుగగా; మమ్మున్; ఏ వంకకున్= ఎక్కడికీ; పోవన్+ఈక= వెళ్ళనీయక; గరువంబున్= గొప్పతనాన్ని; జగంబు= లోకం; ప్రశంస+చేయఁగన్= పొగడగా.

తాత్పర్యం: ఇక మీదట కూడా అట్లాగే సహించి ఉంటామని యెంచుము; మేము ఒకఅపకారానికి కూడా పూనుకొనము. ఆ అనుమానాలు విడిచిపెట్టుము. తండ్రిఅయిన ధృతరాష్ట్రుడికి వివేకం కనక ఉన్నట్లయితే, చుట్టరికం మళ్ళీ మొలకెత్తేటట్లు మాపై దయయుంచి మమ్ములను ఎక్కడికీ వెళ్ళనీయక తన గొప్పతనం లోకులు ప్రశంసించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. రండని పిలువఁ బనిచి, పా । లిండని కొడుకులకుఁ జెప్పి, యింద్ర ప్రస్థం
బొండెను, వేఱొక పట్టణ । మొండెను మా కిచ్చి యనుచు టుచితము కాదే?' 327

ప్రతిపదార్థం: రండు+అని; పిలువన్+పనిచి= పిలిపించి; పాలు+ఇండు+అని= భాగం ఇవ్వండి అని; కొడుకులకున్+చెప్పి; ఇంద్రప్రస్థంబు+ఒండెను= ఇంద్రప్రస్థమో; వేఱు+ఒక, పట్టణము+ఒండెను= ఇంకో పట్టణమో; మాకున్, ఇచ్చి; అనుచుట= పంపటం; ఉచితము+అ కాదే?= మంచిది కాదా?

తాత్పర్యం: రండి అని పిలిపించి, వాళ్ళకు భాగం ఇవ్వండి అని తన కొడుకులకు చెప్పి, ఇంద్రప్రస్థమో, లేదా ఇంకో పట్టణమో మా కిచ్చి పంపటం మంచిది కాదా?'

ఉ. నా విని సంజయుండు నరనాథున కిట్లను 'నెట్టి తప్పులుం
బోవఁగఁ ద్రోచి తాలిమియ పూనుదు గావున నిన్నిమాట లి
ట్లీవు వినంగ నాడియును, నేఁ దనివోవక విన్నవించెదన్
నీ విభవం బహింసయు ననింద్యచరిత్రమ కాక యన్యమే? 328

ప్రతిపదార్థం: నాన్+విని= అని ధర్మరాజు అనగా విని; సంజయుండు; నరనాథునకున్= రాజుకు; ధర్మరాజుతో; ఇట్లు+అనున్; ఎట్టితప్పులున్= ఎటువంటి తప్పులనైనా; పోవఁగన్+త్రోచి= పోనీలే అని త్రోసివైచి; తాలిమి+అ= సహనమే; పూనుదు(వు)+ కావునన్= వహిస్తావు కాబట్టి; ఈవు= నీవు; వినంగన్= వినేటట్లు; ఇట్లు= ఇట్లా; ఇన్ని మాటలు; ఆడియును= పలికీ; నేన్= నేను; తనివి+పోవక= తృప్తిపడక; విన్నవించెదన్= మనవి చేస్తాను; నీ విభవంబు= నీ ఐశ్వర్యం; అహింసయున్= అహింసా; అనింద్య చరిత్రము+అ+కాక= నిందించ దగని నడవడే కాక; అన్యము+ఏ?= ఇంకొకటి కాదు కదా!

తాత్పర్యం: అని ధర్మరాజు అనగా విని సంజయుడు అతడితో ఇట్లా అన్నాడు- 'నీవు ఎట్లాంటి తప్పులనైనా పోనీలే అని ఉపేక్షించి సహనమే వహిస్తావు కాబట్టి నీవు వినేటట్లు ఈ విధంగా ఇన్నిమాటలు పలికి, నేను తృప్తి పడక ఇంకా మనవి చేస్తాను. నీ ఐశ్వర్యం, అహింసా, అనింద్యమైన నడవడీ తప్ప వేరొకటి కాదు కదా!

విశేషం: అహింసా సచ్చరితలే ఐశ్వర్యంగా గల నీవంటి వాడు రాజ్యభాగం కొరకు అంతగా పట్టించుకొనగూడదని సంజయుడి సూచన.

క. పా లీక కౌరవులు దు । శ్శీలతఁ జెడఁ దలఁచిరేనిఁ, జెప్పెద, రుధిరా
భీలాన్నంబునకంటెను । మేలగు భిక్షాన్నమైన మీ నడవడికిన్. 329

ప్రతిపదార్థం: కౌరవులు, పాలు= భాగం; ఈక= ఇయ్యక; దుశ్శీలతన్= దుష్టస్వభావంతో; చెడన్+తలఁచిరి+ఏనిన్= చెడిపోవాలనుకొన్నా; చెప్పెదన్= చెపుతాను; మీ నడవడికిన్= మీ సత్ప్రవర్తనకు; రుధిర+ఆభీల+అన్నంబునకంటెను= నెత్తుటితో భయంకరమైన కూటికంటె; భిక్షా+అన్నము+ఐనన్= బిచ్చపు కూడైనా; మేలు+అగున్= మంచిది.

తాత్పర్యం: కౌరవులు దుష్టస్వభావులై మీకు రాజ్యభాగం ఇవ్వక చెడిపోవాలనుకొన్నా, చెపుతున్నాను వినుము మీ సత్ప్రవర్తనకు భయంకరమైన నెత్తుటికూటికంటె, బిచ్చపుకూడుతినటం మేలు.

విశేషం: 'రుధిరాభీలాన్నం' యుద్ధం చేయగా లభించే అన్నం. యుద్ధంలో శత్రువీరులను చంపగా లభించే అన్నం కాబట్టి అది 'ఆభీలం'= భయంకరంగా ఉంటుంది. కౌరవులు దుష్టులు. వాళ్ళు చచ్చినా మీకు భాగం ఇవ్వరు. అయినా సరే మీరు ఆ నెత్తుటి కూడుకొరకు ఆశించక, అడుక్కొని అయినా తిని బ్రతకటం నయం - అని ధర్మరాజుకు సంజయుడి సూచన.

వ. అది యెట్లంటేని. 330

తాత్పర్యం: నెత్తుటి కూటికంటె బిచ్చపుకూడు ఎట్లా నయం అంటావేమో.

సీ. రాజసూయ మహాధ్వరం బట్లు నడపి స । ద్విజులకు సురలకుఁ దృప్తిఁ జేసి,
శాంతియు దాంతియు సకలలోకంబులఁ । బొగడొంద బ్రదికిన పుణ్యమూర్తి
విట్టి నీ చరితంబు హింసాకళంకిత । మగు టెంత యొప్పదు? నదియుఁగాక
దుర్ణయవృత్తి దుర్ద్యూతంబు పుట్టించి । యంతలు సేసిన యట్టివారి

తే. నేల గర్వంబు సెల్లంగ నిచ్చి, జగము । చేతఁ దిట్టులు వడునట్లు సేసి పోయి
తేల? యడవుల నిమ్మెయి నిడుమ గుడిచి । తేల? తాల్మియ ధనముగా నింత వడితి. 331

ప్రతిపదార్థం: రాజసూయ మహత్(మహా)+అధ్వరంబు= రాజసూయ మహాయజ్ఞం; అట్లు= అంత గొప్పగా; నడపి= చేసి; సత్+ద్విజులకున్= ఉత్తమ బ్రాహ్మణులకూ; సురలకున్= దేవతలకూ; తృప్తిన్+చేసి= సంతుష్టి కలిగించి; శాంతియున్= అంతరింద్రియ నిగ్రహమూ; దాంతియున్= కర్మేంద్రియ నిగ్రహమూ; సకల లోకంబులన్= అన్ని లోకాలలోనూ; పొగడు+ ఒందన్= ప్రశంస పొందేటట్లే; బ్రదికిన పుణ్యమూర్తివి= బ్రదికిన పుణ్యాత్ముడవు; ఇట్టి నీ చరితంబు= ఇటువంటి నీ నడవడి; హింసా+అకళంకితము+అగుట= హింసచేత కలుషితం కాకపోవటం; ఎంత+ఒప్పదున్?= ఎంత బాగుండదు! ఎంతో బాగుంటుందని భావం; అదియున్+కాక= అదీకాక; దుర్ణయ వృత్తిన్= అవినీతి పద్ధతితో; దుర్ద్యూతంబు= దుష్టమైన జూదం; పుట్టించి= ఏర్పాటు చేసి; అంతలు+చేసిన+అట్టివారిన్= అంతటి ఘోరాలు చేసిన వాళ్ళను; ఏల= ఎందుకు; గర్వంబు+చెల్లంగన్+ ఇచ్చి= గర్వం చెల్లనిచ్చి; ఏల; జగముచేతన్= లోకంచేత; తిట్టులు+పడు+అట్లు+చేసి= తిట్లు పడేటట్లుచేసి; పోయితి(వి), ఏల; అడవులన్; ఇమ్మెయిన్(ఈ+మెయిన్)= ఈ విధంగా; ఇడుమ+కడిచితి(వి)?= కష్టా లనుభవించావు?; తాల్మి+అ= ఓరిమే; ధనము+కాన్= ధనంగా; ఇంత+పడితి(వి)= ఇంతపడ్డావు.

తాత్పర్యం: రాజసూయ మహాయజ్ఞం అంత వైభవోపేతంగా చేసి బ్రాహ్మణోత్తములకూ, దేవతలకూ సంతృప్తి కలిగించి, నీ శాంతీ, నీ కర్మేంద్రియ నిగ్రహమూ లోకాలలో ప్రశంస పొందేటట్లు బ్రదికిన పుణ్యాత్ముడవు. ఇటువంటి నీ నడవడి హింసతో కలుషితం కాకుండా ఉంటే ఎంత బాగుంటుంది! అదీకాక దుర్నీతితో కపటద్యూతం ఏర్పాటు చేసి అంతంత ఘోరాలు చేసిన వాళ్ళ గర్వం ఎందుకు చెల్లనిచ్చావు? లోకులచేత తిట్లు తినేటట్లు ఎందుకు చేశావు? అడవులలో ఈ విధంగా ఎందుకు కష్టపడ్డావు? ఓరిమే ధనంగా ఇన్నిపాట్లు పడ్డావు.

విశేషం: భిక్షాన్నానికి తగిన ప్రవర్తన శమదమాదిగుణాల వలన కలుగుతుంది. అట్టి శాంతిని, దాంతిని ధర్మజుడి ప్రవర్తనలో సంజయుడు నిరూపిస్తున్నాడు. రాజ్యాలను జయించి, రాజసూయం చేసి, అపారసంపదలను దానం చేసి దేవతలను, బ్రాహ్మణులను తృప్తిపరచటంలో శాంతిదాంతులు ప్రదర్శితమయ్యాయి. దుర్ద్యూతంలో వంచించి సంపదలు హరించి గర్వంతో పాండవులను అవమానించిన కౌరవులను ప్రజల నిందలకు వదిలివేసి, అరణ్యాజ్ఞాత వాసాలకు పోవటం కూడా శమదమాదుల వలననే. ఆ రెండు సందర్భాలలో కూడా పాండవులు భౌతిక రాజ్య సంపదల మీద తృష్ణను ప్రకటించలేదు. అది శమ దమ చిత్తవృత్తులు గల విరక్తుల స్వభావం. పాండవ ప్రవర్తన అట్లాగే ఉన్నదని సంజయుడు వ్యాఖ్యానించి వారికి సహనమే యోగ్యమైనదని సోదాహరణంగా వ్యాఖ్యానించాడు. (సంపా.)

క. తుదిఁ బోయి క్రూర కర్మా । స్పదమగు తెఱఁగునకుఁ జొచ్చి, బంధుల గురులన్
వెదకి వధియించు సౌఖ్యం । బది యేటికి, నార్యనింద్య మస్థిర మరయన్. 332

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తుదిన్+పోయి= చివరకు వెళ్ళి; క్రూర కర్మ+ఆస్పదము+అగు తెఱఁగునకున్+చొచ్చి= క్రూరపు పనికి చోటయిన పద్ధతికి పూని-యుద్ధానికి పూనుకొని; బంధులన్= చుట్టాలనూ; గురులన్= పెద్దలనూ; వెదకి; వధియించు+అట్టి సౌఖ్యంబు= చంపగా కలిగే సౌఖ్యం; అది+ఏటికిన్?= అది ఎందుకు?; అరయన్= పరిశీలించగా; ఆర్య నింద్యము= పెద్దలు నిందించేది; అస్థిరము= నిలకడలేనిదీ.

తాత్పర్యం: అట్లాంటి బ్రదుకు బ్రతికి, చివరకు క్రూరకర్మకు ఆస్పదమైన యుద్ధమార్గం అవలంబించి బంధువులను పెద్దలనూ వెదకి చంపటం వలన కలిగే సుఖం ఎందుకు? పరిశీలించగా ఆ సౌఖ్యం పెద్దలు నిరసించేదీ, నిలకడలేనిదీను.

విశేషం: శమంవలన శాంతం ఏర్పడుతుంది. శాంతం వలన అహింసా ప్రవృత్తి కలుగుతుంది. 'అహింసా పరమో ధర్మః' అని వేదోక్తి. ఇంతవరకు అహింసా వ్రతం నడిపి, ఇప్పుడు యుద్ధమనే క్రూరకర్మకు పూనుకొనటం నివృత్తి ధర్మ విరుద్ధం కాబట్టి, ధర్మరాజు శాంతుడై ఉండిపోతే. పెద్దలను చంపి సంపదను సాధించే పాపం లేకుండా పోతుంది. ఒకవేళ అట్లా వచ్చిన సంపదకూడా అనిత్యమని తెలిసి తరువాత నిర్వేదం పొందే అవసరం లేకుండా పోతుంది- అని సంజయుడు ధర్మరాజుకు బోధించాడు. సాత్త్వికుడైన యుధిష్ఠిరుడు దానికి సమ్మతించవచ్చునని భ్రమించాడు.(సంపా.)

తే. **అల్పులకు మ్రింగఁ జేఁదైన హాలహలము । భంగిఁ బొంగెడు కోపంబు మ్రింగికొనఁగ**
నీలగళు నెన్ని నిన్నెన్నఁబోలు; నట్టి । నీవు సాలినఁ గా కేల నెగడుఁ బేరు?' **333**

ప్రతిపదార్థం: అల్పులకున్= తక్కువవారికి; మ్రింగన్= మ్రింగటానికి; చేఁదు+ఐన; హాలహలము భంగిన్= హాలాహలం వలె; పొంగెడు కోపంబున్= పొంగే కోపాన్ని; మ్రింగికొనఁగన్; నీలగళున్= నీలకంఠుడిని-ఈశ్వరుడిని, ఎన్ని= లెక్కించి; నిన్నున్; ఎన్నన్+పోలున్= లెక్కించదగును; అట్టి నీవు= అట్లాంటి నీవు; చాలినన్+కాక= సమర్థించకపోతే; పేరు= కీర్తి; ఏల= ఎట్లా; నెగడున్?= వస్తుంది?

తాత్పర్యం: క్షుద్రులకు మ్రింగటానికి చేదుగా ఉండే హాలాహలం వలె పొంగే కోపాన్ని దిగమ్రింగటంలో నీలకంఠుడి తరువాత నీవే అని చెప్పవచ్చును. అటువంటి నీవు కోపోపశమనానికి పూనుకోకపోతే నీకు పేరెట్లా వస్తుంది?'

విశేషం: అలం: ఉపమ, పరికరాంకురం. రాజ్యభాగం లేకున్నా ధర్మరాజు యుద్ధంవైపు మొగ్గకుండా ఉండటానికి సంజయుడు అతడిని ఆకాశం మీదకు ఎత్తేస్తున్నాడు. వట్టి పొగడ్తలకు ఉబ్బిపోయేవాడు కాడు ధర్మరాజు. హాలహలము భంగిఁ బొంగెడు కోపంబు - అలంకారం ఉపమ. ఈశ్వరుడికి నీలగళ శబ్దం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరాంకురం.

చ. **అనవుడుఁ బాండురాజతనయాగ్రణి సంజయుమోముఁ జూచి యి**
ట్లను; 'నది యెల్ల నీ పలికినట్టిద; ధర్మువులట్ల యుండి బో
ధను లరయంగ వచ్చిన నధర్మములై చెడుఁ గొన్ని; ధర్మ వ
ర్తనములు గాక తోఁచి తుది ధర్మములై చనుఁ గొన్ని కర్మముల్. **334**

ప్రతిపదార్థం: అనవుడున్= అని సంజయుడు అనగానే; పాండురాజ తనయ+అగ్రణి= పాండురాజు యొక్క కొడుకులలో పెద్దవాడు ధర్మరాజు; సంజయు మోమున్= సంజయుడి ముఖం; చూచి; ఇట్లు+అనున్; అది ఎల్లన్= నీవు చెప్పినదంతా; నీ పలికిన+అట్టిది+అ= నీవు చెప్పినట్లే, నీ మాట యథార్థమే; కొన్ని(కర్మములు)= కొన్ని పనులు; ధర్మువులు+అట్లు+అ+ఉండి=

ధర్మాలవలెనే పైకి కనిపించి; బోధనులు= తెలిసినవాళ్ళు; అరయంగన్+వచ్చినన్= పరిశీలించవస్తే; అధర్మములు+ఐ; చెడున్= పోతాయి; కొన్ని కర్మముల్; ధర్మ వర్తనములు+కాక+తోఁచి= ధర్మాలవలె అనిపించక; తుదిన్= చివర; ధర్మములు+ఐ+చనున్= ధర్మాలయి ఒప్పుతాయి.

తాత్పర్యం: అని సంజయుడు అనగానే, ధర్మరాజు సంజయుడి ముఖంవైపు చూచి ఇట్లా అన్నాడు.' అదంతా నీవు చెప్పినట్లే, కొన్ని పనులు పైకి ధర్మాలవలె కనిపించి, తెలిసినవాళ్ళు పరిశీలిస్తే ధర్మాలు కాకుండా పోతాయి. మరికొన్ని పనులు ధర్మాలవలె మొదట అనిపించక చివరకు ధర్మాలయి ఒప్పుతాయి.

విశేషం: 'నేను యుద్ధం చేస్తా ననటం పైకి అధర్మం వలె తోచవచ్చును. కాని, తెలిసిన వాళ్ళెవరైనా రాజ్యభాగం లేకపోతే నేను యుద్ధానికి దిగటం ధర్మమే అని చెపుతారు-' అని ధర్మరాజు అభిప్రాయం. తరువాతి వచనంలో ఈ అభిప్రాయం స్పష్టపడుతుంది.

వ. **కావున నన్ను దూఱఁదలంచితేని నా చేయునది ధర్మం బధర్మంబని నిరూపించి మఱి దూఱుము; కోపంబు నివారింపం దగు; నహింసయ యుత్తమధర్మం బగు; నట్లయినను వంశదూషకులును, లోకకంటకులును నగు పాపాత్ముల నిర్మూలంబుగాఁ జెఱుచుట ధర్మంబని పెద్దలచేత వింధు; మది యట్లుండె; సంగ్రామంబు రాజులకు ధర్మం బవుంగాదని నీవచెప్పు; మట్లుంగాక యిది కర్తవ్యం బిది యకర్తవ్యం బని మనల శాసింప వాసుదేవుండు గలండు; మన కీ వితర్కం బేటికి? నితండు ధర్మాధర్మవిదులకు గురుండు, కార్యాకార్య నిరూపకులకు శిక్షకుం, డుచితానుచితజ్ఞులకుఁ బ్రదర్శకుం; డితని పంపునంగాదె యదు భోజాంధక వృష్ణి సృంజయ కేకయ ప్రభృతి భూపతి ప్రకరంబు ప్రశస్త పథంబునం బ్రవర్తిల్లుచున్నయది; విశేషించి మాకు నితని బుద్ధియ సమస్త పురుషార్థమ్ములకు మూలం బగుట నితని వచనం బవశ్యంబు నలంఘనీయం' బనిన విని జనార్దనుండు సంజయున కిట్లనియె.** **335**

ప్రతిపదార్థం: కావునన్, నన్నున్; దూఱన్+తలంచితి(వి)+ఏనిన్= నిందించాలనుకొంటే; నా చేయునది= నేను చేసేది; ధర్మంబు+అధర్మంబు+అని నిరూపించి= ధర్మమో అధర్మమో నిరూపించి; మఱి దూఱుము= మరీ నిందించుము; కోపంబు; నివారింపన్+తగున్= విడనాడటం ఉచితం; అహింస+అ= అహింసే; ఉత్తమ ధర్మంబు+అగున్= పరమ ధర్మం అవుతుంది; అట్లు+అయినను= అయినప్పటికీ; వంశ దూషకులును= వంశానికి చెడ్డపేరు తెచ్చేవాళ్ళూ; లోక కంటకులునున్= లోక బాధకులూ; అగు పాప+ఆత్ములన్= అయిన దుర్మార్గులను; నిర్మూలంబు+కాన్+చెఱుచుట= మొదలంటా చెరచటం; ధర్మంబు+అని; పెద్దలచేతన్; విందుము; అది+అట్లు+ఉండెన్; సంగ్రామంబు= యుద్ధం; రాజులకున్; ధర్మంబు; అవును+కాదు+అని, నీవు+అ, చెప్పుము, అట్లున్+కాక= అదీకాక; ఇది; కర్తవ్యంబు= చేయదగినది; ఇది; అకర్తవ్యంబు+అని= చేయదగనిది అని; మనలన్; శాసింపన్= ఆజ్ఞాపించటానికి; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; కలండు; మనకున్, ఈ వితర్కంబు+ ఏటికిన్= ఈ సంశయం ఎందుకు?; ఇతండు; ధర్మ+అధర్మ విదులకున్= ధర్మాధర్మాలు తెలిసినవాళ్ళకు; గురుండు= పెద్ద; కార్య+అకార్య నిరూపకులకున్= చేయదగిన, చేయదగని వాటిని నిర్ణయించేవారికి; శిక్షకుండు= గురువు; ఉచిత+అనుచితజ్ఞులకున్= మంచిఏదో చెడ్డఏదో తెలిసిన వారికి; ప్రదర్శకుండు= విశదీకరించేవాడు; ఇతని పంపునన్+కాదె= ఇతడి ఆజ్ఞచేతకదా; యదు భోజ+అంధక వృష్ణి, సృంజయ, కేకయ, ప్రభృతి, భూపతి, ప్రకరంబు= యదువులూ, భోజులూ, అంధకులూ, వృష్ణులూ, సృంజయులూ, కేకయులూ మొదలుగా గల రాజుల సమూహం; ప్రశస్త పథంబునన్= సన్మార్గంలో; ప్రవర్తిల్లుచున్+ ఉన్నఅది= నడుస్తున్నది; విశేషించి= ముఖ్యంగా; మాకున్= మాకు; ఇతని బుద్ధి+అ= ఇతడి తెలివే; సమస్త పురుషార్థమ్ములకున్= ధర్మార్థ

కామమోక్షాల కన్నింటికీ; మూలంబు+అగుటన్= పునాది అవటంచేత; ఇతని వచనంబు= ఇతడి మాట; అవశ్యంబున్= తప్పక; అలంఘనీయంబు= దాటరానిది; అనినన్; విని; జనార్దనుండు= కృష్ణుడు; సంజయునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కాబట్టి నన్ను నిందించాలనుకొంటే నేను చేసేది ధర్మమో, అధర్మమో నిర్ణయించి మరీ నిందించుము. కోపం విడనాడవలసిందే. అహింసే పరమధర్మం. అయినా వంశానికి చెడ్డపేరు తెచ్చేవాళ్ళూ, లోకానికి బాధకలిగించేవాళ్ళూ అయిన దుష్టులను మొదలంటా చెరచటం ధర్మమని పెద్దలవలన వింటాం. అది అట్లా ఉండనీ. యుద్ధం రాజులకు ధర్మం అవునో కాదో నీవే చెప్పుము. అదీకాక ఇది చేయదగింది, ఇది చేయదగనిది అని మనలను ఆజ్ఞాపించటానికి శ్రీకృష్ణు డున్నాడు, మన కీ సంశయం ఎందుకు? ఇతడు ధర్మాధర్మవేత్తలకు పెద్ద. కార్యాకార్య నిర్ణాయకులకు గురువు. ఉచితానుచితాలు తెలిసినవాళ్ళకు విశదీకరించేవాడు. ఇతడి ఆజ్ఞచేతనేకదా యదు భోజాంధక వృష్ణి సృంజయ కేకయాదులైన రాజుల సమూహం సన్మార్గంలో నడుస్తున్నది. ముఖ్యంగా మాకు ఇతడి తెలివే ధర్మార్థ కామమోక్షాల కన్నింటికీ మూలాధారం అవటంచేత ఇతడి మాట మాకు తప్పక అనతిక్రమణీయం-' అనగా విని శ్రీకృష్ణుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 1. ధర్మజుడు సంజయుడి వాదనను మెత్తగా కుశలంగా ఖండిస్తున్నాడు. మొదట ధర్మజుడు చేసే యుద్ధ ప్రయత్నం అతడి ప్రవర్తనకు తగినదా కాదా అన్నది ప్రస్తుత సమస్య కాదన్నాడు. అది ధర్మమా? అధర్మమా? అన్నది అసలు సమస్య అన్నాడు. దానిని ముందుగా నిర్ణయించి తనను సహేతుకంగా నిందించుమని హెచ్చరిక చేశాడు. అంటే సంజయుడి వాదానికి సరైన భూమిక లేదనీ, అప్రస్తుతమనీ, అనవసరమనీ తేల్చిచెప్పాడు.

2. సంజయుడు ధర్మాన్నే ప్రాతిపదికగా తీసికొంటే- వంశకంటకులనూ, లోక కంటకులనూ, పాపాత్ములనూ సమూలంగా సంహరించటం ధర్మం- అనే కొలమానంతో ధర్మజుడి యుద్ధం ధర్మమా? అధర్మమా? నిశ్చయించుమన్నాడు. యుద్ధం రాజులకు ధర్మమా? అధర్మమా? నిశ్చయించుమన్నాడు.

3. అయితే ధర్మరాజుకు సంజయుడు చెప్పిన ధర్మం ఉచితమా? క్షత్రియధర్మం ఉచితమా? అని తేల్చిచెప్పదగిన పరమ ధర్మవిదుడూ, ఉత్తమ న్యాయవిదుడూ శ్రీకృష్ణుడని నిర్దేశించాడు. ఇప్పుడు సంజయుడొకపక్షం. ధర్మజుడో పక్షం. న్యాయాధికారి శ్రీకృష్ణుడు. (సంపా)

4. సంజయ ధర్మరాజుల మాటలు వింటూ ఇప్పటివరకూ మౌనంగా ఉన్న శ్రీకృష్ణుడు ధర్మరాజు తన పేరెత్తగానే మాటాడటానికి ఉపక్రమిస్తున్నాడు.

ఉ. **'పాండుతనూజకోటికి శుభం బెడఁ గోరుదు నెప్డు; నాంబికే**
యుండును బుత్త్ర పౌత్త్ర మహిమోజ్జ్వలుఁ; డక్కట చేటు మేలె యం
చుండుదు; నట్లుగాక తెలివొంది యతం డిట వీరిఁ దేర్పఁగా
నిండుమనంబుతోఁ బనిచె ని న్నని దీనికిఁ బ్రీతిఁ బొందితిన్. **336**

ప్రతిపదార్థం: ఎప్డున్= ఎప్పుడూ; పాండు తనూజ కోటికిన్= పాండవుల సమూహానికి; శుభంబు= మేలు; ఎడన్= హృదయంలో; కోరుదున్= ఆకాంక్షిస్తాను; ఆంబికేయుండును= ధృతరాష్ట్రుడు కూడా; పుత్త్ర పౌత్త్ర మహిమ+ఉజ్జ్వలుఁడు= కొడుకుల, మనుమల గొప్పతనంతో ప్రకాశించేవాడు; అక్కట= అయ్యో!; చేటు= అశుభం; మేలు+ఎ= మంచిదా; అంచున్+ఉండుదున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంటూ ఉంటాను; అట్లు+కాక= ఎవరికీ అశుభం కాకుండా; అతండు= ఆ ధృతరాష్ట్రుడు; తెలివి+ఒంది= జ్ఞానం కలిగి; వీరిన్= పాండవులను; తేర్పఁగాన్= ఓదార్చటానికి; నిన్నున్; నిండు మనంబుతోన్= నిండు మనస్సుతో; ఇటన్= ఇక్కడికి; పనిచెన్+అని= పంపాడని; దీనికిన్; ప్రీతిన్+పొందితిన్= సంతోషించాను.

తాత్పర్యం: 'నేను ఎప్పుడూ పాండవులకు హృదయంలో మేలు ఆకాంక్షిస్తూ ఉంటాను. ధృతరాష్ట్రుడు కూడా కొడుకుల మనుమల కలిమి అనే గొప్పతనంతో ప్రకాశించేవాడు. పాపం, అతడికి అశుభం మంచిదా అంటూ ఉంటాను. అట్లా ఎవరికీ అశుభం కాకుండా ధృతరాష్ట్రుడు జ్ఞానం తెచ్చుకొని పాండవులను ఓదార్చటానికి నిన్ను నిండుమనస్సుతో ఇక్కడికి పంపాడని దీనికి సంతోషించాను.

ఆ. నీవు నుచితవృత్తి నెయ్యంబు, ధర్మంబు। వినయ మొప్పఁ దెలిపి, వీరు శాంతిఁ
బొందునట్టి భంగి పాసఁగఁ బల్కుటయును। నాకు సమ్మదం బొనర్చె నిపుడు. 337

ప్రతిపదార్థం: నీవున్= నీవు కూడా; ఉచిత వృత్తిన్= సముచితంగా; నెయ్యంబు= స్నేహమూ; ధర్మంబు= ధర్మమూ; వినయము= మర్యాదా; ఒప్పన్= ఒప్పేవిధంగా; తెలిపి= చెప్పి; వీరు= పాండవులు; శాంతిన్+పొందు+అట్టి భంగి= శాంతించే విధం; పొసఁగన్= కలిగేటట్లు; పల్కుటయును= మాటలాడటం కూడా; నాకున్; ఇపుడు; సమ్మదంబు= సంతోషం; ఒనర్చెన్= కలిగించింది.

తాత్పర్యం: నీవుకూడా సముచితంగా స్నేహమూ, ధర్మమూ, మర్యాదా ఒప్పేటట్లు చెప్పి వీరు శాంతించే మార్గం ఏర్పడే విధంగా మాటాడటం కూడా నాకు ఇప్పుడు సంతోషం కలిగించింది.

ఆ. అనఘ! యిట్టు లంతయును దలఁపం గడు। నెనసినట్టు లుండెనేని వింటె?
పాండవాగ్రజన్ము పలుకుల చందంబు। సూడ సంధి లేని చొప్పు దోఁచె. 338

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఇట్టులు= ఈ విధంగా; అంతయును= అంతా; తలఁపన్= ఆలోచించగా; కడున్= మిక్కిలి; ఎనసిన+అట్టులు+ఉండెన్+ఏనిన్= పొందుపడినట్లు ఉన్నప్పటికీ; వింటివి+ఎ?= విన్నావా?; పాండవ+అగ్రజన్ము పలుకుల చందంబు= ధర్మరాజు మాటలతీరు; చూడన్= చూడగా; సంధి లేని చొప్పు= సంధి లేని విధం; తోఁచెన్= స్ఫురించింది.

తాత్పర్యం: పాపరహితుడా, సంజయా! ఈ విధంగా అంతా చూడగా ఎంతో పొందుపడినట్లు ఉన్నప్పటికీ విన్నావు కదా! ధర్మరాజు మాటలతీరు చూస్తే సంధి కుదరని వైనం స్ఫురిస్తున్నది.

క. అది యట్టిద; సంధానము। దుది నెమ్మెయిఁ గల్గు? నెట్లు దుర్యోధనుఁ డు
న్మదుఁడు; ధృతరాష్ట్రభూవిభు। హృదయంబు తెఱంగు గొంత యెఱుఁగుదుము కదా! 339

ప్రతిపదార్థం: అది+అట్టిది+అ= అది అంతే- ధర్మరాజు అభిప్రాయం సరిఅయినదే; సంధానము= సంధి; తుదిన్= చివర జరగవలసినవన్నీ జరిగాక; ఏ+మెయిన్= ఏ రీతిగా; కల్గున్?= సిద్ధిస్తుంది; దుర్యోధనుఁడు; ఎట్లున్= ఎటు చూసినా; ఉన్మదుఁడు= ఉన్మత్తుడు, మహాగర్వి; ధృతరాష్ట్ర భూవిభు, హృదయంబు= ధృతరాష్ట్ర మహారాజు మనోరీతి; కొంత= కొంచెం; ఎఱుఁగుదుము కదా!= మనకు తెలుసుకదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అది అంతే, ధర్మరాజు అభిప్రాయం సరియైనదే. జరుగవలసిన వన్నీ జరిగాక సంధి ఎట్లా పొసగుతుందయ్యా? ఎటు చూసినా దుర్యోధనుడు మహాగర్వి, ధృతరాష్ట్ర మహారాజు హృదయం మనకు కొంచెం తెలుసుకదా!

క. ఆ రాజు సేయు నెయ్యము । గారామును జెప్పె దీవు గడుఁ దీపులుగా
వీరు దమ పాలు వడయక । నేరిమి మాటలన తీర నేర్తురె చెపుమా! 340

ప్రతిపదార్థం: ఆ రాజు= ఆ ధృతరాష్ట్రుడు; చేయు= చూపే; నెయ్యమున్= స్నేహమూ; గారామును= ఆదరమూ; ఈవు= నీవు; కడున్+తీపులు+కాన్= ఎంతో మధురంగా; చెప్పెదు(చెప్పెదవు)= చెపుతావు; వీరు= పాండవులు; తమ పాలు= తమ భాగం; పడయక= పొందకుండా; నేరిమి మాటలన్+అ= చతురవచనాలతోటే; తీరన్+నేర్తురె= సంతృప్తిపడగలరా? చెపుమా= చెప్పుము.

తాత్పర్యం: ఆ రాజు ధృతరాష్ట్రుడు చూపే స్నేహమూ, ఆదరమూ నీవు ఎంతో మధురంగా చెపుతావు. వీరు తమరాజ్యభాగం పొందకుండా వట్టి చతుర వచనాలతోటే తృప్తి పొందుతారా? నీవే చెప్పుము.

ఉ. వీరలు పెద్ద ద్రవ్వ, కొకవెంట నొడంబడి, తేటి శాంతులై
కౌరవకోటిఁ గూడి మనఁగా మదిఁ గోరుట పెంపుఁ దాల్మియుం,
గారుణికత్వముం దగవుఁ గాదె? జగంబున పాడిఁ దండ్రిపా
లీరని తెంపు సేసి పయినెత్తిన నెత్తిరిగాక ద్రోహమే? 341

ప్రతిపదార్థం: వీరలు= పాండవులు; పెద్ద త్రవ్వక= జరిగినవన్నీ ఎక్కువగా త్రవ్వుకోకుండ; ఒకవెంటన్+ఒడంబడి= ఏదో ఒక పద్ధతికి అంగీకరించి; తేటి= ఊరట చెంది; శాంతులు+ఐ= ఉపశమించినవారయి; కౌరవ కోటిన్= కౌరవుల సమూహంతో; కూడి= కలిసి; మనఁగాన్= బ్రదకటానికి; మదిన్= మనస్సులో; కోరుట; పెంపున్= గొప్పతనమూ; తాల్మియున్= ఓరిమీ; కారుణికత్వమున్= కనికరమూ; తగవున్= న్యాయమూ; కాదె?= కాదా?; జగంబున పాడిన్= లోకధర్మం ప్రకారం; తండ్రి పాలు= తమ తండ్రి భాగం; ఈరు+అని= ఇవ్వరని; తెంపు+చేసి= తెగించి; పయిన్+ఎత్తినన్+ఎత్తిరి+కాక= మీదపడితే పడతారు (దండెత్తితే దండెత్తుతారు); ద్రోహమే?= అది ద్రోహ మవుతుందా?

తాత్పర్యం: పాండవులు పూర్వం జరిగినవన్నీ పెద్దగా త్రవ్వుకోకుండా ఏదో ఒక పద్ధతికి అంగీకరించి ఊరట చెంది శాంతం వహించి కౌరవులతో కలిసి బ్రదకటానికి అంగీకరించారంటే, అది గొప్పతనమూ, ఓరిమీ, కనికరమూ, ధర్మమూ కాదా? లోకాచారాన్ని బట్టి తమతండ్రి భాగం వారు ఇవ్వటం లేదని తెగించి దండెత్తితే దండెత్తుతారు, అది ద్రోహ మెట్లా అవుతుంది?

క. విను మవమానము పడి యి । ట్లునికిఁ బడయు పొగడు కంటె, నుజ్జ్వలులై మా
ర్కొనిన నది లెస్స; యెట్లయి । నను వీరికిఁ బోటు మేలు నాకుం జూడన్. 342

ప్రతిపదార్థం: వినుము; అవమానముపడి= పరాభవం పొంది; ఇట్లు+ఉనికిన్= ఇట్లా ఉండటం చేత; పడయు పొగడు కంటెన్= పొందే పొగడ్తకన్నా; ఉజ్జ్వలులు+ఐ= ప్రకాశించే వారయి; మార్కొనినన్= ఎదుర్కొంటే; అది లెస్స= అది మంచిది; నాకున్+చూడన్= నా దృష్టిలో; ఎట్లు+అయినను= ఎట్లా అయినా; వీరికిన్= పాండవులకు; పోటు= యుద్ధం; మేలు= మంచిది.

తాత్పర్యం: సంజయా! వినుము. పరాభవం పొంది ఇట్లా దీనంగా ఉండటం వలన కలిగే పొగడ్తకన్నా, తేజస్వులై ఎదుర్కొంటే, అది మంచిది. నాకు చూడగా ఎట్లా అయినా వీరికి యుద్ధమే మంచిది.

వ. 'సంగ్రామంబు రాజులకు ధర్మం బవుంగాదని నీవ చెప్పు'మని యుధిష్ఠిరుండు నిన్నడిగెఁగదా! ద్విజాతులకు యజన యాజనాది కర్మ కరణ విభాగంబు ధర్మశాస్త్రాచార్యులు విధించునప్పుడు రాజు లిచ్చువారు గాని, వేఁడుకొనువారు గారని చెప్పుట సకలలోక ప్రసిద్ధంబు; సర్వ వర్ణాశ్రమ ధర్మ పరిపాలనంబు సేయునట్టి రాజులు దార నిజధర్మంబు వదలుదురా? యదియునుంగాక; పాడితోడి యార్జనంబునం దమకుఁ గల కలిమి యనుభవించుచు సత్పథంబున నడచుచుండఁ, ద మ్మొరు లన్యాయంబు సేసినయప్పటికిం గదా యీ శస్త్రాస్త్రధర్మంబు లింద్రాదులగు పెద్దలు గావించిరి; నీ చెప్పెడి ధర్మంబులు కౌరవులకుం జెప్పవలవదా? వారలు గదా మీఁ దెఱుంగక కొఱఁతనుఱుకులై చెడు తెరువునం బోయెడువా' రని పలికి మఱియు నిట్లనియె. 343

ప్రతిపదార్థం: సంగ్రామంబు= యుద్ధం; రాజులకున్; ధర్మంబు; అవును+కాదు+అని; నీవు+అ; చెప్పుము; అని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; నిన్నున్+అడిగెన్+కదా!; ధర్మ శాస్త్ర+ఆచార్యులు= ధర్మశాస్త్ర గురువులు; ద్విజాతులకున్= బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు; యజన యాజన+ఆది కర్మ కరణ విభాగంబున్= యజ్ఞం చేయటం, చేయించటం మొదలయిన పనుల చేతల విభజనను; విధించు+అప్పుడు= విధించేటప్పుడు; రాజులు; ఇచ్చువారు+కాని; వేఁడుకొనువారు కారు+అని= ఇచ్చేవాళ్ళేకాని పుచ్చుకొనేవాళ్ళు కారని; చెప్పుట; సకల లోక ప్రసిద్ధంబు= ఎల్ల లోకాలలోనూ ప్రసిద్ధమయినది; సర్వ వర్ణ+ఆశ్రమ ధర్మ పరిపాలనంబు= బ్రహ్మ క్షత్రియ వైశ్యులనే ఎల్ల వర్ణాశ్రమ ధర్మాలనూ కాపాడటం; చేయు+అట్టి రాజులు= చేసే క్షత్రియులు; తారు+అ= తామే; నిజ ధర్మంబున్= తమధర్మాన్ని; వదలుదురు+ఆ?= విడిచిపెడతారా?; అదియునున్+కాక; పాడితోడి+ఆర్జవంబునన్= న్యాయయుక్తమైన సంపాదనతో, తమకున్+కల, కలిమి= తమ కున్న సంపద; అనుభవించుచున్; సత్+పథంబునన్= సన్మార్గంలో; నడచుచున్+ఉండన్= నడుస్తూ ఉండగా; తమ్మున్; ఒరులు= ఇతరులు; అన్యాయంబు+చేసిన+అప్పటికిన్+కదా= అన్యాయం చేసినప్పటికి కదా; ఈ శస్త్ర+అస్త్ర ధర్మంబులు= ఈ శస్త్రాల అస్త్రాల ధర్మాలు; ఇంద్ర+ఆదులు+అగు పెద్దలు= ఇంద్రుడూ మొదలైన పెద్దలు; కావించిరి= చేశారు; నీ చెప్పెడి ధర్మంబులు= నీవుచెప్పే ధర్మాలు; కౌరవులకున్; చెప్పన్+వలవదా?= చెప్పవద్దా?; వారలు+కదా; మీఁదు+ఎఱుంగక= రాగలదానిని ఎరుగక; కొఱఁతన్+ఉఱుకులు+ఐ= ఉరికంబం మీదికి ఉరికే వారయి (అకార్యాలు చేసే వాళ్ళయి); చెడు+తెరువునన్+పోయెడు, వారు= అపమార్గంలో నడిచేవాళ్ళు; అని పలికి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'యుద్ధం క్షత్రియులకు ధర్మం అవునా కాదా నీవే చెప్పుము' అని ధర్మరాజు నిన్ను అడిగాడు కదా! బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు యజ్ఞం చేయటం, చేయించటం మొదలయిన పనుల విభజన ధర్మశాస్త్ర గురువులు విధించేటప్పుడు రాజులు ఇచ్చేవాళ్ళు గాని పుచ్చుకొనేవాళ్ళు కారని చెప్పటం సర్వజగత్ప్రసిద్ధమైన విషయం కదా! ఎల్ల వర్ణాశ్రమ ధర్మాలనూ కాపాడవలసిన రాజులు తామే తమధర్మాన్ని విడిచిపెడతారా? అదీకాక న్యాయార్జనతో తమకు కల సంపద ననుభవిస్తూ సన్మార్గంలో నడుస్తూంటే, తమ కెవరైనా అపకారం చేసినప్పుడు ఉపయోగపడటానికి కదా ఈ శస్త్రాస్త్రాల ధర్మాలు ఇంద్రుడూ మొదలైన పెద్దలు నిర్ణయించారు? నీవు చెప్పే ధర్మాలు కౌరవులకు చెప్పవద్దా? వాళ్ళు కదా రాబోయేది తెలిసికొనక అకార్యాలు ఆచరిస్తూ అపమార్గంలో నడిచేవాళ్ళు' అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'నెట్టన సభలో వేవుర । కట్టెదుర నరాతితనము గా కెంతయు వా
రెట్టితులువలో! ద్రౌపది । నట్టులు పఱిచెడిదె! జూదమాడరె యెందున్?' 344

ప్రతిపదార్థం: నెట్టన= బరితెగించి; సభలోన్; వేవుర కడు+ఎదురన్= వేయిమంది ఎట్టఎదుట; ఎంతయున్+అరాతి తనము+కాక= మిక్కిలి శత్రుత్వం(పోకిరితనం) కాకపోతే; వారు; ఎట్టి తులువలో= ఎటువంటి దుర్మార్గులో; ద్రౌపదిన్; అట్టులు= ఆ విధంగా- పైకి చెప్పరాని రీతిగా; పఱిచెడిదె= అవమానించటమా; ఎందున్= ఎక్కడా; జూదము+ఆడరె?= జూదం ఆడరా?- ఇట్లా ఆడతారా? అని భావం.

తాత్పర్యం: 'సభలో వేయిమంది ఎట్టయెదుట తెగించి, మిక్కిలి పోకిరితనం కాకపోతే, వాళ్ళు ఎటువంటి దుర్మార్గులో ద్రౌపదిని ఆ విధంగా అవమానిస్తారా? ఎక్కడా జూదం ఆడరా? ఎవరైనా ఇట్లా చేశారా?'

విశేషం: ఈ పద్యంలో తిక్కన వాక్య విన్యాసం గమనించదగింది '. . . . వేవుర కట్టెదుర ద్రౌపది నట్టుల పఱిచెడిదె' అనే వాక్యం నడుమ'అరాతి తనముగా కెంతయు వారెట్టి తులువలో" అనే వాక్యం చొప్పించబడింది. ఇటువంటి రచన కోపావేశాన్ని సూచిస్తుంది. ద్విత్వప్రాసాక్షరం కోపోద్రేకాన్ని వ్యంజింపజేస్తున్నది.

వ. అనవుడు సంజయుండు 'దేవా! నీ చిత్తంబున నిడి దీని నింత కొనయాడినఁ గర్జం బొడఁగూడునే?' యనిన వాసుదేవుం డిట్లనియె. 345

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; సంజయుండు; దేవా! నీ చిత్తంబునన్= నీ మనస్సులో; ఇడి= పెట్టుకొని; దీనిన్= ఈ విషయాన్ని; ఇంత కొనియాడినన్= ఇంతగా పట్టించుకొంటే; కర్జంబు+ఒడన్+కూడునే= కార్యం సఫలం అవుతుందా?; అనినన్= అని అనగా; వాసుదేవుండు= కృష్ణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని కృష్ణుడనగానే సంజయుడు 'దేవా! ఈ విషయాన్ని నీ మనస్సులో పెట్టుకొని ఇంతగా పట్టించుకొంటే కార్యం సఫల మవుతుందా?' అని అనగా, కృష్ణుడు ఇట్లా అన్నాడు.

విశేషం: పూర్వం కౌరవులు చేసిన దుర్ణయాలన్నీ ఇప్పుడు తడవుతూ శ్రీకృష్ణుడు మాటాడటం వలన సంధికార్యం భగ్నమవుతుందని సంజయుడి భయం. కాని కృష్ణుడు ఆగక అవన్నీ ఏకరువు పెట్టుతున్నాడు. సంధి కాకూడదనే అతడి ఉద్దేశం.

ఉ. 'అత్తఱి భీష్మముఖ్యులగు నచ్చటి వృద్ధజనంబు లెల్ల నో
రెత్తక యూరకుండిరి మహీశ్వరుచిత్త మెఱుంగకున్కిఁ; దా
నొత్తి కుమారులం గినియనోపఁడు; యక్కట! మాన్పఁ గన్న; నా
చిత్తమ కాదు; లోకముల చిత్తము లెల్లను సంతసింపవే? 346

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= ఆ సమయంలో ద్రౌపదిని అవమానించేటప్పుడు; భీష్మ ముఖ్యులు+అగు= అచ్చటి వృద్ధజనంబులు+ ఎల్లన్= భీష్ముడూ మొదలయిన అచటి పెద్దలందరూ; మహీ+ఈశ్వరు చిత్తము+ఎఱుంగక+ఉన్కిన్= రాజుయొక్క(ధృతరాష్ట్రుడి) అభిప్రాయం తెలియకపోవటం చేత; నోరు+ఎత్తక ఊరక+ఉండిరి= నోరు మెదపకుండా ఊరుకొన్నారు; తాను= ధృతరాష్ట్రుడు; కుమారులన్= కొడుకులను; ఒత్తి,కినియన్+ఓపఁడు+అ= గట్టిగా కోపపడలేదు; అక్కట!;=అయ్యో!; మాన్పన్+కన్నన్= ధృతరాష్ట్రుడు వారించగలిగితే; నా చిత్తము+అ కాదు= నామనస్సే కాదు; లోకముల చిత్తములు+ఎల్లనున్= లోకుల మనస్సులన్నీ; సంతసింపవే?= సంతోషించవా?

తాత్పర్యం: 'ద్రౌపదిని కౌరవు లవమానించేటప్పుడు భీష్ముడూ మొదలైన అక్కడి పెద్దలందరూ ధృతరాష్ట్ర మహారాజు అభిప్రాయం తెలియకపోవటం చేత నోరు మెదపకుండా ఊరుకొన్నారు. ఆ ధృతరాష్ట్రుడు కొడుకులను కోపపడలేదు. అయ్యో! అతడే కనక వాళ్ళను వారించగలిగితే, నా మనస్సే కాదు, లోకుల మనస్సులన్నీ సంతోషపడవా?

విశేషం: కౌరవ పాండవ విభేదమూలాన్ని శ్రీకృష్ణు డీపద్యంలో వివేచించాడు. తండ్రి మనసు తెలియక నోరు మెదపలేని పాండవులను, కౌరవులు అవినీతులై అవమానాల పాలు చేస్తుంటే వారిని వారించలేక అధర్మానికి ఆసట బాసటగా నిలిచిన ధృతరాష్ట్రుడే అన్ని పాపాలకు మూలహేతువనీ, బాధ్యుడనీ శ్రీకృష్ణుడు నిర్ణయించి చెప్పాడు. ఆ రాజు కొడుకులను వారించి ఉంటే భగవంతుడైన శ్రీకృష్ణుడూ, అన్ని లోకాలూ హర్షించి ఉండేవి అని చెప్పి, ఇప్పు డా ఇరువురూ ధృతరాష్ట్రుడిని గర్హిస్తున్నారని ధ్వనింపజేశాడు కృష్ణుడు! (సంపా.)

ఉ. **తిట్టులఁబోయి యక్కొలువు తేఁకువ వారలలోని కింతిఁ దా**
నట్టులు దుస్ససేనుఁ డదయాకృతి ముందల వట్టి యీడ్వఁగా
నెట్టు సహించె మామ? సతి యేడ్పు టెలుంగున కెట్టు లోర్చె? నీ
పట్టున సేమ మారయఁగఁ బంచుట కెట్టులు నేర్చెఁ గ్రమ్మఱన్? **347**

ప్రతిపదార్థం: దుస్ససేనుఁడు= దుశ్శాసనుడు; తిట్టులన్+పోయి= తిట్లతో పోయి; ఆ+కొలువు తేఁకువ వారలలోనికిన్= ఆ సభలోని మిగుల ధైర్యపరులైన గౌరవార్హులమధ్యకు; ఇంతిన్= స్త్రీని- ద్రౌపదిని; తాను; అట్టులు= ఆ విధంగా; అదయ+ ఆకృతిన్= నిర్దాక్షిణ్య రూపంతో; ముందు+తల+పట్టి+ఈడ్వఁగాన్= తలముందటి జుట్టు పట్టుకొని ఈడ్వగా; మామ= ధృతరాష్ట్రుడు; ఎట్టు సహించెన్= ఎట్లా ఓర్చుకొన్నాడు; సతి= పతివ్రతయొక్క; ఏడ్పు+ఎలుంగునకున్= రోదన స్వరానికి; ఎట్టులు+ఓర్చెన్= ఎట్లా సహించాడు; ఈ పట్టునన్= ఈ సమయంలో; క్రమ్మఱన్= మళ్ళీ; సేమము+ఆరయఁగన్= క్షేమం తెలిసికొనటానికి; పంచుటకున్= పంపటానికి; ఎట్టులు నేర్చెన్?= ఎట్లా నేర్చాడు?

తాత్పర్యం: దుశ్శాసనుడు తిట్లతోపోయి ఆ సభలో ఉన్న పెద్దల మధ్యకు ద్రౌపదిని ఆ విధంగా నిర్దాక్షిణ్యంతో ముందటి జుట్టుపట్టుకొని ఈడుస్తుంటే మామ ధృతరాష్ట్రుడు ఎట్లా సహించాడు? పతివ్రత రోదన ధ్వనికి ఎట్లా ఓర్చాడు? మళ్ళీ ఇప్పుడు క్షేమం తెలిసికొనటానికి దూతను పంపడానికి ఎట్లా నేర్చాడు?

విశేషం: ధృతరాష్ట్రుడు పాండవులను మున్నీట ముంచగలడు, వారిపట్ల మొసలి కన్నీరు కార్చగలడు. అతడి ప్రవృత్తి పయోముఖ విషకుంభం.. (సంపా.)

చ. **ఇది తగదంచు నడ్డపడునింతకు నేరక సభ్యులందఱున్**
మది మఱగొన్న యట్టి యెడ మానినికిం దనుఁ దాన కాచికో
లొదవిన దానఁ జేసి సభ నొచ్చెము దక్కినఁ బాండునందనుల్
బ్రదికిరి గాక; యయ్యెడరు రాచకొమారుల కోర్చునట్టిదే? **348**

ప్రతిపదార్థం: ఇది= ఒకస్త్రీని సభలోనికి జుట్టుపట్టుకొని ఈడ్వటం; తగదు+అంచున్= మంచిది కాదంటూ; అడ్డపడు+ఇంతకున్= అడ్డుపడే మాత్రానికి కూడా; నేరక= తెలియక; సభ్యులు+అందఱున్= సభలోని వాళ్ళందరూ; మదిన్ మఱగొన్న+అట్టి+ఎడన్=

మనస్సునందు మరబొమ్మవలె స్తబ్దతతో దైన్యం పొంది ఉన్న సమయంలో; మానినికిన్= ఆ అభిమానవతికి; తనున్+తాను+అ= తనను తానే; కాచికోలు+ఒదవినదానన్+చేసి= రక్షించుకొన గలగడం చేత; సభన్= సభయందు; ఒచ్చెము+తక్కినన్= అవమానం జరగకపోవటం వలన; పాండు నందనుల్= పాండవులు; బ్రదికిరి+కాక= బ్రదికిపోయారు కాని; ఆ+ఎడరు= ఆ భంగపాటు; రాచ కొమారులకున్= రాచబిడ్డలకు; ఓర్చునట్టిదే?= సహించవలసిందా?

తాత్పర్యం: ఆడదానిని జుట్టుపట్టుకొని సభలోని కీడ్వటం మంచిది కాదని అడ్డుపడే మాత్రానికి చాలక సభలోని వాళ్ళందరూ మనస్సులలో దైన్యం పొంది ఉన్న సమయంలో పాపం ఆ మానవతి తనను తానే కాపాడుకొనగలగటం చేత సభలో అవమానం జరగక పాండవులు బ్రదికిపోయారు కాని, అటువంటి భంగపాటు రాచబిడ్డలు సహించవలసిందేనా?

విశేషం: కౌరవసభలో ద్రౌపదియొక్క గౌరవం రక్షించబడటానికి తాను కారణమైనా శ్రీకృష్ణుడా విషయాన్ని పేర్కొనకపోవటంలో ఆయన ఉదాత్తవ్యక్తిత్వం తేటతెల్లమౌతున్నది.

వ. సంజయా! వినవే యప్పుడు సభాసధులకుఁ గర్ణశూలంబు లగునట్లుగాఁ గర్ణుండు. 349

ప్రతిపదార్థం: సంజయా!; వినవే= నీవు వినలేదా?; అప్పుడు; సభాసదులకున్= సభ్యులకు; కర్ణ శూలంబులు+అగునట్లుగాన్= చెవులకు గ్రుచ్చుకొనేటట్లు; కర్ణుండు.

తాత్పర్యం: సంజయా! నీవు వినలేదా? అప్పుడు కర్ణుడు సభ్యుల చెవులకు గ్రుచ్చుకొనేటట్లు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'లే రిచట మగలు నీకును; । వీరలు జూదమున నోడి విడిచిరి నిన్నున్;
వారిజలోచన! నీపైఁ । గూరిమి గల మగని వెదకికొను మొరు' ననఁడే? 350

ప్రతిపదార్థం: ఇచటన్= ఇక్కడ; నీకును; మగలు= భర్తలు; లేరు; వీరలు= నీ భర్తలనబడే ఈ ఐదుగురూ; నిన్నున్; జూదమునన్; ఓడి; విడిచిరి; వారిజలోచన!= ఓ పద్మాక్షీ! ద్రౌపదీ!; నీ పైన్= నీ మీద; కూరిమి+కల మగనిన్+ఒరున్= ప్రేమగల భర్తను ఇంకొకడిని; వెదకికొనుము; అనఁడే= అనడా?.

తాత్పర్యం: 'ఇక్కడ నీకు భర్తలు లేరు. నీ భర్త లని చెప్పబడే ఈ ఐదుగురూ నిన్ను జూదంలో ఓడిపోయి వదిలేశారు. అందుచేత ఓ పద్మాక్షీ! నీ మీద అనురాగం గలిగిన భర్త నింకొకడిని వెతుక్కో' అనలేదా?

క. నరునకు నదివాఙ్మయ మగు । శరమై హృదయంబు నాటి చలియింపక దు
ర్భర వేదనఁ జేయంగాఁ । జిరకాలము, దచ్చికిత్స చేసెనె చెపుమా? 351

ప్రతిపదార్థం: అది= కర్ణుడన్న ఆ మాట; నరునకున్= అర్జునుడికి; వాక్+మయము+అగు శరము+ఐ= వాగ్రూపమైన బాణమయి; హృదయంబు నాటి= మనస్సులో గ్రుచ్చుకొని; చలియింపక= ఊడిరాక; దుర్భర వేదనన్= సహించ శక్యం కాని బాధను; చేయంగాన్= కలిగించగా; చిరకాలమున్= చాలాకాలంగా; తద్+చికిత్స చేసెనె?= దానికి ప్రతిక్రియ చేశాడా?; చెపుమా= చెప్పుము.

తాత్పర్యం: కర్ణు డాడిన ఆ మాట అర్జునుడికి వాగ్రూపమైన బాణమై హృదయంలో నాటుకొని ఊడిరాక దుస్సహమైన బాధ కలిగించగా చాలాకాలంగా దానికి ప్రతిక్రియ చేశాడా? నీవే చెప్పుము. (ఆ కర్ణుడిపై పగ దీర్చుకొనే ప్రతిక్రియ ఏమైనా ఇంతకాలంగా చేశాడా? అని భావం.)

వ. మఱియు దుశ్శాసనుండు 'వీర లందఱును గొడ్డువోయిన వారలు; పౌరుషంబు గల మానిసి యిం దెవ్వం?' డనియె; నతని చెప్పినట్ల పెద్దగాలంబేని వీరల గొడ్డువోయిరి గాక, వీరిదెస వారికి నేమిఫలించె? వెండియుఁ దత్సమయంబునఁ బుట్టిన మాట లుగ్గడించునట్టివిగా; వీ సంధికార్యం బత్యంత దుర్ఘటంబని తలంచెద; నయినను. 352

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; దుశ్శాసనుండు; వీరలు+అందఱును= వీళ్ళందరూ; గొడ్డు+పోయినవారలు= నిష్ఫలులు, పౌరుషహీనులు; పౌరుషంబు+కల మానిసి= పౌరుషవంతుడైన మనుష్యుడు; ఇందున్= వీరిలో - ఈ పాండవులలో; ఎవ్వండు; అనియెన్; అతని చెప్పిన+అట్లు+అ= అతడు చెప్పిన విధంగానే; పెద్ద+కాలంబు+ఏనిన్= ఎంతోకాలమైనా; వీరలు+అ= వీరే- ఈ పాండవులే; గొడ్డు+పోయిరి+కాక= నిష్ఫలు లయినారే కాని; వీరి దెసన్= వీరివలన; వారికిన్= కౌరవులకు; ఏమి ఫలించెన్?= ఏమి ఫలితం దక్కింది?; వెండియున్= ఇంకా; తద్+సమయంబునన్= ఆసమయంలో; పుట్టిన మాటలు; ఉగ్గడించు+అట్టివి+కావు= పైకి అనవలసినవి కావు; ఈ సంధి కార్యంబు; అత్యంత దుర్ఘటంబు= మిక్కిలి అసాధ్యం; దీనిన్; ఘటియింపన్+చేయుట= కుదర్చటం; అశక్యంబు+ అని= తరం కాదని; తలంచెదన్= అనుకొంటాను; అయినను= అయినప్పటికీ.

తాత్పర్యం: ఇంకా దుశ్శాసనుడు 'వీళ్ళందరూ - ఈ పాండవులంతా, నిష్ఫలులు, పౌరుషహీనులు. వీరిలో పౌరుషవంతుడైన మనుష్య డెవడు? అన్నాడు. అతడు చెప్పిన రీతిగా ఎంతో కాలంగా వీళ్ళే నిష్ఫలులయినారే కాని వీరివలన వారి కేమి ఫలితం దక్కింది? ఇంకా ఆ సమయంలో పుట్టిన మాటలు పైకి అనవలసినవి కావు. ఈ సంధికార్యం జరగటం మిక్కిలి కష్టం. దీనిని కుదర్చటం అసాధ్యం అని భావిస్తున్నా. అయినా.

విశేషం: 'వీరల గొడ్డువోయిరి గాక, వీరి దెస వారికి నేమి ఫలించె?' కౌరవులు తమకి చేసిన అన్యాయాలకు పాండవులు ప్రతిస్పందించి వారికి ఏదయినా ప్రతీకారం చేసి పగదీర్చుకొని ఉంటే వారు సఫలులయినట్లు. ఇంతవరకూ అటువంటి దేమీ జరుగలేదు కాబట్టి పాండవులు 'గొడ్డువోయినవారే' అని శ్రీకృష్ణుడి అభిప్రాయం.

సీ. పాండవేయులఁ దగం బ్రార్థించి, యందుల । కక్కట! యేనైన నరుగుదెంచి,
కౌరవులకు బుద్ధిగాఁ జెప్పి రాజ్యంబు । పాలుసేసిన, మృత్యుపాశములకుఁ
దప్పరే వారలు? దగవును నేర్పును । నా మీఁద నిలుచుట నాకుఁ గీడె?
నన్ను మన్నింతు; రన్యాయంబు సొరని నా । మాటకుఁ దా రొడఁబాటు లేక

తే. యుండుదురె? కేరడము లాడుచుండిరేనిఁ । గవియు పాండవ బాణాగ్ని గాదు సువ్వె,
తమ్ముఁ దమ లోభ మను చిచ్చు దరికొనంగఁ । దెగినవారయి పోదు; రింతియ తలంప. 353

ప్రతిపదార్థం: పాండవేయులన్= పాండవులను; తగన్= ఒప్పుగా; ప్రార్థించి= మిక్కిలి బతిమాలి; అక్కట!= అయ్యో!; అందులకున్= అక్కడికి; ఏను+ఐనన్= నేనయినా; అరుగుదెంచి= వచ్చి; కౌరవులకున్; బుద్ధి+కాన్= బుద్ధివచ్చేటట్లు; చెప్పి;

రాజ్యంబు; పాలు+చేసినన్= భాగం చేస్తే; వారలు= కౌరవులు; మృత్యు పాశములకున్= మరణం అనే త్రాళ్ళకు; తప్పరే?= తప్పిపోరా?- వారు చావు తప్పించుకోరా అని భావం; తగవును= న్యాయమూ; నేర్పును; నా మీఁదన్; నిలుచుట= ఉండటం; నాకున్; కీడు+ఎ?= అనుచితమా?; నన్నున్; మన్నింతురు= (కౌరవులు) ఆదరిస్తారు-నేను చెప్పినట్లు వింటారు; అన్యాయంబు+చొరని, నా మాటకున్= అధర్మయుక్తం కాని నా మాటకు; తారు= తాము, వారు-కౌరవులు; ఒడఁబాటు లేక+ ఉండుదురె?= అంగీకరించకుండా ఉంటారా?; కేరడములు+అడుచున్+ఉందురు+ఏనిన్= పరిహాసంతో కూడిన తిరస్కారపు వంకరమాటలు పలుకుతూ ఉంటే; కవియు పాండవ బాణ+అగ్ని+కాదు సువ్వే= క్రమ్ముకొనే పాండవుల బాణాలనే అగ్ని కాదు సుమీ; తమ లోభము+అను చిచ్చు= తమ దురాశ అనే అగ్ని; తమ్మున్= తమను; దరికొనంగన్= దహించగా; తెగినవారు+ అయిపోదురు= నాశనమయిపోతారు; తలంపన్= ఆలోచించగా; ఇంతియ= ఇంతే.

తాత్పర్యం: పాండవులను ఒప్పేటట్లు బతిమాలి, అయ్యో! అక్కడికి నేనయినా వచ్చి, కౌరవులకు బుద్ధికలిగి ఉండండని చెప్పి రాజ్యం భాగం చేస్తే, వాళ్ళు చావు తప్పించుకొనరా?, న్యాయమూ, నేర్పూ నాపై ఉండటం నాకు అనుచితమా? నేను కలగజేసికొని న్యాయమూ నేర్పూ చూపటం నాకు తగదా? వాళ్ళు నా మాట వింటారు. అన్యాయం కాని నా మాటకు వాళ్ళు అంగీకరించకుండా ఉంటారా? అట్లా కాక, వంకరమాట లేమైనా అంటే, క్రమ్ముకొనేది పాండవుల బాణాలనే అగ్ని కాదు సుమీ! తమని తమ దురాశ అనే చిచ్చే దహించివేయగా నాశనమయిపోతారు. ఆలోచించగా జరిగే దింతే'.

విశేషం: అలం: రూపకం. బాణాగ్ని= బాణములనే అగ్ని, తమలోభమను చిచ్చు= తమ లోభమనే చిచ్చు - ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం, కృష్ణుడి మాటలలో సంధియొక్క అసాధ్యత్వం సుస్పష్టమయింది. సంజయుడు యుద్ధాన్ని ఆపడానికి ఎంత తెలివిగా మాటాడినా కృష్ణుడు, జరిగిపోయిన అన్యాయాలన్నీ ఏకరువుపెట్టి ఇది కుదిరేది కాదని సూటిగా కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పాడు.

వ. అని పలికి వెండియు నిట్లనియె. 354

తాత్పర్యం: అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు:

ఆ. 'రోషమయ మహాతరువు సుయోధనుఁ డురు । స్కంధ మందులోనఁ గర్ణుఁ, డలరుఁ
గొమ్మ సౌబలుండు, గుసుమ ఫలములు దు । శ్శాసనుండు, మూలశక్తి తండ్రి. 355

ప్రతిపదార్థం: సుయోధనుఁడు= దుర్యోధనుడు; రోషమయ మహాతరువు= క్రోధరూపమైన మహావృక్షం; కర్ణుఁడు; అందులోనన్= ఆ వృక్షంలో; ఉరు స్కంధము= పెద్ద బోదె; సౌబలుండు= శకుని; అలరు+కొమ్మ= పూలకొమ్మ; దుశ్శాసనుండు; కుసుమ ఫలములు= పూలు, పండ్లు; తండ్రి= ధృతరాష్ట్రుడు; మూల శక్తి= వేరుయొక్క బలం.

తాత్పర్యం: దుర్యోధనుడు క్రోధరూప మహావృక్షం. కర్ణుడు దాని పెద్ద బోదె. శకుని పూలకొమ్మ, దుశ్శాసనుడు పుష్ప ఫలములు. తండ్రి అయిన ధృతరాష్ట్రుడు దాని మూలబలం.

విశేషం: అలం: రూపకం. శ్రీకృష్ణుడు దుర్యోధనాది దుష్టచతుష్టయాన్ని రూపించిన తీరు బాగున్నది. ధృతరాష్ట్రుడు ఆ వృక్షమూల మనటం వలన దుర్యోధనుడి దుశ్చేష్టల కన్నింటికి మూల భూతుడైన వాడు అతడే అని శ్రీకృష్ణుడి అభిప్రాయం. చెట్టుబలం అంతా దాని వేరు లోనే ఉంటుంది కదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. ధర్మజుండు ధర్మతరు, వర్జునుఁడు ఘన। స్కంధ, మనిలసుతుఁడు శాఖ, కవలు
పుష్పఫలము; లేను, భూసురులును, వేద। ములుఁ దదీయమైన మూల చయము. 356

ప్రతిపదార్థం: ధర్మజుండు= ధర్మరాజు; ధర్మ తరువు= ధర్మరూపమనే చెట్టు; అర్జునుఁడు; ఘన స్కంధము= పెద్ద బోదె; అనిలసుతుఁడు= వాయుపుత్రుడు - భీముడు; శాఖ= కొమ్మ; కవలు= నకుల సహదేవులు; పుష్ప ఫలములు= పూలుపండ్లు; ఏనున్= నేనూ; భూసురులును= బ్రాహ్మణులూ; వేదములున్= వేదాలూ; తదీయము+ఐన మూల చయము= దానిదైన వేరుల సమూహం.

తాత్పర్యం: ధర్మరాజు ధర్మమనే చెట్టు. అర్జునుడు దాని పెద్ద బోదె. భీముడు దాని కొమ్మ. నకుల సహదేవులు పూలూ, పండ్లూ, నేనూ, బ్రాహ్మణులూ, వేదాలూ దాని వేళ్ళ సమూహం.

విశేషం: అలం: రూపకం. కౌరవులను గురించి చెప్పిన పద్యానికి ఇది దీటుగా ఉన్నది. అదీ ఆటవెలదే. ఇదీ ఆటవెలదే. దుర్యోధనుడి బలమంతా ధృతరాష్ట్రు డయితే, ధర్మరాజు బలం కృష్ణుడూ, బ్రాహ్మణులూ, వేదాలూను. ధర్మరాజు ప్రవర్తన కృష్ణప్రియంగానూ, బ్రాహ్మణసమ్మతంగానూ, వేదోక్తంగానూ ఉంటుందని భావం.

క. ఈ రెంటియందు నరసి య। సారం బిది, గాఢసార సహితం బిది నా
నేరవలయు; నదియును గా। కేరూపం బయ్యెనేని నీ సేమిటికిన్? 357

ప్రతిపదార్థం: ఈ రెంటియందున్= ఈ రెండింటిలోనూ; అరసి= పరిశీలించి; ఇది; అసారంబు= నిస్సారమయినదీ; ఇది; గాఢ సార సహితంబు= మిక్కిలి సారంతో కూడినదీ; నాన్+నేరవలయున్= అనేది తెలిసికొనాలి; అదియును+కాక; ఏ రూపం బు+అయ్యెన్+ఏనిన్= ఏ విధమయితేనేం; ఈసు= ఈర్ష్య, పగ; ఏమిటికిన్?= ఎందుకు?

తాత్పర్యం: ఈ రెండింటిలోనూ పరిశీలించి ఇది నిస్సారమైనదీ, ఇది మంచి సారవంతమైనదీ అనేది తెలిసికొనాలి. అయినా ఏ విధమయితేనేం, ఈర్ష్య ఎందుకు?

విశేషం: పై పద్యాల క్రమాన్ని అనుసరించి రోషమయ మహాతరువు నిస్సారమైనదనీ, ధర్మతరువు సారవంతమైనదనీ గ్రహించాలి.

మ. ధృతరాష్ట్రుండును బుత్త్రులున్ వనము; కుంతీనందనుల్ సింహముల్;
మతి నూహింప నసింహమైన వనమున్ మర్దింతు; రెందున్ వనా
వృత వృత్తంబులు గాని సింహములకున్ వేగంబ చేటొందుఁ; గా
న తగం బొందుట కార్య మీ యుభయమున్ సంతుష్టిమై నున్కికిన్. 358

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండును; పుత్త్రులున్= కొడుకులూ; వనము= అడవి; కుంతీ నందనుల్= కుంతి కొడుకులు పాండవులు; సింహముల్; మతిన్+ఊహింపన్= మనస్సులో ఆలోచించగా; అసింహము+ఐన వనమున్= సింహాలు లేని అడవిని; మర్దింతురు= కొట్టివేస్తారు; ఎందున్= ఎక్కడైనా; వన+ఆవృత వృత్తంబులు+కాని సింహములకున్= అడవిచేత ఆవరించబడని సింహాలకు; వేగంబు+అ= శీఘ్రమే; చేటు+ఒందున్= హాని కలుగుతుంది; కాన= కావున; ఈ ఉభయమున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈరెండూ - వనమూ, సింహాలూ; సంతుష్టిమైన్= సంతోషంతో సుఖంగా; ఉన్కికిన్= ఉండటానికి; తగన్= ఒప్పుగా; పొందుట= కూడిఉండటం; కార్యము= చేయదగింది.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడూ, అతడి కొడుకులూ వనం. పాండవులు సింహాలు. ఆలోచించగా సింహాలు లేని అడవిని కొట్టివేస్తారు. ఎక్కడైనా అడవిలో లేని సింహాలకు వెంటనే హాని కలుగుతుంది. కాబట్టి ఈ రెండూ- వనమూ, సింహాలూ సుఖంగా ఉండాలంటే ఒప్పుగా కలిసి ఉండటం మంచిది.

విశేషం: అలం: రూపకం. ధృతరాష్ట్రుండును బుత్త్రులున్ వనము; కుంతీనందనుల్ సింహముల్ రూపకాలంకారాలు. కాన= కానన్ ఇది ద్రుతప్రకృతికమైనా, ఇక్కడ మాత్రం కళగా ప్రయోగించబడింది. ద్రుతప్రకృతికమయితే కానఁ దగం బొందుట అని ఉండాలి. అప్పుడు ప్రాసమైత్రి దెబ్బతింటుంది. కౌరవులూ, పాండవులూ ఇద్దరూ సుఖంగా ఉండాలంటే- వాళ్ళిద్దరూ కలిసి ఉండటం మంచిదని భావం.

క. పరిచారకులై యుండుదు, । రరివర్గ వ్యతికరమున కగుదురు; వీరిన్
సరిఁ దన కొడుకుల మెలపిన । తెరువున మెలఁగింపవలదె ధృతరాష్ట్రునకున్. 359

ప్రతిపదార్థం: (పాండవులు); పరిచారకులు+ఐ= సేవకులయి; ఉండుదురు= ఉంటారు; అరి వర్గ వ్యతికరమునకున్= శత్రు సమూహం వలని కష్టదశకు; అగుదురు= అవుతారు; ధృతరాష్ట్రునకున్; వీరిన్= ఈ పాండవులను; సరిన్= సమానంగా; తన కొడుకుల మెలపిన తెరువునన్= తన కుమారులను నడిపించిన మార్గంలో; మెలఁగింపన్‌వలదె?= నడిపించవద్దా?

తాత్పర్యం: పాండవులు కౌరవులకు పరిచర్య చేస్తూ ఉంటారు. శత్రువుల వలన ఏదయినా కష్టదశ ప్రాప్తించినప్పుడు వారిని ఆదుకొంటారు. అందుచేత ధృతరాష్ట్రుడు వీళ్ళను సరిగా తన కొడుకులను నడిపించే మార్గంలోనే నడిపించవద్దా? వీళ్ళను తన కొడుకుల వలెనే చూడవద్దా? అని భావం.

విశేషం: అరివర్గ వ్యతికరమున కగుదురు-ఘోషయాత్రా సంఘటనను దృష్టిలో పెట్టుకొని శ్రీకృష్ణుడా రీతిగా అన్నాడు.

క. ఏ నీ పనికై వచ్చెదఁ । దా నొప్పఁ దలంచె నొండెఁ దప్పం దలఁచెన్;
దానన నెగడెద మే; మ । మ్మానవ నాథునకుఁ జెప్పు మా మతమెల్లన్. 360

ప్రతిపదార్థం: ఏను= నేను; ఈ పనికై= కౌరవపాండవులను కలిపే పనికొరకు; వచ్చెదన్; తాను= అతడు- ధృతరాష్ట్రుడు; ఒప్పన్+తలంచెన్= అంగీకరిస్తాడో; ఒండెన్= లేదా; తప్పన్+తలఁచెన్= అంగీకరించడో; ఏము= మేము; దానన్+అ= దానినిబట్టే; నెగడెదము= ప్రవర్తిస్తాం; ఆ+మానవ నాథునకున్= ఆ రాజుకు- ధృతరాష్ట్రుడికి; మా మతము+ఎల్లన్= మా అభిప్రాయమంతా; చెప్పు(ము).

తాత్పర్యం: నేను ఈ కౌరవ పాండవ సంధి కార్యానికై వస్తాను. ధృతరాష్ట్రుడు ఒప్పుకొంటాడో ఒప్పుకోడో? మేము దానినిబట్టే ప్రవర్తిస్తాం. ఆ రాజుకు మా అభిప్రాయమంతా చెప్పుము'.

వ. అనిన విని సంజయుండు ధర్మతనయుం గనుంగొని 'యట్లయినను గడు లెస్సగదా! దేవా! నా వచ్చిన కార్యంబు సఫలం బయ్యెఁ; బనివినియెద' నని, వాసుదేవునకు నట్ల విన్నవించి, భీమార్జున నకుల సహదేవ

సాత్యకి ద్రుపద విరాటుల నీక్షించి, 'మీ యందఱచేత ననుజ్ఞాతుండన కదా? పోయి వచ్చెద. నా యాడిన మాటలయం దేమియుఁ దగని యట్టివి లేవు గదా?' యనుటయుఁ బాండవాగ్రజుం డతని కిట్లనియె. **361**

ప్రతిపదార్థం: అనినన్; విని; సంజయుండు; ధర్మతనయున్= ధర్మరాజును; కనుంగొని= చూచి; అట్లు+అయినను= అట్లా అయితే; కడున్= మిక్కిలి; లెస్స+కదా!= మంచిది కదా!; దేవా!; నా వచ్చిన కార్యంబు= నేను వచ్చిన పని; సఫలంబు+అయ్యెన్= నెరవేరింది; పనివినియెదన్= వెళ్ళివస్తాను; అని; వాసుదేవునకున్= కృష్ణుడికి; అట్లు+అ= అట్లాగే; విన్నవించి= మనవి చేసి; భీమ+అర్జున నకుల సహదేవ సాత్యకి ద్రుపద విరాటులన్+ఈక్షించి= భీముడినీ, అర్జునుడినీ, నకుల సహదేవులనూ, సాత్యకి, ద్రుపద, విరాటులనూ చూచి; మీ+అందఱచేతన్= మీ అందరిచేత; అనుజ్ఞాతుండన్+అ కదా?= అనుమతించబడినట్లే కదా?; పోయి వచ్చెదన్= వెళ్ళివస్తాను; నా+ఆడిన మాటలఅందున్= నే నన్న మాటలలో; ఏమియున్= ఏవీ; తగని+అట్టివి= అనుచిత మయినట్టివి; లేవు+కదా; అనుటయున్; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడు- ధర్మరాజు; అతనికిన్= ఆ సంజయుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని సంజయుడు ధర్మరాజును చూచి 'అట్లా అయితే మరీ మంచిది కదా! నేను వచ్చినపని నెరవేరినట్లే. మీ అనుమతితో సెలవు పుచ్చుకొంటాను' అని చెప్పి, కృష్ణుడితో కూడా అట్లాగే మనవి చేసి, భీమార్జున నకుల సహదేవ సాత్యకి ద్రుపద విరాటులను చూసి మీ అనుమతితో 'నేనన్నమాటలలో ఏవీ అనుచితమైనవి లేవు కదా?' అనగా ధర్మరాజు సంజయుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 'నా వచ్చిన కార్యంబు సఫలం బయ్యె' - అది నిజం కాకపోయినా సంజయుడు ఇట్లా ఎందుకంటున్నాడు? తాను వచ్చింది సంధి చేయటానికి. అందుకొరకు కురుసభకు శ్రీకృష్ణుడంతటివాడు రాబోవటమే తన కార్యం సఫలమయినట్లు స్పష్టం చేస్తున్నది. శ్రీకృష్ణుడు సంధి చేయటానికి వస్తున్నాడంటే అది తప్పక జరుగుతుంది.

ఆ. **'పోయి వత్తుగాక, యీ యున్న యందఱు । వినఁగ నాడి తీవు విశదభంగి;**
నొక్కమాట యైన నుచితంబు గానిది । గలదె? యి ట్లనంగ వలయు నెట్లు? **362**

ప్రతిపదార్థం: పోయివత్తు(వు)+కాక= వెళ్ళిరమ్ము; ఈ+ఉన్న+అందఱున్= ఇక్కడ ఉన్న వీళ్ళందరూ; వినఁగన్= వింటూండగా; ఈవు= నీవు; విశద భంగిన్= స్పష్టమైన విధంగా; ఆడితి(వి)= మాటాడావు; ఒక్క మాట+ఐనన్; ఉచితంబు+కానిది= తగనిది; కలదె?; ఇట్లు+అనంగన్వలయున్+ఎట్లు?= ఇట్లా మాట్లాడాలి.

తాత్పర్యం: 'వెళ్ళిరమ్ము. ఇక్కడ ఉన్న అందరూ వినేటట్లు నీవు స్పష్టంగా మాటాడావు. నీ మాటలలో ఒక్కటికూడా అనుచితమైనది లేదు. మాట అంటే ఇట్లా ఉండాలి!'

క. **ఎదురున్న రూపు వలుకఁగఁ । దుదిఁ కటకటఁ బడవు నీవు; దుర్ణయమును బె**
ట్టిదమును బెండును నగు పలు । కొదవదు నీనాలుకకు నయోన్నత! యెపుడున్. **363**

ప్రతిపదార్థం: ఎదురు= ముందు; ఉన్నరూపు= ఉన్న విధం; పలుకఁగన్= మాటాడటానికి; నీవు; తుదిన్= చివరకు; కటకటన్+ పడవు= బాధపడవు; నయ+ఉన్నత!= నీతియందు గొప్పవాడా!; నీ నాలుకకున్; ఎపుడున్= ఎప్పుడూ; దుర్ణయమును= నీతి మాలినదీ; బెట్టిదమును= పరుషమయినదీ; బెండును= నిస్సారమైనదీ; అగు పలుకు= అయినమాట; ఒదవదు= కలుగదు.

తాత్పర్యం: ముందుగా ఎదుటివారు ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడితే నీవు చివరకు బాధపడవు. నీతికోవిదుడా! నీ నాలుకకు ఎప్పుడూ నీతి మాలినదీ, పరుషమైనదీ, నిస్సారమయినదీ అయిన మాట పుట్టదు.

క. నీ వొండె, విదురుఁ డొండెను । గా వలయుంగాక యిట్టి కార్యంబులకున్
రా వేఱ కలరె తగువా । రీ వినయము నేర్పు గలదె యితరుల కెందున్? 364

ప్రతిపదార్థం: ఇట్టి కార్యంబులకున్= ఇటువంటి పనులకు; నీవు+ఒండెన్, విదురుఁడు+ఒండెను= నీవో, విదురుడో; కావలయున్+కాక= కావాలి కాని; రాన్= రావటానికి; తగువారు= అర్హులు; వేఱు+అ కలరె?= వేరే ఉన్నారా?; ఎందున్= ఎక్కడైనా; ఇతరులకున్; ఈ వినయము నేర్పు కలదె?= ఈ వినయనైపుణ్యం (ఔచిత్యపు నేర్పు) ఉంటుందా?

తాత్పర్యం: ఇటువంటి పనులకు నీవో విదురుడో పూనుకొనాలి కాని, రావటానికి అర్హు లింకెవ రయినా ఉన్నారా? ఎక్కడైనా ఇతరులకు ఈ వినయనైపుణ్యం (ఔచిత్యపు నేర్పు) ఉంటుందా?

చ. అరిగినయప్డు పెద్ద లగు నందలి విప్రుల నెల్లఁ గాంచి, యా
దరమున వారి సేమ ముచితంబుగ నారసి, వెండి కాన్పుమీ
గురునిఁ బితామహుం గృపునిఁ; గూర్తురు వారలు నాకు; నా నమ
స్కరణము గాఁగ వారి కధికప్రియభక్తి నమస్కరింపుమీ! 365

ప్రతిపదార్థం: అరిగిన+అప్డు= నీవు వెళ్ళినపుడు; పెద్దలు+అగు+అందలి విప్రులన్+ఎల్లన్= అక్కడి పెద్దలైన బ్రాహ్మణుల నందరినీ; కాంచి= చూచి; ఆదరమునన్= గౌరవంతో; వారి సేమము= వాళ్ళ క్షేమం; ఉచితంబుగన్= తగినట్లుగా; అరసి= తెలిసికొని; వెండి= తరువాత; గురునిన్= ద్రోణుడినీ; పితామహున్= తాత భీష్ముడినీ, కృపునిన్; కాన్పుమీ= దర్శించుము; వారలు; నాకున్+కూర్తురు= నేనంటే ఇష్టపడతారు; వారికిన్; నా నమస్కరణము+కాఁగన్= నా నమస్కారంగా; అధిక ప్రియ భక్తిన్= మిక్కిలి ప్రీతితోడి భక్తితో; నమస్కరింపుమీ= నమస్కరించుము.

తాత్పర్యం: నీవు వెళ్ళినపుడు అక్కడ ఉన్న పెద్దలైన బ్రాహ్మణుల నందరినీ చూచి ఆదరంతో వాళ్ళ క్షేమం ఒప్పుగా తెలిసికొని, తరువాత ద్రోణ భీష్మ కృపులను దర్శించుము. వాళ్ళకు నేనంటే ఎంతో ఇష్టం. వారికి మిక్కిలి ప్రీతితో భక్తితో నేను నమస్కరించినట్లు నమస్కరించుము.

సీ. మా తండ్రిఁ గని యేను బ్రీతి మ్రొక్కుట గాఁగ । దండప్రణామంబు దగ నొనర్పు;
దుర్వృత్తిఁ బొరయు నా దుర్యోధనుని సేమ । మడిగితి నని చెప్పు; మతని తమ్ముఁ
డగుటకుఁ దగియెడు నా దుస్ససేనుని । కుశల మారయుము; దక్కును గుమార
వర్గంబు నెల్లను, వనితాజనంబుల । నుచితంపుమై సుఖ మున్కి యడుగు;

ఆ. విదురు, శల్యుఁ గాంచి వినయంబు దోఁపంగ । నాడు; ద్రోణతనయు నక్కు సేర్చి
కొంటి ననుము; బాహ్లికుని సోమదత్తు, భూ । రిశ్రవసునిఁ దలఁచి ప్రియము నెఱపు. 366

ప్రతిపదార్థం: మా తండ్రిన్= మా తండ్రి అయిన ధృతరాష్ట్రుడిని; కని= చూచి; ఏను= నేను; ప్రీతిన్= సంతోషంతో; మ్రొక్కుట+కాఁగన్= నమస్కరించినట్లు; దండ ప్రణామంబు= సాష్టాంగ నమస్కారం; తగన్= ఒప్పుగా; ఒనర్పు(ము)=

చేయుము; దుర్వృత్తిన్+పొరయు= చెడు నడవడి కలుగు; ఆ దుర్యోధనుని సేమము= ఆ దుర్యోధనుడి క్షేమం; అడిగితిన్+అని చెప్పుము; అతడి తమ్ముఁడు; అగుటకున్+తగియెడు+ఆ దుస్సేనుని కుశలము= అతని తమ్ముడు అనటానికి అర్హుడైన ఆ దుశ్శాసనుడి క్షేమం; ఆరయుము= తెలిసికొనుము; తక్కును+కుమార వర్గంబున్+ఎల్లను= తక్కిన కుమారుల సమూహాన్ని అంతనూ; వనితాజనంబులన్= స్త్రీలనూ; ఉచితము+మై= తగిన విధంగా; సుఖము+ఉన్కి= సుఖంగా ఉన్న సంగతి; అడుగు(ము); విదురున్; శల్యున్, కాంచి= చూచి; వినయంబు+తోఁపంగన్= అణకువ కనబడేటట్లు; ఆడు(ము)= మాటాడుము; ద్రోణ తనయున్= ద్రోణుడి కొడుకైన అశ్వత్థామను; అక్కు+చేర్చికొంటిన్+అనుము= కౌగిలించుకొన్నానని చెప్పుము; బాహ్లికునిన్; సోమదత్తున్; భూరిశ్రవసునిన్; తలఁచి; ప్రియము= ఇష్టం; నెఱపు= చేయుము.

తాత్పర్యం: మా తండ్రిఅయిన ధృతరాష్ట్రుడిని చూచి నేను సంతోషంతో నమస్కరించినట్లు సాష్టాంగ నమస్కారం చేయుము. చెడు నడవడి కలిగి ఉండే ఆ దుర్యోధనుడి క్షేమం అడిగానని చెప్పుము. అతడికి తమ్ముడు అనిపించుకొనటానికి తగిన ఆ దుశ్శాసనుడి క్షేమం తెలిసికొనుము. తక్కిన కుమారులనూ, అందరినీ, స్త్రీలనూ, తగిన విధంగా సుఖంగా ఉన్న సంగతి తెలిసికొమ్ము. విదురుడినీ, శల్యుడినీ చూచి వినయంతో మాటాడుము; అశ్వత్థామను ఆలింగనం చేసికొన్నానని చెప్పుము. బాహ్లిక, సోమదత్త, భూరిశ్రవసులను తలచి సంతోషం ప్రకటించుము.

వ. మఱియు వంశవంతులు, వయోవృద్ధులు నగు భూపతులను, గృతవర్మను, గర్ణ శకుని సైంధవ ప్రభృతులను; దక్కటిరాజలోకంబును; గయ్యంబునకుఁ దోడు వచ్చిన సకల దేశాధీశులనుం గని, యెవ్వరితోడ నెవ్విధంబునం బలుకందగు ప్రణామ వినయ బాంధవ మైత్రీ వాత్సల్యంబులకు నయ్యై ప్రకారంబుల మద్వచనంబులుగాఁ బలికి; యుచితంబుమెయి నుపచరింపుము. 367

ప్రతిపదార్థం: మఱియున్; వంశవంతులున్= కులీనులూ; వయస్(ః)+వృద్ధులున్= వయస్సుచేత పెద్దవారూ; అగు; భూపతులను= రాజులనూ; కృతవర్మను; కర్ణ శకుని సైంధవ ప్రభృతులను= కర్ణుడూ, శకునీ, సైంధవుడూ మొదలైన వారినీ; కయ్యంబునకున్= యుద్ధానికి; తోడు వచ్చిన= సహాయంగా వచ్చిన; సకల దేశ+అధీశులనున్= ఎల్ల దేశాల రాజులనూ; కని; ఎవ్వరి తోడన్; ఏ+విధంబునన్= ఏ రీతిగా; పలుకన్+తగు= పలుకరించదగిన; ప్రణామ వినయ బాంధవ మైత్రీ వాత్సల్యంబులకున్= నమస్కారం, వినయం, చుట్టరికం, స్నేహం, వాత్సల్యం అనేవాటికి; ఆ+ఆ+ప్రకారంబులన్= ఆయా విధాలుగా; మత్+వచనంబులుగాన్= నా మాటలుగా; పలికి; ఉచితంబు మెయిన్= తగిన విధంగా; ఉపచరింపుము= సమ్మానించుము.

తాత్పర్యం: ఇంకా, కులీనులూ, వయస్సుచేత పెద్దవారూ అయిన రాజులనూ, కృతవర్మనూ, కర్ణుడూ, శకునీ, సైంధవుడూ మొదలయిన వాళ్ళనూ, తక్కిన రాజసమూహాన్నీ, యుద్ధంలో తోడు పడడానికి వచ్చిన ఎల్లదేశాల ప్రభువులనూ చూచి ఎవరితో ఏ విధంగా నమస్కారం, వినయం, బంధుత్వం, స్నేహం, వాత్సల్యం అనే వాటితో పలకాలో ఆయా విధాలుగా నా మాటలుగా పలికి సముచితంగా ప్రవర్తించుము.

క. దాసీ దాస జనముల కు । దాసీనము గాక యుండఁ, దడయక యే మి
త్రాసంగ మొంది, శత్రు ని । రాసం బొనరించి; తమ్ము నరసెద ననుమీ. 368

ప్రతిపదార్థం: దాసీ దాస జనములకున్= దాసీ జనానికీ, దాస జనానికీ; ఉదాసీనము+కాక+ఉండన్= మనకెందుకని ఊరుకొనకుండా; తడయక= ఆలస్యం చేయకుండా; ఏన్= నేను; మిత్ర+ఆసంగము+ఒంది= మిత్రుల తోడ్పాటు పొంది; శత్రు నిరాసంబు+ఒనరించి= శత్రు నిరసనం చేసి; తమ్మున్= తమను; అరసెదన్+ అనుమీ!= రక్షిస్తానని చెప్పుము.

తాత్పర్యం: దాసీజనులనూ, దాసజనులనూ చూచి, మన కెందుకులే అని ఊరుకొనకుండా నేను, వెంటనే మిత్రులను కూర్చుకొని, శత్రువులను నిరసించి తమను కాపాడుతానని చెప్పుము.

క. పోయిన మొగమున నచ్చటఁ। జేయు తెఱంగెల్ల నీకుఁ జెప్పితిఁ; బిదపన్
మా యయ్య పెద్ద కొలువున। వా యోడక యిట్టనంగ వలయుం జుమ్మీ! 369

ప్రతిపదార్థం: పోయిన మొగమునన్= వెళ్ళీ వెళ్ళగానే; అచ్చటన్; చేయు తెఱంగు+ఎల్లన్= చేసే విధమంతా; నీకున్; చెప్పితిన్; పిదపన్= పిమ్మట; మా+అయ్య పెద్ద కొలువునన్= మా తండ్రిదైన నిండు సభలో; వాయి+ఓడక= పలుకటానికి వెనుకాడక; ఇట్టు+అనంగవలయున్+చుమ్మీ!= ఇట్లా పలకాలి సుమీ!

తాత్పర్యం: వెళ్ళీ వెళ్ళగానే అక్కడ నీవు చేయవలసిన దంతా నీకు చెప్పాను. తరువాత మా తండ్రి నిండోలగంలో మోమోటపడకుండా ఇట్లా అనాలి సుమీ!

చ. అనఘ! భవద్బలంబునన యాపద యించుక లేక పాండునం
దనులు నిజాప్తబంధుసహితంబు సుఖస్థితి నున్నవారు; త
జ్జనకుని రాజ్యపీఠమున సమ్మద మొందఁగ నిల్పి శైశవం
బునన ప్రభుత్వ మిచ్చి తగఁ బ్రోచితి వారల విశ్రుతంబుగన్. 370

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; భవత్+బలంబునన్+అ= నీ బలం వలననే; పాండునందనులు= పాండవులు; ఆపద+ఇంచుక లేక= కొంచెం కూడా కష్టం లేకుండా; నిజ+ఆప్త బంధు సహితంబు= తమమిత్రులతోనూ, బంధువులతోనూ; సుఖ స్థితిన్+ఉన్న వారు= సుఖంగా ఉన్నారు; వారలన్= వారిని; శైశవంబునన్+అ= బాల్యంలోనే; తద్+జనకుని రాజ్య పీఠమునన్= వారి తండ్రి రాజ్యసింహాసనం మీద; సమ్మదము+ఒందఁగన్= సంతోషపడేటట్లు; నిల్పి; ప్రభుత్వము+ఇచ్చి= రాచరికం ఇచ్చి; తగన్= తగిన విధంగా; విశ్రుతంబుగన్= ప్రసిద్ధంగా; ప్రోచితి(వి)= రక్షించావు.

తాత్పర్యం: పాపరహితుడా! నీ బలం వలననే పాండవులు కొంచెమైనా కష్టమనేది లేకుండా, తమ మిత్రులతోనూ, బంధువులతోనూ సుఖంగా ఉన్నారు. వారిని బాల్యంలోనే వారి తండ్రి రాజ్య సింహాసనం మీద సంతోషపడేటట్లు కూర్చుండబెట్టి రాచరిక మిచ్చి తగిన విధంగా ప్రసిద్ధంగా కాపాడావు.

విశేషం: 'భవద్బలంబునన సుఖస్థితి నున్నవారు' ధర్మరాజు ఇట్లా నిజంగా అనమంటున్నాడా? దెప్పి పొడుపా? నిజానికి పాండవులు సుఖంగా లేరు. ఎన్నో కష్టాలు పడ్డారు. వాటి కన్నింటికీ ధృతరాష్ట్రుడే మూల కారణం. మరి ఇట్లా అనడం ఏమనుకొనాలి? 'అనఘ' అనే సంబోధనం కూడా అనుమానించదగ్గదే!

ఉ. ఇప్పు డుపేక్ష సేసి, కృప యేమియు లేక, విహీనవృత్తి వా
రొప్పమిఁ బొందఁ జూచు టిది యొప్పునె? యింతట సంతసింప రా
దిప్పుడు; నంతకంత నట యెక్కుడు గోరినఁ జాలకుండదే?
యొప్పదె కూడి మన్కి మన కొప్పనివారల యుక్కు దక్కఁగన్?' 371

ప్రతిపదార్థం: ఇప్పుడు; ఉపేక్ష+చేసి= ఒప్పరికించి, అశ్రద్ధ వహించి; కృప+ఏమియున్ లేక= దయ ఏమాత్రమూ లేకుండా; వారు; విహీన వృత్తిన్= అధమస్థితితో; ఒప్పమిన్= ఆపదను; పొందన్+చూచుట= పొందేటట్లు చూడటం; ఇది; ఒప్పునె?= తగునా?; ఇప్పుడున్= ఇప్పుడుకూడా; ఇంతతటన్ సంతసింపరాదు= ఇంతటితో సంతోషించకూడదు; అంతకున్+అంతన్+అట+ ఎక్కుడు+కోరినన్= అంతకంటె అధికంగా కోరినప్పటికీ; చాలక+ఉండదే?= సరిపోకుండా ఉండదా?-ఎంత ఎక్కువ కోరినా చాలదని భావం; ఒప్పని వారల+ఉక్కు+తక్కగన్= పగవారి పొగరు అడగేటట్లు; మనకున్; కూడి మన్కి= కలిసి బ్రతకటం; ఒప్పదె?= తగదా?

తాత్పర్యం: బాల్యంలో అట్లా ఆదరించి, ఇప్పుడు ఒప్పరికించి, దయ ఎంత మాత్రమూ లేకుండా, వారు అధమ దశతో ఆపద పొందగా చూస్తూ ఊరుకొనటం తగునా? ఇప్పుడు అంతటితో సంతోషించకూడదు. అంతకంటె అధికంగా కోరినప్పటికీ సరిపోదు. పగవారి పొగరు అణగేటట్లు మనం కలిసి బ్రదకటం మంచిది కాదా?

విశేషం: నేనింకా తక్కువ కోరుతున్నాను గాని అంతకంటె ఎక్కువ కోరినప్పటికీ తక్కువే అవుతుందని భావం.

వ. అని తదవసరంబునం బితామహుతో నిట్లనుము. 372

తాత్పర్యం: అని ఆ సమయంలో భీష్ముడితో ఇట్లా అనుము.

చ. 'అడఁగఁగనీక శంతనుని యన్వయముం గలిగించి; తీవ యి
ప్పుడుఁ దగ నీ మతంబునన పొందొడఁగూడఁగఁ జేర్చి పొత్త్రులన్
సడికి నధర్మవృత్తికిని జావునకుం దొలఁగించి మన్చినం
బుడమిజనంబు రాజులును భూసురులున్ నినుఁ బ్రస్తుతింపరే?' 373

ప్రతిపదార్థం: ఈవు+అ= నీవే; శంతనుని+అన్వయమున్= శంతనుడి వంశాన్ని; అడఁగఁగ నీక= నశించిపోనివ్వకుండా; కలిగించితి(వి)= నిలబెట్టావు; ఇప్పుడు; తగన్= ఒప్పుగా; నీ మతంబునన్+అ= నీ ఇష్టప్రకారమే; పొందు+ఒడఁగూడఁగన్+ చేర్చి= సంధి కుదిరే విధంగా కలిపి; పౌత్త్రులన్= మనుమలను; సడికిన్= నిందకూ; అధర్మ వృత్తికినిన్= అన్యాయపు నడవడికీ; చావునకున్; తొలఁగించి= దూరంగా ఉంచి; మన్చినన్= బ్రదికిస్తే; పుడమి జనంబున్= భూజనులూ; రాజులునున్= రాజులూ; భూ సురులున్= బ్రాహ్మణులూ; నినున్= నిన్ను; ప్రస్తుతింపరే?= మెచ్చుకోరా?

తాత్పర్యం: ఇదివరకు నీవు శంతనుడి వంశం అంతరించి పోకుండా నిలబెట్టావు. ఇప్పుడు నీవే ఒప్పేటట్లు నీ ఇష్ట ప్రకారమే సంధి కుదిర్చి మనుమలను కలిపి, వారు నిందకూ, అన్యాయానికీ, చావుకూ దూరంగా ఉండేటట్లు చేసి బ్రదికిస్తే భూజనులూ, రాజులూ, బ్రాహ్మణులూ నిన్ను మెచ్చుకొనరా?

విశేషం: భీష్ముడు శంతనుడి కొడుకు. శంతనుడు సత్యవతిని పెళ్ళి చేసికొనటంలో భీష్ముడు సహాయపడ్డాడు. తాను పెళ్ళి చేసికొనని శపథం చేశాడు. సత్యవతీ శంతనులకు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అని ఇద్దరు కొడుకులు పుట్టారు. వారి చిన్నతనంలోనే శంతనుడు మరణించాడు. చిత్రాంగదుడు అవివాహితుడుగా మరణించాడు. భీష్ముడు కాశీరాజు కూతుళ్ళయిన అంబ, అంబిక, అంబాలిక అనే వాళ్ళను స్వయంవరంలో గెల్చి తీసికొనిరాగా, అంబ సాళ్వుడిని ప్రేమించానంటే వెళ్ళిపొమ్మని, అంబికాంబాలికలను విచిత్రవీర్యుడి కిచ్చి పెళ్ళి చేశాడు. విచిత్ర వీర్యుడు సంతానం పొందకుండానే చచ్చిపోయాడు. శంతనుడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వంశం అంతరించిపోతున్నదని సత్యవతి తన ప్రథమ పుత్రుడైన వ్యాసుడిని (పరాశరుడి వలన సత్యవతికి పుట్టినవాడు) అంబికాంబాలికలకు దేవరన్యాయం చొప్పున సంతానం పొందవలసిందిగా ఆదేశిస్తుంది. వ్యాసుడివలన అంబికకు ధృతరాష్ట్రుడూ, అంబాలికకు పాండురాజూ జన్మించారు. దాసిఅయిన శూద్రస్త్రీకి విదురుడు జన్మించాడు. ఈ విధంగా భీష్ముడు శంతనుడి వంశం అంతరించిపోకుండా నిలబెట్టాడు.

వ. అని పలికి వెండియు. 374

తాత్పర్యం: అని పలికి ఇంకా.

క. ఇంతలు పుట్టిన చోటను । శంతనునందన! యహీన శాంతిపరుండై
కౌంతేయాగ్రజుఁ డాలము । పొంతం బో నొల్లఁ' డనుము బుధు లియ్యకొనన్. 375

ప్రతిపదార్థం: బుధులు+ఇయ్యకొనన్= తెలిసినవారు సమ్మతించగా; శంతను నందన!= శంతనుని కుమారుడా! భీష్ముడా!; ఇంతలు+పుట్టిన చోటను= ఇంతలేసి ఘోరాలు జరిగినచోట కూడా; కౌంతేయ+అగ్రజుఁడు= పాండవులలో పెద్దవాడు; ధర్మరాజు; అహీన శాంతి పరుండు+ఐ= తక్కువకాని గొప్పశాంతియం దాసక్తికలవాడయి; ఆలము పొంతన్= యుద్ధం దరికి; పోన్+ఒల్లఁడు+ అనుము= పోవ నంగీకరించడు అనుము.

తాత్పర్యం: తెలిసిన వారు సమ్మతించగా 'భీష్ముడా! ఇంతలేసి ఘోరాలు జరిగిన సందర్భంలో కూడా ధర్మరాజు గొప్ప శాంతియందు ఆసక్తి గలవాడై యుద్ధపు చాయలకు పోవ నంగీకరించడు' అనుము.

సీ. ఆ సమయంబున నచ్చటి వారెల్ల । వినునట్లుగా సుయోధనుని తోడ
'బాహుబలాఢ్యుల బలవిహీనుల క్రియ । వెడలంగ నడిచిన వెట్టితనము,
నత్యంత చిరకాల మడవులఁ గొండల । బాధలఁ బెట్టిన పరుసఁదనము,
సభలోన నట్లు పాంచాల రాజాత్మజఁ । దలవట్టి యీడ్చిన తులువతనము

తే. ధర్మపుత్త్రుండు సైరించెఁ దథ్య; మీవు । కురుకుమారుల నని మ్రింగికొనకు; మొరుల
సొమ్మునకు నాసపడఁ దగ; దిమ్ము వారి । పాలు; వారలతోఁ గూడి బ్రదుకు' మనుము. 376

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ సమయంలో; అచ్చటి వారు+ఎల్లన్= అక్కడ ఉన్నవాళ్ళు అందరూ; విను+అట్లుగాన్= వినేటట్లుగా; సుయోధనుని తోడన్= దుర్యోధనుడితో బాహు బల+ ఆఢ్యులన్= భుజ పరాక్రమ సంపన్నులైన పాండవులను; బల విహీనుల క్రియన్= పరాక్రమశూన్యులవలె; వెడలంగన్+అడిచిన వెట్టితనమున్= ఊళ్ళోనుండి వెళ్ళగొట్టిన వెర్రితనమూ; అత్యంత చిరకాలము= ఎంతోకాలం; అడవులన్= అడవులలోనూ; కొండలన్= కొండలలోనూ; బాధలన్+పెట్టిన పరుసఁదనమున్= బాధపెట్టిన క్రూరత్వమూ:సభలోనన్; అట్లు= ఆ రీతిగా పైకిచెప్పరాని విధంగా; పాంచాల రాజ+ఆత్మజన్= పాంచాల దేశపు రాజయిన ద్రుపదుడి కూతురిని-ద్రౌపదిని; తల+పట్టి+ఈడ్చిన తులువతనమున్= జుట్టుపట్టుకొని ఈడ్చిన తుంటరితనమూ, ధర్మపుత్త్రుండు= ధర్మరాజు; సైరించెన్= సహించాడు; తథ్యము= నిజం; ఈవు= నీవు; కురు కుమారులన్= కౌరవులను; అనిన్= యుద్ధంలో; మ్రింగికొనకుము= నాశనం చేసికొనకుము; ఒరుల సొమ్మునకున్= ఇతరుల డబ్బుకు; ఆసపడన్+తగదు= ఆశించకూడదు; వారి పాలు= వారి భాగం; ఇమ్ము= ఇచ్చివేయుము; వారలతోన్= ఆ పాండవులతో; కూడి= కలిసి; బ్రదుకుము; అనుము.

తాత్పర్యం: నీవు ధృతరాష్ట్రుడి సభలో ఇక్కడి సంగతులన్నీ చెప్పేటప్పుడు అక్కడున్నవాళ్ళంతా వినేటట్లు దుర్యోధనుడితో 'భుజ పరాక్రమ సంపన్నులైన పాండవులను పరాక్రమ శూన్యులవలె ఊళ్ళోనుండి వెళ్ళగొట్టిన మీ వెర్రితనమూ, ఎంతోకాలం అడవులలోనూ, కొండలలోనూ బాధలు పెట్టిన మీ క్రూరత్వమూ, సభలో ద్రౌపదిని ఆ విధంగా జుట్టుపట్టుకొని ఈడ్చిన మీ తుంటరితనమూ ధర్మరాజు సహించాడు నిజం. నీవు కౌరవులను యుద్ధంలో నాశనం చేసికొనకుము. ఇతరుల డబ్బుకొరకు ఆశించకూడదు. వారి భాగం వారి కిచ్చివేయుము. వాళ్ళతో కలిసి బ్రదుకుము' అని చెప్పుము.

విశేషం: 'బాహు బలాఢ్యుల.........వెఱ్ఱితనము.' భుజపరాక్రమసంపన్నులైన పాండవులను స్వప్రయోజనం కొరకు ఉపయోగించుకొనకుండా దుర్యోధనుడు వాళ్ళను ఊళ్ళోనుండి వెళ్ళగొట్టటం వెర్రితనం కాక మరేమిటి?

వ. **ఏము కలహం బొల్లక పొందుగోరుట తనకు మేలు; తన మనంబున దరికొను తృష్ణానలం బార్ప నొరు లడ్డంబు సొరమింజేసి, యేన బుద్ధి సెప్పవలసెఁ; దనయొద్దం గల యోధవీరులె య్యెడల లేమి దెల్లంబయినను, మాకుఁ జేదోడు ధర్మంబు గల; దదియునుంగాక యఖిలలోక సేవితుండైన కృష్ణుండు పెనుబ్రాపు గావునఁ దమకు మమ్ము గెలువం గొలఁదిగా; దదియట్లుండె; నేను భీమసేనాదులకుం దమకుం బెద్దవాఁడ నగుట వీరును వారును మదీయ ప్రార్థనా భంగంబు సేయక, నాదగు శాంతియు దాంతియుఁ జెల్లించి; న న్నలజడిఁ బెట్టక, పోరితం బుడిగి తమతమ ధనంబులు గుడిచి సుఖంబుండుట మన పెద్దలకుం దక్కటి బుద్ధిమంతులకును సంతోషంబగుఁ; బెద్దయీా నోపఁడయ్యేనేనిఁ గుశస్థలంబును; వృకస్థలంబును; వాసంతియు; వారణావతంబును జాలుఁ; గాదేని మఱియు నెందేనియు నొక్కటి యగునట్లుగాఁ దన తోడఁబుట్టువు లేవురకు నిలువతావు లయి దిచ్చిన సర్వశాంతి యగు; నట్లయిన నిందలి యందలి బంధు మిత్త్ర సహాయజనంబులు గలసి నవ్వుచుం దెగడుచు నునికి మన మనంబులకుఁ బ్రియంబుసేయుఁ; గురు పాంచాల యాదవ మాత్స్యులు పరస్పర ప్రీతి సంపాదకత్వ సంపన్నులై బ్రదుకుట నాకుం గోర్కి; యింతయు నమ్మహాపురుషునకుం దెలియం జెప్పు' మనిన విని 'దేవా! నీ యానతిచ్చిన మార్గంబంతయు నడపెద; మీ తండ్రి నీకును దమ్ములకును వాసుదేవునకు నెట్లు ప్రియం బట్లు సేయువాఁడ కాక' యనుచుం బ్రణామంబు సేసిన, సంజయునకు ధనంజయుం డిట్లనియె.** **377**

ప్రతిపదార్థం: ఏము= మేము; కలహంబు+ఒల్లక= యుద్ధం అంగీకరించక; పొందు+కోరుట= సఖ్యం కోరటం; తనకున్; మేలు= మంచిది; తన మనంబునన్= తన మనస్సులో; దరికొను= మండే, తృష్ణా+అనలంబు= పేరాస అనే అగ్ని; ఆర్పన్= చల్లార్చటానికి; ఒరులు= ఇతరులు; అడ్డంబు+చొరమిన్+చేసి= అడ్డం రాకపోవటం చేత; ఏను+అ= నేనే; బుద్ధి+చెప్పన్+వలసెన్= బుద్ధి చెప్పవలసి వచ్చింది; తన+ఒద్దన్+కల యోధ వీరులు= తన దగ్గరున్న యుద్ధవీరులు; ఏ+ఎడలన్= ఎక్కడా; లేమి= లేకపోవటం; తెల్లంబు+అయినను= స్పష్టం అయినప్పటికీ; మాకున్; చేదోడు= సహాయం; ధర్మంబు; కలదు; అదియునున్+ కాక; అఖిలలోక సేవితుండు+ఐన కృష్ణుండు= ఎల్ల లోకాల చేత సేవించబడే కృష్ణుడు; పెను+ప్రాపు+కావునన్= పెద్ద దిక్కు కాబట్టి; తమకున్; మమ్మున్; గెలువన్+కొలఁది+కాదు= గెలవటం శక్యం కాదు; అది+అట్లు+ఉండెన్; ఏను; భీమసేన+ఆదులకున్= భీముడూ మొదలయిన వారికీ; తమకున్; పెద్దవాఁడన్+అగుటన్= పెద్దవాడిని అవటం చేత; వీరును+వారును= వీళ్ళూ, వాళ్ళూ; మదీయ ప్రార్థనా భంగంబున్+చేయక= నాదయిన ప్రార్థనను అనాదరించక; నాది+అగు శాంతియున్ దాంతియున్=

నా శాంతినీ, కర్మేంద్రియాల నిగ్రహశక్తినీ; చెల్లించి= సాగనిచ్చి; నన్నున్; అలజడిన్+పెట్టక= బాధపెట్టక; పోరితంబు+ఉడిగి= యుద్ధం మాని; తమ తమ ధనంబులు+కుడిచి= తమ తమ సొమ్ము లనుభవించి; సుఖంబు+ఉండుట= సుఖంగా ఉండటం; మన పెద్దలకున్; తక్కటి బుద్ధిమంతులకును= తక్కిన బుద్ధిమంతులకూ; సంతోషంబు+అగున్; పెద్ద+ఈన్+ఓపఁడు+ ఏనిన్= అంత ఎక్కువ ఇవ్వలేకపోతే; కుశస్థలంబును; వృకస్థలంబును; వాసంతియున్; వారణావతంబును; చాలున్= సరిపోతాయి; కాదు+ఏనిన్= లేకపోతే; మఱియున్+ఎందున్+ఏనియున్= మరి ఎక్కడైనా; ఒక్కటి+అగునట్లుగాన్; తన తోడఁబుట్టువులు+ ఏవురకున్= తన సోదరులైదుగురికీ; నిలువన్= ఉండటానికి; ఠావులు= నివాసస్థానాలు; అయిదు= ఐదు; ఇచ్చినన్= ఇస్తే; సర్వశాంతి+అగున్= సంపూర్ణ శాంతి ఏర్పడుతుంది; అట్లు+అయినన్= అట్లా జరిగితే; ఇందలి, అందలి బంధు మిత్ర సహాయ జనంబులు= ఇక్కడి అక్కడి చుట్టాలూ, స్నేహితులూ, తోడ్పాటుకై వచ్చిన వాళ్ళూ, కలిసి= కూడి; నవ్వుచున్; తెగడుచున్= త్రుళ్ళుతూ; ఉనికి= ఉండటం; మన మనంబులకున్= మన మనస్సులకు; ప్రియంబు+చేయున్= సంతోషం కలిగిస్తుంది; కురు పాంచాల యాదవ మాత్స్యులు= కౌరవులూ, పాంచాలురూ, యాదవులూ, మాత్స్యులూ; పరస్పర ప్రీతి సంపాదకత్వ సంపన్నులు+ఐ= ఒండొరుల ప్రేమ సంపాదనతో కూడినవారై; బ్రదుకుట; నాకున్+కోర్కి= నా కోరిక; ఇంతయున్; ఆ+మహా పురుషునకున్= ఆ మహానుభావుడికి; తెలియన్+చెప్పుము= స్పష్టపరుచుము; అనినన్; విని; దేవా; నీ+ఆనతి+ఇచ్చిన మార్గంబు+అంతయున్= నీవు సెలవిచ్చిన విధం అంతా; నడపెదన్= జరుపుతాను; మీ తండ్రి; నీకును; తమ్ములకును; వాసుదేవునకున్= కృష్ణుడికీ; ఎట్లు ప్రియంబు+అట్లు+చేయువాఁడు+అ కాక= ఎట్లా ఇష్టమో అట్లా చేసేవాడే అవుతాడు; అనుచున్; ప్రణామంబు+చేసినన్= నమస్కరించగా; సంజయునకున్; ధనంజయుండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: మేము యుద్ధానికి అంగీకరించక సఖ్యం కోరటం తనకు మంచిది. తన మనస్సులో రగిలే తృష్ణ అనే అగ్నిని ఆర్పటానికి ఇతరులు పూనుకొనకపోవటం చేత నేనే బుద్ధి చెప్పవలసి వచ్చింది. తన దగ్గర ఉన్న యోధులు ఎక్కడా లేకపోవడం స్పష్టమే అయినా, మాకు తోడ్పాటు ధర్మం ఉన్నది. అదీకాక ఎల్లలోకాలూ సేవించే కృష్ణుడు మాకు పెద్ద దిక్కు. కాబట్టి తమకు మమ్ములను గెలవటం సాధ్యంకాదు. అది అట్లా ఉండనిమ్ము, నేను భీమాదులకూ, తమకూ పెద్దవాడిని అవటంచేత, వీళ్ళూ, వాళ్ళూ నా కోరికను అనాదరించక, నా శాంతినీ, దాంతినీ సాగనిచ్చి నన్ను బాధించక, యుద్ధం మాని, తమ తమ సొమ్ము లనుభవిస్తూ సుఖంగా ఉండటం మన పెద్దలకూ, తక్కిన బుద్ధిమంతులకూ సంతోషం. అంత ఎక్కువగా ఇవ్వలేకపోతే, కుశస్థలమూ, వృకస్థలమూ, వాసంతీ, వారణావతమూ సరిపోతాయి. లేకపోతే మరి ఎక్కడైనా ఏదో ఒకటి తన సోదరులకు అయిదుగురికీ నిలవడానికి చోట్లు అయిదిస్తే సంపూర్ణశాంతి అవుతుంది. అట్లా అయితే ఇక్కడి అక్కడి బంధువులూ, మిత్రులూ తోడ్పాటు కొరకు వచ్చినవాళ్ళూ కలిసి, నవ్వుతూ, త్రుళ్ళుతూ ఉండటం మన మనస్సులకు సంతోషం కలిగిస్తుంది. కురు పాంచాల యాదవ మాత్స్యులు ఒండొరుల ప్రేమను సంపాదించుకొని బ్రదకాలని నా కోరిక. ఇదంతా ఆ మహానుభావుడికి స్పష్టపరుచుము, అనగా విని 'దేవా! నీవు సెలవిచ్చిన విధానం అంతా నడుపుతాను. మీ తండ్రి నీకూ, తమ్ములకూ, కృష్ణుడికీ ఎట్లా ఇష్టమో అట్లా చేస్తాడు' అంటూ నమస్కరించగా, సంజయుడితో అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: తృష్ణానలంబు-తృష్ణ అనే అనలం రూపకాలంకారం. కుశస్థలంబును, వృకస్థలంబును, వాసంతియు, వారణావతంబును, ఇంకొకటి ఏదయినా ఇట్లా ఏవో అయిదూళ్ళు మాత్రమే ధర్మరాజు కోరినట్లు కనిపించినా, అవి కౌరవ సామ్రాజ్యానికి ఆయువుపట్టులైన ఊళ్ళు. ధర్మరాజు గడుసుదనం అక్కడే ఉన్నది. 'అమ్మహాపురుషునకున్' ఆ మహానుభావుడికి - ఇది స్తుతికాదు విసుగు చెంది అన్నమాట. మూలంలో 'వాసంతి' లేదు. దానికి బదులు 'అవంతి' ఉన్నది. 'కుశస్థల వృకస్థలం అవన్తీం వారణావతమ్.'

క. 'బాల సఖుండవు; నాకును। నీ లెస్స(దనంబు; నేము నీతి విడిచి దు
శ్శీలుర మగుటయు; శైశవ। లీల మొదలు గా(గ మును దెలియదే నీకున్? 378

ప్రతిపదార్థం: బాల సఖుండవు= బాల్య మిత్రుడివి; నాకును; నీ లెస్స(దనంబు= నీ మంచితనమూ; నీకున్; ఏము= మేము; నీతిన్; విడిచి; దుశ్శీలురము+అగుటయున్= దుష్టస్వభావులం అవటమూ; శైశవ లీల మొదలు+కా(గన్= బాల్యం నుండి; మును= ముందు; తెలియదే?= తెలియదా?

తాత్పర్యం: నీవు నాకు బాల్య స్నేహితుడివి. నీ మంచితనం నాకూ, మేము నీతి విడిచి దుస్స్వభావులం అవటం నీకూ చిన్ననాటి నుండీ ముందు తెలియదా?

విశేషం: 'నాకును నీ లెస్స(దనంబు!' 'ఏము నీతి విడిచి దుశ్శీలురమగుటయు' - ఇవి నిజంగా అన్నమాటలు కావు. విపరీతార్థాన్ని ఇచ్చే మాటలు.

మ. బలమత్తాకృతి యైన భీము(డను శుంభత్కుంభి సంరంభమున్
నిలిపెన్ నా(డును నంకుశంబయి; తుదిన్ నే(డుం దదుద్రేకమున్
మలు(గం జేయ నజాతశత్రుని కృపామౌర్ఖ్యంబ చాలంగ; వా
రల కేలా నయవిక్రమోచిత విచారక్లేశముల్ సంజయా!' 379

ప్రతిపదార్థం: సంజయా!; అజాతశత్రుని కృపా మౌర్ఖ్యంబు+అ= ధర్మరాజు యొక్క దయతో కూడిన తెలివితక్కు(వతనమే; నా(డును= అప్పుడూ; అంకుశంబు+అయి= అంకుశమయి; బల మత్త+ఆకృతి+ఐన= బలంచేత మదించిన ఆకారం కలవాడయిన; భీము(డు+అను= భీముడనే; శుంభత్+కుంభి సంరంభమున్= ప్రకాశించే ఏనుగుయొక్క విజృంభణాన్ని; నిలిపెన్= ఆపుచేసింది; తుదిన్= చివర; నే(డున్= ఇప్పుడూ; తద్+ఉద్రేకమున్= ఆ భీమగజం ఆవేశాన్ని; మలు(గన్+చేయన్= అణచటానికి;(అదే), చాలంగన్= సరిపడగా; వారలకున్= ఆ కౌరవులకు; నయ విక్రమ+ఉచిత విచార క్లేశముల్= నీతితో కూడిన పరాక్రమానికి తగిన ఆలోచనల కష్టాలు; ఏలా?= ఎందుకు?

తాత్పర్యం: సంజయా! అజాతశత్రువైన ధర్మరాజు దయతో కూడిన తెలివితక్కు(వతనమే అప్పుడు అంకుశమయి, పరాక్రమ మత్తాకారుడైన భీముడనే మత్తేభం విజృంభణాన్ని ఆపుచేసింది. చివరకు ఇప్పుడుకూడా ఆ భీమగజం ఆవేశాన్ని అణచటానికి అదే సరిపడగా, ఆ కౌరవులకు నీతి పరాక్రమానికి తగిన ఆలోచనలు చేసే కష్టం ఎందుకుంటుంది?

విశేషం: అలం: రూపకం, పరికరాంకురం. భీము(డనే శుంభత్కు(oభి అలంకారం రూపకం. అజాతశత్రుని కృపామౌర్ఖ్యంబ అంకుశం బయి - రూపకమే. అజాతశత్రు(డు అనే ధర్మరాజునామం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరాంకురం.

వ. అని పలికి ధర్మతనయానుమతంబున సంజయునకు సపరివారంబుగా సముచిత ప్రకారంబున మజ్జన భోజనంబు లొనరించి, మాల్యానులేపనాద్యుపచారంబులు సేయించి, మణిభూషణ చిత్రాంబరంబు లొసంగి వీడుకొల్పిన, నతండును బాండవులను వాసుదేవుని వీడ్కొని చనియె' నని చెప్పిన. 380

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని పలికి; ధర్మతనయ+అనుమతంబునన్= ధర్మరాజుయొక్క అనుజ్ఞతో; సంజయునకున్; సపరివారంబుగాన్= పరిజనసమేతంగా; సముచిత ప్రకారంబునన్= తగిన విధంగా; మజ్జన భోజనంబులు= స్నానాహారాలు; ఒనరించి= చేసి; మాల్య+అనులేపన+ఆది+ఉపచారంబులు= దండలు, మైపూఁతలు మొదలయిన సమ్మానములు; చేయించి; మణి భూషణ చిత్ర+అంబరంబులు= రత్నాలంకారాలు, మనోజ్ఞములైన వస్త్రాలు; ఒసంగి= ఇచ్చి; వీడుకొల్పినన్= సెలవిచ్చి పంపగా; అతండును; పాండవులను; వాసుదేవునిన్= కృష్ణుడిని; వీడ్కొని చనియెన్= విడిచి వెళ్ళాడు; అని; చెప్పినన్= అని వైశంపాయనుడు చెప్పగా;

తాత్పర్యం: అని పలికి ధర్మరాజు అనుజ్ఞతో సంజయునకు పరిజనసమేతంగా తగిన విధాన స్నానాహారాలు చేయించి, పూలమాలలు, మైపూతలు మొదలయిన సమ్మానాలు జరిపించి, రత్నాలంకారాలు, మనోజ్ఞములయిన వస్త్రాలు సమర్పించి, సెలవిచ్చి పంపగా సంజయుడును పాండవులను, శ్రీకృష్ణుడిని విడిచి వెళ్ళాడు' అని వైశంపాయనుడు చెప్పగా.

క. విని, యత్యంత కుతూహల । మునఁ బొదలుచు, 'సంజయుండు మున్నెచ్చటికిం
జనియెను? నెవ్వరితో నే । మనియెను వినవలయు; మునిజనాధిప! చెపుమా.' 381

ప్రతిపదార్థం: విని= (జనమేజయుడు) విని; అత్యంత కుతూహలమునన్= మిక్కిలి ఆసక్తితో; పొదలుచున్= ఒప్పుతూ; ముని జన+అధిప!= మునీశ్వరా! వైశంపాయన మహర్షీ!; సంజయుండు; మున్ను= ముందు; ఎచ్చటికిన్= ఎక్కడకు; చనియెను= వెళ్ళాడు; ఎవ్వరితోన్; ఏమి+అనియెను; వినవలయున్; చెపుమా.

తాత్పర్యం: జనమేజయుడు విని మిక్కిలి ఆసక్తితో ఒప్పుతూ 'మునీశ్వరా! సంజయుడు ముందుగా ఎక్కడకు వెళ్ళాడు? ఎవరితో ఏ మన్నాడు? వినాలి చెప్పుము.'

వ. అని యడిగిన. 382

తాత్పర్యం: అని జనమేజయుడు అడుగగా. (తరువాతి ఆశ్వాసంలోని వచనంతో అన్వయం).

ఆశ్వాసాంతము

ఉ. భూరికృపానుషంగ! మునిపుంగవ చిత్త సరోజ భృంగ! సం
సార దవ ప్రవర్ష! సుర సంస్తుత దివ్య గుణ ప్రకర్ష! దో
స్సారనిరస్త దైత్య! శమశాలి మనస్స్థితి నిత్య! లోక ని
స్తారక శీల! నిర్వృతి విశాల! నిరంజన! పాపభంజనా! 383

ప్రతిపదార్థం: ఇది కృతిపతి అయిన హరిహరనాథుడికి కృతికర్త తిక్కన చేసిన స్తుతి. భూరి కృపా+అనుషంగ!= (ఆపన్నులైన వారి యందు) గొప్ప దయ కలవాడా!; (అనుషంగము= ఆసక్తి); ముని పుంగవ చిత్త సరోజ భృంగ!;= మునిశ్రేష్ఠుల మనఃపద్మములకు తుమ్మెద అయినవాడా!; సంసార దవ ప్రవర్ష!= సంసారమనే కార్చిచ్చునకు ధారాపాతమైన వాడా!; సుర సంస్తుత దివ్య గుణ ప్రకర్ష!= దేవతలచేత మిక్కిలి స్తుతించబడిన ఉత్తమ గుణాతిశయం కలవాడా!; దోస్+సార నిరస్త దైత్య!= భుజబలంచేత నిరసింపబడిన రాక్షసులు కలవాడా!; శమశాలి మనస్+స్థితి నిత్య!= ఇంద్రియనిగ్రహం కలవారి మనస్సులందలి ఉనికిచేత శాశ్వతుడా-వశులైన మహర్షులు తమ మనసులను పరమేశ్వరుడియందే లగ్నం చేస్తారని భావం; లోక విస్తారక

శీల!= భక్త లోకాన్ని తరింపజేసే స్వభావం కలవాడా!; నిర్వృతి విశాల!= ఆనందం చేత విశాలుడా! (అనంతానంద స్వరూపుడా అని భావం); నిరంజన!= దేనితోనూ తగులులేనివాడా!; పాప భంజనా= (భక్తుల) పాపాలను నశింపజేసేవాడా! హరిహరనాథా!

తాత్పర్యం: ఆపన్నులయందు గొప్పదయ గలవాడా! మహర్షుల మనఃపద్మాలకు తుమ్మెద అయినవాడా! సంసారం అనే కార్చిచ్చుకు ధారాపాతమైన వాడా! దేవతల చేత కూడా స్తుతించబడిన సుగుణాల అతిశయం కలవాడా! భుజబలం చేత నిరసించబడిన రాక్షసులు కలవాడా! ఇంద్రియనిగ్రహం కలవారి మనస్సులందు నిత్యం ఉండేవాడా! భక్త లోకాల్ని తరింపజేసే స్వభావం కలవాడా! అనంతానంద స్వరూపుడా! దేనితోనూ సక్తత లేనివాడా! భక్తుల పాపాలను నశింపజేసేవాడా! హరిహరనాథా!

విశేషం: అలం: రూపకం. అంత్యానుప్రాసం. ముని పుంగవ చిత్త సరోజ భృంగ- చిత్తములనే సరోజాలకు భృంగము- అలంకారం రూపకం. సంసారదవ ప్రవర్ష - సంసారమనే దవానికి ప్రవర్షమైనవాడు- అలంకారం రూపకం. రెండేసి విశేషణాలకు అంత్యానుప్రాసం.

క. శ్రుతి మౌళి రత్నమూర్తీ! । శతధృతి ముఖ పద్మ షండ సౌరభ కీర్తీ!
రతిపతి హితాహితాక్షా! । సతత సమాచరిత భక్త జన సంరక్షా! 384

ప్రతిపదార్థం: ఇది కూడా హరిహరనాథస్తుతే. శ్రుతి మౌళి రత్నమూర్తీ!= వేదం అనే స్త్రీయొక్క శిరస్సునకు రత్నమైన స్వరూపం కలవాడా! - వేదాంతాలచేత ప్రతిపాదించబడే వాడా అని భావం; శతధృతి ముఖ పద్మ షండ సౌరభ కీర్తీ!= బ్రహ్మయొక్క తామరల వంటి ముఖాల యొక్క సమూహం యొక్క పరిమళరూపకమైన యశస్సు కలవాడా!; రతి పతి హిత+అహిత+అక్షా!= మన్మథుడికి మేలూ, కీడూ కలుగజేసే కన్నులు కలవాడా!; సతత సమాచరిత భక్త జన సంరక్షా!= ఎల్లప్పుడూ చేయబడిన భక్త జనుల రక్షణం కలవాడా! నిత్యమూ భక్తులను రక్షించేవాడా అని భావం - హరిహరనాథా!

తాత్పర్యం: శ్రుతి కాంత శిరోరత్నమైనవాడా! వేదాంతాలచేత ప్రతిపాదించబడేవాడా! బ్రహ్మ ముఖ పద్మసమూహాల పరిమళంవంటి కీర్తి కలవాడా! (బ్రహ్మ ముఖ పద్మ నిర్గత చతుర్వేదాలూ పరమేశ్వరుడి యశస్సునే తెలుపుతున్నాయని భావం.) మన్మథుడికి మేలూ కీడూ కలుగజేసే కన్నులు కలవాడా! ఎల్లపుడూ భక్తజనులను రక్షించేవాడా! హరిహరనాథా!

విశేషం: శ్రుతిమౌళులు వేదాంతాలు. వాటికి రత్నమైన వాడు అనగా వాటిచేత ప్రతిపాదించబడేవాడు. వేదం పూర్వభాగం కర్మలకు సంబంధించేది. ఉత్తరభాగమైన ఉపనిషత్తులు పరమేశ్వరుడికి సంబంధించేవి. రతిపతి హితాహితాక్షా! హరి రూపంలో మన్మథుడు పుత్రుడవటం చేత అతడియందు ప్రసన్నమైన దృష్టీ, హరరూపంలో శత్రువవటం చేత మూడో కంటితో దహించి అతనియందు అహితమైన దృష్టీ హరిహరనాథుడి కున్నాయని భావం. శ్రుతిమౌళిరత్నమూర్తీ-రూపకాలంకారం. శతధృతి ముఖపద్మషండ సౌరభకీర్తీ రూపకాలంకారమే. రతిపతి హితాహితాక్షా - అలంకారం యథాసంఖ్యం. హితాక్షి హరిదీ, అహితాక్షి హరుడిదీ అని క్రమాన్వయం. రెండేసి పాదాలకు అంత్యానుప్రాసం పాటించబడింది.

మాలిని.

సదయ విమల దృష్టీ! సంశ్రితాశీః ప్రవృష్టీ!
హృదయ కమల వాసా! యిద్ధమాయా విలాసా!
విదిత నిఖిల భూతీ! విశ్వరక్షాత్తహేతీ!
సదసదుపచితాత్మా! సంభృతానందవర్మా! 385

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇది కూడా హరిహరనాథుడిని స్తుతించే పద్యమే. సదయ విమల దృష్టీ!= (భక్తులయందు) దయతో కూడిన స్వచ్ఛమైన కీర్తిగలవాడా; సంశ్రిత+ఆశీస్+ప్రవృష్టీ!= ఆశ్రితులకు ఆశీస్సులను మిక్కిలి వర్షించేవాడా!; హృదయ కమల వాసా!= పద్మంవంటి హృదయం నివాసస్థానంగా కలవాడా!; ఇద్ధ మాయా విలాసా!= అప్రతిహతమైన మాయయొక్క జగదుత్పత్తి స్థితి లయ రూపమైన లీలగలవాడా!; విదిత నిఖిల భూతీ!= తెలియబడిన సకలైశ్వరములూ కలవాడా!; విశ్వ రక్షా+ఆత్త హేతీ!= జగద్రక్షణ కొరకే పొందబడిన ఆయుధములు కలవాడా!; సత్+అసత్+ఉపచిత+ఆత్మా!= సద్రూపంతోనూ, అసద్రూపంతోనూ పెంపొందిన స్వరూపం కలవాడా!; సంభృత+ఆనంద వర్త్మా!= పొందబడిన ఆనందమార్గం కలవాడా! హరిహరనాథా!

తాత్పర్యం: భక్తులయందు సదయమూ నిర్మలమూ అయిన దృష్టికలవాడా! ఆశ్రితులకు ఆశీస్సులను వర్షించేవాడా! హృదయపద్మం వాసస్థానంగా కలవాడా! అడ్డులేని మాయయొక్క జగదుత్పత్తి స్థితి లయరూపమైన లీలగలవాడా! సకలైశ్వర్యాలూ తెలిసినవాడా! జగద్రక్షణ కొరకే ఆయుధాలు ధరించినవాడా! సద్రూపంతోనూ, అసద్రూపంతోనూ పెంపొందిన స్వరూపం కలవాడా! ఆనందమార్గం పొందినవాడా! హరిహరనాథా!

విశేషం: 'సదసదుపచితాత్మా' విశ్వమంతా సదసద్రూపాలతో కూడి ఉన్నది. సద్రూపం కారణరూపం వాస్తవం. అసద్రూపం కార్యరూపం అవాస్తవం. కార్యములైన ఘటాదులు వాస్తవములు కావు. కారణమైన మట్టియే వాస్తవం. కార్యకారణ రూపంతో ఒప్పు ఈ విశ్వమంతా పరమేశ్వర రూపమే కాబట్టి పరమేశ్వరుడు సదసదుపచితాత్ముడు. లేదా సత్తంటే మూర్తరూపాలైన పృథివి, జలం, అగ్ని మొదలయినవి. అసత్తంటే అమూర్తములైన వాయువు, ఆకాశం మొదలయినవి. తదుపచితాత్ముడు పరమేశ్వరుడు, 'సంభృతానంద వర్త్మా'-పరమేశ్వరుడిని పొందించే భక్తి జ్ఞాన కర్మ మార్గాలలో ఏదయినా ఆనందపరిపూర్ణమే అని భావం. ఆశీః ప్రవృష్టీ రూపకం. హృదయ కమలం ఉపమిత సమాసం. రెండేసి విశేషణాలకు అంత్యప్రాసం పాటించబడింది.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజ తిక్కన సోమయాజి ప్రణీతం బయిన శ్రీ మహాభారతంబున యుద్యోగపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది; శ్రీమత్+ఉభయకవి మిత్త్ర= శ్రీమంతుడైన ఉభయకవిమిత్త్ర బిరుదాంచితుడూ(సంస్కృతకవులూ, ఆంధ్ర కవులూ ఈ ఉభయులకూ మిత్త్రుడు ఇది తిక్కన బిరుదు.) కొమ్మన+అమాత్య పుత్త్ర= కొమ్మన మంత్రి కుమారుడూ; బుధ+ ఆరాధన విరాజి= పండితుల పూజచేత ప్రకాశించే వాడూ; (అగు), తిక్కన సోమయాజి ప్రణీతంబు+అయిన= తిక్కన సోమయాజిచేత రచించబడిన; శ్రీ మహాభారతంబున+ఉద్యోగపర్వంబునందున్= శ్రీ మహాభారతంలోని ఉద్యోగపర్వంలో; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది ఉభయ కవిమిత్త్ర బిరుదాంచితుడూ, కొమ్మనామాత్యుడి కుమారుడూ, బుధుల పూజచేత ప్రకాశించే వాడూ అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శ్రీ మహాభారతంలోని ఉద్యోగపర్వంలో మొదటి ఆశ్వాసం.

ఉద్యోగపర్వంలోని ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీ విస్తారకరణ కరు । ణావేశోదార ! శశ్వదమలాకారా!
భావ వికార విదూర! శు । భావహ నామప్రకార! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: ఇది తిక్కన కృతిపతిఐన హరిహరనాథుడిని స్తుతిస్తూ చెప్పిన ఆశ్వాసాది పద్యం.

శ్రీ విస్తార కరణ కరుణా+ఆవేశ+ఉదార!= ఐశ్వర్యాన్ని అధికం చేసే దయయొక్క ఆవేశం చేత గొప్పవాడా!; శశ్వత్+అమల+ ఆకారా!= ఎల్లప్పుడూ స్వచ్ఛమైన ఆకారం కలవాడా!; భావ వికార విదూర!= పదార్థాలకు లోకంలో గలిగే మార్పులకు మిక్కిలి దూరంగా ఉండేవాడా!; శుభ+ఆవహ నామ ప్రకార!= శుభాలను కలిగించే పేరు గలవాడా!; హరిహరనాథా!

తాత్పర్యం: హరిహరనాథా! ఐశ్వర్యాన్ని పెంపొందించే దయావేశంచేత గొప్పవాడా! ఎప్పుడూ నిర్మలమైన ఆకారం కలవాడా! పదార్థాలకు కలిగే జనన మరణాది వికారాలకు మిక్కిలి దూరమైనవాడా! జనులకు శుభాలను కలిగించే పేరు కలవాడా!

విశేషం: పరమేశ్వరుడి దయావేశం ఐశ్వర్యహేతు వనటానికి కుచేలాదుల వృత్తాంతాలు దృష్టాంతాలు. భావ వికార విదూర- లోకంలో వస్తువులకుగల పుట్టటం, ఉండటం, వృద్ధిపొందటం, మారటం, క్షీణించటం, నశించటం అనే ఆరు విధాలయిన మార్పులు లేని నిర్వికారుడు పరమేశ్వరుడు. 'శుభావహనామ ప్రకార' - పరమేశ్వరుడి నామం మంత్రరూపమే కాబట్టి అట్టి మంత్రజపం తదుపాసకుడికి శుభం కలుగజేస్తుంది.

సంజయుఁడు ధర్మజుని సంధి పల్కులను ధృతరాష్ట్రునకుఁ దెల్పుట (సం.5-32-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; 'నివ్విధంబున వీడ్కొని సూతనందనుండు పవనజవంబు లగు నరదంబు తురంగంబులం దఱిమి ప్రొద్దుగ్రుంకునంతకుం గరిపురి సొచ్చి నగరి కరిగి యంతః పురంబున నున్న ధృతరాష్ట్రునకుం దనరాక యెఱింగించి పుచ్చి యతనిం గాంచి యడుగుల కెఱఁగిన, నమ్మహీవరుండును నత్యాదరంబున నెత్తి సమీపంబున నునిచినం గొలిచియుండి చేతులు మోడ్చి యిట్లనియె; 2

ప్రతిపదార్థం: దేవా!= స్వామీ, హరిహరనాథా!; వైశంపాయనుండు; జనమేజయునకున్; ఇట్లు+అనియెన్; సూత నందనుండు= సంజయుడు; ఈ+విధంబునన్; వీడ్కొని= వీడి; పవన జవంబులు+అగు= వాయువువేగంవంటి వేగంగలవైన; అరదంబు తురంగంబులన్= రథాశ్వాలను; తఱిమి= పరుగెత్తించి; ప్రొద్దు+క్రుంకు+అంతకున్= సూర్యుడు అస్తమించే సమయానికి;

కరిపురి+చొచ్చి= హస్తినాపురం ప్రవేశించి; నగరికిన్+అరిగి= రాజభవనానికి వెళ్ళి; అంతఃపురంబునన్+ఉన్న ధృతరాష్ట్రునకున్= అంతఃపురంలో ఉన్న ధృతరాష్ట్రుడికి; తన రాక; ఎఱింగించి పుచ్చి= తెలిపి; అతనిన్; కాంచి; అడుగులకున్+ఎఱఁగినన్= పాదాలకు మొక్కగా; ఆ+మహీవరుండును= ఆ రాజును; అతి+ఆదరంబునన్= మిక్కిలి ఆదరంతో; ఎత్తి= లేవనెత్తి; సమీపంబునన్= చేరువలో; ఉనిచినన్= కూర్చుండ బెట్టగా; కొలిచి+ఉండి= సేవించి; చేతులు మోడ్చి= చేతులు జోడించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ప్రభూ! హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు. 'సంజయుడు ఈ విధంగా పాండవులను వీడి వాయువేగాలయిన రథాశ్వాలను పరువెత్తించి సూర్యాస్తమయ సమయానికి హస్తినాపురం ప్రవేశించి, రాజభవనానికి వెళ్ళి, అంతఃపురంలో ఉన్న ధృతరాష్ట్రుడికి తన రాక తెలిపి, అతడిని చూచి, పాదాలకు మ్రొక్కగా, ఆ రాజు మిక్కిలి ఆదరంతో లేవనెత్తి దగ్గర కూర్చుండబెట్టుకొన్నాడు. సంజయుడు అతడిని సేవించి చేతులు జోడించి ఇట్లా అన్నాడు.

ఉ. 'దేవర పంపఁగాఁ జని యుధిష్ఠిరునిం గని వచ్చినాఁడ; నా
భూవిభుఁ డప్రమేయ గుణపూజ్యుఁడు మీకు నమస్కరించె; సం
భావనసేసె నా; కిచటి బంధుల నెల్లఁ దలంచె; మీ సుఖ
శ్రీ విభవంబులున్, సుతుల సేమము నన్నడిగెం బ్రసన్నుఁడై.' 3

ప్రతిపదార్థం: దేవర= తమరు; పంపఁగాన్; చని= వెళ్ళి; యుధిష్ఠిరునిన్= ధర్మరాజును; కని= చూచి; వచ్చినాఁడన్; అప్రమేయ గుణ పూజ్యుఁడు= కొలది ఇడరాని సుగుణాలచే పూజించదగినవాడు; (అగు); ఆ భూవిభుఁడు= ఆ రాజు ధర్మరాజు; మీకున్; నమస్కరించెన్; నాకున్; సంభావన+చేసెన్= మర్యాద చేశాడు; ఇచటి బంధులన్+ఎల్లన్= ఇక్కడి చుట్టాలనందరినీ; తలంచెన్= స్మరించాడు; ప్రసన్నుఁడు+ఐ= సంతుష్టుడయి; మీ సుఖ శ్రీ విభవంబులున్= మీ సౌఖ్యమూ, సంపదా, వైభవమూ, సుతుల సేమమున్= కొడుకుల క్షేమమూ; నన్నున్+అడిగెన్.

తాత్పర్యం: 'తమరు పంపగా వెళ్ళి ధర్మరాజును చూచివచ్చాను. అమిత సుగుణాలు కలిగి పూజ్యుడైన ఆ రాజు మీకు నమస్కరించాడు. నాకు మర్యాద చేశాడు. ఇక్కడి చుట్టాలనందరినీ స్మరించాడు. సంతోషంతో మీ సౌఖ్యమూ, సంపదా, వైభవమూ, కొడుకుల క్షేమమూ నన్ను అడిగాడు.

విశేషం: రాయబారిగా సంజయుడు ఉపప్లావ్యంనుండి తిరిగి వచ్చి ధృతరాష్ట్ర మహారాజుకు అక్కడ జరిగిన విశేషాల తాత్పర్యాన్ని (సారాంశాన్ని) సంగ్రహంగా సారవంతంగా నివేదిస్తున్నాడు. ఇది ప్రాథమిక నివేదిక వంటిది. అందువలన ఇందులో ప్రతిపద సార్థక్యం పరిగణించదగింది. ప్రభువులైన మీరు నన్ను పంపారు. నేను 'యుధిష్ఠిరుడిని చూచి వచ్చాను' అని మొదటి వాక్యం. యుద్ధమందు స్థిరసంకల్పంతో ఉన్న ధర్మరాజును నేను అక్కడ చూచాను - అని అర్థం. 'చూచి వచ్చా'నంటే ఆశించిన ప్రయోజనం మరేమీ సిద్ధించ లేదని కూడా ధ్వని. ధర్మజుడు గుణపూజ్యుడు. ప్రసన్నుడు - అనిపించాడు; అందరినీ ఆదరంతో అభినందించాడని పేర్కొన్నాడు. ధృతరాష్ట్రుడి వ్యూహానికి విరుద్ధంగా యుద్ధ నిర్ణయంలో ధర్మజుడున్నా, శత్రువులు కూడా పూజ్యుడనీ, ప్రసన్నుడనీ భావించేటట్లు వ్యవహరించాడనీ తాత్పర్యం. యుధిష్ఠిరుడైనా ప్రసన్నుడై తండ్రియొక్క యోగక్షేమాలు తెలిసికొనటం, అతడి ప్రతినిధికి మర్యాద చేయటం, కౌరవుల క్షేమాన్ని అడగటం విశేషం. (సంపా.)

తే. అనుడు ధృతరాష్ట్రుఁ డిట్లను 'నయ్యజాత । శత్రునకు సేమమే? యనుజన్ము లెల్ల
సుఖులె? బంధులు, భృత్యులు, సఖులు, మంత్రి । వరులు సంప్రీతిమెయి నున్నవారె యచట?' 4

ప్రతిపదార్థం: అనుడున్= అనగానే; ధృతరాష్ట్రుఁడు+ఇట్లు+అనున్; ఆ+అజాతశత్రునకున్= ఆ ధర్మరాజుకు; సేమమే?; అనుజన్ములు+ఎల్లన్= తమ్ములందరూ; సుఖులె?= సుఖంగా ఉన్నారా?; బంధులున్= చుట్టాలూ; భృత్యులున్= సేవకులూ; సఖులున్= స్నేహితులూ; మంత్రివరులున్= మంత్రిశ్రేష్ఠులూ; అచటన్= అక్కడ; సంప్రీతి మెయిన్= సంతోషంతో; ఉన్నవారె?= ఉన్నారా?

తాత్పర్యం: అనగానే ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు; 'ఆ ధర్మరాజుకు క్షేమమా? అతడి తమ్ములందరూ సుఖంగా ఉన్నారా? అక్కడ చుట్టాలూ, సేవకులూ, స్నేహితులూ, మంత్రివర్యులూ సంతోషంతో ఉన్నారా?'

విశేషం: 'అజాతశత్రు'వనే పద ప్రయోగం సార్థకం. పేరుకు యుధిష్ఠిరుడైనా, స్వభావంచేత 'అజాత శత్రువు'. ధృతరాష్ట్రుడు ధర్మరాజులోని అజాతశత్రుత్వాన్ని మేలుకొల్పటానికే సంజయుడిని పంపాడు. అది సఫలమైనదా? అని ఆశతో ఆ పదాన్ని వాడాడు. ధర్మజుడి శాంతప్రవృత్తిని సహించి తమ్ములూ, బంధువులూ, భృత్యులూ సంతృప్తితో ఉన్నారా? అని అడిగాడు. లోగుట్టు లాగటానికి నగిషీగా మాట్లాడే తీరిది. (సంపా.)

వ. అనిన సంజయుం డిట్లనియె; 5

తాత్పర్యం: అనగా సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

క. 'వారెల్లను భవదీయ । స్ఫారబలము గారణముగ సౌఖ్యంబున ను
న్నారమని పలుకుదురు; నిజ । మారయఁగా నట్ల కాదె యది, జననాథా! 6

ప్రతిపదార్థం: జననాథా= రాజా!; వారు+ఎల్లను= వారందరూ; భవదీయ స్ఫార బలము+కారణముగన్= నీదైన అధిక బలం కారణంగా; సౌఖ్యంబునన్= సుఖంగా; ఉన్నారము+అని పలుకుదురు= ఉన్నామని అంటారు; నిజము+ఆరయఁగాన్= నిజం చెప్పాలంటే; అది; అట్లు+అ కాదె!= అంతేకదా!

తాత్పర్యం: 'రాజా! వారందరూ నీ గొప్పబలం కారణంగా సుఖంగా ఉన్నాం' అని అంటారు. నిజం చెప్పాలంటే అది అంతేకదా!

విశేషం: ఈ వాక్యాలు మెలిక మాటలు. వ్యంగ్యోక్తులు. కాకువు స్థగితం చేసిన పలుకులు. ధర్మరాజు 'ఆ రాజు మాదెసం గల కారుణ్యము కతమునను సుఖంబున నిట్లున్నారము'- అని కాకువుతో ఎత్తి పొడిచినట్లున్నాడు. దానిని సంజయుడు యథాతథంగా నివేదించకుండా సంస్కరించాడు. ధృతరాష్ట్రుడి ఉజ్జ్వలబలంవలన వారు క్షేమంగా ఉన్నారని అంటున్నారు - అన్నాడు. అంటే ఇప్పటికీ ధృతరాష్ట్రుడి రక్షలోనే మేమున్నామని భావిస్తున్నామని పాండవులు అంటున్నారని భావం. నిజానికి ఆ మాటలు సత్యం కావు. నిజం గాని మాటలను నిజంగా నమ్మించటమే కదా సంజయుడి రాయబారంలోని రాజనీతి. ఆ రాజనీతిని కన్నులతో వెక్కిరిస్తున్నట్లు సంజయుడు పలికాడు. 'నిజ మారయఁగా నట్లకాదె!' అని, ధర్మజుడి కాకువును స్థగితం చేసి తన వ్యంగ్యోక్తిని ప్రకటించటం సంజయుడి వాక్యనీతి. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ధర్మజునకు భోగంబులు । ధర్మువున ట్లింపు గావు; ధర్మంబులలో
నిర్మల బుద్ధి నహింసకుఁ । గూర్మి గడుం గలఁ డతండు, కురువంశనిధీ! 7

ప్రతిపదార్థం: కురు వంశ నిధీ!= కురువంశానికి ఆశ్రయమైనవాడా - ధృతరాష్ట్రా!; ధర్మజునకున్= ధర్మరాజుకు; భోగంబులు= సౌఖ్యాలు; ధర్మువు+అట్లు= ధర్మం వలె; ఇంపు+కావు= ప్రియము కావు; అతండు; నిర్మల బుద్ధిన్= స్వచ్ఛమైన మనస్సుతో; ధర్మంబులలోన్= ధర్మాలలో; అహింసకున్= అహింస అనే ధర్మానికి; కూర్మి= ప్రీతి; కడున్= మిక్కిలి; కలఁడు= కలవాడు;

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడా! ధృతరాష్ట్రా! ధర్మరాజుకు సౌఖ్యాలు ధర్మం వలె ప్రియం కావు. అతడు నిర్మల మనస్సుతో ధర్మాలన్నిటిలోనూ అహింసాధర్మాన్ని బాగా ఇష్టపడతాడు.

విశేషం: సంజయుడి రాయబారపు ప్రయత్నమంతా ధర్మరాజులోని శాంత ప్రవృత్తిని ప్రబుద్ధం చేసి, అతడి యుద్ధ ప్రయత్నం మాన్పించి, రాజ్యకాంక్ష లేని ప్రసన్నభావంతో వైరాగ్యచిత్తంతో జీవించేటట్లు ప్రబోధించటం కదా! ఆ పరివర్తన ప్రయత్నంతో సంజయు డెంత వరకు కృతకృత్యుడైనాడో తెలిసికొనటం ధృతరాష్ట్రుడి ఆసక్తి. దాని కనుగుణంగా ధర్మజుడి చిత్తవృత్తిని సంజయుడు వివరించనారంభించాడు. ధర్మరాజుకు భోగాల కంటె ధర్మమంటే ప్రీతి. ధర్మాలలో అహింస అంటే అత్యంత ప్రీతి అని ఆరంభించాడు. ధృతరాష్ట్రుడికి ఈ ఎత్తుగడ ఆశాజనకంగా ఉన్నది. అయితే, ధర్మమంటే ఏమిటి? అన్నది ఈ పద్యంలో మిగిలే యక్షప్రశ్న. (సంపా.)

ఉ. మానుషశక్తి యొల్లఁడు; సమంచిత దైవము యూఁదియుండు; నీ
పైన యతండు పుణ్యమును బాపముఁ బెట్టినవాఁడు; నీవు నీ
సూనువశంబ కాని యొకచొప్పుఁ దలంపవు; కర్ణ సౌబలా
ధీనము కార్యనిశ్చయము; తెల్లము నీ మత మొప్ప దేమియున్. 8

ప్రతిపదార్థం: (ధర్మరాజు కర్త); మానుష శక్తి= పౌరుషమైన శక్తి; ఒల్లఁడు= అంగీకరించడు; సమంచిత దైవము+అ= ఒప్పిదమైన దైవమే; ఊఁది+ఉండున్= అవలంబించి ఉంటాడు; అతండు= ధర్మరాజు; నీ పైన్+అ= నీ మీదనే; పుణ్యమును+ పాపమున్+పెట్టినవాఁడు= పుణ్యపాపాలు పెట్టాడు; నీవు; నీ సూను వశంబు+అ కాని= నీ కొడుకు అధీనతే కాని; ఒక చొప్పున్= మరే విధమూ; తలంపవు= ఆలోచించవు; కార్య నిశ్చయము= కార్య నిర్ణయం; కర్ణ సౌబల+అధీనము= కర్ణ శకునుల వశం; నీ మతము= నీ విధం; ఏమియున్+ఒప్పదు= ఏమీ బాగుండదు; తెల్లము= స్పష్టం.

తాత్పర్యం: ధర్మరాజు పౌరుషాన్ని అంగీకరించడు; ఒప్పిదమైన దైవాన్నే నమ్ముకొని ఉంటాడు. అతడు పుణ్యపాపాలను నీమీదే పెట్టాడు. నీవు నీ కొడుకు కోరినట్లేకాని ఇంకో విధం ఆలోచించవు. కార్య నిర్ణయం కర్ణ శకునుల వశం. నీ విధం ఏమీ బాగుండదు. అది స్పష్టం.

విశేషం: 'అహింసా పరమో ధర్మః' అని నమ్మిన ధర్మరాజు ఆ ధర్మసాధనలో పురుషయత్నాన్ని చేస్తాడు కాని, అది దైవ సమ్మతం కాకపోతే సఫలం కాదని నమ్ముతాడు. ఇది ధర్మజుడి వ్యక్తిత్వంలోని కీలకమైన అంశం. అందువలన దేవుడి మీద భారం వేసి ఈ కార్యంలోని పుణ్యపాపాలు రెండూ ధృతరాష్ట్రుడి మీదనే ఉంచాడు ధర్మరాజు. అంటే, నిర్ణయం తీసికొనవలసింది ధృతరాష్ట్రుడే. అతడి నిర్ణయం దైవప్రేరితంగా ధర్మజుడు భావించి పురుషయత్నం చేయాలని భావించాడు. ధర్మజుడు స్వయంనిర్ణయం తీసికొని వైరాగ్య వృత్తిని వరిస్తాడేమో అనుకొని ధృతరాష్ట్రుడు పురుషయత్నం చేశాడు. ధర్మజుడు దానిని

నిపుణంగా త్రిప్పికొట్టి 'తండ్రి నిర్ణయమే దైవనిర్ణయంగా భావిస్తానన్నా'డని సంజయుడు తేల్చి చెప్పాడు. అంటే- పుణ్యపాపాలన్నీ ధృతరాష్ట్ర నిర్ణయం మీదే ఆధారపడి ఉన్నవనీ బాధ్యత గ్రుడ్డిరాజుదే అయిందనీ ధ్వని.

ఈ విధంగా ధర్మజ ప్రవృత్తిని తెలిపి అంతటితో ఆగక ధర్మజుడి ఎత్తుగడతో ధృతరాష్ట్రుడి అసలు బండారం ఎంత బైటపడుతుందో తెలిసేటట్లు వ్యంగ్యంగా రాజును అధిక్షేపగర్భితంగా ఆక్షేపించ నారంభించాడు. రాయబారి పాత్ర కంటె హితుడి పాత్రను గ్రహించి పలుక నారంభించాడు. అందులోని ముఖ్యాంశాలు ఇవి. అక్కడ నిర్ణయం ధర్మరాజుది. కాని, ఇక్కడ నిర్ణయం ధృతరాష్ట్రుడిది కాదు. అది దుర్యోధనాధీనం. ఆ దుర్యోధనుడి ఆలోచన కూడా అతడి స్వంతం కాదు. కార్యం నిశ్చయించేది కర్ణసౌబలులు. అందువలన కౌరవ నిర్ణయం పురుషయత్నమే కాదు. కాపురుషయత్నం, పరోక్ష యత్నం, పరాధీనమైన కార్యనిశ్చయం. అది అన్ని విధాలా అనర్థదాయకం. కాబట్టి ఈ పురుషయత్నం దైవబలం పొందలేక విఫలమౌతుందని ధ్వనిమయంగా పలికాడు. తన రాయబారి తనకే నీతి చెప్పితే వినే వింత పరిస్థితిలో పడ్డాడు ధృతరాష్ట్రుడు. ఇది శోచనీయావస్థ. (సంపా.)

ఆ. ఆలు బిడ్డ లేని యట్టి త్రిమ్మరి యగు । కొయ్య గాక, కుదుటఁ గూడు వెట్టి
కుడుచువార లిట్టి క్రొవ్విదంబులు సేయఁ । జొచ్చు టిచ్చగించి చూతురయ్య? 9

ప్రతిపదార్థం: ఆలు బిడ్డ లేని అట్టి త్రిమ్మరి+అగు కొయ్య+కాక= పెళ్లాం బిడ్డా లేక ఇష్టం వచ్చినట్లు తిరిగే మొద్దుకాక; కుదుటన్+కూడు+పెట్టి కుడుచువారలు= ఒకచోట స్థిరంగా ఉండి అన్నం తినేవాళ్ళు; ఇట్టి క్రొవ్విదంబులు= ఇటువంటి పొగరుబోతు చేతలు; చేయన్+చొచ్చుట= చేయబూనటం; ఇచ్చగించి చూతురయ్య?= ఇష్టపడి చూస్తారా?

తాత్పర్యం: ఆలుబిడ్డలు లేక యథేచ్ఛగా తిరిగే మొద్దుగాక, ఒక చోట స్థిరంగా ఉండి అన్నం తినేవాళ్ళు ఇటువంటి పొగరుబోతు చేతలు ఇష్టపడి చూస్తూ ఊరుకొంటారా?

విశేషం: ఇది నిందోక్తి, అర్థవాదం. అలనాడు కురుసభలో దుర్యోధనాదులు చేసిన దుర్నయాన్ని నివారించకుండా ఉపేక్ష వహించిన ధృతరాష్ట్రుడి వర్తనం శత్రువుల చేత, మిత్రులచేత, ప్రజల చేత గర్హించబడుతున్నది. అది ఎంత నీచమైనదో సంజయు డీ పద్యంలో చెప్పాడు పరోక్షంగా. పెళ్ళాం బిడ్డలు లేనివాడు, దేశదిమ్మరి, మొద్దువంటివాడు అనే విశేషణాలు ధృతరాష్ట్రుడికి వర్తిస్తాయి. మర్యాదగా ఒక కుటుంబంలో ఉండి అన్నం తింటున్న పొగరుబోతులు కౌరవులు, వారివి అన్నం తినే వాళ్ళు చేసే పనులు కావు. పెళ్ళాలు బిడ్డలు లేనివాడు, తిరుగుబోతు, మొండిముండావాడు, బండ మొదలైనవి తెలుగుదనం ఉట్టిపడే తిట్లు. ఇవి సంజయుడు అంటున్నవిగా ఇందులో తోచినా తరువాతి పద్యంలో ఇవన్నీ ప్రజలంటూంటే చెవులు చీములు కట్టేట్లు వింటున్నవిగా చెప్పబడ్డాయి. ధృతరాష్ట్రుడికి ప్రజలలో ఉన్న అపకీర్తికి ఈ మాటలు అక్షర సాక్ష్యాలు. (సంపా.)

చ. కొడుకులఁ గానరే నృపు లకుంఠితతేజుల నెందు? నిమ్మెయిం
జెడు తెరు వైనచోఁ దగవు సెప్పక యొప్పరికించి చూతురే?
పుడమి జనంబులెల్ల నినుఁ బ్రువ్వఁగఁ దిట్టఁగ వించు నుక్కి నొ
చ్చెడు మది యెప్పుడుం, జెవులు చీములు గట్టెడుఁ గౌరవేశ్వరా! 10

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా= కురురాజా! ధృతరాష్ట్రా!; ఎందున్= ఎక్కడా; నృపులు= రాజులు; అకుంఠిత తేజులన్ కొడుకులన్= మొక్కవోని తేజస్సుగల కొడుకులను; కానరే?= కనరా?; ఈ+మెయిన్= ఈ విధంగా; చెడు తెరువు+ఐనచోన్=

దుర్మార్గులయితే; తగవు+చెప్పక= బుద్ధి చెప్పక; ఒప్పరికించి చూతురే= గ్రుడ్లప్పగించి చూస్తారా?; పుడమి జనంబులు+ఎల్లన్= భూజనులందరూ; నినున్; ప్రువ్వఁగన్+తిట్టఁగన్= పుచ్చిపోయేటట్లు; తిడుతూంటే; వించున్+ఉన్కిన్= వింటూ ఉండటం చేత; మది= మనస్సు; ఎప్పుడున్; నొచ్చెడున్= బాధపడుతుంది; చెవులు చీములు+కట్టెడున్= చెవులు పుచ్చిపోతున్నాయి. (వినలేకపోతున్నానని భావం.)

తాత్పర్యం: కురురాజా! ధృతరాష్ట్రా! మరి ఎక్కడా రాజులు కుంటువడని తేజస్సుగల కొడుకులను కనరా? నీవొక్కడివే కన్నావా? ఈ తీరుగా వాళ్ళు అపమార్గంలో నడుస్తూంటే బుద్ధిచెప్పక గ్రుడ్లప్పగించి చూస్తూంటారా? ప్రజ లంతా నిన్ను పుచ్చిపోయేటట్లు తిట్టుతూండగా వింటూ ఉండటం నా మనస్సు కెప్పుడూ బాధాకరంగా ఉన్నది. నా చెవులు పుచ్చిపోతున్నాయి.

విశేషం: కానరే అనే క్రియ సార్థకం. జాగ్రత్తగా చూచుకోరా, సరిదిద్దుకోరా, రక్షించుకోరా అని అన్వయిస్తుంది. ప్రువ్వఁగఁ దిట్టఁగన్- తెలుగు నుడికారం. చెవులు చీములు గట్టెడు - తెలుగు జాతీయం. ఇవి తిక్కన రచనలోని తెలుగుదనానికి మచ్చుతునకలు. (సంపా.)

చ. **చలమున దుస్ససేనుఁడును సౌబలుఁడున్ మిముఁ బట్టి యార్ప బొ**
మ్మల క్రియ నాడుచుండుదురు మానక నీవు సుయోధనుండుఁ; దా
రలసి యొకప్డు పాండుసుతు లాగ్రహవృత్తికిఁ జొచ్చిరేని నీ
చలము బలంబునుం గులముఁ జక్కఁగఁ జేయరె యొక్క వ్రేల్మిడిన్? **11**

ప్రతిపదార్థం: చలమునన్= మాత్సర్యంతో; దుస్ససేనుఁడును= దుశ్శాసనుడూ; సౌబలుఁడున్= శకునీ; మిమున్+పట్టి+ఆర్పన్= మిమ్మల్ని పట్టుకొని ఆడిస్తూంటే; నీవున్; సుయోధనుండున్= దుర్యోధనుడూ; మానక= విడువకుండా ఎప్పుడూ; బొమ్మల క్రియన్= బొమ్మలవలె; ఆడుచున్+ఉండుదురు= ఆడుతూ ఉంటారు; పాండు సుతులు= పాండవులు; ఒక+అప్డు= ఒకవేళ; తారు= తాము; అలసి= విసిగిపోయి; ఆగ్రహ వృత్తికిన్+చొచ్చిరి+ఏనిన్= కోపపడితే; ఒక్క వ్రేల్మిడిన్= ఒక్కచిటిక సేపటిలో; నీ చలమున్ బలంబునున్ కులమున్= నీ మాత్సర్యాన్నీ, బలాన్నీ, కులాన్నీ, చక్కఁగన్+చేయరె?= నేలమట్టం చేసివేయరా?

తాత్పర్యం: దుశ్శాసనుడూ, శకునీ మాత్సర్యంతో మిమ్మల్ని పట్టుకొని ఎట్లా ఆడిస్తే అట్లా బొమ్మలవలె నీవూ, దుర్యోధనుడూ ఎప్పుడూ ఆడుతూ ఉంటారు. పాండవులే కనక ఒక వేళ విసిగిపోయి కినుక వహిస్తే, ఒక్క చిటిక కాలంలో నీ చలాన్నీ, బలాన్నీ, కులాన్నీ నేలమట్టం చేసివేయరా?

విశేషం: 'గులముఁ జక్కఁగఁ జేయరె' - తెలుగు విశ్వవిద్యాలయప్రతి.

క. **వినుము యుధిష్ఠిరు సైరణ । మనవారలు వెఱపుగా సమర్థింతురు; డీ**
కొనఁగం దగరే కొండం । గని యోటమి వెట్టినట్లు, కౌరవనాథా! **12**

ప్రతిపదార్థం: కౌరవ నాథా!= కురుప్రభూ, ధృతరాష్ట్రా!; వినుము; డీకొనఁగన్= ఎదుర్కొనగా; తగరే= పొట్టేలే; కొండన్+కని= కొండను చూచి; ఓటమి+పెట్టిన+అట్లు= ఓడిపోయిందని అన్నట్లు; మనవారు; యుధిష్ఠిరు సైరణన్= ధర్మరాజు శాంతాన్ని; వెఱపు+కాన్= పిరికితనంగా; సమర్థింతురు= భావిస్తారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! వినుము. మనవాళ్ళు ధర్మరాజు శాంతాన్ని భయంగా భావిస్తున్నారు. ఇది ఎట్లా ఉన్నదంటే గొర్రెపొట్టేలు కొండను చూచి 'ఇది నాతో ఓడిపోతుంది' అన్నట్లున్నది.

విశేషం: అలం: ఉపమ. గొర్రెపొట్టేలు కొండను ఢీకొన్నట్లు అనే జాతీయం తెలుగులో ఉన్నది. పొట్టేలు మరొక పొట్టేలుతో తలతో ఢీకొట్టి పోరు చేయటం స్వభావం. పొగరు వలన, మదం వలన అది అట్లా చేస్తుంది. అది ఒక్కొకసారి అజ్ఞానంలో కొండను గూడా ఢీకొని తల పగిలి చనిపోతుంది. కాబట్టి ఎదుటివారి బలాన్ని అంచనా వేయకుండా పోరుకు దిగటాన్ని ఈ జాతీయంతో పోల్చి చెబుతారు. అయితే ఇక్కడ పొట్టేలు దుర్యోధనుడు. కదలకుండా ఉన్న కొండ సహనమూర్తి అయిన ధర్మరాజు. కొండ తనంత తాను ముందుకు వచ్చి ఢీకొనదు కాబట్టి అది ఓడిపోయినట్లే అని పొట్టేలు ప్రకటిస్తే ఎట్లా ఉంటుందో దుర్యోధనుడు ధర్మరాజు బలహీనుడు అని భావించి అతడు పోరులో ఓడిపోతాడని ఆశించటం అట్లా హాస్యాస్పదంగా ఉంటుందని సంజయుడు ఈ పోలిక చెప్పాడు. పొట్టేలుకూ దుర్యోధనుడికీ మదం, అవివేకం; ధర్మరాజుకూ కొండకూ సహనం. బలం సమాన లక్షణాలు. (సంపా.)

క. అనుజులకు నడ్డపడి యే । మిని జేయఁగ నీమిఁ జూచి మెచ్చితిగా కీ
వును; సాదు రేఁగె నేని । న్వినుు, తలపొలమునన కాని నిలువదు సుమ్మీ! 13

ప్రతిపదార్థం: (ధర్మరాజు); అనుజులకున్= తమ్ములకు; అడ్డము+పడి= అడ్డం వచ్చి; ఏమిని= ఏమీ; చేయఁగన్+ఈమిన్+ చూచి= చేయనీయకపోవటం చూచి; ఈవును= నీవు కూడా; మెచ్చితి(వి)+కాక= సంతోషించావు కాని; విను(ము); సాదు= సాధువైన జంతువు; రేఁగెన్+ఏనిన్= విజృంభించిందా; తలపొలమునన్+అ+కాని నిలువదు సుమ్మీ!= ఊరి చివరి భాగంలోనే కాని ఆగదు సుమా! తుదముట్టించక మానదు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! వినుము. ధర్మరాజు తమ్ములకు అడ్డం వచ్చి ఏమీ చేయనీయకుండా అదుపులో పెట్టటం చూచి నీవు కూడా సంతోషించావు కాని, సాధుజంతువు విజృంభించిందా, ఊరి చివరి భాగంలోనే కాని ఆగదు సుమా! తుదముట్టించి తీరుతుంది సుమా! (అట్లాగే పరమసాధువైన ధర్మరాజు కనుక కోపంతో విజృంభించాడా, నిన్ను సర్వనాశనం చేయకమానడని భావం.)

విశేషం: 'సాదురేఁగెనేనిన్.... సుమ్మీ. అలంకారం: అప్రస్తుత ప్రశంస. 'సాదురేగెనేనిన్':- సాధు అనుదాని పూర్వరూపము 'సాతు' సంస్కృతమున 'సార్థమ్'. అనగా వ్యాపారస్థుల సముదాయము. దీనిని పూర్వము 'బిడారు' వ్యాపార మనెడివారు. వర్తకులు తమ సరుకులను బండ్లు మొ॥ వానిపై వేసుకొనిపోయి ఒకచోట(అనువయినచోట) నిలిపి అమ్ముకొనెడివారు. ఒక మజిలీ విడిచిన తరువాత రెండవ మజిలీ చేరువరకు ఆగెడువారుకారు. ఇక్కడ ధర్మరాజు అడ్డుపడకపోతే అతని తమ్ములు వైరమునకు అంతమును చూసెడివారే. వారు తలచుకొంటే మధ్యలో ఆగరు. అంతుచూస్తారని భావం. (ఈ విషయం తెలుగుపరిశోధన 2వ సంచిక నుండి గ్రహింపబడినది - రచయితకు కృతజ్ఞతలు)' జనహితవ్యాఖ్య (పు.176-177).

చ. అనయము పుట్టె జూదమున యప్పుడ; యెంతయుఁ జిచ్చువెట్టి కా
ల్చినయది నీ యుపేక్షయ; వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మె
త్తని పులి; యెల్లవారలు నధర్మము నీపయిఁ బెట్టునంతకు
న్వినఁడును గానఁడుం, బిదప నీకును నాకు మరల్పవచ్చునే? 14

ప్రతిపదార్థం: జూదమున+అప్పుడు+అ= జూదం ఆడినప్పుడే; అనయము+పుట్టెన్= అవినీతి ఏర్పడింది, కీడు మూడింది; నీ+ఉపేక్ష+అ= నీ ఊరుకోవడమే; ఎంతయున్= మిక్కిలి; చిచ్చు+పెట్టి కాల్చిన+అది= నిప్పుపెట్టి దహించివేసింది; వశీకృత చిత్తుఁడు ధర్మసూతి= స్వాధీన మనస్కుడైన ధర్మరాజు; మెత్తని పులి= పైకి మృదువుగా కనిపించే పులి; ఎల్లవారలున్= అందరూ; అధర్మము= అన్యాయం; నీ పయిన్= నీమీద; పెట్టు+అంతకున్= పెట్టేదాకా; వినఁడును+కానఁడున్= వినడు, కనడు;- ఏమీ ఎరుగనట్లు ఉంటాడు; పిదపన్= తరువాత- నీవు అన్యాయపరుడవని అందరూ నిన్ను నిందించిన తరువాత; నీకును, నాకును; మరల్పన్+వచ్చునే= వెనుకకు మరలించడం తరమా?

తాత్పర్యం: జూదం ఆడినప్పుడే అవినీతి ఏర్పడింది, కీడు మూడింది. అప్పుడు నీవు ఉపేక్షతో ఊరుకొనటమే (మనసులో) నిప్పు పెట్టి మిక్కిలి దహించివేసింది. (ఒడలు మండించింది.) ధర్మరాజు స్వాధీన మనస్కుడు. పైకి ఎంతో మృదువుగా కనిపించే పులి, లోకులంతా అన్యాయం నీమీద పెట్టే దాకా వినడు కనడు. ఏమీ ఎరుగనట్లు ఉంటాడు. అటువంటి నింద పడ్డ తరువాత అతడిని ఆపటం నీకూ నాకూ తరం కాదు.

విశేషం: 1. ఉద్యోగ పర్వంలో ప్రసిద్ధమైన పద్యాలలో ఇది ఒకటి. వక్త ఆలోచిస్తూ మాట్లాడటమే కాక వినేవారిచేత ఆలోచింప చేసే స్వభావం గల వాక్య విన్యాసం ఈ పద్య రచనాశిల్పం. ఈ పద్యంలో అయిదు వాక్యాలు ఉన్నాయి. వాక్యం వాక్యం మధ్య అభినయపరమైన విరామం పాటించబడటం గమనార్హం. రాజనీతిలో ఇటువంటి వాక్య శిల్పం తిక్కన రచనలో సర్వసామాన్యం.

2. సంజయుడు రాయబారిగా చేసిన ఈ దౌత్యకార్యంలో తాను చెప్పదలచుకొన్న పరమ తాత్పర్యాన్ని ఈ పద్యంలో చెప్పాడు. ఇది పాండవులు పంపిన సందేశం కాదు. సంజయుడి స్పందన; ధృతరాష్ట్రుడికి చెప్పదలచుకొన్న సత్య నివేదన రూపమైన హితవు.

3. జూదం ఆడినప్పుడే కీడు మూడింది. ఎవరికి? కౌరవులకని భావం. ఎటువంటి కీడు? పాండవులు ప్రతీకారం తీసికొనే పగ ఏర్పడటమనే కీడు. ఇది కూడా శ్రోతభావనకే వదలబడింది. ఆ తరువాత రెండో వాక్యం మొదలయ్యేలోగా వక్త హృదయంలో సాగిన భావన గమనించాలి. ఆ కీడు సమసిపోవటానికి వీలున్నదే. వెంటనే వారించినట్లయితే అది క్రోధ తీవ్రాగ్నిగా ప్రజ్వలించకుండా సమసి ఉండేది. అది జరగలేదు. అని చెప్పకుండా ధ్వనింపచేశాడు సంజయుడు.

4. ధృతరాష్ట్రుడు ఆ సభలో ఉపేక్ష వహించటమే చిచ్చు పెట్టి కాల్చినంత పని అయింది. "చిచ్చుపెట్టి కాల్చటం" తెలుగు జాతీయ ప్రయోగం. కళకళలాడుతున్న దానిని అగ్గిపెట్టి బుగ్గిచేయటమనీ, కలిసి ఉన్న వారి మధ్య కలహం పెట్టి వారిని కలతపెట్టటమనీ అర్థాలు చెప్పుకొనవచ్చును. చిచ్చుపెట్టి కాల్చటం వలన బాధ హృదయానికే కలుగుతుంది. ధృతరాష్ట్రుడు తండ్రిగా కౌరవ పాండవులు కలిసి ఉండటానికి యత్నించకుండా, ఊరకుండి కౌరవుల దుర్నయానికి తోడుపడ్డాడనే బాధ పాండవుల హృదయాలలో అగ్గిపెట్టినట్లు బాధ కలిగించి, వారిని నిలువునా దహించి వేసింది. ఇక ఆ బాధ నివారించడానికి వీలులేకపోయిందనీ, అది పగ సాధించటం వలననే చల్లారుతుందనీ భావం.

5. 'వశీకృతచిత్తుడు ధర్మసూతి మెత్తని పులి'- ఈ మూడు మాటలు ధర్మరాజు వ్యక్తిత్వాన్ని ధ్వనిమయంగా చిత్రించేవి. తమను అవమానించి వంచన చేసి, ఉపేక్షా భావాన్ని ప్రదర్శించినందుకు ధర్మరాజుకు తీవ్రమైన ఆగ్రహం కలిగింది కాని, అతడు వశీకృతచిత్తుడు కాబట్టి నిబ్బరంగా ఉన్నాడు. అతడి శాంతం అసమర్థత కాదు. అట్లా శాంతంగా ఉన్న ధర్మరాజు యమధర్మరాజు కొడుకు. అంటే సమయాన్ని చూచి కౌరవుల అంతం చూచేవాడు. ఎప్పుడు ఎట్లా మృత్యువు వస్తుందో తెలుపని విలయ శక్తి యమధర్మరాజు. అతడికి అన్ని విధాలా తగిన కొడుకు ధర్మరాజు. అందువలన అతడి వలన కౌరవులకు

మృత్యువెప్పుడు కలుగుతుందో జాగ్రత్తగా పరిశీలించ వలసి ఉంటుంది. మొత్తం మీద ధర్మరాజు మెత్తని పులి. పైకి మెత్తగా కనపడుతూ పులివలె శత్రువులపై లంఘించే క్రూరుడని భావం. తిక్కనగారు ధర్మరాజు కిచ్చిన తెలుగు బిరుద మిది. పండితుల ప్రశంసల నందుకొన్న ప్రయోగం అన్ని బాధలు పడి కూడా, పగ సాధించగలిగి కూడా శాంతికొరకు, సంధి కొరకు ప్రయత్నించటంలో మెత్తనిపులి స్వభావం గోచరిస్తుందని భావం.

6. మెత్తని పులి స్వభావం ఉద్యోగపర్వంలో ఎట్లా ప్రదర్శితమౌతుందో సంజయుడు వివేచించి చెప్పాడు. లోకులందరూ ధృతరాష్ట్రుడే పాండవులకు అన్యాయం చేశాడని అనుకొనేంత వరకూ ధర్మరాజు ఉలకడు, పలకడు. "వినఁడును కానఁడును" జాతీయం. మరే విషయాన్నీ విన్నట్లుగా గాని, చూచినట్లుగా గాని కనపడక ఏమీ ఎరుగనట్లు అమాయకంగా ఉంటాడని భావం. దానివలన ప్రజల సానుభూతి అతడి పట్ల ఏర్పడుతుంది అని ధ్వనిమయంగా ఊహించుకొనాలి.

7. ఆ తరువాత నాకూ నీకూ అతడిని మరల్చటం సాధ్యమౌతుందా? - ఈ వాక్యం కూడా జాతీయంతో కూడి ఉన్నది. మరల్చటం దేని నుండి? సాదురేగితే తలపొలానగాని ఆగడు కదా! అటువంటి యుద్ధం నుండి మరల్చటం. 'నీకూ నాకూ' అనే మాటల ప్రయోగం నుడికారం. ఇప్పుడు సంధి యత్నంలో ఉన్న నీకూ నాకూ అని ఒక అర్థం. ఎవరికైనా అని నుడికారపరమైన అర్థం.

8. ఈ పద్యం ప్రశ్నార్థకంతో ముగియటం కూడా సార్థకమే. ఆ ప్రశ్న ధృతరాష్ట్రుడి మనశ్శాంతిని, నిద్రను భగ్నం చేసింది. (సంపా.)

చ. అనయము నొచ్చుచున్నయవి యంగము లెల్లను వేగ వచ్చుట;
న్మనము వశంబు గాదు; జననాయక! ప్రొద్దును బోయె; నిప్పు డేఁ
బనివిని రేపు పుత్త్రులును, బంధులు, నాప్తులు, నీవు నేర్పడన్
విన మన కార్యమంతయు సవిస్తరతం దగ విన్నవించెదన్.' 15

ప్రతిపదార్థం: జననాయక!= రాజా!, ధృతరాష్ట్రా!; వేగన్+వచ్చుటన్= వడిగా రావటం చేత; అంగములు+ఎల్లను= అవయవాలన్నీ; అనయమున్= మిక్కిలి; నొచ్చుచున్+ఉన్న+అవి= నొప్పిపెడుతున్నాయి; మనము= మనస్సు; వశంబు+కాదు= స్వాధీనంలో లేదు; ప్రొద్దునున్+పోయెన్= ప్రొద్దుకూడా పోయింది; ఇప్పుడు; ఏన్= నేను; పనివిని= వెళ్లి పోయి; రేపు= ప్రొద్దున; పుత్త్రులును= కొడుకులూ; బంధులున్= చుట్టాలూ; ఆప్తులున్= స్నేహితులూ; నీవున్= నీవూ; ఏర్పడన్+వినన్= స్పష్టంగా వినేటట్లు; మన కార్యము+అంతయున్= మన ప్రయత్నం అంతా; తగన్= ఒప్పుగా; సవిస్తరతన్= విపులంగా; విన్నవించెదన్= మనవి చేస్తాను.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! నేను వేగంగా రావటం వలన నా అవయవాలన్నీ నొప్పి పెడుతున్నాయి. నా మనస్సు స్వాధీనంలో లేదు. ప్రొద్దు కూడా పోయింది. ఇప్పుడు నేను వెళ్ళిపోయి ప్రొద్దున నీ కొడుకులూ, బంధువులూ, మిత్రులూ, నీవూ స్పష్టంగా వింటూండగా మన కార్యం అంతా ఒప్పుగా వివరంగా విన్నవిస్తాను.'

ఆ. అనిన, 'నట్ల కాక' యని సంజయుని వీడు । కొలిపి, కొంత ప్రొద్దు కురువిభుండు
కార్యచింత మునిఁగి, కంచుకి నొక్కరుఁ । బిలిచి, వేగ విదురుఁ బిలువు మనియె. 16

ప్రతిపదార్థం: అనినన్= అనగా; కురు; విభుండు= కురురాజైన ధృతరాష్ట్రుడు; అట్లు+అ కాక= అలాగే; అని; సంజయునిన్; వీడు కొలిపి= పంపి; కొంత ప్రొద్దు= కొంతసేపు; కార్య చింతన్= కర్తవ్యాన్ని గురించిన ఆలోచనలో; మునిఁగి; కంచుకిన్+ ఒక్కరున్= కంచుకినొకడిని; పిలిచి; వేగన్= శీఘ్రంగా; విదురున్; పిలువుము+అనియెన్.

తాత్పర్యం: అని సంజయు డనగా ధృతరాష్ట్రుడు 'అట్లాగే' అని అతడిని పంపివేసి, కొంతసేపు కర్తవ్యం గురించిన ఆలోచనలో మునిగి, ఒక కంచుకిని పిలిచి, 'విదురుడిని వేగంగా పిలువుము' అన్నాడు.

వ. వాఁడును సత్వరంబుగాఁ జని యతనిం దోడ్తెచ్చి కాన్పించిన, నమ్మహీవరుం డత్యాదరంబున విదురుం దనయొద్ద నునిచికొని యతని కి ట్లనియె: 17

ప్రతిపదార్థం: వాఁడును= ఆ కంచుకియు; సత్వరంబుగాన్= వేగంగా; చని= వెళ్ళి; అతనిన్= విదురుడిని; తోడ్తెచ్చి= తీసికొనివచ్చి; కాన్పించినన్= చూపగా; ఆ+మహీవరుండు= ఆ రాజు ధృతరాష్ట్రుడు; అతి+ఆదరంబునన్= మిక్కిలి ప్రీతితో; విదురున్; తన+ఒద్దన్= తన దగ్గర; ఉనిచికొని= ఉంచుకొని; అతనికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ కంచుకి వేగంగా వెళ్ళి విదురుడిని తీసికొని వచ్చి చూపగా, ఆ రాజు మిక్కిలి ప్రీతితో విదురుడిని తన దగ్గర కూర్చుండబెట్టుకొని అతడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'పాండురాజసుతుల పాలికిఁ చని యిప్డు । సంజయుండు వచ్చి, సమ్ముఖమున
నన్నుఁ జాల దూఱి, నాకు రే పచ్చటి । పనులు సెప్పువాఁడ ననుచుఁ జనియె. 18

ప్రతిపదార్థం: సంజయుండు; పాండురాజు సుతుల పాలికిన్+చని= పాండవుల దగ్గరకు వెళ్ళి; ఇప్డు= ఇప్పుడు; వచ్చి; సమ్ముఖమునన్= ముఖంమీద; సమక్షంలో, నన్నున్; చాలన్= మిక్కిలి; దూఱి= తిట్టి; రేపు= ప్రొద్దున; నాకున్; అచ్చటి పనులు= అక్కడ జరిగిన కార్యాలు; చెప్పువాఁడన్; అనుచున్; చనియెన్= వెళ్లాడు.

తాత్పర్యం: సంజయుడు పాండవుల దగ్గరకు వెళ్ళి ఇప్పుడు వచ్చి, నన్ను నా ముఖం మీదే మిక్కిలి తిట్టి, ప్రొద్దున నాకు అక్కడి కార్య విశేషాలు చెపుతానని వెళ్ళాడు.

క. అప్పటినుండియు నెవ్వగ । గప్పికొనినఁ జిత్తవృత్తి గలఁగెడు; మేనున్
నిప్పులఁ బొరలినయ ట్లయి । చొప్పడ దించుకయు నిద్ర శుద్ధవిచారా!' 19

ప్రతిపదార్థం: శుద్ధ విచారా!= నిర్మల భావా- విదురా!; అప్పటి నుండియున్; నెవ్వగ - నెఱ+వగ= మిక్కిలి దుఃఖం; కప్పికొనినన్= ఆక్రమించగా; చిత్తవృత్తి= మనస్థితి; కలఁగెడున్= కలత చెందింది; మేనున్= శరీరం కూడా; నిప్పులన్= నిప్పులలో; పొరలిన+అట్లు+అయి= దొరలినట్లుగా అయి; నిద్ర; ఇంచుకయున్= కొంచెం కూడా; చొప్పడదు= లభించదు.

తాత్పర్యం: నిర్మలభావా, విదురా! అప్పటి నుంచి అధికమైన దుఃఖం ఆక్రమించి మనస్థితి కలత చెందింది. శరీరం నిప్పులలో పొరలినట్లయి కొంచెం కూడా నిద్రపట్టదు.'

విశేషం: తన ఉపేక్షయే విపత్తుకు మూలమని తెలిసిన తరువాత ధృతరాష్ట్రుడి మనస్సు దుఃఖంతో నిండింది. "సర్వేంద్రియాణ్య ప్రకృతిం గతాని' (సం. 5-33-12) అని మూలం. నెవ్వగ, కలత మనస్సులో పొందే అవస్థలు. వాటి వలన కలిగే సాత్త్వికభావం శరీరం నిప్పులలో పొరలినట్లు తాపం పొందటం. ఈ ఉపమానం జాతీయం. (సంపా.)

వ. అనిన, విదురుం డిట్లనియె : 20

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగా విదురు డతడితో ఇట్లా అన్నాడు :

క. **'బలవంతుఁడు పై నెత్తిన । బలహీనుఁడు, ధనము గోలుపడిన యతఁడు, ముు**
చ్చిల వేచువాఁడుఁ, గామా । కుల చిత్తుఁడు నిద్రలేక కుందుదు రధిపా! **21**

ప్రతిపదార్థం: అధిపా!= రాజా, ధృతరాష్ట్రా! బలవంతుడు; పైన్+ఎత్తిన= మీద పడిన; బలహీనుఁడున్= దుర్బలుడూ; ధనము+కోలుపడిన+అతఁడున్= డబ్బు పోగొట్టుకున్నవాడూ; ముచ్చిలన్ వేచువాఁడున్= దొంగిలించటానికి ఎదురుచూచేవాడూ; కామ+ఆకుల చిత్తుఁడున్= కామం (కోరిక) చేత కలతపడిన మనస్సు గలవాడూ; నిద్ర లేక కుందుదురు= నిద్రపట్టక బాధ పడతారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! బలవంతుడు మీదపడిన దుర్బలుడూ, డబ్బు పోగొట్టుకొన్నవాడూ, ఎప్పుడు దొంగిలిద్దామా అని కాచుకొని కూర్చున్నవాడూ, కామం చేత మనస్సు కలత చెందినవాడూ నిద్రపట్టక బాధపడతారు.

విశేషం: ఇది చక్కని సూక్తి. దీనికి మూలం-

> **"అభియుక్తం బలవతా, దుర్బలం హీన సాధనమ్**
> **హృతస్వం కామినం చోర, మావిశన్తి ప్రజాగరాః" (సం. 5-33-13)**

క. **ఇక్కొఱగాముల లోపల । నొక్కటి నీ చిత్తవృత్తి నొందెనో? యొరు సొ**
మ్మెక్కటి గుడువఁ దలంచితొ? । నిక్కము గత మేమి సెపుమ నిద్ర సెడుటకున్?' **22**

ప్రతిపదార్థం: ఈ+కొఱగాముల లోపలన్= ఈ దోషాలలో; ఒక్కటి; నీ చిత్త వృత్తిన్+ఒందెనొ= నీ మనస్సులో చోటుచేసికొన్నదా; ఒరు సొమ్ము= ఇతరుల ధనం; ఎక్కటి= ఒక్కడవే; కుడువన్+తలంచితొ= అనుభవించాలనుకొన్నావొ; నిద్ర+చెడుటకున్= నిద్రపట్టకపోవటానికి; నిక్కము కతము+ఏమి+చెపుమ= నిజమైన కారణం ఏమిటో చెప్పుము.

తాత్పర్యం: ఈ దోషాలలో ఏదయినా ఒక్కటి నీ మనస్సులో ప్రవేశించిందా?, ఇతరుడి ధనం ఒక్కడవే అనుభవించాలనుకొన్నావా? నిద్ర పట్టకపోవటానికి నిజమైన కారణం ఏమిటో చెప్పుము.'

విశేషం: పైన చెప్పిన కారణాలే కాక విదురుడు మరొక క్రొత్త కారణాన్ని కల్పించాడు. అది ఇతరుల ధనాన్ని మరొకడు ఒక్కడే అనుభవించటం. దానిని పేర్కొని ఎత్తిపొడిచాడు విదురుడు. (సంపా.)

తే. **అనిన, ధృతరాష్ట్రుఁ డిట్లను నతనితోడ । 'ధర్మసుతుమాటచొ ప్పెవ్విధంబొ యెఱుఁగ**
కునికిఁజేసి చింతిల్లితి; నోపు దీవు । దెలియఁ జెప్పి నా యలమట మలుగఁ జేయ.' **23**

ప్రతిపదార్థం: అనినన్; ధృతరాష్ట్రుఁడు; అతని తోడన్; ఇట్లు+అనున్; ధర్మసుతు మాట చొప్పు= ధర్మరాజు మాట తీరు; ఏ+విధంబొ= ఎటువంటిదో; ఎఱుఁగక+ఉనికిన్+చేసి= తెలియకపోవటం చేత; చింతిల్లితిన్= దుఃఖించాను; ఈవు= నీవు; తెలియన్+చెప్పి; నా+అలమటన్= నా దుఃఖాన్ని, మలుగన్+చేయన్= పోగొట్టటానికి; ఓపుదు(వు)= చాలుదువు.

తాత్పర్యం: అని విదురు డనగా ధృతరాష్ట్రు డతడితో ఇట్లా అన్నాడు. 'ధర్మరాజు ఏమన్నాడో తెలియకపోవటం చేత దుఃఖించాను. నీవు స్పష్టపరిచి నా దుఃఖాన్ని పోగొట్టగలవు.'

చ. **అనవుడు నిట్లనున్ విదురుఁ; 'డక్కట! ధర్మసుతుండు బాంధవుం**
డును జెలికాఁడునుం దగు భటుండును బ్రెగ్గడయున్ గురుండుఁ గాఁ
డె, నృపవరేణ్య! నీకుఁ? బ్రకటీకృత సత్త్వుఁడు శాంతమూర్తి స
ద్వినయ వివేక శీలముల విశ్రుతుఁ; డాతఁడు గీడు వల్కునే? **24**

ప్రతిపదార్థం: అనవుడున్= అని ధృతరాష్ట్రుడు అనగానే; విదురుఁడు; ఇట్లు+అనున్; అక్కట!= అయ్యో!; నృపవరేణ్య!= రాజశ్రేష్ఠుడా!; నీకున్; ధర్మసుతుండు= ధర్మరాజు; బాంధవుండును= చుట్టమూ; చెలికాఁడునున్= స్నేహితుడూ; తగు భటుండును= తగిన బంటూ; ప్రెగ్గడయున్= మంత్రీ; గురుండున్= రక్షకుడూ; కాఁడె?= కాడా?; ప్రకటీకృత సత్త్వుఁడున్= బయల్పరుపబడిన సత్త్వగుణం కలవాడూ; శాంతమూర్తి; సత్+వినయ వివేక శీలములన్= మంచి వినయం; వివేకం; శీలమూ అనే వాటి యందు; విశ్రుతుఁడున్= ప్రసిద్ధుడూ; ఆతఁడు= ఆ ధర్మరాజు; కీడు+పల్కునే= తప్పు మాట్లాడుతాడా?'

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అనగానే విదురుడు అతడితో ఇట్లా అన్నాడు: 'అయ్యో! రాజోత్తమా! నీకు ధర్మరాజు బంధువూ, స్నేహితుడూ, తగిన భటుడూ, మంత్రీ, రక్షకుడూ కాడా? తన సత్త్వగుణాన్ని స్పష్టపరిచినవాడూ; శాంతమూర్తీ, మంచి వినయం, వివేకం, శీలం అనే వాటిలో ప్రసిద్ధుడూ అయిన అతడు తప్పు మాట్లాడుతాడా?

ఆ. **నీవుఁ గొడుకు వారి నెఱి లేక పఱిచితి; । రదియ చాలు; నుచితమైన పాలు**
పంచి యిండు; పిల్లి వట్టిన యీరువు । సేసియున్న నేల చెల్ల నేర్చు? **25**

ప్రతిపదార్థం: నీవున్+కొడుకున్= నీవూ, నీ కొడుకు దుర్యోధనుడూ; వారిన్= పాండవులను; నెఱి లేక= న్యాయం లేక-అన్యాయంగా; పఱిచితిరి= బాధించారు; అది+అ చాలున్= అదే చాలు; ఉచితము+ఐన పాలు= వాళ్ళకు న్యాయంగా ఇవ్వవలసిన భాగం; పంచి+ఇండు= పంచి ఇవ్వండి; పిల్లి+పట్టిన+ఈరువు+చేసి+ఉన్నన్= పిల్లి పట్టుకున్న మాంసంలా చేస్తే; ఏల చెల్లన్+నేర్చున్= ఎందుకు చెల్లుతుంది?

తాత్పర్యం: నీవూ, నీ కొడుకు దుర్యోధనుడూ వాళ్ళను అన్యాయంగా బాధించారు. అది చాలదా? వాళ్ళకు న్యాయంగా ఇవ్వవలసిన భాగం పంచిపెట్టండి. అంతేకాని, పిల్లి పట్టుకున్న మాంసం విధం చేస్తే ఎట్లా చెల్లుతుంది?

విశేషం: 'పిల్లి వట్టిన యీరువు' - దీనికి అనేకులు అనేక విధాలైన అర్థాలు చెప్పారు. శ్రీ మున్నంగి లక్ష్మీనృసింహ శర్మగారు ఇట్లా చెప్పారు: 'ఈరువునకు చేదుగుండె' అని పడమటి సీమలోఁ గొంత భాగమున వాడుట కలదు. ప్రకృత సందర్భమున రాజ్యము సర్వము హరింపవలయునను దురాశకును, పాండవుల పరాక్రమమునకు జడుపునకును జిక్కువడిన ధృతరాష్ట్రునకు సరిపడ 'పిల్లి వట్టిన యీరువు' అని ఉపమింపఁబడినది. చేదుగుండెఁగఁఱచి తినుటకుఁజేఁదు, విడువ మనసొప్పదు-ఇట్లు మ్రింగలేక, క్రక్కలేక పెనఁగుచున్న పిల్లితో ధృతరాష్ట్రునకుఁ బోలిక చెప్పఁబడినది. ఈరువునకు మాంసమను నర్థము గ్రహించుచో నీ సందర్భమున కొప్పదు. మాంసమును బట్టిన పిల్లి దానిని గబళించి వేయును. అట్టిచో మ్రింగుడు వడక, క్రక్కనిష్టము లేక తల్లడవడు ధృతరాష్ట్రునకుఁ బోలిక యెట్లు? కావునఁ జేఁదుగుండె అను నర్థమే అన్నిట నొప్పియున్నది.'

వీరి అభిప్రాయం బాగానే ఉన్నది కాని, దీనికి ప్రధాన ప్రతిబంధకాలు రెండు ఉన్నాయి. ఒకటి- 'ఈరువు' అనే పదానికి ఏ నిఘంటువులోనూ 'మాంసము' అనే అర్థమేకాని, చేదుగుండె అనే అర్థం లేకపోవటం. రెండు- ఈరువునకు చేదుగుండె అనే వాడుక పడమటి సీమలో కొంతభాగంలో ఉన్నదట- కవి అంత అప్రసిద్ధమైన అర్థంలో ఈ శబ్దాన్ని ఎందుకు వాడతాడు? ఏమాత్రం వాడుకలో ఉన్నా అది నిఘంటువుల కెక్కి ఉండేదే.

'ఈరువు'నకు మాంసం అనే అర్థాన్ని చెప్పినా, ఈ సందర్భానికి అతుకుతుంది. ధృతరాష్ట్రుడు పాండవుల భాగాన్ని కూడా పట్టుకుని వదలిపెట్టటం లేదు. అది పిల్లి మాంసం పట్టుకుని విడిచిపెట్టకపోవటంవలె ఉన్నది. పిల్లి పట్టిన ఈరువువలె పాండవుల రాజ్యభాగాన్ని పట్టుకొని విడిచిపెట్టకపోతే ఎట్లా చెల్లుతుంది? అని సమన్వయం. ఇలా అర్థం చెపితే పైని చెప్పిన ప్రతిబంధకాలు ఉండవు. 'డక్కెను రాజ్యమంచు నకటా! యిటు దమ్ముని భాగమీక నీ వెక్కటి మ్రింగఁజూచెదు' (52) అనే పద్యం అభిప్రాయాన్నే చెపుతుంది.

ఈ 'ఈరువు'నకు 'ఈలువు' అనే పాఠం కొన్ని ప్రతులలో ఉన్నది. ఈలువు అనే మాటకు 'పాతివ్రత్యం' 'వ్రతం' అనే అర్థాలున్నాయి. 'పిల్లి పట్టిన వ్రతం' అంటే ఏమిటో- అది ఈ సందర్భానికి ఎట్లా కుదురుతుందో తెలియదు.

వ. మీరు శకుని కర్ణ దుశ్శాసనుల మీఁద రాజ్యభారంబు వెట్టికొనియుండుదు; రిది దుది ముట్టనేర దెట్లంటేని. 26

ప్రతిపదార్థం: మీరు, శకుని కర్ణ దుశ్శాసనుల మీఁదన్; రాజ్య భారంబు= ప్రభుత్వపు బాధ్యతను; పెట్టికొని+ఉండుదురు= ఉంచి వ్యవహరిస్తారు; ఇది; తుదిముట్టన్+నేరదు= కొనసాగలేదు; ఎట్లు+అంటి(వి)+ఏనిన్= ఎలా అంటావేమో!

తాత్పర్యం: మీరు- నీవూ నీ కొడుకూ- శకుని కర్ణ దుశ్శాసనులపై రాజ్యభారం మోపి ఉంటారు. ఇది చివరిదాకా కొనసాగబోదు. ఎలా అంటావేమో.

క. తముఁ దా రెఱుఁగుట, వేగ ప । డమి, దాలిమి, విడుపు గలుగుటయు లేని ప్రభు
త్వము గలదె? వారియం దీ । సుమానుషము లొకఁడుఁ బట్టి చూడం గలఁడే? 27

ప్రతిపదార్థం: తమున్= తమను; తారు= తాము; ఎఱుఁగుట= తెలిసికొనుట; వేగ పడమి= తొందరపడకపోవటం; తాలిమి= ఓర్పు; విడుపు+కలుగుటయున్= త్యాగం, ఈవి కలుగుటా; లేని ప్రభుత్వము+కలదె?= లేని ప్రభుత్వం ఉందా?; వారి యందున్= ఆ శకుని కర్ణ దుశ్శాసనులలో; పట్టిచూడన్= బాగా పరిశీలించి చూస్తే; ఈ సుమానుషములు+ఒకఁడున్= ఈ సుగుణాలలో ఒక్కటైనా; కలఁడే= కలవాడున్నాడా?

తాత్పర్యం: తమను తాము ఎరగటం, తొందరపడకపోవటం, ఓర్పు, ఈవీ లేని ప్రభుత్వం ఉంటుందా? ఆ శకుని కర్ణ దుశ్శాసనులలో బాగా పరిశీలించి చూస్తే పైసుగుణాలలో ఒక్కటైనా కలవాడున్నాడా?

వ. యుధిష్ఠిరుండు నీవు నిక్కమ తండ్రివని, తగవు నమ్మి, చాల సైరించియున్నవాఁ; డది నీవ యెఱుంగు' దనిన విని ధృతరాష్ట్రుం డిట్లనియె : 28

ప్రతిపదార్థం: యుధిష్ఠిరుండు= ధర్మరాజు; నీవు; నిక్కము+అ= నిజంగానే; తండ్రివి+అని= తండ్రిగా తలంచి; తగవు నమ్మి= ధర్మాన్ని నమ్మి; చాలన్= మిక్కిలి; సైరించి ఉన్నవాఁడు= ఓపికపట్టి ఉన్నాడు; అది= ఆ సంగతి; నీవు+అ= నీవే; ఎఱుంగుదు(వు); అనినన్; విని; ధృతరాష్ట్రుండు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధర్మరాజు నీవు నిజంగానే తండ్రివని, ధర్మం నమ్మి, మిక్కిలి ఓపికపట్టి ఉన్నాడు. అది నీవే ఎరుగుదువు' అనగా విని ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు :

తే. **'సంజయునిచేతఁ గార్యంబు చంద మెల్లి । యెఱిఁగి, మన కెద్ది సేయంగఁ దెఱఁగు, దానిఁ**
బనిచి చేయింపు; మిపుడు నా మనము దల్ల । డిలుట హితభాషణంబుల డిందుపఱుపు. **29**

ప్రతిపదార్థం: సంజయుని చేతన్= సంజయుడివలన; కార్యంబు చందము= కార్యం రీతి; ఎల్లి= రేపు; ఎఱిఁగి= తెలిసికొని; మనకున్; ఎద్ది= ఏది; చేయంగన్+తెఱఁగు= చేస్తే క్షేమకరమో; దానిన్, పనిచి= నియోగించి; చేయింపుము; ఇపుడు; నా మనము= నా మనస్సు; తల్లిడిలుట= కలత చెందటాన్ని; హిత భాషణంబులన్= మేలు కూర్చే మాటలతో; డిందు పఱుపు(ము)= మాన్పుము.

తాత్పర్యం: 'సంజయుడు వెళ్ళిన పని ఏమయిందో రేపు అతడివలన తెలిసికొని మన కేది చేస్తే క్షేమకరమో దానిని నియోగించి చేయించుము. ఇప్పుడు నా మనస్సులోని కలతను హితభాషణాలతో మాన్పుము.

వ. **నీవు ధర్మాధర్మ విదుండవు; నయానయజ్ఞుండవు. నాకుం బ్రజాగరం బొనర్చుచున్న సంతాపం బుపశమిం చునట్లుగా భవద్వచనామృతంబు నా యుల్లంబున వెల్లిగొల్పు' మనిన విదురుం డిట్లనియె.** **30**

ప్రతిపదార్థం: నీవు, ధర్మ+అధర్మ విదుండవు= ధర్మాధర్మాలు తెలిసినవాడవు; నయ+అనయజ్ఞుండవు= నీతి, అవినీతి తెలిసినవాడవు; నాకున్; ప్రజాగరంబు+ఒనర్చుచున్+ఉన్న= నిద్రలేమి కలిగిస్తూన్న; సంతాపంబు= దుఃఖం; ఉపశమించు+ అట్లుకాన్= తగ్గేలాగ; భవత్+వచన+అమృతంబు= నీ మాటలనే అమృతం; నా+ఉల్లంబునన్= నా మనస్సులో; వెల్లి+కొల్పుము= ప్రవహించేటట్లు చేయుము; అనినన్; విదురుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నీవు ధర్మాధర్మాలూ, నీత్యవినీతులూ తెలిసినవాడవు. నాకు నిద్రాఖేదాన్ని కలిగిస్తూన్న దుఃఖం పోయేటట్లు నీ వచనం అనే అమృతాన్ని ప్రవహింపచేయి' అనగా విదురుడిట్లా అన్నాడు.

ధృతరాష్ట్రునకు విదురుఁడు హిత ముపదేశించుట (సం. 5-33-16)

క. **'జనులకు నొడఁ బా టగువిధ । మున నడచుచు, లోకనింద్యముల నుడుగుచు, మీఁ**
దని యొకని కలిమి కులుకక । మనుజులతోఁ బొంది పొసఁగి మను టొప్పు నృపా! **31**

ప్రతిపదార్థం: నృపా!= రాజా, ధృతరాష్ట్రా!; జనులకున్; ఒడఁబాటు+అగు విధమునన్= అంగీకారమైన రీతిలో; నడచుచున్= ప్రవర్తిస్తూ; లోక నింద్యములన్= లోకం చేత నిందించదగిన పనులను; ఉడుగుచున్= మానుతూ; మీఁదు+అని= గొప్ప అని- తన కలిమికంటె ఎక్కువని; ఒకని కలిమికిన్= ఇంకొకడి సంపదకు; ఉలుకక= ఈర్ష్య చెందక; మనుజులతోన్= మనుష్యులతో; పొంది పొసఁగి= కలిసియుండి; మనుట= బ్రతకడం; ఒప్పున్= తగును.

తాత్పర్యం: 'రాజా, ధృతరాష్ట్రా! జనులకు అంగీకారమైన విధంగా ప్రవర్తిస్తూ, లోకం నిందించే పనులను చేయటం మాని, తన సంపద కంటె ఎక్కువని ఇంకొకడి సంపదకు ఈర్ష్య చెందక, మనుష్యులతో కలిసి మెలిసి బ్రతకటం మంచిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: విదురుడు చేసే హితబోధ తత్కాలంలో ధృతరాష్ట్రుడి చిత్తవృత్తిని సంస్కరించి శాంతిని కూర్చేదీ, సర్వకాలాలలో లోకులకు హితం కలిగించేదీ కావటం విశేషం. అతడి బోధలో మూడంశాలు ముఖ్యంగా ఉన్నాయి. 1.లోకనీతి, 2.ధర్మప్రీతి 3.దైవభీతి. ఈ మూడూ త్రికరణ శుద్ధితో పాటిస్తే చిత్తశాంతి కలుగుతుందని హితబోధ తాత్పర్యం. ఈ పద్యంలో లోకనీతికి సంబంధించిన ముఖ్యాంశాలు నాలుగు పేర్కొనబడ్డాయి.

అవి- 1. జనులు మెచ్చుకొనేటట్లు ప్రవర్తించటం. 2.లోకులు నిందించే పనులను చేయకుండటం. 3. ఇతరులు తమకంటె బాగుపడుతున్నారే అని అసూయపడకుండా ఉండటం. 4.అందరితో కలిసి మెలిసి జీవించటం. 'యథారాజా తథా ప్రజా' అని న్యాయం. "యద్య దాచరతి శ్రేష్ఠః తత్త దే వేతరో జనః । సయత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే" అని భగవద్గీత. అందువలన రాజు ప్రజలు మెచ్చుకొనేటట్లు ప్రవర్తించటం ప్రథమ నీతి. ధృతరాష్ట్రుడు లోభంతో పాండవులకు అన్యాయం చేసి అధర్మవర్తనుడని లోకంలో అపకీర్తి పొందాడు. ఆ అపకీర్తి అతడి అశాంతికి మూలం. రాజు ద్యూతం వంటి వ్యసనాలను అధికారికంగా గుర్తించి, వాటి వలన కలిగే ఫలితాలను ధర్మ పాలనలో భాగంగా పరిగణించటం వలన లోకనింద ఏర్పడుతుంది. నిందను లెక్కచేయకుండా వ్యవహరిస్తే మనస్తాపం తప్పదు. ధృతరాష్ట్రుడు అటువంటి లోకనిందాకరమైన ద్యూత చర్యకు ధర్మప్రతిపత్తి కలిగించి పరిపాలనను కలుషితం చేశాడు. దాని ఫలితం అనుభవిస్తున్నాడు. అసూయ మనస్సుకు చీడపురుగు వంటిది, ప్రవర్తనకు పాము కాటు వంటిది. పాండవ సంపదకు అసూయ పడి అన్యాయంగా దానిని దొంగిలించాలని కపట ద్యూతాన్ని జరిపి కలుషవర్తనులనిపించుకొన్నారు దుర్యోధనాదులు. ఆ పాపానికంతా అండదండలుగా నిలిచినవాడు ధృతరాష్ట్రుడు. అతడి మనస్సులోని అసూయయే అంతటి హాలాహలాన్ని పాండవ జీవితంలో నింపింది. పరుల సంపదను చూచి ఓర్వలేని ఆ చుప్పనాతి గుణం కట్టెలోని నిప్పువలె మనిషిని బూది చేస్తుంది. అందుకే ధృతరాష్ట్రుడికి అంతటి అశాంతి. కౌరవ, పాండవులు నీరక్షీరాల వలె కలిసి ఉంటే వంశానికి మేలు. కాని, ధృతరాష్ట్రుడికి స్వార్థబుద్ధి దుర్యోధనుడి దుష్ట ప్రయత్నాలను మాన్పలేక వంశనాశనానికి దోహదం చేసింది. ధృతరాష్ట్రుడు లోకనీతికి ఆదర్శం కావలసిన శ్రేష్ఠుడు, ప్రభువు. అతడే నీతి తప్పాడు. నిందించదగిన పనులు చేశాడు. అసూయకు గురిఅయ్యాడు. తమ్ముడి కొడుకులతో కలిసి ఉండలేకపోయాడు. ఈ నాలుగు దోషాలకూ గురి అయిన ధృతరాష్ట్రుడు పొందే మనస్తాపం స్వయంకృతాపరాధమే అని తాత్పర్యం. (సంపా.)

క. కోపము, నుబ్బును, గర్వము । నాపోవక యునికియును, దురభిమానము, ని
ర్వ్యాపారత్వము నను నివి । కాపురుషగుణంబు లండ్రు కౌరవనాథా! 32

ప్రతిపదార్థం: కౌరవనాథా= కురురాజా, ధృతరాష్ట్రా!; కోపమున్, ఉబ్బును= పొంగిపోవటమూ; గర్వమున్; ఆపోవక+ఉనికియును= తృప్తిలేకపోవడమూ; దురభిమానమున్= తగని అభిమానమూ; నిర్వ్యాపారత్వమున్= ఏ పనీ చేయకపోవటమూ; అను+ఇవి; కాపురుష గుణంబులు+అండ్రు= దుర్జనుడి గుణాలు అంటారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! కోపమూ, పొంగిపోవటమూ, గర్వమూ, తృప్తిలేకపోవటమూ, దురభిమానమూ, ఏ పనీ చేయకపోవటమూ అనే ఇవి దుర్జనుడి లక్షణాలు అంటారు.

విశేషం: అంతశ్శత్రువుల వంటి ఈ ఆరుగుణాలు కలవాడు అధముడు. దుర్యోధను డటువంటి వాడు, అతడిని సమర్థించే ధృతరాష్ట్రుడూ ఆ కోవకు చెందుతాడు. ఇటువంటి వారి ప్రవర్తనం సంఘనీతికి చేటు. (సంపా.)

క. ఏలిన వానిని, దైవము, । నాలిని, బంధులను సముచితారాధన సం
శీలతఁ బ్రీతులఁ జేయని । పాలసుఁడా ఫలము లాసపడు, మనుజేంద్రా! 33

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్రా!= రాజా! ధృతరాష్ట్రా!; ఏలినవానిని= రాజునూ; దైవమున్= భగవంతుడినీ; ఆలిని= భార్యనూ; బంధులను= చుట్టాలనూ; సముచిత+ఆరాధన సంశీలతన్= తగిన విధంగా పూజించే సత్స్వభావంతో; ప్రీతులన్+చేయని పాలసుఁడా= సంతోష పరచని యుక్తాయుక్త వివేకశూన్యుడా; ఫలములు+ఆసపడున్?= సత్ఫలితాలు ఆసపడేది?

తాత్పర్యం: ధృతరాష్ట్రా! రాజునూ, భగవంతుడినీ, భార్యనూ, చుట్టాలనూ, తగిన విధంగా పూజించే సత్స్వభావంతో సంతోషపెట్టని యుక్తాయుక్త వివేకశూన్యుడా సత్ఫలితాలు ఆశించేది?

విశేషం: లోకనీతి ననుసరించి వివేకవంతులు రాజునూ, దైవాన్నీ, భార్యనూ, బంధువులనూ గౌరవంగా చూస్తూ సత్ప్రవర్తనతో వారిని సంతోషపెట్టుతారు. ఆ లక్షణాలు పాండవులకు సహజంగా ఉన్నాయి. వారు ధృతరాష్ట్రుడి మాట పాటించారు. శ్రీకృష్ణుడిని దైవంగా భావించి ఆరాధించారు. భార్యను ప్రేమతో చూచుకొన్నారు. బంధువులను ఆదరంతో గౌరవించారు. వారు ఆయా ధర్మాలకు తగిన సత్ఫలితాలు అనుభవించగలరు. ఆ నీతులను పాటించని కౌరవులూ, ధృతరాష్ట్రుడూ వివేకవిహీనులై విషాదానికి గురి ఔతారు. ధృతరాష్ట్రుడి మనస్తాపానికి అతడి వివేక రాహిత్యమే కారణం. (సంపా.)

క. **నెమ్మి గలవారి నొల్లరు । త మ్మొల్లనివారి వెనుకఁ దగులుదు; రధిక**
త్వ మ్మెఱిఁగి యెఱిఁగి తొడరుదు । రి మ్మెఱుఁగని యట్టివార లిభపురనాథా! **34**

ప్రతిపదార్థం: ఇభపుర నాథా!= హస్తినాపుర ప్రభూ, ధృతరాష్ట్రా!; ఇమ్ము+ఎఱుఁగని+అట్టివారలు= ఉపాయశాలులు కానివారు; నెమ్మి కలవారిన్+ఒల్లరు= తమపై ప్రేమ ఉన్నవాళ్ళను, ఇష్టపడరు; తమ్మున్+ఒల్లనివారి వెనుకన్= తమను ఇష్టపడనివారి వెనుక; తగులుదురు= ఆసక్తి చూపుతారు; అధికత్వమ్ము= ఆధిక్యం గొప్పతనం; ఎఱిఁగి+ఎఱిఁగి= తెలిసి తెలిసి; తొడరుదురు= ఎదుర్కొంటారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! ఉపాయశాలులు కానివారు తమను ప్రేమించేవారంటే ఇష్టపడరు. తమను ప్రేమించనివారి వెనుక పడతారు. తమకంటె అధికులని తెలిసి తెలిసీ ఇతరులను ఎదుర్కొంటారు.

విశేషం: తనను నిజంగా గౌరవించే పాండవులను కాదని, తనను తమ వ్యూహంలో పావువలె భావించి తేలికగా చూచే దుష్టచతుష్టయాన్ని మన్నించి, అన్నిట్లోనూ అధికులైన పాండవులతో వైరం పెట్టుకొనటం ధృతరాష్ట్రుడి ఉపాయరాహిత్యమని తాత్పర్యం. అతడికి శాంతి లేకపోవటం సహజం. (సంపా.)

క. **ధనమును, విద్యయు, వంశం । బును దుర్మతులకు మదంబుఁ బొనరించును; స**
జ్జను లైనవారి కడఁకువ । యును, వినయము నివియతెచ్చు నుర్వీనాథా! **35**

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= రాజా, ధృతరాష్ట్రా!, ధనమును= డబ్బూ, విద్యయున్; వంశంబును= ఉత్తమ వంశమూ; దుర్మతులకున్= దుర్బుద్ధులకు; మదంబున్= గర్వాన్నీ; పొనరించును= కలిగిస్తాయి; ఇవి+అ= ఇవే- ధనవిద్యావంశాలే; సత్+జనులు+ఐన వారికిన్= సద్బుద్ధులకు; అడఁకువయును= నమ్రతా; వినయమున్= గౌరవమూ; తెచ్చున్= తెస్తాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! ధనమూ, విద్యా, ఉత్తమ వంశమూ దుర్బుద్ధులకు మదం కలిగిస్తాయి. ఇవే సద్బుద్ధులకు అడకువనూ, గౌరవాన్నీ తెచ్చిపెట్టుతాయి.

విశేషం: 1. దుర్బుద్ధులు కౌరవులు, సద్బుద్ధులు పాండవులు. వీరిరువురికీ ధనం, విద్య, ఉత్తమవంశం అనే మూడు అదృష్టాలున్నాయి. కాని, కౌరవులు వాటి వలన మదోన్మత్తులయ్యారు. కాని, పాండవులు వినయవంతు లయ్యారు. దానివలన వారు లోకనీతిలో గౌరవ పాత్రులయ్యారు. (సంపా.)

2. "దీనికి మూలంలో చక్కని చమత్కారం ఉంది.

'విద్యా మదో ధన మద స్తృతీయోభిజనో మదః

ఏతే మదావలిప్తానాం ఏత ఏవ సతాం దమాః' (సం.5.33-41)

ఈ మూడూ దుర్మార్గులకు మదమూ, సన్మార్గులకు దమమూ కలిగిస్తాయి. అక్షరాలు తిరగబడ్డాయి. (మద-దమ). కథా సంబంధిగా మదం దుర్యోధనుడికీ - దమం ధర్మరాజుకూ కలుగుతాయి. తెలుగులో అడకువ చేత దమమునూ, వినయం చేత శమమునూ గ్రహించాలి" జనహిత వ్యాఖ్య. (పు.185-186).

క. అరిది విలుకాని యుజ్జ్వల । శర మొక్కని నొంచుఁ; దప్పి చనినం జను; నే
ర్పరి యైనవాని నీతి । స్ఫురణము పగరాజు, నతని భూమిం జెఱుచున్. 36

ప్రతిపదార్థం: అరిది విలుకాని+ఉజ్జ్వల శరము= గొప్ప విలుకాడియొక్క ప్రకాశించే బాణం; ఒక్కనిన్= ఒకడిని; నొంచున్= బాధిస్తుంది; తప్పి చనినన్+చనున్= తప్పిపోతే తప్పిపోతుంది; నేర్పరి+ఐన వాని నీతి స్ఫురణము= నేర్పుగలవాడి నీతి ప్రకాశం; పగ రాజున్= శత్రురాజునీ; అతని భూమిన్= అతడి దేశాన్నీ; చెఱుచున్= నశింపజేస్తుంది.

తాత్పర్యం: గొప్ప విలుకాడి మంచి బాణం ఒకడిని బాధిస్తే బాధిస్తుంది లేదా తప్పిపోతే తప్పిపోతుంది కాని, నేర్పుగలవాడి నీతిస్ఫూర్తి శత్రురాజునూ, అతడి దేశాన్నీ నశింపజేస్తుంది.

విశేషం: దీనికి మూలం:

"ఏకం హన్యా న్నవా హన్యా దిషుర్ముక్తో ధనుష్మతః

బుద్ధిర్బుద్ధిమతో త్సృష్టా హన్యా ద్రాష్ట్రం సరాజకమ్" (సం.5-33-42)

బాణ(బల) ప్రయోగం ఎదుటివారి నొకరినే చంపుతుంది. బుద్ధి (నీతి) ప్రయోగం రాజునూ రాజ్యాన్నీ నశింపచేస్తుంది. దుర్యోధనుడు బలప్రయోగాన్ని నమ్ముకొన్నాడు. ధర్మరాజు ధర్మనీతిప్రయోగాన్ని నమ్ముకొన్నవాడు. దుర్యోధనుడు కొందరిని చంపగలడేమో కాని, ధర్మజుడి రాజనీతి కౌరవులనూ, వారి రాజ్యాన్నీ కూడా హరించగలదని ప్రకరణోచితమైన తాత్పర్యం. (సంపా.)

తే. ఒకటిఁ గొని, రెంటి నిశ్చలయుక్తిఁ జేర్చి, । మూఁటి నాల్గింటఁ గడు వశ్యములుగఁ జేసి,
యేనిటిని గెల్చి, యాఱింటి నెఱిఁగి, యేడు । విడిచి వర్తించువాఁడు వివేకధనుఁడు. 37

ప్రతిపదార్థం: ఒకటిన్= ప్రభుత్వమును; కొని= చేపట్టి-స్వీకరించి; రెంటిన్= మంత్రము, ఉత్సాహము అను రెండింటిని; నిశ్చల యుక్తిన్+చేర్చి= కదలనీయక జోడు చేసి; మూఁటిన్= మిత్రులు, అమిత్రులు, తటస్థులు అనే మూఁడు వర్గాలను; నాల్గింటన్= సామ, దాన, భేద, దండములనే నాలుగు ఉపాయాలచేత; కడున్= మిక్కిలి; వశ్యములుగన్+చేసి= వశపరచుకొని; ఏనిటిన్= త్వక్కు, చక్షువు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణము అనే అయిదింటినీ; గెల్చి= జయించి; ఆఱింటిన్= సంధి, విగ్రహము, యానము,

ఆసనము, ద్వైధీభావము అనే ఆరింటినీ; ఎఱింగి= తెలిసికొని; ఏడు= వ్యసనముల నేడింటినీ; విడిచి; వర్తించువాఁడు= ఉండేవాడు; వివేక ధనుఁడు= వివేకం ధనంగా కలవాడు.

తాత్పర్యం: ప్రభుత్వాన్ని చేపట్టి, మంత్రోత్సాహములనే రెండింటినీ కదలనీయక జోడు చేసి, మిత్రులు, అమిత్రులు, తటస్థులు అనే మూడు వర్గాలనూ సామ దాన భేద దండములనే నాలుగు ఉపాయాలచేతా పూర్తిగా వశపరచుకుని, త్వక్కు, చక్షువు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణము అనే అయిదు ఇంద్రియాలనూ జయించి, సంధి విగ్రహ యాన ఆసన ద్వైధీభావములు అనే ఆరింటినీ తెలిసికొని, వేట, జూదము, పానము, స్త్రీ, వాక్పారుష్యము, దండపారుష్యము, అర్థదూషణము అనే సప్త వ్యసనాలనూ విడిచి వర్తించేవాడు వివేకధనుడు.

దీనికి ఇంకో విధమైన అర్థం:

ఒకటి- బుద్ధి. దీనికి వాక్కు, క్రియ అనే రెండింటినీ నిశ్చలత్వంతో చేర్చి, ధర్మార్థకామాలనే మూడింటినీ బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసములనే నాల్గింటితో మిక్కిలి వశపడేటట్లు చేసి, వాక్, పాణి, పాద, పా,యూపస్థ లనే కర్మేంద్రియాల నయిదింటినీ గెలిచి, యజన, యాజ, నాధ్యయన, దాన, ప్రతిగ్రహాలనే ఆరు స్మార్త కర్మలను తెలిసి, ఆవరణం (పంచభూతాలు), బుద్ధ్యహంకారాలూ అనే ఏడింటినీ విడిచి వర్తించే వాడు వివేకధనుడు.

మరోవిధమైన అర్థం: ఒకటి- సత్త్వం, రెండు- రజస్తమస్సులు, మూడు- ధన దార పుత్రేషణములు, నాలుగు- ధ్యాన, ధారణ, యోగ, సమాధులు, తక్కినవి పైని చెప్పబడినట్లే.

విశేషం: మూల భారతంలో దీనికి సరియైన శ్లోకం-

> **'ఏకయా ద్వే వినిశ్చిత్య త్రీం శ్చతుర్భి ర్వశే కురు,**
>
> **పఞ్చ జిత్వా విదిత్వా షట్ సప్త హిత్వా సుఖీభవ.' (సం. 5-33.43)**

క. **విను, మధురాహారంబులు । గొనుటయుఁ, బెక్కండ్రు నిద్ర గూరినయెడ మే**
ల్కని యునికియుఁ, గార్యాలో । చనముఁ, దెరువు నడచుటయును జన దొక్కనికిన్. 38

ప్రతిపదార్థం: విను(ము), ఒక్కనికిన్= ఒంటరిగా; మధుర+ఆహారంబులు+కొనుటయున్= మధురములైన ఆహారాలు స్వీకరించటమూ, పెక్కండ్రు= అనేకులు; నిద్ర+కూరిన+ఎడన్= నిద్రించేచోట; మేల్కని+ఉనికియున్= మేలుకొని ఉండటమూ; కార్య+ఆలోచనమున్= ఒక పనిని గూర్చి ఆలోచించటమూ; తెరువు నడచుటయును= మార్గంలో నడవటమూ; చనదు= తగదు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! విను. మధురాహారాలు ఒక్కడూ తినటమూ, పలువురు నిద్రపోతుంటే ఒక్కడూ మేలుకొని ఉండటమూ, కార్యాలోచన ఒక్కడూ చేయటమూ, మార్గంలో ఒక్కడూ నడవటమూ తగదు.

విశేషం: దీనికి మూలం.

> **'ఏక స్స్వాదు న భుఞ్జీత ఏక శ్చార్థాన్ న చిన్తయేత్,**
>
> **ఏకో న గచ్ఛే దధ్వానం నైక స్సుప్తేషు జాగృయాత్,' (సం. 5.33.45)**

మధుర పదార్థం వంటి రాజ్యాన్ని న్యాయంగా పాండవులకు పంచి ఇచ్చి దానిని మరల హరించారు కౌరవులు. దానికి సాక్షీభూతుడు ధృతరాష్ట్రుడు. అందరూ నిద్రపోతూ ఉండగా మేల్కొని విదురుడి నీతి బోధ వింటున్నవాడు ధృతరాష్ట్రుడు. విదురుడు చెప్పే మాటలన్నీ వింటూ తనలో తాను ఏకాంతంగా తన వ్యూహాన్ని తీర్చిదిద్దికొనేవాడూ, ఎవరినీ నమ్మక తన దారిలో తాను ఒంటిగా సాగేవాడూ ధృతరాష్ట్రుడు. సంఘనీతికి సరిపడని వ్యక్తినీతి సన్మానయోగ్యం కాదనీ, పైపెచ్చు అది మనోవేదనను కలిగిస్తుందనీ తాత్పర్యం. (సంపా.)

క. నడవడి యను మున్నీటిం । గడవం బెట్టంగ నోడకరణిం దగి తా
నొడఁగూడు ననిన, సత్యము । గడచినగుణ మింక నొండు గలదే యరయన్? 39

ప్రతిపదార్థం: నడవడి+అను మున్నీటిన్= ప్రవర్తన అనే సముద్రాన్ని, కడవన్+పెట్టంగన్= దాటించటానికి; ఓడ కరణిన్= ఓడవలె; తగి= ఒప్పి; తాను; ఒడఁగూడన్+అనినన్= ఉంటుందంటే; అరయన్= పరిశీలించగా; సత్యము+కడచిన గుణము= సత్యాన్ని మించిన గుణం; ఇంకన్+ఒండు+కలదే?= ఇంకొకటి ఉన్నదా?

తాత్పర్యం: సత్ప్రవర్తన అనే సముద్రాన్ని దాటించటానికి ఓడవలె సత్యం ఒప్పి ఉంటుందంటే, సత్యాన్ని మించిన గుణం ఇంకోటి ఉంటుందా?

విశేషం: 1. ధర్మప్రీతి వ్యక్తిశీలాన్ని తీర్చిదిద్దుతుంది.

'ధృతిః క్షమా దయాఽస్తేయం శౌచ మింద్రియనిగ్రహః

హ్రీ ర్విద్యా సత్య మక్రోధో దశకం ధర్మలక్షణమ్'

అని భారతంలో చెప్పబడింది. ఈ దశధర్మలక్షణాలలో సత్యం మూలభూతమైనది, సారభూతమైనది. సత్ప్రవర్తన దాటరాని సముద్రం వంటిదైతే, దానిని దాటటానికి తోడ్పడే ఓడవంటిది సత్యం. ధర్మజుడి చరిత్రం సత్ప్రవర్తన సాగరం వంటిది. అతడికి సత్యమే తరణోపాయం. అతడికి సత్య ధర్మపాలనం వలన కష్టాలు వచ్చాయి. అయినా అతడు అంతశ్శాంతిని కోల్పోలేదు. ధృతరాష్ట్రుడి స్థితి తద్భిన్నం. (సంపా.)

2. దీనికి మూలం:

'ఏవమే వాద్వితీయం తద్యద్రాజన్నావ బుద్ధ్యసే

సత్యం స్వర్గస్య సోపానం పారావారస్య నౌ రివ' (సం. 5-33-46)

ఇందులో 'సత్యం స్వర్గ సోపానం' అనే వాక్యాన్ని తిక్కన గ్రహించలేదు. ప్రవర్తనను గురించి చెప్పేటప్పుడు సముద్రాన్ని ఓడతో దాటటం అనే ఉపమానమే సరిపోతుంది. దాటటం వేరు, ఎక్కటం వేరు. అందువలన ఆ వాక్యాన్ని వదలి నట్లున్నారు. (సంపా.)

క. క్షమియించు వారిఁ గని చా । లమి వెట్టుదు; రైననుం దలంప, ననూన
క్షమయ కడు మెఱయు తొడ; వు । త్తమ రూపము గోరువారు దాల్తురు దానిన్. 40

ప్రతిపదార్థం: క్షమియించు వారిన్= క్షమించే గుణం కలవాళ్ళను; కని= చూచి; చాలమి+పెట్టుదురు= అసమర్థత ఆరోపిస్తారు; ఐననున్= అయినప్పటికీ; తలంపన్= ఆలోచించగా; అనూనక్షమ+అ= తక్కువ కాని (గొప్పదైన) ఓర్పే; కడున్= మిక్కిలి; మెఱయు తొడవు= ప్రకాశించే ఆభరణం; దానిన్= ఆ ఆభరణాన్ని; ఉత్తమ రూపము+కోరువారు= సుందరతమమైన ఆకారం కావాలనుకొనే వాళ్ళు; తాల్తురు= ధరిస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: క్షమించే స్వభావం కలవాళ్ళను చూచి జనులు అసమర్థతను ఆపాదిస్తారు. అయినా, ఆలోచిస్తే, గొప్పదైన క్షమాగుణమే మిక్కిలి మెరిసే ఆభరణం. మంచి సౌందర్యం కావాలనుకొనేవాళ్ళు దానిని ధరిస్తారు.

విశేషం: 1. దశ విధ ధర్మ లక్షణాలలో సత్యం తరువాత క్షమ గణనీయమైనది. సత్యం ధర్మహృదయం, క్షమ అలంకారం. పైపద్యానికి మూలం.

'ఏకః క్షమావతాం దోషో ద్వితీయో నోపలభ్యతే

యదేవం క్షమయా యుక్త మశక్తం మన్యతే జనః' (సం. 5-33-47)

క్షమ గలవారిమీద అసామర్థ్య దోషం ఒకటే తప్ప మరే దోషమూ జనులు ఆరోపించటానికి వీలుకాదు. అది అతడి దోషంగా భావించరాదు. ఓర్పే మానవుడికి శ్రేష్ఠమైన బలం. అసమర్థులకు ఓర్పు గుణమైతే, సమర్థులకు భూషణమౌతుంది. క్షమను వశీకరణ శక్తిగా భావించాలి. క్షమ చేత సాధించలేని దేదీ లేదు అని మూలం క్షమాగుణ ప్రాశస్త్యాన్ని పేర్కొన్నది.

2. క్షమాగుణ సంపన్నుడు ధర్మరాజు. పాండవులు ద్వైతవనంలో ఉన్న సమయంలో ధర్మజుడు ద్రౌపదికి క్షమావీరుడి మాహాత్మ్యాన్ని వర్ణించి చెప్పాడు.

క. **'క్షమగల వానికిఁ బృథ్వీ । సమునకు నిత్యంబు విజయసంసిద్ధి యగున్**
క్షమయైనవాని భుజవి । క్రమము గడున్ వలయు సర్వకార్యక్షమమై'. (ఆరణ్య.1.223). అట్టి క్షమాగుణుడిని అసమర్థుడిగా భావించే దుర్యోధన ధృతరాష్ట్రుల భావాన్ని వ్యంగ్యంగా హెచ్చరించాడు; క్షమ లేని వాడు ఉత్తమవ్యక్తి కాజాలడని పేర్కొన్నాడు విదురుడు.

క. **పురుషుండు రెండు దెఱఁగుల । ధర నుత్తముఁ డనఁగఁ బరఁగుఁ; దా నెయ్యెడలం**
బరుసములు వలుక కునికిన్; । దురితంబులు వొరయు పనులు దొఱఁగుట కతనన్. 41

ప్రతిపదార్థం: పురుషుండు= మనుష్యుడు; రెండు+తెఱఁగులన్= రెండు విధాల; ధరన్= భూమియందు; ఉత్తముఁడు+ అనఁగన్+పరఁగన్= శ్రేష్ఠుడు అనదగిఉంటాడు; తాను; ఏ+ఎడలన్= ఎక్కడా; పరుసములు+పలుకక+ఉనికిన్= పరుషవాక్కులు పలకకుండటం చేతా; దురితంబులు+పొరయు పనులు= పాపకార్యాలు; తొఱఁగుట కతనన్= విడిచిపెట్టటం చేతా.

తాత్పర్యం: ఎక్కడా పరుషవాక్కులు పలకకపోవటం, పాపపు పనులు చేయకపోవటం- ఈ రెండింటిచేతా లోకంలో పురుషుడు ఉత్తముడు అనిపించుకొంటాడు.

విశేషం: దీనికి మూలం.

'ద్వే కర్మణీ నరః కుర్వ న్నస్మిన్‌లోకే విరోచతే,

అబ్రువన్ పరుషం కిఞ్చి దసతో నార్థయం స్తథా.' (సం.5.33.50)

పరుషాలాడటం వాగ్దోషం. పాపపు పనులు చేయటం చేష్టా దోషం. ఆ రెండు దోషాలు చేయనివారు ఉత్తములు. కౌరవులు ఆ రెండు దోషాలు చేశారు. పాండవులు చేయలేదు. అందువలన పాండవులు ఉత్తములు. ధర్మాచరణ ప్రవృత్తిని బోధిస్తున్నట్లున్న ఈ నీతులలో పాండవ గుణస్తుతి వ్యంగ్యంగా వినపడుతున్నది. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. చెల్లియుండియు సైరణ సేయువతఁడుఁ, । బేదవడియును నర్థికిఁ బ్రియముతోడఁ
దనకుఁ గల భంగి నిచ్చు నతండుఁ, బుణ్య । పురుషు లని చెప్పి రార్యులు కురువరేణ్య! 42

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశశ్రేష్ఠుడా, ధృతరాష్ట్రా!; చెల్లి+ఉండియున్= సమర్థుడయి ఉండికూడా; సైరణ+చేయు+ అతఁడున్= శాంతం వహించేవాడూ; పేద+పడియును= బీదవాడయినప్పటికిని; అర్థికిన్= యాచకుడికి; ప్రియముతోడన్= ప్రీతితో; తనకున్+కలభంగిన్= తనకున్నంతలో; ఇచ్చు+అతండున్= ఇచ్చేవాడూ; పుణ్యపురుషులు+అని= పుణ్యాత్ములని; ఆర్యులు= పెద్దలు; చెప్పిరి= అన్నారు.

తాత్పర్యం: కురువంశోత్తమా, ధృతరాష్ట్రా! సమర్థుడయి ఉండికూడా శాంతం వహించేవాడూ, బీదవాడయినప్పటికీ తనకున్నంతలో ఇచ్చేవాడూ పుణ్యాత్ములని పెద్దలన్నారు.

విశేషం: దీని మూల శ్లోకం-

'ద్వా విమౌ పురుషౌరాజన్! స్వర్గస్యోపరి తిష్ఠతః।

ప్రభు శ్చ క్షమయా యుక్తో । దరిద్ర శ్చ ప్రదానవాన్'. (సం.5-33-53) అరణ్యాజ్ఞాత వాస నియమాలను పాటించిన పాండవులలో ఈ రెండు గుణాలూ ప్రకాశించాయి. (సంపా.)

ఆ. పాడి దప్పకుండఁ బడయు సొమ్ములకు న । పాత్రములకు నీగి, పాత్రములకుఁ
బెట్ట కునికి యనఁగ నెట్టన రెండు వి । ధములఁ గీడు దొడరు ధరణినాథ! 43

ప్రతిపదార్థం: ధరణినాథా!= రాజా, ధృతరాష్ట్రా!; పాడి+తప్పక+ఉండన్= న్యాయం అతిక్రమించకుండా; పడయు సొమ్ములకున్= గడించే ధనములకు; అపాత్రములకున్= అనర్హులకు; ఈగి= ఇవ్వటం; పాత్రములకున్= అర్హులకు; పెట్టక+ఉనికి= ఇవ్వకపోవటం; అనఁగన్; రెండు విధములన్; కీడు= హాని; నెట్టన= తప్పక; తొడరున్= కలుగుతుంది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! న్యాయబద్ధంగా సంపాదించిన ధనాన్ని అనర్హులకు ఇవ్వటమూ, అర్హులకు ఇవ్వకపోవటమూ అనే వాటివలన రెండు విధాలా కీడు కలుగుతుంది.

విశేషం: దీనికి మూలం:

'న్యాయాగతస్య ద్రవ్యస్య బోద్ధవ్యౌ ద్వావతిక్రమౌ

అపాత్రే ప్రతిపత్తి శ్చ పాత్రే చాప్రతిపాదనమ్'. (సం. 5-33-54)

ఈ నీతి కథాసందర్భంలో సవ్యంగా, అపసవ్యంగా కూడా ధృతరాష్ట్రుడికి తగిలి వస్తుంది. ఎట్లాగంటే- న్యాయపరంగా వచ్చిన పైతృకమైన రాజ్యాన్ని పాత్రులైన పాండవులకు ఇవ్వకపోవటం, అపాత్రులైన కౌరవులకు దక్కేటట్లు ప్రయత్నించటం అనే రెండు దోషాలు ధృతరాష్ట్రుడికి తగిలాయి. ఇకపోతే అన్యాయార్జిత ద్రవ్యమైన పాండవ రాజ్యాన్ని కూడా పాత్రులైన పాండవులకు చెందకుండా చేయటం, ఆపాత్రులైన కౌరవులకే దక్కేటట్లు చూడటం అనే దోషద్వయం కూడా ధృతరాష్ట్రుడికి చెందింది. కాబట్టి రెండు విధాలా ద్విగుణీకృతమైన కీడు గలుగుతుందని ధృతరాష్ట్రుడిని విదురుడు వ్యంగ్యంగా హెచ్చరించాడు. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **వెలఁది, జూదంబు, పానంబు, వేఁట, పలుకు । ప్రల్లదంబును, దండంబుఁ బరుసఁదనము**
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ము సేఁత । యనెడు సప్తవ్యసనములఁ జనదు తగుల. **44**

ప్రతిపదార్థం: వెలఁది= స్త్రీ; జూదంబు; పానంబు= మద్యసేవనం; వేఁట; పలుకు ప్రల్లదంబును= వాక్పారుష్యం; దండంబు పరుసఁదనమున్= దండపారుష్యం- అతిక్రూరంగా దండించటం; నిష్ప్రయోజనముగన్ సొమ్ము వమ్ము+చేఁత= నిరర్థకంగా డబ్బు పాడుచేయటం; అనెడు; సప్త వ్యసనములన్= ఏడు వ్యసనాలలోను; తగులన్+చనదు= ఆసక్తి చూపరాదు.

తాత్పర్యం: స్త్రీ, జూదం, త్రాగుడు, వేట, వాక్పారుష్యం, దండపారుష్యం, డబ్బు వృథా చేయటం అనే ఏడు వ్యసనాలయందు ఆసక్తి చూపరాదు.

విశేషం: అన్ని ప్రతులలోనూ 'దండంబుఁ, బరుసఁదనము' అని రెండుగా చూపబడ్డాయి. అది సరికాదు. అవి రెండయితే వ్యసనాలు ఎనిమిది అవుతాయి. అవి ఏడే కదా! దండంబు పరుసఁదనము అంతా ఒక్కటే. దానికి దండపారుష్యమని అర్థం. దండపారుష్యమంటే అతిక్రూరంగా దండించటం. మూలంలో 'మహచ్చదణ్డ పారుష్యం' అనే ఉన్నది. దండం వేరుగానూ, పారుష్యం వేరుగానూ లేదు.

మూలం: **'స్త్రి యోఽక్షా మృగయా పానం వాక్పారుష్యం చ పఞ్చమమ్,**
మహచ్చ దణ్డపారుష్య మర్థదూషణ మేవ చ.'

తే. **తగిన వేషంబు, దనుఁ దాన పొగడుకొనమి । నొచ్చియును గీడు వలుకమి, యిచ్చి వగవ**
కునికి, దన కెంత నడవకయున్నఁ బథము । దప్పకుండుట నడవడి కొప్పు సేయు. **45**

ప్రతిపదార్థం: తగిన వేషంబు= తన హోదాకు ఉచితమైన వేషమూ; తనున్+తాను+అ= తన్ను తానే; పొగడుకొనమి= స్తుతించుకొనకపోవటం; నొచ్చియును+కీడు+పలుకమి= బాధపడికూడా కీడు పలకకపోవటం; ఇచ్చి వగవక+ఉనికి= దానం చేసి బాధపడకపోవటం; తనకున్+ఎంత నడవక+ఉన్నన్= తనకెంత గతి లేకున్నా; పథము+తప్పక+ఉండుట= మార్గం తప్పకుండడం; నడవడికిన్= ప్రవర్తనకు; ఒప్పు+చేయున్= మంచి కలిగిస్తాయి.

తాత్పర్యం: తన హోదాకు ఉచితమైన వేషధారణా, తనను తానే స్తుతించుకొనకపోవటమూ, బాధపడి కూడా కీడు పలుకక పోవడమూ, దానం చేసి- ఎందుకు చేశానా అని బాధపడకపోవటమూ, తన కెంత గతి లేకపోయినా ధర్మమార్గం అతిక్రమించకపోవటమూ ప్రవర్తనకు మేలు కలిగిస్తాయి. సత్ప్రవర్తన అనిపించుకొంటుంది.

క. **చెలిమియు, సంభాషణమును । బలిమి, వివాదంబుఁ, ద్రోపుఁ బాడియుఁ దమయం**
తలవారితోన తగు; నధి । కుల, హీనుల తోడనైనఁ గొఱ గా దధిపా! **46**

ప్రతిపదార్థం: అధిపా= రాజా, ధృతరాష్ట్రా! చెలిమియున్= స్నేహమూ; సంభాషణమును= మాటా; బలిమి= బలమూ; వివాదంబున్= వాదించటమూ; (వివాహంబున్= పెండ్లీ - సూ.ని.); త్రోపుఁబాడియున్= యుద్ధమూ; తమ+అంతలవారితోన్+అ= తమతో సమానులైనవారితోనే; తగున్= ఒప్పుతుంది; అధికుల, హీనుల తోడన్+ఐనన్= తమకంటె గొప్పవారితోనూ, తక్కువవారితోనూ అయితే; కొఱ+కాదు= యుక్తంకాదు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! స్నేహమూ, మాటా, బలమూ, వివాదమూ (వివాహము), యుద్ధమూ తమతో సమానులైనవారితోనే ఒప్పుతుంది కాని, తమకంటె అధికులతోకాని, అల్పులతోకాని యుక్తం కాదు.

విశేషం: 'వివాదంబు' అనే దానికి బదులుగా 'వివాహంబు' అని సూర్యరాయాంధ్ర నిఘంటువులో ఉదాహృతమైన చోట ఉన్నది. అది మూలానుగుణం కూడా. **"సమై ర్వివాహం కురుతే న హీనైః"** అని మూలం.

తే. కొంచె మైనను దగఁ బంచి కుడువ మేలు; । పనులయెడ దుఃఖ మోర్చి యల్పంబు సుఖము
ననుభవించుట హితము; శత్రునకు నైన । నిచ్చుటయ లెస్స యడిగినయెడ నృపాల! 47

ప్రతిపదార్థం: నృపాల!= రాజా!; ధృతరాష్ట్రా!; కొంచెము+ఐనను= తక్కువ ఉన్నప్పటికీ, తగన్= ఒప్పుగా; పంచి= విభజించి, కుడువన్= అనుభవించటం; మేలు= మంచిది; పనుల+ఎడన్= పనులు చేసేటప్పుడు; దుఃఖము+ఓర్చి= కష్టం సహించి; అల్పంబు సుఖమున్= ఇంచుక సుఖాన్ని; అనుభవించుట; హితము= మేలు; అడిగిన+ఎడన్= అడిగితే; శత్రునకున్+ఐనన్; ఇచ్చుట+అ= ఇవ్వటమే; లెస్స= మంచిది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఎంత తక్కువ ఉన్నప్పటికీ దానినే ఒప్పుగా ఇతరులకు పంచిపెట్టి అనుభవించటం మంచిది. పనులు చేసేటప్పుడు కష్టానికి సహించి, ఇంచుక సుఖాన్ని అనుభవించటం మేలు. అడిగితే శత్రువుకైనా ఇవ్వటమే మంచిది.

విశేషం: దీనికి మూలశ్లోకం-

'మితం భుంక్తే సంవిభజ్యాశ్రితేభ్యో । మితం స్వపి త్యమితం కర్మ కృత్వా
దదా త్యమిత్రే ష్వపి యాచిత స్సన్ । తమాత్మవంతం ప్రజహత్యనర్థాః' (సం.5-33-55)

అడిగితే శత్రువుకైనా ఇవ్వటం మంచిది- అనే నీతి ఇందులో ప్రత్యేకంగా పేర్కొనదగింది. పాండవులు తమ్ముడి బిడ్డలు. వారు తమకు న్యాయంగా రావలసిన రాజ్యభారం తిరిగి ఇమ్మని అడిగినప్పుడు ఇవ్వకపోవటం మహాదోషమని విదురుడి హితవు. (సంపా.)

క. తను లోకము గొనియాడఁగ । విని యుబ్బఁడు సజ్జనుండు; వెండియుఁ గడు మే
లొనరించుఁ; గీ డొకించుక । యును దసదెసఁ దోఁపనీక యుడుపుచు వచ్చున్. 48

ప్రతిపదార్థం: సత్+జనుండు= మంచివాడు; తనున్= తనను; లోకము= లోకులు; కొనియాడఁగన్= పొగడితే; విని; ఉబ్బఁడు= పొంగిపోడు; వెండియున్= మళ్ళీ ఇంకా; కడున్= మిక్కిలి; మేలు+ఒనరించున్= మేలు చేస్తాడు; ఒక+ఇంచుకయును+ కీడు= అపకారం ఏకొంచెమూ; తన దెసన్= తనయందు; తోఁపన్+ఈక= కనబడనీయకుండా; ఉడుపుచున్+వచ్చున్= పోగొట్టుతూ ఉంటాడు.

తాత్పర్యం: లోకం తనను పొగడితే సజ్జనుడు విని పొంగిపోడు. ఇంకా ఎంతో మేలు చేస్తాడు. తానుమాత్రం ఏ కొంచెం కీడుకూడా చేయనివిధంగా ప్రవర్తిస్తాడు. ఇతరుల కీడును పోగొట్టుతూ ఉంటాడు.

విశేషం: దీనికి మూల శ్లోకం:

'న హృష్య త్యాత్మసమ్మానే నావమానేన తప్యతే,

గాంగోహ్రద ఇవాక్షోభ్యో య స్స పండిత ఉచ్యతే'. (సం.5-33-56)

ఇందులోని గంగాహ్రదం తోటి ఉపమానం తిక్కన గ్రహించలేదు. అక్షోభ్యంగా ఉంటాడు అన్నదాని కంటె ధర్మరాజులో కనపడే విశిష్ట లక్షణం- "గడు మేలొనరించుఁ, గీడొకించుకయును దనదెసఁ దోఁపనీక యుడుపుచు వచ్చున్' అనే దానిని పేర్కొనటం గమనార్హం. ఇది సజ్జనుడి గురించి చెప్పుకొనే చక్కని సూక్తి. ధర్మరాజు గుణాలకు అక్షర నీరాజనం. (సంపా.)

వ. ఇట్టి చందంబులు ధర్మనందనునకుం గల' వని పలికి, విదురుం డది ప్రసంగంబుగాఁ బాండవులఁ బ్రశంసించి, 'నీవు వారలం బెనిచి మానుసులం జేసి రక్షించి, యిప్పు డుపేక్షించి, వారలు వెలినుండ నూరకుండం దగునే? తగుపాలిచ్చి, వారి రావించి, నీ కొడుకుల తోడివారింగా నడపుట యుచితంబు, మీరును వారును నొక్కటియై యున్న మీదిక్కు దేవతలకుం దేఱి చూడరా' దనిన, నమ్మాటలు వెడవెడ యూఁకొని ధృతరాష్ట్రుండు విదురున కిట్లనియె. 49

ప్రతిపదార్థం: ఇట్టి చందంబులు= ఇట్టి విధాలు; ఈ లక్షణాలు; ధర్మనందనునకున్+కలవు= ధర్మరాజుకున్నాయి; అని; పలికి, విదురుండు; అది ప్రసంగంబుగాన్= ఆ సందర్భంగా; పాండవులన్; ప్రశంసించి= స్తుతించి; నీవు; వారలన్; పెనిచి= పెంచి; మానుసులన్+చేసి= మనుష్యులను చేసి- పెద్దవాళ్ళను చేసి; రక్షించి= కాపాడి; ఇప్పుడు; ఉపేక్షించి= ఊరకుండి; వారలు; వెలిన్+ఉండన్= వేరే ఉంటూంటే; ఊరక+ఉండన్+తగునే= మాటాడకపోవటం తగునా?; తగుపాలు+ఇచ్చి= న్యాయంగా ఇవ్వవలసిన భాగం ఇచ్చి; వారిన్; రావించి= రప్పించి; నీకొడుకుల తోడివారిన్+కాన్= నీ కొడుకులతో సమానంగా; నడపుట= నడపటం- చూడటం; ఉచితంబు= మంచిది; మీరును; వారునున్; ఒక్కటి+ఐ+ఉన్నన్= ఏకమయి ఉంటే; మీ దిక్కు= మీకేసి; దేవతలకున్= దేవతలకు కూడా; తేఱి చూడన్ రాదు= తేరిచూడటం కష్టం; అనినన్; ఆ+మాటలకున్; వెడవెడ= ఇంచు కించుక; ఊఁకొని= ఊకొట్టి; ధృతరాష్ట్రుండు; విదురునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇట్లాంటి లక్షణాలు ధర్మరాజు కున్నాయి' అని పలికి విదురుడు ఆ సందర్భంలో పాండవులను పొగడి, 'నీవు వాళ్ళను పెంచి పెద్దవాళ్ళను చేసి రక్షించి, ఇప్పుడు మాని, వాళ్ళు వేరే ఉంటూంటే ఊరుకొనవచ్చునా? వాళ్ళకు న్యాయంగా ఇవ్వవలసిన భాగం వాళ్ళకిచ్చి, వాళ్ళను రప్పించి, నీ కొడుకులతో సమానంగా చూడటం మంచిది. మీరూ వాళ్ళూ ఒక్కటయి ఉంటే మీకేసి దేవతలు కూడా తేరి చూడలేరు' అనగా, ఆ మాటలకు కొంచెంగా ఊకొట్టి ధృతరాష్ట్రుడు విదురుడితో ఇట్లా అన్నాడు :

విశేషం: ధర్మరాజు సంజయుడితో ఏమన్నాడో తెలియక, సంజయుడు తనను ఎందుకు ముఖం మీద తిట్టినట్లు మాటలాడాడో తెలియక ధృతరాష్ట్రుడు వేదనపడి విదురుడిని దాని కారణం వివరించుమన్నాడు. విదురుడు లోకనీతిని, ధర్మప్రీతిని పాటించే సజ్జనుల లక్షణాలను వివరించి, అవి ధర్మరాజులో నిండుగా ఉన్నాయని పేర్కొన్నాడు. కౌరవులయం దా గుణాలు లేవని తేల్చిచెప్పాడు. తులనాత్మకంగా ఈ అంశాలను వితర్కించుకొని పాండవులకు రావలసిన భాగాన్ని ఇచ్చి, వారిని దగ్గరికి తీసికొని, కలసి మెలసి స్నేహంతో ఉండుమనీ, కౌరవ పాండవులు సమైక్యంగా ఉంటే వారిని దేవతలు కూడా తేరిపార చూడలేరనీ హితవు చెప్పాడు. అదే ధర్మరాజు హృదయమన్నాడు. అదే ధృతరాష్ట్రుడి కర్తవ్యమన్నాడు. అదే ధృతరాష్ట్రుడి మనశ్శాంతికి మందని చెప్పాడు. ఈ మాటలు ధృతరాష్ట్రుడికి మ్రింగుడు పడలేదు. ఔనని తల ఊపలేడు; కాదని త్రోసివేయలేడు. ఆ మానసిక స్థితినే 'వెడవెడ ఊకొట్టే' అభినయంతో ప్రదర్శించాడు. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. 'హితముఁ గర్తవ్యమును నాకు నెఱుఁగు దీవ; । ధర్మసుతు చందమును విదితంబు నీకు;
నట్లు గావున నెఱిఁగింపు మఖిలకార్య । జాతమును జిత్తతాపోపశమము గాఁగ.' 50

ప్రతిపదార్థం: ఈవు+అ= నీవే; నాకున్; హితమున్= మేలయినదీ; కర్తవ్యమును= చేయదగినదీ, ఎఱుఁగుదు(వు); నీకున్, ధర్మసుతు చందమును= ధర్మరాజు పద్ధతీ; విదితంబు= తెలిసినది; అట్లు+కావునన్= అందుచేత; చిత్త తాప+ఉపశమము+ కాఁగన్= మనోవేదన పోయేటట్లు; అఖిల కార్య జాతమును= చేయదగినవాని సమూహమునంతనూ; ఎఱింగింపు(ము)= తెలుపుము.

తాత్పర్యం: 'నాకు మేలయినదీ, కర్తవ్యమయినదీ నీవే ఎరుగుదువు. ధర్మరాజు పద్ధతి కూడా నీకు తెలుసు. అందుచేత నా మనస్తాపం అడగేటట్టు నేను చేయవలసినదంతా చెప్పుము.'

విశేషం: ధృతరాష్ట్రుడు నివురు కప్పిన నిప్పు; విదురుడి మాటలు తనకు రుచించలేదని సూటిగా చెప్పడు. వక్రంగా వ్యక్తం చేస్తాడు. ఈ పద్యంలోని మూడు వాక్యాలలో మూడు మెలికలున్నాయి. 1.విదురుడు ధృతరాష్ట్రుడికి (పైపద్యంలో) చెప్పింది హితమూ, కర్తవ్యమే. కాని, ధృతరాష్ట్రుడు తనకు హితాన్నీ, కర్తవ్యాన్నీ చెప్పుమని మరల కోరుతున్నాడు. అంటే- ముందు చెప్పినవి తాను అంగీకరించటం లేదని సున్నితంగా సూచించి, విదురుడి హితవును వ్యంగ్యంగా త్రోసిపుచ్చుతున్నాడన్నమాట. ఇది మొదటి మెలిక. 2. ధర్మరాజు పద్ధతి కూడా విదురుడికి బాగా తెలుసు అని పేర్కొనటంలో గల అంతరార్థం - ధర్మరాజు మెత్తని పులి అనీ, సజ్జనుడుగా కనపడ్డా యుద్ధం చేయాలనీ, రాజ్యాన్ని పొందాలనీ స్థిరసంకల్పతో ఉన్నాడనీ, సమయం కొరకు వేచి ఉన్నాడనీ తెలిసికొనటం ముఖ్యమని సూచన. ఇది రెండవ మెలిక. 3.ధృతరాష్ట్రుడికి చిత్తోపశాంతి ఎట్లా ఔతుందో కూడా విదురుడు తెలిసికొని హితవు చెప్పాలనే సున్నితమైన హెచ్చరిక మూడవ మెలిక. తన మన సెరిగి, తన కోర్కె తీరే విధానాన్ని వివరంగా తెలుపుమని విదురుడిని వేడుకొన్నాడు. ధృతరాష్ట్రుడి దృక్పథంతో ఆలోచించి అతడికి హితవు కలిగేటట్లు, మనస్తాపం తీరేటట్లు భావి కార్యక్రమం ఎట్లా చెయ్యాలో సూచించాలని అతడి ఆశయం. అంటే ప్రచ్ఛన్నంగా ధర్మరాజు వ్యూహానికి ప్రతివ్యూహ మేమిటో సూచించాలని తాత్పర్యం. (సంపా.)

క. అనుడు విదురుఁ డాతని కి । ట్లను; 'నిమ్మెయి నన్ను నొత్తి యడిగినఁ జెప్పం
జను నున్న రూపు; సెప్పెద । విను మవధానంబు తోడ విమలవిచారా! 51

ప్రతిపదార్థం: అనుడున్= అనగానే; విదురుఁడు; ఆతనికిన్; ఇట్లు+అనున్; విమల+విచారా!= నిర్మలమైన భావాలు కలవాడా! ధృతరాష్ట్రా!; ఈ+మెయిన్= ఈ విధంగా; నన్నున్; ఒత్తి+అడిగినన్= నొక్కి అడిగితే; ఉన్న రూపు= ఉన్న సంగతి; చెప్పన్+ చనున్= చెప్పాలి; అవధానంబు తోడన్= శ్రద్ధగా; వినుము; చెప్పెదన్.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అడగగానే విదురుడు అతడితో ఇట్లా అన్నాడు: 'ఈ విధంగా నన్ను మరీ మరీ అడిగితే ఉన్న సంగతి చెప్పాలి. నిర్మలభావుడవైన ధృతరాష్ట్రా! శ్రద్ధగా వినుము చెప్పుతాను'.

విశేషం: ఒత్తి అడిగితే ఉన్న సంగతి చెప్పవలసి వస్తుంది. ఈ వాక్యం తెలుగు జాతీయంగా అమరింది. ఒత్తి అడగటమంటే- గట్టిగా అడగటం, నొక్కి అడగటం, బలవంతపెట్టి అడగటం, మరీ మరీ అడగటం, కావాలని అడగటం- అనే అర్థాలున్నాయి. ఆ అర్థాలన్నీ ఈ సందర్భంలో సార్థక మౌతాయి. మూలంలో- "అపృష్ట స్తన్యతత్ బ్రూయాత్ యస్య నేచ్ఛేత్ పరాభవమ్".

'రాజు యొక్క పరాజయాన్ని కోరని మిత్రుడు, భృత్యుడు, ఆ రాజు అడగకుండానే అతడికి మంచిదేదో, చెడ్డదేదో, శ్రేయస్కరమైనదేదో, ముప్పు తెచ్చేదేదో తప్పక చెప్పాలి. కాబట్టి కౌరవుల హితమేదో, శ్రేయస్కరమేదో, ధర్మయుక్తమైనదేదో చెప్పుతాను. సావధానంగా వినుము' అని విదురుడు పలికాడు. ఈ తాత్పర్యాన్నంతా 'ఉన్నమాట చెప్పవలసి వస్తుంది సుమా!' అనే తెలుగు జాతీయంతో ధ్వనిమయం చేయటమే కాకుండా - నీకు నిజం చెప్పటం ముఖ్యం కాని, కళ్ళనీళ్ళు తుడిచే కల్లబొల్లి మాటలను ముఖప్రీతి కలిగించే ముచ్చట్లు చెప్పటం నా అభిమతం కాదని సున్నితంగా పలికాడు. ధృతరాష్ట్రుడి వక్రపద్ధతికి దీటుగా విదురుడు వాచ్యమైన సూటి పద్ధతిని అనుసరించాడు. ఇందులో మరొక గడుసుదనం కూడా ప్రదర్శించాడు. అంతవరకూ దీటుగా విదురుడు వాచ్యమైన సూటి పద్ధతిని అనుసరించాడు. ఇందులో మరొక గడుసుదనం కూడా ప్రదర్శించాడు. అంతవరకూ నీతులు చెప్పినట్లు చెప్పి, అవన్నీ పాండవుల సుగుణాలుగా వ్యాఖ్యానించి, ఆ సుగుణాలు లేని కౌరవుల ప్రవృత్తులను వ్యంగ్యంగా నిరసించాడు. అదే సంగతిని మరల చెప్పవలసి వస్తే- ధృతరాష్ట్రుడి యొక్క కౌరవుల యొక్క దుర్గుణాలను, ప్రవర్తనలను ఉన్నవి ఉన్నట్లుగా కుండబ్రద్దలు కొట్టినట్లు చెప్పవలసి వస్తుంది అని అంటూ 'నామాటలు సావధానంగా వినుము' అని హెచ్చరించాడు. దోషాలను తెలిసికొని విమలవిచారుడవు కమ్మని సంబుద్ధితో సూచించాడు. (సంపా.)

ఉ. డక్కెను రాజ్యమంచు నకటా! యిటు దమ్ముని భాగ మీక నీ
వెక్కటి మ్రింగఁ జూచె; దది యె ట్లఱుగున్? విను, మీను లోలతన్
గ్రక్కున నామిషంబు చవి గాలము మ్రింగిన చాడ్పు సూవె యి;
ట్లుక్కివుఁడైన నీ కొడుకు నుల్లము నున్నటు లాడఁగూడునే?' 52

ప్రతిపదార్థం: అకటా!= అయ్యో!; రాజ్యము; డక్కెను= దక్కింది; అంచున్; ఇటు= ఇట్లా; తమ్ముని భాగము+ఈక= తమ్ముడి వాటా ఇవ్వక; నీవు; ఎక్కటిన్= ఒక్కడవే; మ్రింగన్+చూచెదు(దవు)= మ్రింగాలని చూస్తున్నావు - కాజెయ్యాలని చూస్తున్నావు, అది ఎట్లు+అఱుగున్= అది ఎట్లా జీర్ణమవుతుంది?; విను(ము); ఇట్లు= ఈ విధంగా తమ్ముడిభాగం కూడా మ్రింగాలని చూడటం; మీను= చేప; లోలతన్= పేరాసతో; గ్రక్కునన్= శీఘ్రంగా; ఆమిషంబు చవిన్= మాంసపురుచితో; గాలమున్; మ్రింగిన చాడ్పు+చూవె= మ్రింగిన విధం సుమీ; ఉక్కివుఁడు+ఐన= వంచకుడైన; నీ కొడుకు+ఉల్లము+ఉన్న+అటులు= నీ కుమారుడైన దుర్యోధనుడి మనసులో ఉన్నట్లు; ఆడన్+కూడునే?= చెప్పటం చెల్లుతుందా?

తాత్పర్యం: రాజ్యం చేతికి చిక్కింది గదా అని, అయ్యో! తమ్ముడి వాటా ఇవ్వక నీవు ఒక్కడవే మ్రింగివేయాలని చూస్తున్నావు. అది ఎట్లా అరుగుతుంది? విను. ఇది చేప పేరాసతో మాంసంతోపాటు శీఘ్రంగా గాలాన్ని కూడా మ్రింగటంవలె ఉంటుంది. కపటిఅయిన నీ కొడుకు మనస్సులో తలచినట్లంతా మాట్లాడితే అట్లా నెరవేరుతుందా?'

విశేషం: అలం: ఉపమ. నిజం చెప్పుతున్నాను వినుమని విదురుడు నిష్ఠురంగానూ, ముక్కుమీద గుద్దినట్లుగానూ ఉపమాలంకార సుందరంగానూ చెప్పాడు. అందులో తెలుగుదనం ఒలకపోశాడు. 'వెక్కటి మ్రింగఁజూచెదు' 'అది యెట్లరుగున్' గాలము మ్రింగిన చాడ్పు' ఈ పలుకుబడి తెలుగువారిది. ఈ భావాలు మూలంలోనూ ఉన్నాయి. (చూడు.5-34-13,14); కాని తెలుగులో పొందికగా కుదిరాయి. పేరాసను చేపగాలం మ్రింగటంతో పోల్చి చెప్పటం- జనంలో బాగా వ్యాప్తి చెంది ఉన్నది. ఒకరికి పెట్టకుండా ఒంటిగా తినే తిండి అరగదని తెలుగువారి జాతీయం. ఈ మాటలలో ఎంత చమువు ఉన్నదో అంత చురుకు కూడా ఉన్నది. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అన విని నిరుత్తరుం డయి । మనుజేంద్రుఁడు గొంతసేపు మ్రాన్పడి తలఁపుల్
పెనఁగొన, నిద్రాహానిం । దను వలయఁగ విదురుతోడఁ దా నిట్లనియెన్: 53

ప్రతిపదార్థం: అనన్= విదురు డట్లా అనగా; మనుజ+ఇంద్రుఁడు= రాజు-ధృతరాష్ట్రుడు; విని; నిరుత్తరుండు+అయి= సమాధానం లేనివాడయి; కొంతసేపు; మ్రాన్పడి= నిశ్చేష్టుడయి; తలఁపుల్= ఆలోచనలు; పెనఁగొనన్= పెనగులాడగా; నిద్రాహానిన్= నిద్ర లేకపోవటం చేత; తనువు= శరీరం; అలయఁగన్= బడలగా; తాను; విదురు తోడన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: విదురుడి మాటలు విని ధృతరాష్ట్రుడు మాటలాడక, కొంతసేపు నిశ్చేష్టుడై, భావాలు ఒకదానితో ఒకటి పెనగులాడగా, నిద్ర లేకపోవటంచేత శరీరం బడలి, విదురుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: మ్రాన్పడటం సాత్త్విక భావం. కొయ్యబారిన ధృతరాష్ట్రుడు తేరుకొన్నాడు. దానికి రెండు దశలు పట్టింది. 1.ఏమి బదులు పలకాలో తెలియక భావాలు అతడిలో పెనగులాడాయి. 2. ఆ తరువాత సమాధానం చెప్పలేని అలసట నిద్రలేని అలసటను ముందుకు తెచ్చింది. దానితో మారుపలుకకుండా మంచి మాటలు వింటూ ఉండే స్థితిని ధృతరాష్ట్రుడు కోరుకొన్నాడు. ఇది మ్రానుపడ్డ శరీరావస్థ గల మానసికావస్థను వ్యక్తం చేస్తున్నది. ఇది తిక్కన నాటకీయతకు ఉదాహరణం. (సంపా.)

క. 'ఇందాఁక నీదు పలుకుల । డెందము తాపంబు గొంత డిందుపడియె; నా
కుం దగ నయానయంబుల । చందంబులు సెప్పుచుండు సౌజన్యనిధీ!' 54

ప్రతిపదార్థం: సౌజన్య నిధీ!= మంచితనానికి నిధానమైనవాడా! విదురా!; ఇందాఁకన్= ఇప్పటివరకూ; నీదు పలుకులన్= నీ మాటల చేత; డెందము తాపంబు= (నా) మనస్తాపం; కొంత= కొంచెం; డిందు పడియెన్= తగ్గింది; నాకున్; తగన్= ఒప్పుగా; నయ+అనయంబుల చందంబులు= నీత్యవినీతుల రీతులు; చెప్పుచున్+ఉందు(ము)= చెపుతూ ఉండుము.

తాత్పర్యం: 'సౌజన్యానికి నిధివైన విదురా! ఇప్పటి వరకూ నీ మాటల వలన నా మనస్తాపం కొంచెం ఉపశమించింది. నీవే నాకు నీత్యవినీతుల రీతులు ఒప్పుగా చెప్పుతూ ఉండుము.'

విశేషం: ధృతరాష్ట్రుడు వినగోరుతున్నవి నయ+అనయములు. నయమంటే పొందించేది, నీతి, అనయము- అంటే పొందించనిది అవినీతి. ఒక కార్యం పొందుపడే నీతిని, పొందుపడని అవినీతిని ప్రక్కప్రక్కన చెప్పుమని రాజు కోరిక. ఇకపై విదురనీతి బోధ ఈ రీతిలో సాగుతుందని సూచన. (సంపా.)

వ. అనిన విని విదురుం డిట్లనియె: 55

తాత్పర్యం: అని అడుగగా విని విదురుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

ఆ. 'తనియఁ బండకుండ మును గోసికొనఁ జవి । చేటె కాదు; విత్తు చేటుఁ గలుగుఁ;
బక్వమైనఁ గొనిన ఫల మించుఁ, జెడదు బీ । జంబుఁ; గార్యసిద్ధిచంద మిట్లు. 56

ప్రతిపదార్థం: తనియన్= తృప్తిగా, బాగుగా; పండకుండన్= పక్వానికి రాకుండానే; మును= ముందుగా; కోసికొనన్; చవి చేటె+కాదు= రుచి లేకపోవటమే కాదు; విత్తు చేటున్+కలుగున్= విత్తనం కూడా నశిస్తుంది; పక్వము+ఐనన్= పండితే;

కొనినన్= స్వీకరిస్తే; ఫలము= పండు; ఇంచున్= బాగుంటుంది; బీజంబున్= విత్తనం కూడా; చెడదు= పోదు; కార్యసిద్ధి చందము+ఇట్లు= కార్యం సాఫల్యం పొందే రీతి ఇదీ.

తాత్పర్యం: బాగా ముగ్గకుండానే ముందే కోస్తే పండు రుచిగా లేకపోవటమే కాదు, విత్తనం కూడా పనికిరాదు. పక్వమైన తరువాత కోస్తే పండు బాగుంటుంది; విత్తనం కూడా చెడదు. కార్యం సఫలమయ్యే విధం కూడా ఇంతే.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. విశేషాంశం సామాన్యాంశం చేత సమర్థింపబడింది. కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం. ఫల విషయం విశేషం. కార్యసిద్ధి విషయం సామాన్యం. మూలంలోని రెండు శ్లోకాల తాత్పర్యాన్ని తిక్కన ఒక ఆటవెలదిలో సూక్తివలె స్ఫూర్తిమంతంగా రచించాడు. మూలం:

"వనస్పతే రపక్వాని ఫలాని ప్రచినోతి యః ।

స నాప్నోతి రసం తేభ్యో బీజం చాస్య వినశ్యతి ॥

యస్తు పక్వ ముపాదత్తే కాలే పరిణతం ఫలమ్ ।

ఫలాద్రసం స లభతే, బీజా చ్చైవ ఫలం పునః ॥ (సం. 5-34-15,16)

ఇది లోకనీతి, రాజనీతి కూడా. అపరిపక్వస్థితిలో ఫలాన్ని కోయరాదని నీతి. దాని వలన రససిద్ధి ఉండదు. బీజసిద్ధి కలుగదు. రససిద్ధి స్వీయప్రయోజన లబ్ధి. బీజసిద్ధి లోకహితసిద్ధి. ఈ రెండూ ఒక కార్యం సహజంగా కాలం చేత పరిపక్వం చెందటంమీద ఆధారపడి ఉంటాయి. పరిణత ఫలం వలన రససిద్ధి, కార్యసిద్ధి కలుగుతుంది. ఈ నీతిలోని అపరిపక్వస్థితి దుర్యోధనుడి నీతిని సూచిస్తున్నది. పరిపక్వ స్థితి ధర్మజుడి నీతిని ధ్వనింపచేస్తున్నది. దుర్యోధనుడు అత్యాశతో పాండవ సంపదను మాయాద్యూత నెపంతో హరించి దాని ఫలాన్ని శాశ్వతంగా అనుభవించలేని స్థితిని కల్పించుకొనటమేకాక, దాని వలన సత్ఫలితా లివ్వ గలిగిన బీజాలను (హేతువులను) నైతికంగా ధ్వంసం చేసికొన్నాడు. దాని వలన దుర్యోధనుడు అపహరించిన పాండవ సంపద అపరిపక్వ ఫలం వంటిది. ధర్మరాజు రాజ్యాన్ని కోల్పోయినా అరణ్యాజ్ఞాతవాసాలు నిర్వహించి, తన యుద్ధోద్యోగానికి తగిన కాలపరిపక్వస్థితిని కల్పించుకొంటున్నాడు. సామదాన భేద దండోపాయాలనే బీజాలు నయనీతితో ఫలించేటట్లు కార్యాన్ని పరిపక్వ స్థితికి తెచ్చుకొంటున్నాడు. నయనీతి ధర్మజుడిది; అవినయనీతి దుర్యోధనుడిది. ఇవే ఈ పద్యంలోని నయానయాలు. (సంపా.)

తే. మాలకరి పుష్పములు గోయుమాడ్కిఁ, దేఁటి । పువ్వుఁ దేనియ గొనియెడు పోల్కి నెదురు
గందకుండఁగఁ గొనునది కార్యఫలము; । బొగ్గులకుఁ బోలె మొదలంటఁ బొడువఁ జనదు. 57

ప్రతిపదార్థం: మాలకరి= దండలు కట్టేవాడు; పుష్పములు= పువ్వులు, కోయు మాడ్కిన్= కోసే విధంగా; తేఁటి= తుమ్మెద; తేనియ= మకరందం; కొనియెడు పోల్కిన్= ఆస్వాదించే రీతిగా; ఎదురు= ఎదుటివాడు; కందక+ఉండంగన్= బాధపడకుండా; కార్యఫలమున్= ఒక పనియొక్క ఫలితాన్ని; కొనునది= పొందాలి; బొగ్గులకున్+పోలెన్= బొగ్గుల కొరకు వలె; మొదలు+అంటన్= పూర్తిగా; పొడువన్+చనదు= నరికివేయగూడదు.

తాత్పర్యం: దండలు కట్టేవాడు చెట్టునుండి పువ్వులు కోసే విధంగా, తుమ్మెద పువ్వులలోని మకరందం పీల్చుకొనే రీతిగా, ఎదుటివాడు బాధపడకుండా ఒక పని ఫలితాన్ని పొందాలి. అంతేకాని, బొగ్గుల కొరకు మొదలంటా నరికివేయగూడదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ. ఉపమలు మూడు ఉన్నాయి కనుక, మాలోపమ. 1.'మాలకరి ...మాడ్కి', 2.'తేఁటి ...పోల్కి,' 3.'బొగ్గులకుఁ బోలె.' ఈ పద్యం కూడా మూలంలోని రెండు శ్లోకాల తాత్పర్యాన్ని కలిపి పునర్నిర్మించినది. మూల శ్లోకా లివి-

"యథా మధుసమాదత్తే రక్షన్ పుష్పాణి షట్పదః ।

తద్వ దర్థా న్మనుష్యేభ్య ఆదద్యా దవిహింసయా ॥

పుష్పం పుష్పం విచిన్వీత మూలచ్ఛేదం నకారయేత్ ।

మాలాకార ఇవారామే న యథాఽఙ్గారకారకః ॥ (సం. 5-34-17,18)

-మూలంలోని 'అర్థం' తెలుగులో 'కార్యఫలం'గా పేర్కొనబడింది. వరుస మారినా ముచ్చటైన మూడు ఉపమానాలు ఒక పద్యంలో ఉక్తి విలాసాన్ని పొందాయి. మాలాకారుడి ఉపమానం ముందువచ్చింది. పూలు కోసినా మూలనాశం కాకూడదని నీతి అందులో ఉన్నది. ధర్మజుడి శాంతిసందేశం ఆ కార్యసిద్ధిని సూచిస్తుంది. అంతే కాదు. పూలను కోయటమంటే ఉపాయ సాధనం, లేదా ఉపకరణ సేకరణం. ధర్మజుడి సామదానాద్యుపాయాలు వంశనాశం కాకుండా ఉండటానికే ఉద్దేశించబడ్డాయి. పాండవులు కౌరవులకు పంపే సందేశాలన్నీ ఆ తాత్పర్యాన్నే సూచిస్తున్నాయి. ఆ తరువాత మధుకరోపమానం సార్థకం. ఇది శత్రుశిబిరంలోని వీరుల హృదయాలలో ధర్మజుడు తన ధర్మనీతి వర్తనం పట్ల సాముఖ్యం ఏర్పడటానికి చేస్తున్న ప్రయత్నం. భీష్మాదుల వంటి వారు కౌరవ వంశ వృక్షానికి పూచిన పూలు. వారి సాముఖ్యం పూదేనె. దానిని ధర్మరాజు వారి మనస్సులు కందకుండా దౌత్యం ద్వారా సంఘటిస్తున్నాడు. చివరకు యుద్ధం వలని కీడును అందరికీ తెలియజెప్పి వంశమూలాలు నాశనం కాకుండా, కౌరవులు నశించకుండా రక్షించ యత్నించాడు. స్వార్థం కొరకు కౌరవ వంశవృక్షాన్ని బొగ్గులు చేయతలచలేదు. ఇది ధర్మరాజు యొక్క నయనీతి. దుర్యోధనుడు ఈ మూడు రకాలైన యత్నాలనూ స్వీయకులనాశానికి అనుగుణంగా నడిపి అవినీతిని ప్రదర్శించాడు. పేర్లు ప్రత్యేకించి పేర్కొనకుండా ధర్మజ దుర్యోధను లనుసరిస్తున్న నీతి అవినీతులను అలంకార సుందరంగా ఆవిష్కరించిన సూక్తి ఇది. (సంపా.)

క. పరుల ధనమునకు, విద్యా । పరిణతికిం, దేజమునకు, బలమునకు మనం
బెరియఁగ నసహ్యపడు న । న్నరుఁడు దెవులు లేని వేదనం బడు నధిపా! 58

ప్రతిపదార్థం: అధిపా!= రాజా, ధృతరాష్ట్రా!; పరుల ధనమునకున్= ఇతరుల డబ్బుకూ; విద్యా పరిణతికిన్= విద్యాపరిపక్వతకూ; తేజమునకున్= తేజస్సుకూ; బలమునకున్= పరాక్రమానికీ; మనంబు= మనస్సు; ఎరియఁగన్= మండేటట్టు; అసహ్యము+పడు+ఆ+నరుఁడు= ఓర్వలేని ఆ మనుష్యుడు; తెవులు లేని వేదనన్+పడున్= రోగం ఏమీ లేకుండానే బాధపడతాడు.

తాత్పర్యం: రాజా ధృతరాష్ట్రా! ఇతరుల డబ్బుకూ, విద్యాపరిపక్వతకూ, తేజస్సుకూ, బలానికీ మనస్సు కాలిపోయేటట్లు ఓర్వలేని ఆ మనుష్యుడు రోగం ఏమీ లేకుండానే బాధపడతాడు.

విశేషం: ఇది చక్కని లోకనీతి. హితోక్తి. మూల శ్లోకభావాన్ని సందర్భశుద్ధితో నిగ్గుతేల్చి తెలుగులో వెలయించాడు తిక్కన. మూలం-

"య ఈర్షుః పరవిత్తేషు రూపే వీర్యే కులాన్వయే

సుఖ సౌభాగ్య సత్కారే తస్య వ్యాధి రనన్తకః". (సం. 5-34-42)

ఇతరుల ధనానికీ, రూపానికీ, బలానికీ, కులానికీ, సుఖసౌభాగ్యాలకూ, సత్కారానికీ ఈర్ష్య పొందేవాడి రోగానికి అంతం లేదని మూల శ్లోక తాత్పర్యం. ఇది సర్వసాధారణ లోకనీతి. తిక్కన పద్యంలో ఈర్ష్య పడదగిన అంశాలను, వాటి వరుసను మార్చి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పునర్నిర్మించాడు. ఈర్ష్యపడేవాడు ఏ రోగం లేకున్నా, దీర్ఘరోగంతో బాధపడేవాడివలె లోలోన వేదన పడతాడని తిక్కన తీర్చిన భావం. ఈ దీర్ఘరోగి ధృతరాష్ట్రుడని చెప్పకుండానే తెలుస్తున్నది. అతడి కా వేదన- పాండవ సంపదను చూచిన తరువాత మొదలయింది. సంపదనంతా కపట ద్యూతంలో హరించాడు, పాండవులను అరణ్యాజ్ఞాతవాసాలకు పంపారు. వారు నయనీతి విద్యాపారంగతులు కావటంతో ధర్మానికి కట్టుపడి ఆడిన మాటను పాటించారు. వారు విజయవంతంగా ప్రతిజ్ఞలను ముగించినందుకు ధృతరాష్ట్రుడు లోలోన బాధపడ్డాడు. పాండవులు పాశుపతాది మహాస్త్రాలను సంపాదించి శత్రువులకు అసాధ్యులై ఉత్తమ శీలంతో ప్రకాశిస్తున్నారు. ఆ అంశం ధృతరాష్ట్రుడి హృదయంలో శల్యం వలె బాధిస్తున్నది. చివరిది పాండవుల బలం. పాండవుల బలాన్ని గురించి, విశేషించి శ్రీకృష్ణుడి మహత్వాన్ని గురించి తలచినప్పుడెల్లా ధృతరాష్ట్రుడికి గుండెలో శతఘ్నులు మ్రోగుతూ ఉంటాయి. మాయాద్యూతం నుండి రాయబారాల వరకు సాగిన కథలో పాండవులలో వెలుగొందిన సద్గుణాలు వరుసగా పేర్కొనటం ఒక విశేషం. రోగం కాని రోగం అసూయ. ధనం కొరకైన అసూయ ఇంద్రియ సంక్షోభాన్ని కలిగిస్తుంది. విద్యను చూచి పడే అసహనం బుద్ధిని కలతపెట్టుతుంది. తేజస్సు వలన కలిగే అసూయ హృదయాన్ని క్షోభ పెట్టుతుంది. శత్రువుల బలాధిక్యాన్ని గమనించి పొందే అసూయ శరీరాన్నంతా దగ్ధం చేస్తూ ఉంటుంది. ఇంతటి దారుణ రోగావస్థను ధృతరాష్ట్రుడు అంతరంగంలో పొందుతూ ఉన్నాడని ప్రకరణోచిత ధ్వని. (సంపా.)

క. ఎదిరికి హితమును, బ్రియమును, । మది కింపును గాఁగఁ బలుకు మాటలు పెక్కై
యొదవినను లెస్స; యటు గా । కిది యది యన కూరకునికి యెంతయు నొప్పున్. 59

ప్రతిపదార్థం: ఎదిరికిన్= ఎదుటివాడికి; హితమును= మేలయినదీ; ప్రియమున్= ఇష్టమైనదీ; మదికిన్+ఇంపును+కాఁగన్= మనస్సునకు సంతోషకరమైనదీ అయ్యేటట్టు; పలుకు మాటలు= మాటాడే మాటలు; పెక్కు+ఐ= ఎక్కువయి; ఒదవినను= కలిగితే; లెస్స= మంచిది; అటు+కాక= అలా కాక; ఇది+అది+అనక= ఏమీ అనకుండా- నోరెత్తకుండా; ఊరక+ఉనికి= ఊరుకోవడం; ఎంతయున్+ఒప్పున్= మిక్కిలి బాగుంటుంది.

తాత్పర్యం: ఎదుటి వాడికి మేలయినవీ, ఇష్టమైనవీ, మనస్సంతోషకరమైనవీ అయిన మాటలు ఎక్కువగా మాటాడగలిగితే మంచిది. అట్లా కాకపోతే ఏమీ అనకుండా నోరు మూసికొని ఊరుకొనటం ఎంతో మంచిది.

విశేషం: మూలంలోని విదురనీతి వాక్యాలను సందర్భోచితంగా వినిర్మించటం తిక్కన శిల్పం. అందుకు ఇటువంటి పద్యాలు ఉదాహరణలు.

"వాక్ సంయమో హి నృపతే సుదుష్కరతమో మతః ।
అర్థ వచ్చ, విచిత్రం చ న శక్యం బహుభాషితుమ్" (సం. 5-34-76)

వాక్సంయమనం పాటించటం చాలా కష్టం! సార్థకంగా, చమత్కారంగా నిరంతరం మాట్లాడటం అసాధ్యం- అని మూల శ్లోకం. మితహిత భాషణం మంచిదనీ, అది ఎదుటి వారికి ఇంపును కలిగించాలనీ, అట్లా నిరంతరం మాట్లాడటం మంచిదనీ, అట్టి నేర్పు లేకపోతే నోరు మూసికొని ఉండటం భావ్యమనీ తిక్కన చెప్పించాడు. ఈ వాక్యనీతి కౌరవులను ఉద్దేశించి చెప్పిందే. దుష్ట చతుష్టయం మాటల తీరే వారికి దోషాన్నీ, పాపాన్నీ, హానినీ కలిగిస్తున్నదని హెచ్చరిక. వారు మాట్లాడకుండ మిన్నకుండి నయ వాక్యకోవిదులను గౌరవించటమే ఉత్తమమని విదురుడి సూచన! పైది నీతివాక్యం; లోకహిత వాక్యం ఈ పద్యం. (సంపా.)

క. చెలిమియుఁ బగయును, దెలివియుఁ, । గలఁకయు, ధర్మంబుఁ, బాపగతియును, బెంపుం,
దులువతనంబును వచ్చును । బలుకుబడిన; కానఁ బొసఁగఁ బలుకఁగ వలయున్. 60

ప్రతిపదార్థం: చెలిమియున్= స్నేహమూ; పగయును= విరోధమూ; తెలివియున్= తెలివీ; కలఁకయున్= కలతా; ధర్మంబున్; పాపగతియును= పాపమార్గమూ; అధర్మమూ; పెంపున్= ఆధిక్యమూ; తులువతనంబును= తుంటరితనమూ; పలుకుబడిన్+అ= మాట తీరుచేతనే; వచ్చును; కానన్= కాబట్టి; పొసఁగన్+పలుకఁగన్+వలయున్= ఒప్పేటట్లు మాటాడాలి.

తాత్పర్యం: స్నేహ విరోధాలూ, జ్ఞానాజ్ఞానాలూ, ధర్మాధర్మాలూ, ఆధిక్య నైచ్యాలూ తమ మాటలతీరును బట్టి వస్తాయి. కాబట్టి ఒప్పుగా మాటాడాలి.

విశేషం: మూల శ్లోకం కంటే ఈ పద్యం సానబెట్టిన వజ్రంవలె ఉన్నది.

"అభ్యావహతి కల్యాణం వివిధం వాక్ సుభాషితా ।

సైవ దుర్భాషితా రాజ న్ననర్థా యోపపద్యతే ॥' (సం. 5-34-77)

పొసగేటట్లు పలకటం ఎంత లోకనీతియో, అంత రాజనీతి. పాండవ పక్షంలోని వారు, రాయబారులూ, భీష్మాది కురువీరులూ పొసగేటట్లు మాట్లాడుతారు. దుష్టచతుష్టయం పొసగని మాటలు పలుకుతారు. పొసగే మాటల వలన కలిగేవి స్నేహం, జ్ఞానం, ధర్మం, అభ్యుదయం. పొసగనిమాటల వలన క్రమంగా కలిగేవి పగ, కలక, పాపగతి, తులువతనం. ఉద్యోగపర్వంలో పాండవ కౌరవ పక్షాలలోని పాత్రలు ఎట్లా పలికారన్నది వాక్యరీతి విన్యాస చర్చ. తిక్కన ఈ పద్యంలో రాజనీతి పండిన తన వాక్యరచనా వైదగ్ధ్యాన్ని ప్రదర్శించాడు. రాయబారాల ఘట్టాలు వాక్యరచనా శిల్పాలకు రాచబాటలు. ఈ సూక్తిలో తిక్కన కవితా శిల్ప ప్రసక్తి కూడా ధ్వని. (సంపా.)

క. **బెడిదముగఁ గత్తి గొడ్డటఁ । బొడువఁ దెగినమ్రానఁ జిగురు వొడముఁ; బలుకులం**
జెడఁ దునిసిన కార్యంబు ని । గుడనేరదు పిదపనెట్టుఁ గురువంశనిధీ! **61**

ప్రతిపదార్థం: కురువంశ నిధీ!= కురువంశానికి ఆశ్రయమైనవాడా ధృతరాష్ట్రా!; కత్తిన్= కత్తిచేతా; గొడ్డటన్= గొడ్డలి చేతా; బెడిదముగన్= గట్టిగా; పొడువన్= పొడువగా; తెగిన మ్రానన్= తెగినచెట్టునందు; చిగురు; పొడమున్= పుట్టుతుంది; పలుకులన్= మాటలచేత; చెడన్= చెడిపోగా; తునిసిన కార్యంబు= భగ్నమైన పని; పిదపన్= తరువాత; ఎట్టున్= ఏవిధంగానూ; నిగుడన్+ నేరదు= చక్కబడదు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! కత్తితోగానీ, గొడ్డలితోగానీ గట్టిగా నరకగా తెగిపోయిన చెట్టుకు చిగురు పుడుతుంది. కాని, మాటలచే చెడి భగ్నమైన కార్యం తరువాత ఏవిధంగానూ చక్కబడలేదు.

విశేషం: అలం: వ్యతిరేకం. ఇందు ఉపమేయంకంటె ఉపమానానికి ఆధిక్యం చెప్పబడింది. కాబట్టి అలంకారం వ్యతిరేకం. ఈ సూక్తి దుష్టచతుష్టయం పలికే మాటలలోని వాక్పారుష్యాన్ని, దానివలన కలిగే ఫలితాలను ధ్వనింపజేస్తున్నది. (సంపా.)

క. **తనువున విఱిగిన యలుఁగుల । ననువునఁ బుచ్చంగవచ్చు; నతి నిష్ఠురతన్**
మనమున నాటిన మాటలు । విను మెన్ని యుపాయములను వెడలునె యధిపా! **62**

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! ధృతరాష్ట్రా! వినుము, తనువునన్= శరీరంలో; విఱిగిన+అలుఁగులన్= విరిగిపోయిన బాణాలను; అనువునన్= ఉపాయంతో; పుచ్చంగన్+వచ్చున్= తొలగించవచ్చు; అతి నిష్ఠురతన్= మిక్కిలి పారుష్యంతో; మనమునన్=

మనస్సునందు; నాటిన మాటలు= గ్రుచ్చుకొన్న మాటలు; ఎన్ని ఉపాయములను= ఎన్ని ఉపాయాలచేతనైనా; వెడలునె?= పోతాయా?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! విను. శరీరంలో నాటుకొన్న బాణాలను ఉపాయంతో తొలగించవచ్చును. కాని, మిక్కిలి గట్టిగా మనస్సులో నాటుకొన్న మాటలు ఎన్ని ఉపాయాలచేతనైనా వెలికి వస్తాయా?

విశేషం: అలం: వ్యతిరేకం. ఇందులో ఉపమేయం కంటె ఉపమానానికి ఆధిక్యం చెప్పబడింది. కాబట్టి అలంకారం వ్యతిరేకం. ఈ సూక్తి నిండుసభలో కర్ణుడు పలికిన మాటలను, దుర్యోధన దుశ్శాసనుల దుర్భాషలను సూచిస్తున్నది. (సంపా.)

ఉ. అక్కట! ధర్మనందనుని యాస్యమునం దొకనాఁడుఁ గీడుప
ల్కొక్కఁడు లేదు; నీ కొడుకు లొండొరు మీఱి నికృష్టవాక్యముల్
పెక్కులు పెక్కుభంగులను బ్రేలుచు నుండఁగ నీవు దానికిన్
స్రుక్కక వించు నుండెదు; దనురూపమె నీ కిది కౌరవేశ్వరా? 63

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= కురురాజా, ధృతరాష్ట్రా!; అక్కట= అయ్యో!; ధర్మ నందనుని+ఆస్యమునందున్= ధర్మరాజునోట; ఒక నాఁడున్= ఒకప్పుడునూ; కీడు పల్కు+ఒక్కఁడున్= దుర్భాష ఒక్కటి కూడా; లేదు; నీ కొడుకులు; ఒండొరున్= ఒకళ్ళ నొకళ్ళు; మీఱి= అతిక్రమించి; నికృష్ట వాక్యముల్= నీచములైన వాక్కులు; పెక్కులు= అనేకం; పెక్కు భంగులను= అనేక విధాల; ప్రేలుచున్+ఉండఁగన్= వాగుతూ ఉంటే; నీవు; దానికిన్; స్రుక్కక= జంకక; వించున్+ఉండెదు(దవు)= వింటూ ఉంటావు; నీకున్; ఇది; అనురూపమె?= తగినదేనా?

తాత్పర్యం: ధృతరాష్ట్రా! అయ్యో! ధర్మరాజు నోట ఒకప్పుడు దుర్భాష ఒక్కటి కూడా లేదు. నీ కొడుకులు ఒకళ్ళని మించి ఒకళ్ళు నీచవాక్యాలు అనేకం అనేక విధాలుగా ప్రేలుతూ ఉంటే నీవు దానికి జంకక వింటూ ఉంటావు. నీకిది తగినదేనా?

విశేషం: సద్భాషలు వినకపోవటం, దుర్భాషలు వింటూ వాటిని వారించక, మౌనంగా అంగీకరిస్తూ వాటికి బాసటగా నిలవటం మహాదోషం. ధృతరాష్ట్రుడు దుర్యోధనాదుల దుష్టభాషణ దుష్టఫలితాన్ని అనుభవించదగిన అర్హత పొందాడని ధ్వని. దాని ఫలమే అతడి అంతర్వేదన. (సంపా.)

ఆ. చేటుకాలమైనఁ జెట్టమాటలు నెఱి । గాని తెరువు వట్టు కర్జములును
దగవు లట్లు తోఁచుఁ; దగియెడునవి యవి । నీతు లని మనంబు నిశ్చయించు. 64

ప్రతిపదార్థం: చేటు కాలము+ఐనన్= చెడుకాలం దాపురించినప్పుడు; చెట్ట మాటలున్= చెడుమాటలును; నెఱి+కాని తెరువు+పట్టు కర్జములును= చెడుత్రోవపట్టిన పనులును; తగవులు+అట్లు తోఁచున్= ధర్మాలవలె తోస్తాయి; తగియెడు+అవి= తగిన మాటలూ; అవినీతులు+అని= నీతిమాలినవని; మనంబు= మనస్సు; నిశ్చయించున్= నిర్ణయిస్తుంది.

తాత్పర్యం: చెడుకాలం దాపురిస్తే చెడు మాటలూ, చెడుత్రోవ పట్టిన చేతులూ ధర్మబద్ధాలయినట్లు తోస్తాయి. తగిన మాటలూ, చేతలూ నీతిమాలినవని మనస్సు నిర్ణయిస్తుంది.

విశేషం: "వినాశకాలే విపరీత బుద్ధిః" అనే సూక్తికి ఈ పద్యం హృద్యమైన, అభినవాభివ్యక్తి. (సంపా.)

వ. నీ బుద్ధి పాండవులతోడి విరోధంబునెడ మరలంబడమి పాపం బింతియకాక యేమి సేయుదము? మన కులంబునం దేజో ధైర్య ధార్మికత్వాది గుణంబుల గరిష్ఠుండయిన యుధిష్ఠిరుండు నీ సిరికి వెలియై యట్లుండుట దగ వగునే? నీ పెద్దతనంబు సూచి సైరణ వాటించి యున్నవాఁ'డనిన, విదురు దిక్కు మొగంబై ధృతరాష్ట్రుండు 'నీ చెప్పిన నీతివాక్యంబుల నా మనంబు దనివోవ దింకను జెప్పు' మనవుడు నతండు వెండియు నిట్లనియె. 65

ప్రతిపదార్థం: నీ బుద్ధి, పాండవులతోడి విరోధంబు+ఎడ= పాండవులతోడి పగ నుంచి; మరలంబడమి= మరలకపోవటం; పాపంబు; ఇంతియ కాక= ఇంతేకాక; ఏమి+చేయుదము? మన కులంబునన్= మన వంశంలో; తేజస్(ః)+ధైర్య ధార్మికత్వ+ఆది గుణంబులన్= తేజస్సూ, ధైర్యమూ, ధర్మపరాయణతా, మొదలైన గుణాల చేత; గరిష్ఠుండు+అయిన= గొప్పవాడైన; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; నీ సిరికిన్= నీ సంపదకు; వెలి+ఐ= దవ్వయినవాడై; అట్లు+ఉండుట; తగవు+అగునే; నీ పెద్దతనంబు+చూచి; సైరణ+పాటించి= శాంతం వహించి; ఉన్నవాఁడు; అనినన్; విదురు దిక్కు మొగంబు+ఐ= విదురుడి కేసి తిరిగి; ధృతరాష్ట్రుండు; నీ చెప్పిన నీతివాక్యంబులన్; నా మనంబు; తనివోవదు= తృప్తిపడదు, ఇంకనున్+చెప్పుము; అనవుడున్; అతండు; వెండియున్= మళ్లీ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నీ మనస్సు పాండవులపై పగ నుండి మరలకపోవటం పాపం. ఇంతే. ఏం చేద్దాం? మన వంశంలో తేజస్సూ, ధైర్యమూ, ధర్మపరత్వమూ మొదలైన గుణాల చేత గొప్పవాడైన ధర్మరాజు నీ సంపదకు దూరమైనవాడై అట్లా ఉండటం న్యాయమా? నీ పెద్దరికం చూచి శాంతం వహించి ఉన్నాడు' అనగా ధృతరాష్ట్రుడు విదురుడివైపు మొగంపెట్టి 'నీవు చెప్పిన నీతివాక్యాలతో నా మనస్సు తృప్తిపడదు. ఇంకా చెప్పుము.' అనగా విదురుడు మళ్ళీ ఇట్లా అన్నాడు:

విశేషం: ధృతరాష్ట్రుడు వస్తుతః గొప్ప శ్రోత. అతడి గ్రుడ్డితనం, స్థిరనిర్ణయం చేయలేని పిరికితనం అతడిని అట్లా మార్చింది. శత్రు మిత్ర పక్షాల వాదాలు చాలా ఓపికగా వింటాడు. దానికి అనువుగా విదురనీతి వాక్యబోధా శ్రవణం అమరింది. దీనివలన ధృతరాష్ట్రుడు కౌరవ పాండవ పక్షాల వర్తన విశేషాలను తులనాత్మకంగా తెలిసికొనే అవకాశం కలగటంతోపాటు, పాండవుల ప్రయత్నాలకు ప్రతిగా దుర్యోధను డనుసరించే పద్ధతిని మూల్యాంకనం చేసికొనటానికి అతడు ప్రయత్నించవచ్చును. రాత్రి తెల్లవారేదాకా, మనశ్శాంతి కలిగే దాకా విదురుడు నీతులు వల్లిస్తూనే ఉంటాడు. అక్కడక్కడ ధర్మరాజు యొక్క గొప్పతనాన్ని చెప్పి తన ఉపన్యాసాన్ని ఆపటానికి విదురుడు యత్నిస్తే, ధృతరాష్ట్రుడు కొనసాగించుమంటాడు. ఇది కూడా అతడి అనిశ్చిత మనఃస్థితిని వ్యక్తం చేస్తున్నది. (సంపా.)

**ఆ. 'సకల పుణ్యకర్మ చయమును నొకదెస, । వినుము పాడి దప్పకునికి యొక్క
దిక్కు; దీని శ్రుతులు తెలిపెడునెడఁ, బాడి । కలిమి యెందుఁ బెద్దగా నుతించె. 66**

ప్రతిపదార్థం: వినుము; సకల పుణ్య కర్మ చయమునున్= ఎల్ల పుణ్యాకార్యాల సమూహమూ; ఒక దెస= ఒకవైపు; పాడి+తప్పక+ఉనికి= ధర్మం తప్పకుండటం; ఒక్క దిక్కు= ఒక వైపు; దీనిన్; శ్రుతులు= వేదాలు; తెలిపెడు+ఎడన్= తెలిపే టప్పుడు; పాడి కలిమి= ధార్మిక సంపదనే; ఎందున్= ఎక్కడైనా; పెద్దగాన్= అధికంగా; నుతించెన్= పొగిడాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: విను. ఎల్ల పుణ్యకార్యాల సమూహమూ ఒక దిక్కునా, ధర్మం తప్పకుండా ఉండడం ఒక దిక్కునా ఉంచగా- దీనిని గురించి చెప్పేటప్పుడు వేదాలు ధార్మిక సంపత్తినే ఎందయినా అధికతరంగా పొగిడాయి.

తే. పాడి గలిగిన నిహలోకఫలములెల్లఁ । జేరుటయ కాదు, కీర్తియుఁ జెందుఁ బురుషు;
ధరణిఁ బొగడిత యెందాఁకఁ బరఁగు, నంత । కాలమును బుణ్యలోకంబు గల్గు నండ్రు. 67

ప్రతిపదార్థం: పాడి+కలిగినన్= ధర్మం కనుక కలిగి ఉంటే; పురుషున్= మనుష్యుడిని; ఇహ లోక ఫలములు+ఎల్లన్= భూలోకఫలాలన్నీ; చేరుట+అ కాదు= చేరటమే కాదు; కీర్తియున్= కీర్తికూడా; చెందున్= కలుగుతుంది; ధరణిన్= భూమిలో; పొగడిత= పొగడ్త; ఎందాఁకన్= ఎంతకాలం; పరఁగున్= ఒప్పుతుందో; అంత కాలమును; పుణ్య లోకంబు, కల్గున్+అంద్రు= కలుగుతుంది అంటారు.

తాత్పర్యం: ధర్మం కనక కలిగి ఉంటే, పురుషుడిని భూలోకఫలాలన్నీ చేరడమే కాదు, అతడికి కీర్తి కూడా కలుగుతుంది. భూమిలో పొగడ్త (కీర్తి) ఎంతకాలం ఉంటుందో, అంతకాలమూ పుణ్యలోకం కలుగుతుందని అంటారు.

వ. తొల్లి ప్రహ్లాదుండు దైత్యజాతి సంభవుం డయ్యును, దనకొడుకు విరోచనుండును, నంగిరసుండను విప్రకొడుకు సుధన్వుండును దమతమ ప్రాణంబు లొడ్డుగా నొడ్డి యొక్క ధర్మ సందేహంబునకుఁ బన్నిదంబు సఱచి వచ్చి త న్నడిగిన, నితండు గొడు, కితండు లాఁతి యని తలంపక మధ్యస్థుండై సుధన్వు గెలిపించి, యతని చేత నిజతనయుని జీవితంబు దానంబుగాఁ గొని వాని బ్రదికించెం గావున, నీవును ధర్మంబు విడువక, యధర్మోపేతులైన నీకొడుకులవలని పక్షపాతంబు విడిచి తెఱంగు సేయుము; వారును వీరును నాపదలేక బ్రదుకుదురు; నీవును శోకంబులేక తక్కుదు'వని చెప్పి మఱియును- 68

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; ప్రహ్లాదుండు; దైత్య జాతి సంభవుండు+అయ్యును= రాక్షసకులంలో పుట్టినవాడయినా; తన కొడుకు, విరోచనుండును; అంగిరసుండు+అను విప్రుకొడుకు సుధన్వుండును= అంగిరసుడనే బ్రాహ్మణుడి కుమారుడైన సుధన్వుడూ; తమ తమ ప్రాణంబులు; ఒడ్డుగాన్+ఒడ్డి= పణంగా పెట్టి; ఒక్క ధర్మ సందేహంబునకున్; పన్నిదంబు+చఱచి వచ్చి= పందెం వేసికొని వచ్చి; తన్నున్; అడిగినన్; ఇతండు; కొడుకు; ఇతండు; లాఁతి= ఇతరుడు; అని; తలంపక; మధ్యస్థుండు+ఐ= మధ్యవర్తియై; సుధన్వున్; గెలిపించి; అతని చేతన్; నిజ తనయుని జీవితంబున్= తన కొడుకు ప్రాణాన్ని; దానంబుగాన్; కొని; వానిన్; బ్రదికించెన్; కావునన్; నీవునున్; ధర్మంబు విడువక; అధర్మ+ఉపేతులు+ఐన= అధర్మంతో కూడుకొన్నవారైన; నీ కొడుకుల వలని పక్షపాతంబు విడిచి= నీ కొడుకుల మీది పక్షపాతం విడిచిపెట్టి; తెఱంగు+చేయుము= సంధిచేయుము; వారును; వీరునున్; ఆపద లేక; బ్రదుకుదురు; నీవును; శోకంబు లేక; తక్కుదువు= తొలగుదువు; అని, చెప్పి; మఱియును-

తాత్పర్యం: పూర్వం ప్రహ్లాదుడు రాక్షసకులంలో పుట్టినవాడయినా, తన కొడుకు విరోచనుడూ, అంగిరసుడనే బ్రాహ్మణుడి కొడుకు సుధన్వుడూ తమ తమ ప్రాణాలు పణంగా పెట్టి, ఒక ధర్మ సందేహానికి పందెం వేసికొని వచ్చి త న్నడిగితే, వీడు తన కొడుకూ, వీడు ఇతరుడూ అని భావించక మధ్యవర్తిత్వం వహించి, సుధన్వుడి పక్షాన తీర్పు చెప్పి, అతడి నుంచి తన కొడుకు జీవితాన్ని దానంగా పుచ్చుకొని అతడిని బ్రతికించాడు. కాబట్టి నీవు కూడా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మం విడువక, అధర్మపరులైన నీ కొడుకుల మీది పక్షపాతం విడిచిపెట్టి ఉభయులకూ సంధి చేయుము. వాళ్ళూ, వీళ్ళూ ఆపద లేక బ్రతుకుతారు. నీవూ దుఃఖం లేకుండా ఉంటావు.' అని చెప్పి, ఇంకా.

విశేషం: మూలంలో విపులంగా ఉన్న ప్రహ్లాదోదంతాన్ని సంగ్రహంగా రచించటం తిక్కన ప్రకరణౌచిత్యానికి నిదర్శనం. (సంపా.)

క. 'పాపంబులు గర్జము లని । యేపునఁ జేయంగ నవియు నింపగు; ధర్మ
వ్యాపారంబు లకార్యము । లై పరిణతిఁ బొందెనేని నట్టుల చెల్లున్. 69

ప్రతిపదార్థం: పాపంబులు; కర్జములు+అని= కార్యములని- చేయదగినవని; ఏపునన్= గర్వంతో; చేయంగన్= చేస్తే; అవియున్= ఆ పాపాలు కూడా; ఇంపు+అగున్= ఇష్టం అవుతాయి; ధర్మ వ్యాపారంబులు= ధర్మకార్యాలు; అకార్యములు+ఐ= చేయరానివయి; పరిణతిన్+పొందెన్+ఏనిన్= పరిణమిస్తే; అట్టులు+అ= అలాగే- అకార్యములుగానే; చెల్లున్= అయిపోతాయి.

తాత్పర్యం: పాపాలు చేయదగినపని గర్వంతో చేస్తే, అవే ఇష్టమవుతాయి. ధర్మకార్యాలు చేయరానివిగా పరిణమిస్తే అవి అట్లాగే అయిపోతాయి.

విశేషం: ఈ పద్య భావం మూలంలోని ముచ్చటైన రెండు సుభాషితాల సులభీకరణం: ఆ శ్లోకా లివి-

"పాపం ప్రజ్ఞాం నాశయతి క్రియమాణం పునః పునః
నష్ట ప్రజ్ఞః పాప మేవ నిత్య మారభతే నరః ॥
పుణ్యం ప్రజ్ఞాం వర్ధయతి క్రియమాణం పునః పునః
నష్ట ప్రజ్ఞః పాపమేవ నిత్య మారభతే నరః" (సం.5-35-52,53)

చ. అది సభయే ప్రియం బెసఁగ నార్యులు నిల్వరయేని? నార్యులే
మదిఁ దలఁపంగ వారలు సమంచిత ధర్మము వల్కరేని? న
ట్టిదియును ధర్మువే తగ ఘటించిన నిక్కము లేద యేనిఁ? దాఁ
బదిలపునిక్కమే యొక నెపంబిడు చొప్పగునేని భూవరా! 70

ప్రతిపదార్థం: భూవరా!= రాజా, ధృతరాష్ట్రా!; ప్రియంబు+ఎసఁగన్= ప్రీతి అతిశయించగా; ఆర్యులు= పూజ్యులు; నిల్వరు+అ+ఏనిన్= ఉండకపోతే; అది; సభయే= సభయా (కాదని భావం); వారలు= వాళ్ళు-ఆ ఆర్యులు; మదిన్+తలఁపంగన్= మనస్సులో ఆలోచింపగా; సమంచిత ధర్మము+పల్కరు+ఏనిన్= ఒప్పయిన న్యాయం చెప్పకపోతే; ఆర్యులు+ఏ?= ఆర్యులా? (పూజ్యులా); తగన్+ఘటించినన్= ఒప్పుగా చేస్తే; నిక్కము లేదు+అ+ఏనిన్= సత్యం లేకపోయినట్లయితే; అట్టిదియును+ధర్మువు+ఏ!= అటువంటిది కూడా ఒక ధర్మమేనా?; ఒక నెపంబు+ఇడు చొప్పు+అగున్+ఏనిన్= ఏదో ఒక నెపం పెట్టే విధం అయితే; తాన్= తాను- ఆ సత్యం; పదిలము+నిక్కము+ఏ?= సిసలైన సత్యమా?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! మిక్కిలి ప్రీతితో ఆర్యులు నిలవకపోతే అది కూడా ఒక సభయేనా? ఆ ఆర్యులు ఒప్పుగా న్యాయం మాటాడకపోతే, వాళ్ళూ ఓ ఆర్యులేనా? ఆ ధర్మాన్ని బాగా ఆచరిస్తే, అందులో సత్యం లేకపోతే, అదీ ఒక ధర్మమేనా? ఏదో ఒక నెపంతో కూడినదయితే, అదీ ఒక సిసలైన సత్యమా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: దీనికి మూలమైన శ్లోకం సంస్కృతభారతంలో ఇట్లా ఉంది.

'న సా సభా యత్ర న సన్తి వృద్ధా । న తే వృద్ధా యే న వదన్తి ధర్మమ్,

నా సౌ ధర్మో యత్ర న సత్యమస్తి । న తత్ సత్యం యచ్ఛలే నానువిద్ధమ్.' (సం. 5-35-58)

ఇదే శ్లోకం సంస్కృత భారతంలో సభాపర్వంలో కూడా ఉన్నది. (60-69) కాని దీనిని నన్నయ ఎందుచేతనో తెనిగించలేదు.

ఉ. నీతి పథంబునన్ బ్రదుక నేర్చుట యుత్తమ భంగి; శౌర్య సం
జాతములై కరం బలరు సంపద లొందుట మధ్యవృత్తి; య
స్ఫీతములైన భారవహజీవనముల్ దలఁపం గనిష్ఠముల్;
నీతికి బాహ్యులైన, ధరణీవర! మెత్తురె వారి నుత్తముల్? 71

ప్రతిపదార్థం: ధరణీవర!= రాజా, ధృతరాష్ట్రా!; నీతి పథంబునన్= నీతిమార్గంలో; బ్రదుకన్+నేర్చుట= బ్రతకగలగటం; ఉత్తమ భంగి= శ్రేష్ఠమయిన విధం; శౌర్య సంజాతములు+ఐ= పరాక్రమం చేత కలిగినవయి; కరంబు+అలరు= మిక్కిలి ఒప్పే; సంపదలు; ఒందుట; మధ్య వృత్తి= మధ్యమం; తలఁపన్= ఆలోచించగా; అస్ఫీతములు+ఐన= అరకొరలైన; భార వహ జీవనముల్= బరువుగా లాగే బ్రతుకులు; కనిష్ఠముల్= అధమాలు; నీతికిన్+బాహ్యులు+ఐనన్= నీతికి వెలి అయితే; వారిన్; ఉత్తముల్= సజ్జనులు; మెత్తురె?= మెచ్చుకొంటారా?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! నీతిమార్గంలో బ్రతకగలగటం ఉత్తమం. శక్తియుక్తులతో సంపదలు పొందటం మధ్యమం. ఆలోచిస్తే బరువుగా లాగే అరకొరలైన బ్రతుకులు అధమం. నీతిమాలిన వాళ్ళను ఉత్తములు మెచ్చుకొంటారా?

ఆ. కయ్యమునక యెపుడుఁ గాలు ద్రవ్వుదురు నీ । పుత్త్రు లెల్ల; సూతపుత్త్రుఁ డాది
యగు తదీయ మంత్రు లంతకు ముందర । బిరుదు; లీవు నీతి తెరువు సొరవు. 72

ప్రతిపదార్థం: నీ పుత్త్రులు+ఎల్లన్= నీ కొడుకులందరూ; ఎపుడున్= ఎప్పుడూ; కయ్యమునకున్+అ= యుద్ధానికే; కాలు+త్రవ్వుదురు= కాలు తవ్వుతారు; సూత పుత్త్రుండు+ఆది+అగు తదీయ మంత్రులు= కర్ణుడూ మొదలుగాగల వారి మంత్రులు; అంతకు ముందరన్= అంతకు ముందే; బిరుదులు= క్రొవ్వెక్కినవాళ్ళు; నీవు; నీతి తెరువు= నీతిమార్గంలో; చొరవు= ప్రవేశించవు.

తాత్పర్యం: నీ కొడుకులందరూ ఎప్పుడూ కయ్యానికే కాలు దువ్వుతారు. కర్ణుడు మొదలుగాగల వారి సలహాదారులు అంతకుముందే క్రొవ్వెక్కి ఉన్నవాళ్ళు. నీవేమో నీతిమార్గం పట్టవు.

క. పాండవులు శౌర్య మొల్లరు । ఖండిత నీతి ప్రకార కార్యము మెచ్చై
యుండుదు; రెదు రేచినఁ దుది । మండుదు; రార్పంగ రాదు మఱి యెవ్వరికిన్. 73

ప్రతిపదార్థం: పాండవులు; శౌర్యము+ఒల్లరు= పరాక్రమం అంగీకరించరు; అఖండిత నీతి ప్రకార కార్యము= మొక్కవోని నీతిమార్గంతోడి కార్యం; మెచ్చు+ఐ+ఉండుదురు= మెచ్చుకొంటూ ఉంటారు; ఎదురు+ఏచినన్= ఎదుటివాడు చెలరేగాడా; తుదిన్= చివరకు; మండుదురు= మండిపడతారు; మఱి= తరువాత; ఎవ్వరికిన్= ఎవరికీ; ఆర్పంగన్+రాదు= ఆర్పటం తరం కాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పాండవులు అనవసరంగా పరాక్రమించడానికి ఇష్టపడరు. మొక్కవోని నీతిసహమైన కార్యమే మెచ్చుకుంటూ ఉంటారు. ఎదుటివాడు చెలరేగేడా, చివరకు మండిపడతారు. తరువాత వారిని ఆర్పటం (శాంతింప జేయటం) ఎవరి తరమూ కాదు.

క. తమ తండ్రి భంగి నీకును । సముచిత మగు భక్తి సేసి సజ్జననుత మా
ర్గమున నడచువారల నీ । వమలమతిం గన్నకొడుకు ల ట్లరయఁదగున్.' 74

ప్రతిపదార్థం: తమ తండ్రి భంగిన్= తమ తండ్రి అయిన పాండురాజువలె; నీకును, సముచితము+అగు భక్తి+చేసి= తగిన భక్తి చూపి; సత్+జన నుత మార్గమునన్= మంచివాళ్ళచేత పొగడబడే దారిలో; నడచు వారలన్= నడుచుకొనే వాళ్ళను; నీవు, అమల మతిన్= నిర్మలమైన మనస్సుతో; కన్న కొడుకులు+అట్లు= కన్న కొడుకులవలె; అరయన్+తగున్= చూడదగును.

తాత్పర్యం: తమ తండ్రి అయిన పాండురాజువలెనే నీ యందు సముచితమైన భక్తి కలిగియుండి సత్పురుషులు మెచ్చుకొనే మార్గంలో నడిచే ఆ పాండవులను నీవు నిర్మలబుద్ధితో కన్నకొడుకులవలె చూడదగును.'.

వ. అని పలికి మఱియు నిట్లనియె: 75

తాత్పర్యం: అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'కారణము లేకయును నుప । కార పరత్వమున నొరుల కార్యంబులకున్
వారని యలజడిఁ బడియెడు । వారల చూ యేడుగడయు వారికి నధిపా! 76

ప్రతిపదార్థం: అధిపా!= రాజా, ధృతరాష్ట్రా!; కారణము లేకయును= ఏ కారణం లేకుండానే; ఉపకార పరత్వమునన్= ఉపకారం చేయాలనే ఆసక్తితో; ఒరుల కార్యంబులకున్= ఇతరుల పనులను గురించి; వారని= ఉడుగని; అలజడిన్+పడియెడు వారలు+అ+చూ= బాధపడేవాళ్ళే సుమా; వారికిన్= ఆ పాండవులకు; ఏడుగడయున్= దిక్కు.

తాత్పర్యం: 'రాజా! ధృతరాష్ట్రా! పాండవులు దిక్కులేనివారు అనుకొనకు. ఏమీ కారణం లేకుండానే ఉపకారం చేసే బుద్ధితో ఇతరుల పనుల గురించి ఉడుగని బాధపడే వాళ్ళే సుమా ఆ పాండవులకు దిక్కు.

చ. ఒకరుని చేతిప్రోపును దదున్నతి ప్రాపును గాంచి, యెల్లవెం
టకును గొఱంతలేక పొగడందగు సంపద నొంది, యట్టి దా
తకుఁ దుదిఁ గీడు సేసిన కృతఘ్నుని పీనుఁగునైన రోఁత పు
ట్టక కబళింపఁ గుక్కలు నొడంబడునే కురువంశవర్ధనా! 77

ప్రతిపదార్థం: కురువంశ వర్ధనా!= కౌరవ వంశాన్ని వృద్ధిపొందించేవాడా!; ధృతరాష్ట్రా!; ఒకరుని చేతి ప్రోపును= ఒకడి చేతి పోషణమునూ; తద్+ఉన్నతి ప్రాపును= అతడి ఔన్నత్యం యొక్క అండనూ; కాంచి= పొంది; ఎల్ల వెంటకును= అన్ని విషయాలలోనూ; కొఱంత లేక= లోటు లేక; పొగడన్+తగు సంపదన్+ఒంది= పొగడదగిన సంపదను పొంది; అట్టి దాతకున్; తుదిన్= చివర; కీడు+చేసిన కృతఘ్నుని పీనుఁగున్+ఐనన్= హాని చేసిన కృతఘ్నుడి శవాన్ని కూడా; రోఁత+పుట్టక= అసహ్యించుకొనకుండా; కబళింపన్= తినటానికి; కుక్కలున్= కుక్కలు సైతం; ఒడంబడునే?= అంగీకరిస్తాయా?

తాత్పర్యం: ఓయి కురువంశశ్రేష్ఠుడా! ధృతరాష్ట్రా! ఒకడు ఒక మహానుభావుడి పోషణలో ఉండి, అతడి ఔన్నత్యాన్ని ఆసరాగా చేసికొని, ఏ విషయంలోనూ లోటులేక మంచి సంపద సంపాదించి చివరికి అటువంటి మహోదారునికే హాని చేస్తే, ఆ కృతఘ్నుడి శవాన్ని కూడా అసహ్యించుకొనకుండా తినటానికి కుక్కలు సైతం అంగీకరిస్తాయా?

విశేషం: ఈ పద్యం పరోక్షంగా ధృతరాష్ట్ర నింద. ఆ గ్రుడ్డిరాజు మొదట పాండురాజు పోషణలో ఉన్నాడు. అతడు తనను గద్దెమీద ఉంచి గౌరవిస్తే ఉన్నతిని పొందాడు. దిగ్విజయాలు చేసి ధనరాశులు తెచ్చి అందిస్తే అపారసంపదను అనుభవించాడు. అతడు చనిపోతే, అతడి కొడుకులకు అన్యాయం చేయతలపెట్టటం కృతఘ్నుడి లక్షణం. అటువంటి కృతఘ్నుడి శవాన్ని కుక్కలు కూడా ముట్టుకొనవు అన్నాడు విదురుడు. ఇంతకంటె హీనమైన తిట్టు మరొకటి ఉండబోదు. అయినా, నిబ్బరంగా ఉండటం ధృతరాష్ట్రుడి దుష్టనీతి. (సంపా.)

వ. **కావునఁ గృతము దలంపమి గీడు; పాండురాజు నీకుం బరమ భక్తుండు; పాండవులునుం దేజో లాభంబులు గావించినవారలు; వారల నాదరింపు' మని చెప్పి వెండియు నిట్లనియె:** **78**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; కృతము= చేసిన మేలు; తలంపమి= గుర్తించుకొనకపోవటం; కీడు= తప్పు; పాండురాజు; నీకున్; పరమ భక్తుండు= మిక్కిలి భక్తుడు; పాండవులునున్= పాండవులు కూడా; తేజ(ః)+లాభంబులు= తేజస్సూ; లాభమూ; కావించిన వారలు= చేసినవాళ్ళు; వారలన్= వాళ్ళను; ఆదరింపుము+అని చెప్పి; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కాబట్టి చేసిన మేలు మరిచిపోవటం తప్పు. పాండురాజు నీకు మంచి భక్తుడు. పాండవులు కూడా తేజస్సూ, లాభమూ నీకు సంపాదించి పెట్టినవాళ్ళు. వాళ్ళను ఆదరించుము' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: 'కృతము తలంపమి కీడు' అని తిక్కన సూక్తి.

క. **'కృత మెఱుఁగుట పుణ్యము స । న్మతి దానికి సమము సేఁత మధ్యము, మఱి త**
త్కృతమున కగ్గలముగ స । త్కృతి సేయుట యుత్తమంబు కృతబుద్ధులకున్. (ఆది. 1.244)

'కృత మెఱిఁగెడు పతియె జగజ్జనుల నెల్లఁ బరిపాలించును' (సభా. 1.46) అని నన్నయ. (సంపా.)

ఆ. **'బ్రదుకు, చేటు, పొగడువడుట, దూ ఱొందుట, । యీఁగి, వేఁడుకొనుట, యిట్లు మఱియుఁ**
గలుగు సౌఖ్య దుఃఖములు వచ్చు నడవడి; । వాని కింత యేల వగవ నధిప! **79**

ప్రతిపదార్థం: అధిప!= రాజా, ధృతరాష్ట్రా!; బ్రదుకు= మంచి బ్రదుకూ; చేటు= వినాశమూ; పొగడు+పడుట= ప్రశంసలు పొందటమూ; దూఱు+ఒందుట= నిందపడటమూ; ఈఁగి= త్యాగమూ; వేఁడుకొనుట= అడుగుకొనటమూ; ఇట్లు= ఈ విధంగా; మఱియున్+కలుగు సౌఖ్య దుఃఖములు= ఇంకా ఉన్న సుఖాలూ; దుఃఖాలూ; నడవడిన్= ప్రవర్తనలో- జీవితంలో; వచ్చున్= కలుగుతాయి; వానికిన్= ఆ సుఖాలకూ, దుఃఖాలకూ; ఇంత వగవన్+ఏల?= ఇంతగా చింతించటం ఎందుకు?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఒకప్పుడు మంచి బ్రదుకు బ్రదుకవచ్చును, లేదా ఆపదలకు గురికావచ్చును, ఒకప్పుడు ప్రశంసలు పొందవచ్చును. లేదా అడుగుకొనే దుఃస్థితి రావచ్చును. ఇట్లా ఇంకా ఉన్న సుఖాలూ దుఃఖాలూ జీవితంలో కలుగుతూ ఉంటాయి. వాటి కొరకు ఇంతగా చింతించటం ఎందుకు?

క. **వగ బలము దఱుఁగు, రూపఱు; । వగచిన మతి దప్పుఁ, దెవులు వచ్చును; దూరన్**
వగచి నలంగినఁ బ్రియ మగుఁ । బగతురకును; వగచు టుడుగు; పార్థివముఖ్యా!' 80

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= రాజోత్తమా, ధృతరాష్ట్రా!; వగన్= దుఃఖం చేత; బలము+తఱుఁగున్= శక్తి నశిస్తుంది; రూపు+అఱున్= ఆకారం చెడుతుంది; వగచినన్= దుఃఖిస్తే; మతి+తప్పున్= మనసు పాడవుతుంది; తెవులు వచ్చున్= రోగం వస్తుంది; దూరన్+వగచి నలఁగినన్= మిక్కిలి దుఃఖించి కృశిస్తే; పగతురకును= శత్రువులకు; ప్రియము+అగున్= సంతోషం కలుగుతుంది; వగచుట+ఉడుగు(ము)= దుఃఖించటం మానుము.

తాత్పర్యం: రాజోత్తమా, ధృతరాష్ట్రా! దుఃఖంవలన బలం నశిస్తుంది. ఆకారం చెడుతుంది. దుఃఖిస్తే మనసు పాడవుతుంది. రోగం వస్తుంది. మిక్కిలి దుఃఖించి కృశిస్తే శత్రువులు సంతోషిస్తారు. కాబట్టి దుఃఖించటం మానుము.

విశేషం: తిక్కన భారతంలో పగమీద ధర్మరాజూ, వగమీద విదురుడూ పలికిన పద్యాలు ప్రసిద్ధాలు. అందులో వగమీది పద్యమిది. దీనికి మూలం కూడా ముచ్చటగా ఉంటుంది.

"సంతాసా ద్భ్రశ్యతే రూపం, సంతాసా ద్భ్రశ్యతే బలమ్
సంతాసా ద్భ్రశ్యతే జ్ఞానం, సంతాసా ద్వ్యాధి మృచ్ఛతి
అనవాప్యం చ శోకేన, శరీరం చోపతప్యతే
అమిత్రా శ్చ ప్రహృష్యన్తి మా స్మశోకే మనః కృథాః" (సం. 5-36-44,45)

వ. **అనిన విని ధృతరాష్ట్రుండిట్లనియె :** 81

తాత్పర్యం: అనగా విని ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు.

క. **'రిత్త యుపచారముల నే । నుత్తముఁ డగు ధర్మతనయు నుడికించితి; దు**
ర్వృత్తులగు మత్సుతులకును । మిత్తి యగుం బోర; వగలు మిగులక యున్నే? 82

ప్రతిపదార్థం: నేను, ఉత్తముఁడు+అగు ధర్మతనయున్= శ్రేష్ఠుడైన ధర్మరాజును; రిత్త ఉపచారములన్= వట్టి కల్లబొల్లి మాటలతో; ఉడికించితిన్= బాధించాను; దుర్వృత్తులు+అగు మత్+సుతులకును= దుష్టులైన నా కొడుకులకు; పోరన్= యుద్ధంలో; మిత్తి+అగున్= చావు కలుగుతుంది. వగలు= దుఃఖాలు; మిగులక+ఉన్నే?= కలగవా?

తాత్పర్యం: 'నేను ఉత్తముడైన ధర్మరాజును కల్లబొల్లిమాటలతో బాధించాను. దుష్టులైన నా కొడుకులకు యుద్ధంలో మరణం కలుగుతుంది. ఇంక నాకు దుఃఖం అతిశయించదా మరి?

వ. **నెవ్వగలు నివ్వటిల్లనీక నిలుపునట్టిది యెయ్యది? దాని నెఱింగింపు' మనిన విదురుం డిట్లనియె.** 83

ప్రతిపదార్థం: నెఱ+వగలు= పెను దుఃఖాలు; నివ్వటిల్లన్+ఈక= కలగనీయక; నిలుపు+అట్టిది= ఆపేది; ఎయ్యది?= ఏది?; దానిన్; ఎఱింగింపుము= తెలుపుము; అనినన్; విదురుండు; ఇట్లు+అనియెన్:

తాత్పర్యం: పెనుదుఃఖం కలుగకుండా ఆపేది ఏది? దానిని చెప్పుము.' అనగా; విదురుడు ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. 'నియత తపమును, నింద్రియ నిగ్రహంబు, । భూరి విద్యయు శాంతికిఁ గారణములు;
వాని యన్నిటికంటె మేలైన శాంతి । కారణము లోభ ముడుగుట కౌరవేంద్ర!' 84

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కురువంశశ్రేష్ఠుడా, ధృతరాష్ట్రా!; నియత తపమునున్= నియమయుక్తమైన తపస్సూ; ఇంద్రియ నిగ్రహంబున్= ఇంద్రియాలను అదుపులో పెట్టుకొనటమూ; భూరి విద్యయున్= అధికమైన విద్యా; శాంతికిన్+కారణములు= మనశ్శాంతికి కారణాలు; వాని+అన్నిటికంటెన్ మేలు+ఐన శాంతి కారణము= వాటన్నిటికన్నా గొప్ప శాంతి కారణం; లోభము+ఉడుగుట= పేరాస విడవటం.

తాత్పర్యం: 'కురువంశశ్రేష్ఠుడవైన ధృతరాష్ట్రా! నియమయుక్తమైన తపస్సూ, ఇంద్రియాలను అదుపులో పెట్టుకొనటమూ, అధిక విద్యా మనశ్శాంతికి కారణాలు. వాటన్నిటికంటే అసలైన శాంతి కారణం లోభం విడిచిపెట్టటం.'

వ. అని వెండియు. 85

తాత్పర్యం: అని మళ్ళీ.

క. 'జ్ఞాతుల పోరితమును; గో । వ్రాతము నాక్రమము, విప్ర వర్గము చనవున్,
నాతులఁ గారించుటయును । బ్రీతిం జన నిచ్చునతని పెం పొప్పు నృపా! 86

ప్రతిపదార్థం: నృపా!= రాజా, ధృతరాష్ట్రా!; జ్ఞాతుల పోరితమును= జ్ఞాతి వైరాన్నీ; గో వ్రాతము+ఆక్రమమున్= గోవుల సమూహాన్ని ఆక్రమించటాన్నీ; విప్ర వర్గము చనవున్= బ్రాహ్మణుల సమూహం పట్ల చులకనగా వర్తించటాన్నీ; నాతులన్= స్త్రీలను; కారించుటయును= బాధించటాన్ని; ప్రీతిన్= ఆసక్తితో; చననిచ్చు+అతని పెంపు= పోగొట్టేవాడి గొప్పతనం; ఒప్పున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! జ్ఞాతి వైరాన్నీ, గోవులను ఆక్రమించటాన్నీ, విప్రులను లోకువ చేయటాన్నీ, స్త్రీలను బాధించటాన్నీ ఆసక్తితో నివారించేవాడి గొప్పతనం విలసిల్లుతూ ఉంటుంది.

క. అలమికొని యొండొరుల ప్రో । పులఁ బ్రాపుల నెలమికలిమిఁ బొంది బహు జ్ఞా
తులు నెమ్మిఁ గూడి తామర । కొలని క్రియన్ సిరికిఁ బట్టగుదు రుజ్జ్వలులై. 87

ప్రతిపదార్థం: బహు జ్ఞాతులు= దాయాదులనేకులు; అలమికొని= కలసి మెలసి; ఒండొరుల ప్రోపులన్= ఒకరొకరి రక్షణములనూ; ప్రాపులన్= అండలనూ; ఎలమి కలిమిన్= సంతోష సంపదనూ; పొంది; నెమ్మిన్= ప్రీతితో; కూడి= ఒక్కరయి; తామర కొలని క్రియన్= తామరల సరస్సువలె; ఉజ్జ్వలులు+ఐ= ప్రకాశించేవాళ్ళయి; సిరికిన్+పట్టు+అగుదురు= శ్రీకి ఆకరమవుతారు.

తాత్పర్యం: దాయాదులు పెక్కండ్రు కలసి మెలసి ఒకరొకరి రక్షణలనూ, ఆశ్రయాలనూ, సంతోష సంపదనూ పొంది ప్రీతితో ఒక్కరయి తామరల సరస్సువలె ప్రకాశిస్తూ శ్రీకి స్థానమవుతారు.

విశేషం: తామరకొలని క్రియన్= అలంకారం : ఉపమ.

చ. కరి తురగాది ఘట్టనయు గాలియు నొంపదె యొంటి నున్న య
త్తరువు? ననేక భూరుహవితానము గుంపయిపేర్చి బాధలం
బొరయునె? యన్నదమ్ములును బొందిన నేరి కసాధ్యు; లట్లు గా
కెరవయి నిల్చినం గెలని కెల్లిదమై పఱిపోదు రెంతయున్. 88

ప్రతిపదార్థం: ఒంటిన్+ఉన్న+ఆ+తరువున్= ఒంటరిగా ఉన్న ఆ చెట్టును; కరి తురగ+ఆది ఘట్టనయున్= ఏనుగులూ, గుర్రాలూ మొదలయిన వానియొక్క రాపిడీ; గాలియున్= గాలీ; నొంపదె= బాధింపదా (వా); అనేక భూరుహ వితానము= పెక్కు చెట్ల సమూహం; గుంపు+అయి పేర్చి= గుంపుగా ఉండి విజృంభిస్తే; బాధలన్+పొరయునె?= బాధలు పొందుతాయా?; అన్న+తమ్ములును; పొందినన్= కలిసి ఉంటే; ఏరికిన్+అసాధ్యులు= ఎవరికైనా అసాధ్యులవుతారు; అట్లు+కాక= అట్లాకాక; ఎరవు+అయి= వేరయి; నిల్చినన్= ఉన్నట్లయితే; కెలనికిన్= శత్రువుకు; ఎల్లిదము+ఐ= లోకువయి; ఎంతయున్= మిక్కిలి; పఱి+పోదురు= నశిస్తారు.

తాత్పర్యం: చెట్టు ఒక్కటే ఉంటే, దానిని ఏనుగులూ, గుర్రాలూ త్రొక్కివేస్తాయి; గాలి కూల్చివేస్తుంది. పెక్కు చెట్లు ఒకచోట గుంపుగా ఉంటే అవి ఎటువంటి బాధా పొందవు. అట్లాగే అన్నదమ్ములు కూడా కలిసివుంటే ఎవరికైనా అసాధ్యులవుతారు. అట్లాకాక వేర్వేరుగా ఉంటె శత్రువుకు లోకువయి మిక్కిలి నశిస్తారు.

విశేషం: అలం: దృష్టాంతం.

వ. కావునఁ గౌరవులుం బాండవులు నొండొరులకుఁ బ్రాపై పొదలిన నెదిరికి నజయ్యు లగుదురు; పరుల యొత్తులేని రాజ్యంబు పూజ్యమహిమం బరఁగు. వనవాసంబునం గుందిన కౌంతేయులం దడయక తెచ్చి యుచితపదం బిచ్చి నిలుపుట నీ కొడుకులకు నిలుపు గావించుట యగు'నని చెప్పి మఱియు నిట్లనుఁ 'బ్రియవాదు లెందును గల రప్రియం బగుంగాకేమియని పథ్యంబు(తథ్యంబు) వలుకువారు లేరు. జూదంబునప్పు డే నడ్డపడి, యప్రియం బగుటకు శంకింపక తథ్యంబు వలికితి; నది నీకు రుచియింపక, రోగికిఁ బథ్యాహారంబు దలకంటగించునట్లయ్యెఁ; నైన నిప్పుడుం జెప్పెద వినుము: కాకంబులం గైకొని మయూరంబులం బరిహరించు విధంబున, మార్జాలంబులం బాటించి సింహంబులయెడ ననాదరంబు సేయు చందంబున సుయోధనాదులం బట్టి యుధిష్ఠిర ప్రముఖుల విడిచితి; నేఁడు కార్యంబు ముట్టవచ్చినం దోఁపక మిడుంగుఱు సోఁకినట్లు దల్లడించెదవు. కులంబునకై యొకనిఁ దొఱంగుటయ నీతి యని పెద్దలు సెప్పుదురు; దుర్ణయపరుండై సద్బుద్ధి సెప్ప వినం డేని, మనము దుర్యోధనుం దొఱంగిన నేమి యగు? నది యట్లుండె, సంపద సహాయంబు నపేక్షించియుండు; సహాయంబు సంపద నుద్దేశించి వర్తిల్లు; నిట్లవి యొకటొకటి పొందునంగాని సిద్ధింపవు కావున నీ సంపద పాండవులకును, వారి సహాయత్వంబు నీకునుం బ్రియం బొనరింప, నొండొరుల కలయుట మేలుగాక, మనలావువెలిసేయుట లెస్స యగునే? కురువంశనిస్తారకులగు భీష్మ యుధిష్ఠిరులును, నవక్ర విక్రములగు కర్ణార్జునులును, బ్రతాపధాములగు భీమ దుర్యోధనులును, శస్త్రాస్త్రపారగులగు నభిమన్యు లక్ష్మణ ప్రభృతి కుమారులును, శాపాను గ్రహసమర్థులగు ద్రోణ ద్రుపదాది పరమాప్తులును, వారి వారి బంధు మిత్రజనంబులును, నొక్క మొగంబై నీ పనుపు సేయుచు,

నయ విక్రమంబు లప్రతిహతంబులై నడవం, బృథివి శాసింప భవదీయ విభవం బుజ్జ్వలంబై యొరులకెడలేక చెల్లుచున్న నెంత యొప్పగునో యటు విచారింపుము. పాండవులు ధీరమతులై వైర మెత్తక యూరక తొలంగియుండిరేనియుఁ, గతిపయ దినంబులలోఁ జీకాకుపడి చెడుంగాక, గాంధారీనందనుచేత వసుంధరా పరిపాలన భారంబు నిర్వహింపబడునే?' యనిన విని ధృతరాష్ట్రుండు విదురున కి ట్లనియె: 89

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; కౌరవులున్, పాండవులున్, ఒండొరులకున్= ఒకరి కొకరు; ప్రాపు+ఐ= అండయై; పొదలినన్= ఒప్పితే; ఎదిరికిన్= శత్రువుకు; అజయ్యులు+అగుదురు= జయించరానివారు అవుతారు; పరుల+ఒత్తులేని రాజ్యంబు= శత్రువుల అదుముడు లేని రాజ్యం; పూజ్య మహిమన్+పరఁగున్= పూజించదగిన గొప్ప మహిమతో ఒప్పుతుంది; వన వాసంబునన్= అడవిలో నివసించటం చేత; కుందిన కౌంతేయులన్= దుఃఖించిన పాండవులను; తడయక= ఆలస్యం చేయక; తెచ్చి= తీసికొని వచ్చి; ఉచిత పదంబు+ఇచ్చి= తగిన స్థానం కల్పించి; నిలుపుట= నిలపటం; నీ కొడుకులకున్ నిలుపు+కావించుట+అగున్= నీ కొడుకులను నిలపటమే అవుతుంది, అని, చెప్పి, మఱియున్; ఇట్లు+అనున్; ప్రియవాదులు= ఇచ్చకాలు పలికేవాళ్ళు; ఎందున్+కలరు= ఎక్కడైనా ఉంటారు; అప్రియంబు+అగున్+కాకేమి+అని= అప్రియం అయితే అయిందని; పథ్యంబు+పలుకువారు లేరు= హితం పలికేవాళ్ళు లేరు; జూదంబు+అప్పుడు= జూదం ఆడే సమయంలో; ఏను= నేను; అడ్డము+పడి= అడ్డం వచ్చి; అప్రియంబు+అగుటకున్= రుచించేది కామికి; శంకింపక= సంకోచించక; తథ్యంబు+పలికితిన్= సత్యం చెప్పాను; అది; నీకున్; రుచియింపక= నచ్చక; రోగికిన్= జబ్బుచేసినవాడికి; పథ్య+ఆహారంబు= పథ్యమైన ఆహారం; తలకంటగించు+అట్లు+అయ్యెన్= సయించనట్లు అయింది; ఐనన్= అయినప్పటికీ; ఇప్పుడున్= ఇప్పుడుకూడా; చెప్పెదన్+వినుము= చెపుతాను విను; కాకంబులన్= కాకులను; కైకొని= చేరదీసి; మయూరంబులన్= నెమళ్ళను; పరిహరించు విధంబునన్= విడిచి పెట్టినట్లుగా; మార్జాలంబులన్= పిల్లులను; పాటించి= ఆదరించి; సింహంబుల+ఎడన్= సింహాలపై; అనాదరంబు+చేయు చందంబునన్= విముఖత చూపే విధంగా; సుయోధన+ఆదులన్= దుర్యోధనుడు మొదలయినవాళ్ళని పట్టి= పట్టుకొని; యుధిష్ఠిర ప్రముఖులన్= ధర్మరాజాదులను విడిచితివి; నేఁడు= ఈవేళ; కార్యంబు; ముట్టన్+వచ్చినన్= విషమించగా; తోఁపక= ఏం చెయ్యాలో తెలియక; మిడుంగుఱులు సోఁకిన+అట్లు= నిప్పులుతాకినట్లు; తల్లడించెదవు= భయపడుతున్నావు; కులంబునకున్+ఐ= వంశంకొరకు; ఒకనిన్= ఒక్కడిని; తొఱంగుట+అ= విడిచిపెట్టటమే; నీతి; అని; పెద్దలు+చెప్పుదురు= పెద్దలంటారు; దుర్ణయపరుఁడు+ఐ= అవినీతిపరుడై; సత్+బుద్ధి+చెప్పన్ వినండు+ఏనిన్= మంచి మాటలు చెపితే వినకపోతే; మనము; దుర్యోధనున్= దుర్యోధనుడిని; తొఱంగినన్= విడిచిపెట్టితే; ఏమి+అగున్= ఏమవుతుంది; అది; అట్లు+ఉండెన్= అట్లా ఉండనీ; సంపద; సహాయంబున్= తోడును; అపేక్షించి+ఉండున్= కోరుతుంది; సహాయంబు= తోడు; సంపదన్+ ఉద్దేశించి వర్తిల్లున్= సంపదనుబట్టి ఉంటుంది; ఇట్లు= ఇట్లా; అవి= సహాయమూ, సంపదా; ఒకటి+ఒకటి పొందునన్+కాని సిద్ధింపవు= ఒక దానితో ఒకటి కలిసి ఉంటేనే కాని లభించవు; కావునన్; నీ సంపద; పాండవులకును; వారి సహాయత్వంబు= వారి తోడ్పాటు; నీకునున్= నీకూ; ప్రియంబు+ఒనరింపన్= ప్రీతి కలిగించాలంటే; ఒండొరుల కలయుట= ఒక్కళ్ళతో ఒకళ్ళు కలిసి ఉండడం; మేలు+కాక= మంచిదికాని; మన లావు= మన బలం; వెలి+చేయుట= బయటపెట్టటం; లెస్స+అగునే?= మంచిదా?; కురు వంశ నిస్తారకులు+అగు భీష్మ యుధిష్ఠిరులును= కురుకులాన్ని ఉద్ధరించే వాళ్ళయిన భీష్మ ధర్మరాజులూ; అవక్ర విక్రములు+అగు= మంచి పరాక్రమవంతులైన; కర్ణ+అర్జునులును= కర్ణార్జునులూ; ప్రతాపధాములు+అగు భీమ దుర్యోధనులును= పరాక్రమ నిలయులైన భీమ దుర్యోధనులూ; శస్త్ర+అస్త్ర పారగులు+అగు అభిమన్యు లక్ష్మణ ప్రభృతి కుమారులును= శస్త్రాస్త్ర విద్యలలో ఆరితేరిన అభిమన్యుడు లక్ష్మణుడు మొదలుగా గల యువకులూ; శాప+అనుగ్రహ సమర్థులు+అగు ద్రోణ ద్రుపద+ఆది పరమ+ఆప్తులును= శపించడానికీ అనుగ్రహించడానికీ సమర్థులైన ద్రోణుడూ, ద్రుపదుడూ మొదలైన గొప్ప ఆత్మీయులూ; వారి వారి బంధు మిత్ర జనంబులును= వారి వారి చుట్టాలూ, స్నేహితులూ; ఒక్క

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మొగంబు+ఐ= ఏకమయి; నీ పనుపు+చేయుచున్= నీ ఆజ్ఞ పాటిస్తూ; నయ విక్రమంబులు= నీతి పరాక్రమాలు; అప్రతిహతంబులు+ఐ వడవన్= నిరాటంకంగా సాగుతూ ఉంటే; పృథివిన్+శాసింపన్= భూమిని పరిపాలిస్తే; భవదీయ విభవంబు= నీ వైభవం; ఉజ్జ్వలంబు+ఐ= ప్రకాశిస్తూన్నదయి; ఒరులకున్= ఇతరులకు; ఎడ లేక చెల్లుచున్+ఉన్నన్= ఆపులేక చెల్లుతూ ఉంటే; ఎంత+ఒప్పు+అగునో అటు విచారింపుము= ఎంత బాగుంటుందో ఆలోచించుము; పాండవులు; ధీరమతులు+ఐ= నిర్వికారచిత్తులయి; వైరము+ఎత్తక= పగమాట తలపెట్టక; ఊరక తొలంగి+ఉండిరి+ఏనియున్= మాటాడక ఊరుకున్నప్పటికీ; కతిపయ దినంబులలోన్= కొన్నాళ్ళలో; చీకాకుపడి= ఇబ్బందులుపాలయి; చెడున్+కాక= నశిస్తుంది కాని; గాంధారీ నందనుచేతన్= దుర్యోధనుడి చేత; వసుంధరా పరిపాలన భారంబు= భూపాలన భారం; నిర్వహింపంబడునే?= వహించబడుతుందా?; అనినన్; విని; ధృతరాష్ట్రుండు; విదురునకున్; ఇట్లు+అనియెన్;

తాత్పర్యం: కాబట్టి కౌరవులూ, పాండవులూ ఒకళ్ళకొకళ్ళు అండగా ఉంటే శత్రువుకు జయించరానివాళ్ళవుతారు. శత్రువుల ఒత్తిడి లేని రాజ్యం అధికమహిమతో ఒప్పుతుంది. అడవిలో నివసించి దుఃఖితులైన పాండవులను వెంటనే రప్పించి వాళ్ళకు సముచితస్థానం ఇచ్చి నిలపటం, నీ కొడుకులను బ్రదికించుకొనటమే అవుతుంది-' అని చెప్పి విదురు డింకా ఇట్లా అన్నాడు: 'ఇచ్చకాలు మాట్లాడేవాళ్ళు ప్రతీచోటా ఉంటారు. అప్రియమయితే అయిందని హితం పలికేవాళ్ళు వేరు. రుచించేది కాదని సంకోచించక జూదం ఆడేటప్పుడు నేను అడ్డుపడి హితం చెప్పాను. అది నీకు రుచించక, రోగం వచ్చిన వాడికి పథ్యం సయించనట్లు అయింది. అయినా ఇప్పుడు కూడా చెపుతా వినుము. కాకులను చేరదీసి నెమళ్లను పారద్రోలినట్లూ, పిల్లులను ఆదరించి సింహాలను తోసిపుచ్చినట్లూ, దుర్యోధనాదులను పట్టుకుని ధర్మరాజాదులను వదిలేశావు. ఈవేళ పీకమీదకు వస్తే ఏం చేయాలో తోచక నిప్పులు తగిలినట్లు తల్లడిల్లిపోతున్నావు. కులం నిలపటానికి ఒక్కడిని వదలివేయటమే నీతి అని పెద్దలంటారు. అవినీతిపరుడై, మంచి చెపితే వినిపించుకొనకపోతే, మనం దుర్యోధనుడిని వదలుకుంటే నష్టం ఏమిటి? అది అట్లా ఉండనీ. సహాయం సంపదను బట్టీ, సంపద సహాయాన్ని బట్టీ ఉంటాయి. ఇట్లా అవి ఒకదానితో ఒకటి కూడి ఉంటేనే కాని సిద్ధించవు. కాబట్టి నీ సంపద పాండవులకూ, వాళ్ళ సహాయం నీకూ ప్రీతి కలిగిస్తూ ఉంటే పరస్పరం కలిసి ఉండటం మేలుకాని, మన బలం బయట పెట్టుకొనటం మంచిదా? కురు వంశోద్ధారకులైన భీష్మ ధర్మరాజులూ, మంచి పరాక్రమవంతులైన కర్ణార్జునులూ, పరాక్రమ నిలయులయిన భీమ దుర్యోధనులూ, శస్త్రాస్త్ర విద్యలలో ఆరితేరిన అభిమన్యు లక్ష్మణాది కుమారులూ, శపించటానికీ, అనుగ్రహించటానికి సమర్థులైన ద్రోణ ద్రుపదాదులైన ఆత్మీయులూ, వాళ్ళ వాళ్ళ చుట్టాలూ, మిత్రులూ ఏకమయి, నీ ఆజ్ఞ పాటిస్తూ, నీతి పరాక్రమాలు నిరాటంకంగా సాగుతూండగా, భూపరిపాలన కావిస్తూంటే, నీ వైభవం ప్రకాశవంతమై, శత్రువులకు స్థానం లేక, సాగితే అదెంత బాగుంటుందో ఒక్కసారి ఆలోచించుము. పాండవులు నిర్వికారచిత్తులై పగమాట తలపెట్టక మాటాడక ఊరుకొన్నా, కొన్ని నాళ్ళలో ఇబ్బందులు పాలయి చెడుతుందేకాని, దుర్యోధనుడిచేత రాజ్యం పాలించబడదు.' అని విదురుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు :

విశేషం: 'అది నీకు రుచియింపక, రోగికిఁ బథ్యాహారంబు దల కంటగించునట్లయ్యె.' అలంకారం ఉపమ, 'కాకంబులంగైకొని, మయూరంబులం బరిహరించు విధంబున, మార్జాలంబులం బాటించి సింహంబులయెడ ననాదరంబు సేయు చందంబున, సుయోధనాదులంబట్టి యుధిష్ఠిర ప్రముఖుల విడిచితివి.' అలంకారం ఉపమ. 'మిడుంగుఱులు సోఁకినట్లు' - అలంకారం ఉపమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. 'నీవు సెప్పిన మాటలు నిర్మలములు, । నిపుణ సమ్మతములు, రాజనీతి మార్గ
బోధకంబులు; నైనను బుత్త్రువిడువ । నోప, 'ధర్మో జయతి'యని యుండువాఁడ.' 90

ప్రతిపదార్థం: నీవు+చెప్పిన మాటలు= నీవు చెప్పిన మాటలు; నిర్మలములు= కల్మషంలేనివి; నిపుణ సమ్మతములు= నేర్పరుల చేత అంగీకరించబడేవి, రాజనీతి మార్గ బోధకంబులున్= రాజనీతి మార్గాన్ని బోధించేవీ; ఐనను= అయినా; పుత్త్రున్= కొడుకును; విడువన్+ఓపన్= విడువలేను; ధర్మః+జయతి= ధర్మం జయిస్తుంది; అని; ఉండువాఁడన్= ఉంటాను.

తాత్పర్యం: 'నీవు చెప్పిన మాటలు కల్మషం లేనివి. నేర్పరులు సమ్మతించేవి, రాజనీతి మార్గాన్ని బోధించేవి. అయినా కొడుకును విడవలేను. 'ధర్మం జయిస్తుంది' అని చూస్తూ ఉంటాను.

వ. అనిన విని విదురుం డతని కిట్లనియె: 'దేవా! జ్ఞాతులు గుణహీనులైనను విడువందగ దనిన, సకల గుణసంపన్నులై భవత్ప్రసాదంబు గోరుచున్న కౌంతేయులన్ దిగవిడువం దగునే? యేను నీకు హితంబు గోరెడువాఁడనని నిశ్చయించి నా బుద్ధి వినుము; వారల జీవనంబునకుఁ గొన్ని యలంతిపల్లియలైనను దుర్యోధను నొడంబఱచి యేర్పఱచి, తెఱంగు పఱచిన లెస్స యని చూచెద; నతని విడువ వలయునని చెప్పితినేనిఁ బెనఁకువం బశ్చాత్తాపంబువుట్టు; దాని కప్పుడు ప్రతీకారంబు లేదు. కావున నెల్లభంగుల నియ్యకొని పాండవులతోడ సంధి సేయవలయు; నట్లుం గాక. 91

ప్రతిపదార్థం: అనినన్, విని, విదురుండు; అతనికిన్= ధృతరాష్ట్రుడికి; ఇట్లు+అనియెన్; దేవా= ప్రభూ, ధృతరాష్ట్రా!; జ్ఞాతులన్= దాయాదులను, గుణ హీనులు+ఐనను= గుణం లేని వాళ్ళయినా; విడువన్+తగదు+అనినన్= విడవకూడదంటే; సకల గుణ సంపన్నులు+ఐ= ఎల్ల సుగుణ సంపదగలవారై; భవత్+ప్రసాదంబు= నీ అనుగ్రహం; కోరుచున్+ఉన్న కౌంతేయులన్= కోరుతూన్న పాండవులను; దిగన్+విడువన్+తగునే?= విడనాడ వచ్చునా?; ఏను= నేను; నీకున్; హితంబు+కోరెడువాఁడన్+ అని నిశ్చయించి= మేలు కోరేవాడినని నిర్ణయించి; నా బుద్ధిన్+వినుము= నా తలపు వినుము; వారల జీవనంబునకున్= వాళ్ళ బ్రతుకుకు; కొన్ని+అలంతి పల్లియలు+ఐనను= కొన్ని చిన్న పల్లెలయినా; దుర్యోధనున్+ఒడంబఱచి= దుర్యోధనుణ్ణి సమ్మతింపజేసి; ఏర్పఱచి= నిర్ణయించి; తెఱంగు పఱచినన్+లెస్స+అని చూచెదను= సంధి చేస్తే మంచిదని భావిస్తాను; అతనిన్; విడువన్+వలయున్+అని చెప్పితిన్+ఏనిన్= విడిచిపెట్టాలంటున్నానంటే; పెనఁకువన్= యుద్ధం చేత; పశ్చాత్+తాపంబు+ పుట్టున్= తరువాత విచారించవలసి ఉంటుంది. దానికిన్; అప్పుడు; ప్రతీకారంబు లేదు= మారుచేత లేదు- ఏమీ చేయలేము; కావునన్; ఎల్లభంగులన్= అన్ని విధాలా; ఇయ్యకొని= అంగీకరించి; పాండవులతోడన్; సంధి, చేయవలయున్; అట్లున్+కాక= అదికాక.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగా విని విదురుడు అతడితో ఇలా అన్నాడు. 'ప్రభూ! దాయాదులు గుణంలేని వాళ్ళయినా విడిచిపెట్టకూడదంటే, సకల సుగుణ సంపద గలవారై నీ అనుగ్రహం కోరుతున్న పాండవులను విడనాడవచ్చా? నేను నీకు మేలు కోరేవాణ్ణని నిర్ణయించి నా మాట వినుము. వాళ్ళు బ్రతకడానికి కొన్ని చిన్న పల్లెలయినా; దుర్యోధనుడిని సమ్మతింపజేసి, కేటాయించి, సంధి చేస్తే మంచిదని భావిస్తాను. అతడిని విడిచి పెట్టాలంటున్నానంటే, అట్లా చేయకపోతే, యుద్ధం వలన తరువాత విచారించవలసి వస్తుంది. ఇక దానికప్పుడు ఏమీ చేయలేము కాబట్టి అన్ని విధాలా అంగీకరించి పాండవులతో సంధి చెయ్యాలి. అట్లాకాక- (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: 'జ్ఞాతులు గుణహీనులైనను... దిగవిడువందగునే?' - అలంకారం కావ్యార్థాపత్తి.

క. తమలోని పాళ్ళకుం గా । సమరము సేసినను గాని చాఁ జనదె? శరీ
రము లాధివ్యాధి జరా । సమన్వితము లగుటఁ జేటు సహజం బరయన్. 92

ప్రతిపదార్థం: తమలోని పాళ్లకున్+కాన్= తమ తమ పంపకాల విషయంగా; సమరము+చేసినను+కాని= యుద్ధం చేస్తే కాని; చాన్+చనదె?= చావరాదా?; అరయన్= పరిశీలించగా; శరీరములు= మేనులు; ఆధి వ్యాధి జరా సమన్వితములు+అగుటన్= మనోవ్యాధులతోనూ; రోగాలతోనూ; ముసలితనంతోనూ కూడుకొన్నవి కావటం చేత; చేటు= నాశనం, సహజం.

తాత్పర్యం: తమ తమ పంపకాల విషయంగా యుద్ధం చేస్తే కాని చావు రాదా ఏమి? చూడగా శరీరాలు మనోవ్యాధితోనూ, రోగంతోనూ, ముసలితనంతోనూ కూడుకొన్నవవటంచేత వాటికి నాశనం సహజం.

చ. గజ తురగాది సంపదలుఁ, గాంతలతోడి విహారలీలలుం,
బ్రజ కనురాగ మొందఁ బరిపాలన సేయుక్రమంబుఁ, బోరులన్
విజయము లొంది పేర్చుటయు, విస్ఫురితాభరణానులేపవ
స్త్ర జనిత వైభవంబుఁ గల రాజులుఁ బోయిర కాక నిల్చిరే? 93

ప్రతిపదార్థం: గజ తురగ+ఆది సంపదలున్= ఏనుగులూ, గుర్రాలూ మొదలుగాగల సంపదలూ; కాంతలతోడి విహార లీలలున్= అందమైన స్త్రీలతోడి క్రీడా విలాసాలూ; ప్రజకున్= జనానికి; అనురాగము+ఒందన్= ప్రీతి కలిగేటట్లు; పరిపాలన+చేయు క్రమంబున్= ఏలే పద్ధతీ; పోరులన్= యుద్ధాలలో; విజయమున్+పొంది పేర్చుటయున్= గెలుపుగాంచి అతిశయించటమూ; విస్ఫురిత+ఆభరణ+అనులేప వస్త్ర జనిత వైభవంబున్= ప్రకాశించే భూషణాలూ, మైపూతలూ, వస్త్రాలూ అనే వాటి నుండి పుట్టిన విభవమూ; కల రాజులున్= ఉన్నరాజులు కూడా; పోయిరి కాక= మరణించారేకాని; నిల్చిరే?= జీవించి ఉన్నారా?

తాత్పర్యం: ఏనుగులు, గుర్రాలు మొదలుగాగల సంపదలూ, అందమైన స్త్రీలతోడి క్రీడా విలాసాలూ, ప్రజలకు ప్రీతికరంగా పరిపాలించే పద్ధతీ, యుద్ధాలలో గెలిచి అతిశయించటమూ, ప్రకాశించే ఆభరణాలూ, మైపూతలూ, వస్త్రాలూ అనే వాటివలన కలిగే వైభవమూ కల రాజులు సైతం మరణించారే తప్ప జీవించి ఉన్నారా?

క. కావునఁ జెవికిం జేఁ దగు । నీ వాక్యము వినఁగఁ జాలితేని, నిహపర
శ్రీ విభవములకుఁ గీర్తికిఁ । దావలమై వెలయు టింత తథ్యము సుమ్మీ! 94

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; చెవికిన్+చేఁదు+అగు+ఈవాక్యమున్= చెవికి చేదుగా ఉండే ఈ మాటను; వినఁగన్+చాలితి(వి)+ఏనిన్= వినగలిగావా; ఇహపర శ్రీ విభవములకున్= ఈ లోకపు, పరలోకపు సంపదలకూ వైభవాలకూ; కీర్తికిన్; తావలము+ఐ= స్థానమయి; వెలయుట= ఒప్పుట; ఇంత తథ్యము సుమ్మీ!= ఇంతా నిజం సుమా!

తాత్పర్యం: కాబట్టి చెవికి చేదుగా ఉండే ఈ మాట వినగలిగావా ఇహలోక, పరలోక సంపదలకూ, వైభవాలకూ, కీర్తికీ నిలయమైన వాడవయి ఒప్పడం నిజం సుమా!

క. తగ నీలో నూహింపుము; । దిగ విడువకు ధర్మతనయు; దృఢమతివై పొం
దగు చందము గొడుకులకుం । బ్రెగడలకుం జెప్పి తీర్పు పెం పేర్పడఁగన్. 95

ప్రతిపదార్థం: తగన్= ఒప్పుగా; నీలోన్= నీ మనస్సులో; ఊహింపుము= ఆలోచించుము; ధర్మతనయున్= ధర్మరాజును; దిగన్+విడువకు(ము)= విడనాడకు; దృఢ మతివి+ఐ= గట్టి మనస్సుకలవాడవై; కొడుకులకున్; ప్రెగడలకున్= మంత్రులకూ; పొందు+అగు చందము= సంధి అయ్యే విధం; చెప్పి; పెంపు+ఏర్పడఁగన్= అభ్యుదయం కలిగేటట్లు; తీర్పు(ము)= కుదుర్చుము.

తాత్పర్యం: నీలో నీవే బాగా ఆలోచించుకొమ్ము. ధర్మరాజును విడనాడకుము. మనసు గట్టిపరచుకుని కొడుకులకూ, మంత్రులకూ సంధి అయ్యే విధం చెప్పి అభ్యుదయం కలిగేటట్లు కుదుర్చుము.'

ఆ. అనిన నాంబికేయుఁ డను: 'నీదు పలుకులఁ। గలఁక దేఱి బుద్ధి దెలివి నొందె;
నిట్ల చేయువాఁడ; నిదియ కర్జము, ధర్మ। మును, యశంబు, లాభమును దలంప.' 96

ప్రతిపదార్థం: అనినన్; ఆంబికేయుఁడు= అంబిక కొడుకు - ధృతరాష్ట్రుడు; అనున్; నీదు పలుకులన్= నీ మాటల చేత; బుద్ధి= మనస్సు; కలఁక+తేఱి= నిర్మలమయి; తెలివిన్+ఒందెన్= తేరుకుంది; ఇట్లు+అ చేయువాఁడన్= ఇట్లాగే చేస్తాను; తలంపన్= ఆలోచించగా; ఇది+అ= ఇదే; కర్జమున్= చేయదగిందీ; ధర్మమును= ధర్మమూ; యశంబున్= కీర్తి; లాభమును= లాభమూ.

తాత్పర్యం: అని విదురు డనగా, అతడితో ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు: 'నీ మాటల వలన నా మనస్సు నిర్మలమై తేరుకుంది. నేను ఇట్లాగే చేస్తాను. ఆలోచించగా ఇదే చేయదగింది. ఇదే ధర్మమూ, కీర్తి, లాభమూ.'

చ. అనుడు ముదంబు నమ్మమియు నాత్మఁ బెనంగొన నన్నతోడ ని
ట్లను విదురుండు: 'పెద్దవడి కక్కట! నీ మది కార్యవృత్తి నూ
ల్కొనియె; సుయోధనుం గని యకుంఠిత నిశ్చయమై యతండు వ్రా
లినదెస వ్రాలకుండిన బలే, మముబోఁటులకుం బ్రియం బగున్. 97

ప్రతిపదార్థం: అనుడున్= అని ధృతరాష్ట్ర డనగానే; విదురుండు; ముదంబున్= సంతోషమూ; నమ్మమియున్= అపనమ్మకమూ; ఆత్మన్= మనస్సులో; పెనంగొనన్= పెరిగొనగా; అన్నతోడన్= అన్న అయిన ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనున్; అక్కట!= ఆహా!; ఇది సంతోషసూచకం; పెద్దవడికిన్= ఎంతో కాలానికి; నీ మది= నీ మనస్సు; కార్యవృత్తిన్= చేయదగిన నడవడియందు; నూల్కొనియెన్= స్థిరపడింది; సుయోధనున్+కని= దుర్యోధనుడిని చూచి; అకుంఠిత నిశ్చయము+ఐ= కుంటువడని నిర్ణయమై; అతండు; వ్రాలిన దెసన్= మొగ్గినవైపు; వ్రాలక+ఉండినన్= మొగ్గకపోతే; బలే; మము బోఁటులకున్= మా వంటివారికి; ప్రియంబు+అగున్= ఆనందం కలుగుతుంది.

తాత్పర్యం: అని ధృతరాష్ట్ర డనగానే విదురుడు ఒకవైపు సంతోషమూ, ఇతడిలో నిజంగా మార్పు వచ్చిందా అనే అపనమ్మకమూ మనస్సులో పెరిగొనగా అన్నగారితో ఇట్లా అన్నాడు. 'ఆహా! ఎంతో కాలానికి నీ మనస్సు చేయదగిన దానియందు స్థిరపడింది. దుర్యోధనుడిని చూచి, నిర్ణయం మార్చుకోక, అతడు మొగ్గినవైపు నీవు కూడా మొగ్గకపోతే, బలే, మావంటివారికి ఎంతో ఆనందం కలుగుతుంది.'

వ. అని పలికి నిట్టూర్పు నిగిడించి. 98

తాత్పర్యం: అని పలికి విదురుడు నిట్టూర్పు పుచ్చి.

క. 'దైవంబు నేర్చుఁగా; కిటు । వోవఁగ నే నేర్తు, నేరఁ బొమ్మని పలుకం
గా వశమె నరున? కెక్కుడు । దైవము పౌరుషముకంటె ధరణీనాథా!' 99

ప్రతిపదార్థం: ధరణీనాథా!= రాజా! ధృతరాష్ట్రా!; దైవంబు+అ= దైవమే; నేర్చున్+కాక= సమర్థమైనదికాని; ఇటు+పోవఁగన్= ఇట్లా నడవటానికి; ఏన్= నేను; నేర్తున్= సమర్థుడిని; నేరన్+పొమ్ము+అని పలుకంగాన్= సమర్థుడను కానులే అనడానికి; నరునకున్= మనుష్యుడికి; వశమె?= తరమా?; దైవము; పౌరుషము కంటెన్= పురుష ప్రయత్నంకంటె; ఎక్కుడు= గొప్పది.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! దైవమే సమర్థమయినది. 'నే నిలా నడవగలను, నడవలేనులే' అనటానికి మానవుడి తరమా? పురుష ప్రయత్నం కంటె దైవం గొప్పది.'

విశేషం: ధృతరాష్ట్రుడిలో మార్పు వచ్చిందే అని సంతోషించిన విదురుడు మళ్ళీ ఇట్లా అనటానికి కారణం ధృతరాష్ట్రుడి మాటలలో అతడికి ఒకవైపున ఉన్న అపనమ్మకమే.

వ. అనిన, విదురునకు వైచిత్రవీర్యుం డిట్లనియె: 100

ప్రతిపదార్థం: అనినన్, విదురునకున్, వైచిత్రవీర్యుండు= విచిత్రవీర్యుడి కొడుకు ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్;

తాత్పర్యం: అని విదురుడనగా, అతడికి ధృతరాష్ట్రు డిట్లా అన్నాడు:

తే. 'ధర్మ పథమును, నీతి తత్త్వంబు తెరువు । నిర్మలము లగు పలుకుల నీవు నాకుఁ
దెలియఁ జెప్పితి; పరమార్థ దృష్టి యెట్టి । వాక్యములఁ గల్గుఁ? జెప్పుము వాని ననఘ! 101

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా, విదురా!; ధర్మ పథమును= ధర్మ మార్గాన్నీ; నీతి తత్త్వంబు తెరువున్= నీతితత్త్వపు మార్గాన్నీ; నీవు; నాకున్; నిర్మలములు+అగు పలుకులన్= స్వచ్ఛములైన మాటలలో; తెలియన్+చెప్పితి(వి)= స్పష్టపరచినావు; పరమార్థ దృష్టి= పారమార్థికమైన చూపు; ఎట్టి వాక్యములన్+కల్గున్?= ఎటువంటి వాక్కులవల్ల ఏర్పడుతుంది?; వానిన్, చెప్పుము.

తాత్పర్యం: 'పుణ్యాత్మా విదురా! నీవు నాకు ధర్మమార్గాన్నీ, నీతితత్త్వమార్గాన్నీ స్వచ్ఛములైన మాటలలో స్పష్టపరిచావు. ఆధ్యాత్మిక దృష్టి ఎటువంటి వాక్కులవలన ఏర్పడుతుందో వాటిని చెప్పుము.'

సనత్సుజాతుఁడు ధృతరాష్ట్రునకు నధ్యాత్మతత్త్వంబుఁ జెప్పుట - (సం. 5-41-2)

వ. అని యడిగిన, విదురుం డతని కిట్లనియె; 'నాకుఁ దోఁచిన యన్నియు నా నేర్చినట్లు నీ కెఱింగించితి; నత్యంత గుహ్యంబులగు నర్థంబులు పురాణుం డయ్యునుం గుమారుం డగు సనత్సుజాతుండు దెలుపనోపుంగాని యిట మీఁద నాకుం దెలియ' దనిన ధృతరాష్ట్రుం 'డమ్మునీంద్రుండు నా కెంతదవ్వు! నీవ యవియునుం జెప్పు' మనిన, 'నేను శూద్రయోని జాతుండ, వేదాంత వేద్యంబు లగు నర్థంబులు నా కగోచరంబు; లమ్మహాత్ము బుద్ధి నే నెఱుంగుదు. దేవతలకుం దెలియనట్టివి యాతనికిం దెలియు; నతండు దెలుపంజాలు' ననిన, ధృతరాష్ట్రుం డతి కుతూహలుండై. 102

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని; అడిగినన్; విదురుండు; అతనికిన్; ఇట్లు+అనియెన్; నాకున్; తోఁచిన+అన్నియున్= తెలిసినవన్నీ; నా నేర్చిన+అట్లు= నా శక్తి ననుసరించి; నీకున్; ఎఱింగించితిన్= తెలిపాను; అత్యంత గుహ్యంబులు+అగు+అర్థంబులు= మిక్కిలి రహస్యములైన విషయాలు; పురాణుండు+అయ్యునున్= చాలా కాలం నాటి వాడయినా; కుమారుండు+అగు సనత్సుజాతుండు= యువకుఁడే అయిన సనత్సుజాతుడు; తెలుపన్+ఓపున్+కాని= చెప్పగలడుకాని; ఇట మీఁదన్= ఈపైని; నాకున్; తెలియదు; అనినన్; ధృతరాష్ట్రుండు; ఆ+ముని+ఇంద్రుండు= ఆ మునీశ్వరుడు; నాకున్; ఎంత దవ్వు= ఎంతో దూరం; నీవు+అ= నీవే; అవియునున్= అవి కూడా; చెప్పుము; అనినన్; నేను; శూద్రయోని జాతుండన్= శూద్ర స్త్రీ సంభవుడిని; వేదాంత వేద్యంబులు+అగు+అర్థంబులు= వేదాంతుల చేతనే తెలియదగిన విషయాలు; నాకున్+అగోచరంబులు= నాకు తెలియవు; ఆ+మహాత్ముబుద్ధి= ఆ మహనీయుడి హృదయం; నేను; ఎఱుంగుదున్; దేవతలకున్; తెలియని+అట్టివి; ఆతనికిన్; తెలియున్; అతండు; తెలుపన్+చాలున్= చెప్పగలడు; అనినన్; ధృతరాష్ట్రుండు; అతి కుతూహలుండు+ఐ= మిక్కిలి ఆసక్తిగలవాడయి-

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అడుగగా విదురుడు అతడితో ఇట్లా అన్నాడు: 'నాకు తెలిసినవన్నీ యథాశక్తి నీకు తెలిపాను. మిక్కిలి రహస్యాలయిన విషయాలు ఏకాలం నాటివాడో అయినా యువకుడే అగు సనత్సుజాతుడు చెప్పగలడు కాని ఈ పైని నాకు తెలియదు.' అంటే, ధృతరాష్ట్రుడు 'ఆ మునీశ్వరుడు నాకెంతో దవ్వు. సులభుడు కాడు. నీవే అవి కూడా చెప్పు.' అనగా 'నేను శూద్రుడిని. వేదాంతులకు మాత్రమే తెలియదగిన విషయాలు నాకు తెలియవు. ఆ మహాత్ముడి హృదయం నాకు తెలుసు. దేవతలకు కూడా తెలియని విషయాలు అతడికి తెలుసు. అతడు తెలుపగలడు' అనగా ధృతరాష్ట్రుండు మిక్కిలి ఆసక్తి గలవాడయి.

ఆ. **'మనకు నిప్పు డతనిఁ గను తెఱంగెయ్యది । యగుటయును నెఱుంగ' ననిన, విదురుఁ**
డధిక భక్తిఁ దలఁచె నాత్మలో నాశ్రిత । వత్సలత్వ నిధి సనత్సుజాతు. **103**

ప్రతిపదార్థం: మనకున్; ఇప్పుడు; అతనిన్; కను తెఱంగు+ఎయ్యది+అగుటయునున్= చూచే మార్గం ఏదో కూడా; ఎఱుంగన్+అనినన్= తెలియదనగా; విదురుఁడు; ఆత్మలోన్= మనస్సులో; ఆశ్రిత వత్సలత్వ నిధిన్= ఆశ్రయించిన వారిమీద వాత్సల్యానికి ఆశ్రయమైనవాడిని; సనత్సుజాతున్; అధిక భక్తిన్= మిక్కిలి భక్తితో; తలఁచెన్= స్మరించాడు.

తాత్పర్యం: 'మన కిప్పుడు అతడిని చూసే మార్గం ఏదో కూడా తెలియదే' అని ధృతరాష్ట్ర డనగా, విదురుడు తన మనస్సులో ఆశ్రితులపై వాత్సల్యానికి నిధియైన సనత్సుజాతుడిని అమితభక్తితో తలచుకొన్నాడు.

వ. **ఇట్లు దలంచుటయును, దివ్యజ్ఞాన మాననీయుండగు నమ్మునివరేణ్యుం డాక్షణంబ పొడసూపిన, విదురుం డతని వచ్చుట యుగ్గడించుచు, వినయంబున నతని నెదుర్కొని, దండ నమస్కారంబు లాచరించి, యున్నతాసనంబిడి, యర్ఘ్యపాద్యంబు లిచ్చి, ససంభ్రమంబుగాఁ బ్రత్యుత్థానంబును బ్రణామంబునుం జేసియున్న ధృతరాష్ట్రు నతనికిం జూపి విదురుం డి ట్లనియె:** **104**

ప్రతిపదార్థం: ఇట్లు; తలంచుటయును; దివ్యజ్ఞాన మాననీయుండు+అగు+ఆ+మునివరేణ్యుండు= ఆధ్యాత్మిక జ్ఞానం చేత మాన్యుడైన ఆ మునిశ్రేష్ఠుడు; ఆ క్షణంబు+అ= ఆ క్షణమే; పొడ+చూపినన్= ప్రత్యక్షంకాగా; విదురుండు; అతని వచ్చుట= అతని రాక; ఉగ్గడించుచున్= ప్రకటిస్తూ; వినయంబునన్= నమ్రతతో; అతనిన్; ఎదుర్కొని; దండ నమస్కారంబులు+ఆచరించి= సాష్టాంగవందనాలు చేసి; ఉన్నత+ఆసనంబు+ఇడి= ఉన్నతమైన పీఠం వేసి; అర్ఘ్య పాద్యంబులు+ఇచ్చి= పూజాద్రవ్యాలూ;

పాదప్రక్షాళన జలమూ ఇచ్చి; స సంభ్రమంబుగాన్= వేగిరపాటుతో; ప్రత్యుత్థానంబును= ఎదుర్కోలూ; ప్రణామంబునున్= నమస్కారమూ; చేసి+ఉన్న; ధృతరాష్ట్రున్; అతనికిన్+చూపి; విదురుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇట్లా స్మరించగానే, ఆధ్యాత్మిక జ్ఞానంచేత మాన్యుడైన ఆ మునిశ్రేష్ఠుడు ఆ క్షణమే ప్రత్యక్షం కాగా, విదురుడు అతడి రాక ప్రకటించి, నమ్రతతో అతని కెదురేగి సాష్టాంగ నమస్కారాలు చేసి, ఉన్నత పీఠం వేసి, అర్ఘ్యపాద్యాదులిచ్చి, వేగిరపాటుతో ఎదుర్కోలూ, నమస్కారమూ చేసి ఉన్న ధృతరాష్ట్రుడిని అతడికి చూపి ఇట్లా అన్నాడు:

క. 'దేవా! దేవర కృప నీ। భూవల్లభుఁ డమల తత్త్వ బోధకమై సౌ
ఖ్యావహ మగు వాక్య చయముఁ। దా వినఁ గోరుటయు, మిమ్ముఁ దలఁచితి భక్తిన్. 105

ప్రతిపదార్థం: దేవా!= స్వామీ!; ఈ భూవల్లభుఁడు= ఈ రాజు-; ధృతరాష్ట్రుడు; దేవర కృపన్= తమ దయచేత; అమల తత్త్వ బోధకము+ఐ= నిర్మలమైన తత్త్వాన్ని ఉపదేశించేదయి; సౌఖ్య+ఆవహము+అగు వాక్య చయమున్= సుఖాన్ని కలిగించే వాక్కుల సమూహాన్ని; తాన్= తాను; వినన్+కోరుటయును= వినగోరగా; మిమ్మున్; భక్తిన్= భక్తితో; తలఁచితిన్= స్మరించాను.

తాత్పర్యం: 'స్వామీ! ఈ ధృతరాష్ట్ర మహారాజు తమ దయవలన నిర్మలమైన వేదాంత తత్త్వాన్ని ఉపదేశించేదీ, సుఖాన్ని కలిగించేదీ అయిన వాక్సమూహాన్ని వినగోరడం చేత మిమ్ములను భక్తితో స్మరించాను.

వ. మీరును గారుణ్యాతిశయంబున విజయం చేసితిరి. గురు సమాశ్రితులగు వార లెద్దాని వలన సుఖదుఃఖంబులు, లాభాలాభంబులుఁ, బ్రియద్వేషంబులు నాదిగాఁ గల ద్వంద్వంబులం బడక బ్రదుకుదురు? రట్టి పరమార్థోపదేశంబున నితనిం గృతార్థునిం గావించి రక్షింపవలయు'నని ప్రార్థించినం, బార్థివుండునుం దదనురూపంబు లగు నాలాపంబుల నారాధించినం బ్రసన్నుండై, సనత్సుజాతుం డధ్యాత్మ విషయంబులగు వివిధ వాక్యంబుల సోపాన ప్రకారంబున నంతకంతకు సూక్ష్మంబులగు నర్థంబులు సమర్థించుచు, నందుఁ బ్రజ్ఞాచక్షుండెయ్యది యేర్పడ నడిగె నది యెల్ల వివరించుచు, హృదయ పుష్కర కలితంబగు పరతత్త్వంబు ప్రసాదించునట్టి గూఢోక్తు లనుగ్రహించుచుండ, నెట్టకేలకుఁ బ్రభాతం బగుటయు, ధృతరాష్ట్ర విదురుల నామంత్రణంబు సేసి యద్దేవముని యంతర్ధానంబు నొందె; నట్టి సమయంబున. 106

ప్రతిపదార్థం: మీరును, కారుణ్య+అతిశయంబునన్= దయాతిశయంతో; విజయం చేసితిరి= విచ్చేశారు; గురు సమాశ్రితులు+అగు వారలు= గురువు నాశ్రయించుకొన్నవారు; ఏ+దాని వలనన్= దేనివలన; సుఖదుఃఖంబులున్; ప్రియ ద్వేషంబులున్; ఆదిగాన్= మొదలుగా; కల; ద్వంద్వంబులన్+పడక= జంటలయందు తగుల్కొనక; బ్రదుకుదురు; అట్టి; పరమార్థ+ఉపదేశంబునన్= తత్త్వం ఉపదేశించడం చేత; ఇతనిన్; కృతార్థునిన్= ధన్యుడిని; కావించి= చేసి; రక్షింపన్+వలయున్= కాపాడాలి; అని; ప్రార్థించినన్= కోరగా; పార్థివుండునున్= రాజు- ధృతరాష్ట్రుడు కూడా; తద్+అనురూపంబులు+అగు+ఆలాపంబులన్= దానికి తగిన మాటల చేత; ఆరాధించినన్= పూజించగా; ప్రసన్నుండు+ఐ= సంతోషించినవాడయి; సనత్సుజాతుండు; అధ్యాత్మ విషయంబులు+అగు వివిధ వాక్యంబులన్= పరమార్థానికి సంబంధించిన వివిధ వాక్కులతో; సోపాన ప్రకారంబునన్= ఒకదాని తరువాత ఒకటిగా- మెట్ల వరసను; అంతకున్+అంతకున్= క్రమక్రమంగా; సూక్ష్మంబులు+అగు+అర్థంబులు= అగోచరములైన విషయాలు; సమర్థించుచున్= బోధిస్తూ; అందున్= వాటిలో; ప్రజ్ఞా చక్షుండు= గ్రుడ్డివాడు- ధృతరాష్ట్రుడు; ఎయ్యది= ఏది; ఏర్పడన్+అడిగెన్= స్పష్టపరచుమని అడిగాడో; అది+ఎల్లన్= అదంతా; వివరించుచున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్పష్టపరుస్తూ; హృదయ పుష్కర కలితంబు+అగు పరతత్త్వంబు= హృదయ పద్మంలో ఉన్న పరతత్త్వం; ప్రసాదించు+అట్టి= అనుగ్రహించే; గూఢ+ఉక్తులు+అనుగ్రహించుచున్+ఉండన్= రహస్యోక్తులు అనుగ్రహిస్తూంటే; ఎట్టకేలకున్= చాలసేపటికి; ప్రభాతంబు= ఉదయం; అగుటయున్= కాగా; ధృతరాష్ట్ర విదురులన్; ఆమంత్రణంబు+చేసి= వీడ్కొని; ఆ+దేవముని= ఆ దివ్యర్షి; అంతర్ధానంబున్+ఒందెన్= అదృశ్యుడయ్యాడు; అట్టి సమయంబునన్= ఆ సమయంలో-.

తాత్పర్యం: మీరు కూడా దయాతిశయంతో విచ్చేశారు. గురువు నాశ్రయించుకొన్నవారు దేనివలన సుఖదుఃఖాలూ లాభాలాభాలూ, ప్రియద్వేషాలూ మొదలుగాగల ద్వంద్వాలలో తగుల్కొనక బ్రదుకుతారో అటువంటి తత్త్వోపదేశంచేత ఇతడిని ధన్యుడిని చేసి కాపాడాలి' అని ప్రార్థించగా, ధృతరాష్ట్రుడు కూడా దానికి తగిన మాటలతో పూజించగా ప్రసన్నుడయి సనత్సుజాతుడు అధ్యాత్మ విషయాలైన వివిధ వాక్యాలతో ఒకదాని తరువాత ఒకటిగా- మెట్ల వరసను- క్రమక్రమంగా సూక్ష్మార్థాలు సమర్థిస్తూ, వాటిలో ధృతరాష్ట్రుడు స్పష్టపరచుమన్న వాటినన్నిటినీ వివరిస్తూ, హృదయపద్మంలో ఉన్న పరమాత్మ ప్రసాదించే రహస్య వాక్కులు అనుగ్రహిస్తూండగా, చాలాసేపటికి ప్రొద్దుపొడవగా, ధృతరాష్ట్ర విదురులను వీడుకొని ఆ దేవర్షి అదృశ్యుడయ్యాడు. ఆ సమయంలో.

ప్రాతఃకాల వర్ణనము (అమూలకము)

తే. **తన కులంబునఁ బుట్టిన ధార్తరాష్ట్రు । లన్నదమ్ములతో విగ్రహంబు గొనుట**
కుమ్మలించి వివర్ణత నొందినట్లు । గంది, యెంతయుఁ జెలు వేదెఁ జందురుండు. **107**

ప్రతిపదార్థం: తన కులంబునన్= తన వంశంలో; పుట్టిన; ధార్తరాష్ట్రులు= కౌరవులు; అన్నదమ్ములతోన్; విగ్రహంబు+ కొనుటకున్= విరోధించటానికి; చందురుండు= చంద్రుడు; ఉమ్మలించి= దుఃఖించి; వివర్ణతన్= కాంతిహీనతను; ఒందిన+ అట్లు= పొందిన విధంగా; కంది= తేజోవిహీనుడయి; ఎంతయున్= మిక్కిలి; చెలువు+ఏదెన్= అందం కోల్పోయాడు.

తాత్పర్యం: తన వంశంలో పుట్టిన కౌరవులు అన్నదమ్ములతో విరోధపడినందుకు చంద్రుడు దుఃఖించి కాంతిహీనతను పొందినవిధంగా తేజోవిహీనుడై మిక్కిలి అందం కోల్పోయాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. కౌరవులు చంద్రవంశోద్భవులు. ఉదయ సమయంలో చంద్రుడు పాలిపోవడం సహజం. దానికి ధార్తరాష్ట్రు లన్నదమ్ములతో విగ్రహము గొనుట హేతువు కాదు. హేతువుకాని దానిని హేతువుగా చెప్పటం చేత అలంకారం హేతూత్ప్రేక్ష.

మూలంలో ఈ సందర్భంలో ప్రాతఃకాలవర్ణన లేదు. 'తస్యాం రజన్యాం వ్యుష్టాయాం' అని మాత్రమే మూలభారతంలో ఉన్నది. ఆ మాత్రపు సూచననే పురస్కరించుకుని తిక్కన ఇక్కడ ప్రాతఃకాల వర్ణన విపులంగా చేశాడు. నీతులతోనూ, ధర్మాలతోనూ విసుగెత్తిన పఠితలకు ఈ ప్రకృతి వర్ణన ఇంచుక చిత్తాహ్లాదాన్ని కలిగిస్తుంది.

క. **కుముదములుఁ దారు నొక్కటఁ । బ్రమదంబున నుండి, వాని పదవి దొలఁగినం**
దమకున్ నిలువఁగఁ దగదను । క్రమమునఁ జనునట్లు తారకంబులు విరిసెన్. **108**

ప్రతిపదార్థం: తారకంబులు= నక్షత్రాలు; కుముదంబులున్= (తెల్ల) కలువలూ; తారున్= తామూ; ఒక్కటన్+ఒకచోట; ప్రమదంబునన్= సంతోషంతో; ఉండి; వాని పదవి తొలఁగినన్= ఆ కుముదముల సంపద నశించగా; తమకున్; నిలువఁగన్+ చనదు+అను క్రమమునన్= ఉండగూడదనే న్యాయం చొప్పున; చను+అట్లు= పోయే విధంగా; విరిసెన్= అదృశ్యమయ్యాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కలువలూ తామూ ఒకేచోట సంతోషంతో ఉండి, ఆ కలువల సంపద నశించగానే - ఉన్నతస్థానం తొలగగానే - ఇంక తాము అక్కడ ఉండటం భావ్యం కాదని తొలగి పోయాయా అన్నట్లు నక్షత్రాలు అదృశ్యమయ్యాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. రాత్రివేళ కలువలు వికసిస్తాయి. నక్షత్రాలు కూడా అప్పుడే మెరుస్తూంటాయి. రాత్రి నశించగానే, సూర్యోదయం కాగానే కలువల వికాసం నశిస్తుంది. నక్షత్రాలు కూడా సహజంగానే అదృశ్యమవుతాయి. నక్షత్రాలు అదృశ్యమవటానికి కలువల పదవి పోయినప్పుడు ఇంక మనం ఉండగూడదనుకొనటం హేతువు కాదు. హేతువుకాని దానిని హేతువుగా ఊహించటంచేత ఇక్కడ అలంకారం హేతూత్ప్రేక్ష.

ఉ. ఎత్తిన వేడ్కఁ గంధరము లెత్తి, మొగంబులు సాఁచి, చూడ్కులం
జిత్తములన్ నిగిడ్చి, తమ చెందెడు నిక్కలు రోసి, యింపు ద
ళ్కొత్తఁగ నొక్కచో నొకటి నొక్కటి గాంచి, యెలర్చు కాయ్వులం
జిత్తజుకేళిఁ దేలె విలసిల్లుచు జక్కవదోయి వేకువన్. 109

ప్రతిపదార్థం: వేకువన్= తెల్లవారుజామున; జక్కన దోయి= చక్రవాక పక్షుల జంట; ఎత్తిన వేడ్కన్= అతిశయించిన కోరికతో; కంధరములు+ఎత్తి= మెడలెత్తి; మొగంబులు= ముఖాలు; చాఁచి; చూడ్కులన్= చూపులతో; చిత్తములన్= మనస్సులను కూడా; నిగిడ్చి= ప్రసరింపజేసి; తమ చెందెడు+ఇక్కలు రోసి= తాము వెళ్ళవలసిన స్థానాలు వెదకి; ఒక్కచోన్= ఒకచోట; ఇంపు+తళ్కొత్తఁగన్= ఆనందం అతిశయించగా; ఒకటిన్+ఒక్కటి+కాంచి= ఒకదాని నొకటి చూచి; ఎలర్చు కాయ్వులన్= వికసిల్లే వలపులతో; విలసిల్లుచున్= ప్రకాశిస్తూ, ఆనందిస్తూ, చిత్తజుకేళిన్= మన్మథక్రీడయందు; తేలెన్= సుఖించాయి.

తాత్పర్యం: తెల్లవారుజామున చక్రవాక పక్షుల జంట అతిశయించిన కోరికతో మెడలెత్తి, ముట్టెలు చాచి, చూపులతోపాటు మనస్సులను కూడా ప్రసరింపజేసి, తాము చేరవలసిన స్థానాలు వెదకి, ఒకచోట ఆనందమతిశయించగా ఒకదానిని ఒకటి చూచి విలసిల్లుతూ ప్రకాశించే వలపులతో మన్మథక్రీడ చేసి ఆనందించాయి.

విశేషం: అలం: స్వభావోక్తి. చక్రవాకపక్షుల జంట రాత్రి తెల్లవార్లూ ఒకదాని నొకటి వీడి విరహం అనుభవించి తెల్లవారుజామున కలిసికొంటాయని కవులు వర్ణిస్తారు. పక్షుల పనులను స్వభావరమణీయంగా ఇందులో కవి వర్ణించాడు కాబట్టి అలంకారం స్వభావోక్తి.

మ. మును సౌరభ్యము నివ్వటిల్లఁగ, మనోమోదంబునం దేఁటు ల
ల్లన యోలిన్ వెడలంగ, రేకులు సముల్లాసంబునన్ బింక మె
క్క నయంబెక్కుచు, గద్దె పొం దెడలి వీఁకం గేసరంబుల్ గడ
ల్కొనఁ, దోడ్తో మధు వుచ్చి, పేరెలమిఁ బొల్పుం జెందె నంభోజముల్. 110

ప్రతిపదార్థం: అంభోజముల్= పద్మాలు; మును= ముందు; సౌరభ్యము= పరిమళం; నివ్వటిల్లఁగన్= వ్యాపించగా; తేఁటులు= తుమ్మెదలు; మనస్(ః)+మోదంబునన్= మనస్సంతోషంతో; అల్లన= మెల్లగా; ఓలిన్= క్రమంగా; వెడలంగన్= బయలుదేరగా; రేకులు= పూవురేకులు; సముల్లాసంబునన్= వికాసంతో; బింకము+ఎక్కన్= పైకి లేవగా- విచ్చుకోగా; నయంబు+ఎక్కుచున్= అంద మతిశయిస్తూ; కేసరంబుల్= అకరువులు; గద్దె పొందు+ఎడలి= దుద్దునుండి వీడి; వీఁకన్= విజృంభణంతో; కడల్కొనన్= వ్యాపించగా; తోడ్తోన్= వెనువెంటనే; మధువు+ఉచ్చి= తేనె పైకి వచ్చి; పేరు+ఎలమిన్= అధిక వికాసంతో- సంపూర్ణ వికాసంతో; పొల్పున్+చెందెన్= అందగించాయి.

తాత్పర్యం: పద్మాలు ముందుగా పరిమళం వ్యాపించగా, తుమ్మెదలు దానికి మనస్సంతోషంతో మెల్లగా క్రమంగా వాటి దగ్గరకు బయలుదేరగా, రేకులు మంచి వికాసంతో విచ్చుకోగా, అందమతిశయిస్తూ, అకరువులు దుద్దునుండి వీడి విజృంభణంతో వ్యాపించగా, వెనువెంటనే తేనె పైకి వచ్చి, సంపూర్ణ వికాసంతో అందగించాయి.

విశేషం: అలం: స్వభావోక్తి. ఇందులో ఉదయ సమయంలో పద్మాల వికసన క్రమాన్ని స్వభావసుందరంగా కవి వర్ణించాడు కాబట్టి అలంకారం స్వభావోక్తి. మనోమోదంబునన్.... వెడలంగ .... పద్మాలు వికసించకుండానే వాటి పరిమళం ముందు వ్యాపిస్తుంది. దానికి ఆకృష్టములై తుమ్మెదలు క్రమక్రమంగా వాటిదరికి వెడతాయి. గద్దె పొందెడలి - కేసరాలు మొగ్గగా ఉన్నప్పుడు దుద్దునంటిపెట్టుకుని ఉంటాయి. పువ్వు వికసించగానే అవి దాని నుంచి విడివడుతాయి. గ్రద్దె- అనే పాఠం అన్ని ప్రతులలోనూ ఉంది. కాని ఆ పదం సూర్యరాయాంధ్ర నిఘంటువులో లేదు. అందులో 'గద్దె' అని ఉన్నది. అందుచేత అదే గ్రహించబడింది. తోడ్తో మధువుచ్చి - పువ్వు వికసించిందే తడవుగా అందులో నుండి మకరందంపైకి పొరలుతుంది.

చ. **వెడవెడ నిద్రవొంది కనువిచ్చిన పాంథులమీఁద దాడి వోఁ,**
దడఁబడ నొండొరుం బిలుచు దర్పకు పంపు బలంబులోని య
ల్కుడు కరణిం జెలంగె శుక కోకిల భృంగతతుల్ వనంబులం
దెడనెడఁ బల్కఁ, గూయ, సొగియింపఁగ మ్రోయఁగఁ దద్విరావముల్. **111**

ప్రతిపదార్థం: వనంబులందున్= తోటలలో; శుక కోకిల భృంగ తతుల్= చిలుకల, కోకిలల, తుమ్మెదల సమూహాలు; ఎడనెడన్= అప్పుడప్పుడు; పల్కన్= పలుకగానూ; కూయన్= కూయగానూ; సొగియింపఁగన్ మ్రోయఁగన్= సుఖించేటట్లు రొదచేయగానూ; తద్ విరావముల్= వాటి వాటి ధ్వనులు; వెడవెడ= మిక్కిలి అల్పంగా; నిద్ర+పొంది= నిద్రపోయి; కనువిచ్చిన= కళ్ళు తెరిచిన; పాంథుల మీఁదన్= విరహుల పైకి; దాడి+పోన్= దండెత్తేటప్పుడు; తడఁబడన్= తొట్రుపడేటట్లు; ఒండొరున్= పరస్పరం; పిలుచు= పిలిచే; దర్పకు పంపు బలంబులోని+అల్కుడు కరణిన్= మన్మథుడు పంపే సైన్యంలోని ధ్వనివలె; చెలంగెన్= మ్రోగాయి- ఒప్పాయి.

తాత్పర్యం: తోటలలో చిలుకలూ, కోకిలలూ, తుమ్మెదలూ అప్పుడప్పుడు పలుకుతున్నాయి, కూస్తున్నాయి, సుఖం కలిగేటట్లు రొద చేస్తున్నాయి. ఆ ధ్వనులు ఎట్లా ఉన్నాయంటే- ఇంచుక నిద్రపోయి కళ్ళు తెరిచిన విరహుల మీదికి తన బలగాన్ని పంపితే, అందులోని పరివారం వాళ్లమీదకు పోయేటప్పుడు తొట్రుపాటుతో పరస్పరం పిలుచుకుంటూ చేసే చప్పుడువలె ఒప్పుతున్నాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. విరహులకు రాత్రి నిద్రపట్టలేదు. తెలతెలవారుతూందనగా కొంచెం కన్నుమూశారు. తెల్లవారగానే కళ్ళు తెరిచారు. అప్పుడు వాళ్లపైకి మన్మథుడు తన బలగాన్ని పంపాడు. అతడి బలగం చిలుకలూ, కోకిలలూ, తుమ్మెదలూ. అవి 'మన ప్రభువు ఆజ్ఞ అయింది. ఇంక ఏమాత్రమూ ఆలస్యం చేయగూడదు. విరహుల మీదకు పోదాం రండి అని తొట్రుపాటుతో ఒకళ్ళ నొకళ్ళు పిలుస్తున్నాయా అన్నట్లుగా పలుకుతున్నాయి, కూస్తున్నాయి, రొద చేస్తున్నాయి. అవి అప్పుడు చేసే చప్పుడులా అన్నట్లుగా ఉన్నాయి వనంలో చిలుకలూ, కోకిలలూ, తుమ్మెదలూ పలికే పలుకుల, కూసే కూతల, చేసే రొదల చప్పుడులు.

సీ. పద్మపరాగంబుఁ బరఁగించు నరుణోద । యంబు కాంతికిఁ జెలువంబు మిగులఁ,
బరువంబు దప్పిన విరుల రాలుచుఁ దరు । చయము చుక్కలు లేని చదలఁ జెనయ,
నరవిరి నెత్తావి నడరించు నున్నిద్ర । విట వీటి సౌరభవితతి పొదల,
నెలఁత చీరిన యెఱకల నెఱిఁ దీర్చు జ । క్క వలు చందోయి కేఁకట యొనర్ప,

ఆ. వెలరువాఱు దీవియల నల్లనల్లార్చు । సోర్ణగండ్లయందుఁ జొచ్చి సుడిసి,
తిరిగి వేగుఁబోక తెమ్మెర లెలదీఁగ । కొనల వంక లొత్తు, ననలఁ బ్రోచు. 112

ప్రతిపదార్థం: వేగుఁబోక తెమ్మెరలు= తెల్లవారుజామునందలి పిల్లగాలులు; తిరిగి= సంచరించి; అరుణ+ఉదయంబు కాంతికిన్= సూర్యోదయపు కాంతికి; చెలువంబు= అందం; మిగులన్= అతిశయించగా; పద్మ పరాగంబున్= తామర పుప్పొడిని; పరఁగించున్= వ్యాపింపజేస్తుంది; తరు చయము= చెట్ల సమూహం; చుక్కలు లేని చదలన్= నక్షత్రాలు లేని ఆకాశాన్ని; చెనయన్= పోలేటట్లు; పరువంబు+తప్పిన విరులన్= పక్వస్థితి నతిక్రమించిన పువ్వులను; రాలుచున్= రాలగొట్టుతుంది; ఉన్నిద్ర విట వీటిన్= నిద్రలేని విటుల వీటి యొక్క ప్రదేశంయొక్క; సౌరభ వితతి= పరిమళాల సమూహం; పొదలన్= అతిశయించేటట్లు; అర విరి నెఱ+తావి= సగం విచ్చిన పూల పరిమళాన్ని; అడరించున్= వ్యాపింపజేస్తుంది; జక్కవలు= చక్రవాకపక్షులు; చెన్ను+తొవలకున్= ఎర్ర కలువల కొరకు; ఏఁకట+ఒనర్పన్= అభిలాష చేయగా- అపేక్షించగా; నెలఁత= ఆడు జక్కవ- చక్రవాకి; చీరిన+ఎఱకల= చీలిన రెక్కల యొక్క; నెఱిన్= చిక్కును; తీర్చున్= సరిచేస్తుంది; సోర్ణ గండ్ల యందున్= కిటికీలలో; చొచ్చి= ప్రవేశించి; సుడిసి= చుట్టుకొని; వెలరు+పాఱు= వెలవెల పోయే; దీవియలన్= దీపాలను; అల్లన్= మెల్లగా; అల్లార్చున్= చలింపజేస్తుంది; ఎలదీఁగ కొనల వంకలు= లేదీగల చివరల వంకరలు; ఒత్తున్= సరిచేస్తుంది; ననలన్= పువ్వుల్ని; ప్రోచున్= పెంచుతుంది.

తాత్పర్యం: తెల్లవారుజామున వీచే గాలి సంచరిస్తూ సూర్యోదయపు కాంతికి అందం అతిశయించేటట్లు తామర పుప్పొడిని ఎగురగొట్టుతుంది. చెట్ల సమూహం నక్షత్ర రహితమైన ఆకాశాన్ని పోలేటట్లు వాడిపోయిన పువ్వులను రాలగొట్టుతుంది. నిద్రలేని విటుల ప్రదేశంలో పరిమళాలు అతిశయించేటట్లు సగం విచ్చిన పూల సువాసనను వ్యాపింపచేస్తుంది. చక్రవాక పక్షులు ఎర్ర కలువల కొరకు అభిలషించగా చక్రవాకి చీలిన రెక్కల చిక్కు సరిచేస్తుంది. కిటికీలను చుట్టి వచ్చి వెలవెలపోయే దీపాలను మెల్లగా చలింపచేస్తుంది. లేదీగ కొసల వంకరలను తీరుస్తుంది. పువ్వులను పెంచుతుంది.

విశేషం: అలం: స్వభావోక్తి, ఉపమ. గాలి వీచే విధాన్ని కవి స్వభావరమణీయంగా వర్ణించాడు కాబట్టి అలంకారం స్వభావోక్తి. అరుణోదయం కాంతి ఎరుపు. పద్మరాగం కూడా ఎరుపే. అందుచేతనే చెలువం మిగలటం. పూలు రాలిపోతే చెట్లు చుక్కలులేని ఆకాశంవలె ఉంటాయి. అలంకారం ఉపమ. విటులు పరిమళద్రవ్యాలు పూసికొని' (సెంట్లు మొదలైనవి) గుమగుమలాడుతుంటారు. వాళ్ళ వలన ఆ వీడంతా పరిమళిస్తుంది. పూల నెత్తావితో ఆ వీడు మరింత పరిమళిస్తుంది. తెల్లవారుజామున సూర్యుడి వెలుగువలన దీపాలు వెలవెలపోతాయి. కిటికీలలో వీచేగాలి వాటిని అల్లల్లాడిస్తుంది.

ఆ. అంత నుదయశైల మను నశోకద్రుమ । సమితియందుఁ గాంతి చారుభంగి
నెఱయ విరిసి తొలుత నెగసిన యుజ్జ్వల । స్తబక మనఁగఁ బద్మసఖుఁడు పొడిచె. 113

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట - తెల్లవారిన తరువాత; ఉదయ శైలము+అను+అశోక ద్రుమ సమితి+అందున్= తూర్పుకొండ అనే అశోక వృక్షాల సమూహంలో; కాంతి; చారు భంగిన్= మనోహరమైన విధంగా; నెఱయన్= నిండగా; విరిసి= పూసి; తొలుతన్= మొదటిసారి; నెగసిన+ఉజ్జ్వల స్తబకము+అనఁగన్= బయల్వెడలిన ప్రకాశించే పూలగుత్తియో అనేటట్లు; పద్మసఖుఁడు= పద్మబాంధవుడు-సూర్యుడు; పొడిచెన్= ఉదయించాడు.

తాత్పర్యం: అప్పుడు తూర్పుకొండ అనే అశోక వృక్ష సమూహంలో కాంతి మనోహరంగా వ్యాపించగా పూసి మొదటిసారిగా బయల్వెడలిన ప్రకాశించే పూలగుత్తియా అనేటట్లు సూర్యుడు ఉదయించాడు.

విశేషం: అలం: రూపకం. ఉదయశైలమే అశోకద్రుమ సమితి. పద్మసఖుడే ఉజ్జ్వలస్తబకం - రూపకం. తదనుప్రాణితమైన ఉత్ప్రేక్ష. సూర్యబింబం ఎరుపు. అశోకపుష్ప స్తబకం కూడా ఎరుపే. పుష్పస్తబకం గుండ్రన. సూర్యబింబం కూడా గుండ్రనిదే. అంచేత పోలిక సరిపోయింది. తొలుత- సూర్యు డొక్కడే అందుచేత పుష్పస్తబకం కూడా ఒక్కటే. మరి పూయవు. స్తబకమూ, సూర్యబింబమూ రెండూ ఉజ్జ్వలాలే. అశోకద్రుమ సమితి అనటం కొండతో పోలికకు.

సీ. **ఉర్వీధరంబుల నొప్పెడు జేవుఱుఁ । జఱుల కాంతికి నును మెఱుఁగు వెట్టి,**
ధరణీజ గుల్మ లతా వితానము పల్ల । వములకుఁ గట్టెఱ్ఱ వన్నె యొసఁగి,
యరుణాంబుజంబుల యంతర్దళంబుల । తళతళలకు జిగి దళము కొల్పి,
చక్రవాకద్వయ సంతతి యెఱకల । కొమరారు కెంజాయఁ గ్రొత్తసేసి,

ఆ. **తనదు బాలబింబ మనుపమేయప్రభా । పటల జటిల గగనభాగ మగుచు**
నుల్లసిల్లి, జగము లెల్లను విలసిల్లఁ । బూర్వశిఖరిమీఁదఁ బొడిచె నినుఁడు. **114**

ప్రతిపదార్థం: ఉర్వీధరంబులన్= కొండలందు; ఒప్పెడు= ఒప్పే; జేవుఱు+చఱుల కాంతికిన్= జేవురు రంగు చరియల కాంతికి; నును మెఱుఁగు+పెట్టి= ఇంచుక మెరుగుపెట్టి; ధరణీజ గుల్మ లతా వితానము పల్లవములకున్= చెట్లయొక్కయు, పొదలయొక్కయు, తీగల యొక్కయు సమూహం యొక్క చివురులకు; కడు+ఎఱ్ఱ వన్నె+ఒసఁగి= మిక్కిలి ఎరుపురంగు కలిగించి; అరుణ+అంబుజంబుల= ఎఱ్రతామరలయొక్క; అంతర్దళంబుల తళతళలకు= లోపలి రేకుల తళతళమనే కాంతులకు; జిగిన్= మెఱుగుదనాన్ని; దళము+కొల్పి= అధికం చేసి; చక్రవాక ద్వయ సంతతి ఎఱకల= చక్రవాక పక్షుల జంటల సమూహం యొక్క రెక్కల యొక్క; కొమరు+ఆరు= అందగించే; కెంపు+చాయన్= ఎఱ్రటి కాంతిని; క్రొత్త+చేసి= అపూర్వం చేసి; తనదు బాల బింబము= తన యొక్క లేతబింబం; అనుపమేయ ప్రభా పటల జటిల గగన భాగము+అగుచున్= సాటిలేని కాంతుల యొక్క సమూహంచేత క్రిక్కిరిసిన ఆకాశ ప్రదేశం కలది అవుతూ; ఉల్లసిల్లి= ప్రకాశించి; జగములు+ఎల్లను= లోకాలన్నీ; విలసిల్లన్= ప్రకాశించగా; ఇనుఁడు= సూర్యుడు; పూర్వ శిఖరి మీఁదన్= తూర్పు కొండపై; పొడిచెన్= ఉదయించాడు.

తాత్పర్యం: కొండలలో ఒప్పే జేవురురంగు చరియల ఎఱ్రటి కాంతికి ఇంచుక మెరుగు పెట్టి, చెట్ల, పొదల, తీగల సమూహాల చిగుళ్లకు మిక్కిలి ఎరుపు వన్నె కలిగించి, ఎఱ్ర తామరల లోపలి రేకుల తళతళలాడే కాంతిని అతిశయింపజేసి, చక్రవాక పక్షుల జంటల సమూహపు రెక్కల మనోహరమైన ఎఱ్రటి కాంతిని అపూర్వం చేసి, తన లేత బింబం ఆకాశ ప్రదేశాన్ని సాటిలేని కాంతి పుంజంతో క్రిక్కిరిసినదిగా చేస్తూ ఒప్పగా, లోకాలన్నీ ప్రకాశించేటట్లు సూర్యుడు ఉదయ పర్వతం మీద ఉదయించాడు.

విశేషం: అలం: స్వభావోక్తి. కొండ చరియలు సహజంగానే జేవురురంగు కలిగి ఉంటాయి. ఉదయ సూర్యుడి కాంతి వాటి కింకా ఇంచుక మెరుగు పెడుతుంది. చివుళ్ళ కాంతి సహజంగానే ఎరుపు. సూర్యకాంతి దాని నింకా ఎర్రగా చేస్తున్నది. ఎర్ర తామరల లోపలి రేకులు తళతళలాడుతూంటాయి. ఆ తళతళలను మరింత సాంద్రం చేస్తున్నది సూర్యబింబం. చక్రవాక మిథునాల రెక్కలకు ఎర్రటి కాంతిని అపూర్వంగా కలిగిస్తున్నాడు సూర్యుడు.

వ. **ఇట్లు సూర్యోదయం బగుటయు, ధృతరాష్ట్రుండు తత్కాలోచితాచారంబులు నిర్వర్తించి, తగు తెఱంగున నలంకృతుం డయి, యాస్థానమండపంబున కరిగి పేరోలగం బిచ్చినఁ, గుంభ సంభవ కృప కృతవర్మాశ్వత్థామ కర్ణాదు లగు దొరలును, భీష్మ విదుర బాహ్లిక సోమదత్త భూరిశ్రవః ప్రభృతులగు బంధుజనులును, దుర్యోధన దుశ్శాసన ప్రముఖులగు కుమారులును లోనుగాఁ గల సమస్త పరిజనంబులును వచ్చి బలసియుండి; రయ్యవసరంబున సంజయుండు వచ్చి వాకిట నిలిచి పణిహారుల వలనఁ దన్నెఱింగించి పుచ్చి చొచ్చి, సముచిత ప్రదేశంబునం గూర్చుండి, తన మాటలు వినుటకుఁ జిడిముడిపడుచున్న కొలువుఁ గలయం గనుంగొని యిట్లనియె.** **115**

ప్రతిపదార్థం: ఇట్లు; సూర్య+ఉదయంబు+అగుటయున్= సూర్యోదయం కాగా; ధృతరాష్ట్రుండు; తద్+కాల+ఉచిత+ఆచారంబులు= ఆ సమయానికి తగిన పనులు; నిర్వర్తించి= చేసి; తగు తెఱంగునన్= తగిన విధంగా; అలంకృతుండు+అయి= అలంకరించబడినవాడై; ఆస్థాన మండపంబునకున్+అరిగి= సభా మందిరానికి వెళ్ళి; పేరు+ఓలగంబు+ఇచ్చినన్= నిండు సభ తీర్చగా; కుంభసంభవ కృప కృతవర్మ+అశ్వత్థామ కర్ణ+ఆదులు+అగు దొరలును= ద్రోణుడూ, కృపుడూ, కృతవర్మా, అశ్వత్థామా, కర్ణుడూ మొదలైన నాయకులునూ; భీష్మ విదుర బాహ్లిక సోమదత్త భూరిశ్రవస్+ప్రభృతులు+అగు బంధు జనులును= భీష్ముడూ, విదురుడూ, బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవుడూ మొదలుగాగల చుట్టాలునూ; దుర్యోధన దుశ్శాసన ప్రముఖులు+అగు కుమారులును= దుర్యోధనుడూ, దుశ్శాసనుడు మొదలైన కుమారులునూ; లోనుగాన్+కల సమస్త పరిజనులును= మొదలుగాగల ఎల్ల పరివారమూ; వచ్చి; బలసి+ఉండిరి= కూడి ఉన్నారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; సంజయుండు; వచ్చి; వాకిటన్= ద్వారం దగ్గర; నిలిచి; పణిహారుల వలనన్= ద్వారపాలకుల చేత; తన్నున్+ ఎఱింగించి పుచ్చి= తన రాక తెలియజేసి; చొచ్చి= ప్రవేశించి; సముచిత ప్రదేశంబునన్= తగిన స్థానంలో; కూర్చుండి; తన మాటలన్ వినుటకున్; చిడిముడి పడుచున్+ఉన్న= వేగిరపడుతున్న; కొలువున్= సభను; కలయన్+కనుంగొని= అంతటా చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇట్లా సూర్యోదయం కాగా ధృతరాష్ట్రుడు ఆ సమయానికి తగిన పనులు చేసి, తగిన విధంగా అలంకరించుకొని, సభాస్థానానికి వెళ్ళి నిండుసభ తీర్చగా, ద్రోణుడూ, కృపుడూ, కృతవర్మా, అశ్వత్థామా మొదలగు నాయకులూ, భీష్ముడూ, విదురుడూ, బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవుడూ మొదలైన బంధువులూ, దుర్యోధనుడూ, దుశ్శాసనుడూ మొదలగు కుమారులూ, ఇంకా ఉన్న ఎల్ల పరిజనులూ వచ్చి పరివేష్టించారు. ఆ సమయంలో సంజయుడు వచ్చి ద్వారం దగ్గర నిలిచి ద్వారపాలకుల చేత తన రాక తెలిపి ప్రవేశించి తగిన స్థానంలో కూర్చుండి, తన మాటలు వినటానికి తొందరపడుతున్న సభను అన్ని వైపులా చూచి ఇట్లా అన్నాడు.

సంజయుఁడు ధృతరాష్ట్రునితోఁ బాండవుల తెఱంగుసెప్పుట (సం. 5-46-15)

తే. **'పాండురాజ తనూజులపాలి కర్థి । నిమ్మహారాజు పనుపంగ నేఁగి ధర్మ**
పుత్త్రుఁ గాంచితి; నాతండు మైత్రి మెఱయఁ । గౌరవుల సేమ మెల్లఁ బేర్వేర నడిగె. **116**

ప్రతిపదార్థం: పాండురాజు తనూజుల పాలికిన్= పాండురాజు కొడుకుల వద్దకు; అర్థిన్= కోరికతో; ఈ+మహారాజు పనుపంగన్= ఈ ధృతరాష్ట్ర మహారాజు; పంపగా; ఏఁగి= వెళ్ళి; ధర్మపుత్త్రున్= ధర్మరాజును; కాంచితిన్= చూచాను; ఆతండు; మైత్రి మెఱయన్= స్నేహం ప్రకాశించగా- ఒప్పగా; కౌరవుల సేమము+ఎల్లన్= కౌరవుల క్షేమం అంతా; పేర్వేరన్= పేరుపేరునా; అడిగెన్= అడిగాడు.

తాత్పర్యం: 'పాండవుల వద్దకు ఈ ధృతరాష్ట్ర మహారాజు పంపగా వెళ్ళి ధర్మరాజును చూచాను. అతడు చెలిమి ఒప్పగా కౌరవుల యోగక్షేమాలను గురించి పేరుపేరునా అడిగాడు.

వ. మఱియుఁ దగువారల నెల్ల నయ్యై యుచితవిధిం బ్రణామంబున, వినయంబున, బాంధవంబున, మిత్రభావంబున, వాత్సల్యంబునఁ, బ్రసాదంబున నాదరించె; నేనును భూనాథుండు గఱపిన తెఱంగునఁ గొఱంత లేకుండ బంధుత్వంబునకు వలయు మాటలాడితిఁ; బదంపడి కార్యంబు ప్రసంగించి నా యాడిన మాటలకు నయ్యుధిష్ఠిరుండు పలికిన వచనంబు లింత యొప్పునే?' యని యగ్గించిన, ధృతరాష్ట్రుం డవహితుండై యడుగఁ, దా నయ్యుధిష్ఠిరునకుం జెప్పిన భంగులు, నతండు వానికి నెల్ల నుత్తరం బిచ్చిన తెఱంగును నెఱింగించి, ధృతరాష్ట్రునకుం, బితామహునకు, దుర్యోధనునకుం గ్రమంబున వారివారితో నాడుమని నియమించిన చందంబులు ధర్మనందను పలుకుల పరిపాటిం దేటపడం జెప్పి సూతసూనుండు వెండియు నిట్లనియె. 117

ప్రతిపదార్థం: మఱియున్, తగు వారలన్+ఎల్లన్= తగువారినందరినీ, ఆ+ఆ=ఆయా; ఉచిత విధిన్= తగిన విధంగా; ప్రణామంబునన్= నమస్కారంతో; వినయంబునన్= నమ్రతతో; బాంధవంబునన్= చుట్టరికంతో; మిత్ర భావంబునన్= స్నేహభావంతో; వాత్సల్యంబునన్= ప్రేమతో; ప్రసాదంబునన్= అనుగ్రహంతో; ఆదరించెన్= సంభావించాడు; ఏనును= నేనును; భూనాథుండు= రాజు ధృతరాష్ట్రుండు; కఱపిన తెఱంగునన్= బోధించిన విధంగా; కొఱంత లేక+ఉండన్= లోపం లేకుండా; బంధుత్వంబునకున్= చుట్టరికానికి; వలయు మాటలు+ఆడితిన్= అవసరమైన పలుకులు పలికాను; పదంపడి= పిమ్మట; కార్యంబు ప్రసంగించి= వచ్చిన పనిని ప్రస్తావించి; నా+ఆడిన మాటలకున్= నేను పలికిన పలుకులకు; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; పలికిన వచనంబులు= పలికిన పలుకులు; ఇంత+ఒప్పునే!= ఎంత బాగున్నాయి!; అని; అగ్గించినన్= పొగడగా; ధృతరాష్ట్రుండు; అవహితుండు+ఐ+అడుగన్= సావధానుడై అడుగగా; తాను; ఆ+యుధిష్ఠిరునకున్= ఆ ధర్మరాజుకు; చెప్పిన భంగులున్= చెప్పిన తెఱగులూ; అతండు; వానికిన్+ఎల్లన్= వాటి కన్నింటికీ; ఉత్తరంబు+ఇచ్చిన తెఱంగునున్= సమాధానం చెప్పిన విధమూ; ఎఱింగించి= తెలిపి; ధృతరాష్ట్రునకున్; పితామహునకున్= తాతకు- భీష్ముడికి; దుర్యోధనునకున్; క్రమంబునన్= వరుసగా; వారి వారితోన్; ఆడుము+అని= చెప్పుమని; నియమించిన చందంబులున్= విధించిన విధములూ; ధర్మనందను పలుకుల పరిపాటిన్= ధర్మరాజు మాటల క్రమమూ; తేటపడన్+చెప్పి= స్పష్టపడేటట్లు చెప్పి; సూతసూనుండు= సంజయుడు; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇంకా తగువారినందరినీ ఆయా వారికి తగిన రీతిని నమస్కారమూ, వినయమూ, బంధుత్వమూ, స్నేహభావమూ, వాత్సల్యమూ, అనుగ్రహమూ నెరపి ఆదరించాడు. నేను కూడా రాజు బోధించిన విధంగా లోపం లేకుండా బంధుత్వానికి అవసరమైన రీతిగా పలికాను. పిమ్మట, వచ్చిన పనిని ప్రస్తావించి నేను పలికిన పలుకులకు ఆ ధర్మరాజు పలికిన పలుకులు ఎంత బాగున్నాయి!' అని పొగడగా, ధృతరాష్ట్రుడు సావధానుడై అడుగగా, తాను ఆ ధర్మరాజుతో అన్న మాటలూ, అతడు వాటి కన్నింటికీ సమాధానం చెప్పిన విధమూ తెలిపి, ధృతరాష్ట్రుడికీ,

భీష్ముడికీ, దుర్యోధనుడికీ క్రమంగా వారి వారితో చెప్పుమని చెప్పిన రీతులు ధర్మరాజు మాటల క్రమంలో స్పష్ట పడేటట్లు చెప్పి సంజయుడు ఇంకా ఇట్లా అన్నాడు:

తే. **'ఏ నుపప్లావ్య పురమున కేఁగి తొలుత । వాసుదేవార్జునులఁ గంటి; వారు నీతి**
పథము దప్పని మాటలు బలిమిఁ దోఁచు । నట్లుగా నాడి; రవి వినుం డాదరించి.' **118**

ప్రతిపదార్థం: ఏను= నేను; ఉపప్లావ్య పురమునకున్; ఏఁగి; తొలుతన్= మొదట; వాసుదేవ+అర్జునులన్= కృష్ణుడినీ, అర్జునుడినీ; కంటిన్= చూచాను; వారు; నీతి పథము+తప్పని మాటలు= నీతి మార్గం అతిక్రమించని మాటలు; బలిమిన్= విధిగా; తోఁచు+అట్లు+కాన్= స్ఫురించే విధంగా; ఆడిరి= పలికారు; అవి; ఆదరించి వినుండు= ఆదరంతో వినండి.

తాత్పర్యం: 'నేను ఉపప్లావ్యపురానికి వెళ్ళి మొదట కృష్ణార్జునులను చూచాను. వారు నీతిమార్గం తప్పని మాటలు విధిగా తోచేటట్లు పలికారు. వాటిని సాదరంగా వినండి.'

విశేషం: ఉపప్లావ్య నగరంలో సంజయుడు మొదట దర్శించింది వాసుదేవార్జునులను. వాసుదేవుడిని దర్శించబోగా అక్కడ అర్జునుడు అతడి వెంట అంటిపెట్టుకొని ఉన్నాడు. నరనారాయణ మైత్రిని ముమ్మూర్తుల ఈ పుట్టుకలో వారిద్దరు ప్రదర్శించారు. వారిద్దరూ నీతియుక్తంగా పలికారని చెప్పటంవలన వారు కుటిల నీతిని ప్రదర్శించలేదని భావం. (సంపా.)

వ. **అనిన విని ధృతరాష్ట్రుం 'డవ్వాసుదేవు చిత్తం బె? ట్లతం డేమనియె?' నని యడిగిన, నతనికి సంజయుం డిట్లనియె:** **119**

ప్రతిపదార్థం: అనినన్; విని; ధృతరాష్ట్రుండు; ఆ+వాసుదేవు చిత్తంబు+ఎట్లు= ఆ కృష్ణుడి మనస్సు ఎట్లా ఉన్నది?; అతండు; ఏమి+అనియెన్; అని+అడిగినన్; అతనికిన్; సంజయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని ధృతరాష్ట్రుడు 'ఆ కృష్ణుడి మనస్సు ఎట్లా ఉన్నది? అత డే మన్నాడు?' అని అడుగగా, అతడితో సంజయుడు ఇట్లా అన్నాడు.

విశేషం: కృష్ణార్జునులలో వాసుదేవుడి హృదయమేమిటి? అతడి మాటల తీరేమి?టని ధృతరాష్ట్రుడు గుచ్చి గుచ్చి అడిగాడు. పాండవుల బుద్ధిశక్తితోపాటు ఆత్మశక్తికూడ శ్రీకృష్ణుడే. అతడి మాటను వారందరు శిరసా వహిస్తారు. అర్జునుడు ధర్మజుడి తమ్ముడు. అన్న మాట దాటని వాడు. వాసుదేవుడిమాట దైవాజ్ఞగా భావించేవాడు. అందువలన శ్రీకృష్ణుడి అభిప్రాయాన్ని ధృతరాష్ట్రు డడిగాడు. అతడి మాటలలో అతడి హృదయం ప్రతిఫలిస్తుందా? అని ప్రత్యేకించి అడగటం ధృతరాష్ట్రుడి నైజం. తాను మనసుకూ, మాటకూ పొంతన లేనివాడు కావటంచేత లోకమంతా తన వలెనే ఉంటుందని భావిస్తాడు. ఏమైనా ధృతరాష్ట్రుడికి శ్రీకృష్ణుడి రాజనీతిజ్ఞతమీద గౌరవ ప్రపత్తులకన్నా భయసందేహాలే ఎక్కువగా ఉన్నాయని తెలుస్తుంది. (సంపా.)

ఉ. **'తానును సత్యభామయును ద్రౌపదియున్ నరుఁడున్ రహస్యగో**
ష్ఠీ నిరతాత్ముఁడై సుతులుఁ జేరని చెందని యట్టిచోటఁ గాం
తానివహంబు గొల్వఁ బ్రమదస్థితి నుండియుఁ, బిల్వఁబంచె న
న్నా నలినోదరుండు; హృదయంబున నీ దెస కూర్మియెట్టిదో? **120**

ప్రతిపదార్థం: ఆ నలిన+ఉదరుండు= ఆ పద్మనాభుడు- శ్రీకృష్ణుడు; తానును; సత్యభామయునున్; ద్రౌపదియున్; నరుఁడున్= అర్జునుడూ; రహస్య గోష్ఠీ నిరత+ఆత్ముఁడు+ఐ= రహస్య సంభాషణలో ఆసక్తిగల మనస్సు కలవాడయి; సుతులున్= కొడుకులు కూడా; చేరని చెందని+అట్టి చోటన్= దగ్గరకు రానటువంటి చోట; కాంతా నివహంబు= భార్యల సమూహం; కొల్వన్= సేవిస్తూండగా; ప్రమద స్థితిన్+ఉండియున్= ఆనందస్థితిలో ఉండి కూడా; నన్నున్; పిల్వన్+పంచెన్= పిలిపించాడు; హృదయంబునన్= అతడి హృదయంలో; నీ దెస కూర్మి= నీ మీది ప్రేమ; ఎట్టిదో= ఎటువంటిదో (ఎంత గొప్పదో).

తాత్పర్యం: ‘ఆ శ్రీకృష్ణుడూ తనూ, సత్యభామా, ద్రౌపదీ, అర్జునుడూ రహస్య సంభాషణలు గావించే కోరిక కలవాడై కొడుకులు కూడా సమీపించని చోట, భార్యలు కొలుస్తూండగా, ఆనందంగా ఉండి కూడా నన్ను పిలిపించాడు. ఆతడి హృదయంలో నీమీద ఎంత ప్రేమో!

విశేషం: శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడిమీద గల అపారమైన ఆదరగౌరవాలను అతడి దూతను గౌరవించటం ద్వారా ప్రకటించాడు. అంతఃపురంలో కాంతలతో, అర్జునుడితో కలిసి ముచ్చటలాడుతున్న రహస్య సమావేశమది. కొడుకులకే అందులోనికి ప్రవేశం లేదు. కాని, సంజయుడికి దర్శన మిచ్చాడు. అది తన మీది అభిమానం కాదనీ, ధృతరాష్ట్రుడి మీది ప్రేమ అనీ సంజయుడు వ్యాఖ్యానించాడు. శ్రీకృష్ణుడి వర్తనం రెండంచులున్న కత్తి వంటిది. తేనె పూసిన కత్తివలె ధృతరాష్ట్రుడు రాయబారం పంపాడు. శ్రీకృష్ణుడు కూడా దానికి ప్రతిగా వ్యవహరించాడు. శ్రీకృష్ణుడు తనమీద ప్రేమాదరాలు ప్రదర్శించాడంటే నమ్మేంత అమాయకుడు కాడు ధృతరాష్ట్రుడు. అయినా లోకమర్యాద ననుసరించి శ్రీకృష్ణుడి నీతివర్తనం పరమోదారం. (సంపా.)

వ. ఏనును దత్ప్రకారంబు పణిహారుల వలన మున్న యెఱింగిన వాఁడ నగుటం జేసి కంచుకంబును, శిరోవేష్టనంబును ధరియించి వినీత వేషుండనై పోవునప్పుడు కృష్ణార్జును లనేక మణిమయ భూషణ ప్రభా భాసితులై యొక్కసెజ్జన యున్నవారు; కృష్ణుండు పవ్వళించి యుండి, చాఁచిన చరణంబులు దొడలపై నిడికొని యర్జునుండు గూర్చున్నవాఁడు; సత్యభామయుం బాంచాలియుం గద్దియలపై నున్నవారు; సవినయంబుగా నేనును దండప్రణామంబు సేసిన నన్నాదరించి, కృష్ణుని చేసన్న నర్జును పనుపునం గనక రత్నమయంబగు నతని పాదపీఠం బతండు వ్రేల్చిన కాళ్ళు దిగిచికొన; నిద్దఱు ముద్దియ లెత్తి తెచ్చి నాకుం బెట్టిన, నేనును దానిం గరతలంబున నంటుచు ధరణీతలంబునఁ గూర్చుండి, కేలు మొగిడ్చి ఫాలతలంబునం గదియించి, నీలవర్ణులు బాహుబల మద భరితులును నయి యేనుఁగు దోయియుంబోలె నున్న యమ్మాధవధనంజయులఁ జూచునప్పుడు నాకు హర్షాశ్రు పులకలును, దదనంతరంబ భయంబునుం బుట్టె; నట్టియెడ. 121

ప్రతిపదార్థం: ఏనును= నేను కూడా; తద్+ప్రకారంబు= ఆవిధం; పణిహారుల వలనన్= ద్వారపాలకుల వలన; మున్ను+అ= ముందే; ఎఱింగిన వాఁడన్+అగుటన్+చేసి= ఎరిగినవాడనవటం చేత; కంచుకంబును= చొక్కానూ; శిరోవేష్టనంబును= తలపాగానూ; ధరియించి; వినీత వేషుండను+ఐ= పెద్ద మనిషి తరహా వేషం కలవాడినయి; పోవు+అప్పుడు= వెళ్ళేసరికి; కృష్ణ+ అర్జునులు; అనేక మణిమయ భూషణ ప్రభా భాసితులు+ఐ= పెక్కు మణులతో నిర్మించబడిన అలంకారాల కాంతులచేత ప్రకాశించిన వారై; ఒక్క సెజ్జన్+అ= ఏకశయ్యయందే; ఉన్నవారు; కృష్ణుండు; పవ్వళించి+ఉండి= పరుండి; చాఁచిన చరణంబులన్= చాచిన పాదాలను; తొడలపైన్+ఇడికొని= తొడలమీద పెట్టుకొని; అర్జునుండు, కూర్చున్నవాఁడు; సత్యభామయున్; పాంచాలియున్= ద్రౌపదీ; గద్దియలపైన్= పీఠాలమీద; ఉన్నవారు; ఏనును; సవినయంబుగాన్= అడకువతో; దండ ప్రణామంబు+చేసినన్=

సాష్టాంగ నమస్కారం చేయగా; నన్నున్+ఆదరించి= నన్ను సంభావించి; కృష్ణుని చేసన్నన్= కృష్ణుడి చేతి సంజ్ఞతో; అర్జును పనుపునన్= అర్జునుడి ఆజ్ఞచొప్పున; కనక రత్న మయంబు+అగు+అతని పాదపీఠంబు= బంగారుతోనూ; మణులతోనూ చేయబడినదైన అతడి పాదపీఠం; అతండు వ్రేల్చిన కాళ్ళు+తిగిచికొనన్= అతడు పెట్టుకున్న కాళ్ళు తీసికొనగా; ఇద్దఱు ముద్దియలు= ఇద్దరు స్త్రీలు; ఎత్తి; తెచ్చి; నాకున్; పెట్టినన్; నేనును; దానిన్; కరతలంబునన్= చేతితో; అంటుచున్= తాకుతూ; ధరణీ తలంబునన్= నేల మీద; కూర్చుండి; కేలు మొగిడ్చి= చేతులు జోడించి; ఫాల తలంబునన్= నుదుటిమీద; కదియించి= పెట్టి; నీల వర్ణులున్= నల్లని మేని చాయగలవారూ; బాహు బల మద భరితులును= భుజపరాక్రమమనే మదంతో కూడినవారూ; అయి, ఏనుఁగు దోయియున్+పోలెన్= ఏనుగుల జంటా అన్నట్లుగా; ఉన్న, ఆ+మాధవ ధనంజయులన్= ఆ కృష్ణార్జునులను; చూచు+అప్పుడు= చూసేటప్పుడు; నాకున్; హర్ష+అశ్రు పులకలును= సంతోష బాష్పాలూ, గగుర్పాటూ; తద్+అనంతరంబు+అ= ఆ వెంటనే; భయంబునున్; పుట్టెన్= కలిగింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: నేనూ వాళ్ళున్న విధం ద్వారపాలకుల చేత ముందే తెలిసినవాడిని కావడం చేత, చొక్కా, తలపాగా ధరించి పెద్ద మనిషి తరహా వేషంతో వెళ్ళినపుడు కృష్ణార్జునులు పెక్కు మణులు పొదిగిన అలంకారాల కాంతులతో మెరిసిపోతూ ఒక్క శయ్యపైనే ఉన్నారు. కృష్ణుడు పరుండి చాచుకొన్న పాదాలను తన తొడలపై పెట్టుకొని అర్జునుడు కూర్చున్నాడు. సత్యభామా, ద్రౌపదీ పీఠాలపై ఆసీనలయ్యారు. నేను సవినయంగా సాష్టాంగ నమస్కారం చేయగా కృష్ణుడు నన్ను ఆదరించాడు. బంగారంతోనూ, మణులతోనూ, చేసిన పాదపీఠంపై తను పెట్టుకొన్న కాళ్ళు తీసివేయగా, కృష్ణుడి చేతి సంజ్ఞతోనూ, అర్జునుడి ఆజ్ఞ చొప్పునా, ఇద్దరు స్త్రీలు దానిని తెచ్చి నాకు వేయగా, నేను దానిని చేతితో తాకి, నేలపైన కూర్చుండి చేతులు జోడించి నుదుటిపై పెట్టి, నల్లని మేనిచాయ కలిగి, భుజ పరాక్రమ గర్వితులై ఏనుగుల జంటవలె ఉన్న ఆ కృష్ణార్జునులను చూస్తుంటే నాకు ఆనందంతో కళ్ళు చెమర్చాయి, ఒళ్ళు పులకించింది. ఆ తరువాత భయం కూడా వేసింది. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: 1. శ్రీకృష్ణుడి మందిర సన్నివేశంలో ఒక దివ్య వాతావరణాన్ని సంజయుడు దర్శించాడు. వాసుదేవుడు నారాయణుడు. అర్జునుడు పాద సంవాహన రూపమైన సేవాభక్తిని ప్రదర్శిస్తున్న భాగవతోత్తముడు. వారిద్దరు ఒకే శయ్యమీద ఉన్నారు. అది వారి అభేద ప్రవృత్తికి నిదర్శనం. సత్యభామా ద్రౌపదులు వేరే గద్దెలపై కూర్చొని ఉన్నారు. వారు మధుర ముగ్ధ భక్తిభావాలకు ప్రతీకలు. పరమాత్మను సేవించే మూడు రకాల భక్తుల ముప్పేట దృశ్యమది. శ్రీకృష్ణుడికి సంజయుడు దండప్రణామం చేశాడు. అది ఎంతటి రాచరికపు మర్యాదో, అంతటి భక్తి మర్యాద. సంజయుడు దూతగానే కాక, భక్తుడుగా నమస్కరించాడు. అందుకే తనకు రత్న సింహాసనం చూపించినా వద్దని నేలమీద కూర్చున్నాడు. నెన్నుదురును నేలకు తాకించి నమస్కరించాడు. ఏన్గుల జంటవలె ఉన్న నరనారాయణులను చూచి పులకించాడు, ఆనందాశ్రువులను రాల్చాడు. అది భక్తి తన్మయభావానికి ప్రతీక. భక్తిభావం తరువాత భయభావం కలగటం విశేషం. ఇది రసధ్వని. భక్తుడుగా చూచినప్పుడు ఆనందం కలిగింది. ఆ స్థితి నుండి లౌకిక స్థాయికి వచ్చి దూతగా చూచినప్పుడు భయం కలిగింది. ధృతరాష్ట్రుడి సందేశం ఋజుమార్గాన సాగేది కాదు. వాసుదేవుడి ముందు తాను ప్రదర్శించబోయే వక్రనీతికి అతడి అంతరాత్మ భయభావాన్ని ప్రదర్శించింది. తన అనుభవాన్ని దాచుకొనకుండ చెప్పుతున్న సంజయుడి నిజాయితీ ఇందులో స్పష్టం. (సంపా.)

2. 'ఏనుఁగు దోయియిం బోలె నున్న యమ్మాధవధనంజయులన్' - అలంకారం ఉపమ. వాళ్లిద్దరూ ఏనుగులవలె తోచటం చేత 'భయం'.

క. 'ఈ యిరువురుఁ బంచిన పని । సేయుదురటె! ధర్మజునకుఁ జేకుఱని తలం
పేయది? యతనిం దొడరుట । వేయేటికి జముని శిరము వ్రేయుట గాదే?' 122

ప్రతిపదార్థం: ఈ+ఇరువురున్= ఈ ఇద్దరూ కృష్ణార్జునులు; పంచిన పని+చేయుదురు+అటె= ధర్మరాజు చెప్పినపని చేస్తారట!; ధర్మజునకున్= ధర్మరాజుకి; చేకుఱని తలంపు+ఏ+అది= నెరవేరని కోరిక ఇక ఏముంటుంది?; వేయి+ఏటికిన్= వేయి మాట లెందుకు?; అతనిన్+తొడరుట= ఆ ధర్మరాజును ఎదిరించటం; జముని శిరము వ్రేయుట+కాడే= యమధర్మరాజు శిరస్సును తెగవేయటమే కాదా?

తాత్పర్యం: 'ఈ కృష్ణార్జునులిద్దరూ తాను ఏ పనిచెప్పితే ఆ పని చేస్తారట! ఇంక ధర్మరాజుకు నెరవేరని కోరికంటూ ఏముంటుంది? వేయిమాట లెందుకు? ఒక్క మాటలో చెప్పాలంటే, అతడిని యుద్ధంలో ఎదిరించడం అంటే, యమధర్మరాజు శిరస్సును తెగవేయటమే కాదా?

విశేషం: అలం: నిదర్శన. సాక్షాత్తూ యమధర్మరాజు తల తెగెయ్యటం ఎవరికైనా ఎంత అసాధ్యమో, ధర్మరాజును యుద్ధంలో ఎదిరించటం అంత అసాధ్యం అని భావం. 'అతనిం దొడరుట .... జముని శిరము వ్రేయుట గాదే' - ఉపమాన వాక్యార్థానికీ (జముని శిరము వ్రేయుట), ఉపమేయ వాక్యార్థానికీ (అతనిం దొడరుట) అభేదం చెప్పబడటం చేత అలంకారం నిదర్శన.

వ. అని తలంచుచుండ, నమ్మహానుభావులు నన్ను సంభావించి, తా రుపయోగించునట్టి యన్నపానంబులను, దమకుఁగట్టఁదగినట్టి వస్త్రంబులను, దాము దొడుగునట్టి భూషణంబులను నాకుఁ బ్రియంబొనర్చి గారవించిరి, నేనును నా పోయిన కార్యంబు విన్నవించిన; విజయుండు బలుమొగంబుతో దానికి నుత్తరంబు వలుకం దొడంగిన వారించి వారిజోదరుం డిట్లనియె: 123

ప్రతిపదార్థం: అని; తలంచుచున్+ఉండన్= అనుకుంటూంటే; ఆ+మహానుభావులు= ఆ మహాత్ములు; నన్నున్; సంభావించి= ఆదరించి; తారు= తాము; ఉపయోగించు+అట్టి+అన్నపానంబులను= ఉపయోగించే అన్నపానాలనూ; తమకున్+కట్టన్+తగిన+అట్టి వస్త్రంబులను= తాము కట్టదగిన వస్త్రాలనూ; తాము; తొడుగు+అట్టి భూషణంబులను= ధరించే అలంకారాలూ; నాకున్; ప్రియంబు+ఒనర్చి= ప్రీతితో ఇచ్చి; గారవించిరి= గౌరవించారు; నేనును; నా పోయిన కార్యంబు= నేను వెళ్ళిన పని; విన్నవించినన్= మనవి చేయగా; విజయుండు= అర్జునుడు; బలు మొగంబుతోన్= తీక్ష్ణమైన ముఖంతో; దానికిన్; ఉత్తరంబు= సమాధానం; పలుకన్+తొడంగినన్= చెప్పబూనగా; వారిజ+ఉదరుండు= పద్మనాభుడు- శ్రీకృష్ణుడు; వారించి= ఆపి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అనుకుంటూంటే, ఆ మహాత్ములు నన్ను ఆదరించి తాముపయోగించే అన్నపానాలు, తాము కట్టదగిన వస్త్రాలూ, తాము ధరించే ఆభరణాలూ నాకు ప్రీతితో సమర్పించి గౌరవించారు. నేను వెళ్ళిన పని మనవి చేశాను. అప్పుడు అర్జునుడు తీక్ష్ణమైన ముఖంతో దానికి సమాధానం చెప్పబోతూ ఉంటే కృష్ణుడు ఆపి ఇట్లా అన్నాడు:

సంజయుండు ధృతరాష్ట్రునకుఁ గృష్ణుండు సెప్పినమాట లెఱింగించుట (సం. 5-58-18)

తే. 'వినుము సంజయ! ధృతరాష్ట్ర విభుని పెద్ద । కొలువునందుఁ దత్పుత్త్రులు, గురుఁడుఁ, గృపుఁడు,
నాపగానందనుఁడు మొదలైన సకల । జనులు వినుచుండఁగా నిట్టు లనుము నీవు. 124

ప్రతిపదార్థం: సంజయ!= సంజయా!; వినుము; ధృతరాష్ట్ర విభుని పెద్ద కొలువునందున్= ధృతరాష్ట్ర మహారాజు నిండుసభలో; తద్+పుత్త్రులున్= అతడి కొడుకులూ; గురుఁడున్= ద్రోణుడూ; కృపుఁడున్; ఆపగానందనుఁడున్= నదీసుతుడూ- భీష్ముడూ; మొదలు+ఐన= ఆదిగాగల; సకల జనులున్= ఎల్లరూ; వినుచున్+ఉండఁగాన్= వింటూండగా; నీవు; ఇట్టులు+అనుము.

తాత్పర్యం: సంజయా! వినుము. ధృతరాష్ట్ర మహారాజు నిండుసభలో అతడి కొడుకులూ, ద్రోణుడూ, కృపుడూ, భీష్ముడూ మొదలుగాగల వాళ్ళందరూ వింటూండగా నీవు ఇట్లా అనుము.

ఆ. అయ్యజాతశత్రుఁ డలుగుట నీళ్ళుల । నగ్ని పుట్టినట్టి దయ్యెఁ; మీకు
నార్ప వెరవు లేదు; నేర్పుమై నింకఁ గా । వింపవలయు పనులు వినుఁడు మీరు. **125**

ప్రతిపదార్థం: ఆ+అజాతశత్రుఁడు= ఆ ధర్మరాజు; అలుగుట= కోపం వహించటం; నీళ్ళులన్= నీళ్ళల్లో; అగ్ని= నిప్పు; పుట్టిన+అట్టిది+అయ్యెన్= పుట్టటంవంటిది; మీకున్; ఆర్పన్= ఆర్పటానికి; వెరవు= ఉపాయం; లేదు; ఇంకన్= ఇకమీదట; నేర్పుమైన్= నేర్పుతో; కావింపవలయు పనులు= చేయవలసిన పనులు; మీరు; వినుఁడు= వినండి.

తాత్పర్యం: ఆ అజాతశత్రుడికి కోపం రావటం అంటే, నీళ్ళల్లో నిప్పు పుట్టటం వంటిది. దానిని ఆర్పటానికి మీకు ఉపాయం లేదు. ఇక మీదట నేర్పుతో మీరు చేయవలసిన పనులు వినండి.

విశేషం: అలం: నిదర్శన, పరికరాంకురం. 'అయ్యజాతశత్రుఁ డలుగుట నీళ్ళుల - నగ్ని పుట్టినట్టిది' - ఉపమాన వాక్యానికీ (నీళ్ళుల నగ్ని పుట్టుట); ఉపమేయ వాక్యానికీ (అయ్యజాతశత్రుఁ డలుగుట) ఐక్యారోపణం- అభేదం - చెప్పబడింది కాబట్టి అలంకారం నిదర్శన. నీళ్ళల్లో అగ్ని పుట్టడం ఎలాంటి వైపరీత్యమో, అజాతశత్రుడికి (శత్రువులే లేనివాడికి) కోపం రావటం అటువంటి వైపరీత్యమని భావం. 'ధర్మరాజు' శబ్దానికి 'అజాతశత్రు'డనే శబ్దం సాభిప్రాయంగా వాడబడింది కాబట్టి అలంకారం పరికరాంకురం.

వ. అవి యెవ్వి యంటేని. **126**

తాత్పర్యం: అంటే మీరు చేయవలసిన పనులు ఏవి అంటావేమో.

సీ. కలయట్టి వివిధార్థములు నశేషంబుగఁ । దగ నొసంగుండు సత్పాత్రములకుఁ,
జెలులఁ జుట్టముల నాశ్రితులను రావించి । సత్కరింపుఁడు సంతసం బెలర్ప,
నిచ్ఛానుగుణముల నింద్రియసుఖముల । ననుభవింపుఁడు హృదయంబు లలర,
నాండ్రను బిడ్డల నయ్యై విధంబుల । గారవింపుఁడు ప్రియపూరితముగ

తే. మఱియు నెవ్వరి చిత్త మెత్తెఱఁగునందు । వాటమైయుండు నది యెల్ల వలయునట్లు
సేసి విహరింపుఁ; డిం కెడ సేయ కనికి । నడవుఁ డఱచేతఁ బ్రాణంబు లిడి కడంగి. **127**

ప్రతిపదార్థం: కల+అట్టి= ఉన్నట్టి; వివిధ+అర్థములున్= రకరకాల వస్తువులూ; అశేషంబుగన్= నిశ్శేషంగా- సంపూర్ణంగా; సత్+పాత్రములకున్= మంచి యోగ్యులైనవారికి; తగన్= ఒప్పుగా; ఒసంగుండు= ఇచ్చివేయండి; చెలులన్= స్నేహితులను; చుట్టములన్= బంధువులను; ఆశ్రితులను= ఆశ్రయించుకొన్న వాళ్ళనూ; రావించి= రప్పించి; సంతసంబు+ఎలర్పన్= సంతోషం అతిశయించగా; సత్కరింపుఁడు= సమ్మానించండి; ఇచ్ఛా+అనుగుణములన్= కోరికకు అనుకూలమైన వాటిని;

ఇంద్రియ సుఖములన్= ఇంద్రియ సౌఖ్యాలను; హృదయంబులు+అలరన్= హృదయాలు ఆనందించగా; అనుభవింపుడు; ఆంద్రను= భార్యలనూ; బిడ్డలన్= బిడ్డలనూ; ఆ+ఆ విధంబులన్= ఆయా విధాలుగా; ప్రియ పూరితముగన్= ప్రీతి నిండేటట్లు; గారవింపుఁడు= ఆదరించండి; మఱియున్= ఇంకా; ఎవ్వరి చిత్తము= ఎవరి మనస్సు; ఏ+తెఱఁగు+అందున్= ఏ రీతిలో; వాటము+ఐ+ఉండున్= సక్తమై ఉంటుందో-తగిలి ఉంటుందో; అది+ఎల్లన్= అదంతా; వలయు+అట్లు+చేసి విహరింపుఁడు= కావలసిన విధంగా చేసి స్వేచ్ఛగా సంచరించండి; ఇంకన్; ఎడ+చేయక= ఆలస్యం చేయక; అఱచేతన్= అరచేతిలో; ప్రాణంబులు+ఇడి= ప్రాణాలు పెట్టుకొని; కడంగి= పూని; అనికిన్= యుద్ధానికి; నడవుఁడు= నడవండి.

తాత్పర్యం: ఉన్న వస్తువులన్నీ యోగ్యులైనవాళ్ళకు ఒప్పుగా పంచిపెట్టండి. స్నేహితులనూ, చుట్టాలనూ, ఆశ్రితులనూ రప్పించి సంతోషం అతిశయించగా సమ్మానించండి. మీ కోరికలకు అనుకూలంగా హృదయాలు ఆనందించేటట్లు ఇంద్రియసుఖాలు అనుభవించండి. మీ భార్యల్నీ, బిడ్డల్నీ ఎవరికి ఏ విధం తగుతుందో ఆ విధంగా ప్రీతి నిండేటట్టు ఆదరించండి. ఇంకా- ఎవరి మనస్సు ఏ రీతియందు తగిలి ఉంటుందో అదంతా కావలసినవిధంగా స్వేచ్ఛగా చేసి సంచరించండి. ఇంక ఆలస్యం చేయకుండా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని యుద్ధానికి బయల్దేరండి.

విశేషం: కృష్ణుడిట్లా చెప్పడం యుద్ధంలో కౌరవులకు చావు తప్పదనే ఉద్దేశంతో చేయవలసినవీ, అనుభవించవలసినవీ ఇప్పుడే-బ్రతికుండగానే చేసికొనండి అని హెచ్చరిస్తున్నారు.

వ. అని చెప్పు; మింత యేమిటి కంటేని. 128

తాత్పర్యం: ఇదంతా ఎందుకు చెపుతున్నావంటావేమో.

ఉ. ఎందును నెవ్వరుం బడని యెంతయుఁ గష్టముపాటు వచ్చినం
గొందల మంది పాండువిభుకోడలు దవ్వుల నున్న నన్ను 'గో
విందుఁడ ! కావు' మంచుఁ బలవించుట యీఁగఁగరాని యప్పుఁ బో
లెం దలపోయ వ్రేఁగయి చలింపకయున్నది యెప్పుడున్ మదిన్. 129

ప్రతిపదార్థం: పాండువిభు కోడలు= పాండురాజు కోడలు- ద్రౌపది; ఎందునున్= ఎక్కడా; ఎవ్వరున్= ఎవ్వరూ; పడని= అనుభవించని; ఎంతయున్+కష్టము, పాటు, వచ్చినన్= ఎంతో కష్టం వస్తే; కొందలము+అంది= దుఃఖించి; దవ్వులన్+ఉన్న నన్నున్= దూరంగా ఉన్న నన్ను; గోవిందుఁడ!= కృష్ణా!; కావుము= రక్షించుము; అంచున్= అంటూ; పలవించుట= ఏడవటం; ఈఁగఁగన్+రాని+అప్పున్+పోలెన్= తీర్చరాని అప్పువలె; తలపోయన్= చింతించగా; వ్రేఁగు+అయి= బరువై; మదిన్= మనస్సులో; ఎప్పుడున్= నిరంతరమూ; చలింపక+ఉన్నది= నిలిచి ఉన్నది.

తాత్పర్యం: పాండురాజు కోడలు - ద్రౌపది ఎప్పుడూ ఎవరూ పడని ఎంతో కష్టం వస్తే, దుఃఖించి, ఎక్కడో దూరంగా ఉన్న నన్ను 'గోవిందా! రక్షించుము' అంటూ ఏడవటం తీర్చలేని అప్పువలె - ఆలోచించగా బరువై నా మనస్సులో ఎప్పుడూ నిలిచి ఉన్నది.

విశేషం: యుద్ధంలో కౌరవులు నశించినప్పుడే ఆ అప్పు తీరుతుంది అని కృష్ణుడి అభిప్రాయం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **ఇట్టి యేఁ దేరు గడపంగ, నెందు నుతికి । నెక్కు గాండీవ మేడ్తెఱ నెక్కు వెట్టి**
రెండు దొనలను బూని కిరీటి యనికి । వచ్చు నేఁ డెల్లి; యెందుఁ బోవచ్చు మీకు?' **130**

ప్రతిపదార్థం: ఇట్టి+ఏన్= ద్రౌపదికి ఋణగ్రస్తుడనై ఉన్న నేను; తేరు+కడపంగన్= రథం తోలగా; ఎందున్= ఎక్కడా; నుతికిన్ ఎక్కు గాండీవము= పొగడ్తకెక్కు గాండీవం; ఏడ్తెఱన్= పరాక్రమంతో; ఎక్కు+పెట్టి= సజ్యం చేసి- నారి తొడిగి; రెండు దొనలను= రెండు అమ్ముల పొదులను; పూని= ధరించి; కిరీటి= అర్జునుడు; నేఁడు+ఎల్లి= ఈవేళ రేపట్లో; అనికిన్= యుద్ధానికి; వచ్చున్; మీకున్; ఎందున్+పోన్+వచ్చున్?= ఎక్కడకు తప్పించుకొని పోవీలౌతుంది? (కాదని భావం).

తాత్పర్యం: ద్రౌపదికి అప్పుపడి ఉన్న నేను రథం తోలగా, పొగడ్త కెక్కిన గాండీవాన్ని పరాక్రమంతో ఎక్కుపెట్టి రెండు అంపపొదులను ధరించి అర్జునుడు ఈవేళ రేపట్లో యుద్ధానికి వస్తాడు. ఇక మీరు ఎక్కడికి పోతారు?'

విశేషం: శ్రీకృష్ణుడి మనోగతమైన భావం ఈ తేటగీతిలో తేటతెల్లమవుతున్నది. ద్రౌపదికి శ్రీకృష్ణుడు పడిన అప్పును తీర్చికొనటానికే శ్రీకృష్ణుడు పార్థసారథిగా పూనుకొంటాడు. రథస్థుడైన అర్జునుడు గాండీవ పరాక్రమాన్ని ప్రదర్శిస్తాడు. ఇక కౌరవులు తప్పించుకొనే అవకాశం లేదు అని హెచ్చరించాడు. (సంపా.)

వ. **అని పలుకునప్పటి వారి యెత్తికోలును, నీ కొడుకు నిలుపోపమియునుం దలంచి భయం బందితి; నితండు వారల నెఱుంగండు; భీష్మద్రోణుల ప్రాపును, గర్ణు గర్వంబును దన్ను గెలిపించునని నచ్చి తొడరెడు' ననిన విని ధృతరాష్ట్రుం 'డర్జునుం డేమనియె?' నని యడిగిన నతనికి సంజయుం డిట్లనియె:** **131**

ప్రతిపదార్థం: అని పలుకు+అప్పటి వారి+ఎత్తికోలును= అని పలికేటప్పటి వారి పూనికా (కోరికా); నీ కొడుకు నిలుపు+ఓపమియునున్= నీ కొడుకు దుర్యోధనుడు (వాళ్ళకు ఇవ్వవలసిందేదో) విడవలేకపోవటమూ; తలంచి; భయంబు+అందితిన్= భయపడ్డాను; ఇతండు= దుర్యోధనుడు; వారలన్= పాండవులను; ఎఱుంగండు; భీష్మ ద్రోణుల ప్రాపును= భీష్మద్రోణుల అండా; కర్ణు గర్వంబును= కర్ణుడి గర్వమూ; తన్నున్+గెలిపించున్+అని నచ్చి తొడరెడున్= తనను గెలిపిస్తాయని నమ్మి ఎదిరిస్తాడు; అనినన్; విని; ధృతరాష్ట్రుండు; అర్జునుండు; ఏమి+అనియెన్; అని; అడిగినన్; అతనికిన్; సంజయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికేటప్పటి వారి పూనికా, నీ కొడుకు వాళ్ళకివ్వవలసింది ఇవ్వలేకపోవటమూ తలచుకొని నేను భయపడ్డాను. ఇతడికి వాళ్ళ సంగతి తెలియదు. భీష్మద్రోణుల అండా, కర్ణుడి గర్వమూ తనను గెలిపిస్తాయనే ధీమాతో ఎదిరిస్తాడు' అనగా, ధృతరాష్ట్రుడు విని 'అర్జును డేమన్నాడు?' అని అడుగగా అతడికి సంజయుడు ఇట్లా అన్నాడు:

విశేషం: శ్రీకృష్ణుడు పార్థసారథిగా యుద్ధంలో పాల్గొంటానని చెప్పి శత్రు సంహారం చేసేది అర్జునుడే అని ధ్వనింపజేశాడు. అందువలన అర్జునుడి అభిప్రాయాన్ని ధృతరాష్ట్రుడు తెలిసికొనగోరాడు. అర్జునుడు శ్రీకృష్ణుడికి అంగమా? ధర్మరాజుకు అంగమా? అనే అనుమానం కలిగి ఉండవచ్చును. ఏమైనా పాండవ పక్షంలో పార్థుడి అభిప్రాయానికి బలమున్నదని భావించి ధృతరాష్ట్రుడు అడిగాడు. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంజయుఁడు ధృతరాష్ట్రున కర్జునుఁడు చెప్పిన మాట లెఱింగించుట (సం. 5-47-6)

క. 'నరుఁ డలుక వొడమియును సు । స్థిరుఁడై, తన యెఱ్ఱ సెరల చెలువునఁ గెందా
మరలం దెగడెడు కన్నుల । నరుణచ్ఛవి నెఱయ నిట్టు లనియె నరేంద్రా! 132

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా, ధృతరాష్ట్రా!; నరుఁడు= అర్జునుడు+పొడమియును= కోపం వచ్చినా; సుస్థిరుఁడు+ఐ= చలించని వాడయి; తన+ఎఱ్ఱ సెరల చెలువునన్= తన కళ్ళల్లోని జీరల కాంతితో; కెంపు+తామరలన్= ఎఱ్ఱ తామరలను; తెగడెడు కన్నులన్= తిరస్కరించే కన్నులలో; అరుణ+ఛవి= ఎఱ్ఱని కాంతి; నెఱయన్= నిండగా; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! కోపం వచ్చినా అర్జునుడు చలించక, తన కళ్ళల్లోని ఎఱ్ఱటి జీరల కాంతి చేత ఎఱ్ఱ తామరలను తిరస్కరించే కళ్ళల్లో ఎఱ్ఱటి కాంతి నిండగా ఇట్లా అన్నాడు.

విశేషం: అర్జునుడి కళ్ళల్లో ఎఱ్ఱటి జీరలుండటం చేత వాటి కాంతిచే అవి ఎఱ్ఱ తామరలవలె ఉన్నాయి. వాటిలో ఎఱ్ఱటి కాంతి నిండటం కోపాతిశయంచేత.

ఆ. 'ఆ సుయోధనుండు, నతనికిఁ దోడ్పడ । నరుగుదెంచినట్టి ధరణినాథ
చయము వినుచునుండ సంజయ ! నా వచ । నములు గాఁగ ని ట్లనంగవలయు. 133

ప్రతిపదార్థం: సంజయ!= సంజయుడా!; ఆ సుయోధనుండున్= ఆ దుర్యోధనుడూ; అతనికిన్; తోడ్పడన్+అరుగుదెంచిన+అట్టి= సాయపడటానికి వచ్చినట్టి; ధరణినాథ చయమున్= రాజుల సమూహమూ; వినుచున్+ఉండన్= వింటూండగా; నా వచనములు+కాఁగన్= నా మాటలుగా; ఇట్లు+అనంగన్ వలయున్= ఇట్లా చెప్పాలి.

తాత్పర్యం: 'సంజయా! ఆ దుర్యోధనుడూ, అతడికి సాయపడటానికి వచ్చిన రాజుల సమూహమూ వింటూండగా నా మాటలుగా నీవు ఇట్లా అనాలి.

ఉ. పాండుని యగ్రనందనుఁడు పా లడుగం దగ నీఁడయేని, మా
కొం డన నేల? మే లది; సుయోధనుఁ డింతకుమున్ను పెక్కు లు
ద్దండతఁ దాను జేసిన విధంబుల కెల్ల మెఱుంగు వెట్టిన
ట్లుండెడుఁ గాక, యేనును వృకోదరుఁడుం బ్రియమందునట్లుగన్. 134

ప్రతిపదార్థం: పాండుని+అగ్ర నందనుఁడు= పాండురాజు పెద్ద కొడుకు ధర్మరాజు; పాలు+అడుగన్= భాగం ఇమ్మంటే; తగన్= ఒప్పుగా; ఈఁడు+అ+ఏనిన్= ఇవ్వకపోతే; మాకున్; ఒండు+అనన్+ఏల= ఇంకో మాట అనటం ఎందుకు?; అది; మేలు= మంచిది; ఇంతకున్+మున్ను= ఇదివరకు; సుయోధనుఁడు= దుర్యోధనుడు; ఉద్దండతన్= తెగువతో; తాను; చేసిన పెక్కులు విధంబులకున్+ఎల్లన్= చేసిన ఎన్నో వాటికన్నిటికీ; ఏనును= నేనూ; వృక+ఉదరుఁడున్= భీముడూ (తోడేలు పొట్టవంటి పొట్టగలవాడు); ప్రియము+అందు+అట్లుగన్= సంతోషిస్తూండగా; మెఱుంగు+పెట్టిన+అట్లు+ఉండెడున్+కాక= మెరుగుపెట్టినట్లుగా ఉంటుందిలే.

తాత్పర్యం: ధర్మరాజు భాగం ఇమ్మని అడిగితే ఒప్పుగా ఇవ్వకపోతే, మేము ఇంకో మాట అనటం ఎందుకు? అది మంచిది. ఇంతకు ముందు దుర్యోధనుడు మహాగర్వంతో చేసిన ఎన్నో పనుల కన్నింటికీ - నేనూ భీముడూ సంతోషించేటట్టుగా మెరుగుపెట్టినట్లు ఉంటుందిలే.

విశేషం: 'ఇంతకు మున్ను .... మెఱుంగు వెట్టి నట్లుండెడుఁగాక' - ఇంతకు ముందు దుర్యోధనుడు మాకెన్నో అపకారాలు చేశాడు. అవి మా ప్రతీకారానికి చాలనివైతే; ఇప్పుడు ధర్మరాజు కోరినట్లుగా భాగం ఇవ్వకపోవడం వాటికి తోడై, మా ప్రతీకారానికి తగినవౌతాయని భావం.

క. **మా యిరువురతోఁ గయ్యము । సేయ నతం డియ్యకొనిన, సిద్ధించెన కా**
దే యుచితచరితుఁ డగు కౌం । తేయాగ్రజు కార్య; మట్టి తెఱఁగొప్పుఁ గదా! **135**

ప్రతిపదార్థం: మా+ఇరువురతోన్= మా ఇద్దరితో-నాతోనూ; భీముడితోనూ; కయ్యము+చేయన్= యుద్ధం చేయడానికి; అతండు= దుర్యోధనుడు; ఇయ్యకొనినన్= అంగీకరిస్తే; ఉచిత చరితుఁడు+అగు కౌంతేయ+అగ్రజు కార్యము= మంచినడవడి కల ధర్మరాజు పని; సిద్ధించెన్+అ+కాదే= ఫలించినట్లే కాదా?; అట్టి తెఱఁగు= అటువంటి విధం; ఒప్పున్+కదా!= మంచిది కదా!

తాత్పర్యం: దుర్యోధనుడు నాతోనూ, భీముడితోనూ యుద్ధం చేయటానికి అంగీకరిస్తే, ఇంక మాకు కావలసిందేమిటి? ధర్మరాజు అనుకున్నపని నెరవేరినట్లే! అట్లా అయితే మంచిదే కదా!

విశేషం: దుర్యోధనాదులను ప్రతిఘటించటంలో భీమార్జునుల సంఘటిత శక్తిని ప్రస్తావించటం ప్రకరణౌచిత్యం. వ్యంగ్యంగా ధర్మజ నాయకత్వాన్ని అర్జునుడు సమర్థించటం సూక్ష్మాంశం. (సంపా.)

క. **వనవాసంబున భూశ । య్యను ధర్మజుఁ డున్నయట్టి యాయాసము వో**
వునె, యంపశయ్య దుర్యో । ధనుఁడు రణక్షోణిఁ బడక తక్కిన యేనిన్? **136**

ప్రతిపదార్థం: దుర్యోధనుఁడు; రణ క్షోణిన్= యుద్ధభూమిలో; అమ్మ+శయ్య= అమ్ముల సెజ్జ మీద; పడక తక్కిన+ఏనిన్= పడకుండా ఉన్నట్లయితే; ధర్మజుఁడు= ధర్మరాజు; వన వాసంబునన్= అరణ్యవాసంలో; భూశయ్యను= నేలే పాన్పుగా; ఉన్న+అట్టి+ఆయాసము= ఉన్న కష్టం; పోవునె?= పోతుందా?

తాత్పర్యం: దుర్యోధనుడు యుద్ధభూమిలో అమ్ముల పాన్పు మీద పడకుండా ఉంటే, ధర్మరాజు వనవాస సమయంలో నేలమీదే పరుండి పడ్డ ఆయాసం పోతుందా?

విశేషం: దుర్యోధనుడు రణరంగంలో అంపశయ్యమీద పడటం అనేది ధ్వనిమయమైన ఆలంకారికోక్తి. ధర్మరాజు వనవాసంలో నేలమీద పడుకొని ఎంత బాధపడ్డాడో ఆ ఆయాసం దుర్యోధనుడికి అంపశయ్యపై శయనించినప్పుడు తెలియాలి. నేలమీద పడుకొన్న ధర్మజుడి దుఃఖం తాత్కాలికం. కాని, దుర్యోధనుడి అంపశయ్య మరణశయ్యయే ఔతుందని ధ్వని. (సంపా.)

ఉ. **సూనృత మూఁది బన్నములు సూడక లోన నడంచినట్టి కో**
పానల మెండియున్న నిబిడాటవిపైఁ బచరించు తీవ్ర దా

వానలుఁ బోలి శాత్రవచయంబుపయిం గవియించి నిల్చినం
గాని యుధిష్ఠిరున్ సరకుగాఁ గొన రా ధృతరాష్ట్రనందనుల్. 137

ప్రతిపదార్థం: సూనృతము+ఊఁది= సత్యాన్ని పట్టుకొని; బన్నములు+చూడక= కష్టాలు లెక్కచేయక; లోనన్= లోపల; అడంచిన+అట్టి= అణచిపెట్టినట్టి; కోప+అనలము= కోపం అనే అగ్ని; ఎండి+ఉన్న నిబిడ+అటవిపైన్= ఎండిపోయి ఉన్న దట్టమైన అడవి మీద; పచరించు= వ్యాపించే; తీవ్ర దావ+అనలున్+పోలి= దారుణమైన కార్చిచ్చువలె; శాత్రవ చయంబుపయిన్= విరోధి వర్గం మీద; కవియించి= వ్యాపింపజేసి; నిల్చినన్+కాని= నిలిస్తేనేకాని; ఆ ధృతరాష్ట్ర నందనుల్= ఆ ధృతరాష్ట్రుడి కొడుకులు- కౌరవులు; యుధిష్ఠిరున్= ధర్మరాజును; సరకుగాన్+కొనరు= లక్ష్యపెట్టరు.

తాత్పర్యం: సత్యాన్నే పట్టుకొని, కష్టాలను పరిగణించక, లోపలే అణచుకొన్న కోపాగ్నిని ఎండిపోయి ఉన్న దట్టమైన అడవిమీదకు ప్రసరించే దారుణమైన కార్చిచ్చువలె - శత్రు సమూహంపైకి వ్యాపింప జేస్తేనే కాని ధృతరాష్ట్రుడి కొడుకులు యుధిష్ఠిరుడిని లెక్కచేయరు.

విశేషం: 'లోన నడంచినట్టి కోపాగ్ని... గవియించి' .....అలంకారం ఉపమ. కోపాగ్ని....కోపమనే అగ్ని....రూపకం. రూపకానుప్రాణితమైన ఉపమ. 'యుధిష్ఠిరున్' ఇక్కడ ధర్మరాజుకు యుధిష్ఠిర శబ్దం సాభిప్రాయంగా ప్రయోగించబడింది. కాబట్టి అలంకారం పరికరాంకురం.

మ. గద సారించుచు నంత్యకాల విచలత్కాలాకృతిన్ భీముఁ డు
న్మద మాతంగచయంబు నుగ్గుగ, లసన్నానా రథవ్రాతముల్
చదియన్, భూరి హయవ్రజంబు పొడిగా సంరంభతుంగాంగుఁడై
కదియం జూచి బలే! సుయోధనుఁడు భాగం బిచ్చు రాజ్యంబునన్. 138

ప్రతిపదార్థం: భీముఁడు; అంత్య కాల విచలత్ కాల+ఆకృతిన్= ప్రళయ సమయంలో విశేషంగా చలించే యముడివలె; గదసారించుచున్= గద త్రిప్పుతూ; ఉన్మద మాతంగ చయంబు= మిక్కిలి మదించిన ఏనుగుల గుంపు; నుగ్గుగన్= ముక్కలు కాగా; లసత్+నానా రథ వ్రాతముల్= ఒప్పుతూన్న అనేక రథాల సమూహాలు; చదియన్= నలిగిపోగా; భూరి హయ వ్రజంబు= అధికమైన గుఱ్ఱాల సమూహం; పొడి+కాన్= పొడికాగా; సంరంభ తుంగ+అంగుఁడు+ఐ= ఉద్రేకం చేత ఎత్తయిన శరీరం కలవాడై; కదియన్= సమీపించగా; సుయోధనుఁడు= దుర్యోధనుడు; చూచి; రాజ్యంబునన్= రాజ్యంలో; భాగంబు+ ఇచ్చున్ బలే!= భాగం ఇస్తాడు సుమీ!

తాత్పర్యం: భీముడు ప్రళయకాలంలో విశేషంగా చలించే యముడివలె గద త్రిప్పుతూ, మదించిన ఏనుగుల సమూహం ముక్కలు ముక్కలు కాగా, ఒప్పే పెక్కు రథాల సమూహాలు నలిగిపోగా, అధికమైన గుఱ్ఱాల సమూహం పొడియైపోగా; ఉద్రేకంతో పెరిగిన శరీరం కలవాడై సమీపించటం చూచి దుర్యోధనుడు రాజ్యంలో భాగం ఇస్తాడు సుమీ!

విశేషం: 'అంత్యకాల విచలత్కాలాకృతిన్' - అలంకారం ఉపమ. 'ఆకృతి' శబ్దం ఇక్కడ ఇవార్థకం - ఉపమా వాచకం.

సీ. కోల్పులి వీఁకమై గొదగొని లేళ్లకు । నుఱుకు తెఱంగునఁ దటియఁ జొచ్చి,
పెనుగాలి జీమూత బృందంబుపైఁ బెట్టి । దంబుగ వీఁచుచందమున నడరి,
కసి మసంగిన మారి గడఁగి జీవులమీఁద । నుగ్రతఁ గవియున ట్లురవడించి,
యాఁకొన్న లయరుద్రుఁ డాగ్రహంబున జగ । త్ప్రచయంబు ముట్టెడు భంగిఁ బొదివి.

తే. నకులుఁడును, దదనుజుఁడు, సాత్యకియు, నా సు । భద్ర కొడుకును నెదిరిన బలము నెల్ల
బెదరఁ, జెదర, బడల్పడఁ, బెల్లు సావఁ । జేయఁగని కౌరవులు సంధి సేయువారు. 139

ప్రతిపదార్థం: కోల్పులి= పెద్దపులి; వీఁకమైన్= పరాక్రమంతో; గొదగొని= ఆకలిగొని; లేళ్లకున్= లేళ్లకై; ఉఱుకు తెఱంగునన్= ఉరికే విధంగా; తటియన్+చొచ్చి= తాకి; పెనుగాలి= పెద్దగాలి; జీమూత బృందంబుపైన్= మేఘాల సమూహం మీద; బెట్టిదంబుగన్= భయంకరంగా; వీచు చందమునన్= వీచే విధంగా; అడరి= విజృంభించి; కవిసి- కసి మసంగిన మారి= రెచ్చిపోయిన మృత్యుదేవత; కడఁగి= పూని; జీవుల మీఁదన్= ప్రాణులపై; ఉగ్రతన్= భయంకరత్వంతో; కవియు+అట్లు= పడే విధంగా; ఉరవడించి= విజృంభించి; ఆఁకొన్న= ఆకలిగొన్న; లయ రుద్రుఁడు= ప్రళయకాల రుద్రుడు; ఆగ్రహంబునన్= కోపంతో; జగత్+ప్రచయంబున్= లోకాల సమూహాన్ని; ముట్టెడు భంగిన్= ఆక్రమించే విధంగా; పొదివి= మార్కొని; నకులుఁడును+తద్+అనుజుఁడున్= నకులుడూ, అతడి తమ్ముడు సహదేవుడూ; సాత్యకియున్; ఆ సుభద్ర కొడుకును= ఆ సుభద్ర కొడుకైన అభిమన్యుడూ; ఎదిరిన బలమున్+ఎల్లన్= ఎదుర్కొనిన సైన్యాన్ని అంతనూ; బెదరన్= భయపడేటట్లుగాను; చెదరన్= చెల్లాచెదరయి పోయేటట్లుగాను; బడల్పడన్= చీకాకుపడేటట్లుగాను; పెల్లు+చావన్= ఎక్కువగా చచ్చేటట్లుగాను; చేయన్= చేయగా; కని= చూచి; కౌరవులు; సంధి+చేయువారు= సంధి చేస్తారు.

తాత్పర్యం: బెబ్బులి ఆకలిగొని పరాక్రమంతో క్రౌర్యంతో లేళ్ళమీదికి ఉరికే విధంగా తాకీ, పెద్ద గాలి మేఘసమూహంపై భయంకరంగా వీచే విధంగా కవిసీ, రెచ్చిపోయిన మృత్యుదేవత పూని ప్రాణులపై క్రూరంగా పడే విధంగా విజృంభించీ, ఆకలిగొన్న ప్రళయ సమయ రుద్రుడు ఆగ్రహంతో లోకాల సమూహాన్ని ఆక్రమించే విధంగా మార్కొనీ, నకులుడూ, సహదేవుడూ, సాత్యకీ, అభిమన్యుడూ తమ్మెదుర్కొన్న శత్రుబలమంతా బెదిరిపోయేటట్లూ, చెల్లాచెదరయిపోయేటట్లూ; చీకాకు పడేటట్లూ, పెక్కుమంది చచ్చేటట్లు చేస్తే చూచి కౌరవులు సంధి చేస్తారు.

విశేషం: అలం: ఉపమ. సీసపద్యంలోని ఒక్కొక్క పాదాన్ని తేటగీతిలోని ఒక్కొక్క వీరుడితో సమన్వయిస్తే బాగుంటుంది. కోల్పులి లేళ్ల మీదకు ఉరికేటట్లు నకులుడు శత్రుసైన్యాన్ని బెదరగొట్టితేనూ, పెనుగాలి మేఘాల్ని తరిమేటట్లు సహదేవుడు శత్రు బలాన్ని బెదరగొట్టితేనూ, రెచ్చిపోయిన మృత్యువు జీవులపై పడే విధంగా సాత్యకి వైరి సేనను చీకాకు పరిస్తేనూ, ఆకొన్న ప్రళయకాల రుద్రుడు లోకాలను ఆక్రమించే విధంగా అభిమన్యుడు విరోధి సైన్యాన్ని చంపితేనూ- ఇట్లా సమన్వయించడానికి అవకాశం ఉన్నది. అప్పుడు అలంకారం యథాసంఖ్యం- తదనుప్రాణితమైన ఉపమ. పద్యంలో ఒక్కొక్క ఉపమానాన్నీ, ఒక్కొక్కవీరుడినీ, అతడు చేసే పనినీ విడివిడిగా చెప్పటంచేత ఈ రీతి సమన్వయం సముచితమేమో అనే ఊహ వచ్చింది.

ఉ. చిత్తము లుల్లసిల్ల, నల సింహకిశోరము లొక్కమై మదో
న్మత్త గజావళిం బొదువుమాడ్కి నరాతి బలంబు ముట్టి, యు
ద్వృత్తిఁ గడంగి యప్రతిమవీరులు ద్రౌపదిపుత్త్రులేవురున్
నెత్తురు నీరఁ దేల్చిన ననిం గని మీ నృపుఁ డల్క దీఱెడిన్. 140

ప్రతిపదార్థం: అప్రతిమ వీరులు ద్రౌపది పుత్రులు+ఏవురున్= సాటిలేని పరాక్రమవంతులైన ద్రౌపది కొడుకులు (ఉపపాండవులు) అయిదుగురూ; చిత్తములు= మనస్సులు; ఉల్లసిల్లన్= సంతోషించగా; అల= ఆ; సింహ కిశోరములు= సింగపు కొదమలు; ఒక్కమ్మైన్= ఒక్క పెట్టున; మద+ఉన్మత్త గజ+ఆవళిన్= మదంచేత మిక్కిలి పొగరెక్కిన ఏనుగుల వరసను; పొదుపు మాడ్కిన్= ఆక్రమించే విధంగా; అరాతి బలంబున్= శత్రుసైన్యాన్ని; ముట్టి= తాకి; ఉద్వృత్తిన్= గర్వంతో; కడంగి= పూని; నెత్తురు నీరన్= రక్తం అనే జలంలో; తేల్చినన్= తేలిస్తే; అనిన్= యుద్ధాన్ని; కని= చూసి; మీ నృపుఁడు= మీ రాజు - దుర్యోధనుడు; అల్క+తీఱెడిన్= కోపం వీడుతాడు.

తాత్పర్యం: సాటిలేని పరాక్రమవంతులైన ఉపపాండవు లైదుగురూ మనస్సులు సంతోషించగా సింగపు కొదమలు ఒక్క పెట్టున మదించిన ఏనుగుల గుంపులను ఆక్రమించే విధంగా శత్రుసైన్యాన్ని ఆక్రమించి నెత్తురు అనే నీటిలో తేలిస్తే, ఆ యుద్ధాన్ని చూసి మీ రాజు - దుర్యోధనుడు శాంతిస్తాడు.

విశేషం: అలం: ఉపమ. నెత్తురు నీరన్ అనే చోట రూపకం. 'చిత్తము లుల్లసిల్లన్' అనేదానిని ఉపమేయోపమానాలు రెండింటితోనూ ద్రౌపది పుత్త్రులు చిత్తము లుల్లసిల్లన్ సింహ కిశోరములు చిత్తము లుల్లసిల్లన్ అనే రీతిగా అన్వయించవచ్చును.

మ. చెలులుం జుట్టలు నిష్టభృత్యులు మహాజిం బ్రాణముల్ డాఁప కు
జ్జ్వలులై తో నడవన్, విరాటుఁడును బాంచాలుండు నేపారి సే
నల యుద్రేకము రౌద్రముం బెనుప, నానా హేతి ఘోరంబుగాఁ
దలపడ్డం గని గాక; స్రుక్కుదురె గాంధారీసుతుల్ మాటలన్? 141

ప్రతిపదార్థం: చెలులున్= స్నేహితులూ; చుట్టలున్= చుట్టాలూ; ఇష్టభృత్యులున్= ఇష్టులైన సేవకులూ; మహా+ఆజిన్= గొప్ప యుద్ధంలో; ప్రాణముల్; డాఁపక= దాచుకోకుండా; ఉజ్జ్వలులు+ఐ= ప్రకాశించేవారై; తోన్= కూడా; నడవన్= నడవగారాగా; విరాటుఁడును; పాంచాలుండున్= ద్రుపదుడూ; ఏపు+ఆరి= విజృంభించి; సేనల= సేనల యొక్క; ఉద్రేకమున్= విజృంభణమూ; రౌద్రమున్= కోపమూ; పెనుపన్= వృద్ధి పొందించగా; నానా హేతి ఘోరంబు+కాన్= పెక్కు ఆయుధాల చేత భయంకరమైనదికాగా; కని కాక= చూసికాని; గాంధారీ సుతుల్= గాంధారి కొడుకులు - కౌరవులు; మాటలన్= మాటలచేత; స్రుక్కుదురె= వెనుకకు తగ్గుతారా?

తాత్పర్యం: స్నేహితులూ, చుట్టాలూ, ఇష్టసేవకులూ మహాయుద్ధంలో ప్రాణాలు దాచుకోకుండా ప్రకాశిస్తూ వెంట రాగా విరాటుడూ, ద్రుపదుడూ విజృంభించి సేనల విజృంభణమూ, రౌద్రమూ వృద్ధిపొందిస్తూ, అనేకాయుధాలతో భయంకరంగా మార్మోగనడం చూచికాని కౌరవులు మాటలచేత వెనుకకు తగ్గుతారా?

చ. తఱిమి శిఖండి తన్నొరులు దాఁకఁగ నెవ్వరి దిక్కుఁజూడ కే
డ్తెఱఁ దనపూన్కిపై మనము ధీరత నిల్పి, రథంబు బల్విడిం
బఱపి, కురుక్షితీశుఁడను బ్రహ్మకు వేయును నిండ భీష్ముపై
కుఱికినఁ గాక, మాకు సగ మూరక యిత్తురె మీరు మేదినిన్? 142

ప్రతిపదార్థం: శిఖండి; తన్నున్; ఒరులు= శత్రువులు; తాఁకఁగన్= ముట్టగా; ఎవ్వరి దిక్కున్+చూడక= ఎవరివైపూ చూడక; తఱిమి= కవిసి; ఏడ్తెఱన్= పరాక్రమంతో; తన పూన్కిపైన్= తన పనిమీద; మనము= మనస్సు; ధీరతన్= ధైర్యంతో; నిల్పి;

రథంబున్; బల్విడిన్= వేగంగా; పఱపి= పోనిచ్చి; కురుక్షితి+ఈశుఁడు+అను బ్రహ్మకున్= కురురాజు - దుర్యోధనుడు అనే బ్రహ్మకు; వేయును నిండన్= వేయేళ్ళు నిండగా- మరణించగా; భీష్మపైన్= భీష్ముడి మీదకు; ఉఱికినన్+కాక= ఉరికితేనే కాని; మాకున్; మీరు; మేదినిన్= భూమిలో- రాజ్యంలో; సగము; ఊరక+ఇత్తురె?= ఊరికే ఇస్తారా?

తాత్పర్యం: తనను శత్రువులు ముట్టగా శిఖండి ఎవరివైపూ చూడక కవిసి పరాక్రమంతో తన పనిమీదే మనస్సు ధైర్యంతో నిలిపి, రథం వేగంగా పోనిచ్చి, కురురాజు (దుర్యోధనుడు) అనే బ్రహ్మకు వెయ్యేళ్ళూ నిండగా- మరణించగా- భీష్ముడి మీదకు ఉరికితేనే కాని మాకు మీరు రాజ్యంలో సగం ఊరికే ఇస్తారా?

విశేషం: కురుక్షితీశుఁ డను బ్రహ్మకు- అలంకారం రూపకం, శిఖండి - పూర్వజన్మలో అంబ. భీష్ముడు తనను నిరాకరించాడనే కోపంతో అతడిని సాధించాలని తపస్సు చేసింది. తరువాత జన్మలో ఆమె ద్రుపదుడికి కూతురై పుడుతుంది. కాని, తల్లిదండ్రు లామెను పురుషుడుగానే పెంచి, హేమవర్మ కూతురుతో వివాహం చేస్తారు. తన అల్లుడు పురుషుడు కాడని తెలిసి హేమవర్మ ద్రుపదుడిపై దండెత్తుతాడు. శిఖండి స్థూలకర్ణుడనే యక్షుడి అరణ్యంలో ప్రాయోపవేశం చేస్తూండగా, స్థూలకర్ణుడామె వృత్తాంతం విని తన పురుషత్వం ఆమెకిచ్చి, ఆమె స్త్రీత్వం తాను గ్రహిస్తాడు. శిఖండి భారత యుద్ధంలో పాండవుల పక్షంలో ఉంటాడు. షండులతోనూ, స్త్రీలతోనూ యుద్ధం చేయనని భీష్ముడి ప్రతిజ్ఞ. ఆ విషయం తెలిసికొని పాండవులు భీష్ముడితో యుద్ధం చేయుమని శిఖండిని నియోగిస్తారు. భీష్ముడు శిఖండిని చూడగానే అస్త్రసన్న్యాసం చేస్తాడు.

శా. **విద్యుద్దండము నిల్చిపొల్చినగతిన్ విల్లందమైయుండ న**
స్మ ద్యోధావలి మానసంబున రణోత్సాహంబు రెట్టింప ధృ
ష్టద్యుమ్నుండు గడంగి ద్రోణుఁ గడిమిన్ డాయంగ, వీక్షించి కా
కుద్యోగించుట కేల తక్కుదురు మీ రుగ్రాహవక్రీడకున్? **143**

ప్రతిపదార్థం: విద్యుత్+దండము= మెఱపు దండం; నిల్చి; పొల్చిన గతిన్= ఒప్పిన విధంగా; విల్లు, అందము+ఐ+ఉండన్= అందంగా ఉండగా; అస్మద్+యోధ+ఆవలీ మానసంబునన్= మా వీరుల వరుస యొక్క మనస్సులో; రణ+ఉత్సాహంబు= యుద్ధోత్సాహం; రెట్టింపన్= ఇనుమడించగా; ధృష్టద్యుమ్నుండు= ద్రుపద పుత్రుడు; కడంగి= పూని; ద్రోణున్= ద్రోణుడిని; కడిమిన్= పరాక్రమంతో; డాయంగన్= సమీపించగా; వీక్షించికాక= చూచికాని; మీరు; ఉగ్ర+ఆహవ క్రీడకున్= భయంకరమైన యుద్ధం అనే ఆటకు; ఉద్యోగించుటకున్= పూనుటకు; ఏల తక్కుదురు?= ఎందుకు విరమిస్తారు?

తాత్పర్యం: విద్యుద్దండంవలె విల్లు అందగించగా, మా యోధుల మనస్సులలో యుద్ధోత్సాహం ఇనుమడించగా, ధృష్టద్యుమ్నుడు పూని ద్రోణుడిని పరాక్రమంతో సమీపించగా చూచికాని మీరు భయంకర యుద్ధక్రీడకు పూనుకొనటం ఎందుకు విరమిస్తారు?

విశేషం: విద్యుద్దండము నిల్చిపొల్చినగతిన్ విల్లందమైయుండ - అలంకారం ఉపమ. విద్యుద్దండం మెరిసి ఇట్టే అదృశ్యమవుతుంది. అది క్షణప్రభ. అందుచేతనే 'నిల్చి' అనటం. ధృష్టద్యుమ్నుడు ద్రుపదుడి కొడుకు. ద్రోణుడు తనను అవమానించటం చేత, అతడిని చంపగల కొడుకు కొరకు ద్రుపదుడు పుత్రేష్టి చేస్తాడు. ధృష్టద్యుమ్నుడూ, ద్రౌపదీ యజ్ఞకుండంలోంచి పుట్టుతారు. ధృష్టద్యుమ్నుడు పాండవుల పక్షంలో ఉండి కౌరవులతో పోరాడతాడు. అతడు ద్రోణుడిని చంపలేదు కాని, చనిపోయిన ద్రోణుడి శిరస్సు ఖండిస్తాడు. ఆ కోపంతో ద్రోణ పుత్రుడైన అశ్వత్థామ ధృష్టద్యుమ్నుడిని రాత్రి శిబిరంలో నిద్రపోతూండగా ఆకస్మికంగా మీదబడి వధిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. గాండీవ గుణ రవం బొండొండ చెలఁగంగ, । శరపరంపర లాకసంబు గప్పఁ,
బ్రతి విశిఖములు ఖండితములై రాలంగ, । నెదిరి సైన్యంబుల మదగజాది
చతురంగములును జర్జరితంబులై యవ । యవ భేద మెఱుఁగని యట్లు గాఁగఁ
దునిసిన, నెత్తురు నెనడును నెమ్ములు । నెఱచియుఁ గండలు నెనసి సమర

తే. తలము ఘోరంబుగాఁ, గపిధ్వజము, ధవళ । హరులు శోభిల్ల, నొగలపై హరి యెలర్ప,
దేవదత్తంబు మ్రోయఁ దోఁతెంచునట్టి । రథముఁ గని కాని కానఁడు రాజరాజు. 144

ప్రతిపదార్థం: గాండీవ గుణ రవంబు= గాండీవమనే వింటి యొక్క అల్లెత్రాటి ధ్వని; ఒండు+ఒండు+అ= క్రమక్రమంగా; చెలఁగంగన్= మ్రోయగా; శరపరంపరలు= బాణాల వరుసలు; ఆకసంబు+కప్పన్= ఆకాశాన్ని కప్పివేయగా; ప్రతి విశిఖంబులు= ఎదిరి బాణాలు- శత్రువుల బాణాలు; ఖండితములు+ఐ= ముక్కలయి; రాలంగన్= రాలిపోగా; ఎదిరి సైన్యంబులన్= శత్రుసేనల యందలి; మద గజ+ఆది చతురంగములును= మదించిన ఏనుగులు మున్నగు నాలుగు యుద్ధాంగాలూ- రథ, గజ, తురగ, పదాతులు; జర్జరితంబులు+ఐ= తూంట్లు పడినవయి; అవయవ భేదము+ఎఱుఁగని+అట్లు+కాఁగన్= అవయవాల తేడా ఎరగని విధంగా; తునిసినన్= ముక్కలయిపోగా; నెత్తురున్+నెనడునున్= రక్తమూ, ఎముకలలోని క్రొవ్వూ(మూలుగ); ఎమ్ములున్= ఎముకలూ; ఎఱచియున్= మాంసమూ; కండలున్; ఎనసి= కలిసి; సమరతలము= యుద్ధభూమి; ఘోరంబు+కాన్= భయంకరం కాగా; కపి ధ్వజమున్; ధవళ హరులున్= శ్వేతాశ్వాలూ; శోభిల్లన్= ప్రకాశించగా; నొగలపైన్= బండికాడికట్టుకఱ్ఱలపై- తొట్టెలో; హరి= కృష్ణుడు; ఎలర్పన్= ఒప్పగా; దేవదత్తంబు మ్రోయన్= దేవదత్తమనే శంఖం మ్రోయగా; తోఁతెంచు+అట్టి= కనబడే; రథమున్+కని కాని= రథాన్ని చూచికాని; రాజరాజు= దుర్యోధనుడు; కానఁడు= చూడడు- తెలిసికొనడు.

తాత్పర్యం: గాండీవమనే వింటి అల్లెత్రాటి ధ్వని క్రమక్రమంగా మ్రోయటమూ, బాణాల సమూహాలు ఆకాశాన్ని కప్పివేయటమూ, శత్రువుల బాణాలు ముక్కలై రాలటమూ, శత్రు సేనలలోని మత్తేభాలు మొదలుగాగల చతురంగ బలాలూ తూంట్లు పడినవై, ఇది ఈ అవయవం అనే వైనం తెలియకుండేటట్లు ముక్కలైపోగా, రక్తంతోనూ, మజ్జతోనూ, ఎముకలతోనూ, మాంసంతోనూ, కండలతోనూ కూడి యుద్ధభూమి భయంకరం కావటమూ, కపిధ్వజమూ, తెల్లగుఱ్ఱాలూ ఒప్పగా, తొట్టెలో హరి ఒప్పగా, దేవదత్తమనే శంఖం మ్రోయగా కనబడే రథం చూచికాని రాజరాజు- దుర్యోధనుడు కానలేడు.

విశేషం: అలం: పర్యాయోక్తం. ఈ విషయం మాటాడుతూన్నవాడు అర్జునుడు. అతడు తన పేరు చెప్పకుండా, విన్నవాళ్లకు అర్జునుడని స్ఫురించే విధంగా మాటాడింపజేశాడు కవి. కపిధ్వజమూ, ధవళ హరులూ, తొట్టెలో హరీ, దేవదత్తము - ఇవి ఆ రథం అర్జునుడిదని స్ఫురింపజేస్తున్నాయి. ఇది పర్యాయోక్తమనే అలంకారం. భంగ్యంతరం చేత గమ్యార్థసిద్ధి జరగటం పర్యాయోక్తం.

శా. బాలక్రీడ మహాసురప్రకరమున్ భంజింపఁడే? యెప్పుడుం
ద్రైలోక్యంబును భక్తియుక్తిఁ దగ నారాధింపదే? యట్టి శౌ
ర్యాలంకారు మహాత్ముఁ దా సరకుసేయం డచ్యుతున్! మ మ్మతం
డేలా కైకొను? నా సుయోధనునియం దెగ్గేది యూహింపఁగన్? 145

ప్రతిపదార్థం: బాలక్రీడన్= పిల్లాటయందు; మహా+అసుర ప్రకరమున్= గొప్ప రాక్షసుల సమూహాన్ని; భంజింపఁడే?= చంపడా? ఎప్పుడున్= నిత్యమూ; త్రైలోక్యంబును= మూడు లోకాల సమూహమూ; భక్తి యుక్తిన్= భక్తితో; తగన్= ఒప్పుగా; ఆరాధింపదే?= పూజింపదా?; అట్టి శౌర్య+అలంకారున్= అటువంటి పరాక్రమం అలంకారంగా కలవాడిని, మహాత్మున్= మహానుభావుడిని, అచ్యుతున్= కృష్ణుడిని; తాన్= తాను - దుర్యోధనుడు; సరకు+చేయండు= లక్ష్యపెట్టడు; అతండు= దుర్యోధనుడు; మమ్మున్; ఏలా= ఎందుకు; కైకొనున్?= లక్ష్యపెడతాడు?; ఊహింపఁగన్= ఆలోచింపగా, ఆ సుయోధనునియందున్= ఆ దుర్యోధనుడిలో; ఎగ్గు+ఏది?= దోషమేది- అపరాధ మేముంది?

తాత్పర్యం: పిల్లాటయందు ఘోర రాక్షసుల సమూహాన్ని చంపడా? నిత్యమూ మూడులోకాలూ భక్తితో ఒప్పుగా పూజింపవా? అటువంటి పరాక్రమం అలంకారంగా కలవాడూ, మహాత్ముడూ అయిన కృష్ణుడిని తను లెక్కచేయడు! ఇంక అతడు మమ్మల్ని ఎందుకు లెక్కచేస్తాడు? ఆలోచిస్తే ఆ దుర్యోధనుడిలో తప్పేముంది?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. శౌర్యాలంకారుడూ, మహాత్ముడూ అయిన కృష్ణుడినే లెక్కచేయని దుర్యోధనుడు మమ్మల్ని లెక్క చేయకపోవటం దోషం కాదు- సహజమే అని భావం. 'తా సరకు సేయం డచ్యుతున్ మమ్మతండేలా కైకొను?' అచ్యుతుడినే సరకుసేయనివాడు మమ్మల్ని సరకు సేయడని వేరే చెప్పాలా? అని కైముత్యం చేత అర్థ సంసిద్ధి జరుగుతోంది కాబట్టి అలంకారం కావ్యార్థాపత్తి.

వ. ఏము పితామహ గురు కృపాచార్యులకు నమస్కరించి, యస్మదీయ రాజ్యభాగంబునకై తొడరి కయ్యంబు సేయువారము; కౌరవులకుంబూని యెవ్వరేమాతోఁబెనంగినను వారి శస్త్రాస్త్రంబులు ధర్మప్రతిహతంబులగునని తలంచెదము; పండ్రెండు వత్సరంబులు వనంబున నమ్మెయి నిడుమలం బడి, జనపదంబునం బదుమూఁడగునేఁ డజ్ఞాతవాసాయాసం బట్లనుభవించి వచ్చి, మా తండ్రి పాలికినై పెనం గు మమ్ము నింద్రాది సుర సహాయులయ్యును ధార్తరాష్ట్రులు గెల్చువారైరేని ధర్మంబుకంటె నధర్మము బలవంతం బైనయదియగు; నింతియకాని మా చేయునట్టిది గీ డైనదిగా; దేము వాసుదేవుని మున్నిడుకొని నడతుము గావున, నీ యుద్ధంబునం జయంబు మాకు సిద్ధంబ; యెల్ల భంగులం గర్ణ సహితంబుగా గాంధారీనందనులం దునిమి యేము భూమి గొనుట దప్పదు; 'గాండీవంబు దివియకయును గుడుసువడియెడు; బాణంబులు దమయంతన తూణీరంబుల వెడలెడుఁ; దోలూడ్చు మహానాగంబునుంబోలెఁ గరవాలంబు దాన యొఱవెలికి నిగుడుచున్నయది గావున, మా కవశ్యంబును సంగరంబు సంభవించుఁ; బాశుపతాది దివ్యశరంబులం గురుపక్ష ప్రజాక్షయంబు సేసి శాంతిం బొందెదము; సూతనందనా! నీవు సుస్థిరుండవై యింతయుం దెలియం బలుకవలయు; నిమ్మాటలు విని కురువృద్ధుండగు బాహ్లికుండును, బితామహుండగు భీష్ముండును, గురుం డగు కుంభసంభవుండును, శిక్షకుండగు కృపాచార్యుండును, గురుపుత్రుండగు నశ్వత్థామయు, సద్బుద్ధి యగు విదురుండును, ధర్మాచరణకల్యుండగు శల్యుండును నెయ్యది నిశ్చయించి పలికి రది యయ్యెడు; సుయోధనాదు లాయుష్మంతు లగువారకాక! యని పలికె.' నని చెప్పిన విని మందాకినీనందనుం డందఱు విన దుర్యోధనున కి ట్లనియె: 146

ప్రతిపదార్థం: ఏము= మేము; పితామహ గురు కృపాచార్యులకున్= భీష్ముడికీ, ద్రోణుడికీ, కృపాచార్యుడికీ; నమస్కరించి; అస్మదీయ రాజ్య భాగంబునకై= మా రాజ్యభాగం కొరకు; తొడరి= పూని; కయ్యంబు+చేయువారము= యుద్ధం చేస్తాం;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కౌరవులకున్+పూని= కౌరవులకొర్కై యత్నించి; ఎవ్వరేన్= ఎవరైనా; మాతోన్; పెనంగినను= యుద్ధం చేస్తే; వారి శస్త్ర+అస్త్రంబులు; ధర్మ ప్రతిహతంబులు+అగున్+అని తలంచెదము= ధర్మం చేత దెబ్బ కొట్టబడినవి అవుతాయని భావిస్తాం; పండ్రెండు వత్సరంబులు= పన్నెండేళ్ళు; వనంబునన్= అడవిలో; ఆ+మెయిన్= ఆ విధంగా; ఇడుమలన్+పడి= కష్టా లనుభవించి; జనపదంబునన్= దేశంలో; పదుమూఁడగు+ఏఁడు= పదమూడోయేడు; అజ్ఞాతవాస+ఆయాసంబు+అట్లు+అనుభవించి వచ్చి= అజ్ఞాతవాస కష్టం ఆ విధంగా అనుభవించి వచ్చి; మా తండ్రి పాలికినై= మా తండ్రి వాటా కొరకు; పెనంగు మమ్మున్= పోరాడే మమ్మల్ని; ఇంద్ర+ఆది సుర సహాయులు+అయ్యును= ఇంద్రుడు మొదలగు దేవతలు తోడుగా గలవారయినా; ధార్తరాష్ట్రులు= కౌరవులు; గెల్చువారు+ఐరి+ఏనిన్= గెలిస్తే; ధర్మంబు కంటెన్; అధర్మంబు; బలవంతంబు ఐన+అది+అగున్= బలవత్తరం అవుతుంది; ఇంతియకాని= ఇంతేకాని; మా చేయు+అట్టిది= మేము చేసేది; కీడు+ఐనది+కాదు= తప్పుకాదు; ఏము; వాసుదేవునిన్= కృష్ణుడిని; మున్ను+ఇడికొని= ముందు పెట్టుకొని; నడతుము; కావునన్; ఈ యుద్ధంబునన్, జయంబు; మాకున్; సిద్ధంబు+అ= సిద్ధమే; ఎల్లభంగులన్= అన్ని విధాలా; కర్ణ సహితంబుగాన్= కర్ణుడితో కూడా; గాంధారీ నందనులన్= గాంధారి కొడుకులను-కౌరవులను; తునిమి= వధించి; ఏము= మేము; భూమి+కొనుట; తప్పదు; గాండీవంబు; తివియకయును= లాగకుండానే; గుడుసు+పడియెడున్= గుండ్రంగా చుట్టుకుంటున్నది; బాణంబులు; తమ+అంతన్+అ= తమకు తామే; తూణీరంబులన్+వెడలెడున్= అమ్ముల పొదులలోనుండి వెలువడుతున్నాయి; తోలు+ఊడ్చు మహత్ నాగంబునున్+పోలెన్= కుబుసం విడిచిపెట్టే పెద్ద పామువలె; కరవాలంబు= కత్తి; ఒఱ వెలికిన్= ఒరబయటికి; నిగుడుచున్+ఉన్న+అది= వస్తున్నది; కావునన్; మాకున్; అవశ్యంబును= తప్పక; సంగరంబు= యుద్ధం; సంభవించున్= కలుగుతుంది; పాశుపత+ఆది దివ్య శరంబులన్= పాశుపతం మొదలైన దేవతా సంబంధ్యాస్త్రాలతో; కురు పక్ష ప్రజా క్షయంబు+చేసి= కౌరవుల పక్షంలో ఉన్న జనుల నాశనం చేసి; శాంతిన్+పొందెదము= శాంతిస్తాం; సూత నందనా!= సంజయా!; నీవు; సుస్థిరుండవు+ఐ= నిలకడగలవాడవై-జంకులేనివాడవయి; ఇంతయున్= ఇదంతా; తెలియన్+పలుకవలయున్= తెలపాలి; ఈ+మాటలు; విని; కురు వృద్ధుండు+అగు బాహ్లికుండును= కురు వంశంలో పెద్దవాడైన బాహ్లికుడూ; పితామహుండు+అగు భీష్ముండును= తాత అయిన భీష్ముడూ; గురుండు+అగు కుంభసంభవుండును= ద్రోణుడూ; శిక్షకుండు+అగు కృపాచార్యుండును= ఆచార్యుడైన కృపుడూ; గురు పుత్త్రుండు+అగు+అశ్వత్థామయున్= ద్రోణుడి కుమారుడైన అశ్వత్థామా; సత్+బుద్ధి+అగు విదురుండును= బుద్ధిమంతుడైన విదురుడూ; ధర్మ+ఆచరణ కల్యుండు+అగు శల్యుండును= ధర్మం ఆచరించటంలో సమర్థుడైన శల్యుడూ; ఎయ్యది= ఏది; నిశ్చయించి= నిర్ణయించి; పలికిరి; అది; అయ్యెడున్; సుయోధన+ఆదులు= దుర్యోధనుడు మొదలగువారు; ఆయుష్మంతులు+ అగు వారు+అ కాక= ఆయువు కలవాళ్ళు అవుతారు కాక; అని; పలికెన్; అని; చెప్పినన్; విని; మందాకినీ నందనుండు= గంగాసుతుడు- భీష్ముడు; అందఱున్; వినన్; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: మేము భీష్ముడికీ, ద్రోణుడికీ, కృపుడికీ నమస్కరించి, మా రాజ్యభాగానికై పూని యుద్ధం చేస్తాం. కౌరవుల కొరకు ఎవరైనా మాతో యుద్ధం చేసినా, వారి శస్త్రాలూ, అస్త్రాలూ ధర్మంచేత నిరోధించబడతాయని భావిస్తాం. పన్నెండేళ్ళు అడవిలో అలా కష్టా లనుభవించి, గ్రామంలో పదమూడోయేడు అజ్ఞాతవాస కష్టం అట్లా అనుభవించి వచ్చి, మా తండ్రి వాటా కొరకు పోరే మమ్ములను, ఇంద్రాది దేవతలు తోడు వచ్చినా కౌరవులు గెలిస్తే, ధర్మం కంటె అధర్మం బలవత్తరం అన్నమాట. ఇంతేకాని మేము చేసేది తప్పు కాదు. మేము కృష్ణుడిని ముందు పెట్టుకొని నడుస్తాం కాబట్టి ఈ యుద్ధంలో గెలుపు మాదే, అన్ని విధాల కర్ణుడితో కూడా కౌరవులను వధించి మేము భూమిని పుచ్చుకొనటం తప్పదు, గాండీవం లాగకుండానే వంగుతున్నది. బాణాలు తమకు తామే అంప పొదులలోనుండి వెలువడుతున్నాయి. కుబుసం విడిచే మహాసర్పంవలె ఖడ్గం తనంతట తానే ఒరలో నుండి బయటికి వస్తున్నది. కాబట్టి మాకు తప్పకుండా యుద్ధం జరిగితీరుతుంది. పాశుపతాది దివ్యాస్త్రాల చేత కురుపక్షంలో

ఉన్న వాళ్ళను నశింపజేసి శాంతిస్తాం. సంజయా! నీవు ఏమీ జంకకుండా ఇదంతా స్పష్టపరచాలి. ఈ మాటలు విని కురువృద్ధుడైన బాహ్లికుడూ, తాత అయిన భీష్ముడూ, గురుడైన ద్రోణుడూ, ఆచార్యుడైన కృపుడూ, గురుపుత్రుడైన అశ్వత్థామా, బుద్ధిమంతుడైన విదురుడూ, ధర్మనిర్వహణ దక్షుడైన శల్యుడూ ఏది నిర్ణయించి పలుకుతారో అది జరుగుతుంది. దుర్యోధనాదులు దీర్ఘాయువు లవుతారు కాక' అన్నాడు. ఆ మాటలు విని భీష్ముడు అందరూ వినేటట్లు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 'గాండీవంబు దివియకయును గుడుసువడియెడు - బాణంబులు దమయంతన తూణీరంబుల వెడలెడు; కరవాలంబు దాన యొఱ వెలికి నిగుడుచున్నయది.' అలంకారం విభావన. కారణం లేకుండానే కార్యం జరిగినట్లు చెప్పటం విభావనాలంకారం. 'తోలూడ్చు మహానాగంబునుం బోలెఁ గరవాలంబు దాన యొఱ వెలికి నిగుడుచున్నయది'- అలంకారం ఉపమానుప్రాణిత విభావన.

సీ. **నలినగర్భుఁడు పెద్ద కొలువున నున్నెడ । సురపతి ప్రముఖుల చూడ్కులెల్ల**
మెఱయు తేజంబున మిఱుమిట్లు గొన నిద్ద । ఱచ్చట నొరసికొంచరుగఁ జూచి,
'వీ రెవ్వ, రిమ్మెయి మీ రుండ సరుకుసే । యని యట్లు వోయెడు నట్టివార?'
లని బృహస్పతి బ్రహ్మ నడిగిన నతని కి । ట్లనియె నా చతురాస్యుఁ డాదరమునఁ

తే. **దపము పెంపును బలశౌర్యదర్పములును । గలిగి లోకహితార్థంబుగాఁ జరింతు**
రే యుగంబున నరుఁడు నారాయణుండు । నసఁ బ్రసిద్ధికి నెక్కిన మునులు సుమ్ము!' **147**

ప్రతిపదార్థం: నలిన గర్భుఁడు= తమ్మిచూలి-బ్రహ్మ; పెద్ద కొలువునన్= నిండు సభలో; ఉన్న+ఎడన్= ఉండగా; సురపతి ప్రముఖుల చూడ్కులు+ఎల్లన్= ఇంద్రాదుల చూపులన్నీ; మెఱయు తేజంబునన్= ప్రకాశించే తేజస్సుతో; మిట్లు+మిట్లు+కొనన్= కళ్ళు చెదిరిపోయేటట్లు; ఇద్దఱు= ఇరువురు; అచ్చటన్; ఒరసికొంచున్= రాసుకొంటూ; అరుగన్+చూచి= వెళ్ళటం చూచి; వీరు= ఈ ఇరువురూ; ఎవ్వరు?; ఈ+మెయిన్= ఈ విధంగా; మీరు+ఉండన్= మీరు ఉంటూండగా; సరకు+చేయని+అట్లు= లెక్కచేయనట్లు; పోయెడు+అట్టివారలు= ప్రవర్తిస్తున్నారు; అని; బృహస్పతి; బ్రహ్మన్; అడిగినన్= అడుగగా; ఆ చతురాస్యుఁడు= ఆ బ్రహ్మ; ఆదరమునన్= ప్రీతితో; అతనికిన్; ఇట్లు+అనియెన్; తపము పెంపును= తపోమహిమా; బల శౌర్య దర్పములను= బలం, శౌర్యం, గర్వం కలిగి; లోక హిత+అర్థంబుగాన్= లోకం మేలుకోసం; ఏ యుగంబునన్= ఏ యుగంలో అయినా; నరుఁడున్ నారాయణుండున్+అనన్+ప్రసిద్ధికిన్+ఎక్కిన మునులు= నరుడూ నారాయణుడూ అని ప్రసిద్ధి వహించిన మునులు; చరింతురు సుమ్ము!= సంచరిస్తారు సుమా!

తాత్పర్యం: బ్రహ్మ నిండుసభ తీర్చి ఉండగా, ఇంద్రాదుల చూపులన్నీ- మెరిసిపోయే తేజస్సుతో కళ్ళుమిరుమిట్లు కొలిపేటట్లు ఇద్దరు ఒకరినొకరు రాసుకుంటూ వెళ్ళటం చూచి, 'ఈ ఇరువురూ ఎవ్వరు? మీ రుంటూండగా మిమ్ములను లక్ష్యపెట్టనట్లు సంచరిస్తున్నారు?' అని బృహస్పతి బ్రహ్మనడుగగా, ఆ బ్రహ్మ ప్రీతితో ఇట్లా అన్నాడు: 'తపశ్శక్తీ, బలమూ, పరాక్రమమూ, గర్వమూ కలిగి లోకహితం కొరకు ప్రతియుగంలోనూ నరుడూ, నారాయణుడూ అని ప్రసిద్ధికెక్కిన మునులు సంచరిస్తారు సుమా!'

వ. **అని పలికి వెండియు** **148**

తాత్పర్యం: అని పలికి, ఇంకా.

క. 'అనిమిషహితము దనుజ నా। శనమును జేయుదు; రధర్మ సంగ్రామము గ
ల్గిన చోట ధర్మపరు లగు। జనముల గెలిపింతు రధిక సంరంభమునన్. 149

ప్రతిపదార్థం: అనిమిష హితమున్= దేవతలకు మేలూ; దనుజ నాశనమును= రాక్షస వినాశాన్నీ; చేయుదురు; అధర్మ సంగ్రామము= అధర్మ యుద్ధం; కల్గిన చోటన్; ధర్మపరులు+అగు జనములను= ధర్మాత్ముర్మలైన జనుల్నీ; అధిక సంరంభమునన్= మిక్కిలి ఆటోపంతో; గెలిపింతురు.

తాత్పర్యం: 'దేవతలకు హితమూ, రాక్షసులకు వినాశమూ చేస్తారు. అధర్మయుద్ధం జరిగేచోట ధర్మపరులైన జనులను మిక్కిలి ఆటోపంతో గెలిపిస్తారు.

వ. దేవాసుర యుద్ధంబు నప్పు డింద్రుండు వోయి వీరి నారాధించి తో డడిగినం, జనుదెంచి పౌలోమ కాలకేయాదులగు ననేక దైత్య దానవులం జంపి యింద్రునకు విజయంబు గావించి; రది మొదలుగా వీరల నెల్లవారలు నెఱింగియుండుదు; రిది యొక్క తేజంబ రెండు దెఱంగులై వెలుంగుచుండు' నని చెప్పి, వినోదార్థంబు జన్మాంతరంబు నొందిన యమ్మహాత్ములు గదా యీ యర్జునుండును వాసుదేవుండును! నర్జునుండు సముద్రతీరంబున హిరణ్యపురంబు వొడిచి నివాతకవచుల నఱువది వేవుర నిర్జించి పర్జన్యునకుఁ బ్రియంబుసేసె; వాసుదేవు పరాక్రమంబు గంస నరకాసుర ప్రముఖ నిఖిల దుష్ట నిగ్రహంబునం బ్రసిద్ధంబు గాదె? తెలియ విను మున్నరూపు సెప్పెద. 150

ప్రతిపదార్థం: దేవ+అసుర యుద్ధంబు+అప్పుడు= దేవదానవ యుద్ధ సమయంలో; ఇంద్రుండు+పోయి; వీరిన్; ఆరాధించి= పూజించి; తోడు= సహాయం; అడిగినన్= అడుగగా; చనుదెంచి= వచ్చి; పౌలోమ కాలకేయ+ఆదులు+అగు= పౌలోములు; కాలకేయులు మొదలగు; అనేక దైత్య దానవులన్= పెక్కురు దైత్యులనూ, దానవులనూ; చంపి; ఇంద్రునకున్; విజయంబు= గెలుపు; కావించిరి; అది మొదలుగాన్; వీరలన్; ఎల్లవారలున్= అందరూ; ఎఱింగి+ఉండుదురు; ఇది; ఒక్క తేజంబు+అ= ఒక తేజస్సే; రెండు+తెఱంగులు+ఐ= రెండు విధాలయి; వెలుంగుచున్+ఉండున్= ప్రకాశిస్తూ ఉంటుంది; అని; చెప్పెన్; ఈ+అర్జునుండును; వాసుదేవుండును= కృష్ణుడూ; వినోద+అర్థంబు= వేడుకకొరకు; జన్మ+అంతరంబున్+ఒందిన= మరో జన్మనందిన; ఆ+మహాత్ములు+కదా!= ఆ మహానుభావులే కదా!; అర్జునుండు; సముద్ర తీరంబునన్= సముద్రపుటొడ్డున; హిరణ్యపురంబు+పొడిచి; నివాతకవచులన్; అఱువది వేవురన్= అరవై వేల మందిని; నిర్జించి= జయించి; పర్జన్యునకున్= ఇంద్రుడికి; ప్రియంబు+చేసెన్= ప్రీతి కలిగించాడు; వాసుదేవు పరాక్రమంబు= కృష్ణుడి శౌర్యం; కంస నరక+అసుర ప్రముఖ నిఖిల దుష్ట నిగ్రహంబునన్= కంసుడూ; నరకాసురుడూ మొదలయిన ఎల్ల దుర్మార్గుల వధచేత; ప్రసిద్ధంబు+కాదె= తెలిసిందేకదా; ఉన్న రూపు= ఉన్న విధం; చెప్పెదన్; తెలియన్+వినుము.

తాత్పర్యం: దేవ దానవ యుద్ధ సమయంలో ఇంద్రుడు వెళ్ళి ఈ నరనారాయణులను పూజించి సహాయం చేయండని అడిగితే, వచ్చి పౌలోములూ, కాలకేయులూ మొదలైన పెక్కుమంది దైత్యులనూ, దానవులనూ చంపి ఇంద్రుడికి విజయం సంపాదించిపెట్టారు. అది మొదలుకొని వీరిని అందరూ ఎరుగుదురు. ఇది ఒక్క తేజస్సే. రెండు విధాలుగా అయి ప్రకాశిస్తూ ఉంటుంది' అని చెప్పాడు. వేడుక కొరకు మరో జన్మనెత్తిన ఆ మహాత్ములే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కదా ఈ అర్జునుడూ, కృష్ణుడూ. అర్జునుడు సముద్రతీరస్థమైన హిరణ్యపురం పొడిచి అరవైవేలమంది నివాతకవచులను జయించి ఇంద్రుడికి ప్రీతి కలిగించాడు. కృష్ణుడి పరాక్రమం కంస నరకాసురాది సకల దుర్మార్గులను చంపడం వలన తెలిసిందేకదా! ఉన్న విధం చెపుతాను తెలిసేటట్లు వినుము.

క. ఆ యిరువురు నొకతలయై। యాయోధనమునకు నడచునట్టిద యేనిన్
వే యేల మనక కా దెదు। రై యెద్దెఱఁ దాఁక హరునకైనను వశమే? 151

ప్రతిపదార్థం: ఆ+ఇరువురున్= ఆ కృష్ణార్జును లిద్దరూ; ఒక తల+ఐ= ఏకమయి; అయోధనమునకున్= యుద్ధానికి; నడచు+అట్టిది+అ+ఏనిన్= నడవటమే జరిగితే; వేయి+ఏల= వేయి మాట లెందుకు? మనకున్+అ కాదు= మనకే కాదు; ఎదురు+ఐ= ఎదురుగా ఉండి; ఏడ్తెఱన్= పరాక్రమంతో; తాఁకన్= ఎదిరించటానికి; హరునకున్+ఐనను వశమే= ఆ ఈశ్వరుడికైనా సాధ్యమే?

తాత్పర్యం: ఆ కృష్ణార్జును లిద్దరూ ఏకమయి యుద్ధానికి నడవడమే జరిగితే, వేయి మాటలెందుకు? మనకే కాదు, ఎదురుగా నిలబడి పరాక్రమంతో ముట్టటానికి ఆ హరుడికి కూడా సాధ్యం కాదు.

విశేషం: హరుడికే సాధ్యం కాదన్నప్పుడు మనకు సాధ్యం కాదని వేరే చెప్పాలా? అని కైముత్యంచేత అర్థ సంసిద్ధి కలుగుతున్నది. కాబట్టి అలంకారం కావ్యార్థాపత్తి. ఇక్కడ ఈశ్వరుడికి హరశబ్దం సాభిప్రాయంగా ప్రయుక్తమైంది కాబట్టి అలంకారం పరికరాంకురం.

క. సారథియు రథియు నై యొక। తేరం గృష్ణు లతిఘోరతేజస్సార
స్ఫారతఁ దోఁచిన నైనను। ధీరత వాటించి చూచి తెలిసెదవు బలే!' 152

ప్రతిపదార్థం: కృష్ణులు= కృష్ణార్జునులు; సారథియున్; రథియున్+ఐ= రథికుడూ అయి; ఒక తేరన్= ఒక రథం మీద; అతి ఘోర తేజస్+సార స్ఫారతన్= మిక్కిలి భయంకరమైన తేజస్సారం యొక్క ఆధిక్యంతో; తోఁచినన్+ఐననున్= కనబడినప్పుడైనా; ధీరత+పాటించి= ధైర్యం కలిగి; చూచి; తెలిసెదవు బలే!= తెలిసికొంటావు సుమీ!

తాత్పర్యం: ఒక కృష్ణుడు సారథీ, ఇంకో కృష్ణుడు (అర్జునుడు) రథికుడూ అయి ఒక రథంపై మిక్కిలి భయం కరమైన తేజస్సారపుటాధిక్యంతో కనబడినప్పుడైనా నీవు ధైర్యం వహించి చూచి తెలిసికొంటావులే.'

విశేషం: కృష్ణుడంటే శ్రీకృష్ణుడే కాక, అర్జునుడు కూడా. కృష్ణుడు= నల్లనివాడు. అర్జునుడు నల్లని వాడవటం చేత అతడు కూడా కృష్ణు డనబడతాడు. ఇక్కడ 'కృష్ణులు' అని ఇద్దరికీ ఒకే శబ్దం వాడటం వలన వారి ఐక్యాన్ని ఒక తేజస్సే రెండయిన దనటాన్ని సూచిస్తున్నాడు కవి.

వ. అనుచు నా సుయోధను నుపలక్షించి శాంతనవుండు మఱియు నిట్లనియె: 153

ప్రతిపదార్థం: అనుచున్; ఆ సుయోధనున్= ఆ దుర్యోధనుడిని; ఉపలక్షించి= చూచి; శాంతనవుండు= శంతనుపుత్రుడు-భీష్ముడు; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అంటూ ఆ దుర్యోధనుడిని చూచి భీష్ముడు ఇంకా ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'మది నా మాట కొకింతయు । బెదర వకార్యంబునందుఁ బ్రియము గలిగి యుం
డుదు; కౌరవులకుఁ గాలము । తుదియో కా కిట్టి గర్వితుని నే మందున్? 154

ప్రతిపదార్థం: నా మాటకున్; ఒక+ఇంతయున్= కొంచెం కూడా; మదిన్= మనస్సులో; బెదరవు= భయపడవు; అకార్యంబు నందున్= చెడుపనియందు- చేయదగని పనియందు; ప్రియము+కలిగి+ఉండుదు(వు)= ప్రీతి కలిగి ఉంటావు; కౌరవులకున్; కాలము+తుది+ఓ= అంత్యకాలమో; కాక= లేకపోతే; ఇట్టి గర్వితునిన్= ఇట్లాంటి పొగరుబోతును; ఏమి+అందున్?= ఏమంటాను?

తాత్పర్యం: 'నా మాటకు కొంచెం కూడా మదిలో భయపడవు. చేయదగని పనియందు ప్రీతి కలిగి ఉంటావు. కౌరవులకు పోగాలం దాపురించిందేమో లేకపోతే ఇట్లాంటి పొగరుబోతును నిన్ను ఏమంటాను?

తే. హితములగు నాదు వచనంబు లిపుడు వినని । వాఁడవైతేని నప్పుడు 'వారు వడిరి,
వీరు వడి' రను పలుకులు విందుగాక । శకుని కర్ణ దుశ్శాసనుల్ సమ్మతింప. 155

ప్రతిపదార్థం: హితములు+అగు నాదు వచనంబులు= మేలును గూర్చే నా మాటలు; ఇపుడు; వినని వాఁడవు! ఐతి(వి)+ఏనిన్= వినకపోతే; అప్పుడు= యుద్ధ సమయంలో; శకుని కర్ణ దుశ్శాసనుల్; సమ్మతింపన్= ఇష్టపడగా; వారు+పడిరి= వారు చచ్చారు; వీరు+పడిరి= వీరు చచ్చారు; అను పలుకులు= అనే మాటలు; విందు(వు)+కాక= వింటావులే.

తాత్పర్యం: నీ హితం కోరే నా మాటలు ఇప్పుడు నీవు వినకపోతే, అప్పుడు కురుక్షేత్ర యుద్ధ సమయంలో 'వారు చచ్చారు, వీరు చచ్చారు' అనే మాటలు - శకునీ, కర్ణుడూ, దుశ్శాసనుడూ ఇష్టపడగా - వింటావులే.

వ. దుష్ట కష్ట నికృష్టాత్ము లగు నిమ్ముువ్వురుఁ జెప్పెడు బుద్ధులుగాని యొండు విననొల్లు; వేమి సేయవచ్చు?' నని పలికినం గానీనుండు గనలి గాంగేయున కిట్లనియె; 156

ప్రతిపదార్థం: దుష్ట కష్ట నికృష్ట+ఆత్ములు+అగు+ఈ+ముువ్వురున్= దుర్మార్గులూ, పాపులూ, నీచ బుద్ధులూ అయిన ఈ ముగ్గురూ (కర్ణ శకుని దుశ్శాసనులు); చెప్పెడు బుద్ధులు+కాని= చేసే బోధలు కాని; ఒండు= ఇంకొకటి; వినన్+ ఒల్లవు= వినటానికి ఇష్టపడవు; ఏమి చేయన్+వచ్చున్?= ఏమిటి చేయటం?; అని; పలికినన్; కానీనుండు= కర్ణుడు (కన్యాపుత్రుడు); కనలి= కోపం వహించి; గాంగేయునకున్= భీష్ముడికి (గంగా పుత్రుడు); ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దుర్మార్గులూ, పాపులూ, నీచస్వభావులూ అయిన ఈ కర్ణ శకుని దుశ్శాసనులు ముగ్గురూ చేసే బోధలే కాని ఇంకొకటి వినడానికి ఇష్టపడవు. ఏం చెయ్యటం?' అని అంటే, కర్ణుడు కోపించి భీష్ముడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'ఇట్టు లాడఁ దగునె? యే నేమి సేసితిఁ? । గొలిచి కుడుచు పాడి నలవుఁ జలముఁ
బలుకు టెందు నెగ్గె? పతికిఁ బుత్త్రులకును । మనుమలకు హితంబ యొనర నడతు. 157

ప్రతిపదార్థం: ఇట్టులు= ఇలా; ఆడన్+తగునె= మాటాడవచ్చా?; ఏను+ఏమి+చేసితిన్= నేనేం చేశాను?; కొలిచి కడుచు పాడిన్= సేవించి, తినే ధర్మంచేత; అలవున్= ఉపాయమూ; చలమున్= పంతమూ; పలుకుట; ఎందున్= ఎక్కడా; ఎగ్గె= తప్పా?; పతికిన్= రాజుకూ - ధృతరాష్ట్రుడికీ; పుత్త్రులకును= కొడుకులకూ; మనుమలకున్; హితంబు+అ= మేలే; ఒనరన్= కలిగేటట్లు; నడతున్= ప్రవర్తిస్తాను.

తాత్పర్యం: 'నీవు ఇట్లా మాటాడవచ్చా? నేనేం చేశానని? వాళ్ళను సేవిస్తూ, వాళ్ళ ఉప్పు తింటూన్న న్యాయం చేత, ఏదో నాకు తోచిన ఉపాయం చెప్పటమూ, వాళ్ళకై పంతం పూనటమూ ఎక్కడైనా తప్పా? నే నెప్పుడూ ధృతరాష్ట్ర మహారాజుకూ, అతడి కొడుకులకూ, మనుమలకూ మేలే కలిగేవిధంగా ప్రవర్తిస్తాను.

క. కాని తెలుఁగైన నింతటి । మానిసిఁ గా నేల చేయు మనుజేంద్రుఁడు న
న్నీ నెఱి దప్పిన మాటలు । నీ నోరన్ వెడలఁ దగునె నిండిన సభలోన్?' 158

ప్రతిపదార్థం: కాని తెలుఁగు+ఐనన్= దుర్మార్గం అయితే; మనుజ+ఇంద్రుఁడు= రాజు-దుర్యోధనుడు; నన్నున్; ఇంతటి మానిసిన్+కాన్= ఇంతటి గొప్పవాడినిగా; ఏల చేయున్= ఎందుకు చేస్తాడు?; నిండిన సభలోన్= నిండు సభలో; ఈ నెఱి+ తప్పిన మాటలు= ఈ అన్యాయపు మాటలు; నీ నోరన్= నీ నోటి నుండి; వెడలన్+తగునె?= రావచ్చా?

తాత్పర్యం: నాది దుర్మార్గం అయితే, రాజు దుర్యోధనుడు నన్ను ఇంతటి గొప్పవాడుగా ఎందుకు చేస్తాడు? నిండుసభలో ఈ అన్యాయపు మాటలు నీ నోటి నుండి వెలువడవచ్చా?'

విశేషం: 'ఇంతటి మానిసిఁగా నేల చేయు' - కర్ణుడు సూతకులజుడని కుమారాస్త్ర విద్యా ప్రదర్శనలో పెద్దలు పాల్గొననీయకపోతే, దుర్యోధనుడు అప్పటికప్పుడు అంగరాజ్యానికి అభిషిక్తుడిని చేసి కర్ణుడిని రాజుగా చేస్తాడు. ఇదీ కర్ణుడి అభిప్రాయం.

వ. అనిన విని భీష్ముఁడు ధృతరాష్ట్రున కిట్లనియె: 159

తాత్పర్యం: అనగా విని భీష్ముడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు :

భీష్ముఁడు కర్ణుని దుర్ణయంబు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట (సం. 5-48-33)

తే. 'ఒకట నైనను వారియం దొకరిలోని । చిదుర పాలును బోలండు; సిగ్గులేక
'పాండవుల గెల్తు నే' నని పలుకుచుండు; । వీని రజ్జులు దులువలు విండ్రు తగిలి! 160

ప్రతిపదార్థం: ఒకటన్+ఐనను= ఒక్క విషయంలో అయినా; వారి యందున్= ఆ పాండవులలో; ఒకరిలోని చిదురపాలును= ఒక్కరిలోని చిన్న తునుకంత కూడా; పోలఁడు= సరిపోడు; సిగ్గులేక; పాండవులన్; నేను; గెల్తున్; అని; పలుకుచున్+ఉండున్= అంటూఉంటాడు; వీని రజ్జులు= వీని పొల్లుకూతలు; తులువలు= దుర్మార్గులు; తగిలి= ఆసక్తి వహించి; విండ్రు= వింటారు.

తాత్పర్యం: ఒక్క విషయంలోనైనా పాండవులలో ఒకడిలోని చిన్ని తునుకంత కూడా పోలడు. సిగ్గులేక పాండవులను నేను గెలుస్తానంటూ ఉంటాడు ఈ కర్ణుడు. వీడి పొల్లుకూతలను దుర్మార్గులు ఆసక్తితో వింటారు.

క. మగఁటిమి వారికి వీఁ డెదు । రుగ నమ్మి, సుయోధనుఁడు విరోధము గొని, స
ర్వ గుణాఢ్యులు బలవంతులు । నగు పాండునృపాలసుతుల నవమానించెన్. 161

ప్రతిపదార్థం: మగఁటిమిన్= పరాక్రమంలో; వారికిన్= ఆ పాండవులకు; వీఁడు= ఈ కర్ణుడు; ఎదురుగన్= ప్రతిగా; నమ్మి; సుయోధనుఁడు= దుర్యోధనుడు; విరోధము+కొని= శత్రుత్వం తాల్చి; సర్వ గుణ+ఆఢ్యులున్= సకల సుగుణ సంపన్నులూ; బలవంతులున్= పరాక్రమవంతులూ; అగు; పాండు నృపాల సుతులన్= పాండురాజు కొడుకులను-పాండవులను; అవమానించెన్= పరాభవించాడు.

తాత్పర్యం: పరాక్రమంలో పాండవులకు కర్ణుడు ప్రతి అని నమ్మి దుర్యోధనుడు పాండవులతో శత్రుత్వం వహించి సకల సుగుణ సంపన్నులూ, పరాక్రమవంతులూ అయిన వాళ్ళని అవమానించాడు.

ఉ. ఒక్కఁ డొకం డనేక విధ యుద్ధ జయంబులు గొన్నవారు వా;
రెక్కడ నేమి సేసె నితఁ? డీతని తమ్మునిఁ గూలనేసి యు
క్కెక్కిన పార్థుపైఁ గవిసెనే? పసు లాతఁడు గ్రమ్మఱింపఁగా
నక్కడ లేఁడె వీఁడు? భవదాత్మజుఁ గోల్పడె ఘోషయాత్రలోన్. 162

ప్రతిపదార్థం: వారు= పాండవులు; ఒక్కఁడు+ఒకండు= ఒక్కొక్కడు; అనేక విధ యుద్ధ జయంబులు= పెక్కురీతులైన యుద్ధ విజయాలు; కొన్నవారు= పొందినవారు; ఇతఁడు= ఈ కర్ణుడు; ఎక్కడన్; ఏమి+చేసెన్?= ఏం చేశాడు?; ఈతని తమ్మునిన్; కూలన్+ఏసి= కూల్చి చంపి; ఉక్కు+ఎక్కిన పార్థుపైన్= అతిశయించిన అర్జునుడి మీద; కవిసెనే?= పడ్డాడా?; అతఁడు= అర్జునుడు; పసులు= గోవులు; క్రమ్మఱింపఁగాన్= మరలించగా; వీఁడు= ఈ కర్ణుడు; అక్కడ లేఁడె?; ఘోషయాత్రలోన్; భవత్+ఆత్మజున్= నీ కొడుకును- దుర్యోధనుడినీ; కోల్పడెన్= పోగొట్టుకొన్నాడు (ఓడగొట్టుకొన్నాడు).

తాత్పర్యం: పాండవులు ఒక్కొక్కడు అనేక విధాలయిన యుద్ధ విజయాలు పొందినవారు. వీడు ఎక్కడ ఏం చేశాడు? ఇతడి తమ్ముడిని కూల్చి విజృంభించిన అర్జునుడిమీదికి ఉరికాడా? అతడు గోవులను మరలించుకొనిపోతే, వీడు అక్కడ లేడా? ఘోషయాత్రలో నీ కొడుకును ఓడింపజేసికొన్నాడు.

విశేషం: 'ఈతని తమ్మునిఁ గూలనేసి యుక్కెక్కిన పార్థుపైఁ గవిసెనే?' - ఈతడి తమ్ముడు 'సంగ్రామజిత్తు' అని తెలుస్తున్నది. ఉత్తరగోగ్రహణ సందర్భంగా అర్జునుడితో సంగ్రామజిత్తు అనేవాడు తలపడగా, అర్జును డతడి 'తల దునిమివైచె' అని ఉన్నది. వెంటనే 'అపుడు రాధేయుఁ డిమ్మెయి ననుజుపాటుఁ జూచి' అని ఉన్నది. (విరాట. 5-80, 81). అందుచేత కర్ణుడి తమ్ముడు సంగ్రామజిత్తు అని చెప్పాలి.

వ. ఈ దురాత్ముండు కర్జం బెఱుంగక నీతిబాహ్యుండై వలసినట్లు ప్రేలరిమాట లాడుచుండు; నీవునుం గైకొని వినుచుండుదువు; మేల కాక!' యనిన భీష్ము పలుకులు విని ద్రోణుం డమ్మహారాజుతో నిట్లనియె; 163

ప్రతిపదార్థం: ఈ దురాత్ముండు= దుష్టబుద్ధి గల ఈ కర్ణుడు- ఈ దుష్టుడు; కర్జంబు+ఎఱుంగక= చేయవలసిన పని తెలియక; నీతి బాహ్యుండు+ఐ= నీతికి వెలియైన వాడయి - అవినీతిపరుడయి; వలసిన+అట్లు= ఇష్టం వచ్చినట్లు; ప్రేలరి మాటలు+అడుచున్+ఉండున్= వదరుబోతు మాటలాడుతూ ఉంటాడు; నీవునున్= నీవు కూడా; కైకొని= సమ్మతించి; వినుచున్+ఉండుదువు= వింటూంటావు; మేలు+అ కాక= మంచిదే; అనినన్; భీష్ము పలుకులు; విని; ద్రోణుండు; ఆ+ మహారాజుతోన్= ధృతరాష్ట్ర మహారాజుతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ దుష్టుడు చేయవలసిన పని ఏమిటో తెలియక అవినీతిపరుడయి ఇష్టం వచ్చినట్లు ప్రేలుతూ ఉంటాడు. నీవూ సమ్మతించి ఊఁ కొట్టుతుంటావు. మంచిదే' అనగా, భీష్ముడి మాటలు విని ద్రోణుడు ధృతరాష్ట్ర మహారాజుతో ఇట్లా అన్నాడు.

ఉ. **'శాంతనవుండు సర్వకురుసంతతికిం గలవాఁడు గాఁడె? య**
త్యంత హితంబు లీ పలుకు; లాహవ మొప్పదు; ధర్మసూతితోఁ
బొంతము మేలు; దేవపతిపుత్త్రుఁడు సంజయుతోడ నాడిన
ట్లంతకు నోపు; మీకుఁ దెలియం దగు ఖాండవదాహ మాదిగాన్. **164**

ప్రతిపదార్థం: శాంతనవుండు= శంతను పుత్త్రుడు- భీష్ముడు; సర్వకురు సంతతికిన్+కలవాఁడు+కాఁడె= కురు సంతానానికంతకూ పాండవులకూ, కౌరవులకూ కావలసినవాడు కాడా?; ఈ పలుకులు= ఇతడి మాటలు; అత్యంత హితంబు= మిక్కిలి మేలు కూర్చేవి; ఆహవము+ఒప్పదు= యుద్ధం తగదు; ధర్మసూతితోన్= ధర్మపుత్త్రుడితో; పొంతము= పొందు; మేలు= మంచిది; దేవ పతి పుత్త్రుఁడు= సురరాజు కొడుకు అర్జునుడు; సంజయుతోడన్+ఆడిన+అంతకున్+ఓపున్= సంజయుడితో అన్నంతా చేయటానికి సమర్థుడు; ఖాండవ దాహము+ఆదిగాన్= ఖాండవ వన దహనం మొదలుగా; మీకున్; తెలియన్+తగున్= తెలిసికొనటం మంచిది.

తాత్పర్యం: "భీష్ముడు అటు పాండవులకూ, ఇటు కౌరవులకూ మొత్తం కురు సంతతికంతకూ కావలసినవాడు కాడా? అతని మాటలు మిక్కిలి మేలు కూర్చేవి. యుద్ధం తగదు. ధర్మరాజుతో సంధి చేసుకోవడం మంచిది. అర్జునుడు సంజయుడితో అన్నంతా చేయగలవాడు. ఖాండవ వనదహనం మొదలుగా అతడు చేసిన వీరకృత్యాలు తెలిసికొనటం మంచిది.

ఆ. **శర శరాసనములు ధరియింప రెట్టు లె । వ్వరును? మగతనంబు వలనుఁ గలిగి**
కయ్యమున జయంబు గైకొనరే యొరు? । లర్జునుండ విజయుఁ డనఁగ నెగడె! **165**

ప్రతిపదార్థం: ఎవ్వరును= మరెవ్వరూ; శర శరాసనములు= బాణాలూ; ధనుస్సులూ; ధరియింపరు+ఎట్టులు= ధరించరా ఏమి?; ఒరులు= ఇతరులు; మగతనంబు= పౌరుషం; వలనున్+కలిగి= నేర్పు కలిగి; కయ్యమునన్= యుద్ధంలో; జయంబు+ కైకొనరే= గెలుపొందరా?; అర్జునుండు+అ= అర్జును డొక్కడే; విజయుఁడు+అనఁగన్+నెగడెన్= విజయ డనగా పేరుపొందాడు.

తాత్పర్యం: మరెవ్వరూ విల్లమ్ములు ధరించరా ఏమి? ఇతరులు పౌరుషమూ, శక్తీ (నేర్పు) కలిగి యుద్ధంలో గెలుపొందరా? అర్జునుడి కొక్కడికే విజయు డనే పేరు వచ్చింది!

క. **మన వీటనకా, దయ్య । ర్జునునకు సరివింటివానిఁ జూడఁగ లోకం**
బున నెందు లేమి దెల్లం । బనుమానములేదు; తొడరనగునే వానిన్?' **166**

ప్రతిపదార్థం: మన వీటన్+అ కాదు= మన దేశంలోనే కాదు; ఆ+అర్జుననకున్; సరి వింటి వానిన్= సమానుడైన విలుకాడిని; చూడఁగన్; లోకంబునన్; ఎందున్; లేమి; తెల్లంబు= స్పష్టం; అనుమానము లేదు= సందేహం లేదు; వానిన్; తొడరన్+అగునే?= ఎదిరించటం సాధ్యమా?

తాత్పర్యం: మన దేశంలోనే కాదు, ఆ అర్జునుడితో సమానుడైన విలుకాడు చూడగా లోకంలో ఎక్కడా లేకపోవటం స్పష్టం. సందేహం లేదు. అతడిని ఎదిరించటం అసాధ్యం.'

వ. అని చెప్పి, యప్పాటం బరమహితోపదేశంబు సేసిన భీష్మ ద్రోణుల పలుకు లాదరింపక, వారికి సదుత్తరంబు లీక, వారలతోడం దదనురూపంబుగా సంభాషింపక, ధృతరాష్ట్రుండు వెండియుఁ బాండవులవలని వార్త లడుగుటకు సంజయుదిక్కు మొగంబైనం జూచి, కురుపక్షవీరు లందఱుఁ బ్రాణంబుల దెస నిరాశులై యుండి; రమ్మహీపతి సంజయునితో నిట్లనియె; 167

ప్రతిపదార్థం: అని; చెప్పి; ఆ+పాటన్= ఆ విధంగానే; పరమహిత+ఉపదేశంబు+చేసిన భీష్మ ద్రోణుల పలుకులు= మంచి హితం ఉపదేశించిన భీష్మ ద్రోణుల మాటలు; ఆదరింపక= స్వీకరించక; వారికిన్= ఆ భీష్మద్రోణులకు; సత్+ఉత్తరంబులు+ ఈక= తగిన సమాధానాలు చెప్పక; వారలతోడన్; తద్+అనురూపంబుగాన్= వాటికి తగినట్లుగా; సంభాషింపక= మాటాడక; ధృతరాష్ట్రుండు; వెండియున్= మళ్ళీ; పాండవుల వలని వార్తలు= పాండవులను గూర్చిన విషయాలు; అడుగుటకున్; సంజయు దిక్కు మొగంబు+ఐనన్= సంజయుడివైపు చూడగా; చూచి, కురుపక్ష వీరులు+అందఱున్= కౌరవపక్షంలో ఉన్న వీరులంతా; ప్రాణంబుల దెసన్= ప్రాణాల మీద; నిరాశులు+ఐ= ఆశలేనివారై; ఉండిరి; ఆ+మహీపతి= ఆ రాజు-ధృతరాష్ట్రుడు; సంజయునితోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చెప్పి ఆ విధంగా మంచి హితవు ఉపదేశించిన భీష్మద్రోణుల మాటలు మన్నించక, వారికి తగిన సమాధానాలు చెప్పక, వాళ్ళతో వాటికి తగ్గట్టుగా మాటాడక ధృతరాష్ట్రుడు మళ్ళీ పాండవులను గూర్చిన విషయా లడగడానికి సంజయుడికేసి చూచాడు. అది చూచి కౌరవుల పక్షంలో ఉన్న వీరులంతా తమ ప్రాణాల మీద ఆశలు వదులుకొన్నారు. ఆ ధృతరాష్ట్ర మహారాజు సంజయుడితో ఇట్లా అన్నాడు :

విశేషం: ధృతరాష్ట్రుడు పాండవుల గొప్పతనం విని సహించలేడు. అందుచేతనే భీష్మ ద్రోణుల మాటలు అతడికి రుచించలేదు. వాళ్ళమాటలకు సమాధానాలు చెప్పలేదు.

తే. 'ధర్మ పుత్త్రున కిక్కడి తలఁపు భంగి । యెట్టు లుండు? నీ సైన్యంబులెల్లఁ గూడి
యునికి వినియెనే? యెవ్వరిఁ గొని యతండు । కౌరవులమీఁది కెత్తి రాఁగలుగువాఁడు?' 168

ప్రతిపదార్థం: ధర్మ పుత్త్రునకున్= ధర్మరాజునకు; ఇక్కడి తలఁపు భంగి= ఈ పక్షాన్ని గూర్చిన ఆలోచనా క్రమం; ఎట్టులు+ ఉండున్?= ఎట్లా ఉంటుంది?; ఈ సైన్యంబులు+ఎల్లన్= ఇక్కడి సేనలన్నీ; కూడి+ఉనికి= కూడి ఉండటం; వినియెనే?= విన్నాడా?; అతండు; ఎవ్వరిన్+కొని= ఎవరిని తోడు చేసికొని; కౌరవుల మీఁదికిన్; ఎత్తి రాన్+కలుగువాఁడు?= దండెత్తి రాగలుగుతాడు?

తాత్పర్యం: 'ధర్మరాజు ఈ పక్షం గూర్చి ఏమనుకొంటున్నాడు? ఇక్కడ సైన్యాలన్నీ మోహరించి ఉండటం అతడికి తెలుసా? అతడు ఎవరిని తోడు చేసికొని కౌరవులపైకి దండెత్తి రాగలవాడు.

వ. అనిన విని సంజయుండు వెచ్చనూర్చి, ఱిచ్చవడి, మూర్ఛవోయిన చందంబున డెందంబు మొగుడం జేష్టలు దక్కియుండి, కొండొక సేపునకుఁ జిత్తం బొక్కింత సేసికొని, 'యక్కటా! యీ భూపాలుం డింత బేల యగునే? యుధిష్ఠిరుం డెవ్వరిఁ గొని యెత్తి వచ్చు వాఁడని యడుగుచున్నవాఁ! డింత యెఱుంగని వాఁ డెంతసెప్పినను తెలియనేర్చునే? యితని భంగి యిట్టిదనినఁ, గొడుకుల తెఱంగు వేఱ యెన్న నేల? యే నింక

నేమనువాఁడ? నైనను నన్నడిగిన మాటకుం దగిన మాఱుమాట పలుకవలయునకాదె' యని తలంచి ధృతరాష్ట్రున కిట్లనియె;' 169

ప్రతిపదార్థం: అనినన్; విని; సంజయుండు; వెచ్చన్+ఊర్చి= వేడి నిట్టూర్పు విడిచి; ఊచ్చ+పడి= నిశ్చేష్టుడయి; మూర్ఛ+పోయిన చందంబునన్= మూర్ఛిల్లిన రీతిగా; డెందంబు= హృదయం; మొగుడన్= ముడుచుకొనగా; చేష్టలు+తక్కి+ఉండి= కొయ్యబారిపోయి; కొండొక సేపునకున్= కొంతసేపటికి; చిత్తంబు+ఒక్క+ఇంత చేసికొని= మనస్సు కొంచెం పదిలపరుచుకొని; అక్కటా= అయ్యో; ఈ భూపాలుండు= ఈ రాజు- ధృతరాష్ట్రుడు; ఇంత బేల+అగునే?= ఇంత వెర్రివాడా? యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఎవ్వరిన్= ఎవరిని; కొని= తీసికొని ఎత్తి వచ్చువాఁడు+అని= దండెత్తి రానున్నాడని; అడుగుచున్+ఉన్నవాఁడు; ఇంత; ఎఱుంగనివాఁడు; ఎంత+చెప్పినను; తెలియన్+నేర్చునే= తెలిసికొనగలడా; ఇతని భంగి= ఇతడి విధం; ఇట్టిది+అనినన్= ఇటువంటిదంటే; కొడుకుల తెఱంగు; వేఱు+అ= వేరే; ఎన్నన్+ఏల?= ఎంచటం ఎందుకు?; ఏను; ఇంకన్; ఏమి; అనువాఁడన్; ఐనను; నన్నున్+అడిగిన మాటకున్; తగిన; మాఱుమాట= ప్రతివచనం, సమాధానం; పలుకవలయున్+అ కాదె!= చెప్పవలసిందే కదా!; అని; తలంచి; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని సంజయుడు వేడి నిట్టూర్పు పుచ్చి, నిశ్చేష్టుడయి, మూర్ఛిల్లిన విధంగా మనస్సు ముకుళించగా కొయ్యబారిపోయి, కొంతసేపటికి మనస్సు గట్టిపరచుకొని, 'అయ్యో! ఈ రాజు ఇంత వెర్రివాడా? యుధిష్ఠిరుడు ఎవరిని తీసికొని దండెత్తి రానున్నాడని అడుగుతున్నాడు! ఇంత తెలియనివాడు ఎంత చెప్పితే మాత్రం తెలిసికొంటాడా? ఇతడి విధం ఇట్టిదంటే కొడుకుల విధం వేరే చెప్పటం ఎందుకు? నే నింక ఏమంటాను? అయినా, నన్నడిగిన మాటకు తగిన సమాధానం చెప్పాలి కదా!' అని తలచి ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 'ఇతని భంగి యిట్టిదనినఁ గొడుకుల తెఱంగు వేఱ యెన్ననేల?' అలంకారం కావ్యార్థాపత్తి. 'యుధిష్ఠిరుండు' అతడే యుద్ధంలో స్థిరంగా ఉండేవాడయితే ....' అని యుధిష్ఠిర శబ్దం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరాంకురం.

చ. **'వినుము నరేంద్ర! పాండుపృథివీపతి యగ్రసుతుండు సంధిసే**
యన మదిఁ గోరు; మీరు దమ యయ్యసగంబును భూమియీక త
క్కిన మఱికాని ముంద రొకకీడుఁ దలంపఁడు; మీ బలంబు నె
ల్లను మదిఁ జీరికిం గొనఁడు లావున నేలఁ గొనం దలంచినన్.' 170

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= రాజా, ధృతరాష్ట్రా!; వినుము; పాండు పృథివీ పతి అగ్ర సుతుండు= పాండురాజు పెద్ద కొడుకు ధర్మరాజు; సంధి+చేయన్+అ మదిన్+కోరున్= సంధి చేసికొనటానికే మనస్సులో కోరుతున్నాడు; మీరు; తమ+అయ్య సగంబును భూమి+ఈక తక్కిన మఱికాని= తమ తండ్రి సగం భూమిని ఇవ్వకపోతే తప్ప; ముందర= ముందు; ఒక కీడున్= ఒక హానిని కూడా; తలంపఁడు; లావునన్= పరాక్రమంతో; నేలన్= భూమిని; కొనన్+తలంచినన్= పుచ్చుకొనాలనుకొంటే- పుచ్చుకోవలసివస్తే, మీ బలంబున్+ఎల్లను= మీ సైన్యాన్నంతనూ; మదిన్= మనస్సులో; చీరికిన్+కొనఁడు= కొంచెం కూడా లక్ష్యపెట్టడు.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! వినుము. ధర్మరాజు సంధి చేసికొనటానికే మనస్సులో కోరుతున్నాడు. మీరు తమ తండ్రి సగం భూమినీ ఇవ్వకపోతే తప్ప, ముందే ఏ కీడూ తలపెట్టడు. బలంతోనే భూమిని పుచ్చుకొనవలసి వస్తే, మీ బలాన్ని కొంచెం కూడా లక్ష్యపెట్టడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఒక రాయబారి తన ప్రయత్నాన్నీ ఫలితాంశాలనూ ప్రభువుముందు లేదా సభముందు ఉంచేటప్పుడు నాలుగంశాలు తన నివేదనంలో ప్రదర్శిస్తాడు. 1.సారాంశాన్ని అసందిగ్ధంగా చెప్పటం. 2.సమస్యలను స్పష్టంగా వివరించటం. 3.శత్రుపక్షంవారి ప్రవృత్తులను ప్రస్ఫుటంగా వివేచించి చెప్పటం. 4.తాను గమనించిన అంశాలను నిర్మొగమాటంగా తేటతెల్లంగా చెప్పటం. ధర్మజాదులను గురించి తన తుది అంచనాలను ఫలితాంశాలుగా ప్రకటిస్తున్న ఈ ఘట్టంలో ధర్మజుడిని గూర్చి చెప్పిన పద్యమిది. ఈ పద్యంలోని మూడు వాక్యాలలో పై మూడంశాలు ప్రదర్శితమయ్యాయి. వాటిని చెప్పిన తీరులో సంజయుడి మొగమోటం లేనితనం స్పష్టమవుతున్నది. సంజయుడు సమర్థుడైనా వాగ్మి. (సంపా.)

వ. అతం డెవ్వరిం గొని యెత్తివచ్చువాఁ డని యడిగితివి; నీ యెఱుంగని వార లం దెవ్వరు గల? రవధరింపుము. 171

ప్రతిపదార్థం: అతండు= ధర్మరాజు; ఎవ్వరిన్+కొని= ఎవరిని వెంటబెట్టుకొని; ఎత్తి వచ్చువాఁడు+అని+అడిగితివి= దండెత్తి వస్తాడని అడిగావు; నీ+ఎఱుంగని వారలు+అందున్+ఎవ్వరు+కలరు?= నీకు తెలియనివాళ్ళు అక్కడ ఎవరున్నారు? అవధరింపుము= చిత్తగించుము.

తాత్పర్యం: ధర్మరాజు ఎవరిని తోడు తెచ్చుకొని దండెత్తి రానున్నాడని అడిగావు. నీకు తెలియనివాళ్ళు అక్కడ ఎవరున్నారు? చిత్తగించుము:

మ. బకవిధ్వంసి జటాసురాంతకు హిడింబప్రాణపారీణుఁ గీ
చక నిర్మూలన కేళి లోలు సమరోత్సాహైక శీల ప్రవ
ర్తకు నాగాయుత సామ్యకీర్తిత బలోదగ్రుం బ్రతివ్యూహ దా
హకు భీముం గొని వచ్చు ధర్మజుఁడు బాహాటోపముం జూపఁగన్. 172

ప్రతిపదార్థం: ధర్మజుఁడు= ధర్మరాజు; బక విధ్వంసిన్= బకాసుర నాశకుడూ; జటా+అసుర+అంతకున్= జటాసురుడిని అంత మొందించినవాడూ; హిడింబ+ప్రాణ పారీణున్= హిడింబుడనే రాక్షసుడి ప్రాణాల పారం ముట్టినవాడూ- ప్రాణాల అంతు చూచిన వాడూ; కీచక నిర్మూలన కేళి లోలున్= కీచకుడిని తుదముట్టించటం అనే ఆటయందు ఆసక్తి గలవాడూ; సమర+ఉత్సాహ+ఏక శీల ప్రవర్తకున్= యుద్ధోత్సాహమనే ప్రధానమైన స్వభావంతో ప్రవర్తించేవాడూ; నాగ+అయుత సామ్య కీర్తిత బల+ఉదగ్రున్= పదివేల ఏనుగుల సాదృశ్యంతో పొగడబడే పరాక్రమంచేత భయంకరుడూ- పదివేల ఏనుగుల బలంతో సమానమైన పొగడబడే బలంచేత భయంకరమైనవాడూ; ప్రతివ్యూహ దాహకున్= శత్రువుల మారు వ్యూహాలను తగల బెట్టేవాడూ అయిన; భీమున్= భీముడిని; బాహా+ఆటోపమున్= భుజాల విజృంభణాన్ని - భుజబల విజృంభణాన్ని; చూపఁగన్= చూపించటానికి; కొని వచ్చున్= తీసికొని వస్తాడు.

తాత్పర్యం: బకాసురుడిని చంపినవాడూ, జటాసురుడిని అంతమొందించినవాడూ, హిడింబుడనే రాక్షసుడి ప్రాణాల అంతు చూచినవాడూ, కీచకుడిని తుదముట్టించటమనే ఆటయందు ఆసక్తి కలవాడూ, యుద్ధోత్సాహం ఒక్కటే స్వభావంగా ప్రవర్తించేవాడూ, పదివేల ఏనుగుల బలమంత బలం గలవాడని పొగడబడే భయంకరుడూ, శత్రువుల వ్యూహాలను తగలబెట్టేవాడూ అయిన భీముడిని భుజపరాక్రమ విజృంభణం చూపించటానికి వెంటబెట్టుకొని ధర్మరాజు వస్తాడు.

విశేషం: పద్యంలోని భీమ విశేషణాలన్నీ సంస్కృత సమాస భీమము లయి అతడి భీమ పరాక్రమాన్ని సూచిస్తున్నాయి. ప్రకరణాను గుణమైన శయ్యను ప్రదర్శించటం మహాకవుల ప్రత్యేకత.

వ. మఱియును. 173

తాత్పర్యం: ఇంకా.

మ. అట మిన్నందిన యట్టివాని పొడ వెం తన్నట్లు ఫాలాక్షు నె
క్కటి కయ్యంబునఁ గన్న ఫల్గును భుజాగర్వంబు లెక్కించు; టం
తటి వానింగొని ధర్మసూతి సమరోత్సాహంబుమై నెత్తి వ
చ్చుటకుం గొంకునె? వీఁపు సక్కనయి నిల్చుంగాక మీ సైన్యముల్. 174

ప్రతిపదార్థం: ఫాల+అక్షున్= నుదుట కన్నుగలవాడిని- ఈశ్వరుడిని; ఎక్కటి కయ్యంబునన్= ద్వంద్వయుద్ధంలో; కన్న= పొందిన- చూచిన; ఫల్గును భుజా గర్వంబున్= అర్జునుడి బాహు పరాక్రమ గర్వాన్ని; లెక్కించుట= లెక్కపెట్టటం; అట మిన్ను+అందిన+అట్టి వాని పొడవు= ఆకాశాన్ని తాకిన ఆ మనుష్యుడి పొడవు; ఎంత+అన్న+అట్లు= ఎంత అని అడగటం వంటిది; అంతటి వానిన్+కొని= అంతటి గొప్పవాడిని మహోన్నతుడిని తీసికొని; ధర్మసూతి= ధర్మరాజు; సమర+ఉత్సాహంబు మైన్= యుద్ధోత్సాహంతో; ఎత్తి వచ్చుటకున్= దండెత్తి రావటానికి; కొంకునె?= సందేహిస్తాడా?; మీ సైన్యముల్= మీ సేనలు; వీఁపు+చక్కన+అయి= వీపు తిన్ననై; నిల్చున్+కాక= ఉంటాయిలే - వెనుదిరుగుతాయిలే.

తాత్పర్యం: నిటలాక్షుడిని ద్వంద్వయుద్ధంలో కన్న అర్జునుడి భుజబలం పరిమితి ఎంత అని లెక్కించటం, ఆకాశాన్ని తాకే ఆ మనుష్యుడి పొడవెంత అని అడగటం లాంటిది. అంతటివాడిని వెంటబెట్టుకొని ధర్మరాజు యుద్ధోత్సాహంతో దండెత్తి రావటానికి సందేహిస్తాడా? మీ సైన్యాలు వెనుదిరిగి పోవాలిసిందే.

విశేషం: ఈశ్వరు డనక ఫాలాక్షు డనటం తన్మహిమను చెప్పటం కొరకు ఫాలాక్ష శబ్దం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరాంకురం. 'అట మిన్నందిన యట్టివాని ..... లెక్కించుట' - ఉపమేయోపమాన వాక్యాలకు ఐక్యారోపణం చెప్పబడింది కాబట్టి అలంకారం నిదర్శన. వెనుదిరుగుతాయి అనే' దానిని 'వీఁపు సక్కనయి నిల్చు'నని భంగ్యంతరంచేత చెప్పడంచేత అలంకారం పర్యాయోక్తం.

తే. నకులు సహదేవుఁ గొని ధర్మనందనుండు । మొనసి కౌరవ బలముల ముట్టికొనఁగఁ
దలఁచి తఱి వేచి వచ్చుట ధరణినాథ! । సింగములఁ బట్టి వేఁటాడు భంగి గాదె? 175

ప్రతిపదార్థం: ధరణినాథ= ధృతరాష్ట్ర మహారాజా!; ధర్మనందనుండు= ధర్మరాజు; నకులున్; సహదేవున్; కొని= వెంటబెట్టుకొని; మొనసి= పూని; కౌరవ బలములన్= కౌరవుల సేనలను; ముట్టికొనఁగన్+తలఁచి తఱి వేచి వచ్చుట= ఎదుర్కొన దలచి సమయం చూచి రావటం; సింగములన్+పట్టి= సింహాలను అవలంబించి వెంటతీసికొని; వేఁట+ఆడు భంగి+కాదె= వేటాడటానికి రావటం వంటిది కాదా?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! నకులుడినీ, సహదేవుడినీ తీసికొని ధర్మరాజు పూని కౌరవులపై దండెత్తాలని తలచి సమయం చూచి రావటం, సింహాలను తీసికొని వేటాడటానికి రావటం వంటిది కాదా?

విశేషం: వేటకాడు వేటాడటానికి వెళ్ళేటప్పుడు సాధారణంగా తనతో వేటకుక్కలను తీసికొనివెళ్ళుతాడు. అట్లాకాక సింహాలనే తీసికొని వెళ్ళటం వంటిది- ధర్మరాజు నకుల సహదేవులను తీసికొని కౌరవుల మీదకు వెళ్ళటం. వేటపని అంతా సింహాలే చేసేస్తాయి. వేటగాడిపని సులభతరం అవుతుంది. అట్లాగే యుద్ధకార్యం అంతా నకుల సహదేవులే చేసి, ధర్మరాజు పని సులభతరం చేస్తారని స్వారస్యం. ఉపమేయోపమాన వాక్యాలకు ఐక్యారోపణం చేయటం వలన అలంకారం నిదర్శన.

తే. **ద్రౌపదేయులు, నా సుభద్రా సుతుండు । నుక్కు తునియలు గారె? మి మ్మక్కుమార**
వరులఁగొని యోర్చువాఁడయి వచ్చు ధర్మ । పుత్త్రుఁ; డిది నీకుఁ జూడంగఁ బోల దెట్లు?' **176**

ప్రతిపదార్థం: ద్రౌపదేయులున్= ద్రౌపది కొడుకులూ-ఉపపాండవులూ; ఆ సుభద్రా సుతుండున్= ఆ సుభద్ర కొడుకు అభిమన్యుడూ; ఉక్కు తునియలు+కారె= ఉక్కు ముక్కలు కారా? - మహాబలవంతులు కారా; ధర్మపుత్త్రుఁడు= ధర్మరాజు; ఆ+కుమార వరులన్+కొని= ఆ కుమార శ్రేష్ఠులను తీసికొని; మిమ్మున్= మిమ్ములను; ఓర్చువాఁడు+అయి= ఓడించటానికని; వచ్చున్; చూడంగన్= ఆలోచించగా; ఇది; నీకున్; ఎట్లు+పోలదు?= ఎట్లా సంగతం కాదు?

తాత్పర్యం: ద్రౌపది కొడుకులూ, ఆ సుభద్ర కొడుకు అభిమన్యుడూ ఉక్కు ముక్కలు కారా? ధర్మరాజు ఆ కుమారశ్రేష్ఠులను వెంట బెట్టుకుని మిమ్ములను ఓడించటానికి వస్తాడు. ఆలోచించగా ఇది నీకు ఎట్లా సంగతం కాదు? - ఔననిపించటం లేదు?'

విశేషం: ద్రౌపదేయులు, ఆ సుభద్రాసుతుడు ఉక్కుతునియలు - అలంకారం రూపకం.

వ. **అని చెప్పి వెండియు నిట్లనియె :** **177**

తాత్పర్యం: అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు :

క. **'వృష్ణి కుమారోత్తముఁ డా । కృష్ణుని తమ్ముండు సాత్యకియు, దవదహనా**
త్యుష్ణ ప్రతాపదీప్తులు । కృష్ణా సోదరులుఁ దలఁపఁ గేవలులె నృపా! **178**

ప్రతిపదార్థం: నృపా!= ధృతరాష్ట్ర మహారాజా!; వృష్ణికుమార+ఉత్తముఁడు= వృష్ణివంశకుమారులలో శ్రేష్ఠుడు; ఆ కృష్ణుడి తమ్ముండు సాత్యకియున్; దవ దహన+అతి+ఉగ్ర ప్రతాపదీప్తులు= కార్చిచ్చు యొక్క మిక్కిలి వేడియైన ప్రతాపము అనెడి ప్రతాపము (పరాక్రమము) యొక్క కాంతులైనవారు; అగు; కృష్ణా సోదరులు= ద్రౌపది సోదరులు; తలఁపన్= ఆలోచించగా; కేవలులె?= సామాన్యులా?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! వృష్ణి వంశ కుమారులలో శ్రేష్ఠుడూ, ఆ కృష్ణుడి తమ్ముడూ అయిన సాత్యకీ, కార్చిచ్చు యొక్క అత్యుష్ణమైన ప్రతాపం అనే పరాక్రమం యొక్క కాంతులైనవారగు ద్రౌపదీ సోదరులు ఆలోచించగా సామాన్యులా?

విశేషం: దవదహనాత్యుష్ణ ప్రతాపదీప్తులు- ప్రతాపము (మిక్కిలి తాపము) అనెడి ప్రతాపము (పరాక్రమము)-శ్లిష్ట రూపకం. దీప్తులే అయిన కృష్ణా సోదరులు-రూపకం.

సీ. శౌర్యోజ్జ్వలుండు పాంచాల భూనాథుండు, । మహితవిక్రముఁ డగు మత్స్యవిభుఁడు
నధిక ధైర్యాన్వితు లతని తమ్ము, లుదగ్ర । తేజస్కులైన తదీయసుతులు,
నన్నదమ్ములు ప్రతాపోన్నతు లేవురు । కేకయపతులు, నక్షీణ బాహు
శక్తియుక్తులు జరాసంధ సూనుఁడు సహ । దేవుండు, నా జయత్సేన విభుఁడు

తే. వినుము శిశుపాల తనయులు వీరధనులు । ధృష్టకేతుండు వృషభుండుఁ, దీవ్రరణ వి
నోది యదుభర్త చేకితానుండు, దర్ప । ఘనుఁడు శైబ్య నృపాలుండుఁ గలరుగాదె! 179

ప్రతిపదార్థం: వినుము= ధృతరాష్ట్రా! వినుము; శౌర్య+ఉజ్జ్వలుండు= పరాక్రమంచేత ప్రకాశించేవాడు; అగు; పాంచాల భూనాథుండున్= పాంచాల దేశపురాజూ- ద్రుపదుడూ; మహిత విక్రముఁడు+అగు మత్స్య విభుఁడున్= గొప్ప పరాక్రమం కలవాడైన మత్స్యరాజు విరాటుడూ; అధిక ధైర్య+అన్వితులు+అతని తమ్ములు= ఎక్కువ ధైర్యంతో కూడినవారైన తమ్ములూ; ఉదగ్ర తేజస్కులు+ఐన తదీయ సుతులున్ అన్నదమ్ములన్= భయంకరమైన తేజస్సు గల వారగు అతడి కొడుకులూ, అన్నలూ, తమ్ములూ; ప్రతాప+ఉన్నతులు+ఏవురు కేకయ పతులున్= పరాక్రమం చేత గొప్పవారైన అయిదుగురు కేకయ వంశరాజులూ; అక్షీణ బాహు శక్తియుక్తులు= తరుగని భుజం యొక్క పరాక్రమంతో కూడినవారు; అగు; జరాసంధ సూనుఁడు సహదేవుఁడున్+ఆ జయత్సేన విభుఁడున్= జరాసంధుడి కొడుకు సహదేవుడూ, ఆ జయత్సేన రాజూ; శిశుపాల తనయులున్= శిశుపాలుడి కొడుకులూ; వీర ధనులున్= పరాక్రమమే ధనంగా కలవారు; అగు; ధృష్టకేతుండున్; వృషభుండున్; తీవ్ర రణ వినోది యదుభర్త చేకితానుండున్= తీవ్రమైన యుద్ధం చేత వినోదించే వాడైన యాదవరాజు చేకితానుడూ; దర్పఘనుఁడు= (పరాక్రమ) గర్వంచేత గొప్పవాడు అగు శైబ్యరాజూ; కలరు+కాదె!= ఉన్నారు గదా!

తాత్పర్యం: ధృతరాష్ట్రా! వినుము. శౌర్యంచేత ప్రకాశించే ద్రుపదుడూ, గొప్ప పరాక్రమం కలవాడైన విరాటుడూ, మిక్కిలి ధైర్యంతో కూడినవారైన అతడి తమ్ములూ, గొప్ప తేజస్సు కలవారగు అతడి కుమారులూ, అన్నదమ్ములూ, పరాక్రమంచేత ఉన్నతులైన అయిదుగురు కేకయరాజులూ, తరుగని భుజ పరాక్రమంతో కూడిన జరాసంధ తనయుడు- సహదేవుడూ, ఆ జయత్సేనరాజూ, శిశుపాలుడి కుమారులూ, పరాక్రమధనులూ అయిన ధృష్టకేతు వృషభులూ, తీవ్ర యుద్ధంలో వినోదించే యాదవరాజు చేకితానుడూ, పరాక్రమగర్వంచేత ఘనుడైన శైబ్యనృపాలుడూ ఉన్నారు గదా!

క. వీరెల్లఁ బాండురాజ కు । మారుల పాటునకుఁ గుందు మనములతోడన్
వారి పగ దీర్పఁ గడఁగెడు । వారల కా, కందు లాఁతివారుం గలరే? 180

ప్రతిపదార్థం: వీరు+ఎల్లన్= వీళ్ళందరూ; పాండు రాజ కుమారుల పాటునకున్= పాండవుల కష్టానికి; కుందు మనములతోడన్= దుఃఖించే మనస్సులతో; వారి పగ+తీర్పన్= వారి పగదీర్చటానికి; కడఁగెడు వారలు+అ కాక= ప్రయత్నించేవాళ్ళేకాని; అందున్= అక్కడ; లాఁతివారున్+కలరే?= వేరేవాళ్ళు కూడా ఉన్నారా?

తాత్పర్యం: ఈ వీరులందరూ పాండవుల ఆపదకు దుఃఖించే మనస్సులతో ప్రతీకారం చేసి వాళ్ళ పగదీర్చటానికి ప్రయత్నించేవాళ్ళే కాని వేరేవాళ్ళు ఎవరూ లేరు.

వ. భీమసేనసూనుండు ఘటోత్కచుండు తండ్రికంటెను లావును బీరంబునుం గలవాఁడు, మాయాబలంబున మనబలంబు నెల్లం గలంచు; మఱియును దూర్పున నుత్తరంబునం గలుగు నరనాయకులు నానా సేనా సమన్వితులయి వచ్చి చిచ్చయిననుం బిడికిలింత మనుచున్నవా; రదియునుంగాక. 181

ప్రతిపదార్థం: భీమసేన సూనుండు= భీముడి కొడుకు; ఘటోత్కచుండు; తండ్రికంటెను; లావును= బలమూ; బీరంబునున్= పరాక్రమమూ; కలవాఁడు; మాయా బలంబునన్= మాయా శక్తితో; మన బలంబున్+ఎల్లన్= మన సేననంతనూ; కలంచున్= చీకాకుపరుస్తాడు; మఱియును; తూర్పునన్; ఉత్తరంబునన్; కలుగు నర నాయకులు= ఉన్న రాజులు; నానా సేనా సమన్వితులు+ అయి వచ్చి= అనేక సేనలతో కూడినవారయి వచ్చి; చిచ్చు+అయిననున్+పిడికిలింతము+అనుచున్+ఉన్నవారు= నిప్పయినా పిడికిట్లో పట్టుకుందాం అంటున్నారు; అదియునున్+కాక-

తాత్పర్యం: భీముడి కొడుకు ఘటోత్కచుడు తండ్రికన్నా బలపరాక్రమాలు కలవాడు. మాయాబలంచేత మన సైన్యాన్నంతనూ చీకాకు పరుస్తాడు. ఇంకా తూర్పునా, ఉత్తరానా ఉన్న రాజులు అనేక సేనలతో వచ్చి అగ్గి నయినా సరే పిడికిట పట్టుకుందాం అంటున్నారు. అదీకాక.

విశేషం: చిచ్చయిననుం బిడికిలింతము- ఎంత కష్టం వచ్చినా సహిద్దాం - అలంకారం అతిశయోక్తి.

క. సకల భువనములు నఱ చే। తికిఁ దేరంజాలు నట్టి ధీమంతుఁడు దే
వకి కొడుకు గలఁడు ధర్మజు। నికి; నాతం డెత్తి రాక నిలుచునె యధిపా?' 182

ప్రతిపదార్థం: అధిపా!= రాజా, ధృతరాష్ట్రా!; సకల భువనములున్= ఎల్ల లోకాలూ; అఱ చేతికిన్; తేరన్+చాలు+అట్టి= తేగలిగే; ధీమంతుఁడు= బుద్ధిమంతుడు - శక్తి మంతుడు; దేవకి కొడుకు= దేవకి కొడుకు- శ్రీకృష్ణుడు; ధర్మజునికిన్= ధర్మరాజుకు; కలఁడు= ఉన్నాడు; ఆతండు= ఆ ధర్మరాజు; ఎత్తి రాక నిలుచునె?= దండెత్తకుండా ఉంటాడా?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! లోకాల నన్నిటినీ అరచేతిలోకి తీసికొని రాగలిగే శక్తి సంపన్నుడు దేవకి కొడుకు శ్రీకృష్ణుడు ధర్మరాజుకున్నాడు. ఇంక ఆ ధర్మరాజు దండెత్తి రాకుండా ఉంటాడా?'

విశేషం: 'సకల భువనములు నఱచేతికిఁ దేరం జాలునట్టి' - లోకాల నన్నిటినీ తన చెప్పుచేతులలో పెట్టుకొనగల.

వ. అని చెప్పిన సూతపుత్త్రునకు నంబికాపుత్త్రుం డిట్లనియె: 183

ప్రతిపదార్థం: అని; చెప్పిన; సూత పుత్త్రునకున్= సంజయుడికి; అంబికా పుత్త్రుండు= ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికిన సంజయుడితో ధృతరాష్ట్రు డిట్లా అన్నాడు.

ధృతరాష్ట్రుండు భీమసేనాదుల పరాక్రమంబు దలంచి దుఃఖించుట (సం. 5-50-1)

క. 'వారి దెస నీదు సెప్పిన। యా రథికులు ప్రబలు లగుదు రందఱు; నైనన్
వా రెల్లను నొకతల, య। మ్మారుతి యొకతల బలప్రమాణము సూడన్. 184

ప్రతిపదార్థం: వారి దెసన్= వారి పక్షంలో; నీదు+చెప్పిన ఆ రథికులు= నీవు పేర్కొన్న ఆ రథికులు; అందఱున్, ప్రబలులు+అగుదురు= మిక్కిలి బలవంతులవుతారు; ఐనన్= అయినా; బల ప్రమాణము+చూడన్= బలపరిమితి చూస్తే; వారు+ఎల్లరున్= వాళ్ళందరూ; ఒక తల= ఒక ఎత్తు; ఆ+మారుతి+ఒక తల= ఆ భీముడు ఒక ఎత్తు.

తాత్పర్యం: పాండవపక్షంలో నీవు చెప్పిన ఆ రథికులందరూ మిక్కిలి బలవంతులే. అయినా బలపరిమితి చూస్తే వాళ్ళంతా ఒక ఎత్తు, ఆ భీము డొక్కడూ ఒక యెత్తు.

విశేషం: ఇది ధృతరాష్ట్రుడి అంచనా. పాండవవీరులందరూ ఒక ఎత్తు. భీముడొక్కడూ ఒక్క ఎత్తు. ఇది అతడి దృక్కోణం. భీముడే కౌరవులను సంహరిస్తానని ప్రతినబూనాడు. చేసిన ప్రతిజ్ఞను నిర్వహించి తీరుతాడు. అంతే కాదు. తనమీదకు వచ్చిన శత్రువులను మట్టుపెట్టటం, వ్యూహాలను భగ్నం చేయటం అతడి సాహసవృత్తి. భీముడు ధృతరాష్ట్రుడికి సింహస్వప్నం వంటివాడు. (సంపా.)

ఉ. భీముఁ దలంచినన్ మనము భీతిఁ గలంగుచునుండు నాకు, రే
లేమియు నిద్ర రా; దతని నేడ్తెఱ మార్కొనఁ జాలునట్టి వాఁ
డీ మొన లేఁ; డతం డలుక నెత్తిన యా గద కాలదండ; ము
ద్దామ విలాసుఁడై కురు కదంబములో విహరింపకుండునే? 185

ప్రతిపదార్థం: భీమున్= భీముడిని; తలంచినన్= తలచుకొంటే; నాకున్; మనంబు= మనస్సు; భీతిన్= భయంతో; కలంగుచున్+ ఉండున్= కలత చెందుతూ ఉంటుంది; రేలు= రాత్రులు; ఏమియున్ నిద్ర రాదు= కొంచెం కూడా నిద్ర పట్టదు; అతనిన్= ఆ భీముడిని; ఏడ్తెఱన్= పరాక్రమంతో; మార్కొనన్+చాలు+అట్టివాఁడు= ఎదురుకొనగలిగేవాడు; ఈ మొనన్= ఈ సేనలో; లేఁడు; అతండు+ఆ భీముడు; అలుకన్= కోపంతో; ఎత్తిన ఆ గద= ఎత్తి పట్టుకొన్న ఆ గదాయుధం; కాల దండము= యమ దండం; ఉద్దామ విలాసుఁడు+ఐ= విశృంఖలమైన లీల గలవాడయి; కురు కదంబములోన్= కౌరవుల సమూహంలో; విహరింపక+ ఉండునే?= విహరించకుండా ఉంటాడా?

తాత్పర్యం: భీముడిని తలచుకొంటే నాకు గుండె బేజారెత్తిపోతూ ఉంటుంది. రాత్రులు కొంచెమయినా నిద్రపట్టదు. అతడిని పరాక్రమంతో ఎదురుకొనగలవాడు ఈ సైన్యంలో లేడు. అతడు కోపంతో ఎత్తిన గదాదండం యమదండమే. అతడు అడ్డులేకుండా కౌరవ సమూహంలో విహరించకుండా ఉంటాడా?

విశేషం: 'ఆ గద కాలదండము' - అలంకారం రూపకం. భీముడి వలన గ్రుడ్డిరాజు పొందే భయభావాన్ని రమణీయంగా తిక్కన చిత్రించాడు. భీముడి వలని భయం వలన మనస్సు కలతచెందటం అనుభావం. రాత్రిళ్ళు నిద్రపట్టకపోవటం సాత్త్వికభావం. నిరంతరం మేల్కొని భీముడిని గురించే ఆలోచిస్తూ ఉంటే అతడిని ఎదుర్కొనే వీరుడు కౌరవపక్షంలో లేడని స్పష్టమవుతుంది. దాని వలన మరణభీతి కలుగుతుంది. ఆ భావమే భీముడి గదను యమదండంగా భావింపజేస్తుంది. దానితో గుండె పగిలినంత పని ఔతుంది. కౌరవ సమూహంలో అతడు దండధారి అయిన యముడివలె విహరిస్తున్నట్లుగా మనోరంగంలో గోచరిస్తుంది. స్మరణ రూపమైన ఈ ఊహాచిత్రం భావరమణీయం. (సంపా.)

తే. చిఱుతనాఁడును వాఁడు నాశిక్షఁ బోఁడు; । వీరు చివ్వకుఁ జొత్తురు వైర మెత్తి;
వానిచేఁ బీడ వడియును మాన; రిదియ । కాదె యీ భేదమున కెల్లఁ గారణంబు. 186

ప్రతిపదార్థం: వాఁడు= ఆ భీముడు; చిఱుత నాఁడును= చిన్నప్పుడు కూడా; నా శిక్షన్+పోఁడు= నేను చెప్పినట్లు వినడు; వీరు= ఈ కౌరవులు; వైరము+ఎత్తి= పగపెట్టుకొని; చివ్వకున్+చొత్తురు= కయ్యానికి పూనుకొంటారు; వానిచేన్= ఆ భీముడి చేత; పీడ+పడియును= బాధ పొందికూడా; మానరు= పగ విడువరు; ఈ భేదమునకున్+ఎల్లన్= ఈ కురుపాండవ వైరాని కంతకూ; కారణంబు; ఇది+అ+కాదె!= ఇదే కదా!

తాత్పర్యం: ఆ భీముడు చిన్నప్పుడు కూడా నా మాట వినేవాడు కాడు. వీళ్ళు పగబూని కయ్యానికి కాలు ద్రువ్వుతారు. వాడిచేత బాధ పొందికూడా పగ విడవరు. ఈ కౌరవ పాండవ వైరానికంతకూ మూలకారణం ఇదే కదా!

క. సమరమున దైత్య దానవ । సమితియు నాతని నెదుర్పఁ జాలదు; భుజయు
ద్ధమున జరాసంధుని నొక । నిమిషంబునఁ జంపె; నొరులు నిలుతురె యెదురన్? 187

ప్రతిపదార్థం: సమరమునన్= యుద్ధంలో; దైత్య దానవ సమితియున్= రాక్షస జాతుల సమూహం కూడా; ఆతనిన్= ఆ భీముడిని; ఎదుర్పన్+చాలదు= ఎదిరించ లేదు; భుజ యుద్ధమునన్= బాహుయుద్ధంలో; జరాసంధునిన్; ఒక నిమిషంబునన్+ చంపెన్= ఒక్క రెప్పపాటుకాలంలో చంపాడు; ఒరులు= ఇతరులు; ఎదురన్= ఎదురుగా; నిలుతురె?= నిలబడగలరా?

తాత్పర్యం: యుద్ధంలో రాక్షస జాతుల సమూహం కూడా ఆ భీముడిని ఎదిరించలేదు. బాహుయుద్ధంలో అతడు జరాసంధుడిని ఒక్క రెప్పపాటు కాలంలో చంపాడు. ఇంక ఇతరులు ఎదుట నిలబడతారా?

విశేషం: 'భుజ యుద్ధమున .... యెదురన్' కైముత్యం చేత అర్థ సంసిద్ధి జరుగుతున్నది కాబట్టి అలంకారం కావ్యార్థాపత్తి.

మ. బొమ లల్కన్ ముడివడ్డ, రౌద్రరస ముప్పొంగం, దనర్పన్ భుజా
గ్రము, 'లిందెవ్వఁడు నాకు మా' అనుచు శౌర్యస్ఫూర్తి శోభిల్ల దు
ర్దమ లీలం గదియంగ, భీముఁ గని ధైర్యం బేది కౌరవ్యసై
న్యము లంతంతఁ గలంగఁ బాఱినటులై నా మోమునన్ వ్రేలెడిన్. 188

ప్రతిపదార్థం: బొమలు= కనుబొమలు; అల్కన్= కోపంతో; ముడి+పడ్డన్= ముడిపడగా; రౌద్ర రసము+ఉప్పొంగన్= రౌద్ర రసం పొంగి పొరలగా; భుజ+అగ్రములు= భుజాల కొనలు; తనర్పన్= పొంగగా; ఇందున్= ఈ కురుసేనలో; ఎవ్వఁడు; నాకున్; మాఱు+అనుచున్= ఎదురంటూ; శౌర్యస్ఫూర్తి= పరాక్రమ ప్రకాశం; శోభిల్లన్= ప్రకాశించగా, ఒప్పగా; దుర్దమ లీలన్= అణచరాని విధంగా; కదియంగన్= సమీపించగా; భీమున్; కని; కౌరవ్య సైన్యములు= కురుసేనలు; ధైర్యంబు+ఏది= ధైర్యం నశించి; అంతంతన్= క్రమక్రమంగా; కలంగన్+పాఱిన+అటులు+ఐ= కలత చెందిన విధమై; నా మోమునన్, వ్రేలెడిన్= నా కళ్ళకు కట్టినట్లున్నాయి.

తాత్పర్యం: కోపంతో కనుబొమలు ముడిపడగా, రౌద్రరసం పొంగి పొరలగా, భుజాల కొనలు పొంగగా, ఈ కురుసేనలో నాకు ఎదురెవ్వడు అంటూ పరాక్రమం ఒప్పగా, అణచరాని విధంగా సమీపించే భీముడిని చూచి ధైర్యం నశించి కౌరవసైన్యాలు కలత చెందినట్లై, నా కళ్లకు కట్టినట్లున్నాయి.

విశేషం: రౌద్రరసమూర్తి అయిన భీముడి ఆంగికాభినయం శత్రువుల హృదయాలపై అంతటి భయముద్రను వేసిందన్నమాట! కళ్ళున్నవాళ్ళు కళ్ళు మూసికొని చూచినా భయపడతారు. ఇక గ్రుడ్డిరాజు మనోనేత్రంతో దర్శించి లోలోననే హడలిపోతున్నాడు. (సంపా.)

క. కరవాలము గద మొదలగు । పరికర మేమియును లేక బాహుబలమునం
గరి గతి నడరినను వృకో । దరునకు నొకఁ డెదుర నిలిచి తలపడువాఁడే? 189

ప్రతిపదార్థం: కరవాలము= కత్తి; గద, మొదలు+అగు; పరికరము= సాధనం; ఏమియును-లేక; బాహు బలమునన్= భుజబలంతో; కరి గతిన్= ఏనుగువలె; అడరినను= విజృంభిస్తే; వృకోదరునకున్= భీముడికి; ఒకఁడు; ఎదురన్; నిలిచి; తలపడువాఁడే;= ప్రతిఘటించగలడా?

తాత్పర్యం: కత్తి, గద మున్నగు సాధన సామగ్రి ఏమీ లేకుండానే కేవలం భుజబలంతో ఏనుగువలె విజృంభించినా భీముడి ఎదుట నిలబడి ఎవడైనా ప్రతిఘటించగలడా?

విశేషం: భీముడికి ఇక్కడ వృకోదరుడు (వృకము= తోడేలు ఉదరం వంటి ఉదరం గలవాడు) అనే శబ్దం సాభిప్రాయంగా ప్రయోగించబడింది కాబట్టి అలంకారం పరికరాంకురం.

తే. ప్రళయకాల సముద్రము భంగిఁ బొంగి । కడు భయంకరుఁడగు భీముఁ గడవ నీఁద
వశమె నా పుత్త్రులకు? విధివశము వొంది । యెదిరిఁ దమ్మును నెఱుఁగరు మదము కతన. 190

ప్రతిపదార్థం: ప్రళయ కాల సముద్రము భంగిన్= ప్రళయ సమయంలోని సముద్రంవలె; పొంగి, కడున్= మిక్కిలి; భయంకరుఁడు+ అగు భీమున్= వెరపు గొలిపే భీముడిని; కడవన్+ఈఁదన్= దాటేటట్లు ఈదటానికి; నా పుత్త్రులకున్= నా కుమారులకు; వశమె?= తరమా?; విధి వశము+పొంది= విధి వశం చేత; మదము కతనన్= గర్వం క్రొవ్వు కారణంగా; ఎదిరిన్+తమ్మునున్= ఎదుటివాళ్ళనూ; తమనూ; ఎఱుఁగరు.

తాత్పర్యం: ప్రళయ సమయంలో సముద్రంవలె పొంగి మిక్కిలి వెరపు గొలిపే భీముడిని తరించేటట్లు ఈదటానికి నా కుమారులకు శక్యమా? విధి వశంచేత, మదం కొద్దీ, ఎదుటివాళ్ళనూ తమనూ ఎరగరు.

విశేషం: 'ప్రళయ కాల సముద్రము భంగిన్' - అలంకారం ఉపమ.

క. చిచ్చునకుఁ దోడు కరువలి । వచ్చు గతిన్ భీము దుర్నివార విహారం
బచ్చు పడఁగఁ బ్రాపై వి । వ్వచ్చుఁడు వెస వచ్చు గాండివంబును దానున్. 191

ప్రతిపదార్థం: చిచ్చునకున్= అగ్నికి; తోడు= సహాయం(గా); కరువలి= గాలి; వచ్చు గతిన్= వచ్చే విధంగా; భీము దుర్నివార విహారంబు= భీముడియొక్క అడ్డగించ శక్యం కాని విహారం; అచ్చు పడఁగన్= తెల్లమయ్యేటట్లు; ప్రాపు+ఐ= అండయై-తోడయి; వివ్వచ్చుఁడు= బీభత్సుడు- అర్జునుడు; గాండివంబును+తానున్= గాండీవమూ; తానూ- గాండీవ సహితుడై; వెసన్= శీఘ్రంగా; వచ్చున్.

తాత్పర్యం: అగ్నికి వాయువు తోడయినట్లు, భీముడి అనివార్యమైన యుద్ధ విహారం బాగా తెలిసేటట్లు, అతడికి అండగా అర్జునుడు గాండీవంతో శీఘ్రంగా వస్తాడు.

విశేషం: 'చిచ్చునకుఁ దోడు కరువలి వచ్చుగతిన్... విన్వచ్చుఁడు వెసవచ్చు.' అలంకారం ఉపమ. ధృతరాష్ట్రుడికి కూడా అభిమానంలో దుర్యోధను డొక్కడూ ఒక ఎత్తు; మిగిలిన వారందరూ మరొక ఎత్తు. అందుకే దుర్యోధనుడిని, అతడి సోదరులనూ చంపే భీముడు మొదటి స్థానంలో జ్ఞాపకం వస్తాడు. ఆ తరువాత భీష్మ, ద్రోణ, కర్ణాది వీరులనందరినీ చంపగలిగిన అర్జునుడు మేటివీరుడైనా తరువాత లెక్కకు వస్తాడు. ఇది సహజం. (సంపా.)

వ. సంజయా! వినుము; నీ కున్న రూపు సెప్పెద. 192

తాత్పర్యం: సంజయా! నీకు ఉన్న సంగతి చెపుతాను. వినుము.

క. ఆ యర్జును మగఁటిమి కెన । యే యుగములఁ జూడ వినఁగ నెందును గలదే?
నీ యెదుర నాడి నంతయుఁ । జేయుట కతఁ డోపు; రిత్త సెప్పెడువాఁడే? 193

ప్రతిపదార్థం: ఆ+అర్జును మగఁటిమికిన్= ఆ అర్జునుడి పరాక్రమానికి; ఎన= సాటియైనవాడు; ఏ యుగములన్= ఏయుగాలలోనైనా- ఏ కాలంలోనైనా; ఎందును= ఎక్కడైనా; చూడన్ వినఁగన్= చూడడానికీ, వినడానికీ; కలఁడే?= ఉన్నాడా? అతఁడు; నీ+ఎదురన్= నీ ఎదురుగా; ఆడిన+అంతయున్= చెప్పినదంతా; చేయన్+ఓపున్= చేయటానికి సమర్థుడు; రిత్త+చెప్పెడు వాఁడే?= ఊరికే చెప్పేవాడా?

తాత్పర్యం: ఆ అర్జునుడికి పరాక్రమంలో సాటియైనవాడు ఏ యుగాలలోనైనా, ఎక్కడైనా ఉన్నాడని చూచామా, విన్నామా? అతడు నీ యెదుట అన్నదంతా చేయగల సమర్థుడు. ఊరికే అనేవాడా?

విశేషం: అర్జునుడు కూడా అన్నంత పనీచేస్తాడని భయం. (సంపా.)

ఉ. ఎక్కటి గాండివంబు నుతికెక్కి వెలుంగుట! మీఁదఁ గేశవుం
డక్కజమైన తేజ! మది యాసపడండు, దనంత నర్జునుం
డొక్కఁడ వైరిసేనలకు నొట్టిన మంట! ప్రతాపమూర్తు లి
ట్లొక్కెడఁ గూడె, నిన్నిటి మహోగ్రపు వేఁడిమి కోర్వవచ్చునే? 194

ప్రతిపదార్థం: ఎక్కటి గాండివంబు= సాటిలేని గాండీవం; నుతికిన్+ఎక్కి వెలుంగుట= పొగడ్తకెక్కి ప్రకాశించటం; మీఁదన్= ఆపైన; కేశవుండు= కృష్ణుడు; అక్కజము+ఐన తేజము= ఆశ్చర్యకరమైన తేజస్సు; అది, ఆసపడండు= దానికొరకు ఆశపడడు; తన+అంతన్= స్వయంగా; అర్జునుండు+ఒక్కఁడు+అ= అర్జునుడొక్కడే; వైరి సేనలకున్= శత్రుసేనలకు; ఒట్టిన మంట= మండే మంట; ఇట్లు= ఈవిధంగా; ప్రతాపమూర్తులు= తేజోమూర్తులు మూడు- గాండీవం, కృష్ణుడు, అర్జునుడు; ఒక్క+ఎడన్= ఒకచోట; కూడెన్= కలిశాయి; ఇన్నిటి మహా+ఉగ్రపు(ము)+వేఁడిమికిన్= ఈ మూడిటి మిక్కిలి భయంకరమైన వేడిమికి; ఓర్వన్+వచ్చునే?= సహించ శక్యమా?

తాత్పర్యం: సాటిలేని గాండీవం పొగడ్తకెక్కేటట్లు వెలుగుతూంటుంది. ఆపైన కృష్ణుడు ఇంకో ఆశ్చర్యకరమైన తేజస్సు. ఆ తేజస్సును అర్జునుడు ఆశించడు. తనకు తాను అర్జును డొక్కడే శత్రుసైన్యాలకు మండుతున్న మంట.

ఈ విధంగా ప్రతాపమూర్తులు మూడూ ఒక్కచోట కూడాయి. ఇన్ని ప్రతాపాల భయంకరమైన వేడిని తట్టుకో తరమా?

విశేషం: అలం: రూపకం, శ్లేష, సార్థక శబ్ద ప్రయోగం వలన ఈ పద్యంలో 'ప్రతాపమూర్తు లిట్లొక్కెడఁ గూడెన్' అనే వాక్యం ప్రాణం. ప్రతాపమూర్తులంటే పరాక్రమమూర్తులనీ, ప్రకాశమానులనీ, అధికంగా తాపం కలిగించే వారనీ రెండర్థాలు స్ఫురిస్తాయి. వీరులనీ అగ్నులనీ తాత్పర్యం. ఇక్కడ యుద్ధ యజ్ఞ త్రేతాగ్నులని కూడా ధ్వని. గాండీవం ఒక తేజస్సు. కృష్ణు డొక తేజస్సు, అర్జును డొక తేజస్సు. అర్జునుడు గాండీవ తేజస్సునే గ్రహిస్తాడు. కాని, కేశవ తేజాన్ని గ్రహించడు. అందువలన కేశవార్జునులు స్వతంత్ర తేజస్సులు. అవి మహోగ్ర భావాన్ని చెందినప్పుడు కలిగే 'వేడిమి'కి ఇతరులు తట్టుకొనటం కష్టం. వేడిమి అంటే కోపం, పౌరుషం అనీ, వెచ్చదనమనీ అర్థాలున్నాయి. అందువలన ఇందులో ధ్వనిమయంగా త్రేతాగ్ని రూపకం సార్థకంగా రాణించింది. ఆ ముచ్చిచ్చు మృత్యువు వంటిదని గ్రుడ్డిరాజు భయం. (సంపా.)

క. దివిజ దనుజ సహితము లగు । భువనము లన్నిట మహేంద్ర పుత్త్రుఁడు విజయో
త్సవ లీలఁ గ్రీడ సల్పుం; । దవులం బడఁడెందు నత్యుదగ్ర బలమునన్.' 195

ప్రతిపదార్థం: మహేంద్ర పుత్త్రుండు= మహేంద్రుడి కొడుకు- అర్జునుడు; దివిజ దనుజ సహితములు+అగు భువనములు+ అన్నిటన్= దేవతలతోనూ; రాక్షసులతోనూ కూడినవైన లోకాలన్నిటా; విజయ+ఉత్సవ లీలన్= గెలుపు వేడుకల విలాసంతో; క్రీడ+చల్పున్= విహరిస్తాడు; అతి+ఉదగ్ర బలమునన్= మిక్కిలి భయంకరమైన బలం వలన; ఎందున్= ఏ భువనంలోనూ; తవులంబడఁడు= అరికట్టబడడు.

తాత్పర్యం: అర్జునుడు సురాసుర సహిత లోకాలన్నిటిలోనూ విజయోత్సవలీలలతో విహరిస్తాడు. మిక్కిలి భయంకరమైన బలం ఉండటం వలన అతడు ఏ లోకంలోనూ అరికట్టబడడు.'.

వ. అని పలికి వెండియు. 196

తాత్పర్యం: అని పలికి, మళ్ళీ.

క. 'కురుసేనఁ గదా! గెలుచుట । కరము భరం బర్జునునకు! గాండీవమునం
బెరిఁగిన యమ్ముల మంటలు! దరికొని తెగఁ గాల్చునట్టిద యగుం జుమ్మీ! 197

ప్రతిపదార్థం: కురు సేనన్+కదా!= కౌరవ సైన్యాన్ని కదా!; అర్జునునకున్; గెలుచుట; కరము భరంబు= మిక్కిలి కష్టం!; (ఇది విపరీతార్థ ద్యోతకం); గాండీవమునన్= గాండీవంలో; పెరిఁగిన= వృద్ధి పొందిన; అమ్ముల మంటలు+అ= బాణాల మంటలే; దరికొని= విజృంభించి; తెగన్+కాల్చు+అట్టిది+అ= నిశ్శేషంగా కాల్చేదే; అగున్+చుమ్మీ!= అవుతుంది సుమీ!

తాత్పర్యం: కౌరవ సైన్యాన్ని! గెలవటం అర్జునుడికి చాలా(వింత) కష్టం! గాండీవంలో వృద్ధిపొందిన బాణాల మంటలే విజృంభించి, దానిని నిశ్శేషంగా దహించేవి అవుతాయి సుమీ!

విశేషం: 'గెలుచుట కరము భరం బర్జునునకు' ఏమీ భరం కాదనే విపరీతార్థమే ఇక్కడ గ్రాహ్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. భీమార్జునుల కొలందులు భీష్మద్రోణు లెఱుంగునంతకంటె నెవ్వ రెఱుంగుదు? రెఱింగియు మానుషంబు వాటించి సేన మొగంబున నిలుతురు; కీర్తి వట్టి ప్రాణంబులు విడుతు; రంతియకాని చేయునది లే; దదియునుం గాక పౌత్రులగుటయు శిష్యు లగుటయు, గాంగేయునకు గురునకు సామాన్యం బగుటం జేసి, రెండు దెఱంగుల వారికి వీ రొక్కరూప; మన కడనున్న తప్పునకు మనముందట నిలువవలయునను నింత మాత్రకుంగా వీరల కింత వలసె; నేను దైవాధీనత కతంబున బిడ్డల నొత్తి చెప్పను, నియమింపనుం జాల; మొదల విదురుం డేమని చాటి చెప్పి నదియంతయుం బాటిలె; జూదంబు నాఁటనుండియుఁ గురుజాతికిం జేటు మూఁడుట దోఁచుచుండు; మంద బుద్ధియు, లోభోపహతుండును నయి దురభిలాషంబున దుర్యోధనుఁ డింతసేసెఁ; గాలపర్యాయంబునఁ గౌరవులకుఁ గడవరాని యవస్థ వచ్చె; సంజయా! నే నేమి సేయుదు? నెందుఁ జొత్తు? నెద్ది దెరు? వెవ్వరు శరణంబు? వా రిరువురుఁ గల యంతటన పోయెనే? విను' మని మఱియు నిట్లనియె:' 198

ప్రతిపదార్థం: భీమ+అర్జునుల కొలందులు= భీమార్జునుల శక్తులు; భీష్మ ద్రోణులు ఎఱుంగు+అంతకంటెన్= భీష్మ ద్రోణులకు తెలిసినదానికంటె; ఎవ్వరు+ఎఱుంగుదురు?= ఎవరికి తెలుసు?; ఎఱింగియున్= తెలిసికూడా; మానుషంబు+ పాటించి= అభిమానం వహించి; సేన మొగంబునన్= సేన అగ్రభాగాన; నిలుతురు= ఉంటారు; కీర్తి+పట్టి= కీర్తి నవలంబించి- కీర్తే ముఖ్యమని; ప్రాణంబులు; విడుతురు; అంతియకాని; చేయు+అది లేదు; అదియునున్+కాక; పౌత్రులు+అగుటయున్= మనుమలు కావటం; శిష్యులు+అగుటయున్= శిష్యులు కావటం; గాంగేయునకున్= భీష్మునికీ; గురునకున్= ద్రోణుడికీ; సామాన్యంబు+అగుటన్+చేసి= సమానమవటం చేత; రెండు+తెఱంగులవారికిన్= ఇరు పక్షాలవారికీ; వీరు; ఒక్క రూపు+అ= ఒక్కటే; మన కడన్+ఉన్న తప్పునకున్= మన దగ్గరనున్న దోషానికి; మన ముందటన్ నిలువ వలయున్+అను+ఇంత మాత్రకున్+కాన్= మన ముందు నిలిచి తీరాలనే ఈ మాత్రానికే కదా; వీరలకున్+ఇంత వలసెన్= వీళ్ళకింత కావలసి వచ్చింది; నేను; దైవ అధీనత కతంబునన్= విధివశం చేత; బిడ్డలన్+ఒత్తి చెప్పనున్, నియమింపనున్+చాలన్= పిల్లలకు గట్టిగా చెప్పడానికీ, వాళ్ళను ఆజ్ఞాపించటానికీ సమర్థుడినీ కాను; మొదలన్= ఆదిలో; విదురుండు; ఏమి+అని చాటి చెప్పెన్= ఏమని విశదంగా చెప్పాడో; అది+అంతయున్+పాటిలెన్= అదంతా జరిగింది; జూదంబు నాఁటన్+ఉండియున్= జూద మప్పటినుండీ; కురుజాతికిన్= కౌరవులకు; చేటు మూఁడుట తోఁచుచున్+ఉండున్= కీడు వాటిల్లుతున్నదని అనిపిస్తూంటుంది; మందబుద్ధియున్= తెలివిమాలినవాడూ; లోభ+ఉపహతుండునున్= దురాశా దూషితుడూ; అయి, దురభిలాషంబునన్= దుష్టవాంఛతో; దుర్యోధనుఁడు; ఇంత+చేసెన్; కాల పర్యాయంబునన్= కాల భ్రమణంలో; కౌరవులకున్; కడవన్+రాని అవస్థ= దాటరాని దుస్స్థితి; వచ్చెన్; సంజయా!; నేను+ఏమి చేయుదున్; ఎందున్+చొత్తున్= ఎక్కడికి వెళ్ళుతాను?; ఎద్ది తెరువు?= ఏది మార్గం?; ఎవ్వరు - శరణంబు?= ఎవరు దిక్కు?; వారు+ఇరువురున్= ఆ భీమార్జును లిద్దరూ; కల+అంతటన్+అ+ పోయెనే?= ఉండటంతోనే అయిపోయిందా; వినుము+అని; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీమార్జునుల శక్తులు భీష్మ ద్రోణులకు తెలిసినదానికంటె ఎవరికీ తెలియదు. తెలిసి కూడా, అభిమానం వహించి వాళ్ళు మన సేనా ముఖంలో నిలుస్తారు. కీర్తే ముఖ్యమనుకొని ప్రాణాలు విడుస్తారు. ఇంతేకాని చేసేది లేదు. అదీగాక మనుమలు కావడమూ, శిష్యులు కావటమూ భీష్మద్రోణులకు సమానమవటం చేత, వీళ్ళు ఇరు పక్షాలవారికీ ఒక్కటే. మన దగ్గర ఉన్న దోషానికి మనముందు నిలిచితీరాలనే ఈ మాత్రానికే కదా వీళ్ళ కింత కావలసి వచ్చింది! నేను విధివశంచేత బిడ్డలకు నొక్కి చెప్పటంగాని, ఇట్లా నడవండి ఇట్లా నడవకండి అని అజ్ఞాపించటంగాని చేయలేకపోతున్నాను. ఆదిలో విదురు డెట్లా జరుగుతుందని విశదంగా చెప్పాడో, అట్లాగే జరిగింది. జూద

మప్పటినుండి కౌరవులకు కీడు జరుగుతున్నట్లు అనిపిస్తున్నది. తెలివిమాలినవాడూ, దురాశా దూషితుడూ అయి దుష్టవాంఛతో దుర్యోధనుడు ఇంత పని చేశాడు. కాలభ్రమణంలో కౌరవులకు దుస్తరమైన దురవస్థ తటస్థించింది. సంజయా! నే నేమి చేస్తాను? ఎక్కడికి పోతాను? ఏది దారి? ఎవరు దిక్కు? ఆ భీమార్జునులు ఇద్దరూ ఉండటంతోనే అయిపోయిందా? వినుము.' అని ఇంకా ఇట్లా అన్నాడు:

చ. 'అనుజులు నట్టి వార; ద్రుపదాది సుహృజ్జను లెల్ల నంతకం
టెను బలవంతు; లాహవ పటిష్ఠుఁడు రాజు యుధిష్ఠిరుండు; స
ద్వినయ వివేక శీలముల విశ్రుతుఁ డాతఁడు బంధు భృత్యులం
దనకు వశంబు సేసికొనుదానికి నేర్చుఁ బ్రభుత్వ సంపదన్. 199

ప్రతిపదార్థం: అనుజులున్= తమ్ములు కూడా; అట్టివారు+అ= అంతటివాళ్ళే; ద్రుపద+ఆది సుహృద్+జనులు+ఎల్లన్= ద్రుపదుడు మొదలైన మిత్రులందరూ; అంతకంటెను బలవంతులు; రాజు యుధిష్ఠిరుండు= రాజయిన ధర్మరాజు; ఆహవ పటిష్ఠుఁడు= యుద్ధంలో మిక్కిలి గట్టివాడు; సత్+వినయ వివేక శీలములన్= మంచి వినయం, వివేకం, స్వభావమూ అనే వాటిచేత; విశ్రుతుఁడు= ప్రసిద్ధుడు; ఆతఁడు= ఆ ధర్మరాజు; ప్రభుత్వ సంపదన్= ప్రభుత్వపు కలిమి చేత- ప్రభువు అవటం చేత; బంధు భృత్యులన్= చుట్టాలనూ, సేవకులనూ; తనకున్ వశంబు+చేసికొనుదానికిన్+నేర్చున్= తనకు అధీనులను చేసుకొనటం తెలిసినవాడు.

తాత్పర్యం: ఆ భీమార్జునుల తమ్ములు - నకుల సహదేవులు కూడా అంతటివాళ్ళే. ద్రుపదుడు మొదలుగా గల స్నేహితులందరూ అంతకంటె బలవంతులు. రాజైన యుధిష్ఠిరుడు యుద్ధంలో చాలా గట్టివాడు. మంచి వినయమూ, వివేకమూ, శీలమూ అనే వాటిచేత ప్రసిద్ధుడు. అతడు ప్రభువవటంచేత బంధువులనూ, సేవకులనూ తనకు స్వాధీనులను చేసికొనటం తెలిసినవాడు.

విశేషం: 'ఆహవ పటిష్ఠుఁడు రాజు యుధిష్ఠిరుండు'- ఇక్కడ యుధిష్ఠిర శబ్దం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరాంకురం.

ఆ. సత్య శౌచ ధర్మశాలి దయాపరుం। డట్టి ధర్మపుత్త్రు నాక్రమింప
మనము దలఁచు టెల్ల మంటలో మిడుత లు। దగ్రవృత్తి నుఱుకఁ దలఁచునట్ల. 200

ప్రతిపదార్థం: సత్య శౌచ ధర్మశాలి= సత్యమూ, శుచిత్వమూ, ధర్మమూ అనే వాటిచేత ఒప్పేవాడు; దయాపరుండు= దయా స్వభావుడు; అట్టి ధర్మపుత్త్రున్= అటువంటి ధర్మరాజును; మనము= మనం; ఆక్రమింపన్+తలఁచుట+ఎల్లన్= ఆక్రమించాలనుకొనటం అంతా; మిడుతలు; మంటలోన్; ఉదగ్రవృత్తిన్= గర్వంతో; ఉఱుకన్+తలఁచు+అట్లు+అ= ఉరకాలనుకొనటం వంటిదే.

తాత్పర్యం: సత్యమూ, శుచిత్వమూ, ధర్మమూ అనేవాటితో ఒప్పేవాడు. అటువంటి ధర్మరాజును మనం ఆక్రమించా లనుకొనటం అంతా - మిడుతలు గర్వంతో మంటలో ఉరకా లనుకొనటమే.

విశేషం: ఇందులో ఉపమేయ వాక్యానికీ (ధర్మపుత్త్రు నాక్రమింప మనము దలఁచు టెల్ల); ఉపమాన వాక్యానికీ (మంటలో మిడుత లుదగ్రవృత్తి నుఱుకఁ దలఁచునట్ల) ఐక్యారోపణం చేయబడింది కాబట్టి అలంకారం నిదర్శన.

వ. కావునఁ బాండవులతోడి భండనంబునఁ గులక్షయం బగుట దప్పదు; శాంతిఁ బొందుటయ మేలు; మనవారల కది ప్రియంబగునేని దానికిఁ దగిన యత్నంబు సేసెద' ననిన విని ధృతరాష్ట్రునకు సంజయుం డిట్లనియె: 201

ప్రతిపదార్థం: కావునన్; పాండవులతోడి భండనంబునన్= పాండవులతో యుద్ధంలో; కుల క్షయంబు+అగుట= వంశ నాశన మవటం; తప్పదు; శాంతిన్+పొందుట+అ= శాంతి వహించటమే; మేలు= మంచిది; మన వారలకున్; అది= శాంతి; ప్రియంబు+అగున్+ఏనిన్= ఇష్టమైనది అయితే; దానికిన్; తగిన యత్నంబు+చేసెదన్; అనినన్; విని; ధృతరాష్ట్రునకున్; సంజయుండు; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: కాబట్టి పాండవులతో జరిగే యుద్ధంలో వంశనాశన మవటం తప్పదు. శాంతి వహించటమే మేలు. మనవాళ్ళకు అది (శాంతి) ఇష్టమయితే దానికొరకు తగిన ప్రయత్నం చేస్తాను.' అనగా విని ధృతరాష్ట్రుడితో సంజయుడు ఇట్లా అన్నాడు.

క. 'దేవర యానతి యిచ్చిన । యీ వాక్యము లెస్స! నాఁడు నీవ యుపేక్షం
బో విడిచితి; వింకను నీ । చే వత్తురు వారు; వీరి చే టొప్పుదురే? 202

ప్రతిపదార్థం: దేవర= ప్రభువు; ఆనతి+ఇచ్చిన= సెలవిచ్చిన; ఈ వాక్యము; లెస్స= మంచిది; నాఁడున్= అప్పుడు; ఈవు+అ= నీవే; ఉపేక్షన్= అలక్ష్యంతో; పోన్; విడిచితివి= ఆ పాండవులను వదిలేశావు; వారు= పాండవులు; ఇంకను; నీచేన్+వత్తురు= నీ వశంలోకి వస్తారు; వీరి చేటు+ఒప్పుదురే?= కౌరవుల హానికి సమ్మతిస్తారా?- కౌరవులకు కీడు కలుగుతుందంటే సహిస్తారా?

తాత్పర్యం: 'ప్రభువు సెలవిచ్చిన ఈ మాట మంచిది. అప్పుడు నీవే అలక్ష్యం చేసి పాండవులను వదిలేశావు. ఇప్పుడైనా మించిపోయింది లేదు. ఇంక వాళ్ళు నీ అధీనంలోకి వస్తారు. కౌరవుల హానికి వాళ్ళు అంగీకరిస్తారా?'

వ. అది యెట్లంటేని. 203

తాత్పర్యం: పాండవులు కౌరవులకు కీడు జరుగుతుందంటే ఒప్పుకోరనేది ఎట్లా అంటావేమో.

క. వారు దెస లొత్తికొనియు ధ । రా రాజ్యం బిచ్చి పోయిరా పోరా? తా
రారణ్యపీడఁ బడియును । రారాజుం జెఱకుఁ బాపరా మన మెఱుఁగన్? 204

ప్రతిపదార్థం: వారు= పాండవులు; దెసలు+ఒత్తికొనియున్= దిక్కులను రాచికొని - దిక్కుల్ని అంటిపెట్టుకొని; ధరా రాజ్యంబు+ఇచ్చి పోయిరా పోరా?= భూరాజ్యం మీ కిచ్చి వెళ్ళిపోయారా లేదా?; తారు= తాము; ఆరణ్య పీడన్+పడియును= అరణ్యవాస బాధ పడి కూడా; మనము+ఎఱుఁగన్= మనం ఎరుగగా; రారాజున్= దుర్యోధనుడిని; చెఱకున్+పాపరా= గంధర్వుల బంధనం నుండి విడిపించరా?

తాత్పర్యం: పాండవులు భూరాజ్యం మీ కిచ్చి దిక్కులను పట్టుకొని వెళ్ళిపోయారా లేదా? తాము అరణ్యంలో బాధలు పడుతూ కూడా దుర్యోధనుడిని ఘోషయాత్రా సందర్భంలో గంధర్వుల చెరనుండి విడిపించటం మనకు తెలుసు గదా!

వ. అట్టి యెడ నైనను. 205

తాత్పర్యం: ఆ సమయంలో అయినా.

క. రావించి తగవుమై సం । భావింపవ కాక, నాఁడ పాండవు లలుకం
బో విడువరె? మిగులుదురే । నీ వచనంబులకుఁ? బిలిచి నిలుపుము వారిన్.' 206

ప్రతిపదార్థం: రావించి= (పాండవులను) రప్పించి; తగవు మైన్= న్యాయంతో; సంభావింపవు+అ+కాక= ఆదరించవుకాని; నాఁడు+అ= అప్పుడే - నీవు ఆదరించిననాడే; పాండవులు; అలుకన్= కోపాన్ని; పోన్+విడువరె?= విడిచిపెట్టరా?; నీ వచనంబులకున్= నీ మాటలకు(ను); మిగులుదురే?= అతిక్రమిస్తారా?; వారిన్; పిలిచి; నిలుపుము= అధికారంలో ఉంచుము.

తాత్పర్యం: పాండవులను రప్పించి న్యాయం చేసి ఆదరించవుగాని, ఆనాడే వారు కోపం విడిచిపెట్టరా? నీ మాటలు అతిక్రమిస్తారా? వారిని (ఇప్పుడైనా) పిలిచి నిలుపుము.

దుర్యోధనుఁడు తండ్రితో స్వపక్షవీరుల సామర్థ్యంబు సెప్పుట (సం. 5-54-1).

వ. అనిన విని దుర్యోధనుండు దండ్రి కి ట్లనియె: 207

తాత్పర్యం: అనగా విని దుర్యోధనుడు తండ్రితో ఇట్లా అన్నాడు.

చ. 'అడవులఁ గొండలం బడి మహాపద రూపటి చన్నవారి ని
ప్పుడు కొనివచ్చి కృష్ణుఁ డొక ప్రోవుగఁ గూటువమూఁకఁ గూర్చినం,
బొడుతురె పాండునందనులు? భూవర! యేటికి నింతభీతి? మా
కడిమియు లావు నీ వసదుగా గణుతింపకు; గెల్తు మెమ్మెయిన్. 208

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; అడవులన్= అడవులలోనూ; కొండలన్+పడి= కొండలలోనూ పడి; మహత్(మహా)+ఆపదన్= పెద్ద ఆపద చేత; రూపు+అటి చన్నవారిన్= రూపు చెడిపోయినవాళ్ళను; ఇప్పుడు; కొని; వచ్చి; కృష్ణుఁడు; ఒక ప్రోవుగన్= ఒక గుంపుగా; కూటువ మూఁకన్= ప్రోత్సాహపరిచి అక్కడక్కడ వెదకి తెచ్చిన పిరికిబలాన్ని; కూర్చినన్= కూరిస్తే; పాండునందనులు= పాండవులు; పొడుతురె?= యుద్ధం చేస్తారా?; ఇంత భీతి= ఇంత అధికమైన భయం; ఏటికిన్?= ఎందుకు?; నీవు; మా కడిమియున్= పరాక్రమమూ; లావున్= బలమూ; అసదుగాన్= తక్కువగా; గణింపకు(ము)= లెక్కించకుము; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; గెల్తుము= జయిస్తాం.

తాత్పర్యం: 'అడవులలోనూ, కొండలలోనూ పడి పెద్ద ఆపదచేత రూపుచెడిపోయిన వాళ్ళను ఇప్పుడు తీసికొని వచ్చి కృష్ణుడు శిక్షణంలేని పిరికివాళ్ళ గుంపును ఒక ప్రోవుగా కూరిస్తే పాండవులు యుద్ధం చేస్తారా? రాజా! ఎందుకయ్యా నీకు ఇంతటి భయం? మా బలపరాక్రమాన్ని నీవు తక్కువ అంచనా వేయకుము. ఎట్లా అయినా మేమే గెలుస్తాం.

విశేషం: 'పొడుతురె పాండునందనులు' -ఇది తిక్కన రచనలోని తెలుగు పలుకుబడికి చక్కని ఉదాహరణం. ఈపద్యం దుర్యోధనుడి స్వభావాన్ని స్పష్టంగా చాటుతున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. పరశురాముని గెలిచిన బల్లిదుండు । భీష్ముఁ; డవనీశు లీతని పేరు వినినఁ
బాఱుచుండుట యెఱుఁగవే? పాండుపుత్త్రు । లనఁగ నెంతటివా రితం డలిగెనేని? 209

ప్రతిపదార్థం: భీష్ముఁడు; పరశురామునిన్; గెలిచిన; బల్లిదుండు= శూరుడు; అవని+ఈశులు= రాజులు; ఈతని పేరు వినినన్= ఇతడి పేరు వింటేనే; పాఱుచున్+ ఉండుట= పరిగెత్తుకొని పోతూండటం; ఎఱుఁగవే?= తెలియవా?; ఇతండు; అలిగెన్+ఏనిన్= కోపం వహిస్తే; పాండుపుత్త్రులు+అనఁగన్+ఎంతటివారు= పాండవులంటే ఎంతటివారు?

తాత్పర్యం: భీష్ముడు పరశురాముడిని గెలిచిన శూరుడు. రాజు లితని పేరు వినగానే పారిపోవటం నీకు తెలియదా? ఇతడికి కోపం వస్తే పాండవులంటే ఎంత?

విశేషం: 'పరశురాముని గెలిచిన బల్లిదుండు భీష్ముఁడు' - అంబ కోరికపై భీష్ముడిని లొంగదీసుకోవడానికి పరశురాము డతడితో యుద్ధం చేశాడు. కాని భీష్మ డతడికి లొంగకపోవడంతో పరశురాముడు ఆ యత్నం విరమించాడు.

క. కృపుఁడును గురుఁడు నయోనిజు । లపరిమిత భుజాబలాఢ్యు, లాహవకేళీ
నిపుణు, లజేయులు; వీరలు । కుపితాత్మకులైన మాఱుకొనునే హరుఁడున్? 210

ప్రతిపదార్థం: కృపుఁడును; గురుఁడున్= ద్రోణుడూ; అయోనిజులు= యోనినుంచి పుట్టనివారు- పవిత్రులు; అపరిమిత భుజా బల+ఆఢ్యులు= మితిలేని బాహుబలంతో కూడినవారు; ఆహవ కేళీ నిపుణులు= యుద్ధ క్రీడయందు నేర్పరులు; అజేయులు= జయించరానివారు; వీరలు; కుపిత+ఆత్మకులు+ఐనన్= కోపించిన వారయితే; హరుఁడున్= ఈశ్వరుడయినా; మాఱుకొనునే?= ఎదుర్కొంటాడా?

తాత్పర్యం: కృపుడూ, ద్రోణుడూ అయోనిసంభవులు, అమిత బాహు బల సంపన్నులు. యుద్ధ క్రీడలో ఆరితేరిన వారు. వీళ్ళకు కోపం వస్తే హరుడు కూడా ఎదుర్కొనలేడు.

విశేషం: కృపుడు - శరద్వంతుడనే ముని తపస్సు చేస్తూండగా ఇంద్రుడతడి తపస్సును భగ్నం చేయటానికి ఒక అప్సరసను పంపాడు. ఆమెను చూడగానే మునికి కామం కలిగి రేతఃపతనమయింది. అతడి వీర్యం ఒక రెల్లుకాడమీద ద్వివిధంగా పడింది. అందులోంచి ఒక కొడుకూ, కూతురు పుట్టారు. వేట కొరకు వచ్చిన శంతనుడు వీళ్ళను చూచి కృపతో పెంచాడు. అందుచేతనే కొడుకు కృపుడూ, కూతురు కృపీ అయ్యారు. ఈ విధంగా కృపుడు అయోనిజుడు. ద్రోణుడు- భరద్వాజుడు ఘృతాచిని చూచి కామపరవశుడవుతాడు. అతడికి రేతః పతనమయింది. దానిని తెచ్చి భరద్వాజు డొక ద్రోణం (కుండ)లో పెట్టి కాపాడాడు. అందులోనుండి ద్రోణుడు పుట్టుతాడు. ఈ విధంగా ద్రోణుడు అయోనిజుడు. 'హరుఁడున్' ఈశ్వరుడికి బదులుగా హరశబ్దం సాభిప్రాయంగా ప్రయోగించబడింది కాబట్టి అలంకారం పరికరాంకురం.

క. ఈశ్వర వరజనితుఁడు, హరి । దశ్వ ప్రతిమాన తేజుఁ, డస్త్రకళా ని
త్యై శ్వర్య ధురంధరుఁ డీ । యశ్వత్థామ గలుగ మన కని వెఱపేలా? 211

ప్రతిపదార్థం: ఈశ్వర వర జనితుఁడు= ఈశ్వరుడి వరం వలన పుట్టినవాడూ; హరిదశ్వ ప్రతిమాన తేజుఁడు= సూర్యుడితో (పచ్చని గుర్రాలు గలవాడు) సమానమైన తేజస్సు కలవాడూ; అస్త్ర కళా నిత్య+ఐశ్వర్య ధురంధరుఁడు= అస్త్ర విద్య అనే

శాశ్వతైశ్వర్యం యొక్క భారాన్ని ధరించినవాడూ- అస్త్ర విద్యా సంపద అధికంగా కలవాడూ (అగు); ఈ+అశ్వత్థామ+కలుగన్= ఈ అశ్వత్థామ ఉండగా; మనకున్; అని వెఱపు= యుద్ధ భయం; ఏలా?= ఎందుకు?

తాత్పర్యం: ఈశ్వరుడి వరం వలన పుట్టినవాడూ, సూర్యుడి తేజస్సు వంటి తేజస్సు గలవాడూ, అస్త్ర విద్యా సంపన్నుడూ అయిన ఈ అశ్వత్థామ ఉండగా మనకు యుద్ధ భయం ఎందుకు?

ఆ. సహజ కుండలుండు, శౌర్యధుర్యుఁడు, సము । దీర్ణ బాహుబలుఁడు కర్ణుఁ డిందుఁ
గలఁడు; వీని కెదురు గలఁడని యెన్నుమా । ధర్మపుత్త్రుపాల, ధరణినాథ! 212

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; సహజ కుండలుండు= సహజములైన (పుట్టుకతోఉన్న) కుండలాలు గలవాడు; శౌర్య ధుర్యుఁడు= పరాక్రమ భారం వహించినవాడు; సముదీర్ణ బాహు బలుఁడు= మిక్కిలి గొప్ప భుజ బలంగలవాడు; (అగు); కర్ణుఁడు; ఇందున్= ఇక్కడ; కలఁడు; ధర్మపుత్త్రు పాలన్= ధర్మరాజు దగ్గర; వీనికిన్; ఎదురు; కలఁడు+అని; ఎన్నుమా= ఎంచుమా?

తాత్పర్యం: రాజా! సహజములైన కుండలాలు కలవాడూ, పరాక్రమభారం వహించినవాడూ, మిక్కిలి గొప్ప భుజబలం గలవాడూ అయిన కర్ణుడు ఇక్కడ ఉన్నాడు. ధర్మరాజు దగ్గర ఇతడికి ప్రతి అనదగినవాడు ఉన్నాడేమో ఎంచుము.

క. వినుము నరేశ్వర! కర్ణుని । పెనుపు; మహేంద్రుండు వచ్చి ప్రియమున శచికై
తను నర్థింపఁగ నిచ్చెను । గొను మని లోకంబు లెఱుఁగఁ గుండల యుగమున్. 213

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= రాజా!; కర్ణుని పెనుపు= కర్ణుడి గొప్పతనం; వినుము; మహేంద్రుండు; వచ్చి; ప్రియమునన్= ప్రీతితో; శచికై= శచి కొరకు; తనున్; అర్థింపఁగన్= కోరగా; కొనుము+అని= తీసుకో అని; లోకంబులు+ఎఱుఁగన్= లోకాలు ఎరిగేటట్లు - జగద్విదితంగా; కుండల యుగమున్= కుండలాల జతను; ఇచ్చెను= ఇచ్చాడు- (దానం చేశాడు.)

తాత్పర్యం: రాజా! కర్ణుడి గొప్పతనం చెపుతా వినుము. ఇంద్రుడు వచ్చి ప్రీతితో శచి కొరకని తనను కోరితే, తీసికొమ్మని కుండలాల జత ఇవ్వటం జగద్విదితం.

విశేషం: సహజ కవచ కుండలాలతో కూడిన కర్ణుడు తన కొడుకైన అర్జునుడికి అజేయు డవుతాడని భయపడి ఇంద్రుడు బ్రాహ్మణ వేషధారియై వచ్చి వాటినిమ్మని కర్ణుడిని అడగ్గా, అతడు మహోదారు డవటం వలన అంతకుముందే తన తండ్రియైన సూర్యుడు వారించినా, ఇచ్చి వేశాడు. అదీ అతని 'పెనుపు.'

వ. వీర లా ధర్మపుత్త్రాదుల చేతన కా దెవ్వరి చేతనుం జెడమి దెల్లంబు. బాహ్లిక సోమదత్త భూరిశ్రవ శ్శల్య సింధురాజ గాంధారరాజ ప్రభృతి మహావీరులు వీరలకంటెను శక్తి సమగ్రులు. తక్కటి రాజలోకంబును, సహాయులై వచ్చిన వివిధ దేశాధీశులును నాతోడి సుఖదుఃఖంబుల కియ్యకొని, యగ్గలికమై నగ్గినైన నుఱుకను, సముద్రంబైన నీఁదను దెంపుసేసి పొంపిరివోవుచున్నవారు. కావునఁ బాండవులకు మా దిక్కుదేఱి చూడనుం గొలంది గా, దనుమానింపకు; మిట్లునుంగాక మాకు నెవ్వరును లేక చుట్టంబులును జెలులును

విడిచి, తోడు వచ్చినవారును విచ్చిపోయి, భృత్యులును విరక్తులై, వారిక పోటుమానుసులును, బంధుమిత్త్ర సహాయులును, బ్రజానురాగంబునుం గలిగినట్టిదైన నది ప్రాప్తకాలం; బింతియకాని, యేమింక వారి యడుగు లొత్తను, బాఱిపోవనుం జాల; మెల్ల భంగుల సమరంబు సేయుదుము; మా తలంపిట్టిద; నా తలంచినట్లొండె, వాసుదేవుండు దలంచిన ట్లొండె నయ్యెడు నట్లైన మే; లింత వట్టును నిర్ణయం' బని పలికి, మఱియు నిట్లనియె: 214

ప్రతిపదార్థం: వీరలు= వీరు - ఈ వీరులు; ఆ ధర్మపుత్త్ర+ఆదులచేతన్+అ కాదు= ఆ ధర్మరాజు మున్నగువారిచేతనే కాదు; ఎవ్వరి చేతనున్; చెడమి= చెడకపోవటం; తెల్లంబు= స్పష్టం; బాహ్లిక సోమదత్త భూరిశ్రవస్+శల్య సింధురాజ గాంధారరాజ ప్రభృతి మహావీరులు= బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవుడూ, శల్యుడూ, సైంధవుడూ, శకునీ మొదలైన మహావీరులు; వీరల కంటెను; శక్తి సమగ్రులు= బలంచేత సంపూర్ణులు; తక్కటి రాజ లోకంబును= తక్కిన రాజుల సమూహమూ; సహాయులు+ఐ వచ్చిన వివిధ దేశ అధీశులును= వివిధ దేశాల రాజులూ; నాతోడి సుఖ దుఃఖంబులకున్= నాతోపాటు సుఖాలకూ దుఃఖాలకూ; ఇయ్యకొని= సమ్మతించి; అగ్గలికమైన్= ఉత్సాహంతో; అగ్గిన్+ఐనన్+ఉఱుకను= నిప్పులోనైన ఉరకడానికీ; సముద్రంబు+ఐనన్+ఈఁదను= సముద్రమైనా ఈదటానికీ; తెంపు+చేసి= సాహసించి; పొంపిరి+పోవుచున్+ఉన్నవారు= విజృంభిస్తున్నారు; కావునన్; పాండవులకున్; మా దిక్కు+తేఱి చూడనున్+కొలంది+కాదు= మావైపు తేరి చూడటానికి కూడా తరం కాదు; అనుమానింపకుము= సందేహించకుము; ఇట్టునున్+కాక= ఇట్లా కాక; మాకున్; ఎవ్వరును; లేక; చుట్టంబులును; చెలులును= స్నేహితులూ; విడిచి; తోడు వచ్చినవారును; విచ్చిపోయి= విడిచిపోయి; భృత్యులును= సేవకులు కూడా; విరక్తులు+ఐ= అసంతుష్టులయి; వారికిన్+అ= వారికే- ఆ పాండవులకే; పోటు మానుసులును= వీరులూ; బంధు మిత్ర సహాయులును= చుట్టాలూ, స్నేహితులూ, తోడ్పడ వచ్చినవాళ్ళూ; ప్రజా+అనురాగంబునున్= ప్రజల అనురాగమూ; కలిగిన+అట్టిది+ఐనన్= కలిగేటట్లయితే; అది; ప్రాప్త కాలంబు= ప్రారబ్ధం; ఇంతియ+కాని; ఏము= మేము; ఇంకన్; వారి అడుగులు+ఒత్తను= వారి పాదాలు పట్టటానికిగాని; పాఱిపోవనున్= పారిపోవటానికిగాని; చాలము= ఓపము; ఎల్ల భంగులన్= అన్ని విధాల; సమరంబు+చేయుదుము= యుద్ధం చేస్తాము; మా తలంపు+ఇట్టిది+అ= మా అభిప్రాయం ఇదే; నా తలంచిన+అట్లు+ఒండెన్= నేను అనుకొన్నట్లయినా; వాసుదేవుండు= కృష్ణుడు; తలంచిన+అట్లు+ఒండెన్= అనుకున్నట్లయినా; అయ్యెడున్= అవుతుంది; ఎట్లు+ఐనన్= ఎట్లా అయినా; మేలు= మంచిది; ఇంత వట్టును= ఇంతవరకూ; నిర్ణయంబు= నిశ్చయం; అని; పలికి; మఱియున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇప్పుడు నేను చెప్పిన వీరులు ఆ ధర్మరాజాదులచేతనే కాదు, మరెవ్వరిచేతా చెడిపోరు అనేది స్పష్టం. బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవుడూ, శల్యుడూ, సైంధవుడూ, శకునీ మొదలైన మహావీరులు వాళ్ళకంటెను బలవంతులు. తక్కిన రాజ సమూహమూ, తోడ్పడ వచ్చిన వివిధ దేశాల రాజులూ నాతోపాటు సుఖ దుఃఖాలకు సమ్మతించి, ఉత్సాహంతో నిప్పులలోనైనా ఉరకటానికి, సముద్రమైనా ఈదటానికి తెగించి విజృంభిస్తున్నారు. కాబట్టి పాండవులు మావైపు తేరి చూడటానికి కూడా సమర్థులు కారు. సందేహించకుము. ఇట్లాకాక, మాకు ఎవరూ లేక, చుట్టాలూ, స్నేహితులూ విడిచిపెట్టి, తోడువచ్చినవాళ్ళూ వెళ్ళిపోయి, సేవకులూ అసంతుష్టులయి, ఆ పాండవులకే వీరులూ, బంధువులు, మిత్రులు, సహాయులు, ప్రజానురాగమూ లభించేటట్లయితే, అది మా ప్రారబ్ధం. ఇంతేకాని, మేము ఇంక వారి పాదాలు పట్టటంగాని, పారిపోవటంగాని చేయలేము. అన్నివిధాలా యుద్ధం చేస్తాము. ఇదే మా అభిప్రాయం. నేననుకొన్నట్లయినా కావాలి, కృష్ణు డనుకొన్నట్లయినా జరగాలి. ఎట్లా అయినా మేలే. ఇంతవరకూ నిశ్చయం' అని పలికి, ఇంకా ఇట్లా అన్నాడు:

తే. 'కులములోఁ దలవంపగు కూడు గుడువఁ। బంపఁ జూచెద, వొకళులఁ బఱతు రట్టె!
వారు పై నెత్తి వచ్చినఁ 'బోరి కోప'। మనిన, ధృతి చేట కాక, పొం దగునె చెపుమ? 215

ప్రతిపదార్థం: కులములోన్= వంశంలో; తలవంపు+అగు కూడు= అవమానకరమైన కూడు; కుడువన్+పంపన్+చూచెదవు= తినుమని పంపటానికి చూస్తావు; ఒకళులన్= ఒకళ్ళను; పఱతురు+అట్టె!= బాధిస్తారట!; వారు= ఆ బాధితులు; పైన్+ఎత్తి వచ్చినన్= మీదికి దండెత్తి వస్తే; పోరికిన్+ఓపము= యుద్ధానికి చాలం- యుద్ధం చేయలేము; అనినన్= అంటే; ధృతి+చేటు+అ కాక= ధైర్యం చెడటమేకాని; పొందు+అగునె చెపుమ?= సంధి- సఖ్యం కుదురుతుందా? చెప్పుము.

తాత్పర్యం: 'కులంలో అవమానకరమైన, సిగ్గు చేటయిన కూడు తినుమని పంపాలని చూస్తున్నావు. ఒకళ్ళను బాధించిన వాళ్ళ మీదకు ఆ బాధితులు దండెత్తి వస్తే 'మేము యుద్ధం చేయలేము' అంటే, ధైర్యానికి చేటే (కీడే) కాని సఖ్యం కుదురుతుందా?

విశేషం: ఇంతవరకూ మేము పాండవులను బాధించాం. ఇప్పుడు వాళ్ళు మామీద తిరగబడితే 'మేము పోరాడలే'మంటే, 'వీళ్ళకు ధైర్యం లేదంటారే' తప్ప సఖ్యం కుదురుతుందా? అని భావం.

క. నీవు బతిమాలి కొడుకుల। చావునకును జేటునకును జాలక, యిమ్మై
వా విడిచి యఱచినం గడు। నేవ పడరె జనులు? నిన్ను నే మననేర్తున్? 216

ప్రతిపదార్థం: నీవు; బతిమాలి= దీనంగా వేడుకొని; కొడుకుల చావునకును+చేటునకును= కొడుకుల చావుకీ, హానికీ; చాలక= సైపక; ఈ+మైన్= ఈ విధంగా; వా విడిచి= నోరు విడిచి; అఱచినన్= ఏడిస్తే; జనులు= లోకులు; కడున్+ఏవ పడరె?= మిక్కిలి అసహ్యించుకోరా?; నిన్నున్; ఏమి+అనన్+నేర్తున్?= నేను ఏమనగలను?

తాత్పర్యం: నీవు వాళ్ళను దీనంగా వేడుకొని, నీ కొడుకుల చావుకూ, హానికీ ఓర్వక, ఇట్లా నోరు విడిచి విలపిస్తే లోకులు మిక్కిలి అసహ్యించుకొనరా? నిన్ను నేనేమనగలను?

తే. భీమసేనుని నీ వింత పెద్ద చేసి। పెక్కు భంగులఁ జెప్పితి 'యుక్కు గలఁడు,
గదకు నేర్చు నం' చెంతయు బెదరె; దతఁడు। నన్నుఁ బోలమి యెఱుఁగవే నరవరేణ్య? 217

ప్రతిపదార్థం: నరవరేణ్య!= రాజా!; నీవు; భీమసేనునిన్= భీముడిని ఇంత పెద్ద చేసి= ఇంత పెద్దవాడిని చేసి; పెక్కు భంగులన్= అనేక విధాల; చెప్పితి(వి)= చెప్పావు; ఉక్కు+కలఁడు= శౌర్యం కలవాడూ; గదకున్+నేర్చున్= గదయందు నేర్పరి; అంచున్; ఎంతయున్= మిక్కిలి; బెదరెదు (దవు)= భయపడతావు; అతఁడు; నన్నున్; పోలమి= సరిపోలకపోవటం; ఎఱుఁగవే?= తెలియవా?

తాత్పర్యం: రాజా! నీవు భీముడిని ఇంత గొప్ప చేసి అనేక విధాల చెప్పావు. అతడు బలం గలవాడు, గదయందు నేర్పరి అంటూ ఎంతో భయపడుతున్నావు. అతడు నన్ను పోలడని నీవు ఎరుగవా?

విశేషం: పెక్కు భంగులఁ జెప్పితి యుక్కు గలఁడు- ఇందులో 'చెప్పితి' అనేది మధ్యమపురుషక్రియ- చెప్పితివి. దీని వకారానికి లోపం వచ్చి, చెప్పితి+ఇ అయి, సంధి జరిగి, చెప్పితి అయింది. దీనిలోని ఇకారానికి ఉక్కులోని ఉకారం పరమయి-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'మధ్యమ పురుష క్రియలయం దిత్తునకు సంధి యగును' - బాల. సం.7 సూత్రం చేత 'చెప్పి తుక్కు ....' అని కావాలి. కాని అన్ని ప్రతులలోనూ 'చెప్పితి యుక్కు' అని యడాగమం వచ్చిన రూపమే ఉన్నది. కొన్ని వావిళ్ళవారి ప్రతులలో మాత్రం 'చెప్పి తట్లుక్కు గలఁడు' అనే పాఠం అధస్సూచికలో ఇవ్వబడింది.

మ. గద నాతో 'సరి మూఁడు లోకముల నేఁ గానం; జలం బెత్తి యు
న్మదుఁ డా భీముఁడు న న్ననిం దొడరిన న్వజ్రప్రహారంబు బె
ట్టిదమై తాఁకినఁ గూలు పర్వతము మాడ్కిం గుంభినిం గూలవ్రే
సెద! నా కోర్కి గదా గదారణము వచ్చెం బెద్దకాలంబునన్! 218

ప్రతిపదార్థం: గదన్= గదయందు- గదా యుద్ధంలో; నాతోన్, సరి= సమానుడిని; మూఁడు లోకములన్; ఏన్= నేను; కానన్= చూడను; ఉన్మదుఁడు= మిక్కిలి పొగరెక్కినవాడు; ఆ భీముఁడు; చలంబు+ఎత్తి= పంతం అతిశయించి; నన్నున్; అనిన్= యుద్ధంలో; తొడరినన్= మార్కొంటే; వజ్ర ప్రహారంబు= వజ్రపు దెబ్బ; బెట్టిదము+ఐ= గట్టిదయి; తాఁకినన్= తగిలితే; కూలు పర్వతము మాడ్కిన్= కూలిపోయే కొండలాగా; కుంభినిన్= నేల మీద; కూలన్+వ్రేసెదన్= పడిపోయేటట్లు కొడతాను; నా కోర్కిగదా= ఇది నా కోరిక కదా; పెద్ద కాలంబునన్= చిరకాలానికి; గదా రణము= గదాయుద్ధం; వచ్చెన్= వచ్చింది.

తాత్పర్యం: గదా యుద్ధంలో నాతో సమానుడు మూడులోకాలలోనూ నాకు కనిపించడు. పొగరెక్కిన ఆ భీముడు పంతం అతిశయించి నన్ను యుద్ధంలో మార్కొంటే, వజ్రం దెబ్బ గట్టిగా తగిలితే కూలిపోయే కొండలాగా, వాడిని నేలమీద పడేటట్లు కొట్టుతాను. ఇది నా కోరిక గదా! చిరకాలానికి గదాయుద్ధం వచ్చింది.

విశేషం: 'వజ్ర ప్రహారంబు బెట్టిదమై తాఁకినఁ గూలు పర్వతము మాడ్కిన్'- అలంకారం ఉపమ. నా కోర్కి గదా గదారణము ... గదా శబ్ద పునరక్తి అతని గదా యుద్ధ ప్రీతిని తెలియజేస్తున్నది. అలంకారం : యమకం.

ఆ. అతఁడు వడిన వెండి యా సేనఁ గోల్తల । సేయ నొకఁడు లేమి సిద్ధ; మింత
యెఱిఁగి వెఱచి కాదె 'యే నూళ్ళు లైనను । దమకుఁ జాలు' ననియె ధర్మసుతుఁడు. 219

ప్రతిపదార్థం: అతఁడు= ఆ భీముడు; పడినన్= పడిపోతే; వెండి= మళ్ళీ; ఆ సేనన్= ఆ సైన్యాన్ని; కోల్తల+చేయన్= ఎదుట నిలబడి యుద్ధసన్నాహం చేయటానికి; ఒకఁడు= ఎవడూ; లేమి= లేకపోవటం; సిద్ధము= స్పష్టం; ఇంత+ఎఱిఁగి వెఱచి కాదె= ఇదంతా ఎరిగి భయపడే కదా; ధర్మ సుతుఁడు= ధర్మరాజు; తమకున్; ఏను+ఊళ్ళులు+ఐనను= అయి దూళ్ళయినా; చాలున్= సరిపోతాయి; అనియెన్.

తాత్పర్యం: భీముడు నేలగూలితే ఇంక ఆ సేనలో ఎదుట నిలబడి యుద్ధం చేయటానికి మరెవ్వడూ లేడనటం స్పష్టం. ఇదంతా తెలిసి భయపడే కదా ధర్మరాజు 'మాకు అయిదూళ్ళయినా చాలు' అనటం!

వ. అర్జునుండు గలం డని తలంచితివేని. 220

తాత్పర్యం: భీముడు పోతే అర్జును డున్నాడు గదా అని అనుకొంటున్నావేమో.

తే. కర్ణు పడసిన యా శక్తి గలుగఁ, బోర । బ్రదుక వచ్చునె నరునకు? నదియుఁ గాక,
యతని భీష్మాది రథికుల యతులితాస్త్ర । మేయ దివ్యబాణంబులు మ్రింగికొనవె? 221

ప్రతిపదార్థం: కర్ణు పడసిన+ఆ శక్తి కలుగన్= కర్ణుడు పొందిన ఆ శక్త్యాయుధం ఉండగా; నరునకున్= అర్జునుడికి; పోరన్= యుద్ధంలో; బ్రదుకన్+వచ్చునె= బ్రతుక తరమా?; అదియున్+కాక= అదీకాక, అతనిన్= అర్జునుడిని; భీష్మ+ఆది రథికుల= భీష్ముడు మున్నగు రథికుల యొక్క; అతులిత= సాటిలేని; అప్రమేయ= ఇంత అని మితి ఏర్పరచడానికి శక్యంకాని; దివ్య బాణంబులు= దేవతా సంబంధి బాణాలు; మ్రింగికొనవె?= మ్రింగెయ్యవా?

తాత్పర్యం: కర్ణుడు పొందిన ఆ శక్త్యాయుధం ఉన్నంతకాలం, అర్జునుడికి యుద్ధంలో బ్రతుక తరమా? అదీకాక అతడిని భీష్మాది వీరుల సాటిలేనివీ, అమిత శక్తిమంతాలూ అయిన దివ్యబాణాలూ మ్రింగేయవా?

వ. దుశ్శాసన దుష్ప్రహ దుర్ముఖ వివింశతి వికర్ణ చిత్రసేనాదులగు నీ కొడుకు లొకం డొకండ జగంబులెల్ల జయింపఁజాలుదు; రందఱు నొక్క మొగంబై త్రోచి నడచిన సవ్యసాచి నొక్కరుండ కాదు; పాండవులనెల్ల నొక్కెత్తున వైచికొన నోపుదు; రట్లునుంగాక, మాకు నక్షౌహిణులు పదునొకండు, వారికి నే డక్షౌహిణులు, మా సైన్యంబు సారవంతంబు; వారిబలంబు నిస్సారంబు; వారు మమ్మెవ్విధంబున జయింపనోపుదు? ఈ యెక్కువ తక్కువలు విచారింపక వలవని వెఱపు గట్టికొని ముక్కూరి వగచుచున్నవాఁడవు; నిన్ను వగవకుండ నుడుపం జాల మంతియ కాని, తక్కెల్ల పనులకుం జాలుదు' మని పలికి, సంజయు దెసఁ గనుంగొని సుయోధనుం డిట్లనియె: 222

ప్రతిపదార్థం: దుశ్శాసన దుష్ప్రహ దుర్ముఖ వివింశతి వికర్ణ చిత్రసేన+ఆదులు+అగు నీ కొడుకులు= దుశ్శాసనుడూ, దుష్ప్రహుడూ, దుర్ముఖుడూ, వివింశతీ, వికర్ణుడూ, చిత్రసేనుడూ మొదలగు నీ కొడుకులు; ఒకండు+ఒకండు+అ= ఒక్కొక్కడే; జగంబులు+ఎల్లన్= లోకాలన్నీ; జయింపన్+చాలుదురు= జయించగలరు; అందఱున్= అంతా; ఒక్క మొగంబు+ఐ= ఒక్కసారిగా; త్రోచి నడచినన్= కలిసి నడిస్తే; సవ్యసాచిన్+ఒక్కరుండు+అ కాదు+ అర్జునుడిని ఒక్కడినే కాదు; పాండవులన్+ ఎల్లన్= పాండవులనందరినీ; ఒక్క+ఎత్తునన్= ఒక్కపెట్టున; వైచికొనన్+ఓపుదురు= ఎగురగొట్టగలరు; అట్లునున్+కాక= అదీకాక; మాకున్; అక్షౌహిణులు; పదునొకండు= పదకొండు; వారికిన్; ఏడు అక్షౌహిణులు; మా సైన్యంబు; సారవంతంబు; వారి బలంబు; నిస్సారంబు= సారం లేని; వారు; మమ్మున్; ఏ+విధంబునన్; జయింపన్+ఓపుదురు?= జయించగలరు?; ఈ ఎక్కువ తక్కువలు; విచారింపక= ఆలోచించక; వలవని వెఱపు= కూడని భయం; కట్టికొని= పొంది; ముక్కూరి వగచుచున్+ఉన్నవాఁడవు= తెలివి తక్కువగా దుఃఖిస్తున్నావు; నిన్నున్; వగవక+ఉండన్= దుఃఖించకుండా; ఉడుపన్+చాలము= మాన్పలేము; అంతియ కాని; తక్కు+ఎల్ల పనులకున్+చాలుదుము= తక్కిన పనుల కన్నిటికీ సమర్థులం; అని పలికి; సంజయు దెసన్+కనుంగొని= సంజయుడికేసి చూచి; సుయోధనుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దుశ్శాసనుడూ, దుష్ప్రహుడూ, దుర్ముఖుడూ, వివింశతీ, వికర్ణుడూ, చిత్రసేనుడూ మొదలుగాగల నీ కొడుకులు ఒక్కొక్కడే లోకాల నన్నిటినీ జయించగలరు. ఇక అందరూ ఒకటై కలిసి నడిస్తే అర్జునుడిని ఒక్కడినే కాదు- పాండవుల నందరినీ ఒక్క పెట్టున ఎగుర గొట్టగలరు. అదీకాక, మాకు పదకొండు అక్షౌహిణు లున్నాయి. వాళ్ళకి ఏడే ఉన్నాయి. మా సైన్యం సారవంతమైంది. వాళ్ళది నిస్సారం. వాళ్ళు మిమ్మల్ని ఎలా జయించగలరు? ఈ ఎక్కువ తక్కువలను చూడక తగని భయం పెట్టుకొని తెలివితక్కువగా దుఃఖిస్తున్నావు. మేము తక్కిన పనులన్నీ చేయగలం కాని నిన్ను ఏడువకుండా మాత్రం చేయలేము.' అని పలికి సంజయుడి వైపు చూచి దుర్యోధను డిట్లా అన్నాడు:

క. 'నానాదేశంబుల బలు । మానుసులం గూర్చికొని సమత్సరబుద్ధిం
దా నే మనియెడు నయ్యమ । సూనుం డాతని తెఱంగు సూతము చెపుమా!' 223

ప్రతిపదార్థం: నానా దేశంబుల బలు మానుసులన్= అనేక దేశాలలో ఉన్న గొప్ప మనుష్యులను- వీరులను; సమత్సర బుద్ధిన్= క్రోధ బుద్ధితో; కూర్చికొని= కలిపికొని; ఆ+యమ సూనుండు= ఆ ధర్మరాజు; తాను; ఏమి+అనియెడున్= ఏమంటాడు?; ఆతని తెఱంగు+చూతము చెపుమా!= అతడి సంగతి చూద్దాం చెప్పుము.

తాత్పర్యం: 'అనేక దేశాలలో ఉన్న గొప్ప వీరులను క్రోధ బుద్ధితో కూర్చుకొని ఆ ధర్మరాజు ఏమంటాడో- అతడి సంగతి చెప్పుము చూద్దాం.'

వ. అనిన విని సంజయుం డిట్లనియె : 224

తాత్పర్యం: అనగా విని సంజయుడిట్లా అన్నాడు :

సంజయుఁడు దుర్యోధనునకు ధర్మరాజు నిశ్చయం బెఱింగించుట (సం. 5-55-2)

ఉ. 'ఆతఁడు భండనం బనిన నార్చిన మూరెఁడు వేర్చు; నెంతయుం
బ్రీతి వహించి తమ్ము లొక పెండ్లికిఁ బోయెడు నట్ల యున్నవా;
రా తెలి వెందునుం గలదె? యందలి నాయకు 'లెప్పుడొక్కొ మా
చేతుల తీఁట పుత్తు?' మను చిత్తమ కాని చలింప రేమియున్. 225

ప్రతిపదార్థం: ఆతఁడు= ధర్మరాజు; భండనంబు+అనినన్= యుద్ధమంటే; ఆర్చినన్ మూర+ఎఁడు+పేర్చున్= అరిస్తే మూరెడు పైకి విజృంభిస్తాడు; తమ్ములు; ఎంతయున్; ప్రీతి వహించి= సంతోషం పూని; ఒక పెండ్లికిన్+పోయెడు+అట్లు+అ+ఉన్నవారు= ఒక పెళ్ళికి వెళ్ళే విధంగానే ఉన్నారు; ఆ తెలివి= ఆ ఉల్లాసం; ఎందునున్+కలదె?= ఎక్కడైనా ఉన్నదా?; అందలి నాయకులు= ఆ పక్షంలోని నాయకులు; ఎప్పుడు+ఒక్కొ!= ఎప్పుడోకదా!; మా చేతుల తీఁట+పుత్తుము= మా చేతుల దురద తీర్చుకొంటాం; అను చిత్తము కాని= అనే మనస్సే- కోరికే కాని; ఏమియున్+చలింపరు= కొంచెం కూడా చలించరు.

తాత్పర్యం: 'ధర్మరాజు యుద్ధం అనగానే మూరెడు లేస్తాడు. అతడి తమ్ములు ఎంతో సంతోషంతో ఒక పెళ్ళికి వెళ్ళుతున్న విధంగానే ఉన్నారు. వాళ్ళ ఉల్లాసం ఎక్కడైనా ఉన్నదా? ఆ పక్షంలోని నాయకులు 'మా చేతుల దురద తీర్చుకొనటం ఎప్పుడా?' అని ఉవ్విళ్ళూరుతూంటారు కాని కొంచెం కూడా చలించరు.

తే. నరుని పాశుపతాది బాణముల పెంపు, । భీము గద సొంపు నమ్మి యుద్దామ లీలఁ
జెలఁగి వెఱపేది యక్కడి బలము మునురు । గవిసి యెపుడుఁ గయ్యమునకుఁ గాలు ద్రవ్వు.' 226

ప్రతిపదార్థం: అక్కడి బలము= ఆ పక్షంలోని సైన్యం; నరుని పాశుపత+ఆది బాణముల పెంపున్= అర్జునుడి పాశుపతం మొదలైన అస్త్రాల గొప్పతనమూ; భీము గద సొంపున్= భీముడి గద అందమూ- శక్తీ; నమ్మి, ఉద్దామ లీలన్= విశృంఖలంగా; చెలఁగి= విజృంభించి; వెఱపు+ఏది= భయం లేక; మునురు కవిసి= గుమికూడి; ఎపుడున్= ఎప్పుడూ; కయ్యమునకున్; కాలు+ద్రవ్వున్= సై కొడుతూ ఉంటుంది.

తాత్పర్యం: ఆ పక్షంలోని సైన్యం అర్జునుడి పాశుపతాది బాణాల గొప్పతనమూ, భీముడి గద గొప్పతనమూ నమ్మి విశృంఖలంగా గుమికూడి ఎప్పుడూ కయ్యానికి కాలుద్రవ్వుతూ ఉంటుంది.'

క. నావుడు 'నిది యౌ, సంజయ! । కైవారము సేసె దీవు కౌంతేయులు; వా
రేవి రణ సాధనమ్ములు । గా వెఱవక నడచువారు కౌరవుల పయిన్?' 227

ప్రతిపదార్థం: నావుడున్= అనగానే; సంజయ!; ఇది+ఔన్= ఇది సరే; ఈవు= నీవు; కౌంతేయులన్= పాండవులను; కైవారము+చేసెదు (దవు)= స్తుతి చేస్తావు; వారు= ఆ పాండవులు; ఏవి; రణ సాధనమ్ములు+కాన్= యుద్ధ పరికరాలుగా; కౌరవుల పయిన్= కౌరవుల మీదకు; వెఱవక= నిర్భయంగా; నడచువారు?= నడుస్తారు- దండెత్తుతారు?

తాత్పర్యం: అనగానే, 'సంజయా! అది సరే. నీవు పాండవులను పొగుడుతావు. ఆ పాండవులు వేటిని యుద్ధసాధనాలుగా చేసికొని కౌరవుల మీదకు నిర్భయంగా దండెత్తుతారు?'

వ. అనిన సుయోధనునకు సూతనందనుం డర్జును దివ్యరథ శ్వేతాశ్వ కపిధ్వజ దేవదత్తంబుల మహానుభావంబులు వేఱువేఱ వర్ణించి చెప్పి, యుధిష్ఠిర భీమ నకుల సహదేవుల యరదంబులు, తురంగాది పరికరంబు లిట్టిట్టి వని యేర్పడం బలికి, విరాట ద్రుపదాదులకు వలయు నుపకరణంబులు గొఱంత లేమియు నెఱింగించిన, ధృతరాష్ట్రుం 'డిందుఁ గల బలు మానుసు లెవ్వరికి నసాధ్యులు. వీరి సాధించుతెఱం గూహించిరే?' యని యడిగిన నతనికి సంజయుం డిట్లనియె: 228

ప్రతిపదార్థం: అనిన సుయోధనునకున్= అట్లా అడిగిన దుర్యోధనుడికి; సూత నందనుండు= సంజయుడు; అర్జును= అర్జునుడి యొక్క; దివ్య రథ శ్వేత+అశ్వ కపిధ్వజ దేవదత్తంబుల= దేవతా సంబంధాలయిన రథమూ; తెల్లని గుర్రాలూ, కపిధ్వజమూ; దేవదత్తమూ అనేవాటి; మహా+అనుభావంబులు= గొప్పతనాలు; వేఱు వేఱు+అ= ప్రత్యేకంగా; వర్ణించి చెప్పి= వివరించి చెప్పి; యుధిష్ఠిర, భీమ, నకుల, సహదేవుల, రథాలు= ధర్మజ, భీమ, నకుల, సహదేవుల రథాలు; ఇట్టి+ఇట్టివి+అని= ఇట్లాంటివి ఇట్లాంటివి అని; ఏర్పడన్+పలికి= స్పష్టంగా చెప్పి; విరాట ద్రుపద+ఆదులకున్ వలయు+ఉపకరణంబులు= విరాటుడూ, ద్రుపదుడూ మొదలైనవాళ్ళకు కావలసిన సాధనాలు; కొఱంత లేమియున్= లోటు లేకపోవటం; ఎఱింగించినన్= చెప్పగా; ధృతరాష్ట్రుండు; ఇందున్= కౌరవ పక్షంలో; కల= ఉన్న; బలు మానుసులు= మహావీరులు; ఎవ్వరికిన్= ఎవరికీ; అసాధ్యులు= సాధించరానివారు - జయించరానివారు; వీరిన్= కౌరవ వీరులను; సాధించు తెఱంగు= జయించే విధం; ఊహించిరే; అని అడిగినన్; అతనికిన్= ధృతరాష్ట్రుడికి; సంజయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అడిగిన దుర్యోధనుడితో సంజయుడు అర్జునుడి దివ్యరథమూ, తెల్లగుర్రాలూ, కపిధ్వజమూ, దేవదత్తమనే శంఖమూ అనే వాటి మహత్త్వాలు ప్రత్యేకంగా వివరించి చెప్పి, ధర్మజ భీమ నకుల సహదేవుల రథాలూ, మొదలగు ఉపకరణాలూ ఇట్లాంటి విట్లాంటివని స్పష్టంగా చెప్పి, విరాటుడూ, ద్రుపదుడూ మొదలైనవారికి కావలసిన సాధనాల లోటు లేకపోవటం చెప్పగా, ధృతరాష్ట్రుడు 'కౌరవ పక్షంలోని మహావీరులు ఎవరికీ అసాధ్యులు. వీళ్ళను సాధించే విధం వాళ్ళు ఊహించారా?' అని అడిగితే, అతడితో సంజయుడు ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'గంగాసుతుండు శిఖండిపా, లతనికిఁ । బ్రాపు మత్స్యేశ్వరు బలము; కుంభ
భవుఁడు ధృష్టద్యుమ్ను పా, లతనికిఁ దోడు । పడు ద్రౌపదీ పుత్త్ర పంచకంబు;
రారాజుఁ, దమ్ములు మారుతి పాలు; కు । మారు లందఱు నభిమన్యు పాలు;
శకుని సైంధవులు, నశ్వత్థామ కర్ణులుఁ, । దక్కొరుచేఁ బోని దండిమగలు

ఆ. సవ్యసాచి పాలు; సాత్యకి పాల్ కృత । వర్మ; చేకితాన వసుమతీశు
పాలు సోమదత్తుఁ; డాలంబునకు నిట్లు । నిశ్చయించి రచట నృపవరేణ్య! 229

ప్రతిపదార్థం: నృపవరేణ్యా!= రాజోత్తమా! ధృతరాష్ట్రా!; భీష్ముడు శిఖండి పాలు= వంతు; అతనికిన్= ఆ శిఖండికి; మత్స్య+ ఈశ్వరు బలము= మత్స్య దేశరాజు - విరాటుడి సేన; ప్రాపు= అండ; కుంభభవుఁడు= ద్రోణుడు; ధృష్టద్యుమ్ను పాలు; అతనికిన్; ద్రౌపదీ పుత్ర పంచకంబు తోడుపడున్= ద్రౌపది కొడుకులు - ఉపపాండవులు అయిదుగురూ సహాయపడతారు; రారాజున్+తమ్ములున్= దుర్యోధనుడూ, అతడి తమ్ములూ; మారుతి పాలు= భీముడి పాలు; కుమారులు+అందఱున్= యువకులంతా; అభిమన్యు పాలు; శకుని సైంధవులున్; అశ్వత్థామ కర్ణులున్; తక్కు+ఒరుచేన్+పోని దండి మగలు= ఇంకొకడి చేత పడని మహాశూరులు; సవ్యసాచి పాలు= అర్జునుడి వంతు; కృతవర్మ; సాత్యకి పాల్; సోమదత్తుఁడు; చేకితాన వసుమతీ+ఈశు పాలు= చేకితానుడనే యాదవరాజు పాలు; అచటన్; ఆలంబునకున్= యుద్ధానికి; ఇట్లు= ఇట్లా; నిశ్చయించిరి= నిర్ణయించుకొన్నారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! భీష్ముడు శిఖండి వంతు. ఆ శిఖండికి విరాటుడి సైన్యం అండ. ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి వంతు. అతడికి ఉపపాండవు లైదుగురూ తోడ్పడుతారు. దుర్యోధనుడూ, అతడి తమ్ములూ భీముడి వంతు. యువ వీరులంతా అభిమన్యుడి వంతు. శకుని సైంధవులూ, అశ్వత్థామ కర్ణులూ- ఇతరుడికి లొంగని మహాశూరులైన వారూ అర్జునుడి వంతు. కృతవర్మ సాత్యకి వంతు. సోమదత్తుడు చేకితానుడనే యాదవరాజు వంతు. యుద్ధానికి ఇట్లా అక్కడ నిర్ణయించుకొన్నారు.

క. నకులుఁడు, సహదేవుండును, । శకుని నులూకాది సుతుల సారస్వతులం
బ్రకటబలులైన కాళిం । గకులను సమయించువారు కౌరవనాథా! 230

ప్రతిపదార్థం: కౌరవ నాథా!= కురురాజా, ధృతరాష్ట్రా!; నకులుఁడున్, సహదేవుండునున్; శకునిన్; ఉలూక+ఆది సుతులన్= ఉలూకుడూ మున్నగు కొడుకులనూ; సారస్వతులన్; ప్రకట బలులు+ఐన కాళింగకులను= ప్రసిద్ధమైన బలంగల కాళింగకులను, సమయించువారు= చంపుతారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! నకులుడూ, సహదేవుడూ శకునినీ, ఉలూకుడూ మొదలైన కొడుకులనూ, సారస్వతులనూ, ప్రసిద్ధమైన బలం కల కాళింగకులనూ చంపుతారు.

క. కేకయులు మనలఁ గలిసిన । కేకయుల జయించువారు; కృతపుణ్యుఁడు సు
శ్లోకుఁడు ధర్మతనూజుఁడు । లోకోత్తరు శల్యుఁ దా గెలుచువాఁ డధిపా ! 231

ప్రతిపదార్థం: అధిపా!= రాజా, ధృతరాష్ట్రా!; కేకయులు; మనలన్; కలిసిన కేకయులన్; జయించువారు; కృతపుణ్యుఁడు= చేయ బడిన పుణ్యం కలవాడు - పుణ్యాత్ముడు; సుశ్లోకుఁడు= మంచి కీర్తి గలవాడు అగు; ధర్మ తనూజుఁడు= ధర్మరాజు; తాన్= తాను; లోకోత్తరున్= అసాధారణుడు అయిన శల్యున్= శల్యుడిని; గెలుచువాఁడు= గెలుస్తాడు.

తాత్పర్యం: రాజా! కేకయులు మనలను కూడిన కేకయులను జయిస్తారు. పుణ్యాత్ముడూ, సుశ్లోకుడూ అయిన ధర్మరాజు లోకోత్తరుడైన శల్యుడిని గెలుస్తాడు.

వ. అట్టి పలుకుల సమయంబున నచ్చోటఁ గొందఱు జనంబులు ధర్మనందను నుద్దేశించి. 232

ప్రతిపదార్థం: అట్టి పలుకుల సమయంబునన్= ఆ మాటల సందర్భంలో; ఆ+చోటన్= అక్కడ; కొందఱు జనంబులు= కొంతమంది జనులు; ధర్మనందనున్+ఉద్దేశించి= ధర్మరాజుతో.

తాత్పర్యం: ఆ మాటల సందర్భంలో అక్కడ కొందరు జనులు ధర్మరాజుతో (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'ఇతఁ డెక్కడ? మద్ర మహీ । పతి యెక్కడ? నితని కతఁడు సాటియె?' యనుడుం,
బ్రతివచనంబుల శల్యుని । యతి బల శౌర్యములు వారి కాతఁడ చెప్పెన్. 233

ప్రతిపదార్థం: ఇతఁడు= ధర్మరాజు; ఎక్కడన్; మద్ర మహీపతి= మద్రదేశాధిపతి శల్యుడు; ఎక్కడన్; ఇతనికిన్; అతఁడు; సాటియె?= సమానుడా?; అనుడున్= అనగానే; ఆతఁడు+అ= అతడే- ధర్మరాజే; ప్రతి వచనంబులన్= బదులు పలుకులతో; వారికిన్; శల్యుని+అతి బల శౌర్యములు= శల్యుడి అమిత బలపరాక్రమాలు; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'ధర్మరా జెక్కడ? శల్యు డెక్కడ? ఇతడికి అతడు సమానుడా?' అనగానే వారికి అతడే శల్యుడి అమిత బలపరాక్రమాలను గూర్చి చెప్పాడు.

విశేషం: ఇతఁ డెక్కడ మద్రమహీపతి యెక్కడ- అననురూపములైన వాటికి ఘటన వర్ణించబడింది కనుక విషమాలంకారం.

వ. ఇట్లు గాకయు నెవ్వరి మొగంబున నెవ్వరు పడిరి, వారికి వార చాలియుండు వా రని; రివ్విధంబునఁ గ్రొవ్వు మిగిలి కొఱంతలేని తెగువం దేజరిల్లుచున్నవారు. నీకు నీ కొడుకునకు నెయ్యది గర్జంబై తోఁచె నదియ చేయుం' డనిన విని విచిత్రవీర్యతనయుం డిట్లనియె. 234

ప్రతిపదార్థం: ఇట్లు+కాకయున్= ఇట్లా కాక; ఎవ్వరి మొగంబునన్+ఎవ్వరు పడిరి= ఎవరిని ఎవరు ఎదుర్కొంటే; వారికిన్, వారు+అ= వారే; చాలి+ఉండువారు+అనిరి= గెలువగలుగుతారు అన్నారు; ఈ+విధంబునన్; క్రొవ్వు మిగిలి= గర్వం అతిశయించి; కొఱంత లేని తెగువన్= తక్కువకాని సాహసంతో; తేజరిల్లుచున్+ఉన్నవారు= ప్రకాశిస్తున్నారు; నీకున్; నీ కొడుకునకున్; ఎయ్యది+కర్జంబు+ఐ+తోఁచెన్= ఏది చేయదగిందని అనిపిస్తుందో; అది+అ= అదే; చేయుండు; అనినన్; విని; విచిత్రవీర్య తనయుండు= విచిత్రవీర్యుడి కొడుకు- ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఇట్లాగే కాక, ఎవరిని ఎవరు మార్కొంటారో, వారిని వారే గెలువగలుగుతారు' అన్నారు. ఈ రీతిగా గర్వం అతిశయించి కొదవ లేని సాహసంతో వారు ప్రకాశిస్తున్నారు. ఇక- నీకూ నీ కొడుకుకూ ఏది చేయదగిందని అనిపిస్తే అదే చేయండి' అనగా విని ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు:

క. 'నా కొడుకుల కెక్కడి బ్రదు? । కే కొలఁది దలంపు నిప్పు డెన్నిన వీరా
నీకంబు నోర్వవచ్చునె । యీ కూడిన సైనికులకు? నే మనువాఁడన్? 235

ప్రతిపదార్థం: నా కొడుకులకున్; ఎక్కడి బ్రదుకు?= ఇక బ్రతికి ఉండటం ఎక్కడిది?- చావు తప్పదు; ఏ కొలఁది+తలంపన్= ఎంత ఆలోచించినా; ఈ కూడిన సైనికులకున్= ఈ కూడుకొన్న సైనికులకు; ఇప్పుడు+ఎన్నిన వీర+అనీకంబున్= ఇప్పుడు నీవు చెప్పిన వీరుల సమూహాన్ని (వీరుల సేనను); ఓర్వన్+వచ్చునె?= ఓడించవీలవుతుందా?; ఏమి+అనువాఁడన్!= ఇంక ఏమంటాను!

తాత్పర్యం: 'ఇంక నా కొడుకులకు ఎక్కడి బ్రదుకు? ఎంత ఆలోచించినా, ఇక్కడ కూడుకొన్న సైనికులకు ఇప్పుడు నీవు చెప్పిన వీరుల సమూహాన్ని- వీరుల సేనను గెలవటం సాధ్యపడుతుందా? ఇక నేనేమి అనేది?

క. రాజు యుధిష్ఠిరుఁడై, హరి । దా జయ మొడఁగూర్ప నున్న, దత్సైన్యము రా
రా జిట్లు సరకు సేయమి । నా జన్మము దుఃఖభాజనం బగుటఁ జుమీ! 236

ప్రతిపదార్థం: రాజు; యుధిష్ఠిరుఁడు+ఐ= ధర్మరాజయి; హరి= కృష్ణుడు; తాన్= తాను; జయము+ఒడఁగూర్పన్+ఉన్నన్= గెలుపు కలిగించబోతూండగా; తద్+సైన్యమున్= ఆ సేనను; రారాజు= దుర్యోధనుడు; ఇట్లు; సరకు+చేయమి= లక్ష్యపెట్టకపోవటం; నా జన్మము= నా పుట్టుక; దుఃఖభాజనంబు+అగుటన్+చుమీ!= దుఃఖానికి పాత్రమైనది అవటం చేత సుమా!

తాత్పర్యం: రాజు ధర్మరాజుయి, కృష్ణుడు జయం కలిగించబోయే ఆ సైన్యాన్ని దుర్యోధనుడు ఇట్లా లక్ష్య పెట్టకపోవటం నా పుట్టుక దుఃఖశీలం అవటంచేతనే.

విశేషం: ధర్మరాజుకు యుధిష్ఠిరు డనే శబ్దం సాభిప్రాయంగా ప్రయోగించబడింది కాబట్టి అలంకారం పరికరాంకురం.

క. నా కుడుప నేల వశమగు? । నీ కూడిన భూపతులకు నింతియ కాలం
బై కడచన్నది సంజయ! । నీ కీ వగపేల? యింక నిలుపుము పలుకుల్.' 237

ప్రతిపదార్థం: నాకున్+ఉడుపన్+ఏల వశము+అగున్= మాన్పటానికి నాకెట్లా సాధ్యమవుతుంది?; ఈ కూడిన భూపతులకున్= ఈ చేరిన రాజులకు; ఇంతియ కాలంబు+ఐ కడచన్నది= ఇంతే బ్రదుకయిపోయింది - ఆయువు ఇంతటితో మూడింది; సంజయ; నీకున్; ఈ వగపు+ఏల?= ఈ శ్రమ-దుఃఖం ఎందుకు?; ఇంకన్, పలుకుల్, నిలుపుము= ఇక నీ మాటలు చాలించుము.

తాత్పర్యం: నే నెట్లా మాన్పగలను? ఈ చేరిన రాజులకు ఆయువు మూడింది. సంజయా! నీ కీ శ్రమ ఎందుకు? ఇంక చెప్పకుము.'

వ. అనిన విని దుర్యోధనుండు నిజ జనకునితో నిట్లనియె : 238

తాత్పర్యం: అనగా విని దుర్యోధనుడు తన తండ్రితో ఇట్లా అన్నాడు :

ఉ. 'ఏమును బాండునందనులు నేక కులంబునఁ బుట్టి యొక్కచో
నే మొకఁడైనఁ జేసి గెడ నెప్డుఁ జరించినయట్టివార; ము
ద్దామబలంబు శౌర్యమును దర్పము వారిక కల్గి, వార సం
గ్రామమునన్ జయింతు రనఁగా నొక నిశ్చయ మెట్లు గల్గెడున్? 239

ప్రతిపదార్థం: ఏమును= మేమూ; పాండు నందనులున్= పాండవులూ; ఏక కులంబునన్= ఒకే కులంలో; పుట్టి; ఒక్కచోన్= ఒక చోట; ఏము; ఒకఁడు+ఐనన్+చేసి= ఒకటి (ఏకం) అవటం చేత; ఎప్డున్= ఎప్పుడూ; గెడన్= జతగా; చరించిన+అట్టి సంచరించినవాళ్ళం; ఉద్దామ బలంబున్= అధిక బలమూ; శౌర్యమును= పరాక్రమమూ; గర్వమున్; వారికిన్+అ= వారికి-వారికే; కల్గి; వారు+అ= వారే; సంగ్రామమునన్= యుద్ధంలో; జయింతురు+అనఁగాన్= జయిస్తారంటే; ఒక నిశ్చయము= ఒక నిర్ణయం; ఎట్లు+కల్గెడున్= ఎట్లా కలిగింది?

తాత్పర్యం: 'మేమూ పాండవులూ ఒకే కులంలో పుట్టి, ఒక్కచోట ఏకమవటం చేత ఎప్పుడూ జతగా సంచరించిన వాళ్ళం. అట్లాంటప్పుడు అధికమైన బలపరాక్రమాలూ గర్వమూ వారికే కలిగి, వారే యుద్ధంలో జయిస్తారనే నిర్ణయం నీకు ఎట్లా ఏర్పడింది?

ఉ. వారిని, వారివారి నిటు వర్ణన సేసెదు గాని, మమ్ము మా
వారిఁ దలంప; వి పృడమి వారికిఁ బాయను, మాకు నంతయున్
జేరను మున్ సృజించె విధి సిద్ధము, దీని నొకండు మాన్పఁగా
నేరఁ; డకారణంబ మది నెవ్వగ లేటికిఁ బట్టుకొల్పఁగన్?' 240

ప్రతిపదార్థం: వారిని= పాండవులనూ; వారి వారిన్= వాళ్ళ వాళ్ళనూ; ఇటు= ఇట్లా; వర్ణన+చేసెదు(దవు)+కాని= వర్ణిస్తావు కాని; మమ్మున్; మా వారిన్; తలంపవు; ఈ+పుడమి= ఈ భూమి; వారికిన్+పాయను= వాళ్ళకు లేకుండానూ; మాకున్; అంతయున్= అంతా; చేరను= చెందేటట్లు; విధి= బ్రహ్మ - దైవం; మున్= ముందు, మొదటే; సృజించెన్= పుట్టించాడు-నిర్ణయించాడు; సిద్ధము= తప్పదు; దీనిన్= ఈ విధి నిర్ణయాన్ని; ఒకండు= ఎవడూ; మాన్పఁగాన్+నేరఁడు= తప్పించలేడు; ఆకారణంబు+అ= నిష్కారణంగానే; మదిన్= మనస్సులో; నెఱ+వగలు= అధిక దుఃఖాలు - ఎక్కువ ఆలోచనలు; పట్టుకొల్పఁగన్+ఏటికి?= కలిగించడం దేనికి?

తాత్పర్యం: పాండవులనూ, వాళ్ళ వాళ్ళనూ ఇట్లా తెగ పొగుడుతావు కాని, మమ్ములను, మా వాళ్ళనూ తలపెట్టవు. ఈ భూమి వాళ్ళకు కాదనీ, మాకే అంతా చెందాలనీ మొదటే విధి నిర్ణయించాడు. ఇది తప్పదు. ఈ విధి నిర్ణయాన్ని ఎవడూ తప్పించలేడు. నిష్కారణంగా మనస్సులో ఇంత బాధ పడటం దేనికి?'

వ. అనిన విని సూతనందనునకు నంబికానందనుం డిట్లను- 'నా కొడు కున్మత్త ప్రలాపంబులు సేయుచున్నవాఁ; డింతియకాని సత్యధర్మ నయ పరాక్రమ సహాయ సంపన్నులైన పాండవులఁ దనకు గెలువ వచ్చునే? తాను బ్రబలుం డయినను బెనఁకువ గీడ కాక మేలగునే? యది యట్లుండె; నొక్కటి యడిగెద సంజయా! చెప్పుము. 241

ప్రతిపదార్థం: అనినన్; విని; సూతనందనునకున్= సంజయుడికి; అంబికానందనుండు= ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనున్; నా కొడుకు; ఉన్మత్త ప్రలాపంబులు+చేయుచున్+ఉన్నవాఁడు= పిచ్చి పిచ్చిగా వాగుతున్నాడు; ఇంతియకాని= ఇంతే కాని; సత్య ధర్మ నయ పరాక్రమ సహాయ సంపన్నులు+ఐన పాండవులన్= సత్యమూ, ధర్మమూ, నీతీ, పరాక్రమం, సహాయమూ తోడుగా గలిగిన పాండవులను, తనకున్+గెలువన్+వచ్చునే?= తనకు గెలవటం సాధ్యమా?; తాను; ప్రబలుండు+అయినను= మిక్కిలి బలం కలవాడే అయినప్పటికీ; పెనఁకువ= కలహం; కీడు+అ+కాక= హానే కాని; మేలు+అగునే= మంచిదవుతుందా?; అది+అట్లు+ఉండెన్= అది అట్లా ఉండనీ; సంజయా!; ఒక్కటి+అడిగెదన్; చెప్పుము.

తాత్పర్యం: అనగా విని సంజయుడితో ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు. 'నా కొడుకు పిచ్చి పిచ్చిగా వాగుతున్నాడు. ఇంతేకాని సత్యమూ, ధర్మమూ, నీతీ, పరాక్రమం, సహాయమూ గలిగిన పాండవులను తను గెలవగలడా? తాను అధిక బలవంతుడయినప్పటికీ కలహం కీడే కాని మేలు కలిగిస్తుందా? అది అట్లా ఉంచి, సంజయా! నిన్నొక్కటి అడుగుతాను చెప్పుము.

క. సమరమునకుఁ బురికొల్పుచు, । మముఁ దలఁచిన నుల్లి కుట్టు మాటలఁ దచ్చి
త్తము లుడికించుచుఁ బాండవ । సమితిం గడఁగించువా రచట నెవ్వరొకో?' 242

ప్రతిపదార్థం: సమరమునకున్= యుద్ధానికి; పురికొల్పుచున్= ప్రేరేపిస్తూ; మమున్= మమ్మల్ని; తలఁచినన్= తలచుకోగానే; ఉల్లి కుట్టు మాటలన్= సూటీ పోటీ మాటలతో- ఎత్తి పొడుపు మాటలతో; తద్+చిత్తములు= వాళ్ళ మనస్సులు; ఉడికించుచున్= వేడెక్కిస్తూ; పాండవ సమితిన్= పాండవుల సమూహాన్ని; కడఁగించువారు= ప్రోత్సహించేవాళ్ళు; అచటన్= అక్కడ; ఎవ్వరు+ ఒకో?= ఎవరో?

తాత్పర్యం: యుద్ధానికి పురికొల్పుతూ మా మాట స్మరించగానే సూటిపోటి మాటలతో వాళ్ళ మనస్సులను వేడెక్కిస్తూ పాండవులను ప్రోత్సహించే వాళ్ళు అక్కడ ఎవరో?'

క. నావుడు సంజయుఁ డిట్లను; । 'దేవా! పాండవుల యలుక ధృష్టద్యుమ్నుం
డే వెరవుమాటనైనను । నే వోసిన యగ్ని భంగి నిగుడం జేయున్. 243

ప్రతిపదార్థం: నావుడున్= అనగానే; సంజయుఁడు; ఇట్లు+అనున్; దేవా!; ధృష్టద్యుమ్నుండు; ఏ వెరవు మాటన్+ఐనను= ఏ రకం మాటతో అయినా; పాండవుల అలుకన్= పాండవుల కోపాన్ని; నే+పోసిన+అగ్ని భంగిన్= నేయి పోసిన నిప్పువలె; నిగుడన్+చేయున్= రగుల్కొలుపుతాడు.

తాత్పర్యం: అట్లా ధృతరాష్ట్రుడు అడగగానే సంజయుడు ఇట్లా అన్నాడు: 'ప్రభూ! ధృష్టద్యుమ్నుడు ఏదో మాటతో పాండవుల కోపాన్ని నెయ్యి పోసిన నిప్పువలె రగుల్కొలుపుతాడు.

విశేషం: నే వోసిన యగ్ని భంగి- అలంకారం ఉపమ.

వ. అతండు ధర్మతనయుతో నిట్లను: 'గాంగేయ కుంభసంభవాది మహావీర క్రూరసత్త్వ బహుళంబును, గరిఘటా గిరి కదంబ కలితంబును, దురంగ నికర తరంగ పరంపరా ఘోరంబు నగు కౌరవసేనా సముద్రంబునకు నేనొక్క చెలియలికట్టనై నిలిచెద' ననవుడు నయ్యుధిష్ఠిరుండు 'నీ వింతకుఁ జాలుట యెవ్వరు నెఱుంగరే? యెట్లును సంగరంబున మమ్ముద్ధరింపు' మనియె; నిట్లు గొనియాడిన, నాతండు నా దెసం గనుంగొని, 'సంజయా! మీ వారల కెల్లనుం దెలియం జెప్పు; మీశ్వరాది దేవతలు సమకట్టిన సవరణగల యర్జునుచేత నిర్జింపంబడిన యుత్కృష్టజాతు లనేకు లగుట యెఱుంగుదుర కాదె? మనుష్యు లతనికెంత పెద్ద? యిట్టి జెట్టి వెన్నుదన్ని చూడఁగలవాఁడు గావున, మముబోంట్లెల్లఁబోక పెనంగినం, బోరు భరంబైనం, బ్రాణంబులపై వచ్చు; నంతకంటెను బరమ దయాపరుండైన పాండవాగ్రజు మఱువు సొచ్చి బ్రదుకుం డను; మంతలంతలు

దప్పులు సేసితి మని తలంక వలవ; దెంత సేసినను, గౌంతేయ పూర్వజుండు శాంతి సుధానిధి యగుటంజేసి శరణు సొచ్చినం గాచు' నని పలికె' ననిన విని ధృతరాష్ట్రుండు దుర్యోధనున కిట్లనియె: 244

ప్రతిపదార్థం: అతఁడు= ధృష్టద్యుమ్నుడు; ధర్మతనయుతోన్= ధర్మరాజుతో; ఇట్లు+అనున్; గాంగేయ కుంభసంభవ+ఆది మహావీర క్రూర సత్త్వ బహుళంబును= భీష్ముడూ, ద్రోణుడూ మున్నగు గొప్ప వీరులనే క్రూరమృగాలతో సాంద్రమైనదీ; కరి ఘటా గిరి కదంబ కలితంబును= ఏనుగుల గుంపు అనే కొండల సమూహంతో కూడుకొన్నదీ; తురంగ నికర తరంగ పరంపరా ఘోరంబును= గుర్రాల సమూహం అనే అలల వరసచేత భయంకరమైనదీ; అగు; కౌరవ సేనా సముద్రంబునకున్= కురుసైన్యం అనే సముద్రానికి; ఏను= నేను; ఒక్క చెలియలికట్టను+ఐ= ఒక గట్టు నయి; నిలిచెదన్= నిలుస్తాను; అనవుడున్= అనగానే; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; నీవు; ఇంతకున్+చాలుట= ఈ చెప్పినదానికి సమర్థుడవటం; ఎవ్వరున్= ఎవరూ; ఎఱుంగరే?= ఎరగరా?; ఎట్లునున్= ఎట్లా అయినా; సంగరంబునన్= యుద్ధంలో; మమ్మున్; ఉద్ధరింపుము= లేవనెత్తుము, ఆదుకో; అనియెన్; ఇట్లు; కొనియాడినన్= పొగడగా; అతండు+ ధృష్టద్యుమ్నుడు; నా దెసన్= నా వైపు; కనుంగొని= చూచి; సంజయా!; మీ వారలకున్+ఎల్లనున్= మీవాళ్ళకందరికీ; తెలియన్+చెప్పుము= తెలిసేటట్లు చెప్పుము; ఈశ్వర+ఆది దేవతలు= ఈశ్వరుడూ మొదలైన దేవతలు; సమకట్టిన సవరణ+కల= సమకూర్చిన యుద్ధపరికరాలు ఉన్న; అర్జును చేతన్; నిర్జింపంబడిన= జయించబడిన; ఉత్కృష్ట జాతులు= గొప్పవాళ్ళు; అనేకులు+అగుట= పెక్కుమంది అవటం; ఎఱుంగుదురు+అ కాదె= ఎరుగుదురు కదా; అతనికిన్; మనుష్యులు= మానవ మాత్రులు; ఎంత పెద్ద?= ఏమి ఎక్కువ?; ఇట్టి జెట్టి= ఇటువంటి వీరుడు; వెన్ను దన్ని చూడన్+కలవాఁడు+కావునన్= వెనకాల ఉండి చూడగలవాడు కాబట్టి; మము బోంట్లు+ఎల్లన్= మావంటివాళ్ళు అందరూ; పోక పెనంగినన్= పారిపోకుండా యుద్ధం చేయగా; పోరు= యుద్ధం; భరంబు+ఐనన్= అతిశయం అయితే; ప్రాణంబులపైన్+వచ్చున్= ప్రాణాంతకమవుతుంది; అంతకంటెను= దానికంటె; పరమ దయాపరుండు+ఐన= మిక్కిలి దయగల వాడయిన; పాండవ+అగ్రజు= ధర్మరాజుయొక్క; మఱువు+చొచ్చి= శరణుపొంది; బ్రదుకుండు+అనుము= బ్రతకండి అని చెప్పుము; అంతలు+అంతలు+తప్పులు+చేసితిమి+అని= అంతంత అపరాధాలు చేశామని; తలంకవలవదు= భయపడవద్దు; ఎంతలు+చేసినను= ఎంతటి ఘోరాలు చేసినా; కౌంతేయ పూర్వజుండు= పాండవులలో పెద్దవాడు- ధర్మరాజు; శాంతి సుధానిధి+అగుటన్+చేసి= శాంతికి చంద్రుడు అవటం చేత- శాంతి అనే అమృతానికి నిధానం కావటం చేత; శరణు+చొచ్చినన్= శరణంటే; కాచున్= రక్షిస్తాడు; అని; పలికెన్; అనినన్; విని; ధృతరాష్ట్రుండు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అతడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: 'భీష్మద్రోణాది మహావీరులనే క్రూరమృగాలతో తరచైనదీ, ఏనుగుల గుంపు అనే కొండల సమూహంతో కూడుకొన్నదీ, గుర్రాల సమూహం అనే అలల వరసచేత భయంకరమయినదీ అయిన కురుసేన అనే సముద్రానికి నేను ఒక గట్టునయి నిలుస్తాను' అనగానే ఆ ధర్మరాజు 'నీవు అన్నంత దానికీ సరిపోతావని ఎవరికి తెలియదు? ఎట్లా అయినా యుద్ధంలో మమ్మల్ని ఆదుకో' అన్నాడు. ఇట్లా పొగిడితే, ధృష్టద్యుమ్నుడు నావైపు చూచి 'సంజయా! మీ వాళ్ళ కందరికీ తెలిసేటట్లు చెప్పుము. ఈశ్వరుడు మొదలైన దేవతలు సమకూర్చిన యుద్ధ పరికరాలు గల అర్జునుడిచేత జయించబడిన గొప్పవాళ్ళు ఎంతో మంది ఉండటం మీకు తెలిసిందే కదా! మనుష్యులు అతడికి ఏమి ఎక్కువ? ఇటువంటి శూరుడు వెనకాల ఉండి చూడగలవాడు కాబట్టి, మావంటివాళ్ళం పారిపోకుండా నిలబడి యుద్ధం చేస్తాం. అప్పుడు యుద్ధం తలకు మించిన బరువై ప్రాణాంతక మవుతుంది. దానికంటె మిక్కిలి దయగలవాడైన ధర్మరాజును శరణనివేడి బ్రతకండి అని చెప్పుము. అంతలేసి తప్పులు చేశాం అని భయపడవద్దు. ఎంతటి తప్పులు చేసినా ధర్మరాజు శాంతికి చంద్రుడు (శాంతి అనే అమృతానికి నిధానం) కాబట్టి, శరణంటే రక్షిస్తాడు' అని పలికాడు:' అనగా విని ధృతరాష్ట్రుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'గాంగేయ ... బహుళంబును',- 'కరిఘటా .... కలితంబును', 'తురంగ నికర తరంగ ఘోరంబును'; 'కౌరవ సేనా సముద్రంబునకు నేను చెలియలికట్టను' - అన్నీ రూపకాలంకారాలు. 'ఒక్క చెలియలికట్టనై నిలిచెద' - చెలియలి కట్ట సముద్రం పొంగి పొరలకుండా ఆపినట్లు, 'నేను కౌరవసేన మీదికి రాకుండా అడ్డుపడతాను' అని భావం. 'శాంతి సుధా నిధి' శాంతి అనే సుధకు నిధి- అలంకారం రూపకం. 'అర్జును చేత నిర్జింపబడిన ఉత్కృష్ట జాతులనేకులగుట యెఱుంగుదుర కాదె? మనుష్యు లతని కెంత పెద్ద?' - అలంకారం కావ్యార్థాపత్తి.

క. 'పరిజనులకు నీకును ని । ద్ధరలోన సగంబు సాలుఁ; దక్కటి సగముం
గర ముచితంబుగఁ బాండవ । వరుఁ డగు ధర్మజున కిచ్చి బ్రదుకుము నెమ్మిన్. 245

ప్రతిపదార్థం: పరిజనులకున్ నీకునున్= నీ పరివారానికీ, నీకూ; ఈ+ధరలోనన్= ఈ భూమిలో; సగంబు+చాలున్= సగం సరిపోతుంది; తక్కటి సగమున్= మిగిలిన సగాన్ని; కరము+ఉచితంబుగన్= సముచితంగా; పాండవ వరుఁడు+అగు ధర్మజునకున్+ఇచ్చి= పాండవ శ్రేష్ఠుడైన ధర్మరాజు కిచ్చి; నెమ్మిన్= హాయిగా; బ్రదుకుము= జీవించుము.

తాత్పర్యం: 'నీకూ నీ పరివారానికే ఈ భూమిలో సగం చాలు, తక్కిన సగం సముచితంగా ధర్మరాజుకిచ్చి హాయిగా బ్రతుకుము.

ధృతరాష్ట్రుఁడు దుర్యోధనునితో సంధి సేయుమని చెప్పుట **(సం. 5-57-4)**

చ. పెనఁకువ నాక యేల మన పెద్దల కెవ్వరి కియ్యకోలు గా;
దనుచిత వృత్తి గాన గురుఁడాదిగ నాప్తులు బంధుమిత్రులున్
గొనకొని పోరికిం జొర; రకుంఠిత తేజుఁడు ధర్మపుత్రుఁ; డా
తనిఁ దగఁ గూడి మన్కి ప్రమదం బగుఁ గౌరవజాతి కెంతయున్.' 246

ప్రతిపదార్థం: పెనఁకువ= యుద్ధం; నాకున్+అ= నాక= నాకే; ఏల; మన పెద్దలకున్; ఎవ్వరికిన్; ఇయ్యకోలు+కాదు= సమ్మతం కాదు; అనుచిత వృత్తి+కానన్= తగని వ్యాపారం కాబట్టి; గురుఁడు+ఆదిగన్= ద్రోణుడు మొదలుకొని; ఆప్తులున్; బంధు మిత్రులున్= చుట్టాలూ; స్నేహితులూ; గొనకొని= పూని; పోరికిన్= యుద్ధానికి; చొరరు= ప్రవేశించరు - ముందుకు రారు; ధర్మపుత్రుఁడు= ధర్మరాజు; అకుంఠిత తేజుఁడు= కుంటువడని తేజస్సు కలవాడు; ఆతనిన్; తగన్= ఒప్పుగా; కూడి మన్కి= కలిసి బ్రతకటం; కౌరవజాతికిన్= కురు కులానికి; ఎంతయున్= మిక్కిలి; ప్రమదంబు+అగున్= ఆనందమవుతుంది.

తాత్పర్యం: యుద్ధం నాకే కాదు, మన పెద్దల కెవ్వరికీ సమ్మతం కాదు. అది తగని పని కాబట్టి ద్రోణుడు మొదలుకొని ఆప్తులుగాని, బంధువులుగాని, మిత్రులుగాని యుద్ధానికి పూని ముందుకు రారు. ధర్మరాజు కుంటువడని తేజస్సు కలవాడు. ఆతడితో ఒప్పుగా కలిసి బ్రతకటం కౌరవజాతికి ఎంతో సంతోషం కలిగిస్తుంది.'

వ. అని వెండియు. 247

తాత్పర్యం: అని మళ్ళీ.

క. 'కర్ణుండు రేఁచి పెట్టఁగ, । దుర్ణయపరులైన శకుని దుశ్శాసను లీ
నిర్ణయమె మేలనఁగ, నీ । కర్ణములకు నించు నెట్లు కార్యవచనముల్?' 248

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కర్ణుండు; రేచి పెట్టఁగన్= ప్రేరేపించగా; దుర్ణయపరులు+ఐన= అవినీతిపరులైన; శకుని దుశ్శాసనులు; ఈ నిర్ణయమె; మేలు+అనఁగన్; కార్యవచనముల్= చేయాల్సినదానికి సంబంధించిన మాటలు; ఎట్లు ఇంచున్= ఎట్లా ఇష్టమవుతాయి?

తాత్పర్యం: 'కర్ణుడు ప్రేరేపించగా, అవినీతిపరులైన శకుని దుశ్శాసనులు ఈ నిర్ణయం బాగుందని మెచ్చుకోగా, చేయవలసిన దానికి సంబంధించిన మాటలు నీకెట్లా చెవికెక్కుతాయి?'

వ. అనినఁ గటకటంబడి సుయోధనుం డిట్లనియె : 249

తాత్పర్యం: అనగా, బాధపడి దుర్యోధనుడు ఇట్లా అన్నాడు :

క. 'నీ చెప్పెడి పెద్దలు ద్రో । ణా చార్యులు మొదలుగాఁగ నని కొల్లని వా
రై చేరని వారిం గొని । యే చక్కం బెట్టువాఁడ నేఁ బాండవులన్? 250

ప్రతిపదార్థం: నీ చెప్పెడి= నీవు చెప్పే; పెద్దలు ద్రోణాచార్యులు మొదలు+కాఁగన్= పెద్దలైన ద్రోణాచార్యులు మున్నుగా; అనికిన్= యుద్ధానికి; ఒల్లనివారు+ఐ= ఇష్టపడనివారయి; చేరనివారిన్= కలిసిరానివారిని; కొనియే= కొనియా; ఏన్= నేను; పాండవులన్; చక్కంబెట్టువాఁడన్= జయిస్తాను.

తాత్పర్యం: 'నీవు చెప్పే పెద్దలు ద్రోణాచార్యులు మొదలగు యుద్ధాని కంగీకరించక కలిసిరానివాళ్ళను వెంటబెట్టుకొనియా నేను పాండవులను జయిస్తానని అనుకొంటున్నావు?

శా. రాధేయుండును దుస్ససేనుఁడును బోరం బ్రాపుగాఁ బాండవ
క్రోధజ్వాలల నార్తు; నొండొకఁడు నాకుం దోడె? నీ వింక నన్
బాధం బెట్టకు; వాఁడి సూది మొనమోవంజాలు నంతైన నే
నీ ధాత్రీతల మీను వారలకు; నాకే లింత సేగిం బడన్?' 251

ప్రతిపదార్థం: రాధేయుండును= కర్ణుడూ; దుస్సేనుఁడును= దుశ్శాసనుడూ; పోరన్= యుద్ధంలో; ప్రాపు+కాన్= అండగా; పాండవ క్రోధ+జ్వాలలన్= పాండవుల కోపాగ్ని జ్వాలలను; ఆర్తున్= ఆర్పుతాను; ఒండు+ఒకఁడు= ఇంకొకడు; నాకున్; తోడె?= తోడా? ఇంకొక డెవడూ నాకు తోడు అక్కర్లేదు అని భావం; నీవు; ఇంకన్; నన్; బాధన్+పెట్టకు; నేను; వారలకున్= పాండవులకు; ధాత్రీతలము= భూభాగం; వాఁడి సూది మొన మోవన్+చాలు+అంత+ఐనన్= వాడిఅయిన సూది మొన ఆక్రమించేటంత కూడా; ఈను= ఇవ్వను; నాకున్; ఇంత సేగిన్+పడన్+ఏల?= ఇంత చేటు పొందటం ఎందుకు?

తాత్పర్యం: యుద్ధంలో నాకు కర్ణుడూ, దుశ్శాసనుడూ అండగా ఉండగా నేను పాండవుల కోపాగ్ని జ్వాలలను ఆర్పుతాను. ఇంకొకడి సాయం నా కెందుకు? నీవు ఇంక నన్ను బాధించకుము. నేను వాడి సూది మొన పట్టేటంత భూమిని కూడా పాండవులకు ఇవ్వను. ఇంత చేటు పొందే అవసరం ఏముంది నాకు?'

విశేషం: క్రోధ జ్వాలలన్ - క్రోధమనే (అగ్ని) జ్వాలల్ని - అలంకారం రూపకం. సూదే సన్నం. వాడి సూది మరీ సన్నం. దాని మొన చెప్పలేనంత సన్నం. అది పట్టేటంత నేలను గూడా ఇవ్వను- అణువంత భూమిని కూడా ఇవ్వనని భావం.

వ. అనిన గాంధారీవల్లభుం డతని కిట్లనియె: 252

ప్రతిపదార్థం: అనినన్; గాంధారీ వల్లభుండు= గాంధారి భర్త- ధృతరాష్ట్రుడు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని దుర్యోధను డనగా, ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు:

ఆ. 'నీకు నంత వగవ; నీపోవు తెరువునఁ । బోవు వారు గాఁగఁ బూనియున్న
వారికెల్ల నేను వగచెదఁ; గయ్యంబు । వలవ దుడుగు మయ్య చలము గొనక. 253

ప్రతిపదార్థం: నీకున్+అంత వగవన్= నీ కొరకు అంతగా దుఃఖించను; నీ పోవు తెరువునన్= నీవు వెళ్ళే మార్గంలో; పోవు వారు+కాఁగన్+పూని+ఉన్న వారికిన్+ఎల్లన్= వెళ్ళటానికి యత్నించే వాళ్ళందరి కొరకు; ఏను= నేను; వగచెదన్= దుఃఖిస్తాను; కయ్యంబు వలవదు= యుద్ధం వద్దు; చలము కొనక= పంతం పూనక; ఉడుగుము+అయ్య= మానవయ్య.

తాత్పర్యం: 'నీ కొరకు అంతగా విచారించను. నీవు పయనించే దారిలో పయనించడానికి యత్నించే వాళ్ళందరికొరకు నేను విచారిస్తాను. యుద్ధం వద్దు. పంతానికి పోక మానవయ్యా!

చ. ఉభయ బలంబులుం బొగడ నుగ్రత భీముఁడు విస్ఫురద్గదన్
రభస మెలర్పఁ గుంభములు వ్రయ్యఁగ వ్రేసిన, నెత్తు రొల్కఁగా
నిభముల పిండు గావి సెలయేఱుల తోడి నగంబులట్లు సం
క్షుభితములై పయిం బఱవఁ జూచి తలంచెదు నాదు వాక్యముల్! 254

ప్రతిపదార్థం: భీముఁడు; ఉభయ బలంబులున్= రెండు పక్షాల సేనలూ; పొగడన్= పొగడగా; ఉగ్రతన్= కోపంతో; విస్ఫురత్+గదన్= ప్రకాశించే గదతో; రభసము+ఎలర్పన్= సంతోష మతిశయించగా; కుంభములు= కుంభస్థలాలు; వ్రయ్యఁగన్+ వ్రేసినన్= బ్రద్దలయ్యేటట్లు కొట్టగా; నెత్తురు+ఒల్కఁగాన్= రక్తం ఓడగా; ఇభముల పిండు= ఏనుగుల గుంపు; కావి సెలయేఱుల తోడి నగంబుల+అట్లు= ఎఱ్ఱటి సెలయేళ్ళతోడి కొండల వలె; సంక్షుభితములు+ఐ= మిక్కిలి వ్యాకులత నొందినవయి; పయిన్+పఱవన్= పైని వ్యాపించగా; చూచి; నాదు వాక్యముల్= నా మాటలు; తలంచెదు (దవు)= స్మరిస్తావు.

తాత్పర్యం: ఇరుపక్షాల సేనలూ ప్రశంసిస్తూండగా భీముడు మహాకోపంతో ప్రకాశించే గదతో, హర్షం అతిశయించగా కుంభస్థలాలు బ్రద్ధలు కొడితే, నెత్తురోడుతూ ఏనుగుల గుంపు ఎఱ్ఱటి సెలయేళ్ళతో కూడిన కొండల వలె మిక్కిలి వ్యాకులత చెంది పైని వ్యాపించగా చూచి నా మాటలు స్మరిస్తావు.

విశేషం: 'నెత్తు రొల్కఁగా నిభముల పిండు గాని సెలయేఱులతోడి నగంబు లట్లు సంక్షుభితములై పయిం బఱవ'- అలంకారం ఉపమ.

చ. ఉఱక ధనంజయుండు వివిధోగ్ర శరంబుల నొక్క మాత్ర నే
డ్తెఱ నుఱుమాడినం బుడమిఁ ద్రెళ్ళిన నీదగుసైన్యమంతయున్
నఱకినఁ బడ్డ ఘోర విపినంబు విధంబున నున్నఁ జూచి, య
త్తఱి నయినం దలంపు ముచితంబగు నా వచనంబుఁ బుత్త్రకా!' 255

ప్రతిపదార్థం: పుత్త్రకా!= కుమారా!; ధనంజయుండు= అర్జునుడు; ఉఱక= ఎవర్నీ సరకు గొనక; వివిధ+ఉగ్ర శరంబులన్= పెక్కు రీతులైన భయంకర బాణాలతో; ఒక్క మాత్రన్= ఒక రెప్పపాటు కాలంలో; ఏడ్తెఱన్= పరాక్రమంతో; నుఱుమాడినన్= వధించగా; పుడమిన్= నేలమీద; త్రెళ్ళిన= పడిన; నీ+అది+అగు సైన్యము+అంతయున్= నీదైన సేన అంతా; నఱికినన్= నరకగా; పడ్డ= పడిపోయిన; ఘోర విపినంబు విధంబునన్= భయంకరమైన అడవి వలె; ఉన్నన్+చూచి= ఉండటం చూచి; ఆ+తఱిన్+అయినన్= ఆ సమయంలోనైనా; ఉచితంబు+అగు నా వచనంబున్= తగిన నా మాటను; తలంపుము= స్మరించుము.

తాత్పర్యం: కుమారా! అర్జునుడు ఎవర్నీ సరకుగొనకుండా పెక్కు రీతులైన భయంకర బాణాలతో ఒక్క రెప్పపాటు కాలంలో పరాక్రమంతో నరకగా నేలమీద పడిన నీ సేన అంతా నరికితే పడిపోయిన భయంకరాటవి వలె ఉండటం చూచి, అప్పుడైనా సముచితమైన నా మాటను స్మరించుము.

విశేషం: 'నుఱుమాడినం బుడమిఁ ద్రెళ్ళిన నీదగు సైన్యమంతయున్ - నఱికినఁ బడ్డ ఘోర విపినంబు విధంబున నున్నన్'- అలంకారం ఉపమ.

వ. అని పలికి, యతని వలనం బలుకుగానక మనంబు మరలంబెట్టు కొని కొడుకులు జయింప నోపుదురొకో యను నాస సంజయు దిక్కు మొగంబుసేసి పాండవ కౌరవ పక్షంబులం గలవారి నడుగుచుం, గొలందులు దలపోయుచు, నాతని వచనంబులం దన విచారంబులను బలాబలంబులు నిశ్చయించి, పాండవేయు లెక్కు డవుట యెఱుంగుచుఁ, గ్రమ్మఱ నా సూతపుత్రుతో లెక్కలు వెట్టుచుం, బోలించుచుఁ, బెద్దప్రొద్దు వితర్కించి, కౌంతేయుల శక్తి దేవశక్తియు, గాంధారేయుల శక్తి మనుష్యశక్తియుంగాఁ దెలిసినవాఁడై, యంబికానందనుండు నిజనందనునితో నిట్లనియె: 256

ప్రతిపదార్థం: అని; పలికి; అతని వలనన్= అతడిలో - దుర్యోధనుడిలో; పలుకు+కానక= ఎటువంటి సమాధానమూ పొందక; మనంబు= మనస్సు; మరలన్+పెట్టుకొని= మరల్చుకొని; కొడుకులు; జయింపన్+ఓపుదురు+ఒకో+అను+ఆసన్= గెలవగలరా అనే ఆశతో; సంజయు దిక్కు మొగంబు+చేసి= సంజయుడికేసి చూచి; పాండవ కౌరవ పక్షంబులన్+కలవారిన్= పాండవుల పక్షంలోనూ, కౌరవుల పక్షంలోనూ ఉన్నవాళ్ళని గూర్చి; అడుగుచున్= అడుగుతూ; కొలందులు+తలపోయుచున్= సామర్థ్యాలు తలచుకొంటూ; ఆతని వచనంబులన్= ఆ సంజయుడి మాటలతోనూ; తన విచారంబులను= తన ఆలోచనలతోనూ; బల+ అబలంబులు= బలాబలాలు; నిశ్చయించి= నిర్ణయించి; పాండవేయులు; ఎక్కుడు+అవుట= ఎక్కువవటం; ఎఱుంగుచున్= తెలిసికొంటూ; క్రమ్మఱన్= మళ్ళీ; ఆ సూతపుత్త్రుతోన్= ఆ సంజయుడితో; లెక్కలు+పెట్టుచున్= లెక్కలు కట్టుతూ; పోలించుచున్= పరస్పరం పోలుస్తూ; పెద్ద ప్రొద్దు= చాలసేపు; వితర్కించి= యుక్తులతో ఆలోచించి; కౌంతేయుల శక్తి= పాండవుల శక్తి; దేవశక్తియున్= దివ్యశక్తీ; గాంధారేయుల శక్తి= కౌరవుల శక్తి; మనుష్య శక్తియున్+కాన్= మానవశక్తీ అని; తెలిసినవాఁడు+ఐ= గుర్తించినవాడై; అంబికా నందనుండు= ధృతరాష్ట్రుడు; నిజ నందనునితోన్= తన కొడుకుతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికి, అతడినుండి మారుపలుకు పొందక మనస్సు మరలించుకొని, కొడుకులు గెలవగలరా అనే ఆశతో సంజయుడివైపు చూచి, పాండవ కౌరవ పక్షాలలో ఉన్నవారిని గూర్చి ప్రశ్నిస్తూ, వాళ్ళ వాళ్ళ శక్తులు తలచుకొంటూ, పాండవులు అధికులు కావడం తెలిసి, మళ్ళీ ఆ సంజయుడితో లెక్కలు కట్టుతూ, ఒకళ్ళతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒకళ్ళని పోలుస్తూ, చాలాసేపు యుక్తులతో ఆలోచించి, పాండవుల శక్తి దివ్యశక్తి అనీ; కౌరవుల శక్తి మానవశక్తి అనీ తెలిసి ధృతరాష్ట్రుడు తన కొడుకు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

క. 'నరుఁ డగ్నిదేవుఁ దనకును । వరదునిఁగాఁ గొలిచినాఁడు; వానికిఁ గేతు
స్ఫురణం బాదిగఁ గల సం । గర పరికర మెల్ల నతఁడు గావించె దయన్. 257

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; అగ్నిదేవున్= అగ్నిదేవుడిని; తనకును; వరదునిన్+కాన్= వరాలిచ్చేవాడినిగా; కొలిచినాఁడు= సేవించినాడు; వానికిన్= అర్జునుడికి; కేతు స్ఫురణంబు+ఆదిగన్+కల= జెండా ప్రకాశం మొదలుకొని ఉన్న; సంగర పరికరము+ఎల్లన్= యుద్ధసాధనం అంతా; అగ్నిదేవుడు; దయన్= దయతో; కావించెన్= చేశాడు- ఇచ్చాడు.

తాత్పర్యం: అర్జునుడు అగ్నిదేవుడిని తనకు వరదాత అయ్యేటట్లు సేవించాడు. అర్జునుడికి జెండా మొదలైన యుద్ధోపకరణాలనన్నిటినీ అగ్నిదేవుడు దయతో అనుగ్రహించాడు.

వ. అదియునుం గాక ధర్మదేవతయు, వాయుదేవుండును, వాసవుండును, నాశ్వినులును వారలకుఁ బాండురాజు తోడి వారలు; వారి నొక కీడునుం బొరయకుండ రక్షింతురు గావున, భీష్మ ద్రోణ ప్రముఖులకుఁ బాండవులం బరిభవింపరామి దెల్లంబు. 258

ప్రతిపదార్థం: అదియున్+కాక= అదీకాక; ధర్మదేవతయున్= ధర్ముడూ - యముడూ; వాయుదేవుండును; వాసవుండునున్= ఇంద్రుడూ; ఆశ్వినులును= అశ్వినీ దేవతలూ; వారలకున్= పాండవులకు; పాండురాజు తోడివారలు= పాండురాజుతో సమానులు; వారిన్= పాండవులను; ఒక కీడునున్= ఒక హాని కూడా; పొరయక+ఉండన్= కలగకుండా; రక్షింతురు= కాపాడతారు; కావునన్; భీష్మ ద్రోణ ప్రముఖులకున్= భీష్ముడు, ద్రోణుడు మొదలైనవారికి; పాండవులన్; పరిభవింపన్+రామి= ఓడించలేకపోవటం; తెల్లంబు= స్పష్టం.

తాత్పర్యం: అదీకాక, ధర్ముడూ, వాయువూ, ఇంద్రుడూ, అశ్వినీదేవతలూ వాళ్ళకు పాండురాజెంతో అంత. వాళ్లకు ఎటువంటి హానీ కలగకుండా వారు కాపాడుతారు. కాబట్టి భీష్ముడూ, ద్రోణుడూ మొదలైనవాళ్ళు పాండవులను జయించలేరనడం స్పష్టం.

విశేషం: పాండవుల కందరికీ పాండురాజు తండ్రి అయినప్పటికీ ధర్మరాజు యముడి అంశవలనా, భీముడు వాయుదేవుడి అంశవలనా, అర్జునుడు ఇంద్రుడి అంశవలనా, నకుల సహదేవులు అశ్వినీ దేవతల అంశవలనా పుట్టినవాళ్ళు కాబట్టి, యమాదులైన ఆ అయిదుగురూ పాండవులకు పాండురాజుతో సమానులు. అందుచేతనే పాండవులను ఆదుకొనటం.

క. దేవత లేటికిఁ? బార్థుఁడు । దేవ సముఁడు గాఁడె? వాఁడు దివిజులచేతం
బోవని దైత్యులఁ జంపఁడె? । యీవును నీవారు నతని నెఱుఁగరె చెపుమా? 259

ప్రతిపదార్థం: దేవతలు+ఏటికిన్= దేవతల దాకా ఎందుకు?; పార్థుఁడు= అర్జునుడు; దేవ సముఁడు+కాఁడె?= దేవతలతో సమానుడు కాడా?; వాఁడు= అర్జునుడు; దివిజుల చేతన్+పోవని దైత్యులన్= దేవతలకు సాధ్యంకాని రాక్షసులను; చంపఁడె?= చంపలేదా?; ఈవును= నీవూ; నీ వారున్= నీ వాళ్ళూ; అతనిన్; ఎఱుఁగరె?= తెలియరా; చెపుమా= చెప్పుము.

తాత్పర్యం: దేవతల దాకా ఎందుకు? అర్జునుడు దేవతలతో సమానుడు కాడా? అతడు దేవతలకు సాధ్యంకాని రాక్షసులను చంపలేదా? నీవూ, నీవాళ్ళూ అతడిని ఎరగరా చెప్పుము.

వ. కౌరవులకు వచ్చిన యిమ్మహాభయంబునకుఁ బ్రతీకారంబు శాంతిం గడచినయది లే; దెన్ని భంగులం జూచినఁ గయ్యం బుడుగుటయ మనకుం గర్తవ్యంబై యున్నయది; యుపశమింపవయ్య! దీర్ఘ వైరంబు వలవదనినఁ దండ్రికిఁ గొడు కిట్లనియె: 260

ప్రతిపదార్థం: కౌరవులకున్; వచ్చిన= కలిగిన; ఈ+మహా భయంబునకున్= ఈ గొప్ప ఆపదకు; ప్రతీకారంబు= చికిత్స; శాంతిన్= శాంతిని; కడచిన+అది లేదు= మించింది లేదు; ఎన్ని భంగులన్+చూచినన్= ఎన్ని విధాల చూసినా; కయ్యంబు= యుద్ధం; ఉడుగుట+అ= విరమించటమే; మనకున్; కర్తవ్యంబు+ఐ= చేయదగినదయి; ఉన్న+అది= ఉన్నది; ఉపశమింపవయ్యా= శాంతించవయ్య; దీర్ఘ వైరంబు= చిరకాలపు పగ; వలవదు= వద్దు; అనినన్; తండ్రికిన్; కొడుకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కౌరవులకు వచ్చిపడ్డ ఈ మహాపదకు చికిత్స శాంతిని మించింది లేదు. ఎన్ని విధాల చూచినా యుద్ధం విరమించటమే మనం చేయవలసింది. శాంతించవయ్యా. దీర్ఘవైరం పనికి రాదు.' అనగా తండ్రికి కొడుకిట్లా అన్నాడు:

క. 'దేవత లర్జుననకుఁ దో । డై వత్తు రనంగ వలవ; దది యెట్లనినన్
దేవత్వము రాగద్వే । షావేశము లేమిఁ గాదె యైనది మొదలన్? 261

ప్రతిపదార్థం: దేవతలు; అర్జుననకున్; తోడు+ఐ= సహాయంగా; వత్తురు+అనంగన్ వలవదు= వస్తారనవద్దు; అది+ఎట్లు+అనినన్+అది ఎట్లా అంటే; మొదలన్= మొట్టమొదట; దేవత్వము; రాగ ద్వేష+ఆవేశము లేమిన్+కాదె+ఐనది?= రాగద్వేషాల ఆవేశం లేకపోవటం చేతనే కదా ఏర్పడింది?

తాత్పర్యం: 'దేవతలు అర్జునుడికి సహాయులై వస్తారనవద్దు. అది ఎట్లా అంటే- మొట్టమొదట- అసలు, దేవత్వం అంటే రాగద్వేషరాహిత్యమే కదా!

విశేషం: 'అర్జునుడి మీద రాగమూ, మామీద ద్వేషమూ పూని దేవతలు అతడికి సహాయపడితే వాళ్ళు దేవత లెట్లా అవుతా'రని దుర్యోధనుడి ప్రశ్న. అసలు దేవత్వం అంటే రాగద్వేషరాహిత్యమే. వాళ్ళు నిజంగా దేవతలే అయితే అర్జునుడికి సాయపడరని దుర్యోధనుడి అభిప్రాయం.

వ. కావున వా రొకళ్ళవారుం గా; రట్లుంగాక పక్షపాతులై పూని వత్తురయేని నది దేవత్వంబు గా; దట్టి దేవత్వంబున నర్జునుండును సురక్షితుండు గానేరఁడు; నీకు నా పనికిఁ జింత వలవ' దని పలికి, వెండియు నిట్లనుఁ; 'బెఱిగి వచ్చు కార్చిచ్చు నుడుపను, బాషాణ వర్షంబు వారింపను, మహావాయువు నిలుపను, నీళ్ళు గట్టిగా నభిమంత్రించి వానిపైఁ గరి తురగాదుల నడపింపను, నా సేన నడచునప్పుడు వలసినచోట జలంబు లుత్పాదింపను జాలుదు; సింహ శరభ శార్దూల భూత బేతాళాది క్రూరసత్త్వ సంరంభ స్తంభన ప్రకారం బెఱుంగుదు, మిత్త్రశత్త్రు విషయంబులైన శుభాశుభంబులు వలయుభంగి నావహింపనేర్తు; మఱియు నానావిధ సిద్ధి ప్రదంబులగు మంత్ర ధ్యానాద్యనుష్ఠానంబుల నాకుం గొఱంత లేదు; నీ చెప్పిన యగ్నిప్రముఖ

దేవతలం బ్రసన్ను లగునట్లుగా నారాధించినవాఁడ; వారికి నాకుం బోలె మహానుభావంబు గలిగినఁ బదుమూఁడు వత్సరంబు లబ్బంగి నిడుమలం బడుదురె? వినుము చెప్పెద. 262

ప్రతిపదార్థం: కావునన్; వారు= ఆ దేవతలు; ఒకళ్ళవారున్+కారు= ఏ ఒక్కరి వాళ్ళూ కారు; అట్లున్+కాక= అట్లాకాక; పక్షపాతులు+ఐ= ఏ ఒక్కరి పక్షమో వహించి; పూని వత్తురు+అ+ఏనిన్= ప్రయత్నించి వచ్చే మాటయితే; అది; దేవత్వంబు+కాదు; అట్టి దేవత్వంబునన్; అర్జునుండును; సురక్షితుండు= లెస్సగా కాపాడబడినవాడు; కాన్+నేరఁడు= కాలేడు; నీకున్; నా పనికిన్= నేను చేసే పనిని గూర్చి; చింత= విచారం; వలవదు= వద్దు; అని; పలికి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనున్; పెఱిగి వచ్చు కార్చిచ్చున్+ఉడుపను= పెద్దదయి వచ్చే అడవి నిప్పును మాన్పటానికీ- ఆర్పటానికీ; పాషాణ వర్షంబున్= రాళ్ళ వానను; వారింపను= ఆపటానికీ; మహా వాయువున్= పెనుగాలిని; నిలుపను= నిలపటానికీ; నీళ్ళు; గట్టిగాన్; అభిమంత్రించి= మంత్రంచే సంస్కరించి; వానిపైన్; కరి తురగ+ఆదులన్= ఏనుగులు, గుర్రాలు మొదలైన వాటిని; నడిపింపను= నడపటానికీ; నా సేన= నా సైన్యం; నడచు+అప్పుడు= నడిచేటప్పుడు; వలసిన చోటన్= కావలసినచోట; జలంబులు= నీళ్ళు; ఉత్పాదింపను= పుట్టించటానికీ; చాలుదున్= సమర్థుడిని; సింహ శరభ శార్దూల భూత బేతాళ+ఆది క్రూర సత్త్వ సంరంభ స్తంభన ప్రకారంబు= సింహాలూ, శరభమృగాలూ (సింహం కంటె బలవత్తరమై ఎనిమిది పాదాలుగల జంతువు), పెద్దపులులూ, భూతాలు, బేతాళురూ మొదలయిన క్రూరమృగాల అలజడి యొక్క నిలుపుదల విధం; ఎఱుంగుదున్; మిత్త్ర శత్రు విషయంబులు+ఐన= మిత్రులకూ, శత్రువులకూ సంబంధించిన; శుభ+అశుభంబులు= శుభాలూ, అశుభాలూ; వలయు భంగిన్= కావలసిన రీతిగా; ఆవహింపన్+నేర్తున్= కలిగించగలను; మఱియున్; నానా విధ సిద్ధి ప్రదంబులు+అగు= అనేక రీతులైన సిద్ధులు కలిగించే; మంత్ర ధ్యాన+ఆది+అనుష్ఠానంబులన్= మంత్రాల ధ్యానమూ మొదలైన వాటి చేతలలో; నాకున్; కొఱంత లేదు= లోటు లేదు; నీ చెప్పిన= నీవు చెప్పిన; అగ్ని ప్రముఖ దేవతలన్= అగ్ని మొదలగు దేవతలను; ప్రసన్నులు+అగు+అట్లు+కాన్= సంతుష్టులుఅయ్యే విధంగా; ఆరాధించినవాఁడన్= పూజించాను; వారికిన్= పాండవులకు; నాకున్+పోలెన్= నావలె; మహత్(మహా)+అనుభావంబులు+కలిగినన్= గొప్ప ప్రభావాలు ఉన్నట్లయితే; పదుమూఁడు సంవత్సరంబులు= పదమూడేళ్ళు; ఆ+భంగిన్= ఆ విధంగా; ఇడుమలన్+పడుదురు+ఏ?= కష్టాలు పడతారా?; చెప్పెదన్, వినుము= చెపుతాను వినుము.

తాత్పర్యం: కాబట్టి ఆ దేవతలు ఏ ఒక్కరి వాళ్ళూ కారు. అట్లాకాక ఏదో ఒక పక్షం వహించే మాటయితే వారిది దివ్యత్వం కాదు. అటువంటి దేవత్వంచేత అర్జునుడూ లెస్సగా కాపాడబడలేడు. నా గురించి నీవు బాధపడవద్దు' అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు: పెచ్చురేగి వచ్చే కార్చిచ్చును ఆర్పటానికీ, రాళ్ళ వర్షం ఆపటానికీ, పెనుగాలిని స్తంభింపచేయటానికీ, నీళ్ళు గట్టిగా మంత్రించి, వాటిపై ఏనుగులు గుర్రాలు మొదలైనవాటిని నడిపించటానికీ, నా సైన్యం నడిచేటప్పుడు కావలసినచోట నీళ్ళు పుట్టించటానికీ సమర్థుడిని. సింహాలూ, శరభాలూ, పెద్ద పులులూ, భూతాలూ, బేతాళురూ మొదలయిన క్రూర మృగాల అలజడిని స్తంభింపజేసే విధం నాకు తెలుసు. మిత్రులకు శుభాలూ, శత్రువులకు అశుభాలూ కలిగించే విధం నేనెరుగుదును. ఇంకా ఎన్నో విధాల సిద్ధులను కలిగించే మంత్ర ధ్యానాదుల విషయంలో నాకు లోటు లేదు. నీవు చెప్పిన అగ్ని మొదలగు దేవతలను ప్రసన్నులయ్యేట్లు పూజించాను. పాండవులకు నాకువలె మహాప్రభావమే ఉంటే పదమూడేళ్ళు ఆ విధంగా కష్టా లనుభవిస్తారా? చెపుతా వినుము.

విశేషం: మిత్ర శత్రు విషయంబులైన శుభా శుభంబులు- మిత్ర విషయములైన శుభాలు, శత్రు విషయములైన అశుభాలు అని క్రమం. అటువంటి అమానుషాలైన శక్తులు గల తనకు మనుష్యమాత్రులైన పాండవు లొక లెక్కా అని దుర్యోధనుడి ధీమా.

దుర్యోధనుఁడు తండ్రితోఁ దన బలపరాక్రమంబులు సెప్పుట (సం. 5-60-20)

క. **ఏ నలిగిన వారిని సుర । లైనను రక్షింపనోప; రమరు లలిగినం**
బూని చెడకుండఁ గాతును; । మానవు లొక సరకె నాకు మనుజాధీశా? **263**

ప్రతిపదార్థం: ఏను= నేను; అలిగినన్= కోపిస్తే; వారిని= ఎదుటివారిని; సురలు+ఐనను= దేవతలయినా; రక్షింపన్+ఓపరు= కాపాడలేరు; అమరులు= దేవతలు; అలిగినన్= కోపిస్తే కూడా; పూని= యత్నించి; చెడక+ఉండన్= చెడిపోనివిధంగా; కాతును= రక్షిస్తాను; మనుజ+అధి+ఈశా= రాజా; నాకున్; మానవులు= మనుష్యమాత్రులు; ఒక సరకు+ఎ?= ఒక లెక్కా?

తాత్పర్యం: రాజా! నాకు కోపం వస్తే వాళ్ళను దేవతలు కూడా రక్షించలేరు. దేవతలకు కోపం వస్తే కూడా, ప్రయత్నించి హానికలుగకుండా ఉండేటట్లు రక్షిస్తాను. అటువంటి నాకు మనుష్య లోక లెక్కా?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి.

తే. **గర్వమున నాడు మాటలుగాఁ దలంప । వలవ; దిది యెల్ల నిక్కంబు; వసుమతీశ!**
నన్ను నేఁ జెప్పికొందునే యెన్నఁడైన? । నాత్మసంస్తుతి పౌరుషం బగునె చెపుమ? **264**

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= రాజా!; గర్వమునన్= గర్వంతో; ఆడు మాటలు+కాన్= చెప్పే మాటలుగా; తలంపన్+వలవదు= భావించవద్దు; ఇది+ఎల్లన్= ఇప్పుడు నేను చెప్పినదంతా; నిక్కంబు= నిజం; ఎన్నఁడు+ఐనన్= ఎప్పుడైనా; నన్నున్; నేన్= నేను; చెప్పికొందునే= పొగుడుకొంటానా?; ఆత్మ సంస్తుతి= తనని తాను పొగడుకొనటం; పౌరుషంబు+అగునె చెపుమ?= పురుష లక్షణం ఔతుందా చెప్పుము?

తాత్పర్యం: రాజా! నా మాటలను గర్వంతో అన్నవిగా భావించి తీసిపారెయ్యకుము. ఇప్పుడు నేను చెప్పినదంతా నిజం. ఎప్పుడైనా నన్ను నేను పొగడుకొంటానా? ఆత్మస్తుతి పురుషలక్షణమా? చెప్పుము.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'నన్ను నేఁ ... యెన్నఁడైన' అనే విశేషాంశం. 'ఆత్మ సంస్తుతి పౌరుషం బగునె' అనే సామాన్యాంశంచేత సమర్థించబడుతున్నది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

వ. **ధర్మతనయాది పాండవేయులును, ద్రుపదాది పాంచాలురును, విరాటాది మాత్స్యులును, వాసుదేవాది యాదవులును, మఱియునుం గేకయ పాండ్య మాగధ చైద్య ప్రముఖ నిఖిల దండనాయకులును నాబారింబడి మున్నీరు సొచ్చిన యేఱుల చందంబున నడంగిపోవుట యవధరించెదుగాక! వారెల్లఁ దేజోధైర్య పరాక్రమోపాయ విచార వివేకంబుల నాయెత్తు వత్తురె? పితామహ ద్రోణ కృపాశ్వత్థామలు శస్త్రాస్త్ర విషయంబులుగా నేమేమి యెఱుంగుదు రెంతెంత నేర్తు రది యెల్ల నెఱుంగుదు; నంతయు నేర్తు' నని పలికి, యందఱు వెఱఁగుపడియుండం, దాను సంజయుతో సంగరంబు తెఱంగు నాలోచనంబుగాఁ బాండవుల దెస మాటలాడుచుండఁ గర్ణుండు ధృతరాష్ట్రుం గైకొనక, ధార్తరాష్ట్రునకుం బ్రియంబుగా నిట్లనియె:** **265**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధర్మ తనయ+ఆది పాండవేయులును= ధర్మరాజు మొదలుగాగల పాండవులూ; ద్రుపద+ఆది పాంచాలురును= ద్రుపదుడు మొదలైన పాంచాలదేశీయులూ; విరాట+ఆది మాత్స్యులును= విరాటుడు మొదలగు మత్స్యదేశీయులూ; వాసుదేవ+ఆది యాదవులును= కృష్ణుడు మున్నగు యాదవులూ; మఱియునున్= ఇంకా; కేకయ పాండ్య మాగధ చైద్య ప్రముఖ నిఖిల దండ నాయకులును= కేకయులు, పాండ్యులు, మాగధులు, చైద్యులు మొదలైన ఎల్ల సేనాధిపతులూ; నా బారిన్+పడి= నా హింసకు లోనయి; మును+నీరు+చొచ్చిన= సముద్రంలో ప్రవేశించిన; ఏఱుల చందంబునన్= నదుల విధంగా; అడంగిపోవుట= రూపుమాసిపోవటం; అవధరించెదవు+కాక= చిత్తగిస్తావు; వారు+ఎల్లన్= వాళ్ళందరూ; తేజస్+ధైర్య పరాక్రమ+ఉపాయ విచార వివేకంబులన్= ధైర్యంలోనూ, పరాక్రమంలోనూ, ఉపాయంలోనూ, ఆలోచనలోనూ, వివేకంలోనూ; నా+ఎత్తు వత్తురె?= నాతో సాటి అవుతారా?; పితామహ ద్రోణ కృప+అశ్వత్థామలు= భీష్ముడూ, ద్రోణుడూ, కృపుడూ, అశ్వత్థామా; శస్త్ర+అస్త్ర విషయంబులుగాన్= శస్త్రాల విషయంలోనూ, అస్త్రాల విషయంలోనూ; ఏమి+ఏమి+ఎఱుంగుదురు; ఎంత+ఎంత; నేర్తురు; అది+ఎల్లన్; ఎఱుంగుదున్; అంతయున్+నేర్తున్; అని పలికి; అందఱున్; వెఱఁగుపడి+ఉండన్= ఆశ్చర్యపడుతూండగా; తాను; సంజయుతోన్; సంగరంబు తెఱంగున్= యుద్ధ పద్ధతిని; ఆలోచనంబు+కాన్= ఆలోచనగా; పాండవుల దెసన్= పాండవులను గూర్చి; మాటలు+ఆడుచున్+ఉండన్= మాటలాడుతూండగా; కర్ణుండు; ధృతరాష్ట్రున్; కైకొనక= పట్టించుకొనక; ధార్తరాష్ట్రునకున్= దుర్యోధనుడికి; ప్రియంబు+కాన్= ఇష్టమయ్యేటట్లు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు మొదలైన పాండవులూ, ద్రుపదుడు మున్నగు పాంచాలురూ, విరాటుడు మొదలగు మాత్స్యులూ, కృష్ణుడు మొదలుగా గల యాదవులూ, ఇంకా కేకయులు, పాండ్యులు, మాగధులు, చైద్యులు మొదలైన ఎల్ల సేనాధిపతులూ, నా హింసకు లోనయి, సముద్రంలో కలిసిన నదుల విధాన రూపుమాసిపోవటం చిత్తగిస్తావులే. వాళ్ళందరూ తేజస్సులోను, ధైర్యంలోను, పరాక్రమంలోను, ఉపాయంలోను, ఆలోచనలోను, వివేకంలోను నాతో సాటి ఔతారా? భీష్ముడికీ, ద్రోణుడికీ, కృపుడికీ, అశ్వత్థామకూ శస్త్రాలను గురించీ, అస్త్రాలను గురించీ ఏమేమి, ఎంతెంత తెలుసో అది అంతా, అంత బాగానూ నాకూ తెలుసు' అని పలికి, అందరూ ఆశ్చర్యంతో చూస్తూండగా, తాను సంజయుడితో యుద్ధవిషయమై పాండవులను గురించి మాటలాడుతూంటే, కర్ణుడు ధృతరాష్ట్రుడిని పట్టించుకొనక దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: 'మున్నీరు సొచ్చిన యేఱుల చందంబున' - అలంకారం ఉపమ.

క. 'గురు నలుక నాకు నస్త్ర । స్ఫురణ మెడలె నండ్రు జనులు; బొం కది; పూజా
పరతమెయి నమ్మునీశ్వరు । కరుణ గొఱలి మగుడఁ బడయఁ గాంచితిఁ బ్రీతిన్. 266

ప్రతిపదార్థం: జనులు= లోకులు; నాకున్; గురు+అలుకన్= గురుడి కోపం చేత; అస్త్ర స్ఫురణము= అస్త్రాల స్ఫురణ; ఎడలెన్= పోయింది; అండ్రు= అంటారు; అది; బొంకు= అసత్యం; పూజాపరత మెయిన్= పూజాపరత్వంచేత; ఆ+ముని+ఈశ్వరు కరుణ= ఆ మునిశ్రేష్ఠుడి దయ; కొఱలి= అతిశయించి; ప్రీతిన్= సంతోషంతో; మగుడన్= మళ్ళీ; పడయన్+కాంచితిన్= పొందగలిగాను.

తాత్పర్యం: 'నాకు గురువుగారి కోపం కారణంగా అస్త్రాలు స్ఫురించ కుండా పోయాయని లోకులంటారు. కాని, అది అసత్యం. నా ఆరాధనాపరత్వంచేత ఆ మునిశ్రేష్ఠుడి దయ అతిశయించి సంతోషంతో మళ్ళీ పొందగలిగాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'గురు నలుక' బ్రాహ్మణుడిని అని చెప్పి తన దగ్గర అస్త్రవిద్య నేర్చుకొనే కాలంలో పరశురాముడు కర్ణుడి ఒడిలో పరున్నాడు. అప్పు డొక కీటకం కర్ణుడితొడ కరిచింది. రక్తం కారుతున్నా, కర్ణుడు గురువుగారికి నిద్రాభంగం అవుతుందని ఓర్చుకొని కదలలేదు. కొంతసేపటికి పరశురాముడు లేచి, రక్తం చూచి, బ్రాహ్మణుడయితే ఇంత సహనం ఉండదని ఎంచి 'నీ కులం ఏమిటో చెప్పుము' అన్నాడు. కర్ణుడు తాను సూతకులజుడిని అని చెప్పాడు. అసత్య మాడినందుకు పరశురాముడు కోపించి, ఆపద వచ్చినప్పుడు బ్రహ్మాస్త్రం అతడికి తోచదనీ, మృత్యువు ఆసన్నమైనపుడు తోస్తుందనీ కర్ణుడిని శపించాడు.

ఉ. కావున నస్త్రశస్త్రము లఖండిత సంపద నొంది యుండు; దే
వావలికైన నన్నుఁ జెనయన్ భర; మేఁ గలుగంగ నర్జునుం
డే విడిపించు మేదినిఁ? గడింది మగంటిమి యుల్లసిల్లఁగా,
నీవు బలంబు మెచ్చ నని నిల్చెద గెల్చెదఁ బాండవేయులన్. 267

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అస్త్ర శస్త్రములు; అఖండిత సంపదన్= సంపూర్ణ సంపదతో; ఒంది+ఉండున్= ఒప్పి ఉంటాయి; దేవ+ఆవలికిన్+ఐనన్= దేవతల సమూహానికైనా; నన్నున్; చెనయన్= ఎదిరించడం; భరము= కష్టం; ఏన్+కలుగంగన్= నేనుండగా; మేదినిన్= భూమిని; అర్జునుండే= అర్జునుడా; విడిపించున్?= విడిపిస్తాడు?; కడింది మగంటిమి= అధికమైన పరాక్రమం; ఉల్లసిల్లఁగాన్= ప్రకాశించగా; నీవున్= నీవూ; బలంబున్= నీ సైన్యమూ; మెచ్చన్= పొగడగా; అనిన్= యుద్ధంలో; నిల్చెదన్= నిలబడతాను; పాండవేయులన్= పాండవులను; గెల్చెదన్= జయిస్తాను.

తాత్పర్యం: కాబట్టి నాకు అస్త్రశస్త్ర సంపద సంపూర్ణంగా ఉన్నది. దేవతలకయినా నన్ను తాకడం కష్టం. నే నుండగా అర్జునుడా భూమిని పట్టుకొని పోవటం? అధికమైన పరాక్రమం ప్రకాశించగా, నీవూ నీ సైన్యమూ ప్రశంసించగా, యుద్ధంలో నిలుస్తాను, పాండవులను గెలుస్తాను.

శా. గాంగేయాదులు నీకడన్ నిలిచి వేడ్కం జూడఁగా సర్వ సే
నాంగాంగంబులమీఁద గాలియును జిట్టాడంగ నీ కేను వీఁ
కం గౌంతేయులఁ దాఁకి, తత్తనువు లుగ్రస్ఫారబాణాళిఁ గూ
లం గోదండ విలాసముల్ మెఱయ లీలం బోరఁ గ్రీడించెదన్,' 268

ప్రతిపదార్థం: గాంగేయ+ఆదులు= భీష్ముడు మొదలగువారు; నీ కడన్= నీ చెంత; నిలిచి; వేడ్కన్= వేడుకతో; చూడఁగాన్; సర్వ సేనాంగ+అంగంబుల మీఁదన్= రథ గజ తురగ పదాతులనే అన్ని సేనావిభాగాల యొక్క శరీరాల మీదా; గాలియును= గాలి కూడా; చిట్టాడంగన్+ఈక= సోకనియ్యకుండా; ఏను= నేను; వీఁకన్= పరాక్రమంతో; కౌంతేయులన్= పాండవులను; తాఁకి= ఎదిర్చి; తద్+తనువులు= వాళ్ళ మేనులు; ఉగ్ర స్ఫార బాణ+ఆలిన్= భయంకరములూ; అధికములూ అయిన బాణాల వరుస చేత; కూలన్= నేలపై పడేటట్లు; కోదండ విలాసముల్= వింటి లీలలు; మెఱయన్= ప్రకాశించగా; పోరన్= యుద్ధంలో; క్రీడించెదన్= విహరిస్తాను.

తాత్పర్యం: భీష్మాదులు నీ దగ్గర ఉండి వేడుక చూస్తుండగా, రథ గజ తురగ పదాతులైన సర్వసేనాంగాల మేనులపై గాలి కూడా సోకనీయక, నేను పరాక్రమంతో పాండవులను ఎదుర్కొని, వాళ్ళ శరీరాలు భయంకర బాణాలచే కూలిపోయేటట్లు వింటి లీలలు ప్రకాశించగా యుద్ధభూమిలో విహరిస్తాను.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని యినసందనునకు మందాకినీనందనుం డిట్లనియె: 269

ప్రతిపదార్థం: అనినన్; విని; ఇన నందనునకున్= సూర్యపుత్రుడికి; (కర్ణుడికి); మందాకినీ నందనుండు= గంగాసుతుడు-(భీష్ముడు); ఇట్లు+అనియెన్:

తాత్పర్యం: అనగా విని భీష్ముడు కర్ణుడితో ఇట్లా అన్నాడు :

క. 'కాలుఁడు ప్రేరేపఁగ నిటు । ప్రేలినయంతటన నిన్నుఁ బెద్దగఁ దలఁపం
బోలునె మాకును? నుడుగుము; । చాలుదు నీ వెల్ల పనులు సాధింపంగన్! 270

ప్రతిపదార్థం: కాలుఁడు= యముడు; ప్రేరేపఁగన్= పురికొల్పగా; ఇటు ప్రేలిన+అంతటన్+అ= ఇట్లా వాగగానే; మాకును; నిన్నున్; పెద్దగన్+తలఁపన్+పోలునె?= గొప్పగా భావించడం మంచిదా?; ఉడుగుము= చాలులే; నీవు; ఎల్ల పనులు, సాధింపగన్= అన్ని పనులూ సాధించటానికి; చాలుదు(వు)= సమర్థుడివి!

తాత్పర్యం: 'యముడు పురికొల్పగా ఇట్లా నీవు వాగుతూంటే నిన్ను గొప్పగా భావించటం మాకు తగునా? చాలులే ఊరుకో. నీవు అన్ని పనులూ సాధించడానికి సమర్థుడివి!

విశేషం: 'చాలుదు నీవెల్ల పనులు సాధింపంగన్' - విపరీత లక్షణచే వ్యతిరేకార్థాన్నే గ్రహించాలి.

ఉ. కూలెడువారె పాండవులు? ఘోరపుఁబోర నొకం డొకండ యీ
చాలెడువార లెల్ల మును చావఁ, గ్రమంబున సేన లన్నియుం
గూలఁగఁ గౌరవుల్ పిదపఁ గూలుదు; రింతియకాక, నోరి చే
టేల? వృథాభిమానమున నిన్నియుఁ బ్రేలెదు సూతనందనా! 271

ప్రతిపదార్థం: సూత నందనా!= కర్ణా!; పాండవులు; కూలెడువారె?= కూలిపోయేవాళ్ళా?; ఘోరము+పోరన్= భయంకరమైన యుద్ధంలో; ఈ చాలెడు వారలు+ఎల్లన్= ఈ సమర్థులైన వాళ్ళందరూ; ఒకండు+ఒకండు+అ= ఒక్కొక్కడే; మును= ముందు; చావన్= చావగా; క్రమంబునన్; సేనలు+అన్నియున్; కూలఁగన్= కూలిపోగా; పిదపన్= తరువాత, కౌరవుల్; కూలుదురు; ఇంతియ కాక= జరిగేది ఇంతేలే; నోరిచేటు+ఏల?= వాగటం ఎందుకు?; వృథా+అభిమానమునన్= పనికిమాలిన గర్వంతో; ఇన్నియున్+ప్రేలెదు?= ఇన్ని వాగుతావు?

తాత్పర్యం: కర్ణా! పాండవులు కూలిపోయేవాళ్ళా? భయంకర యుద్ధంలో ఈ సమర్థులందరూ, ఒక్కొక్కడే ముందు చావగా, క్రమంగా సేనలన్నీ కూలిపోగా, అప్పుడు కౌరవులు చస్తారు. జరిగేది ఇంతేలే. ఊరికే వాగటం ఎందుకు? పనికిమాలిన గర్వంతో ఇన్ని మాటలూ వాగుతావు.

తే. దివిజపతి నీకు నిచ్చిన తీవ్రశక్తి । చేతఁ గవ్వడి పడునని చూతువేని
వాసుదేవునిచే నది వ్రయ్యలయ్యెఁ, । దునియ లయ్యును, బొడియయ్యెఁ దొరఁగు ధరణి. 272

ప్రతిపదార్థం: దివిజ పతి= దేవేంద్రుడు; నీకున్; ఇచ్చిన= ఇచ్చినట్టి; తీవ్ర శక్తిచేతన్= తీవ్రమైన శక్త్యాయుధంచేత; కవ్వడి= అర్జునుడు; పడును+అని= కూలుతాడని; చూతువు+ఏనిన్= చూస్తావేమో, అనుకొంటున్నావేమో; అది= ఆ శక్తి; వాసుదేవునిచేన్=

కృష్ణుడిచేత; వ్రయ్యలు+అయ్యున్= ముక్కలయీ; తునియలు+అయ్యును= చిద్రుపలయీ; పొడి+అయ్యున్= చూర్ణం అయీ; నులి అయీ; ధరణిన్= నేలమీద; తొరఁగున్= రాలుతుంది.

తాత్పర్యం: దేవేంద్రుడు నీ కిచ్చిన తీవ్ర శక్త్యాయుధంచేత అర్జునుడు కూలిపోతాడని అనుకొంటున్నావేమో, ఆ శక్తి కృష్ణుడిచేత ముక్కలయి, చిద్రుపలయి, చూర్ణమయి నేల రాలుతుంది.

విశేషం: తాను అడగగానే అతని సహజ కవచకుండలాలను ఇచ్చిన కర్ణుడి ఔదార్యానికి మెచ్చుకొని ఇంద్రుడు అతడికి, అతడి కోరికపై, ఒక దివ్యశక్తి నిచ్చాడు. దానిని ఒక్కడి మీదనే ఒక్కసారి ప్రయోగించాలని ఇంద్రుడు ఆనతిచ్చాడు. దానిని అర్జునుడిపై ప్రయోగిద్దాం అని కర్ణుడు అనుకొంటాడు. కాని, దానిని ఘటోత్కచుడిపై ప్రయోగించవలసివస్తుంది.

క. సర్పముఖ శరము గల దను । దర్పంబునఁ గ్రీడిఁ దొడరఁ దలఁపకు; హరి పెం
పేర్పడఁగ నదియ కా, దట । తీర్పవలయువాని నెల్లఁ దీర్చు నరునకై.' 273

ప్రతిపదార్థం: సర్ప ముఖ శరము కలదు+అను దర్పంబునన్= సర్పముఖంకల అస్త్రం ఉన్నదనే గర్వంతో; క్రీడిన్= అర్జునుడిని; తొడరన్= ఎదుర్కొనటానికి; తలఁపకు= అనుకొనకు; హరి= కృష్ణుడు; పెంపు+ఏర్పడఁగన్= గొప్పతనం స్పష్టపడేటట్లు; అది+అ= అదే; కాదు; నరునకై= అర్జునుడి కొరకు; అట తీర్పవలయు వానిన్+ఎల్లన్= ఆ నశింపజేయవలసిన వాటినన్నిటినీ; తీర్చున్= నాశనం చేస్తాడు.

తాత్పర్యం: నా దగ్గర సర్పముఖం గల అస్త్రం ఉన్నది గదా అనే గర్వంతో అర్జునుడిని ఎదుర్కొందా మనుకొనకు. కృష్ణుడు దానినే కాదు, అర్జునుడి కొరకు నాశనం చేయవలసిన వాటినన్నిటినీ నాశనం చేస్తాడు.'

వ. అని పలికి, ధృతరాష్ట్రునితో నిట్లనియె: 274

తాత్పర్యం: అని పలికి, ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు :

క. 'జ్ఞాతులు దమలోఁ బొందినఁ । జేతో మోదమున వెలిఁగి చెలు వొందుదు; ర
న్నీతిం బాసిన విగత వి । భూతిం గడకొఱవులట్ల పొగయుదు రధిపా! 275

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! ధృతరాష్ట్రా!; జ్ఞాతులు= దాయాదులు; తమలోన్= ఒకరితో ఒకళ్ళు; పొందినన్= కలిసి ఉంటే; చేతన్+మోదమునన్= మనస్సంతోషంతో; వెలిఁగి= ప్రకాశించి; చెలువు+ఒందుదురు= ఒప్పుతారు; ఆ+నీతిన్+కలిసి ఉండాలనే ఆ నీతిని; పాసినన్= విడిచిపెడితే; విగత విభూతిన్= పోయిన సంపదతో - సంపద పోయి; కడ కొఱవుల+అట్లు+అ= కాలగా మిగిలి పొగవచ్చే కట్టెలవలె; పొగయుదురు= పొగచిమ్ముతారు- లో లోపల తపిస్తారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! జ్ఞాతులు ఒకళ్ళతో ఒకళ్ళు కలిసి ఉంటే మనస్సంతోషంతో వెలిగి ఒప్పుతారు. ఆ నీతిని విడనాడినట్లయితే, ఐశ్వర్యం కోల్పోయి, కాలగా మిగిలి పొగలు చిమ్మే కట్టెలవలె లో లోపల తపిస్తారు.

విశేషం: కడకొఱవు లట్ల- అలంకారం ఉపమ, 'జ్ఞాతులు దమలో.... పొగయుదురు' - ఇదంతా సామాన్యాంశం. దీనిచే 'పాండవులూ కౌరవులూ కలిసి ఉంటే బాగుంటుంది' అనే విశేషాంశం సమర్థించబడుతున్నది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. కావునఁ దమలో విరోధం బొప్పదు; సంభాషణ సహభోజనాది సత్కారంబులను, సవినయ వర్తనంబులను బ్రీతులైన జ్ఞాతు లిహ పరార్థ సాధకు లగుదు' రని చెప్పి వెండియు. 276

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; తమలోన్ విరోధంబు+ఒప్పదు= తమలో తాము కలహించగూడదు; సంభాషణ సహభోజన+ఆది సత్కారంబులను= మాట్లాడుకొనటం; కలిసి భోజనం చేయటంవంటి సత్కార్యాలచేతా; సవినయ వర్తనంబులను= వినయంతో కూడిన నడవడులచేతా; ప్రీతులు+ఐ= సంతోషించినవారయి; జ్ఞాతులు; ఇహ పర+అర్థ సాధకులు= ఈ లోకపు, పరలోకపు ప్రయోజనాలను సాధించేవారు; అగుదురు; అని; చెప్పి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: కాబట్టి తమలో తాము కలహించటం తగదు. మాటలాడుకొనటం, కలిసి భోజనం చేయటం మొదలైన సత్కారాలచేతా, వినయంతో కూడిన నడవడులచేతా ప్రీతులై జ్ఞాతులు ఈ లోకపు, పరలోకపు ప్రయోజనాలను సాధించగలుగుతారు' అని చెప్పి ఇంకా.

క. 'విను మే నొక శైలమునకు । మును భూసురవర్గ సహితముగ నొకపనికిం
జను నెడఁ జనరాని తటం । బున నొక జున్నుండె; దానిఁ బొగడిరి తద్జ్ఞుల్. 277

ప్రతిపదార్థం: వినుము; మును= పూర్వం; ఏను= నేను; ఒక శైలమునకున్= ఒక కొండకు; భూసురవర్గ సహితముగన్= బ్రాహ్మణుల సమూహంతో కూడా; ఒక పనికిన్= ఒక పనిమీద; చను+ఎడన్= వెళ్ళే సమయంలో; చనన్+రాని తటంబునన్= దుర్గమమైన చరియఅందు; ఒక; జున్ను= తేనెపట్టు; ఉండెన్; దానిన్; తద్జ్ఞుల్= తెలిసినవారు; పొగడిరి.

తాత్పర్యం: 'వినుము. పూర్వం నేను ఒక కొండమీదికి బ్రాహ్మణ సమూహంతో కూడా ఒక పని మీద వెళ్ళేటప్పుడు దుర్గమమైన చరియయందు ఒక తేనెపట్టు ఉన్నది. తెలిసినవారు దానిని పొగిడారు.

తే. 'దీని తేనియఁ ద్రావిన మానవులకు । జరయు రుజయును డప్పియుఁ జావుఁ గలుగ'
వనఁగఁ, గొందఱు బోయలు విని, కడంగి । యుఱక మొఱకలై చఱిఁబడ నుఱికి రపుడు. 278

ప్రతిపదార్థం: దీని తేనియన్; త్రావిన మానవులకున్= త్రాగిన మనుష్యులకు; జరయున్= ముసలితనమూ; రుజయును= రోగమూ; డప్పియున్= ఆయాసమూ, దాహమూ; చావున్; కలుగవు+అనఁగన్; కొందఱు బోయలు; విని; కడంగి= పూని; అపుడు; ఉఱక= లక్ష్యపెట్టక; మొఱకులు+ఐ= మూర్ఖులయి; చఱిన్= చరియలో; పడన్; ఉఱికిరి.

తాత్పర్యం: దీని తేనె త్రాగిన మనుష్యులకు ముసలితనమూ, రోగమూ, శ్రమా, (దాహమూ), చావూ ఉండవని అనగా, కొందరు బోయలు విని, పూని, మూర్ఖులై లక్ష్యపెట్టక అప్పుడు చరియలో పడేటట్లు ఉరికారు.

వ. ఇట్లుఱికి మృతిఁ బొంది; రట్లపోలె నవినీతు లైన నీ కొడుకులు పుడమి యెల్లను దార యేలుతీపుఁ జూచెదరుగాని తమ పాలిసి పోవుటం గానరు; వీర లర్జునుతోడం బెనంగి మానప్రాణంబులు దక్కించుకొనువారె? యట్లుంగాక సమబలులైననుం గయ్యంబునఁ గదా వీరౌదురు వారౌదు రనవచ్చు; నదియేల నీలోనికి ధర్మనందనుం దెచ్చికొనుటయ నీకుఁ గర్తవ్యం' బనిన బాహ్లికుండు ధార్తరాష్ట్రున కిట్లనియె: 279

ప్రతిపదార్థం: ఇట్లు; ఉఱికి; మృతిన్+పొందిరి= మరణించారు; అట్లు+అ పోలెన్= ఆ రీతిగానే; అవినీతులు+ఐన నీ కొడుకులు= అవినయపరులైన నీ కొడుకులు; పుడమి+ఎల్లను= భూమినంతనూ; తారు+అ= తామే; ఏలు తీపున్+చూచెదరు+

కాని= పరిపాలించాలనే తీపి కొరకు చూస్తారు కాని, తమ పొలిసిపోవుటన్+కానరు= తాము చచ్చిపోతామని చూడరు; వీరలు; అర్జును తోడన్; పెనంగి= పోరి; మాన ప్రాణంబులు= మానాన్నీ, ప్రాణాన్నీ; దక్కించుకొనువారె?= నిలుపుకొంటారా?; అట్లున్+కాక= అట్లాకాక; సమ బలులు+ఐననున్= సమానమైన బలం కలవాళ్ళయినా; కయ్యంబునన్+కదా= యుద్ధంలో కదా; వీరు+ఔదురు, వారు+ఔదురు+అనన్+వచ్చున్= వీళ్ళు సమర్థులు, వాళ్ళు సమర్థులు అనవచ్చును; అది+ఏల= అదంతా ఎందుకు?; నీ లోనికిన్; ధర్మనందనున్= ధర్మరాజును; తెచ్చికొనుట+అ= తెచ్చుకొనటమే; నీకున్; కర్తవ్యంబు= చేయదగింది; అనినన్; బాహ్లికుండు; ధార్తరాష్ట్రునకున్= దుర్యోధనుడికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇట్లా ఉరికి మరణించారు. అట్లాగే అవినయపరులైన నీ కొడుకులు భూమినంతనూ తామే ఏలాలనే తీపి కోసం చూస్తారుగాని తాము చచ్చిపోతామేమో అని చూడరు. వీళ్ళు అర్జునుడిని ఎదుర్కొని మానప్రాణాలు దక్కించుకొంటారా? అట్లాకాక, సమానమైన బలం కలవాళ్ళయినా, యుద్ధంలోగదా వీరి సామర్థ్యాలూ, వారి సామర్థ్యాలూ తేలేది? అదంతా ఎందుకు? ధర్మరాజును నీలోకి తెచ్చుకొనటం నీకు కర్తవ్యం' అనగా; బాహ్లికుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: భీష్ముడు ధృతరాష్ట్రుడితో చెప్పిన జ్ఞాతులు ప్రవర్తించవలసిన విధంగానీ, జున్ను కొరకు ఆశపడి మరణించిన బోయల వృత్తాంతంగానీ, సంస్కృత భారత ప్రతులలో కానరావు.

క. 'కను బ్రమసిన తెరువరి తన। కనపాయం బైన మార్గ మరసి తగ నెఱిం
గినవారు సెప్పఁగాఁ గై। కొనని కరణిఁ దగిన వెంటకుం జొర వకటా!' 280

ప్రతిపదార్థం: ఎఱింగినవారు= తెలిసినవాళ్ళు; తనకున్; అనపాయంబు+ఐన మార్గము= అపాయంలేని దారి; అరసి= చూచి; తగన్= ఒప్పుగా; చెప్పఁగాన్= కనుబ్రమసిన తెరువరి= కళ్ళు మిరుమిట్లుగొన్న బాటసారి; కైకొనని కరణిన్= అవలంబించని విధంగా; అకటా!= అయ్యో!; తగిన వెంటకున్+చొరవు= తగిన దారికి నీవు రావు.

తాత్పర్యం: 'దుర్యోధనా! తెలిసినవాళ్ళు తనకు అపాయం లేని దారి చూపి ఒప్పుగా చెప్పగా కళ్ళు మిరుమిట్లుగొన్న పాంథుడు అవలంబించని విధంగా, అయ్యో! నీవు తగిన దారికి రావుగదా!'

విశేషం: అలం: ఉపమ. బాహ్లికుడనిన ఈ మాటలు సంస్కృత భారత ప్రతులలో గానరావు.

వ. అనిన వైచిత్రవీర్యుండు దుర్యోధనున కిట్లనియె: 281

తాత్పర్యం: అనగా, ధృతరాష్ట్రుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

మ. 'కొడుకా! యే నెటు లట్ల బాహ్లికుఁడు నీకుం గూర్చు, భీష్ముండు నీ
యెడ సస్నేహుఁడు, వీరి మాట విను; మే మీ ముప్వురున్ మన్ననల్
వడయంగాఁ దగునట్టివారము; నినుం బ్రార్థించెదన్ ధర్మజున్
విడువంగాఁ దగ, దిమ్ము వారలకు నుర్విం బాలు నెమ్మిం దగన్.' 282

ప్రతిపదార్థం: కొడుకా!= బిడ్డా!; ఏను+ఎటులు+అట్లు+అ= నే నెట్లాగో అలాగే; బాహ్లికుఁడు; నీకున్+కూర్చున్= నీవంటే ఇష్టపడతాడు; భీష్ముండున్= భీష్ముడుకూడా; నీ+ఎడన్= నీ విషయంలో; సస్నేహుఁడు= స్నేహభావంతో కూడినవాడు; వీరి

మాట వినుము; ఏము+ఈ మువ్వురున్= ఈ మేము మువ్వురమూ; మన్ననల్+పడయంగాన్+తగు+అట్టి వారము= మన్ననలు పొందదగిన వాళ్ళం; నినున్; ప్రార్థించెదన్= బతిమాలుతాను; ధర్మజున్; విడువంగాన్+తగదు= విడిచిపెట్టదగదు; వారలకున్= పాండవులకు; ఉర్విన్= భూమిలో; పాలు= భాగం; నెమ్మిన్= సంతోషంతో; తగన్= ఒప్పుగా; ఇమ్ము.

తాత్పర్యం: 'నాయనా! దుర్యోధనా! నా వలెనే బాహ్లికుడు కూడా నీవంటే ఇష్టపడతాడు. భీష్ముడు కూడా నీయందు స్నేహభావం కలిగి ఉంటాడు. వీళ్ళ మాట విను. ఈ మేము మువ్వురమూ నీ మన్ననలు పొందదగినవాళ్ళం. నిన్ను బతిమాలుకుంటానురా. ధర్మరాజును విడిచిపెట్టదగదురా. వాళ్ళకు భూమిలో వాటా ప్రీతితో ఒప్పుగా ఇయ్యరా!'

క. అనినను వెండియు నొడఁబా । టునకుఁ జొరని దానికిం గొడుకుతోడఁ గడుం
గినిసి ధరణీశ్వరుం డి । ట్లనుఁ గొలువున నున్న వార లందఱు వినఁగన్. 283

ప్రతిపదార్థం: అనినన్= అనగా; వెండియున్= ఇంకా; ఒడఁబాటునకున్+చొరనిదానికిన్= సమ్మతించకపోవటానికి; కడున్= మిక్కిలి; కినిసి= కోపించి; ధరణీ+ఈశ్వరుఁడు= రాజు-ధృతరాష్ట్రుడు; కొలువునన్+ఉన్నవారలు+అందఱున్= సభలో ఉన్నవాళ్ళందరూ; వినఁగన్= వినేటట్లు; కొడుకుతోడన్; ఇట్లు+అనున్.

తాత్పర్యం: అని తాను చెప్పగా, ఇంకా సమ్మతించకపోవటానికి మిక్కిలి కోపించి ధృతరాష్ట్రుడు సభలో ఉన్నవాళ్ళందరూ వింటూండగా కొడుకుతో ఇట్లా అన్నాడు:

తే. 'బవరములు గావె! విఱిగిన బార సాఁప । వచ్చునే? యొక్కరుండ వివ్వచ్చుఁ డదరి
పసులఁ బెట్టించునపుడు నీ బలము విఱుగ । దయ్యెనే? నీవుఁ గర్ణుండు నచట లేరె?' 284

ప్రతిపదార్థం: బవరములు+కావె?= యుద్ధాలు జరగలేదా?; విఱిగిన బార+చాఁపవచ్చునే?= విరిగిపోయిన చేయి చాపవచ్చా? (ఓడిపోయి మళ్ళీ యుద్ధానికి పూనుకొనవచ్చా?); వివ్వచ్చుఁడు+ఒక్కరుండు+అ= బీభత్సుడు (అర్జునుడు) ఒక్కడే; అదరి= విజృంభించి; పసులన్= పశువులను; పెట్టించు+అపుడు= విడిపించే సమయంలో; నీ బలము= నీ సైన్యం; విఱుగదయ్యెనే?= పారిపోలేదా?; అచటన్= అక్కడ; నీవున్+కర్ణుండున్= నీవూ; కర్ణుడూ; లేరె?= లేరా?

తాత్పర్యం: 'ఇదివరలో యుద్ధాలు జరగలేదా? విరిగిపోయిన చేయి చాచవచ్చా?- ఓడిపోయి మళ్ళీ యుద్ధానికి పూనుకొనవచ్చా? అర్జును డొక్కడూ విజృంభించి పశువులను విడిపించేటప్పుడు నీ సైన్యం పారిపోలేదా? నీవూ, కర్ణుడూ అక్కడ లేరా?'

వ. అని రాధేయు దిక్కు మొగంబై మఱియు నిట్లనియె: 285

తాత్పర్యం: అని కర్ణుడికేసి చూసి ధృతరాష్ట్రుడు ఇంకా ఇట్లా అన్నాడు:

ఆ. 'నాఁటి కొలఁది గాదు; నారాయణుఁడు నొగ । లెక్కఁ, గెలన భీముఁ డేచి నడవ,
ననుజ తనుజ సహితుఁడై వచ్చు వివ్వచ్చు । మార్కొనంగ వశమె మనకుఁ గర్ణ! 286

ప్రతిపదార్థం: కర్ణ!; నాఁటి కొలఁది+కాదు= అప్పటివలె అనుకొన్నావేమో! (గోగ్రహణ సమయంలో ఉన్నంతే అనుకొన్నావేమో); కాదు= అంత మాత్రమే కాదు; నారాయణుఁడు= కృష్ణుడు; నొగలు+ఎక్కన్= రథం తొట్టెలో కూర్చుండగా; కెలనన్= ప్రక్కన;

భీముఁడు; ఏచి= విజృంభించి; నడవన్= నడవగా; అనుజ తనుజ సహితుఁడు+ఐ= తమ్ములతో; కొడుకులతో కూడినవాడయి; వచ్చు వివ్వచ్చున్= వచ్చే బీభత్సుడిని- అర్జునుడిని; మనకున్; మార్కొనంగన్+వశమె?= ఎదుర్కొనతరమా?

తాత్పర్యం: 'కర్ణా! అప్పటివలె- గోగ్రహణ సమయంలో వలె- అంతమాత్రమే అనుకొన్నావేమో! కాదు. కృష్ణుడు సారథి అయి రథం తొట్టెలో కూర్చుండగా, ప్రక్కన భీముడు విజృంభించి నడవగా, తమ్ములతోనూ, కొడుకులతోనూ వచ్చే బీభత్సుడిని ఎదుర్కొనటం మన తరమా?

విశేషం: 'ఉత్తర గోగ్రహణ సమయంలో అర్జును డొక్కడే దండెత్తి వచ్చాడు. ఇప్పు డట్లా కాదే! ఒక్కడూ వచ్చినప్పుడే మనం ఓడిపోయాము. ఇప్పుడు వాళ్ళందరితోనూ వస్తే అర్జునుడిని మనం ఎదుర్కొనగలమా?' అని భావం. ఇక్కడ బీభత్సుడు అనే పదానికి వికృతియైన 'వివ్వచ్చుడు' అనే శబ్దాన్ని సాభిప్రాయంగా ప్రయోగించటం వలన అలంకారం పరికరాంకురం. యుద్ధంలో అర్జునుడు బీభత్సం చేస్తాడు కాబట్టి అతనికి బీభత్సుడనే పేరు వచ్చింది.

చ. బలమును దర్పమున్ మెఱయ బంటుతనంబున నీవు పాండవే
యుల నని మార్కొనం గడఁగు టొప్పెడు తెంపగుఁ; జచ్చి శుద్ధుఁడై
పలుకులు మాన్పు భృత్యుఁ డను పాటి దలంచెద; విట్లు మేలె? య
చ్ఛలమున నీ సుయోధనుని చావున కోర్చుట గాదె యంతయున్? 287

ప్రతిపదార్థం: నీవు; బలమును= పరాక్రమమూ; దర్పమున్= గర్వమూ; మెఱయన్= ప్రకాశించగా; బంటుతనంబునన్= శూరత్వంతో; పాండవేయులన్= పాండవులను; అనిన్= యుద్ధంలో; మార్కొనన్+కడఁగుట= ఎదుర్కొన పూనటం; ఒప్పెడు తెంపు+అగున్= మంచి సాహసమే అవుతుంది; చచ్చి; శుద్ధుఁడు+ఐ= పవిత్రుడయి; పలుకులు= నిందలు; మాన్పు= పరిహరించే (పోగొట్టే); భృత్యుఁడు= సేవకుడు; అను పాటి= అనే మాత్రం (అంత మాత్రమే); తలంచెదవు= అనుకొంటున్నావు; ఇట్లు మేలె?= ఈ రీతి మంచిదా?; ఇంతయున్= ఇదంతా; (నీవు పాండవులను ఎదుర్కొనటం); అచ్ఛలమునన్= పట్టుదలతో;- పూనికతో; ఈ సుయోధనుని చావునకున్= ఈ దుర్యోధనుడి చావుకు; ఓర్చుట+కాదె!= సహించటమే కదా!

తాత్పర్యం: 'నీవు పరాక్రమమూ, గర్వమూ ప్రకాశించగా శూరత్వంతో పాండవులను ఎదురుకొనపూనటం మంచి సాహసమే అవుతుంది. 'కర్ణుడు చచ్చి పవిత్రుడై నిందలు పోగొట్టుకొన్న భృత్యుడు' అనే పేరు సంపాదిస్తావు. నీవు అంతమాత్రమే కోరుకొంటున్నావు. ఇది మంచిది కాదు. ఎందుచేతనంటే- ఇదంతా ఈ దుర్యోధనుడికి చావు మూడటమే అవుతుంది. దానిని సహించటమే అవుతుంది.'

విశేషం: 'చచ్చి శుద్ధుఁడై' - పాండవులను ఎదిరించటం మంచి సాహసమే అయినా ఆ యుద్ధంలో నీవు తప్పక చస్తావని సూచన. చచ్చి పవిత్రుడై నిందలు పాపిన భృత్యుడు కర్ణుడు అనే పేరు నీకు వస్తుంది. నీవు అదొక్కటే చూచుకొంటున్నావు. ఇది న్యాయం కాదు. ఎందుచేతనంటే ఇదంతా దుర్యోధనుడి చావుకే కారణం కనక.

వ. అనిన విని కానీనుండు సంక్షుభితమానసుండై 'యిది యెల్ల నిట్లయ్యెఁ; నిట్లుం గాక, తక్కినయది యట్లుండె; నదీ సూనుండు నన్ను నిరాకరించి పలికిన పలుకుల ఫలం బనుభవించుం గాక!' యని యతని నుద్దేశించి యిట్లనియె: 288

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్; విని; కానీనుండు= కన్యాపుత్రుడు - కర్ణుడు; సంక్షుభిత మానసుండు+ఐ= మిక్కిలి కలగిన మనస్సు కలవాడయి; ఇది+ఎల్లన్= ఇదంతా; ఇట్లు+అయ్యెన్= ఇట్లా అయింది; ఇట్లున్+కాక= ఇట్లా కాక; తక్కిన+అది= తక్కినది; అట్లు+ఉండెన్= అట్లా ఉండగా; నదీ సూనుండు= గంగానది కొడుకు- భీష్ముఁడు; నన్నున్; నిరాకరించి= తిరస్కరించి; పలికిన పలుకులు ఫలంబు; అనుభవించున్+కాక= తప్పక అనుభవిస్తాడు; అని; అతనిన్+ఉద్దేశించి= అతడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగా విని కర్ణుడు కలగిన మనస్సు కలవాడయి 'ఇదంతా ఇట్లా అయింది. తక్కినది అట్లా ఉండగా భీష్ముడు నన్ను తిరస్కరించి పలికిన పలుకుల ఫలితం తప్పకుండా అనుభవిస్తాడు' అని అతడితో ఇట్లా అన్నాడు:

విశేషం: ధృతరాష్ట్రుడు కూడా తనను నిరాకరించి పలికినా, ఆ మాటలకంటె భీష్ముడి తిరస్కారవాక్యాలే కర్ణుడికి ఎక్కువ బాధ కలిగించాయి.

కర్ణుఁడు భీష్మునిపై రోషముచేత నస్త్రసన్న్యాసంబు సేయుట (సం. 5-61-13)

తే. **'నీకు నా లావు తోడ్పాటు లేకయుండ । వలయు; నీ తెగునంతకుఁ గలన నిలువ;**
నాయుధంబులు విడిచితి; నంత మీఁద । మెఱసి బలవిక్రమంబులు నెఱపువాఁడ.' **289**

ప్రతిపదార్థం: నీకున్; నా లావు తోడ్పాటు= నా బలం తోడు; లేక+ఉండవలయున్= లేకపోవాలి; నీ తెగు+అంతకున్= నీవు చచ్చేదాకా; కలనన్= యుద్ధంలో; నిలువన్= ఉండను; ఆయుధంబులు; విడిచితిన్; అంతమీఁదన్= ఆపైని (నీవు చచ్చినమీదట); మెఱసి= విజృంభించి; బల విక్రమంబులు= బలపరాక్రమాలు; నెఱపువాఁడన్= చూపిస్తాను.

తాత్పర్యం: 'నీకు నా బలం తోడు లేకుండా ఉండాలి. నీవు చచ్చేవరకూ నేను యుద్ధభూమిలో అడుగుపెట్టను. అస్త్రాలు విడిచాను. ఆ తరువాత - నీవు చనిపోయిన తరువాత - విజృంభించి నా బలపరాక్రమాలు చూపిస్తాను.'

విశేషం: కర్ణుడు పంతానికి పోయి, భీష్ముడి మీది ద్వేషం కొద్దీ, రాజభక్తినీ, తన కర్తవ్యాన్నీ విస్మరించి అవివేకంతో ఇట్లాంటి శపథం చేశాడు.

వ. **అని శస్త్రసన్న్యాసంబుసేసి కొలువున నిలువనొల్లక దిగ్గన లేచిపోయె; నట్టియెడ శాంతనవుండు నవ్వుచు దుర్యోధనునితో నిట్లనియె:** **290**

ప్రతిపదార్థం: అని; శస్త్రసన్న్యాసంబు+చేసి= శస్త్రాలు విడిచిపెట్టి; కొలువునన్= సభలో; నిలువన్+ఒల్లక= ఉండటానికి ఇష్టపడక; దిగ్గనన్= వెంటనే; లేచిపోయెన్; అట్టి+ఎడన్= ఆ సమయంలో; శాంతనవుండు= భీష్ముడు; నవ్వుచున్; దుర్యోధనునితోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని శస్త్రసన్న్యాసం చేసి కర్ణుడు సభలో ఉండటానికి ఇష్టపడక వెంటనే లేచి వెళ్ళిపోయాడు. అప్పుడు భీష్ముడు నవ్వుతూ దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'అంతకుఁ జాలఁడె కర్ణుం? । డింతకు మును బాస యిచ్చి యెన్నఁడు బొంకం!
డింతటి మానిసి యలిగినఁ । గౌంతేయుల కెట్లు బ్రదుకఁగా వచ్చు ననిన్?' 291

ప్రతిపదార్థం: కర్ణుండు; అంతకున్+చాలఁడె?= అందుకు తగ్గవాడు కాడా?; ఇంతకున్+మును= ఇంతకు పూర్వం; బాస+ ఇచ్చి= శపథం చేసి; ఎన్నఁడున్= ఎప్పుడూ; బొంకండు= అసత్యమాడడు; (మాట తప్పేవాడే ఎప్పుడూ అని భావం); ఇంతటి మానిసి= ఇంత సమర్థుడైనవాడు; అలిగినన్= కోపిస్తే; అనిన్= యుద్ధంలో; కౌంతేయులకున్= పాండవులకు; ఎట్లు బ్రదుకఁగాన్ వచ్చున్= బ్రదకటానికి ఎలా సాధ్యమవుతుంది?

తాత్పర్యం: 'కర్ణుడు అందుకు తగ్గవాడు కాడా? ఇంతకుముందు ప్రతిజ్ఞ చేసి ఎప్పుడూ బొంకడు! ఇంతటి మహావీరుడు అలిగితే యుద్ధంలో పాండవులెట్లా బ్రదకగలరు?'

విశేషం: విపరీత లక్షణచే భీష్ముడి మాటలకు వ్యతిరేకభావాన్నే గ్రహించాలి. కర్ణుడు అస్త్రసన్న్యాసం చేయటానికి తగినవాడే అనీ, మాట తప్పటం ఎప్పుడూ అతడికి అలవాటే అనీ, ఇంతటి మహావీరుడు అలిగితే యుద్ధంలో పాండవులకు ఏమీ కాదనీ భావం.

క. అని వెండియు నిట్లను: 'నా । తని మాటల కెట్లుఁ గడఁగి ధర్మతనయుతో
నని సేయక తక్కవు నీ । వనుమానము వాయఁ జూడు మతనిని, నన్నున్. 292

ప్రతిపదార్థం: అని, వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనున్; నీవు; ఆతని మాటలకున్; ఎట్లున్= ఎట్లా అయినా; కడఁగి= పూని; ధర్మ తనయుతోన్= ధర్మరాజుతో; అని+చేయక తక్కవు= యుద్ధం చేయకుండా ఉండవు- యుద్ధం చేసి తీరుతావు; అనుమానము= సందేహం; పాయన్= పోయేటట్లు; అతనిని= ఆ కర్ణుడినీ; నన్నున్; చూడుము.

తాత్పర్యం: అని భీష్ముడింకా ఇట్లా అన్నాడు: 'నీవు అతడి మాటలను పట్టుకుని' అతడి 'భరోసా' చూచుకొని ధర్మరాజుతో ఎట్లాగూ యుద్ధం చేసితీరుతావు. నీ అనుమానం తీరేటట్లు అప్పుడు అతడినీ నన్నూ చూద్దువుగాని- (మా ఇద్దరి పరాక్రమాల తారతమ్యం నీకప్పుడు నిస్సందేహంగా బోధపడుతుందని భావం.)

వ. ఏను బాహ్లిక ద్రోణ ప్రముఖులు గనుంగొనుచుండఁ బ్రతివీరుల ననేక సహస్రంబుల సమయించెదఁ; బిదప రాధేయు రణంబునుం జూచెదవుగాక!' యనిన విని దుర్యోధనుండు కర్ణ పక్షపాతియు, నవినీతుండు నగుటం జేసి సహింపక పితామహుతో నిట్లనియె: 293

ప్రతిపదార్థం: ఏను= నేను; బాహ్లిక ద్రోణ ప్రముఖులు= బాహ్లికుడూ, ద్రోణుడూ మొదలగువారు; కనుంగొనుచున్+ఉండన్= చూస్తూండగా; ప్రతివీరులన్+అనేక సహస్రంబులన్= పెక్కువేలమంది శత్రువీరులను; సమయించెదన్= చంపుతాను; పిదపన్= తరువాత; రాధేయు రణంబునున్= కర్ణుడి యుద్ధం కూడా; చూచెదవు+కాక= చూద్దువులే; అనినన్; విని; దుర్యోధనుండు; కర్ణ పక్షపాతియున్= కర్ణుడి మీద పక్షపాతం కలవాడూ; అవినీతుండున్= అవినయపరుడూ; అగుటన్+చేసి= కావడంచేత; సహింపక= ఓర్వక; పితామహుతోన్= భీష్ముడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నేను బాహ్లికుడూ, ద్రోణుడూ మొదలైనవారు చూస్తుండగా పెక్కువేల మంది శత్రువీరులను చంపుతాను. తరువాత కర్ణుడి యుద్ధనైపుణ్యం కూడా చూద్దువుగాని' అనగా విని దుర్యోధనుడు కర్ణుడి మీద పక్షపాతం కలవాడూ, అవినయపరుడూ కావటంచేత ఓర్వక భీష్ముడితో ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. ‘ఎఱిఁగి యెఱింగి యొండె, మది నేది యెఱుంగక యొండె నెప్డు నం
దఱు వినఁ ‘బాండునందనులు దర్పితులై యని గెల్తు’ రండ్రు; ముం
దఱ నిను బాహ్లికున్ గురునిఁ దక్కటివారిని నమ్మి యేను నే
డ్తెఱ నని సేయఁబూనితిఁ; గడింది మగంటిమి తోడు సాలదే? 294

ప్రతిపదార్థం: ఎఱిఁగి+ఎఱింగి+ఒండెన్= తెలిసి తెలిసో; మదిన్= మనస్సులో; ఏది+ఎఱుంగక+ఒండెన్= ఏమీ తెలియకో; ఎప్డున్= ఎప్పుడూ; అందఱున్= అందరూ; వినన్= వినేటట్లు; పాండునందనులు= పాండవులు; దర్పితులు+ఐ= గర్వించినవారయి; అనిన్= యుద్ధంలో; గెల్తురు= గెలుస్తారు; అండ్రు= అంటారు; ముందఱన్= మొదట; నినున్= నిన్నూ; బాహ్లికున్; గురునిన్= ద్రోణుణ్ణీ; తక్కటివారిని= తక్కినవాళ్ళనూ; నమ్మి; ఏను; ఏడ్తెఱన్= విజృంభణంతో; అని+చేయన్+పూనితిన్= యుద్ధం చేయటానికి సిద్ధపడ్డాను; కడింది మగంటిమి తోడు= అధికమైన పరాక్రమం యొక్క సాయం; చాలదే?= సరిపోదా?

తాత్పర్యం: తెలిసో తెలియకో అందరూ ‘పాండవులు పరాక్రమ గర్వంతో యుద్ధంలో గెలుస్తా’రని అంటారు. మొదట నిన్నూ, బాహ్లికుడినీ, ద్రోణుడినీ, తక్కినవాళ్ళనీ నమ్ముకొని విజృంభించి యుద్ధం చేయడానికి సిద్ధపడ్డాను. నా అధికమైన పరాక్రమం తోడ్పాటు సరిపోదా?

ఉ. కర్ణుఁడు దుస్ససేనుఁడును గల్గఁగ నా కొరులేల? సద్భటా
కీర్ణ విరోధి సైన్యముల గెల్వఁగఁ జాలుదు మేము; మాకు నీ
యర్ణవ వేష్టిత క్షితి యనర్గళ విక్రమ మొప్పదక్కు; మా
నిర్ణయ మెల్ల నిట్టి; దవినీతియొ నీతియొ చూడుమీ తుదిన్.’ 295

ప్రతిపదార్థం: కర్ణుఁడును; దుస్ససేనుఁడును= దుశ్శాసనుడూ; కల్గఁగన్= ఉండగా; నాకున్; ఒరులు+ఏల= ఇతరు లెందుకు; ఏము+అ= మేమే; సత్+భట+విరోధి సైన్యములన్= గొప్ప వీరులతో గూడిన శత్రు సేనలను; గెల్వఁగన్+చాలుదుము; గెలవగలం; మాకున్; అనర్గళ విక్రమము+ఒప్పన్= అడ్డులేని పరాక్రమం ఒప్పగా; ఈ అర్ణవ వేష్టిత క్షితి= ఈ సముద్ర పరివృతమైన భూమి; దక్కున్= లభిస్తుంది; మా నిర్ణయము+ఎల్లన్= మా నిశ్చయమంతా; ఇట్టిది; అవినీతియొ; నీతియొ; తుదిన్= చివర; చూడుమీ.

తాత్పర్యం: కర్ణుడూ, దుశ్శాసనుడూ ఉండగా నాకు ఇతరులెందుకు? మంచి వీరులతో వ్యాపించిన శత్రుసేనలను మేమే గెలవగలం. ఈ సముద్ర పరీత భూమి అడ్డులేని పరాక్రమం ఒప్పగా మాకు దక్కుతుంది. ఇదీ మా నిశ్చయం. అవినీతో, నీతో చివరకు చూడుము’.

క. అను పలుకులకు విషాదము। దనుకఁగ ధృతరాష్ట్రవిభుఁడు దననందను నే
మనియుం బలుకఁగఁజాలక। వెనుఁబాటున నిట్టులనియె విదురునితోడన్. 296

ప్రతిపదార్థం: అను పలుకులకున్= దుర్యోధను డన్న ఆ మాటలకు; విషాదము= విచారం; తనుకఁగన్= కలుగగా; ధృతరాష్ట్ర విభుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; తన నందనున్= తన కొడుకును; ఏమి+అనియున్+పలుకఁగన్+చాలక= ఏమీ అనలేక; వెనుఁబాటునన్= విచారంతో; విదురునితోడన్; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: దుర్యోధనుడి మాటలకు దుఃఖం కలుగగా, ధృతరాష్ట్ర మహారాజు తన కొడుకును ఏమీ అనలేక విచారంతో విదురుడితో ఇట్లా అన్నాడు:

తే. **'మృత్యుపాశోపహతుఁడయ్యె మీఁదు లేక। సూతనందనుతోఁగూడి నా తనూజుఁ**
డకట! నాశంబుఁ బొందువాఁడయ్యెఁ; మనకు। నింకఁ జేయంగ నగుపని యెద్ది చెపుమ?' **297**

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; నా తనూజుఁడు= నా కొడుకు; మీఁదు లేక= పైని లేక - తనకంటె అధికుడు లేక; సూత నందనుతోన్= కర్ణుడితో; కూడి= కలిసి; మృత్యుపాశ+ఉపహతుఁడు+అయ్యెన్= మృత్యుపాశాలచేత కొట్టబడినవాడు అయ్యాడు; నాశంబున్+పొందువాఁడు+అయ్యెన్= నశిస్తున్నాడు; మనకున్; ఇంకన్; చేయంగన్+అగు పని= చేయదగినపని; ఎద్ది= ఏది; చెపుమ= చెప్పుము.

తాత్పర్యం: 'అయ్యో! నా కొడుకు పైనెవడూ లేక కర్ణుడితో కలిసి మృత్యుపాశాలలో చిక్కుకున్నాడు. నశిస్తున్నాడు. ఇంక మనకు చేయదగింది దేదో చెప్పుము.'

వ. **అనిన విని విదురుం డతని కిట్లను: 'మనవారలు మున్న దుర్బలులు. తమలోనం బెనంకువలయి విరస వచనంబు లాడుచు నింతలు పుట్టించుట యది యర్జునునకుఁ గార్యసాధనం బింతియకాక యే మనువారము? వారలు బంధుమిత్త్ర సహాయులుం దారును నొక్క తలంపువారలయి యున్నవారు. వలవని యీ వెంగలి మాటలు విడిచి పాండవులం బిలువం బనిచి తగవు నడపుటదక్క మనకుఁ జేయందగుపని వేఱొండు గలుగునే?' యని చెప్పిన, ధృతరాష్ట్రుండు సంజయు చెప్పిన కార్యవచనంబులు కొఱంత వినంగలవాఁడై యతని దిక్కు మొగంబు సేసి.** **298**

ప్రతిపదార్థం: అనినన్; విని; విదురుండు; అతనికిన్; ఇట్లు+అనున్; మనవారలు; మున్ను+అ= ముందే; దుర్బలులు= బలహీనులు; తమలోనన్; పెనంకువలు+అయి= కలహాలయి; విరస వచనంబులు+ఆడుచున్= దుర్భాషలాడుతూ; ఇంతలు పుట్టించుట= ఇంతా కలిగించడం; అది అర్జునునకున్; కార్యసాధనంబు= ప్రయోజనాన్ని సాధించిపెట్టేది; ఇంతియకాక ఏమి+అనువారము?= ఇంతేతప్ప ఏమంటాం?; వారలు= పాండవులు; బంధు మిత్త్ర సహాయులున్+తారునున్= చుట్టాలూ, స్నేహితులూ, తోడువచ్చినవాళ్ళూ; ఒక్క తలంపు వారలు+అయి+ఉన్నవారు= ఏకాభిప్రాయులై ఉన్నారు; వలవని+ఈ వెంగలి మాటలు= పనికిరాని ఈ పిచ్చిమాటలు; విడిచి; పాండవులన్; పిలువన్+పనిచి= పిలిపించి; తగవు నడపుట+తక్కన్= న్యాయం చేయటం తప్ప; మనకున్+చేయన్+తగు పని= మనం చేయదగినపని; వేఱు+ఒండు+కలుగునే?= ఇంకోటి ఉంటుందా?; అని, చెప్పినన్; ధృతరాష్ట్రుండు; సంజయు చెప్పిన= సంజయుడు చెప్పిన; కార్య వచనంబుల కొఱంత= రాయబారపు మాటల శేషం; వినంగలవాఁడు+ఐ= వినగోరినవాడై; అతని దిక్కు= అతడి వైపు; మొగంబు+చేసి= తిరిగి.

తాత్పర్యం: అనగా విని విదురుడు అతడితో ఇట్లా అన్నాడు: 'మనవాళ్ళు అసలే బలహీనులు. తమలో తాము పోట్లాడుకొంటూ దుర్భాషలాడుకుంటూ ఇట్లా ఉండటం అది అర్జునుడికి లాభం. ఇంతేతప్ప ఏమంటాం? పాండవులు ఏకాభిప్రాయులై ఉన్నారు. పనికిమాలిన ఈ పిచ్చిమాటలు కట్టిపెట్టి పాండవులను పిలిపించి న్యాయం చేయటం తప్ప మనం చేయవలసింది ఇంకోటి లేదు' అని చెప్పగా, ధృతరాష్ట్రుడు సంజయుడు చెప్పిన రాయబారపు మాటల శేషం వినగోరి అతడివైపు చూచి.

క. 'మును వరుసతోడఁ దన తలఁ । చిన యన్నియు నీవు వినఁగఁ జెప్పి తగవుమై
నిను వీడుకొల్పునెడ, న । ర్జునుఁ డేమని నిశ్చయించెఁ జూతము చెపుమా!' 299

ప్రతిపదార్థం: మును= ముందు; వరుసతోడన్= క్రమంతో; తన తలఁచిన+అన్నియున్= తన మనస్సులో ఉన్నవన్నీ; నీవు; వినఁగన్+చెప్పి; తగవుమైన్= సముచితంగా; నినున్; వీడుకొల్పు+ఎడన్= పంపించేటప్పుడు; అర్జునుఁడు; ఏమి+అని; నిశ్చయించెన్= నిర్ణయించాడో; చెపుమా= చెప్పుమా; చూతము= చూద్దాం.

తాత్పర్యం: 'ముందు తన మనస్సులో ఉన్నవన్నీ క్రమంగా నీవు వినేటట్లు చెప్పి, సముచితంగా నిన్ను పంపించేటప్పుడు అర్జునుడు తుదినిర్ణయంగా ఏమన్నాడో చెప్పుము చూద్దాము.'

క. అని యడిగిన సంజయుఁ డి । ట్లనుఁ: 'దుదిఁ బార్థుండు నిశ్చయము సేసి సుయో
ధనుతో నిందలి పెద్దలు । వినఁగా ననుమన్నపలుకు వినుము నరేంద్రా!' 300

ప్రతిపదార్థం: అని; అడిగినన్; సంజయుఁడు; ఇట్లు+అనున్; నర+ఇంద్రా!= రాజా!; పార్థుండు= అర్జునుడు; తుదిన్= చివరగా; నిశ్చయము+చేసి= నిర్ణయించి; సుయోధనుతోన్; ఇందలి పెద్దలు; వినఁగాన్; అనుము+అన్న పలుకు= చెప్పుమన్న మాట; వినుము.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు డడుగగా సంజయుడు అతడితో ఇట్లా అన్నాడు: 'మహారాజా! అర్జునుడు చివరగా నిర్ణయించి దుర్యోధనుడితో ఇందలి పెద్దలు వింటూండగా చెప్పుమన్న పలుకులు చెపుతా వినుము.'

మ. 'కురువంశోత్తముఁడైన ధర్మజుఁడు 'నాకుం దండ్రిపా లీఁదగున్
ధరలో సా' మని తాన పల్క, వినియున్ దర్పంబుమై నీక త
క్కిరయేనిం, జటు లాస్మదీయ విశిఖాగ్నిజ్వాలలం దాహుతుల్
వరుసం బెట్టుదు ధార్తరాష్ట్రతతి నైశ్వర్యం బవార్యంబుగన్.' 301

ప్రతిపదార్థం: కురు వంశ+ఉత్తముఁడు+ఐన ధర్మజుఁడు= కురు వంశశ్రేష్ఠుడైన ధర్మరాజు; నాకున్; తండ్రిపాలు= తండ్రివాటా; ధరలోన్ సాము= భూమిలో సగం; ఈన్+తగున్= ఈయదగును; అని; తాను+అ= తానే స్వయంగా; పల్కన్= చెప్పగా; వినియున్; దర్పంబు+మైన్= గర్వంతో; ఈక తక్కిరి+అ+ఏనిన్= ఇయ్యకపోయారో, ధార్తరాష్ట్ర తతిన్= ధృతరాష్ట్ర పుత్రుల సమూహాన్ని; వరుసన్= వరసగా ఒక్కొక్కడినే; ఐశ్వర్యంబు= సంపద, రాజ్యభాగం; అవార్యంబుగన్= తప్పనిసరి అయ్యేటట్లు; చటుల+అస్మదీయ విశిఖ+అగ్ని జ్వాలల+అందున్= చలించే నా బాణాలనే అగ్నిజ్వాలలలో; ఆహుతుల్ పెట్టుదున్= వేలుస్తాను-హోమం చేస్తాను.

తాత్పర్యం: 'కురువంశ శ్రేష్ఠుడైన ధర్మరాజు స్వయంగా- 'మా తండ్రి వాటా భూమిలో సగం నాకివ్వదగు'నని అంటే, వినీ, గర్వంతో ఇయ్యకపోయారో, ధృతరాష్ట్ర పుత్రుల సమూహాన్ని వరసగా, మాకు రాజ్యభాగం తప్పనిసరి అయ్యేటట్లు, నా చంచలమైన బాణాలనే అగ్ని జ్వాలలో వేలుస్తాను.'

విశేషం: విశిఖాగ్నిజ్వాలలు - విశిఖాలనే అగ్నిజ్వాలలు - రూపకాలంకారం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి, కౌఁగిలించుకొని భూషణాంబరాది కమనీయ వస్తువు లొసంగిన, నేనునుం బాండవులను వాసుదేవుని సవినయంబున వీడ్కొని యింతవట్టును దేవరకు నెఱింగింప వేగంబ వచ్చితి' ననిన నమ్మాటలు దుర్యోధనుం డాదరింపక పెడచెవులంబెట్టె; ధృతరాష్ట్రుండును ఱిచ్చవడి యూరకుండె; నప్పు డయ్యిరువురపాలను సంజయుం డొక్కరుండుదక్క నయ్యాస్థానంబున నున్న సమస్త జనంబులును దిగ్గన లేచి తమతమ నివాసంబులకుం బోయిరి; తదనంతరంబ. 302

ప్రతిపదార్థం: అని; పలికి; కౌఁగిలించుకొని; భూషణ+అంబర+ఆది కమనీయ వస్తువులు= అలంకారాలూ, వస్త్రాలూ మొదలగు కోరదగిన వస్తువులు; ఒసంగినన్= ఇయ్యగా; ఏనునున్= నేనుకూడా; పాండవులను; వాసుదేవునిన్= కృష్ణుడినీ; సవినయంబునన్= అడకువతో; వీడ్కొని= విడిచి; ఇంతవట్టును= ఇంతవరకూ; దేవరకున్= తమకు; ఎఱింగింపన్= తెలపటానికి; వేగంబు+అ= వేగమే; వచ్చితిన్; అనినన్; ఆ+మాటలు; దుర్యోధనుండు; ఆదరింపక= మన్నించక; పెడచెవులన్+పెట్టెన్= వినిపించుకొనలేదు; ధృతరాష్ట్రుండును; ఱిచ్చవడి= నిశ్చేష్టుడై; ఊరక+ఉండెన్; అప్పుడు; ఆ+ఇరువుర పాలను= ఆ ఇద్దరి దగ్గరా; సంజయుండు; ఒక్కరుండు+తక్కన్= ఒక్కడు తప్ప; ఆ+ఆస్థానంబునన్; ఉన్న; సమస్త జనంబులను= ఎల్లజనులూ; దిగ్గనన్+లేచి= వెంటనే లేచి; తమ తమ నివాసంబులకున్= తమ తమ ఇండ్లకు; పోయిరి; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: అని పలికి కౌగిలించుకొని అలంకారాలూ, వస్త్రాలూ మొదలైన వస్తువు లియ్యగా నేనూ పాండవులనూ కృష్ణుడినీ వీడి ఇంతవరకూ తమకు తెలపటానికి వేగమే వచ్చాను' అనగా ఆ మాటలు దుర్యోధనుడు మన్నించక వినిపించుకొనలేదు. ధృతరాష్ట్రుడునూ నిశ్చేష్టుడై ఊరుకున్నాడు. అప్పుడు ఆ ఇద్దరి దగ్గరా సంజయుడు ఒక్కడు తప్ప ఆ ఆస్థానంలో ఉన్నవాళ్ళందరూ వెంటనే లేచి తమ తమ ఇళ్ళకు వెళ్ళిపోయారు. ఆ తరువాత (తరువాతి పద్యంతో అన్వయం).

క. తనుజవశవర్తి యగు న । మ్మనుజేంద్రుఁడు దన సుతుండు మర్దింపఁగ నో
పునొ యనిఁ బాండుతనూజుల? । నను మతి సంజయునితోడ నాడె దురాశన్. 303

ప్రతిపదార్థం: తనుజ వశవర్తి+అగు+ఆ+మనుజ+ఇంద్రుఁడు= కొడుకునకు అధీనుడై మెలగే ఆ రాజు - ధృతరాష్ట్రుడు; తన సుతుండు= తన కొడుకు; అనిన్= యుద్ధంలో; పాండు తనూజులన్= పాండవులను; మర్దింపఁగన్+ఓపునొ= చంపగలడా; అను మతిన్= అనే తలపుతో; సంజయునితోడన్; దురాశన్= దురాశతో; ఆడెన్= పలికాడు.

తాత్పర్యం: కొడుకునకు అధీనుడై మెలగే ఆ ధృతరాష్ట్ర మహారాజు, తన కొడుకు పాండవులను యుద్ధంలో చంపగలడా? అనే తలపుతో సంజయుడితో దురాశతో ఇట్లా అన్నాడు:

సీ. 'ఈ రెండు వీకుల తారతమ్యంబులు । నెఱుఁగుదు; పోరైన నెవ్వ రోర్తు
రిది నిశ్చయింతమే? యెందు నుపాయంబుఁ । బౌరుషంబును గలవారు గలరు?
సూతము చెపు' మన్న సూతనందనుఁడు 'న । న్నడిగెద వే నొంటి యడుగవలదు;
మీ యయ్య సాత్యవతేయుఁ డీయెడకు వేం । చేయునట్లుగ భక్తిఁ జేసి తలఁపు;

తే. పిలువఁబంపు గాంధారి; వారలు వినీతి । రతులు, నిశ్చయవిదులు, ధర్మజ్ఞ చిత్తు;
లుల్లమున నీ కసూయాదు లొదవెనేని । పూని మాన్పంగ నేర్తురు మానవేంద్ర!' 304

ప్రతిపదార్థం: ఈ రెండు వీఁకుల తారతమ్యంబులున్= ఈ రెండు సేనల తరతమ భావాలూ; ఎఱుఁగుదువు; పోరు+ఐనన్= యుద్ధం వస్తే; ఎవ్వరు+ఓర్తురు?= ఎవరు గెలుస్తారు?; ఇది నిశ్చయింతమే?= ఇది నిర్ణయిద్దామా?; ఎందున్= ఏ సేనలో; ఉపాయంబున్; పౌరుషంబును; కలవారు= కలరు?; చూతము; చెపుము; అన్నన్; సూతనందనుఁడు= సంజయుడు; మానవ+ఇంద్ర!= రాజా!; నన్నున్ అడిగెదవు+ఏన్= అడిగితే; ఒంటి+అడుగన్ వలదు= ఒంటరిపాటున అడగవద్దు; మీ+అయ్య= మీ తండ్రి; సాత్యవతేయుఁడు= వ్యాసుడు; ఈ+ఎడకున్= ఇక్కడికి; వేంచేయునట్లుగన్= విచ్చేసేటట్లు; భక్తిన్+చేసి తలఁపుము= భక్తితో ధ్యానించుము; గాంధారిన్; పిలువన్+పంపుము= పిలిపించుము; వారలు; వినీతిపరులు= మర్యాదస్థులు; నిశ్చయవిదులు= నిర్ణయం తెలిసినవారు; ధర్మజ్ఞచిత్తులు= ధర్మం తెలిసిన మనస్సు కలవారు; నీకున్; ఉల్లమునన్= మనస్సులో; అసూయా+ఆదులు= ఈర్ష్య మొదలైనవి; ఒదవెన్+ఏనిన్= కలిగినట్లయితే; పూని= పూనిక వహించి; మాన్పంగన్+నేర్తురు= పోగొట్టగలరు.

తాత్పర్యం: 'ఈ రెండు సైన్యాలలోనూ గల తరతమ భావాలను నీ వెరుగుదువు. యుద్ధం వస్తే ఎవరు గెలుస్తారో నిశ్చయిద్దామా? ఏ సైన్యంలో ఉపాయమూ, పౌరుషమూ కలవాళ్ళు ఉన్నారు? చూద్దాం చెప్పుము" అనగా, సంజయుడు 'రాజా! నన్నడిగే మాటుంటే ఒంటరిగా అడగవద్దు. మీ తండ్రి వ్యాసుడు ఇక్కడికి విచ్చేసేటట్లు ఆయనను భక్తితో ధ్యానించుము. గాంధారిని పిలిపించుము. వాళ్ళు మర్యాదస్థులు, నిర్ణయం తెలిసినవాళ్ళు. ధర్మం తెలిసిన మనస్సు కలవాళ్ళు. నీకు మనస్సులో అసూయ మొదలైనవి కలిగితే వాటిని పోగొట్టగలవాళ్ళు.'

కృష్ణద్వైపాయనుఁడు ధృతరాష్ట్రుని యొద్దకు వచ్చుట (సం. 5-65-8)

వ. అనిన విని యంబికానందనుం 'డట్లకాక'యని యొక కంచుకిం బిలిచి వానిం బుచ్చి గాంధారి రావించి, సద్భక్తి తాత్పర్యంబునఁ గృష్ణద్వైపాయన మహామునిం దలంచిన, దివ్యబోధ మహనీయుండైన యమ్మహాత్ముండు విజయం చేయుటకు, నందఱు దండ ప్రణామంబులు సేసి సమున్నతాసనంబున నునిచి, యర్ఘ్యపాద్యాది విధులం బూజించియున్న సమయంబున ధృతరాష్ట్రుండు విన్నపంబు సేయక మున్న యమ్మహాపురుషుండు ధృతరాష్ట్ర సంజయుల చిత్తవృత్తులు దాన యెఱింగినవాఁడగుటం జేసి, సంజయువలనఁ బ్రసన్న దృష్టి నవలోకించి యతని కిట్లనియె: 305

ప్రతిపదార్థం: అనినన్; విని; అంబికా నందనుండు= ధృతరాష్ట్రుడు; అట్లు+అ కాక= అట్లాగే; అని; ఒక కంచుకిన్+పిలిచి= ఒక రాజాంతఃపురాధికారిని పిలిచి; వానిన్; పుచ్చి= పంపి; గాంధారిన్; రావించి= రప్పించి; సత్+భక్తి తాత్పర్యంబునన్= సద్భక్తి తత్పరత్వంతో; కృష్ణద్వైపాయన మహామునిన్= వ్యాసమహర్షిని; తలంచినన్= ధ్యానించగా; దివ్య బోధ మహనీయుండు+ఐన+ఆ+మహాత్ముండు= దివ్యజ్ఞానం చేత పూజనీయుడైన ఆ మహానుభావుడు; విజయం చేయుటయున్= విచ్చేయగా; అందఱున్; దండ ప్రణామంబులు+చేసి= సాష్టాంగ నమస్కారాలు చేసి; సమున్నత+ఆసనంబునన్= ఎత్తయిన పీఠంపై; ఉనిచి= కూర్చుండపెట్టి; అర్ఘ్య పాద్య+ఆది విధులన్= పూజాద్రవ్యాలూ, పాదజలమూ మొదలైన సత్కారాలతో; పూజించి+ఉన్న సమయంబునన్= పూజించి ఉన్నప్పుడు; ధృతరాష్ట్రుండు; విన్నపంబు+చేయక మున్ను+అ= మనవి చేయకముందే; ఆ+మహాపురుషుండు= ఆ మహాత్ముడు; ధృతరాష్ట్ర సంజయుల చిత్తవృత్తులు= ధృతరాష్ట్ర సంజయుల మనోగతాలు; తాను+అ= తానే; ఎఱింగిన వాఁడు+అగుటన్+చేసి= తెలిసినవాడవటంచేత; సంజయువలనన్= సంజయుడికేసి; ప్రసన్నదృష్టిన్= అనుగ్రహంకల చూపుతో; అవలోకించి= చూచి; అతనికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అట్లా సంజయుడనగా విని ధృతరాష్ట్రుడు 'అలాగే' అని ఒక కంచుకిని పిలిచి అతడిని పంపి గాంధారిని రప్పించి, భక్తిపారవశ్యంతో వ్యాస మహర్షిని ధ్యానించగా, దివ్యజ్ఞాన మహనీయుడైన ఆ మహానుభావుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విచ్చేశాడు. అందరూ సాష్టాంగ నమస్కారాలు చేసి ఉన్నతమైన పీఠంపై ఆసీనుడిని చేసి అర్ఘ్యం పాద్యం మొదలైన సత్కారాలతో పూజించి ఉన్నప్పుడు, ధృతరాష్ట్రుడు మనవి చేయకుండానే, ఆ మహాత్ముడు ధృతరాష్ట్ర సంజయుల మనోగతాలు తెలిసినవాడవటం చేత, సంజయుడికేసి అనుగ్రహంతో కూడిన దృష్టితో చూచి, అతడితో ఇట్లా అన్నాడు:

క. 'నీవు సమస్తము నెఱుఁగుదు । గావున నీ కూరకుండఁగాఁ దగదు; ధరి
త్రీ వల్లభుఁ డడిగిన పని । యీ విధమని తెలియఁబలుకు మేను వినంగన్.' 306

ప్రతిపదార్థం: నీవు; సమస్తమున్+ఎఱుఁగుదువు+కావునన్= అంతా ఎరుగుదువు కాబట్టి; నీకున్+ఊరక+ఉండఁగాన్+తగదు= నీవు ఊరుకొనగూడదు, ధరిత్రీ వల్లభుఁడు= రాజు- ధృతరాష్ట్రుడు; అడిగిన పని; ఈ విధము+అని= ఇదీ అని; ఏను వినంగన్= నేను వినేటట్టు; తెలియన్+పలుకుము= స్పష్టంగా చెప్పుము.

తాత్పర్యం: 'నీకు అన్నీ తెలుసు కాబట్టి నీవు ఊరుకొనగూడదు. ధృతరాష్ట్రుడు అడిగిన ప్రశ్నకు సమాధానం నేను వినేటట్లు స్పష్టంగా చెప్పుము.'

వ. అనినఁ బ్రసాదం బని సంజయుండు ధృతరాష్ట్రున కిట్లనియె: 307

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ప్రసాదంబు+అని= సంతోషం అని; సంజయుండు; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని వ్యాసుడు అనగానే 'సంతోషం' అని సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

క. 'ఆ సేనకు నీ సేనకు । వాసి యడిగె దీవు నన్ను, వసుదేవసుతుం
డా సేనఁ గలఁడు; తత్సము । నీ సేనం జూపుమా నరేశ్వర! నాకున్. 308

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= రాజా, ధృతరాష్ట్రా!; ఈవు= నీవు; నన్నున్; ఆ సేనకున్= ఆ (పాండవుల) సేనకూ; ఈ సేనకున్= ఈ (కౌరవుల) సేనకూ; వాసి= తారతమ్యం; అడిగెదవు; ఆ సేనన్= పాండవుల సేనలో; వసుదేవ సుతుండు= కృష్ణుడు; కలఁడు= ఉన్నాడు; ఈ సేనన్= కౌరవుల సేనలో; తద్+సమున్= అతడితో సమానుడిని; నాకున్; చూపుమా= చూపించుము.

తాత్పర్యం: 'ధృతరాష్ట్రా! నీవు నన్ను పాండవుల సేనకూ, కౌరవుల సేనకూ తారతమ్యం అడిగావు. పాండవుల సేనలో కృష్ణు డున్నాడు. ఈ కౌరవసేనలో అతడితో సమానుడిని నాకు చూపించుము.

వ. వాసుదేవుం డెట్టివాఁ డని యడిగెదేనిం జెప్పెద. 309

ప్రతిపదార్థం: వాసుదేవుండు= కృష్ణుడు; ఎట్టివాఁడు+అని= ఎటువంటివాడు అని; అడిగెదు (దవు)+ఏనిన్= అడిగితే; చెప్పెదన్.

తాత్పర్యం: కృష్ణుడు ఎట్లాంటివాడని అడిగితే, చెప్పుతాను వినుము.

చ. జగముల నన్నిటిం దనవశంబుగఁ జేసినవీరు, భంగమున్,
బగయు లలాట లోచనుఁడు వాపఁగఁ బేర్చినయట్టి బాణు, నొ
క్క గడియలోన గర్వ మడఁగం బరిమార్చె; సురేంద్ర కల్పకం
బు గరములీలఁ దెచ్చె; హరి భూరి పరాక్రమ మప్రసిద్ధమే! 310

ప్రతిపదార్థం: జగములన్+అన్నిటిన్= లోకాల నన్నింటినీ; తన వశంబుగన్+చేసిన వీరున్= తనకు లోబడేటట్లు చేసికొన్న వీరుడిని; భంగమున్= అవమానమూ; పగయున్= శత్రుత్వమూ; లలాట లోచనుఁడు= నుదుట కన్నుకలవాడు- శివుడు; పాపఁగన్= లేకుండా చేయగా; పేర్చిన+అట్టి= విజృంభించినట్టి; బాణున్= బాణుడిని; ఒక్క గడియలోన్+అ= ఒక గడియ కాలంలోనే; గర్వము+అడఁగన్= గర్వం నశించిపోయేటట్లు; పరిమార్చెన్= సంహరించాడు; సుర+ఇంద్ర కల్పకంబు= దేవేంద్రుడి కల్పవృక్షం- పారిజాతం; కరము లీలన్= మిక్కిలి విలాసంతో- అనాయాసంగా; తెచ్చెన్; హరి భూరి పరాక్రమము= కృష్ణుడి మహాపరాక్రమం; అప్రసిద్ధమే?= ప్రసిద్ధమైనది కాదా? (అందరికీ తెలిసిందే కదా!)

తాత్పర్యం: లోకాల నన్నింటినీ తనకు అధీనాలుగా చేసికొన్న వీరుడూ, అవమానమూ, శత్రుత్వమూ ముక్కంటి పోగొట్టగా విజృంభించినవాడూ అయిన బాణుడిని ఒక గడియ కాలంలోనే గర్వం నశించేటట్లు వధించాడు. దేవేంద్రుడి పారిజాత వృక్షాన్ని అవలీలగా తీసికొనివచ్చాడు. కృష్ణుడి మహాపరాక్రమం సుప్రసిద్ధమే కదా!

విశేషం: బాణుడు - బాణాసురుడు బలి కొడుకు. ఇతడు ఈశ్వరుడిని గురించి తపస్సు చేసి మూడు లోకాలలోనూ తన కెదురు లేకుండా వరం పొందుతాడు. ఇతని కూతురు ఉష. ఈమె కలలో చూచిన అనిరుద్ధుడిని ప్రేమించి తన చెలికత్తె సాయంతో అతణ్ణి తన అంతఃపురానికి రప్పించుకొంటుంది. అతనితో సంగమించటం వలన ఆమె గర్భవతి అవుతుంది. ఈ సంగతి బాణుడు తెలిసికొని అనిరుద్ధుడి తాతయైన కృష్ణుడితో యుద్ధం చేస్తాడు. కృష్ణుడు బాణుడి వేయి బాహువులను నరుకుతాడు. బాణుడు ఓడిపోయి ఉషానిరుద్ధులకు వివాహం జరిపిస్తాడు. 'సురేంద్ర కల్పకంబు గరము లీలఁ దెచ్చె' - కృష్ణుడు సత్యభామ కోరికపై ఇంద్రుడి మీదికి దండెత్తిపోయి అతడి నందనవనంలోని పారిజాత వృక్షాన్ని భూమికి తెచ్చి సత్యభామ పెరట్లో నాటుతాడు.

ఆ. అధిక దుష్కరంబులైన కార్యంబులు । క్రీడవోలెఁజేయుఁ గేశవుండు;
విను మతండు పార్థు నెనసి యేకార్థుఁడై । యుండుఁ బూర్వ భవ సఖుండు గాన. 311

ప్రతిపదార్థం: కేశవుండు= కృష్ణుడు; అధిక దుష్కరంబులు+ఐన కార్యంబులు= మిక్కిలి కష్టములైన పనులు; క్రీడ+పోలెన్+చేయున్= ఆటవలె చేస్తాడు; వినుము; అతండు; పూర్వభవ సఖుండు+కానన్= పూర్వజన్మలో మిత్రుడు కాబట్టి, పార్థున్= అర్జునుడిని; ఎనసి= కూడి; ఏక+అర్థుఁడు+ఐ+ఉండున్= ఒకే ప్రయోజనం కలవాడై ఉంటాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! విను. కృష్ణుడు మిక్కిలి కష్టములైన పనులు ఒక ఆటవలె అవలీలగా చేస్తాడు. అంతేకాక అతడు పూర్వజన్మలో అర్జునుడికి స్నేహితుడు కాబట్టి, అర్జునుడితోకూడి ఒకే ప్రయోజనం కలిగి ఉంటాడు.

ఆ. అట్టి వాసుదేవుని చక్రంబు నిజమాయాబలంబునఁ బాండవుల సర్వ సమర సాధనంబుల యందును సూక్ష్మరూపవ్యాపియై నిలిచి వారికి విజయం బొసంగుచుండు' నని చెప్పి, మఱియు నిట్లనియె: 312

ప్రతిపదార్థం: అట్టి వాసుదేవుని చక్రంబు= అటువంటి కృష్ణుని చక్రాయుధం (సుదర్శనం); నిజ మాయా బలంబునన్= తనదైన మాయయొక్క శక్తిచేత; పాండవుల సర్వ సమర సాధనంబుల అందును= పాండవుల యుద్ధ పరికరాలన్నిటిలోనూ; సూక్ష్మ రూప వ్యాపి+ఐ= సూక్ష్మరూపంతో వ్యాపించినదై; నిలిచి; వారికిన్; విజయంబు; ఒసంగుచున్+ఉండున్= కూరుస్తూంటుంది; అని; చెప్పి; మఱియున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అటువంటి కృష్ణుని సుదర్శనం తన మాయా బలంతో పాండవుల యుద్ధోపకరణాలన్నిటియందూ సూక్ష్మరూపంతో వ్యాపించి, వారికి విజయం చేకూరుస్తుంది' అని చెప్పి, ఇంకా ఇట్లా అన్నాడు:

క. 'పలుమఱుఁ బాండు తనూజుల । కొలఁది వితర్కించెదవు; నిగూఢం బదియుం
దెలియం బలికెద; వారికి । బలమును సత్త్వంబు హరియ పార్థివముఖ్యా! 313

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= రాజోత్తమా, ధృతరాష్ట్రా!; పాండు తనూజుల కొలఁది= పాండవుల సామర్థ్యం; పలుమఱున్= పలుసార్లు; వితర్కించెదవు= సంశయిస్తావు; నిగూఢంబు+అదియున్+తెలియన్+పలికెదన్= రహస్యమైన దానినికూడా తెలిసేటట్లు చెపుతాను; వారికిన్= పాండవులకు; బలమును= పరాక్రమమూ; సత్త్వంబున్= ప్రాణమూ; హరి+అ= కృష్ణుడే.

తాత్పర్యం: 'రాజోత్తమా, ధృతరాష్ట్రా! నీవు మాటిమాటికీ పాండవుల సామర్థ్యాన్ని సంశయిస్తావు. అది రహస్యమైనా, స్పష్టపరుస్తాను. వారికి కృష్ణుడే పరాక్రమమూ, ప్రాణమూ.

వ. హరి మహత్త్వంబు విన్నవించెద నవధరింపుము. 314

తాత్పర్యం: కృష్ణుడి మాహాత్మ్యం మనవి చేస్తాను, శ్రద్ధగా వినుము.

క. ఒక తల సమస్త జగములు, । నొకఁడ జనార్దనుఁడు నిలిచి యొక తలయైనన్,
సకలము నసార; మాతం । డొకరుని సారంబ చాల నుత్కృష్టమగున్. 315

ప్రతిపదార్థం: సమస్త జగములున్= లోకాలన్నీ; ఒక తల= ఒక వైపు; జనార్దనుఁడు+ఒక్కఁడు+అ= కృష్ణు డొక్కడూ; నిలిచి; ఒక తల+ఐనన్= ఒక వైపూ అయితే; సకలమున్= అంతా; అసారము= నిస్సారం; ఆతండు+ఒకరుని సారంబు+అ= అతడొక్కడి సారమూ; చాలన్+ఉత్కృష్టము+అగున్= మిక్కిలి గొప్పది అవుతుంది.

తాత్పర్యం: లోకాలన్నీ ఒక పక్షాన, కృష్ణు డొక్కడూ ఒక పక్షాన నిలిస్తే, అంతా నిస్సారమూ అతడి ఒక్కని సారమూ మహోత్కృష్టమూ అవుతుంది.

క. తలఁపునన వాసుదేవుఁడు । గలిగింపను, నిలుప, నడఁపఁగా నోపు జగం
బుల; మఱియును గ్రీడార్థము । పలువోకలఁ బుచ్చుచుండుఁ బౌరవనాథా! 316

ప్రతిపదార్థం: పౌరవ నాథా!= పూరు వంశశ్రేష్ఠుడా, ధృతరాష్ట్రా!; వాసుదేవుఁడు= కృష్ణుడు; తలఁపునన్+అ= సంకల్పంచేతనే; జగంబులన్= లోకాలను; కలిగింపను= పుట్టించడానికీ; నిలుపన్= నిలపటానికీ; అడఁపఁగాన్= నశింపచేయటానికీ; ఓపున్= చాలును; మఱియును= ఇంకా; క్రీడా+అర్థము= ఆటకొరకు; వినోదంకొరకు; పలు+పోకలన్+పుచ్చుచున్+ఉండున్= అనేక రీతులను ప్రయోగిస్తూంటాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! కృష్ణుడు సంకల్పమాత్రంచేతనే లోకాల సృష్టి స్థితి లయాలను చేయగల సమర్థుడు. ఇంకా ఎన్నో రీతులను ప్రయోగిస్తూంటాడు.

విశేషం: కృష్ణుడు త్రిమూర్త్యాత్మకుడని భావం.

క. **ఎక్కడ నడచును సత్యం, । బెక్కడ ధర్మంబు వరఁగు, నెక్కడఁ గలుగుం**
జక్కటి నిలుచుం గృష్ణుం । డక్కడ; నతఁ డున్నకడన యగు జయ మధిపా! **317**

ప్రతిపదార్థం: అధిపా!= రాజా, ధృతరాష్ట్రా!; సత్యంబు; ఎక్కడన్; నడచున్= ప్రవర్తిస్తుందో; ధర్మంబు; ఎక్కడ; పరఁగున్= ఒప్పుతుందో; చక్కటి= న్యాయంగా; ఎక్కడన్; కలుగున్; కృష్ణుండు; అక్కడన్; నిలుచున్= ఉంటాడు; అతఁడు; ఉన్న కడన్+అ= ఉన్నచోటనే; జయము; అగున్.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! సత్యం ఎక్కడ ప్రవర్తిల్లుతుందో, ధర్మం ఎక్కడ ఒప్పుతుందో, న్యాయం ఎక్కడ ఉంటుందో కృష్ణుడు అక్కడ నిలుస్తాడు. అతడున్న చోటనే జయం కలుగుతుంది.

సీ. **పురుషోత్తముం డెల్ల భువనంబులును దాన । యఖిల భూతాత్మకుండై విహార**
లీల విచేష్టించు; నీ లోకముల మాయ । దొట్టి యొక్కొకమరి పుట్టి, పెరిఁగి
కర్మానుచరణముల్ గైకొని వర్తించు; । శిష్టరక్షణమును, దుష్ట నిగ్ర
హంబును దన పను లగుటఁ; బాండవుల నె । పం బిడుకొని ధర్మబాహ్యు లైన

తే. **నీ తనూజుల నిక్కము నిగ్రహింపఁ । దలఁచినాఁ డమ్మహాత్ముండు; తథ్య మతని**
నిట్టి చందంబువాఁ డని యెఱిఁగి యెవ్వ । రాశ్రయింతురు, బ్రదుకుదు రట్టివారు.' **318**

ప్రతిపదార్థం: పురుష+ఉత్తముండు= కృష్ణుడు; ఎల్లభువనంబులును= అన్నిలోకాలు; తాను+అ= తానే; అఖిల భూత+ ఆత్మకుండు+ఐ= ఎల్లప్రాణులలో అంతర్యామిగా- నున్నవాడై; విహార లీలన్= ఒక ఆటగా; విచేష్టించున్= క్రియా కలాపములు సాగిస్తుంటాడు; ఈ లోకములన్= ఈ లోకాలలో; మాయ+తొట్టి= మాయను అవలంబించి; ఒక్కొకమరి= ఒక్కొక్కసారి; పుట్టి; పెరిఁగి; కర్మ+అనుచరణముల్+కైకొని= కర్మలను అనుసరించటం స్వీకరించి; వర్తించున్= మెలగుతాడు; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు- కృష్ణుడు; శిష్ట రక్షణమును= మంచివాళ్ళను కాపాడడమూ; దుష్ట నిగ్రహంబును= చెడ్డవాళ్ళను శిక్షించటమూ; తన పనులు+అగుటన్= తన విధులు అవటం చేత; పాండవుల నెపంబు+ ఇడుకొని= పాండవులను నిమిత్తంగా చేసికొని; ధర్మ బాహ్యులు+ఐన నీ తనూజులన్= ధర్మానికి వెలిఅయిన- అధర్మపరులైన నీ కొడుకులను; నిక్కము+అ= నిజంగానే; నిగ్రహింపన్+తలఁచినాఁడు= శిక్షించనెంచాడు; తథ్యము= ఇది నిశ్చయం; అతనిన్; ఇట్టి చందంబువాఁడు+అని+ఎఱిఁగి= ఇటువంటివాడని తెలిసి; ఎవ్వరు; ఆశ్రయింతురు= ఆశ్రయిస్తారో, శరణు కోరతారో; అట్టివారు; బ్రదుకుదురు= ప్రాణాలతో ఉంటారు.

తాత్పర్యం: కృష్ణుడు సకలలోక స్వరూపుడు. సర్వ జీవాంతరాత్ముడై ఒక క్రీడగా క్రియాకలాపములు సాగిస్తుంటాడు. మాయనవలంబించి ఈ లోకాలలో ఒక్కొక్కసారి పుట్టి, పెరిగి తన జన్మలకు అనుగుణమైన కర్మలను స్వీకరించి ప్రవర్తిస్తాడు. శిష్టులను రక్షించటమూ, దుష్టులను శిక్షించటమూ తన పనులు కావటం చేత పాండవుల నెపంతో

అధర్మపరులైన నీ కొడుకులను ఆ మహాత్ముడు నిజంగా శిక్షించదలచుకొన్నాడు. ఇది తథ్యం. ఇటువంటి మహనీయుడని తెలిసి అతడిని ఎవరు ఆశ్రయిస్తారో, వాళ్ళు బ్రదుకుతారు.'

విశేషం: అతడిని ఆశ్రయించనివాళ్ళు చస్తారని అర్థం.

క. అనవుడు ధృతరాష్ట్రుఁడు 'వి । ష్ణుని నే నెఱుఁగని విధంబునుం, దెలియఁగ నీ
కని యున్న తెఱఁగుఁ జెప్పుమ' । యనుటయు సూతసుతుఁ డిట్టులను నాతనితోన్. 319

ప్రతిపదార్థం: అనవుడున్= అన్నంతనే; ధృతరాష్ట్రుఁడు; విష్ణునిన్= విష్ణువును; ఏను= నేను; ఎఱుఁగని విధంబునున్= ఎరగని విధమూ; నీ కని+ఉన్న తెఱఁగున్= నీవు చూచి ఉన్న- తెలిసిఉన్న విధమూ; తెలియఁగన్= స్పష్టపడేటట్లు; చెప్పుమ; అనుటయున్= అనగా; సూతసుతుఁడు= సంజయుడు; అతనితోన్= ఆ ధృతరాష్ట్రుడితో; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సంజయుడు అట్లా అన్నంతనే ధృతరాష్ట్రుడు 'విష్ణువును నేను ఎరుగకపోవటానికీ, నీవు ఎరగటానికీ కారణం ఏమిటో స్పష్టంగా చెప్పుము' అని అడగగా, సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

వ. 'విద్యయు నవిద్యయు ననఁగా రెండు గల; వవిద్యాదూషితుండై తమోగ్రస్తుండైనవాఁడు విష్ణు నెఱుంగఁడు. విద్యాసంపన్నుం డెఱుంగు' ననిన, 'విద్య యనునది యెట్టి? దెద్దాన నీవా సర్వేశ్వరు నెఱింగితి? దాని, నవిద్య యెట్టిది? దానిని జెప్పు' మనుటయు, నాంబికేయునకు సంజయుం డిట్లనియె: 'సాత్త్విక రాజస తామస వికారంబుల త్రిప్పులంబడక ధర్మం బాచరించుచు భావశుద్ధి గలిగి యుండుదు; దీన నే నచ్యుతు నెఱుంగుదు; విద్య యిట్టిది. నీకునుం, దక్కవరికైనను నతని నెఱుంగుటకు నిదియ తెరు; విట్టిదిగాని విధం బవిద్య' యని చెప్పిన, నతండు నిజనందనున కిట్లనియె: 320

ప్రతిపదార్థం: విద్యయున్; అవిద్యయున్; అనఁగాన్; రెండు; కలవు; అవిద్యా దూషితుండు+ఐ= అవిద్యచేత నిందితుడయి; తమస్(ః)+గ్రస్తుండు+ఐనవాఁడు= తమోగుణం చేత ఆక్రమించబడినవాడు; విష్ణున్; ఎఱుంగఁడు; విద్యాసంపన్నుండు= విద్యతో కూడినవాడు; ఎఱుంగున్; అనినన్; విద్య+అను+అది+ఎట్టిది?= విద్య అనేది ఎటువంటిది?; ఏ+దానన్= దేనిచేత; నీవు; ఆ సర్వేశ్వరున్= ఆ కృష్ణుడిని; ఎఱింగితివి; దానిన్= దానినీ; అవిద్య; ఎట్టిది; దానిని; చెప్పుము; అనుటయున్; ఆంబికేయునకున్= ధృతరాష్ట్రుడికి; సంజయుండు; ఇట్లు+అనియెన్; సాత్త్విక రాజస తామస వికారంబుల త్రిప్పులన్+పడక= సత్త్వ రజస్తమో గుణ వికారాల చిక్కులలో పడక; ధర్మంబు+ఆచరించుచున్= ధర్మ ఆచరిస్తూ; భావశుద్ధి+కలిగి= అంతశ్శుద్ధి కలిగి; ఉండుదున్= ఉంటాను; దీనన్= దీనిచేత; నేను; అచ్యుతున్= కృష్ణుడిని; ఎఱుంగుదున్; నీకునున్; తక్క+ఎవరికిన్+ఐనను= తక్కిన ఎవరికైనా; అతనిన్; ఎఱుంగుటకున్; ఇది+అ= ఇదే; తెరువు= మార్గం; ఇట్టిది కానివిధంబు= ఇటువంటిది కానిది; అవిద్య; అని; చెప్పినన్; అతండు; నిజనందనునకున్= తన కుమారుడికి- దుర్యోధనుడికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: విద్య అనీ, అవిద్య అని రెండున్నాయి. అవిద్య చేత పాడయి, తమోగుణం చేత ఆక్రమించబడినవాడు విష్ణువును ఎరగడు. విద్యతో కూడుకొన్నవాడు ఎరుగుతాడు, అనగా, 'విద్య అనేది ఎటువంటిది? నీవు ఆ సర్వేశ్వరుడిని ఎలా తెలిసికొనగలిగావో దానినీ, అవిద్య ఎటువంటిదో దానినీ చెప్పుము అని అడగగా, ధృతరాష్ట్రుడితో సంజయుడు ఇట్లా' అన్నాడు: 'సత్త్వ రజస్తమోగుణాల వికారాలకు లోనుగాక, ధర్మం ఆచరిస్తూ, అంతశ్శుద్ధి కలిగి ఉంటాను.

దీనివలన నేను ఆ విష్ణువును ఎరుగుదును. ఇదీ విద్య. నీకుగానీ, ఇంకెవరికిగానీ విష్ణువును తెలిసికొనే మార్గం ఇదే. ఇటువంటిది కానిది అవిద్య' అని చెప్పగా, ధృతరాష్ట్రుడు తన కొడుకుతో ఇట్లా అన్నాడు:

క. 'మన కాప్తుఁడు సంజయుఁ; డీ । తని యుపదేశంబు వట్టి ధర్మమున ముకుం
దుని నాశ్రయింపవయ్య! య । తనిఁ జొచ్చిన బ్రదుకుదీవుఁ దమ్ములు సుతులున్.' 321

ప్రతిపదార్థం: సంజయుఁడు; మనకున్; ఆప్తుండు= కావలసినవాడు; ఈతని+ఉపదేశంబు+పట్టి= ఇతడి బోధను అనుసరించి; ధర్మమునన్= ధర్మంతో; ముకుందునిన్= కృష్ణుడిని; ఆశ్రయింపవయ్య!= ఆశ్రయించు నాయనా!; అతనిన్+చొచ్చినన్= అతడిని శరణంటే; తమ్ములున్; సుతులున్= కొడుకులూ; ఈవున్= నీవూ; బ్రదుకుదువు= ప్రాణాలతో ఉంటావు.

తాత్పర్యం: 'సంజయుడు మన మేలు కోరేవాడురా, ఇతని ఉపదేశం పాటించి ధర్మంతో కృష్ణుడిని ఆశ్రయించు నాయనా. అతడిని శరణంటే నీవు నీ తమ్ములతోనూ, కొడుకులతోనూ బ్రదుకుతావు.'

చ. అనిన సుయోధనుండు దమ యయ్యకు నిట్లను: 'నిజ్జగంబు ల
న్నిని నొకపెట్ట మ్రింగినను, నెట్టన సర్వము గాచెనేనియు
న్వినుము - ముకుందుఁ డర్జునుని నెచ్చెలి నాఁ జెవులార వించు, నిం
క నతని నొక్క బాముసకుఁగా ధృతిపెంపఱ నాశ్రయింతునే?' 322

ప్రతిపదార్థం: అనినన్= అని ధృతరాష్ట్రు డనగానే; సుయోధనుండు= దుర్యోధనుడు; తమ+అయ్యకున్= తమ తండ్రికి; ఇట్లు+అనున్; వినుము; ఈ+జగంబులు+అన్నినిన్= ఈ లోకాల నన్నింటినీ; ఒకపెట్టన్= ఒక్కసారిగా; మ్రింగినను; నెట్టన= నిజంగా; సర్వము= అన్నింటినీ; కాచెన్+ఏనియున్= రక్షించినా; ముకుందుఁడు= కృష్ణుడు; అర్జునుని నెచ్చెలి నాన్= అర్జునుడి చెలికాడు అనగా; చెవులు+ఆరన్; వించున్= వింటూ; ఇంకన్; అతనిన్; ఒక్క బామునకున్+కాన్= ఒక కష్టానికిగాను; ధృతిపెంపు= ధైర్యాతిశయం; అఱన్= నశించగా; ఆశ్రయింతునే?= ఆశ్రయిస్తానా?

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగానే, దుర్యోధనుడు తన తండ్రితో ఇట్లా అన్నాడు: 'విను. ఈ లోకాల నన్నింటినీ ఒక్కసారిగా మ్రింగినా, అన్నింటినీ నిజంగా రక్షించినా, కృష్ణుడు అర్జునుడి చెలికాడని చెవులారా వింటూ, ఇంక అతడిని ఒక కష్టం వచ్చింది గదా అని, ధైర్యాతిశయం నశించగా ఆశ్రయిస్తానా?'

విశేషం: ఇందులో ఔపవిభక్తికమైన ఎన్ని శబ్దం అనౌపవిభక్తికంగా ప్రయుక్తమవటం విశేషం.

తే. అనిన గాంధారి కిట్లను జనవిభుండు: । 'నీ తనూజుండు దుర్మాని నీతిబాహ్యుఁ
డుద్ధతుం డీసుమాని నా బుద్ధి వినఁడు; । వీఁడు సెడుఁగాని బ్రదుకంగ లేఁడు సుమ్ము!' 323

ప్రతిపదార్థం: అనినన్= అని దుర్యోధను డనగానే; జనవిభుండు= రాజు - ధృతరాష్ట్రుడు; గాంధారికిన్; ఇట్లు+అనున్; నీ తనూజుండు= నీ కొడుకు - దుర్యోధనుడు; దుర్మాని= దురభిమానం కలవాడు; నీతిబాహ్యుఁడు= నీతికి వెలిఅయినవాడు; ఉద్ధతుండు= గర్వితుడు; ఈసు మాని= ఈర్ష్య విడిచి; నా బుద్ధిన్; వినఁడు; వీఁడు; చెడున్+కాని= చెడిపోతాడే తప్ప; బ్రదుకంగన్+లేఁడు సుమ్ము!= బ్రతకలేడు సుమా!

తాత్పర్యం: అని దుర్యోధను డనగానే ధృతరాష్ట్రుడు గాంధారితో ఇట్లా అన్నాడు: 'నీ కొడుకు దురభిమాని, నీతిమాలిన వాడు. గర్వితుడు. ఈర్ష్య విడిచి నా బుద్ధి వినడు. వీడు చెడిపోతాడే తప్ప బ్రదకలేడు.'

ఉ. **నావుడుఁ దల్లి యిట్టులను నందనుతోః 'నిది యేల యాయువున్**
శ్రీ విభవంబులన్ మము నశేషసుహృజ్జనులం దొఱఁగఁగా
నీవు గడంగె? దిట్టి యవినీతులునుం గలరే? వృకోదరుం
డై విధి సంపఁగా నొరుల కాఁగఁగ వచ్చునె యింకఁ బుత్త్రకా?' **324**

ప్రతిపదార్థం: నావుడున్= అనగానే; తల్లి; నందనుతోన్= కొడుకుతో; ఇట్టులు+అనున్; పుత్త్రకా!= కొడుకా!; నీవు; ఆయువున్; శ్రీ విభవంబులన్= సంపదనూ, వైభవాలనూ; మమున్; అశేష సుహృద్+జనులన్= సకల మిత్రులనూ; తొఱఁగఁగాన్+కడంగెదవు= విడిచిపెట్టాలని చూస్తావు; ఇది+ఏల?= ఎందుకురా ఇది?; ఇట్టి+అవినీతులునున్+కలరే!= ఇటువంటి అవినయపరులు కూడా ఉన్నారా?; విధి= దైవం; వృకోదరుండు+ఐ= భీముడై - భీముడి రూపంలో; చంపఁగాన్= చంపుతూ ఉంటే; ఇంకన్; ఒరులకున్= ఇతరులకు; ఆఁగఁగన్ వచ్చునె?= ఆప తరమా?

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగానే తల్లి గాంధారి తన కొడుకుతో ఇట్లా అన్నది: 'నాయనా, దుర్యోధనా! నీవు ఆయువునూ, సంపద్వైభవాలనూ, మమ్మల్నీ, సర్వమిత్రుల్నీ వదులుకొన యత్నిస్తావు ఎందుకురా? ఇటువంటి అవినీతులు కూడా ఉన్నారా? దైవం భీముడి రూపంలో నిన్ను చంపబోతూంటే ఇంక ఎవరాపగలరు?'

విశేషం: భీముడికి 'వృకోదర' శబ్దం సాభిప్రాయం కాబట్టి అలంకారం పరికరాంకురం.

వ. **అనియె; నట్టి యెడం గృష్ణద్వైపాయనుండు ధృతరాష్ట్రునకిట్లను 'కృష్ణుండు నీకుం గూర్చు; నీవుం బరమాప్తుండైన సంజయు నతనిపాలికిం బుచ్చి; తది లెస్స కార్యం బయ్యె, వీఁడును నమ్మహానుభావు మహనీయ ప్రభావం బున్నరూ పెఱుంగు. వీని బుద్ధి విని యద్దేవు నాశ్రయింపు; మతం డేకాగ్రచిత్తులై యారాధించినవారికిఁ జేరువ యగుఁ; గామక్రోధోపహతులై తమ తమ ధనంబులం దృప్తులు గాక యన్యాయంబున వర్తించువారలకు దూరంబై యుండు; నెల్లభంగుల నాతనిం జొచ్చి బ్రదుకు;' మనినం, 'బ్రసాదం బట్ల చేయుదు' నని, విచిత్రవీర్యనందనుండు సూతనందనునితో 'నవ్వాసుదేవ నామ నిర్వచనంబు నాకుఁ దేటపడం దెలిపి యతనిం బొందు నుపాయం బుపదేశింపవే' యని యడిగిన.** **325**

ప్రతిపదార్థం: అనియెన్= అన్నది; అట్టి+ఎడన్= అప్పుడు; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనున్; కృష్ణుండు; నీకున్; కూర్చున్= ఇష్టపడతాడు; నీవున్= నీవూ; పరమ+ఆప్తుండు+ఐన సంజయున్= మిక్కిలి కావలసినవాడైన సంజయుడిని, అతని పాలికిన్= ఆ కృష్ణుడి దగ్గరకు; పుచ్చితివి= పంపావు; అది; లెస్స కార్యంబు+అయ్యెన్= మంచి పని అయింది; వీఁడునున్= ఈ సంజయుడు కూడా; ఆ+మహానుభావు మహనీయ ప్రభావంబు= ఆ మహాత్ముడి మహామహిమ యొక్క; ఉన్న రూపు= ఉన్న విధం; ఎఱుంగన్; వీని బుద్ధి విని; ఆ+దేవున్= ఆ కృష్ణుడిని; ఆశ్రయింపుము; అతండు= కృష్ణుడు; ఏకాగ్రచిత్తులు+ఐ= అతడియందే లగ్నమైన మనస్సు కలవారయి; ఆరాధించినవారికిన్= పూజించినవారికి; చేరువ+అగున్= చేరువవుతాడు; కామ క్రోధ+ఉపహతులు+ఐ= కామమూ, క్రోధమూ మొదలైవాటిచే కొట్టబడినవారయి; తమ తమ

ధనంబులన్= తమ తమ సంపదలతో; తృప్తులు+కాక= తనివి చెందక; అన్యాయంబునన్= సబబుగాని పద్ధతిలో; వర్తించువారలకున్= నడిచేవారికి; దూరంబు+ఐ+ఉండున్= దూరంగా ఉంటాడు; ఎల్ల భంగులన్= అన్నివిధాలా; ఆతనిన్= ఆ కృష్ణుడిని, చొచ్చి= చేరి; బ్రదుకుము= జీవించుము; అనినన్= అనగా; ప్రసాదంబు= చిత్తం; అట్లు+అ= అట్లాగే; చేయుదున్+అని= చేస్తానని; విచిత్రవీర్య నందనుండు= ధృతరాష్ట్రుడు; సూతనందనునితోన్= సంజయుడితో; ఆ+వాసుదేవ నామ నిర్వచనంబు= ఆ 'వాసుదేవు'డనే పేరున కర్థం; నాకున్; తేటపడన్+తెలిపి= స్పష్టపరిచి; అతనిన్= ఆ వాసుదేవుడిని; పొందు+ఉపాయంబు పొందేకిటుకు; ఉపదేశింపవే= బోధించవా; అని అడిగినన్= అని అడుగగా.

తాత్పర్యం: అని గాంధారి అన్నది. అప్పుడు వ్యాసుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: 'కృష్ణుడంటే నీ కిష్టం. నీవు మిక్కిలి కావలసినవాడైన సంజయుడిని అతడి దగ్గరకు పంపావు. అది మంచి పని అయింది. సంజయుడూ ఆ మహాత్ముడి మహా మహిమ యాథార్థ్యం తెలిసినవాడు. ఈ సంజయుడి మాట విని ఆ కృష్ణుడిని ఆశ్రయించుము. అతడు ఏకాగ్రచిత్తతతో ఆరాధించేవాళ్ళకు చేరువవుతాడు. కామ క్రోధాదులచేత దూషితులై తమకున్నదానితో తృప్తిపడక అన్యాయమార్గంలో ప్రవర్తించేవాళ్ళకు దూరమవుతాడు. అన్నివిధాలా అతడిని చేరి బ్రదుకుము. 'అనగా- 'చిత్తం అలాగే చేస్తా' అని ధృతరాష్ట్రుడు సంజయుడితో 'ఆ వాసుదేవుడనే పేరుకు అర్థం ఏమిటో నాకు స్పష్టపరిచి, అతడిని పొందే ఉపాయం ఉపదేశించవా' అని అడుగగా.

తే. **'ఎల్లయందును దా వసియించు, టెల్ల । యదియుఁ దనయందు వసియించు టండ్రు వాసు**
దేవుఁ డనుపేరి కర్థంబు; దెల్ల మింత । యెఱుఁగు జనులందుఁ దగ వసియించు శుభము. **326**

ప్రతిపదార్థం: వాసుదేవుఁడు+ అను పేరికిన్= వాసుదేవుడు అనే పేరుకు; అర్థంబు; ఎల్లఅందును= అన్నింటను; తాన్; వసియించుట= ఉండటమూ; ఎల్ల+అదియున్= ప్రతీదీ; తన+అందున్; వసియించుట; అండ్రు= అంటారు; తెల్లము= స్పష్టం; ఇంత+ఎఱుఁగు జనులందున్= ఈ విషయం తెలిసినవాళ్ళయందు; శుభము= మేలు; తగన్= ఒప్పుగా; వసియించున్= ఉంటుంది.

తాత్పర్యం: 'వాసుదేవుడు' అనే పేరుకు అర్థం అన్నిటా తాను ఉండటమూ, ప్రతీదీ తనయందు ఉండటమూ అంటారు పెద్దలు. ఇది స్పష్టం. ఈ విషయం తెలిసినవాళ్ళకు ఒప్పుగా శుభం కలుగుతుంది.

తే. **అతనిఁ బొందు నుపాయంబు నంతరంగ । నిగ్రహమ కాఁగ నార్యు లనుగ్రహింతు;**
రోపి చిత్తవికారంబు లుడిపి, యేక । బుద్ధిఁ గొలువఁ బ్రసన్నతఁ బొందు నతఁడు. **327**

ప్రతిపదార్థం: అతనిన్= ఆ వాసుదేవుడిని; పొందు+ఉపాయంబున్= పొందే ఉపాయాన్ని; అంతరంగ నిగ్రహము+అ కాఁగన్= మనోనిగ్రహమే అని; ఆర్యులు+అనుగ్రహింతురు= పెద్దలు సెలవిస్తారు; ఓపి= ఓర్చి; చిత్తవికారంబులు+ఉడిపి= మనోవికారాలను విడిచి; ఏకబుద్ధిన్= ఏకాగ్రచిత్తంతో; కొలువన్= సేవిస్తే; అతఁడు= వాసుదేవుడు; ప్రసన్నతన్+పొందున్= ప్రసన్నుడవుతాడు.

తాత్పర్యం: మనోనిగ్రహమే ఆ వాసుదేవుడిని పొందడానికి ఉపాయం అని ఆర్యులు సెలవిస్తారు. ఓర్పు వహించి, మనోవికారాలను పోగొట్టి, ఏకాగ్రతతో సేవిస్తే వాసుదేవుడు ప్రసన్నుడవుతాడు.

వ. **నీవును బలుబుద్ధులుడిగి గోవిందు నాశ్రయింపు' మనినం బ్రజ్ఞాచక్షుం డిట్లనియె:** **328**

ప్రతిపదార్థం: నీవును; పలు బుద్ధులు= పెక్కు చింతలు; ఉడిగి= మాని; గోవిందున్= కృష్ణుడిని; ఆశ్రయింపుము= శరణువేడుము; అనినన్; ప్రజ్ఞా చక్షుండు= బుద్ధియే నేత్రాలుగా కలవాడు - చర్మచక్షువులు లేనివాడు - గ్రుడ్డివాడు- ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నీవుకూడా పెక్కు అన్యచింతలను విడిచి కృష్ణుడిని ఆశ్రయించు' అనగా ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు:

క. 'నాకు నయనేంద్రియము గతి । లేకుండుట కంత వగపులే; దఖిల మనో
జ్ఞాకారుఁడైన హరి నా । లోకింపం గానమికిఁ గలుగు వగ పెపుడున్. 329

ప్రతిపదార్థం: నాకున్; నయన+ఇంద్రియము గతి= నేత్రేంద్రియ సౌకర్యం; లేక+ఉండుటకున్= లేకపోవటానికి; అంత వగపు లేదు= అంత విచారం లేదు; అఖిల మనోజ్ఞ+ఆకారుఁడు+ఐన హరిన్= అందరికంటె మనోహరమైన ఆకారంగల కృష్ణుడిని; ఆలోకింపన్+కానమికిన్= చూడలేకపోవటానికి; ఎపుడున్= ఎల్లప్పుడూ; వగపు= దుఃఖం, విచారం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: 'నాకు నేత్రేంద్రియ సౌకర్యం లేనందున అంత విచారం లేదు. అందరికంటె మనోహరమైన ఆకారం కల కృష్ణుడిని చూడలేకపోతున్నానే అని ఎప్పుడూ విచారిస్తాను.

ఉ. ఆతనిఁ గన్నులారఁగ నహర్నిశముం గనుఁగొంచు నుండువా
రే తప మాచరించిరో? యుపేంద్రుని, నాశ్రితవత్సలున్, విని
ర్ధూతకలంకు, ధర్మనిరతుం, గరుణాకరు, సర్వలోక వి
ఖ్యాతుఁ, బవిత్రమూర్తి, శరణాగతరక్షకు నాశ్రయించెదన్'. 330

ప్రతిపదార్థం: ఆతనిన్= ఆ కృష్ణుడిని; కన్నులారఁగన్= కళ్ళారా; అహర్నిశమున్= పగలూ, రాత్రీ; కనుఁగొంచున్+ఉండువారు= చూస్తూ ఉండేవాళ్ళు; ఏ తపము+ఆచరించిరో?= ఎటువంటి తపం చేశారో?; ఆశ్రిత వత్సలున్= ఆశ్రయించినవాళ్ళపై వాత్సల్యం కలవాడూ; వినిర్ధూత కలంకున్= ఎగురగొట్టబడిన పాపాలు కలవాడూ; ధర్మనిరతున్= ధర్మంపై ఆసక్తి కలవాడూ; కరుణాకరున్= దయగలవాడూ; సర్వలోక విఖ్యాతున్= అన్ని లోకాలలోనూ ప్రసిద్ధుడూ; పవిత్రమూర్తిన్= పావనాకారుడూ; శరణ+ఆగత రక్షకున్= శరణన్నవారిని కాపాడేవాడూ; అయిన; ఉపేంద్రునిన్= కృష్ణుడిని; ఆశ్రయించెదన్= శరణు వేడుతాను.

తాత్పర్యం: ఆ కృష్ణుడిని కళ్ళారా రేయింబవళ్ళు చూస్తూ ఉండేవాళ్ళు ఎటువంటి తపం చేశారో? ఆశ్రిత వత్సలుడూ, పాపాలను ఎగురగొట్టేవాడూ, ధర్మపరుడూ, సదయుడూ, సర్వలోక ప్రసిద్ధుడూ, పావనాకారుడూ, శరణాగతరక్షకుడూ అయిన కృష్ణుడిని ఆశ్రయిస్తాను.'

వ. అని పలికి పరమశాంతుండై పారాశర్యు నుద్దేశించి 'దేవా! యేను వాసుదేవుని శరణు సొచ్చి బ్రదుకువాఁడ' ననుచుఁ గృతాంజలి యగుటయు వ్యాసమహామునియు నాశీర్వాదంబు సేసి యంతర్హితుం డయ్యెఁ; గౌరవేశ్వరుండును దుర్యోధన సంజయుల నిజ నివాసంబులకుం బోవం బనిచి, తానును గాంధారియు నభ్యంతర మందిరంబున కరిగి, యుచిత వ్యాపారంబులం బ్రవర్తిల్లుచునుండె' నని చెప్పిన విని 'పదంపడి పుట్టిన విశేషంబు లెట్టి' వని యడిగిన. 331

ప్రతిపదార్థం: అని; పలికి; పరమ శాంతుండు+ఐ= మిక్కిలి శాంతుడయి; పారాశర్యున్= వ్యాసుడిని; ఉద్దేశించి; దేవా; ఏను; వాసుదేవునిన్; శరణు+చొచ్చి; బ్రదుకువాఁడన్; అనుచున్; కృత+అంజలి= నమస్కరించినవాడు; అగుటయున్= కాగా; వ్యాస మహామునియున్; ఆశీర్వాదంబు+చేసి; అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడయ్యాడు; కౌరవ+ఈశ్వరుండును= కురుప్రభువునూ - ధృతరాష్ట్రుడునూ; దుర్యోధన సంజయులన్; నిజ నివాసంబులకున్= తమ ఇండ్లకు; పోవన్+పనిచి= పంపివైచి; తానును; గాంధారియున్; అభ్యంతర మందిరంబునకున్= అంతఃపురగృహానికి; అరిగి= వెళ్ళి; ఉచిత వ్యాపారంబులన్= తగిన పనులలో; ప్రవర్తించుచున్= మెలగుతూ; ఉండెన్; అని; చెప్పినన్; విని; పదంపడి= తరువాత; పుట్టిన విశేషంబులు; ఎట్టివి; అని; అడిగినన్.

తాత్పర్యం: అని పలికి మిక్కిలి శాంతం వహించి వ్యాసుడిని చూచి, 'దేవా! నేను వాసుదేవుడిని శరణుచొచ్చి బ్రదుకుతాను' అంటూ నమస్కరించగా వ్యాసమహర్షియు దీవించి అదృశ్యుడయ్యాడు. ధృతరాష్ట్రుడు దుర్యోధనుడినీ సంజయుడినీ వారి నివాసాలకు పంపివైచి, తాను గాంధారితో అంతఃపురగృహానికి వెళ్ళి తగిన పనులలో మెలగుతూ ఉన్నాడు' అని వైశంపాయనుడు చెప్పగా విని, జనమేజయుడు 'తరువాత పుట్టిన విశేషాలు ఏమిటి?' అని అడగగా. (తరువాత మూడో ఆశ్వాసంలోని రెండో వచనంలోని 'అనియె' అనే క్రియతో అన్వయం.)

ఆశ్వాసాంతము

శా. **నిత్యానిత్యవివేక వైభవ సమున్నిద్రాంతరంగస్ఫుట**
ప్రత్యక్షా! పరమేశ! విశ్వ జగదారాధ్యా! మహానంత చి
త్సత్యానంద విభు స్వభావ మహితా! సంవిత్సమాధాన దౌ
ర్గత్య వ్యాహృతి సంప్రవర్తన విదగ్ధ శ్రీ పదాంభోరుహా! **332**

ప్రతిపదార్థం: నిత్య+అనిత్య= ఇది నిత్యమూ, అది అనిత్యమూ అనే; వివేక= జ్ఞానం యొక్క; వైభవ= సంపద చేత; సమున్నిద్ర= మేల్కొన్న; అంతరంగ= మనస్సులో; స్ఫుట= స్పష్టమైన; ప్రత్యక్షా!= దర్శనం కలవాడా!; పరమేశ!= ఉత్కృష్టుడవైన ఈశ్వరా!; విశ్వ జగత్+ఆరాధ్యా!= సర్వజగత్తులచేతను పూజించదగినవాడా! మహా= గొప్పదీ; అనంత= అంతం లేనిదీ అయిన; చిత్= జ్ఞానమూ; సత్య= సత్యమూ; ఆనంద= ఆనందమూ; విభు= సర్వ వ్యాపకుడై ఉండటం; అనే; స్వభావ= స్వభావం చేత; మహితా!= పూజించబడినవాడా!; సంవిత్= జ్ఞానాన్ని; సమాధాన= కలిగించటంచేత; దౌర్గత్య వ్యాహతి= పాపవినాశాన్ని; సంప్రవర్తన= కలిగించటంలో; విదగ్ధ= నేర్పుగల; శ్రీ పద+ అంభోరుహా!= పద్మాలవంటి శ్రీపాదాలు కలవాడా!

తాత్పర్యం: ఇది నిత్యమూ, అది అనిత్యమూ అనే వివేక సంపద చేత ప్రబుద్ధమైన మనస్సులో స్పష్టంగా సాక్షాత్కరించేవాడా! పరమేశ్వరా! సకల జగత్తుల చేత ఆరాధించ దగినవాడా! గొప్పదీ, అంతం లేనిదీ అయిన సచ్చిదానంద సర్వవ్యాపకత్వ స్వభావం చేత పూజించబడేవాడా! ఉత్తమ జ్ఞానాన్ని కలిగించి, పాపాన్ని పోగొట్టటంలో నేర్పుగల శ్రీపాదపద్మాలు కలవాడా! హరిహరనాథా!

విశేషం: నిత్యానిత్య ...... ప్రత్యక్షా - భగవంతుడగు హరిహరనాథుడు ఏది నిత్యమో, ఏది అనిత్యమో తెలిసిన మనస్సులు గలవారికి తప్పక ప్రత్యక్షమవుతాడు. సంవిత్సమాధాన ... శ్రీ పదాం భోరుహా-పరమేశ్వరుడి శ్రీపాదపద్మాల ధ్యానం చేత జ్ఞానం కలిగి పాపాల నుండి విముక్తులవుతారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వ్యాసాది మునిప్రోక్త మ। హా సందర్భాప్రమేయతా రూఢ గుణో
ల్లాసా! నైర్గుణ్యసము। ద్భాసి రహస్యానుభావ! భక్తాధీనా! 333

ప్రతిపదార్థం: వ్యాస+ఆది= వ్యాసుడూ మొదలైన; ముని= మహర్షులచేత; ప్ర+ఉక్త= చెప్పబడిన; మహా సందర్భ= వాఙ్మయంలోని గొప్ప ప్రకరణాలచేత కూడా; అప్రమేయతా= నిర్ణయించశక్యం కాని; ఆరూఢ= ప్రసిద్ధాలైన; గుణ= గుణముల యొక్క; ఉల్లాసా!= ప్రకాశం కలవాడా! నైర్గుణ్య= గుణరాహిత్యం చేతనే; సముద్భాసి= మిక్కిలి ప్రకాశించే; రహస్య= గూఢమైన; అనుభావ!= ప్రభావం కలవాడా! భక్త+అధీనా= భక్తులకు వశమైనవాడా!

తాత్పర్యం: శ్రీకృష్ణద్వైపాయనాది మహర్షులచేత రచించబడిన గ్రంథాల ప్రకరణాలలో కూడా నిర్ణయించ శక్యంకాని గుణముల ప్రకాశం కలవాడా! గుణరాహిత్యమునందే ప్రకాశించే గూఢమైన మహాశక్తి కలవాడా! భక్తవశంవదుడా హరిహరనాథుడా!

విశేషం: 'వ్యాసాది...గుణోల్లాసా!' వ్యాసాది మహర్షులు పరమేశ్వర ప్రతిపాదకములైన బ్రహ్మసూత్ర భగవద్గీతాది మహాగ్రంథాలను పరమేశ్వర నిరూపణకై రచించినా, ఆ గ్రంథాలు కూడా పరమేశ్వరుడి గుణప్రకాశాన్ని ప్రతిపాదించలేకపోతున్నాయి. 'నైర్గుణ్య ---- భావ' ఎటువంటి గుణాలూ లేకున్నా, జగత్సృష్టి స్థితి లయ రూపమైన మహాశక్తి అతడియందు అంతర్గతంగా ఉంటుందని భావం. 'భక్తాధీనా' పరమేశ్వరుడు వాస్తవంగా స్వతంత్రుడే అయినా, భక్తజనులకు మాత్రం అధీనుడు.

మాలిని.

నమ దనిమిషచూడా నవ్యరత్న ప్రభా సం
గమ రుచిర పదాబ్జా! గర్వ దుర్వార దైత్యో
ద్యమ బహుల తమో మార్తాండ! దోః క్రీడన ప్ర
క్రమ లలిత వికాసా! గాఢ భక్తి ప్రకాశా! 334

ప్రతిపదార్థం: నమత్= నమస్కరిస్తున్న; అనిమిష= దేవతలయొక్క; చూడా= సిగయందలి; నవ్య= క్రొత్తవియగు; రత్న= మణుల యొక్క; ప్రభా= కాంతుల యొక్క; సంగమ= కలయికచేత; రుచిర= మనోహరమైన; పద+అబ్జా!= తామరలవంటి పాదములు కలవాడా! గర్వ= అహంకారం చేత; దుర్వార= వారించశక్యంకాని; దైత్య= రాక్షసుల యొక్క; ఉద్యమ= లోకాలను బాధించే ప్రయత్నం అనే; బహుల తమస్= గాఢాంధకారానికి; మార్తాండ!= సూర్యుడైనవాడా!; దోస్+క్రీడన= దుష్ట శిక్షణం కోసమైన భుజ పరాక్రమంయొక్క; ప్రక్రమ= ప్రారంభమనే; లలిత వికాసా!= మనోహరమైన వికాసం కలవాడా!; గాఢ భక్తి ప్రకాశా!= దృఢమైన భక్తి చేతనే ప్రకాశించేవాడా! - హరిహరనాథా!

తాత్పర్యం: హరిహరనాథా! తలలొగ్గి నీకు నమస్కరించే దేవతల సిగల లోని నూత్నమణుల కాంతుల కలయికచేత మనోహరమైన అడుగుదామరలు కలవాడా!, అహంకారం చేత వారించ శక్యం కాని రాక్షసుల జగద్బాధక ప్రయత్నం అనే గాఢాంధకారానికి సూర్యుడైనవాడా; దుష్టులను శిక్షించటం కొరకు చూపే భుజపరాక్రమం అనే లీల కలవాడా! దృఢమైన భక్తి చేతనే తెలియబడేవాడా!

విశేషం: 'దైత్యోద్యమ బహుల తమో మార్తాండ' - దైత్యోద్యమమే బహుల తమస్సు. దానికి హరిహరుడే మార్తాండుడు - రూపకాలంకారం. బహుల తమస్సును మార్తాండుడు పారద్రోలే విధంగా, దైత్యోద్యమాన్ని హరిహరనాథుడు వమ్ము చేస్తాడని

భావం. మాలినీ వృత్తంలోని ప్రతి పాదంలో వరుసగా న-న-మ-య-య- అనే గణాలు వరుసగా ఉంటాయి. 9వ అక్షరం యతిస్థానం. ప్రాస నియతం.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున నుద్యోగపర్వంబునందు ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది ఉభయ కవిమిత్త్ర బిరుదాంచితుడూ, కొమ్మనామాత్యుడి కుమారుడూ, బుధుల పూజచేత ప్రకాశించేవాడూ అగు తిక్కన సోమయాజిచే రచించబడిన శ్రీ మహాభారతంలోని ఉద్యోగపర్వంలో రెండో ఆశ్వాసం.

ఉద్యోగపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము - తృతీయాశ్వాసము

శ్రీవాగ్విభవారోగ్య । ప్రావీణ్యప్రాభవానుభావమహిత సౌ
ఖ్యావహ పదస్మరణ! కరు । ణావాస కటాక్షకిరణ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీవాక్+విభవ= లక్ష్మీసరస్వతుల యొక్క సమృద్ధి; ఆరోగ్య= రోగం లేకుండటం; ప్రావీణ్య= నేర్పు; ప్రాభవ= ప్రభుత్వం అనే వాటియొక్క; అనుభావ= ప్రభావంచేత; మహిత= గొప్పదైన; సౌఖ్య= ఆనందాన్ని; ఆవహ= కలిగించే; పదస్మరణ= పాదములయొక్క స్మరణం కలవాడా!; కరుణా= దయకు; ఆవాస= నిలయమైన; కటాక్ష కిరణ!= కడగంటి చూపులయొక్క వెలుగు కలవాడా!; హరిహరనాథా= హరిహరనాథుడనే పేరుగల దైవమా!

తాత్పర్యం: హరిహరనాథుడనే పేరు గల పరమేశ్వరా! నీ చరణాలను స్మరించేవారికి నీవు ఐశ్వర్యం. విద్య, ఆరోగ్యం, నైపుణ్యం, ప్రభుత్వం అనే వాటిని లభింపజేసి, వాటి మహిమ చేత గొప్పదైన ఆనందాన్ని సమకూరుస్తావు. నీ పదధ్యానం అటువంటి మహిమ గలది. స్వామీ! వెలుగులు వెదచల్లే నీ క్రీగంటి చూపులు దయకు నిలయాలు.

శ్రీకృష్ణుని రాయబారము (సం. 5-70-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: 2

తాత్పర్యం: స్వామీ! హరిహరనాథా! అవధరించుము. కథకుడైన వైశంపాయన మహర్షి శ్రోత అయిన జనమేజయ మహారాజుతో ఇట్లా అన్నాడు:

తే. సంజయుఁడు దన్ను వీడ్కొని చనిన ధర్మ । సుతుఁడు మఱునాఁడు దమ్ముల సుతుల నిష్ట
భృత్యవరులఁ గొలువునకుఁ బిలువఁ బనిచి । యెల్లవారలు వినుచుండ నిట్టు లనియె. 3

ప్రతిపదార్థం: సంజయుఁడు= ధృతరాష్ట్రుడి దగ్గర నుండి దూతగా వచ్చిన సూతపుత్రుడైన సంజయుడు; తన్నున్= తనను (ధర్మపుత్రుడిని); వీడ్కొని= వదలి; చనినన్= (హస్తినాపురికి) వెళ్ళగా; ధర్మసుతుఁడు= యముని కుమారుడైన ధర్మరాజు; మఱునాఁడు= మరుసటిదినం; తమ్ములన్= తమ్ములను; సుతులన్= కొడుకులను; ఇష్టభృత్యవరులన్= తనకు ప్రీతిపాత్రులైన సేవకులను; కొలువునకున్= ఆస్థానానికి; పిలువన్+పనిచి= పిలుచుకొనిరండని పరిచారకులను పంపి; ఎల్లవారలు= అందరును; వినుచున్+ఉండన్= ఆలకిస్తూ ఉండగా; ఇట్టులు+అనియెన్= ఈ ప్రకారంగా అన్నాడు.

తాత్పర్యం: ఉపప్లావ్య పట్టణంలో ఉన్న తనను వదలి సంజయుడు హస్తినాపురికి వెళ్ళిన తరువాత ధర్మనందనుడు ఆ మరుసటిరోజు తన తమ్ముళ్ళనూ, కొడుకులనూ, సామంతరాజులనూ చెంతకు పిలిపించుకొని, వారంతా వింటుండగా ఇట్లా అన్నాడు :

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: సంజయుడి రాయబారం వలన పాండవులకు ఒరిగినదేమీ లేదు. అందువలన శ్రీకృష్ణుడి రాయబారం అవసరమైనది. దానికి శ్రీకారం చుట్టుతూ పాండవ నాయకుడైన ధర్మరాజు కాలయాపనం జరుగకుండా మరునాడే యత్నం ప్రారంభించాడు. తన స్వంత కొలువులో ఆత్మీయులనూ, సన్నిహితులనూ సమావేశపరిచాడు. అది ఒక విధంగా ఆత్మీయసభ, ఆంతరంగిక సభ, అత్యవసర సమావేశం. రాజు తనంతట తాను పిలిచిన సభ. నాటకీయంగా ఇదొక చిన్నరంగం వంటిది. సభలో సభ్యులు కూర్చున్నట్లూ, వారందరూ వినేటట్లుగా ధర్మరాజు సమావేశ ప్రయోజనాన్ని వినిపించనున్నట్లూ ఒక నిండైన దృశ్యం ఈ తేటగీతిలో ప్రత్యక్షమయింది. (సంపా.)

క. 'మనము జనార్దను పాలికిఁ । జని కౌరవసభకు నతనిఁ జనుమని ప్రార్థిం
చిన మేలు బంధు హిత గురు । జనములతో రణము గాక సంప్రీతి యగున్.' 4

ప్రతిపదార్థం: మనము= మన మందరమూ; జనార్దను పాలికిన్= శ్రీకృష్ణుడి వద్దకు; చని= వెళ్ళి; కౌరవ సభకున్= ధృతరాష్ట్రుడి కొలువుకూటానికి; చనుము+అని= పొమ్మని; అతనిన్= ఆ శ్రీకృష్ణుడిని; ప్రార్థించినన్= వేడుకొన్నచో; మేలు= మంచిది; బంధు హిత గురుజనములతోన్= చుట్టాలు, మేలుకోరేవారు, గురువులు అయినట్టివారితో; రణము కాక= యుద్ధం జరగకుండ; సంప్రీతి+అగున్= సంతోషం కలుగుతుంది.

తాత్పర్యం: 'మన మంతా కలిసి మాధవుడి దగ్గరకు వెళ్ళి కౌరవసభలో మన విషయాలన్నీ చర్చించవలసినదిగా ఆయనను వేడుకొందాము. అట్లా చెయ్యటంవలన మనకెంతో మేలు కలుగుతుంది. ఎందుకంటే చుట్టాలతో, హితులతో, గురువులతో మనకు పోరు తప్పుతుంది. ఆనందం కలుగుతుంది.'

విశేషం: సభలో ముక్తసరిగా మూడు ముక్కలతో తాత్పర్యం తేటపడేటట్లు మాటలాడే ధర్మజుడి నేర్పు ఈ పద్యంలో స్పష్టం. ఇందులో రెండు వాక్యాలున్నాయి. రెండూ మిశ్ర సమ్మితంగా ఉన్నాయి. వాటిలో వాడిన పదాల వరుస కూడా కార్యక్రమ సూచకంగా ఉండటం విశేషం. 'అందరూ కలిసి జనార్దనుడి దగ్గరకు పోవాలి. ఆ తరువాత కౌరవ సభకు ఆయనను పొమ్మని ప్రార్థించాలి. అట్లా చేయటం శుభం. మనకు మేలు జరుగుతుంది. ఆ మేలు ఎటువంటిదంటే బంధువులతో, స్నేహితులతో చివరకు పెద్దలతో యుద్ధం తప్పుతుంది. సంతోషం కలుగుతుంది' అని అన్నాడు. కార్యాన్నీ, ఫలాన్నీ ఒక్కసారి దర్శించగల వాక్యం. చమత్కార మేమంటే - ఈ వాక్యాలు సున్నితమైన ఆదేశాలు, నిపుణమైన నిర్ణయాలు, తీర్చిదిద్దిన తీర్మానాలు. రాజు ఒక సంగ్రహ ప్రకటన చేయటం, దాని నందరూ ఏకగ్రీవంగా అంగీకరించటం ఈ సన్నివేశ చాతుర్యం. ధర్మజుడి సర్వామోద నాయకత్వం ఈ సన్నివేశం ధ్వనింపజేస్తున్నది.

2. శ్రీకృష్ణుడే స్వయంగా 'కురుసభకు వచ్చి శాంతివచనాలు ధృతరాష్ట్రుడితో పలుకుతా'నని సంజయుడి రాయబారపు సందర్భంగా చెప్పాడు (ఉద్యో-1-360). ధర్మరాజు దానిని వ్యవస్థీకరించే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ రచనలో శబ్దార్థగుణమైన ప్రసాదం పోషించబడింది. (సంపా.)

వ. అని పలికి వార లందఱు బలసి చనుదేర మాధవు మందిరంబున కరిగి యతని చేత సత్కృతుండయి సమస్త పరిజనంబులుం బరివేష్టింప నొక్క పార్శ్వంబునం బాంచాలియు సముచిత పరివార పరివృతయై యుండ నతండునుం దానును సుఖాసీనులై యుండి యతనితో నిట్లనియె: 5

ప్రతిపదార్థం: అని పలికి= అలా ధర్మరాజు వచించి; వారలు+అందఱున్= సోదరులు, కుమారులు, సామంతులు, ఇష్టభృత్యులు; బలసి= చుట్టుకొని; చనుదేరన్= తన వెంట రాగా; మాధవు మందిరంబునకున్= శ్రీకృష్ణుడి భవనానికి; అరిగి= పోయి;

అతనిచేతన్= వాసుదేవుడి చేత; సత్కృతుండు+అయి= సమ్మానించబడి; సమస్త పరిజనంబులున్= పరివారమంతా; పరివేష్టింపన్= తన చుట్టూ చేరగా; ఒక్క పార్శ్వంబునన్= ఒకవైపు; పాంచాలియున్= పాంచాల దేశాధిపతి పుత్రికఅయిన ద్రౌపది; సముచిత పరివార పరివృత ఐ= తగిన పరిజనంతో చుట్టబడినదై; ఉండన్= ఉండగా; అతండునున్= ఆ శ్రీకృష్ణుడునూ; తానును= ధర్మరాజున్నూ; సుఖ+ఆసీనులు+ఐ+ఉండి= హాయిగా కూర్చుండినవారై; అతనితోన్= హరితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అట్లా పలికి ధర్మజుడు తనవారంతా వెనువెంట రాగా శ్రీకృష్ణుడున్న చోటికి వెళ్ళాడు. అక్కడ ఆయన ఆదరణలు అందుకొన్నాడు. పరివారమంతా తనను సేవిస్తుండగా, తగిన పరిజనంతో ద్రౌపది ఒక ప్రక్క నుండగా ధర్మరాజు కృష్ణుడితోపాటు హాయిగా కూర్చున్నాడు. ఆ తరువాత ఇట్లా అన్నాడు :

విశేషం: ఇందులోనిది మాధవుడి మందిరంలోని రంగం, ఆ రంగంలో పాత్రలు కూర్చున్న రంగపరికల్పనం ప్రత్యక్షం. సామూహికంగా అందరూ కలిసి మాధవుడి మందిరానికి పోయారు. క్రమశిక్షణతో మెలగారు. విశేష మేమంటే పరివారంతో పాంచాలి కూడా అక్కడికి వచ్చింది. ఆమె పరిజనంతో కూడి ఒక ప్రక్కన కూర్చున్నది. మిగిలిన వారందరూ మరొక ప్రక్కన కూర్చున్నారు. ఉభయ పార్శ్వాలకు నడుమ ఉన్నతాసనాలమీద శ్రీకృష్ణుడు, ధర్మరాజు అభ్యర్థి కాబట్టి అత డీ సంభాషణ మొదలు పెట్టాడు. అంటే మరొక రంగం ప్రారంభమైనదన్నమాట. రంగ పరికల్పన శిల్పంలో తిక్కన అందెవేసిన చేయి. (సంపా.)

క. 'ఆపదఁ గడవం బెట్టఁగ । నోపి శుభంబైనదాని నొడఁగూర్పను మా
కీ పుట్టువునకుఁ బాండు । క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా! 6

ప్రతిపదార్థం: మహాత్మా!= మహానుభావా!; ఆపదన్= కష్టాన్ని; కడవన్+పెట్టఁగన్= దాటించుటకు; ఓపి= సమర్థుడై; శుభంబు+ఐనదానిన్= మేలు గూర్చునట్టిదానిని; ఒడఁగూర్పను= కలిగించుటకు; మాకున్= తన కుమారులమైన మాకు; ఈ పుట్టువునకున్= ఈ జన్మకు; పాండుక్ష్మాపాలుఁడు= పాండు మహారాజు; నిన్నున్+చూపి= నిన్ను దిక్కుగా మాకు కనబరచి; చనియెన్= స్వర్గం చేరాడు.

తాత్పర్యం: 'మహానుభావా! కష్టాలను తొలగించటానికీ, శుభాలను సమకూర్చటానికీ సమర్థుడవైన నిన్ను ఈ జన్మకు మాకు దిక్కుగా చూపి, మా తండ్రి పాండుమహారాజు వెళ్ళిపోయాడు.

విశేషం: అలం: హేతువు. 1.ధర్మజుడి ధర్మనీతికి కీర్తిధ్వజం వంటి ఉపన్యాసానికి ఈ పద్యం నాందీ వాక్యం వంటిది. 2. 'మహాత్మా!' అనే సంబుద్ధి ధర్మరాజు శ్రీకృష్ణుడిలో దేవుడినీ, పూజ్యుడినీ, స్నేహితుడినీ, మార్గదర్శకుడినీ దర్శిస్తున్నాడని ధ్వని. 3. 'తండ్రి తరువాత తండ్రి వంటివాడవు నీవే' అని చెప్పే భావాన్ని 'మా తండ్రి పోతూ నిన్ను చూపించి వెళ్ళాడు' అనటం తెలుగు జాతీయం. అంటే- పాండవులు తండ్రి లేని బిడ్డలనీ, వారిని తండ్రిగా రక్షించి, పోషించి దీవించవలసిన బాధ్యత ఆయనదే అనీ పలికాడు ధర్మజుడు. ఈ జన్మకు నీవే మా తండ్రివి - అనటం శరణాగత భావానికి ప్రతీక. 4. కష్టాలనుండి గట్టెక్కించేవాడూ, శుభాలు కలిగించేవాడూ భగవంతుడు. లేదా మహాత్ముడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ విధుల వంటివవి. వాటిని పాండవులకు సదా సమకూర్చే పరమాత్మ శ్రీకృష్ణుడని ధర్మజుడు భగవద్భక్తి విశేష చిత్తవృత్తిని ప్రదర్శించాడు. 5. శ్రీమన్నారాయణుడైన శ్రీకృష్ణుడు స్నేహభక్తి భావవశుడై పాండవుల యోగక్షేమాలు చూడటం ప్రసిద్ధం. 6. ఉద్యోగపర్వంలో పాండవులను యుద్ధమనే ఆపద నుండి గట్టెక్కించటం, రాజ్యలాభమనే శుభాన్ని కలిగించటం శ్రీకృష్ణుడి కర్తవ్యాలని ధ్వని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తనంతట తానే హస్తినాపురానికి వెళ్ళి శాంతియత్నం చేయబూనటం - ఆపద గడవం బెట్టటం. ఫలిత మేమైనా పాండవులకు విజయాన్ని చేకూర్చి కౌరవనాశనం చేయటం శుభఫలం. ఈ రెండూ శ్రీకృష్ణుడి అంటే భగవంతుడి అధీనంలో ఉన్నాయనటం, ఆ భగవద్రూపుడైన శ్రీకృష్ణుడే తల్లి, తండ్రి, దైవం, రక్ష అని నివేదించుకొనటం ధర్మజుడి భక్తియుక్తమైన ధర్మనీతి వర్తనకు నిదర్శనం. ప్రార్థనకు శుభారంభం. ఇందులోని గుణం ప్రసాదం. (సంపా.)

తే. సమయ మిది మిత్త్రకార్యంబు చక్కఁ జేయ। నీ కతంబున నే మవినీతుఁ డైన
యా సుయోధను తోడి పోరాట దక్కి। యనుభవింతుము మా యంశమగు ధరిత్రి. 7

ప్రతిపదార్థం: మిత్ర కార్యంబున్= స్నేహితుల యొక్క పనిని; చక్కన్+చేయన్= సరిచేయటానికి; సమయము+ఇది= ఇది తగిన వేళ; నీ కతంబునన్= నీ మూలాన; ఏము= మేము; అవినీతుఁడు+ఐన= అవిధేయుడైనట్టి; ఆ సుయోధనుతోడి పోరాట= ఆ దుర్యోధనుడి తోడి కలహం; తక్కి= మాని; మా+అంశము+అగు ధరిత్రిన్= మా వంతు భూమిని; అనుభవింతుము= మేము అనుభవించగలం.

తాత్పర్యం: కృష్ణా! మిత్రులమైన మా పనిని చక్కబెట్టడానికి నీ కిది తగిన తరుణం. నీవు రాయబారానికి వెళ్ళితే అయోగ్యుడైన ఆ దుర్యోధనుడితో మేము యుద్ధం చేయవలసిన అవసరం రాదు. మా పాలికి వచ్చే రాజ్యాన్ని మేము అనుభవించగలం.

విశేషం: దివ్యాదివ్యుడైన శ్రీకృష్ణుడికి సూటిగా చేసిన ప్రార్థన ఇది. ఇందులో రెండంశాలు స్పష్టమవుతున్నాయి.

1. కురుపాండవుల వివాదం మిత్రకార్యంగా భావించుమని వేడికోలు. మిత్రకార్యమైతేనే మిత్రసమ్మితమైన ప్రబోధం నిర్వహించటానికి వీలవుతుంది. హితబోధకు అవకాశ మేర్పడుతుంది. ఇరువైపులా సమయ మెరిగి మందలించటానికి అనువుగా ఉంటుంది.

2. కౌరవపక్షంలో ప్రధానుడు దుర్యోధనుడు. అతడు నీతియుతుడు కాకపోగా అవినీతిపరుడు. అతడిని మిత్రవాక్యాలతో ఒక త్రోవకు తేవటం తేలికైన పనికాదు. అతడు రాజ్యపిపాసి. అందువలన యుద్ధం కాకుండా అతడు రాజ్యభాగమీయటం అసంభవం.

3. అటువంటి దుర్యోధనుడితో, అతడి తండ్రితో మంతనాలు సలిపి, హితవు చెప్పి పాండవులకు న్యాయంగా రావలసిన రాజ్యభాగాన్ని తిరిగి ఇప్పించటానికి శ్రీకృష్ణుడు కృషి చేయాలి.

4. ఈ పద్యం 6వ పద్యానికి అనుబంధం. అది సూత్రం. ఇది ఉదాహరణం. అది శ్రీ కృష్ణుడి దక్షతను తెలిపేది. ఇది ఆ దక్షత వలన సాధించదగిన అసాధ్యకార్యాన్ని నిర్దేశించేది.

5. ఇందులో ధర్మరాజు శాంతియుతంగా తనకు రావలసిన నేల వాటాను మాత్రమే కోరుతున్నాడు. దానికి దుర్యోధను డంగీకరించడు. సగమిస్తే పూర్తిగా జయించగల పరాక్రమం పాండవులకున్నదని అతడికి తెలుసు. ధర్మజుడు భాగం అడుగుతున్నాడు. కాదంటే మొత్తం రాజ్యాన్నే ఆక్రమిస్తాడు. భావి వ్యూహమంతా 'పోరాట దక్కి యనుభవింతుము మా యంశమగు ధరిత్రి' అనే వాక్యంలో బీజప్రాయంగా నిక్షిప్తం చేయబడి ఉన్నది.

6. కాబట్టి ఈ పద్యం భావి యుద్ధోద్యోగ బీజతుల్యం. గుణం ప్రసాదం (సంపా.)

వ. నీకు మేము ప్రద్యుమ్నాది కుమారుల తోడివారము, మమ్ము దురితంబులు వొరయకుండ నరసి రక్షింపు' మనవుడు వాసుదేవుండు 'నీ పంచిన యట్ల చేయంగలవాఁడ; నెయ్యది తలంపు? సెప్పు' మనిన

నజాతశత్రుండు 'నీవు కరినగరంబున కరిగి కౌరవులతోడం దగిన మాటలాడి తెఱంగు సేయవలయు' నని ప్రార్థించి, యతని నియ్యకొలిపి యిట్లనియె: 8

ప్రతిపదార్థం: నీకున్= నీకు; మేము= పాండవులం; ప్రద్యుమ్న+ఆది కుమారులతోడివారము= ప్రద్యుమ్నుడు మొదలైన నీ పుత్రులతో సమానులం; మమ్మున్= మమ్ములను; దురితంబులు= పాపములు; పొరయక+ఉండన్= చెందకుండేటట్లుగా; అరసి= విచారించి; రక్షింపుము= కాపాడుము; అనవుడున్= అని ధర్మరాజు వేడిన మీదట; వాసుదేవుండు= వసుదేవుని కుమారుడైన శ్రీకృష్ణుడు; నీ పంచిన+అట్లు+అ= నీవెట్లా చేయుమని చెపుతావో ఆ విధంగా; చేయన్+కలవాఁడన్= చేయగలను; ఏ+అది+తలంపు+చెప్పుము= నీ ఉద్దేశ మేమిటో నాకు తెల్పుము; అనినన్= అని శ్రీకృష్ణుడు పలుకగా; అజాతశత్రుండు= విరోధులే లేని ధర్మరాజు; నీవు కరినగరంబునకున్+అరిగి= నీవు హస్తినాపురికి వెళ్ళి; కౌరవులతోడన్= ధృతరాష్ట్రుడు మొదలైనవారితో; తగిన మాటలు+ఆడి= ఉచితములైన పలుకులు పల్కి; తెఱంగు+చేయవలయున్= ఒక దారి నేర్పరచాలి; అని ప్రార్థించి= అని వేడుకొని; అతనిన్= శ్రీకృష్ణుడిని; ఇయ్యకొలిపి= సమ్మతింపజేసి; ఇట్లు+అనియెన్= మళ్ళీ ఈ ప్రకారం పలికాడు.

తాత్పర్యం: కృష్ణా! ప్రద్యుమ్నుడు మొదలైన నీ కుమారులు నీకు ఎట్లాంటివాళ్ళో మేము కూడా అట్లాంటి వాళ్ళమే. మాకు పాపాలు సోకకుండేటట్లు ఆలోచించి మమ్మల్ని కాపాడుము' అంటూ ధర్మనందనుడు ప్రార్థించాడు. అంతట శ్రీకృష్ణుడు 'నీవు ఏమి చేయుమని ఆదేశిస్తావో అట్లా చేస్తాను. నీ అభిప్రాయ మేమిటో చెప్పు' మన్నాడు. అప్పుడు ధర్మజుడు కృష్ణుడితో 'నీవు హస్తినాపురికి పోయి కౌరవులతో తగుమాటలాడి ఒకదారి నేర్పరచాలి' అని అర్థించి, అందు కాయనను అంగీకరింపజేసి మళ్ళీ ఇట్లా పలికాడు :

విశేషం: 1. రక్షించుమని ధర్మరాజు శ్రీకృష్ణుడిని - దేవుడిని ప్రార్థించినట్లు ప్రార్థిస్తున్నాడు. ఆ రక్షా విధానం పితాసుత సంబంధ బంధురమై ఉండాలని తమను ప్రద్యుమ్నాదులతో పోల్చుకొన్నాడు. అంటే శ్రీకృష్ణుడిని పాండవుల కపికిశోర న్యాయంతో రక్షించుమని వేడుతున్నారని భావం. పాండవ యత్నం లేకుండా భగవంతుడైన శ్రీకృష్ణుడి యత్నమే కార్యంగా సాగాలని వేడుకొన్నాడు. అంటే, పాండవుల భారమంతా శ్రీకృష్ణుడిపై ఉంచారన్నమాట.

2. పాండవులకు పాపాలు సోకకుండా కార్యం నిర్వహించుమని మరొక వేడికోలు. ఇది ధర్మజుడి ధర్మనీతి వర్తనాన్నీ, భగవంతుడికి ప్రీతిపాత్రమైన ప్రవృత్తినీ వ్యంజింపజేస్తున్నది. ఉద్యోగంలో రాజనీతి ప్రవర్తిల్లినా, అది ధర్మహాని కలిగించి పాండవులకు అపకీర్తిని, పాపఫలితాన్ని కలిగించకూడదు. అర్థం కంటె ధర్మమే ధర్మరాజుకు ప్రీతి. అది దేవుడు మెచ్చే గుణం.

3. ధర్మరాజు ప్రార్థిస్తున్నాడు. శ్రీకృష్ణుడు 'నీ ఆదేశాన్ని అక్షరాలా పాటిస్తా'నని అంటున్నాడు. ఇక్కడ ఒక రాజనీతి ధర్మసూత్రం ఉన్నది. శ్రీకృష్ణుడు తానే హస్తినాపురానికి పోవాలని నిశ్చయించాడు. దానికి ధర్మజుడి అనుమతిని కోరలేదు. అయితే ధర్మజుడు ఆ ప్రతిపాదనను నిండుసభలోనే సమ్మతించాడు. కాగా, శ్రీకృష్ణుడు కురుసభలో స్వతంత్ర ప్రతిపత్తితో మాట్లాడతాడు. అందువలన ఆ మాటలాడేటప్పుడు ఏ పక్షానికీ అతడు ప్రాతినిధ్యం వహించక ధర్మదేవతలవలె పలుకవచ్చును. కాబట్టి, ముందుగానే తన వాదాన్ని శ్రీకృష్ణుడి ముందు నివేదించుకొనటానికి ధర్మరాజు పూనుకొన్నాడు. శ్రీకృష్ణుడు మనసు విప్పి, ధర్మరాజు ఏది ఆజ్ఞాపిస్తే దానినే చేస్తానని చెప్పి, తాను పాండవపక్షాననే హస్తినకు వెళ్ళుతున్నట్లు ప్రకటించాడు. దానితో ప్రభువు ధర్మరాజనీ అతడి పంపున వెళ్ళుతున్న రాయబారి శ్రీకృష్ణుడనీ భావించే అవకాశం కలిగింది. దానిని ధర్మరాజు చక్కగా వినియోగించుకొని 'నీవు హస్తినాపురానికి పోయి కౌరవులతో తగు మాటలాడి న్యాయం చేయు'మని కోరాడు. అంటే-

మొదట శ్రీకృష్ణుడు స్వీయ సంకల్పంతో పోదలచాడు. ఇప్పుడు పాండవ ప్రార్థనకు అనువుగా పోవనిశ్చయించాడు. శ్రీకృష్ణుడు ఎంత స్వతంత్రుడో, అంతటి భక్తపరతంత్రుడని రాజనీతిపరంగా కూడా ప్రదర్శించటం ఈ సన్నివేశ విశేషం. (సంపా.)

సీ. 'మా తండ్రి తలఁపును నాతని నందను। చందంబు నిన్న నా సంజయుండు
పలికిన పలుకులఁ దెలిసెఁగదా నీకు;। వారి చిత్తము భంగి వాఁ డెఱుంగుఁ;
బాలు పంపనియీక మేలిమాటలన మ। మ్మలుక దీర్చెదరు తా; రధిక దుష్క
రంబైన యాసమయం బేము పదుమూఁడు। వత్సరంబులు సల్పి వచ్చియుండఁ

ఆ. గులము పాడి నడపఁ దలఁపడ; పతి సెడఁ। దలఁచెనేనిఁ గొడుకు వలచినట్టి
వాఁడు గాన యతని వక్రత మాన్పలేఁ;। డింతకంటెఁ గలదె యెడరు మాకు? 9

ప్రతిపదార్థం: మా తండ్రి తలఁపును= మా నాయనగారైన ధృతరాష్ట్రుడి ఉద్దేశం; ఆతని నందను చందంబున్= ఆయన కొడుకైన దుర్యోధనుడి తీరూ; నిన్న= నిన్నటి దినం; ఆ సంజయుండు పలికిన పలుకులన్= దూతగా వచ్చిన సంజయుడు మాటలాడిన మాటల వలన; నీకున్= నీకు; తెలిసెన్+కదా!= తెలిసింది కదా!; వారి చిత్తము భంగిన్= ఆ కౌరవుల మనోవైఖరి; వాఁడు+ఎఱుంగున్= ఆ సంజయుడికి తెలుసు; పాలుపంపు+అని+ఈక= మీ భాగమునకు వచ్చిన భూమి ఇంతని ఇయ్యక; మేలి మాటలన్+అ= తియ్యని పలుకులతోనే; తారు= ఆ కౌరవులు; మమ్ము+అలుక+తీర్చెదరు= మేము అలుగకుండ బుజ్జగిస్తారు; అధిక దుష్కరంబు+ఐన= చేయుట కేమాత్రం శక్యం కాని; ఆ సమయంబున్= ఆ ప్రతిజ్ఞను; ఏము= మేము; పదుమూఁడు వత్సరంబులు సల్పి= పన్నెండేళ్ళరణ్యావాసం; ఒకయే డజ్ఞాతవాసం చేసి; వచ్చియుండన్= రాగా; పతి= ధృతరాష్ట్రుడు; కులము పాడి నడపన్= వంశధర్మం సాగించుటకు; తలపఁడు+అ= అనుకొనకున్నాడు; చెడన్+తలఁచెనేనిన్= చెడిపోదలచుకుంటే; కొడుకున్ వలచినట్టివాఁడు= దుర్యోధనుడిమీద దురభిమానం చూపువాడవుతున్నాడు; కానన్= కాబట్టి; అతని వక్రతన్+మాన్పన్+ లేఁడు= కొడుకు కుటిలబుద్ధిని తొలగించలేకున్నాడు; ఇంతకంటెన్= ఈ విషమ స్థితికంటె; మాకున్= అన్నదమ్ములమైన మాకు; ఎడరు= ఆపద; కలదె?= మరొకటున్నదా? (లేదని భావం.)

తాత్పర్యం: 'నిన్న సంజయుడు మాట్లాడిన మాటల వలన మా తండ్రి ధృతరాష్ట్రుడి ఉద్దేశ మేమిటో, అతడి కుమారుడైన దుర్యోధనుడి తీరు ఎటువంటిదో నీకు తెలిసింది కదా! ఆ తండ్రి కొడుకుల చిత్తవృత్తులు ఎట్లాంటివో సంజయుడికి తెలుసు. మా రాజ్యభాగం మాకియ్యకుండా, మాకు కోపం రాకుండా, కల్లబొల్లి మాటలతో బుజ్జగిస్తున్నారు. చెప్పిన ప్రకారం మేము ఏమాత్రం చేయశక్యంకాని అరణ్యాజ్ఞాతవాసాలు పదమూడేళ్ళు చేసి వచ్చిఉండగా ధృతరాష్ట్రుడు వంశధర్మం పాటించకున్నాడు. చెడదలచియే అతడు కొడుకు దారి ననుసరిస్తున్నాడు. అతడికి కొడుకుపట్ల వల్లమాలిన దురభిమానం కాబట్టి, సుయోధనుడి కుటిలత్వం మాన్పలేకున్నాడు. ఇంతకంటె మాకు విపత్తు మరేముంటుంది?

విశేషం: 1. ధర్మజుడు మహావక్త. విషయ స్వభావాన్ని బట్టి దానిని ఆతడు ప్రపంచించే తీరు మారుతూ ఉంటుంది. శ్రీకృష్ణుడు హస్తినాపురానికి వెళ్ళి పరిష్కరించవలసిన సమస్యలోని ప్రధానాంశాన్ని మొదట సవిస్తరంగా, సమర్థవంతంగా ప్రతిపాదించా డీ పద్యంలో. 'ఇంతకంటెఁ గలదె యెడరు మాకు?' అన్నది ప్రధానాంశంలోని ప్రాణం. 'ఆపదఁ గడవం బెట్టగ నోపెడి' శ్రీకృష్ణుడికి తన కేర్పడిన ఆపద (ఎడరు)ను పేర్కొన్నాడు.

2. సంజయుడి రాయబారం వలన దుర్యోధన ధృతరాష్ట్రుల మనోగతం తెల్లమైపోయింది. రాజ్యభాగమీయకుండా మాయమాటలతో పాండవుల కోపం చల్లార్చే సాంత్వన వచనాలు పలుకుతున్నారు. పాండవులు దుష్కరమైన అరణ్యాజ్ఞాతవాసాలు నియమంతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గడపినా వంశ మర్యాదను పాటించి కౌరవులు రాజ్యభాగమిచ్చే ఆలోచన చేయరు. దుర్యోధనుడు దుర్మార్గుడై నాశనం కావటానికి సిద్ధమైనా, అది తెలిసిన ధృతరాష్ట్రుడు తన కొడుకు వక్రబుద్ధిని మాన్పలేదు. కొడుకును కాదనలేని ధృతరాష్ట్రుడి చిత్తవృత్తియే పాండవులకు అడ్డువచ్చిన పెద్ద సమస్య. దీనిని తీర్చి కార్యాన్ని శాంతంగా సాధించుకొనటమే శ్రీకృష్ణుడి ముందున్న సమస్య - అని ధర్మరాజు పండు ఒలిచి చేతిలో పెట్టినట్లు చెప్పాడు.

3. 'పాలుపంపని యీక.....తారు' - అనేది సంజయుడి రాయబారపు సారాంశం. దీనికి మూలం. "అప్రదానేన రాజ్యస్య శాంతి మస్మాసు మారతి'' (సం. 5-70-80) యుద్ధోన్ముఖులు కాకుండా శాంతి పరచటానికే. (సంపా.)

క. జననియు సమస్త బాంధవ । జనములుఁ బ్రియమంద, వారి శాంతులఁగాఁ జే
యను, నెమ్మిగ నొక్కటియై । మననుం దెలఁగేది యునికి మా పౌరుషమే? 10

ప్రతిపదార్థం: జననియున్= మా తల్లిఅయిన కుంతీదేవి; సమస్త బాంధవ జనములున్= చుట్టాలందరున్నూ; ప్రియము+అందన్= సంతోషం చెందగా; వారిన్= దుర్యోధనాదులను; శాంతులన్+కాన్+చేయను; నెమ్మిగన్= కూర్మితో; ఒక్కటి+ఐ+మననున్= కౌరవులున్నూ మేమూ కలసి మెలసి జీవించటానికీ; తెలఁగు+ఏది+ఉనికి= దారి దోచక ఇట్లా పడిఉండటం; మా పౌరుషమే?= మాకు మగతనం అవుతుందా?

తాత్పర్యం: మా తల్లీ, చుట్టపక్కాలూ హర్షించేటట్లూ, దుర్యోధనాదులందరూ యుద్ధంమాట ఎత్తకుండా శాంతించేటట్లూ, కౌరవులూ మేమూ కలసి మెలసి ఒద్దికగా జీవించేటట్లూ మార్గం తెలియక ఇట్లా బ్రతకటం మాకు మగతనం కాదు.

విశేషం: ఎడరు తీరటంవలన రెండు ఫలితాంశాలు కలగాలని ధర్మరాజు స్పష్టం చేస్తున్నాడు.

1. ప్రస్తుతం ఉన్న స్థితి ఇట్లాగే కొనసాగటానికి వీలులేదు. అట్లా కొనసాగటం పాండవ పౌరుషానికే తలవంపులు. కాబట్టి పరిష్కారం త్వరగా జరగాలి.

2. అయితే ఆ పరిష్కారం తల్లికీ బంధువులకూ సంతోషంతోపాటు ఊరట కలిగించేదిగా ఉండాలి. కౌరవ పాండవులు కలిసి కలకాలం జీవించేటట్లుండాలి. (సంపా.)

క. ఇచ్చటి బంధులు నీవును । నచ్చెరువడి వినుచునుండ నయిదూళ్ళును మా
కిచ్చినను జాలు నంటిని । బొచ్చెముగా దింతవట్టు పూర్ణము సుమ్మీ! 11

ప్రతిపదార్థం: ఇచ్చటి బంధులు= ఇక్కడనున్న చుట్టాలూ; నీవును= నీవూ; అచ్చెరువడి= ఆశ్చర్యపడి; వినుచున్+ఉండన్= వింటూండగా; మాకున్= అన్నదమ్ములమైన మాకు; అయిదు+ఊళ్ళును= ఐదు గ్రామాలను; ఇచ్చినను= ఇచ్చినప్పటికీ; చాలున్+అంటిని= సరిపోతుందని సంజయుడితో అన్నాను; పొచ్చెము+కాదు= తక్కువ కాదు; ఇంతవట్టు= నేనాడిన ఈమాత్రపు మాట; పూర్ణము సుమ్మీ!= చాలు సుమా!

తాత్పర్యం: కృష్ణా! ఇక్కడున్న చుట్టాలూ, నీవు విస్మయంతో వింటుండగా- 'సక్రమంగా మాకు అర్ధరాజ్యం పంచియివ్వటానికి మా తండ్రికి మనసొప్పకపోతే ఇంద్రప్రస్థం, కుశస్థలం, వృకస్థలం, వాసంతి, వారణావతం చాలు. అందుకూ అతడిష్టపడకపోతే ఎక్కడైనా మేము తలదాచుకొనటానికి ఐదూళ్ళిచ్చినా చాలు' నని సంజయుడితో ఇంతవరకూ నే చెప్పిన మాటలలో కపటం లేదు. అంతా యథార్థం సుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 1. ఆ ఫలితాంశాల సాధనలో ధర్మజుడు ఇంతకు పూర్వమే ఒకదారి చూపించాడు. అర్ధరాజ్యం బదులు అయిదూళ్ళు ఇస్తే చాలునని నిండుమనసుతో ఉన్నాడు. నిజానికి అది దానోపాయ ప్రయోగ నైపుణ్యం. దానివలన బంధువులతో పాటు కృష్ణుడు కూడా ఆశ్చర్యపోయాడు. అంతటి ఔదార్యం కూడా దుర్యోధన ధృతరాష్ట్రుల ప్రవర్తన వలన బూడిదలో పోసిన పన్నీరై పోయింది - అని ధర్మరాజు మనవి చేశాడు. అంతకంటె మంచి ఉపాయం మరేదైనా ఉంటుందా? అని ఆలోచించాలని సమస్యలోని మరొక ముడి విప్పి చెప్పాడు. 2. ధర్మరాజడిగిన అయిదూళ్ళ పేర్లు మూలంలో ఇట్లా ఉన్నాయి. అవిస్థలం, వృకస్థలం, మాకంది, వారణావతం మరింకేదైనా ఒక ఊరు. తెలుగులో అవిస్థలం, మాకంది పట్టణాలకు బదులు కుశస్థలం, వాసంతి పేర్కొనబడ్డాయి. (చూడు. ఉద్యో. 1.377). (సంపా.)

శా. **ఆ దుర్యోధనుఁ డంతమాత్రయును జేయంజాలఁడో కాని, పెం**
పేదం గ్రూరత కోర్వరాదు; సిరి నా కేలందునే, గ్రాసవా
సోదైన్యంబులు వచ్చు నా యరయు నీ చుట్టాలకుం; గావునన్
మోదంబందుట గల్గుఁ గౌరవులు నేముం బొంది శ్రీ నొందినన్. **12**

ప్రతిపదార్థం: ఆ దుర్యోధనుఁడు= ఆ సుయోధనుడు; అంతమాత్రయును+చేయన్+చాలఁడో కాని= కడకు నేను కోరిన ఐదూళ్ళైనా ఇస్తాడో ఇవ్వడో తెలియదు గాని; పెంపు+ఏదన్= గౌరవం నశించేటట్లు; క్రూరతకున్+ఓర్వన్ రాదు= క్రూరకర్మలు కావించటానికి సహించలేను; సిరి= రాజ్యసంపద; నాకున్+ఏల+అందునేన్= నా కెందు కని తలంచితినేని; నా+అరయు= నేను చూచే; ఈ చుట్టాలకున్= ఈ బంధు జనాలకు; గ్రాసవాసస్(ః)+దైన్యంబులు వచ్చున్= తిండికీ, బట్టకూ కరువేర్పడుతుంది; కావునన్= అందుచేత; కౌరవులున్= ధార్తరాష్ట్రులూ; ఏమున్= మేమూ; పొంది= కూడి; శ్రీన్+ఒందినన్= సంపద పొందితే; మోదంబు+అందుట+కల్గున్= సంతోషం పొందటం జరుగుతుంది.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు కడకు నే నడిగిన ఐదూళ్ళయినా ఇస్తాడో ఇవ్వడో తెలియదు. కాని, గౌరవం చెడేటట్లు క్రూర కార్యాచరణానికి నా మనసు ఒప్పుకోదు. పోనీ, రాజ్యసంపద నా కెందు కని వారిని అడగటం మానితే, నన్నాశ్రయించుకొనిఉన్న నా బంధుజనులకు కూటికీ, గుడ్డకూ దైన్యం ఏర్పడుతుంది. కనుక కౌరవులూ, మేమూ ఒద్దికగా ఉండి రాజ్యసంపద పంచుకొంటే ఉభయులకూ సంతోషం సమకూరుతుంది.

విశేషం: 1. ధర్మజుడు ఈ పద్యంలోని వాక్యాలను భావోద్వేగంతో పలికినట్లు తిక్కన రచించాడు. ఇందులో నాలుగు వాక్యాలున్నాయి. అవి భిన్న భావావస్థలను వ్యక్తం చేసేవి. 'దుర్యోధను డీమాత్రం కూడా చేయలేడా?' అన్నది ఆవేశంతో, ఆవేదనతో గొంతెత్తి పలికే రోషవాక్యం. ఆ వాక్యం తరువాత కొంత విరామం అభినయంగా స్ఫురిస్తుంది. ఉదాత్త స్థాయిలో పలికిన ఆ వాక్యం నుండి తన గొంతును మంద్రస్థితికి తెచ్చుకొనటానికి 'కాని' అనే పదం తోడ్పడింది. ఈ వాక్యానికీ తరువాతి వాక్యానికీ ఉన్న అంతరం తెలియచెప్పింది. 'పెంపేదం గ్రూరత కోర్వరాదు' అనే వాక్యంలో ధర్మజుడి అభిమానం ద్యోతకమైనది. అప్పటి తన దీనస్థితిని స్ఫురింపచేసింది. దీనికి రెండు మూడు రకాల అర్థాలు చెప్పవచ్చును. (1) దుర్యోధనుడి పరంగా-అయినా, ఆ విధంగా ఔన్నత్యాన్ని వీడి క్రూరత్వాన్ని చేపట్టటం సహించరాదు- అని చెప్పవచ్చును. (2) ధర్మరాజుపరంగా-అతడు ఐదూళ్ళు కూడా ఇవ్వలేదని నా గౌరవాన్ని దిగజార్చుకొని నన్ను నేను క్రూరంగా కించపరచుకొనటం సహించరాని స్థితి. (3) దుర్యోధనుడు అయిదూళ్ళు ఇవ్వలేదనే నెపంతో గౌరవం చెడేటట్లు క్రూరకార్యానికి పూనుకొనటానికి నా మనసు ఒప్పుకోదు. సందర్భశుద్ధి గలిగిన మూడంచుల అర్థాలతో ముచ్చట కొలిపే ఈ వాక్యం ఒక్కటే మంద్రస్థాయిలో అనే వాక్యం. ఆ తరువాత కొంత విరామం ఉంటుంది. 'సిరి నాకేలందునే?' - ఈ వాక్యం సంజయుడి రాయబారంలోని తాత్పర్యాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనసులో తలచుకొని గూఢమైన బాధతో, దెబ్బతిన్న ఆత్మాభిమానంతో, ఆలోచిస్తూ, గంభీరంగా అనే వాక్యం. ధృతరాష్ట్రుడు 'పాండవులకు రాజ్యం వద్దు, యుద్ధం కూడదు, ప్రశాంతంగా బ్రాహ్మణుల వలె జీవించటం ఉచిత'మని సంజయుడి ద్వారా సూచించాడు. ఆ ఆదేశాన్ని అనుసరించి ధర్మరాజు తనకు సంపద ఎందుకులే? అని అనుకొన్నా- అది పొసగని పని అని భావం. దీనిని మరొక విధంగా అన్వయించవచ్చును. 'ఒకవేళ దుర్యోధనుడు ఐదూళ్ళు కూడా ఇవ్వకపోతే ధర్మరాజుకు సిరి సంపదలకు ఆలవాలమైన రాజ్యం అసలు ఉండదు. అయినా, ధర్మరాజు సిరిని కోరకుండా వైరాగ్య జీవితం గడపటానికి అతడు విపుల సంసారి. అందువలన అది సాధ్యం కాదు. మరి సిరి ఎందుకు? అంటే.. 'నా అరయు చుట్టాలకు - గ్రాసవాసోదైన్యం వస్తుం'దని ధర్మజుడి సమాధానం. ఇది తన స్థితిని చెప్పుకొనటమే కాక కౌరవులను వ్యంగ్యంగా ఎత్తిపొడవటం కూడా, నూరుగురు కొడుకులు, బంధువులు ఉన్న పెద్ద సంసారం ధృతరాష్ట్రుడిది. వారి కొరకే అత డీ రాజ్యాన్ని హరించింది. వారి పోషణ వారి కెంత ముఖ్యమో తనవారి పోషణ తనకంత ముఖ్యమని ధర్మజుడి ఎత్తిపొడుపు. అంతేకాదు. తనది కూడా క్షత్ర గార్హస్థ్య జీవితమనీ, బ్రాహ్మణ సన్న్యాస జీవితం కాదనీ హెచ్చరిక! ఈ వాక్యం ధర్మరాజు నిక్కచ్చిగా, నిష్ఠురంగా, నిండుగా, గండుగా అన్నాడు. ఈ మూడు వాక్యాలే ధర్మజుడి వాదనలో మూడు బలమైన అంశాలు. వాటి ఫలితాలు శ్రోత ఊహించాలని గ్రహించాలి. అంటే, అయిదూళ్ళయినా ఇవ్వని క్రూరత్వం ఏర్పడితే, మా అయిదుగురి బంధువులనూ పోషింప దగినంత రాజ్యాన్ని మేము గ్రహించక తప్పదు. అప్పుడు యుద్ధం తప్పదు. 'కౌరవ నాశనం తప్పదు. ఇవన్నీ ఊహించగలిగితే ధర్మరాజు 'కావునన్' అనటంలో ఉన్న గడుసుదనం గోచరిస్తుంది. 'కౌరవ పాండవులు కలిసి రాజ్యసంపదను పంచుకొంటే ఉభయులూ సంతోషాన్ని పొందే స్థితి ఏర్పడుతుంది' అని ధర్మజుడు తేల్చి చెప్పాడు.

2. తిక్కన ధర్మరాజు యొక్క ఉపన్యాస శిల్పంలో కొన్ని శైలీ స్వభావాలను రచనలో ప్రవేశపెట్టాడు. అవి (1) ఒక పద్యాన్ని ఒక విధమైన భావావస్థకు ఆలోచనాత్మకమైన అభివ్యక్తిగా మలచటం. ఈ వాక్యంలో ధర్మరాజు ఉభయులూ సంపద పంచుకొనటం ఉచితం అనే తాత్పర్యాన్ని చెప్పటానికి కావలసిన మానసికావస్థను ప్రకటించాడు. (2) పద్యాన్ని వాక్యమండలిగా రూపొందించటం. (3) వాక్యానికీ వాక్యానికీ మధ్య కొంత విరామం ఉన్నట్లు, అభినయం సాగుతున్నట్లు, ఒక భావం నుండి మరొక భావానికి మరలుతున్నట్లు స్ఫూర్తిని కలిగించటం. వాక్యాలను పలకటంలో ఉండే ఉదాత్తానుదాత్తస్థితులను ధ్వనింప జేయటం. (4) వాచికాభినయ ద్యోతకమైన నాటకీయ పద్య రచనను సంతరించటం. (5) వాదాంశాలను క్రమంగా ఆవిష్కరించి పద్యం చివర ప్రతిపాద్యాంశ ఫలితాంశాన్ని ప్రకటించటం. ఈ లక్షణాలన్నీ ఒక మహావక్త, రాజనీతివేత్త మాట్లాడే ఉపన్యాసంలో గోచరించే అంశాలు.

3. తిక్కన రచించిన మంచి పద్యాలలో ఇది ఒకటి. ధర్మజోపన్యాసంలో తిక్కన వివిధ అర్థగుణాలను సార్థకంగా వాడాడు. ఇందులో అజఠరత్వం, అపారుష్యం అనే లక్షణాలు గల సౌకుమార్యం సంతరించబడింది. (సంపా.)

ఉ. అక్కట! లాఁతులైనఁ బగఱైనను జంపన కోర నేల? యొం
డొక్క తెఱంగు లేదె? యది యొప్పదె? బంధు సుహృజ్జనంబు లా
దిక్కున నున్నవారు; గణుతింపక సంపదకై వధించి దూ
ఱెక్కుట దోషమందు టను నీ దురవస్థల కోర్వవచ్చునే?' 13

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; లాఁతులు+ఐనన్= పరాయివారైనా; పగఱు+ఐనను= శత్రువులే అయినా; చంపన్+అ+కోరన్+ఏల= చంపాలనే ఎందుకు కోరాలి?; ఒండు+ఒక్క+తెఱంగు లేదె?= యుద్ధం కంటె మరొకమార్గం లేదా?; అది+ఒప్పదె?= ఆ మార్గం తగింది కాదా?; ఆ దిక్కునన్= ఆ కౌరవుల పక్షంలో; బంధు సుహృద్ జనంబులు= చుట్టాలు, మిత్రులు; ఉన్నవారు= ఉన్నారు; గణుతింపక= ఆ వైపున ఉన్న మా బంధుమిత్ర వర్గాన్ని లెక్కించక; సంపదకై= సిరికై; వధించి= (వారిని) చంపి; దూఱు+ఎక్కుట= నిందలపాలవటం; దోషము+అందుట= పాపం మూటగట్టుకొనటం; అను= అనునట్టి; ఈ దుర్+అవస్థలకున్= ఈ దుర్దశలకు; ఓర్వన్+వచ్చునే?= సహింప శక్యమగునా? (కాదని భావం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అయ్యో! వారు ఇతరులే అగుదురుగాక! విరోధులే అగుదురుగాక! వారిని చంపవలెననే ఎందుకు కోరాలి? పోరాటంకంటే మరో మంచిదారి లేదా? ఆ మార్గం మంచిది కాదా? కౌరవుల పక్షంలో మా చుట్టాలు, మిత్రులు ఉన్నారు. వారిని లెక్కించక రాజ్యసంపదకై సంహరిస్తే నిందలపాలుగాక తప్పదు. పాపాలు మూటగట్టుకొనక తప్పదు. ఇట్లా ఇహపరాలు రెంటికీ దూరం చేసే దుర్దశను నేను భరించలేను.

విశేషం: 1. రారాజు రాజ్యభాగ మీయడు కాబట్టి యుద్ధం చేసి రాజ్యాభాగం పొందటమే కర్తవ్యం- అని భావించే వారి తలపులను మనస్సులో ఉంచుకొని ధర్మరాజు యుద్ధం కంటే వేరే మరొక మార్గాన్ని అన్వేషించవలసిన అవసరాన్ని ఈ పద్యంలో నొక్కి చెపుతున్నాడు. పైపద్యంలో రాజ్యభాగం యొక్క అవసరాన్ని చెప్పి, దానిని సాధించే మార్గాన్ని గురించి తన ఆలోచనా విధానాన్ని ఈ పద్యంలో ఆవిష్కరించాడు.

2. ఈ పద్యం 'అక్కట!' అనే మాటతో మొదలవుతున్నది. అది విచారాన్నీ, ఆశ్చర్యాన్నీ తెలిపే వాచికాభినయ వాచకం! ఆమాట అనే ముందు ధర్మజుడి భావనలో యుద్ధమే కర్తవ్యమనే యోచన మెదలిన సంగతి ధ్వని. ఇట్లా అభినయాంశాలతో, అభినయ వాచకాలతో మనోగత భావాలను ధ్వనింప చేయటం నాటకీయ శిల్పంలో రసధ్వని.

3. చంపవలసి వస్తే లోకంలో పరాయివారినీ, శత్రువులనూ ఎన్నుకొనటం సహజం. వారితో స్నేహ సంబంధాలుగాని, రక్త సంబంధాలుగాని, భావజాల సంబంధాలు కాని ఉండవు కాబట్టి. అయినా వారిని కూడా రాజ్యం కొరకు చంపాలనుకొనటం అహింసాధర్మం కాదు. మానవ మూల్యమైన దయాధర్మం కూడా కాదు. అది యుద్ధనీతి ఔతుందేమో కాని, ధర్మనీతి కాదు. ఆ అంశాన్ని ఈ వాక్యంలో ధర్మజుడు చెప్పాడు. ఇది సాధారణ శాంతిసూక్తం.

4. 'ఒండొక్క తెఱంగు లేదె?' ఇది ఆలోచనాముద్రతో వేస్తున్న ప్రశ్న. ఎదుటివారిని 'ఆలోచించండి' అని అడుగుతున్న నాట్యముద్ర. దీని వెనుక రాజనీతి కూడా ఉన్నది. చతుర్విధోపాయాలలో చివరిది. సామ, దాన, భేదోపాయాలు విఫలమైపోయిన తరువాత దండోపాయాన్ని తప్పనిసరి పరిస్థితులలో ప్రయోగించాలి కాని, ముందుగానే తొందరపడి యుద్ధం చేయరాదు. అయితే, యుద్ధానికి ప్రత్యామ్నాయమైన ఉపాయం ప్రప్రథమ కర్తవ్యం. దానిని ధర్మజుడు సూచిస్తున్నాడు.

5. 'అది యొప్పదె?' - అట్లా చెయ్యటం న్యాయం కాదా? అని ప్రశ్నిస్తున్నాడు. ధర్మజుడి దృక్పథంలో అదే న్యాయం. సభ్యులు కూడా తన అభిప్రాయంతో అంగీకరించేటట్లు చేసే నేర్పుతో కూడిన ప్రశ్న. ఈ ప్రశ్న వేసి ధర్మరాజు కొంత విరామం పాటించి ఉంటాడు. ఆయన నిజానికి ఏ పరాయివారినో, శత్రువులనో ఉద్దేశించి మాట్లాడటం లేదు. హస్తినాపురంలో ఉన్న బంధు మిత్రులను గురించే భావిస్తున్నాడు. ఆ ఆలోచన నుండి తరువాతి వాక్యం వెలువడింది.

6. 'బంధు సుహృజ్జనంబు లా దిక్కున నున్నవారు'. ఇది పాండవు లను కొనవలసిన మాట. కౌరవు లెట్లాగూ పాండవులు బంధువులని భావించటం లేదు. ధర్మరాజు దయామూర్తి కాబట్టి ఈ ధర్మనీతి పద్ధతిలో ఆలోచిస్తున్నాడు. పగవారినే చంపగూడదని లోకనీతి చెప్పుతుండగా బంధు మిత్రులను చంపటం న్యాయమా? అని యుద్ధోద్యోగానికి విరుగుడుగా ఈ అంశాన్ని పేర్కొన్నాడు.

7. ఈ ధర్మనీతిని లెక్కచేయకుండా సంపద కొరకు బంధుమిత్రులను యుద్ధంలో చంపితే రెండు దుర్దశలు కలుగుతాయట! అవి- అపకీర్తి, పాపం. ఈ రెండూ ధర్మవీరుడి జీవితానికి ఇహపరాలు లేకుండా చేసే దుర్దశలు. అపకీర్తి వలన ఈ జన్మలో మృత్యువు పాలైనట్లే, పాపంవలన జన్మ జన్మలలో సద్గతి కోల్పోయినట్లే. కాబట్టి కౌరవులను యుద్ధంలో చంపితే పాండవు లిహపరాలకు చెడుతారని ధర్మరాజు నిశ్చయం.

8. 'ఈ దురవస్థల కోర్వవచ్చునే?' సంపద లేకపోయినా బ్రతుక వచ్చునుగాని, అపకీర్తితో పాపంతో బ్రతకటం అసాధ్యమని ధర్మజుడి నీతిసూక్తం.

9. ఈ పద్యం ముగిసేసరికి రెండు విరుద్ధాంశాలు ధర్మజుడు ప్రతిపాదించాడు. (1) రాజ్యభాగం కావాలి. అందరూ కలిసి ఉండాలి. (2) యుద్ధం జరుగకూడదు. ఈ రెండూ జరిగేవి కావని స్పష్టం. కాని, ఆ దిశలో యత్నం జరగాలని ధర్మజుడి ఆశయం.

10. ఈ విషయాన్ని సభ మననం చేసికొనటానికి ధర్మరాజు కొన్ని క్షణాల విరామం ఇచ్చాడు. అది నాటకీయంగా అవసరం.

11. ఈ పద్యంలో శ్లేషమనే శబ్దార్థోభయ గుణాలు సంతరించబడ్డాయి. రచనలో మస్పృణత్వం, పదవాక్య సంవిధానంలో ఘటన ఈ పద్య రచనకు ప్రాణం.

12. తిక్కన తీర్చిదిద్దిన ఉపన్యాస శిల్ప పద్యాలలో ఇది కూడా ప్రశస్తి చెందింది. నేటికీ తెలుగువారి మాటలలో సంధి యత్నాల పట్ల ఈ పద్యం పల్లవిగా వినిపిస్తుంది. (సంపా.)

వ. అని పలికి పాండవాగ్రజుండు వెండియు. 14

తాత్పర్యం: అట్లా ధర్మజుడు పలికి మరల ఇట్లా అన్నాడు :

విశేషం: ఉపన్యాసఘట్టంలో తిక్కన నడుమ నడుమ రచించే చిన్న చిన్న వచనాలను అభినయ వ్యంజకాలుగా రూపొందించటం నాటక శిల్పం. పాండవాగ్రజుడు అనే విశేషణం సార్థకం. అతడి మాట పాండవ స్కంధావారంలో ముక్తకంఠంతో వినపడుతుం దని ధ్వని. 'వెండియు' - అనేది కొన్ని క్షణాల విరామానంతరం అనే కాలసూచిక. (సంపా.)

ఆ. క్షత్త్రధర్మ మింత కష్టమగునె? పెఱ । ధర్మ మాచరింపఁ దగ దటండ్రు
గాన శస్త్రజీవికయ తగియున్నది; । యైన వంశనాశ మనభిమతము. 15

ప్రతిపదార్థం: క్షత్త్రధర్మము= రాజధర్మము; ఇంత కష్టము+అగునె?= ఇంతటి కష్టంతో కూడుకొన్నది గదా!; పెఱ+ధర్మము= (క్షత్రియులు) అన్యధర్మము; ఆచరింపన్+తగదు+అటండ్రు= అనుష్ఠించరాదని పెద్దలు చెప్పుతారు; కానన్= కాబట్టి; శస్త్రజీవిక+అ+తగి+ఉన్నది= మాకు ఆయుధోపజీవనమే యుక్తమై ఉన్నది; ఐనన్= అయినప్పటికీ; వంశనాశము= కులనిర్మూలనం; అనభిమతము= నాకు ఇష్టం కాదు.

తాత్పర్యం: ఔరా! క్షత్రియ ధర్మపాలనం ఎంతో కష్టంతో కూడుకొన్నది. అన్య ధర్మాచరణం రాజులకు తగదని పెద్దలంటారు. కనుక ఆయుధాలను చేతబట్టి బ్రదకటమే వారికి యోగ్యమైన పని. కాని, రాజ్యానికై కులనిర్మూలనం చేయటం నాకు సమ్మతం కాదు.

విశేషం: 1. అజాతశత్రువు యొక్క అంతర్మథనానికి ఈ ఆటవెలది అచ్చమైన అభినయ వాచికం. ఈ పద్యానికి మూలం గమనిస్తే దీని ముచ్చట మరీ బాగుంటుంది.

"పాపః క్షత్రియ ధర్మోఽయం నయంచ క్షత్రబాంధవాః,
స నః స్వధర్మోఽధర్మో వా వృత్తి రన్యా విగర్హితా". (సం. 5-70-46)

"క్షత్రియ ధర్మం ఎంత పాపం!' అని మూలంలో అంటే. 'ఎంత కష్టం?' అని తెలుగులో అన్నాడు. 'మనమేమో క్షత్రియ బంధువుల' మని మూలంలో ఉంటే. తిక్కన దానిని వదలివేశాడు. ఈ విషయం వాచ్యం చేయవలసిన అవసరం లేదు. 'అది

మనకు స్వధర్మం. ధర్మమైనా పరధర్మం నిందకు పాత్రమౌతుంది' - అని మూలం. దీని వరుస మార్చి - 'పెఱ ధర్మమాచరింపఁ దగ దటంౘ్రడు' అని మొదట పలికాడు తెలుగులో. ఆటవెలది ఉత్తరార్ధం అన్వయ సుందరంగా తెలుగులో అమరింది. క్షత్రియులైన పాండవులకు 'శస్త్రజీవికయే' స్వధర్మమై తగి ఉన్నది. అట్లని యుద్ధం చేసి కార్యం సాధించటమే కర్తవ్యం కాదు. వంశనాశనం జరుగకుండా కార్యసాధనం చేయటం కర్తవ్యం. క్షత్రధర్మానికీ, అహింసకూ సంఘర్షణ వచ్చినపుడు యుద్ధేతర మార్గంలో కార్యాన్ని లోకహితంగా సాధించటం కూడా ధర్మమే. దానినే ధర్మనీతివర్తనం అంటారు. ధర్మరాజు ఆ మార్గాన్ని సూచించాడు.

2. ఆటవెలది పాదాలు నాలుగూ నాలుగు వాక్యాలు. విరుద్ధ ధర్మ సూచికలు. అయినా అన్వయసుందరాలు.

3. ఇందులో అర్థవ్యక్తి అనే శబ్దార్థ గుణాలు పోషించబడ్డాయి. (సంపా.)

వ. అదియునుంగాక. 16

తాత్పర్యం: ఇంతేకాక.

ఆ. కలహ మగుట లక్ష్మిఁ గావించుఁ, బ్రాణహా । నియును జేయు; నింత నిక్కువంబు;
పలువు రొకని కోడి పాఱుట, బల్లిదు । లనదచేతఁ జెడుటయును ఘటించు. 17

ప్రతిపదార్థం: కలహము+అగుట= యుద్ధం రావటం (సంభవించటం); లక్ష్మిన్= సంపదను; కావించున్= లభింపజేస్తుంది; ప్రాణహానియును+చేయున్= ప్రాణనష్టం గూడ కలిగిస్తుంది; ఇంత నిక్కువంబు= (ధనసంప్రాప్తి, ప్రాణనష్టం, యుద్ధం వలన జరగటం) యథార్థం; పలువురు= అనేకులు; ఒకనికిన్+ఓడి= ఒక్కడి చేతిలో అపజయం పొంది; పాఱుట= పరుగిడిపోవటం; బల్లిదులు= బలవంతులు; అనదచేతన్= దుర్బలుడిచేత; చెడుటయును= నశించుటయున్నూ; ఘటించున్= కలుగజేస్తుంది.

తాత్పర్యం: యుద్ధం జరిగితే సంపదలు సంప్రాప్తిస్తాయి. ప్రాణహాని కూడా సంభవిస్తుంది. ఇందులో సందేహం లేదు. పెక్కుమంది ఒక్కడి చేతిలో ఓడిపోయి పరుగెత్తిపోవటం, బలవంతులు బలహీనుడి చేజిక్కి సమసిపోవటం కూడ జరుగుతుంది.

విశేషం: యుద్ధం వలన లాభనష్టాలు మొదట చెప్పాడు ధర్మజుడు. సంపద కలగటం లాభం. ప్రాణహాని నష్టం. యుద్ధంలో జరిగే అబ్బురాలను రెండింటిని తరువాత పేర్కొన్నాడు. ఒకే మహావీరుడి చేతులలో పలువురు పారిపోవచ్చును. ఒక్కొక్కసారి అసమర్థులైన వారు గుంపు కట్టి బలవంతులను చంపవచ్చును. మొదటి దానికి అర్జునుడు, భీష్ముడు ఉదాహరణలు కావచ్చును. కౌరవులు చంపిన అభిమన్యుడు, ఘటోత్కచుడు మొదలైనవారు రెండవ పద్ధతికి ఉదాహరణలు. ఇవి అసహజమైనవి. అదృష్టంమీద, అవకాశం మీద ఆధారపడిన ఇటువంటి సంఘటనలను ఆధారంగా చేసికొని జయాపజయాలను ముందే నిశ్చయించటం కష్టం. జయాపజయాలు దైవాధీనాలు. ఈ వాస్తవం - యుద్ధోపాయం విశ్వసనీయం కాదని సూచిస్తున్నది. (సంపా.)

క. జయమగు నోడుదు మను ని । శ్చయ మొక్కఁడు లేదు; వినుము! సమరమునఁ బరా
జయము మరణంబు కంటె హ్యా । దయపుట భేదనము సేయుఁ దథ్యం బనఘా! 18

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్య పురుషా!; వినుము= నా మాట ఆలకించుము; సమరమునన్= యుద్ధంలో; జయము+అగున్= మనకే విజయం లభిస్తుంది. ఓడుదుము= మనమే అపజయం పొందుతాము; అను నిశ్చయము= అనే నిర్ణయం;

ఒక్కఁడు లేదు= ఒకటీ లేదు; పరాజయము= అపజయం; మరణంబుకంటెన్= మృతికంటె కూడా; హృదయపుట భేదనము+చేయున్= దొప్పవంటి గుండెను పగులగొట్టుతుంది; తథ్యంబు= ఇది నిజం

తాత్పర్యం: కృష్ణా! యుద్ధంలో మనమే గెలుస్తాం, లేదా ఓడిపోతాం అని నిశ్చయంగా చెప్పటానికి వీలులేదు. సంగ్రామంలో అపజయమే సంప్రాప్తమైతే అది మరణంకంటె గుండెను బ్రద్దలు చేసి, దుస్సహమైన వేదనను కలిగిస్తుంది. ఇది నిజం.

విశేషం: 'విజయం తథ్యం కాని యుద్ధం కంటె మరణం మే' లని ధర్మరాజు పేర్కొని సభ్యులు, యుద్ధేతర మార్గాలలో కార్యసాధన మేలని తలంచేటట్లు చేస్తున్నాడు. యుద్ధం చేయాలనే భీమాదుల వాదాలను తర్కబద్ధమైన ప్రతివాద చాతుర్యంతో నియమిస్తున్నాడు. (సంపా.)

క. కాన నవశ్యముఁ బెనఁకువ । గాని యుపాయమునఁ బగఱఁ గడతేర్చు ధృతిం
బూని నడచు నెవ్వఁడు డెం । దానం జెయివెట్టికొని యతఁడు నిద్రించున్. 19

ప్రతిపదార్థం: కానన్= కాబట్టి; అవశ్యమున్= తప్పక; పెనఁకువ కాని= కయ్యం జరగని; ఉపాయమునన్= వెరవు చేత; పగఱన్= శత్రువులను; కడతేర్చు ధృతిన్+పూని= అణచునట్టి ధైర్యం వహించి; ఎవ్వఁడు నడచున్= ఎవడు మెలగునో; అతఁడు= అట్టివాడు; డెందానన్= గుండెమీద; చెయి+పెట్టికొని= చేతిని ఉంచుకొని; నిద్రించున్= హాయిగా నిద్రపోతాడు.

తాత్పర్యం: యుద్ధం అన్ని అనర్థాలకు మూలమవటంచేత కయ్యం చేయకుండానే ఉపాయంతో విరోధులను అణచివేయగలననే ధైర్యం వహించి ఎవడు ప్రవర్తిస్తాడో వాడు గుండెమీద చేయి వేసుకొని నిశ్చింతగా నిదురిస్తాడు.

విశేషం: యుద్ధోపాయాన్ని ప్రయోగించే అవసరం రాకుండానే సామదాన భేదోపాయాలతోనే కార్యఫలాన్ని సాధించటం ఉత్తమమని ధర్మజుడు తేల్చిన ఫలితాంశం. ఇది శాస్త్ర సమ్మతమైన ధర్మనీతి. ఈ పద్యంతో ఒక ప్రతిపాదన ముగిసింది. అందుకే 'కాన' అని పద్యం మొదలైంది. ధర్మరాజు తన ఉపన్యాసంలో ప్రతిపాద్యాంశ పరిసమాప్తిని సూచించే వాక్యాన్ని 'కావున' అని మొదలు పెడుతూ ఉంటాడు. అది ఆయన వాక్యశిల్పం. (సంపా.)

ఆ. పగయ కలిగె నేనిఁ బాముున్న యింటిలో । నున్న యట్లకాక యూఱడిల్లి
యుండు నెట్లు చిత్త మొకమాటుఁ గావున । వలవ దధిక దీర్ఘ వైరవృత్తి. 20

ప్రతిపదార్థం: పగ+అ+కలిగెనేనిన్= విరోధమే ఏర్పడితే; పాము+ఉన్న+ఇంటిలోన్= సర్పమున్న గృహంలో; ఉన్న+అట్ల కాక= ఉన్నట్లే ఉంటుందిగాని; ఒకమాటున్= ఒకసారిఅయినా; చిత్తము= హృదయం; ఊఱడిల్లి= ఊరటపొంది; ఎట్లు+ఉండున్?= ఎట్లా ఉండగలదు?; కావునన్= కాబట్టి; అధికదీర్ఘవైరవృత్తి= చిరకాలం విరోధంతో మెలగటం; వలవదు= కూడదు.

తాత్పర్యం: శత్రుత్వమే ఏర్పడితే పామున్న యింటిలో కాపురమున్నట్లే ఉంటుందిగాని ఒక తడవైనా మనస్సు నిమ్మళంగా ఉండదు. కనుక ఎవరితోనూ దీర్ఘకాలం విరోధంతో ప్రవర్తించటం తగదు.

విశేషం: అలం: ఉపమ. ఇది గొప్ప నైతిక సూక్తి, సుభాషితం. మూలం:

"సుఖం ప్రశాన్తః స్వపితి హిత్వా జయపరాజయౌ ॥
జాత వైర శ్చ పురుషో దుఃఖం స్వపితి నిత్యదా ।
అనివృత్తేన మనసా స సర్ప ఇవ వేశ్మని ॥
ఉత్సాదయతి యః సర్వం యశసా స విముచ్యతే ।" (సం. 5-70-59,60,61)

జయాపజయాలను పట్టించుకొనని ప్రశాంతచిత్తులు సుఖంగా నిద్రిస్తారు. పగపట్టిన పురుషుడు ప్రతిదినం దుఃఖంతో పడుకొంటాడు. పగ వలన సుఖం లేని వాడు పామున్న ఇంటిలో ఉన్నవాడి వలె సర్వాన్నీ పాడుచేసికొంటాడు. వాడికి పూర్వమున్న కీర్తి కూడా తరిగిపోతుంది- అని మూల తాత్పర్యం. తిక్కన మూలాన్ని సందర్భోచితంగా చికిలిపెట్టి నాడుకొన్నాడు.

సంస్కృతంలో వైరం అనే పదానికి తెలుగు-పగ. ఈ పదం తెలుగులో బాగా ప్రచారంలో ఉన్నది. పాముకూ పగకూ కవి సమయం వంటి అనుబంధం ఉన్నది. అందువలన తిక్కన పగ కలిగిన చిత్తం పాము పుట్ట వంటిదనీ, అటువంటి చిత్తవృత్తిగల వ్యక్తి పాముపుట్ట ఉన్న ఇల్లనీ ఉపమించాడు. వ్యాస హృదయానికి వన్నెపెట్టాడు.

పగ ఒకసారి ప్రవేశిస్తే శాంతి ఉండదు కాబట్టి దానిని తగ్గించటం, తొలగించటం తప్ప మార్గాంతరం లేదు. అంటే ఎక్కువ కాలం పగను మనసులో ఉంచుకొనకుండా నిర్మూలించుకొనటమే యుద్ధనివారణకు తరణోపాయమని ధర్మజుడి భావన.

యుద్ధానికి మూలం పగ. ఎడతెగని పగయే యుద్ధోన్మాదంగా మారుతుంది. మాయాద్యూతంలో వంచించి రాజ్యాన్ని కాజేశారనే పగతో పాండవులలో యుద్ధజ్వాల రగులుతున్నది. బలవంతులైన పాండవులు బ్రతికి ఉంటే ప్రభుత్వం దక్కదని అసూయాపరులైన కౌరవులు వారి మీద పగతో యుద్ధానికి కూడా సిద్ధమవుతున్నారు. ఇది ఉభయులకు వర్తించే నీతి. పగ తగ్గితే యుద్ధ ప్రవృత్తి సహజంగానే సమసిపోతుంది. యుద్ధేతరోపాయాలలో ఇది ఉత్తమం, నైతికం, ఆధ్యాత్మికం. కాని, అది సాధ్యమా? అన్నది హిమాలయమంత ప్రశ్న. (సంపా.)

చ. **పగ యడఁగించు టెంతయు శుభం; బది లెస్స; యడంగునే పగం**
బగ? వగ గొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే? కడుం
దెగ మొదలెత్తిపోవఁ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు; నే
మిగతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా! 21

ప్రతిపదార్థం: కేశవా!= శ్రీకృష్ణా!; పగ+అడఁగించుట= విరోధాన్ని రూపుమాపటం; ఎంతయున్+శుభంబు= మిక్కిలి శ్రేయస్కరం; అది లెస్స= అది మంచిపని; పగన్= విరోధంచేత; పగ+అడంగునే= విరోధం శమిస్తుందా? (అంటే శమించదు); వగ+కొన్నన్= (ఒకరి) పగవలన (మరొకరు)బాధపడితే; మార్కొనక= అతడిని ఎదిరించక; పల్కక+ఉండఁగన్+వచ్చునే= ఊరకుండటం శక్యమా? కాదు; కడున్+తెగన్= పరమ సాహసంతో; మొదలు+ఎత్తిపోవన్= తుదముట్టేటట్లు; పగన్+తీర్పఁగన్+వచ్చినన్= వైరాన్ని నిర్మూలించటానికి సిద్ధపడితే; క్రౌర్యము+ఒందున్= క్రూరకృత్యములకు తాను ఒడిగట్టవలసి వస్తుంది; ఏమిగతి+తలంచినన్= ఏ విధంగా ఆలోచించినా; పగకున్= విరోధానికి; మేలిమి లేమి= ఆధిక్యం లేకుండుట; ధ్రువంబు= నిజం.

తాత్పర్యం: విరోధాన్ని అణచివేయడం ఎంతో శ్రేయస్కరం. అది మంచి పని. విరోధం వలన విరోధం సమసిపోదు. ఒకడు వైరం వహించి మరొకరికి బాధ కలిగిస్తే, బాధపెట్టిన వాడితో తలపడక ఊరకుండటం శక్యం గాదు. పరమ సాహసంతో తుదముట్ట పగను నిర్మూలించటానికి పూనుకొంటే దారుణ కృత్యాలకు ఒడిగట్టవలసివస్తుంది. కనుక, ఎన్ని విధాల ఆలోచించినా పగవలన కీడేగాని ప్రయోజనం శూన్యం. కృష్ణా! ఇది నిజం.

విశేషం: 1. పగ వలన కలిగే అనర్థాన్ని చెప్పే గొప్ప సూక్తి ఇది. తెలుగువారి నిత్య వ్యవహారంలో నిత్యంగా నిలిచే సత్యం వంటి పద్యం. తిక్కన రచించిన మేటి పద్యాలలో ఒకటి.

2. ధర్మరాజు తర్కబద్ధంగా ఆలోచిస్తాడు. ఆలోచిస్తూ మాట్లాడుతాడు. ఆ పాత్ర స్వభావానికి అనుగుణంగా ఈ పద్యాన్ని చిన్న చిన్న వాక్యాల పొందికైన రచనతో చేశాడు తిక్కన. చిన్న వాక్యం ఆలోచనాతరంగం. శాంతి పొందటం కర్తవ్యం. 'దానికి భంజకం పగ' అని చెప్పాలి. దానినే పగను గురించి వివరించి, 'అది లేకపోతేనే శాంతి, అది కర్తవ్యం' అని ధర్మరాజు చెప్పాడు. కూడనిది ముందు చెప్పితే కూడేదాని ప్రతిపాదనకు బలం వస్తుంది. దీన్నే తర్కంలో నేతి నేతి వాదం అంటారు. ధర్మరాజు దానిని పాటించాడు.

3. ధర్మరాజు మౌలికంగా శాంతి కాముకుడు. ధర్మనీతి వర్తనుడు. కౌరవులు రాజ్యభాగ మీయరని సంజయుడి రాయబారం వలన తేలిపోయింది. అది కౌరవుల పగ సాధింపు చర్య. అయితే, ఆ పగల వలన కలిగే ఫలమేమిటి? అని జిజ్ఞాసువైన ధర్మరాజు ఆలోచించాడు. శ్రీకృష్ణుడి రాయబారానికి మూలకారణం పగలేకుండా చేయటమే అని బలంగా ఈ పద్యంలో ప్రతిపాదిస్తున్నాడు.

4. పగ ఉన్న మనసు పాము పుట్ట ఉన్న ఇల్లు వంటిది. అందులో శాంతి ఉండదు- అని చక్కని దృష్టాంతాన్ని నిత్య జీవితంలో నుండి తీసికొని పూర్వపద్యంలో చెప్పి, ఈ పద్యాన్ని ఎన్నుకొనటంలో మంచి పూర్వరంగం తయారు చేసి, ప్రతిపాద్యాంశాన్ని చెపుతున్న వాద కౌశలం ప్రకటిత మౌతున్నది.

5. పగను అణచటం ఎంతైనా శుభం. శుభం అనే మాటకు బదులు మేలు, మంచిది, హితవు వంటి అర్థాలు వచ్చే పదాలు వాడవచ్చును. తెలుగు పలుకుబడిలో 'శుభం' పదాని కున్న వాడుక శక్తి మరో పదానికి లేదు. 'అది లెస్స' అనే చిన్నవాక్యం- తెలుగువారు తాను చెప్పిన దాన్ని స్థిరంగా నమ్ముతున్నారని ధ్రువీకరించే పద్ధతికి ప్రతినిధి. 'నిజం. నా మాట నమ్ము- సత్యం' మొదలైన పలుకుబడులకు అది సమానం. ధర్మరాజు చెప్పింది తాను గట్టిగా నమ్మి చెప్పిందే అని అర్థం. తెలుగు పలుకుబడి గల వాక్యాలకు ఈ తిక్కన పద్యం రత్నాల పేటి.

6. పగను గురించి చెప్పే ఈ పద్యంలో ధర్మరాజు- (పాండవులు) - భవిష్యత్తులో అనుసరించబోయే కార్యాచరణ పద్ధతి ఈ పగమీదే ఆధారపడి ఉంటుందని హెచ్చరిక చేశాడు. పగ వలన వగగొన్నవారు తిరగబడకుండా ఊరుకొనబోరట! సంజయుడు- పాండవులు శాంతించాలని చెప్పాడు. దానికి తిరుగు సమాధాన మిది. కౌరవుల పగకు తగిన సమాధానం చెప్పటమే వగగొన్న పాండవుల సహజ కార్యాచరణం. అయితే, ఒకసారి పగసాధింపుకు దిగితే ఇక దయాదాక్షిణ్యాలకు తావుండదు. సంధి వచనాలకు అవకాశముండదు. దారుణమైన క్రూరవృత్తితో శత్రు సంహారమే సాగుతుంది. కౌరవనాశనం తప్పదు. కాబట్టి ఎన్ని రకాలుగా ఆలోచించినా పగను తొలగించక పోతే ఎటువంటి మంచీ ఏర్పడదు. చివర 'ధ్రువంబు కేశవా!' అనే వాక్యం కూడా - ఇది నిశ్చయం, ఇది జరిగి తీరుతుంది. నా మాట అయి తీరుతుంది. ఇది నిజం- ఇన్ని అర్థాలనిస్తుంది. వాద ప్రతిపాద్యాంశంలోని నిత్యత్వాన్ని స్థాపించే తర్కరహస్యం ఈ పద్య నిర్మాణ మర్మం.

7. పూర్వరంగాన్ని ముందు పద్యంలోనూ, తాత్పర్యాన్ని తరువాతి పద్యంలోనూ చెప్పిన తిక్కన ఛందస్సుల మధ్య తర్కంతో వంతెన కట్టాడు. 'కావున శాంతి పొందుటయ కర్జము' అనే నిశ్చితాంశం తరువాతి పద్యం ఎత్తుగడలోని వాక్యం.

8. తిక్కన నాటకీయ సంభాషణ శిల్పంలో ఉపన్యాస రచన- లేదా - దీర్ఘ సంభాషణ ఒక విశిష్టాంశం. సందేశమిచ్చే ముఖ్యపాత్రలూ, దూతలూ మాత్రమే ఈ దీర్ఘసంభాషణలు చేస్తారు. భారతంలో ధర్మజుడి ఉపన్యాస ఖండికలలో ఉద్యోగపర్వంలోని ఈ భాగం ప్రసిద్ధమైనది. అందులో ఈ పద్యం శిరోమణి వంటిది.

9. ఈ పద్యంలో వాడిన తెలుగు పదాల పొందిక గమనిస్తే సంస్కృత భారతంలోని భావాలను తెలుగులో ఎంత ఆత్మీయం చేసికొని, జాతీయంగా తెలుగు పలుకుబడికి ప్రాణంగా తిక్కన రచించాడో స్పష్టమవుతుంది. విశేషించి - పగ, శుభంబు,

లెస్స, పగ, మార్కొనక, కడుందెగ మొదలెత్తిపోవ, మేలిమి, ధ్రువంబు మొదలైన పదాలు సార్థకాలు, శబ్ద ప్రయోగౌచిత్యానికి పద్యమంతా ఉదాహరణమే.

10. 'పగ గొన్న మార్కొనక' - అనే పాఠానికి 'పగగొన్న మార్కొనక', 'తెగగొన్న మార్కొనక' అనే పాఠాంతరాలు కనపడుతున్నాయి.

11. ఈ పద్య రచనకు సహకరించిన మూలశ్లోక మిది-

"న చాపి వైరం వైరేణ కేశవ వ్యుపశామ్యతి,
హవిషాగ్నిర్యథా కృష్ణ, భూయ ఏవాభివర్ధతే". (సం. 5-70-63)

కేశవా! పగతో పగ ఎప్పటికీ చల్లారదు. హోమ పదార్థా లుంచిన కొద్దీ హోమాగ్ని ఎట్లా ప్రజ్వరిల్లుతుందో పగవలన పగ మరల మరల రగిలి పెచ్చుపెరుగుతుంది. తిక్కన ఈ ఉపమానాన్ని గ్రహించలేదు. యజ్ఞోపకరణాన్ని పగకు ఉపమానంగా వాడక పోవటం వలన ఔచిత్యం పోషించబడింది. మూలంలో కంటె తిక్కన పద్యం వస్తువులో, రచనలో, జిగి బిగి ప్రదర్శిస్తున్నది.

12. తిక్కన ధ్వనిమార్గంలో కవిత రచించాడు. అందులోనూ రసధ్వని ఆయన ప్రత్యేక రంగం. వాచికాభినయ ప్రధానమైన ఈ ఘట్టంలో మాటలు పాత్రల స్వభావాలనూ, స్వభావాలు ప్రకరణ భావాలనూ, ధ్వనింపజేసి, నాయకుడైన ధర్మజుడి ధర్మనీతి వర్తనంలోని ఉత్సాహదీప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ధర్మజుడి ధర్మవీరం తిక్కన కవితలో రసోల్లాసం.

13. తిక్కన శబ్దగుణానికి అర్థగుణాన్ని వన్నెగా నిలుపుతాడు. ఈపద్యం అటువంటి శిల్పానికి ఉదాహరణం. పదబంధంలోని మసృణత్వమే శబ్దగుణమైన శ్లేష లక్షణం. బహుపదా లున్నప్పటికీ ఏకపదం వలెనే భాసించటం దాని స్వభావం. అర్థగుణమైన శ్లేష అర్థఘటనకు సంబంధించింది. అనేకభావా లున్నప్పటికీ వాటికి ఐక్యఘటనాన్ని మార్చేదిగా అర్థగుణశ్లేష రాణిస్తుంది. శ్లేషలో క్రమం, కౌటిల్యం, అనుల్బణత్వం ఉపపన్నమై ఉండాలని వామనుడు పేర్కొన్నాడు. ఈ మూడు లక్షణాలూ ధర్మజుడి వాక్యఘటనలో అర్థగుణ సిద్ధిని పొందాయి. ధర్మరాజు మాటల పొందికలో ఎంత మన్నిక ఉంటుందో, వాక్యాల కూర్పులో అంత అర్థ సంఘటన ఉంటుంది. మాటలను అతకటం శబ్దగుణం, ఊటగా ఊరే భావాలను బహు వాక్యాలలో ప్రయాణింపజేసినా ఏకధారను అర్థస్ఫూర్తియందు సంఘటింపజేయటం అర్థగుణం. తిక్కన రచనలో శబ్దగుణమైన శ్లేష అర్థగుణమైన శ్లేషకు ఊడిగం చేస్తుంది. వాక్యవిన్యాసంలో ఏకసూత్రంగా ఉండే ఆలోచనాక్రమం ఒక్కొక్కప్పుడు వక్రతతో కూడి ఉన్నా, అనుల్బణత్వాన్ని ఆద్యంతమూ ఆదరిస్తుంది. ఇది తిక్కన సంభాషణ శిల్పంలోని ఆయుస్సూత్రం. ఈ పద్యంలోని ధర్మజుడి వాక్యరచన అర్థగుణమైన శ్లేషకు శీర్షప్రాయమైన ఉదాహరణం.

14. ఈ పద్యంలో అలంకారం లేదు. కాని, నాటకీయత ఉన్నది. సమాసాలు లేవు కాని, వాక్య విన్యాసం ఉన్నది. ఆడంబరం లేదు. కాని, ఆలోచన ఉన్నది. తిక్కన పద్యరచన ఆలోచనామృతం. (సంపా.)

ఉ. కావున శాంతిఁ బొందుటయ కర్జము; దా నది యట్టులుండె; శ్రీ
గావలె నంచుఁ, బోరితము గామియుఁ గోరెద; మెల్లసొమ్ములుం
బోవుటయుం గులక్షయము పుట్టుటయున్ వెలిగాఁగ నొండుమై
నే విధినైనఁ జిక్కఁబడు టెంతయు నొప్పుఁ జుమీ జనార్దనా! 22

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; శాంతిన్+పొందుట+అ= శాంతి వహించటమే; కర్జము= చేయవలసిన పని; తాన్+అది+అట్టులు+ఉండెన్= ఆ విషయం అట్లా ఉండనీ; శ్రీ+కావలెన్+అంచున్= సంపద కావలెననీ; పోరితము+కామియున్= యుద్ధం జరగకుండ ఉండవలెననీ; కోరెదము= మేము వాంఛిస్తాము; ఎల్ల సొమ్ములున్= ఉన్న సమస్త ధనాలూ; పోవుటయున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నశించటమూ; కులక్షయము పుట్టుటయున్= వంశనాశం కలగటమూ; వెలి కాఁగన్= ఈ రెండునూ జరగకుండా; ఒండుమైన్= వేరొక్క విధంగా; ఏ విధిన్+ఐనన్= ఏ ప్రకారంగా నైనా; చక్కన్+పడుట= బాగుపడటం; ఎంతయున్+ఒప్పున్+చుమీ!= మిక్కిలి తగును గదా! (ఎంతో బాగుంటుంది కదూ!); జనార్దనా!= శ్రీకృష్ణా!.

తాత్పర్యం: వైరం వలన ప్రయోజనం శూన్యం. కలత లేక నిమ్మళంగా ఉండటమే తగిన పని. కృష్ణా! ఆ విషయమట్లా ఉండనీ. నేను సంపద కావాలనీ, యుద్ధం జరగకుండ ఉండాలనీ కోరుకొంటున్నాను. యుద్ధం వలన ధననష్టం, వంశనాశనం జరుగుతుంది. ఈ రెండూ జరగని ఉపాయంతో ఎట్లాగయినా బాగు పడటం మిక్కిలి సముచితం కదా!

విశేషం: 1. పాండవోద్యోగ సారసర్వస్వ మనదగిన పద్యం ఇది. ఉద్యోగపర్వానికి గుండెకాయవంటిది.

2. కావున- అనే నిశ్చితార్థంతో మొదలు కావటం రచనాశిల్పం.

3. యుద్ధం లేకుండా శాంతి పొందటం ప్రస్తుత కర్తవ్యం - అని ఫలితాంశ ప్రతిపాదనం.

4. దూతకార్యంలో లక్ష్యం శాంతి. ఆ శాంతిని సాధించే మార్గంలో రక్షించబడవలసిన మూల్యాలు మూడు. అవి:

(1) రాజ్య సంపద కావాలి. (2) కాని, యుద్ధం జరగకూడదు. (3) సంపద నష్టం కాకుండా, కులక్షయం కాకుండా మరే మార్గంలోనైనా, ఏ పద్ధతిలో నయినా కార్యం చక్కబడాలి.

ఈ ప్రణాళిక ధర్మజుడి ఉద్యోగంలోని ధర్మనీతి. ఇంతటితో ధర్మజుడి ప్రధాన ప్రతిపాదనం ముగిసింది. (సంపా.)

చ. **మనమునఁ బక్షపాతగతి మాదెస మానుము ధర్మనీతి వ**
ర్తనముల రెండు దిక్కుల హితంబును బెంపును గల్గునట్టి చొ
ప్పున విదురాది సజ్జనుల బుద్ధికి రా నుచితంబుతోడి మె
ల్పునఁ బరుసందనంబునను భూపతులెల్ల నెఱుంగ నాడుమీ! **23**

ప్రతిపదార్థం: మనమునన్= నీ హృదయంలో; మా దెసన్= మా విషయమై; పక్షపాతగతిన్= అభిమానం చూపటం; మానుము= వదలి పెట్టుము; ధర్మనీతివర్తనములన్= ధర్మంతో నీతితోకూడిన నడవడికలతో; రెండు దిక్కులన్= ఇరుపక్షాలకూ; హితంబును= మేలును; పెంపును= అభివృద్ధియు; కల్గునట్టి చొప్పునన్= సమకూడే రీతిలో; విదుర+అది= విదురుడు మొదలైన; సజ్జనుల బుద్ధికిన్+రాన్= సత్పురుషుల మనసునకు సమ్మతమయ్యేటట్లుగా; ఉచితంబుతోడి మెల్పునన్= అనువైన మెత్తబాటుతోనూ; పరుసందనంబునను= కరకుదనంతోనూ; భూపతులు+ఎల్లన్= కురుసభలోని రాజులందరూ; ఎఱుంగన్= తెలిసికొనేటట్లు; ఆడుమీ= పలుకుము.

తాత్పర్యం: కృష్ణా! మా విషయంలో పక్షపాతం చూపవద్దు. ధర్మం, నీతి- వీటి ననుసరించి ఇరుపక్షాలకున్నూ మేలు, అభివృద్ధి సమకూరే రీతిలో, విదురుడు మొదలైన సత్పురుషుల మనసులకు సమ్మతమయ్యేటట్లుగా తగినంత మెత్తదనంతోనూ, కఠినమైన మందలింపులతోనూ కురుసభలో రాజు లందరూ గ్రహించేటట్లు మాట్లాడుము.

విశేషం: ఇంతవరకూ దౌత్య కార్య లక్ష్యాన్నీ, ప్రయోజనాన్నీ నిర్దేశించిన ధర్మరాజు ఈ పద్యం మొదలుకొని 26వ పద్యం వరకు దూత వర్తనాన్ని గురించి తన అభిప్రాయాలను తెలుపుతున్నాడు. ఇవి పరోక్షంగా ఉత్తమదూత సాధారణ లక్షణాలుగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కూడా అన్వయిస్తాయి. అవి 1. మనస్సులో పక్షపాతగతి మానాలి. 2. ధర్మనీతి పథంలో తప్పకుండా నడవాలి. 3. ఉభయ పక్షాలకూ మేలూ, అభ్యుదయం కలిగేటట్లు మాట్లాడాలి. 4. సభ్యులలో విదురాది సత్పురుషులకు సమ్మతమయ్యేటట్లు మాట్లాడాలి. 5. అవసరాన్ని బట్టి మెత్తగానూ, కఠినంగానూ, మందలిస్తున్నట్లుగా సంభాషణ నిపుణంగా సాగించాలి. 6. సభలోనున్న రాజులందరూ పాండవుల ఉద్యోగాన్ని సక్రమంగా, సమగ్రంగా తెలిసికొన గలిగేటట్లు మాట్లాడాలి. మహాభారతంలో- దూతలకు ఉండదగిన ఈ లక్షణాలన్నీ చెప్పింది ధర్మజుడు. ఆచరించి చూపింది శ్రీకృష్ణుడు. (సంపా.)

చ. తగవునఁ బోక రాజు బెడిదంబులు వల్కినయేని సైఁచి యొ
ప్పగ నిలుమీ; గురుత్వముఁ బ్రభుత్వమునుం గల పెద్దవారి మా
ట గొనమి యా సుయోధను కడన్ నిలువన్ మన మెల్ల గారవం
బుగఁ గురువృద్ధ పల్కుఁ దలఁపుం జన నిచ్చిన మెచ్చరే జనుల్? 24

ప్రతిపదార్థం: రాజు= దుర్యోధనుడు; తగవునన్+పోక= న్యాయమార్గాన నడువక; బెడిదంబులు= కఠినవాక్యాలు; పల్కిన+ ఏనిన్= మాట్లాడినట్లయితే; సైఁచి= సహించి; ఒప్పగన్+నిలుమీ= చక్కగా నిలబడుము; గురుత్వమున్= పెద్దరికం; ప్రభుత్వమునున్= రాచరికమున్నూ; కల= కలిగిన; పెద్దవారిమాట= వృద్ధుల వచనం; కొనమి= ఆదరించకుండటం; ఆ సుయోధను కడన్+నిలువన్= ఆ దుర్యోధనుడి దెసనుండగా; మనము+ఎల్లన్= మనమందరమూ; గారవంబుగన్= మర్యాదతో; కురువృద్ధ పల్కున్= కౌరవులలో పెద్దవారైన భీష్మాదుల మాటను; తలఁపున్= ఉద్దేశమును; చనన్+ఇచ్చినన్= సాగనిస్తే; జనుల్= లోకులు; మెచ్చరే?= మనలను పొగడకుందురా?

తాత్పర్యం: న్యాయ మెంచక దుర్యోధనుడు పరుష వాక్యాలు పల్కితే సహించవలసింది. తొందరపాటున సభ విడిచి రావద్దు. పెద్దరికం, రాచరికంగల పెద్దలమాట సుయోధనుడు వినలేదనే నింద వాడి తలపై వేయవలసింది. మనం గౌరవంగా కురువృద్ధులైన భీష్మాదుల మాటనూ, ఉద్దేశాన్నీ సాగనిస్తే లోకులు మనలను మెచ్చుకొంటారు.

విశేషం: ఈ పద్యంలో ధర్మరాజు కురుసభలో ఏర్పడే సంఘటనలను బుద్ధిబలంతో ఊహించి ఆయా సందర్భాలలో శ్రీకృష్ణుడు వ్యవహరించవలసిన తీరులను నిర్దేశించాడు. అవి-

(1) దుర్యోధనుడు అన్యాయంగా, అసభ్యంగా, పరుషంగా పలికినా, వ్యవహరించినా వాటిని సహించి సభలో నిగ్రహంతో ఉండాలి. తొందరపడి సభ వెలువడి రావద్దు. ఇది కీలకాంశం.

(2) సభలోని పెద్దలు దుర్యోధనుడి దుష్ప్రవర్తనాన్ని వారిస్తారు. నిందిస్తారు, అతడికి హితవులు బోధిస్తారు. అతడు వారి మాటలు వినడు. ఆ నింద అతడికి నిండు కొలువులో ఏర్పడేటట్లు నిబ్బరంగా నిలిచి నిర్వహించాలి.

(3) ధృతరాష్ట్రుడు పెద్దలు చెప్పిన మాటలు విని, వారికి అనుకూలంగా మాట్లాడి, కొడుకును వారించవచ్చును. ఆ పరిస్థితిని గమనించి, ధృతరాష్ట్రుడి ఆనతిని మనం గౌరవిస్తున్నట్లు వ్యవహరించి, అతడి మాట సాగేటట్లు చేయాలి. అంటే దుర్యోధనుడి మాట కాదని పాండవులకు ధృతరాష్ట్రుడు రాజ్యభాగం ఇచ్చే పరిస్థితులను కలిగించి ఫలప్రాప్తిని సాధించాలి.

(4) దీనినే సామభేదోపాయాల నిపుణ ప్రయోగమంటారు రాజనీతిలో. దీనివలన యుద్ధం లేకుండానే పాండవులకు రాజ్యభాగం దక్కే అవకాశా లేర్పడతాయి. (సంపా.)

మ. సుతువాఁడై వినయంబు సేకొనక యేచొప్పున్ దగం జెప్ప కా
ధృతరాష్ట్రుం డవినీతిఁ జేసినను సంధింపంగ రాదంచు వే

గ తెగంబాఱకు తెంపుసేయునెడ లోకంబెల్ల మెచ్చం బ్రకా

శిత ధర్మస్థితి నొంది మా మనము నిశ్చింతంబుగాఁ జేయుమీ! 25

ప్రతిపదార్థం: ఆ ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు; సుతువాఁడు+ఐ= కుమారుడి పక్షం వహించినవాఁడై; వినయంబు చేకొనక= విధేయత చూపక; ఏ చొప్పున్= ఏ మార్గమునూ; తగన్+చెప్పక= యుక్తంగా తేల్చక; అవినీతిన్ చేసినను= అవినీతితో వర్తించినట్లయితే; సంధింపంగన్+రాదు+అంచున్= సంధి చేయటం పొసగదని; వేగ= వెంటనే; తెగన్+పాఱకు= సాహస కార్యానికి పూనవద్దు; తెంపు+చేయు+ఎడన్= సాహసానికి పూనుకొనవలసినప్పుడు; లోకంబు+ఎల్లన్+మెచ్చన్= జనులందరూ కొనియాడునట్లుగా; ప్రకాశిత ధర్మస్థితిన్+ఒంది= ప్రకటితమైన ధర్మంలో నెలకొన్నవాడవై; మా మనమున్= మా హృదయాన్ని; నిశ్చింతంబుగాన్+చేయుమీ= నిర్విచారంగా ఉండేటట్లు కావించవలసింది.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్ర మహారాజు కుమారుడి పక్షం వహించి వినయం వీడి ఏ అభిప్రాయం వెల్లడించక అవినీతితో మెలగినప్పుడు ఇక నేమాత్రం సంధి పొసగదని వెంటనే సాహసించవద్దు. సాహసం చేయవలసివస్తే జనులంతా కొనియాడేటట్లు ప్రకటిత ధర్మమందు నిలిచిన వాడవై మా మనసు విచారరహితంగా ఉండేటట్లు చేయవలసింది.

విశేషం: 1. ఒకవేళ- అనుకొన్నట్లు ధృతరాష్ట్రుడు వ్యవహరించక దుర్యోధనుడి దుర్నీతిని సమర్థించి అవినీతితో ప్రవర్తించి, రాజ్యభాగాన్ని ఇవ్వదలచకపోతే సంధికార్యం చెడిపోయిందని వెంటనే సభను వదలిపెట్టి రావద్దు.

2. సాహసించి నిండు కొలువులో నిలబడి ప్రజలందరూ గ్రహించేటట్లు పాండవుల ధర్మస్థితి ప్రకటితమయ్యేటట్లు గంభీరంగా ఉపన్యసించుము. ప్రజలు పాండవ ప్రయత్నాలు తెలిసికొని సత్యధర్మస్థితిని సమర్థిస్తే చాలు. రాయబారం సఫలమైనట్లే. అంటే సామదాన భేదాల ప్రయోగాన్ని కౌరవులు తిరస్కరించి యుద్ధోపాయానికి దారిచూపినట్లే ఔతుంది. (సంపా.)

ఆ. ఇన్ని సంకటముల నిబ్బంగి నెంతయు । నొగులు చిత్తవృత్తి నొవ్వు దీర్ప

వెజ్జ వీవకావె! వేయేల? యేగతి । నడపఁ దలఁచి తదియ నాకుఁ బ్రియము.' 26

ప్రతిపదార్థం: ఇన్ని సంకటములన్= ఇన్ని చిక్కులతో; ఈ+భంగిన్= ఈ విధంగా; ఎంతయున్= మిక్కిలి; నొగులు= వికలమౌతున్న; చిత్తవృత్తి నొవ్వు= మనో వ్యాపారము యొక్క వేదనను; తీర్పన్= తొలగించటానికి; వెజ్జవు= వైద్యుడవు; ఈవు+అ+కావె!= నీవే కదా!; వేయి+ఏల= పలుమాట లెందుకు?; ఏ గతిన్= ఏ రీతిగా; నడపన్+తలఁచితి(వి)= మమ్ములను ముందుకు నడిపించ దలచుకొన్నావో; అది+అ= అదే; నాకున్+ప్రియము= నాకిష్టం.

తాత్పర్యం: కృష్ణా! ఇన్ని చిక్కులతో ఈ ప్రకారంగా నా మనస్సు వికలమై వేదన చెందుతున్నది. నా మనో బాధను తొలగించుటకు తగిన వైద్యుడవు నీవుకాక మరెవ్వరు? ఇన్ని మాటలెందుకు? నీవు మమ్ము ఏ మార్గాన నడిపించ నెంచావో ఆ మార్గంలో నడవటమే నాకు సమ్మతం.'

విశేషం: 1. ధర్మరాజు తన చిత్తం చిక్కులతో ఈ విధంగా వేదనపడుతున్నదని చెప్పాడు. అంటే ఆయన తన మనసులోని బాధనే వెళ్ళగ్రక్కాడన్న మాట. అంటే శ్రీకృష్ణుడికి తన బాధను నివేదించుకొన్నాడన్నమాట! ఆయనది ఆదేశం కాదనీ, నివేదనమనీ నిపుణంగా చెప్పాడు. ఇది వాస్తవంగా గోచరించే రాజనీతి. ఆ సంగతి శ్రీకృష్ణుడికి తెలుసు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

2. ధర్మరాజు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించవలసిన విధానాలు, ఫలితాంశాల అంచనాలు సంక్లిష్టంగా ఉన్నాయి. అఘటనా ఘటన సామర్థ్యం ఉంటేనే అవి సాధ్యాలవుతాయి.

3. నొవ్వు తీర్చే వైద్యుడు శ్రీకృష్ణుడని ధర్మరాజు సాభిప్రాయంగా అన్నాడు. ఆ నొవ్వేమిటి? ఆ మందేమిటి?

(1) కౌరవులమీద నిందపడకుండా తాను యుద్ధం ప్రకటించవలసి వస్తుందేమోనని ధర్మజుడి బాధ. ఆ బాధను తొలగించే మందు రాయబారం.

(2) దుర్యోధనుడి దుర్నయాన్ని ధృతరాష్ట్రుడు పుత్రవ్యామోహంతో సమర్థిస్తూ సంధి కార్యాన్ని భగ్నం చేస్తే తప్ప యుద్ధం ధర్మనీతియుక్తం కాదు. కౌరవసభలో దాని కనుగుణంగా కథ నడిపే కథానాయకుడుగా ఒక మహావ్యక్తి కావాలి. అది నెరవేరాలని ధర్మజుడి బెంగ. దానిని తీర్చగలిగిన మానసిక వైద్యుడు శ్రీకృష్ణుడు.

(3) దుర్యోధన ధృతరాష్ట్రులు దుర్నీతి ప్రదర్శించినా, భీష్మాదులు, రాజులు, మిత్రులు, ప్రజలు, పాండవ యత్నాన్ని విని హర్షించి కౌరవులను నిందించి, పాండవోద్యోగాన్ని సమర్థించాలి. ఆ విధంగా శత్రు శిబిరంలో భేదోపాయాన్ని ప్రయోగించాలని ధర్మజుడి చింత. ఆ చింతను, వంతను తీర్చగలవాడు శ్రీకృష్ణుడు.

(4) రోగి తన రోగ లక్షణాలను తన బాధను వైద్యుడికి చెప్పుతాడు. బాధానివారణ వైద్యుడి కర్తవ్యం. కాని, చికిత్స విధానం ఆయనదే ఔతుంది. శ్రీకృష్ణుడు మహాత్ముడైన దివ్య పురుషుడు. సాక్షాత్ నారాయణుడు. అతడి సంకల్పం ప్రకారమే కార్యం నడుస్తుంది, నడుస్తున్నది. అయితే, నారాయణుడు భక్తవత్సలుడు. మొరపెట్టుకొన్న వారిని రక్షిస్తాడు. వారికి ప్రియం చేకూరుస్తాడు. 'మ్రొక్కిన వరమిచ్చు వేల్పు' శ్రీకృష్ణుడు. అందుకే వేయేల? ఏగతి నడపఁ దలఁచితి, అదియ నాకుఁ బ్రియము' అని 'అన్యథా శరణం నాస్తి' అని వేడుకొంటూ దైవసంకల్పమే తన సంతోషంగా పేర్కొని ముగించాడు.

(5) 'ఆపదఁ గడవం బెట్టఁగ' (6వ పద్యం) అని మొదలు పెట్టి 'ఇన్ని సంకటముల నిబ్బంగి' అని ముగించే ఈ పద్యాల ఎత్తుగడలలో ఒకే విధమైన మనఃస్థితి ఉండటం, శ్రీకృష్ణుడిని దివ్యాత్ముడిగా భావించే భక్తిభావం ప్రకటితం కావటం గమనిస్తే తిక్కన పూర్వాపరకావ్య కథార్థ సమన్వయ శిల్పం స్పష్టమవుతుంది. (సంపా.)

వ. అని చెప్పి తలంచికొని వెండియు నిట్లనియె : 27

తాత్పర్యం: అని పలికి, ఏదో భావం మనసుకు రాగా, మళ్ళీ ఇట్లా అన్నాడు:

విశేషం: 'తలంచికొని' - అభినయ విశేష వ్యంజకం. పాదరసం వంటి బుద్ధిగల ధర్మరాజు - శ్రీకృష్ణుడు కురుసభకు పోతే ఏయే సన్నివేశాలు జరుగవచ్చునో, ఏయే విపరీత పరిస్థితులు శ్రీకృష్ణుడు ఎదుర్కొనవలసి వస్తుందో ఊహించాడు. బహుశః దుర్యోధనాదులు శ్రీకృష్ణుడిని ఒంటరివాడిని చేసి బంధించవచ్చును, సంహరించవచ్చును. ఒకవేళ అటువంటి గడ్డు పరిస్థితినే ఎదుర్కొనవలసి వస్తే యుద్ధ ప్రయోజనాల కొరకు శ్రీకృష్ణుడిని నిష్ప్రయోజనంగా బలిపెట్టుకొనవలసి వస్తుందేమో-అనే భావం ధర్మజుడి మనసులో మెరసినట్లుంది. మరల మాట్లాడటం మొదలు పెట్టాడు. ఆలోచనాముద్రలో ఉన్న ధర్మజుడిని గమనించి, అత డింకా మాట్లాడే అవకాశమున్నదని ఎవరూ పలకటానికి ముందుకు రాలేదు. ఇవన్నీ నిశ్శబ్దంగా ధ్వనింపబడే తిక్కన నాటకరంగ సూచనలు. (సంపా.)

క. 'నీవు సుయోధను పాలికిఁ । బోవఁగ వలదనియు నొక్క బుద్ధి వొడమెడున్;
గోవింద! యతఁడు మంత్రులుఁ । గావరమునఁ జక్క వినరు కార్యవచనముల్. 28

ప్రతిపదార్థం: గోవింద= కృష్ణా!; నీవు= నీవు; సుయోధనుపాలికిన్= దుర్యోధనుడి దగ్గరకు; పోవఁగన్+వలదు= వెళ్ళవద్దు; అనియున్= అనికూడ; ఒక బుద్ధి పొడమెడున్= ఒక తలంపు కలుగుతున్నది; అతఁడు= ఆ సుయోధనుడు; మంత్రులున్= ఆతడి సచివులు; కావరమునన్= పొగరుబోతుతనంతో; కార్యవచనముల్= సంధి మాటలు; చక్కన్+వినరు= శ్రద్ధగా ఆలకించరు.

తాత్పర్యం: 'కృష్ణా! నీవు దుర్యోధనుడి దగ్గరకు వెళ్ళటం సముచితం కాదని కూడా నాకొక తలంపు కలుగుతున్నది. అతడూ, ఆతడి మంత్రులూ పొగరుబోతులు. వారు నీ సంధివచనాలు శ్రద్ధగా చెవులబెట్టరు.

తే. **కుటిలమతు లవినీతులు క్రూరకర్ము; । లట్టి నీచుల కడకు ని న్ననుపఁజాల;**
నీవు సంకటపడియెడు దేవపదవి । యైన నే నొల్ల; నొంటి యం దరుగు టుడుగు.' **29**

ప్రతిపదార్థం: కుటిలమతులు= కుచ్చితపు బుద్ధిగలవారు; అవినీతులు= అడకువ లేనివారు; క్రూరకర్ములు= ఘోరకృత్యాలు చేసేవారూ అయిన; అట్టి నీచుల కడకున్= అటువంటి తుచ్ఛులైన కౌరవుల వద్దకు; నిన్నున్= నిన్ను; అనుపన్+చాలన్= పంపలేను; నీవు సంకటపడియెడు= నీవు శ్రమల పాలు కావలసిన; దేవపదవి+ఐనన్= స్వర్గరాజ్యమైనా; నేను+ఒల్లన్= నేనిష్టపడను; ఒంటిన్= ఒంటరిగా; అందున్+అరుగుట+ఉడుగు(ము)= అక్కడికి వెళ్ళటం మానవలసింది.

తాత్పర్యం: కృష్ణా! దుర్యోధనాదులు వక్రబుద్ధి గలవారు, వినయరహితులు, దారుణకృత్యాలకు పాల్పడేవారు. అట్లాంటి తుచ్ఛుల దగ్గరికి నిన్ను పంపలేను. నిన్ను చిక్కులపాలు చేసే ఇంద్రపదవిని సైతం నేను వాంఛించను. కనుక కౌరవుల కడకు నీవు ఒంటరిగా వెళ్ళటం మానుకో.'

విశేషం: 1.28, 29 పద్యాలలో ధర్మజుడు శంకించినవన్నీ ఊహలుగా అనిపించినా, అతడు శంకించినట్లుగానే అవి జరుగబోతున్నాయి. అంటే ధర్మరాజు ఆగామిని అంత నిర్దిష్టంగా దర్శించగల ప్రజ్ఞావంతు డన్నమాట!

2. త్రిలోకపదవికంటె శ్రీకృష్ణుడి క్షేమం ధర్మజుడికి ప్రియం- అనే వాక్యం పాండవుల అనన్యభక్తికి ప్రత్యక్షర సాక్ష్యం.

3. దీనికి మూలం : "నహినః ప్రణయే ద్ద్రవ్యం, నదేవత్వం కుతః సుఖమ్ । న చ సర్వామరైశ్వర్యం తవరోధిన మాధవ!" (5.70.84). 'ఒంటి యం దరుగుటుడుగు' అనే మాట అమూలకం. అయినా ప్రకరణోచితం" (సంపా.)

చ. **అనవుడుఁ గృష్ణుఁ డిట్లనియె 'నా ధృతరాష్ట్రుఁడు నట్టివాఁడ త**
త్తనయుఁడ యేల; నీ పలుకు తథ్యము; నీ తలఁ పే నెఱింగితి;
న్మనమున శంక దక్కుము; వినన్ వలతే విను; మేను నిక్క మ
ల్గిన నచటం గలండె రణకేళికి మార్కొన నొక్కఁడేనియున్? **30**

ప్రతిపదార్థం: అనవుడున్= ధర్మజుడు అట్లా పలుకగా; కృష్ణుఁడు= వాసుదేవుఁడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; తత్+తనయుఁడ+ఏల?= అతని కుమారుడైన సుయోధను డొక్కడే యేమి?; ఆ ధృతరాష్ట్రుఁడున్+అట్టివాఁడు+అ= ఆంబికేయుడును అట్లాంటివాడే; నీ పలుకు తథ్యము+అ= నీమాట నిజమే; నీ తలఁపు= నీ భావం; ఏను+ఎఱింగితిన్= నేను తెలిసికొన్నాను; మనమునన్= నీ హృదయంలో; శంక+తక్కుము= అనుమానం మాను; వినన్ వలతేన్= నా మాటలు వినగోరితే; వినుము= వినుము; ఏను= నేను; నిక్కము= నిజంగా; అల్గినన్= నిజంగా ఆగ్రహిస్తే; అచటన్= ఆ కురుసభలో; రణకేళికిన్= యుద్ధ క్రీడకు; మార్కొనన్= ఎదిరించటానికి; ఒక్కఁడు+ఏనియున్= లెక్కకు ఒక్కడైనా; కలండె?= ఉన్నాడా?

తాత్పర్యం: ధర్మజుడి మాటలకు శ్రీకృష్ణుడు ఇట్లా బదులు పలికాడు. 'సుయోధను డొక్కడేయేమి, ఆతడి తండ్రి ధృతరాష్ట్రుడుగూడ నీవు పల్కిన తీరువాడే. నీ మాట సత్యం. నీ భావ మేమిటో నేను గ్రహించాను. నీవు మనసులో సందేహించ వద్దు. నా మాటలు వినదలిస్తే వినుము. నేను నిజంగా ఆగ్రహిస్తే అక్కడ యుద్ధంలో న న్నెదిరించగలవాడు ఒక్కడైనా ఉన్నాడా?

విశేషం: 1. ఒంటరిగా కురుసభకు వెళ్ళటం మానుమని స్నేహ పురస్సరంగా ధర్మరాజు అన్నాడు. దానికి శ్రీకృష్ణుడు ఆర్ద్రుడయ్యాడు. ధర్మజుడి మనసులో ఉన్న శంక తొలగించాలని ఈ పద్యంలోని మాటలన్నాడు. ధర్మజుడివలెనే శ్రీకృష్ణుడు చిన్న చిన్న వాక్యాలతో తన మనోభావాన్ని తెలిపాడు. దుర్యోధన ధృతరాష్ట్రుల స్వభావా లటువంటివే అని ఒప్పుకొన్నాడు. ధర్మజు డనిన మాటలన్నీ నిజాలనీ (నిజాలౌతాయనీ) చెప్పాడు. 'నీతలఁ పే నెఱింగితి'- అనే వాక్యం బహుళార్థకం. ధర్మజుడు తన ఉపన్యాసంలో కోరుతున్న తాత్పర్యాన్ని, అంతరార్థాన్ని అవగాహనం చేసికొన్నానని ఒక అర్థం. కురుసభకు పోతే ఏర్పడే అపాయాన్ని గురించి శంకిస్తున్న ధర్మజుడి ఆత్మీయతను గ్రహించానని మరొక అర్థం. మనస్సులో శంకను మానేయమన్న వాక్యం - రెండర్థాలకూ వర్తిస్తుంది. 'వినవలతేన్ వినుము'- అనే వాక్యం శ్రీకృష్ణుడి అభిమానోక్తి, వీరోక్తి, ఒంటరిగా వెళ్ళినా, ఎంద రెదిరించినా, నిజంగా కోపించి యుద్ధానికి దిగితే శ్రీకృష్ణుడికి ఎదురైన వాడు కురుసభలో లేడని చెప్పి, 'నే నొక్కడినే, నావలె మరొక్కడున్నాడా?' అని వీరోక్తి పలికాడు. ఒక్కడు - అంటే ఒంటరివాడు అని ఒక అర్థం. ఏకైక వీరుడు అని మరొక అర్థం. శ్రీకృష్ణు డొక్కడైనా ఏకైక వీరుడని ధ్వని. ఇవి సంభాషణ చమత్కారాలని భావించినా, శ్రీకృష్ణుడి మాటలు కూడా కురుసభలో సత్యాలు కాబోతున్న భావికథార్థ ధ్వనులవలె వెలుగొందుతున్నాయి. ఈ పద్యంలో శ్రీకృష్ణుడి దివ్యాదివ్య స్వభావం ధ్వని.

2. ఇందులో అర్థవ్యక్తి అనే గుణం భాసిస్తున్నది. శ్రీకృష్ణ స్వభావ స్ఫుటత్వం ఇందులోని అర్థగుణదీప్తి. (సంపా.)

క. పనుపుము కౌరవసభ; కేఁ । జను టెట్లును మేల; యర్థ సంసిద్ధియగున్;
మన కొకటం బాపము రా । కునికికిఁ గతమైన పలుకు లొండెను గలుగున్.' 31

ప్రతిపదార్థం: కౌరవసభకున్= కౌరవుల కొలువు కూటానికి; పనుపుము= నన్ను పంపుము; ఏన్= నేను; చనుట= అచటికి వెళ్ళటం; ఎట్లును+మేలు+అ= ఏ విధంగా ఆలోచించినా అది మంచిదే; అర్థ సంసిద్ధి+అగున్= మన ప్రయోజనం నెరవేరుతుంది; మనకున్= మనకు; ఒకటన్= ఏ రకంగానూ; పాపము రాక+ఉనికికిన్= దురితం రాకుండటానికి; కతము+ఐన= కారణమైన; పలుకులు+ఒండెను= మాటలైననూ; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: నన్ను కౌరవ సభకు పంపుము. నేనచటికి వెళ్ళటం ఎంతైనా మంచిది. మన కార్యం నెరవేరుతుంది. లేదా మనకు పాపం సంభవించని పలుకులైనా పలకడానికి వీలవుతుంది.'

విశేషం: ఈ పద్యం ధర్మరాజు హృదయాన్ని పూర్తిగా తెలిసికొన్న దూత పలికినట్లుండటం విశేషం. ప్రతి వాక్యం ప్రయోజనాత్మకం.

(1) 'నన్ను కౌరవసభకు పంపుము'- శ్రీకృష్ణుడు స్వతంత్రుడుగా కౌరవసభకు పోయినట్లు కాకుండా ధర్మజుడి రాయబారిగానే వెళ్ళుతున్నట్లు సూచించి, ధర్మరాజ ప్రభుత్వాన్ని గౌరవించాడు, మన్నించాడు.

(2) 'నేను వెళ్ళటం అన్ని విధాలా మంచిది'- ఈ మాట నిజం. ధర్మజుడు సామదాన భేదోపాయాలను ప్రయోగించి, అవన్నీ కౌరవులవలననే భంగమయ్యాయని నిరూపించగల వ్యక్తిని కోరుతున్నాడు. అతడి ఆశయాల నన్నింటిని నెరవేర్చటమే కాక,

చూచి రమ్మంటే కాల్చి వచ్చే సమర్థుడు శ్రీకృష్ణుడు. కర్ణుడితో సాగించిన మంతనాలవంటివి శ్రీకృష్ణుడే చేయగలడు. అవెంతో మేలు చేశాయి. అందువలన సర్వసమర్థుడైన రాయబారి శ్రీకృష్ణుడని స్పష్టం.

(3) ధర్మరాజు కోరినట్లు అర్థసిద్ధి అయ్యేటట్లు, పాపం రానట్లు, కీర్తి కలిగేటట్లు మాట్లాడతానని శ్రీకృష్ణుడు పలకటం ధర్మరాజుకు పరిపూర్ణ సంతృప్తి నిచ్చింది. అర్థమంటే సంపద, ప్రయోజనం అని రెండర్థాలు. ఇక్కడ మొదట సంధి ప్రయోజనసిద్ధి, ఆ తరువాత యుద్ధ విజయసిద్ధి అని గ్రహించవచ్చును. ధర్మజుడి విస్తృతోపన్యాస సారాంశం ఒక కంద పద్యంలో అందంగా చెప్పాడు కృష్ణుడు. ధర్మజుడు గడుసుగా మాట్లాడగలడు. ఒడుపుగా మాట్లాడగలడు. (సంపా.)

వ. అని పలికిన యుధిష్ఠిరుం డిట్లనియె: 32

తాత్పర్యం: శ్రీకృష్ణుని మాటలకు ధర్మనందనుడు ఇట్లా అన్నాడు:

ఆ. 'మేలుగాక నీకుఁ బోలినట్లయిన నం। దరిగి యేము వారు నర్థిఁ బొంది
యుండునట్లుగాఁగ నొడఁబాటు గావింపు। మెల్లభంగి మనకు నిదియ లెస్స. 33

ప్రతిపదార్థం: మేలుగాక!= శుభమగుగాక;! నీకున్= నీకు; పోలిన+అట్లు+అయినన్= యుక్తమని తోస్తే; అందున్+అరిగి= కౌరవసభకు వెళ్ళి; ఏము= మేము; వారు= కౌరవులు; అర్థిన్= ప్రీతితో; పొంది+ఉండునట్లు కాఁగన్= కూడిఉండేటట్లు; ఒడఁబాటు కావింపుము= అంగీకారం కుదుర్చుము; ఎల్లభంగిన్= అన్ని విధాల; మనకున్= మనకు; ఇది+అ లెస్స= సంధియే మేలు.

తాత్పర్యం: 'కృష్ణా! మంచిది. కురుసభకు వెళ్ళటం నీకు యుక్తమని తోస్తే వెళ్ళి మేమూ, వారూ కలసి మెలసి ఉండేటట్లుగా సంధి కుదుర్చుము. అన్ని విధాలా వారితో సంధి కుదుర్చుకొనటమే మనకు మంచిది.

క. మ మ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు। నెమ్మి యెఱుఁగు దర్థసిద్ధి నెఱి యెఱుఁగుదు వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు। పా మ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్. 34

ప్రతిపదార్థం: మమ్మున్+ఎఱుఁగుదు(వు)= మేమెట్లాంటి వాళ్ళమో ఎరుగుదువు; ఎదిరిన్+ఎఱుఁగుదు(వు)= కౌరవు లెట్టివారో ఎరుగుదువు; నెమ్మిన్+ఎఱుఁగుదు= కూర్మిఅనగా ఎటువంటిదో ఎరుగుదువు; అర్థసిద్ధినెఱి+ఎఱుఁగుదు(వు)= కార్యసాధన విధాన మెట్టిదో ఎరుగుదువు; వాక్యమ్ముల పద్ధతిన్+ఎఱుఁగుదు(వు)= మాటలాడే తీరు ఎట్టిదో ఎరుగుదువు; నీకున్+బుద్ధులు+చెప్పన్= నీకు ఉపాయాలు బోధించటానికి; నేను+ఎవ్వఁడన్= నేనేపాటివాడిని; పొమ్ము= హస్తినాపురికి వెళ్ళిరమ్ము.

తాత్పర్యం: కృష్ణా! పాండవులూ, కౌరవులూ ఎట్లాంటివారో ఎరుగుదువు. కూర్మి అంటే ఎట్టిదో ఎరుగుదువు. కార్యసాధన విధాన మెట్టిదో ఎరుగుదువు. మాటలాడు తెరగెట్టిదో ఎరుగుదువు. నీకు ఉపాయాలు చెప్ప నేనే పాటివాడిని?, హస్తినకు వెళ్ళి రమ్ము.'

విశేషం: 1. ఈ పద్యం పైకి ప్రశంసావాక్యం, లోన దూతలక్షణవివేకం.

2. ధర్మరాజు చేసిన ఉపన్యాసంలోని లోగుట్టులు తెలిసిన వ్యక్తి శ్రీకృష్ణుడే. మిగిలిన వారికి చూచాయగా మాత్రం గోచరమై ఉండవచ్చును. శ్రీకృష్ణుడు ఆవులిస్తే ప్రేవులు లెక్క పెట్టగలవాడని అతడి సమాధానం బైటపెట్టింది. దానికి లోలోన సంతోషించి ముసి ముసి నవ్వులతో ప్రశంసల జల్లులు కురిపించాడు ధర్మరాజు. 'ఎఱుగుదు(వు)' అనే క్రియను అయిదుసార్లు వాడాడు. ఆరవసారి వాచ్యం చేయకుండా ధ్వనిమయం చేసి సర్వజ్ఞత్వాన్ని సూచించాడు.

3. శ్రీకృష్ణుడిని 'దివ్యుడిగా సర్వజ్ఞుడిగా ప్రశంసించిన తాత్పర్యం ఇది. మమ్ములను గురించి తెలుసు. ఆపైన ఎదుటి వారిని గురించి తెలుసు అనటంలో పాండవాధిక్యాన్ని తెలిసినవాడివని భావం. శ్రీకృష్ణుడిని రాయబారిగా ప్రశంసించిన తాత్పర్యంలో 'నీకు ఉభయ పక్షాలూ తెలు'సని భావం. 'ఇరువురికి ఉన్న అనుబంధ మెటువంటిదో తెలుసు. వాక్య రచనా పద్ధతులు తెలుసు. ఇన్ని తెలిసిన సర్వజ్ఞుడైన నీకు ధర్మనీతులు చెప్పటానికి నేనెంత వాడను?' అని ఒక అర్థం. 'నీకు ఉపాయాలు చెప్పేటంత వాడినా నేను?'- అని మరొక అర్థం. అన్ని వాక్యాలూ ఒక ఎత్తు; చివరివాక్యం ఒక్కటీ ఒక ఎత్తు. ముగింపు వాక్యాన్ని మెరిపించిన వాడే మహావక్త. ఈ పద్యంలో చివరి వాక్యం- తెలుగుదనం పుక్కిట పట్టిన వాక్యం. అప్యాయతకు అచ్చమైన నిదర్శనం. ముచ్చటైన ముగింపు. (సంపా.)

శ్రీకృష్ణుఁడు ధర్మరాజుతోఁ గౌరవుల దుర్ణయంబు సెప్పుట (సం. 5-71-1)

సీ. అనిన ముకుందుఁ డిట్లనియె; 'సంజయుని మా । టలును నీవన్న పల్కులును వింటి;
నీమది ధర్మైకనిష్ఠమై యున్నది; । వైరంబు విడువరు వారు; ద్రోణ
భీష్ములు గలరని బిరుదులై యున్న వా; । రగునె రాజన్యుల కడఁగి కుడువ?
నక్లేశవృత్తి రాజ్యము చవి గొన్న వా । రేల యిత్తురు నీకుఁ బాలు సెపుమ!
తే. ధార్తరాష్ట్రులు సడికి నధర్మమునకు । నలుక రెన్నఁడు; విడువు దైన్యంబు; పోడువు
కయ్య మరివర్గ జయమునఁ గలుగు నిహ ప । రములుఁ జిరకీర్తియును బాండురాజతనయ! 35

ప్రతిపదార్థం: అనినన్= ధర్మజుడు అట్లా పలుకగా; ముకుందుఁడు= మోక్షప్రదాతయగు శ్రీకృష్ణమూర్తి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా మాట్లాడాడు; పాండురాజ తనయ!= పాండురాజు పుత్రుడవైన ధర్మజా!; సంజయుని మాటలును= సంజయు డాడిన వాక్యాలూ; నీవు+అన్న పల్కులును= నీవు మాట్లాడిన మాటలూ; వింటిన్= ఆకర్ణించితిని; నీ మది= నీ హృదయం; ధర్మ+ఏకనిష్ఠమైన్+ఉన్నది= ధర్మమునందే ముఖ్యంగా నెలకొని ఉన్నది; వారు= కౌరవులు; వైరంబున్+విడువరు= విరోధాన్ని మానరు; ద్రోణభీష్ములు= గురుడూ, పితామహుడూ; కలరు+అని= తమ పక్షంలో ఉన్నారని; బిరుదులు+ఐ= శూరులై; ఉన్నవారు= ఉన్నారు; రాజన్యులకున్= క్షత్రవంశజులకు; అడఁగి= విధేయులై; కుడువన్= భుజించటం; అగునె?= తగునా?; అక్లేశవృత్తిన్= ఎట్టి కష్టం లేకుండా; రాజ్యము చవికొన్నవారు= రాజ్యం యొక్క రుచి చూచినవారు; నీకున్= నీకు; పాలు= రాజ్యభాగం; ఏల+ఇత్తురు చెపుమ!= ఎందుకిస్తారో చెప్పుము; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుడి కొడుకులు; సడికిన్= నిందకు; అధర్మమునకున్= అన్యాయానికి; ఎన్నఁడున్= ఎప్పుడూ; అలుకరు= భయపడరు; దైన్యంబు= దీనతను; విడువు(ము)= వదలిపెట్టుము; కయ్యము పోడువు(ము)= పోరు సల్పుము; అరివర్గజయమునన్= శత్రు సమూహాన్ని జయించటంవలన; ఇహపరములున్= ఇహపరసుఖాలునూ; చిరకీర్తియున్= శాశ్వత యశమున్నూ; కలుగున్= నీకు లభించగలవు.

తాత్పర్యం: ధర్మనందనుడి మాటలు విని శ్రీకృష్ణు డిట్లా అన్నాడు. 'పాండురాజపుత్రా! సంజయు డాడిన మాటలూ, నీవు పల్కిన పల్కులూ విన్నాను. నీ మనస్సు ధర్మంలో పూర్తిగా నెలకొని ఉన్నది. కౌరవులు పగ మానరు. భీష్మ ద్రోణులు తమ పక్షంలో ఉన్నారని శూరులై నిక్కుతున్నారు. రాజులకు అణగిమణగి యాచించి భుజించటం తగదు. అనాయాసంగా లభించిన రాజ్యం రుచి మరిగిన కౌరవులు పుడమిలో పాలు పంచి నీ కెందు కిస్తారో నీవే చెప్పుము. దుర్యోధనాదులు నిందకూ, అధర్మానికీ ఎన్నడూ జంకరు. నీవు దైన్యం వదలిపెట్టుము. యుద్ధం సలుపుము. శత్రు సమూహాన్ని జయించటం వలన ఇహపరసుఖాలు సమకూరుతాయి. శాశ్వత కీర్తి లభిస్తుంది.

విశేషం: 1. ఇంతవరకు శ్రీకృష్ణుడు హస్తినాపురానికి వెళ్ళే రాయబారిగా మాట్లాడాడు. ప్రభువైన ధర్మరాజు నిర్దేశించిన ప్రయోజనాలను సాధిస్తానని నిస్సంశయంగా పలికాడు. ఇక ఇప్పుడు శ్రీకృష్ణుడు మిత్రుడుగా, హితవరిగా, సచివుడుగా పాండవులు నమ్మిన భగవంతుడుగా మాట్లాడుతున్నాడు. ధర్మరాజు ఉపప్లావ్యనగరంలో ఎట్లా వ్యవహరించుకొనాలో చెప్పుతున్నాడు. ఇది పాండవులకు వాసుదేవుడు చెప్పే హితవు.

2.'మ మ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు' అని ధర్మరాజు చేసిన ప్రశంసకు అనుగుణంగా శ్రీకృష్ణుడు తా నెఱిగిన అంశాలను ఈ పద్యంలో నివేదించాడు. 'ధర్మజుడి మనస్సు ధర్మైక నిష్ఠం. ధార్తరాష్ట్రులు నిందకూ, అధర్మానికీ ఎన్నడూ జంకరు' అని తేల్చి చెప్పాడు. "తన ధర్మాశ్రితా బుద్ధిః । తేషాం వైరాశ్రితా మతిః" (5-71-2) అని మూలం. ధర్మాధర్మాలకు సంధి కుదురుతుందా? అన్న ప్రశ్న లేవనెత్తాడు మాధవుడు. సంధి సందిగ్ధం కాబట్టి పాండవులు సమర సన్నాహం మానకూడదని హితవు చెప్పాడు. ధర్మజుడు చేస్తున్న శాంతి యత్నానికి, పాండవ యుద్ధ సన్నాహం విరుద్ధం కాదని ప్రకటించాడు. శ్రీకృష్ణుడి హితవు అనుష్ఠాన రాజనీతి.

3. తిక్కన మూలంలోని భావాలను సందర్భోచితంగా మార్చి రచించటం సర్వసామాన్యం. దానికి ఉదాహరణగా ఇక్కడ ఒక విషయం చెప్పుకొనవచ్చును. కౌరవులను గురించి చెప్తూ శ్రీకృష్ణుడు -

> **"అతి గృద్ధాః కృతస్నేహా దీర్ఘకాలం సహోషితాః**
> **కృత మిత్రాః కృతబలా ధార్తరాష్ట్రాః పరంతప". (సం. 5-71-6)**

అని అన్నాడని మూలం. 'ధార్తరాష్ట్రులు మిక్కిలి పిసినిగొట్టువారు. అయినా మీరు చాలాకాలం వారితో స్నేహం చేశారు, కలిసి మెలసి ఉన్నారు. మైత్రి పెంపొందించుకొన్నారు. బలాన్ని కూడా పెంపొందించుకొని ఉన్నారు' అనే ఈ మాటలను తిక్కన స్వీకరించక. 'అక్లేశవృత్తి రాజ్యము చవిగొన్న వారేల యిత్తురు నీకుఁ బాలు సెపుమ?' అని అనిపించాడు. ఈ వాక్యం సన్నివేశౌచిత్యాన్ని పెంచింది.

4. ఎత్తుగీతి తిక్కన పాత్రోచిత సంభాషణ కెత్తిన పతాక! ధర్మజుడి శాంతిప్రయత్నంతో పాండవ స్కంధావారంలో ఉత్సాహం కొంత మందగించినట్లు కనపడింది. అది భావి కార్యసాధనకు పోషకం కాదు. శ్రీకృష్ణు డా సమయంలో పగనూ, సమరోత్సాహాన్నీ, వీరరౌద్రరసస్ఫూర్తినీ పాండవవర్గంలో జాగృతం చేసి రసోల్లాసాన్ని కలిగించదలచాడు. అందువలననే ఎత్తుగీతిలో నినాద కవిత్వం చెప్పాడు. అందులో అంతర్గత తర్కం కూడా ఇమిడ్చాడు. 'కౌరవులు నిందకు భయపడరు కాబట్టి నీవు దైన్యాన్ని వదలిపెట్టుము: వాళ్ళు అధర్మానికి జంకరు కాబట్టి నీవు యుద్ధానికి జంకక వారిమీద దాడి చేయుము' అని రెచ్చగొట్టాడు. శత్రువులను జయించటం వలన ఇహపర సుఖాలూ, చిరకీర్తీ వస్తాయని ధర్మజుడి చిత్తవృత్తికి హత్తుకొనేటట్లు పలికాడు.

5. దూతగా శ్రీకృష్ణుడు శాంతినీ, హితుడుగా యుద్ధాన్నీ అనుసరిస్తూ ద్విముఖ పాత్ర నిర్వహిస్తున్నట్లు కనపడుతున్నా, ధర్మజుడు సాధించ దలచుకొన్న ధర్మనీతికి అది విరుద్ధం కాదని తెలిపే సంభాషణ ఇక ముందు శ్రీకృష్ణుడు సాగించటం గమనార్హం.

6. 'పాండురాజతనయ!' అనే సంబుద్ధి సార్థకం. చిరకీర్తీ, ఇహపరాలూ పాండురాజు పుత్రుడైతేనే కోరుకొంటాడని భావం.

7. ధర్మైకనిష్ఠమై ఉన్న ధర్మరాజు చిత్తవృత్తిని యుద్ధైక నిష్ఠం చేయటానికి శ్రీకృష్ణుడు ప్రయోగించిన ప్రథమ వాఙ్మయోపాయం ఈ పద్యం. (సంపా.)

మ. గురుభీష్మాదులు సూచుచుండ సభ మీకుం గీడు నాఁ డట్లు ము
ష్కరులై చేసిరి; యంతసేసియును బశ్చాత్తాపముం బొంద నో
పర వా రెన్నఁడు; నట్టిచోటఁ గృపయున్ బంధుత్వముం దక్కు; మె
వ్వరుఁ గోపింపరె యా దురాత్మకుల గర్వక్రౌర్యముల్ సూచినన్. 36

ప్రతిపదార్థం: గురు భీష్మ+ఆదులు= ఆచార్యుడైన ద్రోణుడు; పితామహుడైన భీష్ముడు మున్నగువారు; చూచుచున్+ఉండన్= వీక్షిస్తూఉండగా; సభన్= కొలువులో; మీకున్= మీకు; కీడు= అపకారం; నాఁడు= అప్పుడు; అట్లు= ఆ విధంగా; ముష్కరులు+ఐ= నీచులై; చేసిరి= చేశారు; అంత చేసియును= అంతటి కీడు చేసికూడా; వారు= కౌరవులు; ఎన్నఁడున్= ఒకనాడైనా; పశ్చాత్తాపమున్+పొందన్+ఓపరు+అ= చేసిన తప్పును గూర్చి తరువాత చింతించినవారు కారు; అట్టిచోటన్= అట్టివారి విషయంలో; కృపయున్= కారుణ్యమునూ; బంధుత్వమున్= చుట్టరికాన్నీ; తక్కుము= మానుము; ఆ దురాత్మకుల గర్వ క్రౌర్యముల్= ఆ దుష్టచిత్తుల యొక్క పొగరుబోతుతనం, క్రూరత్వం; చూచినన్= పరికిస్తే; ఎవ్వరున్+కోపింపరె?= ఎంతటి సాధువులైనా కోపగించక మానుతారా?

తాత్పర్యం: గురుడు, భీష్ముడు మొదలైన పెద్దలు చూస్తుండగా, సభలో తుచ్ఛులైన కౌరవులు మీకు ఆనాడు అపకారం చేశారు. అంతటి అపకారం చేసికూడా ఆ తరువాతనైనా, వారు చేసిన తమ తప్పుకు ఎన్నడూ పశ్చాత్తాపం ప్రకటించనేలేదు. అట్టి వారి విషయంలో కారుణ్యం, బంధుభావం విడిచిపెట్టుము. ఆ దుష్టచిత్తులయొక్క పొగరు, క్రౌర్యం చూస్తే ఎవరైనా వారిపై కోపపడకుంటారా?

విశేషం: 1. 'పగ యడగించుటెంతయు శుభంబు'- అన ధర్మరాజుఅభిమతం. అది రాజకీయానికి పనికి వచ్చే శాంతి సూక్తం. కాని, పాండవ స్కంధావారానికి అప్పు డది పనికిరాదు. కురుసభలో పగ సెగలు క్రక్కుతున్న వాస్తవం గమనించి కూడా పాండవులు పగను చల్లార్చుకొనటం సబబుకాదు. అందువలన పగకు మూలమైన కౌరవ దుష్కృత్యాన్ని శ్రీకృష్ణు డిందులో పేర్కొన్నాడు. అందులోనూ ఆ చెప్పే తీరులో ఒక క్రమోన్మీలనం గోచరిస్తుంది. శ్రోతను భావోద్వేగస్థితికి చేర్చే మాటల పొందిక కనబడుతుంది. అది శ్రీకృష్ణుడి ప్రబోధ వాక్యరచనా శిల్పం.

2. కౌరవులు వస్తుతః దురాత్ములు, పైపెచ్చు గర్విష్ఠులు, క్రూరులు. ఈ మూడు గుణా లున్నవారిని లోకంలో ఎవరైనా కోపిస్తారు! గర్హిస్తారు. దురాత్ములు అనటానికి - ద్రోణ భీష్మాదులు చూస్తూ ఉండగా నిండుసభలో పాండవులకు నీచంగా కీడు చేయటమే సాక్ష్యం. ఒకవేళ ఆవేశంలో ఆ తప్పు చేసినా, వారు గర్వాంధులు కాబట్టే చేసిన తప్పుకు పశ్చాత్తాపం కూడా ప్రకటించలేదు. ఇప్పటికీ క్రూరులై మీకు కీడే తలపెట్టుతున్నారు. అటువంటి వారిమీద దయాదాక్షిణ్యాలు కాని, బంధుత్వ మిత్రత్వాలు కాని తగవు. కాబట్టి యుద్ధం వలన బంధునాశన మవుతుందని నిర్వేదం చెందవలసిన అవసరం లేదని హితవు చెప్పాడు. కోపంతో పగసాధించటమే కర్తవ్యమని బోధించాడు.

3. 'ఎవ్వరు కోపింపరె?' అనే ప్రశ్నార్థకం వ్యంగ్యగర్భితం. 'ఎవరు కోపించరు? నీ వొక్కడివి తప్ప' అని భావం. లోకమంతటిదీ ఒకదారి, నీవొక్కడిదీ ఒకదారి - అని సున్నితమైన అధిక్షేపం. కరుడుకట్టుకొన్న భావాలను కరిగించటానికి ప్రశ్నార్థక వాక్యాలు వేడి తూటాల వంటివి. శ్రీకృష్ణుడికి వాటిప్రయోగం బాగా తెలుసు. (సంపా.)

వ. కపటపు నెత్తంబు నెపంబుగా మిమ్ము వెడలనడుచునప్పుడు దుర్యోధన దుశ్శాసన శకుని సూతనందనులు పుయిలోట దక్కి కలకల నవ్వుచుం బలికిన పలుకు లుగ్గడింపవచ్చునే? వాని విని సమస్త జనంబులు ధృతరాష్ట్రు నిందించుచు మీరు బలవంతులరయి యుండియు సత్యంబు వాటించి యూరకపోక సూచి యచ్చెరు వాటుతో నుమ్మలించుచుండిరి; తిట్టువాట్లం బోయెడువారు దైవోపహతులై మున్న చెడియుండుదురు గావున వారలం జంపనుం జెఱుపనుం జులుకన క్రూరాత్ములగు కౌరవులెల్లవారికి వధ్యులుగాఁ దగుదురు; నీకేల యవధ్యులైరి? పాపాత్మకులగు హింసకులం బాముల నెట్లట్ల నిర్విచారంబుగా వధియించుట కర్తవ్యంబు. 37

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కపటము నెత్తంబు= మోసపు జూదం; నెపంబుగాన్= మిషగా; మిమ్మున్= మిమ్మలను; వెడలనడుచు+అప్పుడు= అడవులకు పంపేటప్పుడు; దుర్యోధన దుశ్శాసన శకుని సూతనందనులు= దుర్యోధనుడు, దుస్సేనుడు, శకుని, సూతపుత్రుడైన కర్ణుడు; పుయిలోట+తక్కి= సంకోచం వీడి; కలకల నవ్వుచున్= పకపక నవ్వుతూ; పలికిన పలుకులు= మాట్లాడిన మాటలు; ఉగ్గడింపన్+వచ్చునే?= పలుక దగినవా?; వానిన్+విని= ఆ మాటలు విని; సమస్త జనంబులు= ప్రజలందరు; ధృతరాష్ట్రున్+ నిందించుచున్= ధృతరాష్ట్రుడిని దూషిస్తూ; మీరు బలవంతులరు+అయి+ఉండియున్= మీరు బలశాలురై ఉండికూడా; సత్యంబు+పాటించి= సత్యము నవలంబించి; ఊరకపోక+చూచి= తలవంచుకొని అడవులకు వెళ్ళటం చూచి; అచ్చెరు+ పాటుతోన్= ఆశ్చర్యం పొందుటతో; ఉమ్మలించుచున్+ఉండిరి= దుఃఖపడుచుండిరి; తిట్టువాట్లన్+పోయెడువారు= నిందల పాలైనవారు; దైవ+ఉపహతులై= దైవముచే చెరుపబడినవారై; మున్ను+అ= ముందుగానే; చెడి+ఉండుదురు= చెరుపబడినవారౌదురు; కావునన్= కనుక; వారలన్= కౌరవులను; చంపనున్= సంహరించటానికీ; చెఱుపనున్= చెరచటానికీ; చులుకన= తేలిక; క్రూర+ఆత్ములు+అగు= కఠినచిత్తులైన; కౌరవులు= దుర్యోధనాదులు; ఎల్లవారికిన్= అందరికిని; వధ్యులు కాన్+తగుదురు= చంప దగినవారౌతారు; నీకున్= నీకు మాత్రం; ఏల+అవధ్యులు+ఐరి?= ఎందుకు చంపకూడనివారైనారు? పాప+ఆత్మకులు+అగు= పాపంతో కూడిన చిత్తంగల; హింసకులన్= ఘాతుకులను; పాములన్+ఎట్లు= సర్పాలను ఎట్లా వధిస్తారో; అట్లు= ఆ ప్రకారం; నిర్విచారంబుగాన్= ఆలోచించకుండా; వధియించుట కర్తవ్యంబు= చంపటమే చేయదగినపని.

తాత్పర్యం: ధర్మజా! కపట ద్యూతంలో మిమ్మ ఓడించి అడవులకు పంపేటప్పుడు దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు సంకోచం లేకుండా పకపక నవ్వుతూ ఆడిన మాటలు నోటితో వెల్లడించరానివి. ఆ మాటలన్నీ విని ప్రజలంతా ధృతరాష్ట్రుడిని దూషిస్తూ, మీరు బలవంతులై ఉండికూడా సత్యమునకు తల ఒగ్గి తలవంచుకొని ఊరక అడవులకు వెళ్ళటం చూచి ఆశ్చర్యపడుతూ దుఃఖించారు. నిందాపాత్రులైనవారు దైవంచేత ముందుగానే చెరుపబడి ఉంటారు. కనుక అటువంటివారిని చంపటం, చెరచటం చాల తేలిక. దుష్టచిత్తులైన కౌరవులు అందరికీ చంపదగిన వారైనప్పుడు నీకు మాత్రం చంపదగనివారైనారా? పాపహృదయులైన హింసాస్వభావులను పాముల నెట్లా ఆలోచించక వధిస్తారో అట్లా వధించడం తగిన పని.

విశేషం: అలం: ఉపమ: అర్థాంతరన్యాసం. పాపాత్ములను, హింసాత్మకులను పాములను నిర్దాక్షిణ్యంగా చంపినట్లు చంపాలి- అనేది ప్రతిపాద్యాంశం. పాముల కున్న విషలక్షణాలు కౌరవులయందు నిరూపించటం ఇందులోని అలంకార శిల్పం.

1. కపట ద్యూత సభలోనూ, అడవులకు పంపేటప్పుడూ పాండవులను దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణ లాడిన పరిహాసోక్తులు పాములు వేసే కాట్లవంటివి. పాముల కాట్లతో చంపబూనినా భీముడు వాటిని నిగ్రహించి బ్రతికిన ఘట్టాలు జ్ఞాపకం వస్తాయి. దుర్యోధనాదుల పరిహాస వాక్యాలు పాండవులకు విషబాధను కలిగించిన మాట వాస్తవం. బాధ కోర్చి సత్యవ్రతాన్ని సహనంతో పాటించిన పాండవుల ఉత్తమప్రవృత్తి ప్రజాదరణం పొందింది. కౌరవులను జనులు నిందించారు. వారి క్రౌర్యానికి కన్నీరు పెట్టారు. శ్రీకృష్ణుడు వాటిని మృత్యుదంష్ట్రల కాట్లగా అభివర్ణించాడు. పాము కాటుకు విరుగుడున్నది కాని, చావు కాటుకు తిరుగు లేదు. ఈ నీతితో కౌరవులు దైవోపహతులు. వారు తమ పాపకార్యాలతో ధార్మికంగా, నైతికంగా హతులైనారు. చనిపోయినవారిని భౌతికంగా చంపటమే మిగిలి ఉన్నదన్నాడు. ఈ మాటలంటున్న శ్రీకృష్ణుడిలో భగవద్గీతాచార్యుడు ప్రత్యక్షమవుతున్నాడు. అందుకే పాండవులను కౌరవుల వధకు ప్రేరేపించాడు.

2. పగ కలిగి ఉన్న మనసు పాముల పుట్టలున్న ఇల్లు వంటిదని ధర్మరాజన్నాడు. (3.20) దానికి శ్రీకృష్ణు డిస్తున్న ప్రచ్ఛన్న ప్రత్యాఖ్యానం.

ధర్మరాజు మనసులో పుట్టపెట్టుకొని ఉన్న పాము లెవరో కాదు- కౌరవులే. ఆ పాములను చంపకపోతే శాంతి ఎట్లా కలుగుతుంది? అని ఎదురు ప్రశ్న వేస్తున్నాడు. కాబట్టి 'వధించుట కర్తవ్యంబు' అని తర్కబద్ధంగా తేల్చి ఫలితాంశాన్ని నిర్దేశించాడు. శ్రీకృష్ణుడి తర్కానికి తట్టుకొనటం సామాన్యులకు సాధ్యం కాదు. (సంపా.)

క. మీ తండ్రికి భీష్మునకుం । జేతోముద మొదవ భక్తి సేయన తగు నీ;
కా తలకు నేనుఁ జని వి । ఖ్యాతంబుగ నీదు వినయ మభివర్ణింతున్. 38

ప్రతిపదార్థం: మీ తండ్రికిన్= మీ జనకుడైన ధృతరాష్ట్రుడికీ; భీష్మునకున్= తాతయగు భీష్ముడికీ; చేతస్(ః)+ముదము= హృదయానికి సంతోషం; ఒదవన్= కలుగునట్లు; నీకున్= నీకు; భక్తి చేయన్+అ తగున్= భక్తి చూపటమే యుక్తం; నేనున్= నేను; ఆ తలకున్= అక్కడికి; చని= వెళ్ళి; విఖ్యాతంబుగన్= వెల్లడిఅయ్యేటట్లు; నీదు వినయము= నీ అడకువను; అభివర్ణింతున్= పొగడుతాను.

తాత్పర్యం: ధర్మజా! మీ తండ్రి ధృతరాష్ట్రుడికీ, తాత భీష్ముడికీ, హృదయానందం కలిగేటట్లు భక్తి చూపటమే నీకు ఉచితం. నేనా కురుసభకు వెళ్ళి నీ వినయగుణాన్ని అందరికీ తేటపడేటట్లు లెస్సగా వర్ణిస్తాను.

విశేషం: కురుసభలో ధృతరాష్ట్రుడు మెచ్చుకొంటే సాహసించి రాజ్యంలో సగభాగం ఇవ్వవచ్చును. భీష్ముడు సంతోషిస్తే ధృతరాష్ట్రాదులకు హితవు చెప్పి పాండవులకు న్యాయం జరిగేటట్లు చూడవచ్చును. లేదా యుద్ధమే జరిగితే స్వేచ్ఛామరణశక్తి ఉన్న ఆ పితామహుడు స్వీయ వధోపాయాన్ని పాండవులకు చెప్పవచ్చును. వారి మనసులలో అట్టి సౌముఖ్యాన్ని కలిగించాలంటే కురుసభలో శ్రీకృష్ణుడు ధర్మజుడి వినయాది గుణాలను ప్రస్తుతించటం రాజనీతి. ఇది భేదోపాయంలో ఒక భాగం. (సంపా.)

క. చెలులుం జుట్టలు దేశం । బులరాజులు వినఁగ నీదు పుణ్యచరిత్రం
బులు నీవు ధర్మమార్గము । దలఁచుటయుం దెలియఁబలికెదం గురుసభలోన్. 39

ప్రతిపదార్థం: చెలులున్= మిత్రులూ; చుట్టలున్= బంధువులూ; దేశంబుల రాజులున్= నానా దేశాధిపతులూ; వినఁగన్= వింటూ ఉండగా; నీదు పుణ్య చరిత్రంబులు= నీ పవిత్రమైన నడవడులు; నీవు ధర్మమార్గము తలఁచుటయున్= నీవు న్యాయ మార్గాన్ని ఎంచుకొన్న తీరూ; కురు సభలోన్= కౌరవుల కొలువులో; తెలియన్+పలికెదన్= స్పష్టంగా వక్కాణిస్తాను.

తాత్పర్యం: మిత్రులూ, బంధువులూ, నానా దేశాల రాజులూ ఆలకించగా నీ పావనమైన ప్రవర్తననూ, నీవు ధర్మమార్గం అవలంబించే తీరూ కౌరవుల సభలో అందరికీ తెలిసేటట్లుగా మాట్లాడుతాను.

విశేషం: కురుసభలో సంధికార్యం ఫలించినా ఫలించకపోయినా సభ్యులైన బంధుమిత్రులైన రాజులందరూ పాండవుల ధర్మనీతి వర్తనాన్ని మెచ్చుకొని, కౌరవులను నిందించి నిరసించేటట్లుచేయటమే ధర్మజ వ్యూహం. దానిని సఫలంగా నిర్వహిస్తానని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. (సంపా.)

వ. దానికి దుర్యోధనుం డియ్యకొనక తెఱంగుమాలిన మాట లాడుటయుఁ దండ్రి యతని వారింప నేరమికిఁదో డుపేక్షకుం డగుటయుఁ జూచి, మీ తొల్లింటిపాట్లునుం దలంచి యెల్లవారును వారిన గర్హింతు; రింతియ కాక మనకు నొండేమి వలయు? నా యోపినంతయుఁ బెక్కు భంగుల సంధియ కావింపఁజూచెద; నవ్విధంబు

సిద్ధించిన మేలుగాదె! యట్లుగాకతక్కిన నచ్చోటి యుత్సాహంబు చందంబును, నందుఁ జేయంగలవారి వర్తనంబులుఁ గొలందులు నెఱింగి నీకు విజయంబగు విధంబునం జనుదెంచెద. 40

ప్రతిపదార్థం: దానికిన్= నా పలుకులకు; దుర్యోధనుండు+ఇయ్యకొనక= సుయోధను డంగీకరించక; తెఱంగు మాలిన మాటలు+ఆడుటయున్= న్యాయం తప్పిన పలుకులు పలకటమున్నూ; తండ్రి= జనకుడైన ధృతరాష్ట్రుడు; అతనిన్= దుర్యోధనుడిని; వారింపన్ నేరమికిన్+తోడు= అడ్డగించలేనందుకు తోడుగా; ఉపేక్షకుండు+అగుటయున్= ఉదాసీనుడు కావటమున్నూ; చూచి= కనుగొని; మీ తొల్లింటి పాట్లనున్+తలంచి= మీరు మునుపు పడిన కష్టాలను స్మరించి; ఎల్లవారును= సభలోని వారందరూ; వారిన్+అ= ఆ కౌరవులనే; గర్హింతురు= నిందిస్తారు; ఇంతియకాక= ఇంతకంటెను; మనకున్+ఒండు+ఏమివలయున్?= మనకు మరేమి కావలెను?; నా+ఓపినంతయున్= నా శక్తి కొలది; పెక్కు భంగులన్= అనేక రీతుల; సంధి+అ కావింపన్+చూచెదన్= సంధి చేయటానికే యత్నిస్తాను; ఆ విధంబు సిద్ధించినన్ మేలు+కాదె!= అట్లా సంధికార్యం నెరవేరితే మంచిదే కదా! అట్లు కాక తక్కినన్= అట్లా సంధి కార్యం నెరవేరకపోతే; అచ్చోటి+ఉత్సాహంబు చందంబును= ఆ కౌరవుల యొక్క ప్రయత్నాల తీరునూ; అందున్+చేయన్+కలవారి వర్తనంబులున్= అక్కడ యుద్ధం చేయగలవారియొక్క ప్రవర్తనలనూ; కొలందులున్= వారి వారి శక్తియుక్తుల పరిమాణములనూ; ఎఱింగి= గ్రహించి; నీకున్= నీకు; విజయంబు+అగు విధంబునన్= గెలుపు చేకూరే పద్ధతిలో; చనుదెంచెదన్= మరలివస్తాను.

తాత్పర్యం: నేను సభలో పలికిన పలుకులకు దుర్యోధనుడు సమ్మతించక న్యాయం విడిచి ప్రసంగించటం, ధృతరాష్ట్రుడు అతడి మాటలు తిరస్కరించకపోవటమే కాక తాను ఉదాసీన వైఖరి వహించటం కనులారా చూస్తూ, మీరింతకుముందు అనుభవించిన కష్టాలన్నిటినీ స్మరించి సభలోనివారంతా ఆ కౌరవులనే చీకొడతారు. ఇంతకు మించి మనకు కావలసింది ఏముంది? నా శక్తి కొలది బహు విధాల సంధికే ప్రయత్నిస్తాను. సంధి కుదిరితే మంచిదే. ఒకవేళ కుదరకపోతే ఆ సభలోని వారి ప్రయత్నాలు ఎట్లా ఉన్నవో, యుద్ధం చేయగల అచటివారి ప్రవర్తనలూ, వారి సామర్థ్యాలూ ఏపాటివో గ్రహించి, నీకు విజయం సమకూడేవిధంగా మరలివస్తాను.

విశేషం: ఒక రాయబారివలన సాధించబడే ఉపాయాలన్నీ సాధించగలనని శ్రీకృష్ణుడు మాట ఇచ్చాడు. ధర్మరాజు చెప్పని మరొక విశేషం కూడా పలికాడు. శత్రు బలాబల రహస్యాలు తెలిసి కొనిరావటం రాయబారంలో ఔపచారికాంశం. ధర్మరాజుకు విజయం కలిగేటట్లు తిరిగి రావటం రాజనీతి పరాకాష్ఠ. దానిని కూడా శ్రీకృష్ణుడు సాధిస్తే 'చూచి రమ్మంటే కాల్చిరాగల' ప్రతిభను ప్రదర్శించినట్లవుతుంది. (సంపా.)

తే. ఆ సుయోధను ముక్కున నావి గలుగఁ । బుడమి నీ కీఁడు గావునఁ బోర కలుగు,
నేను గయ్యపు శకునంబు లెన్నియేనిఁ । గంటి; నీ వనుత్సాహివి గాఁగ వలదు. 41

ప్రతిపదార్థం: ఆ సుయోధను ముక్కునన్= ఆ దుర్యోధనుడి ముక్కులో; అవి కలుగన్= ఊపిరి ఉండగా; పుడమిన్= భూమిని; నీకున్+ఈఁడు= నీకు పంచి ఇవ్వడు; కావునన్= కనుక; పోరు+అ కలుగున్= యుద్ధమే సంభవిస్తుంది. నేను కయ్యపు శకునంబులు= నేను యుద్ధ నిమిత్తాలు; ఎన్నియేనిన్+కంటిన్= ఎన్నో చూచాను; నీవు+అనుత్సాహివి+కాఁగన్+వలదు= నీవు యుద్ధ ప్రయత్నాలు విరమించవద్దు. (నీవు యుద్ధోత్సాహం లేనివాడవు కావద్దు.)

తాత్పర్యం: ఆ దుర్యోధనుడి ముక్కులో శ్వాస ఉన్నంతకాలం అతడు నీకు రాజ్యభాగం ఇవ్వడు. యుద్ధం తప్పదు. పోరు జరిగే శకునాలు నేనెన్నో చూచాను. కాబట్టి (ఈ తరుణంలో శాంతి, సంధి - అంటూ) యుద్ధోత్సాహాన్ని మాని(శాంతమూర్తివై) ఉండవద్దు.

విశేషం: 'ముక్కున నావి గలుగ' - చక్కని తెలుగు నుడికారం, 'నీ వనుత్సాహివి గాఁగవలదు' అన్నది శ్రీకృష్ణుడి ఉపన్యాస పరమ తాత్పర్యం. (సంపా.)

వ. చతురంగ బలంబుల నాయితంబు గావించుచు దొరలం బురికొల్పికొనుచు నాలస్యంబులేక సమరంబునకు సన్నాహంబు సేయుచుండవలయునని పలికిన విని వృకోదరుండు దామోదరున కిట్లనియె: 42

ప్రతిపదార్థం: చతురంగబలంబులన్= రథ గజ తురగ పదాతులను; ఆయితంబు+కావించుచున్= సంసిద్ధం చేస్తూ; దొరలన్= రాజులను; పురి కొల్పికొనుచున్= యుద్ధానికి ప్రేరేపిస్తూ; ఆలస్యంబు లేక= జాగుచేయక; సమరంబునకున్= యుద్ధానికి; సన్నాహంబు+చేయుచున్+ఉండన్+వలయున్= ప్రయత్నాలు చేస్తూ ఉండాలి; అని పల్కినన్= అని శ్రీకృష్ణు డనగా; విని; వృకోదరుండు= భీముడు; దామోదరునకున్= శ్రీకృష్ణునకు; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మజా! రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాలిబంటులు అనే నాలుగు రకాల సేనా విశేషాన్ని సంసిద్ధం చేసికొని, దొరలను యుద్ధానికి ప్రేరేపిస్తూ ఆలస్యం జరగకుండా కదనానికి సన్నాహాలు సాగించు అని శ్రీకృష్ణు డన్నాడు. ఆ మాటలు విని భీమసేనుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. చతురంగ బలాలు= రథాలు, ఏనుగులు, గుర్రాలు, పదాతులు అనే సైన్యంలోని నాలుగు అంగాలు.

2. **"సాంగ్రామికం తే యదుపార్జనీయం । సర్వం సమగ్రం కురు తన్నరేంద్ర!' (సం.5-71-36)** అనే మూలశ్లోకానికి ఈ వచనం వివరణం. ఇది భావికథార్థ సూచన. శ్రీకృష్ణుడు కర్ణుడితో - యుద్ధం రాబోయే అమావాస్య నాడు ప్రారంభమవుతుందని ప్రకటించి రాబోతున్నాడు. అందువలన ఏ క్షణంలోనైనా యుద్ధయాత్ర సాగించే యత్నంలో ఉండాలని శ్రీకృష్ణుడు ధర్మరాజును హెచ్చరించాడు. (సంపా.)

క. 'సమరంబు గలుగు ననుచును । మము వెఱపింపంగ వలదు మాధవ! నీ వా
కుమతి యగు ధార్తరాష్ట్రుఁడు । శమించు కార్యంబు నడపు సౌజన్యమునన్.' 43

ప్రతిపదార్థం: మాధవ!= శ్రీకృష్ణా!; నీవు= నీవు; సమరంబు కలుగున్+అనుచును= యుద్ధం సంభవిస్తుందని పలుకుతూ; మమున్= మమ్మల్ని; వెఱపింపంగన్+వలదు= భయపెట్టవద్దు; ఆ కుమతి+అగు= ఆ చెడుబుద్ధి కల్గిన; ధార్తరాష్ట్రుఁడు= ధృతరాష్ట్రుడి కొడుకైన దుర్యోధనుడు; శమించు కార్యంబు= అణగి మణగి ఉండే పనిని; సౌజన్యమునన్= మంచితనంతో; నడపు(ము)= ప్రవర్తింపజేయుము.

తాత్పర్యం: 'లక్ష్మీవల్లభా! యుద్ధం జరుగుతుందని చెప్పుతూ మమ్ము భయపెట్టవద్దు. దుష్టచిత్తుడైన ఆ దుర్యోధనుడు అణగి మణగిఉండే పనిని సద్భావంతో సాధించుము.'

విశేషం: 1. ఈ పద్యం నాటకీయతకు చక్కని ఉదాహరణం.

2. 'సమరానికి సన్నాహం చేయు'మన్న శ్రీకృష్ణుడి వాక్యానికి భీముడు స్పందించి, 'సమరంబు గలుగు ననుచు మము వెఱపింపవలదు' అని పలకటం నాటకీయం. ఒక రకమైన ప్రయోగాతిశయం.

3. తన అభిప్రాయం ఎవ్వరూ అడుగకుండానే భీముడు సంభాషణ మొదలుపెట్టి తన ఆవేశ స్వభావాన్నీ, అన్నగారి మాటను శ్రీకృష్ణుడు కాదంటున్నాడని భ్రమించి తొందరపడటంలో ధీరోద్ధతనూ ప్రదర్శించాడు. అయితే అతడు నిష్కల్మషుడు కావటం చేత ఎవరూ అపార్థం చేసికొనరు.

4. భీముడి మాటల వలన అతడు శ్రీకృష్ణుడిని దివ్యుడిగా కంటే, అదివ్యుడైన దూతగానే భావిస్తున్నట్లుగా స్పష్టం. (సంపా.)

వ. అని వెండియు. 44

తాత్పర్యం: అని మళ్ళీ భీమసేనుడు (ఇట్లా అన్నాడు).

శా. 'పాపాత్ముండు మదాంధుఁ డా తులువ నీపంపెట్లునుం జేయఁగా
నోపం; డడ్డము సెప్ప రెవ్వరును; మానోద్రేకమున్ గర్వముం
గోపంబుం దనుఁ ద్రిప్ప నాప్తజనులం గుందించుటం బోయిన
ట్లే పోనిత్తురు; గాన ని న్నతఁడు జాలింబెట్టెడుం జూడుమీ! 45

ప్రతిపదార్థం: ఆ తులువ= ఆ కుత్సితుడైన దుర్యోధనుడు; పాప+ఆత్ముండు= దురితచిత్తుడు; మద+అంధుఁడు= మదముచేత కన్నుగాననివాడు; నీ పంపు= నీ ఆజ్ఞ; ఎట్లునున్= ఏ విధంగానూ; చేయఁగాన్+ఓపండు= చేయలేడు; ఎవ్వరును= ఏ ఒక్కరైనను; అడ్డము చెప్పరు= అతడిని ఎదిరించి మాట్లాడరు; మాన+ఉద్రేకమున్= అహంకారము యొక్క ఆటోపమునూ; గర్వమున్= పొగరుబోతుతనమునూ; కోపంబున్= క్రోధమునూ; తనున్+త్రిప్పన్= తనను ఆడిస్తుండగా; ఆప్తజనులన్= ఆత్మీయులైనవారిని; కుందించుటన్= దుఃఖపెట్టటం చేత; పోయినట్లే పోనిత్తురు= అతడు వెళ్ళే దారినే చూస్తూ ఊరకుంటారు; కాన= కాబట్టి; నిన్నున్= నిన్ను; అతఁడు= ఆ దుర్యోధనుడు; జాలిన్+పెట్టెడున్= చింతల పాలు చేయగలడు; చూడుమీ= గ్రహింపుమా! (చూస్తూ ఉండుము)

తాత్పర్యం: 'మాధవా! ఆ దుర్యోధనుడు కలుషాత్ముడు. మదంచేత కన్ను మిన్ను కాననివాడు. కుత్సితుడు. నీ ఆదేశం మన్నించడు. ఒక్కరైనను అతడి మాటకు అడ్డు చెప్పలేరు. అహంకారం, గర్వం, కోపం తనను పట్టి ఆడిస్తుండగా ఆప్తులను సైతం అతడు దుఃఖపెట్టుతున్నాడు. అత డేమైపోయినా తమకేమి లెమ్మని అందరూ మిన్నకుండటం చేత ని న్నతడు సంకటపరుస్తాడు సుమా!

విశేషం: హస్తినాపురాన్ని తలచుకొంటే భీముడికి పాపాత్ముడైన దుర్యోధనుడే జ్ఞాపకం వస్తాడు. అతడు చేసిన అపకారాలు గుర్తుకు వస్తాయి. కోపోద్రేకం కలుగుతుంది. ఆవేశంలో అతడిని నిందిస్తాడు. ఇది భీమ స్వభావం. ఆ సహజ స్వభావానికి ఈ పద్యం అద్దం పట్టుతున్నది. దుర్యోధనుడు పాపాత్ముడనీ, మదాంధుడనీ, తులువ అనీ, నోరారా తిట్టితేతప్ప అతడికి తృప్తి ఉండదు. అతడిలో దురహంకారం, గర్వం, కోపం అనే దుష్ట గుణాలు ఉంటాయనీ, వాటి వలన పరులను, ఆత్మీయులను బాధపెట్టుతాడనీ, పెద్దల మాటలు వినడనీ, భీముడిని తిప్పలు పెట్టుతాడనీ పేర్కొంటాడు. శత్రువైన దుర్యోధనుడిని గురించి భీముడికి ఎంత స్పష్టమైన అవగాహన ఉన్నదో ఈ పద్యం స్పష్టం చేస్తున్నది. (సంపా.)

ఉ. చొచ్చిన చోన చొచ్చి తెగఁ జూచెద నంచుఁ గడంగుచుండు; న
న్నెచ్చఁడు బాహుగర్వమున; నీచు సుయోధనుఁ; డట్టివానితోఁ
బొచ్చెములేక కూడి మనఁ బోవక పోవఁగరాదు నాకు వి
వ్వచ్చుఁడు రాచవారుఁ గురువంశము చేటున కోపకుండుటన్. 46

ప్రతిపదార్థం: నీచు సుయోధనుఁడు= తుచ్ఛుడైన దుర్యోధనుడు; చొచ్చిన చోన్+అ= నేను ప్రవేశించినచోటనే; చొచ్చి= తానూ ప్రవేశించి; తెగన్+చూచెదన్+అంచున్= నన్ను చంపుతా నంటూ; కడంగుచున్+ఉండున్= పూనిక వహిస్తూ ఉంటాడు;

బాహుగర్వమునన్= భుజవిక్రమంలో; నన్+మెచ్చఁడు= నన్ను లెక్కించడు; వివ్వచ్చుఁడు= బీభత్సుడు (అర్జునుడు); రాచవారున్= ప్రభువైన ధర్మరాజు; కురువంశము చేటునకున్= కురువంశముయొక్క వినాశానికి; ఓపక+ఉండుటన్= సహింపకుండటంచేత; అట్టివానితోన్= అటువంటి (అల్పుడైన) దుర్యోధనుడితో; నాకున్= నాకు; పొచ్చెములేక= కపటంలేక; కూడి= కలసి; మనన్+పోవక= జీవించనెంచక; పోవఁగన్+రాదు= తప్పుకొనటానికి వీలులేకుండా ఉన్నది.

తాత్పర్యం: నేను ప్రవేశించిన చోట తానూ ప్రవేశిస్తూ నన్ను చంపటానికి యత్నిస్తుంటాడు. భుజ విక్రమంలో నన్ను లెక్కించడు. ఆతడు వట్టి తుచ్ఛుడు. ఫల్గునుడూ, ప్రభువైన ధర్మజుడూ కురువంశ వినాశానికి సమ్మతించ కుండటం వలన ఆ దుర్యోధనుడితో నిష్కపటంగా కలసి మెలసి జీవించడం నాకు తప్పేటట్లు లేదు.

విశేషం: భీముడి ఆత్మాభిమానమే కాక, అమాయకత్వం కూడా బైటపడుతున్నది. (సంపా.)

ఉ. **పాండవ కౌరవుల్ గలసి పాలును నీరును బోలె నెమ్మిమై**
నుండఁగ దుష్టచేష్టల సుయోధనుఁ డింతలు సేసె; నాతఁ డొ
క్కండ కులక్షయంబునకుఁ గారణమం; డ్రది దప్ప; దైన నీ
వొం డన నేల యా బిరుదు నోపిన యంతయుఁ దీర్పు నేర్పునన్. **47**

ప్రతిపదార్థం: పాండవ కౌరవుల్= పాండవులూ, కౌరవులూ; పాలును నీరును+పోలెన్= పాలూ నీరూ వలె; కలసి= (విడదీయటానికి వీలు లేనట్లుగా) కలిసిపోయి; నెమ్మిమైన్= ప్రేమతో; ఉండఁగన్= జీవిస్తూ ఉండగా; దుష్టచేష్టలన్= దుండగపు పనులతో; సుయోధనుఁడు; ఇంతలు+చేసెన్= ఇట్టి దుర్ణయాలు కావించాడు; ఆతఁడు+ఒక్కఁడు+అ= అతడొక్కడే; కులక్షయంబునకున్= వంశ వినాశనానికి; కారణము+అంద్రు= హేతువని పెద్దలు చెప్తుతారు; అది+తప్పదు= ఆ మాట వృథా కాదు; అయినన్= అయినప్పటికినీ; నీవు; ఒండు+అనన్+ఏల?= నీవు వేరొక మాట పలుకుటెందుకు?; ఆ బిరుదున్= ఆ శూరుని; ఓపిన+అంతయున్= శక్తిఉన్నంత వరకూ; నేర్పునన్= చాతుర్యంతో; తీర్పు(ము)= చక్కబఱచుము.

తాత్పర్యం: పాండవులూ, కౌరవులూ పాలూ నీరూవలె కలసి మెలసి ప్రేమతో జీవిస్తుండగా దుర్యోధనుడు తన దుండగపు పనులతో ఒద్దిక చెరచివేశాడు. అతడే ఈ కురువంశ వినాశానికి కారణమని పెద్దల మాట ఆ మాట ఎన్నటికినీ తప్పదు. ఐనప్పటికీ నీవు నేర్పుతో శక్తి కలిగినమేరకు ఆ జగజెట్టిని దారిలో పెట్టజూడుము.

విశేషం: 1. అలం: ఉపమ, క్రమం. పాండవులూ కౌరవులూ పాలూ, నీరూ వంటివారు. ఉపమాన ఉపమేయాలను ఆ వరుసలోనే గ్రహించాలి. కాబట్టి క్రమాలంకారం. పాండవులు పాలవంటివారు. కౌరవులు నీళ్ళవంటివారు. అంటే నీళ్ళకంటె పాలు చిక్కన. కౌరవులకంటె పాండవులు బలవంతులు అని ధ్వని. ఇందులో మరొక విశేషం కూడా ఆలోచిస్తే స్ఫురిస్తుంది. పాలతో కలిసి ఉంటేనే నీటికి గౌరవం. నీళ్ళతో పాలు కలిపిస్తే పాలకు విలువ లేదు. పాలూ నీరూ కలిసి ఉన్నప్పుడు వాటిని వేరు చేసేది హంస. కాని, దుర్యోధనుడు హంస కాదు. కాకి. అతడు చేసింది నీరక్షీర వివేకం కాదు. కలిసి వున్న పాలనూ నీళ్ళనూ కలుషితం చేశాడు. కలిసి ఉన్న గుణం కలిగించేది కులవృద్ధి. దానిని పాడు చేయటం కులక్షయం. పాడైపోయిన పాలు ఏ ప్రయోజనాన్నీ పొందలేవు. ఈ తాత్పర్యం మరొక వ్యంగ్యార్థం.

2. ఈ మాటలంటున్న భీముడు ధర్మరాజుతమ్ము డనిపించుకొన్నాడు. అయితే ధర్మజుడు తన భావాన్ని గూఢంగా నిపుణంగా చెప్పగలడు. భీముడు బయటపడి ఘాటుగా చెప్పగలడు. ధర్మరాజుకూ సంధిమీద నమ్మకం లేదు. అయినా

అంతకంటె మించిన రాజనీతి ప్రయోజనాల కొరకు, భేదోపాయాన్ని ప్రయోగించటం కొరకు శ్రీకృష్ణుడిని రాయబారిగా పంపుతున్నాడు. ఆ సంగతి అందరికీ తెలిసేటట్లు చెప్పాడు. కాని, భీముడికి ఆ వ్యూహరహస్యాలు తెలియవు. దుర్యోధనుడిని కులక్షయ కారకుడిగా నిరూపించటానికే శ్రీకృష్ణుడి రాయబారం పనికి వస్తుందని భావించాడు. భావాభివ్యక్తితో ఈ రెండు పాత్రల తారతమ్యం పరమ రమణీయం.

3. భీముడికి దుర్యోధనుడు ఆగర్భశత్రువు. ఆ దుర్మార్గుడు భీముడిని చంపటానికి చేసిన కుతంత్రాలు ఇన్నీ అన్నీ కావు. భీముడు లేకపోతే పాండవులు లేనట్లే అని సుయోధనుడి అంచనా. అతడంటే భీముడికి అమితకోపం. దుర్యోధనుడు పుట్టినప్పుడే అతడు కులక్షయకారకుడని ఆకాశవాణి పలికింది. ఆ తరువాత వ్యాసమహర్షి చెప్పాడు. అయినా, ధృతరాష్ట్రుడు వాటిని పట్టించుకొనలేదు. దుర్యోధనుడి దుష్టచేష్టలన్నీ క్రమంగా కులక్షయానికే దారితీస్తున్నాయి. సంధి యత్నం సాగుతుందనే నమ్మకం భీముడికీ లేదు. అయినా, శ్రీకృష్ణుడు రాయబారం చేయవలసిందే, ధర్మజుడి ఆనతి పాటించవలసిందే- అని భీముడి అభిప్రాయం.

4. ఈ పద్యంలో 'దుష్టచేష్టలు', 'ఇంతలు సేసె' 'అది తప్పదు', 'నీవు ఒండన నేల?', 'ఆ బిరుదు' అనే పదాలు తెలుగు పలుకుబడిని పుక్కిటబట్టాయి. అంత, ఇంత, ఎంత అనే అవ్యయాలకు తెలుగులో ఎంతటి శక్తి ఉన్నదో అంతటిశక్తి 'ఇంతలు సేసె' అనే వాక్యంలో ఉన్నది. జరిగిన కథంతా అందులో ధ్వనిస్తుంది. శబ్దప్రయోగౌచిత్యానికి ఇవి ప్రమాణాలు.

5. తిక్కన నాటకీయతలో పాత్రోచిత సంభాషణ ఒక ప్రత్యేకత. భీముడు లౌకిక వాది. అతడికి భుక్తియందున్న ఆసక్తి భక్తియందు లేదు. అందుకే 'పాలు నీరు' ఉపమానం తీసికొన్నాడు. పరమాత్ముడైన హరిని రాయబారిగానే మన్నిస్తాడు. అతడిలోని దివ్యత్వం ఇతడికి కనపడదు. భీమపాత్రోచితమైన సంభాషణ ఇది. ఇట్లాగే ఈ సన్నివేశంలో ధర్మజ, అర్జున, నకుల, సహదేవులూ, ద్రౌపదీ, శ్రీకృష్ణుడూ, చేసే సంభాషణలలో వారి వారి సంస్కారాలు గుబాళిస్తుంటాయి. ఇటువంటి రచన రసధ్వనిలోని ఒక మెళకువ; నాటకీయ రచనాశిల్పంలోని ఒక రహస్యం. (సంపా.)

6. ఈ సందర్భంలో భీముడు కులక్షయ కారకులైన అసురవంశ రాజులను పదునెనిమిది మందిని పేర్కొన్నట్లు మూలంలో ఉన్నది. వారు- 1. హైహయవంశజుడైన ముదావర్తుడు 2. నీప కులానికి చెందిన జనమేజయుడు 3. తాలజంఘ వంశజుడైన బహుళుడు 4. క్రిమి కులోద్భవుడు వసువు 5. సువీరవంశజుడు అజబిందువు 6. సురాష్ట్ర కులజుడు రుషర్ధికుడు 7. బలీహ వంశజుడు అర్కజుడు 8. చీనీయ వంశం వాడైన ధౌతమూలకుడు 9. విదేహ వంశీయుడైన హయగ్రీవుడు 10. మహౌజ క్షత్రియ వంశజుడు పరాయువు 11. సుందరవంశీయుడు బాహువు 12. దీప్తాక్షకులజుడైన పురూరవుడు 13. చేది మత్స్య వంశీయులలోని సహుజుడు 14. ప్రవీర వంశంలోని వృషధ్వజుడు 15. చంద్రవత్స కులజుడు ధారణుడు 16. ముకుట వంశీయుడు విగాహనుడు 17. నందివేగ కులోద్భవుడు శముడు 18. చంద్ర వంశజుడైన దుర్యోధనుడు. (వివరాలకు చూడు: సం. 5-72-11 నుండి 18).

చ. తన పొరిపోవునంతకు నుదగ్రతయుం గపటంబు మాన నే
ర్చునె ధృతరాష్ట్ర సూనుఁడు? యశోభరితంబగు భారతాన్వయం
బున కొక నిందవచ్చు ననుబుద్ధి దురాత్మున కేలకల్గు? నా
యనమెయిఁబోయి హీనగతినైన ఘటించిన నెంత యొప్పునో! 48

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రసూనుఁడు= ధృతరాష్ట్రుడి కొడుకైన దుర్యోధనుడు; తన పొరిపోవునంతకున్= తాను చచ్చేవరకూ; ఉదగ్రతయున్= క్రౌర్యమునూ; కపటమున్= మోసమునూ; మానన్+నేర్చునె?= విడువగలడా?; యశోభరితంబు+అగు= కీర్తితో నిండిన; భారత+అన్వయంబునకున్= భరతుడు జన్మించిన వంశానికి; ఒక నింద వచ్చున్= అపకీర్తి కల్గుతుంది; అను బుద్ధి= అనే తలంపు; దుర్+ఆత్మునకున్= దుష్టహృదయుడైన ఆ దుర్యోధనుడికి; ఏల+కల్గున్?= ఎందుకు జనిస్తుంది?;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆయన మెయిన్+పోయి= అతడి తలంపు ననుసరించి; హీనగతిన్+ఐనన్= నీచస్థితితో నైనను; ఘటించినన్= సంధి కుదుర్చుకొంటే; ఎంత+ఒప్పునో!= ఎంత బాగుంటుందో కదా!

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు తాను చచ్చేవరకూ తన క్రౌర్యాన్నీ, మోసమునూ విడిచిపెట్టడు. కీర్తిమంతమైన భరతవంశం అపకీర్తి పాలవుతుందే అనేతలంపు ఆ దుష్టచిత్తుడికి కలుగనే కలుగదు. ఆ సుయోధనుడి మనోవైఖరి ననుసరించి నీచత్వానికి దిగజారిఅయినా మనం సంధి కావించుకొంటే అదెంతో మేలుగా ఉంటుంది.

విశేషం: 1. 'ఆయన మెయిన్+పోయి'= మా అన్న ధర్మజుడి తలంపు ననుసరించి - అనిన్నీ, నాయన మెయిన్+పోయి= తండ్రి అయిన ధృతరాష్ట్రుడి తలంపు ననుసరించి - అనిన్నీ అన్వయం చెప్పటానికి వీలుంది.

2. విరాటోద్యోగ పర్వాలలో భీముడు తన సహజమైన ఔద్ధత్యాన్ని తగ్గించుకొని ఉదాత్తుడి వలె వ్యవహరించాడు. ఈ పద్యం అట్టి ప్రవృత్తికి చక్కని ఉదాహరణం. ఇది భీముడికి అలంకారం కాదనీ, కార్యసాధకం కాదనీ శ్రీకృష్ణుడు భావించి అతడిని యుద్ధోత్సాహపూరితుడినీ, ఉద్ధతుడినీ చేయాలని యత్నిస్తాడు. (సంపా.)

వ. అని పలికి, మాకును వారికిఁ బితామహుండగు భీష్ముండు వినుచుండ సుయోధనుతోడం గురుకులేశ్వరు నాస్థానంబున నా వచనంబులుగా నిట్లనుము. 49

ప్రతిపదార్థం: అని, పలికి; మాకును, వారికిన్= (పాండవులకూ, కౌరవులకూ); పితామహుండు+అగు= తండ్రియొక్క తండ్రి (తాత); అయిన; భీష్ముండు; వినుచున్+ఉండన్= వింటూ ఉండగా; కురుకుల+ఈశ్వరు+ఆస్థానంబునన్= ధృతరాష్ట్రుడి నిండు కొలువులో; సుయోధను తోడన్= దుర్యోధనుడితో; నా వచనంబులుగాన్; నా మాటలుగా; ఇట్లు+అనుము= ఇట్లా చెప్పుము.

తాత్పర్యం: కృష్ణా! మాకూ, కౌరవులకూ తాతఅయిన భీష్ముడు వింటుండగా ధృతరాష్ట్ర మహారాజు కొలువులో నా మాటలుగా సుయోధనుడితో ఇట్లా చెప్పుము.

తే. అన్నదమ్ములమై యుండి యకట! మనల । నొరులు దలయెత్తి చూడ నొండొరులతోడఁ
బెనఁగ నేటికి? నీ నేల పెద్దవారి । బుద్ధి విని పంచి కుడుచుట పోల దొక్కొ? 50

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; అన్నదమ్ములము+ఐ+ఉండి= సోదరులమై జన్మించికూడా; మనలన్= మనలను; ఒరులు= ఇతరులు; తల+ఎత్తి+చూడన్= ఆశ్చర్యంతో కనుగొనగా; ఒండొరుల తోడన్= ఒకరితో మరొక్కరు; పెనఁగన్+ఏటికిన్?= పోట్లాడుకొనటమెందుకు?; ఈ నేలన్= ఈ భూమిని; పెద్దవారి బుద్ధి విని= పెద్దలు చెప్పిన నీతులు ఆలకించి; పంచికుడుచుట= పంచుకొని అనుభవించటం; పోలదు+ఒక్కొ!= యుక్తము కాదా!

తాత్పర్యం: మనం అన్నదమ్ములమై ఉండి కూడ లోకులు తలయెత్తి చూచి పరిహాసించగా మనలో మనం ఒకరితో నొకరు పోట్లాడుకొనటం మంచిది కాదు. హస్తినాపుర సామ్రాజ్యాన్ని పెద్దల మాట ప్రకారం పంచుకొని హాయిగా అనుభవించటం ఎంతో మేలుగదా!

క. అని యెవ్విధమున నైనను । వనజోదర! సంధి సేయవలయుం దగ నే
మును వారును గలయుట భూ । జనులకునెల్లను హితంబు సౌఖ్యకరంబున్.' 51

ప్రతిపదార్థం: అని= అనుచు; వనజ+ఉదర!= పద్మనాభా!; ఏ విధమునన్+ఐనను= ఏ రీతిగానైనా; సంధిచేయన్+వలయున్= సంధి సమకూరేటట్లు చేయవలసింది; తగన్= చక్కగా; ఏమును వారును కలయుట= మేమూ, కౌరవులూ ఒకటిగా చేరటం; భూజనులకున్+ఎల్లన్= పుడమిలోని ప్రజలందరికీ; హితంబు= మేలు; సౌఖ్యకరంబున్= సుఖాన్ని కలుగజేస్తుంది.

తాత్పర్యం: పద్మనాభా! నా మాటలుగా కురుసభలో అట్లా చెప్పి, ఎట్లాగైనా సంధి పొసగేటట్లు ప్రయత్నించుము. వారూ మేము కలసిమెలసి వర్తించటం పుడమిజనులకు ఎంతో మేలు. సుఖకరంగానూ ఉంటుంది.'

చ. **అనుటయుఁ బిన్ననవ్వు నగి యంబుజనాభుఁడు వల్కు 'నెన్నఁడున్**
వినవివి భీముపాలఁ గడు వింతలు వింటిమి మాట; లగ్గి చ
ల్లనగుట భూరిభూధరము లాఘవ మొందుటఁ గాదె యివ్విధం
బున నితఁ డిప్డు మార్దవముఁ బొందుట; యింకిటఁ జెప్ప నేటికిన్? **52**

ప్రతిపదార్థం: అనుటయున్= భీమసేను డట్లా వచించగా; అంబుజనాభుఁడు= కమలం నాభియందుగలవాడు- శ్రీకృష్ణుడు; పిన్న నవ్వు నగి= చిన్నగానవ్వి; పల్కున్= ఇట్లా మాట్లాడాడు. ఎన్నడున్= ఎప్పుడునూ; వినవివి= మేము ఆలకించనట్టివి; భీము పాలన్= భీమసేనుడి దగ్గర; కడున్ వింతలు మాటలు వింటిమి= మిక్కిలి వింత (విస్మయం) కలిగించే పలుకులు విన్నాము; ఈ+విధంబునన్= ఇట్లా; ఇతఁడు= భీముడు; ఇప్డు= ఈ సమయంలో; మార్దవము పొందుట= మృదుత్వం వహించటం అన్నది; అగ్గి చల్లన+అగుట= నిప్పు చల్లబడటం; భూరిభూధరము= గొప్ప పర్వతం; లాఘవము+ఒందుట కాదె= తక్కువతనం పొందటమే అవుతుంది; ఇంకన్+ఇటన్+చెప్పన్+ఏటికిన్?= మరిఇక్కడ పలుకవలసిన దేమున్నది?

తాత్పర్యం: భీమసేనుడి మాటలకు పద్మనాభుడు చిరునవ్వు నవ్వి ఇట్లా అన్నాడు: మునుపెన్నడు విననట్టి మాటలు ఇపుడు భీముడి నోటినుండి విన్నాను. మఱి చెప్పవలసిన దేముంది? ఈ విధంగా వృకోదరుడు ఇపుడు మెత్తబడటం చూడగా అగ్ని చల్లదనం పొందినట్లుగా, గొప్ప పర్వతం తేలిక అయిన చందంగా ఉన్నది.

విశేషం: అలం: ఉపమ.

1. శ్రీకృష్ణుడు భీముడి మాటలను విని చిరునవ్వు నవ్వాడు. వికృతి వలన హాసం పుట్టుతుంది. భీముడు సహజంగా ఉద్ధతుడు, కాని, ఉదాత్తుడివలె మాట్లాడుతున్నాడు. దుర్యోధన స్మరణ మాత్రం చేతనే కోపోద్రేకంతో ఉగ్రరూపం తాల్చి, అతడిని అంతం చేయటమే తనకు సంతోషదాయకమని భావించే భీముడు అతడిపై అన్నదమ్ముల ప్రేమను, ఐక్యభావాన్ని ఒలకబోస్తూ అతడితో కలిసి జీవించటం కర్తవ్యమంటున్నాడు. శ్రీకృష్ణుడిని ఏ విధంగానైనా సరే అతడిని ఒప్పించి సంధి చేయుమని అడుగుతున్నాడు. ఇది భీముడిలోని స్వభావ విశ్రుతి. దీనిని అలంకారంతో ధ్వనింపచేయటం రచనా శిల్పం.

2. వికృతి వలన ఆశ్చర్యం కలిగిందని వాచికాభినయంతో శ్రీకృష్ణుడి పాత్ర మాటల వలన ధ్వనింపజేసింది. 'ఎన్నడున్ వినవివి', 'కడువింతలు' అనే మాటలు తెలుగుదనం మూటకట్టినట్లున్నాయి. మూలంలో- "ఏత చ్ఛ్రుత్వా మహాబాహుః కేశవః ప్రహసన్నివ- అభూతపూర్వం భీమస్య మార్గవోపహితం వచః" (సం. 5-73-1) అని ఉన్నది. శ్రీకృష్ణుడు మూలంలో పెద్దగా నవ్వాడు. తెలుగులో చిరునవ్వు నవ్వాడు. ప్రహసనం చేస్తే భీముడు నొచ్చుకొంటాడనీ, కోపిస్తాడనీ తెలుగులో తిక్కన భావించి ఈ మార్పు చేసి ఉండవచ్చును. 'అభూతపూర్వం' అనే మాటకు తెలుగులో చక్కని వ్యాఖ్యానమిచ్చాడు తిక్కన.

3. భీముడు మెత్తబడటం అగ్గి చల్లబడినట్లూ, మహాపర్వతం తేలిక పడ్డట్లూ ఉన్నదట! భీముడు శాంతి సూక్తం పలకటం శత్రువులను దహించే అతడి క్రోధభావం శాంతించినట్లున్నదని భావం. శత్రువులకు తలవంచని సమున్నత ఆత్మాభిమానం

వదలి బంధుత్వాన్ని భావించి కలసి ఉండాలని తలంచటం పర్వతం తేలికపడటం వంటిది. ఈ రెండంశాలూ భీముడి స్వభావానికి విరుద్ధమైనవి. అయినా, ధర్మరాజుమీది భక్తిగౌరవాలచేత భీముడు మెత్తపడ్డాడు. ఇది వింతగా ఉన్నదని శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వాడు.

4. 'ఇం కిటఁ జెప్ప నేటికిన్?' అనే వాక్యం ఆశ్చర్య భావముద్రను వ్యక్తం చేస్తున్నది. భీముడిని ఆ విధంగా నేను చూడలేను. అతడు సహజస్వభావంతో ఉంటేనే బాగుంటుందని సూచన అందులో వినబడుతుంది. పఠితలు ఆ వాక్యంతో తాదాత్మ్యం పొందుతారు. (సంపా.)

శ్రీకృష్ణుఁడు భీమసేనునిఁ గౌరవులతోడి యుద్ధమునకుఁ బురికొల్పుట (సం. 5-73-1)

తే. అని సహోదరు లాజి నాయాసపడుట। కోర్వమియుఁ గౌరవులఁ జంప నొల్లమియును,

గలుగు నెయ్యంబు పెంపునఁ గరుణ నార్ద్రుఁ। డైన పవనజుఁ బురికొల్ప నాత్మఁ దలఁచి. 53

ప్రతిపదార్థం: అని= అలా వచించి; ఆజిన్= యుద్ధంలో; సహోదరులు= తోబుట్టువులు; ఆయాసపడుటకున్= శ్రమ చెందటానికి; ఓర్వమియున్= సహించలేకుండుటయున్నూ; కౌరవులన్= దుర్యోధనాదులను; చంపన్+ఒల్లమియున్= చంపుటకు ఇష్టపడ కుండటమున్నూ; కలుగు నెయ్యంబు పెంపునన్= మనసులో కలిగే ప్రేమాధిక్యం చేతనున్నూ; కరుణన్= దయారసముచేత; ఆర్ద్రుఁడు+ఐన= కరిగిపోయిన; పవనజున్= వాయుపుత్రుడైన భీముడిని; పురికొల్పన్= రెచ్చగొట్టటానికై; ఆత్మన్+తలఁచి= మనసులో సంకల్పించి. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: తన తోబుట్టువులు యుద్ధంలో కష్టపడటానికి సహించలేనందుననూ, కౌరవులను సంహరించటానికి ఇష్టపడనందుననూ, కలిగిన స్నేహాధిక్యం చేతనున్నూ పొంగిన కరుణచేత వాయునందనుడు కరగిపోయాడు. అతడిని యుద్ధానికి రెచ్చగొట్టవలెనని మనసులో సంకల్పించి.

విశేషం: భీముడు ఎందుకు, ఎట్లా మెత్తబడ్డాడో చెప్పి, అతడి మానసిక స్థితిని వ్యాఖ్యానించే చక్కని పద్యం ఇది. సహోదరులు యుద్ధం చేయటం వలన పొందే శ్రమను భావించి, వారి కా శ్రమ లేకుండా చేద్దామనే స్నేహాతిశయం మొదటి కారణమట! కౌరవులను చంపటం వలన వంశనాశన మవుతుందనే కరుణాభావం రెండవ కారణమట! క్రోధభావం స్నేహభావం వలన మెత్తబడుతుంది. కరుణ వలన ఆర్ద్రమవుతుంది. ఈ క్రమాన్ని భావించిన శ్రీకృష్ణుడు ఇంగితజ్ఞుడు, రసజ్ఞుడు. ఇప్పుడు స్నేహ, కరుణ భావాలకు విరుగుడు పెట్టి ఆర్ద్రత నుండి ఆగ్రహాన్ని ప్రజ్వలింపచేసి, యుద్ధానికి భీముడిని పురికొల్పటం శ్రీకృష్ణుడి సంకల్పం. రాబోయే పద్యంలో ఈ పరిణామ క్రమం గోచరిస్తుంది. (సంపా.)

వ. మురమర్దనుం డతనితో నిట్లనియె : 54

ప్రతిపదార్థం: మురమర్దనుండు= మురాసురుని సంహరించినవాడు, శ్రీకృష్ణుడు; అతనితోన్= భీమునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు భీముడితో ఇట్లా అన్నాడు.

ఉ. 'యుద్ధము మీఁది వేడ్కయు మహోగ్ర విరోధుల నల్కఁజేయు ద

ర్పోద్ధతియున్ సుయోధనుని యున్నతి సైఁపని యేపు రాజ్యసం

సిద్ధి నిజాగ్రజన్మునకుఁ జేయు తలంపును గల్గు నీ వసం

బద్ధములైన వాక్యములు వల్కుట యొప్పునె కీచకాంతకా!' 55

ప్రతిపదార్థం: కీచక+అంతకా!= కీచకుడినీ, ఉపకీచకులనూ మట్టుపెట్టిన వాయుపుత్రా!; యుద్ధము మీఁది వేడ్కయున్= సంగ్రామం సల్పుటలోని అభిలాష; మహా+ఉగ్రవిరోధులన్= మిక్కిలి భయంకరులైన శాత్రవులను; అల్కన్+చేయు= భయపెట్టే; దర్ప+ఉద్ధతియున్= గర్వాటోపమునూ; సుయోధనుని+ఉన్నతిన్= దుర్యోధనుడి గొప్పతనమును; సైపని+ఏపున్= సహించనట్టి విజృంభణమునూ; రాజ్యసంసిద్ధిన్= రాజ్యలాభమును; నిజ+అగ్రజన్మునకున్= నీ అన్నఅయిన ధర్మపుత్రుడికి; చేయుతలంపును= కలిగించే ఉద్దేశమునూ; కల్గు నీవు= ఉన్నట్టి నీవు; అసంబద్ధములు+ఐన= పొందికలేని వైన; వాక్యములు= పలుకులు; పల్కుట+ఒప్పునె?= చెప్పుట తగునా? (తగదని భావం.)

తాత్పర్యం: కీచకుడి రూపుమాపిన భీమసేనా! సంగ్రామం సల్పటంలో కుతూహలమూ, పరమ దారుణ శాత్రవులను గడగడ వణకించే శౌర్యాటోపమూ, దుర్యోధనుడి గొప్పతనము సహించని ఔద్ధత్యమూ, అన్నఅయిన ధర్మజుడికి రాజ్యప్రాప్తి కలిగించే సంకల్పమూ కలిగిన నీవు ఇపుడు పొంతన లేని మాటలు మాట్లాడటం తగదుసుమా!'

విశేషం: 1. ఈ పద్య ప్రాణం 'నీ వసంబద్ధములైన వాక్యములు పల్కుట యొప్పునె?' అనే వాక్యం. అసంబద్ధాలు అంటే పొందిక లేనివనీ, సందర్భానికి తగినవి కానివనీ, అనరాని మాటలనీ, వ్యర్థపదాలనీ అర్థాలున్నాయి. ఆ నాలుగర్థాలూ సార్థకమయ్యేటట్లు శ్రీ కృష్ణుడు వ్యాఖ్యానించటం విశేషం.

2. ఇందులో భీముడి సహజ లక్షణాలు నాలుగు చెప్పబడ్డాయి. 1.యుద్ధం మీద ఎప్పుడూ ఉండే ప్రీతి. 2.భయంకర శత్రువులను సైతం లెక్క చేయని గర్వోన్నతి. 3.దుర్యోధనుడి ఆధిక్యాన్ని సహించని ఉద్ధతి. 4.ధర్మరాజుకు రాజ్యం కట్టబెట్టాలన్న సంకల్పం. యుద్ధప్రీతి కలవాడు 43, 50, 51 పద్యాలు మాట్లాడడు. శత్రుభావం కౌరవులపట్ల ఉన్న భీముడు 45, 46, 47 పద్యాలు పలకడు. దుర్యోధనుడి మీది పగగల భీముడు 48 పద్యం చెప్పడు. కాని, ఇప్పుడు అన్నాడంటే భీమ స్వభావం తెలిసినవారికి అవి పొందిక లేని మాటలుగా తోస్తాయి.

3. యుద్ధం చేసి శత్రువర్గాన్ని చంపి విజయాన్ని సాధించవలసిన ఆ తరుణంలో భీముడు అనదగిన మాటలు కావు ఇవి. నిజానికి భీముడి మాటలు కార్యరూపం తాల్చేవి కావు కాబట్టి వ్యర్థమైనవని కూడా తోచవచ్చును. అందువలన అసంబద్ధ శబ్దం సార్థకం.

4. ఆర్ద్ర హృదయం యుద్ధోత్సాహంతో కరడు కట్టుతుంది. శత్రువుల ధిక్కార స్మరణం వలన ఆగ్రహంగా మారుతుంది. సోదరుడైనా తనను చంపజూచిన దుర్యోధనుడి స్మరణ చేత స్నేహం పగగా మారుతుంది. చివరకు 'కీచకాంతకా!' అనే పిలుపుతో ద్రౌపదికి కౌరవులు చేసిన అవమానం జ్ఞాపకం వచ్చి అతడిని చంపినట్లే చంపాలనే క్రోధోద్రేకం పొంగులువారుతుంది. అంటే ఈ పద్యం భీముడిని అతడి సహజ స్వభావంతో వెలుగొందటానికి చేసిన వాఙ్మయ ప్రేరణ మన్నమాట. ఇది రసధ్వని. (సంపా.)

వ. అని యంత నిలువక. 56

తాత్పర్యం: అని అంతటితో ఆగక.

క. 'వెఱ పెట్టిదియో యెన్నఁడు । నెఱుఁగని నీ యట్టివాని కెవ్వరొకో యీ
పిఱికితన మింత యలవడ । గఱపినవా' రనుచు శౌరి గలకల నవ్వెన్. 57

ప్రతిపదార్థం: వెఱపు+ఎట్టిదియో= భయమంటే ఎటువంటిదో; ఎన్నఁడున్= ఏనాడును; ఎఱుఁగని= తెలియని; నీ+అట్టివానికిన్= నీవంటి బలశాలికి; ఈ పిఱికితనము; ఇంత+అలవడన్= ఇంతగా అభ్యాసమయేట్లు; కఱపినవారు= బోధించినవారు; ఎవ్వరు+ఒకో= ఎవరో కదా!; అనుచున్= అంటూ; శౌరి= శ్రీకృష్ణుడు; కలకల నవ్వెన్= పకపకమని నవ్వాడు.

తాత్పర్యం: 'భయమంటే ఏమిటో ఎప్పుడూ తెలియని నీవంటి ధీరుడికి ఈ పిరికితనం ఇంతగా అలవాటయ్యేటట్లు చేసినవారు ఎవరో?' అని హరి పకపక నవ్వాడు.

విశేషం: భయ మెరుగని భీముడికి పిరికితనం నూరిపోసిం దెవ్వరు? -అని ప్రశ్న వేయటం ఒక ఎత్తు, కలకలనవ్వటం మరొకయెత్తు. భీముడి వాక్యాలు అనునయవాక్యాలే కాని భయపడినవాడి మాటలు కావు. కాని, శ్రీకృష్ణుడు వాటికి భయం రంగు పులుముతున్నాడు. అతడిది వక్రోక్తి, జల్పోక్తి. అయినా లోకం భీముడు పిరికివాడని అనుకొనే ప్రమాదముందని హెచ్చరించాడు. అతడిని సంకటస్థితిలో పెట్టాడు. 'దీని కేమి సమాధానం చెప్పుతావు?' అన్నట్లు హాస్యంగా నవ్వాడు. ఈ నవ్వు కవ్వింపు నవ్వు, చనువుతో చుర్రెక్కించే నవ్వు, పిరికివాళ్ళను చూస్తే లోకం ఇట్లాగే నవ్వుతుంది అని ఎగతాళి చేసే నవ్వు. అందుకే శ్రీకృష్ణుడు కలకలనవ్వినా భీముడికి పెళపెళ కోపం రాలేదు. పైపెచ్చు ఆప్యాయంగా ఆ పరిహాసానికి ప్రతిస్పందనగా భీముడు ఒక చిరునవ్వును చిందించాడు. (సంపా.)

వ. దానికి దరహసితవదనుం డగుచు భీమసేనుండు వసుదేవసూనున కిట్లనియె: 58

ప్రతిపదార్థం: దానికిన్= శౌరి వచనాలకు; దరహసిత వదనుండు+అగుచున్= చిరునవ్వుతో కూడిన ముఖం కలవాడై; భీమసేనుండు= భీముడు; వసుదేవసూనునకున్= వసుదేవుడి పుత్రుడైన శ్రీకృష్ణుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా సమాధాన మిచ్చాడు.

తాత్పర్యం: శౌరి మాటలకు భీముడు చిరునవ్వు తన మోమున నిండగా వాసుదేవుడితో ఈ విధంగా అన్నాడు.

ఉ. 'బంటుతనంబు మాటలకుఁ బాఱకు; పాండునృపాలుపాలు గై
కొంటయ చాలునన్న నృపకుంజరు పల్కుల కడ్డమాడ రా
కుంట యెఱుంగవే; మును సుయోధను చందముఁ జూపి యప్పు డే
మంటి యుపేంద్ర! న న్నని రణాగ్రమునన్ నిను మూదలించెదన్. 59

ప్రతిపదార్థం: ఉపేంద్ర!= మాధవా!; బంటుతనంబు మాటలకున్+పాఱకు= పౌరుష వచనాలు పలకటానికి పూనవద్దు; పాండు నృపాలు పాలు= పాండు మహారాజుయొక్క రాజ్యభాగం; కైకొంటయ చాలున్= గ్రహించుటయే మనకు చాలు; అన్న నృపకుంజరు పల్కులకున్= అని పలికిన రాజోత్తముడైన ధర్మజుడి మాటలకు; అడ్డము+ఆడన్+రాకుంట= వ్యతిరేకంగా పలుక లేకుండటం; ఎఱుంగవే= నీకు తెలుసు గదా; మును= మున్ముందు; సుయోధను చందమున్+చూపి= దుర్యోధనుడు పడే పాట్లు కనబరచి; అప్పుడు= దౌత్యం కావింప కురుసభకు వెళ్ళే సమయంలో; నన్నున్= నన్ను; ఏమంటి= ఏమని పల్కితివి; అని= అంటూ; రణ+అగ్రమునన్= అని మొనలో; నినున్= నిన్ను; మూదలించెదన్= హెచ్చరించుకొంటాను.

తాత్పర్యం: 'కృష్ణా! మగసిరి మాటలు నా దగ్గర మాట్లాడవద్దు. మన తండ్రి రాజ్యభాగమే మనకు చాలునని ప్రభువగు ధర్మరాజు పలికిన మాటలకు మేము బదులు చెప్పలేకుండటం నీకు తెలుసు. జరుగబోయే సంగ్రామంలో దుర్యోధనుడు పడే పాట్లు చూపి ఆనాడు కురుసభకు వెళ్ళేటప్పుడు ఉపప్లావ్యపురిలో నన్నేమంటివో జ్ఞప్తికి తెచ్చుకొమ్మని యుద్ధముఖంలో నిన్ను హెచ్చరించకపోనులే.

విశేషం: 1. భీము డీ పద్యంలో శ్రీకృష్ణుడితో రసికవీరుడుగా పరిహాసోక్తులు మాట్లాడాడు. 'కృష్ణా! నీ వేమీ నాకు పౌరుషం నూరిపోసేపని లేదులే. ధర్మరాజు రాజ్యభాగం తీసికొంటే చాలులే అన్నందువలననే నే నిట్లా మాట్లాడాను. కాని, ఆనాడు

కురుసభలో దుర్యోధనుడి తీరు చూచి నేను ప్రతిజ్ఞ చేసిన మాటలు నీకు తెలియవా? వాటిని రణరంగంలో చేసి చూపిస్తాను. అంటే దుర్యోధనుడి తొడలు విరుగగొట్టి నేను పిరికివాడిని కానని నీ ఎదుట నిరూపించుకొంటాను' అని భీముడు సరసంగానే పౌరుషంగా మాట్లాడాడు. నవ్వుతూ మాట్లాడితే కలిగే ఫల మది. భీముడు సంధి జరిగితే సౌమ్యుడు; యుద్ధం జరిగితే యముడు.

2. ఏమంటి యుపేంద్ర - 'అంటివి' అనునది మధ్యమపురుషక్రియ. 'లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాష నగు.' అనే సూత్రంచేత, వకారానికి లోపం వచ్చి 'అంటి' అయినది. 'మధ్యమపురుషక్రియలయం' 'దిత్తునకు సంధి యగు' అనే సూత్రంచేత, సంధి నిత్యంగా రావలసి యుండగా, ఏమంటి యుపేంద్ర - అని యడాగమము వచ్చుట విశేషం. ఏమంటి వుపేంద్ర- అన్నచో సరిపోయెడిది. (సంపా.)

క. నా కొలఁది విచారింపక । నీ కిట్లనఁ దగునె? మిన్ను నేలయు నిమ్మైఁ
గాక తిరుగంగఁ బడినం । బో కే ముంజేతు లొడ్డి పోవఁగఁ ద్రోతున్. 60

ప్రతిపదార్థం: నా కొలఁది= నా శక్తి ఏపాటిదో; విచారింపక= ఆలోచించకుండ; నీకున్+ఇట్లు+అనన్+తగునె?= నీకు ఇట్లా పలకటం న్యాయమా?; మిన్నున్= ఆకాశమూ; నేలయున్= భూమియు; ఇమ్మైన్+కాక= ఇప్పుడున్నట్లుండక; తిరుగంగన్+పడినన్= తార్మారైనప్పటికీ; పోక= వెనుకాడక; ఏన్= నేను; ముంజేతులు+ఒడ్డి= ముంజేతులు అడ్డముపెట్టి; పోవఁగన్+త్రోతున్= వాటి వాటి స్థానాలకు నెట్టివేస్తాను.

తాత్పర్యం: బావా! నా శక్తిసామర్థ్యాలు ఏపాటివో ఆలోచించక ఇట్లా నీవు మాట్లాడటం న్యాయం కాదు. నేలా, నింగీ ఇప్పుడున్నట్లు కాక తలక్రిందులైనప్పటికీ వెనుదీయక నేను ముంజేతులు ఒడ్డి వాటిని పాటుకు తోస్తాను సుమా!'

విశేషం: 1.అలం: అత్యుక్తి. "అత్యుక్తి రద్భుతా తథ్య శ్యార్యౌదార్యాది వర్ణనమ్". శ్రీకృష్ణుడి పరిహాసానికి భీముడి అత్యుక్తి సమతౌల్యాన్ని తెచ్చింది. మూలశ్లోకం ఇట్లా ఉన్నది.

> **"యది మే సహసా క్రుద్ధే సమేయాతాం శిలే ఇవ,**
> **అహ మేతే నిగృహ్ణీయాం బాహుభ్యాం సచరాచరే". (సం. 5-74-8)**

భూమ్యాకాశాలు పరస్పరం రాపిడి పడితే విడదీస్తానని అనటం సంస్కృతంలో జాతీయం కావచ్చును. కాని, నేలా నింగీ తిరగబడితే సరిగా త్రోయటం తెలుగువారికి దగ్గరగా ఉండే జాతీయం. 2.శ్రీకృష్ణుడి మాటలకు భీముడికి అభిమానం పొడుచుకొని వచ్చింది కాని, ఆగ్రహం ప్రజ్వరిల్లలేదు. ఈ సందర్భంలో కొందరు కవులు భీముడికి నిజంగా పట్టరానంత కోపం వచ్చినట్లు, అతడు శ్రీకృష్ణుడిని తూలనాడినట్లూ చిత్రిస్తారు. వారు వ్యాసుడి వద్దా, తిక్కన వద్దా ఔచిత్యపాఠాలు నేర్చుకొనాలి. ఇక్కడ భీముడు ఉచితజ్ఞుడు. (సంపా..)

ఉ. నావుడు 'నవ్వుటాల కనినం బవనాత్మజ! యింత యేటికిం?
గేవల యోధవే? పరుల కిల్బిషముల్ దలపోయ కిమ్మెయిన్
జావడమైనఁ జూచి యిది చందము గాదని యంటిఁగాక, నీ
చేవయు లావు నీవు మును చేసిన భంగులు నే నెఱుంగనే? 61

ప్రతిపదార్థం: నావుడున్= భీమసేను డట్లా పలుకగా; పవన+ఆత్మజ!= వాయునందనా!; నవ్వుటాలకున్= ఎగతాళికి; అనినన్= నేనట్లా అంటే; ఇంత+ఏటికిన్?= ఇంత ఎందుకు?; కేవల యోధవే?= నీవు సామాన్య వీరుడవా?; పరుల కిల్బిషముల్=

శత్రువు లొనర్చిన పాతకములు; తలపోయక= మదినెంచక; ఈ+మెయిన్= ఈ విధంగా; జావడము+ఐనన్= అపౌరుషవృత్తి నవలంబించగా; చూచి= గమనించి; ఇది చందము+కాదు= ఇది సుక్షత్రియుడి పద్ధతి కాదు; అని+అంటిన్+కాక= అని పల్కితినే తప్ప; నీ చేవయున్= నీ సారమూ; లావు= బలమూ; నీవు+మును+చేసిన భంగులు= నీవు పూర్వం చేసిన వీరవిహారాలూ; ఏన్= నేను; ఎఱుంగనే!= తెలియనటయ్యా!

తాత్పర్యం: భీముడి మాటలు విని వాసుదేవుడు 'పవనపుత్రా! నే నేదో పరిహాసానికై పలికిన మాటలకు ఇంత రాద్ధాంతమా? నీవు అసామాన్య వీరుడివి. ఇట్లాంటివాడివి దుర్యోధనాదులు మునుపు మీకు చేసిన అపకారాలను స్మరించక పౌరుష హీన వాక్యాలు పల్కటం చూచి, ఇది నీవంటి రాచబిడ్డకు యుక్తం కాదన్నానేగాని మరేమీ కాదు. నీ భుజసారం, శక్తీ, నీవు పూర్వం చేసిన సాహసకృత్యాలు- హిడింబాసుర, బకాసుర, కీచక, జరాసంధాది వధలు నాకు తెలియనివి కావు గదా!'

విశేషం: భీముడిలో క్రోధాగ్ని చల్లారలేదని తెలిసికొన్న శ్రీకృష్ణుడు తనవి పరిహాస వచనాలని ఊరటపలికి, భీముడి బలపరాక్రమాలను ప్రశంసించి, అతడిలో యుద్ధోత్సాహాన్ని స్థాయిగా నిలిపాడు. (సంపా.)

వ. అని చెప్పి మాధవుండు మఱియును. 62

తాత్పర్యం: ఇట్లా వచించి శ్రీకృష్ణుడు మళ్ళీ భీముడితో ఇట్లా అన్నాడు:

ఉ. 'పార్థుఁడు పోరఁ దేరు గడపం దనకున్ ననుఁ గోరి యెంతయుం
బ్రార్థన సేసె; దాని కనురాగము నొందితి నేను గాన యు
ద్ధార్థులమైన మాకు నిను నాసపడం దగదే? యశంబు నా
నార్థములున్ విరోధి విజయంబునఁ దక్కఁగ నొంటఁ గల్గునే?' 63

ప్రతిపదార్థం: పార్థుఁడు= కుంతీపుత్రుడైన అర్జునుడు; పోరన్= యుద్ధంలో; తనకున్= తనకు; తేరు+కడపన్= రథం తోలటానికి; ననున్+కోరి= నన్ను అభిలషించి; ఎంతయున్+ప్రార్థన చేసెన్= మిక్కిలి వేడుకొన్నాడు; దానికిన్= అర్జునుడి వేడికోలుకు; నేను+అనురాగము+ఒందితిన్= నేను ఆసక్తి వహించాను; కానన్= కనుక; యుద్ధ+అర్థులము+ఐన మాకున్= యుద్ధం చేయవలెనని కాంక్షిస్తున్న మా ఇద్దరికీ; నినున్= నిన్ను; ఆస+పడన్+తగదే?= కోరుకొనటం యుక్తమే గదా!; యశంబున్= కీర్తీ; నానా+అర్థములున్= బహుళ ప్రయోజనాలూ; విరోధి జయంబునన్+తక్కఁగన్= శత్రువులను గెల్చుటచేగాక; ఒంటన్= మరొక్క విధాన; కల్గునే?= లభింపగలవా? (లభించవని అర్థం.)

తాత్పర్యం: 'ఫల్గునుడు యుద్ధంలో తనకు రథసారథ్యం చేయవలసిందిగా నన్ను మిక్కిలి కోరుకొన్నాడు. అందుకు నేను సమ్మతించాను. కనుక యుద్ధం అభిలషిస్తున్న మాకు కదనంలో నీ తోడ్పాటు ఎంతో అవసరం. కీర్తి, సకల ప్రయోజనాలూ శాత్రవులను గెలవటంవలన కాక మరో విధంగా సమకూడవు గదా!'

విశేషం: ఈ పద్యంలోని వాక్యప్రవృత్తిని గురించి తిక్కన 66వ వచనంలో- పరిహాసంతో పని సాధించే సరస వాక్యాలని సూచించాడు. ఇంతవరకూ పరిహాసంతో పని సాధించే మాటలయ్యాయి. ఇప్పుడు సరస వాక్యాలు ఇక్కడ మొదలయ్యాయి. సరస వాక్యం వినోద పర్యవసాయిగా ఉంటుంది. నవ్వుతో చిగురిస్తుంది. ఉద్ధతుడైన భీముడికి ఇతరులు తనకంటె గొప్పవారంటే

మండిపడతాడు. ప్రత్యేకించి కౌరవవీరులంటే అసలు సహించలేడు. శ్రీకృష్ణుడు పాండవులలోనే సారథిగా తన సహాయం పొందిన అర్జునుడి ప్రస్తావన చేసి, వారిద్దరూ కలసి భీముడి సహాయాన్ని కోరతామని వ్యంగ్యంగా అన్నాడు. ఇందులో కాకువులో రెండర్థాలు స్ఫురించవచ్చును.

1. మేమిద్దరం కలిసి యుద్ధం చేసినా విజయం సాధ్యం కాకపోవచ్చును. కాబట్టి నీసహాయం మాకు అవసరం అని. అంటే భీముడి సహాయమే విజయమూలమని ప్రశంస. కృష్ణార్జునుల కంటె భీముడే అధికుడని తాత్పర్యం. 2.అసలు యుద్ధం చేసేది కృష్ణార్జునులే. వారి బలపరాక్రమాలే విజయ హేతువులు. అయినా, భీముడి సహాయం కూడా విజయానికి తోడ్పడుతుందని మరొక అర్థం. ఈ భావంలో భీముడు కృష్ణార్జునులకు సహాయకుడు, ఉపాంగతుల్యుడు. భీముడు రెండో అర్థాన్ని గ్రహిస్తే ఉద్రిక్తుడు కావచ్చును. కాని, ఆ వాక్యం శ్రీకృష్ణు డాడుతున్న సరస వాక్యంగా గ్రహించటం చేత కోపం తెచ్చుకొనకుండా సరితూకంగా తానూ పరిహాసోచిత వీరసరసం మాట్లాడగలిగాడు. భీముడిని సరైన బాటలో పెట్టిన శ్రీకృష్ణుడి సరసవాక్య మిది. (సంపా.)

వ. అనవుడు. **64**

తాత్పర్యం: అని అనగా.

శా. 'ఏమీ! పార్థుఁడు నీవు దండిమగలై యీవచ్చు కౌరవ్య సం
గ్రామక్షోభము బాహుదర్పమునఁ దీర్పం బెద్ద మిట్టెక్కి మి
మ్మే మెల్లన్ వెఱఁగంది చూచెదముగా; కీసారెకుం బోయి రా
భీముం డిత్తఱి రిత్తమాటలకుఁ గోపింపండుసూ పెంపఱన్.' **65**

ప్రతిపదార్థం: ఏమీ!= ఎట్టెట్టూ!; పార్థుఁడున్= అర్జునుడూ; నీవున్= నీవూ; దండిమగలు+ఐ= మేటి శూరులై; ఈ వచ్చు= ఇప్పుడు రానున్న; కౌరవ్య సంగ్రామ క్షోభమున్= కురు సంతతి యొక్క యుద్ధంవలని కలతను; బాహుదర్పమునన్= భుజగర్వంతో; తీర్పన్= తొలగిస్తుండగా; ఏము+ఎల్లన్= తక్కిన మేమందరమూ; పెద్ద+మిట్టు+ఎక్కి= ఎత్తైన మిట్టమీద నిలిచి; వెఱఁగు+అంది= ఆశ్చర్యంపొంది; చూచెదముగాక= తిలకిస్తాము లెమ్ము; ఈ సారెకున్= ఈ తడవకు; పోయిరా= సంధికి వెళ్ళిరమ్ము; భీముండు= ఈ భీమసేనుడు; ఈ+తఱిన్= ఈ సమయంలో; రిత్త మాటలకున్= వ్యర్థ వచనాలకు; పెంపు+ అఱన్= గౌరవం చెడేటట్లు; కోపింపండు సూ!= కోపము వహించడు సుమా!

తాత్పర్యం: ఎట్టెట్టూ? అర్జునుడూ నీవూ మేటిశూరులై రానున్న కురు సంగ్రామ క్షోభను మీ భుజశక్తితో నివారిస్తుంటే మేమందరమూ చేతులు ముడుచుకొని పెద్ద మిట్ట నెక్కి ఆశ్చర్యంతో మిమ్ము చూస్తుంటాంలే. నీవు ఈ సారికి కురుసభకు వెళ్ళి రావయ్యా! ఇట్లాంటి సమయంలో భీముడు గౌరవం చెడేటట్లు వ్యర్థ వచనాలకు కోపం చెందడు.'

విశేషం: ఇది వ్యంగ్య సరసోక్తి. భీముడు గూఢాభిమానం తొంగి చూచేటట్లు మాట్లాడాడు. 'ఏమీ!' - ఆశ్చర్యార్థకం. కాకువులో పరిహాసార్థకం 'దండి మగలై' - తెలుగుదనం గుబాళించే సమాసం. మేటి వీరులై అని అర్థం. భీముడికంటె గొప్పవారుగా రణరంగంలో రాణించే వారై అని భావం. భీము డీ మాటలు ఎగతాళిగా కూడా అనే అవకాశం ఉన్నది; గౌరవంగా కూడా చెప్పే అవకాశం ఉన్నది; అందువలన ఎదుటివా రేమీ అనలేరు. శ్రీకృష్ణుడు రెండు రకాల అర్థాలు వచ్చే సరసవాక్యాలు ఎట్లా మాట్లాడాడో భీముడూ వాటికి దీటుగా మాట్లాడాడు. 'మిట్టలెక్కి మీ పరాక్రమాన్ని మేము భయపడుతూ చూస్తాంలే' అనే మాట మనసులో దెబ్బతిన్న అభిమాని ఎదుటివారి మనసు దెబ్బతినకుండా నవ్వి ఊరుకొనేటట్లు మాట్లాడిన సరసవ్యంగ్యోక్తి. ఇవన్నీ

ఒక ఎత్తు. 'ఈ సారెకుం బోయిరా!' అనే వాక్యం మరొక ఎత్తు. 'ఎప్పుడో జరుగబోయే యుద్ధంలో సారథ్యాన్ని నిర్వహిస్తానని బడాయిలు కొట్టటం ఎందుకు? యుద్ధం చేయటం కంటె సంధి చేయటం తక్కువైనదేమీ కాదు. నీనేర్పు ఈ సంధి సారథ్యంలో మొదట బైటపడుతుంది. ఇక్కడ నీవు నెగ్గితే యుద్ధం సంగతి ఆ తరువాత గమనిద్దాం' అని ఆ వాక్యంలో స్ఫురించే వ్యంగ్యార్థం. 'భీముఁ డిత్తఱి రిత్తమాటలకుఁ గోపింపండు సూ పెంపఱన్' - ఈ వాక్యం వినయ వివేకంతో పలికిన వీరవాక్యం. తనపేరు తానే చెప్పుకొనటం, అహంకార సూచకమైన ప్రథమ పురుష ప్రయోగం కాక, వినయసూచకమైన ప్రథమపురుష కావటం విశేషం. శ్రీకృష్ణుడు 'అసంబద్ధ వాక్యా'లని భీముడిని ఎత్తిపొడిచిన దానికి, భీముడు 'రిత్తమాటల'ని శ్రీకృష్ణుడి పట్ల ప్రయోగించాడు. కోపం రేకెత్తించాలని శ్రీకృష్ణుడు మేలమాడిన సంగతి గుర్తించి 'నీ యత్నాలు ఫలించవు' నేను గంభీరుడను, ధీరుడను, వివేకుడను, ఉదాత్తుడను అని కన్నులెగరేస్తూ పరిహాసంగా భీముడు పలికాడు. (సంపా.)

వ. అని పలికి యివ్విధంబున గోపాలదేవు మేలంపు మెయివడి కార్యవచనంబులకుం దగం దానును దోడ్తో సరసం బాడుటయకా మఱుమాటలాడి యంతటఁ దనివోవక బకమర్దనుం డతనితో నిట్లనియె: 66

ప్రతిపదార్థం: అని పలికి= అంటూ మాట్లాడి; ఈ+విధంబునన్= ఈ రకంగా; గోపాలదేవు= శ్రీకృష్ణస్వామియొక్క; మేలంపు మెయివడి కార్యవచనంబులకున్= పరిహాసంతో కూడిన కార్యానుకూలాలైన మాటలకు; తగన్= ఒప్పిదంగా; తానును= తాను గూడ; తోడ్తోన్= వెంటనే; సరసంబు+ఆడుట+అ కాన్= సరసమాడటమేకాగా; మఱుమాటలు+ఆడి= ప్రతివచనాలు పలికి; అంతటన్+తని+పోవక= ఆ మాటలతోనే తనివి తీరక; బకమర్దనుండు= బకాసురుడిని చంపినవాడు- భీముడు; అతనితోన్+ఇట్లు+అనియెన్= కృష్ణుడితో ఇట్లా పలికాడు.

తాత్పర్యం: భీము డీవిధంగా గోపాలకృష్ణుడి పరిహాస చతురాలైన పని సాధించే మాటలకు యుక్తంగా వెంటనే తానుగూడ సరసపు మాటలతోనే సమాధానం చెప్పి, అంతటితో తృప్తిపడక మళ్ళీ ఇట్లా అన్నాడు:

ఉ. 'కయ్యము గల్గినట్లయిన గంధ గజ ప్రకరంబు కుంభముల్
వ్రయ్యఁ దురంగ పంక్తులు ధరం బడఁ దేరిగముల్ బడల్పడన్
డయ్యమి కీవు వెక్కసపడన్ గదపండువు సేయఁగోరు నా
దయ్యము నెత్తికోలు దుది దాఁకుటగాదె భుజంగభంజనా! 67

ప్రతిపదార్థం: భుజంగభంజనా!= కాళీయుడిని మర్దించిన కృష్ణా!; కయ్యము+కల్గినట్లు+అయినన్= పోరాటం జరిగితే; గంధగజ ప్రకరంబు కుంభముల్= మదించిన ఏనుగుల గుంపుల యొక్క తలలు; వ్రయ్యన్= బ్రద్దలు కాగా; తురంగ పంక్తులు= గుర్రాల బారులు; ధరన్+పడన్= భూమిపై కూలగా; తేరిగముల్= రథాల మొత్తాలు; బడల్ పడన్= శిథిలాలుకాగా; డయ్యమికిన్= నేను అలసట చెందకున్నందుకు; ఈవు= నీవు; వెక్కసపడన్= దుస్సహత్వము చెందగా; గద పండువు+చేయన్+కోరు= నా హస్త మందలి గదకు ఉత్సవం చేయనెంచుతున్న; ఆ దయ్యము+ఎత్తికోలు= ఆ దైవం యొక్క ఉద్యమం, ఆ విధియొక్క విజృంభణం; తుది+తాఁకుట గాదె!= కడముట్టుటయే(నెరవేరటమే) అగును సుమా!

తాత్పర్యం: యుద్ధం జరిగితే మదించిన యేనుగుల తలలు బ్రద్దలు చేస్తాను. గుర్రాల బారులను భూమిపై కూలుస్తాను. రథ సమూహాలను నుగ్గు నుగ్గు చేస్తాను. ఇంత చేసికూడా బడలిక చెందని నన్ను చూచి నీవు ఆశ్చర్యపడక మానవు. నా గదతో పండుగ చేయగోరుతున్న దైవసంకల్పం అప్పుడే కదా సఫలమయ్యేది!

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం. లోకోక్తి. అర్జునుడికి గాండీవ పాండిత్యం ఎంత పేరు తెచ్చిందో భీముడికి గదాయుధం అంత కీర్తి తెచ్చింది. గదాయుద్ధంలో భారత వీరులలో అతడు మేటి. 'దయ్యము నెత్తికోలు దుది దాకుట కాదె'. ఇది లోకోక్తి. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. అన విని దేవకీతనయుఁ డాతని కిట్లనుఁ 'జెప్పినంత కం
టెను మిగులంగఁ జేయుదు గడింది మగండవు నిన్నుఁ దెప్పగాఁ
గొని పలుమాఱు నాపదలకున్ భయమొందక దుఃఖవార్ధు లీఁ
దిన మము నెల్ల నిక్కొఱఁత దీర్చి సుఖాత్ములఁ జేయు పావనీ! 68

ప్రతిపదార్థం: అనన్+విని= భీముడట్లా పలుకగా విని; దేవకీతనయుఁడు= దేవకీదేవి కుమారుడైన కృష్ణుడు; ఆతనికిన్= భీముడికి; ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పాడు; పావనీ!= వాయుకుమారా!; చెప్పిన+అంతకంటెను= చెప్పినదానికన్న, మిగులంగన్+చేయుదు(వు)= ఎక్కువగా చేస్తావు; కడింది మగండవు= నీవు మేటి వీరుడివి; నిన్నున్= నిన్ను; తెప్పగాన్+కొని= నౌకగా చేసికొని; పలుమాఱున్= పెక్కుసారులు; ఆపదలకున్= కష్టాలకు; భయము+ఒందక= వెరపు చెందక; దుఃఖవార్ధులు+ఈదిన= దుఃఖాలనే సాగరాలను దాటిన; మమున్+ఎల్లన్= మమ్ములనందరినీ; ఈ కొఱఁతన్+తీర్చి= ఇప్పు డేర్పడిన ఆపదను బాపి; సుఖ+ఆత్ములన్+చేయు!= సుఖంతో గూడిన హృదయం కలవారినిగా చేయవయ్యా!

తాత్పర్యం: భీముడు పలికిన పలుకులు విని శ్రీకృష్ణుడు 'వాయునందనా! నీవు చెప్పినదానికంటె ఎక్కువగానే చేస్తావు. నీవు గొప్ప వీరుడివి. నిన్ను తెప్పగా చేసికొని కడగండ్లకు భయపడకుండా మేము దుఃఖమనే సముద్రాలీది గట్టెక్కినాము. ఇప్పు డేర్పడిన సంకటం తొలగించి మమ్ము సుఖపెట్టవలసింది.

విశేషం: అలం: రూపకం. సంధియత్న సమయంలో ధర్మరాజు యుద్ధోత్సాహాన్ని మానకుండా ఉండటానికి భీమాదులలో పౌరుషాన్ని ప్రజ్వలింపజేస్తున్న శ్రీకృష్ణుడి వ్యూహాశక్తికి ఈ పద్యం ఒక తార్కాణం. భీముడు పైకి చల్లారినట్లున్నా, లోన మండుతూనే ఉన్నాడని పాండవ పక్షానికి ప్రదర్శింపజేసి చూపించాడు. 'పావనీ!' - సార్థక సంబోధనం. దుఃఖవార్ధులు దాటేవారికి భీముడు తెప్పయేకాదు, తెప్పను ముందుకు త్రోసి ఒడ్డుకు చేర్చే పవనకుమారుడు (పిల్లగాలి) కూడా అని చమత్కారం. (సంపా.)

క. ఇదె పోయెదఁ గౌరవ్యులఁ । బదనికి రాఁ బలికి సంధి వాటించెద; నా
కది యొప్పదె! కాని తుదిం । గుదురింతకు నీవ కావె గుణరత్ననిధీ!' 69

ప్రతిపదార్థం: గుణరత్ననిధీ! -సద్గుణాలనెడు రత్నాలకు నిలయమైనవాడా!; ఇదె= ఇప్పుడే; పోయెదన్= కురుసభకు వెళ్తాను; కౌరవ్యులన్= కురువంశసంభవులను; పదనికి రాన్+పలికి= పాకానికి వచ్చేటట్లు మాట్లాడి; సంధి పాటించెదన్= సంధి సమకూరుస్తాను; నాకున్= నాకు; అది+ఒప్పదె?= అట్లా సంధి కుదుర్చుట సమ్మతమే; కాని; తుదిన్= చివరకు సంధి కుదురని పక్షంలో; ఇంతకున్+కుదురు= అన్నింటికినీ; ఆధారము; నీవు+అ, కావె!= నీవే సుమా!

తాత్పర్యం: గుణరత్న నిధివైన భీమా! నే నిపుడే కురుసభకు వెళ్ళుతాను. పాకానికి వచ్చేటట్లు వారితో మాట్లాడి సంధి పొసగే టట్లు చూస్తాను. అట్లా యత్నించటం నాకు సమ్మతమే. ఒకవేళ సంధి కుదరని పక్షంలో మాకు అన్నింటికీ ఆధారం నీవే సుమా!'

విశేషం: 1. 'ఈ సారెకుం బోయిరా' అని 65వ పద్యంలో భీముడన్న మాటలకు ప్రతిధ్వని ఈ పద్యం.

2. ఒక దీర్ఘసంభాషణను ముగించే తరుణంలో పాటించే నిర్వహణ శిల్పం తిక్కన రచనలో గమనించదగింది. ఈ పద్యం శ్రీకృష్ణుడు భీముడితో చేసిన సంభాషణకు సముచితమైన ముగింపు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

3. 'తుదిన్ కుదు రింతకు నీవకావె గుణరత్ననిధీ' - కుదుటపరిచే వాడు, ఆధారమైన వాడు భీముడు అనే మాట సాధారణార్థంలో సరసంగా ఉన్నది. భావికథార్థ వ్యంజకంగా కూడా ఉన్నది. మహాభారత యుద్ధంలో చిట్టచివర దుర్యోధన సంహారమే విజయనిర్ధారకంగా నిలిచే అంశం. దానిని విజయవంతంగా ముగించి భారత యుద్ధంలో విజయానికి ఒక కుదురుగా నిలిచేవాడు భీముడే కదా! శ్రీకృష్ణుడు సత్యవాక్కు. 'గుణరత్ననిధీ' ప్రశంసకు పరాకాష్ఠ. (సంపా.)

అర్జునుఁడు శ్రీకృష్ణునితోఁ దన యభిప్రాయంబు సెప్పుట (సం. 5-76-1)

వ. అనిన వాసుదేవున కర్జునుం డిట్లనియె : 70

తాత్పర్యం: అని పలికిన కృష్ణుడితో అర్జునుడు ఇట్లా అన్నాడు :

తే. 'చెప్పఁ గల యంతవట్టును జెప్పె నీ క। జాత శత్రుండు; వింటి వీ వా తెఱంగు;
మాకు నెల్లను బలుకంగ మాట లొండు। గలవె? యైనను జెప్పెదఁ గన్నయంత. 71

ప్రతిపదార్థం: అజాతశత్రుండు= ధర్మరాజు; నీకున్= నీకు; చెప్పన్+కల+అంతవట్టును+చెప్పెన్= చెప్పగలిగినంతవరకు చెప్పాడు; ఈవు= నీవు; ఆ తెఱంగు వింటివి= ఆయన పలుకుల చందం విన్నావు; మాకున్+ఎల్లను= మాకందరికీ; పలుకంగన్= చెప్పటానికి; మాటలు= పలుకులు; ఒండు+కలవె?= వేరే ఉన్నవా?; ఐనను= లేనప్పటికీ; కన్న+అంత= ఎరిగినంతవరకూ; చెప్పెదన్= పలుకుతాను.

తాత్పర్యం: 'ధర్మనందనుడు నీకు చెప్పవలసినదంతా చెప్పాడు. ఆయన మాటలన్నిటినీ నీవు విన్నావు. ప్రత్యేకంగా మేము చెప్పవలసిన మాటలు లేవు. అయినా నాకు తోచిన మాటలు నేనూ చెపుతాను.

విశేషం: భీముడు సూటిగా మాట్లాడితే అర్జునుడు సున్నితంగా మాట్లాడతాడు. చెప్పవలసినదంతా 'అజాతశత్రుడు' చెప్పాడట. ఆ విశేషణం సార్థకం. ధర్మజుడి మాటలు శత్రువులు కూడా కాదన లేని రీతిలో ఉన్నాయి. అతడు మాట్లాడిన తరువాత ఎవరికైనా మాటలు మిగులుతాయా? అనటం ఔపచారికార్థం. అతడి అభిప్రాయం కంటె వేరైన నిశ్చయం మాకు ఉంటుందా? అని మరొక అర్థం. అయినా చెప్పుతున్నాను వినుమని అంటున్న అర్జునుడు పెద్దలను కాదనని స్వీయ అస్తిత్వం కల అభిమానధనుడని స్పష్టమవుతున్నది. (సంపా.)

మ. ధృతరాష్ట్రుం డతిలోభదూషితుఁడు ధాత్రీభాగ మీ నేర్చునే
సుతుఁడుం గష్టుఁడు సంధి యేల యగునంచున్ మున్న కైపెక్కిన
ట్టితలం పచ్యుత! నీకుఁ గల్గినది; గాండీవంబు దివ్యాస్త్ర సం
తతియుం బెట్టినయట్లయుండ మముఁ జింతం బాపరాదో కదే! 72

ప్రతిపదార్థం: అచ్యుత!= శ్రీకృష్ణా!; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు; అతి లోభదూషితుఁడు= మిక్కిలి దురాశచేత నిందింపదగినవాడు; ధాత్రీ భాగము= పుడమిలో పాలు; ఈన్+నేర్చునే= ఇచ్చుటకు సమ్మతిస్తాడా?; సుతుఁడున్= అతని కుమారుడైన సుయోధనుడు; కష్టుఁడు= కర్కశుడు; సంధి+ఏల+అగున్+అంచున్= సంధి ఎట్లా కుదురుతుందని; మున్ను+అ= ముందుగానే; కైపు+ఎక్కినట్టి తలంపు= సందేహంతో కూడిన ఆలోచన; నీకున్+కల్గినది= నీకు పుట్టింది; గాండీవంబున్= నా ధనుస్సును; దివ్య+అస్త్ర సంతతియున్= దివ్యములైన బాణ సమూహమును; పెట్టిన+అట్ల+ఉండన్= వానికేమాత్రం

పనితగులకుండ ఉన్నచోటనే అవి ఉండగా; మమున్= మమ్ము; చింతన్+పొపరాదో+కదే?= విచారం పాలుగాకుండా చేయగూడదా యేమి?

తాత్పర్యం: కృష్ణా! ధృతరాష్ట్రుడు పరమ దురాశాపరుడు. అతడు మాకు రాజ్యభాగ మివ్వటానికి అంగీకరించడు. అతడి కొడుకు గూడా మిక్కిలి కర్కశుడు. మరి సంధి కుదరటం అసంభవమని ముందుగానే నీకు సందేహం కలిగింది. నా గాండీవం, దివ్యబాణ పరంపర పనిమాని ఊరక ఉన్నచోటనే ఉండగా మేము ఏ విచారం లేకుండా ఉండే మార్గం చూపించలేవా?

విశేషం: అర్జునుడు గూఢాభిమాని. ధృతరాష్ట్రుడు దుర్యోధనుడు సంధి పడనీయరని అతడి దృఢ విశ్వాసం. శ్రీకృష్ణుడు కూడా అటువంటి అభిప్రాయాన్ని ఆవేశంతో అనటం కూడా జరిగింది. (చూడు పద్యాలు 1.352; 3.41). అంటే అర్జునుడికున్న అభిప్రాయమే కృష్ణుడి కున్నదన్నమాట! శ్రీకృష్ణుడు అచ్యుతుడు, అన్న మాట నుండి జారి పోయేవాడు కాదు. అయినా సంధి యత్నం చేస్తున్నాడు. ఇందులో సహజ విరోధాభాసం ఉన్నది. జగన్నాటక సూత్రధారి సాగించే రాజనీతి ఉన్నది. దానిని మనసులో పెట్టుకొని ఎత్తిపొడుపుగా 'నా గాండీవం, దివ్యాస్త్రాలూ ఉన్నవి ఉన్నట్లుగానే ఉండగా మా దిగులు తీరేటట్లు చేయు'మని అనటం వ్యంగ్యోక్తి. అర్జునుడి రథసారథిగా కృష్ణుడు కుదిరింది గాండీవి పరాక్రమాన్ని ప్రపంచానికి చాటటానికే. అదీ శ్రీకృష్ణు డన్నమాటే. ఇపుడు సంధి చేస్తే ఆమాట నిలువదు. అచ్యుత బిరుదం పొసగదు. కాబట్టి ఘటనాఘటన సమర్థుడైన శ్రీకృష్ణుడిలోని దివ్యత్వాన్ని భావిస్తూ 'అన్న మాటలన్నీ నిలబెట్టుకొని అచ్యుతత్వాన్ని కాపాడుకొ'మ్మని పార్థుడు సున్నితమైన వ్యంగ్యోక్తిని పలికాడు. (సంపా.)

ఉ. నీ వొనరింపఁ బూనిన పనిం గమలోదర! కీడు వుట్టునే?
కా వనినట్ల యుండి యవుఁ గార్యము; లట్లగుటం బ్రయత్న సం
భావనసేఁత పౌరుషము పద్ధతి తత్ఫలసిద్ధి వొందుచో
దైవము దోడ్పడన్ వలయుఁ; దథ్యము రెండును నీ వినోదముల్. 73

ప్రతిపదార్థం: కమల+ఉదర!= ఓ పద్మనాభా!; నీవు+ఒనరింపన్+పూనిన పనిన్= నీవు చేయనెంచిన పనికి; కీడు+పుట్టునే?= హాని కలుగుతుందా? (కలుగదనిభావం); కార్యములు= నీవు సంకల్పించిన పనులు; కావు+అనినట్లు+అ+ఉండి= నెరవేరనట్లే కనిపించినప్పటికీ; అవున్= నెరవేరుతాయి; అట్లు+అగుటన్= అందువలన; ప్రయత్న సంభావన+చేఁత= కార్యమొనర్చుటకు పూనుకొనటం; పౌరుషము పద్ధతి= పురుష లక్షణం; తద్+ఫలసిద్ధి+పొందుచోన్= ఆ కార్యం యొక్క ఫలమును పొందే విషయంలో; దైవము తోడ్పడన్ వలయున్= దైవము సాయపడాలి; రెండును= కార్యం అనుకూలించటం, అనుకూలించకపోవటం, అనేవి, పౌరుషమూ దైవమూ అనేవి; నీ వినోదముల్= నీ ఇచ్ఛకు లోబడి ఉంటాయి; తథ్యము= ఇది నిజం.

తాత్పర్యం: స్వామీ! నీవు చేయ నెంచిన పనికి హాని ఎప్పుడూ కలుగదు. కొన్ని పనులు ఫలించనట్లే ముందు కనిపించినా చివరకు ఫలిస్తాయి. కాబట్టి కార్యానికి పూనుకొనటం పురుష లక్షణం. కార్యఫలం తనకు సమకూరటంలో దైవ సహాయం అవసరం. కనుక పురుషయత్నం, దైవానుకూల్యం. కార్యం అనుకూలించటం, అనుకూలించకపోవటం అనేవి రెండున్నూ నీ సంకల్పానికి లోబడి ఉంటాయి. ఈ మాట వాస్తవం.

విశేషం: 1. నరనారాయణ మహర్షులే భూతలం మీద అర్జునుడుగా, శ్రీకృష్ణుడుగా జన్మించారు. అర్జునుడు శ్రీకృష్ణుడి పట్ల స్నేహభక్తిని ప్రసరిస్తూ ఉంటాడు. నరుడు భక్తుడు, నారాయణుడు భగవంతుడు. అందువలన శ్రీకృష్ణుడిని దైవస్వరూపుడుగా,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పురుషకారదైవానుకూల్య శక్తిస్వరూపుడుగా భావించి పలుకుతున్నాడు. అతడి దృష్టిలో కృష్ణుడు దూత కాడు; ఘటనాఘటన సమర్థుడైన పరమాత్ముడు. ఆ భావానికి ఈ పద్యం అద్దం.

2. దైవ సంకల్పానికి వికల్పం లేదు. అయితే, కృష్ణుడు సంధిని కోరుతున్నాడా? యుద్ధాన్ని కోరుతున్నాడా? అన్నది అసలు ప్రశ్న. అది ఫలాన్ని చూచి తెలిసికొనవలసిన సత్యం. ఆ కార్యం ఏదైనా జయం మాత్రం తథ్యం - అని అర్జునుడి విశ్వాసం.

3. ఈ పద్యం భక్తిభావ వ్యంజకంగా ఉన్నది. ఎత్తుగడలో, ముగింపులో, నిర్వహణలో సమత అనే గుణం కనపడుతున్నది. వాక్య నిర్మాణంలో ఆ గుణం ప్రతిఫలిస్తున్నది. అది భక్తుడైన అర్జునుడి మనస్సులోని నిర్మలత్వాన్ని సమత్వాన్ని సూచిస్తున్నది.

4. తిక్కన రచనలోని నాటకీయతలో పాత్రోచిత సంభాషణ ప్రవృత్తికి ఈ పద్యం ఉదాహరణం.

5. వాక్య విన్యాసంలో భక్తిభావాన్ని ధ్వనింపచేయటం తిక్కన రసధ్వనిశిల్పం.

6. 'కమలోదర!' సార్థక శబ్ద ప్రయోగం. శ్రీకృష్ణుడిలో విష్ణువును దర్శించే భావన ధ్వని. 'తథ్యము' 'నీ వినోదముల్' అనే పదాలు సమానమైన దైవలీలా విలాసాన్ని ధ్వనింపజేస్తున్నాయి. తేటతెనుగుకు తిక్కన శైలి ప్రసిద్ధి. దాని కిది ఉదాహరణం. (సంపా.)

ఉ. వేరిమి ధర్మజుం బరిభవించిన ద్రోహులు వధ్యులన్న నె
వ్వారికిఁ బోలదే సుజనవత్సల! నీ విటులంట వారు మ
మ్మీరసమెత్తి కీడ్పఱిచి యింతలుసేసినదాన నీ మదిం
గూరిన నొవ్వుసొంపునను గోపము పెంపునఁ గాదె యారయన్. 74

ప్రతిపదార్థం: సుజన వత్సల!= సత్పురుషులందు ప్రేమగల కృష్ణా!; వేరిమిన్= శత్రుభావంతో; ధర్మజున్= ధర్మపుత్రుడిని; పరిభవించిన ద్రోహులు= అవమానపరచిన ఘాతుకులు; వధ్యులు= చంపదగినవారు; అన్నన్= అనగా; ఎవ్వారికిన్+పోలదే= ఎవరికైనను యుక్తమే; నీవు+ఇటులు+అంట= యుద్ధంలో కౌరవులను జయించి రాజ్యభాగం గైకొనుట సమంజసమని నీవు పల్కటం; ఆరయన్= నిజం పరికిస్తే; వారు= ఆ కౌరవులు; ఈరసము+ఎత్తి= ద్వేషం వహించి; మమ్మున్= మమ్ములను; కీడ్పఱిచి= కష్టపెట్టి; ఇంతలు చేసిన దానన్= ఇంతటి దురవస్థల పాలు కావించిన కారణాన; నీ మదిన్= నీ హృదయంలో; కూరిన= నిండిన; నొవ్వుసొంపునను= బాధాతిశయం వలననూ; కోపము పెంపునన్+కాదె!= క్రోధవిజృంభణం వలననేకదా!

తాత్పర్యం: శత్రుభావంతో జూదంలో ధర్మజు నోడించి అవమానించిన ఆ ఘాతుకులు వధార్హులని ఎవరైనా చెప్పగలరు. నీవు సత్పురుషుల యందు వాత్సల్యం కలవాడవు కనుక ఆ కౌరవులు మా యెడ ద్వేషం పూని, మమ్ములను బాధించి, ఇంతటి దుఃస్థితి పాలుగావించిన కారణాన నీ హృదయంలో నెలకొన్న మిక్కుటమైన బాధ చేతనున్నూ, అగ్గలమైన కోపం చేతనున్నూ వారిని సంగ్రామంలో నిర్జించి, రాజ్యభాగం గైకొనటం యోగ్యమని చెప్పావుగాని మరేమీ కాదు.

విశేషం: అలం: కావ్యలింగం. 'సమర్థనీయ స్యార్థస్య కావ్యలింగం సమర్థనమ్'. 'అజాతశత్రువైన ధర్మరాజుపై శత్రుభావం పూని అవమానించిన ద్రోహులైన కౌరవులు వధ్యులు అని ఎవరికైనా అనిపిస్తుంది. సుజనవత్సలా! నీకు కూడా అనిపించింది. అది సహజమే' అని తన ఊహను ఉపపత్తితో సమర్థించుకొంటున్నాడు అర్జునుడు. పగబూని పాండవులను పరిపరివిధాల బాధించినందుకు శ్రీకృష్ణుడి మనసు నొచ్చి కోపం వచ్చి ఉంటుందని సమర్థించాడు. అట్లా కోపం రావటానికి కారణం పాండవులు సుజనులు కావటం. శ్రీకృష్ణుడు సుజన వత్సలుడు కావటం. ఈ మాటలో తన మనోభావాలనే శ్రీకృష్ణుడిపై ఆరోపించి చెప్పే వైఖరి కూడా తోస్తుంది. నరనారాయణుల అభేద ప్రవృత్తి ఇందులో వ్యంగ్యంగా స్ఫురిస్తుంది. (సంపా.)

ఉ. ఐనను జిత్తగింపు; ద్రుపదాత్మజ నాసభ నట్లు సేసినన్
దానికి సైఁప లెస్సయని దైన్యముఁ బొందుట కోర్చి యమ్మెయిం
గాననభూమికిం జనుట కారుణికోత్తమ! నీ వెఱుంగవే?
కాన సహించి పాండవులఁ గౌరవులం దగఁ గూర్పు నేర్పునన్. 75

ప్రతిపదార్థం: కారుణిక+ఉత్తమ!= దయావంతులలో శ్రేష్ఠుడా!; ఐనను= ఇనప్పటికినీ; చిత్తగింపు= మా మాటలు అవధరించవలసింది; ద్రుపద+ఆత్మజన్= పాంచాలిని; ఆ సభన్= ఆనాటి ఒడ్డోలగంలో; అట్లు+చేసినన్= తలవెంట్రుకలు పట్టి ఈడ్చి వలువలు ఒలిచినమా; దానికిన్= ఆ దుండగాలకు; సైఁపన్+లెస్స+అని= సహించియుండటం మంచిదని; దైన్యమున్+పొందుటకున్+ఓర్చి= దీనదశ పాలవటానికి సహించి; ఆ+మెయిన్= ఆ విధంగా; కానన భూమికిన్+చనుట= అరణ్య ప్రదేశాలకు వెళ్ళుట; నీవు+ఎఱుంగవే?= నీకు తెలియదా?; కానన్= ఇన్నిటినీ నీ వెఱిగి ఉన్నందువలన; సహించి= ఓర్చుకొని; పాండవులన్ కౌరవులన్= కౌరవ పాండవులను; నేర్పునన్= సామర్థ్యంతో; తగన్+కూర్పు(ము)= ఒకటిగా చేయవలసింది.

తాత్పర్యం: పరమ కృపాశాలివగు కృష్ణా! కౌరవులను ఏమి చేసినా దోషం లేనప్పటికీ నా మాటలు ఆలకించవలసింది. ఆనాడు నిండు సభలో పాంచాలిని కొప్పుపట్టి ఈడ్చి, వలువ లొలిచిననూ మంచిదని మిన్నకున్నాం. దైన్యస్థితి పొందుటకున్నూ ఓర్చి, తలవంచుకొని అడవులకు పోయాం. ఇదంతా నీవెఱుగుదువు. కావున వారి దుండగాలన్నింటినీ మన్నించి, నేర్పుతో కౌరవ పాండవుల నొకటిగా ఉండేటట్లు కావించుము.

విశేషం: 1. అర్జునుడి మాటల కన్నిటికీ కీలకం వలె ఉండేది సంబుద్ధి. 'కారుణికోత్తమా!' అని శ్రీకృష్ణుడిని సంబోధించాడు. ఇతరుల కష్టసుఖాలను తనవిగా భావించి ఆర్ద్రుడయ్యే వారిలో అగ్రగణ్యుడు శ్రీకృష్ణుడట! అందువలన అలనాడు కౌరవసభలో ద్రౌపదికి చేసిన అవమానాలకు సైతం ఓర్చి అరణ్యాజ్ఞాతవాసాలు చేసి కష్టాలు పడిన పాండవుల దీనస్థితిని శ్రీకృష్ణుడు తానే అనుభవించినట్లు భావించి క్రోధోద్రిక్తుడు కావటం అతడి నైజగుణం. అటువంటి వాడు కౌరవ సభలో ఆ దైన్యాన్ని స్మరించి కోపానికి వశుడై సంధి యత్నాన్ని విఫలం చేస్తాడేమో! అని అర్జునుడు సహనాన్ని ప్రబోధిస్తున్నాడు. ఇది తన మానసిక స్థితిని శ్రీకృష్ణుడియందు ఆరోపించటమే, పైపెచ్చు సంధి ప్రయత్నాల సమయంలో పాండవులు పడిన బాధలు మరచిపోవద్దనటం వ్యతిరేక వ్యంగ్యధ్వని. పార్థుడిక్రోధం హృదయంలో గూఢంగా ధ్వనిస్తున్నది. (సంపా.)

2.'ద్రుపదాత్మజ నా సభనట్లు సేసినన్' - ద్రౌపదికి కౌరవులు చేసిన అవమానం పైకి చెప్పరాని దనుట.

తే. అలవి యెఱుఁగక ధార్తరాష్ట్రులు గడంగి । మమ్ముఁ బఱచిన పాటులు మానసమునఁ
జవుటఁబెట్టిన విత్తుల చందమొంది । యంకురింపక చెడిపోయె నంబుజాక్ష! 76

ప్రతిపదార్థం: అంబుజ+అక్ష!= కమలాల వంటి కన్నులు గల శ్రీకృష్ణా!; అలవి+ఎఱుఁగక= తమశక్తి ఏపాటిదో తెలిసికొనక; ధార్తరాష్ట్రులు= కౌరవులు; కడంగి= పూనుకొని; మమ్మున్= మమ్ములను; పఱచిన పాటులు= పెట్టిన బాధలు; మానసమునన్= మా హృదయంలో; చవుటన్+పెట్టిన= చవిటి నేలలో విత్తిన; విత్తుల చందము+ఒంది= గింజల తీరై; అంకురింపక= మొలకెత్తక; చెడిపోయెన్= నశించాయి.

తాత్పర్యం: పుండరీకాక్షా! తమ శక్తి ఏపాటిదో తెలిసి కొనక దుర్యోధనాదులు పూనుకొని మమ్ము నానావిధ బాధలకు గురి చేశారు. చవిటి నేలలో విత్తిన విత్తులు మొలకెత్తక నశించిన విధంగా ఆ తలంపులన్నీ మా హృదయంలోనే అణగారిపోయాయి.

విశేషం: అలం: ఉపమ. 1.అర్జునుడి మనస్సులో ఉన్న గూఢామర్షకు ఈ పద్యం అద్దం పట్టుతున్నది. బాధ పొందిన హృదయక్షేత్రాలు పగ సాధింపు చర్యతో సారవంతమౌతాయి. కాని, పాండవ హృదయాలు ధర్మజశాంతి ప్రబోధం చేత శమభావాన్ని పొంది యుద్ధబీజాలు మొలకెత్తని చవిటి నేలలుగా తయ్యారయ్యాయి. దానితో వారి ఆశలు, ఆకాంక్షలు మొలకెత్తని విపరీతస్థితికి గురి అయ్యాయి. ఇది ఆత్మనిర్వేదాన్ని భగవంతుడితో చెప్పుకొంటున్న తీరు. యుద్ధ వాంఛను గూఢంగా వ్యక్తం చేస్తున్న వైఖరి. వ్యతిరేక వ్యంగ్య స్ఫూర్తి ధ్వనించే విధంగా మాట్లాడే ఈ తీరు సుకుమార వైఖరి అంటారు. (సంపా.)

2. దుర్యోధనాదులు మాకు కలిగించిన కష్టాలు నా మనస్సులో చవిటినేలలో చల్లిన విత్తులవలె మొలకెత్తకుండా చెడిపోయాయి - అని తెలుగులో ఉండగా, మూలంలో - 'సనామ సమ్య గ్వర్తేత పాండవేష్విత మాధవ, నమే సంజాయతే బుద్ధిః బీజ ముప్తమి వోష'(సం. 5-76-19) - చవిటి నేలలో చల్లిన విత్తనంవలె, దుర్యోధనుడు పాండవుల విషయంలో సరిగా ప్రవర్తిస్తాడని నాకు అనిపించటంలేదు. అని మూలంలో ఉంది. (సంపా.)

వ. అమ్మొఱకుల నెమ్మెయి నయినను. 77

తాత్పర్యం: ఆ మూర్ఖులను ఏ విధంగానైనా

క. ఒడఁబఱిచి మాకు వారికిఁ । బుడమి సగము గాఁగఁ జేసి పొంది పొసఁగియుం
డెడు నట్టి తెఱఁగు సేయుట । కడు మేఁ; లది గౌరవము సుఖంబును జేయున్. 78

ప్రతిపదార్థం: ఒడన్+పఱిచి= సమ్మతింపజేసి; మాకున్ వారికిన్= మాకున్నూ, కౌరవులకున్నూ; పుడమి సగము గాఁగన్+చేసి= భూమిలో చెరిసగము వచ్చునట్లొనరించి; పొంది పొసఁగి+ఉండెడు+అట్టి= కలిసి మెలసి జీవించే; తెఱఁగుచేయుట= విధానం రూపొందించటం; కడున్+మేలు= మిక్కిలి మంచిది; అది= ఆ ఏర్పాటు; గౌరవమున్= గౌరవాన్ని; సుఖంబును= సౌఖ్యాన్ని; చేయున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: కృష్ణా! ఆ మూర్ఖుల నెట్లాగయినా సంధి కొప్పించి మాకూ, వారికీ రాజ్యంలో చెరిసగం వచ్చేటట్లుగా చేసి, ఉభయులం కలిసి మెలసి ఒద్దికగా జీవించే ఏర్పాటు కావించటం చాలా మంచిది. ఆ ఏర్పాటు వలన మాకు గౌరవమూ, సౌఖ్యమూ లభిస్తాయి.

క. నీ కిట్టిది చిత్తమునకు । రాకున్నది యేని వలదు రం డిమ్మెయి మీ
రీకార్యము సేయుం డని । మా కానతి యిమ్ము కంసమర్దన! తెలియన్. 79

ప్రతిపదార్థం: కంసమర్దన!= కంసుడిని నిర్మూలించినవాడా!; నీకున్= నీకు; ఇట్టిది= ఇటువంటి సంధి విధానం; చిత్తమునకున్+రాక+ఉన్నది+ఏనిన్= మనసునకెక్కని పక్షాన; వలదు= అక్కరలేదు; మీరు రండు= మీరు రండి; ఈ+మెయిన్= ఈ విధంగా; ఈ కార్యము చేయుండు+అని= మీరీపని చేయండని; తెలియన్= మేము గ్రహించి అనుసరించేటట్లుగా; మాకున్+ఆనతి+ఇమ్ము= మాకు ఆజ్ఞ దయచేయుము.

తాత్పర్యం: కృష్ణా! కౌరవులతో మేము సంధి చేసికొనుట మీ దివ్యచిత్తానికి సరిపడకపోతే - ఆ పద్ధతి మీకు తగదు, మీరు ఈ రకంగా ఈ పని చెయ్యండి అని స్పష్టంగా మాకు ఆజ్ఞ నివ్వండి.

మ. **హిత మిబ్భంగిది మాకు ధర్మము తెఱం గిట్లుండునం చేను నీ**
మతి బోధింప వలంతినే? హితము ధర్మంబున్ విచారించి చూ
చి తగున్‌బొమ్మని యేది పంచి తది నిశ్చింతంబునంజేసి యు
న్నతిఁ బొందంగలవారమై యునికి కృష్ణా! నేఁడుగా వచ్చెనే! **80**

ప్రతిపదార్థం: కృష్ణా!= శ్రీకృష్ణా!; మాకున్= మాకు; హితము+ఈ భంగిది= మేలుగల్గించు పద్ధతి ఇటువంటిది; ధర్మము తెఱంగు= న్యాయసరణి; ఇట్లు+ఉండున్+అంచున్= ఈరీతిగా ఉండునని; ఏను= నేను; నీ మతి బోధింపన్= నీ మదికి గోచరింపచేయుటానికి; వలంతినే= సమర్థుడనా? (కానని అర్థం); హితమున్, ధర్మంబున్= హితమునూ, ధర్మమునూ; విచారించి చూచి= ఆలోచించి నిర్ణయము ఒనర్చి; తగున్+పొమ్ము+అని= ఈ దారిలో చక్కగా సాగుమని; ఏది+పంచితి(వి)= ఏమి సల్పుటకు ఆజ్ఞాపింతువో; అది= దానిని; నిశ్చింతంబునన్+చేసి= నిర్విచారంగా కావించి; ఉన్నతిన్+పొందన్+కలవారము+ఐ+ఉనికి= ఔన్నత్యం వహించి జీవించే స్థితి; నేఁడుగా+వచ్చెనే?= ఈ నాడు వచ్చిందా? కాదని భావం.

తాత్పర్యం: కృష్ణా! మా కిది మేలు కలిగిస్తుంది; ధర్మస్వరూప మిటువంటిది- అని నీకు తెలియజెప్పుటకు నేను ఏపాటివాడిని? ఏది హితమో, ఏది న్యాయమో నీవే ఆలోచించి నిర్ణయించి ఈ దారిని పొమ్మని నిర్దేశిస్తే ఆ మార్గాన్ని అవలంబించి నిర్విచారంగా నీవు చెప్పినట్లు చేసి ఉన్నతస్థితికి రాగలం. అట్టి స్థితి నేడు క్రొత్తగా ఏర్పడింది కాదుకదా!

విశేషం: 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అన్న గీతాకారుడి వాక్యానికి అనుగుణంగా అర్జునుడు పాండవుల అనన్య భక్తి విశేషాన్ని పేర్కొని, శ్రీకృష్ణు డేది చెప్పితే అదే హితవు. అదే ధర్మం అని భావించే శరణాగత ప్రవృత్తిని, నిరహంకార చిత్తవృత్తినీ ఈ పద్యంలో ప్రదర్శించి భక్తు డనిపించుకొన్నాడు. 78, 79, 80 పద్యాలు అర్జునుడి త్రికరణశుద్ధిని ప్రదర్శిస్తున్నాయి. (సంపా.)

వ. **అనిన విని కృష్ణుండు విజయున కిట్లనియె :** **81**

తాత్పర్యం: అనగా విని కృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు :

ఉ. **వెరవున లావునం గృషికి వేయు విధంబుల మేలొనర్చినం**
దొరకొనునే ఫలంబు? తఱితోఁ దగు వర్షము లేకయున్న; నె
ప్పరుసున లెస్స సేసినను బౌరుషముల్ ఫలియించు టెల్ల నా
దరణమునం బ్రసన్నమగు దైవముచేఁతన చూవె ఫల్గునా! **82**

ప్రతిపదార్థం: ఫల్గునా!= (ఉత్తర ఫల్గునీ నక్షత్రాన జన్మించిన) అర్జునా!; వెరవునన్= ఉపాయంతో; లావునన్= శక్తితో; కృషికిన్= సేద్యానికి; వేయు విధంబులన్= బహు ప్రకారాల; మేలు+ఒనర్చినన్= దోహదం చేసినప్పటికినీ; తఱితోన్= అదనులో; తగు వర్షము లేక+ఉన్నన్= తగినంత వాన కురియకపోతే; ఫలంబు దొరకొనునే?= పంట లభించగలదా?; ఏ+పరుసునన్= ఏ విధంగా నైనను; లెస్స+చేసినను= చక్కగా పనులు గావించిననూ; పౌరుషముల్ ఫలియించుట+ఎల్లన్= పురుష యత్నాలు సఫలం కావటం అన్నది; ఆదరణమునన్= ప్రేమతో; ప్రసన్నము+అగు= అనుగ్రహం చూపు; దైవము చేఁతన్+అ చూవె= దైవం యొక్క తోడ్పాటు వల్లనే సుమా!

తాత్పర్యం: ఉపాయంతో శక్తితో శ్రమించి సేద్యానికి పలు రకాల దోహదం చేసినప్పటికీ సమయానికి తగినంత వర్షం లేకుంటే పంట చేతికందదు. అట్లాగే ఎన్నో విధాల పరిశ్రమ చేసినప్పటికినీ ప్రేమతో దైవం ప్రసన్నమైనప్పుడే పురుషయత్నాలు సఫలమౌతాయి.

విశేషం: 1. అలం: దృష్టాంతం, అప్రస్తుత ప్రశంస, అర్థాంతరన్యాసం. "చేద్ బింబప్రతిబింబత్వం దృష్టాంత స్తదలంకృతిః". రెండు వాక్యాలకు బింబప్రతిబింబ భావం వర్తించబడితే దృష్టాంతం. ఈ పద్యంలో పద్యపూర్వార్ధంలోని వాక్యానికి ఉత్తరార్ధంలోని వాక్యం దృష్టాంతం. "అప్రస్తుత ప్రశంసా స్యాత్ సా యత్ర ప్రస్తుతాశ్రయా". అప్రస్తుత కథనం వలన ప్రస్తుతం స్ఫురిస్తే అప్రస్తుత ప్రశంస. ఇక్కడే సేద్యం, సకాలవర్షం లేక ఫలం చేతికందకపోవటం అనే అప్రస్తుత కథనం వలన ప్రస్తుత కథాంశం స్ఫురించబడుతున్నది కాబట్టి అప్రస్తుత ప్రశంస.

2. 'పురుషకారం, దైవానుకూల్యం అనేవి రెండూ నీ లీలలే కృష్ణా!' అని అర్జునుడు శ్రీకృష్ణుడి దివ్యత్వాన్ని కీర్తించగా, శ్రీకృష్ణుడు తాను దివ్యుడు కానట్లు, లౌకిక వ్యక్తి అయినట్లు, దైవం ప్రత్యేకంగా ఉన్నట్లు మాట్లాడిన మాటలివి. 'దైవం మానుష రూపేణ.'

3. ఎన్ని పాట్లు పడి వ్యవసాయం చేసినా తగిన సమయంలో పడిన వర్షం వలననే పంట పండుతుంది. అట్లాగే ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఆ సమయానికి దేవుడు ప్రసన్నుడైతేనే అవి ఫలిస్తాయి- అనే ఈ తాత్పర్యంలో అర్థాంతర న్యాసాలంకారం కూడా సార్థకంగా ఔచిత్యవంతంగా ప్రయోగించబడింది. అర్థాంతరన్యాసంలో సామాన్యం విశేషం చేత కాని, విశేషం సామాన్యం చేతకాని సమర్థించబడాలి. ఇందులో సామాన్యం విశేషం చేత సమర్థించబడింది. ఇటువంటి అర్థాంతరన్యాసం తక్కువగా కవులు వాడుతుంటారు. విశేషాన్ని సామాన్యంతో సమర్థించే పద్ధతిని మార్చి చెప్పిన ఈ వాక్యం శ్రీకృష్ణుడి స్వభావాన్ని ధ్వనింపజేస్తున్నది. అతడు నిజంగా దివ్యుడే. కాని, అదివ్యుడనని సమర్థించుకొనబోతున్నాడు. ఇది నిజానికి వ్యత్యస్తమే. దానిని అలంకార ధ్వనితో తిక్కన ప్రదీప్తం చేశాడు.

4. శ్రీకృష్ణు డీ సందర్భంలో చెప్పిన ఈ పద్యం, రాబోయే పద్యం, ఈ రెండూ - ధర్మరాజు పలికిన రెండు పద్యాలకు ప్రతి రూపాలుగా కనపడతాయి. ఉదా.

ధర్మ: పగయడగించు టెంతయు శుభంబు... (3.21)

శ్రీకృష్ణ: వెరవున లావునం గృషికి వేయువిధంబుల ... (3.82)

ధర్మ : కావున శాంతి బొందుటయ కర్జము ... (3.22)

శ్రీకృష్ణ: కావున సంధికిం బురుషకార మొనర్చెద ... (3.83)

తిక్కన పద్యరచనలో సందర్భోచితంగా, పాత్రోచితంగా ఇటువంటి సంవాద శిల్పాలను ప్రదర్శిస్తాడు. శ్రీకృష్ణ పాత్రోచిత పద్య మిది. పద్యం సంబుద్ధితో అంతమైనప్పుడు ప్రతిపాద్యాంశంమీద శ్రోత సమాహితాన్ని నిలిపే సూచన గోచరిస్తుంది.

6. తెలుగు - పదాల పొందికకు ఈ పద్యం హృద్యమైన ఉదాహరణం. (సంపా.)

ఉ. కావున సంధికిం బురుషకార మొనర్చెద నోపినంతయున్
దైవముచేత యెట్లగునొ దాని నెఱుంగ సుయోధనుండు సం
భావనసేసి పా లొసఁగు పాడియ కల్గిన బాల్యమాదిగా
నేవిధి నైననుం జెఱుప నింతలు పాపము లాచరించునే? 83

ప్రతిపదార్థం: కావునన్= కనుక; సంధికిన్= సంధికి; ఓపిన+అంతయున్= శక్తి ఉన్నంతవరకూ; పురుషకారము+ఒనర్చెదన్= పురుష ప్రయత్నం చేస్తాను; దైవము చేత+ఎట్లు+అగునొ?= దైవ మేమి చేయదలం చాడో; దానిన్+ఎఱుంగన్= ఆ విషయం

తెలియలేను; సుయోధనుండు= దుర్యోధనుడు; సంభావన+చేసి= మనమాట నాదరించి; పాలు+ఒసఁగు= భాగమిచ్చునట్టి; పాడియ కల్గినన్= న్యాయబుద్ధి గలవాడైతే; బాల్యము+ఆదిగాన్= చిన్నతనం నుండి; ఏ+విధిన్+ఐననున్= ఏ రకంగానైనను; చెఱుపన్= మిమ్ము నాశనం చేయటానికి; ఇంతలు పాపములు= ఇంతటి పాపపుపనులు; ఆచరించునే?= చేస్తాడా? (చేయడని అర్థం-)

తాత్పర్యం: నేను మాత్రం నా శక్తికొద్దీ సంధి సమకూర్చటానికే ప్రయత్నిస్తాను. దైవం ఏమి చేయదలచాడో చెప్పలేను. దుర్యోధనుడు ఆదరంతో రాజ్యభాగమిచ్చే న్యాయబుద్ధికలవాడైతే చిన్నతనంనుండి ఎన్నో విధాల మిమ్మల్ని పాడు చెయ్యటానికి ఇన్ని దుష్కృత్యాలు కావిస్తాడా? (కావించడని తాత్పర్యం.)

విశేషం: మూలాన్ని సందర్భోచితంగా మలచే నేర్పరితనానికి ఈ పద్యం చక్కని ఉదాహరణం. మూల శ్లోకా లివి-

> **"అహం హి త త్కరిష్యామి పరం పురుషకారతః ।**
> **దైవంతు న మయా శక్యం కర్మ కర్తుం కథంచన ॥ (సం. 5-77-5)**
> **యత్తు వాచా మయా శక్యం కర్మణా చాపి పాండవ ।**
> **కరిష్యే తదహం పార్థ న త్వాశంసే శమం పరైః ॥ (సం. 5-77-18)**

మూలంలో కృష్ణుడు విధి ప్రస్తావన చేశాడు. తెలుగులో అది లేదు. సంధి జరిగే నమ్మకం, ఆశా తనకు లేదని మూలంలో శ్రీకృష్ణుడు అన్నాడు. తెలుగులో పురుషయత్నం చేస్తాను కాని దైవానుకూల్యం ఎట్లా ఉంటుందో తెలియదన్నాడు. అంటే ఉండదనే ధ్వని. ఇది అర్జునుడి అంతరంగాన్ని ఊరట పరిచే వాక్యం. చిన్ననాటినుండి దుర్యోధనుడు ప్రదర్శించే ప్రవర్తనను పేర్కొని, అందులో మార్పు లేదు కాబట్టి సంధి జరగటం అసంభవమని ప్రత్యక్ష ప్రమాణాల నాధారంగా ప్రతిపాదించటం విశేషం. పద్య ఉత్తరార్థం తరువాతి కథార్థాల కనుగుణంగా మలచబడటం విశేషం. (సంపా.)

వ. అది యెల్ల నట్లుండె; నిచ్చట విరాటు పసులన్ బెట్టింప నీవు వోయిన యప్పుడు భీష్ముండు దుర్యోధనుతోఁ జెప్పిన తెఱంగు. 84

ప్రతిపదార్థం: అది+ఎల్లన్+అట్లు+ఉండెన్= ఆ సంగతి అట్లా ఉండగా; ఇచ్చటన్= మత్స్యనగరంలో; విరాటు పసులన్+పెట్టింపన్= విరటుడి గోవులను మరలించటానికి; నీవు పోయిన+అప్పుడు= నీవు వెళ్ళిన సమయంలో; భీష్ముండు= పితామహుడు; దుర్యోధను తోన్+చెప్పిన తెఱంగు= దుర్యోధనుడితో వచించిన విధ మిది:

తాత్పర్యం: ఆ విషయం అట్లా ఉంచుము. మత్స్యనగరంలో విరటుడి గోవులను కౌరవులు తోలుకొనిపోతుండగా, వాటిని మళ్ళించుకొనిరావటానికి నీవు వెళ్ళినప్పుడు భీష్ముడు దుర్యోధనుడితో పలికిన పలుకులివి:

ఉ. వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తు మనంగరాదు రా
లచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వనేర్చునే?
హెచ్చగుఁ గుందగుం దొడరు టెల్ల విధంబుల కోర్చు టట్లుగా
కిచ్చఁ దలంచి యొక్క మెయి నిత్తఱిఁ బొందగుచేఁతయుం దగున్. 85

ప్రతిపదార్థం: వచ్చినవాఁడు= గోవులను మరలించటానికై అరుదెంచినట్టివాడు; ఫల్గునుఁడు= అర్జునుడు; అవశ్యమున్= తప్పక; గెల్తుము+అనంగన్ రాదు= మనమే జయించగలమని చెప్ప వీలుగాదు; రాలచ్చికిన్+ఐ= రాజ్యలక్ష్మికొరకు; పెనంగినన్=

పోరాడితే; బలంబులు రెండును= ఇరుసైన్యాలూ; గెల్వన్+నేర్చునే?= జయించగలవా? (జయించలేవని అర్థం); హెచ్చుగున్= ఒకటి మించుతుంది; కుందు+అగున్= మరొక్కటి తగ్గుతుంది; తొడరుట= ఎదిరించటం; ఎల్లవిధంబులకున్+ఓర్చుట= జయాపజయాలను భరించుటే ఔతుంది; అట్లు+కాక= జయాపజయాలను కలిగించే పోరాటానికి దిగకుండా; ఇచ్చన్+తలంచి= మనసులో యోచించి; ఒక్క మెయిన్= ఒక రీతిని; ఈ+తఱిన్= ఈ సమయంలో; పొందు+అగు+చేఁతయున్+తగున్= పొత్తు సమకూడే పనికి పూనుకోవటమే యుక్తం.

తాత్పర్యం: ఆవులను మరలించుకొని పోవుటకై వచ్చినవాడు అర్జునుడు! తప్పక యుద్ధంలో మనమే గెలుస్తా మనటానికి వీలుగాదు. రాజ్యలక్ష్మి కొరకు సైన్యాలు తలపడితే ఇరుపక్షాలు జయం పొందగలవా? ఒకరిది పైచేయి, మరొకరిది క్రిందిచేయి అవుతుంది. జయాపజయాలను భరించటానికి సమ్మతమైతేనే సంగ్రామానికి దిగవలె. అట్లాకాకుండా ఆలోచించి ఏదో ఒక విధంగా సంధి కావించుకొనటం మంచిది.

విశేషం: 1. కృష్ణుడు మహావక్త. ప్రతిపాద్యాంశాలకు దృష్టాంతాలను పేర్కొంటూ మాట్లాడటం తర్కబద్ధ వాక్యవాదికి సహజగుణం. శ్రీకృష్ణుడు అర్జునుడితో చెప్పదలచుకొన్న అంశం- దుర్యోధనుడు సంధికి అంగీకరించడని. దానికి తార్కాణంగా ఉత్తర గోగ్రహణ సమయంలో భీష్ముడు పలికిన ఈ పద్యాన్ని (విరా. 4.234) పేర్కొని, దానికి దుర్యోధనుడిచ్చిన సమాధానాన్ని చెప్పాడు. అది - 'మనకూ పాండవులకూ ఎట్లా పొత్తు కలుగుతుంది? నేను వారి రాజ్యభాగం తిరిగి ఇవ్వను. యుద్ధం చేసి పరాక్రమంతో వారిని జయించటమే మార్గం. ఇది నా నిశ్చయం.' (విరా. 4.235)

2. యుద్ధంలో జయాపజయాలు అనిశ్చితాలని చెప్పే భీష్ముడి అభిప్రాయం లోకనీతి వాక్యమే. యుద్ధం వద్దనే వారూ, శాంతిని కోరేవారూ ఈ అంశాన్ని పేర్కొని, సంధి అనుసరణీయమని చెప్పుతారు. ఉద్యోగపర్వంలో ధర్మరాజు కూడా ఇటువంటి అభిప్రాయాలే వ్యక్తం చేశాడు. (3.18). యుద్ధంలో జయమో, ఓటమో నిశ్చయంగా చెప్పలేం. యుద్ధంలో ఓడితే మరణం కంటె దుర్భరమైన మనోవేదన పడాలి. కాబట్టి, సంధి మేలంటాడు ధర్మరాజు. ధర్మరాజూ, భీష్ముడూ ఒకే రకంగా, శాస్త్రీయంగా, లోకహితంగా, అచరణయోగ్యంగా ఆలోచిస్తున్నారని ఇక్కడ స్పష్టం. ఒకసారి ఇట్లాంటి యత్నం చేసి భీష్ముడు విఫలుడు కాగా, ఇప్పుడు ధర్మరాజు సఫలుడౌతాడా? అనే ప్రశ్న శ్రీకృష్ణుడు రేకెత్తించాడు.

3. 'వచ్చిన వాడు ఫల్గునుఁడు'- తిక్కనగారి ఈ వాక్యం తెలుగువారి జాతీయమైపోయింది. ఫల్గునుడు అంటే ఫల్గుని నక్షత్రంలో పుట్టినవాడు. పిడుగులు పడేటప్పుడు 'అర్జునః ఫల్గునః'' అని తలచుకొంటాం. పిడుగు పడి చనిపోతామన్న భయం కలిగే సమయంలో తలచుకొనే ఈ పేరు పిడుగుపాటు వంటి వాడు అనే అర్థంలో తెలుగువారి నోట రూఢికెక్కింది. ఎవడో అసాధ్యుడు వస్తున్నాడనే అర్థంలో తెలుగు వ్యవహారంలో రూఢి కెక్కింది. ఆ పలుకుబడికి ఈ పద్యం మూలం.

4. అచ్చమైన తెలుగు పదాలను దేశీయంగా వాడటం, ద్విత్వచకారప్రాస పద్యం ఎత్తుగడలో ఆశ్చర్యం, ముగింపులో హితబోధ అచ్చు గుద్దినట్లు కనపడుతున్నాయి.

5. పాత్రోచిత, సందర్భోచిత సంభాషణలకు తిక్కన పెట్టింది పేరు. భీష్ముడు శాంతి కాముకుడు. కాని, మహావీరుడు. అతడి దృష్టిలో అర్జునుడు అతిలోకవీరుడు. దానికి కారణం అతడు సాధించిన పాశుపతాస్త్రం, ఇంద్రాది దేవతలిచ్చిన అస్త్ర సంపద. 'విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమమ్' అని లోకోక్తి. పండితుడే పండితుడిని అంచనా వేయగలడు. ఈ మాట ఈ పద్యంలో అక్షర సత్యం.

6. ఈ పద్యంలో అర్జునుడి పరాక్రమం ధ్వని. దానిని ధ్వనింపజేసి కౌరవ పాండవుల మధ్య సంధి కుదిరించాలన్న భీష్ముడి శాంతి సంకల్పం ధ్వని. కవిత్రయం ధ్వని ప్రస్థానానికి సంబంధించిన వారు. తిక్కన రసధ్వని మార్గంలో సాగాడు. శబ్దవాక్య

ప్రయోగంలో తిక్కన ఔచిత్య పాలనం చేస్తాడు. శబ్దగుణాల కంటె అర్థ గుణాలను ఎక్కువగా పోషిస్తాడు. ఈ పద్య రచనలో ప్రసాద గుణం ఉన్నది. బంధ శైథిల్యం అర్థ వైమల్య పోషకంగా నిలవటం ఇందులో విశేషం.

7. తిక్కన తన రచనలో కొన్ని పద్యాలను సందర్భోచితంగా పునరుక్తం చేశాడు. అట్లా చేసిన వాటిల్లో ఈ పద్యం, తరువాతి పద్యం కూడా ఉన్నాయి. కథలో కీలకపాత్ర నిర్వహించే ఈ రెండు పద్యాలూ వస్తుగత ప్రాధాన్యం కలవి. (సంపా.)

వ. అనియె దానికతం డుత్తరం బిచ్చిన తెఱంగు. 86

ప్రతిపదార్థం: అనియెన్= అని భీష్ముడు చెప్పాడు; దానికిన్= అందుకు; అతండు= దుర్యోధనుడు; ఉత్తరంబు+ఇచ్చిన తెఱంగు= సమాధానం చెప్పిన విధం ఇది:

తాత్పర్యం: భీష్ముడి పలుకులకు దుర్యోధనుడు ఇట్లా సమాధాన మిచ్చాడు:

ఆ. మనకుఁ బాండురాజతనయవర్గమునకు । నెట్లు వొందు గలుగు? నేను రాజ్య
భాగ మీను; సమరభంగిక విక్రమ । నిరతిఁ బూను టిదియ నిశ్చయంబు. 87

ప్రతిపదార్థం: మనకున్= మనకూ; పాండురాజు తనయ వర్గమునకున్= పాండురాజు యొక్క కుమార సమూహానికీ; ఎట్లు+పొందు+కలుగున్?= ఎట్లా పొత్తు కుదురుతుంది?; నేను రాజ్యభాగము+ఈను= నేను రాజ్యంలో భాగం పంచి వారి కివ్వను; సమర భంగికిన్+అ= యుద్ధపద్ధతికే; విక్రమ నిరతిన్+పూనుట= యుద్ధమునందు ఆసక్తి వహించటం; ఇది+అ= ఇదియే; నిశ్చయంబు= నా నిర్ణయం.

తాత్పర్యం: మనకూ పాండవులకూ పొత్తెలా పొసగుతుంది? నేను రాజ్యంలో వారికి భాగం పంచి ఇవ్వను. పరాక్రమంతో సమరం సాగించి రాజ్యమంతా ఏలుకొనటానికే నిర్ణయించుకున్నాను.

వ. అని పలికె; నది యంతయుఁ బదంపడి మనమెల్ల వింటిమ కాదె! యా మాటల ఫలం బప్పుడ కనియు నా కష్టాత్ముండు వెండియుఁ దెలియండు. 88

ప్రతిపదార్థం: అని పలికెన్= అని చెప్పాడు; అది+అంతయున్= ఆ సంగతంతా; పదంపడి= తరువాత; మనము+ఎల్లన్= మనమందరమూ; వింటిమి+అ కాదె!= విన్నాంగదా!; ఆ మాటల ఫలంబు= ఆ మాటల వలన కలిగిన లాభమేమిటో; అప్పుడు= ఆ ఉత్తర గోగ్రహణ యుద్ధంలో; ఆ కష్ట+ఆత్ముండు= ఆ కఠినచిత్తుడైన దుర్యోధనుడు; కనియున్= చూచి కూడా; వెండియున్= ఆ తరువాతనైనా; తెలియండు= గ్రహించలేకున్నాడు.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు భీష్ముడితో చెప్పిన మాటలు ఆ తర్వాత మనమంతా విన్నాం. ఆ మాటల ఫలమేమిటో ఉత్తర గోగ్రహణ యుద్ధంలో అతడు చవి చూచాడు. రణంలో నీచేత పరాజితుడైన తర్వాతకూడా ఆ దుష్టచిత్తుడు తన మూర్ఖపు పట్టు విడువలేకున్నాడు.

తే. అతని గుణదోషముల చంద మట్లయుండె; । నాకు ధర్మజు బుద్ధిన నడపవలయు
నిత్తెఱం గాచరింపంగ నేఁగి యచట । నెల్ల తెఱఁగును నేర్పడ నెఱిఁగివత్తు.' 89

ప్రతిపదార్థం: అతని గుణదోషముల చందము= ఆ దుర్యోధనుడి గుణావగుణముల తీరు; అట్లు+అ+ఉండెన్= ఆవిధంగా ఉండనీ; నాకున్= నాకు; ధర్మజుబుద్ధిన్+అ= ధర్మరాజు తలపుజాడలోనే; నడవన్+వలయున్= మెలగవలసి ఉన్నది; ఈ+తెఱంగు+

ఆచరింపఁగన్+ఏఁగి= సంధి సమకూర్చటానికి కురుసభకు వెళ్ళి; అచటన్= అక్కడ; ఎల్ల+తెఱఁగును= ఉన్న విధమంతా; ఏర్పడన్= విశదంగా; ఎఱిఁగి వత్తున్= తెలిసికొని వస్తాను.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడి గుణదోషాలు అట్లా ఉండనీ. నేను ధర్మరాజు కోరిన చందంగా రాయబారం నడపటానికి కురుసభకు వెళ్ళవలసి ఉన్నది. పొత్తు కుదర్చటానికి వెళ్ళి, అక్కడ వారి వర్తనాలెలా ఉన్నాయో తేటతెల్లంగా తెలిసి కొని తిరిగి వస్తాను.'

విశేషం: అర్జునుడితో పలికిన ఈ చివరి పద్యం రాయబారపు రహస్యం చెప్పే రాజనీతి మంత్రం. దుర్యోధనాదులు ఎట్లా వర్తించినా శత్రు రహస్యాలను తెలిసికొనటం, భేదోపాయాన్ని నిపుణంగా ప్రయోగించటం, విజయావకాశాలను మెరుగు చేసికొనటం - అనేవి శ్రీకృష్ణుడి హస్తినాపుర ప్రయాణ ప్రయోజనాలలోని రహస్యం. ధర్మజుడు కోరేదీ అదే. దానిని మనసు విప్పి అర్జునుడితో చెప్పిన ముగింపు పద్యం. (సంపా.)

చ. అనిన ముకుందుతో నకులుఁ డల్లన యిట్లను 'నీకు ధర్మజుం
డును బవనాత్మజుండు నరుఁడుం దగఁ జెప్పుట రిత్తగాదు; మా
మనము లరణ్యవాసమున మత్స్యమహీపతిపాల నున్నయ
ద్దినముల భంగి గావు; కృపఁ దీవ్రతఁ గుందిన చంద మయ్యెడున్. 90

ప్రతిపదార్థం: అనిన ముకుందుతోన్= అని పల్కిన కృష్ణుడితో; నకులుఁడు; అల్లన= తిన్నగా; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; నీకున్= నీకు; ధర్మజుండును= ధర్మరాజూ; పవన+ఆత్మజుండున్= భీమసేనుడూ; నరుఁడున్= అర్జునుడూ; తగన్+చెప్పుట= ఒప్పిదంగా తెలపటం; రిత్తకాదు= వట్టిమాటలు కావు; మా మనములు= మా మనసులు; అరణ్యవాసమునన్= అడవులలో నివసించేకాలంలో; మత్స్యమహీపతి పాలన్+ఉన్న= విరాట మహారాజు దగ్గర నివసిస్తున్న; ఆ దినముల భంగిన్+కావు= ఆ రోజులలో ఉన్నవిధంగా లేవు; కృపన్= దయ చేత; తీవ్రతన్= తీవ్రతచేత; కుందిన చందము+అయ్యెడున్= కొరతపడినట్లు ఉన్నవి.

తాత్పర్యం: సంధికార్యం సాధించటానికై కురుసభకు వెళ్ళి వస్తానన్న శ్రీకృష్ణుడితో నకులు డిట్లా అన్నాడు: నీకు ధర్మనందనుడూ, భీమసేనుడూ, అర్జునుడూ చెప్పినవి వట్టి మాటలు కావు. మా మనస్సులు అప్పు డరణ్యావాసకాలంలో, విరాట మహారాజు దగ్గర గడపిన అజ్ఞాత వాసకాలంలోని రోజులలో వలె ప్రతీకారేచ్ఛతో ఇప్పుడు లేవు. కౌరవులపట్ల కారుణ్యాతిశయంతో తీవ్రత తగ్గినట్లు ఉన్నాయి.

విశేషం: నకులుడు ధర్మజుడివలె వక్రోక్తులు కాక, భీముడివలె సూటిమాటలు కాక, అర్జునుడి వలె సున్నితంగా కాక, ఋజువాదిగా మాట్లాడతాడు. అందరికంటె ఆశావాదిగా కనపడతాడు. భీమాదులందరిలో కంటె సంధికి సుముఖంగా పలికిన అమాయకుడు నకులుడు. తాము ప్రతీకారేచ్ఛతో కాక కారుణ్యాతిశయంతో ఉన్నామని చెప్పటం అట్లా ఉండగా, ధర్మరాజాదులందరూ అటువంటి చిత్తవృత్తితోనే ఉన్నారని అంటున్నాడు. భీముడికంటె అమాయకుడివలె మాట్లాడాడు. అతడు అందగాడు. అతడి చిత్తం ఆర్ద్రం. అది ఈ పద్యంలో ప్రతిఫలించింది. (సంపా.)

క. కడవఁగ నొకళ్ళు పసరము। నడిచిన నొక్కకులుఁ బెయ్య నడువ వలయునే?
చెడుతెరు వా కౌరవ్యుల। కడ నిలుచుంగాక మనకుఁ గ్రౌర్యం బేలా? 91

ప్రతిపదార్థం: కడవఁగన్= ముందు మిగిలి; ఒకళ్ళు= ఒకరు; పసరమున్= ఆవును; అడిచినన్= కొట్టగా; ఒక్కళులు= మరొక్కరు; పెయ్యన్= దూడను; అడువన్+వలయునే?= కొట్టవలెనా?; చెడు తెరువు= చెడ్డదారి; ఆ కౌరవ్యుల కడన్= ఆ ధార్తరాష్ట్రులవద్దనే; నిలుచున్+కాక= ఉండుగాక; మనకున్= మనకు; క్రౌర్యంబు+ఏలా?= ఆ క్రూరత్వం ఎందుకు?

తాత్పర్యం: కృష్ణా! ముందుగా తొందరపడి ఒకడు గోవును కొట్టితే మరొకడు దాని దూడను కొట్టాలా? ఆ పని మంచిది కాదు. ఆ దుర్యోధనాదులు చెడుమార్గం అనుసరిస్తే అనుసరించనీ. మనం మాత్రం క్రూరులమై ఎందుకు మెలగాలి?

విశేషం: అలం: ప్రతివస్తూపమ. "వాక్యయో రేక సామాన్యే ప్రతివస్తూపమా మతా." రెండు వాక్యాలకూ ఒకే సమానధర్మముండి అది భిన్న శబ్దాల చేత చెప్పబడితే ప్రతివస్తూపమాలంకారం. 'ఒకడు ఆవును కొడితే మరొకడు దాని దూడను కొట్టాలా'- అనేది తెలుగు సామెత. కౌరవులు పాండవులను కష్టాల పాలు చేస్తే, తిరిగి పాండవులు కౌరవులను హింసించాలా? అని సాధువర్తనుడివలె మాట్లాడాడు నకులుడు. పై పద్యంలో మెత్తబడిన హృదయం ఈ పద్యంలో కరుణతో జాలువారింది. (సంపా.)

సీ. గోగ్రహణంబునఁ గోలె నెంతయు మెత్తఁ । బడకుండుదురె వారు పద్మనాభ!
నీ యనుగ్రహమున నెమ్మిమైఁ గూడిన । బలము లేడక్షౌహిణులును, దొరలుఁ,
బాంచాల యాదవ పాండ్య కేకయ మాత్స్య । లొకతెంపు నెఱుఁగకయున్నవారె
భీమార్జునుల లావు పెంపును నీ సహా । యంబును గలుగుట కలుక రెట్లు?

ఆ. గురుఁడుఁ గృపుఁడు బాహ్లికుఁడు భీష్ముఁడును బుద్ధి । సెప్పి వారిఁ జక్కఁ జేయరెట్లు?
కార్య మీవు చెప్పఁగా విదురుండు వి । నంగ నెట్లు గాదనంగ వచ్చు? 92

ప్రతిపదార్థం: పద్మనాభ!= కృష్ణా!; గోగ్రహణంబునన్+కోలెన్= తమ్ము ఓడించి విరటుడి పశువులను ఏకాంగవీరుడై అర్జునుడు మరలించుకొని వచ్చినప్పటినుండి; వారు= కౌరవులు; ఎంతయున్= మిక్కిలి; మెత్తన్+పడక+ఉండుదురె= మునుపటి కాఠిన్యము తగ్గి మెత్తబడకుంటారా? (మెత్తబడి ఉంటారని భావం); నీ అనుగ్రహమునన్= నీ దయచేత; నెమ్మిమైన్= ప్రేమచేత; కూడిన= మన పక్షంలో చేరిన; బలములు+ఏడు+అక్షౌహిణులును= ఏడక్షౌహిణుల సైన్యాలునూ; దొరలున్= ప్రభువులూ; పాంచాల, యాదవ, పాండ్య, కేకయ, మాత్స్యులు= ద్రుపద సాత్యకుల యొక్కయూ; పాండ్య కేకయ భూవల్లభుల యొక్కయూ; విరాట మహారాజు యొక్కయూ; ఒక తెంపున్+ఎఱుఁగక+ఉన్నవారె?= విశిష్టమైన సాహస ప్రవృత్తిని తెలియజాలకున్నారా?; (తెలియుదురని భావం); భీమ+అర్జునుల లావు= భీమార్జునుల యొక్క శక్తి; వెరవు= ఉపాయం; నీ సహాయంబును= నీ యొక్క తోడ్పాటున్నూ; కలుగుటకున్= ధర్మరాజునకు లభించటానికి; ఎట్లు+అలుకరు?= ఎందుకు జంకరు?; (జంకుదురని భావం); గురుఁడున్= ద్రోణాచార్యులూ; కృపుఁడున్= కృపాచార్యులూ; బాహ్లికుఁడున్= బాహ్లికుడూ; భీష్ముఁడును= పితామహుడూ; బుద్ధి చెప్పి= నీతి బోధించి; వారిన్= కౌరవులను; ఎట్లు+చక్కన్+చేయరు= ఎందులకు చక్కబరచకుంటారు?; (చక్కబరుస్తారని భావం); ఈవు= నీవు; కార్యము చెప్పఁగాన్= కర్తవ్యం ఉపదేశించగా; విదురుండు వినంగన్= విదురుడు వినగా; ఎట్లు= ఏవిధంగా; కాదు+అనంగన్ వచ్చున్?= కాదనటానికి వీలౌతుందా? (శక్యం కాదని భావం).

తాత్పర్యం: వీరాధి వీరులైన తమ్మందరినీ నిర్జించి అర్జును డొక్కడే విరటుడి పశువులను మళ్ళించుకొని వచ్చిననాటి నుండి కౌరవులు మునుపటి కరకుదనం వదలి మెత్తబడి ఉంటారు. నీ కృపవలన కూర్మితో ఏడక్షౌహిణుల సైన్యం

వాటి అధిపతులూ, ధర్మరాజు పక్షాన చేరటం వారెరుగరా? పాంచాల యాదవ పాండ్య మత్స్య దేశాల రాజుల సాహస ప్రవృత్తు లెట్టివో వారికి తెలియదా? భీమార్జునుల బల విక్రమాలు, గొప్పతనం, నీ తోడ్పాటు ధర్మపుత్రుడికి ఉన్నాయని వారు భయపడకుండా ఉంటారా? ద్రోణ కృపాచార్యులు, బాహ్లికుడు, భీష్ముడు, నీతి బోధించి ఎట్లాగైనా వారిని చక్కబరచకుండా ఉంటారా? విదురుడు వింటుండగా, నీవు చేసే కర్తవ్య బోధను తిరస్కరించటం వారికి ఎట్లా సాధ్యమౌతుంది?

విశేషం: ఈ పద్యం పాత్ర స్వభావోచిత సంభాషణకు అచ్చమైన ఉదాహరణం. నకులుడు తన వలెనే పరులు కూడా ఉంటారని భావించే ఋజుభావుకుడు. అందువలననే పరిస్థితులనుండి గుణపాఠాలు నేర్చికొని దుర్యోధనుడు మారి, సంధి కంగీకరిస్తాడని భావించాడు. శ్రీకృష్ణు డంతటివాడు పోయి మాట్లాడితే కౌరవులు భయభక్తులతో ఆయన మాట నంగీకరిస్తారని అంచనా వేశాడు. నకులుడి మాటలకు శ్రీకృష్ణు డేమీ మాట్లాడడు. బహుశః అతడి అమాయకత్వానికి పైకి కనపడని కడుపులోనే నవ్వుకొని ఉంటాడు - పఠితవలె. (సంపా.)

వ. అట్లుంగాక నీవు దమపాలికిం బోవుట ధార్తరాష్ట్రు లాదరింపకుండ వెఱవరే? నీ పోయినప్పుడ యీ కార్యంబు చక్కనగు' ననిన విని సహదేవుండు వాసుదేవున కిట్లనియె: 93

ప్రతిపదార్థం: అట్లున్+కాక= అంతేకాక; నీవు తమ పాలికిన్+పోవుట= నీవు తమ దగ్గరకు విచ్చేయటం; ధార్తరాష్ట్రులు+ ఆదరింపక+ఉండన్+వెఱవరే= దుర్యోధనాదులు గౌరవించకుండ ఉండటానికి జంకరా?; నీ పోయినప్పుడు+అ= నీవు వెళ్ళినవెంటనే; ఈ కార్యంబు చక్కన్+అగున్= ఈ సంధికార్యం నెరవేరుతుంది; అనినన్ విని= నకులు డట్లా పలుకగా విని; సహదేవుండు వాసుదేవునకున్+ఇట్లు+అనియెన్= సహదేవుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కృష్ణా! నీవు తమ దగ్గరకు వస్తే దుర్యోధనాదులు నిన్ను అనాదరించటానికి భయపడతారు. నీవు వెళ్ళిన వెంటనే కార్యం సఫలమవుతుంది' అని నకులు డన్నాడు. ఆ పిదప సహదేవుడు శ్రీకృష్ణుడితో ఇట్లా చెప్పాడు:

ఉ. 'రక్కెస మాట లాడెదరు రాజును దమ్ములు; వానిలోన నీ
వొక్కటియైనఁ గాదనక యూఁ కొనుచుండుట యంతకంటె మేః;
లక్కట! యిట్లు వేఁడికొననైనను బోయెదువో; సుయోధనుం
డెక్కడ? భూమిలోన సగమిచ్చుట యెక్కడ? దానవాంతకా! 94

ప్రతిపదార్థం: దానవ+అంతకా!= రాక్షసులను అంతమొందించినవాడా!; కృష్ణా!; రాజును= ప్రభువగు ధర్మజుడునూ; తమ్ములున్= ఆయన తమ్ములునూ; రక్కెస మాటలు+ఆడెదరు= అయుక్తములైన పల్కులు పల్కుతున్నారు; వానిలోనన్= వారు చెప్పిన మాటలలో; నీవు= నీవు; ఒక్కటి+ఐనన్= ఒకమాటనైనను; కాదు+అనక= కాదనకుండ; ఊఁకొనుచున్+ఉండుట= ఊఁకొట్టుతూ ఉండటం, అంగీకరించటం; అంతకంటెన్ మేలు= వారు పల్కిన దానికంటె బాగున్నది; అక్కట!= అయ్యో!; ఇట్లు వేఁడికొనన్+ఐనను+పోయెదువో= ఈ రీతిగా వారిని బిచ్చమడగటానికి సైతం వెళ్ళుతావా?; సుయోధనుండు+ఎక్కడ?= దురాత్ముడైన ఆ దుర్యోధను డెక్కడ?; భూమిలోనన్= పుడమిలో; సగము+ఇచ్చుట+ఎక్కడ?= అర్ధ భాగ మివ్వటం ఎక్కడ?

తాత్పర్యం: 'ఔరా! ధర్మపుత్రుడూ, ఆతడి సోదరులూ తగని పల్కులు పల్కుతున్నారు. వాటిలో ఒక మాటనైనా తిరస్కరించక అన్నిటికీ నీవు ఊకొట్టటం అంతకన్న బాగుంది. రాక్షసులను విధ్వంసం చేసిన నీవు కురుసభకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బిచ్చమడగటానికి సైతం పోతావన్నమాట? దుష్టచిత్తుడైన దుర్యోధను డెక్కడ? రాజ్యంలో మనకు సగం పంచి ఇవ్వటం ఎక్కడ? అది కల్ల.

విశేషం: 1. పాండవులలో చిన్నవాడైన సహదేవుడు చిచ్చఱపిడుగు వంటివాడు. అభిమానధనుడు. పౌరుషోపేతుడు. సంధి మాటలు అతడికి సరిపడవు. అందువలన ధర్మరాజాదుల అభిప్రాయాన్ని కాదంటున్నాడు. ఇతడివి వీరోక్తులు, పౌరుషోక్తులు.

2. అభిప్రాయం నచ్చకపోతే ఎంతటి దగ్గరి వారైనా ఇతడికి పరాయివారుగా కనపడతారు. అందుకే ఇతడి దృష్టిలో ధర్మరాజూ, అతడి తమ్ములూ అయోగ్యమైన మాటలు మాట్లాడేవారట! సహదేవుడు ధర్మజుడి తమ్ముడు కాడా? నకులుడు తమ్ముడైనప్పుడు అతడు కాడా? ప్రశ్న అది కాదు. ధర్మజుడి మాటకు 'తందానతాన' పలికి తమ్ములనిపించుకొంటున్న నీడలు భీమాదులు. సహదేవు డా స్థితిని కోరటం లేదు. అందువలన వారికంటె తనను వేరు చేసి చెప్పుకొన్నాడు. ఇది కోపపరుల స్వభావం.

3. చేటతోపాటు పరుగు కూడా ఎండుతుందట. అట్లాగే ధర్మరాజాదులతోపాటు శ్రీకృష్ణుడు కూడా దైన్యస్థితికి రావలసి వచ్చిందట! ఎందుకంటే- తనవలె కాక ఆయన ధర్మజుడి తమ్ములతో చేరిపోయాడట! అందుకే దానవాంతకుడు ఇప్పుడు బిచ్చగాడివలె కౌరవసభకు పోతున్నాడట! వ్రతం చెడినా ఫలం దక్కదని అధిక్షేపించాడు యువకిశోరమైన సహదేవుడు.

4. ఇది సహదేవ పాత్రోచిత పద్యం. రంగస్థల ప్రదర్శనకు పనికివచ్చే నాటకీయ రచన.

5. 'రక్కసమాట లాడెదరు' వంటి మాటలు అతడి కసిని బైట పెట్టుతున్నాయి. ప్రకరణౌచిత్యంతో ప్రకాశిస్తున్నాయి.

6. పౌరుషోపేతుడైన సహదేవుడి మాటలు సాత్యకి వంటి ఆవేశపరులను ఆకర్షిస్తాయి. ధర్మరాజు మాటలలోని లోతులు తెలియని వెలితి పఠితకు తెలుస్తుంది. విశేషమేమంటే- ధర్మరాజు కాని, భీమార్జునులు కాని, శ్రీకృష్ణుడు కాని అతడిమీద ఏ విమర్శా చేయరు. సంధిప్రయత్నం జరుగుతున్నా, ధర్మజుడి స్కంధావారంలో యుద్ధాగ్ని చల్లారకూడదు. సవన యజ్ఞానికి ధర్మజుడింట నున్న త్రేతాగ్నులు-భీముడు, అర్జునుడు, సహదేవుడు. ఈ అగ్నులు చల్లారకుండటమే ఔచిత్యం. ధర్మజ వాసుదేవాదులు కోరేది కూడా అదే. (సంపా.)

మ. **తలఁపం గూడునె యింత లేసి దొర లీ దైన్యంబు? చుట్టంబులుం**
జెలులుం దిట్టరె? లాఁతిరాజులకు మెచ్చే యి వ్విధం' బిట్టిదిం
గలదే? వేఁడఁగ ధర్మజుం డడుగఁ బోఁగాఁ గృష్ణుఁ డా ధార్తరా
ష్ట్రులు పాలీక చలంబునం బెనఁగ నిట్లుం గూడు దీపయ్యెనే? **95**

ప్రతిపదార్థం: ఇంతలు+ఏసి దొరలు= ఇంతటి శక్తిమంతులైన ప్రభువులు- ధర్మజ భీమార్జున నకులులు; ఈ దైన్యంబు= ఒకరిని యాచించే దీనత్వం; తలఁపన్+కూడునె?= తలచనైనా తలచవచ్చునా?; చుట్టంబులున్= బంధువులూ; చెలులున్= మిత్రులూ; తిట్టరె?= మనలను నిందించరా?; లాఁతి రాజులకున్= ఇతర రాజులకును; ఈ+విధంబు= ఇట్టి చందం; మెచ్చే?= మెప్పు గలిగిస్తుందా?; ఇట్టిదిన్+కలదే= లోకంలో ఇంత విడ్డూరం ఉంటుందా?; ధర్మజుండు+వేఁడఁగన్= పాలివ్వండని ధర్మరాజు యాచించగా; కృష్ణుఁడు+అడుగన్+పోఁగాన్= శ్రీకృష్ణుడు రాజ్యభాగం అడగటానికివారి వద్దకు వెళ్ళగా; ఆ ధార్తరాష్ట్రులు= ఆ కౌరవులు; పాలు+ఈక= భాగమీయకుండా; చలంబునన్= ఈర్ష్యతో; పెనఁగన్= పోరాటం సాగించగా; ఇట్లున్= ఇన్నివిధాల బాధపడి సంపాదించే; కూడు= తిండి; తీపు+అయ్యేనే?= అంత రుచికరం అయిందా?

తాత్పర్యం: ధర్మజాదుల వంటి దొడ్డదొరలు ఇంతటి దైన్యానికి దిగజారటం ఊహించని విషయం. ఇందుకు బంధువులూ స్నేహితులూ నిందించక మానరు. యుద్ధ సన్నద్ధులై వచ్చిన పాంచాలాది మహీపతులకు ఈ తీరు

మెప్పు కలిగించదు. లోకంలో ఇట్టి విడ్డూరం మరొకటి ఉంటుందా? ధర్మరాజు రాజ్యభాగం యాచించటం, దానిని పరమ పురుషుడైన శ్రీకృష్ణుడు అడగబోవటం, లోభదూషితులైన కౌరవులు భాగమివ్వక ఈర్ష్యతో పోరాడటం గమనిస్తే-ఇంతటి హీనమైన తిండి కూడా ఇంత ఇంపయిందా?

విశేషం: సహదేవుడు పాండవుల ఆత్మాభిమానం ఉట్టిపడేటట్లు మాట్లాడిన ఈ పద్యంలో అన్నీ ప్రశ్నార్థకాలే. పద్యం చివర 'ఇట్లుం గూడు దీపయ్యెనే?' అనే ప్రశ్న ఈ భావావస్థకు పరాకాష్ఠ. ఇట్లున్- అని చెప్పబడే దీనావస్థను నిరూపించేవి మిగిలిన ప్రశ్నలన్నీ. ధర్మరాజు చక్రవర్తి అయి కూడా యాచించటం మొదటి దైన్యం. దానివలన బంధుమిత్రులు తమను తేలికగా చూడటం రెండవ దైన్యం. లోకంలో మిగిలిన రాజులు కూడా దీనిని గర్హించటం మూడవ దైన్యం. ఈ విధంగా తనకు తాను తేలిక కావటం, బంధుమిత్ర రాజసంస్థానాలలో తేలిక పడటం కంటె అభిమానధనుడైన ప్రభువుకు హీనమైన స్థితి మరొకటి ఉండదని సహదేవుడి అభియోగం. పోగా, ఇంతటి దైన్యంతో ధర్మరాజు శ్రీకృష్ణుడిని హస్తినాపురికి పంపినా పని చక్కపడుతుందా అంటే- ఆ ఆశ కూడా లేదు. పైపెచ్చు ధర్మజ శ్రీకృష్ణుల ప్రతిపాదనలను కౌరవులు లోభంతో ఈర్ష్యతో త్రోసిరాజని పోరుకు దిగితే ఎంత పరువు పోయినట్లు? పరులచేత ఛీ అనిపించుకొంటూ పొందే తిండి రుచిగా అనిపించిందా? అని నిష్ఠురంగా మాట్లాడాడు. 'కూడు రుచిస్తుందా' అనేది తెలుగు జాతీయం. ఇక్కడ జీవన భృతికై రాజ్యాన్ని యాచించటం అనుసరణీయమైన విధానం కాదని భావం. సహదేవుడి మాటలు రోషావేశంతో కూడి అభిమాన స్ఫోరకాలుగా ఉన్నా, రాజనీతిలోని లోతులు తెలిసికొన్నవిగా కనపడవు. అందుకే శ్రీకృష్ణుడు అతడి మాటల నంత పట్టించుకొన్నట్లు లేదు. (సంపా.)

ఉ. వీరలు ధర్మమార్గము సవిస్తరతం దగనాడి రేనియు
న్వారలు దాని కియ్యకొనినన్ విను మచ్యుత! యట్టిసంధి పెం
పారఁగ నేర్చునే? యుచితమైనది కయ్యము; వంకమాట లే
నేరఁ గురుప్రవీరుసభ నిశ్చయ మిట్టిద కాఁగఁ జెప్పుమీ! 96

ప్రతిపదార్థం: వీరలు= ధర్మజాదులు; ధర్మమార్గమునన్= న్యాయసరణిలో; సవిస్తరతన్= విపులంగా; తగన్+ఆడిరి+ఏనియున్= ఒప్పిదంగా చెప్పినప్పటికిన్నీ; వారలు= కౌరవులు; దానికిన్+ఇయ్యకొనినన్= అందులకు సమ్మతించి ఏదో కొంత ఇచ్చినను; అచ్యుత= శ్రీకృష్ణా!; వినుము= నా మాటలు వినుము; అట్టి సంధి= ఆ విధంగా కుదుర్చుకొన్న సంధి; పెంపు+ఆరఁగన్+నేర్చునే?= గౌరవాన్ని కలిగించగలుగుతుందా?; కయ్యము+అ= యుద్ధమే; ఉచితము+ఐనది= యోగ్యమైనది; వంక మాటలు= కృత్రిమ వచనాలు; ఏన్+నేరన్= చెప్పటం నాకు తెలియదు; కురుప్రవీరుసభన్= ధృతరాష్ట్రుడి ఓలగంలో; నిశ్చయము= మా నిర్ణయము; ఇట్టిది కాఁగన్= ఇదేఅని; చెప్పుమీ!= పలుకుము.

తాత్పర్యం: అచ్యుతా! మావారు న్యాయమార్గ మెట్టిదో విపులంగా చర్చించినప్పటికీ, అందుకు కౌరవు లంగీకరించి ఏదో కొంత మా కిచ్చినప్పటికీ, ఈ పొత్తు పెంపు వహించదు. మాకు యుద్ధమే తగినది. వంకర మాటలు నాకు తెలియవు. కాబట్టి ఆ ధృతరాష్ట్రుడి నిండు కొలువులో నా నిశ్చయం ఇటువంటిదిగా చెప్పుము.

విశేషం: సంధికుదిరి కౌరవపాండవులు గతాన్ని మరచి కలసి స్నేహంతో జీవించటం అసంభవం. ఈ నిజం తెలిసి కూడా ఈ సంధి ప్రయత్నాలు దేనికి? అని ప్రశ్నించి ధర్మరాజాదుల పలుకులన్నీ 'వంక మాటలు'- వక్రోక్తులు అని అధిక్షేపించాడు సహదేవుడు. తనకు వంకమాటలాడటం చేతగాదన్నాడు. కాబట్టి తన అభిప్రాయం భిన్నమైనదని చెప్పడం అతడి ప్రత్యేకత. తెగించి మాట్లాడే స్వభావం ఈ పద్యంలో స్పష్టం. (సంపా.)

మ. తుది రాజ్యమ్ము సగమ్ము గొ; మ్మడవియందుం, బేరు వంచించియుం,
బదుమూఁడేఁడులు నీవునుం దిరిగిరాఁ బాలీకపోవచ్చునే?
యది గాదేఁ దెగి బంటవై యఱుము మాయల్వన్ను నేర్పింకఁ జె
ల్లదుసూ నీ కని యా సుయోధనుని యుల్లం బుచ్చిపోనాడుమీ!' 97

ప్రతిపదార్థం: తుదిన్= చివరకు; రాజ్యమ్ము సగమ్ము+కొమ్ము= పాండు మహారాజు గడించిన రాజ్యంలో సగం తీసికొమ్ము; అడవియందున్= అరణ్యాలలో పన్నెండేళ్ళూ; పేరు వంచించియున్= పేర్లు మాటుపరచుకొని ఒక యేడూ; పదుమూఁడు+ ఏఁడులు= ఇట్లా పదమూడేళ్ళు; తిరిగి రాన్= మేము సంచరించి మరలిరాగా; నీవునున్= నీవునూ; పాలు+ఈక= భాగమొసగక; పోన్+ వచ్చునే?= తప్పించుకొనటానికి వీలవుతుందా?; అది+కాదు+ఏన్= అట్లా రాజ్యమొసగ వైతివేని; తెగి= సాహసించి; బంటవు+ఐ= వీరుడవై; అఱుము= యుద్ధంలో మమ్ము ఎదుర్కొని నశించుము; మాయల్+పన్ను నేర్పు= కపటం పన్నటంలోని చాతుర్యం; ఇంకన్= ఇకమీదట; నీకున్ చెల్లదుసూ+అని= నీకు సాగదుసుమా అని; ఆ సుయోధనుని+ఉల్లంబు+ఉచ్చిపోన్= ఆ దుర్యోధనుడి మనసుకు గ్రుచ్చుకొనేటట్లు; ఆడుమీ!= పలుకుము.

తాత్పర్యం: మా తండ్రి పాండురాజు గడించిన రాజ్యంలో ఎట్టకేలకు నీవు కూడ సగం తీసికో. పన్నెండేళ్ళు అరణ్యవాసం, మారుపేర్లతో ఒరులెరుగకుండ ఒక యేడు అజ్ఞాతవాసం ఇట్లా పదమూడేళ్ళు గడపి మేము ప్రాణాలతో మరలిరాగా రాజ్యంలో పాలుపంచి మాకివ్వక నీకు తప్పుతుందా? నీ వట్లా రాజ్యభాగం ఇవ్వటానికి ఇష్టపడకపోతే శూరుడవై సాహసంతో మమ్మెదుర్కొనుము. ఇకమీదట నీ టక్కుటమారాలు సాగవు - అని దుర్యోధనుడి హృదయానికి సూటిగా గ్రుచ్చుకొనేటట్లు నీవు మాట్లాడుము.'

విశేషం: 1. మూలభారతంలో సహదేవుడి ఈ మాటలు లేవు. అందులో ఎంతసేపూ సంధివద్దు, యుద్ధం వచ్చేటట్లే వ్యవహరించుమని చెప్పినట్లే ఉన్నది.

2. ఇది వీరోచిత భాషణం. అతడి వాదంలో అసలు రాజ్యాధికారం పాండురాజుదే. అతడు దయతో ఇస్తే - సగం పొందతగినవారు కౌరవులు. కాగా, 'అరణ్యాజ్ఞాతవాసాలు మాట ప్రకారం పూర్తి చేసి వచ్చిన తరువాత కూడా మా సహజ రాజ్యాన్ని మాకివ్వటానికి దుర్యోధనుడు కాదనటమేమిటి? అతడి కేమి హక్కున్నది? రాజ్యభాగం ఇవ్వకపోతే దుర్యోధనుడు దురాక్రమణం చేసిన వాడౌతాడు. దండార్హుడౌతాడు. మా దాడికి యోగ్యుడౌతాడు. ఇదీ అసలు వ్యవహారం. దీనిని కాదని మాయలూ మర్మాలూ చేస్తే చెల్లేది లే దని నిష్ఠురసత్యం. గుండె బ్రద్దలయ్యేటట్లు చెప్పు'మన్నాడు. 'పాండురాజు దయాభిక్షగా ఇచ్చిన రాజ్యం తింటున్నది దుర్యోధనుడు. దానిని గుర్తించకపోవటం అన్యాయం, అహంకారం, అక్రమంగా ఆక్రమించిన పాండవ భాగాన్ని ఇవ్వకపోవటం లోభగుణం, క్రౌర్యం, రెండు విధాలా తప్పు చేసింది కౌరవులే. వారు వధ్యులుకాని, యాచించదగినవారు కా'దని సహదేవుడి అభిప్రాయం. ఇట్లా విశిష్టంగా మాట్లాడటం పాండవులలో సహదేవుడికే చెల్లింది. అందుకే సజాతీయ ప్రవృత్తిగల సాత్యక్యాదుల మెచ్చుకోలు వెంటనే అతడికి లభించింది. (సంపా.)

3. ఈ పద్యాన్ని విమర్శకులు మరికొన్ని విధాలుగా వ్యాఖ్యానించారు. వాటిని 'జనహిత' వ్యాఖ్య ఇట్లా సమీకరించింది.

"సంస్కృత మహాభారతంలో వ్యాసఘట్టాలు ప్రసిద్ధాలు. తిక్కన కూడా కొన్ని పద్యాలు అలా వ్రాశాడు. వాటిల్లో ఇది ఒకటి. దీనికి కొంత మంది విజ్ఞులు ఎలా అర్థాలు చెప్పారో పరిశీలిద్దాం.

(i) "తిక్కన రచనలో రెండు మూడు ప్రౌఢ రచనావిన్యాసములు గూడ గనఁబడును" అని చెప్పి శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రిగారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించిన ఉద్యోగపర్వం పీఠికలో ఈ పద్యం ఉదాహరించారు.

అర్థం: "అడవి యందున్= అరణ్యములోను; పేరు వంచించియున్= మారుపేరులు పెట్టుకొనియు; పదుమూఁడేఁడులు= పదమూడు సంవత్సరములు; ఉండి యను క్త్వార్థక మధ్యాహారము; తుదిన్= చివరను; రాజ్యమ్ము సగమ్ము గొమ్ము= అర్ధరాజ్యమును స్వీకరించుము (అని); నీవు= నీవు (దుర్యోధనుడని యర్థము); అనన్= (ధర్మరాజుతో) అనగా; (అట్లుచేసి); తిరిగి రాన్= తిరిగి రాగా; పాలీక పోవచ్చునే?= భాగమీయకుండుట న్యాయమా?; అది కాదేన్= అది నీయిష్టము కాకున్న; తెగి= సాహసించి; బంటవై= వీరుడవై; అఱుము= ఆక్రమించుము (గెలువుము); మాయల్ పన్ను నేర్పు= మాయలను గల్పించు తెలివి; ఇంకన్= ఇకమీద; చెల్లదుసూ= పనికి రాదు సుమా; నీకని; ఆ సుయోధనుని= ఆ దుర్యోధనుని యొక్క; ఉల్లంబు= డెందంబు; ఉచ్చిపోన్= డస్సిపోవునట్లుగా; ఆడుమీ= పల్కుమా.

తాత్పర్యం: వనవాసాజ్ఞాతవాసములు రెండును బదుమూడేడులు సలిపి, తుది రాజ్యమ్ము సగమ్ముగొమ్మని నీవనగా, ధర్మరాజు తిరిగిరా పాలీయకుండుట న్యాయమా? అట్లిష్టపడవేని సాహసించి వీరుడవై యుద్ధమున గెలువుము. మోసగించి సంపాదించు నేర్పింక నీకు సాగదు సుమా! యని యాసుయోధనుని యుల్లంబుచ్చిపోవునట్లు వచింపుమా! యని సహదేవుడు శ్రీకృష్ణునితో జెప్పెనని తాత్పర్యము. (చూ. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక; సంపుటి 17, సంచిక-5, పుట= 253).

(ii) "శ్రీ చంద్రాభట్ట రామమూర్తిగారు 'నీవనన్' అని సవరించి చెప్పిన యర్థము సముచితముగా కనిపించుచున్నది" అని తిక్కన కావ్య శిల్పము అనే సిద్ధాంత గ్రంథంలో డా॥ కేతవరపు వేంకట రామకోటిశాస్త్రిగారు భావించారు.

అర్థం: "నీవునున్= నీవు కూడ; తుదిన్= మాకు బంచియిచ్చిన పిమ్మట; రాజ్యమ్ము సగమ్ము= అర్ధరాజ్యమును; కొమ్ము= పుచ్చుకొనుము; అడవియందున్= అరణ్యమునందును; పేరు వంచించియున్= అజ్ఞాతమునందును; పదమూడు వత్సరములు; తిరిగిరాన్= తిరిగిరాగా; పాలు+ఈకన్= భాగం ఇవ్వకుండా; పోవచ్చునే?= ఉండవచ్చునా?; అదికాదు+ఏన్= అది పొసఁగనిచో; తెగి= తెగించి; బంటవు+ఐ= వీరుడవై; అఱుము= ఎదుర్కొని నశింపుము; మాయల్+పన్ను= మోసములను పన్నునట్టి; నేర్పు= కౌశలము; నీకున్= నీకు; చెల్లదు+సూ(సుమీ); అని; ఆ సుయోధనుని= ఆ దుర్యోధనుని యొక్క; ఉల్లంబు= మనస్సు; ఉచ్చిపోన్= దూరిపోవునట్లుగా; ఆడుమీ= పల్కుము.

తాత్పర్యం: 'తొలుత మాకు సగము రాజ్యము పంచి యిచ్చి మిగిలిన దానిని నీవు పుచ్చుకొమ్ము. పదమూడు వత్సరము లరణ్యముల నజ్ఞాతమున గడపి వచ్చిన తరువాత రాజ్యభాగ మీయకపోవచ్చునా? అది పొసఁగనిచోఁ దెగించి వీరుడవై యుద్ధమునకు వచ్చి మమ్మెదుర్కొనుము. మాయలు పన్ను నీనేర్పు ఇక చెల్లదు సుమీ! యని యా దుర్యోధనుని హృదయమున గాటముగా గుచ్చుకొని పోవునట్లు పలుకుము.' (శ్రీ వావిలాల సోమయాజులు).

భీమార్జున నకులులు ధర్మరాజు అభిప్రాయాన్ని కాదనలేకా, ఔను అనటం ఇష్టం లేకా, ఎటూగాని మాటలు మాట్లాడారు కాని సహదేవుడు జంకు లేకుండా తన పైవాళ్ళు చెప్పలేని దానిని సూటిగా చెప్పాడు. పాండవులలో ముగ్గురు ఒకే మాట మీద ఉన్నట్లు, ఒక్కరు అందుకు భిన్నంగా ఉన్నట్లు అనిపిస్తుంది. కాని, తరువాత ద్రౌపది చెప్పబోయే మాటలకు సహదేవుని ఈ మాటలు ఉపోద్ఘాతంలాగా ఉన్నాయి. పాండవ పక్షంలో సంధికి అనుకూలత కంటే వ్యతిరేకతే ఉందని ఇక్కడి నుండి స్పష్టమవుతుంది' (ఉద్యోగపర్వము జనహిత వ్యాఖ్య. పు. 373-375).

(iii) శ్రీ పార్థసారథి రచించిన ఉద్యోగపర్వము - ఆమ్నాయకళానిధి వ్యాఖ్యలో ఇట్లా ఉన్నది.

అర్థం: "తుదిన్= కడపటి పక్షమగు; రాజ్యమ్ము సగమ్ము కొమ్ము; అడవియందున్= వనవాసమునను; పేరు వంచించియున్= మారు పేరులతోడ నజ్ఞాతవాసమునను; పదుమూఁడేఁడులు, తిరిగి రాన్; నీవు; పాలు= భాగమైనను; ఈక= ఇయ్యక; పోవచ్చునే; అది; కాదేని= ఇచ్చుట కాకపోయినన్; బంటవై= శూరుడవై; అఱుము= యుద్ధమునఁ జచ్చిపొమ్ము; మాయల్ పన్ను నేర్పు= మోసములు చేయు గట్టితనము; ఇంకన్= ఇట మీఁద; చెల్లదు సూ= జరుగదు సుమా; నీకున్; అని; సుయోధనుని యుల్లంబు= వాని మనసు; ఉచ్చిపోన్= నాటునట్లుగా; ఆడుమీ= భాషింపుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: న్యాయముగా రాజ్యమంతయు మాదైనను, గడపటి పక్షమున సగము రాజ్యమునైనను నీవు తీసికొని సగము మాకిమ్ము. మేమడవులందు బం(డ్రెండేళ్ళు తిరిగి మాఱుపేరులు పెట్టుకొని యజ్ఞాతవాసమున నొక్కయేఁడు వసించి తిరిగి వచ్చినపుడు మారాజ్యమంతయు నిచ్చుట యటుండ నీవు సగభాగమైన నియ్యకపోవచ్చునా? అట్లు నీ మనసు రాని యెడల శూరుడవై యుద్ధమునకుం దిగుము. లోఁగడవలె టక్కు చేసి రాజ్యముం గొనుట యింక ననుకూలింపదు సుమా!" అని దుర్యోధనుడి మనంబున నాటునట్లు పలుకుము.' (పు.279) (సంపా.).

(iv) కొందరీ క్రింది విధంగా అర్థం చెప్పుతారు.

అర్థం: అడవియందున్= పన్నెండేళ్ళు అడవిలోనూ; పేరు వంచించియున్= మారుపేర్లు పెట్టుకొని; ఒక యేడు అజ్ఞాతంగానూ; (ఈ విధంగా) పదుమూఁడు+ఏఁడులు= పదమూడు సంవత్సరాలు; నీవునున్= (మావలెనే) నీవుకూడా; తిరిగి రా= తిరిగి రమ్ము; తుదిన్= చివర; రాజ్యమ్ము సగమ్ము= సగం రాజ్యభాగం; కొమ్ము= తీసికొమ్ము; పాలు+ఈక పోవచ్చునే?= (నీకు) భాగం ఇవ్వకుండా ఉండటానికి (మాకు) వీలవుతుందా?; అట్లాగే- అనుకొన్న విధంగా పదమూడేళ్ళు కడపి తిరిగి వచ్చిన మాకు నీవు కూడా భాగం ఇవ్వకుండా ఉండటానికి వీలులేదు; అది కాదు+ఏన్= ఆ రీతిగా ఇవ్వటానికి ఇష్టం లేకపోతే; తెగి= సాహసించి; బంటవు+ఐ= వీరుడవయి; అఱుము= నశించుము; (ఒప్పందం ప్రకారం మా భాగం మాకు ఇవ్వాలి లేకపోతే వీరోచితంగా యుద్ధంలో చావాలి అనటం); (అంతేకాని) - మాయల్- పన్ను నేర్పు= వంచనా శిల్పం; ఇంకన్= ఇకమీద; నీకున్; చెల్లదు, సూ= సాగదు సుమా; అని, ఆ - సుయోధనుని; ఉల్లంబు= మనస్సు; ఉచ్చిపోన్= దూసుకొని పోయేటట్లు; ఆడుమీ= మాటాడుము.

తాత్పర్యం: నీవు కూడా మా వలెనే పదమూడేళ్ళు తిరిగిరా, చివర సగం రాజ్యం తీసుకో. మేము వాటా పెట్టకుంటే నీవు ఒప్పుకుంటావా? అట్లాగే ఒప్పందం ప్రకారం పదమూడేళ్ళు కడపి తిరిగి వచ్చిన మాకు రాజ్యభాగం ఇవ్వకుండా ఉండటానికి నీకు వీలులేదు. అట్లా కాకపోతే యుద్ధంలో చావుము. (మా వాటా మాకు ఇచ్చి తీరాలి లేదా చచ్చి తీరాలి.) ఇంక నీకు మాయలు పన్నే నేర్పు సాగదు - అని ఆ దుర్యోధనుడి మనస్సు దూసుకొనిపోయే విధంగా మాటాడుము.

మ. అనినన్ సాత్యకి ప్రీతుఁడై 'యితఁడు లెస్సై యుండఁబల్కెం; బ్రయో
జనముం గల్గదు గౌరవంబుఁ జెడు దుశ్చారిత్రకుం డా సుయో
ధను బోధింపఁగఁ బోయినన్; సరభసోత్సాహంబుమై నున్న వీ
రనికాయంబున కెల్లనుం బ్రియము సంగ్రామంబు మే లెమ్మెయిన్.' 98

ప్రతిపదార్థం: అనినన్= అని సహదేవుడు పలుకగా; సాత్యకి= కృష్ణుడి తమ్ముడు; ప్రీతుఁడు+ఐ= సంతోషించినవాడై; ఇతఁడు= సహదేవుడు; లెస్స+ఐ+ఉండన్+పల్కెన్= చక్కగా మాట్లాడాడు; దుస్+చారిత్రకుండు= చెడువర్తనములు గల; ఆ సుయోధనున్= ఆ దుర్యోధనుడిని; బోధింపఁగన్+పోయినన్= మంచి తెలియ జెప్పుటకు యత్నించినను; ప్రయోజనమున్+ కల్గదు= లాభం కూడా ఉండదు; గౌరవంబున్+చెడున్= మన పరువుకూడా పోతుంది; సరభస+ఉత్సాహంబుమైన్+ఉన్న= సంతోషంతో కూడిన యుద్ధ యత్నంతో ఉన్న; వీర నికాయంబునకున్+ఎల్లనున్= వీరుల సమూహాని కంతటికినీ; ఏ+మెయిన్= ఏ విధంగా యోచించిననూ; సంగ్రామంబు ప్రియము= యుద్ధమే ఇష్టమైనది; మేలు= శ్రేయస్కరం కూడ.

తాత్పర్యం: సహదేవుడి మాటలకు సాత్యకి సంతోషించి ఇట్లా అన్నాడు: 'ఈతడు యుక్తంగా మాట్లాడాడు. దుర్యోధనుడు దుష్టవర్తనుడు. అతడికి నీతులు చెప్పబోతే ప్రయోజనముండదు. అంతే కాదు. మన గౌరవం కూడ ఊడిపోతుంది. సంతోషోత్సాహాలతో ఉన్న ఈ వీరులందరికీ యుద్ధమే ఇష్టం. ఏ విధంగా ఆలోచించినా మనకు సంగ్రామమే మంచిది.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని రథికవరు లందఱు 'సహదేవుం డింత యొప్పనాడునే? సాత్యకి పలుకు లిట్లుండునే? తక్కటివి యెక్కడి మాటలు? పగవారి నడిగికొనంబోవుట యుచితంబఁట! కయ్యంబు కర్జంబుగాదఁట! భంగంబు నీఁగికొనం దగదఁట! యనునిది మొదలుగా ననేకు లనేక ప్రకారంబుల వీరాలాపంబులం గొలువెల్ల నొక్క మ్రోఁతగాఁ జెలంగిన యెలుంగులు నింగి ముట్టెఁ దదనంతరంబ. 99

ప్రతిపదార్థం: అనినన్ విని= సహదేవ సాత్యకుల మాటలు విని; రథికవరులు+అందఱున్= రథమెక్కి యుద్ధం చేసే వీరాగ్రేసరులంతా; సహదేవుండు+ఇంత+ఒప్పన్+ఆడునే!= సహదేవు డింత ఒప్పిదంగా పల్కునా!; సాత్యకి పలుకులు+ఇట్లు+ఉండునే!= సాత్యకి మాటలింత బాగుంటాయా?; తక్కటివి= మిగిలినవారు చెప్పినవి; ఎక్కడి మాటలు?= ఏమి పలుకులు?; పగవారిన్+అడిగి కొనన్+పోవుట= శత్రువులను యాచించటానికి వెళ్లటం; ఉచితంబు+అఁట!= యోగ్యమట!; కయ్యంబు కర్జంబు+కాదు+అఁట!= యుద్ధం చేయటం తగదట!; భంగంబున్+ఈఁగి కొనన్+తగదు+అట!= అవమానం బాపుకొనుట తగదట!; అనునివి మొదలుగాన్= అనునిటువంటి మాటలతో; అనేకులు= పలువురు; అనేక ప్రకారంబులన్= పలు రకాల; వీర+ఆలాపంబులన్= వీరోక్తులతో; కొలువు+ఎల్లన్= సభఅంతా; ఒక్క మ్రోఁతగాన్= ఒకే ధ్వనితో నిండినదికాగా; చెలంగిన+ఎలుంగులు= చెలరేగిన కంఠధ్వనులు; నింగిన్+ముట్టెన్= అంబరం అంటాయి; తత్+అనంతరంబు+అ= ఆ పిదప.

తాత్పర్యం: సహదేవుడూ, సాత్యకీ చెప్పిన మాటలు విని రథికశ్రేష్ఠులందరూ 'ఆహా! సహదేవు డెంత చక్కగా పలికాడు. సాత్యకి మాటలు ఎంత బాగా ఉన్నాయి! తక్కినవారి మాటలు ఏమి మాటలులే. విరోధులను యాచించటానికి వెళ్లటం మంచిదట! యుద్ధం చేయడం తగదట! వారు చేసిన అవమానానికి ప్రతీకారం కూడదట!' అంటూ అక్కడ అనేకులు అనేక విధాల వీరోక్తు లాడుతుండగా కొలువుకూటంలో ఒకే రొద చెలరేగింది. వారి కంఠధ్వనులు ఆకాశాన్ని తాకాయి. ఆ తరువాత.

విశేషం: ధర్మజుడు పలికిన రాజనీతి వాక్యాలకు సభ నిశ్శబ్దంగా ఉండి పోయింది. భీమార్జున నకులులు పల్కిన మాటలకు మారుపల్కకుండా ఊరుకొన్నది. సహదేవుడి మాటలకు ఉబ్బితబ్బిబ్బయిపోయింది. మనసులలో ఉన్న యుద్ధోత్సాహాన్ని మాటలలో బైటపెట్టింది. సభ్యుల వీరాలాపాలు గమనిస్తే పాండవ స్కంధావారమంతా యుద్ధాన్నే కోరుతున్నదని ప్రకటితమైనది. దీనిని పోషించటమే శ్రీకృష్ణుడి సంకల్పం. అందుకే వారిని వారించని వైనం. (సంపా.)

ద్రౌపది కృష్ణునితోఁ దన మున్ను పడిన భంగపాట్లు సెప్పుట (సం. 5-80-1)

తే. ధర్మనందను పలుకులు దనకు హృదయ । తాప మొనరింప మోమున దైన్య మొంద
నున్న పాంచాలి యిట్లని యొయ్యఁ బలికెఁ । గనలి శౌరితో గద్గదకంఠి యగుచు. 100

ప్రతిపదార్థం: ధర్మనందను పలుకులు= ధర్మజుడాడిన మాటలు; తనకున్= తనకు; హృదయతాపము+ఒనరింపన్= మనస్సునకు వ్యథ కలిగించగా; మోమునన్= ముఖంలో; దైన్యము+ఒందన్= దీనత తోపగా; ఉన్నపాంచాలి= అక్కడఉన్న ద్రౌపది; కనలి= కోపించి; శౌరితోన్= శ్రీకృష్ణుడితో; గద్గద కంఠి+అగుచున్= డగ్గుత్తిక పడిన గొంతుగలదై; ఇట్లు+అని= ఈ రీతిగా; ఒయ్యన్+పలికెన్= తిన్నగా మాట్లాడింది.

తాత్పర్యం: ధర్మపుత్రుడి వాక్కులు తన హృదయానికి వేదన కలిగించగా, తన ముఖంలో దైన్యం నెలకొనగా; అందరి మాటలు వింటూ అక్కడున్న ద్రౌపది కోపించి, శ్రీకృష్ణుడిని చూచి డగ్గుత్తికతో మెల్లగా ఇట్లా అన్నది.

విశేషం: 1. తిక్కన ద్రౌపది పాత్రను ఈ ఘట్టంలో సమున్నతంగా సహజంగా చిత్రించాడు. పాండవులు యుద్ధనీతిని అనుసరించి మాట్లాడుతారు. ఆమె హృదయ నీతిని పాటించి మాట్లాడుతుంది. ఆమెలో ఆవిర్భవించే భావకదంబాన్ని ఆమె చేష్టలు అభినయ దర్పణాలుగా వ్యాఖ్యానిస్తాయి. తిక్కన నాటకీయ రచనా శిల్పం ఈమె హావభావాలలో ఆయువు పోసికొన్నది.

ఆమెకు ధర్మరాజు మాటలు మనస్తాపాన్ని కలిగించాయి. దాని వలన ఆమె ముఖం చిన్నబుచ్చుకొన్నది. ఇది మనస్తాపానికి అనుభావం. ఆమెకు కోపం వచ్చింది. 'కనలు' అనే పదం సార్థకం. ఆపాదమస్తకం కోపంతో ఎర్రబడింది. ఇది సాత్త్విక భావం. గద్గద కంఠంతో నెమ్మదిగా మాట్లాడటం మొదలుపెట్టింది. గాద్గద్యం తన పరితాపానికి అనువైన వాచికాభినయంతో కూడిన సాత్త్వికభావం. మెల్లగా మాట్లాడటం మనస్తాప వ్యంజకం.

2. మూలంలో ద్రౌపది ధర్మజాదుల పలుకులకు ప్రతిస్పందించిన వివరాలు కూడా ఇవ్వబడ్డాయి.

> **"రాజ్ఞస్తు వచనం శ్రుత్వా ధర్మార్థ సహితం హితమ్**
> **కృష్ణా దాశార్హ మాసీన మబ్రవీచ్ఛోకకర్శితా॥**
> **మతా ద్రుపదరాజస్య స్వసితాయత మూర్ధజా**
> **సంపూజ్య సహదేవం చ సాత్యకిం చ మహారథమ్॥**
> **భీమసేనం చ సంశాన్తం దృష్ట్వా పరమదుర్మనాః**
> **అశ్రుపూర్ణేక్షణా వాక్య మువాచేదం మనస్వినీ॥" (సం. 5-80-1,2,3)**

ధర్మార్థ సహితంగా మాట్లాడిన ధర్మరాజు మాటలు విని ద్రౌపది శోకంతో కుమిలిపోయి శ్రీకృష్ణుడితో పలికింది. సహదేవుడిని, సాత్యకిని ప్రశంసించింది. చల్లబడిన భీముడిని చూచి గుండెలో కుమిలిపోతూ కళ్ళల్లో నీళ్ళు నిండగా ఆ అభిమానవతి ఇట్లా అన్నది. తిక్కన ధర్మరాజు ప్రసక్తిని చెప్పి మిగిలిన విశేషాలు వదలాడు. భీమాదులేమన్నా, ఎన్ని అన్నా ధర్మజుడి మాటను కాదనలేరు. శ్రీకృష్ణుడూ అంతే. అయినా ఆతడు స్వతంత్రుడు కాబట్టి తాను నమ్మింది చెప్పగలడు. చెప్పింది చేసి చూపించగలడు. అందువలన తిక్కన ద్రౌపది ధర్మజుడి మాటనే లెక్కలోకి తీసికొంటుంది. మిగతావారిని గురించి మాట్లాడకుండా ఉండటం ఇక్కడ ప్రకరణౌచిత్యం. తిక్కన ఔచిత్య పోషణ కిది తార్కాణం.

3. వ్యాసుడు మహర్షి. ధర్మరాజు పలికిన మాటలు ధర్మార్థ సహితాలైనా అవి ఆమెకు శోకం కలిగించాయని వ్యాఖ్యానం చేశాడు. అది సత్యమే అయినా ఆమె అవివేకాన్ని బైటపెట్టినట్లుంటుందని తిక్కన ధర్మార్థ ప్రసక్తి తీసికొని రాలేదు. ఆమెకు అంతస్తాపం కలిగిందని చెప్పాడు. వ్యాసుడు చిత్రించిన ద్రౌపది శోకమూర్తి. అశ్రుపూర్ణ నయన. మూలంలో అనుభావ సంచారిభావాలు వర్ణించబడ్డాయి. తిక్కన ద్రౌపది కన్నీటి వరకు రాలేదు. మొగం చిన్నబుచ్చుకొన్నది. మనసులో బాధపడుతున్నది. ఆ తాపానికి శరీరమంతా (మొగమంతా) నల్లబడిపోయింది. గొంతు బొంగురుపోయింది. అంటే కన్నీళ్ళు గొంతుకలోనే ఉన్నాయి కాని, ఇంకా కళ్ళల్లోకి పొంగలేదు. తిక్కనది క్రమదశావికాసస్ఫూర్తిగల అభినయ శిల్పం. రసాభ్యుదయ శిల్పంలో అది భాగం. (సంపా.)

ఉ. **అంతలు సేసి పోనడిచి యక్కట సంజయుచేతఁ జెప్పి పు**
త్తెంతురె? యిట్టి యూఅట మదిం బ్రియమందె యుధిష్ఠిరుండు దా
నంతన యూళ్ళు లేవురకు నైదు సుయోధనుఁ డిచ్చు నొక్కొ? యీ
కంత కృపావిహీనమతి నాతఁడు నొంచునె యన్నదమ్ములన్? 101

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; అంతలు+చేసి= అన్ని దుండగా లొనర్చి; పోన్+అడిచి= అడవులకు తరుమగొట్టి; సంజయు చేతన్= సంజయుడితో; చెప్పి పుత్తెంతురె?= ఉపచార వాక్యాలు చెప్పి పంపుతారా?; ఇట్టి+ఊఱటన్= ఇటువంటి ఓదార్పు మాటలచేత; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; మదిన్+ప్రియము+అందెన్= మనసులో సంతోషించాడు; సుయోధనుఁడు= ఆ దుర్యోధనుడు; తాను; అంతన్+అ= అంత తేలికగా; ఏవురకున్= అన్నదమ్ము లైదుగురకూ; ఊళులు+ఐదు= ఐదు గ్రామాలను; ఇచ్చును+ఒక్కొ?= ఇస్తాడా?; ఈక= ఇవ్వక; అంత కృపావిహీనమతిన్= అంత నిర్దయమైన చిత్తంతో; అతఁడు= సుయోధనుడు; అన్నదమ్ములన్= సహోదరులను; నొంచునె?= బాధిస్తాడా?

తాత్పర్యం: కౌరవులు అంతటి అకృత్యాలు చేసి, అడవులకు తరిమివేసి, నేడు సంజయుడిచేత ఊరడింపు మాటలు చెప్పిపంపుతారా? ధర్మనందనుడు ఆ మాటలకు మనసులో ఎంతో ఉబ్బిపోగా, సుయోధనుడు తనకై తాను మనసొప్పి ఐదుమంది అన్నదమ్ములకు ఐదూళ్ళు ఇస్తాడా? ఇవ్వక దయారహిత బుద్ధితో అత డింకా ఇట్లా అన్నదమ్ములను బాధిస్తాడు కాబోలు!

విశేషం: 1. ద్రౌపది తనకు కలిగిన మనస్తాపానికి గల హేతువులను ఒక్కొక్క దానిని పేర్కొంటూ తన అభిప్రాయాన్ని శ్రీకృష్ణుడికి నివేదించుకొనటం ద్రౌపది ఉపన్యాసశిల్పంలోని మొదటి ముఖ్యాంశం. అందులో ఈ పద్యం మొదటిది.

2. ఇందులో అయిదూళ్ళడిగిన ధర్మరాజు దైన్యాన్నీ, అవి కూడా ఇవ్వని దుర్యోధనుని దౌష్ట్యాన్నీ పేర్కొంటూ 'కౌరవుల వలన పాండవులకు ఇంకా బాధలు తప్పవు కాబోలు' అని తన మనోవేదనను ప్రదర్శించింది. ఇందులో వ్యంగ్యంగా ధర్మజుడి అయిదూళ్ళ ప్రతిపాదనను ద్రౌపది గర్హిస్తున్నది. కౌరవులకు కాళ్ళిస్తున్నట్లు బాధపడుతున్నది. ఇది మనస్తాపానికి మొదటి కారణం.

3. ఈ పద్యం ప్రతిపద సార్థకం. 'అంతలు చేసి' అంటే- చెప్పలేనన్ని బాధలు పెట్టి అని భావం. 'పోనడచి' అన్నప్పుడు అన్యాయంగా రాజ్యం నుండి వెళ్ళగొట్టిన ఆ కాఠిన్యం వ్యంగ్యం. 'అక్కట!' ఇది జాలిని తెలిపేది కాదు. కౌరవుల నీతిలేని తనానికి అబ్బురపాటు వ్యక్తం చేసిన మాట. అంత చేసి, మరల సిగ్గు లేకుండా రాయబారం పంపుతారా? అని భావం. 'చెప్పి పుత్తెంతురె?' రాయబారం పంపుతారా? అని సామాన్యార్థం. కాని, కౌరవులే స్వయంగా వచ్చి క్షమాభిక్ష కోరి రాజ్యభాగం ఇవ్వవలసింది ఇవ్వకపోగా, సంజయుడితో కబురంపుతారా? అది ఆహ్వానం కాదు ప్రచ్ఛన్నమైన అపకారం. సంజయుడి రాయబారం వట్టి కన్నీటి తుడుపు. అతడి మాటలు శుష్కప్రియాలూ, శూన్య హస్తాలు, వాటికి ధర్మరాజు అమాయకుడై ఉబ్బితబ్బిబ్బయిపోయి, అయిదూళ్ళ బేరానికి దిగాడు. ఈ వరుసను ఇట్లా చెప్పటం వలన పై సన్నివేశాల కన్నిటికీ ధర్మజుడి వర్తనమే కారణమని ధ్వని. దానివలన ముఖ్యంగా ద్రౌపది హృదయతాపాన్ని పొందిందని భావం. (సంపా.)

4. ఇందు 'ఇట్టి యూఱట మదిం బ్రియమంది యుధిష్ఠిరుండు ---' అనేది అసమాపకం. తరువాతి తలంపు పైకొనటంచేత ఆ వాక్య మంతటితో ఆగింది. సహజమైన మాట వరస పాటించి చూపినాడు తిక్కన. 'సంజయుచేతఁ జెప్పి పుత్తెంతురె?' అనేచోట 'సంజయుచేత' అనే మాటలో ఊతమున్నది. ధర్మరాజును మోమాటపెట్ట గల నేర్పరిని -సంజయుడిని పంపినారే అని వారి సమయాభిజ్ఞతకూ, స్వభావగ్రహణ కౌశలానికీ, కుటిల ప్రయోగానికీ వింతపాటు. 'ఇట్టియూఱట----యుధిష్ఠిరుండు' అనే వాక్యంలో వెక్కసపాటు. అంతలో 'తానంతనె---సుయోధనుఁ డిచ్చునొక్కొ?' అనిన సందియపాటు. 'అన్నదమ్ములన్' అనుటలో ఎత్తిపొడుపు. సహజసిద్ధమైన వాక్యరచన!' ఈ కంత కృపావిహీనమతి --- అన్నదమ్ములన్' అనుటలో ఎత్తిపొడుపు! తిక్కన రచనలో ఇటువంటి అసమాపక వాక్యాలు గల పద్యాలు ఉంటాయని, వాటిలో ఇది ఒకటనీ విమర్శకులంటారు. 'ప్రియమందె' అని ఉంటే అన్వయం సుకరం.

చ. తన మును బడ్డ బన్నములుఁ దమ్ములపైఁ గల కూర్మి పేర్మి నీ
జనపతి సైఁపకున్నె? యది సక్కన; రాజ్యము పాలులేక తీ
ఱున కొడఁబాటు గల్గిన నెఱుంగమి వెట్టరె? 'చాలరైరి వీ'
రన రొకొ? నానలేమి యని యాడరె లోకమువారు కేశవా? 102

ప్రతిపదార్థం: కేశవా!= శ్రీకృష్ణా!; ఈ జనపతి= ఈ ప్రభువైన ధర్మజుడు; తన మునుపడ్డ బన్నములున్= తా నింతవరకు పొందిన పరాభవాలు; తమ్ములపైన్+కల= తమ్ముళ్ళైన కౌరవుల మీద ఉన్న; కూర్మిపేర్మిన్= అనురాగాతిశయంచేత; సైఁపక+ఉన్నె?= సహించకుండా ఉంటాడా? (సహిస్తాడని భావం); అది+చక్కన= అట్లా సహించటం మంచిదే; రాజ్యము పాలులేక= రాజ్యంలో భాగం లేకుండా; తీఱునకున్= సంధికి; ఒడఁబాటు+కల్గినన్= అంగీకారం కుదిరితే; లోకమువారు= ప్రజలు; ఎఱుంగమి పెట్టరె?= పాండవులు తెలివిమాలినవారని పల్కరా?; వీరు చాలరు+ఐరి+అనరు+ఒకొ?= వీరు యుద్ధం చేయటానికి సమర్థులు కారని అనరా?; నానలేమి+అని+ఆడరె?= సిగ్గులేనివారని నిందించకుండ ఉంటారా?

తాత్పర్యం: కృష్ణా! ప్రభువగు ధర్మజుడు తమ్ములైన దుర్యోధనాదులైన కౌరవులమీద తనకున్న ప్రేమాతిశయంవలన తా నింతవరకు పొందిన అవమాన పరంపరలు సహించిన సహించుగాక! మంచిదే. కాని రాజ్యంలో భాగం తీసికొనకుండా వారితో పొత్తుకు అంగీకరిస్తే మాత్రంలోకులు పాండవు లెంత అవివేకులు! ఎంత అసమర్థులు! ఎంత సిగ్గులేనివారు! అని నిందించరా?

విశేషం: 1. ద్రౌపది తన మనోవేదనకు రెండవ కారణం గురించి ఇందులో వ్యంగ్యంగా చెప్పుతున్నది. ఈ పద్యంలో ఒక క్రమాన్వయం ఉన్నది. ధర్మరాజు తాను పడ్డ కష్టాలన్నీ మరచిపోయి తమ్ముళ్ళయిన కౌరవులను ప్రేమాతిశయంతో మన్నిస్తే ఆయనకు బాగానే ఉండవచ్చునుగాని లోకులు మాత్రం పాండవు లెంత అవివేకులు అని నవ్విపోతారు. రాజ్యభాగం ప్రసక్తి లేకుండా సంధి చేసికొంటే ధర్మరాజుకు తృప్తిగానే ఉండవచ్చును కాని లోకులు మాత్రం పాండవుల వంటి అసమర్థులు మరెవ్వరూ లేరని ఎగతాళి చేస్తారు. ఈ రెండూ బాంధవ్యానికీ ఔదార్యానికీ ప్రతీకలుగా భావించి ధర్మరాజు మురిసిపోవచ్చును కాని లోకులు పాండవులకు సిగ్గులేదని ఏవగించుకొంటారు. కాబట్టి కౌరవులతో సంధి కొరకు చేసే ఎటువంటి ప్రయత్నమైనా పాండవులకు నగుబాట్లు కలిగిస్తుందనీ, అటువంటి పనిని చేసి తమ నిందను తామే కొనితెచ్చుకొంటున్నారనీ వారి భార్య అయిన ద్రౌపది మనోవేదన పడుతున్నట్లు చెప్పింది. పగవారితో పొత్తు బంధుత్వం కాదనీ, పరిహాస జనకమనీ ద్రౌపది అభిప్రాయం. (సంపా.)

2. 'ఈ జనపతి సైఁపకున్నె?' --- ఈ మాటలో ధర్మరాజు దయాగుణాన్ని అసమయ, అస్థానపతితంగా ఎగతాళి చేస్తున్నది ద్రౌపది. 'తమ్ములపైన్ - ఇక్కడ తమ్ములంటే పాండవులనే అర్థం అంత సమంజసంగా ఉండదు. పాండవులపై గల ప్రేమాతిశయం చేత ధర్మరాజు సహించకపోతాడా? అనటంకంటె, 'తమ్ములపై' అనేదానికి దుర్యోధనాదులని చెప్పితే ద్రౌపది వ్యంగ్య సహితమైన వాగ్విన్యాసానికి సూచకమవుతుంది. (సంపా.)

శా. పెంపేదన్ దమకిట్టి తక్కువలు రూపింపంగ నేలా? విచా
రింపన్ వారిక మేలు సంధి; దము వారిం జూచినం దారు సా
ధింపం జాలరొ? కాక పోరఁ దగ మర్దింపం దలంపేని శం
కింపం బట్టొకొ? వారు బ్రాహ్మణులె యే కీడైన సైరింపఁగన్? 103

ప్రతిపదార్థం: పెంపు+ఏదన్= గౌరవం చెడేటట్లు; తమకున్= తమకు; ఇట్టి తక్కువలు= ఇంతటి హీనత్వములు; రూపింపంగన్+ ఏలా?= తామే నిరూపించుకొనటం ఎందుకు?; విచారింపన్= తర్కించగా; సంధి= పొత్తు; వారికిన్+అ మేలు= కౌరవులకే లాభం; తమున్ వారిన్ చూచినన్= తమనూ కౌరవులనూ పోల్చుకొన్నప్పుడు; తారు= కౌంతేయులు; సాధింపన్+చాలరొ?= కార్యం నెరవేర్చుకొనలేరా?; కాక= అట్లా పని సాధించుకొనలేకపోతే; పోరన్= రణంలో; తగన్= చక్కగా; మర్దింపన్+తలంపు+ఏనిన్= దండించే ఉద్దేశం ఉంటే; శంకింపన్+పట్టు+ఒకో!= సందేహానికి తావున్నదా? ఏ కీడు+ఐనన్+సైరింపఁగన్= ఎట్టి దోషమైనా సహించి విడిచిపెట్టటానికి; వారు= ఆ దుర్యోధనాదులు; బ్రాహ్మణులె?= భూసురులా?

తాత్పర్యం: గౌరవం చెడిపోయేటట్లు తాము తక్కువవార మని ఏల నిరూపించుకొనవలె? బాగా ఆలోచిస్తే సంధి కౌరవులకే లాభం. తా మెంత మాత్రమో, కౌరవు లెంతమాత్రమో పోల్చి చూచుకొంటే కౌంతేయులు కార్యం సాధించలేరా? సంధి పొసగనప్పుడు పోరిలో వారిని దండించే తలపు వీరికి ఉంటే గెలవటంలో అనుమానానికి అవకాశమే లేదు. ఏ తప్పు చేసినా మన్నించి విడిచిపెట్టటానికి దుర్యోధనాదులు బ్రాహ్మణులా ఏమి?

విశేషం: 1. ద్రౌపది తన మనోవేదనకు గల మూడవ కారణం చెప్పుతున్నది. ఈ మనోవేదన ధర్మజుడి మాటల వలన ఏర్పడింది. ధర్మరాజు రాజ్యభాగం అర్థించటంలో తనను తాను తక్కువ పరచుకొన్నాడు. అందుకే ఆమె బాధ. కులక్షయం కాకుండా సంధి చేసికొనదలిస్తే అది పాండవులకంటె కౌరవులకే ఎక్కువ లాభం. వారందరూ ఎన్ని దుర్మార్గాలు చేసినా ప్రాణాలతో బ్రతుకుతారు. బలాబలాలతో పోల్చి చూచుకొంటే వారందరికంటె పాండవులే శ్రేష్ఠులు కదా! యుద్ధంలో ఎవరికి అపజయం కలుగుతుందో చెప్పలేమని భయపడి ఎందుకు సంధి చేయాలి?- అని ఆమె మనోవేదన. అసలు ధర్మరాజుకు యుద్ధం చేసి వారిని శిక్షించాలన్న తలపే మనస్సులో లేదు. ఉంటే ఇన్ని అనుమానాలూ, ఆలోచనలూ ఉంటాయా? అసలు సమస్య ధర్మజుడి శాంతికాముకత్వమే. అయితే, ధర్మజుడి శాంతి గుణాన్ని చూచి దుర్యోధనాదులు హర్షిస్తారా? గౌరవిస్తారా? అట్లా చేయటానికి వారు బ్రాహ్మణులు కారు కదా! - అని ద్రౌపది అధిక్షేపించింది. పాండవులు క్షత్రియుల వలె కాక బ్రాహ్మణులవలె వర్తించి తమ గౌరవాన్ని తామే జారవిడుచుకొంటున్నారని ద్రౌపది మనస్సులో వేదన పడుతున్నది. తమ ఉపాయంతో పాండవులు తమకే అపాయం తెచ్చుకొంటున్నారని ఆమె వేదన.

2. ఆత్మన్యూనతా భావం గల పాండవులకు వారి అతి సమర్థత గుర్తు చేస్తున్నది ద్రౌపది. 'విచారింపన్ వారికమేలు సంధి.' అనటంలో పాండవుల తెలివి మాలినతనాన్నీ, దూరదృష్టి రాహిత్యాన్నీ ఒక పనివల్ల కలిగే లాభాలాభాలను బేరీజు వేసికొనలేని అసమర్థతనూ వెక్కిరిస్తున్నది ద్రౌపది. తము వారిం జూచినం దారు సాధింపం జాలరొ?' -- పాండవుల ఆత్మ సామర్థ్యజ్ఞతా రాహిత్యాన్ని ఈసడిస్తున్నది. 'శంకింపం బట్టొకొ?' -- కౌరవ మర్దనమెంత ధర్మబద్ధమో నిరూపిస్తున్నది. 'వారు బ్రాహ్మణులె- సైరింపఁగన్' బ్రాహ్మణుడెంతటి పాపి అయినా 'బ్రాహ్మణో నహంతవ్యః', అనే ధర్మసూక్ష్మాన్ని చెప్పి క్షమించటానికి వారు బ్రాహ్మణులు కారు గదా అని అడుగుతున్నది. ద్రౌపది పాండవులను కౌరవ నాశనానికి పురికొల్పేవిధం ఆమె వాక్చాతుర్యాన్ని, హేతుబద్ధతనూ నిరూపిస్తున్నది. (సంపా.)

ఉ. ఓట యొకింత యేనియు సుయోధను చిత్తమునందు లేదు; నీ
మాటలఁ బోవునే దురభిమానమ యెక్కుడు పూనుఁగాక; య
చ్చోటన సంగరంబు లగు చొప్పులు పుట్టిననైనఁ బాండవుల్
పోటున కిచ్చగింతురొకొ! పోదురొ కానల నుండ నచ్యుతా! 104

ప్రతిపదార్థం: అచ్యుతా!= శ్రీకృష్ణా!; ఓట= భయం; ఒకింత+ఏనియున్= రవ్వంతైనా; సుయోధను చిత్తమునందున్= దుర్యోధనుడి మనస్సులో; లేదు= లేదు; నీ మాటలన్= నీ హితవచనాలను; పోవునే= అనుసరిస్తాడా?; దురభిమానము+అ=

చెడ్డ అహంకారమునే; ఎక్కుడు పూనున్+కాక= మిక్కిలి వహిస్తాడు; ఆ+చోటన్+అ= ఆ కురుసభలోనే; సంగరంబులు+అగు చొప్పులు= యుద్ధం జరిగే సూచనలు; పుట్టినన్+ఐనన్= సంభవించినప్పటికిన్నీ; పాండవుల్= కౌంతేయులు; పోటునకున్= పోరాటానికి; ఇచ్చగింతురు+ఒకొ!= ఇష్టపడతారంటావా?; కానలన్+ఉండన్= అడవులలో నివసించటానికి; పోదురొ!= వెళ్ళుదురో ఏమో తెలియదు.

తాత్పర్యం: కృష్ణా! సుయోధనుడి మనసులో భయం ఒకింతైనా లేదు. నీ హితవచనాలను అనుసరిస్తాడా? అంతకంతకూ దురహంకారమే ప్రదర్శిస్తాడు. ఆ కురుసభలో యుద్ధం జరిగే సూచన లేర్పడితే అప్పటికైనా పాండవులు కదనానికి సిద్ధపడతారో? వనాలలోనే వసించటానికి వెళ్ళుతారో ఏమో?

విశేషం: సుయోధనుడు రాజ్యభాగ మీయనని పరుషంగా మాట్లాడి శ్రీకృష్ణుడికి కీడు తలపెట్టినా సభను వీడిరాకుండా ఓర్పుతో నిలబడి పాండవుల సత్ప్రవర్తన సభలోనివారికి తెలిపేటట్లు మాట్లాడి రమ్మని ధర్మజు డంటున్నాడు. ఆమాటలు ఆమెకు బాధ కలిగించాయి. దుర్యోధనుడికి 'ఓట' లేదట! లజ్జ, సిగ్గు, భయం, మొగమోటం, జంకు, గొంకు, భయం, భక్తి అనే భావాలు ఈ మాటలో స్ఫురిస్తాయి. వాటికి సంబంధించిన కొద్దిపాటి సంస్కారం కూడా లేని కరడు కట్టిన దురహంకారి దుర్యోధనుడు. అతడు మంచి మాటలతో వింటాడా? మరీ కొండెక్కి కూర్చుంటాడు. అతడు పాండవులు పనికిరానివారని భావించి యుద్ధానికి కాలుదువ్వుతాడు. అప్పుడైనా పాండవులు పౌరుషంతో యుద్ధానికి సిద్ధమవుతారా? లేదా, వంశనాశనమవుతుంది యుద్ధం వద్దని మేము ముందే అన్నాము కదా అని మాట నిలబెట్టుకొనటానికి అడవులకు పోతారా? - అని ద్రౌపది మనోవేదనతో ప్రశ్నించింది. అలనాటి కురుసభలో ప్రదర్శించిన మనః ప్రవృత్తినే ఇప్పుడు కూడా ప్రదర్శించి ధర్మరాజు రాజ్యావకాశాన్ని చేజేతులా జారవిడచుకొని మరల శాంతికై అడవులకు పోతాడేమోనని ఆమె వేదన! దీనితో ధర్మరాజు ప్రవర్తనయే ఆమె వేదనకు హేతువని తేలింది. (సంపా.)

ఉ. **ఏ నిటులంటి నా వలవ; దింకను నీవును రాజుఁ దమ్ములుం**
గా నుచితంబు చూచి మన కార్యము మీసుజనత్వముం జెడం
గా నొకభంగి సేయక తగం గురువర్గము తోడి సంధి మీ
కైన తెఱంగునన్ వలచినట్టుల చేయుఁడు నేర్పు లేర్పడన్. **105**

ప్రతిపదార్థం: ఏను= నేను; ఇటులు+అంటిన్+నాన్+వలవదు= నేనిట్లా మాట్లాడానని అనుకొనవద్దు; ఇంకను= మరియు; నీవును; రాజున్= ధర్మజుడూ; తమ్ములున్+కాన్= తమ్ములునూ కూడి; ఉచితంబు చూచి= తగిన పద్ధతిని పరికించి; మన కార్యమున్= మన పనియు; మీ సుజనత్వమున్= మీ మంచితనమును; చెడంగాన్= చెడిపోయేటట్లు; ఒక భంగి+చేయక= ఏదో విధంగా సరిపెట్టుకొనక; తగన్= యుక్తంగా; కురువర్గముతోడి సంధి= కౌరవులతో పొత్తు; మీకున్+ఐన తెఱంగునన్= మీకు శక్యమైన రీతిలో; వలచినట్టులు+అ= మీకిష్టమైన పద్ధతిలో; నేర్పులు+ఏర్పడన్= మీ చాతుర్యాలు వెల్లడి అయ్యేటట్లు; చేయుఁడు= చేయవలసింది.

తాత్పర్యం: అన్నా! నే నిట్లన్నానని వేరుగా తలంచవద్దు. ఇంకా నీవూ, ధర్మజుడూ, అతని తమ్ముళ్ళూ కలసి, ఏది యుక్తమో పరికించి, మన పనీ, మీ మంచితనమూ చెడేటట్లు, ఏదో ఒక విధంగా కాకుండా ఒప్పిదంగా ఉండేటట్లు, శక్యమైనంతలో మీకిష్టమైనట్లు, మీ నేర్పు తేటపడేటట్లుగా కౌరవులతో పొత్తు కుదుర్చుకొనండి.

విశేషం: ఇవి ద్రౌపది యొక్క గూఢామర్షోక్తులు. విపరీతవ్యంగ్యోక్తులు. మగవారు తన గోడు పట్టించుకొనకుండా తమకు తోచిన పనులు నిరంకుశంగా చేసికొంటూ పోతూంటే, తన మాట సాగదని తెలిసి కూడా, వ్యంగ్యోక్తులతో మెత్తని నిష్ఠురాలాడే

అభిమానవతి పలికే కాకూక్తు లివి. ద్రౌపది అనే మాటలకు అర్థాలు విపరీతంగా ఉంటాయి. అట్లా ఉండేటట్లు మాట్లాడటమే కాకువు.

1. నేనిట్లా అంటున్నానని మీరేమీ అనుకొనవద్దు- అంటే ధర్మరాజు చేస్తున్న సంధి యత్నాన్ని కాదన్న దానికి తప్పుపట్టబోకండి, నిరసించబోకండి. కాని, మాటలలోని వాస్తవాన్ని, నా మనసులోని బాధను గమనించండి. నా మాటలు నా మనసుకు తేటలు. వాటిని పట్టించుకొనటం కనీస కర్తవ్యం - అని భావం.

2. ఇంకను- మరింకొకమాట. ఇది నా సొంత గోడని అనుకొంటారేమో. అయినా నేను అనుకొంటున్న విషయాన్ని మీకు తెలుపుతున్నాను వినండి.

3. కృష్ణా! ఇప్పుడు జరుగుతున్న ప్రయత్నం నీవూ, పాండవులూ కలిసి రాజనీతికి ఉచితంగా చేస్తున్న కార్యం. కాదనటానికి నేనెవరిని? ఏమైనా, మీరు చేసే కార్యంలో మీ మంచితనంతో అందరూ మెచ్చుకొనే పద్ధతినే అవలంబిస్తారు కాని, నేను పడ్డపాట్లు మీకు జ్ఞాపకముండవు. అయినా, మీమీ ప్రయోజనాలు చెడకుండా కౌరవులతో సంధిని మీ నేర్పరితనం వాసికెక్కేటట్లు, మీకు కావలసినట్లు చేసి కొనటమేగా నేను కోరేది? - అని ద్రౌపది నిష్ఠురంగా మాట్లాడింది. ఈ సంధి ప్రయత్నం వలన పాండవులు మంచివారనిపించుకొంటారేమో కాని, నేను మాత్రం వారు మంచిపని చేస్తున్నారని అనలేను. నే ననకపోయినంత మాత్రాన ఎవరికి కావాలి? - అని ఎత్తిపొడుపు మాటలంటూ తన అభిప్రాయానికి కూడా తగినంత విలువ ఇవ్వటం కనీస కర్తవ్యమనీ, అది ఇంతవరకు పాండవుల మనసులలోకే రాలేదనీ, ఆత్మీయుడైన శ్రీకృష్ణుడితో మనవి చేసికొంటున్నది ద్రౌపది. గూఢాధిక్షేపోక్తులతో గూఢాభిమానాన్ని ప్రదర్శించిన గొప్ప పద్యం ఇది. ఇంతవరకు ధర్మజుడి సంధి యత్నాన్ని నిరసించింది. ఇకపై తన మనస్తాపాన్ని పరిగణనంలోకి తీసికొనని పరిస్థితికి పరితాపాన్ని వ్యక్తం చేస్తున్నది.

4. ద్రౌపది తన ఒక్కతెపైనా పూర్తి బాధ్యతను పెట్టుకొనటంలేదు. ఏదయినా జరగకూడనిది జరిగితే, నింద తన ఒక్కతె మీదనే పడుతుంది. ద్రౌపది గడుసరి మాటనేర్పూ, వ్యవహారజ్ఞానమూ అద్భుతాలు. తమ కార్యమూ చెడకూడదు. వారి మంచితనమూ, పౌరుషమూ చెడకుండా సంధికార్యాన్ని నిర్వహించాలట! తాను కర్తవ్యబోధ చేస్తూనే, మీకు నచ్చినట్లు, నేర్పుతో చక్కబెట్టండి అంటోంది. ఆమె వాగ్నైపుణ్యం ప్రశంసనీయం.

వ. అని మఱియు నిట్లనియె. 106

తాత్పర్యం: అని ఇంకా ద్రౌపది ఇట్లా మాట్లాడింది :

ఉ. ఆఱడిఁ బోకయున్ ఫలము నందుటయుం గని పల్కనేరమిన్
మాఱట నోరి దాననయి మాటలు చిత్తమునందు నిల్ప కేఁ
గాఱులు ప్రేలెదన్; వినుఁడు; కర్జము నెగ్గును గాన నల్కమై,
వీఱిఁడి యైన మానిసికి వెండి వివేకము గల్గనేర్చునే? 107

ప్రతిపదార్థం: ఆఱడిన్+పోకయున్= నిందలపాలగుటయు; ఫలమున్+అందుటయున్= ప్రయోజనం సిద్ధించటమూ; కని= చూచికూడా; పల్కన్+నేరమిన్= (భర్తలు) మాటాడకపోవటం చేత; మాఱటనోరిదానన్+అయి= ఆడినమాటనే ఆడెడి దాననయి; చిత్తము నందున్= మనస్సులో; మాటలు నిల్పక= మాటలు దాచుకొనక; ఏన్= నేను; కాఱులు ప్రేలెదన్= ఏమిటో వదరుతున్నాను; వినుఁడు= నా మాట లాలకించండి; అల్కమైన్= కోపంచేత; కర్జమున్+ఎగ్గున్, కానన్= చేయవలసిన దానిని, హానిని తెలియలేను; వీఱిఁడి+ఐన+మానిసికిన్= వెఱ్ఱిపట్టిన మనిషికి; వెండి= మరల; వివేకము= యుక్తా యుక్తపరిజ్ఞానం; కల్గన్+నేర్చునే?= సమకూడగలదా?

తాత్పర్యం: నేను అల్లరి పాలవటమూ, తత్ఫల మనుభవించటమూ చూచి కూడా 'పల్కనేరమి'కి కర్త నేను అనటం కంటె, పాండవులనటమే మేలు. నా భర్తలు మాటాడక పోవటంచేత, ఆడినమాటనే మళ్ళీ మళ్ళీ ఆడే దాననయి, మాటలను మనస్సులోనే నిల్పలేక, నేను ఏదో నోటికి వచ్చినట్లు మాటాడుతున్నాను. వినండి. కోపోద్రేకం చేత ఏది కార్యమో, ఏది అకార్యమో తెలియకున్నాను. అవివేకి అయిన మానిసికి మళ్ళీ వివేకం కలుగుతుందా? (ఈ మాటలు మూలంలో లేవు.)

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 1. తన బాధను గాని, మాటనుగాని పట్టించుకొనని ధర్మజుడి వైఖరిమీద ద్రౌపది వ్యంగ్యమైన వాఙ్మయాస్త్రాలు ప్రయోగిస్తున్నది. అన్నీ విపరీత వ్యంగ్యార్థక కాకువులు.

2. కార్యాకార్య వివేకుడై ధర్మరాజు ఆచితూచి మాట్లాడుతాడు. ఆమాట బైటికి అనకుండా 'నాకు మంచీ చెడులూ తెలిసికొని మాట్లాడటం చేతకా'దని ద్రౌపది అంటుంది. అంటే. ఆమెకు చేతకాదని కాదు, చేతకాదని ధర్మరాజాదులు అనుకొంటారు కాబట్టి, తన మాటలు పట్టించుకొనరు కాబట్టి ఆ మాట అన్నది. పైకి వినయంగానూ లోన వేదనగానూ వినపడుతుం దీ వాక్యం.

3. మాట దాచుకోలేక పైకి బడబడ మాట్లాడే మనిషట ద్రౌపది! ఇది ధర్మరాజు ప్రవృత్తికి సాక్షాత్ విరుద్ధం. అదే అందులోని అధిక్షేపం. ధర్మజుడు బైటపడడు, ద్రౌపది బైటపడుతుంది. ఆమె చెడ్డదనిపించుకొంటుంది. అసలు మౌనంగా చేసేది ధర్మరాజే అని ఆమె ఆక్షేపం.

4. ఇటువంటి దాననైనా నామాట కాస్త వినండి-అని నిష్ఠురమాడింది. నామాట త్రోసివేయదగింది కాదని మందలింపు అందులో ధ్వని.

5. నాకు మంచి చెడ్డలు తెలియవు అనటం కూడా గడుసరిదనమే. మంచిచెడ్డలనేవి పురుష ప్రమాణంతో నిర్ణయించేవి కావనీ, అవమానాల పాలైన తనను దృష్టిలో ఉంచుకొని నిశ్చయించండనీ ద్రౌపది మనవి చేసింది.

6. 'కోపంతో వెర్రిదాన్ని అయిపోయిన నావంటి మనసున్న దానికి వివేకం ఉంటుందా?' అని అర్థాంతరన్యాసాలంకారం వలె మాట్లాడింది. ఆమె మాటలు అరణ్య రోదనలుగా మారటానికి గల కారణం ఆమె మనసులోని మాటను మన్నించకపోవటమే అని తన మనోవేదనను వ్యక్తం చేసింది.

7. 'కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ' అని కదా న్యాయం. సంధి విషయంలో పాండవ పత్ని అయిన ద్రౌపది యొక్క సలహా అడగలేదని అభిమానంతో అన్నమాట ఇది! ధర్మజుడి నిర్ణయమే అందరి నిర్ణయమన్న నిరంకుశ వైఖరిని ఆమె ఆత్మన్యూనతాభావ ద్యోతకమైన వ్యంగ్యాధిక్షేపోక్తులతో నిందించటం ఇందులోని సంభాషణ శిల్పం. (సంపా.)

8. మూలం: పునరుక్తంచ వక్ష్యామి విశ్రమ్భేణ జనార్దన- కాతు సీమన్తినీ మాదృక్ పృథివ్యా మస్తి కేశవ- "మాఱట నోరి దాననయి -----

చ. **వరమునఁ బుట్టితిన్, భరత వంశముఁ జొచ్చితి, నందుఁ బాండుభూ**
వరునకుఁ గోడలైతి, జనవంద్యులఁ బొందితి, నీతి విక్రమ
స్థిరులగు పుత్త్రులం బడసితిన్, సహజన్ముల ప్రాపు గాంచితిన్
సరసిజనాభ! యిన్నిటఁ బ్రశస్తికి నెక్కినదాన నెంతయున్. **108**

ప్రతిపదార్థం: వరమునన్+పుట్టితిన్= దేవతా వరప్రసాదాన జన్మించాను; భరత వంశమున్+చొచ్చితిన్= భరతుడు మూల పురుషుడుగా గల కురు వంశమునందు మెట్టాను; అందున్= ప్రసిద్ధమైన ఆ కురువంశంలో కూడ; పాండు భూవరునకున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాండు మహారాజునకు; కోడలు+ఐతిన్= కోడలనైనాను; జనవంద్యులన్= ప్రజలచేత నమస్కరించదగినవారిని; పొందితిన్= పతులుగా పడశాను. నీతి విక్రమస్థిరులు+అగు= రాజనీతిలో, పరాక్రమంలోనూ చలించనివారైన; పుత్రులన్+పడసితిన్= కొడుకులను కన్నాను; సహజన్మల ప్రాపు+కాంచితిన్= సోదరుల యొక్క అండగలదాననైనాను; సరసిజనాభ!= (కమలము నాభియందుగల) శ్రీకృష్ణా!; ఇన్నిటన్= ఇన్ని విధాల; ఎంతయున్= మిక్కిలి; ప్రశస్తికిన్+ఎక్కినదానన్= ప్రఖ్యాతి పొందాను.

తాత్పర్యం: కృష్ణా! నేను దేవతావర ప్రసాదం వలన జన్మించాను. భరతవంశం మెట్టాను. భరతకుల ప్రసిద్ధుడైన పాండు మహారాజుకు కోడలినైనాను. జనులచేత నమస్కరించదగిన భర్తలను పొందాను. రాజనీతి లోనూ, శౌర్యంలోనూ చలించని ఉత్తమ పుత్రులను కన్నాను. తోబుట్టువుల తోడు నాకున్నది. ఇన్ని విధాల నేను ప్రఖ్యాతి గడించాను.

విశేషం: 1. ధర్మరాజు ద్రౌపది చింతను పరిగణనంలోనికి తీసికొనటం లేదని ద్రౌపది మనోవేదన. దానిని మరింత మండించే లక్షణం ఆమె అస్తిత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ లెక్కించక పోవటం. అందుకని ఇంత అవజ్ఞకు గురి అయిన తనను గురించి తానే చెప్పుకొంటున్నది. ఇది అహంకారంతో చెప్పుకొనేది కాదు. తనంతట తానే చెప్పుకొని ఎదుటివారి మన్ననల కొరకై పాటుపడవలసిన దైన్యాన్ని ఎత్తిచూపి, ఎదుటివారిని ఎత్తిపొడవటానికి వాఙ్మయాస్త్రంగా ప్రయోగించటానికి అన్నది. అప్పటి రాజనీతిలో తన మనోభావానికి కూడా తగినంత గౌరవస్థానం ఇవ్వాలని ఒత్తిడి తేవటానికి ఈ పద్యం అన్నది. ఇది మానోక్తికి మధురోదాహరణం.

2. ఉత్తమ ఇల్లాలికి గౌరవ ప్రమాణాలు ఆరు. (1) పుట్టుక (పుట్టింటి) గౌరవం, (2) మెట్టినింటి గౌరవం. (3) అత్తామామల గౌరవం (4) భర్త గౌరవం, (5) సంతాన గౌరవం, (6) పుట్టింటి సహకార గౌరవం. ఈ షడ్గౌరవాలు పరిపూర్ణంగా గలది ద్రౌపది అని వరుసగా పేర్కొన్నది.

3. ద్రౌపది వాక్కులలో అహంకారం కంటె అభిమానం అధికంగా ధ్వనిస్తున్నది. (సంపా.)

4. పైపెచ్చు ఆమె అయోనిజ. ద్రుపద మహారాజు తపఃఫలం. వరమున పుట్టిన పుణ్యవతి. అట్టి సహధర్మచారిణి అభిప్రాయాన్ని, సలహాలను అవజ్ఞ చేయటం అసమంజసం. పాండవులు ఆ పొరపాటు చేశారని ఈ పద్యంలో చెప్పింది. శ్రీకృష్ణుణ్ణికూడా అటువంటి పొరపాటు చేయవద్దని తరువాత పద్యంలో హెచ్చరించబోతున్నది.

5. దీనికి మూలము.

> **సుతా ద్రుపదరాజస్య వేదిమధ్యాత్ సముత్థితా,**
> **ధృష్టద్యుమ్నస్య భగినీ తవ కృష్ణ ప్రియా సఖీ ॥**
> **ఆజమీఢ కులం ప్రాప్తా స్నుషా పాణ్డోర్మహాత్మనః,**
> **మహిషీ పాణ్డు పుత్రాణాం పఞ్చేంద్ర సమవర్చసామ్ ॥**
> **సుతా మే పఞ్చభి ర్వీరైః పఞ్చ జాతా మహారథాః**
> **అభిమన్యు ర్యథా కృష్ణ తథా తే తవ ధర్మతః, ॥ (సం. 3-80- 21, 22, 23)**

వ. **అట్లుంగాక.** **109**

తాత్పర్యం: అంతమాత్రమే కాకుండా.

ఉ. **నీవు సుభద్రకంటెఁ గడు నెయ్యము గారవముం దలిర్ప సం**
భావన సేయు; దిట్టి ననుఁ బంకజనాభ! యొకండు రాజసూ
యావభృథంబు నందు శుచియై పెనుపొందిన వేణి వట్టి యీ
యేవురుఁ జూడఁగా సభకు నీడ్చెఁ; గులాంగన ని ట్లొనర్తురే? **110**

ప్రతిపదార్థం: పంకజనాభ!= పద్మము నాభియందు కలవాడా, శ్రీకృష్ణా! నీవు సుభద్రకంటెన్= నీ చెల్లెలైన సుభద్ర కంటెను; కడున్= మిక్కిలి; నెయ్యమున్= స్నేహమూ; గారవమున్= గౌరవమూ; తలిర్పన్= అతిశయించగా; సంభావన చేయుదు(వు)= నన్ను ఆదరిస్తావు; ఇట్టి ననున్= నీ మన్ననకు పాత్రురాలనైన నన్ను; ఒకండు= నోటితో ఉచ్చరించరానివాడైన దుశ్శాసనుడు; రాజసూయ+అవభృథంబునందున్= రాజసూయ యాగదీక్షానంతరం చేసే మంగళ స్నానంచే; శుచి+ఐ= పవిత్రమై; పెనుపు+ ఒందిన= మహిమ గాంచిన; వేణిన్+పట్టి= నా జడను పట్టుకొని; ఈ ఏవురు+చూడఁగాన్= ఈ భర్త లైదుగురూ చూస్తూ ఉండగా; సభకున్+ఈడ్చెన్= సభలోని కీడ్చి తెచ్చాడు; కుల+అంగనన్= ఇల్లాలిని; ఇట్లు+ఒనర్తురే?= ఇంతటి అవమానానికి గురిచేస్తారా?

తాత్పర్యం: పద్మనాభా! నీవు నన్ను నీ చెల్లెలు సుభద్రకంటె మిక్కిలి స్నేహ గౌరవాలతో ఆదరిస్తావు. ఇట్లాంటి నన్ను రాజసూయ యజ్ఞదీక్షానంతరం కావించిన మంగళ స్నానంతో పావనమై, మహిమ గాంచిన నా జడ పట్టుకొని ఒకానొకడు నా పతులైదుగురూ చూస్తుండగా కొలువులోనికి ఈడ్చి తెచ్చాడు. ఇల్లాలిని ఇట్లా పరాభవిస్తారా? నీవే చెప్పుము.

విశేషం: 1. శ్రీకృష్ణుడితో ఆత్మీయత ఉట్టిపడేటట్లు ద్రౌపది పలికిన గొప్పపద్య మిది. రసధ్వని రమణీయం. ప్రతిపదసార్థక రచన.

2. శ్రీకృష్ణుడు సుభద్రకంటె ప్రేమగా, ఆదరంగా ద్రౌపదిని చూచేవాడట. అది నిజం. సుభద్ర స్వంత చెల్లెలు. ఆమె యోగక్షేమాలన్నీ శ్రీకృష్ణుడే చూచాడు. రహస్యంగా అర్జునుడికిచ్చి వివాహం కూడా చేశాడు. అయినా, ఆయనకు ద్రౌపదంటే అంతకంటె ప్రేమ. కురుసభలో ఆమెను అవమానం నుండి రక్షించాడు. ఆమెను కనురెప్పవలె కాపాడుతూ ఆమెను గౌరవంగా మర్యాదలిచ్చి మన్నిస్తాడు. పాండవులకంటె శ్రీకృష్ణుడికి ఆమెయందు ఆదరణం అధికం. పాండవు లామె కష్టనిష్ఠురాలను పట్టించుకొనరు కాని, శ్రీకృష్ణుడు వాళ్ళవలె ఉండడు, ఉండకూడదు అని ఆమె అభిమతం. శ్రీకృష్ణుడికి అభిమాన పాత్రురాలు కావటం ఆ తరంలో గొప్ప అదృష్టం. గొప్ప యోగ్యత. అందుకే 'పంజకనాభ! అట్టి నన్ను' అని అనగలిగింది సార్థకంగా, సాభిమానంగా, చనువుగా.

3. అట్టి ఆమెను ఒకడు జుట్టుపట్టి సభకు లాగికొని తెచ్చాడని అన్నది. ఒకడు అనే మాటకు అల్పుడు, ఏకాకి, పేరుచ్చరించరాని పాపి - అనే అర్థాలు ఈ ప్రకరణంలో సరిపోతాయి. శ్రేష్ఠుడనే అర్థం ఉన్నా ఇక్కడ అది పొసగదు. ఆ ఒకడు దుశ్శాసనుడు.

4. ఒక అల్పుడు - మహాపరాక్రమవంతులైన 'ఈ యేవురు' (అని పాండవులవైపు చూపించి అనే అభినయాత్మక వాచకం) ఏమీ చేయలేక కళ్ళప్పగించి చూస్తూ ఉండగా, ఆమె కేశపాశాన్ని పట్టి లాగాడట! ఆ కేశపాశం సామాన్యమైనదా! రాజసూయయాగం చేసి, పరిసమాప్తిలో పవిత్రమైన అవభృథ స్నానం చేయడం చేత పవిత్రమైనది. సమ్రాజ్ఞి అర్హత పొందిన ఆ కేశం ఆమె సుమంగళీత్వానికి చిహ్నం. దాన్ని కించపరిచేటట్లు దుశ్శాసనుడు లాగాడని జ్ఞాపకం చేసింది. ఆ చేష్ట వెనుక ఉన్న కౌరవుల క్రౌర్యం తలపోసింది. పాండవుల నిస్సహాయ స్థితికి నిట్టూర్చింది. కృష్ణుడి దయకు ధ్వనిమయంగా కృతజ్ఞత చెప్పింది. 'ఇల్లాలిని ఇట్లా చేస్తారా?' అని ప్రశ్నించింది. 'ఇట్లు' అనే మాట చాలా విలువైనది. కౌరవులు పరుల ఇల్లాలిని ఇట్లా అవమానిస్తారా? అని, పాండవులు తమ ఇల్లాలిని అట్లా అగచాట్ల పాలుపడనిస్తారా? అని ఉభయులను మందలించింది. అసలు ఇల్లాళ్ళను ఇటువంటి అవమానాల పాలు చేసే వారితో పాలు పంచుకోబోతారా? అని అందరినీ ప్రశ్నించింది. దాని సమాధానం కొరకు శ్రీకృష్ణుడివైపే చూచింది. ఇది మానసిక వేదనను పతాక స్థానాన్ని చేర్చే ప్రశ్న.

5. సంధి వద్దని నేరుగా చెప్పక, ద్రౌపది ఈ విధంగా మాటాడటం వలన సంధిగాక యుద్ధమే అవశ్యం జరగాలని ఆమె అభిప్రాయంగా శ్రీకృష్ణుడు గ్రహించగలడు. 'నీ చెల్లెలు సుభద్రకే ఇటువంటి అవమానం జరిగితే నీవు ఊరుకొంటావా? మరి నీవు నన్ను అంతకంటె మిన్నగా ఆదరిస్తావు కదా! నా విషయంలో ఉపేక్షించవచ్చా?' అని ఆమె హృదయం. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ఆ సభ కేకవస్త్ర యగు నట్టి ననుం గొనివచ్చి నొంచు దు
శ్శాసనుఁ జూచుచుం బతు లసంభ్రములై తగుచేష్ట లేక నా
యాసలు మాని చిత్రముల యాకృతి నున్న యెడన్ ముకుంద! వి
శ్వాసముతోడ నిన్ గొలువ వచ్చె మనం; బదియుం దలంపవే. 111

ప్రతిపదార్థం: ముకుంద!= కృష్ణా!; ఆ సభకున్= ఆ కురుసభలోనికి; ఏకవస్త్ర+అగునట్టి ననున్= రజస్వలనైన నన్ను; కొని వచ్చి= ఈడ్చి తెచ్చి; నొంచు= బాధిస్తున్న; దుశ్శాసనున్+చూచుచున్= దుస్ససేనుడి దుండగం చూస్తూ; పతులు= నా భర్తలు; అసంభ్రములు+ఐ= తొట్రుపాటు చెందనివారై; తగుచేష్ట లేక= తగిన చర్య గైకొనక; నా+ఆసలు మాని= నాపై తమ ఆశలు వదలుకొని; చిత్రముల+ఆకృతిన్= బొమ్మల ఆకారంతో - నిశ్చేష్టులై; ఉన్న+ఎడన్= ఉన్నట్టి సమయంలో; విశ్వాసము తోడన్= నమ్మికతో; మనంబు= నా హృదయం; నిన్+కొలువన్+వచ్చెన్= నిన్ను సేవించటానికి వచ్చింది; అదియున్+తలంపవే= ఆ విషయాన్ని కూడా స్మరించుము.

తాత్పర్యం: ముకుందా! ఆ నాడు కురుసభకు ఒంటి చీరతో ఉన్న (బైటచేరి ఉన్న) నన్ను బలాత్కారంగా లాగితెచ్చి దుశ్శాసనుడు బాధిస్తుంటే నా భర్తలు దిగ్భ్రాంతి పొంది ఏమీ చెయ్యలేక నా మీది ఆశలు వదలుకొని చిత్రాలవలె కదలక మెదలక ఉండగా నమ్మికతో నా మనస్సు నిన్ను భజించటానికి పూనుకొన్నది. ఆ విషయాన్ని నీవు సంధి కుదిర్చేవేళ జ్ఞప్తికి తెచ్చుకో!

విశేషం: 1. సభానీతి లేక రాజనీతిని గురించి పై పద్యంలో మాట్లాడి, కుటుంబ నీతికి వెలియైన రాజనీతిని గురించి ఇక్కడ పేర్కొంటున్నది ద్రౌపది. ఏకవస్త్ర (ముట్టయిన) అయిన స్త్రీని పురుషుడు తాకరాదు. ఆమెను బాధపెట్టరాదు. ఇది కుటుంబ నీతి, గృహనీతి. దీనిని రాజనీతితో ధ్వంసం చేయటం అవినీతి. దుశ్శాసనాదులు చేసిన అవినీతి దండార్హం. అయినా, దానిని పాండవులు చూస్తూ, ఎటువంటి ప్రతిస్పందన లేకుండా, ఆశలు వదలుకొని, బొమ్మలవలె కూర్చున్నారు. చక్కని నాటకీయ సన్నివేశ స్మృతి. అట్టి దయనీయ సమయంలో విశ్వాసంతో తలచినంతమాత్రంలోనే శ్రీకృష్ణుడు ఆమెను కాపాడాడు. దానిని గుర్తుంచుకొనమంటున్నది ద్రౌపది.

2. 110వ పద్యంలో శ్రీకృష్ణుడికి తనపై నిజసోదర నిర్విశేషమైన ఆదరం ఉందని చెప్పి, యిప్పుడు ఈ పద్యంలో తనకు శ్రీకృష్ణుడిపై ఎంత విశ్వాసమో చెప్తుతోంది ద్రౌపది. ఆ సమయంలో నిజ భర్తలకు తన యెడగల ఉపేక్షాభావం చేత, ఆమె నిస్సహాయత ఎవరికైనా జాలి కలిగిస్తుంది. 'అదియుం దలంపనే' - సంధి కుదిర్చేటప్పుడు అవన్నీ మనసులో పెట్టుకొని ప్రయత్నిస్తే, అది ఎట్లాగూ కుదిరేది కాదు. శ్రీకృష్ణుడికే సంధి కుదర్చటం ఇష్టంకాదు. అది అతని పూర్వపు మాటలలో తెల్లమైంది. ఇప్పుడు ద్రౌపదికి కూడా సంధి ఇష్టం కాదని స్పష్టమౌతున్నది.

3. ఇందులో చక్కని ధ్వని ఉన్నది. 'ప్రస్తుత సంధి ప్రయత్నంలో కూడా- కౌరవుల చేత అవమానించబడిన నేను పరోక్షంగా- అదే స్థితిలో నేటికీ ఉన్నాను. సంధి చేయటం నన్ను నిండుకొలువులో అవమానించడం వంటిదే' అని ధ్వని. ఆనాడు మిన్నక కూర్చున్నారు పాండవులు. ఈ రోజు కూడా తనను పట్టించుకొనక, తనను అవమానం నుండి రక్షించక, తమ మంచితనం కొరకు దుర్మార్గులతో స్నేహం చేయబోతున్నారు. వారితో కలిసి బ్రతకాలని భావిస్తున్నారు. ఈ పరిస్థితులలో ద్రౌపది ఆనాటి వలెనే శ్రీకృష్ణుడితో తన మొర చెప్పుకొంటున్నది. ఆనాడు శ్రీకృష్ణుడు ఆమెను ఎట్లా ఆదుకొన్నాడో, అట్లాగే ఇప్పుడూ అట్టి ప్రేమతో ఆదుకొనవలెనని ప్రార్థిస్తున్నది. ఆనాటి సభకూ ఈనాటి సభకూ చక్కని సామ్యాన్ని ధ్వనింపచేసిన ద్రౌపది వాక్కులు ఆలోచనామృతాలు.

4. అర్థవ్యక్తి అనే శబ్దార్థగుణ స్వభావాలు ఈ పద్యంలో హృద్యంగా రాణిస్తున్నాయి. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. అరయమిఁ జేసి కోడ లన కప్పుడు దాసిగఁ జేసె; నమ్మహా
పురుషుని పాలికిం బతులు వోవఁగ వీరలతోన యేను జె
చ్చెరఁ జని కోటరంబు దగఁ జేయుదునో? యటుఁగాక పాడిమై
వరవుడ మోపి చేయుదునొ వారికి మాధవ! నిశ్చయింపుమా!' 112

ప్రతిపదార్థం: మాధవ!= లక్ష్మీవల్లభా!; అరయమిన్+చేసి= ముందు వెనకలు విచారించక; కోడలు+అనక= కోడలు అని కూడా భావించక; దాసిగన్+చేసెన్= నన్ను ఊడిగపుదానిగ చేశాడు; ఆ+మహాపురుషుని పాలికిన్= ఆ దొడ్డ మనిషి ధృతరాష్ట్ర మహారాజు కడకు; పతులు పోవఁగన్= నా భర్తలు వెళ్ళగా; వీరలతోన్+అ= వీరి వెంటనే; ఏను= నేను; చెచ్చెరన్+చని= శీఘ్రముగా పోయి; వారికిన్= ఆ పెద్దలకు; కోటరంబు= కోడరికము; తగన్+చేయుదునో= చక్కగా చేయవలెనో; అటుఁగాక= అలా కాకుండా; పాడిమైన్= న్యాయముతో; వరవుడము= దాస్యము; ఓపి= సహించి; చేయుదునొ= చేయవలెనో; నిశ్చయింపుమా= నీవే నిర్ణయించవలసినది.

తాత్పర్యం: అన్నా! ముందు వెనుకలు ఆలోచించక కోడలని కూడా భావించక అప్పుడు నన్ను దాసిని గావించిన ఆ పెద్దమనిషి ధృతరాష్ట్ర మహారాజు దగ్గరకు నా భర్తలు వెళ్ళగా, వారి వెంట నేను కూడా వెళ్ళి ఆ పెద్దలకు కోడరికము చేయాలో లేక న్యాయప్రకారం వారికి దాస్యమే చేయాలో నీవే నిర్ణయించి చెప్పుము.'

విశేషం: 1. ఈ పద్యం ఒక కీలకాంశం. ద్రౌపది సమయోచిత ప్రతిభకు మచ్చుతునక. సభాపర్వంలో 'మున్ను తన్నోడి ఆపైన నన్నోడెనా? నన్ను మున్నోడి విభుఁడు ఆమీద తన్నోడెనా?' అని అడిగిన చిక్కుముడి ప్రశ్నవంటిది.

2. హస్తినాపురంలో జరిగిన మాయా ద్యూతంలో ధర్మజాదులు ఓడి దాసులయ్యారు. ద్రౌపదిని దాసిగా భావించి కౌరవులు అవమానించారు. దానిని ధృతరాష్ట్రుడు గమనిస్తూనే కిమ్మనకున్నాడు. ఆపైన రాజ్యాన్నిచ్చాడు. పాండవులు ప్రభువులైనారు. ద్రౌపది రాణి అయింది. ఆపైన పునర్ద్యూతంలో ఓడి అరణ్యాజ్ఞాతవాసాల పాలయ్యారు. ఆ పరిస్థితులకూ ధృతరాష్ట్రుడు సాక్షిగా నిలిచాడు. 'ఒకవేళ ఇప్పుడు హస్తినాపురికి పోతే పాండవుల స్థితి ఏమిటి? రాజ్యాన్ని వదలిపోయిన పాండవులకు రాజ్యమున్నట్లా? లేనట్లా? దుర్యోధన ధృతరాష్ట్రులు ఇస్తేనే ఉన్నట్లా? ఇవ్వకపోతే లేనట్లా? ఒకవేళ రాజ్యభాగం ఇవ్వకపోయినా, వారితో కలిసి ఉండే సంధి కుదిరితే ధృతరాష్ట్రుడి సమ్ముఖంలో పాండవుల అధికారమేమిటి? రాజ్యంలేని రాజులా? ఇచ్చిన రాజ్యాన్ని కోల్పోవటం ద్వారా వారు దాసులుగానే పరిగణించబడతారా? రాజ్యం స్వీయాధికారం వలన ఏర్పడేదా? కౌరవుల దయాభిక్షవలన కలిగేదా? ఇంతటి సందిగ్ధావస్థలో పాండవులు ధృతరాష్ట్రుడి మందిరానికి పోతే వారెట్లా మెలగుతారో, మెలగరాదో వారికే ఏమైనా నిశ్చితాభిప్రాయం ఉన్నదో లేదో నాకు తెలియదు. కాని, నేను ధృతరాష్ట్రుడికి కోడరికం చేయాలా? దాస్యం చేయాలా? అన్నది నీవే నిశ్చయించి చెప్పు'మని శ్రీకృష్ణుడిని వేడింది. స్వాభిమానాన్ని సర్వనాశనం చేసే సంధిని ఆమె అంగీకరించదు. ఆమె మనోవేదన పాండవులకు పట్టదనీ, దానిని శ్రీకృష్ణుడే పట్టించుకొని తగిన పరిష్కారం చూపించాలనీ ఆమె పరితాపం. (సంపా.)

వ. అని యట్లుగ్గడించి. 113

తాత్పర్యం: అట్లా పలికి.

ఉ. ద్రోవది బంధురం బయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి, వెండ్రుకల్
దా వలచేతఁ బూని, యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో

నా విలసిల్లి వ్రేలఁగ, మనంబునఁ బొంగు విషాద రోషముల్

గావఁగ లేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై. 114

ప్రతిపదార్థం: ద్రోవది= ద్రౌపది; బంధురంబు+అయిన= ఒప్పిదమైన; క్రొమ్ముడిన్= క్రొత్త సిగముడిని; గ్రమ్మన= శీఘ్రంగా; విడ్చి= విప్పి; వెండ్రుకల్= శిరోజాలు; తాన్= తాను; వలచేతన్+పూని= కుడిచేతపట్టుకొని; అసిత+ఛవిన్= నల్లని కాంతితో; పొల్చు= ఒప్పు; మహాభుజంగమో= గొప్ప సర్పమేమో; నాన్= అన్నట్లు; విలసిల్లి= ప్రకాశించి; వ్రేలఁగన్= వ్రేలాడుతుండగా; మనంబునన్= తన హృదయంలో; పొంగు= అతిశయిస్తున్న; విషాదరోషముల్= దుఃఖమూ కోపమూ; కావఁగన్+లేక= అణచుకొనలేక; బాష్పములు= కన్నీరు; క్రమ్మఁగన్= కన్నులలో ఆవరించగా; ఆర్త+ఐ= దుఃఖితురాలై; దిగ్గనన్+లేచి= తటాలున లేచి.

తాత్పర్యం: ద్రౌపది తన ఒప్పిదమైన అప్పుడే వేసుకున్న కొప్పును గ్రక్కున విప్పి, శిరోజాలను కుడిచేతదాల్చి నల్లని రంగుతో నిగనిగలాడే పెద్ద పాములవె ప్రకాశిస్తూ వ్రేలాడుతుండగా తన హృదయంలో చెలరేగు దుఃఖాన్నీ, క్రోధాన్నీ ఆపుకొనలేక కనులలో అశ్రువులు నిండగా విలపిస్తూ తటాలున లేచి దుఃఖితురాలై. (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: 1. అలం: ఉత్ప్రేక్ష. శ్రీకృష్ణుడి ఎదుట ద్రౌపది తన మనోగత వేదనను ప్రదర్శించిన మాటలతో పాటు ఆమె చేష్టలను కూడా వర్ణించిన పద్యాలలో ఇది ఆణిముత్యం.

2. ద్రౌపది ఉపన్యాసంలో తిక్కన చేసిన వర్ణనగా నిలిచిన పద్యం ఇది ఒక్కటే. మిగిలినవన్నీ ద్రౌపదీ సంభాషణలే. ఈ పద్యం నాటకీయతలోని ఆంగిక, ఆహార్య, సాత్త్వికాభినయాల సంపుటి. అందువలన అభినయం రీత్యా ఒక ప్రత్యేక స్థానం దీనికి ఉన్నది. తెలుగు సాహిత్యంలోని మంచి పద్యాలలో ఇది ఒకటిగా ఆంధ్రులు భావిస్తారు.

3. ద్రౌపది కురుసభలో పొందిన అవమానానికి ప్రత్యక్ష ఉద్దీపన విభావం ఆమె దీర్ఘ శిరోజవేణి. ఆమె శిరోజాలు అవభృథస్నానపూతమైనవి. అవి దుశ్శాసనుడి కరస్పర్శతో అపవిత్రమయ్యాయి. ఆ అవమానానికి తగిన ప్రతీకారంకొరకు ఆమెహృదయంలో పగ అనే చిచ్చు మండుతున్నది. ఆ అగ్నినుండి రేగిన పొగలా అన్నట్లున్నాయి ఆమె శిరోజాలు. అంతేకాదు. అవి కౌరవులను కాటందాలని బుసలు కొట్టుతున్న కాలమహాభుజంగమా అన్నట్లున్నాయి. కౌరవ నాశాన్ని కోరే ప్రతీకార వాంఛకు ప్రతీక ఆమె శిరోజ మంజరి.

4. ఇందులోని ఉత్ప్రేక్షాలంకారం సార్థకం. ఉపమాన ధర్మసంబంధం చేత ఉపమేయాన్ని ఉపమానంగా భావించటం (లేదా ఊహించటం) ఉత్ప్రేక్ష. ఇందులో ద్రౌపది శిరోజవేణి ఉపమేయం. అది 'అసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో' అన్నట్లు ఇందులో భావింపబడుతున్నది. అలంకారం సార్థకం కావటంతో అలంకారౌచిత్యం ఏర్పడింది. అలంకార స్వభావంతో భావికథార్థ ధ్వని ప్రతీయమానం ఔతున్నది.

5. పాండవ యుద్ధనీతిలో కీలకస్థానం వహించవలసిన అంశం ద్రౌపది జడ. అది అపవిత్రమైనది. పవిత్రం కావాలంటే మార్గమేమిటి? ఆలోచించండని సూచిస్తున్నది. అక్కడ ఆమె ప్రదర్శించిన అభినయం ఆమె భావాలకు ఆంగిక వ్యాఖ్యానం. ఆమె శిరోజాలను తన కుడిచేతిమీద ఉంచింది. శ్రీకృష్ణుడు తోబుట్టువు కాబట్టి కుడిచేతిమీద ఉంచి భారమంతా ఆయనమీద ఉండునట్లు చేసింది. ముడి విప్పటంలో ఆత్రుత ప్రకటించింది. మాటలు వెలువడటానికి ముందే మనోవేదన వెలికి తీసికొని వస్తున్నది. తన శిరోజాల విషయంలో తనకు ఊరట కలిగించే ఉపాయం ఎవ్వరూ ఊహించక పోవటంతో విషాదం మొదట తలయెత్తింది. తనంతట తాను ఆ విషయం శ్రీకృష్ణాదులకు జ్ఞాపకం చేయవలసి వచ్చినందుకు రోషం పొంగివచ్చింది. ఆ అవమాన వేదన స్మరణ చేత దుఃఖం పెల్లుబికి కన్నీళ్ళు క్రమ్మాయి. ఇక ఆలస్యం పనికి రాదని పగ వగను వెనకకు త్రోసి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తానే ముందుకు వచ్చింది. దానితో ఆమె దిగ్గున లేచింది. అదుపులో పెట్టుకొనలేని దుఃఖం ఆర్తిగా మారింది. గుండెలో కరడు గట్టిన వేదన మాటలతో బైటపడాలంటే అంతవరకూ అడ్డుగా నిలిచిన దుఃఖం ఆర్తిగా మారి త్రోవ ఇవ్వాలి. లోతైన అభినయ రహస్యాలను ద్రౌపది పాత్రయందు సంగ్రహ సుందరంగా వర్ణించి తిక్కన రసాభ్యుదయ శిల్పాన్ని ప్రదర్శించాడు.

6. ఏడుస్తూ ద్రౌపది శిరోజాలను శ్రీకృష్ణుడి ముందు ఉంచటం ఈ నాటకీయతలోని పరాకాష్ఠ. తీరని సమస్యను దేవుడి ముందుంచి వేడుకొన్న స్ఫూర్తి ఇందులో ఉన్నది. ఎదుట లేని శ్రీకృష్ణుడిని అప్పుడు తలచింది. ఎదుట నున్న మాధవుడి ముందు ఇప్పుడు తన గోడు వినిపించింది. అప్పు డాదుకొన్నాడు కృష్ణుడు. ఇప్పుడూ ఆదుకోక తప్పదు.

7. ఈ పద్యానికి మూల మిట్లున్నది -

"ఇత్యాక్త్వా మృదుసంహారం వృజినాగ్రం సుదర్శనమ్,
సునీల మసితాపాఙ్గీ సర్వగంధాధివాసితమ్ ॥
సర్వలక్షణసంపన్నం మహాభుజగవర్చసమ్,
కేశపక్షం వరారోహా గృహ్య వామేన పాణినా ॥
పద్మాక్షీ పుణ్డరీకాక్ష ముపేత్య గజగామినీ,
అశ్రుపూర్ణేక్షణా కృష్ణా కృష్ణం వచనమబ్రవీత్ ॥ (సం. 5.80.33-35)

మూలంలో ద్రౌపది 'వామేన పాణినా' అని జడను ఎడమచేత పట్టినట్లున్నది. తిక్కన 'వలచేత' అని కుడిచేతికి మార్చాడు. మూలంలో 'అశ్రుపూర్ణేక్షణా' అని ఉండగా తెలుగు 'విషాదరోషముల్ గావఁగలేక' అని ఉన్నది. విషాదరోషాలను ఆపుకొనలేకపోతే బాష్పాలు క్రమ్మటం తప్పదు. (సంపా.)

వ. గోవిందు ముందటంబెట్టి యిట్లనియె : 115

తాత్పర్యం: కృష్ణుడి ఎదుట తలవెంట్రుకలను పారబట్టి ఇట్లా అన్నది :

క. 'ఇవి దుస్ససేను వ్రేళ్ళం। దవిలి సగము ద్రెవ్విపోయి దక్కినయవి; కౌ
రవుల కడఁ దీఱుమాటల। యవసరమునఁ దలఁపవలయు నచ్యుత! వీనిన్. 116

ప్రతిపదార్థం: అచ్యుత!= శ్రీకృష్ణా!; ఇవి= ఈ వెంట్రుకలు, దుస్ససేను వ్రేళ్ళన్+తవిలి= దుశ్శాసనుడి వ్రేళ్ళలో చిక్కుకొని; సగము= అర్ధభాగం; త్రెవ్విపోయి= తెగిపోయి; తక్కిన+అవి= మిగిలినట్టివి; కౌరవులకడన్= దుర్యోధనాదుల దగ్గర; తీఱుమాటల+ అవసరమునన్= సంధి వచనములాడే సందర్భంలో; వీనిన్= ఈ శిరోజాలను; తలఁపన్+వలయున్= నీవు యోచించవలెను.

తాత్పర్యం: 'కృష్ణా! ఈ శిరోజాలు దుశ్శాసనుడు నన్ను బలాత్కారంగా సభకీడ్చి తెచ్చేవేళ అతడి చేతివ్రేళ్ళలో చిక్కుకొని సగం తెగిపోగా మిగిలినవి. నీవు కౌరవుల దగ్గర సంధి వచనములాడే సందర్భంలో వీటిని జ్ఞప్తిలో ఉంచుకొనాలి.

విశేషం: 1. 114వ పద్యంలో ద్రౌపది మనస్సులో పొంగిన భావాలలో విషాదం మొదటిది. దానికి సంబంధించిన వాచికాభినయం ఇది. ఇందులో వాడిన పదాలు దీప్తరసత్వాన్ని వ్యంజింపజేస్తూ కాంతిగుణంతో రాజిల్లుతున్నాయి.

2. దీనికిమూలం :

'అయం తే పుణ్డరీకాక్ష దుశ్శాసనకరోద్ధృతః
స్మర్తవ్యః సర్వకార్యేషు పరేషాం సంధిమిచ్ఛతా॥" (సం. 5.80.36) అని మాత్రమే ఉండగా, తెలుగున తిక్కన -

'ఇవి దుస్సేను వేళ్ళం, దవిలి సగము త్రెవ్విపోయి దక్కినయవి'' - అనటం వినటానికీ చూడటానికీ మరింత బాధాకరం. (సంపా.)

సీ. **ఈ వెండ్రుకలు వట్టి యీడ్చిన యాచేయి । దొలుతగాఁ బోరిలో దుస్ససేను**
తను వింత లింతలు దునియలై చెదరి రూ । పఱియున్నఁ గని యుడుకాఱుఁగాక!
యలుపాలఁ బొనుపడునట్టి చిచ్చే యిది; । పెనుగద వట్టిన భీమసేను
బాహుబలంబును బాటించి గాండీవ । మను నొక విల్లెప్పుడును వహించు

ఆ. **కట్టి విక్రమంబు గాల్పనే? యిట్లు బ । న్నములు వడిన ధర్మనందనుండు**
నేను రాజరాజు పీనుంగుఁ గన్నారఁ । గానఁ బడయమైతిమేనిఁ గృష్ణ! **117**

ప్రతిపదార్థం: కృష్ణ!= శ్రీకృష్ణా!; పోరిలోన్= యుద్ధములో; తొలుతగాన్= ప్రప్రథమంగా; ఈ వెండ్రుకలు+పట్టి= ఈ శిరోజాలను ఒడిసిపట్టి; ఈడ్చిన= లాగిన; ఆ చేయి= ఆ దుశ్శాసనుడి హస్తము; దుస్ససేను తనువు= దుశ్శాసనుడి శరీరం; ఇంతలు+ఇంతలు+తునియలు+ఐ= ఇంతింత ముక్కలై; చెదరి= చెల్లా చెదరై; రూపు+అఱి+ఉన్నన్= రూపు చెడియుండగా; కని= చూచి; ఉడుకు+ఆఱున్+కాక= నామనస్తాపం చల్లారునుగాని; అలుపాలన్= స్వల్పకార్యాలతో; ఇది; పొనుపడునట్టి చిచ్చే?= అణగారే అగ్నియా?; ఇట్లు= ఈ విధంగా; బన్నములు+పడిన= భంగపాటులొందిన; ధర్మనందనుండున్= ధర్మజుడూ; నేనున్= నేనున్నూ; రాజరాజు పీనుంగున్= దుర్యోధనుడి శవమును; కన్నారన్+కానన్+పడయము+ఐతిమి+ఏనిన్= కనులార చూచే భాగ్యానికి నోచనిచో; పెనుగద+పట్టిన= పెద్ద గదను ధరించిన; భీమసేను బాహుబలంబును= వాయునందనుని భుజశక్తి; పాటించి= ఆదరించి; గాండీవము+అను+ఒక విల్లు= గాండీవం అనెడు ఒక చాపమును; ఎప్పుడున్= ఎల్లవేళల; వహించు= తాల్చు; కట్టివిక్రమంబు= అర్జునుడి పరాక్రమమూ; కాల్పనే?= తగుల బెట్టటానికా?

తాత్పర్యం: యుద్ధంలో ప్రప్రథమంగా నా తలవెండ్రుకలను పట్టి సభలోని కీడ్చి తెచ్చిన ఆ దుశ్శాసనుడి హస్తం, అతని దేహం ఇంతింత ముక్కలై చెల్లాచెదరుగా నేలబడి రూపు మాసిఉండగా చూచినప్పుడే నా మనస్తాపం చల్లారగలదు. అల్పకార్యాలతో చల్లారే అగ్ని కాదిది. ఆ విధంగా పరిభవముల పాలైన ధర్మనందనుడూ, నేనూ దుర్యోధనుడి శవాన్ని కనులార చూడటానికి నోచుకొనకపోతే, కొండంత గదను మూపున వేసికొని తిరిగే భీమసేనుడి భుజబలమూ, ఆదరంతో గాండీవమనే పేరుగల దొడ్డ వింటిని ధరించే పాండవమధ్యముడి శౌర్యమూ తగులబెట్టనా?

విశేషం: 1. ఈ పద్యంలో ఉన్న సొగసు మూలంలో లేదు. దుశ్శాసనుడి శరీరమంతటిలోను, ప్రప్రథమంగా తన వెండ్రుకలు పట్టి యీడ్చిన ఆ చేయి రూపఱవలెనట. ద్రౌపదికాతని చేయి యన్న అంతటి ప్రత్యేకమైన కోపము! 'తొలుతగా' అను పదం చాల ముఖ్యమైనది. ఇది మూలంలో లేదు. 'దుశ్శాసన భుజం శ్యామం సంభిన్నం పాంసుగుణ్ఠితమ్' అని మాత్రమే ఉన్నది. ఆతని తను వింత వింతలు దునియలై చెదరవలయు ననుట మూలంలో లేనే లేదు. పెచ్చరిల్లిన అచ్చమైన ఆమె కోపం అచ్చ తెనుగు పదములలో ప్రదర్శింపబడటం మెచ్చదగినది. ఏడ్చుచున్న ద్రౌపదిని పతితల కన్నుల యెదుట సాక్షాత్కరింప జేసినాడు తిక్కన. ఆతడి నాటకీయ రచనలో, పాత్రల ప్రత్యక్షీకరణ మొక అంశం. 'పెనుగద పట్టిన భీమసేను ----- కట్టి విక్రమంబు గాల్పనే' --- అనే మాటలు మూలంలో లేవు. "ఇత్యుక్త్వా బాష్పరుద్ధేన కణ్ఠే నాయతలోచనా, రురోద కృష్ణా సోత్కమ్పం సస్వరం బాష్పగద్గదమ్, స్తనౌ పీనాయతశ్రోణీ, సహితా వధివర్షతీ'' - అనేది తెలుగులో లేదు.

2. 114వ పద్యంలోని ద్రౌపది రోషభావానికి అనుగుణమైన వాక్యాలివి. దుశ్శాసన దుర్యోధనులపై ఆమె కెంత కసి కడుపులో మండుతున్నదో ఈ దీర్ఘమైన సీసపద్యం సాక్ష్యంగా తిక్కన చిత్రించాడు. శత్రుసంహారమే ఆమె కడుపు మంటకు చల్లార్పు.

ఆ ఉపశమనం చేయలేనప్పుడు 'భరించేవాళ్ళు భర్తలం' అని చెప్పుకొనే వారిలో బలవంతులమనుకొనే భీముడిగదా, అర్జునుడి గాండీవం తగుల బెట్టనా? అని నిష్ఠురమాడింది. ధర్మజుడి మాటలకు తల ఊపుతున్న వారిద్దరిమీద నిప్పులు కురిపించింది. ఈ పద్యం ఆమెలోని ప్రతీకారాగ్ని జ్వాలల భుగభుగలను మూర్తికట్టించింది. (సంపా.)

ఉ. నెట్టన యిట్టియల్క మది నిల్పితి రక్కెస తాల్మిఁ జిచ్చొడిం
గట్టిన యట్లు పెద్దయును గాలము దీనికి నాఱు టెన్నఁడుం
బుట్టదు దుష్టనిగ్రహము పూని జగంబులు గాచునట్టి తోఁ
బుట్టువు తీవ్ర తేజమునఁ బొల్చిన భర్తలు గల్గ నచ్యుతా!' 118

ప్రతిపదార్థం: అచ్యుతా!= శ్రీహరీ!; దుష్ట నిగ్రహము పూని= దుర్మార్గులను శిక్షించటానికి పూనిక వహించి; జగంబులు= లోకాలు; కాచునట్టి= కాపాడే; తోఁబుట్టువు= అన్నవైన నీవూ; తీవ్ర తేజమునన్= మిక్కిలి ప్రతాపంతో; పొల్చిన భర్తలున్= ఒప్పుతున్న పతులూ; కల్గన్= నాకుండగా; నెట్టన= అనివార్యంగా; ఇట్టి+అల్కన్= ఇటువంటి క్రోధాన్ని; చిచ్చు+ఒడిన్+కట్టిన+ అట్లు= నిప్పును ఒడిలో ఉంచుకొన్నట్లు; పెద్దయును+కాలము= బహుకాలం; రక్కెస తాల్మిన్= దుస్సహమైన ఓర్పుతో; మదిన్+నిల్పితిన్= మనసులో భరించాను; దీనికిన్= ఈ అవమానాగ్నికి; ఆఱుట= శమించటం; ఎన్నఁడున్ పుట్టదు= ఏనాడూ కలుగదు.

తాత్పర్యం: దుష్టులను శిక్షించటానికి లోకాలను రక్షించటానికి పూనుకొనిఉన్న నీవంటి తోడబుట్టువూ, మిక్కుటమైన పరాక్రమంతో దీపించే భర్తలు కలిగి కూడా నేను ఇంతటి పరాభవ జనిత క్రోధాగ్నిని, నిప్పును ఒడిలో నుంచుకొన్న చందాన రాక్షస సహనంతో భరిస్తున్నాను. ఈ పరిభవానలం శమించటం ఏనాడూ కలుగదు.

విశేషం: అలం: ఉపమ, హేతువు.

1. కోపాన్ని చిచ్చుతో పోల్చటం విశిష్టం. పదమూడేళ్ళుగా కోపాన్ని గుండెల్లో దాచింది ద్రౌపది. అది చిచ్చును ఒడిలో మూటకట్టి పెట్టుకొన్నట్లున్నదట! ఒడిలోని చిచ్చు ఒడలెల్ల కాలుస్తుంది. గుండెలోని చిచ్చు అంతరంగాన్నే దహిస్తుంది. అయినా 'రక్కెసతాల్మి'తో ఆమె సహించింది. 'రాక్షసమైన ఓర్పు' అనే అర్థాన్నిచ్చే తెలుగు పలుకుబడి రక్కెసతాల్మి. అల్క, చిచ్చు ఒడి, రక్కెస తాల్మి అనే తెలుగు మాటలు ఇక్కడ సార్థకాలు. గుండెలు కాల్చే భావచిత్రం చిచ్చు అనే పదంతోనే ఏర్పడుతుంది. అట్లాగే మిగతావి కూడా. ఉపమానం ఉజ్జ్వలం.

2. ఆమె గుండెలోని చిచ్చు - తోబుట్టువు. భర్తలూ అండగా ఉన్నా, ఆరేటట్లు కనపడటం లేదని ఆమె వేదన. అన్న దుష్టశిక్షణ, శిష్టరక్షణ వ్రతంతో అవతరించిన మహాత్ముడు. ఎదురు లేని పరాక్రమం కలవారు పాండవులు. అయినా ఆమె వేదన ఆరదు - అని హేత్వలంకారంలో పలికింది. హేతువునూ హేతుమంతాన్నీ ఒకే వాక్యంలో వర్ణించటం హేత్వలంకారం. (సంపా.)

శ్రీకృష్ణుఁడు ద్రౌపది నూరార్చుట (సం. 5-80-43)

వ. అనుచు నెలుంగు రాలుపడ నేడ్చిన యాజ్ఞసేనిం గృపాయత్తచిత్తుండయి నారాయణుం డూరార్చి కూర్చుండ నియమించి కన్నీరు దుడువను బెన్నెఱివేణి ముడువనుం దగువారి నియోగించి య మ్మానినితో నిట్లనియె: 119

ప్రతిపదార్థం: అనుచున్= అని; ఎలుంగు రాలుపడన్= కంఠధ్వని కంపించగా; ఏడ్చిన= విలపించిన; యాజ్ఞసేనిన్= ద్రౌపదిని; కృపా+ఆయత్తచిత్తుండు+అయి= దయకు అధీనమైన మనస్సుకలవాడై; నారాయణుండు= శ్రీకృష్ణుడు; ఊరార్చి= ఓదార్చి;

కూర్చుండన్+నియమించి= కూర్చుండుమని తెలిపి; కన్నీరు తుడువను= కన్నీరు తుడవటానికీ; పెన్నెఱి వేణి ముడువను= అందమైన పెద్ద కొప్పును ముడివేయటానికీ; తగువారిన్= తగిన స్త్రీలను; నియోగించి= నియమించి; ఆ+మానినితోన్= ఆత్మాభిమానం కల్గిన ఆ ద్రౌపదితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇట్లా కంఠస్వరం కంపిస్తుండగా పాంచాలి విలపించింది. శ్రీకృష్ణుడు ఆమెను ఊరడించి కూర్చుండుమని చెప్పి ఆమె కన్నీటి నొత్తడానికి, చెదరిన చక్కని పెద్ద కొప్పును ముడవటానికి తగినవారిని నియమించి, ఆ మానవతితో ఇట్లా అన్నాడు:

విశేషం: తిక్కన అభినయ క్రమాన్ని శిల్పమయం చేశాడు. ద్రౌపది 100వ పద్యంలో గద్గద కంఠంతో నెమ్మదిగా మాట్లాడటం ప్రారంభించింది. 114వ పద్యంలో మనస్సులో విషాదరోషాలు పొంగగా కళ్ళలో నీళ్ళు నిండగా దిగ్గన లేచి దుఃఖించింది. ఈ పద్యంలో కంఠస్వరం కంపించగా ఏడ్చింది (బావురుమన్నది). అది పరాకాష్ఠ బావురుమని విలపించటంతో ఆమె మాట లయిపోయినవని సూచన. అంతవరకు మధ్యలో ఆమెతో మాట్లాడకుండా ఉండటం మాధవుడి మనోవిజ్ఞానశాస్త్రపాండిత్యం. (సంపా.)

ఉ. 'మ్రుచ్చిర నేల యేఁ గలుగ? ముద్దియ! నాకు వృకోదరుండు వి
వ్వచ్చుఁడుఁ దోడుగాఁగ జనవంద్యుఁడు ధర్మసుతుండు పంప నీ
మెచ్చుగ శత్రు సంక్షయము మేకొని చేసెదఁగాక! వేఱొకం
డచ్చుపడంగ నేర్చునె? దురాత్ములు కౌరవు లుర్వి యిత్తురే? 120

ప్రతిపదార్థం: ముద్దియ!= ఓ ముద్దరాలా! ద్రౌపదీ; ఏన్+కలుగన్= నేనుండగా; మ్రుచ్చిరన్+ఏల= శోకించుటెందుకు?; నాకున్= నాకు; వృకోదరుండున్= భీముడూ; వివ్వచ్చుఁడున్= సవ్యసాచి; తోడు కాఁగన్= సహాయులు కాగా; జనవంద్యుఁడు= జనులచేత నమస్కరించదగిన; ధర్మసుతుండు= ధర్మరాజు; పంపన్= ఆజ్ఞాపించగా, నీ మెచ్చుగన్= నీకు ప్రీతి కలిగేటట్లు; మేకొని= సమ్మతించి; శత్రు సంక్షయమున్= శాత్రవ నిర్మూలనం; చేసెదన్+కాక!= చేస్తాను సుమా!; వేఱు+ఒకండు= మరొకదారి; అచ్చుపడంగన్+నేర్చునె?= అలవడటానికి వీలుందా? (వీలులేదు); దురాత్ములు= దుష్టచిత్తులైన; కౌరవులు= ధార్తరాష్ట్రులు; ఉర్విన్+ఇత్తురే?= భూమిని పంచి మనకిస్తారా?

తాత్పర్యం: పాంచాలీ! నేనుండగా ఎందుకు శోకిస్తావు? నాకు భీమార్జునులు సాయపడగా, జనవినుతుడైన ధర్మజుడు ఆజ్ఞాపించగా, నీవు సంతోషించేటట్లు శాత్రవులను నిర్మూలిస్తాను. మరొక మార్గం లేదు. దుష్టచిత్తులైన కౌరవులు భూమిని పంచి మన కిస్తారా? (ఇవ్వరని భావం).

విశేషం: 1. ద్రౌపది 'అచ్యుతా' అని (పద్యం 118) ఎలుగెత్తి పిలిచింది. ఆ పిలుస్తున్నప్పుడు ఆమె కంఠధ్వని కంపించింది (ప.119). ఆ పిలుపు 'అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ!' అన్న భక్తుడి పిలుపువలె ఉన్నది. గజేంద్రుడి కేకవలె తోచింది. 'అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం, యోగక్షేమం వహామ్యహమ్'- అని ప్రతిజ్ఞచేసిన శ్రీకృష్ణుడిలోని భగవదంశ ప్రబుద్ధమయింది. దివ్యాదివ్యుడివలె వెలుగొందే ఆ వాసుదేవుడు కృపాయత్తచిత్తుడయ్యాడు. ఆ స్థితిలో ఆయన సాక్షాత్ 'నారాయణుడు'గా వెలుగొందాడు. అతడి మాటలు భక్తరక్షణ కళాప్రావీణ్యంతో ప్రతిధ్వనించాయి. ఈ పద్యం ఆ ప్రతిధ్వనులలో మొదటిది.

2. ఇందులోని ప్రతి వాక్యం సార్థకం. పదాల పొందిక కూడా సాభిప్రాయం. అనునయించటం కూడా ఒక కళగా తెలిసిన మహానుభావుడు శ్రీకృష్ణుడు. 'ఏడుస్తావెందుకమ్మా నేనుండగా పిచ్చితల్లీ?' అన్న వ్యవహార వాక్యానికి మొదటి వాక్యం పద్యాకృతి. ముందు దుఃఖాన్ని విడువుమన్నాడు. నే నున్నానని నమ్ముమన్నాడు. ఆ నమ్మిక దుఃఖాన్ని తొలగిస్తుందన్నాడు. నన్ను నమ్మికూడా, నన్నడిగి కూడా ఇంకా ఎందుకు దుఃఖిస్తావు? నీ భక్తి నా మనస్సు కెక్కింది. నే నెప్పుడూ నీకు ప్రసన్నుడనే. ఈ సంగతి తెలిసి కూడా దుఃఖించే నీవు ఎంత అమాయకురాలవు! - అనే భావం ఏర్పడే ఆ మాటలు తీవ్ర దుఃఖాన్ని తగ్గిస్తాయి. తన మాట విని ఆదుకొనే దేవుడివంటి అన్న ఉన్నాడన్న ధైర్యం ఏర్పడుతుంది. మొదటి వాక్యమే కాదు అందులోని పదాల వరస కూడా మార్చటానికి వీలు పడనివి కావటం విశేషం.

3. యుద్ధంలో శ్రీకృష్ణుడు ద్రౌపది మెచ్చేటట్లు శత్రువులను సంహరిస్తాడట! పాండవులు తన దుఃఖాన్ని తీర్చలేదని శ్రీకృష్ణుడిని వేడుకొంటున్న ద్రౌపదిని ఊరట పరచే వాక్యమిది. యుద్ధం చేస్తాననీ, ఆ చేయటం నీకు పూర్తిగా సంతోషం, తృప్తీ కలిగించటానికే అనీ అనటంతో ద్రౌపదికి హామీ దొరికింది. ఆమె నిశ్చింతురాలు కాగలిగింది ఆ వాక్యంతో. అయితే ఆ వాక్యంలో అనుబంధాలు రెండున్నాయి. 1. భీమార్జునులు తోడుపడతారట. 117వ పద్యంలో 'భీమసేను బాహుబలంబును, నొక విల్లెప్పుడును వహించు కట్టి విక్రమంబు కాల్పనే?' అని అధిక్షేపించిన దానికి ఇది పరోక్ష సమాధానం. యుద్ధంలో శ్రీకృష్ణుడికి భీమార్జునులు అండగా నిలిచి ద్రౌపది ఆశలను చిగురింప చేస్తారని ధ్వని. ఆ తరువాత 'జనవంద్యుడు ధర్మసుతుడు ఆజ్ఞాపించగా' అనటం సాభిప్రాయం. ద్రౌపది కోపమంతా ధర్మజుడి మాటల మీదనే. అతడు సంధి మాటలు మాట్లాడినందుకే. సంధి కోరే ధర్మరాజే సమరాన్ని చేయండని ఆజ్ఞాపిస్తాడనీ, అతడి ఆజ్ఞతోనే యుద్ధం సాగుతుందనీ చెప్పి ద్రౌపది మనోవేదనకు మూలమైన అనుమానాన్ని తొలగించాడు. పరిస్థితులను అట్లా మార్చే బాధ్యత శ్రీకృష్ణుడు స్వీకరించాడు.

4. 'మరొకం డచ్చు వడంగ నేర్చునె?' అనే వాక్యం జరుగబోయే శత్రుసంహారాన్ని ధ్రువీకరించే వాక్యం. దానివలన విశ్వాసం గట్టిపడుతుంది. దుఃఖం ఉపశమిస్తుంది.

5. రాయబారం జరిగినా దురాత్ములు రాజ్యభాగ మివ్వరని - చివర చెప్పిన వాక్యం కొసమెరుపు. 112వ పద్యంలో ద్రౌపది లేవనెత్తిన కీలకమైన ప్రశ్నకు కీలెరిగి చెప్పిన సమాధానం, సంధి ఫలవంతం కాదని సూచన. ద్రౌపది దిగులుపడవలసిన దేమీ లేదని భావం. భావి కథంతా ద్రౌపదిని సంతోషపెట్టటానికే సాగుతుందనీ, దానినంతా శ్రీకృష్ణుడే సూత్రధారుడై నడుపుతాడనీ, నమ్మకం కలిగి ఉండుమనీ శ్రీకృష్ణుడు ద్రౌపదికి అభయహస్తం ఇచ్చాడు.

6. పాండవుల వలెనే పాండవపత్ని కూడా శ్రీకృష్ణుడిని పరమాత్మగా భావించే సంస్కృతినీ, భక్తజనావన బిరుదాంకితుడైన నారాయణుడి స్వభావాన్ని ప్రకటిస్తున్న అవతార పురుషుడని భావించే సంస్కృతీ ఈ పద్యంలో బింబ ప్రతిబింబభావంతో ప్రకటితం కావటం వస్తుధ్వని. (సంపా.)

క. లలనా! యుడుగుము నీ యే । డ్పుల కొలఁదియె కురునృపాల పుత్త్ర కళత్రం
బుల యేడ్పు; లింక వానిం । గలకల నవ్వుచు వినంగఁ గాలం బయ్యెన్. 121

ప్రతిపదార్థం: లలనా!= ఓ వనితా, ద్రౌపదీ; ఉడుగుము= దుఃఖించటం మానుము; కురునృపాల పుత్త్ర కళత్రంబుల+ఏడ్పులు= కురురాజయిన ధృతరాష్ట్రుని కొడుకుల భార్యల యొక్క రోదనములు; నీ+ఏడ్పుల కొలఁదియె= నీ యేడ్పుల పరిమాణం కలవే; ఇంకన్= ఇక; వానిన్= వారి శోకాలను; కలకలనవ్వుచున్= నీవు పకపక నవ్వుతూ; వినంగన్= వినటానికి; కాలంబు+అయ్యెన్= సమయం వచ్చింది.

తాత్పర్యం: అమ్మా! దుఃఖం మాను. నీ వెంత విలపించావో దుర్యోధనాదుల భార్యలుగూడ అంత విలపిస్తారు. వారి యేడ్పులు నీవు పకపక నవ్వుతూ వినే సమయం సమీపించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 1. అలం: విషమం. "విషమం వర్ణ్యతే యత్ర ఘటనా ననురూపయోః". అననురూపాలైన వాటికి సంబంధాన్ని వర్ణించటం విషమాలంకారం. కౌరవుల భార్యల విలాపాలకూ ద్రౌపది కలకలనవ్వటానికీ ఇందులో సంబంధం చెప్పబడింది కావున విషమం.

2. అనునయంలో పాటించే మెలకువలకు శ్రీకృష్ణుడు పెట్టింది పేరు. ద్రౌపదికి దుఃఖాన్ని కలిగించింది కౌరవులు. వారి భార్యాపుత్రులు ఆమెవలె దుఃఖిస్తే ఆమెకు ఉపశాంతి. పరదుఃఖం ఉపశమనమే కాదు ఉల్లాసం కూడా కలిగిస్తుందన్న మానసిక సూత్రం తెలిసిన విజ్ఞుడు శ్రీకృష్ణుడు. అందుకు విషమాలంకారం అర్థవంతంగా ఉంటుందని తిక్కన తీర్పు. (సంపా.)

క. యమ మహిష ఘంటికా నా । దము వినఁ గౌతూహలంబు దళుకొత్తెడు చి
త్తములు గల కౌరవుల కి । ష్టము లగునే సంధికార్య శాంతవచనముల్? 122

ప్రతిపదార్థం: యమ మహిష ఘంటికా నాదమున్= యముడి వాహనమైన దున్నపోతు యొక్క మెడగంటల చప్పుడును; వినన్= వినటానికి; కౌతూహలంబు= ఉబలాటము; తళుకొత్తెడు= అతిశయిస్తున్న; చిత్తములుకల= మనస్సులు కల్గిన; కౌరవులకున్= ధార్తరాష్ట్రులకు; సంధికార్య శాంతవచనముల్= సంధికి సంబంధించిన శాంతంతోడి మాటలు; ఇష్టములు+అగునే?= సమ్మతాలౌతాయా? (కానేరవు.)

తాత్పర్యం: అమ్మా! యముని దున్నపోతు మెడలోని గంటల సవ్వడి వినటానికి మిక్కిలి ఉబలాటపడుతున్న కౌరవులకు సంధికి సంబంధించిన సౌమ్య వాక్యాలు సమ్మతాలు కావు.

విశేషం: అలం: అప్రస్తుతప్రశంస. మహిషం యముడి వాహనం. యము డా వాహనాన్ని ఎక్కి వడివడిగా వస్తున్నప్పుడు దాని మెడలోని లోహఘంటలు మ్రోగుతాయి. అవి వినబడితే మరణం ఆసన్నమైనదని ధ్వని. మరణాన్ని మనసారా కోరుకొంటున్న కౌరవులకు బ్రతకటానికి వీలున్న సంధి వాక్యాలు రుచించవనటం- వారికి త్వరలో మరణం తథ్యమని ధ్వని. నిజానికి శ్రీకృష్ణుడు హస్తినకు పోవటానికీ, యమ మహిష ఘంటానాదం వినబడటానికీ ఉన్న సాజాత్యాన్ని ఊహిస్తే ఆలోచనామృతం. (సంపా.)

క. మొదల విధినియతియును న । ట్టిద యందురు పెద్ద; లది ఘటింపకపో దే
మదిఁ జూచి చెప్పినను ద । ప్పదు మేరువు దిరిగెనేనిఁ బాంచాలసుతా! 123

ప్రతిపదార్థం: పాంచాల సుతా!= పాంచాల రాజపుత్రీ!; పెద్దలు= తెలిసినవారు; మొదలన్= తొలుతనే; విధి నియతియును= విధి నిర్ణయం కూడా; అట్టిది+అ+అందురు= కురుపాండవులకు పొత్తు కుదరదనీ కౌరవులకు చావు మూడిందనే చెపుతారు; అది ఘటింపక పోదు= అలా జరగకుండాపోదు; ఏన్= నేను; మదిన్+చూచి= బుద్ధిలో ఊహించి; చెప్పినను= వాకొన్నచో; మేరువు తిరిగెను+ఏనిన్= మేరు పర్వతం తల్లక్రిందైనను; తప్పదు= నా వచనం వ్యర్థంగాదు.

తాత్పర్యం: అసలు దైవ నిర్ణయ మిదే అని పెద్దలు చెపుతున్నారు. ఇంతకు అదే జరుగుతుంది. నేను బుద్ధిలో ఊహించి చెప్పిన మాట మేరు పర్వతం తలక్రిందైనను తప్పదు సుమా!

విశేషం: అలం: అతిశయోక్తి. శ్రీకృష్ణుడే కాలపురుషుడని ధ్వనింపజేసే పద్యం ఇది. ఆతడి దివ్యాదివ్య స్వభావం మాటలలో వ్యంగ్యం. పెద్దలంటున్నారన్నప్పుడు అదివ్యుడు. నేను మదిఁ జూచి చెప్పెదను అన్నప్పుడు దివ్యుడు. మేరుపర్వతం తలక్రిందైనా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నామాట తప్పదంటున్న శ్రీకృష్ణుడు విధిస్వరూపుడు. భక్తప్రసన్నుడైన భగవంతుడు దివ్యరూపంతో మాట్లాడుతున్న అనుభూతి నందించే పద్య మిది. (సంపా.)

తే. పూని పలికెద వినుము రిపు క్షయంబుఁ । జేసి యుజ్జ్వల పుణ్యలక్ష్మీ సమేతు
లైన పాండు కుమారుల యధిక విభవ । మీవు సూచెదు; తడవులే; దిది నిజంబు! 124

ప్రతిపదార్థం: పూని పలికెదన్= నొక్కి చెపుతున్నాను; వినుము= నా మాటలు వినుము; రిపుక్షయంబున్+చేసి= విరోధులను నాశముచేసి; ఉజ్జ్వల పుణ్యలక్ష్మీసమేతులు= ప్రకాశించే పుణ్యమనెడు సంపదతో కూడినట్టి; పాండు కుమారుల= పాండవుల యొక్క; అధిక విభవము= గొప్ప ప్రాభవము; ఈవు= నీవు; చూచెదు(వు)= చూడగలవు; తడవు లేదు= ఇందుకు ఆలస్యం లేదు; ఇది నిజంబు= నా మాట సత్యం.

తాత్పర్యం: ద్రుపదపుత్రీ! శపథం చేసి చెపుతున్నాను. నా పలుకు లాలకించుము. విరోధులను విధ్వంసం చేసి, ప్రకాశమానమైన పుణ్యసమృద్ధితో కూడిన పాండురాజ తనయుల యొక్క మిక్కుటమైన వైభవాన్ని నీవు దర్శించగలవు. ఇందుకు అట్టే ఆలస్యం లేదు. నా మాట నిజం.'

విశేషం: ఈ మాటలు విశ్వరూప ప్రదర్శనం చేస్తూ పరమాత్ముడు పలుకుతున్న అద్భుత వాతావరణం స్ఫురింపజేస్తున్నవి. శ్రీకృష్ణుడి వాక్కు భగవన్నిర్ణయమని స్పష్టమవుతుంది. ఊరడింపు కిది పరాకాష్ఠ. ద్రౌపది హృదయతాపం చల్లారింది అని ధ్వని. (సంపా.)

క. అని యూఱడిలఁగఁ బలికిన । విని యంకిలి దేఱు చిత్తవృత్తిగలుగు నం
గన యే డ్పుడిగెం; దగ ఫ । ల్గునుఁ డిట్లని పలికె నపుడు గోవిందునితోన్. 125

ప్రతిపదార్థం: అని+ఊఱడిలఁగన్= అంటూ ఊఱడిల్లేటట్లు; పలికినన్= శ్రీకృష్ణుడు చెప్పగా; విని; అంకిలి తేఱు+చిత్తవృత్తి కలుగు= కలతనుండి ప్రసన్నత కాంచిన మనోవ్యాపారంగల; అంగన= ద్రౌపది; ఏడ్పు+ఉడిగెన్= విలపించటం మానింది; తగన్= ఒప్పుగా; ఫల్గునుఁడు= అర్జునుడు; అపుడు= ఆ సమయాన; గోవిందునితోన్= గోపాలదేవుడితో; ఇట్లు+అని పలికెన్= ఈ విధంగా వచించాడు.

తాత్పర్యం: జనార్దను డిట్లా ద్రౌపదిని సాంత్వనవచనాలతో ఊరడించాడు. ఆమె కలత వీడి ప్రసన్నత నొందిన మనసుగలదై యేడ్పు మానింది. పిదప పార్థుడు గోపాలకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తే. 'పాండవులు ధార్తరాష్ట్రులుఁ బుండరీక । నేత్ర ! చుట్టరికంబున నీకు నొక్క
రూప; కావునఁ గోరి యేరూపునందు । నుభయపక్షంబులకుఁ జేయు ముచితహితము. 126

ప్రతిపదార్థం: పుండరీక నేత్ర!= తెల్ల దామరల వంటి కన్నులు గల కృష్ణా!; నీకున్= నీకు; చుట్టరికంబునన్= బంధుత్వం చేత; పాండవులున్= పాండుపుత్రులమైన మేము; ధార్తరాష్ట్రులున్= ధృతరాష్ట్రుడి కుమారులగు దుర్యోధనాదులు; ఒక్క రూప= ఒకే విధమైనవారం; కావునన్= కనుక; కోరి= వాంఛించి; ఏ రూపు+అందున్= ఎట్లాగయినా; ఉభయ పక్షంబులకున్= రెండు వర్గాలకు ఉచిత హితము+చేయుము= తగిన మేలు చేయుము.

తాత్పర్యం: 'కమల పత్రాక్షా! బంధుత్వమును బట్టి కురుపాండవులు నీకు సమానులే. కనుక ఏ విధంగానైనా ఆసక్తితో ఇరువర్గాలకూ తగిన మేలు గావించు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 124లో విరోధుల విధ్వంసాన్ని గురించి మాట్లాడిన శ్రీకృష్ణుడు దివ్యత్వస్థాయిలోకి వెళ్ళి మాట్లాడినట్లుండగా, అర్జునుడు అతడిని వాస్తవ స్థితిలోనికి తెచ్చాడు. బంధుత్వం అనే సమాన గుణంతో ఉభయులకూ మేలు చేయుమన్నాడు. (సంపా.)

క. ధర్మార్థ సంగతంబుగ । ధర్మతనయు చెప్పినట్ల తగఁ బల్కఁగ నా
దుర్మతులు కౌరవులు స । త్కర్మమునకుఁ జొరకయున్న దైవమ యెఱుఁగున్. 127

ప్రతిపదార్థం: ధర్మ+అర్థ సంగతంబుగన్= ధర్మార్థాలతో కూడేటట్లుగా; ధర్మతనయు చెప్పినట్లు+అ= ధర్మనందనుడు తెల్పినట్లుగా; తగన్= ఒప్పిదముగా; పల్కఁగన్= నీవు కురుసభలో మాట్లాడితే; ఆ దుర్మతులు= ఆ చెడుబుద్ధి కలిగిన; కౌరవులు= దుర్యోధనాదులు; సత్కర్మమునకున్= మంచి పనికి; చొరక+ఉన్నన్= నడుము కట్టనిచో; దైవము+అ+ఎఱుఁగున్= ఆవల దేవుడే పని చక్కబెట్టగలడు.

తాత్పర్యం: కృష్ణా! ధర్మార్థయుక్తంగా ధర్మపుత్రుడు చెప్పినట్లు కౌరవ సభలో చక్కగా హితోక్తులు పలుకవలసింది. దుర్బుద్ధిగల కౌరవులు మంచి చేయటానికి పూనుకొనకపోతే దైవమున్నాడు. ఆ దేవుడే అన్నీ చక్కబెట్టగలడు.'

విశేషం: శ్రీకృష్ణుడు ధర్మజుడికి ఇచ్చిన మాటను జ్ఞాపకం చేసి, కౌరవసభలో సముచిత విధానంలో వ్యవహరించుమన్నాడు. దైవం మీద భారముంచి ప్రయత్నించటం పురుషకారం. తగిన ఫలాన్ని అందించేది దైవానుకూల్యం. దూతగా శ్రీకృష్ణుడు పురుషకారం చేస్తాడు. దైవంగా ఆయనే ఫలాన్ని అందిస్తాడు - అని అర్జునుడు ధర్మ కర్మ యోగాన్ని ప్రదర్శిస్తూ పలికాడు. నరుడు నారాయణుడికి సన్నిహితుడు కావటంతో ఆ చనువు తీసికొనగలిగాడు. (సంపా.)

క. అన విని 'కౌరవులకు మీ । కును హితముఁ బ్రియంబుఁ జేయఁ గోరియ కుంతీ
తనయాగ్రజుపని ధృతరా । ష్ట్రుని కడకుం బోయెదను గడుం బ్రీతిమెయిన్. 128

ప్రతిపదార్థం: అనన్ విని= అర్జునుడిట్లా పలుకగా ఆలించి; కౌరవులకున్= దుర్యోధనాదులకూ; మీకును= మీకున్నూ; హితమున్= మేలు; ప్రియమున్= స్నేహమునూ; చేయన్+కోరి+అ= చేయటానికి కోరికొనియే; కుంతీ తనయ+అగ్రజుపనిన్= ధర్మనందనుడి పనిమీద; కడున్+ప్రీతిమెయిన్= మిక్కిలి సంతోషంతో; ధృతరాష్ట్రుని కడకున్= ఆంబికేయుని దగ్గరకు; పోయెదన్= వెళ్ళుతాను.

తాత్పర్యం: పార్థుడి పలుకులు విని శ్రీకృష్ణుడు - 'అర్జునా! కౌరవులకూ మీకూ ఇష్టమైనదానిని, మేలుగూర్చే దానినీ చేయవలెనని తలంచి కుంతీపుత్రులలో పెద్దవాడైన ధర్మజుడి పనిమీద ధృతరాష్ట్రుడి దగ్గరకు మిక్కిలి సంతోషంతో వెళ్ళుతున్నాను.'

విశేషం: పైకి చూస్తే ద్రౌపదికి తగిన మాటలు ఆమె వద్దా, అర్జునుడికి తగిన మాటలు అతడి వద్దా శ్రీకృష్ణుడు పలికినట్లుంటుంది కాని, శ్రీకృష్ణుడి మాటలలో వైరుధ్యం లేదు. ఎట్లాగంటే - ధర్మజుడి వాక్యాలు యుద్ధానికి పూర్వార్థం; ద్రౌపదికి ఇచ్చిన మాటలు యుద్ధానికి ఉత్తరార్థం. ఆ వరుసలో నిర్వహించే శ్రీకృష్ణుడు కార్యపరమార్థం. (సంపా.)

క. అని పలికిన హరి ధర్మ వ । చనముల తెఱఁగున కజాతశత్రుఁడు చిత్తం
బునఁ బొంగి 'యట్ల చేయుము । మన నిశ్చయ మిదియ దీని మఱవకు మనఘా!' 129

ప్రతిపదార్థం: అని పలికిన= ఈ విధంగా వచించిన; హరి= శ్రీకృష్ణుడి యొక్క; ధర్మవచనముల తెఱఁగునకున్= న్యాయంతో కూడిన వాక్యాల పద్ధతికి; అజాతశత్రుఁడు= ధర్మజుడు; చిత్తంబునన్+పొంగి= మనస్సులో ఉబ్బి; అనఘా!= పుణ్యపురుషా!; అట్లు+అ చేయుము= అట్లే కావించుము; ఇది+అ మన నిశ్చయము= ఇదే మనయొక్క నిర్ణయం; దీనిన్= ఈ మాటను; మఱవకుము= మరిచిపోవద్దు.

తాత్పర్యం: త్రివిక్రముడి ధర్మయుక్తమైన మాటల తీరునకు ధర్మరాజు మనసులో పొంగిపోయాడు. 'మహానుభావా! నీ వన్నట్లే చేయవలసింది. మా తలపు కూడ అదే. ఈ విషయం మరచిపోవద్దు.'

విశేషం: ద్రౌపదితో శ్రీకృష్ణుడు మాట్లాడిన తరువాత ధర్మజుడు అడుగవలసిన మాటలు అర్జునుడే అడిగాడు. శ్రీకృష్ణుడు ధర్మజుడి వ్యూహానికి అనుగుణంగా మాట్లాడాడు. దానికి ధర్మజుడు పొంగిపోయాడు. శ్రీకృష్ణుడితో మూడు మాటలన్నాడు. 'అట్లాగే చేయుము; మన నిశ్చయం ఇదే. ఓ పుణ్యాత్మా! దీనిని మరచిపోకుము'. ఈ మూడూ కార్యనిర్ణాయక మంత్రాలు. మొదటివాక్యం అధికారికం. రెండవ వాక్యం నిశ్చయాత్మకం. మూడవ వాక్యం ఔపచారికం. (సంపా.)

వ. **అని కార్యంబు నిశ్చయించి దినశుద్ధి నిరూపించి నారాయణుం జూచి 'నీ నక్షత్రంబు రోహిణిగదా యెల్లి రేవతి నీకుఁ జంద్ర తారాబలంబులు గలవు; గమనంబునకు రేపకడయ మేలు; పయనం బగుట లెస్స'యని చెప్పిన నప్పలుకుల కతండు సగౌరవంబుగా నియ్యకొనినం బాండవాగ్రజుండు కొలువుం గలయం గనుంగొని యెల్లవారును విన నది యట్లకాక యని పలికి తదనంతరంబ తానునుం దమ్ములుఁ బాంచాలియుఁ బరివారంబును నుచిత ప్రకారంబున నిజనివాసంబులకుం జనిరి; మఱునాఁ డరుణోదయంబునఁ గృష్ణుండు గాలోచిత కృత్యంబులు నిర్వర్తించి సూర్యోపాస్తి సేసి యగ్ని సమారాధనం బాచరించి ధరణిసురులం బ్రణామపూర్వకంబుగాఁ బ్రయాణ దాన ప్రముఖ పూజావిశేషంబులం బ్రీతులం గావించి వారల యిచ్చు నాశీర్వాదంబులును సమంత్రాక్షత దూర్వాంకురాదులునుం గైకొని యుచిత ప్రదేశంబున నుండి సాత్యకి రావించి.** **130**

ప్రతిపదార్థం: అని= అని ధర్మరాజు పలికి; కార్యంబు నిశ్చయించి= చేయవలసిన పనిని తీర్మానించి; దినశుద్ధి నిరూపించి= మంచి రోజు నిర్ణయించి; నారాయణున్+చూచి= కృష్ణుడిని చూచి; నీ నక్షత్రంబు రోహిణి కదా= నీ జన్మనక్షత్రం రోహిణి కదా; ఎల్లి= రేపు; రేవతి= రేవతీ నక్షత్రము; నీకున్ చంద్ర తారాబలంబులు+కలవు= నీకు చంద్రబలమున్నది. తారా బలమున్నది; గమనంబునకున్= ప్రయాణానికి; రేపకడయ= ఉదయమే; మేలు= మంచిది; పయనంబు+అగుట లెస్స= ప్రయాణమై వెళ్ళటం బాగు; అని చెప్పినన్= అని చెప్పగా; ఆ+పలుకులకున్= ధర్మజుడి మాటలకు; అతండు= శ్రీకృష్ణుడు; సగౌరవంబుగాన్= ఆదరంతో; ఇయ్యకొనినన్= అంగీకరించగా, పాండవ+అగ్రజుండు= ధర్మనందనుడు; కొలువున్= సభను; కలయన్+కనుంగొని= తేరిపారచూచి; ఎల్లవారును వినన్= అందరూ వినేటట్లుగా; అది+అట్లు+అ+కాక= అది అట్లే అగుగాక!; అని పలికి; తద్+అనంతరంబు+అ= అటు తరువాత; తానున్= తానూ; తమ్ములున్= అనుజులూ; పాంచాలియున్= ద్రౌపదియూ; పరివారంబును= భృత్యవర్గమునూ; ఉచిత ప్రకారంబునన్= తగు విధంగా; నిజనివాసంబులకున్+చనిరి= తమ తమ నివాస ప్రదేశాలకు వెళ్ళారు; మఱునాఁడు= ఆ మరుసటి దినం; అరుణ+ఉదయంబునన్= సూర్యోదయవేళ; కృష్ణుండు; కాల+ఉచిత కృత్యంబులు= ప్రాతఃకాలానికి తగిన పనులు; నిర్వర్తించి= చేసి; సూర్య+ఉపాస్తి+చేసి= సూర్యోపాసన కావించి; అగ్ని సమారాధనంబు+ఆచరించి= అగ్నికార్యం నెరవేర్చి; ధరణిసురులన్= బ్రాహ్మణులను; ప్రణామ పూర్వకంబుగాన్= నమస్కార పురస్సరంగా; ప్రయాణ దాన ప్రముఖ పూజా విశేషంబులన్= ప్రయాణకాలంలో చేసే దానాలు అర్చనలు మొదలైన

వాటిచే; ప్రీతులన్+కావించి= సంతోషింపజేసి; వారల+ఇచ్చు= ఆ బ్రాహ్మణు లిచ్చే; ఆశీర్వాదంబులును= దీవనలును; సమంత్ర+అక్షత దూర్వా+అంకుర+ఆదులున్= మంత్రపూర్వకాక్షతలు, గరికపోచలు మున్నగువాటిని; కైకొని= గ్రహించి; ఉచిత ప్రదేశంబునన్+ఉండి= తగిన తావులో నిల్చినవాడై; సాత్యకిన్ రావించి= సాత్యకిని రప్పించి.

తాత్పర్యం: ధర్మజుడు కృష్ణుడిని కౌరవసభకు పంపటానికి తీర్మానించి రేపు మంచి రోజని తెల్పి, 'నారాయణా! నీ జన్మనక్షత్రం రోహిణి; వృషభరాశి. రేపు రేవతీ నక్షత్రం గనుక చంద్రుడు మీనరాశిలో ఏకాదశ స్థానంలో శుభుడై ఉన్నాడు. కావున చంద్ర బలమునూ, రేవతి నీకు సాధన తార అగుటచే తారాబలమున్నూ చక్కగా కుదిరి ఉన్నవి. ప్రయాణానికి రేపు ఉదయమే అనుకూలం' అని చెప్పాడు. మాధవుడు ధర్మజుడి పలుకులను సగౌరవంగా అంగీకరించాడు. పిదప ధర్మపుత్రుడు కొలువు నలువంకలా కలయచూచి అందరూ వింటుండగా 'ఇదే మన నిర్ణయం' అని చెప్పాడు. తరువాత ధర్మరాజు, అతడి తమ్ములు, ద్రౌపది, పరివారం తగిన విధాల తమ తమ నివాస స్థానాలకు తరలి వెళ్ళిపోయారు. మరుసటి దినం శ్రీకృష్ణుడు సూర్యోదయం కాగానే కాలోచిత కృత్యాలు సలిపి, సూర్యోపాసన చేశాడు. అగ్నిని ఆరాధించాడు. బ్రాహ్మణులకు నమస్కారాలు చేసి, ప్రయాణ కాలంలో చేయవలసిన దానాలు, పూజలు సల్పి, వారిని సంతోషపరిచాడు. బ్రాహ్మణుల దీవనలను, వారు మంత్ర పురస్సరంగా ఇచ్చిన అక్షతలను, దూర్వాంకురాలను స్వీకరించాడు. ఉచిత ప్రదేశంలో ఉండి, దామోదరుడు సాత్యకిని పిలిపించాడు.

విశేషం: 1. ప్రయాణాలకు తారాబలం చంద్రబలం చూడటం పరిపాటి. 'శుక్లే పక్షే శీతరశ్మి ర్బలీయాన్' అని జ్యోతిశ్శాస్త్రం (రత్నమాల). కాబట్టి చంద్ర బలం ఉన్నది. శ్రీకృష్ణుడి జన్మనక్షత్రం రోహిణి. ప్రయాణ నక్షత్రం రేవతి. రోహిణికి రేవతి సాధన తార ఔతుంది. రేవతి ప్రయాణానికి శుభ నక్షత్రం. ధర్మజుడు భావించినట్లు శ్రీకృష్ణ దౌత్యం సాధించబడుతుంది- అని ధ్వని.

2. వేదోచితమైన సంస్కారం కలవాడు ప్రయాణారంభంలో నిర్వహించే పుణ్య విధులు ఇందులో చెప్పబడ్డాయి. ఇవి తిక్కననాటి ఆచారాలు కూడా కావచ్చును. ఆతడు కూడా వైదిక మార్గ నిష్ఠమగు వర్తనం కలవాడు కదా! (సంపా.)

క. 'మన ప్రజలోఁ గరిపురికిం । జనుదేరఁగ వలయువారి సవరణతో రం
డని యేర్పడ నియమింపు ప । యనమై యేతెమ్ము నీవు' నని తగ మఱియున్. 131

ప్రతిపదార్థం: మన ప్రజలోన్= మన యాదవులలో; కరిపురికిన్= హస్తినానగరానికి; చనుదేరఁగన్ వలయువారిన్= రావలసిన వారిని; సవరణతోన్= సన్నాహంతో; రండు+అని= రావలసిందని; ఏర్పడన్= స్పష్టముగా; నియమింపు= నిర్ణయించుము; నీవున్= నీవుకూడా; పయనము+ఐ+ఏతెమ్ము= ప్రయాణమై నా వెంట రావలసింది; అని= అని చెప్పి; తగన్= ఒప్పిదంగా; మఱియున్= ఇంకను ఇట్లాఅన్నాడు;

తాత్పర్యం: 'మన యాదవులలో హస్తినాపురానికి రావలసిన వారినందరినీ, సన్నాహాలతో రావలసిందిగా స్పష్టంగా చెప్పుము. నీవు కూడా నా వెంట ప్రయాణమై రమ్మ' అంటూ ఇంకా ఇట్లా చెప్పాడు:

వ. 'దుర్యోధనుండు దుష్టాత్మకుం; డతని మన్నించు మానుసులునుం గుటిలబుద్ధులు గావునఁ జక్రగదాద్యాయుధంబులు రథంబునం బెట్టింపవలయు' నని చెప్పి పనిచి సమయజ్ఞతం బొడసూపి నిలుచున్న దారుకుం జూచి తేరు పూన్ప నియోగించిన, నతండును మణిగణ ప్రభాపటల జటిలంబగు నరదంబు వన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శైబ్య సుగ్రీవ మేఘపుష్ప వలాహకంబు లనంబరఁగు తురంగంబులం బూన్చి గరుడధ్వజం బెత్తి తెచ్చినం దానునుం బయనంపుఁ జందంబునఁ గట్టాయితంబై జనంబుల చూడ్కులకుం బండు వగుచుఁ బుండరీకాక్షుండు మంగళ తూర్యంబులు సెలంగఁ జామరంబు లుల్లసిల్ల రథం బెక్కిన యవసరంబున యాదవ పరివారంబుతో నరుగుదెంచిన సాత్యకిం దన రథం బెక్కించుకొని యాంగికంబులైన శుభ సూచకంబులు గైకొనుచుఁ బూర్ణ కలశ వృషభాది భద్రపదార్థంబుల నవలోకించుచుఁ బుణ్యాంగనలు సేసలొలుకఁ జిత్తంబు ప్రసన్నతం బొంద వెడలునప్పుడు. 132

ప్రతిపదార్థం: దుర్యోధనుండు; దుష్ట+ఆత్మకుండు= చెడు మనస్సు కలవాడు; అతని మన్నించు= అతడు ఆదరించు; మానుసులునున్= మనుష్యులు కూడ; కుటిలబుద్ధులు= వక్రబుద్ధికలవారు; కావునన్= కనుక; చక్ర గదా+ఆది+ఆయుధంబులు= సుదర్శన మనే చక్రం, కౌమోదకి అనే గద మొదలైన యుద్ధోపకరణాలను; రథంబునన్+పెట్టింపన్+వలయున్= రథములో నుంచవలసినది; అని చెప్పి; పనిచి= పంపి; సమయజ్ఞతన్+పొడచూపి= సమయము నెఱిగినవాడై కన్పించి; నిలుచున్న దారుకున్+చూచి= నిలబడియున్న దారుకుడనే తన సారథినిగాంచి; తేరు పూన్పన్+నియోగించినన్= రథమును ఆయత్తం కావించుమని ఆజ్ఞాపించగా; అతండును= సారథియైన దారుకుడు కూడా; మణిగణ ప్రభా పటలజటిలంబు= మణుల సమూహము యొక్క కాంతిపుంజముచే సాంద్రమైనది, అగు+అరదంబు+పన్ని= అయినట్టి రథమును సిద్ధపరిచి; శైబ్యసుగ్రీవ మేఘపుష్ప వలాహకంబులు= శైబ్యము, సుగ్రీవము, మేఘపుష్పము, వలాహకము; అనన్+పరఁగు= అను పేర్లతో ఒప్పుతున్న; తురంగంబులన్+పూన్చి= గుర్రాలను కట్టి; గరుడ ధ్వజంబు+ఎత్తి= రథముపై గరుడుని జెండా నిలిపి; తెచ్చినన్= తన సన్నిధికి కొనిరాగా; పుండరీక+అక్షుండు= తెల్లదామరలవంటి కన్నులుగల శ్రీకృష్ణమూర్తి; పయనంపుఁ జందంబునన్= ప్రయాణ విధానంతో; కడు+ఆయితంబు+ఐ= మిక్కిలి సంసిద్ధుడై; జనంబుల చూడ్కులకున్= ప్రజల యొక్క నేత్రాలకు; పండువు+ అగుచున్= ఉత్సవం చేస్తూ; మంగళ తూర్యంబులు= మంగళ వాద్యాలు; చెలంగన్= మ్రోయగా; చామరంబులు+ఉల్లసిల్లన్= వింజామరలు విలసిల్లగా; రథంబు+ఎక్కిన+అవసరంబునన్= రథారోహణం కావించిన సమయంలో; యాదవ పరివారంబుతోన్= యదువంశమునకు చెందిన బలగంతో; అరుగుదెంచిన= వచ్చినట్టి; సాత్యకిన్; తన రథంబు; ఎక్కించుకొని; ఆంగికంబులు+ఐన= అంగములందు ఏర్పడిన; శుభసూచనంబులు+కైకొనుచున్= శుభ శకునాలను స్వీకరిస్తూ; పూర్ణకలశ వృషభ+ఆది= జలముతో నిండిన కలశము, ఎద్దు మొదలైన; భద్ర పదార్థంబులన్= శుభ ప్రదాలైన వస్తువులను; అవలోకించుచున్= చూస్తూ; పుణ్య+ అంగనలు= ముత్తైదువలు; సేసలు+ఒలుకన్= అక్షతలు చల్లగా; చిత్తంబు= తన మనస్సు; ప్రసన్నతన్+పొందన్= శాంతమై ఉండగా; వెడలు+అప్పుడు= బయలుదేరే వేళలో.

తాత్పర్యం: 'దుర్యోధనుడు దుష్టచిత్తుడు. అతడు ఆదరించే మనుషులంతా వంకరబుద్ధి గలవారు. కాబట్టి నీవు చక్రం, గద మొదలైన ఆయుధాలను రథంలో పెట్టించు' అని శ్రీకృష్ణుడు సాత్యకితో చెప్పి పంపాడు. సమయం గుర్తించి దారుకుడు అనే సారథి ఎదుటికి వచ్చి నిలబడగా అతడిని కనుగొని శ్రీకృష్ణుఁడు 'నీవు రథాన్ని ఆయత్తం కావించుము' అని ఆజ్ఞాపించాడు. మణి సమూహాల కాంతిపుంజంతో నిండిన రథానికి శైబ్యం, సుగ్రీవం, మేఘ పుష్పం, వలాహకం అనే గుర్రాలను కట్టి, రథంమీద గరుడకేతనం నిలిపి దారుకుడు అరదం తీసికొనివచ్చాడు. అంతట కృష్ణుడు ప్రయాణ సన్నాహంతో ప్రజలకు కన్నుల పండువు కావిస్తూ, మంగళ వాద్యాలు మ్రోగుతుండగా, వింజామరలు వీస్తుండగా రథారోహణం చేశాడు. సాత్యకి యాదవ పరిజనంతో ఎదుటికి రాగా అతడిని తన రథ మెక్కించుకొని కుడి కన్ను అదరటం మొదలైన ఆంగికాలైన శుభ నిమిత్తాలకు ప్రీతి చెందుతూ, పూర్ణ కుంభం,

వృషభం మొదలైన క్షేమకర పదార్థాలను చూస్తూ, ముత్తయిదువలు అక్షతలు చల్లుతుండగా ప్రసన్నమైన మనస్సుతో కృష్ణుడు బయలుదేరాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 1. రాజపురుషులు యాత్రకు బయలుదేరేటప్పుడు భద్రతకు తీసికొనే రక్షణ చర్యలను శ్రీకృష్ణుడు నిశితంగా పాటించటం ఆతడి కార్యదక్షతకు నిదర్శనం. చిన్న విషయంలో కూడా పెద్ద జాగ్రత్త అవసరమని తాత్పర్యం.

2. ప్రయాణం సాగించేటప్పుడు మంగళవాద్యాలు మ్రోయించటం, శుభశకునాలు దర్శించటం, శుభ చిహ్నాలను తమ శరీరాల మీద తోచటాన్ని గమనించటం, పూర్ణకుంభ వృషభ దర్శనాలను చేయటం, వనితలు అక్షతలూ పూలూ చల్లటం మొదలైన దేశీయాచారాలను వర్ణించటం జాతి వార్తా విశేషకథనం. (సంపా.)

సీ. పాండవ యాదవ పాంచాల కేకయ । పాండ్య మాత్స్యాదులు భద్రదంతి
హయరథంబులతోడ నతికుతూహలమున । వచ్చినఁ గనుఁగొని వారినెల్ల
సంభావనంబుల సంభాషణంబుల । నాదరించుచుఁ దగ నల్ల నల్ల
విభవంబు మెఱయంగ విడిదల పఱపెల్లఁ । గడచిన యత్తఱిఁ గరము శుభము

ఆ. లైన శకునములకు నందఱుఁ బ్రియమంద । నరుగుచున్నయట్టి యవసరమున
రథము రథముఁ గదియ రా నిచ్చి ధర్మనం । దనుఁడు నెమ్మి నిట్టు లనియె హరికి. 133

ప్రతిపదార్థం: పాండవ, యాదవ, పాంచాల, కేకయ, పాండ్య, మాత్స్య+ఆదులు= పాండవులు, యాదవులు, పాంచాల విభుడు - ద్రుపదుడు, కేకయ రాజు, పాండ్య భూపతి, మత్స్య దేశాధీశుడు విరాటరాజు మొదలైనవారు; భద్ర దంతి హయరథంబుల తోడన్= భద్రజాతికి చెందిన ఏనుగులు, గుర్రాలు, రథాలతో; అతి కుతూహలమునన్= మిక్కిలి అభిలాషతో; వచ్చినన్= రాగా; కనుఁగొని= శ్రీకృష్ణుడు చూచి; వారిన్+ఎల్లన్= వారినందరినీ; సంభావనంబులన్= మన్ననలతో; సంభాషణంబులన్= చక్కని మాటలతో; ఆదరించుచున్= గౌరవిస్తూ; తగన్= ఒప్పిదంగా; అల్లన్+అల్లన్= మెల్ల మెల్లగా; విభవంబు+మెఱయంగన్= వైభవం ప్రకాశించగా; విడిదల పఱపు+ఎల్లన్= సేనలు విడిసిన ప్రదేశమంతా; కడచిన+ఆ+తఱిన్= దాటిన తరుణంలో; కరము= మిక్కిలి; శుభములు+ఐన+శకునములకున్= మంగళకరాలైన శకునాలకు; అందఱున్= అచటి వారెల్లరూ; ప్రియము+ అందన్= సంతోషపడగా; అరుగుచున్న+అట్టి అవసరమునన్= వెళ్ళుతున్న వేళలో; రథమున్= తన రథాన్ని; రథమున్+కదియన్+ రాన్+ఇచ్చి= శ్రీకృష్ణుడి రథాన్ని వెంబడించేటట్లు కావించి; ధర్మనందనుఁడు; హరికిన్= గోవిందుడికి; నెమ్మిన్= ప్రీతితో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: పాండవులు, యాదవులు, పాంచాల విభుడైన ద్రుపదుడు, కేకయరాజు, పాండ్య వల్లభుడు, విరాట మహారాజు మొదలైనవారు భద్రజాతికి చెందిన ఏనుగులు, గుర్రాలు, రథాలతో మిక్కిలి ఆసక్తితో వచ్చారు. వారిని వీక్షించి శ్రీకృష్ణుడు ఆదరణలతో సంభాషణలతో గౌరవించాడు. వైభవంతో మెల్ల మెల్లగా సేనలు నిలిచి ఉన్న తావు లన్నిటినీ దాటగానే శుభ శకునాలు గోచరించాయి. అందరూ ఎంతో హర్షించారు. అలా శ్రీకృష్ణుడు వెళ్ళుతున్న సమయంలో తన రథం అతడి రథం దగ్గరకు పోనిచ్చి ధర్మపుత్రుడు శ్రీహరితో ఇట్లా అన్నాడు.

ఉ. 'వచ్చె జనార్దనుం డనిన వార్తకుఁ బ్రాణము మేనికంతకున్
వచ్చిన సేదఁ దేఱుఁ గురువంశ పవిత్రచరిత్ర గొంతి నీ
వచ్చటి కేఁగి పాండవుల యందఱ మాఱనిచెప్పి మ్రొక్కుచున్
గ్రుచ్చియ కౌఁగిలించుకొని కుందిన చిత్తము నొప్పి దీర్పుమీ! 134

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కురువంశ పవిత్ర చరిత్ర= కురువంశమును పావనము చేయు నడవడిగల; గొంతి= కుంతీదేవి; జనార్దనుండు= శ్రీకృష్ణుడు; వచ్చెన్= వచ్చాడు; అనిన వార్తకున్= అనినట్టి వృత్తాంతానికి; ప్రాణము= ఊపిరి; మేనికిన్+అంతకున్= శరీరాని కంతటికినీ; వచ్చినన్= రాగా; సేద తేఱున్= బడలిక నుండి తేరుకొంటుంది; నీవు+అచ్చటికిన్+ఏఁగి= నీవు ఆమె ఉన్న తావునకు పోయి; పాండవుల+అందఱ మాఱు+అని చెప్పి= పాండవులందరికీ బదులు అని పలికి; మ్రొక్కుచున్= నమస్కరిస్తూ; గ్రుచ్చి+అ కౌఁగిలించుకొని= గట్టిగా కౌగిలించుకొని; కుందిన చిత్తము నొప్పిన్= క్రుంగిపోయిన మనసులోని బాధను; తీర్పుమీ!= పోగొట్టుము.

తాత్పర్యం: 'మా తల్లి కుంతీదేవి కురువంశాన్ని పవిత్రం చేసే ప్రవర్తన కలది. మధుసూదనుడు వచ్చాడన్న సంగతి చెవి సోకగానే ఆమె శరీరమంతటికినీ చైతన్యం వచ్చినట్లుంటుంది. (ప్రాణం లేచి వచ్చినట్లుంటుంది.) ఆమె శ్రమ తొలగిపోతుంది. నీవు మా తల్లి కడకేగి మా అందరికి మారుగా నమస్కరించి, గట్టిగా కౌగిలించుకొని, కుప్పకూలిన ఆమె మనసులోని బాధను నివారించుము.

చ. **అడవికి నేఁగునాఁడు మము నంపఁగ నెంతయు దవ్వు వచ్చిన**
ప్పుడు దనమోము దైన్యమునఁ బొందెడు నశ్రులుఁ జూచి చూచి య
ట్లొడఁబడి డించిపోవలసె నుమ్మలికమ్మున గొంతి యింతకుం
బడుగయి పాలలోఁ బడిన బల్లి విధంబున నుండకుండునే? **135**

ప్రతిపదార్థం: అడవికిన్+ఏఁగునాఁడు= అరణ్యవాసానికి వెళ్ళే వేళలో; మమున్+అంపఁగన్= మమ్ము పంపటానికి; ఎంతయున్ దవ్వు= మిక్కిలిదూరం; వచ్చిన+అప్పుడు= వచ్చిన సమయాన; తన మోము= తన ముఖం; దైన్యమునన్= దీనత్వంచేత; పొందెడు+అశ్రులు= పొందుతున్న దుఃఖబాష్పాలు; చూచి చూచి= ఆ విధంగా కనులతో చూస్తూ కూడ; అట్లు ఒడఁబడి= ఆ రీతిగా సమ్మతించి; డించిపోన్+వలసెన్= వదలిపెట్టి వెళ్ళవలసి వచ్చింది; ఉమ్మలికమ్మునన్= శోకంతో; గొంతి= (మా జనని) కుంతీదేవి; ఇంతకున్= ఇప్పటికి; బడుగు+అయి= శుష్కించినదై; పాలలోన్ పడిన= పాలలో పడిన; బల్లి విధంబునన్= బల్లివలె; ఉండక+ఉండునే?= ఉండక ఉంటుందా? (ఉండి ఉంటుంది.)

తాత్పర్యం: అడవులకు పోయేటప్పుడు మమ్ములను పంపటానికి చాలా దూరం నడచి వచ్చింది. ముఖంలో దైన్యం నెలకొన్నది. కన్నులలో దుఃఖబాష్పాలు నిండాయి. అట్టి మా తల్లిని చూస్తూ చూస్తూ సమ్మతించి హస్తినలో విడిచిపెట్టి వెళ్ళవలసి వచ్చింది. పాలలో పడిన బల్లివలె ఆమె దుఃఖంతో ఈపాటి కెంతో శుష్కించిపోయి ఉంటుంది.

విశేషం: 1. అలం: ఉపమ, లోకోక్తి.

2. ధర్మజుడు కుంతీదేవిని గురించి చెప్పిన మాటలు వత్సల, ప్రేయోరసముద్రితాలు. తల్లిని కలిసికొని తమ పక్షాన ఆమెను ప్రేమతో కౌగిలించుకొని మనోవేదన తొలగేటట్లుగా శ్రీకృష్ణుడిని మాట్లాడుమన్నాడు. అడవికి పంపేనాడు ఆమె దైన్యంతో కన్నీరు మున్నీరయిన ఆనాటి దృశ్యం ఇంకా కళ్ళల్లో మెదలుతున్నదని ధర్మజుడు జ్ఞాపకం చేసికొన్నాడు. విధిలేక ఆమెను హస్తినలో వదలవలసి వచ్చింది. ఇన్నేళ్ళుగా ఆమె దిగులుతో వరుగై పోయి ఉంటుందని అంటూ 'పాలలో బడ్డ బల్లి' వలె అనే ఉపమానం వాడాడు. పాలు రుచిగా ఉండేవయినా, దానిలో పడి బల్లి ప్రాణాంతకంగా భావిస్తుంది. హస్తినలో విదురుడింట ఆమె సుఖంగా ఉన్నా పుత్ర వియోగతాపంతో వేడిపాలలోని బల్లివలె మగ్గిపోతూ ఉంటుందని సార్థకంగా చెప్పాడు. లోకోక్తిని ఉపమానంగా తీసికొని చెప్పటం దేశీయం. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. లక్కయిలు కాలినది మొద । లక్కట! మా తల్లి మాకునై నెవ్వగతోఁ
బెక్కిడుమలఁ బడుచున్నది । దిక్కెవ్వరు లేనియట్లు దీనత్వమునన్. 136

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; లక్క ఇలు కాలినది మొదలు= లాక్షాగృహదహనం జరిగినప్పటి నుండి; మా తల్లి= మా జనని; మాకున్+ఐ= మా కొఱకు; నెఱ+వగతోన్= నిండు దుఃఖంతో; ఎవ్వరు దిక్కులేని అట్లు= ఎవరూ తనకు ఆధారం లేనివిధంగా; దీనత్వమునన్= దైన్యంతో; పెక్కు+ఇడుమలన్+పడుచున్+ఉన్నది= పలు కష్టాలు అనుభవిస్తున్నది.

తాత్పర్యం: అయ్యో! లాక్షాగృహదహనం జరిగినది మొదలు దిక్కుమాలినదానివలె మా తల్లి దైన్యంతో మా కొరకు పలు కష్టాలు అనుభవిస్తూ ఉన్నది.

క. ఏ ననుట గాఁగ దుఃఖము । లైనవి దెగు సమయ మయ్యె నని చెప్పుము; మీ
మేనత్త నూఱడింపుము; । దా నెప్పుడు నీవు గలవు తన కనుచుండున్.' 137

ప్రతిపదార్థం: ఏన్+అనుట+కాఁగన్= నేను చెప్పినట్లుగా; దుఃఖములు+ఐనవి= దుఃఖాలనునట్టివి; తెగు సమయము+అయ్యెన్= తొలగేవేళ సమీపించింది; అని చెప్పుము= అని చెప్పవలసింది; మీ మేనత్తన్+ఊరడింపుము= మీ మేనత్త అగు కుంతీదేవిని ఓదార్చ వలసింది; తాన్= మా అమ్మ; ఎప్పుడున్= ఎల్లవేళలందు; తనకున్= తనకు; నీవు కలవు+అని= నీవు(ఆధారమని) ఉన్నావని; అనుచున్+ఉండున్= పలుకుతుంటుంది.

తాత్పర్యం: దుఃఖాలు అనుభవించటం ఐనది, కష్టాలు తొలగే సమయం వచ్చింది - అని మా అమ్మతో నేను చెప్పినట్లుగా చెప్పవలసింది. కృష్ణా! మీ మేనత్తను ఊరడించవలసింది. నీవు తన కెప్పుడూ ఆధారమని ఆమె పలుకుతుంటుంది.'

వ. అని చెప్పి వెండియు. 138

తాత్పర్యం: ధర్మజుడిట్లా చెప్పి, మరల ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. 'గురుఁడు బాహ్లికాది కురువృద్ధులును సుహృ । ద్బాంధవులు నశేష ధరణిపతులుఁ
బ్రీతిఁ బొంద నెవ్వరికి నేది దగుఁ బ్రణా । మాది విధుల నడపు నాదుపలుకు. 139

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణుడు; బాహ్లిక+ఆది= శంతన మహారాజు తమ్ముడైన బాహ్లికుడు మున్నగు; కురువృద్ధులును= కురు వంశములోని పెద్దలును; సుహృత్+బాంధవులును= చెలికాండ్రు, చుట్టాలును; అశేష ధరణి పతులున్= సకల రాజులున్నూ; ప్రీతిన్+పొందన్= సంతోషం చెందేటట్లు; ఎవ్వరికిన్+ఏది, తగున్= ఎవరి యెడల ఏది ఉచితమో; ప్రణామ+ఆది విధులన్= నమస్కారాలు మొదలైన ఉపచారాల చేత; నాదు పలుకున్= నా మాటను; నడపు(ము)= వారికి అందజేయవలసింది.

తాత్పర్యం: 'గురువగు ద్రోణాచార్యులు, బాహ్లికుడు మొదలైన కురువంశంలోని పెద్దలు, చెలికాండ్రు, చుట్టాలు, సకల భూపతులు సంతసించేటట్లు ఎవరి పట్ల ఏది ఉచితమో, ఆ విధంగా నమస్కారాది విధు లొనర్చినానని నా మాటగా వారికి చెప్పుము.

క. పరమ ప్రియమున నాకై । పరిరంభణ సేసి గాఢ బాంధవ సాంద్రా
దరమున సంభాషింపు వి । దురుతోఁ; మధ్యస్థుఁడగు హితుం డతఁ డనఘా!' 140

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనఘా!= దోషరహితుడా!; నాకై= నాకు మారుగా; పరమ ప్రియమునన్= మిక్కిలి ప్రేమతో; పరిరంభణ చేసి= కౌగిలించుకొని, గాఢ బాంధవ= దృఢమైన చుట్టరికంచేత కలిగిన; సాంద్ర= నిబిడమైన; ఆదరమునన్= గౌరవంచేత; విదురుతోన్; సంభాషింపు(ము)= మాట్లాడుము; అతఁడు= ఆ మహనీయుడు; మధ్యస్థుఁడు+అగు హితుఁడు= పక్షపాతం లేక ఉభయ వర్గాల మేలు కోరేవాడు.

తాత్పర్యం: మిక్కిలి ప్రేమతో నాకు బదులుగా విదురుడిని కౌగిలించుకొని గాఢమైన బాంధవాదరంతో ఆయనను గౌరవించి మాటాడుము. అతడు పక్షపాతం లేకుండా కురు పాండవుల మేలుకోరే మహనీయుడు.'

వ. అనియెఁ దదనంతరంబ యర్జునుండు. 141

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తర్వాతనే.

తాత్పర్యం: అని ధర్మరాజు చెప్పినాడు. అటు తర్వాత అర్జునుడిలా అన్నాడు.

చ. 'జనులు వినంగ రాజ్యమున సాము గొనంగలవారమన్న యీ
జనపతి కార్యనిశ్చయము సమ్మతి గైకొని చేసినన్ సుయో
ధనుఁడును దమ్ములున్ సఖులు దానికి నేమును నియ్యకొందు మొం
డనిన సపుత్త్రమిత్త్రముగ నద్దెస నందఱ గ్రొచ్చి పాఁతుదున్.' 142

ప్రతిపదార్థం: జనులు వినంగన్= ప్రజలందరూ వింటుండగా; రాజ్యమునన్= హస్తినాపుర సామ్రాజ్యంలో; సాము= సగపాలు; కొనన్+కలవారము= తీసికొనగలం; అన్న= అని నుడివిన; ఈ జనపతి కార్య నిశ్చయమున్= విభుడగు ధర్మజుడి కార్య నిర్ణయాన్ని; సుయోధనుఁడును= దుర్యోధనుడూ; తమ్ములున్= అతడి సహోదరులూ; సఖులున్= అతని చెలికాండ్రూ; సమ్మతిన్= అంగీకారంతో; కైకొని= అతని మాట స్వీకరించి; చేసినన్= ఆచరిస్తే; దానికిన్= అర్ధ రాజ్యం తీసుకొనటానికి; ఏమును= మేమున్నూ; ఇయ్యకొందుము= ఒప్పుకొంటాం; ఒండు+అనినన్= వేరు విధంగా పలికితే; సపుత్త్ర మిత్త్రముగన్= సుతులతో, హితులతో కూడా; ఆ+దెసన్+అందఱన్= ఆ పక్షంలోఉన్న వారినందరినీ, గ్రొచ్చి పాఁతుదున్= గోయి త్రవ్వి పూడ్చిపెడతాను.

తాత్పర్యం: 'జనులంతా వింటుండగా రాజ్యంలో సగభాగం మేము తీసికొంటాం'. అని ధర్మజుడు తీర్మానించాడు. ఆ తీర్మానానికి సమ్మతించి దుర్యోధనుడూ, అతడి తమ్ములూ, అతడి స్నేహితులూ అర్ధరాజ్యమిస్తే మేము అందుకు అంగీకరిస్తాము. ఇందుకు మరో విధంగా చెపితే కౌరవపక్షంలో ఉన్నవారినందరినీ సుతులతో హితులతో కూడ గోతులు త్రవ్వి పూడ్చిపెడతాను.'

విశేషం: 'అందఱ గ్రొచ్చి పాఁతుదున్' - అన్నది తెలుగు జాతీయం. కోపం వచ్చినప్పుడు ఎదుటివారిని (గొయ్యితీసి) పాతిపెడతాననటం తెలుగువారికి అలవాటు. కాగా, యుద్ధ రంగాలలో కుప్పలు కుప్పలుగా పడి ఉన్న శవాలను పెద్ద పెద్ద గోతులు తవ్వి మూక ఉమ్మడిగా పూడ్చటం కూడా సహజం. ఏమైనా ఈ వాక్యం అర్జునుడికి కౌరవులమీదగల తీవ్రకోపాన్ని వ్యక్తం చేస్తున్నది. (సంపా.)

మ. అనినన్ మెచ్చి వృకోదరుం డితఁడు కార్యం బింత దెల్లంబుగాఁ
బొనరం బల్కునె?' యంచుఁ బేరెలుఁగు సొంపుం బొంద వక్త్రంబు పా
ల్పున దర్పం బొలయంగ నంగములునుం బొంగార నుద్బృంహిత
ధ్వనియై పొల్చు మహోగ్ర సింధురము చందం బొంది యొప్పెం గడున్. 143

ప్రతిపదార్థం: అనినన్= అని పార్థుడు పలుకగా; మెచ్చి= మెచ్చుకొని; వృకోదరుండు= భీమసేనుడు; ఇతఁడు= అర్జునుడు; కార్యంబున్= చేయదగిన పనిని; ఇంత తెల్లంబుగాన్= ఇంత విస్పష్టంగా; పొనరన్+పల్కునె?= ఒప్పుగ చెప్పుతాడా?; అంచున్= అంటూ; పేరు+ఎలుఁగు= గొప్ప కంఠధ్వని; సొంపున్+పొందన్= అందగించగా; వక్త్రంబు పొల్పునన్= ముఖ సౌందర్యం చేత; దర్పంబు= గర్వం; ఒలయంగన్= వ్యాపించగా; అంగములునున్= అవయవాలు కూడా; పొంగు+ఆరన్= పొంగగా, ఉబ్బగా; ఉత్+బృంహితధ్వని+ఐ= గొప్ప ఘీంకార శబ్దంకలదై; పొల్చు= శోభిల్లు; మహా+ఉగ్రసింధురము చందంబున్+ఒంది= మహా భయంకరమైన ఏనుగు తీరై; కడున్= మిక్కిలి; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: అర్జునుడి పలుకులు శ్లాఘిస్తూ 'ఇతడు చేయవలసిన పనిని గూర్చి ఎంతో విస్పష్టంగా చెప్పాడు అంటూ తన గంభీర కంఠస్వరం అందం చిందగా, ముఖ సౌందర్యంచేత గరువం వ్యాపించగా, అవయవాలు పొంగగా, గొప్ప ఘీంకార ధ్వనితో చెలువారు మత్తగజంవలె భీముడు ప్రకాశించాడు.

విశేషం: భీముడు గొప్ప సహృదయుడు. అర్జునుడు వీరవాక్యం మాట్లాడగా విని తానే ఆ మాటలన్నంత ఉప్పొంగిపోయాడు. ఆ అన్నదమ్ముల ఆత్మీయత కూడా అటువంటిదే. వీరోల్లాసంతో సంతోషించే భీముడు ప్రదర్శించే ఆంగికాభినయం ఇందులో సుందర గంభీరం. మాటలు శ్రావ్య గంభీరంగా వెలువడ్డాయి. ముఖం గర్వంతో అందంగా వెలిగిపోయింది. ఒడలు ఉప్పొంగింది. పెద్ద పెట్టున ఘీంకారం చేసే మత్తేభంవలె మనోహరంగా ఉన్నాడు. మదేభం వలె ఉన్న భీముడిని మత్తేభవిక్రీడితంలో వర్ణించటం ఛందశ్శిల్పం. (సంపా.)

క. నకుల సహదేవులును దా । నికి సంతసమంది 'యిట్లు నెయ్యము కయ్యం
బొక తెఱఁగు సేసికొని తడ । యక ర మ్మని పలికి రప్పు డచ్యుతుతోడన్. 144

ప్రతిపదార్థం: నకుల సహదేవులును= నకులుడూ, సహదేవుడూ; దానికిన్= అర్జునుడి పలుకులకు; సంతసము+అంది= సంతోషపడి; ఇట్లు= ఈ ప్రకారంగా; నెయ్యము= స్నేహమో; కయ్యము= యుద్ధమో; ఒక తెఱఁగు+చేసికొని= రెంటిలో ఒక దానిని నిశ్చయించి; తడయక రమ్ము+అని= ఆలసింపక రమ్మని; అచ్యుతు తోడన్= శ్రీకృష్ణుడితో; అప్పుడు= ఆ సమయాన; పలికిరి= చెప్పారు.

తాత్పర్యం: నకుల సహదేవులు అందుకు సంతసించి పొత్తో లేక పోరో ఏదో ఒకటి తీర్మానించుకొని వెంటనే రావలసినదని శ్రీకృష్ణుడితో చెప్పారు.

శ్రీకృష్ణుఁడు నారదాది మహామునులం గని సంభాషించుట (సం. 5-81-58)

వ. ఇవ్విధంబునం బాండునందను లందఱును గోవిందునకు వలయు మాటలు సెప్పి 'యతనిఁ గౌఁగిలించికొని యథోచిత ప్రకారంబుల వీడుకొని వలగొని మగిడిరి; తక్కినవారలు నర్వంబులగు తెఱంగుల నామంత్రితులై మరలిరి; మాధవుండును బ్రయాణ సర్వ సంభార నిర్వాహకులం గలయం గనుంగొని తగిన సల్లాపంబులు సేసి, కరినగరంబు పెం దెరువుఁ గైకొని దారుకుని చతురత్వంబునఁ దురంగంబుల పటుత్వంబున నత్యంత సమీచీనంబైన యానంబున మనం బలరం జనిచని, యొక్కయెడ నారద జమదగ్ని కణ్వాదులగు మహామునులం గొందఱం గని రథంబు డిగ్గి నమస్కరించి సభక్తి తాత్పర్యంబునఁ గుశలం బడిగి, మీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రిక్కడకు, విజయంచేయుటకుఁ గతం బేమి? సేయంగల పని యెయ్యది? నా కానతిం' డనిన నారాయణునకు నారదుం డిట్లనియె. 145

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈతీరున; పాండునందనులు; అందఱును; గోవిందునకున్= కృష్ణుడికి; వలయు మాటలు+ చెప్పి= చెప్పవలసిన మాటలు చెప్పి; అతనిన్; కౌఁగిలించికొని; యథా+ఉచిత ప్రకారంబులన్= అర్హమైన విధానాలతో; వీడుకొని= వెళ్ళి వస్తామని చెప్పి; వలగొని= ప్రదక్షిణంచేసి; మగిడిరి= మరలారు; తక్కినవారలు; అర్హంబులు+అగు తెఱంగులన్= తగిన విధాల; ఆమంత్రితులు+ఐ= ఆ కృష్ణుడిచేత అనుమతి కొన్నవారై; మరలిరి= తిరిగి వెళ్ళారు; మాధవుండును; ప్రయాణ సర్వ సంభార నిర్వాహకులన్= పయనానికి కావలసిన సమస్త వస్తువులు సమకూర్చేవారిని; కలయన్+కనుంగొని= తేరిపార చూచి; తగిన సల్లాపంబులు+చేసి= తగు ముచ్చటలు ఆడి; కరినగరంబు పెను+తెరువు+కైకొని= హస్తినాపురికి పోయే పెద్దబాట ననుసరించి; దారుకుని చతురత్వంబునన్= దారుకుని నేర్పు చేతను; తురంగంబుల-పటుత్వంబునన్= గుఱ్రాలయొక్క దృఢత్వం చేతను; అత్యంత సమీచీనంబు+ఐన= మిక్కిలి యుక్తమైన; యానంబునన్= గమనంచేత; మనంబు+అలరన్= హృదయ మానందించగా; చని చని= వెళ్లి వెళ్లి; ఒక్క+ఎడన్= ఆ వెళుతున్న దారిలో; నారద, జమదగ్ని; కణ్వ+ఆదులు+అగు= నారదుడు, జమదగ్ని, కణ్వుడు మొదలైన; మహామునులన్= మహర్షులను; కొందఱన్; కని= చూచి; రథంబు; డిగ్గి= దిగి; నమస్కరించి; సభక్తి తాత్పర్యంబునన్= భక్తితోడి తత్పరత్వంతో; కుశలంబు+అడిగి= క్షేమం విచారించి; మీరు; ఇక్కడకున్; విజయం చేయుటకున్= రావటానికి; కతంబు+ఏమి?= కారణమేమిటి?; చేయన్+కలపని+ఎయ్యది?= తమకు నేనేకార్యం చేయాలి?; నాకున్; ఆనతి+ఇండు= సెలవియ్యండి; అనినన్; నారాయణునకున్; నారదుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా పాండవు లందరూ శ్రీకృష్ణుడికి చెప్పవలసిన మాటలన్నీ చెప్పి, ఆలింగనం చేసికొని అర్హ ప్రకారంగా సెలవు పుచ్చుకొని ప్రదక్షిణం చేసి వెనుకకు మరలారు. యాదవులు, పాంచాలురు మొదలైన వారంతా తగు విధాల కృష్ణుడి అనుమతి పొంది అక్కడ నిల్చిపోయారు. తరువాత శౌరి ప్రయాణానికి కావలసిన పదార్థాలు సమకూర్చినవా రందరినీ కనుగొని వారితో ముచ్చటించాడు. హస్తినానగరికి వెళ్ళే విశాల మార్గంలో దారుకుని నైపుణ్యం, గుఱ్రాల పటుత్వం కారణంగా సాగిన చక్కని రథగమనం ఆయన మనస్సును ఆహ్లాదపరిచింది. కృష్ణుడు వెళ్ళుతుండగా దారిలో ఒకచోట నారదుడు, జమదగ్ని, కణ్వుడు మొదలైన మహర్షులు కొందరు కనిపించారు. వెంటనే గోవిందుడు రథం దిగి వారికి నమస్కరించాడు. మాధవుడు భక్తితత్పరుడై వారి క్షేమం విచారించి, 'మీరిక్కడికి విచ్చేయటానికి హేతువేమిటి? నేను తమకు చేయవలసిన పనులేమి?' సెలవియ్యం'డని అడిగాడు. అప్పుడు నారదుడు నారాయణుడితో ఇట్లా అన్నాడు:

సీ. **'అనఘ! పుణ్యాత్ముఁడ వగు నిన్నుఁ గనుఁగొనఁ, । గౌరవసభ నీవు గారవమునఁ**
బలికెడి పలుకుల భంగు లాకర్ణింప, । విదుర భీష్మాదులు విను తెఱంగు
నుత్తరం బిచ్చు కార్యోక్తులు నెఱుఁగంగ । వేడుక వచ్చిరి వీరలెల్ల'
నని చెప్ప విని 'లెస్స, యట్ల చేయుదురుగా' । కని హరి వల్కిన నమ్మునీంద్రు

తే. **లతని దీవించి 'నీవు పొ; మ్మచటి కేము । నరుగుదెంచెద'మని ప్రీతి ననుప నరిగి**
యొక్క పుణ్యాశ్రమంబున యొద్ది యేట । విడిసి దివస ప్రవర్తన విధులు నడిపి. 146

ప్రతిపదార్థం: అనఘ!= దోషరహితుడా!; పుణ్య+ఆత్ముఁడవు+అగు నిన్నున్= సుకృతాత్ముఁడవైన నిన్ను; కనుఁగొనన్= చూడటానికి; కౌరవ సభన్= ధృతరాష్ట్రుని కొలువులో; నీవు; గారవమునన్= ఆదరంతో; పలికెడి పలుకుల భంగులు= మాటాడే

మాటల తీరులు; ఆకర్ణింపన్= వినటానికీ; విదుర భీష్మ+ఆదులు= విదురుడు, భీష్ముడు మొదలైనవారు; విను తెఱంగు= వినే విధం; ఉత్తరంబు+ఇచ్చు కార్య+ఉక్తులు= కార్యానికి సంబంధించి వారు సమాధాన మిచ్చే మాటలు; ఎఱుఁగంగన్= తెలియటానికి; వీరలు+ఎల్లన్= ఈ మునీశ్వరులందరు; వేడుకన్= కుతూహలంతో; వచ్చిరి= వచ్చారు; అని; చెప్పన్; విని; లెస్స= మంచిది; అట్ల చేయుదురు గాక= అట్లే వచ్చి విందురుగాక; అని; హరి; పల్కినన్; ఆ+ముని+ఇంద్రులు= ఆ మౌనిశ్రేష్ఠులు; అతనిన్ దీవించి= కృష్ణుడిని ఆశీర్వదించి; నీవు; అచటికిన్= కురుసభకు పొమ్ము; ఏము= మేము; అరుగుదెంచెదము= వస్తాం; అని; ప్రీతిన్= సంతోషంతో; అనుపన్+అరిగి= వారు సాగనంపగా వెళ్ళి; ఒక్క+పుణ్య+ఆశ్రమంబున+ఒద్ది+ఏటన్= ఒక పావనాశ్రమం చెంతగల నది ఒడ్డున; విడిసి= దిగి; దివసప్రవర్తన విధులు+నడిపి= ఆహ్నికాలైన వేదవిహిత కార్యాలు ఆచరించి.

తాత్పర్యం: 'వాసుదేవా! పుణ్యచిత్తుడవైన నిన్ను చూడటానికి కౌరవ సభలో నీవు ఆదరంతో చెప్పే మాటలు వినటానికీ, విదురుడు భీష్ముడు మొదలైనవారు వినే విధమూ, విని వారిచ్చే సమాధానాలూ తెలిసికొనటానికీ కుతూహలపడి ఈ మునీశ్వరులంతా వచ్చారు' అని చెప్పగా శ్రీకృష్ణుడు ఆలకించి 'మంచిది అలాగే చేయండి' అని అనుమతించాడు. మహర్షులు ఆయనను ఆశీర్వదించి 'నారాయణా! నీవు హస్తినాపురికి వెళ్ళుము. మే మక్కడికి వస్తాము' అని సంతోషంతో పంపగా, కృష్ణుడు బయలుదేరి ఒక పావనాశ్రమం చెంత గల ఏటి ఒడ్డున విడిది చేశాడు. అక్కడ శాస్త్ర విహితాలైన ఆహ్నికాలు నిర్వర్తించాడు.

వ. **కమలనాభుండు గదలిపోయి సూర్యాస్తమయ సమయంబునఁ గుశస్థలంబు సేరం జనునప్పు డందలి విప్రు లెదురు వచ్చి కాంచి నిజనివాసంబులకుం బిలిచినం బ్రసన్నవదనుండగుచు సమ్మర్దంబు వలవదని పలికి విశాల రమణీయంబైన బహిరంగణంబునం బటకుటీర ప్రకరం బెత్తించి విడిసి, తగువారును దానును వారల గృహంబుల కరిగి యభ్యాగత పూజలు గైకొని వారిని సంభావించి విడిదలకుం జని సమయ సముచిత వృత్తిం బ్రవర్తిల్లుచుండె; నంత నక్కడ;** **147**

ప్రతిపదార్థం: కమలనాభుండు= కమలం నాభియందు కల శ్రీకృష్ణుడు; కదలిపోయి= పయనం సమకట్టి; సూర్య+అస్తమయ సమయంబునన్= ప్రొద్దు గ్రుంకువేళకు; కుశస్థలంబు చేరన్+చను+అప్పుడు= కుశస్థలమనే ప్రదేశాన్ని సమీపించే సమయంలో; అందలి విప్రులు= కుశస్థల వాసులైన బ్రాహ్మణులు; ఎదురు వచ్చి= కృష్ణుడికి ఎదురుగా వెళ్ళి; కాంచి= చూచి; నిజనివాసంబులకున్= తమ ఇండ్లకు; పిలిచినన్= రండని ఆహ్వానింపగా; ప్రసన్న వదనుండు+అగుచున్= అనుగ్రహంతో కూడిన మోముకలవాడై; సమ్మర్దంబు వలవదు= సందడి పనికిరాదు; అని పలికి; విశాల రమణీయంబు+ఐన= విరివి ఐనది సుందరమైనది అగు; బహిః+అంగణంబునన్= మైదానంలో; పట కుటీర ప్రకరంబు+ఎత్తించి= పెక్కు గుడారాలు వేయించి; విడిసి= వాటిలో దిగి; తగువారును= తగిన మనుష్యులును; తానును; వారల గృహంబులకున్; అరిగి; అభ్యాగత పూజలు+కైకొని= భోజనమప్పుడు వచ్చిన వారికి చేసే సత్కారాలు స్వీకరించి; వారిని సంభావించి= ఆ బ్రాహ్మణులను ఆదరించి; విడిదలకున్+చని= తాము విడిసిన పట కుటీరాలకు వెళ్ళి; సమయ సముచిత వృత్తిన్= ఆ వేళకు దగిన పనిపాటులలో; ప్రవర్తిల్లుచున్+ఉండెన్= మెలగుతూ ఉన్నాడు; అంతన్= అటు పిమ్మట; అక్కడ= హస్తినాపురంలో.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు బయలుదేరి ప్రొద్దుగ్రుంకే వేళకు కుశస్థలం సమీపించాడు. అక్కడి బ్రాహ్మణులు నారాయణునకు ఎదురువచ్చి తమ గృహాలకు రమ్మని ఆహ్వానించారు. శౌరి ప్రశాంత ముఖంతో వారిని చూచి, ఇంత మంది పరిజనంతో రావటం లేదు, అని చెప్పి అక్కడొక విశాలమైన సుందరమైన మైదానంలో గుడారాలు

వేయించాడు. పరిజనమంతా ఆ శిబిరాలలో ఉండగా తాను, అర్హులైన కొద్దిమందితో మాత్రం ముకుందుడు ఆ విప్రుల నిలయాలకు వెళ్ళాడు. అక్కడ వారిచ్చే అతిథి సపర్యలు స్వీకరించాడు. భూసురులను ఆదరించి తిరిగి తమ విడిది పట్టులకు చేరి, ఆ సమయానికి తగిన పనులలో నిమగ్నుడైనాడు. ఇక హస్తినాపురంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **వార్త విని యాక్షణమ కౌరవక్షితీశ్వ। రుండు గాంగేయ గురు విదురులను బుత్త్రు**
సంజయునిఁ గర్ణు సైంధవు శకునిఁ బిలువఁ। బనిచి తా నిట్టు లనియె నందనునితోడ. **148**

ప్రతిపదార్థం: కౌరవక్షితి+ఈశ్వరుండు= ధృతరాష్ట్ర మహారాజు; వార్తన్ విని= కృష్ణుడు వస్తున్న సమాచారం తెలిసి; ఆ క్షణమ= అప్పుడే; గాంగేయ గురు విదురులను= గంగా పుత్రుడైన భీష్ముడిని, ఆచార్యుడైన ద్రోణుడిని, సచివుడైన విదురుడిని; పుత్త్రున్= కుమారుడైన దుర్యోధనుడిని; సంజయునిన్= చెలికాడగు సంజయుడిని; కర్ణున్= రాధేయుడిని; సైంధవున్= అల్లుడైన సైంధవుడిని; శకునిన్= మరిదిఅయిన శకునినీ; పిలువన్+పనిచి= దగ్గరకు రప్పించుకొని; నందనునితోడన్= కుమారుడితో; తాన్= తాను (ఆ ధృతరాష్ట్రుడు); ఇట్టులు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: కురువంశ విభుడగు ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడు తమకడకు వస్తున్నాడనే సమాచారం విని, వెంటనే తన దగ్గరికి భీష్మడిని, ద్రోణుడిని, విదురుడిని, దుర్యోధనుడిని, కర్ణుడిని, సైంధవుడిని, శకునినీ పిలిపించాడు. దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

వ. **'కృష్ణుఁడు పాండవ కార్యార్థంబుగా మనయొద్దకు వచ్చుచున్నవాఁడు; నేఁడు కుశస్థలంబున విడిసె రేపిందులకు వచ్చునని వింటి; మిట్టి యాశ్చర్యంబునుం గలదే! సర్వలోకాభిగమ్యుండగు నమ్మహానుభావునకు మన మభిగమ్యుల మైతిమి; మన కింతకంటెను బెంపెయ్యది? యతం డెవ్వరివలన సంతుష్టుండయ్యె వారికి శుభంబును, నెవ్వరిదెస ననాదరంబు సేసె వారికి నశుభంబు నగుటదప్పు; దతనికి వలయు పూజ లాచరించుటకు సంవిధానంబు సేయుము; గృహాలంకరణాది మంగళప్రకారంబు లనుష్ఠింప నియమింపు; మతని చిత్తంబునకు నీ విభవంబును దనమీఁది ప్రియంబునుం దోఁచునట్టి తెఱంగున సమస్తంబును సమకట్టుము.** **149**

ప్రతిపదార్థం: కృష్ణుఁడు; పాండవ కార్య+అర్థంబుగాన్= పాండవుల పని కొరకై; మన+ఒద్దకున్; వచ్చుచున్+ఉన్నవాఁడు; నేఁడు; కుశస్థలంబునన్; విడిసెన్; రేపు; ఇందులకున్; వచ్చున్; అని; వింటిమి; ఇట్టి ఆశ్చర్యంబునున్+కలదే?= ఇంతటి వింత ఉన్నదా?; సర్వలోక+అభిగమ్యుండు= సమస్త లోకములకు పొందదగినవాడు; అగు+అ+మహానుభావునకున్; మనము; అభిగమ్యులము+ఐతిమి= పొందదగినవారమైనాము; మనకున్; ఇంతకంటెను; పెంపు+ఎయ్యది?= భాగ్యమేముంది?; అతండు; ఎవ్వరివలనన్; సంతుష్టుండు+అయ్యెన్= మిక్కిలి సంతోషం పొందిన వాడాయెనో; వారికిన్; శుభంబును; ఎవ్వరి దెసన్= ఎవరి విషయమున; అనాదరంబు+చేసెన్= మన్నన చూపడో; వారికిన్; అశుభంబున్= అమంగళమూ; అగుట; తప్పదు; వలయు= కావలసిన; పూజలు= సపర్యలు; ఆచరించుటకున్= కావించటానికి; సంవిధానంబు+చేయుము= ఏర్పాటు చేయుము; గృహ+అలంకరణ+ఆది= ఇండ్లు అలంకరించటం మున్నగు; మంగళ ప్రకారంబులు= శోభన కార్యాలు; అనుష్ఠింపన్= ఆచరించటానికి; నియమింపుము= ఆజ్ఞాపించుము; అతని చిత్తంబునకున్= శౌరి మనస్సునకు; నీ విభవంబును= నీ ప్రాభవం; తన మీఁది ప్రియంబునున్= తన యెడ నీకు గల ఇష్టం; తోఁచునట్టి తెఱంగునన్= గోచరించే విధంగా; సమస్తంబును సమకట్టుము= అన్ని ఏర్పాట్లు చేయుము.

తాత్పర్యం: 'శ్రీకృష్ణుడు పాండవుల పనిమీద మన దగ్గరకు వస్తున్నాడు. ఈ రోజు కుశస్థలంలో నిలిచాడు. ఇక్కడకు రేపు వస్తాడని విన్నాను. ఇంతటి అద్భుత విషయం ఉన్నదా? లోకులందరు ఎవడి చెంతకు చేరవలెనని ఉవ్విళ్ళూరుతారో అట్టి మహానుభావుడు మనకడకు వస్తున్నాడు. మన కింతకంటే అదృష్టముందా? ఎవ్వరు అతడిని సంతోషపెట్టుతారో వారికి శుభాలూ, ఎవరు అతడిని ఆదరించరో వారికి అశుభాలూ జరగటం తథ్యం. కావున ఆయనకు సర్వ సపర్యలు చేయటానికి కావలసిన ఏర్పాట్లన్నీ చక్కగా కావించుము. భవనాలు అలంకరించటం మొదలైన మంగళ కార్యాలకు వెంటనే ఆదేశాలివ్వవలసింది. అతడి హృదయం సంతోషించేటట్లు, నీ ప్రాభవానికి తగ్గట్లు, తనమీద నీకున్న ప్రేమ వెల్లడి అయ్యేటట్లు సర్వమూ సంసిద్ధ మొనర్చుము.'

విశేషం: 1. అలం: ప్రహర్షణం. "ఉత్కంఠితార్థ సంసిద్ధి ర్వినా యత్నం ప్రహర్షణమ్'. ప్రయత్నం లేకుండానే అభిమతార్థం సిద్ధించినట్లు చెప్పితే ప్రహర్షణాలంకారం. ధృతరాష్ట్రుడి వాక్యాలు ఈ అలంకారానికే అలంకారం.

2. ధృతరాష్ట్రుడు గుడ్డివాడు. కాని, లోవెలుగుతో శ్రీకృష్ణుడి దివ్యత్వాన్ని గుర్తించి 'సర్వలోకాభిగమ్యుండగు నమ్మహానుభావునకు మన మభిగమ్యులమైతిమి. మన కింతకన్నకు 'బెం పెయ్యది?' అని ఉప్పొంగిపోయాడు. ఇది సహజమైన ఆత్మానందోల్లాసం. ఇక్కడ ఈ వాక్యం కీలకం. పాండవుల కొరకైనా పరమాత్ముడు కౌరవసభకు వస్తున్నాడని గుర్తించి ధృతరాష్ట్రుడు నిండుసభలో విశ్వరూపదర్శనం చేయదగిన అంతస్సంస్కారం, లోచూపు కలవాడని వస్తుధ్వని.

3. కన్నులు లేకపోయినా కమలనాభుడిని అంతర్నేత్రంతో చూడగల ధృతరాష్ట్రుడు కన్నులున్నా పద్మాక్షుడిని కనుగొనలేని గర్వాంధుడైన దుర్యోధనుడికి ఆ మహాత్ముడిని ఆరాధించుమని చెప్పటం విశేషం. గర్భశిలవంటి వాడు ధృతరాష్ట్రుడు.

4. శ్రీకృష్ణుడు సాక్షాత్ నారాయణుడని భావించిన ధృతరాష్ట్రుడు ఆయన ఆదరణం పొందగలగటం శుభప్రదం. అనాదరణం పొందటం అశుభం- అని నిర్దేశించాడు. ఇది భావికథార్థ సూచిక అయిన పతాక.

5. అపూర్వాహ్వాన సంభారాలు చేయండని ఉప్పొంగుతూ ధృతరాష్ట్రుడు ఆదేశాలిచ్చాడు. ఆ మాటలన్నీ దుర్యోధనుడు వింటాడని అతడూ భ్రమించలేదు. అందుకే మెళకువగా అన్నాడు - దుర్యోధనుడి వైభవ మొకవైపూ, ప్రీతి మరొక వైపూ ప్రదర్శితమయ్యేటట్లుగా స్వాగత సన్నాహాలు చేయుమన్నాడు.

6. పరమాత్మయొక్క భావనం, దర్శన స్పర్శన సంభాషణ సౌముఖ్యాల సమ్మోదం, అనుగ్రహాశీర్వాద ప్రసాద లాభం మొదలైన వాటి వలన కలిగే ప్రహర్షణం తెచ్చిపెట్టుకొనేది కాదు. అంతఃప్రబోధంతో ఆవిర్భవించే ప్రహర్షణం. (సంపా.)

క. అనిన ధృతరాష్ట్ర పలుకులు । గొనియాడిరి సంతసిల్లి గురుఁడును భీష్మం
డును నౌఁగాకని దుర్యో । ధనుడుం బరిచారక ప్రతతిఁ బిలిపించెన్. 150

ప్రతిపదార్థం: అనిన ధృతరాష్ట్ర పలుకులు= అని చెప్పిన ధృతరాష్ట్రుడి మాటలు; గురుఁడును= ద్రోణుడును; భీష్ముండును= భీష్ముడూ; సంతసిల్లి= ఆనందించి; ఔన్+కాక+అని= మంచిదే అని; కొనియాడిరి= మెచ్చారు; దుర్యోధనుఁడున్= సుయోధనుడూ; పరిచారక ప్రతతిన్= సేవకుల సమూహాన్ని; పిలిపించెన్= రావించాడు.

తాత్పర్యం: ద్రోణుడు, భీష్ముడు ధృతరాష్ట్రుడి మాటలకు సంతోషించి ఇది యుక్తమే అని మెచ్చారు. అంతట దుర్యోధనుడు సేవకులను పిలిపించాడు.

వ. ఇట్లుచిత పరివారంబు రావించి యతండు. 151

తాత్పర్యం: ఈ విధంగా దుర్యోధనుడు తగిన పరిచారకులను పిలిపించి ఇట్లన్నాడు:

క. 'అలుకుఁడు మృగమదమున, ము । గ్గులు వెట్టుఁడు గప్పురమునఁ, గుంకుమమున గో
డలు పూయుఁడు' మణిదామక । ములు గట్టుఁడు పెద్ద కూటమున సొంపారన్. 152

ప్రతిపదార్థం: పెద్ద కూటమునన్= సభాసదనంలో; సొంపు+ఆరన్= కనుల కింపుగా; మృగమదమునన్= కస్తూరితో; అలుకుఁడు= నేల నలకండి; కప్పురమునన్= కర్పూరంతో; ముగ్గులు+పెట్టుఁడు= రంగవల్లికలు తీర్చండి; గోడలు= గోడలు; కుంకుమమునన్= కుంకుమ ద్రవ్యంతో; పూయుఁడు= మెత్తండి; మణిదామకములు+కట్టుఁడు= మణుల దండలు ద్వారాలకు కట్టండి.

తాత్పర్యం: సభా సదనంలో నేలను కస్తూరితో అలకండి. కర్పూరంతో రంగవల్లికలు తీర్చండి. గోడలు కుంకుమ పంకంతో మెత్తండి. ద్వారదేశాలకు మణుల దండలు వ్రేలాడదీయండి.

విశేషం: విశేషం: అలం: ఉదాత్తం.

వ. మఱియు నగరెల్లను శోభిల్ల నలంకారంబు సేయుండు. 153

తాత్పర్యం: ఒక్క కొలువు కూటమునేకాక నగరమంతా అలంకరించండి.

క. పెనుపుం జతురత మెఱయఁగ । మన యింటను దుస్ససేను మందిరమున శో
భనశిల్పము లొనరింపుఁడు । చనుఁడు వృకస్థలమునందుఁ జప్పరము లిడన్. 154

ప్రతిపదార్థం: పెనుపున్= పెంపును; చతురత= నేర్పు; మెఱయఁగన్= వెల్లడి అయ్యేటట్లు; మన+ఇంటను= మన భవనంలో; దుస్ససేను మందిరమునన్= దుశ్శాసనుడి సౌధంలో; శోభన శిల్పములు+ఒనరింపుఁడు= మంగళకరమైన చిత్తరువులు వ్రాయించండి; వృకస్థలమునందున్= వృకస్థలం అనేచోట; చప్పరములు+ఇడన్+చనుఁడు= పందిళ్ళు వేయటానికి పొండి.

తాత్పర్యం: మీ కళాచాతుర్యము వెల్లడి యగునట్లు మన భవనంలో, దుశ్శాసనుడి భవనంలో మనోహరాలైన చిత్తరువులు చిత్రించండి. వృకస్థలంలో చలువ పందిళ్ళు వేయించండి.

వ. అది విడి పట్టు గాఁదగియెడు ప' ట్టని పలికి 'వాసుదేవుండు రేపకడయ వచ్చునంతకుమున్న యింతయుం గావింపవలయు' నని పనిచి పురంబున నుత్సవంబు సాటుండని నియోగించి వివిధ గంధ మహిత మాల్యంబులు సంపాదింపను మణిభూషణ చిత్రాంబరంబులు సమకట్టను సరసాన్నస్వాదు పాన ద్రవ్యంబు లొడఁగూర్పను నేర్పరులగు తద్‌జ్ఞుల నియమించె; నట్టి యెడ నాంబికేయుండు విదురున కిట్లనియె: 155

ప్రతిపదార్థం: అది= వృకస్థలము; విడిపట్టు= విడిది; కాన్+తగియెడు పట్టు= కాదగిన చోటు; అని పలికి; వాసుదేవుండు; రేపకడయ వచ్చున్= ఉదయమే రాగలడు; అంతకున్ మున్ను+అ= అతడి రాకకు మునుపే; ఇంతయున్ కావింపన్ వలయున్= ఈ పనులన్నీ చేయవలె; అని పనిచి= అని సేవకులను నియమించి; పురంబునన్= పట్టణంలో; ఉత్సవంబు+ చాటుండు= సంబరాన్ని చాటండి; అని నియోగించి= అని భృత్యుల నాజ్ఞాపించి; వివిధ గంధ మహిత మాల్యంబులు= పలు విధాలైన సువాసనలతో గొప్పవైన పూలదండలు; సంపాదింపను= కొనివచ్చుటకు; మణి భూషణ చిత్ర+అంబరంబులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మణుల నగలు, వింత గొలుపు వస్త్రాలు; సమకట్టను= సమకూర్చటానికి; సరస+అన్న= రససంపన్నాలైన అన్నాలు; స్వాదు పానద్రవ్యంబులు= రుచికరమైన పానీయాలు; ఒడఁగూర్పను= లభింపజేయుటకు; నేర్పరులు+అగు= సమర్థులైన; తద్జ్ఞులన్= తెలిసినవారిని; నియమించెన్= నియోగించాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆంబికేయుండు= అంబిక కొడుకు- ధృతరాష్ట్రుడు; విదురునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: వృక్షస్థలం లం విడిది చేయటానికి తగిన చోటు 'అని పరిచారకులతో పలికి దుర్యోధనుడు మళ్ళీ ఇట్లా అన్నాడు: 'శ్రీకృష్ణుడు ఉదయమే ఇచటికి రాగలడు. రావటానికి మునుపే అన్ని పనులు చేయాలి సుమా' అని వారిని పంపివేశాడు. 'హస్తినాపురంలో ఉత్సవం చాటండి' అని మరి కొందరిని ఆజ్ఞాపించాడు. 'రకరకాల సుగంధ ద్రవ్యాలు, పూలదండలు, రత్నాల నగలు, చిత్ర, విచిత్రాలైన వస్త్రాలు సమకూర్చండి. రుచికరాలైన వంటకాలు, కమ్మని పానీయాలు సిద్ధం చేయండి' అంటూ ఆయా పనులలో ప్రవీణులైనవారిని నియమించాడు. ఆ తరువాత ధృతరాష్ట్రుడు విదురుడితో ఇట్లా అన్నాడు:

ధృతరాష్ట్రుండు విదురుతో శ్రీకృష్ణు రాక సెప్పి సంతోషించుట (సం. 5-84-20)

క. 'వివిధ మణిమయ రథంబులు। జవనాశ్వంబులును భద్రసామజములు ర
త్న విభూషణములు దాసీ। నివహంబులుఁ జాలఁ గృష్ణునికి నే నిత్తున్. 156

ప్రతిపదార్థం: వివిధ మణిమయ రథంబులున్= రకరకాల రతనాల రథాలను; జవన+అశ్వంబులును= వడిగల గుఱ్ఱలను; భద్ర సామజములున్= భద్రజాతికి చెందిన ఏనుగులను; రత్న విభూషణములున్= రతనాల ఆభరణాలను; దాసీ నివహంబులున్= పనికత్తెల గుంపును; చాలన్= ఎక్కువగా; నేను; కృష్ణునకున్; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: 'నేను శ్రీకృష్ణుడికి మణులు పొదిగిన రకరకాల రథాలను, వేగంగా పరుగెత్తగల గుర్రాలను, భద్రజాతికి చెందిన గజాలనూ, రతనాల సొమ్ములనూ, పెక్కుమంది పరిచారికలను ఇస్తాను.

క. మన యింట సుయోధను గృహ। మున దుశ్శాసను నికేతమున నెయ్యది యా
తని చూడ్కి కించు నదియె। ల్లను గౌరవమొప్ప నీవలయు మన మనఘా!' 157

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; మన+ఇంటన్= మన గృహంలో; సుయోధను గృహమునన్= దుర్యోధనుడి మందిరంలో; దుశ్శాసను నికేతమునన్= దుశ్శాసనుడి సౌధంలో; ఎయ్యది= ఏ వస్తువు; ఆతని చూడ్కికిన్+ఇంచున్= ఆయన చూపునకు ఇంపు గొలుపుతుందో; అది+ఎల్లను= దాని నంతయు; గౌరవము+ఒప్పన్= ఆదర మతిశయించునట్లు; మనము= మనం; ఈన్+వలయున్= (కృష్ణుడికి) ఇవ్వాలి.

తాత్పర్యం: విదురా! మన గృహంలో కాని, సుయోధనుడి మందిరంలోగాని; దుశ్శాసనుడి భవనంలోగాని గోవిందుడి చూపులకు ఏ వస్తువు ఇంపు కలిగిస్తుందో ఆ వస్తువును మన మెంతో ఆదరంతో ఆయనకు సమర్పించాలి.'

విశేషం: శ్రీకృష్ణు డేది కోరితే అది కానుకగా ఇచ్చి, అతడిని తన వాడిగా చేసికొని, పాండవులలో భేదాన్ని తీసికొనిరావాలని ధృతరాష్ట్రుడి రాజకీయ వ్యూహం. ఇది శత్రువుల పట్ల ప్రచ్ఛన్న భేదోపాయం. (సంపా.)

చ. అన విని యాతఁ డిట్లనియె 'నంబుజనాభునిఁ బ్రీతుఁ జేయు కం
టెను హితమైన కృత్య మొకటిం గలదే? యది మేలు; పాండునం
దనులకు నైదయూళ్ళు లుచితస్థితి నిచ్చుట కోపమన్న యు
న్కిన యిటు లోపు కల్మి ధరణీవర! యేమిట వచ్చెఁ జెప్పుమా! 158

ప్రతిపదార్థం: అనన్ విని= ధృతరాష్ట్రుడు అట్లు పల్కగా విని; ఆతఁడు+ఇట్లు+అనియెన్= విదురుడిట్లా చెప్పాడు; అంబుజ నాభునిన్= కమలము నాభియందుగల నారాయణుడిని; ప్రీతున్ చేయు కంటెను= సంతుష్టుడిని చేయటంకంటే; హితము+ఐన; కృత్యము= శ్రేయస్కరమైనపని; ఒకటిన్+కలదే!= మరొక టున్నదా?; అది మేలు= అట్లా చేయటం మంచిది; పాండునందనులకున్= నీ తమ్ముని కొడుకులకు; ఐదు+అ+ఊళ్ళు= కేవలం ఐదు గ్రామాలు; ఉచితస్థితిన్= న్యాయమైన రీతిలో; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; ఓపము= సహించలేము; అన్న+ఉన్కిన్+అ= అనెడు స్థితిలో; ఇటులు+ఓపు+కల్మి= వాసుదేవునకు నచ్చినవెల్లా ఇచ్చుటకు చాలిన సిరి; ధరణీవర!= ఓరాజా!; ఏమిటన్ వచ్చెన్= ఏవిధంగా లభించింది; చెప్పుమా!= తెలుపుము.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడిట్లా పలికిన పలుకులు విని విదురుడు ఇట్లా బదులు పలికాడు: 'మహారాజా! పరమాత్ముడైన శ్రీకృష్ణుడిని సంతుష్టుని చేయటంకన్న మంచిపని మరొక్కటి ఉంటుందా? అది మన కెంతో శ్రేయస్కరం. కాని, పాండు కుమారులకు న్యాయపద్ధతిలో కేవలం ఐదు గ్రామాలు ఇవ్వటానికి తగినశక్తిలేని మనకు శ్రీహరి కిష్టమైనవాటిని సమర్పించటానికి చాలినంత సంపద ఉన్నట్లుండి ఎట్లా లభించిందో చెప్పు.

విశేషం: ధృతరాష్ట్రుడి లోభగుణాన్ని వ్యంగ్యంగా అధిక్షేపించటం ఇందులో ధ్వని. అయినవాళ్ళకు అయిదూళ్ళివ్వలేని పీనాసి ఆ భగవంతుడికి సమర్పించగల సంపదను ఇవ్వగలడా? అని ప్రశ్న. 'భక్తి కలుగుకూడు పట్టెడైనను చాలు' అనే వేమన సూక్తి జ్ఞాపకం వచ్చేటట్లు మాటలాడాడు విదురుడు. (సంపా.)

ఉ. నీ తలఁ పేను గంటి నొకనేర్పున శౌరికి లంచమిచ్చి సం
ప్రీతునిఁ జేసి, కార్యగతి భేదము సేయఁగఁ జూచె; దింత బే
లైతిగదే! సుమేరు సదృశార్థముఁ జూచియుఁ బార్థుఁ బాయునే?
యాతఁడు? క్రీడి భక్తియును నచ్యుతు పెంపును నీ వెఱుంగవే? 159

ప్రతిపదార్థం: నీ తలఁపు= నీ ఉద్దేశం; ఏను= నేను; కంటిన్= తెలిసికొన్నాను; ఒక నేర్పునన్= ఒక చాతుర్యంతో; శౌరికిన్= శ్రీకృష్ణుడికి; లంచము+ఇచ్చి= లంచమిచ్చి; సంప్రీతునిన్+చేసి= సంతుష్టుడిని చేసి; కార్యగతిన్= రాయబారం విషయంలో; భేదము+చేయఁగన్+చూచెదు= భేదబుద్ధి పుట్టించాలని ఆలోచిస్తున్నావు; ఇంత బేల+ఐతి+కదే!= ఇంత మూఢుడవైనావు గదా! ఆతఁడు= కృష్ణుడు; సుమేరుసదృశ+అర్థమున్= మేరుపర్వతమంత ధనాన్ని; చూచియున్= చూచికూడా; పార్థున్= అర్జునుడిని; పాయునే?= విడుస్తాడా?; క్రీడిభక్తియును= అర్జునుడి పరమప్రేమనూ; అచ్యుతు పెంపును= గోవిందుడి గొప్పతనమునూ; నీవు; ఎఱుంగవే?= తెలియవా?

తాత్పర్యం: మహారాజా! నీ ఉద్దేశం నేను గ్రహించాను. ఏవో కానుకలు సమర్పించే మిషతో శ్రీకృష్ణుడికి లంచమిచ్చి, తృప్తిపరిచి పాండవుల విషయమై కార్యవిధానంలో భేదబుద్ధి కల్పించవలెనని యత్నిస్తున్నావు. నీ వెంత తెలివిమాలినవాడవో చెప్పలేను. నీవు మేరుపర్వతంతో సమానమైన ధనం సమర్పించినప్పటికీ, ఆయన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అర్జునుడిని విడువడు. వాసుదేవుడిపై, పార్థుడికున్న భక్తి ప్రపత్తు లెటువంటివో, గోపాలదేవుడి గొప్పతన మెటువంటిదో తెలియనివాడవా నీవు?

విశేషం: ధృతరాష్ట్రుడు లోభి. శ్రీకృష్ణుడిని లోభపెట్టి వశం చేసికొనవలెనని యత్నించటం ఎంత అవివేకమో విదురుడు హెచ్చరించాడు. నరనారాయణుల సంబంధం విభజించలేని భక్తి ప్రేమ సూత్రాలతో కట్టబడి ఉన్నది. దానిని మేరు పర్వతమంత ధనాన్నిచ్చినా భేదించ లేవని హెచ్చరించాడు. వారిది అర్థార్థ సంబంధం కాదని తెల్పాడు. శ్రీకృష్ణుడు భక్తికి వశమవుతాడు కాని, లంచాలతో కాదని తేల్చి చెప్పాడు. ధృతరాష్ట్రుడి నైచ్యం ఈ భేదోపాయంలో తేటపడుతుంది. (సంపా.)

తే. అర్జునుఁడు ప్రాణతుల్యుండు హరికి నట్లు । గాన జలపూర్ణ మంగళ కలశమునకుఁ
బాద్యమునకును గుశలసంప్రశ్నమునకు । మిగుల నొండు జనార్దను మెచ్చుగాదు. 160

ప్రతిపదార్థం: హరికిన్= శ్రీకృష్ణునికి; అర్జునుఁడు; ప్రాణతుల్యుండు= ప్రాణంతో సమానమైనవాడు; అట్లు+కానన్= అందువలన; జలపూర్ణ మంగళ కలశమునకున్= మంగళార్థమై నీటితో నిండిన కుంభమునకును; పాద్యమునకును= కాళ్ళు కడుగుకొనే నీళ్ళకును; కుశల సంప్రశ్నమునకున్= యోగక్షేమాలు అడుగుటకంటెను; మిగులన్= మించి; ఒండు= మరొక్కటి; జనార్దను మెచ్చు+కాదు= శౌరికి ప్రీతిని కలిగించదు.

తాత్పర్యం: అర్జునుడు శ్రీకృష్ణుడికి ప్రాణసమానుడు కనుక మంగళాచారానికైన జలపూర్ణ కుంభానికి మించి, కాళ్ళు కడుగుకొనే నీళ్ళకు మించి, యోగక్షేమాలు పరామర్శించటానికి మించి మరేదీ అతడికి ప్రీతికరంకాదు.

క. మన కడకు నేమి కార్యం । బునకై యాతండు వచ్చెఁ బూనికిమెయి నా
పని వంచింపక చేయుట । విను మతనికిఁ బ్రియము; తక్కువేయును నేలా?' 161

ప్రతిపదార్థం: వినుము; ఆతండు= శ్రీకృష్ణుడు; మన కడకున్= మన దగ్గరకు; ఏమి కార్యంబునకై= ఏ పని మీద; వచ్చెన్= వచ్చాడో; పూనికి మెయిన్= శ్రద్ధతో; ఆ పనిన్= ఆ కార్యాన్ని; వంచింపక= మోసగించక; చేయుట= చేయటం; అతనికిన్= హరికి; ప్రియము= ఇష్టం; తక్కు= ఇతరములు; వేయునున్+ఏలా?= వేయి చేయట మెందుకు?

తాత్పర్యం: మహారాజా! నా మాటలు వినుము. శ్రీకృష్ణుడు మన దగ్గరకు ఏ పని మీద వస్తున్నాడో ఆ పనిని మోసగించక నెరవేర్చటం అతడికి ఇష్టం. ఆ పనిని కాదని మనం ఎన్ని చేసినా ఏమి లాభం?' (ఏమీ లాభం లేదని భావం).

వ. అనిన విని దుర్యోధనుండు దండ్రి కిట్లనియె: 162

తాత్పర్యం: విదురుడి మాటలు విని సుయోధనుడు జనకుడితో ఇట్లా అన్నాడు:

క. 'అది విదురు చెప్పినట్టిద । తుదిఁ గృష్ణుఁడు పాండుసుతులతో వేఱగునే?
పదనెఱుఁగ కీఁగియిచ్చిన । బెదరి రనరె యొచ్చెమైనఁ బిమ్మట నగరే! 163

ప్రతిపదార్థం: అది విదురు చెప్పిన+అట్టిది+అ= విదురుడు చెప్పిన ఆ మాట వాస్తవం; తుదిన్= కడకు; కృష్ణుఁడు; పాండుసుతులతోన్= పాండవుల నుండి; వేఱు+అగునే?= విడివడునా?; పదను+ఎఱుఁగక= మనసు యొక్క పాకం

తెలియక; ఈఁగి+ఇచ్చినన్= కానుకలు(దానాలు) ఇస్తే; బెదరిరి+అనరె?= కౌరవులు భయపడినా రనరా?; ఒచ్చెము+ఐనన్= న్యూనత కలిగితే; పిమ్మటన్= పిదప; నగరె?= పరిహసింపరా?

తాత్పర్యం: 'కృష్ణుడి తత్త్వ మెట్టిదో విదురుడు చెప్పాడు. అతడు పాండవులను ఎన్నటికీ విడువడు. అతడి మనః పరిపాకం తెలియక కానుకలిస్తే మనం భయపడ్డామని అంటారు. కార్యంలో న్యూనత కలిగితే పిదప మనలను అందరూ పరిహసిస్తారు.

ఆ. అతఁడు పూజనీయుఁ డగు; నే నెఱుంగుదు; । నైన ధనము లీఁగి యనదతనము
వచ్చుఁ; బెచ్చు పెరిఁగి వైరులు గర్వింతు; । రేల పగ యడంగు నిట్టులైన?' 164

ప్రతిపదార్థం: అతఁడు= శ్రీకృష్ణుడు; పూజనీయుఁడు+అగున్= పూజించదగిన వాడే ఔతాడు; ఏన్+ఎఱుంగుదున్= నాకు తెలుసు; ఐనన్= కాని; ధనములు+ఈఁగిన్= ధనావళి ఇవ్వటంచేత; అనదతనము+వచ్చున్= మనకు అల్పత్వం కలుగుతుంది; పెచ్చుపెరిఁగి= అంతకంతకు విజృంభించి; వైరులు= మన విరోధులు; గర్వింతురు= అహంకరిస్తారు; ఇట్టులు+ఐనన్= ఇట్లు కావిస్తే; పగ+ఏల+అడంగున్?= శత్రుత్వం ఎట్లా అణగిపోతుంది?

తాత్పర్యం: శ్రీకృష్ణుడు పూజించటానికి తగినవాడని నాకు తెలుసు. కాని, అతడికి మనం ధనాలిస్తే మన అల్పత్వం బయటపడుతుంది. వైరులు అంతకంతకూ అహంకరిస్తారు. ఇందువలన విరోధం శమించదు.'

క. అనవుడు భీష్ముఁడు ధృతరా । ష్ట్రున కిట్లను 'నీవునుం గొడుకు నేమే ని
చ్చిన నొకటి యీఁగి లేకు । న్నను వేఱొక్కటి దలంచునా కేశవుఁడున్. 165

ప్రతిపదార్థం: అనవుడున్= దుర్యోధనుడు అట్లా పలుకగనే; భీష్ముడు; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; నీవునున్; కొడుకున్; ఏమేన్= ఏమైనను; ఇచ్చినన్+ఒకటి= ఇస్తే ఒకవిధంగా; ఈఁగి లేకున్నను= ఇవ్వక పోయిననూ; వేఱు+ఒక్కటి= మరొక్కటి; కేశవుఁడున్= శ్రీకృష్ణుడు కూడా; తలంచునా?= భావిస్తాడా?

తాత్పర్యం: సుయోధనుడు పలికిన తర్వాత భీష్ముడు ధృతరాష్ట్రుడిని జూచి 'నీవూ, నీ కొడుకూ ఏమైనా ఇస్తే ఒక విధంగానూ, ఇవ్వకపోతే మరొక విధంగానూ ఆ శ్రీకృష్ణుడుకూడా భావిస్తాడా?

క. విను, మతఁడు సేయఁబూనిన । పని దప్పింపంగరాదు పాండవులం దే
ర్పను గృష్ణుఁడు వెరవుగఁ జొ । చ్చిన మే లాపురుషు పనుపు సేయుము పుత్త్రా! 166

ప్రతిపదార్థం: పుత్త్రా!= వత్సా!; వినుము= నా మాటలు వినుము; అతఁడు= కృష్ణుఁడు; చేయన్+పూనిన పనిన్= చేయటానికి నిర్ణయించిన కార్యాన్ని; తప్పింపంగన్ రాదు= తొలగద్రోయటానికి శక్యం కాదు; పాండవులన్= పాండవులను; తేర్పను= ప్రసన్నులను కావించటానికి; కృష్ణుఁడు= పురుషోత్తముడు; వెరవుగన్+చొచ్చినన్= యుక్తంగా ఇందు ప్రవేశించిన; మేలు= మంచిది; ఆ పురుషు పనుపు చేయుము= ఆ మహానుభావుడి ఆజ్ఞ నిర్వర్తించుము.

తాత్పర్యం: కుమారా! నారాయణుడు చేయదలచిన పనిని తప్పించటానికి మన తరం కాదు. ఆయన పాండవుల నుద్ధరించటానికి ఇక్కడికి రావటం సమంజసమే. ఆ మహాత్ముడి ఆజ్ఞ శిరసావహించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **నారాయణుండు ధర్మా। ర్థారూఢము గాఁగఁ బలుకు నది నీవును నీ**
వారును గైకొని యెంతయు। గారవమునఁ జేయ నెల్ల కార్యంబు నగున్.' 167

ప్రతిపదార్థం: నారాయణుండు= శ్రీకృష్ణుడు; ధర్మ+అర్థ+అరూఢము కాఁగన్= ధర్మార్థాలతో ప్రసిద్ధమయ్యేటట్లుగా; పలుకునది= చెప్పునట్టిదానిని; నీవును; నీ వారును= నీ మిత్రులును; కైకొని= స్వీకరించి; ఎంతయున్= మిక్కిలి; గారవమునన్+చేయన్= ఆదరంతో చేస్తే; ఎల్లకార్యంబున్+అగున్= పనులన్నీ చక్కబడతాయి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ధర్మార్థయుక్తంగా చెప్పే మాటలు నీవూ, నీవారూ గ్రహించి మిక్కిలి ఆదరంతో ఆ ప్రకారంగా చేస్తే పనులన్నీ సఫలమౌతాయి.'

క. **అనుటయు సుయోధనుఁడు భీ। ష్మున కిట్లనుఁ 'బాండురాజు సుతులకు నిమ్మే**
దిని హరి సగపా లీఁ దగు। ననుఁ బో, యే నీను, గాని యది యట్లుండెన్. 168

ప్రతిపదార్థం: అనుటయున్= అని పితామహుడు చెప్పగా; సుయోధనుఁడు= దుర్యోధనుడు; భీష్మునకున్= భీష్ముడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; హరి= శ్రీకృష్ణుడు; పాండురాజ సుతులకున్= పాండురాజు కుమారులకు; ఈ+మేదినిన్= ఈ భూమిలో; సగపాలు= అర్ధ భాగం; ఈన్+తగున్+అనున్+పో= ఇవ్వటం యోగ్యం అని అంటాడు; ఏన్= నేను; ఈను= ఇవ్వను; కాని; అది+అట్లు+ఉండెన్= ఆ విషయమంతే.

తాత్పర్యం: భీష్ముడి మాటలు విని దుర్యోధనుడు ఆయనతో ఇట్లా అన్నాడు: 'శ్రీకృష్ణుడు పాండవులకు అర్ధరాజ్య మిమ్మని చెపుతాడు; నేను ఇవ్వను. ఆ విషయం వదలిపెట్టండి.

విశేషం: పాండవులకు రాజ్యభాగం ఇవ్వనని దుర్యోధనుడు ఉత్తర గోగ్రహణ సమయంలో భీష్ముడికి చెప్పాడు. (విరా. 4-236) అతడా మాట మీదనే ఉన్నాడు. (సంపా.)

వ. **వేఱొక కార్యంబు సేయం దలంచితి; నది వినుము! పాండవులకు నేడుగడయు జనార్దనుం; డతనింబట్టి బంధించిన ఱెక్కలు విఱిగిన పులుఁగులుం బోలె వారు నాకు విధేయు లగుదురు; పాంచాల యాదవాదులైన తదీయ బంధు మిత్రులు నా వశంబున వర్తిల్లుదురు; సమస్త దేశంబులు నేన యేలుదు; దీనికిం దగిన యుపాయ సహాయంబు లనువు సేసెద; నీవింక నేమి సెప్పెదవు చెప్పుమనిన విని యతిఘోరంబగు నవ్విచారంబునకు నమాత్యసహితంబుగా సంతప్తచిత్తుండై వైచిత్రవీర్యుండు కొడుకున కిట్లనియె: 169**

ప్రతిపదార్థం: వేఱు+ఒక కార్యంబు= మరొక పని; చేయన్+తలంచితిన్= చేయటానికి సంకల్పించాను; అది వినుము= ఆ పని ఏమిటో వినుము; జనార్దనుండు= శ్రీకృష్ణుడు; పాండవులకున్; ఏడు+కడయున్= గురువు, తల్లి, తండ్రి, పురుషుడు, విద్య, దైవం, దాత అని సప్త ప్రకారాలుగా రక్షకమైఉన్నవాడు; అతనిన్ పట్టి బంధించినన్= అతడిని పట్టుకొని కట్టిపడవేస్తే; వారు= పాండవులు; ఱెక్కలు విఱిగిన= రెక్కలు తెగిన; పులుఁగులున్+పోలెన్= పక్షుల మాదిరిగా; నాకున్; విధేయులు+అగుదురు= అణగి మణగి ఉంటారు; పాంచాల యాదవ+ఆదులు+ఐన= ద్రుపదుడు, యాదవులు మొదలైన; తదీయ బంధు మిత్రులు= పాండవులయొక్క చుట్టాలు, హితులు; నా వశంబునన్+వర్తిల్లుదురు= నా అధీనంలో మెలగుతారు; సమస్త దేశంబులు; నేను+అ= నేనే; ఏలుదున్= పాలిస్తాను; దీనికిన్ తగిన; ఉపాయ సహాయంబులు= ఉపాయం, తోడ్పాటు; అనువు+చేసెదన్=

సిద్ధపరుచుకొంటాను; నీవు; ఇంకన్; ఏమి చెప్పెదవు చెప్పుము; అనినన్+విని= దుర్యోధనుడనగా విని; అతి ఘోరంబు+అగు= మిక్కిలి దారుణమైన; ఆ+విచారంబునకున్= అతడి ఆలోచనకు; అమాత్య సహితంబుగాన్= మంత్రులతో కూడ; సంతప్త చిత్తుండు+ఐ= ఉడుకుతున్న మనస్సు కలవాడై; వైచిత్రవీర్యుండు= విచిత్రవీర్యుడి కొడుకైన ధృతరాష్ట్రుడు; కొడుకునకున్= దుర్యోధనుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: మరొక పని చేయదలచాను. అదేమిటో వినుము. పాండవులకు గురువు, తల్లీ, తండ్రీ, పురుషుడూ, విద్యా, దైవం, దాత అయి సర్వ విధాల రక్షిస్తున్న ఆ శ్రీకృష్ణుడిని పట్టి బంధిస్తే వారు రెక్కలు విరిగిన పక్షులై నాకు అణగి మణగి ఉంటారు. పాంచాలపతి, యాదవులు మొదలైన వారి చుట్టపక్కాలు, మిత్రులు నేను చెప్పినట్లు మెలగుతారు. దేశాలన్నీ నేనే ఏలుతాను. ఇందుకు తగిన ఉపాయం, తోడ్పాటు సిద్ధం చేసికొంటాను. ఇక నీవేమి చెప్పదలచావో చెప్పుము' అన్నాడు. మిక్కిలి దారుణమైన అతడి ఆలోచనకు మంత్రులతో కూడిన ధృతరాష్ట్రుడు తన హృదయం ఉడికిపోగా సుయోధనుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. అలం: ఉపమ. శ్రీకృష్ణుడు దూరమైతే పాండవులు రెక్కలు తెగిన పక్షులవలె విలవిలలాడి తనకు వశమవుతారని దుర్యోధనుడి వ్యూహం. ఇది భేదం కాదు ద్రోహం. ఇది కుటిలోపాయం. దుష్టనీతి. ధర్మనీతి ఈ ఉపాయాన్ని అంగీకరించదు. పైపెచ్చు గర్హిస్తుంది.

2. దుర్యోధనుడు బరి తెగించి తన దుర్నీతిని అందరి ముందూ ప్రకటించి, ఎవరేమన్నా తన యత్నం కొనసాగుతుందని ప్రకటించి ఉద్ధతుడివలె వ్యవహరించాడు. (సంపా.)

క. **'ఓహో! యిట్లనుట జగ । ద్ద్రోహం; బిమ్మాట మఱవు; దూతత్వంబున్**
మాహాత్మ్యంబును ధర్మో । త్సాహంబును విను మబాధ్యతకుఁ గారణముల్. **170**

ప్రతిపదార్థం: ఓహో!= ఔరా!; ఇట్లు+అనుట= శ్రీకృష్ణుడిని బంధిస్తానని పలకటం; జగత్+ద్రోహంబు= లోకానికి కీడు చేయటం; ఈ+మాట= ఇపుడు నీవన్నమాట; మఱవు= మరచిపొమ్ము; వినుము= నా మాట వినుము; దూతత్వంబున్= రాయబారితనం; మాహాత్మ్యంబున్= మహానుభావత్వం; ధర్మ+ఉత్సాహంబును= ధర్మానికై పాటువడటం; అబాధ్యతకున్= బాధించబడ కుండుటకు; కారణముల్= హేతువులై ఉన్నవి.

తాత్పర్యం: 'ఔరా! శ్రీకృష్ణుడిని బంధిస్తాననటం లోకానికంతటికీ కీడు చేసినట్లేకదా! ఈ దురాలోచన మానుము. రాయబారిగా వచ్చినవాడిని, మహాత్ముడిని, న్యాయంకొరకు పాటువడేవాడిని బాధించకూడదు.

విశేషం: ఊహించని విషయాన్ని ఒక్కసారిగా విన్నప్పుడు కలిగే ఆశ్చర్యభావం, వినకూడని విషయం విన్నప్పుడు కలిగే ఉద్వేగం ఈ పద్యంలోని చిత్తవృత్తి. దుర్యోధనుడి వ్యూహం బాధ్యతారహితమైనదని ధృతరాష్ట్రుడు ఉద్వేగంతో పేర్కొన్నాడు. దానికి కారణాలు మూడింటిని చెప్పాడు. 1. శ్రీకృష్ణుడు దూత. అతడిని బంధించరాదు. 2. అతడు మహాత్ముడు. మహాత్ములకు కీడు చేస్తే హాని కలుగుతుంది. 3. అతడు ధర్మసాధనోత్సాహంతో వస్తున్న పుణ్యాత్ముడు. అతడికి కీడు చేయటం అధర్మం. అందువలన శ్రీకృష్ణ నిర్బంధం సర్వత్రా నిరసించతగిందని తెలిపాడు. (సంపా.)

క. **ఈ కారణములు గలవను । నా కొలఁదియె వాసుదేవుఁ? డదిగాకయుఁ గీ**
డే కురువంశమున కతని । రాక? యతం డేమి సేసెరా పాపాత్మా!' **171**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఈ కారణములు గలవు= ఈ హేతువులన్నీ శ్రీకృష్ణుడి విషయంలో ఉన్నవి; అను+ఆ కొలఁదియె?= అన్నంత మాత్రమేనా?; వాసుదేవుఁడు= శ్రీకృష్ణుడు (అతడు జగద్వ్యాపకుడైన భగవంతుడు); అదికాకయున్= అంతేకాక; అతనిరాక= ఆ మహనీయుడి ఆగమనం; కురువంశమునకున్= కురుకులానికి; కీడే?= హానికరమా?; అతండు= కృష్ణుడు; ఏమి చేసెరా?= ఏమి తప్పు చేశాడురా?; పాప+ఆత్మా?= పాపచిత్తుడా!

తాత్పర్యం: దౌత్యం నెరపుటకు వస్తున్నవాడు, గొప్పవాడు, ధర్మం నిలపటానికి పాటుపడేవాడు అయిన గోపాలదేవుడిని నొప్పించరాదు. అతడు సామాన్యు డనుకొన్నావా? సకల జగద్వ్యాపకుడైన శ్రీమన్నారాయణుడు. ఇంతేకాదు. అతడిరాకవలన మన కురువంశానికి ఏమి హాని? పాపీ! పట్టి బంధించటానికి అతడు చేసిన తప్పేమిటి?'

విశేషం: 1. శ్రీకృష్ణుడిని బంధించటం ఎంత అధర్మమో, అంత అసంబద్ధం. సామాన్యుడైతే బంధించవచ్చు ననుకొంటే శ్రీకృష్ణుడు అసామాన్యుడు. కీడు చేసిన వాడైతే అతడికి కీడు తలపెట్టటం లోకన్యాయం. కాని, కురువంశానికి హితం కోరి వచ్చేవాడిని బంధించటం దరిచేరిన అదృష్టాన్ని దూరం చేసికొనటమే. ఈ మాటలన్న తరువాత ధృతరాష్ట్రుడు నిగ్రహించుకొనలేక బావురుమన్నట్లు 'పాపాత్మా! శ్రీకృష్ణుడు నీకేం అపకారం చేశాడురా?' అని ఎలుగెత్తి ఆక్రోశించాడు.

2. ఇది చిత్తశుద్ధితో అన్న మాటలుగానూ ఉన్నాయి, అందరి ముందు కొడుకును మందలిస్తున్నట్లూ ఉన్నాయి. తండ్రిమాట కొడుకు లెక్కచేయడని చెప్పుకొంటాడు. ఎవరైనా చెప్పగలిగితే చెప్పి దుర్యోధనుడిని మార్చండని పిలుపునిస్తాడు. పైకి ఎన్ని పలికినా లోన పుత్రుడి పక్షంవాడే ధృతరాష్ట్రుడు. అతడి నీతివాక్యాలు నీటి బుడగలు. (సంపా.)

వ. **అని యదల్చె నప్పుడు గాంగేయుం డాంబికేయున కిట్లను 'నీ కొడుకు ప్రాణగొడ్డంబైన కార్యంబు సేయందలంచె దామోదరు నిట్లు సేయం జూచెనేనిం దానును దనవారును వినాశంబుఁ బొందుదు; రింతియ; యిది సేసిరి సేయరైరి యమ్మహాత్మునెడ నీయపరాధంబు విచారించిన దుష్టాత్ములు నష్టాత్ముల కాక, యని పలికి యేనిట్టిదాని వినంజాల' ననుచు మొగంబు గంటువెట్టుకొని దిగ్గన లేచిపోయె, ధృతరాష్ట్రుండును దుర్యోధనునితో 'నిటువంటి కొఱగాములు మనంబునం దలంచినప్పుడు సేయంగలవాఁడవు గావున దీనం జేటువచ్చు నుడుగుమయ్య' యనిచెప్పి యతనిం దక్కినవారినిం బోవంబనిచి తగిన వర్తనంబున నుండె; మఱునాఁడు. 172**

ప్రతిపదార్థం: అని+అదల్చెన్= అని కోపంతో ధృతరాష్ట్రుడు గద్దించాడు; అప్పుడు; గాంగేయుండు= గంగాపుత్రుడగు భీష్ముడు; ఆంబికేయునకున్= అంబ కొడుకైన ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; నీ కొడుకు; ప్రాణగొడ్డంబు+ఐన= ప్రాణసంకటం కలిగించే; కార్యంబు చేయన్+తలంచెన్; పని చేయటానికి తలపెట్టాడు; దామోదరున్= వనమాలా విరాజితుడైన శ్రీకృష్ణుడిని; ఇట్లు; చేయన్+చూచెన్+ఏనిన్= చేయటానికి యత్నిస్తే; తానును= అతడూ; తనవారును= అతడికి సంబంధించిన వాళ్ళూ; వినాశంబున్ పొందుదురు= నాశనాన్ని పొందుతారు; ఇంతి+అ= ఇది నిశ్చయం; ఇది చేసిరి+చేయరు+ఐరి= ఈ పని చేసినా; చేయకమానినా; ఆ+మహాత్ము+ఎడన్= ఆ మహానుభావుడి విషయమై; ఈ+అపరాధంబు= ఈ దోషం; విచారించిన= సంకల్పించిన; దుష్ట+ఆత్ములు= పాపహృదయులు; నష్ట+ఆత్ములు+అ కాక= నాశనమై పోతారు పో; అని పలికి= అంటూ భీష్ముడు వచించి; ఏను= నేను; ఇట్టిదానిన్= ఇటువంటి పాపపు మాటను; వినన్+చాలన్= విని భరించలేను; అనుచున్; మొగంబు= ముఖం; గంటు+పెట్టుకొని= ముడుచుకొని; దిగ్గనన్= శీఘ్రంగా; లేచిపోయెన్= ఆ చోటు విడిచి వెళ్ళిపోయాడు; ధృతరాష్ట్రుండును; దుర్యోధనుడితో; ఇటువంటి, కొఱగాములు= అకార్యములు; మనంబునన్= మనస్సులో; తలంచిన+అప్పుడు= అనుకొన్న వెంటనే; చేయన్+కలవాఁడవు= చేసే స్వభావం కలవాడివి; కావునన్= కాబట్టి; దీనన్= ఈ

పాపకార్యాచరణంవలన; చేటువచ్చున్= కీడు మూడుతుంది; ఉడుగుము+అయ్య!= నాయనా, ఈ చెడుపని చేయవద్దు; అని చెప్పి; అతనిన్; తక్కినవారినిన్= మిగిలిన వారిని; పోవన్+పనిచి= వెళ్ళిపొండని చెప్పి; తగిన వర్తనంబునన్+ఉండెన్= ధృతరాష్ట్రుడు తన పనిలో తాను ఉన్నాడు; మఱునాఁడు= ఆ మరుసటి రోజు.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు తన కుమారుడిని కసరినాడు. అప్పుడు భీష్ముడు ధృతరాష్ట్రుడితో 'నీ కుమారుడు ప్రాణసంకటమైన పనికి పూనుకొన్నాడు. గోవిందుడికి ఇట్లా కీడు చేయటానికి యత్నిస్తే తానూ తనవారూ నాశనమైపోతారు. ఈ పని చేసినా చేయకున్నా ఆ మహాపురుషుడి యెడ ఇట్టి అపకారం తలపెట్టిన దుష్టులు నష్టమై పోతారు. నేనిటువంటి మాటలు వినలేను' అని పలికి ముఖం ముడుచుకొని అక్కడనుండి వెంటనే లేచివెళ్ళాడు. ధృతరాష్ట్రుడు కొడుకుతో 'ఇటువంటి అకార్యాలను ఎప్పుడు మనసులో అనుకుంటావో అప్పుడే వాటిని చేసి తీరుతావు. నాయనా! ఇట్లాంటి పాడుపని చేస్తే కీడుమూడుతుంది. కనుక ఈ పని విరమించుకొనుము' అని చెప్పి అతడినీ, తక్కినవారినీ వెళ్ళండని చెప్పి, తన పాటికి తాను ఉండిపోయాడు. ఆ మరునాడు.

విశేషం: 1. దుర్యోధనుడి దుష్టవ్యూహానికి భీష్ముడు అసమ్మతి తెలియజేయటమే కాక, దానివలన కలిగే దుష్పరిణామాలను కూడా తెలియజెప్పాడు. 'వినాశకాలే విపరీత బుద్ధిః' అని భావించి సభనుండి తొలగిపోయాడు. పాండవులలో భేదాన్ని కలిగించాలని తలంచిన ధృతరాష్ట్ర దుర్యోధనుల పన్నాగాలు విఫలమై, వారి పక్షంలోనే భేదోపాయం ప్రవర్తిల్లింది. మహాత్ముడైన శ్రీకృష్ణుడి రాకయే ఇన్ని కలతలకు కారణమైతే, ఆయన దౌత్యం ఎంతటి విపరీత పరిణామాలకు దారితీస్తుందో చెప్పలేమన్న భావం ధ్వని.

2. 'అకార్యాలను అనుకొన్నప్పుడే ఆచరణలో పెట్టటం దుర్యోధనుడి స్వభావం'- అని ధృతరాష్ట్రుడి వ్యాఖ్య. దానిని వారించాడు. కాని, దుర్యోధనుడు వినడని తెలుసు. ధృతరాష్ట్రుడు తన అధికారాన్ని వినియోగించి కొడుకును దండించడు. అదుపులేని అవినీతికి ప్రభువుగా ఉన్న ధృతరాష్ట్రుడి ద్వంద్వనీతికి ఈ సన్నివేశం ఉదాహరణం. (సంపా.)

సీ. **కాలోచితములగు కరణీయములు దీర్చి । కమలనాభుఁడు రేపకడయ కదలి**
తనుఁ గుశస్థలవాసు లనుప రా నందఱ । నాదరంబున నిల్పి యరుగునపుడు
గజ్జంబులును బండ్లు గంధమాల్యంబులు । ధృతరాష్ట్ర సుతుఁడు పుత్తేరఁ బ్రీతి
నెడ నెడఁ గొనివచ్చి యిచ్చిన వాని నె । ల్లను వేడ్క ననుభవించిన విధంబు

తే. **సలిపి, యనుభవ మొల్లక చనఁగ, నెదుర । బాహ్లిక ద్రోణ భీష్మాది బంధుమిత్త్ర**
గణము సర్వభూపాల లోకంబుఁ గురుకు । మార వర్గంబుఁ బుత్తెంచె మనుజవిభుఁడు. **173**

ప్రతిపదార్థం: కమలనాభుఁడు= పద్మము బొడ్డునగల శ్రీహరి; కాల+ఉచితములు+ఐన= వేళకు తగినట్టి; కరణీయములు తీర్చి= చేయదగిన పనులు చేసి; రేపకడ+అ= ప్రాతఃకాలంలోనే; కదలి= బయలుదేరి; తనున్= తనను; కుశస్థలవాసులు= కుశస్థలంలో ఉన్నవారు; అనుపన్+రాన్= సాగనంపటానికిరాగా; అందఱన్= వారినందరినీ; ఆదరంబునన్= మన్ననతో; నిల్పి= ఆగండని చెప్పి; అరుగు+అపుడున్= వెళ్ళేసమయంలో; కజ్జంబులును= భక్ష్యాలను; పండ్లున్= ఫలాలను; గంధమాల్యంబులున్= చందనం; పూలదండలు; ధృతరాష్ట్ర సుతుఁడు= దుర్యోధనుడు; పుత్తేరన్= పంపగా; ప్రీతిన్= సంతోషంతో; ఎడన్+ఎడన్= అక్కడక్కడ; కొనివచ్చి= తీసికొనివచ్చి; ఇచ్చినవానిన్+ఎల్లను= తన కిచ్చిన వాటినన్నిటినీ; వేడ్కన్= అభిలాషతో; అనుభవించిన విధంబు సలిపి= అనుభవించినట్లుగా నటించి; అనుభవము+ఒల్లక= నిజంగా ఆయా

పదార్థాలను అనుభవించక; చనఁగన్= వెళ్ళుతుండగా; మనుజవిభుఁడు= నరపతి అయిన ధృతరాష్ట్రుడు; బాహ్లిక ద్రోణ భీష్మ+ఆది= బాహ్లికుడు, ద్రోణుడు, భీష్ముడు మొదలైన; బంధు మిత్ర గణమున్= చుట్టాలయొక్క హితుల యొక్క సముదాయాన్ని; సర్వభూపాల లోకంబున్= సమస్త రాజసమూహాన్ని; కురుకుమార వర్గంబున్= తన కొడుకుల యొక్క మొత్తమును; ఎదురన్ పుత్తెంచెన్= శ్రీకృష్ణుడికి ఎదురుకోలు జరపటానికి పంపాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ప్రాతఃకాల విధు లన్నిటినీ నెరవేర్చి ఉదయమే హస్తినాపురికి బయలుదేరనుండగా కుశస్థల నివాసులు తనను సాగనంపటానికై దగ్గరకు వచ్చారు. వారినందరినీ ఆగండని నిల్పి శౌరి బయలుదేరాడు. అతడు వెళ్ళుతున్నప్పుడు దుర్యోధనుడు పంపగా పిండివంటలు, పండ్లు, చందనము, పూలదండలు దారిలో అక్కడక్కడా ప్రీతితో ఆయనకు తెచ్చి ఇచ్చారు. ఇచ్చినవాటినెల్ల నారాయణుడు అభిలాషతో అనుభవించినవానివలె నటించాడు. నిజానికి వాటి నతడు అనుభవించలేదు. ఇట్లా శ్రీహరి హస్తినాపురికి వస్తుండగా ధృతరాష్ట్ర మహారాజు- బాహ్లికుడు, భీష్ముడు, ద్రోణుడు మొదలైన బంధు మిత్ర కోటిని, సకల రాజ సమూహాన్ని, తన పుత్రులను ఆయనకు ఎదురుకోలు సల్పటానికి పంపాడు.

శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రుని మందిరంబునకుఁ బోవుట (సం. 5-87-1)

వ. **ఇట్లు దుర్యోధనుం డొక్కరుండు దక్కనెల్లవారిం దూర్యాది శోభన పదార్థంబులు సమకట్టి ధృతరాష్ట్రుండు వనుప నెదుర్కొనిన వాసుదేవుండు వారల నందఱ నయ్యైతెఱంగుల సంభావించి, కృతవర్మ దమవాఁడు గావున నతనికి సవిశేష స్నేహంబు సేసి, యతండు సేరువరా సమస్త జనంబులుం బరివేష్టింపం జని తన రాకకు నలంకృతంబును బ్రమోద చాపల సుభగ జనంబును నైన పురంబు సొచ్చి, రాజమార్గంబున నరుగు నవసరంబున మౌక్తిక మిళితంబులు బహుగంధ లుళితంబులు నగు నక్షత ప్రకరంబులును బుష్ప నికరంబులునుం జల్లుచు సంతసిల్లుచు మ్రొక్కుచుఁ జొక్కుచు నిరుగెలంకుల రమ్యహర్మ్యంబులపై నిలిచి పొలిచి కనుంగొను నంగనాజనంబులు తమలోన.** **174**

ప్రతిపదార్థం: ఇట్లు; దుర్యోధనుండు; ఒక్కరుండు తక్కన్= ఒకడు తప్ప; ఎల్లవారిన్= అందరినీ; తూర్య+ఆది శోభన పదార్థంబులు= వాద్యాలు మొదలైన మంగళ వస్తువులు; సమకట్టి= సిద్ధపరిచి; ధృతరాష్ట్రుండు; పనుపన్= పంపగా; ఎదుర్కొనినన్= ఎదురురాగా; వాసుదేవుండు; వారలన్+అందఱన్= వారినందరినీ; అయ్యై తెఱంగులన్ సంభావించి= ఆయా విధాల ఆదరించి; కృతవర్మ; తమవాఁడు కావునన్= తమ భోజ వంశస్థుడగుటచేత; అతనికిన్+సవిశేష స్నేహంబు+చేసి= ఆతనిపై మిక్కుటమైన స్నేహం కనబరిచి; అతండు= ఆ కృతవర్మ; చేరువన్ రాన్= వెంట వస్తుండగా; సమస్త జనంబులున్+పరివేష్టింపన్= జనులందరూ తన చుట్టూ బలసిఉండగా; చని= వెడలి; తన రాకకున్; అలంకృతంబును= అలంకరించబడినదీన్నీ; ప్రమోదచాపల సుభగ జనంబును= సంతోషంచేత సంచలిస్తున్న సుందర జనములు కలది; ఐన= ఐనట్టి; పురంబు చొచ్చి= హస్తినాపురం ప్రవేశించి; రాజమార్గంబునన్; అరుగు+అవసరంబున్= వెళుతున్న సమయంలో; మౌక్తిక మిళితంబులు= ముత్యాలతో చేరినవియు; బహుగంధ లుళితంబులు= పెక్కు సువాసనలతో కూడినవి; అగు= ఐనట్టి; అక్షత ప్రకరంబులును= అక్షతల సమూహాలును; పుష్పనికరంబులును= పువ్వుల యొక్క మొత్తములును; చల్లుచున్; సంతసిల్లుచున్= సంతోషిస్తూ; మ్రొక్కుచున్= నమస్కరిస్తూ; చొక్కుచున్= ఒడలు మరుస్తూ; ఇరు+కెలంకున్= రాజమార్గానికి రెండు వైపుల; రమ్యహర్మ్యంబులపైన్= అందమైన మేడల మీద; నిలిచి= నిలువబడి; పొలిచి= ప్రకాశించి; కనుంగొని= చూస్తున్న; అంగనాజనంబులు= ఆడువారు; తమలోనన్= తమలో తాము.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజు ఒక్క దుర్యోధనుడిని తప్ప తక్కిన వారినెల్ల వాసుదేవుని మంగళ వాద్యాలతో ఎదుర్కొనడానికి పంపించాడు. శ్రీకృష్ణుడు తనను ఆహ్వానించటానికి ఎదురుగా వచ్చిన వారినందరినీ ఆయా రీతుల గౌరవించాడు. కృతవర్మ తమవాడు గనుక అతడిని ప్రత్యేకంగా ఆదరించాడు. కృతవర్మ తన వెంబడి వస్తుండగా, జనులందరూ తన చుట్టూ బలసిరాగా, తనరాక సందర్భంగా చక్కగా అలంకరించబడినట్టిదీ, సంతోషంచేత కళకళలాడుతున్న ప్రజలు గలదీ అయిన హస్తినాపురంలో ప్రవేశించాడు. అతడు రాజమార్గంలో వెళుతుండగా రకరకాల సువాసనలు విరజిమ్ముతున్న ముత్యాలు కలిపిన తలంబ్రాలు, పూల మొత్తాలు శౌరిమీద చల్లుతూ, సంతసిస్తూ, నమస్కరిస్తూ, పరవశిస్తూ మార్గానికి ఇరువైపుల నున్న అందమైన మేడలపై నిలిచి కనుగొంటున్న వనితలు తమలో తాము ఇట్లా అనుకొన్నారు:

విశేషం: 1. మూర్ధాభిషిక్తులైన ధృతరాష్ట్ర దుర్యోధనులు తప్ప మిగిలిన పెద్దలూ, పిన్నలూ అందరూ శ్రీకృష్ణుడిని ఆహ్వానించటానికి వెళ్ళారు. అది రాచమర్యాదలలో శ్రేష్ఠమైన పద్ధతి. శ్రీకృష్ణుడిని దూతగానే కాక మహాత్ముడుగా భావించిన వైఖరి ధ్వని.

2. ఆ వేడుకలో దుర్యోధనుడు పాల్గొంటే జరుగరానిది జరుగవచ్చునని కూడ ధృతరాష్ట్రుడు భావించి, అతడిని పంపకపోయి ఉండవచ్చును.

3. శ్రీకృష్ణుడి దివ్యతేజం జీవులనందరినీ ఆకర్షించింది. ప్రజలందరూ ఆ పరమాత్ముడిని దర్శించుకొనటానికి ఉత్సాహ పడ్డారు. సముచితంగా ఆరాధిస్తూ ఆహ్వానించారు. (సంపా.)

సీ. **'ప్రాణంబుతోఁ గూడ రక్కసి చన్నుల । పాలు ద్రావిన ప్రౌఢబాలుఁ డితఁడె!**
వ్రేల్మిడిఁ జాణూరు విఱిచి లోకముల మె । చ్చించిన యా జగజెట్టి యితఁడె!
దుర్వృత్తుఁడగు కంసుఁ దునిమి యాతని తండ్రిఁ । బట్టంబు గట్టిన ప్రభు వితండె!
సత్యభామకుఁ బారిజాతంబుపైఁ గల । కోర్కిఁ దీర్చిన రసికుం డితండె!

తే. **వెన్నలును గోపికాచిత్త వృత్తములును । నరసి ముచ్చిల నేర్చిన హరి యితండె!**
శ్రుతిశిరోభాగములఁ దన సుభగచరణ । సరిసిజామోదమును గూర్చు చతురుఁ డితఁడె! **175**

ప్రతిపదార్థం: ప్రాణంబుతోన్+కూడన్= అసువులతో కూడ; రక్కసి చన్నుల పాలు= రాక్షసిఅయిన పూతన చనుబాలు; త్రావిన= క్రోలిన; ప్రౌఢబాలుఁడు= గడుసరి పిల్లవాడు; ఇతఁడె!= ఈతఁడే సుమా!; వ్రేల్మిడిన్= చిటిక వేసినంతలో; చాణూరున్= కంసుడి మల్లవీరుడైన చాణూరుడిని; విఱిచి= భంజించి; లోకములన్= జగాలను; మెచ్చించిన= మెప్పించినట్టి; ఆ జగజెట్టి+ ఇతఁడె!= ఆ మేటివీరు డితడే సుమా!; దుర్వృత్తుఁడు+అగు= చెడు నడవడి గల్గినట్టి; కంసున్+తునిమి= కంసుడిని సంహరించి; ఆతని తండ్రిన్= అతని తండ్రియగు ఉగ్రసేనుడిని; పట్టంబు+కట్టిన= పట్టాభిషిక్తుడిని చేసిన; ప్రభువు+ఇతండె!= దొర యితడే సుమా!; సత్యభామకున్= సత్యాదేవికి; పారిజాతంబుపైన్+కల= ఇంద్రుడి నందనోద్యానంలోని పారిజాత వృక్షం మీద నున్న; కోర్కిన్= కాంక్షను; తీర్చిన రసికుండు+ఇతండె!= నెరవేర్చిన సరసు డితడేసుమా!; వెన్నలును= నవనీతపు ముద్దలు; గోపికా చిత్త వృత్తములును= గోపికల యొక్క మనోవ్యాపారాలనూ; అరసి= తెలిసికొని; ముచ్చిలన్+నేర్చిన= దొంగిలించనేర్చిన; హరి= దోషాలను హరించే నారాయణుడు; ఇతండె!= ఇతడే సుమా!; శ్రుతి శిరస్+భాగములన్= వేద శీర్ష ప్రదేశాలందు - ఉపనిషత్తులందు; తన సుభగ చరణ సరసిజ+ఆమోదమును= తన యొక్క మనోహరమైన పాదపద్మాలయొక్క పరిమళాన్ని, కూర్చు= సంధించు; చతురుఁడు= నేర్పరి; ఇతఁడె!= ఇతడే సుమా!

తాత్పర్యం: ప్రాణాలతోపాటు రాక్షస కాంత అయిన పూతన చనుబాలు పానం చేసిన గడుసరి పిల్లడు ఇతడే. చిటికెలో మల్లవీరుడైన చాణూరుడిని విరిచి ప్రోగులుపెట్టి లోకాలను మెప్పించిన మేటి శూరు డితడే సుమా! దుష్టవర్తనుడైన కంసుడిని నిర్మూలించి, అతడి జనకుడైన ఉగ్రసేనుడికి మధురా రాజ్యపట్టం కట్టబెట్టిన ప్రభు వితడే సుమా! పారిజాతవృక్షంపై సత్యభామకు గల కోర్కి తీర్చిన రసికవల్లభు డితడే సుమా! వెన్నలతోపాటు గొల్ల చేడెల చిత్తాలను అపహరించ నేర్చిన శ్రీహరి ఇతడే సుమా! ఉపనిషత్తులకు తన పాదపద్మ పరిమళాన్ని సంధింప జాలు జాణ ఇతడే సుమా!

విశేషం: 1. అలం: ఉల్లేఖం, ఉదాత్తం. 'బహుభి ర్బహుధోల్లేఖా దేకస్యోల్లేఖ ఇష్యతే''. ఒకే వస్తువు అనేకుల చేత అనేకవిధాలుగా వర్ణించబడితే ఉల్లేఖాలంకారం. "ఉదాత్త మృద్ధిశ్చరితం శ్లాఘ్యం వాన్యోపలక్షణమ్'' శ్లాఘనీయమైన సమృద్ధిని వర్ణించినా, మహాపురుషుల చరిత్రాన్ని ఉపలక్షణంగా వర్ణించినా ఉదాత్తం. హస్తినాపురంలో పిల్లల నుండి వృద్ధుల వరకు శ్రీకృష్ణుడిని పరిపరివిధాల ప్రశంసించిన ఘట్టమిది. ప్రశంసలకు సీసం కుదురైన ఛందం. ఒక్కొక్క చరణం ఒక్కొక్క ప్రశంసకు అనువై ఆరు ప్రశంసలకు ఆలవాలమై అందగిస్తుంది. శ్రీకృష్ణుడు ఉదాత్తుడు కావటంతో ఉదాత్తాలంకారం సార్థకం.

2. ఉల్లేఖంలో ఆరు ప్రశంసలున్నాయి. అవి- 1. ప్రౌఢ బాలుడు 2. జగజెట్టి 3. ప్రభువు 4. రసికుడు 5. హరి 6. చతురుడు. ఆ ఆరు ప్రశంసలూ క్రమంగా శైశవంలో, బాల్యంలో, యౌవనంలో, ప్రౌఢ దశలో, వార్ధక్య దశలో, ముముక్షు దశలో ఉన్నవారు ప్రశంసించే వాక్యాలు. వారి వారి మనస్తత్త్వాలకు అనుగుణమైన ప్రశంసలివి. సహృదయులు గమనించటం సులభం. పసిబాలుడి నుండి పరమాత్మ వరకు సాగిన ఈ దశలు భాగవత కృష్ణుడి దివ్యమహిమలుగా విజ్ఞులు భావిస్తున్నారు. శ్రీకృష్ణుడు పరమాత్మ అని నిర్ధారించటానికి తోడ్పడే షడ్లింగాలు ఇవి. ఉపనిషత్తులపై నిలచిన ఉజ్జ్వలతత్త్వం శ్రీకృష్ణతత్త్వం. (సంపా.)

వ. **అనుచు నతి కుతూహలంబున నవలోకింప నాబాలవృద్ధంబగు పౌరలోకం బాలోకన కౌతుకంబునఁ దన రథంబు గదిసిన సందడి జడియు వేత్రహస్తుల వారించుచు నారాయణుండు సమ్మర్ద మందగమనంబునం జని మణితోరణ సుందరం బగు రాజమందిర ద్వారంబు ప్రవేశించి కక్ష్యాంతరంబులు గడచి యేనుంగు మొగసాలఁ జొచ్చి యరదంబు డిగ్గి యల్లన నడచునప్పు డంతకు మున్నయరిగి భీష్మద్రోణ ప్రముఖులగు తగు వారలు ధృతరాష్ట్రునిం బొదువ నతండుఁ బ్రత్యుత్థానంబు సేసి విదుర సంజయ సహితంబుగా నెదుర్కొనం జేరి.** **176**

ప్రతిపదార్థం: అనుచున్; అతి కుతూహలంబునన్= మిక్కిలి వేడ్కతో; అవలోకింపన్= కనుగొనటానికి; ఆబాలవృద్ధంబు+అగు= పిల్లలు మొదలు ముదుసళ్ళ వరకుగల; పౌరలోకంబు= పురప్రజలు; ఆలోకన కౌతుకంబునన్= తనను చూచుటయందలి అభిలాషతో; తన రథంబున్= తన తేరిని; కదిసిన సందడిన్= సమీపించటం వలన ఏర్పడిన రద్దిని; జడియు= నివారించే; వేత్రహస్తులన్= బెత్తాలవారిని; వారించుచున్= వలదని పలుకుతూ; నారాయణుండు; సమ్మర్ద మందగమనంబునన్+చని= జనుల రాయిడివలన మెల్లని గమనంతో వెళ్ళి; మణితోరణ సుందరంబు+అగు= రత్నాలతోరణముచే అందమైన; రాజమందిర ద్వారంబు= రాజభవనం యొక్క వాకిలి; ప్రవేశించి= చొచ్చి; కక్ష్య+అంతరంబులు+కడచి= లోగిళ్ళు దాటి; ఏనుంగు మొగసాలన్+చొచ్చి= ఏనుగులను కట్టివేసే చావడిలో ప్రవేశించి; అరదంబు+డిగ్గి= రథంనుండి దిగి; అల్లన= తిన్నగా; నడచునప్పుడు= నడిచేవేళ; అంతకున్+మున్ను+అ= అంతకు మునుపే; అరిగి= వెళ్ళి; భీష్మ ద్రోణ ప్రముఖులు+అగువారలు= భీష్ముడు, ద్రోణుడు మొదలైనవారు; ధృతరాష్ట్రునిన్+పొదువన్= ధృతరాష్ట్రుడిని పట్టుకొనగా; అతండున్= ఆంబికేయుడు; ప్రత్యుత్థానంబు+చేసి= ఎదుర్కొనుటకు లేచినవాడై; విదుర సంజయ సహితంబుగాన్= విదురుడితో సంజయుడితో; ఎదుర్కొనన్+చేరి= నారాయణుడిని ఎదుర్కొనటానికి సమీపించి. (క్రింది పద్యంతో అన్వయం)

తాత్పర్యం: అంటూ మిక్కిలి అభిలాషతో శౌరిని దర్శించటానికి పిల్లలు మొదలు ముసలివారివరకు హస్తినాపురిలోని ప్రజలంతా వేడ్కపడి ఆయన రథం చుట్టూ గుమిగూడారు. ఆ జనుల రాయిడిని తొలగించటానికై వేత్రహస్తులు బెత్తాలు జళిపించగా, వలదని వారిని వారిస్తూ నారాయణుడు ఆ సందడిలో మెల్లని గమనంతో మణితోరణంతో విరాజిల్లే రాజమందిర ద్వార ప్రవేశం చేశాడు. తొట్టికట్లు దాటుతూ పోయి ఏనుగుల చావడిలో ప్రవేశించి అక్కడ రథం దిగాడు. అక్కడ నుండి గోవిందుడు తిన్నగా నడిచివస్తుండగా అంతకుమునుపే వెళ్ళినవారై భీష్ముడు, ద్రోణుడు మొదలైనవారు ధృతరాష్ట్రుడిని పొదివి పట్టుకొన్నారు. ధృతరాష్ట్రుడు విదుర సంజయులతో నడచి వచ్చి ముకుందుడిని ఎదుర్కొన్నాడు.

ఆ. అతనిఁ గౌఁగిలించి యచ్చటఁ గల విదు । రాది శిష్టజనుల నాదరార్ద్ర
బంధు దృష్టిఁ జూచి పరిరంభ సంభావ । నము లొనర్చి శౌరి ప్రమద మెసఁగ. 177

ప్రతిపదార్థం: శౌరి= శ్రీకృష్ణుడు; అతనిన్+కౌఁగిలించి= ధృతరాష్ట్ర మహారాజును ఆలింగనం చేసికొని; అచ్చటన్+కల= అక్కడున్న; విదుర+ఆది+శిష్టజనులన్= విదురుడు మొదలైన పెద్దలను; ఆదర+ఆర్ద్ర+బంధుదృష్టిన్= ఆదరంచేత మృదువైన చుట్టపు చూపుతో; చూచి= కనుగొని; పరిరంభ సంభావనములు= ఆలింగనాదికమైన మన్ననలు; ఒనర్చి= చేసి; ప్రమదము+ ఎసఁగన్= సంతోష మొప్పగా. (మీది వచనంతో అన్వయం)

తాత్పర్యం: మాధవుడు ధృతరాష్ట్ర మహారాజును కౌఁగిలించుకొని, విదురుడు మొదలైన పెద్దలను ఆదరమేదురమైన చుట్టపు చూపులతో చూచి, మన్ననతో వారిని ఆలింగన మొనర్చుకొన్నాడు.

వ. వార లందఱకును సాత్యకిని దగిన సమాచారంబులు నడపం బనిచె; నటమున్న ధృతరాష్ట్రు పనుపునం దెచ్చి పెట్టిన నచ్చోటన యున్న యున్నత కనకాసనంబున నతం డునుప నాసీనుం డయ్యె; నవ్వాసుదేవునకు విహితానుష్ఠాన పరాయణు లగు నగరి పురోహితులు రాజానుమతంబున నర్ఘ్యపాద్య మధుపర్కాద్యుపచారంబు లాచరించి యతని తమ్ముని నర్హపీఠంబున నునిచి యర్చించిరి; నరనాథుండును దొరలును నిజోచితాసనంబుల నుండిరి; కొలువెల్లను సూర్యోదయ సమయంబునఁ గమలాకరంబు విధంబున వికసించి యుండె నయ్యవసరంబునఁ గృష్ణుండు ధర్మనందను వచనంబులుగా నాంబికేయునకుం దగువారలకుం బ్రణామ పరిరంభణ ప్రముఖ సముచిత సంభావనంబులు వలికి సంభాషణంబులకుం జొచ్చి. 178

ప్రతిపదార్థం: వారలందఱకును; సాత్యకిని తగిన సమాచారంబులు+నడపన్= తగిన వార్తలు అందించటానికి; పనిచెన్= నియమించాడు; అటమున్న+అ= అంతకు మునుపే; ధృతరాష్ట్రు పనుపునన్+తెచ్చిపెట్టిన= ధృతరాష్ట్రుడి ఆదేశంవలన తెచ్చిఉంచిన; ఆ+చోటన్+అ+ఉన్న= అక్కడేఉన్న; ఉన్నత+కనక+ఆసనంబునన్= ఎత్తయిన బంగారు పీఠమునందు; అతండు= ధృతరాష్ట్రుడు; ఉనుపన్= కూర్చుండ బెట్టగా; ఆసీనుండు+అయ్యెన్= కూర్చున్నాడు; ఆ వాసుదేవునకున్= గోపాలదేవుడికి; విహిత+అనుష్ఠాన+పరాయణులు+అగు= శాస్త్రోక్తమైన ఆచారమునందు శ్రద్ధగలవారైన; నగరి పురోహితులు= రాజపురోహితులు; రాజ+అనుమతంబునన్= ధృతరాష్ట్రుడి సమ్మతితో; అర్ఘ్యపాద్యమధుపర్క+ఆది+ఉపచారంబులు= చేతులకు కాళ్ళకు నీళ్ళు ఇచ్చుట, పాలలో కలిపిన తేనె ఇవ్వటం మొదలైన సమ్మానాలు; ఆచరించి= చేసి; అతని తమ్మునిన్= శ్రీకృష్ణుడి అనుజుడైన సాత్యకిని; అర్హపీఠంబునన్+ఉనిచి= తగిన పీఠముపై కూర్చుండ బెట్టి; అర్చించిరి= పూజించారు; నరనాథుండును= ధృతరాష్ట్రుడును; దొరలును= ఇతర రాజులును; నిజ+ఉచిత+ఆసనంబులన్+ఉండిరి= తమకు తగిన పీఠాలపై తాము

కూర్చున్నారు; కొలువు+ఎల్లను= సభ అంతా; సూర్య+ఉదయసమయంబునన్= భానుడుదయించిన వేళలో; కమల+ఆకరంబు విధంబునన్= తామర కొలనువలె; వికసించి+ఉండెన్= ప్రకాశిస్తున్నది; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; కృష్ణుండు; ధర్మనందను వచనంబులుగాన్= ధర్మరాజు చెప్పిన మాటలుగా; ఆంబికేయునకున్= అంబిక కుమారుడైన ధృతరాష్ట్రుడికీ; తగువారలకున్= తగినట్టివారికినీ; ప్రణామ= నమస్కారాలు; పరిరంభణ= ఆలింగనాలు; ప్రముఖ= మొదలైన; సముచిత సంభావనంబులు= తగిన మన్ననలు; పలికి= తెలిపి; సంభాషణంబులకున్= మాటలకు; చొచ్చి= ఉపక్రమించి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అందరి యోగక్షేమాలు విచారించటానికై సాత్యకిని నియమించాడు. అంతకుమునుపే అచ్చటికి ధృతరాష్ట్ర మహారాజు ఆజ్ఞ చేత ఎత్తయిన బంగారు పీఠాన్ని తెచ్చి ఉంచారు. ఆ పీఠంపై ధృతరాష్ట్రుడు కూర్చుండ బెట్టగా శౌరి కూర్చున్నాడు. అప్పుడు శాస్త్ర విహితమైన ఆచారమునందు శ్రద్ధ గల రాజపురోహితులు రాజుగారి అనుమతితో వాసుదేవుడికి అర్ఘ్యం పాద్యం మధుపర్కం మొదలైన మర్యాదలు జరిపారు. గోవిందుడి తమ్ముడగు సాత్యకిని కూడా తగిన పీఠంమీద కూర్చుండ బెట్టి పూజించారు. ఆ తరువాత ధృతరాష్ట్రుడూ, తక్కిన రాజులూ తమ తమ గద్దెలపై ఉన్నారు. సూర్యోదయ కాలంలో పద్మసరస్సువలె సభ అంతా కళకళలాడుతూ ఉండింది. అప్పుడు శ్రీకృష్ణుడు ఆంబికేయునకూ, అర్హులైనవారికీ ధర్మరాజు మాటలుగా ఆతడి నమస్కారాలు, ఆలింగనాలు మొదలైన మన్ననలు అందజేసి సంభాషించటానికి ఉపక్రమించాడు.

విశేషం: 1. అలం: ఉపమ. సూర్యోదయ సమయంలో వికసించిన కమలాలతో ఒప్పారే సరోవరం వలె కౌరవసభ కృష్ణ దర్శనంతో కళకళలాడిందని భావం. చక్కని ఉపమానం. శ్రీకృష్ణ దివ్యత్వదీపకం.

2. ఈ సన్నివేశంలో అతిథులు వచ్చినప్పుడు ఆయా సందర్భాలలో సాగే రాజమర్యాదలను సవిస్తరంగా, సముచితంగా వర్ణించి తిక్కన రంగ మర్యాదలను నాటకీయంగా చిత్రించాడు. (సంపా.)

క. రాజునకుఁ దియ్య మెసఁగెడు । పూజా వచనముల నెయ్యపుంబలుకులఁబే
రోజ మెయి బంధుమిత్ర స । మాజములకు మేలములఁ గుమారులకుఁ దగన్. 179

ప్రతిపదార్థం: రాజునకున్= ధృతరాష్ట్రునకు; తియ్యము+ఎసఁగెడు= ప్రియమొప్పు; పూజావచనములన్= గౌరవ వాక్యాలతోను; పేరు+ఓజమెయిన్= మహోత్సాహంతో; బంధుమిత్ర సమాజములకున్= చుట్టముల యొక్క హితుల యొక్క సమూహమునకు; నెయ్యపున్+పలుకులన్= స్నేహ వచనాలతోడనూ; తగన్= ఒప్పిదముగా; కుమారులకున్= ధృతరాష్ట్రుడి కొడుకులకు, మేలములన్= పరిహాసాలతోడను.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడికి ప్రీతి కలిగించే గౌరవ వచనాలతో; బంధు మిత్ర సమూహానికి మహోత్సాహమొప్పే ప్రేమవచనాలతో, కురుకుమారవర్గానికి పరియాచకపు మాటలతో. (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: శ్రీకృష్ణుడు సభలో సంభాషణ ప్రారంభించాడు. సంభాషణం రాయబారపు ఉపన్యాసం కాదు. పలు హోదాలలో ఉన్నవారిని ఆయా పద్ధతులలో పలుకరించే మర్యాద. శ్రీకృష్ణుడి ప్రవర్తనలోని ప్రతి చిన్న అంశాన్ని కూడా వదలకుండా తిక్కన జాతి వార్తా చమత్కారయుతంగా వర్ణించాడు. ఈ పద్యంలో మొదట రాజును పలుకరించాడు. ఆ మాటలతో రాజుకు సంతోషం కలిగించాడు. ఆయనకు సాక్షాత్తు (వాక్పుష్పాలతో) పూజిస్తున్నట్లు, గౌరవిస్తున్నట్లు మర్యాదను నడిపాడు. రాజును ఒక్కడినీ పలకరించే తీరొకటి. ఆ తరువాత బంధువులు, మిత్రులు మొదలైన వారు సభలో ఆయాచోట్ల కలిసి కూర్చుండి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉంటారు. వారిని సామూహికంగా పలకరించాడు. స్నేహంగా ఉత్సాహంగా మాట్లాడాడు. తరువాత కురుకుమార వర్గాన్ని గుంపుగా పలకరించాడు. వారితో పరిహాసాలాడుతూ చనువును స్నేహాన్నీ ప్రకటించాడు. సంభాషణ వైవిధ్యం వర్ణన శిల్పం. (సంపా.)

వ. ఇంపు పుట్టించుచుఁ గొండొకసేపు నిలిచి పుండరీకాక్షుండు విదురు సదనంబునకుం జనియెద మఱియుఁ బోవలయు నెడలకుం బోయి వచ్చెద' నని పలికి యాంబికేయుననుమతి వడసి యరుగ, విదురుండు ససంభ్ర మంబునం గడచిచని మంగళోపచార సహితంబుగా నెదుర్కొని భయ భక్తి వినయ స్నేహానందంబులఁ గందళితుం డగుచు గోవిందునకు దేవోపచారంబుల ననేక ప్రకారంబుల నర్చన లిచ్చి, కౌంతేయుల కుశలం బడిగిన నతనికి వారలవృత్తాంతంబు సమస్తంబును సవిస్తరంబుగాఁ జెప్పిన యనంతరంబ. 180

ప్రతిపదార్థం: ఇంపు పుట్టించుచున్= ఆనందం కలిగిస్తూ; కొండొకసేపు= కొంత తడవు; నిలిచి= ఆగి; పుండరీక+అక్షుండు= తెల్లదామరల వంటి కన్నులు గల గోవిందుడు; విదురు సదనంబునకున్= విదురుడి గృహానికి; చనియెదన్= వెళ్ళుతాను; మఱియున్= ఇంకను; పోవలయు+ఎడలకున్= పోవలసిన చోట్లకు; పోయివచ్చెదన్; అని పలికి; ఆంబికేయు+అనుమతి+పడసి= ధృతరాష్ట్రుడి అంగీకారం పొంది; అరుగన్= వెళ్ళగా; విదురుండు; ససంభ్రమంబునన్= వేగిరపాటుతో; కడచిచని= దాటుకొని వెళ్ళి; మంగళ+ఉపచార+సహితంబుగాన్= శుభకరాలైన సేవలతో కూడునట్లుగా; ఎదుర్కొని= స్వాగతం చెప్పి; భయభక్తి వినయ స్నేహ+ఆనందంబులన్= భయం, భక్తి, అణకువ, ప్రేమ, సంతోషం అనే గుణాలతో; కందళితుండు+అగుచున్= వికాసం పొందినవాడై; గోవిందునకున్= శ్రీ కృష్ణుడిని; దేవ+ఉపచారంబులన్= దేవతలకు కావించే మన్ననలతో; అనేక ప్రకారంబులన్= పలు విధముల; అర్చనలు+ఇచ్చి= పూజ లొసగి; కౌంతేయుల కుశలంబు= పాండవుల క్షేమం; అడిగినన్= ప్రశ్నించగా; అతనికిన్= విదురుడికి; వారల వృత్తాంతంబు= పాండవుల యొక్క సమాచారం; సమస్తంబును= అంతయూ; సవిస్తరంబుగన్= విపులంగా; చెప్పిన+అనంతరంబు+అ= చెప్పిన తరువాత.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు కొంతసేపు అక్కడ ఆగి, విదురుడి గృహానికీ, ఇంకా వెళ్ళవలసిన చోట్లకూ వెళ్ళి వస్తాను' అని ధృతరాష్ట్రుడి అంగీకారం పొంది బయలుదేరాడు. విదురుడు గబగబ ముందువెళ్ళి తన యింటి దగ్గర ఎదుర్కొని శ్రీహరికి స్వాగతం పలికాడు. భయం, భక్తి, వినయం, స్నేహం, సంతోషం పెల్లుబుకగా గోవిందుడికి దేవతోపచారాలతో, బహువిధాల పూజలు చేశాడు. కుంతీపుత్రుల యోగక్షేమాలు అడిగాడు. అతడికి కమలాక్షుడు పాండవుల సంగతి అంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. ఆ తరువాత.

విశేషం: 1. సభలో సంభాషించే వారితో మాట్లాడి, సభాసదులైన వారందరికీ సంతోషం కలిగేటట్లుగా తన దివ్య మంగళ విగ్రహ దర్శనాన్ని ప్రసాదిస్తూ కొంతసేపు నిలవటం రాజసభలో పెద్దల మర్యాద. శ్రీకృష్ణుడు దివ్యుడు కావటం చేత అతడి దర్శనానికి ప్రత్యేకత ఉన్నది. 'పురుషులందు పుణ్యపురుషులు వేరయా!' అన్న వేమన సూక్తి ఇక్కడ నిజమనిపిస్తుంది.

2. ఒకసారి రాజసభలో ప్రవేశించిన దూత రాజానుమతితోనే బయటకు వెళ్ళాలి. దౌత్యం మొదలు కాకపోయినా కృష్ణుడు సభామర్యాదను పాటించాడు. ధృతరాష్ట్రుడికి తన కార్యక్రమం చెప్పి అనుమతి వేడాడు.

3. విదురుడు శ్రీకృష్ణుడిని దివ్యుడిగా భావించి షోడశోపచార విధులతో దేవతార్చన విధితో పూజించాడు. భయభక్తి, వినయ వందనా లాచరిస్తూ పులకించాడు. విదురుడు భక్తుడు. శ్రీకృష్ణుడు భగవంతుడు. అందుకే భక్తుడి ఇంటికి వెళ్ళాడు భగవంతుడు. లౌకిక ఆధ్యాత్మిక భావాల తారతమ్య మిక్కడ స్పష్టం. (సంపా.)

క. ముదమునఁ గృష్ణుఁడు కుంతీ । సదనమునకుఁ జనియె; నపుడు సమ్మదమున న
వ్విదురుం 'డోగిర మొనరిం । చెద' నని తన్నడుగ 'నట్ల చేయుం' డనుచున్. 181

ప్రతిపదార్థం: కృష్ణుఁడు, ముదమునన్= సంతోషంతో; కుంతీ-సదనమునకున్= కుంతి యింటికి; చనియెన్= వెళ్ళాడు; అపుడు; ఆ+విదురుండు= ఆ విదురుడు; సమ్మదమునన్= హర్షంతో; ఓగిరము+ఒనరించెదన్= వంట చేయిస్తాను; అని; తన్నున్+అడుగన్= తనతో చెప్పగా; అట్ల చేయుండు+అనుచున్= అట్లాగే చేయించం డని చెప్పి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు సంతోషంతో కుంతీ గృహానికి వెళ్ళాడు. అప్పుడు విదురుడు హర్షించి 'వంట చేయిస్తాను' అని శ్రీహరితో అన్నాడు. అట్లాగే చేయించండి' అని చెప్పి కృష్ణుడు.

వ. చని కాంచిన నద్దేవియు నతని తోడు నీడయుంబోని తన కొడుకులం దలంచి యడలు పుట్టిన నమ్మాధవు మెడ వట్టికొని యెలుంగెత్తి యేడ్చిన, నతండు సంబోధించి యూరార్ప నెట్టకేలకు నుడిగి యాతనికి నాసన విన్యాసనాద్యుపచారంబులు చేయించి తత్సమీపంబున నుచిత పీఠంబునం గూర్చుండి గద్గద కంఠంబుతో నిట్లనియె. 182

ప్రతిపదార్థం: చని= కుంతీదేవి నివాసానికి ఏగి; కాంచినన్= ఆమెను చూడగా; ఆ+దేవియున్= ఆ కుంతీదేవికూడ; అతని తోడు నీడయున్+పోని= అతని వెన్నంటి వచ్చు నీడల వంటివారైన; తన కొడుకులన్+తలంచి= తన కుమారులను జ్ఞప్తికి తెచ్చుకొని; అడలు+పుట్టినన్= దుఃఖం జనించగా; ఆ+మాధవు మెడ పట్టుకొని= కృష్ణుడి కంఠం పట్టుకొని; ఎలుంగు+ఎత్తి= గొంతెత్తి; ఏడ్చినన్= విలపించగా; అతండు= హరి; సంబోధించి= అత్తా అని హెచ్చరించుకొని; ఊరార్పన్= ఓదార్చగా; ఎట్టకేలకున్= తుదకు; ఉడిగి= ఏడ్పుమాని; అతనికిన్= మేనల్లుడికి; ఆసన+విన్యాసన+ఆది+ఉపచారములు చేయించి= పీఠముంచటం మొదలైన మన్ననలు కావించి; తద్+సమీపంబునన్= అతడి చెంగట; ఉచిత పీఠంబునన్+కూర్చుండి= తగిన పీఠం మీద కూర్చొని; గద్గద కంఠంబుతోన్= డగ్గుత్తికతో; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికింది:

తాత్పర్యం: శ్రీకృష్ణుడు కుంతీదేవి గృహానికి వెళ్ళి ఆమెను దర్శించాడు. ఆమె అతడి వెన్నంటే నీడల వంటి తన కొడుకులు జ్ఞప్తికి రాగా దుఃఖంతో మేనల్లుడి మెడపట్టుకొని గొంతెత్తి విలపించింది. ముకుందుడు అత్తా అని సంబోధించి ఊరడించాడు. హరి ఊరడింపుతో ఆమె ఏడ్పుమాని అతడికి కూర్చుండ పీఠం వేయించటం మొదలైన ఉపచారాలు చేయించింది. తాను ఆయన చెంత అర్హపీఠంమీద ఆసీనురాలై ఎలుగురాలుపడ ఇట్లా అన్నది.

విశేషం: కుంతీదేవికి ఎదుట శ్రీకృష్ణుడు కనపడగానే అతడికి తోడునీడలవలె ఉండే పాండవులు జ్ఞాపకం రావటం వలన ఆమెకు దుఃఖం పొంగివచ్చింది. శ్రీకృష్ణుడు పాండవుల కెంత ఆత్మీయుడో కుంతీదేవి కంత ఆత్మీయుడు. వత్సల భావద్యోతకమైన చేష్ట - అప్యాయంగా మెడను కౌగిలించుకొనటం. మనసులో బాధను కొన్నేళ్ళుగా అణచుకొని ఉండటంచేత దానిని ఒక్కసారిగా వెలువరించే సాత్త్విక భావం వంటి అభినయ విశేషం ఎలుగెత్తి ఏడ్వటం. కుంతికి శ్రీకృష్ణుడన్నా, తన బిడ్డలన్నా ఉన్న అభేద వాత్సల్య భావం ఇందులో వ్యంగ్యం. స్వయంగానూ, ధర్మజుడి ప్రార్థన వలననూ ఆమెను దర్శింప వచ్చాడు శ్రీకృష్ణుడు. సాక్షాత్తు తన పుత్రులను చూచిన సంతృప్తి ఆమెకు కలిగించాలని వచ్చాడు. అందువలననే ఈ సన్నివేశంలో ఆ ఆర్ద్రత. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **'నీ శిక్షఁ బెరుఁగుట నీతిమంతులుఁ బుణ్య । పరులు శూరులు గదా పాండుసుతులు**
సుఖవృత్తిఁ బెక్కండ్రు సూరెలఁ గొలువ నుం । డెడువార లిడుమలఁ బడుచు నిర్జ
నంబైన కానలోనన యెట్లు నిలిచిరి? । ననుఁ బెట్టి నాయెదఁ గొనుచుఁ జనిరి
యేను వడ్డింపంగ నింపారఁ గుడిచి మె । త్తని సెజ్జ నిద్రించి వినుతభద్ర

తే. **గాన కరి బృంహితముల మేల్కాంచునట్టి । వారు కందమూలంబు లాహారములుగఁ**
బొదలఁ బుట్టలఁబడి యుండి పులుఁగు మెకము । లఱవ మేల్కనుచుండిరే యక్కటకట! **183**

ప్రతిపదార్థం: నీ శిక్షన్= నీ అభ్యాసంలో; పెరుఁగుటన్= పెరిగినవారగుటచేత; పాండుసుతులు= పాండుపుత్రులు; నీతిమంతులున్= న్యాయంతో కూడినవారు; పుణ్యపరులు= సుకృతమునందు ఆసక్తికలవారు; శూరులుగదా= వీరులు గదా!; పెక్కండ్రు= పలువురు; సూరెలన్= కుడి యెడమ పార్శ్వములందు; కొలువన్= సేవిస్తుండగా; సుఖవృత్తిన్= సుఖ జీవనోపాయంతో; ఉండెడివారలు= ఉన్నట్టివారు; ఇడుమలన్+పడుచున్= కష్టాలనుభవిస్తూ; నిర్జనంబు+ఐన= మనుష్యులులేని; కానలోనన్+అ= అడవులలోనే; ఎట్లు నిలిచిరి?= ఎట్లున్నారు?; ననున్+పెట్టి= నన్నిక్కడ వదలిపెట్టి; నా+ఎదన్+కొనుచున్+చనిరి= నా హృదయాన్ని తమ వెంట తీసికొని వెళ్ళారు; ఏను వడ్డింపంగన్= నేను వడ్డన చేయగా; ఇంపు+ఆరన్+కుడిచి= కమ్మగా కడుపార భుజించి; మెత్తని సెజ్జన్= మృదువైన పాన్పుల మీద; నిద్రించి= నిదురపోయి; వినుత= కొనియాడదగిన; భద్రగాన= మంగళ గానాల చేతను; కరిబృంహితములన్= ఏనుగుల ఘీంకార ధ్వనుల చేతను; మేల్కాంచునట్టివారు= కనులు తెరచునట్టివారు; కందమూలంబులు= గడ్డలు; వేళ్ళు; ఆహారములుగన్= భోజనంకాగా; పొదలన్= పొదలలో; పుట్టలన్= పుట్టలమీద; పడియుండి= నివసిస్తూ; పులుఁగు మెకములు= పక్షులు, జంతువులు; అఱవన్= అరవగా; మేల్కనుచున్+ఉండిరే?= మేల్కొనుచున్నారా?; అక్కట+అకట!= అయ్యయ్యో! (వారికెన్ని కష్టాలు వచ్చాయి.)

తాత్పర్యం: 'కృష్ణా! నీ కట్టుబాటులో పెరిగిన వారగుటచే పాండవులు నీతిమంతులు, పుణ్యపరులు, వీరులు అయినారు. వారు ఇరుగెలంకులజేరి పెక్కుమంది సేవిస్తుండగా సుఖంగా నుండవలసినవారు కష్టాలనుభవిస్తూ నిర్మానుష్యాలైన అరణ్యాలలో ఎట్లా నివసించారో! నన్నిక్కడ విడిచిపెట్టి నా హృదయాన్ని తమవెంట కొనిపోయారు. నేను వడ్డిస్తుంటే కడుపారా కమ్మగా తిని మెత్తని పాన్పుల మీద నిదురించి మాగధుల మంగళ గానాలతో, భద్రగజాల ఘీంకార ధ్వనులతో మేల్కొనునట్టి నా బిడ్డలు పొదలలో గుట్టలలో పడియుండి పక్షుల కూతలకు, జంతువుల అరపులకు మేల్కొంటున్నారు గదా! అయ్యో, వారి కెన్ని కష్టాలువచ్చాయి?

విశేషం: అలం: విషమం. కుంతీదేవి వేసిన కుశల ప్రశ్నలలో ఒక మర్యాద. సంస్కృతి, మాతృప్రేమావిష్కార క్రమం గోచరిస్తుంది. కొడుకుల శీలం వీరమాతకు ప్రథమ గణ్యమైన కుశలాంశం. ఆ తరువాత వారి సుఖజీవన విధానాన్ని గురించిన విశేషం తెలిసికొనగోరుతుంది. ఆ తరువాత తన పెంపకంలో తాను చూపిన వాత్సల్యం. వారు పొందిన సుఖాలను గురించి సంస్మరణం తల్లి అడుగుతుంది. తల్లి లాలించటం, అన్నం పెట్టటం, నిద్రపుచ్చటం, నిద్రలేపటం మొదలైన సేవలు చేసి పిల్లలను పెంచుతుంది. వాత్సల్యపూర్ణంగా అవన్నీ పిల్లలు కలకాలం అనుభవించాలని ఆశిస్తుంది. కుంతి ఈ పద్యంలో వీటిని ప్రస్తావించటం సహజం. కుశల ప్రశ్నలలో తొలుత నిలిచే చల్లని మాటలివి. (సంపా.)

ఆ. **తండ్రిలేని ప్రజలు తల్లిని బాసి పె । ద్దయునుగాల మివ్విధమునఁ బడిరి**
భంగపాటు దుఃఖపాటును సంకట । పాటు గలిగె విరటు పాలఁ బిదప.' **184**

ప్రతిపదార్థం: తండ్రి లేని ప్రజలు= తండ్రిని కోల్పోయిన బిడ్డలు; తల్లినిన్+పాసి= తల్లిని గూడా విడిచి; పెద్దయును+కాలము= చాలా కాలము; ఈ+విధమునన్= ఈ రీతిగా; పడిరి= కష్టాలనుభవించారు; పిదపన్= అరణ్యావాసమైన తరువాత; విరటుపాలన్= విరటుడి దగ్గర; భంగపాటు= అవమానం; దుఃఖపాటు= దుఃఖాలనుభవించటం; సంకటపాటు= చిక్కులలో పడటం; కలిగెన్= సంభవించాయి.

తాత్పర్యం: తండ్రి లేని పాండవులు తల్లినైన నన్ను కూడా విడిచి చాలా కాలం ఈ విధంగా అడవులలో కష్టాలు అనుభవించారు. ఆ పిదప విరటుడికడ వారికి భంగపాటు, దుఃఖపాటు, సంకటపాటు కలిగాయి.'

విశేషం: పాండవులు పొందిన కష్టాలను మూడంచెలుగా భావించిందా తల్లి. 1. తండ్రి పోయిన తరువాత పాండవులు భంగపాటు పొందారు. రాజ్యభాగ ప్రసక్తిగాని, రాజ్యాన్ని కోల్పోయే ప్రసక్తిగాని, దుర్యోధనాదుల వలన కలిగే అవమానాలుగాని పాండురాజు బ్రతికి ఉంటే జరిగేవి కావు. కాబట్టి, తండ్రిలేని పిల్లలు కాబట్టే రాజ్యాన్ని కోల్పోయి అరణ్యాజ్ఞాతవాసాలు చేసే అవమానం కలిగింది.

2. పాండవులు తల్లిని వదలి ఎన్నడూ లేరు. కాని, అరణ్యావాసానికి వెళ్లుతూ ఆమెను వదలి వెళ్ళవలసి వచ్చింది. ఆ వియోగం తల్లికీ, బిడ్డలకూ దుఃఖతీవ్రతను కలిగించింది.

3. ఇక అజ్ఞాతవాసకాలంలో విరాటనగరంలో పాండవులు ఎన్నో చిక్కులు పడవలసి వచ్చింది. తండ్రి లేని పిల్లలు అందరికీ లోకువ. తల్లికి దూరమైన పిల్లలు ఆదరానికి దూరమైనవారు. అజ్ఞాతవాసంలో దినదినగండంగా బ్రదుకవలసి వస్తుంది. ఆ అవస్థలను తలచుకొన్న తల్లి- కుంతి తల్లడిల్లిపోయింది. (సంపా.)

వ. అని వెండియు. 185

తాత్పర్యం: అని, మరల.

ఉ. 'దానదయాపరుం డయిన ధర్మతనూభవు సేమ మెట్లు? పం
చాననవిక్రముం డగు బకారికి భద్రమె? యస్త్ర శస్త్ర వి
ద్యానిపుణుండు క్రీడి సుఖియా? వినయాభరణుల్ గవల్ సమా
ధాన సమేతులే? యకట! ద్రౌపది సాధ్వి; సుఖంబె దానికిన్? 186

ప్రతిపదార్థం: దానదయాపరుండు+అయిన= దానదయా గుణాలలో శ్రద్ధ గల్గిన; ధర్మ తనూభవు= ధర్మజుడియొక్క; సేమము+ఎట్లు?= క్షేమమెట్లా ఉన్నది?; పంచ+ఆనన విక్రముండు+అగు= సింహపరాక్రమంతో సమానమైన పరాక్రమం కల్గిన; బక+అరికిన్= బకాసురుడిని సంహరించిన భీమసేనుడికి; భద్రమె?= కుశలమా?; అస్త్ర శస్త్ర విద్యానిపుణుండు= బాణవిద్యలలో ఆయుధ విద్యలలో నేర్పరి అయిన; క్రీడి= అర్జునుడు; సుఖియా?= హాయిగానున్నాడా?; వినయ+ఆభరణుల్= అడకువయే సొమ్ములుగా గల్గిన; కవల్= అమడలు - నకుల సహదేవులు; సమాధాన సమేతులు+ఏ= శాంతితో కూడిఉన్నారా?; అకట!= అయ్యో! ద్రౌపది= ద్రుపద పుత్రి; సాధ్వి= పతివ్రత; దానికిన్+సుఖంబె?= ఆమెకు సౌఖ్యమేనా?

తాత్పర్యం: దానదయాగుణాలుగల ధర్మజునకు క్షేమమా? సింహపరాక్రముడైన భీమసేనుడికి కుశలమా? అస్త్రశస్త్ర విద్యలందు ఆరితేరిన అర్జునుడు హాయిగా ఉన్నాడా? వినయాలంకృతులైన నకుల సహదేవులు నెమ్మదిగా ఉన్నారా? అయ్యో! పాంచాలి పరమ సాధ్వి- ఆమె సుఖంగా ఉన్నదా?

విశేషం: పిల్లల క్షేమం గురించి అడిగేటప్పుడు తల్లి వారి అసలు పేర్లు పేర్కొనకుండా, ముద్దుపేర్లుకాని, బిరుదనామాలుకానీ, ఆత్మీయముద్రతో పిలిచే పిలుపులు గాని పలకటం లోకసహజం. దాని కనుగుణంగా ధర్మతనూభవుడు, బకారి, క్రీడి, కవలు - అనటం గమనించదగింది. వారిని ఆమెకు నచ్చిన, ఆమె మెచ్చిన గుణాలతో విశేషించి పేర్కొనటం ఆమె అభిమానానికి నిదర్శనం. వీరమాతలు పిల్లల యోగక్షేమాల నడిగే నమూనా పద్యమిది. కోడలిని పేరు పెట్టి పిలిచి, సాధ్విగా గౌరవించటం ఆదరాభిమానాలకు సాక్ష్యం. దాదాపు 25 శ్లోకాలలో కొడుకులను గురించి అడిగిన మూలంలోని కుంతి బావురుమన్నట్లుంటుంది. తిక్కన తీర్చిదిద్దిన కుంతి నిర్వేదాన్ని కూడా నిబ్బరంగా ప్రదర్శించగలిగింది. (సంపా.)

చ. **కొడుకుల కంటె నయ్యనుఁగుఁ గోడలి కెక్కుడు గూర్తుఁ గోడలుం**
గొడుకులు సేయు భక్తి కట కోటి మడుంగులు భక్తి నాకు నె
ప్పుడుఁ దగఁ జేయుచుండు నది పుణ్యచరిత్ర కులాగ్రగణ్య క్రొ
త్తడి సకలంబుఁ జూడ సభ దైన్యముఁ బొందుట సూచి పొక్కితిన్. **187**

ప్రతిపదార్థం: కొడుకుల కంటెన్= కుమారుల కంటెను; ఆ+అనుఁగు కోడలికిన్= ఆ కూర్మి కోడలికి; ఎక్కుడు కూర్తున్= నేను మిక్కిలి ప్రియపడుదును; కొడుకులు చేయు భక్తికిన్= కుమారులు కనబరచే పరమప్రేమకు; అట కోటి మడుంగులు భక్తిన్= అంతకు కోటి రెట్లు భక్తిని; నాకున్= నాకు; ఎప్పుడున్= ఎల్లవేళలందును; తగన్= చక్కగా; చేయుచున్+ఉండున్= ఆమె సలుపుతుంటుంది; అది పుణ్యచరిత్ర= ఆమె పవిత్రమైన నడవడి గలది; కుల+అగ్రగణ్యా= వంశములో తొలుత లెక్కించ దగినది; క్రొత్తడి= మగనాలు; సకలంబున్+చూడన్= అందరూ చూస్తూఉండగా; సభన్= కురుసభలో; దైన్యమున్+ పొందుట చూచి= దీన దశ పాలవటం చూచి; పొక్కితిన్= దుఃఖించాను.

తాత్పర్యం: కొడుకుల కంటె కోడలు అంటే నాకు చాలా ఇష్టం. కుమారులు చూపు ప్రేమ కంటె కోటి రెట్లు భక్తితో ఆమె నాకు సేవలు చేస్తుంది. పాంచాలి పవిత్రమైన నడవడి కలది. కులంలో వన్నె కెక్కింది. ఆ మగనాలు అందరు చూస్తుండగా కురుసభలో అంతటి దైన్యం పొందటం చూచి దుఃఖపడ్డాను.

విశేషం: కోడలిని మెచ్చుకొనే అత్త గుణవంతురాలు. కుంతి కోడలిని ఉత్తమురాలని ప్రశంసించింది. ఆమెను మనసారా ప్రేమించింది. కొడుకులకంటె ఆమెకు కోడలే ప్రీతిపాత్రురాలట! ద్రౌపది కుంతిని భక్తితో సేవించేదట! ఆమె పుణ్యచరిత్రట! కులాగ్రగణ్యట! మగనాలట! అంతటి అనురాగవతికి అంతటి అవమానం జరిగినందుకు ఆవేదన పడింది. ఈ పద్యం ఒక సత్యాన్ని బైటపెట్టింది. పాండవపక్షం వారందరిలో అగ్నివలె గుండెలను మండిస్తున్నది- కురుసభలో ద్రౌపది పొందిన అవమాన దుఃఖం. ద్రౌపది ఒకవైపు గర్వకారణం. మరొకవైపు జాలికి తావలం. (సంపా.)

తే. **నాఁడు ద్రౌపది పడిన బన్నములు సూడ । నోర్చినప్పుడ యెంతకు నోర్వఁ జెపుమ**
యంత గడచిన దుఃఖంబు లనుభవింపఁ । గలవె లోకంబువారికిఁ గమలనాభ! **188**

ప్రతిపదార్థం: కమలనాభ!= పద్మం నాభియందుగలవాడా!; కృష్ణా; నాఁడు= ఆనాడు; ద్రౌపది+పడిన బన్నములు= ద్రౌపది పొందిన అవమానాలను; చూడన్+ఓర్చిన+అప్పుడు+అ= చూచి సహించ జాలినప్పుడే; ఎంతకున్+ఓర్వన్?= ఎంతకైనా భరించలేనో; చెపుమ= పల్కుమా!; (ఎన్నిటినైన భరింపగలనని అర్థం); లోకంబు వారికిన్= లోకులకు; అంత+కడచిన దుఃఖంబులు= ఆమె అనుభవించిన దుఃఖాల కంటె మించిన దుఃఖాలు; కలవె!= ఉన్నవా? (లేవని భావం.)

తాత్పర్యం: ఆనాడు పాంచాలి పొందిన అవమానాలు చూచి సహింపజాలిన నేను ఎంతకైనా ఓర్చుకోగలను. ఆమె అనుభవించిన కష్టాలను మించిన కష్టాలు లోకంలోని వారెవ్వరూ అనుభవించి ఉండరు.

విశేషం: ద్రౌపది పొందిన కష్టాలు మరెవ్వరూ లోకంలో అనుభవించి ఉండరని చెపుతూనే ఆ కష్టాలను చూచి సహించి ఇంకా బ్రతికి ఉన్న తాను మరెన్ని కష్టాలనైనా ఓర్చుకొనగలనని తన దుర్భర మనోవేదనను ధ్వనిమయంగా వ్యక్తం చేసింది కుంతి. సంధి మాటలలో శాంతి ప్రసంగాలలో కూడా మరువ లేని బడబాగ్ని వంటి బాధ ద్రౌపది మీది సానుభూతి. (సంపా.)

వ. అట్టి యెడ. 189

తాత్పర్యం: ఆ సమయాన.

క. విదురుం డొక్కఁడు దక్కఁగ । సదస్యు లెవ్వరును ధర్మసంక్షయ మిది కూ
డదు నార; యతని శీలమ । కుదు రీ లోకమున కింతకుం దలఁపంగన్." 190

ప్రతిపదార్థం: విదురుండు+ఒక్కఁడు+తక్కఁగన్= విదురు డొక్కడు తప్ప; సదస్యులు= సభలో ఉన్నవారు; ఎవ్వరును= ఒక్కరైనను కూడ; ఇది ధర్మ సంక్షయము= ద్రౌపదీ వస్త్రాపహరణం ధర్మమును నశింపజేస్తుంది; కూడదు= ఇట్టి నీచపు పని తగదు; నారు+అ= అనరు; తలఁపంగన్= ఆలోచించగా; ఈ లోకమునకున్+ఇంతకున్= ఈ జగమున కంతటికినీ; అతని శీలము+అ= ఆతడి వర్తనమే; కుదురు= ఆధారం.

తాత్పర్యం: విదురు డొక్కడు దప్ప నాటి సభలోని వారిలో ఒక్కరైనా పాంచాలిని పరాభవించటం ధర్మ వినాశక కృత్యం; ఇది తగదు అని పల్కినవారు కారు. ఆలోచించగా విదురుడి సత్స్వభావమే ఈ జగత్తుకంతా ఆదర్శప్రాయం.

వ. అని యివ్విధంబునఁ గృష్ణుతోడఁ దన యుమ్మలికంబు లన్నియుఁ ద్రవ్వికొని శోకంబు వెల్లిగొనఁ గొండొక దిగం బాటెడు చిత్తంబుతో మఱియు నిట్లనియె; 191

ప్రతిపదార్థం: అని; ఈ+విధంబునన్; కృష్ణుతోడన్; తన+ఉమ్మలికంబులు= తన దుఃఖాలు; అన్నియున్+త్రవ్వికొని= అన్నింటినీ స్మృతికి తెచ్చుకొని; శోకంబు= దుఃఖం; వెల్లిగొనన్= పొంగిప్రవహించగా; కొండొక దిగన్+పాటెడు చిత్తంబుతోన్= కొంచెం క్రుంగిపోతున్న మనస్సుతో; మఱియున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కుంతీదేవి ఈ విధంగా మేనల్లుడైన శ్రీకృష్ణుడితో తన దుఃఖాలన్నింటినీ జ్ఞప్తికి తెచ్చుకొని శోకం వెల్లివిరియగా కొంచెం క్రుంగిన మనస్సుతో మళ్ళీ ఇట్లా అన్నది:

క. 'ఇది యెల్లను నొకతల; యీ । పదు మూఁ డేఁడులును నాకు బావకొడుకుచే
నదయమగు కూడుగుడుచుట । యది యొక తలయయ్యె; నేమి యనఁగల దనఘా! 192

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యపురుషా!; ఇది+ఎల్లను+ఒకతల= ఈ కష్టాలన్నీ ఒక ఎత్తు; ఈ పదుమూఁడు+ఏఁడులును= ఈ పదమూడు సంవత్సరాలూ; నాకున్= నాకు; బావకొడుకుచేన్= బావ కుమారుడైన దుర్యోధనుడిచేత; అదయము+అగుకూడు= దయలేని అన్నం; కుడుచుట+అది= తినటంఅన్నది; ఒక తల+అయ్యెను= ఒక యెత్తైనది; ఏమి+అనన్+కలదు?= చెప్పటాని కింకే మున్నది?

తాత్పర్యం: కృష్ణా! ఈ పడిన కష్టాలు, అనుభవించిన దుఃఖాలు అన్నీ ఒక యెత్తు. ఈ పదమూడేళ్ళూ నాకు బావ కొడుకు పెట్టే దయమాలిన తిండి తినటం ఒక యెత్తుగా ఉన్నది. నే నేమి చెప్పగలనయ్యా?

విశేషం: కుంతి అభిమానవతి. అందుకే పదమూడేళ్ళు పరాయి పంచలో ఉండటంతోపాటు బావ కొడుకైన దుర్యోధనుడు నిర్దయగా, పరుషంగా వ్యవహరిస్తూ పెట్టుతున్న తిండి తినటం ఆమె భరించలేకపోయింది. 'ఏమి యనగలదు అనఘా!' అనే వాక్యం ఆమె దైన్యావస్థ యొక్క పరాకాష్ఠ! 'బావకొడుకు' అనే మాట సార్థకం. సొంత కొడుకులుండి కూడా బావగారి కొడుకు పెట్టే తిండి తినవలసి వచ్చిందని ఒక దైన్య భావం. 'దుర్యోధనుడి' పేరుచ్చరించని అనిష్టం అందులో వ్యంగ్యం. (సంపా.)

క. తన్నుఁ దన తమ్ములను నా । కన్న కొడుకు లట్ల తలఁతుఁ గాని విభేదం
బెన్నఁడు నా మది లేమికి । వెన్నుఁడ దైవంబు సాక్షి వినుము పలికెదన్. 193

ప్రతిపదార్థం: తన్నున్= ఆ దుర్యోధనుడినీ; తన తమ్ములను= అతడి సహోదరులనూ; నా కన్నకొడుకులు+అట్ల+ తలఁతున్+కాని= నా కడుపున గన్నబిడ్డలైన పాండవులవలెనే భావిస్తానుగాని; విభేదంబు= వ్యత్యాసం; ఎన్నఁడున్= ఎప్పుడూ; నా మదిన్+లేమికిన్= నా మనసులో లేనందుకు; వెన్నుఁడ= ఓ విష్ణుమూర్తీ!- కృష్ణుడా!; (దైవంబు సాక్షి= ఇందుకు దేవుడే సాక్షి.) పలికెదన్ వినుము= చెప్పుతున్నాను వినుము.

తాత్పర్యం: కృష్ణా! దుర్యోధనుడినీ, అతని తోబుట్టువులనూ నా కడుపున గన్న కొడుకులవలెనే చూస్తాను గాని భిన్నంగా చూడను. నాకు భేదబుద్ధి లేనందుకు ఆ దేవుడే సాక్షి అని చెపుతున్నాను వినుము.

విశేషం: కుంతీదేవి పాండవ కౌరవులను సమదృష్టితో చూచేది. కాని, కౌరవులు మాత్రం తననూ, తన బిడ్డలనూ వేరుగా చూచారని మనోవేదన. ఆమె చిత్తశుద్ధికి దైవం సాక్ష్యం- అనటం జాతీయం. (సంపా.)

క. ఇది నిక్కం బగునేనియుఁ । దుది నీవుం బాండవులను దురితరహితులై
ముదమందఁ జూడఁగనియెద; । నది దీనికి మందు సువ్వె యంబుజనాభా! 194

ప్రతిపదార్థం: అంబుజనాభా!= పద్మము నాభియందు గలవాడా!; ఇది నిక్కంబు+అగున్+ఏనియున్= ఈ మాటలే నిజమైతే; తుదిన్= చివరకు; నీవున్= నీవున్నూ; పాండవులును= పాండవులున్నూ; దురితరహితులు+ఐ= పాపంలేనివారై; ముదము+అందన్= సంతోషం పొందగా; చూడన్+కనియెదన్= చూడటానికి నోచుకొంటాను; అది= అట్లా మీరు ఆనందంతో ఉండటం; దీనికిన్+ మందు+చువ్వె!= నా ఇప్పటి మనోవ్యథకు ఔషధం ఔతుంది సుమా!

తాత్పర్యం: కృష్ణా! నా మాట సత్యమైతే కడపటికి నీవూ పాండవులూ దోషాలంటనివారై ఆనందించగా చూడనోచెదను. ఇప్పటి నా హృదయ వ్యథకు మీరు పరమానందంతో ఉండగా చూడటమే ఔషధం సుమా!

విశేషం: 1. పాండవులను కౌరవులను సమంగా చూడటం అనేది నిజమే అయితే పాండవులు నిందలపాల్గాక, విజయులై తిరిగి వస్తారని ప్రమాణం చేసింది. ఇదీ దేశీయాచారమే.

2. అన్ని బాధలకూ నివారణశక్తి శ్రీకృష్ణుడే అని నమ్మి భక్తి విశ్వాసాలను ప్రదర్శించే కుంతీస్వభావం ఇందులో విశదం. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. బావ యొప్పం డనుపలుకుల నేమగు? । నాతని కొడుకుఁ గీడాడనేల?
కురువృద్ధుఁడగు బాహ్లికుని దూఱ నేటికి? । భీష్మునిపైఁ బ్రయి వెట్టనగునె?
యిట్టి క్రూరుల యింటి కిచ్చిన మనవారి । నందుఁగా కట్లు దాననుటమేలె?
యర్జును పుట్టిన యప్పుడు 'వీఁడు లో । కము లెల్ల గెల్చు పొగడ్త మొగులు

తే. ముట్టు నట్టిద యగు, రణమున జయించు । గౌరవుల; సోదరులుఁ, దాను భూరి రాజ్య
గౌరవముఁ బొందు' నని యశరీరవాణి । వలికె; నది తిట్టువడుఁగాక వలయునేని. 195

ప్రతిపదార్థం: బావ+ఒప్పండు+అనుపలుకులన్= ధృతరాష్ట్రుడు మా మేలు సహించలేడు అనే మాటల వలన; ఏమి+అగున్?= ఏమి ప్రయోజనం?; ఆతని కొడుకున్= అతడి పుత్రుడైన దుర్యోధనుడిని; కీడు+ఆడన్+ఏల?= నిందించటమెందుకు?; కురువృద్ధుఁడు+అగు= కౌరవులలో పెద్దవాడైన; బాహ్లికునిన్= బాహ్లికుడిని; దూఱన్+ఏటికిన్?= తిట్టటం ఎందులకు?; భీష్మునిపైన్= పితామహుడిమీద; ప్రయి+పెట్టన్+అగునె?= నింద మోపవచ్చునా?; ఇట్టి క్రూరులు+ఇంటికిన్= ఇట్టి కఠినాత్ముల యొక్క గృహానికి; ఇచ్చిన= నన్ను కోడలిగా చేసిన; మనవారిన్= పుట్టింటివారిని; అందున్+కాక= అంటానే అనుకో; అట్లు= ఆ విధంగా; తాన్= నేను; అనుట మేలె?= నిందించటం న్యాయమా? (కాదని భావం); అర్జును పుట్టిన+అప్పుడు= అర్జునుడు జన్మించిన సమయంలో; వీఁడు= పార్థుడు; లోకములు+ఎల్లన్= జగములన్నిటిని; గెల్చు= జయిస్తాడనే; పొగడ్త= ప్రశంస; మొగులు ముట్టినట్టిది+అ+అగున్= మేఘమండలం తాకునటువంటి దౌతుంది; రణమునన్= కదనంలో; కౌరవులన్+జయించున్= దుర్యోధనాదులను గెలుస్తాడు; సోదరులున్= తోబుట్టువులూ; తానున్= తానూ; భూరి రాజ్యగౌరవమున్+పొందున్= గొప్ప రాజ్యం ఏలుట వలని గొప్పతనమును పొందుతాడు; అని= అంటూ; అశరీరవాణి= అశరీరవాక్కు; పలికెన్= పల్కింది; వలయున్+ఏనిన్= కావలసివస్తే; అది= అశరీరవాణి; తిట్టుపడున్+కాక!= నిందించబడుగాక!

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు పాండవుల మేలోర్చువాడు కాడని అనటంవలన ఏమి లాభం? అతని కొడుకు దుర్యోధనుడిని తిట్టటం వలన ప్రయోజనమేముంది? కౌరవులలో పెద్దవాడగు బాహ్లికుడిని నిందించడం దేనికి? భీష్ముడి మీద తప్పు మోపటం న్యాయమా? ఇట్లాంటి కఠినచిత్తుల ఇంటికి నన్ను కోడలిని చేసిన నా పుట్టింటివారినే దూషించాలి. అట్లా దూషించటం కూడా సమంజసం ఔతుందా? పార్థుడు జన్మించినవేళ 'ఇతడు లోకాలన్నీ జయిస్తాడనే కీర్తి మేఘమండల మంటుతుంది. ఇతడు కౌరవులను యుద్ధంలో గెలుస్తాడు. తానూ, తన తోబుట్టువులూ భూరి సామ్రాజ్యాధిపత్య గౌరవం పొందుతారు' అని అశరీరవాణి పలికింది. అవసరమైతే ఇట్లా నుడివిన ఆ అశరీరవాణినే నిందించాలి. మరెవ్వరినీ కాదు.

విశేషం: కుంతీదేవి మెత్తని హృదయం గల తల్లియే కాదు, కడుపులోని బాధను గడుసుదనంతో చెప్పగల గడుసరి కూడా. శ్రీకృష్ణుడి బహిఃప్రాణమైన అర్జునుడు పుట్టినప్పుడు ఆకాశవాణి పలికిన పలుకుల వైపు శ్రోత మనస్సును మళ్ళించి గ్రుచ్చుకొనేటట్లు చెప్పటానికి. 'నేతినేతివాదం' వలె- ధృతరాష్ట్రుడిని అనటం ఎందుకు? దుర్యోధనుడిని అనటం ఎందుకు? అని వరుస మొదలు పెట్టింది. ఆ మాట నిజానికి శ్రీకృష్ణుడి మనస్సుకు గ్రుచ్చుకొనాలని అన్నదే. (సంపా.)

వ. ధర్మంబు గలుగునే నది నిక్కంబయ్యెడు; దాని కెల్లను నిర్వాహకుండవు నీవు గలవు గాదె! నీ మన్నించు నెచ్చెలులకుం జెప్పెడు మాటలు గలవు విను; మయ్యుధిష్ఠిరునితో నిట్లనుము; 196

ప్రతిపదార్థం: ధర్మంబు కలుగునేన్= లోకంలో ధర్మమున్నట్లయితే; అది నిక్కంబు+అయ్యెడున్= అశరీరవాణి మాటలు యథార్థాలవుతాయి; దానికిన్+ఎల్లను= ఆ ధర్మానికంతటికినీ; నిర్వాహకుండవు= ప్రవర్తిల్ల చేసేవాడవు; నీవు+కలవు+కాదె!= నీవున్నావు గదా!; నీ మన్నించు నెచ్చెలులకున్= నీ వాదరించే నీ ప్రియమిత్రులైన పాండునందనులకు; చెప్పెడు మాటలు+కలవు= చెప్పవలసిన మాట లున్నాయి; వినుము= ఆలింపుము; ఆ+యుధిష్ఠిరునితోన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనుము= ఈ విధంగా చెప్పు.

తాత్పర్యం: లోకంలో ధర్మ మున్నట్లయితే అశరీరవాణి చెప్పినదే సత్యమవుతుంది. కృష్ణా! ధర్మోద్ధారకుడవు నీవున్నావు. నీవు మన్నించే నీ అనుగు నెచ్చెలికాండ్రకు చెప్పవలసిన మాట లున్నాయి. వినవలసింది. ముందుగా ధర్మతనయుడితో ఇట్లా చెప్పుము:

విశేషం: 1. ధర్మముంటే దేవతల మాటలు నిజమౌతాయట! అన్నిటికీ నిర్వాహకుడైన శ్రీకృష్ణుడే ఉన్నాడట! ఈ దృఢ నిశ్చయమే ఆమెను ధర్మశీలనుగా నిలిపింది. ఆమె కొడుకులను ధర్మమార్గంలో నడిపింది.

2. కొడుకుల స్వభావాలను బట్టి ఎవరెవరికి ఎటువంటి సందేశమివ్వాలో తెలిసిన వివేకవతి అయిన వీరమాత కుంతి.

3. ఉపప్లావ్యంనుండి వచ్చిన కృష్ణుడు పాండవ దూత. హస్తినాపురంనుండి తిరిగి వెళ్ళే శ్రీకృష్ణుడు కుంతీదూత. (సంపా.)

క. వేఁడికొని కృపణులై కను । పోఁడిమి యది యేల రాజపుత్రులు దమ మై
వాఁడిమి దప్పిన నిప్పులు । వేఁడిమి సెడినట్లు జనులు విని యులుకుదురే? 197

ప్రతిపదార్థం: కృపణులు+ఐ= దీనులై; వేఁడికొని= ప్రార్థించి; కనుపోఁడిమి= పొందునట్టి సంపద; అది+ఏల?= అదెందుకు?; రాజపుత్రులు= క్షత్రియకుమారులు; తమ= తమయొక్క; మైవాఁడిమి= శరీరమందలి ప్రతాపం; తప్పినన్= విడిచినయెడల; నిప్పులు= అగ్నులు; వేఁడిమి చెడిన+అట్లు= వేడిమిని గోల్పోయినట్లే అగును; జనులు విని= ప్రజలు అట్టి ప్రతాపహీనుల ఆజ్ఞ లాలించి; ఉలుకుదురే?= జంకుదురా? (జంకరని అర్థము.)

తాత్పర్యం: దీనులై యాచించి గడించిన సంపద లెందుకు? క్షత్రియ కుమారులు ఒడలిలో తేజం కోల్పడితే నిప్పులు వేడిమిని విడిచినట్లే అవుతుంది. మగటిమి లేనివారి మాటలకు జనులు జంకుతారా?

విశేషం: అలం: ఉపమ. ఇది ధర్మరాజున కిచ్చిన సందేశం. అతడిని మూడు విధాల మందలించింది కుంతి. 1. నీకు రావలసిన రాజ్యభాగాన్ని దీనుడివలె యాచించటం తప్పు. అట్లా భిక్షాదానంగా వచ్చే రాజ్యాన్ని స్వీకరించటం తప్పు- అని మొదటి హెచ్చరిక. కపట ద్యూతంలో రాజ్యసంపద కోల్పోయినప్పుడు ద్రౌపదికి వరంగా ధృతరాష్ట్రుడు దానిని తిరిగి ఇచ్చాడు. అరణ్యాజ్ఞాతవాసాలు ముగిసిన తరువాత కూడ మరల ధృతరాష్ట్రుడి దయ కొరకు, దుర్యోధనుడి సుముఖత కొరకు ఇంత దీనంగా అడగటం అవమానం. అడగటంలో కూడా ఆత్మగౌరవం ఉండాలి. రాజ్యభాగం ఇవ్వకపోయినా అయిదూళ్ళు ఇస్తే చాలని కోరటం మరీ అవమానం- అని హెచ్చరించింది.

2. క్షత్రియులు ప్రతాపాన్ని విడిచిపెడితే వేడిలేని అగ్నులవలె మారి శత్రువులను తపింపచేసే శక్తిని కోల్పోతారు. కాబట్టి యుద్ధంలో పరాక్రమాన్ని ప్రదర్శించి రాజ్యాన్ని పొందండి. క్షత్రియ ధర్మాన్ని రక్షించండి. యుద్ధం కంటె శాంతి మేలు అని భావిస్తున్న ధర్మజుడిని యుద్ధోన్ముఖుడిగా చేయాలన్న వీరమాత ప్రబోధ మిది.

3. ఒకవేళ ప్రతాపరహితులై యాచించి, రాజ్యాన్ని పొందినా జనులు ఆ రాజులను గౌరవించరు. కాబట్టి అటువంటి రాజ్యసంపదను పొందినా ప్రభుత్వాన్ని నిలుపుకొనటం కష్టం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

4. తాత్పర్య మేమంటే- 'దైన్యాన్ని వదులు. క్షత్రియోచిత పరాక్రమాన్ని ప్రదర్శించి రాజ్యాన్ని సాధించు. ప్రజల ఆదరాభిమానాలను పొందు.' ఈ మూడూ పరస్పరాశ్రితాలైన గుణాలు. ఏ ఒకటి లేకపోయినా మిగిలినవి దక్కవు అని శాంతికాముకుడైన ధర్మజుడు పౌరుషాగ్నితో ప్రజ్వలించేటట్లు పలికింది. అయితే, ధర్మజుడు సూక్ష్మగ్రాహి కాబట్టి సందేశాన్ని మృదువుగా, వ్యంగ్యంగా, మనసు నొవ్వకుండా చెప్పింది.

5. కుంతి మనసులో పడుతున్న వేదనకు ఈ మాటలు అక్షరదీపికలు. వీరులను కన్న రాజమాత తన కొడుకులు వీరులుగానే బ్రతికి తనకు గౌరవం తేవాలని అనుకొనటం సహజం. కాని, ధర్మజుడు ధర్మనీతిలో భాగంగా చతుర్విధోపాయాలను ప్రదర్శిస్తూ సంధియత్నం చేస్తున్నాడే కాని, పౌరుషహీనుడై కాదన్న సత్యం గమనార్హం. (సంపా.)

వ. భీమార్జునుల కిట్లని చెప్పుము: 198

తాత్పర్యం: భీముడికి, అర్జునుడికి ఇట్లా చెప్పుము:

ఆ. కొడుకుఁ గాంచు రాచకూఁతు రెద్దానికి? । నట్టిపనికి నుచితమైన సమయ
మొదవెఁ; దడయుటింక నొప్పదు; జనములు । నట్లుగాని పురుషు లనరు మిమ్ము. 199

ప్రతిపదార్థం: రాచకూఁతురు= క్షత్రియపుత్రి; ఏ+దానికిన్= దేనికొరకు; కొడుకున్+కాంచున్= కుమారుడిని కంటుందో; అట్టిపనికిన్= అట్లాంటి యుద్ధ కార్యానికి; ఉచితము+ఐన+సమయము+ఒదవెన్= తగిన వేళ వచ్చింది; ఇంకన్= ఇటమీదట; తడయుట= ఆలసించటం; ఒప్పదు= తగదు; అట్లు+కాని= అప్పుడు తప్ప; జనములు= ప్రజలు; మిమ్మున్= మిమ్మలను; పురుషులు+అనరు= మగవారని చెప్పరు.

తాత్పర్యం: క్షత్రియకన్య పెండ్లాడి కొడుకును ఏ కార్యానికై కంటుందో, అట్టి ప్రతాపప్రదర్శనకు తగిన అదను సంప్రాప్తించింది. ఇక ఆలసించటం తగదు. అప్పుడుగాని మిమ్మల్ని ప్రజలు మగవారని అనరు సుమా!

విశేషం: 1. కుంతీదేవి తన కొడుకులలో ధర్మజుడిని ప్రత్యేకంగా, ప్రజ్ఞావంతుడైన మనీషిగా భావించి గౌరవిస్తుంది. ఆ తరువాత భీమార్జునులను ఒక జంటగా, నకుల సహదేవులను ఒక జంటగా భావిస్తుంది. ద్రౌపదిని ప్రత్యేకంగా సంభావిస్తుంది. ఈ స్వభావం ఈ సందర్భంలో స్పష్టమౌతున్నది.

2. ధర్మజుడు నీతిజ్ఞుడు కాగా, భీమార్జునులు గదాగాండీవాలతో ప్రసిద్ధి కెక్కిన శస్త్రజీవులు. నిజానికి క్షత్రియ వనిత యుద్ధంలో సాటిలేని మేటి వీరులను కనాలనీ, వారు రణరంగంలో తమ మగతనం ప్రదర్శించి తమకు, తనకు పేరు తేవాలనీ అనుకొంటుంది. తల్లి కలలు కని కన్న వీరసంతానం భీమార్జునులు. ఆ కలలు నిజం చేయటం వారి ధర్మమని హెచ్చరిక. ఆమె కోర్కెను తీర్చకపోతే వారు వీరులు కాదు, ఆమె వీరమాత కాజాలదు- అని నిష్ఠురం.

3. యుద్ధం చేసి పౌరుషాన్ని ప్రదర్శించకపోతే వారిని పురుషులని లోకం గుర్తించదట! ఇది చాలా నిష్ఠురమైన మాట. మరీ, బృహన్నలగా అజ్ఞాతవాసం చేసిన అర్జునుడికి గుచ్చుకొనే మాట! తెలుగులో 'మిమ్మలిని మగవా రనరు' అనే తిట్టు జాతీయం. బలపరాక్రమమే తమ అస్తిత్వంగా బ్రతికే కొడుకులను ఉత్తేజపరిచే వాఙ్మయ శిల్పం తెలిసిన వీరమాత కుంతి.

4. భీమార్జునులు కీచకవధలోనూ, దక్షిణ ఉత్తర గోగ్రహణ ఘట్టంలోనూ తమ పౌరుషాన్ని ప్రదర్శించే ఉన్నారు. కాని, ఆమె వాటిని గుర్తించినట్లు చెప్పకపోవటం గడుసుదనం. ఆ యుద్ధాలు పాండవులు ఆత్మరక్షణ కొరకు చేసినవి. కాని, మాతృమూర్తిని వీరమాతగా చేయాలంటే కౌరవులపై యుద్ధం చేసి తమ శస్త్రాస్త్రబల సంపదను ప్రదర్శించి పురుషులనిపించుకొన్నప్పుడే సాధ్యమౌతుందని హెచ్చరిక చేసింది. ఆలసించవద్దని ప్రేరేపించింది.

5. భీమార్జునులకు ధర్మరాజుకు వలె సున్నితంగా చెప్పలేదు. బాణంతో గుచ్చినట్లు మాట్లాడింది. మగతనం- అనే మాట వారి మనసులపై దెబ్బకొట్టుతుంది. ఆకలి తెలిసి అన్నం పెట్టేదీ, అదనెరిగి ఆగ్రహించేదీ, అనువుగా మందలించేదీ, ఆదర్శంతో తీర్చిదిద్దేదీ తల్లి, కుంతి వీరమాత. (సంపా.)

క. భుజ బలమున జీవించుట । నిజధర్మము మెత్తఁబడుట నింద్యము; మాద్రీ
ప్రజలకుఁ జెప్పుము ద్రుపదా । త్మజఁ గార్యం బడుగుమనుము తగనందఱతోన్. 200

ప్రతిపదార్థం: భుజబలమునన్= బాహు విక్రమంతో; జీవించుట= బ్రతకటం; నిజధర్మము= క్షత్రియ ధర్మం; మెత్తఁబడుట= అణగిపోవటం; నింద్యము= దూషింపదగింది అని; మాద్రీప్రజలకున్= మాద్రి కుమారులకు; చెప్పుము= తెలుపుము; ద్రుపద+ ఆత్మజన్= ద్రౌపదిని; తగన్= ఒప్పిదంగా; అందఱతోన్= పాండవులందరితో; కార్యంబు+అడుగుము+అనుము= కర్తవ్యం గురించి అడుగుమని చెప్పుము.

తాత్పర్యం: మాద్రీనందనులైన నకుల సహదేవులతో- బాహుబలంతో బ్రదకటం క్షత్రియధర్మమనీ, అణగిమణగి ఉండటం దూషింపదగిన విషయమనీ చెప్పుము. తన కర్తవ్యమేమిటో ద్రౌపది నడిగి తెలిసికొనండని పాండవులందరితో చెప్పుము.

విశేషం: 1. కవలలు నకుల సహదేవులు. వారిద్దరికీ కలిపి సందేశం ఇవ్వటం ఔచిత్యం. అందులోనూ క్రమాన్ని పాటించి అన్వయించుకొంటే నకులుడికి భుజబలంతో జీవించుమని హెచ్చరిక. సహదేవుడికి క్షత్రియ ధర్మంలో మెత్తబడటం నింద్యమని గట్టిగా చెప్పింది. శ్రీకృష్ణుడితో వారిరువురు మాట్లాడిన తీరులు గమనిస్తే ఈ సందేశాలు వారి మనఃప్రవృత్తులకు అచ్చంగా అతికినట్లున్నాయని స్పష్టమవుతుంది.

2. పాండవులలో పరాక్రమాన్ని ప్రేరేపించే ప్రధానశక్తిగా ద్రౌపదిని కుంతి గుర్తించి, సమయోచితంగా వారిలో యుద్ధోత్సాహాన్ని ప్రజ్వలింపజేస్తూ ఉండుమని కోరింది. ద్రౌపది కాంతాసమ్మితంగా కార్యాన్ని చక్కదిద్దగలదని ఆమె విశ్వాసం. అది సహజం కూడా. (సంపా.)

చ. అలిగిన భీమ ఫల్గునుల కడ్డము లేమి యెఱుంగు; దంతలం
తలు వడి వాని నీఁగవలదా? విను మాపని కెల్లఁ బాండుపు
త్రులె కలవారు; నీ కెటుల దోఁచిన నట్టులు సేయువారు గా;
కలఘువిచార! నా యలఁత యార్పుము; నన్ గడతేర్పు మెమ్మెయిన్.' 201

ప్రతిపదార్థం: అలిగినన్= కోపగిస్తే; భీమఫల్గునులకున్= భీమార్జునులకు; అడ్డము లేమిన్= అవరోధం లేకుండటం; ఎఱుంగుదున్= తెలియుదును; అంతలు+అంతలు+పడి= అంతలేసి అవమానాల పాలై; వానిన్= ఆ పరాభవాలను; ఈఁగన్ వలదా= తీర్చుకొనవద్దా; వినుము= ఆలింపుము; ఆ పనికిన్+ఎల్లన్= పరాభవ దుఃఖాలను బాపుకొనే పనికంతా; పాండుపుత్రులె కలవారు= పాండు నందనులే సంసిద్ధంగా ఉన్నారు; నీకున్= నీకు; ఎటులు తోఁచినన్= ఏ విధమైన అభిప్రాయం కల్గుతుందో; అట్టులు+చేయువారు+కాక= ఆ విధంగా సల్పగలరు; అలఘువిచార!= గొప్ప ఆలోచనగలవాఁడా! కృష్ణా!; నా+అలఁత= నా శోకం; ఆర్పుము= తొలగించుము; నన్= నన్ను; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; కడతేర్పుము= ఉద్ధరించుము.

తాత్పర్యం: అలుక వహిస్తే భీమార్జునులకు అడ్డం లేదని నాకు తెలుసు. అంతంత అవమానాలు పొంది ఆ కసి తీర్చుకొనవద్దా? ఆ పని పాండునందనులు చేయగలరు. నీవెట్లా చెపితే వారట్లా చేస్తారు. గొప్ప ఆలోచనగల నీవు నా బాధ తీర్చవలసినది. నన్ను ఎట్లయినా దుఃఖాల నుండి కడతేర్చవలె.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 1. ఈ మాటలు కుంతీదేవి శ్రీకృష్ణుడితో అంటున్నవి. ఆమె ఆయనను కోరింది రెండంశాలు: 1. నా దుఃఖం (అనే అగ్నిని) ఆర్పుము. 2. నన్ను ఉద్ధరించుము. ఈ రెండూ పరమాత్మరూపుడైన శ్రీకృష్ణుడి దివ్యత్వాన్ని గుర్తించి అన్నవే. 'కడతేర్పుము' అనే క్రియ తెలుగు జాతీయం. దానికి అనేకార్థాలున్నా ఇక్కడ కష్టాలనుండి గట్టెక్కించుమని భావం.

2. కుంతి విజ్ఞురాలు. ఒక కార్యం సాధించబడాలంటే ఇచ్ఛాక్రియా జ్ఞానశక్తుల సమన్వయ వినియోగాలు అవసరం. ఇక్కడ ఇచ్ఛాశక్తులు భీమార్జునులు. వారు కోపిస్తే చాలు ఆ కార్యానికి అడ్డం ఉండదు. ఆ సంగతి శ్రీకృష్ణుడికి కూడా తెలుసుననటం కుంతీదేవి గడుసుదనం. అవమానాల పాలైన పాండవులు వాటికి ప్రతీకారం తీర్చికొనే ప్రయత్నం చేయాలి. ఇది కార్యశక్తి. పాండవులు సంఘటితంగా కూడి యుద్ధకార్యాన్ని స్వయంగా నిర్వహించగలరని కుంతీదేవి కొడుకుల పౌరుషంమీద ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది.

3. ఇక పాండవ పక్షంలో ఇచ్ఛాక్రియాశక్తులకు మూలమైనదీ, చోదకమైనదీ, వాటిని నియంత్రించగలిగినదీ. ఫలాగమందాకా ముందుకు నడిపించేదీ జ్ఞానశక్తి. అదే శ్రీకృష్ణుడు. ఆ అర్థం వ్యంగ్యంగా స్ఫురించేటట్లు 'అలఘువిచార!' అని సంబోధించింది. నీ కెట్లా తోస్తే అట్లా పాండవులను నియోగించు మని కోరింది. కార్యచక్రం తిప్పుమని వేడింది. ఫలితం మాత్రం- కుంతి వంత తీరాలి. ఆమె ఉద్ధరించబడాలి.

4. కుంతి మనోదుఃఖం అగ్నివంటిదని 'ఆర్పు' అనే క్రియతో ధ్వనింపజేశాడు తిక్కన. అది శత్రుసంహారంవలన సాధ్యం. ఇక ఉద్ధరించమంటే- పరుల పంచలో ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి దైన్యంతో బ్రతికే అప్పటి దురవస్థ నుండి ఉద్ధరించటమే, పాండవులు పరాక్రమంతో రాజ్యాన్ని జయించి, తనను రాజమాతగా గౌరవపదంలో నిలపటమే. ఈ పని చేసే వారు పాండవులైనా చేయించే దైవీసంకల్పశక్తి శ్రీకృష్ణు డని ఆమె తాత్పర్యం. కార్యసాధకమైన మాటల పొందికలో అర్థవ్యక్తి అనే గుణం రాణించి వస్తు స్వభావ స్ఫుటత్వాన్ని కలిగిస్తున్నది. (సంపా.)

వ. అనినఁ గృష్ణుండు గొంతి ననునయించి యిట్లనియె: 202

తాత్పర్యం: కుంతి అట్లా తన మనోబాధను వెల్లడించగా కృష్ణుడు ఆమె నోదార్చి ఇట్లా చెప్పాడు:

శ్రీకృష్ణుఁడు కుంతీదేవి నూఱడించుట (సం. 5-88-89)

చ. 'సుగుణవు, పుట్టినింటికిని జొచ్చినయింటికిఁ దేజ మెక్కఁగాఁ
దగుచరితంబునన్ నడచు ధన్యవు, ధీరవు, దేవి! నీ వెడ
న్వగ లడఁగింపకున్న భువనంబుల నింకిట నెవ్వ రోర్చువా
రు గలఁక దక్కుమీ హృదయ రోగము లన్నియుఁ బుచ్చివైచెదన్. 203

ప్రతిపదార్థం: దేవి!= కుంతీమహాదేవీ!; సుగుణవు= మంచి గుణములు కలదానివి; పుట్టిన+ఇంటికిని= పుట్టింటికినీ; చొచ్చిన+ ఇంటికిన్= అత్త యింటికినీ; తేజము+ఎక్కఁగాన్= వన్నె మీరగా; తగుచరితంబునన్= యోగ్యమైన నడవడితో; నడచుధన్యవు= ప్రవర్తించే పుణ్యాత్మురాలవు; ధీరవు= ధైర్యముగలదానవు; నీవు= అట్టి నీవు; ఎడన్= హృదయంలో; వగల్= చింతలు; అడగింపక+ఉన్నన్= అణచకపోయినచో; ఇంకన్= మరి; ఇటన్= ఇక్కడ; భువనంబులన్= లోకాలలో; ఓర్చువారు= దుఃఖాలను సహించేవారు; ఎవ్వరు?= ఎవరు గలరు?; కలఁక+తక్కుమీ= సంక్షోభం మానుము; హృదయ రోగములు+అన్నియున్= నీ మనోవ్యాధు లన్నింటినీ; పుచ్చివైచెదన్= తొలగించివేస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'అత్తా! నీవు గుణవంతురాలివి. పుట్టినింటికీ, మెట్టినింటికీ వన్నె వాసి ఏర్పడగా ఒప్పిదమైన నడవడితో ప్రవర్తించే పుణ్యాత్మురాలివి. ధైర్యంగలదానివి. ఇట్టి నీవు మనస్సులోని చింతలను అణచుకొనకుంటే మరి ఈ లోకంలో దుఃఖాలను సహించేవారు ఎవరుంటారు? అమ్మా! కలత మానుము. నీ మనోవ్యాధులన్నిటినీ తొలగిస్తాను.

విశేషం: 1. యోగ్యుడైన భక్తుడు ఆర్తితో అడుగుతుంటే కరుణారసం పొంగగా అభయహస్తం ఇస్తున్న భగవంతుడివలె శ్రీకృష్ణుడు పలుకుతూ ఉండటం పరిపాటి. 2. ద్రౌపది కెట్లా అభయహస్త మిచ్చాడో, కుంతికీ అట్లాగే అభయహస్త మిచ్చాడు. సంధి కాదు, యుద్ధం ఆగదు. విజయం సిద్ధించక మానదు, మనశ్శాంతి కుదరక తీరదు- అన్నట్లు ధైర్యం చెప్పాడు.

3. కుంతీ మనోవేదనను రోగంగా చెప్పి రూపకాలంకార శోభను కలిగించాడు తిక్కన. ఇక్కడ బహువచనం చెప్పటం మరొక విశేషం. కుంతి మనసులో పాండవుల బెంగ ఒక ప్రక్క. తనకు కన్యాత్వంలో సూర్యుడి వరం వలన కలిగిన కర్ణుడి బెంగ మరొక ప్రక్క బాధిస్తున్నాయి. ఒక దానిని చెప్పగలిగింది. మరొకటి చెప్పలేనిదిగా దాచుకొన్నది. శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడు. ఆ దుఃఖాన్ని కూడా మానుస్తానన్నాడు. ఎట్లా? అది భావికథలోగాని ప్రసన్నం కాదు. శ్రీకృష్ణుడిని దివ్యుడిగా భావిస్తే అతడు దివ్యమహిమలనే ప్రసాదించగలడు. (సంపా.)

క. **తనయులుఁ గోడలు సేమం । బున నున్నా; రధిక భక్తిపూర్వముగా దం**
డనమస్కారంబులు నీ । కొనరించిరి, కౌఁగిలించి రుల్లములఁ దగన్. **204**

ప్రతిపదార్థం: తనయులున్= నీ కుమారులును; కోడలున్= నీ కోడలుకూడా; సేమంబునన్+ఉన్నారు= సుఖంగా ఉన్నారు; అధిక భక్తిపూర్వముగాన్= మిక్కుటమైన భక్తి పురస్సరంగా; నీకున్= నీకు; దండ నమస్కారంబులు+ఒనరించిరి= నీకు సాగిలపడి మ్రొక్కారు; తగన్= చక్కగా; ఉల్లములన్= తమ మనసులందు; కౌఁగిలించిరి= నిన్ను కౌగిలించుకొన్నారు.

తాత్పర్యం: అత్తా! నీ కొడుకులు కోడలు క్షేమంగా ఉన్నారు. మిక్కిలి భక్తితో నీకు సాగిలపడి మ్రొక్కులు సమర్పించారు. మనసులందే నిన్ను కౌగిలించుకొన్నారు.

క. **నీ కొడుకు లొండు సుఖములు । చేకొన; రవ్వీరసుఖమ చిత్తములఁ గరం**
బాకాంక్షింతు; రలంతులఁ । బోక గలుగు నెట్టు? లల్పబుద్ధులె వారల్? **205**

ప్రతిపదార్థం: నీ కొడుకులు= నీ కుమారులు; ఒండు సుఖములు= ఇతర సౌఖ్యాలు; చేకొనరు= గ్రహించరు; ఆ+వీరసుఖము+అ= శౌర్యవృత్తి వలన చేకూరు సౌఖ్యమే; చిత్తములన్= హృదయములందు; కరంబు= మిక్కిలి; ఆకాంక్షింతురు= కోరుకొంటారు; అలంతులన్+పోక= అల్పమార్గాలలో వెళ్ళటం; ఎట్టులు+కలుగున్?= వారికెట్లా అలవడుతుంది?; వారల్= నీ కుమారులు; అల్పబుద్ధులె?= నీచస్వభావులా?- కారు సుమా!

తాత్పర్యం: అత్తా! నీ కుమారులు లోక సాధారణమైన సౌఖ్యాలు అనుభవించటానికి అంగీకరించరు. వీర ధర్మాన లభించే సౌఖ్యమే తమ మనస్సులో కోరుకొంటారు. వారు తుచ్ఛమార్గాలు అనుసరించేటంత నీచబుద్ధులు కారు సుమా!

క. **ఉత్సాహంబున శత్రు కు । లోత్సాదన విధి యొనర్చి యున్నత సామ్రా**
జ్యోత్సవము నొందు పుత్త్రుల । నుత్సుకతం జూతుగాక; యూఱడు మింకన్.' **206**

ప్రతిపదార్థం: ఉత్సాహంబునన్= పూనికతో; శత్రుకుల+ఉత్పాదన విధి+ఒనర్చి= విరోధి వంశాన్ని పెల్లగించి వేయటం అనే కార్యం నిర్వహించి; ఉన్నత సామ్రాజ్య+ఉత్సవము= దొడ్డ ప్రభుత్వం అనే పండుగను; ఒందు= పొందే; పుత్త్రులన్= కొడుకులను; ఉత్సుకతన్= ఉబలాటంతో; చూతు+కాక= చూచెదవు లెమ్ము; ఇంకన్= ఇక; ఊఱడుము= ఊరడిల్లుము.

తాత్పర్యం: పాండవులు విరోధివంశాన్ని కూకటివేళ్ళతో పెల్లగించి వేసి,; ఉన్నత సామ్రాజ్యాధిపత్యమనే పండుగను జరుపుకుంటుంటే నీవు ఉత్సాహంతో కనుగొనగలవు. ఇంక ఊరట వహించుము.'

చ. **అన విని మోము విచ్చుచు మురారికి నిట్లనుఁ గుంతి 'పాండు నం**
దనులకుఁ దండ్రియున్ గురువు దైవము నారయ నీవ కావె! నీ
మనమున ధర్మమున్ హితము మంచిగఁ జూచి విధించినట్ల చే
సి నెగడువారు గాక నినుఁ జేరిన నాపద లొంద నేర్చునే? 207

ప్రతిపదార్థం: అనన్+విని= శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు విని; కుంతి= కుంతీదేవి; మోము విచ్చుచున్= మొగం వికసింప చేస్తూ; ముర+అరికిన్= ఆ మురవైరికి; ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పింది; పాండునందనులకున్= పాండుకుమారులకు; తండ్రియున్= జనకుడును; గురువు= ఒజ్జయును; దైవమున్= దైవతమును; ఆరయన్= పరికించగా; నీవు+అ+కావె!= నీవేగదా!; నీ మనమునన్= నీ చిత్తంలో; ధర్మమున్= న్యాయాన్ని; హితమున్= మేలును; మంచిగన్+చూచి= చక్కగ తలపోసి; విధించిన+అట్లు+అ= నీవు నిర్ణయించిన విధాన; చేసి= ఆచరించి; నెగడువారు+కాక= వృద్ధి పొందుతారు లెమ్ము; నినున్+చేరినన్= నిన్నాశ్రయించుకొన్నచో; ఆపదలు= కష్టాలు; ఒందన్+నేర్చునే= కలుగ గలవా? (కలుగవని అర్థం.)

తాత్పర్యం: కృష్ణుడి మాటలు వినేసరికి కుంతీదేవి ముఖం వికసించింది. ఆమె మురవిధ్వంసకుడైన మేనల్లుడితో ఇట్లా అన్నది. 'పాండుకుమారులకు తండ్రి, గురువు, దైవం నీవేకదా! నీ మనస్సులో ఏది న్యాయమో, ఏది హితమో మంచిగా నీవే చూచి ఇట్లా చేయండి అని నిర్దేశిస్తే వారు అట్లా చేసి బాగుపడగలరు. నిన్ను ఆశ్రయించుకొన్నవారికి ఎట్టి ఆపదలు రావుగదా!

విశేషం: 1. అలం: మాలారూపకం. 2.పాండవులకు శ్రీకృష్ణుడు వరుసగా తండ్రి, గురువు, దైవం అని నివేదించుకొన్నది. ముగ్గురూ ఒకరిలోనే ఉన్నారు. తండ్రిగా ధర్మాన్ని నిర్దేశిస్తాడు. గురువుగా హితాన్ని బోధిస్తాడు, దైవంగా 'మంచిగ చూస్తాడు' అంటే యోగక్షేమం వహిస్తాడు అని క్రమాన్వయం. 'నిను చేరిన నాపద లొంద నేర్చునే!' అన్నది విశ్వాసంతో కూడుకొన్న శరణాగత భక్తి భావ ప్రకటనం. భగవంతుడి రక్షణలో ఉన్నవారి దరికి ఆపదలు చేరవు అన్నది విశ్వాసం. పాండవులు శ్రీకృష్ణుడిని శరణు వేడి అటువంటి భద్రస్థితిలో ఉన్నారని ధ్వని. (సంపా.)

క. **వారలక యేల మాధవ! । కౌరవులకు మఱియు నీజగంబులకెల్లం**
జేరుగడ నీవ; నీ పలు । కారయ వేదంబ కాదె యఖిలంబునకున్.' 208

ప్రతిపదార్థం: మాధవ!= శ్రీకృష్ణా!; వారలకున్+అ+ఏల?= పాండవులకు మాత్రమే అననేల?; కౌరవులకున్= కౌరవులకుకూడా; మఱియున్= ఇంకను; ఈ జగంబులకున్+ఎల్లన్= ఈ లోకాలన్నింటికినీ; చేరుగడ= శరణం; నీవు+అ= నీవే సుమా!; అఖిలంబునకున్= సమస్తమునకునూ; ఆరయన్= విచారించగా; నీ పలుకు= నీ వచనం; వేదంబు+అ కాదె!= వేదమే గదా!

తాత్పర్యం: మాధవా! ఒక్క పాండుకుమారులకే అననేల? కౌరవులకునూ; ఈ లోకము లన్నింటికినీ నీవేదిక్కు. సమస్త జగాలకూ పరికించగా నీ పలుకే వేదం కదా!'

విశేషం: 1. అలం: రూపకం. శ్రీకృష్ణుడి మాట వేదం.

2. భగవంతుడు జగద్రక్షకుడనీ, పాండవ కౌరవులందరికీ ఆయన సముడనీ భావించే కుంతీభావంలో సమత్వం స్ఫురిస్తున్నది.

3. అఖిలలోకాలకూ శ్రీకృష్ణుడి వాక్కులు వేదంకాగా ఆ మాటలు విన్నవారు ధర్మమూర్తు లౌతారు. విననివారు పతితులౌతారని ధ్వని. (సంపా.)

వ. అనినం బ్రసన్నవదనుం డగుచు నద్దేవి గారవించి యామంత్రణంబు సేసి తదావాసంబు వెలువడి తనరాకకు నలంకృతంబైన దుర్యోధను మందిరంబునకుఁ గృతవర్మ సాత్యకి సమేతుండయి పోవు గోవిందునిం గని తదీయ ద్వారపాలకులు సంభ్రమంబునం బఱచి యతని కెఱిఁగించి తదనుమతంబునం బఱతెంచి యెదుర్కొని కక్ష్యాంతరంబుల సందడి నెడగలుగ జడియుచు వినయంబునం దోడ్కొనిచన నమ్మనుజవిభుండు కైలాసశిఖరాకారంబగు సౌధంబున బాహ్లిక భీష్మ ద్రోణ ప్రభృతులును, గర్ణశకుని సైంధవాదులును, దుశ్శాసన వికర్ణ దుర్ముఖ ప్రముఖులును మఱియు ననేక దేశాధీశులునుం బరివేష్టింపఁ బేరోలగంబున సింహాసనాసీనుండై యున్న యెడకుం జను నప్పు డాసుయోధనుండు సపరివారంబుగాఁ బ్రత్యుత్థానంబు సేయం జేర నరిగి యతనికిం దగువారలకు నాలింగనాద్యుపచారంబులు తానుం దమ్ముండును నాచరించి. 209

ప్రతిపదార్థం: అనినన్; ప్రసన్న వదనుండు+అగుచున్= అనుగ్రహంతో కూడిన ముఖం కలవాడై; ఆ+దేవిన్= ఆ కుంతిని; గారవించి= గౌరవించి; ఆమంత్రణంబు+చేసి= ఆమె నుండి వీడ్కోలు పడసి; తద్+ఆవాసంబు+వెలువడి= ఆమె గృహం నుంచి బయటకువచ్చి; తన రాకకున్= తన ఆగమనమునకై; అలంకృతంబు+ఐన= అలంకరించబడిన; దుర్యోధను మందిరంబునకున్= సుయోధనుడి సౌధానికి; కృతవర్మసాత్యకి సమేతుండు+అయి= కృతవర్మ, సాత్యకి అనే వారితో కూడినవాడై; పోవు గోవిందునిన్; కని= చూచి; తదీయ ద్వారపాలకులు= ఆ దుర్యోధనుడి వాకిలిగాచువారు; సంభ్రమంబునన్+పఱచి= తొట్రుపాటుతో పరుగెత్తిపోయి; అతనికిన్+ఎఱిఁగించి= సుయోధనుడికి కృష్ణుడి రాక తెలిపి; తద్+అనుమతంబునన్= సుయోధనుడి అంగీకారంతో; పఱతెంచి= మరలివచ్చి; ఎదుర్కొని= శ్రీకృష్ణుడికి ఎదురుగా వచ్చి; కక్ష్యా+అంతరంబుల సందడిన్= లోగిళ్ళ లోపల కలిగిన సమ్మర్దమును; ఎడ కలుగన్= దారి ఏర్పడేటట్లు; జడియుచున్= తొలగిస్తూ; వినయమునన్= అణకువతో; తోడ్కొని చనన్= వెంట బెట్టుకొని వెళ్ళగా; ఆ+మనుజ విభుండు= ఆ నరనాథుడైన సుయోధనుడు; కైలాస శిఖర+ఆకారంబు+అగు= కైలాస పర్వత శిఖరం మాదిరి ఉన్న; సౌధంబునన్= భవనంలో; బాహ్లిక భీష్మ ద్రోణ ప్రభృతులును= బాహ్లికుడు, భీష్ముడు, ద్రోణాచార్యులు మొదలైనవారున్నూ; కర్ణ శకుని సైంధవ+ఆదులును= కర్ణుడు శకుని సైంధవుడు మొదలైనవారున్నూ; దుశ్శాసన వికర్ణ దుర్ముఖ ప్రముఖులును= దుశ్శాసనుడు, వికర్ణుడు, దుర్ముఖుడు మొదలైనవారున్నూ; మఱియున్= ఇంకను; అనేక దేశ+అధీశులునున్= పెక్కు దేశాల రాజులున్నూ; పరివేష్టింపన్= చుట్టుచేరిఉండగా; పేరు+ఓలగంబునన్= గొప్ప కొలువు కూటంలో; సింహ+ఆసన+ఆసీనుండు+ఐ= సింగపు గద్దె మీద కూర్చుండినవాడై; ఉన్న+ఎడకున్= ఉన్న తావుకు; చను+అప్పుడు= వెళ్ళుతున్న సమయంలో; ఆ సుయోధనుండు= ఆ దుర్యోధనుడు; సపరివారంబుగన్= పరిజనులతో కూడ; ప్రత్యుత్థానంబు+చేయన్= ఎదుర్కోలు జరుపుటకై; చేరన్+అరిగి= శ్రీకృష్ణుడి సమీపానికి వెళ్ళి; అతనికిన్= శ్రీకృష్ణుడికి; తగువారలకున్= అతని వెంట వచ్చిన అర్హులైన వారందరికీ; ఆలింగన+ఆది+ఉపచారంబులు= కౌగిలించుకొనటం మున్నగు మన్ననలు; తానున్= తానును; తమ్ముండును= తన అనుజుడైన దుశ్శాసనుడును; ఆచరించి= కావించి.

తాత్పర్యం: కుంతీదేవి మాటలు విని శ్రీకృష్ణుడు ప్రశాంత ముఖపద్మంతో ఆ దేవిని మన్నించి, సెలవు పుచ్చుకొని, ఆమె నివాసం నుండి వెలుపలికి వచ్చాడు, తన ఆగమనానికై అలంకరించబడిన దుర్యోధనుడి భవనానికి హరి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కృతవర్మతో సాత్యకితో కలిసి బయలుదేరాడు. కృష్ణస్వామి రాకనుగాంచి వాకిటి కావలివాండ్రు సత్వరంగా వెళ్ళి దుర్యోధనుడికి ఆ వార్త తెలిపారు. ఆయన ఆదేశంతో వారు వచ్చి శౌరి నెదుర్కొని లోగిళ్ళలోని సమ్మర్దం తొలగిస్తూ దారి నేర్పరచి వినయంతో తోడ్కొనిపోయారు. సుయోధనుడు కైలాస శిఖరంవలె ఉన్న ఉన్నత సౌధంలో బాహ్లికుడు భీష్ముడు ద్రోణుడు మున్నగువారూ, కర్ణుడు శకుని సైంధవుడు మొదలైనవారూ, దుశ్శాసనుడు వికర్ణుడు దుర్ముఖుడు ఆదిగాగలవారూ, ఇంకా పలు దేశముల ప్రభువులూ తన చుట్టూ చేరి ఉండగా, సింహాసనాసీనుడై కొలువుదీరి ఉన్నాడు. అక్కడికి శ్రీకృష్ణుడు వస్తుండగా దుర్యోధనుడు పరిజనులతో కూడ ఎదుర్కోలు జరపటానికై మురారిని చేరవచ్చి ఆయనకూ, తగినవారలకూ తానూ తన తమ్ముడు దుశ్శాసనుడూ ఆలింగనాదులైన మన్ననలు చేశారు.

విశేషం: అలం: ఉపమ. 1. దుర్యోధనుడి భవనం శిఖరాకారంవలె ఉన్నదనటంలో ఉపమ.

2. శ్రీకృష్ణుడు ప్రసన్నవదనుడై కుంతిని గారవించాడంటే దైవానుగ్రహం ఆమె పట్ల ఉంటుందని ధ్వనింపజేశాడు.

3. దుర్యోధనుడి మందిరంలో ప్రవేశించేటప్పుడు శ్రీకృష్ణుడికి భద్రతా సేనానులవలె కృతవర్మ, సాత్యకి ఇరువైపుల నడవటం గమనార్హం. అది మిత్రమందిరంగా కంటె శత్రుమందిరంగానే శ్రీకృష్ణుడు భావిస్తున్నాడని ధ్వని.

4. మందిరంలో కక్ష్యలన్నీ దాటి సభాభవన కక్ష్యలో ప్రవేశించిన తరువాత దుర్యోధనుడు పరివారంతో ఎదుర్కోలివ్వటం రాజమందిర మర్యాద. తనను ఆహ్వానించటానికి వస్తున్న దుర్యోధన దుశ్శాసనాదులను స్నేహపూర్వకమైన ఆలింగనాదులతో సమ్మానించటం స్నేహ మర్యాద. ఆసనాదు లిచ్చి అతిథిని గౌరవించటం అతిథి మర్యాద. దూతకిచ్చే మర్యాదలకంటె ఉన్నతమైన వాటిని కౌరవులు శ్రీకృష్ణుడికి అందచేస్తున్నారు. అది వారి వ్యూహంలో ఒక భాగం, గౌరవించి, కానుకలిచ్చి శ్రీకృష్ణుడిని పాండవులనుండి వేరు చేయాలన్న భేదోపాయం. (సంపా.)

క. అతఁ డునుపఁగఁ గనక మయో । న్నత పర్యంకంబునందు నారాయణుఁ డూ
ర్జిత మహిమ నుండి యభ్య । ర్చితుఁ డయ్యెఁ దగంగ నతనిచే సత్కృతులన్. 210

ప్రతిపదార్థం: అతఁడు+ఉనుపఁగన్= సుయోధనుడు కూర్చుండ బెట్టగా; కనకమయ= సువర్ణమయమైన; ఉన్నత పర్యంకంబు+అందున్= ఎత్తయిన మంచం మీద; నారాయణుఁడు= వాసుదేవుడు; ఊర్జిత మహిమన్+ఉండి= గొప్ప ప్రభావంతో అధివసించి, తగంగన్= ఒప్పుగా; అతనిచేన్= దుర్యోధనుడి చేత; సత్కృతులన్= సత్కారాలతో; అభ్యర్చితుఁడు+అయ్యెన్= లెస్సగా పూజించబడ్డాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు కూర్చుండ బెట్టగా సమున్నతమైన బంగరు మంచం మీద గొప్ప విభూతితో వాసుదేవుడు కూర్చుండి అత డొనర్చే సత్కారాలతో మిక్కిలి పూజించబడ్డాడు.

శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో సంభాషించుట (సం. 5-89-1)

వ. సాత్యకియును సముచిత ప్రకారంబునం బూజితుండయ్యెఁ; దదనంతరంబు నిజాసనాసీనులయి తన మొగంబునం జూడ్కి నిలిపియున్న దుర్యోధనాదులతో మాధవుండు మధురసంభాషణంబులు సేయుచుండె; నట్టియెడ. 211

ప్రతిపదార్థం: సాత్యకియును, సముచిత ప్రకారంబునన్= తగు విధంగా, పూజితుండు+అయ్యెన్= పూజించబడ్డాడు, తద్+అనంతరంబు= అటుపిమ్మట, నిజ+ఆసన+ఆసీనులు+అయి= తమ పీఠాలమీద కూర్చుండినవారై, తన మొగంబునన్=

తన ముఖంమీద, చూడ్కిన్= దృష్టిని, నిలిపి+ఉన్న= ప్రసరింపజేస్తున్న, దుర్యోధన+ఆదులతోన్= సుయోధనుడు మొదలైనవారితో, మాధవుండు= లక్ష్మీవల్లభుడు, శ్రీకృష్ణుడు; మధుర సంభాషణంబులు+చేయుచున్+ఉండెన్= ఇంపైన మాటలాడుతూ ఉన్నాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: సాత్యకికూడ తగు విధంగా పూజించబడ్డాడు. పిదప తమ తమ పీఠాలమీద కూర్చుండి తన వదనం మీద చూపులు సారించిఉన్న దుర్యోధనుడు మొదలైనవారితో గోవిందుడు ఇంపైన మాటలు మాట్లాడుతుండినాడు. ఆ సమయంలో - (తరువాతి పద్యంతో అన్వయం).

తే. సముచితంబుగఁ గూరలచంద ముగ్గ । డించి కుడుపు తెఱంగు పుట్టించి పలుకు
నా సుయోధనుతోఁ గృష్ణుఁ డచటఁ దాను । గుడువ నొల్లక యునికి యేర్పడఁగఁ జెప్పె. 212

ప్రతిపదార్థం: సముచితంబుగన్= మిక్కిలి యుక్తంగా; కూరలచందము= కూరల విధం- శాకపాకాల రీతి; ఉగ్గడించి= పలికి; కుడుపు తెఱంగు పుట్టించి= భోజన విషయం ప్రస్తావనకు దెచ్చి; పలుకు= మాట్లాడుతున్న; ఆ సుయోధనుతోన్= ఆ దుర్యోధనుడితో; కృష్ణుఁడు= శ్రీ కృష్ణుడు; అచటన్= దుర్యోధనుడి గృహంలో; తాను= తాను; కుడువన్+ఒల్లక+ఉనికి= భుజించటాని కిష్టపడని స్థితి; ఏర్పడఁగన్+చెప్పెన్= స్పష్టంగా తెలిపాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తగు విధాన తన ఇంటిలో వండిన శాకపాకాల వివరాలు తెలిపి, భోజన విషయం ప్రస్తావనకు తేగా, శ్రీకృష్ణుడు అక్కడ తాను భుజించటానికి ఇష్టపడకుండటం స్పష్టంగా చెప్పివేశాడు.

విశేషం: ఇంటికి వచ్చిన అతిథిని భోజనానికి ఆహ్వానించటం గృహస్థుడి మర్యాద. దానిని దుర్యోధనుడు నిర్వహించినట్లుగా పైకి కనపడుతున్నాడు. అప్యాయతతో, భక్తితో, వినయంతో పిలిచేవారు కూరల రుచిని గురించి అంతగా గొప్పలు చెప్పుకోరు. భోజనంమీద మోహం కలిగేటట్లు మాట్లాడరు. ఆ వైఖరిలో సహజత్వం కొరవడినట్లు ఎదుటివారికి స్పష్టం ఔతున్నది. అన్నంలో విషం పెట్టటానికి పన్నాగం వేశాడా? అన్నంత అనుమానం కలుగుతుంది. అందువలననే శ్రీకృష్ణుడు 'అన్నం తినజాలను' అన్నాడు. 'తినను' అనలేదు. తినను అంటే తిరస్కారమౌతుంది. 'తినజాలను' అంటే పరిస్థితుల ప్రభావమౌతుంది. అడుగడుగున సమస్యలు సృష్టించి శ్రీకృష్ణుడు పాండవ పక్షపాతిగా, కౌరవ విరోధిగా, కపట వర్తనుడుగా నిరూపించాలని దుర్యోధనుడు ప్రయత్నించటం ఇక్కడే ప్రారంభమయింది. విందు నొక సమస్య చేశాడు దుర్యోధనుడు. (సంపా.)

వ. చెప్పిన విని దుర్యోధనుండు సూర్యసూను వదనం బవలోకించి యల్లన యిట్లనియె: 213

ప్రతిపదార్థం: చెప్పినన్+విని; దుర్యోధనుండు; సూర్యసూనువదనంబు= సూర్యుని పుత్త్రుడైన కర్ణుడి ముఖం; అవలోకించి= చూచి; అల్లన= నెమ్మదిగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి మాటలు విని సుయోధనుడు రవితనయుడైన కర్ణుడి ముఖం వైపు చూచి నెమ్మదిగా ఇట్లా అన్నాడు:

క. 'హరి వలికిన విధ మెంతయు । నెరవై యున్నయది వింటె యిమ్మాట తెఱం
గరయుదము తొలుత; నీ పెను । పరిచందం బెల్ల నెఱుకపడియెడుఁ బిదపన్.' 214

ప్రతిపదార్థం: హరిపలికిన విధము= కృష్ణుడు మాటాడిన తీరు; ఎంతయున్= మిక్కిలి; ఎరవై+ఉన్న+అది= భేదబుద్ధితో కూడిఉన్నది; వింటె!= వింటివిగదా!; ఈ+మాట తెఱంగు= ఈ పలుకుల విధ మెట్టిదో; తొలుతన్= మొదట; అరయుదము= పరిశీలిద్దాం; పిదపన్= తరువాత; ఈ పెనుపరిచందంబు+ఎల్లన్= ఈ పెద్దమనిషి వైనమంతా; ఎఱుకపడియెడున్= బయటపడుతుంది.

తాత్పర్యం: 'కర్ణా! శ్రీకృష్ణు డాడినమాట మిక్కిలి భేదబుద్ధితో కూడి ఉంది. నీవు విన్నావుకదా! మొదట అతడిమాటతీరు పరిశీలిద్దాం. అవతల ఆ పెద్దమనిషి పద్ధతి అంతా తేటతెల్లమవుతుంది.'

విశేషం: దుర్యోధనుడి నీతిని తీర్చిదిద్దే ఆప్తమిత్రుడు కర్ణుడని మొదట్లోనే బైటపెట్టుకొన్నాడు దుర్యోధనుడు. భోజనానికి రాని కారణం అడిగితే పాండవ పక్షపాతం బయటపడుతుంది. ఆ తరువాత శ్రీకృష్ణుడి చర్యలన్నీ పక్షపాతంతో, శత్రుత్వంతో కూడినవే అని నిరూపించవచ్చునని దుర్యోధనుడి వ్యూహం. (సంపా.)

వ. అని పలికి యచ్యుతున కిట్లనియె: 215

తాత్పర్యం: అని చెప్పి దుర్యోధనుడు శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు:

తే. 'వలయు నన్నపానంబులు పలు దెఱఁగుల । నేర్చు విధముల నే మొడఁ గూర్చి వేడ్క
నున్న నీ వుపయోగింప నొల్లకునికి । బాంధవమునకు నీతికి బాహిరంబు. 216

ప్రతిపదార్థం: వలయు+అన్నపానంబులు= కావలసిన అన్నం, పానీయాలు; పలు+తెఱఁగులన్= అనేకరీతుల; నేర్చు విధములన్= మాకు తెలిసినంతలో; ఏము= మేము; ఒడఁగూర్చి= సిద్ధపరిచి; వేడ్కన్+ఉన్నన్= అభిలాషతో ఉండగా; నీవు= నీవు; ఉపయోగింపన్+ఒల్లక+ఉనికి= భుజించటాని కిష్టపడకుండటం; బాంధవమునకున్= చుట్టరికానికి; నీతికిన్= న్యాయానికి; బాహిరంబు= వెలియైన విషయం.

తాత్పర్యం: 'కృష్ణా! కావలసిన అన్నపానీయాలు పలురీతుల మాకు తెలిసినంతలో సిద్ధపరిచి మేము ఆశతో ఉండగా, నీవు వాటిని భుజించటానికి ఇష్టపడకపోవటం మన చుట్టరికానికి, న్యాయానికి విరుద్ధమైన విషయం.

క. కౌరవులకుఁ బాండవులకు । నారయ నీ వొక్క రూప; యసదృశ ధర్మా
చారుండవు రాజునకుం । గూరుతు? కతమేమి యిట్లగుటకుం జెపుమా'. 217

ప్రతిపదార్థం: కౌరవులకున్= ధృతరాష్ట్రుడి కుమారులమైన మాకూ; పాండవులకున్= పాండురాజు కొడుకులకున్నూ; ఆరయన్= పరికింపగా; నీవు; ఒక్కరూపు+అ= సమానమైనవాడివే; అసదృశ+ధర్మ+ఆచారుండవు= సాటిలేని న్యాయాచరణం గలవాడివి; రాజునకున్= ధృతరాష్ట్ర మహారాజునకు; కూరుతు(వు)= ప్రియమైనవాడివి; ఇట్లు+అగుటకున్= నీ విట్లా మారిపోవటానికి; కతము+ఏమి?= కారణ మేమి? చెపుమా= చెప్పుము.

తాత్పర్యం: ఆలోచించగా కురుపాండవులకు నీవు ఒకే విధమైనవాడవు. అంతేకాదు. సాటిలేని ధర్మశీలుడవు. ధృతరాష్ట్ర మహారాజుకు ఇష్టుడవు. ఇట్లాంటివాడివి మా యింట భుజించను అనటానికి హేతువేమో చెప్పుము.'

క. అనుడు నుపేంద్రుఁడు మనుజేం । ద్రుని కిట్లను 'దూత లెందుఁ దొలిదొలి గుడువం
గొనఁ గట్టఁ దొడఁగుదురె? వ । చ్చిన కార్యము దీర్చి పిదపఁ జేయుదు రెల్లన్.' 218

ప్రతిపదార్థం: అనుడున్= అని దుర్యోధనుడు ప్రశ్నించగా; ఉపేంద్రుఁడు= దేవేంద్రుడికి అనుజన్ముడైన శ్రీకృష్ణుడు; మనుజ+ఇంద్రునికిన్= నరేశ్వరుడైన దుర్యోధనుడికి; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; దూతలు= రాయబారులు; ఎందున్= ఎక్కడైనా; తొలి+తొలిన్= దౌత్యానికి మునుముందే; కుడువన్= భుజించటానికి; కొనన్= సత్కారములందుకొనటానికి; కట్టన్= నూతన వస్త్రాలు స్వీకరించి ధరించటానికి; తొడఁగుదురె= పూనుకొందురా? (పూనుకొనరని అర్థము;) వచ్చిన కార్యమున్= ఏ పనిమీద వచ్చిరో ఆ పనిని; తీర్చి= నెరవేర్చి; పిదపన్= తరువాత; ఎల్లన్+చేయుదురు= అన్ని మన్ననలను స్వీకరిస్తారు.

తాత్పర్యం: శ్రీ కృష్ణుడు దుర్యోధనుడికి ఇట్లా ప్రత్యుత్తరమిచ్చాడు: 'రాయబారులు వచ్చినపని చూడకుండ మున్ముందుగా భుజించటం, వస్తువులను గైకొనటం, ఉడుపులు చేకొని ధరించటం కూడదు. వచ్చిన పని నెరవేర్చిన తరువాత అన్ని మర్యాదలు అంగీకరిస్తారు.'

విశేషం: దుర్యోధనుడు శ్రీకృష్ణుడిని అందరికీ కావలసిన బంధువుగా ఆహ్వానించి చెప్పాడు. అందువలన విందుకు అంగీకరించకపోవటం శ్రీకృష్ణుడి దోషంగా పేర్కొన్నాడు. శ్రీకృష్ణుడు తాను విందుకు రాకపోవటానికి రాయబారి ధర్మాన్ని కారణంగా పేర్కొన్నాడు. రాయబారి వచ్చినపని ముగించకుండా భుజించటం, కానుకలు తీసికొనటం, నూతన వస్త్రాలు తీసికొని ధరించటం నిషేధమనే రాజనీతిని పేర్కొని తాను వచ్చినపని ముగించిన తరువాత మర్యాదలన్నీ స్వీకరిస్తానని చెప్పాడు. బంధుత్వంకంటె బాధ్యత ప్రథమగణ్యం. (సంపా.)

వ. అనిన గాంధారీనందనుండు దేవకీనందనున కిట్లనియె: 219

ప్రతిపదార్థం: అనినన్= అని కృష్ణుడు పలుకగా; గాంధారీనందనుండు= గాంధారి కుమారుడైన సుయోధనుడు; దేవకీనందనునకున్= దేవకీదేవి తనయుడైన శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా బదులు పలికాడు.

తాత్పర్యం: మాధవుని మాటలకు సుయోధను డిలా బదులు చెప్పాడు:

ఆ. 'వేగపడుట మేలె? వినుము; కార్యము దీఱుఁ । దీఱకుండు దాని తెఱఁగు దగిన
యప్పు డాడరాదె? యిప్పుడు ముకుఁ ద్రాటఁ । గాలు గ్రువ్వనేల కమలనాభ! 220

ప్రతిపదార్థం: కమలనాభ!= కమలము నాభియందు గల వాడా కృష్ణా!; వేగపడుట మేలె?= త్వరపడటం మంచిదా?; వినుము= నా మాటలు వినుము; కార్యము తీఱున్= పని నెరవేరవచ్చును; తీఱక+ఉండున్= నెరవేరకపోవచ్చును; దాని తెఱఁగు= ఆ విషయం; అప్పుడు+ఆడన్‌రాదె= అప్పుడు పలుకవచ్చును కదా!; ఇప్పుడు= ఈ సమయంలో; ముకుఁద్రాటన్= ముక్కునకు గ్రుచ్చిన త్రాటియందు; కాలు+క్రువ్వన్+ఏల?= కాలిని దూర్చుటెందుకు?

తాత్పర్యం: పద్మనాభా! తొందరపడటం అంత మంచిదికాదు. నా మాట వినుము. పని అవుతుంది, కాకపోతుంది. అవసరం వచ్చినపుడు ఆ సంగతి మాటాడవచ్చును గదా! ముక్కుకు గ్రుచ్చిన త్రాటిలో కాలు దూర్చటమెందుకు?

విశేషం: 1. అలం: లోకోక్తి. లోకోక్తితో కలిపి చెప్పటం లోకోక్తి అలంకారం. 2.శ్రీకృష్ణుడు విందుకూ రాయబారం పూర్తికావటానికీ లంకె పెట్టాడు. దానిని దుర్యోధనుడు నిపుణంగా పరిహసిస్తున్నాడు. శ్రీకృష్ణుడు తొందరపడుతున్నాడని ఒక అభియోగం చేశాడు. రాయబారానికీ విందుకూ సంబంధం లేదని చెప్పాడు. ఒకవేళ రాయబారం సఫలం కావచ్చును, కాకపోవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దానికీ విందుకూ ముడిపెట్టటం తొందరపాటు అని హెచ్చరించాడు. చివరకు 'ముక్కు[త్రాటిలో కాలుదూర్చటం ఎందుకు?' అనే లోకోక్తితో ఎత్తిపొడిచాడు. పని మొదలు కాకపోగా ముగింపు సంగతి ఎందుకు అప్పుడే తెస్తావు? అని భావం. మరొక మాటలో చెప్పాలంటే- సంధి కుదురుతుందంటేనే నేను విందు చేస్తా'నన్నట్లున్నదని భావం. ముక్కు[త్రాడు - మొదటి మర్యాదలకూ, కాలు - చివరి ముగింపుకూ ఆ సూక్తిలో స్ఫూర్తినిస్తాయి. శ్రీకృష్ణుడి వక్రనీతిని బయటపెట్టాలని పలికిన మాట లివి. (సంపా.)

వ. నీవు వచ్చినవాఁడవు మా యింటఁ గుడిచి కూర్చుండి యెల్లపనులుం జెప్పుట యొప్పుఁగాక; కుడువనొల్ల ననం దగునె? దీనికిం గారణంబు నా యెఱింగిన యది లేదు; విచారింపక పలికి' తనిన మందరధరుండు మందస్మితంబుతో నందఱం గలయం గనుంగొని ధార్తరాష్ట్రకరంబు గజంబు పల్లవం బల్లన తెమల్చు లీలం గేల నమర్చి 'యిట్టి మాటలు తేటపఱుపవలయునేని విను'మని యతని కిట్లనియె: 221

ప్రతిపదార్థం: వచ్చినవాడవు నీవు; మా యింటన్= మా గృహంలో; కుడిచి= భుజించి; కూర్చుండి; ఎల్లపనులన్= అన్ని కార్యాలూ; చెప్పుట; ఒప్పున్+కాక= తగునుగాని; కుడువన్+ఒల్లన్+అనన్+తగునె?= భుజించటాని కిష్టపడను అని చెప్పటం యుక్తమా?; దీనికిన్= ఇట్లు తిననని చెప్పటానికి; కారణంబు; నా+ఎఱిఁగిన+అది= నాకు తెలిసినట్టిది; లేదు; విచారింపక పలికితి(వి)= ఆలోచించక మాట్లాడావు; అనినన్; మందరధరుండు= క్షీరసాగర మథన కాలంలో మందరగిరిని మూపున దాల్చిన మహాకూర్మ స్వరూపుడైన శ్రీకృష్ణుడు; మందస్మితంబుతోన్= చిరునవ్వుతో; అందఱన్+కలయన్+కనుంగొని= అక్కడున్నవారినెల్ల తేరిపారజూచి; ధార్త రాష్ట్రకరంబు= దుర్యోధనుడి చేతిని; గజంబు= ఏనుగు; పల్లవంబున్= చిగురుటాకును; అల్లన= మెల్లగా; తెమల్చులీలన్= చలింప జేయు విధాన; కేలన్+అమర్చి= తన చేతిలో ఇమిడ్చి; ఇట్టిమాటలు= ఇటువంటి పలుకులు; తేటపఱుపన్+వలయున్+ఏనిన్= విశదం చేయవలసి వస్తే; వినుము= చెప్పుచున్నాను ఆలకించు; అని; ఆతనికిన్; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: కృష్ణా! వచ్చినవాడివి వచ్చినట్లు మా ఇంటిలో కమ్మగా భుజించి, హాయిగా కూర్చుండి, అన్ని పనులు చెప్పటం తగును గాని భుజించటానికి సమ్మతించనని చెప్పవచ్చునా? ఇందుకు కారణం నా యెరిగినంతలో ఏదీలేదు. ఆలోచించక ఇట్లా పలికావు' అని దుర్యోధను డన్నాడు. అప్పుడు వెన్నుడు చిరునవ్వు నవ్వుతూ అక్కడున్నవారినంతా కలయజూచి ఏనుగు చిగురుటాకును తొండంతో పట్టుకొని కదల్చేరీతిగా దుర్యోధనుడి చేతిని తన హస్తంతో పట్టుకొని కదల్చుతూ ఇట్లాంటి విషయాలు వివరించవలసిన అవసరముంటే వెల్లడిస్తాను. విను'మంటూ అతడితో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. అలం: ఉపమ. తన ఇంట విందు చేయనన్న శ్రీకృష్ణుడి వర్తనానికి కారణ మేమిటో రారాజుకు బోధపడలేదు. సూటిగా అతడినే అడిగాడు. అట్లా అడిగితే శ్రీకృష్ణుడి బండారం బైటపడుతుందని దుర్యోధనుడి తలపు. అడిగితే దుర్యోధనుడి బండారం బైట పెడదామని గోవిందుడి మనసు. ఇద్దరికీ అవకాశం దొరికింది.

2. ఇక్కడ శ్రీకృష్ణుడి అభినయం అమోఘం. క్షీరసాగర మథనంలో మందరపర్వతాన్ని మోసిన ఆదికూర్మ రూపుడు శ్రీకృష్ణుడు. ఈ సమస్య ఒక లెక్కా? మందహాసం చేస్తూ అందరినీ చూచాడు. తాను చెప్పబోయే అంశం దుర్యోధనుడే కాదు అందరూ వినదగింది అని హెచ్చరిక. దుర్యోధనుడి దుర్వివేకంపై ఒక పరిహాస హేల. అంతటితో ఆగక ఏనుగు తన తొండంతో ఒక చిగురాకును అవలీలగా పైకి లేపినట్లు దుర్యోధనుడి చేతితో కరచాలనం చేస్తూ పలికాడు. (చక్కని ఉపమాలంకారం.) దీనిభావ మేమి? 'దుర్యోధనా! నీ సంగతి నీవే త్రవ్వుకొని అడుగుతున్నావు. నేను చెప్పే మాటల కన్నిటికీ

నీవే బాధ్యుడవు. ఇందులో నా తప్పేమీ ఉండదు. తరువాత నన్ను లాభం లేదు' - అని ఆ అభినయానికి అర్థం. 'వివరించమంటే వివరిస్తాను వినండి' అని హుందాగా హుంకరించాడు. దుర్యోధనుడు కదిలించాడు. శ్రీహరి విజృంభించాడు. (సంపా.)

చ. ప్రియమెసఁగం దగం బిలిచి పెట్టెడు కూ డది లెస్సకూడు; ద
క్కయనయహీనతం దమకు నాపద యైనెడ నిట్టునట్టు నే
మియు ననలేని కూ డదియు మేవడియై చను; నీవు మా దెసం
బ్రియుఁడవు గావు; మాకు ధృతి పెంపఱ నాపదలే దొకింతయున్. 222

ప్రతిపదార్థం: ప్రియము+ఎసఁగన్= ప్రేమ అతిశయించగా; తగన్+పిలిచి= హృదయపూర్వకంగా ఆహ్వానించి; పెట్టెడుకూడు= పెట్టే అన్నం; అది లెస్సకూడు+తక్క= అది మంచి అన్నం దప్ప; అయనయహీనతన్= శుభం, న్యాయం లేకుండా; తమకున్= తమకు; ఆపద+ఐన+ఎడన్= విపత్తు సంభవించిన చోట; ఇట్టున్+అట్టున్= ఇట్టిట్టని; ఏమియున్+అనలేని= సంకటస్థితిలో ఇంచుకకూడా బదులాడటానికి వీలుగాని; కూడు+అదియున్= భోజనం కూడా; మేవడి+ఐ+చనున్= ఉచితమైనదే ఔతుంది.; నీవు; మా దెసన్= మా యెడ; ప్రియుఁడవు కావు= ప్రేమకలవాడవు కావు; మాకున్= మాకు; ధృతిపెంపు+అఱన్= ధైర్యసమృద్ధి చెడేటట్లుగా; ఒకింతయున్= రవంతైనా; ఆపద లేదు= కీడు వాటిల్లలేదు.

తాత్పర్యం: ప్రేమతో తన ఇంటికి పిలిచి పెట్టే భోజనం మంచి భోజనం. విపత్తు కలిగినచోట ఔను కాదని బదులేమీ పలకటానికి వీలుగాని సంకట స్థితిలో అయనయములు లేక తినే కూడు కూడా ఉచితమైన కూడే అవుతుంది. దుర్యోధనా! నీవు మా ఎడ ప్రేమకలవాడవు కావు. మాకు ధైర్యం నశించగా ఇప్పుడు ముంచుకొని వచ్చిన ఆపద కొంచెం కూడా లేదు. అందువలన నీ ఇంటిలో భుజించటానికి ఇష్టపడను.

విశేషం: 1.ప్రీతితో పిలిచి పెట్టే విందు ప్రియమైనది. లేదా 'భక్తి గలుగుకూడు పట్టెడైనను చాలు'. అంటే దుర్యోధనుడు ఇంటికి వచ్చిన తరువాత శ్రీకృష్ణుడిని విందుకు పిలిచాడు. అయినా అచ్చమైనా స్వచ్ఛమైన ప్రీతితో పిలువలేదు. మరొకమాటలో చెప్పాలంటే రాజకీయమైన దురుద్దేశంతో పిలిచాడని భావం.

2. ఏదైనా తీరని ఆపద కలిగితే, కాదనలేక కటకటపడుతూ తప్పనిసరిగా తినే మిగిలిన కూడు కూడా తినదగిందే. ప్రీతితో పెట్టే భోజనం ఒకటి, ఆపదలో చేసే భోజనం ఒకటి- ఈ రెండే సబబైన విందులు.

3. ఈ రెండు ప్రమాణాలూ దుర్యోధనుడి పట్ల వర్తించవు. అతడు పాండవులకు హితుడు కాడు; పాండవుల కిప్పు డంతటి ఆపద ఏమీ రాలేదు అన్నాడు కృష్ణుడు. ఇది ముక్కుపై గుద్దినట్లు చెప్పిన సమాధానం. మూర్ఖంగా వేసిన ప్రశ్నకు ఇటువంటి జవాబే తగింది.

4. ఈ పద్యానికి మూలం:

'సంప్రీతి భోజ్యా న్యన్నాని ఆపద్భోజ్యాని వా పునః

నచ సంప్రీయసే రాజన్ నచైవా సద్గతా వయమ్' (సం. 5-89-25)

తిక్కన దీనిని చక్కని తెలుగు పద్యంగా మార్చాడు. (సంపా.)

వ. అట్లుంగాక. 223

తాత్పర్యం: అంతేకాదు.

క. పగవారి యింటఁ గుడిచిన । నగుఁ దమ కనుమాన; మమృత మైనను దారుం
బగతురకుఁ గుడువఁ బెట్టఁగఁ । దగ; దొడలుల కెప్పు డెవ్విధము వాటిలునో? 224

ప్రతిపదార్థం: పగవారి+ఇంటన్= శత్రు గృహంలో; కుడిచినన్= భుజిస్తే; తమకున్= తమకు; అనుమానము+అగున్= సందేహం కలుగుతుంది; అమృతము+ఐనను= సుధారసమైనప్పటికినీ; తారున్= గృహస్థులు; పగతురకున్= తమ విరోధులకు; కుడువన్+పెట్టఁగన్+తగదు= తినబెట్టరాదు; ఒడళులకున్= దేహాలకు; ఎప్పుడు= ఏ సమయంలో; ఏ+విధము+పాటిలునో!= ఏమి జరుగుతుందో తెలియదుకదా!

తాత్పర్యం: శత్రుగృహాలలో భుజించేటప్పుడు వారు తన కేమి పెడతారో అని సందేహం కలుగుతుంది. అమృతమైనప్పటికినీ యజమానులు తమ శత్రువులకు తినబెట్టటం కూడదు. క్షణభంగురాలైన ఈ శరీరాలకు ఎప్పుడు ఏ విధంగా చేటు మూడుతుందో చెప్పలేము కదా!

విశేషం: ఇది చక్కని సూక్తి. ఈ పద్యం లోకధర్మనీతిగా కనపడుతున్నా దుర్యోధనుడి దురాలోచనను ధ్వనింపచేసే నిపుణోక్తి. శత్రువు విషాహారం పెట్టకపోయినా, తినినవాడికి సహజంగా ఏదయినా హాని జరిగితే, అతడు శత్రువు పెట్టినకూడు తినటంవలన అనే అనుమానం కలుగుతుంది. (సంపా.)

వ. నేను పగతుండనె యంటేని. 225

ప్రతిపదార్థం: నేను; పగతుండనె?= శత్రువునా?; అంటి(వి)+ఏని= అంటావేమో!

తాత్పర్యం: నేను నీకు విరోధినా? అని ప్రశ్నిస్తావేమో - వినుము.

క. అలుగుదు పాండవులకు వా । రలు నాకుం బ్రాణములు ధరావల్లభ! యి
ట్టలముగఁ దమ ప్రాణములకు । నలుగు జనులు పగతు రగుట యనుమానంబే? 226

ప్రతిపదార్థం: ధరావల్లభ!= రాజా!; పాండవులకున్= పాండవులపై; అలుగుదు(వు)= నీవు కోపం వహిస్తావు; వారలు= కౌంతేయులు; నాకున్ ప్రాణములు= నాకు అసువుల వంటివారు; ఇట్టలముగన్= అధికంగా; తమ ప్రాణములకున్= తమ ప్రాణాలపై; అలుగు జనులు= కినుక వహించినవారు; పగతురు+అగుట= విరోధులు కావటం; అనుమానంబే?= సందేహమా?

తాత్పర్యం: దుర్యోధనా! పాండవులంటే నీకు కోపం. వారు నాకు పంచప్రాణాలు. తమ ప్రాణాలకు ఎసరుపెట్టేవారు తమకు విరోధులు కావటంలో సంశయ మేముంది?

విశేషం: 1. పాండవులనుండి కృష్ణుడిని వేరు చేయాలనీ, లేదా బంధించాలనీ, లేదా చంపాలనీ దుర్యోధనుడు ప్రకటించిన పన్నాగం. విందు ప్రాణాలు తీసే ప్రయోగం. ఆ సంగతిని శ్రీకృష్ణుడు ధ్వనిమయంగా చెప్పాడు.

2. పాండవులు తన పంచప్రాణాలని ప్రకటించిన శ్రీకృష్ణుడు వారు ఆయనకంటె అభిన్నులని స్పష్టం చేశాడు. కృష్ణుడికి దుర్యోధనుడు నేరుగా శత్రువు కాకపోయినా, అతడికి ప్రాణసములైన పాండవులకు శత్రువు కాబట్టి, అతడు తనకూ శత్రువే. శ్రీకృష్ణుడి హేతుబద్ధ వాక్చైపుణ్యం ప్రశంసనీయం. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. కారణంబు లేక కౌంతేయులకు బాల్య । మాదిగాఁగఁ గీడె యాచరింతు;
పుణ్యపరులు తోడఁబుట్టువు లార్యులు । వైర మెత్తఁదగునె వారితోడ? 227

ప్రతిపదార్థం: కారణంబులేక= నిమిత్తంలేక; కౌంతేయులకున్= కుంతీపుత్రులకు; బాల్యము+ఆది కాఁగన్= చిన్నతనంనుండి; కీడె= అపకారమే; ఆచరింతు(వు)= చేస్తుంటావు; పుణ్యపరులు= పుణ్యకార్యాలు సల్పటంలో శ్రద్ధకలవారు; తోడఁబుట్టువులు= సహోదరులు; ఆర్యులు= పూజ్యులు ఐన; వారితోడన్= పాండవులతో; వైరము+ఎత్తన్+తగునె?= కలహించవచ్చునా?

తాత్పర్యం: వైర కారణమేమీ లేకుండా చిన్నతనం నుండీ నీవు పాండవులకు అపకారమే చేస్తున్నావు. వారు నీకు సహోదరులు, పుణ్య కార్యాలందు ఆసక్తి గలవారు, పూజ్యులు. అట్టివారితో నీవు విరోధం కలిగి ఉండవచ్చునా?

వ. ఇట్లున్న మీ యందఱ యన్నంబులు దుష్టాన్నంబులు; విదురుం డొక్కని యన్నంబు భోక్తవ్యంబని నిశ్చయించితిఁ గావున నందుఁ బోయెద'నని చెప్పి యజ్జనపతి యనుమతి సేయఁ జనునప్పుడు తోడన బాహ్లిక భీష్మాది కౌరవులును గుంభసంభవ ప్రముఖులైన మాన్యులును జని మాధవుతోడ 'మా యిండ్ల నెల్లను గానిక లాయితంబులు చేసికొని నీవు విజయం చేయుటకు నెదురు చూచుచున్న వార'మని పల్కి ప్రార్థించిన 'నే నన్ని చోట్లకు వచ్చిన వాఁడన; యందఱ యర్చనలుం గైకొంటిన; మీరు నిలువుం'డని వారల నిలిపి విదురు గృహంబునకుం బోయిన. 228

ప్రతిపదార్థం: ఇట్లు+ఉన్న= పుణ్యపురుషులను; పూజ్యులను బాధిస్తున్న; మీ+అందఱ+అన్నంబులు= మీ అందరియొక్క భోజనాలు; దుష్ట+అన్నంబులు= పాపపు కూళ్ళు; విదురుండు+ఒక్కని+అన్నంబు= ఒక్క విదురుడి అన్నం మాత్రం; భోక్తవ్యంబు= భుజించదగింది; అని నిశ్చయించితిన్= అని నిర్ణయించుకొన్నాను; కావునన్= కనుక; అందున్+పోయెదన్= అతడి ఇంటికి వెళ్ళుతాను; అని చెప్పి; ఆ+జనపతి+అనుమతి+చేయన్= రాజగు దుర్యోధనుడు సమ్మతించగా; చను+అప్పుడు= వెళ్ళేటప్పుడు; తోడన్+అ= అతడివెంటనే; బాహ్లిక భీష్మ+ఆది కౌరవులును= బాహ్లికుడు భీష్ముడు మున్నగు కురువంశస్థులును; కుంభసంభవ ప్రముఖులు+ఐన మాన్యులును= కలశంనుండి ఉద్భవించిన ద్రోణుడు మున్నుగా గల పెద్దలూ; చని= వెళ్ళి; మాధవుతోడన్= కృష్ణుడితో; మా+ఇండ్లన్+ఎల్లను= మా అందరి ఇళ్ళలో; కానికలు= బహుమతులు; ఆయితంబులు చేసికొని= సిద్ధపరచుకొని; నీవు విజయం చేయుటకున్= నీవు విచ్చేయటానికి; ఎదురుచూచుచున్+ఉన్నవారము= ప్రతీక్షిస్తున్నాం; అని పల్కి= అని నుడివి; ప్రార్థించినన్= వేడుకోగా; నేను; అన్నిచోట్లకున్+వచ్చినవాఁడను+అ= వచ్చినట్లే; అందఱ+అర్చనలున్= మీ అందరి పూజలు; కైకొంటిన్+అ= స్వీకరించినట్లే; మీరు నిలువుండు= మీరు ఆగండి; అని; వారలన్ నిలిపి= వారిని తన వెంట రాకుండ అక్కడే ఆగేటట్లు చేసి; విదురు గృహంబునకున్; పోయినన్= వెళ్ళగా.

తాత్పర్యం: పుణ్యాత్ములను బాధిస్తున్న మీ అందరి అన్నాలు చెడుతిండ్లు. ఒక్క విదురుడి అన్నమే భుజించదగినది అని నిర్ణయించుకొన్నాను. కావున అక్కడికి వెళ్ళుతాను' అని చెప్పి దుర్యోధనుడు పంపగా వెళ్ళుతున్న సమయంలో శ్రీకృష్ణుడిని బాహ్లికుడు భీష్ముడు మొదలైన కురువృద్ధులున్నూ, ద్రోణాచార్యులు మొదలైన పూజ్యులున్నూ, వెంబడించి 'మా ఇళ్ళలో నీ కోసం కానుకలు సిద్ధపరచుకొని ఉన్నాము. నీ రాకకు ఎదురు చూస్తున్నాము. మా ఇళ్ళకు దయచేయండని వేడుకొన్నారు. 'నేను మీ అందరి ఇళ్ళకు వచ్చినట్లే, మీ పూజలన్నీ అందుకొన్నట్లే అని భావించండి. ఇక ఆగండి' అని వాళ్ళను నిలిపి, విదురుడి మందిరానికి వెళ్ళాడు.

విశేషం: 1. కౌరవుల ఇండ్లలోని విందులు పాపపుకూళ్ళు అని నిందించాడు. 2. విదురు డొక్కడే హితుడనీ, అతడి విందే హితమైన భోజనమనీ ప్రకటించాడు. 3. భీష్మాదు లెందరో తమ ఇండ్లకు పిలిచారు. 'అందరూ పిలిచినట్లే, నేను వచ్చినట్లే, మీ పూజలందుకొన్నట్లే' అని అనునయించాడు. నిజానికి భీష్మాదులతో పలికిన మాటలు సర్వవ్యాపకుడైన సర్వేశ్వరుడు అనదగిన మాటలు. ఆధ్యాత్మికమైన అర్థంలో మీ అందరి ఇండ్లకూ భౌతికంగా రాకపోయినా మీ అందరి పూజలూ మానసికంగా అందుకొన్నానని అర్థం. లౌకికంగా- మీరందరూ కౌరవుల నాశ్రయించి ఉన్నారు కాబట్టి మీకూళ్ళు నాకు పొసగవు అని చెప్పినట్లు తాత్పర్యం. (సంపా.)

సీ. **సంభ్రమ స్నేహ నిశ్చల భక్తియుక్తిఁ బ । విత్ర మజ్జనము గావించి విదురుఁ**
డెల్లవంటకమును నేర్పడ బోనాలు । వేర్పింప, నెంతయుఁ బ్రీతి ముంద
రోజమై బ్రాహ్మణభోజనం బొనరించి । సపరివారముగ విశాల రమ్య
పూత స్థలంబునఁ బుండరీకాక్షుండు । దమ్ముండు దాను నుత్సవ మెలర్ప

తే. **సరస రంజక మహనీయ సంప్రయోగ । మగు చతుర్విధ హృద్యాన్న మారగించె**
లలిత సంభావనా మంజులంబు లైన । పలుకు లెడనెడ విదురున కెలమి యొసఁగ. **229**

ప్రతిపదార్థం: విదురుఁడు; సంభ్రమస్నేహ నిశ్చలభక్తియుక్తిన్= ఆదరం, స్నేహం, నిలుకడఐన భక్తి అనేవాటితో కూడినవాడై; పవిత్ర మజ్జనము+కావించి= శౌరికి పావనమైన స్నానం చేయించి; ఎల్లవంటకమును= పలు తెరగులైన వంటకములు అన్నీ; ఏర్పడన్= విశదంకాగా; బోనాలు+పేర్పింపన్= భోజనపదార్థములు పేర్పించగా; ఎంతయున్+ప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; ముందర= తాను భుజించటానికి మునుపే; ఓజమైన్= క్రమ ప్రకారం; బ్రాహ్మణభోజనంబు+ఒనరించి= బ్రాహ్మణులకు భోజనం పెట్టి; పుండరీక+అక్షుండు= తెల్లదామరలవంటి కన్నులుగల నారాయణుడు-శ్రీకృష్ణుడు; విశాల రమ్య పూత స్థలంబునన్= విశాలమైన, సుందరమైన, పవిత్రమైన ప్రదేశంలో; సపరివారముగన్= సహచరులతోకూడ; తానున్= తానున్నూ; తమ్ముండున్= అనుజుడైన సాత్యకియున్నూ; ఉత్సవము+ఎలర్పన్= వేడుకమీరగా; సరస= రసవంతమూ; రంజక= మదికింపు గొల్పేది; మహనీయ సంప్రయోగము+అగు= గొప్పగా చేయించబడింది ఐన; చతుర్విధ= భక్ష్య భోజ్య లేహ్య చోష్యములు అనే నాల్గు విధాలైన; హృద్య+అన్నము= ఆత్మకింపైన భోజనం; ఎడన్+ఎడన్= మధ్య మధ్య; లలిత సంభావనా మంజులంబులు+ఐన= మృదులములైన ప్రశంసలచేత ఒప్పుతున్నట్టి; పలుకులు= మాటలు; విదురునకున్= విదురుడికి; ఎలమి+ఒసఁగన్= సంతోషం కలిగించగా; ఆరగించెన్= భుజించాడు.

తాత్పర్యం: విదురుడు ఆదరం, స్నేహం, నిలుకడ గల భక్తి అనే గుణాలతో కూడినవాడై శౌరికి మంగళస్నానం చేయించాడు. ఆ తరువాత వండిన వంటకాలన్నింటినీ వరుసగా వడ్డన చేయించాడు. శ్రీకృష్ణుడు ఆచారక్రమాన్ని అనుసరించి బ్రాహ్మణులు ముందు భుజించిన తరువాత తానూ, తన తమ్ముడూ, సహచరులూ పవిత్రమైన విశాల సుందర ప్రదేశంలో సంతోషంగా భోజనాలకు కూర్చున్నారు. నడుమ నడుమ మృదుల సమ్మాన వాక్యాలతో విదురుడికి ఆనందం కలిగిస్తూ, మహనీయంగా, కమనీయంగా తయారు చేసిన రసవంతాలు, ఆత్మ కింపైనవీ అయిన భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యాలనే నాలుగు విధాలైన భోజన పదార్థాలను శ్రీకృష్ణుడు ఆరగించాడు.

వ. **ఆతండును.** **230**

తాత్పర్యం: ఆ విదురుడు కూడ.

క. 'గోవింద! సంభ్రమము సం। భావింపుము మాకు నిదియ పరమధనం; బొం
డే విధమున నీ కర్చన। గావింపం జాలువాఁడు కలఁడే యెందున్?' 231

ప్రతిపదార్థం: గోవింద!= శ్రీకృష్ణా!; సంభ్రమము సంభావింపుము= మా ఆదరపూర్వకమైన ఆతిథ్యం మన్నించవలసింది. మాకున్+ఇదియ= మా ఆతిథ్యం నీవు స్వీకరించటమే; పరమధనంబు= గొప్పధనం; ఒండు+ ఏ విధమునన్= మరే విధంగానూ; నీకున్+అర్చన+కావింపన్+చాలువాఁడు= నీకు పూజలు చేయగలిగినవాడు; ఎందున్+కలఁడే?= ఎక్కడైనను ఉన్నాడా? (లేడని అర్థం.)

తాత్పర్యం: 'పురుషోత్తమా! నా ఆతిథ్యం మన్నించుము. నీకు ఆతిథ్యమివ్వటమే మాకు పరమ సంపద. వేరొక విధంగా నిన్ను అర్చించగలవాడు ఎక్కడా లేడు.'

విశేషం: మానవాకారంలో వచ్చిన మాధవుడికి భక్తి కలుగుకూడు పెట్టి భజించటానికి విదురుడి విందు ఉదాహరణం. (సంపా.)

వ. అని మఱియు నత్యంత వినయ వాక్యమ్ముల నారాధించుచుండె; నిట్లు కృతాహారుండైన హరికి చందన చర్చా ద్యుపచారంబు లాచరించి యవ్విదురుండు కృతార్థుండై యుండఁ; గవి గాయక ప్రముఖ నిఖిల విద్వజ్జనంబులు పాఠక వాంశిక వైణికాది వినోద పాత్రంబులు నప్పరమేశ్వరుం గానవచ్చి ప్రొద్దుపుచ్చి యభిమతార్థంబులు వడసి చనిరి; రాత్రియగుటయుం దగిన యభ్యంతర మందిరంబున హంసతూలికా తల్పంబున భుజంగ తల్పు నునిచి యతనికడ నుచితాసనంబున నుండి. 232

ప్రతిపదార్థం: అని, మఱియున్= ఇంకను; అత్యంత వినయ వాక్యమ్ములన్= మిక్కిలి అణకువతో కూడిన మాటలచేత; ఆరాధించుచున్+ఉండెన్= శ్రీకృష్ణుడిని పూజిస్తూ ఉన్నాడు. ఇట్లు= ఈ రీతిగా; కృత+ఆహారుండు+ఐన= స్వీకరించిన భోజనంకలవాడైన; హరికిన్= కృష్ణుడికి; చందనచర్చా+ఆది= గంధం పూయటం మున్నగు; ఉపచారంబులు+ఆచరించి= సేవలుచేసి; ఆ+ విదురుండు; కృతార్థుండు+ఐ+ఉండన్= మనోరథం ఫలించినవాడై-ధన్యుడై ఉండగా; కవిగాయక ప్రముఖ= కవులు, గానం చేసేవారు మొదలుగా గల; నిఖిల విద్వత్+జనంబులు= సమస్త పండితులు; పాఠక= స్తుతిపాఠకులూ; వాంశిక= పిల్లన గ్రోవులూదేవారూ (మురళివాయించేవారూ); వైణిక= వీణ వాయించేవారూ; ఆది= మున్నుగా గల; వినోద పాత్రంబులు= వేడుక కలిగించే కళాకారులు; ఆ+పరమ+ ఈశ్వరున్= భగవంతుడైన శ్రీకృష్ణుడిని; కానన్+వచ్చి= దర్శించి; ప్రొద్దు+పుచ్చి= కాలక్షేపం చేసి; అభిమత+అర్థంబులు+ పడసి= ఇష్టప్రయోజనాలను పొంది; చనిరి= తమ నివాసాలకు వెళ్ళారు; రాత్రి; అగుటయున్= కాగా; తగిన; అభ్యంతర మందిరంబునన్= లోపలి సౌధంలో; హంసతూలికా తల్పంబునన్= అంచ రెక్కలతో తయారుచేసిన మెత్తని పరుపుమీద; భుజంగ తల్పున్= శేషశాయియైన శ్రీమహావిష్ణువును; ఉనిచి= అధివసింపజేసి; అతని కడన్= ఆ పరమపురుషుడి చెంత; ఉచిత+ఆసనంబునన్= తగిన పీఠంమీద; ఉండి= కూర్చున్నవాడై.

తాత్పర్యం: విదురుడు మిక్కిలి వినయ వచనాలతో స్వామిని ఆదరించాడు. భోజనమైన తరువాత శ్రీహరికి గంధం పూయటం మొదలైన సపర్యలన్నీ చేసి విదురుడు ధన్యుడైనాడు. ఆ తరువాత కవులు గాయకులు మొదలైన సకల విద్వాంసులు, స్తుతిపాఠకులు, వేణువు లూదేవారు, వీణ వాయించేవారు- ఇట్లా వివిధ విద్యలలో ప్రవీణులై వినోదాన్ని కలిగించే కళాకారులందరూ ఆ జగన్నాయకుని దర్శించి కాలక్షేపం కావించి ఇష్టార్థాలు పడసి తమ తమ నివాసాలకు వెళ్ళారు. రాత్రికాగానే విదురుడు లోపలి సౌధంలో హంసతూలికా తల్పంమీద గోవిందుడిని శయింపజేసి ఆయన దగ్గర తగిన పీఠంమీద తాను కూర్చుండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'విదురుఁ డిట్టు లనియె నిది యొక కార్యంబు। గాఁగఁ బూని యిందు రాఁగఁ దగునె?
దుష్టబుద్ధి నీచు దుర్యోధనుండు నీ। మాట వినునె? దురభిమాన ఘనుఁడు. 233

ప్రతిపదార్థం: విదురుఁడు, ఇట్టులు+అనియెన్; ఇది+ఒక కార్యంబు కాఁగన్+పూని= ఇది ఒక చేయవలసిన పనిగా భావించి పనిగట్టుకొని; ఇందున్= ఇక్కడికి; రాఁగన్+తగునె?= మీరు రావచ్చునా?; దుర్యోధనుండు; దుష్టబుద్ధి= చెడు తలంపుకలవాడు; నీచు= అల్పుడు; దుర్+అభిమాన ఘనుఁడు= దురహంకారంలో దొడ్డవాడు; నీ మాట వినునె?= నీ హితవు వింటాడా?

తాత్పర్యం: పడుకపైనున్న పరమేశ్వరుడితో విదురు డిట్లా పలికాడు: 'స్వామీ! ఇదొక పనిగా పనిగట్టుకొని ఇక్కడికి నీవు రావచ్చునా? దుర్యోధనుడు దురాత్ముడు. నీచుడు. దురహంకార పూరితుడు. అతడు నీ మాటలను వింటాడా?

క. వచ్చిన సైన్యంబులఁ గని। పెచ్చు పెరిఁగినాఁడు; ద్రోణ భీష్ముల లావుల్
నచ్చియుఁ గర్ణుం డొక్కఁడ। యిచ్చుఁ దనకు విజయ మనియు నెంతయుఁ బొంగున్. 234

ప్రతిపదార్థం: వచ్చిన సైన్యంబులన్+కని= తన చెంతకు జేరిన పదకొండక్షౌహిణుల సేనలను చూచి; పెచ్చు+పెరిఁగినాఁడు= విర్రవీగుతున్నాడు; ద్రోణ భీష్ముల లావుల్= ద్రోణ భీష్ముల యొక్క శక్తులు; నచ్చియున్= నమ్మికూడ; కర్ణుండు+ ఒక్కఁడు+అ= రాధేయు డొకడే; తనకున్= తనకు; విజయము+ఇచ్చున్+అనియున్= గెలుపు నొసగ గలడనియు; ఎంతయున్= మిక్కిలి; పొంగున్= మిడిసిపడుతుంటాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తన పక్షాన చేరిన పదకొండక్షౌహిణుల సేనలను చూచుకొని విర్రవీగుతున్నాడు. ద్రోణభీష్ముల శక్తిపై విశ్వాసమున్నప్పటికీ ఒక్క కర్ణుడే తనకు జయం కలిగిస్తాడని మిడిసిపడుతుంటాడు.

వ. నీ విట వచ్చుట వినిన యప్పుడు ధార్త రాష్ట్రులందఱుం గూడంబాటి తమలో నిశ్చయించిన తెఱంగు నీ శాసనం బుల్లంఘింపం గలవారు 'పాండునందనులకు నేమియు నీకుండువారు' తార యీ ధాత్రియంతయు బీఱువోవ కుండ నేలువారు; వారింగూడిన రాజులెల్లను దిగ్విజయంబునాఁడు పాండవులచేత భంగపడినవారు గావునఁ గర్ణుతో నేకార్థులమై చత్తుము గెలుతు; మింతియ కాని యొండు లేదని నిశ్చయించికొని యున్నవా; ర ట్లగుటంజేసి దుర్యోధనుండు గండు మిగిలి యున్నవాఁడు; సంధి గానేరదు; వారల కందఱకు నిది ప్రాప్తకాలంబై యున్నయది; యెట్లును నుడుగ నేర్చినవారు గా;రిట్లు తమ్మెఱుంగని దుష్టాత్ముల నడుమం గూర్చుండుటయు నవ్వెంగలివిత్తు లఱచు వీఱిఁడి యఱపులకు వంకలొత్తి మాఱుసెప్పుటయు నొప్పకయుండు వెడంగు లగుటం గార్యవచనంబు లెఱుంగరు; మొఱకులగుటం బ్రతాపభాషణంబులకు వెఱవరు; వారల తలంపులు కీడు; నీ మహనీయ ప్రభావబుద్ధి పౌరుషంబు లే నెఱుంగుదు; నయినను బాండవేయులపై స్నేహంబునను నీమీఁది భక్తినిం జెప్పెద; నందుఁ బో వలవ' దనిన వాసుదేవుం డతని కిట్లనియె: 235

ప్రతిపదార్థం: నీవు, ఇటవచ్చుట= ఇక్కడికి రావటం; వినిన+అప్పుడు= విన్నవెంటనే; ధార్తరాష్ట్రులు+అందఱున్= కౌరవులందరూ; కూడన్+పాఱి= గుంపుగా చేరి; తమలోన్= తమలో తాము; నిశ్చయించిన తెఱంగు= నిర్ణయించుకొన్న విధం ఏమిటంటే; నీ శాసనంబు= నీ ఆజ్ఞ; ఉల్లంఘింపన్+కలవారు= అతిక్రమిస్తారు; పాండునందనులకున్; ఏమియున్+ఈక+ఉండువారు= ఏమి కూడ ఇవ్వరు; తారు+అ= తామే; ఈ ధాత్రి+అంతయున్= ఈ పుడమి నంతటినీ; బీఱుపోవక+ఉండన్= బెత్తెడు చోటుకూడ వదలకుండా; ఏలువారు= పాలించదలచారు; వారిన్ కూడిన రాజులు+ ఎల్లను= వారి పక్షం అవలంబించిన

రాజులంతా; దిక్+విజయంబునాఁడు= (కౌంతేయులు) దిగ్విజయం చేసేటప్పుడు; పాండవుల చేతన్; భంగపడినవారు= ఓడించబడినవారు; కావునన్= అట్లగుటచేత; కర్ణుతోన్= రాధేయుడితోపాటు; ఏక+అర్థులము+ఐ= ఒకే ప్రయోజనం ఆశించినవారమై; చత్తుము= యుద్ధంలో చావనైనా చస్తాము; గెలుతుము= గెలువనైనా గెలుస్తాము; ఇంతి+అకాని= ఇంతే తప్ప; ఒండు లేదు= మరో మార్గం మాకు లేదు; అని నిశ్చయించుకొని ఉన్నవారు= అని తీర్మానించుకొని ఉన్నారు; అట్లు+అగుటన్+చేసి= వారల నిర్ణయం ఇట్లా ఉండటం వలన- అనగా కదనానికి వారు కాలు ద్రవ్వటం వలన; దుర్యోధనుండు; గండు మిగిలి+ఉన్నవాఁడు= పౌరుషం వహించి(పొగరుబట్టి) ఉన్నాడు; సంధి, కానేరదు= జరుగబోదు; వారలకున్, అందఱకున్, ఇది ప్రాప్తకాలంబు+ఐ+ఉన్నఅది= వినాశకాలం దాపురించి ఉన్నది; ఎట్లును= ఏ విధంగానైనా; ఉడుగన్ నేర్చినవారు కారు= యుద్ధం చేయవలెననే సంకల్పం మానుకొనేవారు కారు; ఇట్లు= ఈ ప్రకారంగా; తమ్ము+ఎఱుంగని= తమ హాని వృద్ధులే తమకు తెలియనట్టి; దుష్ట+ఆత్ముల+నడుమన్= చెడు మనసులుకలవారి మధ్య; కూర్చుండుటయున్= మీరు కూర్చొనటం; ఆ+వెంగలి విత్తులు= ఆ మూర్ఖ శిరోమణులు; అఱచు; వీఱిఁడి+అఱపులకున్= అవివేకపు కూతలకు; వంకలు+ఒత్తి= వంకరలు సరిదిద్ది; మాఱు చెప్పుటయున్= బదులాడుటయు; ఒప్పక+ఉండున్= యుక్తంగా నుండదు; వెడంగులు+అగుటన్= అవివేకులు కావడంవలన; కార్యవచనంబులు+ఎఱుంగరు= ప్రయోజనకరమైన మాటలు వినరు; మొఱకులు+అగుటన్= మూర్ఖులు కావటంవలన; ప్రతాప భాషణంబులకున్= వేడిమాటలకు; వెఱవరు= భయపడరు; వారల తలంపులు కీడు= వారి ఆలోచనలు చెడ్డవి; నీ మహనీయ ప్రభావ బుద్ధి పౌరుషంబులు= నీ గొప్ప మహిమ, బుద్ధి, మగటిమి; ఏన్+ఎఱుంగుదున్= నాకు తెలుసు; అయినను, పాండవేయులపైన్+స్నేహంబునను= పాండవులమీద గల ప్రేమచేతను; నీమీఁది భక్తినిన్= నీయందుగల భక్తిచేతను; చెప్పెదన్; అందున్+పోవలదు= కురుసభకు వెళ్ళవద్దు; అనినన్; వాసుదేవుండు; అతనికిన్; ఇట్లు+ అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: నారాయణా! నీ విక్కడికి వస్తున్నావని వినినప్పుడు కౌరవులందరూ చేరి తమలో నిర్ణయించుకొన్న సంగతులు మనవి చేస్తాను. వారు నీ ఆజ్ఞ నతిక్రమిస్తారు. పాండవులకు ఏమీ పంచి ఇవ్వరు. తామే ఈ భూమినంతటినీ ఏలుకో దలచారు. వారితో చేరిన రాజులంతా పాండవులు దిగ్విజయం చేసినప్పుడు వారిచేతిలో అవమానం పొందినవారు గనుక తామూ పాండవులతో యుద్ధం చేసి (కర్ణుడితో పాటు) చస్తాం లేదా గెలుస్తాం తప్ప మరో మార్గం అనుసరించమని నిర్ణయించుకొని ఉన్నారు. కాబట్టి దుర్యోధనుడు అహంకరించి ఉన్నాడు. కనుక సంధి జరగదు. కౌరవులకు వినాశకాలం దాపురించింది. అందువలన వారు కదనానికి కాలు ద్రవ్వుతున్నారు. ఇట్లా ఒళ్ళెరుగక త్రుళ్ళిపడుతున్న ఆ దుష్టచిత్తుల మధ్య నీవు కూర్చొని, ఆ మూఢాగ్రేసరులు కూసే అవివేకపు కూతలకు సర్ది సర్ది బదులుమాటలు పల్కటం బాగుండదు. వారందరూ తెలివిమాలినవారు. కనుక ప్రయోజనకరమైన పలుకుల విలువ వారికి తెలియదు. పరమ మూర్ఖులు గనుక చురుకుపుట్టించు మాటలకు చలించరు. వారివి చెడు తలంపులు, స్వామీ! నీ మహామహిమ, నీ ప్రజ్ఞాపాటవం, నీ పౌరుషం నేనెఱుగుదు. అయిననూ పాండుపుత్రులపై గల ప్రేమచేతనూ, నీ యెడగల భక్తిచేతనూ చెపుతున్నాను. నీవు వారున్న సభకు వెళ్ళవద్దు' అని పల్కగా విని పురుషోత్తముడు విదురుడితో ఇట్లా అన్నాడు:

తే. **'నీ వివేకంబు నాప్తియు నెఱపితీవు। తల్లిదండ్రుల మాడ్కి హితంబు సెప్పి**
తేను నా రాక తెఱఁగెల్ల నేర్పరించి। చెప్ప విని యేమి సెప్పినఁ జేయువాఁడ. **236**

ప్రతిపదార్థం: నీ వివేకంబు= నీ జ్ఞానము; ఆప్తియున్= ఆప్తత్వము; ఈవు= నీవు; నెఱపితి(వి)= ఉపయోగపరచావు; తల్లిదండ్రులమాడ్కిన్= జననీజనకులవలె; హితంబు+చెప్పితి(వి)= ఏదిమేలు కలిగిస్తుందో తెలిపినావు; ఏను= నేను; నా రాక

తెలుఁగు+ఎల్లన్= నేను ఎందుకు వచ్చానో అదంతయు; ఏర్పరించి+చెప్పన్= తేటతెల్లమొనర్పగా; విని= ఆలకించి; ఏమి చెప్పినన్ చేయువాఁడన్= ఏమి చెపుతావో ఆ ప్రకారమే చేస్తాను.

తాత్పర్యం: 'నీ వివేకం, ఆత్మీయత నాయెడ కనబరచి, తల్లిదండ్రులకైవడి హితం చెప్పావు. నేనిచటికి వచ్చిన దెందుకో వారికి తెలియజెప్పి, అందుకు వారేమంటారో తెలిసికొని అందుకు అనుగుణంగా చేయవలసింది చేస్తాను.

శ్రీకృష్ణుఁడు విదురుతో సంభాషించుట (సం. 5-91-3)

క. ఎఱుఁగుదు నేను సుయోధను । కొఱగామియు నతనితోడఁ గూడిన నృపు లం
దఱుఁ బగ మనమున నిడికొని । యఱుమటయును సంధి పొసఁగదనియు మహాత్మా! 237

ప్రతిపదార్థం: మహాత్మా!= దొడ్డబుద్ధిగలవాడా!; నేను; సుయోధను కొఱగామియున్= దుర్యోధనుడి చెడ్డతనాన్ని; అతని తోడన్+కూడిన= అతడితో జేరిన; నృపులు+అందఱున్= రాజులంతా; పగ= వైరం; మనమునన్+ఇడికొని= మనసులో ఉంచుకొని; అఱుమటయును= ప్రతిఘటించటమూ; సంధి పొసఁగదు+అనియున్= సొత్తుకుదరదనీ; ఎఱుఁగుదున్= తెలియుదును.

తాత్పర్యం: 'నాకు దుర్యోధనుడి దౌష్ట్యమంతా తెలుసు. అతడితో చేరిన రాజులందరూ పాండవుల మీద పగగొని ఎదిరించటానికి సిద్ధంగా ఉన్నారనీ తెలుసు. సంధి సమకూడదనీ తెలుసు.

ఆ. పుడమియెల్ల నొడ్డగెడవయి గజవాజి । యుతముగాఁ గడంగి యుగ్ర మృత్యు
ముఖము సొరఁగఁ దివురు మూర్ఖత మాన్పుట । యధికమైన పుణ్య మనఘచరిత! 238

ప్రతిపదార్థం: అనఘచరిత!= దోషరహితమైన నడవడి గలవాడా!; పుడమి+ఎల్లన్= భూమండలమంతా; ఒడ్డగెడవు+అయి= భారంతో ఒక ప్రక్క కొరగి; గజ వాజియుతముగాన్= ఏనుగులు గుఱ్ఱాలు అనువాటితో కూడ; కడంగి= పూనుకొని; ఉగ్రమృత్యు ముఖము+చొరఁగన్= దారుణమైన మిత్తియొక్క నోటిలో ప్రవేశించటానికి; తివురు= త్వరపడుతున్న; మూర్ఖతన్= మొండితనాన్ని; మాన్పుట= తొలగించటం; అధికము+ఐన పుణ్యము= మిక్కిలి పుణ్యకార్యం.

తాత్పర్యం: భూ మండలమంతా భారముతో ఒక ప్రక్క కొరగి ఏనుగులతో, గుఱ్ఱాలతో కూడ భీకరమైన మృత్యువు నోటిలో ప్రవేశించటానికి వేగిరపడుతున్నది. ఇట్టి మూర్ఖత్వాన్ని తొలగించుట మిక్కిలి పుణ్య కార్యం.

వ. మానుప వచ్చునే యంటేని. 239

తాత్పర్యం: భూమండలం మృత్యువు నోటిలో ప్రవేశించకుండ ఆపటం శక్యమా అంటే.

క. దొరకొని పుణ్యముఁ బాపము । నరుఁ డర్థిం జేయుచుండ నడుమ నొకట న
వ్వెర వెడలి తప్పినను ద । త్పరిణతి ఫలమొందునండ్రు ధర్మవిధిజ్ఞుల్. 240

ప్రతిపదార్థం: దొరకొని= పూనిక వహించి; పుణ్యమున్= సుకృత కర్మలనూ, పాపమున్= దురిత కర్మలనూ; నరుఁడు= మానవుడు; అర్థిన్= ఆసక్తితో; చేయుచున్+ఉండన్= కావిస్తున్నప్పుడు; నడుమన్= మధ్యలో; ఒకటన్= ఒకానొక కారణంచేత; ఆ+వెరవు+ఎడలి= ఉపాయము చెడి; తప్పినను= ఆ కార్యము నెరవేరకపోయిననూ; ధర్మవిధిజ్ఞుల్= ధర్మస్వరూపమెరిగిన పెద్దలు; తద్+పరిణతి= ఆ పనులయొక్క పరిణామం; ఫలము+ఒందున్+అండ్రు= ఫలం చెందుతుందని చెప్తుతారు.

తాత్పర్యం: ఒకడు పూనికతో పుణ్యమో, పాపమో చేస్తూ ఉండగా నడుమ ఏదో ఒక కారణంచేత ఆ పని వెరవు తప్పి నెరవేరకపోయినా చేసిన ప్రయత్నం మాత్రం ఫలాన్ని పొందియే తీరుతుంది - అని ధర్మస్వరూపం తెలిసిన పెద్దలు చెపుతారు. విదురా! ఇక్కడ నా మాట ఫలించినా ఫలించకపోయినా చేసిన పుణ్యయత్నఫలం మాత్రం నాకు దక్కుతుంది.

విశేషం: దీనికి మూలం:

"ధర్మకార్యం యతన్ శక్త్యా నచేచ్ఛక్నోతి మానవః

ప్రాప్తో భవతి తత్పుణ్య మత్ర మే నాస్తి సంశయః." (సం. 5-91-6)

మానవుడు తన శక్తిలోపం లేకుండా ధర్మకార్యాన్ని చేయటానికి ప్రయత్నిస్తాడు. ఒకవేళ అతడు దానిని పూర్తి చేయలేక, ఫలం పొందకపోయినా, దాని పుణ్యాన్ని తప్పక పొందుతాడు. అందులో నాకు సంశయం లేదు. ఈ శ్లోకం భారత కథాసందేశంగా వినిపిస్తున్నది. (సంపా.)

వ. అట్లుంగాక. 241

తాత్పర్యం: అంతే కాకుండా.

తే. చుట్టములలోన నొప్పమి పుట్టినప్పు । డడ్డపడి వారితోడఁ గొట్లాడియైన
దాని నుడుపంగఁ జొరకున్నవానిఁ గ్రూర । కర్ముఁడని చెప్పుదురు కర్మకాండవిదులు. 242

ప్రతిపదార్థం: చుట్టములలోనన్= బంధువులలోపల; ఒప్పమి పుట్టినపుడు= ద్వేషం కలిగినప్పుడు; అడ్డపడి= అడ్డం వచ్చి; వారితోడన్= ఆ చుట్టాలతో; కొట్లాడి+ఐనన్= తగవులాడి అయినా; దానిన్= ఏర్పడిన విరోధాన్ని; ఉడుపంగన్= మాన్పటానికి చొరక+ఉన్నన్= పూనుకోకపోతే; వానిన్= అట్టివాడిని; కర్మకాండ విదులు= కార్యస్వరూపం తెలిసిన పెద్దలు; క్రూరకర్ముఁడు+అని= ఘాతుకుడని; చెప్పుదురు= చెప్పుతారు.

తాత్పర్యం: బంధువులలో పరస్పరం వైరమేర్పడితే అడ్డం వచ్చి వారితో తగవులాడి అయినా ఆ పగను మాన్పకుంటే అలాంటివాడిని క్రూరకర్ముడని కర్మకాండయొక్క తత్త్వం తెలిసిన పెద్దలు చెపుతారు.

వ. కావున నీ రెండు దెఱంగులవారికి శాంతిగావింపం బ్రయత్నంబు సేసెద; ధర్మార్థ సహితంబైన తెఱంగు మాటలు మంత్రి జన సహితుండైన సుయోధనునకుం జెప్పెదఁ దనకుం బాండునందనులకు లోకంబులకు హితంబయిన విధంబు వంచన లేక చెప్పెడు నన్ను పాండవులవాఁడని శంకించి యతండు నామాట వినండయ్యె నేనియు మేలకాక యిట్లు సొచ్చి చెప్పకున్న నన్నదమ్ములు దమలోనం బోరఁ గృష్ణుండు వారింపక యుపేక్షించెఁ దనచేతఁ జక్కంబడదా? యని యజ్ఞులైన జను లాడుదు; రెల్లభంగులం గార్యం బార్యు లియ్యకొనం జెప్పుదు; ధార్త రాష్ట్రులుం దమకు బ్రదుకు తెరువైన నా పలుకులు వట్టుదురు; పట్టక నీ తలంచిన చందమునం దులువలై కలఁగం బాఱినవారు నా ముందర నిలువం జాలుదురే' యని పలికిన విదురుం డట్లకాక యని సమ్మతించి యామంత్రణంబు సేసి నిజ శయన స్థానంబునకుం జనియె; ననంతరంబ. 243

ప్రతిపదార్థం: కావునన్; ఈ రెండు తెఱంగుల వారికిన్= ఈ కురు పాండవులకు; శాంతి కావింపన్= సంధి చేయటానికి; ప్రయత్నంబు చేసెదన్= ప్రయత్నం చేస్తాను; ధర్మ+అర్థ సహితంబు= ధర్మార్థాలతో కూడిన; తెఱంగు మాటలు= సంధి వచనాలు; మంత్రిజన సహితుండు+ఐన= మంత్రులతో కూడిన; సుయోధనునకున్; చెప్పెదన్; తనకున్, పాండునందనులకున్= పాండురాజు కుమారులకు; లోకంబునకున్; హితంబు+అయిన విధంబు= మేలు కలిగించే మార్గం; వంచనలేక= కపటం లేక; చెప్పెడు నన్నున్; పాండవులవాఁడు+అని= పాండవ పక్షపాతి అని; శంకించి= అనుమానించి; అతఁడు; నా మాట; వినఁడు+ అయ్యెన్+ఏనియున్= పెడచెవిని బెట్టినచో; మేలకాక= మంచిదే పొమ్ము; ఇట్లు చొచ్చి చెప్పక+ఉన్నన్= ఇట్లు కార్యరంగంలో ప్రవేశించి చెప్పదగిన మాటలు నేను చెప్పకపోతే; అన్నదమ్ములు; తమలోనన్; పోరన్= కలహించుకొంటుండగా; కృష్ణుండు; వారింపక= అడ్డుపడక; ఉపేక్షించెన్= అశ్రద్ధ చేశాడు; తన చేతన్= తన వల్ల; చక్కంబడదా= కార్యము నెరవేరదా; అని, అజ్ఞులు+ఐన జనులు= ఏమీ తెలియని మనుష్యులు; ఆడుదురు= పలుకుతారు; ఎల్ల భంగులన్= అన్ని విధాలా; కార్యంబు; ఆర్యులు= పెద్దలు; ఇయ్యకొనన్= సమ్మతించగా; చెప్పుదున్; ధార్తరాష్ట్రులున్= దుర్యోధనాదులుకూడ; తమకున్= తమకు; బ్రదుకు, తెరువు+ఐన= జీవనాధారమైన; నా పలుకులు= నా మాటలు; పట్టుదురు= చేకొందురు గాక; పట్టక= నా మాటలు ఆదరింపక; నీ తలంచిన చందంబునన్= నీవు భావించిన విధాన; తులువలు+ఐ= కుత్సితులై; కలఁగన్+పాఱినన్= చిత్తసంక్షోభము పొందినయెడల; వారు; నా ముందరన్= నా యెదుట; నిలువన్+చాలుదురే?= ధైర్యంతో నిలబడగలరా?; అని పల్కినన్; విదురుండు; అట్లు+అ కాక= నీవు సంకల్పించినట్లే; అని సమ్మతించి; ఆమంత్రణంబు+చేసి= హరి దగ్గర పోయి రమ్మనిపించుకొని; నిజశయన స్థానంబునకున్= తాను పరుండే ప్రదేశానికి; చనియెన్= వెళ్ళాడు; అనంతరంబు+అ= అటుతరువాత.

తాత్పర్యం: కురుపాండవుల పొత్తుకొరకు ప్రయత్నం చేస్తాను. ధర్మార్థయుక్తంగా ఒద్దిక మాటలు మంత్రి సహితుడైన దుర్యోధనుడికి చెపుతాను. అతడికీ, పాండుకుమారులకూ, సర్వజనులకూ మేలు కలిగించే మార్గమేదో మోసం లేకుండా తెలుపుతాను. ఇట్లా చెపుతున్న నన్ను పాండవ పక్షపాతి అని, దుర్యోధనుడు సందేహపడి నా మాటలు వినకపోతే పోనీ. అదీ ఒకందుకు మంచిదే. ఇట్లా నేను ఈ రెండు కుటుంబాలవిషయంలో జోక్యం కలిగించుకొనకుంటే అన్నదమ్ములు తమలో తాము పోట్లాడుకొంటుంటే కృష్ణుఁడు వారించక తన కేమీ పట్టనట్లు ఊరక ఉండిపోయాడు; తాను అనుకుంటే కార్యం చక్కదిద్దలేడా? అని అవివేకులు నన్ను ఆడిపోసుకొంటారు. అందుచేత పెద్దలు సమ్మతించేటట్లు అన్ని విధాలా కార్యం చక్కబెట్టటానికి అనుకూలమైన మాటలు వారికి చెపుతాను. దుర్యోధనాదులు తాము బ్రదకటానికి దారి కల్పించే నా మాటలు మన్నిస్తే బాగుపడతారు. అట్లా నా పలుకులు ఆదరించక నీవు భావించినట్లు కుత్సితులై మనసులు చెరుచుకొని తిరగబడితే వారు నాముందు నిలువ గల్గుతారా?' అని వాసుదేవుడు విదురుడితో పలికాడు. విదురుడు 'అట్లాగే స్వామీ అని ఆయన మాటలకు సమ్మతి తెల్పి' శౌరికడ సెలవు తీసికొని తాను పరుండేచోటికి వెళ్ళిపోయాడు.

ఆ. **ఆతని వచన రచన యాత్మలోఁదలపోసి । యిట్టివాఁడు గలఁడె యెందు?' ననుచుఁ**
బాలకడలి కడల పాటియై యొప్పు న । ప్పాన్పునందు శౌరి పవ్వడించె. **244**

ప్రతిపదార్థం: శౌరి= శూరుడి మనుమడైన శ్రీకృష్ణుడు; అతని వచన రచన= ఆ విదురుడి మాటలయొక్క పొంకమును; ఆత్మలోన్= తన మదిలో; తలపోసి= స్మరించి; ఇట్టివాఁడు= ఇంతటి మహనీయుడు; ఎందున్= ఎచ్చటైనా; కలఁడు+ఎ?= ఉన్నాడా?; అనుచున్= అనుకొంటూ; పాలకడలి కడలపాటి+ఐ= క్షీర సాగర తరంగాలకు సమానమై; ఒప్పు= ప్రకాశించే; ఆ+ పాన్పునందున్= ఆ పరుపుమీద; పవ్వడించెన్= పండుకొన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు విదురుడి మాటల పొందికను తన మదిలో స్మరించి, ఇంతటి మహనీయు డెక్కడైనా ఉన్నాడా అని అనుకొంటూ క్షీరసముద్ర తరంగాలవలె విశాలమైన ఆ తెల్లని పరుపుమీద పవ్వళించాడు.

విశేషం: అలం: ఉపమ. శ్రీకృష్ణుడియందు విష్ణుత్వం అలంకార ధ్వని. (సంపా.)

వ. ఇట్లు సుఖనిద్రసేసి వేగుంబోకట మాగధమంగళగానంబుల మేలుకాంచి సమయ కర్తవ్యంబులు సలిపె; నట్టియెడఁ గృతవర్మయు సాత్యకియు వచ్చి పొడసూపినం బురుషోత్తముండ వారలు మొదలుగాఁగల యిష్ట జనంబులు పరివేష్టింప నుచిత ప్రదేశంబున నున్నంత. 245

ప్రతిపదార్థం: ఇట్లు సుఖనిద్ర+చేసి= ఇట్లా విదురుడి గృహంలో హాయిగా నిదురించి; వేగుంబోకటన్= తెల్లవారే సమయంలో; మాగధ మంగళగానంబులన్= మేలుకొలుపువారియొక్క శుభకరాలైన గానములచేత; మేలుకాంచి= నిదుర లేచి; సమయ కర్తవ్యంబులు= ప్రాతఃకాలకృత్యాలు; సలిపెన్; అట్టియెడన్= అట్టివేళలో; కృతవర్మయున్; సాత్యకియున్; వచ్చి; పొడచూపినన్= కనబడగా; పురుషోత్తముండు= శ్రీకృష్ణుడు; వారలు మొదలుగాన్ కల= కృతవర్మ సాత్యకి ప్రభృతులైన; ఇష్టజనంబులు= ప్రియమైన వారు; పరివేష్టింపన్= తన చుట్టు చేరగా; ఉచిత ప్రదేశంబునన్= తగిన చోట; ఉన్న+అంతన్= ఉండగా.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు విదురుడి గృహంలో సుఖంగా నిద్రించి వేగుజామున వైతాళికులు వచ్చి మేలు కొలుపు పాటలు పాడగా మేల్కొని, ప్రాతఃకాల కృత్యములన్నీ నెరవేర్చాడు. ఇంతలో కృతవర్మ, సాత్యకి వచ్చి కనిపించుకొన్నారు. నారాయణుడు వారితోపాటు, మరికొంతమంది ఇష్టులు తన చుట్టూ చేరి కొల్చుచుండగా తగిన చోట ఆసీనుడై ఉన్నాడు. అప్పుడు.

క. ఇనతనయ శకుని దుశ్శాసన సహితము । గాఁగ నెలమిఁ జనుదెంచి సుయో
ధనుఁడు ప్రియోక్తులఁ దగు వా । రును దానును వారిజోదరుం గొనియాడెన్. 246

ప్రతిపదార్థం: సుయోధనుఁడు= దుర్యోధనుడు; ఇన తనయ= సూర్య పుత్రుడైన కర్ణుడు; శకుని= శకుని; దుశ్శాసన సహితము కాఁగన్= దుశ్శాసనునితో కూడ; ఎలమిన్= సంతోషంతో; చనుదెంచి= వచ్చి; ప్రియ+ఉక్తులన్= ఇంపైన మాటలతో; తగువారును= అర్హులైనవారున్నూ; తానును= తానున్నూ; వారిజ+ఉదరున్= కమలనాభుడిని; కొనియాడెన్= శ్లాఘించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు రాధేయుడితో శకునితో దుశ్శాసనుడితో కలసి సంతోషంతో వచ్చి, మది కింపైన మాటలతో తగినవారూ, తానూ మధుసూదనుడిని వినుతించాడు.

వ. అతండును మధుర సంభాషణంబులు చేయ వార లతనికి ధృతరాష్ట్రుండు బంధుమిత్త్రాది సమస్త పరిజన సమన్వితుండయి పేరోలగంబున నునికి యెఱిఁగించినఁ బ్రియంబునఁ గట్టాయితంబైన తేరెక్కి భేరీశంఖచామర ప్రముఖ భద్ర చిహ్నంబులతో వెడలి గరుడధ్వజంబు గ్రాలఁ గృతవర్మ సాత్యకు లొక్కరథంబునను, దుర్యోధనాది దుష్టచతుష్టయం బొక్క రథంబునను బార్శ్వంబుల రాఁ బౌరులకుఁ గన్నుల పండువగుచు రాజమందిర ద్వారంబు సేర నరుగునప్పటి యులివునకుఁ గొలువువారెల్ల నత్యుత్సుకులై యెదురుచూడ రథోత్తమంబు నవతరించి యరవిందనాభుండు. 247

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అతండును= శ్రీకృష్ణుడున్నూ; మధుర సంభాషణంబులు చేయన్= ప్రియమైన పలుకులు పలుకగా; వారలు= ఆ వచ్చిన దుర్యోధనాదులు; అతనికిన్= శ్రీకృష్ణుడికి; ధృతరాష్ట్రుండు; బంధుమిత్ర+ఆది+సమస్త పరిజన సమన్వితుండు+అయి= చుట్టాలు, స్నేహితులు మున్నగు పరివారంతో కూడివున్నవాడై; పేరు+ఓలగంబునన్+ఉనికి= నిండుకొలువున ఉండటం; ఎఱిఁగించినన్= తెలుపగా; ప్రియంబునన్= ఇష్టంతో; కడు+ఆయితంబు+ఐన= సర్వ సంసిద్ధమై ఉన్న; తేరు+ఎక్కి= రథమెక్కి; భేరీ శంఖ చామర ప్రముఖ భద్ర చిహ్నంబులతోన్= భేరులు, శంఖములు, వింజామరలు మొదలైన మంగళ లాంఛనాలతో; వెడలి= బయలుదేరి; గరుడధ్వజంబు+క్రాలన్= రథంపై గరుత్మంతుడి టెక్కెం ప్రకాశించగా; కృతవర్మసాత్యకులు; ఒక్క రథంబునను; దుర్యోధన+ఆది+దుష్ట చతుష్టయంబు= దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని అనే దుర్మార్గులు నలుగురు; ఒక్క రథంబుననూ; పార్శ్వంబులన్+రాన్= తన రథానికి కుడియెడమ ప్రక్కల వస్తూ ఉండగా; పౌరులకున్= పురజనులకు; కన్నుల పండువు+అగుచున్= కన్నుల విందుచేస్తూ; రాజమందిర ద్వారంబు= ధృతరాష్ట్రుడి సభాభవనం యొక్క వాకిలి; చేరన్+అరుగు+అప్పటి+ఉలివునకున్= సమీపించే వేళలో ఏర్పడిన సద్దునకు; కొలువువారు+ఎల్లన్= సభలో ఉన్నవారందరూ; అతి+ఉత్సుకులు+ఐ= మిక్కిలి ఉత్సాహం కలవారై; ఎదురుచూడన్= ప్రతీక్షిస్తుండగా; రథ+ఉత్తమంబున్= శ్రేష్ఠమైన తేరును; అవతరించి= దిగి; అరవిందనాభుండు= పద్మం నాభియందుగల శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: దుర్యోధనాదులతో శౌరికూడా ప్రియమైన మాటలు మాట్లాడాడు. అప్పుడు సుయోధనాదులు శ్రీకృష్ణుడితో 'ధృతరాష్ట్రమహారాజు బంధుమిత్రులతో పరిజనులతో కొలువుదీరి ఉన్నారు' అని చెప్పారు. ఆ మాటలతో సంతోషించి శ్రీహరి సంసిద్ధంగా ఉన్న రథమెక్కాడు. భేరులు, శంఖాలు, వింజామరలు మొదలైన మంగళ లాంఛనాలతో, గరుడకేతనం ప్రకాశిస్తుండగా రథంపై బయలుదేరాడు. తన అరదానికి ఒకవైపు సాత్యకి కృతవర్మలు ఎక్కిన రథం, మరోవైపు దుర్యోధన దుశ్శాసన కర్ణ శకునులనే నలుగురు దుర్మార్గులెక్కిన రథం వస్తుండగా స్వామి పురజనుల కన్నులకు విందు గావిస్తూ రాజభవనద్వారం సమీపించాడు. స్వామి తేరు మందిర ద్వారం సమీపిస్తుండగా కలిగిన సందడికి కొలువు కూటంలోని వారంతా రాజీవలోచనుడి రాకకు పరమోత్సాహంతో ఎదురుచూడసాగారు. శ్రీమన్నారాయణుడు శ్రేష్ఠమైన రథం నుండి క్రిందికి దిగాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **ఎదురు వచ్చిన విదురుని యిచ్చు కరముఁ । దమ్ము చేయును రెండు హస్తములఁ బట్టి**
నడచె ముందటఁ గదియు సందడిఁ గడంగి । కర్ణ దుర్యోధనులు దొలఁగంగ జడియ. **248**

ప్రతిపదార్థం: ఎదురువచ్చిన= తన కెదురుగా వచ్చిన; విదురుని+ఇచ్చుకరమున్= విదురుడందిచ్చిన హస్తాన్నీ; తమ్ము చేయును= తమ్ముడైన సాత్యకి హస్తాన్నీ; రెండు చేతులన్+పట్టి= తన రెండు బాహువులతో ఊతగా గ్రహించి; ముందటన్= ఎదుట; కదియు సందడిన్= ఏర్పడిన సమ్మర్దాన్ని; కడంగి= పూని; కర్ణ దుర్యోధనులు= కర్ణుడూ, దుర్యోధనుడునూ; తొలఁగంగన్= దూరమయ్యేటట్లు; జడియన్= తోలగా; నడచెన్= నారాయణుడు సాగాడు.

తాత్పర్యం: తన కెదురుగా వచ్చి విదురు డందించిన హస్తాన్నీ; తమ్ముడైన సాత్యకి చేతినీ తన రెండు చేతులతో ఊతగా గ్రహించి శ్రీకృష్ణుడు నడుస్తూండగా ఎదుట ఏర్పడిన జన సమ్మర్దాన్ని కర్ణ దుర్యోధనులు దవ్వులకు తొలగద్రోశారు.

వ. **కృత వర్మాది యాదవులు లోనుగాఁగల యభ్యంతరులైన బలు మానుసులు పొదివి కొని పోవఁదన సమీపంబునఁ గౌరవులు రవి సన్నిధి తారాగ్రహంబుల చందం బగుచుండం దేజోరాజియగు రాజీవాక్షుండు చని తనకుఁ బ్రత్యుత్థానంబు సేసిన కురురాజును దొరలను నభినందించుచు.** **249**

ప్రతిపదార్థం: కృతవర్మ+ఆది యాదవులు= కృతవర్మ మొదలైన యదువంశస్థులు; లోనుగాన్+కల= మొదలుగా కలిగిన; అభ్యంతరులు+ఐన= సన్నిహితులైన; బలు+మానుసులు= దొడ్డమనుష్యులు; పొదివి కొనిపోవన్= కూడికొనిపోగా; తన సమీపంబునన్= తన దగ్గర; కౌరవులు; రవి సన్నిధిన్= సూర్యుడి ముందు; తారాగ్రహంబుల చందంబు+అగుచుండన్= నక్షత్రాల గ్రహాల వలె వెలవెల పోతూ ఉండగా; తేజోరాశి+అగు= వెలుగుల ప్రోగైన; రాజీవ+అక్షుండు= కమల నేత్రుడు; చని= సభలో ప్రవేశించి; తనకున్= తనకు; ప్రత్యుత్థానంబు+చేసిన= ఎదురుగా వచ్చిన; కురురాజును= ధృతరాష్ట్రుడినీ; దొరలను= ఇతర రాజులను; అభినందించుచున్= మెచ్చుకొంటూ.

తాత్పర్యం: బలసంపన్నులు, సన్నిహితులు అయిన కృతవర్మ మొదలైన యాదవులు తనను అలముకొని వెంటరాగా, తన సన్నిధిలో కౌరవులందరూ భాస్కరుడి మ్రోల తారలవలె, గ్రహములవలె వెలవెల పోతుండగా, వెలుగుల ముద్దలయిన పుండరీకాక్షుడు కొలువుకూటం లోనికి వచ్చాడు. ధృతరాష్ట్రుడూ, ఇతర ధరాపతులూ శౌరికి ఎదురు వచ్చి ఆహ్వానించారు. శ్రీకృష్ణుడు వారిని అభినందిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: ఉపమ. ధృతరాష్ట్రుడి సభలో ప్రవేశించిన కృష్ణుడు సూర్యుడివలె వెలుగు ముద్దగా వెలిగిపోయాడట. కౌరవులు తారకలవలె, గ్రహాల వలె వెలవెల పోయారట! త్వరలో శ్రీకృష్ణుడు చూపబోయే విశ్వరూపానికి ఈ అలంకారం ధ్వనిసంకేతం. (సంపా.)

క. **తన కని పెట్టిన మణిమయ । కనకోన్నత పీఠమునఁ బ్రకాశంబున ని**
ల్చిన యెడఁ దోఁచిరి నారద । ముని ప్రముఖు లంతరిక్షమున నుజ్జ్వలులై. **250**

ప్రతిపదార్థం: తనకున్+అని= తనకొరకని; పెట్టిన= ఉంచిన; మణిమయ+కనక+ఉన్నతపీఠమునన్= రతనాలు చెక్కిన, ఎత్తయిన బంగరు గద్దెపై; ప్రకాశంబునన్= కాంతితో; నిల్చిన+ఎడన్= నిలిచినవేళలో; అంతరిక్షమునన్= ఆకాశమునందు; ఉజ్జ్వలులు+ఐ= దీప్తిమంతులై; నారదముని ప్రముఖులు= నారదుడు మున్నగు మునిపుంగవులు; తోఁచిరి= కనబడ్డారు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు తన కొరకై అక్కడనుంచిన రత్నఖచితమగు ఎత్తయిన బంగారు గద్దెమీద వెలుగులు వెదచల్లుతూ నిలిచి ఉండగా ప్రకాశమానులై నారదుడు మొదలగు మునీశ్వరులు గగనతలంలో కాన్పించారు.

విశేషం: కౌరవ సభలో శ్రీకృష్ణుడిని నిలిపి అతడి చుట్టూ ఒక దివ్య వాతావరణాన్ని ధ్వనింపజేయటం ఈ వర్ణన పరమార్థం. ఎత్తైన చోట మణుల కాంతులతో మెరుస్తున్న బంగారు గద్దె. ఆ గద్దెకే ప్రకాశాన్ని కలిగించే దివ్యతేజోమూర్తి శ్రీకృష్ణుడు. దానికితోడు ఆయన దర్శనం కొరకు వచ్చిన నారదాది దివ్యమునీంద్రులు. నేల శ్రీకృష్ణుడితో ఆకాశానికి అంటింది. నారదాదుల ఆగమనంతో నింగి నేలకు దిగింది. ఇహపరాల అద్భుత సమ్మేళనం శ్రీకృష్ణ సందర్శనం. (సంపా.)

వ. **ఇవ్విధంబున సన్నిహితులయిన యమ్మహామునులం గురుపితామహునకుం జూపి నారాయణుం డిట్లనియె.** **251**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; సన్నిహితులు+అయిన= అచటికి చనుదెంచిన; ఆ+మహామునులన్= ఆ మహర్షులను; కురుపితామహునకున్= కౌరవులకు తాత అయిన భీష్ముడికి; చూపి= కనబరిచి; నారాయణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అచటికి వచ్చిన మహామునులను కౌరవులకు తాతఅయిన భీష్ముడికి చూపి ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. మనలఁ జూచువేడ్కఁ జనుదెంచినారు మ । హాత్ములైన నారదాది మునులు;
వీరి కర్ఘ్యపాద్య విధు లొనరించి యా । సనము లిడఁగఁ బనుపు సత్వరముగ. 252

ప్రతిపదార్థం: మనలన్= మనలను; చూచువేడ్కన్= చూడవలెననే అభిలాషతో; మహా+ఆత్ములు+ఐన= మహానుభావులైన; నారద+ఆది మునులు= నారదుడు మొదలైన మునీశ్వరులు; చనుదెంచినారు= విచ్చేశారు; వీరికిన్= ఈ మహాపురుషులకు; అర్ఘ్య+పాద్య విధులు= అర్ఘ్యమివ్వటం, పాద్యమివ్వటం అనే ఉపచారాలు; ఒనరించి= చేసి; సత్వరముగన్= తొందరగా; ఆసనములు+ఇడఁగన్= పీఠాలు వేయటానికి; పనుపుము= పంపుము.

తాత్పర్యం: మనలను చూడవలెననే కుతూహలంతో మహనీయులైన నారదాది మహర్షులు విచ్చేశారు. వీరికి అర్ఘ్య పాద్యాదులైన ఉపచారాలు చేయించు, వారు కూర్చుండటానికి వెంటనే పీఠాలు వేయించు.

వ. వీరలు సముచితాసనంబుల నుండక మనకుఁ గూర్చుండుట తగవుగా'దనినం గొలువువారెల్ల సంభ్రమాశ్చర్యంబులతో మునుల వలను జూచుచుండ భీష్ముండు పరిచారకులం బనిచి కనక మణిమయాసనంబు లనేకంబులు దెప్పింప వార లరుగుదెంచిన వారలకు నమస్కరించి యాసనార్ఘ్య పాద్యాది విధులం బూజలు సేయించి కృష్ణుండు గూర్చున్న యనంతరంబ ధృతరాష్ట్రుండునుం దక్కటివారును నుచిత ప్రకారంబుల నమ్మునీంద్రులకు నభివందనంబులు సేసి నిజాసనా సీనులైరి; దుశ్శాసనుండును వివింశతియును గద్దియ లిడ సాత్యకియుఁ గృతవర్మయుఁ గృష్ణుం గదిసి యిరువంకలం గూర్చుండిరి. కర్ణ దుర్యోధనులుం జేరువ నొక్క గద్దియ నుండిరి. విదురుండును మణిపీఠంబునఁ గృష్ణుని వెనుక దెసఁ దదీయోన్నత పీఠంబునఁ గరంబత్తమిల్లి యుండె; గాంధార రాజు నిజపుత్త్ర పరివృతుండై యొక్క దిక్కున నుచిత పీఠాసీనుండయ్యె; నట్టి సమయంబున. 253

ప్రతిపదార్థం: వీరలు= నారదాది మునులు; సముచిత+ఆసనంబులన్+ఉండక= తగిన పీఠాలపై కూర్చుండక; మనకున్; కూర్చుండుట; తగవు+కాదు= ధర్మంకాదు; అనినన్= అని శ్రీకృష్ణుడు పలుకగా; కొలువువారు+ఎల్లన్= సదస్యులందరూ; సంభ్రమ+ఆశ్చర్యములతోన్= సంతోషాద్భుతములతో; మునుల వలను= ఆ మునీశ్వరులవైపు; చూచుచున్+ఉండన్; భీష్మ్ముండు; పరిచారకులన్+పనిచి= సేవకులను పంపి; కనకమణిమయ+అసనంబులు= బంగారు రత్నాలు తాపిన పీఠాలు; అనేకంబులు= పెక్కు; తెప్పింపన్; వారలు= ఆ నారదాదులు; అరుగుదెంచినన్= (సభకు)రాగా; వారలకున్; నమస్కరించి; ఆసన+అర్ఘ్య పాద్య+ఆదివిధులన్= ఆసనాలివ్వటం; అర్ఘ్యమివ్వటం; పాద్యమొసగటం మొదలైన ఉపచారాల చేత; పూజలు= అర్చనలు; చేయించి; కృష్ణుఁడు; కూర్చున్న+అనంతరంబు+అ= కూర్చున్న తరువాతనే; ధృతరాష్ట్రుండునున్; తక్కటివారును= మిగిలినవారున్నూ; ఉచిత ప్రకారంబులన్= తగురీతుల; ఆ+ముని+ఇంద్రులకున్= ఆ నారదాది ముని పుంగవులకు; అభివందనంబులు చేసి= ప్రణామాలు సలిపి; నిజ+ఆసన+ఆసీనులు+ఐరి= తమ తమ పీఠాలందు కూర్చున్నారు; దుశ్శాసనుండును, వివింశతియును; గద్దియలు+ఇడన్= పీఠాలుంచగా; సాత్యకియున్; కృతవర్మయున్; కృష్ణున్, కదిసి= ఆనుకొని; ఇరువంకలన్= రెండువైపుల; కూర్చుండిరి; కర్ణ దుర్యోధనులున్; చేరువన్= చెంతనే; ఒక్క గద్దియన్; ఉండిరి; విదురుండును; మణిపీఠంబునన్; కృష్ణుని; వెనుకదెసన్= వెనుకవైపున; తదీయ+ఉన్నత పీఠంబునన్= ఎత్తైన గద్దియమీద; కరంబు= మిక్కిలి; అత్తమిల్లి= ఒరిగి; ఉండెన్= ఉన్నాడు; గాంధారరాజు= శకుని; నిజపుత్త్ర పరివృతుండు+ఐ= శకుని తన కుమారులతో చుట్టబడినవాడై; ఒక్కదిక్కునన్= ఒక దెస; ఉచితపీఠ+ఆసీనుండు+అయ్యెన్= తగిన గద్దెపై ఉన్నాడు; అట్టి సమయంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: 'నారదాది మహామునులు తగిన పీఠాలపై కూర్చుండకుండా మనం కూర్చుండటం న్యాయం కాదు' అని శ్రీకృష్ణుడు భీష్ముడితో చెప్పాడు. సదస్యులంతా తొట్రుపాటుతో ఆశ్చర్యపడి ఆ మునులవైపే చూస్తుండిపోయారు. భీష్ముడు సేవకులను పంపి మణులు తాపిన బంగారు గద్దెలు పెక్కింటిని తెప్పించాడు. ఇంతలో మునీశ్వరు లచటికి విచ్చేయగా పరమాత్ముడు వారికి నమస్కరించి, ఆసనమివ్వటం, అర్ఘ్య పాద్యాదు లొసంగటం మొదలైన దివ్యోపచారాలతో పూజలు చేయించాడు. వాసుదేవుడు కూర్చున్న పిదప ధృతరాష్ట్రుడున్నూ, మిగిలిన వారున్నూ తగిన రీతుల ఆ మునిపుంగవులకు నమస్కారాలు చేసి తమ తమ పీఠాలపై ఆసీనులయ్యారు. దుశ్శాసనుడు, ధార్తరాష్ట్రులలో పదిహేడవవాడగు వివింశతి అనే అతడు గద్దె లిడగా సాత్యకి, కృతవర్మ శ్రీకృష్ణుడికి రెండువైపులా ఆనుకొని కూర్చున్నారు. కర్ణుడు, దుర్యోధనుడు ఆ సమీపంలో ఒకే పీఠాన ఉండినారు. విదురుడు వెనుక తట్టుగా మురారి యొక్క ఎత్తైన గద్దెమీదికి వ్రాలి మణిపీఠంమీద కూర్చున్నాడు. గాంధార రాజైన శకుని తన కొడుకులతో ఒక తట్టు తగిన గద్దెమీద తానుండినాడు. ఇట్టిసమయంలో.

విశేషం: 1. శ్రీకృష్ణుడు నిలిచిన సభ లౌకికత్వం మీద దివ్యత్వం ఆవేశించిన ట్లుంటుంది. కురువీరులందరూ లేచి దివ్యమునులకు ఆసనాలిచ్చి కూర్చొనబెట్టారు. శ్రీకృష్ణుడి దివ్య సందేశం వినటానికై వచ్చిన మహర్షులు వారు. శ్రీకృష్ణుడి సందేశం యొక్క గొప్పదనాన్ని మునిగణం మౌనంగా వ్యాఖ్యానించి చెపుతున్నట్లున్నది.

2. దేవర్షులు కూర్చున్న తరువాత శ్రీకృష్ణుడు కూర్చున్నాడు. ఆ తరువాత ధృతరాష్ట్రుడు, ఆ తరువాత సభ్యులు కూర్చున్నారు. సభ నంతా శ్రీకృష్ణాధీనమైన ఒక దివ్యానుభూతి వాతావరణం అలముకొన్నది.

3. సభలో భద్రతా విశేషాలు ప్రత్యేకంగా గమనించదగినవి. అవి ఆసనాలు అమర్చటంలో స్పష్టమౌతున్నది. శ్రీకృష్ణుడి భద్రత అత్యంత ముఖ్యం. అందుకే ఆయన కిరుప్రక్కల సాత్యకీ, కృతవర్మా కూర్చున్నారు - అంగరక్షకులవలె. విదురుడు వెనుకభాగంలో ఒదిగి కూర్చున్నాడు. అంటే మూడు దిక్కులా నమ్మిన బంటులవంటి వారు శ్రీకృష్ణుడికి రక్షా కవచంవలె వ్యాపించి కూర్చున్నారు. శ్రీకృష్ణుడికి ఎదురు బడి ఎవరూ నిలవలేరని ధ్వని.

4. శ్రీకృష్ణుడికి కొద్ది దూరంలో ఒక ప్రక్కన కర్ణదుర్యోధనులు ఒకే సింహాసనం మీద కూర్చున్నారు. తనువులు వేరైనా మనసులు ఒకటే సుమా! అని వారి నేస్తం ఆ కూర్చోటంలో ధ్వనించబడుతున్నది. వారిద్దరూ శ్రీకృష్ణుడిని బంధించటానికి అనువైన దూరంలో కూర్చున్నారు. శకుని సకుటుంబంగా ఆ సమీపంలో ఉన్నాడు. దుశ్శాసనుడు అన్నకు నీడగా ఉంటాడు. దుష్టచతుష్టయం దాడికి అనువుగా సభలో కూర్చున్నది. ఈ విధంగా సభాసదులు కూర్చొనటంలో కూడా వ్యూహారచన మున్నట్లు చిత్రించటం రాజకీయ సభా ప్రాశస్త్యాన్ని తెలుపుతున్నది. ఉద్యోగపర్వ సభలో ఇది అన్ని విధాలా ఉన్నతమైన రాజ్య (రాజకీయ) సభ. (సంపా.)

క. **అంబుద శుభగాత్రుం బీ। తాంబరధరుఁ గమలదళ నిభాక్షున్ హరిఁ జూ**
డం బడసి లోచనము లమృ। తం బానిన మాడ్కి సమ్మదంబునఁ దేలన్. **254**

ప్రతిపదార్థం: అంబుద శుభగాత్రున్= మేఘం వంటి మంగళకరమైన శరీరం కలవాడును; పీత+అంబరధరున్= పచ్చని పట్టు పుట్టం కట్టినవాడును; కమలదళ నిభ+అక్షున్= తామర రేకులతో సమానమైన కన్నులు కలవాడును; అగు; హరిన్= శ్రీకృష్ణుడిని; చూడన్+పడసి= చూచే భాగ్యంపొంది; లోచనములు= నేత్రాలు; అమృతంబు+ఆనినమాడ్కిన్= సుధారసమును గ్రోలిన విధాన; సమ్మదంబునన్= ఆనందమునందు; తేలన్= తేలగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మేఘవర్ణంవలె సుందరమైన దేహవర్ణం కలవాడూ, పచ్చని పట్టుపుట్టం ధరించినవాడూ, తామర రేకులతో సమానమైన నయనాలు కలవాడూ, అయిన శ్రీహరిని చూడనోచినందులకు సభలోనివారి కన్నులు అమృతరసాన్ని గ్రోలినట్లు ఆనందంలో ఓలలాడాయి.

విశేషం: అలం: ఉపమ. 1. రాజనీతికి ఈ రాయబారపు ఘట్టం శిఖరాయమాణం. అందులో శ్రీకృష్ణుడి వ్యక్తిత్వం మకుటాయమానం. ఈ ఘట్టాన్ని అటు వ్యాసమహర్షీ, ఇటు తిక్కన సోమయాజీ అద్భుతంగా చిత్రించారు.

2. సభలో అందరినీ ఆకర్షించేది వక్త యొక్క రూపవైభవం. అంటే ఆంగిక, ఆహార్య అభినయ సంపద. శ్రీకృష్ణుడు కన్నుల పండుగ కలిగించే మధురాకృతి కలవాడు. వ్యాసమహర్షి మాటలలో.

'అతసీ పుష్ప సంకాశః పీతవాసా జనార్దనః

వ్యభ్రాజత సభామధ్యే హేమ్నీవోపహితో మణిః' (సం. 5-92-52)

నల్లని అవిసెపూవు వంటి మేనికాంతి కలవాడూ, పచ్చని పట్టువస్త్రం ధరించినవాడూ అయిన శ్రీకృష్ణుడు సభామధ్యంలో బంగారంలో పొదిగిన ఇంద్రనీలమణివలె ప్రకాశించాడు- అని వ్యాసుడు వర్ణించాడు. తిక్కన శ్రీకృష్ణుడిని అంబుదశుభగాత్రుడుగా మొదట పేర్కొన్నాడు. సర్వజనుల కన్నులనూ, హృదయాలనూ ఆకర్షించేది శ్రావణమేఘం. పచ్చని పట్టువస్త్రం కట్టటం శ్రీకృష్ణుడి నైజం. ఆ రంగు చూచేవారికి శాంతిని ప్రసాదిస్తుంది. ఆ తరువాత తిక్కన- మూలంలో ప్రస్తావించబడని కమలదళనిభాక్షులను వర్ణించాడు. విశాలాక్షుడని విష్ణువుకు పెట్టింది పేరు. ప్రకృతి నుండి పురుషోత్తముడి వరకు, భౌతికం నుండి ఆధ్యాత్మికం వరకు, సౌందర్యం నుండి కారుణ్యం వరకు వ్యాపించి ఉన్న ఒక దివ్యచైతన్యం రూపుతాల్చిన అనుభవం. గాత్రం ఇంద్రియాలను, అంబరం మనస్సును, కమలాక్ష దృష్టి ఆత్మను ఆకట్టుకొనే స్వభావం కలవి. వీటన్నిటినీ తిక్కన ఒకచోట కూర్చాడు.

3. శ్రీకృష్ణుడు ఒక దివ్యాదివ్యవిభావం. ఆయనను చూచిన సభాసదులు మూడంచెల అనుభూతిని పొందారు. క్రమంగా అన్వయించుకొంటే 'అంబుదనిభ గాత్రుడి'ని చూచి కన్నులు ఆనందించాయి. పీతాంబరధరుడిని చూచి మనస్సులు అమృతం త్రాగిన అనుభూతిని పొందాయి. కమలదళాక్షుని కరుణామయ విశాలదృక్కులను చూచి ఆత్మలు ఆనందాంబుధిలో తేలినట్లున్నవి. తిక్కన అలంకారధ్వని ఇక్కడ గమ్యమానం. మూడు రకాల అనుభవాన్ని ఒక ఉపమాలంకారంలో సూచించాడు. కన్నులు అమృతరసాన్ని గ్రోలి ఆనందంలో తేలాయట! ఇది అలంకారాన్ని మించిన ధ్వనిమయ భావచిత్రం.

4. సభలో అందరినీ ఆకర్షించే రూపం, వేషం, అభినయం (దృష్టి) అనే మూడంశాలు ముప్పిరిగొని ముచ్చట కొలపటం నాటకీయత. (సంపా.)

క. ఆ కొలువువారు కర మచ । లాకృతి నొక పలుకులేక యందఱు వింజం
బాఁకిడిన కరణి నవశ ము । దాకారిత చిత్తవృత్తులై యుండంగన్. 255

ప్రతిపదార్థం: ఆ కొలువువారు= ధృతరాష్ట్రుడి కొలువుకూటంలో ఉన్నవారు; కరము= మిక్కిలి; అచల+ఆకృతిన్= కదలని రూపాలతో; ఒక పలుకులేక= ఏమియు మాటాడక; అందఱున్= ఎల్లరు; వింజంబు= వింధ్య పర్వతం; ఆఁక+ఇడిన కరణిన్= అడ్డపడిన తీరున; అవశ+ముద్+ఆకారిత+చిత్తవృత్తులు+ఐ= పారవశ్యం, సంతోషం రూపుగొన్న మనోవ్యాపారం కలవారై; ఉండంగన్= ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: మేరుగిరి చుట్టూ ప్రదక్షిణం చేస్తున్న సూర్యుడి భ్రమణాన్ని వింధ్యపర్వతం నిరోధించిన వేళ సృష్టి నిశ్చలమైనట్లు ధృతరాష్ట్రుడి కొలువు కూటంలోని వారందరూ శ్రీకృష్ణ సందర్శనంతో తమ మనస్సులు సంతోష పరవశాలు కాగా ఇట్టట్టు చలింపక నోట మాటలేక అట్లే స్తంభించిపోయారు.

విశేషం: అలం: ఉపమ. 1. శ్రీకృష్ణుడి దివ్య దర్శనం చేసికొంటున్న సభాసదుల స్థితిని తిక్కన ఉపమాలంకార సుందరంగా వర్ణించాడు. తెలుగుదనం ఒలకపోశాడు.

2. సభాసదుల అవస్థలన్నీ సాత్త్వికాభినయ విశేషాలు కావటం చేత అవి తెచ్చిపెట్టుకొన్నవి కాక శ్రీకృష్ణ దర్శనం వలన పొంగిన సాత్త్వికచిత్తవృత్తి జన్యమైన సహజాభినయ విశేషాలని స్పష్టం.

3. ఇందులో మూడు రకాలైన అవస్థలు వర్ణించబడ్డాయి. 1. 'కరమచలాకృతి' అవస్థ. మిక్కిలి కదలని ఆకృతితో ఉన్నారట! లేదా, శ్రేష్ఠమైన పర్వతంవలె స్థిరమైన ఆకృతితో సభ్యులున్నారట. అంటే ఆశ్చర్యజన్యమైన స్తంభావస్థలో ఆంగికాభినయాన్ని ప్రదర్శిస్తున్నారన్నమాట. స్తంభావస్థలో వాచికాభినయం ఉండకపోవటం సహజం. అందుకే 'ఒక పలుకు లేక' ఉండిపోయారు. ఇవి అభినయావస్థలు.

4. ఇక వారి చిత్తవృత్తులు 'వింజం బాకిడిన కరణి' నవశముదాకారిత చిత్తవృత్తులై ఉన్నట్లు తిక్కన విశేషంగా వర్ణించాడు. వింధ్యపర్వతం అడ్డుపడితే జనులు సూర్యచంద్రుల గతిని గమనించలేక కాలజ్ఞానాన్ని కోల్పోయారట. ఆ అనుభవాన్ని తెలుగులో జాతీయంగా భద్రపరచుకొన్నారు తెలుగువారు. అంటే, శ్రీకృష్ణుడి దివ్యాకారాన్ని చూస్తూ కాలాన్ని మరచిపోయారు. దానికి కారణం- వారందరూ పారవశ్యంతో కూడుకొన్న ఆనందమే ఆకారంగా రూపుదాల్చిన చిత్తవృత్తులు కలవారయ్యారు. ఇది తన్మయావస్థ. (సంపా.)

శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రునితో సంభాషించుట (సం. 5-93-1)

క. **జలదస్వన గంభీరత । నెలుఁగొప్పఁగ దంత దీప్తు లెసఁగ ముకుందుం**
డలరుచు సభ నఖిల జనం । బులు విన ధృతరాష్ట్ర భూవిభున కిట్లనియెన్. **256**

ప్రతిపదార్థం: ముకుందుఁడు= శ్రీకృష్ణుడు; జలదస్వన గంభీరతన్= మేఘధ్వనియొక్క గాంభీర్యంతో; ఎలుఁగు+ఒప్పఁగన్= తన కంఠధ్వని సొంపారగా; దంత దీప్తులు+ఎసఁగన్= దంతాల యొక్క కాంతులు అతిశయించగా; సభన్= సభలో; అలరుచున్= ప్రకాశిస్తూ; అఖిలజనంబులు= ధృతరాష్ట్రుడి కొలువులోనున్న సమస్త ప్రజలు; వినన్= ఆలకించగా; ధృతరాష్ట్ర భూవిభునకున్= ధృతరాష్ట్ర మహారాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా వచించాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు మేఘధ్వనివలె గంభీరమైన తన కంఠధ్వనితో, దంతాల కాంతులు ప్రసరిస్తూ ఉండగా సభలో వెలుగొందుతూ సదస్యులందరూ చెవులు నిక్కించుకొని ఆలకిస్తుండగా ధృతరాష్ట్ర మహారాజుతో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. అలం: ఉపమ. శ్రీకృష్ణుడి కంఠస్వరం మేఘ గర్జనవలె గంభీరంగానూ, హృదయంగమంగానూ ఉన్నది. దానికి తోడు ఆయన దంతకాంతులు మెరుపుల వలె మెరిసిపోతున్నాయి. వర్షాకాల ప్రకృతి రామణీయకం కాల్పనిక సౌందర్యంతో శ్రీకృష్ణుడియందు దర్శనమిస్తున్నట్లు తిక్కన చిత్రించి, సందేశ ఘట్టానికి పూర్వరంగ ప్రక్రియను నిర్వహించాడు. చెప్పేవాడు గొప్పవాడైతే చెప్పేది గొప్పగా రాణిస్తుంది. (సంపా.)

క. **'జననాథ! నీ యెఱుంగని । పనులు గలవె? యైనఁ దగవుఁ బరమహితంబుం**
దనవారికిఁ జెప్పన తగు । నని వచ్చితి భారతాన్వయము ప్రియమొందన్. **257**

ప్రతిపదార్థం: జననాథ!= రాజా ధృతరాష్ట్రా!; నీ+ఎఱుంగని+పనులుకలవె?= నీకు తెలియని కార్యాలున్నాయా?; ఐనన్= అయినప్పటికీ; తగవున్= న్యాయాన్ని; పరమ హితంబున్= మిక్కిలి శ్రేయస్కరమైనదానిని; భారత+అన్వయము= భరతుడు

జన్మించిన కురువంశము; ప్రియము+ఒందన్= సంతోషపడగా; తనవారికిన్= నా వారికి; చెప్పన్+అ+తగున్+అని= చెప్పటమే ఉచితమని; వచ్చితిన్= ఇక్కడికి వచ్చాను.

తాత్పర్యం: 'మహారాజా! నీ వెరుగని కార్యా లేమున్నాయి? ఐనప్పటికీ, భరతవంశం సంతోషించేటట్లు నా ఇరుకుటుంబాలవారికీ న్యాయమూ, పరమహితమూ చెప్పటం ఉచితమని నేనిక్కడికి వచ్చాను.

విశేషం: 1. శ్రీకృష్ణుడి గంభీరోపన్యాసం ఇక్కడి నుండి ప్రారంభమౌతున్నది. ఉపన్యాసానికి ఉపక్రమణిక ఊపిరి. ఎత్తుగడలోనే వక్త శ్రోతల చిత్తాలను ఆకర్షించాలి. అందుకై శ్రీకృష్ణుడు నాలుగంశాలను తొలి పలుకులలో తోచేటట్లు చెప్పాడు. అవి- (1) సంబుద్ధి (2) వినయవచనం (3) వక్త లక్ష్యం (4) ప్రయోజనం.

2. 'జననాథ!' అన్న సంబుద్ధి సార్థకం. ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడి మాటలను కౌరవులకు తండ్రిగా కాక, ప్రజలకు ప్రభువుగా వినాలని ధ్వని. ఇందులో వంశం కంటె ప్రజల యోగక్షేమం ముఖ్యమని సూచన. లోకక్షేమం కొరకే శ్రీకృష్ణుడి బోధ అని ధ్వని.

3. పెద్దల ముందు ఉపన్యసించేటప్పుడు వివేకవంతుడు వినయోక్తులతో మొదలు పెట్టాలి. దాని వలన వక్త యొక్క నిరహంకార ప్రవృత్తి వ్యక్తమై శ్రోతల ఆభిముఖ్యం ఏర్పడుతుంది. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడి ఆభిముఖ్యాన్ని సాధించ యత్నించాడు రెండవ అంశంలో.

4. శ్రీకృష్ణుడు తన ఉపన్యాసానికి లక్ష్యాన్ని వివరించాడు మూడవ అంశంగా. కౌరవులందరూ తనవారని అనుకొని వారితో తన అభిప్రాయం చెప్పటం న్యాయమని భావించి శ్రీకృష్ణుడు హస్తినకు వచ్చాడట! ఆ మాటలలో రెండు లక్ష్యాలున్నాయి. 1. న్యాయం 2. పరమహితం ఏర్పడేటట్లు చెప్పటం.

5. ఆ చెప్పటం వలన భారతాన్వయమంతా సంతోషించే ప్రయోజనం సాధించబడుతుందని సూచించాడు. లక్ష్య ప్రయోజనాల నిర్దేశం వలన వక్తవ్యాంశం మీద ఆసక్తి అంకురిస్తుంది.

6. అవధాన సాధనమే ఈ పద్య ప్రయోజనం. ప్రసాద గుణభూయిష్ఠమైన రచన దీనికి ప్రాణం. (సంపా.)

క. క్షీరోదక గతిఁ బాండవ । కౌరవు లొడఁగూడి మనికి కార్యం బది నీ
వారసి నడపుము వా రన । వీ రనఁ గురుముఖ్య! నీకు వేఱుంగలదే? 258

ప్రతిపదార్థం: కురుముఖ్య!= కురువంశంలో ప్రధానమైనవాడా!; క్షీర+ఉదకగతిన్= పాలూ, నీరూవలె; పాండవ కౌరవులు= పాండవులున్నూ కౌరవులున్నూ; ఒడన్+కూడి= ఒద్దిక కలిగి; మనికి= జీవించటం; కార్యంబు= చేయదగినపని; అది= దానిని; నీవు= నీవు; ఆరసి= పరికించి; నడపుము= సాగించుము; నీకున్= నీకు; వారు+అనన్= పాండవులనగా; వీరు+అనన్= కౌరవులనగా; వేఱున్+కలదే= భేదమున్నదా? (లేదని అర్థం.)

తాత్పర్యం: కురునాథా! పాండవ కౌరవులు పాలూ నీరూ వలె కలసి మెలసి జీవించటం మంచిపని. వారు అట్లా ఒద్దికతో ఉండేటట్లు నీవు వారిని నడపించవలసింది. పాండవులు వేరు, కౌరవులు వేరు అనే భేదబుద్ధి నీకు లేదు కదా!

విశేషం: అలం: ఉపమ, యథాసంఖ్యం. కురుముఖ్యుడుగా ధృతరాష్ట్రుడు చేయవలసిన బాధ్యతను ఇక్కడ శ్రీకృష్ణుడు చెప్పుతున్నాడు. 1. పాండవ కౌరవులు పాలూనీరువలె కలిసి ఉండటం కాదగిన కార్యం. 2. అట్లా జరగాలంటే ధృతరాష్ట్రుడు కౌరవపాండవులను సమంగా చూడాలి. ఇందులో మొదటిది న్యాయం. రెండవది హితం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

2. కౌరవ పాండవులు కలిసి ఉండాలి అన్నప్పుడు చాలవరకు ఈ ఘట్టంలో అందరూ క్షీరోదక సామ్యాన్నే స్వీకరించారు. అయితే ధృతరాష్ట్రుడు కౌరవపాండవులు క్షీరోదకాలవంటివారన్నాడు. (1.263), భీముడు పాండవ కౌరవులను క్షీరోదకా లన్నాడు. (3.47). శ్రీకృష్ణుడు పాండవ పక్షం వాడే కాబట్టే వారు పాలవలె బలవంతులనీ, కౌరవులు నీరువలె బలహీనులనీ, పాండవుల నాశ్రయించి బ్రతకటమే ధార్తరాష్ట్రులకు క్షేమమనీ భావించాడు. (సంపా.)

చ. భరతకులంబు ధర్మమును బాడియు సత్యముఁ బొత్తుఁ బెంపునుం
గరుణయుఁ గల్గి యుండు ననఁగా నుతిఁ గన్నది; యందు సద్గుణో
త్తరులరు నీవు నీ యనుఁగుఁ దమ్ముఁడు; నీ తనయుల్ యశోధురం
ధర శుభ శీలు; రీ సుచరిత క్రమ మిప్పుడుఁ దప్పనేటికిన్? 259

ప్రతిపదార్థం: భరతకులంబు= భరతుడు జన్మించిన కురువంశం; ధర్మమును= ధర్మమూ; పాడియున్= న్యాయమూ; సత్యమున్= సూనృతమూ; పొత్తున్= ఐకమత్యమూ; పెంపునున్= గొప్పతనమూ; కరుణయున్= కృపయూ; కల్గి+ఉండున్+ అనఁగాన్= కల్గియుంటుందని; నుతిన్+కన్నది= ప్రఖ్యాతి వహించింది; అందున్= అట్టి వంశంలో; నీవున్= నీవూ; నీ+ అనుఁగుఁ దమ్ముఁడున్= నీ ప్రియమైన తమ్ముడు పాండురాజూ; సద్గుణ+ఉత్తరులరు= మంచి గుణాలచేత శ్రేష్ఠులు; నీ తనయుల్= నీ కొడుకులున్నూ నీ తమ్ముడి కొడుకులున్నూ; యశోధురంధర శుభశీలురు= కీర్తి భారాన్ని వహిస్తున్న మంచి స్వభావం కలవారు; ఈ సుచరితక్రమము= పరంపరగా వస్తున్న ఈ మంచి నడవళ్ళతీరును; ఇప్పుడున్= ఇప్పుడుకూడా; తప్పన్+ ఏటికిన్?= విడుచుట ఎందులకు?

తాత్పర్యం: మహారాజా! మీ భరతవంశం ధర్మం న్యాయం సత్యం ఐకమత్యం గౌరవం కారుణ్యం మొదలైన సద్గుణాలు గలిగి పొగడ్త కెక్కింది. అట్టి వంశంలో నీవూ, నీ ప్రియ సహోదరుడు పాండురాజూ, సద్గుణాలయందు శ్రేష్ఠులు, మరి నీ కుమారులో కీర్తి భారం వహించజాలినవారు, కళ్యాణ స్వభావులు. ఇంత మంచి నడవడిగల వంశసంప్రదాయం ఇపుడు కూడా తప్పించటమెందుకు?

విశేషం: 1. వెనుకటి పద్యంలో ధృతరాష్ట్రుడు నిర్వహించవలసిన బాధ్యతలు అవశ్య కర్తవ్యాలని చెప్పటానికి శ్రీకృష్ణుడు ఉపపత్తులను ఏకరువు పెట్టుతున్నాడు. వాటిల్లో మొదటిది వంశగౌరవ సంప్రదాయ పరిరక్షణ. దానిని వివరించా డీ పద్యంలో.

2. భరతవంశం ఆరు గుణాలకు ప్రసిద్ధి. వాటిని ఈ క్రమంలో చెప్పుకొనాలి. (1) ధర్మం - వేదశాస్త్రాదులలో ప్రతిపాదించిన విధి. (2) న్యాయం - లోకహితాన్ని కలిగించే సాంఘిక మర్యాద. (3) సత్యం - నిజం మాట్లాడటం, నిజం భావించటం, నిజం పాటించటం (4) పొత్తు - అరమరికలు లేక ఒకరి మేలు ఒకరు కోరుతూ కలసి మెలసి ఉండటం. (5) గౌరవం - వ్యక్తిసుఖం కంటె వంశానికి కళంకం రాకుండా గౌరవం కలిగేటట్లు వర్తించటం (6) కరుణ - సర్వజీవ హితభావం.

3. భరతవంశంలో కొందరు కొన్ని కొన్ని గుణాలు ఆచరించి ఉండవచ్చును. కాని, పాండురాజూ, ధృతరాష్ట్రుడూ అన్ని గుణాలను ఆచరించేవారిలో అగ్రగణ్యులుగా పరిగణించబడతారు. ఈ మాట ధృతరాష్ట్రుడి యందు సత్యం కాకపోయినా ముందుకాళ్ళకు బంధంగా శ్రీకృష్ణుడు అట్లా పొగిడాడు. 'నీతనయుల్' అనే మాట పాండవ కౌరవుల కిద్దరికీ వర్తిస్తుంది. తండ్రి లేని పాండవులను ధృతరాష్ట్రుడే తండ్రిగా పెంచి పెద్దవాళ్ళను చేశాడని తాత్పర్యం. కౌరవ పాండవులు యశోధురంధర శుభశీలురట! యశస్సు, వంశ గౌరవ పరిరక్షణ వలననే కలుగుతుందని ధ్వని. ఆ మంచి వంశ సంప్రదాయాన్ని మానవద్దని హితవు చెప్పాడు. ఈ పద్యం హితోక్తి. (సంపా.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శా. ఈ వంశంబున కెల్ల నీవ కుదు; రిం దెవ్వారి చందంబు లె
ట్లై వర్తిల్లినఁ గీడు మేలుఁ దుది నీయం దొందెడుం గాన స
ద్భావం బారసి లోనిపొత్తు వెలివృత్తంబున్ జనస్తుత్యముల్
గావింపం దగు నీక యెవ్విధమునం గౌరవ్యవంశాగ్రణీ! 260

ప్రతిపదార్థం: కౌరవ్యవంశ+అగ్రణీ!= కురువంశంవారిలో శ్రేష్ఠుడా!; ఈ వంశంబునకున్+ఎల్లన్= ఈ కురుకులాని కంతటికీ; నీవు+అ= నీవే; కుదురు= ఆశ్రయం; ఇందున్= ఈ కురువంశస్థులలో; ఎవ్వారి చందంబులు= ఎవ్వరి నడవడులు; ఎట్లు+ఐ వర్తిల్లినన్= ఏ విధంగా ఉండునో వాటిననుసరించి, కీడు= హాని, మేలు= వృద్ధి; తుదిన్= కడపటికి; నీఅందున్+ఒందెడున్= నీకే చెందగలవు; కానన్= కనుక; సద్భావంబు+ఆరసి= మంచి తలంపునకు వచ్చి; లోనిపొత్తు= అంతరంగంలో ఒద్దిక; వెలివృత్తంబున్= బహిరంగ ప్రవర్తన; జనస్తుత్యముల్= ప్రజలచేత మెచ్చదగినవిగా; కావింపన్= చేయటానికి; నీకున్+అ= నీకే; ఏ విధమునన్= ఏ విధంగానైనా; తగున్= యోగ్యం.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! నీవు కురువంశస్థులలో అగ్రేసరుడివి. ఈ వంశాని కంతటికీ నీవే ఆధారం. నీ కుటుంబంలో ఎవ్వరెవ్వరి నడవడికలు ఎట్టెట్లుగా ఉంటాయో వాటినిబట్టి కలిగే మేలు కీళ్ళు నీకే చెందుతాయి. కాబట్టి నీవు ఇరు కుటుంబాల వారి శ్రేయస్సు నూహించి అంతరంగ స్నేహం, బహిరంగ ప్రవర్తన జనులు మెచ్చేటట్లుగా ఏవిధంగానైనా వారిని చక్కదిద్దవలసి ఉంటుంది.

విశేషం: కౌరవ్య వంశాగ్రణీ! అనే పిలుపు సాభిప్రాయం. ధృతరాష్ట్రుడు కౌరవవంశరాజులలో అగ్రగణ్యుడు కావాలంటే ఈ తగవు (న్యాయం) పాటించాలని శ్రీకృష్ణుడు నిర్దేశించాడు. 1. ఇప్పుడు ఈ వంశానికంతా నీవే ఆధారం. అతడు న్యాయంగా వ్యవహరిస్తే వంశం నిలుస్తుంది. లేదా వంశం అతడితోనే అంతమౌతుంది. అంతటి కీలకమైనది ఆయన వర్తనం.

2. వంశంలో ఇతరులు అతడిని కాదని ఏమి చేసినా, దానివలన కలిగే కీడుగాని, మేలుగాని ధృతరాష్ట్రుడే అనుభవించవలసి వస్తుంది.

3. కాబట్టి కుటుంబ శ్రేయస్సును భావించి, మనసూ మాటా ఒకటిగా తలంచి, జనులు మెచ్చేటట్లు వ్యవహరించాలి.

4. ఏ విధంగా చూచినా ఈ బాధ్యత మరెవ్వరిదీ కాదు. ధృతరాష్ట్రుడిదే. కాదని తప్పించుకొనటం న్యాయం కాదు- అని శ్రీకృష్ణుడు స్పష్టపరిచాడు. తరతరాల వంశ సంప్రదాయ గౌరవం ఒక్క ధృతరాష్ట్రుడి వర్తనం మీదనే ఆధారపడి ఉన్నదనీ, వంశ చరిత్రలో ధృతరాష్ట్రుడు కీలకమైన పాత్ర నిర్వహించవలసి వచ్చిందనీ, న్యాయంగా వ్యవహరించి కౌరవ్యవంశాగ్రణి కావాలనీ శ్రీకృష్ణుడు హెచ్చరించాడు. (సంపా.)

చ. వినుము! సుయోధనాదులగు వీరు సధర్ములు గాక కార్యము
లొ్ంనక మహార్థసిద్ధి యెడలుం దమ కిట్లన కన్వయంబు వ
ర్తనమిది గాదు నాక బెడిదంపుఁదనంబున బంధుకోటికి
న్మనసులు నొవ్వఁగా నవగుణంబులకుం బుయిలోడ రేమియున్. 261

ప్రతిపదార్థం: వినుము= మహారాజా, నామాటలాలకించవలసింది; సుయోధన+ఆదులు+అగు+వీరు= దుర్యోధనుడు మొదలుగా గల్గిన నీ కుమారులు; సధర్ములు కాక= ధర్మము ననుసరించే వారుకాక; కార్యముల్+కొనక= చేయదగిన మంచి పనులు

చేయక; ఇట్లు= ఈ రీతిగా మెలగితే; తమకున్= తమకు; మహా+అర్థసిద్ధి= గొప్ప ప్రయోజనాలు చేకూరుట; ఎడలున్+అనక= తొలగిపోవునని తలంచక; అన్వయంబు వర్తనము= వంశపు నడవడి; ఇది కాదు= ఇటువంటిది కాదు; నాక= అనక; బెడిదంపుఁ దనంబునన్= దారుణ స్వభావంతో; బంధుకోటికిన్= బంధువర్గానికి; మనసులు నొవ్వఁగాన్:= హృదయాలు వ్యథ చెందేటట్లు; అవగుణంబులకున్= దుర్గుణాలకు; ఏమియున్= ఇంచుకయు; పుయిలోడరు= వెనుదీయరు.

తాత్పర్యం: రాజా! వినుము. దుర్యోధనాదులైన వీరు ధర్మపరులుగాక, సత్కార్యాలాచరించక, ఇట్లా ఉంటే మహార్థసిద్ధికి దూరమవుతామని తలంచక, వంశపునడవడి ఇట్టిది కాదనక, దారుణ బుద్ధితో బంధువుల మనస్సులు బాధచెందేటట్లుగా దుష్టచేష్టలు చేయటానికి ఏమాత్రం వెనుదీయకున్నారు.

విశేషం: భరతవంశం సద్గుణాలకు నిలయం. మరి ధృతరాష్ట్రుడి కొడుకులు అవగుణాలకు ఆశ్రయాలు. కాబట్టి దుశ్చేష్టలు చేయటానికి వెనుకాడరు. వంశపురుషులకు కౌరవులకూ ఉన్న భేదాన్ని శ్రీకృష్ణుడు చక్కగా విశ్లేషించాడు. వారు సధర్ములు- వీరు అధర్ములు. వారు న్యాయవర్తనులు - వీరు మంచి పనులు చేపట్టరు. వారు సత్యనిష్ఠులు - వీరు మహార్థసిద్ధిని లెక్కచేయని అసత్యనిష్ఠులు. వారు వంశజులందరూ కలసి మెలసి ఉండాలనేవారు. వీరు అన్వయ వర్తనాన్ని గౌరవించనివారు; వారు వంశౌన్నత్యానికి కృషి చేశారు. వీరు బంధుకోటి మనసులను బాధపెట్టి వంశగౌరవాన్ని మట్టి కలిపారు. వారు కరుణామూర్తులు - వీరు పాపకర్మలకు వెనుకాడని కఠినాత్ములు. ఈ విధంగా కౌరవులు భరత వంశ సంప్రదాయాన్ని చట్టుబండలు చేశారని స్పష్టంగా చెప్పాడు. వీరివలననే వంశ క్షయం కలుగుతుందని ధ్వనింపచేశాడు. (సంపా.)

ఉ. **కౌరవ పాండవుల్ తెఱఁగు గైకొని శాంతతఁ బొందియున్కి మే**
లారయ నాకు నీకుఁ గులమంతకు నీ నృపకోటి కుర్వికిం
బోరితమైన నింతకును బుట్టు మహాపద గావునన్ ధరి
త్రీ రమణాగ్రగణ్య! గణుతించి యవశ్యముఁ బొం దొనర్పవే! **262**

ప్రతిపదార్థం: ధరిత్రీ రమణ+అగ్రగణ్య!= రాజులలో ఉత్తముడా!; కౌరవపాండవుల్= కౌరవులూ, పాండవులూ; తెఱఁగు+ కైకొని= సంధి నిర్ణయానికి వచ్చి; శాంతతన్+పొంది= ప్రసన్నత్వం వహించి; ఉన్కి= ఉండటం; ఆరయన్= పరికించగా; నాకున్= నాకును; నీకున్= నీకును; కులము+అంతకున్= కురువంశాని కంతటికీ; ఈ నృపకోటికిన్= ఈ రాజ సమూహానికి; ఉర్వికిన్= ఈ జగత్తునకూ; మేలు= శ్రేయం; పోరితము+ఐనన్= యుద్ధం జరిగితే; ఇంతకును= ఈ సమస్తమునకునూ; మహా+ఆపద+పుట్టున్= గొప్ప విపత్తు సంభవిస్తుంది; కావునన్= అట్లగుటచేత; గణుతించి= నా మాటలు లెక్కించి; అవశ్యమున్= తప్పక; పొందు+ఒనర్పవే= సంధి కావించవలసింది.

తాత్పర్యం: కౌరవులు పాండవులు ఒక మంచి నిర్ణయానికి వచ్చి, శాంతం వహించి, జీవించటం మంచిది. ఇట్లు వారు ప్రసన్నచిత్తులై ఉండటం నాకూ, నీకూ, కురువంశానికీ, ఈ రాజ సమూహానికీ, ఈ భూ మండలానికి శ్రేయం. అట్లాకాక యుద్ధమే సంభవిస్తే మనందరికీ మహా విపత్తు కలుగుతుంది. కనుక రాజోత్తమా! నా మాటలపై విశ్వాసముంచి తప్పక సంధి జరిపించవలసింది.

విశేషం: 1. శ్రీకృష్ణుడు తనవారని భావించేవారికి తెలిపే పరమహితం ఈ పద్యతాత్పర్యం.

2. కౌరవ పాండవు లేదో ఒక పద్ధతితో శాంతి కుదుర్చుకొంటే మేలయ్యేది శ్రీకృష్ణుడికి, ధృతరాష్ట్రుడికి, వంశంలో ఉన్నవారి కందరికీ, ఆ సభలో ఉన్న రాజులందరికీ, చివరకు సమస్త భూమికీ అని పేర్కొనటం సఖ్యత వలన ఎంతటి సౌఖ్యమేర్పడుతుందో భావనా రమణీయంగా ప్రసన్నమౌతున్నది.

3. యుద్ధమైతే అందరికీ మహాపద కలుగుతుంది - దాన్ని లెక్కలోనికి తీసికొనుమన్నాడు. పాండవ యాదవ కుటుంబ సభ్యులు కొందరైనా పోవటం శ్రీకృష్ణుడి కేర్పడే ఆపద. కొడుకులందరూ మరణించి తర్పణాలు ఇవ్వటానికి కూడా ఎవ్వరూ మిగలని మహాపద ధృతరాష్ట్రుడిది. కౌరవులందరూ నశించటం వంశజుల కేర్పడే మహాపద. యుద్ధంలో సహాయపడే రాజులు ప్రాణాలు కోల్పోతారు. దానివలన భూమి వీరులను కోల్పోతుంది. రక్తంతో తడుస్తుంది. జననాశం ఏర్పడుతుంది. వితంతువుల విషాదం పెల్లుబుకుతుంది. ఇవన్నీ లోకాని కేర్పడే ఆపదలు. వీటిని పరిగణించి తప్పక సంధి చేయుమని హితవు చెప్పి హెచ్చరించాడు శ్రీకృష్ణుడు. (సంపా.)

తే. **నీకు వలసినఁ దీర్పంగ నేరవచ్చు। నధిప! తెఱఁగు నీ వశమున యదియ కాన**
నీకు వీరలఁ దేర్చుట నెఱియ కాదె। సిద్ధ మెవ్వారిఁ దెలివొందఁ జేయనేర్తు. **263**

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; తెఱఁగు= సంధి; నీ వశమున+అదియ+కానన్= నీ అధీనంలో ఉన్నట్టిదే కావటం చేత; నీకున్+వలసినన్= నీకు అవసరమని తోస్తే; తీర్పంగన్+నేరన్+వచ్చున్= కార్యం సరిదిద్దవచ్చు; నీకున్= నీకు; వీరలన్+తేర్చుట= కురుపాండవుల కలతలు మాన్పి ప్రసన్నులను చేయటం; నెఱియకాదె?= న్యాయంగదా!; సిద్ధము= ఇది నీ వశము లోనిది; ఏ+వారిన్= ఎవ్వరినైనను; తెలివి+ఒందన్= వివేకం పొందేటట్లు; చేయన్+నేర్తు(వు)= చేయటానికి నీవు సమర్థుడివి.

తాత్పర్యం: రాజా! సంధికార్యం నీ చేతిలో ఉన్నది. అవసరమైతే పని చక్కబెట్టగలవు. కురుపాండవులను ప్రసన్నులను చేయుట న్యాయం. ఎవ్వరికైనా వివేకం కల్గించటానికి నీవు సమర్థుడవు. ఇది నిజం.

విశేషం: 1. సంధి అవశ్యం జరగవలసిన కార్యం. అది ధృతరాష్ట్రుడిపై ఆధారపడి ఉన్నది. ఆ సంధి జరిపే పద్ధతి కూడ ధృతరాష్ట్రుడి అధీనంలోనే ఉన్నది. కాబట్టి కౌరవ పాండవులను సంధి కంగీకరించేటట్లు ప్రసన్న మనస్కులను చేయటం కర్తవ్యం. అది చేయగలవాడు ధృతరాష్ట్రు డొక్కడే - ఇది శ్రీకృష్ణుడి మాటల ఫలితాంశం. ప్రతిపాద్యాంశ తాత్పర్యాన్ని స్పష్టంగా చెప్పటం ఉపన్యాస ఉపసంహారాంశం ఔతుంది.

2. ఇంతవరకు వంశగౌరవానికి తగ్గట్లుగా ధృతరాష్ట్రుడూ, అతడి కొడుకులూ నడచుకొనవలసిన అంశాన్నీ, సంధి అవసరాన్నీ విడమరచి చెప్పాడు. సంధి చేయటం న్యాయమన్నాడు. ధృతరాష్ట్రుడే ఆ నిర్ణయం తీసికొనటం పరమహితమన్నాడు శ్రీకృష్ణుడు. 257వ పద్యంలో ఆరంభించిన విశ్లేషణను ఇక్కడివరకు హేతుబద్ధంగా కొనసాగించటం తిక్కన సంభాషణ శిల్పం. (సంపా.)

ఉ. **అందు వృకోదరార్జునుల నాహవ రంగమునందు మీఱువా**
రెందఱొ యెన్నుమా యిచట; నీ గురుభీష్ములఁ గ్రేణిసేయువా
రెందఱొ; వారు వీరు నని నీల్గుటకంటె భవద్బలంబులై
యందఱుఁగూడు టొప్పదె జనాధిప! శాంతి యొనర్పు మెమ్మెయిన్. **264**

ప్రతిపదార్థం: అందున్= అక్కడఉన్న; వృకోదర+అర్జునులన్= భీమార్జునులను; ఆహవరంగమునందున్= యుద్ధరంగంలో; మీఱువారు= మించగలవారు; ఎందఱొ+ఎన్నుమా= ఇక్కడ ఎందరున్నారో నీవే లెక్కించు; ఇచటన్= ఇక్కడఉన్న; ఈ

గురుభీష్ములన్= ఈ ద్రోణుడిని; భీష్ముడిని; క్రేణి+చేయువారు= పరిహసించగలవారు; ఎందఱొ?= అక్కడెందరున్నారు?; వారున్, వీరున్= అక్కడివారూ, ఇక్కడివారూ; అనిన్= యుద్ధంలో; ఈల్గుట కంటెన్= చావటంకంటె; భవత్+బలంబులు+ఐ= నీ బలగాలై; అందఱున్= వీరందరూ; కూడుట+ఒప్పదె?= కలసిమెలసి వర్తించటం తగదా?; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; శాంతి+ఒనర్పుము= సంధిచేయుము.

తాత్పర్యం: అక్కడున్న భీమార్జునులను యుద్ధరంగంలో మించేవారు ఇక్క డెంద రున్నారో చెపుము? ఇక్కడున్న ద్రోణభీష్ముల పరాక్రమాన్ని లక్ష్యపెట్టక పరిహసించ గలవారు అక్కడ కూడా లేరు. ఇట్లా ఉభయ పక్షాలలోని వీరులు యుద్ధంలో చావటం కన్న నీ బలగాలై కలసి మెలసి వర్తించటం మంచిది. మహారాజా! ఏవిధంగానైనా వీరిని శాంతింపజేయుము.

విశేషం: 1. భరతవంశ సంప్రదాయం నిలపగలిగిన కీలకస్థానంలో ధృతరాష్ట్రుడున్నాడని చెప్పి కౌరవ పాండవులు కలసి ఉంటే కలిగే లాభాలను వివరిస్తున్నాడు శ్రీకృష్ణుడు. వాటిలో మొదట సంఘటిత బలశక్తిని ప్రస్తావిస్తున్నా డీ పద్యంలో. పాండవ పక్షంలో భీమార్జునులూ, కౌరవ పక్షంలో గురు భీష్ములూ కలిసి ఉంటే ధృతరాష్ట్రుడి రాజ్యం శత్రుదుర్భేద్యంగా ఉంటుందని చెప్పాడు. రాజ్యానికీ, రాజుకూ మొదట కావలసింది రక్ష. ఆ అంశాన్ని ఇందులో ఒత్తి చెప్పాడు.

2. మూలంలో ఇరుపక్షాలలో ఉన్న పెక్కు వీరుల పేర్లు చెప్పబడ్డాయి. కాని, పై నలుగురూ సంగ్రామంలో ఓడడం దుర్లభం. మిగిలినవారి కా ప్రతిపత్తి లేదు. అందువలన తిక్కన ఈ మార్పు చేశాడు. దుర్యోధనుడు ఇటువంటి మహావీరులలో ఒకడని శ్రీకృష్ణుడు చెప్పకుండా ఉండటం గమనింపదగిన అంశం. ఆ సత్యాన్ని గుర్తించుమని ధృతరాష్ట్రుడికి వ్యంగ్యంగా హితవు పలికాడు శ్రీకృష్ణుడు.

3. ఏ విధంగానైనా శాంతిని స్థాపించుము- అన్నది పద్యంలోని వాద తాత్పర్యం. తిక్కన ఒక్కొక్క పద్యాన్ని ఒక వాదాంశానికి ప్రతినిధిగా నిలపటం వాదన కళ. కార్యకారణ సంబద్ధమైన తాత్పర్య ప్రతిపాదనం అందులోని వాక్యకళ. వస్తువు కనుగుణమైన పద్య రచనా శైలిని సంఘటించటం కావ్యకళ. బంధ శైథిల్యం, అర్థవైమల్యం గల ప్రసాదగుణం ఈ రచనలోని జీవకళ. (సంపా.)

తే. **జగతిఁగల జనపతులు నీ చరణపీఠ । మర్థిఁ గొలువ సముద్ర వేలావృతోర్వి**
యెల్ల నేలుట యొప్పదే? । తల్లి ప్రజల । యెడ విరోధంబు వాటించు టెంత మేలు? **265**

ప్రతిపదార్థం: జగతిన్+కల= లోకంలో ఉన్న; జనపతులు= రాజులు; నీ చరణ పీఠము= నీ పాద పీఠం; అర్థిన్= ప్రీతితో; కొలువన్= సేవిస్తుండగా; సముద్ర వేలా+ఆవృత= సాగరం యొక్క చెలియలికట్టచేత చుట్టబడిన; ఉర్వి+ఎల్లన్= పుడమి నంతయు; ఏలుట= నీవు పాలించటం; ఒప్పదే?= తగదా?; తల్లి= జనని; ప్రజల+ఎడన్= తన బిడ్డల విషయంలో; విరోధంబు పాటించుట= వైరం వహించటం; ఎంత మేలు?= ఏపాటి శ్రేయం?

తాత్పర్యం: లోకంలోని రాజులందరూ నీ పాదపీఠాన్ని ప్రీతితో సేవిస్తుండగా సముద్రపు చెలియలికట్టచేత చుట్టబడిన పుడమినంతటినీ నీవే ఏకచ్ఛత్రంగా పరిపాలించటం తగును. తల్లి తన బిడ్డలపట్ల శత్రుత్వం వహించటం ఎంత సమంజసమో నీవే యోచించుము.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం, నిదర్శన. 1.ఇందులో సర్వసామ్రాజ్యాధిపత్యం ధృతారాష్ట్రుడిదే అని హెచ్చరించటం ముఖ్యాంశం. కాని, ధృతరాష్ట్రుడు ఆ అధికారం తన కుమారుడిదిగా ప్రజలు భావించేటట్లు వ్యవహరిస్తాడు. దానిని మానుకొమ్మని శ్రీకృష్ణుడి హితవు. పాండవులను కూడ ఉత్తరాధికారులుగా గుర్తించుమని హెచ్చరిక.

2. ఆ అంశాన్ని (విశేషాన్ని) లోకన్యాయంతో (సామాన్యంతో) సమర్థించాడు ఈ పద్యంలో. తల్లికి బిడ్డలుంటారు. వారినందరినీ సమభావంతో ప్రేమతో చూడటమే వాత్సల్యం. అట్లాకాక పక్షపాత వైఖరి ప్రకటించటం అన్యాయం- అని చెప్పి పాండవుల పట్ల విరోధం ప్రదర్శించటం అన్యాయమని శ్రీకృష్ణుడు హెచ్చరించాడు. 'ప్రజలు' అనే శబ్దం సార్థకం. పిల్లలనీ, ప్రజలనీ రెండర్థాలు. ధృతరాష్ట్రుడు రాజకుమారులకూ ప్రజలకూ తల్లివంటివాడనీ ధ్వని. ఏలుట - అనే క్రియ సాభిప్రాయం. కొడుకులను అదుపులో ఉంచటం, ప్రజలను పాలించటం అనే అర్థాలేర్పడతాయి. 'విరోధంబు పాటించు టెంత మేలు?' అని ప్రశ్నార్థక వాక్యాన్ని చివర ఉంచటం సాభిప్రాయం. ఒక హితాన్ని చెప్పి దాని బాగోగులను గురించి ఎదుటివారి చేతనే ఆలోచింపచేయటానికి తోడ్పడే శక్తిమంతమైన పద్ధతి ప్రశ్నార్థక వాక్య ప్రయోగం. సంభాషణ శిల్పి తిక్కన తెలిసివాడిన సంభాషణ శిల్పమిది.

3. రచనలో అర్థవ్యక్తి అనేగుణం సార్థకంగా పోషించబడింది. (సంపా.)

క. నరనాథ! నీవుపేక్షా । పరుఁడ వయినఁ గౌరవులక పాండవులక కా
దరయఁగ భూ ప్రజకెల్లను । దురితం బొనరించి నట్ల తుదిఁ గీడు సుమీ! 266

ప్రతిపదార్థం: నరనాథ!= రాజా!; నీవు; ఉపేక్షాపరుఁడవు+అయినన్= ఈ విషయంలో అశ్రద్ధ వహిస్తే; కౌరవులకున్+అ పాండవులకున్+అ+కాదు= కురుపాండవులకే కాదు; అరయఁగన్= ఆలోచిస్తే; భూప్రజకున్+ఎల్లను= పుడమి యందలి జనుల కందరికినీ; దురితంబు+ఒనరించిన+అట్లు+అ= పాపం చేసినట్లే ఔతుంది; తుదిన్= చివరకు; కీడు+చుమీ!= నీకే అపకారం సుమా!

తాత్పర్యం: రాజా! నీవు కురుపాండవుల విషయంలో శ్రద్ధ వహించకుంటే ఈ ఉభయ వర్గాలకే కాదు, పుడమిలోని జనులందరికీ పాపం చేసినట్లే ఔతుంది. చివరకు నీకే హాని కలుగుతుంది.

విశేషం: ధృతరాష్ట్రుడు తల్లివలె తన ధర్మాన్ని నిర్వహించకుండా ఉపేక్ష వహిస్తే కలిగే నష్టాన్ని ఈ పద్యంలో పేర్కొన్నాడు శ్రీకృష్ణుడు. ఉపేక్ష వలన మొదట కౌరవులకే హాని జరుగుతుంది. పాండవులకు అన్యాయం జరుగుతుంది. ప్రజలకు అపద కలుగుతుంది. 'దురిత' శబ్దం నానార్థ వ్యంజకం. చివరికి ధృతరాష్ట్రుడికే కీడు మూడుతుంది. ఉపేక్ష వలన కులనాశనం, ప్రజాక్షయం, చివరకు ఆత్మహాని చేసికొన్న వాడవుతాడని ధృతరాష్ట్రుడిని శ్రీకృష్ణుడు హెచ్చరించి, పరమ హితాన్ని బోధించాడు. లోకంలో ఆత్మనాశన కారకమైన చర్యను చేపట్టటానికి ఎవరైనా జంకుతారు. ధృతరాష్ట్రుడు ఆ విషయంలో కూడా గ్రుడ్డిరాజే. (సంపా.)

క. కౌరవ పాండవులం దె । వ్వారలకుం జావు నొవ్వు వచ్చిన మే లు
ర్వీరమణ! చిత్తమున నె । ట్లారయుమా నీకు దుఃఖమగు నెట్లయినన్. 267

ప్రతిపదార్థం: ఉర్వీరమణ!= భూనాథా!; కౌరవ పాండవులందున్= కౌరవులలో పాండవులలో; ఏ+వారలకున్= ఎవరికైనా; చావు= మరణం; నొవ్వు= బాధ; వచ్చినన్= కలిగినా; చిత్తమునన్= మనస్సులో; ఎట్లు మేలు= ఏ విధంగా మేలవుతుందో; ఆరయుమా= పరిశీలించుము; ఎట్లు+అయినన్= వారికి ఏలాగైనా; నీకున్= నీకు; దుఃఖము+అగున్= విషాదం కలుగుతుంది.

తాత్పర్యం: రాజా! కురు పాండవులలో ఎవరికి మరణం సంప్రాప్తించినా, బాధలు కలిగినా నీకు ఎట్లా మేలవుతుందో మనస్సులో ఆలోచించుము. వారికి చావు నోవులు వస్తే నీకే ఏ విధంగానైనా దుఃఖం కలుగుతుంది.

విశేషం: 1. అలం: యథాసంఖ్యం. గుణం: అర్థవ్యక్తి.

2. ఉపేక్ష వలన యుద్ధం వస్తుంది. కౌరవ పాండవులకు రణంలో చావు కలుగవచ్చును, లేదా బాధ కలుగవచ్చును. ఈ వాక్యంలో యథాసంఖ్యాలంకారం వాక్యశిల్పంలో భాగం. అంటే కౌరవులకు చావు, పాండవులకు బాధ కలుగుతాయని ధ్వని.

3. ఇది ఫలితాంశమని గట్టిగా చెప్పాడు శ్రీకృష్ణుడు. అదే నిజమైతే ధృతరాష్ట్రుడి స్థితి ఏ విధంగా ఉంటుంది? ఆలోచించుకొనుమంటున్నాడు శ్రీకృష్ణుడు. ప్రస్తుతం ధృతరాష్ట్రుడు ఉర్వీరమణుడు (రాజు). కౌరవులు చనిపోతే అతడి రాచరికం చిక్కులలో పడుతుంది. ఉపేక్ష వలన ధృతరాష్ట్రుడి రాచరికం మరుక్షణమే అపాయస్థితిలో పడుతుంది. నైతికంగా అతడు భూరమణుడుగా ఉండలేడు. పదవీభ్రష్టుడు కావటం ఒక విధమైన దుఃఖం. ఒకవేళ పాండవులు ధృతరాష్ట్రుడి పెద్దరికాన్ని గౌరవించినా వారు ఎత్తిపొడుపు మాటలలో వేధించక మానరు. అప్పుడూ అతడికి దుఃఖమే మిగులుతుంది. యుద్ధంలో పాండవపక్షంలో కూడా కొందరు చనిపోవచ్చును. వారు అందుకు మనసు నొచ్చుకొనవచ్చును. ఆ విపత్తుకు కారణం ధృతరాష్ట్రుడి ఉపేక్షయే అని భావించి గ్రుడ్డిరాజును వేధించవచ్చును. అదీ అతడికి దుఃఖహేతువే. అందువలననే శ్రీకృష్ణుడు 'ధృతరాష్ట్రా! నీ మనసులో ఎన్నిరకాలుగా ఆలోచించినా ఉపేక్ష వలన చివరకు నీకు మిగిలేది దుఃఖమే సుమా!' అని విషయాన్ని విశ్లేషించి చెప్పాడు. (సంపా.)

ఉ. **వీరును వారుఁ బండితులు, విక్రమవంతులు, బాహుగర్వదు**
ర్వారులు; పూని రిత్త బవరంబున నాఱడిఁ జావఁబోవ నె
ట్లూరక యుండవచ్చుఁ? గడు నొప్పెడు మేనులు వాఁడి కైదువుల్
గూరఁగ నాటినం బుడమిఁ గూలుట కక్కట! యోర్వవచ్చునే? **268**

ప్రతిపదార్థం: వీరును= ఈ కౌరవులున్నూ; వారున్= ఆ పాండవులున్నూ; పండితులు= చదువు సాములు నేర్చినవారు; విక్రమవంతులు= పరాక్రమం కలవారు; బాహుగర్వ దుర్వారులు= భుజబలంచేత అడ్డగించరానివారు; పూని= ఉద్యమించి; రిత్తబవరంబునన్= తమలో తమకు ఏర్పడిన వ్యర్థమైన కలహంవల్ల; ఆఱడిన్= వ్యర్థంగా; చావన్+పోవన్= మరణించటానికి సిద్ధపడగా; ఎట్లు+ఊరక+ఉండన్+వచ్చున్?= నివారించక మౌనంగా ఎట్లుండదగును?; వాఁడి కైదువుల్= పదునైన ఆయుధాలు-బాణాలు; కూరఁగన్ నాటినన్= దూసుకొనిపోయేటట్లు గ్రుచ్చుకొనగా; కడున్= మిక్కిలి; ఒప్పెడు మేనులు= సుకుమారమైన శరీరాలు; పుడమిన్+కూలుటకున్= నేలపై త్రెళ్ళుటకు; అక్కట!= అయ్యో!; ఓర్వన్+వచ్చునే?= సహింపశక్యమగునా? (శక్యం కాదని భావం.)

తాత్పర్యం: కౌరవులూ పాండవులూ మంచి చదువరులు, పరాక్రమవంతులు. భుజదర్పం గలవారు గనుక ఎవ్వరూ వీరి నడ్డగించలేరు. ఇట్లాంటివారు తమలో తమ కేర్పడిన కొరమాలిన యుద్ధంలో ఊరక మరణించటానికి సిద్ధపడుతుండగా అడ్డపడక చూస్తూ ఊరకుండటం యుక్తం కాదు. ఇంత కోమలమైన శరీరాలు వాడి బాణాలు ఆవలికి దూసుకొని వెళ్ళేటట్లు గ్రుచ్చుకోగా నేలమీద కూలటం చూచి సహించటానికి శక్యం కాదు.

విశేషం: 1. యుద్ధంలో నిరర్థకంగా వీరులు చనిపోయే పరిస్థితి వస్తే ఉపేక్షతో ఊరుకొనటం ఏమి న్యాయం? అని ప్రశ్నిస్తున్నాడు శ్రీకృష్ణుడు. తాను ఉపేక్ష విడనాడి శాంతి కొరకు యత్నించటానికి కారణ మదే అని సూచిస్తున్నాడు. తన ప్రబోధంతో ధృతరాష్ట్రుడిని కూడా తనవలె స్పందించుమని హితవు చెప్పుతున్నాడు.

2. చనిపోయేవారు వ్యర్థులు కారు. చదువుకొన్నవారు, పరాక్రమవంతులు. పైపెచ్చు తమ భుజబలాలమీద ఉన్న నమ్మకంతో యుద్ధానికి వెనుకాడనివారు, వారిని నిష్కారణంగా కొల్పోతే దేశంలో జ్ఞానేచ్ఛాక్రియా వృత్తులలో సుశిక్షితులైన వీరులు తరుగౌతారు. దేశం అన్ని విధాలా దివాలా తీస్తుంది అని హెచ్చరించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

3. దేశానికి మానవ సంపదగా పేరొందే వీరులు యుద్ధంలో ఆయుధాల బారిపడి చనిపోతే ఆ దృశ్యం చూడటానికీ, భావించటానికీ దుర్భరం. నిష్కారణ హింసను సహించవచ్చునా? అని ప్రశ్నించి ధృతరాష్ట్రుడిని ఆలోచించుమని హెచ్చరించాడు శ్రీకృష్ణుడు.

4. తిని కూర్చుండి సంపదను నిష్కారణంగా నాశనం చేసికొనే వాడు జాతికి ద్రోహి. ధృతరాష్ట్రుడు ఉపేక్ష వహిస్తే అటువంటి నిందపడతాడు. అర్థవ్యక్తి గుణ ప్రధాన రచనలో తిక్కన వస్తుస్వభావాన్ని స్ఫుటంగా వ్యక్తీకరించా డీపద్యంలో. (సంపా.)

ఆ. ఇట్లు గాక యుండ నీ రెండు దెఱఁగుల । వారి గాచికొనుము వసుమతీశ !
నీదు ప్రాభవంబు నీతియు శాంతియు । నఖిల జనులుఁ బొగడునట్లుగాఁగ.' 269

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= భూవల్లభా! ధృతరాష్ట్రా! నీదు ప్రాభవంబు= నీ యొక్క దొరతనం; నీతియున్= రాజనీతీ; శాంతియున్= కామక్రోధాది రాహిత్యమూ; అఖిల జనులు= సమస్త ప్రజలు; పొగడునట్లు కాఁగన్= ప్రశంసించునట్టి తీరులో; ఇట్లు+కాక+ఉండన్= ఇట్లా చావు నొవ్వుల పాలుగాకుండా; ఈ రెండు తెఱఁగులవారిన్= ఈ ఉభయ పక్షాల వారిని; కాచికొనుము= రక్షించుకొమ్ము.

తాత్పర్యం: రాజా! నీ విభుత్వమునూ, రాజనీతినీ, శాంతినీ సమస్త ప్రజలు మెచ్చుకొనేటట్లు కురుపాండవులు సంగ్రామంలో నశించకుండా సంరక్షించుకొనుము'.

విశేషం: యుద్ధం రాకుండా చేసి, రెండు వైపులవారినీ చావు నొవ్వుల నుండి రక్షించుకొంటే ధృతరాష్ట్రుడికి నాలుగు ప్రయోజనాలు కలుగుతాయని శ్రీకృష్ణుడు చెప్పాడు. 1. ప్రభుత్వం నిలుస్తుంది. 2. లోకనీతి, రాజనీతి, ధర్మనీతి ఫలించి ప్రభునీతి ప్రకాశిస్తుంది. 3. శాంతి ఏర్పడి రక్తపాతం లేని స్నేహభావం చిగురిస్తుంది. 4. ప్రజలందరూ ధృతరాష్ట్రుడి వర్తనాన్ని నోరారా కీర్తిస్తారు. ఉపేక్షాభావంతో పక్షపాత వైఖరి అనుసరిస్తే రాజ్యం పోతుంది. అవినీతిపరుడనే అపకీర్తి వస్తుంది. బ్రతుకంతా అశాంతితో గడపవలసి వస్తుంది. ప్రజలు చీకొట్టి నిందిస్తారు. తులనాత్మకంగా ఆలోచించి హితమైన పద్ధతి నాశ్రయించుమని పేర్కొన్నాడు. 5. వంశగౌరవం కొరకు కౌరవ పాండవుల నడుమ సంధి కుదిరించటంలో ఉపేక్ష వహిస్తే కలిగే విషపరిణామాల గురించి ఇంతవరకు శ్రీకృష్ణుడు వివరించాడు. ఈ అంశం తరువాత మరొక అంశాన్ని ఎత్తుకొంటున్న దానికి సూచనగా 'అని చెప్పి వెండియు' అని తరువాతి వచనం వాడటం తిక్కన ఉపన్యాస శిల్పంలో భాగం. (సంపా.)

వ. అని చెప్పి వెండియు. 270

తాత్పర్యం: అనిచెప్పి శ్రీకృష్ణుడు మళ్ళీ (ఇట్లా అన్నాడు:)

శ్రీకృష్ణుఁడు పాండవులు సెప్పిన మాటలు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట (సం. 5-93-36)

తే. పాండవులు తండ్రి సచ్చిన ప్రజలు వారి । నరసి ప్రోచితి శైశవ మాదిగాఁగ
నడుమ నిష్కారణమ దిగవిడువఁ దగునె? । పారమొందంగ రక్షింపు గారవమున. 271

ప్రతిపదార్థం: పాండవులు= ధర్మజాదులు; తండ్రి చచ్చిన ప్రజలు= తండ్రిలేని బిడ్డలు; వారిన్= వారలను; శైశవము+ ఆదిగాఁగన్= చిన్నప్పటినుంచి; అరసి ప్రోచితి(వి)= చక్కగ విచారించి కాపాడావు; నడుమన్= మధ్యలో; నిష్కారణము+అ=

హేతువులేకుండా; దిగన్+విడువన్+తగునె?= వదలి వేయవచ్చునా?; పారము+ఒందంగన్= ఆవలిగట్టు చేరువరకూ; గారవమునన్= ఆదరంతో; రక్షింపు(ము)= కాపాడుము.

తాత్పర్యం: 'పాండవులు తండ్రిలేని పిల్లలు. వారిని పసితనంనుంచి చల్లగా కాపాడావు. ఇప్పుడు వారిని కారణం లేకుండా మధ్యలోనే విడిచిపెట్టటం న్యాయం కాదు. కడపటివరకు నీవు ప్రేమతో వారిని కాపాడవలసిందే.

విశేషం: 1. 'పాండవులు తండ్రి లేనివారు' అనే మాట ఉద్యోగపర్వంలో బాగా వినబడుతుంది. ధర్మరాజే పాండురాజు పోతూ శ్రీకృష్ణుడిని చూపి వెళ్ళాడని పేర్కొన్నాడు. (ఉద్యో. 3.6) కొడుకులను ఆపదనుండి రక్షించటం, వారికి శుభాలు కలిగించటం తండ్రి బాధ్యత. వంశపారంపర్యంగా వచ్చిన బాధ్యత ధృతరాష్ట్రుడి మీద ఉన్నది. కన్నతండ్రి పోతే వంశంలో పెంపుడు తండ్రిగా వ్యవహరించే పెద్దవాడు ఆ బాధ్యతలు నిర్వహించాలి. ఇది ఉమ్మడి కుటుంబ ధర్మం. దానిని ధృతరాష్ట్రుడికి జ్ఞాపకం చేశాడు శ్రీకృష్ణుడు. కొందరు భావించినట్లు ఈ వాక్యం పాండవుల పట్ల సానుభూతి కలిగించటానికి అన్నది కాదు.

2. ఆ బాధ్యతను ధృతరాష్ట్రుడు ఇదివరలో నిర్వహించాడు. పాండవులను పెంచి పెద్దవారిగా చేశాడు. అయితే ఆరంభించి మధ్యలో కార్యాన్ని దిగవిడవటం ఉత్తముల స్వభావం కాదు. అందువలన ఆ బాధ్యతను అతడి జీవితం ఉండేంత వరకూ కొనసాగించటం న్యాయమని శ్రీకృష్ణుడు ప్రబోధించాడు. (సంపా.)

వ. పాండుకుమారులు నీకుం బరమభక్తిం బ్రణమిల్లి యందఱు నొక్కమాటగా నీతోఁ జెప్పుమని నాకుం జెప్పిన విధంబు వినుము: తన పంపునం బన్డ్రెండు వత్సరంబులు వనంబున వసియించితిమి. పదుమూఁడగునేడు జనపదంబున నజ్ఞాతవాసంబునుం జలిపితిమి; మా తండ్రి సమయంబు పరిపాలించి యే మర్ధరాజ్యం బెట్టునుం బడయుదు మని కృతనిశ్చయులమై పడితిమి; తల్లియుఁ దండ్రియు నెల్ల చుట్టంబులు నేడుగడయును మాకుఁ దాన; మావలన నేరమి గల్గినం గినిసి యిట్లుగా దట్లని చక్కం బెట్టునది; తనగల పది వేలేండ్లకుం దన్నకాని మఱియెఱుంగ మెట్టివారమైనను మమ్మును దుర్యోధనాదులనుం దలంపరు తనయందుఁదెఱంగు గలిగిన నెవ్వరు గొఱగాకున్నను గులంబుపాడి సెడక చెల్లునని' రని పలికి మఱియు నిట్లనియె: 272

ప్రతిపదార్థం: పాండు కుమారులు; నీకున్; పరమభక్తిన్= మిక్కిలి భక్తితో; ప్రణమిల్లి= నమస్కరించి; అందఱున్; ఒక్కమాటగా= ఏకవాక్యంగా; నీతోన్; చెప్పుము+అని; నాకున్; చెప్పిన విధంబు; వినుము; తన పంపునన్= తన ఆజ్ఞచేత; పన్డ్రెండు వత్సరంబులు= పన్నెండేళ్ళు; వనంబునన్; వసియించితిమి; పదుమూఁడగు+ఏఁడు; జనపదంబునన్= జనులుండే తావున; అజ్ఞాతవాసంబునున్+చలిపితిమి= ఇతరులు మమ్మొరుగకుండేటట్లుగా నివాసం చేశాము; మా తండ్రి సమయంబు పరిపాలించి= మా తండ్రి ఏర్పరచిన ఒడంబడికను నెరవేర్చి; ఏము= మేము; అర్ధరాజ్యంబు; ఎట్టును= ఏ విధంగానైనా; పడయుదుము= పొందగలం; అని, కృతనిశ్చయులము+ఐ= తీర్మానించుకొన్నవారమై; పడితిమి= కష్టాలు అనుభవించాం; తల్లియున్; తండ్రియున్; ఎల్లచుట్టంబులున్, ఏడుగడయును= సర్వవిధాల రక్షించేవాడు; మాకున్, తాన్+అ= అతఁడే; మా వలనన్; నేరమి+కల్గినన్= దోషముంటే; కినిసి= కోపించి; ఇట్లుకాదు; అట్లు+అని; చక్కన్+పెట్టునది= సరిదిద్దవలెను; తన కల పదివేల+ఏండ్లకున్= తాను జీవించిన పదివేల సంవత్సరాలకైనా; తన్నున్+అకాని= తన్నేతప్ప; మఱి+ఎఱుంగము= ఇతరుల నాశ్రయించం; ఎట్టివారము+ఐనను= మే మెటువంటివాళ్ళమైనా; మమ్మును; దుర్యోధన+ఆదులను; తలంపరు= లోకులు భావింపరు; తనయందున్+తెఱంగు+కల్గినన్= తనకు కార్యం సరిదిద్దవలెనన్న తలంపుఉంటే; ఎవ్వరు కొఱ+కాకున్నను= ఎవరు పనికిమాలిన వారైనా; కులంబుపాడి= వంశధర్మం; చెడక; చెల్లును= సాగును; అనిరి; అని పలికి; మఱియున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! పాండునందనులు నీకు పరమభక్తితో నమస్కరించి ఒకే గొంతుతో చెప్పుమని నాతో చెప్పి పంపిన మాటలు చెపుతాను, వినుము. 'తండ్రీ! నీ ఇష్టప్రకారం పన్నెండు సంవత్సరాలు అరణ్యాలలో నివసించాము. పదమూడవ సంవత్సరం విరటుడి పట్టణంలో అజ్ఞాతవాసం కావించాము. ఈ విధంగా ఒడంబడికను నెరవేర్చి మేము రాజ్యంలో సగపాలు పొందగలమని దృఢనిశ్చయంతో ఉన్నాము. మాకు తల్లి, తండ్రి, చుట్టములు- వెయ్యేల సర్వవిధ రక్షకులు మీరే. మా వలన ఏమైనా అపరాధముంటే కోపించి ఇట్లా కాదు అట్లా నడచుకొనండని చెప్పి చక్కబెట్టండి. నీవు పదివేలేండ్లు జీవించినప్పటికినీ నిన్ను దప్ప మరెవ్వరినీ ఎరుగము. ఎట్టివాళ్ళమైననూ, మమ్మూ, దుర్యోధనాదులనూ లోకులు అనుకోరు. నీకు సదభిప్రాయముంటే మాలో ఎవరు కొరగాకపోయినా వంశ ధర్మం చెడక నిలుస్తుంది అని నీతో చెప్పుమన్నారు' అంటూ శ్రీకృష్ణుడు ఆయనతో ఇంకా ఇట్లా అన్నాడు:

విశేషం: 1. తండ్రిలేని పాండవులు ధృతరాష్ట్రుడే తమ తండ్రిగా భావించి, భక్తి ప్రపత్తులతో పలికిన మాటల పద్ధతిని గమనించుమని శ్రీకృష్ణుడు వివరించటం ఇందులో ప్రధానాంశం. 'మాటల పద్ధతి' రచనలోని విశేషాంశం.

2. అరణ్యాజ్ఞాత వాసాలు నిర్వహించండని ఆజ్ఞ ఇచ్చింది ధృతరాష్ట్రుడే నట. ఇది ఎట్లా? దుర్యోధనుడి ప్రవర్తనను అడ్డుకొనకుండా ఉపేక్షతో అతడి చర్యలకు రాజముద్ర గౌరవాన్ని కలిగించినవాడు ధృతరాష్ట్రుడు. ప్రవర్తన దుర్యోధనుడిదైనా బాధ్యత ధృతరాష్ట్రుడిదే. అందువలన అతడికి నివేదించుకొనటం.

3. ధృతరాష్ట్రుడు పాండవులకు అర్ధరాజ్యం ఆధికారికంగా ఇచ్చి ఉన్నాడు. అనుద్యూతంలో రాజ్యాన్ని వారు కోల్పోలేదు. ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరంగా ఇచ్చిన రాజ్యభాగం న్యాయంగా పాండవులదే ఔతుందికదా! ఈ విధంగా రెండుసార్లు ధృతరాష్ట్రుడే అర్ధరాజ్యాన్ని పాండవులకు దత్తం చేసి ఉండగా, అరణ్యాజ్ఞాత వాసాల తరువాత వారి కా భాగం సహజంగా చెందుతుంది అని నిర్ధారించి చెప్పి, ఆ భాగాన్ని ఒప్పచెప్పవలసింది ధృతరాష్ట్రుడు. కాని, విచిత్రమేమంటే అతడు తన బాధ్యతను దుర్యోధనుడికి బదిలీ చేశాడు. అట్లని తన ప్రభుత్వాన్ని వదలు కొన్నాడా? లేదు. ప్రభువు తానై ఉండి ప్రభుత్వం కొడుకు దనే ద్వంద్వ వైఖరిని పాండవులు గుర్తించటం లేదు. సమస్య అంతా అక్కడే ఉన్నది. శ్రీకృష్ణుడు కూడా ధృతరాష్ట్రుడి ద్వంద్వ వైఖరిని వ్యంగ్యంగా నిరసిస్తున్నాడు.

4. పాండవులు అన్నివిధాలుగా రక్షకుడు ధృతరాష్ట్రుడని నమ్మి ఉన్నారు కాబట్టి అర్ధరాజ్యం ఎట్లాగూ వస్తుందనే విశ్వాసంతో ఉన్నారు.

5. ఒకవేళ పాండవులవలన ఏవైనా లోపాలుకాని, పొరపాట్లుకానీ ఉంటే వాటిని సరిజేసి కార్యం చక్కబెట్టవలసిన కర్తవ్యం కూడా ధృతరాష్ట్రుడిదే అని ధ్రువపరుస్తున్నారు.

6. పాండవులు ధృతరాష్ట్రుడికి జీవితాంతం కృతజ్ఞులమై ఉంటామంటున్నారు. తమను దుర్యోధనాదులతో సమంగా చూడమంటున్నారు.

7. వంశధర్మం పాటించే న్యాయాన్ని ధృతరాష్ట్రుడు మన్నిస్తే ఎవరు పనికి వచ్చినా, పనికి రాకపోయినా పుత్రులందరూ బాగుపడతారు. కులం వర్ధిల్లుతుంది.

8. తండ్రి చచ్చిన పాండవులు ధృతరాష్ట్రుడిని తండ్రిగా భావించి పలకటంలో విశేషం గమనార్హం. పాండురాజే బ్రతికి ఉంటే కురుపాండవ భేదం ఉండేది కాదు. కలసి ఉండే కుటుంబం కొరకు ఆయన తన సర్వస్వాన్ని ధారపోశాడు. ఆయన గతించటం వలన ధృతరాష్ట్రుడిని తండ్రిగా గౌరవించవలసి వచ్చింది. అయితే పాండవులు త్రికరణశుద్ధిగా పితృభక్తిని పచరిస్తున్నారు. ఇక దాని కనుగుణంగా వ్యవహరించవలసిన న్యాయం ధృతరాష్ట్రుడి మీదే ఉన్నదని శ్రీకృష్ణుడు నిర్దేశిస్తున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

9. సంజయుడు 'ధర్మసూతి మెత్తని పులి', 'ఎల్లవారలు నధర్మము నీపయి బెట్టునంతకు న్వినడును, గానడుం; బిదప నీకును నాకు మరల్ప వచ్చునే?' (2.14) అన్న మాటలు ఇక్కడ స్మరణీయాలు.

10. ధర్మజుడి ధర్మనీతి పద్మవ్యూహం వంటిది. మాటలు తేటలుగా ఉన్నా, అందులో నీతి సుడిగుండాలుగా మెలికలు తిరుగుతూ ఉంటుంది. సామోపాయంతో సానబెట్టిన చతురవచనా లివి. (సంపా.)

ఉ. **'సారపు ధర్మమున్ విమల సత్యముఁ బాపముచేత బొంకుచేఁ**
బారముఁ బొందలేక చెడఁ బాఱినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుఁగాని ధర్మని
స్తారక మయ్యు సత్యశుభ దాయక మయ్యును దైవ ముండెడున్.' **273**

ప్రతిపదార్థం: సారపుధర్మమున్= శ్రేష్ఠమైన ధర్మమును; విమల సత్యమున్= నిర్మలమైన సత్యమును; పాపముచేతన్= దురితం చేతనూ; బొంకుచేన్= అబద్ధం చేతనూ; పారమున్+పొందన్+లేక= గట్టు చేరలేక; చెడన్ పాఱినది+ఐన+అవస్థన్= చెడటానికి సిద్ధంగా ఉన్న దుర్దశలో; దక్షులు= చక్కదిద్దటానికి సమర్థులు; ఏ+వారలు= ఎవరు; ఉపేక్ష+చేసిరి= అశ్రద్ధ వహిస్తారో; అది= అట్లా ఉపేక్షించటం; వారలచేటు+అగున్= వారికే హాని కలిగిస్తుంది; కాని= కాని; ధర్మనిస్తారకము+అయ్యున్= ధర్మమునుద్ధరించేదిగానూ; సత్యశుభదాయకము+అయ్యును= సత్యానికి మేలు కల్గించేదిగాను; దైవము+ఉండెడున్= దైవం ఆధారంగా ఉంటుంది.

తాత్పర్యం: 'ఉత్తమమైన ధర్మం, నిర్మలమైన సత్యం పాపంచేతను, అబద్ధం చేతనూ దరి చేరలేక చెడటానికి సంసిద్ధంగా ఉన్న స్థితిలో వాటిని రక్షించే శక్తి ఉన్నా ఎవరు అడ్డుపడక అశ్రద్ధ వహిస్తారో అది వారలకే హానికరమవుతుంది. ఆ స్థితిలో భగవంతుడు ధర్మమును ఉద్ధరించటానికీ, సత్యమునకు శుభం కలిగించటానికీ ముందుకు వస్తాడు.

విశేషం: అలం: యథాసంఖ్యం.

1. పాండవులు సభాసదుల నుద్దేశించి చెప్పుమన్న సందేశ మిది. ఉద్యోగపర్వ తాత్పర్యానికీ, మహాభారత కథాతత్త్వానికీ ఈ పద్యం ఆత్మవంటిది. తెలుగువారు క్లిష్టపరిస్థితులలో భగవంతుడు ధర్మాన్నీ ధర్మాత్ములనూ రక్షిస్తాడనీ, అధర్మాన్నీ, అధర్మాత్ములనూ శిక్షిస్తాడనీ తమ విశ్వాసాన్ని ఈ పద్యం చదివి వ్యక్తం చేస్తూ ఉంటారు. అందువలన తెలుగు సాహిత్యంలో ఈ పద్యం ఒక ధర్మదీపం.

2. మూల తాత్పర్యాన్ని తిక్కన చికిలిపెట్టి తెలుగులో నిర్మించాడు. మూలం-

"యత్ర ధర్మో హ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ
హన్యతే ప్రేక్షమాణానాం హతాస్తత్ర సభాసదః ॥
విద్ధో ధర్మో హ్యధర్మేణ సభాం యత్ర ప్రపద్యతే
న చాస్య శల్యం కృన్తన్తి విద్ధా స్తత్ర సభాసదః
ధర్మ ఏతా నారుజతి యథా నద్యనుకూలజాన్ ॥
యే ధర్మ మనుపశ్యన్త స్తూష్ణీం ధ్యాయన్త ఆసతే
తే సత్య మాహుర్ధర్మం చ న్యాయ్యం చ భరతర్షభ!" (సం. 5.93.48-50)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మం అధర్మం చేతా, సత్యం అసత్యం చేతా నశిస్తున్నప్పుడు చూస్తూ ఊరకుంటే సభాసదులకే చేటు మూడుతుంది. ధర్మం అధర్మం చేతిలో దెబ్బతిని సభలోకి ప్రవేశిస్తే దాని బాధను (ముల్లును) తొలగించకపోతే ఆ సభాసదులే దెబ్బతింటారు. అటువంటి వారిని నది తన ఒడ్డున పుట్టిన చెట్లను ప్రవాహంతో పెకలించి వేసినట్లుగా, ధర్మం వారిని ఉన్మూలించివేస్తుంది. కాబట్టి, ధర్మాన్ని సదా పరిశీలిస్తూ, పరిరక్షిస్తూ దానినే ధ్యానిస్తూ కాలం గడిపేవారు సత్యాన్నీ, ధర్మాన్నీ, న్యాయాన్నీ మాత్రమే పలుకుతారు - అని పై శ్లోకాల తాత్పర్యం. వ్యాసుడు మహర్షి, తిక్కన మహాకవి. ఋషివాక్కు ఇతిహాసంలో అర్థప్రధానం, కవి వాక్కు కావ్యేతిహాసంలో శబ్దార్థోభయప్రధానం. మూలానికీ తెలుగుకూ ఈ తారతమ్యం గమ్యం.

3. సారవంతమైన ధర్మం, నిర్మలమైన సత్యం - అంటున్న తిక్కన మాటలలో ఆ విశేషణాలు ఆ విశేష్యాలకు నిత్యధర్మాలుగా పేర్కొనటం గమనార్హం. ధర్మం ఎప్పుడూ సారవంతమైనదే. శక్తిమంతమైనదే, సత్యం ఎల్లప్పుడూ కల్మషం లేనిదే, నిర్మలమైనదే, స్వచ్ఛమైనదే. అవి రెండు స్వయం సమర్థములైనవే. అయితే వాటిని వ్యతిరేకించేవీ, కలతపెట్టేవీ, నశింపజేయ యత్నించేవి పాపం, బొంకు కాని, అవి (వరుసగా) సారవంతం, నిర్మలం కాకపోవటం చేత ధర్మసత్యాలను నశింపచేయలేవు. అయితే, సత్యధర్మాలు ఫలవంతమయ్యే తరుణంలో అవి ఫలించకుండా అడ్డుపడి చెరిచే యత్నాలు చేస్తాయి. అప్పుడు ధర్మసత్యాలు చెడబారే పరిస్థితులు ఏర్పడతాయి. కాని, అవి చెడిపోవు. 'ధర్మో రక్షతి రక్షితః' అనే న్యాయాన్ని అనుసరించి ధర్మాత్ములు, సత్యశీలురు వాటిని తమ శక్తియుక్తులతో రక్షించే యత్నం చేస్తారు. పాపం చేసేవారూ, అబద్ధా లాడేవారూ మానవులే; ధర్మాన్ని రక్షించేవారూ సత్యాన్ని కాపాడేవారూ మానవులే. అయితే ధర్మాన్ని రక్షించేవారు దానికొరకు తమ శక్తిని ధారపోయాలి. సత్యాన్ని రక్షించేవారు సత్యాచరణంలోని అసంబద్ధతను తొలగించి త్రికరణశుద్ధిని ప్రదర్శించాలి. అప్పుడు ధర్మసత్యాలు తమ సార నిర్మలత్వాలను రక్షించుకొనగలుగుతాయి. ఎందుకంటే - ధర్మం సత్యం ఎంతటి గుణాలో అంతటి ఆచరణాలు. ఆచరణలోపం వలననే ధర్మం బలాన్ని కోల్పోయినట్లు, సత్యం మలినమైనట్లు కనపడతాయి. దీనిని తెలిసిన విజ్ఞులు తమ బాధ్యతను తెలిసికొని వాటిని రక్షించి తమను తాము రక్షించుకొనాలి. ఆ విషయంలో ఉపేక్ష చేస్తే వారి చరిత్రలకు ధర్మసత్య కవచాలు తొలగిపోయి బలహీనులై పాపాలకూ, అసత్యాలకూ బలి అయిపోతారు. దక్షులై కూడా తమ ధర్మాన్ని నిజాయితీతో నిర్వహించని వారికి చేటు రాకతప్పదని ఈ సందేశం.

4. మానవులు తమ ధర్మాన్ని నిర్వర్తించకపోతే ధర్మ, సత్యాలు నశించిపోవు. ఎట్లాగంటే వేదాన్ని రక్షించవలసింది బ్రాహ్మణుడు. కాని, అతడు వేద ధర్మాన్ని ఆచరించకపోతే వేదం వెనకబడినట్లుంటుందేమో కాని నశించిపోదు. వేదాన్ని రక్షించిన వాడే బ్రాహ్మణుడనబడతాడు. వేదాన్ని పరమాత్ముడు రక్షించగలడు, ఉద్ధరించగలడు. అట్లాగే ధర్మాన్ని సత్యాన్ని కూడా, అందుకే భగవంతుడు ధర్మోద్ధారకుడు, సత్యశుభదాయకుడు అని ప్రశంసించబడతాడు. ధర్మంలోని సారం, సత్యంలోని విమలత్వం దైవం.

5. ఈ మాటలంటున్న శ్రీకృష్ణుడే పాండవుల దృక్పథంలో దైవం. ధర్మరాజు సత్యశీలుడు. అతడు వంచితుడూ, రాజ్యాన్ని కోల్పోయి బలహీనుడై ధర్మసత్య ఫలాన్ని పూర్తిగా పొందలేని దురవస్థలో ఉన్నట్లు ఇప్పుడు కనపడుతున్నాడు. పాపానికీ, అబద్ధానికీ ప్రతినిధులైన కౌరవుల వలన పాండవులు తమ ప్రయత్నంలో పారం ముట్టలేక నశించిపోతారని తెలుస్తున్నప్పుడు దక్షులైన సభాసదులు ఆ పరిస్థితిని చక్కబెట్టాలి. అది వారి విధ్యుక్తధర్మం. అక్కడ విఫలులైతే వారి ముప్పు వారే కొని తెచ్చుకొంటారని ధ్వని.

6. ఉదాత్తమైన ఈ పద్యాన్ని పెక్కురు పండితులు వ్యాఖ్యానించారు. వారి వాక్యాలలో కొన్ని - శ్రీ భూపతి లక్ష్మీనారాయణ రావుగారి వ్యాఖ్య.

"ఈ పలుకులు గంభీరభావ ప్రధానములైనవి. సత్యధర్మములను భావించుచున్న పాండవు లెట్లును దైవముచే రక్షితు లగుదు రనియుఁ, గౌరవుల వలనఁ గలిగిన యాపదనుండి సత్యధర్మముల నుద్ధరింప సమర్థులయ్యు, నుపేక్ష వహించిన భీష్మాదులు చెడుదురనియు, నీవాక్యములు తెలుపుచున్నవి. భీష్మద్రోణాదులకుఁ గూడ స్వధర్మస్మృతిఁ గలుగఁ జేయుట కృష్ణుని యుద్దేశము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'ద్రోణ భీష్మ లీ దిక్కు సుమ్ము' అని దుర్యోధనుడు పల్కినట్లు కౌరవుల యుద్ధోత్సాహమంతయు నీయిరువురపైఁ బడియున్నదని కృష్ణుఁ డెఱుఁగును. వారిని యధర్మ ప్రయత్నమునకు విముఖులఁ గావించి, యుద్ధమునఁ బాల్గొనకుండునట్లు చేసినచో కోరలూడ్చిన త్రాచులై, కౌరవులు సంధి కొప్పుకొందురని కృష్ణుని యాశయము. కనుక, ధర్మనాశము నెడ నౌదాసీన్యము కూడ నధర్మమే యగునని భీష్మాదులు కీవాక్యములు సూచించుచున్నవి.'' (భారతము: తిక్కన రచన. పు. 57-58).

7. డా. పాటిబండ మాధవశర్మగారి వ్యాఖ్య:- "ఈ సందేశమున కురుక్షేత్ర సంగ్రామ పర్యవసానము వ్యంగ్యముగా సూచింపబడినది. ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమున ధర్మసత్యములకు అధర్మ+అసత్యములతో సంఘర్షణ తటస్థించినది. అధర్మాసత్యములే బలవత్తరములై ధర్మసత్యములు గట్టెక్కజాలని యవస్థ వచ్చినది. ధర్మము గమ్యము చేరలేక చెడబారుట లోకవినాశమునకు హేతువగును. లోకకల్యాణము నభిలషించువారెల్లరును ధర్మవిజయమునకు తోడ్పడవలయును. అధర్మ విజృంభణమును నిరోధింపవలయును. అట్లు చేయుటకు దక్షత కలిగియుండియు ఉదాసీన భావముచేత గాని, పక్షపాతముచేత గాని సత్యధర్మ నాశనమును కనులారా చూచుచు ఎవ్వ రుపేక్షింతురో వారి వినాశనమునకే ఆ యుపేక్ష కారణ మగును. ఉపేక్షాభావమున వారు తమ కర్తవ్యము నిర్వర్తింపనంత మాత్రమున సత్యధర్మముల కెట్టి క్షతియు కలుగదు. ధర్మమునకు, సత్యమునకు దైవము ఎప్పుడును అండగా నుండును. ధర్మమును ఒడ్డెక్కించును. సత్యమునకు శుభము కూర్చును. అట్టి దైవమైన శ్రీకృష్ణుడు తమకు రక్షగా నున్నాడనియు, సమర్థులైన భీష్మద్రోణాదులు ఉదాసీనత వహించినను, కౌరవపక్షమున నిల్చినను వారు నశించుట తప్పదనియు పాండవుల సందేశమందలి వ్యంగ్యార్థము.'' (తిక్కన కవితా వైభవము: యువభారతి ప్రచురణ. పు. 27-28)

8. ప్రసాదగుణంలో పర్యవసించే గుణం అర్థవ్యక్తి ఇందులో పోషించబడింది. ఝటిత్యర్థ ప్రతిపత్తి హేతుత్వం శబ్దగుణమైన అర్థవ్యక్తి లక్షణం. వస్తు స్వభావ స్ఫుటత్వం అర్థగుణమైన అర్థవ్యక్తి. నన్నయ తిక్కనలకు అర్థవ్యక్తి అంటే అలవిమాలిన అభిమానం. నన్నయలో శబ్దగుణమైన అభివ్యక్తి. తిక్కన రచనలో అర్థగుణమైన అర్థవ్యక్తి బలంగా ఉన్న అనర్ఘరత్నాలవంటి పద్యాలు వెలువడ్డాయి. తిక్కన రచనలో ఈ పద్యం ఉజ్జ్వ లోదాహరణం. ధర్మరక్షాదక్షమైన దైవం యొక్క స్వభావాన్ని వ్యాఖ్యానించే వాక్యసముదాయం ఇందులో ప్రసన్నంగా ప్రకాశిస్తున్నది కాబట్టి అర్థవ్యక్తి అర్థవంతంగా అవతరించింది. (సంపా.)

వ. అని యీ సభ్యులకుం జెప్పుమనిరి; నీవును సభాసదులైన రాజులు నేమనియెద రనుం; డేను ధర్మంబును నీతియుఁ జుట్టఱికంబును మున్నిడుకొని మనోవాక్ప్రకారంబు లేక రూపంబైన సత్యంబకాఁ జెప్పితి; నిత్తెఱంగు మీకు మేలు; క్రోధమాన మత్సరంబులు విడిచి యిట్లు సేయుండు. 274

ప్రతిపదార్థం: అని; ఈ సభ్యులకున్= సభలోని పెద్దలకు; చెప్పుము+అనిరి= చెప్పవలసినదిగా పాండవులు నన్ను కోరారు. నీవును; సభాసదులు+ఐన రాజులు= సభలో ఉన్న దొరలు; ఏమి+అనియెదరు+అనుండు= ఏమిచెపుతారో చెప్పండి; ఏను= నేను; ధర్మంబును= న్యాయమును; నీతియును= రాజనీతిని; చుట్టఱికంబును= బాంధవమును; మున్ను+ఇడుకొని= ముందుంచుకొని; మనః వాక్+ప్రకారంబులు= మనసు యొక్క వాక్కు యొక్క వైఖరులు; ఏకరూపంబు+ఐన= ఒకే విధమైన; సత్యంబకాన్= సత్యమునే;చెప్పితిన్; ఈ+తెఱంగు= ఈ విధం; మీకున్; మేలు= మంచిని కలిగిస్తుంది; క్రోధ మానమత్సరంబులు= కోపం, గర్వం, ద్వేషం; విడిచి; ఇట్లు+చేయుండు= నేను చెప్పిన రీతిని ఆచరించండి.

తాత్పర్యం: పాండవులు సభలోని పెద్దలకు నన్ను చెప్పుమని కోరినమాటలు చెప్పాను. మహారాజా! నీవూ, సభలోని రాజులూ ఇందుకు బదు లేమి చెపుతారో చెప్పండి. నేను నీతి ధర్మాలనూ, బాంధవాన్నీ ముందుంచుకొని మనో వాక్కులు ఏకరూపంగాఉన్న సత్యమునే చెప్పాను. నే చెప్పిన పద్ధతి మీకు మేలు గలిగిస్తుంది. కోపం గర్వం ద్వేషం వదలి, నేను చెప్పినట్లు చేయండి.

విశేషం: 1. శ్రీకృష్ణుడి సందేశంలో ధర్మం, నీతి చుట్టరికం అనే అంశాల మేళవింపు కనబడుతుంది. ధర్మం విశ్వవ్యాప్తం, నీతి కార్యవ్యాప్తం, చుట్టరికం వ్యక్తి సంబంధి - ఈ మూడూ పరస్పరం విరుద్ధం కాకుండా ఉండటం ధర్మనీతివర్తనం. శ్రీకృష్ణుడి సందేశం దానికుదాహరణం.

2.మనోవాక్కాయ కర్మలు ఏకమై వ్యక్తమైన వాక్కు సత్యం. శ్రీకృష్ణుడు త్రికరణశుద్ధిగా పలికిన ఈ సందేశం సత్యం. అంటే నిజాయితీతో కూడుకొన్న నిజం.

3. శ్రీకృష్ణుడి సత్యవాక్కును గుర్తించాలంటే క్రోధం, అభిమానం, మాత్సర్యం అనే గుణాలు మాని ఆలోచించాలి. క్రోధం వలన ధర్మం దర్శనమివ్వదు. అభిమానం వలన నీతి యొక్క నిజస్థితి స్ఫురించదు. మాత్సర్యం వలన చుట్టరికపు ప్రేమ మనసులో మోసులెత్తదు. ఆ మూడు అవగుణాలను వదలితే శ్రీకృష్ణుడి సందేశంలోని నిజస్థితి గోచరిస్తుంది. క్రోధ మాన మత్సరాలకు పుట్టినిల్లు దుర్యోధనుడు. అతడి అంశలుగా క్రోధంతో దుశ్శాసనుడు, మానంతో కర్ణుడు, మత్సరంతో శకుని ఎప్పుడూ మసలుతుంటారు. వారికి శ్రీకృష్ణుడి సందేశ తాత్పర్యం సవ్యంగా స్ఫురించదని ధ్వని. (సంపా.)

ఆ. పాండవులకుఁ దగిన పాలు మేదిని బంచి । యిచ్చుకంటెఁ గార్య మెద్ది గలదు?
ధర్మమెద్ది? సముచితంబగు విధమెద్ది? । శక్యమెద్ది? చెపుఁడ వాక్యవిదులు! 275

ప్రతిపదార్థం: పాండవులకున్= పాండుపుత్రులకు; మేదినిన్= పుడమిలో; తగినపాలు= రా దగిన భాగం; పంచి+ఇచ్చుకంటెన్= పంచి ఇవ్వటం కంటె; కార్యము+ఎద్ది+కలదు?= చేయదగిన పని మరేముంది?; ధర్మము+ఎద్ది?= ఇంతకంటె న్యాయమేముంది?; సముచితంబు+అగు విధము+ఎద్ది?= మిక్కిలి తగిన తెఱంగు వేరొక టేముంది?; శక్యము+ఎద్ది?= మీకు వీలైన పని ఇంకొకటి ఏమున్నది?; వాక్య విదులు= మాటలతీరెరింగిన పెద్దలారా!; చెపుఁడ= చెప్పండి.

తాత్పర్యం: కౌంతేయులకు పుడమిలో తగిన భాగం పంచి ఇవ్వటంకంటె మంచి పని మరొక టేముంది? ధర్మం వేరేముంది? ఇంతకంటె తగిన తెరగు అన్యమేముంది? మీకు శక్యమైనది ఇంతకన్న ఏముంది? వాక్య పద్ధతి నెరింగిన పెద్దలు మీరే చెప్పండి.'

విశేషం: ఇంతవరకు నాలుగంచెలుగా సాగిన శ్రీకృష్ణ సందేశంలో ధర్మశాస్త్ర తర్కశాస్త్ర పండితులు పరిశీలిస్తే నాలుగు నిర్ణయాలకు రాకతప్పదనే హెచ్చరిక ఇందులో ఉన్నది. 1. పాండవులకు రాజ్యభాగ మీయటమే కార్యం. 2. అదే ధర్మం. 3. అదే సముచితమైన నీతి. 4. అదే ప్రస్తుతం సాధ్యమైన పని. శ్రీకృష్ణుడే సభాభిప్రాయాన్ని ఏకోన్ముఖం చేసి వారిచేత ఒప్పించేటట్లు ధ్రువీకరిస్తూ మాట్లాడాడు. సమర్థుడైన వక్త సాధించే ప్రబోధఫల మిది. (సంపా.)

క. అని పలికి మహారాజా । వినుమని ధృత రాష్ట్రు తోడ వెండియుఁ దా ని
ట్లని చెప్పె వాసుదేవుఁడు । తనమది నఱలేక కార్యదశ దెలియంగన్. 276

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; మహారాజా!= భూవల్లభా ధృతరాష్ట్రా!; వినుము+అని; ధృతరాష్ట్రుతోడన్; వెండియున్= మరల; కార్యదశ తెలియంగన్= కార్యపద్ధతి విశదమయ్యేటట్లు; వాసుదేవుఁడు= శ్రీకృష్ణుడు; తన మదిన్= తన హృదయంలో; అఱలేక= మర్మంలేక; తాన్+ఇట్లు+అని చెప్పెన్= తా నీ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇట్లా వచించి శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడితో రాజా! నా మాటలు విను' మంటూ మనసులో మర్మం ఉంచుకోక కార్యపద్ధతి తేటతెల్లమయ్యేటట్లు మళ్ళీ ఈ విధంగా పలికాడు:

ఆ. 'వారి తండ్రిపాలు వారికి నిచ్చి నీ। పాలు నీవుఁ బుత్త్ర పౌత్త్ర చయము
ననుభవించి సుఖులరై యుండుఁ డిది బంధు। మిత్త్ర సుజనకోటి మెచ్చు తెఱఁగు. 277

ప్రతిపదార్థం: వారి తండ్రిపాలు= పాండవుల తండ్రి భాగం; వారికిన్+ఇచ్చి= పాండవులకు ఇచ్చి; నీ పాలు= నీ రాజ్యభాగం; నీవున్= నీవూ; పుత్త్రపౌత్ర చయమున్= నీ కొడుకులయొక్క మనుమలయొక్క సమూహం; అనుభవించి= కుడిచి; సుఖులరు+ఐ+ ఉండుఁడు= హాయిగా జీవించండి; ఇది= ఇట్లా ఉండటం; బంధుమిత్ర సుజనకోటి= చుట్టముల స్నేహితుల సత్పురుషులయొక్క సముదాయం; మెచ్చుతెఱఁగు= కొనియాడువిధమై ఉన్నది.

తాత్పర్యం: 'రాజా! పాండవుల తండ్రి భాగం పాండవుల కిచ్చి; నీ రాజ్యభాగం నీ కుమారులు, నీ మనుమళ్ళూ హాయిగా అనుభవిస్తూ ఉంటే చుట్టాలూ, స్నేహితులూ, సత్పురుషులూ మిమ్ము కొనియాడుతారు.

విశేషం: ఈ పద్యంలో శ్రీకృష్ణుడు పాండవ పక్షంగానే కాక బంధుమిత్ర సుజనకోటిపక్షాన, వారందరి ఏకగ్రీవాంగీకారంగా, ఫలితాంశాన్ని ప్రకటించటం గమనిస్తే, ధృతరాష్ట్రుడిని ఏకాకి చేసి, అంగీకరించక తప్పనిదైన ఒత్తిడి స్థితిని కల్పించే నీతి వలె కనపడుతుంది. అయినా, అది న్యాయమని అందరికీ అనిపిస్తుంది. ధర్మజుడు ఆశించిన ఫలితాన్ని శ్రీకృష్ణు డింతవరకు విజయవంతంగా సాగించాడు. (సంపా.)

క. ఎఱుఁగవె యజాతశత్రుని। నెఱియును ధర్మంబు సత్యనిష్ఠయు మిము నె
త్తెఱఁగున ననువర్తించెనొ। యెఱుఁగవె? తగు చేవ గలుగు టెఱుఁగవె? యధిపా! 278

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; అజాతశత్రుని= ధర్మజుడియొక్క; నెఱియును= న్యాయమును; ధర్మంబున్= ధర్మమును; సత్యనిష్ఠయున్= సత్యమునందలి ఉనికియు; ఎఱుఁగవె?= తెలియవా? మిమున్= మిమ్ము; ఏ+తెఱఁగునన్= ఏ విధంగా; అనువర్తించెనొ= అనుసరించిమెలగెనో; ఎఱుఁగవె= తెలియవా?; తగుచేవ= తగిన శక్తి; కలుగుట= ఆతడు కల్గియుండటం; ఎఱుఁగవె?= తెలియవా?

తాత్పర్యం: మహారాజా! ధర్మజుడి న్యాయమూ, ధర్మమూ, సత్యప్రవృత్తీ నీకు తెలుసు. అతడు మిమ్మాశ్రయించుకొని ఎట్లా ఉండినదీ నీకు తెలుసు. తగినశక్తి కలిగి ఉండటం కూడ నీకు తెలుసు.

విశేషం: ఇది ధర్మరాజ ప్రశంస. ఆరుగుణాల చేత అతడు అగ్రగణ్యుడు.

1. అజాతశత్రుత్వం-ఎదుటివారు అతడిని శత్రువనుకొనవచ్చునేమో కాని అతడు ఎదుటివారిని ఎప్పుడూ శత్రువని భావించడు. ఇది అపూర్వగుణం. మహాభారత చక్రవర్తులలో ధర్మరాజుకే చెల్లింది. 2. న్యాయం తప్పని లోకనీతి. 3. ధర్మం తప్పని వేదనీతి. 4. సత్యం తప్పని వ్యక్తి నీతి. 5. పెద్దల మాట తప్పని వంశనీతి. 6. రాజ్యం పాలించగలిగిన శక్తి - ప్రభునీతి. ఈ ఆరుగుణాలు ఉత్తమ వంశకర్తకుండే లక్షణాలు. సారపు ధర్మం, విమలసత్యం ధర్మజుడి జీవిత రథచక్రాలు. (సంపా.)

వ. అది యెల్ల నీ వెఱుంగు; దైనను దెలియఁ జెప్పెద విను; మింద్రప్రస్థపురంబున నుండి పాండవాగ్రజుండు నీకుం బెంపునుం బేరునుం జేయం గోరి. 279

ప్రతిపదార్థం: అది+ఎల్లన్= అది అంతయూ; నీవు+ఎఱుంగుదు= నీకు తెలియును; ఐనను; తెలియన్+చెప్పెదన్+వినుము= తేటతెల్లంగా తెలుపుతాను వినుము; ఇంద్రప్రస్థపురంబునన్+ఉండి; పాండవ+అగ్రజుండు= పాండవులలో తొలుత జన్మించిన ధర్మజుడు; నీకున్; పెంపునన్= గౌరవమును; పేరునున్= ప్రఖ్యాతిని; చేయన్+కోరి= కలిగింపనెంచి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మజు డెటువంటివాడో నీ వెరుగుదువు. అయినప్పటికీ స్పష్టంగా చెపుతాను, విను. అతడు ఇంద్ర ప్రస్థపురంలో ఉంటూ నీకు గౌరవఖ్యాతులు కలిగింప నెంచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. **మద మడఁగించి భూపతిసమాజము నెల్లను నిన్నుఁ గొల్వఁజే**
యుదునని పూని దిగ్విజయ మున్నతిఁజేసి మహావిభూతితో
మదిమదినుండ నీ సుతుఁడు మంత్రులు సౌబలు జూదమార్చి సం
పద గొని యంతఁ బోవక సభన్ ద్రుపదాత్మజ భంగపెట్టరే. **280**

ప్రతిపదార్థం: మదము+అడఁగించి= గర్వాన్ని తొలఁగించి; భూపతి సమాజమున్+ఎల్లను= రాజలోకమంతటినీ; నిన్నున్= నిన్ను; కొల్వన్+చేయుదున్+అని= సేవించేటట్లు చేయుదునుగాక అని; పూని= పూనుకొని; దిగ్విజయము= దిగ్జయమును; ఉన్నతిన్+చేసి= గొప్పగా కావించి; మహావిభూతితోన్= గొప్ప ఐశ్వర్యంతో; మది మదిన్+ఉండన్= నెమ్మదిగా ఉండగా; నీ సుతుఁడు= నీ కుమారుడైన దుర్యోధనుడు; మంత్రులు= అతడికి ఆలోచనచెప్పే కర్ణదుశ్శాసనులు; సౌబలున్= సుబలుని పుత్రుడైన శకునిని; జూదము+ఆర్చి= జూదమాడించి; సంపదన్+కొని= సిరిని హరించి; అంతన్+పోవక= అంతటితో విడువక; ద్రుపద+ఆత్మజన్= ద్రౌపదిని; సభన్= కొలువులో; భంగపెట్టరే= అవమానించినారు గదా!

తాత్పర్యం: రాజుల దర్పమడచి వారందరు నిన్ను కొలిచేటట్లు చేయటానికై ధర్మనందనుడు గొప్పగా దిగ్విజయం చేసి మిక్కుటమైన సిరిసంపదలతో తులతూగుతూ నిమ్మళంగా ఉన్నాడు. అప్పుడు నీ తనయుడూ, అతని మంత్రులూ చేరి శకునిచే జూదమాడించి ధర్మజుడి సంపదనెల్ల హరించారు. అంతటితో తృప్తిపడక నిండుసభలో ద్రౌపదిని పరాభవించారు.

విశేషం: 1. ధర్మరాజు దిగ్విజయం చేయటం ధృతరాష్ట్రుడి ఔన్నత్యాన్ని పెంచటానికే అన్నాడు కృష్ణుడు.

2. దిగ్విజయంలో ఓడిన రాజులు దుర్యోధనుడికి సాయం చేస్తున్నారు. వారి నుద్దేశించి చెప్పిన మాట ఇది. దిగ్విజయం చేసింది ధర్మరాజు; దాని ఫలితాన్ని అనుభవిస్తున్నది ధృతరాష్ట్రుడు. ఆ యుద్ధాలన్నీ ధృతరాష్ట్రుడి సంపదను పెంచటానికే అని వారు గ్రహించి పాండవులయందు సౌముఖ్యాన్ని వహించాలని శ్రీకృష్ణుడి అభిప్రాయం.

3. ధర్మజుడు తండ్రిపెంపుగోరి సంపద గడిస్తే, దుర్యోధనుడు తండ్రికి కళంకం తెచ్చేటట్లు సంపద హరించాడు. అంతేకాదు ద్రౌపదిని నిండుసభలో భంగపరచి తండ్రికి తలవంపులు తెచ్చాడు. తులనాత్మక విచారంతో ఎవరు యోగ్యులో తేల్చుకొనుమని సూచన. తండ్రి పెంపుకు కృషి చేసిన కొడుకుకు కీడు తలపెట్టటం తగదని హితవు. (సంపా.)

ఉ. **దానికి నీ వొడంబడితి; ధర్మజుఁ డంతయుఁ జూచి సత్యముం**
బూని వృకోదరార్జునులు భుగ్నులుగాఁ బెడచేతఁ గన్ను నీ
రూనఁగ నొత్తుకొంచుఁ జని యుగ్ర వనంబున దుఃఖమగ్నుఁడై
దీనత నుండి పూన్కి దగఁ దీర్చియుఁ గూడి మనంగఁ గోరెడిన్. **281**

ప్రతిపదార్థం: దానికిన్= దుర్యోధనుడి దుష్టచేష్టకు; నీవు+ఒడంబడితి(వి)= నీవు సమ్మతించావు; ధర్మజుఁడు= ధర్మరాజు; అంతయున్+చూచి= పరిస్థితి నాకళించుకొని; సత్యమున్+పూని= సత్యం అవలంబించి; వృకోదర+అర్జునులు= భీమార్జునులు; భుగ్నులుగాన్= విఱిగినవారు కాగా, క్రుంగినవారుకాగా; కన్ను= నేత్రములు; నీరు+ఊనఁగన్= కన్నీరు వహించగా; పెడచేతన్=

వెనుక చెయ్యితో; ఒత్తుకొంచున్= తుడుచుకొంటూ; చని= వెళ్ళి; ఉగ్రవనంబునన్= ఘోరారణ్యంలో; దుఃఖమగ్నుఁడు+ఐ= శోకమునందు మునిగినవాడై; దీనతన్+ఉండి= దైన్యంతో పడియుండి; పూన్కిన్= ప్రతిజ్ఞను; తగన్+తీర్చియున్= సక్రమంగా నిర్వహించికూడా; కూడి= మీతో కలసిమెలసి; మనంగన్= జీవించాలని; కోరెడిన్= కోరుకొంటున్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడి దుష్కృత్యాలకు నీవు సమ్మతించావు. ధర్మరాజు తనకేర్పడిన సంకటాన్ని గమనించి సత్యం తప్పక తన ఆజ్ఞచేత భీమార్జునులు బలముడిగి క్రుంగిపోగా కంటినుండి కారుకన్నీటిని పెడచేతితో తుడిచికొంటూ ఘోరారణ్యాలకు వెళ్ళాడు. అక్కడ దుఃఖాలలో మునిగి దైన్యం అనుభవిస్తూ ప్రతిజ్ఞను సక్రమంగా నెరవేర్చికూడా నేడు మీతో ఒద్దికగా జీవించవలెనని కోరుకుంటున్నాడు.

విశేషం: 1. దుర్యోధనుడు చేసిన దుర్నయం క్షమార్హం కానిది. అయినా, దానికి ధృతరాష్ట్రుడు అంగీకరించి ఆ పాపభారాన్నంతా తన తలమీద వేసికొన్నాడు. అందుచేత పాండవులు అరణ్య అజ్ఞాతవాసాలు ఆయాసపడుతూనే సత్యవ్రతంగా నిర్వహించారు. అడవులలో అన్ని యాతనలు పడికూడా పగ సాధించే క్రౌర్యానికి పోకుండా, అన్ని అపకారాలు చేసినా కౌరవులతో కలిసి జీవించాలని కోరుతున్నారు. అజాతశత్రువు శీలానికి ఇంతకంటె నిదర్శన మే ముంటుంది? - అని ధర్మజుడి ధీరోదాత్తతను, శాంతికాముకత్వాన్నీ బంధుప్రీతిని సమర్థవంతంగా సభలో తెలియచెప్పాడు.

2. భీమార్జునులు కన్నీరొత్తుకొంటూ వెళ్ళినట్లు చెప్పిన అంశం సాభిప్రాయం. వారు క్రోధమూర్తులు. యుద్ధాన్నే కోరుతున్నారు. అయినా, వారిని తగిన విధంగా నియంత్రించి సత్యధర్మాలను పాటిస్తున్నాడు ధర్మరాజు. అతడివలె ధృతరాష్ట్రుడు కూడ తన పుత్రులను అదుపులో పెట్టి పాండవులకు న్యాయం చేయాలని హెచ్చరిక. (సంపా.)

క. తనుఁ దాన పోలుఁగా కే । మనవచ్చు? నజాతశత్రు నతిశాంతతయున్
వినయము సత్యము ము న్నే । జనపతులకుఁ గలవు సెపుమ? సౌజన్యనిధీ! 282

ప్రతిపదార్థం: సౌజన్యనిధీ!= మంచితనానికి స్థానమైనవాఁడా!; తనున్+తాను+అ+పోలున్+కాక= ఆతడికి అతడే సాటిఅగును; ఏమి+అనన్+వచ్చున్?= అతడిని ఎంతని కొనియాడగలము?; అజాతశత్రు= ధర్మజుడియొక్క; అతి= మిక్కుటమైన; శాంతతయున్= శాంతస్వభావమూ; వినయమున్= అణకువా; సత్యమున్= సత్యమూ; మున్ను= పూర్వం; ఏ జనపతులకున్+కలవు= ఏ రాజులకున్నాయో; చెపుము+అ= చెప్పుము.

తాత్పర్యం: ధర్మపుత్రుడికి సాటి ధర్మపుత్రుడే. అతడిని ఎంతని కొనయాడగలం? ఆయన శాంతస్వభావం, అణకువ, సత్యనిష్ఠ ఇంతకుమునుపు ఏ రాజులకున్నవో చెప్పు.

విశేషం: 1. అలం: అనన్వయం, కావ్యలింగం. "ఉపమానోపమేయత్వం యదేక స్యైవ వస్తుతః". ఒకే వస్తువుకు ఉపమానత్వం, ఉపమేయత్వం కూడా చెప్పితే అనన్వయం. ధర్మజుడు తనకు తానే పోలినవాడు అనటం అనన్వయం. సాటి లేని మేటి వ్యక్తిత్వం ధ్వని. మహాభారత పురుషులలో శ్రీకృష్ణుడిని మించిన మహాపురుషుడు లేడని ప్రసిద్ధి. అతడి ప్రశంస పొందిన ధర్మరాజు ధన్యజీవి.

2. "సమర్థనీయస్యార్థస్య కావ్యలింగం సమర్థనమ్" అని కావ్యలింగాలంకార లక్షణం. అతడి కతడే సాటి అయిన ధర్మరాజును ప్రశంసించటానికి మాటలు లేవట! శాంతవినయ సత్యగుణాలలో అతడివంటివారు అంతవరకు లేరట! ఇది అతిశయోక్తిగా ఉన్నా ధర్మజుడి అనన్యత్వాన్ని సమర్థించే వాక్యమే- అందుకు కావ్యలింగం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

3. ధర్మజుడి వంటి రాజులు అంత వరకు పుట్టలేదన్న ప్రశంస సమకాలీనులైన ప్రభువులలో గల అతడి నిరుపమాన వ్యక్తిత్వాన్ని ధ్వనిస్తున్నది. (సంపా.)

క. ఏ నిం తాడితి నీ సం । తానం బిరుదెఱఁగునకు హితము గోరి భవ
త్సూనుని మతి యతిలోభము । మానిచి పాండవులఁ దెమ్ము మనుజాధీశా! 283

ప్రతిపదార్థం: మనుజ+అధి+ఈశా!= నరనాథా!; నీ సంతానంబు= నీ బిడ్డలైన; ఇరు+తెఱఁగునకున్= రెండు పక్షాల వారికి; హితమున్+కోరి= మేలు దలచి; ఏను= నేను; ఇంత+ఆడితిన్= ఇన్నిమాటలు చెప్పాను; భవత్+సూనుని= నీ కొడుకైన దుర్యోధనుడియొక్క; మతి+అతిలోభమున్= మనస్సునందలి మిక్కిలి దురాశను; మానిచి= తొలగించి; పాండవులన్+తెమ్ము= పాండవులను నీ కడకు రప్పించుకొనుము.

తాత్పర్యం: మంచితనంగల ధృతరాష్ట్ర మహారాజా! నీ బిడ్డలైన కురుపాండవుల మేలు గోరి నే నిన్నిమాటలు చెప్పవలసి వచ్చింది. నీ పుత్రుడైన దుర్యోధనుడి మనసులో ఉన్న పరమ దురాశను తొలగించి, పాండవులను నీ చెంతకు పిలిపించుకొనుము.

విశేషం: ధర్మరాజ ప్రశంస ప్రయోజనం అతడిని పిలిపించటం కొరకే. దానికి ప్రతిబంధకంగా నిలిచే దుర్యోధనుడి లోభాన్ని నియమించటం కొరకే. (సంపా.)

ఉ. వారలు శాంతశూరులు; భవచ్చరణంబులు గొల్వఁబూని యు
న్నారటుఁగాక మీ కది మనంబున కప్రియమేని నింతకుం
బోరికి వచ్చుచుండుదురు; భూవర! రెండు దెఱంగులందు నీ
కారయఁ బథ్యమేది యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా!' 284

ప్రతిపదార్థం: వారలు= కౌంతేయులు; శాంతశూరులు= శాంతస్వభావులున్నూ, పరాక్రమవంతులున్నూ; భవత్+చరణంబులు= నీ పాదాలు; కొల్వన్= సేవించటానికి; పూని+ఉన్నారు= సంసిద్ధంగా ఉన్నారు; అటున్+కాక= అట్లాకాక; మీకున్= మీకు; అది= పాండవుల పొత్తు; మనంబునకున్= మీ మనస్సులకు; అప్రియము+ఏనిన్= ఇష్టంకానిచో; ఇంతకున్= ఈపాటికి; పోరికిన్= యుద్ధానికి; వచ్చుచున్+ఉండుదురు= వస్తూ ఉంటారు; భూవర!= రాజా!; రెండు తెఱంగులందున్= సంధి సంగ్రామాలలో; నీకున్= నీకు; ఆరయన్= ఆలోచించగా; ఏది పథ్యము+అగున్= ఏది హితమౌతుందో; ఆ+విధము= ఆ తెఱగు; ఏర్పడన్+నిశ్చయింపుమా!= తేటపడేటట్లు తీర్మానించుము.

తాత్పర్యం: మహారాజా! పాండవులు ఎంతటి శాంత స్వభావులో అంతటి వీరాగ్రేసరులు. వారు నీ పాదసేవ చేయటానికి సంసిద్ధంగా ఉన్నారు. వా రట్లా మీతో కలసి మెలసి వర్తించటం మీకు ఇష్టంకాకపోతే ఈ పాటికి కదనం కావించటానికి బయలుదేరి వస్తుంటారు. సంధి, సంగ్రామం - ఈ రెండింటిలో మీ కేది హితమని తోస్తుందో దానిని నిర్ణయించి వెల్లడించండి.'

విశేషం: 1. అలం: విషమం. "విషమం వర్ణ్యతే యత్ర ఘటనాననురూపయోః" అననురూపాలైన వాటికి సంబంధం వర్ణిస్తే విషమాలంకారం. పాండవులు శాంతశూరులు - అనే వాక్యం చక్కని ఉదాహరణం. శాంత శూరత్వాలు అననురూపాలైన

గుణాలు. పాండవులు అట్టి గుణాలు కలవారని భావం. తిక్కన ధర్మరాజును - 'మెత్తనిపులి' అని అన్నాడు. పాండవులను 'శాంతశూరులు' అని పేర్కొన్నాడు. తెలుగు సాహిత్యంలో ఈ బిరుద విశేషణాలు తిక్కన ప్రతిభావైభవానికి కీర్తి పతాకలు.

2. శాంతులు కాబట్టి ధృతరాష్ట్రుడిని సేవించాలని భావిస్తున్నారు. ధృతరాష్ట్రుడు వారికి రాజ్యభాగమిచ్చి మన్నించకపోతే శూరులవలె యుద్ధానికి సిద్ధమౌతారు. సహజంగా వారు శాంతులు, అవసరం వస్తే వారు శూరులు. ధృతరాష్ట్రుడు పాండవుల నెట్లా ప్రవర్తించవలెనని కోరుకొంటున్నాడో తేల్చిచెప్పాలని సభలో నిలదీసి అడిగాడు కృష్ణుడు. ఇది సందేశంలోని తారాస్థాయి (క్లైమాక్స్). (సంపా.)

చ. అనవుడు రోమహర్షణము లంగములం బొడమన్ సదస్యు లె
ల్లను బ్రియమంది నెమ్మనములం 'బురుషోత్తముఁ డింత యొప్పఁ బ
ల్కునె? మఱుమాటలాడ నయకోవిదుఁ డెవ్వఁడు? ధీరుఁడెవ్వఁ? డిం
దనువరి యెవ్వఁ' డంచు నచలాకృతులై నెఱి నూరకుండఁగన్. 285

ప్రతిపదార్థం: అనవుడున్= శ్రీకృష్ణుడు అట్లా పలుకగా; అంగములన్= శరీరములందు; రోమహర్షణములు= గగుర్పాటు; పొడమన్= కలుగగా; సదస్యులు+ఎల్లను= కొలువులోని వారంతా; ప్రియము+అంది= హర్షించి; నెమ్మనములన్= తమ నిండు మనసులలో; పురుషోత్తముఁడు= శ్రీ కృష్ణుడు; ఇంత+ఒప్పన్+పల్కునె= ఇంత బాగా మాట్లాడుతాడా? (ఎంతబాగా మాట్లాడాడు? అని భావం); మఱుమాటలు+ఆడన్= ఆ మాటలకు బదులు పలకటానికి; ఇందున్= ఈ సభలో; నయకోవిదుఁడు+ ఎవ్వఁడు?= నీతిశాస్త్ర నిపుణుడు ఎవడున్నాడు?; ధీరుఁడు+ఎవ్వఁడు?= ధైర్యశాలి ఎవడున్నాడు?; అనువరి+ఎవ్వఁడు?= ఉపాయశాలి ఎవడున్నాడు?; అంచున్= అని పలుకుతూ; అచల+ఆకృతులు+ఐ= చలించని ఆకారాలు గలవారై; నెఱిన్= ఒప్పుగా; ఊరక+ఉండఁగన్= మిన్నకుండగా.

తాత్పర్యం: శ్రీ కృష్ణుడి మాటలు వినగానే సభ్యులందరి శరీరాలు గగుర్పాటు వహించాయి. వారు మనస్సులలో ఎంతో సంతోషించి, 'నారాయణు డెంత ఒప్పిదంగా మాటాడాడు! శౌరి మాటలకు ప్రతివచనాలు పల్కగల నీతి నిపుణుడు, ధీరుడు, ఉపాయశాలి ఈ కొలువులో ఎవడున్నాడు' అని కదలక మెదలక నోరు విప్పక అట్లాగే ఉండిపోగా, (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: ఒక మహావక్త ఉపన్యసించినప్పుడు సభాసదులు ఎట్లా సమ్మోహితు లౌతారో వర్ణించిన పద్యమిది.

1. అందరి శరీరాల మీద పులకలు నిలిచాయి. ఇది సాత్త్వికభావం. అప్రయత్నకృతమైన సాత్త్విక చేష్ట అవ్యక్తమైన ఆనందానికి గుర్తు.

2. మనస్సులు సంతోషించాయి- ఇది పద్యఃపరనిర్వృతి వంటిది.

3.'ఇంత ఒప్పఁ బల్కునె?' - అనే మాట ఆశ్చర్య ప్రకటనం. శ్రీకృష్ణ సందేశంలోని వస్తువుకు శ్రోతలు అబ్బురపాటు పడిన వైఖరి.

4. 'మారుమాటాడే నీతికోవిదు డెవ్వడున్నాడు?' అన్నది ఆశ్చర్యజనకమైన ప్రతిస్పందన. శ్రీకృష్ణుడి సందేశోపన్యాసంలో చెప్పిన దెంత బాగుందో, చెప్పినతీరు అంతకంటె బాగుంది. దానికి తిరుగుచెప్పే పండితులు లేరని భావం. ఇది బుద్ధిమంతుల ప్రశంస.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

5. 'ధీరు డెవ్వడు' - అట్లా చెప్పగలిగిన ధైర్యం ఉన్న వాడెవడు? ధృతరాష్ట్రుడి నిండు కొలువులో అతడి ఉపేక్షయే ప్రళయ హేతువని ప్రకటించి, రాజ్యభాగమివ్వటం కంటె గత్యంతరం మరొకటి లేదని సూటిగా, ఘాటుగా చెప్పగల మొనగాడు శ్రీకృష్ణు డొక్కడే అని తెగువరుల ప్రశంస.

6. 'అనువరి ఎవ్వడు?' అన్న ప్రశ్న రాజనీతిజ్ఞులు వేసేది. శ్రీకృష్ణుడి మాటలు పైకి నీతులు. లోన సామదానభేదోపాయ బృంహితాలు. ధర్మనీతి మార్గంలో ఉపాయాలు ప్రయోగించ బడతాయి. కౌరవులు దుర్నీతి మార్గగాములు కాబట్టి ఉపాయ నైపుణ్యం ఉండదు. యుద్ధ పిపాస మాత్రమే కనపడుతుంది.

7. 'అచలాకృతులై ఊరకుండటం' సాత్త్వికాభినయం. కదలకుండా కొండవలె (ఉపమాలంకారం) కొయ్యబారి కూర్చుండిపోయారు. అందుకే కాబోలు జమదగ్న్యాది మహర్షులు తేరుకొని మాట్లాడటం మొదలు పెట్టారు.

8. శ్రీకృష్ణుడు కౌరవసభలో గాలినంతా తనవైపు మళ్ళించుకొన్నాడు. ధర్మజుడి ఉపాయంలోని తొలిఘట్టం విజయవంతంగా ముగించాడు. (సంపా.)

వ. జామదగ్న్య మహాముని సుయోధనునితో నిట్లనియె : 286

ప్రతిపదార్థం: జామదగ్న్య మహాముని= జామదగ్న్యుడనే మహర్షి; సుయోధనునితోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: జామదగ్న్యుడు అనే మహర్షి దుర్యోధనుడితో ఇట్లా చెప్పాడు :

సీ. వినుము దంభోద్భవుం డనురాజు దన కెదు । రెవ్వరు లేరంచు గ్రొవ్వి నరుఁడు
నారాయణుం డనువారలు గంధమా । దనమను నగమునఁ దపము సేయ
వారిపైఁ జని యాహవమునకుఁ బిలిచిన । నమ్మునీంద్రులు వలదని యనేక
విధములఁ జెప్పంగ వెండియుఁ బోకున్నఁ । గుశముష్టి నుజ్జ్వల విశిఖ వృష్టిఁ

ఆ. గురిసి నరుఁడు సేనఁ గూల్చి యాతని భంగ । పెట్టి పట్టి విడిచె నట్టి యమ్మ
హాత్ము లిపుడు పార్థుఁడనఁ గృష్ణుఁడనఁగ లీ । లార్థ కలిత జన్ములైరి సూవె! 287

ప్రతిపదార్థం: వినుము= సుయోధనా! నా మాటలు వినుము; దంభోద్భవుండు+అను రాజు= దంభోద్భవుఁడనే ప్రభువు; తనకున్+ఎదురు+ఎవ్వరున్+లేరు+అంచున్= తనకు అడ్డమెవ్వరూ లేరని; క్రొవ్వి= గర్వించి; నరుఁడు; నారాయణుండు; అనువారలు= అనునట్టివారు; గంధమాదనము+అను నగమునన్= గంధమాదనము అనే పేరుగల పర్వతంమీద; తపము+చేయన్= తపసు చేస్తుండగా; వారిపైన్+చని= వారిమీదికి వెళ్ళి; ఆహవమునకున్+పిలిచినన్= యుద్ధానికి ఆహ్వానించగా; ఆ+ముని+ఇంద్రులు= ఆ మునీశ్వరులు; వలదు+అని= వద్దని; అనేక విధములన్= పలు రీతుల; చెప్పంగన్= పలుకగా; వెండియున్= మరల; పోక+ఉన్నన్= అతడు తొలగకున్నప్పుడు; నరుఁడు= నరుడనే ఋషి; కుశముష్టిన్= దర్భలు ధరించిన పిడికిటితో; ఉజ్జ్వల విశిఖ వృష్టిన్= వాడియైన బాణాలు అనే వర్షమును; కురిసి= వర్షించి; సేనన్+కూల్చి= దంభోద్భవుడి సైన్యాన్ని హతంచేసి; ఆతనిన్= అతడిని; భంగపెట్టి= పరాభవించి; పట్టి= బంధించి; విడిచెన్= ఆ తరువాత కరుణతో వదలివేశాడు; అట్టి= అటువంటి; ఆ+మహా+ఆత్ములు= ఆ మహనీయులు; ఇప్పుడు= ఈవేళ; పార్థుఁడు+అనన్= అర్జునుడనగా; కృష్ణుఁడు+అనఁగన్= శ్రీకృష్ణుడనగా; లీలా+అర్థ+కలిత జన్ములు+ఐరి+చూవె!= విలాసం కొరకు పుట్టుకలను స్వీకరించారు సుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దుర్యోధనా! వినుము. దంభోద్భవుడనే రాజు తనకు ఎదురెవ్వరూ లేరని గర్వంతో విర్రవీగుతూ, నరనారాయణులనే దేవర్షులు గంధమాదన పర్వతంమీద తపస్సు చేసికొంటుంటే వారిపైకి వెళ్ళి యుద్ధానికి ఆహ్వానించాడు. ఆ మహామునులు యుద్ధం వద్దని ఎన్నో విధాల చెప్పిచూచారు. అతడు మొండికి పడి అక్కడి నుండి కదలకుంటే నరుడు దర్భలు ధరించిన పిడికిటితో వాడియైన బాణాల వాన కురిపించి దంభోద్భవుడి సేనలను హతం చేశాడు. అతడిని పట్టి పరాభవించి చివరికి దయదలచి వదలివేశాడు. ఆ మహానుభావు లిద్దరూ ఇప్పుడు పార్థుడనే పేరుతో శ్రీకృష్ణుడనే పేరుతో క్రీడార్థమై ఈ భువిలో అవతరించారు సుమా!

వ. కావున నీవా దంభోద్భవు చందంబున నుద్ధతి వాటించుటయు, నరనారాయణులతోడఁ దొడరుటయు మీఁద మేలయి యుండదు; పాండవులతోడి పొందు మేలనిన యనంతరంబ కణ్వుండు దుర్యోధనున కిట్లనియె: 288

ప్రతిపదార్థం: కావునన్= కనుక; నీవు; ఆ దంభోద్భవు చందంబునన్= ఆ దంభోద్భవుడి మాదిరి; ఉద్ధతి+పాటించుటయున్= గర్వం వహించటమూ; నరనారాయణులతోడన్; తొడరుటయున్= ఎదిరించటమూ; మీఁదన్= ముందు; మేలు+అయి+ఉండదు= శ్రేయం కలిగించదు; పాండవులతోడి పొందు= పాండవులతో కలిసి ఉండటం; మేలు= మంచిది; అనిన+అనంతరంబు+అ= అని జామదగ్న్యుడు చెప్పిన పిదప; కణ్వుండు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కాబట్టి ఆ దంభోద్భవుడి విధంగా గర్వం వహించటం, నరనారాయణులను ఎదిరించటం మేలుకాదు. పాండవులతోడి పొందు మేలు' అని జామదగ్న్యుడు చెప్పిన పిదప కణ్వుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

కణ్వుండు దుర్యోధనునితో గరుత్మంతుని వృత్తాంతంబు సెప్పుట (సం. 5-95-1)

ఆ. అదివోలుఁ; దన్ను నెదిరిని । మది నెఱుఁగక నిగ్రహించి మదమెత్తుట యొ
ప్పు; దహంకారం బొనరిం । పదె పౌరుషహానిఁ దొల్లి పక్షీంద్రునకున్. 289

ప్రతిపదార్థం: అది+పోలున్= జామదగ్న్యుడు చెప్పినమాటలు తగిఉన్నవి; తన్నున్= తనను; ఎదిరినిన్= ఎదుటివానిని; మదిన్= మనస్సులో; ఎఱుఁగక= తెలియలేక; నిగ్రహించి= త్రోసివేసి; మదము+ఎత్తుట= గర్వపడటం; ఒప్పదు= తగదు; తొల్లి= మునుపు; పక్షి+ఇంద్రునకున్= పక్షులకు రాజైన గరుత్మంతుడికి; అహంకారంబు= గర్వం; పౌరుషహానిన్= పరాక్రమానికి చేటు; ఒనరింపదె?= కలిగింపలేదా? (కలిగించినదని అర్థం.)

తాత్పర్యం: 'జామదగ్న్య మహాముని చెప్పిన మాటలు సమంజసాలు. తన శక్తినీ, ఎదిరి శక్తినీ గమనించక గర్వంతో ధిక్కరించటం యుక్తం కాదు. పూర్వం అహంకారం గరుత్మంతుడికి శౌర్యహానిని కలిగించింది సుమా!

వ. అది యెట్లనిన. 290

తాత్పర్యం: ఆ కథ యేమిటంటే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. అమరేంద్రరథసూతుఁడైన మాతలి దన । సుత గుణకేశికిఁ బతిఁ దగంగ
నారసి యార్యకుండను భుజంగాధిపు । మనుమనిఁ జికురుని తనయు సుముఖు
నర్థిమైఁ గోరిన నార్యకుం డుమ్మలి । కంబుతో నిట్లను "గరుడుఁ డితని
తండ్రి వధించి యెంతయు నల్కమై వీని । నింకిట నెల సమయించువాఁడు

ఆ. గాఁగఁ బూనిపోయెఁ గావున నే మియ్య । కొనఁగనేర" మనిన విని 'బలారి
నడిగి పడసి యిత్తు నాయువు రం' డని । వారిఁగొనుచు నరిగె సారథియును. 291

ప్రతిపదార్థం: అమర+ఇంద్ర= దేవేంద్రుడియొక్క; రథసూతుఁడు+ఐన= రథసారథి ఐన; మాతలి= మాతలి అనేవాడు; తనసుత= తన కొమార్తెఅయిన; గుణకేశికిన్= గుణకేశి అనేదానికి; పతిన్= భర్తను; తగంగన్= చక్కగా; ఆరసి= విచారించి; ఆర్యకుండు+అను= ఆర్యకుడనే పేరుగల; భుజంగ+అధిపు మనుమనిన్= సర్పరాజు యొక్క మనుమడూ; చికురుని తనయున్= చికురుడనే వాడి కుమారుడూ అయిన; సుముఖున్= సుముఖుడనే పేరుగలవాడిని; అర్థిమైన్= ఆసక్తితో; కోరినన్= వేడగా; ఆర్యకుండు= ఆర్యకుడు; ఉమ్మలికంబుతోన్= దుఃఖంతో; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; గరుడుఁడు= గరుత్మంతుడు; ఇతని తండ్రిన్= ఈతడి జనకుడిని; వధించి= చంపి; ఎంతయున్= మిక్కిలి; అల్కమైన్= కోపంతో; వీనిన్= సుముఖుడిని; ఇంకన్+ఇటన్= ఇంకనిక్కడ; నెలన్= నెలరోజులలో; సమయించువాఁడు+కాఁగన్= చంపేటట్లుగా; పూని= నిశ్చయించి; పోయెన్= వెళ్ళాడు; కావునన్= కనుక; ఏము= మేము; ఇయ్యకొనఁగన్+నేరము= పెండ్లికి అంగీకరించలేము; అనినన్+విని= అని ఆర్యకుడు చెప్పగా ఆలించి; సారథియును= ఇంద్ర రథ సారథి అయిన మాతలియు; బల+అరిన్= బలుడనే రాక్షసుడికి విరోధి అయిన దేవేంద్రుడిని; అడిగి= అర్థించి; ఆయువున్= ఆయుర్దాయాన్ని; పడసి+ఇత్తున్= పొంది సుముఖుడికిస్తాను; రండు= మీరు నావెంట రండి; అని= అనుచు; వారిన్+కొనుచున్+అరిగెన్= వారిని తన వెంట తీసికొనివెళ్ళాడు.

తాత్పర్యం: దేవేంద్రుడి రథసారథి అయిన మాతలి గుణకేశి అనే తన కొమార్తెకు విచారించుకొని, ఆర్యకుడు అనే సర్పనాయకుడి మనుమడున్నూ, చికురుడనే వాడి తనయుడున్నూ అయిన సుముఖుడిని భర్తగా నిర్ణయించాడు. అట్లా నిర్ణయించుకొని ఆర్యకుడి దగ్గరకు వెళ్ళి ప్రీతితో సుముఖుడిని కోరాడు. అప్పుడు ఆర్యకుడు దుఃఖంతో 'గరుత్మంతుడు వీని తండ్రియైన చికురుడిని చంపివేసి, నెలరోజులలో సుముఖుడిని కూడ సంహరిస్తానని కోపంతో పంతగించి పలికి వెళ్ళాడు. ఇట్టి దశలో మేము సుముఖుడి వివాహానికి సమ్మతించలేము' అని చెప్పాడు. ఆ మాటలు విని మాతలి 'దేవేంద్రుడి నడిగి సుముఖుడికి ఆయుస్సు తీసి యిస్తాను రం'డని వారిని తన వెంటబెట్టుకొని ఇంద్రుడి కడకు వెళ్ళాడు.

వ. వారల భాగ్యంబున నప్పు డింద్రుండును, నుపేంద్రుండును, నొక్కచో నుండం గని మాతలి యక్కార్యంబు విన్నవించినం గరుణించి జిష్ణుండు విష్ణునకుం జెప్పి చేయించువాఁడై వైనతేయు దెసకుం దాన చాలి సుముఖుం జిరాయు రుపేతుం జేసిన 292

ప్రతిపదార్థం: వారల భాగ్యంబునన్= వారి అదృష్టంచేత; అప్పుడు; ఇంద్రుండును; ఉపేంద్రుండును= విష్ణువు; ఒక్కచోన్= ఒక్కచోట; ఉండన్+కని= ఉండటం చూచి; మాతలి; ఆ కార్యంబు విన్నవించినన్= తాను వచ్చినపని మనవి చేయగా; కరుణించి; జిష్ణుండు= దేవేంద్రుడు; విష్ణునకున్+చెప్పి చేయించువాఁడు+ఐ= మహావిష్ణువునకు దెలిపి చేయించేవాడై; వైనతేయు

దెసకున్= వినతా పుత్రుడైన గరుత్మంతుడి దిక్కునకు; తాను+అ= తానే; చాలి= శక్తి గల్గినవాఁడై; సుముఖున్= సుముఖుడిని; చిర+ఆయుః+ఉపేతున్+చేసినన్= దీర్ఘాయుష్యంతో కూడినవాడిని చేయగా.

తాత్పర్యం: వారి అదృష్టంవలన అప్పుడు ఇంద్రుడూ ఉపేంద్రుడూ ఒకే చోట ఉన్నారు. మాతలి వారిని చూచి వచ్చిన కార్యం నివేదించాడు. అందుకు సురపతి కరుణించి విష్ణుదేవుడికి చెప్పి చేయించదలచి, గరుత్మంతుడి విషయంలో తాను చాలుదునని ఎంచి సుముఖుడిని దీర్ఘాయుష్మంతుణ్ణి చేశాడు.

క. **మాతలి పాణిగ్రహణం । బాతనిఁ జేయించియున్న నంతయు విని తా**
నేతెంచి గరుడుఁ డతి కో । పాతురుఁడై రేఁగి పెలుచ నమరాధిపుతోన్. **293**

వ. **వాసుదేవ సన్నిధి నిట్లనియె.** **294**

ప్రతిపదార్థం: మాతలి= ఇంద్ర సారథి; ఆతనిన్= సుముఖుడిని; పాణిగ్రహణంబు చేయించి= పెండ్లి చేయించి; ఉన్నన్= సుఖంగా ఉండగా; అంతయున్+విని= ఆ విషయమంతా తెలిసి; గరుడుఁడు= గరుత్మంతుఁడు; తాన్+ఏతెంచి= తా నచ్చటికి వచ్చి; అతికోప+ఆతురుఁడు+ఐ= మిక్కిలి కోపంతో ఒడలు తెలియనివాడై; పెలుచన్+రేఁగి= మిక్కిలి చెలరేగి; అమర+అధిపుతోన్= దేవతలకు రాజైన ఇంద్రుడితో; వాసుదేవ సన్నిధిన్= నారాయణుడి సముఖంలో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: మాతలి తన పుత్రికను సుముఖుడి కిచ్చి వివాహం జరిపించి ఉండగా ఆ సంగతి విని గరుత్మంతుడు అక్కడికి వచ్చి క్రోధపరవశుడై ఇంద్రుడితో నారాయణుడి సమక్షంలో ఇట్లా అన్నాడు:

క. **'విను నీ వదితిసుతుండవు । వినత కొడుక నేను; విఱ్ఱవీఁగెడు మనకున్**
జనకుఁడు గ శ్యపుఁ డొక్కఁడ; । దనుజుల శోధించి చంపుదమ యిరువురమున్. **295**

ప్రతిపదార్థం: విను= వినుము; నీవు; అదితిసుతుండవు= అదితియొక్క కొడుకవు; నేను; వినత కొడుకన్= వినతయొక్క కొడుకును; విఱ్ఱవీఁగెడు మనకున్= మిక్కిలిఒప్పుతున్న మనకు; జనకుఁడు= తండ్రి; కశ్యపుఁడు+ఒక్కఁడు+అ= కశ్యపుడొకడే; ఇరువురమున్= మనమిద్దరమునూ; దనుజులన్= రక్కసులను; శోధించి= వెదకి; చంపుదము+అ= చంపుదామా?

తాత్పర్యం: 'అదితిపుత్రుడవు నీవు. వినతా పుత్రుడను నేను. వైభవాతిశయంగల మన కిద్దరికీ కశ్యపు డొక్కడే తండ్రి. ఇద్దరం కలిసి రాక్షసులను వెదకి వెదకి చంపుదామా?

క. **ఏమిట నీకేఁ దక్కువ । నా మేరకు నడ్డపడితి 'నావుడు నింద్రుం**
డీ మహనీయ మహిమకును । ధామము విష్ణుండుగాక తక్కొరుఁ డగునే?' **296**

ప్రతిపదార్థం: నీకున్= నీకు; ఏన్= నేను; ఏమిటన్= ఏ విషయంలో; తక్కువ?= లొచ్చు?; నా మేరకున్= నా నిర్ణయానికి; అడ్డపడితి(వి)= అడ్డం వచ్చావు; నావుడున్= అని గరుత్మంతుడనగా; ఇంద్రుండు= ఇంద్రుడు; ఈ మహనీయ మహిమకును= ఈ నీ గొప్ప ప్రభావానికి; ధామము= ఆశ్రయం; విష్ణుండు+కాక= విష్ణుదేవుడే తప్ప; తక్కు+ఒరుఁడు+అగునే?= మరొక్కడు కాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఇంద్రా! ఏ విషయంలో నేను నీ కంటె తక్కువ? నా నిర్ణయానికి నీవెందుకు అడ్డుపడ్డావు? అని గరుత్మంతుడు ప్రశ్నించగా సురనాథుడు ఈ నీ గొప్ప ప్రభావానికి అంతటికీ విష్ణుదేవుడు తప్ప మరొక్కడు కారణం కాదు.'

వ. అనిన విని గటకటం బడి గరుత్మంతుం డిట్లనియె: 297

ప్రతిపదార్థం: అనినన్; విని; కటకటంబడి= విచారపడి; గరుత్మంతుండు= గరుత్మంతుడు; ఇట్లు+అనియెన్= ఇట్లాఅన్నాడు.

తాత్పర్యం: ఇంద్రుడి మాటలకు విచారపడి గరుత్మంతు డిట్లా అన్నాడు :

ఉ. 'తమ్ముఁడ! నీవు నా కొలఁది తథ్యమెఱుంగక నాకు నీచభా
వమ్మగు భంగిఁ జేసితివి; వాసవ! యి య్యదితి ప్రసూత వం
శ మ్మఖిలమ్ముఁ దాల్తు నొక సన్నపు టీఁకన; యిట్టి నన్ను నీ
విమ్మెయి దూలపుత్తె! యని యీక్షణరోచులఁ గెం పెలర్పఁగన్. 298

ప్రతిపదార్థం: తమ్ముఁడ!= తమ్ముడవైన ఇంద్రుడా!; నీవు= నీవు; నా కొలఁది= నా శక్తి యొక్క పరిమాణం; తథ్యము= వాస్తవంగా; ఎఱుంగక= తెలియజాలక; నాకున్= నాకు; నీచభావమ్ము+అగుభంగిన్+చేసితివి= అల్పస్థితి కలిగేటట్లు వ్యవహరించావు; వాసవ!= ఇంద్రా! ఈ+అదితి ప్రసూత వంశమ్ము+అఖిలమ్మున్= ఈ అదితికి జన్మించిన దేవతాకులం అంతటినీ; ఒక సన్నము+ ఈఁకన్+అ= ఒక సన్నపాటి ఈకమీదే; తాల్తున్= ధరించగలను; ఇట్టి నన్నున్= ఇట్లాంటి బలాఢ్యుడవైన నన్ను; నీవు= నీవు; ఈ+మెయిన్= ఈ విధంగా; తూల+పుత్తె?= చిన్నబుచ్చుతావా?; అని= అంటూ; ఈక్షణరోచులన్= కన్నుల కాంతులందు; కెంపు+ఎలర్పఁగన్= ఎర్రదనం అతిశయించగా.

తాత్పర్యం: 'తమ్ముడా! నీవు నా శక్తి సామర్థ్యాలు ఎట్లాంటివో వాస్తవంగా గ్రహించలేక నాకు హీనత్వమేర్పడేటట్లుగా ప్రవర్తించావు. అదితిగన్న సమస్త దేవతాకులాన్ని ఒక సన్నని ఈకపై ధరించగలను సుమా! ఇంతటి బలాఢ్యుడిని నన్ను నీవీరకంగా చిన్నబుచ్చుతావా?' అని నేత్రకాంతులలో ఎర్రదనం నిండగా.

వ. ఉన్నం గనుంగొని కోపించి వాసుదేవుండు వెడనవ్వు నవ్వుచు. 299

ప్రతిపదార్థం: ఉన్నన్= అక్కడుండగా; కనుంగొని= చూచి; కోపించి= అలుకపూని; వాసుదేవుండు= నారాయణుడు; వెడనవ్వు+ నవ్వుచున్= వెటకారంగా నవ్వుతూ.

తాత్పర్యం: ఇంద్రుడిపై గ్రుడ్లురుముతూ అక్కడున్న గరుత్మంతుడిని చూచి నారాయణుడు వెటకారంగా నవ్వుతూ.

క. 'నీవేటి మోపుకాఁడవు? । నా వెరవున నిన్ను నడపినను గర్వం బే
లా వెడఁగ' యంచుఁ దనముం । జే వీఁపున నిడ సురేంద్రజిత్తు వికలుఁడై. 300

ప్రతిపదార్థం: వెడఁగ!= వివేకహీనుడా!; నీవు+ఏటి మోపుకాఁడవు?= నీవేపాటి బరువు మోయగలవాడవు?; నా వెరవునన్= నా చాతుర్యంచేత; నిన్నున్+నడపినను= నిన్ను ప్రవర్తింపజేస్తుంటే; గర్వంబు+ఏలా?= నీ కింతటి పొగరెందుకు?; అంచున్= అని;

తనముంజే= తనయొక్క ముంజేతిని; వీ(పునన్+ఇడన్= అతడి వీపుమీద ఉంచగా; సురేంద్రజిత్తు= ఇంద్రుడిని జయించిన గరుత్మంతుడు; వికలుఁడు+ఐ= బెదరినవాఁ డై.

తాత్పర్యం: 'అవివేకీ! నీవు ఏపాటి భారం మోయగలవురా? నా సామర్థ్యంతో నిన్ను నడుపుకొనివస్తుంటే నీకు పొగరెందుకు?' అంటూ పరమపురుషుడు తన ముంజేతిని అతడి వీపుమీద మోపాడు. ఆ భారానికి గరుత్మంతుడు బెదరిపోయాడు.

క. ఎఱకలు విచ్చుచుఁ దుండము । దెఱచుచు వ్రేఁగడరి సొగసి త్రెళ్ళి వివశుఁడై
యఱచిన నోడకుమని హరి । నెఱి సక్కఁగఁ ద్రోచి యెత్తె నెగయంగఁ గృపన్. 301

ప్రతిపదార్థం: ఎఱకలు= రెక్కలు; విచ్చుచున్= చాస్తూ; తుండము+తెఱచుచున్= నోరు (ముక్కు పుటాలు) తెరుస్తూ; వ్రేఁగు+అడరి= బరువు అతిశయించటం చేత; సొగసి= మూర్ఛిల్లి; త్రెళ్ళి= క్రిందపడి; వివశుఁడు+ఐ= ఒడ లెరుగనివాడై; అఱచినన్= ఆక్రోశించగా; హరి= విష్ణుమూర్తి; ఓడకుము+అని= భయపడవద్దని; నెగయంగన్= ఎగురుటకు; నెఱిన్= ఈకలచిక్కును; చక్కఁగన్+త్రోచి= బాగుగా సవరించి; కృపన్= దయతో; ఎత్తెన్= పైకెత్తాడు.

తాత్పర్యం: పుండరీకాక్షుడు తన వీపుమీద చేయి మోపగానే ఆ బరువునకు గరుత్మంతుడు రెక్కలు చాస్తూ, నోరు తెరుస్తూ నొచ్చి నేలమీద కూలి ఒడలు తెలియక ఆక్రందనం చేశాడు. అంతట శ్రీహరి 'గరుడా! భయపడవ' ద్దని ఆతడి ఈకల చిక్కు చక్కగా సవరించి ఎగరటానికి కరుణతో అతడిని పైకెత్తాడు.

వ. ఇవ్విధంబునం గేశవుండు గరుణించి గరుడని ననునయించి 'యింక నవుదానికి నుద్ధతి మాని బుద్ధిగలిగి యుండు' మని వీడ్కొలిపి పుచ్చినం బోయెం; గావున గర్వంబు గొఱగా'; దింతయు నీ మహానుభావుం డెఱుంగునని నారదుం జూపియితండు మాతలి కన్యా కార్యంబునకుఁ దోడైనడచె; నడుగు; మదియకాదు సర్వేశ్వరుం డగు మాధవు మాహాత్మ్యం బితనికిం గరతలా మలకం బయి యుండు; బ్రభవిష్ణుండగు నాదివిష్ణుండు గదా యీ కృష్ణుం డీతని సహాయత్వంబు గల కౌంతేయులతోడం గూడి మనికి కార్యం' బనిన నారదుండు ధార్తరాష్ట్రు నాలోకించి.' 302

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; కేశవుండు= శ్రీహరి; కరుణించి= దయచూపి; గరుడనిన్= గరుత్మంతుడిని; అనునయించి= ఓదార్చి; ఇంకన్= ఇటుపై; అవుదానికిన్= జరుగనున్న దానికి; ఉద్ధతిన్మాని= గర్వం వదలి; బుద్ధి+కలిగి+ఉండుము; అని; వీడ్కొలిపి= సెలవొసగి; పుచ్చినన్= పంపగా; పోయెన్= వెళ్ళాడు; కావునన్; గర్వంబు; కొఱగాదు= పనికిరాదు; ఇంతయున్= ఈ సంగతిఅంతా; ఈ+మహా+అనుభావుండు= ఈ మహాత్ముడు; ఎఱుంగన్+అని; నారదున్+చూపి; ఇతండు= ఈ నారదమహర్షి; మాతలి కన్యా కార్యంబునకున్= మాతలి కొమార్తె పనికై; తోడు+ఐ నడచెన్= సాయంగా వెంట వెళ్ళాడు; అడుగుము= నారదుడిని ప్రశ్నించుము; అది+అ కాదు= అంతమాత్రమే కాదు; సర్వ+ఈశ్వరుండు+అగు= విశ్వానికి ప్రభువైన; మాధవు మాహాత్మ్యంబు= లక్ష్మీవల్లభుడి ప్రభావం; ఇతనికిన్= నారదుడికి; కరతల+ఆమలకంబు+అయి+ఉండున్= చేతిలోని ఉసిరిక కాయవలె స్పష్టంగా తోస్తూ ఉంటుంది; ఈ కృష్ణుండు= ఈ కృష్ణమూర్తి; ప్రభవిష్ణుండు+అగు= ప్రభావశీలుడైన; ఆదివిష్ణుండు+కదా!= ఆదినారాయణమూర్తికదా!; ఈతని సహాయత్వంబు+కల= ఈతని తోడ్పాటు కలిగిఉన్న; కౌంతేయుల తోడన్= కుంతీ కుమారులతో; కూడి మనికి= కలసి జీవించటం; కార్యంబు= చేయదగిన పని; అనినన్= అని కణ్వమహాముని పలుకగా; నారదుండు; ధార్తరాష్ట్రున్= ధృతరాష్ట్రుడి కుమారుడైన దుర్యోధనుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఈ విధంగా విష్ణుదేవుడు దయచూపి గరుత్మంతుడిని ఊరడించి, 'ఇక మీదట నీవు గర్వం విడిచి బుద్ధిగలిగి ఉండు'మని సెలవిచ్చి పంపగా, అతడు వెళ్ళిపోయాడు. కావున గర్వం పనికి రాదు. ఇదంతయు మహాత్ముడైన ఈ నారద మహర్షికి తెలుసు' అని దుర్యోధనుడికి నారదుడిని చూపి 'ఈయన మాతలి కొమార్తె పనికై వారి వెంట వెళ్ళాడు. ఈయనను అడిగిచూడుము. ఇంతేకాదు, సర్వేశ్వరుడైన శ్రీకృష్ణుడి మహిమ ఇతడికి అరచేతిలోని ఉసిరిక కాయ సుమా! ప్రభావశీలుడైన ఆదినారాయణమూర్తియే ఈ దేవకీనందనుడని గ్రహించుము. ఈయన తోడ్పాటు గల కుంతీపుత్రులతో నీవు పొత్తుగలిగి ఉండటం చేయదగిన పని' అని కణ్వమహర్షి పలికాడు. అప్పుడు నారద మునీంద్రుడు సుయోధనుడిని చూచి.

క. 'బలవంతుల బలములు న । నగ్గలమగు బల మెదురఁ గలుగఁగాఁ గీడ్పడు నే
కొలఁదుల వారికి గర్వము । నిలుచునె నయమార్గ వృత్తి నిలిచిన భంగిన్.' 303

ప్రతిపదార్థం: బలవంతుల బలములు= బలశాలులయొక్క శక్తులు; ఎదురన్= తమముందు; అగ్గలము+అగు+బలము= అధికమైన బలం; కలుగఁగాన్= ఏర్పడగా; కీడ్పడున్= తక్కువయిపోతుంది; ఏ కొలఁదుల వారికిన్= ఎంతటి శక్తి సంపన్నులకైనా; నయమార్గవృత్తి= న్యాయమార్గ ప్రవర్తనం; నిలిచిన భంగిన్= నిలబడినట్లుగా; గర్వము= పొగరు; నిలుచునె?= నిలబడగలదా?;

తాత్పర్యం: 'బలవంతుల బలాలు అంతకంటె మిక్కుటమైన బలం ఎదురైనపుడు అవి క్రిందైపోతాయి. ఎంతటి శక్తిసంపన్నులకయినా ధర్మమార్గ ప్రవర్తనం తలయెత్తి నిలబడినట్లుగా అహంకారం నిలబడలేదు.'

వ. అని పలికి వెండియు నిట్లనియె: 304

తాత్పర్యం: అని పలికి మరల నారదు డిట్లా వచించాడు :

ఆ. 'ఇదియకాని చేయ నెద్ది యే ననుచు । నిర్బంధవృత్తిఁ దలఁపు వట్టికొనిన
నట్టి వాని కెందు నలజడి వాటిల్లు । గాలవుండు గుఱియ కాఁడె మనకు? 305

ప్రతిపదార్థం: ఇదియకాని= ఈ పని దప్ప; ఎద్దియేన్= మరేపనిని; చేయన్+అనుచున్= నేను చేయనని; నిర్బంధవృత్తిన్= కదలమెదలగూడని పట్టుదలయందు; తలఁపు పట్టుకొనినన్= తన అభిప్రాయం నిల్పితే; అట్టివానికిన్= అట్లాంటి మొండి పట్టుపట్టినవాడికి; ఎందున్= ఎచ్చటకూడ; అలజడి= క్లేశం; పాటిల్లున్= కల్గుతుంది; గాలవుండు= గాలవుడనే ముని కుమారుడు; మనకున్= మనకు; గుఱి+అ కాఁడె= ఇందుకు సాక్షి కాడా?

తాత్పర్యం: 'నేనీ పనిదప్ప మరే పనీ చేయను - అని మొండిపట్టుపట్టినవాడికి ఎక్కడ కూడా ఆపదలే కల్గుతాయి. గాలవుడనే ముని కుమారుడు ఇందుకు ఉదాహరణం.

వ. వినుము విశ్వామిత్రు పాల విద్యాభ్యాసంబు సేసి గాలవుండను మునికుమారుండు 'గురుదక్షిణ యేమి సమర్పింతు' నని యడిగిన, నతం'డేమియు నేల?'యని యుడిపిన, నుడుగక యెన్ని సెప్పిన నన్నింటికి నన్నిసెప్పి నిర్బంధించినఁ, గటకటంబడి యత్తపోధనవర్యుం 'డట్లేని శుద్ధ ధవళవర్ణంబులై యొక్క కర్ణంబు నీలంబైన యుత్తమాశ్వంబు లెనమన్నూఱు దెచ్చి యి'మ్మని పలికినం బోయి. 306

ప్రతిపదార్థం: వినుము; విశ్వామిత్రుపాలన్= విశ్వామిత్రుడి దగ్గర; విద్యా+అభ్యాసంబు చేసి= విద్యను నేర్చి; గాలవుండు అను ముని కుమారుండు; గురుదక్షిణ; ఏమి; సమర్పింతున్?= ఇచ్చికొనేది?; అని+అడిగినన్; అతండు= విశ్వామిత్రుడు; ఏమియున్; ఏల; అని; ఉడిపినన్= మాన్పగా; ఉడుగక= మానక; ఎన్ని చెప్పినన్; అన్నింటికిన్; అన్నిచెప్పి; నిర్బంధించినన్= బలాత్కారం చేయగా; కటకటంబడి= కోపించి; ఆ+తపోధన+వర్యుండు= తపమే ధనంగా గల మునులలో శ్రేష్ఠుడు విశ్వామిత్రుడు; అట్లు+ఏనిన్= అట్లా అయితే; శుద్ధ ధవళ వర్ణంబులై= కేవలం తెల్లని రంగు కలిగినవై; ఒక్క కర్ణంబు= ఒక చెవి; నీలంబు+ఐన= నల్లనిరంగు కలిగిన; ఉత్తమ+అశ్వంబులు= మేలుజాతి గుర్రాలు; ఎనమన్నూఱు= ఎనిమిది వందలు; తెచ్చి+ఇమ్ము; అని; పలికినన్; పోయెన్= తేవటానికి గాలవుడు వెళ్ళాడు.

తాత్పర్యం: దుర్యోధనా! ఆ గాలవుడి వృత్తాంతం వినుము. గాలవుడనే ముని కుమారుడు విశ్వామిత్రుడి దగ్గర విద్యలు అభ్యసించి 'తమకు గురుదక్షిణ నేనేమి సమర్పించుకొనవలెనో సెలవివ్వండి' అని గాధేయుడిని అడిగాడు. అందుకు విశ్వామిత్రుడు 'ఏమీ వద్దు' అన్నాడు. అన్నప్పటికీ గాలవుడు మానక గురువు చెప్పిన ప్రతిమాటకూ బదులు చెపుతూ గురుదక్షిణ చెప్పితీరవలెనని బాధించాడు. విశ్వామిత్రుడికి కోపం వచ్చింది. అట్లాగయితే శరీరమంతా తెల్లగా ఉండి, ఒక చెవిమాత్రం నల్లగా ఉండే మేలుజాతి గుర్రాలు ఎనిమిదివందలు తెచ్చి ఇవ్వవలసిందని అడిగాడు. అట్లాగే అని గాలవుడు అశ్వాలకోసం అక్కడినుంచి బయలుదేరివెళ్ళాడు.

తే. **గాలవుం డవ్విధము ఘోటకముల నెందుఁ । బడయలేక చింతాభరభ్రాంతుఁ డగుచు**
వెడలి యాహార నిద్రలు విడిచి తా మ । హాపథముఁ బోదుఁగాకని యరిగి యరిగి. **307**

ప్రతిపదార్థం: గాలవుండు= గాలవుడు; ఆ+విధము ఘోటకములన్= ఆ రకమైన గుర్రాలను; ఎందున్= ఎక్కడా; పడయన్‌లేక= సంపాదించలేక; చింతాభర+భ్రాంతుఁడు+అగుచున్= విచారభారంచేత మనసు చలించినవాడు ఔతూ; వెడలి= పయనమై; ఆహారనిద్రలు విడిచి; తాన్= తాను; మహాపథమునన్+పోదున్+కాక= ప్రాణాంతం కావించుకుంటాను గాక; అని; నిశ్చయించుకొని; అరిగి అరిగి= వెళ్ళి వెళ్ళి.

తాత్పర్యం: దేహమంతా తెలుపు, ఒక చెవి మాత్రం నలుపు కలిగిన గుర్రాలను గాలవుడు ఎక్కడా సంపాదించలేక పోయాడు. విచారభారం చేత భ్రమచెంది ఆహారనిద్రలు కూడ మాని వేశాడు. ప్రాణాంతం చేసుకుంటానని నిర్ణయించుకొని గాలవుడు అట్లా వెళ్ళి వెళ్ళి.

వ. **ఒక్కచో గరుడునిం గని బాలసఖుండు గావున నతనికిం దనవృత్తాంతంబు సెప్పిన నతండు కరుణా భరితుండై** **308**

ప్రతిపదార్థం: ఒక్కచోన్= ఒకచోట; గరుడునిన్+కని; బాలసఖుండుకావునన్= చిననాటి చెలికాడు గనుక; అతనికిన్; తన వృత్తాంతంబు= తన సమాచారం; చెప్పినన్; కరుణా భరితుండు+ఐ= గరుత్మంతుడు దయతో నిండినవాడై

తాత్పర్యం: దైవికంగా ఒకచోట గరుత్మంతుడిని చూశాడు. గరుత్మంతుడు తనకు చిననాటి చెలికాడుగనుక అతనికి సంగతి అంతా చెప్పాడు. గరుడుడు దయతో నిండిన మనసు కలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **'దేవతలు గాని యిట్టివి । గావింపం జాల రీ సకల దిక్కులలో**
దేవేంద్రు దిక్కు బహు దివి । జావాసం బందుఁ బోద మని మునిపుత్త్రున్.' **309**

ప్రతిపదార్థం: దేవతలు+కాని= వేల్పులు తప్ప; ఇట్టివి= ఇటువంటి పనులు; కావింపన్+చాలరు= చేయలేరు; ఈ సకల దిక్కులలోన్= ఈ దిక్కులన్నింటిలో; దేవేంద్రు దిక్కు= తూర్పు; బహు దివిజ+ఆవాసంబు= పలు దేవతలకు నిలయం; అందున్+పోదము+అని= అక్కడికి వెళ్ళుదామని; మునిపుత్రున్= గాలవుడిని.

తాత్పర్యం: దేవతలు తప్ప ఇలాంటి కార్యాలు ఇతరులు సాధించలేరు. అన్ని దిక్కులలో తూర్పు దిక్కు వేల్పులకు నిలయం కనుక అక్కడకి వెళదామని గరుత్మంతుడు గాలవుడితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **అఱకడ నిడి ప్రాఙ్ముఖుఁడై। పఱచి జలధిలోనఁ జదలఁ బాఱెడునెడఁ జె**
య్వఱి దప్పి నిలువఁ జాలక। యొఱగిన గాలవుని డించె నొక గిరి మీఁదన్. **310**

ప్రతిపదార్థం: అఱకడన్+ఇడి= భుజస్కంధంపై పెట్టుకొని; ప్రాక్+ముఖుఁడు+ఐ= తూరుపు మొగమైనవాడై; పఱచి= పరువెత్తి; జలధిలోనన్= సముద్రంమీద; చదలన్= ఆకాశంలో; పాఱెడు+ఎడన్= ఎగిరిపోయేటప్పుడు; చెయ్వు+అఱి= చేష్టలుడిగి; దప్పిన్= శ్రమచేత; నిలువన్+చాలక= స్కంధ ప్రదేశంమీద ఉండలేక; ఒఱగిన గాలవునిన్= ప్రక్కకు వ్రాలిన గాలవుడిని; ఒక గిరిమీఁదన్= ఒక కొండమీద; డించెన్= గరుత్మంతుడు దించాడు.

తాత్పర్యం: గరుత్మంతుడు గాలవుడిని తన భుజస్కంధంమీద కూర్చుండ బెట్టుకొని, తూర్పు ముఖంగా బయలుదేరి సముద్రంమీద ఆకాశవీథిలో ఎగిరిపోతూ ఉండగా గాలవుడు చేష్టలుడిగి, శ్రమచేత నిలువలేక ప్రక్కకొరుగుతుండగా అతడిని ఒక కొండ మీద దించాడు.

వ. **ఇట్లు డించి డప్పిదేర్చి యందుఁ గశ్యప నందనుండు శాండిలి యను నొక్క తపస్విశాపంబునఁ బక్షంబులు డుల్లి యనుగ్రహంబునం గ్రమ్మఱ వచ్చిన విషాదమోదంబు లనుభవించి యట ననుట సాలించి మగుడ మహీతలంబునకు మునికుమారుం దెచ్చి యయాతి తన నెచ్చెలియని ప్రతిష్ఠానపురనాథుండగు నతని కడకు నాతనిం దోడ్కొని చని, యగ్గాలవు తెఱం గెఱింగించిన నతండు.** **311**

ప్రతిపదార్థం: ఇట్లు; డించి= దించి; డప్పి+తేర్చి= శ్రమను పోగొట్టి; అందున్= ఆ గిరిమీద; కశ్యపనందనుండు= కశ్యపప్రజాపతి కుమారుడైన గరుత్మంతుడు; శాండిలి+అను+ ఒక్క తపస్వి శాపంబునన్= శాండిలి అనే పేరుగల ఒకానొక ముని శాపం వలన; పక్షంబులు= రెక్కలు; డుల్లి= రాలి; అనుగ్రహంబునన్= ఆ ముని కృపవలన; క్రమ్మఱన్= మరల; వచ్చినన్= మొలవగా; విషాద+మోదంబులు= రెక్కలు రాలినందుకు దుఃఖమును, మరల మొలచినందుకు సంతోషమును; అనుభవించి; అటచనుట= అలా తూర్పు దెసకు వెళ్ళటం; చాలించి= మాని; మగుడన్= మరల; మహీతలంబునకున్= భూస్థలికి; మునికుమారున్+తెచ్చి; యయాతి= యయాతి అనే పేరుగల రాజు; తన నెచ్చెలి+అని= తన ప్రియమిత్రుడని; ప్రతిష్ఠాన పురనాథుండు+అగు= ప్రతిష్ఠాన పట్టణానికి అధిపతిఅయిన; అతని కడకున్= యయాతిదగ్గరకు; అతనిన్= గాలవుడిని; తోడ్కొని చని= తీసికొని వెళ్ళి; ఆ+గాలవు తెఱంగు= ఆ గాలవుని వృత్తాంతం. ఎఱింగించినన్= చెప్పగా; అతండు= ఆ యయాతి మహారాజు.

తాత్పర్యం: గరుత్మంతుడు గాలవుడిని కొండమీద దించి బడలిక పోగొట్టాడు. అక్కడ శాండిలి అనే పేరుగల ఒక మునీశ్వరుడి శాపంవలన తన రెక్కలు రాలి పడగా దుఃఖించి ఆ ముని అనుగ్రహంతో మరల మొలవగా సంతోషించి తూర్పు దెసగా ప్రయాణం సమకట్టటం మానివేశాడు. గరుడుడు మరల గాలవుని భూమండలానికి

కొనివచ్చాడు. ప్రతిష్ఠానపురాధీశ్వరుడు యయాతి తనకు అనుగు చెలికాడగుటవల్ల అతడి చెంతకు గాలవుడిని తోడ్కొని వెళ్ళి ఆతడి వృత్తాంతమంతా చెప్పాడు.

క. తన కట్టి గుఱ్ఱములు లే। కునికిని మాధవి యనంగ నొప్పెడు పుత్త్రిన్
ముని కొసఁగె దీనికై యే। మనుజేశుఁడు నీఁడె హయసమాజము ననుచున్. 312

ప్రతిపదార్థం: తనకున్= తనకు; అట్టి గుఱ్ఱములు= అట్లాంటి గుర్రాలు; లేక+ఉనికిని= లేకుండుటవలన; మాధవి+అనంగన్+ ఒప్పెడు= మాధవి అనే పేరుతో ప్రకాశించే; పుత్త్రిన్= కొమార్తెను; దీనికై= ఈ కన్యకకై; ఏ మనుజ+ఈశుఁడు= ఏ రాజైనను; హయసమాజమున్= అశ్వాల సమూహాన్ని; ఈఁడె?= ఇవ్వకుంటాడా?; అనుచున్= అని భావించి; మునికిన్+ఒసఁగెన్= గాలవుడికి సమర్పించాడు.

తాత్పర్యం: యయాతి మహారాజు తనకు అట్లాంటి గుర్రాలు లేనందున మాధవి అనే తన పుత్రికను - ఈ కన్యక కొరకై ఏ రాజైనను గుర్రాల నివ్వకపోతాడా అని భావించి గాలవుడికి ఆమెను సమర్పించాడు.

వ. ఇ ట్లొసంగినం దోడుకొని. 313

తాత్పర్యం: ఇట్లా ఇవ్వగా ఆమెను (మాధవిని) వెంటబెట్టుకొని.

తే. ఇట్టి హయములుగల రాజు లెవ్వరొక్కొ!। యనుచుఁ దిరిగి యయోధ్యకుఁ జని తదీయ
నాథు నిక్ష్వాకుఁ గనిన నన్నరవరుండు। దనకు నిన్నూఱు కాని లేవనియె హరులు. 314

ప్రతిపదార్థం: ఇట్టి హయములు= ఇట్లాంటి గుర్రాలు; కలరాజులు= కలిగిన భూపతులు; ఎవ్వరు+ఒక్కొ!= ఎవరున్నారో!; అనుచున్= అని తలస్తూ; తిరిగి= సంచరించి; అయోధ్యకున్+చని= అయోధ్యానగరానికి వెళ్ళి; తదీయనాథున్= ఆ పట్టణ ప్రభువైన; ఇక్ష్వాకున్+కనినన్= ఇక్ష్వాకు భూపాలుడిని దర్శించగా; ఆ+నరవరుండు= ఆ మనుజేశ్వరుడు; తనకున్= తనకు; ఇన్నూఱు+అ+కాని= రెండువందలే తప్ప(అంతకుమించి); హరులు= గుర్రాలు; లేవు+ అనియెన్= లేవని చెప్పాడు.

తాత్పర్యం: యయాతి మహారాజు తనకిచ్చిన మాధవిని వెంటబెట్టుకొని, గాలవుడు విశ్వామిత్రుడు చెప్పిన లక్షణాలు కల గుర్రాలు కలిగిన రాజు లెవరా అంటూ సంచారం చేసి, ఇక్ష్వాకు మహారాజు ఏలుతున్న అయోధ్యానగరానికి వచ్చాడు. ఆయనను సందర్శించాడు. ఆయన తనకు అట్లాంటి గుర్రాలు రెండువందలు తప్ప అంతకుమించి లేవని చెప్పాడు.

క. అన విని మాధవి ఋషికి। ట్లను నొక్క మహానుభావు నతుల వరమునం
దనయవతి నయ్యు నేఁ గ। న్యన యగుదుంగాన నిమ్ము నన్నీతనికిన్. 315

ప్రతిపదార్థం: అనన్+విని= ఇక్ష్వాకు మహారాజు అట్లా చెప్పగా విని; మాధవి= యయాతి పుత్రి; ఋషికిన్= మునిఅయిన గాలవుడికి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నది; ఒక్క మహానుభావు+ అతులవరమునన్= ఒకానొక మహనీయుడి సాటిలేని వరంచేత; తనయవతిన్+అయ్యున్= బిడ్డలు కన్నదానసైనప్పటికిన్నీ, నేన్= నేను; కన్యన్+అ+అగుదున్= పెండ్లికాని కన్యకగానే ఉంటాను; కానన్= కాబట్టి; నన్నున్= నన్ను; ఈతనికిన్= ఈ ఇక్ష్వాకు మహారాజునకు; ఇమ్ము= అర్పించుము.

తాత్పర్యం: ఇక్ష్వాకు విభుడి మాట లాలకించి మాధవి గాలవుడితో ఇట్లా చెప్పింది. 'ఒకానొక మహాత్ముడి వరప్రభావం వలన నేను బిడ్డలను కన్నప్పటికీ, కన్యకగానే ఉంటాను. కనుక నన్ను ఈతడికి భార్యగా సమర్పించండి.

వ. ఒక్క సమయంబు సేసికొని యిచ్చి గుఱ్ఱంబులు వచ్చినవి యెల్లరాఁబుచ్చి కొమ్మనిన గాలవుండు నవ్విధంబునకు సమ్మతించె; నపత్యార్థియై యిక్ష్వాకుండును నయ్యుంకువునకు భార్య యగుట పుత్త్రజన్మావధిగా నొడివి యశ్వంబుల నొసంగి కన్యకం బరిగ్రహించి దానియందు వసుమనస్సుండను కొడుకుం బడసి గాలవునకు నమ్మగువను మగుడ సమర్పించినఁ జూచి యబ్భంగిం గలచోట్ల నెల్ల నరసి తురంగంబులం గావించికొమ్మని యతనికిం జెప్పి సుపర్ణుండు సనియె; మఱియు మహీతలంబునం గ్రుమ్మరి యమ్ముని కుమారుండు గందువ లెఱింగి పోవంబోవ. 316

ప్రతిపదార్థం: ఒక్క సమయంబు+చేసికొని= ఒక ఒడంబడిక కావించుకొని; ఇచ్చి= పత్నిగా నన్నొసగి; గుఱ్ఱంబులు వచ్చినవి+ ఎల్లన్= వచ్చిన గుఱ్ఱాల నన్నింటిని; రాన్+పుచ్చికొమ్ము= వచ్చినట్లుగా తీసికొమ్ము; అనినన్= అని మాధవి చెప్పగా; గాలవుండు; ఆ విధంబునకున్; సమ్మతించెన్= అంగీకరించాడు; ఇక్ష్వాకుండును; అపత్య+అర్థిఐ= సంతానాన్ని అభిలషిస్తున్నవాడై; ఆ+ఉంకువునకున్= ఆ శుల్కానికి (అల్లుడు కన్యకార్థం మామకిచ్చే ద్రవ్యం); భార్య+అగుట= మాధవి తనకు పెండ్లమగుట; పుత్త్రజన్మ+అవధిగాన్+నొడివి= కుమారుడు కలుగునంతవరకే గడువుగా చెప్పి; అశ్వంబులన్; ఒసంగి= గాలవున కిచ్చి; కన్యకన్; పరిగ్రహించి= స్వీకరించి; దానియందున్= మాధవియందు; వసుమనస్సుండు, అను కొడుకున్; పడసి= పొంది; గాలవునకున్; ఆ+మగువను= ఆ కాంతను; మగుడన్ సమర్పించినన్= తిరిగి ఇచ్చివేయగా; సుపర్ణుండు= గరుత్మంతుడు; చూచి= ఆ విధమంతా చూచి; ఆ+భంగిన్= ఆరీతిగా; కలచోట్లన్+ఎల్లన్+అరసి= గుఱ్ఱాలున్న తావులన్నిటిని చూచి; తురంగంబులన్= అశ్వములను; కావించికొమ్ము= సంపాదించుకొమ్ము; అని; అతనికిన్= గాలవునకు; చెప్పి; చనియెన్= తన దారిని తానే వెళ్ళాడు; మఱియున్; మహీతలంబునన్= భూ ప్రదేశంలో; క్రుమ్మరి= సంచరించి; ఆ+ముని కుమారుండు; కందువలు+ఎఱింగి= గుఱ్ఱాలున్న జాడలు దెలిసి; పోవన్+పోవన్= పోతూ పోతూ ఉండగా.

తాత్పర్యం: ఒక ఒడంబడిక చేసుకొని నన్ను ఇక్ష్వాకుడికి పత్నిగా నిచ్చి వచ్చిన గుఱ్ఱాలను వచ్చినట్లుగా పుచ్చుకొమ్మని మాధవి చెప్పింది. అందుకు గాలవుడు సమ్మతించాడు. సంతానం అభిలషిస్తున్న ఇక్ష్వాకు చక్రవర్తి, ఒక కుమారుడు కలుగునంత వరకే మాధవి తనకు భార్యగా ఉంటుందని పల్కి, కన్యాశుల్కంగా ఇన్నూరు గుఱ్ఱాలను గాలవుడికి సమర్పించాడు. ఇక్ష్వాకువు మాధవి యందు వసుమనస్సుడు అనే కొడుకును పొంది తిరిగి ఆమె నతని కిచ్చివేశాడు. ఇదంతయు గమనించిన గరుత్మంతుడు ఈ పద్ధతిలోనే గుఱ్ఱాలను సంపాదించుకొమ్మని మునిపుత్త్రుడికి చెప్పి వెళ్ళిపోయాడు. గాలవుడు గుఱ్ఱాల కొరకు అవనీతలంలో తిరుగుతున్నాడు.

క. ఆ సమయంబునను దివో । దాసుఁడు నౌశీనరుండుఁ దరుణికి నిన్నూ
ఱేసి హయంబుల నిచ్చి మ । హాసత్త్వుల సుతులఁ బడసి రధికప్రీతిన్. 317

ప్రతిపదార్థం: ఆ సమయంబునను= అట్టితరి; దివోదాసుఁడున్= కాశీనగరాధిపతి అయిన దివోదాసుఁడు; ఔశీనరుండున్= భోజపుర ప్రభువైన ఔశీనరుడును; తరుణికిన్= చెలువయైన మాధవికి; ఇన్నూఱు+ఏసి= రెండేసి వందలు; హయంబులన్+ఇచ్చి= గుఱ్ఱాల నొసగి; అధికప్రీతిన్= మిక్కుటమైన సంతోషంతో; మహాసత్త్వులన్= మిక్కిలి బలశాలులైన; సుతులన్+పడసిరి= కొడుకులను కన్నారు.

తాత్పర్యం: అట్టి సమయంలో కాశీశ్వరుడైన దివోదాసుడు, భోజపురాధీశ్వరుడైన ఔశీనరుడు మాధవికి రెండేసి వందల గుఱ్ఱాల నిచ్చి అధిక బలవంతులైన కుమారులను పరమసంతోషంతో పొందారు.

వ. ఇట్లు క్రమంబునఁ గాశీశ్వరునకుఁ బ్రతర్దనుని భోజపురనాథునకు శిబిం గనిన యక్కన్యకఁ గొని వెండియు వసుంధరం దిరుగుచుండ గరుత్మంతుండు గ్రమ్మఱి వచ్చి యమ్మునితో నీ వింక జాలింబడ వలవ; దొక్క కారణంబున నీ రాజులు ముగ్వురకు నివ్వాజులు గలిగె; నింతియకాని యొండెడ నీచందంబున మొత్తంబులై దొరకనేర; వియ్యాఱునూఱు గుఱ్ఱంబులను గురువునకు సమర్పింపు; మొక్కటి సెప్పెద విను'మని యిట్లనియె. 318

ప్రతిపదార్థం: ఇట్లు; క్రమంబునన్= వరుసగా; కాశీశ్వరునకున్= కాశీపట్టణప్రభువైన దివోదాసునకు; ప్రతర్దనునిన్= ప్రతర్దనుడనే కుమారుడినీ; భోజపురనాథునకున్= భోజపట్టణానికి భర్తఅయిన ఔశీనరునకు; శిబిన్= శిబిఅనే పుత్రుడినీ; కనిన= కనినట్టి; ఆ+కన్యకన్= బిడ్డలను కనికూడ కన్యాత్వం పాయని మాధవిని; కొని= గాలవుడు వెంటబెట్టుకొని; వెండియున్= మరల; వసుంధరన్= భూమిలో; తిరుగుచున్; ఉండన్; గరుత్మంతుండు; క్రమ్మఱివచ్చి= మరలివచ్చి; ఆ+మునితోన్= గాలవుడితో; నీవు; ఇంకన్; జాలిన్+పడన్+వలవదు= శ్రమపడవద్దు; ఒక్క కారణంబునన్= ఒక హేతువు చేత; ఈ రాజులు ముగ్వురకున్= ఇక్ష్వాకువు, దివోదాసుడు, ఔశీనరుడు అనే ఈ ముగ్గురు ప్రభువులకు; ఈ+వాజులు+కలిగెన్= ఈ గుఱ్ఱాలు లభించాయి; ఇంతియకాని= ఇంతేతప్ప; ఒండు+ఎడన్= మరొక్కచోట; ఈ చందంబునన్= ఈ మాదిరి; మొత్తంబులు+ఐ= గుంపులుగా; దొరకన్+నేరవు= లభించజాలవు; ఈ+ఆఱునూఱు గుఱ్ఱంబులను= నీవు సంపాదించిన ఈ ఆరువందల గుఱ్ఱాలను; గురువునకున్= గురువైన విశ్వామిత్రుడికి; సమర్పింపుము; ఒక్కటి చెప్పెదన్; వినుము; అని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా కాశీశ్వరుడైన దివోదాసుడికి ప్రతర్దనుడు అనే కుమారుడిని, భోజ పట్టణాధీశ్వరుడైన ఔశీనరునకు శిబి అనే తనయుడిని క్రమంగా మాధవి కన్నది. కనికూడా కన్యాత్వం కోల్పోని ఆమెను వెంటబెట్టుకొని మళ్ళీ గుఱ్ఱాలకై గాలవుడు భూ సంచారం చేస్తుండగా గరుత్మంతుడు మరల వచ్చి అతడితో- 'నీవిక శ్రమపడవద్దు. ఒకానొక కారణం చేత ఈ ముగ్గురు రాజులకు ఇట్లాంటి గుఱ్ఱాలు లభించాయి. అంతేకాని లోకంలో మరెక్కడా ఈ విధంగా ఇన్ని గుఱ్ఱాలు దొరకవు. ఈ ఆరువందల అశ్వాలను నీ గురుడైన విశ్వామిత్రుడికి సమర్పించుము. ఒక మాట చెపుతాను, వినుము.

క. ఈ ముగ్వుర తెఱఁగునఁ దగ । నా మునియుం గొడుకుఁ బడయునట్లుగ ని మ్మీ
కోమలిని గొఱంతకు వి । శ్వామిత్రున కెట్టులైన సంప్రార్థనతోన్. 319

ప్రతిపదార్థం: ఈ ముగ్వుర తెఱఁగునన్= ఈ ముగ్గురు రాజులవలెనే; తగన్= యుక్తంగా; ఆ+మునియున్= మౌనిఐన ఆ విశ్వామిత్రుడున్నూ; కొడుకున్= కుమారుడిని; పడయునట్లుగన్= పొందేటట్లుగా; కొఱంతకున్= తక్కువపడిన ఇన్నూరు గుఱ్ఱాల కొరకు; ఎట్టులు+ఐనన్= ఏవిధంగా నైనా; సంప్రార్థనతోన్= వేడికోలుతో; ఈ కోమలినిన్= సుకుమారిఅయిన ఈ మాధవిని; ఇమ్ము= గురుదక్షిణగా సమర్పించుము.

తాత్పర్యం: ఈ ముగ్గురు రాజుల వలెనే మౌనిఅయిన విశ్వామిత్రుడు కూడ కుమారుడిని కనే విధంగా తక్కువ పడిన ఆ రెండువందల గుఱ్ఱాలకొరకై ఎట్లాగైనా వేడుకొని విశ్వామిత్రుడికి తరుణిఅయిన మాధవిని సమర్పించవలసింది.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని తానునుఁ దోడుసని యత్తపస్విపాలికింబోయి యత్తెఱం గెఱింగించి, గాలవుం గానిపించి, 'యీతండు బాలుండు, నీవు దయాళుండ' వితనిం గృతార్థుం జేయవలయు నని ప్రార్థించి పక్షిరా జక్కార్యంబు చక్కంజేసి పోయిన. 320

ప్రతిపదార్థం: అని; తానును; తోడు+చని= సహాయంగా బయలుదేరి; ఆ+తపస్విపాలికిన్+పోయి= ఆ మునీంద్రుడి చెంతకుపోయి; ఆ+తెఱంగు+ఎఱింగించి= గాలవుడు ఆరువందల గుర్రాలను సంపాదించినవైనమూ, మరెక్కడా అలాంటి గుర్రాలు దొరకని స్థితీ తెలిపి; గాలవున్; కానిపించి= చూపి; ఈతండు; బాలుండు= పసివాడు; నీవు; దయాళుండవు= కరుణాస్వభావుడవు; ఇతనిన్; కృతార్థున్+చేయన్+వలయున్= కోరిక నెరవేరినవాడినిగా కావించవలెను; అని ప్రార్థించి= అని వేడుకొని; పక్షిరాజు= ఖగనాథుడైన గరుత్మంతుడు; ఆ+కార్యంబు; చక్కన్+చేసి= సరిపరచి; పోయినన్= వెళ్ళగా.

తాత్పర్యం: గరుత్మంతుడు తాను కూడ గాలవుడికి తోడుగా విశ్వామిత్ర మునీంద్రుడి పాలికి వెళ్ళి గాలవుడిని చూపి, అతడు ఆరువందల అశ్వాలను సంపాదించిన వైన మెరింగించి 'ఇతడు పసివాడు; నీవు కృపాస్వభావుడివి. ఇతడిని గురు ఋణంనుండి విముక్తుణ్ణి కావించు'మని వేడుకొని, పని చక్కబెట్టి వెళ్ళిపోగా.

క. మునివరుఁ డష్టకుఁ డనియెడు । తనయుఁ బడసి శిష్యునకు సుదతి నొప్పించెన్;
వనితయుఁ దపంబు సేయం । జనియెను; గాలవున కిట్టి చరితము గలిగెన్. 321

ప్రతిపదార్థం: మునివరుఁడు= మునులలో శ్రేష్ఠుడైన విశ్వామిత్రుడు, అష్టకుఁడు+అనియెడు= అష్టకుడనే పేరుగల; తనయున్+పడసి= కుమారుడిని పొంది; శిష్యునకున్= ఛాత్రుడైన గాలవుడికి; సుదతిన్= చక్కని దంతాలుగల మాధవిని; ఒప్పించెన్= అతడికి అప్పజెప్పాడు; వనితయున్= మాధవియు; తపంబుచేయన్+చనియెన్= తపస్సు చేయటానికి వెళ్ళింది; గాలవునకున్= గాలవుడికి; ఇట్టి చరితము= ఇట్టి వర్తనం; కలిగెన్= సంప్రాప్తమైనది.

తాత్పర్యం: మునిపుంగవుడైన విశ్వామిత్రుడు అష్టకుడనే కుమారుడిని కని శిష్యుడికి మాధవిని అప్పగించాడు. మాధవి కూడ తపస్సు చేసికొనటానికి వెళ్ళిపోయింది. గాలవుడి కథ ఇట్లా జరిగింది.

వ. కావున నెట్టివారికి నిర్బంధము దగదు; దుర్మానంబు దుర్దశ నాపాదించు; నయ్యయాతి దుర్మానంబునంగాదె పుణ్యలోక పరిభ్రష్టుండై మాధవీ పుత్త్రులగు నన్నలువురు దౌహిత్రులకతంబున నూర్ధ్వగతిం గనియె; నట్లగుటం జేసి. 322

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఎట్టివారికిన్= ఎటువంటివారికైనను; నిర్బంధము తగదు= బలాత్కారం కూడదు; దుర్మానంబు= దురహంకారం; దుర్దశన్= దుఃస్థితిని; ఆపాదించున్= కలిగిస్తుంది; ఆ యయాతి; దుర్మానంబునన్+కాదె= దుర్గర్వం వల్లనే కదా; పుణ్యలోక పరిభ్రష్టుండు+ఐ= ఉత్తమలోకాలనుండి జారినవాడై; మాధవీపుత్త్రులు+అగు= మాధవి అనే తన కొమార్తె కొడుకులైన; ఆ+నలువురు దౌహిత్రుల కతంబునన్= ఆ నలుగురు మనుమళ్ళ మూలాన (దుహిత= కూతురు; దౌహిత్రుడు= దుహితయొక్క పుత్త్రుడు- మనుమడు); ఊర్ధ్వగతిన్+కనియెన్= ఉత్తమలోక ప్రాప్తినందాడు; అట్లు+ అగుటన్+చేసి= అందువలన.

తాత్పర్యం: దుర్యోధనా! ఎట్టివారికైనా నిర్బంధం పనికిరాదు. దురహంకారం దుఃస్థితి కలిగిస్తుంది. యయాతి మహారాజు దురహంకారం చేతనే పుణ్యలోకాలనుండి దిగజారి కొమార్తె మాధవియొక్క నలుగురు తనయుల మూలాన ఊర్ధ్వలోక ప్రాప్తి నందాడు. కాబట్టి- (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నిర్బంధము దుర్మానము । దుర్బుద్ధికిఁ గాక తగునె? దుర్యోధన! నీ
మార్బలమె పాండవులకున్ । దౌర్బల్యము వాయు శుభము దలఁకొను సంధిన్. 323

ప్రతిపదార్థం: దుర్యోధన!= సుయోధనా!; నిర్బంధము= కదలమెదలగూడని కట్టుబాటూ; దుర్మానము= దురహంకారమూ; దుర్బుద్ధికిన్+కాక= దుష్టచిత్తుడికి తప్ప; తగునె?= నీకు తగునా? (తగవని అర్థం); నీ మార్బలమె?= పాండవులు నీకు శత్రుబలమా? (కారనుట); పాండవులకున్= కౌంతేయులకు; సంధిన్= పొత్తువలన; దౌర్బల్యము+పాయున్= దుర్బలత్వం తొలగుతుంది; శుభము= మేలు; తలఁకొనున్= కలుగుతుంది.

తాత్పర్యం: సుయోధనా! పరులను నిర్బంధించటం, దురహంకారం పూనటం దుష్టాత్ముడికి తప్ప నీకు తగవు. నీవు ప్రతిఘటించడం పాండవుల దౌర్బల్యాన్ని తొలగిస్తుంది. సంధివల్ల నీకు మేలు కల్గుతుంది.

విశేషం: సూర్యరాయాంధ్ర నిఘంటువులో ఈ పద్యమిట్లు పేర్కొనబడింది: **"క. నిర్బంధము దుర్మానము । దుర్బుద్ధికిఁ గాక తగునె? దుర్యోధన! నీ । మార్బలమె పాండవేయులు? దౌర్బల్యము వాయు, శుభముదలఁకొను సంధిన్."** ప్రతిపదార్థం: నిర్బంధమున్= బలాత్కారమూ; దుర్మానమున్= దురహంకారమూ; దుర్బుద్ధికిన్+కాక= దుష్టబుద్ధికి కాక; తగునె= తగునా?; దుర్యోధన!; పాండవేయులు= పాండవులు; నీ-మార్బలమె?= నీ శత్రుబలమా?; సంధిన్= సంధిచేత; దౌర్బల్యము+పాయున్= దుర్బలత్వము పోతుంది; శుభము= మంచి; తలఁకొనున్= కలుగుతుంది. (సంపా.)

వ. కృష్ణుని మాట విని నీ వీక్కౌరవాన్వయంబు రక్షింపు' మనియె; నివ్విధంబున నమ్మువ్వురు మునీంద్రులు సెప్పిన హితోపదేశంబుల దెస ననాదరంబు సేసి గాంధారేయుండు రాధేయుం గనుంగొని చేయప్పళించి నవ్వి 'వీర లింత వెఱ్ఱు లగుదురే?' యని పలికి వారల నవలోకించి. 324

ప్రతిపదార్థం: కృష్ణునిమాటన్; విని; నీవు; ఈ+కౌరవ+అన్వయంబున్= ఈ కురువంశమును; రక్షింపుము= కాపాడుము; అనియెన్; ఈ+విధంబునన్; ఆ+మువ్వురు; ముని+ఇంద్రులు= మునిశ్రేష్ఠులు, చెప్పిన; హిత+ఉపదేశంబుల దెసన్= హితబోధలపట్ల; అనాదరంబు+చేసి= అసమ్మతి చూపి; గాంధారేయుండు= గాంధారి కుమారుడైన దుర్యోధనుడు; రాధేయున్= కర్ణుడిని; కనుంగొని= చూచి; చే+అప్పళించి= చప్పట్లు చరచి; నవ్వి= పరిహసించి; వీరలు= ఈ మునులు; ఇంత వెఱ్ఱులు+అగుదురే?= ఇంత పిచ్చివారా? అని పలికి; వారలన్= ఆ మునీశ్వరులను; అవలోకించి= కనుగొని.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి మాటలు విని నీవు ఈ కురువంశాన్ని కాపాడుము'. అని నారదుడు పలికాడు. ఆ విధంగా ఆ ముగ్గురు మునిపుంగవులు చెప్పిన హితవాక్యాలను మన్నించక దుర్యోధనుడు కర్ణుడిని చూచి, చేయి చరుస్తూ, నవ్వి 'ఈ మునీశ్వరు లెంత పిచ్చివారు? అని పలికి, వారిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

దుర్యోధనుఁడు నారదాది మునుల మాటలు వినక నిరాకరించుట (సం. 5-122-1)

క. 'మునులార! నన్ను విధి యే । మని మును పుట్టించె నట్టులయ్యెడుఁ గా కీ
వినఁ జవి గాని పలుకులకుఁ । బని గలదే యుడుగుఁ డింక బహుభాషణముల్. 325

ప్రతిపదార్థం: మునులార!= ఓ మునీశ్వరులారా!; నన్నున్= నన్ను; విధి= బ్రహ్మదేవుఁడు; ఏమి+అని= ఎట్లు కమ్మని; మును= తొలుత; పుట్టించెన్= జన్మింపజేశాడో; అట్టులు+అయ్యెడున్+కాక= అట్లాగే జరుగుతుంది పొండు; ఈ+వినన్+చవికాని+

పలుకులకున్= వినుటకు రుచించని మీ మాటలవలన; పనికలదే?= ప్రయోజనముందా?; ఇంకన్= ఇక; బహుభాషణముల్= పలుమాటలు; ఉడుగుఁడు= మానండి.

తాత్పర్యం: 'ఓ మునీశ్వరులారా! బ్రహ్మదేవుఁడు నన్ను ఏమి కమ్మని పుట్టించాడో అట్లానే జరుగుతుంది. వినటానికి రుచించని మీ మాటలవలన ఏమి ప్రయోజనం? ఇక పలుమాటలాడటం చాలించండి.'

వ. **అనిన విని ధృతరాష్ట్రుం డమ్మహామునులతో నిట్లనియె.** **326**

ప్రతిపదార్థం: అనినన్; విని; ధృతరాష్ట్రుండు; ఆ+ మహామునులతోన్; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కుమారుని పలుకులు విని ధృతరాష్ట్రుడు ఆ మహర్షులతో ఇట్లా అన్నాడు:

తే. **'మీరు చెప్పిన బుద్ధులు గారవమునఁ । జేయఁ గాంచినఁ బుణ్యంబు సేయ నెట్లు**
నా ముఖంబునఁ గార్యంబు నడవ దేమి । సేయువాఁడ నొం డెద్దియుఁ జెప్పలేదు. **327**

ప్రతిపదార్థం: మీరు చెప్పిన బుద్ధులు= మీరు చేసిన హితోపదేశాలు; గారవమునన్= ఆదరంతో; చేయన్+కాంచినన్= చేయుటకు నోచియున్నచో; పుణ్యంబున్+ఎట్లు+చేయన్= సుకృతం చేసినవాడనే అగుదును గదా!; నా ముఖంబునన్= నా చేతిమీదుగా; కార్యంబు నడవదు= పని జరుగదు; ఏమి చేయువాఁడన్?= నేనేమి చేయగలను?; చెప్పన్= ఇంతకుమించి నుడువుటకు; ఒండు+ఎద్దియున్+లేదు= మరేమియూ లేదు.

తాత్పర్యం: 'మునిపుంగవులారా! మీరు చేసిన హితోపదేశాన్ని ఆదరంతో అనుసరించగలిగితే నేను పుణ్యం చేసినవాడనే ఔతాను గదా! కాని నావల్ల ఏ పనీ కాదు. నే నేమి చేయగలను? ఇంతకుమించి చెప్పవలసినదేమీ లేదు.'

క. **అని యతఁడు శౌరితో ని । ట్లను 'నిహముం బరముఁ గలుగునట్టి విధము నీ**
వనఘా! చెప్పితి; నాకుం । జన వేదియు లేదు దీన సమ్మతి నడపన్. **328**

ప్రతిపదార్థం: అని= అనుచు; అతఁడు= ధృతరాష్ట్రుడు; శౌరితోన్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనున్= ఈ లాగున అన్నాడు; అనఘా= పుణ్యాత్ముడా!; నీవు ఇహమున్= ఈ లోకమందు సుఖము; పరమున్= ఆలోకమందు సుఖము; కలుగు+అట్టివిధమున్= లభించే మార్గాన్ని; చెప్పితి(వి)= వచించావు; దీనిన్= నీవు చెప్పిన హితమును; సమ్మతిన్= అంగీకారముతో; నడపన్= ఆచరణలోనుంచుటకు; నాకున్= నాకు; చనవు= చొరవ, ఏదియున్+లేదు= ఏ మాత్రం లేదు.

తాత్పర్యం: మునులతో అట్లా పల్కి ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడితో ఇట్లాఅన్నాడు. 'పుణ్యపురుషా! ఇహపరాలు రెండూ సమకూడే విధమేదో నీవు చెప్పావు. కాని, నీవు చెప్పినట్లుగా కార్యం నిర్వర్తించటానికి నాకు ఏ మాత్రం చొరవ లేదు.

ఆ. **మందబుద్ధి నాదు నందనుఁ డీవు పో । రాని చుట్టమవు మహానుభావుఁ**
డవు దయార్ద్రచిత్తుఁడవు; వీనిఁ దేర్పవే । యనునయించి యెట్టులైనఁ గృష్ణ!' **329**

ప్రతిపదార్థం: కృష్ణ!= గోవిందా!; నాదు నందనుఁడు= నా కుమారుఁడు; మందబుద్ధి= మూఢచిత్తుడు; ఈవు= నీవు; పోరానిచుట్టమవు= త్రోసివేయరాని బాంధవుడవు; మహానుభావుఁడవు= మహాత్ముఁడివి; దయా+ఆర్ద్ర చిత్తుఁడవు= కృపచేత

తడిసిన మనస్సుకలవాడవు; వీనిన్= దుర్యోధనుడిని; అనునయించి= బుజ్జగించి; ఎట్టులు+ఐనన్= ఏ విధంగానైనను; తేర్పవే!= ప్రసన్నుడిని కావించుమయ్యా!

తాత్పర్యం: కృష్ణా! నా కుమారుడు మూఢచిత్తుడు. నీవో త్రోసిరాజనని బాంధవుడవు. మహాత్ముడవు. కారుణ్య కలిత హృదయుడివి. వీని నెట్లాగయినా శాంతింపజేయు మని వేడుకొంటున్నాను.'

క. అనిన ముకుందుఁడు దుర్యో । ధనుతో నిట్లనియె 'విమల తర వంశమునన్
జనియించి తెల్లగుణముల । ననూనుఁడవు నీకు నా దురాగ్రహ మేలా? 330

ప్రతిపదార్థం: అనినన్= అని ధృతరాష్ట్రుడు కోరగా; ముకుందుఁడు= కృష్ణుడు; దుర్యోధనుతోన్= సుయోధనుడితో; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా అన్నాడు; విమలతర వంశమునన్= పరమ స్వచ్ఛమైన కురుకులంలో; జనియించితి(వి)= పుట్టావు; ఎల్లగుణములన్= అన్నిగుణాలచేత; అనూనుఁడవు= అధికుడవు; నీకున్= ఇట్టి నీకు; ఈ+దుర్+ఆగ్రహము+ఏలా?= ఈ మొండిపట్టుదల ఎందుకు?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు తనను ఆ రీతిని కోరగా కృష్ణు డిట్లా పలికాడు: 'సుయోధనా! నీవు మిక్కిలి నిర్మలమైన వంశంలో జన్మించావు. అన్ని సద్గుణాలచే గొప్పవాడివి. ఇట్లాంటి నీకు ఈ మొండిపట్టుదల తగునటయ్యా!'

చ. తులువలు గాక యిట్టిదొర దుర్ణయవృత్తికిఁ జొచ్చునయ్య? పు
త్రులు ననుజన్ములుం జెలులు దుష్టపథంబునఁ బోవకుండఁ జు
ట్టలుఁ దగువారుఁ దండ్రియు నొడంబడఁ జేయుము కార్య; మల్పబు
ద్ధుల వెడమాట లూఁకొనకు; దోసము సేగియు వచ్చు నమ్మెయిన్. 331

ప్రతిపదార్థం: తులువలు+కాక= కుచ్చితులు తప్ప; ఇట్టిదొర= నీవంటి ప్రభువు; దుర్ణయవృత్తికిన్= అన్యాయకార్యాలకు; చొచ్చును+అయ్య?= పాల్పడునా; పుత్రులున్= నీ కుమారులును; అనుజన్ములున్= తమ్ముళ్ళు; చెలులున్= మిత్రులు; దుష్టపథంబునన్= చెడుదారిలో; పోవక+ఉండన్= నడవకుండునట్లు; చుట్టలున్= బంధువులును; తగువారున్= పెద్దలు; తండ్రియున్= నీ జనకుడును; ఒడంబడన్= సమ్మతించగా; కార్యమున్+చేయుము= పని నిర్వహించుము; అల్పబుద్ధుల= నీచమనస్కులయొక్క; వెడమాటలు= తుచ్ఛవాక్యాలు; ఊఁకొనకు(ము)= అంగీకరించకుము; ఆ+మెయిన్= అట్లు అంగీకరించినయెడల; దోసమున్= పాపం; సేగియున్= కీడును; వచ్చున్= వస్తాయి.

తాత్పర్యం: సుయోధనా! ఎవరో కుచ్చితులు తప్ప నీవంటి ఉత్తమ ప్రభువు ఇట్లాంటి అన్యాయ కార్యాలకు పాల్పడవచ్చునా? నీ కుమారులు, తమ్ములు, స్నేహితులు చెడుదారిలో నడవకుండా చూచుకో. నీ బంధువులు, పెద్దలు, జనకుడు సమ్మతించేటట్లుగా పాండవులతో పొత్తు కావించుకొనుము. అల్పబుద్ధిగలవారి చెడుమాటలు వినవద్దు. వారి మాటలకు తల ఒగ్గితే నీకు పాపం సంభవిస్తుంది. ఆపద మూడుతుంది.

క. పాండిత్య శౌర్య నిత్యులు । పాండుసుతులు వారిఁగూడి బ్రదుకుట ధృతరా
ష్ట్రుండును బాహ్లికుఁడును భీ । ష్మండు గురుఁడు కోరు తెఱఁగు సూవె నరేంద్రా! 332

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= మనుజేశ్వరా!; పాండుసుతులు= పాండురాజు కుమారులు; పాండిత్య శౌర్య నిత్యులు= వివేకం పరాక్రమం అనేవాటిచే స్థిరులు; వారిన్+కూడి= వారితో చేరి; బ్రదుకుట= మనటం; ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడూ; బాహ్లికుడూ, భీష్మ్ముండున్= భీష్ముడూ; గురుఁడున్= ద్రోణుఁడూ; కోరు తెఱఁగు+చూవె= కోరుకొనే తీరు సుమా!

తాత్పర్యం: పాండవులు పాండిత్య పరాక్రమ సమగ్రులు. వీరితో కలసి మెలసి మీరు జీవించవలెనని ధృతరాష్ట్ర బాహ్లిక భీష్మ ద్రోణులు కోరుకొంటున్నారు సుమా!

ఆ. **విను మసత్య లోభమున సిరియగునె యాఁ। కొని ముసిండి దినినఁ గ్రొవ్వు లావుఁ**
గలుగునయ్య? శకుని కర్ణ దుశ్శాసన। మంత్రితంబు కార్య తంత్ర మగునె? **333**

ప్రతిపదార్థం: వినుము= ఆలింపుము; అసత్యలోభమునన్= అసత్యమందలి దురాశచేత; సిరి+అగునె?= సంపద సమకూడగలదా? ఆఁకొని= ఆకలిగొని; ముసిండి+తినినన్= ముసిడి పండ్లను భుజిస్తే; క్రొవ్వులావు+కలుగును+అయ్యె?= కండ బలిమి లభిస్తుందా?; శకుని కర్ణ దుశ్శాసన మంత్రితంబు= శకుని కర్ణ దుశ్శాసనులచే చెప్పబడిన సలహా; కార్య తంత్రము+అగునె?= పనిని సాధించటానికి సాధనం కాగలదా? (కాదని భావం).

తాత్పర్యం: దుర్యోధనా! విను. అసత్యలోభం వల్ల సంపద సమకూడదు. ఆకలి వేసినపుడు మిసమిసలాడుతూ భ్రాంతి గొలిపే ముష్టిచెట్టుపండ్లను తింటే శరీరానికి పుష్టి తుష్టి ఏర్పడుతుందా? అందుకు మారుగా ఆ పండ్లు ప్రాణాంతక మవుతాయి. అట్లాగే శకుని కర్ణ దుశ్శాసనుల చెడు సలహాలు కార్యకారులు ఔతాయా?

విశేషం: అలం: నిదర్శన.

శా. **తోడంబుట్టిన భీమపార్థుల మహా దోర్దర్పముల్ లాఁతులై**
తో డంచుం బెఱవారి దుర్బలుల నెందుం జొచ్చి దైన్యంబునం
గూడం బెట్టెదు; నీవ పాండుసుతులం గుందింపఁగా సత్యముం
బాడిం దప్ప రొకప్పుడుం గినియ రా బంధుత్వ మే లొల్లవో? **334**

ప్రతిపదార్థం: తోడన్+పుట్టిన= సోదరులుగా జన్మించిన; భీమపార్థుల= భీమార్జునుల యొక్క; మహా+దోః +దర్పముల్= గొప్ప భుజశౌర్యాలు; లాఁతులు+ఐ= అన్యములై; పాండుసుతులన్= పాండవులను; కుందింపఁగాన్= బాధించటానికి; నీవు+అ= నీవే; పెఱవారిన్= పరాయివారైన; దుర్బలులన్= శక్తిహీనులను; తోడు+అంచున్= సహాయులని; ఎందున్+చొచ్చి= ఎక్కడెక్కడికో వెళ్ళి; దైన్యంబునన్= కృపణత్వంతో; కూడన్+పెట్టెదు= గుంపుగా చేర్చుకొంటున్నావు; సత్యమున్= నిజమును; పాడిన్= న్యాయమును; తప్పరు= కౌంతేయులు విడిచినవారుకారు; ఒకప్పుడున్= ఏనాడుకూడా; కినియరు= నీపై క్రోధం వహించరు; ఆ బంధుత్వమున్= ఆ చుట్టరికమును; ఏల+ ఒల్లవో?= ఎందుకు ఇష్టపడవో తెలియదు.

తాత్పర్యం: సహోదరులైన భీమార్జునులు గొప్ప భుజపరాక్రమాలు కలవారు. వారు నీకు పరాయివారైనారు. వారిని నొప్పించటానికి సాయపడగలరని శక్తిహీనులను పరాయివారిని ఎక్కడెక్కడికో వెళ్ళి కృపణత్వంతో వేడుకొని అందరినీ గుంపుగా చెంతకు చేర్చుకొంటున్నావు. పాండవులు సత్యాన్నీ, న్యాయాన్నీ వీడనివారు. ఎన్నడూ నీమీద క్రోధం వహించినవారు కాదు. అట్లాంటివారి చుట్టరికం నీ కెందుకు గిట్టదో తెలియదు.

ఉ. వారును మీరుఁ బొంది జనవల్లభు లెల్లను భృత్యభావనం
జేర సమస్త వస్తువులుఁ జేకుఱఁగా బ్రదుకొప్పుఁగాక నీ;
కీరస మెత్తికోల్ గఱపి యిప్పుడు కార్యము దప్పఁజూచు నీ
వారలు ముట్టవచ్చిన నవశ్యము నంతకుఁ జాలరుం జుమీ! 335

ప్రతిపదార్థం: వారును= ఆ పాండవులూ; మీరున్= కౌరవులైన మీరూ; పొంది= ఒద్దికగా ఉండి; జనవల్లభులు+ఎల్లను= రాజులందరూ; భృత్యభావనన్= సేవాబుద్ధితో; చేరన్= మిమ్మాశ్రయించగా; సమస్త వస్తువులున్= ఎల్లపదార్థాలును; చేకుఱఁగాన్= మీకు లభించగా; బ్రదుకు= జీవించటం; ఒప్పున్+కాక= తగి ఉండగలదుగాని; నీకున్= నీకు; ఈరసము+ఎత్తికోల్+కఱపి= ద్వేషం వహించేట్లు బోధించి; ఇప్పుడు= ఈ సమయాన; కార్యమున్+తప్పన్+చూచి= పని చెడిపోయేటట్లు చేసే; నీ వారలు= నీ పక్షంలో ఉన్నవారు; ముట్టన్+వచ్చినన్= పాండవులు మీపై దండెత్తి వచ్చినపుడు; అవశ్యము= నిశ్చయంగా; అంతకున్+చాలరున్+చుమీ!= వారి నెదిరించటానికి సమర్థులు కాలేరు సుమా!

తాత్పర్యం: పాండవులూ మీరూ పొత్తుకూడి ఉండగా, రాజులందరూ తాము సేవకుల మనే తలంపుతో మిమ్ముచేరి కొలుస్తుండగా, అన్ని పదార్థాలు మీకు సమకూడగా హాయిగా జీవించటం మంచిది. అంతేకాని, నీకు కౌంతేయులపై ద్వేషం కల్పించి ఇప్పుడు పనిచెరచటానికి కంకణం కట్టుకొన్న నీ మనుషులు, పాండవులు మీపై యుద్ధానికి తరలివచ్చిన సమయంలో వారి నెదిరించటానికి ఏమాత్రం కొరగారు సుమా!

ఆ. వీరు కారు పాండవేయులఁబోర మా । ర్కొన సురాసురులకుఁ గొలఁది గాదు
కాన వారితోడి కయ్యంబునకు నిర్ణ । యింపవలదు । సంధి పెంపుఁ జేయు. 336

ప్రతిపదార్థం: వీరు+అ+కాదు= నీవు విశ్వసించిన కర్ణాదులే కాదు; పాండవేయులన్= పాండుపుత్రులను; పోరన్= యుద్ధంలో; మార్కొనన్= ఎదిరించటానికి; సుర+అసురులకున్= దేవదానవులకు కూడ; కొలఁది+కాదు= శక్యం కాదు; కానన్= కాబట్టి; వారి తోడి కయ్యంబునకున్= కౌంతేయుల తోడి కలహానికి; నిర్ణయింపన్+వలదు= నిశ్చయించవద్దు; సంధి= పొత్తు; పెంపున్+చేయున్= వృద్ధిని కల్గిస్తుంది.

తాత్పర్యం: కర్ణాదులకే కాదు, దేవదానవులకు కూడ కౌంతేయులను ఎదుర్కొనటం శక్యంకాదు. కనుక పాండవులతో పోరాటానికి నిర్ణయం చేయవద్దు. సంధియే అభివృద్ధి కలిగిస్తుంది.

విశేషం: అలం: అనన్వయం.

క. ఈయున్న రాజులందఱు । వాయుసుతున కొక్క యెత్తు; వాఁ డలిగిన శూ
లాయుధుఁడు వడఁకు; నా కౌం । తేయులతోఁ బెనఁగు టుడుగు ధీరవిచారా! 337

ప్రతిపదార్థం: ధీర విచారా!= ధైర్యాలోచన కలవాడా!; ఈ+ఉన్న రాజులు+అందఱున్= నీ పక్షంలో చేరి ఉన్న ఈ దొరలంతా; వాయుసుతునకున్= గాడ్పుపట్టి ఐన భీమసేనుడికి; ఒక్క+ఎత్తు= సమానం; వాఁడు+అలిగినన్= అతడు కోపిస్తే; శూల+ఆయుధుఁడున్= శూలం ఆయుధంగా గలిగిన పరమేశ్వరుడుకూడా; వడఁకున్= గడగడలాడుతాడు; ఆ కౌంతేయులతోన్= ఆ కుంతీదేవి కుమారులతో; పెనఁగుట+ఉడుగు(ము)= పోరు సల్పటం మానుము.

తాత్పర్యం: ఇక్కడున్న ఈ దొరలంతా చేరి భీమసేనుడికి ఒక యెత్తు. భీముడు గనుక కినుకవహిస్తే త్రిశూలపాణి అయిన ఈశ్వరుడే భయంతో కంపించిపోతాడు. కాబట్టి కౌంతేయులతో కలహించటం మానుకో!

క. ఒక కార్యము సెప్పెద మీ । సకల బలమునందు సవ్యసాచి కెదురుగా
నొకరుఁడు గలిగినఁ గయ్యము । నకుఁ బూనుఁడు; రిత్త బహుజనక్షయ మేలా? 338

ప్రతిపదార్థం: ఒక కార్యము+చెప్పెదన్= ఒక కర్తవ్యం నీకు చెపుతాను; మీ సకలబలమునందున్= మీకున్న సమస్త సైన్యంలో; సవ్యసాచికిన్= అర్జునుడికి; ఎదురుగాన్= ఎదిరించటానికి సమర్థుడుగా; ఒకరుఁడు= ఒక్కడు; కలిగినన్= ఉంటే; కయ్యమునకున్= యుద్ధానికి; పూనుఁడు= సిద్ధపడండి; రిత్త= వ్యర్థంగా; బహుజనక్షయము+ఏలా?= అనేక ప్రజా వినాశం ఎందుకు?

తాత్పర్యం: సుయోధనా! ఒక సంగతి చెపుతాను విను. మీ సమస్త సైన్యంలో అర్జునుడిని ఎదిరించగల వీరుడొక్కడుంటే యుద్ధానికి నడుంకట్టుము. నిరుపయోగంగా బహుజన వినాశం ఎందుకు చేస్తావు?

క. పెక్కండ్రు గోవులంగొని । యుక్కు మిగిలి నడవ వెనుక నుద్దవిడిం దా
నొక్కఁడ నరుఁ డేతెంచినఁ । జిక్కె సమస్తంబు నది ప్రసిద్ధము కాదే? 339

ప్రతిపదార్థం: పెక్కండ్రు= పలువురు వీరులు; గోవులన్+కొని= ఆవులను తోలుకొని; ఉక్కుమిగిలి నడవన్= శౌర్యంతో చెలరేగి ముందుకు సాగుతుండగా; వెనుకన్= వారి వెనుక; ఉద్దవిడిన్= పూనికతో; తాన్+ఒక్కఁడు+అ= తానొక్కడే; నరుఁడు= అర్జునుడు; ఏతెంచినన్= రాగా; సమస్తంబు చిక్కెన్= ఆవులన్నీ దొరకిపోయాయి; అది= ఆ గోవులను మరలించుకొనివచ్చిన విషయం; ప్రసిద్ధము కాదే!= అందరికీ తెలిసినదేగదా!

తాత్పర్యం: పెక్కుమంది వీరులు విరటుడి గోవులను తోలుకొని శౌర్యంతో హస్తినాపురికి వెళ్ళుతుండగా వెనకనే వేగంగా వచ్చి, అర్జునుడు తా నొక్కడే ఆవులన్నింటినీ మత్స్యపురికి మరలించుకు వచ్చిన సంగతి ప్రఖ్యాతమే కదా!

క. తోడు దొనలేనియప్పటి । క్రీడి కొలఁది యట్టి దధిప! కినియక విను మేఁ
దోడై రా నెదురుట గడుఁ । గీడు; వలవ దుడుగవయ్య గెలు పరిది సుమీ! 340

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; తోడుదొన= తనకు ఎట్టి సహాయం, అమ్ములపొదులు; లేని= లేనటువంటి; అప్పటి క్రీడి కొలఁది+అట్టిది= అజ్ఞాతవాస దీక్షలో ఉన్న ఫల్గునుడి పరాక్రమం అటువంటిది; కినియక వినుము= కోపపడక నా మాటలు వినుము; ఏన్= నేను; తోడు+ఐ రాన్= సహాయంగా రాగా; ఎదురుట= అర్జునుడిని మార్కొనటం; కడున్+కీడు= మిక్కిలి హానికరం; వలవదు= తగదు; ఉడుగవు+అయ్య!= వారితో పోరు సల్పటం మానవయ్యా; గెలుపు= విజయం; అరిదిసుమీ!= దుర్లభం సుమా!

తాత్పర్యం: తనకు ఎటువంటి సహాయమూ, అమ్ముల పొదులూ లేని అజ్ఞాతవాసకాలంనాటి అర్జునుడి విక్రమం అటువంటిది. రాజా! నే చెప్పేది కోపగించక విను. నేనే తనకు సహాయుడనై రాగా పార్థుడితో ప్రతిఘటించటం చేటునకు మూలం. ఆ ఆలోచన మానుకో. యుద్ధంలో నీకు విజయం అశక్యం సుమా!

తే. అనుజ తనుజులుఁ జెలులు వియ్యములు నడుగు । మాలి పోదురు నీకుఁగా మనుజనాథ!
దొరకుఁ గులనాశనుండను దూఱు మేలె? । పాండవుతోడ నొడఁగూడి బ్రదుకవయ్య! 341

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; అనుజతనుజులున్= తమ్ములూ, కుమారులూ; చెలులున్= మిత్రులూ; వియ్యములున్= వివాహ సంబంధులున్నూ; నీకున్+కాన్= నీ కొరకై; అడుగుమాలిపోదురు= అణగారిపోతారు; దొరకున్= ప్రభువునకు; కులనాశనుండు= వంశవిధ్వంసకుడు; అను+దూఱు= అనునట్టి నింద; మేలె?= మంచిదా? పాండవులతోడన్= పాండుకుమారులతో; ఒడన్+కూడి= పొత్తుకూడి; బ్రదుకవు+అయ్య!= జీవించవయ్యా!

తాత్పర్యం: సుయోధనా! నీ తమ్ములూ, కుమారులూ, స్నేహితులూ, పిల్లనిచ్చినవారూ, పిల్లను చేసికొన్నవారూ నీమూలంగా నాశనమవుతారు. నీవంటి ప్రభువుకు కులవినాశకుడు అనే నింద పొందటం మంచిదికాదు. పాండవులతో కలిసి మెలసి జీవించు.

ఉ. రాజ్యముభారమెల్ల ధృతరాష్ట్రునియంద వెలుంగుచుండఁ, ద
త్పూజ్య కుమార పట్టమునఁ బొల్చి చరింపఁగ నీవు, పాండవుల్
సజ్యతఁ దండ్రి చిత్తము ప్రసన్నతఁ బొందఁగఁ గొల్చి యున్కి సా
మ్రాజ్యముగాఁ దలంతు రనురక్తమతిం దమకున్ ధరాధిపా! 342

ప్రతిపదార్థం: ధరా+అధిపా!= రాజా!; రాజ్యము భారము+ఎల్లన్= రాజ్యమేలే బరువంతా; ధృతరాష్ట్రుని యందున్+అ= ధృతరాష్ట్రుడియందే; వెలుంగుచున్+ఉండన్= ప్రకాశిస్తుండగా; నీవు; తద్+పూజ్యకుమార పట్టమునన్= మాననీయమైన యౌవరాజ్య పదవిలో; పొల్చి= ఒప్పుచు; చరింపఁగన్= మెలగుతుండగా; పాండవుల్= పాండుకుమారులు; సజ్యతన్= విండ్లనెక్కువెట్టి; తండ్రి చిత్తము= జనకుడైన ధృతరాష్ట్రుడి మనస్సు; ప్రసన్నతన్+పొందఁగన్= శాంతితో కూడి ఉండగా కొల్చి+ఉన్కి= సేవిస్తూ ఉండటం; తమకున్= తమకు; అనురక్తమతిన్= అనురాగముతో నిండిన హృదయంతో; సామ్రాజ్యముగాన్+తలంతురు= చక్రవర్తిత్వం వచ్చినట్లుగా భావిస్తారు.

తాత్పర్యం: రాజా! రాజ్య భారమంతా ధృతరాష్ట్రుడే వహించి ప్రకాశిస్తుంటే, నీవు యౌవరాజ్య పట్టాభిషిక్తుడవై రాచకార్యాలు చూచుకొంటుంటే, పాండవులు విండ్లెక్కు పెట్టుకొని రాజ్యరక్షణ గావిస్తూ జనకుడైన ఆంబికేయుడి మనస్సు ఎట్టి కలతలు లేక ప్రశాంతంగా ఉండగా, ఆయనకు సేవలు చెయ్యటమే తమకు చక్రవర్తిత్వమని అనురాగం గల హృదయాలతో భావిస్తారు.

క. కౌరవనాయక! పాండుకు । మారులు నీ తోడి పొత్తు మనియెద మనఁగా
శ్రీ రా మోఁకా లొడ్డిన । వారి విధమ కాదె నీవు వలదను టెల్లన్.' 343

ప్రతిపదార్థం: కౌరవనాయక!= కురురాజా!; పాండుకుమారులు= పాండునందనులు; నీతోడి పొత్తు మనియెదము= నీతో ఒద్దికగా ఉండి జీవిస్తామని; అనఁగాన్= అంటుంటే; నీవు; వలదు+అనుట+ఎల్లన్= వద్దని చెప్పడం; శ్రీరాన్= సిరివస్తుంటే; మోకాలు+ ఒడ్డినవారి విధమకాదె!= మోకాలు అడ్డంపెట్టే వారి చందంగా ఉండదా?

తాత్పర్యం: కురునాథా! పాండునందనులు నీతో సంధి చేసికొని జీవిస్తామని ఆశతో ఉంటే, నీవు వారి పొత్తు నాకు వద్దని నిరాకరించటం- లక్ష్మి తానై నడచి ఇంటికి వస్తుంటే రావద్దని మోకాలు అడ్డంపెట్టేవారి చందంగా ఉన్నది.

విశేషం: అలం: లోకోక్తి.

భీష్మద్రోణులు దుర్యోధనునకు హితంబు సెప్పుట (సం. 5-123-1)

చ. అన విని భీష్ముఁ డిట్లనియె నాధృతరాష్ట్ర తనూజుతోడ 'నీ
జనకుని మాట వట్టుము ప్రసన్నమతిన్ । మనవంశ మెల్లఁ బా
వనముగ నిందు వచ్చి బుధవత్సలుఁ డీ హరి యిట్లు సెప్పఁగా
వినమిఁ గడుం జెడుం దెరువు; । వీరల పం పొనరింపు పెంపుగన్. 344

ప్రతిపదార్థం: అనన్ విని= అని శ్రీకృష్ణుడు పలుకగా విని; భీష్ముఁడు; ఆ ధృతరాష్ట్ర తనూజు తోడన్= ఆ ధృతరాష్ట్రుడి కుమారుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; ప్రసన్నమతిన్= ప్రశాంతమైన మనస్సుతో; నీ జనకునిమాట+పట్టుము= నీ తండ్రిమాట గ్రహించుము; మన వంశము+ఎల్లన్= మన కురు కుల మంతయూ; పావనముగన్= పవిత్రముకాగా; ఇందున్+వచ్చి= ఇక్కడికి విచ్చేసి; బుధవత్సలుఁడు= విద్వాంసుల యందు ప్రేమ కలిగిన వాడైన; ఈ హరి= ఈ శ్రీకృష్ణుడు; ఇట్లు చెప్పఁగాన్= ఇంత హితం బోధించగా; వినమిన్= వినకుండుట; కడున్= మిక్కిలి; చెడున్+తెరువు= పెడత్రోవ; వీరల పంపు= నీ తండ్రి యొక్క, నారాయణుడికి యొక్క ఆనతి; పెంపుగన్= వృద్ధికరంగా; ఒనరింపు(ము)= ఆచరించుము.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి పలుకులు విని భీష్ముడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు: నీ తండ్రిమాట ప్రశాంత హృదయంతో స్వీకరించు. మన కురుకులం పవిత్రమయేటట్లు పండితుల యందు ప్రేమగల నారాయణుడు ఇక్కడికి విచ్చేసి నీకు హితం తెలిపాడు. ఆయన వచనాలు వినకపోవటం వినాశనానికి మార్గం. వీరందరూ ఆజ్ఞాపించిన పని అభ్యుదయకరంగా ఆచరించు.

క. మానక ధృతరాష్ట్రుఁడు ప్రా । ణానం గలుగంగ బంధునాశము రాజ్య
శ్రీనాశము నుద్దామయ । శోనాశముఁ జేయనేల చూచెద చెపుమా! 345

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; ప్రాణానన్+కలుగంగన్= ప్రాణాలతో ఉండగా; మానక= వదలక; బంధునాశమున్= చుట్టాల యొక్క వినాశనాన్ని; రాజ్యశ్రీ నాశమున్= రాజ్యలక్ష్మియొక్క వినాశనాన్ని; ఉద్దామ యశోనాశమున్= గొప్పదైన కీర్తియొక్క వినాశనాన్ని; ఏల= ఎందుకు; చేయన్+చూచెదు+చెపుమా!= చేయడానికి సంకల్పించావో చెప్పుము.

తాత్పర్యం: 'సుయోధనా! నీ తండ్రి ధృతరాష్ట్రుడు ప్రాణాలతో ఉండగానే' విడువకుండా చుట్టాలనూ, రాజ్యాన్నీ, హద్దులేని కీర్తినీ ఎందుకు నాశనం చేయాలని యత్నిస్తావో చెప్పు.

విశేషం: అలం: సముచ్చయం.

వ. కృష్ణార్జునులతోడి విరోధం బీ బంధులోకంబునక కాదు లోకంబున నెవ్వరికినిం జూడం బోలదు లోకంబులు రెంటికిని హానిం జేయక కూడి బ్రదుకుట మే'లనినఁ దదనంతరంబ ద్రోణాచార్యుండు దుర్యోధనున కిట్లనియె: 346

ప్రతిపదార్థం: కృష్ణ+అర్జునుల తోడి విరోధంబు= శ్రీ కృష్ణార్జునులతోడి వైరం; ఈ బంధులోకంబునకున్+అ+కాదు= ఈ చుట్టాల సమూహానికే కాదు; లోకంబునన్= జగత్తులో; ఎవ్వరికినిన్= ఎట్టివారికిన్నీ; చూడన్+పోలదు= చూచి సహించటానికి శక్యం కాదు; లోకంబులు రెంటికిని= ఇహపరాలు రెంటికిన్నీ; హానిన్+చేయక= చేటు కలిగించక; కూడి= పాండవులతో చేరి;

బ్రదుకుట మేలు= జీవించటం మంచిది; అనినన్= అని భీష్ముడు పలుకగా; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; ద్రోణ+ఆచార్యుండు= గురువైన ద్రోణుడు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కృష్ణార్జునులతో పెట్టుకొనే శత్రుత్వం ఈ సమస్త బంధువులకే కాదు, పుడమిలో ఎవ్వరికినీ చూచి సహించరానిదే అవుతుంది. నీవు ఇహపరాలకు కీడు కలిగించక పాండవులతో కలసిమెలసి జీవించటం మంచిది' అని చెప్పాడు. తరువాత గురువైన ద్రోణుడు సుయోధనుడితో ఇట్లా అన్నాడు :

తే. **'పితృ పితామహ గురులమై ప్రీతిఁగోరు । చున్న యట్టి మా పరమ హితోపదేశ**
వాక్యములు విని దుర్జన వచన రచనఁ । గొనక బంధులతో నొడఁగూడి మనుము. **347**

ప్రతిపదార్థం: పితృపితామహ గురులము+ఐ= తండ్రి, తాత గురువులము అయి; ప్రీతిన్= మీకు సంతోషం; కోరుచున్+ఉన్న+అట్టి= వాంఛిస్తున్నట్టి; మా పరమ హిత+ఉపదేశ వాక్యములు= మిక్కిలిమేలు సమకూర్చే మా హిత వచనాలు; విని= ఆలించి; దుర్జన వచన రచనన్= దుర్మార్గుల పలుకులయొక్క కల్పనను; కొనక= ఆదరించక; బంధులతోన్= చుట్టాలతో; ఒడఁగూడి= చేరి; మనుము= జీవించుము.

తాత్పర్యం: 'సుయోధనా! మీ తండ్రియైన ధృతరాష్ట్రుడు, తాత భీష్ముడూ, గురుడనైన నేనూ మీకు సుఖం కోరుతున్న వాళ్ళం. మేలు కలిగించే మా మంచి మాటలు విను. దుర్మార్గుల పల్కులు ఆదరించక బంధువులైన పాండుపుత్రులతో కలసిమెలసి జీవించు.

ఉ. **వెన్నుఁడు ప్రీతిఁ జెప్పిన సవిస్తర వాక్ప్రచయంబు త్రోవఁ బో**
వన్న కుమార! యట్లయిన వాయువు శ్రీయును నీకుఁ గల్గు మా
కన్నులు సల్లఁగా నకట గన్గొనుచుండుదు మేము; నట్లుగా
కున్నను నీవ నేర్తు నొండన నేరము నిండు కొల్వునన్. **348**

ప్రతిపదార్థం: కుమార!= వత్సా!; సుయోధనా!; వెన్నుఁడు= విష్ణుమూర్తి - కృష్ణుడు; ప్రీతిన్= ప్రేమతో; చెప్పిన= వచించిన; సవిస్తర వాక్+ప్రచయంబు త్రోవన్= విపులమైన మాటల సమూహం చొప్పున; పోవు+అన్న!= పోగదవయ్యా!; అట్లు+అయినన్= శ్రీకృష్ణుడు బోధించిన మార్గాన్ని అనుసరిస్తే; ఆయువున్= ఆయుష్యం; శ్రీయును= సంపదా; నీకున్+కల్గున్= నీకు లభించగలవు; మా కన్నులు చల్లఁగాన్= మా కన్నులు చల్లబడగా; అకట!= ఆహా! మేము= మేమందరం; కన్గొనుచున్+ఉండుదుము= చూస్తూ ఉండగలం; అట్లు+కాక+ఉన్నను= నీవు శౌరియొక్క వాక్య పద్ధతి ననుసరించకుంటే; నీవు+అ నేర్తు(వు)= నీవే తత్ఫల మనుభవించగలవు; నిండు కొల్వునన్= అందరున్న సభలో; నినున్= నిన్ను; ఒండు+అనన్+నేరము= ఇంతకు మించి ఏమీ పల్కలేము.

తాత్పర్యం: వత్సా! గోవిందుడు ప్రేమతో నుడివిన విపులమైన హితవాక్యాలు విన్నావు. ఆ దారిలో మెలగవలసింది. అట్లయితే నీకు ఆయుష్యం, సిరి సంపదలు సమకూడుతాయి. మా కన్నులతో చల్లగా మిమ్ము చూస్తూ హాయిగా ఉంటాము. అట్లా నీవు శౌరి వాక్యపద్ధతి ననుసరించకుంటే తత్ఫలం నీవే అనుభవిస్తావు. ఇంతకుమించి నిండుసభలో నిన్ను ఏమీ అనలేము.'

చ. **అనవుడు నాంబికేయుఁడు నిజాత్మజుదిక్కు మొగంబుచేసి యి**
ట్లను 'హరి నాశ్రయించి భవదగ్రజుఁ బుణ్యు నజాతశత్రునిం
గను మటవోయి దీన మన కార్యము లన్నియు సిద్ధిఁబొందు; నీ
తనిపలు కాదరింపమిఁ బదంపడి పాటిలు నెల్ల చేటులున్. **349**

ప్రతిపదార్థం: అనవుడున్= అట్లా ద్రోణాచార్యుడు పల్కినమీదట; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; నిజ+ఆత్మజు దిక్కు= తన కుమారుడి వైపు; మొగంబుచేసి= ముఖం త్రిప్పి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; హరిన్+ఆశ్రయించి= శ్రీకృష్ణుడిని ఆధారంగా చేసికొని; భవత్+అగ్రజున్= నీ అన్నగారిని; పుణ్యున్= సుకృతశాలి అయిన; అజాతశత్రునిన్= ధర్మజుడిని; అటవోయి= ఉపప్లావ్య పురికలిగి; కనుము= దర్శించుము; దీనన్= ఆయనను కలిసికొనటంచేత; మన కార్యములు+అన్నియున్= మన పనులన్నీ; సిద్ధిన్+పొందున్= నెరవేరుతాయి; ఈతని పలుకున్+ఆదరింపమిన్= మాధవుడి మాటలు మన్నించకుంటే; పదంపడి= తరువాత; ఎల్లచేటులున్= అన్ని ఆపదలు; పాటిలున్= కలుగుతాయి.

తాత్పర్యం: ద్రోణాచార్యులు అట్లా హితం ఉపదేశించిన తరువాత ధృతరాష్ట్రుడు తన కుమారుడి వైపు ముఖం త్రిప్పి ఇట్లా అన్నాడు: నీవు శ్రీకృష్ణుడిని ఆధారంగా చేసికొని అక్కడికి వెళ్ళి నీకు అన్నగారున్నూ, పుణ్యాత్ముడున్నూ అయిన ధర్మపుత్రుడిని చూడు. అందువల్ల మన పనులన్నీ సఫలమవుతాయి. నారాయణుడి మాటలు ఆదరించకుంటే ఆ తరువాత ఎన్నో కష్టాలు కలుగుతాయి.'

వ. **అనియె; నట్టియెడ గురుభీష్ము లొత్తి చెప్పం దలంచి గాంధారేయున కిట్లనిరి:** **350**

ప్రతిపదార్థం: అనియెన్= అని ధృతరాష్ట్రు డన్నాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; గురుభీష్ములు; ఒత్తిచెప్పన్+తలంచి= నొక్కిచెప్పతలచినవారై; గాంధారేయునకున్= గాంధారి కుమారుడైన దుర్యోధనుడికి; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు కుమారుడికి చెప్పిన తరువాత ఇంకా నొక్కి చెప్పదలచి ద్రోణభీష్ములు సుయోధనుడితో ఇట్లా అన్నారు:

క. **'ఈ కృష్ణుని సారథ్యము । నా కృష్ణుని గాండివంబునై తోఁపక ము**
న్నీ కొలఁదిఁ జక్కఁబడి నీ । వీ కురువంశంబు గావు మిభపురనాథా!' **351**

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= హస్తిపురాధీశ్వరా!; ఈ కృష్ణుని సారథ్యమున్= ఈ గోపాలకృష్ణుడి రథచోదకత్వమూ; ఆ కృష్ణుని= పాండవమధ్యముడైన అర్జునుడి; గాండివంబున్+ఐ= గాండివమనే ధనుస్సు కలదై; తోఁపకమున్న= యుద్ధం ఏర్పడకమునుపే; ఈ కొలఁదిన్+చక్కఁబడి= ఈ పాటి ఉపదేశాలతో మనసు సవరించుకొని; నీవు; ఈ+కురువంశంబున్= ఈ కౌరవ వంశాన్ని; కావుము= రక్షించుము.

తాత్పర్యం: 'రాజా! ఈ శ్రీకృష్ణుడు రథసారథ్యం సల్పుతుండగా, గాండివం చేత ధరించి అర్జునుడు యుద్ధ రంగంలో ప్రత్యక్షం కాకమునుపే నీవు ధర్మజుడిని సందర్శించి కార్యం చక్కదిద్దుకొని కౌరవవంశమంతటినీ కాపాడు.'

వ. **అని పలికి మఱియు.** **352**

తాత్పర్యం: అంటూ భీష్మ ద్రోణులు మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. **'ధర్మపుత్త్రుని పద ద్వయమున కతిభక్తి । నెఱఁగిన నతఁడు ని న్నెత్తి గ్రుచ్చి**
నిడుఁ గేలఁ బెద్దయుఁ దడవుగాఁ గౌఁగిలింపఁగ భీముఁడును నీవుఁ బరమహర్ష
మునఁ జారుతర వక్షములు సంగతములుగాఁ । బరిరంభణం బొనర్పంగ నరుఁడుఁ
గవలును మ్రొక్కినఁ గరమర్థిఁ దిగిచి నీ । వాలింగనంబు సేయంగ, నిట్లు

తే. **వారు మీరును దగ బాంధవమునఁ బొదలి । యింపు దళుకొత్తఁ దామరతంపరైనఁ**
జెలులుఁ జుట్టలుఁ గలసి పేరెలమిఁ బొంది । యుల్లసిల్లంగఁ గులమెంత యొప్పునొక్కొ! **353**

ప్రతిపదార్థం: ధర్మపుత్త్రుని పదద్వయమునకున్= ధర్మజుడి యొక్క పాదాల జంటకు; అతిభక్తిన్= మిక్కుటమైన భక్తితో; ఎఱఁగినన్= నీవు సాగిలపడి నమస్కరించగా; అతఁడు= ధర్మజుడు; నిన్నున్ గ్రుచ్చి+ఎత్తి= నిన్ను పట్టి లేవనెత్తి; నిడుఁగేలన్= దీర్ఘబాహువులతో; పెద్దయున్+తడవుగాన్= చాలసేపు; కౌఁగిలింపఁగన్= ఆలింగనం చేసికొనగా; భీముఁడును నీవున్= భీమసేనుడూ, నీవూ; పరమహర్షమునన్= మిక్కిలి సంతోషంతో; చారుతరవక్షములు= మిక్కిలి అందమైన రొమ్ములు; సంగతములు కాన్= హత్తుకొనేటట్లు; పరిరంభణంబు+ఒనర్పంగన్= కౌగిలించుకొనగా; నరుఁడున్= అర్జునుడూ; కవలును= నకులసహదేవులూ; మ్రొక్కినన్= నీకు వందనం చేయగా; కరము+అర్థిన్= మిక్కిలి ప్రీతితో; తిగిచి= వారిని చెంతకు లాగికొని; నీవు; ఆలింగనంబు+ చేయంగన్= వారిని కవుగిలించుకొనగా; ఇట్లు= ఈ ప్రకారం; వారున్ మీరును= పాండవులున్నూ, మీరున్నూ; తగన్= ఒప్పుగా; బాంధవమునన్+పొదలి= చుట్టరికంతో ఏపారి; ఇంపు తళుకొత్తన్= ప్రియ మతిశయించగా; తామరతంపర+ఐనన్= మిక్కిలి అభివృద్ధి గాంచగా; చెలులున్= స్నేహితులు; చుట్టలున్= బంధువులు; కలసి= కూడి; పేరు+ఎలమిన్+పొంది= పరమానందం చెంది; ఉల్లసిల్లంగన్= ప్రకాశించగా; కులము= కురువంశం; ఎంత+ఒప్పున్+ఒక్కొ= ఎంతగా సొంపారునోగదా!

తాత్పర్యం: సుయోధనా! నీవు ధర్మజుడి అడుగుల జంటకు అత్యంత భక్తితో ప్రణమిల్లినప్పుడు అతడు నిన్ను పట్టి లేవనెత్తి దీర్ఘ బాహువులతో చాలసేపు కౌగిలించు కొనగా, భీముడూ నీవూ మీ సుందర వక్షఃస్థలాలు హత్తుకొనేటట్లు మిక్కిలి సంతోషంతో ఆలింగనం చేయగా, అర్జునుడూ నకుల సహదేవులూ నీకు ప్రణామం కావించినపుడు నీవు వారిని దగ్గరకు చేరదీసి కవుగిలించుకోగా- ఇట్లా వారూ మీరూ పరస్పరం వందనాలింగనాలతో, చుట్టరికంతో పెంపారుతూ ప్రియమతిశయిల్ల అభివృద్ధి చెందుతుండగా, స్నేహితులు బంధువులు ఇట్లా ఉన్న మిమ్ము చూచి మిక్కిలి హర్షించగా మీ కురువంశం ఎంత చక్కగా ఉంటుందో ఊహించు.

క. **సమరమునకు వచ్చిన భూ । రమణు లుభయకటకములను బ్రమదం బెసఁ గం**
దమతమ పురములకుం బో । వ మహీ జను లెట్టి యుత్సవముఁ బొందుదురో!' **354**

ప్రతిపదార్థం: సమరమునకున్ వచ్చిన= యుద్ధం చేయటానికి వచ్చిన; భూరమణులు= రాజులు; ఉభయ కటకములను= రెండు సేనాశిబిరాలలో; ప్రమదంబు+ఎసఁగన్= హర్షం అతిశయించగా; తమ తమ పురములకున్+పోవన్= తమ తమ నగరాలకు తరలివెళ్ళగా; మహీజనులు= పుడమిలోని ప్రజలు; ఎట్టి+ఉత్సవమున్= ఎంతటి సంతోషాన్ని; పొందుదురో!= పొందుతారో కదా!

తాత్పర్యం: యుద్ధం చేయటానికి వచ్చిన రాజులు రెండు సేనా శిబిరాలలో ఆనందం విస్తరిల్లగా తాము తమ తమ పట్టణాలకు తరలివెళ్ళుతుంటే పుడమిలోని ప్రజలు ఎంత ఆనందిస్తారో చెప్పటానికి శక్యం కాదు.'

వ. అని వెండియు ననేక విధంబులం జెప్పి యీ రెండు దెఱంగుల వారును బంచి కుడిచి సుఖంబున్న నఖిల భూ ప్రజకును బ్రమోదం బగుం గావున నట్లుసేసి యందఱిచేత దీవనలు వడయవయ్య నీ'వనిన విని దుర్యోధనుం డప్పుండరీకాక్షు వీక్షించి యిట్లనియె: 355

ప్రతిపదార్థం: అని; వెండియున్= ఇంకను; అనేకవిధంబులన్= పలురీతులు; చెప్పి; ఈ రెండు తెఱంగులవారును= ఈ ఉభయ కుటుంబాలవారున్నూ; పంచి= రాజ్యం పంచుకొని; కుడిచి= అనుభవిస్తూ; సుఖంబు+ఉన్నన్= హాయిగా ఉంటే; అఖిల భూ ప్రజలకును= పుడమిలోని జనులందరికినీ; ప్రమోదంబు= సంతోషం; అగున్= కలుగుతుంది; కావునన్; అట్లుచేసి; అందఱిచేతన్; నీవు; దీవనలు పడయవయ్య= ఆశీర్వాదములు పొందవలసింది; అనినన్= అని ద్రోణ భీష్ములు చెప్పగా; విని; దుర్యోధనుండు; ఆ+పుండరీక+అక్షున్= ఆ కమల నేత్రుడిని శ్రీకృష్ణుడిని; వీక్షించి= చూచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇట్లా ఇంకా ద్రోణభీష్ములు పలు విధాలుగా చెప్పి 'మీరెండు కుటుంబాలవారూ రాజ్యం పంచుకొని అనుభవిస్తూ, హాయిగా ఉండటం పుడమిలోని జనులందరికీ సంతోషం కలిగిస్తుంది కనుక మేము చెప్పినట్లు చేసి నీవు అందరివల్ల ఆశీస్సులు పొందు'మని చెప్పారు. వారి మాటలన్నిటినీ విని దుర్యోధనుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు:

క. 'గురుఁడును బితామహుఁడు నీ । నరనాథుఁడు నెల్ల ప్రొద్దు నను దూఱుదు; రి
ప్పరుసున నీవును దామో । దర! దూఱెదుగాని తగవుఁ దలఁపవు కంటే! 356

ప్రతిపదార్థం: దామోదర!= శ్రీకృష్ణా!; గురుఁడును= ద్రోణాచార్యులూ; పితామహుఁడున్= తాతయైన భీష్ముడూ; ఈ నరనాథుఁడున్= ఈ ధృతరాష్ట్ర మహారాజూ; ఎల్లప్రొద్దున్= ఎల్లప్పుడూ; ననున్= నన్ను; దూఱుదురు= నిందిస్తారు; ఈ పరుసునన్= ఈ విధంగా; నీవును; దూఱెదు(వు)కాని= నన్ను నిందిస్తావే తప్ప; తగవున్+తలఁపవు+కంటే!= న్యాయమాలోచించవుగదా!

తాత్పర్యం: 'గురువైన ద్రోణుడూ, తాతగారు భీష్ముడూ, తండ్రి ధృతరాష్ట్ర మహారాజూ ఎప్పుడూ నన్ను తిడుతుంటారు. నీవున్నూ అదే విధంగా నన్ను నిందిస్తావేగాని న్యాయం ఆలోచించవుగదా!

క. వనితం బఱిచి రరణ్యం । బున నిడుమలఁ బడితి మనుచుఁ బోటరులై చం
పను జెఱుపఁదలఁచి మా దెసఁ । గనలుదు రప్పాండుసుతు లకారణమ కడున్. 357

ప్రతిపదార్థం: వనితన్= ద్రౌపదిని; పఱిచిరి= అవమానించారు; అరణ్యంబునన్= అడవిలో; ఇడుమలన్+పడితిమి= కష్టాలు అనుభవించాము; అనుచున్= అని పల్కుతూ; పోటరులు+ఐ= శూరులై; ఆ+పాండుసుతులు= ఆ పాండు రాజు కొడుకులు; అకారణమ= నిష్కారణంగా; కడున్= మిక్కిలి; చంపను= చంపటానికీ; చెఱుపన్= నాశనం చేయటానికీ; తలఁచి= భావించి; మా దెసన్= మా యెడ; కనలుదురు= కోపం వహిస్తారు.

తాత్పర్యం: 'ద్రౌపదిని భంగపరిచారు. అడవులలో మేము నానా కష్టాలు అనుభవించాము' అంటూ పాండవులు నిష్కారణంగా మాపై క్రోధం వహించి వీరులై మమ్మల్ని చంపటానికీ, నాశం చేయటానికీ ఆలోచిస్తారు.

మ. అరయం దప్పొకయింత నా వలన లే దా ధర్మపుత్త్రుండు జూ
దరి వెంటం దమకించి సౌబలునిచేతన్ భూమిఁ గోల్పోయి ము
ష్కరుఁడై వెండియు నొడ్డఁగా నతఁడు నక్షప్రౌఢిమై గెల్చె; నే
తెరువైనం దనయిచ్చతోఁ బడియె; నింతేకాక యేఁ బూఁటయే? 358

ప్రతిపదార్థం: అరయన్= పరికించగా; నావలనన్= నావలన; తప్పు= దోషం; ఒక+ఇంతలేదు= రవ్వంతయినా లేదు; ఆ ధర్మపుత్త్రుండు= ఆ ధర్మరాజు; జూదరి వెంటన్+తమకించి= జూదరితనంతో వేగిరపడి; సౌబలుని చేతన్= శకునిచేత; భూమిన్= పుడమిని; కోల్పోయి= పోగొట్టుకొని; ముష్కరుఁడు+ఐ= మూర్ఖుడై; వెండియున్= మరల; ఒడ్డఁగాన్= పందెం చరచగా; అతఁడు= ఆ శకుని; అక్షప్రౌఢిమైన్= పాచికల ఆటలోని నేర్పుతో; గెల్చెన్= జయించాడు; ఏ తెరువు+ఐనన్= ఏ దారి అయినా; తన+ఇచ్చతోన్+పడియెన్= తన ఇష్టప్రకారమే అనుసరించాడు; ఇంతేకాక= ఇంతదప్ప; ఏన్+పూఁటయే?= అందుకు నేను బాధ్యుడనా?

తాత్పర్యం: కృష్ణా! న్యాయంగా ఆలోచిస్తే నా వలన తప్పేముంది? ధర్మరాజు జూదరి అయి, తానే శకునిని వెంబడించి వేగిరపడి అతడి చేతిలో పుడమినంతా కోలుపోయాడు. అంతటితో ఆట మానక మూర్ఖుడై మరల పందెం చరచగా సౌబలుడు తనకు పాచికల ఆటలో ఉన్న ప్రావీణ్యంతో గెలిచాడు. ఏ తెరువైనా ధర్మజుడు తన ఇష్టప్రకారమే త్రొక్కినాడు. అంతేతప్ప అతని కష్టనష్టాలకు నేను బాధ్యుడనా?

తే. మాత్స్య పాంచాల పాండ్యాది మనుజపతులఁ । గూర్చికొని తార కయ్యంబు గోరి యెత్తి
విడిసి; రింతియ కాక యివ్విధము నుగ్ర । కర్మమున కేము దొడఁగుట గలదె చెపుమ? 359

ప్రతిపదార్థం: మాత్స్య+పాంచాల+పాండ్య+ఆది మనుజపతులన్= మత్స్య దేశం; 'పాంచాల దేశం'; పాండ్య దేశం మున్నగు దేశాలరాజులను; కూర్చికొని= చేర్చుకొని; తారు+అ= తామే; కయ్యంబు+కోరి= యుద్ధం అభిలషించి; ఎత్తి విడిసిరి= మాపై దండెత్తటానికి దిగి ఉన్నారు; ఇంతియకాక= ఇంతేతప్ప; ఈ+విధము+ఉగ్రకర్మమునకున్= ఇట్లాంటి క్రూరకృత్యానికి; ఏము= మేము; తొడఁగుట+కలదె?= పూనుకొనటం జరిగిందా; చెపుమ!= కృష్ణా!; నీవే వచించు.

తాత్పర్యం: కృష్ణా! మత్స్య పాంచాల పాండ్యాది దేశాల రాజులందరినీ కూర్చుకొని యుద్ధం చేయవలెననే కోరికతో తామే మాపై దండెత్తటానికి సిద్ధంగా ఉన్నారు. ఇట్లాంటి క్రూర కృత్యానికి మేమెప్పుడు పాల్పడినామో నీవే చెప్పు.

క. ఉక్కఱి సురపతి కైనను । మ్రొక్కము నృపధర్మమూఁది మొనతలఁబడినన్
మిక్కిలి పేరును నిట దివి । నక్కజముగఁ బెంపుఁ బడయ నగుట నుపేంద్రా! 360

ప్రతిపదార్థం: ఉప+ఇంద్రా!= కృష్ణా!; నృపధర్మము+ఊఁది= క్షత్రియ ధర్మం అవలంబించి; మొనతలన్= రణాగ్రమునందు; పడినన్= కూలినా; ఇటన్= ఈ లోకంలో; మిక్కిలి పేరును= గొప్ప కీర్తినీ; దివిన్= స్వర్గంలో; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; పెంపున్= వృద్ధినీ; పడయన్+అగుటన్= పొందగలగటంచేత; ఉక్కు+అఱి= పౌరుషాన్ని వీడి; సురపతికిన్+ఐనన్= దేవేంద్రుడికైననూ; మ్రొక్కము= నమస్కరించం.

తాత్పర్యం: కృష్ణా! క్షత్రియధర్మం వహించి యుద్ధం చేస్తూ నేలగూలితే ఇక్కడ వీరుడన్న విఖ్యాతి లభిస్తుంది. అక్కడ వీర స్వర్గ సుఖాలు చేకూరుతాయి. అందువల్ల మేము పౌరుషముడిగి దేవేంద్రుడికైనా నమస్కరించం.

చ. **చిఱుతఁదనంబునం దగవు చిత్తమునం దలపోయలేక ముం**
దఱ యటు వోవనిచ్చితిఁ। బితామహుఁడున్ జనకుండు నింకఁ గ్ర
చ్ఛఱ నిలఁ బంచి చక్క సగ మక్కడ నెవ్వరికేని మద్బలం
బెఱుఁగక యీఁదలంచినను నే నది యేటికి సమ్మతించెదన్? 361

ప్రతిపదార్థం: చిఱుతఁదనంబునన్= నేను పసివాడుగా నున్నప్పుడు; తగవు= న్యాయం; చిత్తమునన్= మనసులో; తలపోయన్+ లేక= భావించజాలక; ముందఱ= జరిగిన రోజులలో; అటుపోవన్+ఇచ్చితిన్= అట్లా జరుగనిచ్చాను; పితామహుఁడున్= భీష్ముడూ, జనకుండున్= ధృతరాష్ట్రుడూ; ఇంకన్= ఇకమీదట; క్రచ్చఱన్= అనాలోచితంగా; ఇలన్+పంచి= భూమిని విభజించి; చక్కసగము= సరిగా సగపాలు; అక్కడన్+ఎవ్వరికిన్+ఏనిన్= అక్కడ పాండవులలో ఎవరికైనా; మత్+బలంబు+ఎఱుఁగక= నా శక్తి తెలియక; ఈన్+తలంచినను= ఇవ్వటానికి సంకల్పిస్తే; ఏన్= నేను; అది+ఏటికిన్+సమ్మతించెదన్?= అట్లా సగపాలు పంచి ఇవ్వటానికి ఎందుకు అంగీకరిస్తాను.

తాత్పర్యం: చిన్నతనంలో న్యాయమేదో తెలియనప్పుడు అట్లా సాగనిచ్చాను. ఇపుడు మా తండ్రి, తాత అనాలోచితంగా నా శక్తి సామర్థ్యాలు గుర్తించక రాజ్యంలో సగపాలు పాండవులలో ఎవ్వరికైనా పంచి ఇవ్వవలెనని సంకల్పిస్తే అందుకు నేను ఎందుకు అంగీకరిస్తాను?

తే. **తొంటి చవిగని యిప్పుడుఁ దోఁచి పాండు। సుతులు రాజ్యంబు చేయంగఁ జూచినారు;**
నాకు నీఁ దీఱునే యింక నాఁటి చూఱ। లెక్కడివి ద్రోణ భీష్ము లీ దిక్కుసుమ్ము! 362

ప్రతిపదార్థం: తొంటిచవి+కని= మునుపటి రుచి మరగి; ఇప్పుడున్+తోఁచి= ఈ వేళ కూడా ప్రత్యక్షమై; పాండుసుతులు= పాండుకుమారులు; రాజ్యంబు చేయంగన్= రాజ్యమేలటానికి; చూచినారు= వాంఛిస్తున్నారు; నాకున్= నాకు; ఈన్+తీఱునే= ఇవ్వటానికి వీలగునా?; ఇంకన్= ఇక; నాటి చూఱలు= ఆనాటి కొల్లలు; ఎక్కడివి?= ఎక్కడున్నవి?; ద్రోణ భీష్ములు= గురు పితామహులు; ఈ దిక్కు+చుమ్ము!= మా పక్షంలో ఉన్నారు సుమా!

తాత్పర్యం: మునుపటి రుచిమరగి మళ్ళీ ఇప్పుడు ప్రత్యక్షమై కౌంతేయులు రాజ్యమేలుటకు కోరుతున్నారు. కాని, నే నిస్తానా? ఆనాటి దోపిళ్ళు ఇకమీదట సాగవు. ద్రోణభీష్ములు మా పక్షంలో ఉన్నారు.

ఉ. **ఏమును వారుఁ బంచికొని యేలుట గల్గదు; పల్కకుండు మిం**
కేమియు; వాఁడి సూదిమొన యించుక మోపిన యంతమాత్రయున్
భూమి యొనర్చి పాండునృపపుత్త్రుల కిత్తునె। యెవ్వరైన సం
గ్రామమునన్ జయంబుఁ గొని రాజ్యము సేయుట నిశ్చయించితిన్. 363

ప్రతిపదార్థం: ఏమును= మేమూ; వారున్= పాండవులూ; పంచికొని= రాజ్యాన్ని పంచుకొని; ఏలుట+కల్గదు= పరిపాలించటం జరగదు; ఇంకన్+ఏమియున్= మరేమిన్నీ; పల్కక+ఉండుము= బదులాడవద్దు; వాఁడిసూదిమొన= సన్నని సూదియొక్క కొన; ఇంచుక= కొంచెం; మోపిన+అంతమాత్రయున్= ఆక్రమించినంత మేర కూడా; భూమి+ఒనర్చి= పుడమిని చీల్చి; పాండునృప పుత్త్రులకున్= పాండురాజు కుమారులకు; ఇత్తునె?= ఇస్తానా? నేనివ్వను; ఎవ్వరు+ఐనన్= అటు వారో; ఇటు మేమో;

సంగ్రామమునన్= రణంలో; జయంబు కొని= విజయం పొంది; రాజ్యము చేయుట= రాజ్యము నేలటానికి; నిశ్చయించితిన్= నిర్ణయించుకొన్నాను.

తాత్పర్యం: మేమూ, వారూ పుడమిని పంచుకొని పరిపాలించటం జరగదు. ఇందుకు నీ వేమీ బదులు చెప్పవద్దు. వాడి సూదిమొన మోపినంతమాత్రమైనా భూమిని పంచి పాండునందనులకు నేనివ్వను. మాలో ఎవరో ఒకరు యుద్ధంలో విజయం పొంది రాజ్యం చేయటానికి నిర్ణయించాను.'

విశేషం: అసలే అది సూది. అదీ వాడియైనది. దాని మొనమాత్రమే, అదికూడా ఎక్కువ మోపక 'ఇంచుక' - పాండవులకు కొంచెం కూడా ఇవ్వననటానికి ఈ కూర్పు. (సంపా.)

తే. **అనిన విని కిన్కఁ బూనిన యలఁతి నగవు । చెలువు మొగమున కొక క్రొత్త పొలు పొనర్పఁ**
బుండరీకాక్షుఁడగు టెల్లఁ బోయి యప్పు । డరుణ కమలాక్షుఁ డగుచు మురాంతకుండు. **364**

ప్రతిపదార్థం: అనినన్+విని= దుర్యోధనుడి మాటలు ఆలకించి; కిన్కన్+పూనిన= కోపం వహించిన; అలఁతినగవు చెలువు= చిరునవ్వుయొక్క సొగసు; మొగమునకున్= తన ముఖానికి; ఒక క్రొత్త పొలుపు+ఒనర్పన్= ఒక నూతన సౌందర్యాన్ని ఆపాదించగా; పుండరీక+అక్షుఁడు+అగుట+ఎల్లన్= తెల్లదామరలవంటి కన్నులుగలవాడగుట అంతా; పోయి= తొలగి; ముర+అంతకుండు= మురాసురుడిని హరించిన శ్రీకృష్ణుడు; అప్పుడు= ఆ సమయంలో; అరుణ+కమల+అక్షుఁడు+అగుచున్= ఎర్రదామరల వంటి కన్నులు గలవాడై.

తాత్పర్యం: దుర్యోధనుడి మాటలకు కోపం వహించిన చిరునవ్వుసొగసు తన ముఖమునకు ఒక క్రొత్త అందం సంతరించగా; తెల్లదామరలవంటి కన్నులుగలవాడవటం అంతాపోయి మురవిధ్వంసకుడైన వాసుదేవుడు ఎర్రదామరలవంటి కన్నులు గలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: పర్యాయం, ఉపమ. కృష్ణుఁడు సహజంగా పుండరీకాక్షుడు - తెల్ల దామరలవంటి కన్నులు గలవాడు. ఇప్పుడు కోపంవచ్చి కన్నులు ఎఱ్ఱబడ్డాయి. అందుచేత అరుణ కమలాక్షుడయ్యాడు. ఆరుణ్యం కోపానికి చిహ్నం. శ్రీకృష్ణుడు కుపితుడయ్యాడన్న విషయాన్ని తిక్కన ధ్వనిపూర్వకంగా చెప్పటం ప్రశంసనీయం. పాత్రల మనోభావాలను ఇట్లా బాహ్య వర్ణనలద్వారా చెప్పటం తిక్కన నేర్పు. (సంపా.)

శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో మున్నతండు చేసిన దుర్ణయంబు సెప్పుట (సం. 5-126-1)

క. **'మొనతలఁబడియెదు నీచె । ప్పిన యట్టుల తడవులేదు బిరుదలరై నీ**
వును వీరు నిలువుఁ డిదె భం । డన మెల్లియ వచ్చె నూఱటలు గనుఁడింకన్. **365**

ప్రతిపదార్థం: నీ చెప్పిన+అట్టులు+అ= నీవు వచించిన విధంగానే; మొనతలన్+పడియెదు(వు)= రణాగ్రంలో కూలెదవు; తడవు లేదు= ఇందుకు ఆలస్యం లేదు; బిరుదులరు+ఐ= వీరులై; నీవును= నీవూ; వీరున్= నీకు సాయపడవచ్చిన ఈ రాజులూ; నిలువుఁడు= నిలబడండి; భండనము= యుద్ధం; ఎల్లి+అ+వచ్చెన్= రేపే వస్తున్నది; ఇంకన్= ఇక; ఊఱటలు+కనుఁడు= తృప్తి వహించండి; ఉపశమనం పొందండి.

తాత్పర్యం: 'దుర్యోధనా! నీవు చెప్పినట్లే రణాగ్రంలో కూలగలవు. ఇందుకు ఆలస్యం లేదు. శూరులై నీవూ, నీకు సాయపడవచ్చిన ఈ రాజులందరూ నిలబడండి. రేపే యుద్ధం వస్తున్నది. ఇక ఊరడిల్లండి.

సీ. **అరయంగఁ దప్పు లేదంటి నీవలనఁ గీ । డొకనాఁడు సేసియు నొక్కనాఁడు**
సేయవె? నీ జనించిన యది యాదిగా । నుడుగక పాండవేయులకుఁ జాల
నెగ్గు సేసితి విషమిడి, పెనుఁబాములఁ । గఱపించి, నీరిలోఁ గట్టి త్రోచి,
లక్కయిల్ గాలిచి, పెక్కు భంగులఁ జంపఁ । దలఁచినఁ జావక ధర్మరక్షఁ

ఆ. **జేసి నెగడి రాచసిరి నొందియున్నఁ జూ । పోప కీవు తీవ్ర పాపబుద్ధిఁ**
గసలి జూద మొకటి కల్పించి కపటంబు । సేయ దాన నెల్ల చేటుఁబుట్టె. **366**

ప్రతిపదార్థం: అరయంగన్= విచారించగా; నీ వలనన్= నీయెడ; తప్పులేదు+ అంటి(వి)= దోషం లేదని చెప్పావు; ఒకనాఁడు కీడు చేసియున్= ఒకనాడు పాండవులకు హాని చేసి; ఒక్కనాఁడు చేయవె= ఒకరోజు చేయకున్నావా? (ఎప్పుడూ చేస్తున్నావని అభిప్రాయం), నీ జనించిన అది+ఆదిగాన్= నీవు పుట్టింది మొదలుకొని; ఉడుగక= మానక; పాండవేయులకున్= పాండుపుత్రులకు; చాలన్= మిక్కిలి; ఎగ్గుచేసితి(వి)= కీడు చేశావు; విషము+ఇడి= అన్నంలో విషంపెట్టి; పెనుఁబాములన్+ కఱపించి= నిదురిస్తున్నప్పుడు పెద్ద పెద్ద సర్పాలచేత కరపించి; లక్క+ఇల్+కాలిచి= లాక్షాగృహదహనం చేయించి; పెక్కుభంగులన్= అనేక రీతుల; చంపన్+తలఁచినన్= చంపటానికి యత్నించగా; చావక= చనిపోక; ధర్మరక్షన్+చేసి= ధర్మం తమను కాపాడటం వలన; ధర్మాన్ని తాము కాపాడటం వలన; నెగడి= వృద్ధికి వచ్చి; రాచసిరిన్= రాజ్యలక్ష్మిని; ఒంది+ఉన్నన్= పాండవులు పొంది సుఖులై ఉండగా; చూపు+ఓపక= చూచి సహించలేక; ఈవు= నీవు; తీవ్ర పాపబుద్ధిన్= దారుణమైన పాపచింతతో; కసలి= కోపించి; జూదము+ఒకటి కల్పించి= ద్యూతక్రీడ ఒకటి ఏర్పాటు చేసి; కపటంబు చేయన్= పాండవులను మోసగించగా; దానన్= అందువలన; ఎల్లచేటున్= ఇంత అనర్థమూ; పుట్టెన్= కల్గింది.

తాత్పర్యం: విచారిస్తే నీవల్ల దోషం లేదని చెప్పావు. సుయోధనా! ఒకనాడు పాండవులకు కీడుచేసి మరొకనాడు చేయకున్నావా? నీవు పుట్టింది మొదలు మానకుండ వారికి అపకారాలు చేస్తూనే ఉన్నావు. తినే అన్నంలో విషం పెట్టించావు. పెద్ద పెద్ద విషసర్పాల చేత కరిపించావు. కాళ్లూ చేతులు కట్టించి గంగ మడుగులోనికి నెట్టించావు. లక్కయింటిలో నివసిస్తుండగా కాల్పించావు. ఇట్లా అనేక విధాల పాండవులను నీవు చంపటానికి యత్నించావు. కాని, వారి ధర్మం వారి ప్రాణాలను కాపాడింది. వా రెట్లాగో పైకివచ్చి రాజ్యసంపదను పొంది హాయిగా జీవిస్తుంటే నీకు కన్నుకుట్టింది. దారుణమైన పాపహృదయంతో వారిమీద కినుక పూని, జూదమొకటి ఏర్పాటు చేశావు. ధర్మజుని ఆ కపటద్యూతంలో ఓడించగా ఇంత అనర్థం కల్గింది.

విశేషం: ధర్మరక్షఁజేసి - వారు ధర్మాన్ని రక్షించటం చేతా, వాళ్ళని ధర్మం రక్షించటంచేత - అని రెండు విధాల అర్థం చెప్పవచ్చు. 'ధర్మో రక్షతి రక్షితః' అని కదా సూక్తి (సంపా.)

తే. **అన్నదమ్ముల నెత్తంబు లాడి సతుల । తలలువట్టి సభాస్థలంబులకు నీడ్చి**
చీర లొలిపింతురే? యిట్టి వారి నెందుఁ । దడవుమా నీ వొకండవు దక్క నధిప! **367**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అన్నదమ్ములన్= తోడబుట్టువులతో; నెత్తంబులు+ఆడి= పాచికలాడి; సతుల తలలు+పట్టి= ఇల్లాండ్ర తలవెండ్రుకలు పట్టి; సభాస్థలంబులకున్+ఈడ్చి= కొలువుకూటాలలోనికి ఈడ్చుకొనివచ్చి; చీరలు+ఒలిపింతురే=

వలువలు ఊడదీయిస్తారా; నీవు+ఒకండవు+తక్కన్= నీ వొక్కడివేగాని; ఎందున్= ఎక్కడైనా; ఇట్టివారిన్+తడవుమా!= ఇటువంటి వారున్నారేమో చెప్పుము.

తాత్పర్యం: నీ వొకడివి తప్ప లోకంలో ఎక్కడైనా తోడబుట్టువులతో జూదమాడి, మగనాండ్ర శిరోజాలు పట్టుకొని కొలువు కూటాలలోనికి ఈడ్చుకొని వచ్చి, కట్టిన పుట్టాలు తొలగించే వారున్నారేమో నీవే చెప్పు.

ఉ. అప్పుడు నీవు గర్ణుఁడును నాడిన మాటలు కొల్వులోపలం
జెప్పెడునట్టివే? కులము శీలముఁ గల్గిన పుణ్యకాంత క
ట్లొప్పమి చేయుటెల్లఁ గనియున్న జనంబులు వించునుండఁగాఁ
దప్పొక యింత లేదను విధం బది నీక చనున్ సుయోధనా! 368

ప్రతిపదార్థం: సుయోధనా!= దుర్యోధనా!; అప్పుడు= ద్రౌపదీ మానభంగసమయంలో; నీవున్= నీవూ; కర్ణుడును= కర్ణుడూ; ఆడినమాటలు= పల్కిన పలుకులు; కొల్వులోపలన్= ఈ సభలో; చెప్పెడు+అట్టివే?= వాకొన దగినవా (కావని భావం); కులము= ఉత్తమ వంశాభిజాత్యమూ; శీలము= మంచి నడవడీ; కల్గిన పుణ్యకాంతకున్= కలిగి ఉన్న పవిత్రురాలైన వనితకు; అట్లు+ఒప్పమిచేయుట+ఎల్లన్= ఆ విధంగా పరాభవించటమంతా; కని+ఉన్న= చూచి ఉన్నట్టి; జనంబులు= ఈ సభలో ఉన్న జనులు; వించున్+ఉండఁగాన్= ఆలకిస్తూండగా; తప్పు+ఒక+ఇంత+లేదు= నావలన ఎట్టి నేరమూ లేదు; అనువిధంబు+ అది= అని చెప్పుచున్నట్టి తీరు, నీకున్+అ+చనున్= నీకే చెల్లింది.

తాత్పర్యం: సుయోధనా! పాంచాలికి నిండుసభలో పరాభవం జరుగుతున్నప్పుడు నీవూ, కర్ణుడూ మాట్లాడిన మాటలు ఇపు డీ సభలో చెప్పదగినట్టివి కావు. ఉత్తమ వంశాభిజాత్యం, సత్ప్రవర్తన కల్గిన పరమ పతివ్రతను ఆ విధంగా మీరు పరాభవించటం కనులార చూచిన ఈ జనులందరూ వింటుండగా నా వల్ల ఏ నేరమూ లేదని పల్కటం నీ కొకడికే చెల్లింది.

విశేషం: అట్లొప్పమి చేయుటెల్ల - అట్లు - అనిర్వాచ్యమైన విధంగా, - అట్టి ఘోరమైన అనిభావం. 'అరయం దప్పొకయింత నావలనలే' దన్న దుర్యోధనుడి మాటకిది యెత్తిపొడుపు. (సంపా.)

తే. ఎత్తి విడిసిన వారని యెల్ల తప్పుఁ। బాండవుల మీఁదఁ బెట్టిన బ్రదుకుగలదె?
ద్రోణ భీష్ములుఁ దండ్రియుఁ దోడుతోడఁ। జెప్పు తగుమాట లేమియుఁ జెవులు సొరవు. 369

ప్రతిపదార్థం: ఎత్తి విడిసినవారు+అని= దండెత్తటానికి చేరి ఉన్నారని; ఎల్లతప్పున్= దోషమంతటినీ; పాండవుల మీఁదన్; పెట్టినన్= మోపినచో; బ్రదుకు+కలదె?= మీకు ఆయువు దక్కుతుందా? ద్రోణ భీష్ములు, తండ్రియున్= జనకుడును; తోడుతోడన్= ఒకరి తరువాత మరొక్కరు; చెప్పు= బోధించే; తగుమాటలు= హితవాక్యాలు; ఏమియున్= ఒక్కటి కూడా; చెవులు+చొరవు= నీ చెవులలో దూరవు గదా!

తాత్పర్యం: మాపైకి దండెత్తి రావటానికి సిద్ధంగా ఉన్నారని నేరమంతటినీ పాండవులమీద మోపితే మీకు ఆయువు దక్కుతుందా? ద్రోణుడు, భీష్ముడు, నీ తండ్రి ధృతరాష్ట్రుడు ఒకరి తరువాత మరొకరు చెప్పే హితవచనాలు నీవు వినటమే లేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. శాంతిం బొందుట నీకుం। గుంతీ పుత్త్రులకు మేలగున్; దానిక యే
నింతయు నాడెద; నది నీ। కెంతయు రుచియింపకునికి యెఱిఁగి యెఱిఁగియున్. 370

ప్రతిపదార్థం: శాంతిన్+పొందుట= క్రోధాదులు విడిచి ఒద్దికగా మెలగటం; నీకున్= నీకూ; కుంతీపుత్రులకున్= పాండవులకూ; మేలు+అగున్= శ్రేయోదాయకం; నీకున్= నీకు; అది+ఎంతయున్= అదేమాత్రం; రుచియింపక+ఉనికి= ఇష్టం కాకుండటం; ఎఱిఁగి+ఎఱిఁగియున్= బాగా తెలిసికూడా; దానికిన్+అ= మీరు శాంతితో జీవించటం కొరకే; ఏను= నేను; ఇంతయున్+ ఆడెదన్= ఇంతగా చెపుతున్నాను.

తాత్పర్యం: శాంతి వహించటం నీకూ, పాండవులకూ మిక్కిలి మంచిది. పాండవులతో పొత్తు నీకు బొత్తిగా గిట్టదని తెలిసికూడా శాంతికోసం నేనింతగా నీకు నొక్కి చెపుతున్నాను.

వ. అని యిట్లు నారాయణుండు నానా ప్రకారంబులం జెప్పుటకుఁ గటకటం బడియెడు దుర్యోధనునకు దుశ్శాసనుం డిట్లనియె: 371

ప్రతిపదార్థం: అని+ఇట్లు; నారాయణుండు; నానా ప్రకారంబులన్= పలురకాలుగా; చెప్పుటకు; కటకటంబడియెడు= బాధపడుతున్న; దుర్యోధనునకున్; దుశ్శాసనుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ రకంగా నారాయణుడు బహు విధాల హితవాక్యాలు పలుకుతుంటే వినటానికి బాధపడుతున్న దుర్యోధనుడితో దుశ్శాసనుడు ఇట్లా అన్నాడు:

మ. 'జనకుండున్ గురుభీష్ములుం దగిన కర్జం బాప్తులై నీకుఁ బ్రీ
తి నెఱింగించు తెఱంగు గాదు తమబుద్ధిం బోయి సంధాన మి
ట్లొనరం జేయకయున్నఁ గృష్ణుకు నిన్నొప్పించు వా; రింతవ
ట్టు నిజం; బిచ్చట నింక నీయునికి నెట్లుం గీడు పుట్టుం జుమీ! 372

ప్రతిపదార్థం: జనకుండున్= మన తండ్రీ; గురుభీష్ములున్= ద్రోణుడూ; భీష్ముడూ; తగిన కర్జంబు= యోగ్యమైన పని; ఆప్తులు+ఐ= ఇష్టులై; నీకున్= నీకు; ప్రీతిన్= ప్రేమతో; ఎఱింగించు తెఱంగు కాదు= తెలిపే తీరు కానేకాదు; తమ బుద్ధిన్+ పోయి= తాము చెప్పిన త్రోవ ననుసరించి; సంధానము= సంధి; ఇట్లు= వారు చెప్పినట్లు; ఒనరన్= సముచితంగా; చేయక+ ఉన్నన్= నీవు చేయకపోతే; కృష్ణునకున్= వాసుదేవుడికి; నిన్నున్= నిన్ను; ఒప్పించువారు= అప్పగిస్తారు; ఇంతవట్టు నిజంబు= నేను చెప్పుచున్నది వాస్తవం; ఇచ్చటన్= ఇక్కడ; ఇంకన్= ఇటుమీద; నీ+ఉనికిన్= నీవుండుటవలన; ఎట్లున్= ఏవిధంగానైనా; కీడు+పుట్టున్+చుమీ!= హాని కల్గుతుంది సుమా!

తాత్పర్యం: మన తండ్రీ, ద్రోణాచార్యులూ, పితామహుడూ నీ మేలు కోరి కర్తవ్యం ప్రేమతో నీకు చెప్పేవిధం ఇది కానేకాదు. తాము చెప్పినట్లుగా విని నీవు పాండవులతో పొత్తు కుదుర్చుకొనకుంటే నిన్ను వీరు శ్రీకృష్ణుడికి వశం చేస్తారు. ఈ మాట నిజం. ఇక ఇక్కడ నీ వుండటం చేత ఏ విధంగానైనా హాని కలుగుతుంది సుమా!

ఆ. అనిన బాహ్లికాదులగు కురువృద్ధుల। నాత్మజనకుఁ గృష్ణు నాదరింప
కతఁడు రాజసమున నప్పుడు దిగ్గన। లేచిపోయె సంచలించెఁ గొలువు. 373

ప్రతిపదార్థం: అనినన్= అని దుస్ససేనుడు చెప్పగా; బాహ్లిక+ఆదులు+అగు= శంతనుడి తమ్ముడైన బాహ్లికుడు మొదలైన; కురువృద్ధులన్= కౌరవులలో వయసు మళ్ళినవారినీ; ఆత్మజనకున్= తన తండ్రినీ; కృష్ణున్= నారాయణుడినీ; ఆదరింపక= గౌరవించక; అతఁడు= దుర్యోధనుడు; రాజసమునన్= దురహంకారంతో; అప్పుడు= ఆ సమయాన; దిగ్గనన్= శీఘ్రంగా; లేచిపోయెన్= సభనుంచి నిష్క్రమించాడు; కొలువు= సభ; సంచలించెన్= కలవరపడింది.

తాత్పర్యం: దుశ్శాసనుడు అట్లా చెప్పగానే బాహ్లికుడు మొదలైన కురువంశ వృద్ధులనూ, తమ తండ్రినీ, వాసుదేవుడినీ లెక్కించకుండ దుర్గర్వంతో దుర్యోధనుడు సభనుంచి వెంటనే లేచి వెళ్ళాడు. కొలువంతా కలవరపాటు చెందింది.

తే. **అతని వెనుకన కర్ణుండు ననుజగణము । శకునియును వారి పొందైన జనపతులును**
బోయి రమ్మెయిఁ జని యొక్క ప్రోవుగట్టి । వేఱ యంతంత నుండిరి గోఅడమున. **374**

ప్రతిపదార్థం: అతని వెనుకన్+అ= దుర్యోధనుడి వెంబడే; కర్ణుండున్= రాధేయుడూ; అనుజగణమున్= తమ్ముళ్ళ గుంపూ; శకునియును= సౌబలుడూ; వారిపొందు+ఐన= వారికి అనుకూలురైన; జనపతులును= రాజులున్నూ; పోయిరి= వెళ్ళారు; ఆ+మెయిన్+చని= ఆ విధంగా వారు వెళ్ళి; ఒక్క ప్రోవు+కట్టి= ఒక గుంపుగా చేరి; కోఅడమునన్= క్రోధంతో; వేఱ= ప్రత్యేకంగా; అంతంతన్+ఉండిరి= కొంతదూరంలో ఉన్నారు.

తాత్పర్యం: దుర్యోధనుడి వెంట కర్ణుడు, సహోదరుల సమూహం, శకుని, మిత్రులైన రాజులు సభనుండి ఆ విధంగా లేచిపోయి గుంపుగట్టి క్రోధంతో వేఱుగా కొంచెం దూరంలో ఉండిపోయారు.

వ. **ఇ ట్లున్నం గనుంగొని గాంగేయుండు.** **375**

ప్రతిపదార్థం: ఇట్లు+ఉన్నన్= వారిట్లుండగా; కనుంగొని= చూచి; గాంగేయుండు= గంగకొడుకైన భీష్ముడు.

తాత్పర్యం: దుర్యోధనాదులు సభనుంచి అట్లా లేచిపోయి ఒకచోట గుంపుగా చేరి ఉండగా చూచి గంగా పుత్రుడిట్లా అన్నాడు:

చ. **'ఇతఁ డిదియేల క్రొవ్వి ధరణీశుఁడ నంచు వృథాభిమానియై**
మతిచెడి లోభమోహ మదమత్సరముల్ దనుఁ ద్రిప్ప ని ట్లసం
గతమునఁ బోయె; వీని వెనుకం జని రేమి దలంచియో మహీ
పతులును; వీరు గొంద ఱతి పౌరుష మానసు లేమిచేయుదున్?' **376**

ప్రతిపదార్థం: ఇతఁడు= దుర్యోధనుఁడు; ఇది+ఏల= ఇట్లెందుకు; క్రొవ్వి= మదించి; ధరణీ+ఈశుఁడన్+అంచున్= భూపతిననుచు; వృథా+అభిమాని+ఐ= వ్యర్థమైన అహంకారం కలవాడై; మతిచెడి= బుద్ధిలేక; లోభమోహమదమత్సరముల్= దురాశ, అజ్ఞానం, పొగరు, ద్వేషం అనే దుర్గుణాలు; తనున్= తనను; త్రిప్పన్= పట్టి ఆడించగా; ఇట్లు= ఈ ప్రకారంగా; అసంగతమునన్+ పోయెన్= అమర్యాదగా వెళ్ళాడు; వీని వెనుకన్= ఈ దుర్యోధనుని వెనుకనే; ఏమి తలంచియో= ఏమి భావించిరోగాని; మహీపతులును= రాజులును; చనిరి= వెళ్ళారు; వీరు కొందఱు= వీరిలో కొంతమంది; అతి పౌరుషమానసులు= మిక్కిలి పౌరుషంతో కూడిన మనస్సులు కలవారు; ఏమి చేయుదున్?= ఏమి చేసేది? (ఏమి చేయటానికీ తోచటం లేదని భావం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఈ దుర్యోధనుడు తానూ ఒక రాజునని కొరమాలిన అహంకారంతో పొగరెక్కి, బుద్ధిలేక, అత్యాశ, అజ్ఞానం, మదం, ఈర్ష్య అనే దుర్గుణాలకులోనై, అమర్యాదగా సభనుండి లేచివెళ్ళాడు. ఏ ఉద్దేశంతోనో వీని వెంబడి మరికొందరు రాజులు కూడా వెళ్ళిపోయారు. వీరు కొంతమంది మిక్కిలి పౌరుషంతో కూడిన మనసులు కలవారు. ఇప్పుడేమి చేయవలెనో తోచటం లేదు.'

విశేషం: అలం: సముచ్చయం.

తే. **అని జనార్దనుఁ గనుఁగొని 'యకట' కాల । పక్వమయ్యె నీ నరపతి ప్రతతి కెల్ల !**
ననుడుఁ దగువారి దెసఁ గలయంగఁ జూచి । తగవు మెయి నిట్టులనియె నన్నగధరుండు. **377**

ప్రతిపదార్థం: అని; జనార్దనున్+కనుఁగొని= అంటూ శ్రీకృష్ణుడిని చూచి; అకట!= అయ్యో!; ఈ నరపతి ప్రతతికిన్+ఎల్లన్= ఈ రాజసమూహాని కంతకూ; కాలపక్వము+అయ్యెన్= కాలం పండింది సుమా; అనుడున్= అని పల్కగా; ఆ+నగధరుండు= ఆ గోవర్ధనగిరినెత్తిన గోవిందుడు; తగు వారిదెసన్= యోగ్యులైన వారివైపు; కలయంగన్+చూచి= తేరిపార చూచి; తగవు మెయిన్= ధర్మయుక్తంగా; ఇట్టులు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: భీష్ముడు శ్రీకృష్ణుడి వంక చూచి ఈ రాజులందరికీ వినాశకాలం దాపురించినట్లుంది అని అనగానే శ్రీకృష్ణుడు సభలో యోగ్యులైనవారి వైపు చూచి న్యాయసమ్మతంగా ఇట్లా ప్రసంగించాడు.

శా. **'ఈ దుర్యోధనుఁ డింత గర్వియగునే । యీ యున్నవారెల్ల నా**
చే దైన్యంబునఁ బొందు టొప్పదని చర్చింపండ; యీ భంగికిన్
లేదే యొండు దెఱంగు? సత్కులముఁ బాలింపంగ వర్జింపరా
దే? దుష్టాత్మకు నీచు నొక్కరునిఁ? బోదే భేద మీ జాతికిన్? **378**

ప్రతిపదార్థం: ఈ దుర్యోధనుఁడు= ఈ సుయోధనుడు; ఇంత గర్వి+అగునే= ఇంతటి పొగరుబోతు అవుతాడా? ఈ+ఉన్నవారు+ ఎల్లన్= ఇక్కడున్న రాజులంతా; నాచేన్= నావలన; దైన్యంబునన్+పొందుట= దీనత్వం పాలుకావడం; ఒప్పదు+అని= తగదని; చర్చింపండ?= ఎందుకు ఆలోచించడు?; ఈ భంగికిన్= దుర్యోధనుడి ఈ రీతి వ్యవహారానికి; ఒండు తెఱంగు లేదే?= మరొక మార్గం ఏదీ లేదా?; సత్కులమున్= సద్వంశమును; పాలింపఁగన్= కాపాడటానికి; దుష్టాత్మకున్= చెడుబుద్ధిగలవాడిని; నీచున్= అల్పుడిని; ఒక్కరునిన్= ఒక్కడిని; వర్జింపన్‌రాదే?= పరిత్యజించ తగదా? ఈ జాతికిన్= ఈ కౌరవజాతికి; భేదము పోదే!= ఈ చీలిక తొలగదా?

తాత్పర్యం: 'ఈ సుయోధనుడి కింత పొగరా? ఈ సభలో ఉన్న రాజులందరూ 'నా చేత దైన్యం అనుభవించటం తగ'దని ఆలోచించకున్నారు. ఈతడి అనుచిత ప్రవృత్తి మాన్పటానికి మరో మార్గ మేదీ లేదా? సద్వంశాన్ని సంరక్షించటానికి ఆ కుటుంబంలో పుట్టిన దుష్టచిత్తుడు, అల్పుడు అయిన ఒకే ఒకడిని పరిత్యజించటం తగదా? ఈ కౌరవ జాతి కేర్పడిన పీడ తొలగదా?

ఉ. **కంసుఁడు నిట్ల తండ్రి మది గందెడు చంద మొనర్చి ధర్మ వి**
ధ్వంసము సేసినం గులమువారలు నా కెఱిఁగింప నేను దు

ర్మాంసము గోయు వైద్యుని క్రమంబున నాతనిఁ ద్రుంచి యన్వయో
త్తంసముఁ జేయనే జనకుఁ; దద్విధ మొప్పదె మీరుఁ జేసినన్? 379

ప్రతిపదార్థం: కంసుఁడున్= కంసుడుకూడ; ఇట్లు+అ= ఈ దుర్యోధనుడివలెనే; తండ్రి మది= జనకుడైన ఉగ్రసేన మహారాజు చిత్తం; కందెడు చందము+ఒనర్చి= కుమిలిపోయేటట్లు చేసి; ధర్మ విధ్వంసమున్+చేసినన్= ధర్మాన్ని నిర్మూలించగా; కులమువారలు= భోజవంశంలో పుట్టినవారు; నాకున్= నాకు; ఎఱిఁగింపన్= తెలుపగా; నేను= నేను; దుర్మాంసమున్= చెడుమాంసాన్ని; కోయు= ఖండించే; వైద్యుని క్రమంబునన్= చికిత్సకుడి విధాన; ఆతనిన్= కంసుడిని; త్రుంచి= సంహరించి; జనకున్= అతని తండ్రి అయిన ఉగ్రసేనుడిని; అన్వయ+ఉత్తంసమున్+చేయనే?= కులమునకు పెద్దగా చేయలేదా?; తద్+విధము= ఆ రీతి; మీరున్ చేసినన్= మీరు కూడా సల్పినచో; ఒప్పదె?= బాగుండదా?

తాత్పర్యం: కంసుడు ఈ విధంగానే తండ్రి మనసు నొప్పించి ధర్మాన్ని నశింపజేస్తుంటే కులబంధువులు వచ్చి నాకు చెప్పుకొన్నారు. చెడుమాంసాన్ని కోసివైచే వైద్యుడివలె నేను ఆ దుష్టుడిని సంహరించి అతడి జనకుడైన ఉగ్రసేనుడికి రాజ్యపట్టం కట్టి కులానికి మేటిగా చేశాను. మీరున్నూ అట్లా చేయటం సముచితంగా ఉండదా?

విశేషం: అలం: ఉపమ.

ఆ. అంతతోడ నెల్ల యాపదలును దీఱు । వంశ మధిక గౌరవంబు నొందుఁ
గూడి మనుట గలుగుఁ గురు పాండవులకు ని । త్తెఱఁగు సూడ మీకు నుఱవకాదె? 380

ప్రతిపదార్థం: అంతతోడన్= అంతటితో; ఎల్ల+ఆపదలును= అన్నికష్టాలూ; తీఱున్= తొలగిపోతాయి; వంశము= కౌరవ వంశం; అధికగౌరవంబున్+ఒందున్= మిక్కిలి ఆదరణ పొందుతుంది; కురుపాండవులకున్= కౌరవులకూ, పాండవులకూ; కూడిమనుట+కలుగున్= కలసి జీవించటం సమకూడుతుంది; ఈ తెఱఁగు చూడన్= ఆలోచిస్తే ఈ ప్రక్రియ; మీకున్= మీకు; ఉఱవు+అ కాదె!= ఉచితమే కదా!

తాత్పర్యం: దుర్యోధనుడి పీడ విరగడ కావటంతో అన్ని కష్టాలు తీరుతాయి. కురువంశం మిక్కిలి గౌరవం పొందుతుంది. కురుపాండవులకు కలసి జీవించే భాగ్యం లభిస్తుంది. కనుక నే చెప్పిన మార్గం మీకు సముచితమైనది కదా!'

వ. అనిన విని ధృతరాష్ట్రుం డదరిపడి విదురున కిట్లనియె: 381

ప్రతిపదార్థం: అనినన్+విని= శ్రీకృష్ణుడట్లా చెప్పగా ఆలించి; అదరిపడి= భయపడి; ధృతరాష్ట్రుండు; విదురునకున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సదస్యులతో శ్రీకృష్ణు డన్న మాటలు విని ధృతరాష్ట్రుడు బెదరిపోయి విదురుడితో ఇట్లా అన్నాడు:

ఆ. 'బుద్ధిమంతురాలు పొందుగఁ బలుకంగ । నేర్చు; వచ్చి కొడుకుఁ దేర్చిపోవుఁ
గాన వేగ నీవు గాంధారిఁ దోడితె' । మ్మనుడు నరిగి యతఁడు నట్లచేసి. 382

ప్రతిపదార్థం: బుద్ధిమంతురాలు= తెలివిగలది; పొందుగన్= తగినట్లు; పలుకంగన్+నేర్చున్= మాటలాడటం తెలిసినట్టిది; వచ్చి= ఇక్కడికి వచ్చి; కొడుకున్= కుమారుడిని; తేర్చిపోవున్= ప్రసన్నుడిని చేసి వెళ్ళుతుంది; కానన్= కాబట్టి; వేగ= శీఘ్రమే; నీవు= నీవు; గాంధారిన్= గాంధారీదేవిని; తోడితెమ్ము= పిలుచుకొనిరమ్ము; అనుడున్= అని ధృతరాష్ట్రుడు చెప్పగా; అరిగి= వెళ్ళి; అతఁడు= విదురుడు; అట్ల చేసెన్= ఆమెను సభకు వెంటబెట్టుకొని వచ్చాడు.

తాత్పర్యం: 'గాంధారి తెలివిగలది. తగినట్లు మాట్లాడే నేర్పున్నది. ఇక్కడికి వచ్చి తన కుమారుడిని శాంతింపజేస్తుంది. నీవు త్వరగా వెళ్ళి ఆమెను సభకు తోడ్కొనిరమ్ము' అని ధృతరాష్ట్రుడు చెప్పగా విదురుడు వెళ్ళి ఆమెను వెంటబెట్టుకొని వచ్చాడు.

వ. అద్దేవియు. 383

తాత్పర్యం: ఆ గాంధారీ దేవియును.

క. చనుదెంచి యుచిత పీఠం । బున నున్నం గురువిభుండు పొలఁతుకతో ని
ట్లను; నీ తనూభవుఁడు దు । ర్వినయంబునఁ జనియె; నిట్టి వెంగలి గలఁడే? 384

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; ఉచిత పీఠంబునన్+ఉన్నన్= తగిన ఆసనంపై ఉండగా; కురువిభుండు= కురు రాజైన ధృతరాష్ట్రుడు; పొలఁతుక తోన్= పత్ని అయిన గాంధారితో; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికాడు; నీ తనూభవుఁడు= నీ కుమారుడు; దుర్వినయంబునన్= అవిధేయతతో; చనియెన్= సభనుంచి లేచి వెళ్ళాడు; ఇట్టి వెంగలి+కలఁడే?= ఇటువంటి మూర్ఖుడున్నాడా?

తాత్పర్యం: గాంధారి విదురుడి వెంట వచ్చి తగిన పీఠంమీద కూర్చున్నది. అప్పుడు ధృతరాష్ట్రుడు. ఆమెతో ఇట్లా అన్నాడు. 'నీ కుమారుడు అవిధేయుడై సభనుంచి వెళ్ళిపోయాడు. ఇట్లాంటి మూర్ఖుడు ఎక్కడైనా ఉన్నాడా?'

విశేషం: దుర్యోధనుడు తనకూ కొడుకైనప్పటికీ, భార్యయైన గాంధారితో మన తనూభవుడనక 'నీ తనూభవుఁ' డనటం లోక సహజం. (సంపా.)

క. నీవైనఁ జెప్పి శాంతుం । గావింపఁగ నోపుదేనిఁ గౌరవకుల మీ
గోవిందు శాసనము సం । భావింపం గాంచి చెడక బ్రదుకుంజుమ్మీ! 385

ప్రతిపదార్థం: నీవు+ఐనన్+చెప్పి= నీవైనా తెలిపి; శాంతున్+కావింపఁగన్= ప్రసన్నుడిని కావించటానికి; ఓపుదు(వు)+ఏనిన్= చాలి ఉంటే; కౌరవకులము= కురువంశం; ఈ గోవిందుశాసనమున్= ఈ ముకుందుడి యొక్క ఆజ్ఞను; సంభావింపన్+కాంచి= ఆదరించగల్గినదై; చెడక= నశించక; బ్రదుకున్+చుమ్మీ!= జీవించును సుమా!

తాత్పర్యం: 'నీవైననూ చెప్పి దుర్యోధనుడిని శాంతింపజేయగలిగితే శ్రీకృష్ణుడి ఆజ్ఞ ఆదరించబడినదై, ఈ కురువంశం నశించక బ్రతికి ఉంటుంది.'

తే. అనుడు 'నీ పుత్త్రుఁ డవినీతుఁ డగుట యెఱిఁగి । యెఱిఁగి వాని వశంబున నేలపోయె
దీవు పాండవులకు నేమియిచ్చితేని । నడ్డపడ నెవ్వరికి వచ్చు నధిప! చెపుమ.' 386

ప్రతిపదార్థం: అనుడున్= అని ధృతరాష్ట్రుడు పలుకగా; నీ పుత్త్రుఁడు= నీ కుమారుడు; అవినీతుఁడు= అణకువ లేనివాడు; అగుట= అయి యుండుట; ఎఱిఁగి+ఎఱిఁగి= తెలిసి తెలిసికూడ; వాని వశంబునన్+ఏల పోయెదు(వు)?= వాడికి లోబడి ఎందుకు మెలగుతావు?; ఈవు= నీవు; పాండవులకున్= పాండు కుమారులకు; ఏమి+ఇచ్చితి+ఏనిన్= ఏమిచ్చినప్పటికినీ; అధిప!= రాజా!; ఎవ్వరికిన్+అడ్డపడన్ వచ్చున్?= కాదని చెప్పటానికి ఎవరితరం?; చెపుమ= నీవే చెప్పుము.

తాత్పర్యం: 'రాజా! నీ కొడుకు అవిధేయుడని తెలిసి తెలిసి వాని ఇష్ట ప్రకారం ఎందుకు వ్యవహరిస్తావు? నీవు పాండుకుమారులకు ఏమిచ్చినా వద్దని నీకు అడ్డుపడే వారెవరో నీవే చెప్పు.'

విశేషం: ధృతరాష్ట్రుడు గాంధారితో 'నీ తనూభవు' డంటే, ఆమెకూడా తదనుగుణంగానే 'నీ పుత్త్రు' డనటం గమనించదగింది. లోకంలో కొడుకు చెడ్డవాడైతే తల్లి దండ్రులిట్లా ఎవరిమట్టుకు వారు అతడిని తన కొడుకు కాడనటం పరిపాటి. 'నీ కొడుకని అంటావేమి? నీకు మాత్రం కొడుకు కాడా? అని యెత్తిపొడుపు. 'అధిప' అనే సంబోధనం కూడా సాభిప్రాయం. నీవు అధిపుడవు. ఏమయినా చేయగల సమర్థుడివి. పాండవులకు ఏమి ఇస్తే నిన్ను వారించగలిగే వారెవరున్నారు? నీవు రాజువు కదా! అందుచే తప్పంతా నీదే అంటోంది గాంధారి. (సంపా.)

క. అని గాంధారి పతియుఁ దా । నును విదురుం బనిచె నందనుం బిలువ; నతం
డును మొగము జేవుఱింపఁగఁ । జనుదెంచెను సభకు విదుర సంప్రార్థితుఁడై. 387

ప్రతిపదార్థం: అని గాంధారి= అని గాంధారి పలికి; పతియున్= తనభర్త అగు ధృతరాష్ట్రుడూ; తానును= తానూ; నందనున్= కుమారుడైన దుర్యోధనుడిని; పిలువన్= పిలుచుకొని రావటానికి; విదురున్= విదురుడిని; పనిచెన్= పంపారు; విదుర సంప్రార్థితుఁడు+ఐ= విదురుడిచే వేయబడినవాడై; అతండును= ఆ దుర్యోధనుడూ; మొగము జేవుఱింపఁగన్= ముఖం క్రోధంతో ఎఱ్ఱబడగా; సభకున్= కొలువులోనికి; చనుదెంచెను= వచ్చాడు.

తాత్పర్యం: అట్లా గాంధారి వచించి తానూ ధృతరాష్ట్రుడూ దుర్యోధనుడిని సభకు పిలుచుకొనిరమ్మని విదురుడిని పంపారు. విదురుడు వెళ్ళి రమ్మని చెప్పగా సుయోధనుడు కోపంతో ముఖం ఎఱ్ఱపడగా సభకు వచ్చాడు.

వ. మున్ను దనతోడం జనిన వార లందఱు నచ్చోటన నిలువ నిట్లువచ్చి సుయోధనుండు నిజాసనాసీనుండై యున్నఁజూచి తల్లి చిత్తంబున గర్హించుచు నతనికి ధర్మంబును నీతియును జుట్టఱికంబును బ్రదుకుఁదెరువును నిజశక్తియు సహాయంబు గొలందియుఁ గులజన చిత్త ప్రకారంబున బాండుపుత్త్రుల బలపరాక్రమంబులుఁ దెలియునట్లుగాఁ దెఱంగుపడం జెప్పి, బుజ్జగించియుం గినిసియు ననేక విధంబుల నాడిన నమ్మాటల దెస ననాదరంబు సేసి యుద్ధతిం గ్రమ్మఱం జని యతండు కర్ణాదులం గలిసి వారునుం దానును దుర్మంత్రంబునకుం జొచ్చి. 388

ప్రతిపదార్థం: మున్ను= మునుపు; తనతోడన్చనినవారలు= తనతో వెళ్ళినవారు; అందఱున్; ఆ+చోటన్+అ= అక్కడే; నిలువన్; ఇట్లు వచ్చి= ఈ విధంగా వచ్చి సుయోధనుండు; నిజ+ఆసన+ఆసీనుండు+ఐ= తన పీఠంమీద కూర్చున్నవాడై; ఉన్నన్; చూచి; తల్లి; చిత్తంబునన్= మనసులోపల; గర్హించుచున్= నిందిస్తూ; అతనికిన్; ధర్మంబును; నీతియును; చుట్టఱికంబును; బ్రదుకు+తెరువును= జీవనోపాయం; నిజశక్తియున్= అతనిశక్తిని; సహాయంబు కొలఁదియున్= ఆతడికి జరిగేసాయం యొక్క మోతాదు; కులజన చిత్తప్రకారంబును= కుల బంధువుల యొక్క మనోవైఖరి; పాండు పుత్త్రుల బల పరాక్రమంబులున్;

తెలియునట్లుగాన్; తెఱంగుపడన్+చెప్పి= తేటతెల్లంగా తెలిపి; బుజ్జగించియున్= బతిమాలుకొనియూ; కినిసియున్= కోపించియూ; అనేకవిధంబులన్= పలు రకాల; ఆడిన= పల్కినట్టి; ఆ+మాటల దెసన్= ఆ పలుకులయెడ; అనాదరంబు+చేసి= ఆదరం చూపక; ఉద్ధతిన్= గర్వంతో; క్రమ్మఱన్+చని= మరల వెళ్ళి; అతండు= దుర్యోధనుడు; కర్ణ+ఆదులన్+కలిసి= కర్ణుడు మొదలైనవారితో చేరి; వారునున్= ఆ కర్ణాదులు; తానును; దుర్మంత్రంబునకున్+చొచ్చి= దురాలోచనకు పూనుకొని.

తాత్పర్యం: మునుపు తనతోపాటు సభనుండి లేచి వచ్చిన వారంతా అక్కడే నిలువగా దుర్యోధనుడు తానొక్కడే వచ్చి తన పీఠంమీద కూర్చున్నాడు. గాంధారి అతడిని గమనించి మనసులో తిట్టుకొంటూ అతనికి ధర్మం, రాజనీతి, బాంధవ్యం, బ్రతికే మార్గం, అతనికున్న శక్తి, సహాయము యొక్క మితి, కురువంశంలోని పెద్దల మనోవైఖరి, పాండవుల శక్తిసామర్థ్యాలు స్పష్టంగా అతడి బుద్ధి కెక్కేటట్లు చెప్పింది. అతడిని బతిమాలి, కోపించి బహువిధాలుగా హితవాక్యాలు పలికింది. కాని, అతడు తల్లిమాటలు నిరాదరించి గర్వంతో మళ్ళీ లేచి వెళ్ళి కర్ణాదులతో చేరి తానూ వారూ దురాలోచనకు పూనుకొన్నారు.

దుర్యోధనాదులు శ్రీకృష్ణునిం బట్టికొని చెఱంబెట్టఁ దలంచుట (సం. 5-128-1)

క. హరి తలఁ పొప్పదు భీష్ముని । గురునిం గూర్చికొని మనలఁ గ్రొవ్వఱఁ బట్టం
గర ముత్సహించుచున్నాఁ । డరయ నతని వచన రచన నంతయుఁ దెలిసెన్. 389

ప్రతిపదార్థం: హరి తలఁపు+ఒప్పదు= శ్రీకృష్ణుడి సంకల్పం మంచిది కాదు; భీష్మునిన్= గాంగేయుడిని; గురునిన్= ద్రోణుడిని; కూర్చికొని= తనవైపు చేర్చుకొని; మనలన్= మనందరినీ; క్రొవ్వు+అఱన్= పౌరుషం చెడేటట్లు; పట్టన్= బంధించటానికి; కరము= మిక్కిలి; ఉత్సహించుచున్+ఉన్నాఁడు= యత్నిస్తున్నాడు; అరయన్= పరికించగా; అతని వచనరచనన్= శౌరిమాటల తీరును బట్టి; అంతయున్+తెలిసెన్= సమస్తం వెల్లడి ఐనది.

తాత్పర్యం: 'శ్రీకృష్ణుడి ఉద్దేశం మంచిది కాదు. అతడు గురుభీష్ములను తనవైపు కూడ గట్టుకొని, మనందరినీ గర్వమణగేటట్లు పట్టటానికి మిక్కిలి యత్నిస్తున్నాడు. ఇదంతా అతడి మాటల తీరును బట్టి వెల్లడి ఔతున్నది.

విశేషం: నిజానికి కృష్ణుడిని బంధింప జూచేది తానూ తన మిత్రులూ, కృష్ణుడే తనను బంధింపజూస్తున్నాడనటం విడ్డూరం. దుష్టుడైన దుర్యోధనుడు తాను చేయబోయే దౌష్ట్యానికి హేతువును కల్పిస్తున్నాడు. (సంపా.)

క. మునుఁ దాఁ గంసునిఁబరి మా । ర్చిన చందము వారికెల్లఁ జెప్పెడుఁ; దనకున్
మును మనము గడఁగి వెసఁబ । ట్టినఁ గార్యం బగుఁ; జలంబు డింపకుఁ డింకన్. 390

ప్రతిపదార్థం: మును= పూర్వం; తాన్= తాను; కంసునిన్ పరిమార్చిన చందమున్= కంసుడిని చంపిన వైనం; వారికిన్+ఎల్లన్= సభలోని భీష్మ ద్రోణాదులందరికీ; చెప్పెడున్= చెపుతున్నాడు; తనకున్ మును= తాను మనలను బంధించటానికి పూర్వమే; మనము= మనమందరమూ; కడఁగి= పూనుకొని; వెసన్= శీఘ్రంగా; పట్టినన్= శౌరిని బంధిస్తే; కార్యంబు+అగున్= మనపని నెరవేరుతుంది; ఇంకన్= ఇంక; చలంబు; డింపకుఁడు= పట్టుదల వదలకండి.

తాత్పర్యం: పూర్వం తాను కంసుడిని సంహరించిన విధమెట్టిదో గురుభీష్మాదులైన మనవారి కందరికీ చెప్పుతున్నాడు. తనకంటె మనమే ముందు మిగిలి అతడిని వెంటనే బంధిస్తే మనపని నెరవేరుతుంది. పట్టుదల మానకండి.

తే. **పట్టి యీతనిఁ జెఱఁబెట్టి పాండవులకు । దిగులు పుట్టింత మంతటఁ దెగక యెత్తి**
వచ్చిరేనియు నిర్జింప వచ్చుఁ గోఱ । లెల్లఁ బుచ్చిన నురగంబు లేమిసేయు? **391**

ప్రతిపదార్థం: ఈతనిన్+పట్టి= శౌరిని పట్టుకొని; చెఱన్+పెట్టి= చెరసాలలో ఉంచి; పాండవులకున్= పాండునందనులకు; దిగులు పుట్టింతము= జాలికలిగేటట్లు చేద్దాము; అంతటన్= అంతటితో; తెగక= వెనుదీయక; ఎత్తివచ్చిరి+ఏనియున్= మనపై దాడి సలిపితే; నిర్జింపన్+వచ్చున్= వారి నోడించవచ్చు; కోఱలు+ఎల్లన్= కోరలన్నీ; పుచ్చినన్= తీసివేస్తే; ఉరగంబులు= పాములు; ఏమి చేయున్?= ఏమి చెయ్యగలవు?

తాత్పర్యం: కృష్ణుడిని పట్టి చెరలో పెట్టి పాండవులకు దిగులు పుట్టిద్దాము. అంతటితో వారు దారికి వస్తారు. ఒకవేళ దారికి రాక మనపైకి దండెత్తి వస్తే వారిని సులువుగా మనం ఓడించవచ్చు. కోరలు తీసిన పాము లేమి చేస్తాయి?

విశేషం: అలం: నిదర్శన.

వ. **అని విచారించె నట్లు దుష్కార్యాలోచనంబు సేసి దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులగు దుష్టచతుష్టయంబు మొదలుగాఁ గల యవినీతులు దైతేయమర్దను మర్దింప నిశ్చయించి; రయ్యవసరంబున.** **392**

ప్రతిపదార్థం: అని విచారించెన్= అని దుర్యోధనుడు ఆలోచించాడు. అట్లు= ఆ విధంగా; దుష్కార్య+ఆలోచనంబు చేసి= చెడుపని చేయటానికి ఆలోచించి; దుర్యోధన దుశ్శాసన; శకుని కర్ణులు; అగు= అనునట్టి; దుష్టచతుష్టయంబు= నలుగురు దుర్మార్గులు; మొదలుగాన్+కల= మున్నుగా ఉన్నట్టి; అవినీతులు= చెడు నడవడికలవారు; దైతేయ మర్దనున్= రాక్షసులను నలగగొట్టిన నారాయణుడిని; మర్దింపన్ నిశ్చయించిరి= పీడించటానికి నిర్ణయించుకొన్నారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: కృష్ణుడిని పట్టవలెనని దుష్కార్యాలోచన చేసి, దుష్టచతుష్టయం అని పిలువబడే దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులు, ఇంకా వారి పక్షంలో ఉన్న చెడు నడత గలిగిన మరికొందరూ రాక్షసాంతకుడైన శౌరిని బంధించాలని నిశ్చయించుకొన్నారు.

చ. **అడఁకువ లేమి నల్కి యురియాడుట నొండొరుఁగూడకుండుటన్**
బుడిబుడి మాటలాడుటను బోవుచు వచ్చుచుఁ గ్రందు గ్రమ్మఱం
బడుటను దెల్లమైన మును పన్నుగఁ దాఁ బరికించి యున్కి న
ప్పుడు హరిఁ బట్టు సంకులము పుట్టుట సాత్యకి నిశ్చయించుచున్. **393**

ప్రతిపదార్థం: అడఁకువలేమిన్= వినయం లేకుండటంచేత; అల్కి= శంకించి; ఉరియాడుటన్= కళవళపడటం చేతను; ఒండొరున్+కూడక+ఉండుటన్= ఒకరితో మరొకరు చేరకుండటం చేతను; బుడిబుడి మాటలు+ఆడుటను= గుసగుసలాడు కొనటంచేతను; పోవుచున్ వచ్చుచున్= రాకపోకలు సల్పుతూ; క్రందు= సందడి; క్రమ్మఱన్+పడుటను= మరల నేర్పడుట చేతను; తెల్లము+ఐనన్= స్పష్టంకాగా; మును= ముందే; పన్నుగన్= చక్కగా; తాన్= తాను; పరికించి+ఉన్కిన్= గమనిస్తూ ఉండుటచేత; అప్పుడు= ఆ వేళ; హరిన్= శ్రీకృష్ణుడిని; పట్టు సంకులము= బంధించే సంరంభం; పుట్టుట= జనించటం; సాత్యకి= (కృష్ణుడి సోదరుడు); నిశ్చయించుచున్= నిర్ణయిస్తూ

తాత్పర్యం: దుర్యోధనాదులు వినయరహితులై భయంతో కళవళించటం, ఒకరి నొకరు చేరకుండటం, ఒకరితో ఒకరు గుసగుసలాడుకొనటం, అటునిటు తిరుగులాడుతుండటంవల్ల సందడి హెచ్చటం - ఈ లక్షణాలవల్ల

విషయం విశదమై ముందుగానే అంతా చక్కగా గమనించటం వల్ల శౌరిని బంధించే సంరంభం ఏర్పడిందని అప్పుడు సాత్యకి నిర్ణయిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: సముచ్చయం.

తే. బఱటి కొనిపోయి కృతవర్మఁ బన్నఁ బనిచె । నీవు బలమును వాఁకిట నిలువు; మేను
లోపలికి నెల్లఁ జాలుదుఁ; బాపబుద్ధు । లన్నదెసఁ దప్పిరని నిర్భయమునఁ జెప్పె. 394

ప్రతిపదార్థం: బఱటి= సైగగా గోకి; కొనిపోయి= తనవెంట తీసికొనివెళ్ళి; కృతవర్మన్= కృతవర్మను; పన్నన్+పనిచెన్= యుద్ధానికి తలపడుమని చెప్పాడు; నీవును= నీవూ; బలమును= సేనలూ; వాఁకిటన్= సభాద్వారమునందు; నిలువుము= నిలబడండి; ఏను= నేను; లోపలికిన్+ఎల్లన్= సభలోపలి పని కంతటికీ; చాలుదున్= సరిపోతాను; పాపబుద్ధులు= దురిత చిత్తులైన దుర్యోధనాదులు; అన్నదెసన్+తప్పిరి= అన్నపట్ల దౌష్ట్యానికి దిగారు; అని, నిర్భయమునన్+చెప్పెన్= నిర్భీతితో పలికాడు.

తాత్పర్యం: సాత్యకి సైగచేసి కృతవర్మను తనవెంట కొనిపోయి 'నీవు యుద్ధానికి సంసిద్ధంగా ఉండు. నీవూ, సేనలూ వాకిట నిలబడండి. సభలోని సంగతి నంతా నేను చూచుకొంటాను. దురితచిత్తులై దుర్యోధనాదులు అన్నపట్ల అక్రమ మార్గానికి దిగారు' అంటూ నిర్భయంగా పలికాడు.

వ. ఇట్లు పరమాప్తుండగు హార్దిక్యు నటపుచ్చి సాత్యకి సత్వరంగాఁ జనుదెంచి జనార్దనునకు నత్తెఱంగెల్ల నెఱింగించి, తదనుమతిం గౌరవేశ్వర బాహ్లిక గురు భీష్మ విదురులతో నిట్లనియె. 395

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; పరమ+ఆప్తుండు+అగు= మిక్కిలి హితుడైన; హార్దిక్యున్= కృతవర్మను (హృదికుని కొడుకు); అట+పుచ్చి= సభ వెలుపల ఉండుమని పంపి; సాత్యకి; సత్వరంబుగాన్= వేగంగా; చనుదెంచి= వచ్చి; జనార్దనునకున్= శ్రీకృష్ణుడికి; ఆ+తెఱంగు= ఆ విధమంతయు; ఎఱింగించి; తత్+అనుమతిన్= అచ్యుతుడి అంగీకారంతో; కౌరవేశ్వర; బాహ్లిక గురు; భీష్మ; విదురుల తోన్= ధృతరాష్ట్రుడు, బాహ్లికుడు, ద్రోణుడు, భీష్ముడు, విదురుడు అనువారితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: సాత్యకి ఈ విధంగా పరమహితుడూ యాదవుడూ అయిన కృతవర్మను సభ వాకిట పోరాటానికి సంసిద్ధంగా ఉండుమని పంపి, తాను శీఘ్రంగా కొలువు లోనికి వచ్చాడు. శ్రీకృష్ణుడికి విషయమంతా చెప్పి, ఆయన అంగీకారంతో ధృతరాష్ట్ర బాహ్లిక గురు భీష్మ విదురులతో ఇట్లా అన్నాడు:

మ. 'అదె కౌరవ్యు లశక్తదుర్జనత సేయంబూని పైఁ బాఱఁజూ
చెద రమ్మైఁ దమచేతఁ దీఱునె జయశ్రీకాంతు దైత్యాంతకుం
బొదువం దారు దలంచు టెల్ల ననలంబుం జీర బంధింపఁగా
మది నూహించిన యట్లకాక తమ దుర్మంత్రంబులం బోవునే?' 396

ప్రతిపదార్థం: అదె= అదిగో; కౌరవ్యులు= కురుకుమారులు; అశక్త దుర్జనతన్+చేయన్+పూని= శక్తి లేనందున దౌర్జన్యం జరుపనెంచి; పైన్+పాఱన్+చూచెదరు= శ్రీకృష్ణుడి మీదికి ఉరుక యత్నిస్తున్నారు; అమ్మైన్= (ఆ+మైన్) ఆ విధంగా

గమకించటం; తమచేతన్+తీఱునె?= తమవలన సాధ్యపడుతుందా?; జయశ్రీకాంతున్= జయలక్ష్మీ వల్లభుడూ; దైత్య+అంతకున్= దానవ వినాశకుడూ అయిన శౌరిని; పొదువన్= పట్టటానికి; తారు= తాము; తలంచుట+ఎల్లన్= సంకల్పించటమన్నది; అనలంబున్= అగ్నిని; చీరన్= వస్త్రంలో; బంధింపఁగాన్= మూట గట్టటానికి; మదిన్= మనస్సులో; ఊహించిన+అట్లకాక= తలంచినట్లే అవుతుందిగాని; తమ దుర్మంత్రంబులన్= తమయొక్క దుష్టాలోచనలతో; పోవునే?= పని నెరవేరుతుందా?

తాత్పర్యం: 'అదుగో! కౌరవులు శక్తిహీనులై దౌర్జన్యం జరుపదలచి శ్రీకృష్ణుడి మీదికి దుముక యత్నిస్తున్నారు. అది తమవల్ల శక్యమవుతుందా? శౌరిని ఏమిగా భావించారో! ఆయన జయలక్ష్మీవల్లభుడు. దైత్య సంహారకుడు, అట్లాంటి పురుషోత్తముడిని పట్టనెంచటం వస్త్రంలో అగ్నిని మూట గట్టటమే అవుతుంది. తమ దురాలోచనల వల్ల పని నెరవేరుతుందా?'

విశేషం: అలం: రూపకం.

వ. అనిన విదురుం డదరిపడి వైచిత్త్రవీర్యున కిట్లనియె: 397

ప్రతిపదార్థం: అనినన్; విదురుండు; అదరిపడి= బెదరిపోయి; వైచిత్త్ర్యవీర్యునకున్= విచిత్రవీర్యుడి కుమారుడైన ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సాత్యకి మాటలు విని విదురు డదిరిపడి ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

ఉ. 'భూవర! నీ తనూభవులు పుణ్యు నగణ్యపరాక్రమున్ హరిం
గేవల మర్త్యుఁగాఁ దలఁచి కిట్టినఁ బట్టినఁ దారు మంటపై
వావిరిఁ గ్రమ్ము నా శలభ వర్గము చాడ్పున ద్రుందిపోరె? కా
లావధి యయ్యెఁ గావలయు నక్కట! వారికి వారివారికిన్. 398

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; నీ తనూభవులు= నీ కుమారులు; పుణ్యున్= కలుష రహితుడూ; అగణ్య పరాక్రమున్= గణింప శక్యంగాని శౌర్యము కలవాడునూ అయిన; హరిన్= శ్రీమన్నారాయణుడిని; కేవల మర్త్యుగాన్+తలఁచి= సామాన్యుడైన మానవమాత్రుడిగా నెంచి; కిట్టినన్= సమీపించినా; పట్టినన్= బంధించినా; తారు= తాము; మంటపైన్= అగ్నిజ్వాలపై; వావిరిన్= వరుసగా; క్రమ్ము= మూగు; ఆ శలభ వర్గము చాడ్పునన్= ఆ మిడుతలదండువలె; ద్రుందిపోరె?= మాడిపోవరా?; అక్కట!= అయ్యో; వారికిన్= కౌరవులకు; వారివారికిన్= వారితో చేరిన వారికందరికినీ; కాల+అవధి+అయ్యెన్+కావలయున్= ఆయుష్యం యొక్క గడువు తీరింది కాబోలు!

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! నీ కుమారులు సుకృతాత్ముడూ, లెక్కింప శక్యంగాని పరాక్రమం కలవాడూ అయిన శ్రీహరిని సాధారణ నరుడిగా భావించి ఎదుర్కొని బంధించనెంచితే అగ్నిజ్వాలలపై మూగిన మిడుతల దండువలె మాడి మసియైపోతారు. కౌరవులకూ, కౌరవులతో చేరినవారికీ మరణ సమయం ఆసన్నమయిందేమో!'

విశేషం: అలం: ఉపమ.

వ. అనుటయు గోవిందుం డందఱు విన నంబికానందనున కిట్లనియె: 399

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనుటయున్= అని విదురుడనగా; గోవిందుండు= గోపాలదేవుడు; అందఱువినన్= సభ్యులంతా ఆలకించగా; అంబికానందనునకున్= ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: విదురుడట్లా పలికిన మీదట అందరు వింటుండగా శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

ఉ. 'రోషము నాపయిం గలిగి క్రూరతఁ గౌరవు లింతసేఁత సం
తోషము! నీవు ప్రాభవముతోఁ దగ నాకు ననుజ్ఞయిమ్ము; ని
ర్దోషత నేను నోపుగతి దోర్బల దుర్జయులైన వారి వి
ద్వేషముఁ జక్కఁ బెట్టి జగతీవర! యింతకుఁ బోయివచ్చెదన్.' 400

ప్రతిపదార్థం: జగతీవర!= రాజా!; రోషము= కోపం; నాపయిన్+కలిగి= నామీద జనించి; క్రూరతన్= కర్కశత్వంతో; కౌరవులు= నీ కుమారులు; ఇంతచేఁత= ఇంతపనికి పూనుకొనటం; సంతోషము+అ= నాకు ఆనందమే; నీవు; ప్రాభవముతోన్= రాచరికంతో; తగన్= యుక్తంగా; నాకున్= నాకు; అనుజ్ఞ+ఇమ్ము= ఉత్తరువు నొసగుము; నిర్దోషతన్= దోషం కలుగకుండా; నేనున్= నేనునూ; ఓపుగతిన్= చాలినంతవరకు; దోర్బలదుర్జయులు+ఐన= భుజ విక్రమంతో సులభంగా జయించ రానట్టి; వారి= దుర్యోధనాదుల యొక్క; విద్వేషమున్= వైరమును; చక్కన్+పెట్టి= సరిదిద్ది; ఇంతకున్= ఇటుపై; పోయివచ్చెదన్= పయనమై వెళ్ళుతాను.

తాత్పర్యం: 'మహారాజా! నామీద కినుక వహించి ద్రోహబుద్ధితో కౌరవులింతపనికి పూనుకొన్నారు. చాలా సంతోషం. నీవు నీ రాజాధికారంతో నాకు ఉత్తరువిస్తే నేను దోషమొదవకుండ నా శక్తికొలది బాహుశక్తితో సులభంగా జయించరాని ఈ కురుకుమారుల విరోధాన్ని చక్కబెట్టి, ఆ తర్వాతనే ఇక్కడనుండి పయనమై వెళ్ళుతాను.'

క. అనుడు ససంభ్రమముగ న । జ్జనపతి దుశ్శాసనాది సకల పరిజనం
బును నాదుర్జనునిం దో । డ్కొని రమ్మని విదురుఁ బనుచుడుం జని యతఁడున్. 401

ప్రతిపదార్థం: అనుచున్= అని వాసుదేవుడు పలుకగానే; ససంభ్రమముగన్= తొట్రుపాటుతో; ఆ+జనపతి= ఆ నరేశ్వరుడు అయిన ధృతరాష్ట్రుడు; దుశ్శాసన+ఆది+సకల పరిజనంబును= దుశ్శాసనుడు మొదలైన అనుచరవర్గమునూ; ఆ దుర్జనునిన్= ఆ దుర్మార్గుడైన దుర్యోధనుడినీ; తోడ్కొని రమ్ము+అని= ఇచటికి తీసికొని రమ్ము అని; విదురున్ పనుచుడున్= విదురుడిని పంపగా; అతఁడున్= విదురుడునూ; చని= వెళ్ళి

తాత్పర్యం: వాసుదేవుడి మాటలు విని తొట్రుపాటుతో ధృతరాష్ట్రుడు దుశ్శాసనుడు మొదలైన పరిజనంతోపాటు దుర్మార్గుడైన దుర్యోధనుడిని ఇక్కడికి పిలుచుకొని రమ్మని పంపగా విదురుడు వెళ్ళి.

వ. సపరివారంబుగా దుర్యోధనుం డోడ్తెచ్చినం జూచి యతనికి ధృతరాష్ట్రుం డిట్లనియె: 402

ప్రతిపదార్థం: సపరివారంబుగాన్= పరిజనులతో కూడ; దుర్యోధనున్; తోడ్తెచ్చినన్+చూచి= విదురుడు వెంట బెట్టుక రాగా వీక్షించి; అతనికిన్; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: విదురుడు వెళ్ళి పరిజనులతో కూడ దుర్యోధనుడిని సభకు తోడుకొని వచ్చాడు. అపుడు ధృతరాష్ట్రుడు అతడిని చూచి ఇట్లా అన్నాడు :

చ. ‘అలవి యెఱుంగ కిట్లు దనుజారికిఁ గీడొనరింప నీవు నీ
తులువలు నుత్సహించితిరి దుర్మతులార! సమీరు మీకుఁ జే
నలవడఁ బట్టవచ్చునె? మహాద్రిఁ గదల్పఁగఁ బోలునే? దవా
నలుఁ జమరంగ శక్యమె? వినాశముఁ బొందెద రేమి సేయుదున్?’ 403

ప్రతిపదార్థం: దుర్మతులార!= దుష్టాత్ములారా!; అలవి+ఎఱుంగక= మీ శక్తి ఏపాటిదో గుర్తించక; ఇట్లు= ఈ ప్రకారంగా; దనుజ+అరికిన్= రాక్షస విరోధి అయిన రాజీవాక్షునకు; కీడు+ఒనరింపన్= హాని కల్గించటానికి; నీవున్= నీవూ; ఈ తులువలున్= ఈ తుంటరులూ; ఉత్సహించితిరి= పూనుకొన్నారు; మీకున్= మీకు; సమీరున్= వాయువును; చేన్+అలవడన్+ పట్టన్+వచ్చునే= చేతిలోనికి ఇమిడేటట్లు బంధించటం శక్యమా? మహా+అద్రిన్= గొప్ప పర్వతాన్ని; కదల్పఁగన్+పోలునే?= పెల్లగించతరమా? దవ+అనలున్= కార్చిచ్చును; చమరంగన్+శక్యమె= చేతితో నలపటానికి వీలౌతుందా? వినాశము పొందెదరు= మీరు నశించిపోతారు; ఏమిచేయుదున్?= ఏమనగలను? ఏం చేయగలను?

తాత్పర్యం: ‘దుర్బుద్ధి పుట్టి మీ శక్తి ఏపాటిదో తెలిసికొనక దైత్య మర్దనుడైన నారాయణుడికే హాని కల్గించటానికి నీవూ, ఈ తుంటరులూ పూనిక వహించారు. వాయువును చేతిలో ఇముడ్చటానికి వీలవుతుందా? మహా పర్వతాన్ని పెకలించటం సాధ్యమా? కార్చిచ్చును నలచివేయటానికి శక్యమవుతుందా? ఊరక నాశనమై పోతారు సుమా! మిమ్ము నే నేమి చేయగలను?

విశేషం: అలం: నిదర్శన.

ఆ. అనిన విదురుఁ డిట్టులను సుయోధనుతోడ । ‘బాలకేళిఁ దొడఁగి లీలఁ గృష్ణుఁ
డెచట నెచట నెవ్వరెవ్వరి నేమేమి । సేసె వినవె? యేల చెడియె దిట్లు?’ 404

ప్రతిపదార్థం: అనినన్= ధృతరాష్ట్రుడట్లా చెప్పగా; సుయోధనుతోడన్= దుర్యోధనునితో; విదురుఁడు+ఇట్టులు+అనున్= విదురు డిట్లా అన్నాడు; కృష్ణుఁడు= భగవంతుడైన శ్రీకృష్ణుడు; బాలకేళిన్+తొడఁగి= బాలక్రీడలు చేయటానికి ఆరంభించినది మొదలు; లీలన్= వినోదంగా; ఎచటన్+ఎచటన్= ఎక్కడెక్కడ; ఎవ్వరిన్+ఎవ్వరిన్= ఎవరెవరిని; ఏమి+ఏమి+చేసెన్= ఏమేమి చేశాడో; వినవె?= నీవు వినలేదా?; ఇట్లు= ఈ విధంగా; ఏల చెడియెదు(వు)?= ఎందుకు చెడిపోతావు?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు దుర్యోధనుడిని చీకొట్టిన తర్వాత విదురు డతనితో ఇట్లా అన్నాడు: శ్రీకృష్ణుడు శైశవక్రీడ లారంభించినప్పటి నుండి ఎక్కడెక్కడ, ఎవ్వరెవ్వరిని, ఏమేమి చేసిందీ నీకు తెలియదా? వృథాగా ఎందుకు నాశనమై పోతావు?

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం.

వ. అనియె నట్టియెడఁ గట్టెదురనున్న యక్కురుపతికుమారుం జక్కం జూచి యేనొక్కరుండన యని తలంచియె దుర్మదంబునం బొదివి పట్ట నుత్సాహంబు సేసితనుచు దరహాసంబు సేయు వాసుదేవుని ఫాలప్రదేశంబున బ్రహ్మయు, వక్షంబున విరూపాక్షుండును, వదనంబున వహ్నియుఁ, బార్శ్వంబుల నింద్ర యమ వరుణ కుబేరులు నాదిత్యమరుద్విశ్వేదేవాశ్వినులు నుద్భవించిరి హలగాండీవ మండిత బాహులగు బలదేవార్జునులు

సవ్య దక్షిణ భుజంబులను, నిజాయుధ హస్తులగు యుధిష్ఠిర భీమ నకుల సహదేవులు వీఁపునను. వివిధ ప్రహరణ పాణులగు యదువృష్ణి భోజాంధక వీరు లూరులను బ్రభవించిరి; జనిత నానాహస్త విన్యస్తంబులయి శంఖచక్ర గదా ఖడ్గ శక్తి శార్‌ఙ్గ ప్రముఖ నిఖిల సాధనంబులు వెలింగె; నేత్ర శ్రోత్ర నాసా వివరంబుల సధూమ ధూమకేతు జ్వాలా జాలంబులు నిగిడె; రోమకూప కలాపంబులం దరణి కిరణ నిభ ప్రభలు వెడలె; నిట్లు దుర్నిరీక్షంబగు నత్తేజోరూపంబుఁ గనుంగొనం గొలఁదిగాక సకల జనంబుల నయనంబులు మొగిడ్చి యద్భుత భయానక రసంబుల జొత్తిల్లు చిత్తంబుల తోడం గదలకుండ నప్పుండరీకాక్షుండు నారదాది మహా మునుల వలనను భీష్మవిదుర ద్రోణ సంజయుల యందును గరుణా తరంగితంబగు కటాక్ష వీక్షణం బొలయ వారలకు దివ్య దృష్టి యొసంగిన నా పుణ్యపురుషులు సాంద్రానందంబునం దేలుచుండి; రయ్యవసరంబున.

405

ప్రతిపదార్థం: అనియెన్= అని పలికినాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; కడు+ఎదురన్+ఉన్న= ఎట్ట ఎదుట ఉండిన; ఆ కురుపతికుమారున్+చక్కన్+చూచి= ఆ ధృతరాష్ట్ర పుత్రుని తేరిచూచి; ఏను= నేను; ఒక్కరుండన్+అ+అని= ఒంటరివాడనని; తలంచియె= భావించియేగదా; దుర్మదంబునన్= దురహంకారంతో; పొదివి+పట్టన్= ఆక్రమించి బంధించటానికి; ఉత్సాహంబుచేసితి(వి)= పూనిక వహించావు; అనుచున్= అని పల్కుతూ; దరహాసంబు చేయు= చిరునవ్వు నవ్వుతున్న; వాసుదేవుని ఫాలప్రదేశంబునన్= శ్రీకృష్ణుని యొక్క నొసటిభాగంలో; బ్రహ్మయున్= బ్రహ్మదేవుడూ; వక్షంబునన్= గుండెమీద; విరూప+అక్షుండును= శంకరుడును; వదనంబునన్= ముఖమునందు; వహ్నియున్= అగ్నీ; పార్శ్వంబులన్= కుడి యెడమ ప్రక్కలందు; ఇంద్ర= ఇంద్రుడూ, యమ= యముడూ; వరుణ= వరుణుడును; కుబేరులున్= కుబేరుడు అనే దిక్పాలకులున్నూ; ఆదిత్య= ఆదిత్యులు; మరుత్= మరుత్తులు; విశ్వేదేవ= విశ్వేదేవులు; ఆశ్వినులున్= ఆశ్వినులనేవారు; ఉద్భవించిరి= పుట్టారు. హల గాండీవమండిత బాహులు+అగు= నాగలి, గాండీవం అనే ఆయుధాలతో ప్రకాశించే హస్తాలుగల; బలదేవ+అర్జునులు= బలరాముడు, అర్జునుడు; సవ్యదక్షిణ భుజంబుల= ఎడమకుడిచేతులందు; నిజ+ఆయుధ హస్తులు+అగు= తమ తమ ఆయుధాలు చేతులందు కల్గిన; యుధిష్ఠిర= ధర్మజుడు; భీమనకులసహదేవులు; వీఁపునను= వీపునందును; వివిధ ప్రహరణపాణులు+అగు= రకరకాలైన ఆయుధాలు చేతులయందు ధరించిన వారైన; యదువృష్ణి భోజ+అంధక వీరులు= యదువృష్ణి భోజ అంధక వంశాలకు చెందిన శూరులు; ఊరులను= తొడలయందును; ప్రభవించిరి= పుట్టారు; జనిత నానాహస్త విన్యస్తంబులు+అయి= కలిగిన పెక్కుచేతులందు ఉంచబడినవై; శంఖచక్రగదా ఖడ్గ శక్తి శార్‌ఙ్గ ప్రముఖ= శంఖం చక్రం గద ఖడ్గం శక్తి శార్‌ఙ్గం మొదలైన; నిఖిల సాధనంబులు= సమస్తములైన ఉపకరణములు; వెలింగెన్= ప్రకాశించాయి; నారాయణుడి శంఖం పేరు పాంచజన్యం; సుదర్శనం ఆయన చక్రం; కౌమోదకి గద; ఖడ్గ నామం నందకం; చాపం పేరు శార్‌ఙ్గం.

నేత్ర శ్రోత్ర నాసా వివరంబులన్= కన్నులు, చెవులు, ముక్కు అనే అవయవాల యొక్క రంధ్రాల నుంచి; సధూమ= పొగతో కూడిన; ధూమకేతు= అగ్నియొక్క; జ్వాలాజాలంబులు= మంటలయొక్క గుంపులు; నిగిడెన్= వ్యాపించాయి; రోమకూప కలాపంబులన్= రోమకూపాల సమూహమునుండి; తరణి కిరణ= సూర్యకిరణాలతో; నిభ= సమానాలైన; ప్రభలు= కాంతులు; వెడలెన్= బయలుదేరాయి; ఇట్లు= ఈ మాదిరి; దుర్నిరీక్షంబు= చూడటానికి శక్యం కానిది; అగు= అయినట్టి; ఆ తేజోరూపంబున్= ఆ తేజోమయమైన స్వరూపాన్ని; కనుంగొనన్= చూడటానికి; కొలఁది+కాక= తరంకాక; సకల జనంబులు; నయనంబులు= కన్నులు; మొగిడ్చి= మూసికొని; అద్భుత భయానక రసంబులన్= ఆశ్చర్యము; భయానకం అనే రసాలతో; జొత్తిల్లు= తడిసిన; చిత్తంబుల తోడన్= మనసులచే; కదలక+ఉండన్= చలించకుండగా; ఆ+పుండరీక+అక్షుండు= ఆ కమల నయనుడు; నారద+ఆది మహామునులవలనను= నారదుడు మొదలైన మహర్షుల వైపునను; భీష్మ విదుర ద్రోణ

సంజయులందును; కరుణా తరంగితంబు+అగు= కృపారసమున పొంగి పొరలుతున్న; కటాక్ష వీక్షణంబు+ఒలయన్= కడకంటి చూపు ప్రసరించగా; వారలకున్= ఆ మహనీయులకు; దివ్యదృష్టి; ఒసంగినన్= ప్రసాదించగా; ఆ పుణ్యపురుషులు= ఆ సుకృతాత్ములు; సాంద్ర+ఆనందంబునన్= అధికమైన సంతోషము నందు; తేలుచున్+ఉండిరి= ఓలలాడుతూ ఉండిపోయారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో శ్రీకృష్ణుడు ఎట్టయెదుటనున్న దుర్యోధనుడిని తేరిపారజూచి 'నేను ఒంటరివాడననే కదా నీవు దుర్గర్వంతో నన్ను పైనబడి బంధించాలని ఉత్సాహపడుతున్నావు అంటూ ఒక చిరునవ్వు నవ్వాడు. అప్పుడు ఆ వాసుదేవుడి నుదుట బ్రహ్మదేవుడు, వక్షఃస్థలంలో రుద్రుడు, ముఖంలో అగ్ని, పార్శ్వ ప్రదేశాలలో ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు, ద్వాదశాదిత్యులు, మరుత్తులు, విశ్వేదేవతలు, ఆశ్వినులు జనించారు. నాగలి, గాండీవం చేతులందు ధరించిన బలరాముడు పార్థుడు ఎడమ కుడిచేతుల నుంచి ఉద్భవించారు. వీపునుండి తమ తమ ఆయుధాలు చేతులందు గలిగి ధర్మరాజు, భీమసేనుడు, నకులుడు, సహదేవుడు ఆవిర్భవించారు. అనేకములైన ఆయుధాలు హస్తాలలో ధరించిన యదు, వృష్ణి, భోజక, అంధక వంశాలకు చెందిన తన బంధువులైన వీరు లెందరో శౌరి తొడలనుండి ప్రభవించారు. భగవంతుడైన ఆ పరమ పురుషుడి నానాహస్తాలలో శంఖం, చక్రం, గద, ఖడ్గం, శక్తి, శార్ఙ్గం మొదలైన పలు దివ్యాయుధాలు ప్రకాశించాయి. పురుషోత్తముడి నేత్ర కర్ణ నాసికా రంధ్రాల నుండి పొగతో కూడి అగ్నిజ్వాలల సముదాయం వెలువడి వ్యాపించింది. త్రివిక్రముడి రోమ కూపాలనుండి రవికిరణాలతో సమానమైన కాంతులు వెలువడ్డాయి. ఇట్లా నేత్రాలు మిరుమిట్లు గొలిపే ఆ ముకుందుడి దివ్యతేజ స్స్వరూపం చూడటానికి శక్యం కాక సమస్త జనులు కన్నులు మూసుకొని ఆశ్చర్య భయానక రసాలలో తమ మనస్సులు మునిగి తేలుతుండగా నిశ్చేష్టులయ్యారు. అప్పుడు తెల్ల దామరలవంటి కన్నులు గల ఆ దేవదేవుడు నారదుడు మొదలైన మహర్షుల వైపూ, భీష్ముడు, విదురుడు, ద్రోణుడు, సంజయుడు అనే వారివైపూ దయతో నిండిన తన కడగంటి చూపులు ప్రసరింపజేసి వారికి తన విశ్వరూపం సందర్శించటానికి దివ్యదృష్టి ప్రసాదించాడు. ఆ పుణ్యపురుషులు నారాయణమూర్తియొక్క విశ్వరూపాన్ని తిలకిస్తూ పరిపూర్ణమైన ఆనందానుభవంలో ఓలలాడుతూ ఉన్నారు. ఆ సమయంలో.

విశేషం: కశ్యప ప్రజాపతికి అదితివలన కల్గినవారు ఆదిత్యులు. వీరు పన్నెండుమంది. ఇంద్రుడు, ధాత, సవితృడు, త్వష్ట, పూషుడు, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు.

మరుత్తులు ఏభైనాల్గుమంది.

ఇంద్రుడు దితిగర్భంలో ప్రవేశించి వజ్రాయుధంతో భ్రూణమును నలభై తొమ్మిది శకలాలు కావించాడు. పంచ ప్రాణాలు తోడుకాగా వీరు యాభై నలుగురయ్యారు.

విశ్వేదేవులు పదిమంది. ధర్మునకు దక్షపుత్రి విశ్వయందు జన్మించినవారు; క్రతువు, దక్షుడు, వసువు, సత్యుడు, కాలరాముడు, ముని, కురజుడు, మనుజుడు, వీజుడు, రోచమానుడు. హవ్య కవ్యాలలో వీరు అర్చితులు.

అశ్వినీ దేవులు ఇద్దరు.

తనరూపం చూడగోరిన అర్జునిడికి శ్రీకృష్ణ పరమాత్మ దివ్య చక్షువు లిచ్చి చూడుమంటూ చూపిన రూపంలో వీరంతా గోచరించారు.

పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రా నశ్వినౌ మరుతస్తథా,
బహూ న్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత. (గీత 11-6)

తే. **దేవదుందుభి వ్రాతంబు దివిరెఁ గల్ప। వృక్ష పుష్ప ధారామయ వృష్టి గురిసె**
సిద్ధ సాధ్య విద్యాధర శ్రేణి భక్తి। నిచ్చు జయజయ శబ్దంబు లెసఁగెఁ జదల. **406**

ప్రతిపదార్థం: దేవదుందుభి వ్రాతంబు= వేల్పుల భేరులయొక్క సమూహం; తివిరెన్= మ్రోగింది; కల్పవృక్ష పుష్ప ధారామయవృష్టి= కల్పతరు కుసుమాలు అనే జల్లులతో నిండిన వాన; కురిసెన్= వర్షించింది; సిద్ధ సాధ్య విద్యాధర శ్రేణి= సిద్ధులు, సాధ్యులు, విద్యాధరులు అనే దేవతాగణం; భక్తిన్= భక్తితో; ఇచ్చు= సలుపునట్టి; జయజయ శబ్దంబులు= జేజే అనే ధ్వనులు; చదలన్= ఆకాశంలో; ఎసఁగెన్= అతిశయించాయి.

తాత్పర్యం: దేవతలయొక్క భేరీ సమూహం మ్రోగింది. కల్పతరు కుసుమాల వానజల్లు కురిసింది. సిద్ధులు సాధ్యులు విద్యాధరులు అనే దేవతా సముదాయం భక్తితో చేసిన జయజయధ్వానాలు అంతరిక్షంలో నిండాయి.

వ. **అప్పుడు ధృతరాష్ట్రుం డమ్మహాసంకులంబు విష్ణుని దివ్యవిజృంభణంబు గావలయు నని యూహించి.** **407**

ప్రతిపదార్థం: అప్పుడు; ధృతరాష్ట్రుండు; ఆ+మహాసంకులంబు= సభయందు ఏర్పడిన కలకల ధ్వని; విష్ణుని దివ్య విజృంభణంబు కావలయున్+అని= వాసుదేవుడి యొక్క విశ్వవ్యాపకత్వ మగునేమో అని; ఊహించి= వితర్కించి.

తాత్పర్యం: అప్పుడు ఆంబికేయుడు కొలువులో ఏర్పడ్డ కలకలధ్వని విని, అది గోపాలదేవుడి యొక్క విశ్వరూప ప్రదర్శనమై ఉంటుందని భావించి.

క. **'కరుణింపుము సంశ్రితభయ। హరణ ధురీణా! సహింపు మజ్ఞానంబున్**
శరణంబు వేఁడెద భవ। చ్చరణంబులు గనుఁగొనం బ్రసాదింపఁగదే! **408**

ప్రతిపదార్థం: సంశ్రిత భయహరణధురీణా!= ఆశ్రితులయొక్క భీతిని తొలగించే కార్యభారం వహించేవాడా!; కరుణింపుము= దయచూడుము; అజ్ఞానంబున్= అవివేకాన్ని; సహింపుము= మన్నించు; శరణంబు వేఁడెదన్= నిన్నే రక్షకుడిగా ప్రార్థిస్తున్నాను; భవత్+చరణంబులు= నీ పాదాలు; కనుఁగొనన్= దర్శించటానికి; ప్రసాదింపన్+కదే!= అనుగ్రహించుము.

తాత్పర్యం: 'వాసుదేవా! ఆశ్రితుల భయాన్ని తొలగించేవారిలో అగ్రేసరుడవు. నన్ను దయతో చూడు. నా అజ్ఞానాన్ని మన్నించు. నిన్నే శరణు వేడుతున్నాను. నీ పాదములు దర్శించే భాగ్యం అనుగ్రహించు'.

చ. **అనుడు దయార్ద్రచిత్తుఁడగు నప్పరమేశ్వరుఁ డిచ్చె దృష్టి య**
జ్జనపతి కద్భుతం బడర సమ్మదపూరము గ్రమ్మ నాతఁడుం
గనుఁగొని భక్తి మ్రొక్కి 'నినుఁగంటిఁ గృతార్థుఁడనైతి; నింక నొ
ల్ల నొరులఁ జూడ లోచనములం బురుషోత్తమ! సంహరింపవే **409**

ప్రతిపదార్థం: అనుచున్= అని ఆంబికేయుడు వేడగా; దయా+ఆర్ద్ర చిత్తుఁడు+అగు= దయతో తడిసిన మనస్సుగల ఆ+పరమ+ఈశ్వరుఁడు= ఆ దేవ దేవుఁడు; ఆ+జనపతికిన్= ఆ నరేశ్వరుడైన ధృతరాష్ట్రుడికి; అద్భుతంబు+అడరన్=

ఆశ్చర్య మతిశయిల్లగా; దృష్టిన్+ఇచ్చెన్= చూపు నను(గహించాడు; ఆతఁడున్= అంధరాజైన ధృతరా(ష్ట్రుడు; సమ్మదపూరము+ క్రమ్మన్= ఆనందా(శువులు కన్నులలో నిండగా; కనుఁగొని= స్వామి యొక్క విశ్వరూపం సందర్శించి; భక్తిన్= భక్తితో; (మొక్కి= నమస్కరించి; పురుషోత్తమ!= గోవిందుడా!; నినున్‌కంటిన్= నిన్ను దర్శించాను; కృతార్థుఁడన్+ఐతిన్= ధన్యుడనయ్యాను; ఇంకన్= ఇటుపై; ఒరులన్+చూడన్+ఒల్లన్= ఇతరులను చూడటానికి ఇష్టపడను; లోచనములన్= నీ విచ్చిన నే(త్రాలను; సంహరింపవే= నిరోధించు!

తాత్పర్యం: ధృతరా(ష్ట్రు డట్లా వేడగా దయారసంతో తడిసిన మనస్సుగల ఆ దేవదేవుడు అంధనృపతికి ఆశ్చర్యం కలిగేటట్లు దివ్యదృష్టి (ప్రసాదించాడు. దేవుడిచ్చిన చూపుతో కనులలో ఆనందబాష్పాలు (క్రమ్మగా అతడు శ్రీకృష్ణుడి విశ్వరూపం వీక్షించి భక్తితో నమస్కరించి 'పురుషోత్తమా! నిన్ను చూచాను. ధన్యుడనయ్యాను. నిన్ను జూచిన కన్నులతో ఇతరులను చూడటాని కిష్టపడను. నీవిచ్చిన చూపు నీవే వెనుకకు తీసికొమ్ము!'

క. అనిన పలుకులకు నచ్చటి । జనులెల్ల నృపాలు సితవిశాలాక్షుఁ గనుం
గొనుచుండి రపుడు తమనె । మ్మనమ్ము లాశ్చర్యరస నిమగ్నంబులుగాన్. 410

(ప్రతిపదార్థం: అనిన పలుకులకున్= అనిన ధృతరా(ష్ట్రుడి మాటలకు; అపుడు= ఆ సమయాన; అచ్చటి జనులు+ఎల్లన్= అక్కడున్న జనులంతా; తమ నెమ్మనమ్ములు= తమ నిండు హృదయాలు; ఆశ్చర్య రస నిమగ్నంబులు కాన్= అద్భుత రసంలో మునిగినవి కాగా; సితవిశాల+అక్షున్= తెల్లని వెడదలైన కన్నులు గల; నృపాలున్= ఆ ధృతరాష్ట్ర మహారాజును; కనుంగొనుచున్+ఉండిరి= చూస్తూ ఉన్నారు.

తాత్పర్యం: ధృతరా(ష్ట్రుని మాటలకు ఆ సభలో ఉన్న జనులందరూ తమ హృదయాలు అద్భుతరసంలో మునిగిపోగా విశాలమైన తెల్లని కన్నులు గల ఆ రాజును చూస్తూ ఉండిపోయారు.

వ. తదనంతరంబ దామోదరుండు ధృతరాష్ట్రు నభిమతం బొడఁగూడ నతని కన్ను లెప్పటియట్ల కావించి, నిజ విశ్వరూప ప్రపంచంబు నుపసంహరించి, మునీంద్రుల నామంత్రణంబు సేయ నమ్మహాత్ము లంతర్ధానంబు సేసిరి; దానును సముత్థానంబు సేసి యంతకుమున్న సన్నిహితులైయున్న కృతవర్మ కరంబును, సాత్యకి హస్తంబును నవలంబించి యూరక వెడలెనని చెప్పిన. 411

(ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; దామోదరుండు= శ్రీకృష్ణుడు; ధృతరా(ష్ట్రు+అభిమతంబు= ధృతరా(ష్ట్రుడి యొక్క కోరిక; ఒడఁగూడన్= నెరవేరగా; అతని కన్నులు; ఎప్పటి+అట్ల+కావించి= మునుపటి వలె అంధములుగా ఉండేటట్లు చేసి; నిజ విశ్వరూప (ప్రపంచంబున్= తన విశ్వవ్యాపకమైన దివ్యరూపాన్ని; ఉపసంహరించి= వెనుకకు తీసికొని; ముని+ఇం(ద్రులన్= నారదాది మహర్షులను; ఆమం(త్రణంబు+చేయన్= పోయిరండని సెలవీయగా; ఆ+మహాత్ములు= ఆ మహానుభావులు; అంతర్ధానంబు చేసిరి= మాయమైనారు; తానును= శ్రీకృష్ణుడుకూడా; సముత్థానంబు+చేసి= పీఠంనుండి దిగి; అంతకున్+ మున్న= తాను పీఠం నుండి లేవడానికి మునుపే; సన్నిహితులు+ఐ= సముఖాన నిలిచినవారై; ఉన్న= ఉన్నట్టి; కృతవర్మ కరంబును= కృతవర్మయొక్క చేతిని; సాత్యకి హస్తంబును= సాత్యకియొక్క చేతిని; అవలంబించి= పట్టుకొని; ఊరక వెడలెన్= మౌనంగా బయలుదేరాడు; అని చెప్పినన్= అని వైశంపాయన మహర్షి చెప్పగా.

తాత్పర్యం: ఆ తరువాత శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడి కోరిక తీరేటట్లు ఎప్పటివలెనే అతడి కన్నులు గ్రుడ్డివిగా చేసి తన జగద్వ్యాపకమైన మహామూర్తిని ఉపసంహరించాడు. నారదాది మహర్షులకు వెళ్ళిరండని సెలవిచ్చాడు. అంతట ఆ మహనీయులు అదృశ్యమయ్యారు. అప్పుడు వాసుదేవుడు తన పీఠం నుండి దిగాడు. అప్పటికే సముఖంలో నిలిచి ఉన్న సాత్యకి కృతవర్మల హస్తము లూది నారాయణుడు మౌనంగా అక్కడినుండి బయలుదేరాడు అని వైశంపాయన మహర్షి జనమేజయుడికి చెప్పగా.

ఆ. 'ఇవ్విధమునఁ గృష్ణుఁ డేఁగిన పిదపటి । కథ వినంగ నాకుఁ గౌతుకంబు
మనము నిండి గడలు కొనుచున్నయది వివ । రించి చెప్పు మునివరేణ్య' యనుడు. 412

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ రీతిగా; కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; ఏగిన పిదపటి కథన్= వెళ్ళిన తరువాత జరిగిన కథను; వినంగన్= వినటానికి; నాకున్= నాకు; కౌతుకంబు= కుతూహలం; మనమునిండి= మనస్సునందు నిండి; కడలు కొనుచున్+ఉన్న అది= పొంగి పొరలుతూ ఉన్నది; మునివరేణ్యా!= మునులలో శ్రేష్ఠుడా!; వివరించి చెప్పు= విపులంగా తెలుపుము; అనుడున్= అని జనమేజయుడు అడుగగా.

తాత్పర్యం: ఈ విధంగా శ్రీకృష్ణుడు సభనుండి వెళ్ళిన తరువాత జరిగిన కథ వినవలెననే కుతూహలం నా ఎదలో నిండి పొంగి పొరలుతున్నది. ఆ విషయం మునివర్యా! నాకు సవిస్తరంగా తెల్పు'మని జనమేజయ మహారాజు వైశంపాయన మహర్షిని అడిగాడు.

ఆశ్వాసాంతము

ఉ. భక్త మనస్ ప్రమోదకర పాదసరోజ వికాస! చేతనా
శక్తిమయ ప్రభావ! ముని సంస్తుత! సాత్యవతేయభారతీ
ప్రోక్త! నిగూఢ సంప్రకట భూమ సమాశ్రయ! వత్సలత్వ సు
వ్యక్త కృపాభిరామ! గుణ వర్జన! నిష్కల! నిత్యపుష్కలా! 413

ప్రతిపదార్థం: భక్త మనస్ ప్రమోదకర= భక్తులయొక్క చిత్తమునకు ఆనందాన్ని కలిగించే; పాదసరోజ వికాస!= పద్మాలవంటి పాదాలయొక్క వికాసం కలవాడా!; (హరిహరనాథుని చరణ కమలధ్యానం వలన భక్తుల హృదయాలకు సంతోషం సమకూడుతుందని భావం); చేతనాశక్తిమయ ప్రభావ!= చైతన్య విశిష్టమైనశక్తి యొక్క మహిమగలవాడా! (చైతన్య విశిష్టమైన ఆయన బలం యొక్క మహిమవలననే సకలమూ ప్రవర్తిల్లుతుందనుట); ముని సంస్తుత= జ్ఞానులచేత కొనియాడబడేవాడా; సాత్యవతేయ భారతీ ప్రోక్త!= సత్యవతీ పుత్రుడైన వేదవ్యాస మునీంద్రుడియొక్క వాఙ్మయంచేత చక్కగా చెప్పబడినవాడా! (వ్యాసమహర్షి రచించిన సారస్వతమంతా భగవత్ప్రశస్తిని తెలియజెప్పుతుందనుట); నిగూఢసంప్రకట భూమసమాశ్రయ!= అవ్యక్తం. వ్యక్తం అయినట్టి కారణ కార్యమైన బృహద్రూపాన్ని ఆశ్రయించినవాడా!; వత్సలత్వ+సువ్యక్త+కృపా+అభిరామ!= వాత్సల్య గుణముచేత చక్కగా తెలియబడునట్టి కృపచేత ఇంపైనవాడా!; గుణవర్జన!= ప్రాకృతికములైన హేయగుణాలు లేనివాడా! (హేయ ప్రత్యనీకములైన కారుణ్య వాత్సల్య స్థైర్య ధైర్య శౌర్య పరాక్రమ సత్య కామ సత్య సంకల్ప కృతిత్వ కృతజ్ఞతాదులైన అసంఖ్యేయ కళ్యాణ గుణాలకు ఆటపట్టుగా భగవంతుడిని పెద్దలు వినుతించారు); నిష్కల!= అంశం లేనివాడా! ((ప్రాణము,

శ్రద్ధ ఈ మొదలైనవి షోడశకళలు, సాధారణ పురుషుడు ఈ పదారు కళలు కలవాడు; భగవంతుడట్టివాడు కాడు; ఆయన నిష్కళుడు); నిత్యపుష్కలా!= ఎల్లప్పుడు పూర్ణుడవై ఉండేవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! నీ చరణకమల వికాసం భక్తుల మనస్సులకు సంతోషం చేకూరుస్తుంది. చైతన్య విశిష్టమైన శక్తి సామర్థ్యా లున్నవాడవు నీవు. నిన్ను యోగీశ్వరులు వినుతిస్తారు. వ్యాస రచితమైన వాఙ్మయం నిన్ను గూర్చి తెలుపుతుంది. కారణ కార్యరూపంలో వ్యక్తావ్యక్తంగా ఉన్న పరబ్రహ్మ స్వరూపుడవు నీవు. శరణాగతులందు ప్రకటితమైన వాత్సల్యాన్ని బట్టి నీ కారుణ్య మెంతటిదో బాగా స్పష్టమవుతున్నది. నీవు హేయగుణ రహితుడవు. కళ్యాణ గుణ పరిపూర్ణుడవు. షోడశకళలు గల సాధారణ పురుషుడి వలెగాక నిష్కలుడవై, పురుషోత్తముడవై ఉన్నావు. వృద్ధి క్షయాలు లేక నీవు నిత్యపూర్ణుడవై విలసిల్లుతున్నావు.

విశేషం: అలం: ఉపమ.

క. **అవ్యయ నిర్మల విభవా! । దివ్య ప్రభవా! సుఖైక దీప్తానుభవా!**
నవ్యత్వనిత్య! యతిసం । సేవ్యసుసాంగత్య! లోక జీవన కృత్యా! **414**

ప్రతిపదార్థం: అవ్యయ= నాశరహితమైన? నిర్మల= మాలిన్యంలేని; విభవా!= వైభవం కలవాడా! (విభవ శబ్దానికి నిర్వృతి అనే అర్థం ఉండుటచే (భగవంతుడు శాశ్వతనిర్మల మోక్ష స్వరూపుడు) దివ్య ప్రభవా!= అప్రాకృతమగు పుట్టుక గలవాడా! (భగవంతుడి జన్మకర్మలు దివ్యములు; ప్రాకృతములు కావు); సుఖ+ఏకదీప్త+అనుభవా!= ఆనందంచేతనే ముఖ్యంగా ప్రకాశించే అనుభవం కలవాడా! (భగవంతుడి అనుభవం కేవలానందమే); నవ్యత్వ నిత్య!= నూతనత్వం చేత ఎడతెగని వాడా! (దేవుడు శాశ్వతమైన నవ్యత్వం గలవాడు); యతి సంసేవ్య సుసాంగత్య!= యోగులచేత మిక్కిలి అనుభవించదగిన భేదరహిత భావం కలవాడా!; లోక జీవన కృత్యా!= జగములను పోషించడమే కార్యంగా కలవాడా! (నిఖిల భువన జన్మస్థేమ భంగములు ఆయన కృత్యములే అయిననూ జీవులకు బ్రతుకుతెరువు కల్పించటమే ఆయన ముఖ్యమైన కృత్యం.)

తాత్పర్యం: హరిహరనాథా! నాశరహితమూ, దోషరహితమూ అయిన మోక్షస్వరూపం కలవాడివి నీవు. నీ పుట్టుక సాధారణ జీవుల పుట్టుక వంటిదిగాదు. అది దివ్యమైనది. కేవల సుఖరూపమైన ఆనందంతో నీవు ప్రకాశిస్తుంటావు. నీవు నిత్యనూతనుడివి. అభేద భావంతో పరమయోగులచేత అనుభవించబడుతుంటావు. లోకాలను పరిపోషించటమే నీ ప్రధాన కృత్యం.

విశేషం: అంత్యానుప్రాసం.

మాలిని.

రవిశశి మయనేత్రా! ప్రస్ఫురత్కాంతి హృద్యా!
నవ జరఠ వికార న్యాస లీలానవద్యా!
వివృత నిగమ శాఖా విశ్రుతాగ్రైక వేద్యా!
వివిధ నియత చర్యా విత్త చిత్త ప్రసాద్యా! **415**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: రవిశశిమయ నేత్రా!= సూర్య చంద్ర రూపాలైన కన్నులు కలవాడా!; (విరాట్ విగ్రహుడైన పరమేశ్వరుడికి 'చక్షుషీ చంద్ర సూర్యౌ' నేత్రాలు చంద్ర సూర్యులు అని శ్రుతులు చెపుతున్నాయి.) ప్రస్ఫురత్ కాంతి హృద్యా!= మిక్కిలి ప్రకాశించే తేజస్సుచేత మనోహరమైనవాడా! (గగనతలంలో ఒకేసారి వేయి మంది సూర్యు లుదయిస్తే ఆ కాంతి ఆ మహాత్ముడి కాంతికి సమానం కావచ్చు అని గీత చెపుతుంది.)

దివి సూర్యసహస్రస్య భవే ద్యుగపదుత్థితా,
యది భాస్సదృశీ సా స్యా ద్భాసస్తస్య మహాత్మనః

నవజరఠ వికార న్యాస లీలా+అనవద్యా= బాల్యం వార్ధకం అనే భావవికారాలు ఉంచటం అనే విలాసంచే దోషరహితమైనవాడా! (పుట్టుట, ఉండుట, మారుట, పెరుగుట, కృశించుట, నశించుట అనేవి ఆరువిధాలైన భావవికారాలు. అవి లేనివాడు భగవంతుడు. కాని తనయందునూ, జగమునందునూ వాటిని ఆరోపించటం ఆయనకు లీల); వివృత నిగమశాఖా= వివరించబడిన వేదశాఖలయందలి; విశ్రుత+అగ్ర+ఏక+వేద్యా!= ప్రసిద్ధమైన కొనలచే ముఖ్యంగా తెలియబడేవాడా(వ్యాఖ్యానించబడ్డ వేదశాఖల యొక్క అగ్రభాగములు ఉపనిషత్తులు, వాటిచేతనే భగవంతుడిని తెలుసుకోవచ్చు. ఋగ్యజుస్సామాథర్వణములని వేదాలు నాలుగు. ఆ చతుర్వేదములు 1131 శాఖలుగా విభజించబడినాయి. వాటి అగ్రభాగాలే ఉపనిషత్తులు. బ్రహ్మసూత్రములకు, గీతకు, ఉపనిషత్తులకు పెద్దలు వ్యాఖ్యానాలు రచించారు. వాటివలన భగవత్తత్త్వం తెలియవీలవుతుంది.) వివిధ నియతచర్యా= పలు తెరగులైన యమనియమాది చర్యల వలన; విత్త= పొందబడిన; చిత్తప్రసాద్యా!= మనస్సుచేత ప్రసన్నుడిగా చేయదగినవాడా! (యమనియమాదులైన చర్యలచేత మనస్సు స్వాధీనం కాగా అట్టి మనస్సునందే భగవంతుడు గోచరిస్తాడు.)

తాత్పర్యం: హరిహరనాథా! నీ కన్నులు సూర్యచంద్రరూపాలు. దీపిస్తున్న నీ తేజస్సు మనసులకు ఇంపుగొలుపుతుంది. బాల్య యౌవన కౌమార వార్ధక్యాదులు లేనివాడవైనా వాటిని నీ యందూ, జగమునందూ ఆరోపించటం నీ కొకలీల. వివిధాలైన వేదశిరస్సులచేతనే తెలియదగినవాడవు నీవు. యమనియమాదులచేత స్వస్థమైన మనస్సునకే నీవు గోచరిస్తావు.

విశేషం: అలం: అంత్యానుప్రాసం.

మాలినీ వృత్తంలోని ప్రతిచరణంలోనూ న-న-మ-య-య- అనే గణాలుంటాయి. 9వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమ దుభయకవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీ మహాభారతంబున నుద్యోగ పర్వంబునందుఁ దృతీయాశ్వాసము.

తాత్పర్యం: శ్రీమంతులైన సంస్కృతాంధ్ర కవీశ్వరులకు హితుడును, కొమ్మన మంత్రికి కుమారుడును, పండితులను పూజించటంచేత ప్రకాశించేవాడును అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శుభకరమైన మహాభారతంలోని ఉద్యోగపర్వంలో మూడవ ఆశ్వాసం ముగిసింది.

ఉద్యోగపర్వంలో తృతీయాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము - చతుర్థాశ్వాసము

శ్రీ మత్తులసీ పల్లవ । దామచ్ఛవిలబ్ధ మరకత ప్రతిమత్వో
ద్దామ ప్రభాస్థిమాలా । శ్యామాయిత విపులవక్ష హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీమత్= శోభాయుక్తమైన; తులసీపల్లవదామ= తులసి చిగుళ్లమాలిక యొక్క; ఛవి= కాంతిచేత; లబ్ధ= పొందబడిన; మరకత ప్రతిమత్వ= గరుడపచ్చల మణులతోడి పోలికతో; ఉద్దామ ప్రభా= అధికమైన కాంతిగల్గిన; అస్థిమాలా= పునుకలదండచేత; శ్యామాయిత= నీలంగా చేయబడిన; విపులవక్ష!= విశాలమైన రొమ్ము కలవాడా!; హరిహరనాథా!= హరిహరనాథుడనే పేరుగల దేవా!

తాత్పర్యం: హరిహరనాథా! శోభావంతమైన తులసి చిగుళ్ల మాలికయొక్క నల్లని కాంతిపొత్తుచేత తెల్లని పునుకదండ గరుడపచ్చల సామ్యం పొందినదై తన విశేషమైన దీప్తిచేత నీ వెడల్పయిన ఎడమరొమ్మును నీలంగా చేస్తున్నది స్వామీ!

విశేషం: నారాయణుడు నల్లని రంగు కలవాడు. అతడు తులసీదళదాముడు, శంభుడు తెల్లటి మేనివాడు. పునుకదండను తాల్చేవాడు. తులసి నల్లటిది. పునుక తెల్లటిది. హరిహరనాథుడి దక్షిణార్ధ శరీరం వైష్ణవం. వామార్ధభాగం శైవం. ఒకే మూర్తి కనుక ఒకే వక్షఃస్థలం. ఆ వక్షఃస్థలం యొక్క కుడిభాగంలో నల్లని తులసీమాల, ఎడమ భాగమందు తెల్లని అస్థిమాల ప్రకాశిస్తున్నాయి. కాని, స్ఫటికంవలె తెల్లని పునుకదండ తులసిమాలయొక్క సంసర్గంతో గరుడపచ్చల కాంతి సామ్యం పొంది తెల్లని ఆయన రొమ్మును నల్లగ మారుస్తున్నది.

శ్రీకృష్ణుండు కుంతియింటికిం జని యాయమతో మాటలాడుట (సం. 5-129-20)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియెఁ గృష్ణుం డత్తెఱంగున వెడలిన విస్మితయై గాంధారి యభ్యంతర మందిరంబున కరుగం గౌరవులెల్లను బంధుమిత్ర సహాయ సహితంబుగాఁ దనతోడన వెడల, మొగంబు గంటు వెట్టికొని కక్ష్యాంతరంబులు గడచినప్పుడు దారుకుండు తేరినొగలపై నుండి పొడసూపి కేలు మొగిడ్చి ఫాలభాగంబునం గదియించినం, దత్ప్రదేశంబున నిలిచి, వారలదెస మరలిచూచి 'మీ రింక నిలువుం' డని పలికిన నాంబికేయుండు పుండరీకాక్షుం జేరి నిజతనూజుల నుపలక్షించి. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా! అవధరించు; వైశంపాయనుండు; జనమేజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; కృష్ణుండు, ఆ+తెఱంగునన్= ఆ విధంగా; వెడలినన్= సభనుండి మౌనంగా లేచి వెళ్ళగానే; విస్మిత+ఐ= ఆశ్చర్యం పొందినదై; గాంధారి; అభ్యంతరమందిరంబునకున్+అరుగన్= లోపలి నగరుకు వెళ్ళగా; కౌరవులు+ఎల్లను; బంధుమిత్ర

సహాయ సహితంబుగాన్= బంధువులతో, మిత్రులతో, తోడ్పడేవారితో కూడ; తనతోడన్+అ= తన వెంబడినే; వెడలన్= బయలుదేరగా; మొగంబు గంటుపెట్టికొని= ముఖం చిన్నపుచ్చుకొని; కక్ష్యా+అంతరంబులు= తొట్టికట్లు; కడచిన+అప్పుడు= దాటినప్పుడు; దారుకుండు= కృష్ణసారథి; తేరి నొగలపైన్+ఉండి= రథంయొక్క నొగలమీదినుంచి; పొడచూపి= కన్పించి; కేలుమొగిడ్చి= చేతులు జోడించి; ఫాలభాగంబునన్= నెన్నుదురు ప్రాంతంలో; కదియించినన్= చేర్చగా; తద్+ప్రదేశంబునన్+ నిలిచి= శ్రీకృష్ణుడు ఆ తావులో ఆగి; వారలదెసన్ మరలిచూచి= తన వెంటవస్తున్న వారివైపునకు తిరిగి చూచి; మీరు+ఇంకన్, నిలువుండు+అని; పల్కినన్= గోవిందుడు చెప్పగా; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; పుండరీక+అక్షున్+చేరి= శ్రీకృష్ణుడిని సమీపించి; నిజతనూజులన్= తన కుమారులను; ఉపలక్షించి= ఉద్దేశించి.

తాత్పర్యం: స్వామీ హరిహరనాథా! అవధరించుము: వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజుతో ఇట్లా అన్నాడు: వాసుదేవుడు ఆ విధంగా సభనుంచి నిష్క్రమించగానే ఆశ్చర్యపడి గాంధారీదేవి లోపలినగరుకు వెళ్లిపోయింది. కౌరవులందరూ బంధుమిత్ర సహాయులతో కూడి తనను వెంబడించగా శ్రీ కృష్ణుడు ముఖం చిన్నపుచ్చుకొని కక్ష్యాంతరాలు దాటాడు. అక్కడ రథసారథి అయిన దారుకుడు తేరినొగలపైనుండి మోడ్చినచేతులు నిటల ప్రదేశంలో చేర్చి తనను కనిపించుకొన్నాడు. దేవకీనందనుడు అక్కడ ఆగాడు. వెంటవస్తున్న వారివైపు తిరిగి 'మీ రిక నిలవండి' అని పలికాడు. పిదప ధృతరాష్ట్రుడు శ్రీహరి చెంతకు చేరి తన కొడుకులను ఉద్దేశించి (ఇట్లా అన్నాడు).

ఉ. **'వీరును బాండుపుత్త్రులును వేరము దక్కి పొసంగి మన్కికై**
పోరితమాడి యే నటులు బుద్ధులు సెప్పిన భంగియుం, గులా
చారము నిర్వహింపఁ బలుచందములం దగ దుఃఖపాటు నీ
కౌరవజాతికిం దెలిసెఁ గాదె గదాధర! నీదు సన్నిధిన్.' **3**

ప్రతిపదార్థం: గదాధర!= కౌమోదకి అనే గదను ధరించే శ్రీకృష్ణా!; వీరును= నా కుమారులున్నూ; పాండు పుత్త్రులును= పాండవులున్నూ; వేరము+తక్కి= విరోధం విడిచి; పొసంగి మన్కికై= అనుకూలంగా ఉండటానికై; ఏన్= నేను; పోరితము+ఆడి= జగడమాడి; అటులు= ఆ ప్రకారంగా; బుద్ధులు+చెప్పిన భంగియున్= నీతులు బోధించిన తీరున్నూ; కుల+ఆచారమున్+ నిర్వహింపన్= వంశధర్మం నిలపటానికి; పలుచందములన్= పెక్కువిధాల; తగన్= మిక్కిలి; దుఃఖపాటున్= దుఃఖంపొందటమున్నూ; నీదు సన్నిధిన్= నీ సమక్షంలో; ఈ కౌరవజాతికిన్= ఈ కౌరవులకు; తెలిసెన్+కాదె!= విదితమైనది కదా!

తాత్పర్యం: 'కృష్ణా! కౌరవులున్నూ పాండవులున్నూ విరోధం వీడి ఒద్దికగా జీవించటానికై జగడమాడి నే నెన్ని రీతుల బుద్ధులు చెప్పానో, వంశ ధర్మం నిలుపుటకై ఎన్నివిధాల శ్రమపడ్డానో నేడు నీ సముఖంలో కౌరవజాతికి వెల్లడి అయింది గదా!'

వ. **అని వెండియు.** **4**

తాత్పర్యం: అని, మళ్ళీ ఇట్లా అన్నాడు:

తే. **'నీకు శుద్ధుండ నగుటయ నిఖిలబంధు। మిత్ర గురుజన కోటికి ధాత్రి కెల్ల**
నంబుజాక్ష! నిర్దోషుండ నగుట; గాన। నా తెఱంగు నీ వెఱుఁగుట నాకుఁ జాలు. **5**

ప్రతిపదార్థం: అంబుజ+అక్ష!= కమలనేత్రుడా!; నీకున్= నీకు; శుద్ధుండన్+అగుట+అ= కల్మషం లేనివాడనగుటయే; నిఖిలబంధుమిత్ర గురుజనకోటికిన్= ఎల్ల చుట్టాలు, స్నేహితులు, గురుజన సమూహానికీ; ధాత్రికిన్+ఎల్లన్= లోకమున కంతటికిన్నీ; నిర్దోషుండన్+అగుట= దోషరహితుడనగుట; కానన్= కనుక; నా తెఱంగు= నాతత్త్వం; నీవు+ఎఱుఁగుట= నీకు తెలియటం; నాకున్+చాలు= నాకు చాలు.

తాత్పర్యం: 'కృష్ణా! నేను పరిశుద్ధుడనని నీవు గుర్తిస్తే సమస్తబంధువులు, మిత్రులు, గురుజనాలు, లోకమూ నన్ను నిర్దోషినని గుర్తించినట్లే. కాబట్టి నా చంద మెట్లాంటిదో నీవు తెలిసికొనుటయే నాకు ముఖ్యం.'

వ. అనిన విని యచ్యుతుండు బాహ్లిక భీష్మ ద్రోణ కృప ప్రముఖ నిఖిల విశిష్టజనంబుల నాలోకించి. 6

ప్రతిపదార్థం: అనినన్; విని; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; బాహ్లిక భీష్మ ద్రోణ కృప ప్రముఖ= శంతనుమహారాజు తమ్ముడైన బాహ్లికుడు, భీష్ముడు, ద్రోణాచార్యులు, కృపాచార్యులు మొదలైన; నిఖిల విశిష్టజనంబులన్= సకల సదాచారసంపన్నులైన (ముఖ్యులైన)వారిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి మాటలు విని గోవిందుడు బాహ్లిక భీష్మ ద్రోణ కృపాదులైన సదాచార సంపన్నులను (ప్రముఖులను) చూచి.

తే. 'ఇప్పు డీ సభఁ బుట్టిన యింతవట్టు। మీకుఁ దెల్లంబు గాదె! యీ మేదినీ వి
భుండు దా నేమిటికిని ముఖ్యుఁడఁ గాను। దప్పు దనదెస లేదని చెప్పి విడిచె. 7

ప్రతిపదార్థం: ఇప్పుడు= ఈ వేళ; ఈ సభన్= ఈ కొలువులో; పుట్టిన+ఇంతవట్టు= జరిగిన సంగతి అంతా; మీకున్= మీకు; తెల్లంబు+కాదె!= స్పష్టమైనదికదా!; ఈ మేదినీ విభుండు= ఈ ధృతరాష్ట్ర మహారాజు; తాను= తాను; ఏమిటికిని= ఏ విషయానికీ; ముఖ్యుండన్ కాను= ప్రధానుడినికాను; తప్పు= దోషం; తనదెసన్= తనయెడ; లేదు+అని= లేదని; చెప్పివిడిచెన్= చెప్పివేశాడు.

తాత్పర్యం: 'ఇప్పు డీ సభలో జరిగిన సంగతి అంతా మీకు స్పష్టమే కదా! ఈ ధృతరాష్ట్ర మహారాజు తాను దేనికిన్నీ ప్రధానుడనుకాననీ, తనయెడ తప్పులు లేవనీ చెప్పివేశాడు.

వ. కావున నాకు నియ్యెడం దడయం బనిలేదు; పోయివచ్చెద; ధర్మపుత్త్రునకు నింత వృత్తాంత బెఱింగింపవలయు' నని పలికి వారల నామంత్రణంబు సేసినవాఁడై రథారోహణంబు సేసి ధృతరాష్ట్రుండును నచటి జనంబులును వెనుకం జనఁ జని కుంతీగృహద్వారంబున నరదంబు డిగ్గి. 8

ప్రతిపదార్థం: కావునన్= కనుక; నాకున్, ఈ+ఎడన్= ఇచ్చట; తడయన్+పనిలేదు= ఆలసించవలసిన అక్కరలేదు; పోయివచ్చెదన్; ధర్మపుత్త్రునకున్, ఇంతవృత్తాంతంబు= ఈ జరిగిన సంగతి అంతా; ఎఱింగింపన్+వలయున్; అని, పలికి; వారలన్= ఆ బాహ్లికాదులను; ఆమంత్రణంబు+చేసినవాఁడు+ఐ= అక్కడ ఆగుటకు సెలవిచ్చినవాడై; రథ+ఆరోహణంబు చేసి= రథమెక్కి; ధృతరాష్ట్రుండును; అచటిజనంబులును; వెనుకన్+చనన్= తన రథం వెనుక వస్తుండగా; చని= వెళ్ళి; కుంతీగృహద్వారంబునన్= కుంతీదేవి యింటివాకిలి దగ్గర; అరదంబు= రథం; డిగ్గి= దిగి.

తాత్పర్యం: కనుక నా కిచ్చుట ఆగవలసిన అవసరం లేదు, వెళ్ళివస్తాను. ఇక్కడ జరిగిన సంగతి అంతా ధర్మరాజునకు చెప్పాలి' అంటూ నారాయణమూర్తి అక్కడున్నవారిని నిలవం డని సెలవిచ్చి రథమెక్కాడు. ధృతరాష్ట్రుడు, మిగిలినవారు సగౌరవంగా సాగనంపటానికి వెనుక వస్తుండగా శౌరి కుంతీదేవి వాకిట రథం దిగాడు.

క. **వారందఱుఁ దనతోడన । గారవమున నరుగుదేరఁగాఁ జొచ్చి మహో**
దారుఁడు కుంతీ చరణాం । భోరుహముల కెఱఁగి వినయభూషణుఁ డగుచున్. **9**

ప్రతిపదార్థం: వారు+అందఱున్= ధృతరాష్ట్రుడు మొదలైనవారెల్లరూ; తనతోడన్+అ= తన వెంబడినే; గారవమునన్= ఆదరంతో; అరుగుదేరగాన్= రాగా; చొచ్చి= కుంతీదేవి ఇంటిలో ప్రవేశించి; మహా+ఉదారుఁడు= మిక్కిలి దొడ్డవాడైన శ్రీకృష్ణుడు; వినయభూషణుఁడు+అగుచున్= వినయగుణమే ఆభరణంగా కలిగినవాడై; కుంతీచరణము+అంభోరుహములకున్+ ఎఱఁగి= పద్మాలవంటి కుంతీదేవి పాదాలకు నమస్కరించి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు మొదలైనవారందరూ గౌరవంతో తన వెంబడి రాగా, మిక్కిలి దొడ్డవాడైన కేశవుడు వినయగుణాన్వితుడై కుంతి గృహంలోనికి ప్రవేశించి ఆమె పాదపద్మాలకు నమస్కరించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **కౌరవసభఁ దా నాడిన । గౌరవవాక్యములుఁ గార్యఖడ్గక్రమ వా**
క్పూరములు సుయోధను దు । ష్ప్రారంభము నల్పవచన పద్ధతిఁ జెప్పెన్. **10**

ప్రతిపదార్థం: కౌరవసభన్= ధృతరాష్ట్రుడి కొలువులో; తాన్= తాను; ఆడిన= పల్కిన; గౌరవ వాక్యములున్= ఆదరంతో కూడిన పలుకులున్నూ; కార్యఖడ్గ క్రమ వాక్పూరములున్= కార్యవాదిగా, ఖడ్గవాదిగా పలికిన పలుకుల సమూహాలునూ; సుయోధను= దుర్యోధనుడియొక్క; దుష్ప్రారంభమున్= తనను బంధించే దుష్ట ప్రయత్నమున్నూ; అల్పవచన పద్ధతిన్+ చెప్పెన్= తక్కువ మాటలతోనే తెలిపాడు.

తాత్పర్యం: కురుసభలో ఆదరంతో తాను పల్కిన పల్కులున్నూ, కార్యవాదిగా, ఖడ్గవాదిగా చెప్పిన మాటలున్నూ, దుర్యోధనుడి దుష్టప్రయత్నమున్నూ సంక్షిప్తంగా ఆమెకు తెలిపాడు.

వ. **ఇట్లు ధృతరాష్ట్ర కొలువునం బుట్టిన విశేషంబుల పాండురాజమహిషి కెఱింగించి మాధవుండు మఱియును.** **11**

ప్రతిపదార్థం: ఇట్లు; ధృతరాష్ట్ర కొలువునన్; పుట్టిన విశేషంబులు= జనించిన వింతలు; పాండురాజు మహిషికిన్= పాండురాజు యొక్క పట్టపురాణి అయిన కుంతికి; ఎఱింగించి; మాధవుండు= లక్ష్మీకాంతుడైన శ్రీకృష్ణుడు; మఱియును= ఇంకను.

తాత్పర్యం: ఇట్లా శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడి కొలువుకూటంలో కలిగిన వింతలు పాండురాజు పట్టపురాణి కుంతీదేవికి తెలిపి మళ్ళీ (ఇట్లా అన్నాడు:)

తే. **'కురుకుమారులు తమయంతఁ గుడిచి క్రొవ్వి । మీఁ దెఱుంగరు; మాకేమి? మేల కాక;**
నాలుకలు గ్రోయు నర్జునానలము దగిన । యెర గొనం గని సంతృప్తి యెసక మెసఁగు. **12**

ప్రతిపదార్థం: కురుకుమారులు= కౌరవులు; తమ అంతన్= తమకు తామే; కుడిచి= రాజభోగాలు అనుభవించి; క్రొవ్వి= పొగరెక్కి; మీఁదు+ఎఱుంగరు= రానున్నదేమిటో తెలియకున్నారు; మేలు+అ కాక= మంచిదే అవుతుంది. మాకున్+ఏమి= మాకు మరేమి నష్టంలేదు; నాలుకలు క్రోయు= జిహ్వాలు చాస్తున్న; అర్జున+అనలము= అర్జునుడనే అగ్ని; తగిన ఎర+కొనన్= తగిన ఆహారం గైకొనగా; కని= చూచి; సంతృప్తి= సంతోషం; ఎసకము+ఎసఁగున్= అతిశయిస్తుంది.

తాత్పర్యం: 'కౌరవులు తమపాటికి తాము హాయిగా రాజ్యభోగా లనుభవిస్తూ పొగరుపట్టి రానున్నది తెలియకున్నారు. మాకది మంచిదే. మంటలు వెలిగ్రక్కుతున్న అర్జునుడనే అగ్ని తనకు తగిన ఆహారం లభించినందుకు ఎంతో సంతృప్తి వహిస్తుంది.

విశేషం: అలం: రూపకం.

వ. **పాండుకుమారులపాలికిం బోయి వచ్చెద; వారికిం దగిన బుద్ధు లానతి'మ్మనిన నద్దేవి విక్రమోపజీవులయిన ముచుకుందుండును సృంజయుండును నను తొంటినరపతుల చరిత్రంబులు సెప్పి, 'యుధిష్ఠిరుండు వీరిని వినండొ కాక'యని పలికి యెల్లవారును వినుచుండ వెండియు నిట్లనియె.** **13**

ప్రతిపదార్థం: పాండుకుమారుల పాలికిన్= పాండవుల దగ్గరకు; పోయి వచ్చెదన్; వారికిన్; తగిన బుద్ధులు; ఆనతి+ఇమ్ము= సెలవిమ్ము; అనినన్, ఆ+దేవి; విక్రమ+ఉపజీవులు= పరాక్రమాన్ని అనుసరించి బ్రతికినవారు అయిన ముచుకుందుండును, సృంజయుండునున్; అను= అనునట్టి; తొంటినరపతుల చరిత్రంబులు= పూర్వపురాజుల కథలు; చెప్పి, యుధిష్ఠిరుండు; వీరిని వినండొ కాక= వీరిని గూర్చి వినలేదా ఏమి?; అని పలికి; ఎల్లవారును; వినుచుండన్; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నేను పాండునందనుల దగ్గరకు వెళ్ళివస్తాను. వారికి చెప్పవలసిన మాటలు సెలవిమ్ము!' అని శ్రీకృష్ణు డడిగినాడు. అపుడు కుంతీదేవి పరాక్రమం నమ్ముకొని జీవించిన ముచుకుందుడు, సృంజయుడు అనే పూర్వపు రాజుల కథలు చెప్పి, 'ధర్మజుడు వీరిని గురించి విని ఉన్నాడో, లేదో' అని పలికి, అక్కడి వారంతా ఆలకిస్తుండగా మళ్ళీ ఇట్లా అన్నది:

విశేషం: ముచుకుందుడు - భారత ప్రతులన్నిటిలోను ఈ పదం ఇట్లే ఉన్నది. పూర్వగాథాలహరిలో మాత్రం ముచికుందుడని కలదు. ఇరువురు నొక్కరే అయియుంటారు.

ఇతడొకసారి అలకాపట్టణముపై దండెత్తెను. త్రోవలోనే కుబేరుని భటులు ఈతని సైన్యముపైబడి కొట్టారు. అప్పుడితడు తన పురోహితుని ప్రార్థించాడు. పురోహితుడు తాను చేసిన తపస్సు, మంత్రములు, పూజలు మొదలగువాని వలన వాని సైన్యానికి తిరిగి బలం కలిగించాడు. పిమ్మట ఈతడు కుబేరుడి మీదికి యుద్ధమునకు పోగా, బ్రాహ్మణ క్షాత్ర బలములేకమై ఉండటం వలన నీతో నేను పోరలేనని చెప్పి తప్పుకొన్నాడు. (భార.)

ముచికుందుడు ఒక రాజు. మాంధాత కుమారుడు. ఇతడు దేవాసురులకు యుద్ధమైనప్పుడు దేవతలకు సహాయం చేశాడు. దేవతలు వరం కోరుకో అన్నారు. ఇతడు మిక్కిలి డస్సి ఉండటం చేత, నిద్రపోతూ, ఎవరైనా తనకు నిద్రాభంగం చేస్తే, వారిని ఇతడు చూడగానే, వారు భస్మం కావాలని వరం కోరుకొంటాడు. ఇతడు ఒక గుహలో నిద్రపోతుండగా, కాల

యవనుడు ఆ గుహలోనికే వచ్చి, ఇతనిని చూచి కృష్ణుడని భ్రమించి తన్నాడు. ముచికుందుడు లేచి వానిని చూడగానే వాడు భస్మమయ్యాడు.

సృంజయుడు : ఒక రాజు. ఇతని కడకు పర్వతనారదులు రాఁగా, వారి పరిచర్యకు ఇతడు తన కూతురైన మదయంతిని నియోగించాడు. నారదుడామెను వలచుటచే, రాజామెను నారదుని కిచ్చి పెండ్లి చేశాడు.

సృంజయుడు మూత్ర పురీషములు కూడా బంగారమగునట్టి కుమారుడిని పొందగోరి బ్రాహ్మణులను పూజించి, తన కోరికను నారదుడితో చెప్పాడు. నారదుడి అనుగ్రహం వలన అతని కట్టి కొడుకు పుట్టాడు. అతనిపేరు సువర్ణష్ఠీవి. క్రూరులు కొందరు అతని లోపల బంగారం ఉంటుందని భ్రమించి వానిని చంపి చీల్చారు. సృంజయుఁడు మిక్కిలి దుఃఖించి నారదుడిని తలచుకోగా, నారదుడు వచ్చి, అతని పుత్త్రుణ్ణి బ్రతికించాడు. సృంజయుడు భార్యాపుత్త్రులతో భాగీరథీతీరంలో వనవిహారం చేస్తుండగా, ఇంద్రుడు సువర్ణష్ఠీవి బలానికి భయపడి శార్దూల రూపంలో చంపవలసిందిగా తన వజ్రాన్ని ఆదేశించాడు. వజ్రం వాడిని చంపింది. రాజు కోరికపై నారదుడు మళ్ళీ వానిని బ్రతికించాడు. (సంపా.)

ఉ. 'రాజుల కెందు నారయఁ బరాక్రమజీవన వృత్తి దక్క నొం
డోజ నిషిద్ధ మండ్రు మును; లుత్తమసత్త్వులు వంశధర్మముల్
పూజిత భంగిఁ జేయుదురు; బుద్ధివిహీనులు వానిఁ దక్కి ని
స్తేజపుఁ గూటి కియ్యకొని దీనతఁ బొందుదు రంబుజోదరా! 14

ప్రతిపదార్థం: అంబుజ+ఉదరా!= పద్మనాభా!; ఆరయన్= పరికించగా; రాజులకున్= నరపతులకు; ఎందున్= ఎచ్చటకూడ; పరాక్రమ జీవనవృత్తి+తక్కన్= శౌర్యంతో జీవించే నడవడిక తప్ప; ఒండు+ఓజ= మరోపద్ధతి; నిషిద్ధము= కూడదని; మునులు+అండ్రు= జ్ఞానులు చెపుతారు; ఉత్తమసత్త్వులు= శ్రేష్ఠ బలసంపన్నులు; వంశధర్మముల్= కులాచారాలు; పూజిత భంగిన్= గౌరవపద్ధతిలో; చేయుదురు= ఆచరిస్తారు; బుద్ధివిహీనులు= తెలివిమాలినవారు; వానిన్+తక్కి= తమ కులధర్మాలను అనుసరించక; నిస్తేజము+కూటికిన్= పౌరుషహీనమైన తిండికి; ఇయ్యకొని= సమ్మతించి; దీనతన్+పొందుదురు= దైన్యాన్ని పొందుతారు.

తాత్పర్యం: 'గోవిందా! రాజులు పరాక్రమంతో జీవించవలెనేకాని, మరో మార్గం వారికి తగదని జ్ఞానులు చెపుతారు. బలసంపన్నులు తమ కులధర్మాలను గౌరవబుద్ధితో అనుష్ఠిస్తారు. తెలివిమాలినవారు వంశాచారం వదలిపెట్టి పౌరుషహీనమైన తిండికి సమ్మతించి దేబెలై మనుగడ సాగిస్తారు.

క. నీ వియ్యంబులు సంధియ । కావింపంబడిరి; వీరిఁ గలయుట కష్టం;
బా వెరవు దప్పుటయ మే । లై వచ్చెం బొమ్ము; విడువు మనుమానంబున్. 15

ప్రతిపదార్థం: నీ వియ్యంబులు= నీ మరదులైన నా కొమారులు; సంధి+అ= సంధినే; కావింపన్= చేయుటకు; పడిరి= శ్రమ చెందారు; వీరిన్= ఈ కౌరవులను, కలయుట= చేరుట; కష్టంబు= నా బిడ్డలకు కష్టం; ఆ వెరవు= ఆ సంధిమార్గం; తప్పుట+అ= తొలగిపోవటమే; మేలు+ఐ; వచ్చెన్ పొమ్ము= మంచికే వచ్చింది సుమా!; అనుమానంబున్= ఈ విషయంలో సందేహం; విడువుము= వదలిపెట్టుము.

తాత్పర్యం: కృష్ణా! నీ మరదులు సంధికొరకు సకలవిధాల శ్రమపడ్డారు. కాని, కౌరవులతో కలసిమెలసి మనుగడసాగించటం కష్టం. ఇపుడు సంధి తప్పిపోవడం కూడ మంచికే జరిగింది. నీవు ఈ విషయంలో శంకించవద్దు.

మ. నిజవంశోచిత వీరవృత్తమున కున్మేషంబుగా నా కపి
ధ్వజుఁ డుత్సాహము సేయకున్న నకటా! దైన్యంబు వాటిల్లదే?
భుజదర్పోద్ధతుఁడైన భీమునకు నీ పొం దొప్పునే? నీవు స
ర్వజగన్మాన్యుఁడ విందు రాఁదగునె? దైవం బిట్లు దప్పించునే!' 16

ప్రతిపదార్థం: నిజవంశ+ఉచిత= తమ క్షత్రియ కులానికి (కురువంశానికి) తగిన; వీరవృత్తమునకున్= పరాక్రమపు నడవడికి; ఉన్మేషంబుగాన్= వికాసంగా; ఆ కపిధ్వజుఁడు= హనుమంతుడు టెక్కెమందు కలిగిన ఫల్గునుడు; ఉత్సాహము+చేయక+ ఉన్నన్= ఉద్యమించకుంటే; అకటా!= అయ్యో!; దైన్యంబు+పాటిల్లదే?= చులుకదన మేర్పడదా?; భుజదర్ప+ఉద్ధతుఁడు+ఐన= బాహుబలంచే గర్వితుడైన; భీమునకున్= భీమసేనుడికి; ఈ పొందు= ఈ సంధి; ఒప్పునే?= తగి ఉంటుందా?; నీవు= నీవు; సర్వజగత్+మాన్యుఁడవు= సకల లోకాలచేత - గౌరవించదగినవాడవు; ఇందున్= ఈ కురుసభకు; రాన్+తగునె?= రావచ్చునా?; దైవంబు= భగవంతుడు; ఇట్లు తప్పించునే!= ఈ విధంగా పొత్తు కుదరకుండ చేశాడు గదా!

తాత్పర్యం: మధుసూదనా! క్షత్రియ జాతికి (కురువంశానికి) తగినది వీరవృత్తి. దానికి వన్నెగా కపికేతనుడైన పార్థుడు రణోత్సాహం చూపకుంటే నలుగురిలో పలుచనైపోడా? భుజబల గర్వితుడైన భీమసేనుడికి ఈ సంధి తగినదేనా? సకల లోకపూజ్యుడవైన నీవు ఈ పనికై ఇక్కడికి రావచ్చునా? దేవుడు మేలు చేయగా సంధి భగ్నమైనది.

వ. అని యంత నిలువక గొంతి యిట్లనియె: 17

ప్రతిపదార్థం: అని; అంతన్ నిలువక= అంతటితో ఆగక; గొంతి= కుంతీదేవి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఈ మాటలతో ఆగక కుంతీదేవి మరల ఇట్లా అన్నది:

క. 'మఱచిరె కొలువున ద్రౌపదిఁ । బఱచిన బన్నంబు? ధర్మపథము దొఱఁగన్
వెఱచుట కప్పటి కది దగుఁ; । జెఱచినచో వెదక వలదె చిరతర కీర్తిన్?' 18

ప్రతిపదార్థం: కొలువునన్= సభలో; ద్రౌపదిన్= పాంచాలిని; పఱచిన బన్నంబున్= అవమానపరచటాన్ని; మఱచిరె?= (నా కుమారులు) మరచిపోయారా?; ధర్మపథంబున్= న్యాయ మార్గాన్ని; తొఱఁగన్= విడవటానికి; వెఱచుట= భయపడటం; అప్పటికిన్+అది+తగున్= ఆ సమయానికి అది యుక్తంగానే ఉండింది; చెఱచినచోన్= ధర్మాన్ని నాశనం చేస్తే; చిరతరకీర్తిన్= శాశ్వతమైన యశస్సును; వెదకన్+వలదె?= అన్వేషించవద్దా?

తాత్పర్యం: 'కౌరవులు నిండుసభలో పాంచాలిని అవమానించటం నా కుమారులు మరచిపోయారా? న్యాయమార్గాన్ని వీడటానికి జంకి వా రప్పుడు అట్లా అడవులకు వెళ్ళటం యుక్తమేకాని, న్యాయంగా తమకు రావలసిన అర్ధరాజ్యం ఇవ్వక తామే హరింపదలచి కౌరవులు ధర్మవినాశనానికి పూనుకొన్నప్పుడు తాము శాశ్వతకీర్తిని సంపాదించటానికి యత్నంచేయవద్దా?'

శ్రీకృష్ణుఁడు కర్ణునిఁ దన రథం బెక్కించుకొని కొన్ని రహస్యోక్తులు పలుకుట (సం. 5-138-1)

వ. అని పలికి పుండరీకాక్షుం గౌఁగిలించుకొని, యచ్యుతుండు మ్రొక్కిన దీవించి, 'యేను సుఖంబున్న దాన'నని పాండవులకుం జెప్పుము; చేతుల లావునం గనిన జీవనంబున బ్రదుకుం డనుము; పోయిర'మ్మని వీడుకొల్పిన సింహగమనసుందరంబుగా వెడలి, తన తోడన కదలివచ్చిన ధృతరాష్ట్రాదుల నిలువంబనిచి, రథారోహణంబు సేసి గోవిందుండు కర్ణుదెసం గనుంగొని, 'న న్ననిచి వత్తుగానిర'మ్మని కరంబు సాఁచి చెయివట్టి తన యరదం బెక్కించికొని, సాత్యకి వేసరి నెక్కి కెలనం జనుదేరం గదలిచని, యనుపవచ్చిన కృతవర్మ నుచిత ప్రకారంబున సస్నేహంబుగా నిలిపి యరుగు నవసరంబునఁ బౌరలోకంబు. 19

ప్రతిపదార్థం: అని పలికి= అని కుంతీదేవి వచించి; పుండరీక+అక్షున్= శ్రీకృష్ణుడిని; కౌఁగిలించుకొని; అచ్యుతుండు- శ్రీకృష్ణుడు; మ్రొక్కినన్= తనకు నమస్కరించగా; దీవించి; ఏను= నేను; సుఖంబు+ఉన్నదానన్= సుఖంగా ఉన్నాను; అని, పాండవులకున్; చెప్పుము; చేతులలావునన్= భుజబలంతో; కనిన= పడసిన; జీవనంబునన్= బ్రదుకుతో; బ్రదుకుండు+అనుము= జీవించండి అని చెప్పుము; పోయిరమ్ము= వెళ్లిరమ్ము; అని; వీడుకొల్పినన్= సెలవిచ్చి పంపగా; సింహగమన సుందరంబుగాన్= సింహంయొక్క నడకవలె అందమైన నడకతో; వెడలి= బయలుదేరి; తన తోడన్+అ= తన వెంబడినే; కదలివచ్చిన; ధృతరాష్ట్ర+ఆదులన్= ధృతరాష్ట్రుడు మొదలైనవారిని; నిలువన్+పనిచి= ఆగండి అని చెప్పి; రథ+ఆరోహణంబు చేసి= రథము నెక్కి; గోవిందుండు; కర్ణుదెసన్= రాధేయుడివైపు; కనుంగొని; నన్నున్+అనిచివత్తు+కాని= నన్ను సాగనంపి వత్తువులే; రమ్ము+అని; కరంబు+చాఁచి; చెయి+పట్టి= అతడి హస్తం పట్టుకొని; తన+అరదంబు; ఎక్కించికొని; సాత్యకి; వేసరిన్+ఎక్కి= కంచరగాడిద (అశ్వతరము) నెక్కి; కెలనన్= ప్రక్కను; చనుదేరన్= రాగా; కదలిచని= బయలుదేరివెళ్ళి; అనుపన్ వచ్చిన= తనను సాగనంపటానికి వచ్చిన; కృతవర్మన్; ఉచిత ప్రకారంబునన్= తగు విధంగా; సస్నేహంబుగాన్= ప్రేమయుక్తంగా; నిలిపి= ఆపి; అరుగు+అవసరంబునన్= వెళ్ళే సమయంలో; పౌరలోకంబు= పురజనులు.

తాత్పర్యం: కుంతీదేవి అట్లా పలికి శ్రీకృష్ణుడిని కౌగిలించుకొన్నది. గోవిందుడు తనకు మ్రొక్కగా దీవించి, 'నేను సుఖంగా ఉన్నానని నా కుమారులకు చెప్పుము. భుజ విక్రమంతో సంపాదించిన బ్రదుకు తెరువుతో బ్రదకండని చెప్పుము. పుండరీకాక్ష! పోయిరమ్ము' అని వీడ్కొల్పింది.

శౌరి సింహగమనంవలె సుందరమైన నడకతో కదలి తనతో కదలివస్తున్న ధృతరాష్ట్రుడు మొదలైనవారిని నిలవండని పలికి, తాను రథమెక్కాడు. కర్ణుడివైపు చూచి 'నన్ను సాగనంపివద్దువుగాని రావయ్యా!' అని చెయిసాచి అతడి చేయిపట్టి రథంమీద ఎక్కించుకొన్నాడు.

సాత్యకి ప్రక్కన అశ్వతరము నెక్కి వస్తుండగా శ్రీకృష్ణుడు ముందుకు సాగాడు. తనను సాగనంపటానికి వచ్చిన కృతవర్మను తగిన విధంగా స్నేహయుక్తంగా నిలిపి నారాయణుడు వెళ్ళుతున్నప్పుడు పట్టణ ప్రజలు. (ఇట్లా అన్నారు:)

ఉ. 'అక్కట! వాసుదేవు పను పాదరణంబునఁ జేయరైరి; వీ
రెక్కడి బుద్ధిమంతు? లని నిందును నందును లోకమెల్లఁ బే
రుక్కున మ్రుగ్గుటం దలఁప నొల్ల కపాయము సేసి రట్టె! యీ
యుక్కివు లెందునుం గలరె? యొప్పరు వో ధృతరాష్ట్ర నందనుల్.' 20

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; వాసుదేవు పనుపు= కృష్ణుడి ఆజ్ఞ; ఆదరణంబునన్= గౌరవంతో; చేయరు+ఐరి= చేసినవారు కారు; వీరు= ఈ కౌరవులు; ఎక్కడి బుద్ధిమంతులు?= ఏమి బుద్ధిమంతులండీ?; అనిన్= యుద్ధంలో; ఇందునున్= ఈ కౌరవుల పక్షంలోనూ; అందును= ఆ పాండవుల పక్షంలోనూ; లోకము+ఎల్లన్= జనులందరూ; పేరు+ఉక్కునన్= మిక్కిలి శౌర్యంతో పోరి; మ్రగ్గుటన్= నశించిపోవటం; తలఁపన్+ఒల్లక= ఆలోచించటానికి ఇష్టపడక; అపాయము చేసిరి+అట్టె!= హాని చేశారు గదా!; ఈ+ఉక్కివులు= ఇంత కఠినులు; ఎందునున్+కలరె?= ఎక్కడైనా ఉన్నారా?; ధృతరాష్ట్రనందనుల్= ధృతరాష్ట్రుడి కుమారులు; ఒప్పరు+పో!= ఓర్వలేరు.

తాత్పర్యం: 'అయ్యో! వాసుదేవుడి ఆదేశం ఆదరంతో స్వీకరించని వీరు ఏపాటి బుద్ధిమంతులు? సంగ్రామంలో ఇరుపక్షాలలోని జనులంతా శౌర్యంతో పోరి కూలుతారని భావించక ఇంతటి జనహానికి పూనుకొన్నారు. ఇట్లాంటి కపటులు ఎక్కడైనా ఉన్నారా? ధృతరాష్ట్రుడి కుమారులు ఓర్వలేని వారు సుమా!

వ. **అని మఱియు ననేకు లనేక ప్రకారంబులం బలుకుచు నిరుగెలంకులం జూచుచుండఁ బుండరీకాక్షుండు పురంబు నిర్గమించె; నట ధృతరాష్ట్రుండును మగిడి కొలువు కూటంబునకు వచ్చి యెప్పటివారలు పరివేష్టింప నుండి కృష్ణుని వలని మాటలాడుచున్న సమయంబున సుయోధనునితో భీష్మద్రోణు లిట్లనిరి. 21**

ప్రతిపదార్థం: అని, మఱియున్; అనేకులు= పలువురు; అనేక ప్రకారంబులన్= పెక్కురీతుల; పలుకుచున్; ఇరు+కెలంకులన్= రెండుప్రక్కల; చూచుచున్+ఉండన్; పుండరీక+అక్షుండు= శ్రీకృష్ణుడు; పురంబు నిర్గమించెన్= హస్తినాపురినుండి వెలువడ్డాడు; అట; ధృతరాష్ట్రుండును; మగిడి= మరలి; కొలువు కూటంబునకున్+వచ్చి; ఎప్పటివారలు= మునుపటివారు; పరివేష్టింపన్= చుట్టుకొని ఉండగా; ఉండి; కృష్ణుని వలని మాటలు= కృష్ణుని గురించిన మాటలు; ఆడుచున్+ఉన్న= పలుకుతున్న; సమయంబునన్; సుయోధనుతోన్; భీష్మద్రోణులు; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: ఇట్లా పలువిధాల పలుకుతూ మార్గానికి రెండు వైపులా నిలిచి జనులు చూస్తూండగా నారాయణుడు పట్టణం నుండి వెలువడ్డాడు. తరువాత ధృతరాష్ట్రుడు తిరిగి కొలువు కూటానికి వచ్చి ఎప్పటివారలు చుట్టూచేరి ఉండగా కృష్ణుడిని గురించి మాటాడుతున్న సమయంలో దుర్యోధనుడితో ద్రోణభీష్ము లిట్లా అన్నారు:

చ. **'పలుకునె యిట్లు గొంతి? విని బమ్మెరపోయితి; మింత బెట్టిదం**
బు లగునె మాట? లయ్యమయుఁ బుణ్యుఁడుఁ గృష్ణుఁడు గార్యవాదముల్
వలికెడు వార లిట్లు దెగఁబాఱిరి; ధర్మజవారిరాశికిం
జెలియలికట్ట వాసె; మనచే నగు కర్జముచంద మెట్టిదో?' 22

ప్రతిపదార్థం: గొంతి= కుంతీదేవి; ఇట్లు పలుకునె?= ఇట్లా మాట్లాడుతుందా?; విని= ఆమె మాటలు విని; బమ్మెరపోయితిమి= దిగ్భ్రాంతిచెందాము; మాటలు= ఆమె పలుకులు; ఇంత బెట్టిదంబులు+అగునె?= ఇంత కఠినంగా ఉంటాయా?; ఆ+అమయున్= ఆ తల్లియును; పుణ్యుఁడున్= ధర్మాత్ముడైన; కృష్ణుఁడున్= వాసుదేవుడును; కార్యవాదముల్ పలికెడువారలు= పనికి అనుకూలించే మాటలు చెప్పునట్టివారు; ఇట్లు= నేఁడీ విధంగా; తెగన్+పాఱిరి= సాహసించారు; ధర్మజ వారిరాశికిన్= ధర్మరాజు అనే సాగరానికి; చెలియలికట్ట+పాసెన్= గట్టులేకుండా పోయింది; మనచేన్+అగు= మన వలన అయ్యే; కర్జము చందము= కార్య విధం; ఎట్టిదో!= ఎటువంటిదో!

తాత్పర్యం: 'కుంతీదేవి ఇట్లా మాట్లాడుతుందని ఊహించలేదు. ఆమె పలుకులకు దిగ్భ్రమ కలిగింది. ఆమె వాక్కులు ఎంతో కఠోరంగా ఉన్నాయి. ఆమెయూ, ధర్మస్వరూపుడైన శ్రీకృష్ణుడున్నూ పని అనుకూలపడేటట్లు పలుకనేర్చినవారు. ఈనా డిట్లా వారు సాహసోక్తు లాడారు. ధర్మజుడనే సముద్రానికి చెలియలికట్ట లేకుండా పోయింది. ఈ విషయంలో మనం చేయగలిందేమిటో తోచటంలేదు.'

విశేషం: అలం: రూపకం.

వ. **అని పలికి వెండియు.** **23**

తాత్పర్యం: భీష్ముడు ద్రోణుడు మళ్ళీ దుర్యోధనుడితో (ఇట్లా అన్నారు:)

శా. **'మాకుం జూడఁగఁబోలు కార్య మిది: ధర్మప్రీతి నీ వేఁగి సు**
శ్లోకుండైన యుధిష్ఠిరుం గని జనస్తుత్యంబుగా శాంతిమై
నీ కౌరవ్యులనెల్లఁ గాచికొనవే యే పొప్ప దెందుం; దుదిన్
శోకం బొందక వేగమైఁ గదలి కృష్ణుంగూడఁబోవే నృపా!' **24**

ప్రతిపదార్థం: నృపా!= దుర్యోధనా!; మాకున్= మాకు; చూడఁగన్= ఆలోచించగా; పోలు= తగిన; కార్యము+ఇది= పని యిది; ధర్మప్రీతిన్= ధర్మమందలి ఆసక్తితో; నీవు+ఏఁగి= నీవువెళ్ళి; సుశ్లోకుండు+ఐన= ఉత్తమకీర్తిశాలి అయిన; యుధిష్ఠిరున్+కని= ధర్మరాజును దర్శించి; జనస్తుత్యంబుగాన్= జనులు మెచ్చుకొనేటట్లు; శాంతిమైన్= శాంతితో; ఈ కౌరవ్యులన్+ఎల్లన్= ఈ కురువంశంలో పుట్టిన వారినందరినీ; కాచికొనవే= రక్షించుకొనుము; ఎందున్= ఎక్కడను; ఏపు+ఒప్పదు= గర్వం చెల్లదు; తుదిన్= కడపటికి; శోకంబు+ఒందక= దుఃఖం పాలుగాక; వేగమైన్= శీఘ్రంగా; కదలి= బయలుదేరి; కృష్ణున్+కూడన్+పోవే= శ్రీకృష్ణుడిని చేరబొమ్ము.

తాత్పర్యం: 'దుర్యోధనా! ఆలోచింపగా మాకు తోచిన కర్తవ్యం ఇది. నీవు ధర్మాసక్తితో వెళ్ళి సత్కీర్తిశాలి అయిన ధర్మజుడిని దర్శించి, జనులు మెచ్చేటట్లు శాంతితో ఈ కురుకులమంతటినీ సంరక్షించుకొమ్ము. ఇక ఔద్ధత్యం ఏ మాత్రం కూడదు. కడకు దుఃఖం పాలు కాకుండ వేగిరమే కదలిపోయి శ్రీకృష్ణుడిని కలిసికొమ్ము!'

వ. **అనిన విని దుర్యోధనుండు మొగంబు రాఁజుచుండ నూరకుండె; గాంగేయుండును గురుండును దిగ్గనలేచి యతని నవలోకించి.** **25**

ప్రతిపదార్థం: అనినన్; విని; దుర్యోధనుండు; మొగంబు= ముఖం; రాఁజుచున్+ఉండన్= మండుతూ ఉండగా; ఊరక+ఉండెన్; గాంగేయుండును= భీష్ముడూ; గురుండును= ద్రోణుడూ; దిగ్గన లేచి= తటాలున లేచి; అతనిన్; అవలోకించి= చూచి.

తాత్పర్యం: భీష్మద్రోణులమాటలకు దుర్యోధనుడు మొగం కోపంతో మండుతూ ఉండగా సమాధానం చెప్పకుండా ఉన్నాడు. అప్పుడు వారిద్దరూ తమ పీఠాలనుంచి తటాలున లేచి సుయోధనుడివైపు చూచి.

క. **'కురునృప! విను సంసారము ׀ దరిద్రొక్కినవార; మింకఁ దలఁకెదమే? సం**
గరమునకు నేము నీకై ׀ పొరలితి; మెట్లైన నగును బోయెద' మనుచున్. **26**

ప్రతిపదార్థం: కురునృప!= సుయోధనా!; విను= మేము చెప్పేది వినుము; సంసారముదరి+త్రొక్కినవారము= జీవితం యొక్క చివరి ఒడ్డు చేరినవాళ్ళం; ఏము= మేము; ఇంకన్= మరి; సంగరమునకున్= యుద్ధానికి; తలఁకెదమే?= జంకుతామా?; నీకై పొరలితిమి= నీ మేలుగోరి ఎన్నో విధాల చెప్పిచూచాం; ఎట్లు+ఐనన్+అగును= విధి నిర్ణయమెట్లాఉందో అట్లే జరుగుతుంది; పోయెదము= మేము వెళ్ళి వస్తాం; అనుచున్= అని పలుకుతూ.

తాత్పర్యం: 'దుర్యోధనా! మా మాటలు వినుము. మేము సంసారపు ఆవలి తీరం చేరినవాళ్ళం. ఇట్లాంటి మేము పోరాటానికి భయపడతామా? నీ మేలు గోరి ఎన్నో రీతుల చెప్పిచూచాం. విధి నిర్ణయమెట్లా ఉంటే అట్లాగే ఔతుంది. ఇక మేము వెళ్ళి వస్తాం' అని పలుకుతూ.

క. అరిగిరి, రాజును నభ్యం । తరమునకుం జనియె, రాజతనయుండు బహిః
పరివారముఁ బొమ్మని మిత । పరిజనుఁడై యేఁగె నాత్మభవనంబునకున్. 27

ప్రతిపదార్థం: అరిగిరి= భీష్మద్రోణులు వెళ్ళారు; రాజును= ధృతరాష్ట్రుడున్నూ; అభ్యంతరమునకున్+చనియెన్= లోపలి గృహంలోనికి వెళ్ళిపోయాడు. రాజతనయుండు= సుయోధనుడు; బహిఃపరివారమున్= వెలుపల ఉన్న బలగాన్ని; పొమ్ము+అని= వెళ్ళుమని చెప్పి; మితపరిజనుఁడు+ఐ= కొద్ది పరివారం కలవాడై; ఆత్మభవనంబునకున్= తన మందిరానికి; ఏఁగెన్= పోయాడు.

తాత్పర్యం: భీష్మద్రోణులు వెళ్ళగానే ధృతరాష్ట్రుడు అభ్యంతర గృహానికి వెళ్లిపోయాడు. రాజకుమారుడైన సుయోధనుడు వెలుపలనున్న సేవకులను వెళ్ళుండని చెప్పి మితమైన పరివారంతో తానూ తన భవనానికి వెళ్ళిపోయాడు.

తే. అంత నక్కడ నచ్యుతుఁ డరిగి యరిగి । యధిక సంప్రీతి దలకొన నర్కతనయు
నాననంబు వీక్షించి యిట్లనియె నెమ్మి । నన్యు లెవ్వరు వినకుండ నతనితోడ. 28

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; అక్కడన్= అచ్చట; అచ్యుతుఁడు= శ్రీకృష్ణుడు; అరిగి అరిగి= వెళ్ళి వెళ్ళి; అధిక సంప్రీతి= మిక్కుటమైన ప్రేమ; తలకొనన్= కలుగగా; అర్కతనయు+ఆననంబు= కర్ణుడి యొక్క ముఖం; వీక్షించి= చూచి; నెమ్మిన్= కూర్మితో; అన్యులు+ఎవ్వరున్= ఇతరులెవ్వరున్నూ; వినకుండన్= వినకుండా; అతనితోడన్= కర్ణుడితో; ఇట్లు+ అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అట్లా వెళ్ళివెళ్ళి మిక్కిలి ప్రేమతో సూర్యుడి కుమారుడైన కర్ణుడి వదనం తిలకించి, ఇతరులెవ్వరున్నూ వినకుండ అతడితో ఇట్లా అన్నాడు:

సీ. 'నీవు వృద్ధజనోపసేవివి, ధర్మసం । వేదివి, తెలియంగ వినుము; సిద్ధ
మంత్రబలంబున మార్తాండు వరమునఁ । గన్నియ తఱి గొంతి గన్నవాఁడ
వగుటఁ బాండునృపాలు నగ్రసుతుండవు; । ధర్మమార్గం బిది; ధర్మతనయుఁ
డాదిగాఁ గల తమ్ములందఱు నా చేత । నెఱిఁగి నీ యడుగుల కెఱఁగి సకల

ఆ. పుత్త్ర మిత్త్ర బంధు భూరిసేనా సమ । న్వితముగాఁగఁ గొలిచి నిన్ను రాజ్య
భారవహనమునకుఁ బట్టంబుగట్ట ను । జ్జ్వలుఁడ వగుదు; రమ్ము వారికడకు. 29

ప్రతిపదార్థం: నీవు; వృద్ధజన+ఉపసేవివి= పెద్దలను సేవించినవాడివి; ధర్మసంవేదివి= ధర్మమును చక్కగా ఎరిగినవాడివి; తెలియంగన్+వినుము= స్పష్టమయ్యేటట్లు వినుము; సిద్ధమంత్రబలంబునన్= సిద్ధించిన(దివ్యమైన) ఒక మంత్రశక్తిచేత; మార్తాండువరమునన్= సూర్యుడి వరముచేత; కన్నియతఱిన్= తాను కన్యగా ఉన్నప్పుడే; గొంతి= కుంతీదేవి; కన్నవాఁడవు= కనినట్టివాడివి; అగుటన్= అయినందువలన; పాండునృపాలు= పాండు రాజుయొక్క; అగ్రసుతుండవు= పెద్దకుమారుడవు; ఇది ధర్మమార్గంబు= ఇది ధర్మసమ్మతం; ధర్మతనయుఁడు+ఆదిగాన్+కల= ధర్మజుడు మొదలుగా కలిగిన; తమ్ములు+ అందఱున్; నాచేతన్+ఎఱిఁగి= నీవు తమకు అన్నవన్న వార్త నేను తెల్పగా విని; నీ+అడుగులకున్+ఎఱఁగి= నీ పాదాలకు నమస్కరించి; సకల= సమస్తమైన; పుత్త్రమిత్త్ర బంధు భూరిసేనా సమన్వితము+కాఁగన్= కుమారులు, స్నేహితులు, చుట్టాలు, గొప్పసేనలు అన్నింటితోకూడా; కొలిచి= భజించి; నిన్నున్= నిన్ను; రాజ్యభారవహనమునకున్= రాజ్యభారం వహించటానికి; పట్టంబు+కట్టన్= అభిషేకించగా; ఉజ్జ్వలుఁడవు+అగుదు(వు)= మిక్కిలి ప్రకాశించగలవు; వారి కడకున్= పాండవుల దగ్గరకు; రమ్ము= అరుగుదెంచుము.

తాత్పర్యం: 'కర్ణా! నీవు పెద్దలను సేవించినవాడివి. ధర్మం బాగుగా తెలిసినవాడివి. నే చెప్పేది చక్కగా వినుము, కన్యకగా ఉన్నప్పుడు కుంతీదేవి దివ్యమైన మంత్రమహిమచేత మార్తాండుడి వరంవలన నిన్ను కన్నది. అందుచేత నీవు పాండురాజుకు పెద్దకుమారుడవు. ఇది ధర్మసమ్మతం. ధర్మజుడు, ఆతడి తమ్ములు నీవు తమకు అన్నవని నాచేత తెలిసికొని నీ పాదాలకు నమస్కరించి, పుత్రమిత్ర బంధుసేనాసహితంగా కొలిచి రాజ్యభారం వహించటానికి నీకు పట్టం కట్టుతారు. ఆ రీతిగా నీవు రాజ్యపదవిలో ప్రకాశించగలవు. కనుక నాతో కలసి వారి దగ్గరకు రమ్ము.

వ. ఏను నిన్ను సామ్రాజ్యంబునకు నభిషిక్తుంజేయుదు; నీవు దొలుత వెడలునప్పటి మహోత్సవంబునకు యువరాజైయుధిష్ఠిరుండు నీ రథంబున నుండి నీకు ధవళచామరంబులు వైచు; వాయుపుత్త్రుండు సితచ్ఛత్రంబు వట్టు; సవ్యసాచి సారథ్యంబుచేయు; మఱియుఁ బాంచాల యాదవ పాండ్యమాత్స్యులు లోనుగాఁగల రాజలోకంబుతోడఁ గవలు నభిమన్యు ప్రభృతి కుమారులు బెరయ నే మెల్లం బలసి పరివేష్టించి వత్తు; మిట్టి మహేంద్ర విభవంబున మహనీయుండ వగుచు మహీచక్రం బేలు' మని మఱియును. 30

ప్రతిపదార్థం: ఏను= నేను; నిన్నున్; సామ్రాజ్యంబునకున్+అభిషిక్తున్+చేయుదున్= పాండవరాజ్యపదానికి అభిషిక్తుడిని చేస్తాను; నీవు; తొలుతన్= మొదట; వెడలునప్పటి మహోత్సవంబునకున్= ఊరేగటానికి బయలుదేరునట్టి గొప్పసంబరంలో; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; యువరాజై; నీ రథంబునన్+ఉండి= నీ తేరిలో నిలిచి; నీకున్; ధవళచామరంబులు వైచున్= వింజామరలతో విసరగలడు; వాయుపుత్రుండు= భీమసేనుడు; సిత+ఛత్రంబు= తెల్లని గొడుగు; పట్టున్= పట్టుకొనగలడు; సవ్యసాచి= అర్జునుడు; సారథ్యంబు చేయున్= నీ రథం నడుపగలడు; మఱియున్= ఇంకను; పాంచాల, యాదవ, పాండ్య, మాత్స్యులు= ద్రుపదుడు, యాదవప్రభువులు, పాండ్యరాజు, విరాటుడు; లోనుగాన్+కల= మున్నుగా కలిగిన; రాజలోకంబుతోడన్= రాజుల సమూహంతో; కవలు= అమడలైన నకులసహదేవులు; అభిమన్యు ప్రభృతికుమారులు= అభిమన్యుడు మొదలైన కుమార వర్గం; బెరయన్= కూడగా, నిండగా; ఏము+ఎల్లన్= మేమందరమూ; బలసి పరివేష్టించి వత్తుము= గుమిగా నిన్ను చుట్టుకొని వస్తాము; ఇట్టి మహా+ఇంద్రవిభవంబునన్= ఈ విధమైన దేవేంద్రవైభవంతో; మహనీయుండవు+అగుచున్= గొప్పవాడ వవుతూ; మహీచక్రంబు+ఏలుము= భూమండలం పరిపాలించుము; అని; మఱియును.

తాత్పర్యం: కర్ణా! నిన్ను పాండవసామ్రాజ్యానికి అభిషిక్తుడిని చేస్తాను. నీవు అభిషిక్తుడవై రథమెక్కి నగరంలో ఊరేగునప్పటి మహోత్సవంలో యువరాజై ధర్మజుడు నీకు వింజామరలు వీస్తాడు. భీమసేనుడు తెల్లగొడుగు

పట్టుతాడు. అర్జునుడు రథసారథ్యం వహిస్తాడు. పాంచాల యాదవ పాండ్య మాత్స్య మహీపతులు మొదలైన రాజులందరితో నకుల సహదేవులు, అభిమన్యుడు మొదలైన కుమార వర్గం చేరగా మేమందరమూ గుంపుగా నిన్ను పరివేష్టించి వస్తాము. ఇట్లా, దేవేంద్ర వైభవంతో మహనీయుడవై మహీమండలాన్ని పరిపాలించుము' అని పలికి మళ్ళీ ఇట్లా అన్నాడు:

క. 'పాంచాల రాజపుత్త్రియు । నంచితముగ నిన్నుఁ బొందు నాఱవ వరుసన్;
సంచితపుణ్యుఁడ వీ వొక । యించుకయును వేఱుసేయ కేతె మ్మెలమిన్. 31

ప్రతిపదార్థం: పాంచాల రాజపుత్త్రియున్= పాంచాలరాజు కూతురైన ద్రౌపదియు; అంచితముగన్= ఒప్పిదంగా; నిన్నున్= నిన్ను; ఆఱవ వరుసన్= ఐదుమందితోపాటు ఆరవవాడిగా; పొందున్= పతిగా పడయగలదు; సంచితపుణ్యుఁడవు= సముపార్జించిన సుకృతము గల; ఈవు= నీవు; ఒక+ఇంచుకయును= కొంచెంకూడా; వేఱుచేయక= భేదభావంలేక; ఎలమిన్= సంతోషంతో; ఏతెమ్ము= పాండవులను చేరుము.

తాత్పర్యం: 'కర్ణా! ద్రౌపది ఐదుమందితోపాటు నిన్ను ఆరవభర్తగా ఆప్యాయంతో స్వీకరిస్తుంది. సుకృతాత్ముడవైన నీవు రవంతేని భేదభావంలేక సంతోషంతో పాండవులను కలిసికొనటానికి రమ్మ.

విశేషం: 'అంచితముగ నిన్నుఁబొందు నాఱవ వరుసన్' - అనే వాక్యానికి మూలం: షష్ఠే చ త్వాం తథాకాలే ద్రౌపద్యుపగమిష్యతి' ఆరవస్థానమందు నిన్ను ఆవిధంగా ద్రౌపది పొందగలదు.

వ. ఇట్లైనఁ గుంతికి సమస్త బంధుమిత్రులకుఁ బ్రియంబగు' ననిన విని రహస్యంబుగా రాధేయుండు మాధవున కిట్లనియె: 32

ప్రతిపదార్థం: ఇట్లు+ఐనన్= ఇట్లా నీవు పాండవులతో చేరితే; కుంతికిన్= కుంతీదేవికీ; సమస్త బంధుమిత్రులకున్= బంధువులూ మిత్రులూ అందరికీ; ప్రియంబు+అగును= సంతోషం కలుగుతుంది; అనినన్; విని; రహస్యంబుగాన్= గుట్టుగా; రాధేయుండు= రాధాపుత్రుడైన కర్ణుడు; మాధవునకున్= లక్ష్మీవల్లభుడైన కృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: కర్ణా! నీవు పాండవులతో చేరితే, కుంతికిన్నీ, తక్కిన సకల బంధువులకూ, స్నేహితులకూ సంతోషం కలుగుతుంది' అని శ్రీకృష్ణు డనగా విని రాధేయుడు నారాయణుడితో ఇట్లా అన్నాడు:

కర్ణుఁడు శ్రీకృష్ణునకుఁ దగిన యుత్తరంబు లిచ్చుట (సం. 5-139-1)

చ. 'వెడవెడ యేనుఁ దొల్లి యిది వింటి' ననుం గని కుంతి నిర్దయన్
జెడ నదివైచిపోయెఁ; గృపఁజేకొని సూతుఁడు దెచ్చి తాను మున్
కొడుకులుఁ గానకున్కిఁ బ్రియకుం దగనిచ్చినఁ జేపెఁ జన్నుఁ ల
ప్పడఁతియు నప్పుడాదిగ శుభస్థితిఁ బెంచెఁ బ్రయత్నశీలయై. 33

ప్రతిపదార్థం: వెడవెడ= కొంచెం కొంచెం; ఏనున్= నేను కూడ; ఇది= నీవు చెప్పిన విషయమునే; తొల్లి= మునుపు; వింటిన్= విన్నాను; కుంతి= కుంతీదేవి; ననున్+కని= నన్ను ప్రసవించి; నిర్దయన్= దయమాలినదై; చెడన్= నాశమయ్యేటట్లు; నదిన్=

నదిలో; వైచి= పారవేసి; పోయెన్= ఇంటికి వెళ్ళింది; సూతుఁడు= అధిరథుడు; కృపన్+చేకొని= దయతో నన్ను గ్రహించి; తెచ్చి= తన ఇంటికి తీసికొనివచ్చి; తాను= తాను; మున్= నన్ను కొనిరావటానికి మునుపు; కొడుకులన్+కానక+ఉన్కిన్= కుమారులను పడయకుండటంచేత; ప్రియకున్= తన భార్య అయిన రాధకు; తగన్= ఒప్పుగా; ఇచ్చినన్= ఇవ్వగా; చన్నులు చేఁపెన్= ఆమె స్తనాలకు పాలువచ్చాయి; ఆ+పడఁతియున్= ఆ వనితయు; అప్పుడు+ఆదిగన్= అదిమొదలుకొని; ప్రయత్నశీల+ ఐ= విడువని పూనిక(జాగరూకత)కలదై; శుభస్థితిన్+పెంచెన్= మంచి స్థితిలో నన్ను సాకింది.

తాత్పర్యం: 'కృష్ణా! నీవు చెప్పిన విషయం కొంచెం కొంచెం నేనూ విని ఉన్నాను. కుంతీదేవి నన్ను కని కనికరంలేనిదై గంగలోత్రోసి యింటి కేగింది. అప్పుడు సూతుడు దయతో నన్ను ఎత్తుకొని వచ్చి, తనకు అంతకుముందు బిడ్డలులేనందున తన ప్రియురాలైన రాధ కందించాడు. ఆమెకు పుత్త్రప్రేమ పొడమగా చన్నులు చేపాయి. అది మొదలు ఆమె పాలిచ్చి మిక్కిలి పూనికతో ఉన్నతస్థితిలో నన్ను పెంచింది.

క. మూత్ర పురీషాదులు దమ । గాత్రములం దింక వారు గారవ మెసఁగం
బుత్త్రుండని సంవర్ధిత । గాత్రునిగాఁ జేసి రింతకాలముఁ గూర్మిన్. 34

ప్రతిపదార్థం: మూత్రపురీష+ఆదులు= నా యొక్క మలమూత్రాదులు; తమగాత్రములందున్= తమ శరీరములందు; ఇంకన్= ఆరిపోగా; వారు= ఆ సూతదంపతులు; గారవము+ఎసఁగన్= ఆదరం అతిశయించగా; పుత్త్రుండు+అని= తమ కొడుకని; ఇంతకాలమున్= ఇన్నాళ్ళూ; కూర్మిన్= వాత్సల్యంతో; సంవర్ధితగాత్రునిగాన్+చేసిరి= పోషించబడిన దేహం కలవాడినిగా చేశారు.

తాత్పర్యం: తమ శరీరములందు నా మలమూత్రాదులు ఇంకిపోగా పరమాదరంతో నన్ను కన్నకుమారుడిగా ఆ సూత దంపతులు ఇంతకాలం ఈ శరీరాన్ని పరిపోషించారు.

క. నేఁ డింక నెఱిఁగి యొరువుల । వాఁడఁ గదా యనుచు నేను వారిఁ దొఱఁగినం
బోఁడిమి సెడదే? మదిఁ గడు । వాఁడి గలదె నాకు నకట వారిజనాభా! 35

ప్రతిపదార్థం: వారిజనాభా!= పద్మం నాభియందుగల శ్రీకృష్ణా! నేఁడు= ఈనాడు; ఎఱిఁగి= నా జన్మవృత్తాంతం తెలిసి; ఇంకన్= ఇటుపై; ఒరువులవాఁడన్ కదా= ఇతరుల బిడ్డను గదా; అనుచున్= అని తలుస్తూ; నేను= నేను; వారిన్= సూత దంపతులను; తొఱఁగినన్= విడిచిపెట్టితే; పోఁడిమి+చెడదే?= ధర్మం నశింపదా?; అకట!= అయ్యో!; నాకున్= నాకు; మదిన్= మనసులో; కడున్= మిక్కిలి; వాడి కలదె?= క్రూరత్వ మున్నదా?

తాత్పర్యం: నేడు నాజన్మవృత్తాంతం తెలిసి నేను ఇతరుల బిడ్డను గదా అని పెంచి పెద్దనుచేసిన ఆ సూతదంపతులను వదలివస్తే ధర్మం తప్పినవాడినికాగలను. కృష్ణా! నామనసులో అంతటి క్రౌర్యమున్నదా? (లేదని భావం.)

వ. వృద్ధోప సేవనంబును ధర్మ సంవేదనంబునుం గలవాఁడ వని నన్ను నీవ చెప్పితివి; రాధయు నధిరథుండును నాకు జాతకర్మాది సమస్త సంస్కారంబులు నిజకులోచితంబుగా నాచరించి; రట్టి తల్లిదండ్రులకుఁ బుత్త్రకృత్యంబులు నిర్వర్తింపక వారలంబాసి యేను వచ్చుట ధర్మంబగునే?' యని పలికి వెండియు. 36

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను; వృద్ధ+ఉపసేవనంబును= పెద్దలను సేవించటం; ధర్మసంవేదనంబును= ధర్మం తెలియటం; కలవాఁడవు+అని= కలిగిఉన్నవాడవని; నీవు+అ= నీవే; చెప్పితివి= అన్నావు; రాధయున్; అధిరథుండును; నాకున్; జాతకర్మ+ఆది,

సమస్తసంస్కారంబులు= పుట్టినప్పటినుండి చేయవలసిన వైదిక సంస్కారాలు; నిజకుల+ఉచితంబుగాన్= తమ కులానికి దగినట్లుగా; ఆచరించిరి= చేశారు; అట్టి; తల్లిదండ్రులకున్; పుత్త్రకృత్యంబులు= కుమారుడు చేయవలసిన కార్యములు; నిర్వర్తింపక= చేయకుండా; వారలన్; పాసి= విడిచి; ఏను= నేను; వచ్చుట; ధర్మంబు+అగునే?= ధర్మం ఔతుందా?; అని పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: శ్రీకృష్ణా! నేను పెద్దలను భక్తితో సేవించేవాడననీ, ధర్మం తెలిసినవాడననీ నీవే పలికావు. రాధ, అధిరథుడు నాకు పుట్టినప్పటినుండి చేయవలసిన వైదిక సంస్కారాలన్నీ తమ కులాచారానికి తగినట్లు చేసిఉన్నారు. అట్టి తల్లిదండ్రులకు తనయుడుగా నేను చేయవలసిన పనులను చేయకుండా వారిని వదలి పాండవుల దగ్గరకు రావటం ధర్మమా? చెప్పు'మని పలికి మరల కర్ణు డిట్లా అన్నాడు:

క. 'సోదరులుఁ బ్రియులు ననుజులు । నా దెసఁ బెక్కండ్రు; వారినందఱ విడువం
గాదని యూహింపక దా । మోదర! నన్నిట్లు పిలుచు టుచితమె? చెపుమా! 37

ప్రతిపదార్థం: దామోదర!= శ్రీకృష్ణా!; సోదరులున్= తోడబుట్టినవారు; ప్రియులున్= ఇష్టులు; అనుజులున్= తమ్ములూ; నా దెసన్= నా వైపు; పెక్కండ్రు= పలువురున్నారు; వారిన్+అందఱన్= వారినందరినీ; విడువన్+కాదు+అని= వదలటానికి వీలుగాదని; ఊహింపక= ఆలోచించక; నన్నున్= నన్ను; ఇట్లు= ఈవిధంగా; పిలుచుట= పాండవులను చేరరమ్మని ఆహ్వానించటం; ఉచితమె?; చెపుమా!= నీకు తగునా? తెలుపుము.

తాత్పర్యం: కృష్ణా! సోదరులు, ఇష్టులు, తమ్ముళ్ళు నా వైపు పలువురున్నారు. వారినందరినీ వదలిపెట్టడానికి వీలుకాదని భావించక నన్ను కౌంతేయులను కలియరమ్మని ఆహ్వానించటం నీకు తగునా? చెప్పుము.

వ. అదియునుం గాక. 38

తాత్పర్యం: ఇంతే కాక.

ఉ. సూతసుతుండు వీఁ డనక సూనుల తమ్ములకంటె నాకు సం
ప్రీతియొనర్చి తేజమును బెంపును నాఁటికినాఁటి కగ్గలం
బై తనరార నన్నుఁ దనయంతటి మానిసిఁ జేసియుండ నే
నేతగవూఁది యా కురుకులేశ్వరుఁ బాయుదు? ముట్టవచ్చినన్. 39

ప్రతిపదార్థం: వీఁడు= ఈ కర్ణుఁడు; సూతసుతుండు= సూతజాతివాడి కొడుకు; అనక= అని తలంచక; సూనుల తమ్ములకంటెన్= తన కొడుకులకంటెను, అనుజులకంటెను; నాకున్= నాకు; సంప్రీతి+ఒనర్చి= సంతోషం కలుగజేసి; తేజమును= ప్రతాపాన్ని; పెంపును= వృద్ధినీ; నాఁటికిన్ నాఁటికిన్= దినదినానికి; అగ్గలంబు+ఐ= మిక్కుటమై; తనరారన్= అతిశయించగా; నన్నున్= నన్ను; తన+అంతటి మానిసిన్+చేసి= తనంత వాడినిగా చేసి; ఉండన్= నా యెడ స్నేహభావంతో ఉండగా; నేను; ఏ తగవు+ఊఁది= ఏ ధర్మాన్ని ఆశ్రయించి; ఆ+కురుకుల+ఈశ్వరున్= కురువంశ నాయకుడైన దుర్యోధనుడిని; ముట్టన్ వచ్చినన్= శత్రువులు దాడి సల్పనుండగా; పాయుదున్?= వీడుతాను?

తాత్పర్యం: ఈ కర్ణుడు సూతజాతివాడి కొడుకని భావించక తన కుమారులకంటె, తమ్ముళ్ళకంటె నాకు సంతోషం కలిగిస్తూ నా ప్రతాపం, ఔన్నత్యం దినదినానికీ అతిశయిస్తుండగా సుయోధనుడు నన్ను తనంతవాడినిగా చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అట్లాంటి కురుకులాధినాథుడైన దుర్యోధనుడిని యుద్ధం ముంచుకొని వస్తున్న వేళలో ఏ ధర్మాన్ని అనుసరించి విడువగలనో నీవే చెప్పుము.

క. నను నయ్యర్జునునకు నెదు । రని పెద్దయు నమ్మియుండు నక్కట! దుర్యో
ధనుఁ; డా నమ్మిగ వమ్ముగఁ । జనునే పాండవులఁ గలయఁ జన నా కనఘా! 40

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; దుర్యోధనుఁడు= రాజరాజు; ననున్= నన్ను; ఆ+అర్జునునకున్= ఆ పార్థుడికి; ఎదురు+అని= యుద్ధంలో దీటని; పెద్దయున్= మిక్కిలి; నమ్మి+ఉండున్= విశ్వసించి ఉంటాడు; అక్కట!= అయ్యో!; ఆ నమ్మిగ= ఆతడి విశ్వాసం; వమ్ముగన్= రిత్తకాగా; నాకున్= నాకు; పాండవులన్ కలయన్+చనన్= పాండవులను చేరబోవటం; చనునే?= తగునా?

తాత్పర్యం: కృష్ణా! సుయోధనుడు సంగ్రామంలో నన్ను అర్జునుడికి దీటని మిక్కిలి నమ్మకంతో ఉన్నాడు. ఆతడి నమ్మకం వమ్ముచేసి నేను కౌంతేయులను చేరబోవటం తగునా?

ఆ. ఏను నర్జునుండు నెక్కటెక్కటి దల । పడకయున్న నగరె పుడమి జనము?
లందు నాదు వచ్చు టతనికి నపకీర్తి । యనిన నాకు వేఱె యడుగనేల? 41

ప్రతిపదార్థం: ఏనున్= నేనూ; అర్జునుండున్= అర్జునుడూ; ఎక్కటిన్+ఎక్కటిన్= ఒకడితో నొక్కడు; తలపడక+ఉన్నన్= యుద్ధంలో డీకొనకుంటే; పుడమిజనములు= భూమియందలి జనులు; నగరె?= పరిహసించరా?; అందున్= పాండవుల చెంతకు; నాదు వచ్చుట= నేను రావటం; అతనికిన్= ఆ పార్థునకు; అపకీర్తి= దుర్యశం; అనినన్= అని చెప్పినప్పుడు; నాకున్= నా విషయమై; వేఱె= ప్రత్యేకంగా; అడుగన్+ఏల?= చెప్పటం ఎందుకు?

తాత్పర్యం: నేనూ, అర్జునుడూ రణంలో ఒకరినొక్కరు ఎదుర్కొనకుంటే లోకులు నవ్వరా? నేను పాండవులను చేరరావటం అర్జునుడికి అపకీర్తి హేతువయినప్పుడు, మరి అది నాకెంత అవమానకరమో వేరే చెప్పాలా?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి.

క. హిత ముపదేశించితి నీ । వతి నిర్మలబుద్ధి వగుట; నైనను నిది నా
మతి సొరదు; రహస్యము ర । క్షితముగఁ బాటింపుమయ్య! చిత్తములోనన్. 42

ప్రతిపదార్థం: నీవు= నీవు; అతినిర్మలబుద్ధివి+అగుటన్= మిక్కిలి స్వచ్ఛమైన మనస్సుకలవాడవు గనుక; హితము+ఉపదేశించితి(వి)= శ్రేయమైనదానిని బోధించావు; ఐననున్= కాని; ఇది= నీవు సల్పిన ఈబోధ; నా మతిన్= నా హృదయంలో; చొరదు= ప్రవేశించదు; రహస్యము= ఈ గుట్టు; రక్షితముగన్= సంరక్షింపబడేటట్లు; చిత్తములోనన్= నీ మనస్సులో; పాటింపుము+అయ్య!= ఉంచుకొనవయ్యా!

తాత్పర్యం: శ్రీ కృష్ణా! నీవు మిక్కిలి నిర్మలమైన మనస్సుకలవాడవు కనుక నాకు మేలు కలిగే విధమేదో బోధించావు. కాని, నీ హితోపదేశం నా మనస్సుకు ఎక్కదు. నేను కుంతీపుత్రుడనన్న ఈ రహస్యం వెలికి పొక్కనీయకుండా భద్రంగా నీ హృదయంలోనే ఉంచుకొమ్ము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అది యేమిటి కంటేని. **43**

తాత్పర్యం: అదెందుకని అడుగుతావేమో.

తే. ధర్మతనయుండు తాను నా తమ్ముఁ డగుట । యెఱిఁగెనేనియు సామ్రాజ్య మేల పూను?
నట్టి ధార్మికుఁ డాధిపత్యంబుఁ జేయ । వలవదే శాశ్వతంబుగ వసుధకెల్ల? **44**

ప్రతిపదార్థం: ధర్మతనయుండు= ధర్మరాజు; తాను; నా తమ్ముఁడు+అగుట= నాకు తమ్ముడు అనే విషయం; ఎఱిఁగెన్+ఏనియున్= తెలిసికొన్నయెడల; సామ్రాజ్యమున్= దొరతనాన్ని; ఏల పూనున్?= ఎందుకు వహిస్తాడు; అట్టి ధార్మికుఁడు= అటువంటి పుణ్యాత్ముడు; శాశ్వతంబుగన్= స్థిరంగా; వసుధకున్+ఎల్లన్= పుడమికంతటికిని; ఆధిపత్యంబున్+చేయన్+వలవదే?= అధిపతిగా ఉండి పాలించవద్దా?

తాత్పర్యం: ధర్మపుత్రుడు నాకు తమ్ముడని తాను తెలిసికొంటే భూమండలాధిపత్యం వహించడు. కాని, అట్లాంటి ధర్మాత్ముడు శాశ్వతంగా ఈ పుడమి కంతటికి రాజై పరిపాలించటం న్యాయంకదా!

క. అనుజులు ఋత్విజులుగ, నీ । పని యిటు సేయుమను నీ వుపద్రష్టవుగా
విను! కురుకుమార పశువిశ । సనమున రణయజ్ఞ మతఁడు సమ్మతిఁ జేయున్. **45**

ప్రతిపదార్థం: విను!= కృష్ణా! నా పలుకులాలకించు; అతఁడు= ధర్మజుడు; అనుజులు= తన తమ్ములు; ఋత్విజులుగన్= యజ్ఞం చేయించే ఋత్విక్కులు కాగా; ఈ పని= ఈ కార్యం; ఇటు చేయుము= ఈ విధంగా నిర్వహించుము; అను= అని పలికే; నీవు= నీవు; ఉపద్రష్టవు కాన్= యజ్ఞకర్మలోని గుణదోషాలను కనిపెట్టేవాడవు కాగా; కురుకుమారపశువిశసనమునన్= కౌరవులనే యజ్ఞపశువులను చంపుటద్వారా; రణయజ్ఞము= యుద్ధమనే యాగాన్ని; సమ్మతిన్= ఇష్టంతో; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: కృష్ణా! ధర్మజుడు తన తమ్ములు నలుగురూ, హోత, ఉద్గాత, అధ్వర్యువు, బ్రహ్మ అని యజ్ఞం చేయించే యాజకులు కాగా, ఈ పని ఇట్లా చేయండి అని యజ్ఞకర్మలోని గుణదోషాలను కనిపెట్టి చెప్పే ఉపద్రష్టవు నీవు కాగా, కౌరవులనే పశువులను విశసించి సంప్రీతితో రణయజ్ఞం చేస్తాడు.

విశేషం: అలం: రూపకం.

వ. దానం బుణ్యభూమి యగు కురుక్షేత్రంబున మముబోం ట్లెల్లను సద్గతి వడయుదురు గాక!' యనిన విని వసుదేవనందనుండు సూతనందనున కిట్లనియె. **46**

ప్రతిపదార్థం: దానన్= దానివలన; పుణ్యభూమి+అగు= ధర్మక్షేత్రమైన; కురుక్షేత్రంబునన్= కురుక్షేత్రంలో; మముబోంట్లు+ఎల్లను= మా వంటివారందరూ; సత్+గతి= ఉత్తమలోకాలను; పడయుదురుగాక!= పొందుతారుగాక!; అనినన్= అని కర్ణుడు పలుకగా; విని; వసుదేవనందనుండు= వసుదేవుడి పుత్రుడైన శ్రీకృష్ణుడు; సూతనందనునకున్= అధిరథుడి ఆత్మజుడైన కర్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కృష్ణా! ధర్మజుడు యుద్ధ యజ్ఞంచేసే ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో మా వంటివారంతా ఉత్తమగతులు పొందుతారు' అని కర్ణుడు పలుకగా విని శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. 'దయ నా యాడినమాటఁ గైకొనవు సంతాపంబుఁ దెచ్చుం జుమీ!
స్మయ మెట్లుం దుది నీకు నర్జుననితో మాత్సర్యమైనం బరా
జయ మొండెన్ మృతి యొండెఁ గాక గెలువన్ శక్యంబె? పెక్కండ్ర కిం
తియ కాలం బగునట్టె నీ మనము శాంతింబొందఁగా నేర్చునే? 47

ప్రతిపదార్థం: దయన్= కృపతో; నా+ఆడినమాటన్= నేను పలికిన పలుకును; కైకొనవు= ఆదరించకున్నావు; స్మయము= గర్వం; సంతాపంబున్= దుఃఖమును; తెచ్చున్+చుమీ!= కలిగించగలదు సుమా!; ఎట్లున్= ఎట్లాగయినా; తుదిన్= చివరకు; నీకున్= నీకు; అర్జుననితోన్= పార్థుడితో; మాత్సర్యము+ఐనన్= ద్వేషమొదవినచో; పరాజయము+ఒండెన్= అపజయమో లేదా; మృతి+ఒండెన్= మరణమో; కాక= ఈ రెంటిలో ఒకటితప్ప; గెలువన్ శక్యంబె?= అతనిని జయించుట నీ తరమా? (కాదని అర్థం); పెక్కండ్రకున్= అనేకులకు; ఇంతియకాలంబు+అగునట్టె= బ్రతుకు ఇంతవరకే ఉన్నది కాబోలు (ఆ కారణముచే); నీ మనము= నీ హృదయం; శాంతిన్+పొందగాన్+నేర్చునే?= శాంతిని పొందజాలునా? (చాలదని అర్థం.)

తాత్పర్యం: 'కనికరంతో నేను పలికిన పల్కులు గైకొనకున్నావు. అహంకారం దుఃఖాన్ని కలిగిస్తుంది సుమా! అర్జునుడిపై ద్వేషం వహించిన నీకు అతడితోటి పోరాటంలో పరాజయమో ప్రాణహానియో - ఈ రెంటిలో ఒకటితప్ప విజయం సంప్రాప్తించదు. పలువురకు చేటుకాలం దాపురించి ఉండగా నీ మనసు శాంతి వహించగలదా?

క. గాండీవముఁ గవదొనలు న । ఖండిత దివ్యాస్త్రములు నొగలపై నేనుం
జండ భుజబలమునై యు । ద్దండత నరుఁ డడర నెదురఁ దరమే నీకున్? 48

ప్రతిపదార్థం: గాండీవమున్= గాండీవమనే ధనుస్సు; కవదొనలున్= అక్షయబాణతూణీరాల జంట; అఖండిత దివ్య+అస్త్రములు= అమోఘాలైన దివ్యబాణాలు; నొగలపైన్= తన తేరి నొగల మీద; నేనున్= నేనూ; చండభుజబలమున్+ఐ= తీవ్రమైన బాహుశక్తిగలిగి; ఉద్దండతన్= ఉగ్రంగా; నరుఁడు+అడరన్= అర్జునుడు విజృంభించగా; నీకున్= నీకు; ఎదురన్+తరమే?= యుద్ధంలో ఎదిరించ శక్యమా? (కాదని భావం.)

తాత్పర్యం: గాండీవం, అక్షయ తూణీరాల జంట, అమోఘమైన దివ్యశరాలు, అపార భుజ విక్రమం తనకు తోడై ఉండగా, తన రథం తోలుతూ నొగలపై నేనుండగా, భయంకరంగా చెలరేగిన అర్జునుడిని కయ్యంలో ఎదుర్కొనటానికి నీకు శక్యం కాదు.

విశేషం: తిరుపతికవుల ఉద్యోగ విజయాల నాటకంలోని సుప్రసిద్ధమైన 'జెండాపై కపిరాజు, ముందు సితవాజి శ్రేణి.....' అనే పద్యానికి ఇది స్ఫూర్తియేమో!

వ. ఎల్లభంగులం బాండవుల గెల్తు; రది యట్లుండె; నీవు పొ; మ్మిప్పుడ పోయి సుయోధనునకును గురుభీష్ములకును మీకుం దోడువచ్చిన రాజుల కందఱకుం జెప్పు : మిమ్మాసంబు సౌమ్యంబై సమశీతోష్ణంబై పుష్పఫలోపేతంబును, సమగ్ర ధాన్యంబును, సులభయవ సేంధనంబును నగుచు నొప్పియున్నయది; యేడెనిమిది దివసంబులకు నమావాస్య వచ్చు; నది పుణ్యదినంబు; నాఁడు భండనంబు గావలయు' ననినఁ గానీనుండు కమలనాభున కిట్లనియె. 49

ప్రతిపదార్థం: ఎల్లభంగులన్= అన్ని విధాల; పాండవులు+అ= పాండవేయులే; గెల్తురు= జయిస్తారు; అది+అట్లు+ఉండెన్= ఆ సంగతి అట్లా ఉండనీ; నీవు పొమ్ము= నీవు కరినగరికి వెళ్ళుము; ఇప్పుడు+అ పోయి= ఇపుడే వెళ్ళి; సుయోధనునకును; గురుభీష్ములకును; మీకున్= మీకు; తోడువచ్చిన= సాయపడటానికి వచ్చిన; రాజులకున్; అందఱకున్; చెప్పుము; ఈ+మాసంబు= ఈ నెల; సౌమ్యంబు+ఐ= శాంతమై; సమ శీత+ఉష్ణంబు+ఐ= సమానమైన చలీ, వేడీ కలదై; పుష్పఫల+ఉపేతంబును= పూలతో పండ్లతో కూడినదై; సమగ్ర ధాన్యంబును= అధికమైన ధాన్యం కలదై; సులభ యవస+ఇంధనంబును= తేలికగా లభించే పచ్చిక, వంటచెరకులు కలది; అగుచున్; ఒప్పి+ఉన్నయది= సొంపారుతున్నది; ఏడు+ఎనిమిది దివసంబులకున్= ఏడెనిమిది రోజులకు; అమావాస్య; వచ్చున్; అది= ఆ అమావాస్య; పుణ్యదినంబు= పవిత్రమైన రోజు; నాఁడు= ఆ అమావాస్యరోజు; భండనంబు= యుద్ధం; కావలయున్= జరుగవలెను; అనినన్; కానీనుండు= కుంతి కన్యగా నున్నపుడు సూర్యవర ప్రసాదంతో జనించిన కర్ణుడు; కమలనాభునకున్= బొడ్డున తామరగల శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: సర్వవిధాల పాండవేయులే జయిస్తారు. ఆ విషయం అట్లా ఉండనీ. నీవు హస్తినాపురికి వెళ్ళి ఇపుడే దుర్యోధనుడికీ, భీష్మ ద్రోణులకూ, మీకు సాయపడవచ్చిన రాజులందరికీ చెప్పుము. ఈ నెల అంత చలి, వేడిమి లేక పూలతో పండ్లతో కూడి, ధాన్యంతో నిండి, తేలికగా పచ్చిక, వంట చెరకు దొరుకుతుండగా పెంపారుతున్నది. ఏడెనిమిది రోజులలో అమావాస్య వస్తుంది. అది పుణ్య తిథి. ఆనాడు యుద్ధం ప్రారంభం కావాలి' అని శ్రీకృష్ణుడు చెప్పాడు. అందుకు కర్ణుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: నేడు అమావాస్య. ఏ పనినీ ఆరంభింపగూడని అపవిత్రదినంగా భావింపబడుతుండగా, నాడు యుద్ధంవంటి అతిముఖ్యమైన కార్యాన్ని ఆరంభించదగిన పుణ్యదినంగా భావించబడటం విశేషం.

క. 'కలవు నిమిత్త స్వప్నం । బులు కౌరవ పాండవులకుఁ బోటగు; దానన్
గెలు పయ్యుధిష్ఠిరునకును । గల; దెఱుఁగుదు నీవు సెప్పఁగా నేమిటికిన్? 50

ప్రతిపదార్థం: నిమిత్త స్వప్నంబులు= శకునాలు, కలలు; కలవు= భావియుద్ధాన్నే సూచిస్తున్నాయి; దానన్= ఆ కారణముచే; కౌరవ పాండవులకున్= కౌరవులకు, పాండవేయులకు; పోటు+అగున్= పోరాటం జరుగుతుంది; ఆ యుధిష్ఠిరునకున్= ఆ ధర్మజునకు; గెలుపు+కలదు= విజయం కలుగుతుంది; ఎఱుఁగుదున్= నాకు తెలుసు; నీవు చెప్పఁగాన్+ఏమిటికిన్?= నీవు తెలుపవలసిన అవసరం ఏముంది? (లేదని భావం).

తాత్పర్యం: శకునాలూ, కలలూ భావియుద్ధ సూచకాలై ఉన్నాయి. అందుచేత కురుపాండవులకు పోరు జరుగుతుంది. ఆ పోరాటంలో ధర్మజుడికి గెలుపు కలుగుతుంది. ఆ విషయం నాకు తెలుసు. నీవు వేరే చెప్పటమెందుకు?

వ. అట్లుగాన కదా యే నందు రా' నని పలికి మఱియును. 51

ప్రతిపదార్థం: అట్లు+కాన్+అ+కదా= అందువలననేగదా!; ఏను= నేను; అందున్+రాను= అక్కడికి రావటానికి సమ్మతించను; అని పలికి; మఱియును.

తాత్పర్యం: కృష్ణా! అందువలననే కదా నేను పాండవుల వద్దకు రానని చెప్పుతున్నాను' అని పలికి కర్ణుడు ఇంకా. (ఇట్లా అన్నాడు:)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'దీనికి మూలము శకునియు । నేనును, దుశ్శాసనుండు, నింతియ; కుంతీ
సూనుల వారలు గలసిన । రానేరఁగ వచ్చు నాకు రాజీవాక్షా! 52

ప్రతిపదార్థం: రాజీవ+అక్షా!= కమలాల వంటి కన్నులుగల కృష్ణా!; దీనికిన్= ఈ సంగ్రామానికి; శకునియున్= సౌబలుడూ; నేనును= నేనున్నూ; దుశ్శాసనుండు= దుస్ససేనుడూ; మూలము= హేతువై ఉన్నాము; ఇంతియ= ఇది నిజం; వారలు= ఆ శకుని దుశ్శాసనులు; కుంతీసూనులన్= కుంతి కొడుకులను; కలసినన్= కూడినప్పుడే; నాకున్= నాకు; రానేరఁగన్ వచ్చున్= రాదగి ఉంటుంది.

తాత్పర్యం: ఈ సంగ్రామానికి శకుని, నేను, దుశ్శాసనుడు కారణభూతులం. ఇది నిజం. వారిద్దరు పాండవేయులను కలసినప్పుడు గదా నేను వారిని కలవవలసి ఉంటుంది? వారూ, నేనూ కౌంతేయులను కలవటం అసంభవం.

వ. ఈ సమర సముద్రంబు గడవ నీఁది నిన్నుం గనియెదఁ; గాదేని నూర్ధ్వలోకంబునం గాంచెద; నీ వింక నేమియుం బలుకకుము; పని వినియెద'నని కౌఁగిలించుకొనిన 'నట్ల కాక పో'మ్మని విష్ణుండు వీడుకొలువ రాధేయుండు రథావతరణంబు సేసి, కనక రత్నమయంబగు తన యరదం బెక్కి కరిపురంబున కరిగె; నచ్యుతుండును సాత్యకిం దన రథం బెక్కించుకొని దారుకుం జూచి 'పద పద పోనిమ్ము పోని'మ్మని పలికి లలితాటోపకలితుండగుచుఁ జనియె; నట్టియెడ విదురుండు విషాదంబుతోఁ బాండురాజమహిషి పాలికిం జని యిట్లనియె. 53

ప్రతిపదార్థం: ఈ సమర సముద్రంబున్= ఈ యుద్ధమనెడు సాగరాన్ని; కడవన్+ఈఁది= కడముట్ట దాటి; నిన్నున్+ కనియెదన్= నిన్ను సందర్శిస్తాను; కాదు+ఏనిన్= అట్లా రణ విజయం పొందలేక వీరమరణం చెందితే; ఊర్ధ్వలోకంబునన్= పరలోకంలో; కాంచెదన్= చూస్తాను; నీవు; ఇంకన్; ఏమియున్; పలుకకుము; పని వినియెదన్= వెళ్ళివస్తాను; అని; కౌఁగిలించుకొనినన్; అట్లకాక= అట్లాగే; పొమ్ము+అని; విష్ణుండు= వెన్నుడు; వీడు కొల్పన్= అంపగా; రాధేయుండు; రథ+ అవతరణంబు చేసి= రథం నుండి క్రిందికి దిగి; కనక రత్నమయంబు+అగు= బంగారంతో రతనాలతో నిర్మించిన; తన+అరదంబు+ఎక్కి= తన రథాన్ని అధిరోహించి; కరిపురంబునకున్= హస్తినాపురానికి; అరిగెన్; అచ్యుతుండును= శ్రీకృష్ణుడు కూడా; సాత్యకిన్; తన రథంబు; ఎక్కించుకొని; దారుకున్+చూచి= దారుకుడనే తన రథసారథిని చూచి; పద పద; పోనిమ్ము పోనిమ్ము; అని పలికి; లలిత+ఆటోప కలితుండు+అగుచున్= ఉల్లాసకరమైన గర్వంతో కూడినవాడవుతూ; చనియెన్= పాండవుల దగ్గరకు వెళ్ళాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో, విదురుండు; విషాదంబుతోన్= దుఃఖంతో; పాండురాజమహిషి పాలికిన్+చని= పాండురాజు పట్టపు దేవేరి అయిన కుంతి చెంతకు వెళ్ళి; ఇట్లు+అనియన్.

తాత్పర్యం: శ్రీకృష్ణా! కురుపాండవులకు ఏర్పడనున్న ఈ సంగ్రామ మనే సముద్రాన్ని తుదముట్టనీది విజయినై ఇక్కడ నిన్ను దర్శిస్తాను. లేదా కూలి వీరస్వర్గంచేరి పరమేశ్వరుడవైన నిన్ను చూస్తాను. నా కిక సెలవిప్పించు'మంటూ స్వామిని కర్ణుడు కౌగిలించుకొన్నాడు. వెన్నుడు 'అట్లాగే వెళ్ళు'మని అనుమతి నీయగా రాధేయుడు రాజీవాక్షుడి రథంనుండి దిగి కనకరత్నమయమైన తన తేరెక్కి హస్తినాపురికి తిరిగివెళ్ళాడు. అచ్యుతుడు అంతవరకు దవ్వుల నున్న సాత్యకిని తన రథ మెక్కించుకొని సారథి అయిన దారుకుడితో 'పదపద, రథాన్ని పోని'మ్మని చెప్పి సొబగైన దర్పంతో వెళ్ళాడు. అట్టి సమయంలో విదురుడు దుఃఖంతో పాండునృపాలుడి పట్టపురాణి కుంతీదేవి గృహానికి వెళ్ళి ఆమెతో ఇట్లా అన్నాడు:

విశేషం: సమరసముద్రంబు - అలంకారం రూపకం.

ఉ. **'అక్కట! కౌరవాన్వయ మహార్ణవ మింకెడునట్లు పుట్టె; నిం**
దొక్కరుఁడైనఁ గేశవు హితోక్తికి మేకొనఁ డయ్యె; నర్జునుం
డెక్కటి దాన చాలుఁ దము నిందఱఁ దీవ్రశరాగ్నిఁ గాల్పఁ; బెం
పెక్కిన పాండునందనుల యేడ్తెఱఁ దొల్లియుఁ దా రెఱుంగరే? 54

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; కౌరవ+అన్వయ+మహా+అర్ణవము= కౌరవ వంశమనే గొప్ప సముద్రం; ఇంకెడు+అట్లు+పుట్టెన్= ఎండిపోయేటట్లు యుద్ధం తటస్థించింది; ఇందున్= ఈ కురువంశంలో; ఒక్కరుఁడు+ఐనన్= ఒక్కడు కూడ; కేశవుహిత+ఉక్తికిన్= శ్రీకృష్ణుడి శ్రేయస్కరమైన వచనానికి; మేకొనఁడు+అయ్యెన్= సమ్మతించలేదు; అర్జునుండు= పార్థుడు; ఎక్కటి= అసహాయశూరుడు; తమున్+ఇందఱన్= కౌరవులనందరినీ; తీవ్రశర+అగ్నిని= తీక్ష్ణములైన బాణాలనే నిప్పుతో; కాల్పన్= దహించటానికి; తాను+అ చాలున్= తానొక్కడే సరిపోతాడు; పెంపు+ఎక్కిన= ఘనతగాంచిన; పాండునందనుల= పాండుకుమారుల యొక్క; ఏడ్తెఱన్= శక్తిని (సామర్థ్యాన్ని, పరాక్రమాన్ని); తొల్లియున్= ఇదివరలోకూడా; తారు= తాము; ఎఱుంగరే?= తెలియకున్నారా?

తాత్పర్యం: 'అయ్యో! కౌరవవంశమనే సాగరం ఇంకిపోయేటట్లుగా యుద్ధం తటస్థించింది. కౌరవులలో ఒక్కడైనా శ్రీకృష్ణుడి హితబోధ మన్నించలేదు. అర్జునుడు అసహాయశూరుడు. అత డొక్కడే తామందరినీ వాడిబాణాలనే అగ్ని చేత దహించి వేయగలడు. ప్రసిద్ధికెక్కిన పాండవుల శక్తిసామర్థ్యాలు ఎట్లాంటివో వీరికి ఇంతకు మునుపు తెలియనివి కావు గదా!

విశేషం: అలం: రూపకం. కౌరవాన్వయ మహార్ణవము, తీవ్ర శరాగ్ని.

తే. **అన్ని వడియును బంధుక్షయంబు సేయ । నొల్ల కెల్ల విధంబుల నుపశమంబ**
కోరి రప్పాండవేయులు; వారి కిట్టి । దొసఁగు వచ్చునె తులువల తోడఁబుట్టి.' 55

ప్రతిపదార్థం: ఆ+పాండవేయులు= ఆ పాండునందనులు; అన్ని పడియును= అన్ని కష్టాలు అనుభవించినప్పటికినీ; బంధుక్షయంబు+చేయన్+ఒల్లక= చుట్టాలను నాశనం చెయ్యటాని కిష్టపడక; ఉపశమంబు+అ కోరిరి= శాంతినే వాంఛించారు; తులువల తోడన్+పుట్టి= తుచ్ఛులైన దుర్యోధనాదులకు సోదరులై పుట్టి; వారికిన్= పుణ్యాత్ములైన పాండుపుత్త్రులకు; ఇట్టి దొసఁగు వచ్చునె?= ఇట్టి విపత్తు కలిగిందే?

తాత్పర్యం: పాండుకుమారులు అన్ని కష్టాలు అనుభవించినప్పటికీ చుట్టాలను నాశనం చేయటానికి ఇష్టపడక సకల విధాల శాంతినే అభిలషించారు. అట్టి మహనీయులకు దుర్మార్గులైన కౌరవులు తోడబుట్టువులైనందుకు ఇట్లాంటి బాధలు కలిగాయి'.

వ. **అని వెండియు నివ్విధంబు మాటలఁ బాండవులకుఁ గయ్యంపు టలజడియైన వగపు దోఁప నాడుచుం గొండొక ప్రొద్దు నిలిచి నిజనివాసంబునకుం బోయిన యనంతరంబ కుంతి యిట్లని వితర్కించె. 56**

ప్రతిపదార్థం: అని; వెండియున్= మరల; ఈ+విధంబు మాటలన్= ఇట్లాంటి మాటలతో; పాండవులకున్= ధర్మజాదులకు; కయ్యము+అలజడి+ఐనన్= యుద్ధ సంక్షోభ మేర్పడగా; వగపు+తోఁపన్= చింత వ్యక్తమయ్యేటట్లు; ఆడుచున్= పలుకుతూ; కొండొక ప్రొద్దు= కొంత తడవు; నిలిచి= కుంతీగృహంలో ఆగి; నిజ నివాసంబునకున్= తన నివాస ప్రదేశానికి; పోయిన+ అనంతరంబు+అ= వెళ్లిన తరువాత; కుంతి; ఇట్లని; వితర్కించెన్= ఆలోచించింది.

తాత్పర్యం: విదురుడు పాండవుల కేర్పడిన యుద్ధాందోళనగురించి ఇట్లాంటి మాటలతో తన దుఃఖం వ్యక్తమయ్యేటట్లు పలుకుతూ, కొంచెం సేపు కుంతీగృహంలో నిలిచి, పిదప తన నివాసప్రదేశానికి వెళ్ళాడు. అట్లా విదురుడు వెళ్ళిన తరువాత కుంతి తన మనసులో ఇట్లా ఆలోచించింది:

మ. 'తమ వారిన్ సిరికై వధించు టిది సద్ధర్మంబె? యక్లేశ కృ
త్యమె తాఁ గయ్యము? ద్రోణ భీష్మ కృప కర్ణాటోపముల్ మాన్చు ట
ల్పములం దీఱునె? యందు నర్కజుని యుల్లం బెప్పుడుం గ్రోధ దీ
ప్తము భీమాదుల మీఁదఁ; దక్కొరుల కుత్సాహంబు లే దాజికిన్.' 57

ప్రతిపదార్థం: తమవారిన్= తమ చుట్టాలను; సిరికై= రాజ్యలక్ష్మికై; వధించుట= చంపటం; ఇది సత్+ధర్మంబె?= ఇది శ్రేష్ఠమైన ధర్మమా?; కయ్యము తాన్= సంగ్రామమన్నది; అక్లేశ కృత్యమె?= దుఃఖ మొదవని కార్యమా?; ద్రోణ భీష్మ కృప కర్ణ+ఆటోపముల్= ద్రోణ భీష్ముల యొక్క, కృప కర్ణులయొక్క యుద్ధ విజృంభణాలు; మాన్చుట= లేకుండా చేయటం; అల్పములన్+తీఱునె?= తక్కువ యత్నాలతో జరిగేదా?; అందున్= ఆ ద్రోణభీష్మ కృపకర్ణులలో; అర్కజుని+ఉల్లంబు= కర్ణుడి మనస్సు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; భీమ+ఆదుల మీఁదన్= భీముడు మొదలైన వారిమీద; క్రోధ దీప్తము= కోపంతో మండుతుంటుంది; తక్కొరులకున్= మిగిలిన కౌరవ సేనలోని వీరులకు; ఆజికిన్= యుద్ధం సల్పడానికి; ఉత్సాహంబు లేదు= అభిలాష లేదు.

తాత్పర్యం: 'తమ చుట్టాలను రాజ్యసంపదకై చంపటం ఉత్తమ ధర్మమౌతుందా? యుద్ధం చేయటం దుఃఖరహిత కార్యం కాదుగదా! ద్రోణభీష్మకృపకర్ణుల వీరావేశాలు మాన్పటం తక్కువ యత్నంతో జరిగేవి కావు. ఆ ద్రోణ భీష్మ కృప కర్ణులలో ఆ సూర్యపుత్రుడి మన సెప్పుడూ భీమాదుల మీద కోపంతో మండిపోతుంటుంది. కురుసేనలోని తదితర యోధులకు యుద్ధం చేయాలనే అభిలాష లేదు.'

వ. అని యిత్తెఱంగునఁ బెక్కులు చింతించి తలంచుకొని 'కర్ణునకుం బుట్టువు తెలిపి సహోదర స్నేహం బావహించెద; నట్లయిన నాహవంబువలని కడంక యుడుగకుండునె?' యని విచారించి యతని పాలికిం బోన నిశ్చయించి, యుచిత ప్రకారంబున వెడలి యతం డనుష్ఠానార్థంబు భాగీరథికిం జనుట విని తత్ప్రదేశంబున కరిగి యతనికి జపకాలంబయి యునికిం జూచి వెనుక వలనఁ గూర్చుండఁ, గొండొక సేపునకు జపంబుదీఱి కలయం గనుంగొని యమ్మహాదేవిం గాంచి కానీనుండు సంభ్రమ వినయంబులతోడం జేరి సూత గోత్రంబును రాధేయనామంబునుం జెప్పి యభివాదనంబు చేసి 'నీవు విజయంచేసిన కార్యం బేమి? నాకుం జేయంగల పని యెయ్యది? యానతి'మ్మనినఁ గుంతి యేకాంతంబుగా నిట్లనియె. 58

ప్రతిపదార్థం: అని; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; పెక్కులు చింతించి= అనేక విధాలుగా ఆలోచించి; తలంచుకొని= భావించి; కర్ణునకున్; పుట్టువు తెలిపి= జన్మ ప్రకారం తెలిపి; సహోదర స్నేహంబు+ఆవహించెదన్= తోడబుట్టువుల మీద

ప్రేమను కలిగిస్తాను; అట్లు+అయినన్= అట్లాచేస్తే; ఆహవంబు వలని కడంక= యుద్ధమునందలి పూనిక; ఉడుగక+ఉండునె?= మానకుంటాడా?; అని విచారించి= అని తలపోసి; అతని పాలికిన్+పోవన్+నిశ్చయించి= అతడి దగ్గరకు వెళ్ళటానికి నిర్ణయించి; ఉచిత ప్రకారంబునన్= తగిన విధంగా; వెడలి= బయలుదేరి; అతండు= కర్ణుడు; అనుష్ఠాన+అర్థంబు= విధులాచరించుట కొరకు; భాగీరథికిన్= గంగానదికి; చనుట విని= వెళ్ళాడని తెలిసికొని; అతనికిన్= ఆ కర్ణుడికి; జపకాలంబు= మంత్రజపం చేసే సమయం; అయి+ఉనికిన్= అయి ఉండటం; చూచి; వెనుక వలనన్= అతడికి వెనుక తట్టు; కూర్చుండన్= ఆసీనురాలు కాగా; కొండొక సేపునకున్= కొంత తడవునకు; జపంబు తీఱి= జపం ముగించి; కలయన్+కనుంగొని= నలువైపుల చూచి; ఆ+మహాదేవిన్+కాంచి= పాండురాజు పట్టపు దేవేరిని కనుగొని; కానీనుండు= కన్యాపుత్రుడైన కర్ణుడు; సంభ్రమ వినయంబుల తోడన్= తొట్రుపాటుతో, అణకువతో; చేరి= ఆమెను సమీపించి; సూతగోత్రంబును= తనకు సంబంధించిన సూతగోత్రాన్ని; రాధేయ నామంబునున్= రాధేయుడనే తన పేరునూ చెప్పి; అభివాదనంబు చేసి= పాదనమస్కారంచేసి; నీవు; విజయంచేసిన కార్యంబు+ఏమి?= వచ్చిన పని ఏమిటి?; నాకున్+చేయన్+కల+పని+ఏ+అది?= నేను నీ కొరకై చేయవలసిన పనిఏమిటి?; ఆనతిమ్ము= సెలవిమ్ము; అనినన్; కుంతి; ఏకాంతంబుగాన్= రహస్యంగా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కుంతీదేవి ఇట్లా పలురకాల ఆలోచించింది. 'కర్ణుడికి అతడి జన్మ వృత్తాంతం చెప్పి తన తోబుట్టువుల మీద ప్రేమ కలిగిస్తాను. అట్లా సోదరుల మీద ప్రేమ జనింపజేస్తే యుద్ధం చేయవలెననే పట్టుదల మానుకొంటాడు కదా! అని భావించి అతడి దగ్గరకు వెళ్ళాలని నిశ్చయించుకొన్నది. కర్ణుడు అనుష్ఠానార్థం గంగానదికి వెళ్ళాడని విని తా నక్కడికి వెళ్ళింది. ఆ సమయంలో కర్ణుడు జపం చేస్తున్నాడు. మెల్లగా వెళ్ళి అతని వెనుక కుంతి కూర్చున్నది. కొంచెంసేపటికి తన జపం పూర్తి కాగానే కర్ణుడు కనులు దెరచి నాల్గువైపుల కలయజూచాడు. కుంతి కనిపించింది. అతడు పాండు రాజమహిషిని చూడగానే సంభ్రమ వినయాలతో దగ్గరకు వచ్చాడు. తన సూత గోత్రం, రాధేయ నామధేయం చెప్పి ఆమెకు ప్రణమిల్లాడు. 'నీ విక్కడికి ఏమి పనిమీద వచ్చావో, నేను చేయవలసిన పని ఏమిటో సెల'విమ్మని అడిగాడు. ఆమె రహస్యంగా కర్ణుడితో ఇట్లా అన్నది:

కుంతీదేవి కర్ణునకు నతండు తన పుత్త్రుం డగుట దెలుపుట (సం. 5-143-1)

సీ. 'వినుము! సూతాన్వయంబున నీవు పుట్టుట । బొం; కేను మా కుంతిభోజునింటఁ
గన్నియనాఁడు భాస్కరుని రావించితి । వరమంత్రబలమున; వచ్చి యతఁడు
సంప్రీతి నొసఁగఁగ జన్మించినాఁడవు । నాకుఁ; గావునఁ బాండునందనుండ
వగుదు ధర్మస్థితి; నట్టి నీ వితరులఁ । గొలువ నేటికిఁ గురుకులవరేణ్య?

తే. ధర్మతనయాదులైన నీ తమ్ములకును । ధార్తరాష్ట్రులకును నీవ తగు విభుండ;
వేలు మీ లోకమెల్ల; నీ కేల రాధ । కొడు కితం డను తక్కువ? కొడుకుఁగుఱ్ఱ!' 59

ప్రతిపదార్థం: కొడుకుఁ గుఱ్ఱ!= ముద్దుకుమారా!; వినుము= ఆలకించుము; సూత+అన్వయంబునన్= సూతకులంలో; నీవు పుట్టుట= నీవు జన్మించటం; బొంకు= అబద్ధం; ఏను= నేను; మా కుంతి భోజు+ఇంటన్= మా తండ్రిఐన కుంతిభోజుడి గృహంలో; కన్నియనాఁడు= కన్యగా ఉన్నప్పుడు; భాస్కరునిన్= సూర్యభగవానుడిని; వరమంత్రబలమునన్= శ్రేష్ఠమైన మంత్రశక్తిచేత; రావించితిన్= చెంతకు రప్పించాను; అతఁడు వచ్చి= ఆ సూర్యుడు వచ్చి; నాకున్= నాకు; సంప్రీతిన్= సంతోషంతో; ఒసఁగంగన్= నిన్ను అనుగ్రహించగా; జన్మించినాఁడవు= పుట్టావు; కావునన్= కాబట్టి; ధర్మస్థితిన్= న్యాయపద్ధతితో; పాండు నందనుండవు= పాండురాజు కుమారుడవే; అగుదు(వు)= ఔతావు; అట్టి నీవు= అటువంటి నీవు; ఇతరులన్= అన్యులను;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కొలువన్+ఏటికిన్?= సేవించుటెందులకు?; కురుకులవరేణ్యా!= కురువంశంలో ఉత్తముడవైనపుత్రా!; ధర్మతనయ+ఆదులు+ అయిన= ధర్మజుడు మున్నుగా గల; నీ తమ్ములకును= నీ తమ్ములందరికీ; ధార్తరాష్ట్రులకును= దుర్యోధనాదులైన కౌరవులందరికీ; నీవు+అ= నీవే; తగు విభుండవు= తగిన రాజువు; ఈ లోకము+ఎల్లన్= ఈ జగమంతా; ఏలుము= పాలించుము; నీకున్= నీకు; ఇతండు రాధకొడుకు= ఈ కర్ణుడు రాధయొక్క కుమారుడు; అను తక్కువ= అనునట్టి హీనస్థితి; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: 'వత్సా! నా మాట వినుము. నీవు సూతకులంలో జన్మించినావనటం అబద్ధం. నేను మా తండ్రి కుంతి భోజుడి గృహంలో కన్యగా ఉన్నప్పుడు గొప్ప మంత్ర బలంతో భాస్కరుడిని నా చెంతకు రప్పించాను. ఆతడు వచ్చి సంతోషంతో అనుగ్రహించగా నీవు నాకు జన్మించావు. కావున ధర్మ ప్రకారం నీవు పాండురాజు కుమారుడివే. అట్లాంటి నీవు పరులసేవలో పడిఉండటం తగదు. నీవు కురువంశశ్రేష్ఠుడవు. ధర్మజాదులైన నీ తమ్ముళ్ళకూ, సుయోధనాదులైన కౌరవులకూ నీవు తగిన దొరవు గనుక, ఈ పుడమినంతా నీవే పాలించుము. కర్ణుడు రాధా తనయుడన్న హీనస్థితి నీ కెందుకు?'

క. **అని పలికిన యవసరమున । నినబింబములోన నుండి 'యిది నిజ మిట్టం**
గిన నెగడవన్న మేలగు' । నను వాక్యము వెడలెఁ గర్ణుఁ డాకర్ణింపన్. **60**

ప్రతిపదార్థం: అని పలికిన+అవసరమునన్= కుంతీదేవి అట్లా చెపుతున్న సమయంలో; కర్ణుఁడు+ఆకర్ణింపన్= కర్ణుడు వినేటట్లుగా; ఇన బింబములోనన్+ఉండి= సూర్యమండలంలో నుండి; ఇది నిజము= కుంతి చెప్పినది సత్యం; ఈ+భంగిన్+అ= ఆమె చెప్పిన రీతిలో మెలగి; నెగడవు+అన్న= వర్ధిలుమయ్యా; మేలు+అగున్= నీకు శ్రేయం కలుగుతుంది; అను వాక్యము వెడలెన్= అనే వచనం వినవచ్చింది.

తాత్పర్యం: కుంతీదేవి అట్లా అనగానే 'ఆమె చెప్పింది నిజం. నీవు ఆమె చెప్పినట్లు నడచుకొని వర్ధిల్లుము. ఇది నీకు మేలు' అనే వాక్యం కర్ణుడు వింటుండగా సూర్యబింబంలో నుండి వెలువడింది.

తే. **దాని వినియును నపుడు రాధాసుతుండు । దిరుగఁబడని మనంబుతో ధీరవృత్తిఁ**
దల్లి కిట్లను 'నీమాట తథ్యమగున । యైన నొక్కటి సెప్పెద నవధరింపు. **61**

ప్రతిపదార్థం: దానిన్= ఆ మాటను; వినియునున్= వినికూడ; అపుడు; రాధాసుతుండు= రాధ కొడుకు-కర్ణుడు; తిరుగన్+పడని+మనంబుతోన్= మరలని చిత్తంతో; ధీరవృత్తిన్= ధైర్యమునందు నిలుకడ కలిగినవాడై; తల్లికిన్= జననికి; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; నీ మాట తథ్యము= నీ వాడింది సత్యం; అగును+అ= అయినదే; ఐనన్= అయినప్పటికినీ; ఒక్కటి చెప్పెదన్= నేనొకమాట చెపుతాను; అవధరింపు= శ్రద్ధగా వినుము.

తాత్పర్యం: సూర్యుడు చెప్పిన మాట విని కూడ కర్ణుడు మారని మనస్సుతో ధైర్యం అవలంబించి తల్లితో ఇట్లా అన్నాడు: 'నీవు చెప్పింది సత్యమే అయినప్పటికీ నే నొకటి చెపుతాను. చిత్తగించుము.

క. **క్షత్రియ సంస్కారమునకుఁ । బాత్రముగా నీవు నన్నుఁ బాటింప విహా**
ముత్రఫలములకు నీ కేఁ । బుత్త్రుఁడ నని వచ్చుటింకఁ బోలునె చెపుమా? **62**

ప్రతిపదార్థం: క్షత్రియ సంస్కారమునకున్= క్షత్రియ కులోచితమైన జాతకర్మాది షోడశ కర్మలకు; పాత్రముగాన్= అర్హుడయ్యేటట్లు; నీవు= నీవు; నన్నున్= నన్ను; పాటింపవు= ఆదరించినదానవు కావు; నీకున్= అట్టి నీకు; ఇహ+అముత్ర ఫలములకున్= ఇహపరలోక కర్మఫలాలను కలిగించటానికి; ఏన్= నేను; పుత్త్రుఁడన్+అని+వచ్చుట= కుమారుడనని పేర్కొంటూ రావటం; ఇంకన్= ఇక; పోలునె చెపుమా!= తగునా? నీవే చెప్పుము.

తాత్పర్యం: క్షత్రియులకు తగిన సంస్కారాలకు నేను నోచుకొనేటట్లు నీవు చేయలేదు. ఇప్పుడు ఇహపరసుఖాలు కల్గించుట కొరకై నేను పుత్రుడనని నీ వెంట రావటం తగునా? నీవే చెప్పుము.

వ. సూర్యానుగ్రహంబునఁ జేసి నింద్యంబుగాక తక్కెనేనియు నా జన్మంబు పరమ రహస్యంబునై యున్నయది; దీనిఁ బ్రకాశంబు చేయుట మనకెంత మే? లట్లుంగాక. 63

ప్రతిపదార్థం: సూర్య+అనుగ్రహంబునన్+చేసి= సూర్యుడి ప్రసాదంవలన; నింద్యంబు+కాక+తక్కెన్+ఏనియున్= దూషించదగినది కాకపోయినప్పటికిన్నీ; నా జన్మంబు= నా పుట్టుక; పరమ రహస్యంబున్+ఐ+ఉన్న+అది= మిక్కిలి గూఢంగా ఉన్నది; దీనిన్= నా జన్మాన్ని; ప్రకాశంబు చేయుట= వెల్లడి చేయటం; మనకున్+ఎంత మేలు?= మనకు ఏమాత్రం మేలు?; అట్లున్+కాక= అంతేకాక.

తాత్పర్యం: సూర్యభగవానుని ప్రసాదంచేత నా జన్మ దూషించదగినది కానప్పటికీ పరమ రహస్యంగా ఉన్నది. దీనిని ఈనాడు వెల్లడి చేయటం మనకేమంత మంచిది? (మంచిది కాదని భావం). అదీకాక.

ఆ. విజయు విక్రమంబు విఖ్యాతమై యుండ । 'నేను గుంతికొడుక భానుజుండ'
ననుచు నతనిఁ గూడ నరిగిన నతనికి । వెఱచి పోయె ననరె? వేయు నేల? 64

ప్రతిపదార్థం: విజయు విక్రమంబు= అర్జునుడి పరాక్రమం; విఖ్యాతము+ఐ+ఉండన్= ప్రసిద్ధమైఉండగా; నేను; కుంతి కొడుకన్= కుంతీదేవి పుత్రుడను; భానుజుండన్= సూర్యుడి అనుగ్రహంతో జన్మించినవాడిని; అనుచున్= అని చెప్పికొంటూ; అతనిన్= అర్జునుడిని; కూడన్+అరిగినన్= కలియటానికి వెళ్ళితే; అతనికిన్= ఆ పార్థుడికి; వెఱచి పోయెన్= కర్ణుడు భయపడి అతడిని చేరబోయాడు; అనరె?= అని లోకులు పలుకరా?; వేయున్+ఏల?= ఇక పలుమాట లెందుకు?

తాత్పర్యం: పలుమాటలెందుకు? పార్థుడి పరాక్రమం ప్రసిద్ధమైఉండగా 'నేను కుంతీతనయుడిని, భానుడి వరప్రసాదం వల్ల జనించిన వాడిని' అని చెప్పుకొంటూ అతడిని చేరబోతే, లోకులు నన్ను భయపడి పాండవులను చేరబోయాడని అనక మానరు.

క. కడిఁది పగఱ నేఁ దెప్పగఁ । గడవంగా నీఁదఁదలఁచు కౌరవనాథుం
జెడుఁ గాక యంచు నిత్తఱి । విడువఁదగునె? యతని వలన వెలసిన వాఁడన్. 65

ప్రతిపదార్థం: కడిఁది పగఱన్= సాధించరాని శత్రువులను (దుస్తర శత్రువులనే సముద్రాన్ని); నేన్= నేను; తెప్పగన్= నౌకగా; కడవంగాన్+ఈఁదన్+తలఁచు= ఈది గట్టుచేరనెంచే; కౌరవనాథున్= దుర్యోధనుడిని; చెడున్+కాక+అంచున్= నాశనం కానిమ్మని; ఈ+తఱిన్= అక్కర గలిగిన ఈ సమయంలో; అతని వలనన్= కురుపతి వలన; వెలసినవాఁడన్= ప్రసిద్ధిగాంచిన వాడనైన నేను; విడువన్+తగునె?= వదలిపెట్టటం భావ్యమా?

తాత్పర్యం: దుస్తర విరోధులనే సముద్రాన్ని నన్ను తెప్పగా చేసికొని ఈది గట్టు చేరవలెననే విశ్వాసంతో ఉన్న ఆ కురుపతిని అవసర సమయంలో వదలివేయటం నాకు ధర్మం కాదు. ఆయన వల్లనే నేను ప్రసిద్ధి కెక్కాను.

క. కౌరవులచేతఁ గుడిచిన । వారికి నిది సమయ; మెట్టివారును సంగ్రా
మారంభంబునఁ బాయుదు । రే? రాజులు మనలఁ దిట్టరే యట్లయినన్. 66

ప్రతిపదార్థం: కౌరవులచేతన్= కౌరవులవలన; కుడిచిన వారికిన్= మనుగడ సాగిస్తున్నవారికి; ఇది సమయము= సాయపడటానికి ఇది తగిన వేళ; ఎట్టివారును= ఎంత కృతఘ్నులైనా; సంగ్రామ+ఆరంభంబునన్= యుద్ధ ప్రారంభంలో; పాయుదురే?= వీడుదురా?; అట్లు+అయినన్= అట్లా చేస్తే; మనలన్= మనలను; రాజులు= ప్రభువులు; తిట్టరే?= దూషించరా?

తాత్పర్యం: కౌరవుల తిండి తిని జీవిస్తున్నవారు వారికి సాయపడటానికి ఇది తగిన సమయం. ఎంత విశ్వాసం లేనివారైనా యుద్ధం మొదలయ్యేటప్పుడు తమ పక్షాన్ని వదలి వస్తారా? ఇట్లా చేస్తే తోడ్పాటు చూపవచ్చిన రాజులు మనలను నిందించరా?

వ. ఏ నవశ్యంబును దుర్యోధనునకై నీకొడుకులతోడం బెనంగుదు. 67

ప్రతిపదార్థం: ఏను= నేను; అవశ్యంబును= తప్పక; దుర్యోధనునకై= సుయోధనుడి కొరకు; నీ కొడుకుల తోడన్; పెనంగుదున్= పోరాడతాను.

తాత్పర్యం: నేను దుర్యోధనుడి కొరకు తప్పక నీ కుమారులతో పోరాడుతాను.

ఉ. నీ పలు కెంత వోలినను నిర్ణయ మిట్టిద కాని యొండు లేః
దీపని మీఁది భారమున నీ విట వచ్చితిగాన పాండవుల్
సేపడిరేనిఁ జంప; నఱసేయక చెప్పెద సవ్యసాచిపైఁ
గోపము పెద్ద; వాఁడు సమకూరిన బిట్టఱఁ జంపుదుం జుమీ! 68

ప్రతిపదార్థం: నీ పలుకు+ నీ వచనము; ఎంత పోలినను= ఎంత తగియున్నను; నిర్ణయము= నా నిశ్చయము; ఇట్టిది+అ కాని+ఒండులేదు= ఇదేగాని మరియొకటికాదు; ఈ పనిమీఁది భారమునన్= ఈ కార్యభారం వహించి; ఈవు= నీవు; ఇటవచ్చితి(వి)= ఇక్కడికి వచ్చావు; కాన= కనుక; పాండవుల్= ధర్మజాదులు; చేపడిరేనిన్= నా చేతికి దొరకినా; చంపన్= సంహరించను; అఱ చేయక చెప్పెదన్= కపటం లేకుండా పలుకుతున్నాను; సవ్యసాచిపైన్= అర్జునుడి మీఁద; కోపము పెద్ద= నాకు మిక్కిలి కోపం; వాఁడు= అతడు-అర్జునుడు; సమకూరినన్= లభిస్తే; బిట్టఱన్= శీఘ్రంగా; చంపుదున్+చుమీ!= సంహరిస్తాను సుమా!

తాత్పర్యం: నీ మాట ఎంత ధర్మయుక్తంగా ఉన్నప్పటికీ నా నిశ్చయమింతే. ఇక మారదు. నీవు ఈ కార్యభారం మీద నా దగ్గరకు వచ్చావు. కపటం లేక చెపుతున్నాను. ధర్మజాదులు నా చేతికి దొరకితే నేను వారిని చంపను. అర్జునుడి మీద నాకు క్రోధం మెండు. వాడు తటస్థపడితే మాత్రం చంపి తీరుతాను.

ఆ. సవ్యసాచిచేతఁ జచ్చుటయును గీర్తి । కరమ యతఁడు లోనుగాఁగ నేవు
రేను లోనుగాఁగ నేవురుగాని నీ । కొడుకు లార్వురనుట విడువు'మింక. 69

ప్రతిపదార్థం: సవ్యసాచి చేతన్= అర్జునుడిచేత; చచ్చుటయును= మరణించటం కూడ; కీర్తికరము+అ= నాకు యశస్సునే కలిగిస్తుంది; అతఁడు లోను+కాఁగన్= అతనితో కూడ; ఏవురు= నీకు ఐదుమందే; ఏను లోనుగాఁగన్= అతడు పోతే నాతో కూడ; ఏవురు+కాని= ఐదుమందే తప్ప; నీ కొడుకులు= నీ తనయులు; ఆర్వురు+అనుట= ఆరుమంది అనటం; ఇంకన్+ విడువుము= ఇక మానుము.

తాత్పర్యం: అర్జునుడి చేతిలో నేను చావటం కూడ కీర్తికరమే. నేను పోయినప్పుడు అతడితో కూడ నీకు ఐదుమందే కొడుకులు. అతడు పోతే నాతో కూడ నీకు ఐదుమందే అవుతారు గాని, ఆరుమంది కొడుకు లనటం ఇక మానుకొమ్ము!'

చ. **అనుటయు నప్డు గొంతి హృదయంబున శోకము నివ్వటిల్ల ని**
ట్లను 'నిది దైవసంఘటన మక్కట! యెట్లును దప్ప నేర్చునే?
యనుపమ సత్యవిస్ఫురణ నాడినమాట మఱకుమన్న! నీ
యనుజుల నల్వురం గడపు; మర్జునుఁ జేతకు సమ్మతించితిన్. **70**

ప్రతిపదార్థం: అనుటయున్= అని కర్ణుడు పలుకగా; అప్డు= ఆ వేళ; గొంతి= కుంతీదేవి; హృదయంబునన్= మదిలో; శోకము నివ్వటిల్లన్= దుఃఖం నిండగా; ఇట్లు+అనున్= ఈ తీరున పల్కింది; ఇది దైవ సంఘటనము= ఇది భగవన్నిర్ణయం; ఎట్లును= ఏ రీతిగానైనా; తప్పన్+నేర్చునే?= తప్పిపోదుగదా!; అనుపమ సత్య విస్ఫురణన్= సాటిలేని సత్యం తోచేటట్లు; ఆడిన మాట= పలికిన పలుకు; మఱకుము+అన్న!= వత్సా! మరచిపోవద్దు; నీ+అనుజులన్+నల్వురన్= నీ తమ్ములు నలుగురినీ; కడపుము= వదలిపెట్టుము; అర్జునున్+చేఁతకున్= పార్థుడి విషయంలో నీవు చేసే చేతకు; సమ్మతించితిన్= ఒప్పుకొన్నాను.

తాత్పర్యం: కర్ణు డట్లా పలుకగా కుంతి హృదయంలో దుఃఖమతిశయించగా ఇట్లా అన్నది: 'ఇది భగవత్సంకల్పం. ఎట్లాగూ దీనిని తప్పించ శక్యం కాదు. నీవు సాటిలేని సత్యం ప్రకాశించేటట్లు పలికిన పలుకులు మరచిపోవద్దు. నీ నలుగురు తమ్ములను చంపక వదలి పెట్టుము. యుద్ధం చేసి అర్జునుడిని సంహరించటానికి నేను అంగీకరించాను.'

ఆ. **అనుచుఁ గౌఁగిలింప నర్కజుం 'డట్ల కా'। కని ప్రియంబు మెఱయ వినతుఁ డైన**
నరిగె సదనమునకు నద్దేవి; యతఁడును। జనియె నిజనివాసమునకుఁ బ్రీతి. **71**

ప్రతిపదార్థం: అనుచున్= అని; కౌఁగిలింపన్= ఆలింగనం చేసికోగా; అర్కజుండు= సూర్యసూతి; అట్లకాక+అని= అట్లేఅని; ప్రియంబు మెఱయన్= ప్రేమ ప్రకాశించేటట్లు; వినతుఁడు+ఐనన్= నమస్కరించగా; ఆ దేవి= కుంతీదేవి; సదనమునకున్= తన నివాసానికి; అరిగెన్= వెళ్ళింది; అతఁడును= ఆ రాధేయుడు కూడ; నిజనివాసమునకున్= తన మందిరానికి; ప్రీతిన్= సంతోషంతో; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: కుంతీదేవి ఆవిధంగా పలికి కర్ణుడిని కౌగిలించుకొన్నది. అతడు 'అలాగే' అని పలికి, ప్రేమతో ఆమెకు నమస్కరించాడు. తరువాత వారిద్దరూ తమ తమ నివాసాలకు సంతోషంతో వెళ్ళిపోయారు.

వ. **అక్కడ వాసుదేవుం డుచిత ప్రయాణంబుల నుపప్లావ్యంబునకుం జని ధర్మతనయుచేతం బూజితుండయి, భీమసేనాదులు విరాట ద్రుపదముఖ్యులగు తగువారలుఁ దన్నుం గాంచిన వారినెల్ల నభినందించి, కొలువున నుండి యుధిష్ఠిరుతో నిట్లనియె.** **72**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అక్కడ; వాసుదేవుండు; ఉచిత ప్రయాణంబులన్= తగిన పయనములతో; ఉపప్లావ్యంబునకున్+చని= పాండవులున్న ఉపప్లావ్యపురికి వెళ్ళి; ధర్మతనయుచేతన్; పూజితుండు+అయి= పూజింపబడినవాడై; భీమసేన+ఆదులు= భీముడు మొదలైనవారు; విరాట ద్రుపద ముఖ్యులు+అగు= విరాట మహారాజు, ద్రుపద మహారాజు మొదలైన; తగువారలున్= అర్హులైనవారునూ; తన్నున్+కాంచినన్= తనను దర్శించగా; వారిన్+ఎల్లన్= వారినందరినీ; అభినందించి= ప్రశంసించి; కొలువునన్+ఉండి= సభలో నుండి; యుధిష్ఠిరుతోన్= ధర్మజుడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు తగిన ప్రయాణాలతో హస్తినాపురి నుండి కదలి ఉపప్లావ్యానికి వచ్చి అక్కడ ధర్మజుడి పూజలందుకొన్నాడు. భీముడు మొదలైనవారు, విరాటుడు ద్రుపదుడు మున్నగు అర్హులైనవారు తనను దర్శించగా, వారినందరినీ మెచ్చుకొన్నాడు. సభలో ఆసీనుడై ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

తే. **'ధార్తరాష్ట్ర లున్మత్తులు; తగిన పలుకు । లేల విని సంధి సేయుట కిచ్చగింతు?**
రెదిరిఁ దమ్మును నెఱిఁగిర యేని వార । లంత లంతలు చేయుదు రయ్య నాఁడు?' **73**

ప్రతిపదార్థం: ధార్తరాష్ట్రులు= దుర్యోధనాదులు; ఉన్మత్తులు= మదం చేత కన్ను మిన్ను కాననివారు; తగిన పలుకులు= అనుకూలాలైన మాటలు; ఏల విని= ఎందులకు ఆలకించి; సంధి చేయుటకున్= సంధి చేయటానికి; ఇచ్చగింతురు?= అంగీకరిస్తారు?; ఎదిరిన్= ఎదుటివారి శక్తినీ; తమ్మును= తమ శక్తినీ; ఎఱిఁగిరి+అ+ఏనిన్= తెలిసినవారే అయితే; నాఁడు= జూదమాడేవేళ; అంతలు+అంతలు= అంతంత నీచకృత్యాలు; చేయుదురు+అయ్య!= చేసేవారా?

తాత్పర్యం: దుర్యోధనాదులు పొగరుతో కన్నుమిన్ను కానకున్నారు. న్యాయంగా మాటాడే మాటలు విని సంధి చేయటానికి వారెందు కంగీకరిస్తారు? తమ బలం, ఎదిరి బలం ఎరిగినవారైతే వారు ఆనాడు సభలో అంతంత నీచకృత్యాలకు పాల్పడుతారా?'

వ. **అని యెల్లవారును వినఁ దనపోయివచ్చిన కార్యంబు తెఱంగెఱింగించి, పథిశ్రమంబు పుచ్చువాఁడయి పుండరీకాక్షుండు నిజమందిరంబున కరిగె; నాఁటి రాత్రి ధర్మనందనుం డనుజ సహితంబుగా నుచిత ప్రదేశంబున నుండి గోవిందుని రావించి 'నీవు సుయోధనునితోఁ బలికిన చందం బెయ్యది? యతండేమి విధంబున నుత్తరంబిచ్చె?' నని యడిగిన నచ్యుతుఁ డిట్లనియె.** **74**

ప్రతిపదార్థం: అని; ఎల్లవారును= సభలో ఉన్నవారంతా; వినన్= ఆలింపగా; తన పోయి వచ్చిన కార్యంబు తెఱంగు= తాను హస్తినాపురికి వెళ్ళివచ్చిన విషయమంతా; ఎఱింగించి= తెలిపి; పథిశ్రమంబు పుచ్చువాఁడు+అయి= దారి బడలిక తొలగించుకొనటానికి; పుండరీక+అక్షుండు; నిజమందిరంబునకున్= తన నివాసానికి; అరిగెన్= వెళ్ళాడు; నాఁటి రాత్రి= ఆ రేయి; ధర్మనందనుండు; అనుజసహితంబుగాన్= తమ్ముళ్ళతో కూడి; ఉచిత ప్రదేశంబునన్+ఉండి= తగిన ప్రదేశంలో చేరి; గోవిందునిన్ రావించి= ముకుందుడిని రప్పించుకొని; నీవు సుయోధనునితోన్ పలికిన; చందంబు= విధం; ఏ+అది?= ఎట్టిది?; అతండు+ఏమి, విధంబునన్; ఉత్తరంబు+ఇచ్చెన్= బదులు చెప్పాడు?; అని; అడిగినన్; అచ్యుతుఁడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అక్కడున్న వారంతా వింటుండగా తాను హస్తినాపురికి వెళ్ళి వచ్చిన పని తీరంతా తెలిపి, దారి బడలిక తొలగించు కొనేందుకు, కమలాక్షుడు తన నివాసానికి వెళ్ళాడు. ఆనాటి రాత్రి ధర్మరాజు తమ్ముళ్ళతో తగిన ప్రదేశంలో ఉండి ముకుందుని అక్కడికి రప్పించి 'నీవు దుర్యోధనుడితో అక్కడ ఏమి మాట్లాడావో, అందుకు అతడు ఏమి సమాధానం చెప్పాడో తెల్పవలసిం'దని కోరాడు. అందుకు శౌరి ఇట్లు అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీకృష్ణుఁడు ధర్మరాజునకుఁ గౌరవసభం బుట్టిన విశేషంబు దెలుపుట (సం. 5-145-1)

క. 'కయ్యము గాని తెఱంగున । నెయ్యంబగు నట్లుగాఁగ నెఱిఁ బలికితి నే
నెయ్యది సుఖంబు పథ్యం । బెయ్యది యరయంగఁ దథ్య మెయ్యది దానిన్. 75

ప్రతిపదార్థం: కయ్యము కాని తెఱంగునన్= యుద్ధం జరుగని విధంగా; నెయ్యంబు+అగునట్లు కాఁగన్= స్నేహం కలిగేటట్లుగా; ఎయ్యది సుఖంబు= ఏది సుఖం చేకూరుస్తుందో; పథ్యంబు+ఎయ్యది= ఏది హితకరమో; తథ్యము+ఎయ్యది?= సత్యమైనదేదో; దానిన్= దానిని; అరయంగన్= వారు తెలిసికొనేటట్లుగా; నేను= నేను; నెఱిన్+పలికితిన్= న్యాయంగా వచించాను.

తాత్పర్యం: 'ధర్మజా! వారికీ మీకూ యుద్ధం జరుగకుండేటట్లు, స్నేహం కలిగేటట్లు, ఏది ఉభయులకు సుఖం కలిగిస్తుందో, ఏది మేలు చేస్తుందో, ఏది సత్యమైనదో దానిని వారికి విస్పష్టంగా తెలిసేటట్లు న్యాయం తప్పక వచించాను.

తే. బహు విధంబులఁ బలుకు నా పలుకు లెల్లఁ । జీఁదక న్నిడి తన పెడచెవులఁ బెట్టి
యీఱతాఱలు మఱుమాట లిచ్చి యపహ । సించె; దుర్యోధనుఁడు వేయుఁ జెప్పనేల?' 76

ప్రతిపదార్థం: బహు విధంబులన్= అనేక రీతుల; పలుకు నా పలుకులు+ఎల్లన్= చెప్పిన నా మాట లన్నింటినీ; చీఁదకన్ను+ఇడి= (చిందపక్షివలె) ఆవేశపూరితమైన చూపులతో చూస్తూ; తన పెడచెవులన్+పెట్టి= తన చెవి వెనుక భాగాన ఇడి - (అనగా తన చెవులలో చొరనీయక); ఈఱతాఱలు= వక్రములైనట్టి; మఱుమాటలు+ఇచ్చి= బదులుపలుకులు పలికి; దుర్యోధనుఁడు= కురురాజు; అపహసించెన్= పరిహాసం చేశాడు; వేయున్+చెప్పన్+ఏల?= ఇక పలుమాటలతో ప్రయోజన మేముంది?

తాత్పర్యం: అనేక విధాల పలుకుతున్న నా పలుకులన్నీ చీదకన్నువేసి చూస్తూ తన చెవులలో చొరనీయక వంకర జవాబులు చెపుతూ దుర్యోధనుడు నన్ను గేలి చేశాడు. అత డాడిన మాటలు మీకు చెప్పి లాభ మేముంది?'

విశేషం: చీఁదకన్నిడి - చీఁద కనువడి (మున్నంగి శర్మపాఠం) - శ్రద్ధలేని దృష్టి పెట్టి - సరిగా చూడక. దీనికి మూలం. "మయా నాగపురం గత్వా సభాయాం ధృతరాష్ట్రజః తథ్యం పథ్యం హితం చోక్తో న చ గృహ్ణాతి దుర్మతిః" నచ గృహ్ణాతి - అనేదానికి తిక్కన తెలుగు 'చీఁద కన్నిడి.'

క. అనిన విని ధర్మజుం డి । ట్లను 'నప్పుడు తండ్రి యుచిత మాడఁడె? భీష్ముం
డును గురుఁడు విదురుఁడుం ద । క్కిన పెద్దలుఁ బలుకరే తగిన చందమునన్? 77

ప్రతిపదార్థం: అనినన్ విని= శ్రీకృష్ణుడు అట్లా పలుకగా; ఆలించి= విని; ధర్మజుండు= ధర్మరాజు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అప్పుడు= దుర్యోధనుడు అట్లా మాటాడుతున్న సమయంలో; తండ్రి= ధృతరాష్ట్రుడు; ఉచితము+ఆడఁడు+ఎ= యుక్తముగా చెప్పలేదా? భీష్ముండును, గురుఁడున్, విదురుఁడున్= ఈ ముప్పురున్నూ; తక్కిన పెద్దలున్= సభలో పెద్దలైన ఇతరులును; తగిన చందమునన్= తగిన రీతిని; పలుకరే?= మాటాడలేదా?

తాత్పర్యం: శ్రీకృష్ణుడి పలుకులు విని ధర్మజు డిట్లా అన్నాడు: 'గోవిందా! దుర్యోధనుడు అట్లా వంకర మాట లాడుతున్నవేళ ధృతరాష్ట్రుడు సముచితంగా పలుకలేదా? భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, సభలోనున్న ఇతరులైన పెద్దలు తగిన విధంగా మాటాడలేదా?

క. నావుడు హరి యిట్లను 'స । ద్భావమున విచిత్రవీర్యతనయుఁడుఁ దగ నా
నా విధములఁ జెప్పిన సం । భావన వినఁ డతఁడు, పలుకుఁ బ్రతికూలంబుల్. 78

ప్రతిపదార్థం: నావుడున్= ధర్మజుడట్లా అడుగగా; హరి= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; సత్+భావమునన్= మంచి తలంపుతో; విచిత్రవీర్య తనయుఁడున్= విచిత్రవీర్యుడి కుమారుడైన ధృతరాష్ట్రుడు; తగన్= ఒప్పుగా; నానా విధములన్= పలురీతుల; చెప్పినన్= చెప్పినప్పటికిన్నీ; సంభావనన్= ఆదరంతో; అతఁడు= సుయోధనుడు; వినఁడు= ఆలకించలేదు; ప్రతికూలంబుల్= అనుకూలాలు కాని మాటలు; పలుకున్= పలికాడు.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా ప్రశ్నించగా శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు. 'మంచి మనసుతో ధృతరాష్ట్రుడు చక్కగా, పలు విధాల చెప్పినప్పటికీ ఆ మాటలను ఆదరంతో దుర్యోధనుడు విన్నవాడు కాడు. అందుకు విరుద్ధంగానే పలికాడు.

సీ. శంతను పుణ్యవంశం బంకురించిన । చందంబు, నంబికానందనుండు
జాత్యంధుఁడై యుండ సామ్రాజ్యమంతయుఁ । బాలించి పాండునృపాలుఁ డతనిఁ
గొలిచి యుండుటయును, గురుకులంబున కెల్ల । దేజంబుగా మీరు దిగ్విజయము
సేసి కావించిన సిరి వారు వంచనఁ । గొనుటయు, సత్య మకుంఠితముగ

తే. నీవు సమయంబు నడపిన నెఱియుఁ దండ్రి । పాలు మీకు నీఁదగుటయుఁ, బాడిలేమి
నరయఁ జెడుదురు కౌరవు లనియుఁ, బెద్ద । లెల్లఁ జెప్పిరి మొగమోట యింతలేక. 79

ప్రతిపదార్థం: శంతను పుణ్యవంశంబు= శంతను మహారాజుయొక్క పవిత్రమైన వంశం; అంకురించిన చందంబు= మొలకెత్తిన విధం; అంబికా నందనుండు= అంబిక యొక్క కుమారుడైన ధృతరాష్ట్రుడు; జాత్యంధుఁడై+ఉండెన్= పుట్టుగ్రుడ్డియై ఉండగా; పాండు నృపాలుఁడు= తమ్ముడైన పాండురాజు; సామ్రాజ్యము+అంతయున్+పాలించి= సామ్రాజ్యము నెల్ల ఏలుతూ; అతనిన్= పుట్టుగ్రుడ్డియైన అన్నను; కొలిచి+ఉండుటయున్= సేవిస్తూ ఉండటం; కురు కులంబునకున్+ఎల్లన్= కౌరవ వంశమున కంతటికినీ; తేజంబుగాన్= వన్నె కలుగునట్లుగా, మీరు= మీరలు; దిక్+విజయము చేసి= దిక్కులను జయించి; కావించిన సిరిన్= గడించిన సంపదను; వారు= దుర్యోధనాదులు; వంచనన్+కొనుటయున్= మోసముతో హరించుటయునూ; సత్యము+అకుంఠితముగన్= సత్యము మొక్క పోకుండ; నీవు= నీవు; సమయంబు నడపిన నెఱియున్= ప్రతిజ్ఞాకాలం పదమూడేండ్లు చెల్లించిన క్రమమునూ; తండ్రి పాలు= మీ జనకుని రాజ్యభాగం; మీకున్= మీకు; ఈన్+తగుటయున్= ఇచ్చుట ధర్మమనియూ; పాడిలేమిన్= న్యాయము తమ పట్ల లేనందున; అరయన్= ఆలోచించి చూచినట్లయితే; కౌరవులు+ చెడుదురు+అనియున్= దుర్యోధనాదులు పాడైపోతారనియూ; మొగమోట= దాక్షిణ్యము; ఇంతలేక= రవంతయు లేకుండ; పెద్దలు+ఎల్లన్= సభలోని పెద్దవారంతా; చెప్పిరి= దుర్యోధనునకు తెల్పినారు.

తాత్పర్యం: శంతను మహారాజు పవిత్ర వంశం అంతరించకుండ చిగిరించిన క్రమం, ధృతరాష్ట్రుడు పుట్టుగ్రుడ్డియై ఉండగా పాండురాజు సామ్రాజ్యమంతటినీ తానే పరిపాలిస్తూ అంధుడైన అన్నను భక్తితో కొలిచి ఉండటం, కురువంశానికెల్ల వన్నె కలిగేటట్లు మీరు దిక్కులన్నీ జయించి గడించిన సంపదనంతా కపటద్యూతంలో వారు అపహరించటం, సత్యం తప్పక నీవు ప్రతిజ్ఞాకాలం పదమూడేండ్లు ధర్మయుక్తంగా గడపడం, మీ తండ్రి పుడమి

పాలు మీకు ఇవ్వదగిఉండటం, న్యాయం వదలి మీ రాజ్యభాగం కూడ హరించదలిస్తే, కౌరవులందరూ నాశనమవుతారని సభలోని పూజ్యులంతా మోమోటపడకుండా చెప్పారు.

క. అలయక యందఱుఁ జెప్పం । గల యంతయుఁ జెప్పి; రతఁడు కటకటఁబడి య
క్కొలువు వెడలి పోయెం ద । మ్ములుఁ గర్ణుఁడు రాజలోకముం దో నరుగన్. 80

ప్రతిపదార్థం: అలయక= విసుగు చెందక; అందఱున్= సభలోని పూజ్యులందరూ; చెప్పన్+కల+అంతయున్= తాము చెప్పగలిగినదంతా; చెప్పిరి= చెప్పారు; అతఁడు= సుయోధనుడు; కటకటన్+పడి= వారి హితబోధకు కలతచెందుతూ; తమ్ములన్= దుశ్శాసనాదులూ; కర్ణుఁడున్= రాధేయుడూ; రాజలోకమున్= యుద్ధానికి సాయపడవచ్చిన రాజుల సమూహం; తోన్+అరుగన్= వెంటరాగా; ఆ+కొలువు వెడలిపోయెన్= ఆ సభనుండి నిష్క్రమించాడు.

తాత్పర్యం: సభలోని పెద్దలంతా ఏమాత్రం విసుగుకొనకుండ చెప్పవలసినదంతా చెప్పనే చెప్పారు. కాని, దుర్యోధనుడు వారి మాటలకు సంకటపడుతూ, తమ్ముళ్ళూ, కర్ణుడూ, యుద్ధంలో తనకు సాయపడటానికి వచ్చిన రాజులూ తన్ను అనుసరించగా సభనుండి లేచి వెళ్ళాడు.

వ. ఇట్లు కొడుకు ముష్కరుండై యరిగిన ధృతరాష్ట్రుండు గాంధారి రావించి. 81

ప్రతిపదార్థం: ఇట్లు; కొడుకు; ముష్కరుండు+ఐ= కుటిలుడై; అరిగినన్= వెళ్ళగా; ధృతరాష్ట్రుండు; గాంధారినిన్; రావించి-

తాత్పర్యం: ఇట్లా కుటిలబుద్ధితో కొడుకు సభలోనుండి లేచి వెళ్ళగా, ధృతరాష్ట్రుడు గాంధారిని కొలువుకూటానికి పిలిపించి.

క. తగ విదురుఁ బంచి యాతని । మగుడఁగఁ బిలిపించె; నా యమయుఁ దనయునకున్
వగయును గూర్మియు వెరవును । మిగిలిన వచనముల సంధి మెయికొనఁ జెప్పెన్. 82

ప్రతిపదార్థం: తగన్= ఒప్పుగా; విదురున్+పంచి= విదురుడిని పంపి; ఆతనిన్= సుయోధనుడిని; మగుడఁగన్= మరల; పిలిపించెన్= సభకు రప్పించాడు; ఆ+అమయున్= ఆ గాంధారీదేవి కూడ; తనయునకున్= తన కుమారుడికి; వగయును= దుఃఖాన్నీ; కూర్మియున్= ప్రేమనూ; వెరవును= జీవనోపాయాన్నీ; మిగిలిన= అతిశయించిన; వచనములన్= వాక్కులచేత; సంధి మెయికొనన్+చెప్పెన్= సంధికి అంగీకరించేటట్లు చెప్పింది.

తాత్పర్యం: అటు పిమ్మట ధృతరాష్ట్రుడు విదురుడిని పంపి దుర్యోధనుడిని మరల సభకు పిలిపించాడు. గాంధారి తన కుమారుడు సంధికి సమ్మతించేటట్లు తన మాటలలో శోకం, ప్రేమ, ఉపాయం నెలకొనగా చెప్పింది.

వ. ఎవ్వ రెంత సెప్పినను గైకొనక కడంగి దుర్యోధనుండు దనకుం గలవారల నెల్లను గురుక్షేత్రంబునకు నడవుండని చెప్పంబనిచె; భీష్ముని సేనా ముఖంబు సేసికొని యెత్తి విడియం గలవాఁ; డిది ధార్తరాష్ట్రుల నిశ్చయం; బేనును నా యోపినంత సామవాదంబు లాడితి; నారదాది మహామునులను సుయోధనునకు బుద్ధులు సెప్పనట్లు సేసితి; నేమి చెప్పినను నెంతటం బోకున్నం గినుక దెచ్చికొని జంకించియు భంగించియు ధిక్కరించియుఁ దృణీకరించియుం జూచితిఁ గార్యంబు భగ్నంబగుట కొల్లక వెండియు శాంత వచనంబులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వలికితి; నతం డశక్త దుర్జనత సేయం జూచిన నమానుషంబు లగువానిం గొన్ని వెడమాయలం బన్ని పెక్కుపోకలం బోయితి నెన్ని భంగుల సంధియ కావలయునని పొరలంగలయంతయుంబొరలితి; నప్పాపాత్ముం డెట్లునుం జక్కంబడక తన చలంబుతోన పొట్టుపొరలయ్యుఁ గయ్యంబు వొడుచుంగాని, యవశ్యంబును రాజ్యంబు పాలిచ్చు వాఁడు గాఁడు; కౌరవుల యెడ దండంబు దక్క నొం డుపాయంబు లేదు; మీకుం బోలిన తెఱంగు సేయుం' డనిన ధర్మతనయుండు తమ్ములం గనుంగొని యిట్లనియె: 83

ప్రతిపదార్థం: ఎవ్వరు ఎంత చెప్పినను; కైకొనక= ఆదరించక; కడంగి= పూనుకొని; దుర్యోధనుండు; తనకున్+కలవారలన్+ ఎల్లను= తనకున్నవారి నందరినీ; కురుక్షేత్రంబునకున్; నడవుండు+అని= తరలి వెళ్ళండని; చెప్పన్+పనిచెన్= చెప్పి పంపాడు; భీష్ముని; సేనాముఖంబు చేసికొని= సేనల యొక్క అగ్రభాగమునం దుంచుకొని; ఎత్తి విడియన్+కలవాఁడు= యుద్ధానికి సైన్యంతో దిగుతాడు; ఇది ధార్తరాష్ట్రుల నిశ్చయంబు= ఇది కౌరవుల నిర్ణయం; ఏనును= నేను కూడ; నా+ఓపిన+అంత= నాకు శక్తిగల్గిన మేరకు; సామవాదంబులు+ఆడితిన్= హితవచనాలు పలికాను; నారద+ఆది మహామునులను= నారదుడు మున్నగు మహర్షులను కూడ; సుయోధనునకున్; బుద్ధులు చెప్పునట్లు చేసితిన్= నీతులు చెప్పేటట్లు చేశాను; ఏమి చెప్పినను; ఎంతటన్+పోక+ఉన్నన్= ఏ దారికీ రాకుండగా; కినుక తెచ్చికొని= కోపం వహించి; జంకించియున్= బెదిరించియు; భంగించియున్= అవమానించియు; ధిక్కరించియున్= తిరస్కరించియు; తృణీకరించియున్= అలక్ష్యం చేసియు; చూచితిన్= పనిని సాధించ యత్నించాను; కార్యంబు భగ్నంబు+అగుటకున్= పని చెడటానికి; ఒల్లక= ఇష్టపడక; వెండియున్= మరల; శాంత వచనంబులు పలికితిన్= ప్రసన్న వాక్యాలాడాను; అతండు= సుయోధనుడు; అశక్త దుర్జనత+చేయన్+చూచినన్= తనకు శక్తి లేనందున దౌర్జన్యానికి పూనుకోగా; అమానుషంబులు+అగువానిన్= మానవాతీతాలైనట్టి; కొన్ని వెడమాయలన్+పన్ని= కొన్ని వింత మాయలు కల్పించి; పెక్కుపోకలన్+పోయితిన్= పలుభంగుల ప్రవర్తించాను; ఎన్ని భంగులన్= సర్వవిధాలా; సంధి+అ కావలయున్+అని= సంధి యే పొసగవలెనని; పొరలన్+కలయంతయున్+పొరలితిన్= ఎంతవరకు పాటుపడాలో అంతవరకూ పాటుపడ్డాను; ఆ+పాప+ఆత్ముండు= ఆ దురితచిత్తుడు; ఎట్లునున్= ఏ విధంగానూ; చక్కంబడక= దారికి రాక; తన చలంబుతోన్+అ= తన మాత్సర్యంతోనే; పొట్టుపొరలు+అయ్యున్= పీడితుడైనప్పటికిన్నీ; కయ్యంబు పొడుచున్+కాని= యుద్ధం సల్పునేగాని; అవశ్యంబును= తప్పకుండా; రాజ్యంబు+పాలు+ఇచ్చువాఁడు కాఁడు= రాజ్యంలో భాగమివ్వడు; కౌరవుల ఎడన్= కౌరవుల పట్ల; దండంబు తక్కన్= దండోపాయము తప్ప; ఒండు= మరొక; ఉపాయంబు లేదు; మీకున్+పోలిన తెఱంగు చేయుండు= మీకు అనుకూలమైన మార్గాన్ని అనుసరించండి; అనినన్; ధర్మతనయుండు; తమ్ములన్; కనుంగొని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఎవరు ఎన్ని విధాల చెప్పినప్పటికీ వారి మాటలు మన్నించక దుర్యోధనుడు తన పక్షంలోనివారినంతా కురుక్షేత్రానికి తరలిపొండని ఆజ్ఞాపించాడు. భీష్ముడిని సర్వసైన్యాధ్యక్షుడిని చేసి మనపై దాడి సల్పడానికి దిగగలడు. ఇది కౌరవుల నిర్ణయం. నేను నా శక్తి మేరకు మంచి చెప్పాను. అంతేకాదు. నారదాది మహర్షులు సుయోధనుడికి నీతులు గరపేటట్లు చేశాను. ఎవ రేమి చెప్పినప్పటికీ అతడు దారికి రానందున నేను కోపం తెచ్చుకొని బెదరించి, అవమానించి, తిరస్కరించి, చులుకన చేసి కార్యసాఫల్యం కోసం ఎంతో ప్రయత్నించాను. కార్యం చెడిపోతుందేమోనని మళ్ళీ శాంతవచనాలు పలికాను. ఇంత చేసినా దుర్యోధనుడు అశక్త దుర్జనత్వానికి పాల్పడగా అపుడు అమానుషాలైన కొన్ని అద్భుత మాయలు అక్కడ ప్రదర్శించాను. అన్ని విధాల పొత్తుకొరకు పొరలగలంత మేర పొరలాడాను. కాని, ఆ దుష్టచిత్తుడు దుర్యోధనుడు ఏ విధంగానూ చక్కబడక మాత్సర్యంతో, తనకు ఎన్ని బాధలు వచ్చినప్పటికిన్నీ యుద్ధం చేస్తాడేగాని మీకు రాజ్యభాగం మాత్రమివ్వడు. కౌరవుల పట్ల దండోపాయం తప్ప మరేదీ కొరగాదు. మీకు ఎట్లా సమ్మతమో అట్లా చేయండి' అని శ్రీకృష్ణుడు పల్కగా విని ధర్మరాజు తన తమ్ముళ్ళను చూచి ఇట్లా అన్నాడు:

విశేషం: రాజు శత్రువులను జయించటానికి ప్రయోగించే సామాదులను ఉపాయాలంటారు. వీటిని- సామం, దానం, భేదం, దండం అంటారు. వీటితో 'ఉపేక్ష' చేర్చి శుక్రుడు ఉపాయాలు ఐదన్నాడు. మాయ, ఉపేక్ష, ఇంద్రజాలం అనే మూటిని సామాదులతో చేరిస్తే సప్తోపాయాలని మరికొందరు పెద్దలంటారు.

1. సామం: ఇది చతురుపాయాలలో మొదటిది. మంచిమాట, శాంతపరచుట, ఓదార్చుట, అనునయించుట. అనుకూల ప్రవర్తన రూపమైన ఈ ఉపాయం ఐదు విధాలు. పరస్పరోపకారం కనిపింప జేయటం, మంచితనం చేయటం, గుణాలను కొనియాడటం, చుట్టరికాన్ని తెలపటం, నేను నీ వాడనని మంచిమాటలాడటం.

2. దానం: ఇది రాజ్యాంగ చతురుపాయాలలో రెండోది. ఇది పంచ విధం. తనకున్న ధనమివ్వటం, ఎక్కడనైనా ధనం తీసికొంటే దానికి తాను అనుకూలుడై ఉండటం, అపూర్వ వస్తువుల నివ్వటం, అన్యుల ధనం పుచ్చుకొనేటట్లు చేయటం, అప్పుతీర్చటం.

3. భేదం: చతురుపాయాలలో మూడోది. శత్రుపక్షంలో పరస్పర విరోధం పెట్టటం.

4. దండం: శత్రువుల పట్ల ప్రయోగించే చతురుపాయాలలో నాల్గవది. ఇది వధించటం, ధనం అపహరించటం, పీడించటం అనే మూడు విధాలుగా ఉంటుంది.

క. 'కురుసభఁ బుట్టిన చందము । హరి యంతయుఁ జెప్పెఁ; నింక ననుమానము లే;
దరి మర్దనమున కయ్యెడు । వెరవుం జేవయును మెఱయ వెడలుఁడు గడఁకన్.' 84

ప్రతిపదార్థం: కురు సభన్= కౌరవుల కొలువు కూటంలో; పుట్టిన చందము= జరిగిన విధం; హరి= నారాయణుడు; అంతయున్+చెప్పెన్= సమస్తం తెల్పినాడు; ఇంకన్= ఇక; అనుమానము లేదు= సందేహం లేదు; అరిమర్దనమునకున్= శాత్రవులను దండించటానికి; అయ్యెడు= వలసినట్టి; వెరవున్= ఉపాయమూ; చేవయున్= శక్తీ; మెఱయన్= ప్రకటమయ్యేటట్లు; కడఁకన్= పూనికతో; వెడలుఁడు= బయలుదేరండి.

తాత్పర్యం: 'కౌరవుల కొలువు కూటంలో జరిగిన సంగతినంతా నారాయణుడు సవిస్తరంగా చెప్పాడు గదా! ఇక మనం శంకించ నవసరం లేదు. విరోధులను మట్టుపెట్టటానికి మన శక్తియుక్తులు ప్రస్ఫుటమయేటట్లు పూనిక వహించండి. రణరంగానికి కదలండి.'

వ. అని పలికి, యజాతశత్రుండు కరుణాయత్తచిత్తుండై యచ్చ్యుతు నాలోకించి. 85

ప్రతిపదార్థం: అని పలికి; అజాతశత్రుండు= ధర్మరాజు; కరుణా+ఆయత్తచిత్తుండు+ఐ= దయకు అధీనమైన మనస్సుకలవాడై; అచ్యుతున్; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఇట్లా ధర్మజుడు తమ్ముళ్ళను ఆదేశించి దయాపరవశ హృదయుడై శ్రీ కృష్ణుడిని చూచి.

క. 'కురువంశముఁ ద్రుంచుటకుం । జొరఁజాలక నా మనంబు సుడివడియెడు; నే
వెరవును దొరకొనదు గదే । సరసీరుహనాభ! పొందు సంపాదింపన్. 86

ప్రతిపదార్థం: సరసీరుహనాభ!= కమలనాభా!; కురువంశమున్= కౌరవజాతిని; త్రుంచుటకున్= నాశనం చేయటానికి; చొరన్+ చాలక= యుద్ధంలో ప్రవేశించ నొల్లక; నా మనంబు= నా చిత్తం; సుడి పడియెడున్= పరిభ్రమిస్తున్నది; పొందు= వారితోడి కలయిక; సంపాదింపన్= పొందటానికి; ఏ+వెరవును= ఏ ఉపాయం కూడా; దొరకొనదు+కదే!= లభించక పోయిందిగదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'కృష్ణా! కురువంశం నిర్మూలించటానికి సమ్మతించక నా మనస్సు పరిభ్రమిస్తున్నది. వారితో పొత్తు సాధించడానికి మన కెట్టి మార్గం లభించ లేదుగదా!

వ. నా మనంబును దమ్ములతలంపును నీ వెఱుంగుదు; ధార్తరాష్ట్రుల చందంబును భీష్మ ద్రోణ విదురాదుల చిత్తంబులును నెఱింగి వచ్చితి; మాకు ధర్మచ్యుతి లేకుండునట్టి కార్యంబు నిశ్చయింపు' మనిన నారాయణుం డిట్లనియె. 87

ప్రతిపదార్థం: నా మనంబును= నా హృదయం; తమ్ముల తలంపును= నా అనుజుల ఉద్దేశం; నీవు+ఎఱుంగుదు(వు)= నీవు తెలియుదువు; ధార్తరాష్ట్రుల చందంబును= దుర్యోధనాదుల తీరును; భీష్మ ద్రోణ విదుర+ఆదుల చిత్తంబులును= భీష్ముడు, ద్రోణుడు, విదురుడు మున్నగువారి మనస్సులను; ఎఱింగివచ్చితి(వి)= తెలిసికొని వచ్చావు; మాకున్= మాకు; ధర్మచ్యుతి లేకుండునట్టి కార్యంబు= ధర్మము నుండి జారుపాటు జరుగనట్టి పనిని; నిశ్చయింపుము= నీవే నిర్ణయించుము; అనినన్; నారాయణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నారాయణా! నా మనస్సెట్టిదో, నా తమ్ముల ఉద్దేశమేమిటో నీకు తెలుసు. అక్కడ దుర్యోధనాదుల తీరు, భీష్మ ద్రోణ విదురాదుల తలపులు తెలిసికొనివచ్చావు. మాకు ధర్మహాని కలుగ కుండునట్టి కార్యమేదో నీవే నిర్ణయించు'మని ధర్మజుడు వేడగా గోవిందు డిట్లాఅన్నాడు:

ఉ. 'యుద్ధమ కాక కార్యమును నొండొకఁ డెద్దియుఁ గల్గనేర్చునే?
బుద్ధులు చెప్ప వాక్యములఁ బోల వినం డననేల? యట్టిచో
బద్ధునిఁ జేయఁజూచె ననుఁబట్టి సుయోధనుఁ, డింక నయ్యసం
బద్ధునితోడి సంధికి నుపాయము నా మతిఁ దోఁప దెమ్మెయిన్.' 88

ప్రతిపదార్థం: యుద్ధము+అ,కాక= సంగ్రామమే తప్ప; కార్యమునున్= చేయవలసినపని కూడ; ఒండొకఁడు= ఇంకొక్కటి; ఎద్దియున్= ఏదియు; కల్గన్+నేర్చునే?= ఉండగలదా?; బుద్ధులు చెప్ప వాక్యములన్= నీతులు నేర్పే మాటలను; పోలన్= చక్కగా; వినండు+అనన్+ఏల?= అతడు ఆలకించలేదని చెప్పటమెందుకు?; అట్టిచోన్= నేను హితం చెప్పుతూఉండగా; సుయోధనుఁడు= దుర్యోధనుడు; ననున్+పట్టి= నన్ను పట్టుకొని; బద్ధునిన్+చేయన్+చూచెన్= బంధించటానికి యత్నించాడు; ఇంకన్= ఇక; ఆ+అసంబద్ధునితోడి సంధికిన్= ఆ అయోగ్యుడి తోటి పొత్తుకు; ఉపాయము= వెరవు; నా మతిన్= నా మనసులో; ఏ+మెయిన్= ఏ విధంగానూ; తోఁపదు= గోచరించదు.

తాత్పర్యం: 'యుద్ధము తప్ప చేయవలసినపని మరొక టేదీ లేదు. నేను చెప్పే నీతివాక్యాలు అతడు వినలేదని అనటం మాత్రమే కాదు. అట్లా నేను హితం చెపుతున్నప్పుడు సుయోధనుడు నన్ను పట్టుకొని బంధిప జూచాడు. ఇక అట్లాంటి అయోగ్యుడితోడి పొత్తుకు ఉపాయమేదో నా మనసుకు స్ఫురించటం లేదు.'

వ. అని చెప్పి విదురుం దేకాంతంబున నాడినమాటలును, భీష్మద్రోణ బాహ్లికాదులగు పెద్దలకు ధార్తరాష్ట్రుల దెసం బుట్టిన మనఃక్షోభంబును, గుంతి కౌరవులు వినం బలికిన పలుకులుం బ్రకటించి ధర్మపుత్త్రుపైఁ బాపంబు లేకునికిఁ దెలిపి సమరం బవశ్య కర్తవ్యంబుగా నిశ్చయించె; నట్టియెడఁ దమ్ము లన్న మొగంబునం జూడ్కి నిలిపి యూరకుండి; రతండు వారలం గలయం గనుంగొని యిట్లనియె: 89

ప్రతిపదార్థం: అని చెప్పి; విదురుండు; ఏకాంతంబునన్= రహస్య ప్రదేశంలో; ఆడిన మాటలును= పలికిన పలుకులును; భీష్మద్రోణ బాహ్లిక+ఆదులు+అగు= భీష్ముడు ద్రోణుడు బాహ్లికుడు మున్నగు; పెద్దలకున్= పూజ్యులకు; ధార్తరాష్ట్రుల దెసన్= దుర్యోధనాదులయెడ; పుట్టిన= కలిగిన; మనఃక్షోభంబును= మనస్సులందలి కలతను; కుంతి; కౌరవులు; వినన్= వినేటట్లు; పలికిన పలుకులున్= చెప్పిన మాటలున్నూ; ప్రకటించి= వెల్లడించి; ధర్మపుత్త్రుపైన్= ధర్మరాజు మీద; పాపంబులేక+ఉనికిన్= పాపం లేకుండుటను; తెలిపి= చెప్పి; సమరంబు= యుద్ధం; అవశ్యకర్తవ్యంబుగాన్+నిశ్చయించెన్= తత్క్షణం చేయదగిన పనిగా నిర్ణయించాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; తమ్ములు; అన్న మొగంబునన్; చూడ్కి నిలిపి= దృష్టి సారించి; ఊరక+ఉండిరి; అతండు= ధర్మజుడు; వారలన్= తమ్ములను; కలయన్+కనుంగొని= తేరిపార చూచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని పలికి శ్రీకృష్ణుడు రహస్య ప్రదేశంలో విదురుడు పల్కిన మాటలూ, భీష్ముడు ద్రోణుడు బాహ్లికుడు మొదలైన పెద్దలకు దుర్యోధనాదుల విషయంలో ఏర్పడిన హృదయ సంక్షోభమూ, కుంతీదేవి కౌరవులు వింటుండగా పలికిన పలుకులూ వెల్లడించి, ధర్మజుపట్ల ఏ పాపం లేదని చెప్పాడు. యుద్ధమే తత్క్షణ కర్తవ్యంగా నిర్ణయించాడు. అప్పుడు తమ్ము లందరూ అన్నగారి ముఖం చూస్తూ మౌనంగా ఉండిపోయారు. అంతట ధర్మపుత్త్రుడు తమ్ముళ్ళను కలయజూచి ఇట్లా అన్నాడు:

ఉ. 'కౌరవకోటిచేత మన కష్టపుఁబాటు తలంపు వచ్చినం
గ్రూరవిచేష్టితంబునకు గొంతి యొడంబడె; బంధువర్గమున్
ఘోరముగా వధించుటకుఁ గోల్కొన కున్నది బుద్ధి; మీరు ని
ర్ధారణ చేయుఁడా హితము ధర్మము నయ్యెడు వృత్తమెట్టిదో.' 90

ప్రతిపదార్థం: కౌరవ కోటి చేతన్= కౌరవవర్గంవలన; మన కష్టపుఁబాటు= మనం పడిన బాధలు; తలంపు వచ్చినన్= జ్ఞప్తికి రాగా; క్రూర విచేష్టితంబునకున్= కౌరవులను నిర్మూలించే ఘాతుకపు పనికి; గొంతి= కుంతీదేవి; ఒడంబడెన్= సమ్మతించింది; బంధువర్గమున్= చుట్టాల సమూహాన్ని; ఘోరముగాన్= దారుణంగా; వధించుటకున్= చంపటానికి; బుద్ధి= నా మనస్సు; కోల్కొనక+ఉన్నది= ఉత్సహించటం లేదు; మీరు= తమ్ములైన మీరు; హితము= మేలు; ధర్మము= న్యాయం; అయ్యెడు= కలుగునట్టి; వృత్తము= చర్య (నడవడి); ఎట్టిదో= ఎటువంటిదో; నిర్ధారణ చేయుఁడా= నిర్ణయించండి.

తాత్పర్యం: 'కౌరవుల వలన మనం పడిన కష్టాలు స్మృతికి రాగానే మన తల్లి కుంతీదేవి మారణకర్మకు సమ్మతించింది. చుట్టాలను దారుణంగా చంపటానికి మాత్రం నా మనసు ఉత్సహించటం లేదు. మనకు మేలు గూర్చేదీ, ధర్మయుక్తమైనదీ అయిన నడవడి ఎటువంటిదో మీరే నిర్ధారణ చేయండి.'

వ. అనిన విని అర్జునుం డతని కిట్లనియె : 91

తాత్పర్యం: అనగా విని అర్జునుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

చ. 'హితమును ధర్మముం దగవు నిట్టిది నా మన మేమి నేర్తు? మ
చ్యుతుఁడు సమస్త ధర్మ పరిశోధకుఁ; డా విదురుండుఁ; బాండు భూ
పతి సతియుం దగం బలుకు పల్కుల సందియమెల్లఁ బాసె; ని
ట్లితఁడు రణంబు చేయుఁ డన నింక విచారము లెల్ల నేటికిన్?' 92

ప్రతిపదార్థం: హితమున్= మేలూ; ధర్మమున్= పుణ్యమూ; తగవున్= న్యాయమూ; ఇట్టిది నాన్= ఇటువంటిదని చెప్పటానికి; మనము+ఏమి నేర్తుము?= మనకేమి తెలియును?; అచ్యుతుఁడు= శ్రీకృష్ణుడు; సమస్త ధర్మ పరిశోధకుఁడు= ఎల్ల ధర్మాలను పరిశీలించిన మహానుభావుడు; ఆ+విదురుండున్= విదురుడును; పాండు భూపతి సతియున్= పాండు మహారాజు దేవేరిఅయిన కుంతియు; తగన్= ఒప్పిదంగా; పలుకు పల్కులన్= నుడివిన మాటలవలన; సందియము+ఎల్లన్+పాసెన్= అనుమానమంతా తొలగిపోయింది; ఇట్లు= ఈ ప్రకారంగా; ఇతఁడు= శ్రీకృష్ణ భగవానుడు; రణంబు చేయుఁడు+అనన్= యుద్ధం చేయండని చెప్పగా; ఇంకన్= మరి; విచారములు+ఎల్లన్= ఆలోచనలన్నీ; ఏటికిన్?= ఎందుకు?

తాత్పర్యం: 'ఏది హితమో, ఏది ధర్మమో, ఏది న్యాయమో మన కేమి తెలుసు? నారాయణుడు, ఎల్ల ధర్మాలను పరిశీలించినవాడు. ఆ విదురుడు, పాండు మహారాజు పత్ని కుంతీదేవి చక్కగా పలికిన పలుకుల వలన సందేహమంతా తీరిపోయింది. శ్రీకృష్ణ భగవానుడు యుద్ధం చేయండని పల్కగా మనకు వేరే ఆలోచన లెందుకు?'

ఆ. అనిన 'నట్లకాక యఖిల ధర్మజ్ఞాన । ఘనుఁడు మనకు నేడుగడయుఁ దాన
శౌరి నిశ్చయింప సంశయం బేటికి? । సంఘటింపుఁ డుగ్ర సమర విధము.' 93

ప్రతిపదార్థం: అనినన్= అని ఫల్గునుడు పలుకగా; అట్లకాక= సరిసరి; అఖిల ధర్మజ్ఞాన ఘనుఁడు= సమస్త ధర్మముల యొక్క జ్ఞానంచేత గొప్పవాడు; మనకున్= మనందరికీ; ఏడుగడయున్= రక్షకుడును; తాన్+అ= తానే; శౌరి= అట్టి నారాయణుడు; నిశ్చయింపన్= కర్తవ్యం నిర్దేశించగా; ఏటికిన్ సంశయంబు?= అనుమాన మింకెందుకు?; ఉగ్రసమర విధము= దారుణమైన యుద్ధ విధానం; సంఘటింపుఁడు= రూపొందించండి.

తాత్పర్యం: పార్థు డట్లా పలుకగానే ధర్మజుడు 'అట్లే కానివ్వండి. సకల ధర్మ స్వరూపం ఎరింగిన మహానుభావుడూ, మనకు రక్షకుడూ వాసుదేవుడే. ఆయన కర్తవ్యం నిర్దేశించిన తరువాత మనకు సందేహం తగదు. దారుణ యుద్ధ సన్నాహాలు సాగించండి.'

వ. అని యుధిష్ఠిరుండు తమ్ములతో నెట్టకేలకుం దెగువ సెప్పి. 94

ప్రతిపదార్థం: అని; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; తమ్ములతోన్; ఎట్టకేలకున్= తుదకు; తెగువ చెప్పి= నిర్ణయం తెలిపి.

తాత్పర్యం: అంటూ ధర్మరాజు తుదకు యుద్ధం చేయటమే కర్తవ్యమని నిర్ణయించి.

క. 'బాహాగర్వము వివిధ । వ్యూహ విధిజ్ఞతయుఁ గలిగి యొకరుం డే డ
క్షోహిణులు నడపి భీష్మో । త్సాహంబున కోర్చు చాపధరుఁ డెవ్వఁ డొకో! 95

ప్రతిపదార్థం: బాహాగర్వమున్= భుజ దర్పమూ; వివిధ వ్యూహ విధిజ్ఞతయున్+కలిగి= పలురకాలైన వ్యూహాలు పన్నటం తెలిసి ఉండి; ఒకరుండు= తా నొక్కడే; ఏడు+అక్షోహిణులు నడపి= ఏడక్షౌహిణుల సేనను ముందుకు సాగించి; భీష్మ+ఉత్సాహంబునకున్= పితామహుడి యొక్క సమర విజృంభణానికి; ఓర్చు= తాళగలిగిన; చాపధరుఁడు= విలుకాడు; ఎవ్వఁడు+ఒకో!= మనలో ఎవడున్నాడు?;

తాత్పర్యం: 'బాహు బలము, బహువిధాలైన వ్యూహాలను పన్నే విధానంలో తెలివితేటలు గలిగి, ఏడక్షౌహిణుల సైన్యాన్ని నడిపి భీష్ముడి రణోత్సాహాన్ని అరికట్టగలిగిన మేటి విలుకాడు మనలో ఎవ్వడు?

వ. అట్టివానికి వాహినీ నాయకత్వం బిచ్చి యభిషేకంబు సేయవలయు.' 96

ప్రతిపదార్థం: అట్టివానికిన్= అట్టి వీరాగ్రేసరుడికి; వాహినీ నాయకత్వంబు+ఇచ్చి= సేనాధిపత్యం ఇచ్చి; అభిషేకంబు చేయన్ వలయున్= అభిషేకం జరపాలి.

తాత్పర్యం: మనం అటువంటి వీరాగ్రణికి సర్వసేనాధిపత్యం ఇచ్చి అభిషేకించాలి.'

తే. అనిన సహదేవుఁ డిట్లను 'నధిప! పుత్త్ర । పౌత్ర సోదరవంతుండు బాహువీర్య
ఘనుఁడు మన కాశ్రయంబయి మనిచె మత్స్య । దేశపతి గాఁడె సేనాపతిత్వమునకు?' 97

ప్రతిపదార్థం: అనినన్= అని ధర్మజుడు చెప్పగా; సహదేవుఁడు+ఇట్లు+అనున్= సహదేవుడు ఈ విధంగా చెప్పాడు; అధిప!= రాజా! పుత్త్రపౌత్ర సోదరవంతుండు= కొడుకులు, మనుమలు, తోడబుట్టినవారు కలవాడు; బాహువీర్యఘనుఁడు= భుజపరాక్రమంచేత దొడ్డవాడు; మనకున్= మనందరికీ; ఆశ్రయంబు+అయి= ఆధారమై; మనిచెన్= కాపాడాడు; మత్స్యదేశపతి= మత్స్యదేశానికి పాలకుడైన విరాట మహారాజు; సేనాపతిత్వమునకున్= సేనలయొక్క ఆధిపత్యానికి; కాఁడె?= చాలడా?

తాత్పర్యం: ధర్మజుడి పలుకులు విని సహదేవుడు ఇట్లా అన్నాడు: 'రాజా! విరాటుడు కొడుకులూ మనుమళ్ళూ సోదరులూ మొదలైన బలగం కలవాడు. బాహుబలంలో గొప్పవాడు. మనకు ఆధారమై ఉండినవాడు. అట్టి మత్స్యమహీపతి సేనాధిపత్యానికి తగడా?'

వ. అనవుడు నకులుండు. 98

తాత్పర్యం: తరువాత నకులుడు (ఇట్లా అన్నాడు:)

చ. 'బలఁగముఁ బెంపుఁ, దేజమును, బాహుబలంబును, నగ్గలంబు పె
క్కు లెఱుఁగుఁ గార్య ఖడ్గములకుం దగు త్రోవలు; ద్రోణులందు భీ
ష్ములదెసఁ గోపముం గలఁ, డమోఘ పరాక్రమశాలి, నీ బలం
బుల కధినాథుఁగా ద్రుపదభూపతిఁ బట్టముఁ గట్టు టెట్లొకో!' 99

ప్రతిపదార్థం: బలఁగమున్= పరివారం; పెంపున్= గొప్పతనం; తేజమును= ప్రతాపం; బాహుబలంబునన్= భుజశక్తీ; అగ్గలంబు= అధికంగా ఉన్నవాడు; కార్యఖడ్గములకున్; కార్యవాదానికీ, ఖడ్గవాదానికీ; తగు= తగినట్లు; త్రోవలు= మార్గాలు; పెక్కులు+ఎఱుఁగున్= అనేకాలు తెలిసినవాడు; ద్రోణులందున్= ద్రోణాచార్యుల వారియందును; భీష్ములదెసన్= పితామహులయందును; కోపమున్+కలఁడు= క్రోధం కలవాడు; అమోఘ పరాక్రమశాలి= మొక్కవోని శౌర్యం కల్గినవాడు; అయిన; ద్రుపద భూపతిన్= ద్రుపద మహారాజును; నీ బలంబులకున్= నీ సేనలకు; అధినాథున్+కాన్= అధిపతిగా; పట్టమున్+కట్టుట= అభిషేకించటం; ఎట్లు+ఒకో?= ఎట్లుండునో యోచించండి.

తాత్పర్యం: 'పరివారం, గొప్పతనం, ప్రతాపం, భుజవీర్యం అధికంగా కలవాడూ, కార్యఖడ్గ వాదాలకు తగిన అనేక మార్గాలు ఎరిగినవాడూ, ద్రోణ భీష్ములయందు కోపం కలవాడూ, మొక్కవోని కడిమిగలవాడూ అయిన ద్రుపద మహారాజును నీ సేనలకు అధిపతినిచేస్తే ఎట్లా ఉంటుందో ఆలోచించు.'

వ. అనుటయుం దదనంతరంబ ధనంజయుఁడు. 100

తాత్పర్యం: నకులుడు ద్రుపదుడికి సేనాధిపత్యం అప్పగించటం తగునని పలికిన పిమ్మట అర్జునుడు (ఇట్లా అన్నాడు:)

ధృష్టద్యుమ్నాదులకు సేనానాయకత్వంబు నిర్ణయించుట (సం. 5-149-18)

సీ. 'అగ్నికుండమున ద్రోణాచార్యునకు నాశ । మొనరించుదానికై యుద్భవించె;
రథరథ్యములు ధనుర్బాణంబులును దను । త్రాణఖడ్గములు నుద్దామ లీలఁ
దనతోన జన్మించె; దహన శిఖామూర్తి । భుజవీర్య విక్రమ స్ఫూర్తిశాలి
సైన్యనాథుండు ధృష్టద్యుమ్నుఁ డగునని । తలఁచెద; నాతఁడు దక్క నొరులు

తే. భీష్ము తాఁ కోర్వ; రుగ్రంపు బిరుదు ధైర్య । ధన ఘనుండు శిఖండి భీష్మునకు మృత్యు
వై జనించినవాఁడు మహాబలుండు । దండనాయకుఁ జేయ నతండు దగును.' 101

ప్రతిపదార్థం: అగ్నికుండమునన్= హోమకుండంలో; ద్రోణ+ఆచార్యునకున్= గురుడైన ద్రోణుడికి; నాశము+ఒనరించు దానికై= నిర్మూలంచేసే పనికై; ఉద్భవించెన్= జన్మించాడు; రథ రథ్యములు= రథమూ, అశ్వాలూ; ధనుః+బాణంబులును= విల్లూ, అమ్ములును; తను త్రాణ ఖడ్గములు= కవచమూ, కత్తీ; ఉద్దామలీలన్= భయంకర విలాసంతో; తనతోన్+అ= తనతోడనే; జన్మించెన్= పుట్టాయి; దహనశిఖామూర్తి= అగ్నిజ్వాలవంటి ఆకృతి కలవాడు; భుజవీర్య విక్రమస్ఫూర్తిశాలి= బాహుబలం, ప్రతాప ప్రకాశం కలవాడు; అయిన; ధృష్టద్యుమ్నుఁడు= ద్రుపదపుత్రుడు; సైన్యనాథుండు+అగున్+అని= సేనాధిపతి కాగలడని; తలఁచెదన్= భావిస్తాను; ఆతఁడు+తక్కన్= ధృష్టద్యుమ్నుడు దప్ప; ఒరులు= ఇతరులు; భీష్ముతాఁకున్+ ఓర్వరు= భీష్ముడి ధాటికి ఆగలేరు; ఉగ్రంపు బిరుదు= అతడు ప్రచండ శూరుడు; ధైర్యధన ఘనుండు= ధైర్యమనే ధనం కలవారిలో గొప్పవాడు; శిఖండి= అంగనాపూర్వుడైన ద్రుపద పుత్రుడు శిఖండి; భీష్మునకున్= గాంగేయునకు; మృత్యువు+ఐ= మిత్తిఅయి; జనించినవాఁడు= పుట్టినవాడు; మహాబలుండు= గొప్ప శక్తి కలవాడు; దండనాయకున్+చేయన్= దళవాయిని చేయటానికి; అతండు తగును= అతడు అర్హుడవుతాడు.

తాత్పర్యం: 'ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుడిని నిర్మూలించుటకై అగ్నికుండం నుండి పుట్టాడు. అతడితోపాటు రథం, గుర్రాలు, విల్లమ్ములు, కవచఖడ్గాలు అగ్నికుండం నుంచి పుట్టాయి. ధృష్టద్యుమ్నుడు అగ్నిజ్వాలతో సమానమైన ఆకారం కలవాడు. బాహుబలం కలవాడు, ప్రతాపవంతుడు. సర్వసైన్యాధిపతిగా ఉండటానికి తగినవాడని భావిస్తున్నాను. అతడు తప్ప మరొక్కడు భీష్ముడి ధాటికి తట్టుకోలేడు. మరి శిఖండి అంటేనో- భయంకరమైన వీరుడు. ధైర్యశాలి. మిక్కిలి బలం కలవాడు. భీష్ముడి పాలిటికి మిత్తియై పుట్టినట్టివాడు. అతడిని దళవాయిగా చేయవచ్చును.

విశేషం: ధృష్టద్యుమ్నుని జన్మవృత్తాంతము: భరద్వాజుడనే మునియొక్క కలశంలో ఉద్భవించిన ద్రోణుడు, పృషతుని పుత్రుడైన ద్రుపదుడు ఆబాల్య మిత్రులు. వారిద్దరు వేదాలు చదివి, ధనుర్వేదం అగ్నివేశుని దగ్గర అభ్యసించారు. ద్రుపదుడు తండ్రి తరువాత పాంచాల దేశానికి ప్రభువైనాడు. ద్రోణుడు తన పుత్రుడైన అశ్వత్థామ పాలకొరకు ధేనువును వేడబోయి, ప్రియసఖుడైన ద్రుపదునిచే పరాభవం పొందినాడు. అతడు హస్తినాపురికి వచ్చి కురుకుమారులకు గురువై, తన వద్ద విలువిద్య నేర్చిన పాండవ కౌరవులతో తన్ను అవమానించిన ద్రుపదుడి నోడించి పట్టుకొని తెండని పలుకగా అర్జునుడు మహాయుద్ధంలో

ద్రుపదుడిని ఓడించి పట్టుకొని వచ్చి గురున కొప్పగించాడు. ద్రోణుడు ఎత్తిపొడుపు మాటలతో అతడిని గేలి చేసి విడిచిపుచ్చాడు. అవమానతప్తుడైన ద్రుపదుడు రణరంగంలో ద్రోణుడిని వధించునట్టి కొడుకును, అర్జునునకు దేవి అగునట్టి కొమార్తెను పడయనెంచి గంగాతీరంలో వానప్రస్థులుగా నున్న యాజోపయాజులనే అన్నదమ్ములలో పిన్నవాడైననూ తపోమహిమాఢ్యుడైన ఉపయాజుని ఆశ్రయించాడు. 'నీకు లక్షధేనువు లిస్తాను. నాకు సత్సంతాన మొదవించే క్రతువు చేయించు'మని అర్థించాడు. తనకు ఫలాశ లేదని చెపుతూ 'మా అన్న యాజుడు నీ అభిమతం నెరవేరుస్తాడు వెళ్ళు'మని ఉపయాజుడు చెప్పాడు. పాంచాలుడు యాజుని దర్శించి - 'మునీంద్రా! భారద్వాజుడు నాకు అపాయ మొనరించాడు. ఘోరయుద్ధంలో అతడి నోర్చే అపార పరాక్రముడైన సుతుడినీ, పార్థుని పతిగా బడయునట్టి సుతనూ వాంఛిస్తున్నాను నా కోరిక తీర్చు'మని ప్రార్థించాడు. యాజుడు యాజకత్వానికి అంగీకరించి ద్రుపదుడిచేత పుత్రకామేష్టి చేయించాడు. మంత్రాహుతులతో సంతృప్తుడైన అగ్నిదేవునివలన ద్రుపద మహారాజుకు అగ్నికుండంలోనుండి ఖడ్గచాపాలు ధరించినవాడు; కవచ కిరీటాలంకారుడు, రథారూఢుడు, అగ్నిజ్వాలవంటి శరీరం కలవాడు - ఒక కుమారుడు జనించాడు. అట్లాగే అగ్నికుండం నుండి దివ్యతేజంతో దీపిస్తూ ఒక కుమారి జనించింది. ఇట్లా జన్మించిన ద్రుపద కుమారునకు ధృష్టద్యుమ్నుడనీ, కొమార్తెకు కృష్ణ అనీ ఆకాశవాణి నామకరణం చేసింది. తరువాత ద్రుపదుడు ధృష్టద్యుమ్నుడిని ధనుర్వేద పారంగతుడిని కావించాడు.

వ. అనవుడు ధర్మనందనుండు గోవిందుం జూపి 'యితండు సకల చరాచర తారతమ్య సంవేది; విశేషించి మనకు నితని మాటలు విజయ మూలంబు; గావున నిమ్మహాత్ముండు నిరూపించినవాడు వరూథినీ ముఖ్యుండు.' 102

ప్రతిపదార్థం: అనవుడున్= అని పార్థుడు పలుకగా; ధర్మనందనుండు= ధర్మరాజు; గోవిందున్+చూపి= తమ్ములకు శ్రీకృష్ణుడిని చూపి; ఇతండు= ఈ మహనీయుడు; సకల చర+అచర తారతమ్యసంవేది= సమస్తమైన జంగమ స్థావరాల యొక్క ఎక్కువ తక్కువలు చక్కగ తెలిసినవాడు; విశేషించి= ప్రత్యేకించి; మనకున్; ఇతని మాటలు; విజయమూలంబు= జయానికి ఆధారం; కావునన్; ఈ మహాత్ముండు= ఈ మహానుభావుడు; నిరూపించినవాఁడు వరూధినీ ముఖ్యుండు= నిర్ణయించినవాడే సేనలకు అధిపతి. (వరూధిని= వాహిని, సేన.)

తాత్పర్యం: అర్జునుడి పలుకు లాలకించి ధర్మరాజు తన తమ్ములకు భగవంతుడైన శ్రీకృష్ణుడిని చూపుతూ 'ఈ మహనీయుడు సమస్తమైన జంగమ స్థావరాల యొక్క ఎక్కువ తక్కువలు చక్కగా ఎరిగినవాడు. ముఖ్యంగా ఈయన వచనాలు మన గెలుపునకు కారణాలు. కనుక ఈ మహానుభావుడు నిర్ణయించిన పురుషుడే మన ఏడక్షౌహిణుల సేనలకు అధిపతి అవుతాడు.'

క. అనుటయు దామోదరుఁ డి । ట్లను 'ధృష్టద్యుమ్నుఁ డర్హుఁ డగు నభిషేకం
బొనరింపుము పేరోలగ । మున నక్షోహిణుల కెల్ల ముఖ్యుఁడు గాఁగన్. 103

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధర్మనందనుడు పలుకగా; దామ+ఉదరుఁడు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనున్= ఈ రీతిగా అన్నాడు; ధృష్టద్యుమ్నుఁడు; అర్హుఁడు+అగున్= సైన్యాధిపత్యానికి తగును; అక్ష+ఊహినులకున్+ఎల్లన్= అక్షౌహిణు లన్నింటికి; ముఖ్యుఁడు కాఁగన్= ప్రధానాధికారి అయ్యేటట్లు; పేరోలగమునన్= నిండుసభలో; అభిషేకంబు+ఒనరింపుము= సర్వసేనాధిపత్యానికి అభిషిక్తుడిని చేయుము.

తాత్పర్యం: ధర్మజుని మాటలు విని శ్రీ కృష్ణుడు ఇట్లా అన్నాడు. 'ధృష్టద్యుమ్నుడు సేనాధ్యక్షుడుగా ఉండదగినవాడు. ఇతనిని ఏడక్షౌహిణులకు నాయకుడిగా నిండు కొలువులో అభిషేకించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అక్షోహిణి, అక్షౌహిణి= 21870 రథాలు, అన్ని ఏనుగులు, 65610 గుర్రాలు, 109350 పదాతులు కలిగిన సేన - దీనినే చతురంగ బలం అంటారు.

క. సురగంధర్వ ఖచర కిం। పురుషాది సమస్త దివ్యభూతంబుల బం
ధుర భూరి వ్యూహంబుల। విరచనముల నెఱుఁగు నతఁడు వీరోత్తముఁడున్. 104

ప్రతిపదార్థం: సుర గంధర్వ ఖచర కింపురుష+ఆది= దేవతలు, గంధర్వులు, ఖేచరులు, కింపురుషులు మున్నుగాగల; సమస్త దివ్యభూతంబుల= సకల దేవతా వర్గాల యొక్క; బంధుర= సాంద్రమైన; భూరివ్యూహంబుల విరచనములన్= గొప్ప మొగ్గరాల యొక్క పన్నుగడలు; ఎఱుఁగున్= ఇతనికి తెలుసు; అతఁడు= ధృష్టద్యుమ్నుడు; వీర+ఉత్తముఁడున్= శూరులలో శ్రేష్ఠుడౌతాడు.

తాత్పర్యం: సురలు, గంధర్వులు, ఖేచరులు, కింపురుషులు మొదలైన దేవయోనులు పన్నే సేనావ్యూహాల కల్పన లన్నింటినీ తెలిసినవాడు ధృష్టద్యుమ్నుడు. వ్యూహరచనలో నేర్పు కలవాడే కాదు; వీరులలో కూడ శ్రేష్ఠుడు.

క. నీ యొద్దిరాజు లందఱు। ధీయుక్తులు విక్రమ ప్రదీప్తుల యైనన్
వేయేటికి ధృష్టద్యు। మ్నా యత్తము చేయు సైన్యమంతయు నధిపా!' 105

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; నీయొద్దిరాజులు+అందఱున్= నీ దగ్గరనున్న భూపతులందరున్నూ; ధీయుక్తులు= బుద్ధిమంతులు; విక్రమ ప్రదీప్తులు+అ+ఐనన్= శౌర్యంతో దీపించేవారే అయినప్పటికీ; వేయు+ఏటికిన్?= పలుమాట లెందుకు?; సైన్యము+అంతయున్= నీ సేనలన్నిటినీ; ధృష్టద్యుమ్న+ఆయత్తము+చేయు(ము)= ధృష్టద్యుమ్నుడి అధీనం కావించుము.

తాత్పర్యం: నీ చెంతనున్న భూపతులంతా బుద్ధిమంతులు, ప్రతాపంతో ప్రజ్వలించువారే. సందేహం లేదు. అయినప్పటికినీ నీ సేనలన్నింటినీ ధృష్టద్యుమ్నుడి వశంలో ఉంచుము.'

వ. అనిన విని యుధిష్ఠిరుం 'డక్షోహిణులకుం బ్రత్యేక నాయకులను నీవ నిర్దేశింపు' మనుటయు నతండు. 106

ప్రతిపదార్థం: అనినన్; విని; యుధిష్ఠిరుండు; అక్షోహిణులకున్; ప్రత్యేక నాయకులను= విడివిడిగా అధిపతులను; నీవు+అ= నీవే; నిర్దేశింపుము= నిర్ణయించుము; అనుటయున్; అతండు= శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి వాక్యాలు విని ధర్మజుడు 'ఏడక్షోహిణులకున్నూ విడివిడిగా అధిపతులను నీవే నిర్ణయించు' మని కోరగా వాసుదేవుడు.

తే. 'సేన దమకును గలవారు లేనివారు। ననక తగువారిఁ జెప్పెద నఖిల సమర
పండితుల నేరి, వారి నీ బలము లేడు। నడపఁ జాలించి యభిషేచనం బొనర్పు.' 107

ప్రతిపదార్థం: సేన= సైన్యం; తమకును= తమకు; కలవారు= ఉన్నవారు; లేనివారు= లేనట్టివారు; అనక= అనే భేదం పాటించక; తగువారిన్= అర్హులను; అఖిల సమర పండితులన్= సమస్త యుద్ధాలలో విశారదులైనవారిని; ఏరి= ఎన్ని; చెప్పెదన్= నీకు తెలుపుతాను; వారిన్= అట్టివారలను; నీ బలములు+ఏడున్= నీ ఏడక్షౌహిణులను; నడపన్= నడపటానికి; చాలించి= సమర్థులను చేసి; అభిషేచనంబు+ఒనర్పు= అభిషేకం చేయుము.

తాత్పర్యం: 'తమకు సైన్యం కలవారు లేనివారు అనే భేదం లేక సకల యుద్ధాలలో కోవిదులైనవారును, అర్హులును అయినవారిని పేర్కొంటాను. నీ బలము లేడింటిని నడపటానికి సమర్థులైన వారికి ప్రత్యేక నాయకులుగా నీవు అభిషేకించుము.'

వ. అనిన 'నట్ల చేయుదు; వారెవ్వ రెవ్వరు? నిరూపింపు'మని యడిగినఁ గుంతీనందనునకు దేవకీనందనుం డిట్లనియె. 108

ప్రతిపదార్థం: అనినన్; అట్లు+అ= అట్లే; చేయుదున్; వారు; ఎవ్వరు+ఎవ్వరు= ఎవరెవరు; నిరూపింపుము= నిశ్చయించుము; అని అడిగినన్; కుంతీనందనునకున్= ధర్మజునకు; దేవకీనందనుండు= దేవకీతనయుడైన శ్రీకృష్ణమూర్తి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి మాటలు విని ధర్మజుడు 'నీవు చెప్పినట్లే చేస్తాను. వా రెవరో నిశ్చయింపు'మని అడుగగా దేవకీపుత్రుడు ఇట్లా అన్నాడు:

సీ. 'పటుపరాక్రమనిధి పాంచాలపతియు, న । మానుష తేజుండు మత్స్యవిభుఁడు,
శత్రుభీకరమూర్తి సాత్యకియును, జరా । సంధాగ్ర తనయుండు శౌర్యఘనుఁడు
సహదేవుఁడును, ధైర్యశాలి యాదవశిరో । మణి చేకితానుండు, మహితవిభవ
ఖని యగు శిశుపాల తనయుండు దోర్దర్ప । ధుర్యుండు ధృష్టకేతుండు, సమర

తే. లంపటుండు శిఖండియు లావు వెరవు । గలరు, నీయెడ ననురక్తిఁగలరు, సాలఁ
బెంపుగల, రుక్కు ముట్టిన తెంపుగలరు । కోరి పతులుగఁ జేయు మక్షోహిణులకు. 109

ప్రతిపదార్థం: పటు పరాక్రమనిధి= దృఢమైన శౌర్యానికి ఆశ్రయమైనవాడు; పాంచాల పతియున్= పాంచాలదేశాధీశుడు ద్రుపదుడు; అమానుష తేజుండు= మానవశక్తికి మీరిన ప్రతాపంకలవాడు; మత్స్యవిభుఁడు= మత్స్యదేశ ప్రభువు విరాటుడును; శత్రుభీకరమూర్తి, సాత్యకియును= విరోధులకు వెరపు గలిగించే స్వరూపం గల సాత్యకియున్నూ; శౌర్యఘనుఁడు= పరాక్రమంచేత గొప్పవాడు; జరాసంధ+అగ్రతనయుఁడు= జరాసంధుడి పెద్దకొడుకు; సహదేవుఁడును= సహదేవుడనేవాడున్నూ; ధైర్యశాలి= ధైర్యంకలవాడు; యాదవ శిరోమణి= యాదవులలో శ్రేష్ఠుడు; చేకితానుండున్= చేకితానుడనేవాడును; మహిత విభవఖని= గొప్ప వైభవాలకు గనివంటివాడును; దోః+దర్పధుర్యుండు= భుజబలమునందు మిన్న అయిన; శిశుపాల తనయుండున్= శిశుపాలుడి పుత్రుడు; అగు= అయినట్టి; ధృష్టకేతుండున్= ధృష్టకేతువనేవాడును; సమరలంపటుండు= యుద్ధాలందు అత్యాసక్తికలవాడు; శిఖండియున్= భీష్ముడిని వధించటానికి ఈశ్వరుడి వరం వలన ద్రుపదుడికి ముందు కూతురై పుట్టి పిదప కొడుకుతనమును పొందిన శిఖండి అనేవాడును; లావున్= బలం; వెరవున్= ఉపాయాన్ని; కలరు= కలిగి ఉన్నారు; నీ యెడన్= నీపట్ల; అనురక్తిన్= అనురాగాన్ని; కలరు= కల్గినవారు; చాలన్= మిక్కిలి; పెంపు+కలరు= గొప్పతనం కలవారు; ముట్టినన్= తాకితే; తెంపు+కలరు= సాహసం చూపగలవారు; అక్షోహిణులకున్= నీ సేనలకు; కోరి= ఇష్టపడి; పతులుగన్+చేయుము= నాయకులుగా నియమించుము.

తాత్పర్యం: గొప్ప పరాక్రమరాశిఅయిన ద్రుపదుడు, మానవాతీత ప్రతాపంగల విరాటుడు, శత్రువులకు భయం కలిగించే స్వరూపంగల సాత్యకి, మిక్కిలి శౌర్యవంతుడైన జరాసంధుడి పెద్ద కుమారుడగు సహదేవుడు, యాదవులలో ఉత్తముడును, ధైర్యవంతుడును అయిన చేకితానుడు, గొప్ప వైభవాలకు నెలవైనవాడు, భుజబలం కలిగినవాడు, శిశుపాలుడి నందనుడు అయిన ధృష్టకేతువు, యుద్ధములందు మిక్కిలి ఆసక్తిగల శిఖండి బలసంపన్నులు,

ఉపాయశాలులు. నీయెడ ప్రేమగలవారు, చాల గొప్పతనంగలవారు, సాహసోపేతులు. అట్టి వీరిని ఏడ్గురినీ నీ అక్షౌహిణులకు అధిపతులను గావించుము.

విశేషం: ధృష్టకేతుడి వృత్తాంతము:

శిశుపాలుడు చేదివంశంలో దమఘోషుడనే రాజుకూ, సాత్వతికీ నాల్గు చేతులతో, ఫాలనేత్రంతో పుట్టి గార్దభ స్వరంతో ఏడుస్తుండగా తలిదండ్రులు భయాశ్చర్య నిమగ్నులైనారు. అప్పుడు అశరీరవాణి 'ఇతడిని ఇతరులు చంపలేరు. ఎవడు వీడిని ఎత్తుకొన్నప్పుడు ఎక్కువగానున్న రెండు చేతులూ, నొసటి కన్నూ అణగిపోతాయో అతడే వీడి పాలిటికి అంతకుడు' అని చెప్పింది. జననీజనకులు చూడవచ్చినవారికెల్ల తమ కుమారుడిని ఎత్తుకొనటానికి ఇస్తూ వచ్చారు. ఒకసారి బలరామకృష్ణులు తమ మేనత్త సాత్వతిని చూడదలచి ఆమె ఇంటికి వచ్చారు. సాత్వతి తన కొడుకును ముందు బలరాముడికీ, తరువాత శ్రీకృష్ణుడికీ ఎత్తుకొనటానికి ఇచ్చింది. అచ్యుతుడు బాలునెత్తుకొనగానే వాని మిక్కిలి చేతులు, మిక్కిలి కన్ను మాయమయ్యాయి. సాత్వతి భయపడింది. మురవైరి వలన తన సుతునకు ముప్పు తప్పదని గ్రహించి 'నారాయణా! వీడు మున్ముందు దుర్మార్గుడయి నీకు అప్రియాలు ఆచరించినప్పటికీ, నన్ను జూచి వీని శతాపరాధములు మన్నించవలసినదిగా' వేడింది. కృష్ణు డంగీకరించాడు. శిశుపాలుడు కృష్ణుడి పట్ల అకారణ ద్వేషం వహించి అతడు లేని సమయంలో ద్వారకాపురిని దహించాడు. భోజవంశ ప్రభువులు తమ భార్యలతో రైవతకాద్రిలో విహరిస్తూ ప్రమత్తులై ఉండగా వారిని నిర్దయుడై వధించాడు. వసుదేవుడి యాగహయాన్ని అపహరించి అతడి అశ్వమేధమునకు విఘ్నం కల్గించాడు. ఇంతేకాక వాగ్విషయాలైన అపచారాలెన్నో చేశాడు. ధర్మజుడు రాజసూయ యాగ సమయంలో భీష్మాది వృద్ధుల అనుమతితో శ్రీకృష్ణుడిని పూజిస్తూ ఉండగా అతడు అగ్రపూజకు అనర్హుడని నిండుసభలో నానా దుర్భాషలాడాడు. అత్తకిచ్చిన మాటప్రకారం నూరు తప్పులు సహించి మరి భరించలేక శౌరి చక్రంతో అతడి తల ఖండించాడు. శిశుపాలు నట్లా సంహరించి మాధవుడు వాడి కొడుకును చేది రాజ్యానికి అభిషిక్తుడిని చేశాడు. అతడే ధృష్టకేతుడు. పాండవులకు హితుడై, కురుక్షేత్ర సంగ్రామ రంగంలో పాండవ పక్షం వహించాడు.

వ. అని దండనాథుల నిశ్చయించి వెండియు. 110

ప్రతిపదార్థం: అంటూ ఏడక్షౌహిణులకు దండనాయకులను నిర్ధారించాడు కృష్ణుడు. మరల. (ఇట్లా అన్నాడు:)

క. 'కురుసైన్యము నిస్సారం। బరయఁగ మన బలము లెల్ల నతిదృఢములు; నీ
వరవాయి గొనక నడపుము। ధరణీశ్వర! సేన మొగము దైవము నీకున్. 111

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= భూవల్లభా!; కురుసైన్యము= కౌరవసేన; నిస్సారంబు= శక్తిహీనమైనది; అరయఁగన్= ఆలోచించగా; మన బలములు+ఎల్లన్= మన సైన్యాలన్నియు; అతి ధృఢములు= మిక్కిలి గట్టివి; నీవు= నీవు; అరవాయి+కొనక= వెనుదీయక; నడపుము= సైన్యమును కదలించుము; నీకున్= నీకు; సేనమొగము= సేనాగ్రభాగమునందు; దైవము+అ= దేవుడే నిలిచి ఉంటాడు.

తాత్పర్యం: 'ధర్మజా! కౌరవసేన శక్తిహీనం. ఆలోచించగా మనబలాలు మిక్కిలి చేవగలవి. నీవు సంకోచించక సేనలను నడుపుము. నీ సేనకు అగ్రభాగాన దేవుడే నిలిచి ఉంటాడు.

క. నీ యనుజులు దివిజులకు న। జేయులు ధృతరాష్ట్రసుతులఁ జెఱుచుట వ్రేఁగే?
తోయజనాశము గజలీ। లాయత్తము గాదె! యెత్తు మాహవమునకున్.' 112

ప్రతిపదార్థం: నీ+అనుజులు= నీ తమ్ములు; దివిజులకున్= దేవతలకు కూడ; అజేయులు= జయింపరానివారు; ధృతరాష్ట్ర సుతులన్= ధృతరాష్ట్రుడి కుమారులను; చెఱుచుట= నాశం చేయటం; వ్రేఁగే?= భారమా?; (కాదనిభావం) తోయజనాశము= పద్మాలను పాడుచేయటం; గజలీలా+ఆయత్తము+కాదె!= ఏనుగు యొక్క క్రీడలకు అధీనమైనదే కదా! ఆహవమునకున్= యుద్ధానికి; ఎత్తుము= బయలుదేరుము.

తాత్పర్యం: నీ తమ్ములు వేల్పులకు సైతం గెలువరానివారు. కౌరవులను నాశనం చేయటం వారికి భారం కాదు. తామరల గుంపులను ధ్వంసం చేయటం గజక్రీడలకు లోబడినదే కదా! నీవు యుద్ధానికి బయలుదేరుము.'

విశేషం: అలం: నిదర్శన.

వ. అని నిర్ణయించి నారాయణుఁడు నిజనివాసంబునకుం జనియె; ధర్మతనయుండు దమ్ములుం దానును బ్రియంబంది యారాత్రి సుఖనిద్ర సేసిరి; రేపకడయ పాండవాగ్రజుం డనుజతనుజ దనుజాంతక సామంత మంత్రి పురోహిత సహితంబుగాఁ బేరోలగంబున నుండి సమస్త పరివారంబును వినఁ గార్యంబు నిశ్చయంబుఁ దెలియంబలికి, తగువారలతో సముచిత సంభాషణంబులు సేసి, మహనీయ మహిమ వెలయం బుండరీకాక్షుండు పనిచినట్ల పాంచాలనాథ ప్రముఖుల నక్షౌహిణులకు నధిపతులుగా వేఱువేఱ యభిషేకించి, శ్వేతవంశజాతుం డగుటంజేసి శ్వేతుండనం బ్రఖ్యాతుం డగు ధృష్టద్యుమ్ననకు నుత్కృష్ట ప్రకారంబున నభిషేకం బొనర్చి సర్వసేనాధిపత్యంబునకుం బట్టంబుగట్టి, యయ్యేనమండ్రను దక్కటి దొరలను గనుంగొని మధురవాక్యంబుల నగ్గించి కౌరవులతోడి కయ్యంబునకుం గురుక్షేత్రంబునకు విడియం బోద'మని చెప్పి వారినెల్ల ధనంజయునకుం జూపి. 113

ప్రతిపదార్థం: అని, నిర్ణయించి= కార్యం నిశ్చయించి; నారాయణుండు; నిజ నివాసంబునకున్= తనదైన యింటికి; చనియెన్= వెళ్ళాడు; ధర్మతనయుండున్; తమ్ములున్; తానును; ప్రియంబు+అంది= సంతోషం పొంది; ఆ రాత్రి; సుఖనిద్ర చేసిరి= హాయిగా నిదురపోయారు; రేపకడ+అ= ఉదయముననే; పాండవ+అగ్రజుండు= పాండవులలో తొలుత జన్మించిన ధర్మజుడు; అనుజ= తమ్ములు; తనుజ= కుమారులు; దనుజ+అంతక= రాక్షసులను అంతమొందించిన శ్రీకృష్ణుడు; సామంత= సామంత రాజులు; మంత్రి= సచివులు; పురోహిత సహితంబుగాన్= పురోహితులతో కూడ; పేరు+ఓలగంబునన్+ ఉండి= నిండు సభలో ఉన్నవాడై; సమస్త పరివారంబును వినన్= సకల పరిజనం వింటూ ఉండగా; కార్యంబు నిశ్చయంబు= యుద్ధ కార్య నిర్ణయాన్ని; తెలియన్+పలికి= వారందరికీ తెలిసేటట్లు చెప్పి; తగువారలతోన్= తగినవారితో; సముచిత సంభాషణంబులు చేసి= మిక్కిలి తగిన మాటలు మాటాడి; మహనీయ మహిమ= గొప్ప సంపదలు; వెలయన్= మెరయగా; పుండరీక+అక్షుండు= శ్రీకృష్ణుడు; పనిచిన+అట్ల= ఆజ్ఞాపించినట్లే; పాంచాల నాథ ప్రముఖులన్= ద్రుపదుడు మున్నగువారిని; అక్షౌహిణులకున్= సేనా విభాగాలకు; అధిపతులుగాన్= నాయకులుగా; వేఱువేఱ= ప్రత్యేకంగా; అభిషేకించి; శ్వేత వంశజాతుండు+అగుటన్+చేసి= శ్వేతుడి వంశంలో జన్మించినవాడు కావటంవలన; శ్వేతుండు+అనన్= శ్వేతుడనే నామంతో; ప్రఖ్యాతుండు+అగు= ప్రసిద్ధిగాంచిన; ధృష్టద్యుమ్ననకున్= ద్రుపద మహీపతి కుమారునకు; ఉత్కృష్ట ప్రకారంబునన్= శ్రేష్ఠమైన పద్ధతితో; అభిషేకంబు+ఒనర్చి; సర్వసేనా+ఆధిపత్యంబునకున్= సకల సైన్యాల దొరతనానికి; పట్టంబు+కట్టి= పట్టాన్నిచ్చి; ఆ+ఏనమండ్రను= ఆ ఎనిమిదిమందిని అనగా సర్వ సైన్యాధ్యక్షుడైన ధృష్టద్యుమ్నుడినీ; అక్షౌహిణీ నాయకులగు ద్రుపద, విరాట, సాత్యకి, సహదేవ, చేకితాన, ధృష్టకేతు, శిఖండులనూ; తక్కటి దొరలను= మిగిలిన రాజులనూ; కనుంగొని; మధుర వాక్యంబులన్= ప్రియమైన వచనాలతో; అగ్గించి= కొనియాడి; కౌరవులతోడి కయ్యంబునకున్; కురుక్షేత్రంబునకున్;

విడియన్+ పోదము= దిగుటకు వెళ్ళుదాము; అని చెప్పి; వారిన్+ఎల్లన్= వారందరినీ; ధనంజయునకున్+చూపి= అర్జునుడికి చూపి.

తాత్పర్యం: ఇట్లా నిర్ణయం చేసి కృష్ణుడు తన నివాసానికి వెళ్ళాడు. ధర్మరాజు, అతడి తమ్ములు సంతోషం పొంది ఆ రాత్రి సుఖంగా నిద్రపోయారు. తెల్లవారగనే యుధిష్ఠిరుడు తమ్ములతో, కుమారులతో, శ్రీకృష్ణుడితో, సామంత రాజులతో, మంత్రులతో, పురోహితులతో కూడి నిండు కొలువుండి పరిజనులందరూ వినేటట్లు యుద్ధం నిర్ణయమైనట్లు తెలియబలికాడు. తన వారలతో తగు మాటలాడి, సమున్నత వైభవంతో శ్రీకృష్ణుడు ఆజ్ఞాపించిన విధంగా ద్రుపదుడు మొదలైనవారిని వేర్వేరుగా అక్షౌహిణులకు నాయకులను కావించాడు. విశేషించి ధృష్టద్యుమ్నుడికి ఉత్తమ పద్ధతిలో అభిషేకం చేసి, సర్వసేనాధిపత్యానికి పట్టం కట్టాడు. పిదప ఆ ఎనిమిది మందిని, మిగిలిన రాజులనూ చూచి, ప్రియవచనాలతో వారిని శ్లాఘించి, కౌరవులతో యుద్ధం చేయటానికి కురుక్షేత్రానికి మనం తరలి వెళ్ళుదా' మని చెప్పి వారినందరినీ అర్జునుడికి చూపి (ఇట్లా అన్నాడు:)

ఉ. **'ఎప్పుడు నెయ్యెడం బొదివి యిందఱకుం దగ నీవు కంటికిన్**
ఱెప్పయుఁ బోలె మాటయి నెఱిం బను లారసి యొజ్జచాడ్పునం
జెప్పుచు వీరిబుద్ధిఁగొని చేయుము కార్యము; నీకు రక్షగా
నిప్పరమేశ్వరుండు గలఁ; డిచ్చు శుభం' బని చూపెఁ గృష్ణునిన్. 114

ప్రతిపదార్థం: ఎప్పుడున్= ఎల్లవేళల; ఏ+యెడన్= ఎల్లచోటుల; పొదివి= క్రమ్ముకొని; ఇందఱకున్= ఇచ్చటివారందరికీ; తగన్= ఒప్పిదంగా; నీవు= నీవు; కంటికిన్= కంటికి; ఱెప్పయున్+పోలెన్= రెప్పవలె; మాటు+అయి= అడ్డమై; నెఱిన్= చక్కగా; పనులు+ఆరసి= కార్యాలు విచారిస్తూ; ఒజ్జ చాడ్పునన్= గురుడి చందంగా; చెప్పుచున్= హితవు గరపుతూ; వీరిబుద్ధిన్+కొని= వీరి అభిప్రాయం మన్నించి; కార్యము చేయుము= కర్తవ్యం నిర్వహించుము; నీకున్= నీకు; రక్షగాన్= రక్షకుడుగా; ఈ+పరమ+ఈశ్వరుండు కలఁడు= ఈ దేవాధిదేవుడే ఉన్నాడు; శుభంబు+ఇచ్చున్= శుభం కలిగిస్తాడు; అని+కృష్ణునిన్+చూపెన్= అంటూ శ్రీకృష్ణుడిని చూపాడు.

తాత్పర్యం: 'అర్జునా! ఎల్లవేళలందునూ ఎల్లతావులందునూ క్రమ్ముకొని వీరందరినీ కంటిని రెప్పవలె కాపాడుతూ, పనులన్నింటినీ పరిశీలిస్తూ గురునివలె హితం గరపుతూ, వీరి తాత్పర్యం మన్నిస్తూ కర్తవ్యం సల్పుము. ఈ పరమ పురుషుడే నీకు రక్షకుడు. శుభాలు అనుగ్రహించగలడు' అని శ్రీకృష్ణుడిని చూపాడు.

వ. **ఇట్లు గాంభీర్య మాధుర్య ధుర్యుండైన యుధిష్ఠిరుండు వరిష్ఠ ప్రభువుల చిత్తంబు లారాధించి సర్వజన సమ్మతంబుగా సమరోత్సాహంబు చేసి మహోల్లాసంబునం బ్రస్థాన భేరి సఱవంబంచిన. 115**

ప్రతిపదార్థం: ఇట్లు; గాంభీర్య మాధుర్య ధుర్యుండు= గాంభీర్య మాధుర్య గుణములు వహించేవాడు; (గాంభీర్యమనగా కోపం దుఃఖం మొదలైన వాటిచేత వికారం పొందకుండటం; మాధుర్యమంటే దయ, సౌశీల్యం, సౌజన్యం); ఐన= అయినట్టి; యుధిష్ఠిరుండు; వరిష్ఠ ప్రభువుల చిత్తంబులు= శ్రేష్ఠులైన రాజుల మనస్సులు; ఆరాధించి= పూజించి; సర్వజన సమ్మతంబుగాన్= సకల జనులకు ఇష్టమయ్యేటట్లు; సమర+ఉత్సాహంబు చేసి= యుద్ధం చేసే పూనిక వహించి; (రాజునకు ప్రభుశక్తి, మంత్రశక్తి, ఉత్సాహశక్తి ఉండవలెను. ఈ మూడు శక్తులు ధర్మజుడిలో ముప్పిరిగొన్నవి); అతడు మహా+ఉల్లాసంబునన్= మిక్కిలి సంతోషంతో; ప్రస్థాన భేరి= ప్రయాణ (యుద్ధ) వేళ మ్రోగించే ఢంకా; చఱవన్+పంచినన్= మ్రోగించటాని కాజ్ఞాపించగా.

తాత్పర్యం: ఈ విధంగా గాంభీర్య మాధుర్య గుణ ధురీణుడైన ధర్మజుడు ఉత్తమ ప్రభువుల మనస్సులు ఆరాధించి సకల జనులకు అంగీకారమయ్యేటట్లు యుద్ధంచేయటానికి పూనిక వహించినవాడై, పరమ సంతోషంతో ప్రస్థాన భేరి మ్రోగించండని ఆజ్ఞాపించాడు.

సీ. **బీఱెండ తాఁకున బీఁటలు వాఱిన । పచ్చిగోడల మాడ్కిఁ బగిలె దిశలు,**
కాఁగిన యెసరుల కరణిఁ బొరిం బొరి । శరనిధు లుప్పొంగి పొరలఁబడియెఁ,
గలముపైఁ గీలించి గాలి కెత్తిన చాఁప । వోలె మిన్నంతయు బూరటిల్లెఁ,
గులపర్వతావళి కులిశభయంబున । బెదరి వాపోవున ట్లెదురుసెలఁగె,

తే. **ధాత్రి కుమ్మరి సారె విధమునఁ దిరిగెఁ । జిత్రరూపులభంగి నిశ్చేష్టితంబు**
లయ్యె సర్వభూతములుఁ బ్రయాణభేరి । భూరి నిష్ఠుర ఘోరభాంకార మడర. **116**

ప్రతిపదార్థం: ప్రయాణ భేరి= యుద్ధ ప్రయాణ సమయంలో మ్రోగించబడిన భేరి యొక్క; భూరి= గొప్పదైన; నిష్ఠుర= కఠినమైన; ఘోర= భయంకరమైన; భాంకారము+అడరన్= భాంకారం వ్యాపించగా; బీఱు+ఎండ తాఁకునన్= మిక్కుటమైన ఎండ తగులగా; బీఁటలు+వాఱిన= పగుళ్ళు విడిచిన; పచ్చి గోడల మాడ్కిన్= మట్టి ముద్దలతో పెట్టిన పచ్చి గోడలవలె; దిశలు= దిక్కులు; పగిలెన్= బ్రద్దలయ్యాయి; కాఁగిన్+ఎసరులకరణిన్= తెర్లిన ఎసళ్ళవలె; శరనిధులు= సముద్రములు; పొరిన్+పొరిన్= అత్యంతం; ఉప్పొంగి= పైకి ఉబికి; పొరలన్+పడియెన్= క్రిందికి పొరలినవి; కలముపైన్= పడవమీద; కీలించి= అమర్చి; గాలికిన్+ఎత్తిన చాప+పోలెన్= గాలి కొరకు పైకెత్తిన తెరచాపవలె; మిన్ను+అంతయున్= ఆకాశమంతా; బూరటిల్లెన్= నిండుగా ఉబ్బింది; కులపర్వత+ఆవళి= ఏడు కులగిరులు; కులిశభయంబునన్= ఇంద్రుడి వజ్రాయుధం వలని భీతిచేత; బెదరి= జంకి; వాపోవునట్లు= ఆక్రోశిస్తూ ఉన్న విధంగా; ఎదురు+చెలఁగెన్= ప్రతిధ్వని ఒప్పింది; కుమ్మరి సారె విధమునన్= కుమ్మరిచక్రం వలె; ధాత్రి= పుడమి; తిరిగెన్= భ్రమించింది; సర్వభూతములు= సకల ప్రాణులు; చిత్రరూపుల భంగిన్= పటంలో లిఖించబడిన బొమ్మలవలె; నిశ్చేష్టితంబులు+అయ్యెన్= కదలిక లేకుండినవి.

తాత్పర్యం: ధర్మజుడి యుద్ధ ప్రయాణభేరియొక్క దారుణమైన కఠిన భాంకారం వ్యాపించగా మిక్కిలి ఎండకాసినపుడు మట్టి ముద్దలతో పెట్టిన పచ్చి గోడలమాదిరి దిక్కులు బ్రద్దలయ్యాయి. తెర్లిన ఎసరు నీళ్ళవలె సముద్రాలు అంతకంతకూ ఉప్పొంగి గట్లమీదికి పొర్లిపొరాయి; పడవపై అమర్చి గాలికెత్తిన తెరచాపవలె ఆకసమంతా నిండిపోయింది; ఇంద్రుడి వజ్రాయుధపు వ్రేటుకు భయపడి సప్తకుల పర్వతాలు ఆక్రోశిస్తున్నవో అన్నట్లు ప్రతిధ్వని చెలరేగింది. కుమ్మరివాడి చక్రం మాదిరి భూమి గిరగిరా తిరిగింది. పటంలో లిఖించబడిన బొమ్మలవలె సకల ప్రాణులు నిశ్చలంగా నిలిచిపోయాయి.

విశేషం: కుల పర్వతాల సంఖ్య ఏడు-మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, గంధమాదనం, వింధ్యం, పారియాత్రం.

పాండవులు కౌరవులతోడి యుద్ధంబునకు వెడలుట (సం. 5-149-49)

వ. **ఇట్లు ప్రస్థాన భేరి చెలంగిన సకల సైన్యంబులు దండనాథ సహితంబుగా సన్నద్ధంబులయ్యె; మఱునాఁడు.** **117**

ప్రతిపదార్థం: ఇట్లు; ప్రస్థాన భేరి= ప్రయాణభేరి; చెలంగినన్= మ్రోగగా; సకల సైన్యంబులు= సమస్త సేనలు; దండనాథ సహితంబుగాన్= సేనానాయకులతో కూడ; సన్నద్ధంబులు+అయ్యెన్= యుద్ధానికి సంసిద్ధమయ్యాయి; మఱునాఁడు= మరుసటి దినం.

తాత్పర్యం: ప్రయాణభేరి మ్రోగగానే యుద్ధ యాత్రకు సమస్త సైన్యాలు, దండనాయకులతో సంసిద్ధమయ్యాయి. ఆ మరుసటి రోజు.

ఉ. **భూరి విభూతిఁ బెండ్లికిని బోవు తెఱంగునఁ బాండునందనుల్**
దారును బుత్త్రులున్ హరియుఁ దమ్ముఁడు నుజ్జ్వల చారులీల శృం
గారము చేసి, సమ్మద వికాస మెలర్పఁగ వీర సంభ్రమో
దార సముద్ధతిం జనిరి ద్రౌపది యున్నెడ కందఱుం దగన్. **118**

ప్రతిపదార్థం: భూరి విభూతిన్= అధిక వైభవంతో; పెండ్లికిని+పోవు తెఱంగునన్= పెండ్లికి వెళ్ళే విధంగా; పాండు నందనుల్= పాండవులు; తారును= తామున్నూ; పుత్త్రులున్= తమ కుమారులున్నూ; హరియున్= గోవిందుడూ; తమ్ముఁడున్= అతడి అనుజుడైన సాత్యకీ; ఉజ్జ్వలచారులీలన్= సొంపారు సుందర విలాసంతో; శృంగారము+చేసి= అలంకరించుకొని; సమ్మద వికాసము+ఎలర్పఁగన్= సంతోషకళ అతిశయించగా; వీర సంభ్రమ+ఉదార సముద్ధతిన్= వీరులయొక్క త్వరతో కూడిన గొప్పదైన దర్పంతో; ద్రౌపది+ఉన్న+ఎడకున్= పాంచాలిఉన్న ప్రదేశానికి; తగన్= ఒప్పుగా; అందఱున్= ఎల్లరు; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: మహా వైభవంతో పెళ్ళికి వెళ్ళే విధంగా పాండుకుమారులు తామూ తమ పుత్రులూ, శ్రీకృష్ణుడూ అతడి తమ్ముడైన సాత్యకీ సుందర విలాసాలు సొంపారే తీరున అలంకారాలు కావించుకొని సంతోష కళలు మొగ్గలు తొడుగగా, వీరుల యొక్క త్వరతో గూడిన గొప్ప దర్పంతో పాంచాలిఉన్న ప్రదేశానికి అందరూ వెళ్ళారు.

వ. **ఇట్లుచని యమ్మహాదేవి నామంత్రణంబు సేసి తత్ప్రభృతి పుణ్యస్త్రీ కరకలితలలితాక్షతంబులు గైకొని, విప్రాశీర్వాదంబులాదరించుచు, భద్రపాఠక శ్లోకంబు లాకర్ణించుచు, శోభన పదార్థంబులు గనుంగొనుచు, నాంగిక మాంగల్య సూచకంబులు సేకొనుచు వెడలునప్పుడు.** **119**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; చని= వెళ్ళి; ఆ+మహాదేవిన్= ఆ ద్రౌపదిని; ఆమంత్రణంబు చేసి= వెళ్ళివస్తామని చెప్పి వీడ్కొని; తద్ ప్రభృతి పుణ్యస్త్రీ కరకలిత లలిత+అక్షతంబులు= పాంచాలి మున్నుగాగల సువాసినుల యొక్క చేతుల యందలి ఇంపైన అక్షతలు; కైకొని= స్వీకరించి; విప్ర+ఆశీర్వాదంబులు= బ్రాహ్మణుల యొక్క దీవనలు; ఆదరించుచున్= గౌరవ పూర్వకంగా గ్రహిస్తూ; భద్ర పాఠక శ్లోకంబులు= మంగళ పాఠకుల యొక్క పద్యాలు; ఆకర్ణించుచున్= వింటూ; శోభన పదార్థంబులు కనుంగొనుచున్= ఎదురుగా వచ్చే చందనాది మంగళ ద్రవ్యాలను దర్శిస్తూ; ఆంగిక మాంగల్య సూచకంబులు= తమ శరీరంలో పొడముచున్న శుభ నిమిత్తాలు; చేకొనుచున్; వెడలునప్పుడు= కదలే సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా పాండుకుమారులు పట్టపురాణిఅయిన ద్రౌపదితో వెళ్ళి వస్తామని చెప్పి, ఆమె దగ్గర వీడ్కోలు పొందారు. పాంచాలి మున్నగు ముత్తైదువల చేతులలోని మంగళాక్షతలు స్వీకరించి, భూసురులిచ్చే దీవనలు గ్రహిస్తూ, మంగళ పాఠకుల యొక్క పద్యాలు ఆలకిస్తూ, శుభసూచకాలై ఎదురుగా వస్తున్న మంగళ

వస్తువులను వీక్షిస్తూ, తమ దేహములందు కలుగుతున్న శుభ నిమిత్తాలను కనుగొని మెచ్చుతూ తరలి వెళ్ళే సమయంలో

క. తగ శంఖ కాహళాదిక। మగు మంగళ తూర్యసంచయము గంభీరం
బుగ మ్రోసె జయముఁ దెలుపుచు। జగతీశ్వరు మ్రోల నాకసము దీటుకొనన్. 120

ప్రతిపదార్థం: తగన్= ఒప్పిదమైనట్లు; శంఖ కాహళ+ఆదికము+అగు= శంఖములు, బాకాలు మొదలుగా గల్గిన; మంగళ తూర్య సంచయము= ఢక్క మొదలైన మంగళ వాద్యాల యొక్క సమూహం; ఆకసము దీటుకొనన్= ఆకాశం నిండగా; జయమున్+తెలుపుచున్= గెలుపున్ సూచిస్తూ; జగతీ+ఈశ్వరు మ్రోలన్= భూవల్లభుడి యెదుట; మ్రోసెన్= మ్రోగింది.

తాత్పర్యం: శంఖాలు బాకాలు మొదలైన మంగళవాద్యాల సమూహం గగనతలం నిండగా విజయసూచకమై ప్రభువైన ధర్మజుడి మ్రోల మ్రోగింది.

క. మనుమని జయప్రయాణం। బనుమోదింపంగ నా సుధాంశుఁడు సనుదెం
చినకరణి గొడుగు కుంతీ। తనయాగ్రజుమ్రోల నతిసితప్రభ నొప్పెన్. 121

ప్రతిపదార్థం: మనుమని జయప్రయాణంబు= తన మనుమడి యొక్క యుద్ధ ప్రయాణాన్ని; అనుమోదింపంగన్= అంగీకరించటానికి; ఆ సుధా+అంశుఁడు= అమృతకిరణుడైన ఆ చంద్రుడు; చనుదెంచిన కరణిన్= వచ్చినాడేమో అన్న విధంగా; గొడుగు= ఛత్రం; కుంతీ తనయ+అగ్రజుమ్రోలన్= కుంతి కొడుకులలో పెద్దవాడైన ధర్మజుడి ఎదుట; అతిసితప్రభన్= మిక్కిలి తెల్లని కాంతితో; ఒప్పెన్= శోభిల్లింది; (అమృతము తెల్లనిది; అమృత కిరణుఁడు గనుక చంద్రుడు తెల్లనివాడు; ధవళచ్ఛత్రానికి పోలికగా చంద్రుడిని చెప్పటం రుచిరం; ధర్మజుడు చంద్రవంశంలో జన్మించాడు కనుక చంద్రునికి మనుమడు; మనుమడు ప్రయాణమవుతుండగా తాతగారు వచ్చి చూచి సంతోషించటం సహజం, సమంజసం.)

తాత్పర్యం: తన మనుమడు కురుక్షేత్రానికి పయనం కాగా, అతడి యుద్ధయాత్రను అంగీకరించటానికి అమృత కిరణుడైన చంద్రుడు వచ్చాడేమో అన్నట్లుగా కుంతీ తనయులలో తొలుతటి వాడైన ధర్మపుత్రుడి యెదుట మిక్కిలి ధవళకాంతితో గొడుగు ప్రకాశించింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. అట్టి యెడ నమ్మహీవల్లభుండు. 122

తాత్పర్యం: ఆ సమయంలో ఆ ధర్మరాజు.

క. ఉచితగతిఁ జేరి వంది। ప్రచయముఁ గీర్తింప నెక్కె రథమం దొనరన్
ఖచియించిన వజ్రంబుల। రుచులను బొలుపారు సీవిరులు బెరయంగన్. 123

ప్రతిపదార్థం: ఉచితగతిన్+చేరి= యుక్తమగు విధాన తన దగ్గరకు వచ్చి; వంది ప్రచయము= స్తోత్ర పాఠకుల యొక్క సమూహం- బట్టువారు; కీర్తింపన్= పొగడగా; ఒనరన్= చక్కగా; ఖచియించిన= పొదిగినట్టి; వజ్రంబుల రుచులను= వజ్రాల

కాంతులతో; పొలుపారు= ప్రకాశించు; సీవిరులు= వింజామరలు; బెరయంగన్= పార్శ్వములందు ఆవరించగా; రథమందున్+ ఎక్కెన్= ధర్మజుడు తేరిలో ఎక్కాడు.

తాత్పర్యం: బట్టువారు గారవంగా తన చెంతకు జేరి స్తుతించగా, వజ్రాలు పొదుగుటచేత కాంతులీనే వింజామరలు ఇరుపార్శ్వములందు ఆవరించగా ధర్మరాజు రథాన్ని అధిరోహించాడు.

వ. తదనంతరంబ. 124

తాత్పర్యం: అటు తరువాత.

సీ. వక్ష స్థలంబున వనమాల క్రాలంగ । వెలిమావు గెడల వాగెలు ధరించి
నొగలపై హరియొప్ప నగచరకేతువు । మెఱయంగ నరదంబు మెఱుఁగు లడర
దివ్యకిరీటంబు దీప్తులు భూనభో । తరమెల్లఁ గలయంగఁ బరఁగుచుండ
గాండీవతూణ యుగ్మములు పూర్వాపర । భాగంబులకు నవాభరణములుగఁ

తే. దెలి మొగంబుతో నల్ల నేతెంచి యొక్క। పార్శ్వమునఁ బొడసూపి భూపతికి మ్రొక్కి
దేవదత్తంబు పూరించె దేవదేవు । పాంచజన్యంబునకు మున్న ఫల్గునుండు. 125

ప్రతిపదార్థం: వక్షః+స్థలంబునన్= గుండెమీద; వనమాల= మోకాళ్ళ వరకు వ్రేలాడే పూలదండ; క్రాలంగన్= ఒప్పుతుండగా; వెలిమావు= తెల్లగుర్రాల యొక్క; గెడల వాగెలు= నోటి కళ్ళాలకు తగిలించి జతకూర్చబడిన పగ్గాలు; ధరించి= చేతబట్టి; నొగలపైన్= రథము యొక్క నొగల మీద; హరి+ఒప్పన్= శ్రీకృష్ణుడు విరాజిల్లుతుండగా; నగచర కేతువు= కపిధ్వజం; మెఱయంగన్= ప్రకాశించగా; అరదంబు మెఱుఁగులు+అడరన్= స్యందనం యొక్క కాంతులు వ్యాపించగా; దివ్య కిరీటంబు దీప్తులు= వేల్పులచేత ఒసగబడిన మకుటము యొక్క వెలుగులు; భూనభః+అంతరము+ఎల్లన్= భూమ్యాకాశాల మధ్యప్రదేశమంతటను; కలయంగన్+పరఁగుచున్+ఉండన్= ఎడము లేక నిండగా; గాండీవ= గాండీవమనే విల్లు; తూణయుగ్మములు= అమ్ముల పొదులయొక్క జత; పూర్వ+అపరభాగంబులకున్= తన కుడి యెడమ భుజాలకు; నవ+ఆభరణములుగన్= క్రొత్త సొమ్ములు కాగా; తెలి మొగంబుతోన్= వికాసంతో కూడిన ముఖంతో; అల్లన్= మెల్లగా; ఏతెంచి= వచ్చి; ఒక పార్శ్వంబునన్= ఒక ప్రక్కగా నిలిచి; పొడసూపి= కనబడి; భూపతికిన్= విభుడైన ధర్మజుడికి; మ్రొక్కి= నమస్కరించి; ఫల్గునుండు= అర్జునుడు; దేవదేవు పాంచజన్యంబునకున్= దేవాధిదేవుడైన శ్రీకృష్ణుడి పాంచజన్యమనే పేరుగల శంఖమునకు; మున్న= ముందుగానే; దేవదత్తంబు పూరించెన్= దేవదత్తమనే పేరుగల తన శంఖాన్ని ఒత్తాడు.

తాత్పర్యం: వాసుదేవుడు తన వక్షఃస్థలంలో వనమాల విరాజిల్లుతుండగా తెల్లని గుర్రాల నోటి కళ్లెములకు తగిలించిన పగ్గాలను చేత ధరించి రథం నొగల మీద కూర్చొని ఉన్నాడు. రథంమీద హనుమద్ధ్వజం రెపరెపలాడుతోంది. రథ కాంతులు దిక్కుల వ్యాపిస్తున్నాయి. ఇంద్రదత్తమైన తన మకుట దీప్తులు రోదసీ కుహరమందు సందులేక నిండిపోయాయి. గాండీవం, అక్షయ తూణీర ద్వయం తన కుడి యెడమ భుజాలకు క్రొత్త సొమ్ములుకాగా. వికసించిన ముఖంతో ఫల్గునుడు మెల్లగా వచ్చి ఒక ప్రక్కగా నిలిచి, తనను కనబరచుకొని, నరేంద్రుడైన ధర్మజుడికి నమస్కరించాడు. దేవదేవుడైన శ్రీకృష్ణుడి పాంచజన్య శంఖంకంటె ముందుగానే పార్థుడు దేవదత్తమనే తన శంఖాన్ని ఒత్తాడు.

శా. భీముండుం గవలుం గుమారులును సంప్రీతిన్ గదాద్యాయుధో
ద్దామ స్పీత రుచుల్ వెలుంగ, రథ సంతానంబు రమ్యోజ్జ్వల
శ్రీ మీఱన్ దగ వచ్చి శంఖములు గర్జిల్లంగఁ బూరించుచున్
భూమీశుం గని యగ్రభాగమున కొప్పుం బెంపునుం జేయుచున్. 126

ప్రతిపదార్థం: భీముండున్= వృకోదరుడూ; కవలున్= అమడలైన నకుల సహదేవులు; కుమారులును= అభిమన్యుడు, ఉపపాండవులు మున్నగు పుత్రులును; సంప్రీతిన్= మిక్కిలి హర్షంతో; గదా+ఆది= గద మొదలైన; ఆయుధ= ఆయుధాలయొక్క; ఉద్దామ= అధికమైన; స్ఫీతరుచుల్= స్వచ్ఛమైన కాంతులు; వెలుంగన్= ప్రకాశించగా; రథసంతానంబు= రథాలగుంపు; రమ్య= మనోహరమైన; ఉజ్జ్వల శ్రీమీఱన్= ప్రకాశవంతమైన శోభతో అతిశయిల్లగా; తగన్= ఒప్పిదంగా; వచ్చి; శంఖములు; గర్జిల్లంగన్= రొదచేయగా; పూరించుచున్= ఊదుతూ; భూమీ+ఈశున్+కని= ధర్మరాజును చూచి; అగ్రభాగమునకున్= సేనలయొక్క ముందుభాగానికి; ఒప్పున్= అందమున్నూ; పెంపున్= గౌరవమున్నూ; చేయుచున్= కలిగిస్తూ. (నిలబడిరి - అని తరువాతి పద్యంలోని క్రియతో అన్వయం).

తాత్పర్యం: భీమసేనుడు, నకుల సహదేవులు, అభిమన్యుడు, ఉపపాండవులు, హర్షంతో గద మొదలైన ఆయుధాల యొక్క మిక్కుటమైన స్వచ్ఛ కాంతులు వెలుగుతుండగా, రథాల యొక్క మనోహర శోభలు అతిశయిల్లగా శంఖాలు పూరిస్తూ చనుదెంచి ధరణీవల్లభుడైన ధర్మజుడిని దర్శించారు. సైన్యాగ్ర భాగానికి అందం, గౌరవం సమకూరుస్తూ (నిలబడ్డారు.)

క. నిలిచిరి, తక్కటి దొరలును । బలుమానుసులును మహోగ్రభంగి సవరణల్
సెలువొంద నధిపు చుట్టుల । నలంకరించిరి విభూషణాంశుచ్ఛటలన్. 127

ప్రతిపదార్థం: నిలిచిరి= అభిమన్యుడు మొదలైన కుమారులు నిలబడ్డారు; తక్కటి దొరలును= మిగిలిన ప్రభువులును; బలుమానుసులును= యుద్ధం సల్పగల దొడ్డ మనుష్యులును; మహా+ఉగ్రభంగిన్= మిక్కిలి భయంకరమైన రీతులలో; సవరణల్= యుద్ధ సన్నాహాలు; చెలువు+ఒందన్= వన్నెమీరగా; విభూషణ+అంశు+ఛటలన్= తాము ధరించిన విశిష్టఆభరణాల యొక్క దీప్తి సమూహం చేత; అధిపుచుట్టులన్= ధర్మజుడి నలువైపులను; అలంకరించిరి= సింగారించారు.

తాత్పర్యం: తక్కిన రాజులును, వీరగ్రామణులును మిక్కిలి భయంకరంగా రణసన్నాహకలితులై తాము ధరించిన ఆభరణ కాంతిపుంజంతో ధర్మజుడిని నలువైపుల సింగారిస్తూ నిలిచారు.

వ. అప్పుడు పాండవాగ్రజున కభిముఖంగాఁ జనుదెంచి. 128

ప్రతిపదార్థం: అప్పుడు; పాండవ+అగ్రజునకున్= పాండవులలో పెద్దవాడైన ధర్మనందనునకు; అభిముఖంబుగాన్= ఎదురుగా; చనుదెంచి= వచ్చి.

తాత్పర్యం: అపుడు ధృష్టద్యుమ్నుడు ధర్మనందనుడికి అభిముఖంగా వచ్చి.

క. సాష్టాంగ మెఱఁగి సమరా । వష్టంభం బొప్ప దివ్యవాహన లీలో
త్కృష్టగతిన్ ముంగలియై । ధృష్టద్యుమ్నుండు వొలిచెఁ దేజో మహిమన్. 129

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్నుండు= (ద్రుపద తనయుడు); స+అష్ట+అంగము+ఎఱఁగి= దండాకారంగా ఎనిమిది అవయవాలు నేలకు తగిలేటట్లు నమస్కరించి; సమర+అవష్టంభంబు= యుద్ధగర్వం; ఒప్పన్= అతిశయించగా; దివ్యవాహన లీలా+ఉత్కృష్టగతిన్= దివ్యమైన అశ్వము యొక్క విలాసముచేత ప్రశస్తమైన గమనంతో; ముంగలి ఐ= ముందున్నవాడై; తేజో మహిమన్= ప్రతాప వైభవంతో; పొలిచెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ధర్మరాజుకు సాగిలపడి నమస్కరించి, రణదర్పం మేరమీరగా, అశ్వము నధిరోహించి విలాసగమనంతో సేనలకు ముందున్నవాడై ప్రతాపదీప్తితో ప్రజ్వలించాడు.

వ. ఇవ్విధంబునం జారుభీషణంబుగా సన్నద్ధుండై యుధిష్ఠిరుండు గదలి శుభసూచకంబులు గైకొనుచు నడచె; నట్టిసమయంబున నెల్లవారి పరిచారకులును శకటాది సకల సాధనంబులును బటగృహంబులును మొదలుగా వలయు సమస్త వస్తువు లొడఁగూర్చి వెడలిన దండు పఱపై సముద్రంబు గాఁపువోవు చందంబయ్యె; నిట్లరిగి ధర్మపుత్త్రుండు కురుక్షేత్రంబు దఱియంజొచ్చి ఋష్యాశ్రమంబులకు దేవతాయతనంబులకు నలజడి గాకుండం బరిహారంబు సేయుచుం జని తృణకాష్ఠ జలసమృద్ధంబై తగియెడు సమస్థలంబున హిరణ్వతి యను పుణ్యనది పొంత విడిదలగా నిరూపించి యచ్చో నిలిచెఁ; దదనంతరంబ. 130

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; యుధిష్ఠిరుండు; చారుభీషణంబుగాన్= రమ్యంగానూ, భయానకంగానూ; సన్నద్ధుండై= యుద్ధమునకు సంసిద్ధుడై; కదలి; శుభసూచకంబులు గైకొనుచున్= శుభ శకునములు స్వీకరిస్తూ; నడచెన్= గమనం సాగించాడు; అట్టి సమయంబునన్; ఎల్లవారి పరిచారకులును= రాజులందరి సేవకులును; శకట+ఆది= బండ్లు మొదలైన; సకల సాధనంబులును= సమస్త పరికరాలున్నూ; పటగృహంబులు= గుడారాలు-డేరాలు; మొదలుగాన్= మున్నగు; వలయు= కావలసిన; సమస్త వస్తువులు; ఒడగూర్చి= ప్రోగుచేసి; వెడలిన దండు= బయలుదేరిన సైన్యం; పఱపు+ఐ= విశాలమై - దట్టమై; సముద్రంబు; కాఁపు+పోవు చందంబు+అయ్యెన్= నివసించడానికి వెళుతున్నట్లయింది; ఇట్లు+అరిగి; ధర్మపుత్త్రుండు; కురుక్షేత్రంబు; తఱియన్+చొచ్చి= సమీపించి; ఋషి+ఆశ్రమంబులకున్= మునుల ఆశ్రమాలకూ; దేవతా+ఆయతనంబులకున్= దేవాలయాలకూ; అలజడి+కాకుండన్= బాధ కలుగకుండా; పరిహారంబు చేయుచున్= విడిచిపెట్టి; చని= వెళ్ళి; తృణ కాష్ఠ జలసమృద్ధంబు+ఐ= పశువులకు గడ్డి, వంటచేసికొనటానికి కట్టెలు, త్రాగటానికి నీరు అనునని కలిగినదై; తగియుండు= తగినట్టి; సమస్థలంబునన్= గుంటమిట్టలు లేక చదునైన ప్రదేశంలో; హిరణ్వతి+అను; పుణ్యనది పొంతన్= పావనమైన నదీతీరంలో; విడిదలకాన్= దండు విడిసే చోటుగా; నిరూపించి= నిర్ణయించి; అచ్చోన్+నిలిచెన్= అక్కడ ఆగాడు; తద్+అనంతరంబు+అ= ఆ పిదప.

తాత్పర్యం: ధర్మరాజు రమణీయ భయానకంగా యుద్ధ సన్నద్ధుడైనాడు. శుభ శకునాలను గైకొంటూ నడచాడు. ఆ సమయంలో ఆయా రాజుల సేవకులు బండ్లు మొదలైన ప్రయాణ సాధనాలు, డేరాలు మొదలైన కావలసిన సకల వస్తువులూ సమకూర్చుకొని బయలుదేరారు. అట్లా కదలిపోతున్న విశాలమైన ఆ దండు సముద్రమే కాపురం పెట్టటానికి కురుక్షేత్రానికి తరలిపోతున్నదా అన్నట్లుంది. ఇట్లా వెళ్ళి ధర్మపుత్త్రుడు కురుక్షేత్రాన్ని సమీపించాడు. మునీశ్వరుల ఆశ్రమాలకూ, దేవాలయాలకూ ఎట్టి అలజడి కలుగకుండా వాటికి దూరంగా దండు నడిచింది. అట్లా యుధిష్ఠిరు డరిగి గడ్డి వంటచెరకు జలం సమృద్ధిగా లభించే చదునైన ఒక ప్రదేశంలో హిరణ్వతి అనే పేరుగల ఒక పవిత్ర నది ఒడ్డున ఆగాడు. అది దండు విడియడానికి తగిన చోటుగా నిర్ధారణ చేశాడు.

తే. **విడియుటకు సూచకంబుగ విష్ణుఁ డొత్తెఁ । బాంచజన్యంబు; ధర్మజపార్థులాది**
గాఁగఁ దమతమ వీరశంఖంబు లెల్ల । దొరలు నొత్తిరి దివి మ్రోఁతఁ దూఁటుగట్ట. **131**

ప్రతిపదార్థం: విడియుటకున్= దండు దిగుటకు; సూచకంబుగన్= గుర్తుగా; విష్ణుఁడు= శ్రీకృష్ణుడు; పాంచజన్యంబున్+ఒత్తెన్; ధర్మజ పార్థులు+ఆది గాఁగన్= ధర్మపుత్రుడు అర్జునుడు మున్నుగా; ఎల్ల దొరలున్= రాజులందరూ; దివి= ఆకాశం; మ్రోఁతన్= ధ్వనిచేత; తూఁటు+కట్టన్= చిల్లిపడగా; తమ తమ వీరశంఖంబులు+ఒత్తిరి= పౌరుషం ప్రకటించే తమ తమ శంఖాలను ఊదారు.

తాత్పర్యం: హిరణ్వతీ నదీతీరాన దండు దిగుటకు గుర్తుగా శ్రీ మహావిష్ణువు పాంచజన్యమనే తన శంఖాన్ని పూరించాడు. ధర్మజుడు అనంతవిజయమనే శంఖాన్నీ, అర్జునుడు దేవదత్తాన్నీ, భీముడు పౌండ్రమనే శంఖాన్నీ, నకులుడు సుఘోషాన్నీ, సహదేవుడు మణిపుష్పకాన్నీ పూరించగా యుద్ధం చేయవచ్చిన ప్రభువులందరూ మగటిమి చాటే తమ తమ వీరశంఖాలను ఊదారు.

విశేషం: ఇక్కడ ఇంచుక వివరణ:

> **"తత శ్శ్వేతై ర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ,**
> **మాధవః పాండవ శ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః,**
> **పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః,**
> **పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః।.**
> **అనంత విజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః,**
> **నకుల స్సహదేవ శ్చ సుఘోష మణిపుష్పకౌ॥,**
> **కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః,**
> **ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకి శ్చాపరాజితః.**
> **ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే,**
> **సౌభద్రశ్చ మహా బాహుః శంఖాన్ దధ్ముః పృథక్పృథక్."**

అని సంజయుడు ధృతరాష్ట్రుడితో అంటాడు.

'అప్పుడు కృష్ణార్జునులు పాంచజన్య దేవదత్తంబులును, భీమసేనుండు పౌండ్రంబును, యుధిష్ఠిరుం డనంతవిజయంబును, నకుల సహదేవులు సుఘోష మణిపుష్పకంబులును, పాంచాల విరాట సాత్యకి ధృష్టద్యుమ్న శిఖండి ప్రముఖ దండనాయకులు దమతమ శంఖంబులుఁ బూరించి''రని తిక్కనగారి అనువాదం. భీష్మపర్వం - ప్రథమాశ్వాసం 176. శ్రీకృష్ణార్జునుల శంఖనామములు ప్రసిద్ధాలు. ధర్మజ భీమ నకుల సహదేవుల శంఖముల పేర్లు వరుసగా అనంత, విజయ, పౌండ్ర, సుఘోష, మణిపుష్పకములని వ్యాసులవారు పేర్కొన్నారు.

వ. **తదనంతరంబ యొక్క రమ్యప్రదేశంబున రాజమందిరంబును నుచిత స్థానంబుల సమస్తజన నివాసంబులునై రమణీయబంధురంబును సింధురాశ్వశాలా మాలికా మనోహరంబునుంగా వీడెల్ల విడిసె; వీటి చుట్టునుం దిరిగి ధృష్టద్యుమ్నుండు సురక్షితంబు చేసివచ్చె; రాజును దొరలును దమ్ములును సకల పరివారంబును దగిన తెఱంగున నుండిరి. నానావస్తు బహుళ సంభారంబుల మహోదారం బగుచుఁ బాండవ స్కంధావారంబు మహనీయాకారంబున నొప్పె; నంత నక్కడ.** **132**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తద్+అనంతరంబ= ఆ పిదప; ఒక రమ్య ప్రదేశంబునన్= ఒక మనోహరమైన చోట; రాజమందిరంబును= రాజభవనమును; ఉచిత స్థానంబులన్= తగిన తావులలో; సమస్త జన నివాసంబులును+ఐ= జనులందరికీ నివాస గృహాలు కలిగి; రమణీయ బంధురంబును= మనోహరము, ఒప్పినవియునై; సింధుర+అశ్వశాలా మాలికా మనోహరంబునున్+కాన్= ఏనుగుల, గుర్రాల సాలల యొక్క వరుసలచే ఇంపు గొల్పునది కాగా; వీడు+ఎల్లన్+విడిసెన్= సైన్యమంతయూ బస చేసింది; ధృష్టద్యుమ్నుండు; వీటి చుట్టునున్= సైన్యం విడిసిన చోటు చుట్టూ; తిరిగి= ప్రదక్షిణించి; సురక్షితంబు చేసివచ్చెన్= మిక్కిలి రక్షింపబడినట్టిదిగా చేసి వచ్చాడు; రాజును= ధర్మజుడును; దొరలును= ప్రభువులును; తమ్ములును= భీమాదులు; సకల పరివారంబును= సమస్త పరిజనమున్నూ; తగిన తెఱంగునన్+ఉండిరి= ఉచిత విధంగా ఉన్నారు; నానావస్తు బహుళ సంభారంబులన్= పలు తెఱగులైన వస్తువులు, అధికమైన పదార్థ సంచయం అనే వాటిచే; మహా+ఉదారంబు+అగుచున్= మిక్కిలి దొడ్డదై; పాండవస్కంధావారంబు= పాండవుల యొక్క దండు విడిసిన చోటు; మహనీయ+ఆకారంబునన్= గొప్ప స్వరూపంతో; ఒప్పెన్; అంతన్; అక్కడన్.

తాత్పర్యం: ఒక అందమైన ప్రదేశంలో రాజగృహం, తగిన తావులందు సకల జన నివాసాలూ, గజశాలలూ, అశ్వశాలలూ చూడటానికి సొగసుగా ఉండగా దండు దిగింది. ధృష్టద్యుమ్నుడు పాండవ స్కంధావారం చుట్టూ తిరిగి దానిని సురక్షితం కావించి వచ్చాడు. ధర్మజుడు, అతని తమ్ములు, ప్రభువులు, సమస్త పరిజనులు అర్హ విధాల ఆయా తావులలో ఉన్నారు. నానావస్తుసామగ్రులతో మిక్కిలి దొడ్డదైన ఆ పాండవ స్కంధావారం సమున్నతాకారంతో భాసిల్లింది. ఇక హస్తినాపురంలో.

క. చారులచే నంతయు విని । కౌరవపతి విననియట్ల కర్ణాదులతోఁ
బేరోలగమున విగత వి । కారుండై యిట్టు లనియె గర్వ మెలర్పన్. 133

ప్రతిపదార్థం: కౌరవపతి= కౌరవులకు నాయకుడైన దుర్యోధనుడు; చారులచేన్= వేగులవారిచేత; అంతయున్ విని= పాండవులు దండు విడిసినారని తెలిసి; వినని+అట్ల= తనకేమీ ఆ విషయం తెలియని చందంగా; కర్ణ+ఆదులతోన్= రాధేయుడు మున్నగు వారితో; పేరు+ఓలగమునన్= పెద్దసభలో; విగత వికారుండు+ఐ= మారుపాటు లేనివాడై; గర్వము+ఎలర్పన్= అహంకారం అతిశయించగా; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: వేగులవారి వలన పాండవులు దండు విడిసినారని విని, తానేమీ విననివాడి మాదిరి దుర్యోధనుడు తన ఆకార స్వభావాలందు ఏమార్పు లేనివాడై పెద్ద సభలో రాధేయుడు మొదలైనవారితో అహంకార మతిశయించగా ఇట్లా అన్నాడు:

క. 'తన వచ్చిన కార్యము మన । మనుకూలతఁ జేయకున్న హరి యలుకమెయిన్
జని యప్పాండు తనూజులు । మనములఁ గిను కూనునట్టి మాటలు సెప్పున్. 134

ప్రతిపదార్థం: హరి= శ్రీకృష్ణుడు; తన వచ్చిన కార్యమున్= తాను చనుదెంచిన పనిని; మనము; అనుకూలతన్= తన సంకల్పానికి అనుగుణంగా; చేయక+ఉన్నన్= చేసినవాళ్ళం కానందున; అలుక మెయిన్= కోపంతో; చని= వెళ్ళి; ఆ+ పాండుతనూజులు= ఆ పాండు కుమారులు; మనములన్= తమ చిత్తములందు; కినుక= కోపం; ఊను+అట్టి మాటలు= పొందునట్టి పలుకులు; చెప్పున్= వారికి చెపుతాడు.

తాత్పర్యం: 'శ్రీకృష్ణుడు తాను వచ్చిన పనిని మనం అనుకూలంగా నెరవేర్చనందువలన మన మీద కోపంతో వెళ్ళి, పాండవులకు క్రోధం కలిగించే మాటలు చెప్తుతాడు.

చ. **మును మనచేత భంగపడి ముచ్చిరి యుండుటఁ జేసి పాండునం**
దనులును నెత్తివత్తు రుచితంబుగ; సంగర మెట్లుఁ గల్గుఁ; బే
ర్చిన బహుసైన్యముల్ బయలఁ జేరఁ దగన్ విడియింత; మెల్లి దం
డని పురిఁ జాటఁ బంచి దొరలందఱకున్ బడిసేయుఁ డేడ్తెఱన్. **135**

ప్రతిపదార్థం: మును= పూర్వం; మనచేతన్= మనవలన; భంగపడి= అవమానించబడి; ముచ్చిరి+ఉండుటన్+చేసి= పరితపిస్తున్నందువలన; పాండునందనులును= పాండుపుత్రులు కూడ; ఉచితంబుగన్= తగిన విధంగా; ఎత్తివత్తురు= యుద్ధం చెయ్యటానికి వస్తారు; సంగరము= యుద్ధం; ఎట్లున్+కల్గన్= ఏ విధంగానైనా జరిగి తీరుతుంది; పేర్చిన= అతిశయించిన; బహుసైన్యముల్= పెక్కు సేనలు; బయలన్+చేరన్= బయలునకు చేరగా; తగన్= చక్కగా; విడియింతము= దిగేటట్లు చేద్దాము; ఎల్లి= రేపు; దండు+అని= దండయాత్ర అని; పురిన్= పట్టణంలో; చాటన్+పంచి= చాటించి; దొరలు+ అందఱకున్= రాజులందరికీ; ఏడ్తెఱన్= శీఘ్రంగా; పడి చేయుఁడు= ఆజ్ఞలివ్వండి.

తాత్పర్యం: పూర్వం మనచేత అవమానించబడి పరితపిస్తున్న వారు కనుక పాండవులు తగిన విధంగా యుద్ధం చెయ్యటానికి తరలివస్తారు. సమరం జరగక మానదు. ఏపుమీరిన మన సేనలు విశాలమైన బయలుకు చేరుకొనగానే అక్కడ దిగేటట్లు చేద్దాము. రేపే దండయాత్ర అని నగరంలో చాటించండి. రాజు లందరికీ శీఘ్రమే ఆజ్ఞలివ్వండి.

వ. **మనకు విడిదల కురుక్షేత్రం'బని పలికి దుశ్శాసనుం జూచి, నీవును గర్ణుండును గాంధారపతియును సమస్తంబును సమకట్టుం' డనుటయు వారలు ప్రియంబునం బనిపూని వెడలి దండు సాటించి, తగు వారలకెల్ల నెఱింగించి పుచ్చిన, సకల పరివారంబును బ్రమోదంబు నొందె; భూవల్లభుండును గొలిచియున్నవారలం బోవంబంచి, వలయు నెడకుం జని తగిన వర్తనంబున నుండె; నట్టి సమయంబునఁ బ్రయాణోచితంబులగు బహుప్రకార వ్యాపారంబులయందుఁ దత్పరులయిన దొరల నానాచేష్టితంబులను, గరితురగ రథంబులకు సవరణలు సమకూర్చు చతుర పరిచారకుల సంభ్రమంబునను, వివిధాయుధంబులు రవణంబులుగా నాయితంబులు సేయఁ బ్రవర్తించు పదాతి వర్గంబుల సంరంభంబునను నయ్యైసరకులు పయనంబున కనువు సేయ బలుమానిసుల తిరుగుడు వడుటనుం బురంబు సమరోత్సాహ చంద్రోదయంబునకు మహార్ణవంబై ఘూర్ణిల్లుచుండె; నపరదిన ముఖంబున.** **136**

ప్రతిపదార్థం: మనకున్; విడిదల= విడియు చోటు; కురుక్షేత్రంబు; అని; పలికి దుశ్శాసనున్ చూచి నీవును; కర్ణుండును; గాంధార పతియున్= శకునియు; సమస్తంబును సమకట్టుండు= అన్ని ఏర్పాట్లు చెయ్యండి; అనుటయున్= అని చెప్పగా; వారలు; ప్రియంబునన్= సంతోషంతో; పనిపూని; వెడలి; దండు చాటించి= యుద్ధయాత్రను పట్టణంలో చాటించి; తగువారలకున్+ఎల్లన్= తగిన వారికందరికీ; ఎఱింగించి= తెలిపి; పుచ్చినన్= పంపగా; సకల పరివారంబును= బలగ మంతయున్నూ; ప్రమోదంబున్+ఒందెన్= సంతోషించింది; భూవల్లభుండును= దుర్యోధనుడు; కొలిచి+ఉన్న వారలన్= తనను సేవిస్తున్నవారిని; పోవన్+పనిచి= వెళ్ళండని చెప్పి; వలయు+ఎడకున్+చని= ఇష్టప్రదేశానికి వెళ్ళి; తగిన వర్తనంబునన్+ ఉండెన్= తన పనిలో తానున్నాడు; అట్టి సమయంబునన్; ప్రయాణ+ఉచితంబులగు= పయనమునకు తగినట్టి; బహుప్రకార

వ్యాపారంబులయందున్= అనేక విధాలైన పనిపాటులలో; తత్పరులు+ఐన= శ్రద్ధగలవారైన; దొరల= రాజుల యొక్క; నానా చేష్టితంబులను= పలు తెరగులైన పనులచేతను; కరి తురగ రథంబులకున్= ఏనుగులకు, గుఱ్ఱాలకు, రథాలకు; సవరణలు సమకూర్చు= అలంకారాలు సల్పు; చతుర పరిచారకుల= నేర్పుగల భృత్యులయొక్క; సంభ్రమంబునను= వేగిరపాటు చేతను; వివిధ+ఆయుధంబులు= రకరకాలైన ఆయుధాలు; రవణంబులుగాన్= ఆభరణాలుగా; ఆయితంబులు+చేయన్= సిద్ధపరచుటకు; ప్రవర్తించు= తిరుగుతున్న; పదాతివర్గంబుల= కాలిబంటుల యొక్క (నడజోదులయొక్క); సంరంభంబునను= సన్నాహం చేతనూ; అయ్యై సరకులు= ఆయాపదార్థాలు; పయనంబునకున్= యుద్ధయాత్రకు; అనువు చేయు= సిద్ధం గావించే; బలుమానుసుల= బలిష్ఠులైనవారి యొక్క; తిరుగుడు+పడుటనున్= తిరుగుచుండటం చేతను; పురంబు= హస్తినాపురి; సమర+ఉత్సాహ చంద్ర+ఉదయంబునకున్= యుద్ధ ప్రయత్నమనెడు చంద్రోదయానికి; మహా+అర్ణవంబు+ఐ= గొప్ప సముద్రమై; ఘూర్ణిల్లుచున్+ఉండెన్= మ్రోగుతుండింది; అపరదిన ముఖంబునన్= మరునాటి ప్రభాత సమయంలో-

తాత్పర్యం: మనము విడియవలసిన చోటు కురుక్షేత్ర'మని పలికి దుర్యోధనుడు దుశ్శాసనుడిని చూచి, 'నీవూ కర్ణుడూ, శకునీ అన్ని పనులు చూడండి' అని చెప్పగా వారు మహాసంతోషంతో కార్యోన్ముఖులై వెళ్ళారు. నగరంలో దండయాత్ర చాటించారు. తగిన వారందరికీ యుద్ధయాత్రను గురించి తెల్పటానికి సేవకులను నియోగించారు. దుర్యోధనుని పరివారమంతా సంతోషం పొందింది. రాజరాజు తనను కొలిచిఉన్న వారిని వెళ్ళండని పలికి వారికి సెలవొసంగి తనపాటికి తాను తగిన వర్తనంతో ఉండిపోయాడు. ఆ సమయాన ప్రయాణానికి అనుకూలమైన పలు విధాలైన పనులలో మునిగిన రాజుల చేష్టితాలూ, ఏనుగులను, గుఱ్ఱాలను, రథాలను అలంకరించే నేర్పుగల పరిచారకుల సందడీ, పలురకాలైన ఆయుధాలు అనే సొమ్ములను సంసిద్ధపరచడానికి తిరుగుతున్న కాలిబంటుల యొక్క సంరంభం, ప్రయాణానికి తగిన వస్తుసామగ్రిని సమకూరుస్తున్న బలిష్ఠులైన మనుషుల తిరుగుళ్ళూ కలిగి హస్తినాపురం యుద్ధోత్సాహమనే చంద్రోదయ వేళ ఆటుపోటుల్లో ఉన్న మహాసముద్రంవలె ఉన్నది. అంత మరునాటి ప్రభాతసమయంలో-

విశేషం: సమరోత్సాహ చంద్రోదయంబునకుఁబురంబు మహార్ణవంబై - అలంకారం రూపకం.

క. త్వరితగతి సమయ సముచిత । కరణీయము లాచరించి కమనీయాలం
కరణోజ్జ్వలుఁడై యెలమిం । గురురా జేతెంచెఁ గొలువు కూటంబునకున్. 137

ప్రతిపదార్థం: త్వరితగతిన్= శీఘ్రంగా; సమయ సముచిత= ఆ వేళకు తగిన; కరణీయములు= చేయవలసిన పనులు; ఆచరించి= చేసి; కమనీయ+అలంకరణ+ఉజ్జ్వలుఁడు+ఐ= మనోహరమైన అలంకారాల చేత మిక్కిలి ప్రకాశిస్తున్నవాడై; ఎలమిన్= సంతోషంతో; కురురాజు= కౌరవపతి సుయోధనుడు; కొలువుకూటంబునకున్= సభామందిరానికి; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: మరునాటి ప్రభాత సమయంలో తొందరగా తత్కాలోచితాలైన కృత్యాలు నిర్వర్తించి మనోజ్ఞాలైన అలంకారాలతో ప్రకాశిస్తూ కొలువుకూటానికి కురురాజైన సుయోధనుడు సంతోషంతో వచ్చాడు.

వ. వచ్చి దుశ్శాసన ప్రముఖ నిఖిలసహోదర పరివృతుండై యుండి. 138

ప్రతిపదార్థం: వచ్చి; దుశ్శాసన ప్రముఖ= దుశ్శాసనుడు మొదలైన; నిఖిల సహోదర= సమస్త సోదరులతో; పరివృతుండు+ఐ+ఉండి= చుట్టబడినవాడై ఆసనమునందు అధివసించి.

తాత్పర్యం: వచ్చి, దుశ్శాసనుడు మొదలైన అనుజవర్గంచేత చుట్టబడినవాడై ఉండి రాజరాజు.

దుర్యోధనుఁడు ద్రోణప్రభృతుల సేనాపతులం జేయుట (సం. 5-152-27)

సీ. **అరిభయంకరుఁడు ద్రోణాచార్యుఁడును, రణో । త్సాహ లంపటుఁడు రాధాసుతుండు,**
శరతత్త్వవేది యశ్వత్థామయును, భూరి । బాహా విలాసుండు బాహ్లికుండు,
శౌర్య వైభవశాలి శల్యుండు, ధైర్యసం । పన్నిధి కృపుఁడును, బ్రకటశక్తి
సార దుర్జయమూర్తి భూరిశ్రవుండును, । దర్పోజ్జ్వలుండు గాంధారపతియు,

తే. **నుగ్రతేజుండు గృతవర్మయును, బ్రతాప । ఘనుఁడు కాంభోజుఁడును, బరాక్రమధనుండు**
సింధురాజును బతులుగాఁ జేయఁగోరి । కొనఁగఁ దగువార లగుదు రక్షోహిణులకు.' **139**

ప్రతిపదార్థం: అరిభయంకరుఁడు= శత్రువులకు భయం గలిగించునట్టి; ద్రోణ+ఆచార్యుఁడును= గురువైన ద్రోణుఁడును; రణ+ఉత్సాహలంపటుఁడు= యుద్ధంచేయటంలో మిక్కిలి ఆశ గల్గిన; రాధాసుతుండు= రాధ కొడుకు కర్ణుడును; శరతత్త్వవేది= బాణాల యొక్క స్వరూప స్వభావాలెరిగిన; అశ్వత్థామయును= గురుపుత్రు డశ్వత్థామయూ; భూరిబాహావిలాసుండు= గొప్ప భుజసౌందర్యంగల (అనగా అధిక భుజశక్తి గలిగిన); బాహ్లికుండు= శంతను మహారాజు తమ్ముడైన బాహ్లికుడును; శౌర్యవైభవశాలి= పరాక్రమ విభవము గల్గినట్టి; శల్యుండున్= మద్రరాజు శల్యుడును; ధైర్యసంపద్+నిధి= ధైర్యసంపదకు నిలయమైన; కృపుఁడును= కృపాచార్యులున్నూ; ప్రకట శక్తిసార దుర్జయమూర్తి= ప్రఖ్యాతమైన బలవిక్రమముల చేత జయించరాని స్వరూపంగల; భూరిశ్రవుండును= భూరిశ్రవుడనేవాడును; దర్ప+ఉజ్జ్వలుండు= గర్వరేఖచేత వెలుగునట్టి; గాంధార పతియున్= శకునియూ; ఉగ్రతేజుండు= భయంకర ప్రతాపంగల (రుద్రుని ప్రతాపం వంటి ప్రతాపం గలిగినవాడని భావం); కృతవర్మయును= (భోజకులాగ్రణి) కృతవర్మయున్నూ; ప్రతాపఘనుఁడు= విక్రమంచేత గొప్పవాడైన; కాంభోజుఁడును= కాంభోజ దేశరాజున్నూ; పరాక్రమధనుఁడు= శౌర్యమే ధనంగా కలిగిన; సింధురాజును= సింధుదేశాధిపతి సైంధవుడున్నూ; అక్షోహిణులకున్= పదకొండు అక్షౌహిణుల సేనలకు; పతులుగాన్+చేయన్= నాయకులుగా చేయటానికి; కోరికొనఁగన్+తగువారలు+అగుదురు= వరించటానికి అర్హులైనవారవుతారు.

తాత్పర్యం: శత్రుభయంకరుడైన ద్రోణాచార్యులు, యుద్ధోత్సాహశీలిఅయిన రాధేయుడు, బాణ స్వరూప స్వభావాలెరిగిన అశ్వత్థామ; అధిక భుజశక్తి గలిగిన బాహ్లికుడు, పరాక్రమ వైభవోపేతుడు శల్యుడు, ధైర్య సంపదకు నిలయమైన కృపాచార్యుడు, విఖ్యాత వీర్యంచేత జయించరానట్టి భూరిశ్రవుడు, దర్పంచేత దీపించే శకుని, దారుణ ప్రతాపశాలి కృతవర్మా, విక్రమాఢ్యుడు కాంభోజరాజు, శౌర్యధన సంపన్నుడు సైంధవుడు మన పదకొండక్షోహిణులకు నాయకులుగా కోరదగినవారు.

చ. **అని మది నిశ్చయించి తగ నందఱఁ బిల్వఁగఁ బంచి వారితో**
నని పని మాటలాడి వినయంబునఁ బ్రార్థన చేసి 'మీర లీ
యొనరిన సైన్యముల్ పదునొకొంటికిఁ బ్రాభవ మాచరింపఁ జొ
చ్చిన సకలంబు నొప్పు నభిషేకముఁ గైకొనుఁ డుత్సవంబునన్. **140**

ప్రతిపదార్థం: అని; మదిన్= తన మనస్సులో; నిశ్చయించి= నిర్ధారించుకొని; తగన్= ఒప్పుగా; అందఱన్= వీరినందరినీ; పిల్వఁగన్+పంచి= పిలువనంపి; వారితోన్= ఆ వచ్చిన ద్రోణ ప్రముఖులతో; అని పని మాటలు+ఆడి= యుద్ధ సంబంధి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విషయాలను చర్చించి; వినయంబునన్= అడకువతో; ప్రార్థన చేసి= వేడికొని; మీరలు= మీరు; ఈ+ఒనరిన సైన్యముల్= కూడిన ఈ సేనలు; పదునొకొంటికిన్= పదకొండక్షౌహిణులకు; ప్రాభవము+ఆచరింపన్+చొచ్చినన్= ఆధిపత్యం చేయటానికి పూనుకొంటే; సకలంబున్+ఒప్పున్= అంతా సవ్యంగా జరుగుతుంది; ఉత్సవంబునన్= వైభవంగా; అభిషేకము+కైకొనుఁడు= అభిషిక్తులు కండి.

తాత్పర్యం: దుర్యోధనుడు ఈ ప్రకారంగా తన మనసులో నిర్ణయం చేసికొని చక్కగా వారి నందరినీ సభకు రప్పించి వారితో యుద్ధ విషయాలు ముచ్చటించి, అణకువతో వారినందరినీ స్తుతి చేసి, 'కూడిన ఈ పదకొండక్షోహిణుల సేనలకు మీరు ఆధిపత్యం వహించటానికి పూనుకొంటే అంతా సవ్యంగా జరిగి పోతుంది. వైభవంగా సేనాపతిత్వానికి అభిషిక్తులు కండి.'

క. అనవుడు నందఱు నౌఁగా । కని సంతసమంద నధిపుఁ డభిషేకించెన్
జనులెల్ల సంప్రమోదం । బునఁ బొందఁగ నప్పు డతివిభూతి దలిర్పన్. 141

ప్రతిపదార్థం: అనవుడున్= అని సుయోధనుడు వేడగా; అందఱున్= వారంతా; ఔన్+కాక+అని= అట్లేఅని; సంతసము+అందన్= హర్షించగా; అధిపుఁడు= ప్రభువైన దుర్యోధనుడు; జనులు+ఎల్లన్= జనులందరూ; సంప్రమోదంబునన్+పొందగన్= మిక్కిలి సంతోషం చెందగా; అప్పుడు= ఆ సమయాన; అతి విభూతి= మిక్కిలి వైభవం; తలిర్పన్= ఒప్పగా; అభిషేకించెన్= అభిషిక్తులను చేశాడు.

తాత్పర్యం: సుయోధనుడి మాటలకు వారందరూ సంతోషంగా అంగీకరించారు. జనులంతా పరమానందభరితులుకాగా అపుడు దుర్యోధనుడు ఆ రాజులను మిక్కిలి వైభవంతో అక్షౌహిణీపతులుగా అభిషిక్తులను చేశాడు.

వ. ఇట్లు మహామహిమ వెలయ నక్షోహిణీ నాయకుల సమకట్టి రారాజు పితామహుపాలికి వారిం దోడ్కొని చని సవినయంబుగా నతనికిఁ బ్రణామంబుసేసి, వారలం జూపి 'వీరల మన యక్షోహిణులు పదునొకొంటికిం బతులఁ గావించితి; నిన్నిసైన్యంబులు నొక్కలావున వర్తించు చందంబు సూచికొనవలయు' నని చెప్పుచుఁ జేతులు మొగిచి యిట్లనియె. 142

ప్రతిపదార్థం: ఇట్లు, మహామహిమ వెలయన్= మిక్కిలి ప్రాభవమొప్పగా; అక్షోహిణీ నాయకులన్; సమకట్టి= కూర్చుకొని; రారాజు= రాజులకు రాజైన సుయోధనుడు; పితామహుపాలికిన్= భీష్ముడి చెంతకు; వారిన్= వారలను; తోడ్కొనిచని= వెంటబెట్టుకొని వెళ్ళి; సవినయంబుగాన్= విధేయతతో; అతనికిన్; ప్రణామంబు చేసి= వందన మాచరించి; వారలన్ చూపి= ద్రోణాదులను కనబరిచి; వీరలన్= వీరిని; మన అక్షోహిణులు పదునొకొంటికిన్ పతులన్ కావించితిన్; ఇన్ని సైన్యంబులు; ఒక్క లావునన్= ఒక్క శక్తితో; వర్తించు చందంబు= మెలగు విధానం; చూచికొనవలయున్; అని చెప్పుచున్; చేతులు మొగిచి= హస్తాలు జోడించి; ఇట్లు+అనియెన్-

తాత్పర్యం: ఈ రీతిగా మహావైభవం మెరయగా అక్షౌహిణీ నాయకులను కూర్చుకొని రాజరాజు భీష్మడి చెంతకు వారిని వెంటబెట్టుకొనివెళ్ళాడు. అణకువతో నమస్కరించాడు. వారినందరినీ కనబరిచి- 'వీరిని మన పదకొండు అక్షోహిణులకు అధిపతులను చేశాను. ఇన్ని సేనలు ఏకముఖంగా మెలగే మార్గం చూడవలసి ఉన్నది' అని చెప్తుతూ హస్తాలు ముకుళించి ఇట్లా అన్నాడు:

చ. 'నెటిఁబడి యాజి నీ మొనలు నేరవు కూడి తగం జరింప నిం
దఱు మన సొక్కఁడై చనక తప్పుఁగదా బహుదేశవాసు లం
దఱొకటి సేయుచో వెరవు దప్పక చెల్లుట యెట్లు గల్గు? ని
త్తెఱఁగొక చాలు వాని బలుతీర్పునఁ గాక పొసంగ నేర్చునే? 143

ప్రతిపదార్థం: ఈ+మొనలు= ఈ సేనలు; నెటిన్+పడి= కుదురుపడి; కూడి= కలసి; తగన్= ఒప్పుగా; ఆజిన్= యుద్ధమందు; చరింపన్+నేరవు= మెలగజాలవు; ఇందఱు మనసు= ఈ జోదులందరి చిత్తం; ఒక్కఁడు+ఐ చనక= ఒకటిఅయి వర్తింపకుంటే; తప్పున్+కదా!= కార్యం చెడును గదా!; అందఱున్= వీరెల్లరు; బహుదేశవాసులు= అనేక దేశాలలో నివసిస్తున్నవారు; ఒకటి చేయుచోన్= ఒక పనిని చేస్తున్నప్పుడు; వెరవు= నేర్పు; తప్పక= చెడకుండ; చెల్లుట= సాగటం; ఎట్లు+కల్గున్= ఏరీతిగా సమకూడగలదు?; ఈ తెఱఁగు= ఈ సంవిధానం; ఒక చాలువాని= ఒకానొక సమర్థుడియొక్క; బలుతీర్పునన్+కాక= గొప్ప సవరింతవలనగాని; పొసంగన్+నేర్చున్= కలుగగలదా?; (కలుగదని భావం.)

తాత్పర్యం: 'పితామహా! మన ఈసేనలన్నీ యుద్ధంలో కుదిరికగా కలసి మెలసి చరించగలవా? ఇందరి మనస్సు ఏకముఖంగా వర్తించకుంటే కార్యం తప్పిపోతుంది గదా! చేరిన యోధులందరూ బహుదేశస్థులు. ఒక పని చేసేటప్పుడు అందరి నేర్పు ఏకోన్ముఖం కావలె. అప్పుడే కార్యం సఫలం కాగలదు. లోటుపాటులు సరిదిద్దగల ఒక సమర్థుడి ఆధిపత్యం సేనలకు లభించినపుడే సంకల్పించిన పని సానుకూల మవుతుంది.

ఆ. అమరసేనలును దమంతన వర్తింప । నేర కునికి నా కుమారు మొగము
గానొనర్ప వలసెఁగాదె! సమస్తసే । నలను నీవ యరసి నడపవలయు. 144

ప్రతిపదార్థం: అమర సేనలును= దేవతల సైన్యాలు కూడ; తమంతన= తమకు తామే; వర్తింపన్+నేరక+ఉనికిన్= ప్రవర్తింప జాలకుండటంచేత; ఆ కుమారున్= ఆ కుమారస్వామిని; మొగముగాన్+ఒనర్పన్+వలసెన్+కాదె!= సేనాగ్రమున నిలుపవలసి వచ్చింది కదా!; (కనుక;) సమస్త సేనలను= మన సైన్యాలన్నింటినీ; నీవు+అ= నీవే; అరసి= పరామర్శిస్తూ; నడపన్+వలయున్= నడిపించాలి.

తాత్పర్యం: దేవతాసేనలు కూడ తమకు తామే వ్యవహరించ లేవు కనుక కుమారస్వామిని సైన్యాధిపతిని చేయవలసి వచ్చింది. కావున నా సైన్యాలన్నింటికీ నీవే నాథుడవై నడిపించాలి.

క. తారలకుం జంద్రునిగతిఁ । గౌరవులకు మేటి వీవ; కావున నీవీ
భారంబు పూని మముఁ గడ । చేరుపఁదగు నెమ్మెయిం బ్రసిద్ధచరిత్రా! 145

ప్రతిపదార్థం: ప్రసిద్ధచరిత్రా!= ప్రఖ్యాతమైన నడవడిగల పితామహా!; తారలకున్= చుక్కలకు; చంద్రునిగతిన్= సోమునివలె; కౌరవులకున్= కురుకుమారులకు; ఈవు+అ= నీవే; మేటివి= అధికుడవు; కావునన్= కాబట్టి; నీవు; ఈ భారంబు పూని= ఈ యుద్ధభారాన్ని వహించి; మమున్= మమ్ము; ఏ+మెయిన్= ఏ రీతిగానైనా; కడచేరుపన్= ఒడ్డుకు చేర్చటానికి; తగున్= యుక్తం.

తాత్పర్యం: పితామహా! నీవు సుప్రసిద్ధ చరిత్రుడవు. చుక్కలకు జాబిల్లివలె కౌరవులందరికీ నీవే శరణ్యుడివి. కనుక ఈ రణభారం వహించి ఎట్లాగైనా మమ్ము ఒడ్డుకు చేర్చు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ.

తే. **సర్వసేనాధిపత్యంబు నిర్వహింప । నీవు దక్క నిం దొక్కరు నీవ యరసి**
చెప్పుమా కలఁడేని; రక్షింపు మమ్ముఁ, । బూని పట్టంబుఁ దాల్పుము, పొడిచి గెలుము.' **146**

ప్రతిపదార్థం: సర్వసేనా+ఆధిపత్యంబు= సమస్త సేనలయొక్క నాయకత్వాన్ని; నిర్వహింపన్= నెరవేర్చటానికి; నీవు తక్కన్= నీవు కాక; ఇందున్= మన పక్షంలో; ఒక్కరున్= ఒకడిని; నీవు+అ= నీవే; అరసి= పరికించి; కలఁడు+ఏనిన్= ఉంటే; చెప్పుమా?= వచింపుము; మమ్మున్= మమ్ము; పూని= పూనిక వహించి; రక్షింపు(ము)= కాపాడుము; పట్టంబు+తాల్పుము= సర్వసైన్యాధ్యక్ష పదవి పరిగ్రహించుము; పొడిచి గెలుము= రణమొనర్చి విజయం సాధించు.

తాత్పర్యం: పితామహా! సర్వసైన్యాధిపత్యం నిర్వహించుటకు నీవు దప్ప ఇక్కడ మరెవ్వరూ లేరు. ఉంటే నీవే చెప్పు. పూనికతో మమ్ము కాపాడు. యుద్ధంచేసి విజయం సాధించుము.'

వ. **అనిన విని గాంగేయుండు గాంధారేయున కిట్లనియె :** **147**

ప్రతిపదార్థం: అనినన్ విని; గాంగేయుండు= భీష్ముడు; గాంధారేయునకున్= గాంధారి కొడుకు దుర్యోధనుడితో; ఇట్లు+ అనియెన్-

తాత్పర్యం: ఆ మాటలు విని భీష్ముడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

ఆ. **'మీరుఁ బాండుసుతులు నారయ నా కొక్క । రూప; కార్య మున్నరూపు వలుక**
వలయుఁ; గయ్యమైన వత్తు మీలోన నా । యునికి చందమునకు నుచిత మిదియ. **148**

ప్రతిపదార్థం: ఆరయన్= తలపోయగా; మీరున్= మీరును; పాండుసుతులున్= పాండవులూ; నాకున్= నాకు; ఒక్క రూప= సమానులే; కార్యము= పనియొక్క; ఉన్నరూపు= ఉన్నట్టి చందము; పలుకన్ వలయున్= చెప్పవలసి ఉంటుంది; మీలోనన్= మీలోపలనే; నా+ఉనికి+చందమునకున్= నేనున్నందులకు; కయ్యము+ఐనన్= యుద్ధం సంభవిస్తే; వత్తున్= మీ పక్షం వహిస్తాను; ఇది+అ ఉచితము= ఇదే తగింది.

తాత్పర్యం: 'మీరున్నూ పాండుకుమారులున్నూ నాకు సమానులే. కాని ఉన్న విషయం చెప్పవలె. వారితో మీకు యుద్ధమేర్పడినపుడు నేను మీ పక్షం వాడనే. ఏలన, నేను మీ వద్దనే ఉన్నాను. కనుక నా కిదే సముచితం.

క. **సేనాధిపత్యమును దగఁ । బూనెద; నను మార్కొనంగఁ బురుషుల నుర్విం**
గానఁ; గిరీటికి నొక్కని । కే నోర్వ; నతండు శరము లెక్కు డెఱుంగున్. **149**

ప్రతిపదార్థం: సేనా+ఆధిపత్యమును= సేనా నాయకత్వాన్ని; తగన్= ఒప్పిదంగా; పూనెదన్= వహిస్తాను; ననున్= నన్ను; మార్కొనంగన్= ఎదిరించటానికి; పురుషులన్= వీరులను; ఉర్విన్= పుడమిలో; కానన్= చూడను; కిరీటికిన్+ఒక్కనికిన్= ఒక్క అర్జునుడికి; ఏను= నేను; ఓర్వన్= ఎదురు నిలువలేను; అతండు= అర్జునుడు; ఎక్కుడు= నాకంటె అధికంగా; శరములు= బాణాలు; ఎఱుంగున్= తెలిసినవాడు.

తాత్పర్యం: నేను సర్వసేనాధిపత్యం వహిస్తాను. నన్ను ఎదుర్కొనగల పురుషులెవ్వరూ ఈ పుడమిలో లేరు. కాని నేను కిరీటిని మాత్రం ఎదుర్కొనలేను. ఏలన, అతడికి నాకంటె ఎక్కువ బాణాలు తెలుసు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పెఱవారినెల్లఁ దరమిడి । నఱకుదుఁ; బాండుక్షితీశ నందనులను రూ
పఱసేయం జేయాడదు; । తఱుమరు నామీఁద నత్యుదగ్రత వారున్. 150

ప్రతిపదార్థం: పెఱవారిన్+ఎల్లన్= ఇతరుల నందరినీ; తరము+ఇడి= వరుసపెట్టి (మునుము బట్టి); నఱకుదున్= ఖండిస్తాను; పాండుక్షితి+ఈశ నందనులను= పాండురాజు కుమారులను; రూపు+అఱచేయన్= నిర్మూలించటానికి; చే+ఆడదు= చేయిరాదు; వారున్= కౌంతేయులుకూడ; అతి+ఉదగ్రతన్= మిక్కిలి భయంకరంగా; నా మీఁదన్= నాపైకి; తఱుమరు= కవియరు.

తాత్పర్యం: ఇతరులందరినీ వరుసపెట్టి నఱికివేస్తానుగాని పాండుకుమారులను సంహరించటానికి నాకు చేతులాడవు. వారు కూడా ఉద్ధతులై నా మీదికి దూకరు.

వ. అప్పటికిఁ దగిన భంగి యయ్యెడు; నది యట్లుండె' నని పలికి మఱియు నిట్లనియె. 151

ప్రతిపదార్థం: అప్పటికిన్= ఆ సమయానికి; తగిన భంగి+అయ్యెడున్= తగినట్లు జరుగుతుంది; అది+అట్లుండెన్= ఆ విషయం అట్లా ఉంచుము; అని పలికి; మఱియున్; ఇట్లు+అనియెన్-

తాత్పర్యం: ఆ సమయానికి జరుగవలసిందేదో జరుగుతుంది. ఆ సంగతి అట్లా ఉండనీ' అంటూ భీష్ముడు మళ్ళీ ఇట్లా అన్నాడు:

ఆ. 'మున్ను కర్ణునొండె నన్నొండెఁ గయ్యంబు । చేయఁ బనుపు; మిట్లు సేయువాఁడ
వైనఁ గాని సకల సేనాధిపత్యంబుఁ । బూన నేరఁ జుమ్ము భూపవర్య!' 152

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజవరేణ్యా!; మున్ను= ముందుగా; కర్ణున్+ఒండెన్= కర్ణుడినిగాని; నన్నున్+ఒండెన్= నన్నుగాని; కయ్యంబు చేయన్= యుద్ధం చేయటానికి; పనుపుము= పంపుము; ఇట్లు చేయువాఁడవు+ఐనన్+కాని= ఇట్లా నీవు చేయగల్గినపుడే; సకల సేనా+ఆధిపత్యంబు= సర్వసేనలకు నాయకత్వం; పూనన్ నేరన్ చుమ్ము!= వహించుటకు అంగీకరించను సుమా!

తాత్పర్యం: 'రాజవర్యా! ముందు నన్నుగాని, లేదా కర్ణుడినిగాని యుద్ధం చేయటానికి నియోగించుము. ఇట్లా నీవు చేయగలిగితే తప్ప నేను సర్వసేనాధిపత్యం వహించటానికి సమ్మతించను సుమా!'

వ. అనినం గర్ణుండు కౌరవపతితో నిట్లనియె : 153

తాత్పర్యం: భీష్ము డట్లనగా కర్ణుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

క. 'ఇప్పుడు క్రొత్తగ దీనిం । జెప్పంగా నేల? మున్న చెప్పితిఁగాదే!
యెప్పుడు భీష్ముండు పడు నే । నప్పు డనికి వచ్చువాఁడ నని సభలోనన్.' 154

ప్రతిపదార్థం: ఇప్పుడు; క్రొత్తగన్; దీనిన్= ఈ విషయాన్ని; చెప్పంగాన్+ఏల?= చెప్పటెందుకు?; ఎప్పుడు= ఏ వేళ; భీష్ముఁడు పడున్= భీష్ముడు నేలగూలునో; అప్పుడు= ఆ వేళ; నేను; అనికిన్= యుద్ధానికి; వచ్చువాఁడన్+అని= రాగలనని; సభలోనన్= సభలో; మున్ను+అ= మునుపే; చెప్పితిన్+కాదే!= చెప్పానుగదా!

తాత్పర్యం: ఇపు డీవిషయం క్రొత్తగా చెప్పటమెందుకు? ఎపుడు రణరంగంలో భీష్ముడు నేలగూలుతాడో అపుడు నేను యుద్ధం చేయవస్తానని మునుపే సభలో చెప్పాను కదా!

ఆ. **అనిన 'నట్ల కాక' యని సర్వసేనాధి । పత్యభార పట్టబంధమునకు**
నియ్యకొనియె భీష్ముఁ; డయ్యగ్గలికఁ గొని । యాడె విభుఁడు ప్రముదితాత్ముఁ డగుచు. 155

ప్రతిపదార్థం: అనినన్= అని కర్ణుడు పలుకగా; అట్లకాక+అని= సరేనని; భీష్ముఁడు= గాంగేయుడు; సర్వసేనా+ఆధిపత్యభార= సకలసేనా విభుత్వభారం వహించటం అనెడు; పట్టబంధమునకున్= పట్టం గట్టుకొనుటకు; ఇయ్యకొనియన్= అంగీకరించాడు; విభుఁడు= రాజగు దుర్యోధనుడు; ప్రముదిత+ఆత్ముఁడు+అగుచున్= సంతుష్టచిత్తుడై; ఆ+అగ్గలికన్= భీష్ముడి సమరోత్సాహాన్ని; కొనియాడెన్= మెచ్చాడు.

తాత్పర్యం: అని కర్ణుడు పలుకగా 'అట్లే అగుగాక' అని భీష్ముడు సర్వసేనాధిపతిగా పట్టం కట్టుకొనటానికి అంగీకరించాడు. దుర్యోధనుడు సంతోషించిన మనస్సుకలవాడై ఆతడి యుద్ధోత్సాహాన్ని ప్రస్తుతించాడు.

క. **'భేరీ మృదంగ శంఖ మ । హారవములు సెలఁగఁ జేయుఁ'డని పనిచి, మహో**
దార పతాకా ద్యుత్సవ । గౌరవములు నడపె నెల్లకడలం బురిలోన్. 156

ప్రతిపదార్థం: భేరీ మృదంగ శంఖ= ఢంకాలు, మద్దెలలు, శంఖములు అనువాటియొక్క; మహా+ఆరవములు= గొప్పధ్వనులు; చెలఁగన్+చేయుఁడు+అని= వ్యాపించేటట్లు చేయండని; పనిచి= ఆజ్ఞాపించి; మహా+ఉదార పతాకా+ఆది= మిక్కిలి గొప్పటెక్కెములు మున్నగువాటియొక్క; ఉత్సవ గౌరవములు= ఊరేగింపులు; పురిలోన్= నగరంలో; ఎల్లకడలన్= అన్నివైపుల; నడపెన్= జరిపించాడు.

తాత్పర్యం: ఢంకాలు, మద్దెలలు, శంఖాలు మ్రోగుతుండగా, మిక్కిలి ఎత్తయిన జెండాల ఊరేగింపులు నగరంలో అన్నిచోట్ల దుర్యోధనుడు జరిపించాడు.

వ. **అట్లు పట్టణాలంకారంబు సంఘటించి, రత్నకాంచన కలధౌతమయంబులగు కలశంబులఁ దీర్థజలంబులు దెప్పించి, మణిప్రకరంబునఁ గుసుమ నికరంబున మంగళ తరు త్వక్పల్లవ ప్రచయంబున మహౌషధి నిచయంబున విహిత మంత్రంబుల నుచిత తంత్రంబుల ఋత్విక్పురోహిత సహితుండై త త్సంస్కార ప్రకారం బాచరించి.** 157

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; పట్టణ+అలంకారంబు సంఘటించి= పట్టణమును శృంగారింపజేసి; రత్న కాంచన కలధౌతమయంబులు+అగు= రత్నములు, బంగారం, వెండి అనువాటితో చేయబడిన; కలశంబులన్= పాత్రలలో; తీర్థ జలంబులు తెప్పించి= పవిత్రములైన నదులయందలి ఉదకములు తెప్పించి; మణిప్రకరంబునన్= రత్నాల సమూహం చేతను; కుసుమ నికరంబునన్= పూలమొత్తం తోడను; మంగళతరు త్వక్+పల్లవ= శోభనకరాలైన చెట్లపట్టలయొక్క, చిగురుటాకులయొక్క; ప్రచయంబునన్= సముదాయంతో; మహా+ఓషధి నిచయంబునన్= మందుల కుపయోగించే గొప్ప మూలికలయొక్క రాశితో; విహిత మంత్రంబులన్= ఈ సన్నివేశమునకు శాస్త్రములందు చెప్పబడిన మంత్రాలతో; ఉచిత తంత్రంబులన్= కార్యసాధకాలైన క్రియలతో; ఋత్విక్+ పురోహిత+సహితుండు+ఐ= ఋత్విజులతో పురోహితులతో కూడినవాడై; తద్‌సంస్కార ప్రకారంబు+ఆచరించి= కలశాలలోని పుణ్యనదీ జలాలను పరిశుద్ధపరిచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: దుర్యోధనుడు పట్టణాన్ని అలంకరింపజేశాడు. రత్న కలశాలతో, బంగారు కలశాలతో, వెండి కలశాలతో పవిత్ర నదీ జలాలను తెప్పించాడు. వాటికి మణులతో, పూలతో, పవిత్రములైన వృక్షముల యొక్క బెరడులతో,

చిగుళ్ళతో, గొప్ప ఓషధులతో, వేదవిహితాలైన మంత్రాలతో, తంత్రాలతో ఋత్విక్పురోహితులతో కూడినవాడై సుయోధనుడు సంస్కారం కలుగజేశాడు.

క. గురుఁడును గృపుఁడును లోనగు । గురు లనుమోదింప, బాహ్లికుండు మొదలుగాఁ
గురుజాతి యెలర్పఁగ న । న్నరపతి భీష్మాభిషేచనం బొనరించెన్. 158

ప్రతిపదార్థం: గురుఁడును= ద్రోణాచార్యులు; కృపుఁడున్= కృపాచార్యులు; లోనగు= మున్నుగాగల; గురులు= పెద్దలు; అనుమోదింపన్= అంగీకరించగా; బాహ్లికుండు మొదలుగాన్= బాహ్లికుడు మున్నుగాగల; కురుజాతి= కురువంశస్థులు - కౌరవులు; ఎలర్పఁగన్= సంతోషించగా; ఆ+నరపతి= ప్రభువైన సుయోధనుఁడు; భీష్మ+అభిషేచనంబు+ఒనరించెన్= భీష్ముడికి సర్వసేనా విభుత్వమున్కై మంగళస్నానం చేయించాడు.

తాత్పర్యం: ద్రోణుడు కృపుడు మొదలైన గురువులు అంగీకరించగా, బాహ్లికుడు మొదలైన కురువంశ సంజాతులు సంతోషించగా సుయోధనుడు పుణ్యనదీజలాలతో సర్వసేనాధిపత్యానికి భీష్ముడిని అభిషేకించాడు.

తే. ఇవ్విధంబున నభిషేక మెలమిఁ జేసి । పరమభక్తి నక్షోహిణీపతులఁ జూపి
'వీరికిని సైన్యములకును మీర యొడయ' । లనుచుఁ బట్టంబుఁ గట్టె శంతనుతనూజు. 159

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈవిధంగా; ఎలమిన్= సంతోషంతో; అభిషేకము చేసి; పరమభక్తిన్= మిక్కిలి భక్తితో; అక్షోహిణీపతులన్+చూపి= అక్షౌహిణీ నాయకులను కనబరిచి; వీరికిని= ఈ సేనాధిపతులకు; సైన్యములకును= సేన లన్నింటికిని; మీరు+అ= మీరే; ఒడయలు= అధికారులు; అనుచున్= అని నుడువుచు; శంతను తనూజున్= శంతను మహారాజ పుత్రుడైన భీష్ముడిని; పట్టంబు+కట్టెన్= సర్వసేనాధ్యక్షుడిని కావించాడు.

తాత్పర్యం: ఈ విధంగా భీష్మునకు అభిషేకం చేసి మిక్కుటమైన భక్తితో అక్షోహిణీ నాయకులను ఆయనకు కనబరచి 'వీరికినీ, సేనలన్నింటికినీ మీరే అధికారు'లని భీష్ముడికి సర్వ సైన్యాధ్యక్ష పదవి అప్పగించాడు.

క. అత్తతిఁ బాషాణంబులు । నెత్తురు నెమ్ములను గురిసె, నిష్ఠుర నినదా
యత్తమయి నభము పిడుగుల । మొత్తంబులు వడియె నగరమున నెల్లెడలన్. 160

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= ఆ సమయాన; నభము= ఆకాశం; పాషాణంబులు= రాళ్ళు; నెత్తురున్= రక్తం; ఎమ్ములను= ఎముకలను; నిష్ఠుర= కర్కశమైన; నినద= ధ్వనులకు; ఆయత్తము+అయి= అధీనమై; కురిసెన్= వర్షించింది; నగరమునన్= హస్తినాపురిలో; ఎల్ల+ఎడలన్= అన్నిచోట్ల; పిడుగుల మొత్తంబులు= పిడుగులయొక్క గుంపు; పడియెన్= రాలాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు భీష్ముడిని సర్వసేనాధిపతిగా చేసే సమయంలో ఆకాశం భయంకరంగా గర్జిస్తూ రాళ్ళు నెత్తురు ఎముకలు వర్షించింది. నగరంలో అన్నిచోట్ల పిడుగులు రాలాయి.

క. దానికి జను లుత్సాహ వి । హీనతఁ బొందంగఁ, గౌరవేంద్రుఁడు నానా
దానాదు లయిన శాంతి వి । ధానము లొనరించి యానతత్పరమతియై. 161

ప్రతిపదార్థం: దానికిన్= అట్టి దుర్నిమిత్తాలకు; జనులు= ప్రజలు; ఉత్సాహ విహీనతన్+పొందంగన్= ఉత్సాహం లేనివారు కాగా; కౌరవ+ఇంద్రుఁడు= కురురాజైన సుయోధనుడు; నానా దాన+ఆదులు+అయిన= అనేక దానాలు చేయటం మొదలైన;

శాంతి విధానములు= దోష పరిహారానికైన శాంతి క్రియలను; ఒనరించి= సలిపి; యాన తత్పర మతియై= యుద్ధానికి వెడలుటయందు లగ్నమైన మనస్సుకలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అటువంటి దుర్నిమిత్తాలు చూచి ప్రజలు ఉత్సాహహీను లయ్యారు. కురురాజు తద్దోష పరిహారార్థం దానాలివ్వటం మొదలైన శాంతిక్రియలు సల్పి, యుద్ధప్రయాణంలో మనస్సును లగ్నంచేశాడు.

క. తల్లియుఁ దండ్రియు వెఱఁగునఁ । బుల్లవడన్ వారికడకుఁ బోయి తడయఁగా
నొల్లక పయనపు వీడ్కో । లెల్లను దనయిచ్చ నడపి యేడ్తెఱ వెడలెన్. 162

ప్రతిపదార్థం: తల్లియున్= గాంధారియు; తండ్రియున్= ధృతరాష్ట్రుడును; వెఱఁగునన్= ఆశ్చర్యంచేత; పుల్లవడన్= స్తంభించిపోగా; వారికడకున్= వారి దగ్గరకు; పోయి= వెళ్ళి; తడయఁగాన్= ఆలసించటానికి; ఒల్లక= ఇష్టపడక; పయనపు వీడ్కోలు= యుద్ధ ప్రయాణానికి అనుమతి; ఎల్లను= అంతయు; తన+ఇచ్చన్+నడపి= తన కోరిక ప్రకారం తెల్పి; ఏడ్తెఱన్= పరాక్రమంతో; వెడలెన్= బయలుదేరాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తన తల్లిదండ్రులైన గాంధారీ ధృతరాష్ట్రులు ఆ దుర్నిమిత్తాలుగని భీతితో నిశ్చేష్టులై ఉండగా, వారి దగ్గరకు వెళ్ళి అక్కడ ఆలసించటానికి ఇష్టపడక, యుద్ధానికి వెళ్ళుతున్నాను అంగీకరించండని తానేపలికి సాతిశయంగా అక్కడనుండి బయలుదేరాడు.

తే. వెడలి తమ్ములుఁ దగువారు వివిధభృత్య । గణముఁ దానును నేల గ్రక్కదలఁ గదలి
రాజరాజు గాంగేయుఁ బురస్కరించి । కొని సముద్ధతి నడచె దిక్కులు వడంక. 163

ప్రతిపదార్థం: వెడలి= తల్లిదండ్రుల చెంతనుండి బయలుదేరి; తమ్ములున్; తగువారున్= తగినవారలు; వివిధ భృత్యగణమున్= నానాసేవక సమూహం; తానును= తానున్నూ; నేల= పుడమి; గ్రక్కదలన్= మిక్కిలి కంపించగా; కదలి= బయలువెడలి; రాజరాజు= దుర్యోధనుడు; గాంగేయున్= భీష్ముడిని; పురస్కరించికొని= ముందుంచుకొని; దిక్కులు వడంకన్= దిశలు చలించగా; సముద్ధతిన్= మిక్కిలి గర్వంతో; నడచెన్= ముందుకుసాగాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తన తలిదండ్రుల దగ్గర నుండి కదలి, తమ్ములూ, తగినవారూ, నానాసేవక సమూహామూ తనను అనుసరించగా పుడమి వణకగా కదలాడు. అతడు భీష్ముడిని ముందిడుకొని దిక్కులు కంపించేటట్లు మిక్కిలి గర్వంతో కురుక్షేత్రానికి నడిచాడు.

వ. నడచి కురుక్షేత్రంబు దఱియం జొచ్చి యం దొక్క రమణీయ ప్రదేశంబు విడిదలగా నిరూపించి నిలిచి, భానుసూనుండునుం దానును మెలంగి యెల్లవారిని విడియించి, నడుమ నిజనివాసంబు గావించినఁ, గౌరవేశ్వరు స్కంధావారంబు వారణపురంబున నెవ్వ రెయ్యెడ వసియింతు రాచందంబున నందంబై యొప్పె; నిట్లు రెండు వీళ్ళును సన్నద్ధంబులైన సమయంబున. 164

ప్రతిపదార్థం: నడచి; కురుక్షేత్రంబున్; తఱియన్+చొచ్చి= ప్రవేశించి; అందున్; ఒక్క రమణీయ ప్రదేశంబున్= ఒక ఇంపైన తావును; విడిదలగాన్+నిరూపించి= విడిదిచోటుగా నిర్ణయించి; భానుసూనుండునున్= సూర్యపుత్రుడైన కర్ణుడునూ; తానును; మెలంగి= సంచరించి; ఎల్లవారినిన్= అందఱను; విడియించి= అక్కడ బసచేయించి; నడుమ= ఆ ప్రదేశంయొక్క మధ్యలో;

నిజనివాసంబున్= తానుండు చోటును; కావించినన్= ఏర్పరచగా; కౌరవ+ఈశ్వరు స్కంధావారంబు= దుర్యోధనుడి దండు విడిసిన చోటు; వారణ పురంబునన్= హస్తినాపురిలో; ఎవ్వరు; ఏ+ఎడన్= ఎక్కడ; వసియింతురు= నివాసముంటారో; ఆ చందంబునన్= ఆ విధంగా; అందంబు+ఐ= సుందరమై; ఒప్పెన్; ఇట్లు= ఈ విధంగా; రెండు వీళ్ళును= కురు పాండవ స్కంధావారములు; సన్నద్ధంబులు+ఐన సమయంబునన్= యుద్ధానికి సంసిద్ధాలై ఉన్నవేళ.

తాత్పర్యం: సుయోధనుడు కురుక్షేత్రంలో ప్రవేశించి అక్కడ ఒక మనోహరమైన ప్రదేశాన్ని చూచి, తన సేనలు నిలువదగిన చోటు అదిగా నిర్ణయించాడు. తానూ, కర్ణుడూ ఆ ప్రదేశమంతా కలయదిరిగి అందరూ ఉండవలసిన తావులకు నడుమ తన నివాసం ఏర్పాటు చేసికొన్నాడు. హస్తినాపురంలో ఎవ్వరు ఎక్కడ నివసించారో ఆ విధంగానే దుర్యోధనుడి స్కంధావారం అమరి అందంగా రూపుదిద్దుకొన్నది. ఈ రీతిగా కురుక్షేత్రంలో కౌరవ పాండవ స్కంధావారాలు ఏర్పడి, యుద్ధానికి సంసిద్ధంగా ఉన్నాయి. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. సంధికి నేఁగి కార్యము పొసంగక కృష్ణుఁడు రాకయున్, సుహృ
ద్బాంధవ సంఘయుక్తముగఁ బాండవ కౌరవ వీరు లష్ట ది
క్సింధుర కంధరంబు లడఁగించు బలంబుల పెల్లుతోడ గ
ర్వాంధత నాజికెత్తుటయు నా బలభద్రుఁ డెఱింగి యార్తుఁడై. 165

ప్రతిపదార్థం: సంధికిన్+ఏఁగి= సంధిచేయటానికై పోయి; కార్యము పొసంగక= వెళ్ళిన పని నెరవేరక; కృష్ణుఁడు రాకయున్= శ్రీకృష్ణుడు తిరిగిరావటమూ; పాండవ కౌరవ వీరులు= శూరులైన పాండవులూ, కౌరవులూ; సుహృద్+బాంధవ సంఘయుక్తముగన్= స్నేహితులయొక్క, చుట్టాలయొక్క సమూహాలతో కూడ; అష్టదిక్+సింధుర= ఎనిమిది దిక్కులందున్న ఏనుగులయొక్క; కంధరంబులు= మెడలు; అడఁగించు= వంచునట్టి; బలంబుల పెల్లుతోడన్= సేనలయొక్క ఆధిక్యంతో; గర్వ+అంధతన్= మదంచేత కన్నుగాననివారై; ఆజికిన్= యుద్ధానికి; ఎత్తుటయున్= పూనిక వహించటమూ; ఆ బలభద్రుఁడు= ఆ బలరాముడు; ఎఱింగి= విన్నవాడై; ఆర్తుఁడు+ఐ= దుఃఖితుడై.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు సంధికార్యం విఫలమై తిరిగిరాగా పాండవ కౌరవ వీరులు తమ తమ మిత్ర బంధు సమూహాలతో అష్టదిగ్గజాల మెడలు క్రుంగజేసే మిక్కుటమైన సేనల భారంతో, గర్వంవలన కన్నుగానక యుద్ధానికి సంసిద్ధులై ఉన్నట్లు బలరాముడు విని దుఃఖం పొంది.

విశేషం: అలం: అతిశయోక్తి. దిగ్గజములు: దిక్కులందలి ఏనుగులు ఐరావతం, పుండరీకం, వామనం, కుముదం, అంజనం, పుష్పదంతం, సార్వభౌమం, సుప్రతీకం ఇవీ అష్టదిగ్గజాలు.

బలరాముఁడు పాండవుల వీడ్కొని తీర్థయాత్ర వోవుట. (సం. 5-154-15)

వ. కతిపయ పరివారంబు పరివేష్టింప రయంబునం జనుదెంచి సముచిత ప్రకారంబున ధర్మనందనుం బేరోలగంబునం గని సంభ్రమాలింగనాసనార్ఘ్య పాద్యంబుల నతనిచేత సంభావితుండయి, దామోదర భీమార్జున నకుల సహదేవుల యభివాదనంబు లాదరించి, పాంచాల విరాట ప్రముఖులగు తగువారల వినయంబుల నభినందించి, యా దొరలతోఁ దత్కాలయోగ్య మితసంభాషణంబులు సేసి, యనంతరంబ వారల కిట్లనియె: 166

ప్రతిపదార్థం: కతిపయ పరివారంబు= కొద్ది మంది పరిజనం; పరివేష్టింపన్= చుట్టిరాగా; రయంబునన్= శీఘ్రంగా; చనుదెంచి= వచ్చి; సముచిత ప్రకారంబునన్= తగినవిధంగా; ధర్మనందనున్= ధర్మజుడిని; పేరు+ఓలగంబునన్= నిండుకొలువులో; కని= చూచి; సంభ్రమ+ఆలింగన+ఆసన+అర్ఘ్య పాద్యంబులన్= హర్షంతో కౌగిలించుకొనటం; కూర్చుండుటకు పీఠం వేయటం, అర్ఘ్యమివ్వటం, పాద్యమివ్వటం అనే పనులతో; అతనిచేతన్= ధర్మజుడిచేత; సంభావితుండు+అయి= గౌరవించబడినవాడై; దామోదర+భీమ+అర్జున నకుల సహదేవుల= శ్రీకృష్ణుడి యొక్క; భీమార్జున నకుల సహదేవులయొక్క; అభివాదనంబులు= వందనములు; ఆదరించి= ప్రేమతో స్వీకరించి; పాంచాల విరాట ప్రముఖులు+అగు= ద్రుపదుడు; విరాటుడు మున్నగు; తగువారల= గౌరవపాత్రులయొక్క; వినయంబులన్= అణకువలను; అభినందించి= ప్రశంసించి; ఆ దొరలతోన్= ఆ ప్రభువులతో; తద్+కాలయోగ్య= ఆ సమయానికి తగిన; మిత సంభాషణంబులు చేసి= పరిమితమైన పలుకులు పలికి; అనంతరంబు+అ; వారలకున్; ఇట్లనియెన్.

తాత్పర్యం: బలరాముడు కొంతమంది పరిజనం తనను కొలిచిరాగా శీఘ్రమే వచ్చి తగినవిధంగా ధర్మపుత్రుడిని ఒడ్డోలగంలో చూచాడు. యుధిష్ఠిరుడు బలరాముడిని సంతోషంతో కౌగిలించుకొని, ఆసనమొసగి, అర్ఘ్యపాద్యాదులిచ్చి గౌరవించాడు. శ్రీకృష్ణ భీమార్జున నకుల సహదేవులు తనకు నమస్కరించగా బలదేవుడు ఆదరంతో స్వీకరించాడు. ద్రుపదుడు, విరాటుడు మొదలైనవారు అణకువతో వర్తించగా మెచ్చుకొని, ఆ ప్రభువులతో ఆ సమయానికి తగినట్లు పరిమిత సంభాషణం చేసి, పిదప వారితో ఇట్లా అన్నాడు:

క. **'కౌరవ పాండవు లెంతయుఁ । గ్రూరత వాటించి బంధుకోటికి నిఖిలో**
ర్వీ రమణులకుం జేటుగఁ । బోరికిఁ దెగి; రిట్టి ఘోరపుంబని యగునే? **167**

ప్రతిపదార్థం: కౌరవపాండవులు= కౌరవులు, పాండవులు; ఎంతయున్= మిక్కిలి; క్రూరత+పాటించి= కరకుతనం వహించి; బంధుకోటికిన్= చుట్టాల సమూహానికి; నిఖిల+ఉర్వీరమణులకున్= సకల రాజులకు; చేటుగన్=కీడు మూడేటట్లు; పోరికిన్+తెగిరి= యుద్ధానికి సాహసించారు; ఇట్టి ఘోరపున్+పని+అగునే?= ఇంతటి దారుణకృత్యం తగునా?

తాత్పర్యం: 'కౌరవులూ, పాండవులూ మిక్కిలి క్రూరులై బంధుజనములకూ, పుడమి దొరలకూ కీడు వాటిల్లేటట్లు యుద్ధానికి పూనారు. ఇట్టి దారుణ కృత్యం వారికి తగునా?

తే. **ఇట్టిదానికి నోర్వక యెన్నఁడేనిఁ । గృష్ణుతోడ నేఁ జెప్పితిఁ, గినిసి యిరు దె**
అంగువారికిఁ దగఁ జెప్పి సంగతంబు । సేయు మని యెంత సెప్పినఁ జేయఁడయ్యె. **168**

ప్రతిపదార్థం: ఇట్టిదానికిన్= ఇట్లు జరగటానికి; ఎన్నఁడు+ఏనిన్= ఎప్పుడైనను; ఓర్వక= సహించలేక; కినిసి= కోపించి; ఇరు తెఅంగువారికిన్= ఉభయపక్షాలవారికి; తగన్+చెప్పి= అనుకూలంగా బోధించి; సంగతంబు= సంధిని; చేయుము+అని= కుదుర్చుమని; కృష్ణుతోడన్= మాధవుడితో; నేన్= నేను; చెప్పితిన్= చెప్పాను; ఎంతచెప్పినన్= నే నెంత చెప్పినప్పటికీ; చేయఁడు+అయ్యెన్= అతడు చేసినవాడు కాడు.

తాత్పర్యం: దారుణమైన యుద్ధం కురుపాండవుల మధ్య సంభవించటానికి నే నెన్నడూ సహించలేను. అందుచేత కోపించి అయినా రెండు పక్షాలవారికి తగిన విధంగా నచ్చజెప్పి సంధి సమకూరేటట్లు చూడుమని నేను శ్రీకృష్ణుడితో చెప్పాను. నే నెంత చెప్పినప్పటికిన్నీ అతడు సంధి పొసగేటట్లు చూడలేదు.

క. పలుకుల పొం దెఱుఁగని వా । రలఁ బూజావాక్యములఁ దిరంబై తనకుం
దెలుపం దగదే? యే మని । యలుకమెయిన్ సంధి సెఱిచి హరి యేతెంచెన్? 169

ప్రతిపదార్థం: పలుకుల పొందు= మాటలపొందిక; ఎఱుఁగని వారలన్= తెలియని మూఢులను; పూజా వాక్యములన్= బుజ్జగింపు పలుకులతో; తిరంబు+ఐ= గట్టిగా నిలబడి; తనకున్= గోవిందుడికి; తెలుపన్+తగదే= చెప్పటం యుక్తంకదా!; అలుకమెయిన్= కోపంతో; సంధిచెఱిచి= సంధికార్యం చెడగొట్టి; హరి= శ్రీకృష్ణుడు; ఏమి+అని+ఏతెంచెన్?= ఏమి సంకల్పించి వచ్చాడు?

తాత్పర్యం: మాటాడేతీరు తెలియని పరమ మూర్ఖులకు మంచిమాటలతో హితవు గరపవలసిన శ్రీహరి అలా చేయక వారిపై క్రోధం వహించి సంధికార్యం చెడగొట్టి ఏమి చేయటానికి వచ్చినట్లు?

తే. వీరు వారును సంబంధ విషయబంధు । లగుట సరిగాదె హరికిఁ; దా నర్జునునకుఁ
బక్షపాతంబు చేయుటఁ బాండవులను । బెట్టుచోటులు గానక పట్టి క్రాలు. 170

ప్రతిపదార్థం: వీరున్= పాండవులూ; వారును= కౌరవులూ; సంబంధవిషయబంధులు+అగుటన్= సంబంధవిషయమై చుట్టాలగుటవలన; హరికిన్= శ్రీకృష్ణుడికి; సరి+కాదె= సమానులే కదా!; తాన్= తాను; అర్జునునకున్; పక్షపాతంబుచేయుటన్= మిక్కిలి అభిమానం చూపటంచేత; పాండవులను= పాండుకుమారులను; పెట్టుచోటులుకానక= కుదురుగా ఒక్కచోట నుంచక; పట్టిక్రాలున్= పట్టుకొని ఊరేగుతుంటాడు.

తాత్పర్యం: పాండవులు కౌరవులు సంబంధ విషయమై చుట్టాలు కావటంచేత తనకు ఉభయులూ సమానులే కదా! కాని, అతడికి అర్జునుడిపట్ల అభిమానం మెండు. అందువలన కౌంతేయులను కుదురుగా ఒకచోట నుంచక, తన ఇచ్చకొలదీ వెంట బెట్టుకొని త్రిప్పుతుంటాడు.

ఉ. కావున వీరికిన్ జయము గల్గుట నిశ్చయ; మెల్ల భంగులం
జావు నిజంబు వారికి; నసంశయమై యిటులుండ దీని నె
ట్లే వినఁ జూడ నేర్తు? దగ నింత ప్రవీణుల నేన చేసితిం
జూవె! సుయోధనుం బవనసూనుని నొండొరుఁ జంపఁ జూతునే? 171

ప్రతిపదార్థం: కావునన్= అట్లగుటచే; వీరికిన్= పాండుకుమారులకు; జయము కల్గుట= గెలుపు సమకూడడం; నిశ్చయము= తప్పదు; వారికిన్= కౌరవులకు; ఎల్లభంగులన్= అన్నివిధాల; చావు నిజంబు= మరణం తథ్యం; అసంశయము+ఐ= సందేహము లేనిదై; ఇటులు+ఉండన్= విషయమిట్లా ఉండగా; దీనిన్= ఈ పరిణామాన్ని; ఎట్లు= ఎట్లా; ఏన్= నేను; వినన్చూడన్+నేర్తున్?= వినగలను, చూడగలను?; తగన్= ఒప్పుగా; సుయోధనున్= దుర్యోధనుడిని; పవనసూనునిన్= వాయుపుత్రుడిని; ఇంతప్రవీణులన్= ఇంతటి నేర్పరులుగా; నేను+అ= నేనే; చేసితిన్+చూవె!= చేశాను సుమా! ఒండు+ఒరున్= ఒకడిని మరొకడు; చంపన్+చూతునే?= చంపుతుండగా కనుగొనగలనా?

తాత్పర్యం: పాండవులకు విజయం తథ్యం. అన్ని విధాల కౌరవులకు చావు తప్పదు. ఇందులో సందేహం లేదు. కనుక దీనిని నే నెట్లా చెవులతో వింటూ, కనులతోచూస్తూ భరించగలను? దుర్యోధనుడిని, వృకోదరుడిని గదాయుద్ధంలో ఇంత నేర్పరులను నేనే చేశాను. భీమ సుయోధనులు పరస్పరం చంపుకొంటుండగా ఎట్లా చూడగలను?

క. హరి యెఱుఁగని చక్కటియుం। బురుషార్థము నా కెఱుంగఁ బోలునె? యీ ని
ష్ఠురత వినఁ జూడఁ జాలక। సరస్వతీ తీర్థమునకుఁ జనియెడు బుద్ధిన్. 172

ప్రతిపదార్థం: హరి= శౌరి; ఎఱుఁగని= తెలియని; చక్కటియున్= న్యాయం, ధర్మం; పురుష+అర్థము= పురుష ప్రయోజనం; నాకున్= నాకు; ఎఱుంగన్+పోలునె?= తెలియ శక్యమౌతుందా? (కాదని భావం); ఈ నిష్ఠురతన్= ఈ కర్కశత్వమును; వినన్= వినటానికి; చూడన్= చూడటానికీ; చాలక= సహించలేక; సరస్వతీ తీర్థమునకున్= సరస్వతీ నదికి; చనియెడు బుద్ధిన్= వెళ్ళేతలంపుతో.

తాత్పర్యం: గోవిందుడికి తెలియని న్యాయం, పురుషార్థం నాకు తెలియశక్యంగాదు. ఈ కర్కశత్వాన్ని వినలేక చూడలేక సరస్వతీ తీర్థానికి వెళ్ళే తలంపుతో.

వ. మీకుం జెప్పిపో వచ్చితిఁ; బోయి వచ్చెద' నని పలికి బలదేవుండు వాసుదేవ ధర్మపుత్త్రు లొడంబడి యనుపఁ దీర్థయాత్ర వోయెఁ; దదనంతరంబ. 173

ప్రతిపదార్థం: మీకున్= మీకు; చెప్పిపోన్+వచ్చితిన్= చెప్పివెళ్ళుదామని వచ్చాను; పోయివచ్చెదన్= వెళ్ళివస్తాను; అని పలికి; బలదేవుండు= బలరాముడు; వాసుదేవ ధర్మపుత్త్రులు= శ్రీకృష్ణుడు, ధర్మరాజు; ఒడంబడి= సమ్మతించి; అనుపన్= తనను సాగనంపగా; తీర్థయాత్ర+పోయెన్; తద్+అనంతరంబు+అ= అటుపిమ్మట.

తాత్పర్యం: మీకు చెప్పి వెళ్ళుదామని వచ్చాను. పోయివస్తాను' అని బలదేవు డన్నాడు. అందుకు అంగీకరించి శ్రీకృష్ణుడు ధర్మనందనుడు సాగనంపగా ఆయన తీర్థయాత్రకు వెళ్ళాడు. అటు పిమ్మట.

రుక్మి వృత్తాంతము (సం. 5-155-1)

సీ. కృష్ణుని దేవి రుక్మిణి సోదరుఁడు రుక్మి। యను రాజు బలవిక్రమాన్వితుండు
శార్ఙ్గగాండీవ విజయములు నాఁగల। దివ్య చాపములఁ దృతీయమైన
చాపంబు గలవాఁడు సైన్య సమేతుఁడై। చనుదెంచి ధర్మజుఁ గని తదీయ
సత్కారములు గాంచి సముచితాసనమున। నుండి యక్కొలువున నున్న వీరు

ఆ. లెల్ల వినఁ గిరీటి కిట్లను 'సమరంబు। సేయ వెఱచితేనిఁ జెప్పు; నాకు
నెదురు లేరు జగతి నెవ్వరు; నీకుఁ దో। డ్పడి జయింతు నెట్టి పగఱనైన.' 174

ప్రతిపదార్థం: కృష్ణుని దేవి= శ్రీకృష్ణుడి పత్నిఅయిన; రుక్మిణి= రుక్మిణీదేవికి; సోదరుఁడు= తోడబుట్టినవాడు; రుక్మి అనురాజు= రుక్మి అనే పేరుగల దొర; బలవిక్రమ+అన్వితుండు= బలం పరాక్రమం అనువాటితో కూడినవాడు; శార్ఙ్గ గాండీవ విజయములు నాన్+కల= శార్ఙ్గం, గాండీవం, విజయం అనే పేర్లుగలిగిన; దివ్యచాపములన్= శ్రేష్ఠములైన ధనుస్సులలో; తృతీయము+అయిన= మూడవదైన; చాపంబు+కలవాఁడు= విల్లు కలిగినవాడు; సైన్య సమేతుఁడు+ఐ= సేనలతో కూడినవాడై; చనుదెంచి= వచ్చి; ధర్మజున్+కని= ధర్మనందనుడిని దర్శించి; తదీయ సత్కారంబులు+కాంచి= అతనివలన గౌరవాలు పడసి; సముచిత+ఆసనంబునన్+ఉండి= అర్హపీఠంమీద అధివసించి; ఆ+కొలువునన్+ఉన్నవీరులు+ఎల్లన్= ఆ సభలో నుండిన శూరులందరూ; వినన్= వినుచుండగా; కిరీటికిన్= అర్జునుడికి; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; సమరంబు చేయన్= యుద్ధం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేయటానికి; వెఱచితి(వి)+ఏనిన్= భయపడితే; చెప్పుము= తెలుపుము; నాకున్= నాకు; జగతిన్= పుడమిలో; ఎవ్వరున్= ఎట్టివారున్నూ; ఎదురులేరు= అడ్డంలేరు; నీకున్ తోడ్పడి= నీకు సాయం చేసి; ఎట్టి పగఱన్+ఐనన్= ఎంతటి విరోధులనయినా; జయింతున్= గెలుస్తాను.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి దేవేరి రుక్మిణి. ఆమె అన్నపేరు రుక్మి. అతడు బలం పరాక్రమం కలవాడు. శ్రీకృష్ణుడికి శార్ఙ్గం, అర్జునుడికి గాండీవం అనే ధనుస్సులున్నట్లుగా తనకూ విజయం అనే పేరుగల దొడ్డవిల్లు ఉన్నది. అతడు సేనాపరివృతుడై ధర్మజుడి దగ్గరకు వచ్చి దర్శించాడు. యుధిష్ఠిరుడు అతడికి సముచిత సత్కారాలు జరిపించాడు. అట్లా సమ్మానితుడై రుక్మి అర్ఘ్యపీఠం మీద అధివసించి, ఆ సభలోని వీరులంతా వింటుండగా అర్జునుడితో ఇట్లా పలికాడు: 'అర్జునా! యుద్ధం చెయ్యటానికి నీకు భయంగా ఉంటే చెప్పు. నీకు సాయంగా నిల్చి ఎంతటి శత్రువులనైనా గెలుస్తాను. నాకీ ఇలలో ఎవ్వరూ ఎదురులేరు.'

వ. అని తన్ను నాక్రమించి తన తోఁబుట్టువు రుక్మిణిం గొనివచ్చిన యా కృష్ణు సన్నిధిని సిగ్గులేక యాడిన మాటలు విని, చిఱునవ్వు నవ్వుచుం గవ్వడి యతని యాననం బాలోకించి. 175

ప్రతిపదార్థం: అని; తన్నున్= తనను; ఆక్రమించి= అలమి; తన తోఁబుట్టువు= తన చెల్లెలు; రుక్మిణిన్; కొనివచ్చిన= తీసికొని వెళ్ళిన; ఆ కృష్ణు సన్నిధిన్+అ= ఆ శ్రీకృష్ణుడి సమక్షంలోనే; సిగ్గులేక= లజ్జవీడి; ఆడినమాటలు= పలికిన పలుకులు; విని; చిఱునవ్వు నవ్వుచున్; కవ్వడి= రెండు చేతుల వడిగల అర్జునుడు; అతని; ఆననంబు= ముఖం; ఆలోకించి= చూచి

తాత్పర్యం: తనను అతిక్రమించి తన చెల్లెలైన రుక్మిణిని వెంటగొనిపోయిన ఆ శ్రీకృష్ణుడి ఎదుట రుక్మి సిగ్గులేక మాటాడిన మాటలు విని చిరునవ్వు నవ్వుతూ అర్జునుడు అతడి ముఖం చూచి ఇట్లా అన్నాడు:

తే. 'చెనసి గంధర్వసేన నిర్జించునపుడు । మత్స్యనాథు గోవర్గంబు మరలఁ దెచ్చు
నెడను దప్పె; నీకందువ యెఱుఁగనైతి । నింక నౌఁగాని తోడుగ మ్మెచటి కైన.' 176

ప్రతిపదార్థం: చెనసి= ఎదిరించి; గంధర్వసేనన్= చిత్రసేనుడి సైన్యాన్ని; నిర్జించునపుడున్= జయించేవేళలో; మత్స్యనాథు గోవర్గంబున్= మత్స్యదేశాధీశుడైన విరాటుడి యొక్క ఆలమందలను; మరలన్+తెచ్చు+ఎడను= కౌరవుల బారినుండి మరలించుకొని వచ్చునపుడును; తప్పెన్= అవకాశం జారిపోయింది; నీకందువ+ఎఱుఁగన్+ఐతిన్= నీ ఉనికి ఎక్కడో తెలియనైతిని; ఇంకన్= ఇక; ఔన్+కాని= చాలు గాని; ఎచటికిన్+ఐనన్= నీ సాయం అవసరమైనచోటికి; తోడు+కమ్ము= సాయపడుము.

తాత్పర్యం: 'గంధర్వ సైన్యాన్ని ఎదిరించి చిత్రసేనుడి చెరజిక్కిన సుయోధనుడిని భార్యాపుత్రమిత్ర బంధుసహితంగా బంధవిముక్తుని కావించే టప్పుడూ; కురువీరులందరూ మొత్తమై విరాటుడి గోవులను తోలుకొని కరిపురికి అరుగునప్పుడు, వారిబారినుండి ఆలమందలను మరలించుకొని వచ్చునప్పుడు నీ జాడ నాకు తెలియలేదు. అపుడు నీవెక్కడ ఉన్నావో నాకు తెలియదు. ఇక నీమాటలు కట్టిపెట్టి, అక్కర గల్గినచోటికి సాయపడటానికి వెళ్ళు.'

విశేషం: అర్జునుడు గంధర్వ సేనను నిర్జించుట: పాండవులు ద్వైతవనంలో నివసిస్తున్నారు. తన డాబు దర్పం వారిముందు ప్రదర్శించి మరీ ఏడ్పించవలెనని దుర్యోధనుడికి దుర్బుద్ధి పుట్టింది. కర్ణ శకునులతో మంతనం జరిపాడు. ఘోషయాత్ర

నెపంతో అక్కడికి వెళ్ళదలచాడు. అందుకు ఎట్లాగో ధృతరాష్ట్రుడి అనుమతి సంపాదించాడు. సుయోధనుడు చతురంగబలంతో, అంగనాజనంతో అనుజ బంధు మంత్రి గాయక నర్తక సమూహంతో వందిమాగధ బృందంతో కర్ణ శకునులను వెంటబెట్టుకొని వైభవోపేతంగా తమ గోగణమున్న ద్వైతవనానికి తరలివెళ్ళాడు.

సుయోధనుడు ఆ వనంలో విహరించి అక్కడి మృగాలను వేటాడుతూ ఒక సరస్సు చెంతకు వచ్చాడు. ఆ సమీపంలోనే మునిజన సహాయంతో సద్యస్కందమనే యాగం సల్పుతున్నాడు ధర్మజుడు. ఆ కొలని గట్టున క్రీడా గృహాలను నిర్మించటానికి దుర్యోధనుడు భృత్యవర్గాన్ని నియమించాడు. చిత్రసేనుడనే గంధర్వరాజుకు క్రీడార్థం కల్పితమైన సరస్సు గనుక ఇక్కడనుండి తొలగిపొండని గంధర్వులు కౌరవసేవకులను హెచ్చరించారు. దుర్యోధనుడు దుర్మదాంధులైన సైనికులను గంధర్వుల నెదిరించటానికి పంపాడు. తానూ తన తమ్ములూ కర్ణశకునులూ పోరాటంలో పాల్గొన్నారు. పోరు ఘోరమైంది. కర్ణుడు విరథుడై వికర్ణుడి రథమెక్కి రణరంగంనుండి తప్పుకొన్నాడు. దుర్యోధనుడు గంధర్వులతో తలపడ్డాడు. చిత్రసేనుడు అతడి రథాన్ని భగ్నం చేయించి జుట్టుపట్టి నేలకీడ్చి పెడరెక్కలు గట్టి సింహనాదం చేశాడు. అప్పుడే గంధర్వులు దుర్యోధనుడి వనితలనూ, అతడి సోదరులనూ, తనయులనూ, వాని మంత్రులనూ పట్టి బంధించి చిత్రసేనుడి కొప్పగించారు.

అంతట సుయోధనుడి పరిజనం పరుగెత్తి పోయి ధర్మజుడి పాదాల వ్రాలి, నీ తమ్ముళ్ళనూ, నెలతలనూ రక్షించుమని వేడుకొన్నారు. 'కాగల కార్యం గంధర్వులే తీర్చారు. క్రూరాత్ముని దెస కృప చూపవ'ద్దని అన్నతో అన్నాడు అనిలజుడు హర్షంతో **'శరణం బని వచ్చిన భీకర శత్రువునైన ప్రీతిగావగవలయున్ కరుణాపరుల తెఱంగిది యిరవుగ సరిగావు దీని కేధర్మంబుల్'** అని ధర్మజుడు పలు విధాల భీమసేనుడిని అనునయించాడు. "నేను యజ్ఞదీక్షితుడిని గనుక వెళ్ళరాదు. మీరు వెళ్ళి సామవాక్యాలకు సాధ్యపడకుంటే ఎదిరించిఅయినా గంధర్వుల చెరనుంచి సుయోధనుడిని విడిపించండి" అని ధర్మపుత్రుడు తమ్ముళ్ళ నడిగాడు. అగ్రజుడి ఆజ్ఞ ననుసరించి భీమార్జున నకుల సహదేవులు కదలిపోయి గంధర్వుల నెదుర్కొన్నారు.

దారుణ సంగ్రామం జరిగింది. పాండవుల చిత్తవృత్తి చిత్రసేనుడికి విస్మయం కలిగించింది. అతడు వెంటనే యుద్ధం విరమించి అర్జునుడిని చేరబోయాడు. ఆ వచ్చినవాడిని ఆత్మసఖుడిగా గుర్తించి సవ్యసాచి సంగ్రామం చాలించాడు.

"పరమ ధార్మికులైన మిమ్ము పరాభవింప దలచి, పరిహసించి ఇక్కడికి వచ్చిన సుయోధనుడిని భార్యా భ్రాతృ పుత్ర బంధుయుతంగా పట్టి తెమ్మని దేవేంద్రునాజ్ఞ. అందుకే వచ్చా'నని చిత్రసేనుడు అర్జునుడితో అన్నాడు. 'తానెంత దుర్మార్గుడయినా మాకు సహోదరుడు గనుక దుర్యోధనుడిని విడిచిపెట్టవలసినది. ధర్మజుడిని దర్శించి అతడు చెప్పినట్లు చేయవలసినది" అని పాండవ మధ్యముడు పలికాడు. చిత్రసేనుడు అజాతశత్రుడి దగ్గరకు వచ్చాడు. అతడు ధర్మజుడి ప్రార్థనతో దుర్యోధనాదు లందరినీ విడిచిపెట్టి ఇంద్రుని కడకు వెళ్ళాడు. 'ఇకమీదట ఇట్లాంటి సాహసాలు చేయవద్దు. గుట్టుగ పట్టణానికి వెళ్ళుము" అని బుద్ధులు చెప్పి ధర్మజుడు దుర్యోధనుడికి వీడ్కోలిచ్చాడు. ఈ విషయం అరణ్యపర్వ పంచమాశ్వాసంలో ఉన్నది.

వ. అని యతని యుత్తరమునకుఁ దగిన యట్ల పలికి, మఱియును. 177

తాత్పర్యం: అంటూ రుక్మి మాటలకు సరియైన సమాధానమిచ్చి అర్జునుడు మళ్ళీ (ఇట్లా అన్నాడు:)

క. 'ము న్నే నసహాయుఁడనై । చన్న గతిం జనఁగ నైన చందం బయ్యెన్;
వెన్నుఁడు తోడుగలఁడు; వెఱ । పెన్నండును వలవ దింక నేమిటికైనన్. 178

ప్రతిపదార్థం: మున్ను= పూర్వం; ఏను= నేను; అసహాయుఁడను+ఐ= తోడ్పాటు లేనివాడనై; చన్నగతిన్+చనఁగన్= అరిగిన మార్గంలో అరుగగా; ఐన చందంబు+అయ్యెన్= జరుగవలసిన దేదో జరిగిపోయింది; వెన్నుఁడు= విష్ణుమూర్తి; తోడు+

కలఁడు= నాకిప్పుడు సాయంగా ఉన్నాడు; ఇంకన్= ఇటుపై; ఏమిటికిన్+ఐనన్= ఏ విషయానికైననూ; వెఱపు= భీతి; ఎన్నండును వలవదు= ఎప్పుడూ నాకు కలుగదు.

తాత్పర్యం: 'పూర్వం నేను ఎవ్వరి తోడ్పాటూ లేనివాడనై అనుకొన్న దారిలో నరుగగా జరుగవలసిన దేదో జరిగింది. నేడు నాకు విష్ణుదేవుడి సాయమున్నది. మున్ముందు ఏమి జరిగిననూ నాకు ఎవ్వరి వల్లా భయంలేదు.

చ. వెఱచితి రాఁగదే యనిన వెండికదా పగఁదీర్తు వీవు; నా
వెఱపెటులున్న నీ రథిక వీరులు వాపెద; రొల్ల నిన్ను; నీ
యుఱుకడ కేఁగి తోడుపడు మొడ్లకు నెవ్వరికేని' నన్న నే
డ్తెఱ నతఁ డేఁగి కౌరవపతిం గని యట్టుల బెట్టుపల్కినన్. 179

ప్రతిపదార్థం: వెఱచితిన్= యుద్ధానికి భయపడ్డాను; రాన్+కదే= తోడుపడటానికి రావయ్యా; అనినన్= అని నేను వేడుకొంటే; వెండికదా= అప్పుడుగదా; ఈవు= నీవు; పగన్+తీర్తువు= వైరం బాపగలవు; నా వెఱపు= నా భీతి; ఎటులు+ఉన్నన్= ఎట్లున్నప్పటికినీ; ఈ రథిక వీరులు= వీరులైన ఈ రథికులు; పాపెదరు= తొలగించగలరు; నిన్నున్+ఒల్లన్= నీ సాయం అంగీకరించను; నీ+ఉఱుకడకున్+ఏఁగి= నీకు ఉచితమైన చోటికి వెళ్ళి; ఒడ్లకున్+ఎవ్వరికిన్+ఏనిన్= ఇతరులెవ్వరికైననూ; తోడుపడుము= సాయపడుము; అన్నన్= అని అర్జునుడు పలుకగా; ఏడ్తెఱన్= వెంటనే; ఆతఁడు+ఏఁగి= రుక్మి వెళ్ళి; కౌరవపతిన్+కని= కురువిభుడైన సుయోధనుడిని వీక్షించి; అట్టుల= ధర్మజుడి ఎదుట పలికినట్లుగానే; బెట్టుపల్కినన్= బిగువుగా మాట్లాడగా.

తాత్పర్యం: 'నాకు యుద్ధమంటే భయంగా ఉన్నది, రావయ్యా' అని నేను అడిగినప్పుడు గదా నీవు వచ్చి పగ తొలగిస్తావు. నాకంతగా భయమేర్పడితే దానిని తొలగించటానికి ఈ రథిక శ్రేష్ఠులున్నారు. నీతోడ్పాటు నాకు అక్కరలేదు. నీకిష్టమైన చోటికి వెళ్ళి ఇతరులెవ్వరికైనా సాయపడుమని అర్జునుడు పల్కగా రుక్మి శీఘ్రమే కదలి వెళ్ళి దుర్యోధనుడిని చూచి ఉద్ధతుడై ఈ విధంగానే మాట్లాడగా.

క. ఆతఁడివి యేటిమాటలు । నీ తోడగు టొల్లఁ బొ'మ్మనిన రుక్మి వృథా
యాతాయాస విషణ్ణుం । డై తన పురమునకు మగుడ నరిగెం బెలుచన్. 180

ప్రతిపదార్థం: ఆతఁడు= దుర్యోధనుడు; ఇవి+ఏటిమాటలు= ఏమి టీ పలుకులు?; నీతోడు+అగుట= నీ యొక్క సహాయం; ఒల్లన్= ఇష్టపడను; పొమ్ము= వెళ్ళుము; అనినన్= అని పలుకగా; రుక్మి= రుక్మిణియొక్క అన్న; వృథా+ఆయాత+ఆయాస+విషణ్ణుండు+ఐ= వ్యర్థంగా తన పట్టణం నుండి వచ్చుటచే కలిగిన శ్రమవలన దుఃఖితుడై; తన పురమునకున్= తన నగరానికి; పెలుచన్= వడిగా; మగుడన్= మరల; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు రుక్మియొక్క తలబిరుసు మాటలు విని 'ఇవేటి మాటలు? నీ సాయం నాకు అక్కరలేదు; పొ'మ్మన్నాడు. కుండినపురినుండి తనరాక వృథా ప్రయాస అయిందిగదా అని బాధపడుతూ రుక్మి తన నగరానికి అక్కడనుంచి వెంటనే తిరిగి వెళ్ళాడు.

తే. ఇట్లు బలదేవ రుక్ముల కిద్దఱకును । గయ్యమునకు సన్నాహంబు గలుగదయ్యెఁ
గాని తక్కులోకమ్మునఁ గలుగు నృపతి । కోటి యిరువాఁగు నందును గూడె ననికి. 181

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; బలదేవ రుక్ములకున్+ఇద్దఱకును= బలరాముడు, రుక్మి అనే ఇరువురకునూ; కయ్యమునకున్= యుద్ధానికి; సన్నాహంబు= అవసరం; కలుగదు+అయ్యెన్= లభించలేదు; కాని= కాని; తక్కు+లోకమ్మునన్+కలుగు= మిగిలిన జగతియందున్నట్టి; నృపతి కోటి= రాజసమూహం; అనికిన్= యుద్ధానికి; ఇరువాఁగునందును+కూడెన్= రెండు పక్షాలందు చేరింది.

తాత్పర్యం: ఈ రీతిగా బలరాముడు, రుక్మి అనే ఈ ఇద్దరికీ కురుపాండవ యుద్ధంలో పాల్గొనే అవకాశం చిక్కలేదు. కాని, జగతిలోని మిగిలిన రాజులందరూ పోరాటానికై రెండు పక్షాలలో చేరిపోయారు.

వ. అట్టియెడ నిశాసమయంబున ధృతరాష్ట్రుండు సంజయు రావించి యిట్లనియె. 182

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= అటువంటి తరుణంలో; నిశా సమయంబునన్= రాత్రి వేళ; ధృతరాష్ట్రుండు; సంజయున్; రావించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అప్పుడు రాత్రివేళ ధృతరాష్ట్ర మహారాజు సంజయుడిని తన చెంతకు రప్పించుకొని ఇట్లా అన్నాడు:

క. 'బవరము గీడని యెఱుఁగుదు । నవినీతుండైన కొడుకు నదలిచి యుడుపం
దివిరియు నోరాడమి దై । వ వశం; బప్పనికి మనకు వగ పింకేలా? 183

ప్రతిపదార్థం: బవరము= పోరు; కీడు+అని+ఎఱుఁగుదున్= చేటు కలిగిస్తుందని తెలుసు; అవినీతుండు+ఐన= అడకువలేనట్టి; కొడుకున్= నా కుమారుడిని; అదలిచి= బెదిరించి; ఉడుపన్+తివిరియున్= సంక్షోభం నివారించటానికి పూనియు; నోరు+ఆడమి= నాకు నోరాడకుండటం; దైవ వశంబు= దైవాధీనమే; ఆ+పనికిన్= అలా జరిగినందుకు; మనకున్= మనకు; వగపు= విచారం; ఇంకన్+ఏలా?= మరెందుకు?

తాత్పర్యం: 'యుద్ధం అనర్థాలకు మూలమని నాకు తెలుసు. అవిధేయుడైన నా కుమారుడిని తర్జించి భర్జించి కుటుంబ సంక్షోభం మాన్పడానికి యత్నించి కూడ నాకు నోరు రాకుండటం విధి వైపరీత్యం. అట్లా జరిగినందుకు ఇప్పుడు విచారించి లాభం లేదు.

క. ఎయ్యది గానున్నది యది । యయ్యెడుఁ; జేయునది గలదె? యవనీశులకుం
గయ్యానఁ జచ్చుటయు మే; । లయ్యొప్పుట లెస్సగాక! యది యట్లుండెన్. 184

ప్రతిపదార్థం: ఎయ్యది= ఏది; కానున్నది= జరుగనున్నదో; అది+అయ్యెడున్= అది జరుగగలదు; చేయునది+కలదె?= ఇప్పుడు మనం చేయగల్గింది ఏమీలేదు; అవనీ+ఈశులకున్= రాజులకు; కయ్యానన్= రణంలో; చచ్చుటయున్+మేలు= మరణించటమే శ్రేయస్కరం; ఆ+ఒప్పుట= అందు కంగీకరించటం; లెస్సగాక!= మంచిదే సుమా!; అది+అట్లు+ఉండెన్= ఆ విషయమట్లా ఉండనిమ్ము.

తాత్పర్యం: ఏది జరుగవలసి ఉన్నదో అది జరుగక మానదు. మనం చేయగల్గింది ఏమీ లేదు. రాజులు రణరంగంలో చావడమే మంచిది. అందుకు అంగీకరించటమే యుక్తం. ఆ విషయ మట్లా ఉండనీ.

వ. రెండు వీఙ్కును గురుక్షేత్రంబున విడిసిన పిదపం బుట్టిన విశేషంబులు గలవేని నెఱిఁగింపుము.' 185

ప్రతిపదార్థం: రెండు వీడు+లును= ఉభయ సేనలును; కురుక్షేత్రంబునన్; విడిసిన పిదపన్= దిగిన తర్వాత; పుట్టిన విశేషంబులు= కలిగిన వింతలు; కలవు+ ఏనిన్= ఉంటే; ఎఱింగింపుము= తెలుపుము.

తాత్పర్యం: ఉభయ సైన్యాలూ కురుక్షేత్రంలో దిగిన తరువాత జరిగిన విశేషము లేమైనా ఉంటే నాకు చెప్పు.'

సంజయుండు ధృతరాష్ట్రుని కులూకుఁడు పాండవుల నాడిన మాటలు చెప్పుట (సం. 5-157-1)

తే. **అనిన సంజయుఁ డిట్లను 'నకట! కొడుకు । మీఁదఁ దప్పు పెట్టెదవు నీ మీఁది కొఱఁత**
నీకుఁ గానంగ వచ్చునె? నీ వెఱుంగ । కుండఁ బఱచెనె యాతండు పాండుసుతుల? **186**

ప్రతిపదార్థం: అనినన్= అని ధృతరాష్ట్రుడు అడుగగా; సంజయుఁడు= సంజయుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అకట!= ఔరా!; కొడుకుమీఁదన్= కుమారుడిపై; తప్పు+పెట్టెదవు= నిందమోపెదవు; నీమీఁది కొఱఁత= నీయందున్నలోటు; నీకున్= నీకు; కానంగన్+వచ్చునె?= కనబడునా?; నీవు+ఎఱుంగకుండన్= నీకు తెలియకుండ; ఆతండు= సుయోధనుడు; పాండుసుతులన్= పాండవులను; పఱచెనె?= బాధించాడా?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి మాటలకు సంజయు డిట్లా బదులు పలికాడు: 'ఔరా! నీ కొడుకు మీద దోషం ఆరోపిస్తావు గాని, నీలోని లోపం నీవు గుర్తించకున్నావు. నీకు తెలియకుండ సుయోధనుడు పాండునందనులను కష్టపెట్టాడా?

వ. **ఆ పని గడవంబడియె; వార్తలు వినియెదవేని వినుము; దుర్యోధనుండు దుశ్శాసన శకుని కర్ణులతో విచారించి యులూకుం బిలిపించి నీవు వోయి పాండవులంగని వాసుదేవు సన్నిధిని బాంచాల విరాట ప్రముఖులు వినఁ బలుకు'మని పరుసని మాటలు గఱపి పుచ్చిన నతండును.** **187**

ప్రతిపదార్థం: ఆ పని= ఆ కార్యం; కడవన్+పడియెన్= జరిగిపోయింది; వార్తలు వినియెదవు+ఏనిన్= సంగతులు వినదలచుకొంటే; వినుము= ఆలకించుము; దుర్యోధనుండు దుశ్శాసన శకుని కర్ణులతోన్; విచారించి= ఆలోచించి; ఉలూకున్; పిలిపించి= ఉలూకుడనెడి శకుని కుమారుడిని రప్పించి; నీవు పోయి, పాండవులన్‌కని; వాసుదేవు సన్నిధిని= శ్రీకృష్ణుడి సమక్షంలో; పాంచాల విరాట ప్రముఖులు= ద్రుపదుడు, విరాటుడు మున్నగువారు; వినన్; పలుకుము; అని; పరుసని మాటలు= కఠినవాక్యాలు; కఱపి= చెప్పి; పుచ్చినన్= పంపగా; అతండును= ఆ ఉలూకుడుకూడ.

తాత్పర్యం: ఆ కార్యం గడచిపోయింది. సంగతులు వినదలిస్తే వినుము. దుర్యోధనుడు దుశ్శాసన శకుని కర్ణులతో మంతనమాడి ఉలూకుడనే శకుని పుత్రుడిని పిలిపించి, నీవు వెళ్ళి పాండవులను చూచి, అక్కడ శ్రీకృష్ణుడి సమ్ముఖంలో ద్రుపదుడు విరాటుడు మొదలైనవారు వింటుండగా ఈ పలుకులు పలుకుము అని కొన్ని కఠిన వాక్యాలు అతడికి చెప్పి పంపగా వాడు (వెళ్ళాడు.)

క. **చని కొలువున ధర్మసుతుం । గని 'దుర్యోధనుఁడు చెప్పఁగా నను నియమిం**
చిన మాటలు గొన్ని గలవు । విను మలుగక' యనిన నతఁడు విని యిట్లనియెన్. **188**

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; కొలువునన్= సభలో; ధర్మసుతున్+కని= ధర్మజుడిని చూచి; దుర్యోధనుఁడు= సుయోధనుడు; చెప్పఁగాన్= మీకు తెలుపుటకై; ననున్= నన్ను; నియమించిన మాటలు= ఆజ్ఞాపించిన పలుకులు; కొన్ని కలవు= కొన్ని

ఉన్నాయి; అలుగక= నాపై కోపించక; వినుము= ఆలకించుము; అనినన్= అని ఉలూకుడు పలుకగా; అతఁడు విని= ధర్మపుత్రుడు ఆకర్ణించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఉలూకుడు వెళ్ళి సభలో ధర్మపుత్రుడిని చూచి 'దుర్యోధనుడు మీకు చెప్పుమని నన్ను ఆజ్ఞాపించిన మాటలు కొన్ని ఉన్నాయి. నాపై కోపగించక వాటిని వినుము' అని పలుకగా ధర్మజుడు విని ఇట్లా అన్నాడు:

ఆ. **'నీకు వెఱవనేల? నిన్ను నా బుద్ధిమం। తుండు చెప్పు మనిన తులువమాట**
లెన్ని గలవు వాని నన్నింటి ననుమాన। మింత లేక యాడు మెల్ల వినఁగ. **189**

ప్రతిపదార్థం: నీకున్= నీకు; వెఱవన్+ఏల?= భయపడటమెందుకు?; నిన్నున్= నిన్ను; ఆ బుద్ధిమంతుండు= ఆ ప్రజ్ఞావంతుడు; చెప్పుము+అనిన= పలుకుమనిన; తులువమాటలు= తుంటరికూతలు; ఎన్ని కలవు= ఎన్ని ఉన్నాయో; వానిన్+అన్నింటిన్= ఆ మాటలన్నీ; అనుమానము= సందేహం; ఇంత లేక= రవంతయు లేకుండా; ఎల్లన్+వినఁగన్= అందరూ ఆలకిస్తుండగా; ఆడుము= పలుకుము.

తాత్పర్యం: 'ఉలూకా! నీవు భయపడనక్కరలేదు. నిన్ను ఆ బుద్ధిమంతుడు పలుకుమన్న తుంటరి మాటలు ఎన్ని ఉన్నాయో వాటి నన్నింటిని సందేహం కొంచెం కూడా లేకుండ ఈ కొలువులోని వారెల్లరు ఆలకించగా పలుకుము.'

వ. **అనిన నులూకుం డిట్లనియె :** **190**

ప్రతిపదార్థం: అనినన్= అని ధర్మజు డనగా; ఉలూకుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధర్మజు డట్లా పలుకగా ఉలూకు డిట్లా అన్నాడు:

సీ. **'కయ్యంబునకుఁ బెద్ద కాలమేనియుఁ బూఁచి। పట్టి వచ్చితి కడు బరవసమున;**
సంజయుతో మీరు శంకలే కాడిన। యెక్కుడు మాటలు పెక్కు గలవు;
భూమి భాగము గోలుపోయిన యలుకకు। ద్రౌపదిఁ బఱచిన దైన్యమునకుఁ
దగ మంచిబంటవై తఱి యిది బాహుబ। లాస్త్ర విద్యలు చూపనని తలంచి

ఆ. **నిలువ వలయు నీకుఁగలవారి నెల్లను। గూర్చి మోహరించికొని కడంగి**
నడవు సమరమునకు; వెడజంకఁబోదింకఁ। దప్పఁ గ్రుంకలేదు తఱికిఁ జొరుము. **191**

ప్రతిపదార్థం: కయ్యంబునకున్= యుద్ధానికి; పెద్దకాలము+ఏనియున్= దీర్ఘకాలమైనను; పూఁచి పట్టి= పూనిక వహించి; కడున్ బరవసమునన్= మిక్కిలి ధైర్యంతో; వచ్చితి(వి)= వచ్చావు; సంజయుతోన్= సంజయుడితో; మీరు; శంకలేక= జంకు వహించక; ఆడిన= పలికిన; ఎక్కుడు మాటలు= మీ యోగ్యతను మించిన పలుకులు; పెక్కు కలవు= అనేకములున్నవి; భూమిభాగమున్= రాజ్యభాగాన్ని; కోలుపోయిన+అలుకకున్= పోగొట్టుకొన్న కోపానికి; ద్రౌపదిన్= పాంచాలిని; పఱచిన దైన్యమునకున్= అవమానించిన చిన్నతనానికి; తగన్= చక్కగా; మంచి బంటవు+ఐ= గొప్ప వీరుడవై; బాహుబల+అస్త్రవిద్యలు చూపన్= భుజబలమును, బాణ విద్యా నైపుణ్యమును చూపటానికి; తఱి+ఇది= ఇది తగిన సమయం; అని తలంచి= అని భావించి; నిలువన్ వలయున్= నిలబడవలెను; నీకున్+కలవారిన్+ఎల్లను= నీకున్న వారినందరినీ; కూర్చి= చేర్చుకొని; మోహరించికొని= వ్యూహము లేర్పరచుకొని; కడంగి= పూని; సమరమునకున్= కయ్యానికి; నడవు(ము)= కదలుము; వెడ

జంకన్+బోదు= ఇంచుక జంకితే పోవదు, ఏ మాత్రం జంకినా లాభం లేదు; ఇంకన్= మరి; తప్పన్+క్రుంకన్‌లేదు= తప్పించుకోవడానికి వీలుకాదు; తఱికిన్= సమయానికి; చౌరుము= ప్రవేశించుము, పూనుకొమ్ము.

తాత్పర్యం: 'యుద్ధం చేయటానికి బహుకాలం వేచియుండి మిక్కిలి ధైర్యంతో వచ్చావు. సంజయుడితో మీ యోగ్యతకు మించి పల్కిన మాట లెన్నో ఉన్నవి. రాజ్యభాగం పోగొట్టుకొన్నందుకు, ద్రౌపదిని భంగపెట్టినందుకు పగదీర్చుకొనే సమయ మాసన్నమైనదని తలంచి మీ బాహుబలం, మీ బాణ విద్యా కౌశలం చూపటానికి కదనరంగంలో మేటి వీరుడవై నిలబడుము. నీకున్న వారి నందరినీ కూర్చుకొని, వ్యూహ లమర్చుకొని కదనానికి కదలిరమ్ము. ఇక జంకి లాభంలేదు. తప్పించుకొనటానికి వీలుగాదు. సమయానికి రమ్ము.

క. ఆతతబలుఁ డగు భీష్ముని । చేతి బలువు ద్రోణు నంపసెల లవియుటయుం
జూతు రటురండు కృష్ణుని । చేతన సకలంబుఁ జక్కఁ జేసికొనుండీ! 192

ప్రతిపదార్థం: ఆతత బలుఁడు+అగు= అధికబలంగల వాడయిన; భీష్ముని= పితామహుడి యొక్క; చేతి బలువు= బాహుశక్తి; ద్రోణు+అంపసెలలు= ద్రోణాచార్యుల బాణపు ములుకులు; అవియుటయున్= గ్రుచ్చుకొనటమున్నూ; చూతురు= చూస్తారు; అటురండు= యుద్ధానికి రండి; కృష్ణునిచేతన= కృష్ణుడి వలననే; సకలంబున్= అంతయు; చక్కఁజేసికొనుండీ= చక్కబరచుకొనండి.

తాత్పర్యం: పోరాటానికి రండి. అధిక బలసంపన్నుడైన భీష్ముడి భుజశక్తినీ, ద్రోణాచార్యుల బాణాగ్రాల పోటులనూ కనుగొనగలరు. మీరు శ్రీకృష్ణుడిచేతనే అంతా చక్కబెట్టుకొనండి.

క. వారిద్దఱ వాలమ్ముల । బారింబడి యర్జునునకు బ్రదుక వశమె? మీ
వారెల్ల నెఱుంగరె య । వ్వీరుల దివ్యాస్త్రశస్త్ర విభవ సమృద్ధుల్?' 193

ప్రతిపదార్థం: వారి+ఇద్దఱవాలు+అమ్ములు= ఆ భీష్మ ద్రోణుల నిడుదలైన శరాలయొక్క; బారిన్+పడి= పాలై (హింసకులోనై;) అర్జుననకున్= పార్థుడికి; బ్రదుకన్ వశమె?= జీవించటానికి శక్యమౌతుందా? మీవారు+ఎల్లన్= మీ వారందరూ; ఆ+వీరుల= ఆ శూరులిద్దరియొక్క; దివ్య+అస్త్రశస్త్ర విభవ సమృద్ధుల్= శ్రేష్ఠములైన శరములయొక్కయు, ఆయుధముల యొక్కయు శక్తి సంపన్నతలు; ఎఱుంగరె?= తెలియరా?

తాత్పర్యం: భీష్మ ద్రోణు లిద్దరి దీర్ఘములైన బాణాల బారిన పడి అర్జునుడు బ్రతకటం సాధ్యమా? మీ వారందరు ఆ మేటి శూరులయొక్క దివ్యాస్త్రాల ఆయుధాల శక్తి సంపన్నతను తెలియరా ఏమి?'

వ. అని భీమసేనుం జూచి. 194

తాత్పర్యం: అని ఉలూకుడు పలికి భీమసేనుడిని చూచి.

క. 'ఈ వాయుపుత్త్రుఁ డాజిం । ద్రావుదు నే దుస్ససేను రక్తం బనియెం;
ద్రావఁగ శక్యం బేనిం । ద్రావు మనన్ రాదె? యింకఁ దడ వేమిటికిన్? 195

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఈ వాయు పుత్త్రుఁడు= ఈ భీముడు; దుస్ససేను రక్తంబు= దుశ్శాసనుడి నెత్తురు; ఆజిన్= యుద్ధంలో; నేన్= నేను; త్రావుదున్+అనియెన్= నేను త్రాగుతానని అన్నాడు; త్రావఁగన్= త్రాగటానికి; శక్యంబు+ఏనిన్= వీలయితే; త్రావుము+అనన్ రాదె?= త్రాగుమని చెప్పరాదా?; ఇంకన్= మరి; తడవు+ఏమిటికిన్?= ఆలస్య మెందుకు?

తాత్పర్యం: 'ఈ భీముడు దుశ్శాసనుడి నెత్తురు యుద్ధంలో నేను త్రాగుతానని ప్రతిజ్ఞ చేశాడు. త్రాగటానికి తనకు శక్యమైతే త్రాగుమని చెప్పుము. మరి జాగు చేయటమెందుకు?

క. విను నూతి కప్ప విధమున । నిను నీవ యెఱుంగు; దెఱుఁగ నేరవు గర్వం
బున నావలి కొలఁది రణం । బున నొకమరి పెట్టువడక పోనేర్చెదవే?' 196

ప్రతిపదార్థం: విను= భీమసేనా, వినుము; నూతికప్పవిధమునన్= బావిలోని మండూకం వలె; నినున్= నిన్ను మాత్రమే; నీవ+ ఎఱుంగుదు(వు)= నీవు తెలియుదువు; గర్వంబునన్= పొగరుచేత; ఆవలి కొలఁదిన్= ఇతరుల బల పరిమాణాన్ని; ఎఱుఁగన్ నేరవు= తెలియజాలవు; రణంబునన్= సంగ్రామంలో; ఒకమరి= ఒకసారి; పెట్టువడక= దెబ్బతినక; పోన్+నేర్చెదవే?= తప్పించుకొని పోగలవా?

తాత్పర్యం: భీమసేనా! వినుము. బావిలోని కప్పవలె నిన్ను మాత్రమే నీ వెఱుగుదువు. మదంవలన ఎదుటివారి బల పరిమాణ మేమిటో తెలియకున్నావు. సంగ్రామంలో ఒకసారి మా చేత జిక్కి పెట్టులు (దెబ్బలు) తినకుండ తప్పించుకొని పోలేవు సుమా!'

వ. అని పలికి సవ్యసాచిం జూచి. 197

తాత్పర్యం: అని పలికి అర్జునుడిని చూచి.

తే. 'వినుము గాండీవ మనునొక విల్లు తాటి । పొడవు గలిమియుఁ, గృష్ణుండు పూని తోడు
గూడుకొని వచ్చుటయు నెఱుంగుదుము; వీని । కెల్ల శంకించి భూమి పా లీము గాని. 198

ప్రతిపదార్థం: వినుము= అర్జునా, ఆలకించుము; గాండీవము+అను= గాండీవమనే పేరుగల; ఒక విల్లు= ఒక చాపం; తాటిపొడవు+కలిమియున్= తాటిచెట్టంత పొడవు గలిగి ఉండుటయు; కృష్ణుండు= శౌరి; పూని= పూనిక వహించి; తోడు కూడుకొని వచ్చుటయున్= నీకు సాయంగా వెంబడిరావటం; ఎఱుంగుదుము= మాకు తెలుసు; వీనికిన్+ఎల్లన్= వీటినన్నిటిని చూచి; శంకించి= జంకి; భూమిపాలు+ఈము+కాని= మేము పుడమిలో భాగం మీ కీయము సుమా!

తాత్పర్యం: 'అర్జునా! తాటిచెట్టంత పొడవు గలిగిన గాండీవ మనే విల్లు నీకున్నదనీ, కృష్ణుడు నీకు సాయంగా నీవెంట ఉన్నాడనీ మాకు బాగా తెలుసు. ఈ ఆర్భాటాలకు బెదరిపోయి మీకు పుడమిలో పాలుపంచి మే మొసగం సుమా!

క. పవనజు గదయును నీ గాం । డివమును నెట వోయె నంగడికిఁ బాంచాలిం
దివిచికొని వచ్చునెడఁ బరి । భవ మెఱుఁగవె బీర మేల పలుకుదు తోడ్తోన్? 199

ప్రతిపదార్థం: పాంచాలిన్= ద్రౌపదిని; అంగడికిన్= సభలోనికి; తివిచికొనివచ్చు+ఎడన్= ఈడ్చుకొని వచ్చేటప్పుడు; పవనజు గదయున్= భీముడి గదయు; నీ గాండివమును= నీ గాండీవమును; ఎట+పోయెన్?= ఎక్కడికి పోయాయి?; పరిభవము= జరిగిన అవమానం; ఎఱుఁగవె?= తెలియవా?; తోడ్తోన్= వెంటవెంటనే; బీరము+ఏల+పలుకుదు(వు)?= పౌరుష వచనాలు ఎందుకు పలుకుతావు?

తాత్పర్యం: ద్రౌపదిని ఒడ్డోలగం లోనికి ఈడ్చి తెచ్చేటప్పుడు భీముడి గద, నీ గాండీవం ఎక్కడికి వెళ్ళాయి? జరిగిన అవమానం మరచావా? మాటి మాటికి బింకపు మాటలు ఎందుకు పలుకుతావు?

చ. వలలుఁ డనన్ విరాటుకడ వంటలవాఁడయి భీముఁడున్, బృహ
న్నల యన నాఁడు పేడివయి నాన యొకింతయు లేక నీవు న
గ్గలమగు దైన్యమొంది కడుఁ గాఁతియ వొందితి రుర్వియేలునా
సలఁబడి; సవ్యసాచి! యిది శౌర్యమొ? బాహుబలంబొ? చెప్పుమా! 200

ప్రతిపదార్థం: వలలుఁడు+అనన్= వలలుడనే మారుపేరుతో; వంటలవాఁడు+అయి= బానసీడై; భీముఁడున్= భీముడున్నూ; బృహన్నల+అనన్= బృహన్నల అనగా; నాఁడు= అజ్ఞాతవాస సమయంలో; పేడివి+అయి= నపుంసకుడవై; నాన= సిగ్గు; ఒక+ ఇంతయున్ లేక= ఇంచుకంతైనలేక; నీవున్= నీవునూ; ఉర్వి+ఏలు+ఆసలన్+పడి= పుడమిని పాలించవలెననే ఆశకు వశులై; అగ్గలము+అగు= అధికమైన; దైన్యము+ఒంది= దీనదశ జిక్కి; కడున్= మిక్కిలి; కాఁతియ పొందితిరి= కష్టాలు అనుభవించారు; సవ్యసాచి!= ఓ అర్జునా!; ఇది శౌర్యమొ= ఇది శూరత్వమో; బాహు బలంబొ= భుజబలమో; చెప్పుమా= వచింపుము.

తాత్పర్యం: అర్జునా! వలలుడనే పేరుతో వంటలవాడై భీముడూ, బృహన్నల నామంతో షండుడవై నీవూ సిగ్గు రవంతైనా లేక, రాజ్యం పాలించవలెననే ఆశకు వశులై, విరాటుడి కొలువులో దీనులై నానాకష్టాల పాలైనారు కదా! ఇది శూర లక్షణమో, బాహు విక్రమమో నీవే చెప్పవలె.

ఉ. మాయలు నింద్రజాలములు మాధవుఁ డిందును గొన్ని పన్నినన్
బాయవు రజ్జు లెప్పుడు నవారణ నీ వెటు లాడితేనియున్
వేయును నేల? పార్థులును విష్ణులు నేఁబదివేలు వచ్చినం
జేయుదు మేము గయ్య మొకచీరియు సంపదఁ బంచియిత్తుమే?' 201

ప్రతిపదార్థం: మాధవుఁడు= శ్రీకృష్ణుడు; మాయలున్= టక్కులు; ఇంద్రజాలములు= కనుకట్టు విద్యలు; ఇందును= ఇక్కడ; కొన్ని పన్నినన్= కొన్ని చేసిననూ; పాయవు= తీరవు; రజ్జులు= ఆత్మస్తుతులతో కూడిన వ్యర్థ సంభాషణలు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; అవారణన్= అడ్డం లేకుండా; నీవు+ఎట్టులు+ఆడితి+ఏనియున్= నీవెట్లా పల్కినప్పటికినీ; వేయును+ఏల?= పలుమాటలెందుకు? పార్థులును= అర్జునులు(కౌంతేయులు); విష్ణులు= శ్రీకృష్ణులు; ఏబదివేలు వచ్చినన్= ఏబదివేల మంది వచ్చినప్పటికిన్నీ; ఏము= మేము; కయ్యము చేయుదుము= యుద్ధం చేస్తాము; సంపదన్= రాజ్యసంపత్తిలో; ఒక చీరియున్= ఒకింత చీల్చి; పంచి+ ఇత్తుమే= మీకు పంచి ఇస్తామా? (ఇవ్వమని అభిప్రాయం.)

తాత్పర్యం: మాధవుడు టక్కుటమారాలు, ఇంద్రజాలాలు కొన్ని పన్నినప్పటికీ, గాలిలో కలిసిపోయే ప్రగల్భవచనాలు నోటికడ్డం లేకుండ నీ వెలా ప్రేలినప్పటికీ, ఏబది వేలమంది అర్జునులు శ్రీకృష్ణులు వచ్చినప్పటికీ మేము యుద్ధం చెయ్యకమానము. పలుమాట లెందుకు? పుడమిలో రవంతకూడా చీల్చి మీకు పంచి ఇవ్వం.'

వ. అనిన భీమార్జున నకుల సహదేవు లొండొరుల మొగంబులు సూచుచు నాసనంబులు చలింప, మొగంబులు జేవురింపఁ గ్రోధాయత్తచిత్తులై యున్నం గనుంగొని నవ్వుచు నారాయణుం డులూకున కిట్లనియె 'నీవు వోయి సుయోధనుతో నెల్లవారును విన నిట్లనుము: 202

ప్రతిపదార్థం: అనినన్; భీమ+అర్జున నకుల సహదేవులు; ఒండు+ ఒరుల మొగంబులు చూచుచున్= ఒకరి ముఖం మరొక్కరు చూచుకొంటూ; ఆసనంబులు చలింపన్= పీఠాలు కదలగా; మొగంబులు జేవురింపన్= ముఖాలు ఎర్రపడగా; క్రోధ+ఆయత్త చిత్తులు+ఐ= కోపానికి వశమైన మనస్సులు కలవారై; ఉన్నన్= ఉండగా; కనుంగొని= చూచి; నవ్వుచున్; నారాయణుండు; ఉలూకునకున్; ఇట్లనియెన్; నీవుపోయి; సుయోధనుతోన్; ఎల్లవారును వినన్; ఇట్లు+ అనుము= ఈ రీతి పలుకుము.

తాత్పర్యం: ఉలూకుడి పలుకులు విని భీమార్జున నకుల సహదేవులు ఒకరిముఖం మరొకరు చూస్తూ, కూర్చున్న తమ ఆసనాలు కదలగా, ముఖాలు ఎర్రదనం పొందగా కోపానికి అధీనమైన మనస్సులు కలవారై ఉండగా శ్రీకృష్ణుడు చూచాడు. చూచి నవ్వుతూ ఉలూకుడితో 'నీవు వెళ్ళి అక్కడ అందరూ వింటుండగా దుర్యోధనుడితో ఇట్లా చెప్పు.

తే. బవర మెల్లియ బిరుదవై బరవసంబు । గలిగి చావుము; చావక తొలఁగ రాదు
కృష్ణ సారథికంబగు జిష్ణురథము । తొడరి నీ వెందుఁ జొచ్చినఁ దోన చొచ్చు. 203

ప్రతిపదార్థం: బవరము= యుద్ధం; ఎల్లి+అ= రేపే; బిరుదవు+ఐ= శూరుడవై; బరవసంబు+కలిగి= ధైర్యం వహించి; చావుము= మరణించుము; చావక= మరణం పాలుగాక; తొలఁగన్+రాదు= యుద్ధరంగం నుండి తప్పించుకొనలేవు; కృష్ణ సారథికంబు+అగు= శ్రీకృష్ణుడు సారథిగా కలిగిన; జిష్ణు రథము= జయశీలుడైన పార్థుడి అరదం; తొడరి= ఎదిరించి; నీవు+ ఎందున్+చొచ్చినన్= నీవెక్కడ ప్రవేశించినప్పటికీ; తోన్+అ చొచ్చున్= వెంబడే ప్రవేశిస్తుంది.

తాత్పర్యం: యుద్ధం రేపే. వీరుడవై ధైర్యమూని మరణించుము. మరణించక తప్పించుకొనిపోలేవు. శ్రీకృష్ణుడు సారథ్యం వహించగా వెడలిన విజయుడి తేరు ని న్నెదిరించి నీ వెక్కడ దూరితే వెంటనే తానూ అక్కడ దూరుతుంది.

క. రిత్తలు రజ్జెడువాఁడే । మత్తగజాయుతబలుండు మారుతి యని మ
ద్వృత్తుఁడగు దుస్ససేనుని । నెత్తు రురము వ్రచ్చి త్రావు నీవుం జూడన్. 204

ప్రతిపదార్థం: మత్తగజ+అయుతబలుండు= మదించిన పదివేల యేనుగుల బలం గలిగిన; మారుతి= వాయుపుత్రుడు భీముడు; రిత్తలు= వట్టిమాటలు; రజ్జెడువాఁడే= వాగునట్టివాడా? అనిన్= కదనంలో; ఉద్వృత్తుఁడు+అగు= గర్విఅయిన; దుస్ససేనుని= దుశ్శాసనుడి యొక్క; నెత్తురు= నెత్తురును; ఉరము వ్రచ్చి= గుండె చీల్చి; నీవున్= నీవు; చూడన్= చూస్తూ ఉండగా; త్రావున్= త్రాగగలడు.

తాత్పర్యం: భీముడు పదివేల యేనుగుల సత్తువగలవాడు. అత డెప్పుడూ వట్టిమాటలు వదరెడువాడు కాడు. కదనంలో దుశ్శాసనుడి వక్షం చీల్చి నీవు చూస్తుండగనే రక్తం త్రాగగలడు.'

వ. అని యిట్లు హరి పలికిన యనంతరంబ యర్జునుం డులూకున కిట్లనియె: 205

తాత్పర్యం: ఇట్లా కృష్ణుడు పలికిన తరువాత అర్జునుడు ఉలూకుడితో ఇట్లా అన్నాడు:

క. 'వారు గలరు వీరు గలరు। పోరికి నని చెప్పె దీవు పొంగారుచు మీ
వారిని మిమ్మును రేపు గ। దా రూ పేర్పడఁగఁ జూచెదం గితవసుతా! 206

ప్రతిపదార్థం: కితవసుతా!= ఓ జూదరికొడుకా!; పోరికిన్= యుద్ధానికి; వారు కలరు= వారున్నారు; వీరు కలరు= వీరున్నారు; అని= అంటూ; పొంగారుచున్= నిక్కుతూ; ఈవు= నీవు; చెప్పెదవు= చెపుతున్నావు; మీవారినిన్= మీకు సాయంగా ఉన్నవారినీ; మిమ్మును= బింకాలాడుతున్న మిమ్మునూ; రేపు+కదా= రేపటి దినంగదా; రూపు+ఏర్పడఁగన్+చూచెదను= మీ విధమెట్టిదో తేటతెల్లంగా కనుగొంటాను.

తాత్పర్యం: 'మాకు యుద్ధంలో సాయపడటానికి వారున్నారు. వీరున్నారు' అని నీవు నిక్కుతూ చెప్తుతున్నావు. మీకు సాయంగా ఉన్నవారినీ, బింకాలాడుతున్న మిమ్ములనూ రేపుగదా స్పష్టంగా చూస్తాను.

చ. తన భుజశక్తి లేక యొరుదర్పము యూఁది పరాక్రమింప వ
చ్చిన నది సెల్లునే? కులవిశిష్టుని సువ్రతు వృద్ధు నార్యు భీ
ష్ముని నెసకొల్పి సేనలకు ముఖ్యుఁడ వీవని యుబ్బఁజేసి యీ
సునఁ దలపెట్టి చంపికొనఁజూచె సుయోధనుఁ డింత నేమగున్? 207

ప్రతిపదార్థం: తన భుజశక్తి లేక= తనకు బాహుబలం లేకుండా; ఒరుదర్పము+అ= పరులశక్తినే; ఊఁది= ఆధారం చేసికొని; పరాక్రమింపన్+వచ్చినన్= శౌర్యం చూపవస్తే; అది చెల్లునే= అది సాగుతుందా?; కుల విశిష్టునిన్= కురువంశంలో సదాచార సంపన్నుడునూ; సువ్రతున్= మంచి నియమాలు కలవాడునూ; వృద్ధున్= ముసలివాడునూ; ఆర్యున్= పూజ్యుడునూ అయిన; భీష్మునిన్= పితామహుడిని; ఎసకొల్పి= పురికొలిపి; సేనలకున్+ముఖ్యుఁడవు+ఈవు+అని= సైన్యాలన్నింటికీ ప్రధానాధికారివి నీవేఅని; ఉబ్బన్+చేసి= ఉప్పొంగించి; ఈసునన్+తలపెట్టి= ద్వేషంతో సంకల్పించి; సుయోధనుఁడు= దుర్యోధనుడు; చంపికొనన్+చూచెన్= చంపుకొనటానికి యత్నించాడు; ఇంతన్+ఏమి+అగున్?= భీష్ముడు సర్వసైన్యాధిపతి అయినంత మాత్రాన తాను గట్టెక్కినట్లా?

తాత్పర్యం: తనకు బాహుబలం లేకుండా పరులశక్తి నాశ్రయించి పరాక్రమం ప్రకటింపజూస్తే సాగదు. కురుకులంలో విశిష్టుడూ, మంచి నియమ నిష్ఠలు కలవాడూ, ముసలివాడూ, పూజ్యుడూ అయిన భీష్ముడిని పురికొల్పి సేనలన్నింటికి నీవే అధిపతివని ఉబ్బించి ఈర్ష్యతో అతడిని చంప దలపెట్టాడు సుయోధనుడు. భీష్ముడిని నమ్ముకొన్న మాత్రాన తాను ఒడ్డుకు చేరినట్లా?

చ. తన తలఁ పిట్లు భీష్మభుజదర్పము లోకముకంటె నెక్కు డీ
తని నొకభంగి నండగొని తప్పుదుఁ జావున కంచునున్నవాఁ;
డనిఁ దొలుముద్ద గొందుము రయంబున నాతని, వెండి ద్రోణులం
దునుముదు, మష్ట సూతసుతుఁ దోలుదు, మంతట నాస మాలెడున్. 208

ప్రతిపదార్థం: తన తలఁపు+ఇట్లు= తన ఉద్దేశ మిది; భీష్మభుజ దర్పము= గాంగేయుడి బాహు పరాక్రమం; లోకముకంటెన్= లోకంలోనివారి శౌర్యంకంటె; ఎక్కుడు= అధికం; ఈతనిన్= భీష్ముడిని; ఒక భంగిన్= ఒక విధంగా; అండ+కొని= ఆధారంగా చేసికొని; చావునకున్+తప్పుదున్= మరణం గడచెదను; అంచున్= అని; ఉన్నవాఁడు= దుర్యోధను డాశతో ఉన్నాడు; అనిన్= పోరాటంలో; రయంబునన్= శీఘ్రంగా; ఆతనిన్= ఆ భీష్ముడిని; తొలుముద్ద కొందుము= మొదటి ముద్దగా ఆరగిస్తాం; వెండిన్= ఆతడి తర్వాత; ద్రోణులన్= గురువైన ద్రోణాచార్యుని; తునుముదుము= నరకివేస్తాము; అప్డు= ఆ వెంటనే; సూతసుతున్= కర్ణుడిని; తోలుదుము= రణరంగమునుంచి తరిమి వేస్తాము; అంతటన్= అప్పుడు; ఆసమాలెడున్= దుర్యోధనుడు ఆశ వదలుకొంటాడు.

తాత్పర్యం: సుయోధనుడి ఉద్దేశమిది- లోకంలోని వారందరికంటె భీష్ముడి భుజబలం ఎక్కువని. అది వట్టి భ్రమ. గాంగేయుడిని ఆధారంగా చేసికొని మరణం పాలుగాకుండ మనవలెనని దుర్యోధనుడు భావిస్తున్నాడు. కాని, అతడు విశ్వసించిన గాంగేయుడినే తొలిముద్దగా దిగమ్రింగుతాము. ఆ పిదప గురువైన ద్రోణాచార్యులను మట్టుపెడతాం. అవతల సూతపుత్రుడైన కర్ణుడిని తరుమగొడతాం. అప్పటికికాని సుయోధనుడు ఆశ వదలుకోడు.

క. అనుజుల తనుజుల చావులు । కనుఁగొని మఱి తాను భీము గదచే నిలఁ గూ
లిన యప్పుడైన దుర్యో । ధనుఁడు మదిం దలఁచుఁగాక తన దుష్కృతముల్. 209

ప్రతిపదార్థం: అనుజుల= తమ్ముల యొక్కయు; తనుజుల= పుత్రుల యొక్కయు; చావులు= మరణాలు; కనుఁగొని= చూచి; మఱి= తరువాత; తాను= తాను; భీము గదచేన్= భీమసేనుడి గదాఘాతంతో; ఇలన్+కూలిన+ అప్పుడు+ఐనన్= నేలపై కూలినప్పుడైనా; దుర్యోధనుఁడు= సుయోధనుడు; తన దుష్కృతముల్= తన పాపములు; మదిన్= మనసులో; తలఁచున్+కాక!= భావించుకొనగలడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తన తమ్ముల, కుమారుల మరణాలు చూచి, భీముడి గదాఘాతంతో ధరణిపై కూలినప్పుడైనా తన పాపకార్యాలను స్మరించగలడు.

వ. అది యట్లుండె; నీవు వేగపోయి రేపకడయ మీ రాజుం గలనికి నడపింపు'మనియె; నప్పుడు ధర్మనందనుం డులూకునకుం దాంబూలాభరణంబు లిచ్చి వీడుకొలిపి, ధృష్టద్యుమ్ను నవలోకించి 'యెల్లి కయ్యంబని మన సైన్యంబులకెఱింగించి సర్వసమరసన్నాహంబులు సమకట్టు'మని పనిచి కొలువు విరిసి చనియె; ధృష్టద్యుమ్నుండును ద్రోణులం దొడరం బడసితినని యుబ్బుచు వెడలి, భీష్మం దలపడఁగంటి నని పొంగు శిఖండి తోడుగా రాజు శాసనంబు నిర్వర్తించె; నిట యులూకుండు వచ్చి దుర్యోధనుం బేరోలగంబునం గని యతనికిఁ గృష్ణార్జునుల పలుకు లున్న రూపు విన్నవించిన, నతండు కర్ణుదెసఁ గనుంగొని 'సమస్త సేనలకు రేపు బవరం బని చెప్పి పుచ్చుము; సకల సాధనంబులు నాయితంబులు సేయు' మని పనిచిన నతండు నట్లచేసె; నిట్లు భయకటకంబులు రణంబునకు నుత్సహించి విజృంభించి యుల్లసిల్లె' ననిన ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె: 210

ప్రతిపదార్థం: అది+అట్లు+ఉండెన్= ఆ విషయం అట్లా ఉంచుము; నీవు; వేగన్= శీఘ్రంగా పోయి; రేపకడయ= ఉదయమే; మీ రాజున్; కలనికిన్= యుద్ధానికి; నడపింపుము; అనియెన్; అప్పుడు ధర్మనందనుండు; ఉలూకునకున్; తాంబూల+

ఆభరణంబులు+ఇచ్చి; వీడుకొలిపి= వెళ్ళుటకు అనుమతినిచ్చి; ధృష్టద్యుమ్నున్; అవలోకించి= చూచి; ఎల్లి= రేపు; కయ్యంబు+అని; మన సైన్యంబులకున్; ఎఱింగించి; సర్వ సమర సన్నాహంబులు= అన్ని రకాలైన యుద్ధ ప్రయత్నాలు; సమకట్టుము+అని= చేయుమని; పనిచి= ఆజ్ఞాపించి; కొలువు విరిసి= సభ చాలించి; చనియెన్; ధృష్టద్యుమ్నుండును; ద్రోణులన్; తొడరన్+పడసితిన్= ఎదిరింపగంటినని; ఉబ్బుచున్= సంతోషిస్తూ; వెడలి; భీష్మున్+తలపడన్+కంటిని= భీష్ముతో పోరాడనోచితిని; అని; పొంగు= సంతసిల్లే; శిఖండి; తోడుగాన్= సహాయుడు కాగా; రాజు శాసనంబు= రాజాజ్ఞను; నిర్వర్తించెన్= నెరవేర్చాడు; ఇటన్; ఉలూకుండున్ వచ్చి దుర్యోధనున్; పేరు+ఓలగంబునన్= పెద్ద సభలో; కని; అతనికిన్; కృష్ణ+అర్జునుల పలుకులు; ఉన్నరూపు= ఉన్నవి ఉన్నట్లుగా; విన్నవించినన్= మనవి చేయగా; అతండు= సుయోధనుడు; కర్ణుదెసన్; కనుంగొని; సమస్త సేనలకున్; రేపు; బవరంబు= యుద్ధం; అని చెప్పి; పుచ్చుము= పంపుము; సకల సాధనంబులు= అన్ని యుద్ధోపకరణాలు; ఆయితంబులు= సంసిద్ధాలు; చేయుము; అని; పనిచినన్= పంపగా; అతండు= రాధేయుడు; అట్ల చేసెన్; ఇట్లు; ఉభయకటకంబులు= రెండు సైన్య పక్షాలు; రణంబునకున్; ఉత్సహించి= ఉద్యోగించి; విజృంభించి= చెలరేగి; ఉల్లసిల్లెన్= ప్రకాశించాయి; అనినన్; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ విషయ మట్లుంచు. నీవు తొందరగా వెళ్ళి ఉదయమే మీ రాజును యుద్ధానికి పంపుమని అర్జునుడు పలికాడు. ధర్మరాజు ఉలూకుడికి తాంబూలాభరణాలు ఇచ్చి వెళ్ళుమని చెప్పాడు. అవతల ధృష్టద్యుమ్నుడిని చూచి 'రేపే యుద్ధమని మన సైన్యాలకు తెలిపి యుద్ధ సన్నాహాలన్నీ చేయుమని ఆజ్ఞాపించి కొలువు చాలించి వెళ్ళాడు. ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని ఎదిరించే అవకాశం తనకు లభించినందుకు సంతోషించాడు. భీష్ముడిని ఎదుర్కొనే భాగ్యం తనకు కల్గినందుకు శిఖండి పొంగిపోయాడు. ధృష్టద్యుమ్నుడు శిఖండిని తోడుగా చేసికొని రాజాజ్ఞను నిర్వర్తించాడు. పాండవులకడనుండి తిరిగివచ్చిన ఉలూకుడు దుర్యోధనుడిని ఒడ్డోలగంలో చూచి, కృష్ణార్జునులు పలికిన పలుకులు ఉన్నవి ఉన్నట్లుగా మనవి చేశాడు. దుర్యోధనుడు కర్ణుడి వైపు చూచి, 'మన సేనలన్నింటికి రేపే సంగ్రామమని చెప్పి పంపుము; సకలసాధనాలను సమాయత్తం చేయవలసిం'దని పంపగా అతడు అట్లా చేశాడు. ఈ రీతిగా రెండు పక్షాలు చెలరేగి యుద్ధోత్సాహంతో ఉల్లసిల్లాయి' అని సంజయుడు చెప్పగా ధృతరాష్ట్రుడు విని మళ్ళీ అతడితో ఇట్లా అన్నాడు:

క. 'వినుము హరి తోడుగల య । ర్జును గెలువ నదీసుతునకుఁ జొప్పడునే? యా
పని నిలుపు; ములూకుని చె । ప్పిన మాటల కేమి యనిరి పిదపఁ గొలువునన్?' 211

ప్రతిపదార్థం: వినుము= సంజయా! నా మాటలు వినుము; హరితోడు+కల= శ్రీకృష్ణుడి సహాయం కలిగిన; అర్జునున్= అర్జునుడిని; గెలువన్= జయించటానికి; నదీసుతునకున్= భీష్ముడికి; చొప్పు+పడునే?= శక్యమౌతుందా?; ఆ పని నిలుపుము= ఆ విషయం అలాఉంచు; ఉలూకుని చెప్పిన మాటలకున్= ఉలూకుడు పలికిన పలుకులకు; పిదపన్= తరువాత; కొలువునన్= సభలో; ఏమి+అనిరి?= ఎవ్వరేమన్నారు?

తాత్పర్యం: 'సంజయా! శ్రీహరి సహాయం కలిగిన అర్జునుడిని జయించటానికి భీష్ముడికి సాధ్యమౌతుందా? ఆ విషయం అట్లా ఉంచు. ఉలూకుడు చెప్పిన మాటలు విన్న తరువాత సభలో ఎవ రేమి పలికారో? నాకు తెలుపుము.'

వ. అనిన విని యంబికానందనునకు సూతనందనుం డిట్లనియె : 212

ప్రతిపదార్థం: అనినన్; విని; అంబికానందనునకున్= అంబిక కొడుకైన ధృతరాష్ట్రుడితో; సూతనందనుండు= సూతజాతివాని కొడుకైన సంజయుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి మాటలకు సంజయు డిట్లా బదులు చెప్పాడు:

ఆ. 'అయ్యులూకు పలుకు లన్నియు విని భవ । త్తనయుతోడ నిట్టులనియె భీష్ముఁ
'డేనుగలుగ వెఱవ నేటికి? సేనలఁ । గాతు నీవు మెచ్చఁ గౌరవేంద్ర! 213

ప్రతిపదార్థం: ఆ+ఉలూకుపలుకులు= ఆ ఉలూకుడి మాటలు; అన్నియున్ విని= అన్నిటినీ ఆలకించి; భవత్+తనయుతోడన్= నీ కుమారునితో; భీష్ముఁడు= గాంగేయుడు; ఇట్టులు+ అనియెన్= ఈ ప్రకారం చెప్పాడు; కౌరవ+ఇంద్ర= కురునాథా!; ఏను= నేను; కలుగన్= ఉండగా; వెఱవన్+ఏటికిన్?= భయపడటం ఎందుకు?; నీవు మెచ్చన్= నీవు శ్లాఘించగా; సేనలన్+కాతున్= సైన్యాలను రక్షిస్తాను.

తాత్పర్యం: ఉలూకుడు చెప్పినమాట లన్నీ విని భీష్ముడు నీ కుమారుడితో ఇట్లా వచించాడు: 'కురురాజా! నేనుండగా నీకు భయమెందుకు? నీవు మెచ్చేటట్లు సేనలన్నింటినీ సంరక్షిస్తాను.

క. నడిపింపఁగఁ బొడిపింపఁగ । నెడమడువై కలఁగినప్పు డేర్పఱుపఁగ నేఁ
గడునేర్తుఁ బేర్చు నాదగు । కడిమియ నీ సైన్యమునకు గౌసెన కాదే?' 214

ప్రతిపదార్థం: నడిపింపఁగన్= సేనలను నడిపించటానికి; పొడిపింపఁగన్= యుద్ధం చేయించటానికి; ఎడమడువు+ఐ= తారుమారై; కలఁగిన+అప్పుడు= చెదరిపోయినప్పుడు; ఏర్పఱుపఁగన్= చక్కబరచటానికి; ఏన్= నేను; కడున్= మిక్కిలి; నేర్తున్= తెలియుదును; పేర్చు= అతిశయించే; నాదగు= నాయొక్క; కడిమి+అ= పరాక్రమమే; నీ సైన్యమునకున్= నీ సేనకు; గౌసెన+కాదే!= గలీబు(కవచం) సుమా!

తాత్పర్యం: దుర్యోధనా! సేనలను నడిపించటానికి, యుద్ధం చేయించటానికి, సైన్యం తారుమారై చెదరిపోయినప్పుడు కలతమాన్పి చక్కబరచటానికి నేను మిక్కిలి సమర్థుణ్ణి. అతిశయించే నా పరాక్రమమే సైన్యానికి రక్షాకవచమని గ్రహించుము.'

క. అనినన్ గురురా జిట్లను । 'వినుము పితామహ! మహాస్త్రవిత్తము లనఁగాఁ
జను నీవును నాచార్యుం । డును గలుగఁగ నాకు నెన్నఁడును వెఱపేలా? 215

ప్రతిపదార్థం: అనినన్= అని భీష్ముడు చెప్పగా; కురురాజు= దుర్యోధనుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; పితామహా!= తాతా!; వినుము= ఆలకించుము; మహా+అస్త్ర విత్తములు+అనఁగాన్+చను= మహాస్త్రా లెఱింగిన వారిలో శ్రేష్ఠులు అనగా ఒప్పునట్టి; నీవును= నీవూ; ఆచార్యుండును= గురువగు ద్రోణుడును; కలుగఁగన్= లభించగా; నాకున్= నాకు; ఎన్నఁడును= ఎప్పటికినీ; వెఱపు+ఏలా?= భయమెందుకు?

తాత్పర్యం: భీష్మ డారీతి ధైర్య వచనాలు పల్కగా విని సుయోధనుడు, 'తాతా! నీవూ, గురుడైన ద్రోణాచార్యులూ మహాస్త్రా లెరిగిన వారిలో పరమశ్రేష్ఠులు. మరి మీరుండగా నాకు భయమెందుకు?

తే. ఏను గంధర్వ కిన్నర దానవాది । దివ్య భూతంబులకును భీతిల్ల ననినఁ
బాండుపుత్త్రుల మాత్రకు భయము నాకు । నెక్కడిది? వ్రేల్మిడిన వారి యుక్కు మడఁతు.' 216

ప్రతిపదార్థం: ఏను= నేను; గంధర్వ= గంధర్వులు; కిన్నర= కిన్నరులు; దానవ= రాక్షసులు; ఆది= మొదలైన; దివ్య భూతంబులకును= దేవతా జాతులకూ; భీతిల్లన్+అనినన్= భయపడ నప్పుడు; పాండుపుత్త్రుల మాత్రకున్= కేవలం అల్పులైన పాండవుల గురించి; నాకున్= నాకు; భయము+ఎక్కడిది?= భీతి లేనేలేదు; వ్రేల్మిడిన్+అ= చిటిక వేసినంతలో; వారి+ఉక్కు మడఁతున్= వారల పొగరు అణుస్తాను.

తాత్పర్యం: నేను గంధర్వ కిన్నర దానవాది దేవతా వర్గానికే భయపడనప్పుడు అల్పులైన పాండవుల విషయమై నాకు భయమెక్కడిది? చిటికవేసినంతలో వారి మద మణగిస్తాను.'

భీష్ముఁడు గౌరవసేనలో నతిరథ మహారథాదుల నిరూపణంబు సేయుట (సం. 5-162-15)

వ. అని పలికి మఱియు నిట్లనియె : 217

తాత్పర్యం: అని పలికి దుర్యోధనుడు అంతటితో ఆగక మరల ఇట్లా పలికాడు :

క. 'నీ యందు వారి యందుం । జేయంగల మానుసుల విశేషంబులఁ జి
త్తాయత్తంబుగఁ జెప్పుము । నీ యెఱుఁగని యవియు లేవు నిక్కపుఁ దరముల్.' 218

ప్రతిపదార్థం: నీ యందున్= నీ ఆధిపత్యంలో ఉన్న సేనలందును; వారియందున్= పాండవ పక్షంలో ఉన్న సేనలలో; చేయన్+కల= యుద్ధం సల్పగల; మానుసుల విశేషంబులన్= వీరుల ప్రత్యేకతను; చిత్త+ఆయత్తంబుగన్+చెప్పుము= నా మనసున కెక్కునట్లు తెలుపవలసినది; నిక్కము+తరముల్= వాస్తవమైన హెచ్చు తక్కువలు; నీ+ఎఱుఁగని+అవియున్+లేవు= నీకు తెలియనట్టివి లేవు.

తాత్పర్యం: 'పితామహా! నీ పక్షంలో, పాండవుల పక్షంలో యుద్ధంచేయగల వీరుల ప్రత్యేకతలు నా మదికెక్కేటట్లు చెప్పుము. ఆ వ్యక్తుల తారతమ్యాలు నీకు తెలియనివి కావు.'

క. అనవుడు 'నీ విట్లడిగిన । విని యూరక యుండఁ దగదు విను మేర్పడ నె
ల్లను నున్న రూపు సెప్పెద । మన వారల వారి వారి మానము లధిపా!' 219

ప్రతిపదార్థం: అనవుడున్= సుయోధనుడట్లా పలుకగా; నీవు= నీవు; ఇట్లు+అడిగినన్= వీరులలో గల హెచ్చు తక్కువలు తెలుపుమని నన్ను కోరినప్పుడు; విని= ఆలకించి; ఊరక+ఉండన్+తగదు= మిన్నకుండటం న్యాయంగాదు; అధిపా!= రాజా!; ఏర్పడన్= విశదమయ్యేటట్లు; మనవారల= మన పక్షంలోని వారియొక్కయు; వారి వారి= పాండవ పక్షానికి చెందిన వారియొక్కయు; మానములు= బలపరిమాణాలు; ఉన్నరూపు+ఎల్లను= ఉన్న విధమంతయు; చెప్పెదన్= తెలుపుతాను; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: 'సుయోధనా! వీరులలోని తారతమ్యాలు తెలుపుమని నన్ను కోరినప్పుడు తెలుపక ఊరకుండటం న్యాయం కాదు. మనవారియొక్క పాండవ పక్షంలోని వారియొక్క శక్తులలోని హెచ్చుతక్కువలు ఉన్నవి ఉన్నట్లుగా చెపుతాను విను.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని గాంగేయుం డిట్లనియె : 220

తాత్పర్యం: అని భీష్ముడిట్లా అన్నాడు:

సీ. 'నీ వతిరథుఁడవు, నీ తమ్ములందఱు । సమరథశ్రేష్ఠులు సమరమునకుఁ
బరుసని వీరులు పాంచాలసేన ని । ర్జింతురు; నను నేన చెప్పికొనఁగ
నేర; నా యేడ్తెఱ మీరెఱుంగుదురు; భో । జాగ్రణి కృతవర్మ యతిరథుండు
దృఢవేధి యీతండు దీర్చునెంతటి పని । యైనఁ గైకొని; శల్యుఁ డతిరథుండు;

ఆ. వాసుదేవుతోడి యీసువాఁ, డల్లుర । విడిచె నిన్నుఁ గూడి; విక్రమమునఁ
బేరుకొనఁగఁ జాలు భూరిశ్రవుం డతి । రథుల మొదలి; యనికి రక్కసుండు. 221

ప్రతిపదార్థం: నీవు= నీవు; అతిరథుఁడవు= అనేక రథికులతో ఒంటరిగా పోరాడగల ఉత్తమ రథికుడవు; నీ తమ్ములు+ అందఱున్= నీ అనుజులెల్లరు; సమరథశ్రేష్ఠులు= సమరథులయందు శ్రేష్ఠులు; సమరమునకున్= యుద్ధానికి; పరుసని వీరులు= కరకుతనం కలిగిన శూరులు; పాంచాలసేనన్= ద్రుపదుడి సైన్యమును; నిర్జింతురు= గెలువగలరు; ననున్ నేన చెప్పికొనఁగన్ నేరన్= నన్ను గూర్చి నేనే వెల్లడించుకొనలేను; నా+ఏడ్తెఱ= నా పరాక్రమం; మీరు+ఎఱుంగుదురు= మీకు తెలుసు; భోజ+అగ్రణి= భోజవంశస్థులలో మేటి; కృతవర్మ= కృతవర్మ అనువాడు; అతిరథుండు= అతిరథుడు; ఈతండు= ఈ కృతవర్మ; దృఢవేధి= గట్టిగా లక్ష్యాన్ని భేదించగలవాఁడు; ఎంతటి పని+ఐనన్+కైకొని= ఎట్టి సంకట కార్యాన్నైనా గ్రహించి; తీర్చున్= చక్కబెట్టగలడు; శల్యుఁడు= మద్రపతి; అతిరథుండు= అతిరథుడు; వాసుదేవుతోడి+ఈసువాఁడు= శ్రీకృష్ణుడిపై అసూయ కల్గినవాడు; నిన్నున్+కూడి= నీతోచేరి; అల్లురన్+విడిచెన్= తన మేనల్లుళ్ళైన పాండవులను వదలివేశాడు; విక్రమమునన్= శూరత్వంచేత; పేరుకొనఁగన్+చాలు= పొగడదగినవాడైన; భూరిశ్రవసుడు; అతిరథుల మొదలి= అతిరథులలో అగ్రేసరుడు; అనికిన్= యుద్ధానికి; రక్కసుండు= రాక్షసుడు సుమా!

తాత్పర్యం: 'సుయోధనా! నీ వతిరథుడవు. నీ తమ్ములందరు సమరథులలో ఉత్తములు. యుద్ధం చేయటంలో గడుసుతనం గలవారు. ద్రుపదుడి సేనలను జయించగలరు. ఇక నన్ను గూర్చి నేను చెప్పికొనటం బాగుండదు. నా చేవ ఎలాంటిదో మీకు తెలుసు. భోజులలో మేటి అయిన కృతవర్మ అతిరథుడు. అతడు లక్ష్యాన్ని భేదించగలవాడు. ఎట్టి దుర్ఘటకార్యాన్నైనా చక్కబెట్టగలడు. శల్యుడు అతిరథుడు. అతడికి శ్రీకృష్ణుడిపై ఈర్ష్య. తన మేనల్లుళ్ళైన పాండవులను విడిచి నీతో చేరాడు. పరాక్రమంలో ప్రఖ్యాతి వహించిన భూరిశ్రవుడు అతిరథోత్తముడని గ్రహించుము. ఆతడు రణరంగంలో నిజంగా రాక్షసుడే సుమా!

విశేషం: ఆ కాలంలో రథ సారథ్యంలో నిపుణులు శ్రీకృష్ణుడు, శల్యుడు. ఉత్తరుడు కూడ తేరు నడపటంలో ప్రగల్భుడంటారు. రథచోదకత్వంలో మాధవుడి విఖ్యాతికి శల్యుడు మాత్సర్యగ్రస్తుడయి ఉండవచ్చును. అంతకంటె అతడికి వాసుదేవుడిపై గల ఈసుకు మరొక్క కారణం కనిపించదు. అసలు మేనల్లుళ్ళ పక్షం వహించవలసిన శల్యుడు దుర్యోధనుడి కుతంత్రంవలన కౌరవులతో కలియవలసి వచ్చింది. ఆ కథ యిది.

పాండవులు సమరసహాయం కోరి శల్యుడి పాలికి దూతలను పంపగా అతడు పుత్ర మిత్ర సమేతంగా నానా సేనలతో కదలి పాండవులున్నచోటికి నిత్య ప్రయాణాలతో నడచివస్తున్నాడు. ఈ విషయం తెలిసి దుర్యోధనుడు మద్రపతి

వచ్చే మార్గంలో వారికి అన్ని సౌకర్యాలూ కలిగించాడు. అందుకు సంతుష్టుడై శల్యుడు 'ఇంత చతురంగా ఇన్ని ఏర్పాట్లు చేసిన ధర్మజుడి అమాత్యులెవరో తోడ్కొని రండి. అభినందించాలి' అన్నాడు. పలుతెరగుల పనులు చేస్తున్న తన ఆప్తులలో మరుగున నున్న దుర్యోధనుడు తన కిది తగిన సమయమని వచ్చి వినయంతో శల్యుడిని సందర్శించాడు. ఇదంతా దుర్యోధనుడి యత్నఫలమని 'శల్యుడు గ్రహించి ఉబ్బి తబ్బిబ్బై' నీకేది యిష్టమో కోరుకో, ఇస్తా నన్నాడు. 'నీవు యుద్ధంలో నా పక్షం వహించి నన్ను ఉద్ధరించు' మని సుయోధనుడు అర్థించాడు. మానధనుడైన శల్యుడు మాట తిరుగలేక, 'నేను ఉపప్లావ్యపురికి వెళ్ళి, పాండవులను చూచి, తప్పక హస్తినాపురికి వస్తాను', వెళ్ళుమన్నాడు.

శల్యుడు కౌంతేయులను కలుసుకొన్నాడు. దుర్యోధనుడు తనను దర్శించి సాయమర్థించటం, అందుకు తాను సమ్మతించటం చెప్పి వేశాడు. ధర్మజుడు ఆశ్రితుల అభీష్టం నెరవేర్చటం పెద్దల గుణమని శల్యుడిని ప్రశంసించి 'మామా! పంకజాక్షుడు పార్థుడికి భండనంలో సారథ్యం వహిస్తాడు. కర్ణుడు అర్జునుడితో మచ్చరిస్తుంటాడు గదా! వీరిద్దరికీ పోరు జరిగేటప్పుడు కౌరవ పక్షంలో శ్రీకృష్ణుడికి ప్రతిసారథ్యం చేయగల నేర్పు మరొక్కరికి లేనందున నీకు కర్ణ సారథ్యం తప్పదు. సమరసమయంలో తృణీకరించి పలికి రాధేయుడి మనసుకు కలక పుట్టించి క్రీడిని సంరక్షింపవలసిన'దని వేడుకొన్నాడు. అందుకు శల్యు డంగీకరించాడు.

ధర్మజుడి వేడికోలునుబట్టి చూస్తే, శల్యుడికి సారథి కృత్యంలో గల కౌశలం ఏపాటిదో విశదమవుతుంది.

క. వినుసైంధవుఁడు మహారథుఁ । డనిఁ బోక పెనంగు; నతని నా ద్రౌపదికై
పెనుపఱఁ బఱచిరి కుంతీ । తనయులు వారల కెదుర్పఁ దపముం జేసెన్. 222

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; సైంధవుఁడు= సింధుదేశపతి, నీ చెల్లెలు దుస్సలకు పెనిమిటి; మహారథుఁడు= మహారథుడు; అనిన్= యుద్ధంలో; పోక= వెనుదీయక; పెనంగున్= పోరాడుతాడు; అతనిన్= ఆ సైంధవుడిని; ఆ ద్రౌపదికై= పాంచాలిపట్ల చేసిన తప్పునకై; పెనుపు+అఱన్= మదమణగేటట్లు; కుంతీతనయులు= పాండవులు; పఱచిరి= అవమానపరచారు; వారలకున్= వారికి; ఎదుర్పన్= ఎదురుతిరగటానికి; తపమున్+చేసెన్= (ఈశ్వరుడి గురించి) తపస్సు చేశాడు.

తాత్పర్యం: సుయోధనా! సింధుదేశాధీశుడూ, నీ చెల్లెలు దుస్సల మగడూ అయిన జయద్రథుడిని గురించి వినుము. అతడు మహారథుడు. యుద్ధంలో వెనుకంజవేయక పోరాడుతాడు. ద్రౌపది విషయంలో చేసిన తప్పిదానికి కౌంతేయులు వాడిని మదమణగేటట్లు మర్దించారు. ఆ కోపంతో వారి నెదుర్కొనటానికి అతడు ఈశ్వరుడిని గురించి తపస్సు కూడా చేశాడు.

విశేషం: పాండవులు కామ్యకవనంలో తృణబిందుమహాముని ఆశ్రమంలో కాలం గడుపుతున్నారు. ఒకనాడు వారైదుగురూ పాంచాలి నక్కడ ఉంచి మృగయార్థం వనంలోకి వెళ్ళారు. సాల్వకన్యను పెండ్లాడటానికి సైంధవుడు చతురంగ బలాలతో ఆ దారిని వెళ్ళుతూ ఆశ్రమద్వారంలో ద్రౌపదిని చూచి మోహించి రథమెక్కి తనతో రమ్మని నిర్బంధించాడు. ఆమె భీతిల్లి పురోహితుడైన ధౌమ్యుడిని కేకవేసింది. జయద్రథుడు ఆమెను బలాత్కారంగా రథంలో ఉంచుకొని వెళ్ళుతుంటే పురోహితుడు ఆక్రోశిస్తూ వారి వెంబడి పరుగెత్తసాగాడు.

పాండవులు మృగాలను వేటాడి ఆశ్రమాభిముఖులై వస్తూ పరిచారిక ధాత్రేయివల్ల సంగతి తెలిసి తత్క్షణమే జయద్రథుడిని వెంటనంటారు. ఆక్రోశిస్తూ అరుగుతున్న ధౌమ్యుడిని ఓదార్చి త్రిగర్త శిబిసింధు సౌవీర సైన్యంపై కవిశారు. తుముల యుద్ధం జరిగింది. జయద్రథుడు ద్రౌపదిని దిగవిడిచి పారిపోయి ఒక పొదలోకి దూరాడు. భీముడు సైంధవుడిని వెలికిలాగి పిండిపిండిగా పొడుస్తుంటే, మన అన్న చెప్పినట్లు దుస్సలను తలంచిఅయినా వీనిని చంపవద్దన్నాడు పార్థుడు.

భీమసేనుడు అతడి తల చెక్క లెగసేటట్లు గొరిగి, పెడకేలు గట్టి తెచ్చి ధర్మజుడి ముందు పడవేశాడు. వీడే పాండవదాసు డన్నాడు. అట్లా అయితే ప్రాణాలతో విడిచిపెట్టండని పాంచాలి పలికింది. మున్ముందు ఇట్లాంటి పాపపు పనులు చేయక బుద్ధిగలిగి బ్రతుకుమని నిరసించి ధర్మజుడు వదలిపెడితే వాడు గంగాద్వారంలో శివుడిని గురించి కఠోరతపం చేశాడు.

శంభుడు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మంటే, 'పంచపాండవులను సైన్యయుతంగా జయించేటట్లు అనుగ్రహించు'మని వేడుకొన్నాడు. 'ఒక్క విజయుడిని తప్ప నలుగురు కౌంతేయులను ఒకనాటి యుద్ధంలో జయిస్తావు పో'మ్మని రుద్రు డంతర్ధానమయ్యాడు. అర్జునుడు లేని సమయంలో ద్రోణుడు ధర్మజుడిని బంధించటానికి పన్నిన పద్మవ్యూహాన్ని భేదించటానికి ధర్మరాజు అభిమన్యుడిని నియోగిస్తాడు. అతడు వ్యూహాన్ని భేదించి కౌరవ సేనతో ఒంటరిగా పోరాడుతున్నప్పుడు ధర్మపుత్రుడు వాడికి తోడ్పడటానికి తమ్ములతో సకల సైన్యంతో ఉరవడిస్తాడు. కాని, ఈశ్వరదత్త వర ప్రభావం వలన సైంధవుడు వారిని అడుగు ముందుకు వేయకుండా అడ్డుకొన్నాడు. అక్కడ అభిమన్యుడు యుద్ధంలో ఒంటరిగా పోరి పోరి పెక్కంద్ర చేత హతుడయ్యాడు. ఆ తరువాత అర్జునుడు పాశుపతాస్త్ర మహిమచేత సైంధవుడిని సంహరిస్తాడు.

వ. కాంభోజరాజగు సుదక్షిణుండు సమరథుం; డితనిపాల రథబృందంబులు మేలు గలుగుఁ, బాండవ బలంబులం గలంచు; మాహిష్మతీపతి యగు నీలుం డర్ధరథుం డితనికి సహదేవునకుఁ దెగని పగయై యుండు; దానం జేసి యాలంబున నోలమాసగొనం; డవంతిదేశాధీశులగు విందానువిందు లర్ధరథులు; పరస్పర స్నేహంబున సాహసికులై యొకళ్ళొకళ్ళం బెట్టిపోవక పోరుదురు; త్రిగర్త పతులు తోడంబుట్టువులేవురును మహారథులు; గోగ్రహణంబునం బడిన బన్నంబుఁ బాపికొనం గడంగుదురు; వీరికి భుజబలం బగ్గలంబై యుండు. 223

ప్రతిపదార్థం: కాంభోజరాజు+అగు, సుదక్షిణుండు; సమరథుండు= ఒక విలుకాడితో సరిగా నిలచి యుద్ధం చేసే యోధుడు; ఇతనిపాలన్= ఇతడి దగ్గర; రథబృందంబులు= రథ సమూహాలు; మేలు+కలుగున్= మంచివి కలవు; పాండవబలంబులన్= పాండవుల సేనలను; కలంచున్= కలతనొందించగలవు; మాహిష్మతీపతి+అగు నీలుండు; అర్ధరథుండు; ఇతనికిన్ సహదేవునకున్; తెగని పగ+ఐ= మానని విరోధమై; ఉండున్; దానన్+చేసి= ఆ కారణంచేత; ఆలంబునన్= యుద్ధంలో; ఓలము+ఆస+కొనండు= వెనుదీయడు(మరుగుచోటున ప్రవేశించడు); అవంతి దేశ+అధీశులు+అగు= అవంతిదేశానికి అధిపతులైన; వింద+ అనువిందులు= విందుడు, అనువిందుడు అనేవారు; అర్ధరథులు; పరస్పర స్నేహంబునన్= ఒకరిపై మరొక్కరికి గల చెలిమి చేత; సాహసికులు+ఐ= తెంపరులై; ఒకళ్ళు+ ఒకళ్ళన్+ పెట్టిపోవక= ఒకరిని మరొక్కరు దిగవిడిచి వెళ్ళక; పోరుదురు= పోరాటం సల్పుతారు; త్రిగర్త పతులు= త్రిగర్త దేశాధీశులు; తోడంబుట్టులు+ఏవురును= ఐదుగురు సహోదరులు; మహారథులు; గోగ్రహణంబునన్= దక్షిణ గోగ్రహణకాలమందు; పడిన బన్నంబు= చెందిన భంగపాటు; పాపికొనన్= తొలగించు కొనటానికి; కడంగుదురు= పూనుకొంటారు; వీరికిన్; భుజబలంబు= బాహువిక్రమం; అగ్గలంబు+ఐ+ఉండున్= అధికంగా ఉన్నది.

తాత్పర్యం: కాంభోజ దేశానికి రాజైన సుదక్షిణుడు సమరథుడు. ఇతడి దగ్గర మంచి రథాలున్నాయి. అవి పాండవసేనలను సంక్షోభమొందిస్తాయి. మాహిష్మతీ నాయకుడైన నీలుడు అర్ధరథుడు. ఇతడికీ సహదేవుడికీ మానని విరోధం. అందువలన నీలుడు రణరంగంలో వెనుదీయక పోరాడుతాడు. అవంతిదేశపతులైన విందానువిందులిద్దరూ అర్ధరథులు. అన్యోన్య స్నేహం కలవారు. కనుక ఒకరినొకరు వదలిపెట్టక సాహసంతో పోరు సల్పుతారు. త్రిగర్త దేశపురాజులు అన్నదమ్ములైదుమంది కూడా మహారథులు. దక్షిణ గోగ్రహణకాలంలో పాండవుల వలన పొందిన భంగపాటు తొలగించుకొనటానికి ఉద్యమిస్తారు. వీరు అధిక బాహుపరాక్రమం కలవారు.

క. సమరథుఁడు బిరుదు లక్ష్మణ । కుమారకుం డేచి మొనలఁ గోల్తల సేయున్
మిమునెల్ల మిగులు భుజగ । ర్వము మదముం గలఁడు కొనఁ డరాతుల నధిపా! 224

ప్రతిపదార్థం: అధిపా= రాజా!; లక్ష్మణ కుమారకుండు= నీ తనయుడైన లక్ష్మణకుమారుడు; సమరథుఁడు= సమరథుడై ఉన్నాడు; బిరుదు= శూరుడు; ఏచి= చెలరేగి; మొనలన్= సేనలను; కోల్తలచేయున్= యుద్ధానికి ప్రోత్సహిస్తాడు; మిమ్ముల్+ఎల్లన్= మిమ్మందరినీ; మిగులున్= మించుతాడు; భుజగర్వము= బాహుదర్పం; మదమున్+కలఁడు= పొగరు కలవాడు; అరాతులన్= శత్రువులను; కొనఁడు= లెక్కచేయడు.

తాత్పర్యం: దుర్యోధనా! నీ తనయుడైన లక్ష్మణకుమారుడు సమరథుడు. మంచివీరుడు. విజృంభించి సేనలను యుద్ధానికి ప్రోత్సహించి నడుపగలవాడు. మిమ్మందరినీ మించినవాడు. బాహుబలం, దర్పం కలవాడు. విరోధులను లక్ష్యపెట్టడు.

వ. బృహద్బలుండు సమరథుండు కోసల బలంబుతోడం గడంగి చిచ్చునుం గరువలియునుంగొని తాఁకు; దండధారుం డర్ధరథుండు సేన పఱపు గలండు, బెట్టిదంబుగాఁ గయ్యంబు సేయు. 225

ప్రతిపదార్థం: బృహద్బలుండు; సమరథుండు; కోసలబలంబుల తోడన్= కోసలదేశపుసైన్యాలతో; కడంగి= పూనుకొని; చిచ్చునున్= అగ్నిని; కరువలియునున్= గాలిని; కొని తాఁకున్= ఎదిరిస్తాడు; దండధారుండు; అర్ధరథుండు; సేనపఱపు+కలండు= విస్తారమైన సైన్యంకలవాడు; బెట్టిదంబుగాన్= కఠోరంగా; కయ్యంబు+చేయున్= యుద్ధం చేయగలడు.

తాత్పర్యం: బృహద్బలుడు సమరథుడు. అతడు కోసల దేశ సైన్యాలతో కూడి, అగ్ని వాయువులు జతపడినట్లు శాత్రవ సేనలను ఎదిరిస్తాడు. దండధారుడు అర్ధరథుడు, ఎక్కువ సైన్యం కలవాడు. దారుణంగా పోరాడుతాడు.

తే. అతిరథోత్తముఁ డివ్వీటియందు మేటి । కృపుడు; తన పెంపు వాటించి గెలుచుఁ జిచ్చుఁ
గాని నాలుగు దెఱఁగుల సేనలకును । దివియఁ డించుకయును నరదేవముఖ్య! 226

ప్రతిపదార్థం: నరదేవముఖ్య!= రాజోత్తమా!; కృపుఁడు= కృపాచార్యుడు; అతిరథ+ఉత్తముడు= అతిరథులలో మిన్న; ఈ+వీటియందున్= ఈ మన దండులో; మేటి= గొప్పవాడు; తన పెంపు+పాటించి= తన గొప్పతనం ప్రకటించి; గెలుచున్= విజయము గైకొంటాడు; చచ్చున్+కాని= (లేదా) మరణిస్తాడు కాని; నాలుగు తెఱఁగుల సేనలకును= చతుర్విధములైన సైన్యాలకు - అనగా రథగజతురగ పదాతులకు; ఇంచుకయును= కొంచెమైనా; తివియఁడు= వెనుదీయడు.

తాత్పర్యం: కృపాచార్యుడు అతిరథులలో శ్రేష్ఠుడు. మనదండులో మిన్న. తన ప్రశస్తి చాటుతూ గెలవనైనా గెలుస్తాడు, చావనైనా చస్తాడు గాని చతుర్విధ సైన్యాలకు పోరాటంలో రవంతైనా వెనుదీయడు.

క. శకుని విను సమరథుఁడు పాం । డు కుమారులతోడ నెప్పుడుం బగఁగొని వా
రికిఁ గీడురోయు; భృత్యులు । ప్రకట బలులు గలరు; నేర్చు బవరంబునకున్. 227

ప్రతిపదార్థం: విను(ము)= ఆలకించు; శకుని= నీ మేనమామ; సమరథుఁడు= సమరథుడు; పాండుకుమారులతోడన్= పాండవులతో; ఎప్పుడున్= ఎల్లవేళల; పగన్+కొని= శత్రుత్వం వహించి; వారికిన్= కౌంతేయులకు; కీడు= హానిని; రోయున్=

వెదకుతాడు; ప్రకటబలులు= గొప్ప బలం కలిగిన; భృత్యులు= సేవకులు; కలరు= అతడి కున్నారు; బవరంబునకున్+నేర్చున్= యుద్ధంచేయటం శకుని ఎరుగును.

తాత్పర్యం: శకుని సమరథుడు. పాండునందనులతో ఎల్లప్పుడు విరోధం వహించి వారి చేటునకు దారులు వెదకుతుంటాడు. అతడికి బలాఢ్యులైన సేవకులున్నారు. శకుని చక్కగా యుద్ధం చేయగలడు.

మ. **వరదివ్యాస్త్రవిదుండు బాహుఘనుఁ డశ్వత్థామ గాండీవితోఁ**
బురుడింపందగువాఁడు; వీని కెన యీ భూలోక సంచారు లె
వ్వరులే; రీతఁడు బ్రాహ్మణుం డనని భావం బూనఁగా నోర్వమిం
దర మూహింపఁగ లేదకాని జముచందం బయ్యెడుం బోరులన్. **228**

ప్రతిపదార్థం: వరదివ్య+అస్త్రవిదుండు= శ్రేష్ఠాలైన దివ్యాస్త్రాలెరింగినవాడూ; బాహు ఘనుఁడు= భుజశక్తిచేత గొప్పవాడూ అగు; అశ్వత్థామ= ద్రోణుని పుత్రుడు; గాండీవితోన్= అర్జునుడితో; పురుడింపన్+తగువాఁడు= పోల్చదగినవాడు; వీనికిన్= ఇతడికి; ఎన= సాటి; ఈ భూలోక సంచారులు+ఎవ్వరున్+లేరు= ఈ పుడమియందు తిరిగే వారిలో ఎవ్వరూ లేరు; ఈతఁడు= అశ్వత్థామ; బ్రాహ్మణుండు+అనని భావంబు= బ్రాహ్మణుడు కాడు అనే తలంపు; ఊనఁగాన్= వహించుటకు; ఓర్వమిన్= సహించలేనందున; తరము= కొలది, స్థాయి; ఊహింపఁగన్+లేద= అతడి తరమిట్టిదని నిర్ణయించటానికి వీలుకాదు; కాని= ఐననూ; పోరులన్= పోరాటాలలో; జముచందంబు+అయ్యెడున్= యముడి విధంగా ఉంటాడు.

తాత్పర్యం: శ్రేష్ఠాలూ, దివ్యాలూ అయిన అస్త్రాలు తెలిసినవాడూ, భుజ బలాధికుడూ అయిన అశ్వత్థామ అర్జునుడితో సాటి అనదగినవాడు. ఈతడితో సమానులు ఈ భూలోక వాసులలో ఒక్కడు కూడా లేడు. ఇతడు బ్రాహ్మణుడుకాడనే భావం తలపున బారుట సహించరాని విషయమే. అందువలన ఈతడి కొలది నూహించటానికి వీలులేదు. కాని, యుద్ధాలలో ఇతడు యముడిలా విజృంభిస్తాడు.

విశేషం: కొంచెం ఇబ్బంది పెట్టే తిక్కన పద్యాలలో ఇదికూడా ఒకటి. 'ఈతఁడు బ్రాహ్మణుండనిన భావం బూనఁగా నోర్వమిం - దరమూహింపఁగ లేద - ఈ పాఠం సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'తరము' శబ్దమునకు అర్థము చెప్పునప్పుడు ఉన్నది. ఇదే గ్రహించబడింది. 'బ్రాహ్మణుం డనని భావం బూనఁగా నోర్వమిం - దరమూహింపఁ లేద - బ్రాహ్మణుండు+అననిభావం బూనఁగా ....ఈ విభాగం అర్థం కావటంలేదు. 'బ్రాహ్మణుండన్+అని భావం బూనగా నోర్వమిన్+తర......... ఇదికూడా అంత సుకరంగా లేదు. 'బ్రాహ్మణుండనని భావం బూనఁగా నోర్వము - ఇందర మూహింపఁగ లేద అని విడదీద్దామంటే - 'ఇందఱము' లోనిది శకట రేఫము. యతిప్రాసల విషయంలో కవిత్రయం వారు రేఫ శకట రేఫలకు మైత్రి పాటించలేదు. అందుచేత ఆ విభాగం త్యాజ్యం.

సీ. **అతిరథోత్తముఁడు ద్రోణాచార్యుఁ; డందలి । యిందలి విలుకాండ్ర కెల్ల గురుఁడు,**
హితుఁడు నీ కెంతయు, నేర్చిన మొన లితం। డడరినఁ జమరినయట్ల ప్రుందు;
వృద్ధని యితని భావింపరా; దనిలోన । నంగ విస్ఫురణంబు భంగి చూడ
నర్జునుపైఁ గూర్మి నతని నో నేయఁడు । సచరాచరంబైన జగము లెల్ల

తే. **నొక్క మొగమై కడంగినఁ జిక్కువఱుచు । దివ్యబాణ జాలంబుల దీటు కొలిపి**
ప్రాణములు డాఁపఁ; దీతని పాటి దొరలఁ । గాన మే రాజ్యములయందుఁ గౌరవేంద్ర! **229**

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర= సుయోధనా!; ద్రోణ+ఆచార్యుఁడు= గురుడగు ద్రోణుడు; అతిరథ+ఉత్తముఁడు= అతిరథులలో వరిష్ఠుడు; అందలి+ఇందలి విలుకాండ్రకున్+ఎల్లన్= పాండవ కౌరవులనెడి ఉభయ పక్షాలలో ఉన్న ధానుష్కులందరికీ; గురుఁడు= ఒజ్జ; నీకున్= నీకు; ఎంతయున్+హితుఁడు= మిక్కిలి మేలు కోరేవాడు; ఏర్చిన మొనలు= పన్నిన వ్యూహాలు; ఇతండు= ఈయన; అడరినన్= విజృంభిస్తే; చమరిన+అట్లు+అ= నేలబెట్టి రాచిన విధంగానే; ప్రమందున్= నశించిపోతాయి; అనిలోనన్= కయ్యమునందు; అంగ విస్ఫురణంబు+భంగిన్= శరీర విజృంభణం యొక్క విధమును; చూడన్= కనుగొన్నప్పుడు వృద్ధు+అని= ముసలివాడని; ఇతనిన్ భావింపన్‌రాదు= ఇతడిని తలంచటానికి వీలుగాదు; అర్జునుపైన్+కూర్మిన్= అర్జునుడి మీది వాత్సల్యంతో; అతనిన్= పార్థుడిని; నొనేయఁడు= నొచ్చేటట్లు బాణాలు ప్రయోగించడు; సచర+అచరంబు+ఐన= జంగమ స్థావరాలతో కూడిన; జగములు+ఎల్లన్= లోకాలన్నీ; ఒక మొగము+ఐ= ఏకమై; కడంగినన్= తన మీదికి కవిసినమా; దివ్యబాణజాలంబులన్= దివ్యములైన శరసమూహాలను, దీటుకొల్పి= పరగించి; చిక్కు పఱుచున్= కష్టాలపాలు కావిస్తాడు; ప్రాణములు డాఁపఁడు= ప్రాణాలమీద తీపిలేనివాడు ప్రాణాలు దాచుకోడు; ఈతనిపాటి దొరలన్= ఇతడితో సమానులైన శూర ప్రభువులను; ఏ రాజ్యములఅందున్= ఏ దేశాలలోనూ; కానము= చూడబోము.

తాత్పర్యం: కురుపతీ! ద్రోణాచార్యులు అతిరథులలో శ్రేష్ఠుడు. ఉభయ పక్షాలలోని ధానుష్కులందరికినీ గురువు. నీకు మిక్కిలి మేలు కోరేవాడు. ఏర్చి కూర్చిన వ్యూహాల మీదకు ఇతడు విజృంభించినపుడు అవి చేత నలిపినట్లు నిర్మూలమవుతాయి. యుద్ధంలో ఈయన దేహకాంతి కనుగొంటే ముసలివాడని భావించటానికి శక్యం కాదు. అర్జునుడిపై ప్రేముడి కలవాడు గనుక అతడిని శరాలతో నొప్పించడు. స్థావర జంగమాత్మకమైన జగమంతా ఏకంగా తనమీదికి ఉరికినా దివ్యశర సమూహం ప్రయోగించి చీకాకు పరుస్తాడు. కయ్యంలో ప్రాణాలు పోతాయన్న జంకు ఇతడికి లేదు. ఇతడితో సమానులైన శూర ప్రభువులను ఏ రాజ్యంలోనూ చూడలేము.

క. అతిరథుఁడు బాహ్లికుఁడు విను । మతులిత బలుఁ; డితని యట్ల యాత్మజుఁడును వి
శ్రుతశక్తి సోమదత్తుం; । డితనికి, నీతనికి సమర మెన పెండిలికిన్. 230

ప్రతిపదార్థం: వినుము= ఆలింపుము; బాహ్లికుఁడు= కురువంశస్థులలో పెద్దవాడు; అతిరథుఁడు; అతులిత బలుఁడు= సాటిలేని శక్తికలవాడు; ఇతనిఅట్లు+అ= ఈతడివలెనే; ఆత్మజుఁడును= కుమారుడగు; సోమదత్తుండు= సోమదత్తుడు; విశ్రుతశక్తి= ప్రఖ్యాతమైన బలం కలవాడు; ఇతనికిన్= బాహ్లికుడికి; ఈతనికిన్= సోమదత్తుడికి; సమరము= సంగ్రామం; పెండిలికిన్= వివాహంతో; ఎన= సాటి;

తాత్పర్యం: బాహ్లికుడు అతిరథుడు. సాటిలేని బలం కలవాడు. అతడి వలెనే ఆతడి కుమారుడు సోమదత్తుడు కూడా ప్రసిద్ధమైన బలం కలిగినవాడు. తండ్రికీ, కుమారుడికీ యుద్ధమంటే పెళ్ళితో సమానం.

క. అసురవరుఁ డీ యలంబుషుఁ । డసమాన బలుండు సమరథాగ్రణి; విను పాం
డు సుతులయెడ రోషము గలఁ । డసంఖ్య మాయా బలమున నరులఁ గలంచున్. 231

ప్రతిపదార్థం: అసురవరుఁడు= రాక్షసశ్రేష్ఠుడైన; ఈ+అలంబుషుఁడు= అలంబుషుడు అను పేరుగల ఇతడు; అసమానబలుండు= సాటిలేని శక్తికలవాడు; సమరథ+అగ్రణి= సమరథులలో ఉత్తముడు; విను= సుయోధనా, ఆలకించు; పాండుసుతులయెడన్= పాండుకుమారుల యందు, రోషము కలఁడు= కోపం కలవాడు; అసంఖ్య మాయాబలమునన్= గణింపరాని మాయలయొక్క మహిమచేత; అరులన్= శాత్రవులను; కలంచున్= బాధిస్తాడు.

తాత్పర్యం: రాక్షసులలో శ్రేష్ఠుడైన ఈ అలంబుషుడు సాటిలేని బలం కలిగినవాడు. సమరథుడు. ఇతడికి పాండవులంటే కోపం. అగణితమైన తన మాయా బలంతో విరోధులను బాధిస్తాడు.

విశేషం: అలంబుషుని వృత్తాంతము: అలంబుషుడు అనే పదానికి అలంబుషుడు అనే పాఠాంతరం ఉన్నది. గంధమాదన పర్వతంలో పాండవులుంటున్నారు. జటాసురుడు అనే రాక్షసుడు బ్రాహ్మణరూపం ధరించి తాను పరశురామ శిష్యుడిని అని చెప్పి పాండవులను సేవిస్తుంటాడు. భీము డొకనాడు మృగయా వినోదార్థం అడవికి వెళ్ళిన సమయంలో అతడు రాక్షసరూపం ధరించి ద్రౌపదిని ధర్మజుడిని నకులునీ ఎత్తుకొని శీఘ్రంగా ఆకాశ మార్గంలో వెళుతున్నాడు. సహదేవుడు భీముడిని గొంతెత్తి పిలుస్తూ వనంలోకి పరుగెత్తాడు. 'విశ్వసించినవారికీ, కుడువబెట్టినవారికీ ఎగ్గుచేయటం మహాపాపం. ఆయుధాలతో మమ్మ వదలిపెట్టి మాతో యుద్ధం చెయ్యి. ఇట్లా వెళ్ళటం నీకు తగదు' అంటూ ధర్మజుడు తన చేతులతో వాడిని గట్టిగా అదుముతూ అతడి గమనవేగం తగ్గించాడు. సహదేవుడు అడ్డంవచ్చి నిలునిలుమని అతడిని అదలించాడు. భీముడు అతివేగంగా వచ్చి గగన మార్గంలో వెళుతున్న జటాసురుడిని వారించి 'నీకు బుద్ధి ఉంటే వీరిని వదలిపెట్టి నీ ప్రాణాలు రక్షించుకో, లేదా బక హిడింబ కిమ్మీరులకు పట్టిన దుర్గతి నీకూ పడుతుంది' అన్నాడు. ఆ మాటతో జటాసురుడు భూమికి దిగి భీముడితో తలపడ్డాడు. ఇద్దరికీ పోరు ఘోరమయింది. వృక్షాలతో శిలలతో వారు పోరాడారు. ముష్టాముష్టియుద్ధం చేశారు. జటాసురుడు హీనసత్త్వు డయ్యాడు. భీముడు వాని మెడమీద పొడిచి పుడమిపై పడగొట్టాడు. వాడి కాయమెత్తి ఒక విశాల పాషాణం మీద బాది, యమసదనానికి పంపించాడు. ఆతడి కుమారుడే అలంబుషుడు. బక కిమ్మీరులకు అనుజుడు. పాండవులతో తమకున్న పూర్వ వైరాన్ని పురస్కరించుకొని దుర్యోధనుడి పక్షంలో చేరి పోరాడుతాడు. ఇతడిని ఘటోత్కచుడు సంహరిస్తాడు. భుజంగకన్య ఉలూచికి అర్జునునకు జన్మించిన ఇరావంతుడిని కురుక్షేత్ర సంగ్రామంలో అలంబుషుడు వధిస్తాడు.

విశేషం: మూలంలో అలంబుషుడని ఉన్నది. "అలమ్బుషో రాక్షసేన్ద్రః క్రూరకర్మా మహారథః, హనిష్యతి పరాన్ రాజన్ పూర్వ వై ర మనుస్మరన్" - మున్నంగిశర్మ పరిష్కృత ప్రతిలో - 'అసురవరుఁడీ హలాయుధుఁ డసమాన బలుండు ---' అని ఉన్నది.

తే. వినుము ప్రాగ్జ్యోతిషాధీశుఁ డనుపమాన । శక్తి యీ భగదత్తుండు సమరథుండు;
గజము నెక్కి తా నేనిక కయ్యమైన । నేర్చు నైరావణము మీఁది యింద్రుఁ బోలి. 232

ప్రతిపదార్థం: వినుము; ప్రాగ్జ్యోతిష+అధీశుఁడు= ప్రాగ్జ్యోతిష పురాధీశ్వరుడైన; ఈ భగదత్తుండు= ఈ భగదత్తుడనేవాడు; సమరథుండు= సమరథుడు; అనుపమానశక్తి= సాటిలేని బలంకలవాడు; ఏనిక కయ్యము+ఐనన్= ఏనుగులతో పోరాటం జరుగుతున్నప్పుడు; తాన్= తాను; గజమున్+ఎక్కి= ఏనుగును ఎక్కి; ఐరావణముమీఁది= ఐరావతం అనే దిగ్గజం పైనున్న; ఇంద్రున్+పోలి= దేవేంద్రుడికి సాటి అవుతూ; ఏర్చున్= విజృంభిస్తాడు.

తాత్పర్యం: సుయోధనా! వినుము. ప్రాగ్జ్యోతిష నగరాధిపతిఅయిన ఈ భగదత్తుడు సమరథుడు. సాటిలేని బలం కలవాడు. ఏనుగులతో పోరాటం జరిగేటప్పుడు ఐరావత గజము నధిష్ఠించిన ఇంద్రుడికి సరిపోలుతూ ఇతడు ఏనుగునెక్కి చెలరేగుతాడు.

విశేషం: భగదత్తుని వృత్తాంతం: భగదత్తుడు నరకాసురుడి పుత్రుడు. ఇతడు ప్రాగ్జ్యోతిష పురాధీశ్వరుడు. అర్జునుడు దిగ్విజయానికి వెళ్ళినపుడు ఇతడు ఎనిమిది రోజులు పోరి గెలువలేక 'నేనింద్రసఖుడను; నీవింద్ర పుత్రుడవు. మనలో మనకు పోరాటమెందు' కని పల్కి అర్జునుడితో సంధి చేసికొని కానుకలిచ్చి పంపాడు. భారత సంగ్రామంలో ఇతడు దుర్యోధనుడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పక్షం వహించి పోరాడాడు. నరకుడు తాను గడించిన వైష్ణవాస్త్రాన్ని ఈతనికిచ్చాడు. దానిని భగదత్తుడు అర్జునుడిమీద ప్రయోగించాడు. వైష్ణవాస్త్రమును ఎవ్వరూ సహించలేరు గనుక ఆ సమయంలో శ్రీకృష్ణుడు తన వక్షఃస్థలాన్ని అడ్డుపెట్టి ధరించాడు. అస్త్రం విఫలం కాగానే భగదత్తుడు సుప్రతీకమనే ఏనుగునెక్కి అర్జునుడితో తలపడ్డాడు. విజయుడు ఏనుగుతో కూడా భగదత్తుడిని సంహరించాడు.

భీష్ముఁడు కర్ణుని నర్ధరథుండని చెప్పుట (సం. 5-165-3)

వ. **గాంధార రాజులగు వృక్షుండును, నచలుండును సమరథులు; మానిసితనంబును మానుసులుం గలవారు; వీరి సమరోత్సాహం బజేయంబైయుండు.** **233**

ప్రతిపదార్థం: గాంధారరాజులు+అగు= గాంధార దేశ ప్రభువులైన; వృక్షుండును అచలుండును సమరథులు; మానిసితనంబును= పౌరుషమును; మానుసులును= మనుష్యులను కలవారు; వీరి; సమర+ఉత్సాహంబు= యుద్ధోత్సాహం; అజేయంబు+ఐ+ఉండున్= జయించరానిదై ఉంటుంది.

తాత్పర్యం: గాంధార రాజులైన వృక్షుడు, అచలుడు అనువారు సమరథులు. మగటిమి, మంది కలిగినవారు. వీరి యుద్ధపు పన్నుగడ జయించటానికి శక్యం కాదు.

సీ. **నీకుఁ బ్రెగ్గడయును నెయ్యంపుఁ జెలియునై । కయ్యంబునకు నెప్డుఁ గాలు ద్రవ్వుఁ**
బాండుపుత్త్రుల తోడి పగకు ని న్నెసకొల్పుఁ । గొలువున రజ్జులు పలుకునట్టి
రాధాసుతుం డర్ధరథుఁడు; కుండలములుఁ । గవచంబుఁ బోవుట కారణముగ
బీఱువాఱినవాఁడు, వీఱిఁడి, కృపఁ బెద్ద । పరశురాముండు శాపమున వీని

తే. **యస్త్రవీర్యంబుఁ జెఱిచె; నట్లగుట వీఁడు । పార్థు మార్కొని మానంబుఁ బ్రాణములును**
దనకు సొమ్ముగఁ దక్కించుకొనఁగ లేమి । యెల్లవారికి నెంతయుఁ దెల్ల మధిప!" **234**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నీకున్= నీకు; ప్రెగ్గడయును= మంత్రియు; నెయ్యంపుఁ జెలియున్+ఐ= అనురాగపు మిత్రుడై; కయ్యంబునకున్= కలహానికి; ఎప్డున్= నిరంతరం; కాలుద్రవ్వున్= సిద్ధపడతాడో; పాండుపుత్త్రుల తోడి పగకున్= పాండునందనులతో విరోధానికి; నిన్నున్= నిన్ను; ఎసకొల్పున్= పురికొల్పుతుంటాడో; కొలువునన్= సభలో; రజ్జులు పలుకున్= వ్యర్థపు పలుకులు (దుర్భాషలు, డంబాలు) పల్కుతుంటాడో; అట్టి= అటువంటి; రాధాసుతుండు= కర్ణుడు; అర్ధరథుడు= అర్ధరథుఁడు సుమా!; కుండలములు= సహజకుండలాలు; కవచంబున్= కవచం; పోవుట కారణముగన్= కోల్పడిన హేతువుచేత; బీఱువాఱినవాఁడు= నిస్సారమైపోయినవాడు; వీఱిఁడి= బుద్ధిలేనివాడు; కృపన్= కరుణయందు; పెద్ద= దొడ్డవాడు(అధికుడు); పరశురాముండు= భృగురాముడు; శాపమునన్= శాపంతో; వీని అస్త్రవీర్యంబు చెఱిచెన్= ఇతడియొక్క అస్త్రబలాన్ని పోగొట్టాడు; అట్లు+అగుటన్= అందువలన; వీఁడు= ఈ కర్ణుడు; పార్థున్+ మార్కొని= అర్జునుడిని ఎదిరించి; మానంబున్= గౌరవాన్ని; ప్రాణములును= అసువులును; తనకున్+సొమ్ముగన్= తన హక్కుగా; దక్కించుకొనఁగన్+లేమి= నిలుపుకొనలేకపోవటం; ఎల్లవారికిన్= అందరికినీ; ఎంతయున్= మిక్కిలి; తెల్లము= స్పష్టం.

తాత్పర్యం: రాజా! నీకు మంత్రీ, గారాబు నెచ్చెలికాడూ అయిన కర్ణుడు ఎల్లప్పుడూ కలహానికి కాలుద్రవ్వుతుంటాడు. పాండవులమీద నీ కున్న విరోధాన్ని చల్లారనీయక రగులుకొలుపుతుంటాడు. సభలో కొరమాలిన మాటలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మాటాడుతుంటాడు. ఇట్లాంటి రాధేయుడు అర్ధరథుడని గ్రహించుము. జన్మసిద్ధాలైన కవచకుండలాలు కోల్పోయిన హేతువుచేత ఇతడు శక్తిహీను డయ్యాడు. పైపెచ్చు ఇతడు అవివేకి. కాని, అధికమైన కరుణగలవాడు. పరశురాముడు శాపంపెట్టి ఈతని అస్త్రశక్తిని నాశనం చేశాడు. అందువలన వీడు ఫల్గునుడిని భండనంలో ఎదుర్కొని తన మాన ప్రాణాలు తన సొమ్ముగా దక్కించుకొనలేడన్నది లోకులందరికీ తేటతెల్లం.'

క. అనవుడు గురుఁ డిట్లనుఁ 'గ । ర్ణునిచందము మున్ను కడఁగు రోయఁడు పాఱన్
విను మేమఱి యుండుంగా । వున నీతం డర్ధరథుఁ డవుం దలపోయన్.' 235

ప్రతిపదార్థం: అనవుడున్= భీష్ముడట్లా పల్కిన తర్వాత; గురుఁడు= ద్రోణుడు; కర్ణునిచందమున్= రాధేయుడి తీరు; ఇట్లు+అనున్= ఈ విధంగా తెల్పాడు; మున్ను కడఁగున్= కర్ణుడు అందరికంటే ముందుగా తలపడుతాడు; పాఱన్= పరుగెత్తి పోవటానికి; రోయఁడు= సంకోచించడు; వినుము= సుయోధనా, వినుము; ఏమఱి+ఉండున్= పరాకుగా ఉంటాడు; కావునన్= కనుక; తలపోయన్= ఆలోచించగా; ఈతండు+అర్ధరథుఁడు+అవున్= కర్ణుడు అర్ధరథు డవుతాడు.

తాత్పర్యం: భీష్ముడు మాటలాడిన తరువాత కర్ణుడి స్వభావాన్ని ద్రోణు డీరీతిగా చెప్పాడు. 'ఇతడు అందరికంటె ముందుగా ఉద్యమిస్తాడు. పిరికితనంతో రణరంగమునుండి పారిపోవటానికి సంకోచించడు. పరాకుగా ఉంటాడు. కాబట్టి ఆలోచించి చూస్తే రాధేయుడు అర్ధరథుడే.'

వ. అనిన విని రాధేయుండు క్రోధతామ్రాక్షుం డగుచు గాంగేయున కిట్లనియె: 236

ప్రతిపదార్థం: అనినన్; విని; రాధేయుండు; క్రోధతామ్ర+అక్షుండు+అగుచున్= కోపంచేత ఎఱ్ఱబడిన కన్నులుకలవాడై; గాంగేయునకున్= భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్మద్రోణుల మాటలు విని కర్ణుడు కోపంతో కన్నులు జేవురించగా భీష్ముడితో ఇట్లా అన్నాడు:

క. 'ఒంటమిని లేని యొంటర । మింటరములు వల్కు టుచితమే? యర్ధరథుం
డంటి నను; నేమి తక్కువ । గంటి చెపుమ; దీన నీవు గన్నది కలదే? 237

ప్రతిపదార్థం: ఒంటమిని= నామీది పగతో(ద్వేషంతో); లేని= లేనిపోని; ఒంటరమింటరములు= పరుష వచనాలు; పల్కుట= మాటాడటం; ఉచితమే?= నీకు తగునా?; ననున్= నన్ను; అర్ధరథుండు+అంటి(వి)= అర్ధరథుడని చెప్పితివి; ఏమితక్కువ+ కంటి(వి)= నాలో ఏ లోపం కనుగొన్నావు?; చెపుము!= పల్కుమా! దీనన్= ఇట్లా నన్ను తక్కువ చేసి మాటాడినందువలన; నీవు+కన్నది+కలదే?= నీవు పొందిన ప్రయోజన మున్నదా?

తాత్పర్యం: 'నామీది ద్వేషంతో పరుషవచనాలు పల్కటం నీకు తగునా? నన్ను అర్ధరథుడని చెప్పావు. నాలో ఏ లోపం కనుగొన్నావో చెప్పు. ఇట్లా నన్ను తక్కువచేసి మాటలాడినందువల్ల నీకు కల్గిన లాభ మేమిటి?

తే. నొవ్వఁ బలుకుదు సభలోనఁ జివ్వకొల్ల । కేను గురుపతిఁ జూచి సహించి పోదు;
సురనదీపుత్ర! విను నాకుఁ జూడ నర్ధ । రథుఁడ వగుదీవు లావు బీరంబు నరయ" 238

ప్రతిపదార్థం: సురనదీపుత్ర!= గంగాసుతా భీష్మా!; సభలోనన్= కొలువులోపల; నొవ్వన్= నేను బాధపడేటట్లు; పలుకుదు(వు)= మాటాడుతుంటావు; ఏను= నేను; చివ్వకున్+ఒల్లక= నీతో పోట్లాటకు ఇష్టపడక; కురుపతిన్+చూచి= కౌరవేశ్వరుడిని గాంచి; సహించిపోదున్= ఓర్చుకొని వెళుతుంటాను; విను(ము)= నేను చెప్పేది ఆలకించుము; ఈవు= నీవు; లావు= శక్తి; బీరంబు= పరాక్రమం; అరయన్= పరికించగా; నాకున్+చూడన్= నాకు చూడగా; అర్ధరథుఁడవు+అగుదు(వు)= అర్ధరథుడవే అవుతావు.

తాత్పర్యం: గంగాపుత్రా! బాధపడేటట్లు నన్ను గురించి కొలువులో మాట్లాడుతావు. దుర్యోధనుడిని చూచి నీతో పోట్లాటకు దిగక ఓర్చుకొని వెళుతుంటాను. నీ శక్తినీ, పరాక్రమాన్నీబట్టి నీవు నా దృష్టిలో అర్ధరథుడవే.'

వ. అని పలికి కొలువుఁ గలయం గనుంగొని. 239

ప్రతిపదార్థం: అని పలికి; కొలువున్= సభను; కలయన్+కనుంగొని= నలుమూలల జూచి-

తాత్పర్యం: రాధేయుడు అట్లా పలికి సభను నలువంకల కలయజూచి.

చ. 'హితుఁడని నమ్మఁగాఁ దగునె యీతనిఁ? గార్యపు మాట లిట్టివే?
పతిదెసకూర్మి వాపుటకుఁ బట్టుగ నెక్కువ తక్కువంచు ను
న్నతులగు మేదినీశులకు నానగఁ బల్కుట గాక, యిట్టివా
రితవులు తండ్రికిన్ సుతుల; కేమన నేర్తుము పెద్ద రాజులన్?' 240

ప్రతిపదార్థం: ఈతనిన్= ఈ భీష్ముడిని; హితుఁడు+అని= మేలు చేసేవాడని; నమ్మగాన్+తగునె?= విశ్వసించవచ్చునా?; కార్యపుమాటలు+ఇట్టివే?= పని సాధించుకొనే మాటలు ఇట్లాగే ఉంటాయా?; పతిదెసన్= ప్రభువైన సుయోధనుడి ఎడ; కూర్మి= అనురాగం; పాపుటకున్+పట్టుగన్= తొలగించటానికి వీలుగా; ఎక్కువ తక్కువ+అంచున్= ఇత డెక్కువ, అతడు తక్కువంటూ; ఉన్నతులు+అగు= దొడ్డవారైన; మేదినీ+ఈశులకున్= భూవల్లభులకు; నానగన్= లజ్జకలుగునట్లు; పల్కుటగాక= మాటలాడటంకాక మరేమున్నది?; తండ్రికిన్= ధృతరాష్ట్రుడికి; సుతులకున్= కుమారులైన సుయోధనాదులకు; ఇట్టివారు= ఇటువంటివారు; ఇతవులు= హితులైయున్నారు; పెద్దరాజులన్= దొడ్డ ప్రభువులను; ఏమి+అనన్+నేర్తుము?= మనము ఏమనగలం?'

తాత్పర్యం: ఈ భీష్ముడిని మేలు గూర్చేవాడని విశ్వసించవచ్చునా? పనులు సాధించుకొనే మాటలతీరులు ఇట్లా ఉంటాయా? రాజైన దుర్యోధనుడి పట్ల ఉన్న ప్రేమ పోవటానికి వీలుగా, ఇత డెక్కువ, అతడు తక్కువ అంటూ అధికులైన అవనీపతులకు సిగ్గు కలిగేటట్లు ఇతడు పలుకుతున్నాడు. ఇట్లాంటివారు తండ్రికీ కుమారులకూ హితులై ఉన్నారు. పెద్దలగు దొరలను మన మేమనగలం?'

వ. అని దుర్యోధనుం జూచి యిట్లనియె : 241

తాత్పర్యం: రాధేయుడు దుర్యోధనుడి వైపు చూచి ఇట్లా అన్నాడు :

ఉ. 'కర్జము దప్పె నీ యెదురఁ గష్టపు మాటల కేల యోర్తు రీ
దుర్జనుఁడైన శాంతనవు దోర్బల మేటిది? యీతఁ డొక్కఁడున్
వర్జితుఁడైన నేమి? నృపవర్గము కుందుట యొంటఁ బాయునే?
యర్జున పక్షపాతి యితఁ డాలము మేకొని చేయఁడుంజుమీ! 242

ప్రతిపదార్థం: కర్జము తప్పెన్= పని చెడిపోయింది; నీ+ఎదురన్= నీ సమక్షంలో; కష్టపుమాటలకున్= బాధ కలిగించే పలుకులకు; ఏల+ఓర్తురు?= ఏ విధంగా సహించగలరు?; ఈ దుర్జనుఁడు+ఐన= ఈ దుష్టుడైన; శాంతనవు దోః బలము+ ఏటిది?= భీష్ముడి భుజశక్తి ఏపాటిది?; ఈతఁడు+ఒక్కఁడున్= ఇతఁడొక్కడు; వర్జితుఁడు+ఐనన్+ఏమి?= విడువబడితే కలిగే నష్టమేమి?; నృపవర్గము కుందుట= రాజసమూహం బాధచెందటం; ఒంటన్+పాయునే?= భీష్ముడిని త్యజించకుండా మరొక్క విధంగా తొలగిపోగలదా?; ఇతఁడు= ఈ గాంగేయుడు; అర్జునపక్షపాతి= అర్జునుడి మీద అభిమానం కలవాడు; మేకొని= పూనుకొని; ఆలము= కయ్యం; చేయఁడున్+చుమీ!= సలుపడు సుమా!

తాత్పర్యం: వ్యవహారం చెడిపోయింది. నీ సముఖంలో భీష్ము డాడిన మనసు నొప్పించే మాటలు విని సహించటం ఎట్లా? దుష్టుడైన ఈ గాంగేయుడి భుజశక్తి ఏపాటిది? ఇతడిని మనపక్షం నుండి తొలగిస్తే కలిగే నష్టమేమి? ఈ విధంగాకాక మరోవిధంగా ఈ రాజసమూహం మనోబాధ తీరదు. ఇతడు అర్జునుడి పట్ల పక్షపాతం కలవాడు. పూనికతో యుద్ధం చేయడు సుమా!

తే. చాలఁ గాలంబు పోవక చతురులైన। వృద్ధ జనముల బుద్ధులు విండ్రుగాక!
ముదియ మతిదప్పి నోరికి నొదవినట్లు। పలుకు వెడఁగుల మాటలు పాడి యగునె? 243

ప్రతిపదార్థం: చాలన్+కాలంబు పోవక= బహుకాలం గడవక; చతురులు+ ఐన= నేర్పరులైన; వృద్ధజనముల బుద్ధులు= పెద్దలైన వారి మాటలు; విండ్రుగాక= ఆలకిస్తారుగాని; ముదియన్= ముసలితనం రాగా; మతి+తప్పి= బుద్ధిచెడి; నోరికిన్+ ఒదవినట్లు= నోటికి వచ్చినట్లు; పలుకు= మాటాడునట్టి; వెడఁగుల మాటలు= వివేకం లేనివారి పల్కులు; పాడి+అగునె?= ధర్మమౌతుందా?; (ఆదరింపదగినవి కావని భావం.)

తాత్పర్యం: పండు ముసలివాళ్ళుగాక నేర్పరులైన వృద్ధులయొక్క బుద్ధులు ఆదరించదగినవేకాని ముదిమివలన మదిదప్పి నోటికి వచ్చినట్లు వదరే అవివేకుల వాక్యాలు ప్రమాణంగా స్వీకరించదగినవి కావు.

క. సేనమొగ మీతఁ డైనం। బూని మహీశ్వరులు నీకుఁ బొడిచెదరే? దు
ర్మాని యనిగాదె యీతని। తో నడచుట కొల్లనైతి దురమున కధిపా!' 244

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; సేనమొగము+ఈతఁడు+ఐనన్= సేనలకు అగ్రభాగంలో (సేనాధిపతిగా) ఇతడుంటే; పూని= శ్రద్ధవహించి; మహీ+ఈశ్వరులు= ధరణిపతులు; నీకున్= నీకుగా; పొడిచెదరే?= పోరాడెదరా?; దుర్మాని+అని+కాదె= దురహంకారుడని తలంచికదా; ఈతనితోన్= ఈ భీష్ముడితో; దురమునకున్= యుద్ధానికి; నడచుటకున్= కదలటానికి; ఒల్లన్+ఐతిన్= అంగీకరించలేకపోయాను.

తాత్పర్యం: ఈ భీష్ముడు గనుక సేనాగ్రభాగంలో ఉంటే రాజులు శ్రద్ధతో నీకై పోరాడుతారా? ఇతడు దురహంకారి కావటం వలన ఇతడితో చేరి యుద్ధం చేయటానికి నేను అంగీకరించలేదు.'

వ. అనిన భీష్ముండు సూతసూనున కిట్లనియె: 245

ప్రతిపదార్థం: అనినన్; భీష్ముండు; సూతసూనునకున్= సూతపుత్రుడైన కర్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అందులకు భీష్ముడు కర్ణుడితో ఇట్లా అన్నాడు:

చ. 'ముదుకఁడనైన నాదు బలమున్ జలమున్ వివిధాస్త్రశస్త్ర సం
పదయును బోయి నీ గురుఁడు భార్గవుచే విను, మాజిభూమి నా
కెదిరినవారు పెక్కెడల నేమయిరో యెఱుఁగున్ జగంబు; నా
ముదిమియు నీ కుమారుతనమున్ వరుసన్ విజయుం డెఱింగెడున్. 246

ప్రతిపదార్థం: ముదుకఁడను+ఐన= ముసలివాడనైన; నాదు బలమున్= నా శక్తిని; చలమున్= పట్టుదలను; వివిధ+అస్త్రశస్త్ర సంపదయును= పలురకాలైన అస్త్రశస్త్ర విద్యలలోని ప్రావీణ్యాన్నీ; పోయి= వెళ్ళి; నీ గురుఁడు= నీకు గురువైన; భార్గవుచేన్= పరశురాముడి వలన; వినుము= తెలిసికొనుము; ఆజిభూమిన్= యుద్ధప్రదేశంలో; నాకున్+ఎదిరినవారు= నాతో మార్కొన్నవారు; పెక్కు+ఎడలన్= పలుచోట్ల; ఏమి+అయిరో= ఏమై పోయారో; జగంబు+ఎఱుఁగున్= లోకానికి తెలుసు; నా ముదిమియున్= నా వార్ధక్యం; నీ కుమారుతనమున్= నీయొక్క కౌమారం; వరుసన్= క్రమంగా; విజయుండు= అర్జునుడు; ఎఱింగెడున్= తెలియగలడు.

తాత్పర్యం: 'కర్ణా! నన్ను ముసలివాడని తూలనాడావు. వృద్ధుడనైన నా శక్తి ఎటువంటిదో, పంతం ఏపాటిదో, సకల శస్త్రాస్త్ర సంపన్నత ఎట్టిదో వెళ్ళి నీ గురువైన భార్గవరాముడిని అడిగి తెలిసికొనుము. పలుచోట్ల యుద్ధ రంగాలలో నన్నెదుర్కొన్నవారు ఏమై పోయినారో లోకానికి తెలుసు. నా వార్ధక్యం, నీ కౌమారం క్రమంగా పాండవమధ్యముడు ఎరుగగలడు.

క. అనుమానింపక సభలో। నను నేఁ జెప్పికొనవలసె నా కిమ్మెయి దు
ర్జనితుఁడ వగు నీ యెడ నీ। సున నా కిటు వలుక వలసె సూతతనూజా! 247

ప్రతిపదార్థం: సూత తనూజా!= సూతపుత్రా కర్ణా!; అనుమానింపక= సంకోచించక; సభలోన్= కొలువులో; నాకున్= నాకు; ననున్ నేన్= నన్నుగురించి నేనే; చెప్పికొనన్ వలసెన్= తెల్పుకొనవలసి వచ్చినది; దుర్జనితుఁడవు+ అగు= తల్లికడుపు చెడబుట్టినవాడవైన; నీ ఎడన్= నీయందుగల; ఈసునన్= ద్వేషంచేత; నాకున్+ఇటు+పలుకన్ వలసెన్= నాకిట్లా పలుకవలసి వచ్చింది.

తాత్పర్యం: సూతపుత్రా! సందేహించక సభలో నన్నుగురించి నేనే ఈ విధంగా చాటుకొనవలసి వచ్చింది. తల్లి కడుపు చెడబుట్టిన నీ యెడ గల ద్వేషంచేత నా కిట్లా ఆత్మశ్లాఘ చేసుకొనవలసి వచ్చింది.

తే. కార్యమును ఖడ్గమును నింత గలుగు నీవు। గలుగఁ జేటువాటిల్లె నిక్కౌరవులకు;
దీని మముబోఁటు లెల్లను దీర్పనెట్లు। చాలెదము? మంచిబంటవు చక్కనగుము. 248

ప్రతిపదార్థం: కార్యమును ఖడ్గమును= కార్యాలోచనకూ, ఖడ్గాలోచనకూ; ఇంత+కలుగు= ఇంత దుర్గుణములు గల; నీవు కలుగన్= నీవు మంత్రిగా లభించగా; ఈ+కౌరవులకున్= ఈ దుర్యోధనాదులకు; చేటు+పాటిల్లెన్= ముప్పు మూడింది;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దీనిన్= వీరి కేర్పడిన విపత్తును; మముబోఁటులు+ఎల్లను= మావంటి వాళ్ళమందరం; తీర్పన్= తొలగించటానికి; ఎట్లు చాలెదము?= ఏరీతి శక్తులమవుతాము?; మంచిబంటవు= నీవు మేటి వీరుడవుగాని; చక్కనగుము= యుద్ధానికి సంసిద్ధం కమ్ము.

తాత్పర్యం: కార్యఖడ్గాలోచనలకు మంత్రిగా నీవు కౌరవులకు లభించావు. కనుక వారికి కీడు సంప్రాప్తమయింది. వారి కేర్పడిన ఈ విపత్తు తొలగించటానికి మావంటివారందరికీ శక్తి చాలదు. నీవు మహావీరుడవే గాని, ముందు యుద్ధంలో చక్కగా నిలిచి నీ ప్రతాపం చూపించు.

చ. నెపమిడి యోహటించి యిటు నీవు తొలంగినఁ బోవ వచ్చునే?
కుపితమనస్కుఁడై నరుఁడు కూల్పఁ గ్రమంబున దొడ్డలెల్లఁ జ
న్న పిదప, నెట్లుఁ జొచ్చెదు రణంబున, నప్పుడు చావకున్న దై
న్యపుఁ బరివారముం బతియునైన నెఱింగెద రెల్ల చందముల్.' 249

ప్రతిపదార్థం: నెపము+ఇడి= నామీద సాకుపెట్టి; ఓహటించి= యుద్ధం చేయుటకు జంకి; ఇటు నీవు తొలంగినన్= ఈ రీతిగా నీ విప్పటికి తప్పించుకొన్నను; పోవన్+వచ్చునే?= మున్ముందు తప్పించుకొనిపోగలవా?; కుపిత మనస్కుఁడు+ఐ= కోపించిన మనస్సుకలవాడై; నరుఁడు= అర్జునుడు; కూల్పన్= పడగొట్టగా; క్రమంబునన్= వరుసగా; దొడ్డలు+ఎల్లన్= పెద్దలంతా; చన్నపిదపన్= చచ్చిన తరువాత; ఎట్లున్= ఏ విధంగానైనా; రణంబునన్+చొచ్చెదు(వు)= యుద్ధంలో ప్రవేశించకమానవు; అప్పుడు= అట్టి తరుణంలో; చావక+ఉన్న= మరణించక మిగిలిన; దైన్యపుఁ బరివారమున్= దీన దశలో నున్న బలగమూ; పతియున్+ఐనన్= రాజగు దుర్యోధనుడయిననూ; ఎల్లచందముల్= అన్నివిధాలు; ఎఱింగెదరు= తెలియగలరు.

తాత్పర్యం: యుద్ధానికి జంకి నాపై నెపం మోపి నీ విపుడు తప్పించుకొన్నప్పటికీ మున్ముందు తప్పించుక తిరుగలేవు. క్రోధపరీత చిత్తుడైన అర్జునుడు కూలుస్తూ ఉండగా వరుసగా మహావీరులంతా వెళ్ళిపోయిన తరువాత నీకు కదనరంగ ప్రవేశం తప్పదు. అపుడు చావక మిగిలి దీనదశలో నున్న పరివారమూ, సుయోధనుడూ నీ చందమెటువంటిదో తెలిసికొనగలరు.'

విశేషం: ఎట్లుఁ జొచ్చెదు రణంబున - అనుదానికి 'ఎట్లుఁ జచ్చెదు రణంబున' అను పాఠాంతరము గలదు. నరుఁడు- కూల్పన్= అర్జునుడు చంపఁగా, అప్పుడు, చావక+ఉన్నన్= చావకపోతే, దొడ్డలు+ఎల్లన్, చన్న-పిదపన్, రణంబునన్= యుద్ధంలో, చచ్చెదు(వు)= చస్తావు - నరుడు కూల్చినప్పుడు చావకపోతే యుద్ధంలో ఎట్లాగూ చస్తావు. - అని భావం.

వ. అని పలికి దుర్యోధను నుపలక్షించి కర్ణుతో వెండియు. 250

ప్రతిపదార్థం: అని పలికి; దుర్యోధనున్; ఉపలక్షించి= చూచి; కర్ణుతోన్; వెండియున్= మరల.

తాత్పర్యం: అని పలికి దుర్యోధనుడిని కనుగొని భీష్ముడు కర్ణుడితో మళ్ళీ ఇట్లా అన్నాడు:

ఆ. 'సూతపుత్త్ర! యితఁడు నా తలఁ బెద్ద మో । పెత్తి నమ్మియున్న యట్టి చోటఁ
గ్రందుసేయ నాకుఁ గాదని సైరించి । యున్న బ్రదికి; తింక నూరకుండు.' 251

ప్రతిపదార్థం: సూతపుత్ర!= కర్ణా!; ఇతఁడు= ఈ సుయోధనుడు; నా తలన్= నా శిరస్సు మీద; పెద్ద మోపు+ఎత్తి= పెనుభారం మోపి; నమ్మి+ఉన్న+అట్టి చోటన్= విశ్వసించిఉన్న తావులో; క్రందు+చేయన్= కలహమొనర్చుట; నాకున్= నాకు; కాదు+అని= తగదని; సైరించి+ఉన్నన్= క్షమించి ఉన్నందున; బ్రదికితి(వి)= ప్రాణాలతో ఉన్నావు; ఇంకన్+ఊరకుండు(ము)= ఇక నోరుమూసుకొనుము.

తాత్పర్యం: 'సూతనందనా! ఈ దుర్యోధనుడు నా తలపై పెనుభారం మోపాడు. ఇతడు నన్ను గట్టిగా నమ్ముకొని ఉన్నాడు. ఇట్టిచోట వివాదం తగదని సహించాను. అందుచేత నీవు బ్రతికిపోయావు. ఇక నోరెత్తవద్దు.'

వ. **అనియాడి మొగంబు గంటు వెట్టుకొనియున్న సురనదీసూను దిక్కు మొగంబై సుయోధనుండు 'నీకుం గోపింప నగునె; నన్నును గార్యభారంబునుం జూచి నా బ్రదుకునకై సర్వంబును సహింపలయు'నని తేర్చి యంగ రాజుం గనుంగొని 'మీ రిద్దఱు నొక్కటియై భరంపడి యిప్పని సక్కంజేసి కాక మీలోన నిట్టి యెరవు మాటలేల?' యని పొదివి పలికి, తదనంతరంబ పాండవ పక్షంబు వారల తారతమ్యంబులు వినువాఁడై యమ్మాట పుట్టించిన నతనికి భీష్ముం డిట్లనియె:** **252**

ప్రతిపదార్థం: అని+ఆడి= అనిపలికి; మొగంబు; గంటుపెట్టుకొని+ఉన్న= ముడుచుకొని ఉన్న; సురనదీసూనుదిక్కుమొగంబు+ఐ= గంగానదీపుత్రుడి వైపు ముఖం త్రిప్పి; సుయోధనుండు; నీకున్; కోపింపన్+అగునె?= కినుక వహించటం న్యాయమా?; నన్నును; కార్యభారంబునున్‌చూచి; నా బ్రదుకునకున్+ఐ= నా జీవితంకొరకు; సర్వంబును= అన్నిటినీ; సహింపన్ వలయున్; ఓర్చుకొనాలి; అని; తేర్చి= భీష్ముడిని ప్రసన్నుడిని గావించి; అంగరాజున్= కర్ణుడిని; కనుంగొని= చూచి; మీరు+ఇద్దఱున్+ ఒక్కటి ఐ; భరంపడి= భారం వహించి; ఈ+పనిన్= ఈ యుద్ధకార్యాన్ని; చక్కన్+చేసి= చక్కబరిచి; కాక; మీలోనన్; ఇట్టి; ఎరవుమాటలు= పొరపొచ్చెపు పలుకులు; ఏల?= ఎందుకు?; అని; పొదివిపలికి= క్రమ్ముకొని మాటాడి; తద్+అనంతరంబ= అటు తరువాత; పాండవ పక్షంబువారల= పాండవుల వైపున్నవారియొక్క; తారతమ్యంబులు= ఎచ్చుతగ్గులు; వినువాఁడు+ఐ= వినదలంచినవాడై; ఆ+మాట+పుట్టించినన్= ఆ ప్రస్తావన తీసికొనిరాగా; ఆతనికిన్; భీష్ముండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ము డట్లా పలికి ముఖం ముకుళించుకొని ఉండగా సుయోధనుడు గాంగేయుడి వైపు చూచి 'పితామహా! నీకు కోపించదగునా? నన్నూ, కార్యభారాన్నీ గమనించి నా జీవితానికై నీ వన్నిటినీ సహించవలె' అని పలికి అతడిని ప్రసన్నుడిని కావించాడు. అంగరాజును అవలోకించి 'రాధేయా! మీ రిద్దరూ ఒకటై యుద్ధభారం వహించి కార్యమును గట్టెక్కించక మీలో మీకు ఈ పొరపు మాటలెందుకు?' అని పొందికగా పలికి, అవతల పాండవ పక్షమందున్న వీరుల తారతమ్యములు తెలిసికొనటానికై ఆ మాట ప్రస్తావించగా భీష్ముడిట్లా అన్నాడు:

తే. **'పాండుపుత్త్రుల నద్దెస దండిమగలఁ । గలనిజంబేను జెప్పినఁ గర్ణు మనసు**
నొచ్చు; నీ చిత్త మెట్లగునో యెఱుంగ; । నాకు నిదియేమి పని రిత్త నడుమనుండి?' **253**

ప్రతిపదార్థం: పాండుపుత్త్రులన్= పాండు నందనులను గురించి; ఆ+దెస+దండిమగలన్= ఆ పక్షమందున్న బిరుదుశూరులను గురించి; కలనిజంబు= ఉన్నసత్యం; ఏను చెప్పినన్= నేను పలికితే; కర్ణుమనసు నొచ్చున్= కర్ణుడి హృదయం బాధపడుతుంది; నీ చిత్తము= నీ మనస్సు; ఎట్లు+అగునో+ఎఱుంగన్= ఏ విధంగా ఉంటుందో తెలియదు; రిత్తన్= వ్యర్థంగా; నడుమనుండి= మధ్యలో; నాకున్+ఇది+ఏమిపని?= నాకు ఎందుకు వచ్చిన అక్కర?'

తాత్పర్యం: 'పాండుకుమారుల పక్షంలో ఉన్న మేటి వీరుల వాస్తవమైన శక్తి సామర్థ్యాలను గురించి నేను వివరిస్తే కర్ణుడి మనస్సునకు కష్టం కలుగుతుంది. నీ మనస్సు ఎట్లా ఉంటుందో తెలియదు. మధ్యలో అనవసరంగా నాకీ పని ఎందుకు?'

వ. అనిన, మఱియు దుర్యోధనుండు తఱిమి యడుగుటయు నిట్లనియె: 254

ప్రతిపదార్థం: అనినన్= అని భీష్ముడు పలుకగా; మఱియున్; దుర్యోధనుండు; తఱిమి అడుగుటయున్= బలాత్కరించి చెప్పుమని అడుగగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు నిర్బంధించి అడుగగా భీష్ము డిట్లా అన్నాడు:

భీష్ముండు పాండవవీరులం దతిరథ మహారథాదుల నిరూపించి చెప్పుట (సం. 5-166-14)

తే. 'అతిరథుండు యుధిష్ఠిరుం డగ్నికల్పుఁ। డాహవంబున నప్రతిహతుఁడు; భీముఁ
డతిరథ శ్రేష్ఠుఁ; డతని మహాబలం బ। మానుషము, విక్రమం బసమాన మధిప! 255

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; అతిరథుండు= అతిరథుడు; అగ్నికల్పుఁడు= అగ్నితో సమానుడు; ఆహవంబునన్= యుద్ధంలో; అప్రతిహతుఁడు= అడ్డం లేనివాడు; భీముఁడు= భీమసేనుడు; అతిరథ శ్రేష్ఠుఁడు= అతిరథులలో ఉత్తముడు; ఆతని మహాబలంబు= ఆతడి పెనుశక్తి; అమానుషంబు= మానవాతీతం; విక్రమంబు= పరాక్రమం; అసమానము= పోలికలేనిది.

తాత్పర్యం: 'రాజా! అగ్నితో సమానుడైన ధర్మజుడు అతిరథుడు. యుద్ధరంగంలో అతడికి ఎదురులేదు. భీముడు అతిరథులలో మేటి. అతడు మానవాతీత దేహబలసంపన్నుడు. అతడి పరాక్రమానికి పోలిక చెప్ప వీలుగాదు.

క. సమరథులు కవలు భుజగ। ర్వము పటు విక్రమము దుర్నివారంబులు; వా
రి మనంబులు నిర్భయములు;। తమ మొనలకు మించి బెట్టు దాఁకుదు రధిపా! 256

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; కవలు= అమడలైన నకుల సహదేవులు; సమరథులు= సమరథులైఉన్నారు; భుజగర్వము= వారల బాహు దర్పం; పటువిక్రమము= దృఢ శౌర్యం; దుర్నివారంబులు= అడ్డగించరానివి; వారి మనంబులు= వారి హృదయాలు; నిర్భయములు= భీతిలేనివి; తమ మొనలకున్ మించి= తమ సేనలకు ముందు మిగిలి; బెట్టుతాఁకుదురు= శత్రువులతో గట్టిగా పోరాటం సాగిస్తారు.

తాత్పర్యం: నకుల సహదేవులు సమరథులు. వారి బాహుబలం, దృఢమైన శౌర్యం అడ్డగించరానివి. వారి హృదయాలు భయరహితాలు. వారు తమ సేనలకు ముందు మిగిలి విరోధులతో గట్టిగా పోరాడగలరు.

సీ. వారందఱును ధర్మవైభవంబునఁ, దప। స్సంపద నెక్కుడు జనులకెల్ల
ధనువు నాఱంగంబులను బరిణతులు దాఁ। కోర్తురు; పరులకు నోర్వరాని
కోల్తల గలరు; పెక్కులు పరాక్రమములు। వేర్వేఱ చేసిన వీరు లొక్క
మొగ మయి తాఁకిన వెగడంద కుందునే?। మనసేన ము న్నవమాన పాటు

ఆ. దుఃఖపాటు గలిగి తొడరంగ వచ్చిన । వారుగాన నలఁతిఁ బోరు; ప్రాణ
మాసపడక యోపినంతయుఁ బెనఁగుదు । రది సహించి నిలుచు టరిది మనకు. 257

ప్రతిపదార్థం: వారు+అందఱును= వారెల్లరును; ధర్మవైభవంబునన్= సుకృతాతిశయం వలనను; తపస్+సంపదన్= తపస్సమృద్ధిచేతను; జనులకున్+ఎల్లన్= జనులందరికంటె; ఎక్కుడు= అధికులు; ధనువు+ఆఱు+అంగంబులను= షడంగాలతో కూడిన ధనుర్వేదమునందు; పరిణతులు= పరిపక్వమైనవారు; తాఁకు+ఓర్తురు= శాత్రవుల తాకిడికి తట్టుకొనగలరు; పరులకున్= విరోధులకు; ఓర్వన్+రాని= సహించరానంతటి; కోల్తల కలరు= యుద్ధసన్నాహం కలవారు; పరాక్రమములు పెక్కులు= అనేక విక్రమములు; వేర్వేఱన్+చేసిన వీరులు= వేఱువేఱుగా ప్రదర్శించిన శూరులు; ఒక్కమొగము+అయి= ఏకముఖమయి; తాఁకినన్= వారు ఎదిరిస్తే; మన సేన= మన సైన్యం; వెగడు+అందక+ఉండునే?= తడబాటు చెందక మానదు; మున్ను= పూర్వం; అవమానపాటు= భంగపాటు; దుఃఖపాటు= దుఃఖానుభవం; కలిగి= పొంది; తొడరంగన్ వచ్చినవారుకానన్= ఎదిరించటానికి వచ్చినవారు కనుక; అలఁతిన్ పోరు= అంత తేలికగా మరలరు; ప్రాణము+ఆసపడక= ప్రాణముల కాశింపక; ఓపినంతయున్+పెనఁగుదురు= శక్తిఉన్నంతమేరకు పోరాడుతారు; మనకున్= మనకు; అది సహించి= వారి విజృంభణాన్ని ఓర్చి; నిలుచుట= యుద్ధంలో చెదరక నిలబడటం; అరిది= అశక్యం.

తాత్పర్యం: పాండవులు పుణ్యాతిశయంవల్ల, తపోబలంవల్ల జనులందరికంటె గొప్పవారు. ధనుర్వేదాన్ని ఆరు అంగాలతో అభ్యసించారు. ధనుర్విద్యలో ప్రవీణులు. శత్రుధాటికి తాళగలరు. వైరులు వారి యుద్ధసన్నాహాలకు తట్టుకొనలేరు. వేరువేరుగా తమ తమ ప్రతాపాలెట్టివో ప్రదర్శించిన వీరులు. వీరందరు ఏకంగా తాకినట్లయితే మన సైన్యం తల్లడిల్లిపోతుంది. పూర్వం పొందిన పరాభవంతో, అనుభవించిన దుఃఖాలతో మనల్ని నెదిరింపవచ్చినవారు గనుక అంత తేలికగా వెళ్ళరు. ప్రాణాలను లెక్కించక శక్తి ఉన్నంతవరకూ పెనగులాడుతారు. వారి దాడికి తట్టుకొని రణరంగంలో కాలూని నిలబడటం మనకు అశక్యం.

మ. నరుఁ డీ మానమువాఁ డనంగ వశమే? నా కంతవా రెందు నె
వ్వరులే; రింకను బుట్ట; రాపులికి దుర్వారోద్యముండైన యా
హరియుం దోడటె! యేమి చెప్పుదు? నతం డా సేనలం గాచు నొ
క్కరుఁడుం, గీటడఁగించు నీ బలములన్ గాండీవదుర్దాంతుఁడై. 258

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; ఈ మానమువాఁడు= ఈ కొలదివాడు; అనంగన్= అని చెప్పటానికి; నాకున్= నాకు; వశమే?= తరమా?; అంతవారు= అర్జునుపాటివారు; ఎందున్+ఎవ్వరున్ లేరు= ఎక్కడా ఎవ్వరూలేరు; ఇంకను పుట్టరు= ముమ్ముందు కలుగబోరు; ఆ పులికిన్= ఆ బెబ్బులికి; దుర్వార+ఉద్యముండ+ఐన= అడ్డగించరాని యత్నములుగల; హరియున్= ఆ నారాయణుడును; తోడు+అటె!= సహాయుడై ఉన్నాడట!; ఏమిచెప్పుదున్= ఏమనగలం? ఇక వేరే చెప్పాలా?; అతండు= అర్జునుడు; ఆ సేనలన్+కాచున్= పాండవసైన్యాన్ని రక్షిస్తాడు; ఒక్కరుఁడున్= తానొక్కడే; నీ బలములన్= నీ సేనలన్నింటినీ; గాండీవ దుర్దాంతుఁడు+ఐ= గాండీవముచేత అణచరానివాడై; గీటడఁగించున్= సంహరిస్తాడు.

తాత్పర్యం: సుయోధనా! ఫల్గును డీపాటి వాడని నాకు చెప్పశక్యం కాదు. అంతటివాడు ఎప్పుడూ ఎక్కడా కనిపించటం లేదు. ముమ్ముందు అట్టివారు కలుగరుకూడా. ఆ బెబ్బులికి అడ్డగించరాని యత్నపరుడైన శ్రీహరి తోడ్పాటున్నదట. ఇక చెప్పవలసినదేముంది? గాండీవం అనే వింటిచేత అణచరానివాడై అత డొక్కడే తన సేనలన్నింటినీ కాపాడుకొంటాడు; నీ సేనలన్నింటినీ నిర్మూలిస్తాడు.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఆ హరియున్ దోడఁటె-ఇచ్చట 'హరి' శబ్దమునకు సింహమని కూడా అర్థం. హరి= కృష్ణుడనెడి సింహము-శ్లిష్టరూపకం. అలం: రూపకం. పులికి సింహం తోడయితే ఇక చెప్పేదేమున్నది? - అనే విశేషార్థం ఇందులో సూచితం.

వ. అనిన విని యక్కొలువున నున్న రాజుల మనంబు లెల్లను జేవ సెడియె; భీష్ముండు వెండియు నిట్లనియె : 259

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ+కొలువునన్+ఉన్న; రాజుల మనంబులు; ఎల్లను; చేవ చెడియెన్= సత్తువ కోల్పోయాయి; భీష్ముండు; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడి పలుకులు విని ఆ సభలో ఉన్నవారి మనస్సులు దిగాలుపడిపోయాయి. మరల భీష్ముడిట్లా చెప్పసాగాడు.

సీ. 'ద్రౌపదేయులు మహారథు లేవురును; వారి । తరమ యుత్తరుఁడును ధరణినాథ!
యతిరథవర్యుఁ డయ్యభిమన్యుఁ; డర్జున । వాసుదేవుల కెనవచ్చువాఁడు;
లఘుచిత్రములు నేర్చు లావును దాల్మియుఁ । గలఁడు తండ్రులపాటు తలఁచుచుండుఁ
గావున బెడిదంబుగాఁ బోరు; సాత్యకి । యతిరథోత్తముఁడు శౌర్యాన్వితుండు;

తే. పాండవ స్నేహసక్తుఁడై యుండుఁ గాన । నలుక మనమీఁదఁ బెద్దయుఁ గలిగి పెనఁగు;
వీర లిరువురుఁ బరుసనివారు సమర । పరుల నొప్పింతు రీ యోధవరులనెల్ల. 260

ప్రతిపదార్థం: ధరణినాథ!= దుర్యోధన మహారాజా!; ద్రౌపదేయులు= ద్రౌపదికుమారులైన ఉపపాండవులు; ఏవురును= ఐదుమందికూడ; మహారథులు= మహారథులని చెప్పదగినవారు; ఉత్తరుఁడును= విరటుడి కొడుకైన ఉత్తరుడుకూడా; వారి తరమ= ఉపపాండవులవలె మహారథుడు; ఆ+అభిమన్యుఁడు= ఆ యభిమన్యుడు; అతిరథవర్యుఁడు= అతిరథోత్తముడు; అర్జున వాసుదేవులకున్= పార్థునకు, శ్రీకృష్ణునకు; ఎనవచ్చువాఁడు= సాటివచ్చేవాడు; లఘుచిత్రములు నేర్చున్= వింతవింతలాఘవములు అతడెరుంగును; లావును= బలం; తాల్మియున్= సహనం; కలఁడు= కల్గిఉన్నాడు; తండ్రులపాటు= తనతండ్రు లనుభవించిన కష్టాలను; తలఁచుచున్+ఉండున్= స్మరిస్తూ ఉంటాడు; కావునన్= కాబట్టి; బెడిదంబుగాన్= దారుణంగా; పోరున్= యుద్ధం చేస్తాడు; సాత్యకి= వృష్ణి వంశస్థుడైన సాత్యకి; అతిరథ+ఉత్తముఁడు= అతిరథులలో శ్రేష్ఠుడు; శౌర్య+అన్వితుండు= పరాక్రమంతో కూడినవాడు; పాండవ స్నేహసక్తుఁడు+ఐ= పాండవుల చెలిమియందు కోరిక గలవాడై; ఉండున్+కానన్= ఉంటాడు కనుక; మనమీఁదన్= మనయెడ; అలుక= కోపం; పెద్దయున్+కలిగి= మిక్కిలి కలిగి; పెనఁగున్= మనతో పోరాడుతాడు; వీరలు+ఇరువురున్= అభిమన్యు సాత్యకులిద్దరు; పరుసనివారు= పారుష్యం కలవారు; సమరపరులన్= యుద్ధమునందు ఆసక్తిగల; ఈ యోధవరులన్+ఎల్లన్= మన వీర యోధులందరినీ; నొప్పింతురు= బాధిస్తారు.

తాత్పర్యం: ఉప పాండవులు ఐదుమందీ మహారథులు. వారితో సమానుడు ఉత్తరుడు. అభిమన్యుడు అతిరథులలో అగ్రేసరుడు. శ్రీకృష్ణార్జునులకు సాటియైనవాడు. యుద్ధపు మెలకువ లెన్నింటినో నేర్చినవాడు. శక్తిమంతుడు. సహనయుక్తుడు. అతడు తన తండ్రులు పడిన కష్టపరంపరలను తలపోసుకొంటూ ఉంటాడు. కనుక ఘోరంగా పోరాటం సాగిస్తాడు. సాత్యకి అతిరథులలో సిగబంతి. శౌర్యంతో కూడినవాడు. పాండవస్నేహమునందు సక్తమనస్కుడుగాన మన మీద అతడికి కోపం మెండు. ఆ కారణంతో మనతో లెస్సగా పోరాడుతాడు. అభిమన్యు సాత్యకు లిద్దరూ గండరగండలు. సంగ్రామలంపటులైన మన మేటి జోదులందరినీ వేధించక విడువరు.

విశేషం: ద్రౌపదేయులు: పాంచాలి కుమారులు ఐదుగురు. వీరు ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడు అనేవారు. వీరినే ఉపపాండవు లంటారు.

మ. అలఁతింబోరు మహారథుల్ ద్రుపద మత్స్యాధీశు లుద్యద్భుజా
బలశౌర్యాఢ్యులు పాండురాజసుత సంబంధ ప్రియస్నేహముల్
కలిమింజేసి తదీయ దైన్యమునకుంగా నొచ్చియుం జచ్చియున్
గెలిపింపం దమకించి చొత్తు రని కేకీభూతచేతస్కులై. 261

ప్రతిపదార్థం: ద్రుపద మత్స్య+అధీశులు= ద్రుపదుడు, మత్స్యదేశాధిపతి విరాటుడు అనువారు; ఉద్యత్= పెంపొరుతున్న; భుజాబల= బాహుబలం చేతను; శౌర్య= విక్రమంచేతను; ఆఢ్యులు= సంపన్నులు; అలఁతిన్+పోరు= తేలికగా పోరాటంలో మనలను వదలరు; పాండురాజసుత= పాండవులతోడి; సంబంధ= చుట్టరికం; ప్రియస్నేహముల్= ప్రేమము, చెలిమి అనునవి; కలిమిన్+చేసి= కలిగినవారవటంచేత; తదీయదైన్యమునకున్+కాన్= పాండవుల దీనస్థితికై; నొచ్చియున్= బాధపడియూ; చచ్చియున్= మరణించటానికి సిద్ధపడియూ; ఏకీభూత చేతస్కులు+ఐ= ఒకటిగాఉన్న మనస్సుకలవారై; గెలిపింపన్+తమకించి= విజయం సమకూర్చటానికి త్వరపడుతూ; అనికిన్+చొత్తురు= యుద్ధరంగంలో ప్రవేశిస్తారు.

తాత్పర్యం: పాంచాల దేశపు ప్రభువైన ద్రుపదుడు, మత్స్యదేశాధిపతి విరటుడు పెంపారు భుజశక్తితో, విక్రమంతో ఉద్దీపించే మహారథులు. పాండవులతో సఖ్యసంబంధాలు కలవారవటం వల్ల కౌంతేయుల కష్టపాటు తలంచుకొని వారికొరకు తాము నొచ్చిఅయినా, చచ్చిఅయినా వారిని గెలిపించటానికి ఏకమనస్సుతో యుద్ధరంగంలోనికి ఉరుకుతారు.

ఆ. వీరగుణము బలము వీఁకయుఁగలఁడు మ । హారథుఁడు శిఖండి; యతని తమ్ముఁ
డతిరథుండు దర్పయుతుఁడు ధృష్టద్యుమ్నుఁ । డుగ్రతేజుఁ డనికి నుగ్రునట్లు. 262

ప్రతిపదార్థం: శిఖండి= ద్రుపదుడి తనయుడైన శిఖండి అనేవాడు; మహారథుఁడు= మహారథుడు; వీరగుణము= శూరత్వం; బలము= శక్తి; వీఁకయున్= పట్టుదల; కలఁడు= కలవాడు; అతని తమ్ముఁడు= శిఖండి అనుజుడైన; ధృష్టద్యుమ్నుఁడు; అతిరథుండు= అతిరథుడు; దర్పయుతుఁడు= గర్వంతో కూడినవాడు; అనికిన్= యుద్ధానికి; ఉగ్రు+అట్ల= రుద్రుడివలె; ఉగ్రతేజుఁడు= భయంకరమైన ప్రతాపం కలవాడు.

తాత్పర్యం: శిఖండి మహారథుడు. శౌర్యం, శక్తి, పట్టుదల కలవాడు. అతడి తమ్ముడు ధృష్టద్యుమ్నుడు అతిరథుడు. బాహుదర్పం కలవాడు. యుద్ధంలో రుద్రుడివలె అతడు దారుణమైన ప్రతాపం చూపగలడు.

క. అతని సుతుఁ డర్ధరథుఁ డా । ధృతవర్మ్ముఁడు పిన్నవాఁడు త్రిమ్మటకాఁడై
మతిహీనత శస్త్రా స్త్ర । ప్రతతి పరిశ్రమములేక పాలసుఁ డగుటన్. 263

ప్రతిపదార్థం: అతని సుతుఁడు= ఆ ధృష్టద్యుమ్నుని కుమారుడు; ఆ ధృతవర్మ్ముఁడు= ధృతవర్మ్ముడనేవాడు; పిన్నవాఁడు= పసివాడు; త్రిమ్మటకాఁడై= ఇచ్చవచ్చినట్లు తిరుగుచూ; మతిహీనతన్= తెలివితక్కువచేత; శస్త్ర+అస్త్రప్రతతి పరిశ్రమములేక= శస్త్రాస్త్ర విద్యాభ్యాసం లేక; పాలసుఁడు+అగుటన్= మూర్ఖుడయినందున; అర్ధరథుఁడు= అర్ధరథుడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడి కుమారుడు ధృతవర్మ్ముడు చిన్నతనంనుండి దేశముల వెంట ఇచ్చవచ్చినట్లు తిరుగుతూ తెలివిలేక శస్త్రాస్త్ర విద్యాపరిశ్రమంలేక పాలసుడైనందున అర్ధరథుడయ్యాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. చేది భూవిభుండు శిశుపాల తనయుండు । ధృష్టకేతుఁ డధిక ధీరమతి మ
హారథుండు; భోజుఁ డజుఁ డనురాజులు । నట్టివార తెంపు నలవుఁ గలరు. 264

ప్రతిపదార్థం: చేది భూ విభుండు= చేదిదేశాధిపతిఅయిన; శిశుపాలతనయుండు= శిశుపాలుడి యొక్క కుమారుడు; ధృష్టకేతుఁడు= ధృష్టకేతుడనేవాడు; అధిక ధీరమతి= మిక్కిలి ధైర్యంతో కూడిన మనస్సుకలవాడు; మహారథుండు= మహారథుడై ఉన్నాడు; భోజుఁడు అజుఁడు+అను రాజులు= భోజుడు, అజుడు అను పేర్లుకల నరపతులు; అట్టివారు+అ= మహారథులే; తెంపున్= సాహసమూ; అలవున్= బలమూ; కలరు= కలిగి ఉన్నారు.

తాత్పర్యం: చేది దేశపురాజు శిశుపాలుడి యొక్క కుమారుడు ధృష్టకేతుడు. అతడు మిక్కిలి ధైర్యంతో గూడిన మనస్సుకలవాడు. అతడు మహారథుడు. భోజుడు అజుడు అనే పేర్లుగల నరపతులు కూడ మహారథులే. వారు బలసాహసాలు కలవారు.

వ. ఉత్తమౌజుండును యుధామన్యుండును క్షత్త్ర దేవుండును జయంతుండును నమితౌజుండును విరాటుండును సత్యజితుండును ననం బరఁగు పాంచాల కుల ప్రదీపకులు మహారథులు; మత్తమాతంగ బృందంబు చందంబునం బ్రతిబలంబు పయిం గవిసి కోలాహల బహుళంబుగాఁ గలంపం జాలుదురు; కేకయపతు లేవురు సహోదరులు మహారథులు, కడింది మగలు, కెంపు రథంబుల మొత్తంబులతోఁ గార్చిచ్చు పగిదిం బొదువుదురు; కాశీశుండు నీలుండు సూర్యదత్తుండు మదిరాక్షుండు శంఖుండు విరాటజ్ఞాతులు మహారథులు వివిధాయుధ విద్యా విశారదులు; వారి పోరు భరంబై యుండు. 265

ప్రతిపదార్థం: ఉత్తమౌజుండును; యుధామన్యుండును; క్షత్త్రదేవుండును; జయంతుండును; అమితౌజుండును; విరాటుండును; సత్యజితుండును; అనన్+పరఁగు= అనే పేర్లతో ఒప్పారుతున్న; పాంచాలకుల ప్రదీపకులు= పాంచాల వంశమును వెలిగించేవారు; మహారథులు= మహారథులై ఉన్నారు; మత్తమాతంగ బృందంబు+చందంబునన్= మదించిన గజసమూహంవలె; ప్రతిబలంబుపయిన్= శత్రుసేనమీదికి; కవిసి= దుమికి; కోలాహలబహుళంబుగాన్= కలకలధ్వని చెలరేగేటట్లుగా; కలపన్+చాలుదురు= కలతనొందింప సమర్థులు; కేకయపతులు= కేకయ రాజ్యాధీశులు; ఏవురు సహోదరులు= ఐదుమంది అన్నదమ్ములు; మహారథులు= మహారథులై ఉన్నారు; కడిందిమగలు= వారు శూరులు; కెంపురథంబుల మొత్తంబులతోన్= కెంపులతో నిర్మించిన రథసమూహాలతో; కార్చిచ్చుపగిదిన్= దావానలంవలె; పొదువుదురు= క్రమ్ముకొంటారు; విరాటజ్ఞాతులు= విరాటమహారాజు దాయాదులైన; కాశీశుండు; నీలుండు; సూర్యదత్తుండు; మదిరాక్షుండు; శంఖుండు - ఈ ఏవురూ; మహారథులు= మహారథులై ఉన్నారు; వివిధ+ఆయుధ విద్యా విశారదులు= పలు తెరగులైన శస్త్రవిద్యలలో ప్రవీణులు; వారి పోరు భరంబు+ఐ+ఉండున్= వీరు సల్పు పోరాటం భరింపశక్యంకానిదై ఉంటుంది.

తాత్పర్యం: తమ పుట్టుకచేత పాంచాల వంశాన్ని ప్రకాశింపజేస్తున్న ఉత్తమౌజుడు యుధామన్యుడు క్షత్త్రదేవుడు జయంతుడు అమితౌజుడు విరాటుడు సత్యజితుడు అనే ఏడుగురున్నూ మహారథులు. వారు మదించిన ఏనుగుల గుంపువలె విరోధిసేనలపై దూకి కలకలధ్వని చెలరేగేటట్లు చీకాకు పరుస్తారు. కేకయ దేశాధిపతులు అయిదుమంది అన్నదమ్ములు మహారథులు. వారు మేటి వీరులు. కెంపురథాలతో దావానలం మాదిరి శత్రుసైన్యాలను చుట్టుముట్టుతారు. విరాటుడి దాయాదులైన కాశీశుడు నీలుడు సూర్యదత్తుడు మదిరాక్షుడు శంఖుడు అనేవారు మహారథులు. అనేక విధాలైన ఆయుధ విద్యలలో వారు నేర్పరులు. వారు సాగించే పోరాటం సహింపశక్యంకాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **చిత్రాయుధుండును జేకితానుండు మ । హారథు లిద్దఱు నర్జునునకుఁ**
గూర్తురు, కయ్యాన కోర్తురు, నేర్తు, రా । యుధముల కెల్ల నత్యుగ్రు; లవ్వి
ధము వార; చంద్రదత్త వ్యాఘ్రదత్తులు । వినుము సేనాబిందుఁడను నృపాలుఁ
డతిరథోత్తముఁడు మారుత పుత్త్రు నెన యతం । డొక్కరుండును వారి యుఱిది లావు

ఆ. **పాండ్యుఁ డతిరథుండు బలఁగంబుఁ గలవాఁడు । సమరథుండు కాశ్యుఁ డమితబలుఁడు**
కుంతిభోజుఁ డాజికోవిదుఁ డతిరథుం । డతని యొద్దిజోదు లధికబలులు. 266

ప్రతిపదార్థం: చిత్రాయుధుండును= చిత్రాయుధుడనేవాడును; చేకితానుండున్= యాదవరాజైన చేకితానుడును; మహారథులు= మహారథులై ఉన్నారు; ఇద్దఱున్= వీరిరువురును; అర్జుననకున్; కూర్తురు= ఇష్టులై ఉన్నారు; కయ్యానకున్+ఓర్తురు= యుద్ధం చేయటానికి సమర్థులు; ఆయుధములకున్+ఎల్లన్+నేర్తురు= సకలాయుధాలతో పోరుసల్పడం తెలియుదురు; అతి+ఉగ్రులు= మిక్కిలి భయంకరులు; చంద్రదత్త వ్యాఘ్రదత్తులు= చంద్రదత్తుడు, వ్యాఘ్రదత్తుడు; ఆ+విధమువారు+అ= చిత్రాయుధ చేకితానులవంటివారే; వినుము!; సేనాబిందుఁడు+అను నృపాలుఁడు= సేనాబిందుడనేరాజు; అతిరథ+ఉత్తముఁడు= అతిరథులలో శ్రేష్ఠుడు; మారుతపుత్త్రు+ఎన= భీమసేనుడికి సమానుడు; అతండు+ఒక్కరుండును= ఆ సేనాబిందు డొక్కడే; వారి+ఉఱిదిలావు= వారి గొప్పబలం; పాండ్యుఁడు= పాండ్యభూపతి; అతిరథుండు= అతిరథుడు; బలఁగంబున్+కలవాఁడు= పరివారమున్నవాడు; కాశ్యుఁడు; సమరథుండు= సమరథుడై ఉన్నాడు; అమితబలుఁడు= అతడు మిక్కిలి శక్తి కలవాడు; కుంతి భోజుఁడు= కాశ్యుడి మేనత్త కుమారుడున్నూ, యాదవరాజున్నూ అయిన కుంతిభోజుడనేవాడు; అతిరథుడు; ఆజికోవిదుఁడు= యుద్ధ ప్రావీణ్యం కల్గినవాడు; అతని+ఒద్ది+జోదులు= అతడి వద్ద ఉండే శూరులు; అధికబలులు= మిక్కుటమైన శక్తికలవారు.

తాత్పర్యం: చిత్రాయుధుడు చేకితానుడు మహారథులు. వీరిద్దరూ అర్జునుడిపై ప్రేమగలవారు. యుద్ధ క్రీడయందు సమర్థులు. సకల శస్త్రాస్త్రాలెరింగినవారు. మిక్కిలి భయంకరులు. అట్లాంటి మహారథులే చంద్రదత్తుడు, వ్యాఘ్ర దత్తుడు. సేనాబిందుడనేరాజు అతిరథుడు. అతఁ డొక్కడే వీరందరి శక్తి సామర్థ్యాలు కల్గినవాడు. పాండ్యరాజు అతిరథుడు. సేన కలవాడు. కాశ్యుడు సమరథుడు. మిక్కిలి బలశాలి. కుంతిభోజుడు అతిరథుడు. యుద్ధం చేయటంలో నేర్పుగలవాడు. అతడి కడనున్న యోధులందరూ మిక్కిలి శక్తి సంపన్నులు.

వ. **రోచమానుండు మహారథుండు దేవసమానుండు.** 267

ప్రతిపదార్థం: రోచమానుండు= రోచమానుడనేవాడు; మహారథుండు; దేవసమానుండు= దేవతాతుల్యుడు.

తాత్పర్యం: రోచమానుడనేవాడు మహారథుడు. అతడు వేల్పులతో సమానుడు.

తే. **అతిరథుల కెల్లఁ దల, తండ్రియట్టివాఁడ । యసురవిభుఁడు ఘటోత్కచుం; డా హిడింబ**
కొడుకు మాయాబలంబున నొడుచుఁ బగఱ । నతనికడ దానవానీక మగ్గలంబు. 268

ప్రతిపదార్థం: ఆ హిడింబకొడుకు= హిడింబయనే దానవకాంతకు పుట్టిన; ఘటోత్కచుండు; అతిరథులకున్+ఎల్లన్+తల= అతిరథులందరికంటె మిన్న; తండ్రిఅట్టివాఁడు+అ= తన జనకుడైన భీమసేనుడి వంటివాడే; అసురవిభుఁడు= రాక్షసులకు నాయకుడు; మాయాబలంబునన్= తనకున్న మాయాశక్తిచేత; పగఱన్= శత్రువులను; ఒడుచున్= జయిస్తాడు; అతనికడన్= వాడిదగ్గర; దానవ+అనీకంబు= రాక్షస సమూహం; అగ్గలంబు= మిక్కుటం.

తాత్పర్యం: హిడింబ అనే దైత్యకాంతకు జనించిన ఘటోత్కచుడు అతిరథుడు. అతడు తన జనకుడైన భీముడితో సమానుడు. రాక్షసులకు నాయకుడు. తన మాయామహిమచేత శత్రువులను ఓడించగలడు. వాడికడ రాక్షస సైన్యం మెండు.

విశేషం: ఘటోత్కచుడి జన్మవృత్తాంతం: లాక్షాగృహదహనానంతరం భీమసేనుడు అర్ధరాత్రంలో తల్లితో సహోదరులతో బిలద్వారంనుండి వెలువడి గంగానదిని దాటి సాయం సమయానికి హిడింబాసురుడు నివసించే వనం చేరాడు. అక్కడొక మర్రిచెట్టు క్రింద గమనాయాసంతో అందరూ నేలపరుండి నిద్రపోయారు. భీముడు వారిని కనిపెట్టుకొని మేల్కొని ఉన్నాడు. ఆ సమీపంలో మామిడి గున్నల మధ్యనున్న మండపంలో నుండి హిడింబాసురుడు వారినందరినీ చూచాడు. ఇన్నాళ్ళకు మానవమాంసం లభించిందని సంతోషపడి వారిని చంపి తెచ్చుటకై తన చెల్లెలు హిడింబను పంపాడు. ఆమె మనుజస్త్రీ స్వరూపంతో వచ్చింది. భీమసేనుడిని చూచి మోహించింది. విషయమంతా అతడికి తెలిపింది. హిడింబాసురుడు తడవోర్వక వచ్చి భీముడితో మాటాడుతున్న చెల్లెలిమీద నిప్పులు గ్రక్కాడు. ఆమె భయంతో భీముడి మరుగు జొచ్చింది. తల్లికి సోదరులకు నిద్రాభంగమవుతుందని వృకోదరుడు హిడింబుడిని దూరంగా ఈడ్చుకొని పోయాడు. హోరాహోరీగా వారు పోరాడుతుండగా ధర్మజాదులు మేల్కొన్నారు. హిడింబ వారికి నమస్కరించి తాను రాక్షసకాంతననీ, తనకు త్రైకాలికజ్ఞానం కలదనీ, భీముడిని వలచాననీ, తన్ను రక్షింపుడనీ వారిని వేడుకొన్నది. ఇంతలో హిడింబుడిని సంహరించి వచ్చిన భీముడితో కుంతీదేవి, 'ఈమె పరమసాధ్వి, వేరుగా తలంపక పరిగ్రహించు'మని పల్కి అతడిని ఒడబరిచింది. పగళ్ళు యథేచ్ఛగా విహరిస్తూ రాత్రులు మా యొద్ద ఉండండని వారిని కోరింది. 'పుత్రుడు కలిగేవరకూ ఈమెను పరిగ్రహిస్తా'నని భీముడు తల్లికి మాట ఇచ్చాడు. అక్కడికి వ్యాసభగవానుడు వచ్చి 'దీని పేరు కమలపాలిక. మహాసత్త్వుడైన కొడుకును కంటుంది. ఆపద్విషయంలో అతడు మిమ్ము కాపాడుతాడు' అని చెప్పి వెళ్ళిపోతాడు. పాండవులు వ్యాసమునీంద్రుడి వచనానుసారంగా అచటినుండి శాలిహోత్రుడి ఆశ్రమానికి తరలివెళ్ళుతారు. వారక్కడ వసిస్తున్న కాలంలో భీముడివలన హిడింబకు సద్యోగర్భంలో కామరూపధరుడైన ఘటోత్కచుడు ఉద్భవిస్తాడు. పుట్టగనే అతడు నవయౌవనశాలి, సకలాస్త్రశస్త్ర కుశలుడు, అపరిమిత రాక్షస పిశాచ బలసమేతుడు అయి, తలిదండ్రులకు కుంతీదేవికి నమస్కరిస్తాడు. తమకు పెద్దకొడుకని వారందరూ ముచ్చట పడుతుండగా కొన్నాళ్ళు వారితోఉండి తండ్రులతో అతడు 'నేను నా బలగంతో వెళ్ళి ఇష్టమైన చోట నివసిస్తాను. పనిగల్గినపుడు నన్ను స్మరించండి. వెంటనే వస్తా'నని పల్కి తల్లిని తోడ్కొని ఉత్తరదిశాభిముఖుడై వెళ్ళుతాడు. కురుక్షేత్ర యుద్ధం మొదలయింది. ఘటోత్కచుడు సంగ్రామంలో కురుసైన్యాన్ని నిర్మూలించసాగాడు. అప్పుడు కౌరవవీరులు కర్ణుడితో- 'ఇంద్రదత్తమైన శక్తిని ఇతని మీద ప్రయోగించు. భీమార్జునులు నిన్నేమిచేస్తారు?' అని ప్రోత్సహించారు. ఆ తరుణంలో ఘటోత్కచుడు విజృంభించి కర్ణుడి రథరథ్యాలను గదాఘాతంతో కూల్చివేశాడు. అతడిని నొప్పించాడు. వీడి చేతిలో తనకు చావు తప్పదని రాధేయుడు నిర్ణయించుకొన్నాడు. వాసవు డిచ్చిన ఆ ఘోర శక్తిని భీమనందనుడిపై వేశాడు. ఘటోత్కచుడు భయంకర మరణం పాలయ్యాడు. పాండవులు దుఃఖితులయ్యారు. శ్రీకృష్ణుడు సింహనాదం చేసి శంఖాన్ని పూరించి ఆనందంతో నాట్యంచేస్తూ, రథస్థుడైన అర్జునుడిని కౌగిలించుకొని వెన్ను చరిచాడు. 'మేమంతా విలపిస్తుంటే బావా! ఏమిటీ విచిత్ర వర్తనం?' అని అర్జునుడు ప్రశ్నించాడు. శౌరి ఇట్లా అన్నాడు: 'ఇంద్రు డిచ్చిన శక్తి కర్ణుడి దగ్గరుండగా నిన్ను బ్రతికించుకొనటం దుష్కరమని భావిస్తూ వచ్చాను. ఆ చింత తీరింది, కర్ణుడికి కవచకుండలాలు మునుపే పోయాయి. ఇపుడు ఇంద్రదత్త సాధనమూ పోయింది. ఇక రాధేయుడిని నీవు సుకరంగా గెలుస్తావు. ఈ ఘటోత్కచుడు కిమ్మీర బక హిడింబాసురుల కోవలోనివాడు. ధర్మద్వేషం, రోషం కల్గి ఉండటంవలన ఒకప్పుడు ఒప్పమి రావచ్చు. ఆ దానవుల మాదిరి వీడూ నశించటం నాకు అభిమతం. వీడు రావణుడి వంటివాడు. ఇపుడు చావకపోతే తరువాతనైనా నేను చంపవలసివచ్చేది. అందుచేత అర్జునా! నాకిది సంతోషకాలంగాని శోకసమయం కా'దన్నాడు. ఆ మాటలు వింటున్న సాత్యకి అన్నగారి నడిగాడు- ఇన్నాళ్ళు ఈ శక్తిని కర్ణుడు విజయుడి మీద ఎందుకు ప్రయోగించలేదని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'అతనివారంతా ఈ పని చేయుమని కర్ణుడికి బోధిస్తూనే ఉంటారు. తాను అట్లా తప్పక చేస్తానని అతడు చెపుతూనే ఉంటాడు. తీరా పోరాడే సమయంలో వారంతా ఆ విషయం మరచిపోయేటట్లు నేను చేస్తుంటాను' అంటూ శ్రీకృష్ణుడు ధృష్టద్యుమ్నుడిని పేర్కొని సాత్యకిని చూచి 'మీరూ, నా ప్రాణాలూ, ఈ త్రిలోకీరాజ్యమూ పార్థుడివలె నా కూర్మికి పాత్రాలు కావు. ఆ శక్తి ఘటోత్కచుడి ప్రాణాలు హరించి వమ్మయిపోయింది. ఈ రాత్రి నేను హాయిగా నిద్రపోతాను' అన్నాడు.

వ. నాకుం దోఁచినవారిం బేరుకొంటి; నింతియకాని, రెండు వీళ్లను మంచి మగలు పెక్కండ్రు గల'రని చెప్పి గాంగేయుండు. 269

ప్రతిపదార్థం: నాకున్; తోఁచినవారిన్= జ్ఞప్తికివచ్చినవారిని; పేరుకొంటిన్= చెప్పాను; ఇంతియకాని= ఇంతేతప్ప; రెండువీళ్ళను= ఉభయ సైన్యాలందును; మంచిమగలు= మేటి వీరులు; పెక్కండ్రు కలరు= పలువురున్నారు; అనిచెప్పి; గాంగేయుండు= భీష్ముడు.

తాత్పర్యం: నాకు జ్ఞప్తికి వచ్చినవారిని గురించి చెప్పాను. ఇంతేకాని, ఉభయ పక్షాలందు మేటి వీరులెంతోమంది ఉన్నా'రని భీష్ము డింకా ఇట్లా పలికాడు:

క. 'పాండవుల దిక్కు రథికు ల । ఖండిత బలులైన నా మొగంబునఁబడి యు
ద్దండత చూపఁగ లేరు శి । ఖండిని నొక్కరునిఁ జంపఁగాని కుమారా!' 270

ప్రతిపదార్థం: కుమారా!= వత్సా, సుయోధనా!; పాండవులదిక్కు రథికులు= పాండవ పక్షమందున్న రథికులు; అఖండితబలులు+ ఐనన్= సంపూర్ణమైన శక్తిగలవారైనప్పటికినీ; నా మొగంబునన్+పడి= నా బారినబడి; ఉద్దండతన్+చూపఁగన్+లేరు= విజృంభించలేరు; కాని= ఐననూ; శిఖండిని+ఒక్కరునిన్= ఒక్క శిఖండిని మాత్రం; చంపన్= సంహరించలేను.

తాత్పర్యం: 'పాండవ పక్షమందలి రథికులు అకుంఠిత బలవంతులైనప్పటికీ నా ముందు విజృంభించలేరు కాని, నేను శిఖండిని మాత్రం చంపలేను.'

క. అనవుడు దుర్యోధనుఁ 'డా । తని మీరు వధింపమికిఁ గతం బేమియొకో!
విన దుగనేనిం జెపుఁడా' । యనుటయు నిట్లనియె భీష్ముఁ డతనికి నెమ్మిన్. 271

ప్రతిపదార్థం: అనవుడున్= అని భీష్ముడు పలుకగా; దుర్యోధనుఁడు= సుయోధనుడు; మీరు= మీరు; ఆతనిన్= శిఖండిని; వధింపమికిన్= చంపకుండుటకు; కతంబు= కారణం; ఏమి+ఒకో!= ఏమో!; వినన్+తగున్+ఏనిన్= నేను వినటానికి తగినవిషయమైతే; చెపుఁడా= చెప్పండి; అనుటయున్= అని అడుగగా; అతనికిన్= దుర్యోధనుడికి; నెమ్మిన్= ప్రీతితో; భీష్ముఁడు= దేవవ్రతుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: భీష్ముడి మాటలు విని దుర్యోధనుడు 'మీ రా శిఖండిని చంపకుండటానికి హేతువేమో తెలియదు. నేను వినదగినదయితే చెప్పండి' అని అడుగగా పితామహు డిట్లా అన్నాడు:

వ. 'ఏ నా శిఖండినిఁ జంపమికి మూలంబు సాలం గలదు; తత్ప్రపంచం బంతయు వివరించెద నాకర్ణింపుము: 272

ప్రతిపదార్థం: ఏను= నేను; ఆ శిఖండిని; చంపమికిన్= సంహరించకుండటానికి; మూలంబు చాలన్+కలదు= కారణ మెంతో ఉన్నది; తద్+ప్రపంచంబు+అంతయున్= ఆ వివరాలన్నీ; వివరించెదన్= విశదపరుస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: నేను శిఖండిని చంపకుండటానికి కారణం చాలా ఉన్నది. ఆ విషయమంతా వివరిస్తాను వినుము:

భీష్ముఁడు దుర్యోధనున కంబోపాఖ్యానంబు సెప్పుట (సం. 5-170-1)

సీ. శంతను పిమ్మట సత్యవతీ దేవి । యనుమతితోడఁ జిత్రాంగదునకు
సామ్రాజ్యపట్టంబు సమ్మతిఁ గట్టితి; । నల్పకాలంబున నతఁడు దీఱెఁ;
దత్పరోక్షావస్థఁ దదనుసంభవుని వి । చిత్రవీర్యుని రాజుఁ జేసి, పెండ్లి
సేయంగఁ దివిరి, కాశీపతి కూఁతులు । కన్యలు ముప్పురు గలుగుటయును

తే. నాత డర్థిఁ దదీయ స్వయంవరమున । కఖిల నృపతులఁ బిలిపించె ననియు నెఱిఁగి
తల్లి కెఱిఁగించి యొంటిమైఁ దత్పురమున । కాయితం బయిపోయితి నరద మెక్కి. 273

ప్రతిపదార్థం: శంతనుపిమ్మటన్= శంతనుమహారాజు తరువాత; సత్యవతీదేవి+అనుమతితోడన్= సత్యవతీ దేవియొక్క అంగీకారంతో; చిత్రాంగదునకున్= ఆమె పుత్రుడైన చిత్రాంగదుడికి; సమ్మతిన్= ఇచ్ఛతో; సామ్రాజ్యపట్టంబు+కట్టితిన్= హస్తినాపుర సామ్రాజ్యానికి అభిషిక్తుడిని చేశాను; అల్పకాలంబునన్= పట్టాభిషిక్తుడైన కొద్దికాలానికే; అతఁడు+తీఱెన్= అతడు మరణించాడు; తద్+పరోక్ష+అవస్థన్= చిత్రాంగదుడి పరోక్షంలో; తద్+అనుసంభవునిన్= ఆతడి తమ్ముడైన; విచిత్రవీర్యునిన్= విచిత్రవీర్యుడిని; రాజున్+చేసి= ప్రభువుగాచేసి; పెండ్లి+చేయంగన్= పెండ్లిచేయుటానికి; తివిరి= పూనుకొని; కాశీపతికూఁతులు= కాశీరాజుయొక్క పుత్రికలు; ముప్పురు కలుగుటయును= ముగ్గురుండుటయు; ఆతఁడు= ఆ+కాశీరాజు; అర్థిన్= ప్రీతితో; తదీయస్వయంవరమునకున్= తన కొమార్తెల స్వయంవరానికి; అఖిల నృపతులన్= రాజులందరినీ; పిలిపించెన్= ఆహ్వానించాడు; అనియున్+ఎఱిఁగి= అనికూడా తెలిసికొని; తల్లికిన్+ఎఱిఁగించి= నా జననికి తెల్పి; ఒంటిమైన్= ఒంటరిగా; అరదము+ఎక్కి= రథ మారోహించి; ఆయితంబు+అయి+పోయితిన్= సన్నాహంతో వెళ్ళాను.

తాత్పర్యం: శంతను మహారాజు తరువాత సత్యవతీ దేవి అంగీకారంతో ఆమె పుత్రుడైన చిత్రాంగదుడికి సామ్రాజ్యపట్టం కట్టబెట్టాను. రాజయిన కొద్దికాలానికే అతడు అంతరించాడు. ఆతడి పరోక్షంలో అతడి తమ్ముడైన విచిత్రవీర్యుడిని రాజును చేసి, వివాహం జరిపించటానికి పూనుకొన్నాను. కాశీరాజుకు ముగ్గురు కొమార్తెలు కలరనీ, అతడు తన పుత్రికల స్వయంవరానికి రాజులందరినీ ఆహ్వానించాడనీ తెలిసి, ఆ విషయం మా తల్లికి తెలిపి నేనొక్కడనే రథమెక్కి కాశీనగరానికి సన్నాహంతో వెళ్ళాను.

విశేషం: హస్తినాపురాధీశ్వరుడైన శంతను మహారాజు పరమానురాగంతో దాశరాజుకూతురు సత్యవతిని వివాహమై, ఆమెయందు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అనే ఇద్దరు కుమారులను కన్నాడు. వాళ్ళు సంప్రాప్త యౌవనులు కాకమునుపే శంతనుడు పరలోక గతుడైనాడు. భీష్ముడు తండ్రికి పరలోక క్రియలు నిర్వర్తించి చిత్రాంగదుణ్ణి రాజ్యాభిషిక్తుడిని కావించాడు. అతడు గర్వంతో ఊరక సుర దనుజ మనుజ గంధర్వులను ఆక్షేపిస్తూ వచ్చాడు. అందుకు కోపించి చిత్రాంగదుడు అనే గంధర్వుడు అతడిపై యుద్ధానికి వచ్చాడు. కురుక్షేత్రంలో నరాధిపతి చిత్రాంగదుడు గంధర్వపతి చిత్రాంగదుడితో తలపడ్డాడు. హోరాహోరీగా పోరాటం సాగింది. మాయాయుద్ధంలో అతిదక్షుడైన గంధర్వుడు రవితేజుడైన చిత్రాంగదుడిని సంహరించాడు. ఇలా చిత్రాంగదుడు గంధర్వ నిహతుడు కాగా, అతడి పరోక్షంలో భీష్ముడు విచిత్రవీర్యుడిని కౌరవరాజ్యానికి అభిషిక్తుడిని చేశాడు.

విచిత్రవీర్యుడి వృత్తాంతం:

విచిత్రవీర్యుడు ఆరూఢయౌవనుడు కాగానే భీష్ముడు అతడికి వివాహం చేయసంకల్పించాడు. కాశీరాజు తన పుత్రికలకు స్వయంవరం చాటించడం విని గాంగేయుడు అక్కడికి వెళ్ళి స్వయంవరానికి మూగిన రాజులంతా వెరచి వెరగుపడి చూస్తుండగా కాశీరాజు దుహితలను ముగ్గురినీ రథమెక్కించుకొని, 'నా తమ్మునికి వివాహం చేయటానికి వీరిని గొంపోతున్నాను. బ్రాహ్మము మొదలైన అష్ట వివాహాలలో క్షత్రియులకు గాంధర్వ, రాక్షసాలు ఉత్తమాలు. స్వయంవరంలో జయించి వివాహం కావటం అంతకంటే ఉత్తమం. ఇక్కడ చేరిన రాజలోకాన్ని జయించి ఈ కన్యలను తోడ్కొని చనడం ధర్మం. అడ్డుపడేవారుంటే అడ్డగించండి చూస్తాను' అని కాశీరాజుతో పలికి, వస్తూ ఉండగా అతడిని రాజులెదిరించి పరాజితులయ్యారు. భీష్ముడు ఏకవీరుడై కన్యలతో ఏగుతుంటే సాళ్వుడు వెంటనంటాడు. భీష్ముడు మార్కొని అతడి రథాన్ని రథ్యాలను సారథిని కూల్చివేశాడు. భగ్నరథుడు, భగ్నమనోరథుడు అయి సాళ్వుడు తన పట్టణానికి వెళ్ళిపోయాడు.

అంబ, అంబిక, అంబాలిక అనే ఆ ముప్వురు కన్యలతో భీష్ముడు పురం చేరగానే, వారిలో అంబ తనను సాల్వపతి ప్రేమించగా తండ్రిచే అతడికి పూర్వదత్తనైనాను అన్నది. భీష్ము డామెను విడిచి, మిగిలిన ఇద్దరినీ తమ్ముడికిచ్చి పెళ్ళిచేశాడు. విచిత్రవీర్యుడు సకలవ్యాపారాలు వదలి కాశీరాజు యొక్క దుహితలతో విహరిస్తూ అధిక కామాసక్తివలన శోషించి మరణించాడు. అతడికి పరలోక విధులు జరిపి గాంగేయుడు తల్లిని, మరదళ్ళను ఓదార్చి అరాజకమయిన రాజ్యాన్ని అకలంకంగా ప్రతిపాలిస్తూ వచ్చాడు. ఆ తర్వాత శంతనువంశం నిల్పటానికి సత్యవతీదేవి నియోగం వలన అంబిక, అంబాలికలు వ్యాస ప్రసాదం వలన ధృతరాష్ట్రునీ పాండురాజునూ కన్నారు. వీరిద్దరూ విచిత్రవీర్యుడికి క్షేత్రజులైన కొడుకులు.

వ. ఇవ్విధమునం జని యమ్మహోత్సవంబున నలంకృతలై యున్న యంబయు నంబికయు నంబాలికయు ననుముద్దియల ముప్వురంబట్టి రథంబుపయిఁబెట్టి కొనిరా నచ్చటి రాజులెల్లను జతురంగ బలంబులతో వచ్చి నన్నుం బొదివినఁ, బటువిశిఖానల శిఖా కలాపంబున వేఁడిమి చూపి వారి నిలువరించి, యరుగుదెంచి సత్యవతికి నప్పొలంతుల నొప్పించిన నద్దేవి విచిత్రవీర్యునకు వారల వివాహంబు సేయ నుద్యోగించె; నట్టియెడ నమ్ముప్వురయందుం బెద్దయదియైన యంబయను కన్యక నాతో నిట్లనియె: 274

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; చని; ఆ+మహా+ఉత్సవంబునన్; అలంకృతలు+ఐ= అలంకరించబడినవారై; ఉన్న; అంబయున్; అంబికయున్; అంబాలికయున్ అను; ముద్దియలన్= కాంతలను; ముప్వురన్; పట్టి; రథంబుపయిన్+పెట్టికొని; రాన్= రాగా; అచ్చటి రాజులు+ఎల్లను; చతురంగబలంబులతోన్; వచ్చి; నన్నున్; పొదివినన్= క్రమ్ముకొనగా, ఆవరించగా; పటువిశిఖ+ అనలశిఖా కలాపంబునన్= తీవ్రములైన బాణాలనెడి అగ్నిజ్వాలల యొక్క సముదాయంతో; వేఁడిమి చూపి= ప్రతాపం నెరపి; వారిన్; నిలువరించి= అడ్డగించి; అరుగుదెంచి= వచ్చి; సత్యవతికిన్; ఆ+పొలంతులన్= ఆపడతులను; ఒప్పించినన్= అప్పగించగా; ఆ+దేవి= ఆ సత్యవతి; విచిత్రవీర్యునకున్; వారలన్, వివాహంబు చేయన్; ఉద్యోగించెన్= యత్నించింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ+ముప్వుర అందున్; పెద్ద+అది= పెద్దది; ఐన; అంబ; అను కన్యక; నాతోన్; ఇట్లు+అనియెన్= ఇట్లు అన్నది.

తాత్పర్యం: నేను కాశీనగరానికి వెళ్ళి స్వయంవరోత్సవంలో అలంకరించబడి ఉన్న అంబ, అంబిక, అంబాలిక అనే ముగ్గురు కన్యలను పట్టుకొని రథంలో పెట్టుకొని వస్తుండగా అక్కడ జేరిన రాజులంతా చతురంగ బలాలతో వచ్చి నన్ను చుట్టుముట్టారు. నేను తీవ్ర శరాలనెడి అగ్నిజ్వాలల తాపం చూపి వారిని ముందడుగు వేయకుండా నిలిపివేసి హస్తినకు వచ్చి ఆ అతివలను మా అమ్మకు అప్పగించాను. ఆమె వారి నిచ్చి విచిత్రవీర్యుడికి పెళ్ళి చేయాలని యత్నిస్తుండగా ఆ ముగ్గురిలో పెద్దది అయిన అంబ అనే కన్య నాతో ఇట్లా అన్నది:

తే. **'సౌంభపురవల్లభుండైన సాళ్వుమీఁదఁ । దలఁపు గలదు నా; కతఁడును దగులు గలిగి**
యుండు నాదెస; నీవు ధర్మోత్తరుండ; । వతని పాలికిఁ దగ నన్ను ననుపవయ్య!' **275**

ప్రతిపదార్థం: సౌంభపురవల్లభుండు+ఐన= సౌంభపట్టణప్రభువైన; సాళ్వుమీఁదన్= సాళ్వుడిపై; నాకున్= నాకు; తలఁపు కలదు= ఉద్దేశమున్నది; అతఁడును= సాళ్వుడుకూడ; నాదెసన్= నాపట్ల; తగులు కలిగి+ఉండున్= మమకారం కలిగి ఉన్నాడు; నీవు= నీవు; ధర్మ+ఉత్తరుండవు= ధర్మమెఱింగినవారిలో శ్రేష్ఠుడవు; అతనిపాలికిన్= ఆతడి చెంతకు; తగన్= ఒప్పుగా; నన్నున్= నన్ను; అనుపవు+అయ్య!= పంపుమయ్యా!

తాత్పర్యం: 'సౌంభపట్టణాధీశ్వరుడైన సాళ్వుడిమీద నాకు అనురాగమున్నది. అతడుకూడ నాయెడ మమత కలవాడు. నీవు ధార్మికులలో అగ్రగణ్యుడవు కనుక, అతడి చెంతకు నన్ను సాదరంగా పంప వేడుకొంటున్నాను.'

క. **అనవిని సత్యవతికిఁ జె । ప్పిన నాయమ వనుప నంబఁ బెంపుగ వృద్ధాం**
గనలం దోడుగ నప్పుడ । పనిచి యనిచితిని జనంబు ప్రస్తుతిసేయన్. **276**

ప్రతిపదార్థం: అనన్+విని= అని అంబ చెప్పగా ఆలకించి; సత్యవతికిన్+చెప్పినన్= నేను ఆ విషయాన్ని సత్యవతీదేవి కెరిగించగా; ఆయమ= ఆమె; పనుపన్= పంపగా; అంబన్= అంబను; పెంపుగన్= వైభవంగా; వృద్ధ+అంగనలన్= ముదుసలి స్త్రీలను; తోడుగన్= తోడిచ్చి; అప్పుడ= వెంటనే; పనిచి= నియమించి; జనంబు ప్రస్తుతి చేయన్= జనులు మిక్కిలికొనియాడుతుండగా; అనిచితిని= పంపాను.

తాత్పర్యం: అంబ పలుకులు విని నేను ఆ విషయం సత్యవతికి తెలిపాను. ఆమె అంబను సాళ్వుడిపాలికి పంపటానికి సమ్మతించింది. ప్రజలు నన్ను ప్రస్తుతిస్తూ ఉండగా, వెంటనే నేను వృద్ధాంగనలను తోడిచ్చి ఆమెను వైభవంగా సాళ్వుని కడకు పంపాను.

వ. **ఇట్లు పనిచి తక్కిన కన్నెల నిరువురం బాణిగ్రహణంబు చేయించితి.** **277**

ప్రతిపదార్థం: ఇట్లు; పనిచి= పంపి; తక్కిన కన్నెలన్= మిగిలిన కన్యలైన అంబికను, అంబాలికను; ఇరువురన్= ఇద్దరినీ; పాణిగ్రహణంబు చేయించితిన్= నా తమ్ముడి కిచ్చి వివాహం చేయించాను.

తాత్పర్యం: ఇట్లా అంబను సాళ్వుడికడకు పంపివేసి, అంబిక అంబాలిక అనే ఇరువురు కన్యలను విచిత్రవీర్యుడికిచ్చి పరిణయం జరిపించాను.

క. **అంబయు నట సాళ్వుని కడ । కుం బోయిన నతఁడు 'భీష్ము కొనిపోయిన దా**
నిం బరచుం గైకొన ధ । ర్మంబే? కన్యాత్వ మెడలె మగువా నీకున్. **278**

ప్రతిపదార్థం: అంబయున్= అంబయూ; అట= అక్కడ; సాళ్వుని కడకున్= సాళ్వుడి దగ్గరకు; పోయినన్= వెళ్ళగా; అతఁడు= ఆ సాళ్వుడు; భీష్ముకొనిపోయినదానిన్= భీష్ముడు బలాత్కారంగా తీసికొని వెళ్ళినట్టి; పరచున్= దుష్టురాలిని; కైకొనన్= పత్నిగా గ్రహించటం; ధర్మంబే?= న్యాయమా?; మగువా!= ఓ కాంతా!; నీకున్= నీకు; కన్యాత్వము+ఎడలెన్= కన్యాత్వం తొలగిపోయింది.

తాత్పర్యం: అంబ సాళ్వుడి దగ్గరకు పోగా అతడు 'నీవు భీష్ముడిచేత అపహరించబడిన కులటవు. నిన్ను పత్నిగా స్వీకరించటం న్యాయంకాదు. నీకు కన్యాత్వం పోయింది.

వ. ఇంక నిన్ను భార్యగా వరియింపం దగునే?' యనినఁ గామశరపీడిత యగుచు నక్కామిని యతని కిట్లనియె: 279

ప్రతిపదార్థం: ఇంకన్; నిన్నున్; భార్యగాన్; వరియింపన్; తగునే?= యుక్తమా?; అనినన్; కామశరపీడిత+అగుచున్= మన్మథబాణాలతో బాధింపబడినదై; ఆ+కామిని= ఆకాంత; ఆతనికిన్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ఇక నిన్ను భార్యగా వరించటం తగదు' అని సాళ్వుడు పలుకగా మన్మథబాణ బాధితఅయి అంబ అతడితో ఇట్లా అన్నది:

తే. 'తమ్మునికిఁ గాఁగ భీష్ముఁ డుదగ్రవృత్తిఁ । గన్నియలఁ గొనిపోయెడుఁ గాన బలిమి
నన్నుఁ గొనిపోయె; నాచేత నిన్ను వినిన । యపుడె పుత్తెంచె దూషింప ననఘ! తగునె? 280

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; తమ్మునికిన్+కాఁగన్= తన తమ్ముడైన విచిత్రవీర్యుడికొరకై; భీష్ముఁడు= గాంగేయుడు; ఉదగ్రవృత్తిన్= గర్వప్రవృత్తితో; కన్నియలన్= కన్యలను; బలిమిన్= బలాత్కారంగా; కొనిపోయెడున్+కానన్= తీసికొనివెళుతున్నాడు గనుక; నన్నున్+కొనిపోయెన్= నా చెల్లెళ్ళతో నన్నుగూడ తోడ్కొని వెళ్ళాడు; నాచేతన్= నావలన; నిన్నున్+వినిన+అపుడె= నినుగూర్చి నేను చెప్పిన వెంటనే; పుత్తెంచెన్= నన్ను నీ చెంతకు పంపాడు; దూషింపన్+తగునె?= నిందించటం న్యాయమా?

తాత్పర్యం: 'పుణ్యాత్ముడా! భీష్ముడు తన తమ్ముడి కొరకై బలాత్కారంగా కన్యలను గొనిపోతుండటం వలన నన్నుగూడ వారితోపాటు తీసికొనివెళ్ళాడు. నావలన నిన్ను నే వలచిన సంగతి వినిన వెంటనే, నన్ను నీకడకు పంపివేశాడు. మరి దూషింపదగిన విషయం ఇందులో ఏముంది?

వ. మా తండ్రి యెఱుంగక స్వయంవరాలంకారంబు నాకుం జేయించిన కతంబున నింత వుట్టె; భీష్ముండు నా చెలియండ్రం దన తమ్మున కిచ్చి నన్ను నీకడకుం దగ ననిచె; దీన నేమి త?'ప్పని మఱియు ననేకప్రకారంబులం బలికిన వినక తన్నుం జేకొనక సాళ్వుండు. 281

ప్రతిపదార్థం: మా తండ్రి; ఎఱుంగక; స్వయంవర+అలంకారంబు= స్వయంవరానికైన శృంగారం; నాకున్; చేయించిన; కతంబునన్= కారణంచేత; ఇంత పుట్టెన్= ఇంత జరిగింది; భీష్ముండు; నా చెలియండ్రన్= అంబికను, అంబాలికను; తన తమ్మునకున్; ఇచ్చి; నన్నున్; నీకడకున్; తగన్+అనిచెన్= మర్యాదగా పంపించాడు; దీనన్= ఇందులో; తప్పు+ఏమి?; అని; మఱియున్; అనేక ప్రకారంబులన్= పలువిధాల; పలికినన్; వినక; సాళ్వుండు; తన్నున్= తనను; చేకొనక= గ్రహించక.

తాత్పర్యం: నేను నిన్ను వలచుట మా తండ్రి ఎరుగడు. అందుచేత నాకు స్వయంవరాలంకారం చేయించాడు. ఆ కారణంచేత ఇంతపని జరిగింది. భీష్ముడు నా చెల్లెళ్ళిద్దరినీ తన తమ్మున కిచ్చి, నన్ను నీ దగ్గరకు మర్యాదగా పంపాడు. ఇందులో తప్పేముంది?' అని బహువిధాల అంబ చెప్పినప్పటికీ సాళ్వుడు ఆమెను స్వీకరించలేదు.

క. కరుణంబుగ నేడ్చు తలోదరిఁ । 'బోపా మ్మిచట నింకఁ దడయకు' మని మం
దిరము వెడలంగ నడిచిన । నరిగె నదియు నార్తచిత్తయై వికలగతిన్. 282

ప్రతిపదార్థం: కరుణంబుగన్= జాలికలిగేటట్లు; ఏడ్చు= విలపించు; తలోదరిన్= అంబను; పోపొమ్ము= వెంటనే వెళ్ళిపొమ్ము; ఇచటన్= ఇక్కడ; ఇంకన్= మరి; తడయకుము+అని= ఆలసించవద్దని; మందిరమున్ వెడలంగన్+అడిచినన్= తన భవనం విడిచిపోయేటట్లు తరుమగా; అదియున్= అంబయు; ఆర్తచిత్త+ఐ= దుఃఖిత మనస్కురాలై; వికలగతిన్= తడబడే నడకతో; అరిగెన్= వెళ్ళింది.

తాత్పర్యం: అంబ జాలి కలిగేటట్లు విలపించింది. 'ఇక నిక్కడ నిలువ వద్దు పోపొ'మ్మని ఆమెను సాళ్వుడు గద్దించి తన భవనంనుంచి తరిమివేశాడు. ఆమె తడవాటుతో దుఃఖపూరిత హృదయంతో వెళ్ళిపోయింది.

వ. చనిచని యవ్వెలంది యిట్లని వితర్కించు. 283

ప్రతిపదార్థం: చని చని= వెళ్ళి వెళ్ళి; ఆ+వెలంది= ఆ మగువ; ఇట్లు+అని; వితర్కించున్= ఆలోచించింది.

తాత్పర్యం: అంబ సాళ్వపురినుండి కదలి వెళ్ళి వెళ్ళి తనలో తాను ఇట్లా వితర్కించుకొన్నది.

తే. 'సాళ్వునకుఁ గాని యపుడ సంసారమునకుఁ । బాసితిన; యింక భీష్ముని పాలి కేల
యరుగ? నాతండు మూల మీ హానికెల్లఁ । గాన నాతని సాధింతుఁగాక యేను. 284

ప్రతిపదార్థం: సాళ్వునకున్= సాళ్వభూపతికి; కాని+అపుడు+అ= పనికిరానప్పుడే; సంసారమునకున్= సంసారసౌఖ్యాలకు; పాసితిన్+అ= దూరమయ్యాను; ఇంకన్= ఇక; భీష్ముడి పాలికిన్= భీష్ముని దగ్గరకు, అరుగన్+ఏల?= వెళ్ళుటెందుకు?; ఈ హానికిన్+ఎల్లన్= ఈ కీడునకంతకు; మూలము= కారణం; ఆతండు+ ఆ భీష్ముడే; కానన్= కాబట్టి; ఏను= నేను; ఆతనిన్= గాంగేయుడిని; సాధింతున్+కాక= సాధించి తీరుతాను.

తాత్పర్యం: 'సాళ్వుడికి నేను ఇల్లాలుగా పనికిరానప్పుడు మరెవ్వరికినీ కొరగాను. నా బ్రదుకు చట్టు బండలయింది. ఇప్పుడు నేను భీష్ముడి దగ్గరకు వెళ్ళి మాత్రం ఏమి ప్రయోజనం? ఈ చేటున కంతకు మూలం భీష్ముడే కనుక, అతడిని సాధించి తీరుతాను.

క. గాంగేయు గెల్వ నెవ్వరి । కిం గొలఁదియె? తపముపేర్మి గెలిచెదఁగా' కం
చుం గాంత చనియె సంయమి । పుంగవు లొక కొందఱున్న పుణ్యస్థలికిన్. 285

ప్రతిపదార్థం: గాంగేయు గెల్వన్= భీష్ముడిని జయించటం; ఎవ్వరికిన్= ఎట్టివారికిన్నీ; కొలఁదియె?= శక్యమా; తపముపేర్మిన్= తపస్సుయొక్క ఆధిక్యంచేత; గెలిచెదన్+కాక= జయిస్తాను సుమా!; అంచున్= అని; కాంత= అంబ; సంయమి పుంగవులు= మునిశ్రేష్ఠులు; ఒక కొందఱు= కొంతమంది; ఉన్న పుణ్యస్థలికిన్= ఉన్నట్టి పవిత్ర ప్రదేశానికి; చనియెన్= వెళ్ళింది.

తాత్పర్యం: గంగాపుత్రుడిని గెలవటం ఎవరికినీ తరంకాదు; కనుక అతణ్ణి తపస్సుచేత గెలుస్తా'నని నిశ్చయించుకొని అంబ మునీశ్వరులు కొందరున్నట్టి ఒక పావన ప్రదేశానికి వెళ్ళిపోయింది.

వ. చని వారలకుం దనవృత్తాంతం బెఱింగించిన వా 'రిది రాజులు చేసిన పని సాధులచేతఁ జక్కంబడునే' యనిన నవ్వనిత 'తపశ్చరణంబునకు వచ్చితి' ననుటయు, 'నీవు సుకుమారవు; నీకిది సొప్పడునే? తండ్రి పాలికిం బొ; మ్మదియ పరమ ధర్మం'బని పలికిన వారి కన్నారీరత్నం బిట్లనియె; 286

ప్రతిపదార్థం: చని; వారలకున్+తన వృత్తాంతంబు= తన సమాచారం; ఎఱింగించినన్; వారు; ఇది రాజులు చేసిన పని; సాధులచేతన్; చక్కన్+పడునే?= అనుకూలించ గలదా? అనినన్; ఆ+వనిత= ఆమె; తపన్+చరణంబునకున్= తపస్సు సలుపుటకు; వచ్చితిన్; అనుటయున్= అని పలుకగా; నీవు సుకుమారవు= మృదువైన దానవు; నీకున్ ఇది; చొప్పడునే?= సాధ్యమగునా?; తండ్రిపాలికిన్+పొమ్ము; ఇదియ పరమధర్మంబు= ఉత్తమ ధర్మం; అని పలికినన్; వారికిన్; ఆ+నారీరత్నంబు= ఆ తరుణీమణి; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అంబ వెళ్ళి ఆ మునీశ్వరులకు తన కథ సమస్తం చెప్పింది. వారు విని, 'ఇది రాజులు చేసినపని; సాధువుల చేత చక్కబడగలదా?' అని సమాధాన మిచ్చారు. అప్పుడు అంబ తాను తపస్సు చేయటానికి ఇక్కడికి వచ్చానని చెప్పింది. 'నీవు పరమ సుకుమారవు. తపస్సు చేయటం నీకు శక్యం కాదు. నీ తండ్రి దగ్గరకు వెళ్ళుము. ఇదే పరమ ధర్మం' అని మునులు చెప్పారు. వారికి ఆ వనితామణి ఇట్లా అన్నది:

క. 'ఎవ్వరు నెఱుఁగక యుండఁగ। నివ్వనమునఁ దపముసేఁత యిది నిర్ణయ మే
నెవ్వారి కడకు నేమని। యెవ్విధిఁ బోనేర్చుదాన? నేటికి బంధుల్? 287

ప్రతిపదార్థం: ఎవ్వరున్+ఎఱుఁగక+ఉండఁగన్= ఎవ్వరికీ తెలియకుండా; ఈ వనమునన్= ఈ అరణ్యంలో; తపముచేఁత= తపస్సు చేయటం; ఇది= ఇదే; నిర్ణయము= నా నిశ్చయం; ఏను= నేను; ఎవ్వారికడకున్= ఎవ్వరి దగ్గరకు; ఏమి+అని= ఏ మొగం పెట్టుకొని; ఏ+విధిన్= ఏ రీతిగా? పోన్+నేర్చుదానన్?= పోగలను? బంధుల్+ఏటికిన్?= చుట్టాలతో నాకు ఇక పనేముంది?

తాత్పర్యం: 'ఎవ్వరికీ తెలియకుండ ఈ అరణ్యంలో తపస్సుచేయటమే నా నిశ్చయం. నేను ఎవ్వరిదగ్గరకు ఏ మొగం పెట్టుకొని ఎట్లా వెళ్ళగలను? ఇక చుట్టాలతో నా కేమిపని?

వ. అని చెప్పు నవసరంబున నయ్యాశ్రమంబునకు హోత్రవాహనుండను రాజర్షి వచ్చిన నమ్మును లభ్యాగత పూజలు చేసిన యనంతరంబ యంబం గనుంగొని 'యిక్కన్నియ యెక్కడిది? దీని విషాదంబునకుం గారణం బే?'మని యడిగి, వారివలన దాని జన్మప్రకారంబును దద్వృత్తాంతంబును విని, తన కూఁతుకూఁతు రగుట యెఱింగి యయ్యంగన వినం దపస్విజనంబులకుఁ జెప్పి, యప్పాలంతిం దన యంకతలంబున నునిచికొని వెండియు నడుగ సవిస్తరంబుగా నచ్చేడియ చెప్పిన విని, శోకించి యవ్విషమ ప్రకారంబునకు నిస్తారంబుఁ జింతించి. 288

ప్రతిపదార్థం: అని చెప్పు+ అవసరంబునన్= అని చెప్పే సమయంలో; ఆ+ఆశ్రమంబునకున్= ఆ తపోవనమునకు; హోత్రవాహనుండు; అను; రాజ+ఋషి వచ్చినన్= రాజర్షి రాగా; ఆ+మునులు; అభ్యాగత పూజలు= అతిథి పూజలు; చేసిన; అనంతరంబ= పిమ్మట; అంబన్; కనుంగొని; ఈ+కన్నియ= ఈ బాల; ఎక్కడిది?= ఎక్కడనుంచి వచ్చింది?; దీని; విషాదంబునకున్= దుఃఖమునకు; కారణంబు; ఏమి+అని; అడిగి= హోత్రవాహనుడు ప్రశ్నించి; వారివలనన్= ఆ మునులవలన; దాని జన్మ ప్రకారంబును= ఆమె కాశీరాజ పుత్రిక అంబ అన్న విషయం; తద్+వృత్తాంతంబునున్= ఆమె భీష్ముడిచేత హస్తినకు కొనిరాబడి; సాళ్వునిచేత తిరస్కృతఅయి తపస్సు చేసికొనటానికి ఆ వనానికి వచ్చిన సంగతి; విని; తన కూఁతు కూఁతురు+అగుట= తన కొమార్తె బిడ్డ కావటం; ఎఱింగి; ఆ+అంగన వినన్= అంబ వినేటట్లు; తపస్వి జనంబులకున్+చెప్పి= మునుల కెఱింగించి; ఆ+పాలంతిన్= ఆ పడతిని; తన+అంకతలంబునన్+ఉనిచికొని= తన ఒడిలో కూర్చుండబెట్టుకొని;

వెండియున్ అడుగన్= మరల ఆమెనే అడుగగా; ఆ+చేడియ= ఆ చెలువ; సవిస్తరంబుగాన్= విపులంగా; చెప్పినన్= తన వృత్తాంతము తెల్పగా; విని; శోకించి= దుఃఖించి; ఆ+విషమ ప్రకారంబునకున్= ఆ విపరీత విధానానికి; నిస్తారంబున్+చింతించి= తరణోపాయం ఆలోచించి.

తాత్పర్యం: అని అంబ చెపుతున్న సమయంలో ఆ మునుల ఆశ్రమానికి హోత్రవాహనుడనే రాజర్షి వచ్చాడు. వారు ఆ మహాభాగునకు అతిథిపూజలు చేశారు. పిమ్మట హోత్రవాహనుడు అంబను చూచి 'ఈ కన్య ఎవరు? ఈమె దుఃఖానికి కారణమేమి?' అని మునులను ప్రశ్నించాడు. వారు ఆమె కాశీరాజ పుత్రికఅనీ, సాళ్వుడిని వరించినదనీ, భీష్ముడిచే బలాత్కారంగా హస్తినాపురికి కొనిరాబడిన కారణంవలన సాళ్వుడిచేత తిరస్కృతయై తపస్సు చేయటానికి ఇక్కడికి వచ్చినదనీ తెలిపారు. ఆ సంగతి విని అంబ తన దౌహిత్రి అని ఆమెతోపాటు మౌనులు ఆలకించగా హోత్రవాహనుడు చెప్పి, ఆ బాలామణిని తన ఒడిలో నిడుకొని మరల ఆమె వృత్తాంత మడిగాడు. ఆమె విపులంగా తన విషయం తెల్పగా విని అతడు దుఃఖించాడు. ఆమెను ఆ విషమ పరిస్థితినుండి తప్పించుటకు ఉపాయం ఆలోచించి.

ఉ. **'నీ కిది యేటికిం దప? మనింద్యచరిత్రవు నీవు; నిన్ను నేఁ**
జేకొని కాతు; నొక్క గతిఁ జెప్పెద, భార్గవరాము నాశ్రిత
శ్రీకరుఁ గాన్పు; మాపదలు చెందఁగనీఁ డతఁ డాశ్రయించినన్;
శోకము దక్కు' మన్న విని సుందరి యల్లన యత్తపస్వితోన్. **289**

ప్రతిపదార్థం: నీకున్= నీకు; తపము+ఇది+ఏటికిన్?= ఇట్లా తపం చేయటమెందుకు?; నీవు అనింద్య చరిత్రవు= నీవు దూషింపదగని నడవడి కలదానవు; నిన్నున్= నిన్ను; నేన్= నేను; చేకొని= స్వీకరించి; కాతున్= రక్షిస్తాను; ఒక్కగతిన్= ఒక మార్గమును; చెప్పెదన్= నీకు తెలుపుతాను; ఆశ్రిత శ్రీకరున్= ఆశ్రయించినవారికి శుభములు కలిగించునట్టి; భార్గవరామున్= భృగువంశాన జనించిన పరశురాముడిని; కాన్పుము= దర్శించుము; అతఁడు= ఆ మహాత్ముడు; ఆశ్రయించినన్= తనను శరణు జొచ్చినచో; ఆపదలు చెందఁగన్+ఈఁడు= కష్టాలు పొందనియ్యడు; శోకము+తక్కుము= దుఃఖం వదలుము; అన్నన్= అని హోత్రవాహనుడు చెప్పగా; విని= ఆలకించి; సుందరి= అందగత్తెయగు అంబ; అల్లన= తిన్నగా; ఆ+తపస్వితోన్= ఆ మునీంద్రుడితో

తాత్పర్యం: 'నీవు తపస్సు చేయటమెందుకు? దోషంలేని నడవడి గలదానవు. నిన్ను నేను రక్షిస్తా. ఇందు కొకమార్గం చెపుతా. ఆశ్రయించినవారికి శుభాలిచ్చే భృగుకుల సంజాతుడైన పరశురాముడిని దర్శించు. తనను ఆశ్రయించిన వారికి కష్టాలు కలుగనివ్వక కాపాడుతాడు. అమ్మా! చింత మానుము' అని హోత్రవాహనుడు పలుకగా విని ఆ రాజర్షితో అంబ ఇట్లా అన్నది.

ఆ. **'పరశురాముఁ గానఁబడయుట యెక్కడఁ । గలుగు? నాతఁ డెట్లు కరుణసేయు?'**
ననఁ దపస్వి యిట్టు లను 'మహేంద్రంబను । పర్వతమునఁ జేయు పరమతపము. **290**

ప్రతిపదార్థం: పరశురామున్= పరశురాముడిని; కానన్+పడయుట= దర్శించ గలగటం; ఎక్కడన్= ఎచ్చోట; కలుగున్= సంప్రాప్తిస్తుంది? ఆతఁడు+ఎట్లు+కరుణ చేయున్?= భార్గవరాముడెట్లా కరుణిస్తాడు?; అనన్= అని అంబ అడుగగా; తపస్వి=

ఆ మౌని; ఇట్టులు+అనున్= ఈ విధంగా చెప్పాడు; మహేంద్రంబు+అను పర్వతమునన్= మహేంద్రగిరిలో; పరమ తపమున్+చేయున్= ఆయన గొప్ప తపస్సు చేస్తుంటాడు.

తాత్పర్యం: 'పరశురాముడిని ఎక్కడ దర్శించటానికి వీలవుతుంది? అతడు న న్నెలా కరుణించగలడు?' అని హోత్రవాహనుడిని అంబ అడుగగా, 'అతడు మహేంద్రశైలంలో ఘనతపశ్చర్యలో ఉంటాడు' అని ఆ రాజర్షి సమాధాన మిచ్చాడు.

వ. నన్ను మన్నించుం గావున మదీయ దౌహిత్రి వగుట యెఱింగిన నిన్ను రక్షించు; నందుఁ బొ'మ్మను సమయంబునం బరశురామశిష్యుం డగు నకృతవ్రణుండను ముని వచ్చి, యతిథి సత్కారంబులం బూజితుండై యున్నఁ, బ్రియపూర్వకంబుగా నా హోత్రవాహనుండు 'భార్గవుం డెయ్యెడ నున్నవాఁ?'డని యడిగిన. నతం డిట్లనియె: 291

ప్రతిపదార్థం: నన్నున్; మన్నించున్= ఆదరిస్తాడు; కావునన్= కనుక; మదీయ దౌహిత్రివి+ అగుటన్= నీవు నా కొమార్తె బిడ్డవని; ఎఱింగినన్= తెలిసికొంటే; నిన్నున్; రక్షించున్; అందున్+పొమ్ము= అక్కడికి వెళ్ళుము; అనుసమయంబునన్= అని హోత్ర వాహనుడు చెప్పేవేళకు; పరశురామ శిష్యుండు+అగు అకృతవ్రణుండు; అను ముని వచ్చి; అతిథి సత్కారంబులన్; పూజితుండు+ఐ= గౌరవింపబడి; ఉన్నన్; ప్రియపూర్వకంబుగాన్= ప్రేమపురస్సరంగా; ఆ హోత్రవాహనుండు; భార్గవుండు= పరశురాముడు; ఏ+ఎడన్= ఎచ్చోట; ఉన్నవాఁడు?= ఉన్నాడు; అని; అడిగినన్; అతండు= అకృతవ్రణుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'అమ్మా! పరశురాముడు నన్ను ఆదరిస్తాడు. నీవు నా కొమార్తె బిడ్డవు అని అతడు తెలిసికొంటే చాలు, తప్పక నిన్ను కాపాడుతాడు; కనుక అచటికి వెళ్ళుము' అని హోత్రవాహనుడు చెపుతున్న సమయంలో పరశురాముడి శిష్యుడైన అకృతవ్రణుడు అనే ముని అక్కడికి వచ్చాడు. అతిథి సత్కారాలు అందుకొన్న తరువాత స్నేహపూర్వకంగా హోత్రవాహనుడు 'భార్గవరాముడు ఇప్పు డెక్కడున్నాడు?' అని ప్రశ్నించగా అకృతవ్రణుడు ఇట్లా అన్నాడు:

క. 'తన ప్రియసఖుఁడవు నీవని । మునిజనులకుఁ జెప్పుచుండు ముదమున నిన్నుం
గనుఁగొనఁగ నెల్లి యిచటికిఁ । జనుదెంచు ననేక శిష్య సంఘము తోడన్.' 292

ప్రతిపదార్థం: నీవు; తన ప్రియసఖుఁడవు+అని= తనకు అనుంగు నెచ్చెలికాడవని; ముదమునన్= సంతోషంతో; మునిజనులకున్= మునీశ్వరులకు; చెప్పుచున్+ఉండున్= నిను గూర్చి చెపుతూ ఉంటాడు; నిన్నున్= నిన్ను; కనుఁగొనఁగన్= చూడటానికి; ఎల్లి= రేపు; అనేక శిష్య సంఘముతోడన్= పెక్కుమంది శిష్యులయొక్క సమూహంతో; ఇచటికిన్= ఇక్కడికి; చనుదెంచున్= వస్తాడు.

తాత్పర్యం: 'నీవు తనకు గారాబు మిత్రుడవని ఆయన మునీశ్వరులందరికీ సంతోషంతో చెపుతుంటాడు. నిన్ను చూడటానికి రేపు పలువురు శిష్యులతో బయలుదేరి వా రిక్కడికి వస్తారు.'

తే. అనిన విని యెల్లవారును నధిక హర్ష । మెసఁగ నున్నంత మఱునాఁడ యేగుదెంచె
భార్గవుం; డమ్మునీంద్రులు పరమభక్తి । నర్చ లిచ్చిరి హోత్ర వాహనుఁడు గనియె. 293

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్ విని= అకృతవ్రణుడు చెప్పగా ఆలకించి; ఎల్లవారును= అందరు; అధికహర్షము+ఎసఁగన్= మిక్కిలి సంతోషం అతిశయించగా; ఉన్న+అంతన్= ఉంటుండగా; మఱునాఁడు+అ= ఆ మరుసటిదినమే; భార్గవుండు= పరశురాముడు; ఏగుదెంచెన్= విచ్చేశాడు; ఆ ముని+ఇంద్రులు= అచ్చట ఉన్న మునీశ్వరులు; పరమభక్తిన్= మిక్కుటమైన భక్తితో; అర్చలు+ఇచ్చిరి= పూజలు చేశారు; హోత్రవాహనుడు; కనియెన్= భృగురాముడిని చూచాడు.

తాత్పర్యం: అకృతవ్రణుడు పల్కినమాటలు విని అందరూ మిక్కిలి సంతోషించారు. వారట్లా ఆనందంతో ఉండగా మరునాడు పరశురాము డక్కడికి వచ్చాడు. వారు మిక్కిలి భక్తితో ఆయనకు అతిథి పూజలు సలిపారు. ఆ పిదప హోత్రవాహనుడు ఆయనను దర్శించాడు.

వ. **కని పరశురాముని సంభావనంబును సంభాషణంబును బడసి కాశిరాజు కన్యకం జూపి, 'యిది నా దౌహిత్రి; దీని వృత్తాంతం బంతయు విను' మని య మ్మానినిం గానిపించిన నదియును.** **294**

ప్రతిపదార్థం: కని= చూచి; పరశురాముని సంభావనంబును= పరశురాముడి యొక్క ఆదరాన్ని; సంభాషణంబును= ప్రియపూర్వకమైన సల్లాపాన్ని; పడసి= పొంది; కాశిరాజు కన్యకన్+చూపి= భృగురాముడికి కాశీరాజుయొక్క పుత్రికను చూపి; ఇది= ఈమె; నా దౌహిత్రి= నా కొమార్తె బిడ్డ; దీని వృత్తాంతంబు= దీని సమాచారం; అంతయున్= సమస్తం; వినుము+అని= ఆలకించుమని; ఆ+మానినిన్= ఆ నారీమణిని; కానిపించినన్= చూపగా; అదియును= అంబయు.

తాత్పర్యం: హోత్రవాహనుడు పరశురాముడిని సందర్శించి ఆతడి మన్ననలు పొందాడు. ప్రియపూర్వక సంభాషణ అయిన తరువాత కాశీరాజపుత్రికను చూపి, 'ఇది నా మనుమరాలు; కొమార్తెబిడ్డ. ఈమె కథనంతా ఆలకించు' మని అంబను చూపగా.

చ. **కనుఁగవ నశ్రుధార లొలుకం జరణానతయైన, రాముఁ డి**
ట్లను 'విను హోత్రవాహనుని యట్టుల యేనును నీకు; నీ మనం
బునఁ గల చింతయంతయును బుచ్చెద; నాకడఁ జేరి తింక నీ
వనటఁ దొలంగఁబెట్టి గరువంబుగఁ జెప్పుము దీని మూలమున్. **295**

ప్రతిపదార్థం: కనుఁగవన్= రెండు కనులనుండి; అశ్రుధారలు+ఒలుకన్= కన్నీటి ధారలు కారగా; చరణ+ఆనత+ఐనన్= తన పాదాలపై వ్రాలగా; రాముఁడు= పరశురాముడు; ఇట్లు+అనున్= ఈ రీతిగా పలికాడు; విను(ము)= అమ్మా! ఆలకించు; నీకున్= నీకు; ఏనును= నేనుకూడ; హోత్రవాహనుని+అట్టుల= హోత్రవాహను డెట్లో అట్లే తాతనని తలంచుము; నీ మనంబునన్+కల= నీ హృదయంలో ఉన్న; చింత+అంతయును= విచారాన్నంతా; పుచ్చెదన్= తొలగిస్తాను; నా కడన్+చేరితి(వి)= నా దగ్గరకు వచ్చావు; ఇంకన్= ఇక; నీ వనటన్+తొలంగన్+పెట్టి= నీ దుఃఖాన్ని దూరంగా ఉంచి; గరువంబునన్= ధైర్యంగా; దీనిమూలమున్= నీ విషాదానికి గల కారణాన్ని; చెప్పుము= నా కెరిగింపుము.

తాత్పర్యం: రెండు కనులనుండి కన్నీటిధారలు కారుతుండగా తన పాదాలపై వ్రాలిన అంబను జూచి పరశురాము డిట్లా అన్నాడు: 'తల్లీ! నీకు హోత్రవాహను డెట్లో నేనూ అట్లే. నీవు నన్నాశ్రయించావు. నీ మదిలో నెలకొన్న దుఃఖమంతా తొలగిస్తాను. ఇక విచారం వీడి ధైర్యంతో నీ మనస్తాపానికి హేతువైన వృత్తాంతం నాకు చెప్పు.'

వ. అనిన విని యమ్మహాత్మునకు నంబ దనవృత్తాంతం బంతయు సవిస్తరంబుగాఁ జెప్పి 'నీ వార్తశరణ్యుండవు; నా పరిభవంబు దీర్చి నన్ను రక్షింపు'మనవుడు నతం డిట్లనియె: 296

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ+మహా+ఆత్మునకున్; అంబ; తన వృత్తాంతంబు+అంతయున్= తనచరిత్రనంతా; సవిస్తరంబుగాన్+చెప్పి= విపులంగా నుడివి; నీవు; ఆర్త శరణ్యుండవు= ఆర్తులకు రక్షకుడవు; నా పరిభవంబు+తీర్చి= నా అవమానమును తొలగించి; నన్నున్; రక్షింపుము; అనవుడున్= అని అంబ చెప్పగా; అతండు= పరశురాముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పరశురాముడి పల్కులు విని అంబ ఆ మహానుభావుడికి తన సంగతి అంతా విపులంగా వెల్లడించి, 'దేవా! నీవు దీనరక్షకుడవు. నా అవమానం బాపి నన్ను కాపాడు'మని పల్కింది. అపుడు పరశురాము డిట్లాలన్నాడు.

క. 'పరిభవము రెండు దెఱఁగులఁ । దరుణీ తోఁచినది; సాళ్వుఁ దగఁ దేర్తునొ? యు
ద్ధురుఁ డగు భీష్ముని దీర్తునొ; । కరము ప్రియంబెద్ది హృదయగతముం జెపుమా!' 297

ప్రతిపదార్థం: తరుణీ!= అంబా!; పరిభవము= నీకు కల్గిన అవమానం; రెండు తెఱఁగులన్= రెండు విధాలుగా; తోఁచినది= నాకు గోచరించింది; సాళ్వున్= సాళ్వుడిని; తగన్= తగినట్లు; తేర్తునొ?= శిక్షింతునో?; ఉద్ధురుఁడు+అగు= గర్వితుడైన; భీష్మునిన్= గాంగేయుడిని; తీర్తునొ?= దండింతునో?; కరము ప్రియంబు+ఎద్ది= నీ కీ రెండు విధాలైన చర్యలలో మిక్కిలి ఇష్టమైన దేదో; హృదయగతమున్+చెపుమా!= నీ మనసులోని విషయం నాకు తెలుపుము.

తాత్పర్యం: 'అంబా! నీకు గల్గిన అవమానమునకు రెండు కారణాలు నాకు తోచాయి. సాళ్వుని శిక్షించుమంటావా? భీష్ముని దండించుమంటావా? ఈ రెంటిలో ఏది నీ మనసుకు మిక్కిలి ఇష్టమో దానిని చెప్పు'.

చ. అనవుడు నింతి యిట్లను 'మహాపురుషా! నను సాళ్వుఁ డింకఁ గై
కొనఁ; డది సాలు; భీష్ముదెసఁ గోపము నా మది గల్గియుండు; నా
తని వధియింపఁ బూని యిటు తాపసవృత్తికి వచ్చి యిచ్చటన్
నినుఁ గని యీ పరాభవము నీఁగఁగ నీ శరణంబుఁ జొచ్చితిన్. 298

ప్రతిపదార్థం: అనవుడున్= అని పరశురాముడు పలుకగా; ఇంతి= అంబ; ఇట్లు+అనున్= ఈరీతిగా చెప్పింది; మహాపురుషా!= ఓ మహానుభావా!; ననున్= నన్ను; సాళ్వుఁడు= సాళ్వభూపతి; ఇంకన్+కైకొనఁడు= ఇక నన్ను భార్యగా స్వీకరించడు; అది చాలు= కనుక అతడిని దండించనక్కరలేదు; భీష్ముదెసన్= భీష్ముడి విషయంలో; కోపము= క్రోధం; నా మదిన్= నా హృదయంలో; కల్గి+ఉండున్= కలిగిఉన్నది; ఆతనిన్= గాంగేయుడిని; వధియింపన్+పూని= చంపటానికి నిశ్చయించి; ఇటు తాపసవృత్తికిన్ వచ్చి= ఈ రీతిగా తపస్సు చేయాలని వచ్చి; ఇచ్చటన్= ఈ ఆశ్రమంలో; నినున్+కని= నిన్ను దర్శించి; ఈ పరాభవమున్+నీఁగఁగన్= ఈ అవమానం తొలగించుకొనుటకై; నీ శరణంబున్+చొచ్చితిన్= నిన్ను రక్షకుడిగా ఆశ్రయించాను.

తాత్పర్యం: పరశురాముడి పలుకులు విని అంబ ఇట్లన్నది: 'మహాత్మా! నన్ను సాళ్వు డిక పత్నిగా స్వీకరించడు. అతడిని దండించి ఫలం లేదు. నన్ను బలాత్కారంగా హస్తినకు తెచ్చిన భీష్ముడిపై నాకు మనసులో కోపముంది. అతడిని చంపటానికై తపస్సు చేయవలెనని ఇక్కడికి వచ్చాను. నిన్ను దర్శించి ఈ అవమానం తొలగించు కొనటానికి నీ శరణు జొచ్చాను.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. అనిన 'నా చెప్పినట్లు గంగాత్మజుండు । సేయుఁ; జేయక తక్కిన శితశరముల
నతనిఁ బడవైతు; నూఅడు మబల! నీకుఁ । దపము సేయంగ నేటికిఁ దనువు డయ్య?' 299

ప్రతిపదార్థం: అనినన్= అని అంబ పలుకగా; నా చెప్పిన+అట్లు+అ= నేను వచించినవిధంగా; గంగా+ఆత్మజుండు= గంగకొడుకు భీష్ముడు; చేయున్= ఆచరిస్తాడు; చేయక తక్కినన్= ఆచరించకుంటే; శితశరములన్= వాడి బాణాలతో; అతనిన్+పడన్+వైతున్= వాడిని నేలగూలుస్తాను; ఊఅడుము= ఓర్చుకో! అబల!= అంబా!; తనువు డయ్యన్= శరీరం బడలిపోగా; నీకున్= నీకు; తపము చేయంగన్+ఏటికిన్= తపస్సు చేయటం ఎందుకు?

తాత్పర్యం: 'నేను చెప్పినట్లు గాంగేయుడు చేస్తాడు. చేయకపోతే వాడిబాణాలతో వాడిని కూల్చివేస్తాను. ఓర్చుకో. శరీరం శుష్కించగా నీవు తపస్సు చేయవలసిన అక్కర లేదు.'

పరశురాముఁ డంబం దోడుకొని భీష్మని యొద్దకు వచ్చుట (సం. 5-178-23)

క. అని పలికి పరశురాముఁడు । సనుదెంచెను మునిజనంబు సమ్మదమునఁ దోఁ
జనుదేరఁ గురుక్షేత్రం । బున కుద్ధతిఁ గాశిరాజపుత్రిం గొనుచున్. 300

ప్రతిపదార్థం: అని పలికి= అని వచించినవాడై; పరశురాముఁడు= భార్గవరాముడు; మునిజనంబు= మునీశ్వరులు; సమ్మదమునన్= సంతోషంతో; తోన్+చనుదేరన్= తన వెంబడి రాగా; కాశిరాజపుత్రిన్+కొనుచున్= కాశీరాజు కొమార్తెను తీసికొని; కురుక్షేత్రంబునకున్= కురుక్షేత్రమనే ప్రదేశానికి; ఉద్ధతిన్= దర్పంతో; చనుదెంచెను= వచ్చాడు.

తాత్పర్యం: అట్లా అంబతో పలికి పరశురాముడు మునీశ్వరులు హర్షంతో తనవెంట రాగా, కాశీరాజకుమారిని తోడ్కొని దర్పంతో కురుక్షేత్రానికి వచ్చాడు.

వ. వచ్చి సరస్వతీతీరంబున విడిసి, తనరాక నా కెఱింగించిన, నేను ఋత్విక్పురోహిత ప్రభృతి విశిష్ట బ్రాహ్మణ సమేతంబుగాఁ బూజాద్రవ్యంబులు గొని తత్ప్రదేశంబున కరిగిన, నమ్మహాత్ముండును మదీయ భక్తి వినయ సంభ్రమంబులు సంప్రీతి నభినందించి యర్చనలు గైకొని కాశిరాజకన్యకం జూపి నాతో నిట్లనియె: 301

ప్రతిపదార్థం: వచ్చి; సరస్వతీ తీరంబునన్= సరస్వతీ నది ఒడ్డున; విడిసి= నిలిచి; తనరాక; నాకున్; ఎఱింగించినన్; నేను; ఋత్విక్+పురోహిత ప్రభృతి= ఋత్విజులు పురోహితులు మున్నగు; విశిష్ట= ఆచార సంపన్నులైన; బ్రాహ్మణసమేతంబుగాన్= బ్రాహ్మణులతోకూడ; పూజాద్రవ్యంబులు కొని= పూజకొరకై వస్తువులు తీసికొని; తద్+ప్రదేశంబునకున్= పరశురాము డున్న చోటికి; అరిగినన్; ఆ+మహా+ఆత్ముఁడు= ఆ మహానుభావుడు; మదీయభక్తి వినయ సంభ్రమంబులు= నా యొక్క భక్తి, అణకువ, హర్షము; సంప్రీతిన్= మిక్కిలి తృప్తితో; అభినందించి= కొనియాడి; అర్చనలు కైకొని= నా చేయు పూజలు స్వీకరించి; కాశిరాజ కన్యకన్+చూపి; నాతోన్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పరశురాముడు అట్లా బయలుదేరి వచ్చి సరస్వతీ నదీతటంలో దిగి తాను వచ్చినట్లు నాకు చెప్పి పంపాడు. నేను ఋత్విజులు, పురోహితులు మొదలైన సదాచార సంపన్నులైన బ్రాహ్మణులతో పూజాద్రవ్యాలు తీసుకొని అక్కడికి వెళ్ళాను. ఆ మహానుభావుడు నా భక్తిని, వినయమును, సంతోషమును మిక్కిలి ప్రీతితో మెచ్చి నేను చేసే పూజలు స్వీకరించాడు. ఆ తరువాత కాశీరాజ కన్యఅయిన అంబను చూపి ఇట్లా అన్నాడు:

తే. **'బలిమి మున్నేల తెచ్చి తిప్పడఁతి? మగుడఁ । ద్రోచిపుచ్చంగఁదగునయ్య నీచవృత్తి?**
వచ్చె దీనిఁ దమ్మునికి వివాహమింక । నైనఁ జేయుము; చేయమి యనుచితంబు.' **302**

ప్రతిపదార్థం: బలిమిన్= బలవంతంగా; మున్ను= పూర్వం; ఈ+పడఁతిన్= ఈ కోమలిని; ఏల తెచ్చితి(వి)= ఎందుకు తీసుకువచ్చావు? నీచవృత్తిన్= అల్పుని చందంగా; మగుడన్= మరల; త్రోచిపుచ్చంగన్+తగును+అయ్య!= తిరస్కరించటం ఉచితమా?; వచ్చెన్= ఈ కన్య వచ్చినది; దీనిన్= ఈమెను; తమ్మునికిన్= విచిత్రవీర్యుడికి; వివాహము= పెండ్లి; ఇంకన్+ఐనన్+ చేయుము= ఇకనైనా చేయవలసింది; చేయమి= పెండ్లి చేయకుండటం; అనుచితంబు= తగనిపని.

తాత్పర్యం: 'బలాత్కారంగా ఈ కన్యను మొదట ఏల తెచ్చావు? తెచ్చితివిపో అల్పుడివలె మరల నీమెను తిరస్కరించటం న్యాయమా? ఈమె తిరిగి వచ్చింది. నీ తమ్ముడికి ఈమె నిచ్చి ఇకనైనా పెండ్లి కావించు. ఇట్లా పెళ్ళి చేయకుండటం సముచితం కాదు.'

క. **అనుటయు 'ననఘా! తెలియన్ । విను మిది నాతోడ 'సాళ్వవిభునకు నేఁ గూ**
ర్చినదాన నతనిపాలికి । ననుపుము న' న్ననినఁ గాదె యనిచితి మగుడన్. **303**

ప్రతిపదార్థం: అనుటయున్= అని పరశురాముడు పలుకగా; అనఘా!= పుణ్యాత్ముడా!; తెలియన్ వినుము= నా మాటలు స్పష్టంగా ఆలకించుము; ఇది= ఈమె; నాతోడన్= నాతో; సాళ్వవిభునకున్= సాళ్వపతికి; నేన్+కూర్చినదానన్= నేను ఇష్టురాలను; అతని పాలికిన్= అతడి దగ్గరకు; నన్నున్= నన్ను; అనుపుము= పంపుము; అనినన్+కాదె= అని చెప్పటం వలన కదా; మగుడన్= తిరిగి; అనిచితిన్= పంపాను?

తాత్పర్యం: పరశురాముడి పలుకులు విని నేను, 'మహాత్మా! నా మాటలు చక్కగా విను. ఈమె నాతో 'సాళ్వవిభుడికి నేను ఇష్టురాలను, అతడి దగ్గరకు నన్ను పంపుము' అని అడిగినందువల్ల గదా నే నీమెను తిరిగి అతడి కడకు పంపాను.

తే. **ఇంక నా తమ్మునికి దీని నెట్లు పెండ్లి । సేయ నేరుతు?' ననుడు 'నా చెప్పినట్లు**
సేయ వైతేని నిన్ను నీ చెలులఁ జుట్ట । ములను జంపుదు' ననియె నమ్మునివరుండు. **304**

ప్రతిపదార్థం: ఇంకన్= మఱి; నా తమ్మునికిన్= నా అనుజుడైన విచిత్రవీర్యుడికి; దీనిన్= ఈమెను; ఎట్లు పెండ్లి చేయన్ నేరుతున్?= ఎట్లా వివాహం చేయగలను?; అనుడున్= అని నేననగా; ఆ+మునివరుండు= ఆ మునీశ్వరుడు; నా చెప్పినట్లు= నేను చెప్పిన విధంగా; చేయవైతి(వి)+ఏని= నీవు చేయకపోతే; నిన్నున్= నిన్నును; నీ చెలులన్= నీ మిత్రులను; చుట్టములను= బంధువులను; చంపుదున్+అనియెన్= సంహరిస్తా నన్నాడు.

తాత్పర్యం: మరి నా తమ్ముడికి ఈమె నిచ్చి ఎట్లా పెళ్ళి చేయగలను?' అని నేనన్నాను. అందుకు ఆ మునీంద్రుడు 'నేను చెప్పినట్లు నీవు చెయ్యకపోతే నిన్నూ, నీ స్నేహితులనూ, నీ చుట్టాలనూ చంపుతా'నన్నాడు.

వ. **ఏను వినయంబు వదలక వినతుండ నగుచు వివిధ వాక్యంబులం దెలుప, నంతకంతకు నతనికిఁ గోపం బగ్గలంబైన వెండియు.** **305**

ప్రతిపదార్థం: ఏను= నేను; వినయంబున్ వదలక= అణకువను వీడక; వినతుండన్+అగుచున్= నమస్కారాలు చేస్తూ; వివిధ వాక్యంబులన్= అనేక వచనాలతో; తెలుపన్= నా అభిప్రాయం చెప్పగా; అంతకున్+అంతకున్= క్షణ క్షణానికి; కోపంబు; అగ్గలంబు+ఐనన్= మిక్కుటం కాగా; వెండియున్= మరల.

తాత్పర్యం: నేను వినయం వీడక అణకువతో నమస్కరిస్తూ పలు రకాలైన మాటలతో మనవి చేసుకొన్నాను. కాని, ఆయనకు అంతకంతకూ ఆగ్రహం హెచ్చింది.

ఆ. 'గురుఁడవై సమగ్ర కోదండ విద్యా మ । హత్త్వ మిచ్చినాఁడ వలుగఁ దగునె
కారణంబు లేక యీరసమెత్తి యి?' । ట్లనినఁ బరశురాముఁ డాగ్రహమున. 306

ప్రతిపదార్థం: గురుఁడవు+ఐ= నాకు ఆచార్యుడవై; సమగ్ర= పరిపూర్ణమైన; కోదండ విద్యా మహత్త్వము= ధనుర్విద్యయందలి గొప్పతనం; ఇచ్చినాఁడవు= అనుగ్రహించావు; కారణంబు లేక= హేతువు లేకుండ; ఈరసము+ఎత్తి= ఈర్ష్య వహించి; అలుగన్+తగునె?= నాపై కోపమూనటం యుక్తమా?; అనినన్= అని నేననగా; పరశురాముఁడు= భార్గవరాముడు; ఆగ్రహమునన్= కినుకతో.

తాత్పర్యం: 'నీవు నాకు గురుదేవుడవు. పరిపూర్ణమైన ధనుర్విద్యాపాండిత్యం ప్రసాదించావు. అట్టి నీవు నిష్కారణంగా ద్వేషం పూని నాపై కోపం వహించటం తగునా?' అని నే నన్నాను. అపుడు పరశురాము డాగ్రహిస్తూ.

చ. 'గురుఁడని నన్నెఱుంగు దనఘుండవు నా వచనంబునం దనా
దరణము సేసి తెన్నియొ విధంబులఁ బల్కెదు భక్తితోడ, నీ
వెరవులు దక్కు మీ! యబల వేగమ పెండిలిసేయు మంతతో
మరలు మదీయ కోప శిఖి; మానదు వేఱొక వేయుఁ జేసినన్? 307

ప్రతిపదార్థం: గురుఁడు+అని= ఆచార్యుడవని; నన్నున్+ఎఱుంగుదు= నన్ను తెలుసు; అనఘుండవు= పాపమెరుగనివాడవు; నా వచనంబునందున్= నా మాటయెడ; అనాదరణము చేసితి(వి)= అగౌరవం చూపితివి; భక్తితోడన్= భక్తితో; ఎన్నియొ విధంబులన్+పల్కెదు(వు)= ఎన్నో రకాలుగా మాట్లాడుతున్నావు; నీ వెరవులు తక్కుము= నీ యుక్తులు మానుకొమ్ము. ఈ+అబలన్= ఈ మగువను; వేగమ= శీఘ్రమే; పెండిలి చేయుము= నీ తమ్మునకిచ్చి వివాహం చేయుము; అంతతోన్= అంతటితో; మదీయ కోపశిఖి= నా క్రోధాగ్ని; మరలున్= చల్లారుతుంది; వేఱు+ఒకవేయున్+చేసినన్= ఇందుకు భిన్నంగా వేయి పనులు చేసినప్పటికినీ; మానదు= శమించదు.

తాత్పర్యం: 'నేను నీకు గురువునని తెలుసు. ఏ దోషమెరుగని వాడవైననూ నా మాటను అలక్ష్యం చేశావు. భక్తితో ఎన్నో రీతుల మాటాడుతున్నావు. ఈ ఉపాయాలన్నీ కట్టిపెట్టు. ఈమెను వెంటనే నీ తమ్ముడి కిచ్చి పెండ్లి చేయుము. అంతటితో నా కోపాగ్ని చల్లారుతుంది. నీ వీ పనిచేయక మరి వేయిపనులు చేసినా నా క్రోధానలం శమించదు.'

వ. అనిన విని 'యధర్మాచరణంబున కింతవట్టి పెనంగననగునె? పరానురక్తచిత్తయగు మగువ నిల్లాలిం జేయువారుం గలరె? యిట్టి యకృత్యం బాచరించుకంటె నీచేత నెట్లయినను లెస్స; తొల్లి పెద్దలు సెప్పిన చొప్పవధరింపు' మని యిట్లంటి. 308

ప్రతిపదార్థం: అనినన్ విని; అధర్మ+ఆచరణంబునకున్= అధర్మం ఆచరించటానికి; ఇంత+పట్టి పెనంగన్+అగునె?= ఇంతగా పట్టుకొని పెనగులాడవలెనా?; పర+అనురక్త చిత్త+అగు= ఇతరుడి యందు మమత నిండిన మనస్సుగల; మగువన్= పడతిని; ఇల్లాలిన్ చేయువారున్ కలరె= గృహిణిని కావించువారున్నారా?; ఇట్టి; అకృత్యంబు= చేయరానిపని; ఆచరించుకంటెన్= చేయటంకంటె; నీచేతన్= నీవలన; ఎట్లు+అయినన్ లెస్స= ఎట్లా జరిగినా మంచిదే; తొల్లి= పూర్వం; పెద్దలు చెప్పినచొప్పు= పెద్దలు నుడివిన మార్గం; అవధరింపుము= చిత్తగించుము; అని ఇట్లు+ అంటిన్= పరశురాముడితో ఇట్లా పలికాను.

తాత్పర్యం: పరశురాముడు పలికిన పలుకులు విని నేను 'అధర్మాచరణనిమిత్తమై ఇంత గట్టిగా పట్టుకొని పెనగులాడటం మీ కేమి న్యాయం? పరపురుషుడి యందు మనసు తగిలిన మగువను మరొకడి కిచ్చి పెండ్లి చేసేవారు ఎక్కడైనా ఉన్నారా? ఇట్లాంటి చేయరాని పని చేసేదానికన్నా, మీ వల్ల ఏమి జరిగినా మంచిదే. వెనుకటికి పెద్దలు చెప్పిన విధ మొకటున్నది. చెపుతాను వినండి' అని నే నిలా అన్నాను.

తే. 'గర్వియై కార్య మిట్టి దకార్యమిట్టి। దని యెఱుంగక లోకంబు చనుపథమునఁ
దిరుగ కున్మదవృత్తి వర్తించునట్టి। వాని గురునైన దండింప వలయు నండ్రు.' 309

ప్రతిపదార్థం: గర్వి ఐ= అహంకారం కలవాడై; కార్యము+ఇట్టిది= చేయదగిన పని ఇట్లాంటిది; అకార్యము+ఇట్టిది= చేయదగనిపని ఇటువంటిది; అని+ఎఱుంగక= అని తెలియక; లోకంబు చను పథమునన్= లోకులు నడచే మార్గంలో; తిరుగక= మెలగక; ఉన్మదవృత్తిన్= వెఱ్ఱితనంతో; వర్తించునట్టి వానిన్= మెలగునట్టివాడిని; గురున్+ఐనన్= గురువునైనను; దండింపన్+వలయున్+ అండ్రు= శిక్షించవలెనని పెద్దలు చెపుతారు.

తాత్పర్యం: 'అహంకారంతో ఇది చేయదగినపని, ఇది చేయరానిపని అని తెలిసికొనకుండా ప్రజలు నడిచే మార్గంలో నడవక, వెఱ్ఱియై ఎవడు ప్రవర్తిస్తాడో అతడు గురువైనా దండనార్హుడని పెద్దలు చెపుతారు.'

క. అను మాటకుఁ గాలానల। మును బోలెను మండి 'కయ్యమున కాయితమై
మొనలేర్చి వేగ యిచటికిఁ। జనుదె'మ్మని భార్గవుండు సంరంభమునన్. 310

ప్రతిపదార్థం: అనుమాటకున్= అని నేనన్న మాటకు; భార్గవుండు= పరశురాముడు; కాల+అనలమును+పోలెను= ప్రళయకాలములోని అగ్నివలె; మండి= ప్రజ్వలించి; సంరంభమునన్= ఆటోపంతో; కయ్యమునకున్= యుద్ధానికి; ఆయితము+ఐ= సిద్ధమై; మొనలు+ఏర్చి= వ్యూహాలను సిద్ధపరిచి; ఇచటికిన్= ఇక్కడికి (యుద్ధానికి వ్యూహం సిద్ధంచేసిన చోటుకు); వేగ= త్వరగా; చనుదెమ్ము+అని= రమ్మని.

తాత్పర్యం: నేనాడిన మాటకు పరశురాముడు ప్రళయాగ్ని వలె మండిపడ్డాడు. యుద్ధానికి సిద్ధమై సేనా వ్యూహాలు పన్నుకొని ఆటోపం ప్రదర్శించి, 'శీఘ్రమే ఇక్కడికి రా' అంటూ.

వ. పలికిన నేనును. 311

ప్రతిపదార్థం: అట్లా పరశురాముడు పలుకగా నేనున్నూ.

క. 'చులుకఁదనంబున విప్రున। కలుగంగాఁ దగదు; గురుఁడునై యున్నాఁ డం
చలయక తలఁచితిఁ గా కిటు। నిలుమీ! నీ రణము సేఁత నిజమగునేనిన్. 312

ప్రతిపదార్థం: చులుక+తనంబునన్= గౌరవహీనంగా; విప్రునకున్= బ్రాహ్మణుడికి; అలుగంగాన్+తగదు= కోపించరాదు; గురుఁడును+ఐ+ఉన్నాఁడు= గురువుగా కూడ ఉన్నాడు; అంచున్= అని; అలయక= కోపింపక; తలఁచితిన్+కాక= భావించితినేగాని; నీ రణముచేఁత= నీవు నాతో యుద్ధం చేయటం; నిజము+అగునేనిన్= సత్యమైతే; ఇటు నిలుమీ!= నా మ్రోల ధైర్యంగా నిలబడుమా?

తాత్పర్యం: 'గౌరవహీనంగా బ్రాహ్మణులయెడ కోపించటం పనికిరాదు. అందునా గురుడవై ఉన్నావని విసువక భావించాను. అంతేకాని భయంవల్ల కాదు. నీవు యుద్ధంచేయటం నిజమైతే ఇక నిలబడు.

క. **క్షత్రియులఁ దొల్లి యలుకకుఁ । బాత్రము సేసితటె? నాఁడు బలియుఁడు గంగా**
పుత్రుఁడు పుట్టమిఁగా కిది । యీ త్రయి నింకేల చెల్లు? నెఱుఁగవె నన్నున్! **313**

ప్రతిపదార్థం: క్షత్రియులన్= రాచవారిని; తొల్లి= మునుపు; అలుకకున్= నీ ఆగ్రహానికి; పాత్రము చేసితి(వి)+అటె!= గురి కావించావని చెపుతారు; నాఁడు= అప్పుడు; బలియుఁడు= బలవంతుడైన; గంగా పుత్రుఁడు పుట్టమిన్+కాక= గాంగేయుడు జన్మించని కారణాన చెల్లింది; ఇది= ఈ క్షత్రియవంశ విధ్వంసనం; ఈ త్రయిన్= ఈ ముల్లోకాలలో; ఇంకన్= ఇకమీదట; ఏల చెల్లున్?= ఎట్లు సాగుతుంది?; నన్నున్= నన్ను; ఎఱుఁగవె?= తెలియవా?

తాత్పర్యం: పూర్వం నీవు రాచవారిని నీ క్రోధానికి గురి కావించావని చెపుతారు. ఆనాడు గాంగేయుడు జన్మించని కారణంతో అట్లా జరిగిఉంటుంది. ఇపుడు భీష్ము డున్నాడు. ఇక ముల్లోకాలలో నీ ఆగడం సాగదు. నా బలవిక్రమా లెలాంటివో నీ వెరుగవా?

క. **ఏ నొకరుండన వచ్చెదఁ । గాని బలము దేను; నీవు గఱపిన శస్త్రా**
స్త్రానేక విధవిలాసము । దాన వలయు సేన గాదె! తథ్యం బరయన్'. **314**

ప్రతిపదార్థం: ఏను= నేను; ఒకరుండన్+అ= ఒక్కడనే; వచ్చెదన్+కాని= వస్తానేతప్ప; బలము+తేను= సైన్యాన్ని వెంటబెట్టుకొనిరాను; తథ్యంబు+అరయన్= వాస్తవం పరికిస్తే; నీవు కఱపిన= నీవు నేర్పిన; శస్త్ర+అస్త్ర= శస్త్రాస్త్రములయొక్క; అనేకవిధవిలాసము= పెక్కు తెఱగులైన క్రీడ; తాన్+అ= తానే; వలయుసేన కాదె!= కావలసిన సైన్యమౌతుంది కదా!

తాత్పర్యం: నిజము గమనిస్తే నీవు నేర్పిన శస్త్రాస్త్రవిద్యా విశేషమే నాకు కావలసినంత సైన్యమై ఉండగా, నేను బలగాన్ని వెంటబెట్టుకొనిరాను. యుద్ధానికి ఒక్కడనే వస్తాను.'

వ. **అని పలికి యతనికిం బ్రణమిల్లి చనుదెంచి, సత్యవతి కింతయు విన్నవించి, యద్దేవి యనుమతి వడసి, సర్వసన్నాహ సమేతంబగు రథం బెక్కి విప్రాశీర్వాదంబులు చెలంగ వెడలి వచ్చి కురుక్షేత్రంబు దఱియం జనునెడ, భాగీరథి భామినీ రూపంబున నరుగుదెంచి 'తన్నెఱింగించి, మదీయభక్తి నభినందించి యే నాయితంబై పోవుటకుఁ గారణం బడిగి, నా చేత నత్తెఱం గెఱింగినదియై నన్నుం గినిసి, భార్గవుపాలికిం జని 'నీ శిష్యుండు నిరపరాధుండు నా కొడుకున కలుగం దగునే?' యని చెప్పి, యతని యందుఁ బిక్కు గానక మగుడ నేతెంచి, నావలనను మెత్తంబాటులేకున్నం జనియె; నప్పుడు సిద్ధ విద్యాధర ముని గణంబులు గౌతుకంబునం గనుంగొనుచుండ నేను జమదగ్ని తనయున కనతిదూరంబునం దేరుడిగి వినతుండనై**

నిలిచి 'నీవు భూచారివై యున్నవాఁడవు; రథికుండనైన నాకు నీతోడ సమరంబు చేయనగునే?' యనిన యనంతరంబ యతండు దివ్యంబులగు రథ రథ్యంబులు శస్త్రాస్త్రంబులునుం గలిగి యకృతవ్రణుండు సారథిగా సమర సన్నద్ధుండై తోఁచినం జూచి రథారోహణంబు చేసి శంఖంబు పూరించి గుణంబు సారించి సూతు నగ్గించి తనకు నమస్కరించి కడంగిన నప్పరశురామదేవుండు. 315

ప్రతిపదార్థం: అని పలికి; అతనికిన్= పరశురాముడికి; ప్రణమిల్లి= నమస్కరించి; చనుదెంచి= వచ్చి; సత్యవతికిన్; ఇంతయున్= ఈ విషయమంతా; విన్నవించి; ఆ+దేవి+అనుమతి; పడసి= పొంది; సర్వసన్నాహసమేతంబు+అగు= సర్వసన్నాహాలతో కూడిన; రథంబు+ఎక్కి; విప్ర+ఆశీర్వాదంబులు; చెలంగన్= అతిశయించగా; వెడలివచ్చి; కురుక్షేత్రంబు; తఱియన్+చను+ఎడన్= సమీపించే సమయంలో; భాగీరథి= గంగానది; భామినీ రూపంబునన్= స్త్రీ రూపంతో; అరుగుదెంచి; తన్నున్+ఎఱింగించి= తాను గంగనని చెప్పి; మదీయభక్తిన్= నా భక్తిని; అభినందించి= మెచ్చి; ఏను= నేను; ఆయితంబు+ఐ= సిద్ధమై; పోవుటకున్+ కారణంబు+అడిగి; నాచేతన్; ఆ+తెఱంగు= ఆ విషయం; ఎఱింగినది+ఐ; నన్నున్; కినిసి= కోపించి; భార్గవుపాలికిన్+చని; నీ శిష్యుండు; నిరపరాధుండు= తప్పులేనివాడు; నా కొడుకునకున్; అలుగన్+తగునే; అని చెప్పి; అతని యందున్= ఆ భార్గవరాముడిలో కూడ; పిక్కు+కానక= వెనుదీయటం చూడక; మగుడన్= మరల; ఏతెంచి; నా వలనను= నా వైపు కూడ; మెత్తంబాటు లేకున్నన్= మృదుత్వము లేనందున; చనియెన్= ఆమె వెళ్ళింది; అప్పుడు; సిద్ధ విద్యాధర ముని గణంబులు= సిద్ధులు విద్యాధరులు మౌనులు అనువారియొక్క సమూహాలు; కౌతుకంబునన్= కుతూహలంతో; కనుంగొనుచున్+ఉండన్; నేను; జమదగ్ని తనయునకున్= జమదగ్ని కుమారుడైన పరశురామునికి; అనతి దూరంబునన్= సమీపమందు(చేరువలో); తేరుదిగి; వినతుండను+ఐ= నమస్కరించినవాడనై; నిలిచి= ఆగి; నీవు భూచారివి+ఐ+ఉన్నవాఁడవు= నీవు నేలమీద సంచరిస్తున్నావు; రథికుండన్+ఐన+నాకున్= రథమెక్కిఉన్న నాకు; నీతోడన్= నీతో; సమరంబు+చేయన్+అగునే?= యుద్ధం చేయదగునా? అనినన్+అనంతరంబ= అని నేను పల్కిన పిమ్మట; అతండు; దివ్యంబులు+అగు= దేవ సంబంధములైన; రథ రథ్యంబులు= రథం, గుఱ్ఱాలు; శస్త్ర+అస్త్రంబులున్+కలిగి; అకృతవ్రణుండు= పరశురాముడి శిష్యుడు; సారథి కాన్= రథం నడపేవాడు కాగా; సమరసన్నద్ధుండు+ఐ తోఁచినన్= యుద్ధానికి సంసిద్ధుడై కనబడగా; రథ+ఆరోహణంబు చేసి= నేను రథమెక్కి; శంఖంబు; పూరించి= ఊది; గుణంబు సారించి= నారి మొరయించి; సూతున్= నా రథసారథిని; అగ్గించి= కొనియాడి; తనకున్= పరశురామునికి; నమస్కరించి; కడంగినన్= యుద్ధానికి పూనుకోగా; ఆ+పరశురామదేవుండు= భగవంతుడైన భార్గవరాముడు.

తాత్పర్యం: అని పరశురాముడితో పలికి ఆయనకు నమస్కరించి కదలివచ్చి మా తల్లి సత్యవతీదేవికి జరిగిన విషయం విజ్ఞప్తి చేశాను. ఆ దేవి అనుమతి పొంది సర్వసన్నాహాలతో రథమెక్కి బ్రాహ్మణాశీస్సులు గైకొని కురుక్షేత్రం సమీపిస్తుండగా గంగాదేవి స్త్రీరూపంతో వచ్చి, తానెవరో చెప్పింది. నా భక్తిని మెచ్చి నేను యుద్ధాయత్తుడనై బయలుదేరటానికి కారణమడిగింది. నేను చెప్పగా విని నాపై కోపించి, పరశురాముడి వద్దకు వెళ్ళింది. 'నీ శిష్యుడు ఏతప్పూ చేయనివాడు. అట్టి నా కుమారుడిపై నీవు కినుకవహించ దగునా? అని అన్నది. అతని వల్ల ప్రయోజనం సిద్ధించక మళ్ళీ నా దగ్గరకు వచ్చింది. నా విషయంలోనూ పట్టుదల సడలని కారణంవల్ల తిరిగి వెళ్ళిపోయింది. అప్పుడు సిద్ధ విద్యాధర మునిసమూహాలు కుతూహలంతో చూస్తూ ఉండగా జమదగ్ని మహర్షి తనయుడైన మా గురువుగారికి చేరువలో రథం దిగి వినయంతో నిలిచి 'నీవు నేలపై నుండగా నేను రథస్థుడనై నీతో సంగ్రామం సల్పటం న్యాయం కా'దన్నాను. అనంతర మతడు దివ్యమైన రథం, అశ్వములు, శస్త్రాస్త్రాలు కలిగి, తన శిష్యుడైన

అకృతవ్రణుడు సారథిగా యుద్ధానికి ఆయత్తమై గోచరించాడు. నేను రథ మెక్కి, శంఖం పూరించి, వింటినారిని మొరయించి సూతుడిని శ్లాఘించి రణ సంసిద్ధుడనై పరశురాముడికి నమస్కరించగా, అతడు.

భీష్ముఁడు పరశురామునితో యుద్ధము సేయుట (సం. 5-180-18)

క. శరవర్షము నామీఁదం । గురిసిన నే నాకసమునఁ గుదియించితి నా
యరదంబు పొంతకును న । చ్చెరువుగ నొక బాణమైనఁ జేరకయుండన్. 316

ప్రతిపదార్థం: శరవర్షమున్= బాణాలనెడి వానను; నామీఁదన్= నాపై; కురిసినన్= పరశురాముడు వర్షించగా; నా+అరదంబు పొంతకును= నా రథముయొక్క చేరువకు; అచ్చెరువుగన్= వింతగా, ఒక బాణము+ ఐనన్= ఒక శరమైనను; చేరక+ఉండన్= రాకుండునట్లు; నేను= నేను; ఆకసమునన్= అంతరిక్షములోనే; కుదియించితిన్= ఆ బాణములను అణచివేశాను.

తాత్పర్యం: పరశురాముడు నామీద శరవర్షం కురిశాడు. ఆ బాణాలను నా రథం చెంతకు కూడా చేరకుండా ఆశ్చర్యం కలిగేటట్లు అంబరతలంలోనే అన్నింటినీ అణచివేశాను.

క. ఒక మొగి నఱువది యమ్ములఁ । బ్రకటబలుండైన పరశురాముఁడు నా యం
గకములు దాఁకఁగ నశ్వ । ప్రకరము నొనాఁట సూతుపైఁ బడ నేసెన్. 317

ప్రతిపదార్థం: ప్రకటబలుండు+ఐన= ప్రసిద్ధబలవంతుడైన; పరశురాముడు= భార్గవరాముడు; ఒకమొగిన్= ఒక్కసారిగా; అఱువది+అమ్ములన్= అరవై బాణాలను; నా+అంగకములు= నా అవయవాలకు; తాఁకఁగన్= తగిలేటట్లును; అశ్వప్రకరము నొనాటన్= గుఱ్ఱాల గుంపునకు నొవ్వు కలుగ గ్రుచ్చుకొనేటట్లును; సూతుపైన్+పడన్= రథసారథిపై పడేటట్లునూ; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: ప్రఖ్యాత బలశాలి అయిన పరశురాముడు నా అవయవాలకు తగిలేటట్లు, నా గుఱ్ఱాలగుంపునకు గ్రుచ్చుకొని నొవ్వు కలిగేటట్లు, నా సారథిపై పడేటట్లు ఒక్కసారి అరవై బాణాలు ప్రయోగించాడు.

క. దానికి నవ్వుచు వేగం । బే నొక భల్లంబు దొడిగి యేసితి సాంద్ర
జ్యానాద భరిత రోదసి । యైన తదీయోగ్ర చాప మఱిముఱిఁ దునియన్. 318

ప్రతిపదార్థం: దానికిన్= అందుకు; నవ్వుచున్= నవ్వుతూ; వేగంబు= శీఘ్రమే; ఏను= నేను; ఒక భల్లంబున్= ఒక బాణాన్ని; తొడిగి= వింట సంధించి; సాంద్ర జ్యానాద= నిబిడమైన నారి మ్రోతచేత; భరిత= నిండిన; రోదసి+ఐన= భూమ్యాకాశాల మధ్య ప్రదేశం కలదైన; తదీయ+ఉగ్రచాపమున్= ఆతడి భయంకరమైన ధనుస్సును; అఱిముఱిన్= వెంటనే; తునియన్= విరిగేటట్లు; ఏసితిన్= విడిచాను.

తాత్పర్యం: అందుకు నేను నవ్వుతూ శీఘ్రమే ఒక బాణాన్ని వింటదొడిగి భూమ్యాకాశాల నడిమి ప్రదేశాన్నంతటినీ తన అల్లెత్రాటి మ్రోతచే నిండిస్తున్న పరశురాముడి భయంకరమైన విల్లు విరిగేటట్లు ప్రయోగించాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ఒండొక విల్లు పుచ్చికొని యుజ్జ్వల రోష మహానలార్చు లొం
డొండ మొగంబుపై నెగయ నుర్వి చలింప గుణధ్వనిన్ సము
ద్దండత దీవ్ర మార్గణ శతంబున నా యరదంబు ముంచె రా
ముండు వియచ్చరప్రకరముల్ వెఱఁగందుచుఁ బ్రస్తుతింపఁగన్. **319**

ప్రతిపదార్థం: రాముండు= పరశురాముడు; ఒండొకవిల్లు= మరొక చాపం; పుచ్చికొని= చేతబట్టి; ఉజ్జ్వల= మిక్కిలి మండుతున్న; రోష= రోషమనెడు; మహా+అనల+అర్చులు= గొప్ప నిప్పుమంటలు; ఒండొండన్= ఒక్కటొక్కటిగా; మొగంబుపైన్+ఎగయన్= ముఖంమీద వ్యాపించగా; గుణధ్వనిన్= అల్లెత్రాటిమ్రోతచేత; ఉర్వి చలింపన్= భూమి కంపించగా; వియత్+చర ప్రకరముల్= గగన చారులైన వేల్పుల గుంపులు; వెఱఁగు+అందుచున్= విస్మయం చెందుతూ; ప్రస్తుతింపఁగన్= తనను కొనియాడగా; సముద్దండతన్= మిక్కిలి భయంకరంగా; తీవ్ర మార్గణ శతంబునన్= వాడియైన నూరు బాణాలతో; నా+అరదంబున్+ముంచెన్= నా రథాన్ని మునిగేటట్లు చేశాడు.

తాత్పర్యం: పరశురాముడు వేరొక విల్లు గ్రహించి, చెలరేగుతున్న క్రోధమనే గొప్ప నిప్పుమంటలు అంతకంతకూ తన మొగంమీద వ్యాపించగా, వింటినారి మ్రోతచేత పుడమి వణకగా, మిక్కిలి ఘోరంగా నూరు వాడి బాణాలతో నా రథాన్ని ముంచివేశాడు. ఆ మహాటోపాన్ని చూచి గగనంలో నిలిచిఉన్న దేవతాగణం విస్మయం చెందుతూ అతడిని శ్లాఘించారు.

క. ఉఱక మదీయాంగంబులు । గిఱికొన నట్లేయుటయును గినుక గదిరినన్
మెఱుఁగారు నారసమ్ములు । దఱచుగ నించితిఁ గడంగి తద్గాత్రమునన్. **320**

ప్రతిపదార్థం: ఉఱక= లక్ష్యపెట్టక; మదీయ+అంగంబులు= నా అవయవాలు; గిఱికొనన్= చుట్టుకొనేటట్లు; అట్లు+ఏయుటయును= ఆ విధంగా శరాలు ప్రయోగించగా; కినుక గదిరినన్= నాకు కోపంకలుగగా; మెఱుఁగారు నారసమ్ములు= వాడిదేరిన బాణాలు; తఱచుగన్= దట్టంగా; కడంగి= పూని; తద్+గాత్రంబునన్= ఆతడి శరీరమునందు; నించితిన్= నాటాను.

తాత్పర్యం: లక్ష్యపెట్టకుండా, నా అవయవాలను క్రమ్ముకొనేటట్లు పరశురాముడు తూపులు వేయగా నాకు కోపం కలిగింది. నేను వాడిదేరిన శరాలను ఆయన దేహంనిండా దట్టంగా నాటాను.

తే. ఉచ్చిపోయిన యేటుల నొలుకు శోణి । తమున సర్వాంగకంబులుఁ దడిసి యొప్పెఁ
జిగురుఁదఱుచునఁ గెంజాయ మిగిలి చెలువు । వడయు క్రొమ్మావిచాడ్పున భార్గవుండు. **321**

ప్రతిపదార్థం: ఉచ్చిపోయిన= గ్రుచ్చుకొని ఆవలికి వెడలిన; ఏటులన్= బాణఘాతాలచేత; ఒలుకు= కారుతున్న; శోణితమునన్= రక్తంతో; సర్వ+అంగకంబులు= ఎల్ల అవయవాలు; తడిసి= తడిసినవై; చిగురు+తఱచునన్= దట్టమైన చిగుళ్ళవలన; కెంజాయ (కెంపు+చాయ)మిగిలి= ఎర్రని వన్నెతో అతిశయించి; చెలువు+పడయు= అందగించిన; క్రొమ్మావి (క్రొత్త+మావి) చాడ్పునన్= వసంత ఋతువునందలి క్రొత్తమామిడి చెట్టువలె; భార్గవుండు= పరశురాముడు; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: నేను ప్రయోగించిన బాణాలు పరశురాముడి అవయవాలలోదిగి అవతలకు వెళ్ళబారాయి. ఆ గాయాలనుండి కారే రక్తంతో అతడి అంగాలు తడిసి ముద్దఅయ్యాయి. దట్టమైన చిగుళ్ళవల్ల అరుణకాంతులు విరజిమ్ముతూ సౌందర్య మెగబోసే క్రొత్త మామిడి చెట్టువలె అప్పుడు పరశురాముడు ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **నెత్తురు వడిసిన మూర్ఛా । యత్తుండై సొగయుటయును నాతనిఁగని యు**
ద్వృత్త క్షత్రియ ధర్మో । పాత్తంబగు తేజ మొల్లఁబాటై తోఁచెన్. **322**

ప్రతిపదార్థం: నెత్తురు వడిసినన్= రక్తం కారగా; మూర్ఛా+ఆయత్తుండు+ఐ= మూర్ఛకు అధీనుడై; సొగయుటయును= సొమ్మసిల్లగా; ఆతనిన్+కని= పరశురాముడిని చూచి; ఉద్వృత్త= గర్వముతో కూడిన; క్షత్రియధర్మ= రాజధర్మంచేత; ఉపాత్తంబు+అగు= పొందబడిన; తేజము= ప్రతాపం; ఒల్లఁబాటై= అపేక్షించరానిదై; తోఁచెన్= నాకు గోచరించింది.

తాత్పర్యం: రక్తం కారడం వలన మూర్ఛ పొంది ఒడలెఱుగకున్న నా గురువు పరశురాముడిని చూడగానే గర్వంగల క్షత్రియవృత్తిచేత లభించిన ప్రతాపం నాకు అనపేక్షితంగా కనబడింది.

వ. **అప్పుడు మనంబున నన్ను నేన గర్హించుకొనుచుండితి.** **323**

ప్రతిపదార్థం: అప్పుడు; మనంబునన్= మనసులో; నన్నున్; నేను+అ= నేనే; గర్హించుకొనుచున్= నిందించుకొంటూ; ఉండితిన్= ఉండిపోయాను.

తాత్పర్యం: పరశురాముడు మూర్ఛలో మునిగిఉండగా చూచి నన్ను నేనే ఎంతపని చేశానని నిందించుకొంటూ ఉండిపోయాను.

ఆ. **అంతఁ దెలిసి రాముఁ డతికుపితాత్ముఁడై । యేఱువాఱుతెంచు నెసకమెసఁగ**
నప్రమేయశరము లడరించె; నవి సత్వ । రముగ నేను బ్రతిహతములు సేసి. **324**

ప్రతిపదార్థం: అంతన్= అటు తరువాత; తెలిసి= ఒడలెరిగి; రాముఁడు= పరశురాముడు; అతికుపిత+ఆత్ముఁడు+ఐ= మిక్కిలి కోపంతో కూడిన మనసుకలవాడై; ఏఱు= నది; పాఱుతెంచు+ఎసకము= ప్రవహించే విజృంభణం; ఎసఁగన్= ఒప్పగా; అప్రమేయశరములు= తెలిసికొనటానికి అశక్యములైన బాణాలు; అడరించెన్= నాపై ప్రయోగించాడు; అవి= వాటిని; సత్వరముగన్= వెనువెంటనే; నేను= నేను; ప్రతిహతములు చేసి= త్రిప్పికొట్టి.

తాత్పర్యం: ఆ తరువాత పరశురాముడు మూర్ఛనుండి తేరుకొని, మిక్కిలి కోపంతో నది ప్రవహిస్తున్నదో అనునట్లు అవిచ్ఛిన్నంగా ఇవి ఇట్లాంటివని ఊహించనలవిగాని శరాలు నామీద ప్రయోగించాడు. వాటిని నేను వెంటనే త్రిప్పికొట్టి.

విశేషం: అలం: ఉపమ.

క. **మరుదస్త్ర మేయ గుహ్యక । శరమున వారించె నతఁడు; సరభసముగ ను**
ద్ధుర శిఖి బాణం బేసిన । గురుఁడు వరుణ విశిఖ నిహతిఁ గుదియం జేసెన్. **325**

ప్రతిపదార్థం: మరుత్+అస్త్రము+ఏయన్= వాయవ్యాస్త్రం నేను ప్రయోగించగా; అతఁడు= పరశురాముడు; గుహ్యక శరమునన్= గుహ్యకాస్త్రంతో; సరభసముగన్= సత్వరంగా; వారించెన్= అడ్డగించాడు; ఉద్ధురశిఖిబాణంబు= దృఢమైన ఆగ్నేయాస్త్రం;

ఏసినన్= నేను వేయగా; గురుఁడు= పరశురాముడు; వరుణ విశిఖ నిహతిన్= వారుణాస్త్రంయొక్క పెట్టుచేత; కుదియన్+ చేసెన్= ఆగిపోయేటట్లు చేశాడు.

తాత్పర్యం: నేను మారుతాస్త్రం ప్రయోగించగా గురుడు గుహ్యకాస్త్రంతో దానిని నివారించాడు. దృఢమైన ఆగ్నేయాస్త్రం నేను వేయగా ఆయన వారుణాస్త్రంయొక్క దెబ్బతో దానిని ఆగిపోయేటట్లు చేశాడు.

క. **ఇమ్మెయి నతఁడును దివ్యా । స్త్రమ్ములు నామీఁద నేయ రయమునఁ బ్రతి ఘా**
త మ్మొనరించితి దివిజగ । ణ మ్మంబర వీథిఁ గీర్తన మ్మొనరింపన్. **326**

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; అతఁడును= పరశురామ దేవుడు కూడ; దివ్య+అస్త్రమ్ములు= దేవతాకములైన బాణాలు; నామీఁదన్= నాపై; ఏయన్= ప్రయోగించగా; రయమునన్= శీఘ్రంగా; దివిజగణమ్ము= దేవతావర్గం; అంబరవీథిన్= ఆకాశమార్గంలో నుండి; కీర్తనమ్ము+ ఒనరింపన్= నన్ను పొగడగా; ప్రతిఘాతమ్ము+ఒనరించితిన్= నివారించాను.

తాత్పర్యం: ఈ రీతిగా పరశురాముడు దివ్యాస్త్రాలు నామీద ప్రయోగించగా నేను కూడ శీఘ్రంగా వాటిని వారించాను. ఆకాశపథంలో నిలిచి దేవతాసమూహం నన్ను ప్రశంసించింది.

తే. **రాముఁ డంత్యకాలానలో ద్దామ లీల । మండి నా యురస్థ్సలి యొక్క మార్గణమున**
నేసె నంతంత నున్న మునీశ్వరులును । గాశిరాజ కన్యకయును గడఁగి యార్వ. **327**

ప్రతిపదార్థం: అంతన్+అంతన్+ఉన్న= అక్కడక్కడ నున్న; ముని+ఈశ్వరులును= మునీంద్రులున్నూ; కాశిరాజ కన్యకయును= కాశీరాజపుత్రి అంబయున్నూ; కడఁగి= పూని; ఆర్వన్= అరవగా; రాముఁడు= భార్గవరాముడు; అంత్యకాల= ప్రళయకాలమందలి; అనల= అగ్నివలె; ఉద్దామలీలన్+మండి= అడ్డులేని విధంగా జ్వలిస్తూ; నా= నాయొక్క; ఉరస్+స్థలిన్= వక్షఃస్థలంమీద; ఒక్కమార్గణమునన్= ఒక బాణంతో; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: అక్కడక్కడ నిలిచి చూస్తున్న మునీంద్రులు, కాశీరాజు కుమారి అంబ ఉత్సహించి అరవగా పరశురాముడు ప్రళయకాలానలజ్వాలవలె మండుతూ నా గుండెపై ఒక బాణం వేశాడు.

క. **ఆ నిశితాస్త్రం బెయ్యది । యో నాకుం దెలియ; దది మహోగ్రత నాఁటం**
గా నొచ్చి పడితి నరదము । పై; నప్పుడు సూతుఁ డచటు వాపె రథంబున్. **328**

ప్రతిపదార్థం: ఆ నిశిత+అస్త్రంబు= ఆ వాడి బాణం; ఏ+అదియో= ఏదో; నాకున్+తెలియదు= నాకు తెలియదు; అది మహా+ఉగ్రతన్= అది మిక్కిలి దారుణంగా; నాటంగాన్= నా గుండెలో దిగబడగా; నొచ్చి= బాధనొంది; అరదముపైన్+పడితిన్= రథంలో కూలిపోయాను; అప్పుడు= ఆ సమయాన; సూతుఁడు= నా రథసారథి; రథంబున్= రథాన్ని; అచటు పాపెన్= అక్కడ నుండి మరలించాడు.

తాత్పర్యం: పరశురాముడు ప్రయోగించిన ఆ వాడి బాణమేదో నాకు తెలియదు. అది మిక్కిలి భయంకరంగా నా గుండెలో దిగబడగా బాధతో రథంలో కూలిపోయాను. అప్పుడు సూతుడు నా తేరును అక్కడినుండి తొలగించాడు.

తే. చేతనుఁడ నయి యేను మత్సూతుఁ గినిసి । రాముఁ డున్నెడ కప్పుడు గ్రమ్మఱంగ
రథముఁ దోలించి బాణపరంపరా ని । మగ్నుఁ జేసితి నంబ నెమ్మనము దలఁక. 329

ప్రతిపదార్థం: చేతనుఁడన్+అయి= తెలివివచ్చిన వాడనయి; ఏను= నేను; మత్+సూతున్= నా సారథిని; కినిసి= కోపించి; రాముఁడు+ఉన్న+ఎడకున్= పరశురాముడున్న చోటికి; అప్పుడు= ఆ సమయంలో; క్రమ్మఱంగన్= మరల; రథమున్+తోలించి= రథాన్ని నడిపించి; అంబ నెమ్మనము= అంబయొక్క హృదయం; తలఁకన్= భీతి నొందగా; బాణ పరంపరా నిమగ్నున్+ చేసితిన్= పరశురాముడిని శరసమూహమందు ముంచివేశాను.

తాత్పర్యం: నేను మూర్ఛనుండి తేరుకొన్నపిదప రథం మరలించుక వచ్చినందుకు నా సారథిని కోపించి రాముడున్న చోటికి మరల ఆ రథాన్ని నడిపించాను. అంబ గుండె భయంతో వణకగా పరశురాముడిని బాణసమూహంలో ముంచివేశాను.

వ. ఇట్లు బహు ప్రకారంబులం బోరుచుఁ బ్రొద్దు గ్రుంకినప్పుడు రణం బుపసంహరించుచు, రేపకడ దొడంగుచుం
బెనంగ నిరువది దినంబులు చెల్లిన, మఱునాఁటి కయ్యంబున నేనునుం గడంగి. 330

ప్రతిపదార్థం: ఇట్లు; బహు ప్రకారంబులన్= అనేకవిధాల; పోరుచున్= పోరాడుతూ; ప్రొద్దు+గ్రుంకిన+అప్పుడు= సూర్యుడస్తమించినపుడు; రణంబు+ఉపసంహరించుచున్= పోరాటం చాలిస్తూ; రేపకడ= ఉదయమే; తొడంగుచున్= ప్రారంభిస్తూ; పెనంగన్= మేము పోరాడుతుండగా; ఇరువది రెండు దినంబులు; చెల్లినన్= కడవగా; మఱునాఁటి కయ్యంబునన్; నేనునున్; కడంగి= పూని.

తాత్పర్యం: ఇట్లా అనేక విధాల పోరాడుతూ ప్రొద్దు గ్రుంకినప్పుడు రణం చాలిస్తూ, తెల్లవారగానే ఆరంభిస్తూ గురుశిష్యుల మిద్దరమూ పెనగులాడుతుండగా ఇరవైరెండు రోజులు గడిచిపోయాయి. మరునాడు మళ్ళీ యుద్ధానికి పూనుకొన్నాను.

క. కడు బెట్టిదముగఁ గదియం । బడి హయములు నొవ్వ ధనువు భగ్నంబుగఁ జే
డ్పడి సారథి దెరలఁగఁ దన । యొడలు సిరుఁగ నేసినను మహోద్ధతి గురుఁడున్. 331

ప్రతిపదార్థం: కడున్ బెట్టిదముగన్= మిక్కిలి భయంకరంగా; కదియన్+పడి= కలియబడి; హయములు నొవ్వన్= గుర్రాలు బాధ చెందగా, ధనువు భగ్నంబుగన్= విల్లు విరుగగా; చేడ్పడి= వ్యాకులతచెంది; సారథి= రథ చోదకుడు; తెరలఁగన్= చలించగా; తన+ఒడలు= తన దేహం; చిరుఁగన్= చీలేటట్లు; ఏసినను= నేను శరములు వేయగా; మహా+ఉద్ధతిన్= మిక్కిలి విజృంభణంతో; గురుఁడున్= గురువైన పరశురాముడును.

తాత్పర్యం: మిక్కిలి భయంకరంగా నేను కలియబడి శరాలు ప్రయోగించి రథాశ్వాలను నొప్పించాను. వింటిని విరిచివేశాను. సారథిని వ్యాకులపాటుతో చలించేటట్లు చేశాను. గురుడి శరీరాన్ని చీల్చాను. అప్పుడు నా ధనురాచార్యుడు చెలరేగి.

క. ఒక శక్తి వైవ నఱకితి, । నకుటిలముగ శక్తి దశక మడరించిన స్రు
క్కక త్రుంచితి, బహుశక్తుల । నికరము పరఁగించినం దునిమితిం బెలుచన్. 332

ప్రతిపదార్థం: ఒక శక్తి వైవన్= పరశురాముడు నాపై ఒక శక్తిని ప్రయోగించగా; నఱకితిన్= దానిని ఖండించాను; అకుటిలముగన్= నిర్వక్రంగా; శక్తి దశకమున్= పది శక్తులు; అడరించినన్= వేయగా; స్రుక్కక= గాసిచెందక; త్రుంచితిన్= నరకివేశాను; బహుశక్తుల నికరము= అనేక శక్త్యాయుధాల సమూహాన్ని; పరఁగించినన్= ప్రయోగించగా; పెలుచన్= వెంటనే; తునిమితిన్= ఖండించివేశాను.

తాత్పర్యం: పరశురాముడు ఒక శక్త్యాయుధాన్ని నామీద వేయగా, దానిని నరకివేశాను. పిదప ఆతడు పదింటిని ప్రయోగించగా ఏమాత్రం గాసిచెందక వాటిని తునిమివైచాను. అనేక శక్త్యాయుధాల సముదాయాన్ని ఆతడు ప్రయోగించగా వెంటనే వాటినికూడా ఖండించివేశాను.

క. విస్మయము నొందు భార్గవు । నస్మత్కర మపుడు లాఘవారూఢముగా
సస్మితుఁడ నగుచుఁ బటు దీ । ప్తి స్మేరాస్త్రముల నేసితిం బరవశుఁగాన్. 333

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో; అస్మత్+కరము= నా హస్తము; లాఘవ+ఆరూఢముకాన్= నేర్పుగలది కాగా; సస్మితుఁడన్+అగుచున్= నేను చిరునవ్వుతో కూడిన వాడనవుతూ; విస్మయమున్+ఒందు= ఆశ్చర్యపడుతున్న; భార్గవున్= భృగురాముడిని; పటుదీప్తి స్మేర+అస్త్రములన్= మిక్కిలి తేజోవికాసం గల అస్త్రాలచేత; పరవశున్+కాన్+ఏసితిన్= సొమ్మసిల్లేటట్లు కొట్టాను.

తాత్పర్యం: ఆ సమయంలో నా హస్తం అమితలాఘవాన్ని పుంజుకొన్నది. పరశురాముడు ఆశ్చర్యపడుతుండగా నేను చిరునవ్వుతో మిక్కిలి దీప్తి వికాసం కలిగిన అస్త్రాలు ప్రయోగించి ఆయనను మూర్ఛితుణ్ణి చేశాను.

వ. ఇట్లతండు మూర్ఛిల్లిన మునిజనంబులును నంబయు నధిక శోకసమాకులత్వంబు నొంది హాహా కారంబులు సెలంగఁ బొదివి రంత. 334

ప్రతిపదార్థం: ఇట్లు; అతండు; మూర్ఛిల్లినన్; ముని జనంబులును; అంబయున్; అధికశోక సమాకులత్వంబున్+ఒంది= మిక్కుటమైన దుఃఖంచేత కలతనొంది; హాహాకారంబులు చెలంగన్= అయ్యో అయ్యో అనే అరపులు సందడించగా; పొదివిరి= అతడి చుట్టూ మూగారు; అంతన్= తరువాత.

తాత్పర్యం: పరశురాముడు మూర్ఛిల్లాడు. మునీశ్వరులు, అంబ దుఃఖవ్యాకుల మనస్కులయినారు. వారు హాహాకారాలుచేస్తూ అతడి చుట్టూ క్రమ్ముకొన్నారు. తరువాత

ఆ. తెలిసి భార్గవుండు దృఢ తీవ్ర నారాచ । పంక్తి గురిసి నన్నుఁ బారవశ్య
మంది నేల కొఱగునట్లుగాఁ జేసి మ । త్సూతు మస్తకంబుఁ దునియ నేసె. 335

ప్రతిపదార్థం: తెలిసి= ఒడలెరిగి; భార్గవుండు= పరశురాముడు; దృఢతీవ్ర నారాచ పంక్తిన్= గట్టివి, వాడివి అయిన బాణాలయొక్క శ్రేణిని; కురిసి= నాపై వర్షించి; నన్నున్= నన్ను; పారవశ్యము+అంది= స్మృతికోల్పోయి; నేలకున్+ఒఱగునట్లుగాన్+చేసి= నేలమీదికి వ్రాలేటట్లు కావించి; మత్‌సూతుమస్తకంబున్= నా రథసారథి శిరస్సును; తునియన్+ఏసెన్= తెగేటట్లు బాణం వేశాడు.

తాత్పర్యం: ఒడలు తెలిసి పరశురాముడు పటిష్ఠములైన వాడి బాణాలు గుప్పించి, నేను స్మృతి దప్పి నేలకు వ్రాలేటట్లు చేశాడు. శరంతో నా రథసారథి తలను ఖండించాడు.

వ. అట్టియెడ నెనమండ్రు విప్రులు సమానవయోరూపంబుల నొప్పు వారలు నన్నెత్తి, సేదదీర్చి రథంబు పయింబెట్టి, గగన గమనంబునం బోయి; రంతకు మున్న మందాకిని మున్ను నాకన్న చందంబున నొగలపయినుండి మదీయ రథ్యంబుల పగ్గంబులు ధరియించి యున్న నేనునుం గనుంగొని నమస్కరించిన దీవించి చనియె; వెండియు. 336

ప్రతిపదార్థం: అట్టియెడన్= అటువంటి సమయంలో; ఎనమండ్రు విప్రుల= ఎనిమిదిమంది బ్రాహ్మణులు; సమానవయః+ రూపంబులన్= నాతో సమానమైన ప్రాయం, ఆకారాలతో; ఒప్పువారలు= ప్రకాశించేవారు; నన్నున్+ఎత్తి= నన్ను నేలనుండి పైకి లేవదీసి; సేద+తీర్చి= బడలిక వాపి; రథంబు పయిన్+పెట్టి= రథంమీదకూర్చుండబెట్టి; గగనగమనంబునన్+పోయిరి= ఆకాశ మార్గాన వెళ్ళిపోయారు; అంతకున్+మున్న= వారు నన్ను రథంలో కూర్చోబెట్టటానికి పూర్వమే; మందాకిని= గంగాదేవి; నా+కన్న+చందంబునన్= నేను చూచిన రూపంతోనే; నొగలపయిన్+ఉండి; మదీయ రథ్యంబుల= నా రథాశ్వములయొక్క; పగ్గంబులు= పగ్గాలు; ధరియించి+ఉన్నన్= చేతదాల్చి ఉండగా; ఏనునున్= నేనును; కనుంగొని; నమస్కరించినన్; దీవించి; చనియెన్= వెళ్ళింది; వెండియున్= మరియు.

తాత్పర్యం: నేను మూర్ఛలో మునిగి ఉన్న సమయంలో ఎనిమిది మంది బ్రాహ్మణులు నాతో సమానమైన వయస్సు, రూపం కలవారు నన్ను నేలనుండి లేవదీసి, శ్రమ తొలగించి రథంలో కూర్చోబెట్టి ఆకాశగమనంలో వెళ్ళారు. అంతకుమునుపే గంగాదేవి పూర్వం నేను చూచిన రూపంతో రథం నొగల మీద కూర్చుండి గుర్రాల పగ్గాలు చేత ధరించి ఉండింది. నేను నమస్కరించగా నన్ను దీవించి తన దారిని తాను వెళ్ళింది. ఆ తరువాత.

క. సారథ్యంబును జేయుచు । ధీరత వాటించి రామదేవుని తోడం
గ్రూరాస్త్రంబుల సమర వి । హారం బొనరించితిని సురావలి వొగడన్. 337

ప్రతిపదార్థం: సారథ్యంబును+జేయుచున్= రథం నడుపుతూ; ధీరత+పాటించి= ధైర్య మవలంబించి; సుర+ఆవలి= దేవతాసమూహం; పొగడన్= శ్లాఘించగా; రామదేవునితోడన్= భృగురాముడితో; క్రూర+అస్త్రంబులన్= దారుణమైన అస్త్రాలతో; సమరవిహారంబు+ఒనరించితిని= యుద్ధక్రీడ చేశాను.

తాత్పర్యం: నేనే రథం నడుపుకొంటూ; ధైర్యం వహించి అంబరతలంలో నిలిచి దేవగణం మెచ్చగా భార్గవరాముడితో ఘోరములైన అస్త్రాలతో రణక్రీడ సలిపాను.

భీష్మునకు వసువులు స్వప్నసాక్షాత్కారంబున మోహనాస్త్రం బిచ్చుట (సం.5-184-1)

వ. ఇవ్విధంబునం బోరి సూర్యాస్తమయం బగుటయు నెప్పటియట్ల చని యే నా రాత్రి యేకాంతంబున దర్భశయనంబున నుండి సురభూసుర వర్గంబులం దలంచి భక్తిం బ్రణామంబులు సేసి 'పరశురాముని జయింపరా దయ్యెడు, దినంబులు పెక్కులు సనియె, నతని నాజి జయించుటఁ గలుగునేని మీరు నాకుం

దోఁచి యూఱడింపవలయు' నని ప్రార్థించి నిద్రించుచుండం బవలు నన్నెత్తి రథంబుపయిం బెట్టిన యెనమండ్రునుం బ్రభాత సమయంబునం గలలోన వచ్చి. 338

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; పోరి= పోరాడి; సూర్య+అస్తమయంబు+అగుటయున్= ప్రొద్దుగ్రుంకగా; ఎప్పటి+అట్ల చని= మునుపటి వలె యుద్ధం చాలించి వెళ్ళి; ఏను= నేను; ఆ రాత్రి; ఏకాంతంబునన్= ఒంటరిగా; దర్భశయనంబునన్+ఉండి= దర్భమీద పరుండి ఉండి; సురభూసుర వర్గంబులన్+తలంచి= దేవతలను బ్రాహ్మణులను ధ్యానించి; భక్తిన్; ప్రణామంబులు చేసి= నమస్కరించి; పరశురామునిన్; జయింపన్‌రాదు+అయ్యెడున్= గెలుచుటకు వీలుకావటంలేదు; దినంబులు; పెక్కులు= చాల, చనియెన్= కడచినవి; అతనిన్; ఆజిన్= యుద్ధంలో; జయించుట కలుగున్+ఏనిన్= గెలుచుటకు శక్యమైతే; మీరు; నాకున్; తోఁచి= గోచరించి; ఊఱడింపన్+వలయున్= ఓదార్చవలెను; అని, ప్రార్థించి= వేడుకొని; నిద్రించుచున్+ ఉండన్; పవలు= పగటి పూట; నన్నున్+ఎత్తి; రథంబుపయిన్+పెట్టిన; ఎనమండ్రునున్= ఎనిమిదిమంది; ప్రభాతసమయంబునన్= ఉదయవేళ; కలలోనన్+వచ్చి= స్వప్నంలో కనబడి.

తాత్పర్యం: ఈ రీతి పగలంతా పరశురాముడితో పోరాడి ప్రొద్దు గ్రుంకగనే ఎప్పటివలె నా నివాసానికి వెళ్ళాను. ఆ రాత్రి నేను ఏకాంతంగా దర్భలపై పరుండి దేవతలను బ్రాహ్మణులను ధ్యానించి భక్తితో వారికి నమస్కారాలు చేసి 'పరశురాముడిని జయించటం శక్యంగాకున్నది. ఎన్నో రోజులు గడిచాయి. అతడిని రణంలో నేను జయించగలిగితే మీరు నాకు కనిపించి నన్నూరడించాలి' అని వేడుకొని నిదురించాను. భృగురాముడి శరాహతితో మూర్ఛపొందిన నన్ను ఎత్తి రథంలో కూర్చుండపెట్టి వెళ్ళిన ఆ ఎనమండుగురు ఉదయవేళ నాకు కలలో కన్పించి.

తే. నీవు నేమును నొక్కటి; నీకు వెఱవ । నేల గాంగేయ! రాము జయించునట్టి
శరము సుమ్మని మోహనాస్త్రంబు నాకు । నిచ్చిపోయిరి క్రమ్మఱ నెక్కడేని. 339

ప్రతిపదార్థం: గాంగేయ!= భీష్మా!; నీవున్= నీవును; ఏమును= మేమును; ఒక్కటి= ఒక్కటేసుమా; నీకున్= నీకు; వెఱవన్+ఏల= భయపడటమెందుకు? రామున్= పరశురాముడిని; జయించునట్టి= గెలువగలిగిన; శరముసుమ్ము+అని= బాణం సుమా అని; మోహన+అస్త్రంబున్= మోహనాస్త్రాన్ని; నాకున్= నాకు; ఇచ్చి= ఒసగి; క్రమ్మఱన్= తిరిగి; ఎక్కడ+ఏనిన్+పోయిరి= ఎక్కడికో వెళ్ళిపోయారు.

తాత్పర్యం: 'భీష్మా! నీవూ మేమూ ఒక్కటే. నీవు భయపడనక్కరలేదు. పరశురాముడిని జయించగల బాణమిది సుమా!' అని మోహనాస్త్రం నాకు ప్రసాదించి, తిరిగి ఎక్కడికో వారు వెళ్ళిపోయారు.

విశేషం: అష్టవసువులు: ఇక్ష్వాకు వంశస్థుడైన మహాభిషుడు ఎన్నో యజ్ఞాలు చేసి దేవలోకం చేరి బ్రహ్మదేవుడిని కొలుస్తుండినాడు. గంగాదేవి స్త్రీ రూప ధారిణిఅయి బ్రహ్మసభకు వచ్చింది. వాయు వశాన ఊరుమూలం కనిపించేటట్లు ఆమె చీర తొలగింది. దానిని మహాభిషుడు సాభిలాషంగా చూశాడు. అందుకు విరించి కోపించి 'నీవు మనుష్యయోనిలో జన్మించు'మని శాపం పెట్టాడు. అతడు రాజర్షిఅయిన ప్రతీపుడి కొడుకుగా పుట్టాడు. అతడే శంతనుడు. అష్టవసువులు ఒకనాడు వసిష్ఠుని తపోవనానికి వచ్చారు. అక్కడ నందిని అనే హోమధేనువును చూచారు. కోరిన వస్తువులు కురిసే ఆ గోవును అష్టమ వసువైన ప్రభాసుని పత్ని ఉశీనరపతి కూతురూ తన స్నేహితురాలూ అయిన జితవతికి బహూకరింపదలచింది. అందుకు ప్రభాసుడి సోదరులు కూడా సుముఖత చూపారు. వసిష్ఠుడు యోగదృష్టితో వసువులు హోమధేనువును కొనిపోయారని తెలిసి, మనుజయోనిలో

పుట్టండని వారికి శాపమిచ్చాడు. చిరకాలం మానవలోకంలో ఉండకుండేటట్లు అనుగ్రహించుమని వారు వేడుకున్నారు. ప్రభాసుడే పెద్ద అపరాధం చేశాడు గనుక అతడు మాత్రమే బహుకాలం మర్త్యలోకంలో ఉంటాడని వసిష్ఠు డనుగ్రహించాడు.

శంతనుడై జన్మించిన మహాభిషుడి సమాగమం కోసం గంగాదేవి వస్తుండగా వసువులు చూచారు. ఆమెకు వసిష్ఠుడి శాపం తెలిపి - నీ గర్భంలో జన్మిస్తాము. పుట్టినప్పుడే మమ్మల్ని నీళ్ళలో వేసి ఎక్కువకాలం పుడమిలో ఉండకుండేటట్లు చేయవలసిందని కోరుతూ, మాలో అష్టమ వసువు మాత్రం దీర్ఘాయుష్మంతుడై నీకు సంతోషం కలిగిస్తాడని చెప్పుకొన్నారు. సంప్రాప్త యౌవనుడైన కుమారుడికి రాజ్యమప్పగించి, గంగాతటంలో నీకు కన్పించిన కన్య కులగోత్రనామాలు అడగకుండ ఆమె అభీష్టం సల్పుమని తెల్పి ప్రతీపుడు తపోవనానికి వెళ్ళాడు. తండ్రి చెప్పినట్లుగా శంతనుడు స్త్రీ రూపంలో ఉన్న గంగను ప్రేమించాడు. 'నే నేది చేసినా నీవు సమ్మతించాలి. వారించరాదు. అప్రియం పల్కరాదు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే నిన్ను విడిచి వెళ్ళుతాను' అన్నది గంగ. శంతనుడు సమ్మతించి ఆమెతో కలిసి కాపురం చేస్తున్నాడు. ఆపుడు, ధ్రువుడు, సోముడు, ధరుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు అనే అష్టవసువులు ఒకరివెంట ఒకరుగా గంగ కడుపున పుడుతూ వచ్చారు. పుట్టినవారిని పుట్టినట్లుగా తీసికొనివెళ్ళి భాగీరథి గంగనీళ్ళలో వేస్తూ వచ్చింది. అష్టమపుత్రుడినికూడా గంగలో కలపటానికి ఆమె పూనుకోగా శంతనుడు వారించి నిందించాడు. అపుడు గంగ తన కథ చెప్పి ఇతడు ధర్మమూర్తిఅయి మనుజలోకంలో పెద్దకాల ముంటాడు. పెరిగేవరకు నావద్ద ఉంటాడు' అని చెప్పి కొడుకును తోడ్కొని వెళ్ళింది. భీష్ముడు సాంగములైన వేదాలు వసిష్ఠుడి దగ్గర, ధనుర్విద్య పరశురాముడి వద్ద అభ్యసించాడు. గంగాదేవి తేజస్వియైన కుమారుడిని శంతనున కొప్పగించింది. సత్యవతిని వివాహమాడదలచిన జనకుడి కోరిక తీర్చుటకై భీష్ముడు పెళ్ళి మానుకొన్నాడు. రాజ్యం వదలుకొన్నాడు. బ్రహ్మచర్యం స్వీకరించాడు. అతిమానుషమైన ఆ మహనీయుడి సత్యవ్రతానికి సంతసిల్లిన శంతనుడు అతడికి స్వచ్ఛందమరణం వరంగా ఇచ్చాడు. ఆ వసువులే విప్రరూపాలలో భీష్ముడికి కలలో కనిపించారు.

వ. ఏను మేలుకాంచి సంతోషించి తన్మంత్ర స్వరూపంబును బ్రయోగోపసంహార ప్రకారంబులును జిత్తంబున నిలిపికొనుచుఁ గాలోచితకృత్యంబు లాచరించి యొక్క సారథి నంగీకరించి, యరదంబు పూన్పించి, సన్నద్ధుండనై సత్వరంబుగా సమరంబున కరిగినం బరశురామదేవుండు. 340

ప్రతిపదార్థం: ఏను= నేను; మేలుకాంచి= మేలుకొని; సంతోషించి; తద్+మంత్రస్వరూపంబును= ఆ మోహనాస్త్రంయొక్క మంత్ర విధానాన్ని; ప్రయోగ+ఉపసంహార ప్రకారంబులును= ప్రయోగించే తీరు, వెనుకకు మరలించే రీతి; చిత్తంబునన్= మనస్సులో; నిలిపికొనుచున్; కాల+ఉచిత కృత్యంబులు= ఉదయవేళలో ఆచరించవలసిన పనులు; ఆచరించి= నిర్వర్తించి; అరదంబు; పూన్పించి= సిద్ధపరిచేటట్లుచేసి; సన్నద్ధుండను+ఐ= సిద్ధపడినవాడనై; సత్వరంబుగాన్= శీఘ్రంగా; సమరంబునకున్= కయ్యానికి; అరిగినన్; పరశురామదేవుండు.

తాత్పర్యం: నేను నిద్రనుండి లేచి సంతోషించి మోహనాస్త్రపు మంత్రవిధానాన్ని, ప్రయోగోపసంహార రీతులను జ్ఞప్తిలో ఉంచుకొని ప్రాతఃకాల కృత్యాలు నిర్వర్తించి ఒక్క సారథిని ఏర్పాటు చేసికొని రథాన్ని ఆయత్తపరచుకొని సంసిద్ధుడనై శీఘ్రమే కదనరంగానికి వెళ్ళాను. అప్పుడు పరశురాముడు.

క. నిన్న యఱసచ్చి పోయితి । వున్న యఱయు నేఁడు దీర్చి యుడిపెద నీ గ
ర్వోన్నతి; యిం కెట వోయెదు । నన్ను నెఱుఁగ వెట్టు?'లనుచు నాపైఁ గవిసెన్. 341

ప్రతిపదార్థం: నిన్న= నిన్నటిరోజు; అఱ+చచ్చిపోయితి(వి)= సగం చచ్చి వెళ్ళావు; ఉన్న+అఱయున్= మిగిలిన సగం ప్రాణం; నేఁడు= ఈ రోజు; తీర్చి= తొలగించి; నీ గర్వ+ఉన్నతిన్= నీ మదాతిశయాన్ని; ఉడిపెదన్= మాపెదను; ఇంకన్= మరి;

ఎట+పోయెదు(వు)?= ఎక్కడికి తప్పించుకొని వెళ్ళుతావు? నన్నున్= నన్ను; ఎఱుఁగవు+ఎట్టులు?= ఎట్లు తెలియకున్నావు?; అనుచున్= అని పలుకుతూ; నాపైన్+కవిసెన్= నామీదికి దూకాడు.

తాత్పర్యం: 'నిన్న సగం చచ్చి వెళ్ళావు. ఈ దినం ఆ ఉన్న సగం కూడ హరించి నీ మద మణచి వేస్తాను. ఇంకెక్కడికి తప్పించుకు పోగలవు? నన్నెరుగవా?' అంటూ (పరశురామదేవుడు) నా మీదికి విజృంభించాడు.

క. కవిసినఁ గడంగి పెల్లుగఁ । గవియించితి నంపవెల్లిఁ గడుఁ గ్రూరత భా
ర్గవుఁడును మద్గాత్రంబున । వివిధాస్త్ర ప్రతతి నించి వెగ డొందించెన్. 342

ప్రతిపదార్థం: కవిసినన్= నాపైకి దుముకగా; కడంగి= పూని; పెల్లుగన్= అధికంగా; అంపవెల్లిన్= బాణప్రవాహాన్ని; కవియించితిన్= పరపాను; కడున్= మిక్కిలి, క్రూరతన్= కనికరం లేకుండా; భార్గవుఁడును= పరశురాముడు; మత్+గాత్రంబునన్= నా శరీరమునందు; వివిధ+అస్త్రప్రతతిన్+నించి= పలు తెరగులైన అస్త్ర సమూహాలను నిండించి; వెగడు+ఒందించెన్= తల్లడపరిచాడు.

తాత్పర్యం: పరశురాముడు నామీదికి కవియగా నేను పూనికతో బాణ ప్రవాహాన్ని అతడిపై ప్రసరింపజేశాను. ఆయన రవంతకూడా కనికరం లేకుండా నా శరీరమునందు పలువిధాలైన అస్త్రాలను నాటి భీతి కలిగించాడు.

వ. ఏనుం గోపించి. 343

ప్రతిపదార్థం: ఏనున్= నేనుకూడ; కోపించి= రోషించి-

తాత్పర్యం: నేను కూడా రోషపడి.

తే. రయము మెఱయంగ నొక్క నారసము ఫాల । దేశమునయందు నాఁ టించి తీవ్ర శక్తి
నురము వైచినఁ దూఁగాడి యొఱగ నూఁది । పట్టి యకృతవ్రణుఁడు తేర్చెఁ బరశురాము. 344

ప్రతిపదార్థం: రయము+మెఱయంగన్= వేగం మించగా; ఒక్క నారసమున్= ఒక తూపును; ఫాలదేశమున అందున్= నిటలభాగంలో; నాటించి= దిగేటట్లు చేసి; తీవ్రశక్తిన్= దారుణమైన శక్తిని; ఉరమున్ వైచినన్= రొమ్ముపై వేయగా; తూఁగాడి= చలించి; ఒఱగన్= ప్రక్కకు వ్రాలగా; అకృతవ్రణుఁడు= సారథ్యం సల్పుతున్న అకృతవ్రణుడు; ఊదిపట్టి= వ్రాలకుండా గట్టిగా పట్టుకొని; పరశురామున్+తేర్చెన్= పరశురాముడిని స్మృతికి వచ్చేటట్లు చేశాడు.

తాత్పర్యం: వేగం మీరేటట్లు నేనొక్క తూపును ఆయన నిటలభాగంలో దిగబడే విధంగా నాటాను. తరువాత తీవ్రమైన శక్త్యాయుధాన్ని ఆయన గుండెపై వేశాను. అంతట పరశురాముడు చలించి ప్రక్కకు వ్రాలగా, పడకుండా గట్టిగా పట్టుకొని అకృతవ్రణుడనే ఆయన సారథి అతడిని స్మృతికి వచ్చేటట్లు చేశాడు.

క. అప్పుడు దెప్పిఱి కన్నుల । నిప్పులు రాలంగ నన్ను నిశ్చల దృష్టిం
దప్పక చూచి యలఁతి న । వొప్పంగ బ్రహ్మాస్త్ర మాతఁ డుగ్రత నేసెన్. 345

ప్రతిపదార్థం: అప్పుడు= అంతట; ఆతఁడు= పరశురాముడు; తెప్పిఱి= తేరుకొని; కన్నులన్= నేత్రములనుండి; నిప్పులు రాలంగన్= అగ్నికణాలు రాలుతుండగా; నన్నున్= నన్ను; నిశ్చలదృష్టిన్= చలించని చూపులతో; తప్పక చూచి= మానకుండా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కనుగొని; అలఁతి నవ్వు= చిరునవ్వు; ఒప్పఁగన్= మెరయగా; ఉగ్రతన్= భయంకరంగా; బ్రహ్మ+అస్త్రమున్+ఏసెన్= బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు.

తాత్పర్యం: అంతట పరశురాముడు తేరుకొని తన కనులనుండి అగ్ని కణాలు రాలుతుండగా నన్ను కన్నార్పకుండా క్రూరంగా చూచి చిరునవ్వు దీపించగా బ్రహ్మాస్త్రాన్ని దారుణంగా నాపై ప్రయోగించాడు.

క. తెగఁగొని బ్రహ్మాస్త్రమ యేఁ । దగ నేసిన నొకటి నొకటి దార్కొని రెండున్
గగనంబంతయుఁ దేజ । స్థగితముగాఁ జేసె సురలు దైత్యులుఁ దలఁకన్. 346

ప్రతిపదార్థం: ఏన్= నేను; తెగన్+కొని= నారిసారించి; బ్రహ్మ+అస్త్రము+అ= బ్రహ్మాస్త్రమునే; తగన్= చక్కగా; ఏసినన్= ప్రయోగించగా; ఒకటిన్+ఒకటి= ఒకదాని నొకటి; తార్కొని= మార్కొని; సురలు= దేవతలు; దైత్యులు= రక్కసులు; తలఁకన్= భీతిల్లగా; రెండున్= ఆ రెండు బ్రహ్మాస్త్రాలు; గగనంబు+అంతయున్= ఆకాశము నంతటినీ; తేజస్+స్థగితముగాన్+చేసెన్= కాంతితో ఆచ్ఛాదించబడినదానినిగా చేశాయి.

తాత్పర్యం: నేను కూడా నారి సారించి బ్రహ్మాస్త్రమునే ప్రయోగించాను. ఈ రెండు బ్రహ్మాస్త్రాలు ఒకదాని నొకటి ఎదుర్కొని దేవదానవులు భీతిల్లగా ఆకాశాన్నంతటినీ కాంతితో ఆచ్ఛాదింపజేశాయి.

తే. సకల భూత సంక్షోభ సంజనకమైన । యట్టియెడఁ గని యిది తఱి యని తలంచి
మోహనాస్త్రంబు నంచితావాహనంబు । సేయుటయును జరాచర శ్రేణి మ్రోసె. 347

ప్రతిపదార్థం: సకలభూత సంక్షోభ సంజనకము+ఐన= సర్వప్రాణులకు కలతను గలిగించుచున్నదైన; అట్టియెడన్= ఆ సమయంలో; కని= గమనించి; ఇది తఱి+అని= ఇది అదనని; తలంచి= భావించి; మోహన+అస్త్రంబు= మోహనాస్త్రముయొక్క; అంచిత+ఆవాహనంబు= ఒప్పిదమైన ఆహ్వానాన్ని; చేయుటయును= చేయగా; చర+అచరశ్రేణి= జంగమస్థావరాలయొక్క సమూహం; మ్రోసెన్= ఆక్రోశించింది.

తాత్పర్యం: సకలజీవులకు సంక్షోభం కలిగించే ఆ సమయం చూచి ఇది శర ప్రయోగానికి తగిన వేళ అని తలంచి, నేను మోహనాస్త్రాన్ని ఆవాహనం చెయ్యగా చేతనములు, అచేతనములు ఆక్రందించాయి.

వ. తదవసరంబున. 348

తాత్పర్యం: ఆ సమయంలో.

క. ఉడుగుడుగు మోహనాస్త్రము । విడువకు మను నెలుఁగుతోడ వేగంబున న
య్యెడ కేఁగుదెంచి నారదుఁ । డెడమడు గించుకయు లేక యిట్లను నాతోన్. 349

ప్రతిపదార్థం: ఉడుగు+ఉడుగు(ము)= మానుము మానుము; మోహన+అస్త్రమున్= మోహనాస్త్రాన్ని; విడువకుము= ప్రయోగించవద్దు; అను+ఎలుఁగు తోడన్= అను కంఠధ్వనితో; వేగంబునన్= త్వరితంగా; అయ్యెడకున్= మేము పోరాడుతున్న ప్రదేశానికి; ఏఁగుదెంచి= వచ్చి; నారదుఁడు= నారద మహర్షి; ఎడమడుగు+ఇంచుకయున్ లేక= అరమరిక రవంతకూడా లేకుండ; నాతోన్+ఇట్లు+అనున్= నాతో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: 'వద్దు వద్దు. మోహనాస్త్రాన్ని ప్రయోగించవద్దు' అని కేకలిడుతూ నారదమహర్షి సత్వరంగా అక్కడికి వచ్చాడు. అరమరిక లేకుండా నాతో ఇట్లా అన్నాడు:

క. **'గురునకు నవమానము ని । ష్ఠుర వృత్తిం జేసెదీవు సూచితిమే యి**
ప్పరుసునఁ బరుసపు నడవడిఁ । గురువంశప్రవర యిట్లుఁ గూడునె చేయన్?' **350**

ప్రతిపదార్థం: కురువంశప్రవర!= కురువంశస్థులలో శ్రేష్ఠుడా!; గురునకున్= విద్య గరపిన ఆచార్యునకు; అవమానమున్= పరాభవాన్ని; నిష్ఠుర వృత్తిన్= క్రూరవర్తనంతో; ఈవు చేసెదు(వు)= నీవు చేస్తున్నావు; ఈ+పరుసునన్= ఈరకంగా; పరుసపు నడవడి= క్రూరమైన ప్రవర్తన; చూచితిమే= లోకంలో కనుగొన్నది లేదు; ఇట్లు చేయన్= ఈ విధంగా సల్పడం; కూడునె?= నీవంటివాడికి తగునా?

తాత్పర్యం: 'కురువంశ శ్రేష్ఠుడా! కర్కశ బుద్ధితో గురునకు పరాభవం చేస్తున్నావు. ఇట్టి కఠినమైన నడవడి లోకంలో చూచిందిలేదు. ఇట్లా చేయటం నీవంటి వానికి ఉచితం కాదు.'

వ. **అని సువ్యక్తంబుగాఁ జెప్పి.** **351**

ప్రతిపదార్థం: అని; సువ్యక్తంబుగాన్= స్పష్టంగా; చెప్పి= తెలిపి.

తాత్పర్యం: అని సుస్పష్టంగా నారదుడు పలికి.

క. **'వీరె సుర లాకసంబున । గారవమున బుద్ధి సెప్పఁగా నీకడకుం**
దా రేగు దెంచి'రని క । న్నారంగాఁ జూపె నాకు నయ్యేనమండ్రన్. **352**

ప్రతిపదార్థం: ఆకసంబునన్= గగనంలో; వీరె సురలు= అరుగో దేవతలు; గారవమునన్= గౌరవంతో; బుద్ధి చెప్పఁగాన్= నీకు నీతులు గఱుపుటకై; నీ కడకున్= నీ దగ్గరకు; తారు= తాము; ఏగుదెంచిరి= వచ్చిఉన్నారు; అని= అనుచు; కన్ను+ ఆరంగాన్= కనులార; నాకున్= నాకు; ఆ+ఎనమండ్రన్= ఆ యెనిమిదిమందిని; చూపెన్= చూపాడు.

తాత్పర్యం: 'అరుగో! ఆకాశంలో దేవతలు. వీరు గౌరవంగా నీకు బుద్ధులు గరపవలెనని నీ దగ్గరకు వచ్చి ఉన్నారు' అంటూ నారదుడు కనులారా నాకు ఆ యెనిమిదిమందిని చూపించాడు.

వ. **ఇవ్విధంబున నెప్పటి విప్రవరులు సన్నిధిసేసి నన్నుం జూచి నగుమొగంబులతో నెఱుఁగని వారపోలె నిట్లనిరి;** **353**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ఎప్పటి విప్రవరులు= నిన్న రణంలో మూర్ఛితుడనై నేలబడిఉండగా రథంమీద కూర్చుండబెట్టి చనినవారూ, రాత్రి స్వప్నంలో తోచి మోహనాస్త్రం ఇచ్చినవారూ అయిన ఆ యెనిమిదిమంది బ్రాహ్మణులు; సన్నిధిచేసి= నా సమ్ముఖమున నిల్చి; నన్నున్+చూచి= నను గాంచి; నగు మొగంబులతోన్= నవ్వుతో నిండిన వదనాలతో; ఎఱుఁగని వార పోలెన్= ఏమియు తెలియనివారివలె; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు:

తాత్పర్యం: పరశురామ శరాహతుడనై నేలబడియుండగా నన్నెత్తి రథంలో కూర్చోబెట్టి వెళ్ళినవారూ, వేకువజామున నాకు కలలో కనిపించి మోహనాస్త్రము నిచ్చినవారూ అయిన ఆ యెనమండుగురు బ్రాహ్మణోత్తములు నాచెంత జేరి నవ్వుతున్న ముఖాలతో ఏమీ తెలియనివారివలె నాతో ఇట్లా అన్నారు:

క. 'నారదముని త్రైలోక్య స । మారాధ్యుం డితని పలుకు లాగమ వాక్యో
దారములు వినుము వీనిం । గ్రూరత పాటింపఁ దగదుగురు విషయమునన్.' 354

ప్రతిపదార్థం: నారదముని= నారద మహర్షి; త్రైలోక్య సమారాధ్యుఁడు= ముల్లోకాలవారిచేత పూజించదగినవాడు; ఇతని పలుకులు= ఈ మహనీయుడి మాటలు; ఆగమవాక్య+ఉదారములు= వేదవాక్కులవలె గొప్పవి; వీనిన్+వినుము= ఈ మహాత్ముడి మాటలు ఆలకించు; గురువిషయమునన్= ఆచార్యుడి విషయములో; క్రూరత= కాఠిన్యం; పాటింపన్+తగదు= వహించరాదు.

తాత్పర్యం: 'నారద మహర్షి ముల్లోకాలవారిచే పూజింపదగినవాడు. ఈ మహానుభావుడి మాటలు వేదవచనాలవలె దొడ్డవి. ఈ మునీంద్రుడి పలుకులు వినుము. గురునకు సంబంధించిన విషయంలో కర్కశత్వం కూడదు.'

వ. అనిన విని యేను సమ్మోహనాస్త్రం బేయుట యుడిగి బ్రహ్మాస్త్రంబు దీపింపఁజేసితి; నప్పుడు జామదగ్న్యుం డది యెల్ల నెఱింగి, యోటమి యెక్కించుకొని చలంబు మిగిలియున్నం దజ్జనకుండు జమదగ్నియుఁ దదీయ పితృవర్గంబును నతనికి సన్నిధి సేసి వేఁడికొని శాంతవచనంబులం దేర్చి యిట్లనిరి: 355

ప్రతిపదార్థం: అనినన్; విని; ఏను= నేను; సమ్మోహన+అస్త్రంబు; ఏయుట= ప్రయోగించటం; ఉడిగి= మాని; బ్రహ్మ+అస్త్రంబున్; దీపింపన్+చేసితిన్= ప్రజ్వలింపజేశాను; అప్పుడు; జామదగ్న్యుండు= జమదగ్ని తనయుడైన పరశురామదేవుడు; అది+ఎల్లన్+ఎఱింగి= నారదాదులు వచ్చి నాకు హితం చెప్పటం; నేను మోహనాస్త్రమును విడువకుండటం; తెలిసి; ఓటమి+ఎక్కించుకొని= తాను అపజయం పాలైనట్లుగానే భావించి; చలంబు+మిగిలి+ఉన్నన్= ద్వేషాతిశయంతో ఉండగా; తద్+జనకుండు= నా గురువు తండ్రి; జమదగ్నియున్; తదీయ పితృవర్గంబును= ఆయన పితరుల సమూహమునూ; అతనికిన్; సన్నిధిచేసి= ప్రత్యక్షమై; వేఁడికొని= అర్థించి; శాంతవచనంబులన్= చల్లటి మాటలతో; తేర్చి= కలతబాపి(ప్రసన్నుడిని కావించి); ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: ఎనమండుగురు భూసుర పుంగవుల మాటలు విని, నేను సమ్మోహనాస్త్రం విడవటం మానుకొన్నాను. బ్రహ్మాస్త్రమునే ప్రకాశింపజేశాను. అపుడు జమదగ్నిసుతుడు నారదాదులు వచ్చి నాకు హితోపదేశం చేయటం; నేను సమ్మోహనాస్త్ర ప్రయోగం విరమించటం తెలిసికొని, తాను అపజయం పొందినట్లు భావించి, నాపై ద్వేషం పెంచుకొన్నాడు. అంతట అతడి తండ్రి జమదగ్ని మహర్షి, ఆయన పితరులు పరశురాముడికి ప్రత్యక్షమై వేడుకొని చల్లటి మాటలతో అతడిని ప్రసన్నుడిని కావించి ఇట్లా పలికారు:

క. 'వినుము వసుమూర్తి యీతం । డనన్య సామాన్య తేజుఁ డాహవభూమిన్
మనకు జయింప వశమె భీ । ష్ముని? విపున కగునె రోషమును మత్సరమున్?' 356

ప్రతిపదార్థం: వినుము= పరశురామా! మా మాటలు ఆలకించుము; ఈతఁడు= ఈ భీష్ముడు; వసుమూర్తి= వసు స్వరూపుడు; అనన్య సామాన్య తేజుఁడు= పరుల కెవ్వరికి లేని ప్రతాపం కలవాడు; ఆహవ భూమిన్= యుద్ధరంగంలో;

మనకున్= మనకు; భీష్మని జయింపన్ వశమె?= భీష్ముడిని గెలువ శక్యమా?; (కాదనుట); విప్రునకున్= బ్రాహ్మణుడికి; రోషమును= కోపమూ; మత్సరమున్= ద్వేషమూ; అగునె?= తగునా?

తాత్పర్యం: 'పరశురామా! మా పలుకు లాలకించుము. ఈతడు వసువు. ఇతరుల కెవ్వరికినీ లేనట్టి ప్రతాపం కలవాడు. యుద్ధంలో ఇతడిని గెలువ మనతరమా? బ్రాహ్మణుడికి క్రోధం, ఈర్ష్య తగవు సుమా!

తే. **సమర ముడుగు నారాయణసఖుఁడు నరుఁడు । సవ్యసాచి నా నింకొక జన్మమొంది**
యితని వధియించుఁగాని తక్కితర జనము । లకు నసాధ్యుండు భీష్ముఁ డాలంబులోన. **357**

ప్రతిపదార్థం: సమరము+ఉడుగు(ము)= యుద్ధం మానుము; నారాయణసఖుఁడు= నారాయణుడికి చెలికాడైన; నరుఁడు= నరుడు; సవ్యసాచి నాన్= అర్జునుడనే పేరుతో; ఇంకొక జన్మము+ఒంది= మరొక్క పుట్టువునుపొంది; ఇతనిన్= ఈ భీష్ముడిని; వధియించున్ కాని= చంపునే తప్ప; తక్కు+ఇతరజనములకున్= మిగిలిన వేరే మనుష్యులకు; ఆలంబులోనన్= కదనంలో; భీష్ముఁడు= దేవవ్రతుడు; అసాధ్యుండు= సాధింపరానివాడు.

తాత్పర్యం: రామా! యుద్ధం విరమించుము. నారాయణుడి చెలికాడైన నరుడు అర్జునుడనే పేరుతో వేరొక జన్మమెత్తి వీనిని సంహరించగలడు. అంతే కాని ఇతరులు భీష్ముడిని కదనంలో జయించలేరు సుమా!

వ. **అనిన నతండు పోక పెనంగిన వెండియు ననేక ప్రకారంబులం జెప్పి యమ్మునులు నాకడకుం జనుదెంచి యుపశమన వాక్యంబులు పలికి జామదగ్న్యుతోడం దమయాడిన మాటలు తేటపఱిచి యప్పుడు పొడసూపిన జాహ్నవియుం దారు బహు విధంబుల నన్ను ననునయించి భార్గవుపాలికి నమ్మహాదేవిం దోడ్కొని యరిగియుం గ్రమ్మఱ మత్సమీపంబునకు వచ్చియు నెట్టకేలకుం జలం బుడిపిన నే మిరువురమును దివ్యాస్త్రంబులుప సంహరించి సమరం బుడిగితి; మట్టియెడ నయ్యేనమండ్రు విప్రులుం జేరి నాతో నిట్లనిరి:** **358**

ప్రతిపదార్థం: అనినన్= అని వారు చెప్పినప్పటికినీ; అతండు; పోక= వెనుదీయక; పెనంగినన్= పోరాడగా; వెండియున్= మరల; అనేక ప్రకారంబులన్= పలువిధాల; చెప్పి; ఆ+మునులు; నా కడకున్; చనుదెంచి; ఉపశమనవాక్యంబులు= శాంతివచనాలు; పలికి; జామదగ్న్యుతోడన్= జమదగ్ని తనయుడైన పరశురాముడితో; తమ+ఆడిన మాటలు; తేటపఱిచి= వెల్లడించి; అప్పుడు= ఆ సమయమందే; పొడచూపిన= సాక్షాత్కరించిన; జాహ్నవియున్= గంగాదేవియు; తారున్= తామును; బహువిధంబులన్= పెక్కురీతుల; నన్నున్; అనునయించి= బుజ్జగించి; భార్గవుపాలికిన్= పరశురాముడికడకు; ఆ+మహాదేవిని= ఆ భాగీరథిని; తోడ్కొని+అరిగియున్= వెంటబెట్టుకొని వెళ్ళియు; క్రమ్మఱన్= మరల; మత్+సమీపంబునకున్= నా దగ్గరకు; వచ్చియున్; ఎట్టకేలకున్= చివరకు; చలంబు= పంతం; ఉడిపినన్= మాన్పగా; ఏము+ఇరువురము= గురుశిష్యులమైన మే మిద్దరమూ; దివ్య+అస్త్రంబులు= బ్రహ్మాస్త్రములు రెంటినీ; ఉపసంహరించి= ఉపశమిల్లజేసి; సమరంబు; ఉడిగితిమి= మానినాము; అట్టి+ఎడన్= ఆ తరుణంలో; ఆ+ఎనమండ్రు విప్రులున్; చేరి= నా కడకు వచ్చి; నాతోన్; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు:

తాత్పర్యం: తన జనకుడూ, పితృదేవతలూ చెప్పినప్పటికిన్నీ పరశురాముడు వెనుదీయక పెనగుతుండగా వారింకనూ అనేక విధాల చెప్పి చెప్పి నాకడకు వచ్చారు. నాతో శాంతి వచనాలు పలికి పరశురాముడితో తామన్న మాటలు వెల్లడించారు. ఆ సమయంలో అక్కడ ప్రత్యక్షమైన గంగతో తామూ చేరి నన్ను పలువిధాల బుజ్జగించారు. తరువాత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వారు గంగాదేవిని వెంటబెట్టుకొని పరశురాముడి చెంతకు వెళ్ళారు. మళ్ళీ నా దగ్గరకు వచ్చారు. ఇట్లా వారు మా ఉభయుల చుట్టూ పెక్కు సారులు తిరిగి తిరిగి తుట్టతుదకు మా పంతాలు మాన్పించారు. మేమిద్దరమూ బ్రహ్మాస్త్రాలను ఉపసంహరించి యుద్ధం చాలించాము. అట్టి సమయంలో ముందు కన్పడిన ఆ యెనిమిది మంది భూసురులు నన్ను జేరి నాతో ఇట్లా అన్నారు:

ఆ. 'గురుఁడు బ్రహ్మవిదుఁ డకుంఠిత తేజుండు। పరశురాముఁ డతని పాలి కీవు
భక్తి మెఱయ నేఁగి ప్రణమిల్లి తదనుగ్ర। హంబు వడయవలయు ననఘ! యిపుడు.' 359

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; పరశురాముడు= భార్గవరాముడు; గురుఁడు= నీకు ఆచార్యుడు; బ్రహ్మవిదుఁడు= బ్రహ్మతత్త్వమెరిగినవాడు; అకుంఠిత తేజుండు= మొక్కవోని ప్రతాపం కలవాడు; అతని పాలికిన్= ఆ భృగురాముడి చెంతకు; ఈవు= నీవు; భక్తి మెఱయన్= భక్తి వెల్లడియగునట్లు; ఏఁగి= వెళ్ళి; ప్రణమిల్లి= నమస్కరించి; తద్+అనుగ్రహంబున్= ఆయన కారుణ్యమును; ఇపుడు= ఇప్పుడు; పడయన్ వలయున్= పొందవలెను.

తాత్పర్యం: 'భీష్మా! పరశురాముడు నీకు గురువు. తత్త్వవేత్త. అమోఘమైన ప్రతాపం కలవాడు. ఆ మహామహుడి చెంతకు నీ విప్పుడే వెళ్ళి, నీ భక్తి ప్రకటమయ్యేటట్లు ప్రణామం సలిపి, వారి అనుగ్రహం ఇపుడే పొందవలెను సుమా!'

వ. అని చెప్పి యతని కడకుం దారును నారదమునీశ్వరుండును జమదగ్ని ప్రముఖులును భాగీరథియును జని 'నీ శిష్యుండు దేవవ్రతుండు; వాని యెడ నలుగం దగునె? వాఁడు తగవు మాలిన పనిఁ జేయంజాలక పెనంగె; నింతియకాని విరోధి గాఁడు; వానిం గరుణింపు' మని తెలిపి, నన్నుం బిలిచినం బోయి యే నమ్మహాత్మునకు సాష్టాంగదండ ప్రణామంబు సేసిన నతండు దీవనతో గ్రుచ్చి యెత్తి కౌఁగిలించికొని 'గాంగేయా! నీశక్తికి భక్తికిం బ్రీతుండనైతి' నని సస్నేహంబుగా సంభావించి, యంబ నవలోకించి; నన్ను భీష్ముండు గెలిచె 'నా వలన నయ్యెడుపని యింతియ; నీవింక నీకుం జూడం బోలిన గతిం బొమ్మ'నిన నమ్మానిని' 'దేవా యిది యిట్టిద; నీ యోపినంతయుం జేసితి; నీ చేతం బోకున్న నేమి సేయుదు? నేను దపంబు పెంపున భీష్ముని వధించెద జన్మాంతరంబున నైననుం జలంబు సాధ్యంబు చేయుదు; నటు సూడు' మని పలికిపోయెఁ; దదనంతరంబ యమ్మునిజన పితృదేవతా సమూహంబును భృగు నందను నన్ను నామంత్రణంబు చేసి యంతర్ధానంబు సేసె; భార్గవుండును నన్నువీడ్కొలిపి మున్ను దనతో వచ్చిన తపోధనవర్గముం దానును మహేంద్ర శైలంబునకుం జనియె; నేను మగిడి యెడనెడ నుర్వీసురుల యాశీర్వాదంబులు సంభావన వచనంబులుఁ బ్రస్తుతి వాక్యంబులుఁ గర్ణంబుల కింపుసేయ నిటవచ్చి సత్యవతికి నమస్కారపూర్వకంబుగా నంతయు నెఱింగించిన నద్దేవి యభినందించె. 360

ప్రతిపదార్థం: అని చెప్పి; అతనికడకున్= పరశురాముడి చెంతకు; తారును= ఆ యెనమండుగురు భూసురులను; నారద ముని+ఈశ్వరుండును; జమదగ్ని ప్రముఖులను= జమదగ్ని మున్నగువారును; భాగీరథియును= నా జననిఅయిన గంగాదేవియు; చని; నీ శిష్యుండు; దేవవ్రతుండు= భీష్ముడు; వానియెడన్= అతనిపట్ల; అలుగన్+తగునె?= కోపగించుకొనవచ్చునా?; వాఁడు= భీష్ముడు; తగవు మాలిన పని= న్యాయం తప్పిన పని; చేయన్+చాలక= చేయటానికి ఇష్టపడక; పెనంగెన్= నీతో కలహించాడు;

ఇంతియకాని= ఇంతేతప్ప; విరోధికాఁడు= నీకు శత్రువు కాదు; వానిన్; కరుణింపుము; అని తెలిపి; నన్నున్ పిలిచినన్= నన్ను రమ్మనగా; పోయి; ఏను= నేను; ఆ మహాత్మునకున్; స+అష్ట+అంగ+దండ ప్రణామంబు= ఎనిమిది అవయవాలు నేలకు సోకేటట్లు కర్రవలె పడి చేసే నమస్కారం; చేసినన్= చేయగా; అతండు= పరశురాముడు; దీవనతోన్= ఆశీస్సుతో; గ్రుచ్చి ఎత్తి= దృఢంగా నేలనుండి మీదికెత్తి; కౌఁగిలించికొని; గాంగేయా; నీ శక్తికిన్= నీ బలానికి; భక్తికిన్; ప్రీతుండన్+ఐతిన్= హర్షించాను; అని; సస్నేహంబుగాన్= ప్రేమయుక్తంగా; సంభావించి= ఆదరించి; అంబన్; అవలోకించి= చూచి; నన్నున్; భీష్ముండు; గెలిచెన్; నావలనన్; అయ్యెడు పని= జరుగు పని; ఇంతియ= ఇంతే; నీవు+ఇంకన్; నీకున్+ చూడన్+పోలినగతిన్+పొమ్ము= ఆలోచించుకొని నీకు తగిన దారి నీ వనుసరించుము; అనినన్; ఆ+మానిని= అంబ; దేవా!= ప్రభూ!; ఇది+ఇట్టిదని= నా ప్రాప్తమింతే; నీ+ఓపినంతయున్+చేసితి(వి)= నీకు శక్తి ఉన్నంతవరకు చేశావు; నీచేతన్+పోకున్నన్+ ఏమిచేయుదు?= నీకు శక్యము కానిదానికి నీవేమి చేయగలవు?; నేను తపంబు పెంపునన్= తపశ్శక్తిచేత; భీష్ముని వధించెదన్; జన్మ+అంతరంబునన్+ఐనన్= మరొక జన్మలోనైనా; చలంబు సాధ్యంబు చేయుదున్= పంత మీడేర్చుకుంటాను; అటుచూడుము= నీవు చూస్తూ ఉండుము; అని పలికిపోయెన్; తద్+అనంతరంబ= అంబ వెళ్లిన తరువాత; ఆ మునిజన+ పితృదేవతా సమూహంబును= ఆ జమదగ్ని, పితృదేవతా వర్గం; భృగునందనున్= పరశురాముడిని; నన్నున్= నన్ను; ఆమంత్రణంబు చేసి= పోయి వస్తామని మమ్ము వదలి; అంతర్ధానంబు చేసెన్= మరుగైపోయారు; భార్గవుండును= పరశురాముడునూ; నన్నున్; వీడ్కొలిపి= పోయిరమ్మని చెప్పి; మున్ను= పూర్వం; తనతో వచ్చిన; తపోధన వర్గమున్= మునిసమూహమును; (తపోధనుడు - తపమే ధనంగా కలవాడు= ఋషి); తానును; మహేంద్ర శైలంబునకున్ చనియెన్; నేను; మగిడి= మరలి; ఎడన్+ఎడన్= అక్కడక్కడ, ఉర్వీసురుల= బ్రాహ్మణుల యొక్క; ఆశీర్వాదంబులున్= దీవనలు; సంభావన వచనంబులున్= ఆదరంతో కూడిన పలుకులు; ప్రస్తుతి వాక్యంబులున్= పొగడ్తమాటలు; కర్ణంబులకున్= చెవులకు; ఇంపుచేయన్= ఆహ్లాదం కూర్పగా; ఇటవచ్చి= హస్తినాపురికి చనుదెంచి; సత్యవతికిన్; నమస్కారపూర్వకంబుగాన్= తొలుత నమస్కరించి; అంతయున్; ఎఱింగించినన్; ఆ+దేవి; అభినందించెన్= నన్ను మెచ్చుకొన్నది.

తాత్పర్యం: అని పలికి పరశురాముడి దగ్గరకు ఎనమండుగురు భూసురోత్తములు, నారదమునీంద్రుడు, జమదగ్ని, పితృదేవతా వర్గం, గంగాదేవి వెళ్ళారు. వెళ్ళి భీష్ముడు నీకడ విద్యనేర్చుకొన్నాడు. అతడు నీ శిష్యుడు. వాని యెడ నీకు కోపం తగునా? అతడు న్యాయవిహీనమైన పని చేయటాని కిష్టపడక నీతో కలహించాడు. అంతేకాని, నీకు పగవాడు కాడు. వాడిని కృపతో చూడుమని భృగురాముడికి చెప్పి అతడి చెంతకు రమ్మన్నారు. నేను వెళ్ళి ఆ మహానుభావుడికి సాష్టాంగంగా సాగిలపడి నమస్కరించాను. ఆయన దీవించి నన్ను గ్రుచ్చి లేవనెత్తి కౌగిలించుకొన్నాడు. 'గాంగేయా! నీ శక్తికీ భక్తికీ సంతోషించాను' అంటూ స్నేహయుక్తంగా పలికి నన్ను మన్నించాడు. ఆ తరువాత అంబను జూచి 'నన్ను భీష్ముడు జయించాడు. నేను చేయగల్గిన దింతే. నీ వింక నీకు తోచినదారి చూచుకో. వెళ్ళు' మని చెప్పాడు. ఆమె పరశురాముడితో 'దేవా! నా ప్రాప్తమింతే. నీ చేతనైనంతవరకు చేశావు. నీవలన కానిదానిని నీవు మాత్రమేమి చేయగలవు? నేను తపోబలంచేత భీష్ముడిని వధిస్తాను. మరొక జన్మలోనైనా నా పగ తీర్చుకొంటాను చూడు'మని పలికి అక్కడ నుండి వెళ్ళిపోయింది. అటు తరువాత నారదాది మునులు, జమదగ్ని, పితృదేవతలు పరశురాముడినీ, నన్నూ చూచి వెళ్ళివస్తామని పలికి మాయమయ్యారు. భృగురాముడు నన్ను ఆగుమనిచెప్పి, తనతో వచ్చిన ఋషి సమూహంతో మహేంద్రగిరికి వెళ్ళాడు. నేనున్నూ అక్కడ నుండి బయలుదేరి, దారిలో అక్కడక్కడ బ్రాహ్మణుల ఆశీర్వాదాలు, ఆదరపూర్వక వచనాలు, పొగడ్త మాటలు వీనులకు విందుసేయగా హస్తినకు వచ్చి, మా జనని సత్యవతీ దేవికి నమస్సులర్పించి జరిగినదంతా విన్నవించాను. అందుకు ఆ దేవి సంతోషించింది.

నారదుఁడు భీష్మున కంబవృత్తాంతం బంతయుఁ జెప్పుట (సం. 5-187-16)

తే. **అంబ వృత్తాంత మరయంగ ననుదినంబుఁ। దగిన వారలఁ బుచ్చుచుఁ దలఁకుచుందు**
నేను నది యాదిగాఁ జింత నేపు దక్కి। స్రుక్కియుండియు రాజుల నుక్కుమడఁతు. **361**

ప్రతిపదార్థం: అంబవృత్తాంతమున్= అంబయొక్క సమాచారాన్ని; అరయంగన్= తెలిసికొనటానికి; అనుదినంబున్= ప్రతిదినం; తగిన వారలన్= అర్హులను; పుచ్చుచున్= పంపుతూ; తలఁకుచున్+ఉందున్= భయపడుతుంటాను; నేనున్= నేను; అది+ఆదిగాన్= అది మొదలుకొని; చింతన్= విచారంచేత; ఏపు+తక్కి= ఉత్సాహం కోల్పోయి; స్రుక్కి+ఉండియున్= తగ్గిపోయినప్పటికినీ; రాజులన్= భూపతులను; ఉక్కు మడఁతున్= పొగరణగిస్తాను.

తాత్పర్యం: అంబ వృత్తాంతం తెలిసికొనటానికై ప్రతిదినం తగినవారిని పంపుతూ భయపడుతుంటాను. ఆమె తపోబలంతో నన్ను నిర్మూలిస్తానని పల్కిందిమొదలు నేను చింతతో కృశించినప్పటికినీ శత్రురాజుల మదమణగిస్తూనే ఉన్నాను.

వ. **ఒక్కనాఁడు పారాశర్య నారదులంగని యక్కార్యంబు భయంబు దోఁప విన్నవించిన వారలు 'దైవాధీనంబగు దాని మానుషంబున మానిపింప వశంబుగా; దా చింత విడువు'మని రందు నారదుం 'డక్కాశీశ్వర కన్యక తెఱంగు విను'మని యిట్లనియె.** **362**

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు; పారాశర్య; నారదులన్= పరాశరముని పుత్రుడైన వ్యాసునీ, నారదునీ; కని= చూచి; ఆ కార్యంబు భయంబు+తోఁపన్= అంబ తలపెట్టిన తపము వలన భీతి కలుగగా; విన్నవించినన్= నేను మనవి చేయగా; వారలు; దైవ+అధీనంబు+అగుదానిన్= దైవము చేతిలోనున్న పనిని; మానుషంబునన్= మనుష్య యత్నముచే; మానిపింపన్ వశంబు+కాదు; ఆ చింతన్ విడువుము; అనిరి; అందున్= వారిలో; నారదుండు; ఆ+కాశీ+ఈశ్వర కన్యక+తెఱంగు= ఆ కాశీరాజు పుత్రిక యొక్క వైనము; వినుము; అని ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నే నొకనాడు వ్యాస నారద మునీంద్రులను చూచి అంబవిషయమై నాకు భయమగుచున్నదని మనవి చేశాను. వారు దైవము తలపెట్టిన పనిని మానవ యత్నంతో మరలించడం శక్యం కాదు. నీవు ఈ విచారం విడిచిపెట్టుమని చెప్పారు. కాని నారద మహర్షి నాకు ఆ కాశీరాజపుత్రి విధం వినుమని ఇట్లా చెప్పినాడు:

సీ. **'ఆ తన్వి యమునా నదీ తీరమున కేఁగి। యత్యుగ్రమగు తప మాచరించి**
యందుండి కౌశికు నావాస మాదిగాఁ। గలుగు సిద్ధాశ్రమంబులకు నెల్లఁ
జని చని తత్ప్రదేశంబుల నిష్ఠుర। వ్రతములు సలుపంగ వచ్చి నీదు
జనని జాహ్నవి 'యిట్లు వనితల కతి దుష్క। రములగు బహునియమములు నీకు

తే. **నడపఁ గత మేమి?' యనుడు నన్నాతి పలుకుఁ। 'దద్ద యవమాన పడితి శాంతనవు చేత;**
నపరజన్మంబునం దైన నతనిఁ జంప। నేను జాలుటకై యిట్టిదాన నైతి. **363**

ప్రతిపదార్థం: ఆ+తన్వి= ఆ తరుణి; యమునా నదీ తీరమునకున్= యమునా నది యొక్క తటమునకు; ఏఁగి= వెళ్ళి; అతి+ఉగ్రము+అగు+తపము= మిక్కిలి ఘోరమైన తపస్సు; ఆచరించి= చేసి; అందున్+ఉండి= ఆ యమునా తీరమునుండి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కౌశికు+ఆవాసము= విశ్వామిత్ర మహర్షి నివసించే ప్రదేశం; ఆదిగాన్+కలుగు= మొదలుగా ఉన్నటువంటి; సిద్ధ+ఆశ్రమంబులకున్+ఎల్లన్= తపస్సు ఫలించునట్టి ఆశ్రమాలన్నింటికినీ; చని చని= వెళ్ళి వెళ్ళి; తద్+ప్రదేశంబులన్= ఆయా తావులందు; నిష్ఠురవ్రతములు= కఠిన నియమాలతో కూడిన వ్రతాలు; చలుపంగన్= చేస్తూ ఉండగా; నీదు జనని జాహ్నవి వచ్చి= నీ తల్లిఅయిన గంగాదేవి అంబ కడకువచ్చి; ఇట్లు= ఈ విధంగా; వనితలకున్= ఆడువారికి; అతి దుష్కరములు+అగు= మిక్కిలి శ్రమతో చేయవలసిన; బహునియమములు= అనేకములైన నీమములను; నీకున్= నీకు; నడపన్+కతము+ఏమి?= సాగించడానికి కారణమేమి?; అనుడున్= అని ప్రశ్నించగా; ఆ+నాతి+పలుకున్= ఆ అంబ చెప్పింది; శాంతనవుచేతన్= శంతను పుత్రుడైన భీష్ముడి వలన; తద్ద= మిక్కిలి; అవమానపడితిన్= పరాభవం పొందాను; అపర జన్మంబునందున్+ఐనన్= మీదటి పుట్టువులోనైనా; అతనిన్+చంపన్= అతడిని వధించడానికి; నేను చాలుటకై= నేను సామర్థ్యం కలదాననగుటకై; ఇట్టిదానన్+ఐతిన్= ఇట్లా తపోవృత్తి నవలంబించాను.

తాత్పర్యం: 'అంబ యమునానదీతీరానికి వెళ్ళి అక్కడ ఘోరతపం సాగించింది. అక్కడ నుండి విశ్వామిత్ర మహర్షి నివాసం మొదలుగా ఉన్న సిద్ధాశ్రమాలన్నింటికీ వెళ్ళి వెళ్ళి, ఆయా ప్రదేశాలలో కఠిన నియమాలతో కూడిన వ్రతాలు సల్పుతూ ఉండింది. నీ తల్లి అయిన గంగాదేవి ఒకనా డామె దగ్గరకు వచ్చి 'ఆడువారికి అతి దుష్కరాలైన నియమ వ్రతాలు నీవు నెరపుతున్నావు. కారణమేమి?' అని ప్రశ్నించింది. నేను భీష్ముడిచేత మిక్కిలి పరాభవం పాలైనాను. మరుజన్మలోనైనా అతడిని చంపి పగతీర్చుకొనే సామర్థ్యం సంపాదించాలని ఇట్లా తపోవృత్తి నవలంబించాను' అని అంబ సమాధాన మిచ్చింది.

వ. అనిన విని భాగీరథి 'కుటిల ప్రచారవగుట నీవీ తనువు విడిచి యేఱయి పాఱంగల దాన; వింతియకాని యొండు గానేర' వనిన న వ్వెలంది నవ్వుచు సరకు చేయక యరిగి తొంటికంటెను దీవ్రంబగు తపశ్చరణంబునం బ్రవర్తిల్లుచు మత్స్యదేశ వాసినియై యుండి నాఁడు నిజవ్రత ఫలంబులో సగంబున నంబయను పేర నదియై య మ్మండలంబునం బరఁగియున్న సగంబునను దనరూపు చెడకుండ వహించికొని జాహ్నవీ ప్రభావంబు నాత్మీయ ప్రభావంబున గెలిచి వెండియు. 364

ప్రతిపదార్థం: అనినన్ విని= అంబ పల్కులు ఆలించి; భాగీరథి= గంగాదేవి; కుటిల ప్రచారవు+అగుటన్= నీవు వక్రమైన వర్తనం కలదానవు కావటం వలన; నీవు; ఈ+తనువున్ విడిచి= ఈ శరీరమును వదలి; ఏఱు+అయి+పాఱన్+కలదానవు= నదివై ప్రవహించగలవు; ఇంతియకాని ఒండు కానేరవు= ఇంత దప్ప ఇంకేమీ నీవు చెయ్యలేవు; అనినన్= అని గంగ పలుకగా; ఆ+వెలంది= ఆ మగువ (అంబ); నవ్వుచున్; సరకు చేయక= గంగ మాటలు లెక్కించక; తిరిగి; తొంటి కంటెన్= మునుపటి కంటె; తీవ్రంబు+అగు= కఠినమైన; తపస్+చరణంబునన్= తపస్సు చేయుటంలో; ప్రవర్తిల్లుచున్= మెలగుతూ; మత్స్యదేశవాసిని+ఐ+ఉండి= మత్స్యదేశంలో నివసిస్తూ ఉన్నదై; ఒక్కనాఁడు; నిజవ్రత ఫలంబులోన్= తన వ్రతాల యొక్క ఫలమునందు; సగంబునన్= అర్ధభాగంతో; అంబ+అను పేరన్= అంబ అనే నామంతో; నదియై; ఆ+మండలంబునన్= ఆ భూమి భాగంలో; పరఁగి= ఒప్పుతూ; ఉన్న సగంబునను= మిగిలిన తపోమహిమ యొక్క అర్ధభాగంతో; తన రూపు చెడకుండన్= తన స్వరూపం నశించిపోకుండా; వహించుకొని= కాపాడుకొని; జాహ్నవీ ప్రభావంబున్= గంగాదేవి యొక్క మహిమను; ఆత్మీయ ప్రభావంబునన్= తన తపోమహిమ చేత; గెలిచి= జయించినదై; వెండియున్= మరియు.

తాత్పర్యం: అంబ పల్కులు విని గంగాదేవి 'నీవు, వక్రప్రవర్తన కలదానవు కనుక ఈ దేహం వీడి నదివై ప్రవహించగలవు. ఇంతేకాని నీవు మరేమీ చెయ్యలేవు' అని పలికింది. అంబ నవ్వుతూ గంగ మాటలు లక్ష్యపెట్టక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మళ్ళీ మునుపటికంటె తీవ్రమైన తపోవృత్తిలో మెలగుతూ మత్స్యదేశ నివాసినిఅయి ఉండి, ఒకరోజు తన వ్రతఫలంలో అర్ధభాగమున అంబ అనే నామంతో నదిఅయి మత్స్యధరణీ మండలంలో ప్రవహించింది. మిగిలిన సగం తపోబలంతో తన స్వరూపం చెడకుండా నిలుపుకొని గంగాదేవి మహిమను తన తపోమహిమ చేత జయించింది. గంగాదేవి శాపం వలన తన స్వరూపం పూర్తిగా కోల్పోయి ఏరై పారవలసిన అంబ నిజ తపోబలంచేత ఆకారం కోల్పడనందున గంగను గెలువగలిగింది.

క. పుణ్యాశ్రమ దేశముల న । గణ్యంబగు తపము చేయఁగా రుద్రుఁడు గా
రుణ్యము వాత్సల్యము దా । క్షిణ్యము మెఱయంగ నింతికిం బొడసూపెన్. 365

ప్రతిపదార్థం: పుణ్య+ఆశ్రమ దేశములన్= పావనాలైన ఆశ్రమ స్థలాలలో; అగణ్యంబు+అగు= లెక్కింపరానట్టి; తపము చేయఁగాన్= తపస్సు సల్పగా; రుద్రుఁడు= శంభుడు; కారుణ్యము= దయ; వాత్సల్యము= ప్రేమ; దాక్షిణ్యము= సామర్థ్యం; మెఱయంగన్= ప్రకాశించగా; ఇంతికిన్= అంబకు; పొడసూపెన్= ప్రత్యక్షమయ్యాడు.

తాత్పర్యం: అంబ పవిత్రములైన ఆశ్రమ స్థలాలలో లెక్కించలేనంత తపస్సు సల్పుతుండగా దయ, ప్రేమ, సామర్థ్యం ప్రకటమయ్యేటట్లు శంకరుడు ఆమెకు ప్రత్యక్షమయ్యాడు.

క. మును లచ్చెరు వంది కనుం । గొన శంభుఁడు నిల్చి 'వరముఁ గోరు' మనుడు 'భీ
ష్ముని నాకుఁ జంపఁగా దొర । కొను నట్లుగ నొసఁగు' మనియెఁ గోమలి యెలమిన్. 366

ప్రతిపదార్థం: మునులు= ఋషులు; అచ్చెరువు+అంది= ఆశ్చర్యం పొంది, కనుంగొనన్= వీక్షిస్తూ ఉండగా; శంభుఁడు నిల్చి= ఈశ్వరుడు ఎదుట ప్రత్యక్షమై; వరమున్ కోరుము= వరం కోరుకొమ్ము; అనుడున్= అని పలుకగా; కోమలి= వనితఅయిన అంబ; ఎలమిన్= సంతోషంతో; నాకున్= నాకు; భీష్మునిన్+చంపఁగాన్= భీష్ముడిని వధించటానికి; దొరకొనునట్లుగాన్= పూనుకొనేటట్లు; ఒసఁగుము+అనియెన్= వరం దయచేయు మని పలికింది.

తాత్పర్యం: మును లాశ్చర్యపడి కనుగొనుచుండగా శంకరుడు అంబ యెదుట ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నాడు. అంబ భీష్ముడిని తాను చంపుట సమకూడేటట్లు వరం అనుగ్రహించు'మని సంతోషంతో వేడింది.

వ. అనవుడు నద్దేవుం 'డట్ల కాక' యని యనుగ్రహించిన, నంబ 'యెత్తెఱంగున నది యయ్యెడు?' నని యడిగిన- 367

ప్రతిపదార్థం: అనవుడున్= అంబ అట్లు వరం వేడగా; ఆ+దేవుండు= ఆ పరమేశ్వరుడు; అట్లకాక+అని= అట్లే ఇచ్చానని; అనుగ్రహించినన్= దయచూపగా; అంబ; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; అది+అయ్యెడున్+అని+అడిగినన్= భీష్మవధ జరుగగలదని అడుగగా.

తాత్పర్యం: అంబ అట్లా వరం వేడగా పరమేశ్వరుడు 'అట్లే అగుగాక' అని అనుగ్రహించాడు. ఆమె ఆ పని ఎట్లా జరుగగలదని ప్రశ్నించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. **ఈ మేను విడిచి నీ వేఁగిన యప్పుడు । ద్రుపద భూవిభునకుఁ దొల్త పుత్రి**
వై పుట్టి పిదపఁ బుత్త్రాకృతిఁగాంచి శి । ఖండినామమున నుద్దండబాహు
బలమునఁ గోదండ పాండిత్యమును బటు । శౌర్యంబు నొప్పఁ బ్రశస్తి కెక్కి
యనిఁ జంపఁ గలదాన వాతని; నా మాట । దప్ప దూఱడు' మని చెప్పి హరుఁడు

తే. **సనియె; నా ప్రొద్దు సమిధలు చాలఁ గూడ । వైచి యనలంబుఁ గూర్చి యవ్వనిత క్రోధ**
దీప్తమూర్తియై 'భీష్ము వధించు దాన' । ననుచు సొదఁ జొచ్చె మునులకు నద్భుతముగ. 368

ప్రతిపదార్థం: ఈ+మేను విడిచి= ఈ శరీరం వదలి; నీవు+ఏఁగిన+అప్పుడు= నీవు వెళ్ళిన సమయంలో; ద్రుపద భూవిభునకున్= ద్రుపద మహారాజునకు; తొల్తన్= మొదట; పుత్రివి+ఐ+పుట్టి= కూతురుగా జన్మించి; పిదపన్= తరువాత; పుత్త్ర+ఆకృతిన్+కాంచి= కుమార స్వరూపాన్ని ధరించి; శిఖండి నామమునన్= శిఖండి అనే పేరుతో; ఉద్దండ బాహు బలమునన్= మిక్కుటమైన భుజశక్తితోనూ; కోదండ పాండిత్యమును= ధనుర్విద్యయందు నైపుణ్యమునూ; పటు శౌర్యంబున్= దృఢమగు పరాక్రమమునూ; ఒప్పన్= ప్రకాశించగా; ప్రశస్తికిన్+ఎక్కి= ఖ్యాతిగడించి; అనిన్= యుద్ధంలో; ఆతనిన్= దేవవ్రతుడిని; చంపన్+కలదానవు= సంహరించగలవు; నా మాట తప్పదు= నా పలుకు వమ్ముగాదు; ఊఱడుము= ఉపశమించుము; అని చెప్పి= అని పలికి; హరుఁడు= రుద్రుడు; చనియెన్= అంతర్ధానమయ్యాడు; ఆ ప్రొద్దు= ఆ దినం; సమిధలు= కట్టెలు; చాలన్= మిక్కిలి; కూడవైచి= ఒక చోట చేర్చి (ప్రోగుచేసి) అనలంబున్+కూర్చి= అగ్గినంటించి; ఆ+వనిత= ఆ చెలువ; క్రోధ దీప్తమూర్తి ఐ= కోపంచేత ప్రకాశిస్తున్న ఆకారం కలదై; భీష్మున్ వధించుదానన్= భీష్ముడిని నేను సంహరిస్తాను; అనుచున్= అని పలుకుతూ; మునులకున్= అక్కడి ఋషులకు; అద్భుతముగన్= ఆశ్చర్యం కలిగేటట్లు; సొదన్+చొచ్చెన్= చితిలో ప్రవేశించింది.

తాత్పర్యం: నీవు శరీరం విడిచి వెళ్ళేటప్పుడు ద్రుపద భూపతికి మొదట కూతురుగా పుట్టుతావు. తరువాత కుమారుడ వవుతావు. శిఖండి అనే పేరుతో మిక్కుటమైన భుజశక్తి, ధనుర్విద్యా నైపుణ్యం, దిట్టమైన పరాక్రమం అనే వాటితో ప్రకాశిస్తూ ప్రఖ్యాతి గడించి యుద్ధంలో భీష్ముడిని సంహరిస్తావు. నా మాట వ్యర్థం కాదు. ఓర్మి వహించు' అని చెప్పి రుద్రుడు అంతర్ధానమయ్యాడు. ఆ దినమే అంబ కట్టియలు ఒకచోట ప్రోగుగా పేర్చి నిప్పంటించి క్రోధంతో తన రూపం జ్వలిస్తుండగా, అక్కడి మునులు ఆశ్చర్యపడుతుండగా, 'నేను భీష్ముడిని వధిస్తా'నంటూ ఆ చితిమంటలలో ప్రవేశించింది.

వ. **అట్టియెడ ద్రుపదుం డనపత్య యగు తన మహిషి విషాదంబు దీర్పం దివురుటను గాంగేయు తోడి రోషంబునను శివుని నుద్దేశించి తపంబు సేసిన నద్దేవుండు ప్రత్యక్షంబయి 'వరంబు వేఁడు' మనిన 'భీష్ము వధియించు నట్టివాని నొక్క పుత్త్రుని నొసంగవలయు' ననుడు.** 369

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ తరుణంలో; ద్రుపదుండు; అనపత్య+అగు= బిడ్డలులేని; తన మహిషి విషాదంబు= తన పట్టపురాణి దుఃఖమును; తీర్పన్= తొలగించటానికి; తివురుటను= పూనుకొనటం వలననూ; గాంగేయు తోడి రోషంబునను= భీష్ముడిపై తనకు గల క్రోధంవల్లనూ; శివునిన్+ఉద్దేశించి= శంకరుడి గురించి; తపంబు చేసినన్= తప మొనర్పగా; ఆ+దేవుండు= పరమేశ్వరుడు; ప్రత్యక్షంబు+అయి= గోచరించి; వరంబు వేఁడుము+అనినన్; భీష్మున్ వధియించునట్టివానిన్= గాంగేయుడిని చంపగలవాడిని; ఒక్క పుత్త్రునిన్= ఒక కుమారుని; ఒసంగవలయున్= నాకీయవలెను; అనుడున్= అని కోరగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అంబ చిత్యగ్నిలో ప్రవేశించిన తరుణంలో ద్రుపదుడు బిడ్డలు లేని తన పట్టపురాణి కోకిలాదేవి దుఃఖం తొలగించటానికై పూనిక వహించిన వాడగుట వల్లనూ, గంగాపుత్రుడైన భీష్మడిపై తనకు గల కోపం వల్లనూ శివుడిని గురించి తపస్సు చేశాడు. పరమశివుడు ప్రత్యక్షమై వరం వేడుమని ద్రుపదుడిని అడిగాడు. అపుడు పాంచాలరాజు భీష్మడిని చంపగల ఒక కుమారుడిని అనుగ్రహించుమని ప్రార్థించాడు. అందుకు ఈశ్వరు డిట్లా అన్నాడు:

తే. **'కూఁతురై పుట్టి పదపడి కొడుకుఁదనము । గాంచి భీష్ముని నాజిరంగమునఁ జంపు**
నట్టి యుజ్జ్వలాపత్యంబు పుట్టు నీకుఁ । దప్ప దిది' యని రుద్రుండు సెప్పి చనియె. **370**

ప్రతిపదార్థం: కూఁతురు+ఐ+పుట్టి= మొదట కుమార్తెగా జన్మించి; పదపడి= పిదప; కొడుకుఁదనమున్+కాంచి= కుమారత్వమును పొంది; భీష్మనిన్= శాంతనవుడిని; ఆజిరంగమునన్= రణభూమిలో; చంపునట్టి= వధించగల్గిన; ఉజ్జ్వల+అపత్యంబు= వెలిగిపోయే బిడ్డ; నీకున్= నీకు; పుట్టున్= జన్మిస్తుంది; ఇది తప్పదు= ఇది జరిగి తీరుతుంది; అని= అంటూ; రుద్రుఁడు= ఈశ్వరుడు; చెప్పి చనియెన్= వచించి మరుగయ్యాడు.

తాత్పర్యం: మొదట నీకు పుత్రికగా జన్మించి, ఆ తరువాత కొడుకుగా మారి, భీష్మడిని యుద్ధభూమిలో చంప గల్గిన చక్కని సంతానం నీకు కల్గుతుంది. నా వచనం అమోఘం' అని నుడివి మహేశ్వరుడు అంతర్ధానమయ్యాడు.

వ. **ద్రుపదుండును బ్రీతుండయి నిజప్రియకు నవ్విధం బెఱింగించెఁ; దదనంతరంబ కాశీశ్వరకన్యక చైతన్యం బుదరంబు ప్రవేశించిన.** **371**

ప్రతిపదార్థం: ద్రుపదుండును; ప్రీతుండు+అయి= ఆనందించినవాడై; నిజప్రియకున్= తన భార్యఐన కోకిలాదేవికి; ఆ+విధంబు+ఎఱింగించెన్= ఈశ్వరుడు పలికిన పలుకులు తెలిపాడు; తద్+అనంతరంబ= ఆ తరువాత; కాశీ+ఈశ్వర కన్యక చైతన్యంబు= కాశీరాజపుత్రి అంబ యొక్క చైతన్యం (ప్రాణం); ఉదరంబు ప్రవేశించినన్= ద్రుపద పత్ని గర్భంలో చొరబడగా.

తాత్పర్యం: ద్రుపద మహారాజు సంతోషించి తన ప్రియురాలైన కోకిలాదేవికి ఈశ్వరుడు వరాన్ని అనుగ్రహించిన వైనం తెలియజెప్పాడు, తరువాత కాశీరాజు కూతురైన అంబ యొక్క చైతన్యం రాజమహిషి గర్భంలో ప్రవేశించగా.

క. **పాంచాల రాజభార్య స । మంచిత గర్భంబు దాల్చి, మఱువడఁ గూఁతుం**
గాంచి, నిజపతియుఁ దానును । వంచనఁ గొడు కనిరి యెల్లవారును వినఁగన్. **372**

ప్రతిపదార్థం: పాంచాల రాజభార్య= ద్రుపద మహారాజు పత్ని; సమంచిత గర్భంబున్+తాల్చి= ఒప్పిదంగా కడుపుతో ఉండి; మఱువడన్= రహస్యంగా; కూతున్+కాంచి= కుమార్తెను కని; నిజపతియున్= తన భర్త అగు ద్రుపదుడున్నూ; తానును= తానున్నూ; వంచనన్= కపటంగా; ఎల్లవారును వినఁగన్= లోకులందరూ వినేటట్లు; కొడుకు+అనిరి= తమకు పుత్రుడు కలిగాడని అన్నారు.

తాత్పర్యం: పాంచాల భూవల్లభుడైన ద్రుపదుడి పట్టమహిషి చక్కగా గర్భం ధరించి రహస్యంగా కొమార్తెను కన్నది. తానూ, తన మగడూ కపటంగా తమకు పుత్రు డుదయించాడని లోకులందరికి చెప్పారు.

వ. ఇట్లు పుట్టిన బిడ్డకుఁ బుత్త్ర ప్రకారంబున జాతకర్మాది కృత్యంబులు నిర్వర్తించి శిఖండి యనుపేరుపెట్టి యతి ప్రచ్ఛన్నంబుగాఁ బెనిచి రహస్యంబు తెఱం గా కన్నియకుం జెప్పి' యక్షర శిక్షాదు లాచరించి ద్రోణాచార్యుకడ శస్త్రాస్త్ర పరిశ్రమంబు సేయించుచుండ జవ్వనంబు చేరువకుం దఱియగుటయు నమ్మగువం జూచి వగచి తల్లిదండ్రులు తమలో విచారించి 'వేగంబ వివాహంబు సేయవలయుఁ; బరమేశ్వరు వరంబు కొఱంత వడునె? తన నెఱసినప్పుడు నెఱయుంగాక!' యని నిశ్చయించి దశార్ణ దేశాధీశుండగు హేమవర్మ యను రాజు కన్యకం దగిన తెఱంగునఁ బాణిగ్రహణంబు సేయించి తెచ్చియున్నంత. 373

ప్రతిపదార్థం: ఇట్లు పుట్టిన బిడ్డకున్; పుత్త్రప్రకారంబునన్= కుమారున కెట్లో అట్లు; జాతకర్మ+ఆది+కృత్యంబులు+నిర్వర్తించి= బిడ్డపుట్టినప్పుడు చేయవలసిన శాస్త్రోక్త విధులు చేసి; శిఖండి; అనుపేరు పెట్టి; అతి ప్రచ్ఛన్నంబుగాన్= మిక్కిలి రహస్యంగా; పెనిచి= పెంచి; రహస్యంబు తెఱంగు= ఈ రహస్యానికి గల కారణం; ఆ కన్నియకున్ చెప్పి= ఆ బాలిక కెరిగించి; అక్షర శిక్షా+ఆదులు+ఆచరించి= విద్యాభ్యాసాదులు జరిపించి; ద్రోణాచార్యుకడన్= గురువగు ద్రోణుడి దగ్గర; శస్త్ర+అస్త్ర పరిశ్రమంబు చేయించుచున్+ఉండన్= శస్త్రాస్త్ర విద్యలందు శిక్షణ ఇప్పిస్తుండగా; జవ్వనంబు చేరువకున్= యౌవనం సమీపించుటకు; తఱి+అగుటయున్= సమయ మాసన్నంకాగా; ఆ+మగువన్ చూచి= ఆ పడతినికని; తల్లిదండ్రులు; వగచి= దుఃఖించి; తమలోన్ విచారించి= తమలో తాము ఆలోచించి; వేగంబు+అ= శీఘ్రమే; వివాహంబు చేయన్ వలయున్= పెండ్లి చేయాలి; పరమేశ్వరువరంబు కొఱంత పడునె?= ఈశ్వరుడిచ్చిన వరం లోపించునా?; తన నెఱసినప్పుడు నెఱయున్+కాక= గుట్టు బట్టబయలగునప్పు డగుగాక; అని నిశ్చయించి= అని నిర్ణయం చేసి; దశార్ణ దేశ+అధి+ఈశుండు+అగు= దశార్ణ దేశానికి అధిపతి ఐన; హేమవర్మ+అను= హేమవర్మ అనే పేరు గలిగిన; రాజు కన్యకన్= రాజుయొక్క కొమార్తెను; తగిన తెఱంగునన్= అర్హమైన రీతిలో; పాణిగ్రహణంబు చేయించి= శిఖండి కిచ్చి పెళ్ళి చేయించి; తెచ్చి+ఉన్నంతన్= కోడలిని ఇంటికి కొనివచ్చి ఉండగా.

తాత్పర్యం: ద్రుపద మహారాజు తనకు ఆడుబిడ్డ పుట్టినప్పటికీ మగబిడ్డకు చేయించవలసిన సంస్కార విశేషాలన్నీ చేయించి శిఖండి అనే పేరు పెట్టి అతిరహస్యంగా పెంచుతూ వచ్చాడు. రహస్యానికి గల కారణాన్ని ఆ కన్యకు తెలిపాడు. శిఖండికి అక్షరాభ్యాసం జరిపించి, ద్రోణాచార్యుల దగ్గర క్షత్రియోచితమైన శస్త్రాస్త్ర విద్యాపరిశ్రమ చేయిస్తూ ఉన్నాడు. ఇంతలో యౌవనం చేరువ అయిన తమ బిడ్డను చూచి జననీ జనకులు చింతించారు. వారు తమలో తాము వితర్కించుకొన్నారు. 'తొందరగా కన్యకు పెళ్ళి చేయాలి. ఈశ్వరుడు ప్రసాదించిన వరం వమ్ము కాదు. ఈమెకు మగతనం వచ్చినప్పుడు వచ్చుగాక' అని నిర్ణయించుకొని దశార్ణ దేశాధిపతిఅయిన హేమవర్మ పుత్రితో శిఖండికి ఉపాయంతో పెళ్ళి చేయించి కోడలిని ఇంటికి తెచ్చుకొనగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. అక్కుమారి చతుర యగుట శిఖండి వ। ర్తనము నెడఁ బ్రమాదమున నెఱింగి
యుగ్గడింప నొల్ల కూరక యెఱుఁగని। యదియ పోలె నుండె నాత్మ నొచ్చి. 374

ప్రతిపదార్థం: ఆ+కుమారి= దశార్ణ దేశాధిపతి కూతురు; చతుర+అగుటన్= నేర్పుగలది కావటం వలన; శిఖండి వర్తనము+ఎడన్= శిఖండి యొక్క ప్రవర్తన పట్ల; ప్రమాదమునన్+ఎఱింగి= అతడి యొక్క పరాకు వలన గ్రహించి; ఆత్మన్+నొచ్చి= మనసులో బాధపడి; ఉగ్గడింపన్+ఒల్లక= చెప్పటానికి ఇష్టపడక; ఊరక= మౌనంగా; ఎఱుఁగన్+అదియ పోలెన్= ఏమీ తెలియని దానివలెనే; ఉండెన్= ఉండింది.

తాత్పర్యం: దశార్ణ దేశ విభుడి పుత్రిక నేర్పుగలది. కనుక శిఖండి వర్తనం అతడు ఏమరి ఉన్నప్పుడు తెలిసికొని మనస్సులో బాధపడి, అతడు పడతి అని గ్రహించికూడా ఇతరు లెవ్వరికినీ చెప్పటానికి ఇష్టపడక ఏమీ ఎరుగనిదానివలెనే ఉండిపోయింది.

వ. ఇట్లు దశార్ణ విభుపుత్రి యెఱింగి శిఖండి పురుషుండు గామి దన దాసికిం జెప్పిన నదియు నప్పు డన్నరనాథుని కెఱింగించి, పుచ్చిన, నతండు విషాద రోషంబుల నొంది దూతం బుత్తెంచిన, వాఁడు వచ్చి పాంచాలపతిం గాంచి యిట్లనియె : 375

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; దశార్ణ విభు పుత్రి= దశార్ణరాజకుమారి; ఎఱింగి= గ్రహించి; శిఖండి; పురుషుండు కామిన్= మగవాడు కాడని; తన దాసికిన్; చెప్పినన్= తెలుపగా; అదియున్= ఆ దాసి; అప్పుడు= అపుడే; ఆ+నరనాథునకున్= ఆ దశార్ణపతికి; ఎఱింగించి పుచ్చినన్= తెలియజెప్పి పంపగా; అతండు= ఆ రాజు; విషాద రోషంబులన్+ఒంది= తన కూతురు ఆడుదానికి ఆలయినందుకు దుఃఖాన్నీ, తన పుత్రికను పుత్రుడని చెప్పి తనను వంచించినందుకు కోపాన్నీ పొందినవాడై; దూతన్= దూతను; పుత్తెంచినన్= పంపగా; వాఁడు వచ్చి పాంచాలపతిన్; కాంచి= కనుగొని; ఇట్లు+అనియెన్:

తాత్పర్యం: దశార్ణపతి పుత్రిక శిఖండి మగవాడు కాడని ఎరిగి తన దాసికి చెప్పింది. ఆ పరిచారిక ఆ సంగతి దశార్ణ విభుడికి తెలియజేసింది. అతడు దుఃఖ క్రోధాలను పొంది దూతను పంపగా, వాడు ద్రుపదుడిని చూచి ఇట్లా అన్నాడు:

చ. కొడుకని చెప్పి యిట్లగునె కూఁతు వివాహము చేయ దీన నీ
పడసిన లాభమేమి? నగుఁబాటగు నింతియ కాక యెల్ల నే
ర్పడ నెఱుఁగంగ వచ్చితి; నరాతిభయంకరు హేమవర్మ నా
గడమున గాసిచేసితి మగంటిమి నీదెసనైనఁ జూపుమా! 376

ప్రతిపదార్థం: కొడుకు+అని చెప్పి= కుమారుడని పలికి; కూఁతున్= కొమార్తెను తీసికొనివచ్చి; ఇట్లు+వివాహము చేయన్+అగునె?= ఇట్లా పెండ్లి చేయటం తగునా?; నగుఁబాటు+అగున్= నీకు తలవంపులౌతుంది; ఇంతియకాక= ఇంతకుమించి; దీనన్= ఇట్లు చేసినందువలన; నీ పడసిన లాభము+ఏమి?= నీవు పొందిన ప్రయోజనమేముంది?; ఎల్లన్= ఉన్న విషయమంతయు; ఏర్పడన్= తెల్లముగా; ఎఱుఁగంగన్+వచ్చితిన్= తెలిసికొనటానికి వచ్చాను; అరాతి భయంకరున్= శాత్రవులకు భీతి గొలుపునట్టి; హేమవర్మన్= హేమవర్మను; ఆగడమునన్= అకార్యముచే; గాసి చేసితి(వి)= బాధపెట్టావు; నీ దెసన్+ఐనన్= నీ విషయంలోనైనను; మగంటిమి= మగతనం; చూపుమా= కనబరచుము.

తాత్పర్యం: కొడుకని చెప్పి కొమార్తెను తీసుకొనివచ్చి నా పుత్రికతో వివాహం జరిపించావు. ఇట్లా చేయటం వల్ల తలవంపులు దప్ప నీవు సాధించిన ప్రయోజన మేముంది? ఈ విషయమెల్ల విస్పష్టంగా తెలిసికొనటానికి వచ్చాను. హేమవర్మ శత్రు భయంకరుడని నీకు తెలియదా? అకార్య మొనర్చి ఆయనకు బాధ కల్గించావు. పోనీ నీ విషయంలోనైనా మగతనం చూపవలసినది. (రణరంగంలో ఆతన్నెదుర్కొని నీ పౌరుషం ప్రకటించవలసినదని చమత్కారం.)

విశేషం: మగంటిమి నీ దెసనైనఁ జూపుమా - నీ సంతానానికి ఎట్లాగూ మగతనం లేదు. నీకయినా మగతనం ఉంటే మా రాజుతోడి యుద్ధంలో ప్రదర్శించుము - అని దూతవాక్యంలో చమత్కారం.

ఆ. అనిన నగుచు వాని కను ద్రుపదుం 'డివి । యేటిమాట? లిట్టు లేల చేయ
వచ్చు? నింత వెఱ్ఱివారును గలరె? యి । త్తెఱఁగు వొసఁగ కునికి యెఱుఁగ రాదె?' 377

ప్రతిపదార్థం: అనినన్= అని దూత పలుకగా; ద్రుపదుండు= ద్రుపద మహారాజు; నగుచున్= నవ్వుతూ; వానికిన్+అనున్= వాడితో ఇట్లా అన్నాడు; ఇవి+ఏటి మాటలు?= ఇవెట్టి మాటలు?; ఇట్టులు= ఈ ప్రకారం; ఏల చేయన్ వచ్చున్?= ఎందుకు చేస్తాము?; ఇంత వెఱ్ఱివారును కలరె?= లోకంలో ఇంత పిచ్చివారుంటారా?; ఈ+తెఱఁగు= నీవు నుడివిన విధం; పొసఁగక+ ఉనికి= అసంభవమని; ఎఱుఁగన్+రాదె?= తెలియవలదా?

తాత్పర్యం: దూత మాటలకు ద్రుపదుడు నవ్వుతూ- 'ఆహా! ఇవేటి మాటలు? ఇట్లా ఎందుకు చేస్తాము? ఇంత వెర్రి వారుంటారా? ఇట్లా ఎక్కడా జరగదని గ్రహించుము.'

వ. అని వెండియు నేర్పునం దీర్పుమాట లనేకంబులాడి నిక్కం బరయం జూచిన వానికిం జొరవ యీక త్రోపుసేసి వీడ్కొలిపి పుచ్చినం బోయి వాఁడును నిజనాథున కవ్విధంబు విన్నవించిన. 378

ప్రతిపదార్థం: అని; వెండియున్= మరల; నేర్పునన్= చాతుర్యంతో; తీర్పుమాటలు= పొందిక మాటలు; అనేకంబులు+ఆడి= పెక్కువచించి; నిక్కంబు+అరయన్= నిజం గ్రహించటానికి; చూచినన్= దూత యత్నించగా; వానికిన్= అతడికి; చొరవ+ ఈక= అవకాశం కల్గించక; త్రోపుచేసి= త్రోసిపుచ్చి; వీడ్కొలిపి పుచ్చినన్= పోయిరమ్మని పలికి పంపగా; పోయి= వెళ్ళి; వాఁడును= ఆ దూత; నిజనాథునకున్= తన ఏలికయైన హేమవర్మకు; ఆ+విధంబు= ద్రుపదుడు పల్కిన తీరు; విన్నవించినన్= విజ్ఞప్తి చేయగా.

తాత్పర్యం: అని మళ్ళీ ద్రుపదుడు నేర్పుతో పెక్కు పొందిక మాటలు పలికాడు. నిజం వెలికి తీయటం కొరకు దూత యత్నించగా అట్టి అవకాశ మీయక త్రోసివేసి అతడికి వీడ్కోలిచ్చాడు. వాడు వెళ్ళి తన ఏలిక హేమవర్మకు పాంచాలు డాడిన పలుకులన్నీ విన్నవించగా.

క. కోపోద్రేకంబున నతఁ । డా పాంచాలపతిమీఁద నతులిత సైన్యా
టోపమున వచ్చి పురి పరి । ఖా పరిసర తలము చుట్టుఁ గైకొని విడిసెన్. 379

ప్రతిపదార్థం: అతఁడు= హేమవర్మ; కోప+ఉద్రేకంబునన్= క్రోధావేశంతో; ఆ పాంచాల పతి మీఁదన్= ఆ ద్రుపద మహారాజు మీద; అతులిత= సాటిలేని; సైన్య+ఆటోపమునన్= సేనల యొక్క విజృంభణంతో; వచ్చి= చనుదెంచి; పురి పరిఖా పరిసర తలము చుట్టున్= రాజధానీ నగరం యొక్క అగడ్త సమీప భూమి చుట్టూ; కైకొని= ఆక్రమించి; విడిసెన్= దండు దిగినాడు.

తాత్పర్యం: హేమవర్మ కోపావేశంతో ద్రుపదుడి మీదికి సైన్యసన్నాహంతో వచ్చి అతడి పట్టణపు అగడ్త చుట్టూ ఉన్న ప్రదేశాన్ని ఆక్రమించి ముట్టడి చేశాడు.

వ. ఇట్లు విడిసిన. **380**

తాత్పర్యం: హేమవర్మ తన సేనలతో ద్రుపదుడి పట్టణాన్ని ముట్టడించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. పట్టు వడ్డ ముచ్చు పగిదిఁ బాంచాల భూ। నాయకుండు తనకు నానచేటు
రాక కుమ్మలించి యేకాంతమునఁ బత్ని। యొక్కతియును గొల్వ నూరకుండె. **381**

ప్రతిపదార్థం: పాంచాల భూనాయకుండు= పాంచాల దేశాధీశుడైన ద్రుపదుడు; పట్టు+పడ్డ= దొరకి పోయిన; ముచ్చు పగిదిన్= దొంగవలె; తనకున్= తనకు; నానచేటు రాకకున్= సిగ్గుచేటు స్థితి దాపురించినందుకు; ఉమ్మలించి= దుఃఖించి; ఏకాంతమునన్= ఒంటరిగా; పత్ని+ఒక్కతియును= భార్య ఒక్కతియే; కొల్వన్= సేవిస్తుండగా; ఊరక+ఉండెన్= మౌనంగా ఉన్నాడు.

తాత్పర్యం: ద్రుపద మహారాజు దొరకిపోయిన దొంగవలె తనకు సిగ్గుచేటు దుర్దశ దాపురించినందుకు దుఃఖించి, భార్య యొక్కతే తనను సేవిస్తుండగా ఒంటరిపాటున ఒకచోట మౌనంగా ఉండిపోయాడు.

వ. తదీయ దండనాథులు సమరోత్సాహంబునం బ్రవర్తిల్లి; రంత సూర్యాస్తమయ సమయం బగుటయు రెండు వీళ్లును భండనంబు తోడి వేడుకం జేసి వేగుటకు వేచియుండె. **382**

ప్రతిపదార్థం: తదీయ దండనాథులు= ద్రుపదుడి సేనాపతులు; సమర+ఉత్సాహంబునన్= యుద్ధమునందలి పూనికతో; ప్రవర్తిల్లిరి= మెలగినారు; అంతన్= అంతట; సూర్య+అస్తమయ సమయంబు+అగుటయున్= ప్రొద్దుగ్రుంకేవేళ ఆసన్నం కాగా; రెండు వీళ్లును= ఉభయ సేనాపక్షాలు; భండనంబుతోడి వేడుకన్+చేసి= సంగ్రామం సల్పటంలోని ఉత్సాహంతో; వేగుటకున్= తెల్లవారుటకు; వేచియుండెన్= కనిపెట్టుకొని ఉన్నవి.

తాత్పర్యం: ద్రుపదుడి సేనానాయకులు రణసన్నాహంలో ఉండగా సూర్యు డస్తమించాడు. ఇరు పక్షాలవారు యుద్ధం చేసే కౌతుకంతో ఎప్పుడు తెల్లవారుతుందా అని కాచుకొని ఉన్నారు.

క. అప్పుడు శిఖండి మరణము। దప్పఁగ నడి కొండు ప్రతివిధానము సేయుం
జొప్పడమిఁ దలఁచి యొరులకుఁ। జెప్పక వెస నరిగెఁ బురము చెంత యడవికిన్. **383**

ప్రతిపదార్థం: అప్పుడు= అట్టి సమయంలో; శిఖండి= శిఖండి; మరణము తప్పఁగన్= చావు వినా; నడికిన్= నిందకు; ఒండు ప్రతివిధానము= మరొకమారు చేత; చేయన్= చేయటానికి; చొప్పడమిన్= వీలులేమి; తలఁచి= భావించి; ఒరులకున్+చెప్పక= ఇతరులకు ఎవ్వరికీ చెప్పకుండా; పురము చెంత+అడవికిన్= పట్టణ సమీపంలోని అరణ్యమునకు; వెసన్+అరిగెన్= శీఘ్రంగా వెళ్ళాడు.

తాత్పర్యం: అప్పుడు శిఖండి తనకు మరణం వినా నిందను పోగొట్టుకొనటానికి మరో మార్గం లేకుండటం గ్రహించి ఇతరు లెవ్వరికీ చెప్పకుండ గుట్టు చప్పుడుకాకుండా నగరం చెంతనున్న అరణ్యంలోనికి శీఘ్రంగా వెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శిఖండి యక్షునివలనఁ బురుషత్వంబునొందిన వృత్తాంతము (సం. 5-192-20)

వ. అవ్విపినంబు స్థూలకర్ణుం డను నొక్క యక్షునికి నివాసంబై యునికిం జేసి నిర్జనంబై యుండు; శిఖండియు నత్తెఱం గెఱుంగుం గావున నతని నుద్దేశించి యందుఁ జొచ్చి తత్ప్రదేశంబున మహనీయ సుందరంబగు తదీయ మందిరంబున కరిగి, యచ్చటఁ బ్రాణవియోగం బగు విధం బాచరింపం బూనిన. 384

ప్రతిపదార్థం: ఆ+విపినంబు= ఆ వనం; స్థూలకర్ణుండు అను ఒక్క యక్షునికిన్; నివాసంబు+ఐ; ఉనికిన్+చేసి= ఉండటం వలన; నిర్జనంబు+ఐ+ఉండున్= మనుషులు లేనిదై ఉంటుంది; శిఖండియున్; ఆ+తెఱంగు+ఎఱుంగున్= ఆ విషయం తెలిసిన వాడు; కావునన్; అతనిన్+ఉద్దేశించి= ఆ యక్షుడిని దృష్టిలో ఉంచుకొని; అందున్+చొచ్చి= ఆ కాననంలో ప్రవేశించి; తద్+ప్రదేశంబునన్= ఆ అరణ్య భూమిలో; మహనీయ సుందరంబు+అగు= గొప్పది, అందమైనది అయిన; తదీయ మందిరంబునకున్= ఆ యక్షుని సౌధంలోనికి; అరిగి= వెళ్ళి; అచ్చటన్; ప్రాణ వియోగంబు+అగు విధంబు= ప్రాణాలతో ఎడబాటు కలిగే సంవిధానం; ఆచరింపన్+పూనినన్= చేయటానికి పూనుకొనగా.

తాత్పర్యం: ఆ వనం స్థూలకర్ణుడనే ఒకయక్షుడు కాపురముండే చోటు. కనుక అక్కడ మనుష్య సంచారం ఉండదు. శిఖండికి ఆ విషయం తెలుసు. కనుక యక్షుడిని ఉద్దేశించి శిఖండి ఆ కానలో ప్రవేశించాడు. మహనీయమూ, మనోహరమూ అయిన స్థూలకర్ణుడి మందిరానికి వెళ్ళి అక్కడ తన ప్రాణం తీసికొనే ప్రయత్నంలో శిఖండి ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. యక్షుఁ డెఱింగి వచ్చి 'యిటు లాఅడి చావఁగ నేల చెప్పు మ
బ్జాక్షి! భవన్మనోరుజకు నౌషధ మే నొనరింతు' నన్న 'ఫా
లాక్షుఁడు దక్క నొడ్లకును నా పని సేయఁగరాదు; నాదు చి
త్తక్షతి పుంస్త్వ మేను దగఁ దాల్పక మానదు గుహ్యకోత్తమా!' 385

ప్రతిపదార్థం: యక్షుఁడు= స్థూలకర్ణుడు; ఎఱింగి= శిఖండి ప్రయత్నం తెలిసికొని; వచ్చి= అక్కడి కేతెంచి; ఇటులు= ఈ ప్రకారం; ఆఅడి చావఁగన్+ఏల?= వ్యర్థంగా చనిపోవటమెందుకు?; అబ్జ+అక్షి!= తామర రేకుల వంటి కన్నులు గల కాంతా!; చెప్పుము= తెల్పుము; భవత్+మనః+రుజకున్= నీ మనోవ్యాధికి; ఔషధము= మందు; ఏన్= నేను; ఒనరింతున్= సమకూరుస్తాను; అన్నన్= అని గుహ్యకుడు పలుకగా; గుహ్యక+ఉత్తమా!= యక్షులలో శ్రేష్ఠుడా!; ఫాల+అక్షుఁడు+తక్కన్= నొసట కన్నుగల పరమేశ్వరుడికి తప్ప; ఒడ్లకును= ఇతరులకు; ఆ+పని చేయఁగన్+రాదు= ఆ కార్యం సంఘటింప శక్యము కాదు; పుంస్త్వము= మగతనం; ఏను= నేను; తగన్= చక్కగా; తాల్పక= ధరించక; నాదు చిత్తక్షతి= నా మనస్సునందలి గాయం; మానదు= తొలగదు.

తాత్పర్యం: శిఖండి ప్రాణాలు తీసికొనటానికి ప్రయత్నిస్తున్నాడని యక్షుడు తెలిసికొని అక్కడికి వచ్చి, 'ఓ కాంతా! ఈ విధంగా నీవు వ్యర్థంగా మరణించటానికి కారణమేమో చెప్పు. నీ మనోవ్యాధికి తగుమందు నే నిస్తాను' అని పలికాడు. అందుకు శిఖండి మహేశ్వరునకు తప్ప ఇతరులకు ఈ కార్యం సంఘటింప సాధ్యం కాదు. నాకు మగతనం లభిస్తేగాని నా మనసులోని గాయం మానదు.

క. అని తన వృత్తాంతం బా । తని కెఱిఁగించుటయు, నతఁడుఁ దనదగు చిత్తం
బునఁ గరుణ వుట్టి 'యెంతటి । పని యిది? యే నిత్తు సమయపరిపాలనతోన్. 386

ప్రతిపదార్థం: అని; తన వృత్తాంతంబు= తన సంగతి; ఆతనికిన్= ఆ స్థూలకర్ణుడికి; ఎఱిఁగించుటయున్= తెలుపగా; అతఁడు= ఆ యక్షుడు; తనది+అగు+చిత్తంబునన్= తన మనస్సులో; కరుణ+పుట్టి= దయ జనించి; ఇది+ఎంతటి పని?= ఇదేమి ఘనకార్యం? సమయ పరిపాలనతోన్= ఒడంబడికను పాటించే నియమంతో; నేను+ఇత్తున్= నా పుంస్త్వం నీకిస్తాను.

తాత్పర్యం: శిఖండి తన విషయమంతా యక్షుడికి నివేదించాడు. అతడు తన మనసులో దయ జనించగా 'ఇదెంత పని? నా మగతనం నీకిస్తాను. అందుకు గడువు పెడతాను.

క. నా పురుషత్వము గైకొని । వే పోయి దశార్ణపతికి వెలయించిన మీ
యాపదలు దొలఁగి చనఁ, బొడ । సూపుము పదినాళ్లయంత సూనృత మొప్పన్. 387

ప్రతిపదార్థం: నా పురుషత్వము= నా మగతనం; కైకొని= స్వీకరించి; వే పోయి= శీఘ్రంగా వెళ్ళి; దశార్ణపతికిన్= హేమవర్మకు; వెలయించినన్= నీ పురుషత్వం నిరూపిస్తే; మీ+ఆపదలు= మీకు వచ్చిన కష్టాలు; తొలఁగి చనన్= తీరిపోగా; సూనృతము+ఒప్పన్= సత్యం తప్పకుండా; పది నాళ్ళ అంత= పది దినాల వ్యవధి గడవగనే; పొడచూపుము= నాకు కనిపించుము.

తాత్పర్యం: శిఖండీ! నా మగతనం స్వీకరించి వెంటనే వెళ్ళి దశార్ణ విభునకు నేను పురుషుడనని రుజువుపరిచి మీ కష్టాలు తీరిన తర్వాత పది రోజులు గడవగనే మాట తప్పకుండా వచ్చి నాకు కనిపించు.

క. అంతవునంతకు నీదగు । కాంతారూపంబు నేను గైకొనియెద; ని
శ్చింతమున మగుడఁ జను' మని । యింతికిఁ బురుషత్వ మిచ్చె నెంతయు వేడ్కన్. 388

ప్రతిపదార్థం: అంత+అవునంతకున్= ఆ పది నాళ్ళ మితివరకు; నీదగు= నీదైన; కాంతా రూపంబున్= స్త్రీ రూపాన్ని; నేను= నేను; కైకొనియెదన్= గ్రహిస్తాను; నిశ్చింతమునన్= నిర్విచారంగా; మగుడన్+చనుము+అని= మరల ఇంటికి వెళ్ళుమని; ఇంతికిన్= శిఖండి నామంతో ఉన్న ద్రుపద పుత్రికి; ఎంతయున్+వేడ్కన్= మిక్కిలి ప్రీతితో; పురుషత్వము+ఇచ్చెన్= యక్షుడు తన పుంస్త్వము నిచ్చాడు.

తాత్పర్యం: నేటినుండి పది దినాల వరకు నేను నీ కాంతాస్వరూపాన్ని గైకొంటాను. నీవు నిర్విచారంగా నీ గృహానికి వెళ్ళు'మని యక్షుడు మిక్కిలి సంతోషంతో శిఖండికి తన మగతన మనుగ్రహించాడు.

తే. ఇచ్చి తాను భామాకృతి నెలమిఁ దాల్చి । వీడుకొల్ప శిఖండియు వీటి కేఁగు
దెంచి నిజమందిరంబు సొత్తెంచి తల్లి । దండ్రులకు మ్రొక్కి నిలిచి ముదం బెలర్ప. 389

ప్రతిపదార్థం: ఇచ్చి= తన పురుషత్వ మొసగి; తాను= యక్షుడు; భామా+ఆకృతిన్= స్త్రీ రూపాన్ని; ఎలమిన్= సంతోషంతో; తాల్చి= ధరించి; వీడుకొల్పన్= సాగనంపగా; శిఖండియున్= శిఖండియూ; వీటికిన్= నగరానికి; ఏఁగుదెంచి= వచ్చి; నిజమందిరంబు+చొత్తెంచి= తన భవనానికి చేరి; తల్లిదండ్రులకున్= మాతాపితలకు; ముదంబు+ఎలర్పన్= సంతోషం అతిశయించగా; మ్రొక్కి నిలిచి= నమస్కరించి నిలబడి.

తాత్పర్యం: యక్షుడు తన పురుషత్వ మొసగి తాను స్త్రీరూపం గైకొని అతనిని సాగనంపాడు. శిఖండి నగరం ప్రవేశించి తన మందిరానికి వచ్చి, అచ్చట జననీ జనకులకు ఆనంద మతిశయించగా నమస్కరించి నిలిచి.

క. తన తెఱఁ గంతయు నెఱిఁగిం । చిన నద్భుత హర్షమగ్న చేతసులై త
జ్జననీ జనకులు బహువిధ । వినుతులఁ గొనియాడి; రంత వేకువ యయ్యెన్. 390

ప్రతిపదార్థం: తన తెఱఁగు+అంతయున్= తన విషయమంతా; ఎఱిఁగించినన్= తెలుపగా; అద్భుత హర్షమగ్న చేతసులు+ఐ= ఆశ్చర్యంలో ఆనందంలో మునిగిన మనసులు కలవారై; తద్+జననీ జనకులు= ఆతడి తల్లిదండ్రులు; బహువిధ వినుతులన్= అనేక రీతులైన పొగడ్తలతో; కొనియాడిరి= తమ బిడ్డను మెచ్చుకొన్నారు; అంతన్= అంతట; వేకువ+అయ్యెన్= వేగుజామైనది.

తాత్పర్యం: శిఖండి జరిగిన వృత్తాంతమంతా తన తలిదండ్రులకు తెలిపాడు. వారు సంతోషాశ్చర్య మగ్న హృదయులై అనేక విధాల అతడిని ప్రశంసించారు. ఇంతలో వేకువ జామైనది.

వ. తదనంతరంబ సూర్యోదయం బగుటయుఁ గాలోచిత కరణీయంబులు నిర్వర్తించి, పాంచాల విభుండు సంబంధితో వలయు మాట లాడందగు వారలం బనిచి, రావించి సంభ్రమంబు లేక వేగిరపడక నాగరిక ప్రకారంబున శిఖండి పురుషత్వంబు దేటపఱిచి యతని మాట గీడ్పఱచి, సపరివారంబుగా నద్దశార్ణపతికి విందువెట్టి కట్టనిచ్చి, యతని యనునయాలాపంబు గైకొని యనిచి పుచ్చిన, నతండు తన్నుందాన నిందించు కొనుచు నిజపురంబునకుం బోయె; నట్టియెడ నయ్యక్షవరుమందిరంబు చక్కటికిం గ్రీడార్థంబు గిన్నర విభుండు విమానారూఢుం డయి చని దాని యొప్పు గనుంగొని యగ్గించుచు నిల్చి యొక్కింత సేపునకుం జుట్లనున్న గుహ్యకులతో నిట్లనియె. 391

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మటనే; సూర్య+ఉదయంబు+అగుటయున్= ప్రొద్దు పొడువగా; కాల+ఉచిత కరణీయంబులు= ప్రాతఃకాలకృత్యాలు; నిర్వర్తించి= నెరవేర్చి; పాంచాల విభుండు= ద్రుపద మహారాజు; సంబంధితోన్= వియ్యంకుడితో; వలయు మాటలు= తగిన మాటలు; ఆడన్+తగువారలన్= పలుకగలవారిని; పనిచి= పంపి; రావించి= హేమ వర్మను రప్పించి; సంభ్రమంబు లేక= తొట్రుపాటు నొందక; వేగిరపడక= తొందరపడక; నాగరిక ప్రకారంబునన్= సభ్యతతో; శిఖండి పురుషత్వంబు= శిఖండి యొక్క మగతనం; తేటపఱిచి= స్పష్టమొనరించి; అతని మాట= శిఖండి పురుషుడు కాడు, ఆడుది అనినట్టి హేమవర్మ వాక్యం; కీడ్పఱిచి= తప్పని నిరూపించి (అనుచిత మని తేల్చి); సపరివారంబుగాన్= పరిజనంతో కూడ; ఆ+దశార్ణపతికిన్= హేమవర్మకు; విందుపెట్టి= భోజనమిడి; కట్టన్+ఇచ్చి= ధరించటానికి నూత్నవస్త్రాలొసగి; అతని+అనునయ+ఆలాపంబులు= హేమవర్మ యొక్క ప్రార్థనాపూర్వకాలైన వాక్యాలు; కైకొని= గ్రహించి; అనిచి పుచ్చినన్= సాగనంపగా; అతండు= హేమవర్మ; తన్నున్+తాన; నిందించు కొనుచున్= దూషించుకొంటూ; నిజపురంబునకున్ పోయెన్; అట్టి+ఎడన్; ఆ యక్షవరుమందిరంబు చక్కటికిన్= ఆ స్థూలకర్ణుడి సౌధం దగ్గరకు; క్రీడా+అర్థంబు= వినోదం కొరకై; కిన్నర విభుండు= కుబేరుడు; విమాన+ఆరూఢుండు+అయి= విమానం ఎక్కినవాడై; చని= వెళ్ళి; దాని+ఒప్పున్= స్థూలకర్ణుడి భవనము యొక్క అందాన్ని; కనుంగొని; అగ్గించుచున్= శ్లాఘిస్తూ; నిల్చి= ఆగి; ఒక్కింత సేపునకున్= కొంచెం సేపటికి; చుట్లన్+ఉన్న= తన చుట్టూ చేరిఉన్న; గుహ్యకులతోన్= యక్షులతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అంతట ప్రొద్దు పొడువగా ద్రుపదుడు కాలకృత్యాలు నిర్వర్తించి, వియ్యంకుడితో తగుమాట లాడగల వారిని పంపి అతడిని రప్పించి, ఏమాత్రం తొట్రుపాటు చెందక, తొందరపడక సభ్యంగా శిఖండి పురుషత్వం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్పష్టపరచి, వియ్యంకుడి మాట తప్పని తేల్చి, పరిజనంతో ఆయనకు విందొసగి, ధరించుటకు దుకూలాలిచ్చి దశార్ణపతి వేడికోలు మాటలు మన్నించి సాగనంపాడు. హేమవర్మ తాను శిఖండిపై మోపిన నిందకు తనను తాను దూషించుకొంటూ నిజపురికి వెళ్ళాడు. అట్టి సమయంలో స్థూలకర్ణుడి భవన సమీపానికి క్రీడార్థంగా విమానారూఢుడై కుబేరుడు వచ్చాడు. స్థూలకర్ణుడి సౌధ సౌందర్యానికి మెచ్చుతూ కుబేరుడు కొంచెంసేపు అచ్చట నిలిచి తన చుట్టునున్న యక్షులతో ఇట్లా అన్నాడు:

క. 'మన మిచట నిలిచియుండఁగ । మనమున శంకింప కిట్లు మసలిన వాఁ డీ
తని గర్వ మేల యిక్కడఁ । జనుదేరఁగనిచ్చు నెట్లు సైపఁగ వచ్చున్?' 392

ప్రతిపదార్థం: మనము= మనం; ఇచటన్= ఇక్కడ; నిలిచి+ఉండఁగన్= తనకొరకై వేచిఉండగా; మనమునన్= హృదయంలో; శంకింపక= జంకక; ఇట్లు మసలినవాఁడు= ఈ రీతిని స్థూలకర్ణుడు ఆలసిస్తున్నాడు; ఈతని గర్వము= ఇతడి పొగరు; ఇక్కడన్= ఇక్కడికి; ఏల చనుదేరఁగన్+ఇచ్చున్= ఎందుకు రానిస్తుంది; ఎట్లు= ఏ విధంగా; సైపఁగన్+వచ్చున్?= ఇతడిని క్షమింపవచ్చును?

తాత్పర్యం: మనం ఇక్కడ తన కొరకు వేచియుండగా మదిలో జంకులేక తాను జాగు చేస్తున్నాడు. ఇతడి కింత పొగ రెందుకు? ఈ పొగరు అతడి నిక్కడి కెట్లా రానిస్తుంది? ఇతడి తప్పు సహించట మెట్లా?

వ. అని పలికి యలుక మొగంబున ముడివడ నున్నంతఁ గిన్నరు లా గుహ్యకు నరసి తద్వృత్తాంతం బంతయు నెఱింగించి 'దేవా! సిగ్గుపెంపున రానేరకున్నవాఁ' డని విన్నవించిన. 393

ప్రతిపదార్థం: అలుక= కోపం; మొగంబునన్; ముడి+పడన్= వ్యాపించగా; ఉన్న+అంతన్= ఉండగా; కిన్నరులు(కించిత్+నరులు)= కొంచెం నరాకారం కలవారు (గుర్రం ముఖం కలవారు); ఆ గుహ్యకున్= యక్షుడైన స్థూలకర్ణుడిని; అరసి= విచారించి; తద్+వృత్తాంతంబు+అంతయున్= ఆతడి సమాచార మంతయూ; ఎఱింగించి= కుబేరుడికి తెలిపి; దేవా; సిగ్గుపెంపునన్= లజ్జాతిశయంవలన; రానేరక+ఉన్నవాఁడు= మీ సముఖమునకు రాజాలకున్నాడు; అని; విన్నవించినన్= మనవి చేయగా.

తాత్పర్యం: అని పలికి కుబేరుడు తన ముఖంలో క్రోధ మావరింపగా అక్కడ నిల్చిఉండగా, కిన్నరులు భవనంలోనికి వెళ్ళి స్థూలకర్ణుడి వృత్తాంతం తెలిసికొన్నారు. వారు అతడి సంగతినంతా కుబేరుడికి నివేదించి, ప్రభూ! 'స్థూలకర్ణుడు లజ్జాభరంతో మీ దగ్గరకు రాలేకున్నా' డని మనవి చేయగా.

ఆ. 'అయిన నేమి పిలువుఁ' డని పిలిపించిన । వచ్చి మ్రొక్కుటయును వనితయైన
యతనిఁ జూచి 'యింక నవుదాని కిట్టుల । యుండుఁగాక'! యని విభుండు పలికె. 394

ప్రతిపదార్థం: అయినన్+ఏమి= ఆడుది అయిన అవుగాక; పిలువుఁడు= వాడి నిక్కడికి పిలుచుక రండి; అని పిలిపించినన్= అని కుబేరుడు పిలిపించగా; వచ్చి= స్థూలకర్ణు డేతెంచి; మ్రొక్కుటయును= నమస్కరించగా; వనిత+ఐన= ఆడుదిగా మారిన; అతనిన్+చూచి= స్థూలకర్ణుడిని కనుగొని; ఇంకన్= మున్ముందు; అవుదానికిన్= జరుగనున్న కార్యానికి; ఇట్టుల+ఉండున్+కాక!= ఇతడిట్లే ఆడుదిగా నుండుగాక!; అని= అంటూ; విభుండు= కుబేరుడు; పలికెన్= వచించాడు.

తాత్పర్యం: 'ఆడుది అయిన మాత్రాన నేమి? వాడిని పిలవండి' అని కుబేరుడు పిలిపించగా, స్థూలకర్ణుడు వచ్చి నమస్కరించాడు. ఆడుదిగా మారిన అతడిని చూచి యక్షరాజు 'జరుగబోయే పనికి అనుకూలంగా ఇత డిట్లే వనితగా ఉండుగాక!' అని పలికాడు.

స్థూలకర్ణునకుఁ గుబేరుని వలన స్త్రీత్వము గలుగుట (సం. 5-193-39)

వ. స్థూలకర్ణుండును దలరి దండప్రణామంబులు సేసియుండె; నప్పుడు గొలిచియున్న దొరలు ధనదునకుం గృప వుట్ట నల్లన తెలిపిన నట్లేని 'వీడు శిఖండి యాయువు గలంతకాలంబున గాంతాకృతియై యుండి, పదంపడి నిజరూపంబు దాల్చుంగాక!' యని యనుగ్రహించి యరిగిన. 395

ప్రతిపదార్థం: స్థూలకర్ణుండును; తలరి= దుఃఖపడి; దండప్రణామంబులు చేసి= సాగిలపడి నమస్కరించి; ఉండెన్= మౌనంగా ఉండిపోయాడు; అప్పుడు; కొలిచియున్న దొరలు= కుబేరుడిని సేవిస్తున్న నాయకులు; ధనదునకున్= కిన్నరేశ్వరునకు; కృప+ పుట్టన్= కరుణ కలిగేటట్లు; అల్లన= మెల్లగా; తెలిపినన్= చెప్పగా; అట్లు+ఏనిన్= అట్లయితే; వీఁడు= ఇతడు; శిఖండి+ఆయువు+ కల+అంతకాలంబును= శిఖండికి ఆయుష్యమున్నంత వరకూ; కాంతా+ఆకృతి+ఐ= స్త్రీ రూపం కలవాడై; ఉండి; పదంపడి= ఆ తరువాత; నిజరూపంబున్= తాల్చున్+కాక= తన సహజస్వరూపాన్ని ధరించగలడు; అని; అనుగ్రహించి= శాపావసానమును ప్రసాదించి; అరిగినన్= అలకాపురికి వెళ్ళగా.

తాత్పర్యం: స్థూలకర్ణుడు దుఃఖపడి కుబేరుడికి సాగిలబడి నమస్కరించి మౌనంగా ఉండిపోయాడు. అప్పుడు కిన్నరేశ్వరుని కొలిచియున్న నాయకులు అతడికి కరుణ కలిగేటట్లు నెమ్మదిగా మంచి మాటలు చెప్పారు. అట్లయితే వీడు ఆ శిఖండి బ్రతికిఉన్నంతకాలం పడతిగానే ఉండి, ఆ పిదప నిజస్వరూపం గైకొనగలడు' అని శాపవిముక్తి ప్రసాదించి తన అలకాపురికి వెళ్ళిపోయాడు.

తే. గుహ్యకుండు విషాదంబు గూరియుండ । నచ్చటికిఁ గొన్ని దినముల కరుగుదెంచెఁ
దల్లిదండ్రుల కెఱిఁగించి తగవు మెఱయ । సమయనిష్ఠ వాటించి పాంచాలసుతుఁడు. 396

ప్రతిపదార్థం: గుహ్యకుండు= కుబేరుని అనుచరుడు; విషాదంబు+కూరి+ఉండన్= దుఃఖభరితుడై ఉండగా; అచ్చటికిన్= ఆతడి నివాసానికి; కొన్ని దినములకున్= కొన్నాళ్ళకు; పాంచాల సుతుఁడు= ద్రుపదుడి పుత్త్రుడైన శిఖండి; తల్లిదండ్రులకున్= జననీ జనకులకు; ఎఱిఁగించి= తెలిపి; తగవు మెఱయన్= న్యాయం వెలయగా; సమయనిష్ఠ+పాటించి= ప్రతిజ్ఞ యొక్క నియమాన్ని ఆదరించి; అరుగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: స్థూలకర్ణుడు కుబేరుడిశాపంతో చింతాక్రాంతుడై ఉన్నాడు. శిఖండి తన తల్లిదండ్రులకు చెప్పి న్యాయం తప్పక, ఏర్పరచుకొన్న నియమం ప్రకారం పదిరోజులు ముగియగానే అతడి మగతనం అతడికి తిరిగి ఇచ్చి వేయటం కోసం స్థూలకర్ణుడి గృహానికి వచ్చాడు.

క. వచ్చినఁ గనుఁగొని 'నీ దెసఁ । బొచ్చెము లే; దిట్ల మగిడి పొఃమ్మిది విధి నీ
కిచ్చిన రూపని గుహ్యకుఁ । డచ్చుపడం బలికి యెల్ల నతనికిఁ జెప్పెన్. 397

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వచ్చినన్= శిఖండిరాగా; కనుఁగొని= చూచి; నీ దెసన్= నీ యెడ; పొచ్చెము లేదు= దోషం లేదు; ఇట్లు+అ= వచ్చినవాడవు వచ్చినట్లుగానే; మగిడి పొమ్ము= తిరిగి వెళ్లుము; ఇది; విధి= దైవం; నీకున్= నీకు; ఇచ్చిన రూపు= అనుగ్రహించిన రూపం; అని= అనుచు; గుహ్యకుఁడు= యక్షుడు; అచ్చుపడన్+పలికి= విస్పష్టంగా వచించి; ఎల్లన్= జరిగినదంతయూ; అతనికిన్= శిఖండికి; చెప్పెన్= తెలిపాడు.

తాత్పర్యం: సమయ నిష్ఠ పాటించి తన దగ్గరకు వచ్చిన శిఖండిని చూచి గుహ్యకుడు 'నీయెడ ఏ దోషం లేదు. వచ్చినవాడివి వచ్చినట్లుగానే ఇంటికి మరలిపొమ్ము. ఇది దైవం నీ కనుగ్రహించిన రూపం' అంటూ జరిగిన విషయం తేటతెల్లంగ అతడికి తెలిపాడు.

వ. చెప్పి వీడుకొలిపిన శిఖండి యత్యంత ప్రమోదంబునం దండ్రి కడకు వచ్చి యత్తెఱం గెఱింగించిన నాతండు ప్రీతుండయి దేవగురుద్విజపూజనంబు లాచరించి ద్రోణాచార్యుపాల సవిశేషంబుగా శిష్యభావంబు ప్రతిష్ఠించె'. 398

ప్రతిపదార్థం: చెప్పి= స్థూలకర్ణు డట్లా పలికి; వీడుకొలిపినన్= సాగనంపగా; శిఖండి; అత్యంత ప్రమోదంబునన్= మిక్కిలి హర్షంతో; తండ్రి కడకున్; వచ్చి; ఆ+తెఱంగు= అక్కడ జరిగిన సంగతి; ఎఱింగించినన్; ఆతండు= ద్రుపదుడు; ప్రీతుండు+ అయి= సంతోషించినవాడై; దేవగురు ద్విజ పూజనంబులు= దేవతలకు, గురువులకు, విప్రులకు పూజలు; ఆచరించి= చేసి; ద్రోణాచార్యుపాలన్= ద్రోణుడి దగ్గర; సవిశేషంబుగన్= అసాధారణంగా; శిష్యభావంబున్= శిష్యత్వమును; ప్రతిష్ఠించెన్= స్థిరంగా నెలకొల్పాడు.

తాత్పర్యం: స్థూలకర్ణు డట్లా తెలిపి సెలవొసంగగా, శిఖండి మిక్కిలి సంతోషంతో తన తండ్రి దగ్గరకు వచ్చి జరిగిన విషయమంతా తెల్పాడు. ద్రుపదుడు హర్షించి, దేవతలను గురువులను బ్రాహ్మణులను పూజించి, తన పుత్రుడైన శిఖండిని ద్రోణాచార్యులవారికి అసాధారణ శిష్యుణ్ణి కావించాడు.'

క. అని చెప్పి నారదుఁడు దా । నును సత్యవతీ సుతుండునుం దమ యిచ్చం
జనిరి; శిఖండి చరిత్రము । జనకర్ణ పరంపరం బ్రశస్తం బయ్యెన్. 399

ప్రతిపదార్థం: అని చెప్పి= ఇట్లు తెలిపి; నారదుఁడున్= నారద మహర్షి; తానును= తానూ; సత్యవతీ సుతుండునున్= సత్యవతీ దేవి కుమారుడైన వ్యాసుడూ; తమ+ఇచ్చన్+చనిరి= తమ దారిని తాము వెళ్ళారు; శిఖండి చరిత్రము= శిఖండి కథ; జనకర్ణపరంపరన్= లోకులు ఒకరికొకరు చెప్పుకొంటూఉండగా; ప్రశస్తంబు+అయ్యెన్= వెల్లడైనది.

తాత్పర్యం: భీష్ముడికి నారదు డిట్లా చెప్పి, తానూ వ్యాసుడూ తమ దారిని తాము వెళ్ళారు. లోకులు ఒకరికొకరు చెప్పుకొనగా శిఖండి వృత్తాంతం వెల్లడి అయింది.

వ. ఇవ్విధంబునఁ గాశీపతికన్యక సిద్ధమూర్తి యయి నెగడె; నేను నంగనల నంగనాపూర్వుల నంగనాభిధానుల నంగనాకారులను వధియింపకుండ వ్రతంబు పూనినవాఁడం గావున నంగనాపూర్వుండగు శిఖండి నాకు భండనంబునం గోదండపాండిత్యంబు మెఱసినను జంపను నొంపనుఁ; గడంగితిన యేని నింతకంటె దుర్యశంబు గలదె? యెట్లయిన నగుదుంగాని భగ్నవ్రతుండ నగుట కోర్వ నిది నా తెఱంగు.' 400

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; కాశీపతి కన్యక= కాశీరాజపుత్రి అంబ; సిద్ధమూర్తి+అయి+నెగడన్= తపస్సిద్ధి కలిగినదై విరాజిల్లింది; నేనున్; అంగనలన్= స్త్రీలను; అంగనాపూర్వులన్= తొలుత ఆడువారిగా ఉన్నవారిని; అంగనా+అభిధానులన్= ఆడుపేరులు కలవారిని; అంగనా+ఆకారులను= ఆడువారి ఆకారమువంటి ఆకారం కలవారిని; వధియింపకుండన్= చంపకుండేటట్లు; వ్రతంబు పూనినవాఁడన్= నియమం వహించాను; కావునన్= కాబట్టి; అంగనాపూర్వుండు+అగు= ముందు ఆడుదిగాఉన్న; శిఖండి; నాకున్; భండనంబునన్= యుద్ధమునందు; కోదండ పాండిత్యంబు= ధనుర్విద్యాకౌశలం; మెఱసినను= ప్రకటించినను; చంపను= సంహరించటానికీ; నొంపను= బాధించుటకును; కడంగితిన+ఏనిన్= పూనుకొంటినేని; ఇంతకంటెన్; దుర్యశంబు+కలదె?= అపకీర్తి ఉన్నదా?; ఎట్లు+అయినన్+అగుదున్+కాని= నేనేమైపోతే పోతానుకాని; భగ్న వ్రతుండన్= నియమం చెరచుకొన్నవాడను; అగుటకున్+ఓర్వన్= కావటానికి సహించలేను; ఇది నా తెఱంగు= నా పద్ధతి యిది.

తాత్పర్యం: ఈ విధంగా కాశీరాజకుమారి అంబ తపశ్శక్తిచేత నన్ను సాధించేదిగా వెలసింది. నేను ఆడువారిని, మొదట ఆడువారిగా ఉండినవారిని, ఆడువారి పేరులు పెట్టుకొన్నవారిని, ఆడువారివంటి ఆకారం కలిగిన వారిని చంపనని నియమం వహించి ఉన్నాను. శిఖండి మొదట ఆడుదిగా ఉండి పురుషుడైనాడు గనుక అతడు యుద్ధంలో నామీద తన కోదండ పాండిత్యం ఎంత ప్రకటించినా అతడిని నేను వధించను, బాధించను. అట్లా చేస్తే అంతకన్న నాకు అపకీర్తి వేరే ఉండదు. నేనేమైపోతే పోతానుగాని వ్రతభంగం మాత్రం చేసుకోలేను. ఇది నా నిశ్చయం.'

క. అని చెప్పిన దేవవ్రతు । వినుత వచనములు విభుండు విని తన చిత్తం
బున నొక్కింత వగచి' యీ । తనికి మగతనంబు పూన్కి తగు'నని పలికెన్. 401

ప్రతిపదార్థం: అని చెప్పిన= అని పల్కిన; దేవవ్రతు వినుత వచనములు= భీష్ముడి యొక్క కొనియాడబడిన మాటలు; విభుండు= దుర్యోధనుడు; విని= ఆలించి; తన చిత్తంబునన్= తన మనస్సులో; ఒక్క+ఇంత వగచి= ఇంచుక చింతించి; ఈతనికిన్= ఈ భీష్ముడి కొక్కడికే; మగతనంబు పూన్కి= పౌరుషం చెల్లించుకొనటం; తగున్+అని+పలికెన్= తగియున్నదని పలికాడు.

తాత్పర్యం: అని చెప్పిన భీష్ముడి మెచ్చదగిన పలుకులు దుర్యోధను డాలకించాడు. తన మనసులో ఇంచుక దుఃఖించి, 'మగటిమి నిలుపుకొనటం ఈ మహనీయుడి కొక్కడికే చెల్లిన'దని పలికాడు.

వ. తదనంతరంబ కొలువునం గలయ సమర విషయంబు లయిన సల్లాపంబులు సెలుచుండఁ గొండొకసేపు వినుచుండి సుయోధనుండు సురనదీసూనున కిట్లనియె: 402

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట; కొలువునన్= సభలో; కలయన్= అంతట; సమర విషయంబులు+ అయిన= యుద్ధానికి సంబంధించిన; సల్లాపంబులు= పరస్పర సంభాషణలు; చెల్లుచున్+ఉండన్= సాగుతుండగా; కొండొకసేపు= ఒకించుక తడవు; వినుచున్+ఉండి= ఆలిస్తూ ఉన్నవాడై; సుయోధనుండు; సురనదీసూనునకున్= మందాకినీ కుమారుడైన భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అటు పిమ్మట సభలో యుద్ధానికి సంబంధించిన విషయాలను గూర్చి వీరులు పరస్పరం సంభాషించుకొనుచుండగా దుర్యోధనుడు కొంచెంసేపు ఆలకించి గాంగేయుడితో ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'పాండవులకుఁ గలుగు బలము లన్నియు సమ। యింప నీకు దినము లెన్నిపట్టు
గురుఁడుఁ గృపుఁడు గురుని కొడుకుఁ గర్ణుండు నెం। తెంత మానమున వధింతు రనఘ?' 403

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యుడా!; పాండవులకున్= పాండునందనులకు; కలుగు బలములు= ఉన్న సేనలు; అన్నియున్= అన్నింటినీ; సమయింపన్= చంపటానికి; నీకున్= నీకు; ఎన్ని దినములు+పట్టున్?= ఎన్ని రోజులు సరిపోతాయి?; గురుఁడున్= ద్రోణుడు; కృపుఁడున్= కృపాచార్యుడు; గురుని కొడుకున్= ద్రోణపుత్రుడైన అశ్వత్థామ; కర్ణుండున్= రాధేయుడు; ఎంత+ఎంత మానమునన్= ఎంతెంత కాలంలో; వధింతురు?= చంపగలరు?

తాత్పర్యం: 'పితామహా! పాండవుల కున్న సేనలన్నింటినీ చంపటానికి నీ కెన్ని రోజులవుతాయి? ద్రోణాచార్యులు, కృపాచార్యులు, అశ్వత్థామ, కర్ణుడు ఎంతెంత కాలంలో కౌంతేయుల సేనలను సంహరించగలరో చెప్పుము.'

వ. అనిన విని గాంగేయుం డతని కిట్లనియె : 404

తాత్పర్యం: అట్లా దుర్యోధనుడు అడుగగా విని భీష్ము డిట్లా అన్నాడు:

క. 'అనిఁ బాండవ సేనలఁ జం। పను జెఱుపను నేము చాలు భంగుల నీ కి
ట్లనుమానము వాయఁగ నడు। గన తగుఁ; గడు లెస్స! విందు గాక నరేంద్రా! 405

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధంలో; పాండవ సేనలన్= పాండవుల సైన్యాలను; చంపను= చంపటానికి; చెఱుపను= భగ్నం చేయటానికి; ఏము= మేము; చాలు భంగులన్= శక్తి గలిగినతీరులను; నీకున్= నీకు; అనుమానము+పాయఁగన్= ఏర్పడిన సందేహం తొలగటానికై; ఇట్లు+అడుగన+తగున్= ఇట్లా అడగటం ఉచితమే; కడున్ లెస్స= అది మిక్కిలి మంచిది; నర+ఇంద్రా!= ఓ రాజా!; విందు(వు)కాక= ఆలకించుము.

తాత్పర్యం: 'పాండవ సేనలను యుద్ధ భూమిలో వధించటానికి, చెరచటానికి మాకు గల శక్తియుక్తు లెట్టివో సందేహం తొలగించుకొనటానికై నీ వడగటం సముచితమే. రాజా! నే చెప్పేది బాగా విను.

వ. ఏను నా సాలెడు కొలంది సెప్పెదఁ; దక్కటివారుఁ దమ తమ చాలుటలు దార చెప్పెద; రది యెల్లను బిదప విందుగాని; మున్ను నీ కొక్క బాస యిచ్చెద నాకర్ణింపుము. 406

ప్రతిపదార్థం: ఏను= నేను; నా చాలెడు కొలంది+చెప్పెదన్= నా సామర్థ్యం యొక్క ప్రమాణమెంతో చెప్పుతాను; తక్కటివారున్= మిగిలిన ద్రోణాదులు; తమ తమ చాలుటలు= తమ తమ సామర్థ్యాలు; తారు+అ= తామే; చెప్పెదరు; అది+ఎల్లను; పిదపన్; విందు(వు)కాని; మున్ను= ముందుగా; నీకున్; ఒక్క బాస+ఇచ్చెదన్= ఒక్క ప్రతిజ్ఞ చేస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: నేను నా సామర్థ్యపు ప్రమాణమెంతో చెప్పుతాను. మిగిలినవారు తమ తమ సమర్థతలను గురించి వారే చెప్పుకొంటారు. అన్నీ నీవు విందువుగాని, ముందుగా నా ప్రతిజ్ఞ వినిపిస్తాను. వినుము.

క. మీఁటుగల రాజరథికుల। నాఁటికి వేవుర వధింతు; నరుశరములు నో
నాఁటి పడవైచునంతకు। వేఁటాడెదఁ బ్రతిబలంబు వీరుల నెల్లన్. 407

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మీఁటు+కల= పెంపు వహించిన; రాజరథికులన్= రథికులైన రాజులను; నాఁటికిన్= దినానికి; వేవురన్= వెయ్యిమందిని; వధింతున్= చంపగలను; నరుశరములు= అర్జునుడి బాణాలు; నోనాఁటి= నొచ్చునట్లు నా శరీరంలో గ్రుచ్చుకొని; పడన్+వైచునంతకున్= నన్ను నేలగూల్చేదాక; ప్రతిబలంబు వీరులన్+ఎల్లన్= శత్రు సైన్యంలోని శూరు లందరినీ; వేఁటాడెదన్= వధిస్తాను.

తాత్పర్యం: నేను పెంపుగల రథికులను రోజుకు వెయ్యిమందిని చంపుతాను. అర్జునుడి శరాలు నొచ్చేటట్లు నా అవయవములందు నాటుకొని నన్ను నేలమీద పడవేసేవరకు శాత్రవసేనలోని శూరులను వధిస్తాను.

వ. అట్లుగాక నా కయ్యంబు సేయు దివసంబులోన. 408

ప్రతిపదార్థం: అట్లుగాక= అంతేకాక; నా కయ్యంబు+చేయు= నేను యుద్ధం చేసే; దివసంబులోనన్= దినంలో.

తాత్పర్యం: సుయోధనా! ఆ విధంగా నేను యుద్ధం చేసే రోజులలో.

క. పదివేలఁ జంపఁగా నో । పుదు నే నను నెత్తికోలు పుట్టిన యది నీ
పదునొకఁ డక్షౌహిణులను । జదురున నడపింతు నెదిరి సైన్యము గలఁతున్.' 409

ప్రతిపదార్థం: పదివేలన్= పదివేల మందిని; నేను= నేను; చంపఁగాన్+ఓపుదున్= సంహరింపజాలుదును; అను= అనునట్టి; ఎత్తికోలు= సంకల్పం; పుట్టిన అది= కలుగుతున్నది; నీ పదునొకఁడు+అక్షౌహిణులను= నీ కున్న పదకొండక్షౌహిణుల సేనను; చదురునన్+నడపింతున్= నేర్పుతో యుద్ధం చేసేటట్లు చేస్తాను; ఎదిరి సైన్యము= శత్రుసేనను; కలఁతున్= చీకాకు పరుస్తాను.

తాత్పర్యం: దినమునకు వెయ్యిమందినిగాదు, పదివేల మందిని చంపగలుగుదునసే సంకల్పం కలుగుతున్నది. నీ పదకొండక్షౌహిణుల సైన్యాన్ని చాతుర్యంతో నడిపించగలను. శాత్రవ సేనలను సంక్షోభింపచేయగలను.'

వ. అని పలికి వెండియు. 410

తాత్పర్యం: అని సుయోధనునిడితో పలికి మరల భీష్ము డిట్లా అన్నాడు.

క. 'నీ వడిగిన పని యేర్పడఁ । గా విను "మేనొక్క నెలఁ' దెగంజేయుదు నా
నావిధ దివ్యాస్త్రంబుల । లావున నప్పాండవుల బలంబుల నెల్లన్.' 411

ప్రతిపదార్థం: నీవు= నీవు; అడిగినపని= నన్నడిగిన కార్యాన్ని; ఏర్పడఁగాన్ వినుము= స్పష్టంగా తెలిసికొనుము; నానా విధ= పలు రకాలైన; దివ్య+అస్త్రంబుల లావునన్= దివ్యశరాల శక్తిచేత; ఆ+పాండవుల బలంబులన్+ఎల్లన్= ఆ పాండు నందనుల సేనల నన్నింటినీ; ఏను= నేను; ఒక్కనెలన్= ఒక నెలరోజులలో; తెగన్+చేయుదున్= నరికి వేయగలను.'

తాత్పర్యం: 'నీవు నన్నడిగిన పనిని గూర్చి స్పష్టంగా వినుము. పలు రకాలైన దివ్యాస్త్రాల శక్తిచేత ఆ పాండు కుమారుల బలగాల నన్నింటినీ ఒక నెలరోజులలో ఖండించి వేయగలను.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనవుడు గురుకృపాశ్వత్థామ కర్ణులం గలయం గనుంగొని గాంధారీనందనుండు 'మీమీ చందంబులెట్లు? నిన నాచార్యుండు మందస్మితాననుం డగుచు నిట్లనియె. 412

ప్రతిపదార్థం: అనవుడున్= అని భీష్ముడు పలుకగా; గురుకృప+అశ్వత్థామ కర్ణులన్; కలయన్+కనుంగొని= తేరిపారచూచి; గాంధారీ నందనుండు= గాంధారి కొడుకు సుయోధనుడు; మీమీ చందంబులు+ఎట్లు= మీమీ శక్తి సామర్థ్యాలు ఎట్టివి; అనినన్= అని ప్రశ్నించగా; ఆచార్యుండు= ద్రోణుడు; మందస్మిత+ఆననుండు+అగుచున్= చిరునవ్వుతో కూడిన మొగం కలవాడౌతూ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీష్ముడు పలికిన తరువాత సుయోధనుడు ద్రోణ కృపాశ్వత్థామ కర్ణులను కలయ జూచి, మీమీ సామర్థ్యా లెటువంటివో తెలపం'డని ప్రశ్నించగా, మొగాన చిరునవ్వు మోసులెత్తగా ద్రోణాచార్యు డిట్లా అన్నాడు:

తే. 'ఏను ముదిసిన వాఁడ మహీశ! యెట్టు। లయిన నోపిన భంగి నీ యనుఁగుఁ దాత
సాలి నన్నిదినంబులఁ జాలవచ్చు। నబ్బలంబుల నని సమయంగఁ జేయ.' 413

ప్రతిపదార్థం: మహీ+ఈశ!= భూపతీ!; ఏను= నేను; ముదిసిన వాఁడన్= ముసలి వాడిని, ఎట్టులు+అయినన్= ఎట్లాగయినా; ఓపిన భంగిన్= శక్తి ఉన్నంతమేరకు; ఆ+బలంబులన్= ఆ పాండవుల సేనలను; అనిన్= యుద్ధంలో; సమయంగన్+చేయన్= సంహరించుటకు; నీ+అనుఁగున్+తాత= నీ యందు ప్రేమగల్గిన పితామహుడు; చాలిన+అన్ని దినంబులన్= చంపగలనన్న నెలరోజులలో; చాలన్+వచ్చున్= నేను చంపవచ్చును.

తాత్పర్యం: 'రాజా! నేను ముసలి వాడిని. ఎట్లాగయినా శక్తి ఉన్నంతమేరకు పోరాడుతాను. నీయెడ ప్రేముడిగల నీ తాతకు పట్టినట్లు నాకూ పాండవ సేనలను నిర్మూలించటానికి నెల రోజులు పట్టవచ్చు.'

క. అనినఁ గృపాచార్యుం 'డీ। యినుమడి దివసములఁ దీర్ప నేనోపుదు' నా
విని గురుతనూభవుఁడు 'పది। దినములఁ గడతేర్తు' ననియె ధీరవిచారా! 414

ప్రతిపదార్థం: ధీరవిచారా!= ధైర్యంతో కూడిన ఆలోచనగల జనమేజయ మహారాజా!; అనినన్= అని ద్రోణుడు పలుకగా; కృప+ఆచార్యుండు= కృపాచార్యులవారు; ఈ+ఇనుమడి దివసములన్= భీష్మ ద్రోణులు తెల్పిన దినాలకు రెట్టింపు దినాలలో; ఏన్= నేను; తీర్పన్+ఓపుదున్= శాత్రవ సేనలను కడతేర్చగలను; నాన్= అని చెప్పగా; విని= ఆలించి; గురు తనూభవుఁడు= ద్రోణపుత్రుడైన అశ్వత్థామ; పది దినములన్= పది రోజులలో; కడతేర్తున్+అనియెన్= సమయించగలనని పలికాడు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ఆకర్ణింపు మని వైశంపాయన మహర్షి పలుకుతున్నాడు: 'ద్రోణుడు నెలరోజులలో పాండవసైన్యాన్ని పరిమార్చగల' నని పలికిన తరువాత కృపాచార్యులు అంతకు రెట్టింపు దినాలలో సమయిస్తా నన్నాడు. కృపుడు చెప్పిన తర్వాత అశ్వత్థామ తాను పది రోజులలో పాండవ సైన్యాన్ని హతమార్చగలనన్నాడు.

వ. అందఱ పలుకు లాకర్ణించి కర్ణుండు. 415

ప్రతిపదార్థం: కర్ణుండు; అందఱ పలుకులు; ఆకర్ణించి= విని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అందరి మాటలు విన్న తరువాత కర్ణుడు. (ఇట్లా అన్నాడు:).

క. **'నానాస్త్ర శస్త్ర చయ బల । బానలముం గవియఁ జేసి యత్యుగ్రత నే**
నేనాళ్లన యప్పాండవ । సేనా సాగరము నివురఁ జేయుదు నధిపా!" **416**

ప్రతిపదార్థం: అధిపా!= దుర్యోధన మహారాజా!; నానా+అస్త్ర శస్త్ర చయ= పలు రకాలైన అస్త్రముల యొక్క, ఆయుధాల యొక్క సముదాయమనెడు; బడబా+అనలమున్= బడబాగ్నిని; కవియన్+చేసి= క్రమ్ముకొనేటట్లు చేసి; అతి+ఉగ్రతన్= మిక్కిలి భయంకరత్వంతో; నేను; ఏనాళ్ళన్+అ= ఐదు దినాలలోనే; ఆ+పాండవ సేనా సాగరమున్= పాండవుల సేనఅనే సముద్రాన్ని; ఇవురన్+చేయుదున్= ఇంకిపోయేటట్లు చేస్తాను.

తాత్పర్యం: పలు రకాలైన దివ్యాస్త్రాలు, ఆయుధాలు అనే బడబాగ్నిని క్రమ్ముకొనజేసి అతి భయంకరంగా నేను ఐదు రోజులలో పాండవుల సేన లనెడు సాగరాన్ని ఇంకిపోయేటట్లు చేస్తాను.'

విశేషం: అలం: రూపకం.

వ. **అని ప్రతిన సేసినఁ గలకల నవ్వి గాంగేయుండు.** **417**

ప్రతిపదార్థం: అని; ప్రతిన చేసినన్= ప్రతిజ్ఞ చేయగా; కలకల నవ్వి= పకపక నవ్వి; గాంగేయుండు= భీష్ముడు.

తాత్పర్యం: అని కర్ణుడు ప్రతిజ్ఞ చేయగా పకపక నవ్వుతూ భీష్ముడు.

చ. **'పలికిన నేమి యన్నియును బల్క నగున్ మనరాజు నొద్ద మా**
ర్పలికెడు వారు లేరు విను పాండవమధ్యము గాండివంబు దీ
ప్తుల మిఱుమిట్లుఁ గొన్న కనుదోయి గుణధ్వని వ్రయ్యలైన వీ
నులు నయినన్ బలే పలుకు నూల్కొనకుండుదు సూతనందనా! **418**

ప్రతిపదార్థం: సూతనందనా!= సూతపుత్రా! కర్ణా!; మనరాజు+ఒద్దన్= మన ప్రభువు దగ్గర; పలికినన్+ఏమి?= చెప్పగానే సరిపోయిందా?; అన్నియును పల్కన్+అగున్= ఎన్ని మాటలైనా నుడువ వచ్చును; మార్పలికెడువారు లేరు= బదులు చెప్పేవారెవ్వరూ లేరు; విను= నా మాట లాలకించుము; పాండవ మధ్యము= పాండవులలో నడిమివాడైన విజయుడి యొక్క; గాండివంబు దీప్తులన్= గాండీవ చాపము యొక్క కాంతులచేత; మిఱుమిట్లు కొన్న= చీకిలించుక పోయిన; కనుదోయి= కన్నుల జంట; గుణధ్వనిన్= అల్లెత్రాటి మ్రోతచేత; వ్రయ్యలు+ఐన= బ్రద్దలైన; వీనులున్+అయినన్= చెవులు కలవాడ వైనప్పుడు; బలే= అవురా; పలుకు నూల్కొనక+ఉండుదు= మాట్లాడటానికి ప్రయత్నం చెయ్యవు. (అంతవరకూ ఇట్లాగే వాగుతుంటావు అని భావం.)

తాత్పర్యం: 'సూతపుత్రా! చెప్పగానే సరిపోయిందా? ఎన్ని మాటలైనా పలుకవచ్చు. మన రాజు దగ్గర బదులు పలికేవారు లేరు గదా! ఈ మాట వినుము. అర్జునుడి గాండీవ కాంతులతో కనులు చీకిలించుకపోయినప్పుడు, అల్లెత్రాటి మ్రోతచేత చెవులు బ్రద్దలైనప్పుడు గాని, నీవు ఇట్లా మాటాడటం మానుకోవు. అందాకా ఇట్లానే వాగుతుంటావు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. **అనియెఁ; నివ్విధంబున నీ కొడుకు కడం బుట్టిన విశేషంబులు ధర్మతనయుండు చారులవలన విని తమ్ముల రాఁబనిచి వారలతో నిట్లనియె.** **419**

ప్రతిపదార్థం: అనియెన్= అని భీష్ము డన్నాడు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; నీ కొడుకు కడన్= నీ కుమారుడి దగ్గర; పుట్టిన విశేషంబులు= కలిగిన వింతలు; ధర్మతనయుండు; చారుల వలనన్= వేగులవారివలన; విని; తమ్ములన్= రాన్+పనిచి= రప్పించుకొని; వారలతోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీష్ము డిట్లా కర్ణుడిని వారించాడు. నీ కొడుకు దగ్గర ఇట్లా జరిగిన విశేషాలన్నీ వేగుల వలన విని ధర్మజుడు తన తమ్ములను చెంతకు పిలిపించుకొని వారితో ఇట్లా అన్నాడు:

సీ. **'మన చారు లిప్పుడు చనుదెంచి రావీట । నుండి; దుర్బుద్ధి సుయోధనుండు**
గొలువున గాంగేయ కుంభసంభవ కృపా । శ్వత్థామ కర్ణుల వలను చూచి
యనిఁ బాండవుల బల మంతయు సమయింపఁ । జాలుదు రెంతేసి కాలమాన
మున? నన్న భీష్ముండు దన కొక్క నెలవట్టు । ననియాడె; ద్రోణుండు నట్ల పలికెఁ;

ఆ. **గృపుఁడు రెట్టి సెప్పెఁ; గృపి కొడు కోపుదుఁ । బది దినముల ననియె బాహువీర్య**
ఘనుఁడు గాన సూతతనయుఁ డేనాళ్లన । తీర్ప నేర్తు నని ప్రతిజ్ఞ చేసె.' **420**

ప్రతిపదార్థం: మన చారులు= మన వేగులవారు; ఆ వీటన్+ఉండి= కౌరవుల స్కంధావారం నుండి; ఇప్పుడు చనుదెంచిరి= ఇప్పుడే వచ్చారు; దుర్బుద్ధి సుయోధనుండు= చెడు బుద్ధిగల దుర్యోధనుడు; కొలువునన్= సభలో; గాంగేయ; కుంభ సంభవ కృప+అశ్వత్థామ కర్ణుల వలను= గంగాపుత్రుడైన భీష్ముడు, కలశం నుండి జనించిన ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, కర్ణుడు అనేవారలవైపు; చూచి= కనుంగొని; అనిన్= రణంలో; పాండవుల బలము+అంతయున్= పాండవుల సైన్యం అంతటినీ; ఎంతేసి కాలమానమునన్= ఎంతెంత కాలంలో; సమయింపన్+చాలుదురు?= చంపే శక్తి కల్గి ఉన్నారు? అన్నన్= అని ప్రశ్నించగా; భీష్ముండు= గాంగేయుడు; తనకున్+ఒక్క నెల పట్టును! అని+ఆడెన్= తన కొక మాసం పట్టుతుందని పలికాడు; ద్రోణుండున్= ద్రోణాచార్యుడు; అట్ల పలికెన్= భీష్ముడు చెప్పినట్లే నెలపడుతుందని చెప్పాడు; కృపుఁడు= కృపాచార్యుడు; రెట్టి చెప్పెన్= (రెట్టింపు కాలం)రెండు మాసములౌతుందని అన్నాడు; కృపి కొడుకు= అశ్వత్థామ; పది దినములకున్= పది రోజులకు; ఓపుదున్= చాలుదును; అనియెన్= అన్నాడు; బాహువీర్య ఘనుఁడు కానన్= భుజవిక్రమంచేత దొడ్డవాడు గనుక; సూతతనయుఁడు= కర్ణుడు; ఏనాళ్లన= ఐదు రోజులలోనే; తీర్పన్+నేర్తున్= నిర్మూలించజాలుదును; అని+అనుచు; ప్రతిజ్ఞ చేసెన్= ప్రతిన చేశాడు.

తాత్పర్యం: 'మన వేగులవారు ఇపుడే దుర్యోధనుడి స్కంధావారం నుండి వచ్చారు. దుష్టచిత్తుడైన దుర్యోధనుడు కొలువులో భీష్ముడిని, ద్రోణుడిని, కృపుడిని, అశ్వత్థామను, కర్ణుడిని చూచి 'మీ రెంతెంత కాలంలో పాండవ సేననంతటినీ ప్రత్యేకంగా నిర్మూలించగల?'రని ప్రశ్నించాడట. అందుకు సమాధానంగా భీష్ముడు తన కొక నెల పడుతుందన్నాడు. ద్రోణాచార్యుడు అట్లే ఒక మాస మన్నాడు. కృపాచార్యుడు రెండునెల లన్నాడు. అశ్వత్థామ పదిరోజులన్నాడు. భుజవిక్రమాఢ్యుడైన కర్ణుడు మాత్రం ఐదు రోజులలో మన బలాలనన్నింటినీ సంహరించగలనని ప్రతిజ్ఞ చేశాడట.'

వ. అని చెప్పి యర్జునుం గనుంగొని 'వారు తమ తమ యోపిన చందంబులు సెప్పిరి; నీచేతం గౌరవ బలంబు లెంత దడవునకుం దెగు? నాకుం జెప్పు' మనిన నతం డిట్లనియె. 421

ప్రతిపదార్థం: అని చెప్పి; అర్జునున్; కనుంగొని; వారు; తమ తమ; ఓపిన చందంబులు= చాలినరీతులు; చెప్పిరి; నీ చేతన్= నీ వలన; కౌరవ బలంబులు= కురుసేనలు; ఎంత తడవునకున్= ఎంత కాలంలో; తెగున్= నశించునో; నాకున్; చెప్పుము; అనినన్= అని ధర్మజు డనగా; అతండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ధర్మజుడు పలికి పార్థుడిని కనుంగొని, 'వారు తమ తమ శక్తులు ఏపాటివో చెప్పారు. నీచేత కురుసైన్యం ఎన్నాళ్ళలో హతం కాగలదో నాకు తెల్పు'మని అడుగగా అర్జును డిట్లా అన్నాడు:

తే. 'వార లంతకుఁ జాలని వారె? నీ బ । లముల సమయింపఁ జాలెడు లావు వెరవుఁ
గలర కాక! యా రాజుతోఁ బలికి బాస । దప్పవచ్చునె వారికి ధరణినాథ!' 422

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; వారలు= భీష్మాదులు; అంతకున్+చాలనివారె?= చెప్పినట్లు చేయలేనివారా?; నీ బలములన్= నీ సేనలను; సమయింపన్= వధించటానికి; చాలెడు= కావలసిన; లావున్= బలమూ; వెరవున్= ఉపాయమూ; కలరకాక= ఉన్నవారే అగుదురుగాని; ఆ రాజుతోన్= తమ ప్రభువైన దుర్యోధనుడితో; పలికి= చెప్పి; వారికిన్= వారలకు; బాస= ప్రతిజ్ఞ; తప్పన్ వచ్చునె?= నెరవేర్చకుండటం న్యాయమా? (వారు తమ బాసను ఏనాటికీ నిలబెట్టుకోలేరని భావం.)

తాత్పర్యం: 'భీష్మాదులు గొప్ప శక్తియుక్తులు కలవారే. నీ సేనలను కూల్చదగిన పరాక్రమం ఉపాయం ఉన్నవారే అగుదురుగాక! కాని ఏలిక కిచ్చిన మాట నెరవేర్చుకొనాలి గదా!' (అది వారి తరం కాదని తాత్పర్యం.)

వ. అని దరహాసోల్లాస భాసిత వదనుండై. 423

ప్రతిపదార్థం: అని; దరహాస+ఉల్లాస+భాసిత వదనుండై= చిరునగవు యొక్క ప్రకాశంచేత ఒప్పుతున్న ముఖంకలవాడై.

తాత్పర్యం: అని అర్జునుడు చిరునవ్వుతో ఒప్పుతున్న ముఖంకలవాడై.

మ. 'అనుమానం బదియేల? నీమది మదీయ స్ఫార బాహాబలం
బు నిరూపింప దలంచి తేని విను; మేపుం జేవయుం జూపి కృ
ష్ణుని తోడ్పాటునఁ బేర్చి యేఁ గడగినం జూర్ణంబు గావింతు నొ
క్కనిమేషంబున దేవదానవులతోఁ గూడం ద్రిలోకంబునున్. 424

ప్రతిపదార్థం: నీ మదిన్= నీ మనస్సులో; అనుమానంబు+అది+ఏల?= సందేహ మెందుకు?; మదీయ= నా యొక్క; స్ఫార= అధికమైన; బాహాబలంబు= భుజ శక్తి; నిరూపింపన్= నిరూపణ చేయవలెనని; తలంచితి(వి)+ఏనిన్= నీవు భావించినట్లయితే; వినుము= చెప్పుతున్నాను ఆలకించుము; ఏపున్= విజృంభణం; చేవయున్= ధైర్యం; చూపి= కనబరచి; కృష్ణుని తోడ్పాటునన్= గోపాలదేవుడి సహాయంతో; పేర్చి= చెలరేగి; ఏన్= నేను; కడఁగినన్= పూనుకొంటే; ఒక్క నిమేషంబునన్= ఒక నిముసంలో; దేవదానవులతోన్+కూడన్= దేవతలతో రాక్షసులతో కూడ; త్రిలోకంబునన్= ముజ్జగాలను; చూర్ణంబు కావింతున్= పిండి చేస్తాను.

తాత్పర్యం: 'నీ మనసులో సందేహ మెందుకు? నా విస్తారమైన భుజశక్తి ఏపాటిదో తెలియవలెనని నీవు భావిస్తే చెప్పుతున్నాను వినుము. నా విజృంభణం, ధైర్యం కనబరచి శ్రీకృష్ణుడి సాయంతో చెలరేగి నేను కయ్యానికి పూనుకొంటే ఒక్క నిముసంలో సురాసురులతో కూడ మూడులోకాలను పిండిచేస్తాను.

వ. అది యెట్లంటే నిఁ గృత్రిమ కిరాతుండైన పశుపతి మెచ్చి జగత్సంహార సమయంబునం దాను బ్రయోగించునట్టి పాశుపత మహాస్త్రంబు నాకిచ్చె; నది నాయందు సన్నిహితంబయి యున్నయది గావున శత్రునిరాసం బనాయాసంబై యుండు; నప్పాశుపత మహనీయ ప్రభావంబు భీష్ముండున్నరూపెఱుంగఁడు, ద్రోణ కృపాశ్వత్థామలు నెఱుంగరు, కర్ణున కెఱుంగ నెంతదవ్వట్టి ఘోర సాధనంబున సమస్తంబును సమయించుట యుక్తంబు గాదు తక్కిన యాయుధంబులం బోరి వైరులం బరిమార్చినం బౌరుషంబు దీపించు నని తలంచెద; నప్పటికి వలయు విధం బయ్యెడు; నది యట్లుండె; నీవా రక్కడి వారికిం దక్కువవారే? భీమసేనుండు కవ లభిమన్యుండు ద్రౌపదేయులు సాత్యకి విరాట ద్రుపదులు ధృష్టద్యుమ్నుండు శిఖండి యుత్తమౌజుండు యుధామన్యుండు ఘటోత్కచుండు మొదలైన జగజెట్లున్నవారు; మఱియు ననేకులు వీరల యట్టివారలు కలరు; వారల నందఱం జెప్పనేల? యేనుంగువోలె నీలావు నీవెఱుంగవు దివిజులకు నజేయుండవు నీయొక్కనికిఁ ద్రిభువనంబు నెదురె నీవు నిక్కం బలుగవుగాక; నీ వలిగిన నెవ్వ రెట్లయ్యెదరో యటు సూడుము; నీ సైన్యంబుల నెవ్వరికి నేమి చేయవచ్చు మనకు విజయానందంబు సులభంబ' యని పలికె నని సంజయుండు ధృతరాష్ట్రున కెఱింగించె' నని వైశంపాయనుండు జనమేజయునకుం జెప్పుటయు. 425

ప్రతిపదార్థం: అది ఎట్లు+అంటేనిన్= ఎట్లా చూర్ణం చేయగలవని నీ వడిగితే; కృత్రిమ కిరాతుండు+ఐన= మాయాకిరాతుడైన (కపట కిరాత వేషంలో వచ్చిన); పశుపతి= పరమేశ్వరుడు; మెచ్చి= ప్రీతినొంది; జగత్+సంహార సమయంబునన్= లోకాలను సంహరించే ప్రళయకాలంలో; తాను; ప్రయోగించునట్టి; పాశుపత మహా+అస్త్రంబు; నాకున్; ఇచ్చెన్; అది; నాయందున్; సన్నిహితంబు+అయి+ఉన్నయది= సమీపించి ఉన్నది; కావునన్; శత్రునిరాసంబు= విరోధులను వధించటం; అనాయాసంబు+ఐ+ఉండున్= నాకు శ్రమలేనిదై ఉంటుంది; ఆ+పాశుపత మహనీయ ప్రభావంబున్= ఆ పాశుపతాస్త్రం యొక్క గొప్ప మహిమను; భీష్ముండు; ఉన్నరూపు+ఎఱుంగఁడు= కలరూపు తెలిసినవాడు కాడు; ద్రోణ కృప+అశ్వత్థామలున్; ఎఱుంగరు; కర్ణునకున్; ఎఱుంగన్+ఎంత దవ్వు?= తెలియుట అశక్యం; అట్టి; ఘోరసాధనంబునన్= భయంకరమైన అస్త్రంచేత; సమస్తంబును; సమయించుట= నిర్మూలించడం; యుక్తంబు+కాదు= సమంజసం కాదు; తక్కిన= మిగిలిన; ఆయుధంబులన్= యుద్ధోపకరణాల చేత; పోరి= పోరాడి; వైరులన్= విరోధులను; పరిమార్చినన్= చంపితే; పౌరుషంబు దీపించున్= నా పరాక్రమం ప్రకాశిస్తుంది; అని తలంచెదన్; అప్పటికిన్= ఆ సమయానికి; వలయు విధంబు+అయ్యెడున్= జరుగవలసినదేదో జరుగుతుంది; అది+అట్లుండెన్= ఆ విషయం అట్లా ఉండనీ; నీవారు= నీ సేనలోని వారు; అక్కడి వారికిన్= కౌరవసేనలో ఉన్న వారికంటె; తక్కువవారె?; భీమసేనుండు; కవలు= నకుల సహదేవులు; అభిమన్యుండు; ద్రౌపదేయులు= ద్రౌపది కొడుకులు; సాత్యకి; విరాట ద్రుపదులు; ధృష్టద్యుమ్నుండు; శిఖండి; ఉత్తమౌజుండు; యుధామన్యుండు; ఘటోత్కచుండు; మొదలైన; జగజెట్లు+ఉన్నవారు= శూరాగ్రేసరులున్నారు; మఱియున్; అనేకులు= పలువురు; వీరల అట్టివారలు కలరు= భీమాదుల వంటివారున్నారు; వారలన్+అందఱన్+చెప్పన్+ఏల?= వారందరినీ పేరు పేరున పేర్కొనట మెందుకు?; ఏనుంగు పోలెన్= గజంవలె; నీ లావు= నీ శక్తి; నీవు+ఎఱుంగవు; దివిజులకున్= వేల్పులకు; నీవు అజేయుండవు= గెలువరానివాడవు; నీ+ఒక్కనికిన్; త్రిభువనంబు= ముజ్జగాలు; ఎదురె?= అడ్డమా?; నీవు; నిక్కంబు= నిజంగా; అలుగవు+కాక; అలిగినన్= కోపిస్తే; ఎవ్వరు+ఎట్లు+అయ్యెదరో+అటు+చూడుము= ఎవరు ఎట్లా నాశనమవుతారో ఆ తరువాత చూడుము; నీ సైన్యంబులన్; ఎవ్వరికిన్; ఏమి చేయన్+వచ్చున్;

మనకున్; విజయ+ఆనందంబు= గెలుపు వలని సంతోషం; సులభంబ= తేలికగా సమకూడగలదు; అని పలికెన్+అని= అర్జునుడు ఇట్లా పలికినాడని; సంజయుండు ధృతరాష్ట్రునకున్; ఎఱింగించెన్ అని; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= పరీక్షిన్మహారాజ పుత్రుడైన జనమేజయుడికి; చెప్పుటయున్= చెప్పగా.

తాత్పర్యం: విజయానందం తేలికగా మన కెట్లా కలుగుతుందని నీవు సందేహిస్తే చెప్పుతాను వినుము. 'కపట కిరాతుడై వచ్చిన ఈశ్వరుడు నాతో పోరాడి మెచ్చి, సకల భువనాలను సంహరించటానికి ప్రళయ కాలంలో ప్రయోగించే పాశుపతాస్త్రాన్ని నా కనుగ్రహించాడు. అది నా దగ్గర సిద్ధంగా ఉన్నది. కనుక శత్రు నిర్మూలనానికి నేను శ్రమపడనక్కర లేదు. పాశుపతాస్త్ర మహా మహిమ ఎట్లాంటిదో భీష్ముడికి తెలియదు. ద్రోణాచార్యులకూ, కృపుడికీ, అశ్వత్థామకూ తెలియదు. కర్ణుడికి అసలే తెలియదు. అంత భయంకరమైన ఆ మహాస్త్రంతో అందరినీ దగ్ధం చేయటం సమంజసం కాదు. తక్కిన ఆయుధాలతో విరోధుల నెదిరించి చంపితే మన పరాక్రమ మెటువంటిదో లోకానికి వెల్లడవుతుంది అని నా అభిప్రాయం. ఆ సమయానికి జరగవలసిన దేదో జరుగుతుంది. ఇపు డా విషయ మెందుకు? నీ సైన్యంలోని వీరులు కురుసేనలోని శూరుల కంటె తక్కువ వారని తలంచవద్దు. భీమసేనుడు, నకుల సహదేవులు, అభిమన్యుడు, ద్రౌపది కుమారులు, సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ఉత్తమౌజుడు, యుధామన్యుడు, ఘటోత్కచుడు మొదలైనవారంతా జగజెట్లు. వీరివంటి వారెందరో మన పక్షంలో ఉన్నారు. అందరినీ పేరు పేరున పేర్కొనలేను. ఏనుగువలె నీ శక్తి ఏమిటో నీ వెరుగవు. నిన్ను దేవతలు కూడా జయించలేరు. ముల్లోకాలు నీముందు నిలిచి నిన్నెదిరించలేవు. నీకు నిజంగా కోపం రాదు. వస్తే ఎవరేమవుతారో చెప్పనక్కరలేదు. మనకు విజయానందం సులువుగా చేకూరుతుంది' అని అర్జునుడు ధర్మజుడితో పలికాడని సంజయుడు ధృతరాష్ట్రుడికి వినిపించిన విషయం వైశంపాయన మహర్షి జనమేజయుడికి చెప్పాడు.

విశేషం: పాశుపతాస్త్ర లాభం: పాండవులు ద్వైతవనంలో నివసిస్తుండగా వ్యాసమునీంద్రుడు వచ్చి 'ప్రతిస్మృతి' అనే యోగవిద్యను ధర్మజుడికి ఉపదేశించి, ఈ విద్యవలన అర్జునుడు అధిక తపోవీర్యవిభవుడై ఇంద్రవరుణ కుబేరాది దేవతలనూ, ఈశ్వరుడినీ ప్రత్యక్షం చేసికొని, వారి వలన దివ్యాస్త్రాలు పొంది శత్రువులను జయిస్తాడని చెప్పాడు. పాండవులు ద్వైతవనం విడిచి కామ్యక వనం చేరారు. ధర్మజుడక్కడ అర్జునుడికి ప్రతిస్మృతి నుపదేశించి ఉత్తర దిశగా వెళ్ళి తపోయోగ బలంతో ఇంద్రుడిని ప్రత్యక్షం చేసికొని ఆయుధాలను గడించి ఈశ్వరుడిని ఆరాధించుమని బోధించి పంపాడు. అర్జునుడు ఇంద్రకీలాద్రి మీద ఇంద్ర దర్శనం చేశాడు. పరమాస్త్ర లాభానికై పరమేశ్వరుడిని ప్రసన్నుడిని చేసికొనుమని సురపతి చెప్పగా విజయుడు తపశ్చర్యకై హిమశైల శిఖరానికి వెళ్ళాడు. అక్కడ పాండవ మధ్యముడు కఠోరతపం సాగిస్తుండగా మునులు విస్మయపడి పార్థుడి కోరిక తీర్చి తపోభారాన్ని వారించుమని శంకరుడిని వేడుకొంటారు.

వెంటనే పరమేశ్వరుడు మాయా కిరాతుడయ్యాడు. పార్వతి బోయతగా మారుతుంది. భూతగణాలు ఎరుకలయ్యారు. వేట నెపంతో వారు అర్జునుడి ఆశ్రమ భూమిలో ప్రవేశించారు. ఈశ్వరచోదితుడై మూకాసురుడు సూకరమై సవ్యసాచిని చంపటానికి రాగా అతడా పందిపై బాణం విడిచాడు. అపుడే కిరాతరాజు కూడా ఆ వరాహం మీద అదే సమయంలో బాణం విడిచాడు. ఇరుశరాలు నాటగా మూకాసురుడు సూకరరూపం వదలి అదృశ్యమయ్యాడు. అర్జునుడు ఆశ్చర్యపడుతుండగా కపట కిరాతుడు ఎదుట నిలిచాడు. 'నేను కొట్టిన పందిని కొట్టి మృగయాధర్మం అతిక్రమించావు కనుక నిన్ను నా నిశిత శరాల పాటు చేస్తా'నని అర్జును డన్నాడు. 'నేనే ఆ మృగాన్ని ముందు కొట్టాను. అది నా బాణం చేతనే నిహతమైంది. ముందు కొట్టానని లేని శౌర్యం ఎందుకు ప్రకటించుకొంటావు? వీరుడివైతే నాతో కదనం సల్పు' మంటూ పినాకి కిరీటి మీద బాణాలు

వేశాడు. అర్జునుడు ఎన్నో వాడి సాయకాలు కిరాతుడి మీద ప్రయోగించాడు. బోయ ఏమాత్రం చలించలేదు. మరెన్నో దివ్యబాణాలు పార్థుడు వర్షించాడు. అన్నీ వ్యర్థమయ్యాయి. అగ్నిదేవు డిచ్చిన అక్షయ బాణతూణీరాలలో అతడికి అమ్ములు కనిపించలేదు. గాండీవ మెత్తుకొని కపర్దిపైకి దుమికాడు. అది కూడా మాయమైంది. ఖడ్గంతో బోయ తలపై వ్రేటు వేశాడు. నిరుపయోగమయింది. వృక్షాలతో రాళ్ళతో తలపడ్డాడు. ప్రయోజనం లేకపోయింది. కడకు కపట కిరాతుడిని పెనగి పట్టుకొని ముష్టియుద్ధానికి దిగాడు. ఈశ్వరుడు తన దివ్యదేహంతో అర్జునుడి దేహాన్ని మర్దించాడు. పార్థుడు నేలబడి మూర్ఛిల్లాడు. చంద్రధరుడు నిజరూపంతో సవ్యసాచిమ్రోల నిలిచి 'నీవంటి శౌర్య ధైర్యవంతులు క్షత్రియులలో మరెవ్వరూ లేరు. నీ తపస్సుకు మెచ్చి వరమివ్వటానికి వచ్చాను. కోరుకొమ్మ'న్నాడు. అర్జునుడు పరమ శివుడిని ప్రస్తుతించి 'పాశుపతాన్ని ప్రసాదిస్తే దానితో దైత్యదానవ యక్షరాక్షసగణాన్నీ, భీష్మద్రోణాదులనూ జయిస్తాను. కర్ణుడిని వధిస్తాను. అనుగ్రహించు' మని వేడుకొన్నాడు. విశుద్ధచిత్తుడైన పార్థునకు సంధాన మోక్షణ సంహార సహితంగా పశుపతి పాశుపతాస్త్రమిచ్చి 'అర్జునా! దీనికి ఎక్కడా అసాధ్యం లేదు. అల్పుల మీద ప్రయోగిస్తే జగత్సంహారం చేస్తుంది. ఈ దివ్యాస్త్రంతో నీవు సమస్త లోకాలను జయిస్తా' వని చెప్పి అంతర్ధానమయ్యాడు.

ఆశ్వాసాంతము

చ. **కమల భవాది దైవత ముఖ స్ఫుట నిర్గళిత ప్రశస్త వా**
గమృత రసప్రసార కలితాంచిత సేకవిధి ప్రకర్ష సం
గమ సముదీరితోల్లసన కందళిత ప్రహసద్దయాలతా
సుమహ దుపాశ్రయ ప్రమద శోభిత విశ్వజగన్మధువ్రతా! **426**

ప్రతిపదార్థం: కమలభవ+ఆది= నారాయణుడి నాభి పద్మం నుండి జన్మించిన బ్రహ్మదేవుడు మొదలుగాగల; దైవత= వేల్పుల యొక్క; ముఖ= మోముల నుండి; స్ఫుట= విశదంగా (నిరర్గళంగా); నిర్గళిత= వెడలిన; ప్రశస్తవాక్= ప్రసిద్ధిగాంచిన వచనము లనెడి; అమృతరసప్రసార= సుధాద్రవం యొక్క ప్రవాహంతో; కలిత= కూడినట్టి; అంచిత సేకవిధి= చక్కగా తడుపుట అనేపనియొక్క; ప్రకర్ష= విశేషమైన; సంగమ= పొందికతో; సముదీరిత= లెస్సగా వెలువడిన; ఉల్లసన= వికాసంతో; కందళిత= అంకురించినట్టి; ప్రహసత్= పూస్తున్నట్టి; దయాలతా= కారుణ్యమనెడు తీగకు; సుమహత్+ఉపాశ్రయ= మిక్కిలి గొప్ప ఆధారంగా ఉండటం వలన కలిగిన; ప్రమద= సంతోషంచేత; శోభిత= అలరారుతున్న; విశ్వజగత్= సమస్త ప్రపంచమనెడు; మధువ్రతా!= తుమ్మెదగలవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! పరమేష్ఠి ప్రముఖులైన దేవతలు శ్రేష్ఠములైన తమ వాక్కులతో నిన్ను కొనియాడుతుంటారు. వారొనరించే స్తోత్రాలు సుధాద్రవరూపాలు. వారి వచనామృతంతో మిక్కిలి తడుపబడటం వలన నీ కరుణ అనే తీగ అంకురించి, వికసించి, విరబూస్తుంది. కారుణ్యలతకు నీవు ఆధారభూతుడవైనందున సమస్త ప్రపంచము తుమ్మెదవలె నిన్ను ఆశ్రయించి, సేవించి సంతోషంతో అలరారుతుంది.

విశేషం: లత అంకురించి పుష్పించటానికి జలసేచనం ముఖ్యం. హరిహరనాథుడి కరుణాలత బ్రహ్మాది దేవతల స్తోత్రవచనాలనే అమృతరస సేకంతో పెంపొందుతుంది. పుష్పాల యొక్క సౌగంధ్య మకరందాదులచేత తుమ్మెదలు ఆకర్షించబడి లతను ఆశ్రయించినట్లు సకల లోకాలు హరిహరనాథుడి కృపనాశ్రయించి ఆనందంతో విలసిల్లుతున్నవని మనోజ్ఞమైన రూపకంతో తిక్కన సోమయాజి హరిహరాత్మకమైన పరబ్రహ్మను కీర్తించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. సమయ బహుత్వారణ్య । భ్రమణ పరిశ్రామ్య దంతరంగ నితాంతో
త్తమ సరళమార్గ దర్శన । సమర్థ పుణ్యాభిధాన సకృదుచ్చరణా! 427

ప్రతిపదార్థం: సమయ బహుత్వ= బహుళాచారాలనెడి (నియమాల యొక్క విస్తృతి అనే); అరణ్య= అడవులలో; భ్రమణ= సంచరించటంచేత; పరిశ్రామ్యత్= అలసట చెందిన; అంతరంగ= హృదయానికి; నితాంత= అధికమైన; ఉత్తమ= శ్రేష్ఠమైన; సరళమార్గ దర్శన= ఋజువైనదారిని చూపటంలో; సమర్థ= శక్తిగలిగిన; పుణ్య+అభిధాన= పావనమైన నామముయొక్క; సకృత్+ఉచ్చరణా!= ఒకే ఒకసారి ఉచ్చరించుట కలవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! పరమ పురుషార్థమైన ముక్తిని సాధించటానికి అనేక సిద్ధాంతాలు, శాస్త్ర నియమాలు అనే అరణ్యాలలో సంచరించి సంచరించి నా హృదయం బడలిక చెందింది. చిట్టచివరకు నీ నామం ఒక్కసారి నోటితో పలకటమే ముక్తికి సులభోపాయమని తోచింది.

విశేషం: అనేక శాస్త్ర నియమాలను అనుసరించటం శ్రమతో కూడినపని. ఒక్కసారి హరిహరనాథ నామమును నోటితో ఉచ్చరిస్తే చాలు. మనుజుడు ముక్తుడౌతాడనీ, ఆ నామాని కంతటి మహిమ కలదనీ, నామోచ్చారణ మాత్రాననే దైవం ప్రసన్నుడగుననీ, భవసంతరణానికి నామస్మరణకంటె అన్యమగు సులభోపాయం లేదని తిక్కన విశ్వసించాడు.

మాలిని.

అవగమిత రహస్యాష్టాంగ సమ్యక్ప్రకారో
త్సవ గురుకరుణా విస్తార గాఢ ప్రశాంతి
ప్రవణ హృదయ పద్మోద్భాసి విజ్ఞానసారా
వ్యవహిత పరమానందానుభూత్యేకరూపా! 428

ప్రతిపదార్థం: అవగమిత= తెలియజేయబడిన; రహస్య= గూఢమైన; అష్ట+అంగ= యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యానధారణ సమాధులను ఎనిమిదంగాలతో కూడిన యోగం యొక్క; సమ్యక్+ప్రకార= చక్కని విధమనెడు; ఉత్సవ= ఆనందంకల; గురుకరుణా= గురువు యొక్క దయచేత; విస్తార= మిక్కుటమైన; గాఢప్రశాంతి= పరమశాంతికి; ప్రవణ= ఉన్ముఖమైన; హృదయ పద్మ= మనఃకమలమందు; ఉద్భాసి= లెస్సగా వెలుగొందునట్టి; విజ్ఞానసార= అనుభవసహితమైన జ్ఞానసారమునకు; అవ్యవహిత= ఎడం లేని; పరమ+ఆనంద= బ్రహ్మానందము యొక్క; అనుభూతి= అనుభవమే; ఏకరూపా!= ముఖ్యమైన స్వరూపంగా కలవాడా!

తాత్పర్యం: దేవా! యోగివర్యులు ఆచార్యుడి అనుగ్రహ విశేషం వల్ల అష్టాంగ విద్యారహస్యాలను చక్కగా గ్రహించిన వెంటనే వారి హృదయాలలో పరమ శాంతి, పరమ విజ్ఞానం నెలకొంటాయి. ఆ వెంటనే వారు నీ స్వరూపమైన అవ్యయానందాన్ని అనుభవిస్తారు.

విశేషం: అష్టాంగయోగానుష్ఠానం వలన గాఢమైన హృదయశాంతి ఏర్పడి పరమాత్మ యొక్క విజ్ఞానానందస్వరూపానుభూతి లభిస్తుంది.

గద్యము.

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీ మహాభారతంబున నుద్యోగ పర్వమునందు సర్వంబును జతుర్థాశ్వాసము.

శ్రీ మదాంధ్ర మహాభారతము ఉద్యోగపర్వము సమాప్తము; ఆదిపంచకము సంపూర్ణము.

తాత్పర్యం: శ్రీమంతులైన సంస్కృతాంధ్ర కవులకు చెలికాడు, కొమ్మన మంత్రికి కుమారుడు, పండితులను పూజించటంచేత ప్రకాశించేవాడు అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శుభకరమైన మహాభారతంలోని ఉద్యోగపర్వంలోని నాల్గవ ఆశ్వాసం ముగిసింది. ఉద్యోగపర్వం సమాప్తమయింది.

ఉద్యోగపర్వంలోని చతుర్థాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్రమహాభారతంలోని ఉద్యోగపర్వం ముగిసింది.

ఆదిపంచకం సంపూర్ణం.

- - -

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉద్యోగపర్వము

పద్య - గద్య ప్రథమపాద సూచి

పద్యము	పుట
అ	
అంత	27
అంతం జేదిపతియగు	80
అంతఁ దెలిసిరాముఁడతి	633
అంతకుఁ జాలఁడె కర్ణుం	280
అంతతోడ నెల్లయాపదలును	496
అంత నక్కడ దుర్యోధనుండు	26
అంత నక్కడ నచ్యుతుఁ డరిగి	522
అంతనట శల్యుపాలికిం	35
అంతనిలువక యత్యంత	54
అంత నుదయశైలమను	206
అంతలు సేసి పోనడచి	360
అంతవునంతకునీదగు	657
అంత శల్యుండు	40
అందఱపలుకులాకర్ణించి	665
అందుఁ గూడినవి యేడక్షోహిణు	87
అందు వృకోదరార్జునుల	447
అంబయునటసాళ్వునికడ	617
అంబవృత్తాంతమరయంగ	647
అంబుద శుభగాత్రుం	440
అంబురుహంబులుం గలయ	68
అక్కటా! కౌరవాన్వయ	532
అక్కటా! ధర్మనందనుని	185
అక్కటలాఁతులైనఁ బగ	306
అక్కటా! వాసుదేవు	519
అక్కడ వాసుదేవుం డుచిత	538
అక్కుమారి చతురయగుట	652
అఖిల జనక్షయంబయి	114
అగు నిది వోలును నాకుం	43
అగ్నికుండమున ద్రోణాచార్య	549
అట మిన్నందిన యట్టి	236
అట్టి పలుకులసమయంబున	258
అట్టి యవసరంబున	79
అట్టియెడ	60
అట్టియెడ	411
అట్టియెడ ద్రుపదుండ	650
అట్టియెడ నమ్మహీ	558
అట్టియెడ నిశాసమయంబున	581
అట్టియెడ నెనమండ్రు	637
అట్టియెడనైనను	248
అట్టివానికి వాహినీ	548
అట్టివాసుదేవుని చక్రంబు	287
అట్టి సమయంబున	22
అట్టి సమయంబున మునిజన	71
అట్లకాక వేగ మట వోయి	39
అట్లుంగాక	93
అట్లుంగాక	367
అట్లుంగాక	426
అట్లుంగాక	434
అట్లుంగాక నీవు	353
అట్లుగాన కదా యే నందు	530
అట్లుగాక నాకయ్యంబు	664
అట్లు పట్టణాలంకారంబు	571
అడఁకువ లేమి నల్కి	500
అడఁగఁగనీక శంతనుని	146
అడవికి నేఁగునాఁడు	384
అడవులఁగొండలంబడి	248
అతండు ధర్మతనయుతో	261
అతండును మధుర	436
అతండెవ్వరిం గొనియెత్తి	235
అతఁ డనుపంగఁ గనక	421
అతఁడు పవడింప మును	27
అతఁడు పూజనీయుఁడగు	396
అతఁడు వడినవెండి	253
అతనిఁ బాసి యొక్కింత	32
అతనిఁబొందు నుపాయంబు	293
అతనిగుణదోషముల	350
అతనిఁ గౌఁగిలించి యచ్చటఁ	404
అతని ననుప నేఁగి	78
అతని వెనుకన కర్ణుండు	494
అతని నుతుఁడర్ధరథుఁడా	610
అతిరథుండు యుధిష్ఠిరుం	607
అతిరథుఁడు బాహ్లికుఁడు	598
అతిరథులకెల్లఁదల	612
అతిరథోత్తముఁ డిప్పటి	596
అతిరథోత్తముఁడు ద్రోణా	597
అత్తఱిఁబాషాణంబులు	572
అత్తఱి భీష్మముఖ్యులగు	135
అదను దప్పకుండ	91
అది యట్టిద సంధానము	132
అది యట్లుండె	589
అదియునుంగాక	16
అదియునుంగాక	89
అదియునుంగాక	267
అదియునుం గాక	309
అదియునుంగాక	526
అదియును నొక యక్షౌహిణి	80
అది యెట్లంటేని	72

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అది యెట్లంటేని	127
అది యెట్లంటేని	247
అది యెట్లంటేనిఁ గృత్రిమ	669
అది యెట్లనిన	464
అది యెట్లనిన ధర్మ	11
అది యెయ్యది యంటేని	32
అది యెయ్యది యనిన	51
అదియెల్ల నట్లుండె	348
అది యెల్ల నీ వెఱుంగు దైనను	458
అదియెల్ల నెఱిఁగి	57
అది యేమిటి కంటేని	528
అది విడిపట్టు గాఁదగి	392
అది విదురు చెప్పినట్టిద	395
అదివోలుఁ దన్ను నెదిరిని	464
అది సభయే ప్రియం	188
అదె కౌరవ్యు లశక్త	501
అద్దేవియు	497
అధిక దుష్కరంబులైన	287
అధిక విభవ మెసఁగ	73
అధిప! యిట్టి మీకు నన్యోన్య	116
అనఘ! పుణ్యాత్ముఁడ వగు	388
అనఘ! భవద్బలంబునన	145
అనఘ! యిట్టు లంతయును	132
అనపరాధుఁ దపోనిధి	46
అనయము నొచ్చుచున్న	162
అనయము వుట్టె జూదమున	160
అనవిని కౌరవులకు	379
అనవిని దేవకీతనయుఁ	340
అనవిని నిరుత్తరుండయి	180
అనవిని భీష్ముఁ	483
అనవిని మాధవి	472
అనవిని మోము విచ్చుచు	419
అనవిని యాతఁ డిట్లనియె	394
అనవిని సత్యవతికిఁ	617
అనవుడు	40
అనవుడు	338
అనవుడుఁ గృష్ణుఁడిట్లనియె	318

పద్యము	పుట
అనవుడుఁ బాండురాజ	129
అనవుడు గురుఁడిట్లను	601
అనవుడు గురు కృపాశ్వత్థామ	665
అనవుడు దుర్యోధనుఁడాతని	614
అనవుడు ధర్మనందనుండు	550
అనవుడు ధృతరాష్ట్రుండు	290
అనవుడు నందఱు నౌఁగా	567
అనవుడు నకులుండు	548
అనవుడు నద్దేవుం	649
అనవుడు నాంబికేయు	485
అనవుడు నింతి యిట్లను	624
అనవుడు నిట్లనున్	165
అనవుడు నీవిట్లడిగిన	592
అనవుడు భీష్ముఁడిట్లనియె	91
అనవుడు భీష్ముఁడు	396
అనవుడు రోమహర్షణము	462
అనవుడు వీరె తమ్ములును	112
అనవుడు వృత్రాసురుండు	51
అనవుడు శల్యుఁ డియ్యకొని	38
అనవుడు శోకం బడరఁగ	58
అనవుడు సంజయుండు	135
అనిఁ బాండవసేనలఁ	663
అని కార్యంబు నిశ్చయించి	380
అని గమనోన్ముఖుండయి	20
అని గాంగేయుం	593
అని గాంధారిపతియుఁ	498
అని చూపి చెప్పి వెండియు	121
అని చెప్పి చుట్లనున్న	98
అని చెప్పి తలంచికొని	317
అని చెప్పిన దేవవ్రతు	662
అని చెప్పిన సూత	239
అని చెప్పి నారదుఁడు	661
అని చెప్పి మాధవుండు	337
అని చెప్పి యతని కడకు	645
అని చెప్పి యప్పాటం	233
అని చెప్పి యర్జునుం	688
అని చెప్పి యొడంబఱచి	23

పద్యము	పుట
అని చెప్పి విదురుం	545
అని చెప్పి వెండియు	237
అని చెప్పి వెండియు	385
అని చెప్పి వెండియు	451
అని చెప్పు నవసరంబున	620
అని చెప్పుమింత యేమిటి	215
అని జనార్దనుఁ గనుఁగొని	495
అని తదవసరంబునం	146
అని తన వృత్తాంతం	657
అని తన్ను నాక్రమించి	578
అని తలంచుచుండ	213
అని తలఁచుచు నచ్చట	53
అని తానునుఁ దోడునని	475
అని దండనాథుల	553
అని దరహాసోల్లాస	668
అని దుర్యోధనుం జూచి	602
అనిన ధృతరాష్ట్రుఁ డాపగా	96
అనిన ధృతరాష్ట్రుఁడిట్లను	164
అనిన ధృతరాష్ట్ర పలుకులు	391
అనినం గర్ణుండు	570
అనినన్ గురురాజిట్లను	591
అనినం బ్రసన్నవదనుం	420
అనినన్ దేవతలుం	75
అనినన్ మెచ్చి వృకోదరుం	386
అనినన్ సాత్యకి	358
అనినఁ గటకటంబడి	264
అనినఁ గిరీటికి	35
అనినఁ గృపాచార్యుండీ	665
అనినఁ గృష్ణుండు	417
అనినఁ బ్రసాదంబని	286
అనిన గాంగేయుండు	95
అనిన గాంధారికిట్లను	291
అనిన గాంధారీనందనుండు	424
అనిన గాంధారీవల్లభుం	265
అనిన ద్రుపదుం డిది వోలు	15
అనిన నగుచువాని	654
అనిన నట్లకాక యఖిల	547

పద్యము	పుట
అనిన నట్ల కాకయని	65
అనిన నట్ల కాకయని	162
అనిన నట్ల కాకయని	571
అనిన నట్ల చేయుదు	552
అనిన నతండుపోక	644
అనిన నాంబికేయుఁడను	199
అనిన నాచెప్పినట్ల	625
అనిన నులూకుం	583
అనినను వెండియు	277
అనిన పలుకులకు	508
అనిన బాహ్లికాదులగు	493
అనిన భీమార్జున నకుల	587
అనిన భీష్ముండు	604
అనిన ముకుందుఁడు	478
అనిన మఱియు	607
అనిన ముకుందుఁ డిట్లనియె	321
అనిన ముకుందుతో	351
అనిన వాసుదేవుండు	18
అనిన వాసుదేవున	341
అనిన విదురుం డదరి	502
అనిన విదురుం	163
అనిన విదురుఁ డిట్టులను	504
అనిన విదురునకు	200
అనిన విని వికచ	39
అనిన విని అర్జునుం	546
అనిన విని కర్ణుండు	94
అనిన విని కానీనుండు	278
అనిన విని కిన్కఁబూని	490
అనిన విని కృష్ణుండు	346
అనిన విని గటకటం బడి	467
అనిన విని గాంగేయుండు	569
అనిన విని గాంగేయుండతని	663
అనిన విని దరహసిత	58
అనిన విని దుర్యోధనుండు	33
అనిన విని దుర్యోధనుండు	248
అనిన విని దుర్యోధనుండు	259
అనిన విని దుర్యోధనుండు	395

పద్యము	పుట
అనిన విని దుర్యోధనుండు	521
అనిన విని ధర్మజుం	540
అనిన విని ధర్మనందనుం	45
అనిన విని ధర్మనందనుండు	78
అనిన విని ధృతరాష్ట్రుం	192
అనిన విని ధృతరాష్ట్రుం	210
అనిన విని ధృతరాష్ట్రుం	477
అనిన విని ధృతరాష్ట్రుం	496
అనిన విని భాగీరథి	648
అనిన విని భీష్ముఁడు	230
అనిన విని భీష్ముఁడు	483
అనిన విని యంబికా	285
అనిన విని యంబికా	590
అనిన విని యక్కొలువున	605
అనిన విని యధర్మాచరణం	627
అనిన విని యమ్మహాత్ము	624
అనిన విని యమ్మునీంద్రుం	73
అనిన విని యచ్యుతుండు	514
అనిన విని యిననందను	273
అనిన విని యుధిష్ఠిరుండు	551
అనిన విని యెల్లవారును	622
అనిన విని యొకటి సెప్పెద	50
అనిన విని యేనుసమ్మోహనాస్త్రం	643
అనిన విని రథికవరు	359
అనిన విని రాధేయుండు	601
అనిన విని వికచవదనుం	39
అనిన విని విదురుం	180
అనిన విని విదురుం	197
అనిన విని విదురుం	282
అనిన విని సంజయుండు	141
అనిన విని సంజయుండు	233
అనిన విని సంజయుండు	255
అనిన విని సంజయుండు	582
అనిన విని సూతనందను	260
అనిన వైచిత్రవీర్యుండు	276
అనిన సహదేవుఁడిట్లను	548
అనిన సంజయుండు	108

పద్యము	పుట
అనిన సంజయుండిట్లనియె	156
అనిన సుయోధనునకు	256
అనిన సుయోధనుండు	291
అనిన సూతనందనునకు	104
అని నిర్ణయించి	554
అని పలికి	602
అని పలికి కౌఁగిలించుకొని	284
అని పలికి దుర్యోధను	605
అని పలికి ద్రుపదు	19
అని పలికి ధర్మతనయా	150
అని పలికి ధృతరాష్ట్రునితో	274
అని పలికిన యవసరమున	535
అని పలికిన యుధిష్ఠిరుం	320
అని పలికి హరికిరీటిం	30
అని పలికి నిట్టూర్పు	199
అని పలికి పరమశాంతుండై	294
అని పలికి పరశురాముఁడు	625
అని పలికి పాండవాగ్రజుండు	308
అని పలికి పుండరీకాక్షుం	519
అని పలికి మఱియు	190
అని పలికి మఱియు	485
అని పలికి మఱియు	592
అని పలికి మహారాజా	457
అని పలికి మాకునువారికి	331
అని పలికి యచ్యుతున	423
అని పలికి యజాత	544
అని పలికి యతనికిం	629
అని పలికి యతనివలనం	266
అని పలికి యలుక	659
అని పలికి యివ్విధంబున	339
అని పలికి వారలందఱు	299
అని పలికి వెండియు	77
అని పలికి వెండియు	99
అని పలికి వెండియు	139
అని పలికి వెండియు	147
అని పలికి వెండియు	226
అని పలికి వెండియు	244

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అని పలికి వెండియు	469
అని పలికి వెండియు	521
అని పలికి వెండియు	664
అని పలికి వెడవెడ	123
అని పలికి సంజయు	101
అని పలికి సవ్యసాచిం	585
అని పలికి సూతనందనుండు	116
అని పలికి హరి ధర్మ	379
అని పలికె నదియంతయు	350
అని పలుకునప్పటి	216
అని ప్రతినసేసిన	666
అని దరహాసోల్లాసం	668
అని భీమసేనుంజూచి	584
అని మదినిశ్చయించి	566
అని మఱియు నత్యంత	430
అని మఱియు ననేకు	520
అని మఱియు నిట్లనియె	365
అనిమిషహితము	227
అని యంత నిలువక	334
అని యంత నిలువక	518
అని యట్లుగ్గడించి	370
అని యడిగిన	151
అని యడిగిన విదురుం	200
అని యడిగిన సంజయు	283
అని యతఁడు శౌరితో	477
అని యతని యుత్తరము	579
అని యదల్చె నప్పుడు	399
అని యను రూపాలాపంబుల	59
అని యప్పాలఁతిం	56
అని యాడి మొగంబు	606
అని యిట్లు హరిపల్కిన	588
అని యిట్లు నారాయణుండు	493
అని యిట్లు సెప్పి శల్యుండు	77
అని యిత్తెఱంగునఁ	533
అని యివ్విధంబునఁ	411
అని యీ సభ్యులకుం	456
అని యుచిత సంభాషణంబులు	41
అని యుధిష్ఠిరుండు	547
అని యుల్లసం బాడి	59
అని యూరడిలఁగఁ బలికిన	378
అని యూఱడించి	35
అనియెఁ దదనంతరంబ	386
అనియె దాని కతండుత్తరం	350
అనియె నట్టి యెడం	292
అనియె; నట్టి యెడఁ	485
అనియె నట్టియెడఁ	504
అనియె నివ్విధంబున	667
అని యెల్లవారును	539
అని యెవ్విధమున నైనను	331
అని యొడంబఱిచి	60
అని రాధేయు దిక్కు	277
అని వనితఁ బంచి	66
అని విచారించె నట్లు	500
అని వెండియు	193
అని వెండియు	263
అని వెండియు	328
అని వెండియు	409
అని వెండియు	513
అని వెండియు	532
అని వెండియు ననేక	487
అని వెండియు నిట్లను	280
అని వెండియు నివ్విధంబు	532
అని వెండియు నేర్పునం	654
అని శస్త్రసన్యాసంబు	279
అని సముచితంబుగా	70
అని సహోదరులాజి	333
అని సువ్యక్తంబుగా	642
అనుచు నతండు	57
అనుచుం బ్రణామ	118
అనుచుఁ గడంగి	47
అనుచుఁ గౌఁగిలింప	538
అనుచు నతి కుతూహలం	403
అనుచు నా సుయోధను	228
అనుచు నెలుంగు	374
అనుజ తనుజులుఁ	481
అనుజులకు నడ్డపడి	160
అనుజుల తనుజుల	589
అనుజులు ఋత్విజులుగ	528
అనుజులు నట్టి వార	246
అనుజులు నీవును	103
అనుటయుం దదనంతరంబ	549
అనుటయుఁ బిన్ననవ్వు	332
అనుటయు గోవిందుం	502
అనుటయు దామోదరుఁ	550
అనుటయు ననఘా	626
అనుటయు నవ్వు గొంతి	538
అనుటయు నాతఁడు	34
అనుటయు మద్రేశ్వరుఁ	79
అనుటయు సుయోధనుఁడు	397
అనుడు ధృతరాష్ట్రుఁ	156
అనుడు ముదంబు	199
అనుడు విదురుఁడాతని	178
అనుడు దయార్ద్ర	507
అనుడు నీ పుత్త్రుఁ డవినీతు	497
అనుడు మహేంద్రుఁడు	423
అనుడు మునీంద్రులున్	57
అనుడు ససంభ్రమముగ	503
అను పలుకులకు	281
అనుమాటకుఁ	628
అనుమానంబదియేల	668
అనుమానింపక సభలో	604
అన్నదమ్ముల నెత్తంబు	491
అన్నదమ్ములమైయుండి	331
అన్ని వడియును బంధు	532
అప్పటినుండియు నెవ్వగ	163
అప్పటికిఁ దగిన భంగి	570
అప్పుడు దెప్పిఱి కన్నుల	640
అప్పుడు ధృతరాష్ట్రుం	507
అప్పుడు నీవుఁ గర్ణుఁడును	492
అప్పుడు పాండవాగ్రజున	560
అప్పుడు మనంబున	633

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అప్పుడు శిఖండిమరణము	655
అభిమన్యు వివాహమునకుఁ	31
అమరసేనలును దమంతన	568
అమరేంద్ర రథ	465
అమ్మనుజేశ్వరునకు	105
అమ్మొఱకుల నెమ్మొయి	345
అయినను నొకమాట	120
అయిననేమి పిలువుఁ	659
అయ్యజాతశత్రుఁ	214
అయ్యులూకు పలుకు	591
అరయంగఁ దప్పు లేదంటి	491
అరయం దప్పొకయింత	488
అరయమిఁ జేసి	370
అరిగిన యప్డు పెద్దలగు	143
అరిగిరి రాజును	522
అరిదివిలుకాని	170
అరిభయంకరుఁడు	566
అరుదారు మేలుక ట్లా	36
అర్జునుండు గలండని	253
అర్జునుఁడు ప్రాణ	395
అఱకడనిడి ప్రాఙ్ముఖుండై	471
అలఘు గద బూంచికొని	100
అలఘు బలవిక్ర	8
అలఁతింబోరు మహారథుల్	610
అలమికొని యొండొరుల	193
అలయక యందఱుఁ	542
అలవి యెఱుంగ కిట్లు	504
అలవి యెఱుఁగక	344
అలిగిన భీమ ఫల్గునుల	416
అలుకుఁడు మృగమద	392
అలుగుదు పాండవులకు	427
అల్లన యింతి యిట్లనియె	60
అల్లులకు మ్రింగఁ జేఁదైన	129
అవగమితరహస్యా	672
అవియెవ్వి యంటేని	214
అవ్యయ నిర్మల విభవా!	510
అవ్విపినంబు	656
అసురనాథుండు నలసత	48
అసురవరుఁ డీ యలం	598
ఆ	
ఆ కొలువు వారు కర మ	441
ఆజ్ఞాభంగం బయినం	76
ఆతఁడు భండనం బనిన	255
ఆతండును	429
ఆతతబలుఁడగు	584
ఆతఁడివి యేటిమాటలు	580
ఆతనిఁ గన్నులారఁగ	294
ఆతని వచన రచన	435
ఆతని సమ్ముఖంబునఁ	18
ఆ తన్వియమునానదీ	647
ఆ దుర్యోధనుఁడంత	305
ఆ నహుషు బాహుగర్వ	64
ఆ నహుషువలన నాపద	66
ఆనిశితాస్త్రం బెయ్యది	634
ఆపదఁగడవం బెట్టఁగ	300
ఆ పని గడవం బడియె	582
ఆ బీభత్సుని భూరి భుజా	89
ఆ యర్జును మగఁటిమి	243
ఆ యిరువురు నొక	228
ఆ రాజు మాదెసంగల	104
ఆ రాజు సేయు నెయ్యము	133
ఆఱడిఁ బోకయున్	365
ఆలుబిడ్డ లేనియట్టి	158
ఆ సభ కేకవస్త్ర యగు	369
ఆ సమయంబున నచ్చటి	147
ఆ సమయంబునను	473
ఆ సుయోధనుండు	217
ఆ సుయోధను ముక్కున	326
ఆ సేనకు నీ సేనకు వాసి	286
ఇ	
ఇంక నా తమ్మునికి	626
ఇంక నిన్ను భార్యగా	618
ఇంకను నట్ల కాఁదలఁపు	126
ఇంతయును విని కౌరవా	36
ఇంతలు పుట్టిన చోటను	147
ఇందాఁక నీదుపలుకుల	180
ఇంద్రాణియు నిట్లనియె	65
ఇంపు పుట్టించుచుఁ	406
ఇక్కొఱగామములలోపల	164
ఇచ్చట నేను నిల్చు టిది	63
ఇచ్చటిబంధులు నీవును	304
ఇచ్చితాను భామాకృతి	657
ఇట్టి చందంబులు	177
ఇట్టి చందంబులెల్లను	109
ఇట్టిదానికి నోర్వక	575
ఇట్టియేఁదేరుగడపంగ	216
ఇట్టి హయములుగల	472
ఇట్టు లాడఁదగునె	12
ఇట్టు లాడఁదగునెయేనేమి	229
ఇట్లతండు మూర్ఛిల్లిన	636
ఇట్లధికబలుండైన	48
ఇట్లు క్రమంబునఁ	474
ఇట్లు గాంభీర్య మాధుర్య	555
ఇట్లు గాక యుండ	451
ఇట్లు గాకయు నెవ్వరి	258
ఇట్లు కొడుకు ముష్కరుండై	542
ఇట్లుచని యమ్మహాదేవి	557
ఇట్లుచిత పరివారంబు	391
ఇట్లుడించి డప్పి దేర్చి	471
ఇట్లున్నం గనుంగొని	494
ఇట్లున్న మీ యందఱు	428
ఇట్లు దలంచుటయును	201
ఇట్లుదశార్హ విభు	653
ఇట్లు దివిజానీకంబును	49
ఇట్లు దుర్యోధనుం	401
ఇట్లు ధృతరాష్ట్ర	515
ఇట్లుపనిచి తక్కిన	617
ఇట్లు పరమాప్తుండగు	501
ఇట్లు పుట్టినబిడ్డకుఁ	652

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఇట్లు ప్రస్థాన భేరి	556
ఇట్లు బలదేవరుక్మల	580
ఇట్లు బహుప్రకారంబులం	635
ఇట్లు మహామహిమ	567
ఇట్లు మ్రింగినం ద్రిదశ	48
ఇట్లుటికి మృతిఁబొంది	275
ఇట్లు వడితి ననుచు	44
ఇట్లు విడిసిన	655
ఇట్లు వృత్రారి	61
ఇట్లు చని యమ్మహా	557
ఇట్లు సని వారలఁ గని	97
ఇట్లు సన్నద్ధులై	21
ఇట్లు సుఖనిద్రసేసి	436
ఇట్లు సూర్యోదయంబగు	208
ఇట్లైనఁ గుంతికి సమస్త	524
ఇట్లొసంగినం దోడుకొని	472
ఇతఁ డిదియేల	494
ఇతఁడు మదీయా	17
ఇతఁడెక్కడమద్ర మహీ	258
ఇత్తెఱంగునం గురు	83
ఇది తగదంచు నడ్డపడు	136
ఇది నిక్కం బగునేనియు	412
ఇదియకాదు మఱియు	71
ఇదియకాని చేయ నెద్ది యే	469
ఇది యిక్కడి తెఱంగునకుఁ	8
ఇదియెల్లను నొకతల	411
ఇది యొకఁ డేల నీవు	44
ఇది శ్రీమ దుభయకవి	153
ఇది శ్రీమ దుభయకవి	297
ఇది శ్రీమ దుభయకవి	511
ఇది శ్రీమ దుభయకవి	673
ఇదెపోయెదఁ గౌరవ్యుల	340
ఇనతనయ శకుని	436
ఇన్ని సంకటముల నిబ్బంగి	316
ఇప్పు డీసభఁ బుట్టిన	514
ఇప్పుడు క్రొత్తగ దీనిం	570
ఇప్పు డుపేక్ష సేసి కృప	145
ఇభ తురగ స్యందన గతి	21
ఇమ్మహి యెల్లను నీమది	41
ఇమ్మెయి నతఁడును	634
ఇవి దుస్ససేను వ్రేళ్ళం	372
ఇవ్విధంబునం గూడి పెఱిఁగి	81
ఇవ్విధంబునం గేశవుండు	468
ఇవ్విధంబునం బగతుం	53
ఇవ్విధంబునఁ జూరు	561
ఇవ్విధంబునఁ బాండు	387
ఇవ్విధంబునఁగాశీపతి	661
ఇవ్విధమునం జని	616
ఇవ్విధంబున నభిషేక	572
ఇవ్విధంబున నిచ్చి యధిక	55
ఇవ్విధంబున నెప్పటి	642
ఇవ్విధంబునంబోరి	637
ఇవ్విధంబున మహానుభావుం	76
ఇవ్విధంబున విడిదల	37
ఇవ్విధంబున సన్నిహితు	438
ఇవ్విధమునఁ గృష్ణుఁ	509
ఈ	
ఈ కారణములు గలవను	398
ఈ కృష్ణుని సారథ్యము	485
ఈ దురాత్ముండు కర్ణం	231
ఈ దుర్యోధనుఁ డింత గర్వి	495
ఈ మత్స్యపతి సహాయము	14
ఈ ముప్పుర తెఱఁగునఁ	474
ఈ మేనువిడిచి నీ వేఁగిన	650
ఈ యిరువురుఁ బంచిన	212
ఈయున్న రాజులందఱు	480
ఈ రెంటియందు నరసి	140
ఈ రెండు వీళుల	284
ఈ వంశంబున కెల్ల నీవ	445
ఈ వాయుపుత్రుఁడాజిం	584
ఈ వెంద్రుకలు వట్టి	373
ఈశ్వర వరజనితుఁడు	249
ఈ సమర సముద్రంబు	531
ఉ	
ఉక్కఱి సురపతికైనను	488
ఉచితగతిఁ జేరి వంది	558
ఉచ్చిపోయిన యేటుల	632
ఉడుగుడుగు మోహనాస్త్రము	641
ఉత్తమౌజుండును యుధామన్యు	611
ఉత్సాహంబున శత్రుకులో	418
ఉన్నం గనుంగొని కోపించి	467
ఉన్నసమయంబున	3
ఉభయ బలంబులుం బొగడ	265
ఉర్వీధరంబుల నొప్పెడు	207
ఉఱక ధనంజయుండు	265
ఉఱకమదీయాంగంబులు	632
ఎ	
ఎందును నెవ్వరుం బడని	215
ఎందేనిఁ జనియె నాతని	62
ఎక్కటి గాండివంబు నుతి	243
ఎక్కడ నడచును సత్యంబెక్కడ	289
ఎత్తిన వేడ్కఁ గంధరము	204
ఎత్తి విడిసిన వారని	492
ఎదిరిం దమయట్టుల కా	121
ఎదిరికి హితమును	180
ఎదురున్న రూపు వలుకఁగఁ	142
ఎదురువచ్చిన విదురుని	437
ఎప్పుడు నెయ్యెడం బొదివి	555
ఎయ్యది గానున్నది యది	581
ఎఱకలు విచ్చుచుఁ దుండము	468
ఎఱిఁగి యెఱింగి యొండె	281
ఎఱుఁగవె యజాత	458
ఎఱుఁగుదు నేను సుయోధను	433
ఎలమినభిమన్యు పెండిలి	2
ఎల్లభంగులం బాండవుల	529
ఎల్లయందును దా వసియించు	293
ఎవ్వరు నెఱుఁగక	620
ఎవ్వరెంత సెప్పినను	542

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఏ	
ఏ డక్షౌహిణు లిమ్మెయిఁ	81
ఏ నమటగాఁగ దుఃఖము	385
ఏ నలిగిన వారిని	270
ఏ నవశ్యంబును	537
ఏ నా శిఖండినిఁ జంపమికి	614
ఏ నిం తాడితి నీ సంతానం	461
ఏ నిటులంటి నావలన	364
ఏ నీపనికై వచ్చెదఁ	141
ఏనుంగోపించి	640
ఏను గంధర్వ కిన్నర	592
ఏను దక్క నొరుల	65
ఏను నర్జునుండు నెక్క	527
ఏను నాసాలెడు కొలంది	663
ఏను నిన్ను సామ్రాజ్యంబు	523
ఏమను దత్ప్రకారంబు	211
ఏనును బ్రహ్మమంత్రముల	68
ఏ నుపప్లావ్యపురమున	210
ఏను బాహ్లిక ద్రోణ	280
ఏను ముదిసినవాఁడ	665
ఏను మేలుకాంచి సంతోషించి	639
ఏను వినయంబు వదలక	626
ఏ నొకరుండన వచ్చెద	629
ఏ నొక్క తెఱఁగుసెప్పెద	51
ఏమిట నీకేఁ దక్కువ	466
ఏమీ పార్థుఁడు నీవు	338
ఏము కలహం బొల్లక	148
ఏమును బాండునందనులు	259
ఏమును వారుఁ బంచికొని	489
ఏముపితామహగురు	224
ఏలినవానిని దైవము	168
ఐ	
ఐనను జిత్తగింపు	344
ఒ	
ఒంటిమినిలేనియొంటర	601
ఒండొకవిల్లుపుచ్చికొని	632
ఒండొరుచేతఁ బీడవడ	70
ఒక కార్యము సెప్పెద	481
ఒకటనైనను వారియందొకరి	230
ఒకటిఁగొని రెంటినిశ్చల	170
ఒకతలసమస్తజగములు	288
ఒకనాఁడా తమ ముందటం	106
ఒక మొగినఱువది	631
ఒకరుని చేతిప్రోపును	190
ఒకశక్తి వైవనఱకితి	635
ఒక్కఁడొకం డనేకవిధ	231
ఒక్కచో గరుడునిం గని	470
ఒక్కనాఁడు పారాశర్య	647
ఒక్కసమయంబు సేసికొని	473
ఒక్కొకచోఁ గడంగి	110
ఒడఁబఱిచిమాకు	345
ఓ	
ఓటయొకింత యేనియు	363
ఓహో! యిట్లనుట జగద్ద్రోహం	398
క	
కంసుఁడు నిట్ల తండ్రిమది	495
కడవఁగ జూదమాడి	93
కడవఁగనొకళ్ళు పసరము	351
కడిఁది పగఱ నేఁడెప్పగఁ	536
కడు బెట్టిదముగఁ	635
కతిపయపరివారంబు	574
కని పరశురాముని	623
కనుఁగవ నశ్రుధార	623
కనుబ్రమసినతెరువరి	276
కపటద్యూతమునందు	4
కపటపునెత్తంబు	323
కమలనాభుండు గదలి	389
కమలభవాది దైవత	671
కయ్యంబునకుఁ బెద్ద	583
కయ్యముగల్గినట్లయిన	339
కయ్యము గాని తెఱంగున	540
కయ్యమునకయెపుడు	189
కరవాలముగద	242
కరితురగాదిఘట్టనయు	194
కరుణంబుగ నేడ్చు	618
కరుణింపుము సంశ్రిత	507
కర్ణముదప్పె నీయెదుర	603
కర్ణుండు రేఁచిపెట్టఁగ	263
కర్ణుండు దుస్ససేనుఁడును	281
కర్ణుని సారథి నైనను	43
కర్ణుపడసిన యా శక్తి	253
కలయట్టి వివిధార్థములు	214
కలవు నిమిత్త స్వప్నంబులు	530
కలహమగుట లక్ష్మి	309
కవ లగ్రజన్ముల కంటె	100
కవలవారుఁ గొడుకు	14
కవిసినఁ గడంగి పెల్లుగఁ	640
కష్టుం డగు నా నహుషుఁడు	73
కాంభోజరాజగు	595
కాన నవశ్యముఁ బెనఁకువ	310
కాని తెఱఁగైన నింతటి	230
కారణంబు లేక కౌంతేయులకు	428
కారణము లేకయును	190
కార్యము తెఱఁ గిట్టిది	123
కార్యమును ఖడ్గమును	604
కాలుఁడు ప్రేరేపఁగ నిటు	273
కాలోచితములగు కరణీయ	400
కావలియై సుర రాజ్య శ్రీ	54
కావున	125
కావునఁ గృతము దలంపమి	191
కావునఁ గౌరవులుం	194
కావునఁ జెవికిం జేఁదగు	198
కావునఁ బాండవ పక్షము	8
కావునఁ బాండవులకుఁ	6
కావునఁ బాండవులతోడి	247
కావునఁ దమలో విరోధం	275
కావున నతండు దుర్వినీతుండై	16
కావున నన్ను దూఱఁ	130
కావున నస్త్రశస్త్రము	272
కావున నాకు నియ్యెడం	514

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
కావున నిక్కార్యం బెడ	10
కావున నీ రెండు దెఱంగుల	434
కావున నీవా దంభోద్భవు	464
కావున నెట్టివారికి	475
కావున మీపడిన యరణ్యా	76
కావున లోకంబుపాడి	29
కావున వారొకళ్ళ	268
కావున వీరికిన్ జయము	576
కావున శాంతిఁ బొందుటయు	313
కావున సంధికిం బురుష	347
కుంతీ తనయులు	7
కుటిలమతులవినీతులు	318
కుముదములుఁ దారు	203
కురుకుమారులు తమ	515
కురు నృప! విను	521
కురువంశముఁ ద్రుంచుటకుం	544
కురువంశోత్తముఁడైన	283
కురుసేనఁగదా గెలుచుట	244
కురుసభఁ బుట్టిన	544
కురుసైన్యము నిస్సారం	553
కులములోఁ దలవంపగు	252
కూటికై ద్రోణభీష్ములు	16
కూఁతురై పుట్టి పదపడి	651
కూలెడువారె పాండవులు	273
కృతవర్మాది యాదవులు	437
కృపుఁడును గురుఁడు	249
కృష్ణార్జునులతోడి విరోధం	483
కృష్ణుండు పాండవ	390
కృష్ణుని దేవి రుక్మిణి	577
కృష్ణునిమాట విని	476
కేకయులు మనలఁగలిసిన	257
కొంచెమైనను దగఁబంచి	176
కొడుకని చెప్పి యిట్లగునె	653
కొడుకా యే నెటులట్ల	276
కొడుకుఁ గాంచు రాచకూఁతు	415
కొడుకులుఁ గానరే	158
కొడుకుల కంటె నయ్యనుఁగు	410
కొడుకులుఁ దానును గుజ్జపు	80
కోపము నుబ్బును గర్వము	168
కోపోద్రేకంబున నతఁడా	654
కోల్పులివీఁకమై గొదగొని	220
కౌరవకోటిచేత మన	546
కౌరవనాథుఁ డా నహుషు	77
కౌరవనాయక! పాండు	482
కౌరవ పాండవులం	449
కౌరవ పాండవుల్ తెఱఁగు	446
కౌరవ పాండవు లెంతయు	575
కౌరవసభఁ దా నాడిన	515
కౌరవులకుఁ బాండవులకు	18
కౌరవులకుఁ బాండవులకు	423
కౌరవులకు వచ్చిన	268
కౌరవులచేతఁ గుడిచిన	537
క్షత్రధర్మ మింతకష్ట	308
క్షత్రియ సంస్కారమునకుఁ	535
క్షత్రియులఁదొల్లి	629
క్షమియించు వారిఁగని	172
క్షీరోదక గతిఁ బాండవ	443
క్షీరోదకవృత్తి మనము	99
గ	
గంగాసుతుండు శిఖండి	257
గజతురగాది సంపదలు	198
గదనాతో సరిమూఁడు	253
గదసారించుచు నంత్య	219
గర్వమున నాడు మాటలు	270
గర్వియై కార్యమిట్టి ద	628
గాంగేయాదులు నీకడన్	272
గాంగేయు గెల్వ నెవ్వరి	619
గాండీవ గుణరవం	223
గాండీవ జ్యారవం బుత్కట	124
గాండీవ ధన్వు నాహవ	88
గాండీవముఁ గవదొనలు న	529
గాంధార రాజులగు	600
గాలవుం డవ్విధము	470
గరుఁడని నన్నెఱుంగు	627
గురుఁడవై సమగ్ర	627
గురుఁడును గృపుఁడును	572
గురుఁడును బితామహుఁడు	487
గురుఁడు బాహ్లికాది	385
గురుఁడు బ్రహ్మవిదుఁ	645
గురునకు నవమానము	642
గురు నలుక నాకు	271
గురుభీష్మాదుల మనములు	24
గురు భీష్మాదులు సూచుచుండ	322
గుహ్యకుండు విషాదంబు	660
గోగ్రహణంబునఁ గోలె	352
గోవింద సంభ్రమము	430
గోవిందు ముందటంబెట్టి	372
చ	
చక్రధరు లెక్క గొనఁడు	123
చతురంగ బలంబుల	327
చనికాంచిన నద్దేవియు	407
చని కొలువున ధర్మసుతుం	582
చనిచని యవ్వెలంది	619
చని తదీయ పురప్రవేశంబు	27
చని పౌలోమియు సురగురుఁ	66
చని యతనిం గని	31
చని యతని నశ్వమేధంబునఁ	61
చని యా దైత్యుతెఱంగు	49
చని వారలకుం దన	619
చనుదెంచి యుచిత	497
చను నీవు హస్తినగరం	39
చలమున దుస్ససేనుఁడును	159
చాపాచార్యుఁడు భీష్ముఁడుం	123
చారులచే నంతయు విని	563
చాలఁ గాలంబు పోవక	603
చిందముల మ్రోఁత	81
చిక్కని పోటుమానిసి	95
చిచ్చునకుఁదోడు కరువలి	242
చిత్తములుల్లసిల్ల	220

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
చిత్రాయుధుండును	612
చిఱుతఁదనంబునం	489
చిఱుతనాఁడునువాఁడు	240
చుట్టములలోన నొప్పమి	434
చులుకఁదనంబున	628
చులుకని కార్యము సేయం	113
చెనసి గంధర్వ సేన	578
చెప్పఁగల యంతవట్టును	341
చెప్పిన విని దుర్యోధనుండు	422
చెప్పియుపశ్రుతి	64
చెప్పి వీడుకొలిపిన	661
చెలిమియుఁ బగయును	183
చెలిమియు, సంభాషణమును	175
చెల్లియుండియు సైరణ	174
చెలులుం జుట్టలు దేశంబుల	325
చెలులుం జుట్టలు నిష్ట	221
చేటుకాలమైనఁ జెట్ట	185
చేతనుఁడ నయి యేను	365
చేది భూవిభుండు	611
చొచ్చినచోన చొచ్చితెగఁ	328

జ

పద్యము	పుట
జగతిఁ గల జనపతులు	448
జగముల నన్నిటిం దన	287
జగముల నెల్లెడన్ దురిత	110
జనకుండున్ గురు	493
జననాథ! నీ యెఱుంగని	442
జననియు సమస్తబాంధవ	304
జనరహితంబగు	41
జనులకు నెల్లను	119
జనులకు నొడఁబాటగు	167
జనులు వినంగ రాజ్యమున	386
జనులెల్ల నెఱింగిన	94
జయమగునోడుదు	309
జలదస్వన గంభీరత	442
జలనిధి తీరభూమిఁ	52
జామదగ్న్య మహాముని	463

పద్యము	పుట
జూదపుసిరి యాసపడం	122
జ్ఞాతుల పోరితమును	193
జ్ఞాతులు దమలోఁ	274

డ

పద్యము	పుట
డక్కెను రాజ్యమంచు	179

త

పద్యము	పుట
తండ్రిలేని ప్రజలు	408
తగనీలోనూహింపుము	198
తగ విదురుఁ బంచి యాతని	542
తగవునఁ బోక రాజు	315
తగిన వేషంబు దనుఁదాన	175
తగుమాట లాంబికేయుం	122
తగ శంఖ కాహళాదిక	558
తదనంతరంబ	28
తదనంతరంబ	75
తదనంతరంబ	559
తదనంతరంబ	562
తదనంతరంబ	658
తదనంతరంబ కొలువు	662
తదనంతరంబ దామోదరుండు	508
తదవసరంబున	641
తదీయ దండనాథులు	655
తన కట్టి గుఱ్ఱములు	472
తన కనిపెట్టిన మణిమయ	438
తనకులంబునఁ బుట్టిన	203
తన తలఁ పిట్లు భీష్మ	588
తన తెఱఁగంతయు	658
తన దుష్కర్మంబు ప్రకటం	46
తనపారిపోవునంతకు	330
తన ప్రియసఖుఁడవు	622
తన భుజశక్తిలేక	588
తన మును పడ్డ బన్నములు	362
తనయులుఁ గోడలు	418
తన వచ్చిన కార్యము మన	563
తనియఁ బండకుండ మును	180

పద్యము	పుట
తనుఁ దాన పోలుఁగా	460
తనుజవశవర్తియగు	284
తనులోకము గొనియాడఁగ	176
తనువున విఱిగిన యలుఁగుల	184
తన్నుఁ దన తమ్ములను	412
తమట తండ్రి భంగి నీకును	190
తమలోని పాళ్ళకుం గా	198
తమ వారిన్ సిరికై వధించు	533
తమ సగపాలు గోలువడి	9
తముఁ దారెఱుఁగుట	166
తమ్ముఁడ! నీవు నా కొలఁది	467
తమ్మునికిఁ గాఁగ భీష్ముఁడు	618
తఱిమి శిఖండి తన్నొరులు	221
తఱియగునంతకున్ రిపు	64
తలఁచినట్ల వ్రతము	5
తలఁపం గూడునె యింత లేసి	354
తలఁపఁ బాండవులును	38
తలఁపునన వాసుదేవుఁడు	288
తలరి యమ్మునిఁ	46
తల్లియుఁ దండ్రియు వెఱఁగున	573
తానును సత్యభామయును	210
తానైన నపుడు వక్రుండై	121
తారలకుం జంద్రునిగతిఁ	568
తిట్టులఁ బోయి యక్కొలువు	136
తుదిఁ బోయి క్రూర కర్మాస్పద	128
తుది రాజ్యమ్ము సగమ్ము	356
తులువలు గాక యిట్టి	478
తెగఁగొని బ్రహ్మాస్త్ర	641
తెలిసి భార్గవుండు	636
తొంటి చవిగని యిప్పుడుఁ	489
తొల్లి ప్రహ్లాదుండు దైత్య	187
తోడంబుట్టిన భీమ	479
తోడు దొనలేనియప్పటి	481
త్వరితగతి సమయ	565

ద

పద్యము	పుట
దయ నా యాడిన మాట	529
దరహాసముతో మద్రేశ్వరు	40

పద్యము	పుట
దర్పమును దేజమును	43
దానం బుణ్యభూమియగు	528
దానఁ గొఱంత లే దభిమతం;	38
దాన దయాపరుం డయిన	409
దాన వృత్రుని వ్రేయ	53
దానికంటె నరిది దలపోయ	41
దానికాత్మఁ బొంగి ధార్త	31
దానికఁ గొంద ఱసహ్యపడి	32
దానికి జను లుత్సాహ	572
దానికి దరహసిత వదనుం	335
దానికి దుర్యోధనుం	325
దానికి నవ్వుచు వేగం	631
దానికి నీ వొడంబడితి	459
దాని వినియును నపుడు	535
దాసీదాస జనముల	144
దివిజదనుజ సహితము	244
దివిజపతి నీకునిచ్చిన	273
దివిజాధీశ్వరు పాలికిం	69
దీన నేమి తప్పు? కానకు	94
దీనికి మూలము శకునియు	531
దీని తేనియఁ ద్రావిన	275
దుర్యోధనుండు	98
దుర్యోధనుండు దుష్టాత్మ	381
దుర్యోధను నింటం దగు	107
దుశ్శాసన దుష్ప్రహ దుర్ముఖ	254
దుష్టకష్ట నికృష్టాత్ములగు	229
దేవత లర్జునునకుఁ దోడై	268
దేవతలు గాని యిట్టివి	470
దేవత లేటికిఁ బార్థుఁడు	267
దేవదుందుభి వ్రాతంబు	507
దేవర పంపగాఁ జని	155
దేవర యానతి యిచ్చిన	247
దేవా! దేవరకృప	202
దేవా! వైశంపాయనుండు	2
దేవా! వైశంపాయనుండు	154
దేవా! వైశంపాయనుండు	298
దేవా! వైశంపాయనుండు	512
దేవాసురయుద్ధంబు	227
దైన్యము దక్కి దూత	15
దైవంబు నేర్చుఁగాకిటు	200
దొరకొని పుణ్యము	433
ద్రుపదుండును బ్రీతుండయి	651
ద్రోణుండుఁ గృపుఁడును	105
ద్రోణుఁడు భీష్ముఁడుం	115
ద్రోవది బంధురం బయిన	370
ద్రౌపదేయులు నా సుభద్రా	237
ద్రౌపదేయులు మహారథు	605

ధ

పద్యము	పుట
ధనమును విద్యయు	169
ధర్మంబు గలుగునే నది	413
ధర్మజుండు ధర్మతరు	140
ధర్మజునకు భోగంబులు	157
ధర్మతనయాది పాండ	270
ధర్మతనయుండు దమ్ములు	3
ధర్మతనయుండు తాను	528
ధర్మనందను పలుకులు	359
ధర్మతనూభవు దెస	12
ధర్మపథమును నీతి	200
ధర్మపుత్రున కిక్కడి	233
ధర్మపుత్రుని పద ద్వయ	486
ధర్మమార్గంబు దప్పక	6
ధర్మార్థ సంగతంబుగ	379
ధార్తరాష్ట్రు లున్మత్తులు	539
ధృతరాష్ట్ర పాండుభూపతులు	84
ధృతరాష్ట్ర భూపతికి	109
ధృతరాష్ట్రుం డతిలోభ	341
ధృతరాష్ట్రుం డిటమీఁదను	122
ధృతరాష్ట్రుండును బుత్రులున్	140

న

పద్యము	పుట
నకుల సహదేవులును	387
నకులుఁడు సహదేవుండును	257
నకులు సహదేవుఁగొని	236
నడచి కురుక్షేత్రంబు	573
నడవడి యను మున్నీటిం	172
నడిపింపఁగఁ బొడిపింపఁగ	591
నను నయ్యర్జునునకు	527
నన్ను మన్నించుంగావున	622
నమదనిమిష చూడా	296
నరనాథ! నీవుపేక్షా	449
నరుఁ డగ్నిదేవుఁ దనకును	267
నరుఁడలుక వొడమియును	217
నరుఁ డాల వెనుక వచ్చిన	96
నరుఁడీ మానము వాఁడనంగ	608
నరునకు నది వాఙ్మయమగు	137
నరునిపాశుపతాది	255
నలినగర్భుఁడు పెద్ద	226
నలువురు తమ్ములు భవ	111
నహుషుండు పనుచువాఁడటె	58
నహుషుఁడు మహేంద్ర పదవీ	58
నాఁడట్లు నీవు నీదగు	70
నావుడుఁ దల్లి	292
నాకుం దోఁచినవారిం బేరుకొంటి	614
నాకుఁగర్తవ్యమగు పని	23
నాకుడుప నేల వశమగు	259
నాకు నయనేంద్రియము	294
నా కొడుకుల కెక్కడి	258
నాకొలఁది విచారింపక	336
నాఁటి కొలఁదిగాదు	277
నాఁడు ద్రౌపది వడిన	410
నానా దేశంబుల బలు	255
నానా ముఖముల విడియం గా	83
నానాస్త్ర శస్త్రచయ	666
నా పాటియ పదివేవురు	29
నా పురుషత్వము గైకొని	657
నా మతమునఁ గార్యము	14
నా మనంబును దమ్ముల	545
నారదముని త్రైలోక్య	643
నారాయణ గోపాలుర	33
నారాయణాభిధానులు	30

పద్యము	పుట
నారాయణుండు ధర్మార్థ	397
నారీరత్నము నట్లు దెచ్చి	86
నా విని సంజయుండు	127
నావుడు సంజయుఁడిట్లను	261
నావుడు నవ్వుటాల కనినం	336
నావుడు నిది యౌ సంజయ	256
నావుడు హరి యిట్లను	541
నిజవంశోచిత వీర	518
నిత్యానిత్య వివేక వైభవ	295
నిన్నయఱ సచ్చిపోయితి	639
నియత తపమును నింద్రియ	193
నిర్బంధము దుర్మానము	476
నిలిచిరి తక్కటి దొరలును	560
నిశాసమయంబున	62
నీకిట్టిది చిత్తమునకు	345
నీకిది యేటికిం దపమనింద్య	621
నీకుఁ బ్రెగ్గడయును	600
నీకునంత వగవనీపోవు	265
నీకునాలావు తోడ్పాటు	279
నీకు మేము ప్రద్యుమ్నాది	301
నీకు వలసినఁ దీర్పంగ	447
నీకు వెఱవ నేల నిన్ను	583
నీకు శుద్ధుండ నగుటయు	513
నీకెదురై జయంబుగొన	34
నీ కొడుకు లొండు సుఖములు	418
నీచదశకు వచ్చి నిషిధా	54
నీచెప్పెడి పెద్దలు ద్రోణా	264
నీతలఁ పేను గంటి	394
నీతిపథంబునన్ బ్రదుక	189
నీ పలు కెంత వోలినను	537
నీ బుద్ధి పాండవులతోడి	186
నీ యందు వారియందుఁ	592
నీ యనుజులు దివిజులకు	553
నీ యొద్ది రాజులందఱు	551
నీవడిగిన పనియేర్పడఁ	664
నీవతిరథుఁడవు	593
నీ వాక్యము విప్రస్వాభావిక	92
నీవిట మున్నవచ్చి; తిది	29
నీవిట వచ్చుట విని	431
నీ వియ్యంబులు సంధియ	517
నీ వివేకంబు నాస్తియు	432
నీవుఁ గొడుకు వారినెఱి	165
నీవు ధర్మజు పాలికి	101
నీవు ధర్మాధర్మ విదుండవు	167
నీవు నుచితవృత్తి నెయ్యంబు	132
నీవును బలు బుద్ధులుడిగి	293
నీవు నేమును నొక్కటి	638
నీవు బతిమాలి కొడుకుల	252
నీవు మున్నేఁగు మని	97
నీవు వచ్చినవాఁడవు	425
నీవు వృద్ధజనోపసేవి	522
నీవు సమస్తము నెఱుఁగుదు	286
నీవు సుభద్రకంటెఁ గడు	367
నీవు సుయోధనుపాలికిఁ	317
నీవుసెప్పినమాటలు నిర్మలములు	197
నీవేటి మోపుకాఁడవు	467
నీవైనఁ జెప్పి శాంతుం	497
నీవొండె విదురుఁ డొండెను	143
నీవొనరింపఁబూనిన	342
నీ శిక్షఁ బెరుఁగుట	408
నెట్టన యిట్టియల్క	374
నెట్టన సభలో వేపుర	135
నెత్తురు వడిసిన మూర్ఛా	633
నెపమిడి యొహటించి	605
నెమ్మిగలవారి నొల్లరు	169
నెయ్యము దప్ప నొండొకటి	118
నెయ్యమువాటించి కడుం	101
నెఱిఁబడి యాజి నీ మొనలు	568
నెవ్వగలు నివ్వటిల్ల	192
నేఁ డింక నెఱిఁగి	525
నేను పగతుండనె	427
నొవ్వఁ బలుకుదు సభలో	601
ప	
పగయ కలిగెనేనిఁ బామున్న	310
పగయడఁగించుటెంతయు	311
పగవారి యింటఁ గుడిచిన	427
పటు పరాక్రమనిధి పాంచాల	552
పట్టి యాతనిఁ జెఱఁబెట్టి	500
పట్టు వడ్డ ముచ్చుపగిది	655
పతి సన్నిధి వడసి	63
పదపడి దుస్తరమగు	5
పదివేలఁ జంపఁగా నోపుదు	664
పద్మపరాగంబుఁ బరఁగించు	206
పనిచిన నాతఁడుం జనియె	47
పనిచిన వహ్నియు వనితా	67
పనుపుము కౌరవసభకే	319
పరమ ప్రియమున నాకై	385
పరమాదరంబున నద్దేవిని	56
పరశురాముఁ గానఁబడయుట	621
పరశురాముని గెలిచిన	249
పరిచారకులై యుండుదు	141
పరిజనులకు నీకును	263
పరిభవము రెండుదెఱఁగుల	624
పరుల ధనమునకు విద్యా	182
పలికిన చందముల్ నెఱపి	13
పలికిన నేనును	628
పలికిన నేమి యన్నియును	666
పలుకుల పొందెఱుఁగని	576
పలుకునె యిట్లు గొంతి విని	520
పలుమఱుఁ బాండు తనూజుల	288
పవనజు గదయును	585
పాంచాల మహీవల్లభు	83
పాంచాల రాజపుత్రియు	524
పాంచాల రాజభార్య	651
పాండవ కౌరవుల్ గలసి	329
పాండవ యాదవ పాంచాల	383
పాండవార్థమై యొక్కరుఁ	19
పాండవులకుఁ గలుగు	663

పద్యము	పుట
పాండవులకుఁ దగిన పాలు	457
పాండవుల దిక్కు రథికుల	614
పాండవులు కౌరవులతోడి	87
పాండవులుఁ దండ్రి సచ్చిన	451
పాండవులు ధార్తరాష్ట్రులుఁ	378
పాండవులు శౌర్య మొల్ల	189
పాండవేయులఁ దగం బ్రార్థించి	138
పాండిత్య శౌర్యనిత్యులు	478
పాండుకుమారుల పాలికిం	516
పాండు కుమారులు నీకుం	452
పాండుతనూజకోటికి	131
పాండు తనూభవుల్ వడిన	24
పాండు నరపాల సుతు	98
పాండుని యగ్రనందనుండు	217
పాండుపుత్త్రుల నద్దెస	606
పాండురాజ తనూజుల	208
పాండురాజసుతుల పాలికిఁ	163
పాండ్యవిభుండు లోనుగాఁ	81
పాకశాసను తెఱం గెఱింగించి	54
పాడి గలిగిన నిహలోక	187
పాడి దప్పకుండఁ బడయు	174
పాపంబులు గర్జములని	188
పాపాత్ముండు మదాంధుఁడా	328
పార్థుఁడు పోరఁదేరు	337
పార్థునకుఁ గృష్ణుండు	42
పాలీక కౌరవులు దుశ్శీలత	127
పావకుఁ డాదిగా దిగధి	75
పితృధనమగు పా లుచిత	93
పితృ పితామహ గురులమై	484
పుడమిపాలు పాండవులకు	23
పుడమియెల్ల నొడ్డ	433
పుణ్యాశ్రమ దేశముల	649
పురుషుండు రెండు దెఱఁగుల	173
పురుషోత్తముండెల్ల	289
పూని పలికెద వినుము	378
పెండ్లికని పిల్వఁ బంచినఁ	19
పెంపేదన్ దమకిట్టి	362
పెక్కండ్రు గోవులంగొని	481
పెట్టనికోట నీకు హరి	115
పెనఁకువ నాక యేల	263
పెనుపుం జతురత	392
పెఱవారినెల్లఁ దరమిడి	570
పొందైన లెస్స విరసపుఁ	20
పొందొందఁగఁ దలఁచితి	108
పోయిన మొగమున నచ్చట	145
పోయివత్తుగాక యీ యున్న	142
పౌలోమియు నా నహుషుని	60
ప్రళయకాల సముద్రము	242
ప్రాణంబుతోఁ గూడ రక్కసి	402
ప్రియమెసఁగం దగం	426
బ	
బంటుతనంబు మాటలకు	335
బకవిధ్వంసిజటాసురాంతకు	235
బఱటి కొనిపోయి కృతవర్మ	501
బలఁగముఁ బెంపుఁ దేజమును	548
బలమత్తాకృతియైన	150
బలమును దర్పమున్ మెఱయ	278
బలవంతుఁడు పైనెత్తిన	164
బలవంతుల బలములు	469
బలిమి మున్నేల తెచ్చితి	626
బవరము గీడని యెఱుఁగుదు	581
బవరములుగావె విఱిగిన	277
బవర మెల్లియ బిరుదవై	587
బహు విధంబులఁ బలుకు	540
బాలక్రీడ మహాసుర	223
బాలసఖుండవు నాకును	150
బావ యొప్పం డను పలుకుల	413
బాహాగర్వము వివిధ	547
బాహుబల ఘనుఁడు	88
బీఱెండ తాఁకున బీఁటలు	556
బుద్ధిమంతురాలు పొందుగఁ	496
బృహద్బలుండు సమరథుండు	596
బెడిదముగఁ గత్తి	184
బొమలల్కన్ ముడివడ్డ	241
బ్రదుకు చేటు పొగడు	191
భ	
భక్తమనః ప్రమోదకర	509
భరతకులంబు ధర్మమును	444
భాగ్యమున నిన్నుఁ గనుఁగొన	103
భీమసేనుని నీవింత పెద్ద	252
భీమసేన సూనుండు	239
భీమార్జునుల కిట్లని	415
భీమార్జునులకు రణమున	14
భీమార్జునుల కొలందులు	245
భీముండుం గవలుం	560
భీముఁదలఁచినన్ మనము	240
భుజబల దుర్జయుఁ	50
భుజబలమున జీవించుట	416
భూరికృపానుషంగ	151
భూరి విభూతిఁ బెండ్లికిని	557
భూవర! నీ తనూభవులు	502
భేరీ మృదంగ శంఖముకు	571
భోగంబులు వలదా యని	120
మ	
మంచిగ నేను బంధులును	96
మందబుద్ధి నాదునందను	477
మగఁటిమివారికి వీఁడెదురుగ	230
మడుఁగుఁ జీరయందు	114
మద మడఁగించి భూపతి	459
మదినామాట కొంకితయు	229
మదిసుఖముగోరి దుఃఖం	119
మదీయ తేజోవిశేషంబు	50
మన కడకు నేమి కార్యంబు	395
మనకాప్తుండు సంజయుఁడీ	291
మన కీకుండఁ వచ్చునే	99
మనకుఁ బాండురాజ తనయ	350
మనకు నిప్పుడతనిఁ	201
మనకు విడిదల కురుక్షేత్రం	564

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
మనచారులిప్పుడు చనుదెంచి	667
మన ప్రజలోఁ గరిపురికిం	381
మన మిచట నిలిచి	659
మనము జనార్దనుపాలికి	299
మనమునఁ బక్షపాతగతి	314
మనయింట సుయోధను	393
మనలఁ జూచువేడ్కఁ	439
మనల నింక నమ్మ రన్పతాత్ముల	99
మనవీటన కా దయ్యర్జును	232
మనుమని జయప్రయాణం	558
మమ్మెఱుఁగు దెదిరి	320
మరుదస్త్రమేయ గుహ్య	633
మఱచిరె కొలువున	518
మఱియుఁ దగువారల	209
మఱియు దుశ్శాసనుండు	138
మఱియు నక్కడ	115
మఱియు నగరెల్లను	392
మఱియును	236
మఱియు వంశవంతులు	144
మఱియు సమస్తజనంబుల	25
మహనీయ భవ త్పదవీ	71
మహిత లావణ్యమున	56
మాకుం జాడఁగఁబోలు	521
మాట పొందెఱింగి	10
మా తండ్రిఁ గని యేను	143
మాతండ్రి తలఁపును	303
మాతండ్రి యెఱుంగక	618
మాతలి పాణిగ్రహణం	466
మాత్స్యపాంచాల పాండ్యాది	488
మానక ధృతరాష్ట్రుండు	483
మానుప వచ్చునే యంటేని	433
మానుషశక్తి యొల్లఁడు	157
మాయలు నింద్రజాలములు	586
మాయిరువురతోఁ గయ్యము	218
మాలకరి పుష్పములు	181
మీకుం జెప్పి పోవచ్చితి	577
మీఁటుగల రాజరథికుల	663
మీతండ్రికి భీష్మునకుం	325
మీ పనుపున రాజ్యము	20
మీ యయ్య మీరు వనవాసా	98
మీరలు ధర్మజువర్తన	6
మీరుఁ బాండుసుతులు	569
మీరును గారుణ్యాతిశయం	202
మీరును వారును జలమునఁ	32
మీరుశకుని కర్ణ	166
మీరు చెప్పిన బుద్ధులు	477
ముచ్చిర నేల యేఁగలుగ?	375
ముదమునఁ గృష్ణుఁడు	407
ముదుకఁడనైన నాదు	604
మునివరుఁ డష్టకుఁ డని	475
మునివరుఁడైన యగస్త్యుఁడు	73
మునుఁ దాఁ గంసునిఁ	499
మును పాంచాలవిభుని	26
మును మనచేత భంగపడి	564
మును మమ్ముఁ బొగడి	124
మునులచ్చెరువంది	649
మునులారా! నన్ను విధి	476
మునువరుసతోడఁ దన	283
మునుసౌరభ్యము నివ్వటిల్లఁగ	204
మున్ను కర్ణునొండె నన్నొండె	570
మున్ను దనతోడం జని	498
మున్నే నసహాయుఁడనై	579
మున్నేను గాన వచ్చితి	28
మురమర్దనుండతనితో	333
మూత్ర పురీషాదులు దమ	525
మృత్యుపాశోప హతుఁడయ్యె	282
మృదుభాషణముల దుర్జన	16
మేలుకని కృష్ణుఁ డర్జును	27
మేలుగాక నీకుఁబోలి	320
మేలు సేసితి	42
మైత్రీసౌఖ్యముఁ బోలునే	50
మొదల విధిని యతియును	377
మొనతలఁబడియెదు	490
మోహరము నడచుచుండఁగ	78
మ్రొక్కెద వాసుదేవునకు	116
య	
యక్షుఁడెఱింగివచ్చియిటులాఱడి	656
యమ మహిష ఘంటికా	377
యమవరుణాది త్రిదశులు	55
యుద్ధము కాక కార్యమును	545
యుద్ధముమీఁది వేడ్కయు	333
యుధిష్ఠిరుండు నీవు నిక్కమ	166
యోగ్యతృష్ణ దారు లుచితంపు	120
ర	
రండని పిలువఁబడనిచి	126
రక్కెస మాట లాడెదరు	353
రణమున వారలన్ గెలవ	125
ర మ్మింద్రపదవి సేకొని	54
రయము మెఱయంగనొక్క	640
రవిశశి మయనేత్రా	510
రాజసూయ మహాధ్వరం	128
రాజునకుఁ దియ్య మెసఁగెడు	405
రాజుయుధిష్ఠిరుఁడై	259
రాజుల కెందు నారయ	517
రాజ్యము భారమెల్ల	482
రాధేయుండును దుస్ససేనుఁ	264
రాముఁ డంత్యకాలానలోద్దామ	634
రావించితగవుమై	248
రిత్తయుపచారములనే	192
రిత్తలు రజ్జెడువాఁడే	587
రెండు వీళ్ళను గురుక్షేత్రం	581
రోచమానుండు మహారథుండు	612
రోషమయ మహాతరువు	139
రోషము నాపయిం గలిగి	503
ల	
లక్కయిలు కాలినది మొద	385
లలనా! యుడుగుము నీ	376
లే రిచట మగలు నీకును	137

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
వ		వా రొకతల యే నొక తల	30	వివాహ మహోత్సవంబునకు	21
వక్షస్థ్సలంబున వనమాల	559	వారొక యాగ్రహవృత్తిం	111	వివిధ మణిమయ రథంబులు	393
వగ బలము దఱుఁగు	192	వార్తవిని యాక్షణము	390	వివిధోపాయ పరాయణుండు	89
వచ్చి దుశ్శాసన ప్రముఖ	565	వాసవుఁడు దొల్లి నిజ	45	విస్మయము నొందు భార్గవు	636
వచ్చినఁ గనుఁగొని నీ దెసఁ	660	వాసుదేవసన్నిధి	466	వీర గుణము బలము	610
వచ్చినవాఁడు ఫల్గునుఁ	348	వాసుదేవుండెట్టివాఁడని	286	వీరలవృత్తముఁ, బాండు	86
వచ్చిన సైన్యంబులఁ గని	431	విజయు విక్రమంబు	536	వీరలాధర్మపుత్రాదుల	250
వచ్చి సరస్వతీ తీరంబున	625	విడియుటకు సూచకంబుగ	562	వీరలు ధర్మమార్గము	355
వచ్చె జనార్దనుం డనిన	383	విదురుం డొక్కఁడు దక్కఁగ	411	వీరలు పెద్ద ద్రవ్వకొక వెంట	133
వనవాసంబున భూశయ్యను	218	విదురుఁ డిట్టు లనియె	431	వీరలు సముచితాసనంబుల	439
వనితం బఱిచి రరణ్యంబున	487	విద్యుద్దండము నిల్చి	222	వీరితలం పెఱిఁగిన	7
వరదివ్యాస్త్రవిదుండు	597	విద్యయు నవిద్యయు	290	వీరు కారు పాండవేయుల	480
వరమునఁ బుట్టితిన్	366	విని యత్యంత కుతూహల	151	వీరును బాండుపుత్త్రులును	513
వలయు నన్నపానంబులు	423	విను కొడుకు గొన్న వేఁదుఱ	23	వీరును వారుఁ బండితులు	450
వలలుఁడనన్ విరాటుకడ	586	విను నీ వదితిసుతుండవు	466	వీరు వారును సంబంధ	576
వస్త్రమాల్యాను లేపనా	120	విను నూతి కప్ప విధమున	585	వీరెల్లఁ బాండురాజ	238
వాఁడును సత్వరంబుగాఁజని	163	విను మతఁడు సేయఁ బూనిన	396	వీరె సురలాకసంబున	642
వారందఱుఁ దనతోడన	515	విను మధురాహారంబులు	171	వృద్ధోప సేవనంబును	525
వారందఱును ధర్మవైభవంబునఁ	607	విను మవమానముపడి	133	వృష్ణికుమారోత్తముఁడా	237
వార లంతకుఁ జాలని వారె?	668	విను మసత్య లోభమున	479	వెడలి తమ్ములుఁ దగువారు	573
వార లందఱకును సాత్యకిని	404	వినుము గాండీవ మను	585	వెడవెడ నిద్రవొంది	205
వారలఁజూచి కేశవుఁడు	28	వినుము దంభోద్భవుండను	463	వెడవెడ యేనుఁ దొల్లి	524
వారలక యేల మాధవ!	419	వినుము నరేంద్ర పాండు	234	వెన్నుఁడు ప్రీతిఁ జెప్పిన	484
వారల భాగ్యంబున నప్పు	465	వినుము నరేశ్వర కర్ణుని	250	వెరవున నీపతి యునికియు	67
వారలు శాంతశూరులు	461	వినుము ప్రాగ్జ్యోతిషా	599	వెరవున లావునం గృషికి	346
వారి తండ్రిపాలు వారికి నిచ్చి	458	వినుము మనము మధ్యస్థుల	107	వెరవుమెయిఁ దాన	26
వారిదెసనీదు సెప్పిన	239	వినుము యుధిష్ఠిరు సైరణ	159	వెఱచితి రాఁగదే యనిన	580
వారిద్దఱ వాలమ్ముల	584	వినుము వసుమూర్తి	643	వెఱపెట్టిదియో యెన్నఁడు	334
వారిని వారి వారి నిటు వర్ణన	260	వినుము విశ్వామిత్రుపాల	469	వెలఁది జూదంబు పానంబు	175
వారి వారి మందిరంబులకుం	84	వినుము సంజయ ధృతరాష్ట్ర	213	వెలలి బలరిపుఁడు	48
వారి విలాసంబులను	46	వినుము! సుయోధనాదులగు	445	వేఁడికొని కృపణులై	414
వారు గలరు వీరు గలరు	588	వినుము! సూతాన్వయంబున	534	వేగపడుట మేలె? వినుము	424
వారు దెసలొత్తికొనియు	247	వినుము హరి తోడుగల	590	వేడుక పుట్టిన జూదం	12
వారును మీరుఁ బొంది	480	వినుమేనొక శైలమునకు	275	వేరిమి ధర్మజుం బరిభవించిన	343
వారెల్లనుభవదీయ	156	విను సైంధవుఁడు మహారథుఁ	594	వేఱొక కార్యంబు సేయం	397
		విరటుఁడు బాంచాలుండును	3	వ్యాసాదిమునిప్రోక్తమహా	296
		విరటుఁడు ద్రుపదుఁడుఁ	95		

పద్యము	పుట
శ	
శంతను పిమ్మట సత్యవతి	615
శంతను పుణ్యవంశం	541
శకుని విను సమరథుఁడు	596
శరణాగతనైన నన్ను	66
శరణుసొచ్చిన రక్షింప	59
శరనిధి ఫేనంబున	69
శరవర్షము నామీఁదం	631
శరశరాసనములు	232
శాంతతఁబొంది కార్యము	113
శాంతనవుండు సర్వకురు	232
శాంతిం బొందుట నీకుం	493
శాంతిప్రకారంబునం గార్యంబు	102
శౌర్యోజ్జ్వలుండు పాంచాల	238
శ్రీగౌరీ పల్లవ పుట	1
శ్రీమత్తులసీ పల్లవ	512
శ్రీవాగ్విభవారోగ్య ప్రావీణ్య	298
శ్రీవిస్తారకరణ కరుణా	154
శ్రుతిమౌళిరత్నమూర్తీ	152
స	
సంగ్రామంబు రాజులకు	134
సంజయా వినవే యప్పుడు	137
సంజయా వినుము నీకున్న	243
సంజయుండు కృష్ణు సద్భక్తి	112
సంజయుఁడు దన్నువీడ్కొని	298
సంజయునిచేతఁ గార్యంబు	167
సంధికి నేఁగి కార్యము	574
సంపద దక్కియుండఁగ	121
సంభ్రమ స్నేహ నిశ్చల	429
సకలపుణ్య కర్మచయమును	186
సకల భువనములు	239
సకల భూత సంక్షోభ	641
సకల స్థావర జంగమంబులు	68
సకలారాతి భయంకరుం	79
సత్యశౌచ ధర్మశాలి	246
సత్యసరస్వతి వగు	38
సదయవిమలదృష్టి	152
సపరివారంబుగా దుర్యోధనుం	503
సమయ బహుత్వారణ్య	672
సమయమ యూఁది పాండవు	92
సమయమిది మిత్రకార్యంబు	301
సమరంబు గలుగుననుచును	327
సమరథుఁడు బిరుదు	596
సమరథులు కవలు	607
సమరముడుగు నారాయణ	644
సమరమునకుఁ దగు	21
సమరమునకుఁ బురికొల్పుచు	261
సమరమునకు వచ్చిన	486
సమరమున దైత్య దానవ	241
సముచితంబుగఁ గూరల	422
సముచితములగు మాటలఁ	13
సర్వముఖ శరముగల	274
సర్వసేనాధిపత్యంబు	569
సవరణల నొప్పియునిఁ	82
సవ్యసాచిచేతఁ జచ్చుట	537
సహజకుండలుండు శౌర్య	250
సాత్యకియును సముచిత	421
సారథియు రథియునై	228
సారథ్యంబును జేయుచు	637
సారథ్యం బొనరింపు మపార	34
సారపు ధర్మమున్ విమల	454
సావధానులరై వినుండని	112
సాష్టాంగ మెఱఁగి	560
సాళ్వునకుఁ గాని యపుడ	619
సుగుణవు పుట్టినింటికిని	417
సుతువాఁడై వినయంబు	315
సురగంధర్వ ఖచర	551
సురలోక రాజ్యపదవిన్	56
సూతసుతుండు వీఁ డనక	526
సూతపుత్రయితఁడు	605
సూనృత మూఁది బన్నములు	218
సూర్యానుగ్రహంబునఁ జేసి	536
సేన దమకును గలవారు	551
సేనమొగమీతఁడైనం	603
సేనాధిపత్యమును దగఁ	569
సోదరులుఁ బ్రియులు	526
సౌఖ్యంబులు వొందు జగత్	77
సౌంభపురవల్లభుండైన	617
స్వర్గపరిభ్రష్టుండై	75
స్థూలకర్ణుండును దలరి	660
హ	
హయమేధంబున నాకుం	61
హరిఁ గాంచి యతని చెప్పిన	49
హరి తలఁ పొప్పదు	499
హరి వలికిన విధ మెంతయు	422
హరిమహత్త్వంబు విన్నవించెద	288
హరి యెఱుఁగని చక్కటియుం	577
హరి వాక్యము వింటిరె?	9
హితముఁ గర్తవ్యమును	178
హితమును ధర్మముం దగవు	546
హితమిబ్భంగిది మాకు	346
హిత ముపదేశించితి	527
హితములగు నాదు	229
హితుఁడని నమ్మఁగాఁదగునె	602
హితుఁడవు, మతిమంతుండవు	22

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 8

భీష్మపర్వము

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్యులు

కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి

ప్రధానసంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Bhishmaparvamu of Tikkana Somayaji
Vol.VIII .

Commentary by
Dr. Nanduri Ramakrishnamacharyulu-1,2 Cantos
Kavi Cherukuri Jayachandra Sastri - 3rd Cantos

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Publications Series No.607
First Edition : August 2004
First Re-print : 2006

Second Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D., Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వైయస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

భీష్మపర్వం మహాభారతంలో అత్యంత ప్రధానమైన పర్వం. పదునెనిమిది రోజుల కురుక్షేత్రసంగ్రామంలో సర్వసేనాధిపత్యం వహించిన భీష్ముడు ఒక్కడే చేసిన పదిరోజుల యుద్ధాన్ని మహోజ్జ్వలంగా వివరించినా, బహు వైవిధ్యమైన మానవ మనోరంగంలోని కురుక్షేత్రాన్ని ఈ పర్వం బయలుపరుస్తుంది. సనాతన ధర్మానికి మూలమైన, ఉపనిషత్తుల సారమైన భగవద్గీత ఈ పర్వంలో చెప్పబడింది. శ్రీకృష్ణ భగవానుడు పార్థుని నిమిత్తంగా చేసుకుని మానవాళికి గీత మూలంగా శ్రేయోమార్గం చూపడం ఈ పర్వంలోనే జరిగింది.

తిక్కనసోమయాజి వ్యాసభారతాన్ని తెలుగులోనికి అనువదించేటప్పుడు తాత్త్వికచర్చలకు, తత్త్వశాస్త్ర వివరణలకు పూనుకోకుండా నేలపైన నిలిచిన వ్యక్తిత్వాలనైజాలను చిత్రిస్తూనే తాత్త్విక వివరణలను విశ్లేషించే యత్నంలో సాఫల్యం చెందాడు. అది కవిబ్రహ్మ తిక్కనగారి కొక్కనికే చెల్లింది.

ధర్మరాజు కురుసేనలోని పెద్దల ఆశీస్సులు అర్థించడం, భీష్ముడు పాండవులను వదలి తక్కిన శత్రుసేనలోని వీరులను చించి చెండాడటం, చక్రం పట్టనని చెప్పిన కృష్ణుడే భీష్మనిర్మూలనానికై చక్రంపట్టడం – ఇట్టి ఘట్టాలు నడిపిన తీరు సోమయాజిగారి కొక్కనికే సాధ్యమయిందని చెప్పాలి.

భీష్ముని శౌర్యానికి అడ్డంగా నిలిచిన శిఖండిపాత్ర ఈ పర్వంలో ప్రస్ఫుటంగా ప్రకాశించింది. భీష్ముని సైన్యాధిపత్యంలో యుద్ధం చేయనని చేతులుముడుచుకు కూర్చున్న కర్ణుడు పితామహుడు శరతల్పగతుడుకాగానే ఆయనను సందర్శించి పలకరించి ఆయన ఆశీస్సులు పొందడంతో యుద్ధషట్కంలో ఈ తొలిపర్వం ముగుస్తుంది. ఇక్కడ కర్ణుని మూలాలు భీష్ముడికి చక్కగా తెలుసు. అయినప్పటికీ శ్రీకృష్ణుడు నెరపిన రాజకీయ చదరంగంలో తన్నుదాను ఒక పావుగా భావించి భీష్ముడు నడుచుకోవడం ప్రస్ఫుటమవుతుంది.

ఇటువంటి నానా మానసిక వైవిధ్యాలను ఏకధాటిగా నడిపించి జీవిత కురుక్షేత్రంలో మొదటి ఘట్టాన్ని విప్పిచెప్పిన తిక్కన సోమయాజి భావాలను వివరించిన కీ.శే.నండూరి రామకృష్ణమాచార్యులవారికీ, కవి చెఱుకూరి జయచంద్ర శాస్త్రిగారికీ మా హార్దిక అభినందనలు. ప్రధానసంపాదకులుగా గొప్పపీఠిక సమకూర్చిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారికి మా అభినందనలు.

చదువరులు ఈ భీష్మపర్వాన్ని సమాదరిస్తారని ఆశిస్తూ తక్కిన పర్వాలనుకూడ సాధ్యమైనంత త్వరలో పాఠకుల ముందుంచడానికి ప్రయత్నిస్తాం.

కార్యనిర్వహణాధికారి

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమస్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన ''పోతన'' పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు ''వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత'' గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 - 83 విద్యావత్సరాన్ని ''నన్నయ సంవత్సరం'' గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా

గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జూలై 11వ తేదీన హైదరాబాదు బాలాజీభవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

“ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్యపర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అరసున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసియున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్వురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల ''వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిక్రమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగా పర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జూలై 3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డిగారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి ''తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥ కె. సర్వోత్తమరావు	**శ్రీ డి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥ రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిన అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జూలై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీ డి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీ స్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలోని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక

వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్ల కొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పండ్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులుబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి. విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి''.

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాస్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదకమండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంపాదకమండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు	శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య	డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
డా॥ కె.జె. కృష్ణమూర్తి	డా॥ కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే.	డా॥ బిరుదురాజు రామరాజు
అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్, తి.తి.దే.	డా॥ ఎం. కులశేఖరరావు
ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి, తి.తి.దే.	డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
	డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25 వ తేదిన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలుల లోని సభ్యులయొక్క సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటా లన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్త పాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ఇప్పుడు ప్రథమ సంపుటం - ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం - సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి. సుబ్బారావుగారి తరువాతి కార్యనిర్వహణాధికారి అయిన డా॥ పి.కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారు వచ్చిన తక్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణను గూర్చి ఆసక్తితో గమనిస్తూ అన్ని విధాల సహకరించి ఆది సభా పర్వాల విడుదలకు ఏర్పాటు చేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాల నిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ ప్రణాళిక వ్యాఖ్యా సహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. తరువాతి సంపుటాలు సైతం త్వరలోనే వెలుగుచూడనున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారతం' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన సహృదయులు డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారికి అనేక ధన్యవాదాలు. తిరుమల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. సాహిత్య ప్రీతి కలవారైన తి.తి.దేవస్థానం సంయుక్తకార్యనిర్వహణాధికారి శ్రీ ఆర్. అప్పారావు, ఐ.ఏ.ఎస్., గారికి వందనములు.

సంబంధిత విభాగాధిపతిగా నూతనముగా వచ్చి సలహామండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన డా॥ పి. రంగారావు, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయ సహకారలందించిన తదితర అధికార గణానికి నమస్సులు. ఈ ప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధాన పాత్ర వహించిన - వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదక మండలి, సలహా మండలి) యందలి విద్యావేత్తలు ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు - ఈ విద్వాంసులందరికి నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి.దేవస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడం వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్‌కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానికపండితవర్యుల ఒక ఉప సంఘం (ఎడిటోరియల్‌సెల్) నిర్మాణానికి సిఫారసు చేస్తే దేవస్థానం ఆమేరకు ఎడిటోరియల్ కమిటీలో ఉన్న **డా॥ కె. సర్వోత్తమరావు, స్థానికులైన విద్వాంసులు, పండితవరేణ్యులు శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీ ముదివర్తి కొండమాచార్యులు** గారలతో ఎడిటోరియల్ సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈ సెల్ ఉపకారం మరువరానిది. వీరు వర్క్‌షాపువలె నిర్వహింపబడుతున్న కవిత్రయ మహాభారత యజ్ఞంలో పాలుపంచుకుంటున్నారు. ఆ కారణంగానే ఆరణ్యపర్వం మొదలుకొని తక్కినపర్వాలు త్వరితంగా వెలువరించగలుగుతున్నాం.

"సప్తగిరి" సంపాదకులుగా ఉండి, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి ప్రముఖ పాత్ర వహించిన కీ.శే. కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె. రాధారమణ, డాక్టర్ ఎ. సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి.ఎన్. శ్రీనివాసన్ గారలకు, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పాఠకులకు అతి తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయ అధికారి శ్రీ ఐ. పార్వతీశ్వరరావుగారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ ఎన్.ఎస్. రామమూర్తి
కన్వీనర్
సంపాదకుడు - సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి

అధ్యక్షులు

శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకుడు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం

సంపాదక మండలి సభ్యులు

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆచార్య ఎం. బుద్ధన్న

డా॥ పి. రంగారావు, (పౌరసంబంధాధికారి) (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ మేడసాని మోహన్, డైరెక్టర్ అన్నమాచార్య ప్రాజెక్టు, (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద, కార్యదర్శి ధర్మప్రచార పరిషత్తు (ఎక్స్ అఫిషియో సభ్యులు)

కన్వీనర్

డా॥ ఎస్.ఎస్.రామమూర్తి,

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా. 1,2
4. డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్నశాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	ఆను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	ఆను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు, శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఆను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది.	-	ఆదిపర్వం
సభా.	-	సభాపర్వం
ఆర.	-	ఆరణ్యపర్వం
విరా.	-	విరాటపర్వం
ఉద్యో.	-	ఉద్యోగపర్వం
భీష్మ.	-	భీష్మపర్వం
ద్రోణ.	-	ద్రోణపర్వం
కర్ణ.	-	కర్ణపర్వం
శల్య.	-	శల్యపర్వం
సౌప్తి.	-	సౌప్తికపర్వం
స్త్రీ.	-	స్త్రీ పర్వం
శాంతి.	-	శాంతిపర్వం
ఆను.	-	ఆనుశాసనికపర్వం
అశ్వ.	-	అశ్వమేధపర్వం
ఆశ్ర.	-	ఆశ్రమవాసపర్వం
మౌస.	-	మౌసలపర్వం
మహా.	-	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	-	స్వర్గారోహణపర్వం
సం.	-	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	-	సంస్కృత మహాభారతము
అను.	-	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	-	ప్రధాన సంపాదకుడు

క.	-	కందపద్యం
వ.	-	వచనం
ఆ.	-	ఆటవెలది
తే.	-	తేటగీతి
సీ.	-	సీసం
ఉ.	-	ఉత్పలమాల
చ.	-	చంపకమాల
మ.	-	మత్తేభవిక్రీడితం
శా.	-	శార్దూలవిక్రీడితం
ఆశ్వా.	-	ఆశ్వాసం
క్రీ.శ.	-	క్రీస్తుశకం
య.	-	యగణం
మ.	-	మగణం
త.	-	తగణం
ర.	-	రగణం
జ.	-	జగణం
భ.	-	భగణం
న.	-	నగణం
స.	-	సగణం
ల.	-	లఘువు
గ.	-	గురువు
అలం.	-	అలంకారం
సం.	-	సంవత్సరం
మొ.	-	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పీఠిక

[**పీఠిక విషయసూచిక-**1.భీష్మపర్వం వీరరస మహాసాగరం- పు. 1❋ 2. భగవద్గీత భారతాత్మ - పు.2❋ 3. భీష్ముడు: అమృతత్వసాధన- పు.4❋ 4.భీష్ముడు సమగ్ర యుద్ధరసవీరుడు- పు.6❋ 5. విషాద గంభీర యుద్ధవీరుడు - పు.7❋ 6.భీష్ముడిలోని దేవప్రవృత్తి, రాక్షసావేశం- పు.9❋ 7. పది రోజులపోరు: పది పరిణామాల తీరు- పు.11❋ 8. కావ్యకళాశిల్పం- పు. 20❋ 9. సంజయ కథనం-పు.20❋ 10. కావ్యేతిహాస లక్షణం- పు.20❋ 11. స్మృతి కావ్యరేఖ- పు.20❋ 12. భీష్ముడి నోట గండం- పు.21❋ 13.సంగ్రామాలు: సంభాషణలు- పు.21❋ 14. మాట్లాడే పాత్రలు: పోట్లాడే పాత్రలు- పు. 22❋ 15. పాత్రల ప్రవృత్తులను బట్టి మాటలతీరు- పు. 22❋ 16. ధర్మజ దుర్యోధనుల సాధింపుమాటలు-పు. 28❋ 17. దశవిధ వర్ణనలు- పు.28 ❋ 18. సహజ వర్ణనలు-పు.29❋ 19. రసానుగుణ వర్ణనలు- పు.29❋ 20. అలంకృత వర్ణనలు- పు.30❋ 21. వీరపురుష వర్ణనలు-పు.31❋ 22. వ్యూహవర్ణనలు-పు.32❋23. రణరంగ వర్ణనలు-పు.39❋ 24. సన్నివేశ వర్ణనలు-పు.40❋ 25. వీరోక్తుల వర్ణనలు-పు.41❋ 26. అభినయ వర్ణనలు-పు.42❋ 27. ప్రకృతి వర్ణనలు-పు.43❋ 28. తెలుగు భారతంలో పరచుకొని ఉన్న భగవద్గీత-పు.44❋ 29. స్తోత్రాలు తిక్కన తెలుగు చేయలేదు-పు.47❋ 30. కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం - పు.47❋ 31. భీష్మపర్వ కథాసారం - 47.

ఉ. ‘ ప్రాంశుఁ, బయోద నీలతనుభాసితు, నుజ్జ్వలదండధారుఁ, బిం
గాంశుజటాచ్ఛటా భరణు, నాగమపుంజ పదార్థతత్త్వ ని
స్సంశయకారుఁ, గృష్ణమృగచర్మ కృతాంబరకృత్యు, భారతీ
వంశవివర్ధనుం, ద్రిదశవందితు సాత్యవతేయుఁ గొల్చెదన్.’ **(భీష్మ. 1. 71)**

1. భీష్మపర్వం వీరరస మహాసాగరం

మహాభారతంలో ఆదిపంచకం అయిపోయిన తరువాత యుద్ధషట్కం ప్రారంభమౌతుంది. అందులో మొదటిది భీష్మపర్వం. భారతపర్వ నామాలను గమనిస్తే యుద్ధ షట్కానికి ఒక ప్రత్యేకత గోచరిస్తుంది. ఆ ఆరూ కౌరవుల పక్షాన ప్రవర్తిల్లే వస్తువుకు ప్రాతినిధ్యం వహించేపేర్లు కలవి. మిగిలినవి పాండవ వృత్తానికి ప్రాధాన్యం కల్పించేవి. భీష్మాదులు కౌరవసేనాపతులు. వారు క్రమంగా పడిపోవటం భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక పర్వాలలోని వస్తువు. స్త్రీపర్వం కౌరవ వనితల రోదనకు సంబంధించింది. ఎంతటి బలపరాక్రమ సమన్వితులైనా అధర్మ పక్షవర్తులైన భీష్మాదులు నేలకొరగటం యుద్ధషట్క విశేషం. ఈ యుద్ధ షట్కం పాండవ విజయాన్ని ధ్వనింపజేస్తుంది.

“యత్ర యోగేశ్వరః కృష్ణో । యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీ ర్విజయో భూతి । ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ॥” **(భ.గీ. 18.78)**

తిక్కన అనువాదం -

తే. ‘ అధిప! యోగేశ్వరేశ్వరుండైన కృష్ణుఁ । డును ధనుర్ధరవర్యుఁ డర్జునుఁడు నెచట
నిలిచి రచ్చట విజయంబు నీతి సిరియు । భూతి నిత్యంబు లగు; నిది నా తలంపు’ **(భీష్మ. 1. 230)**

అనే సత్యాన్ని గమ్యమానం చేస్తుంది.

కురుపితామహుడైన భీష్ముడు తండ్రివలన అవధ్యత్వం, స్వచ్ఛందమరణం అనే వరాలను పొందాడు. అందువలన తనంతట తాను మరణించటానికి సంకల్పించుకొని సిద్ధపడితే తప్ప యుద్ధవిముఖుడు కాడు. స్వీయప్రాణాలను త్యజించలేడు. సురాసురులు

కూడా నిర్జించలేని మహాపరాక్రమశాలి. పరశురాముడిని ఓడించిన పరమవీరుడు. అతడికి కృష్ణార్జునులు తప్ప లోకంలో మరెవ్వరూ ఎదురు నిలబడలేరు.

అట్టి మహావీరుడు శిఖండి చేతిలో చనిపోయాడని కథ చెప్పుతున్నది. ఈ కథ వింటే - మొదటిసారిగా విన్న ధృతరాష్ట్రుడివలెనే మనకు కూడ ఆశ్చర్యం అంకురిస్తుంది, ఉత్కంఠ ఉన్మీలిస్తుంది.

ఉ. ‘ వీరరసాంబుపూరమును, విశ్రుత బాహు మహోగ్రసత్త్వముం,
జారు గదాధ్వజాచలవిశాలము, నంబకజాల వీచికా
స్ఫారము నైన భీష్ముఁ డను సాగరముం గడవంగ నీఁదఁ గా
నేరిమి యెట్లొకో కలుగనేర్చె శిఖండికి? నేమి సేయుదున్’. **(భీష్మ. 1. 54)**

భీష్ముడు వీరరసమహాసాగరం. దానిని ఈదటం అసాధ్యం. కాని, పార్థుడు ఈదాడు. శిఖండి అనే నావను ఆధారంగా చేసికొని, ధర్మజుడు తెరచాప ఎత్తాడు. శ్రీకృష్ణుడు అనుకూల పవనాలను అనువుగా ప్రసరింపజేశాడు. ధృష్టద్యుమ్నాదులు తెడ్లు వేశారు. భీముడు ఒడ్డుకు లాగాడు. అదొక పెద్ద సముద్రమంత కథ. అడుగడుగునా ఉత్కంఠతో సాగే యుద్ధోద్యోగం. అందుకే ‘భీష్మపర్వము పంబి వినం బొలుచు’ (ఆది. 1. 46) నని నన్నయభట్టు ప్రశంసించాడు.

2. భగవద్గీత భారతాత్మ

యుద్ధషట్కంలో ప్రథమపర్వంగానే కాకుండా మహాభారతంలోనే అత్యుత్తమ పర్వంగా భీష్మపర్వం పరిగణించబడుతుంది కొందరిచేత. అందుకు కారణం దీనిలో భగవద్గీత ఉండటమే. భారతానికి భగవద్గీత ఆత్మవంటిది. భగవంతుడే ఇట్లా అన్నాడని సంప్రదాయం.

“గీతా మే హృదయం పార్థ! । గీతా మే సార ముత్తమమ్।
గీతా మే జ్ఞానమత్యగ్ర్యం । గీతా మే జ్ఞాన మవ్యయమ్.
గీతా మే చోత్తమం స్థానం । గీతా మే పరమం పదమ్।
గీతా మే పరమం గుహ్యం । గీతా మే పరమో గురుః. ”

ఇంతటి గొప్పది గీత. అంతేకాక ‘ఏకం శాస్త్రం దేవకీపుత్ర గీతమ్’ ‘గీతా కల్పతరుం వందే’ అనీ, పంచమవేదమనీ, అనంతగీత అనీ, వేదోపనిషత్సార భూతమనీ ప్రశస్తి పొందింది. చతుర్వేద సారరూపమైన గ్రంథం పంచమవేదం. మహాభారతానికే పంచమవేద మనే ప్రసిద్ధి ఉండగా ఆ గ్రంథ భాగమైన భగవద్గీతకు కూడా అంతటి ప్రఖ్యాతి ఉండటం గమనార్హం. భగవద్గీత వలననే భారతానికి పంచమవేద గౌరవం వచ్చిందనే వాదం లేకపోలేదు. ఏమైనా భగవద్గీత భారతకథలోని తత్త్వ భూమిక. భారతం గీతాతత్త్వానికి వ్యాఖ్యాతుల్యం. అందువలన భారతానికీ గీతకూ దేహదేహి సంబంధం సంభావ్యం. మహాభారత ప్రబంధ ధ్వని వలన వాసుదేవతత్త్వం ప్రతీయమాన మౌతుంది. అందువలననే మహాభారతం కార్ష్ణవేదమని కీర్తికెక్కింది. ఆ కీర్తిపతాక భగవద్గీత.

భారతీయ వేదాంత సారమంతా భగవద్గీతగా నిబంధించబడటంచేత వ్యాసమహర్షియే సాక్షాన్నారాయణ గౌరవాన్ని పొందాడు. మానవుడి భౌతికజీవితాన్ని నియంత్రించేది ఆధ్యాత్మిక ప్రవృత్తి. అది న్యాయదేవత చేతిలో వ్రేలాడుతుండే త్రాసువంటిది. మానవ జీవితంలోని ఆధ్యాత్మిక తులాదండానికి అక్షరాకృతి భగవద్గీత. త్రాసులో మూడు అంశాలు ఉంటాయి. ఎడమవైపు తక్కెడ, కుడివైపు తక్కెడ. బరువును కొలిచే సూచిక అయిన నడిమిముల్లు. భగవద్గీత ఒక త్రాసైతే అందులో ఎడమ తక్కెడ 2 వ అధ్యాయంలోని 7వ శ్లోకం. తులాభారాన్ని సూచించే నడిమి ముల్లు 9వ అధ్యాయంలోని 22వ శ్లోకం. త్రాసులోని కుడి తక్కెడ 18వ అధ్యాయంలోని 56వ శ్లోకం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'కార్పణ్య దోషోపహత స్వభావః। పృచ్ఛామి త్వాం ధర్మ సమ్మూఢ చేతాః।
యచ్ఛ్రేయ స్స్యా న్నిశ్చితం బ్రూహి త న్మే। శిష్యస్తేzహం శాధి మాం త్వాం ప్రపన్నమ్॥ **(భ.గీ. 2. 7)**

(తిక్కన తెలుగు సేత)

వ. '....నేను గార్పణ్య దోషోపహత స్వభావుండను, ధర్మసమ్మూఢ చేతస్కుండను నై, నిన్ను శరణు సొచ్చి
యడిగెద; నీ శిష్యుండ నగు నన్ను శాసింపుము...' **(భీష్మ. 1. 194)**

కృపణత్వం అంటే ఆత్మజ్ఞానరాహిత్యం, గురువులూ, బంధువులూ అనే మమకారం. దీనివలన మనోదౌర్బల్యం అనే దోషం ఏర్పడుతుంది. దానివలన బుద్ధి నశిస్తుంది. ఆ పైన ధర్మవిషయంలో సందేహం కలుగుతుంది. అప్పుడు మనిషి మంచేదో, చెడేదో తెలిసికొనలేడు. అట్టి దైన్యస్థితిలో మానవుడు దేవుడిని శరణు వేడుతాడు. శిష్యుడై శ్రేయోమార్గాన్ని చెప్పమని వేడుకొంటాడు. అట్టి స్థితిలో ఉన్న నరుడి చిత్తవృత్తి అధ్యాత్మ సాధన తులాదండంలో ఒక వైపున్న తక్కెడ. దోషభారం చేత నరుడి మనసు విషాదమగ్నమై పోయింది. నిరాశా నిస్పృహలతో క్రిందికి క్రుంగిపోయింది. ఆ భారాన్నుండి మనసును తేలికపరిచే మరొక మానసికావస్థ - ఈ క్రింది శ్లోకంలో సూచించబడింది.

"సర్వధర్మా న్పరిత్యజ్య। మామేకం శరణం వ్రజ।
అహం త్వా సర్వపాపేభ్యో। మోక్షయిష్యామి మా శుచః." **(భ.గీ.. 18. 66)**

తిక్కన అనువాదం -

తే. 'క్రందుకొను సర్వధర్మ వికల్పములను। నెడల విడిచి దృఢంబుగ నే నొకండ
శరణముగ నాశ్రయింపుము; సకల దురిత। ములకుఁ దొలఁగింతు నిన్నుఁ బ్రమోద మొంద.'
(భీష్మ. 1. 224)

'సర్వధర్మాలను వదలిపెట్టి నన్నొక్కడిని మాత్రమే శరణుపొందుము. నేను సమస్త పాపాలనుండి దోషాలనుండి నిన్ను విముక్తుడిగా చేస్తాను. విచారించకు' మనే భగవంతుడి అభయముద్ర లభించిన స్థితి ముక్తావస్థ. ఆ స్థితిని పొందటానికి తగిన మానసిక సమస్థితి - తులాదండ సమసూచి అయిన ముల్లు - ఈ క్రింది శ్లోకం.

'అనన్యా శ్చింతయంతో మాం। యే జనాః పర్యుపాసతే।
తేషాం నిత్యాభియుక్తానాం। యోగక్షేమం వహామ్యహమ్.' **(భ.గీ.. 9. 22)**

(దీనిని తిక్కన తెలుగు చేయలేదు)

భగవద్గీత మొత్తం చదివినా, ఈ శ్లోక తాత్పర్యం ఒక్కటి మనసులో నిలిస్తే గీతాఫలం చేకూరినట్లే. అనన్య చింతతో భగవంతుడిని చింతిస్తూ ఎడతెగకుండా ధ్యానిస్తూ ఎవరుంటారో వారి యోగక్షేమాలను భగవంతుడు వహిస్తూ ఉంటాడు.

మహాభారత కురుక్షేత్ర యుద్ధరంగంలో ఎడమవైపు మోహావృతమైన కౌరవసైన్యం. కుడివైపు శ్రీకృష్ణుడిని శరణువేడిన పాండవసైన్యం. భగవానుడైన పార్థసారథి ఆ త్రాసుకు మధ్యవర్తి అయిన ధర్మసూచి. పాండవుల యోగక్షేమం వహించిన వాసుదేవుడు గీతద్వారా తత్త్వాన్నీ, భారతకథా తత్త్వాన్నీ వ్యాఖ్యానించి చెప్పాడు. అందుకే భగవద్గీత భారతాత్మ!

ఆధ్యాత్మికంగా అనుశీలిస్తే మహాభారతం అంతఃకరణ ప్రవృత్తుల అంతస్సంఘర్షణ స్వరూపమే. కౌరవులు ఆసురీ ప్రవృత్తులు, పాండవులు దైవీ ప్రవృత్తులు. దైవీప్రవృత్తుల యోగక్షేమం చూచే పరమాత్ముడు శ్రీకృష్ణుడు. మహాభారతేతిహాసం కార్పణ్య

దోషోపహతులైన మానవులను భగవంతుడు ఉద్ధరించే దివ్యప్రస్థానమే. ఉదాహరణకు గీతలోని ప్రతివాక్యాన్నీ భారతపరంగా వ్యాఖ్యానించ వచ్చును. మచ్చునకొక ఉదాహరణం.

"ధ్యాయతో విషయాన్ పుంసః । సంగ స్తే షూపజాయతే।
సంగాత్ సంజాయతే కామః । కామాత్ క్రోధోz భిజాయతే ॥
క్రోధా ద్భవతి సమ్మోహః । సమ్మోహాత్ స్మృతివిభ్రమః
స్మృతి భ్రంశా ద్బుద్ధి నాశః । బుద్ధి నాశాత్ ప్రణశ్యతి." **(భ.గీ.. 2. 62, 63)**

ఎప్పుడూ శబ్దాది విషయాలను గురించి ఆలోచించేవారికి వాటిమీద ఆసక్తి బాగా పెరుగుతుంది. ఆసక్తి వలన కోరికలు పుట్టుతాయి. కోరికలు కోపం కలుగజేస్తాయి, కోపం మూలంగా అవివేకం కలుగుతుంది. ఆ అవివేకం వలన మరపు, మరపువలన బుద్ధి నశించటం, బుద్ధినాశం వలన తానే నశించటం జరుగుతుంది - అని గీతాకారుడి ప్రవచనం.

గీతాకారుడి సూక్తి దుర్యోధనుడిపట్ల స్పష్టంగా అన్వయిస్తుంది. దుర్యోధనుడు మూర్తికట్టిన క్రోధం. ఆ క్రోధానికి కారణం పాండవుల రాజ్యంమీద ఉన్న తీవ్రమైన కాంక్ష. పాండవులను చంపిగాని, అన్యాయంగా వారిని మోసగించి కాని రాజ్యసంపదను కాజేయాలన్న దురాశ అతడి క్రోధానికి బీజం. ఆ క్రోధం అనేక కార్యాలను అతడిచేత చేయించింది. అతడి కోపం అతడిలోని వివేకాన్నీ, జ్ఞానాన్నీ మట్టుపెట్టింది. సదసద్ జ్ఞానాన్ని కోల్పోయి బుద్ధిహీనుడయ్యాడు. చివరకు పాండవులతో పోరి తననూ తనవారినీ నాశనం చేసికొన్నాడు. ఇట్టి దీనస్థితి పార్థుడికి రాకుండా, పాండవులకు ఏర్పడకుండా శ్రీకృష్ణుడు గీతాబోధ చేసి రక్షించాడు. రోషమయ మహాతరువైన దుర్యోధనుడికి మూర్తి కట్టిన మోహమైన ధృతరాష్ట్రుడు మూలం. ధర్మతరువైన ధర్మరాజుకు పరమాత్ముడైన శ్రీకృష్ణుడు మూలం.

తన జీవన ప్రస్థానానికి ధృతరాష్ట్రుడిని మూలంగా ఎన్నుకొనాలా? శ్రీకృష్ణుడిని మూలంగా నిలుపుకొనాలా? అన్నదే మానవుడి జీవిత పరమార్థ సమస్య. దానికి తగినమార్గం చూపించే జ్ఞానజ్యోతి గీత; దాని వెలుగు మహాభారతం.

3. భీష్ముడు: అమృతత్వ సాధన

భీష్ముడి పేరును అధికరించి నామకరణం చేయబడిన భీష్మపర్వం మహావీరనాయక మైన కావ్యంగా గోచరిస్తుంది. కౌరవ మహాసేనాధ్యక్షుడుగా అభిషిక్తుడైన భీష్ముడు అంపశయ్యమీద పరుండి అసువులను విడవటానికి ఉత్తరాయణ పుణ్యకాలం వరకు విరక్తుడై విశ్రమించిన ఊర్జితకథ ఇందులోని ఇతివృత్తం. అయితే, భీష్ముడి కథ ఆదిపర్వం నుండే ఆరంభమయింది. శాంతిపర్వం దాకా సాగుతుంది. భీష్మపర్వం ఒక విశ్రాంతిస్థానం. భీష్ముడిలోని ఇచ్ఛాశక్తి భీష్మపర్వం దాకా కథను నడిపింది, క్రియాశక్తి భీష్మపర్వంలో తన విభూతిని ప్రదర్శించింది, జ్ఞానశక్తి శాంతిపర్వంలో ప్రకాశించింది. శక్తిత్రయ ప్రవర్తనలో శక్తిమంతుడు భీష్ముడు.

భీష్ముడికి కురుకుల పితామహుడనీ, కురుకుల గురువనీ ప్రసిద్ధి ఉన్నది. భారతేతిహాసంలో నాయక ప్రతినాయకులైన పాండవ కౌరవులకు ఆయన తాత. అందువలన ఆయన లౌకికంగా పితామహుడయ్యాడు. అతడు కురువంశంలో విశిష్టమైన త్యాగవీరానికి బ్రహ్మకల్పుడు. అందువలన ధర్మపరంగా భీష్ముడు పితామహుడు, ద్రష్ట, స్రష్ట. అతడి జీవితమే అతడి సందేశం. చతుర్విధ పురుషార్థ లక్షితమైన ఉత్తమజీవితంలో బ్రహ్మచర్యాశ్రమ మూలమైన త్యాగప్రవృత్తి ఎట్లా ధర్మబద్ధమైన జీవితాన్ని సార్థకంగా సాధించగలుగుతుందో లోకానికి ప్రదర్శించి చూపిన ప్రజ్ఞానిధి భీష్మాచార్యుడు. కురువంశ మహాసాగరంలో అమృతం కొరకు మథనం సాగింది. అందులో కవ్వంవలె నిలిచిన మందర మహాపర్వతం భీష్ముడు. దైవీప్రవృత్తులైన పాండవు లొకవైపు, ఆసురీ ప్రవృత్తులైన కౌరవులు మరొకవైపూ రాజ్యధర్మ మనే శేషుడిని కవ్వపు త్రాడుగా చేసికొని సముద్రమథనం చేశారు. అందులో మాయాద్యూతం వలన ఒకసారీ, మహాయుద్ధం వలన మరొకసారీ హాలాహలం ఉద్భవించింది. ఈ రెండు దశలలోనూ సాక్షీభూతుడుగా

నిలిచిన అచలమూర్తి భీష్ముడు. అయితే సముద్ర మథనం నుండి పుట్టిన మహాపదార్థాలను సవ్యమైన వ్యక్తుల కందే ప్రయత్నంలో తన పాత్రను స్థిరభావంతో నిర్వహించిన స్థితప్రజ్ఞుడు భీష్ముడు. హాలాహలాన్ని మహాశివుడుగా ధర్మరాజు మ్రింగాడు. ఆవిర్భవించిన అమృతాన్ని ఆసురీప్రవృత్తుల కందకుండా దైవీప్రవృత్తులకు అందజేసిన అద్భుతమూర్తి అరవిందాక్షుడైన శ్రీకృష్ణుడు. ఈ తత్త్వాన్ని తెలిసికొనటానికి మూడు మెట్ల నిచ్చెనగా తోడ్పడేది భీష్మచరిత్రం.

ఆంధ్రమహాభారతం అందించే సందేశం అమృతత్వసాధనమని తెలిసికొన్నాం(చూడండి: ఆదిపర్వ పీఠిక). అమృతత్వ సాధనలో ఒక అపూర్వ మార్గాన్ని ఆవిష్కరించిన విశిష్టవ్యక్తి భీష్ముడు.

"న కర్మణా, న ప్రజయా, ధనేన
త్యాగే నైకే అమృతత్వ మానశుః"

అన్న వేదవాక్యానికి వ్యాఖ్యాన ప్రాయమైన జీవితాన్ని గడపిన సార్థకపురుషుడు భీష్ముడు.

"కర్మణ్యేవాధికార స్తే, మా ఫలేషు కదాచన" **(భ. గీ. 2.47)**

అని భగవద్గీత. భీష్ముడు బ్రతుకంతా విధ్యుక్త కర్మాచరణాన్ని నిరంతరాయంగా ఆచరించాడు. కాని, దానివలన ఫలాన్ని ఎన్నడూ కోరలేదు. అందువలన అతడి జీవితం ఒక కర్మవీరమార్గమై సాగింది. అయినా, ఆయన వంశరక్షణ కొరకు, ధర్మపోషణ కొరకు చేసిన మహాకార్యాలన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. భీష్ము డంపశయ్య మీద పరుండి అటు అర్జునుడికీ, ఇటు దుర్యోధనుడికీ చెప్పిన ఈ క్రింది మాటలు భీష్మడి మరణ వాఙ్మాలాల వలె ఉన్నాయి. విధ్యుక్త ధర్మకర్మలను గురించి మనుమళ్ళకు ఆయన చేసిన ప్రబోధాలు ఎట్లా ఫలించక పోయాయో దిఙ్మాత్రంగా సూచిస్తున్నాయి.

1. అర్జునుడితో పలికిన మాటలు:

ఉ. 'నారదుచేత నిన్ను మునినాథునిఁ గాఁగ నెఱింగి యుండుదున్;
శౌరియు నీవుఁ గూడిన నసాధ్యము లెవ్వియు లేవు; దర్పదు
ర్వారుఁడ వైన నీ వలని వైరము గీడని చెప్పఁజెప్ప నీ
కౌరవరాజు మానఁడు; దెగం జెడుఁ గా కిటమీఁద భీముచేన్'. **(భీష్మ. 3. 434)**

2. దుర్యోధనుడికి చెప్పిన హితోక్తులు:

మ. ' నరుఁ డత్యద్భుత విక్రముం, డతని కా నారాయణుం డాప్తుఁ; డె
వ్వరికిన్ వీరి జయింపరాదు; సమరావష్టంభముం దక్కి ధ
ర్మరతుం డైన యజాతశత్రునకు నింద్రప్రస్థమి; మ్మర్థరా
జ్యరమం బొందుము; మీరు గొందఱయినన్ జాకున్న నీ కొప్పదే?' **(భీష్మ. 3. 436)**

పార్థ శ్రీకృష్ణులు నరనారాయణులని తెలిసికూడ వారి నాశ్రయించలేక హస్తినాపుర సింహాసన రక్షలోనే జీవితాన్ని గడిపి యుద్ధానికి దిగాడు భీష్ముడు. నరనారాయణులను ఆశ్రయించుమని దుర్యోధనుడిని ఒప్పించలేక వరుగుతోపాటు చేట ఎండినట్లు మహాభారతయుద్ధంలో కౌరవులతోపాటు తాను కూడ తనువు వాల్చాడు. అతడు సాధించిన దానికంటె సాధించనిదే మిన్నగా మిగిలిపోయింది. తండ్రికి, తల్లులకు, తల్లులకొరకు ఇచ్చిన మాటలతో జీవితాన్ని కర్మబంధాలతో బందీ చేసికొన్నాడు భీష్ముడు. అందువల్ల ఆయనకు కర్మలవలన మరణమే లభించింది కాని, అమృతత్వం సిద్ధించలేదు.

సంతానం చేత అమృతత్వం సిద్ధించదనే సూక్తికి భీష్ముడి చరిత్ర ఉదాహరణం. హస్తినాపుర సింహాసనాన్ని పాలించిన మహారాజులలో భీష్ముడివలె పెండ్లి పెటాకులు లేకుండ, సంతానావకాశం లేకుండ నిలిచిన వారు ఎవ్వరూ లేరు. సత్యవతిని తండ్రి కిచ్చి వివాహం చేయటం కొరకు పిల్లలు పుట్టకుండా ఉండే బ్రహ్మచర్యాన్ని జీవితాంతం చేపట్టాడు. పిల్లలు లేరని గాని, పున్నామనరకం కలుగుతుందని గాని ఆయన చింతపడలేదు. బహుశః ధృతరాష్ట్ర సంతానాన్ని చూచిన తరువాత సంతానం వలన అమృతత్వం లభించదనే నిశ్చయానికి వచ్చి ఉండి ఉంటాడు.

సంపద వలన అమృతత్వం లభించదన్న సత్యాన్ని తెలిపి, రాజ్యసంపదను త్యజించి, కన్నతండ్రి కరుణను వరాలుగా పొందాడు. అవి - అవధ్యత్వం, ఇచ్ఛామరణం. ఈ రెండూ అమృతత్వ సిద్ధికి లౌకిక ఫలాలు. త్యాగం వలన కలిగిన తరగని సంపదలు. చంపబడటం లేని వాడికి మరణం ఉండకూడదు. మరణం లేకపోవటం మాత్రమే అమృతత్వం కాదు. మరణభీతిని జయించటం అమృతత్వం. భీష్ముడు దానిని సాధించాడని పూర్తిగా చెప్పలేము కాని, మరణిద్దామనే సంకల్పం అతడికి కలిగేంత వరకు ఆయనకు మరణభీతి లేదు. అంపశయ్యమీద పరున్న భీష్ముడు మృతుడు కాడు. దేహభ్రాంతిని త్యజించి అమృతత్వ సిద్ధి పొందినవాడు. ఉత్తరాయణ పుణ్యకాలం వరకు దేహంలో ప్రాణాలను బిగబట్టి, ధర్మరాజుకు మహాధర్మ విశేషాలను విపులంగా చెప్పి ఆత్మవివేకంతో ప్రాణాలను వదలిన భీష్ముడు మృతిని జయించిన రాజయోగి.

భారతంలో అమృతత్వం సాధించింది ఇద్దరే. 1. భీష్ముడు, 2. ధర్మరాజు. ఇద్దరూ త్యాగమూర్తులే. ఒకరు బ్రహ్మచారిగా సంసారంలో నివసిస్తూ వీరవ్రతం సాగించి ఫలాన్ని త్యజించి అమృతు డయ్యాడు. మరొకడు సంసారిగా సంసారంలో నివసిస్తూ భోగవాంఛను త్యజించి శమాన్ని సాధించి నిస్సంగ ప్రవృత్తితో జీవించి రాజర్షిగా మారి స్వర్గాన్ని సైతం ధర్మంకొరకు త్యాగం చేసి, బొందితో స్వర్గాన్ని పొంది అమృతత్వానికి అమరత్వ సిద్ధితో సజీవ వ్యాఖ్యానం చెప్పినవాడు ధర్మరాజు. తాత భుజాలమీద కెక్కి కూర్చున్న ధర్మరాజు అతడికంటె అంతెత్తుగా కనపడతాడు. అమృతత్వానికి తాత మనుమళ్ళు బొమ్మ బొరుసులు!

4. భీష్ముడు సమగ్ర యుద్ధరసవీరుడు

భారత వీరులలో భీష్ముడు సమగ్రయుద్ధ వీరరసమూర్తి. అతడిలో గోచరించే ప్రవృత్తులన్నీ యుద్ధవీరాన్ని పోషించి దానికి సమగ్ర స్ఫూర్తిని సాధించిపెట్టాయి. భీష్మోదంతం - ప్రత్యేకించి భీష్మపర్వేతివృత్తం దానికి చక్కని ఉదాహరణం.

బ్రహ్మచేత వీరం మూడు విధాలుగా విభజించబడిందని భరతమహర్షి పేర్కొన్నాడు.

‘ దానవీరం, దయావీరం । యుద్ధ వీరం తథైవ చ
రసం వీర మపి ప్రాహ । బ్రహ్మ త్రివిధ మేవ చ’ **(నాట్య. శా. 4. 80)**

ధనంజయాదులు కూడా వీరాన్ని మూడు రకాలుగా పేర్కొన్నారు. ‘స చ దయా రణ దాన యోగా త్రిథా’ అని దశరూపకం. కాని, భరతుడు చెప్పిన దాన ధర్మయుద్ధ వీరాలకు బదులు దయాదాన యుద్ధాలను (ధర్మవీరాన్ని వదలి) పేర్కొన్నారు. విద్యానాథాదులు ధర్మవీరాన్ని కలిపి, దాన ధర్మ దయా యుద్ధాలని వీరాన్ని నాలుగు విధాలుగా నిర్ణయించారు. అంతటితో ఆగక రసగంగాధర కారుడు వీరాన్ని ఎనిమిది విధాలుగా వింగడించాడు. అవి: యుద్ధవీరం, దానవీరం, దయావీరం, ధర్మవీరం, సత్యవీరం, పాండిత్యవీరం, క్షమావీరం, బలవీరం అనేవి. అష్టవసువులలో ఆఖరివాడైన ప్రభాసుడి అవతారంగా పుట్టిన భీష్ముడు ఆ ఎనిమిదిమంది యొక్క వీరలక్షణాలను సంపుటీకరించుకొని సార్థకవీర జీవితం సాగించినట్లుగా అష్టవిధ వీర ప్రవృత్తులను ప్రకృష్టంగా ప్రదర్శించి యుద్ధవీరంలో పరమేశ్వరుడివలె అష్టమూర్తిగా ఆదర్శప్రాయుడైనాడు భీష్ముడు.

లాక్షణికులలో కొందరు వీరమంటే యుద్ధవీరమనే భావించినట్లు వారి లక్ష్య లక్షణాల వలన స్పష్టమౌతున్నది. వీరరస భేదాలలో యుద్ధవీరానికి ఒక ప్రత్యేకత ఉన్నది. వీరరస భేదాలన్నీ యుద్ధవీరమనే కుదురునుండి పుట్టాయనీ, యుద్ధోత్సాహ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మూలంగాని వీరరస భేదాలకు ఔజ్జ్వల్యం ఉండదనీ కొందరి అభిప్రాయం. శారదాతనయాదులు చేసిన వీరరస భావన ఈ తాత్పర్యాన్ని వ్యక్తం చేస్తుంది. 'విరుద్ధాన్ రాతి హంతీతి వీరశబ్దస్య నిర్వహః। వివిధం చ విచిత్రం చ లాతిజనాతికృంతతి। ఏవంవా వీరశబ్దార్థః కథితః పూర్వసూరిభిః । ప్రేరయత్యత్ర విద్విష్టా నితి వీరో నిరుచ్యతే' (భావప్రకాశమ్. 2 అధికరణం) భీష్ముడు పుట్టింది మొదలు అంపశయ్యకు చేరేంత వరకూ శత్రు నికృంతన రూపమైన ఉత్సాహాన్ని ప్రదర్శించి మహాయుద్ధ వీరుడుగా ప్రశస్తిగాంచాడు. ఆయన తరంలో ఆయనను మించిన యోద్ధ లేడు. అతడు భీష్మంగా ప్రతిజ్ఞలు చేయగలడు, భీష్మంగా యుద్ధాలు చేయగలడు, భీష్మంగా శత్రువులను హింసించగలడు, చివరకు భీష్మంగా ప్రతాపాన్ని ప్రదర్శించగలడు. ఆయన చేసిన వీరకార్యాలే ఆయనకు పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెట్టాయి. ఆయన రాజ్యాన్నీ, వివాహాన్నీ త్యాగం చేయటంలో కూడా భీష్మత్వం కనపడుతుంది. కాశీరాజు కూతుళ్ళను బలప్రయోగంతో తెచ్చి తమ్ముడికి వివాహం చేసే యత్నంలోనూ, అంబతో, ఆ మాటకు వస్తే పరశురాముడితో కూడా ప్రతిజ్ఞాబద్ధమైన ధర్మరక్షణం కొరకు ధర్మయుద్ధాన్ని భీష్మంగా చేశాడు. క్షత్రియధర్మాన్ని అనుసరించి మహాభారత యుద్ధంలో పదిరోజులపాటు పగరను పరిపరివిధాల భీష్మంగా సంహరించాడు. అంతే భీష్మంగా దానదయాగుణాలతో ప్రాణత్యాగ రహస్యాన్ని ధర్మరాజుకు చెప్పగలడు. అతడిది ప్రధానంగా యుద్ధవీరం, దానికి పోషకంగానూ, దానిలోనుండి పుట్టి పెరిగిన ప్రవృత్తులవలెనూ దాన, దయా, ధర్మ, సత్యవీరాలూ, శాంతిపర్వంలో పాండిత్యవీరమూ ప్రత్యక్షం అవుతాయి. అందువలన భీష్ముడు యుద్ధవీర విశ్వరూపుడు - అనటంలో అనుమానం లేదు.

వీరరస వీరుడి జీవితంలో యుద్ధం ధర్మబద్ధంగా ప్రయుక్తం కావాలి. లేదా, యుద్ధం ధర్మసాధన కుపయోగించాలి. అంటే- కీర్త్యాదులను గాని, ప్రజారక్షణాన్ని గాని లక్షించి వీరుడు శత్రువులతో పోరాడినా, అది యుద్ధ ధర్మ విరుద్ధంగానూ, న్యాయవిరుద్ధంగానూ ఉండరాదనటం మొదటిది. క్షత్రియులకు యుద్ధం కులధర్మం కావటం రెండవది.

> "స్వధర్మ మపి చావేక్ష్య న వికంపితు మర్హసి ।
> ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే" । **(భ. గీ. 3.31)**

అనే గీతావాక్యాన్ని అనుసరించి క్షత్రియులకు యుద్ధం ఒక విధమైన ధర్మసాధనరూపమైన కర్మ ఔతున్నది. మొత్తంమీద ధర్మవిరహితమైన యుద్ధం వీరరస మని పిలవబడదు. భీష్ముడు యుద్ధవీరుడే అయినా అధర్మయుద్ధాన్ని ఆశ్రయించనివాడు.

5. విషాద గంభీర యుద్ధవీరుడు

అయితే, భీష్ముడి జీవితం స్వీయప్రయోజనం కంటె పరప్రయోజనం కొరకే ఎక్కువగా అంకితమైనట్లు స్పష్టమౌతుంది. ఆయన చేసిన యుద్ధాలవలన ఆయనకు స్వయంగా లాభించినది తక్కువ. 'పరోపకారార్థ మిదం శరీరం' అన్నట్లు సాగింది ఆయన జీవితయాత్ర. చేసిన ప్రతిజ్ఞలు ఆయనవే అయినా వాటి ఫలితాలు ఆయనవి కావు.

ధనుర్విద్య నేర్చిన బాలభీష్ముడు గంగానదికి బాణాలతో వారధికట్టి తండ్రిని ఆశ్చర్యంలో ముంచెత్తాడు. స్వీయజీవిత గంగా ప్రవాహానికి తన వీరవ్రతాన్నే వారధిగా చేసికొన్నాడు. యువరాజుగా అనేక విజయాలు సాధించి తండ్రికి సామ్రాజ్యాన్ని విస్తరించి పెట్టాడు. శత్రుభయంకరుడుగా ప్రశస్తి గాంచాడు. అఖిల భారతంలో మేటివీరు డనిపించుకొన్నాడు. అయినా, ఆయన పరాక్రమం ఆయనకు వ్యక్తిగతంగా మహారాజు కావటానికి గాని, రాజ్యాన్ని పాలించటానికి గాని ఉపయోగపడ లేదు. స్వార్థ త్యాగరూపమైన అతడి ఉదాత్త స్వభావం ఆయన జీవితాన్ని ఉజ్జ్వలం చేసింది. కాని, అతడి ఊర్జితమైన జీవితాన్ని పరులకు ఉపాంగంగా మార్చింది. అందువలన భీష్ముడు విషాదగంభీర యుద్ధవీరుడై తన జీవితాన్ని పరోక్షంగా పరధర్మానికి ఉపకరణంగా మార్చుకొని ఉపజీవించవలసి వచ్చింది. దానికి దైవికమైన కారణం ఉన్నది. ఆయన వసువులలో చివరివాడు. శప్తుడు. మిగిలిన వసువులకోర్కెమీద భూలోకంలో దీర్ఘకాలం ఉండిపోయినాడు. సంసారబంధం లేకుండా, సంతానబాధలు లేకుండ సుదీర్ఘజీవితం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక ప్రయోజనం కొరకు సాగించి మరల దేవలోకం చేరే నిర్ణీత ప్రణాళికతో, గంగాదేవి అనుగ్రహంతో శంతనుడి పుత్రుడుగా పుట్టాడు. అంటే - ఆయన జాతకం ఆయన విధి సంకల్ప ఫలమే.

శప్తుడైనవాడు సామాన్యంగా శుద్ధప్రవృత్తి కలిగి ఉండడు. మిశ్రప్రవృత్తి కలిగి ఉంటాడు. భీష్ముడు స్వయంగా ఉదాత్తుడైన త్యాగవీరుడు. కాని, ఆయన జీవితం ఉదాత్తులు కాని రాజుల కొరకు ఉంకువపెట్టబడింది. వారిని కాపాడటమే జీవన వ్రతమైపోయింది. వారికొరకు యుద్ధాలు చేశాడు. మాటలు పడ్డాడు. చివరకు శిఖండి రూప మృత్యువును సంపాదించుకొన్నాడు. జీవితమంతా మిశ్రప్రవృత్తితో, అంతస్సంఘర్షణతో, విధిప్రేరితమైన జీవనస్థితితో గడపవలసి వచ్చింది. కలి పేర్కొన్నట్లుగా భీష్ముడు దైవప్రవృత్తి కలిగిన ఉత్తముడైనా, అధర్మ ప్రవర్తకులైన ధృతరాష్ట్ర దుర్యోధనులను సరిదిద్దలేడు. నీతులు చెప్పినా వారిని నీతిమంతులను చేయలేడు. దానితో తాను పెంచిన బిడ్డలే తనను అవజ్ఞ చేస్తున్నారని తెలిసినా ప్రభుత్వం తన చేతిలో లేదు కాబట్టి వారిని శాసించలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు. అట్లని హస్తినాపురాన్ని వదలి వెళ్ళలేకపోయాడు. దుర్యోధనుడి పక్షాన యుద్ధం చేయకుండా ఉండలేకపోయాడు. దానికి కారణం ఎంత శక్తిమంతుడైనా అతడు హస్తినాపుర సింహాసనానికి అంగభూతుడే అంగరక్షకుడే అన్న వాస్తవం. అది అతడి జీవితంలో నిండిన ఎంతటి ధర్మమో అంతటి విషాదరేఖ. దానికి దైవికమైన కారణం అతడిలోని రాక్షసావేశం. కలి చెప్పిన కథనం దానికి సాక్ష్యం. 'భీష్మ ద్రోణ కృపాదులు గొందఱు దేవాంశ సంభవులైనను దదీయ భావంబులు రాక్షసావేశంబు నొందెడు. దానంజేసి వారు నిర్దయులై విమూఢులుం బోలె నన్యోన్య పరుషంబులు పలుకుచు నలుక మిగులం బుత్రపౌత్ర మిత్ర భ్రాతృ శిష్యగురు బాల వృద్ధజన భేదంబులు విచారింపక సమరంబు సేసి దివ్యంబులు మానుషంబులు నైన వివిధాస్త్ర శస్త్రంబులఁ బాండవపక్ష క్షయంబు గావింపంగలవారు' (ఆరణ్య. 6.46) ఈ రాక్షసావేశం భీష్ముడి గంభీర విషాద పాత్రలోని సహజలోపం (ట్రాజిక్ ఫ్లా). దానివలననే అతడికి విషాదాంతం కలిగింది.

భీష్మజీవితంలో ధర్మం గ్రీష్మర్తువువలె అతడికి అనంత తాపాన్ని కలిగించింది. దానికి కారణం అతడిలో అప్పుడప్పు డావేశించే రాక్షసావేశమే. దానివలన అతడిలోని దేవాంశకు మబ్బుక్రమ్ముతుంది. దేవాంశ సంభూతులు ఎవరైనా అతడిలోని దేవాంశను జాగృతం చేస్తే అతడు మరల దేవచైతన్య ప్రకృతిని ప్రదర్శిస్తాడు. భారత కథలోని భీష్మజీవిత ఘట్టాలన్నీ ఇందుకు తార్కాణాలే. భీష్మపర్వం ఆయన జీవితంలో సాగిన చరమ యుద్ధవీర ఘట్టాన్ని విస్తృతంగా ఆవిష్కరించిన వీరగాథ.

కురుసభలో శ్రీకృష్ణుడి రాయబారం జరిగినప్పుడు శుద్ధధర్మ చైతన్యాన్ని త్రికరణశుద్ధిగా ప్రదర్శించిన దేవాంశ సంభూతుడుగా భీష్ముడు కనపడతాడు. దుర్యోధనుడిని మందలించాడు, కౌరవులకు న్యాయాన్ని బోధించాడు. ధర్మాలను వివరించాడు. హితవును మిత్రుడివలె చెప్పాడు, కులవృద్ధుడుగా వంశక్షేమాన్ని గురించి ప్రజాక్షేమాన్ని గురించి ప్రబోధించాడు. అయినా అధర్మవర్తనుడై, పాండవులపై యుద్ధాన్ని ప్రకటించిన దుర్యోధనుడినుండి దూరం కాలేకపోయాడు. దుర్యోధనుడు తనను సర్వసైన్యాధ్యక్షుడవు కమ్మని కోరినప్పుడు అధర్మ యుద్ధానికి సారథ్యం వహించలేనని మొగమాటం లేకుండా చెప్పలేకపోయాడు. కర్ణుడి దొక విధమైన సేవాధర్మం. భీష్ముడి దొక బంధుధర్మం. భీష్ముడు ధృతరాష్ట్రుడు పెట్టిన కూడు తిన్నాడు కాబట్టి, అన్నం పెట్టినవాడు అన్యాయం చేయమన్నా చేయకతప్పదన్నట్లు పోషకుడికి దాసుడై యుద్ధం చేయటానికి అంగీకరించాడు. దుర్యోధనుడితో ఆతడన్న మాటలు-

ఆ. 'మీరు పాండుసుతులు నారయ నా కొక్క । రూప; కార్య మున్న రూపు వలుక
వలయుఁ; గయ్యమైన వత్తు; మీలోన నా । యునికి చందమునకు నుచిత మిదియ.

క. సేనాధిపత్యమును దగఁ । బూనెద; నను మార్కొనంగఁ బురుషుల నుర్విం
గానఁ గిరీటికి నొక్కని । కే నోర్వ; నతండు శరము లెక్కు డెఱుంగున్.

క. పెఱవారి నెల్లఁ దరమిడి । నఱకుదుఁ ; బాండుక్షితీశనందనులను రూ
పఱసేయం జేయాడదు; । దఱుమరు నా మీఁద నత్యుదగ్రత వారున్.' **(ఉద్యో. 4. 148 - 150)**

దుర్యోధన పక్షంలో ఉండటం ఉచితమని భావించి, కౌరవసైన్యాధ్యక్షపదవిని చేపట్టాడు భీష్ముడు. అయితే కిరీటితో సమంగా పోరలేననీ, పాండవులను చంపటానికి మనసు రాదనీ పేర్కొన్నాడు. కాగా, ఇక భీష్ముడి చేతిలో చనిపోయే వారెవరు? కౌరవపాండవులు కాక మిగిలిన పాండవపక్షంలోని వీరులు, సైనికులు. వారెవరూ భీష్ముడితో సరిరారు కాబట్టి పోరిలో వారిని నిర్దాక్షిణ్యంగా చంపటం భీష్ముడి యుద్ధ ప్రయోజనం. ఇందులో పాండవులను చంపనని చెప్పటం దేవప్రవృత్తి. కౌరవుల పక్షాన యుద్ధంలో దిగి పాండవసైన్యాన్ని చంపే తీవ్రయత్నం చేయటం రాక్షసావేశం.

6. భీష్ముడిలోని దేవప్రవృత్తి, రాక్షసావేశం

భీష్ముడిలో సహజసిద్ధంగా అమరి ఉన్న దేవరాక్షస ప్రవృత్తులు అప్పుడప్పుడు తమ అస్తిత్వాలను ఒకదానికంటె మరొకటి అధికంగా ప్రదర్శితం చేసికొనటం భీష్మపర్వంలో కానవచ్చే వెలుగునీడలు. ఉభయపక్ష నాయకులలో ధర్మరాజు దైవీప్రవృత్తి కలవాడు గాబట్టి అతడితో కూడినప్పుడు గాని, అతడి ప్రసక్తి వచ్చినప్పుడు గాని భీష్ముడిలో దేవప్రవృత్తి సాత్త్విక చైతన్యంతో ఉదాత్తంగా లేస్తుంది. దుర్యోధనుడు ఆసురీప్రవృత్తి కలవాడు కాబట్టి అతడితో కూడినప్పుడు భీష్ముడిలోని రాక్షసావేశం ఉవ్వెత్తున ఎగిరిపడుతుంది.

భీష్మపర్వంలో ధర్మరాజు భీష్ముడిని దర్శించే రెండు ఘట్టాలూ చరిత్రగతిని మార్చగలిగినంత శక్తిమంతాలైనవి. దైవీప్రవృత్తుల సంయోజనం వలన గలిగే దివ్యవిభూతుల వంటివి.

పాండవులను చంపలేను, అర్జునుడిని జయించలేను, అయినా యుద్ధం చేస్తానని పూనుకొన్న తాతగారి మనఃప్రవృత్తిని ధార్మికంగా, రాజనీతిపరంగా విశ్లేషించగలిగిన వివేకవంతుడు ధర్మరాజు. పాండవులకు అండగా నిలిచినవాడు శ్రీకృష్ణుడు. అతడు సాక్షాన్నారాయణావతారమని తెలిసిన నాటి ఆత్మజ్ఞానులలో భీష్ముడు ఒకడు. రాక్షసప్రవృత్తుల నడుమ నివసిస్తూ కూడా తన దేవప్రవృత్తిని రక్షించుకొన్న సాత్త్విక రాజసమూర్తి భీష్ముడు. పాండవులను చంపలేక పోవటానికి పాండురాజు మీది మమకారం ఒక కారణం కావచ్చును. అతడికి ప్రతిబింబమైన అర్జునుడిని చూస్తే అందుకే అంతటి అభిమానం. చిన్నప్పుడు మట్టిలో ఆడుకొంటున్న పార్థుడిని ఎత్తుకొని ఆ మట్టిని తన కంటించుకొని, బిడ్డల నెత్తిలేని తన అంతస్తాపం తీరేటట్లు పాండురాజు గుణగణాలను స్మరించుకొంటూ ముద్దుపెట్టుకొనేవాడట! అట్టి తాతను చంపవలసి వస్తే అర్జునుడి మనసు మాటిమాటికీ కటకటపడింది. అది ముగ్ధమైన మమకారం. ధర్మరాజును చూస్తే అపరిమితమైన గౌరవంతో కూడిన వాత్సల్యం భీష్ముడికి. ధర్మజుడి హృదయంలోని లోతు తాతకు తెలుసు. మనుమడు తాతకు దగ్గులు నేర్పగలడని కూడా తెలుసు. పాండవాగ్రజుడు పితామహుడికి ధార్మికపథంలో వారసుడు. పాండవమధ్యముడు పితామహుడి వీరరసపథంలో వారసుడు. అందుకే వారిని భీష్ముడు చంపలేడు. వారిని చంపితే భీష్ముడు తనను తాను చంపుకొన్నట్లే. ఏ అవిచ్ఛిన్న ధర్మవీర సంప్రదాయ రక్షణకొరకు భీష్ముడు నిలిచాడో దానిని హస్తినలో స్థాపించి ముందుకు తీసికొని పోగలిగినవారు పాండవులే. అందువలననే భీష్ముడు పాండవులను చంపడు. ఈ లోతును దుర్యోధనుడు తెలియలేడు. కొంత తెలిసికొన గలిగినవాడు కర్ణుడు. కాని, కర్ణుడు బైటపడడు. భీష్ముడు బైటపడతాడు కాని, దుర్యోధనుడిని వదలలేడు. ఇందులోని సూక్ష్మాన్ని తెలిసికొని, దానివలన లాభాన్ని కొల్లగొట్టగలవాడు ధర్మరాజే.

కురుక్షేత్ర యుద్ధం ప్రారంభం కానున్నది. ధర్మరాజు పాదచారియై కౌరవ సైన్యవ్యూహంలో ప్రకాశించే పితామహుడికి నమస్కరించాడు.

ఆ. ‘ అనఘ! నీ కెదిర్చి యనిసేయువాఁడనై । ము న్ననుజ్ఞ గొనఁగ నిన్నుఁ గాన
నెమ్మి వచ్చినాఁడ నీచేత దీవన । పడసి చనిన నేను బగఱ గెలుతు.’ **(భీష్మ. 1. 156)**

అని ప్రార్థించాడు. శ్రీకృష్ణుడు వ్యాఖ్యానించినట్లుగా అది లోకమర్యాద కావచ్చును. విజయం పొందే ఒక ధర్మమర్యాద కావచ్చును. లేదా, ‘మెత్తని పులి’ అయిన ధర్మజుడి రాజనితిలోని ఒక ఎత్తుగడ కావచ్చును. ధర్మజుడి యుద్ధ తంత్రం ఫలానుమేయం కాబట్టి లోతైనది.

భీష్ముడు భోలాశంకరుడు. నమస్కరించిన మనుమడిని చూచి ఆయన హిమవన్నగమంతా చెమ్మగిల్లినట్లు ఆర్ద్రుడయ్యాడు. సమకాలీనులైన ధర్మవీరులలో ప్రథమ గణ్యుడైన యుధిష్ఠిరుడు సమరాంగణంలో, శత్రుపక్షంనుండి వచ్చి, సామోపాయంతో, సాష్టాంగం చేయటమంటే సామాన్యం కాదు. అట్లా చేసిన మనుమడు తనకు ధర్మపథంలో వారసుడైన ధర్మరాజే. చేసినందుకు లోన ఉప్పొంగిపోయాడు. ఒకవేళ అట్లా చేసి ఉండకపోతే శాపమిచ్చి ఉండేవాడట! అది ఆయనలోని రాక్షసావేశం. దానిని గుర్తించి ధర్మరాజు దానికి విరుగుడు పెట్టాడు. ఆ తరువాత ధర్మరాజు కోరింది యుద్ధానికి అనుజ్ఞ, శత్రువులను గెలవటానికి దీవెన. ఇట్లా అడగగలిగింది మెత్తనిపులి మాత్రమే. కోదండ మెత్తితే పాండవులను నిర్జీవులను చేయగలిగిన పరాక్రమం కలవాడు భీష్ముడు. అత డిచ్చే అనుజ్ఞ వలన పాండవులకు ప్రాణాపాయం తప్పుతుంది. పగరను జయించే దీవెనవలన కౌరవపక్షంమీద గెలుపు సిద్ధిస్తుంది. దానిని తాత కరుణావేశంలో ఇచ్చాడు. అయితే భీష్మ డుండగా పాండవులకు శత్రువిజయం సాధ్యం కాదు. దానిని వరంతో పూరించదలచుకొన్నాడు భీష్ముడు. పాండవపక్షంలో యుద్ధం చేయుమని కాకుండా ఏదైనా వరాన్ని ప్రసాదించదలచాడు పితామహుడు. ధర్మజుడు ఆ అవకాశాన్ని అర్థవంతంగా సాధించుకొన్నాడు.

‘రారాజు పక్షమై రణము సేయుము! నాకు హితమగు కార్యంబు మతిఁ దలంచుము’ అని గడుసుగా అడిగాడు. ‘హితమయ్యే కార్యం’ లో గూఢార్థం ఇమిడిఉన్నది. దానిని భీష్ముడే తెలిసికొన దలచాడు. వివరించుమన్నాడు. ‘నిన్నుఁ బోరఁ గెల్చు విధము బోధింపు’ మని ధర్మరాజు తన మనసులోని గోప్యాన్ని తాతముందు పెట్టాడు. అందులో ఔచిత్యం కూడా పాటించాడు. తాత చావకుండ తాము గెలిచే ఉపాయాన్ని కోరాడు. కౌరవులు హతులైనా భీష్ముడు జీవించి ఉండాలన్న కోరిక అందులో ధ్వనిమయంగా ఉన్నది. తాను జీవించి ఉండగా విజయం రాదని తాతగారు భావిస్తే వధోపాయం చెప్పుమని గూఢార్థం. భీష్ముడు గంభీరంగా నవ్వి ఊరుకోకుండా ‘నే నెదిరించి యుద్ధం చేస్తే దేవతలకు కూడా విజయం అసాధ్యం’ అని రాక్షసావేశంతో అనేశాడు. ధర్మజుడు సమయోచితంగా ‘అందుకే కదా నిన్ను నేను వేడటం’ అని గంభీరంగా గడుసుగా అన్నాడు. మనుమడి గాంభీర్యం చూచిన తరువాత తాతకూడ గంభీరుడైనాడు. మనుమడి నేర్పరితనంతో మనసు కరిగిపోతున్నా బిగబట్టుకొన్నాడు. బింకంగా ఇట్లా పలికాడు:

ఉ. ‘ చుట్టరికంబునన్ మనసు సొచ్చి ననుం గరఁగించి వేఁడినన్
దిట్టతనంబుఁ బోవిడిచి తీవ్రరణంబు కడంక దక్కి నేఁ
బట్టిన యాయుధంబు పెడఁబాపినఁ గాని వధింపఁ బోల; ద
ట్టిట్టన కేఁగు; మిప్పరుస యింతక కాలము గాదు దానికిన్’. **(భీష్మ. 1. 159)**

దుర్యోధనుడి చేత ప్రేరితుడైన భీష్ముడు తనలోని రాక్షసావేశాన్ని పెంచుకొని తీవ్రరణ కౌతూహలాన్ని ప్రదర్శించాడు. ఆ ఆవేశాన్ని అణచుకొనేది దేవభావం. అది దైవీప్రవృత్తి అయిన ధర్మరాజు చేత జాగృతిచెంది ప్రసన్నమయింది. అంటే కౌరవ విజయానికి మూలమైన భీష్మప్రవృత్తిలోని రాక్షసమైన యుద్ధోన్మాదం ధర్మజుడి కిచ్చిన వరమనే దివ్యౌషధంచేత క్రమంగా ప్రాణత్యాగోత్సాహంగా మారి దైవీప్రవృత్తి యొక్క ఉన్నత శిఖరాన్ని అందుకొనాలి. ఆ సాధనతో భీష్ముడిలో పరివర్తన రావాలి. దానికి పదిరోజులు కావాలి. ఆ పరిణామ దశా దశకమే భీష్ముడి దశదిన యుద్ధ క్రమం. దానికి నాంది పలికింది ధర్మరాజుయత్నం.

7. పదిరోజుల పోరు : పది పరిణామాల తీరు

మొదటినాటి యుద్ధంలో భీష్ముడు రెండు రకాల ఒత్తిడుల మధ్య తరతమ భేదాన్ని నిర్ణయించుకొని వ్యవహరించాడు. మొదటి ఒత్తిడి దుర్యోధన పక్షానికి సంబంధించింది. అతడు భీష్ముడిని సర్వసైన్యాధ్యక్షుడిగా చేసి బాధ్యతల నొప్పగించాడు. కర్ణుడు యుద్ధంలో పాల్గొనగూడదని నియమం పెట్టినా కిమ్మనకుండ అంగీకరించి, అది భీష్ముడి మహావీర లక్షణమని ప్రశంసించాడు. అది భీష్ముడి అహాన్ని సంతోషపెట్టి ఉండవచ్చును. దానికి మించి దుర్యోధనుడు వ్యూహంలో భాగంగా భీష్ముడి రక్షను గురించి శ్రద్ధ తీసికొంటూ దుశ్శాసనుడి కిచ్చిన ఆజ్ఞలతో ఆయన మనసు ఆనందంలో మునిగిపోయింది. పిల్లలు చూపించే ఆప్యాయత ఆ బ్రహ్మచారి హృదయాన్ని ఆర్ద్రం చేసివేసింది.

క. ‘కన్నాకు మనకు భీష్ముం। డిన్నరవరుఁ గావవలయు నెమ్మెయి నైనం
దన్నుం గాచిన నితఁడు జ। గన్నుతముగ రణమునం బగఱ నడఁగించున్.

ఆ. ఎల్లవారఁ గాచు నితఁ డని యెప్పుడుం। దలఁతు మితనిఁ గావవలయు టేమి
యని తలంచెదేని విను మిందఱకు నిది। వినఁగవలయునట్టిపని కుమార!

వ. సత్యవ్రతుం డగు నిమ్మహానుభావుండు

క. ‘వినుఁ డన్యు లెవ్వరును నా। మునుమునఁ బడి బ్రదుక రాలమున; నేను శిఖం
డిని నోర్వఁజాలఁ జుండీ’। యని మన యుద్యోగవేళ యప్పుడ చెప్పెన్.

ఉ. ఏమఱి రక్షసాలని మృగేంద్రుని నక్కయుఁ గోలుపుచ్చు; సం
గ్రామములోనఁ గన్గలిగి కానక తక్కిన నా శిఖండిచే
నీ మనుజేంద్రుఁ గోల్పడమె? యట్టిది గోల్పులి నిద్రవోవ ను
ద్దామ బలంబుమై గొఱియ దాఁకి వధించిన యట్టు లుండదే!

క. కావున నీ యుద్భట రథి। కావలి నివ్విభునిఁ గాచునట్లుగఁ బనుపం
గావలయు; మీర లందఱు। నేవలఁ జూచిన శిఖండి కెదురుం డెపుడున్.’ **(భీష్మ. 1. 76-81)**

ఇంత మధురంగా ఎప్పుడో కాని దుర్యోధనుడు మాట్లాడడు. భీష్ముడు కౌరవసేనకు కన్నాకు. పాండవసేనకు ప్రళయం. అందువలన ఆయనను రక్షించుకొనటం కౌరవుల కర్తవ్యం. శత్రువులందరినీ సంహరించే పితామహుడిని కౌరవులందరు కలిసి రక్షించుకొనాలి. రక్షించుకొనే మార్గం భీష్ముడే చెప్పాడు. ‘ఒక్క శిఖండిని మాత్రం నే నెదుర్కొనను. మిగిలినవారెవరైనా నా యెదుటబడి బ్రదుకలేరు’ అని ఉద్యోగసమయంలో అన్నాడు. శిఖండి గొప్పవీరుడని కాదు. రక్ష లేని సింహానికి నక్కకూడా కీడు చేస్తుంది. నిద్రపోతున్న పెద్ద పులిని పొట్టేలు కూడా పొడిచి చంపుతుంది. అందువలన రక్షలేకపోతే భీష్ముడుకూడా శిఖండి చేతులలో కీడు పొందవచ్చును. కాబట్టి మహారథికులందరూ భీష్ముడిని రక్షిస్తూ ఉండండి. శిఖండిని ఆయన ముందుకు రానీయకండి’ అన్నాడు సుయోధనుడు.

ఇవి రారాజు మాటలా? లేక భీష్ముడి మనసులోని ఊసులా? అని పఠితలకు అనుమానం కలిగేటంత కమనీయంగా ఉన్నాయి. ఇవి దైవీప్రవృత్తి కలవాడు పలికే మాటలవలె ఉన్నాయి. అయినా అవి రణవ్యూహంలో భాగాలే. ఏయే వీరుడిని ఎట్లా ఉత్తేజపరిచి యుద్ధంలో విజయం సాధించాలో తెలిసి పలికే తెలివిగల వాడి మాటలు. ఆ మాటలు విన్న భీష్ముడు తన నంతగా అభిమానిస్తున్న ప్రభువుకొరకు శక్తివంచన లేకుండ శత్రుసంహారం చేసి కృతజ్ఞతలు తెలుపుకొనాలనే సహజోత్సాహం ఉరకలు

పెట్టుతుంది. అట్లా యుద్ధోత్సాహమూర్తి అయి సైన్యముఖంలో నిలువబడిన ఆయన పాండవసేనను యమదృష్టితో చూచి ఉంటాడు. దానికి విరుగుడు పెట్టిన ధర్మరాజు వినయాన్ని చూచి 'నీ విట్లా రాకపోయి ఉన్నట్లయితే శపించేవాడి' నని బయటపడ్డాడు.

'నీవు కౌరవపక్షంలోనే యుద్ధం చేయుమనీ, అయినా, పాండవపక్షానికి హితం చేయు' మనీ ధర్మరాజు కోరినప్పుడు భీష్ముడు పాండవులను సంహరించకుండా సైన్యాలను మట్టుపెట్టటమే వారికి చేసే హితంగా భావించాడు. అందుకే మొదటి నాటి యుద్ధంలో అపారసేనావాహినిని అమరపురికి పంపాడు. మధ్య మధ్య సుయోధనుడు భీష్ముడిని ప్రేరేపించగా ఆ పితామహుడు విజృంభించి వీరవిహారం చేశాడు. ఎండిన అడవిని కార్చిచ్చు కాల్చినట్లు పాండవసేనను దహించాడు. దుర్యోధనుడూ, అతడి తమ్ములూ, రాజులూ భీష్మప్రతాపానికి సంతోషించారు. ధర్మరాజు చింతాక్రాంతుడై గోవిందుడి ముందు చిన్నబోయి నిర్వేదంతో యుద్ధాన్ని చాలించి అడవులకు పోతానన్నంత వరకు వెళ్ళాడు.

చ. 'అలవి యెఱుంగనేరక మహాత్ముని లోకముతోడి పాటిగాఁ
దలఁచితి; బేలనైతి; శరతాడన పీడితు లైరి నీ మఱం
దులు; నమరాపగాతనయుతోడి రణంబునకున్ దిశాధి నా
థులు నఱుమంగఁ జాల రని తోఁచుచునున్నది నా మనంబునన్.'

చ. 'అతని జయించు నంచు మన మర్జును నెంతయు నమ్మియుండఁగా
నితఁడును సంగరంబున నుపేక్షకుఁ డయ్యె; వృకోదరుం డొకం
డ తఱికి (జొచ్చి దోర్బలము దాఁపక పోరెడు; నేమి సేయు నా
కితనిని నీతనిం దడవ నేటికిఁ గయ్యము జోలి మానెదన్.'

క. 'నరపతుల నెల్ల భీష్మున । కెరగా నొప్పింపఁజాల; నే నడవులకున్
మరలం బోయెద, నచటం । దిరిగెదఁ గూరాకు గోసి తినియెద ననఘా!' **(భీష్మ. 2. 6 - 8)**

ధర్మరాజు వైరాగ్యానికి భీష్ముడి కోపోద్రేకం కారణం. మొదటినాటి కోపోద్రేకం అర్జునుడిమీద ఒత్తిడిని పెంచింది.

అతడు రెండవనాడు విజృంభించాడు. భీష్ముడికి కూడ అబ్బురపాటు కలిగేటట్లు భీషణంగా పోరాడాడు.

తే. 'కృష్ణసారథ్యమున నొప్పు క్రీడి యిపుడు । కౌరవానీకముల నెల్లఁ గసిమసంగి
కృష్ణసారథ్యమున నొప్పు క్రీడియైన । నెట్లు సేయంగ వలయుఁ దా నట్లు సేసె.' **(భీష్మ. 2. 92)**

'విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమమ్' - అనే సూక్తి భీష్ముడిపట్ల సార్థకమైనది. పరశురాముడిని జయించిన పరమధానుష్కుడు పరవశించి ప్రశంసించదగిన ఆదర్శవీరుడిని అద్భుతంగా దర్శించి ఆనందించాడు.

మూడవనాటి యుద్ధంలో అర్జునుడు రణోత్సాహంతో కౌరవవీరులను భంగపరిచాడు. భీముడు విజృంభించి దుర్యోధనుడిని మూర్ఛలో ముంచాడు. అభిమన్యుడు శకునిని నొప్పించాడు. ఆ అవమానాన్ని భరించలేక దుర్యోధనుడు భీష్మద్రోణులను నిష్ఠురాలాడాడు.

ఉ. 'ఉక్కున మూఁడు లోకములు నొక్కటఁ దాఁకెన యేనిఁ బోర మీ
రొక్కఁ డొకండ గెల్చుటకు నోపుదు రశ్రమవృత్తి; నట్టి మీ
ముక్కున నూర్పు గల్గ మన మోహర మీ దురవస్థఁ బొందునే?
యక్కట! మున్న పాండవుల కల్గఁగ నొల్లమి సెప్పరైతిరే?' **(భీష్మ. 2. 119)**

ఆ మాటలలో భీష్మద్రోణులు కుహనా వీరులని తేల్చి చెప్పినట్లయింది. ఆ సత్యం ముందే కర్ణుడు చెప్పగా నమ్మలేకపోయాననీ, ఇప్పుడు తెలిసికొని భంగపడ్డాననీ పితామహుడిని ఎత్తి పొడిచాడు దుర్యోధనుడు.

దుర్యోధనుడు దుష్టప్రభువు. అతడికి ఎదుటివారి గుణవిశేషాలు తెలియవు. తనకు మెప్పు గలిగించే వారినే గౌరవిస్తాడు. ఎంతటి ఉత్తముడినైనా శంకించటం అతడి స్వభావం. భీష్మద్రోణులు ప్రభువుల యోగక్షేమం కోరే ఉత్తమవీరులు. వారు అర్జునుడిని నిర్జించే ప్రయత్నం చేసి, శ్రీకృష్ణసారథ్యంలో ఉన్న మహిమాతిశయం చేతా, పార్థుడి దివ్యశస్త్రాస్త్ర ప్రాభవం చేతా ఆ పని చేయలేకపోయారు. దానిని పాండవపక్షపాతంగా అనుమానించి దుర్యోధనుడు ఆ వృద్ధవీరుల నిజాయితీని శంకిస్తూ నిష్ఠురా లాడాడు. మొన్న పొగిడాడు, ఈనాడు తెగడుతున్నాడు. అతడి అవివేక ప్రవృత్తికి గంభీరుడైన భీష్ముడు నవ్వుతూ, తెలిసి తెలియని సుయోధనుడితో ప్రియభాషణం చేశాడు.

క. ‘ పురుహూత సహిత మగు ని । ర్జర బలమునకైన గెలువ శక్యమె? సమర
స్థిరులగు పాండు తనూజుల । నరనాయక! నీకు నిట్లనం దగ వగునే?

క. వృద్ధులు గతాయువులు దు । ర్బుద్ధులు నగువారిచేతఁ బోదురె శస్త్రా
స్త్రోద్ధతియు బాహుగర్వ సమృద్ధియుఁ గల పాండుసుతు లమిత్రధ్వంసీ!’ **(భీష్మ. 2. 123. 124)**

ఇవి పైకి సత్యవాక్యాలు. లోన గమనిస్తే అధిక్షేపోక్తులు. భీష్ముడు తన ఎదుటపడిన వాడెవడైనా బ్రదకటం కష్టమన్నా డిదివరలో. అందులో అర్జునుడిని మినహాయించా డిప్పుడు. ఇంద్రాదులే అర్జునుడి నెదిరించి గెలవలేరన్నప్పుడు మే మెంత? అని తేల్చి చెప్పాడు. పాండుతనూజులు సమరస్థిరులని చెప్పి దుర్యోధనుడి ఒడలు మండించాడు. ‘నీ విట్లా మమ్ముల ననటం న్యాయమా?’ అని మందలించాడు. వృద్ధులు, గతాయువులు అని తమను తక్కువచేసి మాట్లాడటమే కాక దుర్బుద్ధులైన దుర్యోధనాదులను గూడ ఆ వరుసలో చేర్చాడు. ఇటువంటి వారందరి చేతులలో పాండవులు చావరనీ, వారి చేతులలో వీరు పోవటం తథ్యమనీ ధ్వనింపజేశాడు. ఉత్తములను శంకించటం ఎంత తప్పో, వారిని నిందించటం అంత తప్పు. ఈ రెండూ చేసి నిండు నమ్మకంతో, బంధుత్వంతో పోరుతున్న తన చిత్తశుద్ధిని గుర్తించలేని ఆ దుర్యోధనుడి శంకాప్రవృత్తికి భీష్ముడు లోలోన బాధపడి, తన కర్తవ్య నిష్ఠ అపాత్రుడికి అంకితమైనదని అంతర్నిర్వేదాన్ని పొందాడు.

అయినా, నమ్మిన రాజు అనగూడని మాటలన్నందుకు, తన నిజాయితీని నిరూపించుకొనటానికి భీష్ముడు పాండవ సైన్యంమీద, అర్జునుడిమీద తిరుగులేని యుద్ధాన్ని చేశాడు. పార్థుడు యుద్ధం చేయలేక తూలిపోయాడు. శ్రీకృష్ణుడు ఆ దృశ్యం చూచి మండిపడి భీష్ముడిమీదికి చక్రాయుధంతో విక్రమించాడు. పార్థుడి ప్రార్థనతో భీష్మవధ యత్నాన్ని శ్రీకృష్ణు డుపసంహరించుకొన్నాడు. శత్రుమర్దన మహాకోపావేశ మగ్నుడైన భీష్ముడు శ్రీకృష్ణుడు చక్రాయుధంతో తనపై లంఘించినప్పుడు వినయంతో చేతులు జోడించి ‘పరమేశ్వరా! నన్ను ఈ విధంగా కృతార్థుడిని చేస్తావా? నీవు వచ్చి ఇప్పుడే, నీ ఇష్టం వచ్చినట్లు ఏ విధంగానైనా చేయుము. నేను సిద్ధం. ఆలస్యం వద్దు. నీ చర్య నాకవశ్యం యోగ్యం’ అని వేడుకొన్నాడు. భీష్మ రౌద్రోద్రేకం శ్రీకృష్ణభక్తి సముద్రంలో మునిగిపోయింది. భీష్ముడి ప్రతాపం మందగించింది. అర్జునుడి పరాక్రమం విజృంభించింది. కౌరవసైన్యం విస్తారంగా నేల కొరిగింది. ఆనాటి యుద్ధం ముగిసింది.

శ్రీకృష్ణవిజృంభణం భీష్ముడిలోని రౌద్ర విజృంభణానికి విరుగుడుగా తోచింది. చావు తప్పదన్న దివ్యసంకేతం తెలిసికొనటానికి తోడ్పడింది. స్వీయమరణాన్ని గురించి సౌముఖ్యాన్ని మనసులో సంతరించుకొనాలని స్ఫురించింది. శ్రీకృష్ణుడి సంరక్షణలో ఉన్న పాండవులకు విజయం చేకూరటం ధర్మవిజయమని అనిపించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాండవుల విజయానికి అనుకూలమైన ప్రవృత్తి మొదటినాడు బీజావస్థలో తోచింది. రెండవరోజు దానికి విఘాతం కలిగించే కోపోద్రేకం కలిగింది. మూడవరోజు శ్రీకృష్ణమేఘదర్శనం వలన పాండవానుకూలత అంకురావస్థ నందుకొన్నది. నాల్గవనాడు భీష్మడి ప్రతాపం ప్రకాశించటం మాని, పాండవ సానుభూతి పల్లవావస్థ నందుకొనేటట్లు పరిణమింపజేసింది.

నాల్గవనాడు పాండవులదే పైచేయి. కౌరవులు చిన్నబోయారు. దుర్యోధనుడు భీష్మడిని అడిగాడు. 'మీవంటి మహావీరులు మా పక్షాన ఉన్నా పాండవులు మన కంటె మిన్నగా ప్రకాశిస్తున్నారు. దానికి కారణం ఏమిటి? అని (భీష్మాదుల ఉపేక్షయా? అనే అనుమానంతో) అడిగాడు.

భీష్ముడు పాండవబలంలోని మూలతత్త్వాన్ని దుర్యోధనుడికి తెలియచెప్పాడు. 'దుర్యోధనా! నేను నీకు ఎన్నోసార్లు చెప్పాను. పాండవులకు వాసుదేవుడు సహాయకుడై ఉన్నాడు. అందువలన వారికి అసాధ్యమనేది లేదు. ఆ పరమేశ్వరుడి అసలు స్వరూపం తెలిసినవారు పెక్కుమంది లేరు. తెలిసినవారికి ఆపదలు ఉండవు. పాండవులు అతడి తత్త్వాన్ని తెలిసికొని ఆశ్రయించారు. నీవు శ్రీకృష్ణుడిని లెక్కచేయవు' అని నిర్ద్వంద్వంగా చెప్పాడు.

శ్రీకృష్ణ చక్రాయుధం భీష్మడిమీద భౌతికంగా పడకపోయినా, దాని ప్రభావం భీష్మడిలో ఒక వెలుగుబాటను ఆవిష్కరించి దుర్యోధనుడికి బోధింపచేసింది. దానివలన ఎందరెన్ని విధాల పోరినా పాండవులకు విజయం తథ్యమని స్పష్టమయింది. శ్రీకృష్ణుడు ప్రత్యక్షంగా సహాయం చేసే పాండవులకు తాను పరోక్షంగా నైనా సాయం చేయాలన్న సౌముఖ్యభావం లోలోన పల్లవించింది.

అయిదవనాడు దుర్యోధనుడు భీష్మడిని ప్రత్యక్షంగా ఏమీ అనలేకపోయాడు. ద్రోణుడిని సంబోధించి భీష్మడినీ కలిపి అధిక్షేపించాడు.

తే. 'పట్టి పాలార్చెదరు మీరు పాండుసుతుల; । నీవు భీష్ముడు నలిగిన దేవతలకు
నైన మార్కొనవచ్చునే? సేన నరుఁడు । నొంపఁగా నిట్టు లొప్పరికింపఁ దగునె? **(భీష్మ.2. 280)**

అర్జునుడు కౌరవసేనను నుగ్గు చేస్తున్నా గురుభీష్మలిద్దరూ అతడిమీది అభిమానంతో తటస్థ వైఖరిని ప్రదర్శిస్తున్నారనీ, వారిద్దరూ పాండవపక్షపాతులైన తోడుదొంగల వలె వ్యవహరిస్తున్నారనీ దుర్యోధనుడు వ్యాఖ్యానించటం వలన వారిద్దరి మనస్సులు కటకటపడ్డాయి. దానితో భీష్మడికి దుర్యోధనుడిపై వైముఖ్య మేర్పడింది. పాండవ సౌముఖ్యం అతడిలో కుట్మలావస్థకు చేరుకొన్నది.

ఆరవనాడు అర్జునుడు ప్రచండంగా ప్రతాపాన్ని ప్రదర్శించాడు. కౌరవసేన దీనదశ పొందింది. దుర్యోధనుడు ఖిన్నుడై ఆ రాత్రి భీష్మడితో నిర్మొగమాటంగా, నిష్ఠురంగా మాట్లాడాడు.

ఆ. 'మనము పూఁచి పట్టి మొన లేర్చికొని పోవఁ । బాండురాజ సుతుల బలము గవిసి
గాసి చేయునదియుఁ గాక నీ ముందటఁ । బవన తనయు చేత భంగపడితి.'

క. 'నినుఁ గొని గెలిచెదఁ గుంతీ । తనయుల నని యున్న తలఁపు దప్పించెదు నీ
వనిమిషులనైనఁ జేకొన । వనిమొన వారింత బలియు రగు టేమియొకో!' **(భీష్మ. 3.5,6)**

ఎన్నివిధాల దృఢ వ్యూహాలను పన్నుకొని వెళ్ళినా పాండవుల ముందు అవి పటాపంచలౌతున్నాయి. భీష్మడి ముందటే భీముడు దుర్యోధనుడిని భంగపరిచాడు. అది దుర్యోధనుడి మనసులో అనుమానపు పొగలు సెగలు రేపింది. భీష్మ డొక్కడు చాలు పాండవులను జయించటానికి - అనే ఆశతో వచ్చిన దుర్యోధనుడు నిరాశపడ్డాడు. పైపెచ్చు దేవతలుకూడా ఎదుర్కొనలేని భీష్మ ద్రోణులు యుద్ధం చేస్తున్నా, పాండవులు రోజు రోజుకు బలపడుతున్నారు. ఈ వైరుధ్యం తెలియలేక వెర్రిగా అడిగాడు రారాజు. ఆ ప్రశ్న వెనుక ఉన్న

అనుమానం భీష్ముడి మనసు విరిచింది. రోషంతో నవ్వుతూ అన్నాడు - 'దుర్యోధనా! నీ విన్నిమాటలు నన్ననవద్దు. యుద్ధంలో నా ఒడలు దాచుకొంటున్నానా? వెనుకా ముందూ చూచుకొనకుండా శత్రువులను వెంటాడుతున్నాము కదా! పాండవులను జయించటం సాధ్యంకాదని నీ కెప్పుడూ చెప్పుతుంటాను' అని విసుగుతో అని, 'నీ కివన్నీ అర్థంకావు. నీకు కావలసింది నా శరీరం పడిపోయేంత వరకు యుద్ధం చేయటమేగా! సరే - నీ జయం కొరకు దాపరికం లేకుండా యుద్ధం చేస్తాను' అని తెగించి రణరంగంలో ప్రవేశించాడు.

దుర్యోధనుడు భీష్ముడి మనసు గాయపరిచాడు. అతడు శరీరం మీద స్పృహ వదలి యుద్ధానికి బయలుదేరాడు. అతడి ప్రాణాలు పాండవులవైపు ప్రసన్నమయ్యాయి. అనుమానించి అధిక్షేపించే రాజుకంటె శరీరం ఉన్నంత వరకు యుద్ధం చేసి, ధర్మం నిర్వహించి, కన్నుమూయటం మేలనే నిర్ణయానికి వచ్చాడు. అది పాండవులపట్ల సాగే సౌముఖ్య ప్రవృత్తిలతకు పుష్పవికాస దశగా భాసించింది.

ఏడవరోజు భీష్ముడి శరీరం యుద్ధం చేసింది. మనసు నిమిత్తంగా నిలిచింది. ఎనిమిదవనాడు భీముడు దుర్యోధనుడి తమ్ములను మట్టుబెట్టాడు. భీష్ముడు అతడిని వారించలేకపోయాడు. దుర్యోధనుడు మండిపడుతూ భీష్ముడిని నిష్ఠురవాక్యాలతో నిందించాడు.

దుర్యో: 'ఈ విధంగా వరుసబెట్టి నా తమ్ములను భీముడు చంపుతూ ఉంటే చూస్తూ ఊరుకొంటావా? రోషశోకాలు నీకు లేవా? తోడుపడకూడదనే మిన్నక ఉండిపోయావా? ఉన్నవారందరూ ఒక్కసారి చావాలన్న కోరికతోనే ఊరకున్నావా?

భీష్మ: (కంటతడిపెట్టి) ఆ సంగతి నీకు ముందే నేనూ, ద్రోణుడూ, విదురుడూ విశదంగా చెప్పాము. పాండవులకు ఎదురై నిలిచి గెలవటం మా వశమా? ఆ భీముడి పాలపడిన కురు కుమారులను కాపాడటం ఎవరికీ సాధ్యం కాదు. దీనికి దుఃఖించి ఇప్పుడేమీ ప్రయోజనంలేదు. వీరస్వర్గమే సంపదగా భావించి నీ వింక యుద్ధం చేయుము. నేనూ నాకు చేతనైనంత యుద్ధం చేస్తాను. మనకు విజయం కలిగితే త్రోసివేసి కొంటామా?'

ఈ మాటలలో భీష్ముడు దుర్యోధనుడితో విడివడిపోతున్న వైఖరిని ప్రదర్శించాడు. చావు తప్పదని హెచ్చరించాడు. ఒప్పుకొన్నందుకు నాకు చేతనైనంత వరకు పోరాడతానని ఒప్పగింతలు పెట్టినట్లు మాట్లాడాడు. ఇది పాండవులకు మంచి అనుకూల దశ.

దుర్యోధనుడు అంతటితో ఆగక ఆనాటి అర్ధరాత్రి పితామహుడి మందిరానికి పోయి నిష్ఠురోక్తులతో అతడి మనసును మరీ బాధపెట్టే సంభాషణ చేశాడు. చేతకాకపోతే సర్వసేనాధిపత్యం వదలి కర్ణుడికి యుద్ధం చేసే అవకాశ మిమ్మని కర్ణప్రేరితుడై దుర్యోధను డడిగాడు.

చ. ' అనిమొన దేవదానవుల కైనను మార్కొనరాదు నిన్ను నేఁ
డెనిమిది నాళ్ళు లయ్యె సమయింపవు నొంపవు సవ్యసాచి; న
ప్పని యటులుండ నిమ్ము; నినుఁ బ్రార్థన సేసెద నింతవట్టు నా
చనవునఁ బోవ నిచ్చి నృపసత్తమ! పోరికిఁ గర్ణుఁ బంపవే!' **(భీష్మ. 3. 171)**

ఆ మాటలు ఈటెలుగా భీష్ముడి హృదయానికి గ్రుచ్చుకొన్నాయి. అమితమైన విషాదం ఆయనను ఆవరించింది. తల వంచుకొన్నాడు. కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాడు. నిట్టూర్పులు నిగిడించాడు, ఎట్టకేలకు మరల ముఖాన్ని పైకెత్తుకొని దుర్యోధనుడితో వేదనపడుతూ ఇట్లా అన్నాడు:

క. ' తలకొని నీకుం బ్రాణం । బులు డాపక యొపినట్లు పోరఁగ నిమ్మెఁ
బలుకఁ దగునె? యక్కట! నా । వలనం గల భక్తి యెల్ల వమ్మునఁ గలయన్.' **(భీష్మ. 3. 175)**

'నీ కొరకు ప్రాణాలర్పించటానికి సిద్ధమై యుద్ధం చేస్తుంటే కృతఘ్నుడివలె ఇట్లా పలకటం న్యాయమా? అయ్యో! నాప్రభుభక్తి భావం బూడిదలో పోసిన పన్నీరయింది' అని వాపోయాడు. విలువ తెలియకుండ నిందించే దుర్యోధనుడిపట్ల కోపం వచ్చింది. అర్జునుడితో యుద్ధమంటే ఆషామాషీ కాదు. అతడు సామాన్యుడా! అలనాడు ఇంద్రాదులను జయించి ఖాండవవనాన్ని దహించలేదా? గంధర్వులచేతిలో ఓడిన కర్ణుడినీ, నిన్నూ, నీ తమ్ములనూ చెరనుండి విడిపించుకొనలేదా? నన్నూ, ద్రోణుడినీ, అశ్వత్థామనూ, కృపుడినీ, కర్ణుడినీ గెలిచి విరాటుడి గోవులను మరల్చుకొనలేదా? ఇంకెన్నో విజయాలను సాధించిన మహావీరుడు అర్జునుడు. అటువంటి జగజెట్టితో ఇన్నాళ్ళు, ఈ విధంగా యుద్ధం చేసికూడా నీ చేత ఈనాడు ఇటువంటి వేడిమాటలు వినవలసి వచ్చింది. అజేయులైన పాండవులతో తగనిపని అని తలంచకుండా పగ సాధించబూనావు. ఇకమీద నీవే సాహసించి యుద్ధంలో పౌరుషాన్ని ప్రదర్శించుము. నీకే తెలిసివస్తుంది. ఇక ఇటువంటి పనికిమాలిన మాటలనటం చాలించుము. మరల చెప్పుతున్నాను వినుము.

క. ' గాండీవి గెలువరాదు; శిఖండిని జంపంగ నాకుఁ గాదు; వినుము! న
న్నొండు మగలు మార్కొనినం। జెండుదు నుగ్రముగ; మున్న చెప్పితి నీకున్.'

క. ' ఏనును నాదళమున ద్రుప। దానీక విరాట సైన్య యాదవబల సం
తానములతోడఁ బెనఁగెదఁ;। బూనుఁడు మీరెల్లఁ బాండుపుత్రుల గెలువన్.' **(భీష్మ.3.180,181)**

అని నిష్ఠురంగా నిలదీసి చెప్పాడు. 'అర్ధరాత్రి వచ్చి ఇట్లా నా మనసు బాధ పడేటట్లు పలికితే నీకు జయం కలుగుతుందా?' అని శపించినట్లు పలికాడు.

అర్జునుడు క్రూరాస్త్రాలు వేసి కూలగొట్టటానికి పూర్వమే దుర్యోధనుడు వాఙ్మయవిషబాణాలను సంధించి భీష్ముడి చిత్తాన్ని మూర్ఛితం చేశాడు. ఇక భీష్ముడు యుద్ధరంగంలో ఎవరికొరకు, ఎవరి విజయం కొరకు పోరాడాలి? దుర్యోధనుడు అవివేకంతో, రాజ్యకాంక్షతో ఎదుట నున్న మహావీరకల్పవృక్షాన్ని పరుష వచనాల గొడ్డళ్ళతో నరుకుకొన్నాడు. తొమ్మిదవనాడు భీష్ముడు తన వ్యక్తిత్వాన్ని గుర్తించలేని వ్యక్తుల మధ్య పరాయివాడై పోయాడు. ఆ అంతర్విషాదం ఆయన యుద్ధంలో కోపాగ్నిగా ప్రజ్వలించింది. కృతఘ్నులు సైతం కృతజ్ఞతలు చెప్పుకొనదగినంత ఘోరమైన యుద్ధం చేశాడు. ప్రళయకాల రుద్రుడిగా విజృంభించి పార్థుడి ప్రాణాలను హరించేటట్లు పోరు సాగించాడు.

నారాయణుడే ఆ నరుడిని ఆదుకొనవలసిన అవసరం ఏర్పడింది. దారుణకోపంతో దామోదరుడు రథంమీదినుండి ధరణిపైకి దూకాడు.

మ. ' ధరణీచక్రము గ్రక్కునం గదల దిగ్దంతావళశ్రేణి కం
ధరముల్ మ్రొగ్గఁ బడన్ దిశావలయ ముత్కంపంబుగా నీ బలం
బురులన్ బాఱఁగ భీష్ముపైఁ గవిసె రౌద్రోద్రేకముం జూచి ఖే
చరలోకంబును సంచలింప హరి చంచద్బాహు ఘోరాకృతిన్.

తే. లలిత పీతాంబరంబు విలాస మొప్ప। సింహనాదోద్భటం బగు చెలువుతోడ
మెఱుఁగు వెలుఁగును గర్జయు మెఱయవచ్చు। కారుమొగిలనఁగృష్ణునాకార మొప్పె.'

(భీష్మ.3.263, 264)

భీష్ము డిక చచ్చాడని కౌరవసైనికులందరూ జీవాలు పోయినట్లు వెలవెలలాడే ముఖాలతో చూస్తూ నిలిచిపోయారు.

చ. ‘ కనుఁగొని భీష్ముఁ డుల్లము వికాసము నొందఁగ నల్ల నవ్వి యి
ట్లనుఁ ‘జనుదెమ్ము వేగమ మహాత్మ! వికస్వర పుండరీక లో
చన! యిది లెస్స; నా కిచట శాశ్వతమైన యశంబు, నచ్చట
న్వినుతికి నెక్కు సద్గతియు నీదయఁ జేకుఱఁ జేయు మిష్టమున్’. **(భీష్మ. 3. 267)**

అని వేడుకొన్నాడు. అంతలో అర్జునుడు పరుగు పరుగున వచ్చి పురుషోత్తముడిని ప్రాధేయపడి వెనుకకు తీసికొని పోయాడు. భీష్ముడు బ్రతికిపోయాడు.

భీష్ముడికి దర్శన మిచ్చింది చక్రధారియే కావచ్చును. కాని, అది భీష్మావతారోపసంహరణానికి పరమాత్ముడిచ్చిన హెచ్చరిక! చక్రి చంపక వదలిన భీష్ముడు పాండవసేనను చంపి పోగులు పెట్టాడు. ఊబిలో దిగబడిన గోవువలె ఉన్న తన సేనను చూచి ధర్మజుడు చింతాక్రాంతుడయ్యాడు. ఆరిపోయేముందు దీపం భగ్గుమన్నట్లు భీష్ముడు తొమ్మిదవనాడు ప్రతాపం ప్రదర్శించాడు.

భీష్ముడు పాండవసైన్యాన్ని పరిమార్చినా, పాండవులపట్ల లోలోన ప్రసన్నుడై ఉన్నాడు. ఇక మరికొన్ని రోజులు యుద్ధం సాగితే పాండవులు బ్రతికి బైటపడటం కష్టమని ధర్మరాజు భావించాడు. ఇంకెన్నినాళ్ళు గుర్తింపులేని ఘోరయుద్ధం చేయాలని భీష్ముడు లోలోన తపించిపోయాడు. ఈ రెండు సమాంతరరేఖలు కలిసే తరుణం తొమ్మిదవనాటి రాత్రి తారసిల్లింది.

ధర్మజుడు శ్రీకృష్ణాదులను వెంటబెట్టుకొని సామాన్య వేషాలతో భీష్ముడి మందిరానికి వచ్చారు. అప్పుడు భీష్ముడు అంతరాంతరాలలో ఆర్ద్రుడై ముఖంలో వెలుగులు చిమ్మగా ఇట్లా ప్రసన్నంగా పలికాడు.

క. ‘ ఇచ్చటికి మీరలందఱు । వచ్చిన పని యేమి? యేది వలసిన నడుగుం
డిచ్చెద; దుష్కరమైనను । జెచ్చెరఁ దలకొని ఘటింపఁ జేసెదఁ బ్రీతిన్’. **(భీష్మ. 3. 295)**

అని మనసారా సుముఖత్వాన్ని ప్రకటించాడు. స్వీయవధోపాయాన్ని అడిగినా చిరునవ్వుతో ఇచ్చే స్నిగ్ధత ఆయన మాటలలో తొంగిచూచింది. దుర్యోధనుడి కొరకు యుద్ధం చేసి పాండవుల కొరకు ప్రాణాల నివ్వటానికి సిద్ధమైనట్లు కనపడ్డాడు. ధర్మరాజు ఆ సన్నివేశాన్ని పూర్తిగా వినియోగించుకొన్నాడు. వారిద్దరి నడుమ సంభాషణ ఈ విధంగా సాగింది.

ధర్మ: (దీనంగా) మాకు ఏ విధంగా సామ్రాజ్యం సమకూరుతుందో, ఏ విధంగా సేనలు చావటంవలన కలిగే వ్యథలేకుండా ఉంటుందో, ఆ మార్గాన్ని దయతో వెంటనే చెప్పాలి.

భీష్మ: అనఘా! నేను యుద్ధం చేస్తుంటే మీ సైన్యం నశించక తప్పదు. సామ్రాజ్యం కూడా మీకు దక్కదు. కాబట్టి నన్ను జయిస్తే మీకు శుభాలన్నీ కలుగుతాయి.

ధర్మ : మహాత్మా! మూడవకన్ను మూసికొని, త్రిశూలాన్ని దాచుకొని అవతరించిన రుద్రుడివలె నీవు రణరంగంలోకి దిగుతావు. ఎటువంటి వీరులకైనా నిన్ను ఎదిరించటం సాధ్యమా? కాబట్టి నీ దయను ఆశ్రయించటానికి వచ్చాను. ని న్నేవిధంగా గెలవటానికి వీలుంటుందో మాకు తేటతెల్లమయ్యేట్లు తెలుపుము.

భీష్మ : నీ వన్నది నిజం. నా చేతిలో ధనువుండగా దేవతలు కూడా నన్ను గెలువలేరు. అటువంటి వాడినిగా మీరు నన్ను గుర్తించి, ఇంతమంది ఇక్కడికి వచ్చి, ఈ విధంగా అడుగుతుంటే మీకు ప్రియమైన కార్యం చేయటం కంటె నాకు వేరే పుణ్యమేముంటుంది? నేను ఆయుధాలను ప్రయోగించటం మానినప్పుడే నన్ను జయించవీలవుతుంది. జోడు పుచ్చినవాడిని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆయుధం క్రింద పెట్టినవాడిని, జెండా దించినవాడిని, స్త్రీని, మొదట స్త్రీగా ఉండినవాడిని, ఆడువారి పేరు పెట్టుకొన్నవాడిని, తలగుడ్డను తీసివేసినవాడిని, సోదరులు లేనివాడిని, పుత్రులు లేనివాడిని చూస్తే వారితో నేను యుద్ధం చేయను. నాకు మరొక నియమం కూడా ఉన్నది. పుట్టినప్పుడు లేకుండా నడుమ దైవమిచ్చిన పురుషత్వం కలవాడితో యుద్ధం చేయను. కాబట్టి మీకు ఒక ఉపాయం చెప్పుతాను. ద్రుపద సంతానమైన శిఖండి అటువంటివాడని మీకు తెలుసు. వాడు పూర్వజన్మలో స్త్రీ కావటం చేత వాడికి ఎదురుగా ఉండి బాణాలను ప్రయోగించను. అందువలన అర్జునుడు అతడిని ముందు పెట్టుకొని వస్తే, నేను బాణప్రయోగం మానితే, నన్ను నొప్పించి పడవేయండి. ఆ తరువాత బంధుమిత్రులతో కూడిన కౌరవులను జయించటం సులభమౌతుంది. ఇది నా ఆజ్ఞ. నేను చెప్పినట్లు చేయండి.

ఆసురీ శక్తులు అడిగితే భీష్ముడు కోపావేశాన్ని ప్రదర్శించాడు. దైవీశక్తులు అర్థిస్తే కృపావేశాన్ని ప్రకటించాడు. స్వీయవధోపాయాన్ని స్నేహదీప్తితో చెప్పిన భీష్ముడు పాండవులపట్ల ప్రసరించే సౌముఖ్యానికి ఫలావస్థను కల్పించాడు.

పదవనాటి యుద్ధంలో పాండవులు ఫలానుభవాన్ని పరిపూర్ణంగా పొందుతారు. అట్లా పొందటానికి పాండవులలో భీష్ముడిలో కలిగే పరిణామాలే ప్రధానకారణాలు. వాటిని సంగ్రహంగా ఇట్లా పేర్కొనవచ్చును.

1. ఫలప్రాప్తికి అనుకూలంగా దైవికమైన చైతన్యం పనిచేస్తుందనీ, దానిని ఆయా ఘట్టాలలో చూచి ఆశ్చర్యపోవలసిందే అనీ దైవస్వరూపుడైన శ్రీకృష్ణుడు చెప్పాడు. కథాంతం దైవమూలం, అద్భుతం అని భావం.

2. దానికి అనుకూలంగా మొదట అర్జునుడిలో మార్పు కనపడింది. తాతను చంపలేనని విషాదయోగాన్ని ప్రదర్శించిన అతడు శిఖండిని ముందు బెట్టుకొని, అతడి వింటికి వెనుక తన గాండీవాన్ని ఉంచి, శిఖండి వేస్తున్నట్లే బాణాలు సంధించి భీష్ముడిని సంహరించటానికి శ్రీకృష్ణ ప్రబోధంతో సిద్ధమైనాడు.

3. శిఖండి ప్రతాపోక్తులతో భీష్ముడిని ఎదిరించాడు. ఆయన అతడిపై బాణాలు ప్రయోగించకుండా ప్రక్కకు పోయాడు. శిఖండి వీరప్రవృత్తిని చూచి అర్జునుడు ఆశ్చర్యపోయి, భీష్ముడు అస్తమించే దైవికమైన సూచనగా భావించి శిఖండిని భీష్మవధకు ప్రోత్సహించాడు.

4. ఆ సమయంలో అర్జునుడు కౌరవసేనను నుగ్గు చేశాడు. దుర్యోధనుడు రోషంతో 'పితామహా! నీవుండగా మనసైన్యం ఇంత దీనంగా మారటం తగునా?' అని నిష్ఠురమాడాడు. భీష్ముడి మనస్సుమీద దుర్యోధనుడు కొట్టిన చివరిదెబ్బ అది. దానికి పితామహుడు తీవ్రంగా స్పందించాడు. 'దుర్యోధనా! పదివేలమందిని చంపుతానని మాటఇచ్చాను. నా మాట నిలబెట్టుకొన్నాను. నీ ఋణం తీర్చుకొన్నాను. నా శరీరంలో ఇంక బలం తగ్గుతున్నట్లు తోస్తున్నది. ఈనాడు పాండవులు నన్నైనా చంపాలి, లేదా నేనైనా వారిని చంపాలి. అమర్త్యులు మర్త్యులచేత చస్తారా?' అని అంటూ ఆ రోజు తన మరణాన్ని సూచించాడు.

5. భీష్ముడికి యుద్ధంలో సాయం చేయాలని భావించిన ద్రోణుడికి శరీరం కంపించింది. బాణ ప్రయోగం చేయలేక అశ్వత్థామను సాయం చేయుమన్నాడు. కాని, అతడి సాయం కూడా భీష్ముడికి అందలేదు.

6. ధర్మరాజు ముఖంలో క్రోధం తాండవించింది. మధ్యాహ్నందాకా ప్రచండంగా యుద్ధం చేసిన భీష్ముడికి, అంతటితో తన శరీరాన్ని చాలించాలనే సంకల్పం కలిగింది. ఆ సంకల్పం లేకపోతే అతడికి సంకల్ప మరణానికి మార్గం తెరుచుకొనదు. ఆయనే అమర పదవిని పొందటానికి ముందుకు వచ్చాడు. పాండవప్రయత్నం ఫలోన్ముఖం కాజొచ్చింది.

7. ఆ తరువాతి పరిణామం అద్భుతం. భీష్ముడు నిజంగా యుద్ధం చేయటం మానాడు. దుర్యోధనుడు దుఃఖించకుండా నాటకమాడాడు. మధ్యాహ్నమయింది. యమతనయుడైన ధర్మరాజును సమీపించాడు. తన చివరి యాత్రకు దారి చూపుమని ఆత్మీయంగా అడిగాడు.

క. ‘జనియించినంత నుండియు । జనపతులం గ్రూరవృత్తిఁ జంపుచు నుండం
జనియెం గాలము; విసివితి । ననఘా! యే నింకఁ జాల నాసుర విధికిన్?

ఆ. ‘మీరు నా హితంబు గోరుదురేని శి । ఖండి మున్నుగాఁగఁ గడఁగి యంత
వట్టువారు నొక్కపెట్ట కాఁ బైఁ బడి । యేయుఁ; డింక దడవు సేయవలదు’. **(భీష్మ. 3. 366, 367)**

ధర్మరాజు కిచ్చిన వరాన్ని అతడే నిర్వహించుకొనాలని పేర్కొన్నాడు. తనను పడగొట్టటానికి ఉపాయంతోపాటు అనుమతిని కూడ నిచ్చాడు భీష్ముడు. కార్యం నిర్వహణ సంధిలో ప్రవేశించింది. ఇంక కథ అద్భుతంగా ముగియటమే తరువాయి. భీష్మడి జీవిత నాటకంలో చివరిరంగం చెల్లబోతున్నది. అది దుర్యోధనుడి దురదృష్టం. ధర్మరాజు అదృష్టం.

8. చివరికి పోరు దేవదానవ యుద్ధం వలె సాగింది. అర్జునుడు భీష్మడి విల్లు విరుగగొట్టాడు, అప్పుడు పితామహు డిట్లా మనసులో తలపోశాడు. ‘పాండవుల నందరినీ నా ఒక్కవింటితో గెలువలేనా? శ్రీకృష్ణుడు వీరికి అండగా ఉన్నాడు కాబట్టి బ్రతికిపోయారు. అది అట్లా ఉండగా పాండవులు కీడుపడి శ్రీకృష్ణుడిని వెంటబెట్టుకొని నా వద్దకు రాగా నా వధవిధానం చెప్పాను. ఇక యుద్ధం మాని శాంతంగా ఉంటాను. ఈ ఆర్భాటం ఎందుకు? అని అస్త్ర సన్న్యాసానికి సిద్ధమయ్యాడు.

9. భీష్ముడు రాజస సాత్త్విక ప్రవృత్తికలవాడు. పాండవులను అనుగ్రహించి, ధర్మవిజయాన్ని లక్షించి తన తనువును ఉపసంహరించుకొంటున్నా, అది బలహీనత కాదని లోకానికి చాటటానికి ఆయన చివరిగడియలలో బాగా తాపత్రయపడ్డాడు. అర్జునుడినీ దుర్యోధనుడినీ చూస్తూ దుర్యోధనుడితో చెప్పిన ఈ పద్యం ఆయన యుద్ధవీరాహంకారానికి అద్దం పట్టింది.

మ. ‘అని దేవాసుర కోటికైనను నశక్యం బిమ్మహావీరు మా
ర్కొన వీఁ డల్గిన మర్త్యులే యెదు రుదారుండైన యీ క్రీడి ద
క్కిన నిప్పాండవ సైన్య మింతయును ద్రుగ్గింపంగ నేఁ జాలుదున్;
విను సత్యం బిది వీనివింటి కెదురన్ విల్లెత్తలేఁ డెవ్వఁడున్’ **(భీష్మ. 3. 403)**

10. శరతల్పగతుడైన భీష్ముడు కౌరవపాండవుల శాంతిని కోరుకొన్నాడు. పితామహుడిని చేజేతులా చంపుకొన్న కౌరవపాండవులు భవిష్యత్తులో జరుగబోయే వీరవధను స్మరించి, వైరప్రవృత్తి మాని, శాంతిపథంలో పయనిస్తారేమో అని ఆశించాడు. కలిసి ఉండటానికి కలిసి రానివాడు దుర్యోధనుడు. అందువలన ఆతడికి ఇచ్చిన సందేశ మిది -

మ. ‘నరుఁ డత్యద్భుత విక్రముం డతని కానారాయణుం డాప్తుఁ; డె
వ్వరికిన్ వీరి జయింపరాదు; సమరావష్టంభముం దక్కి ధ
ర్మరతుండైన యజాతశత్రునకు నింద్రప్రస్థ మి; మ్మర్ధరా
జ్యరమం బొందుము మీరు గొందఱయినం జాకున్న నీకొప్పదే?’ **(భీష్మ. 3. 436)**

భీష్ముడు జీవితమంతా ఇదే సందేశాన్ని ఇంటాబయటా కౌరవులకు ఇస్తూనే ఉన్నాడు. వంశహితాన్ని కోరి లోక హితాన్ని భావించి ఆ మహాత్ముడు ఆశించిన వన్నీ కౌరవులు బూడిదలో పోసిన పన్నీరుగా మార్చారు. హస్తినాపురంలో ఒకప్పుడు రాచరికానికి రక్షగా నిలిచిన మహావీరుడు భీష్ముడు ఇప్పుడు మంచి చెప్పినా వినే నాథుడు లేని విపరీత దశలో అస్తమించవలసి వచ్చింది. చివరకు కౌరవపాండవు లిరువురూ ఆయన కోరికను నిర్లిప్తంగా విన్నారు. మౌనంగా వెళ్ళిపోయారు.

భీష్మడి సంకల్ప మరణం ఆయన ప్రభావం కౌరవ పాండవులపై అంతరించిన స్థితికి సంకేతం. అదే ఆ మహావీరుడి గంభీర విషాదాంతం.

8. కావ్యకళాశిల్పం:

మహాభారతంలో యుద్ధషట్కమని ప్రసిద్ధి గాంచిన ఆరు యుద్ధపర్వాలలో (భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు) భీష్మపర్వం మొదటిది. యుద్ధఘట్టాన్ని రచించే ఉభయ కావ్యకళా శిల్పానికి కూడ ఈ పర్వం ఒజ్జబంతి. తిక్కన మహామంత్రిగా, మహాదండనాయకుడుగా, వేదాంతిగా, మహాకవిగా తన ప్రతిభను యుద్ధపర్వాల రచనలో ప్రసిద్ధంగా ప్రదర్శించాడు. ధర్మజ శ్రీకృష్ణుల యుద్ధనీతి చిత్రణంలో మహామంత్రి ప్రజ్ఞ గోచరిస్తుంది. యుద్ధవ్యూహ చిత్రణంలో, యుద్ధరంగ ప్రదర్శనంలో తిక్కనగారి మహాదండనాయక ప్రతిభ ప్రకటితమౌతుంది. భగవద్గీతాది ఘట్టాలలో వేదాంత పరిపాకం వెల్లడి ఔతుంది. ఉభయకవి మిత్రుడుగా కావ్యాన్ని తీర్చిదిద్దటంలో మహాకవి వ్యక్తిత్వం తేటపడుతుంది. ఆరుపర్వాల యుద్ధకథను ఆసక్తి తగ్గకుండా రచించిన తిక్కన నేర్పు అనన్యసామాన్యం.

9. సంజయకథనం:

వేదవ్యాసుడి కరుణతో సంజయుడికి దివ్యదృష్టి, దివ్యశ్రవణం, దివ్యగమనం, శస్త్రాస్త్రాలకు గురికాకుండా ఉండటం అనే వరాలు సిద్ధించాయి. కురుక్షేత్ర యుద్ధాన్ని స్వయంగా చూచి వచ్చి, ధృతరాష్ట్రుడికి వినిపించే మహాకథన పద్ధతిని సంజయుడి పాత్రద్వారా కథకు కల్పించటం జరిగింది. దానితో సాక్షాత్తుగా చూచి వచ్చినట్లు చెప్పేగుణం, గ్రుడ్డివాడుసైతం సాక్షాత్తు చూస్తున్నట్లుగా అనుభవించే గుణం కావ్యకథనానికి ఏర్పడింది. యుద్ధకథకు ఈ పద్ధతి జవసత్త్వాలను కలిగించింది.

10. కావ్యేతిహాస లక్షణం:

ఇతిహాసంలో శ్రోత అడిగిన ప్రశ్నల నాధారంగా చేసికొని కథకుడు కథను విస్తరిస్తాడు. ఇతిహాసం పురాణం నుండి పుట్టింది కాబట్టి జగద్విజ్ఞానానికి సంబంధించిన అంశాలను సమయోచితంగా సంతరించుకొంటుంది. అయితే, అది కావ్యకళాసుందరంగా ఉండేటట్లు అమర్చటం కవిప్రౌఢిమ. యుద్ధషట్కం రాజ్యం కొరకు రాజులు యుద్ధం చేసిన కథను చెప్పేది. భూమిమీద రాజులకుండే ప్రీతి యుద్ధాలకు మూలం. ఆ సత్యాన్ని యుద్ధషట్కానికి నాందీపద్యంగా నిలపటం రచనాశిల్పం:

ఉ. ‘ భూమికిఁ గాఁగఁ బ్రాణముల పోక దలంపక రౌద్ర ఘోరసం
గ్రామము సేయుచుండుదురు రాజులు దొల్లియు నెంత దీపోకో
భూమి మునీంద్ర సంగతి సుబుద్ధము నీకు జగంబు నాకు నీ
భూమి తెఱంగు సెప్పుము ప్రబోధ నిగూఢముగా సమస్తమున్’. **(భీష్మ. 1. 15)**

11. స్మృతి కావ్యరేఖ:

సంజయుడు సమరభూమికి పోయి సర్వసేనాపతి పడిపోయినప్పుడే తిరిగి హస్తినాపురానికి వచ్చి ధృతరాష్ట్రుడికి ఆ కథనంతా చెప్పుతాడు. అంటే ఒక పర్వకథ చెప్పటానికే సంజయుడు పూనుకొంటా డన్నమాట! ఆ కథలో మొదటివార్త సర్వసేనాపతి విషాదవార్తగా ఉండటం సహజం. ఆ మహితాత్ముడి మరణానికో, పతనానికో ధృతరాష్ట్రుడు దుఃఖించటంతో పర్వం మొదలు కావటం పర్వారంభ శిల్పమౌతున్నది.

భీష్ముడు అంపశయ్యపై ఒరిగిన తరువాత సంజయుడు వచ్చి ఆ సంగతి ధృతరాష్ట్రుడికి చెప్పాడు. అప్పు డా గ్రుడ్డిరాజు భీష్ముడిని గురించి పరితపించిన విధం ఒక స్మృతికావ్య కళారేఖవలె భాసిస్తుంది. 10 పద్యాలలో సాగిన ఆ సన్నివేశం భీష్ముడికి కన్నీటి వీడుకోలే కాక, వీర నీరాజనం కూడా! ఉదాహరణకు.

క. ‘ ఆ శౌర్యం బా సత్త్వం । బా శీలం బా పరాక్రమాభీలత్వం
బా శుద్ధవ్రత మెందు న । నాశము లని భీష్ముఁ బెద్ద నమ్మితిమి గదే!’ **(భీ. 1. 56)**

ఈ పద్యం ధృతరాష్ట్రుడు బావురుమని దుఃఖించినట్లూ, భీష్మ పరాక్రమాన్ని కీర్తించినట్లూ ఉండి స్మృతికావ్య రచనా మర్యాదను గౌరవిస్తున్నది.

ఉ. ‘ నెట్టన యాపగాసుతుఁడు నేలకు వ్రాలె ననంగ విన్న నా
కట్టిఁడి వీను లేమి విను కాఱియ కోర్వవు? దుర్వినీతికిం
బుట్టిన యిల్లనై వినకపోవఁగ వచ్చునె యింక నాకు? నే
డిట్టగ నైతి; నెల్లవియుఁ దెల్లముగా విననేర్తు సంజయా!’ **(భీష్మ. 1. 65)**

ఆత్మనిందాత్మకంగా సాగిన ఈ మాటలలో ధృతరాష్ట్రుడి శోకతీవ్రత గోచరించి సహజ కరుణారస స్ఫూర్తి ప్రకాశించింది.

12. భీష్ముడి నోట గండం:

తొలినాటి యుద్ధం మొదలయ్యే ముందు భీష్ముడు రాజవీరుల నందరినీ ఉద్దేశించి ఇట్లా ఉత్తేజపరిచాడు.

క. ‘ ఆరయ వివృత స్వర్గ । ద్వారము రాజులకు నాహవం; బందు మహో
దారులు దొల్లియు నరిగిరి । మీ రీ మార్గమున నడవ మెయికొను టొప్పున్.’

క. ‘ ఇంటం దెవులునఁ జచ్చుట । కంటెను బాపంబు లొండు గలవె నృపులకున్?
బంటకలను పొలికల నిది । గంట నిధానంబు గంట గాదే మనకున్.’ **(భీష్మ. 1. 98, 99)**

యుద్ధవీరులను ఉత్తేజపరిచే మాటలు ఎన్నోరకాలుగా ఉండవచ్చును. ఉత్తేజపరిచే వీరుడి స్వభావాన్ని బట్టి కూడా అవి మారుతుండవచ్చును. కావ్యాలలో భావికథార్థవ్యంజకంగా పతాకలుగానో, గండాలుగానో అవి నిబద్ధించబడుతూ ఉండటం శిల్పమర్యాద. భీష్ముడి పలుకులలో గండస్ఫూర్తి సార్థకంగా స్ఫురించింది. యుద్ధంలో విజయాన్ని సాధించటానికి పూనుకొనండని చెప్పటం శుభారంభం. యుద్ధం విస్తృత స్వర్గద్వారం అని ప్రారంభించటం యుద్ధంలో వీరస్వర్గం పొందటమే రాజులకు ధ్యేయమంటూ ప్రబోధించటం ఎందుకో ఒక అపశ్రుతివలె వినిపిస్తుంది. దీనినిబట్టి కౌరవసేనలోని వీరులందరూ యుద్ధంలో స్వర్గప్రాప్తి పొందనున్నారనీ, విజయం పాండవులకు తథ్యమనీ ధ్వనించబడుతున్నది.

పాండవపక్షంలో ధర్మరాజు వీరులనందరినీ ఉద్దేశించి అన్న మాటలు భీష్మ వచనాలకంటె విశిష్టంగా ఉన్నాయి. ‘మనమీ రణంబునందు ధరణీరాజ్యంబు వడసెద మొండెఁ బూజ్యంబగు నాకలోక నివాసంబు గనియెద మొండె’ (భీష్మ. 1. 122) అన్నమాటలు ఔచిత్య శోభితాలు; సామ్రాజ్యలాభ సూచకాలు; భావికథార్థ వ్యంజకాలు; పతాకాస్థానాలు. నాయకుల తొలిపిలుపులలోనే భావికథ ధ్వనిత మయ్యేటట్లు రచించటం ఆఖ్యానశిల్పం.

13. సంగ్రామాలు : సంభాషణలూ :

పదిరోజుల యుద్ధాన్ని వర్ణించే భీష్మపర్వ కథనం ఎక్కడా విసుగు కలిగించకపోగా ఉత్కంఠావహంగా సాగుతుంది. దానికి రచనా నిర్మాణ పరమైన ఎన్నో కారణాలు ఉన్నాయి. వాటిలో మొదట పేర్కొనదగింది వర్ణనల సంభాషణల మేలికలయికతో కూడికొన్న మిశ్రకథనం, మొత్తంమీద యుద్ధకథనం ఎంత ఉందో పాత్రల సంభాషణలతో కూడిన కథ అంత ఉండటం ఈ పర్వవిశేషం. సంగ్రామ ఘట్టాలు మిక్కిలివేగంతో కూడిన క్రియాశీలాలై ఉంటాయి. సంభాషణ ఘట్టాలు సమస్యల సమీక్షాత్మకంగా సాగి పాత్రల స్వభావాలకు అద్దం పట్టుతాయి. ఈ వైవిధ్యం పర్వరచనా వైభవం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

14. మాట్లాడే పాత్రలు: పోట్లాడే పాత్రలు :

భీష్మపర్వంలో మాట్లాడే పాత్రలు కొందరే. పాండవులలో ధర్మజ కృష్ణార్జునులు, శిఖండి, కౌరవులలో భీష్మ ద్రోణ దుర్యోధన దుశ్శాసన కర్ణాదులు. వీరు తప్ప మిగిలిన రణవీరులందరూ పోరులో వీరకార్యాలు చేస్తారే కాని మాటలాడవలసిన అవసరం ఉండదు.

యుద్ధభూమికి సంబంధించనివారు ధృతరాష్ట్ర సంజయులు. వీరు సమీక్షకులుగా గోచరిస్తారు. ఈ మూడు రకాల పాత్రల వలన కథకు ముప్పేట బిగువు ఏర్పడింది. యుద్ధపర్వాలలో ఈ శిల్పం రసరమ్యం.

15. పాత్రల ప్రవృత్తులను బట్టి మాటలతీరు :

పాత్రల మనసులు, మాటలు, చేష్టలు వర్ణనాంశాలలో కీలకపాత్ర నిర్వహిస్తాయి. వాటివలన వారి తీరులు మారుతుంటాయి. తిక్కన ఆ పాత్రల ప్రత్యేకత అచ్చుపడేటట్లు సంభాషణలను తీర్చిదిద్దటం ఈ పర్వంలోని రచనాశిల్పం.

భీష్మపర్వంలోని పాత్రలను దాదాపు తొమ్మిది రకాలుగా వింగడించటానికి వీలుంది. లోకం త్రిగుణాత్మకం. 'త్రైగుణ్యోద్భవ మత్ర లోకచరితం నానారసం దృశ్యతే' అని కాళిదాససూక్తి. లోకంలో శుద్ధగుణ సమన్వితులు ఉండటం అరుదు. మిశ్రగుణాన్వితులు ఉండటం బహుళం, మిశ్రగుణపాత్రలు తొమ్మిది రకాలు. అవి: 1. సాత్త్విక సాత్త్వికాలు, 2. సాత్త్విక రాజసికాలు, 3. సాత్త్విక తామసికాలు, 4. రాజససాత్త్వికాలు, 5. రాజస రాజసికాలు, 6. రాజస తామసికాలు, 7. తామస సాత్త్వికాలు, 8. తామస రాజసికాలు, 9. తామస తామసికాలు. ఈ రకమైన పాత్రలు మహాభారతంలో దండిగా కనపడతాయి. భీష్మపర్వంలో మాట్లాడే పాత్రలలో వ్యాసమహర్షి సాత్త్విక సాత్త్వికుడు. ధర్మజ కృష్ణార్జునులు సాత్త్విక రాజసికులు. భీమ ధృష్టద్యుమ్నులు సాత్త్విక తామసికులు. భీష్ముడు రాజస సాత్త్వికుడు. కర్ణుడు రాజస రాజసికుడు. దుర్యోధనుడు రాజసతామసికుడు. ధృతరాష్ట్రుడు తామససాత్త్వికుడు. శిఖండి తామస రాజసికుడు. దుశ్శాసనుడు తామస తామసికుడు. వారి మాటల తీరు కూడా అట్లాగే ఉంటాయి.

1. వ్యాసమహర్షి శుద్ధతపశ్శీలి. సుఖదుఃఖాది ద్వంద్వాలకు అతీతుడు. లోకకళ్యాణాకాంక్షి. కౌరవుల పాండవుల కథలో తానొక పాత్ర అయి కూడా కామక్రోధాలకు లోనుగాక వలసినప్పుడెల్లా పిలిచినా పిలవకపోయినా వచ్చి వలసినవారికి హితాన్నిగాని, ధైర్యాన్నిగాని, శుభాశుభఫలాలను గాని, భవిష్యత్పరిణామాలను గాని చెప్పటం తన ధర్మంగా భావించాడు. ఎదుటివారు వినినా వినకపోయినా చెప్పదగింది చెప్పటం ఆ మహర్షిశీలం. నిర్మలస్ఫటికం వంటిది ఆయన మనసు, మాట. యుద్ధం మొదలు గాకముందే ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చి

క. ' కాలం బగుటయు నృపులకు । నాలము సమకూరె దీని కడలకు; మది; నీ
వాలోకింపఁగ వలసిన । నే లోనికి దివ్యదృష్టి నిచ్చెదఁ బుత్రా! ' **(భీష్మ. 1.6)**

అని అవ్యాజంగా పలికాడు. మొదటివాక్యం యోగులు తెలిసికొనదగింది. రెండవవాక్యం సంసారలంపటులు కోరుకొనేది. ఈ రెండింటిని ధృతరాష్ట్రుడి ముందుంచాడు. అతడు సాత్త్విక గుణప్రధానమైన మొదటి వాక్యాన్ని పట్టించుకొనలేదు. రెండవ వాక్యంలోని దివ్యదృష్టి అలవడితే అన్నదమ్ములు క్రూరంగా పోరాడి పరస్పరం చంపుకొనే ఘోర దృశ్యాలను చూచే ధైర్యం లేకపోయింది. అయితే సర్వం వినాలని కోరుకొన్నాడు. ప్రత్యక్షంగా చూడగలగటం రాజసం. దానికి చాలక వినగలగటం సాత్త్వికం. రాజులకు కాలం దాపురించింది. కాబట్టి యుద్ధం వచ్చింది అన్న సత్యం తెలిసికొంటే సాత్త్వికుడయ్యేవాడు. అప్పుడు ధృతరాష్ట్రుడికి శోకాదులు కలిగేవికావు. ఆ స్థితిని పొందలేక తామసికుడయ్యాడు. వినాలని కోరుకొని సాత్త్వికతను ప్రకటించి తామస సాత్త్వికు డనిపించుకొన్నాడు.

'ఇది ప్రాప్తకాలంబై వచ్చిన భూప్రళయంబు; దీనికి వగవం బనిలేదు; ధర్మో జయ తనుచు నిశ్చింతంబుగ నుండు; మేనును గురుపాండవుల కీర్తిఁ బ్రకటింపం గలవాఁడ' - (భీష్మ. 1. 8) నని వ్యాసమహర్షి తాను భారతేతివృత్తాన్ని మహేతిహాసంగా నిర్మించ సంకల్పించిన ద్రష్ట, స్రష్ట అయిన సాత్త్విక సాత్త్వికుడయ్యాడు.

2. సాత్త్విక రాజసులైన శ్రీకృష్ణ ధర్మరాజార్జునులు ముగ్గురూ మూడు రకాల ప్రవృత్తులకు ముచ్చటైన ఉదాహరణలు. పార్థసారథిగా రణరంగంలో ప్రవేశించి, విషాదమగ్నుడైన విజయుడిని వివేకవంతుడిని చేసి, ధర్మయుద్ధాన్ని అతడిచేత చేయించి, అడుగడుగున పాండవులకు మంత్రి అయి, గురువయి, దైవమయి దివ్యజీవితాన్ని సాగించిన కృష్ణుడు సాత్త్వికుడుగా కనపడతాడు. భక్తరక్షణ కళా ప్రవీణుడైన శ్రీకృష్ణుడు అర్జున రక్షణార్థమై పట్టనని చెప్పిన చక్రాన్ని ధరించి భీష్ముడి మీదకు రెండుసార్లు లంఘించాడు. మూడవనాటి యుద్ధంలో మొదటిసారి ప్రళయరుద్రాకారంతో విజృంభించాడు.

శా. ' అంహోమర్దనుఁ డా జనార్దనుఁడు మాద్యద్భీష్మ కుంభీంద్రుపై
సింహోల్లాస విభాసియై కవియు నుత్సేకంబు నాటోపమున్
రంహస్స్ఫూర్తియు దీప్తమూర్తియును సంరంభంబుఁ జూడన్ జగ
త్సంహారోన్ముఖుఁడైన రుద్రుగతి రౌద్ర ప్రక్రియం బొల్చినన్' . (భీష్మ. 2. 156)

తొమ్మిదవనాటి యుద్ధంలో కారుమేఘం వలె పైకి లేచాడు.

తే. ' లలిత పీతాంబరంబు విలాస మొప్ప । సింహనాదోద్భటం బగు చెలువుతోడ
మెఱుఁగు వెలుఁగును గర్జయు మెఱయ వచ్చు । కారు మొగిలనఁ గృష్ణు నాకార మొప్పె' .
(భీష్మ. 3. 264)

ప్రసన్నుడుగా శ్రీకృష్ణుడు సాత్త్వికుడు. యుద్ధ రౌద్రోద్రేకంలో రాజసికుడు. భక్తులైన పాండవుల పట్ల ప్రసన్నుడు. కౌరవపక్ష వీరులపట్ల కాలయముడు.

శ్రీకృష్ణుడు దివ్యలీలా విలాసుడు. ధర్మరాజు రాజనీతి కళావిశారదుడు. సహజప్రవృత్తి వలన ధర్మజుడు సాత్త్వికుడు. సత్యధర్మాలను సామ్రాజ్యం కంటె ఎక్కువగా భావించేవాడు. కాని ధర్మబద్ధంగా తనకు రావలసిన రాజ్యం కొరకు యుద్ధవ్యూహాన్ని పన్నిన రాజసికుడు. యుద్ధం ప్రారంభం కాక పూర్వం పెద్దల ఆశీస్సులను పొందితే శత్రువులను సులభంగా జయించవచ్చుననే లోకనీతిని పాటించి భీష్మాదుల వధోపాయాలను తెలిసికొనటానికి భీష్మాదుల వద్దకు నడచిపోయాడు. తొమ్మిదవనాటి రాత్రి పితామహుని వద్దకు పోయి వధోపాయాన్ని తెలిసికొన్నాడు. స్వీయ ధర్మ ప్రవర్తనతో పెద్దల గౌరవాదరాలను పొందాడు. శ్రీకృష్ణభక్తుడై అతడి వలన యోగక్షేమాలను పొందగలిగాడు. ధర్మనీతివర్తనంలో ధర్మరాజు సాత్త్వికుడు. శత్రు సంహార యత్నంలో కనపడని కాఠిన్యం కలవాడు. కార్యసాధనకై తాతను బలిపెట్టటానికైనా వెనుకాడడు. అందుకే అతడు సాత్త్విక రాజసికుడు. శ్రీకృష్ణుడిలో రాజసంకంటె సాత్త్వికం పాలెక్కువ. ధర్మజుడిలో సాత్త్వికం కంటె రాజసికం పాలెక్కువ.

అర్జునుడు శ్రీకృష్ణుడిపట్లా, ధర్మరాజు చెంత సాత్త్వికుడు. అతడు ఒంటరిగా ఉంటే రాజసికుడు. బంధుమిత్రులను చంపలేనని విషాదయోగముద్రను తాల్చిన అర్జునుడు లోకదృష్టిలో కారుణ్యమూర్తి అయిన సాత్త్వికుడు. కాని, తనకు నిర్దేశించబడిన ధర్మాన్ని ఆచరించకుండా విషాదాన్ని పొందటం ధర్మదృష్టిలో తామసికం. శ్రీకృష్ణుడి ప్రబోధం వలన తామసికావస్థనుండి రాజసికావస్థకు చేరుకొని, కాలపురుషుడి లీల వలననే శిఖండిని ముందుంచుకొని భీష్మసంహార కర్మను విధ్యుక్త ధర్మంగా నిర్వహించిన సాత్త్వికుడయ్యాడు. కృష్ణధర్మజ పార్థులలో పార్థుడు మూడవ తరగతికి చెందిన వాడనక తప్పదు. అయినా మహాభారతయుద్ధంలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

త్రిమూర్తుల వంటివారు వీరు. యుద్ధ సృష్టి ధర్మరాజనే బ్రహ్మది. యుద్ధ నిర్వహణ శ్రీకృష్ణుడనే విష్ణువుది. శత్రుసంహార రూపమైన రుద్రకర్మ అర్జునుడిది. వీరి ముగ్గురిలో సాత్త్వికానికి పోషణంగా రాజసం తరతమభేదాలతో రాణిస్తుంది.

భీష్ముడిపై శ్రీకృష్ణుడు చక్రంతో లంఘించిన రెండుసార్లు కూడా అర్జునుడు శ్రీకృష్ణుడిని ప్రార్థించి ఉపసంహరింపజేశాడు. ఆ మాటలలో అర్జునుడి సాత్త్విక రాజసతేజం సమృద్ధిగా ప్రకాశించింది.

ఉ. ‘ కోపము సంహరింపు యదుకుంజర ! పాండవకోటి కెల్లనుం
దేపవు గావె నీ; విటు లధీరతఁ బూనికి దప్పినం బ్రతి
జ్ఞాపరుఁడైన ధర్మసుతు శౌర్యము ధైర్యము బాహువీర్యమున్
రూపఱి పోక కాదె! యనురూపమె నీ కిది లోకనాయకా!’ **(భీష్మ. 2. 160)**

తిక్కనగారి రచనలో మిక్కిలి ప్రసిద్ధి కెక్కిన పద్యమిది. దీనిలో ఈ త్రిమూర్తుల స్వభావసంపుటి త్రివేణీ సంగమం వలె రాణించింది.

3. భీమ ధృష్టద్యుమ్నులు సాత్త్విక తామసికులు. మునుమును చూపిస్తే నరుక్కొని పోయేవాడు భీముడు. అతడికి సలహా లవసరంలేదు. చాలవరకు సహాయం కూడా అవసరం లేదు. సమయానుకూలంగా సమరంలో వీరవిహారం చేస్తూ శత్రుసంహారంలో అతడు దిట్ట. భీష్మాది మహావీరులను సైతం జంకులేకుండ ఎదుర్కొన్నాడు. సాయశక్తుల వారిని నిగ్రహించాడు. ధర్మరా జన్నట్లు అప్పుడప్పు డర్జునుడైనా భయపడతాడేమో కాని భీముడికి జంకు గొంకులు లేవు.

చ. ‘ అతని జయించునంచు మన మర్జును నెంతయు నమ్మియుండఁగా
నితఁడును సంగరంబున నుపేక్షకుఁ డయ్యె; వృకోదరుం డొకం
డ తఱికిఁ జొచ్చి దోర్బలము డాఁపక పోరెడు; నేమి సేయు నా
కితనిని నీతనిం దడవ నేటికిఁ? గయ్యపు జోలి మానెదన్!’ **(భీష్మ . 2. 7)**

అన్న మాటను పాలించటంలో భీముడు సాత్త్వికుడు. యుద్ధక్రీడలో తామసికుడు.

ధృష్టద్యుమ్నుడు పాండవ సర్వసైన్యాధ్యక్షుడు. అయినా కౌరవపక్షంలోని సైన్యాధ్యక్షుడు భీష్ముడివలె ఏనాటి సైన్య వ్యూహాన్ని ఆనాడు స్వతంత్రించి పన్నలేడు. అతడికి అర్జునుడో, ధర్మరాజో వ్యూహాన్ని సూచిస్తే, దానిని పన్ని నిర్వహిస్తాడు. అందువలన ఆతడు స్వతంత్ర ప్రవృత్తి గలిగినవాడుగా కనపడడు. అంతేకాదు. అతడు ఎన్నిరోజులు, ఎన్ని ఘట్టాలలో యుద్ధం చేసినా తనను దేవుడు పుట్టించింది ద్రోణుడిని సంహరించటానికే అని ముడిపెట్టికొని ఆలోచిస్తాడు. తదితర వీరులతో యుద్ధం చేస్తే సరిపోతుం దనుకొంటాడు.

చ. ‘ జగమెఱుఁగంగ ద్రోణు నని జంపుటకై సృజియించె ధాత న
న్నగఁటిమి గాఁగ దీని (బలుమాఱు ననంబనిలేదు; భీష్ముఁ డా
దిగఁ గురుసేనలోన గణుతింపఁగఁ బేర్చిన యోధకోటి నా
మొగమునఁ బడ్డ నెట్లడరి ముట్టెదనో యటుసూచుచుండుమీ! **(భీష్మ. 2. 17)**

అని ధర్మరాజుతో పలికిన మాటలు అతడి స్వభావాన్ని తేటపరుస్తున్నాయి. సాత్త్విక తామసిక వీరులలో భీముడుత్తముడు. ధృష్టద్యుమ్నుడు మధ్యముడు.

4. భీష్మపర్వ కథానాయకుడైన భీష్ముడు రాజస సాత్త్వికుడు. కౌరవులలో మేటివీరుడు. తన పరాక్రమం మీద గాఢమైన నమ్మకం ఉన్నవాడు. వ్రతదీక్షతోపాటు వీరదీక్ష కలవాడు. యుద్ధంలో పడిపోయే ముందు కూడా తన పరాక్రమాన్ని చెప్పుకొన్నవాడు.

తాను విల్లెత్తితే దేవాసురులలో ఎవ్వరూ ఎదిరించి విల్లెత్తలేరని ప్రకటించుకొన్న రాజసమూర్తి ఆయన. అయితే ఆయన మెచ్చుకొనే వీరుడు అర్జునుడు. ఆయన నమస్కరించే వీరుడు శ్రీకృష్ణుడు. వారిరువురు నరనారాయణ ఋషుల అవతారమని తెలిసిన విజ్ఞుడు. శ్రీకృష్ణుడి చక్రాయుధంచేత చంపబడే అదృష్టాన్ని మనసారా ఆహ్వానించిన మనస్వి. నారాయణుడైన కృష్ణుడిచేత కాకపోతే నరుడైన అర్జునుడి చేత నేలగూలటానికి సిద్ధమైన ఉచితజ్ఞుడు. పదిరోజుల యుద్ధం అతడిలోని రాజసాన్ని రాణింపజేసింది. పాండవులకు కంటనీరు పెట్టించింది. తాను బ్రతికి ఉండగా పాండవులకు విజయం లేదనిపించింది. అతడి రాజస స్వభావం కౌరవుల పక్షాన యుద్ధం చేయించింది. అతడి సాత్త్విక స్వభావం పాండవ విజయానికీ, స్వీయపతనానికీ దారితీసింది.

5. దుర్యోధనుడు దురహంకారి. కర్ణుడు సాహంకారి. కర్ణుడికి ప్రకట జీవితం ఎంత ఉన్నదో రహస్యజీవితం అంతే ఉన్నది. అర్జునుడిని సంహరిస్తానని దుర్యోధనుడిని ఉబ్బిస్తుంటాడు. కాని, ఎన్నడూ అతడిమీద విజయం సాధించలేకపోయాడు. భీష్ముడు తాను పార్థుడిని జయించలేనని ఒప్పుకొంటాడు కాని కర్ణుడు ఎన్నడూ ఆ మాట అనడు. ఎనిమిదవనాటి రాత్రి దుర్యోధనుడు కర్ణశకుని దుశ్శాసనులతో ఏకాంత సమావేశం జరిపి, భీష్మ ద్రోణ కృపాశ్వత్థామలు మనసుపెట్టి పాండవసేనలను మట్టుపెట్టటంలేదనీ, దానివలన కౌరవసేనలు క్రమంగా క్షీణించి పోతున్నాయనీ చెప్పి, కర్తవ్యాన్ని గురించి వారిని సలహా అడిగాడు. కర్ణుడు వెంటనే తాను యుద్ధం చేసి రాజును మెప్పించాలనే రాజసభావంతో -

క. ‘నరనాథ! యింక భీష్మని । దురమునకుం దేకు; మేను దోర్బల విభవో
ద్ధురతం బాండుకుమారో । త్కరముం దత్సేనలన్ మదం బడఁగింతున్’. **(భీష్మ. 3. 167)**

అని ప్రగల్భాలాడాడు. దుర్యోధనుడికి అతడి సలహా వేదవాక్యం. భీష్ముడివద్దకు పోయి భీష్ముడికి చేతకాకపోతే కర్ణుడికి అవకాశ మిమ్మని అడిగాడు. ఆ మాటలు భీష్ముడి మనసును తీవ్రంగా నొప్పించాయి. దానికి కారణం కర్ణుడి రాజస ప్రవృత్తియే.

అంపశయ్యమీద పరుండి ఉన్న భీష్ముడిని కర్ణుడు దర్శించాడు. భీష్ముడు ఆతడిని కురుపాండవులు కలిసి రాజ్యసంపద ననుభవించేటట్లు చూడుమని కోరాడు. ఆ యత్నం అతడి ప్రవృత్తికి విరుద్ధం. అందువలన రాజసంతో ఆ ప్రతిపాదనను త్రోసిరాజని తన యత్నానికి ఆశీస్సు లిమ్మని కోరాడు.

శా. ‘దైవాధీనము సర్వమున్ మనమతిం దప్పింపఁగా వచ్చునే?
నీ వింకన్ నను నొండు పల్కక పరానీకంబుపైఁ బంపు; మ
త్సేవాధర్మము నిర్వహించెద బలోత్సేకంబు లోకంబు సం
భావింపన్ విహరించెదన్ మురరిపుం బార్థుం దలంకించెదన్.’ **(భీష్మ. 3. 450)**

కర్ణుడు ‘దైవాధీనము సర్వమున్’ అన్న దానిని నమ్మే వేదాంతి కాదు. తన మతిని పెద్దల బోధలతో మార్చుకొనలేని సాహంకారి. భీష్ముడి సలహాను నిరాకరించిన నిర్మొగమాటి. శత్రుసేనలను చంపటంలో సాటిలేని మేటి వీరుడు భీష్ముడు ఆశీస్సులందిస్తే తానూ పాండవులనూ వారి సేనలనూ సంహరించగలననే ధైర్యం కలవాడు. ఇవన్నీ స్వీయ బల ప్రయోగానికి లోకం మెచ్చుకొనేందుకే చేయాలని ఆతడి అభిప్రాయం. ఈ మాటలన్నీ రాజసరాజసికు డనేవే.

6. దుర్యోధనుడు రాజస తామసికుడు. భీష్మపర్వంలో ఆ స్వభావం ముమ్మూర్తులా గోచరిస్తుంది. దుర్యోధను డెంతటి మహావీరుడో కాని, భీష్మద్రోణాది మహావీరులను స్వప్రయోజనం కొరకు ఉపయోగించుకొనే ఉద్ధతుడు. కౌరవవీరులను పాండవ పక్షపాతులేమో అని శంకిస్తాడు. అయినా, వారి చేతనే పాండవులను చంపించాలని భావిస్తాడు. ఏనాడైనా, ఏ ఘట్టంలోనైనా పాండవుల ధాటికి కౌరవసైన్యం బడలిపోతే, నిర్మొగమాటంగా భీష్మాదులను నిష్ఠురాలాడుతాడు. వారు మనసులో కటకటపడినా లెక్కచేయడు. వారిని రెచ్చగొట్టిగానీ, నిందించిగాని, నిష్ఠురాలాడిగానీ పాండవులను పరిమార్చటమే అతడి ధ్యేయం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మూడవనాటి యుద్ధంలో దుర్యోధనుడు భీముడిచేతిలో భంగపడ్డాడు. అందుకు అతడు సిగ్గుపడటానికి మారుగా భీష్మద్రోణాదులను నిష్ఠురా లాడాడు.

ఉ. ‘ ఉక్కున మూఁడులోకములు నొక్కటఁ దాఁకెన యేనిఁ బోర మీ
రొక్క (డొకండ గెల్చుటకు నోపుదు రశ్రమవృత్తి; నిట్టి మీ
ముక్కున నూర్పు గల్గ మన మోహర మీ దురవస్థఁ బొందునే?
యక్కట! మున్న పాండవుల కల్గఁగ నొల్లమి సెప్ప రైతిరే!

వ. అని పలికి గాంగేయుం గనుంగొని

ఆ. నాఁడె చెప్పఁగన్న నాకు రాధేయున । కెట్లు సూడఁ బోలె నట్లు వోలెఁ
బడిన పాటుఁ బడుదు మడియాస నీ చేత । భంగపడితి మింకఁ బలుకు లేల?’ **(భీష్మ.2.119-121)**

‘మీ ముక్కున నూర్పు గల్గ’ (మీరు బ్రతికి ఉండగా) అనటం, భీష్ముడిని కర్ణుడితో కలిపి చెప్పి నిందించటం దురహంకార పూరిత రాజసం.

ఆరవనాటి యుద్ధంలో కూడా భీష్ముడి కట్టెదుట దుర్యోధనుడు భీముడి చేతిలో భంగపడ్డాడు. అప్పుడూ భీష్ముడిని అనుమానంతో నిష్ఠురా లాడాడు.

ఆ. ‘ మనము పూఁచి పట్టి మొన లేర్చికొని పోవఁ బాండురాజ సుతులబలము గవిసి
గాసి చేయునదియుఁ గాక నీ ముందటఁ బవనతనయుచేతఁ భంగపడితి.’

క. ‘ నినుఁ గొని గెలిచెదఁ గుంతీ । తనయుల నని యున్న తలఁపు దప్పించెదు; నీ
వనిమిషులనైనఁ జేకొన । వనిమొన; వా రింత బలియు రగు టేమి యొకో!’ **(భీష్మ. 3.5,6)**

దుర్యోధనుడు భీముడిచేత భంగపడినప్పుడెల్లా భీష్ముడిమీద విరుచుకుపడటం అతడి రాజసస్వభావం. ఎన్ని నీతులు చెప్పినా, పాండవులను జయించటం అసాధ్యమని ఎన్నిసార్లు చెప్పినా దానిని తలకెక్కించుకొనలేకపోవటం రాజసస్వభావం. ఈ రెండూ కలిసిన రాజరాజు వ్యక్తిత్వం రాజసరాజసికం.

7. ధృతరాష్ట్రుడు తామస సాత్త్వికుడు. అతడి అదృష్ట మేమంటే వ్యాసభట్టారకుడు, శ్రీకృష్ణుడు మొదలైన మహామహులు నీతులు బోధించారు, దివ్యదర్శనా లిచ్చారు. వాటిని వినేవాడు. కాని, పుత్రవ్యామోహంతో వాటిని పాటించేవాడు కాడు. యుద్ధం ప్రారంభమయింది. వ్యాసాదులు పాండవవిజయాన్ని సూచించారు. కౌరవమరణం తప్పదని హెచ్చరించారు. అయినా, ఏదో ఆశ కౌరవవిజయం కొరకు మనసులో వెలుగొందుతుండేది. యుద్ధంలో జరిగే పరిణామాలు విని ఆశ్చర్యపోయేవాడు. దుర్యోధనుడివలెనే ధృతరాష్ట్రుడుకూడా భీష్మద్రోణులు అజేయులు కాబట్టి వారిని ప్రయోగించి పాండవులను సంహరించాలని దురాశపడ్డారు. ఆశలన్నీ అడియాసలు కావటం మొదలయ్యాయి. పెద్దలతోడ సత్సంగం చేసి హితోక్తులు ఓపికతో వినేలక్షణం అతడిలో ఎక్కడో మినుకు మినుకు మంటున్న సాత్త్వికం. పెద్దల మాటలను తెలిసి తెలిసి తిరస్కరించటం తామసికం.

ధృతరాష్ట్రుడు సంజయుడి నడిగే ప్రశ్నలు అతడి స్వభావానికి నిలువుటద్దాలు. మచ్చు కొకటి.

ధృత: ‘సంజయా! మనవైపు సైన్యం చచ్చిందనీ, నొచ్చిందనీ తరచుగా చెప్తుతావు. పాండవబలాలు తరుగక యుద్ధం చేయటం పలుమారులు చెప్తుతావు. అకటా! ఇదేమి మాయయో!’ అని సంజయుడినే అనుమానించగల తామసికుడు.

సంజ: మహారాజా! మనవారు తమ తమ సామర్థ్యాలకు తగినట్లు పోరాడుతున్నారు. అయినా నదులు సముద్రంలో కలిసినట్లు మన సేనలు పాండవసేనలో ప్రవేశించి వెలుపలికి రాలేకపోతున్నాయి. దీనిని నీవు తప్పుగా భావించకుము. నీవు చేసిన తప్పులవలన కలిగిన ఈ చేటుకు శోకించి లాభం లేదు.

సంజయుడి మాటలు విన్న తరువాత కూడా విజయాన్ని మనసులో ఆశించే ధృతరాష్ట్రుడు అక్షరాలా తామసికుడే.

8. శిఖండి తామస రాజసికుడు. భీష్మవధకొరకు పంతంపట్టి యుద్ధంలో పాల్గొన్న శిఖండికి స్వయంగా ఆయనను చంపే సామర్థ్యం లేదు. తనను చూచి భీష్ముడు నవ్వుతూ ఊరకుంటే, తన వెనుక నిలువబడి అర్జునుడు బాణాలు సంధించి భీష్ముడిని కూలద్రోశాడు. పేరు శిఖండిది ప్రతాపం పార్థుడిది. అయినా, ఆతడి పౌరుషోక్తులు కోటలు దాటుతుంటాయి. మొదటినాటి యుద్ధంలో భీష్ముడి పరాక్రమ ప్రదర్శనానికి ధర్మరాజు దీనుడై శ్రీకృష్ణుడి వద్దకు వచ్చి, నిరాశతో యుద్ధం చాలించి అడవులకు వెళ్ళుతానని పలికినప్పుడు శ్రీకృష్ణుడు పాండవవీరుల ప్రశంస చేసి అతడికి ధైర్యం చెప్పాడు. ఆ వీరులలో శిఖండి శ్రీకృష్ణుడి ప్రక్కనే చెప్పబడటం విశేషం.

కృష్ణ: ఉ.' నెవ్వగ యింత యేల? విను, నీ కెదు రెవ్వరు? నీదు తమ్ములం
దెవ్వరు సూచినన్ జగము లిన్నియు గెల్వఁ గలారు లావునం;
గ్రొవ్విన భీష్ము నోర్చు రణకోవిదుఁడైన శిఖండి యేను నీ
కొవ్వనివారి నెల్లఁ గ్రమయుక్తి లయం బొనరింతు నెమ్మెయిన్.' **(భీష్మ. 2. 11)**

భీష్ముడిని ఎదిరించి చంపాలన్న సంకల్పం రాజసికం. శిఖండి వెనుక నిలబడి బాణాలు వేసింది పార్థుడనీ, శిఖండి కా పరాక్రమ మెక్కడున్నదనీ భీష్ముడు దుశ్శాసనుడికి చెప్పిన తీరు అతడిని నవ్వులపాలు చేసింది.

సీ. ' అశనికల్పము లివి యర్జును బాణముల్ । గాని శిఖండివి గావు సుమ్ము!
కర్కటి గర్భంబుకరణి గాత్రము వ్రచ్చు । నిట్టివి వీనికి నెందుఁ గలవు?
బ్రహ్మదండంబుల పాటియై మర్మంబు । లిట్టు నో నాఁటునే యితనిచేత!
జముదూత లట్ల ప్రాణముల వెలార్పంగ । నీ ద్రుపదాత్మజుఁ డెన్నఁ డేసె?

ఆ. దృఢ విముక్తములును, దీప్తాకృతులు, లక్ష్య । శుద్ధిమంతములును, సునిశితములు
నైన నారసంబు లతనివి గాక యీ । తనివి యగునె యెవ్విధమునఁ జూడ! ' **(భీష్మ. 3. 405)**

అందుకే కాబోలు భీష్ముడు శిఖండి ఎదురుపడగా ఒక నవ్వు నవ్వాడు. ప్రతాపం కంటె మించిన ప్రసిద్ధి వచ్చిన అదృష్టవంతుడు శిఖండి. తన శక్తి తాను తెలిసికొనలేకపోవటం తామసికం, అయినా భీష్మవధకై జీవితాన్ని అంకితం చేయటం రాజసికం.

9. తామసిక తామసికుడు దుర్యోధనుడి తమ్ముడు దుశ్శాసనుడు. అన్నగారి ఆజ్ఞను అక్షరాలా పాటించటమే ఆతడి జీవితవ్రతం. అందుకే ఆజ్ఞలన్నీ అన్న అతడికే ఇస్తాడు. భీష్మపర్వంలో దీనికి సంబంధించిన కావ్యకళాశిల్పం ఒకటి ప్రస్ఫుటంగా కనపడుతుంది. యుద్ధారంభంలో దుర్యోధనుడు భీష్మరక్షణ బాధ్యత దుశ్శాసనుడికి అప్పగించాడు. పదిరోజులూ భీష్ముడి చుట్టూ తానుగానీ, మహారథికులను గానీ రక్షగా నిలిపాడు. చివరినాడుకూడా చివరివరకు భీష్మరక్షణలో నిలిచి అన్నతోపాటు చివరిగడియలలో ఆయన వద్దనే ఉన్నాడు. ఆయన బాణాలకు గురియై నేలపై ఒరిగే సన్నివేశానికి ఆయనే సాక్షిగా నిలిచాడు. అన్నమాట జవదాటని తమ్ముడే అయినా స్వతంత్ర వ్యక్తిత్వం లేనివాడు కావటంతో తామసికుడైనాడు. భీష్మరక్షణం చేయలేక తామసికు డనిపించుకొన్నాడు. ఆయన చరిత్రనంతా గమనిస్తే ముమ్మాటికి తామస తామసికుడే.

మాట్లాడే పాత్రలలో గల ఈ వైవిధ్యం కథకు వైవిధ్యంతో కూడికొన్న చైతన్యశక్తిని ప్రసాదించింది.

16. ధర్మజ దుర్యోధనుల సాధింపు మాటలు :

నాయక ప్రతినాయకులైన ధర్మజ దుర్యోధనులు ఎదుటి వారి చెవులు పిండి పనిచేయించుకొనే దిట్టలు. అయితే, వారు పాటించే పద్ధతులు, మాట్లాడే మాటలు వారి వారి స్వభావాలకూ, వ్యూహాలకూ అనుగుణంగా ఉంటాయి. భీష్మాదులను శ్రీకృష్ణసహాయంతో అర్జునుడు సంహరించి విజయాన్ని చేకూరుస్తాడని నమ్మికతో యుద్ధానికి ధర్మజుడు దిగాడు. అందువలన భీష్మాదులవలన పాండవసైన్యం భంగపడితే ధర్మజుడు బాధపడేవాడు. అంతటితో ఆగక శ్రీకృష్ణుడికి నివేదించుకొనేవాడు. ధర్మరాజుకు కోపంవస్తే మొదట రాజ్యాన్ని వదలుకొంటానంటాడు, యుద్ధాన్ని మానేస్తానంటాడు. చివరకు అడవులకు పోయి ఆకులలాలు తిని తపోవృత్తితో జీవిస్తానంటాడు. ఇవన్నీ ధర్మజుడి సాత్త్విక నిష్ఠురాలు. శ్రీకృష్ణుడో, అర్జునుడో, చివరకు ధృష్టద్యుమ్నుడో ధర్మరాజుకు ధైర్యం చెప్పి, మరునాడు యుద్ధం చేసి ఆయనకు ధైర్యం కలిగించేవారు. వారు కూడా చాలరనుకొంటే భీష్ముడి వద్దకే పోయి మనవిచేసికొనేవాడు. ఎప్పుడైనా ఎక్కడైనా ధర్మరాజు సాధింపుమాటలు కార్యసాధన వ్యూహానికి పరోక్షపోషకాలుగా ఉండేవి. వాటివలన సత్ఫలితాలు సాధించబడేవి. అందుకే ధర్మరాజు ధర్మనీతివర్తనుడయ్యాడు. మెత్తని పులిగా పేరుగాంచాడు. ధర్మరాజు మెత్తని పులి అయితే దుర్యోధనుడు బెబ్బులి. అతడు భీష్మ ద్రోణ కృపాశ్వత్థామలను నమ్మి యుద్ధంలోకి దిగాడు. వారివలన పాండవనాశనం జరుగుతుందని కర్ణుడిని యుద్ధం చేయటానికి భీష్ముడు అంగీకరించకపోయినా ధైర్యంగా ఉన్నాడు. అయితే, భీష్మాదులందరూ ప్రతి దినం పాండవుల ప్రాణాలు తీసే యత్నం చేసేవారు కారు. పాండవులతో యుద్ధం చేసినా వారిని దయతో వదలిపెడుతున్నట్లుగా దుర్యోధనుడికి తోచేది. పైపెచ్చు భీమాదులతో దుర్యోధనుడు భంగపడినప్పుడు కూడ ప్రతీకారం తగినంత మోతాదులో ఉండేది కాదు. ఈ కారణాలకు తోడు, అనుమాన జాడ్యం తోడై దుర్యోధనుడు భీష్ముడిని నిష్ఠురాలాడేవాడు. అట్లా అతడు పలికినప్పుడెల్లా భీష్ముడిని ఒక్కొక్క అడుగు దూరం చేసికొనేవాడు. చివరకు కర్ణుడిమీద అభిమానంతో భీష్ముడిని సేనాసారథ్యం వదలుకొమ్మని అవమానంగా మాట్లాడాడు. క్రూరమైన మాటలతో భీష్ముడిని దుర్యోధనుడే మొదట కూల్చాడు. ఆ తరువాత భీష్ముడు అతడి మాటలు భరించలేక మరణించటానికి ఉద్యుక్తుడయ్యాడు. మరణరహస్యం ధర్మరాజుకు చెప్పి 'చంపి పుణ్యం కట్టుకొనం'డని బ్రతిమలాడుకొన్నాడు. అతడి అంగీకారంతోనే అర్జునుడు భీష్ముడిని అంపశయ్య నెక్కించాడు.

మాట లన్నా మనసులు దోచుకొనే నేర్పు ధర్మరాజుది. మాటలతో మమతలను దూరం చేసికొనే తొందరపాటు దుర్యోధనుడిది. ఇద్దరూ కార్యసాధకులే. కాని ఒకరు సాధించినట్లు మాట్లాడినా ఫలసాధన చెడకుండ చూచుకొంటారు. మరొకరు తిట్టి పెట్టించుకొందామని ప్రయత్నించి అసలుకే మోసం తెచ్చికొంటారు. ఈ రెండు ప్రధాన పాత్రల స్వభావ సహజ వైరుధ్యంవలన కథకు తులనాత్మక శిల్పం సాధించబడింది.

17. దశవిధ వర్ణనలు :

యుద్ధపర్వాలు సాధారణంగా వర్ణన ప్రధానాలు. వినేవారి కన్నులకు కట్టేటట్లు చెప్పటంలో వర్ణనం బలమైన వాహికగా తోడ్పడుతుంది. పదిరోజుల యుద్ధం ప్రవర్తిల్లే భీష్మపర్వంలో పదిరకాల వర్ణనలను గుర్తించవచ్చును. వాటిని ఈ విధంగా పేర్కొనవచ్చును.

1. సహజ వర్ణనలు	2. రసానుగుణ వర్ణనలు	3. అలంకృత వర్ణనలు
4. వీరపురుష వర్ణనలు	5. వ్యూహ వర్ణనలు	6. రణరంగ వర్ణనలు
7. సన్నివేశ వర్ణనలు	8. వీరోక్తుల వర్ణనలు	9. అభినయ వర్ణనలు

10. ప్రకృతి వర్ణనలు వీటిని సహృదయులు ఆయా సందర్భాలలో గుర్తించటం సులభం. అయినా మచ్చుకొకటి రెండు ఉదాహరణలు.

18. సహజ వర్ణనలు:

యుద్ధ క్రియా వర్ణనలు సహజ వర్ణనలుగా నిబంధించినప్పుడే పఠితలకు దృశ్యమానాలౌతాయి. ఇటువంటివి భీష్మపర్వంలో కోకొల్లలు. మచ్చుకు - వికర్ణాభిమన్యుల యుద్ధం.

చ. ‘ తఱిమి వికర్ణుఁ డప్డు తనుఁ దాఁకిన నా యభిమన్యుఁ డల్గి బి
ట్టఱ విలు ద్రుంచి, సారథి వడం దురగంబులఁ జావమోది క్రొ
మ్మెఱుఁగులతోడఁ దద్ధ్వజము మేదినిఁ గూలగఁ జేసి యంగముల్
గిఱికొన బాణముల్ నినిచెఁ గేలిమెయిన్ బటుదర్ప మేర్పడన్’. **(భీష్మ. 2. 402)**

అభిమన్యుడు వికర్ణుడిని నిరాయుధుడిని చేసిన క్రమాన్ని సహజంగా వర్ణించాడు తిక్కన. విలు త్రుంచటం, సారథిని పడగొట్టటం, గుర్రాలను చావమోదటం, ధ్వజాన్ని కూల్చటం, బాణాలను మేన నాటటం - అనే క్రియలలోని విరుపు సవ్వడులను శకటరేఖ ప్రాసలో ధ్వనింపజేయటం రచనాశిల్పం.

19. రసానుగుణ వర్ణనలు :

యుద్ధ ఘట్టాలలో సాధారణంగా వీర రౌద్ర భయానక బీభత్సాద్భుత కరుణ రసాలు ప్రవర్తిల్లుతూ ఉంటాయి. ఆ రసవిభావానుభావాదుల వర్ణనం కావ్యరసపోషకం. మచ్చుకొక్క ఉదాహరణం.

వీరరసం: రెండవనాటి యుద్ధంలో అర్జునుడు భీష్ముడిపై విజృంభించటం:

మ. ‘ మనసేనం గలగంగఁ జేయుచు మదిన్ మందాకినీ నందనుం
డు ననుం గైకొనకున్నవాఁ డితని యాటోపం బడంగించెదన్
నిను మెప్పించెదఁ జూడు ఖేచరులు వర్ణింపన్ విజృంభించెదన్
దనుజధ్వంసి! రథంబు వే పఱపు ముద్య ద్విక్రమ ప్రక్రియన్’. **(భీష్మ. 2. 31)**

రౌద్రరసం: శ్రీకృష్ణుడు భీష్ముడిపై లంఘించటం

మ. ‘ ధరణీ చక్రము గ్రక్కునం గదల దిగ్దంతావళశ్రేణి కం
ధరముల్ మ్రొగ్గఁబడన్ దిశావలయ ముత్కంపంబుగా నీ బలం
బురులం బాఱఁగ భీష్ముపైఁ గవిసె; రౌద్రోద్రేకముం జూచి ఖే
చరలోకంబును సంచలింప హరి చంచద్బాహుఘోరాకృతిన్’. **(భీష్మ. 3. 263)**

భయానకం: శ్రీకృష్ణుడి భయానకమైన విశ్వరూపం దర్శించిన అర్జునుడి మాటలు.

మ. ‘ అనలజ్వాలలు పర్వు నీ ముఖములం దా ధార్తరాష్ట్ర ప్రజం
బును భీష్మాదులు నిద్దెసం గలుగు నీ భూపాలలోకంబు గ్ర
క్కున నొక్కుమ్మడి వచ్చి చొచ్చెదరు నాకుం జెప్పవే! యెవ్వరో
యని శంకించెద నిన్ను భూరి కరుణాయత్తైక చిత్తుండవై.’ **(భీష్మ. 1. 214)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బీభత్సం :

తే. 'ధరణి నెత్తుటఁ దోఁగి యాభరణకాయ । శస్త్రఖండ జాలంబులఁ జాల నొప్పెఁ
బలుచ గాకుండఁ గుంకుమ మలఁది పెక్కు । దెఱఁగు తొడవులు దొడిగిన తెఱవవోలె'.

(భీష్మ.3. 162)

బీభత్స దృశ్యాలను శృంగారోపమలతో రమణీయంగా మార్చటం తిక్కన వర్ణన శిల్పం.

అద్భుతం: అర్జునుడు అద్భుతమైన శ్రీకృష్ణుడి విశ్వరూపం దర్శించి ఆశ్చర్యపడటం.

సీ. దేవ! నీదగు దివ్య దేహంబునందు సు । రాసురగంధర్వు లాది గాఁగఁ
గల దేవయోనులుఁ గమలాసనుండును । సచరాచరంబైన జగము నాకుఁ
దోఁచె, మొగంబులు దోర్దండములును బా । దములుఁ గన్నులు ననేకములు గంటి
మకుటాది భూషణ నికరంబుఁ జక్రగ । దాద్యాయుధములు మాల్యాంబరములుఁ

ఆ. బెక్కు గానవచ్చె నక్కజమై యిది । నడుము మొదలు దుది యనంగరాదు
తేజ మప్రమేయ దేదీప్యమాన ని । ర్వికృతి మహిమ దుర్నిరీక్ష్యమయ్యె!'

(భీష్మ. 1. 211)

కరుణరసం: భీష్ముడి మరణవార్త విని ధృతరాష్ట్రుడు శోకించాడు.

సీ. ' అతఁడు నొచ్చినతఱి నడ్డంబు సొచ్చెద మని వచ్చువారు లేరైరె యచట?
నడరి పోరాడక యన్ని యక్షౌహిణు । లొప్పరికించెనె యొకనిఁ గలన?
నతని నోర్వఁగఁ జాల వని నిశ్చయించితి । మంతకు నోపెనే యరిబలములు?
ద్రోణుండుఁ గృపుఁడును ద్రోణసుతుండును । శల్యుండుఁ గ్రేడించి చనిరె యపుడు?

తే. పాండుసుతులు శిఖండియుఁ జండశక్తి । మెఱయ నొక్కటఁ పైఁ బడ్డ వెఱచి తాత
విడిచి నా పుత్త్రులందఱు విఱిగి యడవిఁ । గలిసిరొకొ యాతనికిఁ బడవలసె నకట!' (భీష్మ. 1. 58)

20. అలంకృత వర్ణనలు :

తిక్కన ఉపమ, రూపకం మొదలైన అలంకారాలలో వర్ణ్యవస్తువును రమణీయంగానూ, ఆస్వాదమధురంగానూ మారుస్తాడు. సంజయుడు భీష్ముడి మరణాన్ని సూర్యాస్తమయంగా రూపకం చేసి చెప్పి శోకించాడు.

ఆ. ' తీవ్ర బాణజాల దీప్తులు పరఁగించి । పాండుతనయ సైన్య బహుళ తమము
లీలఁ బదిదినంబు లోలి వినోదించి । యధిప! భీష్మభానుఁ డస్తమించె'.

(భీష్మ. 1. 47)

తే. ' చాపవక్త్రుండు భల్లదంష్ట్రావితాన । ఘోరమూర్తి నారాచనఖుండు ఖడ్గ
జిహ్వికా భీషణుఁడు నరసింహమూర్తి । గాక కేవల నరుఁడె గంగాసుతుండు!'

(భీష్మ. 1. 48)

' ఇట్టిది భీష్మ మహాభ్ర; మెట్లడంగించెనొకో శిఖండి యను కృత్రిమ వాయువు దాఁకి దైవమా! '

(భీష్మ. 1.52)

'భీష్ము(డను సాగరముం గడవంగ, నీ(ద(గా నేరిమి యెట్లొకో కలుగనేర్చె శిఖండికి?'-

(భీష్మ. 1. 54)

రూపకానుప్రాణిత ఉపమాలంకారం:

తే. జలరుహంబులు పాండవ సైనికుల ము। గంబు లట్టుల విన్ననై కాంతి దఱి(గె;
వారి మనముల భీత్యంధకార మడరు। కరణి(జీ(కటి యెడనెడ(గవియుదెంచె.'

ఉపమాలంకారం: క్రౌంచవ్యూహాన్ని భీష్ముడు భేదించిన విధం.

ఉ. 'ఱెక్కలు సించి కంఠమున ఱేకులు వాపి శిరంబు వ్రచ్చి పే
రుక్కున(గ్రౌంచ చందమగు నొడ్డు గలంగ(గ(జేసి భీష్ము(డే
దిక్కున(దానయై దిశలు దీటుకొనన్ శరకోటి నింప(గెం
పెక్కిన కంటిక్రేవ చెలు వెక్కుడు సేయ(గ(గ్రీడి కృష్ణుతోన్'. **(భీష్మ. 2.30)**

తే. 'ఆపగానందనుండు మురారియురము। బాణ వితతిని భేదింప శోణితమున(
దో(గి యత(డొప్పె(దలిరాకు దుఱగలింప। మెఱయు నవపారిజాతంబు తెఱ(గు దాల్చి'.

(భీష్మ. 2. 43)

ఇట్లు యుద్ధ వర్ణనలను అలంకృతం చేసి పఠితలకు దర్శనీయం చేశాడు తిక్కన. (వివరాలకు వ్యాఖ్య చూడండి).

21. వీరపురుష వర్ణనలు:

యుద్ధ పర్వాలలో వీరపురుష వర్ణనం ఒక ప్రత్యేక వైభవం. వారు సజీవవీర రౌద్రరస విభావాలు. వారి వర్ణన రసోన్నిద్రం. ప్రతాప ప్రదర్శనం చేసిన వీరులను సహజంగానో, అలంకృతంగానో వర్ణించక తిక్కన వదలలేదు. ఆ వర్ణనలు పద్యరత్నాలు. ఉదాహరణకు కొన్ని.

1. భీమపరాక్రమం. (క్రియా రమణీయం)

శా. 'కుంతీసూను(డు సింహనాదమున దిక్కుల్ పిక్కటిల్లంగ దు
ర్దాంత స్ఫారగతిం గరిం గదిసి రౌద్రస్ఫూర్తి లంఘించి త
ద్దంతంబుల్ వెస నెక్కి త్రొక్కి తునిమెన్ ధారాళరక్త చ్ఛటా
క్రాంతంబై నభ మొప్ప వాని(బటు ఖడ్గ స్ఫార ధారాహతిన్'. **(భీష్మ. 2. 68)**

2. అలంబసుడు ఇరావంతుడిని చంపటం

చ. 'అడరిన దానవుండు గరుడాకృతి(గైకొని మాయతోడ లో(
బడ భుజగంబులం బొదివిపట్టి రయంబున మ్రింగి యప్డు చే
డ్పడు నరుపట్టికంఠము గృపాణమునం దెగవైవ మేదినిం
బడి మొగమొప్పె(బూర్ణశశిభాతి వికారము లేని చెన్నునన్ '. **(భీష్మ. 3. 105)**

3. భీష్మ ప్రతాపం.

ఉ. ‘ శాంతనవుం డనేక బలసంతతి నుద్భట శౌర్యసారదు
ర్దాంత పరాక్రమ స్ఫురణ దాఁకి సముజ్జ్వల శాతసాయక
క్రాంత పరీత నిర్మథిత కంపిత పాతితమూర్తిఁ జేసి య
త్యంత రయంబునం దన రథంబు గతుల్ మెఱయం బ్రదీప్తుఁడై ’. **(భీష్మ. 3. 246)**

22. వ్యూహ వర్ణనలు:

యుద్ధాలలో వ్యూహాలు ఆయువు పట్టులు. వాటిని వర్ణించేటప్పుడు తిక్కన తీసికొనే జాగ్రత్తలు సవ్యంగా ఆయన అనుభవం నుండి పుట్టుకొని వచ్చినట్లుంటాయి. భీష్మపర్వంలో ఉభయపక్షాలు పన్నిన వ్యూహాలు:

	కౌరవులు		**పాండవులు**
మొదటినాడు:	మానుషవ్యూహం	-	అచల వ్యూహం
రెండవనాడు:	త్రిశాఖావ్యూహం	-	క్రౌంచవ్యూహం
మూడవనాడు :	గరుడ వ్యూహం	-	అర్ధచంద్రాకార వ్యూహం
నాల్గవనాడు:	తుముల యుద్ధవ్యూహం	-	తుముల యుద్ధవ్యూహం
ఐదవనాడు:	మకరవ్యూహం	-	శ్యేన వ్యూహం
ఆరవనాడు:	క్రౌంచ వ్యూహం	-	మకర వ్యూహం
ఏడవనాడు:	మండల వ్యూహం	-	వజ్ర వ్యూహం
ఎనిమిదవనాడు:	కూర్మ వ్యూహం	-	శృంగాట వ్యూహం
తొమ్మిదవనాడు:	సర్వతోభద్ర వ్యూహం	-	దృఢ వ్యూహం
పదవనాడు:	శిఖండి వ్యూహం	-	భీష్మ వ్యూహం

వ్యూహరచన విజయ సోపానాలలో మొదటిది. ఇరుపక్షాల వారు విజయావకాశాలను అన్వేషించే పద్ధతులకు వ్యూహాలు సూచికలు. వ్యూహాలకు వివిధాకృతు లుంటాయి; వాటికి తగిన ప్రకృతు లుంటాయి, వాటిని సంవిధానం చేసే పద్ధతులూ, భేదించే విధానాలూ ఉంటాయి. ఒకరు తమకున్న శక్తియుక్తులను బట్టి ఒక వ్యూహం పన్నితే, మరొకరు దానిని భేదించగలిగిన మరొక వ్యూహాన్ని తమకున్న వనరులతో నిర్మించి ప్రతిఘటిస్తారు. ఒక్కొక్క వ్యూహానికి ఒక రూపప్రణాళిక ఉంటుంది. అందులో ముఖ్యస్థానా లుంటాయి. వాటిలో ముందుగా దాడిచేసే వీరులు, ఆ తరువాత రక్షచేసేవీరులు, సాయం చేసే వీరులు, అండగా నిలిచే వీరులు, పోరును ఉద్ధృతం చేసేవీరులు, పారిపోయే వారిని గూడగట్టే వీరులు అని విభాగాలు గోచరిస్తుంటాయి. వారిని ఎన్నిక చేసి ఆయా కీలక స్థానాలలో నిలపటం, వారి సహాయకులను ఆయా ప్రాంతాలలో కేంద్రీకరింపచేయటం, అవసరం వస్తే వ్యూహంలోని వివిధ కేంద్రాలకు వేగంగా వెళ్ళగలిగినవారిని సమన్వయదృష్టితో సన్నద్ధం చేయటం వ్యూహాకృతి నిర్మాణంలో ముఖ్యాంశాలు. స్వీయపక్ష బల ప్రదర్శనానికి అనువైన పద్ధతికి ప్రాధాన్య మివ్వటమే వ్యూహస్వభావం. ఈ దృష్టితో వ్యూహాలు ప్రధానంగా రెండు విధాలుగా కనపడతాయి. ఒకటి - దాడికి పనికి వచ్చేది. రెండవది - రక్షణకు పనికివచ్చేది. కౌరవ పాండవులు వ్యూహరచనలో ఈ అంశాన్ని కూడా లెక్కకు తీసికొన్నారు. ఏ విధమైన వ్యూహమైనా శత్రువ్యూహాన్ని భేదించే లక్ష్యంతోనే సంవిధానం

చేయబడుతుంది. ఒక్కొక్కసారి బలమైన వ్యూహం కూడా బలహీనవ్యూహకర్తలు ప్రదర్శించే నేర్పరితనంవలనకాని, యుద్ధక్రీడా ప్రయోగంవలనకాని సత్ఫలితాలను సాధించలేక వీగిపోవచ్చును. అంతమాత్రాన యుద్ధవీరులు అశాంతికి గురికాకుండ మరునాడు ఎత్తుకు పైయెత్తు వేసికొంటారు. యోగ్యమైన వ్యూహాన్ని కూర్చుకొంటారు. యుద్ధంలో వ్యూహం రక్షాకవచం వంటిది. దానిని తాల్చవచ్చును, చీల్చవచ్చును. వీరుల పౌరుషం కవచంలో ఉండదు కదన పాండిత్యంలో ఉంటుంది.

కౌటిల్యుడి అర్థశాస్త్రంలోని దశమాధికరణంలో సాంగ్రామికాంశాల వివరణం ఉన్నది. ఆ సందర్భంలో వ్యూహాలను గురించి విశేషాలెన్నో చెప్పబడిఉన్నాయి. వాటిని కొన్నింటిని అన్వయించుకొంటే భీష్మ పర్వంలోని వ్యూహాల ప్రయోగ ప్రయోజన ఫలితాంశాలను గ్రహించవచ్చును.

శ్లో. " ఏకం హన్యాన్న వా హన్యాదిషుః క్షిప్తో ధనుష్మతా।
ప్రాజ్ఞేన తు మతిః క్షిప్తా హన్యా ద్గర్భగతా నపి॥". **(కౌటిలీయార్థశాస్త్రమ్. పుట. 788)**

(ధానుష్కుడు విడిచిన బాణం ఒకనిని చంపవచ్చును, చంపకపోవచ్చును. కాని బుద్ధిమంతుడు విసిరిన మతి (ఆలోచన) మాత్రం గర్భంలో ఉన్నవాళ్ళని కూడ చంపివేస్తుంది). (డా. పుల్లెల శ్రీరామచంద్రుడిగారి బాలానందిని వ్యాఖ్య: పుట. 788)

అనే కౌటిల్యుడి సూక్తి ప్రకారం సైన్యవ్యూహం ప్రాజ్ఞుడైన వీరుడి ఆలోచనకు యుద్ధ క్రీడాకృతి. కౌరవపక్షంలో భీష్ముడు వ్యూహకర్త. పాండవ పక్షంలో అర్జున ధర్మజ కృష్ణ ధృష్టద్యుమ్నులు కర్తలు. కౌరవపక్షంలో ఒక్క రాలోచించి వ్యూహం పన్నితే పాండవపక్షంలో నలుగు రాలోచించి ప్రతివ్యూహం రూపొందించేవారు. ఆ క్రమం ఆలోచనా క్రమం కూడా.

"సర్వ దేశకాల ప్రహరణమ్ ఉపాంశు దణ్డ శ్చేతి పత్తియుద్ధాని" (కౌటి. అర్థ. పు. 781) (అన్ని దేశాలలోనూ, అన్ని కాలాలలోనూ శత్రువులను సంహరించటం, ఉపాంశుదండం (రహస్యోపాయాలచేత చంపటం) ఇవి పత్తియుద్ధ విధానాలు. పాండవ కౌరవవ్యూహాలలో వీటికి సంబంధించిన ఆలోచనలూ, వ్యూహరచనలూ సాగాయి.

'1. పక్షా ఉరస్యం, ప్రతిగ్రహః ఇత్యౌశనసో వ్యూహవిభాగః పక్షౌ, కక్షౌ, ఉరస్యం, ప్రతిగ్రహః ఇతి బార్హస్పత్యః' (కౌటి. అర్థ. పు. 783) (1-వ్యూహంలో రెండు పక్షాలు, ఉరస్యం (మధ్యప్రదేశం), ప్రతిగ్రహం (సైన్యపృష్ఠ దేశం) - ఈ నాలుగు అవయవాలు ఉంటాయి అని శుక్రాచార్య సంమతమైన వ్యూహవిభాగం. రెండు పక్షాలు, రెండు కక్షాలు, ఉరస్యం, ప్రతిగ్రహం అనే ఆరు అవయవాలు ఉంటాయని బృహస్పతి సమ్మతమైన వ్యూహవిభాగం). భీష్మపర్వంలో ఉభయపక్షాలూ బృహస్పతి మతాన్నే అనుసరించి వ్యూహరచన చేసినట్లు స్పష్టమౌతున్నది.

వ్యూహ స్వరూప స్వభావాలను గురించి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగా రిట్లా పేర్కొన్నారు: ' వ్యూహస్తు బలవిన్యాసః' - సైన్యముల విశిష్ట రచన - లేక - ఏర్పాటు వ్యూహమగును. 'విశేషేణ ఊహ్యతే ఇతి వ్యూహః' దీర్ఘముగ ఆలోచింపబడునది వ్యూహము. ఈ రెండర్థములును వ్యూహ నిర్మాణమునందు ఇమిడియే యున్నవి. సేనాధ్యక్షుడు తన సైన్యమును మోహరించుటకు ముందు నిశితముగ ఆలోచించును. ఆలోచించి విజయము తనకు కలుగు రీతిని తన వాహినిని పన్నించును. వ్యూహమును ఆంగ్లములో Military Tactics అనుచున్నారు. దీనికి సంబంధించినదే యుద్ధయుక్తి (Strategy). ఆంగ్ల విజ్ఞాన సర్వస్వములో ఈ రెండింటిని ఇట్లు నిర్వచించి యున్నారు. 'Strategy is the art of protected movement from which tactics, the art of protected offensive action is developed. Whilst the one places the army in the last position to overcome the enemy's resistance; the other has for its object the economical development of pressure so that movement into the derived direction may be maintained.' యుద్ధయుక్తి అనగా సంరక్షితయానము. దీనినుండి సంరక్షిత విక్రమ విధానము అనబడు వ్యూహము పరిణమించుచున్నది. మొదటిది శత్రువు యొక్క నిరోధకశక్తిని కుంచించుటకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉపయోగించును. రెండవది తన సైన్యశక్తిని పొదుపుగా వాడుకొనుటకు ఉద్దిష్ట దిశయందు విజృంభణమును నిర్వహించుటకు ఉపయోగించును.' (ఆంధ్ర మహాభారత సంశోధిత ముద్రణ: భీష్మ ద్రోణపర్వ పీఠిక: పుట 19)

మొదటినాడు భీష్ముడే మొదట వ్యూహం పన్నాడు. అది మానుషవ్యూహం. అంటే పదాతులను ముందుంచుకొని పన్నిన వ్యూహం కావచ్చును. 'పత్త్యశ్వ రథ ద్విపానాం పూర్వం పూర్వమ్ ఉత్తరేణ ఘాతయేత్. హీనాఙ్గమ్ అధికాఙ్గేన చేతి" అని కౌటిల్యుడి అర్థశాస్త్రం (పుట 786). కౌరవసైన్యం పాండవసైన్యం కంటె సంఖ్యలో అధికం. దానిలో పదాతుల సంఖ్య బహుళం. ఎక్కువబలమైన పదాతులతో తక్కువమంది పదాతులున్న పాండవ బలాన్ని హతమార్చాలన్నది భీష్ముడి ఆలోచన. దానికితోడు "యత్ పరస్య దుర్బలం వీత హస్త్యశ్వం, దూష్యాత్మకం కృతోపజాపం వా, తత్ ప్రభూత సారేణాభిహన్యాత్. యద్వాపరస్య సాధిష్ఠం తద్ ద్విగుణసారేణాభిహన్యాత్, యదఙ్గ మల్పసార నూత్మనః తద్ బహునా ఉపచినుయాత్, యతః పరస్పరాపచయః తతో వ్యూహేత,యతోవా భయం స్యాత్." (శత్రువుయొక్క ఏ సైన్యం హస్త్యశ్వాలు లేనిదై దూష్యులు అధికంగా ఉండి, లేదా, ఉపజాపం చేయబడి దుర్బలంగా ఉంటుందో దానిని అత్యధికమైన సారంగల సైన్యంచేత నశింపచెయ్యాలి. పరుని ఏ సైన్యం చాలసారం కలదై ఉంటుందో దానిని రెట్టింపు సారం ఉన్న స్వసైన్యం చేత నశింప చెయ్యాలి. తన సైన్యంలో ఏ అంగం తక్కువసారం గలదిగా ఉంటుందో దానికి ఎక్కువ సంఖ్య చేర్చి వృద్ధి చెయ్యాలి. ఎటువైపు శత్రువు దుర్బలంగా ఉంటాడో లేదా ఎటువైపునుండి భయానికి అవకాశం ఉంటుందో దాని దగ్గర వ్యూహం పన్నుకోవాలి') (కౌటిల్యుడి అర్థశాస్త్రం పు. 780) అనే యుద్ధవ్యూహనీతి ననుసరించి కూడా భీష్ముడు మానుషవ్యూహాన్ని పన్ని ఉండాలి. అంతేకాక 'దూష్యామిత్రాటవీ బలై ర్వా పూర్వం యోధయిత్వా శ్రాన్త మశ్రాన్తః పరమభిహన్యాత్ "దూష్యబలేన వా స్వయం భఙ్గం దత్త్వా జితమితి విశ్వస్తమ్ అవిశ్వస్తః సత్రాపాశ్రయః అభిహన్యాత్.' (ముందుగా శత్రువును దూష్య బలాలతోను, ఆటవిక బలాలతోను యుద్ధం చేయించి, తాను అలసిపోకుండా ఉంటూ, అలసిపోయిన శత్రువును చంపాలి. ముందుగా తన దూష్యబలాన్ని యుద్ధం చేయించి, అది ఓడిపోయేటట్లు చేసి, 'జయించాను' అని విశ్వాసంతో ఉన్న శత్రువును తాను మాత్రం విశ్వసించకుండా జాగరూకుడై ఉంటూ సత్రాన్ని(అపాయకరమైన స్థితిని) కల్పించి చంపివేయాలి). (అర్థశాస్త్రం పు. 762 - 763) అనే యుద్ధనీతిని కూడ ఆలోచించి ఉండి ఉంటాడు.

దీనికంటె మరొక రెండు ఆలోచనలు కూడ భీష్ముడు చేసి ఉండవచ్చును. 1. భీష్ముడు పాండవపక్షంలో ఉన్న పార్థుడిని జయించటం సాధ్యంకాదనీ, పాండవులను చంప చేతులు రావనీ చెప్పి మిగిలిన రాజలోకాన్ని నిష్ఠురంగా చంపుతానని దుర్యోధనుడికి మాట ఇచ్చాడు. అందువలన అతడి వధ పదాతి సైన్యంతో మొదలౌతుంది. 2. దుర్యోధనుడు తొందరపెట్టటంచేత పాండవులకంటె ముందు భీష్ముడే వ్యూహాన్ని పన్నవలసి వచ్చింది. అందువలన సర్వసాధారణమైన మానుష వ్యూహంతో మొదలుపెట్టి ఉంటాడు.

మూలవ్యూహాలు నాలుగు రకాలు. అవి: దండం, భోగం (సర్పం), మండలం, అసంహితం. అడ్డంగా పన్నేది దండవ్యూహం. నాలుగు లేదా ఆరు పక్షాలను ఒకదాని వెనుక ఒకటి అడ్డంగా పన్నేది దండవ్యూహం. నాలుగు లేదా ఆరు పక్షాలను ఒకదాని వెనుక ఒకటి మెలికలు తిరిగి సర్పాకారంలో ఉండేటట్లు పన్నేది సర్ప(భోగ) వ్యూహం. శత్రుసైన్యానికి ఎదురుగా ఉండి ఒక్కుమ్మడిగా అన్ని వైపులా ప్రసరించేటట్లు పన్నేది మండల వ్యూహం. ప్రత్యేక వ్యూహరచన లేకుండా శత్రువులపై దొమ్మిగా విరుచుకొనిపడేటట్లు అమర్చేది అసంహితం. ఈ నాలుగు రకాల వ్యూహాలకు మూలప్రకృతులు. వీటినుండి అనేక శాఖలు కాలక్రమంగా, అవసరం కొద్దీ ఏర్పడ్డాయి.

వాటిలో మానుషవ్యూహం ప్రసిద్ధంగా చెప్పబడలేదు. కాని, భీష్మపర్వంలో దాని నిర్మాణప్రశంస స్పష్టంగా తెలుస్తున్నది. దుర్యోధనుడు 'నిబిడ చారు సన్నాహంగా' వ్యూహం ఉండాలని కోరటంతో భీష్ముడు మానుష వ్యూహాన్ని రచించాడు. అది దట్టంగానూ, అందంగానూ, అమర్చినట్లుగానూ ఉన్నది. ఆ వ్యూహంలో భీష్మద్రోణులు ముందు నిలిచారు. కృపాశ్వత్థామలు వలపట, కృతవర్మ మద్రేశ్వరులు దాపట, బాహ్లిక సోమదత్త, భూరిశ్రవసులు వెనుక, దుర్యోధనుడు కురు కుమారవర్గంతో కలిసి మధ్యభాగంలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిలిచారు. అతడికి ముందుగా పదివేలమంది సంశప్తకులు సుశర్మను ముందుంచుకొని 'మేము అర్జునుడిని చంపుతాము లేదా చస్తాము' అని శపథం చేస్తూ సన్నద్ధమయ్యారు. మిగిలిన రాజులు ఆయాచోట్ల పదిలంగా నిలిచి, 'ఇంతకు పూర్వం ఇంతటి దృఢవ్యూహాన్ని ఎన్నడూ చూడలే' దని అందరూ ఆశ్చర్యపోయేటట్లు వ్యూహం సిద్ధమయింది. నిబిడ సుందరంగా వీరుల తీరు శోభిల్లింది. దీనికి తోడు సైన్యాల మోహరింపు సన్నాహరీతిని సంక్లిష్టం చేసింది. ఆయాసైన్యాలకు ఏనుగులనూ, ఏనుగులకు రథాలనూ, రథాలకు గుర్రాలనూ, గుర్రాలకు విలుకాండ్రనూ, విండ్లనారికి నద్ధాయుధులనూ అడ్డంగా ఉండేటట్లు నిలువబెట్టాడు. అది అపూర్వ దృఢవ్యూహంగా కీర్తించబడింది.

దృఢవ్యూహం దండవ్యూహభేదం. పక్షాలు, కక్షాలూ, ఉరస్యం, ప్రతిగ్రహం - ఇవన్నీ ఉండవలసిన స్థానంలో ఉంటే దండవ్యూహం. అందులోని కక్షాలు శత్రుబలానికి ఎదురుగా వెళ్ళితే ప్రదరవ్యూహం ఔతుంది. దండవ్యూహంలోని పక్షాలు కక్షంవైపు వస్తున్న శత్రుబలాన్ని ఎదుర్కొనటం కొరకు వెనుకకు వస్తే అది దృఢకవ్యూహం. దృఢకంలోని పక్షాలు శత్రుబలం లోనికి చొచ్చుకొని పోతే అది అసహ్యవ్యూహం. రెండు పక్షాలను వాటిస్థానంలో ఉంచి ఉరస్యం శత్రుబలం వైపు ముందుకు వెళ్ళితే శ్యేనవ్యూహం. 'అపూర్వ దృఢవ్యూహం' అనే ప్రశంస పొందేది, దండవ్యూహంలోని ద్వితీయ భేదం కావచ్చును. లేదా మిగిలిన దండవ్యూహ భేదాలను కూడ ప్రవర్తిల్ల జేయగల దృఢ వ్యూహం కావచ్చును. దానికి మానుష వ్యూహమని పేరుండి ఉండవచ్చును.

మానుషవ్యూహ స్వభావానికి ప్రతిగా పార్థుడి సూచన మేరకు ధృష్టద్యుమ్నుడు అచల వ్యూహాన్ని పన్నాడు. పదాతులు, గుర్రాలు, రథాలు, ఏనుగులు - ఒకటి వెనుక మరొకటి ఉండేటట్లు పన్నేది అచలవ్యూహం. పాండవ వీరులు నిలిచిన తీరు ఆ వ్యూహ నిర్మాణాన్ని తెలుపుతున్నది. సర్వసేనానులు ఉభయులూ సైన్యముఖంగా నిలవటం సంప్రదాయం. అందువలన దానిని వ్యూహాంగంగా చెప్పరు. అయితే, సైన్యాధ్యక్షుడు కాక మరొకవీరుడు అగ్రభాగంలో నిలిచినప్పుడది వ్యూహరచనలో ప్రత్యేకతనూ, ప్రాధాన్యాన్నీ సంతరించుకొంటుంది. భీష్ముడు కౌరవసేనకు కన్నాకు. ధృష్టద్యుమ్నుడు పాండవసేనకు మారాకు. వారు సేనాముఖాలుగా ప్రత్యర్థులై నిలవటం సహజం. అతడి వెనుక పాండవబలంలో పదాతి వర్గాన్ని ఎక్కువగా తనవెంట నిలుపుకొనే భీముడు నిలిచాడు. అతడికి అండగా రథికులైన అభిమన్యు ప్రభృతి కుమారవర్గం, నకుల సహదేవులూ ఉన్నారు. సాత్యకి సమేతులై పాంచాల మాత్స్య దేశాధిపతులు దక్షిణోత్తర పార్శ్వాలలో క్రమ్ముకొన్నారు. నడిమిభాగంలో గజసైన్య సహితుడై ధర్మజుడు నిలిచి విజయాశీర్వాదాలు పొందుతున్నాడు. ముందట అర్జునుడిచేత రక్షించబడుతున్న శిఖండి భీష్ముడికి ఎదురుగా నిలిచాడు. అపరభాగంలో మాగధ సహదేవ ధృష్టకేతులు ససైన్యులై విజృంభించి ఉన్నారు.

ఉభయ వ్యూహ సన్నాహాలను బట్టి గమనిస్తే మానుషవ్యూహం దాడికి పనికివచ్చేదనీ, అచలవ్యూహం దాడికి తట్టుకొని ఎదురు దాడికి తోడ్పడేదనీ తేలుతున్నది. అంతేకాదు మానుషవ్యూహంలో ఏకవీర విజృంభణం, బహువీర విజృంభణం విడివిడిగా ఎక్కువగా ఉండవచ్చుననీ, ఆచలవ్యూహంలో బహువీరుల సంఘటిత విజృంభణం ప్రాధాన్యం వహించవచ్చుననీ తోస్తున్నది. ఆ నాటి యుద్ధం తీరు ఈ స్వభావాలను తేటపరుస్తుంది.

ప్రథమ దివస యుద్ధంలో భీష్మ విజృంభణం భయంకరంగా సాగింది. భీమార్జునులు తదితరవీరులు భీష్ముడిని నిలువరించటానికి, ఎదురుదాడులలో వెనుకకు పంపటానికీ ఎంతో యత్నించి సాఫల్యం పొందలేకపోయారు. చివరకు పాండవసైన్యంలో భీష్ముడిని ఎదుర్కొనే వీరులు లేక బెండువడిన సన్నివేశాలు పెక్కులు గోచరించాయి. మానుషవ్యూహ ప్రభావం పిడుగుపాటుగా ఉండటంతో పాండవుల అచలవ్యూహం పర్వతంవలె బ్రద్దలయింది. మొదటినాటి యుద్ధంలో మొనలోని సైనికులు చనిపోవటం ఎక్కువ, మహావీరుల మరణం తక్కువ. ఇది మానుషవ్యూహ స్వభావం. అయితే, మానుష వ్యూహం వలన మహావీర సంహారం కాకుండా సాధ్యమైనంతవరకు శత్రుసంహారం చేసి మూలబలాలను రక్షించుకొని స్థిరంగా నిలిచి ఉండటం అచల వ్యూహరచనా ఫలితం. ధర్మజు డా రాత్రి సేనా వినాశనానికి ఖిన్నుడై యుద్ధం మాని అడవులకు పోతానని శ్రీకృష్ణుడితో చెప్పికొని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వైరాగ్యాన్ని ప్రదర్శించగా అతడు పాండవ మూలబలంగా అచలంగా ఉన్న మహావీరుల ప్రతాపాలను ప్రశంసించి భీష్మ విజృంభణం వలన భీతిల్ల వలసిన అవసరం అంతగా లేదని ధైర్యం చెప్పటం గమనార్హం. ఈ విధంగా సమీక్షించుకొంటే వ్యూహవర్ణనలను తిక్కన చేసిన పద్ధతిలో ఒక తీరు కనపడుతుంది. చర్యాప్రధానమైన యుద్ధఘట్టాల వెనుక ఆలోచనా ప్రధానాలైన వ్యూహరచనలుంటాయి. ఆహవ ఘట్టాలు వర్ణ్య రమణీయాలుగా, వ్యూహ నిర్వహణలు వ్యంగ్య గంభీరాలుగా రచనలో రాణిస్తాయన్నమాట. ఈ తీరు యుద్ధపర్వాల అనుశీలనంలో అనుసరణీయం.

ముందుగా వ్యూహాన్ని నిర్మించుకొనేవారు శత్రు విజయానికి తగిన దాడికి సిద్ధం కావచ్చనీ, ఆలస్యంగా పన్నితే స్వీయ రక్షణ విపత్తులో పడవచ్చనీ భావించిన ధర్మరాజు తానే క్రౌంచవ్యూహాన్ని సూచించి ధృష్టద్యుమ్నుడి చేత పన్నించాడు. ముక్కుగా అర్జునుడు, కన్నులుగా కుంతిభోజుడు, శైబ్యుడు, శిఖగా ద్రుపదుడు, కంఠంగా దశార్ణ శూరసేన కిరాత దేశాధిపతులు, కుడి రెక్కగా భీముడు, ఎడమరెక్కగా ధృష్టద్యుమ్నుడూ ఉన్నారు. మిగిలిన వీరులు ధృష్టద్యుమ్నుడికి అండగా నిలిచారు. జఘనభాగంగా కేకయ కాశిరాజులతో కలిసి విరాటుడూ, వెన్నుగా హూణప్రభువులు పరివేష్టించి ఉన్న ధర్మరాజూ నిలిచారు.

సమతలం మీద ఎదురుదాడి చేసే యుద్ధయుక్తికి తోడ్పడే మానుషవ్యూహం కంటె పక్షిరూపాన ఉండే క్రౌంచవ్యూహం విలక్షణమైనది. క్రౌంచపక్షి ఎగురుతుంది రెక్కలబలంతో. ఆ రెండు రెక్కలు భీమధృష్టద్యుమ్నులు. వారు కౌరవ వ్యూహంలో ఎక్కడైనా వాలి వీరవిహారం చేయవచ్చును. పక్షి ముక్కుతో పొడిచి సర్వత్రా హింసిస్తుంది. అట్లా సర్వసైన్య సంహారానికి పూనుకొన్న ముక్కు అర్జునుడు. ఈ సైన్య వ్యూహంలోని ముందు భాగంలో సర్వసైన్యాధ్యక్షుడుండడు. శత్రుసేనను చెండాడే ఏకవీరుడు ఉంటాడు. వెన్ను విరుగకుండ పక్షి నేల కూలకుండ చూచే వెన్నుబలం ధర్మరాజు. మిగిలినవారు ఈ ముగ్గురికి అండదండలుగా ఆహవం చేసేవారు. అంటే ధర్మరాజు శత్రు వ్యూహంలో పక్షివలె వాలి సైన్యాన్ని ముక్కుతో పొడిచి చీకాకు పెట్టాలని ఆలోచించాడన్నమాట! భీష్ముడి సంఘర్షణ వ్యూహానికి ప్రతిగా ఎదురుదాడి పథకాన్ని ధర్మజుడు రూపొందించాడు.

భీష్ముడు అనుభవజ్ఞుడు. పక్షి నేలమీద వాలితే ఒకవిధం కొమ్మమీద వాలితే ఒక విధం. భీష్ముడు ప్రతివ్యూహాన్ని ప్రత్యేకంగా పన్నలేదు కాని తన సేనలను మూడు శాఖలుగా విభజించి నిలిపాడు. దీనికి పేరేమీ లేదు కాని సౌకర్యం కొరకు త్రిశాఖావ్యూహం అన్నాను. నడిమిభాగంలో బలమైన కొమ్మగా భీష్ముడు నిలిచాడు. దానికి ఒక ప్రక్కన దుశ్శాసన వికర్ణ విందానువిందులూ, శూరసేన యవన త్రిగర్త కురుదేశాలవారూ నిలిచారు. మరొకప్రక్కన ద్రోణుడూ, కుంతల దశార్ణ విదర్భ గాంధార సింధు సౌవీర పతులు గుమికూడారు. ఇది భీష్ముడు పన్నిన ప్రతివ్యూహం.

క్రౌంచపక్షి రెక్కలార్చుకొంటూ వస్తుంది. ముక్కును ముందుకు సాచి దిగుతుంది. ముక్కుతో వేటను పొడుస్తూ రెక్కలు విదిలిస్తూ కొమ్మమీద వాలుతుంది. రెక్కలు విరుగగొట్టితే ఎగురలేకపోతుంది. చివరకు వేటకే వేటగా మారిపోవలసి వస్తుంది. భీష్ముడి ఆలోచన ఇది.

అందువలననే రెండవనాటి యుద్ధంలో భీష్ముడు ప్రతాపంతో ప్రకాశించినా అర్జునుడు మేఘంవలె అడ్డుకొన్నాడు. అతడి ధాటికి కౌరవసేన తట్టుకొనలేకపోయింది. దుర్యోధనుడు కటకటపడి భీష్ముడిని నిష్ఠురాలాడాడు. చేతకాకపోతే కర్ణుడిని యుద్ధానికి అనుమతించుమని అధిక్షేపించాడు. భీష్ముడు అర్జునుడి ముక్కుపోట్ల కంటె దుర్యోధనుడి పుల్లపోట్లకు ఎక్కువగా బాధపడ్డాడు. తిరుగబడి పాండవసేనమీద, ప్రత్యేకించి అర్జునుడిమీద, పోరు ఘోరంగా చేశాడు. రెక్కలుగా నిలిచిన భీమధృష్టద్యుమ్నులు భీష్మోద్ధతిని అణచి పీడించారు. కౌరవపక్షంలోని శాఖలవారు అభిమన్యుముఖ్యులను నొప్పించారు. ముక్కుగా నిలచిన అర్జునుడు ఆగ్రహించాడు. రెక్కలతో ఎగురుతూ, భీష్మ విజృంభణాన్ని భీషణంగా ఎదిరించి మూడు కొమ్మలను ముక్కలు ముక్కలుగా చేశాడు. అందుకే రెండవనాడు అర్జునుడు త్రిపురసంహారం నాటి రుద్రుడుగా ప్రశంస లందుకొన్నాడు.

మూడవనాడు ముందుగానే భీష్ముడు గరుడవ్యూహాన్ని పన్నాడు. అది కూడా పక్షి జాతిదే కాని క్రౌంచం కంటె గరుడపక్షి బలమైనది. క్రిందటిరోజు క్రౌంచపక్షి ముక్కుగా భీష్ముడిని బాధించిన అర్జునుడినీ అతడికి రక్షగా నిలిచిన శ్రీకృష్ణుడినీ గరుడపక్షి ముక్కుగా పొడిచి బాధిద్దామని వ్యూహం పన్నినట్లున్నాడు. ఆ వ్యూహంలో భీష్ముడే ముక్కుగా నిలిచాడు. ద్రోణ కృపవర్మలు కన్నులుగానూ, కృపాశ్వత్థామలు శిరస్సుగానూ, భూరిశ్రవసుడు, శల్యుడు, భగదత్త, సౌవీర జయద్రథులు కంఠంగానూ, దుర్యోధనుడూ అతడి తమ్ముడూ వెన్నుగానూ, విందానువిందులు కాంభోజశూరసేనులు తోకగానూ, మాగధ కళింగాదులు దక్షిణపక్షంగానూ, కర్ణాటకోసల ప్రముఖులు వామపక్షంగానూ నిలిచారు.

దీనికి ప్రతిగా అర్జునుడిచేత ప్రబోధితుడైన ధృష్టద్యుమ్నుడు అర్ధచంద్రాకారవ్యూహం పన్నాడు. పాండ్యమగధ బలాలతో కలిసి భీమసేనుడు దక్షిణశృంగంగా నిలిచాడు. ఆ తరువాత విరాట ప్రముఖులున్నారు. శిఖండి సహితుడైన ధృష్టద్యుమ్నుడిని తోడుగా నిలిపికొని ధర్మరాజు మధ్యభాగంలో ఉన్నాడు. మిగిలిన రాకుమారులందరూ శ్రీకృష్ణ సారథ్యంలో సాగే అర్జునుడి వెంట ఒక కొమ్ము కాశారు.

గరుడవ్యూహం శ్యేనవ్యూహంకంటె బలిష్ఠమైనది కావచ్చును. రెండు పక్షాలను వాటి స్థానంలో ఉంచి ఉరస్యం శత్రుబలంవైపు ముందుకు వెడితే శ్యేనవ్యూహమని కౌటిల్యుడి లక్షణం. ఈ లక్షణం ఆనాటి యుద్ధానికి చాలావరకు సరిపోయింది. ఉరస్యంలో ఉన్నది అనుజసహితుడైన దుర్యోధనుడు. భీష్మద్రోణులకంటె, రెండు పక్షాలలో ఉన్నవారికంటె దుర్యోధనుడు దూసికొని వచ్చి దక్షిణ శృంగంగా ఉన్న భీముడితో తలపడి ఘోరయుద్ధం చేసి మూర్ఛపోయాడు. భీష్మ ద్రోణులు భీముడితో పోరి అతడిని బాధించారు. దుర్యోధనుడు తేరికొని భీముడితో పోరలేక భీష్మద్రోణుల వద్దకు వెళ్ళి వారిని నిష్ఠురాలాడి, తాతవద్ద కర్ణుడి ఊసెత్తి కర్ణ కఠోరంగా మాట్లాడాడు. అంటే ఉరస్యం ముందుకు వెళ్ళే ఆ వ్యూహంలో దుర్యోధనుడు ముందుకు వచ్చి భంగపడ్డాడన్నమాట! కౌరవవ్యూహం దానితో దెబ్బతిన్నది. అందుకే దుర్యోధనుడి మనసు మండింది.

పాండవపక్షం పన్నిన అర్ధచంద్రాకారవ్యూహం శత్రువిజయానికి అనువుగా తోడ్పడింది. గరుడపక్షిని కూల్చాలంటే విల్లయినా కావాలి. బాణమైనా కావాలి. అందుకే కౌటిల్యుడు 'శ్యేనం చాపేన ఘాతయేత్' అన్నాడు ఒకచోట. (పు. 786) శ్యేనవ్యూహాన్ని చాపవ్యూహంతో భేదించాలట. బాణాలలో అర్ధచంద్రాకార బాణం పక్షికంఠాన్ని గాని, కడుపునుగాని, చీల్చటానికి అనువుగా ఉంటుంది. కౌటిల్యుడు అర్ధచంద్రవ్యూహాన్ని, అర్ధచంద్రికా వ్యూహమన్నాడు. అర్ధచంద్రిక కర్కట శృంగంవలె వంగి ఉంటుంది. సేనలను మూడింటిని (రెండు పక్షాలను, ప్రతిగ్రహోరస్యాలలో ఒకదానిని) ఒక విధమైన వంకర ఆకారంలో నిలబెడితే అది అర్ధచంద్రికా వ్యూహమని కౌటిల్యమతం. ఆ లక్షణం పాండవ వ్యూహానికి అన్వయిస్తుంది.

దుర్యోధనుడిచేత నిష్ఠురాలు పలికించుకొన్న భీష్ముడు గరుత్మంతుడి వలె లేచాడు. రెండు రెక్కలుగా నిలిచిన వీరులకంటె గరుడపక్షి ముక్కు వంటి భీష్ముడు తీక్ష్ణబాణాలతో పాండవసైన్యాన్నే కాక శ్రీకృష్ణార్జునుల నొప్పించాడు. అది గరుడవ్యూహ రచనా ప్రభావం. శ్రీకృష్ణుడు చక్రప్రయోగం చేయవలసినంత అవసరం ఏర్పడింది. దానిని అర్జునుడు వారించి క్రోధంతో భీష్ముడిపై విరుచుకుపడ్డాడు. అతడిని చిక్కుపరిచాడు. కౌరవసైన్యాన్ని పెంట కుప్పలుగా మార్చాడు. పాండవవ్యూహం సఫలమయింది.

బాణముఖం రెండు శిఖలతో వాడిగా అర్ధచంద్రాకారంగా ఉంటుంది. పాండవవ్యూహంలో ఆ ముఖాలు భీమార్జునులు. వారిద్దరూ శత్రువీర వ్యూహగర్భస్థుడైన దుర్యోధనుడినీ, ముక్కుగా ఉన్న భీష్ముడినీ గ్రుచ్చి నొప్పించి గరుడవ్యూహాన్ని గాయపరిచారు. దుర్యోధన భీష్ములు బాణశిఖలను మొక్కపోగొట్టలేకపోగా డొక్కలలో గ్రుచ్చుకొనకుండ రక్షించుకొనలేకపోయారు. బాణ ప్రయోగనిపుణుడైన పార్థుడు వ్యూహప్రయోగ నిపుణుడని పేరొందాడు.

వ్యూహరచన చేసినా రెండుసార్లు వికలమైన కౌరవసైన్యాన్ని మరునాడు వ్యూహరచన చేయకుండానే భీష్ముడు రణరంగంలో నిలిపాడు. అంటే ఆ నాడు అనియత వ్యూహ యుద్ధానికి గానీ, తుముల యుద్ధానికి గానీ సిద్ధమని ప్రకటించాడన్నమాట! పాండవులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కూడా దానిని సవాలుగా తీసికొని తుములయుద్ధానికే ముందుకు వచ్చారు. అందుకే ఆనాటి యుద్ధంలో దొమ్మియుద్ధాలు ఎక్కువగా సాగాయి. భీమ నాయకమైన సేనకూ, దుర్యోధన ప్రేరితమైన సేనకూ పోరు విపరీతంగా సాగింది. భీమ ఘటోత్కచులు భీష్మ ద్రోణుల కంటె తుముల యుద్ధంలో భయంకరంగా భాసించారు. ఒక విధంగా తుముల యుద్ధ వ్యూహం కూడా కౌరవులకు తోడుపడలేదు. అర్జునుడిని ఎదుర్కొనటం ఎంత కష్టమో భీముడిని నిర్జించటం కూడా అంత దుష్కరమని నాల్గవనాటి పోరు నిరూపించింది. శ్రీకృష్ణ పార్థులున్న వైపు ఏ వ్యూహమైనా విఫలం కాదని వారి నెదిరించే శత్రువ్యూహాలు ఓడిపోక తప్పదనీ భీష్మాదులు గ్రహించి నిష్ఠురాలాడే దుర్యోధనుడికి ఆ సత్యాన్ని తెగించి చెప్పటం జరిగింది.

అయిదవనాడు భీష్ముడు మకరవ్యూహం పన్నాడు.'పురస్తా దభ్యాఘాతే మకరేణ యాయాత్' (కౌటి. అర్థ. పు. 758) అని కౌటిల్యుడు. ఎదుటినుండి శత్రువు ఆక్రమించే భయం ఉన్నప్పుడు మకర వ్యూహంతో ముందుకు వెళ్ళాలని యుద్ధనీతి చెప్తుతున్నది కాబట్టి మకరవ్యూహం పన్నటంలో రహస్యం బయటపడుతూనే ఉన్నది. పాండవులు శ్యేనవ్యూహం పన్నారు. మకరానికి కాళ్ళు అందించకుండా శ్యేనం వలె కౌరవసేనను ముక్కుతో పొడిచి, రెక్కలతో కొట్టి పార్థుడు పిండి చేశాడు. భీష్ముడు చేపట్టి చేజార్చుకొన్న గరుడవ్యూహం వంటి సజాతీయ వ్యూహాన్ని తాను చేపట్టి విజయుడ ననిపించుకొన్నానని పార్థుడు తాతకు వీరగుణపాఠాన్ని నేర్పాడు.

తాత మనుమళ్ళకు గూఢాభిమానాలతో కూడుకొన్న వ్యూహ రచనల పోటీలు పెరిగాయి. ఒకరు పన్ని విడిచిన దానిని మరొకరు పన్ని నెగ్గించుకొనే పట్టుదలలు పొడసూపాయి. ఆరవనాడు అర్జునుడు మకరవ్యూహాన్ని పన్నించాడు. దాని కెదురుగా భీష్ముడు క్రౌంచవ్యూహం నిర్మించాడు. మకరవ్యూహంలో శిరస్సు అర్జునుడు కావటంతో కౌరవసేన అతడి బాణాల కోరల పాలబడింది. భీష్మద్రోణులు క్రౌంచతుండం కావటంతో పాండవసేన తూట్లు పడింది. భీమాదు లొకవైపూ, దుర్యోధనాదు లొకవైపూ తుండకంఠస్థానీయులై పరస్పర పీడనకు తలపడ్డారు. కౌరవుల వ్యూహంగా విఫలమైన మకరం పాండవుల బలంతో నెగ్గింది. దానిని స్వయంగా చూచిన దుర్యోధనుడూ విన్న ధృతరాష్ట్రుడూ కారణం తెలియక ఆశ్చర్యపోయారు. కౌరవుల దురహంకారం, తండ్రి ఉపేక్షా దానికి కారణాలని తెలిసికొని తెల్లబోయారు.

ఏడవనాడు భీష్ముడు మండలవ్యూహం పన్నాడు. దానికి ప్రతిగా ధర్మజుడు వజ్రవ్యూహాన్ని సన్నద్ధం చేశాడు. ఎత్తు భీష్ముడిది పైయెత్తు పాండవులదిగా వ్యూహ రచన సాగింది. పక్షాలు, కక్షాలు, ఉరస్యాలు చాల దగ్గర దగ్గరగా ఉంటే అది మండలవ్యూహ మంటారు. శత్రు సైన్యానికి అభిముఖంగా సమస్త సైన్యాలూ కలిసి ఒక్కుమ్మడిగా అన్ని వైపుల ప్రసరించటం మండలం అని కౌటిల్యుడు. "సరతాం సర్వతోవృత్తిః మణ్డలః" (పుట. 783). భీష్ముడు పాండవసైన్యాన్ని చుట్టుముట్టి మట్టుపెట్టాలన్న ఆలోచనతో సప్తమదివస యుద్ధం సాగించుమన్నాడని వ్యూహం వ్యాఖ్యానించి చెప్పింది.

'పార్శ్వాల నుండి ఆక్రమణం జరుగుతుందనే భయం ఉన్నప్పుడు వజ్రవ్యూహం'లో ప్రస్థానం చేయటం యుద్ధనీతి అని కౌటిల్యరాజనీతి. దాని ననుసరించి ధర్మరాజు వజ్రవ్యూహాన్ని పన్నాడు. అందువలన పార్శ్వాల నాశ్రయించి పాండవసైన్యాన్ని చుట్టుముట్టి ఆక్రమించే భీష్మయుద్ధ వ్యూహాన్ని నూరుముఖాల విజృంభించి దానిపై పిడుగులు కురిపించి స్వీయరక్షణకు సమర్థమైన వజ్రవ్యూహం విజయపథాన నడిపించింది.

ఎనిమిదవనాడు కూర్మవ్యూహాన్నీ భీష్ముడూ, శృంగాట వ్యూహాన్ని ధృష్టద్యుమ్నుడూ పన్నారు. శత్రువులు పైకి ఉరికినప్పుడు తాబేలు వలె స్వీయరక్షణోపాయాలను అమలుపరచటంలో కూర్మవ్యూహం తోడ్పడుతుంది. శత్రువ్యూహ మర్మాలను బట్టబయలు చేసి బాహాటంగా నట్టనడిగడ్డలపై శత్రువీరులను సంహరించే నేర్పు ప్రకటించేది శృంగాటవ్యూహం. ఆనాడు భీష్మభీముల యుద్ధం ప్రబలపాత్ర నిర్వహించింది. భీముడు దుర్యోధనుడి సోదరులను మహావీరులు చూస్తుండగానే శృంగాటకంలో వలె వరుసగా సంహరించిన ఘట్టం అద్భుతాన్ని సృష్టించింది. దుర్యోధనుడు భీష్ముడిని సర్వసైన్యాధిపత్యం వదలి కర్ణుడి కప్పగించుమని అడిగేటంత ఆవేగాన్ని కౌరవులకు కలిగించింది.

తొమ్మిదవనాడు భీష్ముడు సర్వతోభద్రవ్యూహాన్ని పన్నగా పాండవులు దృఢవ్యూహాన్ని అమర్చారు. నలువైపులనుండి ఆక్రమణభయం ఉన్నప్పుడు మాత్రమే సర్వతోభద్ర వ్యూహాన్ని పన్నటం యుద్ధ వ్యూహ రచనలో పరిపాటి. భీష్ముడి మానసిక స్థితికి ఆ వ్యూహం బహిఃప్రతీక. పాండవుల యుద్ధ క్రియా పాటవానికి అది ప్రతిఘటన సూచిక. దానికి విరుగుడు అన్నివైపులనుండి శత్రువులను ఆక్రమించటమే. దానికి తోడ్పడేదే సర్వతోభద్రవ్యూహం. అది భీకరమైన దాడిని సూచించే వ్యూహం కాబట్టి దానిని గట్టిగా తట్టుకొన గలిగిన దృఢవ్యూహం పాండవులు ఎన్నుకొనవలసి వచ్చింది. ఇది పాండవులకు పరీక్ష. తిక్కనగారు వ్యూహానికి పేరు చెప్పలేదు కాని గట్టివ్యూహం అన్నాడు. అది దృఢవ్యూహానికి తెలుగురూపం కావచ్చును. ఎంతటి దృఢవ్యూహమైనా మండలవ్యూహంలో మునిగిపోయింది. భీష్మప్రతాపంలో మ్రగ్గిపోయింది. శ్రీకృష్ణార్జునులకే భీష్మాగ్నిని ఆర్పటానికి సాధ్యం కాకపోయింది. శ్రీకృష్ణుడు భీష్ముడిపై చక్రప్రయోగం చేయబోయేంత తీవ్రస్థితి కలిగింది. పితామహుడు బ్రతికిఉంటే పాండవులు బ్రతికిఉండే ఆశలు దూరమయ్యాయి. పాండవసైన్యం దీనమై దీప్తి కోల్పోయింది. ధర్మజు డా రాత్రి భీష్ముడి వధోపాయాన్ని అర్థించవలసి వచ్చింది. కౌరవ విజయకేతనం మింట నిలిచిన రోజది. సర్వతోభద్ర వ్యూహం సఫలమైన దిన మది.

పదవనాడు ప్రత్యేక వ్యూహాలు లేవు. కౌరవపక్షంలో భీష్ముడి చివరినాటి ప్రతాపాగ్ని ప్రజ్వలనానికి ప్రదర్శనరంగంగా నిలిచే వ్యూహం. ఆయన సేనాముఖంలో నిలిచి ఆయనయే సేనా సర్వస్వమై సర్వతోముఖ సమర పాండిత్యాన్ని ప్రదర్శించి, విరక్తిని భజించి, అంపశయ్యమీద ఒరిగిపోయే యుద్ధం. ఆయన స్వయంగా తన విషాదాంతం కొరకు ఏర్పాటు చేసికొన్న ఆత్మవధవ్యూహం. అందుకే దానిని భీష్మవ్యూహం అన్నాను. ఆ నాడు పాండవ పక్షంలో శిఖండి సేనాముఖంలో నిలిచిన మహావీరుడు. అతడిని ముందు పెట్టుకొని, భీష్ముడి ముందు నిలిపి, అతడు బాణాలు వేస్తున్నట్లే అర్జునుడు బాణవర్షం కురిపించి, యుద్ధ విముఖుడౌతున్న భీష్ముడిని పడవేసే సన్నివేశానికే ప్రాముఖ్యాన్ని కల్పించిన వ్యూహాన్ని శిఖండి వ్యూహమన్నాను. పూర్వ సంకల్పిత నిర్ణయాలను వ్యూహపరంగా అమలుపరచిన ఒక యుద్ధనాటక మది. ఒక మహావీరుడి సాహసగాథకు సార్థక చరమాంకం.

భీష్మపర్వంలో వ్యూహాలన్నీ ఆయా యుద్ధ ప్రయోజనాలను సాధించటానికి అమర్చిన యుద్ధయుక్తులే, సంరక్షితయానాలే, సంరక్షిత విక్రమ విధానాలే. తిక్కన వాటిని వర్ణనాత్మకంగా తీర్చి దిద్ది భారతీయ రణనీతికీ, తెలుగువారి యుద్ధకళకూ కావ్యగౌరవాన్ని కలిగించాడు.

23. రణరంగ వర్ణనలు :

రణవీరులు చేసిన యుద్ధ చిత్రాలను రణరంగ వర్ణనలతో రంగరించి చెప్పటం తిక్కనకు పరిపాటి. సామాన్యంగా ప్రతిదినం మధ్యాహ్న సమయంలోనూ యుద్ధావసాన దశలోనూ రణరంగ వర్ణనం చేసి ముగించే విధానం కనపడుతుంది. అందులో తిక్కన బాణభట్టును తలపింపజేస్తాడు. ప్రథమ దివస మధ్యాహ్న సమయంలో తుముల యుద్ధంతో రణరంగం వీరవిహార భూమిగా రాణించిన వర్ణనం దీర్ఘవచనంలో నిబద్ధించబడింది. (చూడు: 1.267); రెండవనాటి యుద్ధ సమాప్తిలో అర్జునుడి పరాక్రమానికి కౌరవసైన్యం పొందిన పాటు వచనంలో వివరించబడింది (291); తృతీయ దివసాంతంలో 'అర్జునుడు కేశకలాపంబు శైవాలంబును ద్రేవుల ప్రోవులు ఫేనపుంజంబులును మేదోమాంస సమస్త మస్తిష్క పటలంబు పంకంబును నగు రక్త నదీ ప్రవాహంబు భవదీయ సేనామధ్యంబునం బఱపి బేతాళ క్రవ్యాదాది భూతంబుల నోలలార్చె' (2.166) నని జుగుప్సారమణీయంగా రూపకంలో తిక్కన నిర్వహించాడు. పదిరోజుల సమరంలో తిక్కన మధ్యాహ్న సాయంకాల సమయాలలో వీర విజృంభణాలను గాని, రణరంగ దృశ్యాలనుగాని వర్ణించి యుద్ధ వర్ణనలకు సమయ సూచనాత్మకమైన ఒక కళాపద్ధతిని అలవరచాడు. ఉదాహరణకు ఏడవరోజు మధ్యాహ్న సాయంకాల రణరంగ వర్ణనలు: 'ఆ సంక్రందన నందనుండు రాజుల గములకుం గవిసి కేతనంబులు నఱికియు, సారథి రథిక రథ్యంబుల ప్రాణంబులు వెఱికియు, నాతపత్ర చామరంబులు పొడి సేసియుఁ జాపంబులు రూపఱఁజేసియు,

జర్మంబులు వ్రచ్చియు, మర్మంబుల మార్గణంబులు గ్రుచ్చియు, సర్వాంగంబులు నొంచియుఁ దలలు ద్రుంచియు విహరించుచుండ నపరాహ్ణంబయ్యె' (3.50) నన్నది సహజ సుందరం. 'ఇనుఁడు దర్శనీయ మండలుండగుచు నపరశైల శిఖర గతుండయ్యె; నయ్యెడ సంజ కెంజాయ నెఱియ నెత్తురు టేఱులపయి వడిం దేలిపోవు పీనుంగులం దివిచికొని చను భూత బేతాళ సమ్మర్దంబులను, సమర తల ప్రాంత పతితంబులైన శవంబులం గైకొని చెలంగు సృగాలంబుల రవంబులను దత్సమయం బతిఘోరం బగుటయు' (3.65) అన్నది బీభత్స రమణీయం. స్థిరచరవస్తు చిత్రణం రణరంగ వర్ణనలోని వైవిధ్యం.

24. సన్నివేశ వర్ణనలు :

యుద్ధాలలో వీరుల నడుమ జరిగే ద్వంద్వ యుద్ధ సన్నివేశాలు కాని, మూక ఉమ్మడి సన్నివేశాలు గాని, వ్యూహక్రీడా చతురంగ గతులుగాని ఉత్సాహంతో పాటు ఉత్కంఠనూ, ఉద్వేగాన్నీ కూడా కలిగిస్తాయి. విసుగు పుట్టని వినోదాన్ని పుట్టిస్తాయి. అటువంటి వాటిని సహజ సుందరంగా సన్నివేశ బంధురంగా తిక్కన సంఘటించి శిల్పాన్ని ప్రదర్శించటం యుద్ధ పర్వాలలో పెక్కుచోట్ల కనపడుతుంది. భీష్మపర్వంలో పదిరోజుల యుద్ధం మూడాశ్వాసాలలో చెప్పటంచేత వర్ణన నాతివిస్తారం గానూ, నాతిక్లిష్టంగానూ సన్నివేశాలు చకచక సాగిపోతున్నట్లుంటాయి. ఇటువంటి సంగ్రహకథనంలో తిక్కన జిలుగు వెలుగులను చిత్రించటం మహాకవిలక్షణం. ఉదాహరణకు ద్వితీయ దివసంలోని ధృష్టద్యుమ్న ద్రోణాచార్యుల యుద్ధం, భీమసేన భానుమంతుల యుద్ధం, దుర్యోధన భీమసేనుల యుద్ధం, చతుర్థ దివసంలో ఘటోత్కచుడి మాయాయుద్ధం, పంచమదివస యుద్ధంలో అభిమన్యు లక్ష్మణ కుమారుల యుద్ధం, షష్ఠ దివసంలో ధృష్టద్యుమ్న ద్రోణుల యుద్ధం, అష్టమదివసంలో అలంబస ఇరావంతుల యుద్ధం, నవమదివసంలో అర్జున ద్రోణుల యుద్ధం, దశమ దివసంలో భీష్మశతానందుల యుద్ధం పేర్కొన దగినవి. మచ్చుకు భీష్ముడు శతానీకుడిని చంపిన ఘట్టం ముచ్చటగా మూడు పద్యాలలో చెప్పింది చకచక జరిగిన దృశ్యం కంటికి కట్టించేది.

క. ' సేనల నిమ్మెయి భీష్ముఁడు । దీనతఁ బొందింప నలిగి ధీరత్వము వీ
రానీకం బగ్గింప శ । తానీకుఁ డెదిర్చె నతని నాసురభంగిన్.

వ. ఇట్లు దాఁకి విరటుతమ్ముండు వాలమ్ముల నొప్పించినం గోపించి.

శా. విల్లుం గేతువుఁ ద్రుంచి సూతు వెస నుర్విం గూల్చి రథ్యంబులన్
డొల్లం దీవ్రత నేసి యాతఁడు భుజాటోపంబు శౌర్యంబు శో
భిల్లన్ వైచిన శక్తియుం దునిమి యాభీలద్యుతి ప్రస్ఫుర
ద్భల్లం బొక్కటి భీష్ముఁ డేసి నఱకెం దన్మస్తకం బుగ్రతన్.' **(భీష్మ. 3. 390 - 392)**

ఈ రచనలో ప్రతిపదం సార్థకం. పొల్లు పదంలేని రచన. భీష్ముడు సేనలను దీనత్వంలోకి దింపాడు. శత్రుకృతమైన ఆ క్రూరకర్మకు వీరుడైన శతానీకుడికి కోపం వచ్చింది. ఎదిరించటానికి అతడి ముందున్న మహావీరుడు భీష్ముడు. అతడిపై దాడి చేయాలంటే ధీరత్వం కావాలి. శతానందుడు తెగించి ధైర్యంతో యుద్ధానికి తలపడ్డాడు. ఆ పరిస్థితులలో శతానీకుడు ఆ ప్రయత్నం చేయటమే ఘనం. అందుకు వీరులందరూ అతడిని ప్రశంసించారు. వారి ప్రోత్సాహంతో అతడు ఉబ్బిపోయాడు. రాక్షసుడివలె విజృంభించి భీష్ముడిపై విరుచుకుపడ్డాడు. వాలమ్ములతో అతడిని నొప్పించాడు. ఆ చర్యకు భీష్ముడు కోపించాడు. శతానీకుడిమీద శరపరంపర సంధించాడు. వరుసగా విల్లును, కేతువును, సూతుడిని, గుర్రాలనూ నేలగూల్చాడు. విరథుడైన శతానందుడు వీగిపోక, మండిపడి శౌర్యమూర్తి అయి, భుజబలాన్నంతా ఉపయోగించి శక్తిని భీష్ముడిపై సంధించాడు. అందుకు భీష్ముడు ఆగ్రహించి శక్తిని మధ్యలోనే త్రుంచివేశాడు. భయంకరమై, కాంతిచ్ఛటలతో ప్రకాశించే భల్లాన్ని ప్రయోగించి శతానీకుడి శిరస్సును త్రుంచి చంపాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సన్నివేశం చిన్నది. కాని ఎన్ని వివరాలు పొందు పరిచాడు తిక్కన! శతానీకుడికి కలిగింది కోపం అనే స్థాయిభావం. దానివలన ధీరత్వం ఉప్పొంగింది. భీష్ముడిపై విజృంభింపజేసింది. మూడుమాటలలో రసభావానుభావదీప్తి ముప్పిరిగొనేటట్లు రచన రాణించింది. అతడు భీష్ముడిపై బాణాలను, శక్తిని ప్రయోగించి చంపాలనే సూటిచూపు తప్ప దానిలో ఒక క్రమాన్ని పాటించాలన్న నేర్పు కనపడదు. క్రమంలేని పరాక్రమం శతానందుడి విక్రమం. భీష్ముడు మహాయోధుడు. ఎదుటి వీరుడి స్వరూప స్వభావాలను వెంటనే పసిగట్టి తగిన పద్ధతిని ఎన్నుకొని, శాస్త్రబద్ధంగా యుద్ధంచేసి, శత్రుసంహారాన్ని నిర్వహించగల దక్షు డాయన. అందుకే ముందు శతానందుడి విల్లువిరిచి బాణ ప్రయోగాన్ని అరికట్టాడు. చివరకు విరథుడిని చేసి నేలమీదకు దించాడు. అంతటితో ఆగి శతానందుడు తలదాచుకొంటాడేమో అని అవకాశం ఇచ్చాడు. కాని, అతడు శూరుడివలె విరథుడైనా భీష్ముడితో తలపడటానికి సిద్ధమై శక్తిని ప్రయోగించాడు. తన శక్తి నెరుగకుండ భీష్ముడిని వధించే శక్తిని ప్రదర్శింప దలచుకొన్న శతానందుడిని భయంకరంగా (మహాకోపంతో) భల్లంతో తల నరికి చంపాడు. భీష్ముడి పరిణతిని, శతానందుడి ఆవేశాన్నీ అక్షరాలా చిత్రించే ఈ చిన్న ఘట్టం తిక్కన సన్నివేశ చిత్రణకు చక్కని మచ్చుతునక!

25. వీరోక్తుల వర్ణనలు :

యుద్ధ ఘట్టాలకు రసప్రకాశం రంగరించేవి వీరుల పౌరుషోక్తులతో కూడికొన్న ప్రసంగాలు. అయితే, భీష్మపర్వంలో రణరంగాలలో వీరుల రౌద్ర ప్రసంగాలు తక్కువ. యుద్ధ క్రియా ప్రదర్శనలు ఎక్కువ. అయినా, కృష్ణార్జున సంవాదం వంటి భగవద్గీతా ఘట్టాలూ, పరస్పర వీర పరాక్రమ ప్రశస్తులున్న ప్రసంగాలూ, వీర పరాక్రమాలను సమీక్షించే సంభాషణలూ ఎక్కువ. మచ్చుకొకటి రెండు.

శ్రీకృష్ణుడు అర్జునుడితో (భగవద్గీతలో)

చ. ‘ వగవఁగ నేమియుం దగని వారికి నై హృదయంబు గుందఁగా
వగచెదు బుద్ధిమాటలును వావిరి నాడెదు నీవు; పండితుల్
వగతురె యున్నవారికి నవశ్య విధేయతఁ జన్నవారికిం;
దెగు వగలెల్లఁ జిత్తము ప్రదీప్త వివేకమయత్వ మొందినన్’. **(భీష్మ. 1. 195)**

భీష్ముడు దుర్యోధనుడితో చేసిన పార్థ పరాక్రమ ప్రశంస:

సీ. ‘ కాల్పఁడే మహనీయ ఖాండవం బింద్రుని । నమరగణంబుతో విముఖుఁ జేసి,
బహుదివ్య శరములు వడయఁడే యెక్కటి । బవరాన మెప్పించి శివునిచేత,
గంధర్వులకు నోడి కర్ణుండు నీ తమ్ము । లును బాఱ విడిపించికొనఁడె నిన్ను,
నిను నను ద్రోణు నాతని పుత్త్రుఁ గృపుఁ గర్ణు । గెలిచి విరాటు గోవులఁ గొనండె?

ఆ. తక్కు పెక్కు లెడలఁ బెక్కండ్ర నే మేమి । సేసె వినమె? యట్టి జెట్టి నిన్ని
దినము లిట్లు దొడరి పెనఁగియు నీ చేత । నేఁడు వినఁగవలసె వేఁడి పలుకు.’ **(భీష్మ. 3. 177)**

ధర్మరాజు భీష్ముడితో -

ఉ. ‘ చిచ్చఱకన్ను మూసికొని చేతి త్రిశూలము డాఁచి లీలమై
వచ్చిన రుద్రు చందమున వ్రాలుదు వీ వనిలోన నోర్వఁగా
వచ్చునె నిన్ను నెట్టి మగవారికి? నీ కృప నాశ్రయింపఁగా
వచ్చితి; మెవ్విధిన్ గెలువవచ్చు? మహాత్మ! యెఱుంగఁ జెప్పవే.’ **(భీష్మ. 3. 300)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

26. అభినయ వర్ణనలు :

నానారసాభ్యుదయోల్లాసి అయిన విరాటపర్వంలో తిక్కన ప్రదర్శించిన అభినయ వర్ణన మరే పర్వంలోనూ ప్రత్యక్షం కాదు. భీష్మపర్వం వీరరౌద్ర కరుణ రసభావాల సమ్మేళనం. యుద్ధక్రియలలో వీరులు ప్రదర్శించే భావాలను శబ్దమాత్రంగా సూచించి వాటి భావనను పఠితలకు వదలిపెట్టాడు తిక్కన. ఉదాహరణకు - శ్రీకృష్ణుడు భీష్ముడి మీదకు విజృంభించుమని అభినయబంధురంగా ప్రబోధించిన తీరు విశేషం:

చ. ‘ గజిబిజి లేక, యుబ్బక, యఖండిత శౌర్యము, నస్త్రవీర్యమున్
భుజబలముం బొగడ్తవడ భూరిపరాక్రమశాలి భీష్ము న
క్కజముగఁ దాఁకి యద్దెస నకంపితులై నడతెంచు శల్య కుం
భజకురురాజు లచ్చెరువుపాటు భయంబును బొందఁ జేయుమీ!’ **(భీష్మ. 2. 33)**

ఇందులో అర్జునుడు శౌర్యాస్త్ర ప్రదర్శనంలో తడబాటు పడగూడదట! ఉబ్బితబ్బిబ్బు కాకూడదట! భుజబల ప్రకటనం పరులు పొగడేటట్లు ఉండాలట! పరాక్రమశాలి అయిన భీష్ముడే ఆశ్చర్యపడేట్లు ఆయనమీద దాడి చెయ్యాలట! అకంపితులై వస్తున్న శల్యద్రోణులు ఆశ్చర్యంతో కూడిన భయం పొందేటట్లు ఎదురుదెబ్బ తీయాలట! శ్రీకృష్ణ డిచ్చిన ఈ సూచన అభినయాత్మకమైన యుద్ధకార్యశిక్షగానూ ఉన్నది. నటులకు అభ్యాసం నేర్పుతున్న ఆచార్యుడి నాట్యశిక్షగానూ తోస్తున్నది. ఉభయకవిమిత్రుడి శిల్పమిది!

విభావానుభావసాత్త్విక భావావేశాలను ఒక్కెడ పేర్చి ఒక రసభావస్థితిని అభినయాత్మకంగా ఆవిష్కరించటం తిక్కనకు కొట్టినపిండి. అటువంటి రచనను అక్కడక్కడ అమర్చా డీ పర్వంలో. మచ్చుకు - రణరంగంలో మృతుడై పడిఉన్న తన కుమారుడైన ఇరావంతుడిని చూచి అర్జునుడు శోకభావావేశానికి గురి అయ్యాడు. ఆ వర్ణన ఇది -

చ. ‘ ఘనతరశోక వేగమునఁ గన్నుల నీళులు నించి యా సుయో
ధను నవినీతియుం బిదప ధర్మతనూజుఁడు సంధి గోరి ప
ల్కిన తగవుం, గడంగి యనికిం దలకొన్న నిజోద్యమంబుఁ దోఁ
చిన మదిఁ దిట్టుచున్, వినుతి సేయుచు, రోయుచునుండె నయ్యెడన్ ’. **(భీష్మ. 3. 156)**

ఇందులో పుత్రశోకభావావేశం భావం. కన్నులవెంట నీళ్ళు నిండటం సాత్త్వికభావం, అతడి మృతికి కారణమైన యుద్ధానికి దారితీసిన పూర్వ సంఘటనలు జ్ఞాపకం రావటం స్మృతి. వితర్కం మొదలైన సంచారిభావాల సంచారం. పుత్రమరణానికి మూలకారణమని భావించిన దుర్యోధనుడిని తిట్టటం, కుమారుడి గుణగణాలను పేర్కొంటూ ఆవేదనపడటం వాచికాభినయం. ఈ పద్యం సహజవర్ణనంగా సమకూరిన అభినయవర్ణనం!

మాట మనసు చేసే అభినయం. ఆ సత్యాన్ని భీష్మ పాత్రద్వారా నిరూపించిన ఒక ముత్యమంత పద్యం హృద్యం. భీష్ముడి వింటిని వివ్వచ్చుడు విరిచాడు. మరొక వింటిని ఎత్తుకొంటుండగానే దానిని కూడ త్రుటిలో విరిచాడు.

క. ‘ అతఁ డొండొక విల్లెత్తిన । నతిరయమున నదియుఁ దునుమ నాతం ‘డౌరా!
శతమఖనందన!’ యనుచును । ధృతి వేఱొకవింట శరతతిం బరగించెన్’. **(భీష్మ. 3. 258)**

‘ఔరా! శతమఖనందన!’ అనే మాట పలికించి ‘ఔరా! తిక్కన సోమయాజి!’ అనిపించుకొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీష్మపర్వంలో మూడు విషాదాభినయా లున్నాయి. ఒకటి - ధృతరాష్ట్రుడు భీష్మడి మరణవార్త వినగానే 'చిత్తంబు జల్లని యొల్లంబోయి మూర్ఛిల్లి కొండొకసేపునకు శిశిర విధానంబుల సేదదేఱి, గన్నీరు దొరంగ గద్గదకంఠుండై' (భీష్మ. 1.50) నట్లు తిక్కన వర్ణించాడు.

భీష్ముడు ఎనిమిది నాళ్ళయినా సవ్యసాచిని చంపలేదని దుర్యోధనుడు నిష్ఠురాలాడి కర్ణుడిని యుద్ధం చేయటానికి అనుమతించుమని అన్నప్పుడు.

క. 'అమ్మాట మనమునకు వా । లమ్మై తాఁకుటయు భీష్ముఁ డత్యంత విషా
దమ్మున నించుకవడి మౌ । నమ్ము దగం దాల్చియుండె నతవదనుండై.

వ. పదంపడి నిట్టూర్పు నిగిడించి మొగం బెగయించి భూపాలు నాలోకించి,' **(భీష్మ. 3. 173, 174)**

మారు పల్కనట్లు తిక్కన అభినయ వర్ణనం చేశాడు.

అర్జునుడు విషాదయోగాన్ని భజించినప్పుడు స్వీయవిషాద స్థితిని వర్ణించుకొంటూ చెప్పిన పద్యం మరొక అభినయ వర్ణన పద్ధతికి నిదర్శనం.

చ. 'సరసిజనాభ! బంధుజనసంతతిఁ గయ్యపునేలఁ జూడఁగా
విరవిరఁ బోయి మేను నిడువెంట్రుక వెట్టుచుఁ గంప మొందెఁ, జే
నిరతము గాదు గాండివము, నిల్వఁగ నోర్వవు గాళ్ళు; నేను ని
ష్ఠురతకుఁ జాలనొల్ల; నొకఁడున్ మహి యేలుట యేటి సౌఖ్యముల్?' **(భీష్మ. 1. 181)**

విషాదత్రయాన్ని వివిధ వర్ణన పద్ధతులలో వర్ణించటం శిల్పం!

27. ప్రకృతి వర్ణనలు :

ప్రత్యేకంగా ప్రకృతిని వర్ణించిన ఘట్టాలు భీష్మపర్వంలో కానరావు. అయితే కథాసందర్భంతో సంవదించిన కాలాన్ని ప్రకృతితో సమన్వయించి ఆలంకారికంగా వర్ణించటం తిక్కన పరిపాటి. ఉదా:

క. 'సోమాన్వయ ప్రదీపకుఁ । డీ మెయి (దేజోవిశేష మెసకం బెసఁగం
గా మెఱయుటఁ గనుఁగొని సి । గ్గై మఱువడు మాడ్కిఁ గ్రుంకె నర్కుం డంతన్'.

తే. 'జలరుహంబులు పాండవసైనికుల మొ । గంబులట్టుల విన్ననై కాంతి దఱిఁగె;
వారి మనముల భీత్యంధకార మడరు । కరణిఁ జీఁకటి యెడనెడఁ గవియుదెంచె.'

(భీష్మ. 1. 299, 300)

క. 'కిరణంబు లడఁగి యంతకు । నరుణత్వము మెఱయఁ దరణి యపరాద్రి శిరః
స్ఫురణను నధిక రణాలం । కరణం బొనరించుటయును గాంగేయుఁ డెడన్.'

క. 'శ్రాంతం బయ్యెను వాహన । సంతానం బెల్ల నిపుడు సంధ్యాసమయం
బింతట నేఁటికి నని సా । లింతముగా కింకఁ బోర లెస్సై యున్నే!' **(భీష్మ. 2. 339-340)**

క. ' తా నస్తశిఖరి మఱువడఁ । బోనియపుడు పాండురాజపుత్ర్త విరాజ
త్సేన పాడ వడఁగు ననుకృప । నో నలినాప్తుండు గ్రుంకె నుర్వీనాథా! ' **(భీష్మ. 3. 271)**

వ్యాస తిక్కనల దయవలన మహాభారత యుద్ధకాలంలో సూర్యుడు సైతం నిష్కారణంగా నిష్క్రమించలేదు.

28. తెలుగుభారతంలో పరచుకొని ఉన్న భగవద్గీత

ఆంధ్రమహాభారత భీష్మపర్వంలో పండితుల మధ్య ఒక ప్రధాన వివాదాంశం ఉన్నది. అది భగవద్గీతకు సంబంధించింది. సంస్కృత మహాభారతంలోని భగవద్గీతను తిక్కన పూర్తిగా తెలుగులోకి తేలేదు. సంక్షిప్తంగా కొన్ని అంశాలను మాత్రమే తీసికొన్నాడు. దానివలన మూలగౌరవం కంటె తెలుగు రచనకు మర్యాద తరిగిందని భావించేవారు కొందరున్నారు. శాస్త్రేతిహాసంలో ఉన్న భగవద్గీతను కావ్యేతిహాస నిర్మాత అయిన తిక్కన కావ్యకళాదృష్టితో దానిని తగ్గించాడనీ, అది ఉచితమే అనీ మరికొందరు తలుస్తారు. భగవద్గీతలో ప్రతిపాదించబడిన అంశాలు తిక్కన ఒక్కచోట చెప్పకపోయినా, అవి భారతమంతా పరచుకొని ఉన్నవి కాబట్టి తిక్కన భగవద్గీతను తెలుగులో వదలినట్లు కాదనీ, దోషం చేసినట్లు కాదనీ, ఎంతవరకు అవసరమో అంతవరకే తిక్కన గ్రహించాడనీ పేర్కొన్నారు. ఈ అంశాన్ని వివరించే డా॥ కేతవరపు వేంకట రామకోటి శాస్త్రిగారి మాటలు ప్రస్తుతాలు:

'అర్జునుని యుద్ధ విముఖతను నివారించుట సందర్భముగా భారతమున గీత ప్రసక్తించినది. అనగా రణోత్సాహ కారణముగా స్వధర్మావలంబనము వదలదగమిని అర్జునుడు తెలిసికొనుట కేయే విషయములు శ్రీకృష్ణుడు చెప్పినాడో అదంతయు భగవద్గీత. పదునెనిమిది అధ్యాయములలోని ఏడువందల శ్లోకముల తాత్పర్యమును అదియే కావలయును. కేవలము శ్రీకృష్ణపరమాత్మ చేసిన ఉపదేశము ఐదువందల డెబ్బది నాల్గు శ్లోకముల మేర వ్యాపించియున్నది. కాని, యథార్థమునకు గీత ఒక్క కర్మ ప్రాధాన్యమునే చెప్పుటలేదు. 'లోకేऽస్మిన్ ద్వివిధా నిష్ఠా, పురా ప్రోక్తా మయానఘ జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్' (3-3) కర్మజ్ఞానములు రెండింటిని గీత చెప్పినది. భాష్యకారులు నిష్కామమైన కర్మను జ్ఞానసాధనముగా చెప్పినారు. మరి అర్జునుని విషయమునను ఈ యర్థమునే భావించినచో వాని యుద్ధమున ప్రవర్తించుట జ్ఞానమునకు సాధనము కావలయును కాని కాలేదు. మహాభారతమున గీతకు అర్జునుడు యుద్ధమున ప్రవర్తించుటయే ఫలము. అశ్వమేధపర్వమున అర్జునుడు శ్రీకృష్ణునితో ఇట్లనినాడు:

' అనికిఁ దొడంగునప్పుడు మదాత్మ కలంగిన కొన్ని తత్త్వబో
ధన మహనీయ వాక్యము లుదాత్తకృపం దగ నీవు సెప్పి తే
మనమున వాని యర్థములు మాధవ! నిల్పఁగఁ జాలనైతి'. **(అశ్వ. 1. 153)**

శ్రీకృష్ణుని ఉపదేశము పూర్తిగా అర్జునున కప్పుడు పట్టలేదు. స్వధర్మమునందు ప్రవర్తించుట ఒక్కటే అర్జునున కానాడు పట్టినది. తదనుగుణముగా ప్రవర్తించినాడు. అట్టిచో భగవద్గీతను మొత్తము యథాతథముగా భీష్మపర్వమున తిక్కనగారు వ్రాసియున్నచో అర్జునుని యందు ఫలమునకు రాని అనగా వాని బుద్ధి కెక్కని విషయముకూడ వ్రాయబడినట్లగును కదా! ప్రయోజన రహితమైన విషయము నంతగా నేల వ్రాయవలయును? అందువలన తిక్కనగారు భీష్మపర్వమున భగవద్గీతను మొత్తమునకు మొత్తముగా అనువదించలేదు.

అయినచో భగవద్గీతా గత బహువిషయములు తెనుగు భారతమున లేకుండపోయినట్లే కదా అనవచ్చును. ఎక్కడకును పోలేదు. శాంత్యనుశాసనాశ్వమేధ పర్వములయందు గీతార్థము రకరకములుగా వ్యాపించియున్నది. మొదలు స్త్రీపర్వమున ధృతరాష్ట్రుని ఉపశమింపజేయుటకు విదురుడు చెప్పిన మాటలయందే గీతార్థము గుబాళించుచున్నది. ఎట్లును తరువాతి పర్వములలో ప్రయోజనసహితముగా జ్ఞానబోధ జరుగబోవునప్పుడు ప్రయోజన రహితముగా పదునెనిమిది అధ్యాయముల గీతను ఏడువందల శ్లోకముల తోడి దానిని తుచ తప్పక వ్రాయవలసిన పనిలేదు. అందుకే తిక్కనగారు వ్రాయలేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భగవద్గీత ముఖ్యముగా సాంఖ్యయోగమును గూర్చి చెప్పినది. శాంతిత్రయమున గల వేదాంత విషయమంతయు నదియే. భారతమున శాంతిత్రయాదికమునందున్న సాంఖ్యయోగ విషయములను పరిశీలించినచో అవి గీతయందలివే అని తెలియగలదు. గీతకు అతిరిక్తములు కావు. అందువల్ల తిక్కన్నగారి భారతమున గీతార్థము లేకుండ పోయినదన్న చింత అక్కరలేదు. అర్జునుడు యుద్ధమున ప్రవర్తించుటకు భగవద్గీతలోని ఏ భాగము మిక్కిలిగా తోడ్పడినదని తిక్కన్నగారి కనిపించినదో ఆ భాగమునే ఆయన వ్రాసెను.

లౌకికముగా చూచినచో శ్రీకృష్ణుడు చెప్పినమాట అర్జునుడు వినుటయే జరిగినది. ఆయన యుద్ధము చేయుమనగా ఈయన చేసెను. నిత్యజీవితములో మనము చూచుచునే యున్నాము. ఒకడు చెప్పును. ఇంకొకడు చేయును. చేయువానికి చెప్పినవానియందు భయభక్తులుగాని, గౌరవమర్యాదలు గాని ఉండవలయును. ఒకనిమాట నొకడు చేయుటకు భయభక్తులే ముఖ్యకారణము. గీతోపదేశ సందర్భమున శ్రీకృష్ణుడు విశ్వరూపమును ప్రదర్శించి అర్జునునియం దాభావములను కల్పించినాడు. ఏకాదశాధ్యాయము నందున్న అర్జునుని మాటలను నిదానముగా విచారించినచో ఆ విషయము స్పష్టము కాగలదు. విశ్వరూపమును చూచి చూచి అర్జునుడు చివర కనినాడు గదా 'న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్' (11-31). ఈ ఘోరరూపముతో నీవు ప్రవర్తించుటలోని యాంతర్యము నాకు బోధపడుట లేదు - అని. అప్పుడు నేను లోకనాశనము కొరకు వృద్ధినొందిన యముడనని చెప్పుచు శ్రీకృష్ణుడు 'ఉత్తిష్ఠ యశో లభస్వ జిత్వా శత్రూన్' (33) లెమ్ము! శత్రువులను జయించి యశము పొందుము - అని అర్జునుని హెచ్చరించాడు. శ్రీకృష్ణుడు విశ్వరూపమును ప్రదర్శించినది అర్జునుడు శత్రువులను జయించుట కొరకు. అదియే శ్రీకృష్ణుని ఆంతర్యము. అర్జునుడు యుద్ధమున ప్రవర్తించుటకు పదునొకండవ అధ్యాయము ప్రబలమైన హేతువు.

'ధర్మక్షేత్రే కురుక్షేత్రే' - యత్ర యోగీశ్వరః కృష్ణో' - అను ఈ మొదలైన భగవద్గీతయొక్క ఆద్యంతశ్లోకములను యథాతథముగా తిక్కనగారు భీష్మపర్వమున గీతోపదేశమున కాద్యంతములుగా నిక్షేపించిరి. అందువల్ల ఆద్యంతములుగా వ్యాపించిన భగవద్గీతయొక్క తాత్పర్యము ఇందు మాచేతను నిక్షిప్తమగుచున్నదన్న సూచనను మనము భావించవచ్చును. మరియు జాగ్రత్తగా పరిశీలించినచో తిక్కన్నగారు వ్రాసిన గీతోపదేశమున ఎక్కువగా ఏకాదశాధ్యాయమందలి శ్లోకముల యర్థమునే మనము చూడగలము. అర్జునుడు యుద్ధమున ప్రవర్తించుటకు శ్రీకృష్ణుని మాట వినుట కే యధ్యాయము ముఖ్యమో ఆ అధ్యాయమునందలి శ్లోకార్థముల నెక్కువగా గ్రహించి వ్రాసెను. మొత్తము గీతనుండి రెండు మూ డటునిటుగా నూరు శ్లోకముల యర్థమును తిక్కన్నగారు తెనుగున వ్రాసిరి. అందు నలువది శ్లోకముల యర్థ మొక్క ఏకాదశాధ్యాయము నుండి గ్రహింపబడినది. ఈ భగవద్గీతానువాద విషయము నెంత సూక్ష్మముగా విచారించి తిక్కన్నగారు సర్వతంత్ర స్వతంత్రముగా ప్రవర్తించినదియు ఇక బుద్ధిమంతు లూహించవచ్చును. కనుక గీతను మొత్తము భీష్మపర్వమున తిక్కన్నగా రనువదించలేదు. అనువదించకపోవుటయే ఔచిత్యవంతముగా నున్నది. మరియు నక్కడక్కడ గీతాశ్లోకముల కివి అనువాద పద్యములా అన్నట్లున్నవి కొన్ని తిక్కన్నగారి భారతమున కనిపించుచున్నవి.

1. 'శ్రేయా న్స్వధర్మో విగుణః' (3.35) ఇత్యాది శ్లోకమునకు 'ఒప్పకున్నను నాత్మకులోక్త కర్మ మూర్ధ్వగతిఁ జేర్చు' (శాంతి. 1.279) అని తిక్కనగారి పద్యము.

2. 'యదృచ్ఛాలాభ సంతుష్టో' (4.22) ఇత్యాది శ్లోకమునకు శాంతిపర్వమున

తే. ' అనఘ! సుఖదుఃఖములు వచ్చినపుడు మద వి । షాదములు లేక సంప్రాప్త సముపభోగ
రతుఁడు నప్రాప్యవాంఛా నిరాసకుండు । నగుట సారతపోరూప మండ్రు బుధులు.'

(శాంతి. 5.501)

3. 'విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని' (5-18) ఇత్యాది శ్లోకమునకు తిక్కన్నగారి తెనుగు పద్యము.

చ. 'వినయము విద్యయుం గలుగు విప్రునియందును గోవునందు నొ
ప్పు నెఱయు హస్తియందు నొకపోకకుఁ బోవని కుక్కయందు దా
ని నడఁచి తెచ్చి వండి తిను నీచపు మాలనియందు తుల్యద
ర్శనము తదంతరాత్ముని నిరంజనునిం గనునట్టి పండితుల్'. **(5. 109)**

4. 'సర్వతః పాణిపాదం' (13.14) ఇత్యాది శ్లోకమునకు తిక్కన్నగారి పద్యమును అశ్వమేధ పర్వమున (1.223) '(కలయంగ నెల్లయెడలం దలలును' అను ఈ మొదలైన పద్యమును చూచునది.

ఈ విధముగా మరికొన్ని శ్లోకములు పద్యములు ఏరి చూపించవచ్చును. ఇంతకును ఫలితార్థ మేమనగా భీష్మపర్వమున తిక్కన్నగారు భగవద్గీతను మొత్తముగా వ్రాయకపోవుటయే సముచితముగా నున్నదనియు, గీతార్థము తెలుగుభారతమున నష్టమై పోలేదనియు, అది తరువాతి శాంత్యాది పర్వములలో నిక్షిప్తమై యున్నదనియును.

భగవద్గీత ఏ అధ్యాయమునుండి ఏ యే శ్లోకములను గ్రహించి తిక్కన్నగారు వ్రాసినదియు ఇక్కడ చూపబడుచున్నది.

శ్రీమద్భగవద్గీత		భీష్మపర్వము		శ్రీమద్భగవద్గీత		భీష్మపర్వము	
అధ్యా.	శ్లోకములు	ఆశ్వా.	పద్యము	అధ్యా.	శ్లోకములు	ఆశ్వా.	పద్యము
1	1	1	171	11	5	1	208
1	3	1	173	11	8	1	209
1	4 - 13	1	174	11	9, 12, 14	1	210
1	15 - 18	1	176	11	15 - 25	1	211 - 213
1	19	1	177	11	26, 27, 31	1	214
1	20	1	178	11	33 - 35	1	215
1	21 - 23	1	179	11	38 - 39	1	216
1	24 - 27	1	180	11	41, 42	1	217
1	29 - 32	1	181	11	44	1	218
1	33	1	182	11	46	1	219
1	34 - 42	1	183 - 187	11	48, 53, 54	1	220
1	45 - 46	1	188	11	55	1	221
2	1	1	189	11	66	1	224
2	2	1	190	11	67	1	226
2	4, 5	1	193	11	72	1	227
2	7	1	194	11	73	1	228
2	11	1	195	11	74, 77	1	229
2	13, 17, 20 - 23	1	196	11	78	1	231
2	31, 32	1	201				

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(శ్రీ ఆంధ్రమహా భారతము - భీష్మపర్వము - ఉపోద్ఘాతము. డాక్టర్ కేతవరపు వేంకటరామకోటి శాస్త్రి - పుటలు xvi - xx (ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణ 1971)

29. స్తోత్రాలు తిక్కన తెలుగు చేయలేదు

యుధిష్ఠిరుడు యుద్ధయాత్రకు పూనుకొన్నప్పుడు శ్రీకృష్ణుడి సలహా మేరకు అర్జునుడు దుర్గాదేవిని స్తుతించినట్లు కొన్ని ప్రతులలో ఉన్నది.

"నమస్తే సిద్ధసేనాని । ఆర్యే మందరవాసిని।
కుమారి కాళి కాపాలి । కపిలే కృష్ణపింగళే॥"

అని ఆరంభించిన స్తుతి 13 శ్లోకాలలో సాగింది. ఆ తరువాత దుర్గాస్తోత్ర ఫలశ్రుతి కూడా నాలుగు శ్లోకాలలో ఉన్నది.

"సంగ్రామే విజయే న్నిత్యం । లక్ష్మీం ప్రాప్నోతి కేవలామ్।
ఆరోగ్య బలసంపన్నో । జీవేద్వర్ష శతం తథా॥"

అని ముగుస్తుంది. ఇది అంతా మూలంలో ఒక అధ్యాయం (ఇరవైమూడో అధ్యాయం). శ్రీకృష్ణుడే దుర్గాస్తుతి చేయుమని చెప్పటం అసంబద్ధం. నిజానికి శ్రీకృష్ణుడు ఆయననే శరణువేడుమని చెప్పాడు. అందువలన తిక్కన దీనిని గ్రహించి ఉండడు. అట్లా చేయటం ఉచితమే.

ఇట్లాగే అరవై ఏడవ అధ్యాయంలో వర్ణించబడిన శ్రీకృష్ణభగవానుని మహిమను, అరవై ఎనిమిదవ అధ్యాయంలోని పంచభూత స్తోత్రాన్నీ తిక్కన తెలుగు చేయకపోవటం కూడా సముచితమే.

30. కవిత్రయ మహాభారతం : వ్యాఖ్యానం

ఆదికావ్యమైన ఆంధ్రమహాభారతం తెలుగులో అవతరించి దాదాపు వెయ్యేళ్ళు కావస్తున్నా, ఇంతవరకు దానికి సమగ్ర వ్యాఖ్య వెలువడలేదు. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి అనుగ్రహంతో కవిత్రయ మహాభారతానికి తెలుగులో శిష్టవ్యావహారిక భాషలో సరళవ్యాఖ్య వెలువడటం ఆంధ్రావళి ఆనందించే అపూర్వ సాహిత్యోత్సవం. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారు భారతీయ వైదిక ధర్మప్రచార మహోద్యమాన్ని చేపట్టి మహనీయంగా సాగిస్తున్నారు. అందులో ఈ పంచమవేద వ్యాఖ్యాన ప్రణాళిక ఒక మహత్తర సారస్వత యజ్ఞం. ఏడుకొండల రాయడు మాత్రమే చేపట్టి, ధర్మరక్షణ కళాప్రావీణ్యంతో ఈ బృహత్తర ధర్మకార్యాన్ని ప్రజలకు ప్రసన్నంగా ప్రసాదించగలిగిన పరమదయాళువు. ఆ దేవదేవుడి కృపాకటాక్షంతో పండితులు పదునెనిమిది పర్వాల ఈ దివ్య ప్రబంధ మండలిని పరిష్కరించి, ప్రతిపద్యానికి వ్యాఖ్యానం వెలయించి, సవిమర్శకమైన పీఠికలు సమకూర్చి కథాసారాదులతో సర్వార్థ సాధకంగా సంతరించి, సర్వాంగ సుందరంగా ప్రచురించి, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారు చేసికొన్న వెలుగుల పుణ్యం. ఈ పవిత్ర మహత్తర ప్రయత్నానికి శ్రీతిరుమలేశుడి పక్షాన బాధ్యత వహించి, అభ్యుదయ పరంపరను విజయవంతంగా సమకూరుస్తున్న మాన్యులు, మహనీయులు టి.టి.డి. బోర్డు ఛైర్మన్, సభ్యులు, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, సప్తగిరి సంపాదకులూ, వారి సహకారులూ, సంపాదక సలహామండలుల సభ్యులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, ఎడిటోరియల్ సెల్ సభ్యులూ, పలురకాలుగా ఈ కార్యక్రమంలో తోడ్పడుతున్న అధికార, అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటి. అది రెండు భాగాలుగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపు దిద్దుకొన్నది. విస్తృతమైన ఆరణ్యపర్వం మూడవ సంపుటిగా రెండుభాగాలలో ప్రచురించబడింది. మొదటిభాగం నన్నయ

రచించిన ఆరణ్యపర్వభాగం. రెండవభాగం ఎఱ్ఱాప్రెగ్గడ పూరించిన ఆరణ్యపర్వశేషం. ఈ విధంగా ఆరణ్యపర్వం విభజించబడి ప్రచురించబడటం తెలుగులో ప్రథమం. నాల్గవ, అయిదవ సంపుటులుగా విరాట, ఉద్యోగపర్వాలు వెలువడ్డాయి. ఇప్పటి ఈ ఆరవసంపుటి భీష్మపర్వం.

భీష్మపర్వ వ్యాఖ్యానంలో ఇద్దరు మహాపండితులు పాల్గొన్నారు. మొదటి రెండాశ్వాసాలకు డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులుగారూ, మూడవ ఆశ్వాసానికి శ్రీ చెరుకూరి జయచంద్రశాస్త్రిగారూ వ్యాఖ్యానం వ్రాశారు. వీరిరువురూ సాహిత్య సముద్రాన్ని మథించిన మనీషులు కావటంతో వ్యాఖ్యానం అమృతతుల్యంగా ఉన్నది. ఈ పర్వానికి పీఠికను నేను సంతరించాను. ఇవి ఆంధ్రుల ఆమోదాన్ని పొందుతాయని ఆశిస్తున్నాను.

ఈ సంపుటి ఈ విధంగా రూపొందటానికి తోడ్పడిన మిత్రులు విద్వన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారికీ, శ్రీ. కె. సత్యరామప్రసాదుగారికీ, శ్రీమతి జె. రామసుబ్బలక్ష్మిగారికీ, శ్రీ జి. రాధాకృష్ణగారికి, శ్రీమతులు సుశీలా లక్ష్మీవిద్యానాథులకూ, డాక్టర్ వి. యస్. లక్ష్మిగారికీ నా హార్దిక కృతజ్ఞతలు.

పరమ కల్యాణ భద్రమూర్తి అయిన శ్రీ పద్మావతీసహిత శ్రీ వేంకటేశ్వరస్వామివారు వేదవేద్యులు, వేదాంతగమ్యులు. పరతత్త్వరూపులు. అయినా భక్తసులభులు, సాహిత్యసంగీత ప్రియులు, రసానందమూర్తులు. ఆ స్వామికి ఈ పంచమవేదం అక్షరమైన తోమాలసేవ. వ్యాఖ్యానం సుగంధ పరిమళసేవ. భీష్మ పర్వ విశేషాంశాలు ఉజ్జ్వలాలంకారసేవ. పీఠిక విరాణ్మూర్తికి మంగళనీరాజనం. ఈ పర్వం స్వామివారికి సారస్వతమైన అక్షరార్చనం.

సత్య శివ సుందరరూపుడైన స్వామి దివ్య సన్నిధిలో ఈ వ్యాఖ్యా సంపుటిని వాఙ్మయారాధనలోని భాగంగా పుణ్య పూజా కుసుమ మంజరిగా సమర్పించుకొంటున్నాను. విశ్వశ్రేయస్సును ప్రసాదించుమని స్వామిని వేడుకొంటున్నాను.

హైదరాబాదు
స్వభాను శ్రీ రామనవమి
11. 4. 2003

జి.వి. సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు,
కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీష్మపర్వ కథాసారం

పుణ్యక్షేత్రమైన కురుక్షేత్రంలో పాండవ కౌరవులు ఒకరి నొకరు గెలిచే తలంపుతో సైన్యాలను మోహరించి కయ్యానికి కాలుత్రవ్వుతూ ఉన్నారు. ధృతరాష్ట్రుడు కొడుకుల దుర్వినయానికి దుఃఖిస్తూ సంజయుడితో మాట్లాడుతూ ఉండగా వేదవ్యాసమహర్షి వచ్చాడు. ఆయన ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: 'రాజులకు కాలం చెల్లింది. అందువలననే ఈ యుద్ధం వచ్చింది. దీనికి నీవు విచారించకుము. నీ వా యుద్ధాన్ని చూడటానికి దివ్యదృష్టి నిస్తాను. చూడుము'. అన్నాడు. అన్నదమ్ములు దారుణంగా క్రూరంగా యుద్ధం చేసే ఆ దృశ్యాలను తాను చూడలేనని ధృతరాష్ట్రుడు పలికాడు. అయితే, ఆ యుద్ధాన్ని చూచి, ఎవరైనా వర్ణించి చెపితే వినాలని ఉన్నదని కోరిక వ్యక్తం చేశాడు. వేదవ్యాసుడు యుద్ధవార్తలు తెలియచెప్పటానికి సంజయుడిని నియోగించాడు. రెండువైపులవారు రాత్రింబవళ్ళు ప్రవర్తించే పద్ధతులు తెలిసికొనటానికీ, రహస్య సంభాషణలు వినటానికీ, మనోభావాలను గ్రహించటానికీ తగిన శక్తిని వరంగా అతడికి ప్రసాదించాడు. అతివేగంగా వెళ్ళే శక్తినీ, యుద్ధరంగంలో తిరిగేటప్పుడు శస్త్రాస్త్రాలు తగలకుండా ఉండే ప్రభావాన్నీ, దివ్యుల మాటలు, రూపాలు, తలపులు తేటపడేటట్లు దివ్యబోధను ప్రసాదించాడు. భూప్రజకు ప్రళయకాలం వచ్చింది కాబట్టి కురుక్షేత్ర యుద్ధం వచ్చిందనీ, ధర్మమే జయిస్తుందనీ నిశ్చింతగా ఉండుమనీ ధృతరాష్ట్రుడికి చెప్పాడు. కురుపాండవుల కీర్తిని తానే కీర్తించి ప్రకటిస్తానని వేదవ్యాసుడు ప్రకటించి ధృతరాష్ట్రుడిని ఊరటపరిచాడు. కౌరవసైన్యంలో కనపడుతున్న అనేక దుర్నిమిత్తాలను పేర్కొని కులక్షయం, అనేకరాజుల మరణం తప్పదని హెచ్చరించాడు. దుర్యోధనాదులను వారించి పాండవులకు న్యాయంగా రావలసిన రాజ్యభాగ మిచ్చి శాంతిని నెలకొల్పి, మావంటి వారికి సంతోషాన్ని కలిగించుమనీ, నీకీ రాజ్యకాంక్ష ఎందు? కని హితవు చెప్పాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు. 'మహర్షీ! మీరు హితాన్నీ, ధర్మాన్నీ మనసులో పెట్టుకొని ఇట్లా చెప్పారు. నేను కూడా నా కొడుకులకు ఇదివరలో తరచి తరచి చెప్పి చూచాను. వారిని అదుపులో పెట్టే నైపుణ్యంగాని, ప్రభుత్వంగాని నాకు లేవు. ఈ అంశాన్ని మీరు తలపోసి నా కిటువంటి సలహా చెప్పటం మానండి. పరిస్థితులు పాకం తప్పాయి.' ఈ మాటలు విని వ్యాసుడు పెదవి విరిచాడు. 'యుద్ధంలో గెలుపు ఎవరిదో తెలుపు' మని ధృతరాష్ట్రుడు అడిగాడు. అప్పుడు కనపడుతున్న కొన్ని శుభశకునాలను పేర్కొంటూ వ్యాసుడు 'జయం దైవాధీన' మనీ, 'పెద్దలు యుద్ధాన్ని మెచ్చ' రనీ, చెప్పి అంతర్ధానమయ్యాడు.

'లోకంలో రాజులు భూమికొరకు అనాదిగా యుద్ధాలు చేస్తూనే ఉన్నారు. రాజ్యమంటే రాజులకు ఎంత తీపియో?' అని ధృతరాష్ట్రుడు భావించి భూపరిమాణాన్ని గురించి చెప్పమని సంజయుడిని అడిగాడు. నానావిధ చరాచరాలన్నీ భూమిమీద పుట్టుతాయి, పెరుగుతాయి, చనిపోతాయి కాబట్టి భూమి అన్నిటికీ ఆధారమైనది. పంచమహాభూతాలలో భూమి గొప్పది - అని భూమండల విశేషాలనూ, భారత వర్ష స్వరూప స్వభావాలనూ సంజయుడు వివరించి చెప్పాడు. ఆ తరువాత యుద్ధ విశేషాలను దర్శించటానికి అతడు రణరంగానికి వెళ్ళి, కొన్ని రోజుల తరువాత తిరిగివచ్చి, ధృతరాష్ట్రుడికి నమస్కరించి, భీష్ముడు యుద్ధంలో అంపశయ్యపై ఒరిగిపోయిన వృత్తాంతాన్ని చెప్పాడు.

ధృతరాష్ట్రు డా దుర్వార్త విని బావురుమని ఎలుగెత్తి ఏడ్చాడు. 'భీష్ముడు సాక్షాన్నరసింహమూర్తి వంటివాడు. చాపమే అతడి నోరు. భల్లాలు అతడి క్రూరదంతాలు. బాణాలే అతని గోళ్ళు. ఖడ్గమే అతడి నాల్క. భీష్ముడు కేవలం నరుడు కాదు. పదివేలమంది రాజులకు ఎదురు నిలిచి యుద్ధం చేయగల మహావీరుడు. అతడు శిఖండి చేతిలో ఒరిగిపోయాడా? విధి బలీయం' - అని అనేక రకాలుగా ధృతరాష్ట్రుడు శోకించాడు. కొంతసేపు మూర్ఛపోయి తేరుకొన్నాడు. కన్నీరు పెట్టుతూ గద్గద కంఠంతో ఇట్లా అడిగాడు: 'సంజయా! దేవతలూ రాక్షసులూ ఒక్కటై వచ్చినా వారిని ఓడించగల ధీరుడు భీష్ముడు. శిఖండి బాణాల బారిన ఎట్లా పడ్డాడు? ఇక ఏమి అనటానికి వీలుంది? పరశురాముడిని సైతం నిగ్రహించగలిగిన భీష్ముడిని అర్జునుడు శిఖండిని ఎదురుగా నిలిపి సాధించాడా? ఆ శౌర్యం, ఆ బలం, ఆ శీలం, ఆ పరాక్రమం, ఆ నియమవ్రతం - చూచి భీష్ముడికి నాశం ఉండదని గట్టిగా నమ్మాను. నా నమ్మిక

వమ్మయింది. అయినా, ఆ యుద్ధంలో భీష్ముడా దురవస్థకు లోనైనప్పుడు ఆయనను ఆదుకొనటానికి మనలోని మహావీరు లెవ్వరూ దగ్గరలేరా? అందరూ కలిసి అడవిలో కలిసిపోయారా? ఒంటరిగా ఆ మహావీరుడు నేలపై పడవలసిన స్థితి ఎట్లా ఏర్పడింది? ఆయన పోతే మిగిలిన యుద్ధవీరులంతా పోయినట్లే అని అనుకొంటున్నాను. కులవృద్ధుడైన భీష్ముడిని చంపి రాజ్యం చేయాలనుకొంటున్న పాండవులకే దైవం సహాయం చేస్తున్నాడు. ధర్మానికి కీడు చేసి అధర్మం పెరిగినట్లున్నది. భీష్ముడిని చంపి రాజ్యం పొందాలనుకొని సంపదకై సమరం చేసే ఈ రాచకులంలో పుట్టటమే దురదృష్టం. భీష్ముడు నాయకుడుగా లేని కౌరవసైన్యం మగడులేని మగువవలె మనస్తాపం పొంది ఉంటుంది. ఆ తరువాత కౌరవులు ఎవరిని సైన్యాధ్యక్షుడిగా చేశారు? భీష్ముడి పదిరోజుల యుద్ధం ఎట్లా సాగింది? ఆ విపత్తును గడచి కౌరవులు ఏ విధంగా పురోగమించారు? వివరాలన్నీ తెలుపుము'. అని ఆవేగంతో అడిగాడు ధృతరాష్ట్రుడు. సంజయు డిట్లా పలికాడు:

'ప్రభూ! నీ అవినీతి వలన ధర్మనిరతులైన పాండవులు పడరాని పాట్లు పడ్డారు. దానివలన ఇంత ముప్పు వచ్చిపడింది. కీడు చేసేవారికి కీడు కలుగుతుంది. మంచి చెడులను సమీక్షించకుండా యుద్ధరంగంలో జరిగిన విశేషాలను వినుము.' అని అంటూ వేదవ్యాస మహర్షి పాదాలను తలంచి మ్రొక్కి, భక్తిరసానందంతో దివ్యమతియుతుడై యుద్ధ విశేషాలను వివరించటం ప్రారంభించాడు.

భీష్మాది కురువీరులు పరివేష్టించి ఉండగా దుర్యోధనుడు తన స్కంధావారంలో ఒక సమావేశం ఏర్పాటు చేశాడు. ఆ సమయంలో సంజయుడు అక్కడికి దివ్యగమనంతో చేరుకొన్నాడు. అప్పుడు సుయోధనుడు దుశ్శాసనుడిని ఇట్లా ఆజ్ఞాపించాడు.

'చాలాకాలం నుండి ఎదురుచూస్తున్న కౌరవుల పాండవుల మధ్య యుద్ధం ఇన్నాళ్ళకు సిద్ధించింది. భీష్ముడు మనకు రక్ష. మనమందరం ఏ విధంగానైనా ఆయనను రక్షించాలి. మన మాయనను కాపాడితే ఆయన మన శత్రువులను చెండాడుతాడు. యుద్ధోద్యోగ సమయంలో భీష్ముడు తన నెవ్వరు ఎదుర్కొన్నా వారిని సంహరించగలననీ, శిఖండిని మాత్రం జయించలేననీ పేర్కొన్నాడు. రక్షణలేని సింహానికి నక్కకూడ హాని చేయగలుగుతుంది. అట్లాగే మనం భీష్ముడికి రక్షణ కలిగించకపోతే ఆయన శిఖండిపాలుగాక తప్పదు. పెద్దపులి నిద్రిస్తుంటే బలంతో పొట్టేలు క్రుమ్మి చంపినట్లుగా రక్షలేని భీష్ముడిని శిఖండి చంపకుండా మనం అప్రమత్తులమై ఉండాలి. కాబట్టి రథికులందరూ కలిసి భీష్ముడిని రక్షించాలి. శిఖండి ఆయనకు ఎదురుపడకుండా చూడాలి'. అన్నాడు.

తెల్లవారింది. యుద్ధ యాత్రాసంరంభం ఉద్ధృతమైంది. కౌరవులవైపు - భీష్ముడు తేరుపై ముందు సాగగా మహావీరులందరూ వారి వారి సైన్యబలాలతో కదలి మహాసముద్రంవలె భయంకరంగా రణరంగంలో నిలిచారు. భీష్ముడు రాజులనందరినీ ఉద్దేశించి ఈ విధంగా పలికాడు:

'యుద్ధం రాజులకు తెరిచి ఉన్న స్వర్గద్వారం వంటిది. పూర్వమెందరో ఆ మార్గాన నడిచారు. మీరూ ఆ మార్గాన నడవటం న్యాయం. ఇళ్ళల్లో రోగాలతో చనిపోవటంకంటె పాపం మరొకటి లేదు. రాజులకు యుద్ధభూమిలో చావటం పెన్నిధిని పొందటం వంటిది.'

ఈ మాటలు విని రాజులందరు ఉప్పొంగి భీష్ముడి ముందు వివిధ ప్రమాణాలు చేశారు. భీష్ముడు కర్ణుడిని పుత్ర మిత్రామాత్య సహితంగా యుద్ధానికి రాకూడదని దుర్యోధనుడితో హెచ్చరించాడు. 'ఇతరులను వద్దని తానొక్కడే వెళ్ళటం బలవంతుల లక్షణం కదా!' అని దుర్యోధనుడు ప్రశంసించాడు. రారాజు కోరికపై భీష్ముడు మానుషవ్యూహాన్ని పన్నాడు.

ఆ వ్యూహంలో భీష్మద్రోణులు ముందు నిలిచారు. కృపాశ్వత్థామలు వలపట, కృతవర్మ మద్రేశ్వరులు దాపట, బాహ్లిక సోమదత్త భూరిశ్రవసులు వెనుక, దుర్యోధనుడు కురుకుమారవర్గంతో కలిసి మధ్యభాగంలో నిలిచారు. అతడికి ముందుగా పదివేలమంది సంశప్తకులు సుశర్మను ముందుంచుకొని 'మేము అర్జునుడిని చంపుతాము. లేదా, చస్తాము' అని శపథం చేస్తూ సన్నద్ధమయ్యారు. మిగిలిన రాజులను ఆయాచోట్ల పదిలంగా నిలిపి 'ఇంతకుపూర్వం ఇంతటి దృఢవ్యూహాన్ని ఎన్నడూ చూడలేదు'

అని అందరూ ఆశ్చర్యపోయేటట్లు ఏర్పరిచారు. దేవతలు, స్వర్గవాసులైన పూర్వరాజులు - అనేకమంది ఆకసంలో నిలబడి ఆసక్తితో యుద్ధాన్ని చూడటానికి సిద్ధమై ఉన్నారు. ఇది కౌరవపక్ష సన్నాహం.

అంతకుముందే పాండవపక్షం యుద్ధానికి ఆయత్తమై ఉన్నది. వెలిగొడుగుల వెలుగుతో యుధిష్ఠిరుడు ముందుగా యుద్ధభూమికి సాగాడు. భుజాస్తంభ విజృంభణంతో భీముడూ, కదులుతున్న రోహణాద్రివలె శ్రీకృష్ణ సారథికమైన రథాన్ని అధిరోహించి అర్జునుడూ ధర్మజుడి వెంట నడిచారు. ఆ తరువాత నకుల సహదేవులూ, అభిమన్యుడూ, ద్రౌపదేయులూ యుద్ధోత్సాహంతో వెడలారు. వారి వెంట ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడు, సౌభద్రుడు, మొదలైనవారు వెంట నడిచారు. పాంచాల మత్స్య దేశాధిపతులూ, సాత్యకీ, చేకితానుడూ, శిఖండి, మగధ దేశాధిపతి అయిన సహదేవుడు, అతడి తమ్ముడు, ధృష్టకేతుడు, అతడి సోదరుడు, ఘటోత్కచుడు, పాండ్యరాజు, కేకయరాజ పంచకం, శైబ్యుడు, కాశ, కరూశాది బహుదేశాధీశులు మొదలైన మహావీరులు సైన్యాలతో సహా రణరంగంలో నిలిచారు. పాండవసేనకు ముఖతిలకం వలె సర్వసైన్యాధ్యక్షుడైన ధృష్టద్యుమ్నుడు రాణించాడు. పాండవసేనలు కదలి కురుక్షేత్రంలోని శమంతక పంచక సమీపంలో సాగిపోతున్నప్పుడు ధర్మరాజుకు కుడికన్ను అదరటం వంటి శుభశకునాలు తోచాయి. అతడు సంతోషిస్తూ తూర్పు మొగమై కౌరవసైన్యానికి ఎదురుగా నిలిచి అందరితో ఇట్లా అన్నాడు: ' మన మీ యుద్ధంలో రాజ్యలాభాన్ని పొందుదాం. లేదా పవిత్రమైన వీరస్వర్గాన్ని చేరుదాం-' అని శపథం చేశాడు. రాజులందరూ అతడి యెదుట విజయశపథాలు చేసి, విజయతిలకాలు ధరించారు.

పాండవసైన్యంకంటె కౌరవసైన్యం అధికసంఖ్యలో ఉండి విస్తారంగా కనపడుతున్నది. దానిని చూచి ధర్మరాజు నివ్వెరపోయి అర్జునుడికి ఆ సైన్యాన్ని చూపాడు. పార్థుడు చిన్ననవ్వు నవ్వి అన్నతో ఇట్లా అన్నాడు: 'ధర్మాన్ని నాశనం చేసేవారికి విస్తారమైన సైన్యం ఉన్నా, ధర్మపాలకులకు సైన్యబలం తక్కువగా ఉన్నా, విజయం రెండవవారినే వరిస్తుం'దని నారదు డొకసారి నేనూ, ద్రోణాచార్యుడూ, పితామహుడూ, వేదవ్యాసులవారూ వినేటట్లు చెప్పాడు. కాబట్టి గోవింద రక్షితమైన పాండవపక్షానికి విజయం తథ్యం.' అని పలికి పాండవవీరుల పరాక్రమాన్ని ప్రశంసించి చెప్పాడు. ఏనుగువలె తన బలాన్ని తానెరుగడని ధర్మరాజును పొగిడాడు. అత డలిగితే లోకం దద్దరిల్లుతుందని కీర్తించి ధర్మజుడిలో ఉత్సాహాన్ని ఉద్దీపింపజేశాడు.

ఆ తరువాత అర్జున ప్రేరితుడైన ధృష్టద్యుమ్నుడు పాండవ సైన్యబలంతో అచలవ్యూహాన్ని పన్నాడు. ఆ వ్యూహానికి అగ్రభాగంలో ధృష్టద్యుమ్నుడు నిలిచాడు. అతడికి బాసటగా అభిమన్యుడు మొదలైన కుమారవర్గం, నకుల సహదేవ సహితంగా భీముడూ నిలిచారు. చేకితాన, సాత్యకి సమేతులై పాంచాల మాత్స్యదేశాధిపతులు దక్షిణోత్తర పార్శ్వాలలో క్రమ్ముకొన్నారు. నడిమిభాగంలో గజసైన్యసహితుడై ధర్మజుడు నిలిచి విజయాశీర్వాదాలు పొందుతున్నాడు. ముందట అర్జునుడిచేత రక్షించబడుతున్న శిఖండి భీష్ముడికి ఎదురుగా నిలిచాడు. అపరభాగంలో మాగధ సహదేవ ధృష్టకేతులు ససైన్యులై విజృంభించి ఉన్నారు.

ఆ సమయంలో ఉభయసేనలూ ఉజ్జ్వలంగా ఉన్నాయి. అయినా, పాండవపక్షంలో నరనారాయణులు ఉండటం చేత పాండవసేన కౌరవసేనకంటె బలోపేతంగా చూపట్టింది. దుర్యోధనుడు యుద్ధాకాంక్షతో తన వైభవాన్ని ప్రదర్శిస్తూ తెగించి వచ్చాడు. పాండవేయులు పెళ్ళికి వెళ్ళినట్లుగా యుద్ధానికి తరలివచ్చారు. కౌరవులది రోషమయ మహావిజృంభణం. పాండవులది ధర్మమయ ధీరవీర విహారం.

అప్పుడు శ్రీకృష్ణార్జునులు పాంచజన్య దేవదత్త శంఖాలు పూరించారు. పాండవసైన్యం ఉప్పొంగింది. కౌరవసైన్యం ఉలికింది. కౌరవపక్షాన నెత్తురువాన కురిసింది. భీష్మద్రోణాశ్వత్థామలు యుద్ధానికి వెడలేటప్పుడు 'పాండవులకు విజయం తథ్యం' అని సంకల్పిస్తుంటారు. ఇట్లా ఉండగా దుర్యోధనుడు అశుభసూచనలు లెక్కచేయకుండా తూర్యనాదాలు మ్రోయింపజేశాడు. ప్రళయకాలంలో పొంగి పొరలే మహాసముద్రాలవలె ఉభయసైన్యాలూ రణోత్సాహంతో సందడి చేస్తున్నాయి. ఆ సందడిలోనే కొన్ని యుద్ధ నియమాలు చేసికొన్నారు. పూలతో విలసిల్లే తోటలు కదలక మెదలక నిలిచి ఉన్నాయా అన్నట్లు యుద్ధప్రారంభ సంకేతం కొరకు ఉభయసేనలు ఎదురుచూస్తూ ఉన్నాయి. యుద్ధాన్ని చూడాలనే ఆసక్తితో ఆకసాన దేవసమూహాలు నిలిచిఉన్నాయి.

ఆ సమయంలో ఒక ఉత్కంఠావహమైన సన్నివేశం జరిగింది. ఉన్నట్టుండి ధర్మరాజు కవచం విడిచి, ఆయుధాలు రథంలో పెట్టి రథం దిగి, పాదచారియై, మౌనంతో భీష్ముడివైపు పోవటం ప్రారంభించాడు. ఆ దృశ్యాన్ని చూచి భీమార్జునాదులు ఆశ్చర్యపోయారు. 'ఆయన కంత అవసరం ఏమి వచ్చిం?' దని మథనపడ్డారు. ఆయన వెంట నడిచి పరిపరివిధాల ఆయనను ప్రశ్నించారు. కాని, ధర్మరాజు మారుపల్కక తన నడక సాగిస్తూనే పోయాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజు మనసు నెరిగి, 'యుద్ధానికి వెళ్ళేముందు పెద్దల ఆశీస్సులు తీసికొంటే విజయం తప్పక లభిస్తుందని పెద్దలంటారు కాబట్టి ధర్మజుడు భీష్మాదుల అనుమతిని కోరటానికి పోతున్నా'డని వ్యాఖ్యానించాడు. పాండవముఖ్యులందరూ ధర్మరాజును అనుసరిస్తున్నారు. ఆ దృశ్యాన్ని చూచి కౌరవవీరులు కూడా ఆశ్చర్యపోయారు. ధర్మరాజు అంత అధైర్యపడవలసిన అవసరం ఏమి కలిగిందని పలురకాలుగా తలపోశారు.

ధర్మరాజు కౌరవసైన్యవ్యూహంలో ప్రవేశించాడు. భీష్ముడిని సమీపించాడు. వారిరువురి నడుమ ఇట్లా సంభాషణ సాగింది.

ధర్మ: పుణ్యాత్మా! నిన్ను ఎదిరించి యుద్ధం చేయటానికి నీ అనుజ్ఞను ముందుగా తీసికొనటానికి, నిన్ను దర్శించాలని ప్రీతితో వచ్చాను. నీ దీవెన పొంది వెళ్ళితే నేను శత్రువులను జయించగలను.

భీష్మ: ధర్మజా! నీ వీ విధంగా రాకపోయినట్లయితే శాపమిచ్చి ఉండేవాడిని. వచ్చావు. మేలయింది. నీవు శత్రువులను జయింపుము. ఇంతేకాక ఏదైనా వరం కోరుకో; నన్ను నీ పక్షంలో యుద్ధం చేయాలని మాత్రం కోరకు.

ధర్మ: తాతా! నీవు రారాజు పక్షానే యుద్ధం చేయుము. నాకు మేలయ్యే పనిని మనస్సులో తలంచుము.

భీష్మ: అట్లాగే చేస్తాను. నీ మనసులోని మాట ఏమిటో చెప్పుము.

ధర్మ: నిన్ను యుద్ధంలో గెలిచే మార్గం తెలియచెప్పుము.

భీష్మ: (నవ్వుమొగంతో) న న్నెదుర్కొని గెలవటం ఆ దేవతలకు కూడా సాధ్యం కాదు.

ధర్మ: అందుకే కదా! నిన్ను వేడుకొంటున్నది.

భీష్మ: (దయతో) బంధుత్వాన్ని నా మనసులో చొప్పించి. నా హృదయాన్ని కరిగించి వేడితే నా మనోధైర్యాన్ని కోల్పోయి యుద్ధాన్ని మాని ఆయుధాన్ని వదలిపెడితే తప్ప నన్ను చంపటం సాధ్యం కాదు. ఇక ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపొమ్ము. ఇది సమయం కాదు. నీవు కోరినదానిని పొందటానికి మరల వత్తువులే.

ఆ మాటలు విని ధర్మజుడు తాతకు నమస్కరించి ముందుకు సాగాడు. కృష్ణార్జునులు వెంటరాగా ద్రోణుడికీ, కృపాచార్యుడికీ, శల్యుడికీ నమస్కరించి వారినుండి యుద్ధానికి అనుమతి పొందాడు. తనకు జయం కలిగేటట్లు ఆశీర్వదించండని అడిగాడు. అప్పుడు ద్రోణు డిట్లా అన్నాడు: 'నీకు కృష్ణుడు మంత్రియై ఉండగా మరొకరిని జయంకొరకు అడగనవసరం లేదు. ధర్మం ఏ వైపున ఉంటే కృష్ణుడు ఆ వైపున ఉంటాడు. జయం కూడా ఆ వైపే కలుగుతుంది!' ఆ మాటలు విని ధర్మజుడు ఆచార్యుడి వధోపాయాన్ని తెలుపుమని వేడాడు. ద్రోణు డిట్లా చెప్పాడు: ' నా చేతిలో ఆయుధమున్నంత సేపూ నన్నెవ్వరూ చంపలేరు నేను ప్రాయోపవేశం చేసి అస్త్రశస్త్రాలను వదలిపెట్టినప్పుడు మాత్రమే నన్ను చంపటం సాధ్యమౌతుంది. నమ్మదగిన వ్యక్తి వలన మిక్కిలి దుస్సహమైన కీడుమాట విన్నప్పుడు నేను అస్త్రశస్త్రాలను సన్న్యసిస్తాను అప్పుడు శత్రువులు సంహరించవచ్చును'. ఆ తర్వాత కృపాచార్యుడిని అడిగాడు. ఆయన అవధ్యుడు కావటం చేత వధోపాయం చెప్పలేదు. కాని, విజయం కలిగేటట్లు దీవించాడు. ఆ పైన శల్యుడిని సమీపించి 'నీవు కర్ణరథ సారథ్యం చేసేటప్పుడు అతడిని నొవ్వబలికి చిక్కుపరచి మాకు మేలు చేయు' మని కోరాడు. అత డిదివరకే మాట ఇచ్చినట్లు సాయం చేస్తానని హామీ పలికాడు. ఈ విధంగా ధర్మరాజు అందరి అనుమతి పొంది తమ్ములందరు వెంటరాగా తన రథంవైపు నడిచి వచ్చాడు.

ఆ సమయంలో సేనలను చూడటానికి వినోదంగా వచ్చిన కర్ణుడు కనపడ్డాడు. శ్రీకృష్ణుడు అతడిని సమీపించి, 'భీష్ముడిపై కోపం వచ్చి యుద్ధంలో పాల్గొననన్నావట. అట్లయితే ఆయన చచ్చేంతవరకు పాండవపక్షంలో చేరి యుద్ధం చేయటం బాగుంటుంది

కదా!' అని అన్నాడు. వెంటనే కర్ణుడు 'భీష్ముడి మీది కోపంతో యుద్ధంలో పాల్గొనకుండ తొలగి ఉన్నానే కాని, దుర్యోధనుడికి అంకితమైన ఈ ప్రాణాన్ని మరొకప్రక్కకు చేర్చటం న్యాయంకాదు' అని తేల్చి చెప్పాడు. శ్రీకృష్ణుడు సంతోషించి వెడలి వచ్చాడు.

ధర్మరాజు తన సైన్యంలో నిలిచి కౌరవసైన్యం వైపు మొగం పెట్టి ఎలుగెత్తి ఇట్లా ప్రకటించాడు: 'మా యందు ప్రీతితో మా పక్షంలో చేరాలని ఎవరైనా అనుకొంటుంటే, వారికి ఆహ్వానం పలుకుతున్నాను. మాలో చేరినవారిని నా తమ్ములవలెనే గౌరవిస్తాను' అని. ఆ ప్రకటన విని యుయుత్సుడు దుర్యోధనాదులను దూషిస్తూ, ధర్మరాజును ప్రశంసిస్తూ బంధుమిత్ర సైన్య సమేతంగా పాండవపక్షంలో ప్రవేశించాడు. ధర్మరాజు అతడిని ఆదరంతో సమ్మానించాడు.

శ్రీకృష్ణుడి గీతా ప్రబోధం, విశ్వరూప ప్రదర్శనం

ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో యుద్ధానికి సిద్ధమైన కురుపాండవ సైన్యాలు మోహరించి ఏమి చేశాయో చెప్పుమని ధృతరాష్ట్రుడు సంజయుడిని అడిగాడు. సంజయుడు చెప్ప నారంభించాడు.

దుర్యోధనుడు ద్రోణుడి వద్దకు పోయి పాండవ వ్యూహాన్ని చూపించి, కౌరవవీరులను పేరు పేరున పేర్కొని, భీష్మాభిరక్షితమైన కౌరవసైన్యాన్ని ప్రశంసించి, భీష్మరక్షణకు అందరిని ప్రేరేపించాడు. దానితో పితామహుడు పొంగిపోయి సింహనాదం చేసి శంఖం పూరించాడు. కురువీరులందరు కూడా శంఖాలు పూరించారు.

అప్పుడు పాండవపక్షంలో కృష్ణార్జునులు పాంచజన్య దేవదత్తాలు పూరించారు. భీమాదులు కూడా శంఖనాదాలు చేశారు. సింహనాదాలు చేశారు. ఆ శబ్దానికి కౌరవుల హృదయాలు దద్దరిల్లాయి. పాండవవీరుల ఒడళ్ళు పొంగిపోయాయి. ఇక బాణప్రయోగ సమయం ఆసన్నమయింది.

అర్జునుడు గాండీవమెత్తి నారి సారించి కౌరవులను చూచి, శ్రీకృష్ణుడితో తన రథాన్ని ఉభయసేనల నడుమ నిలుపుమన్నాడు. కృష్ణుడు రథాన్ని అట్లాగే నిలిపాడు. అర్జునుడు ఉభయసేనలలోని వీరులను కలయచూచాడు. అందులో తాతలు, తండ్రులు, సోదరులు, సుతులు, బంధువులు, మిత్రులు, ఆచార్యులు, శిష్టజనులు అయిన తనవారిని చూచి పరమకృపావేశం చెంది, అత్యంత విషాదం పొంది గోవిందుడి మొగం చూచి, 'దుర్మదాంధుడయిన దుర్యోధనుడి దుర్వినయంతో ఎంత కీడు పుట్టిందో చూచావా?' అన్నాడు.

'కృష్ణా! యుద్ధభూమిలో ఈ బంధుజనసంతతిని చూడగా నాకు తొట్రుపాటు కలుగుతున్నది. శరీరం వణకుతున్నది. చేతులు కంపిస్తున్నాయి. గాండీవం చేతిలో నిలవటంలేదు. కాళ్ళమీద నిలబడలేకపోతున్నాను. వీరిని చంపే నిష్ఠురత్వానికి నేను ఒడిగట్టలేను. యుద్ధం చేయలేను. రక్తపాతం వలన వచ్చే రాజ్యంగాని, దానివలన కలిగే సుఖాలుగాని నాకు వద్దు. ఎవరికొరకు ఈ రాజ్యాన్నీ, సంపదలనూ కోరుతున్నామో వారందరూ ప్రాణాలు కోల్పోతే, సంపదలు మరెందుకు? తాతలను, మామలను, సుతులను, తండ్రులను, తమ్ములను, అన్నలను, గురువులను, బంధువర్గాలను తుచ్ఛమైన దుర్నీతితో చంపి, నేను పొందే నెత్తుట తడిసిన భోగాలు నాకు సంతోషాన్ని కలిగిస్తాయా? కీర్తినిస్తాయా? పెంపుదల కూరుస్తాయా? బంధుసంహారం వలన పాపం కలుగుతుంది. లోకాల నేలటానికైనా ఇంతటి క్రూరకర్మ నేను చేయలేదు. ఎదుటి వారేమి చేసినా నాకు మారు చేయటానికి మనసురాదు.'

'అయ్యో! మిక్కిలి లోభగుణంతో తరువాత కలిగే కీడును గమనించలేక కౌరవకులక్షయానికి ఓర్చి యుద్ధానికి తెగించి వచ్చారనే అపవాదు కలుగుతుంది. దీనిని తెలిసికూడా మనం వీరిని చంపితే ఫలమేమి వస్తుంది? కులనాశనం వలన కులధర్మాలు చెడిపోతాయి. దానివలన సాంకర్యం ఏర్పడుతుంది. కులనాశకులు నరకకూపంలో పడతారు. రాజ్యలోభంతో బంధుజనుల నందరినీ చంపి, ఇంతపాపం చేయటానికి ఎట్లా పూనుకొంటాం?' అని రథంమీద చేయి ఊతంగా చేసికొని కూలబడ్డాడు. శోక నిమగ్నుడయ్యాడు. విషాద విహ్వలుడై పరమకరుణాభరితు డయ్యాడు. శరశరాసనాలు వదలి కన్నులవెంట నీరుకారుస్తూ కదలకుండా ఉండిపోయాడు.

కృష్ణ : అర్జునా! పరాక్రమం ప్రదర్శించవలసిన సమయంలో ఈ అనువుగాని పద్ధతి ఎక్కడినుండి వచ్చింది? వినుము. ఈ రకంగా అవివేకులు వ్యవహరిస్తారు. ఈ దీనస్థితి సద్గతినీ, సత్కీర్తినీ దూరం చేస్తుంది. కాబట్టి ఈ ఆడుతనం వదలిపెట్టుము. ధీరుడవై లెమ్ము! మనసులోని పిరికితనాన్ని దూరం చేయుము.

అర్జు : అక్కటా! పూజించదగిన భీష్మద్రోణులను బాణాలతో బాధించటం న్యాయమా? మాన్యులను చంపటం పౌరుషం కాదు. దానికంటె బిచ్చమెత్తుకొనటం సుఖం. ఎవ్వరిని చంపితే పెద్ద కీర్తి వస్తుందని అనుకొంటారో అది నాకు ఉత్తమ జీవన పద్ధతి కాదు. ఈ సేనాముఖంలో ఉన్నవారు కౌరవులే కదా! వీరిని చంపి ఇంద్రపదవి పొందినా శోకవహ్ని నా మనసులో చల్లారదు. కాబట్టి నేను యుద్ధం చేయను. పెద్దలను నొప్పించలేను. వారిని గెలిపించినా, నేను గెలిచినా పెద్దగా మేలేమి కలుగుతుంది? నేను కార్పణ్యదోషోపహత స్వభావుడను, ధర్మసమ్మూఢ చేతస్కుడను. నేను నీ శిష్యుడను. శరణుపొంది అడుగుతున్నాను. నన్ను శాసించుము.

కృష్ణ : (కలకల నవ్వి) విచారించగూడని వారిని గూర్చి విచారించటం బుద్ధిమంతుల లక్షణం కాదు. నీవు పండితుడివలె మాట్లాడుతున్నావు. వివేకవంతమైన చిత్తం కలవాడవైతే ఉన్నవారిపై మక్కువ, చనిపోయినవారికై చింత అనేవి ఉండవు.

అని ప్రబోధిస్తూ అర్జునుడికి పరమజ్ఞానానికి కారణాలైన అనేక వాక్యాలను వినిపించాడు. దేహంలో బాల్యం, యౌవనం, వార్ధకం అనే అవస్థలు కలిగినట్లుగానే, చినిగిన వస్త్రాలను వదలి నూతన వస్త్రాన్ని ధరించినట్లు దేహాంతర గమనం చేసే ఆత్మకు నాశనం లేదు. పుట్టుట గిట్టుటలు శరీరానికే. ఆత్మకు శరీరానికి వలె అస్త్రశస్త్ర బాధలుండవు అంటూ ఇటువంటి అనేక వాక్యాలు చెప్పి, ఆత్మతత్త్వాన్ని తెలిపాడు.

'ఆత్మకు మరణం లేదు కాబట్టి ఎవరికొరకునూ శోకించటానికి కారణం కానరాదు. జీవుడు నశించడు కాబట్టి, దుఃఖించ నవసరంలేదు. పురుషుడు చెరపడు, చెడడు. పురుషుడంటే ఎవరో కాదు. పురుషోత్తముడనైన నేనే. ఆత్మకు బాధ్యతా బాధకత్వాలు లేవు. కృపాశోకాలకు మూలం అహంకారాదులు. వాటిని వారించుకొనటం కర్తవ్యం. రాజులకు యుద్ధం ఉత్తమకర్మము. అది అపావృత స్వర్గద్వారం. లెమ్ము! యుద్ధం చేయుము. అనుమానించకుము. కర్మను చేయటానికి నీవు అధికారివి. ఫలాన్ని బ్రహ్మార్పణభావంతో వదలి కర్మచేయటం కర్మయోగం. తత్త్వజ్ఞానం కలిగితే కర్మశమం తనంతట తానే సిద్ధిస్తుంది. ఇటువంటి వాక్యా లెన్నో చెప్పి అర్జును డడిగిన ప్రశ్నలకు సమాధానాల నిచ్చాడు.

అర్జు : జగన్నాథా! అతి గుహ్యమైన ఈ తత్త్వాన్ని పరమకృపతో అనుగ్రహించి, ఆధ్యాత్మిక అనుభవాన్ని ప్రసాదించావు. దీనివలన నాకు కొంత భ్రమ తొలగింది. యోగి హృదయాలకు మాత్రమే గమ్యమైనదీ, అతులైశ్వర్య విభూతితో ఒప్పారేదీ అయిన నీ రూపాన్ని చూడాలనే కోర్కె బలంగా ఉన్నది. నాకు చూప గలిగిందయితే దయతో చూపించి నాకు కన్నులపండుగ చేయుము.

కృష్ణ : వివిధ వర్ణాలతో, నానావిధాలుగా ఉండే నా రూపంలో ఆశ్చర్యకరమైన అనేకాంశాలు చూడవచ్చును. అవి ప్రకాశమయ్యేటట్లు చూపుతాను. నా రూపాన్ని మానుషమైన కన్నులతో చూడలేవు కాబట్టి దివ్య చక్షువులను ప్రసాదిస్తున్నాను.

అని అర్జునుడికి దివ్యదృష్టిని శ్రీకృష్ణుడు ఇచ్చాడు. యోగీశ్వరుడైన లక్ష్మీశ్వరుడు తన దివ్యరూపాన్ని చూపాడు. ఆ విశ్వరూపం వేయి సూర్యుల కాంతికంటె మించినది. వర్ణనాతీతమయింది. ఆ మహామూర్తిని చూచి అర్జునుడు ఆశ్చర్యంతో కూడిన గగుర్పాటుతో అత్యంతానందంతో దండప్రణామాలు చేసి, నిలిచి చేతులు జోడించి ఇట్లా అన్నాడు:

అర్జు : దేవా! నీ దివ్యదేహంలో సురాసుర గంధర్వాదులైన దేవమౌనులు, బ్రహ్మ, చరాచరజగత్తు నాకు కనపడుతున్నవి. భయంకరమైన ముఖాలు, భుజాలు, పాదాలు, కన్నులు అనేకాలను చూస్తున్నాను. కిరీటాలు, ఆభరణాలు, చక్రగదాదులైన ఆయుధాలు, పూలదండలు, వివిధ వస్త్రాలు, మొదలైన అనేక దృశ్యాలు చూస్తున్నాను. ఈ రూపం పరమాద్భుతంగా

ఉన్నది. ఇది మొదలు, ఇది నడుము, ఇది తుది అని తెలిసికోలేకపోతున్నాను. ఆ ప్రకాశం అప్రమేయం, దేదీప్యమానం. నిర్వికారం. మహిమాన్వితం. నేను చూడలేకపోతున్నాను. ఈ లోకాల కన్నిటికి మూలకారణమైన పరతత్త్వానివి నీవే. భూమి, ఆకాశం, దిగంతాలు అన్నీ నీలోనే కనపడుతున్నాయి. నీ కన్నులు సూర్యచంద్రులు, నీ ముఖం భయంకర దంష్ట్రలమయం, జ్వాలాతోరణసంయుతం. రుద్రాదిత్యులూ, మరుద్వసువులూ నీలో ప్రవేశిస్తున్నారు. మహామునులు గుంపులు గుంపులుగా వచ్చి, నిన్ను స్తుతి చేస్తున్నారు. సిద్ధులు, సాధ్యులు, ఆకాశచరులు భయంతో నిన్ను చూస్తున్నారు. నీ ఆకారం దేదీప్యమానంగా భయంకరంగా ఉన్నది. దీనిని చూస్తున్న నాకు భయం వేస్తున్నది.ధైర్యం తూలిపోతున్నది. సంక్షోభపడుతున్నాను. ప్రసన్నుడవై నన్ను రక్షించుము.

అగ్ని శిఖలు వెలువడే నీ ముఖాలలోకి కౌరవులు, భీష్మాదులు, ఇక్కడ ఉన్న రాజులందరూ ఒక్కసారిగా ప్రవేశిస్తున్నారు. దేవా! నీవెవ్వరివో తెలియక సతమతమౌతున్నాను. దయామయుడవై నీవెవరో నాకు తెలియచెప్పుము.

కృష్ణ : నేను లోకాన్ని లయం చేసే కాలుడను. ఇక్కడి జనులను హరించటానికి పూనుకొన్నాను. నీవు యుద్ధంలో వీరిని చంప నవసరం లేదు. భీష్మాదులందరూ నాచేత చంపబడినవారే. నా చేత చచ్చినవారిని నీవు జయించబోతున్నావు. నీవు నిమిత్తమాత్రుడవే. కాబట్టి ఇక లెమ్ము. రాజ్యాన్ని గ్రహించుము.

అర్జు : (వడవడవణకుతూ, చేతులు మోడ్చి, గద్గదకంఠంతో) పుండరీకాక్ష! జలవాయు సూర్యచంద్రాది వివిధ తత్త్వాలకు నీవే ప్రవర్తకుడవు, శాశ్వతుడవు, అచ్యుతుడవు. నిన్ను తెలియక యాదవుడని, మిత్రుడని, మేనబావ అని భావించి కలిసి భోజనం చేయటం, ప్రియసంభాషణలు చేయటం, ఎగతాళి చేయటం, మొదలైన లోకసామాన్య చర్యలు ఆచరించాను. తల్లిదండ్రులు పిల్లలను మన్నించినట్లు నా తప్పులన్నీ క్షమించుము. అపూర్వమైన నీరూపం చూడటం వలన ఆనందం, ఇప్పటి నీ భయంకర రూపదర్శనం వలన భయం, బాధ కలుగుతున్నాయి. ఇక ఈ రూపం చాలించి నీ పూర్వ సౌమ్యాకారాన్ని ధరించి నిలిచి నాకు ఆహ్లాదాన్ని కలిగించుము.

కృష్ణ : (దయార్ద్రచిత్తంతో) పార్థా! ఎన్నోతపస్సులు చేసి, వేదాధ్యయనం చేసిన మహామునులు కూడా దర్శించలేనిది నా దివ్యపరమాకృతి. సమాహిత భక్తిభావం కలవారికి మాత్రమే ఈ రూపం గోచరిస్తుంది. సామాన్యజనులు ఈ రూపాన్ని చూడలేరు. అటువంటి ఈ విశ్వరూపాన్ని నీకు దర్శింపచేశాను. నీవు మానసిక వ్యథ పొందటమెందుకు? మూఢత్వాన్ని వదలి, భయాన్ని వీడి, సంప్రీత హృదయుడవు కమ్ము. (అని పూర్వ ప్రకారరూపం ధరించి ప్రశాంతంగా నిలిచాడు.)

అర్జు : కృష్ణా! నేను చైతన్యవంతుడనయ్యాను. ప్రకృతిస్థుడనయ్యాను.

కృష్ణ : మత్కర్మపరుడు, మద్భక్తుడు అయినవాడు నన్ను పొందగలుగుతాడు. బ్రహ్మవిద్యకు సంబంధించిన నీ అనుమానాల నన్నింటిని నేను తీర్చాను. నేను ఉపదేశించింది అతి గుహ్యమైన జ్ఞానం. దానిని నీవు సముచిత రీతిని గ్రహించి వ్యవహరించుము. ఇంతకంటె పరమ రహస్యమైన మరొక విషయం చెపుతాను. సర్వధర్మాలను పరిత్యజించి నన్నొకడినే శరణు వేడుము. సర్వపాపాలను తొలగించి మోక్షాన్ని ప్రసాదిస్తాను. నీకు బోధింపబడిన ఈ గీతాశాస్త్రము నియమనిష్ఠలు, తపస్సు, భయభక్తులు, నిశ్చయజ్ఞానం గలవారికి మాత్రమే బోధింప తగింది. లేనివారికి ఎన్నడూ బోధింప తగినది కాదు. ఇక నీకు అజ్ఞానసంమోహమంతా తొలగిందా?

అర్జు : కేశవా! మోహమనే చీకటి తొలగింది. నీ దివ్యరూపాన్ని దర్శించి భక్తి ప్రపత్తులు కలవాడనైనాను. నా సందేహాలన్నీ తీరాయి. బోధతో కూడుకొన్న నిరామయమైన స్థిరమనఃస్థితిని పొందాను. నీవు బోధించినట్లు నేను నడచుకొంటాను.

అని ఆ పరమపురుషుడికి భక్తి పురస్సరంగా సాష్టాంగ నమస్కారం చేసి దృఢచిత్తంతో గాండీవాన్ని చేపట్టి యుద్ధోత్సాహంతో పొంగులువారాడు. ఆ దృశ్యాన్ని చూచి, వారి సంభాషణలు వినిన అదృష్టం సంజయుడికి దక్కింది. యోగీశ్వరేశ్వరుడైన కృష్ణుడు, ధనుర్ధారి అయిన అర్జునుడు ఎక్కడ నిలిచి ఉంటారో అక్కడ విజయం, నీతి, సిరిసంపదలు నిత్యమై నిలిచిఉంటాయని

సంజయుడు తన తలపును ప్రకటించాడు.

భీష్ముడి తొలినాటి యుద్ధం

దుర్యోధనుడు ఆగ్రహంతో ఆజ్ఞాపించగా, దుశ్శాసనుడు పురికొల్పగా కౌరవసైన్యం శంఖభేరీమృదంగాది స్వనాలు చెలరేగగా గాంగేయుడు మొదట ముందుకు సాగగా వేగంగా పాండవసైన్యాన్ని కవిసింది.

పాండవులు భీముడు ముందు నడువగా భీష్ముడు వచ్చే తీరుకు ఎదురుగా పోయి కౌరవసేనను ఎదిరించి గజసైన్యాన్ని గడ్డిపరకవలె నిర్వికారంగా నరికివేయటం మొదలుపెట్టారు. ఆకాశభాండం తూటుపడేటట్లు తూర్యనాదాలను మించి గర్జనలు చేస్తూ భీముడు సింహనాదం చేశాడు. యుద్ధం ప్రారంభమయింది.

భీమసేనుడిని దుశ్శాసనుడు, దుర్ముఖుడు, దుస్సహుడు, దుర్మర్షణుడు, వివింశతి, వృషసేనుడు, చిత్రసేనుడు, వికర్ణుడు, పురుమిత్రుడు ఒక్కుమ్మడిగా ఎదుర్కొన్నారు. దుర్యోధనుడు ఆ సన్నివేశాన్ని కన్నులపండువుగా దర్శించాడు. భీముడికి తోడుగా క్రమ్ముకొని ముందుకు సాగి అభిమన్యుడు ఉద్ధృతంగా విజృంభించాడు. అతడికి ఉపపాండవులు అండగా నిలిచారు. వారు చేసే యుద్ధానికి సైనికులందరు అబ్బురపడి వారివైపే చూస్తూ కొంతకాలం నిలిచిపోయారు.

దుర్యోధనుడు ఉన్మదుడై తరుముతూ, ధర్మరాజు జయాస్పదంగా పురికొల్పుతూ తమ తమ సైన్యాలను డీకొనచేశారు. దుమ్ములు రేగేటట్లు తొలిపోరు మొదలయింది.

భీష్ముడు విజృంభించి పాండవసైన్యం మీద దాడిచేసి మధ్యందిన మార్తాండుడివలె వెలిగాడు. అతడిని అర్జునుడు అద్భుతంగా ఎదుర్కొన్నాడు. మహోగ్రశస్త్రాస్త్రాలు దిక్కులు పిక్కటిల్లేటట్లు వ్యాపించి రౌద్రస్ఫూర్తిని ప్రదర్శించాయి.

ఆ రణరంగంలో వివిధ వీరులు ఒకరికొకరు ఎదుర్కొని యుద్ధం చేయనారంభించారు. అభిమన్యుడు కోసలరాజయిన బృహద్బలుడిని, భీష్ముడు భీమసేనుడిని, దుశ్శాసనుడు నకులుడిని, దుర్ముఖుడు సహదేవుడిని, ధర్మరాజు శల్యుడిని, ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని, మాగధ సహదేవుడు భూరిశ్రవసుడిని, ధృష్టకేతుడు బాహ్లికుడిని, ఘటోత్కచుడు అలంబసుడిని, శిఖండి అశ్వత్థామను, భగదత్తుడు విరాటుడిని, బృహత్ క్షత్రవిభుడు కృపాచార్యుడిని, చేకితానుడు సుశర్మను, ద్రుపదుడు జయద్రథుడిని, వికర్ణుడు యుధామన్యుడిని, శకుని ప్రతివింధ్యుడిని, సుదక్షిణుడు శ్రుతసోముడిని, ఇరావంతుడు శ్రుతాయువును, విందానువిందులు గుంతిభోజుడినీ, అతడి కొడుకునూ, కైకేయులేవురు గాంధారరాజు లేవురిని, శతానీకుడు ఉలూకుడిని, ఎదుర్కొని వీరోచిత యుద్ధం చేశారు. రణరంగం రక్తసిక్తమై భీకర రమణీయంగా రాణించింది.

భీష్మ విజృంభణం

దుర్యోధనుడు ప్రేరేపించగా భీష్ముడు ప్రళయతాండవం చేసే పరమేశ్వరుడివలె పాండవసైన్యం మీదకు దాడిచేశాడు. అతడి చుట్టూ పంచాగ్నులవలె దుర్ముఖుడు, కృపుడు, కృతవర్మ, మద్రపతి, వివింశతీ ప్రకాశిస్తూ వెంటనడిచారు. తాళకేతనం ధగధగలాడగా భీష్ముడు విజృంభించాడు. సైన్యంలో చీలికలు కలిగేటట్లు, వంపులుగా, కోణాకారాలుగా, వలయాలుగా రథాన్ని నడిపిస్తూ సైన్యాన్ని చెండాడాడు. శత్రువీరుల తలలు రాలాయి. విండ్లు విరిగాయి. మేనులు నేలకు వాలాయి. టెక్కాలు కూలాయి. పాండవబలాలు నెత్తురు టేరులలో పొర్లాయి. భీష్ముడిని ఎదుర్కొనే వీరులు లేక పాండవసైన్యం బెండుపడింది. అప్పుడు అభిమన్యుడు వారిని ఆదుకొన్నాడు.

శల్యుడిని అయిదు బాణాలతో కొట్టాడు. కృతవర్మను ఒకబాణంతో గ్రుచ్చాడు. ఈటెతో దుర్ముఖుడి సారథిని చంపాడు. వివింశతి వింటిని విరుగగొట్టాడు. కృపుడి గుర్రాలను నాలుగు బాణాలతో కూల్చాడు. భీష్ముడిపై తొమ్మిదిబాణాలు సంధించి కలతపరచి సింహగర్జన చేశాడు. దేవతలు మెచ్చారు. 'వీడు విప్పచ్చుడివంటివాడు కాని సామాన్యుడు కాడు' అని మెచ్చుకొన్నారు.

అప్పుడు భీష్ముడు అభిమన్యుడి మీదకు లంఘించాడు. అయిదు బాణాలతో అతడి టెక్కాన్ని విరుగగొట్టాడు. మరొకఅస్త్రం

ప్రయోగించే లోపల పాండవవీరులు భీష్ముడిమీద బాణాల వర్షం కురిపించారు. భీష్ముడు పర్వతంవలె భాసించాడు. అతడు తిరిగి బాణాలు గుప్పించాడు. అభిమన్యుడు వాటిని తిరుగగొట్టి భీష్ముడి తాళధ్వజాన్ని విరుగగొట్టాడు. ఆ దృశ్యాన్ని చూచి పాండవసైన్యం ఉప్పొంగింది, కౌరవసేన చిన్నబోయింది.

భీముడు అభిమన్యుడికి అండగా వచ్చాడు. భీష్ముడి నెదుర్కొన్నాడు. అతడు భీముడి సింహకేతనాన్ని విరిచాడు. భీముడు కోపించి భీష్ముడిని మూడు బాణాలతో బలంగా కొట్టాడు. అంతటితో ఆగక కృపుడిని, కృతవర్మను, మద్రేశుడిని బాణాలలో ముంచాడు. వారి అనుయాయులు భీముడిపై దాడి చేయగా వారిని అతడు నుగ్గు నుగ్గు చేశాడు.

భీముడికి అండగా సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, కేకయ రాజపంచకం, విరాటుడు, అతడి కొడుకులు వచ్చి యుద్ధం చేయసాగారు. భీష్ముడు వారందరి శరీరాలపై మూడేసి చొప్పున బాణాలు నాటాడు. ఆ తరువాత శల్యుడికీ ఉత్తరుడికీ పోరు బాగా సాగింది. శల్యుడి చేతిలో ఉత్తరుడు చనిపోయాడు. ఆ తరువాత శల్యుడు కృతవర్మ రథంమీదకు కొండపైకి సింగం దూకినట్లు దూకాడు. ఉత్తరుడి తమ్ముడైన శంఖుడు అన్నను చంపిందన్న కోపంతో కౌరవసైన్యం మీద రౌద్రంగా విరుచుకుపడ్డాడు. భీష్ముడతడిపై దాడి చేసి బాణాలలో ముంచెత్తాడు. అర్జును డాసమయంలో అక్కడికి వచ్చి భీష్మబాణాలను - గాలి మేఘాలను ఎగురగొట్టినట్లు దూరంగా తొలగింపజేశాడు. భీష్మార్జునులు రెండు పెద్ద కొరవులు ఢీకొన్నట్లు యుద్ధం చేసి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. అప్పటికి మధ్యాహ్నమయింది.

శల్యుడు కృతవర్మ రథం దిగి శంఖుడి రథాన్ని కూల్చాడు. విరథుడైన శంఖుడు కత్తితో యుద్ధం చేస్తూ సమీపంలో ఉన్న అర్జునుడి రథాన్ని చాటు చేసికొని దూరంగా తొలగిపోయాడు. భీష్ముడు నలుదిక్కుల బాణాలు సారించి అర్జునుడి రథాన్ని వదలి ద్రుపదుడివైపు రథాన్ని నడిపించాడు. ఎండిన అడవిని కార్చిచ్చు కాల్చినట్లు పాండవసైన్యాన్ని బరిమార్చాడు. అప్పుడు చంద్రవంశజుడైన భీష్ముడు సూర్యుడివలె వెలుగొందుతుండగా చూచి సిగ్గుపడి సూర్యుడు అస్తమించాడు. పాండవసైనికుల ముఖాలలో కాంతి తగ్గింది. వారి హృదయాలలో భయాంధకారం అలముకొన్నది. అప్పుడు కయ్యం చాలించి, ఉభయసేనలు తమ తమ ఉనికిపట్లకు పోయాయి. భీష్మపరాక్రమాన్ని స్మరిస్తూ దుర్యోధనుడూ, అతడి తమ్ములూ మిక్కిలి సంతోషించారు.

ఆ రాత్రి ధర్మరాజు విషణ్ణచిత్తుడై తమ్ములతో, తగినవారితో కలిసి శ్రీకృష్ణుడి వద్దకు వెళ్ళి ఈ విధంగా అన్నాడు: 'కార్చిచ్చు అడవినంతా ఒక్కపెట్టున కాల్చినట్లు భీష్ముడు బలదర్పమహోగ్రతతో మన సేననంతా మునుంపెట్టి చంపాడు. మహానీలమేఘంగా విజృంభించి ఎవ రాతడిని చంపగలుగుతారు? ఆయన శక్తిని అంచనా వేయలేక అందరివలె సామాన్యవీరుడిగా భావించి యుద్ధానికి దిగి వెర్రివాడనయ్యాను. నీ మరదులందరూ ఆయన బాణాలకు గురి అయ్యారు. ఆయనతో దిక్పాలురు కూడా ఎదుర్కొని గెలవగలుగుతారని నేననుకోవటంలేదు. భీష్ముడిని మన అర్జునుడు జయించగలడని బాగా నమ్మి ఉండగా అతడు కూడా యుద్ధంలో ఉపేక్ష వహించాడు. భీముడు మాత్రం భుజబలం దాచుకొనకుండా పోరాడాడు. ఇక అతడనీ, ఇతడనీ పేర్కొనటం దేనికి? నేను యుద్ధాన్ని మానుతాను. రాజులనందరినీ భీష్ముడికి ఎరలుగా వేయలేను. నేను మరల అడవులకు పోతాను. అక్కడే ఉంటాను. కూరాకు కోసి తింటాను. దామోదరా! నీ మాటనే మేము ఎప్పుడూ పాటిస్తాము. మాకు అశుభాలు కలుగకుండా ఉండటానికీ, శుభాలు కలగటానికీ ఈ మహిమయే కారణం. ఇప్పుడు మేమేమి చేయాలో ఆజ్ఞాపించుము.'

శ్రీకృష్ణు డిట్లా సమాధానం చెప్పాడు: 'ధర్మరాజా! నీ కింత చింత ఎందుకు? నీ కెదురు ఎవ్వరున్నారు? నీ తమ్ములలో ఒక్కొక్కరు బలంలో లోకాల నన్నిటినీ గెలువగలిగిన సమర్థులు. గర్వితుడైన ఆ భీష్ముడిని శిఖండి చంపుతాడు. నీ శత్రువుల నందరినీ నేను క్రమంగా సంహరిస్తాను. సాత్యకి సత్యపరాక్రముడు. అతడి అస్త్రపాండిత్యం శత్రువీరులకు అశనిపాతం. మహాపరాక్రమవంతులైన విరాట ద్రుపదులు నీ కొరకు ప్రాణాల నివ్వటానికైనా సిద్ధంగా ఉన్నారు. ఇందరు నీకు అండగా ఉండగా దిగులెందుకు? నీ పక్షంలో

ఉన్న ధృష్టద్యుమ్ను డొక్కడు చాలు శత్రువుల నందరినీ మట్టుపెట్టటానికి.

భీష్ముడి రెండవనాటి యుద్ధం

ఆ మాటలు విని ధర్మరాజు ధృష్టద్యుమ్నుడితో ఇట్లా అన్నాడు: 'పాండవ సైన్యాన్ని ఇతడు పాలిస్తాడని శ్రీకృష్ణుడు చెప్పగా నిన్ను సర్వసైన్యాధ్యక్షుడిగా అభిషేకించాము. మేమందరం నీవెంట రాగా శత్రుసైన్యాన్ని చంపటం నీ బాధ్యత కాదా?' అని ప్రశ్నించాడు. 'ధర్మజా! బ్రహ్మ నన్ను ద్రోణుడిని చంపటానికే సృష్టించాడని లోకానికంతటికి తెలుసు. దీనిని పెక్కుసార్లు చెప్పనవసరం లేదు. కౌరవవీరులు నా కెదురైతే వారిని వరుసగా మట్టుపెడతాను. ఇక చూడుము' అని ధృష్టద్యుమ్నుడు ప్రతిజ్ఞ చేశాడు. ధర్మజుడి సూచన మేరకు క్రౌంచవ్యూహాన్ని పన్నాడు. మరునాడు సూర్యోదయానికి అందరూ సిద్ధమయ్యారు. క్రౌంచవ్యూహంలో ముక్కుగలచోట అర్జునుడు నిలిచాడు. కుంతిభోజుడు,శైబ్యుడు కన్నులచోట్లలోనూ, ద్రుపదుడు శిఖాస్థానంలోనూ, దశార్ణ శూరసేన కిరాతదేశాధిపతులు కంఠస్థానంలోనూ, భీముడు, ధృష్టద్యుమ్నుడు కుడి ఎడమ ప్రక్కలలోనూ, మిగిలిన వీరులు ధృష్టద్యుమ్నుడి దిక్కుననూ నిలబడ్డారు. కేకయ కాశీరాజులతో కలిసి విరాటుడు జఘన భాగంలోనూ, హూణప్రభువులు పరివేష్టించి ఉండగా ధర్మరాజు వెన్నుగా నిలిచి ఒప్పారాడు.

కౌరవపక్షంలో దుర్యోధనుడు భీష్మ ద్రోణాశ్వత్థామ కృపశల్య కృతవర్మల పరాక్రమాలను కీర్తిస్తూ వారిని పురికొల్ప పాండవులు పన్నిన క్రౌంచవ్యూహానికి ప్రతిగా మరొక వ్యూహాన్ని పన్నండని ప్రేరేపించాడు. కౌరవసైన్యాన్ని మూడుభాగాలుగా విభజించారు. ఒక దిక్కున దుశ్శాసన వికర్ణ విందానువిందులు, శూరసేన యవన త్రిగర్త కురు దేశాలవారు నిలిచారు. మరొకదిక్కున ద్రోణుడు, కుంతల దశార్ణ విదర్భ గాంధార సింధు సౌవీర పతులు గుమిగూడారు. భీష్ముడు మహాసైన్యంతో నడిమి భాగంలో నిలిచాడు. ఇట్లా మూడు మోహరాలయ్యాయి. పాండవ కౌరవ పక్షాలు యుద్ధానికి తలపడ్డాయి.

భీష్ముడు విజృంభించాడు. పాండవసైన్య మహాసాగరాన్ని మథిస్తున్న మందర పర్వతం వలె సంక్షోభపరిచాడు. అర్జునుడు భీష్మ ప్రతాపాన్ని అడ్డుకొన్నాడు. శల్యద్రోణ దుర్యోధనాదులు భయకంపితులను చేయటానికి పూనుకొన్నాడు. కౌరవవీరులు అర్జునుడిని ఎదుర్కొన్నారు కాని, అతడి ధాటికి ఎదురుదాడి చేసి నిలువలేకపోతున్నారు. అప్పుడు దుర్యోధనుడు భీష్ముడితో ఇట్లా నిష్ఠురంగా పలికాడు. 'తాతా! అర్జునుడు ఉక్కుమిగిలి మన వీరుల నందరినీ అవలీలగా మించి సైన్యాన్ని త్రుంచివేస్తున్నాడు. నీవిట్లా చూస్తూ ఊరుకొనటం న్యాయమా? పైపెచ్చు నీవు కర్ణుడిని యుద్ధంలో పాల్గొనవద్దని నిషేధించావు. అట్లా చేసి అన్యాయం చేశావు.' ఈ ఒప్పనిమాటలు విని భీష్ముడు మనసులో కటకట పడ్డాడు. కుత్సితుడై అర్జునుడిపై దాడికి వెడలాడు. దుర్యోధన వికర్ణులు కుడివైపున, అశ్వత్థామ ఎడమవైపున బాణాల వానలు కురిపించారు. అర్జునుడికి బాసటగా అన్నదమ్ములందరూ కూడి నిలిచారు. పోరు ఘోరంగా సాగింది. అర్జునుడి బాణాలు మహాగ్నులవలె వ్యాపించాయి. భీష్ముడి శరపరంపర మహాసముద్రంవలె పొంగి వాటిని ఆర్పింది. ఈ విధంగా ఇద్దరూ సమయుద్ధం చేశారు. అప్పటికి మధ్యాహ్నమయింది.

ఆ వరుసలో ఆ యుద్ధంలో పాల్గొన్న వీరుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

1. ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుడి నెదుర్కొన్నాడు. ఉభయులు విజృంభించి విండ్లు త్రుంచుకొన్నారు. శక్తులను ప్రయోగించుకొన్నారు. అయినా ద్రోణుడి బాణ ప్రవాహాన్ని ధృష్టద్యుమ్నుడు ఎదుర్కొనలేకపోయాడు. అంతలో భీము డతడికి సాయం వచ్చాడు. ద్రోణుడిని క్రూరాస్త్రాలతో నొప్పించాడు.
2. దుర్యోధనుడు భీమసేనుడిని డీకొనటానికి కళింగపతిని మహాసైన్యంతో ప్రేరేపించాడు.
3. ద్రోణుడు విరాట ద్రుపదులపై విజృంభించాడు.
4. ధర్మరాజు ధృష్టద్యుమ్నుడికి సహాయంగా నిలిచి పోరు సాగించాడు.
5. కళింగ రాజయిన శ్రుతానందుడు భీముడిని విపుల బలంతో చుట్టుముట్టాడు. భీము డా సైన్యాన్ని నేలమట్టం చేశాడు.

ఆ పయి కేతుమంతుడు భీముడిపై విరుచుకుపడ్డాడు. అతడి సేన మంటలో పడ్డ మిడుతల దండువలె భీమపరాక్రమంవలన హతమై పోయింది. కేతుమంతుడి కొడుకు శక్రదేవుడు కోపించి భీముడి రథాశ్వాలను కూల్చాడు. భీముడు కోపించి పెనుగదను ప్రయోగించి శక్రదేవుడిని చంపాడు. శ్రుతాయువు మండిపడి భీముడిపై లంఘించాడు. అంతలో శ్రుతాయువు తమ్ముడైన భానుమంతుడు గజసైన్యంతో భీముడిని ఎదిరించాడు. భానుమంతుడి మదగజం భీముడిపై దుమికింది. భీముడు సింహనాదం చేసి దానిని చంపి, భానుమంతుడిని యమపురికి పంపాడు. గజసైన్యాన్ని హతమార్చాడు. అంతలో శ్రుతాయువు భీముడి మీదకు సైన్యాన్ని పురికొల్పాడు. చతురంగ బలాలు భీముడిని చుట్టుముట్టాయి. భీముడు మేనుపెంచి గదాఖడ్గాది ఆయుధాలతో సైన్యాన్ని నురుమాడాడు. ఇంతలో సారథి తెచ్చిన రథాన్ని మరల ఎక్కి కళింగపతి మీదకు దాడి సాగించాడు. ఆ దాడిలో శతాయువు మూర్ఛపోయాడు. అతడి సారథి ఆ రథాన్ని దూరంగా తోలుకొనిపోయాడు. భీముడు మిన్నుముట్టేటట్లు సింహనాదం చేశాడు. కౌరవసైన్యం చుక్కాని పట్టే నావికుడు లేని నావవలె తిరుగుడుపడింది. భీముడు శంఖం పూరించాడు.

6. ఆ శంఖనాదం విని భీష్ముడు విజృంభించాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి, భీముడికంటె ముందుగా భీష్ముడిని ఎదిరించారు. శిఖండిని తప్ప మిగిలినవారిపై బాణాలు సంధించి భీష్ముడు భీముడి రథాన్ని విరుగగొట్టాడు. అతడు రథంమీద నుండి దూకి శక్తి విసిరాడు. దానిని భీష్ముడు భగ్నం చేశాడు. సాత్యకి భీష్ముడి రథసారథిని చంపాడు. భీష్ముడి రథాశ్వాలు వాయువేగంతో అతడి రథాన్ని దూరంగా తీసికొనిపోయాయి. భయంకరాకారుడైన భీముడిని చూచి కౌరవసైన్యం పరుగెత్తింది. ధృష్టద్యుమ్నుడు భీముడిని తన రథంమీద ఎక్కించుకొన్నాడు. సాత్యకి భీమ విజృంభణాన్ని కీర్తించాడు.

7. ధృష్టద్యుమ్నుడు శల్య కృపాశ్వత్థామలతో యుద్ధంచేసి అశ్వత్థామ రథ్యాలను చంపాడు. శల్యుడు ధృష్టద్యుమ్నుడిమీద బాణాలు నాటాడు. కృపాశ్వత్థామలు అతడిపై దాడిచేశారు. అప్పుడు ధృష్టద్యుమ్నుడిని అభిమన్యుడు ఆదుకొని ఆ మువ్వురు వీరులను నొప్పించాడు.

8. లక్ష్మణకుమారుడు అభిమన్యుడి నెదుర్కొని విల్లువిరిచాడు. అభిమన్యుడు కూడ లక్ష్మణకుమారుడి విల్లు త్రుంచాడు. లక్ష్మణకుమారు నాదుకొనటానికి భీష్మద్రోణాదులు పూనుకొన్నారు. వారినందరినీ అభిమన్యుడు శరపరంపరతో నిలువరించాడు.

9. ఆ సంగతి పసిగట్టి అర్జునుడు భీష్మాదులపై ప్రభంజనంవలె చుట్టుముట్టాడు. ధర్మరాజు స్వయంగా సైన్యాలను పురికొల్పి అర్జునుడికి అండగా నిలిపాడు. భీష్ముడు దుమ్ములు రేగేటట్లు విజృంభించి పాండవసైన్య రక్తపాతంతో దానిని అణచేటట్లు చేశాడు. అర్జునుడు కౌరవసైన్యాన్ని ముక్కలు ముక్కలుగా చేసి రణరంగాన్ని బీభత్సం చేశాడు. చతురంగబలాలను చదును చేశాడు. భీష్ము డా దృశ్యం చూచి, కృష్ణసారథ్యంలో యుద్ధం చేసే అర్జునుడి పరాక్రమానికి మురిసిపోయాడు. అర్జునుడు త్రిపురసంహారివలె రౌద్రమూర్తితో వెలుగొందాడు. 'పోరు నేటికి చాలిద్దాము' అని భీష్ముడు రెండవనాటి యుద్ధాన్ని చాలించాడు.

భీష్ముడి మూడవనాటి యుద్ధం

మూడవనాడు భీష్ముడు గరుడవ్యూహం పన్నాడు. తాను ముక్కుగా నిలిచాడు. ద్రోణ కృపవర్మలు కన్నులుగానూ, కృపాశ్వత్థామలు శిరస్సుగానూ, భూరిశ్రవసుడు, శల్యుడు, భగదత్త సౌవీర జయద్రథులు కంఠంగానూ, దుర్యోధనుడూ అతడి తమ్ముడూ వెన్నుగానూ, విందానువిందులు కాంభోజశూర సేనులు తోకగానూ, మాగధ కళింగాదులు దక్షిణపక్షంగానూ, కర్ణాటకోసల ప్రముఖులు వామపక్షంగానూ నిలిచారు.

పాండవపక్షాన అర్జునుడు అర్ధచంద్రాకార వ్యూహాన్ని పన్నుమని ధృష్టద్యుమ్నుడికి సూచించాడు. అత డట్లాగే చేశాడు. పాండ్యమగధ బలాలతో కలిసి భీమసేనుడు దక్షిణశృంగంలో ఉన్నాడు. ఆ తరువాత విరాట ప్రముఖులు నిలిచారు. శిఖండి సహితుడైన ధృష్టద్యుమ్నుడిని తోడుగా తీసికొని ధర్మరాజు మధ్యభాగంలో ఉన్నాడు. మిగిలిన రాకుమారులందరూ శ్రీకృష్ణ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సారథ్యంలో సాగే అర్జునుడివెంట ఒక కొమ్ము కాచారు.

ఇరువైపుల వీరులు పోరు సాగించారు.

1. భీష్మద్రోణులు, సైంధవసౌబలులు మొదలైనవారు కలిసి ఒక్కుమ్మడిగా పాండవసేనపై విరుచుకుపడ్డారు. పాండవపక్షంలో భీమఘటోత్కచులు, సాత్యకి శైబ్యచేకితాన ద్రౌపదేయులు కలిసి వారిని ఎదుర్కొన్నారు. యుద్ధం సంకులంగా సాగింది.

2. దుర్యోధనుడు భీముడిపై యుద్ధానికి వచ్చాడు. అతడిపై బాణాలు సంధించాడు. భీముడు దుర్యోధనుడిమీద బలమైన బాణం నాటాడు. దుర్యోధనుడు మూర్ఛపోయాడు. అతడి సారథి రథాన్ని దూరంగా తీసికొనిపోయాడు. భీమాదులు విజృంభించగా కౌరవసైన్యం పారిపోవజొచ్చింది. శకుని అడ్డగించబోయి అభిమన్యుడి చేత భంగపడ్డాడు. దుర్యోధనుడు మూర్ఛనుండి తేరుకొని, సారథిని చెడతిట్టి, రథాన్ని భీష్మద్రోణుల వద్దకు తోలుమన్నాడు. అప్పుడు భీష్ముడితో సుయోధను డిట్లా అన్నాడు:

దుర్యో: మూడులోకా లొక్కుమ్మడి కూడి పోరుకు దిగినా మీలో ఒక్కొక్కరు అవలీలగా గెల్వగలవారు. అటువంటి మీరుండగా మనసేన ఇంతటి దురవస్థ పాలుకావాలా? మీరు పాండవులపై అలుక వహించనున్న విషయం ముందుగానే నాకెందుకు చెప్పలేదు. ఆనాడే కర్ణుడు చెప్పాడు. అట్లాగే నేడు పాటుపడ్డాము. నీవల్ల అడియాసపాలయ్యాము. ఇంక వేరే మాటలెందుకు?

భీష్మ: ఇంద్రాదులతో కూడుకొన్న దేవబలాలు సైతం పాండవులను ఎదిరించి నిలువగలవా? తెలిసి తెలిసి నీ విట్లా అనటం న్యాయమా? శస్త్రాస్త్రోద్ధతి, బాహుగర్వ సమృద్ధిగల పాండవులు - వృద్ధులు, ఆయువు చెల్లినవారు, దుర్బుద్ధులు అయినవారిచేత పోతారా? అయినా, నాకు చేతనైనంతవరకు పాండవసైన్యాన్ని చంపుతాను. నీవూ, నీ బంధువులూ సమీపంలో ఉండి చూస్తూ ఉండండి.

అప్పటికి మధ్యాహ్నమయింది. భీష్ముడు మధ్యందిన మార్తాండుడివలె తేజోవంతుడై విజృంభించాడు. సుయోధనాదులు అతడి వెంట సాగారు. భీష్ముడు రౌద్రాకారుడై పాండవసేనను పీనుగుపెంటలుగా మార్చాడు. మిగిలిన సైన్యం భయభ్రాంతమై దీనదశకు వచ్చింది. అప్పుడు శ్రీకృష్ణుడు రథపు పగ్గాలు పట్టుకొని అర్జునుడితో ఇట్లా అన్నాడు:

కృష్ణ: అర్జునా! కృపద్రోణ భీష్మాదులతో కూడుకొన్న కౌరవసైన్యాన్ని పరాక్రమంతో గెలవాలని ఎప్పుడూ కోరుకొంటూ ఉంటావు. ఇపుడు ప్రళయరుద్రుడై భీష్ముడు మన సైన్యాన్ని చెండాడుతుంటే నీ భుజబలాన్ని ప్రదర్శించకుండ ఇట్లా మిన్నకుండటం తగునా?

అర్జు: కృష్ణా! ఇన్నిమాట లెందుకు? భీష్ముడిమీదకు రథం పోనిమ్ము. అతడి గర్వాన్ని భంజిస్తాను.

ఆ మాట విని కృష్ణుడు తేరును భీష్ముడివైపు నడిపాడు. భీష్ముడు వడిగా బాణాలతో గుర్రాలను, కృష్ణుడినీ, అర్జునుడినీ నొప్పించాడు. శ్రీకృష్ణుడు తాను ధీరుడై, గుర్రాలను తేర్చి, అర్జునుడిని పురికొల్పాడు. ఫల్గునుడు గాండీవాన్ని సారించి భీష్ముడి విండ్లను రెండుసార్లు విరుగగొట్టాడు. భీష్ముడు కార్చిచ్చు వలె బాణాలను ప్రయోగించాడు. అర్జునుడు బాణాలను ప్రయోగిస్తున్నాడు. కాని, భీష్ముడు విడవకుండా కృష్ణుడిపై, గుర్రాలమీద, అర్జునుడిమీద బాధ కలిగేటట్లు బాణాలతో క్రమ్ముతున్నాడు. అప్పుడు శ్రీకృష్ణ డిట్లా భావించాడు.

'పాండవ వీరులు సిగ్గువదలి పరుగెత్తుతున్నారు. వీరిలో ఒక్కడు కూడ భీష్ముడిని ఎదిరించి పరాక్రమం ప్రదర్శించలేరు. అర్జునుడు కూడ బాధపొంది తూగుతున్నాడు. ఇట్లాగే సాగితే భీష్ముడు నేడే దుర్యోధనుడి కోర్కెలన్నీ తీర్చేటట్లున్నాడు. యాదవ కేకయ పాంచాలాదులు వెన్నిచ్చి పరుగెత్తుతున్నారు. జయోన్మాదంతో కౌరవసైన్యాలు అన్ని దిక్కులా పెచ్చుపెరుగుతున్నాయి. ఇప్పుడు నే నూరకుండటం తగదు. భీష్ముడిని చంపి ధర్మరాజుకు విజయం చేకూరుస్తాను' అని తలపోశాడు.

అంతలో భీష్ముడు క్రూరబాణాలతో అర్జునుడిని కొట్టాడు. అర్జునుడు బడలిక చెందాడు. ఆ అదను చూచి కృపుడు, కృతవర్మ,

అశ్వత్థామ, భూరిశ్రవసుడు, సైంధవుడు, వికర్ణుడు ఒక్కసారిగా అర్జునుడిపై దాడిచేశారు. అప్పుడు సాత్యకి గజసైన్యంతో అర్జునుడికి

సాయంగా వచ్చి పాండవవీరులను ఇట్లా పురికొల్పాడు. 'చేసిన ప్రతిజ్ఞలు మరచారా? వెన్నుచూపి పరుగెత్తటం తగునా? బెదరక భీష్ముడినీ గీష్ముడినీ ఎదిరించి తరమండి. నే నుండగా మీకెందుకు భయం? అని అంటూ అర్జునుడిని మించి ముందుకు సాగగా శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు:

కృష్ణ: తిరిగిపోయే పందలను పురికొల్పట మెందుకు? ఉన్నవారే ఎదిరిస్తారులే. దుర్యోధనుడు జయించి రాజ్యం ఏలటం నేనుండగా జరుగని పని. నా మాట వినుము. అవక్రమైన నాచక్ర పరాక్రమాన్ని ప్రదర్శించి భీష్ముడిని నేలకూలుస్తాను. ద్రోణుడిని చక్కజేస్తాను. కౌరవవీరులను నురుమాడుతాను. సేనలను చెండాడుతాను. ఈ భూవలయాన్ని పాండవుల హస్తగతం చేస్తాను.

అని పలికి సుదర్శనాన్ని స్మరించాడు. ఆ చక్రాయుధం అతడి చేతిలో నిలిచింది. దానిని కుడిచేతి వ్రేల నిలిపాడు. పగ్గాలు రథానికి ముడివేశాడు. రథంనుండి దూకాడు. భూమి కంపించింది. చక్రకాంతులు పిక్కటిల్లాయి. క్రోధభయంకరంగా కృష్ణుడు సింహనాదం చేశాడు. మదించిన ఏనుగుయొక్క కుంభస్థలంపై దూకే సింహంవలె, ప్రళయరౌద్రాకారంతో భీష్ముడివైపు ఉరికాడు. కౌరవసైన్యంతోపాటు దుర్యోధనాదులు కూడా భయంతో నిశ్చేష్టులై నిలబడిపోయారు.

భీష్మ: (వినయంతో చేతులు జోడించి) పరమేశ్వరా! నన్ను ఈ విధంగా కృతార్థుడిని చేస్తావా? నీవు వచ్చి ఇప్పుడే నీ ఇష్టం వచ్చినట్లు ఏ విధంగానైనా చేయుము. నేను సిద్ధం. ఆలస్యం వద్దు. నీ చర్య నా కవశ్యం యోగ్యం.

అంటూ ఉండగానే అర్జునుడు రథంనుండి దూకి పరుగెత్తి శ్రీకృష్ణుడి వెంట వెళ్ళి అతడిని తన పొడుగైన చేతులతో పట్టి వారించాడు. కాని, పెనుగాలికి కదిలే చెట్టుకొమ్మవలె కొంతదూరం ఈడ్వబడినా పది అడుగుల తర్వాత నిలదొక్కుకొని, ఈడిగిలబడి మాధవుడిని నిలవబెట్టి ఇట్లా ప్రార్థించాడు.

అర్జు: 'యదుసింహా! కోపాన్ని ఉపసంహరించుకొమ్ము. నీవు పాండవుల కందరికీ రక్షవు. అట్టి నీవే ప్రతిజ్ఞను తప్పితే, ప్రతిజ్ఞాపరుడైన ధర్మరాజు శౌర్యం, ధైర్యం, బాహువీర్యం నశించిపోవా? ఈ చర్య నీకు తగిందేనా? కాబట్టి ఈ పని చేయబోకుము. కృష్ణా! నీవు అడుగు ముందుకు వేస్తే సాత్యకిని చంపినంత ఒట్టు. నీవు పూనుకొంటే కౌరవసేనను రూపుమాపటం తేలిక. కాని, నా పరాక్రమం వృథా ఔతుంది. అట్లా చేయటం నీకు తగునా? నాకు అపకీర్తి తేవటానికి నీవు చక్రం పట్టుతావా?

సవ్యసాచి సమయనిష్ఠకు శ్రీకృష్ణుడు సంతోషించి కోపాన్ని తగ్గించుకొని, నొగలెక్కి దిక్కులు పిక్కటిల్లగా పాంచజన్యాన్ని పూరించాడు. అర్జునుడు దేవదత్తాన్ని ఒత్తాడు. అర్జునుడు దూదికొట్టంలో పడ్డ కార్చిచ్చువలె కౌరవసైన్యం మీద దాడి చేశాడు. భీష్మాది కురువీరులను క్రూరబాణాలతో, వివిధాయుధాలతో వివిధ గతుల నొప్పించాడు. రణరంగంలో రథాన్ని కలయదిప్పాడు. కౌరవసైన్యాన్ని పెంటకుప్పలుగా మార్చాడు. రణరంగాన్ని రక్తసిక్తం చేశాడు. అంతలో సూర్యాస్తమయం అయింది. యుద్ధాన్ని చాలించారు. ఆనాటి రాత్రంతా అర్జునుడి పరాక్రమాన్ని గురించి ఉభయ స్కంధావారాలలో అందరూ చెప్పుకొన్నారు.

భీష్ముడి నాల్గవనాటి యుద్ధం

తెల్లవారింది. భీష్ముడు యుద్ధానికి సిద్ధమయ్యాడు. సముద్రతరంగాలవలె ద్రోణాది వీరులు వేగంగా వెంటసాగారు. కౌరవసైన్యం మేఘమాలవలె తోచింది. పాండవసైన్యం వీరరసవిస్ఫారమై మెరిసింది. నరనారాయణులు చంద్రసూర్యులవలె తోచారు. సైనికులు తలపడ్డారు. పలుచోట్ల పలురకాల పోరు సాగింది. భీష్ముడు అర్జునుడితో తలపడ్డాడు. భీష్ముడికి సాయంగా వస్తున్న ద్రోణ వివింశతి కృప సోమదత్త శల్యులను అభిమన్యుడు అడ్డగించాడు. భీష్మార్జునుల యుద్ధం భీకరంగా మొదలయింది. అభిమన్యుడు అశ్వత్థామాది వీరులతో వీరోచితంగా యుద్ధం సాగించాడు. పలువురితో ఒంటరిగా పోరుతున్న కొడుకును చూచి

అర్జునుడు వచ్చి అందరినీ అనేక భంగుల నొప్పించాడు. త్రిగర్తులు, కృతవర్మ, కేకయులు, మరికొందరు రథికులు కలిసి అభిమన్యుడిని చుట్టుముట్టారు. ధృష్టద్యుమ్ను డా సన్నివేశాన్ని గమనించి అభిమన్యుడికి తోడుగా వచ్చాడు. శల్యనందనుడిపై దాడిచేసి అతడిని చిత్రయుద్ధంలో సంహరించాడు. కొడుకు చావును చూచి రోషంతో శల్యుడు విజృంభించి ధృష్టద్యుమ్నుడి విల్లువిరిచి అతడిని చీకాకు పరిచాడు. అప్పుడు ధృష్టద్యుమ్నుడిని అభిమన్యుడు ఆదుకొన్నాడు. శల్యుడిని ఢీకొన్నాడు. దుర్యోధనుడు దానిని గమనించి దుర్ముఖ, దుస్సహ, దుర్మర్షణ, సత్యవ్రత, చిత్రసేన, పురుమిత్ర, వివింశతి, వికర్ణులను పురికొల్పి పంపాడు. వారు అభిమన్యుడిని ఎదుర్కొనటానికి భయపడి ధృష్టద్యుమ్నుడిని చుట్టుముట్టారు. వారందరితో అతడు సమర్థంగా పోరుతున్నాడు.

నకుల సహదేవులు మద్రపతిమీద దాడి చేశారు. వారికి పాంచాలమత్స్యపతులు సాయం వచ్చారు. మధ్యాహ్నం వరకు పోరు సాగింది.

ఇవ్వేళ అటో ఇటో తేలాలని భీముడు కౌరవులమీద పోరు ముమ్మరం చేశాడు.దుర్యోధనుడు కలతచెంది మగధరాజును అపార గజసైన్యంతో భీముడిపైకి పంపాడు. మదేభాలను చూచి భీము డుప్పొంగిపోయి, యుద్ధవీరాన్ని ప్రదర్శించాడు. భీముడికి బాసటగా ఉపపాండవులు, అభిమన్యుడు, ధృష్టద్యుమ్నుడు వచ్చి క్రమ్ముకొన్నారు. మాగధుడిని అభిమన్యుడు క్రూరభల్లంతో చంపాడు. శతానీకుడు ఏనుగుల కుంభస్థలాలను పగులగొట్టాడు. ధృష్టద్యుమ్నుడూ, భీముడూ ఏనికవేట చేశారు. ఉభయసేనాపతులు పురికొల్పగా సేనలు సంకుల సమరంలోకి దిగాయి. భీముడు విజృంభించి సైన్యాన్ని నేలమట్టం చేశాడు. అప్పుడు భీముడిపై భీష్ముడు దాడిచేశాడు. భీష్ముడిని సాత్యకి ఎదుర్కొన్నాడు. అలంబసుడు భీష్ముడికి సాయంగా వచ్చి సాత్యకిని ఎదిరించాడు. అత డాతడిని నాలుగు బాణాలతో చంపాడు. దానిని గమనించి భూరిశ్రవసుడు విజృంభించాడు. పాండవులు సాత్యకికి అండగా నిలిచారు. పరస్పర యుద్ధంలో భీముడు భయంకరంగా పోరి దుర్యోధనుడి తమ్ములను చంపాడు. తమ్ములను చంపిన భీముడిపై మండిపడి దుర్యోధనుడు ఆర్చుతూ భీముడితో తలపడ్డాడు. భీముడు నవ్వి కన్నుల నిప్పులు రాల దుర్యోధనుడిపై బాణాలు సంధించాడు. ఇద్దరూ సములై పోరాడారు. దుర్యోధను డేసిన బలమైన బాణం భీముడి రొమ్మును తాకగా అతడు మూర్ఛపోయాడు.

అప్పుడు అభిమన్యుడూ, ధృష్టద్యుమ్నుడూ, ఉపపాండవులూ కలిసి దుర్యోధనుడిపై దూసికొని వచ్చి క్రమ్ముకొన్నారు. భీముడు సేదతేరి విలయాంతకుడివలె లేచి శల్యుడిని నొప్పించాడు. సింహాన్ని చూచిన ఏనుగులవలె భీముడిని చూచి కౌరవసేనలు పరుగెత్తాయి. అప్పటికి మధ్యాహ్నమయింది.

దుర్యోధన ప్రేరితులై సుషేణాదులైన పెక్కురు సేనాపతులు భీముడితో దొమ్మిపోరు సాగించారు. ఆ భీమసేనుడు పెద్దపులి లేడి పిల్లలను చూచి లంఘించే విధంగా దూకి సుషేణుడిని, భీమబాహుడిని, ఉగ్రుడిని, భీమ భీమరథులను, సులోచనుడిని బాణాలతో చంపివేశాడు. ఈ విధంగా రాజకుమారులను చంపుతున్న భీముడిపై భీష్ముడు కౌరవవీరులను పురికొల్పాడు. భగదత్తుడు మదగజాన్ని అధిరోహించి భీముడిపై లంఘించాడు. అభిమన్యు ప్రభృతులు ఆ ఏనుగును గాయపరిచారు. నెత్తురు ఏరులుగా కారుతుండగా ఆ యేనుగు పాండవసైన్యంపై పిచ్చిగా తిరగబడింది. పాండవసైన్యం భయపడింది. దుర్యోధనుడు ఉప్పొంగి భీముడిపై బాణాలు కురిపించి గుండె మీద బలమైన బాణం నాటి ప్రక్కకు ఒరిగేటట్లు చేశాడు. అప్పుడు ఘటోత్కచుడు తండ్రి బాధ చూచి మాయాయుద్ధంతో విజృంభించి భగదత్తుడి గజబలాన్ని తరిమి దుర్యోధనుడిపై దాడి చేశాడు. అప్పుడు భీష్మ ద్రోణులు సుయోధనుడిని ఆదుకొని ఘటోత్కచుడిపై బాణవర్షం కురిపించాడు. ఘటోత్కచుడికి తోడుగా యుధిష్ఠిరాదులు వచ్చారు. పోరు ఘోరంగా సాగింది. భీష్ముడు పాండవసైన్యానికి గణుపుకొట్టాడు. ఘటోత్కచుడు విక్రమ సింహనాదం చేశాడు. ఆ నాదానికి భయపడిన మదగజాలు నీ సైన్యాన్నీ త్రొక్కుతూ బీభత్సాన్ని సృష్టించాయి. దానితో సూర్యాస్తమయం కూడా కావటంతో భీష్ముడు ఆనాటి యుద్ధాన్ని చాలిస్తున్నట్లు ప్రకటించాడు. పాండవసైన్యం సింహనాదాలు చేస్తూ శిబిరాలకు చేరింది. కౌరవసైన్యం చిన్నబోయి తిరిగిపోయింది. అందరినోటా ఘటోత్కచుడి పరాక్రమ ప్రశంసలే మారుమ్రోగాయి.

నాల్గవనాటి కౌరవుల పాటు విని ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

ధృత: రణరంగ వార్తలలో నీ వెప్పుడూ పాండవులకు మేలు జరిగిందనీ, నా కొడుకులకు పరాక్రమంలో తక్కువతనం కలిగిందనీ

ప్రకటిస్తూ ఉంటావు. భీష్మద్రోణ శల్యాది వీరులు మా ప్రక్కనుండగా ఈ తక్కువతనానికి కారణమేమిటో నాకు చెప్పుము.

సంజ: ఔషధగుణం మంత్రవీర్యం మాయాజనిత సమగ్రోద్ధతి కాదు. ఈ సంగతి నీకు మున్నెన్నిసార్లో చెప్పాను. పాండవులు న్యాయాన్నీ, సత్యాన్నీ తప్పరు. నీ కొడుకులు వాటికి జంకరు. ఆ విధంగా నీ కొడుకులు పాపం చేస్తుంటే తెలిసి తెలిసి చూస్తూ ఉండిపోయావు. దానివలన కలిగే కీడు అనుభవించక తప్పుతుందా? మరి ధర్మం గెలువదా? పాండవులు గెలవటం, కౌరవులు ఓడటం తప్పదు. విదురుడు చెప్పగా మనం విన్నాం గదా! నీ వడిగినట్లే నీ కొడుకు భీష్ముడిని అడిగాడు.

భీష్ముడిట్లా చెప్పాడు

భీష్మ: నే నెన్నోసార్లు నీకు చెప్పాను. పాండవులకు వాసుదేవుడు సహాయకుడై ఉన్నాడు. అందువలన వారికి అసాధ్యమనేది లేదు. ఆ పరమేశ్వరుడి అసలు స్వరూపం తెలిసినవారు పెక్కుమంది లేరు. తెలిసినవారికి ఆపదలు ఉండవు(రావు). పాండవులు ఆతడి తత్త్వాన్ని తెలిసికొని ఆశ్రయించారు. నీవు శ్రీకృష్ణుడిని లెక్కచేయవు. వినుము. నీకు మరొక విషయం చెపుతాను.

మానస సరోవరం ఉత్తరాన గల పర్వతంమీద బ్రహ్మదేవుడు సర్వదేవగణాలతో కొలువై ఉన్నాడు. అప్పు డొక మణిమయోజ్జ్వలమైన విమానమొకటి ఆకసాన కనపడింది. అందులో సర్వాత్ముడైన పరమాత్ముడిని దర్శించి అందరూ నిలిచి నమస్కరించి, స్తుతించారు.

బ్రహ్మ: నారాయణా! నీకు జన్మించి, నేను ఈ లోకాలను సారమతితో సృష్టించాను. నీ రక్ష ఎల్లప్పుడూ వీటికి ఉన్నది. ఇప్పుడు మానవలోకంలో అసురదుర్వృత్తాలు ఎక్కువయ్యాయి. కావున, నీవు యదువంశంలో పుట్టి, నీ సఖుడైన నరుడు కూడ భరతవంశంలో జనించేటట్లుగా చేసి, దైత్యులను సంహరించి, భూభారాన్ని మాన్పుము.

సంజ: అని ప్రార్థించగా ఆ దేవు డంగీకరించాడు. ఆ ప్రార్థనలందుకొన్నవారు నరనారాయణ మహర్షులు. 'నరుల హితం కోరి వారు భూమిపై పుట్టుతారు. వారిని కేవల మర్త్యులుగా భావించేవారు చెడిపోతారు. తెలిసి భక్తితో సేవించేవారు శుభాలను పొందుతారు.' అని చెప్పి బ్రహ్మ తన లోకానికి పోయాడు. మిగిలినవారు వారి వారి లోకాలకు పోయారు. ఈ కథను నారద, జామదగ్న్య, వ్యాసాదులచేత నేను విన్నాను. పూర్వం మహర్షులు నరనారాయణులతో వైరం వద్దని ఎన్నిసార్లు వారించినా మదాంధుడవై వినలేదు. ఇప్పటికైనా కృష్ణుడి నాశ్రయించి, పాండవులతో పొత్తు కలిపికొని బ్రతుకుము - అని భీష్ముడు హితవు చెప్పి ఊరకున్నాడు. నీ కొడుకు ఆ హితోపదేశాన్ని పెడచెవిని పెట్టాడు. మంచివారి మాటలు మీకు రుచించవు కదా!

భీష్ముడి అయిదవనాటి యుద్ధం

అయిదవనాటి ఉదయం భీష్ముడు మకరవ్యూహం పన్నాడు. పాండవులు శ్యేనవ్యూహం తీర్చారు. ముఖస్థానంలో భీముడు, నయనస్థానంలో ధృష్టద్యుమ్న శిఖండులు, శిరస్థానంలో సాత్యకి, కంఠస్థానంలో అర్జునుడు, వామపక్షంలో విరాట ద్రుపదులు, దక్షిణపక్షంలో సేనాసహితుడైన ధర్మరాజు నిలిచారు. భీముడు మకరవ్యూహాన్ని భేదించి లోనికి ప్రవేశించి భీష్ముడిని ఎదుర్కొన్నాడు. భీష్ముడు భీముడిని నొప్పించాడు. అర్జునుడు వచ్చి అతడికి బాసటగానిల్చి భీష్ముడి ప్రతాపాన్ని తగ్గించి కౌరవవీరులను గ్రీష్మాదిత్యుడివలె తపింపజేశాడు.

అప్పుడు దుర్యోధనుడు ద్రోణుడితో ఇట్లా అన్నాడు: 'నీవూ, భీష్ముడూ కోపిస్తే దేవతలు కూడా ఎదుర్కొనలేరు. మీరు తలచుకొంటే పాండవులను పట్టి పాలార్చగలరు. అర్జునుడు మన సేనను మట్టుపెట్టుతుంటే ఇట్లా చూస్తూ ఊరుకోవటం న్యాయమా?' ఈ మాటలకు ద్రోణుడు మనసులో కటకటపడ్డాడు. 'ఎన్నడూ పాండవుల బలాన్ని మనం ఓర్చుకొనలేము. సముద్రంలో సొరకాయ బుర్రను వేస్తే అది పట్టేంత నీటినే తీసికొంటుంది. వారిని గెల్వటం మాకు సాధ్యంకాదు. ఊరక ఈ కాని మాట లెందుకు?' అంటూ పాండవసైన్యం మీద విరుచుకపడ్డాడు.

సాత్యకి ద్రోణుడిని ఎదుర్కొన్నాడు. ద్రోణు డాతడిని నొప్పించాడు. అర్జునుడు గురువుపై బాణవర్షం కురిపించాడు. శల్య

భీష్ములు ద్రోణుడికి అండగా వచ్చారు. భీముడిపై దాడి చేశారు. ఉపపాండవులూ, అభిమన్యుడూ భీముడికి బాసటగా నిలిచారు. ఆ సమయంలో శిఖండి భీష్మడిపై పెనుదాడి చేశాడు. ద్రోణుడు త్రిప్పికొట్టాడు. భీమ భీష్ములు తమ తమ సేనలకు రక్షకులుగా ఉంటూ, అర్జున ద్రోణులకు తోడ్పడ్డారు. దుర్యోధనుడు భీముడిమీదికి కళింగదేశ గజసేనను పురికొల్పాడు. వాటిని భీముడు మర్దించాడు. సైనికులు భయపడి భీష్మడి ప్రాపున చేరారు. ఆ తరువాత తుముల యుద్ధం జరిగింది. విందానువిందులు కాశిరాజు సైంధవుడు కలిసి భీముడి నెదుర్కొన్నారు. వికర్ణుడు సహదేవుడిని, చిత్రసేనుడు శిఖండిని, దుర్యోధనుడు విరటుడినీ, త్రిగర్తులు, నకులుడిని, ద్రోణుడు చేకితాన సాత్యకులనూ, కృపాచార్యాదులు ధృష్టద్యుమ్నుడినీ, అభిమన్యుడు సాల్వకేకయులనూ, ధృష్టకేతు ఘటోత్కచులు ధార్త రాష్ట్రులను, యుధిష్ఠిరుడు శల్యుడిని ఢీకొన్నారు. పోరు తీవ్రంగా సాగింది. రక్తపుటేరులు పారాయి. భీమభీష్మల విజృంభణం హెచ్చుగా సాగింది. వివిధ వీరుల మధ్య వీరోచిత రణోత్సాహం వెల్లివిరిసింది. అంతలో అభిమన్యుడూ లక్ష్మణకుమారుడూ ద్వంద్వ యుద్ధంలో పాల్గొన్నారు. ఇరువురికీ వీరులు తోడ్పడ్డారు. పోరు ఘోరంగా సాగింది. అభిమన్యుడు వార్ష్ణేయులను చంపాడు. వృష్ణి వీరుడిని నేలపై పడవేశాడు. మధ్యాహ్నమయింది. అర్జునుడు ప్రచండంగా పరవళ్ళు త్రొక్కాడు. మంటలో పడే మిడుతలవలె కౌరవసైన్యం అర్జునుడి బాణాగ్నులకు ఆహుతి కాజొచ్చింది. అప్రతిహతంగా సాగిన అతడి యుద్ధ యాత్ర సాయంత్రం కావటంతో ఆనాటికి ఆగింది.

భీష్ముడి ఆరవనాటి యుద్ధం

ఆరవనాటి ఉదయం అర్జునుడు మకరవ్యూహం పన్నుమని సేనాపతికి చెప్పాడు. పార్థుడు పాంచాలపతి శిరస్సుగానూ, నకుల సహదేవులు కన్నులుగానూ, భీమసేనుడు తుండంగానూ, అభిమన్యుడు, ఉపపాండవులు, ఘటోత్కచుడు గండస్థలంగానూ, సాత్యకితో కూడిన ధర్మరాజు కంఠంగానూ, ధృష్టద్యుమ్నుడితో కలిసి ద్రుపదుడు వెన్నుగానూ, కేకయులు వామభాగంలోనూ, ధృష్టకేతుడు మొదలైనవారు దక్షిణభాగంలోనూ, కుంతిభోజశతానీకులు జఘనంగానూ, శిఖండీ, ఇరావంతుడూ తోకగానూ వ్యూహంలో నిలిచారు.

భీష్ముడు పాండవవ్యూహానికి ప్రతిగా క్రౌంచవ్యూహం రచించాడు. ముక్కుగా భీష్మద్రోణులు, నేత్రాలుగా కృపాశ్వత్థామలు, శిరోభాగంగా కృతవర్మ, కాంభోజ బాహ్లికులు, గొంతుగా శూరసేన పరివృతుడైన దుర్యోధనుడు, ఉరోభాగంగా సౌవీర సమేతుడైన భగదత్తుడు, వీపున విందానువిందులు, వామపక్షంలో సుశర్మ, దక్షిణ పక్షంలో యవనపతి, అపరభాగంలో శ్రుతాయువుతో కలిసి భూరిశ్రవసుడు నిలిచారు.

భీముడు ద్రోణుడిని ఎదిరించి అతడి సారథిని చంపాడు. అయినా, ద్రోణుడు తానే రథాన్ని నడుపుకొంటూ యుద్ధం సాగించాడు. భీష్ముడు ద్రోణుడికి తోడై చుట్టూ ఉన్న రాజులను దూరంగా పంపాడు. భీముడు మాత్రం వెనుకాడకుండ కౌరవసైన్యాన్ని నురుమాడాడు. కౌరవవీరులైన దుశ్శాసన, దుర్విషహ, దుర్మద, దుస్సహ, జయ, జయత్సేన, వికర్ణ, చిత్రసేన, సుదర్శన, చారుచిత్ర, సువర్మ, దుష్కర్ణాదులు ఒకచోట ఉండటం చూచి భీముడు వారిపై లంఘించాడు. వారందరు కసితో భీముడిని చుట్టుముట్టారు. భీముడు తన రథంమీదనుండి నేలపైకి దూకి పెనుగదతో వారందరిని ముప్పుతిప్పలు పెట్టాడు. ఆ సమయంలో ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిపైకి దూసికొని వచ్చాడు. భీమసేనుడికి తోడుగా నిలిచి సైన్యాన్ని నురుమాడాడు.

దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడి మీదికి రథికవరులను పురికొల్పి పంపాడు. ధృష్టద్యుమ్నుడు సమ్మోహన బాణాన్ని ప్రయోగించి వారందరిని నిశ్చేష్టులను చేశాడు. ఆ సమయంలో భీముడు ఒక సరోవరంలో నీరుత్రాగి దప్పిక తీర్చికొని మరల యుద్ధం ప్రారంభించాడు. ద్రోణుడు ద్రుపదుడిని నొప్పించాడు. సమ్మోహితులై ఉన్న వీరులకు తెలివి తెప్పించాడు. మరల విజృంభించాడు.

ఆరవనాటి యుద్ధంలో ద్రోణభీష్మ ప్రతాపం పాండవ వీరులకు గట్టి ఎదురు తాకిడి నిచ్చింది. భీముడు, ధృష్టద్యుమ్నుడు, ద్రుపదుడు, అభిమన్యుడు మొదలైన వీరుల పోరాటం, పాండవుల విజయరేఖలను ప్రదర్శించింది. కౌరవపక్షంలో దుర్యోధనుడు, పాండవపక్షంలో ధర్మరాజూ సమయోచితంగా వీరులను ప్రేరేపిస్తూ ఆయా వీరుల రణక్రీడలకు దోహదం చేస్తూ వచ్చారు. అర్జునుడు రణరంగంలో వీరవిహారం చేశాడు. ఉభయపక్షాల వీరులూ పగతో పోరాడి పరాక్రమాలు ప్రదర్శించారు. అంతలో

సూర్యాస్తమయం అయింది. పోరు చాలించారు.

కథా కథన మధ్యభాగంలో సంజయ ధృతరాష్ట్రుల మధ్య ఈ సంభాషణం జరిగింది.

ధృత: సంజయా! మన బలంలో మేటిమగలు చాలామంది ఉన్నప్పటికీ గెలవలేకపోవటం దైవకృతమే కదా! ఆలోచిస్తే ఆశ్చర్యం కల్గుతుంది. ఇది ఇట్లాగే ఔతుందని విదురుడు ఎప్పుడో చెప్పాడు. ఆత డెంత చెప్పినా దుర్యోధనుడు వినడు, కీడు చేయటం మానడు. కర్మఫలం అనుభవించక తీరుతుందా? విధి నెవ్వరూ దాటలేరు. కానున్నది కాకమానదు.

సంజ: నీ కొడుకు తెలియక చేయనీ, తెలిసి తెలిసి నీవు ఆనాటి జూదాన్ని ఉపేక్షించావు. ఆ ఉపేక్షయే నేటి యుద్ధంగా మారింది. ఇక పశ్చాత్తాపం మాని ధైర్యంతో యుద్ధక్రమాన్ని వినుము.

ఆరవనాటిరాత్రి దుర్యోధనుడు భీష్ముడితో ఇట్లా అన్నాడు:

దుర్యో: మనం వ్యూహాన్ని వికాసవంతంగా పన్నుకొని వెళ్ళగా పాండవులు దానిని పాడు చేశారు. పైపెచ్చు భీముడి చేతిలో నేను భంగపడ్డాను. నిన్ను వెంటబెట్టుకొంటే పాండవులను జయించగలననే ఆశ ఉండేది. దానిని తొలగిస్తున్నావు. నీవు దేవతలనైనా లెక్కచేయవు. కాగా, పాండవులు రణరంగంలో ఇంతటి బలవంతులుగా ఎట్లా రాణిస్తున్నారు?

భీష్మ: దుర్యోధనా! నీవిన్నిమాటలు నన్ననవద్దు. యుద్ధంలో నా ఒడలును ఎప్పుడైనా దాచుకొన్నట్లున్నదా? శత్రువులను వెనుకాముందూ చూచుకొనకుండా వెంటాడుతున్నాను కదా! పాండవులను జయించటం సాధ్యంకాదని నీకెప్పుడూ చెప్పుతుంటాను. అయినా, నేను ఎటువంటి దాపరికం లేకుండా నీకు జయాన్ని కోరుతూ యుద్ధం చేస్తాను.

ఆ మాటలు విని దుర్యోధనుడు ఊరడిల్లి ఆ రాత్రి సుఖంగా నిద్రపోయాడు.

భీష్ముడి ఏడవనాటి యుద్ధం

మరునాడు ఉదయం భీష్ముడు మండలవ్యూహం పన్నాడు. దానిని గమనించి ధర్మరాజు వజ్రవ్యూహాన్ని సన్నద్ధం చేశాడు.

అప్పుడు - ద్రోణుడు విరాటుడిని, అశ్వత్థామ శిఖండిని, దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడిని, శల్యుడు నకుల సహదేవులను, విందానువిందులు యుధామన్యుడిని, పెక్కంద్రురాజులు అర్జునుడిని, భీమసేనుడు కృతవర్మను, అభిమన్యుడు చిత్రసేన దుశ్శాసన వికర్ణులను, ఘటోత్కచుడు భగదత్తుడిని, సాత్యకి అలంబసుడిని, ధృష్టకేతుడు భూరిశ్రవసుడిని, పలువురు రాజులు కలిసి భీష్ముడిని రోషాలతో ఎదుర్కొన్నారు.

తనమీద బాణవర్షం కురిపిస్తున్న రాజలోకం మీద అర్జునుడు ఇంద్రాస్త్రం ప్రయోగించాడు. వారు భయంతో పరుగెత్తి భీష్ముడి నాశ్రయించారు. భీష్ముడు పాండవ వీరులపై క్రూరబాణాలు వేసి నిలువరించాడు. ఆ వీరుల పోరుతో ద్రోణుడు శంఖుడిని సంహరించాడు. విరాటుడు భయంతో పరుగెత్తాడు. అప్పుడు శిఖండి అశ్వత్థామతో డీకొన్నాడు. అశ్వత్థామ శిఖండి రథాన్ని కూల్చాడు. అతడు సాత్యకి రథమెక్కి వెళ్ళాడు. ఆ తరువాత దుర్యోధనుడిపై దాడిచేసి అతడి రథాన్ని భగ్నం చేశాడు. విరథుడైన దుర్యోధనుడిని సౌబలుడు తన రథంమీద కెక్కించుకొని పోయాడు. సాత్యకి అలంబసుడి మాయాయుద్ధాన్ని ఇంద్రాస్త్రంతో మాయించి అతడిని దూరంగా తరిమివేశాడు. భీముడు కృతవర్మను విరథుడిని చేశాడు. అతడు వృషకుడి రథమెక్కిపోయాడు.

ధృత: సంజయా! మనవైపు సైన్యం చచ్చిందనీ, నొచ్చిందనీ తరచుగా చెప్పుతావు. పాండవబలాలు తరుగక యుద్ధం చేయటం పలుమారు చెప్పుతావు. అకటా! ఇదేమి మాయయో!

సంజ: మహారాజా! మనవారు తమకు తగినట్లు పోరాడుతున్నారు. అయితే మనసేనలు పాండవసేనలో - నదులు సముద్రంలో

ప్రవేశించినట్లు - ప్రవేశించి వెలుపలికి రాలేకపోతున్నాయి. దీనిని నీవు తప్పుగా భావించరాదు. నీ తప్పు వలన కలిగిన ఈ చేటుకు శోకించి లాభంలేదు. సమరప్రకారం వినుము.

భగదత్తుడికీ, ఘటోత్కచుడికీ భీకరమైన పోరు సాగింది. అందులో ఘటోత్కచుడు ఓడి పరుగెత్తాడు. నకుల సహదేవులు కలిసి శల్యుడి మీద దాడి చేయగా అతడు నకులుడి రథాన్ని విరుగగొట్టాడు. నకులుడు తమ్ముడి రథమెక్కి యుద్ధం చేశాడు. సహదేవుడు శల్యుడిని మూర్ఛపడేట్లు కొట్టాడు. ధర్మరాజు శ్రుతాయువును ఓడించి కాలికి బుద్ధి చెప్పించాడు. చేకితానుడికీ కృపాచార్యులకూ నడుమ గట్టిపోరు చెలరేగింది. వారిరువురు పరస్పరం విరథులను చేసికొని నేలమీద కురికి యుద్ధంచేసి ఇద్దరూ మూర్ఛిల్లారు. ధృష్టకేతుడు భూరిశ్రవసుడిపై తొంభై బాణాలు వేసి నొప్పించాడు. దుశ్శాసన వికర్ణ చిత్రసేనులతో అభిమన్యుడికి మహాయుద్ధమయింది. అభిమన్యుడు వారందరిని విరథులను చేసి తండ్రుల ప్రతిజ్ఞలను తలచికొని వారిని ప్రాణాలతో వదిలాడు.

అర్జునుడు తన రథాన్ని పెక్కురు భూపతులతో కలిసి పోరుతున్న భీష్ముడివైపు పోనిచ్చాడు. నడుమ త్రిగర్తపతి అడ్డుపడి పోరు సాగించాడు. అతడి చక్ర రక్షకులు ముప్పది ఇద్దరు అర్జునుడిపై గుమిగూడి దాడి చేయగా వారిని అరువది నాలుగు బాణాలతో అర్జునుడు సంహరించాడు. అర్జునుడికి దుర్యోధన సైంధవులు సమీపంలో ఉన్నా, శల్యుడు తనవైపు ఎదుర్కొనటానికి వస్తున్నా లెక్కచేయక భీష్ముడివైపు ముందుకు సాగాడు. ధర్మరాజు తమ్ములందరితో కలిసి అర్జునుడికి బాసటగా నిలిచాడు. పాండవులందరితో పోరు సాగిస్తున్న భీష్ముడిని గమనించి దుర్యోధనుడూ, సైంధవుడూ పాండవులపై దాడి చేశారు. కృపుడు శల శల్య చిత్రసేనులతో కలిసి పాండవులమీద విరుచుకుపడ్డారు. శిఖండి సూటిగా భీష్ముడి ఎదుటబడి పోరాడబోగా అతడు మిన్నకున్నాడు. అందుచేత అతడి విల్లు విరిచి వెనుకకు పంపాడు. ధర్మరాజు శిఖండి ప్రతిజ్ఞను జ్ఞాపకం చేశాడు. శిఖండి విజృంభించి అడ్డం వచ్చి మహానలాస్త్రాన్ని ప్రయోగించిన శల్యుడిని వారుణాస్త్రంతో తిప్పికొట్టాడు. భీష్ముడు ధర్మరాజు విల్లును టెక్కాన్ని విరిచాడు. భీముడు రెచ్చిపోయి నేలపైకి దూకి గదతో దుర్యోధనుడిపై లంఘించాడు. జయద్రథుడు భీముడిని అయిదువందల బాణాలతో ఆపటానికి యత్నించాడు. అయినా ఆగక అతడి రథాశ్వాలను చావమోదాడు. అతడు మరొకరథం మీదికి పరుగెత్తాడు. అప్పుడు చిత్రసేనుడు భీముడి నడ్డగించి పెనుగదను విసిరాడు. భీముడు తనగదాఘాతంతో దానిని వారించాడు. భీముడి గదతో చిత్రరథుడి గుర్రాలు కూలాయి. అతడు విరథుడై వికర్ణుడి రథమెక్కి తొలగిపోయాడు.

భీష్ముడు ధర్మరాజుయొక్క రథాశ్వాలను కూల్చాడు. అతడి సర్వాంగాలను నొప్పించాడు. ధర్మరాజు ఆగ్రహించి శక్తిని ప్రయోగించగా అతడు దానిని మధ్యలోనే త్రుంచాడు. ధర్మరాజు నకుల సహదేవుల రథాల నెక్కి యుద్ధం చేయ నారంభించాడు. భీష్ముడు వారి రథాలను కూల్చాడు. ధర్మరాజు ఉమ్మలికతో రాజులను భీష్ముడిపైకి ఉసికొల్పాడు. పెక్కు మృగాలు చుట్టుముట్టగా చెలరేగే సింహంవలె చుట్టుముట్టిన రాజలోకాల్ని భీష్ముడు మండలాకార సంచారంతో చెండాడాడు. నిపుణంగా తాటికాయలను నేలరాల్చే వాడివలె రాజులతలలను నేలవ్రాలేటట్లు చేశాడు. అంతలో శిఖండి కోదండపాండిత్యం ప్రకటిస్తూ వచ్చాడు. అక్కడి మేటి వీరుల మధ్య పోరు బాగా చెలరేగింది. అర్జునుడు సమయానికి వచ్చి ధర్మరాజు సేనను ఆదుకొన్నాడు. ద్రోణుడు అర్జునుడిని బాణాల వర్షంతో కప్పాడు. వాటి నతడు ఛేదించాడు. ధర్మరాజు సూచనతో పార్థుడు విజృంభించి కౌరవసేనలను చిక్కుపరిచాడు. రణరంగం పీనుగు కుప్పలతో బీభత్సమైంది. శత్రువీరులను చిక్కుపెట్టిన భీముడూ ధర్మరాజును సమీపించారు. అప్పటికి సూర్యాస్తమయం కావటంతో అందరూ యుద్ధం చాలించి విడుదలకు తిరిగిపోయారు.

భీష్ముడి ఎనిమిదవనాటి యుద్ధం

భీష్ముడు కూర్మవ్యూహం పన్నాడు. ధృష్టద్యుమ్నుడు శృంగాట వ్యూహం రచించాడు.

భీష్ముడు సింహనాదం చేస్తూ బయలుదేరాడు. పాండవసేనలు భయపడి ముందుకు నడవలేకపోయాయి. భీముడు ఒక్కడే భీష్ముడిని ఎదిర్చి అతడి సారథిని చంపాడు. గుర్రాలు భీష్ముడి రథాన్ని దూరంగా లాగికొని పోయాయి. పాండవసేన ఉత్సాహంతో ఉరకలు వేసింది. సునాభుడు భీముడి నెదుర్కొన్నాడు. ఒక్క గదాఘాతంతో భీము డతడి తల వ్రయ్యలు చేసి చంపాడు. అతడి చావును చూచి అతడి సోదరులు ఏడుగురు భీముడిపై దాడిచేశారు. సంకుల సమరంలో భీముడు వారినందరినీ చంపాడు.

మిగిలినవారు భయపడి భీముడివైపు రాకుండ ఆగిపోయారు. 'ఆనాడు కౌరవ సభలో చేసిన ప్రతిజ్ఞలన్నీ తీర్చేటట్లుగా ఉన్నాడు భీము'డని అందరూ భయపడ్డారు. కౌరవుల దుర్ణయానికి ఫలంగా వారికి చావు తప్పదని అనుకొన్నారు.

దుర్యో: భీష్మా! ఈ విధంగా భీముడు వరుసపెట్టి నా తమ్ములను చంపుతూ ఉంటే చూస్తూ ఊరకుంటావా? రోషశోకాలు నీకు లేవా? తోడుపడకూడదనే మిన్నక నిలిచావా? ఉన్నవారందరూ ఒక్కసారి చావాలన్న కోరికతోనే ఊరకున్నావా? (అని ఏడ్చాడు దుర్యోధనుడు.)

భీష్మ: (కంటతడిపెట్టి) ఈ సంగతి నీకు ముందే నేనూ ద్రోణుడూ, విదురుడూ విశదంగా చెప్పాము. పాండవులకు ఎదురై నిలిచి గెలవటం మా వశమా? ఆ భీముడి పాలబడిన మన కుమారులను కాపాడటం ఎవరికీ సాధ్యం కాదు. దీనికి దుఃఖించ నవసరంలేదు. వీరస్వర్గమే సంపదగా భావించి నీవింక యుద్ధం చేయుము. నేనూ నాకు చేతనైనంత సమరం చేస్తాను. మనకు విజయం కలిగితే త్రోసివేసికొంటామా?

ధృత: (సంజయుడు చెప్పిన ఆ మాటలు విని) ద్రోణ భీష్ము లుండగానే కురుకుమారు లట్లా చనిపోతారా? ఇదంతా గాంధారీ నేనూ చెప్పినా ఆ దుర్యోధనుడు వినలేదు. దాని ఫలాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నాడు. ఇక ఇప్పు డేమనుకొన్నా అది గతజలసేతుబంధనం. (అని ఊరుకొన్నాడు. సంజయుడు కథసాగించాడు)

భీష్ముడు భయంకరంగా భీముడివైపు రథాన్ని నడిపించాడు. అంతకుముందే పాండవసైన్యం మూడు గట్టిగుంపులుగా చేరి ఉన్నది. ఒక మొత్తం చేకితాన ద్రౌపదేయ సహితంగా సవ్యసాచి నాయకత్వంలో ఉన్నది. మరొకటి అభిమన్యుడు ఇంకొకటి ఘటోత్కచుడు నాయకులుగా కల్గి ఉన్నది. ఏడవనాడు ఈ మూడు మొత్తాలు చేసిన వీరవిహారమే కథాసారం. ఆ విహారాలలో పేర్కొనదగినవి. 1. ద్రోణుడు ద్రుపదుడితో చేసిన యుద్ధం, 2. అలంబసుడి చేత ఇరావంతుడు మృతుడైన యుద్ధం, 3.ఘటోత్కచుడు ద్రోణాచార్య ప్రభృతులతో చేసిన యుద్ధం, 4. ఇరావంతుడి మృతికి అర్జునుడు శోకించి శ్రీకృష్ణ ప్రబోధితుడై విజృంభించి చేసిన యుద్ధం. సాయంకాలం కావటంతో ఆనాటి యుద్ధం ఆగింది.

దుర్యోధనుడు నగరు ప్రవేశించి కర్ణశకునులను దుశ్శాసనుడిని పిలిపించుకొని ఏకాంతంలో వారితో రహస్య సంభాషణం చేశాడు.

దుర్యో: భీష్మ ద్రోణ కృపాశ్వత్థామలు మధ్యస్థులై పాండవబలాలను మట్టుపెట్టే విజృంభణం చేయటంలేదు. మన సేనలా నానాటికి సన్నగిల్లుతున్నాయి. ఇప్పుడు మనం ఏమి చేయగలం?

కర్ణ: ప్రభూ! ఇక భీష్ముడిని రణరంగానికి రప్పించబోకుము. నేను నా భుజబలంతో పాండవుల మదాన్నీ, వారి సేనల ఔద్ధత్యాన్నీ మాన్పుతాను.

దుర్యో: (దుశ్శాసనుడితో) మనం పోయి భీష్ముడిని యుద్ధంనుండి మాన్పించివద్దాం.

అని చెప్పి రథమెక్కి భీష్ముడి వద్దకు సుయోధనుడు వెళ్ళాడు. చేతులు మొగిడ్చి ఈ విధంగా అన్నాడు:

దుర్యో: కురుముఖ్యా! నిను నమ్మి పాండవ ప్రాభవాన్ని నేను లెక్కచేయలేదు. అయితే, నీ విప్పుడు చేస్తున్న యుద్ధ వైఖరులను ఎన్నింటినో గమనించాను. నీవు పాండవులను యుద్ధంలో సమీపిస్తావు, కాని చనువిచ్చి వారిని చంపవు. వారు యుద్ధం చేస్తే పట్టి పాలారుస్తున్నావు. ఇంక నేనేమని అనేది? ఇంక - ఇప్పటినుండి నీవు యుద్ధం చాలించుము. నిన్ను యుద్ధంలో దేవతలు కూడా గెలువలేరు. ఇప్పటికి ఎనిమిదినాళ్ళయింది. అర్జునుడిని చంపవు, ఓడించవు. ఆ పని అట్లా ఉండనీ. ఇప్పటికైనా నామీద ఉన్న మమకారంతో, నా ప్రార్థన మన్నించి, కర్ణుడిని యుద్ధం చేయటానికి అనుమతించుము.

భీష్మ: (ఆ మాటలు ఈటెలుగా మనసుకు తాకాయి. అత్యంత విషాదంలో మునిగి కొంతసేపు తలవాల్చుకొని కూర్చుండి, నిట్టూర్చి, చివరకు తలయెత్తి) భూపాలా! నీకొరకు ప్రాణాలు తాకట్టుపెట్టి యుద్ధం చేస్తున్నా నీ విట్లా మాట్లాడటం తగునా?

నా రాజభక్తి అంతా బూడిదలో పోసిన పన్నీరయింది. (కోపంతో) ఆ అర్జునుడు సామాన్యుడా! అలనాడు ఇంద్రాదులను జయించి ఖాండవవనాన్ని దహించలేదా? గంధర్వుల చేతిలో ఓడిన కర్ణుడినీ, నిన్నూ, నీ తమ్ములనూ చెరనుండి విడిపించుకొనలేదా? నన్నూ, ద్రోణుడినీ, అశ్వత్థామనూ, కృపుడినీ, కర్ణుడినీ గెలిచి విరాటుడి గోవులను మరల్చుకొనలేదా? ఇంకెన్నో మహావిజయాలు సాధించిన మహావీరుడు అర్జునుడు. అటువంటి జగజెట్టితో ఇన్నాళ్ళు ఈ విధంగా యుద్ధం చేసికూడా నీచేత ఈనాడు ఇటువంటి వేడిమాటలు వినవలసి వచ్చింది. అజేయులైన పాండవులతో తగనిపని అని తలంచకుండా, పగ సాధించ బూనావు. నీవు సాహసించి యుద్ధంలో పౌరుషాన్ని ప్రదర్శించుము. ఇటువంటి పనికిరాని మాటలాడటం చాలించుము. మరల చెప్పుతున్నాను వినుము. నేను గాండీవిని గెలువలేను. శిఖండిని చంపలేను. మరెవరినైనా యుద్ధంలో ఉగ్రంగా చెండాడుతాను. ఈ సంగతి ముందే చెప్పాను నీకు. నేనూ, నా సేనలూ కలిసి ద్రుపద, విరాట, యాదవాదుల సైన్యాలతో యుద్ధం చేస్తాము. మీరందరూ పాండవులను జయించటానికి పూనుకొనండి. అర్ధరాత్రి వేళ వచ్చి ఈ విధంగా నన్ను నొవ్వబలకటం వలన నీకు జయం కలుగుతుందా? పూనుకొని నీవే యుద్ధాన్ని నడుపుము. రేపు మా చేతి బలుపేమిటో చూస్తావు గాక! ఇక వేయి మాటలెందుకు?

భీష్ముడి తొమ్మిదవనాటి యుద్ధం

దుర్యోధనుడు ఆ రాత్రి సుఖంగా నిద్రించి మరునాడు రాజలోకాన్ని సంబోధిస్తూ ఇట్లా పలికాడు:

'భీష్ముడు పాంచాలురు మొదలుగా పాండవబలాలనన్నింటిని చంపి, యుద్ధంలో పాండవులను జయిస్తానని రాత్రి ప్రతిజ్ఞ చేశాడు. ఈనాడు మన బలపరాక్రమాలు ప్రకటితం కావాలి.' దుర్యోధనుడి తులువ మాటలు విని భీష్ముడు వెగటు పొందాడు. సిగ్గుతో కుంచించుకొనిపోయాడు. విషాదంతో విలవిలలాడాడు. అయినా, తనను తాను నిగ్రహించుకొని ఉన్నాడు. ఆ స్థితిని గమనించి దుర్యోధనుడు దుశ్శాసనుడితో ఇట్లా అన్నాడు:

దుర్యో: మనమంతా పితామహుడి వద్దనే ఉందాం. అంతేకాక శత్రుమర్దనులైన ఇరవై రెండువేల మంది రథికులను ఆయనకు తోడుగా నిలుపుదాం. శిఖండి కనపడితే యుద్ధం చేయనని చెప్పాడు. అందువలన ఆ నీచుడు ఎదుటపడకుండా మనం చూడాలి.

ఆ తరువాత భీష్ముడు సర్వతోభద్ర వ్యూహం పన్నాడు.

భీష్ముడి వెంట కృపాచార్య, కృతవర్మ, శల్య, శకుని, సుదక్షిణ, సైంధవులూ, కురుకుమారులూ కలిసి ముందట నిలిచారు. ద్రోణ, భూరిశ్రవో, భగదత్తులు వలపట నిలిచారు. సోమదత్త, అశ్వత్థామ, విందానువిందులు దాపట నిలిచారు. హలాయుధ, అలంబస, శ్రుతాయువులు వెనుక నిలిచారు. దుర్యోధనుడు త్రిగర్తులు పరివేష్టించి ఉండగా నడుమన నిలిచాడు.

పాండవపక్షం శిఖండిని అగ్రస్థానంలో నిలిపే ఒక గట్టి వ్యూహాన్ని రచించింది. శిఖండి అగ్రస్థానంలో ఉండగా అతడి కొకప్రక్క భీమసేన ఘటోత్కచులు, మరొకవంక అర్జున, ధృష్టద్యుమ్నులు మోహరించారు. సాత్యకి విరాటులు వలపటను, అభిమన్యు పాంచాల కేకయులు దాపటను, నకుల సహదేవ ద్రౌపదేయులను ముందుగా నుంచుకొన్న ధర్మరాజు నడుమను, చేకితాన కుంతిభోజులు వెనుకభాగాన నిలిచారు.

ఆనాడు జరిగిన యుద్ధ ఘట్టాల క్రమ మిది:

1. అభిమన్యుడి విజృంభణం - అభిమన్యుడు కౌరవసైన్యంమీద దూదికొండ మీద చిచ్చు పాకినట్లుగా దాడి చేశాడు. కొరవి త్రిప్పినట్లు మండలచారియై తిరిగాడు. అడ్డులేని విధంగా తిరుగుతున్న అతడిని చూచి దుర్యోధనుడు రెండవ అర్జునుడుగా భావించి భీతిచెందాడు. అలంబసుడనే రాక్షసరాజును అతడిపై పురికొల్పాడు. అతడు మాయాయుద్ధంతో అభిమన్యుడిని ఎదిరించాడు. అతడి మాయల నన్నిటిని అస్త్రాలతో భేదించి అతడిని ఓడించి రణవిముఖుడిని చేశాడు. కౌరవసైన్యం అభిమన్యుని పరాక్రమానికి వికావికలై పోయింది.

భీష్ముడు అనేకమంది రథికులతో కలిసి అభిమన్యుడిని ఎదిరించాడు. అతడు భీష్మాదులను ధైర్యంతో ఎదుర్కొన్నాడు.

సంకుల సమరం సాగింది.

2. అర్జునుడు ద్రోణాచార్యులతో భీకరయుద్ధం చేశాడు. భీష్ముడు ధర్మరాజుతో తలపడ్డాడు. ధర్మరాజుకు పోరు భారంకాగా ధృష్టద్యుమ్న శిఖండి విరాట ద్రుపదులు అతనికి సాయం వచ్చారు. ఉభయ సైన్యాలలో మిక్కుటంగా నష్టాలు జరిగాయి. కౌరవసైనికులు ఆ యుద్ధానికి కారకులైన ధృతరాష్ట్రుడిని, దుర్యోధనాదులను నిందించనారంభించారు.

భీష్ముడిని పాండవవీరులు చుట్టుముట్టారు. దుర్యోధనుడు శకుని దుశ్శాసనులను భీష్ముడికి సహాయంగా పంపాడు. మధ్యాహ్నం వరకు ఒకరిపై నొకరు యుద్ధ తీవ్రతను ప్రకటించారు.

3. మధ్యాహ్నంనుండి భీష్ముడు ప్రచండభానుడివలె విజృంభించాడు. వరుసగా భీష్ముడు ధర్మరాజును, భీముడిని, నకుల సహదేవులను, సాత్యకిని, ధృష్టద్యుమ్నుడిని నొప్పించి ఆర్చాడు. అప్పుడు మాత్స్య, పాండ్య, సోమక, మగధ వీరుల బలాలూ భీష్ముడిని చుట్టుముట్టాయి. భీష్ముడు వారందరినీ చిక్కుపరిచి ప్రచండ పరాక్రమాన్ని ప్రదర్శించాడు. పాండవసైన్యం తునాతునకలై కుప్పలు కుప్పలుగా పడింది. గగ్గోలు పెట్టారు సైనికులు. ఆ దయనీయ దృశ్యాన్ని శ్రీకృష్ణుడు అర్జునుడికి చూపించి పార్థుడికి రణోత్సాహాన్ని కలిగించ యత్నించాడు. కాని, అర్జునుడు విచారంతో, నిరుత్సాహంగా ఉండిపోయాడు. శ్రీకృష్ణుడు విరాట నగరంలో సంజయుడి ఎదుట పలికిన అర్జునుడి పలుకులను అతడికి జ్ఞాపకం చేశాడు. అయినా 'బంధువుల నందరినీ చంపి కౌరవహీనమైన రాజ్యాన్ని పొంది నేనేమి పుణ్యం చేసినవాడ నౌతాను? అందువలన నా మనసు యుద్ధంవైపు మొగ్గటంలేదు. అయినా, నీతో అప్పుడప్పుడు ఈ మాటలెందుకులే! భీష్ముడిని చంపుతాను. ఇక రథాన్ని ఆయనవైపు పోనిమ్ము' అని అన్నాడు. శ్రీకృష్ణుడు అట్లాగే చేశాడు.

4. అర్జునుడు చెదరిపోతున్న సైన్యాన్ని కూడగట్టుకొని భీష్ముడిని సమీపించాడు. అతడు మహాస్త్రాలతో సైన్యాన్ని నిలువరించి గుర్రాలను, సారథిని, అర్జునుడిని నొప్పించాడు. పార్థుడు కోపించి భీష్ముడి విల్లు విరిచాడు. అతడు మరొక విల్లెత్తాడు. దానిని కూడా అర్జునుడు త్రుంచాడు. 'ఔరా! శతమఖనందన!' అని అబ్బురపడుతూ మరొక వింటితో శరపరంపర గుప్పించి పార్థుడిని నొప్పించాడు. అయినా అతడు బింకంతో పోరు సాగించాడు. భీష్ముడు విజృంభించి పార్థుడిని బాధిస్తూ ఉండగా ఎవ్వరూ ఆ దరికే రాలేకపోయారు.

అప్పుడు శ్రీకృష్ణుడు దారుణమైన రోషంతో ఓర్పును కోల్పోయి వెంటనే నొగలుకు పగ్గాలు ముడివేసి, మునికోల చేతబట్టి రథంనుండి నేలమీదకు దూకాడు. భూచక్రం కంపించింది. దిగ్గజాల మెడలు వంగాయి. దిశావలయాలు వణికాయి. కౌరవబలాలు పరుగెత్తాయి. భయంకరాకారంతో చేతులు కదిలిస్తూ దేవతలు భయపడగా రౌద్రోద్రేకంతో భీష్ముడిపైకి ఉరికాడు. లలిత పీతాంబరం విలాసంగా ఒప్పారగా, సింహనాదంతో కూడిన అందంతో మెరుపుకాంతితో, ఉరుములతో కూడుకొన్న నల్లనిమేఘంవలె శ్రీకృష్ణుడి ఆకారం భాసించింది. 'భీష్మ డిక చచ్చా'డని కౌరవసైనికులందరూ జీవాలు పోయినట్లు వెలవెలలాడే ముఖాలతో చూస్తూ నిలిచిపోయారు.

భీష్ముడా నారాయణమూర్తిని చూచాడు. మనసు వికాసం పొందగా అల్లన నవ్వాడు. 'మహాత్మా! వేగంగా రమ్ము. ఓ పుండరీకాక్షా! ఇది నాకెంతో మేలు. నాకు శాశ్వతమైన కీర్తి వస్తుంది. అక్కడ శాశ్వత సద్గతి లభిస్తుంది. నీ ఇష్టం వచ్చినట్లు చేయుము' అని పలికాడు.

అప్పుడు అర్జునుడు వేవేగంగా రథంమీదనుండి దూకి శ్రీకృష్ణుడిని వెన్నంటి వెళ్ళి చేతులతో కౌగిలించుకొని గట్టిగా పట్టుకొన్నాడు. ఆత డీతడిని పది అడుగుల దూరం లాగికొనిపోయాడు. అర్జునుడు అడుగులు బిగబట్టి, బాహువుల బలం పెట్టి, నేలమీద తన్నిపట్టి శ్రీకృష్ణుడిని నిలువం బెట్టి, నిట్టూర్పులు నిగుడించి, జనార్దనుడితో ఇట్లా అన్నాడు:

'నేను యుద్ధం చేయ' నని నిర్మలబుద్ధితో ప్రతిజ్ఞ చేసి, నీ విప్పుడు మాట తప్పితే జగ మేమంటుందో తెలుసుకదా! యుద్ధాలలో కొంతసేపు అలసిపోవటం తప్పా? నాపై యుద్ధానికి పూనుకొన్న భీష్మడిపతనం చూతువుగాని రావయ్యా! రథంమీదికి ఎక్కుము. నిన్నాశ్రయించినవారిని ఈ విధంగా వృథాపుచ్చటం న్యాయమా?' అనగా కృష్ణుడు ప్రియమంది తిరిగివచ్చి రథమెక్కాడు. కృష్ణార్జునుల రథం ప్రళయకాలమేఘంవలె రాణించింది. భీష్ముడు భయంకరంగా నిలిచి పరిక్రాంతులైన కృష్ణార్జునులను, భీతులైన భీమాదులను ఏమీ చేయలేక చూస్తూ ఉండిపోయాడు. అంతలో సూర్యు డస్తమించాడు. ఘోరమైన సంధ్యాసమయంలో బురదలో దిగబడ్డ ఆవువలె ఉన్న తన సేనను చూచి ధర్మరాజు చింతించాడు. భీష్ముడిచేత భంగపడ్డామనే దుఃఖంతో వీరులు వెంటరాగా విడిదులకు తిరిగిపోయాడు. కౌరవవీరులు భీష్ముడి పరాక్రమాన్ని ప్రశంసిస్తూ విలసిల్లిన మొగాలతో విడిదులకు వెళ్ళారు.

ధర్మరాజు తొమ్మిదవనాటి యుద్ధంలో సైన్యం బలహీనపడినందుకు విషాదం చెందుతూ రాత్రివేళ రహస్యంగా తమ్ములతో కలిసి కృష్ణుడి మందిరానికి వెళ్ళి తమగోడు ఇట్లా చెప్పుకొన్నాడు.

ధర్మ: కార్చిచ్చు చుట్టుముట్టి లేళ్ళగుంపును కాల్చే విధంగా ఈనాడు భీష్ముడు విజృంభించటం చూచావుకదా! మనవారెవ్వరూ అతడిని జయించలేరు. దురభిమానంతో ఆ సత్యాన్ని ఇదివరలో గుర్తించలేకపోయాను. నిర్మూలంగా యుద్ధంలో చస్తే సామ్రాజ్యం పొందినట్లవుతుందా? కాబట్టి, తమ్ములతో కూడి నిశ్చింతగా అడవులకు పోయి తపస్సు చేస్తూ గౌరవంగా ఉంటాను. పూర్వం నా కారణంగా నా తమ్ములు ఎన్నో కష్టాలు పడ్డారు. అటువంటి వారిని కన్నారా చూచుకొంటూనైనా ఉంటాను గాని వారిని భీష్ముడికి బలిపెట్టలేను. నీకు మాయందు దయ ఉంటే యుద్ధం మానటానికి ధర్మవిరోధం లేని ఒక మార్గం చూపించుము.

కృష్ణ: (సానునయంగా) ధర్మరాజా! నీవు సత్యప్రతిజ్ఞుడవు. నీ తమ్ములు అద్భుత బాహుబల సంపన్నులు. నీకు దుర్గతి ఎందుకు కలుగుతుంది? నీకు మంత్రినై రాజ్యవైభవాన్ని నేను సమకూరుస్తాను. నీవు విచారించకుము. పార్థుడు సాహసించి యుద్ధం చేయలేకపోతే నేనే భీష్ముడిని చంపి పగసాధిస్తాను. నీవు చూస్తూ ఉండుము. నాకు సవ్యసాచి చెలికాడు, ఆత్మీయుడు, శిష్యుడు. ప్రేమతో అతడి కొరకు నేను కండలు కోసి ఇస్తాను. నాకు అత డంటే అంత అభిమానం. ఉపప్లావ్యంలో సంజయుడితోనూ, ఆ తరువాత ఉలూకుడితోనూ అతడు పలికిన మాటలకు తగినంత నేను కూడా చేయవలసి ఉన్నది. నేను మీ రెండువైపుల పలికిన వాడిని. అందరి మాటలు నేను కూడా పాటించాలి.

ధర్మ: కృష్ణా! యుద్ధం చేయకుండా సముచితమైన సహాయం చేస్తానని నీవు పలికావు. అట్టి నిన్ను ఇప్పుడు అబద్ధమాడేటట్లు చేస్తానా? దైవం నాకెందుకు ఇంత దీనస్థితిని తెచ్చిందో తెలియటంలేదు. నాకూ భీష్ముడికీ ఒక ఒప్పందం ఉన్నది. ఆ మహాత్ముడు కౌరవులకొరకు యుద్ధం చేయటానికీ, నాకు రాజ్యం ఇవ్వటానికీ అంగీకరించాడు. (కంటతడిపెట్టుతూ) అయ్యో! మా తండ్రి చనిపోయిన నాటినుండి మమ్ములను దగ్గరకి తీసి రక్షించిన ప్రియమైన తాతను చంపటానికి మనసులో భావించే సాహసం చూచావా? రాజధర్మం ఎంత క్రూరమైనదో!

కృష్ణ: (తనలో) ఇతడు భీష్ముడి వద్దకు వెళ్ళాలని భావిస్తున్నాడు. (ప్రకాశంగా) మంచిది వెళ్ళి రమ్ము. నీ ఆలోచన బాగున్నది. నీవు ముందు అన్నట్లుగా భీష్ముడు కోపించి యుద్ధంలో చక్కగా చూస్తే శత్రువులు చావటం నిజం. అందువలన ఇప్పుడు అతడి పాలికి వెళ్ళుము. నీవు భీష్ముడిని అడిగితే నిజ వధోపాయాన్ని తప్పక చెప్తాడు. మనమందరం రహస్యంగా వెళ్ళి భక్తితో మ్రొక్కి, హితకార్యాన్ని గురించి వినయంతో ప్రార్థించి అడిగితే అతడు దయతో మనకు ఆ మంత్రోపదేశం చేయగలడు. ఇది తప్పక చేయదగినపని.

ధర్మరాజు, అతడి తమ్ములు, శ్రీకృష్ణుడు సామాన్యవేషాలు ధరించి అతి రహస్యంగా భీష్ముడి మందిరంలో ప్రవేశించారు. అతడిని దర్శించి, భక్తితో స్తుతిస్తూ పాదాభివందనం చేశారు. భీష్ముడు వారందరినీ పేరుపేరున క్షేమ మడిగాడు.

భీష్మ: ఇక్కడికి మీరందరూ కలిసి వచ్చిన పని ఏమిటి? మీ కేది కావాలో అడగండి. ఇస్తాను. ఎంతటి అసాధ్యమైనా వెంటనే సాధించి ఇచ్చి మిమ్ములను సంతోషపెట్టుతాను.

ధర్మ: (దీనంగా) మాకు ఏ విధంగా సామ్రాజ్యం సమకూరుతుందో, ఏ విధంగా సేనలు చావటం వలన కలిగే వ్యథ లేకుండా ఉంటుందో, ఆ మార్గాన్ని దయతో వెంటనే చెప్పాలి.

భీష్మ: అనఘా! నేను యుద్ధం చేస్తుంటే మీ సైన్యం నశించక తప్పదు. సామ్రాజ్యం కూడా దక్కదు. కాబట్టి, నన్ను జయిస్తే మీకు శుభాలన్నీ కలుగుతాయి.

ధర్మ: మహాత్మా! మూడవకన్ను మూసికొని, త్రిశూలాన్ని దాచుకొని అవతరించిన రుద్రుడివలె నీవు రణరంగంలోకి దిగుతావు. ఎటువంటి వీరులకైనా నిన్ను ఎదిరించటం సాధ్యమా? కాబట్టి నీ దయను ఆశ్రయించటానికి వచ్చాను. నిన్నేవిధంగా గెలవటానికి వీలుంటుందో మాకు తేటతెల్లమయ్యేటట్లు తెలుపుము.

భీష్మ: నీ వన్నది నిజం. నా చేతిలో ధనువుండగా దేవతలు కూడా నన్ను గెలువలేరు. అటువంటి వాడినిగా మీరు నన్ను గుర్తించి, ఇంతమంది ఇక్కడికి వచ్చి ఈ విధంగా అడుగుతుంటే మీకు ప్రియమైన కార్యం చేయటం కంటె నాకు వేరే పుణ్యమేముంటుంది? నేను ఆయుధాలను ప్రయోగించటం మానినప్పుడే నన్ను జయించ వీలవుతుంది. జోడు పుచ్చినవాడిని, ఆయుధం క్రిందపెట్టినవాడిని, జెండా దించినవాడిని, స్త్రీని, మొదట స్త్రీగా ఉండినవాడిని, ఆడువారి పేరు పెట్టుకొన్నవాడిని, తలగుడ్డను తీసివేసినవాడిని, సోదరులు లేనివాడిని, పుత్రులు లేనివాడిని చూస్తే వారితో నేను యుద్ధం చేయను. నాకు మరొక నియమం కూడా ఉన్నది. పుట్టినప్పుడు లేకుండా నడుమ దైవమిచ్చిన పురుషత్వం కలవాడితో యుద్ధం చేయను. కాబట్టి, మీకు ఒక ఉపాయం చెప్పుతాను. ద్రుపద సంతానమైన శిఖండి అటువంటివాడని మీకు తెలుసు. వాడు పూర్వజన్మలో స్త్రీ కావటంచేత వాడికి ఎదురుగా ఉండి బాణాలను ప్రయోగించను. కాబట్టి, అర్జునుడు అతడిని ముందు పెట్టుకొని వస్తే, నేను బాణప్రయోగం మానితే, నన్ను నొప్పించి పడవేయండి. ఆ తరువాత బంధుమిత్రులైన కౌరవులను జయించటం తేలికపని ఔతుంది. ఇది నా ఆజ్ఞ. నేను చెప్పినట్లు చేయండి.

అని భీష్ముడిచేత అనుజ్ఞాతులై, అతడికి నమస్కరించి బయలుదేరారు. త్రోవలో అర్జునుడు విషాదాన్ని ప్రకటించాడు. భీష్ముడిని పరలోక గతుడిని చేయటానికి కృత్రిమపద్ధతిని అనుసరించి చంపవలసి వస్తున్నందుకు బాధపడుతూ శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

అర్జు: గురువు, ప్రజ్ఞావంతుడు, ధర్మవ్రతుడు, వయోవృద్ధుడు, లోకమాన్యుడు, దయాళువు అయిన భీష్ముడిని వంచనతో చంపటానికి నాకు బుద్ధి పుట్టటంలేదు. నా చిన్నప్పుడు మట్టిలో ఆడుకొంటున్న నన్ను ఎత్తుకొని, నా ఒంటిపై నున్న దుమ్ము ఆయన కంటేటట్లు ప్రేమతో కౌగిలించి, మా తండ్రి పాండు రాజ గుణాలను స్మరించుకొంటూ కంటతడి పెట్టుకొనేవాడు. తండ్రిలేని మమ్మల్ని తండ్రివలె పెంచిన మాతాతను ఈ విధంగా చంపరాదు. ఆయన యుద్ధంలో తన భుజబలంతో సైన్యాన్నంతా చంపినా నేనుచూస్తూ ఊరకుంటాను కాని ధర్మం తప్పను. ధర్మరాజు తమ్ములు క్రూరకర్ములౌతారా?

కృష్ణ: క్రూరత్వాన్ని సహించి, ఏ మాత్రమూ అసహ్యించుకొనకుండా, పూని, అన్ని విధాలా శత్రువులను చంపి, ప్రజలకు అభ్యుదయం కలిగించటం, న్యాయంగా సుంకాలు తీసికొని, వాటిని సద్వినియోగం చేయటం రాజ ధర్మమని బృహస్పతి ఇంద్రుడికి బోధించిన సంగతి లోక ప్రసిద్ధమే కదా! అంతేకాక, యుద్ధంలో భీష్ముడిని చంపుతానని నీవు చేసిన ప్రతిజ్ఞ లోకమంతా వ్యాపించింది. కాబట్టి పంతంతో ఏ విధంగానైనా అతడిని చంపక తప్పదు. అది రాజధర్మ పరిపాలనమే ఔతుంది కాని క్రూరకర్మకాదు. భీష్ముడిని చంపటానికే బ్రహ్మదేవుడు నిన్ను పంపాడు. కాబట్టి భీష్ముడిని చంపటానికి ఇంకా మీనమేషాలు లెక్కపెట్టట మెందుకు?

అర్జు: ఆ శిఖండి పుట్టుక భీష్ముడిని వధించటానికే అని అంటారు. అది తప్పదు. భీష్ముడు శిఖండిపై బాణాలు వేయడు. నాపై వేస్తాడు. నేను శిఖండి వేస్తున్నట్లుగా పూనుకొని బాణాలు ఇతరులపై వేసినట్లు వేసి వధించటానికి అనువుకాని భీష్ముడిని కోపంతో శిఖండియే వధించినట్లు చేయాలి.

కృష్ణ: (నవ్వి) అవక్ర పరాక్రమశాలి అయిన భీష్ముడిని పడగొట్టటానికి నీకు తప్ప మరెవ్వరికీ సాధ్యంకాదు. నీ ఆలోచనలు దైవమే

కలిగిస్తున్నట్లు వింతగా పరిణతి చెందాయి! అది అట్లా జరగవలెనని ఉంటే మనం దానిని త్రోసి వేయటానికి వీలౌతుందా? నీవే చూస్తూ ఉండుము. అది జరుగుతుంది.

అని అన్న శ్రీకృష్ణుడి మాటలు విని 'అప్పటికి ఎట్లా అయితే, అట్లా ఔతుం'దని అర్జునుడు అంగీకరించాడు. శ్రీకృష్ణుడూ, ధర్మరాజాదులూ సంతోషించారు. నిజమందిరాలకు వెళ్ళి ఆ రాత్రి నిదురపోయారు.

భీష్ముడి పదవనాటి యుద్ధం

మరునాడు సూర్యోదయ సమయంలో పాండవులు సేనావ్యూహాన్ని రచించారు. శిఖండిని ముందు నిలిపారు. అతడికి ఇరుప్రక్కల భీమార్జునులనూ, వెనుక అభిమన్యు ద్రౌపదేయులనూ, వారి కిరుప్రక్కలా చేకితాన శైనేయులనూ నిలిపారు, వారి వెనుక ధృష్టద్యుమ్నాది పాంచాల కుమారులను ముందుంచుకొనిన నకుల సహదేవులనూ రెండువైపుల నిలుపుకొని ధర్మరాజు, వీరిని పరివేష్టించి విరాట ద్రుపదాది రాజ సమూహం నిలిచి ఉన్నారు.

కౌరవపక్షం అంతకుముందే తమ వ్యూహాన్ని సమకూర్చింది. భీష్ముడు అగ్రభాగంలో ఉన్నాడు. కౌరవులు ఆయనను పరివేష్టించి నిలిచారు. ద్రోణ, అశ్వత్థామలు కుడి ఎడమల నిలిచారు. మధ్యభాగంలో దుర్యోధనుడు కృపకృతవర్మ భగదత్తులచేత పరిరక్షితుడై ఉన్నాడు. బృహద్బలాదులు అతడి చుట్టూ రక్షగా వలయం ఏర్పరచారు. త్రిగర్తులు అపరభాగంలో నిలిచారు.

ఉభయసేనలూ తలపడ్డాయి. ఆ యుద్ధం దేవాసురులయుద్ధంవలె అపూర్వంగా తోచింది. ఒకవైపు నకుల సహదేవులు, మరొకవైపు భీముడూ ఔద్ధత్యంతో పోరు మొదలు పెట్టారు. భీష్ముడు ప్రళయకాల భైరవుడివలె భయంకరంగా బాణాలు గుప్పిస్తున్నాడు. శిఖండి భీష్ముడిమీద క్రూరాస్త్రాలు ప్రయోగించ నారంభించాడు. భీష్ముడు అతడివైపు చూడక తల ప్రక్కకు త్రిప్పి ఇట్లా అన్నాడు:

భీష్మ: శిఖండినీ! నిన్ను బ్రహ్మ ఆడుదానిగా సృష్టించాడు. నీవు మగవాడవని నేను అనుకొనటం లేదు కాబట్టి స్త్రీవయిన నిన్ను నేను బాణాలతో కొట్టను. నా మీద నీవు పౌరుషంతో శతకోటి బాణాలు వేసినా నేను నవ్వుతానే కాని కోపించను.

శిఖండి: నీవు రాజుల నెందరినో గెలిచావు. పరశురాముడికి ప్రతివీరుడవై పేరుపొందావు. అటువంటి నీ బలాన్ని నామీద చూపజాలవా? నామీద బాణాలు ప్రయోగించుము. లేదా విలాసంగా వెళ్ళిరమ్ము. నేను ఎవ్వతెనైతేనేమిటి? బాణాలతో నిన్ను పడగొట్టుతాను. నీకు దమ్ములుంటే యుద్ధం చేయుము. ఇవ్వేళ ఎట్లాగైనా నీ పొగరు అణుస్తాను. నిన్ను బాధిస్తాను. మహావీరుడవనే నీ బిరుదు పగలగొట్టుతాను. పరాక్రమంతో అస్త్రవిద్యను నీమీద ప్రయోగిస్తాను.

అర్జు: (తనలో) ఈనాడు శిఖండి వింతగా మాట్లాడుతున్నాడు. భీష్ముడికి చివరి గడియలు సమీపించినట్లున్నాయి. శిఖండిది దైవదత్తమైన ఉత్సాహంగా కనపడుతున్నది. అతడిని నేను ప్రోత్సహిస్తాను. (ప్రకాశంగా) శిఖండీ! నీ వింతగా ప్రతిజ్ఞచేసి దానిని తీర్చకపోతే లోకం నవ్వుతుంది. నే నుండగా ని న్నెవరూ ఏమీ చేయలేరు. కానిమ్ము! భీష్ముడిమీద దాడి సాగించుము.

అని అంటూ ఉండగా భీష్ముడు ప్రక్కకు తిరిగి పాంచాల బలం మీద దృష్టి మళ్ళించాడు. అర్జునుడికి అవకాశం దొరికింది. కౌరవసేనను నుగ్గు నుగ్గు చేశాడు. సేనలు తిరిగి పారిపోవటం మొదలుపెట్టాయి.

దుర్యో: పితామహా! నీవుండగా మన సైన్యం ఇంత దీనంగా మారటం తగునా?

భీష్మ: దుర్యోధనా! పదివేలమందిని చంపుతానని నీకు మాట ఇచ్చాను. నా మాట నిలబెట్టుకొన్నాను. నీ ఋణం తీర్చుకొన్నాను. నా శరీరంలో ఇంక బలం తగ్గుతున్నట్లు తోస్తున్నది. ఈనాడు పాండవులు నన్నైనా చంపాలి లేదా నేనైనా వారిని చంపాలి. అమర్త్యులు మర్త్యులచేత చస్తారా? అయినా నా బలం చూడుము.

అని భీష్ముడు పాండవులమీద విజృంభించాడు. కౌరవులు అతడికి అండగా నిలిచి పోరాడటం మొదలుపెట్టారు. అటు పాండవులు మత్స్య, పాంచాల యాదవ, పాండ్య, కేకయాదులందరు కలిసి ఒక్కుమ్మడిగా వారి నెదుర్కొన్నారు. పోరు ఘోరంగా సాగింది.

అప్పుడు అర్జునుడు శిఖండిని చూచి, 'నీవు భీష్ముడికి భయపడవద్దు. నేనుండగా భయమెందుకు? అతడిమీద దాడి చేయుము. నేను పూనుకొని బాణాలు గుప్పించి అతడిని కూలుస్తాను' అని ప్రోత్సహించాడు. ఆ మాటలు ధృష్టద్యుమ్నుడు విని ఇట్లా ప్రకటించాడు. 'మన వైపు వీరులందరూ భీష్ముడిపై దాడి చేయండి. అర్జునుడు ఉండగా అనుమానించ నవసరంలేదు.' ఆ ప్రకటన విని పాండవపక్షంలోని మేటి వీరులందరు భీష్ముడిపై మూకుమ్మడిగా విరుచుకుపడ్డారు. వారిని మధ్యలోనే అశ్వత్థామాది కౌరవవీరులు అడ్డగించి మహాయుద్ధం చేశారు. దేవతలు తమకున్న అనిమిషత్వం సఫలమయిందని సంతోషించారు.

అర్జునుడు శిఖండిని ముందుంచుకొని ముందుకు సాగుతుండగా దుశ్శాసనుడు సముద్రానికి చెలియలికట్టవలె అడ్డుపడ్డాడు. పార్థుడు కఠినబాణాలతో అతడిని నొప్పించి మూర్ఛిల్లచేశాడు. అతడి సారథి రథాన్ని భీష్ముడి రథం చాటుకు పోనిచ్చాడు. అంతలో అతడు తేరికొని మరల పోరుకు సిద్ధమయ్యాడు. ఆ సమయంలో ఉభయపక్షాల వీరుల మధ్య భీకరసంగ్రామం చెలరేగింది. అర్జునుడు దుశ్శాసనుడిని బాణాలతో దూరంగా తరిమికొట్టాడు. ఆ తరువాత భీష్ముడి ముందున్న సైన్యాన్ని వర్తులాకారంగా తిరుగుతూ చెండాడటం మొదలుపెట్టాడు. ద్రోణు డతడికి అడ్డపడపోయాడు. అతడిని ధర్మరాజు అడ్డగించాడు. అప్పుడు ద్రోణుడు అశ్వత్థామతో ఇట్లా ఎలుగెత్తి పలికాడు:

ద్రోణు: పుత్రకా! నాకు దివ్యబాణతంత్రాలు తడబడుతున్నాయి. విల్లు వణకుతున్నది. మనస్సు వశంలో లేదు. శరీరం కంపిస్తున్నది. ఇవ్వేళవైఖరి చూస్తే అర్జునుడు తన ప్రతిజ్ఞ తీర్చుకొనేటట్లున్నాడు. అర్జునుడు సేనలను చెండాడుతున్నాడు చూడుము.కురుసేనమీద గ్రద్ద లాడుతున్నాయి. ఉల్కలు రాలుతున్నాయి. నక్కలు కూస్తున్నాయి. భీష్ముడికి కీడు కలుగవచ్చును. ధర్మరాజు ముఖంలో క్రోధం తాండవిస్తున్నది. నకుల సహదేవులు అతడిని పరివేష్టించి ఉన్నారు. ఆ వైపు పో రాకున్నది. కాబట్టి నీవు వెంటనే భీష్ముడికి అండగా నిలువుము. ఇది ప్రాణాలు దాచుకొనే సమయంకాదు.

అని హెచ్చరించాడు. అంతలో భీముడు భీష్ముడి ముందు సైన్యాన్ని నుగ్గు చేయనారంభించాడు. భగదత్తాదులు భీముడినెదిరించారు. నొప్పించారు. అయినా భీముడు లెక్కచేయక యుద్ధం సాగించాడు. అర్జునుడు కూడా అతడితో కలిశాడు. దుర్యోధనుడు సుశర్మాదులను భీమార్జునుల మీదకు పురికొల్పాడు. ఈ విధంగా అనేక కౌరవవీరులు క్రమ్ముకొనే సరికి భీమార్జునులకు పోరు భారమైపోయింది. అప్పుడు అభిమన్యుడూ, సాత్యకీ మొదలైన యోధులు అర్జునుడికి సహాయంగా త్రోసికొని వచ్చారు. భీష్ముడు ప్రచండుడై వీరవిహారం చేశాడు. అప్పటికి మధ్యాహ్నమయింది. అతడు తనలో ఇట్లా భావించాడు.

'ఈ పదినాళ్ళబట్టి ఉత్తమ క్షత్రియుల నెందరినో నావాడి బాణాలకు బలిచేశాను. అలసినట్లయినాను. ఇక ఈ శరీరంతో పొత్తు మానాలని అనిపిస్తున్నది.' అని మనసులో తలచి యుద్ధం చేస్తున్నట్లుగా నటిస్తూ ధర్మరాజును సమీపించి, మెల్లగా ఇట్లా అన్నాడు:

'అనఘా! పుట్టినప్పటినుండి క్రూరంగా రాజులను చంపుతూనే ఇంతకాలం గడిచిపోయింది. ఇక నేను హింసతో విసిగిపోయాను. ఈ రాక్షసవృత్తిని నేను సాగించలేను. మీరు నా మేలు కోరేవారైతే, శిఖండిని ముందు పెట్టుకొని, అందరూ కలిసి ఒక్కుమ్మడిగా నామీద దాడి చేయండి.' అని చెప్పి పాంచాల సైన్యంమీదికి రథం పోనిచ్చాడు.

ధర్మరాజు భీష్ముడు చెప్పిన విధంగా చేయుమని ధృష్టద్యుమ్నుడికి చెప్పాడు. అతడు భీమార్జునులను హెచ్చరించాడు. మాత్స్య కైకేయాదులను, అభిమన్యుడు మొదలైన వారిని ఒక్కసారిగా భీష్ముడిపై విజృంభింపచేశాడు. పోరు దారుణంగా సాగింది.

సింహం సింహం మీదకు లంఘించినట్లు అర్జునుడు భీష్ముడిపై పోరు ముమ్మరం చేశాడు. అంతలో దుశ్శాసనుడు అర్జునుడికి అడ్డుతగిలాడు. అతడిని అడ్డం తొలగించాడు. భగదత్తు డడ్డం పడితే అతడిని వారించాడు. శిఖండిని ముందుకు తెచ్చి,

తెరపి కలిగించి, భీష్ముడిపై బాణాలు వేయుమని పురికొల్పాడు. అంతలో కౌరవసైన్యం అర్జునుడిని చుట్టుముట్టింది. అతడు ఆ సైన్యాన్ని వాయువు పిల్లమేఘాలను పారదోలినట్లు దూరం చేశాడు. శిఖండి విజృంభించాడు. భీష్ముడి భుజామధ్య ప్రాంతంలో బాణాలు వేశాడు. భీష్ముడు మంత్రించిన వాడివలె నవ్వుతూ ఉండిపోయాడు. అయితే, శిఖండిని మాని అర్జునుడిపై బాణాలు సారించాడు. దుశ్శాసనుడు, కళింగమాళవ బాహ్లిక విదేహ శూరసేన ప్రముఖులు అర్జునుడిని ఎదుర్కొన్నారు. వారందరిని పార్థుడు దివ్యాస్త్రాలతో తరిమి, చతురంగ బలాలను రూపుమాపి శిఖండికి తెరిపిచూపాడు. శిఖండి బాణాలు సారించాడు. ఆలోగా భీష్ముడిని రక్షించటానికి కృపశల్య వివింశతి వికర్ణాదులు యత్నించారు. అర్జునుడు ఆ అయిదుగురిని విరథులను చేశాడు. మరల వారు విజృంభించారు. పాండవులు ఎదిరించారు. అంతలో భీష్ముడు దివ్యాస్త్రాన్ని శత్రుబలంమీద ప్రయోగించాలని అనుకొన్నాడు. ముందున్న శిఖండిని చూచి మిన్నక ఉండిపోయాడు. అప్పుడు సోమక మాత్స్య ప్రముఖులు అతడిపై దాడి చేశారు. భీష్ముడు వారి సైన్యాలను చంపటమే కాక విరాటరాజు తమ్ముడైన శతానీకుడిని సంహరించాడు.

భీష్ముడు మధ్యందిన మార్తాండుడి వలె వెలిగిపోతున్నాడు. 'అర్జునా! భీష్ముడి ధాటికి మన బలాలు వికావికలౌతున్నాయి. నీవు పూనుకొని ఆతడిని ఎదుర్కొనాలి.' పట్టుదలతో గెలవాలి' అని కృష్ణుడు హెచ్చరించాడు. అర్జునుడు భీష్ముడిపై విజృంభించి బాణాలతో కప్పాడు. శిఖండికూడా బాణాలతో భీష్ముడిని నొప్పించాడు. అయినా భీష్ముడు శిఖండిపై బాణాలు వేయలేదు. ఆ సందు చూచి అర్జునుడు భీష్ముడివిల్లు త్రుంచాడు; బాణాలు గుప్పించాడు. ఆ తరుణంలో శల, శల్య, కృప, కృతవర్మ, చిత్రసేన, భూరిశ్రవో ముఖ్య వీరులందరూ కలిసి భీష్ముడిని క్రమ్ముకొని అతిలోక దివ్యాస్త్రాలు అర్జునుడిపై ప్రయోగించారు. పెద్దపెట్టున బొబ్బలు పెట్టారు. అది గమనించి భీమ, సాత్యకి, సౌభద్ర, విరాట, ద్రుపద, ఘటోత్కచ ప్రముఖులు రంగంలోకి దూకి వారినందరినీ చెదరగొట్టారు. అయినా, రెండు వైపుల సైన్యాన్ని కూర్చుకొని వీరులు యుద్ధం సాగించారు. అది దేవదానవ యుద్ధం వలె సాగింది. అర్జునుడు కౌరవవీరులపై ఐంద్రవారుణాగ్నేయాది మహాస్త్రాలను ప్రయోగించి, వారిని తరిమికొట్టి, శిఖండిని పురికొల్పి భీష్ముడిపై బాణాలు గుప్పింపచేశాడు. భీష్ముడు ఎత్తిన వింటిని వెంటనే విరువసాగాడు. భీష్ముడు అర్జునుడిపై ఉగ్రశక్తిని ప్రయోగించాడు. అతడు దానిని త్రుంచి, భీష్ముడి రథసారథిని, కేతనాన్ని కూల్చాడు. అప్పుడు భీష్ముడు మనసులో ఇట్లా తలపోశాడు.

'పాండవులనందరినీ నా ఒక్కవింటితోనే గెలువలేనా? శ్రీకృష్ణుడు వీరికి అండగా ఉన్నాడు కాబట్టి బ్రతికిపోయారు. అది అట్లా ఉండగా, పాండవులు కీడుపడి శ్రీకృష్ణుడిని వెంటపెట్టుకొని నా వద్దకు రాగా నా వధవిధానం చెప్పాను. ఇక యుద్ధం మాని శాంతంగా ఉంటాను. ఈ ఆర్భాటం ఎందుకు?- అని అనుకొంటూ ఉండగా ఆకాశంలోని దేవతలు అతడి తలంపునకు అంగీకారం తెలిపారు. అది అతడికి మాత్రం వినపడింది. సంజయుడికి మాత్రం వినపడింది. భీష్ముడిమీద మందపవనం వీచింది. దేవతలు పూలవాన కురిశారు. వాటిని సంజయుడు మాత్రమే చూడగలిగాడు.

అట్లా నిశ్చయించుకొన్న భీష్ముడు ఊరక ఉండిపోయినట్లు ఎదుటి వారికి తోచకుండా అర్జునుడి మీద బాణాలు వేశాడు. శిఖండిని ఉల్లంఘించాడు. అర్జునుడు ఆ బాణాలను త్రుంచి అదనెరిగి తెరిపిలేకుండా భీష్ముడిపై బాణపరంపర సంధిస్తూ అతడి విల్లు మరల విరిచాడు. పొరలు చీల్చి శరీరంలో నాటుకొనే బాణాలను అనుసంధించాడు. మహాసముద్రంవలె పొంగి వస్తున్న అర్జునుడిని ఒకవైపూ, తనను వీడకుండ ప్రక్కన ఉన్న దుర్యోధనాదులను మరొకవైపూ కలయచూచి రారాజుతో భీష్ముడిట్లా అన్నాడు:

'ఈ మహావీరుడిని (భీష్ముడిని) దేవాసురకోటికి సైతం ఎదుర్కొనటం సాధ్యంకాదు. ఇక మర్త్యులు ఒక లెక్కా? ఉదారుడైన ఈ అర్జునుడు తప్పితే మిగిలిన పాండవ సైన్యాన్నంతా నేను దగ్ధం చేయగలుగుతాను. నా మాట నిజం. వినుము. వీడి వింటికి ఎదురు ఎవ్వరూ విల్లెత్తలేరు.'

అని అంటున్న సమయంలో శిఖండి విల్లు వెనుక తన విల్లు ఉంచి అతడే వేస్తున్నట్లు అర్జునుడు దొడ్డబాణాలను భీష్ముడిపై సంధించాడు. అప్పుడు భీష్ముడు దుశ్శాసనుడితో ఇట్లా అన్నాడు:

'ఈ బాణాలు పిడుగులవలె ఉన్నాయి. ఇవి శిఖండివి కావు అర్జునుడివే సుమా! ఎండ్రకాయ కడుపువలె నా శరీరాన్ని

ప్రక్కలు చేస్తున్న ఈ బాణాలు శిఖండి కెక్కడున్నాయి? బ్రహ్మదండాలవలె నా మర్మాలను ఎట్లా గ్రుచ్చుకొంటున్నవో చూడుము. యమదూతలవలె ప్రాణాలను లాగే ఈ బాణాలు శిఖండి ఎన్నడు వేశాడు? ఈ బాణాలు దృఢమైనవి, ప్రకాశవంతాలైనవి, లక్ష్యశుద్ధి కలవి. ఇటువంటి బాణాలు అర్జునుడికి కాక శిఖండి కెక్కడివి? అని అంటూ ఒక పెద్ద శక్తిని పార్థుడిమీద విసిరాడు. దానినతడు మధ్యలోనే ముక్కలు చేశాడు. భీష్ముడు డాలూ కత్తీ తీసికొని రథం దిగటానికి ప్రయత్నించాడు. అర్జునుడు డాలునూ, కత్తినీ ముక్కలు చేసి, 'నే నుండగా భయమెందుకు? భీష్ముడిని చుట్టుముట్టండి' అన తన యోధులను ఎలుగెత్తి పిలిచాడు. వారందరూ 'వేయండి, పొడవండి, నరకండి' అంటూ భీష్ముడిని సమీపించారు. అంతలో కౌరవ సైనికులు కేకలు పెట్టుతూ వారితో తలపడ్డారు. పోరు ఘోరమయింది. గాండీవి, పాండవవీరులు విజృంభించి భీష్ముడి శరీరంలో ఎడమింత లేకుండ నిష్ఠురమైన అస్త్రశస్త్రాలు నింపారు. అంతలో సూర్యుడు అస్తగిరికి చేర నారంభించాడు. అర్జునుడు భీష్ముడిపై క్రూరబాణాలు వేసి అతడిని పడద్రోశాడు. సూర్యుడు అస్త్రాద్రిమీద వాలినట్లు దర్పోజ్జ్వలుడైన భీష్ముడు కౌరవులు చూస్తూ ఉండగానే తూర్పు దిక్కు తలకాగా పడ్డాడు. అతడి శరీరం నేలమీద పడకుండ బాణాలే పాన్పుగా అమరాయి.

అట్లా శరతల్పంమీద ఉన్న ఆ మహానుభావుడికి దేవభావం కలిగింది.

ఆకాశంలో దేవతలు 'అయ్యో! పుణ్యాత్ముడైన భీష్ముడు దక్షిణాయనంలో చనిపోతున్నాడే' అని విచారించారు. 'దేవతలారా! నా కాలగతి మనస్సులో నేను కోరుకొన్నదే. నా ప్రాణాలను శరీరంలో ఉంచుకొన్నాను. బాధపడకండి. సత్యవతీ వివాహ సమయంలో నా తండ్రి నన్ను మెచ్చి నాకు 'అవధ్యత్వం' 'స్వచ్ఛంద మరణం' వరాలుగా ఇచ్చాడు. వాటి ప్రభావం వలన నా వధ నేను అంగీకరించకపోతే కలగదు. ప్రాణత్యాగం కూడా నా వశమై ఉన్నది' అని పలికాడు. దేవతలు సంతోషించారు. గంగామాత కొందరు మునులను హంసల రూపంలో పంపి దక్షిణాయనాన్ని గురించి భీష్ముడికి తెలియచెప్పింది. దుర్యోధనుడు భీష్ముడు పడిన వృత్తాంతాన్ని ద్రోణుడికి, దుశ్శాసనుడితో తెలియపంపాడు. ఆ వార్త విని ద్రోణుడు మూర్ఛపోయి, కొంతసేపటికి తేరుకొని, దీనమైన ముఖంతో దుర్యోధనుడి వద్దకు వెళ్ళాడు. పాండవసైన్యం హర్షధ్వానాలు చేసింది. కౌరవసైన్యం హాహాకారాలు చేసింది. ఆ నాదాలతో ఆకసం పిక్కటిల్లింది.

పాండవులకు కాళ్ళు చేతు లాడలేదు. కళ్ళవెంట కన్నీరు కారుతుండగా, మనసులు దుఃఖింపగా వారు చూస్తూ అట్లాగే నిలిచిపోయారు. యుద్ధం ఆగిపోయింది. సూర్యుడు అస్తమించాడు.

కౌరవపాండవులందరూ కవచాలు వదలి, ఆయుధాలు వదలి పగలు మాని, భీష్ముడి చుట్టూ చేరారు. అట్లాగే బంధుమిత్రులు సమకూడారు. అర్జునుడు మాత్రం గాండీవధారియై వెళ్ళాడు. అన్యోన్య రోషాలు మాని తన చుట్టూ చేరి ఉన్న వారందరిని చూచి భీష్ముడు అభినందించాడు.

'నాకు క్రిందుతలగా ఉన్న'దని భీష్ముడు సూచించాడు. దుర్యోధనుడు ఎత్తుగా ఉండటానికి తలగడలు తెండని తనవారిని పంపాడు. భీష్ముడు చిరునవ్వు నవ్వి అర్జునుడిని పిలిచాడు. తలగడగా బాణాలను అమర్చుమని కోరాడు. పార్థుడు కన్నీరొలుకగా దగ్గరికి పోయాడు. పెడతలను చేతితో ఎత్తిపెట్టి, మూడు బాణాలను అభిమంత్రించి నేలపై నిలుచునట్లు అమర్చి బాణాల తలగడను సమకూర్చాడు. భీష్ముడు 'తగిన తలగడను అమర్చా'వని అతడిని కొనియాడాడు. మనుమలనూ, రాజులనూ చూచి ఇట్లా అన్నాడు: 'సూర్యుడిని ధ్యానిస్తూ ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేంతవరకు ఈ అంపశయ్యమీదనే సంతోషంతో శయనించి ఉంటాను. ఈ రోజులలో నాకు గట్టి రక్షణను కల్పించండి. పరిఖలతో ప్రాకారం ఏర్పరచండి. తగినవారిని కాపలాపెట్టండి.' అనగానే కౌరవపాండవులు ఆ ఏర్పాట్లు తమ తమ వారితో చేయించారు. చికిత్సకులు వచ్చి గాయాలకు మందువేస్తామని పూనుకొనగా భీష్ముడు వారిని వారించి కాన్కలిచ్చి పంపించాడు. గీతవాద్య నృత్త ప్రవీణులు ఆయనకు వినోదం కలిగిస్తూ ఉన్నారు.

అప్పుడు భీష్ముడు తనకు దాహమౌతున్నట్లు సూచించి నీటిని అడిగాడు. దప్పిక తీర్చగల పలురకాల జలాలను కౌరవులు తెప్పించారు. భీష్ముడు 'వినండి, శరతల్పంమీద శయనించి ఉన్న నేను సామాన్య జలాలు త్రాగటం సముచితం కాదు. తేజోమయమైన అస్త్రప్రయోగం వలన భూమినుండి పుట్టిన పుణ్యజలాలను త్రాగటమే సముచితం' అని ప్రకటించాడు. కౌరవులు

ఒకరిమొగం మరొకరు చూచుకొంటూ భయపడుతూ ఉండిపోయారు. అప్పుడు భీష్ముడు అర్జునుడితో ఇట్లా అన్నాడు: 'బాణాల బాధతో నా శరీరమంతా నొప్పులు పుట్టుతున్నాయి. పెదవు లెండుతున్నాయి. పెనుదప్పిక కలిగింది. దానిని తీర్చగలిగిన దివ్యజలాలను నీవే తేనేర్తువు. తెమ్ము' అనగానే పార్థుడు తాతకు ప్రదక్షిణం చేసి పర్జన్యమంత్రంతో ఒక బాణాన్ని అభిమంత్రించి భూమి చీలేటట్లు ప్రయోగించాడు. వెంటనే భూమిలోనుండి కాంతిగల నీళ్ళు దివ్యగంధంతో కూడి ధారలుగా పైకి లేచి భీష్ముని నోటిలో ప్రశాంతంగా వాలి అతడి దప్పికను తీర్చాయి. కౌరవు లా దృశ్యం చూచి భయంతో వణికిపోయారు. పాండవులు పొంగిపోయారు. అప్పుడు భీష్ముడు అర్జునుడితో ఇట్లా అన్నాడు: 'నారదుడు చెప్పగా నిన్ను మునినాథుడవని తెలిసికొన్నాను. కృష్ణుడూ, నీవూ కలిస్తే సాధించలేని పనులేవీ లేవు. దుర్వార పరాక్రముడవైన నీతో వైరం పెట్టుకొంటే కీడు తప్పదని ఎన్నిసార్లు చెప్పినా ఈ కౌరవరాజు మానడు. సాహసిస్తే ఇకముందు భీముడి చేతిలో చెడక తప్పదు' అనిపలికి, చిన్న బుచ్చుకొన్న దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు: 'అర్జునుడు అతి పరాక్రమశాలి. అతడికి నారాయణుడు ఆప్తుడు. ఎవ్వరూ వీరిని జయించలేరు. యుద్ధాటోపం మాని ధర్మరాజుకు ఇంద్రప్రస్థం ఇచ్చి, మిగిలిన అర్ధరాజ్యం నీవు అనుభవించుము. మీలో మరికొందరు చావకుండా ఉన్నప్పుడే ఈ మంచిపని చేయటం శ్రేయస్కరం' అని పలికి ఊరకున్నాడు. కౌరవపాండవులు కూడా మారుపలుకక అతడికి నమస్కరించి వెళ్ళారు.

దారిలో శ్రీకృష్ణుడూ, ధర్మరాజూ ఇట్లా మాట్లాడుకొన్నారు.

కృష్ణ: ధర్మరాజా! దేవతలకు కూడా సాధ్యుడు గాని భీష్ముడిని ఈ విధంగా గెలవటం అద్భుత పరికరాలు గల మీకే చెల్లింది.

ధర్మ: కృష్ణా! మే మొక మనుషులమా? వీరులమా? తిరుగులేని పరాక్రమం గల నిన్ను పొంది ఇంతటి పనులు సాధించటానికి సమర్థులమయ్యాము. నీవు భక్తాధీనుడవు కదా!'

అందరూ వారి వారి శిబిరాలకు పోయి ఆ రాత్రి విశ్రాంతి తీసికొన్నారు.

ఆ రాత్రి కర్ణుడు భీష్ముడి వద్దకు పోయి భక్తి వినయాలతో పాదాలకు నమస్కరించాడు. వారిరువురి నడుమ సంభాషణ ఇట్లా సాగింది.

కర్ణ: మహాత్మా! నామీద కోపం చాలించి, వాత్సల్యాన్ని చూపి, తగినమాటలు మాట్లాడుము.

భీష్మ: (గౌరవంగా దగ్గరకు పిలిచి) నీ పట్ల నాకు కోపం ఎందుకు? కులభేదాన్ని కలిగించే మాటలతో మా బిడ్డలను పాడుచేస్తావేమిటని చాలసార్లు మందలించాను. అనరాదు కాని, అప్పుడప్పుడు నిష్ఠురాలతో బెదిరించాను కూడ. అది కోపంకాదు, నీకు మంచిని బోధించటమే. నీ పుట్టుక దైవిక గర్భాయత్తం. నిను బోలిన మానవు లరుదు. నీవు కౌంతేయుడవు కాని రాధేయుడవు కావు. నాకీ విషయం వేదవ్యాసుడు రహస్యంగా తెలిపాడు. నేనుకూడ నీ తేజస్సును గమనించి అట్లాగే భావించాను. పాండవుడవైన నీమీద నాకు వాత్సల్యమే కాని మాత్సర్యం లేదు. ఒక్కమాట చెప్తాను వినుము. నేను కురుపాండవుల వైరాన్ని మాన్పి పంపాను. ఆ పాండవులకు అజయ్యుడు, అప్రమేయుడు అయిన కృష్ణుడు వారికి విధేయుడు. కాబట్టి వారితో విరోధం తగదు. నీవుకూడా మరొకమాట మాని పాండవులతో కలిసి ఉండుము.

కర్ణ: మహాత్మా! నేను కౌంతేయుడనని పూర్వమే ఆర్యుల వలన విన్నాను. ఇంత తెలిసి ఆ పాండవులతో కలిసి ఉండటం నాకు తగునా? పాండవులు మహాబలవంతులు. శ్రీకృష్ణుడి అండ వారికున్నది. వారిని యుద్ధంలో గెలవటం సాధ్యం కాదని కూడా నే నెరుగుదును. అయినా, దుర్యోధన మహారాజు నా పట్ల చూపే గౌరవాదరాలను తలచి చూస్తే, అతడిని విడిచి పోవటం ధర్మమా? వీరకర్మమా? అంతేకాక - నేను పాండవులను దుర్భాషలాడాను. అనుమానం లేకుండా నిండుసభలో వారిని అవమానాల పాలు చేశాను. అన్నివేళలా వారికి అన్యాయం చేసి వైరాన్ని పెంచాను. అందువలన ఈ వీటికీ ఆ వీటికీ పొత్తు పొసగదు. యుద్ధమే తగినకార్యం. అంతా దైవాధీనమే. మనం దేనినీ తప్పించలేము. నీవింక మారు పల్కకుండా శత్రువులమీదకు నన్ను పంపుము. నా కర్తవ్యమైన సేవాధర్మాన్ని నిర్వర్తిస్తాను. లోకం నా బలాన్ని మెచ్చుకొనేటట్లు విహరిస్తాను. కృష్ణార్జునులను నిర్జిస్తాను.

భీష్మ: కర్ణా! నీవు అంతకు సమర్థుడవే. నాకు తెలియదా? దుర్యోధనుడికి నీ భుజబలమే కదా సహాయం. అతడి కేది ప్రియమైతే దానిని సంతోషంగా చేస్తావు. అట్లా చేసి నీవు సంతోషించుము. అనుమానం వదలుము. అనుజ్ఞ ఇచ్చాను వెళ్ళుము.

అని పలికాడు. భీష్ముడి బంధుభావానికి కర్ణుడు పరమానందం పొంది తన నివాసానికి తిరిగివెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జి.వి. సుబ్రహ్మణ్యం

శ్రీమదాంధ్ర మహాభారతము

భీష్మపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
ధృతరాష్ట్రునికడకు వేదవ్యాసుండు వచ్చుట	6 - 2 - 1	02
సంజయుఁడు ధృతరాష్ట్రునకు భూపరిమాణంబు సెప్పుట	6 - 5 - 9	10
సంజయుఁడు ధృతరాష్ట్రునకు భారతవర్షంబునం గలవిశేషంబులు సెప్పుట	6 - 10 - 1	17
ధృతరాష్ట్రుఁడు భీష్మమరణంబు విని విలపించుట	6 - 14 - 1	25
సంజయుఁడు ధృతరాష్ట్రునకు భారతయుద్ధంబు సెప్పఁ బూనుట	6 - 16 - 7	32
భీష్ముఁడు నిజయోధులకెల్ల నుత్సాహంబుగాఁ దెగువ సెప్పుట	6 - 17 - 7	45
పాండవయోధులు యుద్ధంబునకు వెడలుట	. . . . .	48
ధర్మజునకు నర్జునుఁ డుత్సాహంబు గలిగించుట	6 - 1 - 93	59
ధర్మరాజు పాదచారియై భీష్మునియొద్దకుఁ బోవుట	6 - 41 - 6	68
ధర్మరాజు గురుకృపశల్యులచేత యుద్ధమున కనుజ్ఞాతుం డగుట	6 - 41 - 43	73
అర్జునుఁడు స్వజనసంహారంబునకు శంకించి మోహావిష్టుం డగుట	6 - 23 - 30	84
శ్రీకృష్ణుఁ డర్జునునకుఁ దత్త్వజ్ఞానోపదేశంబు సేయుట	6 - 24 - 19	72
అర్జునుఁడు శ్రీకృష్ణునివిశ్వరూపంబు కనుంగొని స్తుతించుట	6 - 33 - 5	100
భీష్ముని ప్రథమ దివసయుద్ధము	6 - 42 - 1	111
భీష్ముఁడు దుర్యోధనప్రేరితుండై పాండవవీరుల నొప్పించుట	6 - 45 - 1	129

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్వితీయాశ్వాసము

ధర్మజుఁడు గోపాలదేవు పాలికిం జనుట	6 - 46 - 1	143
భీష్ముని ద్వితీయదివస యుద్ధక్రమము	6 - 47 - 1	152
అర్జునుఁడు భీష్మునిమీఁదికి రథంబు దోలించి విజృంభించుట	6 - 48 - 2	156
ధృష్టద్యుమ్న ద్రోణాచార్యులయుద్ధము	6 - 49 - 1	162
భీమసేనునిచేత భానుమంతుండు చచ్చుట	6 - 50 - 30	169
భీష్ముని తృతీయదివస యుద్ధము	6 - 52 - 11	181
దుర్యోధనుఁడు భీమునితో యుద్ధము సేసి మూర్ఛిల్లుట	6 - 54 - 15	187
అర్జునుఁడు శ్రీకృష్ణప్రేరితుఁడై భీష్మునిపైఁ గవియుట	6 - 55 - 40	198
శ్రీకృష్ణుఁడు చక్రంబు ధరించి భీష్మునిమీఁది కుఱుకుట	6 - 55 - 84	203
భీష్ముని చతుర్థదివసయుద్ధము	6 - 56 - 1	211
శల్యనందనుఁడు ధృష్టద్యుమ్నునితో యుద్ధంబుసేసి చచ్చుట	6 - 57 - 25	217
దుర్యోధనుఁడు భీముని మార్కొని మూర్ఛఁబొందించుట	6 - 60 -7	231
ఘటోత్కచుండు మాయాబలంబునఁ గౌరవసేనపై విజృంభించుట	6 - 68 - 40	236
భీష్ముని పంచమదివస యుద్ధక్రమము	6 - 65 - 1	247
ద్రోణుండు దుర్యోధన ప్రేరితుండై పాండవసైన్యంబుపైఁ గవియుట	6 - 65 - 21	250
అభిమన్యు లక్ష్మణకుమారుల యుద్ధము	6 - 69 - 30	262
భీష్ముని షష్ఠదివసయుద్ధక్రమము	6 - 71 - 1	269
ధృష్టద్యుమ్నుఁడు భీమసేనునకుఁ దోడ్పడుట	6 - 73 - 31	279
ధృష్టద్యుమ్నుఁడు ద్రోణునితో యుద్ధము సేయుట	6 - 73 - 67	284

తృతీయాశ్వాసము

భీష్మగాంధారేయుల సంవాదము	6 - 76 - 3	295
భీష్ముని సప్తమదివసయుద్ధక్రమము	6 - 77 - 11	297
ధృష్టద్యుమ్నునిచే దుర్యోధనుఁడు విరథుఁడై పోవుట	6 - 78 - 44	303
చేకితాన కృపాచార్యుల ద్వంద్వయుద్ధము	6 - 80 - 20	310
భీష్ముని యష్టమదివసయుద్ధక్రమము	6 - 83 - 1	321
సునాభుఁడు మొదలగు కురుకుమారులు భీమునిచేఁ జచ్చుట	6 - 84 - 12	323
అలంబసునిచేత నిరావంతుఁడు మృతుం డగుట	6 - 86 - 48	333
ఘటోత్కచుఁడు ద్రోణాచార్య ప్రభృతులతో యుద్ధంబుసేయుట	6 - 88 - 25	341
అర్జునుఁ డిరావంతుని చచ్చుట భీమునిచే విని దుఃఖించుట	6 - 92 - 1	350
భీష్ముని నవమదివస యుద్ధము	6 - 95 - 1	361
అలంబసుఁడు దుర్యోధన ప్రేరితుఁడై యభిమన్యుపైఁ గవియుట	6 - 96 - 24	365
అర్జునుఁడు ద్రోణాచార్యులతో యుద్ధముసేయుట	6 - 98 - 4	371
దుర్యోధనుఁడు శకునిదుశ్శాసనుల భీష్మునకు సహాయంబుగాఁ బంపుట	6 - 101 - 1	378
శ్రీకృష్ణుఁడు రథంబు డిగి భీష్మునిపైకిఁ బోవుట	6 - 102 - 52	388
ధర్మరాజు రహస్యప్రకారంబున భీష్మునియొద్దకుఁ బోవుట	6 - 103 - 50	398
భీష్ముని దశమదివసయుద్ధానుక్రమము	6 - 104 - 2	407
అర్జునుఁడు శిఖండికిఁ బ్రోత్సాహంబు గలిగించి భీష్ముపైఁ గవియించుట	6 - 104 - 51	411
ద్రోణాచార్యు లశ్వత్థామను భీష్మునకు సహాయంబుగాఁ బంపుట	6 - 108 - 1	419
విరటుతమ్ముఁ డగుశతానీకుండు భీష్మునిచేఁ జచ్చుట	6 - 113 - 24	431
భీష్ముఁడు శరతల్పగతుఁ డగుట	6 - 114 - 80	440
కర్ణుఁడు భీష్మునియొద్దకుఁ బోయి వినతుం డగుట	6 -117 - 1	450

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

భీష్మపర్వము

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

భీష్మపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీ సంపాది పదాంబుజ! । నాసాగ్ర నివాస రసిక! నాదామృత ధా
రాసారరూప! వేద । వ్యాస వ్యంజిత విహార! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ, సంపాది, పద+అంబుజ!= ఉత్తమమైన ఐశ్వర్యాన్ని కలుగజేసే పద్మాలవంటి పాదాలు కలవాడా! లేదా, శ్రీ అంటే మోక్షం. మోక్షాన్ని కలుగజేసే పాదపద్మాలు కలవాడా! - పరమేశ్వర పాదపద్మధ్యానం చేత మోక్షం కలుగుతుందని భావం; నాసా+అగ్ర, నివాస, రసిక!= యోగనిష్ఠాగరిష్ఠుని ముక్కుయొక్క కొనయందు నివసించు రసజ్ఞుడా! - యోగనిష్ఠా గరిష్ఠుడికి నాసాగ్రదృష్టి విధించబడింది. దానికి హేతువు మనస్సుకు స్థిరమైన ఆత్మనిష్ఠ కలగటం. ఇట్లా నాసాగ్రదర్శనం ఆత్మనిష్ఠా ప్రతిష్ఠితం కావటంచేత పరమేశ్వరుడు నాసాగ్ర నివాస రసికు డని చెప్పబడింది; నాద+అమృత, ధారా+ఆసార, రూప!= నాదమనే అమృతధార యొక్క జడి రూపం కలవాడా! నాదం అమృతధారా సార రూపమగు పరమేశ్వరుడు, లేదా పరమేశ్వరుడు నాదరూపుడనీ, అమృత ధారా సారరూపుడనీ రెండువిధాల రూపత్వం చెప్పవచ్చును; వేదవ్యాస, వ్యంజిత, విహార!= వేదవ్యాసమహర్షి చేత సుస్పష్టం చేయబడిన విహారం కలవాడా! -పరమేశ్వర విహార స్థానాలైన శ్రుతులు సంకీర్ణాలుగా ఉండగా వాటిని వ్యాసుడు అసంకీర్ణాలుగా చేసి పరమేశ్వర విహారాలను శాస్త్రాల రూపంలోనూ, మహాభారతాది గ్రంథరూపంలోనూ సుస్పష్టం కావించాడని భావం; హరిహరనాథా!= శివకేశవులకు అభేదాధ్యవసాయి అయిన భగవంతుడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! శ్రేష్ఠమైన ఐశ్వర్యాన్ని కలుగజేసే పాదపద్మాలు కలవాడా! ముక్కుకొసయందు నివాసం కలవాడా! నాదమనే అమృతధార యొక్క జడిరూపం కలవాడా! వేదవ్యాసమహర్షి చేత సుస్పష్టం చేయబడిన విహారం కలవాడా!

విశేషం: ఇది భీష్మపర్వంలో- మొదటి ఆశ్వాసంలోని మొట్టమొదటి పద్యం. కృతిపతి సంబోధన. తిక్కన భారతానికి కృతిపతి హరిహరనాథుడు.

(ii) నాసాగ్రరసికుడు - ఆ హరిహరనాథుడు. భగవద్గీతలోని శ్లోకం ఇచ్చట అనుసంధించవలసి ఉంటుంది.

సమం కాయ శిరో గ్రీవం । ధారయ న్నచలం స్థిరః,
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం । దిశశ్చానవ లోకయన్. (అధ్యాయం 6, శ్లోకం 13)

అని శ్రీకృష్ణుడు అర్జునుడితో చెప్పి ఉన్నాడు. అనుభవైకవేద్యమైన యోగాభ్యాస రహస్యం ఇందులో ఇమిడి ఉంది. యోగి నాసికాగ్రమునందు ఉపాసనాదృష్టి కేంద్రీకరించవలసి ఉంది.

(iii) హరిహరనాథుడు - 'నాదామృత ధారాసారరూపుడు!' "వేదానాం సామవేదోऽస్మి"- ఇది భగవద్గీతా వాక్యం. భగవంతుడు సామవేద స్వరూపుడు. నాదోపాసకులు మాత్రమే ఇందలి గూఢార్థం గ్రహించగలరు. ఎడతెగని 'అమృతధార' వలె ఆ నాదం అభివ్యక్తం కావాలి. ఇది శ్రుతిలయలకు అతీతమైన సన్నివేశం.

(iv) హరిహరనాథుడు- 'వేదవ్యాస వ్యంజిత విహారుడు.' హరిహరనాథోపాసన - 'విష్ణురూపాయ శివాయ నమః' మాత్రమే కాదు. తిక్కన మాటలలో చెప్పాలంటే - అది "ధర్మాద్వైత" కళోపాసన. దీనిని తిక్కన ఆరంభించినట్లు లోకప్రతీతి. కాని ద్రోణపర్వంలో సంస్కృత మహాభారతంలో సైంధవవధకుముందు అర్జునుడు తాను ఆ కృష్ణుడి మెడలో వేసిన పూలదండను, తనకు స్వప్నంలో సాక్షాత్కరించిన శివుని కంఠంలో చూస్తాడు. శివుడు తనకూ శ్రీకృష్ణుడికీ భేదం లేదని కంఠోక్తిగా ప్రకటిస్తాడు.

అంతేగాక, ఇచట వేదవ్యాస మహర్షి ఉపాసించిన 'వ్యంజన శక్తి' ప్రసక్తి ఉంది. వ్యంజనం - వాచ్యార్థంకంటె అతీతమైనట్టిది. వ్యాస శబ్దానికి సమన్వయత అనే అర్థం ఉంది. వేద వ్యాసుడు, తిక్కన సమన్వయ సిద్ధాంత ప్రవక్తలు. వ్యాసప్రోక్తమైవ మహాభారతం - వ్యంజనాదృష్టితో చూస్తే - సమన్వయ వేదాంత విహారం.

ధృతరాష్ట్రుని కడకు వేదవ్యాసుండు వచ్చుట (సం.6-2-1)

క. దేవా! జనమేజయ వసు। ధా వల్లభుఁ డధిక వినయ తత్పరుఁడై సం
భావించి కుతూహలమునఁ। దా వైశంపాయనునకుఁ దగ ని ట్లనియెన్. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ పరమేశ్వరా! (హరిహరనాథా! జనమేజయ, వసుధా, వల్లభుఁడు= జనమేజయుడు అనే పేరుగల రాజు (భూభర్త); అధిక, వినయ, తత్పరుఁడు+ఐ= మిక్కుటమైన నమ్రతతో కూడినవాడై; సంభావించి= మన్నన చూపి; కుతూహలమునన్= వేడుకతో; తాన్= తాను; వైశంపాయనునకున్= వైశంపాయనుడితో; తగన్= సముచితంగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! జనమేజయ మహారాజు మిక్కిలి నమ్రతతో కూడినవాడై, మన్నన చూపి వైశంపాయనుడితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: (1) తిక్కన మహాకవి - తాను వ్రాసిన మహాభారతాన్ని హరిహరనాథదేవునకు అంకితం ఇచ్చాడు. కృతిపతి - కృతికి మొదటి శ్రోత. ఇది సాహితీ సంప్రదాయం.

(2) మహాభారత కథను - (సంస్కృత మూలభారతం ప్రకారం) జనమేజయ మహారాజు చేసిన సర్పయాగంలో వైశంపాయన మహర్షి మహాభారత కథ ఆ రాజుకు వినిపించాడు. జనమేజయుడు - పరీక్షితుడి కొడుకు. పంచపాండవ మధ్యముడైన అర్జునుడి మునిమనుమడు. అభిమన్యుడి మనుమడు.

క. ఒండొరుల గెలుచు తలఁపునఁ। బాండవులును గౌరవులును బాహా గర్వో
ద్దండత నెట్లు దొడంగిరి?। భండన మెప్పాటఁ జెల్లెఁ బరమమునీంద్రా!' 3

ప్రతిపదార్థం: పరమ, ముని+ఇంద్రా= గొప్పవాడవైన మునిశ్రేష్ఠుడా! (ఇంద్ర శబ్దం శ్రేష్ఠవాచకం); ఒండొరులన్= ఒకరినొకరిని; గెలుచు, తలఁపునన్= జయించవలయుననెడి ఆలోచనతో; పాండవులును, కౌరవులును= పాండురాజు కొడుకులు (ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడును) దుర్యోధనుడును అతని తమ్ములును; బాహా+గర్వ+ఉద్దండతన్= భుజబలం వలని అహంకారం యొక్క అతిశయంతో; ఎట్లు= ఏ రీతిగా; తొడంగిరి?= పూనుకొన్నారు?; భండనము= యుద్ధం; ఏ+పాటన్= ఏ రీతిగా; చెల్లెన్?= జరిగింది?

తాత్పర్యం: మునులలో శ్రేష్ఠుడవైన ఓ వైశంపాయన మహర్షీ! ఒకరినొకరు జయించాలనే అభిప్రాయంతో పాండవులు, కౌరవులు ఏ విధంగా ప్రయత్నించారు? యుద్ధం ఏ రీతిగా జరిగింది? వివరించి తెలుప వేడుతున్నాను.

విశేషం: 1. కౌరవులు అనగా కురురాజు సంతతివారని అర్థం. అనగా పాండవులు కూడా నిజానికి కౌరవులే. పాండురాజు కొడుకులైన వారూ, ధృతరాష్ట్రుడి పుత్రులైన దుర్యోధనుడూ అతడి తమ్ములూ - కురుసంతతివారే. అయితే- వివక్ష కోసం ప్రజలు ఇటు వారిని పాండవులు అన్నారు. అటు వారిని కౌరవులు అన్నారు. అంతే.

2. భీష్మపర్వంలో ఇది కథకు సంబంధించిన మొదటి పద్యం. మహాభారత యుద్ధం - భీష్మపర్వంలోనే ఆరంభమైంది. విశ్వవిఖ్యాతిని ఆర్జించిన మహాభారత యుద్ధం గూర్చి పాండవవంశంలోని వాడైన జనమేజయ మహారాజు ఎంతో ఆసక్తితో అడుగుతున్నాడు.

క. అనుటయు వైశంపాయనుఁ । డనుమోద రసార్ద్రహృదయుఁడై యిట్లనియెన్
జనమేజయు మనమున సం । జనితంబగు కౌతుకంబు సఫలతఁ బొందన్. 4

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పిన పిదప; వైశంపాయనుఁడు= (మహాభారత కథకుడు); అనుమోద, రస+ఆర్ద్ర, హృదయుఁడు+ఐ= అంగీకారం అనెడి ద్రవంతో తడిసినట్టి గుండె కలవాడై, సంతోషంతో సమ్మతించినవాడై; జనమేజయు; మనమునన్= జనమేజయుడి యొక్క మనస్సులో; సంజనితంబు+అగు= పుట్టినట్టి; కౌతుకంబు= వేడ్క; సఫలతన్+పొందన్= నెరవేరేటట్లుగా; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: జనమేజయుడు ఆ విధంగా ప్రశ్నించగా, వైశంపాయన మహర్షి మిక్కిలి సంతోషించి, అతడి మనసులోని ఆసక్తి తీరేటట్లుగా ఈ విధంగా బదులు చెప్పాడు.

విశేషం: ఇచ్చట "రస" శబ్ద ప్రయోగం గమనించాలి. జనమేజయుడి ప్రశ్న - వైశంపాయనుడికి మిక్కుటమైన ఆనందం కలిగించింది. శ్రోతయైన రాజు యొక్క జిజ్ఞాస కథకుడైన మునికి నచ్చింది. అతడి హృదయం 'అనుమోద రసంతో' తడిసింది అని కవి వర్ణన. రసములు తొమ్మిది ఆలంకారికుల దృష్టిలో. అందులో "అనుమోదం" ఒకటికాదు. అయితే- "అనంతో వై రసాః" రసములు అనంతాలు అనే మాట కూడా ఉంది. 'రసం' అంటే హృదయాన్ని కదలింపగల భావం. దానికి గుండెను తడుపగల శక్తి ఉంటుంది.

తిక్కన మహాకవికి - రసశబ్ద ప్రయోగం అంటే మిక్కిలి మక్కువ. కొందరు విమర్శకులు తిక్కన రసశబ్దాన్ని పలుచోట్ల ప్రయోగించి చులకన చేశాడని అధిక్షేపించారు గూడ. అయితే- తిక్కనకు ఇష్టమైన "రసం" హృదయాన్ని తడిపే భావావేశంగా స్వీకరించాలి గాని ఆలంకారికులు ప్రపంచించిన నవరసాలలో చేర్చరాదు.

వ. పుణ్యక్షేత్రోత్తమం బయిన యా కురుక్షేత్రంబున నారెండు దెఱంగుల వారి కటకంబులును విడిసి కయ్యంబునకుఁ గాలు ద్రవ్వునట్టి సమయంబున ధృతరాష్ట్రుండు గొడుకుల దుర్వినయంబునకు నిర్వేదనంబు నొంది, సంజయద్వితీయుండై చింతించుచున్న యెడ కుం బ్రికాలవేదియగు వేదవ్యాసుండు విజయం చేసి యమ్మహీపతి సేయు నర్చనంబులం గైకొని యతని కిట్లనియె: 5

ప్రతిపదార్థం: పుణ్య క్షేత్ర+ఉత్తమంబు+అయిన= పుణ్యమైన ప్రదేశాలలో శ్రేష్ఠమైనది అయిన; ఆ, కురుక్షేత్రంబునన్= ఆ కురుక్షేత్రం అని పేరు వడసిన ప్రదేశంలో; ఆ, రెండు, తెఱంగులవారి= ఆ రెండు పక్షాలవారి (పాండవుల యొక్కయు, కౌరవుల యొక్కయు); కటకంబులును= శిబిరాలు (సేనలు గుమిగూడిన కేంద్ర ప్రదేశం "కటకం"); విడిసి= ఒకచోట చేరి; కయ్యంబునకున్= పోరుకు, యుద్ధానికి; కాలు, త్రవ్వు+అట్టి= సంసిద్ధత చూపించే; సమయంబునన్= తరుణంలో; ధృత రాష్ట్రుండు; కొడుకుల దుర్వినయంబునకున్= తన పుత్రుల యొక్క గర్వానికి (నమ్రత లేకపోవటానికి); నిర్వేదనంబున్+ఒంది= దుఃఖాన్ని పొంది; సంజయ, ద్వితీయుండు+ఐ= సంజయుడు తన చెంత ఉండటం చేత రెండవవాడై- సంజయుడితో కూడినవాడై;

చింతించుచున్+ఉన్న; ఎడకున్= ఆలోచన చేస్తున్న చోటికి; త్రికాల; వేది+అగు= మూడు కాలాలు తెలిసినవాడైన; వేదవ్యాసుండు; విజయం చేసి= వచ్చి; ఆ+మహీపతి= ఆ రాజు (ధృతరాష్ట్రుడు); చేయు, అర్చనంబులన్= చేసే పూజలను; కైకొని= స్వీకరించి; అతనికిన్+ఇట్లు+అనియెన్= ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పుణ్యస్థలమైన ఆ కురుక్షేత్రంలో కౌరవులు పాండవులు గుడారాలు నిర్మించి సేనలతో యుద్ధానికి సన్నద్ధమైన సమయంలో ధృతరాష్ట్రుడు సంజయునితో కూడియుండి తన కొడుకుల గర్వానికి దుఃఖించటం గమనించి మూడు కాలాల పోకడ తెలిసినట్టి వ్యాసమహర్షి అక్కడికి వచ్చి అతడితో ఈ విధంగా అన్నాడు:

విశేషం: భారతదేశంలో కొన్ని స్థలాలు 'పుణ్యక్షేత్రాలుగా' ప్రసిద్ధి చెందాయి. ఆయా స్థలాలకు వెళ్ళేవారికి సుకృతం (పుణ్యం) లభిస్తుందని నమ్మకం. అందులో ఒకటి కురుక్షేత్రం. అక్కడ యుద్ధంలో మరణించినవారికి 'పుణ్యం' లభించగలదనే విశ్వాసం ప్రజలలో ఏర్పడింది. వ్యాసమహర్షి వేదాలకు ఒక అనుక్రమణిక ఆకార రేఖలు స్థిరీకరించాడు గనుక అతడికి వేదవ్యాసుడు అనే బిరుదు ఏర్పడింది. వ్యాసుడు అనే పేరుగల మహర్షులు పలువురు ఉండవచ్చును. 'వేదవిద్యాధురంధరుడైన' వ్యాసుడికి ప్రత్యేకత ఏర్పడింది. త్రికాలవేది - అనగా భూత, వర్తమాన, భవిష్యత్ కాలములు, వాటిలో జరిగింది, జరుగుతున్నది, జరుగబోయేది తెలిసినవాడు. సంజయుడు- ధృతరాష్ట్రుడికి ఆంతరంగిక సచివుడు.

క. ' కాలం బగుటయు నృపులకు । నాలము సమకూరె; దీని కడలకు మది నీ
వాలోకింపఁగ వలసిన । నే లోనికి దివ్యదృష్టి నిచ్చెదఁ బుత్త్రా!' 6

ప్రతిపదార్థం: పుత్త్రా= ఓ కొడుకా! (ఓ ధృతరాష్ట్రా); కాలంబు+అగుటయున్= ఆయుస్సు తీరటం చేత; నృపులకున్= రాజులకు; ఆలము= యుద్ధం; సమకూరెన్= ఏర్పడింది; మదిన్= మనస్సులో; దీనికిన్= (ఈ యుద్ధం దాపురించినందుకు); అడలకు(ము)= దుఃఖించవద్దు; నీవు+ఆలోకింపఁగన్, వలసినన్= నీవు చూడాలనే అవసరం ఉంటే (నీవు చూడాలని కోరితే); ఏన్= నేను; (నీకు) లోనికిన్= లోపలికి; దివ్య, దృష్టిన్= భగవత్ కృపవలన ఏర్పడే చూపు; ఇచ్చెదన్= ఇస్తాను.

తాత్పర్యం: 'కుమారా! పోయేకాలం దగ్గరపడి రాజులకు యుద్ధం దాపురించింది. దీనికి నీవు విచారించకుము. ఆ యుద్ధాన్ని చూడాలని కోరికగా ఉంటే, నీకు దివ్యదృష్టినిస్తాను.'

విశేషం: 1. ధృతరాష్ట్రుడు వేదవ్యాస మహర్షి వలన అంబికకు జన్మించిన కొడుకు. అందుచే 'పుత్త్రా!' అనే సంబోధన. దివ్యదృష్టి: చర్మచక్షువులకు సాధ్యంకాని చూపు.

2. కాలంబగుట, కాలము తీరుట, కాలము మూడుట అనే ప్రయోగాలు గమనించదగినవి. ప్రాచీన భారతీయులలో ప్రబలిన విశ్వాసం - ఎవరికైనా భగవంతుడిచేత నిర్ణయించబడిన ఆయుర్దాయం ఉంటుంది. ఆ గడువు అయిపోగానే మరణం సంభవించటం తథ్యం. ఇంతమంది రాజులకు విధినిర్ణీతమైన ఆయుస్సు తీరింది కాబట్టి యుద్ధం సంప్రాప్తించింది. దీనికి దుఃఖించవలసిన అవసరం లేదని వేదవ్యాస మహర్షి ఊరడింపు. ధృతరాష్ట్రుడు పుట్టుకచే గ్రుడ్డివాడేగాన వేదవ్యాసమహర్షి అతడికి 'దివ్యదృష్టి'ని వరంగా అనుగ్రహిస్తానన్నాడు.

చ. అనుడు నతండు 'ఘోరముగ నన్నలుఁ దమ్ములుఁ బోరు క్రూరతం
గనుఁగొనఁజాల, నేను వినఁగా వలతుం; దదనుగ్రహంబు సే
సినఁ గడు లెస్స'యన్న ముని చిత్తమునం గరుణించి సంజయుం
బనిచె మహారణంబు పరిపాటిమెయిన్ సకలంబుఁ జెప్పఁగన్. 7

ప్రతిపదార్థం: అనుడున్= అని (వేదవ్యాసుడు) చెప్పిన పిదప; అతండు= (ధృతరాష్ట్రుడు); ఘోరముగన్= భయంకరంగా; అన్నలున్, తమ్ములున్= సోదరులు; పోరు= యుద్ధం చేయు; క్రూరతన్= చెడ్డతనమును; కనుఁగొనన్+చాలన్= చూడలేను; ఏను= నేను

(ధృతరాష్ట్రుడు); వినఁగాన్, వలతున్= విన కోరుతున్నాను; తత్+అనుగ్రహంబు+చేసినన్= ఆ దయ చూపితే; కడు, లెస్స= మిక్కిలి మంచిది; అన్నన్= అని చెప్పగా; ముని= ఋషి (వ్యాసుడు); చిత్తమునన్= మనస్సునందు; కరుణించి= దయకలిగి; మహా, రణంబు= గొప్ప యుద్ధం; పరిపాటి మెయిన్= సక్రమంగా; సకలంబున్= అంతా; చెప్పఁగన్= చెప్పటానికి; సంజయున్+పనిచెన్= సంజయుడిని నియమించాడు.

తాత్పర్యం: ఆ విధంగా వేదవ్యాస మహర్షి చెప్పిన పిదప, ధృతరాష్ట్రుడు ఈ రీతిగా బదులు పలికాడు: 'అన్నదమ్ములు చేసే ఘోర యుద్ధం నేను చూడలేను. వినగలను అంతే. నేను వినే ఏర్పాటు చేస్తే చాలు.' ఆ మాటలకు వేదవ్యాసుడు కరుణించి, యుద్ధ విషయాలను జరిగినవి జరిగినట్లుగా (యథాతథంగా) చెప్పుమని సంజయుడిని నియోగించాడు.

వ. ఇట్లు ధృతరాష్ట్రునకుం గయ్యంబు తెఱంగు వినిపింప నియోగించి యా సూతనందనునకు నా రెండు తెఱంగులవారి, దివారాత్ర ప్రవర్తనంబులు గనునట్లును, రహస్య ప్రకార భాషణంబులు వినునట్లును మనోవృత్తంబు లెఱుంగు నట్లునుంగా వరం బిచ్చి, యతి శీఘ్ర గమనంబు నొసంగి, భారత సమర ధరణిం దిరిగినను శస్త్రాస్త్రంబు లెవ్వియుం దాకకుండు నట్టి ప్రభావంబుఁ బ్రసాదించి, దివ్యుల యాలాపంబులు రూపంబులుం దలంపులుం దేటపడునట్టి మహనీయ బోధంబును గలుగ ననుగ్రహించి, యావైచిత్ర వీర్యు నాలోకించి 'యిది ప్రాప్తకాలంబై వచ్చిన భూప్రజాక్షయంబు; దీనికి వగవం బని లేదు 'ధర్మోజయ' తనుచు నిశ్చింతంబున నుండు; మేనును గురుపాండవుల కీర్తిఁ బ్రకటింపంగలవాఁడ' నని యతని నాశ్వాసించి సాత్యవతేయుండు వెండియు. 8

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ధృతరాష్ట్రునకున్; కయ్యంబు తెఱంగు= యుద్ధం జరిగే తీరు; వినిపింపన్; నియోగించి= ఏర్పాటు చేసి; ఆ సూతనందనునకున్= ఆ సూతుడి కొడుకుకు- (సంజయుడికి) ఆ రెండు తెఱంగులవారి= ఆ రెండు పక్షాలవారి (కురుపాండవుల యొక్క); దివా, రాత్ర, ప్రవర్తనంబులు= పగలు, రేయి జరిగే సంగతులు; కనునట్లును= చూచేట ట్లున్నూ; రహస్య, ప్రకార, భాషణంబులు= ఒరులకు తెలియరానట్లుగా జరిగే మాటలు; వినునట్లును; మనస్+వృత్తంబులు= మనస్సులోని తలపులు; ఎఱుంగునట్లును= తెలిసేటట్లున్నూ; వరంబు+ఇచ్చి= దైవబలముచే తీరే కోరిక= వరము; అతిలోకశక్తిని అనుగ్రహించి; అతి, శీఘ్ర, గమనంబును= మిక్కిలి వేగంగా పోగలశక్తిని ఒసంగి= ఇచ్చి; భారత, సమర, ధరణిన్+తిరిగినను= భారత యుద్ధభూమిలో సంచరించినప్పటికినీ; శస్త్ర+అస్త్రంబులు+ఎవ్వియున్= శస్త్రాలు అస్త్రాలు ఏవైనప్పటికినీ; (ఆయుధము లేవియు) తాకక+ఉండు+అట్టి; ప్రభావంబు= మహిమ; ప్రసాదించి= ఇచ్చి; దివ్యుల+ఆలాపంబులు= వేల్పుల మాటలు; రూపంబులున్+తలంపులున్= ఆకారాలు, భావాలు; తేటపడు+అట్టి= తెలిసేటటువంటి; మహనీయ, బోధంబును= గొప్ప జ్ఞానాన్ని; కలుగన్+అనుగ్రహించి; ఆ+వైచిత్ర వీర్యున్= ఆ విచిత్ర వీర్యుడి కొడుకైన (ధృతరాష్ట్రుడిని); ఆలోకించి= చూచి; ఇది= (ఈ యుద్ధం); ప్రాప్తకాలంబు+ఐ= కాలం వలన ఏర్పడినట్టిదై; వచ్చిన, భూ, ప్రజా, క్షయంబు= భూమిమీది ప్రజల వినాశం; దీనికిన్ (ఈ యుద్ధానికి); వగవన్+పనిలేదు= దుఃఖించవలసిన అవసరం లేదు; ధర్మో జయతు= ధర్మః జయతు= ధర్మం జయించుగాక!; అనుచున్; నిశ్చింతంబునన్+ఉండుము= చింత లేకుండా ఉండుము; ఏనును= నేనుకూడా (వ్యాసుడు); కురు, పాండవుల కీర్తిన్= కౌరవుల యొక్కయు పాండవుల యొక్కయు కీర్తిని; ప్రకటింపన్+కలవాఁడను= తెలియచేయగలను; అని, అతనిన్= ధృతరాష్ట్రుడిని; ఆశ్వాసించి= ఓదార్చి; సాత్యవతేయుండు= సత్యవతి కొడుకు (వ్యాసుడు); వెండియున్= మరియు.

తాత్పర్యం: వ్యాసుడు ఈ విధంగా ధృతరాష్ట్రుడికి, యుద్ధ విశేషాలు వినిపించే ఏర్పాటు చేశాడు. అంతేకాక-వార్తాహరుడైన సంజయుడికి కొన్ని అతిలోకశక్తులు ప్రసాదించాడు. సంజయుడు యథేచ్ఛగా యుద్ధభూమిలో అతి

వేగంగా విహరించవచ్చును. అతడిని ఏ ఆయుధాలు తాకజాలవు. అతడు ఇతరుల మనస్సులను పసిగట్టగలడు. వేల్పుల రూపాలు చూడగలడు; మాటలు వినగలడు. ఇట్టి వరాలను అనుగ్రహించి వ్యాసమహర్షి ధృతరాష్ట్రుడిని చూచి, 'ఈ యుద్ధం విధివిలాసం వలన వచ్చింది. భూభారం తగ్గగలదు. దీనికోసం దుఃఖింపవద్దు' అని ఊరడించి 'ధర్మం జయించుగాక! చింత వీడి ప్రశాంతంగా ఉండుము. నేను కురుపాండవుల కీర్తి ప్రకటించగలను' అని చెప్పి మరియు... (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: (1) ప్రాచీన భారతీయ సాహిత్యంలో సంస్కృతిలో పేర్కొనబడిన విశేషం - వరం. వేల్పులు మహనీయులు వరం అనుగ్రహించటం కద్దు. అమానుషశక్తివలన, కోరికలు ఈడేరటం, అతిలోక సన్నివేశాలు జరగటం వరంలోని ముఖ్యమైన అంశాలు. అట్టిదే దివ్య దృష్టి.

(2) మహాభారతంలో యుద్ధ వృత్తాంతాలు సేకరించిన వాడు సంజయుడు. శాంతి సమయంలోనైనా వార్తా సంకలనం ఒక ప్రత్యేక ప్రజ్ఞ. ఇక యుద్ధవార్తా సంకలనం బహుళ ప్రమాదభూయిష్ఠం. దానికి కావలసిన విశేష ప్రజ్ఞలు ఇందు ఉగ్గడించబడ్డాయి.

(3) సమకాలీనుడైన వ్యాసుడు తాను కురుపాండవ చరిత్ర వ్రాయగలనని ఇందులో సూచించాడు.

క. ' మొగులులు లేకయు నుఱుములు । గగనక్షోభంబు సేసెఁ; గరి హయ తతిఁ బె
ల్లుగ నశ్రు లురలఁ జొచ్చెను; । మృగములు పక్షులను, బసులు మృగముల నీనెన్. 9

ప్రతిపదార్థం: మొగుళులు, లేకయున్= మబ్బులు లేకుండానే; ఉఱుములు; గగన, క్షోభంబు= ఆకాశంలో గందరగోళం; చేసెన్= చేశాయి; కరి, హయతతిన్= ఏనుగులయందును, గుఱ్ఱాలయందును; పెల్లుగన్= మిక్కుటంగా; అశ్రులు= కన్నీళ్ళు; ఉరలన్+చొచ్చెను= కారసాగాయి; మృగములు= జంతువులు; పక్షులను; పసులు= ఆవులు; మృగములన్= జంతువులను; ఈనెన్= కన్నాయి.

తాత్పర్యం: మబ్బులు లేకుండానే ఆకాశంలో ఉఱుములు సంక్షోభం రేకెత్తించాయి. ఏనుగులూ, గుఱ్ఱాలూ మిక్కుటంగా కన్నీరు కార్చాయి. జంతువులు పక్షులను కన్నాయి. ఆవులు జంతువులను కన్నాయి.

విశేషం: భారతంలో పలు తావులలో ప్రకృతి వైపరీత్యాలు అపశకునాలుగా ప్రజాక్షయ సూచనలుగా వర్ణించబడ్డాయి.

క. నలువురు నేవురు బిడ్డలు । గలిగెద రొక్కొక్క వనిత గర్భంబున; వా
రలు పుట్టినపుడ యాడుచుఁ । గలకల నవ్వుచుఁ జెలంగఁ గనియెద మెందున్. 10

ప్రతిపదార్థం: నలువురున్= నల్గురు; ఏవురు= అయిదుగురు; బిడ్డలు= సంతానం; ఒక్కొక్క; వనిత; గర్భంబునన్= ఒక్కొక్క స్త్రీ కడుపునుండి; కలిగెదరు= పుడతారు; వారలు= (ఆ బిడ్డలు) పుట్టిన+అపుడు+అ= పుట్టినపుడే; ఆడుచున్= ఆటలాడుతూ; కలకల నవ్వుచున్= పకపక నవ్వుతూ; చెలంగన్= ఒప్పుగా; ఎందున్= ఎచ్చటనైనా; కనియెదము= చూస్తాము.

తాత్పర్యం: ఒకే స్త్రీ గర్భం నుండి ఒకేసారి నలుగురైదుగురు బిడ్డలు పుట్టుతారు. వారు పుట్టగానే ఆడతారు, కలకల నవ్వుతారు. అట్టి అద్భుతాలు మనం చూడగలం.

తే. అర్కు నుదయాస్తమయములయందుఁ గృష్ణ । కాంతి ఘోరకబంధంబు గప్పఁ జొచ్చెఁ;
నిందు లాంఛన స్థితి తలక్రిందుగాఁగఁ । దోఁచుచున్నది ప్రజ యెల్లఁ ద్రుంగకున్నె. 11

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అర్కు+ఉదయ+అస్తమయముల అందున్= సూర్యుడు ఉదయించేటప్పుడు; ప్రొద్దుగ్రుంకేవేళలలో; కృష్ణ, కాంతి= నల్లని కాంతిచేత; ఘోర= భయంకరమైన; కబంధంబు= మబ్బు (కబంధ శబ్దానికి మొండెం, మబ్బు, సముద్రం అనే అర్థాలున్నాయి; ఇక్కడ మబ్బు అనే అర్థం స్వీకరించటం లెస్స); కప్పన్+చొచ్చెన్= ముసురుకొనసాగింది; ఇందు లాంఛన స్థితి= చంద్రుడిలోని మచ్చ యొక్క ఉనికి; తల, క్రిందు, కాఁగన్+తోచుచున్నది= తలక్రిందుగా కనపడుతున్నది; ప్రజ+ఎల్లన్= జనమంతా; త్రుంగక+ ఉన్నె= నాశనం కాదా!

తాత్పర్యం: ప్రొద్దుపొడుపు వేళ ప్రొద్దుగ్రుంకేటప్పుడు నల్లని కాంతితో భయంకరమైన మబ్బులు క్రమ్ముతున్నాయి. చంద్రుడిలోని మచ్చ తలక్రిందులుగా కన్పిస్తున్నది. ఇది ప్రజాక్షయ సూచన కాదా!

విశేషం: రామాయణంలో కబంధుడు - తలలేని మొండెము చేతులుగల రాక్షసుడు. ఇచ్చట వ్యాపించిన చీకట్లు గూడ అట్టివే.

వ. **విశేషించియుం గౌరవ నికేతనంబులఁ గేతనంబులఁ బొగ లెగయుటయు, నాయుధంబులు మండుటయు, నివి మొదలుగా ననేక దుర్నిమిత్తంబులు పుట్టుచున్నయవి; కులక్షయంబును నానా నరేంద్ర నాశంబును నగు; నుపేక్షింపం దగదు; దుష్పథవర్తులగు దుర్యోధనాది కుమారుల వారించి నీ తమ్మునిపా లతని కొడుకుల కొసంగి శాంతి సేయుట మేలు; మము బోంట్ల మనంబులకుం బ్రియంబు గాని యీ రాజ్యంబు నీ కేటి?' కనిన విని యమ్మనుజేంద్రుం డమ్మునీంద్రున కిట్లనియె:** **12**

ప్రతిపదార్థం: విశేషించియున్= మరియును; కౌరవనికేతంబులన్= కౌరవులయొక్క గృహాలలో; కేతనంబులన్= జెండాలలో; పొగలు ఎగయుటయున్= పొగలు వ్యాపించటమూ; ఆయుధంబులు మండుటయున్= కత్తులు మున్నగు యుద్ధసాధనాలు మండటం; ఇవి మొదలుగాన్= ఇటువంటివి; అనేక+దుస్+నిమిత్తంబులు= పెక్కు చెడు శకునాలు; పుట్టుచున్నయవి= కలుగు తున్నవి; కుల, క్షయంబును= వంశ నాశనం; నానా నర+ఇంద్ర, నాశంబును= పలువురు మేటి రాజుల; వినాశం, అగున్= జరుగు తుంది; ఉపేక్షింపన్+తగదు= చూస్తూ ఊరకుండరాదు; దుష్పథ వర్తులు+అగు= చెడుమార్గంలో నడుస్తున్న వారైన; దుర్యోధన+ఆది, కుమారులన్= దుర్యోధనుడు మొదలైన కొడుకులను; వారించి= అడ్డగించి, నీ, తమ్ముని, పాలు= నీ తమ్ముడికి చెందవలసిన (రాజ్య) భాగం; అతని కొడుకులకు= అతడి పుత్రులకు; ఒసంగి= ఇచ్చి; శాంతి+చేయుట= సంధి చేయటం; మేలు= మంచిది; మముబోంట్ల= మావంటివారి; మనంబులకున్= మనస్సులకు; ప్రియంబు కాని= ఇష్టంకాని; ఈ రాజ్యంబు; నీకున్+ఏటికిన్+అనినన్= నీకు ఎందుకు అని అనగా; విని= ఆలకించి; ఆ+మనుజ+ఇంద్రుండు= ఆ రాజు (ధృతరాష్ట్రుడు); ఆ+ముని+ఇంద్రునకున్= మునులలో గొప్పవాడైన ఆతడితో (వ్యాసుడితో); ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'కౌరవుల ఇళ్ళ నుండి జెండాల నుండి పొగలు రేగుతున్నాయి. ఆయుధాలు మండుతున్నాయి. ఇట్టి అపశకునాలు ఎన్నో కన్పిస్తున్నాయి. స్వకులస్థులు, పెక్కుమంది రాజులు మరణించటం చూస్తూ ఊరుకోదగింది కాదు. చెడుమార్గంలో నడుస్తున్న దుర్యోధనాది కురుకుమారులను వారించి నీ తమ్ముని పాలు అతని కొడుకుల కిచ్చి శాంతిచేయడం మంచిది. మావంటి వారికి ఇష్టం కాని ఈ రాజ్యం నీకు ఎందుకు?' అని ధృతరాష్ట్రుడితో వ్యాసమహర్షి చెప్పాడు. ధృతరాష్ట్రుడు వ్యాసుడితో ఈ విధంగా సమాధానం చెప్పాడు:

చ. **' హితమును ధర్మముం దలఁచి యిమ్మెయిఁ జెప్పితి రిట్లు మున్ను; నా**
సుతుల నయంబుమైఁ దఱిమి చూచితి; వారలఁ బంపు సేయ నేఁ
జతురుఁడఁ గాను; బ్రాభవము సాలదు; నాదెసఁ దప్పులేమి మీ
మతిఁ దలపోసి యీ పలుకు మానుఁడు పాకము దప్పెఁ గార్యముల్.' **13**

ప్రతిపదార్థం: హితమును= నాకు మేలైనట్టి దానినీ; ధర్మమున్= చేయదగిన కర్తవ్యాన్నీ; తలఁచి= ఆలోచించి; ఈ+మెయిన్= ఈరీతిగా; చెప్పితిరి= చెప్పారు; ఇట్లు= ఈ విధంగా; మున్ను= లోగడ; నా సుతులన్= నా కొడుకులను; నయంబుమైన్= సాత్త్విక పద్ధతిలో; తఱిమి చూచితిన్= లోతుగా నచ్చచెప్పజూచాను; వారలన్= నా కొడుకులను; పంపు+చేయన్= ఆజ్ఞాపించటానికి (లోబరచుకొనటానికి); నేన్+చతురుఁడన్+కాను= నేను నేర్పరిని కాను; ప్రాభవము+చాలదు= (వారిపై) (నాకు) అధికారం సరిపోవునంతగా లేదు; నా దెసన్= నా యెడ; తప్పు లేమి= దోషం లేకపోవటం; మీ+మతిన్= మీ బుద్ధియందు; తలపోసి= ఆలోచించి; ఈ+పలుకు+మానుఁడు= ఈ మాటలు (ఈ హితోపదేశం) చేయటం మానండి (మీ ఈ బహువచన ప్రయోగం - వ్యాసునియెడ ధృతరాష్ట్రుడికి గల గౌరవాన్ని సూచిస్తుంది); కార్యముల్= పనులు (కర్తవ్యాలు); పాకము+తప్పెన్= పరిపక్వత కోలుపోయాయి అనగా ఇప్పుడు చేయిమించి పోయిందని భావం.

తాత్పర్యం: 'ఓ వ్యాసమహర్షీ! మీరు నామీదగల ప్రేమతో పూర్వం కూడా ఈ విధంగా నాకు హితోపదేశం చేశారు. కర్తవ్యం బోధించారు. ఇదివరలో నేను కూడా నా కొడుకులకు బుద్ధి చెప్పాలని ఎంతో ప్రయత్నించాను. వారు నా అదుపు తప్పిపోయారు. వారిని ఆజ్ఞాపించగల శక్తిసామర్థ్యాలు నాకు లేవు. నా యెడ తప్పులేదని మీరు గ్రహించ ప్రార్థన. దయచేసి నాకు హితవు చెప్పవద్దు. చెప్పి లాభం లేదు. నేను ఇప్పుడు ఇంక చేయగలిగింది ఏమీ లేదని తమకు మనవి చేస్తున్నాను.'

విశేషం: 'పాకము తప్పె కార్యముల్' చక్కని చిక్కని పదగుంఫనం. శాంతి చేకూర్చటం - మంచి పనే. కానీ అది జరిగే పనికాదు అని ధృతరాష్ట్రుడు వ్యాసుడితో అన్నాడు. ధృతరాష్ట్రుడి శీలానుశీలనానికి ఈ పద్యం తోడ్పడుతుంది. ధృతరాష్ట్రుడు తెలిసిన మూర్ఖుడు. మహాభారతంలోని విచిత్రపాత్ర.

వ. అనిన విని పరాశరసూనుండది యట్లుండ నిమ్మింక నేనేమియుం జెప్పవలయు నది గలదే?' యని పలికిన నాంబికేయుండు గయ్యంబున గెలుపుఁ దెలుపు నిమిత్తంబు లడిగిన నమ్మునివరేణ్యుండు వహ్నులు హోమకాలంబునం బుణ్యగంధములతోఁ బ్రదక్షిణార్చు లగుటయు భేరీ ప్రముఖంబులు గంభీర ఘోషంబు లగుటయు వాయువు లనుకూల మృదు మనోహర ప్రచారంబు లగుటయు నివి మొదలుగాఁ గొన్ని శుభ సూచకంబులు నిర్దేశించి, 'కొంచెంబు పెద్ద యన లేదు; సమరంబున జయంబు దైవాధీనంబు గావునం బెద్దలు పెనఁకువ లొప్పవని చెప్పుదు; రేను బోయివచ్చెద నని చెప్పి సముచిత ప్రకారంబున నంతర్ధానంబు సేసెఁ; దదనంతరంబ యక్కౌరవేంద్రుండు గొండొకసేపు చింతించి నిట్టూర్పు నిగుడించి సంజయున కిట్లనియె. **14**

ప్రతిపదార్థం: అనినన్ విని= అని (ధృతరాష్ట్రుడు) చెప్పగా విని; పరాశరసూనుండు= పరాశరుడి కొడుకు (వ్యాసుడు); అది+అట్లు+ఉండనిమ్ము= ఆ విషయం వదలిపెట్టుము; ఇంకన్= ఇకమీద; నేను+ఏమియున్+చెప్పవలయునది+కలదు+ఏ?= నేను చెప్పవలసింది ఏమైనా ఉన్నదా?; అని+పలికినన్= అని చెప్పగా; ఆంబికేయుండు= అంబిక కొడుకైన ధృతరాష్ట్రుడు; కయ్యంబునన్= యుద్ధంలో; గెలుపు+తెలుపు+నిమిత్తంబులు= విజయాన్ని సూచించే శకునాలు; అడిగినన్= ప్రశ్నించగా; ఆ+ముని+వరేణ్యుండు= మునులలో శ్రేష్ఠుడైన వాడు- వ్యాసుడు; వహ్నులు= అగ్నులు; హోమ+కాలంబునన్= హోమం చేసే సమయంలో; పుణ్య+గంధంబులతోన్= మంచి వాసనలతో; దక్షిణ+అర్చులు+అగుటయున్= కుడివైపునకు వ్యాపించే మంటలుగలవి కావటం; భేరీ ప్రముఖంబులు=భేరి మున్నగు యుద్ధ వాద్యాలు; గంభీర+ఘోషంబులు+అగుటయున్= ప్రస్ఫుటమైన ధ్వనులతో కూడినవి కావటం; వాయువులు= గాలులు; అనుకూల+మృదు+మనోహర+ప్రచారంబులు+అగుటయున్= వాలుగా మెల్లగా చల్లగా వీస్తూ ఉండటం. ఇవి+మొదలుగాన్= ఇటువంటివి; కొన్ని శుభసూచకంబులు= కొన్ని మంచి శకునాలను; నిర్దేశించి= ప్రత్యేకంగా చెప్పి; కొంచెంబు పెద్ద+అనన్ లేదు=

(సంఖ్యలో) కొంచెం ఎక్కువ అనే తేడా ముఖ్యం కాదు; సమరంబునన్= యుద్ధంలో; జయంబు= గెలుపు; దైవ+అధీనంబు= భగవంతుడి చేతిలో ఉన్నట్టిది; కావునన్= కాబట్టి; పెద్దలు= వృద్ధులు (జ్ఞానులు); పెనఁకువలు= కలహాలు; ఒప్పవు+అని= మంచివి కావని; చెప్పుదురు= అంటారు; ఏను+పోయివచ్చెదన్= నేను వెళ్ళుతున్నాను; అని+చెప్పి= అని వచించి; సముచిత+ప్రకారంబునన్= ఉచిత రీతిని; అంతర్ధానంబు+చేసెన్= మాయమయ్యాడు; తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట; ఆ కౌరవ+ఇంద్రుండు= కౌరవులలో శ్రేష్ఠుడు= ధృతరాష్ట్రుడు; కొండొకసేపు= కొంత కాలం; చింతించి= ఆలోచించి; నిట్టూర్పు నిగుడించి= దీర్ఘ నిశ్శ్వాసంచేసి; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ విధంగా ధృతరాష్ట్రుడు చెప్పగా వ్యాసుడు 'అది అట్లా ఉంచుము, ఇంక నేను చెప్పవలసింది ఏమైనా ఉన్నదా?' అని అడిగాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు 'యుద్ధంలో గెలుపును సూచించే శకునాలను తెలుపు' మని అడిగాడు. వ్యాసుడు చెప్పిన మాటలు: 'హోమకాలంలో అగ్నులు పుణ్యపరిమళాలు వెదచల్లుతూ సవ్యప్రదక్షిణంగా చక్కగా వెలుగొందుతాయి. వాలుగాలులు మనోహరంగా వీస్తాయి. భేరీలవంటి యుద్ధ వాద్యాల నుండి చక్కని చిక్కని ధ్వనులు వినిపిస్తాయి' అని చెప్పాడు. 'అంతేగాక- యుద్ధంలో విజయం సంఖ్యాబలం మీదకాక దైవానుగ్రహం మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి కలహం మంచిది కాదని పెద్దల ప్రవచనం' అని చెప్పి అతడు అంతర్ధానమైనాడు. ధృతరాష్ట్రుడు కొంతసేపు చింతిస్తూ వేడి నిట్టూర్పులు విడిచి సంజయుడితో ఈ విధంగా అన్నాడు:

ఉ. భూమికిఁ గాఁగఁ బ్రాణముల పోక దలంపక రౌద్ర ఘోర సం
గ్రామము సేయుచుండుదురు రాజులు దొల్లియు; నెంత దీపొకో
భూమి; మునీంద్రసంగతి సుబుద్ధము నీకు జగంబు; నాకు నీ
భూమి తెఱంగు సెప్పుము ప్రబోధ నిరూఢముగా సమస్తమున్. 15

ప్రతిపదార్థం: తొల్లియున్= పూర్వకాలంలోకూడా; రాజులు= ప్రభువులు; భూమికిన్+కాఁగన్= భూమిని సంపాదించటం కోసమై; ప్రాణముల+పోక+తలంపక= ప్రాణాలు పోతాయి అనే జంకు లేకుండా; రౌద్ర+ఘోర+సంగ్రామమున్= భయంకరమూ, దారుణమూ అయిన యుద్ధాన్ని; చేయుచుండుదురు= సలుపుతూ ఉంటారు; భూమి= పుడమి; ఎంత+తీపి+ఒకో!= ఎంత ఇష్టమైనదో; ముని+ఇంద్ర+సంగతిన్= శ్రేష్ఠులైన ఋషులతో నీకుగల పరిచయం వలన; జగంబు= ప్రపంచం; నీకున్= నీకు; సుబుద్ధము= బాగుగా తెలిసినటువంటిది; నాకున్= నాకు (ఇది ధృతరాష్ట్రుడు చెప్పుతున్న మాట); ఈ+భూమి+తెఱంగు= భూమి తీరుతెన్నులు; సమస్తమున్= సర్వమును; ప్రబోధ+నిరూఢముగాన్= తేటతెల్లమయ్యేట్లుగా; చెప్పుము= వివరించుము.

తాత్పర్యం: 'ఓ సంజయా! రాజులు భూమి కోసమై ప్రాణాలకు తెగించి, భయంకరమైన పోరాటాలు చేస్తారు. ఇది పూర్వకాలంనుండి సాగుతున్న జరుగుతున్న విషయం. భూమి అంటే రాజులకు ఎంత తీపియో కదా! నీకు ఋషివరేణ్యులతో గాఢపరిచయం ఉంది. నీ కీ జగత్తులోని విశేషాలన్నీ తెలుసు. కాబట్టి నాకు ఈ భూమి విషయాలు అన్నీ తేటతెల్లంగా వివరించి చెప్పుము.

విశేషం: (1) సంజయుడు ధృతరాచి్రష్టుడికి భూమి విశేషాల వివరాలు చెప్పుతాడు. అనగా సంస్కృత మహాభారత రచనా కాలం నాటి భూమిని గూర్చిన పరిజ్ఞానం మనకు తెలుస్తుంది. పందొమ్మిదవ శతాబ్దినాటికిగాని- మానవులకు - భూ పరిపూర్ణ పరిజ్ఞానం లభించలేదు. సంస్కృత మహాభారత రచనా కాలం నాటికే భారతీయులకు ఏర్పడిన భూ పరిజ్ఞానం ఎన్నదగినది. ఆనాడు ఇతర దేశీయులకు అంతటి పరిజ్ఞానం లేదనే చెప్పవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(2) ఇక రెండవ అంశం. మహాభారత సంగ్రామం జరుగబోతున్నది. అది అవశ్యం. తత్క్షణం వినవలసినది కదా! పానకంలో పుడకవలె ఈ భూగోళ వర్ణనం ఏమిటి? అని పలువురు చేసే విమర్శ సమంజసమైనదే. అయితే మహాభారతం సమకాలీన విజ్ఞాన సర్వస్వంగా తీర్చిదిద్దాలనే రచయిత ఆకాంక్షకు ఈ ఘట్టం ఒక ఉదాహరణ. కథకు తాత్కాలికమైన అంతరాయం కలిగిన మాట నిజమే కాని మహాభారతానికి ఇది విజ్ఞాన పుష్టి కలిగించింది.

వ. అనిన విని సంజయుం డతని కిట్లను 'నా యెఱింగి నంతయు నెఱింగించెద భూతత్త్వప్రకారం బవధరింపుము.' 16

ప్రతిపదార్థం: అనినన్+విని= అని ధృతరాష్ట్రుడు వేసిన ప్రశ్న ఆలకించి; సంజయుండు; అతనికిన్+ఇట్లు+అనున్= ధృతరాష్ట్రుడికి ఈ విధంగా చెప్పాడు; నా+ఎఱింగిన+అంతయున్= నాకు తెలిసిన మేరకు; భూ+తత్త్వ+ప్రకారంబు= భూమికి సంబంధించిన స్వభావాల తెరగు; అవధరింపుము= శ్రద్ధగా వినుము.

తాత్పర్యం: ఆ విధంగా ధృతరాష్ట్రుడు వేసిన ప్రశ్న విని, సంజయుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు. 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! నాకు తెలిసిన మేరకు నీకు భూగోళ విషయాల నన్నీ తేటతెల్లంగా వివరించి చెప్పగలను. శ్రద్ధగా వినుము.'

విశేషం: (1) భూమి సువిశాలమైనది. మహాభారత రచనా కాలంలో భూగోళపరిజ్ఞానం తక్కువ. అయితే ప్రజలలో ఆసక్తి ఎక్కువ అని ధృతరాష్ట్రుని ప్రశ్న వలన తెలుస్తున్నది. కౌరవులు పాండవులు భూమి కోసమే యుద్ధం చేస్తున్నారు. నిజమే. అయితే వారు చేరింది కురుక్షేత్రంలో. వారి రాజ్య విస్తీర్ణం - భూగోళంతో పోల్చిచూస్తే - అత్యల్ప భాగమే కదా. ఆ విషయం ధృతరాష్ట్రునకు - సంజయుడికీ కూడా తెలుసు. కురుక్షేత్రంలో యుద్ధం చేసింది ఆనాడు కౌరవ పాండవ సేనలు మాత్రమే కాదు. భూగోళంలోని పలు ప్రదేశాల నుండి సేనలు అక్కడకు చేరాయి. ఈ ఘట్టంవలన రెండు విషయాలు తెలుస్తున్నవి. (1) ఆనాటి ప్రజలలో భూగోళ విజ్ఞానంపై గల జిజ్ఞాస. (2) ఆనాటి విజ్ఞులకు భూగోళ విషయకంగా గల పరిమిత పరిజ్ఞానం.

సంజయుఁడు ధృతరాష్ట్రునకు భూపరిమాణంబు సెప్పుట (సం.6-5-9)

తే. ' అధిప! నానా ప్రకార చరాచరంబు । లింద వేర్వేఱ జనియించు, నింద పెరుఁగుఁ,
బిదప నింద యడంగు; నీ పృథ్వి దాన । సకలమునకుఁ బరాయణస్థాన మరయ. 17

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ఓ ధృతరాష్ట్ర!); ఇంద= ఇందే (ఈ భూమియందే); నానా+ప్రకార+చర+అచరంబులు= పెక్కు తెరగులైనవి- కదిలేవి, కదలనట్టివి; వేర్+వేఱ= వేరువేరుగా; జనియించున్= పుట్టుతాయి; ఇందున్+అ= ఈ భూమిమీదనే; పెరుఁగున్= అభివృద్ధి చెందుతున్నవి; పిదపన్= తరువాత; ఇంద= ఈ భూమియందే; అడంగున్= నశిస్తున్నవి; అరయన్= విచారించగా ఈ+పృథ్వి= ఈ భూమి; సకలమునకున్= అన్నింటికిని; పరాయణ+స్థానము= ఆధారమైన చోటు.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఈ భూమిమీదనే చరాచరాలన్నీ పుట్టుతూ ఉంటాయి, పెరుగుతూ ఉంటాయి, నశిస్తూ ఉంటాయి. ఈ భూమియే అన్నిటికీ ఆధారమైన చోటు.

విశేషం: భూమిమీది భూతకోటిని పూర్వీకులు (1) చరములు (2) అచరము లని విభాగించి ఉన్నారు. చరములు ప్రాణికోటి మనుష్యులు, జంతువులు మున్నగు భూతాలు. అచరములు - కొండలు చెట్లు నదులు - మొదలైనవి అచరాలుగానే పరిగణించబడ్డాయి.

వ. అదియునుంగాక వినుమాకాశంబునకు గుణంబు శబ్దంబు, వాయువునకు శబ్ద స్పర్శంబులును, దేజంబునకు శబ్ద స్పర్శ రూపంబులును, నప్పులకు శబ్ద స్పర్శరూప రసంబులును గుణంబులు; పృథివికి శబ్ద స్పర్శ రూప రసగంధాత్మకం బైన గుణసముదయం బంతయుం గలదు గావున నిమ్మహా భూతంబు లేనింటిలోనం బృథివి యెక్కుడు; దీని యున్న విధంబు వివరించెద నాకర్ణింపుము. 18

ప్రతిపదార్థం: అదియున్+కాక= అంత మాత్రమేకాక; వినుము; ఆకాశంబునకున్= నింగికి; గుణంబు= లక్షణం; శబ్దంబు= నాదం; వాయువునకున్= గాలికి; శబ్ద, స్పర్శంబులును= నాదం మరియును తాకుడు; తేజంబునకున్= ప్రకాశానికి; శబ్ద, స్పర్శ, రూపంబులును= నాదం, తాకుడు, ఆకారమున్నూ; గుణంబులు= లక్షణాలు; అప్పులకున్= నీళ్ళకు; శబ్ద స్పర్శరూపరసంబులును= నాదం, తాకుడు, ఆకారము, ద్రవం, గుణంబులు= లక్షణాలు; పృథివికిన్= భూమికి; శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ+ ఆత్మకంబు+ అయిన= నాదం, తాకుడు, ఆకారం, ద్రవం, వాసనలతో కూడిన; గుణ, సముదయంబు+ అంతయున్= లక్షణాల సముదాయం అంతా; కలదు= ఉన్నది; కావునన్= కాబట్టి; ఈ+మహా+భూతంబులు+ఏనింటిలోనన్= ఈ పంచభూతాలలో; పృథివి= భూమి; ఎక్కుడు= అధికమైనది; దీని+ఉన్న+విధంబు= ఈ భూమి యొక్క యదార్థమైన తెరగు; వివరించెదన్= తెల్లముగా చెప్పగలను; ఆకర్ణింపుము= ఆలకించుము.

తాత్పర్యం: అంతేకాక ఆకాశానికి లక్షణం శబ్దం; వాయువునకు లక్షణాలు రెండు. అవి- శబ్దం తాకుడు; తేజానికి లక్షణాలు శబ్ద స్పర్శ రూపాలు; నీటికి లక్షణాలు శబ్దస్పర్శరూపాలేకాక ద్రవత్వంగూడ. భూమికి శబ్దస్పర్శరూప రసాలతోపాటు వాసన గూడ ఉన్నది. అనగా పంచభూతాల లక్షణాలు అన్నీ భూమికి ఉన్నాయి. అందుచేత భూతాలలో పంచభూతాలు ఎన్నదగినవి. పంచభూతాలలో భూమి ఎన్నదగినది. గొప్పది.

సీ. ధాత్రీశ! మేరువు దక్షిణంబున సుద। ర్శన మను నభిధానమునఁ బ్రభూత
విస్తార మై రెండువేలు నేనూఱు యో। జనముల పొడవునై సరస మధుర
విపుల శాశ్వత ఫలవితతి సమేతమై। యొక్క జంబూతరు వొప్పియుండు
దాని పండులు మహీస్థలి మహారవముగ। ననిశంబుఁ బడి రాలి యవియుచుండు

ఆ. వానిరసము పొంగి వాహినీ మూర్తి న। న్నగమునకుఁ బ్రదక్షిణంబు గాఁగ
నొరసికొనుచుఁ దిరిగి యుత్తరకురు భూము। లందుఁ జొచ్చి పాఱు నంబునిధికి. 19

ప్రతిపదార్థం: ధాత్రీ+ఈశ!= ఓ రాజా!; మేరువు= మేరువు అనే పేరుగల పర్వతానికి; దక్షిణంబునన్= దక్షిణ దిక్కున; సుదర్శనము+అను+అభిధానమునన్= సుదర్శనం అనే పేరుతో; ప్రభూత+విస్తారము+ఐ= మిక్కిలి నిడివి కలిగినదై రెండువేల, యేనూఱు, యోజనముల; పొడవును+ఐ= రెండువేల అయిదు నూర్ల ఆమడల పొడవు గలిగిందై; సరస+మధుర+ విపుల+శాశ్వత+ఫల+వితతి+సమేతము+ఐ= తియ్యని ద్రవాలతోనూ; ఎల్లప్పుడు ఉండే పెక్కు పండ్ల సముదాయంతో కూడి ఉండే; ఒక్క+జంబూ+తరువు= ఒక నేరేడు చెట్టు; ఒప్పి+ఉండున్= వర్ధిల్లుతుంటుంది; దాని+పండులు= ఆ (నేరేడు) చెట్టు పండ్లు; మహీ+స్థలిన్= భూభాగంమీద; మహా+రవమున్= పెద్ద ధ్వనితో; అనిశంబున్= ఎల్లప్పుడును; పడి+రాలి+అవియుచున్+ ఉండున్= క్రిందపడి చెల్లాచెదరై పగిలిపోతూ ఉంటాయి; వాని+రసము+పొంగి= ఆ పండ్ల ద్రవం పొంగిపోయి; వాహినీ+మూర్తిన్= ఏరు ఆకారంలో; ఆ+నగమునకున్= ఆ చెట్టుకు; ప్రదక్షిణముగన్= కుడినుండి ఎడమ వైపునకు చుట్టు దిరిగి; ఒరసి కొనుచున్= రాసుకొంటూ; తిరిగి= (మలుపు) తిరిగి; ఉత్తర+కురు+భూములందున్= కురుభూమికి ఉత్తరంగా ఉన్న ప్రదేశాలలో; చొచ్చి= ప్రవేశించి; అంబునిధికిన్= సముద్రంలో చేరేటట్లు; పాఱున్= ప్రవహిస్తుంది.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! మేరుపర్వతానికి దక్షిణంగా 'సుదర్శనం' అనే పేరుగల పెద్ద ప్రదేశం ఉన్నది. అది మిక్కిలి విస్తీర్ణం కలది. దాని పొడవు రెండు వేల ఏబది నూర్ల యోజనాలు. అందులో ఒక జంబూ వృక్షం

(నేరేడు చెట్టు) ఉన్నది. ఆ చెట్టు నుండి పండ్లు పెద్ద చప్పుడుతో నేలమీదపడి విచ్చుతాయి. ఆ పండ్ల రసం పెద్ద ఏరుగా తయారయి ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణం చేసి, పొంగి పొరలి ఉత్తర కురుభూముల గుండా ప్రవహించి తుదకు సముద్రాన్ని చేరుకుంటుంది.

విశేషం: 1. యోజనము అనగా సుమారు ఎనిమిది మైళ్ళు అని నేటి పండితుల అంచనా.

2. "భరత వర్షే భరతఖండే మేరోర్దక్షిణ దిగ్భాగే జంబూద్వీపే'' ఇది సంకల్పంలోని భాగం. మేరు పర్వతం - ఉత్తర ధ్రువ ప్రాంతంలోనిది. సూర్యచంద్రాది గ్రహాలు మేరువుచుట్టూ ప్రదక్షిణం చేస్తాయని వర్ణన. అనగా ప్రాచీన భారతీయులకు ఉత్తర ధ్రువప్రాంతం తెలిసినట్లే.

వ. జంబూనది యనం బరఁగిన యా తరంగిణి నీరు సోఁకిన చోటెల్లను సువర్ణం బగుటం జేసి కనకంబునకు జాంబూనదం బను నామంబునుం గలిగెఁ; దదీయ జలపానంబు సేసిన మానవులకు ముదిమియుం దెవులును దప్పియు లే వని చెప్పుదు; రయ్యేటి పడమటం బెరిఁగి పఱపు గలిగి శరనిధిచందంబున జంబూషండంబు గాఱుకొనుచుండు; నింతటికిం గారణంబయిన యాజంబూవృక్షంబు పేర నీ ద్వీపంబు జంబూ ద్వీపంబు; జంబూద్వీపంబును సుదర్శన ద్వీపంబు నన నెగడి లవణ సముద్ర ముద్రితం బయి పొలుచు నద్దీవియందు. 20

ప్రతిపదార్థం: జంబూనది+అనన్+పరఁగిన= జంబూనది అనే పేరుతో ఒప్పిన; ఆ+తరంగిణి= ఆ నది; నీరు= జలం; సోఁకిన+చోటు+ఎల్లను= పారినస్థలం అంతా; సువర్ణంబు+అగుటన్+చేసి= బంగారుగా మారటంచేత; కనకంబునకున్= బంగారానికి; జాంబూనదంబు= 'జాంబూనదం' అనే నామంబు= పేరు కలిగెన్= ఏర్పడింది; తదీయ+జలపానంబు+చేసిన= ఆ నది నీరు త్రాగిన; మానవులకున్= మనుజులకు; ముదిమియున్= ముసలితనం; తెవులును= రోగమును; దప్పియున్= దాహమును; లేవు+అని+చెప్పుదురు= ఉండవు అని (ప్రజలు) చెప్పుతూ ఉంటారు; ఆ+ఏటి+పడమటన్= ఆ నదియొక్క పడమటి దిక్కున; పెరిఁగి= విస్తరించి; పఱపు+కలిగి= వైశాల్యం ఉండి; శరనిధి+చందంబునన్= సముద్రంవలె; జంబూ షండంబు= నేరేడు చెట్ల గుంపు; కాఱుకొనుచుండున్= విస్తరించి ఉంటుంది; ఇంతటికిన్+కారణంబు+అయిన= ఇంతటికి హేతువయిన; ఆ జంబూ+వృక్షంబు= ఆ నేరేడు చెట్టు; పేరన్= పేరుమీద; ఈ+ద్వీపంబు= ఈ దీవి; జంబూ+ద్వీపంబు= జంబూద్వీపము అను పేరుగలదియును; సుదర్శన ద్వీపంబు+అనన్+నెగడి= సుదర్శన ద్వీపం అనే పేరుతో విలసిల్లి; లవణ+సముద్ర+ముద్రితంబు+అయి= ఉప్పునీటి సముద్రంతో చుట్టబడి; పొలుచున్= విలసిల్లుతుంది; ఆ+దీవియందున్= ఆ (జంబూద్వీపంలో).

తాత్పర్యం: జంబూనది అనే పేరుగల ఆ నది ప్రవహించే చోటులు అన్నీ బంగారంగా మారిపోవటం చేత బంగారానికి 'జాంబూనదము' అనే పర్యాయపదం ఏర్పడింది. ఆ నదీ జలం త్రాగిన వారికి ముసలితనం రాదు. ఏ రోగం రాదు, దాహం ఉండదు అని అంటారు. ఆ నదికి పశ్చిమదిక్కున నేరేడు చెట్ల గుంపు విస్తరించి ఉంటుంది. ఆ చెట్టు పేరుమీద ఆ ప్రాంతానికి జంబూద్వీపం అనే పేరు ఏర్పడింది. దానికే సుదర్శన ద్వీపం అని మారుపేరు. ఆ ద్వీపానికి చుట్టూ ఉప్పునీటి సముద్రం ఉంటుంది. ఆ ద్వీపంలో.

సీ. నిడుపునఁ దూర్పును బడమర నై రెండు । గడలు నంభోనిధి గదిసి యుండు
రత్నమయంబులు రమణీయములు సాధ్య । సిద్ధ చారణ గణసేవితములు
నై హిమాచలమును, నావల హేమకూ । టంబును, నట నిషధంబు నొప్పు;
లలితంబు లైన నీల శ్వేత శృంగవం । తంబులు గ్రమమునఁ దనరి పొలుచు;

ఆ. నివుల మూఁటి కవల నవుల యమ్మూఁటికి । నివలఁ దేజరిల్లు దివిజ నగము
గమలకర్ణికానుకారియై కాంచన । మణిమయత్వ మహిమ మహిత మగుచు. 21

ప్రతిపదార్థం: నిడుపునన్= పొడగున; తూర్పును+పడమరను+ఐ= తూరుపు దిక్కున, పడమటి దిక్కున; రెండు+కడలున్= రెండు వైపుల; అంభోనిధి= సముద్రం; కదిసి+ఉండున్= వ్యాపించి ఉంటుంది; రత్నమయంబులు= రత్నాలతో కూడినవి; రమణీయములు= అందమైనవి; సాధ్య, సిద్ధ, చారణ, గణ, సేవితములు+ఐ= సాధ్యులు, సిద్ధులు, చారణులు అనే దేవతా సమూహాల చేత సేవించబడునవి అయి; హిమ+అచలము= హిమవత్పర్వతం; ఆవల= ఆపైన; హేమకూటంబును= హేమకూటం అనే కొండ; అట= ఆ ప్రదేశంలో; నిషధంబున్= నిషధమనే కొండ; ఒప్పున్= విలసిల్లుతూ ఉంటుంది; లలితంబులు+ఐన= సుకుమారాలైన; నీల, శ్వేత, శృంగవంతంబులు= నల్లని తెల్లని శిఖరాలుగల కొండలు; క్రమమునన్= వరుసగా; తనరి= ఒప్పి; పొలుచున్=వెలుగొందుతాయి; ఇవులన్= ఇటువైపు; మూఁటికిన్+అవల= మూడు (పర్వతాలకు) అవలి వైపు; ఆ+మూఁటికిన్+ఇవల= ఆ మూడు కొండలకు ఇవతలి వైపు; దివిజనగము= వేలుపు కొండ (మేరుపర్వతం); కమల+కర్ణికా+అనుకారి+ఐ= పసిడి తామరలను పోలు దుద్దులవలె భాసిస్తూ; కాంచన+మణిమయత్వ+మహిమన్= బంగారంతో, మణులతో పొదుగబడిన గొప్పదనంతో; మహితము+అగుచున్= గొప్పది అవుతూ; తేజరిల్లున్= ప్రకాశిస్తుంది.

తాత్పర్యం: ఆ దీవికి తూర్పు, పడమర దిక్కులందు పొడవుగా సముద్రం వ్యాపించి ఉంటుంది. ఇక ఇరువైపుల దేవతా జాతులతో కూడిన హిమాలయ పర్వతాలు హేమ కూట పర్వతం నిషధ పర్వతాలు ఉంటాయి. అవి నల్లని తెల్లని శిఖరాలతో విరాజిల్లుతూ ఉంటాయి. ఆ మూడింటికి ఇటు అటు వేల్పుకొండ తామరపువ్వునందలి దుద్దువలె సువర్ణమణిమయమై వెలుగొందుతుంటుంది.

విశేషం: సిద్ధులు, సాధ్యులు, చారణులు దేవతలలోని జాతులు. సిద్ధులు అణిమాది మహిమలు గలవారు. సాధ్యులు (పన్నిద్దరు); మనువు రాజమంతుడు, విష్ణువు, ధర్ముడు, నారాయణుడు మున్నగువారు పరిణామశీలురు. చారణులు: నానా ప్రదేశాలలో సంచరించేవారు. వీరు లోకోత్తరుల చరిత్రలు గానం చేస్తూ సంచరిస్తూ ఉంటారు.

తే. అతిదృఢం బగుపాఁతు పదాఱువేల । యోజనము లంద్రు; దానికి రాజముఖ్య
విందు మెనుబదినాలుగువేల యోజ । నంబులని హేమధాత్రీధరంబు పొడవు. 22

ప్రతిపదార్థం: రాజముఖ్య!= రాజులలో గొప్పవాడా, (ఓ ధృతరాష్ట్ర) మహారాజా!; దానికిన్= ఆ మేరుపర్వతానికి; అతి దృఢంబు+అగు+పాఁతు= మిక్కిలి బలంగల పునాది; పది+ఆఱు+వేల+యోజనములు+అంద్రు= పదారువేల యోజనాలు అని అంటారు; హేమ+ధాత్రీధరంబు+పొడవు= బంగారుకొండ నిడివి; ఎనుబది+నాలుగువేల+యోజనంబులు= ఎనభైనాలుగు వేల యోజనాలు; అని= అని; విందుము= వింటాము.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ మేరుపర్వతపు పునాది మిక్కిలి లోతైనది, బలమైనది. దాని లోతు పదారువేల యోజనాలు అని అంటారు. ఆ మేరుపర్వతం పొడవు ఎనభైనాలుగువేల యోజనాలు అని వింటాం.

వ. ఇవ్విధంబున భూమధ్యంబున నున్న యమ్మేరుమహీధరంబున దేవతలును, దేవమునులును, గంధర్వ కింపురుషాది దేవయోనులును, దేవేంద్ర ప్రముఖ దిక్పతులును, బరమేష్ఠియుం దత్తత్ప్రదేశంబులఁ బుణ్య వర్తనంబులం బరమ సుఖంబు లనుభవింతు; రుత్తరతటంబునం గర్ణికారవనంబున గౌరీసమేతుండై సిద్ధగణంబులు పరివేష్టింప విశ్వేశ్వరుండు విహరించుచుండు. 23

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; భూ+మధ్యంబునన్+ఉన్న= భూమికి మధ్యగా ఉన్న; ఆ+మేరు+మహీధరంబున= ఈ మేరు పర్వతంమీద; దేవతలును= వేల్పులు; దేవమునులు= దేవలోకంలోని ఋషులు; గంధర్వ, కింపురుష+ఆది, దేవ

యోనులును= గంధర్వులు, కింపురుషులు మున్నగు దేవతల సంతతులూ; దేవ+ఇంద్ర ప్రముఖదిక్+పతులును= దేవేంద్రుడు మొదలుగాగల దిక్పాలకులూ; పరమేష్ఠియును= బ్రహ్మదేవుడూ; తత్+తత్+ప్రదేశంబులన్= ఆయా స్థలాలలో; పుణ్యవర్తనంబులన్= మంచి కార్యాలను చేస్తూ; పరమ+సుఖంబులు+అనుభవింతురు= మిక్కిలి గొప్పవైన సౌఖ్యాలను అనుభవిస్తారు; తత్+తీర+తటంబున్= ఆ సానువులలో; కర్ణికార, వనంబునన్= కొండ గోగుపూల తోటలలో; గౌరీ+సమేతుండు+ఐ= పార్వతీదేవితో కూడినవాడై; సిద్ధ+గణంబులు= సిద్ధులు అనెడి దేవతల గుంపులు; పరివేష్టింపన్= చుట్టూ చేరి కొలువగా; విశ్వేశ్వరుండు= శివుడు; విహరించుచుండున్= తిరుగుతూ ఉంటాడు.

తాత్పర్యం: ఈ రీతిగా భూమికి మధ్యలో ఉన్న మేరుపర్వతంపై దేవతలు వివిధ వర్గాలు, దేవేంద్రుడు, బ్రహ్మ మున్నగువారు తిరుగాడుతూ ఉంటారు. ఆ కొండ సానువులలో పార్వతీ సమేతుడై శివుడు విహరిస్తూ ఉంటాడు.

విశేషం: గంధర్వులు దేవతలలో ఒక తెగ. సంగీత పరాయణులు. కింపురుషులు, అశ్వముఖం, నరశరీరంగల దేవతలు.

క. తొమ్మిది ఖండములై వ । ర్షమ్ము లనం జాల నొప్పెసఁగు జంబూద్వీ
పమ్మున జనపదములు విను । మమ్మహితాంశములు దెలియ ననువర్ణింతున్. 24

ప్రతిపదార్థం: తొమ్మిది+ఖండములు+ఐ= తొమ్మిది భాగాలుగా ఏర్పడి; వర్షమ్ములు+అనన్= వర్షములు అనే పేరుమీద; చాలన్+ఒప్పు+ఎసఁగు= మిక్కిలి బాగుగా ఉండే; జంబూద్వీపమ్మునన్= జంబూద్వీపంలో; జనపదములు= జనులు నివసించే చోటులు (గ్రామాల సముదాయాలు); ఆ+మహిత+అంశములు= గొప్పవైన అందలి విశేషాలు; తెలియన్= తెలిసేటట్లుగా; అనువర్ణింతున్= వివరించి చెప్పగలను; వినుము= ఆలకింపుము.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆలకించుము. తొమ్మిది భాగాలుగా ఏర్పడిన జంబూద్వీపమును, అందలి జనపదాలను నీకు తెలిసేటట్లు వర్ణించి చెప్పగలను.

వ. ఉత్తర సముద్రంబు శృంగవంతంబు మధ్యమం బైరావతవర్షం బన నొప్పు; శ్వేత పర్వత శృంగవంతంబుల నడుము హైరణ్మయ వక్షం బనం బొలుచు నీలశైలోత్తర దక్షిణదేశంబులు గ్రమంబున రమణక వర్షంబును ననం జెలువమరు; మేరువునకుం బ్రాచ్య ప్రతీచ్యంబు లగు భాగంబులు వరుసన భద్రాశ్వ వర్షంబును గేతుమాలా వర్షంబును ననం బొగడొందు; హేమకూటోత్తర భూమి హరివర్షం బన నెగడు; హిమవంతంబు నక్కడయు నిక్కడయు నోలిన కింపురుష వర్షంబును భారత వర్షంబును ననం బెంపారు; ని ట్లున్న దీనియందు. 25

ప్రతిపదార్థం: ఉత్తర సముద్రంబు= ఉత్తర దిశలో ఉన్న సముద్ర ప్రాంతం నుండి; శృంగవంతంబు= శృంగవంతం; మధ్యమంబు= మధ్యనున్న ప్రదేశం; ఐరావత వర్షంబు+అనన్+ఒప్పున్= ఐరావత వర్షం అనే పేరుతో విలసిల్లుతుంది; శ్వేతపర్వత+శృంగవంతంబుల నడుము= శ్వేతపర్వతం శృంగవంత పర్వతం రెంటికి మధ్య; హైరణ్మయ వర్షంబు+అనన్= హైరణ్మయ వర్షం అనే పేరున; పొలుచున్= విలసిల్లుతుంది; నీల, శైల+ఉత్తర, దక్షిణదేశంబులు= నీలశైలానికి అటు ఉత్తరం, ఇటు దక్షిణంగా ఉన్న ప్రదేశం క్రమంబునన్= వరుసగా; రమణక+వర్షంబును+అనన్= రమణక వర్షం అనే పేరుతో; చెలువు+అమరున్= శోభిల్లుతుంది; మేరువునకున్= మేరుపర్వతానికి; ప్రాచ్య+ప్రతీచ్యంబులు+అగు= తూరుపున పడమట ఉన్న ప్రదేశాలు; వరుసన= క్రమంగా; భద్రాశ్వవర్షం - కేతుమాలా వర్షం; అనన్+పొగడు+ఒందున్= అనే పేరులతో శోభిల్లుతున్నవి; హేమకూట+ఉత్తర భూమి= హేమకూట పర్వతానికి ఉత్తర దిక్కున ఉన్న ప్రదేశం; హరి వర్షంబు+అనన్= హరివర్షం అనే పేరు మీద; నెగడున్= విలసిల్లుతుంది; హిమవంతంబు= హిమాలయ పర్వత ప్రదేశం; అక్కడయు+ఇక్కడయు= ఆ ప్రదేశంలో మరియు ఈ ప్రదేశంలో; ఓలిన= వరుసగా; కింపురుష+వర్షంబును= కింపురుష వర్షం అనే పేరుమీద;

భారత+వర్షంబును అనన్= భారత వర్షం అనే పేరుమీద; పెంపారున్= వర్ధిల్లుతున్నాయి; ఇట్లు+ఉన్న= ఈ విధంగా ఉన్న; దీనియందున్= ఈ భూమియందు.

తాత్పర్యం: ఉత్తర సముద్రానికీ శృంగవంతం అనే పర్వతానికీ మధ్యలో గల ప్రదేశానికి ఐరావతవర్షం అని పేరు. శ్వేతపర్వతం శృంగవంత పర్వతాల మధ్యలోగల ప్రదేశం హైరణ్మయ వర్షం. నీల శైలానికి ఉత్తర దిక్కున దక్షిణ దిక్కునగల ప్రదేశం రమణక వర్షం. మేరు పర్వతానికి తూర్పు దిక్కులో ఉన్న ప్రదేశం భద్రాశ్వవర్షం. మేరు పర్వతానికి పడమర దిక్కులో ఉన్న ప్రదేశం కేతుమాలా వర్షం. హేమకూట పర్వతానికి ఉత్తర దిక్కున గల ప్రదేశం హరి వర్షం. హిమాలయ పర్వతానికి అవ్వలి గట్టున ఉన్న ప్రదేశం కింపురుష వర్షం. హిమాలయ పర్వతానికి ఇవ్వలివైపున ఉన్న ప్రదేశం భారత వర్షం. ఈ విధంగా ఉన్న భూమియందు.

విశేషం: మిక్కిలి ప్రాచీన కాలంలోనే భారతీయులు భూమి సువిశాలమైనదనీ విపుల విస్తీర్ణమైనదనీ గుర్తించారు.

క. ' భారతవర్షముఁ దొడఁగి మ । హీరమణ! యుదీచ్యము లను నెక్కుడు బలస
త్త్వారోగ్యాయుస్సుఖపు । ణ్యా రంభ గుణంబు లంతకంతకు నరయన్.' 26

ప్రతిపదార్థం: మహీరమణ!= భూమిని రంజింపజేసేవాడా - ఓ రాజా! ధృతరాష్ట్ర మహారాజా!; భారత వర్షమునన్= భారత వర్షం అనే పేరుగల ప్రదేశంలో (జంబూద్వీప ఖండమునందు); ఉదీచ్యములను= ఉత్తరదిశయందున్న ప్రదేశాలలో; తొడఁగి= పూని; బల సత్త్వ+ఆరోగ్య+ఆయుస్+సుఖపుణ్య+ఆరంభ+గుణంబులు= శక్తిసామర్థ్యం, ఆరోగ్యం, ఆయుస్సు, సౌఖ్యం, పుణ్యకార్యాలు చేసే లక్షణాలు; అరయన్= పరీక్షించి చూడగా; అంతకున్+అంతకున్= ఒకదానికంటె మరియొక దానికి; ఎక్కుడు= హెచ్చుగా ఉంటాయి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భారతవర్షంలో ఉత్తర దిక్కుననున్న ప్రదేశాలలో ఉత్తరోత్తరంగా శక్తి, సామర్థ్యం, ఆరోగ్యం, ఆయువు, సౌఖ్యం, పుణ్య కార్య నిర్వహణలు ఎక్కువగా కనుపిస్తాయి.'

విశేషం: భారతదేశంలో ఉత్తర ప్రదేశాలు సంస్కృతికి నాగరకతకు కాణాచులు అని మహాభారత నిర్దేశం. ఆర్య నాగరికత, ఆర్షసభ్యత ఉత్తర ప్రదేశాలలో ఉద్భవిల్లి వికసించి దక్షిణానికి విస్తరించటం చరిత్రవేత్తలకు తెలిసిన విషయమే.

వ. అనిన విని వైచిత్రవీర్యుండు 'సమస్తద్వీపంబులు సకలజలనిధులు నున్న పరిపాటియుం బ్రమాణంబులుం బ్రకాశంబుగ నెఱిఁగింపు, మనుటయు, సూతసూనుండు జంబూద్వీప విష్కంభంబు కొలఁది యెనుబదివేలు నాఱు నూఱు యోజనంబులు; దీని రెం డంతలు దొడంగి లవణేక్షు సురాఘృత దధి క్షీరశుద్ధ జలమయంబు లయిన మహార్ణవంబుల విష్కంభంబులు గ్రమంబున నొకటి కొకటి రెట్టి యై యుండుఁ; బ్లక్షద్వీప శాల్మలద్వీప క్రౌంచద్వీప కుశద్వీప శాకద్వీప పుష్కర ద్వీపంబుల విష్కంభంబులు జంబూద్వీప విష్కంభ ద్విగుణ ప్రమాణంబు మొదలుగా నోలి నొకటి కొకటి యినుమడి యై యుండు; నయ్యాఱు దీవులును జంబూ ద్వీపంబుకంటె నెల్లదానను బొగడ్త వడి యనేక పర్వతంబులను నానా నదులను బహు జనపదంబులను నొప్పి వరుస నొండొంటికి గుణవిశేషంబుల నధికంబు లై యుండు; నింతకుం గర్తయు భర్తయు హర్తయునై దుగ్ధాంబుధి యుత్తరంబునం గనకమయం బై యష్టచక్రంబును బ్రభూతభూతయుక్తంబును మనోజవంబును నగు మహనీయ శకటంబున వినోద పరాయణుం డైన నారాయణుండు వికుంఠనిధానుం డగుచు వైకుంఠాభిధా నంబున విఖ్యాతుండై విహరించుచుండు, నని చెప్పుటయు నతండు. 27

ప్రతిపదార్థం: అనినన్+విని= అని చెప్పగా విని; వైచిత్రవీర్యుండు= (విచిత్రవీర్యుడి కుమారుడైన) ధృతరాష్ట్రుడు; సమస్త ద్వీపంబులు= అన్ని ద్వీపాలు; సకల+జలనిధులు= అన్ని సముద్రాలు; ఉన్న; పరిపాటియున్= అనుక్రమం; ప్రమాణంబులున్= కొలత(దు)లు; ప్రకాశంబుగన్= తేటతెల్లమయ్యేటట్లుగా; ఎఱిఁగింపుము+అనుటయున్= తెలుపుము అని చెప్పగా; సూతసూనుండు= సూతుని కొడుకు సంజయుడు; జంబూద్వీప+విష్కంభంబు+కొలఁది= జంబూద్వీపము యొక్క విస్తీర్ణం; ఎనుబదివేలు నాఱునూఱు యోజనంబులు= ఎనభై వేల ఆరువందల యోజనాలు; దీని+రెండు+అంతలు= దీనికి రెండు రెట్లు; తొడంగి= పూని; లవణ+ఇక్షు, సురా+ఘృత, దధి, క్షీర, శుద్ధ జలమయంబులు+అయిన= ఉప్పునీరు, చెరకు, కల్లు, నేయి, పెరుగు, పాలు, మంచినీళ్ళతో కూడిన; మహా+అర్ణవంబుల+విష్కంభంబులు= పెద్ద సముద్రాల విస్తీర్ణాలు; క్రమంబునన్= వరుసగా; ఒకటికి+ఒకటి= ఒకదాని కంటె ఒకటి; రెట్టి+ఐ+ఉండున్= రెండింతలుగా ఉంటాయి, ప్లక్షద్వీప, శాల్మల ద్వీప, క్రౌంచద్వీప, కుశద్వీప, శాక ద్వీప, పుష్కరద్వీప విష్కంభంబులు= ప్లక్ష, శాల్మల, క్రౌంచ, కుశ, శాక, పుష్కరాలు అనే పేరులుగల ద్వీపాల విస్తీర్ణాలు; జంబూద్వీప+ విష్కంభ+ద్విగుణ+ప్రమాణాలు= జంబూద్వీప ప్రమాణానికి రెట్టింపు; మొదలుగాన్+ఓలిన్= మొదలైన వరుసలో ఒకటికి+ఒకటి= ఒకదానికి ఒకటి; ఇనుమడి+ఐ= రెండింతలు అయి; ఉండున్= ఉంటాయి; ఆ+ఆఱుదీవులును= ఆ ఆరు దీవులూ; జంబూద్వీపంబుకంటెన్ ఎల్లదానను= అన్ని రీతులలో; పొగడ్త+పడి= పేరుకు ఎక్కి; అనేక+పర్వతంబులను= పెక్కు కొండలతో; నానానదులను= పెక్కు ఏరులతో; బహు+జనపదంబులను= జనులు నివసించే పెక్కు ప్రదేశాలతో; ఒప్పి= విలసిల్లి; వరుసన్= క్రమంగా; ఒండు+ఒంటికిన్= ఒకదానికంటె ఒకటి; గుణ+విశేషంబులన్= మంచి లక్షణాలతో; అధికంబులు+ఐ+ఉండున్= అతిశయిల్లుతూ ఉంటాయి; ఇంతకున్= ఇన్నిటికి; కర్తయున్= నిర్మించేవాడును; భర్తయున్= పోషించేవాడును; హర్తయున్= లయించేవాడును; ఐ= అయి; దుగ్ధ+అంబుధి+ఉత్తరంబునన్= పాలకడలి ఉత్తరపు దిక్కున; కనకమయంబు+ఐ= బంగారముతో నిండిన; అష్టచక్రంబును= ఎనిమిది అంచులు గల చక్రమునూ; ప్రభూత+భూత+యుక్తంబును= పెక్కు భూతములతో కూడినది; మనోజవంబును= మనస్సుతో సమానమైన వేగం కలిగినదియు; అగు= అయిన; మహనీయ శకటంబున్= గొప్ప వాహనంతో; వినోద+పరాయణుండు+ఐ= క్రీడాసక్తుడై; వికుంఠ నిధానుండు= వికుంఠమునందు ఉండే వాడు; వైకుంఠ+అభిధానంబునన్= వైకుంఠుడు అనే పేరు గలిగినవాడై; విఖ్యాతుండు+ఐ= పేరుకెక్కినవాడై; నారాయణుండు విహరించుచుండున్= ఆనందంతో తిరుగుతూ ఉంటాడు; అని+చెప్పుటయున్= అని వచింపగా; అతండు= అతడు (ధృతరాష్ట్రుడు).

తాత్పర్యం: "ధృతరాష్ట్రుడు తనకు సమస్త ద్వీపాల విస్తీర్ణాలు సమస్త సాగరాలున్న వరుసక్రమమంతా తెలుపుమని సంజయుడిని కోరినాడు. సంజయుడు, "జంబూద్వీప విస్తీర్ణము ఎనభైవేల ఆరునూరు యోజనములు", దీనికి రెండింతలుగా లవణ, ఇక్షు, సుర, ఘృతదధి, క్షీర, శుద్ధజలమయంబులైన మహాసముద్రాల వైశాల్యాలు. జంబూ ద్వీప వైశాల్యానికి ఒకదానికొకటి రెండింతలుగా పక్షద్వీప, శాల్మలద్వీప, క్రౌంచద్వీప, కుశద్వీప, శాక ద్వీప, పుష్కర ద్వీప వైశాల్యాలుంటాయి. ఈ ఆరు ద్వీపాలు జంబూ ద్వీపం కంటె అన్నింటిలోనూ పొగడబడుతూ అనేక పర్వతాలతో నానానదులతో బహుజనపదాలతో కూడి వరుసగా ఒకదాని కంటె మరొకటి గుణవిశేషంలో అధికమై ఉంటాయి. వీటన్నిటికి కర్తయై, భర్తయై, హర్తయై, క్షీర సాగరానికి ఉత్తరంలో కనకమయమైన ఎనిమిది చక్రాలతో పెక్కు భూతములతో కూడినది, మనోజవమైనది అయిన మహనీయ శకటం మీద నారాయణుడు వైకుంఠవాసుడై వైకుంఠుడను పేరుతో విహరించుచుండునని చెప్పినాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: 1. ద్వీపం అనగా నాలుగు వైపులా సముద్రంతో పరివృతమైన భూభాగం.

2. ద్వీపాలపేర్లు సార్థకాలు. వాచ్యార్థం కాకపోవచ్చును. ప్లక్ష= జువ్వి, రావి; శాల్మల= బూరుగు చెట్టు, క్రౌంచము= ఒకానొక పక్షి; కుశ= దర్భ; శాక= టేకుచెట్టు; పుష్కర= మెట్టతామర; అట్లే సముద్రాల పేరులు- లవణ= ఉప్పు; ఇక్షు= చెరకు; సురా=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కల్లు; ఘృత= నెయ్యి; దధి= పెరుగు; క్షీర= పాలు. ఈ పేరులు అన్నింటిని ఆలంకారికంగా ఔపచారికమైన అర్థాలలో స్వీకరింపవలెనని కొందరు పండితుల వాదం. ద్వీపాల పేరులు - అందలి వృక్ష విశేష ప్రాముఖ్య సూచకాలు అనీ సముద్రాల పేరులు వైవిధ్య సూచకాలు అనీ కొందరు పండితుల అభిప్రాయం. అలనాటి భూగోళ పరిజ్ఞానం పరిమితమైనదే కాని ప్రాచీనుల ఏతద్విస్తీర్ణ వైవిధ్యాలను నిశితంగా ఊహించారు.

క. ' భారతవర్షమునకుఁ గాఁ । గౌరవులును బాండవులును గాంక్షం గడుఁ బె
లై రాసి యొండొరులతోఁ । బోరం దెగి రిట్టి లుబ్ధబుద్ధులు గలరే?' 28

ప్రతిపదార్థం: భారత వర్షమునకున్+కాన్= భారతవర్షం అనెడు భూభాగం కోసమే కదా; కౌరవులును (దుర్యోధనుడు మున్నగువారు); పాండవులును (పాండురాజు కొడుకులు); కాంక్షన్= కోరికతో; కడున్+పెల్లు+ఐ, రాసి= మిక్కిలి కలహించి; ఒండొరులతోన్+పోరన్+తెగిరి= ఒకరితో ఒకరు యుద్ధం చేయటానికి తెగించారు; ఇట్టి= ఈ విధమైన; లుబ్ధ బుద్ధులు= పిసినారి బుద్ధిగలవారు; కలరు+ఏ?= ఉన్నారా?

తాత్పర్యం: 'భారతవర్షం అనే భూభాగం కోసమే కదా కౌరవులు పాండవులు ఒకరితో ఒకరు పోరాడి వినాశనానికి పాల్పడ్డారు. ఇట్టి లోభబుద్ధి కలవారు ఎక్కడైనా ఉన్నారా?' అని ధృతరాష్ట్రుడు వాపోయాడు.

వ. అనిన విని యమ్మనుజపతికి సంజయుం డిట్లనియె. 29

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా (ధృతరాష్ట్రుడు చెప్పగా విని); ఆ+మనుజపతికిన్= ఆ రాజుకు (ధృతరాష్ట్రుడికి) సంజయుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అప్పుడు ధృతరాష్ట్రుడి మాటలు విని సంజయుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

ఆ. ' అధిప! పాండుసుతుల కరయంగ నతికాంక్ష । లేదు; లుబ్ధబుద్ధి నీదు సుతుఁడు
శకుని కఱపు విని యసన్మార్గవృత్తికిఁ । జొచ్చి యిట్టి యెడరు దెచ్చికొనియె. 30

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ధృతరాష్ట్ర మహారాజా); అరయంగన్= పరీక్షించి చూస్తే; పాండుసుతులకున్= పాండవులకు; అతికాంక్ష= అత్యాశ; లేదు= లేదు; లుబ్ధ బుద్ధి= పిసినారిఅయిన; నీదు+సుతుఁడు= నీ కొడుకు (దుర్యోధనుడు); శకుని+కఱపు+విని= శకుని బోధ ఆలకించి; అసత్+మార్గవృత్తికిన్+చొచ్చి= చెడు దారికిపోయి; ఇట్టి+ఎడరున్= ఈ కష్టస్థితిని; తెచ్చికొనియెన్= తెచ్చికొన్నాడు.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాండవులకు అత్యాశలేదు. నీ కొడుకు దుర్యోధనుడు సహజంగా లోభి. పైపెచ్చు శకుని చెప్పుడు మాటలు విని చెడ్డదారిని పట్టి ఇట్టి ఆపదను తెచ్చికొన్నాడు.

సంజయుండు ధృతరాష్ట్రునకు భారత వర్షంబునం గల విశేషంబులు సెప్పుట (సం. 6-10-1)

క. తమ తమ దేశంబులకై । మిముఁ గొని పాండవుల గెలుచు మెయికోలున భూ
రమణులుఁ గొందఱు వచ్చిరి । సమగ్ర సఖ్యమునఁ గూడు చందమునఁ దగన్. 31

ప్రతిపదార్థం: తమ+తమ+దేశంబులకై= తమ తమ రాజ్యాలను రక్షించుకోవాలనే ఉద్దేశంతో; మిమున్+కొని= మీ పక్షం వహించి; పాండవులన్+గెలుచు+మెయికోలునన్= పాండవులను జయించాలనే ఆలోచనతో; భూరమణులు కొందరు= కొంతమంది రాజులు; సమగ్ర+సఖ్యమునన్= పరిపూర్ణ స్నేహం చొప్పున; కూడు+చందమునన్= చేరేటటువంటి రీతిలో; తగన్= తగినట్లు; వచ్చిరి= (మీపక్షంలో) వచ్చి చేరారు.

తాత్పర్యం: కొందరు రాజులు తమ తమ రాజ్యాలు సంరక్షించుకోవాలనే స్వార్థబుద్ధితో మీమీద పరిపూర్ణ స్నేహం ఉన్నట్లుగా పైకి నటిస్తూ మీ పక్షంలో వచ్చి చేరి పాండవులను గెలువదలచారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వారిన్= (మీ పక్షంలో చేరిన రాజులను); అనన్+ఏల?= విమర్శించటమెందుకు?; తొల్లియున్= పూర్వకాలంలో కూడ; వసుధకై= భూమికోసం; అనేక+నృపతులు= పెక్కుమంది రాజులు; ఇట్లు= ఈ విధంగా; పోరాడి= యుద్ధాలు చేసి; నేల+వ్రాలి= భూమి మీద పడి (మరణించి); భగీరథ, రఘు, యయాతి, నహుష, ముఖ్యులు= భగీరథుడు, రఘువు, యయాతి, నహుషుడు మున్నగువారు; విశ్రుత+ఉన్నతులు= కీర్తితో గూడిన గొప్పదనాలు; కనిరి= పొందారు.

తాత్పర్యం: ఇప్పుడు మీ పక్షంలో చేరిన రాజులను విమర్శించటం న్యాయం కాదు. పూర్వకాలంలో కూడ భూరాజ్య సంపాదన కోసమేకదా- భగీరథుడు, రఘువు, యయాతి, నహుషుడు మున్నగు మహారాజులు యుద్ధాలు చేసి గొప్ప యశస్సు అభ్యుదయం సాధించగలిగారు.

వ. భారత వర్షంబున నుదార విభూతి విలాసంబున కాసపడి యీసునం బెనంగ కుండుదురె? దీని విస్తారంబు విను వివరించెద. 33

ప్రతిపదార్థం: భారత వర్షంబునన్= భారతదేశమందు; ఉదార+విభూతి+విలాసంబునకున్+ఆసపడి= గొప్పదయిన ఐశ్వర్యం యొక్క వైభవానికి ఆశించి; ఈసునన్= ఈర్ష్యతో; పెనంగక+ఉండుదురె?= పోరాడకుందురా?; దీని= ఈ భారత వర్షం యొక్క; విస్తారంబు= విస్తీర్ణం; వివరించెదన్= వివరాలతో నీకు చెప్పగలను; విను= ఆలకించుము.

తాత్పర్యం: భారత వర్షంలో రాజ్యకాంక్షతో భోగలాలసతతో ఎందరో రాజులు పెక్కు యుద్ధాలు చేశారు. వారికంత ఆసక్తి కలిగించిన భారతవర్ష విస్తీర్ణం నీకు వివరించగలను. వినుము.

ఆ. మలయ మనఁగ శుక్తిమంతంబు నా వింధ్య। మనఁగఁ బారియాత్ర మన మహేంద్ర
మనఁగ ఋక్షవంత మన సహ్య మన నిందుఁ। గులనగంబు లేడు వొలుచు నధిప! 34

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ధృతరాష్ట్ర మహారాజా); ఇందున్= ఈ భరతవర్షంలో; మలయము+అనఁగన్= మలయమనే పేరుగల పర్వతం; శుక్తిమంతంబు+నాన్= శుక్తిమంతం అనే పేరుతో; పారియాత్రము+అని= పారియాత్రం అనే పేరుతో; ఋక్షవంతము+అనన్= ఋక్షవంతము అనే పేరుతో; సహ్యము+అనన్= సహ్యము అనే పేరుతో; కుల+నగంబులు+ఏడు= ఏడు కులపర్వతాలు; పొలుచున్= విలసిల్లుతున్నవి.

తాత్పర్యం: మలయం, శుక్తిమంతం, వింధ్యం, పారియాత్రం, మహేంద్రం, ఋక్షవంతం, సహ్యం అనే ఏడు గొప్ప పర్వతాలు ఈ భారతవర్షంలో కులపర్వతాలుగా ఉన్నాయి.

విశేషం: 1. ఏడు కుల పర్వతాలు భూమిని మోస్తున్నాయని పురాణ కథనం.

"మహేంద్రో మలయ స్సహ్యో శ్శుక్తిమాన్ గంధమాధనః ।
వింధ్యశ్చ పారియాత్రశ్చ సప్తైతే కుల పర్వతాః - త్రికాండశేషం ।"

కుల పర్వతాలు ప్రధాన పర్వతాలు. గంధమాదనం - ఋక్షవంతం పర్యాయ పదాలు.

వ. వీనియందు వివిధ మణిగణంబులు సమకూర్పవచ్చు ననిన ఖనివిశేషంబులు సెప్పనేల? మఱియు నుపమహీధరంబు లనేకంబులు గలిగి యుండు; వానియందు. 35

ప్రతిపదార్థం: వీనియందున్= ఈ పర్వతాలలో; వివిధ+మణి+గణంబులు= పెక్కు రకాలైన మణుల సముదాయాలు; సమ కూర్పవచ్చున్= సేకరింపనగు; అనినన్; ఖని+విశేషంబులు+చెప్పన్+ఏల?= గనులలో దొరికే లోహాలు మున్నగు వాటిని గూర్చి చెప్పనవసరం లేదు గదా! మఱియున్+ఉపమహీధరంబులు= ఇంకా పర్వత శాఖలు; అనేకంబులు= పెక్కులు; కలిగి+ఉండున్

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వానియందున్= ఆ ఉప పర్వతాలలో.

తాత్పర్యం: ఈ పర్వత పంక్తులలో ఎన్నో రకాలైన మణులు సంపాదించవచ్చునంటే- ఇక గనులలో దొరికే లోహాల గూర్చి వేరే చెప్పనవసరం లేదు గదా! ఇంకను ఉపపర్వతాలు పెక్కులు ఉన్నాయి. వాటిలో -

క. ఇనుమును రాగియుఁ దగరం। బును వెండియుఁ బసిఁడియుం బ్రభూతములై పే
ర్చిన సిరిఁ జేయఁగ నొప్పెడు। ఖను లెడనెడఁ బెక్కు గలవు కౌరవనాథా! 36

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఇనుము, రాగియు, తగరంబును, వెండియున్; పసిడియున్= బంగారమును; ప్రభూతములు+ఐ= మిక్కుటములై; పేర్చిన, సిరిన్+చేయఁగన్+ఒప్పెడున్= ప్రోగుచేసిన సంపద వలె భాసించే; ఖనులు= గనులు; ఎడన్+ఎడన్= పలుతావుల; పెక్కు+కలవు= ఎన్నో ఉన్నాయి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఈ ఉపపర్వతాలలో ఇనుము, వెండి, రాగి, తగరం, బంగారం కుప్పవోసిన సంపదవలె పలుచోట్ల దొరుకుతాయి.

క. వెండియు ధనార్జనంబులు। గొండల వలనన ఘటించికొన నగు నేర్పున్
దండితనంబును బాడియు। నొండొంటికి మిగులఁ గలిగి యున్న ట్లయినన్. 37

ప్రతిపదార్థం: వెండియున్= మఱియును; కొండల వలనన్+అ= పర్వతాలవలన; ధన+ఆర్జనంబులు= డబ్బు సేకరించుకొనటం; ఘటించుకొనన్+అగున్= సమకూర్చుకొనవచ్చును; నేర్పున్= సామర్థ్యం; దండితనంబును= గొప్పతనం; పాడియున్= న్యాయం; ఒండు+ఒంటికిన్= ఒకదానిలో ఒకటికి; మిగులన్= మిక్కుటంగా; కలిగి ఉన్నట్లు+అయినన్= కలిగి ఉన్నట్లయితే.

తాత్పర్యం: అంతేకాక, కొండలవలన మిక్కుటమైన ధనం ఆర్జించవచ్చును. నేర్పు, పట్టుదల, న్యాయం అనే గుణాలు ఒకదానితో ఒకటి సంఘటించుకోగలిగితే చాలు.

వ. గంగయుఁ దుంగభద్రయు వేత్రవతియు వేదవతియుఁ గృష్ణవేణియుఁ బెన్నయు యమునయుఁ దమసయు శిరావతియుఁ గావేరియు గోదావరియు నర్మదయు బాహుదయును సరయువును శతద్రువును వితస్తయు విపాశయుఁ దామ్రపర్ణియు నను మహానదులు మఱియు ననేక సరిద్విశేషంబులునుం గలిగి వీనివలన నానాముఖంబులు ధనధాన్యాది సంపదాగమంబులు సొంపు మిగిలి యుండు. 38

ప్రతిపదార్థం: గంగయున్+తుంగభద్రయున్+వేత్రవతియున్+వేదవతియున్+కృష్ణవేణియున్+పెన్నయున్+యమునయున్+తమసయున్+శిరావతియున్+కావేరియున్+గోదావరియున్+నర్మదయున్+బాహుదయును+సరయువును+శతద్రువును+వితస్తయున్+విపాశయున్+తామ్రపర్ణియున్ అను; మహానదులు; మఱియున్; అనేక+సరిత్+విశేషంబులునున్+కలిగి= పెక్కు విధాలైన నదులు కలిగి; వీనివలనన్= ఈ నదుల వలన; నానాముఖంబులు= పెక్కు విధాలైన; ధన+ధాన్య+ఆది సంపద్+ఆగమంబులు= ధనములు ధాన్యములు మొదలగు ఐశ్వర్యాల రాకడలు; సొంపు, మిగిలి+ఉండున్= అందాలు అతిశయిస్తూ ఉంటాయి.

తాత్పర్యం: గంగ, తుంగభద్ర, వేత్రవతి, వేదవతి, కృష్ణవేణి, పెన్న, యమున, తమస, శిరావతి, కావేరి, గోదావరి, నర్మద, బాహుద, సరయువు, శతద్రువు, వితస్త, విపాశ, తామ్రపర్ణి అనే పేరులుగల మహానదులు, మరికొన్ని చిరుప్రవాహాలు ఈ పర్వతాల నుండి పుట్టుతున్నవి. వీని వలన పెక్కు తెరగుల ధనాలు, ధాన్యాలు, సంపదలు లభిస్తాయి.

విశేషం: గంగ భారత వర్షములో పేరుకెక్కిన పెద్ద నది. తుంగ-భద్ర అనే రెండు నదులు దక్షిణాపథంలోనివి కలిసి తుంగభద్ర అయినవి. తుంగభద్ర కృష్ణవేణికి ఉపనది. అయితే తుంగభద్రకు కూడా కృష్ణవేణితోపాటు "పుష్కరం" ఉంది. 'గంగాస్నానం

- తుంగాపానం' అనే సామెత ఏర్పడింది. గంగ హిమాలయ పర్వతాలలో పుట్టి ఋషీకేశ హరిద్వారాల కడ, మైదాన తలం చేరి ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్ ద్వారా తూర్పు సముద్రం చేరుతున్నది. వేత్రవతి కృష్ణవేణి, కావేరి, గోదావరి దక్షిణాపథంలోని నదులు. పెన్న, దక్షిణా పథంలోని ఒక చిరునది. ఇది తిక్కన వ్రాసిన తెలుగు మహాభారతంలో- "మహానదుల" పట్టికలో చేరటానికి కారణం ఆ నదీతీరంలో ఉన్న నెల్లూరి వాస్తవ్యుడు ఆ కవి కావటం. నర్మద- వింధ్య పర్వతాలలో ప్రవహించి గుజరాత్‌లో సముద్రంలో కలిసిన పశ్చిమ వాహిని. బాహుద - ఉత్కళలోనిది. సరయువు అయోధ్య ప్రదేశంలోనిది. వితస్త, విపాశ, శతద్రువు పంజాబులోని నదులు. వాల్మీకి తమసాతీరంలోని ఆశ్రమవాసి. నదుల ప్రాచీననామాలు నేడు కొన్నిటిని గుర్తు పట్టటం కష్టం. శిరావతి అట్టి వాటిలో ఒకటి. శతద్రునదిని నేటి సట్లెజ్‌గా గుర్తిస్తున్నారు. కొందరు పండితులు. మూల సంస్కృత మహాభారతంలో 'పెన్న' పేరు లేదు. గంగవలెనే యమున హిమాలయాలలో పుట్టి గంగకు పలుచోట్ల సమాంతరంగా ప్రవహించి ప్రయాగవద్ద గంగానదిలో కలుస్తున్నది. గంగతోపాటు యమునకు కూడా పుష్కరం ఉన్నది.

క. ఎడనెడఁ బఱపై యొప్పెడి । యడవు లనేకములు; వానియం దర్థము సే
రెడు వెరవులు పెక్కులు సా । ప్పడి యుండు నయంబుతోడి బలిమి గలిగినన్. 39

ప్రతిపదార్థం: ఎడన్+ఎడన్= అక్కడక్కడ (ఒకచోట మరియు మరియొకచోట); పఱపు+ఐ= దట్టంగా; ఒప్పెడి= వర్ధిల్లెడి; అడవులు+అనేకములు= పెక్కు అడవులు (ఉంటాయి); వానియందున్= ఆ అడవుల నుండి; అర్థము= ధనం; చేరెడు+వెరవులు= లభించే ఉపాయాలు; పెక్కులు= ఎన్నియో; చొప్పడి+ఉండున్= అనువుగా ఉంటాయి; నయంబుతోడి బలిమి కలిగినన్= సామంతో కూడిన శక్తి సామర్థ్యాలు (రాజులకు) ఉంటే.

తాత్పర్యం: ~~ఈ~~ నదులేకాక, అక్కడక్కడ ఎన్నో అడవులు ఉంటాయి. ఆ అడవుల నుండి ధనం ఆర్జించే ఉపాయాలు ఎన్నో ఉన్నాయి. అయితే రాజులు సామంతో కూడిన శక్తిసామర్థ్యాలు ప్రయోగించాలి.

విశేషం: అడవుల నుండి ధనార్జన చేయటానికి రాజులకు సామంతో కూడిన శక్తిసామర్థ్యాలు ఉండాలి. ఎందుకు? అడవులలో అనాగరికులైన ఆటవికులు నివసిస్తూ ఉంటారు. వారు బలప్రయోగానికి సులువుగా లొంగరుగాని నయనీతికి లొంగుతారు. అమాయకులైన ఆటవికులు ప్రేమపాత్రులు. వారు కష్టజీవులు. నాగరికులు అడవులలోని సంపదను అంతటి శరీర శ్రమకు ఓర్చి సేకరించలేరు. ఆటవికులకే అడవులలోని సంపద సేకరించే సహజశక్తి ఉంటుంది.

వ. పాంచాల బర్బర వత్స మత్స్య మగధ మళయాళ కళింగ కుళింగ కుకురు కోంకణ టేంకణ త్రిగర్త సాముద్ర సాళ్వ శూరసేన సుదేష్ణ సుహ్మ కురు కరూశ కాశ కోసల యవన యుగంధ రాంధ్ర సింధు చేది చోళ పుళింద పుండ్ర పాండ్యాభీర సావీర సౌరాష్ట్ర మహారాష్ట్ర విదేహ విదర్భ ద్రవిళ దశార్ణ కర్ణాట గౌళాంగ వంగ వరాట లాట బాహ్లిక బహుదాన కిరాత కేకయాశ్మంత కాశ్మీర గాంధార కాంభోజ కేరళ మాళవ నేపాళ ఘూర్జర కుంత లావంతి కానూపాది జనపదంబులు సమస్త వస్తు సంపత్సంపాదనంబు లయిన గుణవిశేషంబుల వెలసి పురుషార్థంబులగు ధర్మార్థ కామంబులకుం గారణంబులై కమనీయంబు లగుచుండు. 40

ప్రతిపదార్థం: పాంచాల, బర్బర, వత్స, మత్స్య, మగధ, మళయాళ, కళింగ, కుళింగ, కుకురు, కోంకణ, టేంకణ, త్రిగర్త, సాముద్ర, సాళ్వ, శూరసేన, సుదేష్ణ, సుహ్మ, కురు, కరూశ, కాశ, కోసల, యవన, యుగంధర+ఆంధ్ర, సింధు, చేది, చోళ, పుళింద, పుండ్ర, పాండ్య+అభీర, సావీర, సౌరాష్ట్ర, మహారాష్ట్ర, విదేహ, విదర్భ, ద్రవిళ, దశార్ణ, కర్ణాట, గౌళ+అంగ, వంగ, వరాట, లాట, బాహ్లిక, బహుదాన, కిరాత, కేకయ+అశ్మంత, కాశ్మీర, గాంధార, కాంభోజ, కేరళ, మాళ్వ, నేపాళ, ఘూర్జర, కుంతల+అవంతి, కానూప+ఆది జనపదంబులు (ఇవి అన్నీ భారత వర్షంలోని, ఆనాటి, జనపదాల పేరులు); సమస్త, వస్తు, సంపత్+సంపాదనంబు అయిన=

అన్ని వస్తువులతో సంపదలతో కూడిన, గుణవిశేషంబులన్= గొప్ప లక్షణాలలో, వెలసి= వర్ధిల్లి; పురుషార్థంబులు అగు= (మానవ జీవిత కర్తవ్యాలయిన); ధర్మ+అర్థ+కామంబులకున్= ధర్మమునకు; ధనమునకు కోరికలకును; కారణంబులు+ఐ= హేతువులై; కమనీయంబులు= సుందరములు; అగుచు.

తాత్పర్యం: పాంచాల బర్బర వత్స మత్స్య మగధ, మళయాళ, కళింగ, కుకురు, కోంకణ, టేంకణ, త్రిగర్త, సాముద్ర, సాళ్వ, శూరసేన, సుదేష్ణ, సుహ్మ, కురు, కరూశ, కాశ, కోసల, యవన, యుగంధర, ఆంధ్ర, సింధు, చేది, చోళ, పుళింద, పుండ్ర, పాండ్య, ఆభీర, సౌవీర, సౌరాష్ట్ర, మహారాష్ట్ర, విదేహ, విదర్భ, ద్రవిళ, దశార్ణ, కర్ణాట, గౌళ, అంగ, వంగ, వరాట, లాట, బాహ్లీక, బహుదాన, కిరాత, కేకయ, అశ్మంత, కాశ్మీర, గాంధార, కాంభోజ, కేరళ, మాళవ, నేపాళ, ఘూర్జర, కుంతల, అవంతి, కామరూపం మొదలైన భారత వర్షాలలోని జనపదాలు. అవి పెక్కు సంపదలకు ఆలవాలాలు. పురుషార్థాలలో ధర్మం, అర్థం, కామం అనుష్ఠానానికి పేరెన్నిక గన్నవి. సుందరములు.

విశేషం: 1. మహాభారతం - నేపాళమును - గాంధారము (నేటి ఆఫ్ఘనిస్థానము) కాంభోజము (నేటి కంబోడియా) భారత వర్షంలోని జనపదాలుగా అభివర్ణించటం గమనింపదగిన అంశం.

2. ఈ జనపదాలలో వర్ధిల్లిన పురుషార్థాలలో మోక్షం చేర్చలేదు మహాభారతం.

క. వినికి గలిగి రక్షించుచు । ననువున దయతోడిపాడి నాయతు లెల్లం
గొనుచుఁ దగ నేలి పొగ డొం । దిన రాజున కుర్వి గామధేనువు గాదే! 41

ప్రతిపదార్థం: వినికి+కలిగి= (ప్రజలు చెప్పే మాటలు) వినే ఓర్పు కలిగి; రక్షించుచున్= కాపాడుతూ; అనువునన్= వెరవుతో; దయతోడి పాడి= కరుణతో రంగరించిన న్యాయం; ఆయతులు+ఎల్లన్= అన్ని రాబడులను; కొనుచున్= స్వీకరిస్తూ; తగన్= ధర్మంతో; ఏలి= పరిపాలించి; పొగడు+ఒందిన= పేరు కెక్కిన; రాజునకున్= ప్రభువుకు; ఉర్వి= భూమి; కామధేనువు= వేల్పుటావు (కోరికలను ఈడేర్చే ఆవు); కాదు+ఏ?= కాదా?

తాత్పర్యం: రాజు అన్ని విషయాలు విని తెలుసుకొనాలి. ప్రజలను రక్షించాలి. కేవలం న్యాయమేకాక ఆ న్యాయం కరుణతో రంగరించి రాబడులను స్వీకరిస్తూ పరిపాలించాలి. ఆ విధంగా పేరు కెక్కిన రాజుకు భూమి కామధేనువై వర్తిల్లగలదు.

విశేషం: 1. ఈ పద్యం తెలుగు మహాభారతంలో మిక్కిలి ప్రశస్తికి ఎక్కింది. భూమి రాజుకు కామధేనువు. ఎట్టి రాజుకు? న్యాయాన్ని దయతో రంగరించి రాబడులను స్వీకరిస్తూ పాలించే రాజునకు. ప్రజల నివేదనలు విని దయతో పరిపాలించే రాజుకు.

కామధేనువు= వేల్పుటావు స్వర్గలోకంలో ఉంటుంది. కోరికలను ఈడేర్చగలది. కామధేనువు, చింతామణి, కల్పవృక్షం స్వర్గంలోనివి. ఏ కోరికలైనా తీర్చగలవి. ఇది ప్రాచీన భారత సంస్కృతి సృష్టించిన మనోహర కల్పన.

ఆ. వెరవు లావుఁ గలుగు నరనాథు లింత దే । శంబు గలదు తమకుఁ జాలు ననరు;
దండ్రి బిడ్డ యన్న తమ్ముఁడు నా కెత్తి । పోయి పోటులాడి పుడమిఁ గొంద్రు. 42

ప్రతిపదార్థం: వెరవు= ఉపాయం; లావున్= బలము; కలుగు= ఉన్నట్టి; నరనాథులు= రాజులు; ఇంత+దేశంబు= ఎక్కువ విస్తీర్ణంగల భూమి; కలదు= ఉంది; తమకున్= తమకు; చాలున్+అనరు= సరిపోతుంది అని చెప్పరు; తండ్రి; బిడ్డ= పుత్రుడు; అన్న= అగ్ర సోదరుడు; తమ్ముఁడు= (తన తరువాత తల్లిదండ్రులకు పుట్టినట్టివాడు); నాక= అనక; ఎత్తిపోయి= ఎదిరించి; పోటులు+ఆడి= యుద్ధాలు చేసి; పుడమిన్+కొంద్రు= భూమిని జయించిలాగుకుంటారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శక్తిసామర్థ్యాలు, ఉపాయం కల రాజులు, తమకు ఎంతో విశాలమైన రాజ్యం ఉన్నప్పటికీ తృప్తి చెందక, తండ్రి, కొడుకు, అన్న తమ్ముడు అనే విచక్షణ లేకుండా యుద్ధం చేసి భూమిని వారినుండి బలవంతంగా లాగుకొంటారు.

క. కావునఁ గౌరవ పాండవు । లీ వసుధకునై పెనంగు టెగ్గే? దైవం
బే వంక వ్రాలె వారిక । పోవుం గా కిది; నరేంద్ర! పొగులకు మింకన్.' 43

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= ఓ రాజా! (ధృతరాష్ట్ర మహారాజా!); కావునన్= కాబట్టి; కౌరవ పాండవులు= కౌరవులును పాండవులును; ఈ వసుధకున్+ఐ= ఈ భూమి కోసం; పెనంగుట= యుద్ధం చేయటం; ఎగ్గు+ఏ?= తప్పిదమా?; దైవంబు= అదృష్టం; ఏ వంకన్+వ్రాలెన్= ఏవైపు మ్రొగ్గు చూపిస్తుందో; వారికిన్+అ= వారికే; ఇది= (ఈ భూరాజ్యం); పోవున్+కాక= పోతుంది కదా; ఇంకన్= ఇకమీద; పొగులకుము= దుఃఖించవద్దు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! పూర్వకాలం నుండీ రాజులు భూమికోసం పోరాడుతూనే ఉన్నారు గదా. ఇప్పుడు కౌరవులతో పాండవులు భూరాజ్యం కోసం పోరాడటం వెనుకటి పరిపాటి మాత్రమేకాని క్రొత్త తప్పు కాదు. దైవం ఏ వైపు అనుకూలిస్తుందో అటు వారు యుద్ధంలో విజయం పొందగలరు. నీవు ఇంక దుఃఖించవలసింది ఏమీ లేదు.

వ. అనిన విని యాంబికేయుండు సంజయుతో 'నీ వింక సంగరంబుఁ జూడం బొమ్మని సముచితంబుగ వీడు కొలిపినం బోయి భారత రణ ప్రకారం బనుసంధించి, యతండు కతిపయ దినంబులకుం జనుదెంచి తగిన తెఱంగునం గాంచి. 44

ప్రతిపదార్థం: అనినన్+విని= (సంజయుడు చెప్పిన మాటలు ఆలకించి); ఆంబికేయుండు= అంబిక కొడుకు ధృతరాష్ట్రుడు; సంజయుతోన్; నీవు+ఇంక= నీవు ఇకమీద; సంగరంబున్= యుద్ధాన్ని; చూడన్+పొమ్ము+అని= చూడటానికి వెళ్లుము అని చెప్పి; సముచితంబుగన్= మర్యాద ప్రకారం; వీడుకొలిపినన్= వీడ్కోలు ఇవ్వగా; పోయి= (సంజయుడు) వెళ్ళి; భారత+రణప్రకారంబు+ అనుసంధించి= భారత యుద్ధం జరిగిన తీరు ఆకళింపు చేసుకొని; అతండు= (సంజయుడు); కతిపయదినంబులకున్= కొన్ని రోజులు గడచిన పిదప; చనుదెంచి= వచ్చి; తగిన+తెఱంగునన్+కాంచి= మర్యాద తీరు ప్రకారం (ధృతరాష్ట్రుడి దగ్గరకు వచ్చి) చూచి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు సంజయుడి మాటలు విన్నాడు. సంజయుడు భూగోళ విషయాలతోపాటు దుర్యోధనుడిని ప్రత్యక్షంగా నిందించాడు. అది ధృతరాష్ట్రుడిపై పరోక్ష నిందయే. అందుచేత- ధృతరాష్ట్రుడు లోలోపల కోపగించి 'ఓ సంజయా! ఇక నీవు సముచితంగా యుద్ధం చూచి వచ్చి నాకు జరిగిన విషయాలు వివరించుము' అని చెప్పాడు. అందులో అంతర్గర్భితమైన మందలింపు ఇమిడి ఉన్నది.

క. కొడుకుల దెస నెవ్వగఁ జే । డ్పడి వందురి యున్న యా నృపాలు నడుగులం
బడి, భీష్మపాటు సెప్పుచు । నడలి కరుణనాద మెసఁగ నాక్రందించెన్. 45

ప్రతిపదార్థం: కొడుకుల దెసన్= పుత్రుల యెడ (దుర్యోధనాదుల యెడ); నెఱ+వగన్= మిక్కుటమైన శోకంతో; చేడ్పడి= వ్యాకులపడి; వందురి+ఉన్న= బాధపడుతున్న; ఆ+నృపాలు+అడుగులన్+పడి= ఆ ధృతరాష్ట్రుడి పాదాలపై వ్రాలి; భీష్మపాటు= భీష్ముడి పతనం; చెప్పుచున్, అడలి= దుఃఖించి; కరుణ+నాదము= శోకంతో కూడిన గొంతు; ఎసఁగన్= వ్యాపించగా; ఆక్రందించెన్= ఏడ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కొడుకుల కోసం మిక్కుటమైన శోకంతో వ్యాకులపడియున్న ధృతరాష్ట్రుడి దగ్గరకు వచ్చి సంజయుడు ఆతని పాదాలపైబడి విలపించి భీష్ముడు యుద్ధభూమిలో పడిపోయినట్లు చెప్పాడు. ఆ సంజయుని విలాపం ఈ విధంగా సాగింది.

వ. అయ్యేడ్పుతో నిట్లని విలాపంబు సేయు. 46

ప్రతిపదార్థం: ఆ+ఏడ్పుతో+ఇట్లు+అని= ఈ విధంగా; విలాపంబు+చేయు= ఏడవటం మొదలుపెట్టాడు.

తాత్పర్యం: ఆ యేడ్పు గొంతుతో బావురుమంటూ ఇట్లా అన్నాడు.

సీ. ఆత్మయోధుల కెల్ల నాధార మగునట్టి। తనకు నస్త్రంబు లాధార మయ్యెఁ;
బరశురామునకు మే ల్సరి యైన తన యందుఁ। గలిగె భంగంబు శిఖండిచేత;
జనపతి దను నచ్చి మును జూద మొనరించె। దాను గయ్యంపు జూదమున నోడెఁ;
దనయార్పు టెలుఁగునఁ దలఁకు వైరులు వొంగ। నొఱలుచు నేలకు నొఱగె నేఁడు;

ఆ. తీవ్ర బాణజాల దీప్తులు పరఁగించి। పాండుతనయ సైన్య బహుళ తమము
లీలఁ బది దినంబు లోలి వినోదించి। యధిప! భీష్మభానుఁ డస్తమించె. 47

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఆత్మ+యోధులకు+ఎల్లన్= తన నాయకత్వంలో యుద్ధం చేసే వీరులకు అందరకు; ఆధారము+అగు+అట్టి= ఆదరువు- రక్షకుడు అయినట్టి; తనకున్= భీష్మునకు; అస్త్రంబులు= ఆయుధాలు (శరతల్పం); ఆధారము+అయ్యెన్= ఆలంబనం అయినవి; పరశురామునకున్= గండ్రగొడ్డలి ఆయుధంగా పేరు పొందిన రామునకు; మేల్+సరి+ఐన= గొప్ప ఈడు అయిన; తన యందున్= (భీష్మునకు); శిఖండి చేతన్= శిఖండి అను వాడిచేత (పేడిరూపంలో ఉన్న వీరమ్మన్యుడి చేత; భంగంబు+కలిగెన్= ఓటమి సంభవించింది; జనపతి= రాజు (దుర్యోధనుడు); తనున్+నచ్చి= (భీష్ముడి) పరాక్రమం మెచ్చుకొని; మును= లోగడ; జూదము+ఒనరించెన్= జూదం ఆడాడు; తాను= (ఇపుడు భీష్ముడు); కయ్యంపు+జూదమునన్= యుద్ధం అనే జూదంలో; ఓడెన్= ఓటమి చెందాడు; తన+ఆర్పు+ఎలుఁగునన్= తనదైన సింహనాదం యొక్క చప్పుడు చేతనే; తలకు+వైరులు= భయపడే శత్రువులు; పొంగన్= సంతోషించగా, ఒఱలుచున్= మూల్గుతూ; నేఁడు= ఈ రోజున (భీష్ముడు); ఒఱగెన్= నేలపై వ్రాలాడు; తీవ్రబాణ+జాల+దీప్తులు= మిక్కుటమైన బాణాల సమూహాల కాంతులు; పరఁగించి= వ్యాపింపచేసి; పాండు తనయ సైన్యబహుళ తమము= పాండవుల సైన్యం అనే దట్టమైన చీకటి; లీలన్= వినోదప్రాయంగా; పదిదినంబులు= పది రోజులు; ఓలి= వరుసగా; వినోదించి= ఆనందంతో విహరించి; భీష్మభానుఁడు= భీష్ముడు అనే సూర్యుడు; అస్తమించెన్= క్రుంకినాడు.

తాత్పర్యం: ఆహా! ఏమిటీ విధివైపరీత్యం! జగదేకవీరుడైన భీష్ముడా ఈ విధంగా నేలమీద పడిపోవటం! తన నాయకత్వంలో పోరాడే వీరులు అందరికీ తాను ఆలంబనమై ఉన్న భీష్ముడికి ఇప్పుడు బాణాలే ఆలంబనమైపోయాయి. (అనగా శరతల్పగతుడైనాడు). రాజలోకాన్ని ఇరువది ఏడు మారులు ఎత్తిన గండ్రగొడ్డలి దించకుండా నరికి విజయాలు సాధించిన పరశురాముడికి లొంగకుండా నిలిచి అతడికి మేల్సరియైన వీరుడు అని పేరుకెక్కిన ఆ భీష్ముడా నేడు మగసిరిలేని పేడి శిఖండి చేత జయించబడ్డాడు. దుర్యోధనుడు ఒకనాడు తనను నమ్ముకొని పాండవులను జూదంలో ఓడించి నిశ్చింతగా ఉన్నాడు. ఇప్పుడు యుద్ధం అనే జూదంలో దుర్యోధనుడు ఓడిపోయాడు గదా! తన సింహనాదము చేత శత్రువులను కంపించేటట్లు చేయగలిగినట్టి భీష్ముడు శత్రువులు ఉత్సాహంతో ఉప్పొంగిపోతూ ఉండగా నేలకువ్రాలాడు. పాండవుల సేనలు అనే చీకట్లను తన బాణాలు అనే కిరణాలతో సులువుగా అవలీలగా పోగొట్టిన భీష్ముడు అనే సూర్యుడు పదిదినములు వినోదించి అస్తమించాడు. కటకటా! ఇది విధివైపరీత్యం కాక మరేమిటి?

విశేషం: 1. భీష్ముడు పరశురాముడి శిష్యుడు. ఒకసారి కాశీరాజపుత్రికలయిన అంబ, అంబిక, అంబాలికలు అనే కన్యకలను, స్వయంవర వేదికనుండి రాజులందరినీ జయించి భీష్ముడు తన తమ్ములకు వివాహం చేయాలని తీసికొనిపోయాడు. అంబ తాను సాళ్వుడు అనే రాజును వరించినట్లు చెప్పింది. భీష్ముడు ఆమెను సాళ్వుడి కడకు పంపాడు. సాళ్వుడు నిరాకరించాడు. అప్పుడు ఆమె భీష్ముడి దగ్గరకు వచ్చి, తనను వివాహం చేసుకోమని కోరింది. భీష్ముడు తన ప్రతిజ్ఞ ప్రకారం ఆజన్మ బ్రహ్మచర్యం పాటిస్తానన్నాడు. అంబ పరశురాముడిని ఆశ్రయించింది. పరశురాముడు అంబ పక్షం వహించి భీష్ముడితో యుద్ధానికి దిగాడు. గురుశిష్యుల పోరు చాలారోజులు జరిగింది. తుదకు సమయుద్ధంగా పరిణమించింది. పరశురాముడు శిష్యుడిని అభినందించి నిష్క్రమించాడు.

2. భీష్మభానుడు= భీష్ముడికి సూర్యుడికి అభేదాధ్యవసాయం. ఈ సీసపద్యం చివరి ఆటవెలదిలో కన్పిస్తున్నది. ఇది రూపకాలంకారం.

క. **పదివేవురు రాజులు దన । కెదిరి పొలిసి రా శిఖండి యేమిటివాఁడై**
తుదిఁ బోయి తన్ను నాజిం । గదియుచుఁ బొలియించె; నియతిఁ గడవఁగ వశమే! **48**

ప్రతిపదార్థం: పదివేవురు రాజులు= పదివేలమంది రాజులు; తనకున్+ఎదిరి= తన్ను ఎదిరించి; పొలిసిరి= మరణించారు; ఆ+శిఖండి= ఆ శిఖండి; ఏమిటివాడై?= ఏమంత ఘనుడై? తుదిన్= చివరకు; పోయి= ఎదురైవచ్చి; తన్నున్= (భీష్ముడిని); ఆజిన్= యుద్ధంలో; కదియుచున్= ఎదిరిస్తూ; పొలియించెన్= పడగూల్చాడు,(నశింపజేశాడు) నియతిన్= (విధి) నిర్ణయం; కడవఁగన్= దాటగా; వశమే?= శక్యమా?

తాత్పర్యం: పదివేలమంది రాజులు భీష్ముడిని ఎదిరించి మరణించారు. ఎంత ఆశ్చర్యం! ఈ శిఖండి ఏపాటివాడు? యుద్ధంలో భీష్ముడిని ఎదిరించి పడగూల్చగలిగాడు! విధినిర్ణయం ఎవరికైనా అతిక్రమించటం సాధ్యం కాదు.

తే. **చాపవక్త్రుండు భల్లదంష్ట్రావితాన । ఘోరమూర్తి నారాచనఖుండు ఖడ్గ**
జిహ్వికాభీషణుఁడు నరసింహమూర్తి । గాక కేవల నరుఁడె గంగాసుతుండు!' **49**

ప్రతిపదార్థం: చాపవక్త్రుండు= విల్లు అనెడి నోరు గలవాడు; భల్ల,దంష్ట్రా,వితాన,ఘోర,మూర్తి= బల్లెములనే కోరల సమూహం చేత భయంకరాకారుడు; నారాచ+నఖుండు= బాణాలనెడి గోళ్ళు కలవాడు; ఖడ్గ జిహ్వికా, భీషణుఁడు= కత్తి అనెడు నాలుకచేత భయం గొలిపేవాడు; నరసింహమూర్తి+గాక= మానవుడు సింహం కలిసిన ఆకారం కలవాడు- విష్ణుదేవుడి అవతారం కాక; గంగాసుతుండు= గంగ కొడుకు- భీష్ముడు; కేవల+నరుఁడు+ఎ?= మానవమాత్రుడా? కాదని అర్థము.

తాత్పర్యం: ధనుస్సు అనెడి నోరు గలవాడు, బల్లెములనెడు పలువరుసలచేత భయంకరాకారుడు, బాణాలు అనెడు గోళ్ళు గలవాడు, కత్తి అనెడు నాలుకతో భీతి కలిగించేవాడు, విష్ణుమూర్తి అవతారమైన నృసింహమూర్తియే భీష్ముడు - కేవలం మానవమాత్రుడు కాడు.

విశేషం: 1. దశావతారాలలో నృసింహాకారం మిక్కిలి భయంకరమైనది. భీష్ముడు యుద్ధభూమిలో అపర నృసింహావతారమే. హిరణ్యకశిపుడిని సంహరించి ప్రహ్లాదుడిని రక్షించిన పౌరాణిక గాథ ఇట స్మరించదగింది. భారత రచన నాటికే నృసింహగాథ బహుళ ప్రచారంలోకి వచ్చింది అనటానికి ఈ పద్యం ఒక నిదర్శనం. నృసింహ పురాణం సంస్కృత మహాభారతం తరువాతనే రచించబడినదని వాదించేవారు ఉన్నారు. అయితే పురాణ గాథలు లోకంలో పురాణాలు రచించబడక పూర్వమే వ్యాపించి ఉన్నట్లు భావించవచ్చును.

ధృతరాష్ట్రుఁడు భీష్మ మరణంబు విని విలపించుట (సం. 6-14-1)

వ. అని సంజయుండు పలవించు పలుకులకుఁ జిత్తంబు జల్లని యొల్లంబోయి మూర్ఛిల్లి కొండొక సేపునకు శిశిర విధానంబుల సేద దేఱి ధృతరాష్ట్రుండు గన్నీరు దొరంగ గద్గదకంఠుండై. 50

ప్రతిపదార్థం: అని సంజయుండు, పలవించు పలుకులకున్= దుఃఖంతో ఆకులుడై చెప్పిన మాటలకు; చిత్తంబు= మనస్సు; జల్లు+అని= సంచలించి, కొట్టుకొని; ఒల్లన్+పోయి= స్వాస్థ్యం తప్పి, అదరిపడి; మూర్ఛిల్లి= స్పృహ తప్పి; కొండొక+సేపునకున్= కొంత సమయము గడచిన పిమ్మట; శిశిర విధానంబులన్= చల్లదనం చేకూర్చే ఉపచారముల వలన; సేద+తేఱి= కోలుకొని; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; కన్నీరు= కంటినీరు; తొరంగన్= కారగా; గద్గదకంఠుండు+ఐ= డగ్గుత్తిక పడిన కంఠం కలవాడై, (బొంగురు పోయిన గొంతుగలవాడై)

తాత్పర్యం: భీష్మపతనమునకు కలతచెంది, దుఃఖంతో వ్యాకులత చెంది పలవిస్తూ ఉన్న సంజయుడి మాటలు విని ధృతరాష్ట్రుడు స్పృహతప్పి పడిపోయాడు. అతడికి శీతలోపచారాలు చేసిన పిమ్మట కోలుకొని కన్నీరు కారుస్తూ.

క. ' దేవాసురవరు లొక్కటి । యై వచ్చినఁ జిక్కువఱుచు నాహవమున నా
దేవవ్రతుఁడు శిఖండి శ । రావలి పాలయ్యెఁ; నేమి యనఁగల దింకన్! 51

ప్రతిపదార్థం: దేవ+అసురవరులు+ఒక్కటి+ఐ= దేవతలలో రాక్షసులలో గొప్పవారు ఏకమై; వచ్చినన్= (యుద్ధానికి) వచ్చినప్పటికిని; ఆహవమునన్= యుద్ధంలో; ఆ దేవవ్రతుఁడు= ఆ భీష్ముడు; చిక్కుపఱచున్= చీకాకుపడేటట్లు చేసి ఓడించగలడు (అట్టివాడు); శిఖండి, శరావలి, పాలు+అయ్యెన్= శిఖండి బాణాల బారిని పడ్డాడు; ఇంకన్= ఇకమీద; ఏమి+అనన్+కలదు?= చెప్పటానికి ఏముంది?

తాత్పర్యం: దేవతలలో రాక్షసులలో ఉన్న గొప్ప వీరులు కలిసి ఏకమై దండెత్తి వచ్చినప్పటికీ వారిని యుద్ధంలో ఓడించగల శక్తిగలవాడు భీష్ముడు. అట్టివాడు ఒక సామాన్య వీరుడైన శిఖండి చేత నిర్జింపబడటం వింతలలో వింత కదా!

ఉ. అంచిత తాలకేతుకిరణాళి మెఱుంగులు గాఁగ, మౌర్వి మ్రో
యించుట గర్జచందముగ నేచి విరోధిదవానలంబు మా
యించు శితాస్త్రవర్షమున నిట్టిది భీష్మమహాభ్ర; మె ట్లడం
గించెనొకో శిఖండి యను కృత్రిమ వాయువు దాఁకి దైవమా! 52

ప్రతిపదార్థం: అంచిత= ఒప్పినట్టి; తాలకేతుకిరణ+ఆళి= తాడిచెట్టు జెండా నుండి వెలువడే వెలుగు రేకల గుంపుల తళతళలు; మెఱుంగులు కాఁగన్= మెఱుపులు కాగా; మౌర్విన్= అల్లె త్రాటిని; మ్రోయించుట= నినదింప చేయటం; గర్జ, చందముగన్= ఉరుముగా; ఏచి= విజృంభించి; విరోధి దవ+అనలంబున్= శత్రువులు అనే కార్చిచ్చును; శిత+అస్త్రవర్షమునన్= వాడి బాణములు అనే వానచేత; మాయించున్= అణగింపచేయును; ఇట్టిది= ఇటువంటిది; భీష్మ మహా+అభ్రము= భీష్ముడు అనే గొప్ప మేఘం; దైవమా!= ఓ భగవంతుడా!; శిఖండి+అను= శిఖండి అనెడి; కృత్రిమ, వాయువు= కపటమైన గాలి; తాఁకి= ఎదిర్చి; సోకి, ఎట్లు= ఏవిధంగా; అడంగించెను+ఒకో!= ఏ విధంగా అణగగొట్టిందో!

తాత్పర్యం: భీష్ముడి రథంపై ఒప్పునట్టి తాడిచెట్టు జెండా వెలుగొందుతూ ఉంటుంది. దాని వెలుగుల మొత్తమే మెరుపు తీగలై మిరుమిట్లుగొలుపుతుంది. అతడి ధనుస్సుకు పొదిగిన అల్లెత్రాటి ధ్వని ఉరుములవలె వినిపిస్తుంది.

శత్రువులు అనే కార్చిచ్చును అతడి బాణవర్షం ఆర్పివేస్తుంది. అయితే- శిఖండి అనే కృతక వాయువు భీష్మ మేఘాన్ని ఏ విధంగా అణగ గొట్టగలిగిందో ఆ దైవానికే తెలియాలి.

విశేషం: అలం: రూపకం. తాళకేతు కిరణాళి మెరుపులుగా, అల్లెత్రాటి మ్రోత గర్జగా, విరోధులు దావాగ్నిగా శితాస్త్రాలు వర్షంగా భీష్ముడు గొప్ప మేఘంగా, శిఖండి కృత్రిమవాయువుగా రూపింపబడ్డారు.

తే. **పెరిఁగి పాండవాంబుధి వెల్లివిరిసినపుడు । నిలువ నిమ్మగు దీవిగా నిన్నుఁ దలఁచి**
యుండ నత్యంతతుచ్ఛ శిఖండి పల్వ । లాక్రమంబున మునిగితే యకట తండ్రి! **53**

ప్రతిపదార్థం: పాండవ+అంబుధి= పాండవులు అనే సముద్రం; పెరిఁగి, వెల్లివిరిసినపుడు= పొంగి పొరలి విజృంభించినపుడు; నిలువన్+ఇమ్ము+అగు+దీవిగాన్= నిలిచియుండటానికి తగిన ద్వీపంగా; నిన్నున్+తలఁచి+ఉండన్= నిన్ను భావించి ఉండగా; అత్యంత+తుచ్ఛ+శిఖండి+పల్వల+ఆక్రమంబునన్= మిక్కిలి నీచుడైన శిఖండి అనే గుంట వశమై; తండ్రి!= ఓ భీష్ముడా!; అకట= అయ్యో!; మునిగితి(వి)+ఏ?= మునిగిపోయావా?

తాత్పర్యం: పాండవులు అనే సముద్రం పొంగి పొరలి విజృంభించినప్పుడు, ఓ తండ్రి! భీష్ముడా! కౌరవులు నిలిచేందుకు తగిన దీవిగా నిన్ను భావించాము. కాని, మిక్కిలి అల్పుడైన శిఖండి అనే చిన్న గుంతకువశమై మునిగి పోయావా?

విశేషం: అలం: రూపకం. పాండవాంబుధి - పాండవులనెడి సముద్రం, నిన్ను దీవిగా, శిఖండి అనెడి పల్వలం. ద్వీపం. నాలుగు వైపులా నీటిచేత చుట్టబడిన భూప్రదేశం.

ఉ. **వీరరసాంబుపూరమును విశ్రుతబాహు మహోగ్ర సత్త్వముం**
జారుగదాధ్వజాచలవిశాలము నంబకజాలవీచికా
స్ఫారము నైన భీష్ముఁడను సాగరముం గడవంగ నీఁదఁగా
నేరిమి యెట్లొకో కలుగ నేర్చె శిఖండికి? నేమి సేయుదున్! **54**

ప్రతిపదార్థం: వీరరస+అంబు+పూరమును= వీరరసం అనే నీటి ప్రవాహమూ; విశ్రుత, బాహు, మహా+ ఉగ్ర, సత్త్వమున్= పేరుకెక్కిన భయంకరమైన క్రూరమృగాలు కలదియు; చారు, గదా, ధ్వజ+ అచల విశాలము= అందమైన, గదలు జెండాలనెడి కొండలచేత విస్తీర్ణమై నట్టిదియు; అంబక, జాల, వీచికా, స్ఫారము= బాణాల సమూహాలు అనెడి కెరటాలతో వెలుగొందునట్టి; భీష్ముఁడు+అను+సాగరమున్= భీష్ముడు అనెడి సముద్రాన్ని; కడవంగన్+ఈఁదఁగా- అవ్వలి ఒడ్డుచేరేటట్లు ఈదగా; శిఖండికిన్; నేరిమి= నేర్పు, సామర్థ్యం; ఎట్లు+ఒకో= ఏ విధంగా; కలుగనేర్చెన్= చేకూరింది; ఏమి+చేయుదున్?= ఏం చేస్తాను?

తాత్పర్యం: భీష్ముడనే సముద్రాన్ని దాటటానికీ, ఈదటానికీ ఎవరికీ శక్యం కాదు. అది వీరరసమనేజల సమూహం కలదీ, ప్రసిద్ధికెక్కిన బాహుబలమనే భయంకర జలజంతువులు కలదీ, అందమైన గదలు ధ్వజాలు మొదలైన వాటి చేత మహాపర్వతాలతో విశాలమైనదీ బాణ సమూహాలనే అలల పొంకం గలది. అటువంటి భీష్మసాగరాన్ని శిఖండి ఎట్లా దాటగలిగాడు? ఈదగలిగాడు? ఆశ్చర్యంగా ఉన్నది? ఇప్పుడేమి చేసేది? అసహాయుడనయ్యాను.

విశేషం: ఈ పద్యంలో భీష్ముడికీ సముద్రానికీ అభేదాధ్యవసాయం కల్పించబడింది. వీరరసంలో భీష్ముడికి రసాంబుపూరం సముద్రానికి, విశ్రుత బాహు పరాక్రమం భీష్ముడికి, మహోగ్రసత్వం సముద్రానికి (సత్త్వము= బలం అని ఒక అర్థం- జంతువు అని మరో అర్థం) గదాధ్వజములు భీష్ముడికి అచలములు సముద్రమునకు అంబక జాలములు భీష్ముడికి, అంబక జాలముల

వంటి కెరటాలు సముద్రానికి అన్వయం. ఇది రూపకాలంకారం. వీరరసం అంబుపూరంగా, బాహువులు మహోగ్రసత్త్వాలుగా గదాధ్వజములు అచలాలుగా, అంబక జాలాలు కెరటాలుగా భీష్ముడు సముద్రంగా రూపించబడ్డాయి.

తే. అంబకై పూని వచ్చి బలాధికుండు । జామదగ్న్యుండు సాధింపఁ జాలకున్న
వాని భీష్ముఁ బాండవులకై పూని వచ్చి । కడిమి సాధించి తౌర! శిఖండి పోర. 55

ప్రతిపదార్థం: అంబకై= అంబకోసం (కాశీరాజు పుత్రికకై); పూని= కడగి; వచ్చి= యుద్ధానికి వచ్చి; బల+అధికుండు= అధికమైన బలంచేత గొప్పవాడు; జామదగ్న్యుండు= జమదగ్ని కొడుకు - పరశురాముడు; సాధింపన్+చాలక+ఉన్నవానిన్= ఓడింపలేకపోయిన వాడిని; అనగా అట్టి గొప్ప వీరుడిని; భీష్మున్= భీష్ముని, పాండవులకై+పూని= పాండవుల కొరకు కడగి; వచ్చి= (యుద్ధానికి) వచ్చి; కడిమిన్= పరాక్రమంతో; పోరన్= యుద్ధంలో; సాధించితి(వి)= సాధించావు; శిఖండి!= ఓ శిఖండీ!; ఔర!= ఆహా!.

తాత్పర్యం: ఓ శిఖండీ! అంబ కోసం దండెత్తి వచ్చి, పరశురాముడు వంటి మహావీరుడు భీష్ముడిని జయించలేక పోయాడు కదా! నీవు పాండవుల కోసం యుద్ధం చేసి ఆ జగదేకవీరుడిని జయించావు. ఎంతటి ఆశ్చర్యం!

విశేషం: అంబ వృత్తాంతం- 47వ పద్య వ్యాఖ్యానం చూడవచ్చును.

క. ఆ శౌర్యం బా సత్త్వం । బా శీలం బా పరాక్రమాభీలత్వం
బా శుద్ధవ్రత మెందు న । నాశము లని భీష్ముఁ బెద్ద నమ్మితిమి గదే. 56

ప్రతిపదార్థం: ఆ శౌర్యంబు= ఆ పరాక్రమం; ఆ సత్త్వంబు= ఆ బలం; ఆ శీలంబు= ఆ సత్ ప్రవర్తన; ఆ పరాక్రమ+ఆభీలత్వంబు= ఆ పరాక్రమంచేత కూడా భయంకరత్వం; ఆ శుద్ధ+వ్రతము= ఆ మంచినిష్ఠ; ఎందున్= ఎచ్చట అయినా; అనాశములు= నశించనట్టివి; అని; భీష్మున్= భీష్ముడిని; పెద్ద= ఎక్కువగా; నమ్మితిమి+కదే!= విశ్వసించాం కదా!

తాత్పర్యం: ఆహా! ఆ పరాక్రమం, ఆ బలం, ఆ సత్ప్రవర్తన, ఆ భయంకర ప్రతాపం, ఆ మంచి నిష్ఠ ఎప్పుడూ నాశనం కావని ఆ భీష్ముడిని అమితంగా విశ్వసించాము కదా!

విశేషం: భీష్ముడి అసలు పేరు దేవవ్రతుడు. తండ్రియైన శంతనుడు సత్యవతి అనే కన్యకను మోహించాడు. సత్యవతి తన తండ్రిని అడుగుమన్నది. సత్యవతి తండ్రి దాశరాజు తన కూతురు కొడుకుకే రాజ్యం సంక్రమించాలని అన్నాడు.

దేవవ్రతుడు తండ్రికోసం - తాను ఆ జన్మ బ్రహ్మచర్య దీక్షను వహిస్తానని "భీష్మ" ప్రతిజ్ఞ చేశాడు. ఆనాటి నుండి దేవవ్రతుడికి భీష్ముడు అనే బిరుదనామం సంక్రమించింది. శుద్ధవ్రతుడుగా సారస్వతంలో భీష్ముడు సుప్రసిద్ధుడైనాడు.

వ. అని బహుప్రకారంబులం బలవించి యా సూతనందను చేసేతం గీలించి. 57

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; బహుప్రకారంబులన్= పలురకాలుగా; పలవించి= దుఃఖంతో కూడిన మాటలు పలికి; ఆ సూతనందను= ఆ సూతపుత్రుడి- సంజయుడి; చే+చేతన్+కీలించి= (తన చేతితో ఆతడి) చేతిని పట్టుకొని.

తాత్పర్యం: ఆ విధంగా చెప్పి, ధృతరాష్ట్రుడు తన చేతితో ఆ సంజయుడి చేయి పట్టుకొని ఈ విధంగా అన్నాడు.

సీ. 'అతఁడు నొచ్చిన తఱి నడ్డంబు సొచ్చెద । మని వచ్చువారు లేరైరె యచట?
నడరి పోరాడక యన్ని యక్షౌహిణు । లొప్పరికించెనె యొకనిఁ గలన?
నతని నోర్వఁగఁ జాలవని నిశ్చయించితి । మంతకు నోపెనే యరిబలములు?
ద్రోణుండుఁ గృపుఁడును ద్రోణసుతుండును । శల్యుండుఁ గ్రేడించి చనిరె యపుడు?

తే. పాండుసుతులు శిఖండియుఁ జండశక్తి। మెఱయ నొక్కటఁ బైఁ బడ్డ వెఱచి తాత
విడిచి నా పుత్రులందఱు విఱిఁగి యడవిఁ। గలిసిరొకో? యాతనికిఁ బడవలసె నకట! 58

ప్రతిపదార్థం: అతఁడు= (భీష్ముడు); నొచ్చిన+తఱిన్= బాధపొందినపుడు; అడ్డంబు+చొచ్చెదము+అని= (అతడికి శత్రువులకు) మధ్య నిలువగలమని అని; వచ్చువారు= (ముందుకు వచ్చి) పూనువారలు; అచటన్= అక్కడ; లేరు+ఐరె?= లేకపోయారా?; కలనన్= యుద్ధమునందు; అదరి= పూని; పోరాడక= యుద్ధం చేయక; అన్ని+అక్షౌహిణులు= అన్ని వేల మంది భటులతో కూడిన సేనలు, ఒకనిన్= ఒకనిని ఒంటరిగా చేసి; ఒప్పరికించెను+ఎ= ఉపేక్షించాయా?; అతనిన్= భీష్ముడిని; అరి+బలంబులు= శత్రుసేనలు; ఓర్వఁగన్+చాలవు+అని= గెలువనేరవు; అని; నిశ్చయించితిమి= నిశ్చయించాము; అంతకున్+ఓపెనే?= అంత పనిచేశాయా?- అనగా ఆ భీష్ముడిని జయించగలిగాయా?; అపుడు= ఆ సమయంలో; ద్రోణుండున్=ద్రోణుడున్నూ; కృపుడును=కృపాచార్యుడున్నూ; ద్రోణసుతుండును=ద్రోణాచార్యుడి పుత్రుడు అశ్వత్థామయున్నూ; శల్యుండున్= శల్యుడును; క్రేడించి+చనిరె?= ఉపేక్షించి వెళ్ళిపోయారా?; పాండుసుతులు= పాండవులు; శిఖండియున్= శిఖండియు; చండ+శక్తిన్= తీవ్ర బలం; మెఱయన్= వెలుగొందుతుండగా; ఒక్కటన్+పైన్+పడ్డ= ఏకమై మీదపడగా; వెఱచి= భయపడి; తాత+విడిచి= పితామహుడైన భీష్ముడిని వదలిపెట్టి; నా పుత్రులు+అందఱున్= నా కొడుకులు ఎల్లరు (దుర్యోధనాదులు); విఱిగి= ఓడిపోయి; అడవిన్= అడవిలో; కలిసినారు+ఒకొ?= కలిసిపోయారా! ఏమి?; ఆతనికిన్= భీష్ముడికి; అకట!= అయ్యో!; పడవలసెన్= (నేలమీద) పడవలసి వచ్చింది.

తాత్పర్యం: భీష్ముడు యుద్ధంలో అలసటచెంది బాధపడేటప్పుడు, శత్రువులను ఎదిరించి అడ్డం నిల్చినవారు అక్కడ లేకపోయారా? యుద్ధంలో అక్షౌహిణులలో వేలకొలది భటులు చేరి పోరాడుతున్నారుగదా; భీష్ముడిని ఏకాకిగా చేసి వారందరూ ఊరకున్నారా? భీష్ముడిని శత్రువులు గెలవ లేరనే నమ్మకంతో వారందరూ ఉండగా వారు ఆతడిని పడగొట్టగల్గారా? ద్రోణుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, శల్యుడు ఏమయ్యారు? అక్కడ లేరా? ఉంటే ఉపేక్షించి వేరే చోటికి పారిపోయారా? దేదీప్యమానమైన బలంతో పాండవులు శిఖండితో కూడి భీష్ముడిపై పడినపుడు నా కొడుకులు దుర్యోధనుడు మున్నగువారు భయపడి అడవిలోకి పారిపోయారా? అయ్యో! భీష్ముడు నేలపై పడిపోవలసి వచ్చింది?

వ. దేవవ్రతుండు దెగినయప్పుడ తక్కినయంతవట్టునుం దెగియనకాఁ దలంచెద' నని మఱియు నిట్లనియె. 59

ప్రతిపదార్థం: దేవవ్రతుండు= భీష్ముడు; తెగిన+అప్పుడు+అ= ఓడిపడిపోయినప్పుడే; తక్కిన+అంత+పట్టును= మిగిలిన మేర అంతా (మిగిలిన సేనలోని వారందరూ); తెగి+అన+కాన్= ఓడిపడిపోయినట్లే; తలంచెదన్= భావిస్తాను; అని మఱియున్+ఇట్లు+అనియెన్= అని చెప్పి, తిరిగి ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: భీష్ముడు పడిపోయినప్పుడే తక్కిన అందరూ పడిపోయినట్లే భావిస్తాను.

సీ. ' కులగురు వృద్ధు నిర్మలచిత్తు గాంగేయుఁ। జంపి రాజ్యము సేయ సమ్మతించి
తొడరిన పాండుపుత్రులకును దైవంబుఁ । దోడయ్యెఁ; ధర్మంబు గీడుపఱిచి
పరఁగి యధర్మంబు పెరిఁగిన ట్లున్నది;। వార లాతనిఁ గూల్చి వసుధఁ గొనఁగ
నిశ్చయించుట గడు నిష్ఠురత్వము; దాని। కంటెను బాపంబు గాదె మనకు

తే. సంగరంబున నాతండు సచ్చు టోర్చి। సంపదకుఁ గాఁ బెనంగిన చంద మరయఁ;
గులములం దెల్ల నీ రాచకులము సాల। బెట్టిదం; బిక్కులంబునఁ బుట్ట నగునె?' 60

ప్రతిపదార్థం: కులగురు వృద్ధున్= వంశంలో పెద్దవాడు ముసలివాడిని; నిర్మల+చిత్తున్= పరిశుద్ధమైన మనస్సు గలవాడిని; గాంగేయున్= గంగకొడుకైన భీష్ముడిని; చంపి= సంహరించి; రాజ్యంబు+చేయన్+సమ్మతించి తొడరిన= ప్రభుత్వం చేయటానికి అంగీకరించి పూనిన; పాండుపుత్రులకును= పాండవులకు; దైవంబు= అదృష్టం; తోడు+అయ్యెన్= సాయం చేసింది; ధర్మంబున్= ధర్మాన్ని; కీడుపఱిచి= చెరిచి; అధర్మంబు= అధర్మం; పరఁగి= ఒప్పి; పెరిఁగినట్లు+ఉన్నది= అభివృద్ధి చెందినట్లు ఉన్నది; పరఁగి= విలసిల్లు; వారలు= (పాండవులు); ఆతనిన్= భీష్ముడిని; కూల్చి= పడగొట్టి; వసుధన్= భూమిని; కొనఁగన్+నిశ్చయించుట= స్వీకరించాలని నిర్ణయించుకొనటం; కడున్= మిక్కిలి; నిష్ఠురత్వము= కఠినమైనపని; దానికంటెను= (పాండవులు భీష్ముడిని పడగొట్టటంకంటె); సంగరంబునన్= యుద్ధంలో; ఆతండు= (భీష్ముడు); చచ్చుట+ఓర్చి= మరణించటం సహించి; సంపదకున్+కాన్= ఐశ్వర్యం కోసం; పెనంగిన= పోరాడిన; చందము= విధం; అరయన్= చూడగా; మనకున్= మనకు (కౌరవులకు); పాపంబు+కాదె?= పాపం కదా?; ఈ రాచకులము= ఈ క్షత్రియ కులం; కులములందున్+ఎల్లన్= అన్ని కులాలలో?; చాల= మిక్కిలి; బెట్టిదంబు= క్రూరమైనది. ఈ+కులంబునన్= (ఈ రాచకొలంలో); పుట్టన్+అగునె?= పుట్టటం మంచిదా?

తాత్పర్యం: ' కౌరవవంశంలో గౌరవపాత్రుడు వయోవృద్ధుడు అయిన భీష్ముడిని సంహరించి రాజ్యం చేయాలని సంకల్పించిన పాండవులకు భగవంతుడు సాయం చేయటం వింతగా ఉన్నది. ధర్మమును అణగద్రొక్కి, అధర్మం అభివృద్ధి చెందినట్లుంది. సరే. భీష్ముడిని చంపి, రాజ్య మేలాలని చూచిన పాండవుల మాట అటుంచి, భీష్ముడుయుద్ధంలో చావడానికి ఓర్చుకొని సంపదకై పోరాడటం దానికంటె పాపం కాదా? అన్ని కులాలలో రాచకొలం మిక్కిలి కఠినమైనది. ఈ క్షత్రియకులంలో పుట్ట వచ్చునా?' అన్నాడు ధృతరాష్ట్రుడు.

వ. అని పలుమాట లాడి వెండియు. 61

తాత్పర్యం: ఆ విధంగా పెక్కు పలుకులు పలికి, ధృతరాష్ట్రుడు మరల ఈ విధంగా మాటాడాడు.

ఆ. మగఁడు లేని మగువ మాడ్కి గాకున్నె నా । సేన భీష్ము లేమిఁ జేసి నేఁడు;
కురుకుమారు లెంత గుందిరో? యెవ్వరే । మైరొ? యింక నెట్టు లగుదు రొక్కొ! 62

ప్రతిపదార్థం: నేఁడు= ఈ దినమునందు; నా సేన= నా సైన్యం; భీష్ము+లేమిన్+చేసి= భీష్ముడు లేకపోవటం చేత; మగఁడు, లేని, మగువ, మాడ్కి= భర్తలేని భార్యవలె (విధవవలె); కాక+ఉన్నె?= కాకుండునా?; కురుకుమారులు= కౌరవులు; ఎంత+కుందిరి+ఓ?= ఎంత దుఃఖించినారో; ఎవ్వరు+ఏమి+ఐరొ?= ఎవ్వరు ఏ విధంగా వర్తించారో; ఇంకన్= ఇకమీద; ఎట్టులు= ఏ రీతిగా; అగుదురు+ఒక్కొ!= అవుతారో గదా!

తాత్పర్యం: ఈనాడు, భీష్ముడు లేని నా సైన్యం, భర్త లేని భార్యవలె కాలేదా? ఇక కౌరవులు ఏ విధంగా దుఃఖంలో మునిగిపోయారో? ఏమయ్యారో? ఇకమీద ఏమౌతారో కదా!

క. రాజులు మంత్రులు ననియెడు । నా జూదరు లాత్మ నేమి యని తలఁచిరొ? యే
యోజం బలికిరొకో! తమ । కాజికి నిట మీఁద నెవ్వ రాధారంబో?' 63

ప్రతిపదార్థం: రాజులు= ప్రభువులు (యుద్ధం చేసే రాజులు); మంత్రులు= రాజులకు హితవు బోధించేవారు; అనియెడు= అని చెప్పబడే ఆ జూదరులు (ఆ జూదం ఆడేటటువంటివారు); ఆత్మన్= మనస్సులో; ఏమి+అని= ఏమని; తలఁచిరొ= ఆలోచించారో; ఏ+ఓజన్= ఏ రీతిగా; పలికిరి+ఒకో= మాటాడారో గదా; తమకున్= ఆ రాజులకు, మంత్రులకు; ఆజికిన్= యుద్ధానికి; ఇటమీదన్= ఇకపై; ఎవ్వరు= ఎవరు; ఆధారంబు+ఓ?= ఆలంబనమో?

తాత్పర్యం: రాజులు (దుర్యోధన దుశ్శాసనులు) మంత్రులు (కర్ణ శకునులు) అనే జూదరులు మనసులో ఏమనుకొన్నారో? ఏ రీతిగా మాట్లాడారో? ఇక మీదట యుద్ధానికి ఆధారమెవ్వరో?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి సంజయుకరంబు విడిచి 'కయ్యం బెయ్యెడం బొడిచిరి? పది దినంబులు నుభయబలంబుల వారును నెవ్విధంబున మోహరించి? రెవ్వ రెవ్వ రెప్పు డెప్పు డేమి సేసి? రిన్నాళ్ళు గాంగేయుఁ డెబ్భంగుల సంగరంబు సేసెఁ దుది నెత్తెఱంగునం దెగియె? నంతయు వివరించి పరిపాటిం దేటపడం జెప్పుము. 64

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; సంజయుకరంబు= సంజయుడి చేయి; విడిచి= వదలి; కయ్యంబు= యుద్ధం; ఏ+ఎడన్=ఎక్కడ; పొడిచిరి= చేశారు. పది+దినంబులున్= పదిరోజులు; ఉభయ+బలంబులవారును= రెండు సేనలలోని వారును (కురుపాండవ సేనలలోనివారు); ఏ+విధంబునన్= ఏ రీతిగా; మోహరించిరి= వ్యూహాలు పన్నారు?; ఎవ్వరు+ఎవ్వరు= ఎవరెవ్వరు; ఎప్పుడు+ఏమి, చేసిరి?= ఎప్పుడు ఏమేమి చేశారు?; ఇన్నాళ్ళు= ఇన్నిరోజులు; గాంగేయుఁడు= భీష్ముడు; ఏ+భంగులన్= ఏవిధంగా; సంగరంబు+చేసెన్?= యుద్ధం చేశాడు?; తుదిన్= చివరకు; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; తెగియెన్?= పడిపోయాడు?; అంతయున్= అంతా; వివరించి= వివరాలతో చెప్పి; పరిపాటిన్= వరుసగా; తేటపడన్= తెల్లమయ్యేటట్లుగా; చెప్పుము= చెప్పుము.

తాత్పర్యం: అని చెప్పి, ధృతరాష్ట్రుడు సంజయుడి చేతిని విడిచిపెట్టి, పిదప ఈ విధంగా ప్రశ్నించాడు. యుద్ధం ఎక్కడ చేశారు? 'ఈ పది రోజులు యుద్ధం ఏ విధంగా జరిగింది? కౌరవ పాండవ సేనలలోనివారు ఏ విధంగా వ్యూహాలు పన్నారు? ఎవ్వ రేమేమి చేశారు? ఇన్ని దినాలు భీష్ముడు ఏ విధంగా యుద్ధం చేశాడు? చివరకు ఏ విధంగా కూలిపోయాడు? అంతా సవిస్తరంగా నాకు వివరించి చెప్పుము?

విశేషం: భీష్ముడు యుద్ధభూమిలో పడిపోయిన సంగతి సంజయుడు చెప్పినపుడు - ధృతరాష్ట్రుడు మూర్ఛపోయాడు. తెప్పిరిల్లిన పిదప ఆతడు సంజయుడి చేయిపట్టుకొని దుఃఖించాడు. 57వ పద్యంలో ధృతరాష్ట్రుడు సంజయుడి చేయిపట్టుకున్నట్లు ఉన్నది 64వ పద్యంలో అతడు సంజయుని చేయి వదలినట్లు ఉన్నది. పదినాళ్ళ యుద్ధంలోని వివరాలు ధృతరాష్ట్రుడు సంజయుడికి దూరంగా కూర్చొని విశ్రాంతిగా విన్నాడు. కథాకథనంలో తిక్కన నిశితదృష్టికి ఇది ఒక చక్కని ఉదాహరణం.

ఉ. నెట్టన యాపగాసుతుఁడు నేలకు వ్రాలె ననంగ విన్న నా
కట్టిఁడి వీను లేమి వినుకాఁటియ కోర్వవు? దుర్వినీతికిం
బుట్టినయిల్లనై వినక పోవఁగ వచ్చునె? యింక నాకు నే
దిట్టఁడ నైతి; నెల్లవియుఁ దెల్లముగా విననేర్తు సంజయా!' 65

ప్రతిపదార్థం: నెట్టన= పూనికతో; ఆపగాసుతుడు= నదీనందనుడు- భీష్ముడు; నేలకున్+వ్రాలెను+అనంగన్= భూమిమీద పడిపోయాడు అని చెప్పగా; విన్న= ఆలకించిన; నా+కట్టిఁడి+వీనులు= కఠినమైన నా చెవులు; ఏమి కాఁటియకున్ ఓర్వవు?= ఏ కష్టమును విన సహించవు? (ఎట్టి దుర్వార్తలు ఐనా వినగలవు); దుర్+వినీతికిన్= చెడ్డవిధానానికి; పుట్టిన+ఇల్లను+ఐ= జన్మస్థానమునై; వినక పోవఁగన్ వచ్చునె+ఇంక+నాకున్= ఇకమీద నాకు వినకుండా తప్పుతుందా?; సంజయా= ఓ సంజయా!; నే+దిట్టఁడన్+ఐతి= నేను ధైర్యవంతుడను అయినాను; అనగా నా మనస్సు గట్టిపడింది అని అర్థం; ఎల్ల+అవియున్= అన్నిటిని; తెల్లముగాన్= సుస్పష్టంగా; వినన్‌నేర్తున్= ఆలకించగలను.

తాత్పర్యం: దీక్షతో యుద్ధం చేసిన- భీష్ముడు యుద్ధభూమిలో పడిపోయాడన్న వార్త విన్న నా చెవులు ఎట్టి దుర్వార్తలనైనా వినగలవు. దుష్టమైన నీతికి నేను పుట్టినిల్లును. నా మనస్సు బండబారింది. ఓ సంజయా! నీవు వెనుకాడక, ఏ విధంగా యుద్ధం జరిగిందో- అంతా నాకు తేటతెల్లంగా తెలియచెప్పుము. సందేహించవద్దు.

వ. అనిన విని సంజయుం డతని కిట్లనియె 66

తాత్పర్యం: అనగావిని, సంజయుడు ధృతరాష్ట్రుడితో ఈ విధంగా అన్నాడు.

ఆ. అధిప! నీవు సెప్పినట్టిద; నీ యవి । నీతిఁ జేసి ధర్మనిరతు లైన
పాండుసుతుల కన్ని పాటులు వాటిల్లె; । నింత దెచ్చికొంటి వంత సేసి. 67

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ధృతరాష్ట్ర మహారాజా!); ఈవు= నీవు; చెప్పిన+అట్టిది+అ= చెప్పిన విషయం వాస్తవం; నీ+అవినీతిన్+చేసి= నీ అవినీతి చేత; ధర్మనిరతులు+ఐన= ధర్మము ఆచరించుటయందు దీక్ష గలిగినట్టి; పాండుసుతులకున్= పాండవులకు; అన్ని+పాటులు= అన్ని దురవస్థలు; పాటిల్లెన్= ఏర్పడ్డాయి; అంత+చేసి= అంత అవినీతి నీవు చేయటం చేత; ఇంత= ఈ దురవస్థ (అనగా భీష్ముడి పతనం); తెచ్చుకొంటివి= తెచ్చుకొన్నావు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీవే ఒప్పుకొన్నావుగదా! నీ అవినీతి వలననే ధార్మికులైన పాండవులకు ఇన్ని బాధలు కలిగాయి. నీవు అవివేకం వలన ఇంతటి దురవస్థ తెచ్చుకున్నావు. నీది స్వయం కృతాపరాధం. నీ కర్మ నిన్ను కట్టికుడుపుతున్నది.

క. కీ డొనరించినవారికిఁ । గీ డగు టరుదయ్య? మేలు గీ డేమియు నీ
వాడక విను; ననుఁ గయ్యముఁ । జూడఁగఁ బుచ్చుట వినంగఁ జూచియ కాదే! 68

ప్రతిపదార్థం: కీడు= అపకారం; ఒనరించిన వారికిన్= చేసినవారికి; కీడు= అశుభం (నష్టం); అగుట= సంభవించటం; అరుదు+అయ్య?= అరుదా?- అరుదుకాదు- తరచుగా సంభవిస్తుంది; మేలు- కీడు+ఏమియున్= ఇది ఉపకారం; అది అపకారం అనే మాటలు; నీవు+ఆడక= నీవు చెప్పకుండా; విను(ము)= నేను చెప్పే మాటలు వినుము; ననున్= నన్ను; కయ్యమున్= యుద్ధాన్ని; చూడఁగన్+పుచ్చుట= చూడుమని పంపటం; వినంగన్+చూచియు+అ, కాదే?= వినాలనే ఉద్దేశం తోడనే కదా!

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అపకారం చేసినవారికి తిరిగి కీడు జరిగితీరుతుంది. అది లోకంలో తరచు చూస్తూనే ఉన్నాం గదా. నీవు ఇది కీడు అది మేలు అని చెప్పకుండా (మధ్య మధ్య ఆపకుండా) నేను చెప్పే మాటలు ఆలకించుము. నీవేకదా యుద్ధం చూచి ఆ వార్తలు నీకు చెప్పుమని నన్ను నియోగించింది. (వినటానికే కదా! ఈ చెప్పటం)

క. వేదవ్యాస మునీశ్వరు । పాదంబులు దలఁచి మ్రొక్కి భక్తిరసైకా
స్వాదన సుకరానందో । త్పాదన దివ్యమతి నగుచుఁ దగ నెఱిఁగింతున్. 69

ప్రతిపదార్థం: వేదవ్యాస, ముని+ఈశ్వరు, పాదంబులు= వేదములను వర్గీకరించి వ్యాసుడనే పేరుపొందిన గొప్ప ఋషి అడుగులు; తలఁచి= స్మరించి; మ్రొక్కి= నమస్కరించి; భక్తి+రస+ఏక+ఆస్వాదన+సుకర+ఆనంద+ఉత్పాదన+దివ్య+మతిన్+అగుచున్= భక్తి అనే 'రసము'నే ఆస్వాదించటం ద్వారా లభ్యమైన ఆనందం పుట్టే దివ్యమైన బుద్ధితో కూడినవాడను ఔతూ; తగన్= తగినట్టుగా (ఔచిత్యంతో); ఎఱిఁగింతున్= తెలుపగలను.

తాత్పర్యం: వేదవ్యాస మహర్షి శ్రీపాదాలను స్మరించి నమస్కరించి భక్తిరసమునందు ఓలలాడే బుద్ధికలవాడనై యుద్ధ వృత్తాంతం తెలుపగలను.

విశేషం: ఇది యుద్ధ కథనానికి మొదలు. భక్తి నవరసాలలో ఒకటి కాదు. ఇచ్చట 'రస' శబ్దాన్ని తిక్కన ఏ అర్థంలో వాడినట్లు? 'రసం' బ్రహ్మానంద సదృశమని ఆలంకారికుల నిర్దేశం. తిక్కనకు రస శబ్దంపై ఆనంద శబ్దంపై మక్కువ ఎక్కువ. యుద్ధ వర్ణన ఆనందదాయకం కాగలదా? రసం ఆనంద పర్యవసాయి. యుద్ధ వర్ణనకు వీరరసం ఆధారం. వీర రసోపాసనకు సంజయుడు వేదవ్యాస పాదాలను ఆలంబంగా చేసికొన్నాడు. ఇది ఉదాత్త భావ కల్పన.

వ. అనిన నాంబికేయుండు 'నట్లకాక యెఱింగింపు' మనుటయు సంజయుండు. 70

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన; ఆంబికేయుండు= అంబికా పుత్రుడు- ధృతరాష్ట్రుడు; అట్ల+కాక= అటులే అగుగాక; ఎఱింగింపుము= తెలుపుము; అనుటయున్= అని చెప్పగానే; సంజయుండు= సంజయుడు.

తాత్పర్యం: అని సంజయుడు చెప్పాడు. ధృతరాష్ట్రుడు ఆతడి మాటలు అంగీకరించి సరే చెప్పుమన్నాడు. అంతట సంజయుడు చెప్పసాగాడు.

సంజయుఁడు ధృతరాష్ట్రునకు భారతయుద్ధంబు సెప్పఁబూనుట (సం. 6-16-7)

ఉ. 'ప్రాంశుఁ బయోదనీలతనుభాసితు నుజ్జ్వల దండధారుఁ బిం
గాంశు జటాచ్ఛటాభరణు నాగమపుంజపదార్థతత్త్వ ని
స్సంశయకారుఁ గృష్ణమృగచర్మకృతాంబరకృత్యు భారతీ
వంశవివర్ధనుం ద్రిదశవందితు సాత్యవతేయుఁ గొల్చెదన్.' 71

ప్రతిపదార్థం: ప్రాంశున్= ఉన్నతుడిని; పయోద, నీల, తను, భాసితున్= మేఘంవలె నల్లనైన శరీరంచేత వెలుగొందేవాడిని; ఉజ్జ్వల, దండ, ధారున్= ప్రకాశించే దండం ధరించేవాడిని; పింగ+అంశు జటా+ఛటా+ఆభరణున్= గోరోజనం రంగు గల జడల సముదాయమనే సొమ్ములు ధరించిన వాడిని; ఆగమ, పుంజ, పద+అర్థ, తత్త్వ, నిస్సంశయకారున్= వేదాల సముదాయమునందలి పదాల యొక్క భావాల యొక్క యాథార్థ్యమును సంశయం లేకుండా నిరూపించినవాడిని; కృష్ణమృగచర్మకృత+అంబరకృత్యున్= జింక చర్మాన్ని బట్టగా చేసికొన్నవాడిని; భారతీ వంశ వివర్ధనున్= భారత రాజవంశమును వృద్ధి చేసిన వాడిని; త్రిదశ+వందితున్= దేవతలచే నమస్కరించబడినవాడిని, సాత్యవతేయున్= సత్యవతి కొడుకును; కొల్చెదన్= ఆరాధించగలను.

తాత్పర్యం: ఉన్నతుడిని, మేఘంవలె నల్లనైన శరీరకాంతితో వెలుగొందే వాడిని, ప్రకాశించే దండం ధరించే వాడిని, గోరోజనపు వర్ణంగల జడల మొత్తం ధరించిన వాడిని, వేదాలలోని పదాల భావాన్ని సంశయాలు లేకుండా నిరూపించిన వాడిని, కృష్ణాజినం వస్త్రంగా ధరించే వాడిని, భారత వంశాన్ని వర్ధిల్లేటట్లు చేసిన వాడిని, దేవతలచేత నమస్కరించబడిన వాడిని, సత్యవతి కొడుకును ఆరాధిస్తాను.

విశేషం: ~~ఈ~~ పద్యం వేదవ్యాసస్తుతి. తిక్కనకు సంస్కృత మహాభారత కర్త అయిన వేదవ్యాసుడిపైగల, భక్తి ప్రపత్తులు ప్రతిఫలించే పద్యం ఇది.

వ. అని పలికి పారాశర్యుం జిత్తంబున నిలిపి నమస్కరించి ధృతరాష్ట్రున కిట్లనియె. 72

ప్రతిపదార్థం: అని, పలికి= అని వచించి; పారాశర్యున్= పరాశరుడి కొడుకగు వ్యాసుడిని; చిత్తంబునన్= మనస్సులో; నిలిపి= ప్రతిష్ఠించి; నమస్కరించి= మ్రొక్కి; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి సంజయుడు వేదవ్యాస మహర్షిని మనస్సులో ధ్యానించి, మ్రొక్కి ధృతరాష్ట్రుడితో ఈ విధంగా అన్నాడు:

క. ' వినినదియును, నెయ్యెడ నేఁ। గనినదియును, మునికృపం బ్రకాశంబై తోఁ
చిన యదియును, విశదంబుగ। వినిపించెద మొదలుకొని సవిస్తారముగన్. 73

ప్రతిపదార్థం: వినినదియును= ఆలకించినట్టిదీ; ఏ+ఎడన్= ఎచ్చట; నేన్+కనిన+అదియును= నేను చూచినట్టిదీ; ముని+కృపన్= (వేదవ్యాస) ఋషిదయ వలన; ప్రకాశంబు+ఐ, తోచిన+అదియును= తెల్లమై స్ఫురించినట్టిదీ; మొదలుకొని= యుద్ధం ఆరంభించిన సమయం నుండి; స, విస్తారముగన్= వివరాలు అన్నింటినీ కలిపి; వినిపించెదన్= నీకు చెప్పగలను.

తాత్పర్యం: అని చెప్పి సంజయుడు వేదవ్యాస మహర్షిని మనస్సులో ధ్యానించి, మ్రొక్కి ఈ విధంగా చెప్పాడు. 'నేను విన్న సంగతులు, నేను కళ్ళార చూచిన విషయాలు, వేదవ్యాస మహర్షి కృపవలన నాకు తెలిసిన అంశాలు, యుద్ధం మొదలుపెట్టినప్పటినుండి జరిగిన విశేషాలు అన్నీ నీకు వివరాలతో చెప్పగలను.

వ. ఆ రాత్రి నిన్ను వీడుకొని మన దండునకుం జని, నీ కొడుకు నగరు సముచిత ప్రకారంబునం బ్రవేశించు నప్పు డతండు గాంగేయాది కౌరవులును దగు రాజులును బరివేష్టింపం బరిమిత స్థానంబున నుండ, నేనును బొడసూపి,యతని యాదరణంబు వడసి కొలిచి యుండితిం; బదంపడి సమర విషయంబులైన సంభాషణంబుల సమయంబున నమ్మేదినీశ్వరుండు దుశ్శాసనుం గనుంగొని యిట్లనియె. 74

ప్రతిపదార్థం: ఆ రాత్రి= ఆ రేయి; నిన్నున్= (ఓ ధృతరాష్ట్ర మహారాజా) నిన్ను; వీడుకొని= నీ దగ్గర సెలవు పుచ్చుకొని; మన, దండునకున్+చని= మన సైన్యం విడిసిన చోటికి వెళ్ళి; నీ కొడుకు= నీ పుత్రుని యొక్క (దుర్యోధనుని); నగరున్= అంతఃపురాన్ని; సముచిత ప్రకారంబునన్= యథావిధి (రాజమర్యాద ప్రకారం); ప్రవేశించు+అప్పుడు= చేరేటప్పుడు; అతండు= (దుర్యోధనుడు); గాంగేయ+ఆది, కౌరవులును= భీష్ముడు మున్నగు కౌరవులును; తగు రాజులును= (కొలువుకూటాన్ని ప్రవేశించే అర్హత గల) తగిన దొరలును; పరివేష్టింపన్= చుట్టూచేరియుండగా; పరిమితస్థానంబునన్+ఉండన్= రాజుగారు కూర్చుండడానికి ఏర్పాటు చేయబడిన చోటులో (కొలదిమందితో కలిసి) ఉండగా; ఏనును= నేను గూడ (సంజయుడనైన నేను); పొడ+చూపి= కన్పించి; అతని= దుర్యోధనుడి యొక్క; ఆదరణంబు+పడసి= మన్ననను పొంది, కొలిచి+ఉండితిన్= కొలువు కూటంలో కూర్చొని ఉన్నాను; పదంపడి= పిమ్మట; సమర, విషయంబులు+ఐన= యుద్ధానికి సంబంధించిన అంశాలు గల; సంభాషణంబుల సమయంబునన్= మాటాడేటప్పుడు; ఆ+మేదినీ+ఈశ్వరుండు= ఆ రాజు- దుర్యోధనుడు; దుశ్శాసనున్+కనుంగొని= దుశ్శాసనుడిని చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! ఆ రాత్రి నీదగ్గర సెలవు తీసికొని నేను మన సేనలు విశ్రమించిన చోటు చేరాను. నీ కొడుకు దుర్యోధనుడి నగరులోకి పోయేసరికి అతడు భీష్ముడు మొదలైన కౌరవులూ ఆంతరంగికులైన రాజులూ పరివేష్టించి ఉండగా నేను కన్పించాను. దుర్యోధన మహారాజు నన్ను మన్నించగా కొలిచి ఉన్నాను. తరువాత యుద్ధవిషయాలు మాట్లాడేటప్పుడు దుర్యోధన మహారాజు దుశ్శాసనుడితో ఈ విధంగా చెప్పాడు.

క. ' మనకుఁ బాండురాజ తనయవర్గమునకుఁ। గయ్యు మయ్యెఁ; బెద్ద కాలమేని
నెదురు చూచుచుండ నొదవె నివ్విధ, మిందుఁ। బూని చేయవలయుదాని వినుము. 75

ప్రతిపదార్థం: మనకున్= (కౌరవులకును); పాండురాజ, తనయ, వర్గమునకున్= పాండవుల పక్షానికి; కయ్యము+అయ్యెన్= యుద్ధం వచ్చింది; ఏను= నేను; పెద్ద కాలము+ఏని= చాలాకాలం నుండి; ఎదురు చూచుచుండన్= ఎదురు చూస్తూ ఉండగా;

ఈ+విధము= ఈ రీతి; ఒదవెన్= ఏర్పడింది; ఇందున్= ఈ యుద్ధంలో; చేయవలయుదానిన్= కర్తవ్యాన్ని; ఆచరించ వలసినదానిని గూర్చి; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: ఎంతోకాలంనుండి ఎదురు చూస్తున్న యుద్ధం మనకూ పాండవ పక్షానికీ ఈ నాటికి ఈ రీతిగా సిద్ధించింది. ఇక ఇప్పుడు మనం చేయవలసినపనిని గురించి, సాధించవలసిన కార్యం గురించి వినుము.

క. కన్నాకు మనకు భీష్ముం। డిన్నరవరుఁ గావవలయు నెమ్మెయి నైనం;
దన్నుం గాచిన నితఁడు జ। గన్నుతముగ రణమునం బగఱ నడఁగించున్. 76

ప్రతిపదార్థం: మనకున్= మన కౌరవ సేనలకు; భీష్ముండు= భీష్ముడు; కను+ఆకు= కనురెప్పవలె రక్ష - నాయకుడు;; ఈ+నరవరున్= నరులలో శ్రేష్ఠుడైన ఈతడిని; ఏ+మెయిన్= ఏ రీతిగా అయినా సరే; కావవలయున్= కాపాడాలి; తన్నున్+కాచినన్= తనను రక్షిస్తే; ఇతఁడు= ఈ భీష్ముడు; జగత్+నుతముగన్= ప్రపంచం చేత ప్రస్తుతించబడే రీతిగా; రణమునన్= యుద్ధంలో; పగఱన్= శత్రువులను; అడఁగించున్= నాశం చేస్తాడు.

తాత్పర్యం: భీష్ముడు మన సేనకు ముఖ్యుడు మనకు రక్ష. శ్రేష్ఠుడైన ఈ వీరుడిని మనం రక్షిస్తే, ఈతడు మనలను అందరినీ రక్షిస్తాడు. అంతేకాక, యుద్ధంలో ప్రపంచం అంతా ప్రస్తుతించే విధంగా ఇతడు శత్రువులను ధ్వంసం చేస్తాడు.

విశేషం: కన్నాకు= కన్ను+ఆకు, తమలపాకు కట్టలో మొదటనుండే పెద్దఆకు అనగా అగ్రేసరుడు= శ్రేష్ఠుడు అని భావం.

ఆ. ఎల్లవారిఁ గాచు నితఁ డని యెప్పుడుఁ। దలఁతు; మితనిఁ గావవలయు టేమి
యని తలంచె దేని విను; మిందఱకు నిది। వినఁగవలయు నట్టి పని కుమార! 77

ప్రతిపదార్థం: కుమార!= చిన్నవాడవైన ఓ దుశ్శాసనా?; ఎల్లవారిన్= అందరినీ; ఇతఁడు= (భీష్ముడు); కాచున్= రక్షిస్తాడు అని; ఎప్పుడున్= ఎప్పుడూ; తలఁతుము= భావిస్తాము; ఇతనిన్= (భీష్ముడిని); కావన్‌వలయుట+ఏమి?= రక్షించటం ఏమిటి; అని తలంచెదు+ఏని= అని ఆలోచిస్తున్నావేమో; వినుము= ఆలకించుము; ఇందఱకున్= ఇంతమందికీ; ఇది= ఇపుడు నేను చెప్పునది; వినఁగన్ వలయున్+అట్టి+పని= వినవలసిన విషయం.

తాత్పర్యం: ఎల్లవారిని ఇతడు (భీష్ముడు) యుద్ధంలో రక్షిస్తాడని ఎప్పుడూ అనుకొంటాము గదా! అట్లాంటి ఈయనను రక్షించటమేమిటని అనుకుంటే దుశ్శాసనా! వినుము. ఇది అందరూ వినవలసినట్టి విషయం.

విశేషం: భీష్ముడు చేసిన ప్రతిజ్ఞ ప్రకారం ఆ మానవాతీతుడు ఆడవారితో పోరాడడు. అంతేగాక- ఆడంగి లేకివారితో గూడా పోరాడడు. శిఖండి ఆకృతిచేత స్త్రీ. అందుచేత భీష్ముడు ఆతడితో పోరాడడుగాని, శిఖండి భీష్ముడితో పోరాడుతాడు. బాణాలు ప్రయోగిస్తాడు. ఆడిన మాట తప్పనివాడు భీష్ముడు. సాయుధుడైన శిఖండి, నిరాయుధుడైన భీష్ముడిపై విజృంభించే అవకాశం ఉంది. జాగ్రత్త.

వ. సత్యవ్రతుం డగు నిమ్మహానుభావుండు. 78

ప్రతిపదార్థం: సత్యవ్రతుండు+అగు= ఎల్లప్పుడూ నిజమే మాటాడే దీక్షగల; ఈ+మహానుభావుండు= ఈ గొప్పవాడు (భీష్ముడు).

తాత్పర్యం: సత్యమే జీవితవ్రతంగా కలిగిన ఈ గొప్పవాడు.

క. వినుఁ డన్యు లెవ్వరును నా। మునుమునఁ బడి బ్రదుక రాలమున; నేను శిఖం
డిని నోర్వఁ జాలఁ జుండీ!। యని మన యుద్యోగవేళయప్పుడ చెప్పెన్. 79

ప్రతిపదార్థం: వినుఁడు= ఆలకించండి; అన్యులు= ఇతరులు; ఎవ్వరును= ఎవ్వరుగానీ; నా మునుమున్+పడి= నా యెదురున నిలిచి; ఆలమునన్= యుద్ధంలో; బ్రదుకరు= జీవించలేరు; ఏను= నేను; శిఖండిని; ఓర్వన్+చాలన్+చుండీ!= గెలువలేను సుమా అని; మన ఉద్యోగ వేళ= మనం (యుద్ధ) ప్రయత్నాలు చేసే సమయంలో; అప్పుడు+అ= ఆ సమయంలోనే; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: మనం యుద్ధ ప్రయత్నాలు చేసే సమయంలో, ఆనాడే భీష్ముడు ఒక మాట ఖండితంగా చెప్పాడు. 'నా ముందు యుద్ధంలో ఇంకెవ్వరూ నిలువలేరు. నిలిచి యుద్ధం చేస్తే జీవించలేరు. అయితే, నేను శిఖండితో పోరాడలేను.'

ఉ. ఏమఱి రక్ష సాలని మృగేంద్రుని నక్కయుఁ గోలుపుచ్చు; సం
గ్రామములోనఁ గన్గలిగి కావక తక్కిన నా శిఖండిచే
నీ మనుజేంద్రుఁ గోల్పడమె? యిట్టిది గోల్పులి నిద్రవోవ ను
ద్దామ బలంబుమై గొఱియ దాఁకి వధించినయట్టు లుండదే. 80

ప్రతిపదార్థం: ఏమఱి= మైమరచి ఉపేక్షవహించి; రక్ష+చాలని= రక్షణ సరిపోని; మృగ+ఇంద్రునిన్= (మృగములలో శ్రేష్ఠమైన) సింహాన్ని; నక్కయున్= నక్క కూడా; కోలుపుచ్చున్= చెడగొట్టగలదు; సంగ్రామములోనన్= యుద్ధంలో; కన్+కలిగి= జాగ్రత్తగా చూస్తూ; కావక, తక్కినన్= కాపాడటం మానివేస్తే; ఆ+శిఖండిచేన్= ఆ శిఖండిచేత; ఈ+మనుజ+ఇంద్రున్= మనుజులలో శ్రేష్ఠుడైన ఈ భీష్ముడిని; కోల్పడమె?= పోగొట్టుకోమా?; ఇట్టిది= ఇటువంటిది; కోల్+పులి= పెద్దపులి; నిద్ర+పోవన్= నిదురిస్తూ ఉండగా; ఉత్+దామ+బలంబుమైన్= అరికట్టలేని శక్తితో; గొఱియ= గొర్రె; తాఁకి= ఎదిరించి; వధించిన+అట్టులు= చంపివేసినట్లు; ఉండదే= ఉండదా?

తాత్పర్యం: ఏమరి రక్షణచాలని సింహాన్ని నక్కసైతం చంపుతుంది. జాగ్రత్తగా కనులు మూయకుండా భీష్ముడిని కాపాడాలి. లేకపోతే శిఖండిచేత ఈ మహావీరుడు నిర్జింపబడవచ్చును. పెద్దపులి నిదురిస్తూ ఉండగా, గొర్రె వచ్చి పైబడి పెద్దపులినే సంహరించినట్లు ఔతుంది.

క. కావున నీ యుద్భటరథి । కావలి నివ్విభునిఁ గాచునట్లుగఁ బనుపం
గావలయు మీర లందఱు । నేవలఁ జూచిన శిఖండి కెదురుం డెపుడున్.' 81

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఈ+ఉద్భట+రథిక+ఆవలిన్= గొప్పవీరులైన ఈ రథికుల సమూహాన్ని; ఈ+విభునిన్= ఈ నాయకుడిని (భీష్ముని); కాచున్+అట్లుగన్= కాపాడేటట్లుగా; పనుపంగాన్ వలయున్= ఏర్పాటు చేయాలి; మీరలు+అందఱున్= మీరందరూ; ఏవలన్+చూచినన్= ఏవైపు చూచినా; ఎపుడున్= ఎల్లప్పుడు; శిఖండికిన్= శిఖండికి; ఎదురుండు= ఎదిరి పోరాడండి.

తాత్పర్యం: కాబట్టి గొప్పవీరులైన ఈ రథికులగుంపును నాయకుడైన భీష్ముని రక్షించడానికి పంపాలి. మీరందరూ ఏ వైపు చూచినా ఎప్పుడూ శిఖండిని ఎదిరించండి.

వ. అని నియమించి కొలువు విరిసి చని యుచిత విధంబున నుండె; నంతఁ బ్రభాతం బగుటయు నమ్మహీపతి పడవాళ్ళం బనిచి బలుమానిసులను బలంబులను బవరంబునకు వెడల నియోగించిన, శంఖ దుందుభి ప్రముఖ మంగళ తూర్య నిస్వనంబులను నయ్యైసాధనంబులు సమకట్ట సముచిత పరివారంబునకుంజెప్పెడు దొరల పలుకుల గంభీర నాదంబులను, గట్టుమట్లు కదలఁ దిగిచినం జెలంగు కరితురంగంబుల బృంహిత హేషిత ఘోషంబులను బూన్పం దిగుచు రథంబుల నేమిస్వనంబులను, బెలుచ నొండొరులం బిలుచు

పదాతుల యెలుంగుల విపులధ్వనులనుం, బేర్చిన మహారవంబున శిబిరంబు చంద్రోదయ ఘూర్ణమాన మహార్ణవంబును గ్రేణి సేయుచుండ సూర్యోదయంబైన సైన్యంబులు సెలంగుచు వెడలునప్పుడు. 82

ప్రతిపదార్థం: అని+నియమించి= అని చెప్పి, ఏర్పాటు చేసి; కొలువు+విరిసి= కొలువు చాలించి; ఉచిత+విధంబునన్+ఉండెన్= తగిన రీతిని ఉన్నాడు; అంతన్= పిదప; ప్రభాతంబు+అగుటయున్= తెల్లవారుటచేత; ఆ+మహీపతి= ఆ రాజు- దుర్యోధనుడు; పడవాళ్ళన్+పనిచి= చిన్న దండనాథులను ఆజ్ఞాపించి; బలుమానిసులను= బలముకల మనుష్యులను, సేనకు ముందు నడిచేవారిని; బలంబులను= సేనలను; బవరంబునకున్= యుద్ధానికి; వెడలన్= వెళ్ళటానికి; నియోగించినన్= ఆజ్ఞాపించగా; శంఖ+దుందుభి+ ప్రముఖ+ మంగళ+తూర్య+నిస్వనంబులను= శంఖాలు దుందుభులు, మొదలైన శుభప్రదమైన వాద్యాల ధ్వనులు; అయ్యై= ఆయా; సాధనంబులు= పరికరాలు; సమకట్టన్= సిద్ధం చేయటానికి; సముచిత+పరివారంబునకున్= తమ తమ అనుచరులకు; చెప్పెడు= ఆజ్ఞాపించే; దొరల+పలుకుల= ప్రభువుల వాక్యాల; గంభీర+నాదంబులు= ఠీవితో కూడిన శబ్దాలు, కట్టుమట్లు= ఉండేచోటులు; కదలన్+తిగిచినన్= కదిలేటట్లు లాగగా; చెలంగు= ధ్వనించే; కరి+తురంగంబుల= ఏనుగుల గుర్రాల; బృంహిత+హేషిత+ ఘోషంబులును= ఘీంకారముల, సకిలింపుల పెద్ద ధ్వనులు; పూన్పన్+తిగుచు రథంబులనేమి స్వనంబులును= కట్టటానికి ఆయత్తం చేసే రథచక్రాల ధ్వనులూ; పెలుచన్= పెద్దగా; ఒండు+ఒరులన్= ఒకరిని ఒకరు, పిలుచు= రమ్మని కేకలు వేసే; పదాతుల+ఎలుంగుల= కాలిభటుల కంఠస్వరముల; విపుల+ధ్వనులన్+పేర్చిన= సంకుల నినాదాలతో అతిశయిల్లిన; మహా+రవంబునన్= పెద్ద సంకులశబ్దంచేత; శిబిరంబు= యుద్ధభూమి దరి వేసిన డేరా; చంద్ర+ఉదయ, ఘూర్ణమాన, మహా+అర్ణవంబును= చంద్రుడు ఉదయించే సమయంలో తిరుగుడుపడే గొప్ప సముద్రాన్ని; క్రేణి+చేయుచుండన్= పరిహసించే విధంగా ఉండగా; సూర్య+ఉదయంబు+ఐనన్= ప్రొద్దు పొడువగా (సూర్యుడు ఉదయించగా); సైన్యంబులు= సేనలు; చెలంగుచున్= ధ్వనిచేస్తూ; వెడలు+అప్పుడు= వెళ్ళే సమయంలో.

తాత్పర్యం: అని ఏర్పాట్లు చేసి, కొలువు చాలించి, వెళ్ళి తగిన రీతిని ఉన్నాడు. అంతట తెల్లవారింది. దుర్యోధనుడు చిరుదండనాథులను బలముగల వారినీ సేనలను యుద్ధభూమికి తరలించండని నియోగించాడు. శంఖాలు దుందుభులు మున్నగు వాద్యాలు మ్రోగాయి. అంతవరకు నిశ్శబ్దంగా ఉన్న ఆ మైదానాలలో పెద్ద గోల గందరగోళం ఏర్పడింది. దొరలు తమ తమ పరివారాలకు ఆజ్ఞలు ఇస్తున్నారు. ఏనుగులు గీపెట్టుతున్నవి. గుర్రాలు సకిలిస్తున్నవి. కదిలే రథాల చక్రాలు ఘోషిస్తున్నవి. భటులు ఒకరినొకరు రమ్మని పిలుస్తున్నారు. ఇన్ని స్వరాలు ఇన్ని శబ్దాలు కలిస్తే, చంద్రోదయ సమయంలో ఘోషించే సముద్రంవలె సేనా శిబిరం కన్పించింది. అంతట సూర్యోదయమయింది. సైన్యాలు ఉత్సాహంతో బయలుదేరేటప్పుడు-

విశేషం: బృంహితం ఏనుగు ఘీంకారానికి మాత్రమే పరిమితమైన శబ్దం. హేష: గుర్రం చేసే సకిలింపునకు మాత్రమే వాడబడేశబ్దం.

తే. **కనకభూషణజాలంబుకతన గజము । లెరవళులు వోవు కొండల నెనసి యొప్పెఁ;**
వల్గనంబుల హేషలవలన నబ్ధి । ఘనతరంగంబు లనఁ దురంగములు వొలిచె. 83

ప్రతిపదార్థం: కనక, భూషణ, జాలంబు, కతనన్= బంగారు ఆభరణ సముదాయాల కారణంగా; గజములు= ఏనుగులు; ఎరవళులు+పోవు= కార్చిచ్చులతో కూడిన; కొండలన్= పర్వతాలను; ఎనసి+ఒప్పెన్= పోలి కన్పించాయి; వల్గనంబులన్= ఏకగతి వేగంలో నడవటం వలన; హేషలవలనన్= సకిలింతలచేత; అబ్ధి, ఘన, తరంగంబులు+అనన్= సముద్రంలోని పెద్ద కెరటాలు అనేటట్లుగా; తురంగములు= గుర్రాలు; పొలిచెన్= వెలుగొందాయి.

తాత్పర్యం: బంగారు ఆభరణాలు ఉండటం చేత ఏనుగులు మంటలు చెలరేగిన కొండలవలె కన్పించాయి; అడుగులు క్రమబద్ధంగా వేస్తూ నడవటం చేత సకిలింతల చేత గుర్రాలు సముద్రంలో చెలరేగే పెద్ద పెద్ద కెరటాలవలె భాసించాయి.

విశేషం: 1. వల్గనం: గుర్రం నడక. ఆ నడకలో ఒక వేగం కాళ్ళు ముందుకు పెట్టి దూకుడుగా నడవటం. ఇది పరుగెత్తటం కాదు, వల్గనం అనే శబ్దం ఒకానొక అశ్వగతికి మాత్రమే వాడబడుతుంది. అట్లే హేష - గుర్రం చేసే సకిలింపు సవ్వడికి మాత్రమే వాడబడుతుంది.

క. అరదములు సవరణలతోఁ । బరపై యొక్కొక్క యూరి పరపున నరిగెం
బరుసని పలుకుల నాకృతి । పరుషత నసురాలివోలె భటతతి మెఱసెన్. 84

ప్రతిపదార్థం: అరదములు= రథాలు; సవరణలతోన్= అలంకారాలతో; పరపు+ఐ= నిడివిగలట్టివై; ఒక్కొక్క= ఒక ఒక; ఊరి+పరపునన్= విస్తరించిన గ్రామం వలె; అరిగెన్= వెళ్ళాయి; భటతతి= భటుల సమూహం; పరసని పలుకులన్= కఠోరమైన మాటలచేత; ఆకృతి పరుషతన్= ఆకారముల కర్కశత్వముచేత; అసుర+ఆళి+పోలెన్= రాక్షసుల గుంపువలె; మెఱసెన్= వెలుగొందింది.

తాత్పర్యం: సవరణలతో గూడిన రథాలు మిక్కుటమై ఒక్కొక్క ఊరు కదలిపోతున్నదా అన్నట్లు వెళ్ళాయి. పరుషవాక్యాలతో, కఠినాకారాలతో రక్కసుల గుంపువలె, భటులగుంపు వెలుగొందింది. అనగా విస్తరించిన గ్రామాలవలె, రథాలు అలంకరింపబడిన గుర్రాలతోపాటు కదలి వెళ్ళాయి.

వ. అట్టియెడ. 85

తాత్పర్యం: ఆ సమయంలో.

మ. పరిధానంబును దేరు నశ్వములుఁ జాపంబుం బరిస్ఫీత వ
జ్రరుచివ్యాప్త సువర్ణతాళమయ చంచత్కేతువున్ వర్మముం
గర మొప్పం దెలుపారు వెల్గొడుగుతో గంగాసుతుం డా సుధా
కరుఁడుంబోలె వెలింగె దర్ప మెసఁగం గౌరవ్యసైన్యాబ్ధికిన్. 86

ప్రతిపదార్థం: పరిధానంబును= (ధరించిన) వస్త్రాలు; తేరున్= రథం; అశ్వములున్= గుర్రాలు; చాపంబున్= ధనుస్సు; పరిస్ఫీత, వజ్ర, రుచి, వ్యాప్త, సువర్ణ, తాళమయ, చంచత్, కేతువున్= అధికమైన వజ్రాల కాంతితో ప్రకాశించే బంగారు తాడిచెట్టుతో కూడి కదలి ఆడే జెండా; వర్మమున్= కవచం; కరము+ఒప్పన్= మిక్కుటంగా విలసిల్లగా; తెలుపారు= తెల్లనైన; వెల్గొడుగుతోన్= తెల్లని ఛత్రంతో; గంగాసుతుండు= గంగకొడుకు= భీష్ముడు; కౌరవ్య, సైన్య+అబ్ధికిన్= కౌరవుల సేన అనే సముద్రానికి; ఆ+సుధాకరుఁడున్+పోలెన్= ఆ చంద్రుడివలె; దర్పము+ఎసఁగన్= గర్వం,ఠీవి విలసిల్లగా; వెలింగెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: సేనాపతి అయిన భీష్ముడు కౌరవసేన అనే సముద్రానికి చంద్రునివలె ఒప్పారినాడు. భీష్ముడికి చెందిన అంశాలు అన్నీ విలక్షణాలైనవే. ఆతడి ఆహార్యం- ధరించిన వస్త్రాలు నిగనిగలాడిపోతున్నాయి. రథమా? అది సేనాధిపతి రథం అనిపిస్తున్నది. ఇక ఆ రథానికి కట్టిన గుర్రాలు, కదం త్రొక్కుతున్నవి. ధనుస్సు - వజ్రాలు పొదగబడి వెలుగొందుతున్నది. జెండా బంగారు తాడిచెట్టుతో రెపరెపలాడుతున్నది. కవచం కాంతులీనుతున్నది రథంపై తెల్లగొడుగు ప్రకాశిస్తున్నది.

విశేషం: తెలుపారు వెల్గొడుగుతో= తెల్లనగు తెల్లని గొడుగుతో అని తిక్కన వ్రాస్తారా? అనే సందేహం విజ్ఞులకు కల్గవచ్చు. కాని అన్ని పుస్తకాలలో ఇలాగే ఉన్నది. తెలుపారునకు బదులు పొలుపారు వెల్గొడుగుతో అన్నప్పుడు ఈపునరుక్తి దోషం పరిహారమౌతుంది.

సీ. కాంచనమయ వేదికా, కనత్కేతనో। జ్జ్వల విభ్రమం బొప్పఁ గలశజుండు,
గనక గోవృషసాంద్ర కాంతి కాంతధ్వజ। విభవ విలాసంబు వెలయఁ గృపుఁడు,
మణిసింహ లాంగూల మహితకేతుప్రభా। స్ఫురణంబు మెఱయంగ గురుసుతుండు,
రత్నశిలారశ్మి రాజిత కదళికా। మహిమ శోభిల్లంగ మద్రవిభుఁడు

తే. వెడలి తమ తమ చతురంగ వితతు లెల్ల। నుచిత గతి నూల్కొనంగఁ జేయుచుఁ గడంగి
సంగరోత్సవ సంభృతోత్సాహు లగుచు। నగుచుఁ దగుమాట లాడుచు నడచి రెలమి. 87

ప్రతిపదార్థం: కాంచన మయ, వేదికా, కనత్+కేతన+ఉజ్జ్వల, విభ్రమంబు+ఒప్పన్= బంగారుతో నిర్మించబడిన అరుగుతో ప్రకాశించే జెండా యొక్క వైభవం విలసిల్లుతుండగా; కలశజుండు= ద్రోణుడు; కనక+గోవృష+సాంద్ర+కాంతి+కాంత+ధ్వజ+విభవ+విలాసంబు= బంగారు ఆబోతు యొక్క దట్టమైన వెలుగులచేత ప్రకాశించే జెండా వైభవం యొక్క విలాసం; వెలయన్= విలసిల్లగా; కృపుఁడు= కృపాచార్యుడు; మణి, సింహ, లాంగూల, మహిత, కేతు, ప్రభా, స్ఫురణంబు= మణులచేత నిర్మించబడిన సింహంతోకతో గొప్పదైన జెండా కాంతుల అతిశయము; మెఱయంగన్= మిరుమిట్లు గొల్పగా; గురుసుతుండు= (ఆచార్యుడి పుత్రుడైన) అశ్వత్థామ; రత్న, శిలా, రశ్మి, రాజిత, కదళికా, మహిమ= రత్నాల రాళ్ళ వెలుగులతో భాసించే అరటిచెట్టు గొప్పదనం; శోభిల్లంగన్= విలసిల్లగా; మద్రవిభుఁడు= మద్రదేశరాజు- శల్యుడు; వెడలి= వెళ్ళి; తమ తమ, చతురంగ, వితతులు+ఎల్లన్= తమకు తమకు, సంబంధించిన (రథ, గజ, తురగ, పదాతి సమూహాలు అన్నీ); ఉచిత రీతిన్= తగు విధంగా; నూల్కొనంగన్+చేయుచున్= పురికొలుపుతూ; సంగర+ఉత్సవ+సంభృత+ఉత్సాహులు+అగుచున్= యుద్ధపు పండుగలో నిండిన ఉత్సాహం కలవారు ఔతూ; నగుచున్= నవ్వుకొంటూ; తగు, మాటలు+ఆడుచున్= తగిన పలుకులు పలుకుతూ; ఎలమిన్= సంతోషంతో; నడచిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ద్రోణాచార్యులవారు స్వీకరించిన జెండా బంగారంతో నిర్మింపబడిన వేదిక (యజ్ఞం ఆస్థానం) కృపాచార్యుల వారి జెండా పసిడి వన్నె చిన్నెలుగల గొప్ప ఆబోతు చిహ్నం గలది. అశ్వత్థామ జెండాపై వెలుగొందే గుర్తు మణి నిర్మితమైన సింహం తోక. రత్నాలు పొదిగి అమర్చిన అరటిచెట్టు మద్రరాజు అయిన శల్యుడి జెండాపై వెలుగొందుతుంది. ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, శల్యుడు వారి వారి జెండాలు ఆకాశంలో మిరుమిట్లుగొలుపుతూ వెలుగొందుతుండగా చతురంగ బలాలతో కదలి ఉత్సాహ సంభరితులై యుద్ధభూమికి తరలి వెళ్ళారు పరిహాస వచనాలు వెదజల్లుకొంటూ.

విశేషం: 1. కలశజుడు= కలశంలో పుట్టినవాడు. ఇరవై శతాబ్దిలో 'కలశజుడిని' ఉత్పత్తి చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నవి. ద్రోణుడు స్త్రీ పురుష సంగమం వలన ఉద్భవించినవాడు కాడట. 'కలశజుడు'. ఈ భావన ప్రాచీనతమ కావ్యమైన సంస్కృత మహాభారతంలోకి ఎట్లా చొరబడింది? ఇది భావి పరిశోధనల వలన తేలవలసిన అంశం.

2. అలనాటి వీరులు పతాకా ప్రియులు. దూరం నుండి జెండా చూచి ఆ రథంలో ఉన్న వీరుడిని గుర్తించగలిగేవారు.

3. వీరులు - నవ్వుతూ ఆడుతూ పాడుతూ, వినోదకేళీ విహారానికి వెళ్ళేటట్లు యుద్ధభూమికి వెళ్ళేవారట!

క. సమరక్రీడా సన్నా। హము లొప్పఁగఁ దక్కుఁ గలుగునట్టి దొరలు ద
ర్పము పల్లవింప వెడలిరి। తమ తమ కేతువులు గ్రాల ధరణీనాథా! 88

ప్రతిపదార్థం: ధరణీనాథా!= ఓ రాజా! ధృతరాష్ట్ర మహారాజా; సమర, క్రీడా, సన్నాహములు+ఒప్పఁగన్= యుద్ధం అనే ఆటకు చేయవలసిన ప్రయత్నాలు అన్నీ వర్ధిల్లుతుండగా; తక్కు+కలుగు+అట్టి, దొరలు= మిగిలిన ప్రభువులు; దర్పము= ఆటోపం;

పల్లవింపన్= చిగురించగా; తమ తమ కేతువులు= తమ తమ జెండాలు; క్రాలన్= మిరుమిట్లు గొలుపుతూ వెలుగొందగా; వెడలిరి= వెళ్ళారు (యుద్ధభూమికి బయలుదేరి నడిచారు).

తాత్పర్యం: సమర క్రీడా సన్నాహంతో మిగిలిన దొరలు యుద్ధభూమికి తమ తమ గొప్పదనం చూపిస్తూ పటాటోపంతో తమ జెండాలు మిరుమిట్లు గొలిపి వెలుగులు వెలారుస్తూ ఉండగా బయలుదేరి వెళ్ళారు.

విశేషం: 1. యుద్ధమును, సంస్కృతభారతంలో తిక్కన తెలుగు భారతంలో 'క్రీడ' గ అభివర్ణించటం కనిపిస్తుంది. యుద్ధం ఒక ఆట, వినోదం ఎట్లా అవుతుంది? అని నవీనులు ప్రశ్నించవచ్చును. అయితే- ఆనాటి వారు యుద్ధాన్ని మారణహోమం క్రింద పరిగణించలేదు. అయితే అది హత్యాకాండ కూడా కాదు. వీరుడు హంతకుడు కాడు. యుద్ధం రమణీయ భయానకమైన ఆట. 'మధ్యవర్తి' (రిఫరీ) లేనట్టి క్రీడా విశేషం. వీరుడును, చంపవచ్చును, లేక చావవచ్చు అక్కడ ముఖ్యమైన అంశం.

2. యుద్ధంలో రంగురంగుల జెండాలు కన్నుల పండువుగా రెపరెపలాడేవి. ప్రతివీరుడూ ప్రత్యేకమైన జెండా ఎన్నుకొనేవాడు. ఆ జెండాను, దూరం నుండి చూచి ఆ రథం ఏవీరుడిదో చెప్పగలిగేవారు. బహుశః రంగు రంగుల జెండాలు, గుర్రాలకు, ఏనుగులకు చేసిన ఆహార్యాలు యుద్ధ బీభత్సాన్ని భటులు మానసికంగా భావింపగలిగేటట్లు చేసేవి.

వ. వా రెవ్వ రంటేని వినుము. 89

ప్రతిపదార్థం: వారు= (ఆ విధంగా యుద్ధభూమికి బయలు వెడిలినవారు); ఎవరు+అంటి(వి)+ఏని= ఎవరని ప్రశ్నిస్తే; వినుము= వినుము.

తాత్పర్యం: వా రెవ రంటావా? చెప్పుతాను వినుము.

క. కల్పితదృఢచతురంగా। నల్పం బై గండు మిగిలి యాదవబల మా
కల్పోజ్జ్వలతఁ గొలువ నవి। కల్పుఁడు గృతవర్మ సనియె గాఢస్ఫూర్తిన్. 90

ప్రతిపదార్థం: కల్పిత+దృఢ+చతురంగ+అనల్పంబు+ఐ= ఏర్పాటు చేయబడిన శక్తిగల (రథ గజ అశ్వపదాతులను) నాలుగు అంగాలతో గొప్పదై; గండు మిగిలి= పరాక్రమంతో అతిశయించి; యాదవ+బలము= యాదవజాతికి చెందిన సైన్యం; ఆ కల్ప+ఉజ్జ్వలతన్= ధగధగ మెరిసే ఆహార్యంతో; కొలువన్= పరివారమై వెంటరాగా; అవికల్పుఁడు= మొక్కవోని పరాక్రమం కలవాడు- కృతవర్మ; గాఢస్ఫూర్తిన్= మిక్కిలి దర్పంతో వెలుగొందుతూ; చనియెన్= (యుద్ధభూమికి) వెళ్ళాడు.

తాత్పర్యం: కృతవర్మ మొక్కవోని పరాక్రమంగల మహావీరుడు. అతడి పరివారమైన యాదవ సైన్యం రథ, గజ, తురగ, పదాతులలో మిక్కిలి దృఢమైనది. ఆ భటుల ఆహార్యం, ధరించిన దుస్తులు మిల మిల మెరిసిపోతూ కన్పిస్తున్నవి. ఆతడు ఆ ప్రచండ సేనా సమూహంతో యుద్ధభూమికి కదలి వెళ్ళాడు.

విశేషం: యాదవులలో ప్రముఖుడు శ్రీకృష్ణుడు పాండవుల పక్షంలో ఉన్నాడు. కృతవర్మ యాదవుడే అయినప్పటికీ కృష్ణుడితో పాటు చేరలేదు. అంతేకాక అతడికి శ్రీకృష్ణుడిపైగల ద్వేషమే దుర్యోధనుడి యెడగల ప్రేమకంటె హెచ్చు. శత్రువునకు శత్రువు తనకు మిత్రుడు అనే రాజనీతి చొప్పున కృతవర్మ కౌరవ పక్షం వహించాడు. మహాభారత యుద్ధం జరిగిన తర్వాత, కౌరవ సేనలో చావక మిగిలిన వారు - రథికత్రయం, కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ. మహాభారత యుద్ధానంతరం కూడ ఆ విద్వేషాలు సమసిపోలేదు. సుమారు ముప్పదిఆరు సంవత్సరాల పిదప యాదవులలో అంతఃకలహాలు చెలరేగాయి. పాండవ పక్షాన పోరాడిన సాత్యకి, దుర్యోధన పక్షాన పోరాడిన కృతవర్మ ఆ అంతఃకలహంలో మరణించారు.

క. **రథములు దఱచై చెలువగు । పృథుసైన్యముతోడ బంధుబృందముఁ దానుం**
బ్రథనోత్సుకవృత్తి మహా । రథుఁడు జయద్రథుఁడు వొలిచెఁ బ్రస్ఫురితగతిన్. 91

ప్రతిపదార్థం: రథములు= రథాలు; తఱచు+ఐ= మిక్కిలి దట్టమై; చెలువు+అగు= అందంగా కనిపించే; పృథుసైన్యము తోడన్= పెద్ద సేనతో; బంధు+బృందము= చుట్టాల సమూహం; తానున్; ప్రథన+ఉత్సుక+వృత్తిన్= యుద్ధం చేయాలనే ఉత్సాహంతో; జయద్రథుఁడు (సైంధవుడు - సింధు దేశాధిపతి)= జయద్రథుడునే పేరుగల; మహారథుఁడు= గొప్ప రథికుడు, మహావీరుడు; ప్రస్ఫురిత గతిన్=ప్రకాశించే నడకతో; పొలిచెన్= వెలుగొందాడు.

తాత్పర్యం: సింధుదేశాధిపతి మహావీరుడు జయద్రథుడు తాను తన చుట్టాలతో కలిసి, క్రిక్కిరిసిన రథాలతో కూడి సుందరంగా భాసించే సైన్యంతో యుద్ధం చేయాలనే ఉత్సాహంతో బయలుదేరి వెళ్ళాడు.

విశేషం: 'మహారథుడు' వాచ్యార్థం గొప్ప రథం కలవాడు. అయితే మహాభారత కాలంలో వీరుల వర్గీకరణం గమనించ దగింది. 'రథికుడు' ఒక సేనాంగానికి అధినేత. అతడికి బాసటగా చతురంగ బలాలు (రథ గజ తురగ పదాతులు) ఉంటాయి. రథానికి చక్రరక్షకులు ఉంటారు. అనేక రథికులకు నాయకుడు మహారథుడు. అంతకుమించిన సైన్యం గలవాడు అతిరథుడు. అంతకంటె గొప్పవాడు అతిరథశ్రేష్ఠుడు.

మ. **చలదుర్వీధరలీలఁ గ్రాలు మదవత్సామోద్భవస్తోమ మ**
గ్గలమై యేచిన సేన లొప్పఁగ దిశల్ గంపింప విందానువిం
దులుఁ గాళింగ మహీవిభుండు భగదత్తుండున్ భవత్సేనయో
ధులకుం గన్నుల పండువై నడచి రుత్తుంగాంగ సంరంభులై. 92

ప్రతిపదార్థం: చలత్+ఉర్వీధర+లీలన్= నడిచే కొండలవలె; క్రాలు= వెలుగొందే; మదవత్+సామోద్భవ, స్తోమము= దానజలధారలుగల ఏనుగుల గుంపులు; అగ్గలము+ఐ= అతిశయించి; ఏచిన= విజృంభించిన; సేనలు= సైన్యాలు; ఒప్పఁగన్= విలసిల్లగా; దిశల్= దిక్కులు; కంపింపన్= కదలగా; వింద+అనువిందులు= విందుడు, అనువిందుడు అనేవారు (అన్నదమ్ములు); కాళింగ+మహీవిభుండు= కళింగ దేశం పరిపాలించే రాజు; భగదత్తుండున్= భగదత్తుడును; భవత్+సేన+యోధులకున్= నీ సేనలలోని వీరులకు; కన్నుల+పండువు+ఐ= చూడటానికి అందంగా; ఉత్తుంగ+అంగ+సంరంభులు+ఐ= ఎత్తైన దేహాల సంరంభం కలవారలై; నడచిరి= వెళ్ళారు.

తాత్పర్యం: నీ సేనలలోని వీరులు అందరూ కన్నుల పండువుగా చూస్తూ ఉండగా, విందుడు అనువిందుండు అనే రాజ సోదరులు, కళింగరాజు భగదత్తుడు, నడచే కొండలవలె భాసించే ఏనుగుగుంపులతో పొంగారే ఉత్సాహంతో యుద్ధభూమికి బయలుదేరి వెళ్ళారు.

విశేషం: 1. మదించిన ఏనుగుల కుంభస్థలం నుండి పరిమళ పూరితమైన మదజలం స్రవిస్తూ ఉంటుందని కవులు వర్ణించారు.

2. విందానువిందులు, కళింగ ప్రభువు, భగదత్తుడు మత్తేభయూధాలకు ప్రసిద్ధి చెందినవారు. వారు అంగసౌష్ఠవం గల ఆజానుబాహులు. భగదత్తుడి ఏనుగు పేరు సుప్రతీకం.

3. మహాభారత సంగ్రామం - సమకాలీన వీరులకు తమ పరాక్రమ ప్రాభవాలు ప్రదర్శించుకొనేందుకు అవకాశం కల్పించింది. అక్కడ ముఖ్యమైనని జయాపజయాలు కాదు. తమ తమ పరాక్రమ ప్రదర్శనమే. కళింగదేశం పౌరాణిక కాలంలోనేకాక చారిత్రక కాలంలో గూడ ఏనుగులకు ప్రసిద్ధి కెక్కింది. కళింగరాజు 'గజపతి'గా చరిత్రలో సుప్రసిద్ధుడు.

క. **కొడుకులుఁ దమ్ములు గుఱ్ఱపు । దడములుఁ బెక్కైన బలవితానముఁ దగుమై**
నడపించుచు మెలుపున సం । గడములతో నరుగు శకుని గడు నొప్పారెన్. 93

ప్రతిపదార్థం: కొడుకులున్= పుత్రులు; తమ్ములున్= తనకంటె వయస్సులో చిన్నవారైన సోదరులు; గుఱ్ఱపు దడములు= అశ్వసేనలు; పెక్కు+అయిన+బలవితానము= ఎక్కువ అయిన సేనాసమూహం; తగుమైన్= తగినట్లుగా, క్రమబద్ధంగా; నడపించుచున్= వెడల చేస్తూ; మెలుపునన్= ఒడుపుతో; సంగడములతోన్= స్నేహితులతో; అరుగు= వెడలే; శకుని= శకుని (దుర్యోధనాదుల మేనమామ); కడున్= ఎక్కువగా; ఒప్పారెన్= వెలుగొందాడు.

తాత్పర్యం: తన కొడుకులతో, గుఱ్ఱపు దళాలతో; పెద్ద సైన్యంతో - క్రమబద్ధంగా నడిపిస్తూ, సపరివారంగా యుద్ధభూమికి వెడలే శకుని వెలుగొందాడు.

విశేషం: శకుని గాంధార దేశాధిపతి. జూదం ఆటలో గడుసరి. దుష్టచతుష్టయంగా ప్రసిద్ధికెక్కిన వారు (దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు), గాంధార దేశం గుఱ్ఱాలకు పేరు కెక్కింది. గుఱ్ఱాల నడక క్రమబద్ధంగా భాసిస్తుంది.

మ. **తనతోఁ గాల్బురు సాలఁ గల్గు బలసంతానంబుతోఁ బ్రీతిఁ బు**
త్రుని వీరోత్తము సోమదత్తు విలసద్దోర్దర్ప దుర్దాంతుఁ బౌ
త్రుని భూరిశ్రవసుం గనుంగొనుచు నింద్రుం గ్రేణి సేయంగ నే
చిన పెంపొప్పఁగ బాహ్లికుం డరిగె నిశ్చింతంబునం బోరికిన్. **94**

ప్రతిపదార్థం: తనతోన్= తనకు తోడుగా (బాహ్లికుడికి బాసటగా); కాల్బురు= పదాతి భటులు; చాలన్= మిక్కుటంగా; కల్గు= ఉన్న; బల+సంతానంబుతోన్= సేనల సమూహాలతో; ప్రీతిన్= ఇష్టంగా; పుత్రుని= కొడుకును; వీర+ఉత్తమున్= శూరులలో గొప్పవాడైన; సోమదత్తున్= సోమదత్తుడు అనే పేరుగలవాడిని; విలసత్+దోః+దర్ప+దుర్దాంతున్= ప్రకాశించే భుజపరాక్రమంయొక్క ఆటోపం చేత దుస్సహుడు అయిన వాడిని; పౌత్రునిన్= కొడుకు కొడుకును; భూరిశ్రవసున్= భూరిశ్రవసుడు అనే పేరుగల వాడిని; కనుంగొనుచున్= చూస్తూ; ఇంద్రున్= వేల్పుదొరను (స్వర్గలోకాధిపతిని); క్రేణి+చేయంగన్+ఎంచిన= పరిహసింప జాలిన; పెంపు+ఒప్పఁగన్= గొప్పదనము విలసిల్లగా; బాహ్లికుండు= బాహ్లికుడు; పోరికిన్= యుద్ధానికి; నిశ్చితంబునన్= జంకులేకుండగా; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: మిక్కుటమైన కాల్బలముగల సైన్యంతో బాహ్లికుడు వీరోత్తముడైన కుమారుడు సోమదత్తునితో, ప్రకాశించే భుజపరాక్రమాటోపంచేత అణచరానివాడైన తన మనుమడు భూరిశ్రవునితో-దేవేంద్రుని పరిహసించగల గొప్పతనంతో యుద్ధభూమికి నిశ్చింతగా వెళ్ళాడు.

విశేషం: 1. బాహ్లికుడు యుద్ధానికి వెళ్ళటాన్ని తిక్కన ఒక చక్కని చిక్కని మత్తేభవృత్తంలో వర్ణించాడు. మహాభారత సంగ్రామంలో పాల్గొన్న వృద్ధవీరులలో ప్రముఖులు బాహ్లికుడు, భీష్ముడు, భగదత్తుడు. బాహ్లికుడిలో ఇంకో విశేషం ఉన్నది. మూడు తరాల వారు ఆతడి సేనలో ఉన్నారు. బాహ్లికుడూ, అతడి కొడుకు సోమదత్తుడూ, సోమదత్తుడి కొడుకు భూరిశ్రవసుడూ. ముగ్గురూ పేరుకెక్కిన వీరాధివీరులే.

వ. **కాంభోజరా జగు సుదక్షిణుం డక్షీణ విభవంబున వెడలె; మఱియుం గోసలపతి యగు బృహద్బలుండును, మాహిష్మతీ పురనాథుం డగు నీలుండును, త్రిగర్తేశ్వరుం డగు సుశర్మయు, నసురేంద్రులగు నలంబస హలాయుధులును, సాల్వ సౌవీర శూరసే నాభీర యవన వసుధాధిపులును లోనుగా ననేక దేశాధీశు లాత్మీయ చతురంగ బలసమన్వితులును నిజధ్వజ విరాజమానులును నానాభరణోజ్జ్వలాంగులును నయి సంగర కౌతుకంబు మొగంబులం దొంగలింప నరిగి ; రివ్విధంబునం బది యక్షౌహిణులు నడవం బదునొకండవ యక్షౌహిణితోఁ గురుక్షోణీవల్లభుండు విస్ఫురిత భూషణభూషితం బైన గంధ సింధురంబు నెక్కి వెలి గొడుగులు మెఱయం దొడవులం దఱచైన వజ్రంబుల యుద్దామంబు లగు**

దీధితిస్తోమంబులును జామరంబులుం గలయం బొలయ బహురత్నప్రభా విభాసితం బయిన భుజంగకేతనంబు గ్రాలఁ గెలంకుల దుశ్శాసన దుర్మర్షణ వివింశతి వికర్ణాదు లగు సోదరులు వాహన వల్గనంబులు మెఱసి మెఱుఁగారు తమ తమ సిడంబు లుల్లసిల్లం జెలువు మిగిలి చనుదేరం జనియె; నిట్లు కౌరవసైన్యంబు గూడికొని కోదండ గదాదండ కుంత క్షురికా ముసల ముద్గర తోమర పరశు భింది పాల శూల ప్రముఖ నిఖిల హేతివ్రాతంబులను భర్మపరికర్మ నిర్మాణశోభిత వర్మంబులును వివిధవర్ణ విచిత్ర తనుత్రాణంబులును, మణిగణోజ్జ్వలజ్వాలాజటిల కేతనంబులం బరమాభీలసుందర సమ్మర్దం బయ్యె; న ట్లున్న యప్పుడు. 95

ప్రతిపదార్థం: కాంభోజ+రాజు+అగు= కాంభోజ దేశానికి పరిపాలకుడు అయిన; సుదక్షిణుండు= సుదక్షిణుడు; అక్షీణ, విభవంబునన్= గొప్ప ఐశ్వర్యంతో; వెడలెన్= వెళ్ళాడు; మఱియున్= అంతేకాక; కోసల+పతి+అగు= కోసల దేశానికి రాజు అయిన; బృహద్బలుండును= బృహద్బలుడూ; మాహిష్మతీ, పుర, నాథుండు+అగు= మాహిష్మతీ నగరం ఏలే రాజు; నీలుండును= నీలుడూ; త్రిగర్త+ఈశ్వరుండు+అగు= త్రిగర్త దేశాధిపతి అయిన; సుశర్మయు; అసుర+ఇంద్రులు+అగు= రాక్షస ప్రముఖులు అయిన అలంబస హలాయుధులును; సాల్వ, సౌవీర, శూరసేన+ఆభీర, యవన, వసుధా+అధిపులును= సాల్వసౌవీర శూరసేన ఆభీర, యవన రాజులును; లోనుగాన్= మొదలగు; అనేక దేశ+అధీశులు= పెక్కు దేశాలను పరిపాలించే రాజులూ; ఆత్మీయ, చతురంగ, బల, సమన్వితులును= తమకు చెందిన నాలుగు అంగాలుగల సేనలతో కూడిన వారూ; నిజ, ధ్వజ, విరాజమానులును= తమకు ప్రత్యేకమైన జెండాలతో భాసించే వారూ; నానా+ఆభరణ+ఉజ్జ్వల+అంగులును= పెక్కు రకాల భూషణాలలో వెలుగొందే శరీరాలు గలవారూ; అయి; సంగర+కౌతుకంబు= యుద్ధమునందలి కుతూహలంతో; మొగంబులన్= ముఖాలపై; తొంగలింపన్= ప్రతిఫలించగా; అరిగిరి= (యుద్ధభూమిని) వెళ్ళారు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; పది+అక్షౌహిణులు= పది అక్షౌహిణులు నిర్ణీత సంఖ్యలో చతురంగబలాలు గల సేనలు; నడవన్= తరలగా; పదునొకండవ+అక్షౌహిణితోన్- పదకొండో అక్షౌహిణితో; కురుక్షోణీ వల్లభుండు= కురురాజ్యనేత- దుర్యోధనుడు; విస్ఫురిత, భూషణ, భూషితంబు+ఐన= దేదీప్యమానంగా ఆభరణాలతో అలంకరించబడిన; గంధ+సింధురంబున్= మదపుటేనుగును; ఎక్కి= అధిరోహించి; వెలిగొడుగులు= తెల్లగొడుగులు; మెఱయన్= ప్రకాశించగా; తొడవులన్= ఆభరణాలందు; తఱచు+ఐన= దట్టమైన; వజ్రంబుల= రవ్వలతోను; ఉద్దామంబులు+అగు= గొప్పవి అగు; దీధితి స్తోమంబులన్= వెలుగుల సముదాయాలతో; చామరంబులున్+కలయన్+పొలయన్= చమరీమృగం వెంట్రుకలతో గూర్చిన వీవెనల కలిసి మెలిసి; బహు రత్న ప్రభా విభాసితంబు+అయిన= పెక్కురత్నాల కాంతులతో వెలుగొందుతున్న; భుజంగ, కేతనము= పాము బొమ్మ ఉన్న జెండా; క్రాలన్= మిరుమిట్లతో ప్రకాశించుండగా; కెలంకులన్= ఇరువైపుల; దుశ్శాసన దుర్మర్షణ వివింశతి వికర్ణ+ఆదులు+అగు= దుశ్శాసనుడు, దుర్మర్షణుడు, వివింశతి, వికర్ణుడు మున్నగు; సోదరులును= తమ్ములూ; వాహన+వల్గనంబులు= గుర్రాల గిట్టల చప్పుడు నడకలు; మెఱసి+మెఱుఁగారు= మిరుమిట్లు గొలిపే; తమతమ సిడంబులు= జెండాలు; ఉల్లసిల్లన్= శోభిల్లగా; చెలువు, మిగిలి= అందం అతిశయించి; చనుదేరన్= రాగా; చనియెన్= యుద్ధభూమికి వెళ్ళాడు; ఇట్లు= ఈ రీతిగా; కౌరవ+సైన్యంబు= కౌరవుల సేనతో; కూడికొని= కలిసి; కోదండ, గదాదండ, కుంత, క్షురికా, ముసల, ముద్గర, తోమర, పరశు, భింది పాల, శూల, ప్రముఖ, నిఖిల, హేతి, వ్రాతంబులన్= ధనుస్సు, నడికట్టు, ఈటె, చిన్న కత్తి, రోకలి, ఇనుపగుదియ, చిల్లకోల, గండ్రగొడ్డలి, రెండు మూడు నాల్కలుగల పెద్దసూది, ఈటె మొదలైనటువంటి అన్ని ఆయుధాలగుంపుతో; భర్మ, పరికర్మ, నిర్మాణ, శోభిత, వర్మంబులును= బంగారుతో చేయబడి శరీరమందలి మురికి పోగొట్టేటట్లు తయారు చేయబడిన కవచాలూ; వివిధ, వర్ణ, విచిత్ర, తనుత్రాణంబులును= పెక్కురంగులతో ఆశ్చర్యకరంగా కనుపించే శరీర రక్షలును; మణి, గణ, ఉజ్జ్వల, జ్వాలా, జటిల, కేతనంబులన్= మణుల సముదాయాల యొక్క కాంతుల మంటలతో దట్టమైన జెండాలతో; పరమ+ఆభీల, సుందర, సమ్మర్దంబు+అయ్యెన్= మిక్కిలి భయంకరంగానూ అందంగాను దట్టంగాను కన్పించింది; అట్లు+ఉన్న+అప్పుడు= ఆ రీతిగా ఉన్నప్పుడు.

తాత్పర్యం: కాంభోజ దేశాన్ని పరిపాలించే రాజు సుదక్షిణుడు గొప్ప వైభవంతో యుద్ధభూమికి తరలివెళ్ళాడు. కోసల దేశరాజు, బృహద్బలుడు, మాహిష్మతీ నగరాన్ని ఏలే ప్రభువు నీలుడు, త్రిగర్తదేశాధిపతి సుశర్మ, రాక్షస నాయకులగు అలంబసుడు, హలాయుధుడు, సాల్వ, సౌవీర, శూరసేన, ఆభీర, యవన, రాజులు మున్నగు అనేక దేశాలను పరిపాలించే ప్రభువులు రథ, గజ, తురగ భట బలాలతో తమ జెండాలు కన్నుల పండువుగా శోభిలుతుండగా, అనేకాలైన ఆభరణాలు శరీరాలపై వెలుగొందుతుండగా యుద్ధం చేయాలనే ఉత్సాహం మొగాలలో తాండవిస్తూ ఉండగా యుద్ధభూమికి వెడలసాగారు.

ఈ విధంగా పది అక్షౌహిణుల సైన్యం తరలి వెళ్లగా, పదకొండో అక్షౌహిణిబలంతో కురుపతి దుర్యోధనుడు ఆభరణాలతో శోభిల్లే మదపు టేనుగును అధిరోహించి యుద్ధానికి తరలివెళ్ళాడు. తెల్లని గొడుగులు అతడి శిరసుపై ప్రకాశించాయి. వజ్రాల తళతళలతో మిరుమిట్లు గొలిపే చామరాలు అతడికి వీస్తున్నారు. రత్నాలు పొదిగిన భుజంగకేతనంతో అతడు ప్రకాశించాడు. అతడి తమ్ములు దుశ్శాసనుడు, దుర్మర్షణుడు, వివింశతి, వికర్ణుడు మొదలైనవారు తమ తమ వాహనాలలో జెండాలతో అతడి వెంట వెళ్ళారు.

ఈ విధంగా యుద్ధానికి సన్నద్ధుడై తరలి వెళ్ళే ఆ కురుసేనలో ధనువులు, గదలు, ఈటెలు, వంకర కత్తులు, రోకళ్ళు, ఇనుపగుదియలు, చిల్లకోలలు, గండ్రగొడ్డళ్ళు, రెండు మూడు నాల్కలుగల పెద్ద సూదులు, బల్లెములు అన్ని ఆయుధాలు కన్పించాయి. బంగారు కవచాలు రంగు రంగుల తనుత్రాణాలు మణులతో పొదగబడిన జెండాలు గల ఆ కౌరవసైన్యం సుందరంగా భయంకరంగా దట్టంగా కనుపించింది.

విశేషం: 1. మహాభారత యుద్ధంలో నేటి భారత దేశం ఎల్లలు దాటిన కాంభోజదేశం నుండి సేనలు యవనులు రాక్షసులు కూడా పాల్గొనటం ఒక విశేషం. ఒక విధంగా అది తొలి ప్రపంచ యుద్ధం.

2. అలనాటి వీరులు యుద్ధాన్ని ఒక వినోద విహార క్రీడగా భావించారు.

3. ఆనాటి ఆయుధ విశేషాలు ధనువులేగాక ఎన్నో రకాలు ఉన్నాయి.

4. ఇక కవచాలు. కవచాల వంటి తను త్రాణాలు. కవచం కడుపును, వక్షఃస్థలాన్నీ రక్షిస్తుంది. మిగిలిన అవయవాలను రక్షించేవి తను త్రాణాలు. శిరస్కం, ముఖత్రాణం, దలపం, ఉదరత్రాణం, నాగోదం, జంఘాత్రాణం, మంఖుణం, బాహుత్రాణం, బాహులం, అంగుళీత్రాణం, గోధ.

5. అక్షౌహిణి: ఇరవై ఒక్కవేల ఎనిమిది వందల రథాలు, అన్ని యేనుగులు, అరవై వేల ఆరువందల గుర్రాలు, లక్షా తొమ్మిదివేల మూడు వందల ఏభైమంది కాల్బలం కలిస్తే ఒక అక్షౌహిణి అని గణితం. ప్రతి రథానికి నలుగురు చక్రరక్షకులు ఉంటారు. అట్టి 18 అక్షౌహిణులు కురుక్షేత్రంలో చేరాయి.

తే. **అమరు తొడవుల వజ్రాంశు లంచపిండు । కరణి హరినీలములఁ బేర్చుకాంతి యళుల**
పగిది మాణిక్యరుచి పద్మభంగి మెఱయఁ । గురుబలంబు గెందామర కొలనిఁ బోలె. **96**

ప్రతిపదార్థం: అమరు, తొడవుల= పొందిక పడిన ఆభరణాలయొక్క; వజ్ర+అంశులు= రవలకాంతులు; అంచ, పిండు, కరణిన్= హంసల సముదాయాలవలె; హరినీలములన్+పేర్చు, కాంతి= ఇంద్రనీలమణుల అధికమైన వెలుగు; అళుల పగిదిన్= తుమ్మెదలవలె; మాణిక్య+రుచి= కెంపుల కాంతి; పద్మభంగిన్= పద్మాలవలె; మెఱయన్= వెలుగొందగా; కురు+బలంబు= కౌరవసేన; కెందామర కొలనిన్= ఎర్ర దామర పువ్వులతో కూడిన సరస్సును; పోలెన్= పోలింది.

తాత్పర్యం: ఆభరణాలలోని వజ్రాల కాంతులు హంసలవలె ఉన్నాయి. ఇంద్రనీలమణుల వెలుగులు తుమ్మెదలవలె ఉన్నాయి. కెంపుల కాంతులు పద్మాలవలె భాసించాయి. కౌరవసేన ఎర్రతామరలు వికసించిన సరోవరం వలె వెలుగొందింది.

విశేషం: అలం: ఉపమ.

వ. అట్టియెడ భీష్ముండు భూవల్లభులనెల్లం గూడం బిలిపించి వారలతో నిట్లనియె. 97

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; భీష్ముండు= భీష్ముడు; భూవల్లభులన్+ఎల్లన్= రాజులను అందరను; కూడన్+పిలిపించి= సమావేశం అయ్యేటట్లు ఆహ్వానించి; వారలతోన్= వారితో; ఇట్లు అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో సేనాపతి అయిన భీష్ముడు రాజులను అందరను ఒక చోట సమావేశపరచి ఈ విధంగా చెప్పాడు.

విశేషం: భీష్ముడు సేనాధిపతి గనుక వీరులకు ప్రబోధం చేయటం అతడి ప్రథమ కర్తవ్యం.

భీష్ముఁడు నిజయోధులకెల్ల నుత్సాహంబుగాఁ దెగువ సెప్పుట (సం. 6-17-7)

క. ' ఆరయ వివృతస్వర్గ । ద్వారము రాజులకు నాహవం; బందు మహో
దారులు దొల్లియు నరిగిరి; । మీ రీ మార్గమున నడవ మెయికొనుటొప్పున్. 98

ప్రతిపదార్థం: ఆరయన్= పరీక్షించి చూడగా; ఆహవంబు= యుద్ధం; రాజులకున్= ప్రభువులకు; వివృత, స్వర్గ, ద్వారము= తెరచబడిన స్వర్గం యొక్క తలుపు- అనగ ప్రవేశమార్గం; మహా+ఉదారులు=గొప్పవారు; తొల్లియున్=పూర్వంకూడా; అందున్= (ఆ ద్వారమునందు); అరిగిరి= వెళ్ళారు; మీరు= రాజులైన మీరు; ఈ మార్గమునన్= ఈ దారినే; నడవన్, మెయికొనుట+ఒప్పున్= నడవటానికి ఇష్టపడటం మంచిది.

తాత్పర్యం: ఆలోచించి చూస్తే, రాజులకు యుద్ధం స్వర్గంలో ప్రవేశించటానికి తెరువబడిన ద్వారం. పూర్వకాలంలో ఎందరో గొప్పవారు ఈ దారినే వెళ్లారు. మీరు ఈ మార్గంలో నడవడానికి ఇష్టపడటం తగినది.

విశేషం: యుద్ధభూమిలో మరణించిన వీరులు (వీరుల ఆత్మలు) స్వర్గలోకంలోకి వెళ్ళగలవు అనే నమ్మకం ప్రాచీనకాలంలో వీరులకు ఉండేది.

క. ఇంటం దెవులునఁ జచ్చుట । కంటెను బాపంబు లొండు గలవె నృపులకున్?
బంటకలను పొలిగల నిది । గంట నిధానంబు గంట గాదే మనకున్?' 99

ప్రతిపదార్థం: నృపులకున్= రాజులకు; ఇంటన్= గృహంలో; తెవులునన్= జబ్బుతో; చచ్చుట కంటెను= మరణించటం కంటె; పాపంబులు= పాపాలు; ఒండు= వేరు; కలవు+ఎ?= ఉన్నాయా?; పొలిగలను= యుద్ధభూమి; పంటకలను= పంటభూమి; ఇది= ఇది; కంట= చూడటం; మనకున్= మనకు; నిధానంబు= ధననిధిని; కంట= చూడటం; కాదు+ఏ?= కాదా?

తాత్పర్యం: ఇంటిలో జబ్బు చేసి మంచమెక్కి బాధపడుతూ మరణించటం కంటే రాజులకు వేరే పాపం ఏమీ ఉండదు. రణరంగమే రాజులకు పంట చేను. యుద్ధభూమిని దర్శించటం అంటే రాజులు పెన్నిధిని పొడగాంచినట్లే.'

తే. **అనిన విని వార లందఱు నగ్గలికలు । నెఱయు మాటలఁ దనతన తెఱఁగు మెఱయ**
బహువిధంబుల నతనికి బాస యిచ్చి । యేచి నిజసైన్యములలోని కేఁగి రథిప! **100**

ప్రతిపదార్థం: అనినన్= అని (భీష్ముడు) పలుకగా; విని= ఆలకించి; వారలు+అందఱున్= ఆ రాజులు అందరూ; అగ్గలికలు= ఉత్సాహాలు; నెఱయు+మాటలన్= అతిశయించే పలుకులతో; అతనికిన్= సేనాపతి అయిన భీష్ముడికి; బహువిధంబులన్= ఎన్నో రీతుల; బాస+ఇచ్చి= ప్రతిజ్ఞలు చేసి; అధిప!= ఓరాజా! (ధృతరాష్ట్ర మహారాజా!); ఏచి= పూని; నిజ+సైన్యములలోనికిన్= తమ సేనలలోనికి; ఏఁగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సేనాపతి అయిన భీష్ముడు ఆ విధంగా ప్రబోధించగా విని, యుద్ధం చేయటానికి వచ్చిన ఆ రాజులు అందరూ ఉత్సాహంతో పొంగి పోయి అతడి యెదుట ఎన్నో విధాలుగా శపథాలు చేసి తమ తమ సేనలలోనికి వెళ్ళి నిలిచారు.

వ. **అయ్యవసరంబున గాంగేయుండు గాంధారేయు నాలోకించి 'మదీయ సంగర సమయంబునఁ గర్ణుండు పుత్త్రమిత్త్రామాత్యబంధు సహితంబుగాఁ గయ్యంబునకు రాకుండం గలవాడని తేటపడం బలికిన.** **101**

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; గాంగేయుండు= గంగ కొడుకు- భీష్ముడు; గాంధారేయున్= గాంధారి కొడుకును దుర్యోధనుడిని; ఆలోకించి= చూచి; మదీయ, సంగర, సమయంబునన్= నేను యుద్ధం చేసే కాలంలో; కర్ణుండు= కర్ణుడు; పుత్త్ర మిత్ర అమాత్య బంధు సహితంబుగాన్= కొడుకులతో, స్నేహితులలో, మంత్రులలో, చుట్టాలతోపాటు; కయ్యంబునకున్= యుద్ధానికి; రాకుండన్+కలవాఁడు= రాగూడదు; అని= అని; తేటపడన్+పలికినన్= సుస్పష్టంగా చెప్పిన.

తాత్పర్యం: ఆ సమయంలో భీష్ముడు దుర్యోధనుతో ఈ విధంగా అన్నాడు. 'ఓ దుర్యోధనా! నీ మిత్రుడైన కర్ణుడు నేను యుద్ధం చేసేటప్పుడు తాను యుద్ధంలో పాల్గొనరాదు. అట్లే అతడి కొడుకులు స్నేహితులు మంత్రులు, చుట్టాలు సయితం యుద్ధంలో పాల్గొనరాదు.

విశేషం: 1. దుర్యోధనుడు భీష్ముడిని సేనాపతిగా నియమించి, ఉభయ పక్షాలలోని యోధుల శక్తిసామర్థ్యాల తారతమ్యాలు వెలకట్టి చెప్పుమని అర్థించాడు. భీష్ముడు వీరులందరినీ పొగడి కర్ణుడిని 'అర్ధరథుడు' అని చెప్పాడు. అనగా వీరులలో రథుడు, మహారథుడు, అతిరథుడు, అతిరథశ్రేష్ఠుడు ఉత్తరోత్తర బలీయములైన పదవులు. వీరులలో అందరి కంటె తక్కువ వాడు రథుడు. ఇక అర్ధరథుడు అంతకంటె మిక్కిలి అధముడు అన్నమాట. అప్పుడు కర్ణుడు కోపించి భీష్ముని నాయకత్వంలో తాను యుద్ధం చేయనని ప్రతిజ్ఞ చేశాడు.అందుచేత భీష్ముడు ఈ మాట చెప్పవలసి వచ్చింది దుర్యోధనునితో.

2. అయితే భీష్మ పతనానంతరం కర్ణుడు రహస్యంగా భీష్ముడిని కలిసికొని అతడికి తన మన్నన తెలిపాడు. భీష్ముడు గూడ కర్ణుని లోకోత్తర వీరుడిగా ప్రశంసించాడు! ఒకనాడు ఆ భీష్ముడేకదా కర్ణుడిని అర్ధరథుడు అని అన్నది!? భీష్ముడిని తూలనాడిన ఆ కర్ణుడే భీష్ముడికి పాదాభివాదం చేశాడు. మానవ మనస్తత్త్వాన్ని మథించిన మహాభారతంలోనే ఇట్టి విచిత్ర విరోధాభాసం వర్ణించబడింది.

క. **' చలముకొని యొరుల నుడుపుట । బలియుండై తెంపు సేసి బవరమునకుఁ దాఁ**
దెలియుట గాదే!' యని కురు । కులముఖ్యుఁడు వొంగి యతనిఁ గొనియాడెఁ దగన్. **102**

ప్రతిపదార్థం: చలము+కొని= మిషపెట్టి; ఒరులన్= ఇతరులను; ఉడుపుట= నిగ్రహించటం; బలియుండు+ఐ= బలంకలవాడై; తెంపు+చేసి= చొరవ వహించి; బవరమునకున్= యుద్ధానికి; తాన్= తానై; తెలియుట+కాదే!= పూనిక వహించటమే కదా!; అని= అని పల్కి; కురు కుల ముఖ్యుఁడు= కౌరవ శ్రేష్ఠుడు- దుర్యోధనుడు; పొంగి= (ఉత్సాహంతో) అతిశయించి; అతనిన్= (భీష్ముడిని); తగన్= తగునట్లుగ (యథోచితంగా); కొనియాడెన్= ప్రశంసించాడు.

తాత్పర్యం: 'నేపం పన్ని ఇతరులను ప్రక్కకు నెట్టివేయటం అంటే యుద్ధంలో తానే బలవంతుడై బాధ్యత వహించి పోరాడటానికీ సంసిద్ధం కావటమేగదా' అని దుర్యోధనుడు భీష్ముడిని పొగిడాడు.

విశేషం: 1. దుర్యోధనుడికి కర్ణుడికిగల మైత్రి జగత్ప్రసిద్ధం. అయితే, సేనాపతి అయిన భీష్ముడు కర్ణుడిని- యుద్ధంలోకే రాకూడదు అని నిషేధించాడు. ఇది దుర్యోధనునికి బాధ కలిగించే అంశమే. అయినప్పటికీ, ఆతడు భీష్ముడిని ప్రశంసించాడు. 'కర్ణుడిని రావద్దంటే - భీష్ముడే యుద్ధ బాధ్యత సర్వం తనమీద వేసుకొన్నట్లేకదా!' అన్నాడు తెలివిగా పరిపాలనాదక్షుడైన దుర్యోధనుడు.

2. చలము అన్న మాట ఇక్కడ మిక్కిలి అర్థవంతమైనది. వాది ఒక అర్థంలో ప్రయోగించిన శబ్దానికి ప్రతివాది, మరియొక అర్థం కల్పించి చేయు దూషణ. ఇది జల్ప దోషాలలో ఒకటి. ఛల శబ్దప్రయోగంవలన కర్ణుడిపై దుర్యోధనుడికి గల ఆంతరంగిక సానుభూతి స్వయం వ్యక్తమైంది.

వ. ఇట్లు పితామహు నెత్తికోలునకుం జిత్తంబు వికసిల్ల ననుజసహితంబుగా నతనిం బరివేష్టించి యన్నరపతి 'నిబిడచారుసన్నాహంబుగా నుచితవ్యూహం బమర్పు' మని యతనికిం జెప్పిన, నతండును బడమరమొగం బయి తానును ద్రోణుండును దాలధ్వజంబును వేదికాకేతనంబును గ్రాలుచుండ ముందఱ నిలిచి వలపటఁ గృపాశ్వత్థామలును దాపటం గృతవర్మ మద్రేశ్వరులును వెనుక బాహ్లిక సోమదత్త భూరిశ్రవసులును నడుమం గురుకుమారసమేతంబుగా నమ్మహీనాథుండును, నతని యగ్రభాగంబున 'నర్జునుం జంపుదుము చత్తు మింతియ కాని యొండులే' దని శపథంబులు పలికి సంశప్తకు లనం బ్రఖ్యాతు లయిన సుశర్మ మొదలుగాఁ గల పదివేవురు రథిక ముఖ్యులును గలయ నెడనెడం దక్కిన యోధవీరులును నిలుచునట్లుగా నియమించి, తగ నయ్యైసైన్యంబుల కేనుంగులు నేనుంగుల కరదంబులు నరదంబులకుం దురంగంబులుఁ దురంగంబులకు విండ్లవారు విండ్లవారికి నద్ధాయుధులు నడ్డం బగు తెఱంగున నిలువ నియోగించి, మానుషవ్యూహంబు సమకట్టిన, నెన్నండును నిట్టి దృఢవ్యూహంబు గనియును వినియు నెఱుంగమని యెల్లవారు నచ్చెరువునం బొరయుచుఁ బ్రియంబందుచుండిరి; బృందారక ప్రముఖ దేవయోనులును దివంబున నున్న పురాతన ధరారమణులును భారత రణంబు గనుంగొను కుతూహలంబున వివిధ విమానారూఢులై యేతెంచి; రంతకు మున్న యక్కడ. 103

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పితామహు+ఎత్తికోలునకున్= తాతగారి నిర్ణయానికి, భీష్ముడి నిర్ధారణకు; చిత్తంబు= మనస్సు; వికసిల్లన్= వికసించగా; అనుజ, సహితంబుగాన్= తమ్ములతో గూడ; అతనిన్= భీష్ముడిని; పరివేష్టించి= చుట్టూ వినయంగా చేరికొలిచి; ఆ+నరపతి= ఆ రాజు - దుర్యోధనుడు; నిబిడ, చారు, సన్నాహంబుగాన్= దట్టమైన, అందమైన, యుద్ధ ప్రయత్నాలతో కూడినదై; ఉచిత, వ్యూహంబు+అమర్పుము+అని= తగిన వ్యూహం ఏర్పాటు చేయుము అని; ఆతనికిన్= (భీష్ముడికి); చెప్పినన్; అతండును= (భీష్ముడును); పడమర+మొగంబు+అయి= పడమటి దిక్కువైపు ముఖము కన్పించునట్లుగా; తానును= (భీష్ముడును); ద్రోణుండును= ద్రోణుడును; తాల+ధ్వజంబును= తాడిచెట్టు జెండా; వేదికా+కేతనంబును= యజ్ఞంకోసం అమర్చబడిన తిన్నెగల జెండా; క్రాలుచుండన్= మిరుమిట్లు గొలుపుతూ వెలుగొందుతుండగా; ముందరన్+నిలిచి= అగ్రభాగంలో నిలిచి; వలపటన్= కుడివైపు; కృప+అశ్వత్థామలును= కృపాచార్యుడును, అశ్వత్థామయును; దాపటన్= ఎడమ ప్రక్కగా; కృతవర్మ, మద్ర+ఈశ్వరులున్= కృతవర్మ, శల్యుడును; వెనుకన్= వెనుకభాగంలో; బాహ్లిక, సోమదత్త, భూరిశ్రవసులును= బాహ్లికుడు, (అతని కొడుకు సోమదత్తుడు) సోమదత్తుని కొడుకు భూరి శ్రవసుడును; నడుమన్= మధ్యభాగమందు; కురు, కుమార, సమేతంబుగాన్= కురుకుమారులతోపాటుగా; ఆ+మహీనాథుండును= ఆ రాజు (దుర్యోధనుడు); అతని+అగ్రభాగంబునన్= ఆతడిముందు; అర్జునున్= అర్జునుడిని; చంపుదుము= సంహరిస్తాము; చత్తుము= మరణిస్తాము; ఇంతియ కాని= ఇంతేకాని; ఒండు+తెఱంగు= వేరుమార్గం; లేదు+అని= లేదంటూ; శపథంబులు= ప్రతిజ్ఞలు; పలికి= వచించి; సంశప్తకులు+అనన్= సంశప్తకులు అనే పేరుమీద;

ప్రఖ్యాతులు+అయిన= పేరుకెక్కిన; సుశర్మ+మొదలుగాన్+కల= సుశర్మ మున్నగువారలైన; పదివేవురు, రథిక, ముఖ్యులును= పదివేల మంది గొప్ప రథికులూ; కలయన్+ఎడన్+ఎడన్= అక్కడ అక్కడ కలిసిపోయేటట్లుగా; తక్కిన= మిగిలిన; యోధ+వీరులును= యుద్ధం చేసే శూరులును; నిలుచు+అట్లుగాన్= నిలబడేటట్లుగా, నియమించి= ఆజ్ఞాపించి; తగన్ తగురీతిగా, అయ్యై+సైన్యంబులన్= ఆయాసేనలను; ఏనుంగులన్= ఏనుగులను; ఏనుంగులకున్+అరదంబులు= ఏనుగులకు రథాలు; అరదంబులకున్+తురంగములు= రథాలకు గుర్రాలు; తురంగబులకున్= గుర్రాలకు; విండ్లవారున్= ధనుస్సులు ధరించేవారు (ధానుష్కులు); విండ్లవారికిన్= చాపములు ధరించేవారికి; నద్ధాయుధులు= కట్టబడిన ఆయుధాలు కలవారు; అడ్డంబు+అగు+తెఱంగున్= అడ్డంగా (రక్షగా) ఉండేటట్లు; నిలువన్= నిలుచున్నట్లు; నియోగించి= ఏర్పాటు చేసి; మానుష, వ్యూహంబు= మనిషి ఆకారంగా వ్యూహం; సమకట్టినన్= ఏర్పాటు చేసినప్పుడు; ఎన్నండును= ఏకాలంలో గూడ; ఇట్టి= ఇటువంటి; దృఢ, వ్యూహంబున్= గట్టిదైన వ్యూహాన్ని; కనియున్+వినియున్+ఎఱుంగము= చూడలేదు, వినలేదు; అని= అని; ఎల్లవారున్= అందరూ; అచ్చెరువునన్+పొరయుచున్= ఆశ్చర్యానికి లోనయి; ప్రియంబు+అందుచుండిరి= సంతోషిస్తూ ఉన్నారు; బృందారక, ప్రముఖ, దేవయోనులును= దేవతలు మున్నగు వేల్పుల తెగలవారూ; దివంబునన్+ఉన్న= స్వర్గలోకంలో ఉన్న; పురాతన, ధరారమణులును= పూర్వకాలంలోని రాజులూ; భారత+రణంబు= భారత యుద్ధాన్ని; కనుంగొను= చూడాలి అనీ; కుతూహలంబునన్= కోరికతో; వివిధ, విమాన+ఆరూఢులు+ఐ= వేరు వేరు విమానాలను ఎక్కి వచ్చినవారై; ఏతెంచిరి= వచ్చారు; అంతకుమున్ను+అ= అంతకు ముందే; అక్కడన్= ఆచట (ఆ యుద్ధభూమియందు).

తాత్పర్యం: ~~ఈ~~ విధంగా భీష్ముడి విజృంభణ సంకల్పానికి, మనస్సు వికసించగా దుర్యోధనుడు తమ్ములతోపాటు అతడి చుట్టుచేరి చక్కని చిక్కని వ్యూహం పన్నుమని అర్థించాడు. భీష్ముడు మనుష్యాకారమైన ఒక గొప్ప వ్యూహాన్ని అమర్చాడు. ముఖం పడమర దిక్కుగ ఉన్నది. ముఖద్వారం కడ తాను. తాడిచెట్టు జెండాతో, యజ్ఞవేదిక ఉన్న జెండాతో ద్రోణాచార్యుడూ నిలిచారు. కుడివైపున కృపాచార్యుడు అశ్వత్థామ, ఎడమ వైపున కృపవర్మ, శల్యుడు నిలిచారు. వెనుక బాహ్లికుడు, అతడి కొడుకు సోమదత్తుడు, సోమదత్తుడి కొడుకు భూరిశ్రవసుడు నిలిచారు. మధ్యలో దుర్యోధనుడు తమ్ములతో పాటు నిలబడ్డాడు.

దుర్యోధనుడి ముందు సంశప్తకులు వారి నాయకుడు సుశర్మ నిలిచారు. 'అర్జునుని చంపుతాము లేదా అర్జునుడి చేత చస్తాము. అంతేగాని ఇక వెనుదిరిగే ప్రసక్తియే లేదు, అనేది వారి ప్రతిజ్ఞ. వారి సంఖ్య పదివేలు . ఇక ఎడనెడ మిగిలిన యోధులు నిలబడ్డారు.

ఆ వ్యూహంలో ఇంకో విశేషం ఉన్నది. ఆయా సైన్యాలను కాపాడేందుకు రక్షగా ఏనుగులు అమర్చబడ్డాయి. ఏనుగులకు ముందు రక్షగా రథాలు, రథాలకు రక్షగా అశ్విక బలాలు, ఆశ్విక బలాలకు రక్షగా విలుకాండ్రు, విలుకాండ్రకు రక్షగా తగిన ఆయుధాలు కత్తులు కటారులు ధరించినవారు నిలిచే ఏర్పాటు జరిగింది. ఇట్లాంటి దృఢమైన వ్యూహాన్ని కనీవినీ ఎరుగమంటూ అందరూ ఆశ్చర్యం చెందుతూ ఆనంద పడుతున్నారు.

భారత యుద్ధాన్ని చూడటానికి, దేవతలు, దేవతా జాతులు, స్వర్గలోకంలో ఉన్న పురాతన మహారాజులు తమ తమ విమానాలలో వచ్చారు. అంతకు ముందే అక్కడ

విశేషం: 1. వ్యూహాలు భారతయుద్ధంలో మిక్కిలి ప్రాముఖ్యం వహించినట్టివి. 'వ్యూహాలు.' ఇవి పలు ఆకారాలలో సేనాపతులు ఏర్పాటు చేసేవారు. 'వ్యూహం' సమరక్రీడలో అంతర్భాగం.

2. విమానాలు: ఆధునిక నాగరకత, విజ్ఞానశాస్త్రం ప్రసాదించిన అద్భుతాలలో విమానం ఒకటి. అయితే భారత రామాయణాలు చదివిన భారతీయులకు 'విమానాలు' సుపరిచితాలు. ఆకాశయానం- విమానయానం ప్రాచీన భారతీయుల ఆలోచనలను - కావ్యకథలను విశేషంగా తీర్చిదిద్దాయి.

3. ఆత్మ - మరణానంతరం ఉంటుందనీ, కర్మానుగుణంగా స్వర్గలోకవాసం, నరకలోకవాసం ఏర్పడుతుందని ప్రాచీన భారతీయులలో అధిక సంఖ్యాకులు విశ్వసించారు. 'ఆత్మ' నిత్యం; శరీరం అనిత్యం అనే భావాన్ని బహుళ ప్రచారంలోకి తీసికొనివచ్చింది. మహాభారతంలో అంతర్భాగమైన భగవద్గీత.

పాండవయోధులు యుద్ధంబునకు వెడలుట

సీ. ఏనిక మదమున కెలయు తేఁటుల మొత్త । ములు వెలిగొడుగుల చెలువు గెలువఁ,
దురగఖురోద్ధూతధూళి యప్సరసల । యలక పూవులతోడఁ జెలిమిసేయఁ,
గేతనంబుల మణివ్రాతంబు రోచులు । రవికిరణంబుల నవలఁ ద్రోవ,
జైత్రభేరుల మహాస్వనములు సకల ప । ర్వతములఁ బ్రతివిరావముల నీన,
తే. నంబరము రథఘోష భీమాభిరామ । కింకిణీ గణఝుణఝుణత్కృతిమయముగఁ
బటు పదాతిహేతిప్రభా పటలియెల్ల । దిశలు వెలిఁగింప వెడలె యుధిష్ఠిరుండు. 104

ప్రతిపదార్థం: ఏనిక, మదమునకున్= ఏనుగుల యొక్క దానజలమునకు; ఎలయు= వ్యాపించే; తేఁటుల+మొత్తము= తుమ్మెదలగుంపు; వెలిగొడుగుల+చెలువున్= తెల్లగొడుగుల అందాన్ని; గెలువన్= జయించగా; తురగ ఖుర+ఉద్ధూత ధూళి= గుర్రాల గిట్టలచేత పైకి లేపబడిన దుమ్ము; అప్సరసల= దేవతాస్త్రీల యొక్క; అలక+పూవుల తోడన్= ముంగురుల యందలి పుష్పాలతో; చెలిమి+చేయన్= స్నేహం చేయగా; కేతనంబుల= జెండాల యొక్క; మణి(వ్రాతంబు+రోచులు= మణుల సముదాయాల కాంతులు; రవి+కిరణంబులన్= సూర్యుడి వెలుగులను; అవలన్+త్రోవన్= దూరానికి నెట్టివేయగా; జైత్ర, భేరుల, మహా, నిస్వనములు= విజయసూచకములైన, పెద్ద డోళ్ళ నుండి వెలువడే గొప్ప శబ్దాలు; సకల, పర్వతములన్= అన్ని కొండలలో; ప్రతి రావములన్+ఈనన్= మారుమ్రోగగా; అంబరము= ఆకాశం; రథఘోషన్= రథాల నుండి వెలువడే ధ్వనితో; భీమ+అభిరామ, కింకిణీ, గణ, ఝుణఝుణత్+కృతిమయముగన్; భయంకరం సుందరం అయిన చిరుగంటల సవ్వడులతో నిండి ఉండగా; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; పటు+పదాతి+హేతి+ప్రభా+పటలి= మిక్కుటములైన కాలి భటుల కత్తి తళతళల వెలుగు గములు, ఎల్ల దిశలు= దిక్కులు అన్నిటిని; వెలిఁగింపన్= వెలుగొందచేయగా; వెడలెన్= యుద్ధభూమికి తరలి వెళ్ళెను.

తాత్పర్యం: ధర్మరాజు యుద్ధభూమికి తరలి వెళ్ళాడు. ఏనుగుల మదం వలన ఏర్పడే సువాసనకు ఆకర్షించబడిన తుమ్మెదల గుంపులు తెల్లగొడుగుల సొగసును జయిస్తున్నట్లు గుమిగూడాయి. గుర్రాల గిట్టలవలన చెలరేగిన దుమ్ము కణాలు, ఆకాశం వరకు వ్యాపించి, దేవతాస్త్రీల ముంగురులలో అలంకరించబడిన పువ్వులతో స్నేహం చేశాయి. జెండాలపై గుర్తులుగా ఉన్న బొమ్మలలో పొదగబడిన మణులయొక్క కాంతులు సూర్యకిరణాలను మించి ప్రకాశించాయి. విజయభేరిధ్వనులు అన్ని కొండలలో మారుమ్రోగాయి. ఆకాశం, రథచక్రాల ధ్వనులతో వెరపు గొలుపుతూ సొగసులు చిందుతూ మారుమ్రోగుతున్న చిరుగంటల సవ్వడులతో నిండిపోయింది. కాల్బలం పట్టుకొన్న కత్తుల యొక్క తళతళల వెలుగులు దిక్కులన్నిటినీ వెలుగొందచేశాయి. ధర్మరాజు యుద్ధానికి తరలి వెళ్ళటం శోభాయమానంగా పరిణమించింది.

విశేషం: మదధారలు ఏనుగుల కుంభస్థలాలనుండి స్రవించటం, ఆ మదధారల పరిమళానికి తుమ్మెదలు ఆకర్షించబడటం హృదయంగమమైన 'కవిసమయం'. వెలిగొడుగులంటే బహిశ్చత్రాలని కొందరు అన్వయించారు.

మ. ప్రమదం బాననకాంతిఁ గ్రొత్తవఱుపం బాదాతిభూయిష్ఠ సై
న్యముతో భీముఁడు భూషణద్యుతి నికాయంబున్ గదాద్యాయుధో
గ్ర మరీచి ప్రకరంబునుం గలిసి చిత్రస్ఫూర్తి శోభిల్లఁ గా
సమరక్రీడకు వచ్చె జృంభిత భుజాస్తంభోజ్జ్వలాకారుఁడై. 105

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భీముఁడు= భీముడు; ప్రమదంబు= సంతోషం; ఆననకాంతిన్= ముఖంలోని వెలుగును; క్రొత్త, పఱుపన్= కొత్తదిగా చేయగా; పాదాతి, భూయిష్ఠ, సైన్యముతోన్= కాల్బలాలతో కూడిన సేనతో; భూషణ, ద్యుతి, నికాయంబున్= ఆభరణాల కాంతుల పుంజము; గదా+ఆది+ఆయుధ+ఉగ్ర, మరీచి, ప్రకరంబునున్= గద మున్నగు ఆయుధాల యొక్క భయంకరమైన కాంతుల సమూహమూ; కలిసి= కలిసి; చిత్ర స్ఫూర్తిన్+శోభిల్లఁగాన్= చిత్రవర్ణ స్ఫూర్తితో; విలసిల్లగా; జృంభిత, భుజా, స్తంభ+ ఉజ్జ్వల+ ఆకారుఁడు+ఐ= విస్తరిల్లిన కంబముల వంటి భుజములతో మెరిసే ఆకారం కలవాడై; సమర+క్రీడకున్= యుద్ధం అనే ఆటకు; వచ్చెన్= (తరలి) వచ్చాడు.

తాత్పర్యం: సంతోషం మొగమందు వెలుగొందుతుండగా, వెంట గొప్ప కాల్బలంతో కూడిన సేన రాగా, ఆభరణాలు గద మున్నగు ఆయుధాల నుండి వెలువడే భయంకరమైన కాంతులు కలిసి చిత్రవిచిత్రమైన శోభ ఏర్పడగా కంబములవంటి భుజాలతో ప్రకాశించే దేహ సౌష్ఠవం కలవాడై యుద్ధ వినోద విహారానికి సన్నద్ధుడై భీముడు వచ్చాడు.

సీ. దివ్యరథస్ఫారదీప్తిజాలంబులు । పద్మరాగోజ్జ్వలప్రభలు గాఁగ,
మహనీయ రథ్యవిగ్రహముల జిగిసొంపు । ఘనవజ్ర వసు సముత్కరము గాఁగ,
నొగలపై నున్న కృష్ణుని మేని నునుఁజాయ । హరినీల కాంతివిస్ఫురణ గాఁగఁ,
బ్రస్ఫీత కేతనాగ్రస్థిత కపిదేహ । రోచులు గరుడాశ్మరుచులు గాఁగ

ఆ. నంపపొదుల నిగుడు నంశువితానంబు । దీప్రమరకతముల దీధితులుగఁ
దాలిమియును బెంపుఁ దనకు నైజములుగ । విజయరోహణాద్రి వెడలి వెలిఁగె. 106

ప్రతిపదార్థం: దివ్య, రథ, స్ఫార, దీప్తి, జాలంబులు= దేవతా సంబంధమైన రథంయొక్క విస్తారమైన కాంతి సమూహాలు; పద్మ, రాగ, ఉజ్జ్వల, ప్రభలు, కాఁగన్= కెంపులనుండి వెలువడు మెరపు వెలుగులు కాగా; మహనీయ, రథ్యవిగ్రహముల, జిగి, సొంపు= గొప్పవైన గుర్రాల శరీరాల యొక్క వెలుగుల సొగసు; ఘన, వజ్ర, వసు, సముత్కరము, కాఁగన్= గొప్ప రవ్వల సంపదల సమూహంకాగా; నొగలపైన్= రథం ముంగలి భాగంపై; ఉన్న= (కూర్చొని) ఉన్న; కృష్ణుని, మేని, నును, చాయ= ఆ కృష్ణుడి దేహము యొక్క జిలుగు వన్నెల రంగు; హరినీల, కాంతి, విస్ఫురణ, కాఁగన్= ఇంద్రనీలమణుల ప్రకాశ ప్రకటనకాగా, ప్రస్ఫీత, కేతన, అగ్ర, స్థిత, కపి, దేహ, రోచులు= ప్రకాశించే జెండాపైన ఉన్న కోతి (ఆంజనేయుడి) శరీర కాంతులు; గరుడ+అశ్మరుచులు కాఁగన్= ఆకుపచ్చ వన్నెగల మాణిక్యకాంతులు కాగా; అంపపొదులన్= బాణాలు పెట్టుకునే పొదులలో; నిగుడు= వ్యాపించు; అంశు వితానంబు= కాంతిపుంజం; దీప్ర, మరకతముల, దీధితులుగన్= ప్రకాశించే పచ్చల వెలుగులు కాగా; తాలిమియును+పెంపు= ఓర్పు గొప్పతనము; తనకున్= తనకు (అర్జునుడికి); నైజములుగన్= స్వభావసిద్ధములుగ; విజయ రోహణ+అద్రి= అర్జునుడు అనే రోహణపర్వతం - లేదా - పరాక్రమం రూపొందిన పర్వతం; వెడలి= (యుద్ధానికి) బయలుదేరి; వెలిఁగెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: కరుడు గట్టిన పరాక్రమంవలె, వెలుగొందే నడగొండవలె అర్జునుడు యుద్ధభూమికి బయలుదేరి వెళ్ళాడు. దివ్యమైన రథం నుండి వ్యాపించిన కాంతులు కెంపు రవ్వ వెలుగులు విస్తరిస్తూండగా, గొప్పవైన గుర్రాల ఆకారరేఖలు వజ్రాల వెలుగులు వ్యాపింప చేయుచుండగా, రథంముందు సారథి స్థానంలో కూర్చొని ఉన్న శ్రీకృష్ణుడి శరీరకాంతి ఇంద్రనీలమణుల వెలుగులు చిమ్ముతుండగా దేదీప్యమానంగా ప్రకాశించే జెండామీద ఉన్న ఆంజనేయుడి శరీర కాంతులు గరుడపచ్చల వెలుగులు వెల్లివిరియ చేయగా, తూణీరంలో మిరుమిట్లు గొలిపే బాణాల కాంతులు ప్రకాశించే పచ్చల వెలుగులు వెలార్చగా, ఓర్పు గొప్పతనం తనకు పుట్టుకతో అలవడిన గుణాలుగా అర్జునుడు యుద్ధభూమికి బయలుదేరి వెళ్ళాడు.

విశేషం: 1. రోహణ+అద్రి= రోహణ పర్వతం. లంకానగరంలో పేరుకెక్కిన కొండ- ఒక అర్థం. రోహణ= వీర్యం, పరాక్రమం. రోహణాద్రి అంటే వీర్యం మానవశరీర రూపం ధరించి కొండవలె కన్పించటం అని రెండో అర్థం. ఇచ్చట రెండవ అర్థమే సందర్భోచితం అని చెప్పాలి.

2. అలం: రూపకం. విజయ రోహణాద్రి= అర్జునుడు అనే రోహణ పర్వతం. ఇక్కడ రోహణ పర్వతానికి, అర్జునుడికి అభేదం కల్పించబడింది. అలంకారం రూపకం. అర్జునుని రథం అతిలోక దీప్తి కలది. అగ్నిదేవుడిచే అతడికి బహూకరించబడినట్టిది. మహాభారత యుద్ధం ముగిసిన పిమ్మట శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి రథం దిగమన్నాడు. అర్జునుడు రథం దిగిన తదుపరి అది అగ్నికి దగ్ధమైపోయింది. దివ్యరథం కాబట్టి శత్రువులు ప్రయోగించిన అస్త్రాల శక్తిని ఆ రథం తనలో ఇముడ్చుకున్నదని అంతరార్థం.

క. అతులితరథప్రతానో । ద్ధతసైన్యము గొలువ దేవదత్తం బంగీ
కృత సకల తూర్యనాదో । ద్గతి యగుచుఁ జెలంగఁ గ్రీడి గడు నొప్పారెన్. 107

ప్రతిపదార్థం: అతులిత, రథ, ప్రతాన+ఉద్ధత, సైన్యము= సాటిలేని రథాల సమూహాలతో అతిశయించిన సేన; కొలువన్= సేవిస్తూ ఉండగా; దేవదత్తం= దేవదత్తము (దేవతలచేత ఇవ్వబడిన శంఖం); అంగీకృత, సకల, తూర్య, నాద+ఉద్గతి+అగుచున్= ఢక్కా, బూరా, పటాహం మున్నగు వాద్యాల మ్రోతల సమాహారంగా అందరిచేత అంగీకరించబడినదిగా; చెలంగన్= శోభిల్లగా; క్రీడి= అర్జునుడు; కడున్= మిక్కిలి; ఒప్పారెన్= విలసిల్లాడు.

తాత్పర్యం: సాటిలేని రథసైన్యసమూహం తనను సేవిస్తూ, అర్జునుడు దేవదత్తం అనే శంఖం పూరిస్తూ మిక్కిలి శోభతో వెలుగొందాడు.

విశేషం: అర్జునుడి శంఖానికి దేవదత్తం అనిపేరు. భారత వీరులు తమ తమ శంఖాలకు ప్రత్యేకమైన పేరులు పెట్టుకొనేవారు. (శ్రీకృష్ణుడి శంఖంపేరు పాంచజన్యం, ధర్మరాజు శంఖం పేరు అనంత విజయం, భీముడి శంఖం పేరు పౌండ్రం; నకుల సహదేవుల శంఖాలపేర్లు సుఘోష, మణిపుష్పకములు.

2. యుద్ధంలో భేరి మున్నగు వాద్యాలు మ్రోయించేవారు. ఢక్క, పటహం, కాహళ, తిరుచిన్నం-ఇలా ... ఎన్నెన్నో- దేవదత్తం నుండి వెలువడే నాదం సకల వాద్య విశేష శబ్ద సమాహారంగా ప్రసిద్ధి కెక్కింది. యోధుడుగా అర్జునుడికీ దేవదత్తానికీ అవినాభావ సంబంధం ఏర్పడింది. అట్లే అర్జునుడి ధనుస్సు గాండీవం.

తే. గాండివం బింద్రచాపంబుకరణి నొప్ప । మెఱసి దివ్యకిరీటంబు మెఱుఁగు లడర
జ్యానినాదంబు గర్జగా మేని కృష్ణ । కాంతిఁ బొలిచెఁ గవ్వడి యను కారుమొగులు. 108

ప్రతిపదార్థం: గాండివంబు= (అర్జునుడి ధనుస్సు); ఇంద్రచాపంబు, కరణిన్= ఆకాశంలో నీటికణాలలో సప్త వర్ణ శబలితంగా ఏర్పడే విల్లును పోలి; ఒప్పన్, మెఱసి= శోభిల్లి; దివ్యకిరీటంబు= అతిలోకమైన కిరీటం; మెఱుఁగులు+అడరన్= మిరుమిట్లు గొల్పగా; జ్యా+నినాదంబు= అల్లెత్రాటిమ్రోత; గర్జగాన్= (మేఘ) ఘోషగా; (ఉఱుముగా); మేని= దేహానికి సంబంధించిన; కృష్ణ, కాంతి= నల్లని కాంతితో; కవ్వడి+అను, కారు, మొగులు= అర్జునుడు అనే నల్లని మబ్బు; పొలిచెన్= శోభించింది.

తాత్పర్యం: అర్జునుడు అనే నల్లని మేఘం శోభిల్లింది. అనగా అర్జునుడు నల్లని మబ్బువలె భాసించాడు. అతడి ధనుస్సు ఇంద్రచాపంవలె శోభిల్లింది. అతడి దివ్యకిరీట కాంతి మెఱపు తీగల వెలుగులుగా మిరుమిట్లు కొల్పింది. అతడి వింటి అల్లెత్రాటి మ్రోత మేఘగర్జనవలె విన్పించింది. అతడి నల్లని శరీరం మేఘవర్ణాన్ని పోలింది.

విశేషం: అలం: ఉపమానుప్రాణితం. కవ+వడి= రెండు వేగాలు కలవాడు- సవ్యసాచి; అర్జునుడు తన రెండు చేతులతో బాణాలు ప్రయోగించే సామర్థ్యం సంపాదించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. వివిధోద్దామ హయావళీబహుళ మై విక్రాంతి కేళీ సము
త్సవ కౌతూహల సుందరం బగు మహాసైన్యంబుతో మేదినీ
ధవ సందోహము ప్రీతిఁ బొంద మహిమోదాత్తోగ్రయానంబులం
గవ లేతెంచిరి వేడ్క నొండొరులకుం గయ్యంబుమైఁ జెప్పుచున్. 109

ప్రతిపదార్థం: వివిధ+ఉద్దామ హయ+ఆవళీ+బహుళము+ఐ= పెక్కు రకాల భయంకరాలు అయిన గుర్రాల గుంపులతో దట్టమై; విక్రాంతి, కేళీ, సముత్సవ, కౌతూహల, సుందరంబు+అగు= పరాక్రమక్రీడ అనే సంబరాన్ని సందర్శించుటచే అందగించిన; మహా+సైన్యంబుతోన్= గొప్ప సేనతో; మేదినీధవ, సందోహము= రాజుల సమూహం; ప్రీతిన్+పొందన్= సంతోషించగా; మహిమ+ఉదాత్త+ఉగ్రయానంబులన్= గొప్పదనంతో అతిశయించి భయంకరంగా కనిపించే వాహనాలతో; కవలు= (జంట) నకుల సహదేవులు; వేడ్కన్= సంతోషంతో; ఒండొరులకున్= ఒకరితో ఒకరు; కయ్యంబుమైన్+చెప్పుచున్= యుద్ధం గూర్చి మాటాడుతూ; ఏతెంచిరి= యుద్ధానికి వచ్చారు.

తాత్పర్యం: అమడ బిడ్డలైన నకుల సహదేవులు ఒకరితో ఒకరు యుద్ధాన్ని గూర్చి సల్లాపాలు ఆడుకొంటూ బయలుదేరి యుద్ధరంగానికి వచ్చారు. వారితోపాటు గొప్ప సైన్యం ఉన్నది. ఆ సైన్యంలో పెక్కు రకాలయిన వాహనాలు ఉన్నాయి. అవి శత్రువులకు భయంకరంగా కన్పించాయి; కదన కుతూహలంతో ఉత్సాహంతో సైన్యాలు కదలసాగాయి. కవలు అధిరోహించిన వాహనాలు గంభీరంగా భాసించాయి.

విశేషం: 1. యానములు: అనగా వాహనాలు. బండి, రథం, పల్లకి, గుర్రం, ఏనుగు మొదలైనవి. ప్రాచీన యుద్ధ తంత్రం అయిదు విధాలయిన 'యానములను' పేర్కొన్నది. 1. సంధానయానం 2. ప్రసంగయానం 3. నిగృహ్యయానం 4. సంభూయయానం 5. ఉపేక్ష్యయానం.

మ. రభసక్షోభితమేదినీతలముపై రథ్యప్రచారంబు లొ
ప్ప భుజాగర్వము నెమ్మొగంబులఁ దలిర్పం గన్నెకయ్యంబు న
ర్థి భవత్పుత్రులమీఁది కోపమున నుద్దీపింప నేతెంచి ర
య్యభిమన్యుండును ద్రౌపదేయులును మాద్యద్దంతియూథాకృతిన్. 110

ప్రతిపదార్థం: రభస, క్షోభిత, మేదినీ, తలముపైన్= వేగముచేత కలతపెట్టబడిన భూప్రదేశంమీద; రథ్యప్రచారంబులు+ఒప్పన్= గుర్రాల కదలికలు ఒప్పగా; భుజా+గర్వము= పరాక్రమం యొక్క దర్పం; నెఱ+మొగంబులన్= నిండు మొగాల అందు; తలిర్పన్= శోభిల్లగా; కన్నె, కయ్యంబున్+అర్థిన్= మొదటిసారిగా యుద్ధం చేయాలని కోరుతూ; భవత్+పుత్రులమీది కోపమునన్= నీ కొడుకులమీది ఆగ్రహంతో; ఉద్దీపింపన్= వెలుగొందగా; ఆ+అభిమన్యుండును= ఆ అభిమన్యుడును (అర్జునునకు సుభద్రకు పుట్టినవాడు); ద్రౌపదేయులును= ద్రౌపదికి పుట్టిన వారున్నూ; మాద్యత్+దంతి, యూథ+ఆకృతిన్= మదించిన ఏనుగుల గుంపు యొక్క ఆకారముతో; ఏతెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: భూమి దద్దరిల్లిపోయేటట్లుగా గుర్రాలను నడిపిస్తూ పరాక్రమాతిశయం ముఖాలలో ప్రతిబింబిస్తుండగా, నీ కొడుకుల మీది కోపం ప్రేరేపించగా కన్నెకయ్యం చేయాలనే కోరికతో అభిమన్యుడు, ద్రౌపదీపుత్రులు మదించిన ఏనుగుల గుంపువలె రణరంగానికి బయలుదేరి వచ్చారు.

విశేషం: కన్నె కయ్యము= ప్రథమ సంగ్రామం. సుభద్ర కొడుకైన అభిమన్యుడు అందరికంటె చిన్నవాడు - వయసులో ద్రౌపది కొడుకులు యువకులు. వారు ఇంత వరకు యుద్ధంలో పాల్గొనలేదు. కురుక్షేత్ర సంగ్రామమే వారికి ప్రప్రథమ యుద్ధం. అదే వారికి మొదటి అవకాశం కాబట్టి వారి ఉత్సాహం పేర్కొనదగింది. కన్నె= పెండ్లికాని అమ్మాయి. కన్నెకు మొదటిరాత్రి అనుభూతి ఎట్టిదో - అట్టిదే ఈ యువకులకు ప్రప్రథమ యుద్ధం 'కన్నెకయ్యము' ప్రౌఢ ప్రయోగం.

"కన్నె కయ్యంబనగ - ప్రథమ యుద్ధాఖ్య"- ఆంధ్ర భాషార్ణవం 2-222.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇవ్విధంబునం బ్రతివింధ్యుండును, శ్రుతసోముండును, శ్రుతకీర్తియు, శతానీకుండును, శ్రుతసేనుండును సౌభద్రుండును దమకుం గన్నాకుగాఁ జెన్నుమిగిలి చనుదేరం గనుంగొని కౌంతేయ బలంబులు సంతసంబునం బొదలె; నప్పుడు. 111

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ప్రతివింధ్యుండును= ప్రతివింధ్యుడును; శ్రుతసోముండును= శ్రుతసోముడును; శ్రుతకీర్తియున్= శ్రుతకీర్తియు; శతానీకుండును= శతానీకుడును; సౌభద్రుండును= సుభద్ర కొడుకు అభిమన్యుడును; తమకున్= తమకు; కన్నాకుగాన్= నాయకులుగా; చెన్ను+మిగిలి= అందం అతిశయించగా; చనుదేరన్+కనుంగొని= రావటం చూచి; కౌంతేయ+బలంబులు= కుంతీసుతులైన పాండవుల సేనలు; సంతసంబునన్+పొదలెన్= సంతోషంతో వర్ధిల్లాయి; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ రీతిగా, ద్రౌపది కొడుకులైన ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడును మరియు సుభద్ర కొడుకు అగు అభిమన్యుడు తమకు నాయకులుగా రావటం చూచి పాండవుల సేనలు సంతోషంతో ఒప్పారాయి. ఆ సమయంలో-

విశేషం: ధర్మరాజుకు, ద్రౌపదికి పుట్టిన కొడుకు - ప్రతివింధ్యుడు. భీముడికి ద్రౌపదికి పుట్టిన కొడుకు - శ్రుతసోముడు.అర్జునుడికి ద్రౌపదికి పుట్టిన కొడుకు - శ్రుతకీర్తి. నకులుడికి ద్రౌపదికి పుట్టిన కొడుకు - శతానీకుడు. సహదేవుడికి ద్రౌపదికి పుట్టిన కొడుకు - శ్రుతసేనుడు. అర్జునుడికి సుభద్రకు పుట్టిన కొడుకు - అభిమన్యుడు.

సీ. కరుల సందడి నొప్పు ఘనసేన దుర్దమ । లీలఁ దో నడవఁ బాంచాలవిభుఁడుఁ
దనుజులు ననుజులు దర్పదుర్జయసైన్య । మహిమఁ దో నేతేర మత్స్యపతియు
యాదవానీకంబు లవని గ్రక్కదలఁ దోఁ । జనుదేరఁ బొలుపారి సాత్యకియును
యోధవీరులు ప్రతాపోగ్ర వాక్యములతోఁ । దనుఁ జుట్టిరాఁ జేకితానవిభుఁడు

తే. బాసటై వీరరథికులు బలసి యెలమి । నొండొరుల గరువంబుగ నుల్లసంబు
లాడుచును జేరి నడతేర నత్యుదార । గతి శిఖండియు నడచిరి కౌరవేంద్ర! 112

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; కరుల సందడిన్+ఒప్పు= ఏనుగుల సంరంభంతో విలసిల్లే; ఘన+సేన= గొప్ప సైన్యం; దుర్దమ లీలన్= నిర్జించటానికి వీలులేని విధంగా; తోన్+నడవన్= కూడి కదలగా; పాంచాలవిభుఁడున్= పాంచాల రాజు ద్రుపదుడూ; తనుజులు+అనుజులు= కొడుకులును తమ్ముళ్ళూ; దర్ప, దుర్జయ, సైన్య, మహిమన్= గర్వం కలిగి, జయింపరానట్టి సేనయొక్క గొప్పదనంతో; తోన్+ఏతేరన్= వెంట రాగా; మత్స్యపతియున్= మత్స్యదేశానికి రాజు (విరాటుడును); యాదవ+అనీకంబులు= యదుకులమునకు సంబంధించిన సేనలు; అవని= భూమి; క్రక్కదలన్= దద్దరిల్లగా; తోన్+చనుదేరన్= వెంబడి రాగా; పొలుపారి= ఒప్పుతూ; సాత్యకియును= సాత్యకియును; యోధ+వీరులు= యుద్ధం చేసే శూరులు; ప్రతాప+ఉగ్ర వాక్యములతోన్= పరాక్రమంతో కూడిన భయంకరములైన మాటలతో; తనున్= తనను; చుట్టిరాన్= పరివేష్టించి రాగా; చేకితానవిభుడు= చేకితాన రాజు; బాసట+ఐ= తోడై; వీర+రథికులు= వీరులైన రథికులు (రథము నెక్కి యుద్ధం చేసేవారు); బలసి= దట్టంగా చేరి; ఎలమిన్= ప్రీతితో; ఒండొరులన్= ఒకరితోనొకరు; గరువంబుగన్= దర్పంతో; ఉల్లసంబులు+ఆడుచున్+చేరి= సల్లాపాలు చేస్తూ కూడి; నడతేరన్= నడచిరాగా; అతి+ఉదార+గతిన్= మిక్కిలి గొప్పదనం గోచరించే విధంగా; శిఖండియున్= శిఖండియు; నడచిరి= తరలి వెళ్ళారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఏనుగుల సంరంభంతో విలసిల్లే గొప్ప సేనతో, జయించటానికి వీలులేని విధంగా పాంచాలప్రభువైన ద్రుపదుడూ, తన కొడుకులూ, తమ్ముళ్ళూ తమను ఎవరూ నిర్జించలేరనే ధైర్యంతో

తన వెంట వచ్చే సైన్యంతో మత్స్యరాజు అయిన విరాటుడూ, యాదవ సైన్యాలు భూమి దద్దరిల్లేటట్లు తనతో రాగా సొగసుగా సాత్యకీ, యుద్ధం చేయాలనే ఉత్సాహంతో పరాక్రమం వెల్లివిరిసే సల్లాపాలు ఆడుతూ తన వెంట యోధవీరులు రాగా చేకితానుడూ, తోడై ఒకరితో ఒకరు దర్పం ఉట్టిపడే విధంగా మాటాడుతూ వీరులు తమ వెంట శిఖండీరాగా, రణభూమికి నడిచారు.

చ. **బధిరిత దిఙ్ముఖంబగుచు బంధుర తూర్య నికాయనాద మం**
బుధియును బోలె సేనకు విభూతి యొనర్పఁగ నేఁగుదెంచె మా
గధ సహదేవుఁ డప్డు రణకౌతుక సల్లపనంబు నుజ్జ్వలా
యుధ విభవంబుఁ జెన్నొసఁగ నొప్పెడు తమ్మునిఁ బ్రీతిఁ జూచుచున్. **113**

ప్రతిపదార్థం: బధిరిత, దిక్+ముఖంబు+అగుచున్= చెవుడుపరచబడిన దిక్కుల యొక్క అగ్రభాగాలు కలది ఔతూ;; బంధుర+తూర్య+నికాయనాదము= దట్టమైన యుద్ధవాద్య సముదాయం యొక్క ధ్వని; అంబుధియును+పోలెన్= సముద్రాన్ని పోలుతూ; సేనకున్= సైన్యానికి; విభూతి+ఒనర్పఁగన్= సంపద చేకూర్చగా; మాగధ, సహదేవుఁడు= మగధ దేశానికి ప్రభువైన సహదేవుడు; అప్డు= అపుడు; రణ, కౌతుక, సల్లపనంబున్= యుద్ధం చేయటంలోగల ఉత్సాహాన్ని తెలిపే సంభాషణలును; ఉజ్జ్వల+ఆయుధ, విభవంబున్= ప్రకాశించే ఆయుధాల గొప్పదనమూ; చెన్ను+ఒసఁగన్= సొగసు నింపగా; ఒప్పెడు= విలసిల్లెడు; తమ్మునిన్= సోదరుడిని; ప్రీతిన్= వేడ్కతో; చూచుచున్= చూస్తూ; ఏగుదెంచెన్= (యుద్ధానికి) తరలివచ్చాడు.

తాత్పర్యం: మగధ దేశరాజు అయిన సహదేవుడు తన తమ్ముడితో కలిసి యుద్ధభూమికి తరలి వచ్చాడు. ఆతడి సేననుండి వెలువడిన భేరీ పటహకాహళాలు మున్నగు యుద్ధ వాద్యాల ధ్వనులు దిక్కులు పిక్కటిల్ల చేశాయి. ఆ సేన సముద్రం వలె ఉప్పొంగిపోతూ కదలింది. రణకౌతూహలం తెలిపే ఆతని సంభాషణలూ ధగధగా మెరిసే ఆయుధాలూ ఆ దండయాత్రకు శోభను చేకూర్చాయి.

విశేషం: ఆనాడు మగధ సామ్రాజ్యం భారతదేశంలో సువిశాలమైనది. సహదేవుడు ఆ మహాసామ్రాజ్యపాలకుడు. అతడి తండ్రి జరాసంధుడు. శ్రీకృష్ణుడిపై పలుమారులు దండెత్తాడు. ఆతడి ధాటికి ఓర్వలేక శ్రీకృష్ణుడు తన రాజధానిని మధుర నుండి ద్వారకకు తరలించాడు. రాజసూయయాగ సందర్భంలో శ్రీకృష్ణుడు అర్జునుడిని, భీముడిని వెంటపెట్టుకొని వెళ్ళి జరాసంధుడి ఎక్కటి కయ్యంలో భీముడిచే చంపించాడు. అయితే శ్రీకృష్ణుడు పాండవులు మగధసామ్రాజ్యాన్ని జరాసంధుని కొడుకు సహదేవునికే ఇచ్చి పట్టాభిషిక్తుడిని చేసి అతడిని మిత్రుడిగా చేసికొన్నారు. మగధ ప్రభువు మహాభారత యుద్ధంలో కృతజ్ఞతతో పాండవపక్షంలో చేరి పోరాడాడు.

ఉ. **చండ భుజాబలంబుఁ బటుశౌర్యసముల్లసనంబుఁ దోఁప ను**
ద్దండత నాత్మ సైనికుల దర్ప మెలర్పఁగ నెమ్మిఁ బల్కుచున్
బాండవకోటి చూడ్కులకుఁ బండువుగాఁ జనుదెంచె ధృష్టకే
తుండు సహోదరుండు దనతో నడతేరఁ బరాక్రమోద్ధతిన్. **114**

ప్రతిపదార్థం: చండ, భుజా, బలంబున్= తీవ్రమైన పరాక్రమమూ; పటు శౌర్య సముల్లసనంబున్= మిక్కిలి గొప్పదైన వీరత్వంయొక్క ఉత్సాహమూ; తోఁపన్= కన్పిస్తుండగా; ఉద్దండతన్= మిక్కుటంగా; ఆత్మ, సైనికుల, దర్పము+ఎలర్పఁగన్= తన భటుల గర్వం అతిశయించగా; నెమ్మిన్+పల్కుచున్= ప్రీతితో చెప్తూ; పాండవ, కోటి, చూడ్కులకున్+పండువుగాన్= పాండవసేనా సమూహాల కన్నులకు పండుగగా; ధృష్టకేతుండు= ధృష్టకేతుడు (అనే పేరుగల రాజు); సహోదరుఁడు= సోదరుడు (తమ్ముడు); తనతోన్= తన వెంట; నడతేరన్= రాగా; పరాక్రమ+ఉద్ధతిన్= శౌర్యం యొక్క ఆటోపంతో; చనుదెంచెన్= (యుద్ధభూమికి) వచ్చాడు.

తాత్పర్యం: ధృష్టకేతుడు అనే రాజు తన తమ్ముడితోపాటు యుద్ధభూమికి తరలివచ్చాడు. తీక్ష్ణమైన పరాక్రమం యుద్ధం చేయటంలో చాకచక్యం వెల్లడించే సంభాషణలతో అతడు తన సైనికులకు ప్రోత్సాహం కల్పించాడు. అతడి దండయాత్ర పాండవసేనలలోని భటులకు కన్నుల పండువుగా భాసించింది.

మ. విచలద్దండధరోపమాశ్రయ వపుర్విస్ఫార మై దానవ
ప్రచయం బుద్ధత లీలఁ గొల్వఁగఁ దమోరాశిప్రతీకాశ ఘో
రచలద్రూపము భంగికిం దగిన దంష్ట్రాయుగ్మ మొప్పన్ ఘటో
త్కచుఁ డేతెంచెఁ గరస్థ శూల రుచు లాకాశంబునన్ బర్వఁగన్. 115

ప్రతిపదార్థం: విచలత్+దండధర+ఉపమ+ఆశ్రయ, వపుః+విస్ఫారము+ఐ= చలించేటటువంటిదియును; యముడితోడి పోలికకు ఆశ్రయమైన శరీరకాంతి కలిగినట్టిదియు అయిన; దానవ, ప్రచయంబు= రాక్షసులమూక; ఉద్ధతలీలన్= దర్పం వెల్లివిరిసే రీతిగా; కొల్వఁగన్= ఆరాధిస్తూ వెంటరాగా; తమః+రాశి, ప్రతీకాశ, ఘోర, చలత్+రూపము+భంగికిన్= చీకటి ప్రోగులకు సమానమై భయంకరంగా కదిలే ఆకారం రీతికి; తగిన= సరిపోయే; దంష్ట్ర, యుగ్మము= కోరల జత; ఒప్పన్= విలసిల్లగా; ఘటోత్కచుఁడు= ఘటోత్కచుడు (అనే పేరుగల రాక్షసుడు); కరస్థ, శూల, రుచులు= చేతియందు ఉన్న బల్లెం వెలుగులు; ఆకాశంబునన్= ఆకసంలో; పర్వఁగన్= వ్యాపించగా; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఘటోత్కచుడు అనే రాక్షసుడు చేతిలో ఉన్న త్రిశూలం ఆకాశంలో వెలుగులు విరజిమ్మేటట్లు త్రిప్పుతూ యుద్ధభూమికి వచ్చాడు. కదలే చీకటి రాశికి సరిపోయే ఆకారానికి తగినట్లుగా అతడి నోటి నుండి భయంకరమైన రెండు కోరలు కనుపిస్తున్నాయి. అతడి వెంట, యమధర్మరాజు శరీరచ్ఛాయతో సమానమైన దేహాలు కల రాక్షసుల మూకలు అతడిని ఆరాధిస్తూ తరలివచ్చాయి.

విశేషం: ఘటోత్కచుడు హిడింబాభీముల కొడుకు. ఈతడు మహాభారత యుద్ధంలో పాండవ పక్షాన పోరాడి శత్రు విధ్వంసం చేశాడు. మాయాయుద్ధ నిపుణుడైన ఈతడిని కర్ణుడు తనకు దేవేంద్రుడు (సహజ కవచకుండలాలు అతనికి దానం చేసినపుడు) ఇచ్చిన శక్తిని ప్రయోగించి సంహరించాడు.

వ. పాండ్యపతియును గేకయపంచకంబును శైబ్యుండును మఱియుం గాశకరూశాది బహుదేశాధీశులును దమతమ బలంబుల దళంబుల సవరణల యొప్పును గయ్యంపుఁ గడంకయు నెఱయం గేతనంబులు మెఱయం దోఁతెంచి; రిత్తెఱంగునం గూడి సప్తాక్షౌహిణీ బంధురంబుగాఁ బేర్చిన పాండవసేన మొగంబునకుం దిలకం బై. 116

ప్రతిపదార్థం: పాండ్యపతియును= పాండ్యరాజు; కేకయ పంచకంబును= కేకయ రాజ్యాధిపతులైన అయిదుగురు రాజులూ; శైబ్యుండును= శిబి వంశానికి చెందిన రాజు; మఱియున్, కాశ+కరూశ, ఆది, బహు, దేశ+అధీశులును= కాశదేశం కరూశదేశం మున్నగు పెక్కు దేశాలను పరిపాలించే రాజులును; తమ+తమ+బలంబుల= తమ తమ సేనల; దళంబుల= సేనా సమూహాల; సవరణల+ఒప్పును= అలంకారాల అందచందాలు; కయ్యంపు+కడంకయున్= యుద్ధము నందలి పూనికయు; నెఱయన్= ప్రకాశించగా; కేతనంబులు= జెండాలు; మెఱయన్= ప్రకాశించగా; తోఁతెంచిరి= వచ్చారు; ఈ+తెఱంగున్= ఈ రీతిగా; కూడి= కలిసి; సప్త+అక్షౌహిణీ బంధురంబుగాన్= ఏడు అక్షౌహిణులతో కూడినదై, పేర్చిన= అతిశయించిన; పాండవ సేన మొగంబున కున్=పాండవుల సైన్యం యొక్క అగ్రభాగానికి (నుదుటికి); తిలకంబు+ఐ= బొట్టువలె వెలిగొందుతూ (ధృష్టద్యుమ్నుడు).

తాత్పర్యం: పాండవుల సైన్యం ఏడు అక్షౌహిణులు అయింది. అందులో పాండ్యరాజు, శిబి వంశీయుడైన రాజు, కాశ కరూశాది రాజులు, పంచ కేకయులు తమ తమ సేనలతో ఆయుధాలతో వెలుగొందుతూ వచ్చి చేరారు.

విశేషం: 1. శిబి కథ - ప్రాచీన భారత సారస్వతంలో బౌద్ధ వాఙ్మయంలో సుప్రసిద్ధం. 'పరోపకారార్థ మిదం శరీరం' అనే ఆదర్శం ఆచరణలో అనువదించి శరణార్థియైన పావురం కోసం తన శరీర మాంసాన్ని కోసి ఇచ్చిన వదాన్యుడు శిబి.

2. భారతదేశంలో దక్షిణపు కొస ఉన్న దేశం పాండ్యరాజ్యం. ఆ రాజు కూడా మహాభారత యుద్ధంలో పాల్గొన్నాడు.

శా. పుష్టోదంచిత సారవీరరససంపూర్ణాంగమున్ సంగరా
వష్టంభోజ్జ్వల వీరరేఖయును భాస్వద్వాహ సంవల్గనో
త్కృష్ట స్యందనముం గనద్ధనువు నుద్దీప్త ధ్వజంబుం దగన్
ధృష్టద్యుమ్నుఁడు వొల్చె నైజవిలసత్తేజోవిరాజద్గతిన్. 117

ప్రతిపదార్థం: పుష్ట+ఉదంచిత, సార, వీర రస, సంపూర్ణ+అంగమున్= ప్రకాశించే నిండుదనం యొక్క నిగ్గుగా వీరరసంతోనూ అంగాలతో ఉపాంగాలతో సమృద్ధమైన శరీరమై; సంగర+అవష్టంభ+ఉజ్జ్వల, వీర, రేఖయును= యుద్ధగర్వంతో చేసికొన్న వీరత్వ చిహ్నితమైన ఆకారమూ; భాస్వత్+వాహ, సంవల్గన+ఉత్కృష్ట, స్యందనమున్= ప్రకాశించే గుర్రాల యొక్క దౌడు తీయటంచేత గొప్పదైన రథమూ; కనత్+ధనువు= ప్రకాశించే విల్లు; ఉద్దీప్త ధ్వజంబున్= దేదీప్యమానంగా వెలుగొందే జెండా; తగన్= ఒప్పుగా; నైజ, విలసత్+తేజస్+విరాజత్+గతిన్= స్వభావసిద్ధంగా వెలుగొందే ప్రభుశక్తితో ప్రకాశించే రీతిగా; ధృష్టద్యుమ్నుఁడు= (పాండవ సర్వసేనాధిపతి, ద్రుపద మహారాజు కొడుకు ద్రౌపది అన్నగారు); పొల్చెన్= విలసిల్లాడు.

తాత్పర్యం: పాండవ పక్షంలో సర్వసేనాధిపతి అయిన ధృష్టద్యుమ్నుడు దేదీప్యమానంగా వెలుగొందాడు. అతడి శరీరం కరడుగట్టిన వీరరసంగా కనుపించింది. నిండైన ఆతడి విగ్రహం పరాక్రమసారంగా భాసించింది. యుద్ధగర్వం తోడి వీరరేఖ ఆతడి ముఖంలో వెలిగింది. ఆతడి రథం క్రమశిక్షణతో దౌడు తీయగల గుర్రాలతో పూన్చబడింది. నాయకత్వ లక్షణాలు, ప్రభుశక్తి ఆతడికి స్వభావసిద్ధాలుగా భాసించాయి.

విశేషం: ధృష్టద్యుమ్నుడు కారణజన్ముడుగా మహాభారతంలో అభినుతుడు. ద్రోణుడు ద్రుపద మహారాజూ శైశవంలో సహపాఠకులు. తదుపరి ద్రుపదుడు రాజైనప్పుడు ఆతడు అర్థిగా తనవద్దకు వచ్చిన ద్రోణుడిని మన్నించలేదు. ద్రోణుడు గురుదక్షిణగా అర్జునుడిని కోరి, ద్రుపద రాజును బందీకృతుడిని చేయించాడు. అవమానఖిన్నుడైన ద్రుపదుడు తపస్సు చేసి ద్రోణుడిని సంహరించగల కొడుకుగా ధృష్టద్యుమ్నుడిని పడశాడు.

వ. ఇట్లొప్పి సేనాపతి యగు నా ద్రుపదసుతుండు ముంగలియై నడపించుచుండ. 118

ప్రతిపదార్థం: ఇట్లు+ఒప్పి= ఈ విధంగా విలసిల్లి; సేనాపతి+అగు= సేనకు నేత అయిన; ఆ+ద్రుపద+సుతుండు= ఆ ద్రుపద రాజు కొడుకు- ధృష్టద్యుమ్నుడు; ముంగలి+ఐ= సైన్యమునకు ముందున్న వాడై; నడపించుచుండన్= సేనలను నడిపించుచుండగా.

తాత్పర్యం: ఈ విధంగా విలసిల్లుతూ ధృష్టద్యుమ్నుడు ముందుండి పాండవ సైన్యాన్ని నడిపిస్తూ ఉండగా.

సీ. ఇల ధూళి యెగసినఁ బలుచగాకుండంగ । రాసిన తొడవుల రజము దొరఁగు,
సమరవికాసంబు చెమట నొప్పఱకుండ । హేతి దీధితులు రేయెండ నొడుచు,
భేరీధ్వనుల నింగి బీఁటలు వోకుండఁ । గరికర శీకరోత్కరము దడుపు,
దర్పంబు గనుఁజాటు దాఁకకుండఁగ గొడు । గులపెల్లు ఖచర దృక్కోటి నాఁగు,

తే. ననిన నిజమైనయట్లుండె మనుజనాథ! । ధరణి వడవడ వడఁకె దిక్తటము లద్రువ
భూరి చతురంగ చండ విస్ఫూర్తిఁ బాండు । నందనులసేన గలనికి నడచునపుడు. 119

ప్రతిపదార్థం: ఇల+ధూళి+ఎగసినన్= భూమి మీది దుమ్ముపైకి వ్యాపించగా; పలుచగాకుండంగన్= పలచవైపోకుండా; రాసిన, తొడవుల, రజంబు= రాపిడిపొందిన ఆభరణాల కణాలు; తొరఁగున్= పడతాయి; సమర, వికాసంబు, చెమటన్= యుద్ధం గూర్చిన శ్రమవలన ఏర్పడిన చెమటచేత; ఒప్పుఱకుండన్= ఒప్పుచెడకుండా; హేతి+దీధితులు= కత్తుల కాంతులు; రే+ఎండన్= లేతయెండను; ఒడుచున్= వ్యాపింపచేస్తున్నాయి; భేరీ, ధ్వనులన్= యుద్ధవాద్యమైన భేరీ నాదాలచేత; నింగి= ఆకసం; బీటలు+పోకుండన్= బ్రద్దలు కాకుండగా; కరికర, శీకర+ఉత్కరము= ఏనుగుల తుండాల నుండి వెలువడే నీటి చిరుజల్లుల సముదాయం; తడుపున్= (నీటితో) చెమ్మగిల్ల చేస్తుంది; దర్పంబు= అహంకార గర్వం; (పాండవసేన యొక్క అతిశయానికి) కనుబాటు+కాకుండన్= (దిష్టి) దృష్టిదోషం తగులకుండా; గొడుగుల పెల్లు= ఎక్కువ గొడుగులు ఉండటం (గొడుగుల గుంపు); ఖచర దృక్+కోటిన్+ఆఁగున్= ఆకాశంలో సంచరిస్తున్న వారి దృష్టులను అరికట్టుతుంది; అనినన్= అని అభివర్ణిస్తే; నిజము+ఐన+అట్లు+ఉండెన్= అది సత్యమే అయినట్లు తోస్తున్నది.; మనుజనాథ!= (ఓ ధృతరాష్ట్ర మహారాజా!); పాండునందనుల+సేన= పాండవుల సైన్యం; భూరి, చతురంగ, చండ, విస్ఫూర్తిన్= ఎక్కువైన, నాలుగు అంగాల (రథ, గజ, తురగ, పదాతి); చండ+విస్ఫూర్తిన్= తీవ్రమైన ప్రకాశంతో; దిక్+తటములు+అద్రువన్= దిక్కుల అంచులు అదిరిపోగా; ధరణి= భూమి; వడవడ= గజగజ (ఎక్కువగా); వడఁకెన్= చలించింది.

తాత్పర్యం: ఈ పద్యం పాండవసేన కురుక్షేత్రానికి తరలివెళ్లటం అభివర్ణిస్తున్నది. భూమిమీద ధూళి ఎగసింది. సేనలోని భటులు, వాహనాలు కదిలి వెళ్ళుతుండగా వీరులు ధరించిన ఆభరణాల రాపిడి వలన ఏర్పడిన రజం ఆ ధూళిని ఇనుమడింపచేసింది. యుద్ధ సన్నద్ధులయిన వీరులకు చెమట పట్టింది. ఆ చెమట ఆరిపోయేటట్లు వీరుల కత్తుల తళతళలు లేతయెండ ప్రసరింపచేశాయి. భేరీ ధ్వనులు ఆకాశాన్ని అంటాయి. ఆకాశం బీటలు వారకుండ ఏనుగుల తొండాల నుండి నీటితుంపురులు విస్తరిల్లాయి. దర్పంతో విజృంభించే పాండవ సైన్యానికి ఆకాశంలో విమానాల నుండి చూచే దేవతల, పితరుల 'దృష్టిదోషం' తగులకుండగా, వెల్లగొడుగులు అడ్డు వచ్చాయి. పాండవ సైన్యం చతురంగబలాలతో దండయాత్ర ఆరంభించినపుడు ధరణి గజగజ వణికింది అనీ, దిక్కులు దద్దరిల్లి పోయాయి అనీ సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్పాడు.

విశేషం: అలం: అతిశయోక్తి. ఈ సీసపద్యం- తిక్కన విరాటపర్వంలో ధర్మరాజును గూర్చి 'ఎవ్వాని వాకిట నిభమద పంకంబు । రాజభూషణరజో రాజి నణఁగు' అనే పద్యాన్ని జ్ఞప్తికి తెస్తుంది.

వ. ఇట్లు నడచి కురుక్షేత్రంబులోన నుత్తమప్రదేశం బగు శమంతపంచక సమీప స్థలంబు సేరు సమయంబున ధర్మనందనునకు దోఁచు దక్షిణాక్షిస్పందనాది శుభసూచకంబులకు మెఱుంగు వెట్టిన చందంబున. 120

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నడచి= (దండెత్తి) వెళ్ళి; కురుక్షేత్రంబులోనన్= కురుక్షేత్రంలో; ఉత్తమ,ప్రదేశంబు+అగు= మంచిచోటఅయిన; శమంతపంచక, సమీప, స్థలంబునన్= శమంతపంచకం అనే పేరుగలచోటుకు దగ్గరగా; చేరు+సమయంబునన్= చేరిన వేళ; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; తోఁచు= స్ఫురించే; దక్షిణ+అక్షి, స్పందన+ఆది+శుభ సూచకంబులకున్= కుడికన్ను అదరటం మొదలైన మంచి శకునాలకు; మెఱుంగున్+పెట్టిన+చందంబునన్= అతిశయమైన దీప్తిని కలిగించిన రీతిగా.

తాత్పర్యం: ఉత్సాహం పెల్లుబుకుతూ పాండవ సైన్యం ఈ విధంగా కురుక్షేత్రంలో గొప్ప చోటుగా ప్రసిద్ధికి ఎక్కినట్టి శమంతపంచకం అనే చోటికి దగ్గరగా చేరినప్పుడు, ధర్మరాజునకు కుడికన్ను అదరటం మొదలైన శుభశకునాలు తోచాయి. అంతేకాక- (మరికొన్ని మంచి శకునాలు ఏర్పడ్డాయి. తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: 1. శమంతపంచకం- కురుక్షేత్రంలో భారతసంగ్రామ సమయంలో మిక్కిలి పేరుకెక్కిన ప్రదేశం. అయిదు సరస్సులతో కూడిన ప్రదేశం అది. పరశురాముడు, క్షత్రియులను నిర్జించిన పిదప, తన గండ్రగొడ్డలిని ఈ సరస్సులలో కడుగుకున్నాడని పురాణ కథనం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

2. ప్రాచీనకాలంలో విరోధిసేనలు - ఇరుపక్షాలకు అనువైనచోట చేరి యుద్ధం చేసేవి. అట్టి యుద్ధస్థలాలలో పురాణ ప్రసిద్ధమైనది "కురుక్షేత్రం." భౌగోళికంగా కురుక్షేత్రం కీలకమైన చోటు అని చెప్పవచ్చు. చారిత్రక కాలంలో గూడ ఎన్నో యుద్ధాలు కురుక్షేత్ర సమీపంలో ఉన్న పానిపట్టు ప్రదేశంలో జరగటం వేత్తలకు తెలిసినట్టి అంశమే.

క. ఏనుఁగుల మదము తావియు । సైనిక నికరానులేపసౌరభ్యములుం
దా నుపలాలించుచుఁ బవ । మానుం డనుకూల మృదు గమనమునఁ బొలసెన్. 121

ప్రతిపదార్థం: పవమానుండు= గాలిదేవుడు; ఏనుఁగుల, మదము, తావియున్= ఏనుగుల కుంభస్థలాల నుండి కారే మదజలము వలన ఏర్పడే పరిమళము; సైనిక, నికర+అనులేప, సౌరభ్యములున్= భటుల సమూహాలు చేసికొన్న మైపూతల నుండి వ్యాపించిన సుగంధములును; తాన్= తాను (గాలిదేవుడు); ఉపలాలించుచున్= నిమిరి బుజ్జగిస్తూ; అనుకూల, మృదు, గమనమునన్= సరిపడి సాయం చేసే మందగమనంతో, పొలసెన్= వ్యాపించాడు.

తాత్పర్యం: ఆ సమయంలో చక్కని చల్లని గాలులు కమ్మని తెమ్మెరలు వీచాయి. ఏనుగుల కుంభస్థలాల నుండి స్రవించే మదజలానికి సంబంధించిన పరిమళం, వీరులు తమ శరీరాలకు అలదుకొన్న మైపూతల సుగంధం ఆ గాలిలో కలిసిపోయి తేలియాడుతూ, పాండవులకు శుభసూచకమైన మంచి శకునంగా పరిణమించాయి.

వ. దానికయ్యుధిష్ఠిరుండు ప్రముదితచిత్తుం డగుచుఁ బ్రీతచేతస్కులగు తమ్ములుం బాంచాలమాత్స్యాధిపతులును సకలజనంబులును పరివేష్టింపం దూర్పుమొగంబై కౌరవులున్న చక్కటికిం గట్టెదురుగా నిలిచి, యెల్లవారి సైన్యంబులుం గ్రమంబునఁ గొలంది వెట్టుకొనుచు , నందఱకు సంజ్ఞలు నడియాలంబులుం గల్పించి, దొరలదెసం గనుంగొని, మన మీ రణంబునందు ధరణీ రాజ్యంబు వడసెద మొండెఁ బూజ్యం బగు నాకలోకనివాసంబు గనియెద మొండె' నని నిశ్చయించి, నా కెలంకుల నిలువుం డని పలికిన, విని, వారలు ధీరోదాత్తంబులగు వివిధ వాక్యంబులం బ్రతిజ్ఞలు సేసి, నిజశంఖంబులు పూరించి, తమతమ బలంబులలోనికిం జని; రజ్జనపతియును దన కమర్చిన కజ్జంబులును బుష్పఫల కర్పూర కస్తూరికాదులును వారలకుం బుచ్చుచుండె.' 122

ప్రతిపదార్థం: దానికిన్= (ఆ శుభ శకునాలకు); యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ప్రముదిత, చిత్తుండు+అగుచున్= సంతోషించిన మనస్సుకలవాడై; ప్రీత, చేతస్కులు+అగు= సంతోషించిన మనస్సులుకలవారైన; తమ్ములున్= తమ్ములును (భీమార్జున నకుల సహదేవులు); పాంచాల, మాత్స్య+అధిపతులును= పాంచాల రాజు (ద్రుపదుడు), మత్స్యరాజు (విరాటుడు)ను; సకల+జనంబులును= అందరూ; పరివేష్టింపన్= కొలువగా; తూర్పు+మొగంబు+ఐ= తూరుపు దెసకు మొగం పెట్టినవాడై; కౌరవులు+ఉన్న= (దుర్యోధనాదులు చేరిన); చక్కటికిన్= ప్రదేశానికి, చోటునకు; కడు+ఎదురుగాన్= మిక్కిలి ఎదురుగా; నిలిచి= నిలిచి; ఎల్లవారి+సైన్యంబులన్= అందరి సేనలనూ; క్రమంబునన్= వరుసగా; కొలంది+పెట్టుకొనుచున్= లెక్కలు కట్టుకొంటూ; అందరకున్= ఎల్లవారలకు; సంజ్ఞలు= గుర్తులు; అడియాలంబులున్= రాజలాంఛనాలు; కల్పించి= ఏర్పరిచి; దొరల, దెసన్+కనుంగొని= నాయకులవైపు చూచి; మనము= మనం; ఈ రణంబునందున్= ఈ యుద్ధంలో; ధరణీ రాజ్యంబు= భూపరిపాలన; పడసెదము= పొందగలం; ఒండు+ఎ= ఒకటి (అనగా పక్షాంతరము); రెండింటిలో ఒకటి (లేదా) (మరి యొకటి). పూజ్యంబు+అగు= పూజింప దగినది అయిన; నాక లోక నివాసంబున్+కనియెదము= స్వర్గలోకంలో ఉండటం అనేది పొందుదాము; అని= అని; నిశ్చయించి= నిర్ణయించి; నా కెలంకులన్= నాప్రక్కల; నిలువుండు= ఉండండి; అని+పలికిన= చెప్పిన; విని= ఆలకించి; వారలు= (పాండవ సేనలోని నాయకులు); ధీర+ఉదాత్తంబులు+అగు= ధైర్యసాహసాలతో కూడిన; వివిధ+వాక్యంబులన్= పెక్కుమాటలతో; ప్రతిజ్ఞలు= శపథాలు; చేసి= (పలికి); నిజ, శంఖంబులు+పూరించి= తమ తమ శంఖాలు ఊది; తమ తమ, బలంబులలోనికిన్+చనిరి= తమ తమ సేనలలోనికి వెళ్ళారు; ఆ+జనపతియును= ఆ రాజును (ధర్మరాజును); తనకున్+అమర్చిన= తనకు ఏర్పరచిన;

కజ్జంబులును= భక్ష్యములను; పుష్ప, ఫల, కర్పూర, కస్తూరిక+ఆదులును= పువ్వులు, పండ్లు, కర్పూరం, కస్తూరి మున్నగువాటిని; వారలకున్= ఆ దొరలకు; పుచ్చుచుండెన్= పంపుతూ ఉన్నాడు.

తాత్పర్యం: ఆ శుభశకునాలు చూచి ధర్మరాజు సంతోషించాడు. అతని తమ్ములు, పాండవ సేనలోని దొరలు కూడా సంతోషించారు. అప్పుడు ధర్మరాజు, ద్రుపద విరాటాదులైన రాజులనందరినీ కొలువుకూటానికి పిలిపించి ఈ విధంగా అన్నాడు: 'యుద్ధంలో మనం గెలుస్తామా, ఈ భూరాజ్యాన్ని ఏలుకుందాము. లేదా స్వర్గలోక సౌఖ్యం అనుభవించగలం. ఏదైన మనకు మంచిదే. దీనికి మీరు సిద్ధమై నా పక్షంలో చేరండి.' రాజులు అందరూ ఏకగ్రీవంగా ధర్మరాజు చెప్పిన మాటలు ఆమోదించి ధైర్యసాహసాలతో ఆ విధంగా ప్రవర్తించటానికి ప్రతిజ్ఞలు చేసి తమ తమ సేనలలోనికి వెళ్ళారు. వెళ్ళుతూ ఉత్సాహంతో శంఖాలు ఊదారు. ధర్మరాజు వారందరకు అభినందన చందనం, కర్పూరం, పూవులు ఫలాలు భక్ష్యాలు పంచిపెట్టాడు.

విశేషం: అడియాలములు, తిక్కన ఈ శబ్దాన్ని విరివిగా ప్రయోగించాడు. అడియాలాలు రాజలాంఛనాలు. గొడుగులు, అందలాలు, చామరాలు, మేల్కట్టులు, ముద్రికలు మున్నగునవి.

క. అనిన విని యాంబికేయుఁడు । మనమొన 'గడుఁ బెద్ద దీని మార్కొనఁ గుంతీ
తనయులు గొంచెంబయ్యును । ననుమానింపక కడంగు టది యెట్లొక్కో!' 123

ప్రతిపదార్థం: అనినన్+విని= అని (సంజయుడు చెప్పగా ఆలకించి); ఆంబికేయుఁడు= అంబిక కొడుకు- ధృతరాష్ట్రుడు; మనమొన= మనసేన; కడున్+పెద్ద= మిక్కిలి గొప్పది; దీనిన్= (ఈ కౌరవసేనను); మార్కొనన్= ఎదిరించి యుద్ధం చేయటానికి; కుంతీతనయులు= కుంతి కొడుకులైన పాండవులు; కొంచెంబు+అయ్యును= (తమసేన) మిక్కిలి చిన్నది అయినప్పటికిని; అనుమానింపక= సందేహించక; (పరాజయం కలుగుతుంది అనే సందేహం లేకుండగా); కడంగుట= పూనటం (యుద్ధం చేయటానికి పూనటం); అది= అది; ఎట్లు+ఒక్కో!= ఏ విధంగా జరిగిందో (ఆశ్చర్యంగా ఉందే)!

తాత్పర్యం: పాండవ సైన్యం ఉత్సాహంతో యుద్ధం చేయటానికి కురుక్షేత్రం చేరింది' అని సంజయుడు చెప్పగా ఆలకించి, ధృతరాష్ట్రుడు ఒక ఎదురు ప్రశ్న వేశాడు. 'ఓ సంజయా! కౌరవుల సేన చాలా పెద్దది కదా! అంతటి పెద్ద సైన్యాన్ని ఎదిరించి యుద్ధం చేస్తే ఓడిపోతామేమో అని పాండవులకు ఎందుకు సందేహం కలగలేదు? అంత ధైర్యంతో యుద్ధానికి ఏ విధంగా పూనుకున్నారు?'

వ. అనుటయు సంజయుం 'డదియునుం జెప్పెద విను' మని యతని కిట్లనియెఁ: 'గౌంతేయాగ్రజుండు కురుబలంబు
గనుంగొని కొండొక విన్ననై వివ్వచ్చు నాలోకించి. 124

ప్రతిపదార్థం: అనుటయున్= అని (ధృతరాష్ట్రుడు చెప్పగా); సంజయుండు= సంజయుడు; అదియునున్+చెప్పెద, వినుము= దానిని గూడ నీకు చెప్పగలను ఆలకించవలసింది; అని+అతనికిన్+ఇట్లు+అనియెన్= అని ధృతరాష్ట్రుడికి ఈ విధంగా చెప్పాడు; కౌంతేయ+అగ్రజుండు= కుంతీకుమారులలో పెద్దవాడు- ధర్మరాజు; కురు+బలంబున్= కౌరవసేనను; కనుంగొని= చూచి; కొండొక+విన్ననై= కొంత దైన్యం చెంది; వివ్వచ్చున్= అర్జునుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడికి సంజయుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీకు ఆ సంగతి కూడా వివరించి చెప్పగలను. కుంతీకుమారులలో పెద్దవాడైన ధర్మరాజు పెద్దదైన కౌరవ సైన్యాన్ని చూచి, కొంత మేర భయపడి, ఆందోళన చెంది, అర్జునుడిని చూచి (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. ' ఘన మయి తోఁచుచున్నయది కౌరవసైన్యము చూడ్కి కందు శాం
తనవుని తాలకేతన ముదగ్రత ముందటఁ బొల్చెఁ జూచితే'
యనవుడుఁ బిన్ననవ్వు నగి యన్నరుఁ డన్నమొగంబుఁ జూచి నె
ట్టన బలుమాట లాడఁగఁ గడంగఁగ నొల్లక యత్యుదాత్తతన్. 125

ప్రతిపదార్థం: చూడ్కికిన్= చూపునకు (స్థూలదృష్టికి); కౌరవ+సైన్యము= (దుర్యోధనాదులైన) కౌరవుల సైన్యం; ఘనము+అయి, తోఁచుచున్నఅది= చాలా పెద్దదిగా కన్పిస్తున్నది; అందున్= (ఆ కురుసేనలో); శాంతనవుని, తాల, కేతనము= శంతనుడి కొడుకు అయిన భీష్ముడి తాడిచెట్టు జెండా; ఉదగ్రతన్= భయంకరంగా; ముందటన్= ముందుగా (అగ్ర భాగంలో); పొల్చెన్= విలసిల్లుతున్నది; చూచితి+ఏ= చూచావుగదా!; అనవుడున్= అని (ధర్మజుడు) చెప్పగా; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; పిన్న+నవ్వు+నగి= చిరునవ్వునవ్వి; అన్న+మొగంబున్+చూచి= అన్నగారి (ధర్మరాజు) ముఖం ఆలోకించి; నెట్టన= పూనికతో; పలు, మాటలు+ఆడఁగన్= పెక్కు మాటలు చెప్పటానికి; కడంగఁగన్+ఒల్లక= పూనుకొనుటకు ఇష్టపడక; అతి+ఉదాత్తతన్= మిక్కిలి గొప్పదనంతో.

తాత్పర్యం: 'ఓ అర్జునా! చూచావుగదా. స్థూలదృష్టికి కౌరవ సైన్యం చాలా పెద్దదిగా కనిపిస్తున్నది. ఆ సేనలో ముందర నిలిచిన భీష్ముడి జెండా చూడుము. ఎంత ఎత్తుగా కన్పిస్తున్నదో తాడిచెట్టు బొమ్మతో. ఎంత భయంకరంగా ఉన్నదో. అని ధర్మరాజు చెప్పగా, చిరునవ్వు చిందిస్తూ అర్జునుడు అన్నగారి ముఖం చూచి, అధిక ప్రసంగం చేయటానికీ ఇష్టం లేక, సముచితంగా సమాధానం చెప్పాడు.

విశేషం: తిక్కన ప్రయోగించిన నవ్వులు పేర్కొనదగినవి. అందులో 'పిన్న నవ్వు' ఒకటి. నవ్వు నవరసఖని. నవ్వు అగాధ హృదయ విషయసూచిక. ఇచ్చట అర్జునుడు మాటలలో చెప్పిన సమాధానం ఒక యెత్తు. అతడు చేసిన మందహాసం మరియొక ఎత్తు. మాటల మాటున - మాటలు చెప్పలేని భావం - మందహాసంలో దాగి ఉంటుంది.

ధర్మజునకు నర్జునుఁ డుత్సాహంబు గలిగించుట (సం. 6.1.93)

వ. అతనితో నిట్లనియె. 126

తాత్పర్యం: ధర్మరాజుతో అర్జునుడు ఈ విధంగా చెప్పాడు:

చ. ' మునివరుఁ డైన నారదుఁడు మున్నొకయప్పుడు సెప్పె 'ధర్మ నా
శను లగు వారలం బ్రబలసైన్యము గల్గెనయేనిఁ గొంచె మై
నను రిపుసేన గెల్చు' నని నాకు గురుండును దేవతానదీ
తనయుఁడు నేర్పడన్ వినఁగఁ దాను బరాశరసూనుఁడుం గృపన్. 127

ప్రతిపదార్థం: మునివరుఁడు+ఐన+నారదుఁడు= ఋషులలో శ్రేష్ఠుడు అయిన నారదుడు; మున్ను+ఒక+అప్పుడు= పూర్వకాలంలో ఒకసారి; నాకున్= నాకు; గురుండును= ద్రోణాచార్యుడును; దేవతా నదీ తనయుఁడున్= దేవలోకంలోని నది (గంగ) కొడుకును; తాను= తాను; పరాశర, సూనుఁడున్= పరాశరుడి కొడుకు అయిన వ్యాసుడు; ఏర్పడన్+వినఁగన్= స్పష్టంగా ఆలకిస్తుండగా; ధర్మనాశనులు+అగు+వారలన్= ధర్మాన్ని పాడుచేసేవారలకు; ప్రబల+సైన్యము= పెద్దసేన; కల్గెన+ఏనిన్= ఉన్నప్పటికీ; రిపుసేన= శత్రుసైన్యం; కొంచెము+ఐనను= మిక్కిలి తక్కువే అయినప్పటికి; గెల్చున్= జయిస్తుంది; అని= అని; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: ధర్మరాజుతో అర్జునుడు ఈ విధంగా చెప్పాడు: 'మునుపు మునిశ్రేష్ఠుడు అయిన నారద మహర్షి

ఒకసారి నాతో 'ధర్మనాశకులకు పెద్ద సైన్యం ఉండవచ్చునుగాని యుద్ధంలో వారిని చిన్నసేన ఉన్నప్పటికి శత్రువులే గెలుస్తారు అనిచెప్పాడు. నాతోపాటు ఈ మాటలు అన్నప్పుడు ద్రోణాచార్యులు, భీష్ముడు, వేదవ్యాసమహర్షి కూడా స్పష్టంగా విన్నారు.

విశేషం: ప్రాచీన భారతీయ సారస్వతంలో- మహాభారతంలో 'ధర్మ' శబ్ద ప్రయోగం చాల చోట్ల కన్పిస్తుంది. ధర్మ శబ్ద నిర్వచనం - మిక్కిలి కష్టం. స్థూలంగా 'ధర్మం' అంటే మంచిపని అనీ, కర్తవ్య సూత్రం అనీ చెప్పవచ్చు. "యతో ధర్మః తతో జయః' ' మహాభారత సారసంగ్రహం. అయితే ఏది ధర్మం. ధర్మాన్ని గుర్తించటానికి మనుధర్మ శాస్త్రం - పది లక్షణాలు పేర్కొన్నది.

"ధృతిః క్షమా దమోऽస్తేయం । శౌచ మింద్రియనిగ్రహః,
ధీ ర్విద్యా సత్య మక్రోధో । దశకం ధర్మలక్షణమ్"

వ. **అది య ట్లుండె నమానుషశక్తిసముద్దామం బగు భీము గదావిహారంబు వైరిదుస్సహంబు; ధృష్టద్యుమ్న శిఖండి ప్రముఖ పాంచాలవర్గం బనర్గళ విక్రమంబు, విరాట శంఖ ముఖ్య మాత్స్యనికరం బరిభయంకరంబు; సాత్యకి చేకితానాది యాదవ నివహంబు భవజ్జ యావహం; బభిమన్యు హైడింబ ప్రభృతి కుమారలోకం బలోకసామాన్య బలశౌర్యధుర్యంబు; నీ కటాక్షంబును గృష్ణు సంరక్షణంబునుం గలిగి గాండివం బను పామునకు ఱెక్కలు వచ్చిన ట్లున్నయది; యట్లుంగాక యేనుఁగుంబోలె నీ లావు నీ వెఱుంగవు; దివిజులకు నజయ్యుండవు; నీ వలిగిన నెవ్వరె ట్లయ్యెదరో యటు సూడు' మనినం దెలివొంది సంక్రందననందనునకు ధర్మనందనుం డిట్లనియె. 128**

ప్రతిపదార్థం: అది= (నారద మహర్షి చెప్పినమాట); అట్లు+ఉండెన్= ఆ విధంగా ఉన్నది= (దానికేమిగాని); అమానుష, శక్తి, సముద్దామంబు+అగు= మనుజులకు అతీతమైన బలంతో భయంకరమైన; భీము, గదా, విహారంబు= భీమసేనుడి యొక్క గద త్రిప్పులాట; వైరి, దుః+సహంబు= శత్రువులు సహించలేనిది; ధృష్టద్యుమ్న, శిఖండి, ప్రముఖ, పాంచాల, వర్గంబు= ధృష్టద్యుమ్నుడు శిఖండి మున్నగు పాంచాల పక్షం; అనర్గళ విక్రమంబు= అడ్డులేని పరాక్రమం (కలది); మాత్స్య+నికరంబు= మత్స్యదేశానికి సంబంధించిన సేనాసమూహం; అరి+భయంకరంబు= శత్రువులకు భయం కలుగజేసేది; సాత్యకి+చేకితాన+ఆది, యాదవ, నివహంబు= సాత్యకి చేకితానుడు మున్నగు యాదవుల బలగం; భవత్+జయ+ఆవహంబు= నీకు జయం కలిగించేది; అభిమన్యు, హైడింబ, ప్రభృతి, కుమార, లోకంబు= అభిమన్యుడు, హిడింబ కొడుకైన ఘటోత్కచుడు మున్నగు కొడుకుల గుంపు; అలోక సామాన్య, బల, శౌర్య, ధుర్యంబు= లోకంలో సాధారణంగా కనుపించనట్టి శక్తి పరాక్రమాలతో కూడినది; నీ కటాక్షంబును= నీ(క్రీగంటిచూపు) దయ; కృష్ణు, సంరక్షణంబును+కలిసి= శ్రీకృష్ణుడి రక్షణ కలిసి; గాండివంబు+అను, పామునకున్= గాండీవం (ధనుస్సు) అనే పామునకు; రెక్కలు, వచ్చినట్లు+ఉన్న+అది= రెక్కలు మొలిచినట్లు ఉన్నది; అట్లు+కాక= ఆ రీతిగా కాక; ఏనుఁగున్+పోలెన్= ఏనుగువలె; నీలావు= నీ బలం; నీవు+ఎఱుంగవు= నీవు తెలిసికోలేవు; దివిజులకున్= దేవతలకు; అజయ్యుండవు= జయింపశక్యంకానివాడవు; నీవు+అలిగినన్= నీవు కోపిస్తే; ఎవ్వరు+ఎట్లు+అయ్యెదరో= ఎవరు ఏ విధంగా ఔతారో; అటు+చూడుము= ఆ దృక్పథంతో వీక్షించుము; అనినన్= అని అర్జునుడు చెప్పగా; తెలివి+ఒంది= జ్ఞానం చేకూర్చుకొన్నవాడై; సంక్రందన నందనునకున్= (దేవేంద్రుడి కుమారుడైన) అర్జునుడికి; ధర్మనందనుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు:

తాత్పర్యం: అది అట్లా ఉండనీ, అమానుషశక్తి సంపన్నుడగు భీముడి గదా విహారం శత్రువులు సహించలేనిది. ధృష్టద్యుమ్నుడు, శిఖండి మొదలైన పాంచాల వర్గం అడ్డులేని పరాక్రమం కలది. విరాటుడు, శంఖుడు మొదలైన మత్స్యదేశ సేనాసమూహం శత్రుభయంకరం. సాత్యకి చేకితానుడు మొదలైన యాదవుల బలగం నీకు జయం కలిగించేది. అభిమన్యుడు, ఘటోత్కచుడు మొదలైన కొడుకుల గుంపు లోకంలో సాధారణంగా కనిపించనట్టి పరాక్రమాలతో కూడినది. నీ దయా వీక్షణం, కృష్ణు రక్షణ కలిగి గాండీవం అనే పాముకు రెక్కలు వచ్చినట్లున్నది.

అంతేగాక ఏనుగుకువలె నీశక్తి నీకు తెలియదు. నీవు దేవతలకు కూడ జయింపరానివాడవు. నీవు కోపగిస్తే ఎవ్వరెట్లౌతారో చూడు అనగా విని వికాసం పొంది అర్జునుడితో ధర్మరాజిట్లన్నాడు.

విశేషం: 1. పాము సహజంగా ప్రమాదం కలిగించే శక్తి కలది. అసలే చురుకైనది పాము. పాముకూ రెక్కలు వస్తే ఇంకేముంది! ఇది ఒక గొప్ప ఉత్ప్రేక్ష.

2. ఏనుగు భూమిమీదగల జంతువులలోకెల్ల బలమైనట్టిది. అయితే అది క్రూరజంతువు కాదు. ఏనుగులు విచ్చలవిడిగా ప్రకోపించి విహరిస్తే ఏనుగునకుగల సహజ సాధుత్వం లోకోపకారకం, ధర్మరాజు తన శక్తి తెలియని ఏనుగు వంటివాడు. మంచి ఉపమ.

తే. **కౌరవవ్యూహమునకుఁ దగఁగ నొక్క। బంధురవ్యూహ మొనరింపఁ బంపు' మనిన**
నతఁడు ద్రుపదాత్మజుని నచలాఖ్యమైన। ఘనతర వ్యూహ మొనరింపఁ బనుచుటయును. **129**

ప్రతిపదార్థం: కౌరవ, వ్యూహమునకున్= కౌరవులు పన్నిన వ్యూహానికి; తగంగన్= అనువుగా; ఒక్క, బంధుర, వ్యూహము= ఒక చిక్కని వ్యూహాన్ని; ఒనరింపన్= ఏర్పాటు చేయటానికి; పంపుము= ఏర్పాటు చేయుము; అనినన్= అని ధర్మరాజు చెప్పగా; అతఁడు= (అర్జునుఁడు); ద్రుపద+ఆత్మజునిన్= ద్రుపదుడి కొడుకైన ధృష్టద్యుమ్నుడిని; అచల+ఆఖ్యము+ఐన= అచలము (కొండ) అనే పేరుగల; ఘనతర, వ్యూహంబు= మిక్కిలి గొప్పదైన వ్యూహాన్ని; ఒనరింపన్= ఏర్పరుప; పనుచుటయును= ఆజ్ఞాపించుటయు.

తాత్పర్యం: కౌరవసేనాపతి భీష్ముడు 'నర' వ్యూహం పన్నాడు. దానిని దేవతలు గూడ అద్భుతమని మెచ్చుకొన్నారు. ధర్మరాజు అర్జునుడితో 'కౌరవుల వ్యూహానికి అనురూపమైన గొప్ప వ్యూహాన్ని పన్నాలని కోరాడు. అర్జునుడు పాండవ సేనాధిపతి అయిన ధృష్టద్యుమ్నుడిని పిలిచి 'అచల' వ్యూహాన్ని పన్నుమని ఆదేశించాడు.

వ. **ఆ ధృష్టద్యుమ్నుండును గలయ మెలంగి మోహరం బమర్చె; నయ్యచలవ్యూహమ్మునందు దా నగ్రభాగంబున నభిమన్యు ప్రభృతి కుమార నకుల సహదేవ సహితంబుగా భీమసేన పరిపాలితుండై నిలిచెఁ; దమతమ బంధువులకును బలంబులకును బలువుతోడి చెలువు గలుగఁ జేకితాన సాత్యకి సమేతంబుగాఁ బాంచాల మాత్స్యాధిపతులు దక్షిణోత్తర భాగంబుల నిలిచిరి; నడుమ నడగొండగమియుం బోని గజరాజితో రాజు రథారూఢుండై ధవళచ్ఛత్ర చామరంబులు మెఱయ విప్రవర్గంబునకు నంబర జాంబూనదంబు లొసంగుచు విజయాశీర్వాదంబు లాదరించుచుండె; ముందటఁ బురందరనందన సంరక్షితుండై శిఖండి గాంగేయునకుఁ గట్టెదురుగా నిలిచి గండు మిగిలి యొప్పె; నపరభాగస్థులై మాగధ సహదేవ ధృష్టకేతు లవష్టంభ విజృంభణంబునఁ బొలిచి; రివ్విధంబునం జారుభీషణం బై.** **130**

ప్రతిపదార్థం: ఆ ధృష్టద్యుమ్నుండును= ఆ ధృష్టద్యుమ్నుడున్నూ; కలయన్ మెలంగి= (సేన) అంతటను పూర్ణంగా తిరిగి; మోహరంబున్+అమర్చెన్= వ్యూహాన్ని ఏర్పాటు చేశాడు; ఆ+అచల+వ్యూహమ్మునందున్= 'అచల'మనే పేరుగల్గిన ఆ వ్యూహంలో; తాన్= తాను (ధృష్టద్యుమ్నుడు); అగ్రభాగంబునన్= మొదటనే; అభిమన్యు, ప్రభృతి, కుమార, నకుల, సహదేవ, సహితంబుగాన్= అభిమన్యుడు మున్నగు పాండవుల కుమారులతోపాటుగా, నకులుడు సహదేవుడుకూడి ఉండగా; భీమసేన+పరిపాలితుండు+ఐ= భీముడి రక్షణకు లోనైన వాడై; నిలిచెన్= నిలిచాడు; తమ తమ+బంధువులకును= తమ తమ చుట్టాలకు; బలంబులకును= సేనలకు; బలువు తోడిచెలువు= శక్తితో కూడిన సౌందర్యం; కలుగన్= ఏర్పడేటట్లుగా; చేకితాన, సాత్యకి, సమేతంబుగాన్= చేకితానుడు సాత్యకి అనే యాదవ వీరులతోపాటుగా; పాంచాల, మత్స్య, అధిపతులు= పాంచాల రాజు ద్రుపదుడును- మత్స్యరాజు

విరాటుడును; దక్షిణ+ఉత్తర భాగంబులన్= దక్షిణంవైపు, ఉత్తరంవైపు; నిలిచిరి= నిలబడ్డారు; నడుమన్= మధ్యలో; నడకొండ గమియున్+పోలి= నడిచే కొండల గుంపు వలె ఉన్న; గజరాజితోన్= ఏనుగుల సమూహంతో; రాజు= (ధర్మరాజు); రథ+ఆరూఢుండు+ఐ= రథాన్ని ఎక్కినవాడై; ధవళ, ఛత్ర, చామరంబులు= తెల్లని గొడుగులు వీవనలు; మెఱయన్= ప్రకాశించగా; విప్రవర్గంబునకున్= బ్రాహ్మణ సమూహానికి; అంబర+జాంబూనదంబులు= వస్త్రాలు, బంగారు కాసులు; ఒసంగుచున్= ఇస్తూ; విజయ+ఆశీర్వాదంబులు= గెలుపుపొందే దీవనలు; ఆదరించుచుండెన్= మన్నిస్తూ ఉన్నాడు; ముందరన్= ముందు భాగంలో; పురందర నందన, సంరక్షితుండు+ఐ= అర్జునుడి చేత కాపాడబడినవాడై; శిఖండి, గాంగేయునకున్= భీష్మునికి; కడు+ఎదుటన్= కట్టెదుటనే- ఎదురు బొదురుగా; నిలిచి= నిల్చుండి; గండు, మిగిలి ఒప్పెన్= వీరత్వంతో మిక్కిలి వెలుగొందాడు; అపర భాగస్థులు+ఐ= వెనుకభాగంలో ఉన్నవారై; మాగధ+సహదేవ+ధృష్టకేతులు= మగధదేశానికి సంబంధించిన సహదేవ మహారాజు అతని తమ్ముడు ధృష్టకేతుడు; అవష్టంభ+విజృంభణంబునన్= గర్వాతిశయంతో పొలిచిరి= శోభిల్లారు; ఆ+విధంబునన్= ఆ రీతిగా; చారు, భీషణంబు+ఐ= రమణీయ భయానకంగా (అందంగానూ, భయంకరంగాను).

తాత్పర్యం: పాండవసేనాపతి అయిన ధృష్టద్యుమ్నుడు తన సేనలలో నలువైపుల తిరిగి, 'అచల వ్యూహం' అమర్చాడు. ఆ అచలవ్యూహంలో మునుముందు తాను అభిమన్యుడు మున్నగు పాండవకుమారులు నకుల సహదేవులు నిలిచారు. అక్కడే, తనకు బాసటగా భీమసేనుడు నిలిచాడు. ఉత్తరంవైపు దక్షిణంవైపు తమ బలాలకు చుట్టాలకు బలం చేకూరుస్తూ విరాటుడు - ద్రుపదుడూ నిలిచారు. వ్యూహం మధ్యభాగంలో, జంగమ పర్వతాలవలె శోభిల్లే ఏనుగుల గుంపు మధ్య ధర్మరాజు రథం మీద ఉన్నాడు, ఛత్రచామరాలతో. బ్రాహ్మణులు ఆశీర్వదించారు. ధర్మరాజు వారికి వస్త్రాలూ, బంగారు కాసులు బహూకరించాడు. ముందు అర్జునుడిచేత కాపాడబడుతూ శిఖండి, అటు కౌరవసేనలోని భీష్ముడికి ఎదురుబొదురుగా నిలిచాడు. వెనుకభాగంలో మగధదేశానికి చెందిన సహదేవుడు, ధృష్టకేతుడు గర్వాతిశయంతో శోభిల్లారు. ఈ విధంగా అందంగానూ, భయంకరంగానూ పాండవులసైన్యం విలసిల్లిందని మీది పద్యంతో అన్వయం.

క. అరదములు దీవు, లున్నత । కరులు గిరులు, హరులు వీచికలు, సుభటసము
త్కర ముగ్రసత్త్వములుగా । శరనిధి గతిఁ బాండుపుత్త్ర సైన్యం బొప్పెన్. 131

ప్రతిపదార్థం: అరదములు= రథాలు; దీవులు= ద్వీపాలు; ఉన్నత, కరులు= ఎత్తైన ఏనుగులు; గిరులు= పర్వతాలు; హరులు= గుర్రాలు; వీచికలు= కెరటాలు; సుభట, సముత్కరము= మంచి భటుల సముదాయం; ఉగ్ర, సత్త్వములుగాన్= భయంకరమైన జంతువులుగా; పాండుపుత్త్ర, సైన్యంబు= పాండవుల సేన; శరనిధి గతిన్= సముద్రంవలె; ఒప్పెన్= విలసిల్లింది.

తాత్పర్యం: పాండవుల సేన సముద్రం వలె శోభిల్లింది. రథాలు దీవులుగా, ఎత్తైన ఏనుగులు కొండలుగా, గుర్రాలు కెరటాలుగా, భటుల సముదాయం భయంకరమైన జంతువులుగా భాసించాయి.

విశేషం: అలం: ఉపమ (రూపకానుప్రాణితం).

క. ఉభయబల దీప్తకేతు । ప్రభలం గీడ్పఱిచి కురుధరావల్లభ సై
న్య భయంకరమై శక్ర । ప్రభువు కపిధ్వజము వెలిఁగె బ్రకటస్ఫురణన్. 132

ప్రతిపదార్థం: ఉభయ, బల, దీప్త, కేతు, ప్రభలన్= రెండు సేనలలో ప్రకాశించే జెండాల కాంతులను; కీడ్పఱిచి= తక్కువ చేసి; కురు, ధరావల్లభ, సైన్య, భయంకరము+ఐ= కురురాజు అయిన దుర్యోధనుడి సేనలకు భయం కలిగించేదై; శక్రప్రభువు, కపిధ్వజము= దేవేంద్రుడి కొడుకు అయిన అర్జునుడి యొక్క కోతి జెండా; ప్రకట+స్ఫురణన్= దేదీప్యమాన కాంతితో; వెలిఁగెన్= ప్రకాశించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అర్జునుడి రథంపై వెలుగొందే కోతి జెండా, రెండు సేనలలోని జెండాలన్నిటినీ మించి, దుర్యోధనుడి సేనలకు భయం కలిగిస్తూ దేదీప్యమానంగా ప్రకాశించింది.

తే. అరుణములును సితంబులు నసితములును । నైన జోడులతో దొరలందు నిందు
నాలలోని యాఁబోతులఁ బోలి పొలిచి । రెసఁగు బెడిదంపుమాట లాకసము ముట్ట. 133

ప్రతిపదార్థం: అరుణములును= ఎర్రనైనట్టి; సితంబులును= తెల్లనివి; అసితములును= నల్లనైనట్టివి; ఐన= ఐనట్టి; జోడులతోన్= కవచాలతో; దొరలు= దండనాయకులు; అందున్+ఇందున్= ఆ కౌరవ సేనలోను పాండవసేనలోనూ; ఆలలోని= ఆవులమధ్య ఉన్న; ఆఁబోతులన్+పోలి= ఆబోతులరీతిగా; ఎసఁగు బెడిదంపు మాటలు= అతిశయంతో కూడిన గొప్ప మాటలు; ఆకసము, ముట్టన్= ఆకాశాన్ని తాకగా; పొలిచిరి= శోభిల్లారు.

తాత్పర్యం: పాండవసైన్యంలోనూ కౌరవసైన్యంలోనూ గల దండనాయకులు ఎర్రని, తెల్లని, నల్లని కవచాలు ధరించి ఆవుల మధ్య ఉన్న ఆబోతులవలె అతిశయించిన గొప్పమాటలు ఆకసమంటగా శోభిల్లారు.

తే. కొన్ని భూముల బలములు గురునృపాలుఁ । బాండవులఁ గొన్ని భూముల బలము లీసు
గలిగి పాయలై కొన్ని భూముల బలములు । రెండు దిక్కులయందుఁ జేరినవి యధిప! 134

ప్రతిపదార్థం: కొన్ని, భూముల, బలములు= కొన్ని ప్రదేశాలకు చెందిన సేనలు; కురు, నృపాలున్= కురురాజు దుర్యోధనుడి; కొన్ని, భూముల, బలములు= కొన్ని ప్రదేశాలలోని సేనలు; పాండవులన్= పాండవులను; ఈసు+కలిగి= అసూయచేత; పాయలు+ఐ= చీలిపోయి; కొన్ని+భూముల+బలములు= కొన్ని ప్రదేశాలకు చెందిన సేనలు; రెండు దిక్కులయందున్= రెండువైపులయందు; అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; చేరినవి= చేరాయి.

తాత్పర్యం: కొన్ని ప్రదేశాలలోని సేనలు కౌరవపక్షంలో చేరాయి. కొన్ని ప్రదేశాలలోని సేనలు పాండవ పక్షంలో చేరాయి. కొన్ని ప్రదేశాలలోని సేనలు వారిలో వారికి గల అసూయ వలన చీలిపోయి, రెండు పక్షాలలో కూడా ఒక చీలిక కౌరవపక్షంలోనూ, మరియొక చీలిక పాండవ పక్షంలోనూ చేరాయి.

విశేషం: కురుక్షేత్రంలో జరిగింది కౌరవులకు పాండవులకు మధ్య కలహం. అయితే ఆ యుద్ధంలో చాలా ప్రదేశాలలోని సేనలు రెండు పక్షాలలో చేరి, పోరాడాయి. ఒక ప్రదేశంలోని సేనలు కౌరవపక్షంలో చేరితే, వారి శత్రుపక్షం సేనలు పాండవ సైన్యంలో చేరాయి. అనగా వారికీ వారికీగల పూర్వవైరాలు తీర్చుకునేందుకు- చిన్న చిన్న ప్రదేశాలలోని వారు- రెండు పక్షాలలో చేరారన్నమాట. విశేషించి, ఉదాహరణకు యాదవులలో సాత్యకి శ్రీకృష్ణుల పక్షం పాండవ పక్షం వహించింది. కృతవర్మ పక్షం కౌరవ సేనలో చేరింది.

వ. కావున. 135

తాత్పర్యం: కాబట్టి.

క. బాలురు వృద్ధులుఁ దక్కఁగ । వ్రాలి యిలం గలుగు పురుషవర్గంబు జయ
శ్రీలోలత నేతెంచుట । నేల యవిసి మూఁగినట్లు నెఱసె బలంబుల్.' 136

ప్రతిపదార్థం: బాలురు= చిన్న పిల్లవాండ్రు; వృద్ధులున్= ముసలివారు; తక్కఁగన్= తప్ప; వ్రాలి= చేరి; ఇలన్+కలుగు= భూమిమీద ఉండే; పురుష+వర్గంబు= మగవారందరూ; జయ, శ్రీ, లోలతన్= గెలుపు అనే గొప్ప సంపదయందలి ప్రీతితో; ఏతెంచుటన్= రావటం మూలాన; (యుద్ధంలో చేరటం వలన); నేల= భూమి; అవిసి= పొంగి; మూఁగిన+అట్లు= ఒకచో చేరినట్లుగా, బలంబుల్= సేనలు; నెఱసెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: చిన్న పిల్లలు ముసలివాళ్ళు తప్ప మగవాళ్ళు అందరూ విజయశ్రీని కాంక్షిస్తూ నేల పిగిలిన, ఈనిన రీతిగా ఒక చోటికి సేనలు చేరాయి.'

వ. అనిన విని ధృతరాష్ట్రుం 'డప్పుడప్పాండవ కౌరవ సైన్యంబులలో నెయ్యది యుబ్బు గలిగి యుండె'నని యడిగిన సంజయుం డతని కిట్లనియె. 137

ప్రతిపదార్థం: అనినన్= అని (సంజయుడు చెప్పగా); విని= ఆలకించి; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+పాండవ, కౌరవ, సైన్యంబులలోన్= ఆ పాండవసేనలో మరియు ఆ కౌరవ సేనలో; ఏ+అది= ఏది; ఉబ్బు కలిగి= అతిశయం కలిగి; ఉండెన్= ఉన్నది; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; సంజయుండు= సంజయుడు; అతనికిన్= ధృతరాష్ట్రుడికి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: సంజయుడి మాటలు ఆలకించిన పిదప ధృతరాష్ట్రుడు ఒక ప్రశ్న వేశాడు. 'ఓ సంజయా! ఆ సమయంలో పాండవుల సైన్యం కౌరవ సైన్యం ఏది ఎక్కువ ఉత్సాహంతో ఓలలాడింది?' ఈ ప్రశ్నకు సంజయుడు ధృతరాష్ట్రుడితో ఈ విధంగా సమాధానం చెప్పాడు.

క. రెండు బలంబుల వారలు । నొండొరువులకంటెఁ జాల నుక్కు మిగిలి యొం
డొండ కడంగుచు నుజ్జ్వల । చండస్థితి నొప్పి రపుడు జగతీనాథా! 138

ప్రతిపదార్థం: జగతీనాథా!= (ఓ ధృతరాష్ట్రమహారాజా!); రెండు+బలంబుల వారలు= ఉభయసేనలలోనివారు (కౌరవులలో చేరినవారు పాండవులలో చేరినవారు) ఒండు+ఒరువుల కంటెన్= ఒకరికంటె ఒకరు (ఒకరిని మించి మరి యొకరు); చాలన్= మిక్కిలి; ఉక్కు+మిగిలి= బలంచేత అతిశయించి; ఒండు+ఒండ, కడంగుచున్= ఒకరితో ఇంకొకరు పూనుతూ; అపుడు= ఆ సమయంలో; ఉజ్జ్వల, చండ స్థితిన్= భయంకరంగా ప్రకాశించే విధంగా; ఒప్పిరి= శోభిల్లారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అపుడు కౌరవసైన్యంలోనివారూ- పాండవసేనల్లోని వారూ, ఒకరిని మించి మరొకరు బలంచేత అతిశయించి పరస్పరం ఎదురుకొంటూ భయంకరంగా ప్రకాశించారు.

వ. అని వెండియు. 139

తాత్పర్యం: అని చెప్పి, ఇంకా ఇట్లా అన్నాడు.

క. ఆ రెండు బలములందును । దోరం బైయున్న యట్లు దోఁచెం బాండు
క్ష్మారమణసుతు బలము నర । నారాయణు లునికిఁ జేసి నాకుం జూడన్. 140

ప్రతిపదార్థం: ఆ+రెండు, బలములందును= ఆ కౌరవ పాండవ సేనలలో; పాండుక్ష్మారమణసుతు బలము= పాండు రాజు కొడుకు సైన్యం; నర, నారాయణుల+ఉనికిన్+చేసి= నరుడు నారాయణుడు (ఇద్దరూ ఉండటం చేత); తోరంబు+ఐ= అధికమై; ఉన్న+అట్లు; నాకున్+చూడన్= నా దృష్టికి; తోఁచెన్= తోచింది.

తాత్పర్యం: 'కౌరవుల సేనలో పాండవుల సేనలో పాండవుల సేనయే నా దృష్టికి బలవత్తరంగా తోచింది. ఎందుకంటే- పాండవసేనలో నరనారాయణులు ఉన్నారు.

విశేషం: 1. నరుడు - నారాయణుడు పురాణ ప్రసిద్ధులైన గొప్ప మునులు. నరుడు - మానవ ప్రతీక, మానవమాత్రుడు, నారాయణుడు- అధిమానవ ప్రతీక. విజయం= పురుషకారం+దైవం అనగా మానవ ప్రయత్నం+దైవానుగ్రహం. అర్జునుడు నరాంశసంభూతుడు, శ్రీకృష్ణుడు నారాయణాంశ సంభూతుడు. వారు ఇద్దరు ఉన్నచో విజయం తథ్యం. భగవద్గీతలోని శ్లోకం ఇట స్మరించ దగినది.

"యత్ర యోగీశ్వరః కృష్ణో । యత్ర పార్థో ధనుర్ధరః,
తత్ర శ్రీ ర్విజయో భూతిః । ధ్రువా నీతి ర్మతిర్మమ". (18-78)

క. ఎలసి పయివారి దంతిఘ । టల మదములఁ దావి వెట్టుటయుఁ గౌరవసే
నల యేనుంగుల మదధా । రలు డొంకెం బొలయు మధుకరములుబ్బడఁగన్. 141

ప్రతిపదార్థం: ఎలసి= అతిశయించి; పయివారి= పైన చెప్పబడిన (నరనారాయణులకు చెందిన); దంతి, ఘటల, మదముల తావి+పెట్టుటయున్= ఏనుగుల గుంపుల దాన జలములు; తావి, పెట్టుటయున్= సువాసన లీనుటయున్ను; కౌరవ, సేనల, ఏనుంగుల, మద, ధారలు= కౌరవసేనలలోని ఏనుగుల దాన జలములు; పొలయు= చేరే; మధుకరములు= తుమ్మెదలు; ఉబ్బు+అడఁగన్= ఉత్సాహం తగ్గిపోయేటట్లుగా; డొంకెన్= తగ్గిపోయాయి (ముసలితనం చెందాయి).

తాత్పర్యం: పాండవసైన్యంలోని ఏనుగుల మదజలాలు పరిమళాలు వెదజల్లాయి. కౌరవుల సైన్యంలోని ఏనుగుల మదం ఇంకిపోయింది. అందుచేత వాటిపై చేరే తుమ్మెదల గుంపు యొక్క ఉత్సాహం అణగిపోయింది.

విశేషం: 1. 140, 141, 142 సంఖ్యలుగల పద్యాలలో 143 సంఖ్యగల వచనంలోగూడ. కృష్ణార్జునులను గూర్చియే వర్ణన ఉన్నది. అందుచేత 141 పద్యంలోని పయివారి- అనగా కృష్ణార్జునుల యొక్క అని అర్థం చెప్పటం సమంజసం.

2. 'దంతి పుటల మదముల రాహువెట్టుటయు' అని ముద్రిత పాఠం. ఆ గ్రంథంలోనే పాఠాంతరం 'తావి' వెట్టుటయు 'గాలి' వెట్టుటయు అని ఉన్నది. మత్తేభాల మదము యొక్క పరిమళానికి తుమ్మెదలు వచ్చి వ్రాలటాన్ని - తిక్కన పలుసారులు భారతంలో వర్ణించాడు. అందుచే 'తావి'- పరిమళం అనే పాఠమే గ్రహించటం మంచిది. దానికి అర్థం సరిపోతుంది. అంతేగాక- ఆ క్రింది పద్యంలో ఉత్తరార్ధంలో కౌరవసేనలలోని ఏనుగుల మదం తగ్గటం - అందుచేత తుమ్మెదల ఉబ్బు అణగటం వర్ణింపబడింది. అందుచే ఈ క్రింది పద్యంలో పూర్వార్ధంలో 'తావి' పెట్టుట= పరిమళించటం అనే అర్థం చక్కగా సరిపోతున్నది. అందుచే 'తావి' వెట్టు అనే పాఠం-స్వీకరించబడింది.

తే. అధిప! నీ తనయుండు గయ్యంబు వొడుచు । తెంపు వదలక విభవంబు పెంపు మెఱసె;
సారసానకు వచ్చిన చందమునను । నెలమిఁ బొందిరి పాండవేయులును హరియు. 142

ప్రతిపదార్థం: అధిప!= (ఓ ధృతరాష్ట్ర మహారాజ!); నీ+తనయుండు= నీ కొడుకు- దుర్యోధనుడు; కయ్యంబు+పొడుచు తెంపు= యుద్ధం ప్రారంభించే తెగువ; వదలక= విడిచిపెట్టక; విభవంపు+పెంపు+మెఱసెన్= (తన) వైభవం యొక్క అతిశయం వెలుగొంద చేశాడు; సారసానకున్= వినోదానికి; వచ్చిన+చందమునను= వచ్చిన రీతిగా; పాండవేయులును= పాండవులును; హరియున్= శ్రీకృష్ణుడును; ఎలమిన్+పొందిరి= సంతోషం పొందారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ కొడుకైన దుర్యోధనుడు యుద్ధాన్ని చేసే తెగువ వదలక అత్యంతవైభవంతో వెలుగొందాడు. పాండవులును, శ్రీకృష్ణుడూ వినోదానికై వచ్చినట్లు సంతోషించారు. (అనగా వారికి యుద్ధం చేయటం వినోదప్రాయమైనది అని భావం).

వ. అట్టియెడఁ గృష్ణార్జునులు పాంచజన్య దేవదత్తంబులు పూరించిన. 143

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; కృష్ణ+అర్జునులు= శ్రీకృష్ణుడును, అర్జునుడును; పాంచజన్య+దేవత్తంబులు= పాంచజన్యం, దేవదత్తం (అనే శంఖాలను); పూరించినన్= మ్రోగించగా.

తాత్పర్యం: ఆ సమయంలో సంతోష పారవశ్యంతో శ్రీకృష్ణుడు పాంచజన్యం అనే శంఖాన్ని, అర్జునుడు దేవదత్తం అనే శంఖాన్ని పూరించగా (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆ నినదము విని పాండవ । సేన లలరె; ధార్తరాష్ట్ర సేనాగత యో
ధానీక ములికె; నెత్తురు । వాన గురిసె నంతఁ గౌరవవ్యూహమునన్. 144

ప్రతిపదార్థం: ఆ+నినదము= ఆ ధ్వని; విని= ఆలకించి; పాండవ, సేనలు= పాండవుల సైన్యాలు; లలరెన్= సంతోషించాయి; ధార్తరాష్ట్ర సేనా+గత, యోధ+అనీకము= ధృతరాష్ట్రుడి కొడుకులకు చెందిన సేనలో ఉన్న వీరుల సమూహం; ఉలికెన్= భయపడ్డది; కౌరవ+వ్యూహమునన్= కౌరవుల వ్యూహంలో; అంతన్= అంతట; నెత్తురు+వాన= రక్తవర్షం; కురిసెన్= కురిసింది.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు పూరించిన పాంచజన్య శంఖారావం, అర్జునుడు పూరించిన దేవదత్త శంఖనినాదం విని పాండవుల సేనలు సంతోషంతో ఉప్పొంగిపోయాయి. కౌరవసేనలు భయపడ్డాయి. కౌరవ వ్యూహంపై నెత్తురు వాన కురిసింది.

విశేషం: 1. యుద్ధంలో కత్తులు, కటార్లు, విండ్లు బాణాలు సముచిత పాత్ర నిర్వహిస్తాయి. అది సహజం. అయితే- జెండాలు కనుల పండువుగా ఆకసంలో రెపరెపలాడటం యుద్ధ వాద్యాలు ఎన్నెన్నో భేరీ కాహళ తూర్యనినాద పరంపరలు మ్రోగటం ఏదో ఒక వర్ణనాతీతమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. ఇక- ముఖ్యంగా పేర్కొనదగింది శంఖనినాదం. ప్రతి వీరుడి చేతిలో విల్లు, కత్తి, డాలు ఉండటం ఒక యెత్తు; శంఖం ఉండటం ఒక యెత్తు, వీరుడు శంఖం ఊదే నేర్పు; అతడి పరాక్రమ ప్రాభవానికి భారమితిగా భాసించింది భారత మహేతిహాస కావ్యంలో.

వ. మఱియు ననేక దుర్నిమిత్తంబులు వుట్టెఁ; బుట్టకేల తక్కు? దేవవ్రతుండును గురుండును గురునందనుండును గృపుండును నిచ్చలుఁ గయ్యంబునకు వెడలు నప్పుడు 'పాండవులకు జయం బవశ్యంబు నయ్యెడు' మనుచు వెడలుదు; రది యట్లుండె నయ్యశుభసూచకంబులకు ధార్తరాష్ట్రులు దలంకక తూర్యంబులు మొరయింప నియోగించిన. 145

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; అనేక, దుర్నిమిత్తంబులు= పెక్కు చెడ్డ శకునాలు; పుట్టెన్= అగుపించాయి; పుట్టక+ఏల, తక్కున్?= అగుపించకుండా ఎందుకు ఉంటాయి?; దేవవ్రతుండును= భీష్ముడూ; గురుండును= ద్రోణాచార్యుడూ; గురు+నందనుండును= అశ్వత్థామయు; కృపుండును= కృపాచార్యుడును; నిచ్చలున్= ఎల్లప్పుడు; కయ్యంబునకున్= యుద్ధానికి; వెడలు+అప్పుడు= వెళ్లేటప్పుడు; పాండవులకున్; జయంబు= గెలుపు; అవశ్యంబు+అయ్యెడున్= తప్పకుండా కలుగుతుంది; అనుచున్= అని తలపోయుచు; వెడలుదురు= వెళ్ళుతుంటారు; అది+అట్లు+ఉండెన్= అది ఆ విధంగా ఉండనీ; ఆ+అశుభ, సూచకంబులకున్= ఆ చెడ్డశకునాలకు; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుడి కొడుకులు- కౌరవులు; తలంకక= చలించక; తూర్యంబులు= (మంగళ సూచకములు అయిన) వాద్యాలు; మొరయింపన్= మ్రోగించటానికి; నియోగించినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఇంకా ఎన్నో చెడ్డ శకునాలు దాపురించాయి. ఎందుకు దాపురించవు? అపజయం రాక తప్పుతుందా? భీష్ముడు, ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు పాండవులే గెలుస్తారు అని రోజూ అనుకుంటూనే యుద్ధానికి తరలివెళ్ళారు. దానికేమిగాని, కౌరవులు మాత్రం ఆ దుశ్శకునాలకు జంకకుండా, యుద్ధ వాద్యాలు మ్రోగించేందుకు ఆజ్ఞ ఇచ్చారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. అప్పుడు రెండు సైన్యములు నాహవకేళికి నుత్సహించి పె
ల్లొప్పెఁ జెలంగి యుబ్బినసముద్ధతిఁ బొల్పగు తొంటి చందముల్
దప్పి యుగాంతకాలచలితత్వము నొంది పరస్పరాకృతుల్
గప్ప నెదుర్చు నంబుధియుగంబు మహోగ్రతఁ గ్రేణిసేయుచున్. 146

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; రెండు, సైన్యములున్= (కౌరవుల సైన్యం, పాండవుల సైన్యం); ఆహవ, కేళికిన్= పోరాటమనే ఆటకు; ఉత్సహించి= ఉత్సాహంతో పూనుకొని; పెల్లు+ఒప్పెన్= అతిశయించి శోభించాయి; చెలంగి, ఉబ్బిన, సముద్ధతిన్= చెలరేగిన ఉత్సాహంతో అతిశయించిన గర్వంతో; పొల్పు+అగు= సొగసుగా ఉన్న; తొంటి+చందముల్= మునుపటి విధాలు; తప్పి= మారిపోయి; యుగ+అంతకాల+చలితత్వమున్+ఒంది= ప్రళయకాలంలో వచ్చే మార్పు పొంది; పరస్పర+ఆకృతుల్+కప్పఁగన్+ఎదుర్చు= తమకు తమకు నైసర్గికంగా ఉన్న ఆకారాలు కనిపించకుండా చేయటానికి మీదికి దూకే; అంబుధి+యుగంబున్= రెండు సముద్రాలను; మహా+ఉగ్రతన్= మహాభయంకరంగా; క్రేణి+చేయుచున్= పరిహసిస్తూ.

తాత్పర్యం: ఆ సమయంలో పోరాటం అనే ఆటకు కౌరవ పాండవ సేనలు ఉత్సాహంతో పూనుకొన్నాయి. ఆ రెండు సేనలు ఏ విధంగా ఉన్నాయంటే ప్రళయకాలంలో తొల్లిటి సౌమ్యరూపం వదలిపెట్టి, భయంకరంగా మారిపోయి ఒకదాని ఆకారం ఇంకొకటి పూర్తిగా మారిపోయేటట్లు చేయటానికి ఉప్పొంగే రెండు సముద్రాల వలె కన్పించాయి.

వ. తదవసరంబున నుభయ బలంబులవారును. 147

తాత్పర్యం: ఆ తరువాత కౌరవ పాండవుల రెండు పక్షాలవారు.

చ. బవరము సేయుచుండియును భాషణముల్ దగఁ బల్కుచుండఁగా
నవినయవృత్తి మై వలవ దాయుధ మార్చుటఁ దాఁకి పడ్డఁ గై
దువు వడినం దొలంగినను దోర్బల మేది భయంబుఁ బొందినం
గవియక బీఱువోయినను గాదు వధింపఁగ నెట్టి శత్రునిన్. 148

ప్రతిపదార్థం: బవరము+చేయుచుండియును= యుద్ధం చేస్తూ కూడా; భాషణముల్+తగన్+పల్కుచుండఁగాన్= మాటలాడుచుండగా, సమయోచిత సంభాషణ సలుపు చుండగా; అవినయ+వృత్తిమైన్= ఉద్ధతితో; ఆయుధము+ఆర్చుట= ఆయుధం ప్రయోగించటం; వలవదు= కూడదు; తాకి+పడ్డన్= ఎదిరించి పడిపోయినచో; కైదువు= కత్తి; పడినన్= పడిపోయినా; దోర్బలము+ఏది= భుజబలం నశించి; తొలంగినన్= ప్రక్కకు తప్పుకొన్నా; భయంబు+పొందినన్= పిరికితనంతో భయపడితే; కవియక= యుద్ధం చేయకుండా; బీఱు+పోయినను= పారిపోతే; ఎట్టి+శత్రునిన్= ఎటువంటి శత్రువైనప్పటికీ; వధింపఁగన్+కాదు= చంపరాదు.

తాత్పర్యం: యుద్ధం చేస్తూనే అవసరానికి తగిన మాటలు మాటాడుతున్న శత్రువుపై సందు చూచుకొని ఆయుధ ప్రయోగం చేయరాదు. యుద్ధం చేసేటప్పుడు క్రింద పడిపోయిన వాడి జోలికి పోరాదు; చేతిలోని కత్తి జారి నేలమీద పడినప్పుడు భుజబలము నశించి యుద్ధమునకు తొలగినా ఆ శత్రువును చంపరాదు. పిరికితనంతో యుద్ధం వదలిపెట్టి పారిపోయేవారిని భయపడిన వారిని - ఎట్టి శత్రువునైనా సంహరించరాదు.

వ. అని సమయంబుసేసి; రా సమయంబున. 149

ప్రతిపదార్థం: అని= అని; సమయంబు+చేసిరి= ఒడంబడిక చేసుకొన్నారు.; ఆ సమయంబున్= ఆ సమయంలో.

తాత్పర్యం: అని ఆ విధంగా ఆ సమయంలో శపథం చేశారు. (ఇరుపక్షాల వారూ కలిసి)

క. పలు చాయల నొప్పిన యా । బలము లొకటి కొకటి కెదురఁ బల్లవ పుష్పా
వలి గల వనములక్రియ ని । శ్చలత నిలిచి పొలిచె నసమసమధైర్యములన్. 150

ప్రతిపదార్థం: పలు, చాయలన్= పెక్కు కాంతులతో; ఒప్పిన= శోభిల్లిన; ఆ+బలములు= ఆ సైన్యాలు; ఒకటికి+ఒకటికిన్+ఎదురన్= ఒకదానికి మరి యొకటి ఎదురు బొదురుగా నిలువగా; (ఆరెండు సేనలు); పల్లవ, పుష్ప+ఆవళి= చిగురుటాకులు పువ్వుల సముదాయాలు; కల= ఉన్నట్టి; వనముల క్రియన్= తోటలవలె; నిశ్చలతన్= ధైర్యంగా; అసమ, సమ, ధైర్యములన్= సాటిలేనట్టి మరియు సమానమైన ధైర్యసాహసాలతో; నిలిచి= నిలబడి; పొలిచెన్= శోభిల్లాయి.

తాత్పర్యం: అలం: ఉపమ. రంగురంగులతో శోభిల్లిన ఆ రెండు సేనలూ సాటిలేని సమాన ధైర్యాలతో ఒకదానికి మరి యొకటి ఎదురుగా నిలబడినప్పుడు చిగురాకులతో పువ్వులతో విలసిల్లే తోటలవలె నిశ్చలంగా నిల్చి శోభిల్లాయి.

క. అత్తఱి సురఖచరాదుల । చిత్తము లనిఁ జూచువేడ్కఁ జిడిముడి పడఁగా
నొత్తొరవున నిరుదెఱఁగుల । యుత్తమవీరులును దాఁక నుంకింపంగన్. 151

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= ఆ సమయమునందు; సుర, ఖచర+ఆదుల, చిత్తములు= దేవతలు, ఆకాశమునందు సంచరించేవారు మొదలైనవారి మనస్సులు; అని, చూచు, వేడ్కన్= యుద్ధాన్ని చూడాలనే కోరికతో; చిడిముడి+పడఁగాన్= తొందరపడగా; ఒత్తొరవునన్= రాపిడితో; ఇరు+తెఱఁగుల+ఉత్తమ, వీరులు= రెండు పక్షాలలోని గొప్ప యోధులు; తాఁకన్= యుద్ధంలో మార్కొనటానికి; ఉంకింపంగన్= పూనుకొనగా.

తాత్పర్యం: ఆ సమయంలో దేవతలు మున్నగు ఆకాశ సంచారులు కురుక్షేత్రంలో జరిగే ఆ మహాసంగ్రామాన్ని చూడాలని వేడుకతో తహతహలాడుతుండగా, ఉభయ పక్షాలలోని యోధులు యుద్ధాన్ని ప్రారంభించాలని ఉత్సాహపడుతుండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

ధర్మరాజు పాదచారియై భీష్ముని యొద్దకుఁ బోవుట (సం. 6.41.6)

తే. సమరకౌతుకి యైన యజాతశత్రుఁ । డొప్పు మిగిలెడు మైమఱు వూడ్చి యాయు
ధములతోఁ గూడఁ దనయరదమునఁ బెట్టి । యిలకు దిగి మౌనియై కరంబులు మొగిడ్చి. 152

ప్రతిపదార్థం: సమర, కౌతుకి+ఐన= యుద్ధం చేయాలనే అభిలాషకలవాడైన; అజాత శత్రుఁడు= పుట్టని శత్రువులు కలవాడు - శత్రువులు లేనివాడు; ధర్మరాజు; ఒప్పు, మిగిలెడు= శోభాయమానమైన; మైమఱువు+ఊడ్చి= కవచాన్ని తీసివేసి; ఆయుధములతోన్+కూడన్= యుద్ధ పరికరాలతోకూడ; తన+అరదమునన్+పెట్టి= రథం మీద ఉంచి; ఇలకున్= నేలకు; డిగి= దిగి; మౌని+ఐ= మాటలాడటం మానివేసినవాడై; కరంబులు+మొగిడ్చి= చేతులు జోడించి.

తాత్పర్యం: అజాతశత్రువుగా పేరుకెక్కిన ధర్మరాజు చిట్టచివరకు యుద్ధం చేయటానికి సంసిద్ధుడై కురుక్షేత్రానికి వచ్చాడు. ఉన్నట్లుండి కవచం తీసివేసి ఆయుధాలతోపాటు రథంమీద పెట్టి, తాను రథం దిగి, మౌనవ్రతం పూని అంజలి ఘటించి.

వ. భీష్ము దెసకుం జనుచున్నం గనుంగొని యమ్మహీవల్లభు తమ్ములును శౌరి సాత్యకులును బరమాప్తు లగు ధరణీశులు నతని చేతోవృత్తం బెఱుంగమి నుత్తలపడు చిత్తంబులతో వాహనంబులు డిగ్గి యతనిం గూడం జని యప్పుడు. 153

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భీష్మ దెసకున్+చనుచున్నన్= భీష్ముడున్న వైపునకు వెళ్ళుతుండటం; కనుంగొని= చూచి; ఆ+మహీవల్లభు+తమ్ములును= ఆ(ధర్మ)రాజు తమ్ములూ; శౌరి, సాత్యకులును= శ్రీకృష్ణుడూ- సాత్యకీ; పరమ+ఆప్తులు+అగు= హృదయానికి మిక్కిలి దగ్గరివారైన స్నేహితులు అయిన; ధరణీ+ఈశులును= రాజులూ; అతని+చేతస్+వృత్తంబు= ధర్మరాజు మనస్సులో ఉన్నది; ఎఱుంగమి= తెలియకపోవటం చేత; ఉత్తలపడు+చిత్తంబులతోన్= కలత చెందిన మనస్సులతో; వాహనంబులు+డిగ్గి= వాహనాలను (రథ, గజ తురగాదులు) దిగి; అతనిన్+కూడన్+చని= ధర్మరాజు దరికి చేరబోయి; అప్పుడు= ఆ సమయమునందు.

తాత్పర్యం: ధర్మరాజు భీష్ముడు ఉన్నచోటికి వెళ్ళటం చూచి, అతడి తమ్ములు, శ్రీకృష్ణుడు, సాత్యకి, అతడికి మిక్కిలి దగ్గర స్నేహితులైన రాజులు, అతడి మనస్సులో ఏమున్నదో తెలియక కంగారు పడ్డారు. అయితే వారు గూడ వాహనాలు దిగి, ధర్మరాజును అనుసరించసాగారు. ఆ సమయంలో వారు ధర్మరాజుతో పలికిన మాటలు.

సీ. **'ఏ మెల్ల నుండ నీ విట్లొంటి గాల్నడ । నేఁగుచున్కికిఁ గత మెద్దియొక్కొ?**
పన్నిన పగఱపై సన్నాహ మంతయు । నెడలించి నడచుట యెట్టులొక్కొ?
రిపులు దేఁకువ సెడఁ గృపణత దుర్బలు । చాడ్పునఁ జను టేమి చంద మొక్కొ?
యదరి పోరాటకు నదనైనచో నొప్పు । పొలివోవఁ బోవుట వోలు నొక్కొ?

తే. **యని క్రమంబున నా మరుత్తనయ విజయ । నకుల సహదేవు లడుగ భూనాథుఁ డొక్క**
పలుకుఁ బలుకక యరుగంగఁ బద్మనాభుఁ । డక్కుమారులతో నిట్టులనియె నగుచు. **154**

ప్రతిపదార్థం: ఏము+ఎల్లన్+ఉండన్= మేము అందరం ఉండగా; ఈవు= నీవు; ఇట్టు= ఇట్లు; ఒంటి= ఒంటరిగా; కాల్నడన్= కాలి నడకతో; ఏగుచున్కికిన్= వెళ్ళటానికి; కతము= కారణం; ఎద్ది+ఒక్కొ= ఏది అయి ఉంటుంది?; పన్నిన-పగఱపైన్+సన్నాహము+అంతయున్= శత్రువులపై చేసిన యుద్ధ ప్రయత్నమంతా; ఎడలించి= విడిచిపెట్టి; నడచుట= వెళ్ళటం; ఎట్టులు+ఒక్కొ?= ఏ విధంగా సమంజసం?; రిపులు= శత్రువులు; తేఁకువ+చెడన్= జంకు పోయేటట్లుగా; కృపణతన్= దైన్యంతో; దుర్బలు+చాడ్పునన్= బలహీనుడి వలె; చనుట= వెళ్ళటం; ఏమి చందము+ఒక్కొ?= ఏవిధంగా సమంజసం?; అదరి= ప్రజ్వలించి; పోరాటకున్= యుద్ధానికి; అదను= సరియైన సమయం; ఐనచోన్= ఐనప్పుడు; ఒప్పు= శోభ; పొలి+పోవన్+పోవుట= క్షీణించునట్లు వెడలుట; పోలును+ఒక్కొ?= సరియైనదా?; అని= అని; క్రమంబునన్= వరుసగా; ఆ+మరుత్+తనయ, విజయ, నకుల, సహదేవులు= భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు; అడుగన్= ప్రశ్నింపగా; భూనాథుఁడు= రాజు (ధర్మరాజు); ఒక్క పలుకు పలుకక= ఒక మాట గూడ మాటాడక; అరుగంగన్= వెళ్ళగా; పద్మనాభుఁడు= (పద్మం నాభియందు కల) విష్ణువు-శ్రీకృష్ణుడు; ఆ+కుమారులతోడన్= ఆ పాండవ కుమారులతో; ఇట్లు= ఈ విధంగా; నగుచున్= నవ్వుతూ; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు నిరాయుధుడై మౌనం వహించి నమస్కారముద్రతో పాదచారియై నడచి వెళ్ళటం చూచి అతడి తమ్ములు ఈ విధంగా ప్రశ్నించారు. భీముడు: 'మే మందరం ఉండగా అన్నయ్యా! నీవు ఒంటరిగా పాదచారివై ఎక్కడకు ఎందుకు వెళ్లుతున్నావు?' అర్జునుడు: 'శత్రువులను ఎదిరించటానికి, ఓడించటానికి మనం ఎన్నో వ్యూహాలు పన్నాము. వాటిని అన్నిటినీ ఉజ్జగించి నీవు ఎక్కడకు ఎందుకు వెళ్ళుతున్నట్లు?' నకులుడు: 'శత్రువులు జంకుపడకుండగా, దైన్యంతో బలహీనుడి వలె ఎందుకు నడచి వెళ్ళుతున్నట్లు?' సహదేవుడు: 'ఉత్సాహంతో ప్రజ్వరిల్లి యుద్ధం చేయవలసిన సమయం ఇది. ఎందుకు ఒప్పు తరుగునట్లు వెళ్ళడం?' ఈ ప్రశ్నలు అడుగుతూ ఉంటే ధర్మరాజు ఒక మాటకూడా మాట్లాడక పోతూఉండగా వారితో శ్రీకృష్ణుడు నవ్వుతూ ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. 'ఇతని తలం పే నెఱింగితి; నితండు భీష్మద్రోణ కృప శల్యులకు నమస్కరించి, వారలచేత ననుజ్ఞాతుండై భండనంబు సేయువాఁడు గాఁ దలంచి చనియెడుఁ; బెద్దల యనుజ్ఞఁ గొని కయ్యంబు సేసిన జయం బగుట నిశ్చయం బని యార్యులు సెప్పుదురు, గావున నా సుకర్మం బాచరించుట మేల కాక, యనిన విని యజాతశత్రు వెనుక నప్పు డరిగినవారలు పలుకు లుడిగి నిలిచి వెఱగుపడి చిత్రరూపంబుల చందంబై చూచుచుండిరి; కృష్ణార్జునులును భీముండును గవలును దోన చనం గౌంతేయాగ్రజుండు గాంగేయు తేరు సేరంబోవం, గౌరవ సైన్యజనంబు లేపు మిగిలి మెడ లెత్తి కనుంగొని; రయ్యవసరంబున నందలి యోధవీరు 'లితం డింత వెఱచునే' యనువారును 'వెఱవ నిప్పు డితని కేమి వచ్చె' ననువారును, 'వృకోదరుండు వివ్వచ్చుండు గవలు సౌభద్రుండు సాత్యకి విరాటుండు ద్రుపదుండు ధృష్టద్యుమ్నుండు శిఖండియుం గలుగఁ దన కింత యేల?' యనువారును 'ధర్మతనయుండు భీతుండు గాఁ' డేమి తలంపున వచ్చెనో? యనువారును; మఱియు ననేక ప్రకారంబులం బలుకు వారునునై యుండిరి; పాండవ సైనికులు 'మానధనుండగు నిమ్మానవనాథుండు నదీనందనుతో నేమనువాఁ? డతం డితని నేమిభంగి సమ్మానించు? మాధవ ధనంజయు లెట్లు పలుకువారు? మారుతసుతుండును మాద్రీసూనులును నెత్తెఱంగున మాటలాడుదురు? వీరేమిటి కివ్విధంబునకుం దొడంగి రనుచు వగచి వెండియు వివిధ వచనముఖరు లగుచుండి; రయ్యుధిష్ఠిరుండు సముద్యత నానాయుధ బహుళంబైన కురువ్యూహంబు దఱిసి, పితామహుపాలికిం బోయి తత్పాదంబులకుఁ, బ్రణామంబు సేసి సవినయంబుగా నతని కిట్లనియె. 155

ప్రతిపదార్థం: ఇతని, తలంపున్= ఇతడి (ధర్మరాజు) అభిప్రాయం; ఏను= నేను; ఎఱింగితిన్= తెలిసికొన్నాను; భీష్మ, ద్రోణ, కృప, శల్యులకున్= భీష్ముడికి, ద్రోణుడికి, కృపుడికి, శల్యుడికి నమస్కరించి= వందనం సమర్పించి; వారలచేతన్= భీష్మ, ద్రోణ, కృప, శల్యులచేత; భండనంబు+చేయువాఁడుగాన్= యుద్ధం చేసేవాడుగా; తలంచి= ఆలోచించి; చనియెన్= వెళ్ళుతున్నాడు; పెద్దల+అనుజ్ఞన్= పెద్దవారి అనుమతి; కొని= పొంది; కయ్యంబు+చేసినన్= యుద్ధం చేస్తే; జయంబు+అగుట= గెలుపు లభించటం; నిశ్చయంబు+అని= తథ్యం అని; ఆర్యులు= పూజ్యులు; చెప్పుదురు= వచిస్తారు; కావునన్= కాబట్టి; ఆ+సుకర్మంబు= ఆ మంచి పని; ఆచరించుట= చేయటం; మేలు+అ+కాక+అనినన్= శుభం కదా! అని చెప్పగా; విని= ఆలకించి; అజాత శత్రు, వెనుకన్= ధర్మరాజు వెంట; అప్పుడు= ఆ సమయంలో; పలుకులు+ ఉడిగి= మాటలు మాట్లాడటం ఉజ్జగించి; నిలిచి= ఆగి; వెఱగు పడి= ఆశ్చర్యం చెంది; చిత్ర, రూపంబుల, చందంబు+ఐ= చిత్రలేఖనంలో ఉన్న బొమ్మల మాదిరిగా అయి (కదలకుండగా మెదలకుండగా నిలిచి); చూచుచున్+ఉండిరి= చూస్తూ ఉండిపోయారు; కృష్ణ+అర్జునులును= శ్రీకృష్ణుడూ, అర్జునుడూ; భీముండును= భీముడూ; కవలును= (నకుల సహదేవులూ); తోన+చనన్= వెనువెంట రాగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతి పెద్ద కొడుకు- ధర్మరాజు; గాంగేయు, తేరు+చేరన్+పోవన్= భీష్ముడి రథాన్ని సమీపించగా; కౌరవ, సైన్య, జనంబు= కౌరవసేనలోని ప్రజ; ఏపు, మిగిలి= అతిశయించి; మెడలు+ఎత్తి= తలపైకిఎత్తి; కనుంగొనిరి= చూచారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; అందలి= (ఆ కౌరవ సైన్యంలోని); యోధవీరులు= యుద్ధం చేసే శూరులు; ఇతండు= (ఈ ధర్మరాజు); ఇంత+వెఱచునే!= ఇంతగా భయపడుతున్నాడే!; అనువారును= అనేవారూ; వెఱవన్= భయపడటానికి; ఇప్పుడు= ఈ సమయంలో; ఈతనికిన్+ఏమి, వచ్చెన్?= ఈ ధర్మరాజుకు ఏ అవసరం కలిగింది; అనువారును= అనేవారూ; వృకోదరుండు= భీముడు; వివ్వచ్చుండు= అర్జునుడు; కవలు= నకుల, సహదేవులు; సౌభద్రుండు= అభిమన్యుడు; సాత్యకి, విరాటుడు; ద్రుపదుండు= ద్రుపదుడు; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; శిఖండియున్= శిఖండీ; కలుగఁగన్= ఉండగా; తనకున్?= (ధర్మరాజుకు); ఇంత+ఏల?= ఇంత (భయం) ఎందుకు? అనువారును= అనేవారూ; ధర్మతనయుండు= ధర్మరాజు; భీతుండు+కాఁడు= భయపడేవాడుకాడు; ఏమి, తలంపునన్= ఏ అభిప్రాయంతో; వచ్చెనో?= వచ్చాడో?; అనువారును= అనేవారూ; మఱియున్= ఇంకా; అనేక+ప్రకారంబులన్=

పెక్కు విధాలుగా; పలుకువారును+ఐ= మాటలాడేవారై; ఉండిరి= ఉన్నారు. పాండవ+సైనికులు= పాండవసేనలోని భటులు; మానధనుండు+అగు= అభిమానమే ధనంగా గల వాడగు; ఈ+మానవనాథుండు= ఈ రాజు; నదీ+నందనుతోన్= భీష్ముడితో (గంగా కొడుకుతో); ఏమి+అనువాఁడు?= ఏమి మాటాడునో?; అతండు= ఆ భీష్ముడు; ఇతనిన్= ధర్మరాజును; ఏమి, భంగిన్= ఏ రీతిగా; సమ్మానించున్?= గౌరవిస్తాడు?; మాధవ, ధనంజయులు= శ్రీకృష్ణుడు, అర్జునుడూ; ఎట్లు+పలుకువారు?= ఏ విధంగా మాటాడుతారు?; మారుత సుతుండును= భీముడు; మాద్రీసూనులు= మాద్రి కొడుకులు- నకుల సహదేవులు; ఏ+తెఱంగునన్= ఏమార్గంలో; మాటలాడుదురు?= మాటాడగలరో; వీరు= వీరు (ధర్మజాదులు); ఏమిటికిన్= ఎందుకు; ఈ+విధంబునకున్= ఈ రీతికి; తొడంగిరో= పాల్పడ్డారో?; అనుచున్+వగచి= అని విచారించి; వెండియున్= మరల; వివిధ, వచన, ముఖరులు+అగుచుండిరి= పెక్కు మాటలు ధ్వనించినవారు అయ్యారు; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; సముద్యత, నానా, ఆయుధ, బహుళంబు+ఐన= ఎన్నో విధాలైన ఆయుధాలతో కూడిన; కురు, వ్యూహంబున్= కౌరవులు పన్నిన వ్యూహాన్ని; డఁటిసి= సమీపించి; పితామహు పాలికిన్ పోయి= తాతగారి దగ్గరకు వెళ్ళి (భీష్ముని దరికి వెళ్ళి); తద్+పాదంబులకున్= ఆతని చరణాలకు; ప్రణామంబు+చేసి= నమస్కారం చేసి; సవినయంబుగాన్= నమ్రతతో; అతనికిన్= భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ధర్మరాజు అభిప్రాయం నేను పసికట్టాను. ఇతడు భీష్ముడికీ, ద్రోణుడికీ, కృపుడికీ, శల్యుడికీ నమస్కరించి యుద్ధం చేయటానికి ముందు పెద్దలు పూజ్యులు అయిన వారి అనుమతి పొందాలని వెళ్ళుతున్నాడు. పెద్దల ఆశీస్సుల వలన విజయం సిద్ధిస్తుందని ఆర్యుల ప్రవచనం.' అంత అజాతశత్రువైన ధర్మరాజు వెంట వెళ్ళేవారు మౌనం వహించి చిత్రపటంలోని బొమ్మలవలె ఆశ్చర్యంతో చూస్తూ నిలబడ్డారు. కృష్ణుడు అర్జునుడు భీముడు, నకులసహదేవులు అనుసరించి తన వెనుక రాగా, కుంతి పెద్ద కొడుకు ధర్మరాజు భీష్ముడి రథం దగ్గరకు చేరేటప్పుడు కౌరవసేనలోని వారు తలలెత్తి చూచారు. అప్పుడు ఆ కౌరవసేనలో నుండి వినిపించిన మాటలు- 'అయ్యో ధర్మరాజు ఎందుకు ఇంత భయపడుతున్నాడు?' 'అసలు భయపడటానికి మూలకారణం ఏమిటి?' 'భీముడు అర్జునుడు నకుల సహదేవులు అభిమన్యుడు. ద్రుపదుడు, విరాటుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి వంటి ఎందరో వీరులు తన పక్షంలో ఉండగా ధర్మరాజుకు ఈ పిరికితనం ఎందుకు?' 'ధర్మరాజు పిరికివాడు కాడు. అతడు రావటానికి ఏదో కారణం ఉండి ఉంటుంది.' 'అతడి మనస్సులో అసలు ఏముందో' - అని ఇంకా అనేక విధాలైన మాటలు వినిపించాయి. పాండవ సేనలో, 'ధర్మరాజు అభిమానవంతుడు. అతడు భీష్ముడితో ఏమి సంభాషిస్తాడో? భీష్ముడు ధర్మరాజును ఏ విధంగా మన్నిస్తాడో? చూడాలి. శ్రీకృష్ణుడు ఏమంటాడో? అర్జునుడు ఏమంటాడో? భీముడు నకుల సహదేవులు ఏ విధంగా సంభాషిస్తారో? వీరందరు ఈ విధంగా ప్రవర్తించటానికి కారణం ఏమిటో? చూడాలి.' 'ఈ విధంగా ఎన్నో మాటలు వెలువడ్డాయి. ధర్మరాజు ప్రౌఢ సన్నాహాలతో చక్కగా చిక్కగా అమర్చబడిన కౌరవవ్యూహాన్ని చేరి, పితామహుడైన భీష్ముడి దగ్గరకు పోయి, అతడి పాదాలకు నమస్కారం చేసి, నమ్రతతో అతడితో ఈ విధంగా అన్నాడు:

ఆ. ' అనఘ! నీ కెదిర్చి యని సేయువాఁడనై । ము న్ననుజ్ఞ గొనఁగ నిన్నుఁ గాన
నెమ్మి వచ్చినాఁడ; నీచేత దీవన । వడసి చనిన నేను బగఱ గెలుతు.' 156

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ భీష్మ పితామహా!; నీకున్+ఎదిర్చి= నిన్ను ఎదిరించి; అని+చేయువాడను+ఐ= యుద్ధం చేసేవాడినై; మున్ను= మొదట; అనుజ్ఞన్+కొనఁగన్= అనుమతి పుచ్చుకొనాలని; నిన్నున్= నిన్ను; కానన్= చూడటానికి; నెమ్మిన్= ప్రీతితో; వచ్చినాఁడన్= వచ్చాను; నీచేతన్= నీ చేత; దీవన= ఆశీస్సు; పడసి= పొంది; చనినన్= వెళ్ళితే; పగఱన్= శత్రువులను; ఏను= నేను; గెలుతున్= జయిస్తాను.

తాత్పర్యం: 'పుణ్యపురుషుడవైన ఓ భీష్మపితామహా! నీవు అన్ని విధాలా పెద్దవాడవు. పూజనీయుడవు. దురదృష్టవశాత్తు నిన్ను యుద్ధంలో ఎదిరించవలసిన అవసరం ఏర్పడింది మాకు. అయితే, ముందుగా నీ అనుమతిని అర్థించి నీ దీవనలు పొంది, తదుపరి యుద్ధం చేయాలని నేను నీ దగ్గరకు ప్రాంజలినై వచ్చాను. నీ ఆశీర్వచనం లభిస్తే నేను శత్రువులను జయించగలను.'

విశేషం: ఇది ధర్మరాజు శీలానికి గీటురాయి. పరాక్రమ ప్రాభవాలలో ధర్మరాజుకంటె అతడి తమ్ములే అధికులు. అయితే, శక్తి సామర్థ్యాల కంటె సౌశీల్యమే గొప్పది. ప్రపంచ చరిత్రలో 'అజాత శాత్రవుడు' అనిపించుకొన్న వ్యక్తి ఉన్నాడా? ఇక మానవ సాహిత్యం మానవ వేదాంతం అటువంటి ఆదర్శ వ్యక్తి కోసం అన్వేషిస్తూనే ఉన్నాయి. ప్రపంచ సాహితీజగత్తులో ఆదర్శ వ్యక్తి అజాతశత్రువు. మహాభారతంలో 'ధర్మరాజు' పాత్రలో సాక్షాత్కరిస్తున్నాడు.

సీ. ' అన విని గాంగేయు! డక్కట! నీ విట్లు । సనుదేక తక్కిన శాపమిత్తు;
వచ్చితి మేలయ్యె; వైరుల నిర్జింపు, । మిది గాకయును వర మెద్దియైన
నడుగుము, నీకుఁగా ననిసేయు టొక్కటి । దక్కంగ' నావుడు ధర్మసుతుఁడు
' రారాజు పక్షమై రణము సేయుము; నాకు । హిత మగు కార్యంబు మతిఁ దలంపు'

ఆ. మనుడు 'నట్ల కాక యట నీతలం పేమి?' । యనిన భీష్ముతోడ నతఁడు 'నిన్నుఁ
బోర గెలుచు విధము బోధింపు' మనుటయు । సస్మితాస్యుఁ డగుచు శాంతనవుఁడు. 157

ప్రతిపదార్థం: అనన్= అని ధర్మరాజు చెప్పగా; విని= ఆలకించి; గాంగేయుఁడు= గంగకొడుకు- భీష్ముడు; అక్కట!= ఆహా!; నీవు+ఇట్లు+చనుదేక+తక్కినన్= నీవు ఈ రీతిగా రాకపోతే; శాపము+ఇత్తున్= శాపం ఇచ్చేవాడిని; వచ్చితి(వి)= వచ్చావు; మేలు+అయ్యెన్= మంచిదయింది; వైరులన్= శత్రువులను; నిర్జింపుము= జయించుము; ఇది+కాకయును= ఇంతేకాక; నీకున్+కాన్+అని+చేయుట+ఒక్కటి+తక్కఁంగన్= నీ పక్షం చేరి యుద్ధం చేయమనటం ఒకటి తప్ప; వరము+ఎద్ది+ఐనన్= ఏదైన కోరిక; అడుగుము= కోరుకొమ్ము; నావుడున్= అని (భీష్ముడు) చెప్పగా; ధర్మసుతుఁడు= ధర్మరాజు; రారాజు+పక్షమై= దుర్యోధనుడివైపు; రణము+చేయుము= యుద్ధం చేయుము; మతిన్= (నీ) మనస్సులో; నాకున్+హితము+అగు+కార్యంబునన్= నాకు మేలు గలిగే పనిని; తలంపుము= యోజించుము; అనుడున్= అని (ధర్మరాజు) చెప్పగా; అట్లు+అ+కాక= సరే ఆ విధంగానే జరుగుగాక; అటన్= అచట; నీ, తలంపు+ఏమి?= నీ మనస్సులోని ఆలోచన ఏమిటి?; అనినన్= అని చెప్పగా; భీష్ముతోడన్= భీష్ముడితో; అతఁడు= ధర్మరాజు; నిన్నున్= నిన్ను (భీష్ముడా! నిన్ను); పోరన్= యుద్ధంలో; గెలుచు+విధము= జయించే ఉపాయం; బోధింపుము= తెల్పుము; అనుటయున్= అని చెప్పగా; సస్మిత+ఆస్యుఁడు+అగుచున్= చిరునవ్వుతో కూడిన మొగం కలవాడు అవుతూ; శాంతనవుండు= శంతనుడి కొడుకు- భీష్ముడు.

తాత్పర్యం: అని ధర్మరాజు పలుకగా, భీష్ముడు ఈ విధంగా సమాధానం చెప్పాడు: 'ఓ ధర్మరాజా! నీవు రావటం మంచిది అయింది. నీవు ఈ విధంగా నా దగ్గరకు రాకపోతే నాకు నీమీద కోపం వచ్చి ఉండేది. నిన్ను శపించి ఉండేవాడిని. నీకు నా ఆశీస్సులు. నీవు శత్రువులను జయిస్తావు. అంతేకాదు, నీకు నేను ఒక వరం ఇవ్వదలిచాను. కోరుకో. నీవైపు నన్ను యుద్ధం చేయుమనే కోరిక తప్ప, ఇంకేది కోరినా నీమాట చెల్లిస్తాను' అన్నాడు. ఆ మాటలకు ధర్మరాజు ఈ విధంగా బదులు పలికాడు. "ఓ భీష్మపితామహా! నీవు రాజరాజు అయిన దుర్యోధనుడివైపే యుద్ధం చేయుము. అయితే- నీ మనస్సులో మాత్రం నా మేలు తలపోయుము' అని కోరాడు. 'అట్లాగే; అయితే అసలు నీ మనస్సులో ఉన్న మాట నీవు విప్పి చెప్పుము' అని అడిగాడు. ధర్మరాజు 'మహానుభావా! నిన్ను యుద్ధంలో మేము గెలిచే ఉపాయం దయచేసి చెప్పు'మని అన్నాడు. ఆ మాటలు విని భీష్ముడు చిరునవ్వు చిందే ముఖంతో ఈ విధంగా పలికాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ధర్మరాజు (తిక్కన మాటలలో) 'మెత్తని పులి.' 'పితామహా! మేము కోరుకునేది నీ మరణం' అన్నాడన్నమాట ధర్మరాజు. భీష్ముడికి ఆ మాట ఆగ్రహం కలిగించలేదు. పైగా ఆతడు సుందర మందహాస మండన ముఖారవిందుడైనాడట! అప్పుడు భీష్ముడి ముఖంలో విరిసిన చిరునవ్వును ఏ చిత్రకారుడైనా చిత్రించగలడా?

క. **' నను మార్కొని గెలువఁగ న । య్యనిమిషులకు నరిది' యనుడు 'న ట్లగుటఁగదా**
నిను వేఁడెద' నని కుంతీ । తనయుఁడు వలుకుటయు విని పితామహుఁడు గృపన్. 158

ప్రతిపదార్థం: ననున్= నన్ను (భీష్ముడిని); మార్కొని= ఎదిరించి; గెలువఁగన్= జయించగా; ఆ+అనిమిషులకున్= ఆ దేవతలకు కూడ; అరిది= అపురూపం (దుర్లభం); అనుడున్= అని భీష్ముడు చెప్పగా; అట్లు+అగుటన్+కదా= అందు చేతనే గదా; నినున్= నిను; వేడెదను= ప్రార్థిస్తున్నాను; అని= అని; కుంతీ+తనయుఁడు= కుంతి కొడుకు- ధర్మరాజు; పలుకుటయును= చెప్పగా; విని= ఆలకించి; కృపన్= దయతో; పితామహుఁడు= తాత - భీష్ముడు.

తాత్పర్యం: 'నన్ను జయించటం ఆ దేవతలకు కూడా సాధ్యం కాదు. ఇక మానవుల మాట చెప్పటం ఎందుకు?' అన్నాడు భీష్ముడు. 'అందుచేతనేగదా, నిన్ను ఈ విధంగా ప్రార్థించవలసి వచ్చింది' అని సమాధానం చెప్పాడు ధర్మరాజు. ధర్మరాజు చెప్పిన సమాధానం విని, పితామహుడు అయిన భీష్ముడు దయగలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. **' చుట్టరికంబునన్ మనసు సొచ్చి ననుం గరఁగించి వేఁడినన్**
దిట్టతనంబు వో విడిచి తీవ్రరణంబు కడంక దక్కి నేఁ
బట్టిన యాయుధంబు పెడఁబాసినఁ గాని వధింపఁ బోల ద
ట్టిట్టన కేఁగు; మిప్పరుస యింతక కాలము గాదు దానికిన్. 159

ప్రతిపదార్థం: చుట్టరికంబునన్= బంధుత్వంచేత; మనసు+చొచ్చి= నా మనస్సులో దూరి; ననున్= నన్ను; కరఁగించి (నా హృదయం) కరగించి; వేఁడినన్= ప్రార్థిస్తే; దిట్టతనంబు+పోన్+విడిచి= శక్తిసామర్థ్యాలు విడిచి పెట్టి; తీవ్రరణంబు+కడంక+తక్కి= ఘోర యుద్ధమందలి పూనిక విడనాడి; నేన్= నేను; పట్టిన+ఆయుధంబు+పెడన్+పాసినన్+కాని= చేతపట్టిన యుద్ధ పరికరాన్ని ప్రక్కకు వదలివేస్తే తప్ప; వధింపన్+పోలదు= (నన్ను) చంపటానికి వీలులేదు; ఈ+పరుస= ఈ విధంగా; అట్టు+ఇట్టు+అనక= ఇది అది అనక (ఎదురు మాటలు చెప్పకుండా); ఏఁగుము= వెళ్లిపొమ్ము; ఇంతకు+అ= ప్రస్తుతం; దానికిన్= నన్ను గెలిచే ఉపాయం ఏదో నీకు చెప్పటానికి; కాలము+కాదు= సమయం కాదు.

తాత్పర్యం: బంధుత్వం చొప్పున నా మనస్సులో దూరి నా హృదయం కరగించి ప్రార్థిస్తే, నా శక్తిసామర్థ్యాలు విడిచి పెట్టి, ఘోర యుద్ధంమీద పూనిక సడలించి, నేను పట్టిన ఆయుధం ప్రక్కకు పెట్టివేస్తే తప్ప, నన్ను ఎవరూ సంహరించలేరు. నాతో అది ఇది అని వాదానికి దిగవద్దు. ప్రస్తుతానికి మారు మాటాడకుండా వెళ్లిపొమ్ము. నన్ను జయించే ఉపాయం చెప్పటానికి ఇది తగిన సమయం కాదు.

ధర్మరాజు గురుకృపశల్యులచేత యుద్ధమున కనుజ్ఞాతుం డగుట (సం. 6.41.43)

తే. **క్రమ్మఱంగ నేతెంచెదు గాక!' యనుడు । నతిముదంబునఁ బ్రణమిల్లి, యతని వాక్య**
మపుడు దల నిడుకొనినవాఁ డగుచు నప్పి । తామహుని నెమ్మి వీడ్కొని ధర్మసుతుఁడు. 160

ప్రతిపదార్థం: క్రమ్మఱంగన్= మరల; ఏతెంచెదు(వు)+కాక= వచ్చెదవు రాక; అనుడున్= అని చెప్పగా; ధర్మసుతుడు= ధర్మరాజు; అతి+ముదంబునన్= మిక్కిలి సంతోషంతో; ప్రణమిల్లి= నమస్కరించి; అపుడు= ఆ సమయంలో; అతడి+వాక్యము= అతడి (భీష్ముని మాట); తలన్= శిరస్సుపై; ఇడికొనినవాడు+అగుచున్= పెట్టుకొన్నవాడై; ఆ+పితామహునిన్= ఆ తాతగారిని (భీష్ముని); నెమ్మిన్= ప్రీతితో; వీడ్కొని= సెలవు గైకొని.

తాత్పర్యం: 'ధర్మరాజా! నీవు మరల నన్ను సందర్శించు' అని భీష్ముడు చెప్పగా. ధర్మరాజు మిక్కిలి సంతోషించి, అతడి మాట శిరసావహించి తాతగారైన భీష్ముడి కడ సెలవు పుచ్చుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. కృష్ణార్జునాదులుం దోడన చనుదేర గురుకృపశల్యుల కడకుం గ్రమంబున నరిగి పాదప్రణామంబు లాచరించి, వారలచేత రణంబునకు ననుజ్ఞ వడసి, యమ్మనుజపతి దనకు జయం బాశాసింపుమని యభ్యర్థించిన నయ్యాచార్యుండు 'నీకుం గృష్ణుండు మంత్రి యై యుండ నొరుల జయం బాశాసింపు మననేల? ధర్మం బేవలనం గలుగు నవ్వలన కృష్ణుండు గైకొను; నవ్వలనికి జయం బగు' ననియె; నిజవధోపాయంబు వేఁడిన నతండు 'నాచేత నాయుధం బున్నంతసేపు నన్నుం జంప నెట్టివారికి నశక్యం; బేను బ్రాయోపవేశంబున సన్న్యస్తశస్త్రుండ నైనం జంపుటకు నోపు నట్టివారికి నది దొరఁకొనుఁ; బెద్దయు నమ్మఁగలవాఁడు సెప్ప నత్యంతదుస్సహం బైన కీడుమాట వింటినేని నట్టివాఁడ నగుదు; నప్పు డట్టి పగఱకు నప్పని దీర్ప ననువై యుండు ' నని చెప్పినఁ గృపాచార్యునిం బరిమార్చు తెఱంగు నడుగం దొడంగి యేర్పడం బలుకనేరకున్న, నతం డెఱింగి తాను వధ్యుండు గామి యెఱింగించి 'గెలువు' మని దీవించె మద్రపతితో 'నీవు రాధేయునకు సారథి వగుట సంభవింప నోపు నని చెప్పి కయ్యంబు నప్పుడు కర్ణుతేజంబు దూలం బలికి యతనిఁ జిక్కువఱుపవలయు' నని వరంబు గోరిన 'నతం; డవ్విధంబు నీ యుద్యోగ సమయంబున నియ్యకొనినయది గాదే' యట్ల చేయుదు' నని పలికె నిత్తెఱంగున నందఱ వీడ్కొని యజాతశత్రుం డనుజవర్గానుగతుండై మరలె నయ్యవసరంబున 161

ప్రతిపదార్థం: కృష్ణ+అర్జున+ఆదులున్= కృష్ణుడు; అర్జునుడు మున్నగువారు; తోడన్+అ+చనుదేరన్= తోడుగా వెనువెంట రాగా; గురు, కృప, శల్యుల, కడకున్= గురువైన ద్రోణాచార్యుడి కడకు; కృపుడి కడకు, శల్యుడి కడకు; క్రమంబునన్= వరుసగా; అరిగి= వెళ్ళి; పాద+ప్రణామంబులు= పాదాలకు నమస్కారాలు; ఆచరించి= చేసి; వారలచేతన్= (గురు కృప శల్యుల చేత); రణంబునకున్= యుద్ధానికి; అనుజ్ఞ= అనుమతి; పడసి= పొంది; ఆ+మనుజపతి= ఆ రాజు- ఆ ధర్మరాజు; తనకున్= తనకు; జయంబు= గెలుపు; ఆశాసింపుము+అని= ఆశీర్వదించుమని; అభ్యర్థించినన్= కోరగా; ఆ+ఆచార్యుండు= ఆ గురుడు- ద్రోణుడు; నీకున్= నీకు; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; మంత్రి+ఐ+ఉండన్= మంత్రిగా ఉండగా; ఒరులన్= ఇతరులను; జయంబు= గెలుపు; ఆశాసింపుము+అనన్+ఏల?= ఆశీర్వదించుమని కోరనేల; ధర్మంబు= ధర్మం; ఏవలనన్+కలుగున్= ఏవైపు ఉంటుందో; ఆ+వలనన్= ఆ వైపే; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; కైకొనున్= స్వీకరిస్తాడు; ఆ+వలనికిన్= ఆ పక్షానికి; జయంబు+అగున్= గెలుపు వస్తుంది; అనియెన్= అని చెప్పాడు; నిజ, వధ+ఉపాయంబున్= తనను సంహరించే తెరువు; వేఁడినన్= అర్థించగా (చెప్పుమని ప్రార్థింపగా); అతండు= ద్రోణుడు; నా చేతన్= నా హస్తమునందు; ఆయుధంబు+ఉన్నంత సేపు= యుద్ధ పరికరం ఉన్నంత కాలం; నన్నున్+చంపన్= నన్ను చంపేందుకు; ఎట్టివారికిన్= ఎవ్వరికైనా సరే; అశక్యంబు= సాధ్యం కాదు; ఏను= నేను; ప్రాయోపవేశంబునన్= ఉపవాసవ్రతంతో (అన్నపానాలు త్యజించి); సన్న్యస్త+శస్త్రుండన్+ఐనన్= విడిచి పెట్టిన ఆయుధాలు కలవాడను అయితే (అనగా శస్త్ర సన్న్యాసం చేస్తే); చంపుటకున్+ఓపు= సంహరించటానికి సామర్థ్యం కల్గిన; అట్టివారికిన్= అటువంటివారికి అది= నన్ను చంపటం; దొరఁకొనున్= వీలుపడుతుంది; పెద్దయున్= మిక్కిలి; నమ్మన్+తగువాఁడు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశ్వసింపదగినవాడు; చెప్పన్= చెప్పగా; అత్యంత, దుస్సహంబు+అయిన కీడుమాట= మిక్కిలిగా భరించలేని చెడుమాట; వింటిన్+ఏనిన్= ఆలకిస్తే; అట్టివాఁడన్+అగుదున్= అటువంటి వాడను= (శస్త్ర సన్న్యాసం చేసినట్టివాడను); కాగలను; అప్పుడు= ఆసమయంలో; అట్టి+పగఱకున్= అటువంటి శత్రువులకు; ఆ+పని= ఆకార్యం (నన్ను వధించటం); తీర్పన్+అనువు+ఐ ఉండున్= నెరవేర్చటానికి వీలుకలుగుతుంది; అని చెప్పినన్= అని ద్రోణుడు చెప్పగా; కృపాచార్యునిన్= కృపుడిని; పరిమార్చు+తెఱంగు= చంపదగిన ఉపాయం; అడుగన్+తొడంగి= ప్రశ్నించటానికి పూని; ఏర్పడన్= స్పష్టంగా; పలుక నేరక+ఉన్నన్= చెప్పజాలకపోవటం చేత; అతండు= కృపుడు; ఎఱింగి= తెలిసికొని; తాను= తాను (కృపుడు); వధ్యుండు+కామి= చంపుటకు వీలైన వాడు కాకపోవటం; ఎఱింగించి= తెలిపి (ధర్మరాజునకు చెప్పి); గెలువుము+అని= విజయం పొందుము అని; దీవించెన్= ఆశీర్వదించాడు; మద్రపతితోన్= మద్రరాజుతో- శల్యుడితో; నీవు= నీవు; రాధేయునకున్= రాధ కొడుకునకు - కర్ణుడికి; సారథివి+అగుట= రథచోదకుడవు కావటం; సంభవింపన్+ఓపున్= జరుగవచ్చును; అని చెప్పి= అని పలికి; కయ్యంబు+అప్పుడు= యుద్ధం చేసే సమయంలో; కర్ణు+తేజంబు= కర్ణుడి యొక్క దీప్తి; తూలన్+పలికి= పడిపోయేటట్లుగా మాటలాడి; అతనిన్= (కర్ణుడిని); చిక్కుపఱుపవలయున్= చీకాకు పెట్టవలెను; అని; వరంబు= వరమును; కోరినన్= అర్థించగా; అతండు= (శల్యుడు); ఆ+విధంబునన్= ఆ రీతిని; నీ+ఉద్యోగ, సమయంబునన్= నీవు యుద్ధ ప్రయత్నాలు చేస్తున్న సమయంలో; ఇయ్యకొనిన+అది= ఒప్పుకొన్నదే; కాదే= అవును గదా; అట్లు+అ= ఆ రీతిగా; చేయుదున్= చేస్తాను; అని పలికెన్= అని చెప్పాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; అందఱన్+వీడ్కొని= అందరి దగ్గర సెలవు తీసికొని; అజాతశత్రుండు= ధర్మరాజు; అనుజ, వర్గ+అనుగతుండు+ఐ= తమ్ములగుంపుచేత అనుసరించబడినవాడై; మరలెన్= వెనుకకు తిరిగి వెళ్ళాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: తనతోపాటు శ్రీకృష్ణుడూ అర్జునుడూ - అనుసరించి రాగా, ధర్మరాజు ముందుకు సాగి, ద్రోణుడు కృపుడు శల్యుడు ఉన్న చోట్లకు వెళ్లి, వారి పాదాలకు నమస్కారాలు చేసి, తాను వారితో యుద్ధం చేయటానికి అనుమతి ప్రసాదించండని అర్థించాడు. తనకు విజయం చేకూరవలెనని ఆశీర్వదించుమన్నాడు. అప్పుడు ద్రోణుడు - 'ధర్మరాజా! నీకు భగవంతుడైన శ్రీకృష్ణుడే మంత్రిగా ఉన్నాడు. ఇంకొకరి దీవనలు నీకు ఎందుకు? ధర్మం ఎక్కడ ఉంటుందో అక్కడ శ్రీకృష్ణుడు ఉంటాడు; శ్రీకృష్ణుడు ఎక్కడ ఉంటాడో అక్కడే విజయం సిద్ధిస్తుంది' అని ద్రోణుడనగా అది విన్న ధర్మరాజు ద్రోణుడిని మిమ్ములను ఏ రీతిగా చంపటానికి వీలు అవుతుందో చెప్పుమన్నాడు. అందులకు ద్రోణుడు చెప్పిన సమాధానం 'నా చేతిలో ఆయుధం ఉన్నంతవరకూ, నన్ను ఎవరూ చంపలేరు. నేను ఉపవాసవ్రతం స్వీకరించి, శస్త్రాలను విసర్జిస్తే, పిదప నన్ను చంపవచ్చును. ఎంతో నమ్మదగిన వాడు, నా గుండె భరించలేని కీడుమాట వినిపిస్తే నేను శస్త్ర సన్న్యాసం చేస్తాను. అట్టి సమయాన శత్రువులు నన్ను సంహరింపవచ్చు.' పిదప ధర్మరాజు కృపాచార్యుడిని అడిగాడు ఆయనను ఏ విధంగా సంహరించటానికి వీలౌతుందో తెలుపుమని. కృపాచార్యుడు తాను వధ్యుడు కాడనీ, అయితే యుద్ధంలో ధర్మరాజు గెలవాలని తాను దీవిస్తున్నట్లు చెప్పాడు. తరువాత- ధర్మరాజు శల్యుడితో, 'మామా! నీవు రాధేయుడైన కర్ణుడికి రథసారథివి కావచ్చును. అప్పుడు అతడి తేజస్సు మాసిపోయేటట్లు చూడుము' అని అర్థించాడు. శల్యుడు ఇట్లా సమాధానం చెప్పాడు. 'ధర్మరాజా! నేను నీవు యుద్ధ సన్నాహాలు చేసేటప్పుడే నీకు వాగ్దానం చేశాను కదా!. ఆ విధంగానే చేస్తాను.' అని ఈ విధంగా అందరి దగ్గర సెలవు తీసికొని ధర్మరాజు తన తమ్ములతో కలిసి మరలి వెళ్ళాడు. ఆ సమయంలో.

విశేషం: 1. మంత్రి= మంత్రం తెలిసినవాడు. హితవు తెలిపేవాడు. చతురుడు. రాజ్యతంత్రజ్ఞుడు.

2. ధర్మం- నిర్వచించటం కష్టం. స్థూలంగా ధర్మం అంటే మంచి పని - కర్తవ్యం అని చెప్పవచ్చును. 'ధర్మంబు బహు మార్గ దృష్టంబు' అని భారతంలోనే చెప్పబడింది. పురుషార్థాలలో 'ధర్మం' మొదటిది. మానవ జీవితానికి పరమ ధ్యేయం ధర్మం.

'ధారయతీతి ధర్మః' జగత్తును ధరించేది ధర్మం.

శ్లో॥ "ధృతిః క్షమా దమోऽస్తేయం । శౌచ మింద్రియనిగ్రహః,

ధీ ర్విద్యా సత్య మక్రోధో । దశకం ధర్మలక్షణమ్." (మనుస్మృతి-6-92)

3. మహాభారత మహేతిహాస సారసంగ్రహంగా చెప్పదగిన వాక్యం- "యతో ధర్మ స్తతో జయః." ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడే విజయం ఉంటుంది. ఈ మాటకు ఎవరూ ఎట్టి అభ్యంతరం పెట్టనక్కరలేదు. ఈ వాక్యం గాంధారి అన్నట్లు సుప్రసిద్ధం. అయితే "యతో ధర్మ స్తతో జయః" అన్న వాక్యం భారతంలో పెక్కు చోట్ల కన్పిస్తుంది. ఇక్కడ- ద్రోణుడు ఆ మాటే అంటాడు. అయితే ఈ వాక్యానికి పూర్వ వాక్యం- "యతో ధర్మ స్తతో కృష్ణః," ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడే శ్రీకృష్ణుడు ఉంటాడు. ఈ వాక్యం కూడ నిరభ్యంతరమైనదే. కాని- సుప్రసిద్ధ పాఠం-

"యతః కృష్ణ స్తతో ధర్మః । యతో ధర్మ స్తతో జయః" శ్రీకృష్ణుడు ఎక్కడ ఉంటే- అక్కడే ధర్మం ఉంటుంది. ధర్మం ఎక్కడుంటే విజయం అక్కడ ఉంటుంది.

ధర్మం నిత్యచైతన్యవంతం అనీ, దేశకాల పాత్రలనుబట్టి ధర్మస్వరూపం మారుతుందనీ- ఈ విషయాన్ని నిరూపించేందుకే మహాభారతం అవతరించింది అనీ ఒక వాదం ఉన్నది. 'ఒకే నదిలో - మానవుడు రెండుసార్లు స్నానం చేయలేడు' అనే వాక్యం ఉదాహరించవచ్చును. సతత ప్రవాహిని నది. నరుడు నదిలో రెండవసారి స్నానం చేసేటప్పుడూ అది మొదట నది కాదు. నది మారుతుంది. నరుడు కూడా మారిపోవచ్చును.

శ్రీకృష్ణుడు మూర్తీభవించిన ధర్మం. ద్రోణుడు సంహరించబడింది- ధర్మరాజు "అశ్వత్థామా హతః (కుంజరః)" అని అబద్ధమాడటం చేత. అసత్యం చెప్పమని అతడిని ప్రేరేపించింది శ్రీకృష్ణుడు. అది ధర్మమా? 'ఆచార్య దేవో భవ' 'సత్యమేవ జయతే' 'సత్యం వద' అనే వేదవాక్యాలు ఏమైనట్లు? ద్రోణుడి చేతిలో ధనుస్సు ఉన్నంత సేపు అతడు అవధ్యుడు. పాండవ సైన్యం సర్వనాశనం కావలసిందేనా? శ్రీకృష్ణుడు "సత్యం వద" అనే వేదవాక్యానికి - విప్రతిపత్తి చూపించాడు 'ప్రతిసూత్రానికి ఏదో ఒక అపవాదం ఉంటుంది.' అది దేశకాల పాత్రలనుబట్టి ఏర్పడుతుంది. ఆ పరిస్థితులలో అసత్యవాక్యం సత్యంతో సమానం. 'భూతహితంబుగాఁ బలుకు బొంకును సత్యఫలంబు నిచ్చు.' ఇది భారతంలోని వాక్యం.

'యతః కృష్ణ స్తతో ధర్మః" "యతో ధర్మ స్తతః కృష్ణః" అనే వాక్యాలు స్థూలదృష్టికి విప్రతిపన్నాలుగా కన్పించవచ్చు. సూక్ష్మదృష్టికి, 'ధర్మసూక్ష్మవేత్తలకు' అవి సమానార్థకాలే. మహాభారతం- 'ధర్మసూక్ష్మ సారసంగ్రహం.'

క. మొనల వినోదంబునకుం । గనుఁగొన నేతెంచియున్న కర్ణునికడకుం
జని హరి యిట్లను నొండొరుఁ । గని యప్పటి యుచితభంగి గడతేర్చి తగన్. 162

ప్రతిపదార్థం: మొనలన్=సేనలను; వినోదంబునకున్= వేడుక కోసం; కనుఁగొనన్+ఏతెంచి+ఉన్న= చూడటానికి వచ్చినట్టి; కర్ణుని+కడకున్+చని= కర్ణుడి వద్దకు వెళ్ళి; హరి= శ్రీకృష్ణుడు; ఒండొరున్+కని= ఒకరి నొకరు చూచి; అప్పటి+ఉచిత+భంగిన్= ఆ సందర్భానికి సరిపోయే మర్యాదలు తీరు తీయాలు జరిపి; తగన్= తగిన రీతిని; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ సమయంలో అచటికి సేనల విన్యాసాలను చూడాలనే వేడుకతో కర్ణుడు వచ్చి ఉన్నాడు. శ్రీకృష్ణుడు కర్ణుడి దగ్గరకు వెళ్ళి, తగిన మర్యాదగా పలుకరించి ఈ విధంగా అన్నాడు.

విశేషం: 1. భీష్ముడు యుద్ధం చేసేటపుడు తాను యుద్ధం చేయనని కర్ణుడు ప్రతిజ్ఞ చేశాడు. మరి యుద్ధభూమిలో కర్ణుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎట్లా ఉన్నాడు? అనే ప్రశ్న రావచ్చును. కర్ణుడు యుద్ధంలో పాల్గొనటానికి రాలేదు. ప్రేక్షకుడుగా మాత్రమే, వినోద కాలక్షేపానికి మాత్రమే వచ్చాడు అనేది తిక్కన చేర్చిన వివరణ, సమాధానం.

తే. ' అమరతటినీతనూజుపై నలుకఁ జేసి । యనికిఁ జేర వటె! యట్లైన నతఁడు సచ్చు
నంతదాఁకఁ బాండవులకై కొంత సమర । కేళి వేడుకఁ జలుపుట వోలదొక్కొ!' 163

ప్రతిపదార్థం: అమర+తటినీ+తనూజుపైన్= దేవతానదియైన గంగ కొడుకు భీష్ముడిపై; అలుకన్+చేసి= కోపం చేత; అనికిన్= యుద్ధానికి; చొరవు+అటె!= నీవు యుద్ధంలో చేరవట కదా!; అట్లు+ఐనన్= అట్లా అయితే; అతఁడు= భీష్ముడు; చచ్చునంతదాకన్= మరణించు వరకూ; పాండవులకై= పాండవ పక్షంలో చేరి; కొంత= కొంత; సమర కేలి= పోరాటం అనే ఆట; వేడుకన్= వినోదంగా; చలుపుట= చేయటం; పోలదు+ఒక్కొ!= సరిపోదా!

తాత్పర్యం: 'ఓ కర్ణా! భీష్ముడిపై కోపంచేత నీవు యుద్ధంలో పాల్గొనటం లేదని తెలిసింది. అయితే, ఆ భీష్ముడు మరణించే వరకు నీవు సరదాగా పాండవపక్షంలో చేరి యుద్ధం చేయగూడదా? భీష్ముడిపై నీవు పగదీర్చుకొనేందుకు ఇది మంచి అవకాశం.

విశేషం: శ్రీకృష్ణుడి రాజనీతి చతురతకు ఈ వాక్యం ఒక ఉదాహరణ. కార్యసాధనకు సామ, దాన, భేద, దండోపాయాలు నీతిజ్ఞులు ప్రవచించారు. ఇది భేదనీతి.

వ. అనిన విని దేవకీనందనునకు రాధానందనుం డిట్లనియె. 164

ప్రతిపదార్థం: అనిన= శ్రీకృష్ణుడు ఆ విధంగా చెప్పగా; విని= ఆలకించి; దేవకీనందనునకున్= దేవకి కొడుకైన శ్రీకృష్ణుడికి; రాధానందనుండు= రాధ కొడుకు కర్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు;

తాత్పర్యం: అనిన ఆలకించి, శ్రీకృష్ణునితో కర్ణుడు ఈ విధంగా చెప్పాడు.

క. ' కినుక వొడమి గంగాపు । త్త్రుని కయ్యమునప్పు డనికిఁ దొలఁగితి నేనిం
జనుఁగా; కేఁ గురుపతికి । చ్చిన ప్రాణం బొండువలనఁ జేర్పం దగునే?' 165

ప్రతిపదార్థం: కినుక+పొడమి= కోపం వచ్చి; గంగాపుత్త్రుని+కయ్యము+అపుడు= గంగ కొడుకు భీష్ముడు యుద్ధం చేసేటపుడు; అనికిన్= యుద్ధానికి; తొలఁగితిన్+ఏనిన్= తప్పుకొంటే; చనున్+కాక= సరిపోవచ్చు; ఏన్= నేను; కురుపతికి+ఇచ్చిన= దుర్యోధనునకు సమర్పించిన; ప్రాణంబు= ప్రాణము- ఉసురు; ఒండువలనన్= వేరొక చోటికి; చేర్పన్+తగును+ఏ= చేర్చటం తగునా?

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! నాకు ఏదో కోపం వచ్చి భీష్ముడి నాయకత్వంలో ఆతడు యుద్ధం చేసేటప్పుడు నేను యుద్ధం చేయనని శపథం చేశాను. అంతేకాని రారాజు అయిన దుర్యోధనుడికి ఏనాడో నా ప్రాణం సమర్పించాను. ఇక వేరే పక్షంలో చేరను. చేరే ప్రసక్తి లేదు. చేరటం న్యాయం కాదు.

విశేషం: కర్ణుడి స్వామిభక్తికి ఈ మాట ఉదాహరణ ప్రాయం. ఇంతేకాక- తాత్కాలిక కోప ప్రకోపానికేమి కాని- కర్ణుడికి భీష్ముడిపై అపారగౌరవం ఉన్నది. భీష్మ పతనానంతరం కర్ణుడు భీష్ముడికి అభివాదం చేసి అతడి మన్ననలు అందుకొన్నాడు.

వ. అనవుడు నప్పలుకులకు సంతోషించినవాఁడయి వాసుదేవుండు గౌంతేయులం గూడఁ జనుదెంచె నివ్విధంబున ధర్మనందనుండు గౌరవసైన్యంబు వెడలి నిలిచి యద్దిక్కు మొగంబు సేసి యెలుం గెత్తి యిట్లనియె: 166

ప్రతిపదార్థం: అనవుడున్= అని (కర్ణుడు) చెప్పగా; ఆ+పలుకులకున్= ఆ మాటలకు; సంతోషించినవాఁడు+ఐ= ఆనందం చెందినవాడై; వాసుదేవుండు= వసుదేవుడి కొడుకు- శ్రీకృష్ణుడు; కౌంతేయులన్+కూడన్+చనుదెంచెన్= కుంతీపుత్రులైన పాండవులను చేరేందుకు వచ్చాడు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; ధర్మనందనుండు= ధర్మరాజు; కౌరవ సైన్యంబు వెడలి= కౌరవసేననుండి బయటకు వచ్చి; నిలిచి= నిలబడి; ఆ+దిక్కు, మొగంబు, చేసి= ఆ వైపు తన ముఖం పెట్టి; ఎలుంగు+ఎత్తి= కంఠస్వరం పెద్దదిగా చేసి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని కర్ణుడు పలుకగా, అతడి స్వామిభక్తికి సంతోషించి శ్రీకృష్ణుడు, పాండవులను చేరటానికై మరలి వచ్చాడు. ఈ విధంగా ధర్మరాజు కౌరవసేన నుండి వెడలి వచ్చి, ఆ సేనవైపు తన ముఖం పెట్టి, తన కంఠస్వరం పెద్దదిగా చేసి ఈ విధంగా ప్రకటించాడు.

తే. **' మమ్ము నెమ్మిమైఁ గలయఁ జిత్తంబు గలుగు । వార లెవ్వరు గలిగిన వచ్చి కలయుఁ;**
డట్టివారిని నా తమ్ము లంతవారి । గాఁగఁ బాటింతు నెంతయు గారవమున.' **167**

ప్రతిపదార్థం: మమ్మున్= మమ్ము (మా పాండవ పక్షాన్ని); నెమ్మిమైన్= ప్రీతితో; కలయన్= చేరటానికి; చిత్తంబు+కలుగువారలు= మనస్సు ఉన్నవారు; ఎవ్వరు+కలిగినన్= ఎవ్వరైనా ఉన్నట్లయితే; వచ్చి+కలయుఁడు= రండి చేరండి; అట్టివారిని= (ఆ విధంగా మా పక్షంలో చేరే వారిని); నాతమ్ములు+అంతవారిన్+కాఁగన్= నా తమ్ములతో సమానులనుగా; ఎంతయున్, గారవమునన్= మిక్కిలి గౌరవంతో; పాటింతున్= చూస్తాను (అనుసరిస్తాను).

తాత్పర్యం: 'కౌరవపక్షంనుండి మా పక్షంలోకి ఎవరయినా వచ్చి చేరితే వారికి నా హృదయపూర్వకమైన స్వాగతం. అట్టివారిని నేను నా తమ్ములతో సరిసమానంగా చూస్తానని వాగ్దానం చేస్తున్నాను.'

వ. **అనిన విని నీ పుత్త్రుండు యుయుత్సుం 'డేను వచ్చెద నన్నుం గలపికొను' మని పలికిన దానికిం బాండవాగ్రజుండు ప్రియంబందిన పలుకులు పలుకుటయును నతండు దుర్యోధనాదుల దుశ్చేష్టితంబు లుగ్గడించుచుఁ గౌంతేయుల గుణంబు లగ్గించుచు నిజసేనాసమేతంబుగా నిస్సాణాది రావంబులు సెలంగం జని ధర్మనందను బలంబులం గలసె; నది యట్టిద కాక సవతాలి ప్రజలు పొంద నేర్తురే? యది యట్లుండె; నిట్లు దన్నుం గలసిన సంతుష్టాంతరంగుం డగుచు నయ్యుధిష్ఠిరుండు యుయుత్సునకు నత్యుపచార సమాచారంబులం బ్రమోదం బొనరించి.** **168**

ప్రతిపదార్థం: అనినన్+విని= అని (ధర్మరాజు) చెప్పగా ఆలకించి; నీ+పుత్త్రుండు= నీ కొడుకు; యుయుత్సుండు= యుయుత్సుడు; ఏను= నేను; వచ్చెదన్= వస్తాను; నన్నున్= నన్ను; కలిపికొనుము+అని= నన్ను మీపక్షంలో చేర్చుకొనవలసింది; అని; పలికినన్= చెప్పగా; దానికిన్= ఆ మాటకు; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడు ధర్మరాజు; ప్రియంబు+అందిన= ప్రీతితో కూడిన; పలుకులు+పలుకుటయున్= మాటలు చెప్పుట చేత; అతండు= (యుయుత్సుడు); దుర్యోధన+ఆదుల+దుస్ చేష్టితంబులు= దుర్యోధనుడు మున్నగు వారు చేసిన చెడ్డపనులు; ఉగ్గడించుచున్= పేర్కొంటూ; కౌంతేయుల+గుణంబులు= కుంతీకుమారుల మంచి లక్షణాలు; అగ్గించుచున్= పొగడుతూ; నిజ సేనా సమేతంబుగాన్= తనయొక్క సైన్యంతోపాటుగా; నిస్సాణ+ఆది రావంబులు+చెలంగన్= పెక్కు చర్మవాద్యాల ధ్వనులు విస్తరిల్లగా; చని= వెళ్ళి; ధర్మనందను+బలంబులన్= ధర్మరాజు సైన్యంలో; కలసెన్= చేరాడు; అది+అట్టిది+అ+కాక= అది అంతే; సవతి+ఆలి+ప్రజలు= సవతులకు పుట్టిన సంతానం; పొందన్+నేర్తురు+ఏ?= కలిసి పొత్తుగా ఉంటారా?; అది= ఆ విషయం; అట్లు ఉండెన్= ఆ విధంగా ఉండుగాక; ఇట్లు= ఈ రీతిగా; తన్నున్+కలసినన్= తనతో చేరగా; సంతుష్ట+అంతరంగుండు+అగుచున్= తృప్తిపొందిన మనస్సు కలవాడై; ఆ+యుధిష్ఠిరుండు=

ఆ ధర్మరాజు; యుయుత్సునకున్; అత్యుపచార+సమాచారంబులన్= మిక్కిలి మర్యాదతో గూడిన సేవలతో; ప్రమోదంబున్+పొనరించి= సంతోషము కల్గించి

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా ప్రకటించ, నీ కొడుకు యుయుత్సుడు 'నేను వస్తాను. నన్ను మీ పక్షంలో చేర్చుకొనండి' అని పలికిన దానికి ధర్మరాజు సంతోషించి ప్రియ వాక్యాలతో అతడికి స్వాగతం చెప్పాడు. యుయుత్సుడు దుర్యోధనాదులు మున్నగువారు చేసిన చెడ్డపనులను ఉద్ఘాటిస్తూ పాండవుల సద్గుణాలను కీర్తిస్తూ తన సేనలతోపాటు పాండవ సైన్యంలో చేరిపోయాడు. అప్పుడు పెక్కు వాద్యాలు ఘోషించాయి. సవతి బిడ్డలు - సామరస్యంగా కలిసి మెలిసి ఉండలేరు గదా అది అట్లా ఉంచుము. యుయుత్సుడు ఈ విధంగా తన పక్షంలో చేరినందుకు సంతోషించి, అతడికి ఎన్నో మర్యాదలు చేసి ధర్మరాజు అతడిని మన్నించాడు.

విశేషం: 1. యుయుత్సుడు- ధృతరాష్ట్రుడికి వైశ్యభార్యవలన కలిగిన కొడుకు.

తే. ' రథముమీఁదికిఁ జనుదెంచి పృథులసైన్య । హర్షభాషణధ్వనులుఁ దూర్యస్వనములు
నెగసి దివి ముట్ట మైమఱు విడి తలిర్చు । నెలమిఁ గోదండ తూణీరములు ధరించె. 169

ప్రతిపదార్థం: రథము మీఁదికిన్+చనుదెంచి= (ధర్మరాజు) రథాన్ని అధిరోహించి; పృథుల, సైన్య, హర్ష, భాషణ, ధ్వనులున్= గొప్పదైన సేనలో సంతోషమును తెలిపే మాటల సవ్వడులూ; తూర్య స్వనములు= మంగళ వాద్యధ్వనులు; దివి ముట్టన్= ఆకాశాన్ని తాకుతూ; ఎగసెన్= వ్యాపించాయి; మైమఱువు+ఇడి= కవచాన్ని ధరించి; తలిర్చు+ఎలమిన్= చిగిర్చే సంతోషంతో; కోదండ+తూణీరములు= విల్లు అమ్ములూ; ధరించెన్= తాల్చాడు.

తాత్పర్యం: ధర్మరాజు రథం ఎక్కి కవచం ధరించాడు. అప్పుడు ఆ గొప్పసేనలో మంగళవాద్యాలు మ్రోగాయి. అతడు సంతోషంతో కవచం తొడిగి ధనుస్సు అమ్ముల పొదులు తాల్చాడు.

విశేషం: ధర్మరాజు పాదచారియై భీష్మ ద్రోణ కృప శల్యుల కడకు వెళ్ళే ముందు కవచం తీసివేశాడు. నిరాయుధుడై నడచి వెళ్ళాడు. ఇప్పుడు కవచం ధరించి ఆయుధాలు చేపట్టి యుద్ధానికి సిద్ధం అయ్యాడు. కథాచిత్రణలో తిక్కన మహాకవికి గల సమ్యక్‌దృష్టికి ఇది ఒక ఉదాహరణం.

వ. తదవసరంబున నితని తమ్ములుం దక్కటి దొరలును దమతమ రథంబు లెక్కి యెప్పటి నెలవుల నిలిచినం, దదీయవ్యూహంబు పూర్వప్రకార సన్నాహం బై యొప్పె నట్టియెడ రెండు బలంబులవారును బాండవులు దొల్లి పడినపాట్లు సెప్పికొని వగచుచు వారు సంధికై చేసిన యత్నంబు వాక్రుచ్చి మెచ్చుచు నప్పుడు గురుజనంబులయెడఁ బాటించిన వినయంబు వర్ణించి యనురాగించుచుండి'రని చెప్పిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 170

ప్రతిపదార్థం: తత్+అవసరంబునన్= ఆ సమయంలో; ఇతని, తమ్ములున్= ధర్మరాజు తమ్ములూ; తక్కటి దొరలును= తక్కిన దండనాథులూ; తమ, తమ, రథంబులు+ఎక్కి= తమ తమ రథాలు అధిరోహించి; ఎప్పటి+నెలవులన్= ఇదివరకు ఉన్నచోటులలో; నిలిచినన్= నిలబడగా; తదీయ+వ్యూహంబు= ఆ వ్యూహం (పన్నుగడ); పూర్వ, ప్రకార, సన్నాహంబు+ఐ= ఇది వరకు మాదిరిగానే సన్నద్ధమై; ఒప్పెన్= విలసిల్లింది; అట్టి+ఎడన్= అప్పుడు; రెండు, బలంబులవారును= (కౌరవుల యొక్కయు పాండవుల యొక్కయు సేనలు); పాండవులు; తొల్లి= పూర్వం; పడినపాట్లు= అనుభవించిన అవస్థలు; చెప్పికొని= మాటలాడి; వగచుచున్= విచారిస్తూ; వారు= పాండవులు; సంధికై= శాంతికై; చేసిన యత్నంబు= చేసిన ప్రయత్నాలు; వాక్రుచ్చి= వచించి; మెచ్చుచున్= పొగడుతూ; అప్పుడు= ఆ సమయంలో; గురు జనంబుల+ఎడన్= పెద్దల యెడ; పాటించిన= అవలంబించిన; వినయంబు=

నమ్రత; వర్ణించి= పొగడి; అనురాగించుచున్+ఉండిరి= ప్రేమను వెదజల్లారు; అని చెప్పినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్+ఇట్లు అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో ధర్మరాజు తమ్ములు మిగిలినవారూ తమ తమ రథాలు అధిరోహించి లోగడ తాము ఉన్న చోటులకు పోయి నిలిచారు. అప్పుడు పాండవుల వ్యూహం మునుపటిలాగానే సన్నద్ధమై విలసిల్లింది. ఇరు పక్షాలలోని సైనికులు - లోగడ పాండవులు పడిన పాట్లు చెప్పుకొని చింతిస్తూ వారు సంధి కోసం చేసిన ప్రయత్నాలు స్మరించి పాండవులను ప్రశంసించారు. ఇప్పుడు పాండవులు శత్రుపక్షంలో ఉన్నపెద్దలు భీష్మ ద్రోణ కృప శల్యుల యెడ చూపిన పూజ్యభావాన్ని వర్ణిస్తూ ప్రేమను వెదజల్లారు' అని సంజయుడు చెప్పగా అతడితో ధృతరాష్ట్రుడు ఈ విధంగా అన్నాడు.

క. ' మానుగ ధర్మక్షేత్రం । బైన కురుక్షేత్రమున మహాహవమునకుం
బూని మన బలముఁ బాండవ । సేనయు నిటు పన్ని యేమి సేసెం జెపుమా!' 171

ప్రతిపదార్థం: మానుగన్= ప్రశస్తంగా (లెస్సగా); ధర్మక్షేత్రంబు+ఐన= ధర్మానికి కుదురైన నేల అయిన; కురుక్షేత్రమునన్= కురుక్షేత్రం అనే పేరుగల ప్రదేశంలో; మహా+ఆహవమునకున్= గొప్ప యుద్ధానికి; పూని= సిద్ధమై; మన+బలమున్= మన సేనయు; పాండవ సేనయున్= పాండవుల సైన్యమూ; ఇటు= ఈ రీతిగా; పన్ని= తలపడి (సిద్ధమై); ఏమి+చేసెన్+చెపుమా!= ఏ విధంగా ప్రవర్తించాయో చెప్పుము.

తాత్పర్యం: ఓ సంజయా! మన సేనలు పాండవుల సేనలు ధర్మక్షేత్రంగా సుప్రసిద్ధమైన కురుక్షేత్రం చేరి, యుద్ధానికి సంసిద్ధములై ఏమి చేశాయో నాకు వివరించి చెప్పుము.

విశేషం: కురుక్షేత్రము= ప్రస్తుతం హర్యానాలో ఉన్న ప్రదేశం. ఢిల్లీకి ఉత్తరదిశగా, సుమారు 120 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రైలుస్టేషను ఉన్నది. ఢిల్లీకి కురుక్షేత్రానికి మార్గమధ్యంలో పానిపట్టు ఉన్నది. పౌరాణిక యుగాలలో 'కురుక్షేత్రం' సుప్రసిద్ధ రణరంగం. అట్లే చారిత్రక కాలంలో పానిపట్టు. కురు అనే పేరు గల రాజు పరిపాలించిన ప్రాంతం కురుక్షేత్రం. 'క్షేత్రం' అనే శబ్దానికి ప్రదేశం అని అర్థం అయినా, 'క్షేత్రం' అంటే పుణ్యప్రదేశం అనే రూఢ్యర్థం ఏర్పడింది. పెద్ద సంఖ్యలో జనులు చేరాలంటే అక్కడ కొన్ని వసతులు ఉండాలి. జలతృణకాష్ఠ సమృద్ధి ఉండి, విస్తీర్ణం గలిగి ఉండాలి. అట్టి ప్రదేశం యజ్ఞవాటికకు అనువైనది. అట్లే సంగ్రామరంగంగా ఉండదగింది. కురుక్షేత్రంలో పౌరాణిక కాలంలో యజ్ఞాలు జరిగాయి. అందుచేత అది 'పుణ్య క్షేత్రం' అయింది. తదుపరి ఆ ధర్మక్షేత్రం - కురుక్షేత్రంగా - సంగ్రామ రంగంగా ప్రసిద్ధికెక్కింది. 'మానుగ ధర్మక్షేత్రంబైన కురుక్షేత్రమున' అనే తిక్కన ప్రయోగం. 'ధర్మ క్షేత్రే - కురుక్షేత్రే' అనే పదగుంఫనంతోనే సంస్కృతంలో భగవద్గీత ప్రారంభమౌతుంది.

ఈ పద్యం నుండి భగవద్గీత ప్రారంభం. సంస్కృత భారతంలోని భగవద్గీతలో 700 శ్లోకాలు ఉన్నాయి. తిక్కన తెలుగు సేతలో ఉన్న పద్యాలు 60 మాత్రమే. దీనినిబట్టి తిక్కన - భగవద్గీతను యథాతథంగా అనువదించ లేదని స్పష్టంగా తెలుస్తున్నది. మూల సంస్కృత మహాభారతం - ఏకలక్ష శ్లోక సంభృతమైన మహేతిహాసం. యావత్ ప్రపంచంలో అంత పెద్ద కావ్యం ఇంకోటి లేదు. కవిత్రయ తెలుగు భారతం మూల భారతానికి అనుసృజనమేకాని అనువాదం కాదు. తిక్కన ఆధ్యాత్మిక భాగాలను చాలా చోట్ల సంక్షేపించాడు. సనత్సుజాతీయాన్ని పూర్తిగా వదలివేశాడు. భగవద్గీతను వదలి పెట్టలేదుగాని - మదించి మదించి - చిన్నదిగా చేశాడు. తిక్కన తెలుగు గీత - సంస్కృత భగవద్గీతా సారసంగ్రహం అని చెప్పవచ్చు. తిక్కన వ్రాసిన భగవద్గీతా భాగంలో ఉన్న 60 పద్యాలలో 20 పద్యాలు సంస్కృత మహాభారతంలో కథాభాగానికి సంబంధించి మొదటి అధ్యాయం అర్జున విషాదయోగానికి చెందినట్టివే. అనగా గీతాప్రబోధాన్ని - తిక్కన కేవలం 40 పద్యాలలో సంక్షేపించినాడన్న మాట.

వ. అనిన విని సంజయుం డతని కి ట్లను: 'దుర్యోధనుండు పాండవవ్యూహంబు గనుంగొని గురుని కడకుం బోయి 172

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= (ధృతరాష్ట్రుడు) చెప్పగా; విని; సంజయుండు; అతనికిన్+ఇట్లు+అనున్= ధృతరాష్ట్రుడితో ఈ విధంగా చెప్పాడు; దుర్యోధనుండు= దుర్యోధనుడు; పాండవ+వ్యూహంబున్= పాండవులు ఏర్పరచిన సైనిక విన్యాసాన్ని; కనుంగొని= చూచి; గురుని+కడకున్+పోయి= ద్రోణాచార్యుడి దగ్గరకు వెళ్లి.

తాత్పర్యం: అనగా విని సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: దుర్యోధనుడు పాండవుల వ్యూహాన్ని చూచి, గురువైన ద్రోణుని దగ్గరకు వెళ్లాడు.

తే. **' చూడు మాచార్య! నీదు శిష్యుండు ద్రుపద । సుతుఁ డమర్చినయది పాండుసుతుల సేన**
పెంపు బలుపును గలిగి యొప్పినది: యందు । భీము నర్జునుఁ బోలిన బిరుదుమగలు. 173

ప్రతిపదార్థం: ఆచార్య!= ఓ ద్రోణాచార్య గురుదేవ!; చూడుము; నీదు+శిష్యుండు= నీ విద్యార్థి; ద్రుపద+సుతుఁడు= ద్రుపదుడి కొడుకు- ధృష్టద్యుమ్నుడు; అమర్చిన+అది= పన్నినట్టిది; పాండు సుతుల సేన= పాండవుల సైన్యం; పెంపు= అతిశయం; బలుపును= బలం కూడ; కలిగి= ఉండి; ఒప్పినది= శోభిల్లింది; అందున్= ఎచట చూచినా సరే; భీమున్= భీముడిని; అర్జునున్= అర్జునుడిని; పోలిన= సాటి అయ్యే; బిరుదు మగలు= శక్తి సామర్థ్యాలుగల వీరులు.

తాత్పర్యం: 'ఓ ద్రోణాచార్య! గురుదేవా! నీ శిష్యుడైన ధృష్టద్యుమ్నుడు - ద్రుపద మహారాజు కొడుకు, పన్నిన వ్యూహం - పాండవ సేనా విన్యాసం వీక్షించుము. ఎంత గొప్పగా, బలంగా శోభిల్లుతున్నదో. ఆ సేనలోని వీరులు శక్తి సామర్థ్యాలుగలవారు. భీముడికీ అర్జునుడికీ దీటైనవారు.

వ. **సాత్యకి విరాటుండు ద్రుపదుండు ధృష్టకేతుండు చేకితానుండు గాశిరాజు పురుజిత్తు కుంతిభోజుండు శైబ్యుండు యుధామన్యుండు నుత్తమౌజుండు నభిమన్యుండు ద్రౌపదేయులు వార లందఱుం జాలు మానిసుల యిట్లు గూడి భీమాభిరక్షితంబగు నబ్బలంబు సాల సమర్థంబునుం బోలె మెఱసె; మన సేనా నాయకులం జెప్పెద; నిన్నును భీష్ముని నెన్న నేల? కృపాచార్యుం డశ్వత్థామ శల్యుండు వికర్ణుండు భూరిశ్రవసుండు మఱియుం బెక్కండ్రు రథికులు గలరు; నానాస్త్ర కోవిదులు, వివిధయుద్ధవిశారదులు, వీర లందఱు నాకై ప్రాణంబులు విడిచెద మని యున్నవా రిట్లు బెరసి భీష్మపరిపాలితం బయిన యీ సైన్యంబు పెద్దయు సమర్థం బై తోఁచుచున్నయది; మీరెల్లను వలయునెడల నిలిచి భీష్మునకుఁ గావలి గావలయు' ననిన ద్రోణుం' డట్ల కాక! యింత సెప్పనేమిటి? కనియె; నప్పలుకులు విని యమ్మహీపతికిఁ బ్రియంబు వుట్ట శాంతనవుండు సింహనాదంబు సేసి శంఖంబు పూరించిన. 174**

ప్రతిపదార్థం: సాత్యకి, విరాటుండు, ద్రుపదుండు, ధృష్టకేతుండు, చేకితానుండు, కాశిరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, శైబ్యుండు, యుధామన్యుండు, ఉత్తమౌజుండు, అభిమన్యుండు, ద్రౌపదేయులు= సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు, ధృష్టకేతుడు; చేకితానుడు, కాశిరాజు అయిన పురజిత్తు, కుంతి భోజుడు, శైబ్యుడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, అభిమన్యుడు, ద్రౌపది కొడుకులు; వారలు+అందరున్= వారు అందరూ; చాలు+మానిసులు+అ= సమర్థులైన మనుష్యులే; ఇట్లు= ఈ రీతిగా; కూడి= కలసి; భీమ+అభి రక్షితంబు+అగు= భీముడిచే లెస్సగా కాపాడబడిన; ఆ+బలంబు= ఆ సేన; చాలన్= మిక్కిలి; సమర్థంబునున్+పోలెన్= మిక్కిలి బలం కలిగి నట్టిదిగా; మెఱసెన్= వెలుగొందుతున్నది; మన+సేనా+నాయకులన్= మన పక్షాన ఉన్న సేనాధిపతులను; చెప్పెదన్= చెప్తుతాను; నిన్నునున్= నిన్ను (ద్రోణుని); భీష్మునిన్= భీష్ముడిని; ఎన్నన్+ఏల?= ప్రత్యేకంగా ఎంచనేల?; కృపాచార్యుండు= కృపాచార్యుడు, అశ్వత్థామ, శల్యుండు, వికర్ణుండు, భూరిశ్రవసుండు; మఱియున్= ఇంకా; పెక్కండ్రు= పెక్కుమంది; రథికులు= రథములపై యుద్ధం చేసే వీరులు; కలరు= ఉన్నారు; నానా+అస్త్ర, కోవిదులు, వివిధ+యుద్ధ+విశారదులు= పెక్కు మంత్రపూతములైన

ఆయుధాలు తెలిసిన వారు, పెక్కు రకములైన యుద్ధాలు చేయటంలో ఆరితేరినవారు; వీరలు+అందఱున్= వీరంతా; నాకై= నా కోసమై; ప్రాణంబులు= అసువులు; విడిచెదము= త్యాగం చేస్తాము; అని; ఉన్నవారు= ఉన్నారు; ఇట్లు= ఈ రీతిగా; బెరసి= సమకూడి; భీష్మపరిపాలితంబు+అయిన= భీష్ముడిచే నడుపబడుచున్న; ఈ సైన్యంబు= ఈ సేన; పెద్దయున్= ఎక్కువగా; సమర్థంబు+ఐ= శక్తి కలదై; తోఁచుచున్నయది= మనస్సుకు అనిపిస్తున్నది; మీరు+ఎల్లరున్= మీరు అందరూ; వలయు+ఎడలన్= అవసరమైన స్థలాలలో; నిలిచి= నిలబడి; భీష్మునకున్= భీష్మునకు; కావలి+కావలయున్= రక్షణ చేకూర్చవలసింది; అనినన్= అని దుర్యోధనుడు; చెప్పగా; ద్రోణుండు= ద్రోణుడు; అట్ల+కాక= అట్లే అగుగాక; ఇంత+చెప్పన్+ఏమిటికిన్?= ఇంతగా నొక్కి వక్కాణించటం ఎందుకు?; అనియెన్= అని ద్రోణుడు పలికాడు; ఆ+పలుకులు= ఆ మాటలు; విని= ఆలకించి; ఆ+మహీపతికిన్= రాజునకు- దుర్యోధనుడికి; ప్రియంబు+పుట్టన్= ప్రీతి కలిగేటట్లుగా; శాంతనవుండు= శంతనుడి కొడుకు- భీష్ముడు; సింహనాదంబు= సింహగర్జన; చేసి= ఒనరించి; శంఖంబు+పూరించినన్= శంఖం ఒత్తగా.

తాత్పర్యం: సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు, ధృష్టకేతుడు, చేకితానుడు, కాశీరాజగు పురుజిత్తు, కుంతిభోజుడు, శైబ్యుడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, అభిమన్యుడు, ఉపపాండవులు, శక్తిసామర్థ్యాలు గల రథికులు. భీముడిచే కాపాడబడుతున్న ఈ సేన మిక్కిలి బలం కలదిగా కన్పిస్తున్నది. మన పక్షంలోని సేనానాయకులను చెప్పుతాను. నిన్ను గూర్చి భీష్ముడి గూర్చి చెప్పే అవసరం లేదు కదా? కృపుడు, అశ్వత్థామ, శల్యుడు, వికర్ణుడు, భూరిశ్రవసుడు ఇంకా ఎందరో రథికులు ఉన్నారు. వీరందరు అస్త్ర నిపుణులు. పెక్కు యుద్ధాలలో ఆరితేరిన యోధులు - నాకై ప్రాణాలు త్యాగం చేయటానికి సంసిద్ధులు. ఈ విధంగా సమకూడి, భీష్ముడి నాయకత్వంలోని మన సైన్యం మిక్కిలి బలంగా మనస్సుకు తోస్తున్నది. మీరందరు పూని, భీష్ముడికి రక్షణ చేకూర్చాలి. అని దుర్యోధనుడు చెప్పగా ద్రోణుడు సరే నీవు ఇంతగా నొక్కి వక్కాణించే అవసరం లేదు అన్నాడు. ఆ మాటలు విని, భీష్ముడు సంతోషించి సింహనాదం చేసి తన శంఖాన్ని ఒత్తాడు.

విశేషం: 1. సంస్కృత భారతంలో దుర్యోధనుడు కౌరవవీరుల గూర్చి చెప్పేటప్పుడు "భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ" అని కర్ణుడిని కలిసి చెప్పాడు. తిక్కన కర్ణుడి పేరు చేర్చలేదు. తాత్కాలికంగా శస్త్ర సన్న్యాసం చేసిన కర్ణుడి పేరు ఎత్తకపోవటమే మంచిది అనిపిస్తుంది.

2. సాత్యకి - కృష్ణుడి తాతగారి మనుమడు. కృష్ణుడికి వరుసకు తమ్ముడు. అర్జునుడికి శిష్యుడు. విరాటుడు - మత్స్యదేశరాజు. అజ్ఞాతవాస సమయంలో పాండవులకు ఆశ్రయ ప్రదాత. అభిమన్యుడికి పిల్లనిచ్చిన మామగారు. ధృష్టకేతుడు- రాజసూయ యాగంలో శ్రీకృష్ణుడు సంహరించిన శిశుపాలుడి కొడుకు. చేకితానుడు - యాదవవీరులలో ఒకడు. పురుజిత్తు - కాశీరాజు, కుంతిభోజుడి తమ్ముడు. కుంతిభోజుడు - యాదవ ప్రభువు. కుంతికి పెంపుడు తండ్రి. శైబ్యుడు - ధర్మరాజునకు రెండవ భార్య దేవికకు తండ్రి. ఉత్తమౌజుడు పాంచాలరాజు కొడుకు.

క. తనతన శంఖంబును ద। క్కును గల దొరలెల్ల ననికి గొనకొని పూరిం
చిన వివిధతూర్యనాదం। బును జెలఁగె నభంబు దిశలుఁ బూర్ణంబులుగాన్. 175

ప్రతిపదార్థం: తన, తన, శంఖంబును= తన తన శంఖాలను; తక్కున్+కల+దొరలు+ఎల్లన్= మిగిలిన దండనాథులు అందరూ; అనికిన్+గొనకొని= యుద్ధానికి సిద్ధమై; పూరించినన్= ఊదగా; నభంబు= ఆకాశమూ; దిశలున్= దిక్కులు; పూర్ణంబులు+కాన్= నిండిపోగా; వివిధ, తూర్య, నాదంబును= బూరాలు మొదలైన పెక్కు వాద్యాల ధ్వని; చెలఁగెన్= అతిశయించింది.

తాత్పర్యం: సేనాపతి అయిన భీష్ముడు సింహనాదం చేసి శంఖం ఊదగా, తక్కిన దండనాథులు తమ తమ శంఖాలు పూరించి యుద్ధానికి తమ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆకాశం- దిక్కులు పిక్కటిల్లగా యుద్ధవాద్యాల నాదంతో నిండిపోయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అప్పుడు కృష్ణార్జునులు పాంచజన్యదేవదత్తంబులును భీమసేనుండు పౌండ్రంబున యుధిష్ఠిరుం డనంతవిజయంబును నకులసహదేవులు సుఘోషమణిపుష్పకంబులును పాంచాల విరాట సాత్యకి ధృష్టద్యుమ్నశిఖండి ప్రముఖ దండనాయకులు దమతమ శంఖంబులుఁ బూరించిన. 176

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కృష్ణార్జునులు= శ్రీకృష్ణుడూ, అర్జునుడూ; పాంచజన్య+దేవదత్తంబులు= పాంచజన్యం అనే శంఖం, దేవదత్తం అనే శంఖం; భీమసేనుండు= భీముడు; పౌండ్రంబును= పౌండ్రం అనే శంఖం; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అనంత విజయంబును= అనంత విజయం అనే శంఖాన్ని; నకుల సహదేవులు= నకులుడు, సహదేవుడు; సుఘోషం, మణిపుష్పకం అనే శంఖాలను; పాంచాల, విరాట, సాత్యకి, ధృష్టద్యుమ్న, శిఖండి, ప్రముఖ, దండనాయకులు= ద్రుపదుడు, విరాటుడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, శిఖండి మొదలైన రథికులు; తమ తమ+శంఖంబులున్+పూరించినన్= శంఖాలను ఊదగా.

తాత్పర్యం: అప్పుడు శ్రీకృష్ణుడు పాంచజన్యం అనే శంఖాన్ని ఊదాడు. అర్జునుడు దేవదత్తం పూరించాడు. ధర్మరాజు అనంతవిజయం అనే శంఖాన్ని ఊదాడు. అట్లే భీముడు పౌండ్రం, నకుల, సహదేవులు సుఘోషం, మణిపుష్పకం ఊదారు. ద్రుపదుడు, విరాటుడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, శిఖండి మున్నగు రథికులు తమ తమ శంఖాలు ఊదారు.

విశేషం: 1. సింహనాదాలు, శంఖాలు పరాక్రమ ప్రకటనలో అంతర్భాగాలు.

2. అటు భీష్ముడు - కౌరవ వీరులు సింహనాదాలు చేసి శంఖాలు పూరించారు. ఇటు పాండవ వీరులు శంఖాలు ఒత్తారు. ఈ విధంగా యుద్ధవాతావరణం ఏర్పడింది.

మహాకవులు కథను నడపటం, పాత్రల శీలాలు చిత్రించటం మాత్రమేకాక 'వాతావరణ కల్పన'కు మిక్కిలి ప్రాధాన్యం ఇస్తారు. భగవద్గీతోపదేశానికి ఈ వాతావరణ కల్పన పూర్వరంగాన్ని సృష్టించింది. ముసలివాడై సర్వసంగపరిత్యాగి అయిన మునీశ్వరుడు - వేరే పనిలేక తీరికగా తన పాద సన్నిధిని చేరిన శిష్యుడికి కన్నులు మూసికొని ఏకాంతంగా అందించిన సందేశం కాదు 'భగవద్గీత'. యుద్ధ సన్నద్ధమై పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం మధ్య తాత్కాలిక నిర్వేదంతో కుమిలిపోయిన వీరుడు అర్జునుడికి చేసిన కర్తవ్యోపదేశం భగవద్గీత. మూల సంస్కృత భారతంలోనూ తెలుగు భారతంలోనూ కూడా భగవద్గీతోపదేశానికి అనువైన వాతావరణ కల్పన చేయబడింది. తిక్కన 'భగవద్గీత సందేశాన్ని' సంక్షేపించాడుగాని వాతావరణ కల్పనను యథాతథంగా తెలుగులో నిర్వహించాడు.

క. అనయము నుగ్రం బగు త । ద్ధ్వని గాంధారేయహృదయదారణ మై పాం
డునరేంద్ర పుత్త్రసైనిక । మనోరమం బగుచుఁ జెలఁగె మనుజాధీశా! 177

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= ఓ రాజా!; అనయమున్= అత్యంతము, మిక్కిలి; ఉగ్రంబు+అగు= భయంకరం అయిన; తత్+ధ్వని= ఆ శబ్దం; గాంధారేయ, హృదయ, దారణము+ఐ= గాంధారి కొడుకులగు కౌరవుల గుండెలను చీల్చునట్టిదై; పాండు నరేంద్ర పుత్త్ర, సైనిక, మనస్+రమంబు+అగుచున్= పాండురాజు కొడుకుల సేనలలోని వారి మనస్సులను రంజింప చేసేది అగుచు; చెలంగెన్= ఒప్పినది.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శ్రీకృష్ణుడు పాండవులు పూరించిన శంఖాల ధ్వని, కౌరవుల గుండెలను చీల్చి, పాండవుల సేనల మనస్సులను రంజింప చేసింది.

వ. తదనంతరంబ శస్త్రసంపాతంబునకు సమయం బగుటయుఁ గపిధ్వజుండు గాండీవంబు వుచ్చికొని గుణంబు సారించి బాణపాణియై నీ కొడుకులం జూచి కృష్ణునితో నిట్లనియె. 178

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటుపిమ్మట; శస్త్ర+సంపాతంబునకున్= ఆయుధాలు ప్రయోగించటానికి; సమయంబు+అగుటయున్= అదను ఏర్పడగా; గాండీవంబు+పుచ్చికొని= గాండీవం అనే పేరుగల విల్లు చేతిలో పట్టుకొని; గుణంబున్+సారించి= అల్లెత్రాటిని మ్రోగించి; బాణపాణి+ఐ= బాణాలు (అమ్ములు) చేత గల వాడై; నీ కొడుకులన్= నీ పుత్రులైన దుర్యోధనుడు మున్నగు వారిని; చూచి= అరసి; కృష్ణునితోన్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అటు పిమ్మట, ఇంక ఆయుధాలు ప్రయోగించి, యుద్ధం ప్రారంభించవలసిన సమయం ఆసన్నం కావటం చేత అర్జునుడు తన విల్లు గాండీవాన్ని గ్రహించి, అల్లెత్రాటిని మ్రోగించి, బాణములు చేతిలో నిడుకొని కౌరవులగు దుర్యోధనుడు మున్నగు వారిని చూచి, శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు:

తే. ' కౌరవులలోన నిప్పు డెవ్వారితోడ । ననికిఁ గడఁగుదునో చూచికొనఁగవలయు
నరద మల్లన యుభయసైన్యముల నడిమి । నేల కటు వోవఁగా నిచ్చి నిలుపు మచట.' 179

ప్రతిపదార్థం: కౌరవులలోనన్= కురుసేనలో ఉన్నవారిలో; ఇప్పుడు= ఇపుడు; ఎవ్వారితోడన్= ఎవరితో; అనికిన్= యుద్ధానికి; కడఁగుదునో= పూనవలసి వస్తుందో; చూచి కొనఁగ+వలయున్= పరీక్షించి చూడాలి; అరదము= రథాన్ని; అల్లన= మెల్లగా; ఉభయ+సైన్యముల+నడిమి+నేలకున్= రెండు సైన్యాల మధ్య ప్రదేశానికి; అటు= అదుగో ఆ వైపుగా; పోవగాన్+ఇచ్చి= పోయేటట్లు చేసి; అచటన్= అక్కడ; నిలుపుము= ఆపుము.

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! ఇప్పుడు కౌరవ సేనలో ఎవ్వరితో నేను యుద్ధం చేయాలో నిర్ణయించుకొనాలి. రథాన్ని రెండు సేనలు నాకు కనిపించేటట్లుగా మధ్య ప్రదేశం చేర్చి అక్కడ నిలుపగోరుతున్నాను.

అర్జునుఁడు స్వజన సంహారంబునకు శంకించి మోహావిష్టుం డగుట (సం. 6.23.30)

వ. అనిన గుడాకేశు పలుకులకు హృషీకేశుండు భీష్మద్రోణప్రముఖ యోధవీరులు గనుంగొనుచుండ నత్తెఱంగున రథోత్తమంబు నిలిపి యతనితో 'నీ వీ కూడిన కౌరవులం జూడు' మనవుడు నప్పార్థుండు రెండు బలంబుల యందు నున్నసోదర సుత మాతులాచార్యాదు లగు బంధుశిష్టజనంబుల నాలోకించి పరమకృపావేశంబున నత్యంత విషాదంబు నొంది, గోవిందు మొగంబు గనుంగొని 'దుర్మదాంధుం డయిన దుర్యోధను దుర్వినయంబున నింత వుట్టెం జూచితే!' యని పలికి వెండియు. 180

ప్రతిపదార్థం: అనినన్= అని (అర్జునుడు) చెప్పగా; గుడాకేశు+పలుకులకున్= అర్జునుడి మాటలకు; హృషీకేశుండు= శ్రీకృష్ణుడు; భీష్మ, ద్రోణ, ప్రముఖ, యోధవీరులు= భీష్ముడు, ద్రోణుడు మున్నగు వీరులు; కనుంగొనుచుండన్= చూస్తూ ఉండగా; ఆ+తెఱంగునన్= ఆ రీతిగా; రథ+ఉత్తమంబున్= శ్రేష్ఠమైన రథాన్ని; నిలిపి= ఆపి; అతనితోన్= అర్జునుడితో; ఈవు= నీవు; ఈ+కూడిన, కౌరవులన్+చూడుము= ఈ విధంగా చేరిన కౌరవులను వీక్షించుము; అనవుడున్= అని చెప్పగా; ఆ+పార్థుండు= ఆ అర్జునుడు; రెండు+బలంబులయందున్+ఉన్న= రెండు సేనలలో ఉన్నట్టి; సోదర, సుత, మాతుల+ఆచార్య+ఆదులను= సహోదరులు, కొడుకులు, మేనమామలు, గురువులు మొదలైన వారిని; బంధు, శిష్ట, జనంబులన్= చుట్టములు గొప్ప వారగు జనులను; ఆలోకించి= చూచి; పరమ, కృపా+ఆవేశంబునన్= మిక్కుటమైన దయ తనలో ప్రవేశించడం చేత; అత్యంత విషాదంబున్+ఒంది= మిక్కుటమైన దుఃఖాన్ని పొంది; గోవిందు+మొగంబు+కనుంగొని= శ్రీకృష్ణుడి ముఖాన్ని చూచి; దుర్మ దాంధుండు= చెడ్డగర్వంతో గ్రుడ్డివాడు; అయిన; దుర్యోధను+దుర్వినయంబునన్= దుర్యోధనుడి యొక్క గర్వంవలన; ఇంత పుట్టెన్= ఇటువంటి అనర్థం దాపురించింది అనగా దారుణ యుద్ధం ఏర్పడింది; చూచితి+ఏ= చూచావా!; అని పలికి= అని వచించి; వెండియున్= మరల.

తాత్పర్యం: అర్జునుడి మాటలు విని, శ్రీ కృష్ణుడు రథాన్ని రెండు సేనలమధ్య- భీష్ముడు ద్రోణుడు మొదలైన వీరులు చూస్తుండగా- నిలిపి 'అర్జునా! నీ కోరిక మేరకు రథాన్ని నిలిపినాను. కౌరవ వీరులను అందరినీ నీవు చూడవచ్చును' అన్నాడు. అర్జునుడు రెండు సేనలలో ఉన్న సోదరులను, సుతులను, బంధువులను, మేనమామలను, గురువులను, మిత్రులను అందరినీ చూచి, కృపావేశంతో మిక్కిలి దుఃఖానికి లోనై శ్రీకృష్ణుడి మొగం తేరిపార చూచి, ఇట్లా అన్నాడు: 'శ్రీకృష్ణా! చూచావుకదా! దురాశతో కన్నులుండి కూడ గ్రుడ్డివాడైన దుర్యోధనుడి మూలాన ఈ మహాయుద్ధం దాపురించింది' అని, ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: 1. ఇంతవుట్టె- అనే ప్రయోగం మిక్కిలి అర్థవంతమైనది. అందులో 'ఇంతటి ఘోర యుద్ధం దాపురించింది, దాని వలన ఏర్పడే దుష్పరిణామాలు వర్ణనాతీతాలు' అనే భావం ఉన్నది. ఆ భావం అర్జునుడి గుండెను కరగించింది. అందులో అగ్ని పర్వత విజృంభణాలు, భూకంపాలు ఎన్నెన్నో ఇమిడి ఉన్నాయి.

చ. సరసిజనాభ! బంధుజన సంతతిఁ గయ్యపునేలఁ జూడఁగా
విరవిరఁ బోయి మేను నిడువెండ్రుక వెట్టుచుఁ గంప మొందెఁ, జే
నిరతము గాదు గాండివము, నిల్వఁగ నోర్వవు గాళ్లు, నేను ని
ష్ఠురతకుఁ జాల నొల్ల, నొకఁడున్ మహియేలుట యేటి సౌఖ్యముల్? 181

ప్రతిపదార్థం: సరసిజనాభ!= పద్మం బొడ్డులో కలవాడా! విష్ణుడవైన ఓ శ్రీకృష్ణా!; బంధు+జన+సంతతిన్= చుట్టాలు పక్కాలు అందరినీ; కయ్యపు+నేలన్= యుద్ధభూమిలో; చూడఁగాన్= వీక్షించగా; విరవిరన్ పోయి= కూలుటకు సిద్ధమై పరవశించి; మేను= శరీరం; నిడు+వెంద్రుక+పెట్టుచున్= నిక్కబొడుచుకొన్న వెంద్రుకలతో; కంపము+ఒందెన్= వణకింది; చేన్= చేతిలో; గాండివము= గాండివము అను పేరుగల విల్లు; నిరతము+కాదు= స్థిరంగా ఉండదు; కాళ్ళు= పాదాలు, నిల్వఁగన్+ఓర్వవు= నిలబడటం లేదు; ఏను= నేను; నిష్ఠురతకున్= కఠినత్వానికి; చాలన్= మిక్కిలి; ఒల్లన్= సమ్మతింపలేను; ఒకఁడున్= ఒక్కడు (ఒంటరిగా); మహిన్= భూమిని; ఏలుట= పరిపాలించటం; ఏటి+సౌఖ్యముల్= ఏ విధంగా సౌఖ్యాలు కలిగిస్తుంది?

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! యుద్ధభూమిలో పోరాటానికి చేరిన కావలసిన చుట్టాలను అందరినీ చూడటం నాకు దుఃఖంగా ఉన్నది. శరీరం విడిపోయినట్లు అయి, గగురుపాటు కలిగింది. వెంట్రుకలు నిక్కబొడుచుకొన్నాయి. గాండీవం చేతిలో నుండి జారిపోతున్నది. కాళ్ళు నిలబడటం లేదు. ఈ క్రౌర్యానికి నేను ఒడిగట్టలేను. ఇంత మంది చచ్చిపోయాక, ఒంటరిగా ఈ భూమిని పరిపాలిస్తే కలిగే సౌఖ్యాలు ఏపాటివి?

విశేషం: కవిత యుగళకళ. శబ్దార్థ సమ్మేళనం. అర్ధనారీశ్వర యోగంలో పార్వతీ పరమేశ్వరులవలె శబ్దం అర్థం అభేద దాంపత్యం నిర్వహించాలి. ఇక తెలుగు కవిత - యుగళకళలో యుగళ కళ. తెలుగు పదాలు సంస్కృత పదాలు చక్కగా చిక్కగా కలిసిపోవాలి. అతుకులు కన్పించకుండా. ఈ పద్యంలో శబ్దార్థాలు 'పొసగ ముత్తెపు సరుల్ పోహళించిన లీల' కలిసి మెలిసి కన్పిస్తున్నాయి.

2. తిక్కన కవితా శిల్పంలోని వైలక్షణ్యం పాత్రల ఆంగిక సాత్త్వికాభివర్ణన. చిత్తవృత్తి నిరూపణ. ప్రసన్న కథాకవితార్థయుక్తి నన్నయ శైలి. తిక్కనది నాటకీయ శైలి. పద్యంలో తిక్కన వర్ణించిన 'అర్జునుని మూర్తి' ఏ చిత్రలేఖకుడు చిత్రపటంలో చూపించగలడు? అయితే- ఈ వర్ణన అంతా సంస్కృతమూలంలో ఉన్నట్టిదే. ఇష్టమైన ఈ సన్నివేశం లభించింది. తిక్కన గంటం చిందులు త్రొక్కింది. తెలుగు భారతంలో మరువరాని మధురమైన మంచి పద్యం అవతరించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

3. విరవిర: త్రెళ్లుట యందలి ధ్వన్యనుకరణ.ఇతరములైన ఉదాహరణలు: ఎండ విరవిర కాసె; కటాక్ష జ్యోత్స్న విరవిర. కరగుచుండ; విరవిరఁ ద్రెల్లి నొవ్వ... దశకంఠుడు

. (తిక్కన నిర్వచనోత్తర రామాయణం.)

తే. ఎవ్వరికిఁ గాఁగ ధరణియు నెల్లసుఖముఁ । గోరెదము వార లందఱు వీరె వచ్చి
ప్రాణములు నర్థములు నొల్లఁబాటు సేసి । కయ్యమునఁ జావ నఱుముట గంటి గాదె! 182

ప్రతిపదార్థం: ఎవ్వరికిన్+కాఁగన్= ఎవరి కోసమై; ధరణియున్= భూమియును; ఎల్ల+సుఖమున్= సర్వసౌఖ్యం; కోరెదము= కావాలి అనుకుంటామో; వారలు+అందఱున్= అంత మందీ; వీరె= వీరే; వచ్చి= అరుగుదెంచి; ప్రాణములు= అసువులు; అర్థములు= సంపదలు; ఒల్లఁబాటు+చేసి= ఉపేక్షించి (నిరసించి); కయ్యమునన్= యుద్ధంలో; చావన్+అఱుముట= మరణించటానికి; ప్రతీక్షించడం, ఎదురుచూడ్డం; కంటి(వి)+కాదె!= చూస్తున్నావు కదా!

తాత్పర్యం: ఎవరిని మెప్పించటానికై ఈ భూమిని సమస్త సౌఖ్యాలను కోరుకుంటామో, వారందరు పోరాటానికి రావటం. ప్రాణాలు సంపదలు ఒడ్డటం, చూస్తున్నావుకదా!

ఉ. తాతల, మామలన్, సుతులఁ, దండ్రులఁ, దమ్ముల, నన్నలన్, గురు
వ్రాతము, శిష్టకోటి, సఖివర్గముఁ, దుచ్ఛజనానురూప దు
ర్నీతి వధించి యేఁ బడయు నెత్తుటఁ దోఁగిన రాజ్యభోగముల్
ప్రీతి యొనర్చునే? యశము పెల్లొడఁగూర్చునె? పెం పొనర్చునే? 183

ప్రతిపదార్థం: తాతలన్= పితామహులను మాతామహులను; మామలన్= తల్లికి సోదరులను (పిల్లనిచ్చిన వారిని); సుతులన్= కొడుకులను, తండ్రులన్= పితృవర్గాన్ని; తమ్ములన్+అన్నలన్= సోదరులను; గురు+వ్రాతమున్= గురువుల సమూహాన్ని; శిష్టకోటిన్= మంచివారిని; సఖి+వర్గమున్= మిత్రుల సముదాయాన్ని; తుచ్ఛ, జన+అనురూప, దుర్నీతిన్= నీచులైనవారి చెడ్డ ప్రవర్తనను అనుసరించి; వధించి= చంపి; ఏన్= నేను; పడయు= సంపాదించే; నెత్తుటన్+తోఁగిన= రక్తంతో తడిసిన; రాజ్యభోగముల్= రాజ్యపరిపాలన వలన సంక్రమించే సౌఖ్యాలు; ప్రీతి= సంతోషం; ఒనర్చును+ఏ?= కలిగిస్తాయా?; యశము= కీర్తి; పెల్లు= మిక్కుటంగా; ఒడన్+కూర్చును+ఎ?= చేకూర్చగలవా?; పెంపు= గొప్పదనం; ఒనర్చునే?= కలుగ చేస్తాయా?

తాత్పర్యం: తాతలను, మామలను, కొడుకులను, తండ్రులను, సహోదరులనూ, గురువుల సముదాయాన్ని గొప్పవారిని, మిత్ర బృందాన్ని నీచమైన స్వార్థ ప్రవృత్తితో సంహరించి, నేను పొందే రాజ్యసౌఖ్యాలు - రక్తంతో తడిసినట్టివి నాకు ఏ సంతోషం కలిగిస్తాయి? ఎట్టి కీర్తిని తెచ్చిపెట్ట గలవు? ఏ అభ్యున్నతిని చేకూర్చగలవు?

క. అక్కడి బంధులఁ జంపుచు, । నిక్కడి బాంధవులు సచ్చు టియ్యకొనుచు, నిం
దెక్కడి పెం పొందెదఁ? దుదిఁ । ద్రెక్కొను పాపంబు రణము తెరు వే నొల్లన్. 184

ప్రతిపదార్థం: అక్కడి+బంధులన్= ఆ ఎదిరిపక్షంలో ఉన్న చుట్టాలను; చంపుచున్= సంహరిస్తూ; ఇక్కడి+బాంధవులు= ఇక్కడి చుట్టాలు; చచ్చుట= మరణించటానికి; ఇయ్యకొనుచున్= ఇష్టపడుతూ; ఇందున్+ఎక్కడి+పెంపు= ఏ చోటగల అభ్యుదయం; ఒందెదన్?= సంపాదించగలను?; తుదిన్= చివరకు; పాపంబు= పాపం; త్రెక్కొనున్= వస్తుంది; రణము+తెరువు= యుద్ధమార్గం; ఏను+ఒల్లన్= నేను సమ్మతించను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఎదిరిపక్షంలో ఉన్న చుట్టాలను చంపటం, ఈ పక్షంలో ఉన్న చుట్టాలు చచ్చిపోవటానికి సమ్మతించటం - ఇది మంచిది కాదు. దీనివలన నాకు ఏ అభ్యున్నతి రాదు. చివరకు మిగిలేది పాపం. యుద్ధమార్గం నేను అంగీకరింపలేను.

విశేషం: పాపము, పుణ్యము అనే ప్రాతిపదికలు ప్రాచీన భారతీయ సంస్కృతి సృష్టించిన భావదీపికలు. పుణ్యం= సుకృతం కలది. శుభదృష్టియగు ధర్మం కలది. పవిత్రత- ధర్మము పుణ్యానికి బొమ్మ బొరుసులు. పుణ్యానికి వ్యతిరేకపదం పాపం. ఆ పదంలో నీచత్వం అన్యాయం ఇమిడి ఉన్నవి. పుణ్యంచేస్తే మరణానంతరం స్వర్గం. పాపం చేస్తే మరణానంతరం నరకం. పుణ్యాపాపాలు పునర్జన్మలో కర్మసిద్ధాంతంలో ముడివడి ఉంటాయి. ఇవి వ్యాఖ్యాన నిరపేక్షాలు. అక్షరాలలో నిర్వచించటం కష్టమేగాని, పుణ్యాపాపాలు కర్మసిద్ధాంతం పాటించే భారతీయులకు సులువుగా అర్థం అయ్యే పదాలు. అణువులో బ్రహ్మాండం ఇమిడి ఉన్నట్లు విత్తనంలో చెట్టు అదృశ్యంగా ఉన్నట్లు పుణ్యం పాపం అనే శబ్దాలలో విశ్వజనీనమైన విపుల వేదాంతం ఇమిడి ఉన్నది.

ఆ. ఎల్ల భువనములను నేలుట కైనను । నిట్టి క్రూరకర్మ మెట్లు సేయ
వచ్చుఁ గడఁగి? యెదిరివా రేమి సేసిన । మాఱుసేయ నాకు మనసురాదు. 185

ప్రతిపదార్థం: ఎల్ల+భువనములను= అన్ని లోకాలను; ఏలుటకున్+ఐనను= పరిపాలించుట కోసమే అయినప్పటికిని; ఇట్టి= ఇటువంటి; క్రూర+కర్మ=కనికరం లేని కఠోర కార్యం= (యుద్ధం); ఎట్లు, చేయన్+వచ్చున్= ఏవిధంగా ఆచరించవచ్చును; కడఁగి= పూని; ఎదిరివారు+ఏమి చేసినన్= శత్రువులు ఏమి చేసినా సరే; మారుచేయన్= ప్రతీకార చర్య చేయటానికి; నాకున్= నాకు; మనసు+రాదు= మన సొప్పదు.

తాత్పర్యం: ఈ భూలోకంలో ఒక భాగమైన కౌరవ రాజ్యం కోసమేగాక అన్ని లోకాలూ పరిపాలించటానికైనా ఇటువంటి క్రూరకర్మ- ఘోర యుద్ధం- చేయలేను. ఒక వేళ శత్రువులు ఏమి చేసినప్పటికీ నాకు మారు చేయటం కూడా మనస్కరించదు.

చ. అకట! నితాంతలోభమున నావలఁ బాటిలు కీడు గానఁ జా
లక ధృతరాష్ట్రసూనులు కులక్షయ మయ్యెడుదాని కోర్చి పో
రికిఁ దెగి వచ్చి రన్కలుచ రెండు నెఱింగెడు నీవు నేను దీ
నికిఁ జొర నేల? వీరి నిటు నిర్దయఁ జంపిన నేమి యయ్యెడున్? 186

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; నితాంత, లోభమునన్= అధికమైన దురాశతో; ఆవలన్= తరువాత; పాటిలు= వచ్చే; కీడు= నష్టం; కానన్+చాలక= చూడకుండగా; ధృతరాష్ట్ర సూనులు= ధృతరాష్ట్రుడి కొడుకులు- దుర్యోధనుడు మున్నగువారు; కుల+క్షయము= వంశనాశనం; అయ్యెడు దానికిన్+ఓర్చి= జరిగే దానికి ఇష్టపడి; పోరికిన్= యుద్ధానికి; తెగి= సాహసించి; వచ్చిరి+అన్= వచ్చారనే; కలుచ= తప్పు; రెండున్= రెండింటిని; ఎఱింగెడు= తెలిసికొనగలిగిన; నీవు= నీవు; ఏను= నేను (ఓ కృష్ణా నీవు నేనూ= అర్జునుడు); దీనికిన్= దీనిలోనికి (యుద్ధంలోనికి); చొరన్+ఏల?= ప్రవేశించటం ఎందుకు?; వీరిన్= వీరిని (కౌరవులను); నిర్దయన్= దయ లేకుండగా; చంపినన్= సంహరించినా; ఏమి+అయ్యెడున్?= ఏమి జరుగుతుంది?

తాత్పర్యం: అయ్యో! దుర్యోధనాదులు తరువాత వచ్చే నష్టం గూర్చి, వంశనాశం అవుతుందని గుర్తించకుండా; ఈ ఘోర యుద్ధానికి సాహసించి వచ్చారు. వారి దోషం పూర్తిగా తెలిసిన నీవూ నేనూ ఇట్టి యుద్ధానికి పూననేల? పూని దయలేకుండగా వారిని చంపి వేసినా ఏమి లాభం చేకూరుతుంది?

క. కులనాశము సేసినఁ ద । త్కులధర్మము లడఁగు నష్టకులధర్ములకుం
గలుగును దుస్సంకర; మ । క్కులఘ్ను లేఁగుదురు నరకకూపంబులకున్. 187

ప్రతిపదార్థం: కుల నాశము+చేసినన్= కులమును నాశనం చేస్తే; తత్+కుల, ధర్మములు= ఆ కులానికి సంబంధించిన (ధర్మాలు); కర్తవ్యాలు; అడఁగున్= అణగిపోతాయి; నష్టకులధర్ములకున్= కులధర్మాలు నష్టమైన వారికి; దుస్సంకరము+అ= చెడు సంయోగం; కలుగును= ఏర్పడుతుంది; ఆకులఘ్నులు= కులానికి కీడు చేసినవారు; నరక కూపంబులకున్= నరకంలోని గోతులలోనికి; ఏఁగుదురు= వెళ్ళుతారు.

తాత్పర్యం: కులనాశనం జరిగితే, కులధర్మాలు నశిస్తాయి. కులధర్మాలను నాశనం చేస్తే, సాంకర్యం ఏర్పడుతుంది. కులానికి కీడు చేసినవారు (మరణానంతరం) నరకకూపంలో పడిపోతారు.

విశేషం: ప్రాచీన భారతదేశంలో సమాజంలో నాలుగు ముఖ్యకులాలు ఉండేవి. బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రుల కులాలు. దానికి వర్ణవ్యవస్థ అనిపేరు. బ్రాహ్మణులు - విద్య, క్షత్రియులకు యుద్ధ పరాక్రమం, వైశ్యులకు వాణిజ్యం పశుపాలన శూద్రులకు సేవ కులధర్మాలుగా ఎంచబడ్డాయి. వర్ణసాంకర్యం వలన సమాజ శ్రేయస్సుకు భంగం అని పలువురు భావించేవారు. అర్జునుడు ఆ అభిప్రాయాలనే వ్యక్తం చేశాడు.

2. పుణ్యం, పాపం, నరకం, స్వర్గం గూర్చి భారతంలో పలుచోట్ల ప్రసక్తి వస్తుంది.

3. మహాభారతకాలంనాటికే వర్ణ వ్యవస్థ బీటలు వారింది. ద్రోణుడు పుట్టుకచేత బ్రాహ్మణుడు. చేపట్టింది క్షాత్రం. అట్లే అతడి కొడుకు అశ్వత్థామ, బావమరది కృపుడు. ఉపకులాలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు సూతకులం. వ్యాసుడు, పరాశర మహర్షికి పల్లెల ఓడగు దాశరాజు కూతురు సత్యవతికి సుతుడు.

తే. **ఇంత పాపంబు సేయంగ నెత్తికొందు । మయ్య? రాజ్యలోభంబున నఖిలబంధు**
జనుల వధియింపఁ దొడఁగితి మని' రథంబు । మీఁదఁ గూర్చుండఁ బడియెఁ జే యూఁదికొనుచు. 188

ప్రతిపదార్థం: ఇంత+పాపంబు+చేయంగన్= ఇంతటి పాపం చేసేందుకు; ఎత్తికొందుము+అయ్య?= పూనుకొంటామా?; రాజ్య+లోభంబునన్= రాజ్యంమీది దురాశచేత; అఖిల+బంధుజనులన్= అందరు చుట్టాలను; వధియింపన్+తొడఁగితిమి= చంపటానికి పూనుకొన్నాము; అని= అని చెప్పి; రథంబుమీదన్= రథంపైన; చేయి+ఊఁదికొనుచున్= చేతిని ఆలంబంగా చేసికొంటూ; (అర్జునుడు) కూర్చుండన్+పడియెన్= కూలబడి కూర్చున్నాడు.

తాత్పర్యం: 'ఇంతటి పాపం చేయటానికి పూనుకొనటమా? రాజ్యంమీద దురాశతో అందరు బంధువులను చంపివేయటానికి సిద్ధమయ్యామే!' అని అర్జునుడు పలుకుతూ, రథం మీద తన చేతిని ఆసరాగా చేసుకొని కూలబడి కూర్చున్నాడు.

విశేషం: 1. అర్జునుడు మహావీరుడుగదా. ఇది పిరికితనం కాదా? అతడి శీలానికి- ఈ 'విషాదయోగం' ఒక కళంకం కాదా? అనే ప్రశ్న ఉదయించడం సహజం. దానికి ఒక సమాధానం మహాభారత రచయిత - జరిగిన దానిని జరిగినట్లు చెప్పాడు. అందులోని మంచిచెడ్డలు వేరే విషయం. మహాభారతాన్ని ఇతిహాసం అనటానికి ఇది ఒక కారణం. ఏతద్రచయిత రంగుపూసి సన్నివేశాలు మార్చలేదు. ఇక అర్జునుడి శీలానికి ఇది కళంకం కాదా? కాదు అని సమాధానం చెప్పవచ్చును. జీవితంలో ఎట్టివారికైనా సందేహాలు ఏర్పడటం సహజం. అవి జీవలక్షణాలు. బలచిహ్నాలు వాటిని దాటగలవాడే వీరుడు. రాయి, రప్పకు, మూఢులకు ఏ సందేహాలు రావు. బాగోగులు గుర్తించి స్థిర నిశ్చయం చేసికొనగలవాడే వీరుడు. ధైర్యశాలి. అర్జునుడు మహావీరుడేకాని ఘోర హంతకుడు కాదు. అర్జున విషాదయోగం - అతడు ఎట్టి సుకుమార హృదయుడో నిరూపిస్తున్నది. లోకోత్తర పరాక్రమంలో కరుణార్ద్ర హృదయం మారురూపంలో దాగి ఉంటుంది.

వ. **ఇవ్విధంబున శోకసంవిగ్నమానసుండును విషాదవిహ్వలుండును బరమకరుణాభరితుండును నై శరశరాసనంబులు విడిచి కన్నీరు దొరంగ నూరకున్న, సవ్యసాచిం జూచి మధుసూదనుం డిట్లనియె. 189**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; శోక+సంవిగ్న+మానసుండును= దుఃఖంచేత కలతచెందిన మనస్సుగలవాడును; విషాద+విహ్వలుండును= శోకంచేత వశం తప్పిన వాడును; పరమ+కరుణా+భరితుండును+ఐ= గొప్ప దయతో కూడిన వాడును అయి; శర, శరాసనంబులు= విల్లు, అమ్ములు; విడిచి= వదలిపెట్టి; కన్నీరు+తొరంగన్= కంటినీరు కారుతుండగా; ఊరకున్నన్= కదలక మెదలక కూర్చుండగా; సవ్యసాచిన్= అర్జునుడిని; చూచి= వీక్షించి; మధుసూదనుండు= మధువు అనే రాక్షసుని సంహరించినవాడు- శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఈ విధంగా దుఃఖంచేత కలతచెందిన మనస్సుగలవాడూ శోకంచేత వశం దప్పినవాడూ, పరమ కరుణాపూరిత హృదయుడూ అయి విల్లూ బాణాలు వదలి కన్నీరు కారుచుండగా ఊరకున్న అర్జునుడిని చూచి శ్రీకృష్ణుడు ఈ విధంగా అన్నాడు.

విశేషం: 1. భగవద్గీతలో ఇంత వరకు అర్జున విషాదయోగం. 2. ఇక్కడనుండి భగవద్గీతోపదేశం ప్రారంభం.

క. ' దెప్పరపుఁ జోట నీ కీ । యొప్పని విధ మెచటినుండి యొదవెను? విను మీ
చొ ప్పవివేకులయది; యిది । దప్పించును సద్గతియు నుదాత్తయశంబున్.' 190

ప్రతిపదార్థం: దెప్పరపున్+చోటన్= ఆపద సంభవించినప్పుడు; నీకున్= నీకు; ఈ+ఒప్పని విధము= ఇటువంటి సరిపడని తీరు; ఎచటన్+ఉండి= ఎక్కడ నుండి; ఒదవెను?= ఏర్పడింది?; వినుము= ఆలకింపుము; ఈ+చొప్పు= ఈ తీరు; అవివేకుల+అది= మూర్ఖులది; ఇది= ఈ అవివేకం; సద్గతియున్= మంచి తీరును (ఉత్తమగతిని); ఉదాత్త+యశంబున్= గొప్పది పవిత్రమునైన కీర్తిని; తప్పించును= చెందకుండా చేస్తుంది.

తాత్పర్యం: కానిచోట నీకు ఈ సరిపడని తీరు ఎట్లా ఏర్పడింది? ఇది అవివేకుల తీరు. నీకు తగనిది. ఈ అవివేకం నిన్ను సద్గతి నుండి (సరియైన మార్గం నుండి) పవిత్రమైన కీర్తి నుండి తప్పిస్తుంది.

వ. అని మఱియును. 191

తాత్పర్యం: అని ఆగక శ్రీకృష్ణుడు మరల ఈ విధంగా అన్నాడు.

తే. ' తగునె యర్జున! యీ పెంటితనము నీకు? । దండివై లెమ్ము' మనసు పేదఱిమి విడిచి;
యనిన నట్లున్న భంగిన యల్ల నిట్టు । లనియె నాతండు పుండరీకాక్షుతోడ. 192

ప్రతిపదార్థం: అర్జున!= ఓ అర్జునా; ఈ+పెంటితనము= ఈ ఆడంగితనం; నీకున్= నీకు; తగును+ఎ?= తగునా?; మనసు, పేదఱిమి, విడిచి= మానసిక దారిద్ర్యాన్ని వదలిపెట్టి; దండివి+ఐ= గొప్పవాడవై; లెమ్ము= లేచి నిలబడు (ఉత్సాహంతో కర్తవ్య నిర్వహణకు ఉద్యుక్తుడవుకమ్ము); అనినన్= అని శ్రీకృష్ణుడు చెప్పగా; అట్లు+ఉన్న, భంగిని+అ= ఎట్లా ఉన్నాడో అట్లాగే ఉండి- అనగా చేయి ఊతగా రథంమీద కూలబడినవాడు అట్లే ఉండి; అల్లన్= మెల్లగా; పుండరీక+అక్షు తోడన్= తెల్ల తామర పువ్వుల వంటి కన్నులుగలవాడితో- శ్రీకృష్ణుడితో; ఆతండు= అర్జునుడు; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు. 'ఓ అర్జునా! నీకు ఇట్టి ఆడంగితనం కూడదు. మనస్సులోని తక్కువ భావం విడిచిపెట్టి, గొప్పవాడవై లెమ్ము' అని హెచ్చరించాడు. అర్జునుడు విషాద తన్మయత్వంతో రథంమీద కూలబడి కూర్చుండి ఉండే, పుండరీకాక్షుడైన శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: పెంటి= పశుపక్ష్యాదులలో ఆడుది. మూలంలో ఉన్న మాటలు. 'క్లైబ్యం మాస్మగమః పార్థ!= క్షుద్రం హృదయ దౌర్బల్యమ్' 'నపుంసకత్వం' వదలుమన్నాడు. ఒకనాడు అజ్ఞాతవాసంలో అర్జునుడు ధరించిన భూమిక అది. తెలుగులో పెంటితనం- అనే

మాటలో మనుష్యజాతిలోని స్త్రీత్వం కంటె పశుపక్ష్యాదుల లోనిది మరీ హేయమైనది అనే ధ్వని ఉన్నది. 'దండివై లెమ్ము' అనే తెలుగులో క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వా ఉత్తిష్ఠ పరంతప' అనే సంస్కృతంలోని ఘాటు లేదు.

సీ. ' అక్కట! పూజార్హు లగు ద్రోణ భీష్ముల । నమ్ముల నొప్పింప నగునె చెపుమ!
మాన్యులఁ జంపుట మగపాడి గాదు; భి । క్షాశనం బైన నత్యంత సుఖము;
కడఁగి యెవ్వరిఁ జంపఁగాఁ బెద్ద బ్రదుకయ్యు । నూహింప బ్రదుకు గాకుండు నాకు;
విను మట్టి ధృతరాష్ట్ర తనయులు గారె యీ । యొడ్డిన మొనలలో నున్నవార;

ఆ. లింద్రియముల నెల్ల నివురంగఁ జేయుచు । నడరు శోకవహ్ని యాఱ నేర
దింద్రపదవి సేరె నేనియుఁ; గావున । భండనంబు సేయకుండువాఁడ. 193

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; పూజా+అర్హులు+అగు= పూజించదగినవారైన; ద్రోణ భీష్ములన్= ద్రోణాచార్యుడినీ, భీష్ముడినీ, అమ్ములన్= బాణాలతో; నొప్పింపన్+అగునె?= బాధింపతగునా?; చెపుము+అ= నీవే చెప్పుము; మాన్యులన్= గౌరవించదగినవారిని; చంపుట= సంహరించటం; మగపాడి+కాదు= పరాక్రమం ఉన్నవారికి న్యాయం కాదు; భిక్షా+అశనము= ముష్టి ఎత్తుకొని సంపాదించే కూడు; ఐనన్= అయినను; అత్యంత+సుఖము= మిక్కిలి సంతోషం; కడఁగి= పూని; ఎవ్వరిన్= ఎవరిని; చంపగాన్= సంహరించగా; పెద్ద+బ్రదుకు+అయ్యున్= గొప్ప జీవితమే అయినప్పటికి; ఊహింపన్= ఆలోచిస్తే; బ్రదుకు= జీవితం; నాకున్+కాకుండున్= నాకు కాకుండా ఉంటుందో; వినుము; అట్టి= అటువంటి; ధృతరాష్ట్ర తనయులు+కారె= ధృతరాష్ట్రుడి కొడుకులు కారా; ఈ+ఒడ్డిన, మొనలలోన్= ఈ పన్నిన సేనలలో; ఉన్నవారలు= ఉన్న వారు; ఇంద్రియములన్+ఎల్లన్= అన్ని ఇంద్రియాలను; ఇవురంగన్+చేయుచున్= శుష్కింపజేయుచు; అడరు= వ్యాపించే; శోక వహ్ని= దుఃఖమనే అగ్ని; ఇంద్రపదవి+చేరెన్+ఏనియున్= ఇంద్రపదవి వచ్చిపుడు గూడ; ఆఱన్‌నేరదు= ఆరిపోదు; కావునన్= కాబట్టి; భండనమ్ము= యుద్ధం; చేయక+ఉండువాఁడన్= చేయకుండా ఉంటాను.

తాత్పర్యం: అయ్యో! పూజార్హులైన ద్రోణభీష్ములను బాణాలతో బాధించ తగునా చెప్పుము? మాన్యులను చంపడం పరాక్రమం కాదు. అంతకంటె భిక్షాన్నమయినా మిక్కిలి సుఖకరం. పూనుకొని ఎవరినిచంపితే గొప్ప జీవితం అవుతుందో ఆలోచిస్తే నాకది బ్రతుకే కాదనిపిస్తుంది. వినుము! అట్లా చంపదగని, ధృతరాష్ట్ర పుత్రులే గదా ఈ పన్నిన సేనలో ఉన్నవారు? అన్ని ఇంద్రియాలను శుష్కింపజేస్తూ వ్యాపించే శోకాగ్ని ఇంద్ర పదవి లభించినా చల్లారదు. కనుక నేను యుద్ధం చెయ్యలేను.

విశేషం: ఇంద్రియాలు ఐదు. జ్ఞానేంద్రియాలు: త్వక్కు (చర్మం), చక్షువు (కన్ను) శ్రోత్రం (చెవి), జిహ్వ (నాలుక), ఘ్రాణము (ముక్కు). కర్మేంద్రియాలు: వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ; మనస్సు- పదకొండో ఇంద్రియం. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు ఇంద్రియార్థాలు.

వ. ఎల్ల భంగుల గురుజనంబుల నొప్పించుటకుం జాల వారిని గెలిపించుటయును మనము వారల గెలిచినవారల మగుటయు నను నీరెంటియందును బెద్ద మే లెయ్యది యేను గార్పణ్య దోషోపహత స్వభావుండను, ధర్మసమ్మూఢచేతస్కుండనునై నిన్ను శరణు సొచ్చి యడిగెద నీశిష్యుండ నగు నన్ను శాసింపు, మనిన విని కలకల నవ్వి నారాయణుండు నరున కిట్లనియె. 194

ప్రతిపదార్థం: ఎల్లభంగులన్= అన్ని విధాల; గురు+జనంబులన్= పెద్దలను; నొప్పించుటకున్= బాధించటానికి; చాలన్= సమర్థుడనుగాను; వారిని+గెలిపించుటయును= వారు జయించేటట్లు చేయటం; మనము, వారలన్+గెలిచిన వారలము+అగుటయున్=

వారిని మనం జయించటం; అను= అనే; ఈ రెంటిలోన్= ఈ రెండింటిలో; పెద్ద మేలు+ఎయ్యది= ఏదీ గొప్ప మేలుకాదు; ఏను= నేను; కార్పణ్య, దోష+ఉపహత, స్వభావుండను= నేను దీనుడను (కార్పణ్యం అనే దోషంచేత కొట్టబడిన స్వభావం గలవాడను); ధర్మ సమ్మూఢ+చేతస్కుండను= ధర్మం తెలియని మూఢ మనస్సుకలవాడను; ఐ= అయి; నిన్నున్= కృష్ణా నిన్ను; శరణు+చొచ్చి= ఆశ్రయించి; అడిగెదన్= ప్రశ్నిస్తాను; నీ శిష్యుండన్+అగు= నీ దగ్గర చేరి జ్ఞానం ఆర్జించే వాడిని; నన్నున్= నన్ను; శాసింపుము= ఆజ్ఞాపించుము; అనినన్= అని (అర్జునుడు) చెప్పగా; విని; కలకల+నవ్వి= పక పక నవ్వి; నారాయణుండు= విష్ణువు- శ్రీకృష్ణుడు; నరునకున్= అర్జునుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'అన్ని విధాలా ఆలోచించి చూస్తే, పెద్దలను నొప్పించటం మంచిది కాదు. వారు మనలను జయించినా, లేదా మనం వారిని జయించినా, రెంటిలో పెద్ద తేడా లేదు. రెండూ దుఃఖకారణాలే. నేను దీనుడను. నేను నీ శిష్యుడను. జిజ్ఞాసువను. ధర్మం తెలియని మూఢుడను. నాకు జ్ఞానోపదేశం చేసి కర్తవ్యం తెలుపవలసినది' అని అర్జునుడు అనగా విని శ్రీకృష్ణుడు కలకల నవ్వి ఈ విధంగా అన్నాడు:

విశేషం: 1. నవ్వులలోని వైవిధ్యం గుర్తించి ప్రయోగించిన కవి తిక్కన. 2. కలకల- నవ్వుకు ధ్వన్యనుకరణం.

చ. 'వగవఁగ నేమియుం దగనివారికినై హృదయంబు గుందఁగా
వగచెదు; బుద్ధి మాటలును వావిరి నాడెదు నీవు, పండితుల్
వగతురె యున్నవారికి నవశ్యవిధేయతఁ జన్నవారికిం;
దెగు వగలెల్లఁ జిత్తము ప్రదీప్త వివేకమయత్వ మొందినన్.' 195

ప్రతిపదార్థం: వగవఁగన్+ఏమియున్+తగని వారికిన్+ఐ= ఏమాత్రం దుఃఖించవలసిన అవసరం లేనివారి కోసం; హృదయంబు= గుండె; కుందఁగాన్= విషాదం చెందగా; వగచెదు= దుఃఖిస్తున్నావు; బుద్ధి+మాటలును= (ప్రజ్ఞావాదములను) తెలివితేటలతో మెరసే పలుకులు; వావిరిన్= అధికంగా; ఆడెదు= పలుకుతున్నావు; పండితుల్= తెలిసినవారు (జ్ఞానం కలవారు); ఉన్నవారికిన్= జీవించి ఉన్నవారికోసం; అవశ్య+విధేయతన్= తప్పనిసరిగా; చన్నవారికిన్= మరణించిన వారి కోసం; వగతురు+ఎ= దుఃఖిస్తారా? (దుఃఖించరు); చిత్తము= మనస్సు; ప్రదీప్త, వివేకమయత్వము+ఒందినన్= వెలుగొందే ప్రాజ్ఞతతో కూడింది అయితే; వగలు+ఎల్లన్= దుఃఖాలన్నీ; తెగున్= తొలగి పోతాయి.

తాత్పర్యం: ఏ మాత్రం దుఃఖించదగని, వారి కోసం హృదయం క్రుంగగా దుఃఖిస్తున్నావు. నీవు తెలివైన మాటలు ఎక్కువగా మాట్లాడుతున్నావు. ఉన్నవారికి (బ్రతికున్నవారికి), విధివశంచేత తప్పనిసరిగా చన్నవారికి (చనిపోయినవారికి) పండితులు దుఃఖిస్తారా? మనసు ఉజ్జ్వలమైన వివేకంతో కూడిన దయితే దుఃఖాలన్నీ నశిస్తాయి.

విశేషం: సంస్కృత భగవద్గీతలో ఉన్న 'ప్రజ్ఞావాదము' అన్న పదాన్ని తిక్కన 'బుద్ధి మాటలు' అని తెనిగించాడు. అర్జునుడి మాటలలో 'తెలివి తేటలు' ఉన్నాయి. చిత్తమునకు కావలసింది వెలుగు. ఆ వెలుగు 'వివేకం'. చిత్తం ప్రదీప్తమైనప్పుడు వివేకపూరితమైన జ్ఞానం లభిస్తుంది. అతడే అచ్చమైన జ్ఞాని. పండితుడు.

వ. అని పలికి పార్థునిం బరమ జ్ఞానంబునకుఁ గారణంబు లగు వాక్యంబులు వినుటకుం జొనిపి, యద్దేహంబునందు బాల్యంబు యౌవనంబు వార్ధకంబుననం గలుగు నవస్థలం బొందినట్లు జీర్ణంబులైన వస్త్రంబులు విడిచి నూతనంబు లైన వానిం గైకొనిన చాడ్పుననుంగాని దేహాంతరగమనం బాత్మహానిం జేయదనియుఁ బుట్టువుఁ జావు నను నివి లేమిం జేసి శరీరంబు వోలె శస్త్రచ్ఛేదనంబు మొదలైన వికృతికారణంబులకు నాత్మండు లోను గాఁ డనియు నప్పురుషుండు నొప్పించువాఁడును నొప్పింప

బడియెడు వాఁడును గాఁ డనియుం జెప్పి మఱియు ననేక వాక్యంబుల నాత్మకు నభావంబును శరీరంబునకు భావంబును గలుగమి దెలిపి యాత్మతత్త్వంబు శాశ్వతం బగుట యెఱింగించి యిట్లనియె. 196

ప్రతిపదార్థం: అని, పలికి= అని (శ్రీకృష్ణుడు) చెప్పి; పార్థునిన్= అర్జునుడిని (పృథాకుమారుడిని); పరమ+జ్ఞానంబునకున్= అన్నిటి కంటె మిక్కుటమైన జ్ఞానానికి; కారణంబు+అగు= మూలహేతువులైన; వాక్యంబులు= సార్థకమైన పలుకులు; వినుటకున్+చొనిపి= ఆలకించేటట్లు చేసి; ఈ+దేహంబునందున్= ఈ శరీరంలో; బాల్యంబు= చిన్నతనం (శైశవం); యౌవనంబు= పడుచుతనం; వార్ధకంబును= ముసలితనం; అనన్+కలుగు+అవస్థలన్= అని చెప్పదగిన శారీరక స్థితిగతులను; పొందినట్లు= అనుభవించేటట్లు; జీర్ణంబులు+ఐన, వస్త్రంబులు= చినిగిపోయిన బట్టలు; విడిచి= వదలిపెట్టి; నూతనంబులు+ఐన= క్రొత్తవి అయిన; వానిన్= వాటిని; కైకొనిన+చాడ్పుననున్= స్వీకరించిన విధంగా; దేహ+అంతరగమనంబు= ఇంకొక శరీరాన్ని (పొందటం, చేరటం); ఆత్మ+హానిన్+చేయదు+అనియున్= ఆత్మకు కీడు చేయదు అనియును; పుట్టువు, చావు+అను+ఇవి+లేమిన్+చేసి= జననం మరణం అనేవి లేవు కాబట్టి; శరీరంబు+పోలెన్= దేహంవలె; శస్త్ర+ఛేదనంబు= ఆయుధాల వలన చీల్చబడటం; మొదలు+ఐన= మొదలైన (మున్నగునట్టి); వికృతి+కారణంబులకున్= వికారహేతువులకు; ఆత్ముండు= ఆత్మ; లోను+కాఁడు+అనియున్= బద్ధుడు కాడనీ; ఆ+పురుషుండు= ఆ ఆత్మ(ఆత్ముండు); నొప్పించువాఁడును= బాధించేవాడున్నూ; నొప్పింపన్+పడువాఁడును= బాధించబడే వాడున్నూ; కాడు+అనియున్= కాడు అనీ; చెప్పి= పలికి; మఱియున్= ఇంకా; అనేక+వాక్యంబులన్= పెక్కు వాక్యాలతో; ఆత్మకున్= ఆత్మకు; అభావంబును= లేకపోవటం; శరీరంబునన్= దేహానికి; భావంబును= అస్తిత్వమునూ (ఉండటమూ); కలుగమి= కలగకపోవటం; తెలిపి= తెలియచేసి; ఆత్మతత్త్వంబు= ఆత్మయొక్క స్వరూపం; శాశ్వతంబు+అగుట= స్థిరంకావటం; ఎఱింగించి= తెలిపి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అర్జునుడికి తత్త్వజ్ఞానం ఉపదేశించాడు. మానవదేహం బాల్యం, యౌవనం, వార్ధకం అనే అవస్థలు పొందినట్లుగా చినిగిపోయిన పాత బట్టలు విడిచి క్రొత్త బట్టలు ధరించినట్లు ఆత్మ ఒక దేహాన్ని విడిచి మరియొక దేహాన్ని పొందుతుంది. ఆత్మ దేహాంతరగమనం వలన నశించదు. నశించేది శరీరం మాత్రమే. ఆత్మకు పుట్టుక, చావు అనేవి లేవు. ఆయుధాలు శరీరానికే తప్ప ఆత్మకు హాని చేయలేవు. ఆత్మ (పురుషుడు) బాధించేవాడు కాడు; బాధను పొందేవాడూ కాడు.' ఆత్మకు అభావం లేదు. ఆత్మ శాశ్వతం. శరీరం నశించేది. దానికి అస్తిత్వం లేదు. ఈ విధంగా పెక్కు భంగుల శ్రీకృష్ణుడు ఆత్మతత్త్వం అర్జునుడికి వివరించి చెప్పాడు.

విశేషం: 1. మూల సంస్కృత భారతంలో చాలా విపులంగా ఉన్న ఆత్మ తత్త్వం తిక్కన తెలుగులో ఎంతో కుదించివేశాడు.

2. 'పురుషుడు' అనే శబ్దం ఈ ప్రకరణంలో ఆత్మకు పర్యాయపదంగా చెప్పబడింది.

3. అవస్థలు పెక్కు రకాలు. ఈ పద్యంలో చెప్పబడినట్టివి బాల్యం, యౌవనం, వార్ధకం మాత్రమే.

బాల్యం- పుట్టినప్పటి నుండి అయిదేండ్ల వరకు.

కౌమారం- ఆరేండ్ల నుండి ముప్పయి ఏండ్ల వరకు.

యౌవనం- ముప్పైఏండ్ల నుండి యాభై సంవత్సరాల పర్యంతం.

వార్ధకం- ఏబదేండ్ల పిదప వయసు.

శ్రీకృష్ణుఁ డర్జునునకుఁ దత్త్వజ్ఞానోపదేశంబు సేయుట (సం. 6-24-19)

ఆ. ఇట్టు లగుటఁ జేసి యెవ్వరి దెసకు శో । కంబుఁ బొందఁ గారణంబు లేదు;
జీవుఁ డెల్లభంగిఁ జెడియెడువాఁడు గాఁ । దలఁచితేని వగవవలదు మున్న. 197

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్టులు+అగుటన్+చేసి= ఈ విధంగా ఉన్నది కాబట్టి; ఎవ్వరి+దెసకున్= ఎవరి యెడలను; శోకంబున్= దుఃఖాన్ని; పొందన్= అనుభవించటానికి; కాణంబు+లేదు= హేతువు లేదు; జీవుఁడు= ఆత్మ; ఎల్లభంగిన్= ఏ విధంగానూ; చెడియెడువాఁడు+కాన్= చెడిపోయేవాడు అని; తలచితి(వి)+ఏని= అనుకుంటే; మున్ను+అ= మున్నే; వగవన్వలదు= దుఃఖించవలసిన అవసరం లేదు.

తాత్పర్యం: ఈ కారణం చేత, ఎవరి కోసమూ శోకించవలసిన అవసరం లేదు. ఒకవేళ జీవుడు చెడేవాడే అని అంగీకరించినా శోకించవలసిన అగత్యం అసలే లేదు. అది సహజ పరిణామం అని సరిపెట్టుకొనాలి.

విశేషం: ఈ పద్యానికి సంస్కృత మూల శ్లోకం

శ్లో॥ "అథ చైనం నిత్యజాతం । నిత్యంవా మన్యసే మృతమ్,
తథాzపి త్వం మహాబాహో । నైవం శోచితు మర్హసి." (భ.గీ.2.26)

ఎల్లప్పుడు ఆత్ముడు పుట్టేవాడనీ, గిట్టేవాడనీ నీవు తలపోస్తే ఇక అటువంటప్పుడు దుఃఖానికి తావే లేదు కదా. ఇది మాట వరుసకు, వాదం కోసం అంగీకరించిన ప్రాతిపదిక మాత్రమే. ఆత్మ, నిత్యం, శాశ్వతం అని నిష్కర్షగా భగవద్గీతా ప్రోక్తమైన అభిప్రాయం.

క. పురుషుఁడు సెడు ననువాఁడును, । బురుషుఁడు సెఱుచు నని పలుకు పురుషుండును న
య్యిరువురు నవివేకుల; య । ప్పురుషుఁడు సెఱుపండు సెడఁడు భుజవీర్యనిధీ! 198

ప్రతిపదార్థం: భుజ+వీర్య+నిధీ!= బాహుపరాక్రమానికి నెలవైనవాడా! ఓ అర్జునా!; పురుషుఁడు= ఆత్ముఁడు; చెడును+అనువాఁడును= నశిస్తాడు అని చెప్పేవాడున్నూ; పురుషుఁడు= ఆత్ముడు; చెఱుచున్= నశింప చేస్తాడు; అని+పలుకు= అని చెప్పే; పురుషుండును= మానవుడున్నూ; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరూ; అవివేకులు+అ= అవివేకులే! మూఢులే; ఆ+పురుషుఁడు= ఆత్ముడు; చెఱుపండు= నాశనం చేయడు; చెడఁడు= నశించడు.

తాత్పర్యం: ఓ అర్జునా! ఆత్ముడు నశిస్తాడు అనేవాడూ, ఆత్ముడు నశింపచేస్తాడు అనేవాడూ- ఇరువురూ అవివేకులే. ఆత్మ నశించదు, ఎవరినీ నాశనం చేయదు.

విశేషం: ఈ పద్యంలో పురుషుడు అనే శబ్దం - మనుష్యుడు అనే అర్థంలో ఒకచోట- ఆత్మ అని మూడుచోట్ల ప్రయోగించబడింది. మొదటి పంక్తిలో పురుషుడు అంటే ఆత్మ. రెండవ పాదంలో పురుషుడు మొదటి పదానికి అదే అర్థం. రెండవ పాదంలో యతిస్థానంలో ఉన్న పురుషుడు అనే శబ్దానికి మనుష్యుడు అని అర్థం. నాలుగో పాదం మొదటి శబ్దం - పురుషుడు అనే మాటకు ఆత్మ అని అర్థం.

క. పురుషుఁ డన వే ఱొకండే । పురుషోత్తముఁ డైన యేన; పురుషోత్తమతా
స్ఫురణకుఁ బురుషత్వం బను । మెరమెర గల; దదియ కాదె మెయికొనుఁ గ్రియకున్. 199

ప్రతిపదార్థం: పురుషుఁడు+అనన్= ఆత్ముడు అనగా; వేఱు+ఒకండే?= వేరే ఇంకొకడా?; పురుష+ఉత్తముఁడు+ఐన= పురుషులలో గొప్పవాడైన; ఏను+అ= నేనే; పురుషోత్తమతా+స్ఫురణకున్= పురుషోత్తమత్వం అభివ్యక్తం అయ్యేందుకు; పురుషత్వంబు= ఆత్మత్వం; అను+మెరమెర= అనే తళతళల కాంతి; కలదు= ఉన్నది; అది+అ= అదియ- అదే; క్రియకున్= పనిచేయటానికి; మెయికొనున్+కాదె!= పూనుకొంటుంది కదా!

తాత్పర్యం: పురుషుడు, ఆత్మ అంటే నేనే; వేరొకడు కాడు. పురుషోత్తమత్వం అభివ్యక్తం కావటానికి ఆత్మత్వస్ఫూర్తి ఉంటుంది. అదే సర్వక్రియలకూ పూనుకొంటుంది.

విశేషం: 1. పురుషుడు- పురుషోత్తముడు అనేది శాబ్దిక వ్యత్యాసమేగాని పురుషుడు- పురుషోత్తముడు అనేది అభేదాధ్యవసాయమే అని ఈ పద్యం చెపుతోంది. అంతేగాక- ఆ పురుషోత్తముడు ఎవరు? తానే అని శ్రీకృష్ణుడు నొక్కివక్కాణించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిక్కన - అద్వైతి అని చెప్పవచ్చు. భగవద్గీతలోని శ్రీకృష్ణ వాక్యాలకూ, మతత్రయకర్తలు ఎవరికి అనుకూలమైన వ్యాఖ్యలు వారు చేశారు.

వ. అని వెండియు వివిధవాక్యంబుల నాత్మునకు బాధ్యబాధకత్వంబులు లే కునికి వివరించి విప్వచ్చునకుం గృపాశోకంబులకు మూలంబు లగు నహంకారంబులు వారించి, యతనికి రణోత్సాహంబునకుం గారణం బైన స్వకర్మావలంబనంబు వదలం దగమి దెలియుటకు వలయు వాక్యంబులు పెక్కు లుపన్యసించి.200

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; వెండియున్= మరియు; వివిధ+వాక్యంబులన్= పెక్కు వాక్యాలలో; ఆత్మునకున్= పురుషుడికి; బాధ్య, బాధకత్వంబులు= బాధను పొందటం బాధను కలిగించటం; లేకునికి= లేకపోవటం; వివరించి= ప్రస్ఫుటంగా చెప్పి; కృపా+శోకంబులకున్= దయకు దుఃఖానికి; మూలంబులు+అగు= కారణాలు అయిన; అహంకారంబులు= అహంకార మమకారాలు; వారించి= తొలగించి; అతనికిన్= (అర్జునుడికి); రణ+ఉత్సాహంబునకున్= యుద్ధం చేయాలనే ఆవేశంతో కూడిన అభిలాషకు; కారణంబు+ఐన= హేతువైన; స్వకర్మ+అవలంబనంబు= కర్తవ్య నిర్వహణం; వదలన్+తగమి= వదలి పెట్టటం మంచిది కాదని; తెలియుటకున్= తెలిసికొనేందుకు; వలయు= అవసరమైన; వాక్యంబులు= సార్థకమైన మాటలు; పెక్కులు= అనేకాలు; ఉపన్యసించి= వివరించి చెప్పి.

తాత్పర్యం: అని మరల ఎన్నో వాక్యాలతో శ్రీకృష్ణుడు అర్జునుడికి జ్ఞానోపదేశం చేశాడు. 'ఆత్మకు బాధింపబడటం లేదు. బాధించటమూ లేదు అని వివరించాడు. అర్జునుడి కృపావేశానికీ దుఃఖానికీ మూలం అతడి అహంకార మమకారాలే గనుక వాటిని తొలగించాడు. అర్జునుడు చేయవలసిన పని యుద్ధానికి తగిన స్వకర్మావలంబనం.' దానిని వదలరాదు అని తెలియటానికి తగిన వాక్యాలు ఎన్నో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపన్యసించాడు.

విశేషం: 'అని వెండియు వివిధ వాక్యంబులన్' అని తిక్కన వ్రాశాడు. అయితే ఆ వివిధ వాక్యాలు ఏమిటో తిక్కన చెప్పలేదు. అవి అన్నీ అర్జునుడిని కర్తవ్యోన్ముఖుడిని గావించాయి అని మాత్రం చెప్పాడు. దీనిని బట్టి తిక్కన బుద్ధిపూర్వకంగానే భగవద్గీతను సొంతంగా అనువదించలేదని తేలుతున్నది.

క. సమరంబు రాజులకు ను । త్తమకర్మం బది; యపావృతస్వర్గ ద్వా
రము సుమ్ము; లెమ్ము! దగఁ గ । య్యము సేయుము; దీనికేల యనుమానింపన్? 201

ప్రతిపదార్థం: సమరంబు= యుద్ధం; రాజులకున్= క్షత్రియులకున్; ఉత్తమ+కర్మంబు= మంచి పని -మేటి కర్తవ్యం; అది= యుద్ధం; అపావృత, స్వర్గ, ద్వారము= తెరువబడిన స్వర్గం యొక్క తలుపు; సుమ్ము= సుమా!; లెమ్ము= లేచి నిలబడుము; (కర్తవ్యానికి పూనుకో); తగన్= తగునట్లుగా; కయ్యము+చేయుము= యుద్ధం చేయుము; దీనికిన్= ఈ విధంగా యుద్ధం చేయటానికి; ఏల+అనుమానింపన్?= సందేహం ఎందుకు?

తాత్పర్యం: క్షత్రియులకు ముఖ్యకర్తవ్యం యుద్ధం. దానివలన స్వర్గం లభిస్తుంది. లెమ్ము. యుద్ధం చెయ్యి. సందేహించవద్దు.

విశేషం: 1. యుద్ధంలో మరణించేవారు (అనగా వారి ఆత్మలు) స్వర్గంలోకి చేరుతాయనే ఆ ప్రాచీన విశ్వాసాన్ని భగవద్గీత అంగీకరించిందా? అసలు స్వర్గనరకాలు ఉన్నాయా?; అథర్వ వేదంలో:

శ్లో॥ "న మోక్షో నభసః పృష్ఠే । న పాతాళే న భూతలే,
సర్వాశా సంక్షయే చేతః । క్షయో మోక్ష ఇతీర్యతే. "

మోక్షం అనేది ఆకాశం వెనుక గాని పాతాళ లోకంలోగాని భూమి మీద గాని ఉండే ఒక స్థాన విశేషం కాదు. ఆశాపరివృతమైన చిత్తవృత్తి నశించటమే నిజమైన మోక్షం. - **'మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః'**- అని చెప్పబడింది. భగవద్గీతలో చెప్పబడిన "స్వర్గ నరకాలు", స్థాన విశేషాలుగా కాకుండా వాచ్యార్థంలో కాకుండా, ఔపచారికంగా యౌగికార్థంలో మానసికమైన అనుభూతులుగా స్వీకరించవచ్చును.

క. ఫలముల యెడ బ్రహ్మార్పణ । కలనపరుం డగుచుఁ గార్యకర్మము నడపన్
వలయుం దత్త్వజ్ఞానము । తలకొనినం గర్మశమము దానై కలుగున్. 202

ప్రతిపదార్థం: ఫలముల+ఎడన్= ఫలితాల పట్ల; బ్రహ్మ+అర్పణ, కలన, పరుండు+అగుచున్= పరమాత్మకు అంకితం చేసినవాడు అవుతూ; కార్య+కర్మము= కర్తవ్యమును; నడపన్+వలయున్= నెరవేర్చాలి; తత్త్వజ్ఞానము= ఆధ్యాత్మిక విద్య; తలకొనినన్= ఏర్పడితే; కర్మశమము= కర్మ వినాశనం; తాను+ఐ+కలుగున్= దాని అంతట అదే ఏర్పడుతుంది.

తాత్పర్యం: ఫలితాల యెడ మమకారం విడిచి కర్తవ్యాలను నిర్వహించాలి. ఫలితాలు జయాపజయాలు భగవదర్పితం చేయాలి. తత్త్వజ్ఞానం లభిస్తే ఇక కర్మనాశనం తానంతట అదే కలుగుతుంది.

విశేషం: ఈ పద్యం - తిక్కన వ్రాసిన భగవద్గీతకు కేంద్ర గరిమనాభి. ఇది భగవద్గీతాసారసంగ్రహం అన దగిన పద్యం. ఇందులోని అంశాలు:

1. కార్యకర్మము= చేయవలసినపని- ధర్మం= కర్తవ్యం చేయాలి. అయితే జయాపజయాలతో కర్తవ్యానికి సంబంధం లేదు. ఉండకూడదు. నిజానికి నరుడు కర్తవ్యం చేయగలడుగాని- ఆశించిన ఫలం- విజయం చేకూరవచ్చును. చేకూరక పోవచ్చును. చేయవలసిన పని చేస్తే చాలు. ఆ తృప్తి చాలు. అదే పరమార్థం. అట్టివాడే కర్మయోగి. జయం వచ్చినా, అపజయం సంప్రాప్తించినా, అతడు కృతకృత్యుడే.

ఇక కర్మ చేయకుండా ఏ మానవుడూ ఉండలేడు గదా!. ఏ పనీ చేయని వాడు - అనుకొన్న వాడు కూడా ఏదో పని చేయక తప్పదు. ఊపిరి పీల్చటం కూడా ఒక పనే కదా. ఎన్ని పనులు చేసినా, ఏ పనీ చేయనివాడే యోగి. దోషికి మరణ శిక్ష విధించాడు అనుకుందాం ఒక న్యాయమూర్తి. అతడు హంతకుడా? కాడు. అట్లే యుద్ధం చేసి ఎంత మందిని చంపినా సరే - కర్తవ్యం నిర్వహించిన వీరుడు కారకుడు కాడు. ఎవరినీ చంపనట్లే. ఈ పద్యంలో ఇంకో చక్కని చిక్కని పదగుంఫన ఉన్నది. అది 'కర్మశమము'.

కర్మ అనే శబ్దానికీ - పని చేసే క్రియ అని వ్యావహారికమైన అర్థం. భగవద్గీత పరిభాషలో- "కర్మ సిద్ధాంతం"లో కర్మకు విపులమైన అర్థం ఉంది. భగవద్గీతలో కర్మ మూడు విధాలుగా విం గడింపబడింది.

శ్లో॥ "కర్మణో హ్యపి బోద్ధవ్యం । బోద్ధవ్యం చ వికర్మణః,
అకర్మణ శ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః" (భ.గీ.4-17)

కర్మరీతులు గ్రహించటం కష్టం. అన్ని పనులు చేసే గృహస్థుడు, సర్వసంగపరిత్యాగియైన సన్న్యాసి సమానులే. "తత్త్వజ్ఞానం' ' తలకొన్న యెడల. ఇక్కడ వినోభా భావేగారి వ్యాఖ్యానం సంగ్రహింప దగినట్టిది. "కర్మ - వికర్మ - అకర్మ, ఈ మూడు శబ్దములును నాల్గవ అధ్యాయంలో చాలా మహత్త్వం కలవి. కర్మ అనగా స్వధర్మాచరణ యొక్క స్థూలరూపం. ఈ బాహ్యకర్మలో చిత్తమును లగ్నం చేయటమే వికర్మ. మనం ఎవరికైనా నమస్కరించినపుడు శిరమువంచే బాహ్యక్రియతోపాటే లోపలి మనస్సును కూడా వినయంతో వంచక పోతే ఆ బాహ్యక్రియ వ్యర్థం.

'తత్త్వజ్ఞానము తలకొనిన' యెడల అనగా- **"జ్ఞానాగ్ని స్సర్వ కర్మాణి । భస్మసాత్కురుతే తథా"** - భ.గీ. 4-37 జ్ఞానాగ్ని, సర్వకర్మలను భస్మం చేయగలదు. ఉదాహరణకు కట్టె ఉన్నది. అది అగ్నిదగ్ధమైనపుడు మిగిలేది బూడిద. కర్ర కాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'తత్త్వ జ్ఞానం తలకొనిన యెడల' అర్జునుడు చేసే యుద్ధకర్మ - కర్మ కాదు. అది జ్ఞానాగ్ని అనే వికర్మ వలన - 'అకర్మ' ఐపోతుంది. అర్జునుడు అప్పుడు ఏ పనీ చేయనట్టి సర్వసంగపరిత్యాగియైన సన్న్యాసితో సముడు. తత్త్వజ్ఞానం వలన 'కర్మ శమము' కర్మవినాశనం సంభవిస్తుంది. ఈ విధంగా జ్ఞాని పుణ్యాపాపాలకు అతీతుడు కాగలడు.

వ. అని మఱియు నీదృశంబు లగు వాక్యంబు లనేకంబు లనుగ్రహించుచు వివిధప్రకారంబుల వికల్పించి
విజయుం డడిగిన వాని కెల్ల సదుత్తరంబు లిచ్చి సందేహంబు వాపుచు. 203

ప్రతిపదార్థం: అని మఱియున్= అని చెప్పి మరల; ఈదృశంబులు+అగు= ఈ రీతి వయిన; వాక్యంబులు+అనేకంబులు= పెక్కు వాక్యాలు; అనుగ్రహించుచున్= దయతో చెప్పుతూ; వివిధ+ప్రకారంబులన్= పెక్కురీతుల; వికల్పించి= ఇది అదీ అని విభజించి చెప్పి; విజయుండు= అర్జునుడు; అడిగిన వానికిన్+ఎల్లన్= వేసిన ప్రశ్నలు అన్నింటికీ; సత్+ఉత్తరంబులు= మంచి సమాధానాలు; ఇచ్చి= చెప్పి; సందేహంబు+పాపుచున్= అనుమానాలు పోగొట్టుతూ.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు మరల ఈ విధమైన వాక్యాలను పెక్కింటిని దయతో చెప్పి, అనేక మార్గాలు వివరించి, అర్జునుడు అడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానాలు చెప్పి, అతడి అనుమానాల నన్నిటినీ పోగొట్టాడు.

విశేషం: 1. వివిధ ప్రకారంబులు, వికల్పించి= ఎన్నో మార్గాలు తాత్త్విక దర్శనాలు వివరించి అని అర్థం; భగవద్గీత మూలంలో 18 అధ్యాయాలు. అర్జున విషాదయోగం - సాంఖ్యయోగం-కర్మయోగం మున్నగునవి మూలంలో ఉన్నాయి. తిక్కన అన్నిటినీ పృథక్కరించి చెప్పలేదు. భగవద్గీత ముముక్షువులు అందరికీ ఏకైక తరణోపాయం ప్రవచించలేదు. అందుచే 'వివిధ ప్రకారంబులు' వికల్పించి అనే తిక్కన ప్రయోగం ఎంతో అర్థవంతమైనది.

2. అర్జునుడు మూఢ భక్తుడు కాడు. శ్రీకృష్ణుడు అర్జునుడి ప్రశ్నలకు, కొన్ని చిక్కు ప్రశ్నలకు సమాధానం చెప్పవలసివచ్చింది. అర్జునుడు వేసిన ప్రశ్నలుగాని శ్రీకృష్ణుడు చెప్పిన సమాధానాలుగాని తిక్కన వివరించలేదు.

క. భారమున నులిచి త్రెంపక । కారాకులు డుల్లినట్లు కర్మము లెల్లం
దార పెడఁబాయ వలయుట । సారకృపం దెలియఁ జెప్పె శౌరి యతనికిన్. 204

ప్రతిపదార్థం: భారమునన్+నులిచి+త్రెంపక= కష్టయాతన చొప్పున ఊడదీసి, త్రుంచివేయకుండా; కారాకులు= పండుటాకులు; డుల్లినట్లు= క్రిందకు పడిపోయినట్లుగా; కర్మములు+ఎల్లన్= అన్ని కర్మలూ; తార+పెడన్+పాయ వలయుట= తమంతట తామే ప్రక్కకు తప్పుకొనుట; సార+కృపన్= మిక్కిలి దయతో; అతనికిన్= అర్జునుడికి; శౌరి= శ్రీకృష్ణుడు; తెలియన్+చెప్పెన్= తెలిసేటట్లు విశదీకరించి చెప్పాడు.

తాత్పర్యం: కర్మలు అన్నీ ఎంతో కష్టపడి త్రుంచి వేయనక్కరలేదు. పండిపోయిన ఆకులు చెట్టు నుండి నేలమీద రాలిపోయేటట్లుగా, సహజంగా ఎట్లా విడిపోగలవో, ఆ విషయం అంతా దయతో శ్రీకృష్ణుడు అర్జునుడికి వివరించి చెప్పాడు.

విశేషం: 1. 202వ పద్యం వ్యాఖ్యానంలో కర్మ ఏ విధంగా అకర్మగా పరిణమిస్తుందో చెప్పబడింది. ఈ పద్యంలో తిక్కన చక్కని ఉపమానం ప్రయోగించాడు. ఎట్లా 'పండిపోయిన ఆకులు చెట్ల నుండి సహజంగా రాలిపోతాయో. అట్లాగే కర్మలు కూడ జ్ఞానిని వీడిపోతాయి. జ్ఞానిని కర్మలు అంటిపెట్టుకొని ఉండవు. జ్ఞానయోగంవలన కర్మలు ఎండిన ఆకులవలె మారిపోయి క్రిందికి రాలిపోతాయి. కర్తకు మరి కర్మలతో అనుబంధం ఉండదు- ఎండిన ఆకులకూ చెట్లకూ సంబంధం ఉండనట్లే.

2. ఈ పద్యంలో మొదటి పదం- 'వైరమున' అని ఉన్నది. పాఠాంతరం 'భారమున' అని ఇవ్వబడింది. ఎండిన ఆకులు సులభంగా సహజంగా రాలిపోతాయి. 'భారంగా' త్రుంచవలసిన అవసరం లేదు అనే పాఠం సుగమంగా ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'వైరమున' అనే పాఠం అన్వయక్లిష్టతకు గురి చేస్తున్నది. 'సారమతిం దెలియ' అనే పాఠం బాగానే ఉన్నది కాని- నాలుగోపాదంలో 'సారకృపం' - అని ఉన్నది కాబట్టి అది పునరుక్తి దోషం అవుతుంది శాబ్దికంగా. కావున భారమున అనే పాఠమే స్వీకరించబడింది.

వ. ఇవ్విధంబునం జెప్పిన విని కవ్వడి సముత్థితుం డై జగన్నాథున కిట్లనియె. 205

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; కవ్వడి= సవ్యసాచి= అర్జునుడు; సముత్థితుంప+ఐ= లేచినిల్చినవాడై; జగత్+నాథునకున్= జగతికి ప్రభువైన శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ రీతిగా శ్రీకృష్ణుడు చెప్పగా ఆలకించి అర్జునుడు లేచి నిల్చి ఆ జగన్నాథునితో ఈ విధంగా అన్నాడు:

మ. ' అతిగుహ్యం బిది; నీవు భూరికృప నీ యధ్యాత్మముం గానఁ జే
సితి; నా కిమ్మెయి విన్కిఁ గొంత భ్రమ వాసెన్; యోగిహృద్ధ్యేయ మై
యతులైశ్వర్యవిభూతి నొప్పు భవదీయం బైన రూపంబు సూ
చు తలం పెత్తెడుఁ; బోలునేని దయఁ జక్షుఃప్రీతిఁ గావింపవే.' 206

ప్రతిపదార్థం: అతి, గుహ్యంబు+ఇది= ఇది మిక్కిలి రహస్యమైనది; నీవు= నీవు (ఓ శ్రీకృష్ణా నీవు); భూరి+కృపన్= మిక్కుటమైన దయతో; ఈ+అధ్యాత్మమున్= ఆ ఆత్మతత్త్వాన్ని; కానన్+చేసితి(వి)= కనిపించేటట్లు చేశావు; నాకున్= నాకు; ఈ+మెయిన్= ఈ రీతిగా; విన్కి= వినటం వలన; కొంత= కొంత; భ్రమ+పాసెన్= భ్రమ తొలగింది; యోగి+హృత్+ధ్యేయము+ఐ= యోగుల హృదయాలకు లక్ష్యమై; అతుల+ఐశ్వర్య+విభూతిన్+ఒప్పు= సాటిలేని సంపద మహత్త్వంతో శోభిల్లే; భవదీయంబు+ఐన= నీదైన; రూపంబు= ఆకారం; చూచు= వీక్షించవలెననే; తలంపు+ఎత్తెడున్= కోరిక కలిగింది; పోలున్+ఏనిన్= అది తగినదైతే; దయన్= కరుణతో; చక్షుః ప్రీతిన్= కన్నులకు వేడుకను; కావింపవు+ఏ?= చేయవా?

తాత్పర్యం: నీవు నాకు అందించిన సందేశం చేసిన ఉపదేశం మిక్కిలి రహస్యమైనవి. నామీద నీకు ఎంతో దయ ఉన్నది కాబట్టి ఈ ఆత్మజ్ఞానం నాకు కలిగించావు. ఈ ఆధ్యాత్మికతత్త్వం వినటంచేత నాకు కొంత భ్రమ తొలగింది. యోగీశ్వరులు నీ రూపం చూడాలని తహ తహలాడుతూ ఉంటారు. సాటిలేని విభూతితో వెలుగొందే నీ ఆకారం వీలైతే దయచేసి నన్ను కన్నుల పండువుగా దర్శింపజేయుము.

విశేషం: 1. భ్రమ అంటే చలనం. లేనిది ఉన్నట్లు తోచటం. అర్జునుడు అన్నాడు శ్రీకృష్ణుడి ఉపదేశం విని 'శ్రీకృష్ణా నాకు 'కొంత' భ్రమ తొలగింది' అని. భ్రమ పూర్తిగా ఎందుకు తొలఁగలేదు అనే ప్రశ్న ఉద్భవిస్తుంది. వినుకలి= వినటం కంటె కనుకలి= కన్నులార చూడటం శ్రుతికంటె ప్రత్యక్ష ప్రమాణం గొప్పది అని కాదు. సిద్ధాంత జ్ఞానం వలన కొంత వరకే భ్రమ తొలగుతుంది. ప్రత్యక్షానుభూతి సిద్ధాంత జ్ఞానాన్ని బలపరుస్తుంది. సిద్ధాంతం కంటె అనుభూతి గొప్పది. అంతే కాదు. జ్ఞానం పరిమిత గమనం కలది. తర్కం ఆగిపోయే చోట అనుభూతి ప్రారంభిస్తుంది. తర్క సిద్ధాంత జ్ఞానం పరిధి కొంత మేర వరకే. "అనుభవైక వేద్య మధ్యాత్మ యోగంబు, తర్క పరిధులెల్ల దాటిపోవు. అర్జునుడు తనకు విశ్వరూప సందర్శనం అనుగ్రహించి 'చక్షుః ప్రీతి గావింపవే' అని ప్రార్థించాడు. అయితే శ్రీకృష్ణుడు, అది మానవుల కన్నులకు అతీతమైనది అని అతడికి 'దివ్యదృష్టి' ప్రసాదించాడు.

3. యోగి= యోగం కలవాడు. యోగశబ్ద నిర్వచనం - భీష్మ అశ్వాసం 110 పద్యం చూడవచ్చు.

వ. అనిన విని యచ్యుతుం డతని కిట్లనియె. 207

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్+విని= అని అర్జునుడు పలుకగా ఆలకించి; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; అతనికిన్= అర్జునునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అర్జునునితో శ్రీకృష్ణుడు ఈ విధంగా చెప్పాడు:

క. ' నానాస్ఫుట వర్ణంబులు। నానాభంగులును గలుగు నారూపములో
నానాశ్చర్యవిధంబులు। గానఁగ నగుఁ జూపెదం బ్రకాశస్ఫూర్తిన్. 208

ప్రతిపదార్థం: నానా, స్ఫుట, వర్ణంబులు= పెక్కు విధాలుగా భాసించే రంగులు; నానా, భంగులును= పెక్కు రీతులును; కలుగు= ఉన్న; నా రూపములోన్= నా ఆకారంలో; నానా+ఆశ్చర్యవిధంబులు= పెక్కు విచిత్రాలైనవి, భిన్నములైన తీరుతెన్నులు; కానఁగన్+అగున్= కనుపిస్తాయి; ప్రకాశ+స్ఫూర్తిన్= మిరుమిట్లు గొలిపే వెలుగుతో; చూపెదన్= చూపిస్తాను.

తాత్పర్యం: పెక్కు రంగురంగులు పెక్కు రీతులు ఉన్న నా రూపంలో పెక్కు ఆశ్చర్యకరాలైన తీరుతెన్నులు కనిపిస్తాయి. వెలుగువెల్లువతో కూడిన నా రూపం చూపిస్తాను. చూడుము.

క. విను మానుషచక్షుర్గతి। గనుఁగొన శక్యంబు గాదు గావున దానిం
గనుట కయి దివ్యచక్షు। ర్జననం బొనరింతు నీకు శత్రువిదారీ!' 209

ప్రతిపదార్థం: శత్రు విదారీ!= శత్రువులను ఖండించగల వాడా! ఓ అర్జునా!; వినుము= ఆలకించుము; మానుష చక్షుః+గతిన్= మనుజులకున్న నేత్ర దృష్టి ప్రసారంతో; కనుంగొనన్= చూడటానికి; శక్యంబు+కాదు= శక్తి చాలదు; కావునన్= కాబట్టి; దానిన్= విశ్వరూపాన్ని; కనుటకున్+అయి= చూడటం కోసం; నీకున్= నీకు (ఓ అర్జునా నీకు); దివ్య+చక్షున్+జననంబు= అతిలోకమైన కన్నులు పుట్టేటట్లు; ఒనరింతున్= చేస్తాను.

తాత్పర్యం: శత్రుసంహారం చేయగల సామర్థ్యం ఉన్న ఓ అర్జునా! ఆలకించుము. మనుజులకు సహజంగా ఉండే చర్మచక్షువులతో నా విశ్వరూపాన్ని వీక్షించే వీలు లేదు. కాబట్టి నీకు దివ్యదృష్టి ప్రసాదించగలను.

వ. అని యతనికి దివ్యదృష్టి యొసంగి యోగీశ్వరేశ్వరుం డైన యాలక్ష్మీశ్వరుండు దనదివ్యరూపంబు సూపె; నా విశ్వరూపుని దివ్యతేజంబు సహస్రసూర్యప్రభానిభం బనుటయుం జాలకుండుం గావున వాక్రువ్వం గొలఁది గా; దట్టి మహామూర్తిఁ గనుంగొని ధనంజయుండు విస్మయరోమహర్షణప్రహర్షోత్కర్షంబులతో దండప్రణామంబులు సేసి నిలిచి కేలు మొగిడ్చి యి ట్లనియె. 210

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; దివ్య+దృష్టి= అతిలోకమైన చూపు; (అర్జునునకు); ఒసంగి=ఇచ్చి; యోగి+ఈశ్వరుండు+అయిన= యోగులలో శ్రేష్ఠుడు అయిన; ఆ+లక్ష్మీ+ఈశ్వరుండు= లక్ష్మీదేవికి భర్త- శ్రీకృష్ణుడు; తన+దివ్య+రూపంబు+చూపెన్= తనదైన అతిలోకమైన ఆకారాన్ని ప్రదర్శించాడు; ఆ+దివ్య+రూపుని= లోకాతీతమైన రూపంగల ఆ శ్రీకృష్ణుడియొక్క; దివ్య+తేజంబు= దైవానికి సంబంధించిన పెను వెలుగు; సహస్ర, సూర్య, ప్రభా, నిభంబు= వేయి సూర్యుల వెలుగుతో సమానం; అనుటయున్+చాలకుండున్= అని వర్ణించటం గూడ తక్కువే అని చెప్పాలి; కావునన్= కాబట్టి; వాక్రువ్వన్= వర్ణించటానికి; కొలఁది+కాదు= అలవి కాదు; అట్టి= అటువంటి; మహా+మూర్తిన్= గొప్ప ఆకృతిని; కనుంగొని= చూచి; ధనంజయుండు= అర్జునుడు; విస్మయ, రోమహర్షణ, ప్రహర్ష+ఉత్కర్షంబులతోన్= ఆశ్చర్యం, గగుర్పాటుతో కూడిన ఆనందాతిశయాలతో; దండ, ప్రణామంబులు చేసి= సాగిలపడి నమస్కారాలు ఆచరించి; నిలిచి= నిలబడి; కేలుమోడ్చి= చేతులు జోడించి; అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అర్జునుడికి దివ్యదృష్టి అనుగ్రహించాడు. యోగీశ్వరుడూ లక్ష్మీవల్లభుడూ అయిన శ్రీకృష్ణుడి విశ్వరూపాన్ని అర్జునుడు సందర్శించాడు. ఆ విశ్వరూపుడి లోకాతీతమైన తేజస్సు వేయి సూర్యుల వెలుగును మించింది అని చెప్పవచ్చును. అది వర్ణనాతీతం. ఆ విశ్వరూపాన్ని దర్శించి, అర్జునుడు ఆశ్చర్యం చెంది, రోమాంచంతో పులకించిన దేహం కలవాడై ఆనందంతో పరవశించిపోయి, చేతులు మోడ్చి నమస్కరించి ఈ విధంగా అన్నాడు:

విశేషం: 1. యోగీశ్వరుడు శ్రీకృష్ణుడు . భగవద్గీత శ్రీకృష్ణుడికి ప్రసాదించిన బిరుదు "యోగీశ్వరుడు." యోగి అనగా యోగం కలవాడు. యోగం అంటే? యోగ శబ్దానికి ఎన్నో అర్థాలు ఉన్నాయి. సనాతన భారతీయ సాహిత్యంలో విపుల ప్రయుక్తమైన శబ్దం - యోగం.

1. యోగశబ్దానికి వ్యావహారికమైన అర్థం కలయిక= పొందిక.
2. సారస్వతార్థం - సామరస్య సంధానం.
3. శ్రీకృష్ణుడు - అర్జునుడిని కర్మవీరుడవు కమ్మని ఉద్బోధిస్తూ ఇట్లా అంటాడు-

శ్లో॥ "యోగస్థః కురు కర్మాణి । సంగం త్యక్త్వా ధనంజయ!

సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా । సమత్వం యోగ ఉచ్యతే" (భగవద్గీత - 2-48)

"యోగస్థుడవై కర్మలు చేయుము. సంగముక్తుడవై జయాపజయాలు సమంగా భావించుము. 'సమత్వం' అని యోగం చెప్పబడింది.

4. భగవద్గీత అభిప్రాయంలో- యోగి, తపస్వి కంటె గొప్పవాడు - భగవద్గీత 4-46.

5. యోగం అంటే శ్రీకృష్ణుడు ఇచ్చిన నిర్వచనం- 'యోగః కర్మసు కౌశలం' యోగం అంటే క్రియా కౌశలం. నిర్వహణ పాటవం - సమబుద్ధికి గీటురాయి. నిర్వహణచాతురి నిస్సంగత్వం వల్లనే సిద్ధిస్తుంది. ఫలాపేక్షతో పనిచేసేవాడు నిరంతరం అపజయ భయ ప్రేరితుడు కాక తప్పదు. అందుచేత భగవద్గీత ప్రకారం యోగం అంటే - సమతా భావం, క్రియా కౌశలం. ఈ రెండు నిర్వచనాలు బొమ్మ బొరుసులే.

యోగి అంటే భిన్నత్వంలో ఏకత్వం చూడగల ద్రష్ట. క్రాంతదర్శి. యోగశబ్దానికి వ్యావహారిక జగత్తులో కలయిక - పొందిక అనే అర్థం స్ఫురిస్తుంది. సాహిత్య ప్రపంచంలో సామరస్య సంధానం స్ఫురిస్తుంది. ద్వంద్వబద్ధమైన ప్రాణికోటి, వికారమయమైన జీవితం, అవ్యక్త స్థితమైన సృష్టిలో సతమతమయ్యే మానవుడు తన ఆంతర్యంలో సామరస్య సంధానం సాధింపగల్గినపుడు అతడే యోగి కాగలడు. యోగికి యావత్ సృష్టి, 'సత్యం శివం సుందరంగా' భాసిస్తుంది. అతడు "ఏకమే వాద్వితీయం బ్రహ్మ' అనీ 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి' అనీ అనగలడు. ఇది అనుభవైకవేద్యం. అవాఙ్మానస వేద్యమైన ఈ అనుభూతిని వేత్తలు 'యోగం' అనే పరిభాషతో నిర్దేశించారు. వేదాంతపరంగా యోగం అంటే జీవాత్మ, పరమాత్మల సమ్మేళనం. ఐహికాముష్మికాల సమన్వయం. శ్రీకృష్ణుడు యోగీశ్వరుడు అని మహాభారతం అభివర్ణించింది. పతంజలి- "యోగః చిత్తవృత్తి నిరోధః" అని నిర్వచించాడు. పతంజలి - యోగసాధనను 'అష్టాంగ మార్గం'గా విశ్లేషించాడు.

1. యమం 2. నియమం 3. ఆసనం 4. ప్రాణాయామం 5. ప్రత్యాహారం 6. ధారణ 7. ధ్యానం 8. సమాధి.

పతంజలి అష్టాంగ యోగంలోని ప్రాథమిక దశలు రెండు- యమం, నియమం సౌశీల్యసంబంధాలు.

యోగసాధనకు సౌశీల్యమే పునాది.

1. **యమం:** 1. అహింస 2. సత్యం 3. అస్తేయం 4. బ్రహ్మచర్యం 5. అపరిగ్రహం.

2. నియమం: 1. శౌచం 2. సంతోషం 3. తపస్సు 4. స్వాధ్యాయం 5. ఈశ్వర ప్రణిధానం

3. ఆసనం: శారీరక మానసిక వ్యాయామం. యోగసాధన చిరకాల సాధన కాబట్టి, చిరసుఖప్రదమైన శరీర భంగిమ కుదుర్చుకొనాలి. శీర్షం, కంఠం, వక్షఃస్థలం ఒకే ఋజురేఖలో ఉండాలి. ఈ ఆసనశాఖ హఠయోగంగా పరిణమించింది.

4. ప్రాణాయామం: ఈ ప్రక్రియ ఊపిరి పీల్చటంతో ప్రారంభిస్తుంది. నిశ్చల మనస్సును సాధించేందుకు - నాసాగ్రంపై ధ్యాస నిలిపి సాధన చేయాలి.

5. ప్రత్యాహారం: మనోనిగ్రహం ద్వారా, ఇంద్రియ నిగ్రహసాధన.

6. ధారణ: చిత్తవృత్తిని ఏకాగ్రం చేయటం ధారణ. మనస్సును కేంద్రీకరించి ఒక బిందువుపై పెట్టవచ్చును. ఉదాహరణకు ఆయా అవయవాలపై దృష్టి కేంద్రీకరించవచ్చును. ముక్కు చెవి కన్నులు మాత్రమేగాక గుండెకాయ కూడా యోగి ఇష్టానుసారం కొట్టుకునేటట్లు చేయవచ్చును.

7. ధ్యానం: యోగసాధనకూ హేతువాదానికీ వ్యతిరేకత ఏమీ లేదు.

శ్లో॥ "ఇంద్రియాణి పరాణ్యాహుః । ఇంద్రియేభ్యః పరం మనః,
మనసస్తు పరా బుద్ధిః । యో బుద్ధేః పరతస్తు సః. (భగవద్గీత - 23-42)"

దేహం కంటె ఇంద్రియాలు గొప్పవి. ఇంద్రియాలకంటె మనస్సు గొప్పది. బుద్ధి మనస్సు కంటె శ్రేష్ఠం. అయితే బుద్ధికంటె గొప్పది ఆత్మ.

మానవబుద్ధికి అతీతమైన అంశాలు ఏ విధంగా గ్రహించాలి? అది యోగసాధన వల్లనే సాధ్యం. జంతువులకు తార్కికమైన బుద్ధి ఉండదు. జంతువులకు మనస్సు మాత్రమే ఉంటుంది. హేతువాద తర్కం ఆగిపోయే చోటు నుండి, సమ్యక్ స్ఫూర్తి ప్రారంభిస్తుంది. ఈ అనుభూతి ధారణవలన చేకూరుతుంది. మౌన ప్రబోధం వాక్ ప్రకర్షకంటె గొప్పది. గురువు మౌనమే వ్యాఖ్యాన భరితం అవుతుంది.

8. సమాధి: యోగసాధనలో తుది మెట్టు సమాధి. నిర్వికల్ప సమాధి ఏర్పడిన పిదప - యోగి చైతన్యసముద్రుడే. ధారణ, ధ్యాన, సమాధులు మూడింటిని కలిపి సంయమం అని పేరు పెట్టారు యోగులు. సంయమ చిత్తవృత్తులు నిరోధించిన పిదప యోగి తరంగాలు లేని సచ్చిదానంద సముద్రుడు, జీవన్ముక్తుడు. ప్రతి అధ్యాయం చివర- ఉపనిషద్ విద్యగా- యోగశాస్త్రంగా భగవద్గీత అభివర్ణితం. భగవద్గీత ప్రోక్త శ్రీకృష్ణుడు యోగీశ్వరుడు.

అర్జునుఁడు శ్రీకృష్ణుని విశ్వరూపంబు గనుంగొని స్తుతించుట (సం. 6-33-5)

సీ. 'దేవ! నీదగు దివ్యదేహంబునందు సు । రాసురగంధర్వు లాది గాఁగఁ
గల దేవమౌనులుఁ గమలాసనుండును । సచరాచరం బైన జగము నాకు
దోఁచె; మొగంబులు దోర్దండములును బా । దములుఁ గన్నులు ననేకములు గంటి,
మకుటాది భూషణనికరంబుఁ జక్రగ । దాద్యాయుధములు మాల్యాంబరములుఁ

ఆ. బెక్కు గానవచ్చె; నక్కజమై యిది । నడుము మొదలు తుది యనంగ రాదు;
తేజ మప్రమేయదేదీప్యమాన ని । ర్వికృతి మహిమ దుర్నిరీక్ష మయ్యె. 211

ప్రతిపదార్థం: దేవ!= ఓ పరమాత్మా! శ్రీకృష్ణా!; నీది+అగు+దివ్య+దేహంబునందున్= నీదైన అతిలోకశరీరంలో; సుర+అసుర, గంధర్వులు+ఆది, కాఁగన్= వేల్పులు, రాక్షసులు, గంధర్వులు మొదలైనవారు; కల= ఉన్నట్టి; దేవ+మౌనులు= దేవతా ఋషులు; కమల+ఆసనుండును= పద్మం ఆసనంగా గలవాడు- బ్రహ్మదేవుడును; స+చర+అచరంబు+ఐన= కదిలేది కదలలేనట్టి వాటితో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కూడిన; జగము= ప్రపంచం; నాకున్= నాకు; తోఁచెన్= కన్పించింది; మొగంబులు= ముఖాలు; దోర్దండములున్= భుజస్కంధాలు; పాదములున్= చరణాలు; కన్నులున్= నేత్రాలు; అనేకములు= పెక్కు; కంటిన్= చూచాను; మకుట+ఆది, భూషణ, నికరంబున్= కిరీటాలు మున్నగు అలంకారాల సముదాయాలూ; చక్ర, గదా+ఆది+ఆయుధములు= చక్రములు గదలు మొదలగు యుద్ధపరికరాలు; మాల్య+అంబరములు= పూలదండలు వస్త్రాలు; పెక్కు= ఎన్నో; అక్కజము+ఐ= ఆశ్చర్యాన్ని కలిగిస్తూ; కానవచ్చెన్= కన్పించాయి. ఇది= ఇది; నడుము= మధ్యది; మొదలు= మొదటిది; తుది= చివర ఉన్నట్టిది; అనంగన్+రాదు= చెప్పటానికి వీలు లేదు; తేజము= ప్రకాశం; అప్రమేయ, దేదీప్యమాన, నిర్వికృతి, మహిమన్= మితిలేని కాంతితో వెలుఁగొందుతూ మార్పులేని గొప్పదనంతో; దుర్నిరీక్షము+అయ్యెన్= చూడటానికి అలవి కానిది అయింది.

తాత్పర్యం: 'ఓ పరమాత్మా! శ్రీకృష్ణా! లోకాతీతమైన నీ శరీరంలో, దేవతలు రాక్షసులు గంధర్వులు మొదలైన వారూ, దివ్యమునులు, బ్రహ్మదేవుడు, చరాచరమైన సర్వప్రపంచం నాకు కనిపించింది. మొగాలు, భుజాలు, పాదాలు, కన్నులు ఎన్నో కన్పించాయి. కిరీటాలు మున్నగు ఆభరణాలు, చక్రం గద మొదలైన ఆయుధాలు, రకరకాల పూలదండలు, వస్త్రాలు కన్పించాయి. ఆశ్చర్యంలో మునిగి తేలాను. నీ దివ్య దేహమునకు మొదలు ఏదో మధ్య ఏదో, తుది ఏదో నాకు తెలియలేదు. నీ తేజస్సు మితిలేనిది. ఊహకు అతీతం. దేదీప్యమానం, ఎల్లప్పుడు వెలుగొందేది. నాకు చూడటానికి అలవి కాకుండా ఉన్నది.

విశేషం: గంధర్వులు, దేవతలలో ఒక తెగవారు. సంగీతప్రియులు.

క. జగములకు నాది కారణ। మగు పరమజ్ఞేయ మీవ యని కనియెద భూ
గగనదిగంతర మంతయు। నగణితమూర్తీ! భవన్మయం బై తోఁచెన్. 212

ప్రతిపదార్థం: అగణితమూర్తీ!= లెక్కకు మిక్కిలియైన ఆకారం కలవాడా! శ్రీకృష్ణా; జగములకున్= ప్రపంచాలకు; ఆది, కారణము+అగు= మూలహేతువు అగు; పరమ, జ్ఞేయము= చిట్టచివరిగా తెలిసికొదగిన లక్ష్యం; ఈవు+అ= నీవే; అని+కనియెదన్= అని గ్రహిస్తాను; భూ, గగన, దిక్+అంతరము+అంతయున్= భూమి ఆకాశం దిక్కుల మధ్యభాగం అంతా; భవత్+మయంబు+ఐ= నీవే అయి; తోఁచెన్= కన్పించింది.

తాత్పర్యం: 'ఓ శ్రీకృష్ణా! నీ ఆకారం ఏ లెక్కలకు అందేది కాదు. ఈ సమస్త సృష్టికీ మూలకారణం నీవే అని గ్రహించగలిగాను. తెలిసికొనదగింది నీవు మాత్రమే. ఈ భూమి, ఆకాశం దిక్కులు అన్నీ నీ రూపంలో అంతర్భాగాలే.

వ. చంద్రార్కులు లోచనంబులు గాఁ గలిగి దంష్ట్రాకరాళంబులైన నీ ముఖంబులు ప్రజ్వరిల్లుచున్నయవి; నిన్ను రుద్రాదిత్య మరుద్వసువులు ప్రవేశించెదరు; సంఘంబు లై వచ్చి మహామునులు ప్రస్తుతించెదరు సిద్ధసాధ్యవియచ్చరులు వెఱఁగంది వీక్షించెద; రిట్లు దీప్తోగ్రంబగు భవదీయ దివ్యరూపంబు గనుంగొని నాకు విభ్రాంతి వొడమి ధృతి దూలి సుఖంబు వడయ నేరక చిక్కువడి యున్నవాఁడ; బ్రసన్నుండ వగుము రక్షింపుము. 213

ప్రతిపదార్థం: చంద్ర+అర్కులు= చంద్రుడూ, సూర్యుడూ; లోచనంబులున్= కన్నులు; కాన్= అగునట్లుగా; కలిగి= ఉండి; దంష్ట్రా, కరాళంబులు+ఐన= కోరలతో భయంకరాలు అయిన; నీ+ముఖంబులు= నీ మొగాలు; ప్రజ్వరిల్లుచున్నవి= దేదీప్యమానంగా వెలుగొందుతున్నవి; నిన్నున్= నిను; రుద్ర+ఆదిత్య, మరుత్, వసువులు= రుద్రుడు, సూర్యుడు, మరుత్తులు, వసువులు ప్రవేశిస్తారు; మహా+మునులు= గొప్ప ఋషులు; సంఘంబులు+ఐ= గుంపులు గూడి; వచ్చి= ఏతెంచి; ప్రస్తుతించెదరు= పొగడ గలరు; సిద్ధ, సాధ్య, వియత్+చరులు= సిద్ధులు సాధ్యులు అనే వేల్పు తెగల వారు ఆకాశంలో సంచరించేవారు;

వెఱఁగు+అంది= ఆశ్చర్యం పొంది; వీక్షించెదరు= చూస్తారు; ఇట్లు= ఈ విధంగా; దీప్త+ఉజ్జ్వలంబగు= ధగధగలతో వెలుగొందే; భవదీయ+దివ్య+రూపంబు= నీదైన లోకోత్తరమైన ఆకారం; కనుంగొని= చూచి; నాకున్= నాకు; విభ్రాంతి+పొడమి= కలవరపాటు కలిగి; ధృతి+తూలి= ధైర్యం సడలిపోయి; సుఖంబు+పడయన్+నేరన్= సంతోషం పొందలేక; చిక్కుపడి, ఉన్నవాఁడన్= బయటపడలేక కష్టాలలో కూరుకొని ఉన్నాను; ప్రసన్నుండవు+అగుము= సౌమ్యతతో కూడిన దయగల వాడవు కమ్ము; రక్షింపుము= నన్ను కాపాడుము.

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! చంద్రుడూ, సూర్యుడూ కన్నులుగా గలిగి నీ ముఖాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. నీయందు రుద్రులు, ఆదిత్యులు, మరుత్తులు ప్రవేశిస్తున్నారు. గుంపులు గుంపులుగా వచ్చి, మహర్షులు నిన్ను కీర్తిస్తున్నారు. వేల్పులు, సిద్ధులు, సాధ్యులు, ఆకాశంలో చరించేవారు ఆశ్చర్యంతో నిన్ను చూస్తున్నారు. 'లోకోత్తరమైన నీ విశ్వరూపం చూస్తే నాకు మతిపోతున్నది. ధైర్యం సడలింది. భయం వేస్తున్నది. ఇటు అటు కదలలేక మెదలలేక బాధపడుతున్నాను. నీవు దయగలిగి సౌమ్యుడవై నన్ను అనుగ్రహించి కాపాడుము.'

విశేషం: 1. రుద్రులు: శివమూర్తి భేదాలు. వీరు పదకొండుమంది. 1. అజైకపాదుడు 2. అహిర్బుధ్న్యుడు 3. విరూపాక్షుడు 4. సురేశ్వరుడు 5. జయంతుడు 6. బహురూపుడు 7. త్ర్యంబకుడు 8. అపరాజితుడు 9. వైవస్వతుడు 10. హరుడు 11. రుద్రుడు.

2. సాధ్యులు - పన్నిద్దరు గణదేవతలలో ఒక తెగ. సిద్ధులు- అణిమాది సిద్ధులుగల వారు; దేవతలలో ఒక తెగవారు.

చ. అనలజ్వాలలు పర్వు నీ ముఖములం దా ధార్తరాష్ట్రవ్రజం
బును భీష్మాదులు నిద్దెసం గలుగు నీ భూపాలలోకంబు గ్ర
క్కున నొక్కుమ్మడి వచ్చి చొచ్చెదరు; నాకుం జెప్పవే యెవ్వరో
యని శంకించెద నిన్ను భూరికరుణాయత్తైకచిత్తుండవై.' 214

ప్రతిపదార్థం: అనల+జ్వాలలు= అగ్నిమంటలు; పర్వు= వ్యాపించే; నీ+ముఖములందున్= నీమొగాల యందు; ఆ+ధార్తరాష్ట్ర వ్రజంబును= ఆ దుర్యోధనాదుల సముదాయమూ; భీష్మ+ఆదులున్= భీష్ముడు మొదలైనవారూ; ఈ+దెసన్+కలుగు= ఈ వైపున ఉన్న (పాండవ పక్షంలోని); భూపాల+లోకంబు= రాజుల సమూహం; గ్రక్కునన్= వెంటనే; ఒక్కుమ్మడిన్= ఏకంగా కలిసి; వచ్చి= వచ్చి; చొచ్చెదరు= ప్రవేశిస్తున్నారు; నిన్నున్+ఎవ్వరో+అని, శంకించెదన్= నీవు ఎవరవా అని సందేహిస్తున్నాను; భూరి, కరుణా+ఆయత్త+ఏక+చిత్తుండవు+ఐ= గొప్ప దయతో కూడిన మనస్సుగలవాడవై; నాకున్+చెప్పవు+ఏ= నాకు తెలియజేయవా.

తాత్పర్యం: శ్రీకృష్ణా! అగ్నిజ్వాలలు నీ ముఖాలలోనుండి వెలువడుతున్నాయి. ఆ వైపున ఉన్న దుర్యోధనుడు మున్నగు వారలేగాక, ఈ వైపున ఉన్న రాజులు గుంపులు గుంపులుగా వచ్చి నీ ముఖంలో ప్రవేశించి మ్రగ్గుతున్నారు. నీవు ఎవ్వరవో అని నేను సందేహిస్తున్నాను. అధిక, కరుణ గలిగిన చిత్తంగలవాడవై అసలు నీ వెవ్వరో నాకు చెప్పవా?

విశేషం: 1. ఈ పద్యంలో అర్జునుడు తన దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాడు. ఇది మత్తేభవృత్తం. 'భూరికరుణాయత్తైకచిత్తుండవై' అనే ఆ సమాసంలోని గంభీర గమనం - అక్షరాల పరిధిని దాటిన మహత్త్వాన్ని ప్రతిబింబిస్తున్నది.

వ. అనవుడు నప్పరమేశ్వరుం 'డేను లోకక్షయకర్త యగు కాలుండ; నిచ్చో జనసమాజ సమాహరణంబునకుం బ్రవృత్తుండ నైతి; నీవు సంపవలయు, నని లే; దీ గురుభీష్మాదు లెట్లును లేకుండువార; నాచేతం జచ్చిన వీరి నెల్లను జయించినవాఁడ వగుటకు నిమిత్తమాత్రమ్ము గమ్ము; లెమ్ము! రాజ్యమ్ము గైకొను!' మనిన విని వడవడ వడంకుచుం జేతులు మొగిడ్చి గద్గదకంఠంబుతో గాండీవి యిట్లనియె. 215

ప్రతిపదార్థం: అనవుడున్= అని (అర్జునుడు) చెప్పగా; ఆ+పరమ+ఈశ్వరుండు= ఆ పరమాత్మ (శ్రీకృష్ణుడు); ఏను= నేను; లోక, క్షయ, కర్త, అగు, కాలుండన్= లోకాలను నాశనం చేసేటటువంటి యముడను; ఈ+చోన్= ఈచోట (ఈ కురుక్షేత్ర సంగ్రామరంగంలో); జన, సమాజ, సమాహరణంబునకున్= మనుజుల గుంపుల వినాశానికి; ప్రవృత్తుండన్+ఐతిన్= పూనుకొనిన వాడను అయ్యాను; ఈవు= ఓ అర్జునా! నీవు; చంపవలయున్+అని+లేదు= సంహరించాలని లేదు; ఈ+గురు, భీష్మ+ఆదులు= ఈ గురువుగారైన ద్రోణుడు భీష్ముడు మున్నగువారు; ఎట్లును= తప్పకుండా ఏదో రీతిగా; లేకుండు వారు+అ= ఉండకుండా పోయేవారే; నా చేతన్= నా చేతనే; చచ్చిన= మరణించిన; వీరిన్+ఎల్లన్= వీరందరినీ; జయించినవాడవు+అగుటకున్= గెలిచినట్లు కనిపించే వాడవు అవటానికి; నిమిత్తమాత్రుండవు+కమ్ము= (పైకి కనిపించే) కారణానివి కావలసింది; లెమ్ము= లే (యుద్ధం చేయుము); రాజ్యమ్మున్= పరిపాలించే భూమిని; కైకొనుము= స్వీకరించుము; అనినన్+విని= అని శ్రీకృష్ణుడు చెప్పగా ఆలకించి; గాండీవి= అర్జునుడు (గాండీవం కల వాడు); వడవడ+వడంకుచున్= గజగజ కంపిస్తూ; చేతులు+మొగిడ్చి= చేతులు జోడించి నమస్కరించి; గద్గద+కంఠంబుతోన్= డగ్గుత్తిక వడిన గొంతుకతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా చెప్పగా, పరమాత్మ అయిన శ్రీకృష్ణుడు అతడితో ఈ విధంగా పలికాడు. 'నేను లోకాల నన్నిటినీ నాశనం చేసే యముడను సుమా.'' ఇప్పుడు ఈ కురుక్షేత్ర సంగ్రామ రంగంలో ఈ జనసందోహాన్ని సంహరించటానికి ఉద్యుక్తుడను అయ్యాను. నీవు చంపుతున్నట్లు భ్రమలో పడనవసరం లేదు. ఈ ద్రోణుడు భీష్ముడు మొదలైన వారు అందరూ అవశ్యం చావవలసిందే. నేను చంపే వీరిని అందరినీ నీవు చంపినట్లుగా కనిపించి విజయం గైకొని, రాజ్యాన్ని ఏలుకొమ్ము. నీవు నిమిత్తమాత్రుడవు సుమా! లే. ఇక యుద్ధం చేయుము.'' ఆ మాటలు ఆలకించి, అర్జునుడు వడవడ వణకుతూ చేతులు జోడించి శ్రీకృష్ణుడికి నమస్కారం చేసి, డగ్గుత్తికవడ్డ గొంతుతో ఈ విధంగా అన్నాడు.

తే. **అంబు పవమాన సూర్య చంద్రానలాది । వివిధ తత్త్వంబులును నీవ; విశ్వలోక**
సంప్రవర్తనకరుఁడవు శాశ్వతుండ । వచ్యుతుండవు పుండరీకాక్ష! నీవు. **216**

ప్రతిపదార్థం: పుండరీక+అక్ష!= తెల్లని పద్మాలవంటి కన్నులు కలవాడా! శ్రీకృష్ణా!; నీవు; అంబు, పవమాన, సూర్య, చంద్ర+ అనల+ఆది, వివిధ తత్త్వంబులును= నీరు, గాలి, సూర్య, చంద్ర, అగ్ని, మొదలైన పెక్కురూపాలు (యాథార్థ్యాలు); నీవు+అ= నీవే; విశ్వలోక, సంప్రవర్తన, కరుఁడవు= సర్వ లోకాలను నడపేవాడవు; శాశ్వతుండవు= ఎల్లప్పుడూ ఉండేవాడవు; అచ్యుతుండవు= పతనం లేని విష్ణుడవు.

తాత్పర్యం: తెల్లని తామరపూవుల వంటి కన్నులు గల శ్రీకృష్ణా! నీరు, గాలి, సూర్యచంద్రులు, అగ్ని మున్నగు తత్త్వాలన్నీ నీవే. అన్ని లోకాలను నడిపేవాడవు నీవే. నీవు ఎల్లప్పుడు ఉండేవాడవు. ఎన్నడూ పతనం లేని వాడవు.

విశేషం: తత్త్వములు: అనగా సత్యాలు: యథాస్థితాకారాలు. సృష్టికి ప్రథమావయమైన ప్రకృతి మొదటి పదార్థం. 'భిన్నమతాలు' 'తత్త్వాలను' భిన్నభిన్నాలుగా ప్రతిపాదించాయి.

మతాలు	తత్త్వములు
1.బౌద్ధం	శూన్యం
2. చార్వాకులు	పృథివి, నీరు, తేజస్సు, వాయువు
3. అర్హతులు-ఒక వర్గం	జీవం, అజీవం
4. అర్హతులు- ఇంకో వర్గం	జీవం, ఆకాశం, ధర్మం, అధర్మం, పుద్గలం

5. అర్హతులు - ఒక వర్గం	జీవం, అజీవం, అస్రతం, బంధం, సంవదం, నిర్జరం, మోక్షం
6. ద్వైతం	స్వతంత్రం, అస్వతంత్రం
7. విశిష్టాద్వైతం	చిత్తు, అచిత్తు, ఈశ్వరుడు
8. పాశుపతులు	పశువు, పతి, పాశం
9. సాంఖ్యం	అవ్యక్తం, బుద్ధి, అహంకారం, పంచతన్మాత్రలు, పంచభూతాలు, ఏకాదశేంద్రియాలు, ఆత్మ.
10. యోగులు	సాంఖ్యుల 25 తత్త్వాలు + ఈశ్వరుడు, వెరసి 26
11. అద్వైతం	బ్రహ్మం

పలువురు తాత్త్వికులు పెక్కు తత్త్వాలను ప్రతిపాదించారు.

క. నిను నెఱుఁగకుండి యాదవుఁ । డని సఖుఁడని మేనబావ యని యే సహభో
జనములు సల్లాపంబులు । నొనరించుచు మేలమాడుచుండుదు నెపుడున్. 217

ప్రతిపదార్థం: నినున్= నిన్ను (ఓ శ్రీకృష్ణా! నిన్ను); ఎఱుఁగకుండి= తెలియక; యాదవుఁడు+అని= యదువంశీయుడవు అని; సఖుఁడు= మిత్రుడు; అని= అనీ; మేనబావ+అని= మేనత్త కొడుకు అనీ; ఏన్= నేను; సహభోజనములు= కలిసి ఆహారం స్వీకరించటం; సల్లాపంబులున్= పరస్పర సంభాషణలు; ఒనరించుచున్= చేస్తూ; ఎపుడున్= ఎల్లప్పుడు; మేలము+ఆడుచుండుదున్= వేళాకోళం చేస్తూ ఉంటాను.

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! పరమాత్మా! నిను తెలియక యదువంశంలో జన్మించిన మానవమాత్రుడిగా, స్నేహితునిగా, మేనబావగా భావించి, కలిసి తిండి తినటం, వేళాకోళం ఆడటం చేశాను. నన్ను క్షమించుము.

తే. మఱియుఁ బెక్కులు లోకసామాన్యభంగు । లాచరించితి నీదెస, నంతవట్టుఁ
దల్లిదండ్రులు ప్రజలకుఁ దప్పుదారు । లెల్ల సైరించునట్లు సహింపవలయు.' 218

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; పెక్కులు= ఎన్నో; లోక+సామాన్య+భంగులు=లోకంలో సాధారణంగా జరిగే రీతులు; నీదెసన్= నీ యెడల; ఆచరించితిన్= చేశాను; అంత+పట్టున్= వాటిని అన్నిటినీ; తల్లిదండ్రులు= మాతాపితలు; ప్రజలకున్= కన్నబిడ్డలకు; తప్పు+దారులు+ఎల్లన్= దోషముల తీరులు అన్నీ; సైరించునట్లు= క్షమించేటట్లుగా; సహింపన్‌వలయున్= క్షమించవలసింది.

తాత్పర్యం: శ్రీకృష్ణా! నీ యెడ నేను ఎన్నో తప్పులు చేశాను. వాటిని అన్నిటినీ తల్లిదండ్రులు తమ బిడ్డలు చేసే తప్పులను క్షమించేటట్లుగా క్షమించ ప్రార్థన.'

వ. అని సంప్రార్థనంబు సేసి పార్థుండు వెండియు నిట్లను 'నదృష్టపూర్వం బైన భవదీయరూపంబు గనుంగొనం బడయుటం బ్రమోదంబును, బిట్టు చూచిన వెక్కసంబును, హృదయవ్యథయునుం బుట్టియున్నయది; నీతొంటి సౌమ్యాకారంబు గైకొని నిలిచి నాకు నాహ్లాదంబు సేయుము.' 219

ప్రతిపదార్థం: అని, సంప్రార్థనంబు+చేసి= అని హృదయపూర్వకంగా ప్రార్థించి; పార్థుండు= అర్జునుడు; వెండియున్= మరల; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అదృష్ట పూర్వంబు+ఐన= ఇంతవరకు చూడబడనట్టి; భవదీయ+రూపంబున్= నీ ఆకృతిని; కనుంగొనన్+పడయుటన్= చూడటం చేత; ప్రమోదంబును= సంతోషమూ; బిట్టు+చూచిన్= ఎక్కువగా చూచిన; వెక్కసంబును= సహింపరాని స్థితియు; హృదయ+వ్యథయును= గుండెలోని బాధయూ; పుట్టి+ఉన్న+అది= కలిగింది; నీతొంటి+సౌమ్య+ఆకారంబున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మొదటినుండీ ఉన్న నీ శాంతమైన ఆకృతిని; కైకొని= స్వీకరించి; నిలిచి= నిలబడి; నాకున్= నాకు; ఆహ్లాదంబు+చేయుము= ఆనందాన్ని కలిగించుము.

తాత్పర్యం: అర్జునుడు ఆ రీతిగా శ్రీకృష్ణుడిని ప్రార్థించి, ఇంకా ఈ రీతిగా అన్నాడు: 'శ్రీకృష్ణా! లోగడ నేను చూడని నీ విశ్వరూపాన్ని చూచి ఆనందించాను. కాని ఎక్కువ సేపు చూస్తే భరించలేని బాధ కలుగుతుంది. కాబట్టి, ఎప్పటి రీతిగా నీ శాంతస్వరూపం ధరించి నాకు సంతోషం చేకూర్చుమని నిన్ను మరల వేడుకొంటున్నాను.'

చ. అనుడు దయార్ద్రచిత్తుఁ డగు నప్పరమేశ్వరుఁ డక్కిరీటి కి
ట్లనుఁ 'దపమాచరించి నిగమాధ్యయనం బొనరించి కానరా
దనఘ! మదీయదివ్యపరమాకృతి; పేర్చిన ఏకభక్తి భా
వనమునఁ దోఁచు; దీని జనవర్గము గానదు; నీక చూపితిన్. 220

ప్రతిపదార్థం: అనుడున్= అని (అర్జునుడు) చెప్పగా; దయా+ఆర్ద్ర, చిత్తుడు+అగు= దయతో తడిసిన మనస్సు కలవాడు అయిన; ఆ+పరమ+ఈశ్వరుఁడు= ఆ పరమాత్మ- శ్రీకృష్ణుడు; ఆ+కిరీటికిన్= ఆ అర్జునుడికి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; తపము+ఆచరించి= తపస్సు చేసి; నిగమ+అధ్యయనంబు+ఒనరించి= వేదాలు చదివి; అనఘ!= ఓ పాపరహితుడైన అర్జునా!; మదీయ, దివ్య, పరమ+ఆకృతి= నాదైన లోకాతీతమైన గొప్ప ఆకారం; కానన్‌రాదు= దర్శింపవీలుగాదు; పేర్చిన= అతిశయించిన; ఏక+భక్తి+భావమునన్= ఏకాంత భక్తిపూర్వకమైన తలంపుతో; తోఁచున్= కన్పిస్తుంది; దీనిన్= ఈ నా విశ్వరూపాన్ని; జన+వర్గము= జనసందోహం; కానదు= చూడలేదు; నీకున్+అ= నీకు మాత్రమే; చూపితిన్= చూపించాను.

తాత్పర్యం: అర్జునుడు ఆ మాటలు పలుకగా, దయతో నిండిన చిత్తం కలవాడై శ్రీకృష్ణ పరమాత్మ ఆతడితో ఈ విధంగా చెప్పాడు: 'వేదాలు పఠించిన విద్వాంసులుగానీ కఠోర తపస్సులు చేసిన మహర్షులుగానీ సమాహిత భక్తిభావంతో మాత్రమే చూడగలిగిన నా విశ్వరూపాన్ని సాధారణ జనులు దర్శించలేదు. నీకు మాత్రమే చూపాను.

వ. నీకు హృదయవ్యథం బొంద నేల? మూఢత్వంబు విడిచి విగతభయుండ వై సంప్రీతచేతస్కుండవు గ' మ్మని చెప్పి పూర్వప్రకారరూపంబు దాల్చి నిల్చినం గనుంగొని , కౌంతేయుం డా సౌమ్యరూపంబు సూచి 'సచేతనత్వంబు నొందితిఁ బ్రకృతిస్థుండ నైతి, నని పలుకుటయు, వాసుదేవుండు 'మత్కర్మపరుండును మద్భక్తుండును నైనవానికి నన్నుఁ బడయవచ్చు' నని యతని నాశ్వాసించి. 221

ప్రతిపదార్థం: నీకున్= ఓ అర్జునా నీకు; హృదయ, వ్యథన్+పొందన్+ఏల?= మనసులో బాధ అనుభవించనేల?; మూఢత్వంబు+విడిచి= బుద్ధిమాంద్యం వీడి; విగత, భయుండవు+ఐ= పోయిన భీతి గల వాడవై; సంప్రీత, చేతస్కుఁడవు, కమ్ము= సంతోషంతో కూడిన మనస్సు గలవాడవుగా మారుము; అని చెప్పి= అని పలికి; పూర్వప్రకారరూపంబున్+తాల్చి= మునుపటి రూపం ధరించి; నిల్చినన్= నిలబడగా; కనుంగొని= చూచి; కౌంతేయుండు= కుంతీ కుమారుడు - అర్జునుడు; ఆ+సౌమ్య, రూపంబు+చూచి= ప్రశాంతంగా కనిపించే ఆ ఆకారం చూచి; సచేతనత్వంబున్+ఒందితిన్= కదలికతో కూడిన వాడను అయినాను; ప్రకృతిస్థుండన్+ఐతిన్= సహజస్థితిని పొందాను; అని+పలుకుటయున్= అని చెప్పగా; వాసుదేవుండు= వసుదేవుడి కొడుకు- శ్రీకృష్ణుడు; మత్+కర్మపరుండును= నాదైన కర్మలు చేసేవాడున్నూ (అనగా నాకు ఇష్టమైన సత్క్రియలు చేసేవాడును); మత్+భక్తుండును= నా భక్తుడైన వాడున్నూ (నన్ను ప్రేమతో ఆరాధించే వాడూ); ఐనవానికిన్= ఐనట్టివానికి; నన్నున్+పడయన్+వచ్చున్= నన్ను పొందవచ్చును (మోక్షం అందుకొనవచ్చును); అని= అని; అతనిన్= అర్జునుడిని; ఆశ్వాసించి= ఓదార్చి.

తాత్పర్యం: 'ఓ అర్జునా! నీవు బాధపడవద్దు. ఆ అవసరం లేదు. నీ అజ్ఞానాన్ని విడిచిపెట్టి భయంలేనివాడవై, ఆనందం పొందిన వాడవై ఉండుము' అని శ్రీకృష్ణుడు చెప్పి, వెనుకటి ఆకారం ధరించి, ప్రశాంతమూర్తిగా కన్పించాడు. ఆ సౌమ్య స్వరూపం చూచి, అర్జునుడు ఈ విధంగా అన్నాడు. 'ఓ శ్రీకృష్ణా! నీ విశ్వరూపం చూచినప్పుడు నేను కొయ్యబారిపోయాను. ఇప్పుడు ఆ భయం పోయింది. నేను తిరిగి యథాప్రకారంగా కదలిక మెదలిక కల మనిషిని కాగలిగాను.' అర్జునుడు చెప్పిన ఆ మాటలు విని, శ్రీకృష్ణుడు అతడిని ఓదార్చి ఈ విధంగా చెప్పాడు. 'నాకు ఇష్టమైన మంచి పనులు చేసేవాడూ. నాకు భక్తుడు అయినవాడూ నన్ను పొందగలడు.'

విశేషం: 1. మద్భక్తుండు అని మాత్రమేగాక, మత్ కర్మపరుండును అని శ్రీకృష్ణుడు చెప్పాడు. అనగా కర్మయోగం - భక్తియోగం వేరుకావని - రెండూ కలిసే ఉంటాయని శ్రీకృష్ణుడి సందేశం.

తే. **అతఁడు మఱియును బ్రహ్మవిద్యాన్వయమునఁ। దనకు సందిగ్ధ మైనట్టి దాని నెల్ల**
నడుగఁగా నమ్మహాత్ముఁ డత్యంతకరుణఁ। దెలియఁ జెప్పుచు హృదయసంచలత మాన్చె. **222**

ప్రతిపదార్థం: అతఁడు= శ్రీకృష్ణుడు; మఱియును= ఇంకా; బ్రహ్మ+విద్యా+అన్వయమునన్= పరమాత్మకు సంబంధించిన జ్ఞానాన్ని అనుసంధించటంలో; తనకున్= అర్జునునకు; సందిగ్ధము+ఐనట్టి+దానిన్+ఎల్లన్= సందేహములు ఏర్పడిన వాటిని అన్నింటినీ; అడుగఁగాన్= ప్రశ్నింపగా; ఆ+మహా+ఆత్ముడున్= ఆ మహాత్ముడు- గొప్ప ఆత్మగలవాడు; అత్యంత+కరుణన్= మిక్కిలి దయతో; తెలియన్+చెప్పుచున్= వివరించి చెప్పుతూ; (అర్జునుడి) హృదయ+సంచలతన్= హృదయానికి సంబంధించిన కలతను; మాన్చెన్= పోగొట్టాడు.

తాత్పర్యం: అంతేకాక, శ్రీకృష్ణుడు ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అర్జునుడికి బోధించాడు. అర్జునుడికి కలిగిన సందేహాలను అతడు అడుగగా, ఆ సందేహాలు అన్నిటినీ పోగొట్టాడు. అర్జునుడి గుండెలో ఉన్న కలతను పోగొట్టాడు.

విశేషం: 1. ఈ పద్యం వలన తిక్కన భగవద్గీతను సంక్షేపించినట్లు సుస్పష్టం.

2. 'బ్రహ్మవిద్యా+అన్వయమున' అనే ప్రయోగం గమనించదగ్గది. స్థూల దృష్టికి భగవద్గీతలోని వాక్యాలలో విప్రతిపత్తి కన్పించవచ్చును. సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే ఆ వైరుధ్యాలు తొలగిపోతాయి. అర్జునుడికి శ్రీకృష్ణుడు ఉపదేశించింది - బ్రహ్మవిద్య మాత్రమేకాదు. 'అన్వయం'గూడ. ఈ వాక్యంలోని నిష్ఠ, విద్య మీదగాక 'అన్వయం' మీద ఉన్నది.

వ. **ఇవ్విధంబునఁ బార్థున కుపనిషదర్థజాతం బవగతంబు సేసి, మనసుకసటు వాపి, వివేకంబునకుం జేవ గలిగించి కృష్ణుం 'డీ గుహ్యతరజ్ఞానం బుపదేశించితి; దీని నెఱింగికొని నీ కెట్లు సూడం బోలె నట్లు ప్రవర్తింపు మను పలుకు పలికి, యింతకంటెం బరమరహస్యం బొక్కటి సెప్పెద విను' మని యతని కిట్లనియె.** **223**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; పార్థునకున్= అర్జునుడికి; ఉపనిషత్+అర్థ+జాతంబు= ఉపనిషత్తులకు సంబంధించిన భావ సముదాయం; అవగతంబు+చేసి= వివరించి చెప్పి; మనసు+కసటు+పాపి= మనస్సులోని సందేహాలు అన్నీ తీర్చి; వివేకంబునకున్+చేవ కలిగించి= ఆత్మజ్ఞానానికి గట్టిదనం కలిగించి; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; ఈ+గుహ్య, తర, జ్ఞానంబు= మిక్కిలి రహస్యమైన జ్ఞానాన్ని; ఉపదేశించితిన్= తెలియచేశాను; దీనిన్= ఈ రహస్య జ్ఞానాన్ని; ఎఱింగికొని= తెలిసికొని; నీకున్+ఎట్లు= నీకు ఏరీతిగా; చూడన్+పోలెన్= కనిపిస్తుందో; అట్లు= ఆ రీతిగా; ప్రవర్తింపుము= ఆచరించుము; అను+పలుకు+పలికి= అను మాటలు చెప్పి; ఇంత కంటెన్= దీని కంటెను; పరమ+రహస్యంబు= గొప్పదైన రహస్యం; ఒక్కటి+చెప్పెదన్= ఒకటి చెప్పగలను; వినుము+అని= ఆలకింపుము అని; అతనికిన్= అర్జునుడికి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ రీతిగా అర్జునుడికి ఉపనిషత్తులలోని సారం అనదగిన సందేశం అందించి, శ్రీకృష్ణుడు ఇట్లా చెప్పాడు. 'ఓ అర్జునా! నీకు మిక్కిలి రహస్యమైన జ్ఞానాన్ని అందించాను. నీవు ఈ సందేశాన్ని అవగాహన చేసికొని, నీకు నచ్చిన రీతిగా ప్రవర్తించుము. ఇంకో మాట. ఇంత కంటె గూడ గొప్ప రహస్యం ఒకటి ఉన్నది. దానిని చెప్పగలను. జాగ్రత్తగా ఆలకించుము.

విశేషం: వివేకం= రెండు వస్తువుల సూక్ష్మభేదం గుర్తించి వేరుపరచటం; ఆత్మ- అనాత్మ భేదం తెలుసుకొనటం, మిథ్యా ప్రపంచం నుండి పరమాత్మను వేరుగా గుర్తించటం.

తే. **' క్రందుకొను సర్వధర్మవికల్పములను । నెడల విడిచి దృఢంబుగ నే నొకండ**
శరణముగ నాశ్రయింపుము సకలదురిత । ములకుఁ దొలఁగింతు నిన్నుఁ బ్రమోద మొంద. **224**

ప్రతిపదార్థం: క్రందుకొను= గుమిగూడే; సర్వ+ధర్మ+వికల్పములను= అన్ని ధర్మాల ప్రత్యామ్నాయాలను; ఎడలన్+విడిచి= తొలగునట్లుగా విడిచిపెట్టి; దృఢంబుగన్= గట్టిగా- ఏకైక దీక్షతో; ఏన్+ఒకండన్= నేను ఒకడను మాత్రమే; శరణముగన్= ఏకైక రక్షణగా; ఆశ్రయింపుము= ఆధారంగా చేసికొనుము; నిన్నున్= నిన్ను; సకల, దురితములకున్= అన్ని పాపాలకు; ప్రమోదము+ఒందన్= సంతోషం చెందేటట్లుగా; తొలఁగింతున్= పోగొట్టగలను.

తాత్పర్యం: 'ఓ అర్జునా! ఇది అన్నిటిని మించినట్టి గొప్ప సందేశం. ఆలకించుము. ధర్మాలు ఎన్నో ఉండవచ్చును. ధర్మాలకు ప్రత్యామ్నాయాలు ఉండవచ్చును. వాటిని అన్నిటినీ వదలిపెట్టి, రక్షించేవాడను నేను ఒకడనే అని నమ్మి నన్ను శరణుపొందుము చాలు. నీ పాపాలు అన్నీ పోగొట్టి నీకు సంతోషం చేకూర్చగలను.

విశేషం: 1. ఈ పద్యానికి భగవద్గీతలో- మాతృక అనదగిన సంస్కృత శ్లోకం ఇది.

శ్లో॥ 'సర్వధర్మాన్ పరిత్యజ్య । మా మేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపేభ్యో । మోక్షయిష్యామి మా శుచః'.(భ.గీ. 18-66)

దీనికి లోకంలో చరమశ్లోకం అని ప్రఖ్యాతి ఏర్పడింది. ఈ శ్లోకంతో గీతా సందేశం సమాప్తి అవుతుంది.

మూల సంస్కృత శ్లోకంలో. సర్వ ధర్మాన్ పరిత్యజ్య; అన్ని ధర్మాలనూ పరిత్యజించి అని ఉన్నది. తిక్కన తెలుగుసేతలో వ్యాఖ్యాన ప్రాయంగా (క్రందుకొను) సర్వధర్మ వికల్పములను విడిచిపెట్టుమని ఉన్నది. భగవద్గీతా సందేశంలో ఎన్నో ధర్మాలు క్రందుకొని కన్పిస్తాయి. భగవద్గీత - ఏకైక ధర్మాన్ని ప్రబోధించలేదు. ధర్మం వైకల్పికము - అని భగవద్గీత ప్రబోధిస్తున్నది. అందుచేతనే సాంఖ్యయోగం, కర్మయోగం, జ్ఞానయోగం, కర్మ సన్న్యాసయోగం, ఆత్మసంయమయోగం మొదలైనవి ఎన్నో ఉన్నాయి. సంసారతరణోపాయాలు ఎన్నోఉన్నాయి. చిట్టచివరకు శ్రీకృష్ణపరమాత్మ అందించిన సందేశం 'సరే, తరణోపాయాలు ఎన్నో చెప్పాను కదా. అవి అన్నీ ఆచరణీయాలే. అయితే, ఏ కారణం చేతనైనా నీవు వాటిని వేటినీ ఆచరించలేకపోతే దిగులుపడ నవసరం లేదు. అందరకూ సులభ సాధ్యమైన ఒక ఉపాయం ఉన్నది. అది శరణాగతి. నన్ను (భగవంతుని) శరణు వేడితే చాలు. నేను నిన్ను పాపాలనుండి విముక్తుడిని చేసి మోక్షం ఇస్తాను.

శాంతిపర్వంలో 'క్రందుకొను ధర్మవికల్పములను' తిక్కన పేర్కొన్నాడు. భీష్ముని ఉపదేశం చివర.

"కొందఱు బ్రహ్మచర్యమునఁ గొందఱు భవ్యగృహస్థ ధర్మముం
బొందుటఁ, గొంద ఱిద్ధ తపమున్ వనభూమిఁ దగం జరించుటం
గొందఱు నిష్క్రియత్వమునఁ, గొందఱు యజ్ఞ విధానశాలితం

గొంద ఆనూన దానమును గోరి యొనర్తురు నిత్య సౌఖ్యమున్."
జననీజనకారాధన । మున గురుభక్తిని సువృత్తమున శాంతిని దాం
తిని సత్యమున నహింసను । విను కాంతురు మోక్షపదము వేర్వేఱ జనుల్" - (శాంతిపర్వం 6 అశ్వా - పద్యం 553) భగవద్గీతలో... శ్రీకృష్ణపరమాత్మ చిట్టచివరకు చెప్పిన మాట 'శరణాగతి'. ఇది భక్తిమార్గం. భక్తి చాలు. భక్తితో సర్వపాపాలు నశించిపోతాయి.

హిందూమతంపై కొందరు పాశ్చాత్యులు చేసే విమర్శ ఒకటి ఉన్నది. 'హిందువులు కర్మ సిద్ధాంతం ప్రతిపాదించారు. మంచి కర్మలు చేస్తే పుణ్యం వస్తుంది. చెడ్డపనులు చేస్తే పాపం వస్తుంది. ఇక దేవుడు చేసేది ఏముంది? జీవుడు హైందవ వేదాంతం ప్రకారం - ఈ కర్మ చక్రబంధంలో సదా పరిభ్రమించవలసిందే అనేక జన్మలు ఎత్తుతూ.''

ఈ చరమ శ్లోకంలో సుస్పష్టంగా చెప్పబడింది. శరణాగతి చేస్తే చాలు భగవంతుడు సర్వపాపాలను పోగొట్టి మోక్షం ప్రసాదించగలడు. వైష్ణవులు ఈ చరమ శ్లోకం గీతా సందేశానికి కేంద్ర గరిమనాభి అని అంటారు. 'ముక్తికి - భక్తి చాలు.' ఇది శ్రీవైష్ణవ వేదాంతం.

విశిష్టాద్వైత మతప్రోక్తయైన రామానుజాచార్యుడు చరమ శ్లోకానికి ప్రత్యేక ప్రాముఖ్యం ఇచ్చారు. అయితే పఠితలు గుర్తుంచుకోవలసిన అంశం - ఇది చరమ శ్లోకమేగాని ప్రథమ శ్లోకమూ కాదు. ఏకైక శ్లోకమూ కాదు.

రామానుజాచార్యుల తరువాత, ఈ భక్తిమార్గం - 1. మార్జాల కిశోర న్యాయం 2. మర్కట కిశోర న్యాయం అని రెండు మార్గాలుగా చీలింది. భగవంతుడే భక్తుడిని తల్లిపిల్లి పిల్లలను మోసికొని పోతుంది మార్జాల కిశోర న్యాయంలో. తల్లికోతి పొట్టకు అంటిపెట్టుకొని చెట్టునుండి ఇంకో చెట్టుకు పోతాయి మర్కట కిశోరాలు.

భగవద్గీత కేవలం శరణాగతికి ఏకాంత భక్తికి మాత్రమే ప్రాముఖ్యం ఇచ్చియుంటే ఈ ఒక్క శ్లోకం చాలు. ఇన్ని అధ్యాయాలు ఇన్ని శ్లోకాలు ఉన్నాయి కదా. ముక్తికి ఎన్నో ఉపాయాలను భగవద్గీత పేర్కొన్నది. 'శరణాగతి' పరమోపాయం అని తిక్కన స్పష్టీకరించి, ఇది అన్నిటి కంటే గొప్ప రహస్యం అని కూడా చెప్పియున్నాడు.

వ. ఇప్పరమోపాయంబు. **225**

తాత్పర్యం: మిక్కిలి గొప్పది అయిన ఈ వెరవు.

క. నియతియుఁ దపమును నా దెస । భయభక్తులు గలిగి నాకు భక్తుం డై ని
శ్చయనిపుణుఁ డయినవానికిఁ । బ్రియమున నెఱిఁగింపు వలదు పెఱవారలకున్.' **226**

ప్రతిపదార్థం: నియతియున్= ఇంద్రియ నిగ్రహమును; తపమును= శరీర క్లేశమునకు జంకక పాటించే ఆధ్యాత్మిక చింతన; నా దెసన్= నా యెడల; భయ+భక్తులు= భీతి గౌరవ పురస్సరమైన ప్రేమ; కలిగి= ఉండి; నాకున్= నాకు; భక్తుండు+ఐ= ఆరాధించేవాడయి; నిశ్చయ+నిపుణుండు+అయిన వానికిన్= దృఢమైన మనస్సు గలవాడికి; ప్రియమునన్= ప్రీతితో; ఎఱిఁగింపుము= ఉపదేశించుము; పెఱ+వారలకున్= ఇతరులకు (అనగా భక్తులు కాని వారలకు); వలదు= ఎరిగించవద్దు.

తాత్పర్యం: ఇంద్రియ నిగ్రహం, నీతినియమాలు గల సౌశీల్యవంతుడు, నా యెడ భక్తి కలిగినవాడికి మాత్రమే నేను నీకు చేసిన ఈ సందేశం అందించుము. అంతేకాని, దృఢమైన మనస్సు లేనివాడికి తదితరులకు ఈ సందేశం వినిపించవద్దు సుమా!

విశేషం: 1. సత్యమూ జగద్విదితమూ అయిన భగవద్గీతా సందేశం రహస్యంగా ఉంచమనటంలో శ్రీకృష్ణుడి ఆంతర్యం ఏమిటి? జిజ్ఞాస లేనివారికి - యోగ్యత లేనివారికి ఈ సందేశం అందించరాదు. ఎందుచేతనంటే- అది నిష్ఫలం కావటం మాత్రమే గాక ప్రమాదాలకు దారితీయవచ్చును.

వ. అని వెండియుఁ బుండరీకాక్షుండు 'నాచెప్పిన యది లెస్సగా నాకర్ణించితే? నీయజ్ఞాన సమ్మోహం బంతయుం బాసెనే?' యనవుడు నర్జునుండు. 227

ప్రతిపదార్థం: అని, వెండియున్= అని చెప్పి - మరల; పుండరీక+అక్షుండు= తెల్లతామర పువ్వుల వంటి కన్నులు గలవాడు - శ్రీకృష్ణుడు; నా+చెప్పిన+అది= నేను చెప్పినట్టిది; లెస్సగాన్= బాగుగా; ఆకర్ణించితి(వి)+ఏ= విన్నావుగదా; నీ, అజ్ఞాన, సమ్మోహంబు= నీ తెలివి లేకుండటం - భ్రాంతి; అంతయున్= సర్వమూ; పాసెను+ఏ?= పోయినదా?; అనవుడున్= అని చెప్పగా; అర్జునుండు= అర్జునుడు.

తాత్పర్యం: అని మరల శ్రీకృష్ణుడు తన సందేశం అందించగా అర్జునుడు విన్నాడు. చివరకు శ్రీకృష్ణుడు అర్జునుడికి ఒక ప్రశ్న వేశాడు. 'అర్జునా! నీకు చెప్పిన విషయాలు అన్నీ విన్నావు గదా. నీ అజ్ఞానం తొలగిపోయిందా? నీ భ్రాంతి అంతా పోయింది కదా!' అని అడిగాడు. అప్పుడు అర్జునుడు ఈ విధంగా చెప్పాడు:

విశేషం: అనవుడు అనగా, నావుడు అనగా అని చెప్పగా అని అర్థం. తెలుగు భారతంలో ఈ పదాలు చాలా చోట్ల ప్రయోగించబడ్డాయి. భారత కథ చాలా భాగం సంభాషణ రూపంలో నడిచింది. 'వైశంపాయనుండు జనమేజయునకు ఇట్లనియె' 'సూతుండు శౌనకాది మహర్షులకు ఇట్లనియె', శ్రీకృష్ణుడు అర్జునుడితో ఇట్లనియె, సంజయుండు ధృతరాష్ట్రునకు ఇట్లనియె - ఈ విధంగా.

అందుచే అనవుడు- నావుడు శబ్దాలు విరివిగా వాడబడ్డాయి. ఇవి డుకారాంతాలుగదా! తెలుగులో "డు'' ప్రథమా విభక్తి ప్రత్యయం. పురుషనామాల చివర 'డు' తరచుగా వస్తుంది. ఒక శ్రోత అడిగాడట- "అనవుడుకు నావుడు ఏమౌతాడని'. ఇంకో శ్రోత చెప్పిన సమాధానం- 'అనవుడు నావుడు అన్నదమ్ములు'. ఈ చమత్కార కథ తెలుగు సీమలో ఎక్కువ ప్రచారంలో ఉండేది.

ఉ. ' మోహ తమంబు వాసెఁ; దుది ముట్టిన నీదు ప్రపత్తి వీత సం
దేహుఁడనైతి; గాఢపరిదీప్త మహాకృతిఁ గాంచి బోధ స
న్నాహనిరామయస్థిరమనస్థితిఁ బొందితి; సర్వలోక ని
ర్వాహవినోద! నీ విమల వాక్యము చొప్పున నెల్లఁ జేసెదన్.' 228

ప్రతిపదార్థం: మోహ+తమంబు+పాసెన్= మోహం అనే చీకటి తొలగిపోయింది; తుదిన్+ముట్టిన= చివరి భాగాన్ని తాకిన, పరిపూర్ణత చెందిన; నీదు+ప్రపత్తిన్= నీ యందలి భక్తిచేత; వీత+సందేహుఁడన్+ఐతిన్= పోయిన అనుమానాలు గలవాడను అయ్యాను; గాఢ, పరిదీప్త, మహా+ఆకృతిన్= గొప్పగా దేదీప్యమానంగా వెలుగొందిన ఆకృతిని (నీ విశ్వరూపాన్ని); కాంచి= చూచి; బోధ+సన్నాహ+నిరామయ+స్థిర+మనస్+స్థితిన్= జ్ఞానంతో నిండిన ఆరోగ్యంతో కూడి చలించనట్టి మనస్సు యొక్క ఉనికిని; పొందితిన్= సంపాదించాను; సర్వ, లోక, నిర్వాహ వినోద!= అన్ని లోకాలను నడపటమే క్రీడగా గలవాడా!- శ్రీకృష్ణా!; నీ, విమల, వాక్యము, చొప్పునన్= నీవు చెప్పిన మాటల ప్రకారం; ఎల్లన్= అంతా; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: 'భ్రాంతి అనే చీకట్లు నానుండి తొలగిపోయాయి. నీయెడ నాకు కుదిరిన పరిపూర్ణ భక్తి విశ్వాసం చేత అన్ని అనుమానాలు నాకు తొలగిపోయాయి. నీ విశ్వరూప సందర్శనం చేత నా జ్ఞానం దృఢంగా పాదుకున్నది. సర్వలోకాలను నడపటమే క్రీడగాగలవాడా, ఓ శ్రీకృష్ణా, నీవు చెప్పినట్లుగా నేను నడచుకోగలను.'

విశేషం: 1. ఇక్కడ శ్రీకృష్ణుడి ప్రబోధం - అర్జునుడి అనుభూతి రెండూ కలిశాయి. ఒకటి శాస్త్రం. అది సిద్ధాంత భాగం. రెండవది కళ. అనుష్ఠానం. సిద్ధాంతం అనుభూతి వలన ధ్రువీకరించబడుతుంది.

2. భగవద్గీత బోధించే వేదాంతం ఏమిటి? వేదాంత తత్త్వం ఐహిక కర్మ విదూరం కాదు; కర్తవ్య ఆచరణ అందులో ఇమిడి ఉన్నది ఎందుచేతనంటే గీతా ప్రబోధం విన్న తదుపరి అర్జునుడు గాండీవాన్ని పట్టి యుద్ధం చేశాడు. కాషాయాంబరాలు ధరించి అడవికి పోలేదు. అడవికి పోవటం తప్పని కాదు. కర్తవ్యం నిర్వహించటం ఒప్పు అని చెప్పటమే.

వ. అని పలికి యప్పరమపురుషునకు సభక్తిక సాష్టాంగ దండ ప్రణామంబు సేసి పార్థుండు గృతార్థుండై ధృతాయుధుండయ్యె'నని చెప్పి సంజయుండు వెండియు నిట్లనుం 'గురుకులేశ్వరా! యేను మునిగణేశ్వరుండైన పారాశర్యు కారుణ్యంబునఁ గృష్ణార్జునుల యద్భుతపుణ్యసంవాదంబు వినుటకు మహాయోగీంద్ర హృదయానందకరుం డైన యద్దేవుని దివ్యరూపంబు గనుటకుం బాత్రభూతుండ నైతి; నమ్మహాత్ముండు దన మధురవాక్యంబుల నుపదేశింప నత్యంతగుహ్యం బైన యోగప్రకారంబు విశదంబుగా ననుసంధించితి; నమ్మహానుభావుల సంభాషణములు నవ్విశ్వరూపుని మహనీయాకారంబునుం దలంచి తలంచి యచ్చెరు వందుచుఁ బ్రియం బందుచు నుండుదు' నని మఱియును. 229

ప్రతిపదార్థం: అని+పలికి= అని (అర్జునుడు చెప్పి); ఆ+పరమ, పురుషునకున్= ఆ (కృష్ణ) పరమాత్మకు; స, భక్తిక, స+అష్టాంగ దండ, ప్రణామంబు+చేసి= భక్తితో కూడిన ఎనిమిది అవయవాలు భూమిని సోకు నమస్కారం చేసి; పార్థుండు= అర్జునుడు (పృథ= కుంతి); కృత+అర్థుండు+ఐ= ధన్యుడై; ధృత+ఆయుధుండు+అయ్యెన్= ఆయుధాన్ని ధరించినట్టి వాడయ్యె; అని+చెప్పి= అని వచించి; సంజయుండు= సంజయుడు; వెండియున్= మరల; ఇట్లు+అనున్= ఈవిధంగా చెప్పాడు; కురు+కుల+ఈశ్వరా!= కురు వంశానికి అధిపతీ- ఓ ధృతరాష్ట్రా!; ఏను= నేను; ముని, గణ+ఈశ్వరుండు+ఐన= మునుల సముదాయంలో శ్రేష్ఠుడు ఐన; పారాశర్య+కారుణ్యంబునన్= పరాశర మహర్షి కొడుకైన వ్యాసుడి దయవలన; కృష్ణ+అర్జునుల= శ్రీకృష్ణుడికి అర్జునుడికి మధ్య జరిగిన; అద్భుత+పుణ్య+సంవాదంబు= ఆశ్చర్యకరమైనట్టిదియు, సుకృతమును చేకూర్చునట్టిదియును అయిన సంభాషణ; వినుటకున్= వినటానికి; మహా, యోగి+ఇంద్ర, హృదయ, ఆనందకరుండు+ఐన= గొప్ప ఋషులలో శ్రేష్ఠులైనవారి హృదయాలకు సంతోషం చేకూర్చేవాడైన; ఆ+దేవుని= ఆ భగవంతుడి; దివ్య+రూపంబు= లోకోత్తరమైన ఆకారం; కనుటకున్= చూడటానికి; పాత్ర, భూతుండన్+ఐతిన్= యోగ్యుడను కాగలిగాను; ఆ+మహా+ఆత్ముండు= గొప్ప ఆత్మగల ఆతడు- శ్రీకృష్ణుడు; తన+మధుర+వాక్యంబులన్+ఉపదేశింపన్= తియ్యనైన తన మాటలు చెప్పగా; అత్యంత+గుహ్యంబు+ఐన= మిక్కిలి రహస్యమైనట్టి; యోగ+ప్రకారంబు= యోగ పద్ధతి; విశదంబుగాన్= తేటతెల్లం అయ్యే రీతిలో; అనుసంధించితిన్= తగినట్లుగా కూర్చి చెప్పాను; ఆ+మహా+అనుభావుల+సంభాషణములు= ఆ మహాత్ముల మాటలు; ఆ+విశ్వరూపుని= విశ్వమే తన ఆకారంగా గల ఆ శ్రీకృష్ణుడి; మహనీయ+ఆకారంబున్= గొప్ప ఆకృతిని; తలంచి; తలంచి= మరల మరల స్మరించి; అచ్చెరువు+అందుచున్= ఆశ్చర్యం అనుభవిస్తూ; ప్రియంబు+అందుచున్= ప్రీతిని అనుభవిస్తూ; ఉండుదున్= ఉంటాను; అని మఱియును= అని చెప్పి మరల.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడు శ్రీకృష్ణుడికి భక్తితో సాష్టాంగ నమస్కారం చేసి గాండీవం ధరించి నిలిచాడు, అని సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పి, మరల ఈ విధంగా అన్నాడు. 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! నేను ఋషివరేణ్యుడైన వ్యాసుడి కరుణవలన కృష్ణార్జునుల సంభాషణ విన్నాను. యోగీశ్వరుల హృదయానికి ఆనందం కలిగించే శ్రీకృష్ణుడి విశ్వరూపం సందర్శించగలిగాను. అంతేకాక మహానుభావుడైన శ్రీకృష్ణుడు అర్జునుడికి అందించిన దివ్య సందేశం యోగ విద్యా సారసంగ్రహం ఆలకించాను. ఆ మహానుభావుల సంభాషణలు- ప్రపంచస్వరూపుడైన శ్రీకృష్ణుడి మహనీయస్వరూపం మాటి మాటికి తలపోసి ఆశ్చర్యము, ఆనందము చెందుతూ ఉంటాను.

విశేషం: 1. భగవద్గీత ప్రత్యక్షంగా విన్నది, శ్రీకృష్ణుడి విశ్వరూపం సందర్శించింది అర్జునుడు. అయితే అతడితోపాటు ప్రత్యక్షంగా వినే అవకాశం చూచే అవకాశం సంజయుడికి సంక్రమించింది గదా వ్యాసమహర్షి దయవలన. అటు అర్జునుడి మాట అటుంచి- ఇటు సంజయుడు ఆనందతన్మయుడై ఉప్పొంగి పోతున్నాడు.

2. సాష్టాంగదండప్రణామం: దండాకారంగా ఎనిమిది అంగాలు, అవయవాలు నేలకు తగిలేటట్లుగా చేసే నమస్కారం. 1. మోకాళ్ళు 2. పాదాలు 3. చేతులు 4. రొమ్ము 5. బుద్ధి 6. తల 7. మాట 8. చూపు- ఇవి అష్టాంగాలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. ' అధిప! యోగీశ్వరేశ్వరుం డైన కృష్ణుఁ। డును ధనుర్ధరవర్యుఁ డర్జునుఁడు నెచట
నిలిచి రచ్చట విజయంబు నీతి సిరియు। భూతి నిత్యంబు లగు; నిది నా తలంపు.' 230

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఓ ధృతరాష్ట్ర మహారాజా!; యోగి+ఈశ్వర+ఈశ్వరుండు+ఐన= ఉత్తమ యోగులలో గొప్పవాడు అయిన; కృష్ణుఁడును= శ్రీకృష్ణుడూ, ధనుస్+ధర+వర్యుఁడు= ధానుష్కులలో- ధనువు ధరించే వారలలో శ్రేష్ఠుడైన; అర్జునుఁడు= అర్జునుడును; ఎచటన్= ఏ స్థలంలో; నిలిచిరి= నిలబడ్డారో; అచ్చటన్= ఆ స్థలంలో; విజయంబు= గెలుపు; నీతి= మంచి నడవడి తీరు; సిరియున్= ఐశ్వర్యం; భూతి= ప్రాభవం; నిత్యంబులు+అగున్= సర్వదా ఉంటాయి; ఇది= ఇది; నా+తలంపు= నా అభిప్రాయం.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడూ, విలుకాండ్రలో శ్రేష్ఠుడైన అర్జునుడూ, ఎచ్చట కలిసి మెలిసి ఉంటారో అచ్చట నీతి, సిరిసంపదలు, విజయం సర్వదా ఉంటాయి.

విశేషం: 1. శ్రీకృష్ణుడు యోగీశ్వరుడుగా భారతంలో భగవద్గీతలో అభివర్ణితుడు.

2. ఆధ్యాత్మిక శక్తికి ప్రతీక శ్రీకృష్ణుడు, ఐహికశక్తికి ప్రతీక అర్జునుడు. శ్రీకృష్ణుడు దైవశక్తికి, పురుషకార శక్తికి అర్జునుడూ ప్రతీకలు. యోగం+పురుషకారం= విజయం అని సంజయుడి వ్యాఖ్యానం.

వ. అనిన విని ధృతరాష్ట్రుం డిట్లనియె. 231

ప్రతిపదార్థం: అనినన్+విని= అని (సంజయుడు చెప్పగా) ఆలకించి; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని సంజయుడు చెప్పగా ఆలకించి ధృతరాష్ట్రుడు ఈ రీతిగా చెప్పాడు.

క. ' ఇవ్విధమున నాయిత మై। క్రొ వ్వెలరారంగ నిలిచి కురుపాండవులం
దెవ్వరు మును గడఁగిరి? రణ। మెవ్విధి నూలుకొని చెల్లె? నెఱిఁగింపు తగన్.' 232

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ రీతిగా; ఆయితము+ఐ= సంసిద్ధమై; క్రొవ్వు+ఎలరారంగన్= గర్వం అతిశయించగా; నిలిచి= నిలబడి; కురు+పాండవులందున్+ఎవ్వరు= కౌరవులలో పాండవులలో ఎవ్వరు; మును= ముందుగా; కడఁగిరి= పూనిరి; రణము= యుద్ధం; ఏ+విధిన్= ఏ రీతిగా; నూలుకొని= ప్రారంభించి; చెల్లెన్= జరిగింది; తగన్= తగినట్లుగా; ఎఱిఁగింపు(ము)= తెలియజేయుము.

తాత్పర్యం: 'ఈ విధంగా యుద్ధానికి సంసిద్ధమై, గర్వంతో కురు పాండవులు నిలిచారు గదా! ఉభయ పక్షాలలో మునుముందుగా యుద్ధం ఎవరు ప్రారంభించారు? యుద్ధం ఏ విధంగా జరిగింది? వివరించి చెప్పుము.'

భీష్ముని ప్రథమ దివస యుద్ధము (సం. 6-42-1)

వ. అనుటయు సంజయుం డతని కి ట్లనియె భవదగ్రనందనుం డత్యంతోదగ్రవ్యగ్రుండై యాగ్రహంబునం బనిచినం బ్రకటదోర్గర్వదుర్దముం డగు దుశ్శాసనుండు పురి కొలుపం గురుసైన్యంబులు శంఖ భేరీ మృదంగాది నిస్వనమ్ములు సెలంగ గాంగేయుండు దొలుతం గదలఁ గేతుశోభాభిరాముం డగుచు నుద్దామ గతిం గవిసినం గనుంగొని. 233

ప్రతిపదార్థం: అనుటయున్= అని (ధృతరాష్ట్రుడు) చెప్పగా; సంజయుండు= సంజయుడు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ధృతరాష్ట్రుడికి, ఈ విధంగా చెప్పాడు; భవత్+అగ్ర నందనుండు= నీ పెద్ద కొడుకు (దుర్యోధనుడు); అత్యంత+ఉదగ్ర

వ్యగ్రుండు+ఐ= మిక్కిలి భయంకరమైన స్ఫూర్తితో చలించినవాడై; ఆగ్రహంబునన్= కోపంతో; పనిచినన్= ఆజ్ఞాపింపగా; ప్రకట, దోర్గర్వ, దుర్దముండు+అగు= పైకి వెల్లడి అయిన భుజబలంచేత అడపరానివాడగు; దుశ్శాసనుండు= దుశ్శాసనుడు; పురికొలుపన్= ప్రోత్సహించగా; కురు, సైన్యంబులు= కౌరవ సేనలు; శంఖ, భేరీ, మృదంగ+ఆది, నిస్వనమ్ములు= శంఖాలు, పెద్దమోతి ఒకటిగల డోళ్లు; మద్దెళ్ల మొదలుగా గల వాద్యాల మ్రోతలు; చెలంగన్= ధ్వనించగా; గాంగేయుండు= గంగ కొడుకు- భీష్ముడు; తొలుతన్= మొదట; కదలన్= నడవగా; కేతు, శోభా+అభిరాముండు+అగుచున్= జెండా యొక్క వైభవంచేత అందంగా కనిపిస్తూ; ఉద్దామ+గతిన్= భయంకరమైన రీతిగా, కవిసినన్= మార్మోనగా; కనుంగొని= చూచి.

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రుడితో ఈ రీతిగా చెప్పాడు- 'నీ పెద్ద కొడుకు మిక్కిలి కోపంతో ఆజ్ఞాపించగా పరాక్రమ గర్వంతో దుశ్శాసనుడు ప్రోత్సహించగా, కౌరవసేనలు శంఖాలు, భేరులు, మద్దెలలు మున్నగు వాద్యాలు మ్రోగించి, ముందు భీష్ముడు సేనాధిపతిగా ఎత్తైన జెండా ఆకాశంలో అందంగా వెలుగొందుతూ ఉండగా, భయం కరంగా మార్మోనటం చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. పాండునృపాలనందనులు పావని మున్నుగ నేచి యప్డు భీ
ష్ముండు గడంక మై నడచు చోటికిఁ జక్కటి గాఁగఁ ద్రోచి యొం
డొండ కడంగి సేన తమ యుబ్బున కుబ్బఁగ నన్యసైన్య వే
దండ ముఖాంగముల్ దృణ వితానముగాఁ గొని నిర్వికారులై. 234

ప్రతిపదార్థం: పాండు, నృపాల, నందనులు= పాండురాజు కొడుకులు పాండవులు; పావని= భీముడు; మున్నుగన్= ముందుండగా; ఏచి= విజృంభించి; అప్డు= అపుడు; భీష్ముండు= భీష్ముడు; కడంకమైన్= పూనికతో; నడచుచోటికిన్= కదలి వెళ్ళే స్థలానికి; చక్కటి+కాఁగన్= చేరువ అయ్యేటట్లుగా; త్రోచి= ముందుకు చేరి; ఒండొండ= ఒకరితో ఒకరు; కడంగి= పూని; సేన= సైన్యం; తమ+ఉబ్బునకున్+ఉబ్బఁగన్= తమ అతిశయానికి ఉప్పొంగగా; అన్య, సైన్య, వేదండ, ముఖ+అంగముల్= శత్రుసైన్యంలోని ఏనుగుల ముందున్న బారులు; తృణ+వితానముగాన్= గడ్డి పోచలవలె; కొని= భావించి; నిర్వికారులు+ఐ= వికారం లేనివారలై ధైర్యంతో ఉన్నవారై.

తాత్పర్యం: పాండవులు భీముడిని ముందు పెట్టుకొని, భీష్ముడు నడుస్తున్న చోటుకు చేరువగా తమ సైన్యాలను తరలించారు. పాండవుల ఉత్సాహం చూచి, ఆ సేనలు ఉప్పొంగాయి. ఉప్పొంగి శత్రుసైన్యంలోని గజబలాన్ని గడ్డిపోచలుగా భావించి ధైర్యంతో (ముందుకు సాగి).

వ. ఉరవడించు సమయంబున. 235

ప్రతిపదార్థం: ఉరవడించు+సమయంబునన్= వేగిరపడే వేళలో.

తాత్పర్యం: వేగిరపడే వేళలో.

క. ఘనతరగర్జా ధ్వనులును, । ఘనపథమఖిలంబుఁ దూఁటు కట్టెడు తూర్య
స్వనములునుం గబళించుచు । ననిలతనయు సింహనాద మడరెం బెలుచన్. 236

ప్రతిపదార్థం: ఘన, తర, గర్జా, ధ్వనులును= మిక్కిలి గొప్పదైన మదపుటేనుగులు చేసే ధ్వనులూ; ఘనపథము+అఖిలంబున్= ఆకాశం అంతయు; తూఁటు+కట్టెడు= చిల్లులు పడచేసే; తూర్య+స్వనములున్= బూరాలు మున్నగు వాద్యాల ధ్వనులునూ; కబళించుచున్= మ్రింగి వేస్తూ; అనిల తనయు, సింహనాదము= వాయుపుత్రుడు అయిన భీముడు చేసిన సింహనాదం; పెలుచన్= ఎక్కువగా; అడరెన్= అతిశయించింది.

తాత్పర్యం: ఉభయసైన్యాలు తలపడాలని వేగిరపడే ఆ వేళలో, భీమసేనుడు సింహనాదం చేశాడు. మదపు టేనుగుల గర్జా నినాదాలను, ఆకాశాన్ని చిల్లులుపడేటట్లు చేసే తూర్యరావాలను భీముడి సింహనాదం కబళించివేసింది.

విశేషం: సింహనాదం: ప్రాచీనకాలంలో యుద్ధవీరుడి నోటి నుండి వెలువడే గర్జన. అది సింహగర్జన సదృశం. అలనాడు వీరులు చేసే సింహనాదాలు 'పూరించే శంఖాలు' భేరీ కాహళ తూర్యాది రావాలు యుద్ధ పరాక్రమంలో అంతర్భాగాలే.

వ. ఇట్లు ప్రతిభటతురంగమాతంగంబుల గుండియ లవియ నందంద యార్చి పేర్చిన భీము నెదిర్చి దుశ్శాసనుండును దుర్ముఖుండును దుష్ప్రహుండును దుర్మర్షణుండును వివింశతియు వృషసేనుండును జిత్రసేనుండును వికర్ణుండును బురుమిత్రుండును దుర్యోధను చూడ్కికి వేడ్క సేయుచుం దాఁకిన. 237

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ప్రతిభట, తురంగ, మాతంగంబుల, గుండియలు+అవియన్= శత్రువుల గుర్రాలు ఏనుగుల దండుల గుండెలు బ్రద్దలయ్యేటట్లుగా; అందంద= అక్కడికక్కడే; ఆర్చి, పేర్చిన= అతిశయించి విస్తరిల్లిన; భీమున్= భీమసేనుడిని; ఎదిర్చి= మార్కొని; దుశ్శాసనుండును= దుశ్శాసనుడూ; దుర్ముఖుండును= దుర్ముఖుడూ; దుష్ప్రహుండును= దుష్ప్రహుండూ; దుర్మర్షణుండును= దుర్మర్షణుడూ; వివింశతియున్= వివింశతీ; వృషసేనుండును= వృషసేనుడూ; చిత్రసేనుండును= చిత్రసేనుడూ; వికర్ణుండును= వికర్ణుడూ; పురుమిత్రుండును= పురుమిత్రుడూ; దుర్యోధను చూడ్కికిన్= దుర్యోధనుడి దృష్టికి; వేడ్క= సంతోషం; చేయుచున్=కలిగిస్తూ; తాఁకినన్= మార్కొనగా.

తాత్పర్యం: ఈ విధంగా శత్రువులకు చెందిన గుర్రాల ఏనుగుల దండుల గుండెలు అదిరిపోయేటట్లు సింహనాదం చేసి విజృంభించిన భీముడిని, దుశ్శాసనుడు, దుర్ముఖుడు, దుష్ప్రహుడు, దుర్మర్షణుడు, వివింశతి, వృషసేనుడు, చిత్రసేనుడు, వికర్ణుడు (దుర్యోధనుడి తమ్ములు) ఎదిరించి, దుర్యోధనుడికి కన్నుల పండువుగా మార్కొన్నారు.

క. ఉద్యతులై కవలును ధృ । ష్టద్యుమ్నుఁడుఁ గడఁగఁ దోన సౌభద్రుండున్
మాద్యద్గతిఁ గవియుడు నే । కోద్యోగత ద్రౌపదీసుతోత్కర మడరెన్. 238

ప్రతిపదార్థం: ఉద్యతులు+ఐ= ఉత్సాహంతో విజృంభించినవారై; కవలును= నకుల సహదేవులు - కవల జంట; ధృష్టద్యుమ్నుఁడు= ద్రుపదుడి పెద్ద కొడుకు- పాండవ సేనాపతి; కడఁగన్= పూనికతో విజృంభించగా; తోన= వెంటనే; సౌభద్రుండున్= సుభద్ర కొడుకు అభిమన్యుడు; మాద్యత్+గతిన్= మదించిన రీతిలో; కవియుడున్= మార్కొనగా; ఏక+ఉద్యోగతన్= ఒకే యత్నంతో; ద్రౌపదీ, సుత+ఉత్కరము= ద్రౌపది పుత్రుల సముదాయం; అడరెన్= విజృంభించింది.

తాత్పర్యం: యుద్ధ సన్నద్ధులై నకులుడు, సహదేవుడు, ధృష్టద్యుమ్నుడు విజృంభించారు. వారితోపాటు అభిమన్యుడు కూడా విజృంభించాడు. అట్లే ద్రౌపది కొడుకులూ చెలరేగారు.

వ. ఇవ్విధంబున వృకోదరునకుం దలకడచి తాఁకి వజ్రనిభమ్ములగు వాలమ్ములు శైలోపములగు కౌరవవీరుల పయిం గురియ నక్కుమారవర్గంబు ననర్గళప్రసారం బగు శరాసారంబుల వారలఁ గప్పె; నట్టియెడం గొండొకసేపు. 239

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; వృకోదరునకున్= భీముడికి; తలకడచి= అతిక్రమించి; తాఁకి= మార్కొని; వజ్ర, నిభమ్ములు+అగు= వజ్రంతో సమానములు అయిన; వాలు+అమ్ములు= వాడి బాణాలు; శైల+ఉపములు+అగు= కొండలతో సాటి అయిన; కౌరవ, వీరులపయిన్+కురియన్= కౌరవ వీరులపై (ధార్తరాష్ట్రులపయి) వర్షించగా, ఆ+కుమార+వర్గంబు= ఆ

కుమారుల సముదాయం (ధార్తరాష్ట్రులు); అనర్గళ+ప్రసారంబులు+అగు= అడ్డు లేకుండా ప్రయోగించబడిన; శరాసారంబులన్= బాణాల జడులతో; వారలన్+కప్పెన్= పాండవ కుమారులను కప్పింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; కొండొక+సేపు= కొంతసేపు.

తాత్పర్యం: ఈ విధంగా పాండవ కుమారులు భీమసేనుడికంటె ముందుకురికి వజ్రాయుధాలవంటి వాడిబాణాలను పర్వతాల వంటి కౌరవవీరులమీద కురిపించారు. కౌరవ కుమారులు కూడా ఎడతెరిపి లేకుండా బాణాల వరుసలతో పాండవ కుమారులను కప్పివేశారు. ఆ సమయంలో కొంతసేపు.

విశేషం: యుద్ధం ప్రారంభిస్తూ కౌరవుల పక్షంలో ముందుకు దూసుకు వచ్చింది దుశ్శాసనుడు. పాండవుల పక్షంలో భీముడు. దుశ్శాసనుడికి బాసటగా నిలిచింది ధృతరాష్ట్రుడి యువకుమారులు. భీముడికి అండగా చేరింది పాండవ యువ కుమారులు. అనగా యుద్ధానికి ముందున్నది ఉభయ పక్షాలలో యువకులే.

క. ఱిచ్చవడి యుభయబలములు । నచ్చెరువుగఁ జిత్రరూపు లట్లుండ శర
ప్రోచ్చలితచండదీప్తి స । ముచ్చయములు పెలుచఁ బరఁగె ముసుఁగువడంగాన్. 240

ప్రతిపదార్థం: ఉభయ, బలములున్= రెండు సేనలూ; ఱిచ్చవడి= ప్రాన్పడి - కొయ్యబారిపోయి; అచ్చెరువుగన్= ఆశ్చర్యకరముగా; చిత్రరూపులు+అట్లు+ఉండన్= చిత్రపటంలోని బొమ్మల వలె (కదలక, మెదలక) ఉండగా; శర, ప్ర+ఉచ్చలిత, చండ, దీప్తి, సముచ్చయములు= బాణాలచేత ప్రజ్వలింపచేయబడిన గొప్ప కాంతుల సముదాయం; ముసుఁగు+పడంగాన్= విస్తరించేటట్లుగా; పెలుచన్+పరఁగెన్= ఎక్కువగా వర్ధిల్లాయి.

తాత్పర్యం: పాండవ కుమారులూ, కౌరవ కుమారులూ ఆ రీతిగా ఒకరిపై నొకరు బాణాల వర్షం కురిపించగా, ఉభయ పక్షాలలోని సేనలూ రిచ్చవడి ఆశ్చర్యకరంగా చిత్రలేఖనంలోని బొమ్మలవలె కన్పించారు. కురు కుమారులు, పాండు కుమారులు ప్రయోగించిన బాణాల సముదాయముల వెలుగు వెల్లువ విస్తరించింది.

క. పదపడి దుర్యోధనుఁ డు । న్మదుఁడై తఱుమంగ ధర్మనందనుఁడు జయా
స్పదముగఁ బురికొల్పఁగ బె । ట్టిదముగ నొండొంటిఁ దలపడియె సైన్యంబుల్. 241

ప్రతిపదార్థం: పదపడి= పిమ్మట; దుర్యోధనుఁడు= సుయోధనుడు; ఉత్+మదుఁడు+ఐ= అతిశయించిన గర్వం కలవాడై; తఱుమంగన్= పురికొల్పగా; ధర్మనందనుఁడు= ధర్మరాజు; జయ+ఆస్పదముగన్= గెలుపు కలిగేటట్లుగా; పురికొల్పఁగన్= ప్రోత్సహించగా; సైన్యంబుల్= ఉభయ సేనలు; బెట్టిదముగన్= ఎక్కువగా; ఒండు ఒంటిన్= ఒక దానితో ఒకటి; తలపడియెన్= ఎదుర్కొన్నాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు గర్వాతిశయంతో తన సేనలను ప్రోత్సహించాడు. గెలుపుమీద దృష్టిని కేంద్రీకరించి, ధర్మరాజు తన సేనలను పురికొల్పాడు. ఆ రెండు సేనలు అతిశయించిన పూనికతో ఒకదానిని మరొకటి మార్కొని విజృంభించాయి.

సీ. కప్పారు రేణువు గమలాప్తబింబంబు । రాహుమండలమన రమణఁ గప్పఁ,
దెల్లని రజము శోభిల్లు సంగ్రామరం । గమునకుఁ దగు మేలుకట్టునట్లు,
ఖచరకాంతల యలకములందుఁ గెందూళి । యళులపై పుప్పొడి ననుకరించు,
నడరి పచ్చని పాంశు వమరు దిశాభిత్తి । తలములఁ గనకంపుఁ దగడు పగిదిఁ,

తే. **బాండవానీకమును గురుబలము నొక్క। పెట్ట రథ గజ హయ భటాభీలచటుల**
గతిఁ బరిక్షుణ్ణ సంగరక్షితితలముగ। వీఁక బెరసిన యత్తొలుతాఁకు నపుడు 242

ప్రతిపదార్థం: పాండవ+అనీకమును= పాండవుల సేనయును; కురు+బలమున్= కౌరవులసేనా; ఒక్కొ+పెట్టన్= ఒకేసారిగా; రథ+గజ+హయ+భట+ఆభీల+చటుల+గతిన్= రథాలు, ఏనుగులు, గుర్రాలతో, కాల్బలంతో భయంకరంగా కదలు పద్ధతిలో; పరిక్షుణ్ణ, సంగర, క్షితి, తలముగన్= ఎక్కువగా నలగగొట్టబడిన యుద్ధభూమి అగుచు; వీఁకన్= ఉత్సాహంతో; బెరసిన= వ్యాపించిన; ఆ+తొలు, తాకు+అపుడు= ఆ మొదటి తాకిడి ఏర్పడినప్పుడు; కప్పారు= నల్లనైనట్టి; రేణువు= దుమ్ము; కనుల+ఆప్త, బింబమ్ము= సూర్యగోళం; రాహు, మండలము+అనన్= రాహుగోళం అనునట్లుగా; రమణన్+కప్పన్= శోభిల్లి కప్పివేసింది; తెల్లని+రజము= తెల్లగా ఉన్న దుమ్ము; సంగ్రామ, రంగమునకున్= యుద్ధభూమికి; తగు= తగిన; మేలు కట్టు+అట్లు= ఉల్లెడ (వితానం)వలె; శోభిల్లన్= విలసిల్లింది; కెంపు, దూళి= ఎర్రని దుమ్ము; ఖచర, కాంతల+అలకములందున్= ఆకాశంలో సంచరించే వేలుపు స్త్రీల ముంగురులలో; అళులపై+పుప్పొడిన్= తుమ్మెదలపై; పుష్పపరాగాన్ని; అనుకరించున్= పోలుతుంది; పచ్చని, పాంశువు= పచ్చని రంగు దుమ్ము; అడరి= వ్యాపించి; దిశా, భిత్తి, తలములన్= దిక్కులు అనెడి గోడలపైభాగాలపై; కనకంపు, తగడు, పగిదిన్= బంగారు రేకు తొడుగు వలె; అమరున్= ఏర్పడుతుంది.

తాత్పర్యం: పాండవ కౌరవసేనలు ఒక్కసారిగా రథగజ హయభటావళి భయంకరంగా కదలగా భూమి నలగగొట్టబడేటట్లు విస్తరించిన ప్రతాపాలతో ఆతొలితాకు ఏర్పడినప్పుడు రకరకాల దుమ్ములు ఆకసానికి ఎగశాయి. నల్లని దుమ్ము కప్పటం చేత సూర్యబింబం రాహుమండలం కప్పినట్లుగా కన్పించింది. తెల్లని దుమ్ము యుద్ధభూమిపై వితానంవలె (మేలుకట్టుగా) భాసించింది. కెంపు వన్నె దుమ్ము, దేవతాస్త్రీల ముంగురులనే తుమ్మెదలపై పుప్పొడి వలె శోభిల్లింది. పచ్చని వన్నెగల దుమ్ము దిశాభిత్తికలమీది బంగారు రేకు తొడుగు వలె విలసిల్లింది.

విశేషం: 1. చతురంగబలములు: రథ+గజ+హయ+భట వర్గాలు. ప్రాచీన భారతదేశంలో సేన చతురంగబలముగ అభివర్ణితం.

2. కమలములకు ఆప్తుడు సూర్యుడు. ఇది కవి సమయం.

3. రాహు మండలం: అసలు లేనే లేదు. రాహువు ఒక బిందువు. ఈ బిందు సంచలనం క్రాంతి వలయంలో వక్రగతిని సంచరిస్తుంది. రాహు గ్రస్తమైనపుడు సూర్యునకు గ్రహణం ఏర్పడుతుంది. ఇట్లే కేతుగ్రస్తమైనపుడు చంద్రునకు. రాహు, కేతువులు గ్రహాలు కావు. రాహు మండలం నల్లగా ఉండటం కవి సమయం.

రాహు కేతువులను ఛాయాగ్రహాలుగా ప్రాచీనులే గుర్తించారు. అసలు రాహు, కేతు సంకేతాలను భారతీయులు ప్రాచీన కాలంలోనే గుర్తించటం విశేషం. ప్రాచీన భారతీయుల ఖగోళ పరిజ్ఞానానికి రాహుకేతు ప్రస్తారం ఒక నిదర్శనం. రాహుగ్రస్తమైనప్పుడు సూర్యబింబం నల్లగా మారటం - అనే వర్ణన ఖగోళ పరిజ్ఞానానికి నిదర్శనం. సూర్యగోళం గ్రహణంనాడు మాత్రమే నల్లనౌతుంది. మహాభారత యుద్ధం అమావాస్యనాడు ఆరంభించినదనీ ఆనాడు గ్రహణం పట్టిందనీ ఒక వాదం ఉన్నది.

మ. **కరిఘంటానిచయస్వనంబులుఁ దురంగస్ఫీతహేషా సము**
త్కరనాదంబులు హేతిపంక్తిపటుసంఘట్టోత్థరావంబులున్
ధరణీభాగనభోంతరం బడరి యుద్యత్తూర్యనానాధ్వని
స్ఫురణం బేమియుఁ దోఁప నీవ మొనలన్ భూపాలచూడామణీ! 243

ప్రతిపదార్థం: భూపాల చూడామణీ!= రాజులలో శ్రేష్ఠుడవైనవాడా ధృతరాష్ట్ర మహారాజా!; కరి, ఘంటా, నిచయ, స్వనంబులున్= ఏనుగులకు కట్టిన గంటల సముదాయం వలన ఏర్పడిన ధ్వనులు; తురంగ, స్ఫీత, హేషా, సముత్కర, నాదంబులున్= గుర్రాల

నుండి వ్యాపించిన సకిలింతల వలన ఏర్పడిన సామూహిక ధ్వనులు; హేతి, పంక్తి, పటు, సంఘట్ట+ఉత్థ, రావంబులున్= కత్తుల వరుసల పలు రాపిడుల వలన పైకి లేచిన ధ్వనులూ; ధరణీ, భాగ, నభస్+ అంతరంబు= భూమి ఆకాశాల మధ్యభాగం; అడరి= వ్యాపించి; మొనలన్= సేనలలో; ఉద్యత్+తూర్య, నానా, ధ్వని, స్ఫుర+ణంబు= పైకి విస్తరించిన తూర్యములు మున్నగు వాటివలన ఏర్పడిన ధ్వనులు విస్తరించటం వలన; ఏమియున్+తోఁప నీవ= ఏమీ ఆలోచించటానికి వీలులేకుండా చేశాయి.

తాత్పర్యం: రాజోత్తమా! ఏనుగులకు కట్టిన గంటల సముదాయాలు మ్రోగుటవలన కల్గిన ధ్వనులూ, గుఱ్ఱాల గుంపుల సకిలింపుల వల్ల ఏర్పడిన ధ్వనులూ, కత్తుల రాపిడుల వల్ల పై కెగసిన ధ్వనులూ భూనభోంతరాళాలలో వ్యాపించి సైన్యంలోని తూర్యాది యుద్ధవాద్యాల మ్రోతలు ఏమీ వినిపించనీయవు.

వ. తదనంతరంబ. 244

తాత్పర్యం: అటు పిమ్మట.

క. కరికరశీకర తురగో । త్కరలాలాజాల రక్తధారాపటలీ
పరిషిక్తంబై సంగర । ధరణీ రజ మడఁగె నద్భుతం బలరారన్. 245

ప్రతిపదార్థం: కరి, కర, శీకర, తురగ+ఉత్కర, లాలా, జాల, రక్త, ధారా, పటలీ, పరిషిక్తంబు+ఐ= ఏనుగుల తుండాల నుండి జారిన నీటి తుంపురలచే, గుఱ్ఱాల గుంపుల నోళ్ళ నుండి వెలువడే జొల్లు మొత్తం వలన, రక్తధారల సముదాయాల వలన తడుపబడినట్టిదై; అద్భుతంబు+అలరారన్= ఆశ్చర్యం శోభిల్లునట్లుగా; సంగర, ధరణీ, రజము= యుద్ధభూమిలోని దుమ్ము; అడఁగెన్= తగ్గిపోయింది.

తాత్పర్యం: రెండు సేనలు మొట్టమొదట ఢీకొనినప్పుడు 'దుమ్ము'' చెలరేగి భూమ్యాకాశాలను చుట్టుముట్టింది. అంతకంటె ఆశ్చర్యకరమైన అంశం, ఏనుగుల తుండాల నుండి కమ్మిన నీటి తుంపురుల వలన; గుఱ్ఱాల నోటినుండి కారిన చొంగవలన, యుద్ధభూమిపై పడిన నెత్తుటి ధారల వలన ఆ దుమ్ము అణగిపోయింది.

విశేషం: 1. నలిగిన యుద్ధభూమి నుండి చెలరేగిన దుమ్ము భూమ్యాకాశాలను క్రమ్మటం ఆశ్చర్యం కాదు.

2. ఆకాశం వరకు ఎగసిన దుమ్ము అణగిపోవటమే ఆశ్చర్యం. దానికి కారణం ఏనుగుల తుండాల నుండి వెలువడిన నీటి తుంపురులు, గుఱ్ఱాల చొంగ, కారిన నెత్తురు. ఎన్ని ఏనుగులు!! ఎన్ని గుఱ్ఱాలు!! ఎంతమంది భటులు!!?

క. కురుపాండవసైన్యంబుల । దొర లడియాలముల నొప్పుతో మెఱయు సము
ద్ధురవీరధ్వజములఁ బొలి । చిరి శౌర్యస్ఫూర్తి మూర్తి సేకొన్నక్రియన్. 246

ప్రతిపదార్థం: కురు, పాండవ, సైన్యంబుల, దొరలు= కౌరవుల సేనలోని రాజులు పాండవుల సేనలోని రాజులు; అడియాలముల+ఒప్పుతోన్= రాజలాంఛనాల శోభతో; మెఱయు= ప్రకాశించే; సముద్ధర, వీర, ధ్వజములన్= మిక్కుటంగా ప్రజ్వరిల్లే - శౌర్య సూచనలైన జెండాలతో; శౌర్య+స్ఫూర్తి= పరాక్రమ ప్రాభవం; మూర్తి, చేకొన్న, క్రియన్= ఆకారం ధరించినట్లుగా; పొలిచిరి= శోభిల్లారు.

తాత్పర్యం: కౌరవ సేనలోని రాజులు, పాండవ సేనలోని రాజులు రాజచిహ్నాలతో భాసించే జెండాలతో, శౌర్యం మూర్తీభవించినట్లు విలసిల్లారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 1. అలం: ఉత్ప్రేక్ష. 'అడియాలములు' - తిక్కన నాటి సమాజంలో సుప్రసిద్ధమైన పదం. కేతన- తన దశకుమార చరిత్రలో తిక్కన గూర్చి వ్రాసిన పద్యం.

"అందలంబు గొడుగు లడపంబు మేల్కట్టు
చామరములు జమిలి శంఖములును
గంబకట్లు భూమి కానిక గాఁగ - పెం
పెసఁగు రాచపదవులెల్లఁ బడసె."

నేడుగూడ సేనలోని దండనాథుల ఆహార్యంలో అడియాలాలు - వర్మప్రకర్ష కనిపిస్తాయి. భారతయుద్ధపు అడియాలాలు - వర్మప్రకర్ష కనిపిస్తాయి. భారత యుద్ధ కాలంలో ఆ చిహ్నాలు ఆయా వీరుల పతాకాలపై ప్రదర్శించేవారు అని తిక్కన వర్ణన.

వ. అట్టియెడ. 247

తాత్పర్యం: ఆ సమయంలో.

క. మీతండ్రి భవత్సుతులకుఁ। జేతోముద మొదవఁ గడఁగి సేన మిగిలి ప్ర
ద్యోతనుఁడు నభోమధ్య। స్ఫీతుం డైనట్లు వెలిఁగె భీషణమూర్తిన్. 248

ప్రతిపదార్థం: మీతండ్రి= భీష్ముడు; భవత్+సుతులకున్= నీ కొడుకులకు; చేతస్+ముదము+ఒదవన్= మనస్సునకు ఆనందం కలిగేటట్లుగా; కడఁగి= పూని; సేనన్+మిగిలి= సైన్యంలో అధికుడై; ప్రద్యోతనుఁడు= సూర్యుడు; నభస్, మధ్య, స్ఫీతుండు+ఐన+అట్లు= ఆకాశమధ్యంలో ప్రకాశించేవాడై ఉన్నట్లుగా; భీషణమూర్తిన్= భయంకరమైన ఆకారంతో; వెలిఁగెన్= వెలుగొందాడు.

తాత్పర్యం: మీ తండ్రి నీకుమారులకు ఆనందం కలుగగా పూని సైన్యంలో అధికుడై ఆకాశమధ్యంలో ప్రకాశించే సూర్యుడివలె భయంకరమైన ఆకారంతో వెలుగొందాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు మెఱసిన. 249

తాత్పర్యం: ఈ రీతిగా ప్రకాశించగా.

ఉ. అర్జునుఁ డప్డు భీష్ముఁ గని యగ్గలికన్ గుణరావ సంగమ
స్ఫూర్జిత దేవదత్తరవశోభితుఁ డై రణకేళి కౌతుకా
వర్జితచిత్తవృత్తి ననివార్యపరాక్రమలీలఁ దాఁక న
త్యూర్జితరౌద్ర మయ్యె బహుళోగ్రమహాస్త్ర గతాగతంబులన్. 250

ప్రతిపదార్థం: అర్జునుఁడు= అర్జునుడు; భీష్మున్+కని= భీష్ముని చూచి; అగ్గలికన్= అతిశయంతో; గుణ, రావ, సంగమ, స్ఫూర్జిత, దేవదత్త, రవ, శోభితుడు+ఐ= అల్లెత్రాటి మ్రోతతో కలిసి వ్యాపించే దేవదత్తం అనే పేరుగల శంఖనాదంతో విలసిల్లేవాడై; రణ, కేళి, కౌతుక, ఆవర్జిత, చిత్త, వృత్తిన్= పోరాటం అనే ఆటయందుగల వేడుక విస్తరించిన మనస్సుయొక్క ప్రసారంతో; అనివార్య, పరాక్రమ, లీలన్= వారించటానికి వీలులేని శౌర్యంతో భాసించే క్రీడతో; తాఁకన్= మార్కొనగా; బహుళ+ఉగ్ర, మహా+అస్త్ర, గత+ఆగతంబులన్= పెక్కు భయంకరములైన గొప్ప అస్త్రముల రాక పోకలతో; అత్యూర్జిత+రౌద్రము+అయ్యెన్= మిక్కిలి భయంకరమైన పోరాటం జరిగింది.

తాత్పర్యం: ఆ సమయంలో అర్జునుడికి భీష్ముడికి మధ్య భీకరమైన పోరాటం జరిగింది. అర్జునుడు గాండీవ ధనుస్సు యొక్క అల్లెత్రాటిని మ్రోగించాడు. తన శంఖం దేవదత్తం పూరించాడు. ఆ రెండు ధ్వనులు కలిసి దిక్కులు పిక్కటిల్లచేశాయి. అర్జునుడు యుద్ధక్రీడయందు వేడ్కకలవాడై, అడ్డులేని పరాక్రమంతో భీష్ముడిని తాకాడు. వారి ఇద్దరి మధ్య రౌద్రరసం తాండవించింది.

విశేషం: రౌద్రరసమునకు స్థాయి భావం కోపం. భీష్ముడు అర్జునుడు ఆగ్రహావేశంతో యుద్ధం చేశారు.

తే. **తటిమి సాత్యకి గృతవర్మఁ దాఁక నతఁడు । నేచి మార్కొన నిరుమేను పూచి యొప్ప**
మిగులు మోదుగు మ్రాఁకుల పగిది గాఁగ । నడరె మార్కొన్న రెండువా లంపగములు. **251**

ప్రతిపదార్థం: తటిమి= ఉత్సాహంతో తలపడి; సాత్యకి= సాత్యకి; కృతవర్మన్= కృతవర్మను; తాఁకన్= ఎదిరింపగా; అతఁడున్= ఆ కృతవర్మ; ఏచి= అతిశయించి; మార్కొనన్= ఎదిరించి యుద్ధం చేయగా; ఇరు+మేను= రెండు శరీరాలు; పూచి= పుష్పించి; ఒప్పుమిగులు= మిక్కుటంగా శోభిల్లే; మోదుగు మ్రాఁకుల, పగిదిన్+కాఁగన్= మోదుగుచెట్ల మాదిరిగా తోచగా; మార్కొన్న రెండు+వాలు+అంపగములు= ఎదురుకొనిన రెండు విధములైన వాడి బాణాల గుంపులు (అనగా ఉభయులూ ఒకరిపై ఒకరు ప్రయోగించిన బాణాల మార్పిడి ఇటువి అటు, అటువి ఇటు చేరి) అడరెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: ఉత్సాహం పొంగి పొరల సాత్యకి, కృతవర్మతో యుద్ధం చేయటానికి తలపడ్డాడు. కృతవర్మగూడ సాత్యకిని ఎదిరించి యుద్ధం చేశాడు. ఇరువురూ ఒకరిపై ఒకరు బాణాలు ప్రయోగించుకొన్నారు. ఆ బాణాలు ఇరువురి శరీరాలను గాయపరచాయి. ఇద్దరి శరీరాల నుండి నెత్తురు కారజొచ్చింది. ఆశరీరాలు పూచిన మోదుగు చెట్లవలె శోభిల్లాయి.

విశేషం: అలం: ఉపమ. మోదుగు చెట్టు పువ్వులు ఎఱ్ఱగా ఉంటాయి. అంతేకాదు. మోదుగు చెట్టు పుష్పించినప్పుడు- ఆకులు మిక్కిలి తక్కువ పువ్వులు ఎక్కువగా కన్పిస్తాయి. చెట్టునిండా పువ్వులే. అట్లే సాత్యకి కృతవర్మల శరీరాల నిండా నెత్తురు కన్పించింది.

చ. **మదమునఁ గోసలేంద్రు నభిమన్యుఁడు దాఁకిన నా బృహద్బలుం**
డెదిరి కడంగి సూతుఁ బడ నేసి హయంబులఁ జంపఁ జూడ్కిఁ గెం
పొదవఁగఁ బార్థసూనుఁడు మహోగ్రత నట్టుల చేసి, కేతనం
బు దునిమి విల్లుఁ ద్రుంచి శరపూరితగాత్రునిఁ జేసె నాతనిన్. **252**

ప్రతిపదార్థం: అభిమన్యుఁడు= అర్జునుడి కొడుకు- యువవీరుడు; మదమునన్= గర్వంతో; కోసల+ఇంద్రున్= కోసల దేశరాజును; తాఁకినన్= తలపడగా; ఆ+బృహద్బలుఁడు= బృహద్బలుడు అనే ఆ కోసల రాజు; ఎదిరి+కడంగి= ఎదిరించి పూని; సూతున్= సారథిని; పడన్+ఏసి= చంపి; హయంబులన్= గుర్రాలను; చంపన్= వధింపగా; చూడ్కిన్= చూపునందు; కెంపు+ఒదవఁగన్= ఎర్రతనం భాసించగా (అనగా కోపించి); పార్థసూనుఁడు= అర్జునుడి కొడుకు అభిమన్యుడు; మహా+ఉగ్రతన్= మిక్కిలి భీకరంగా; అట్టుల+చేసి= ఆ విధంగానే చేసి (సారథిని గుర్రాలను చంపి); కేతనంబు+తునిమి= జెండాను ముక్కలు చేసి; విల్లున్+త్రుంచి= ధనుస్సును ముక్కలు చేసి; ఆతనిన్= ఆ బృహద్బలుడిని; శర, పూరిత, గాత్రున్= బాణాలతో నిండిన శరీరం కలవాడిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: అభిమన్యుడు గర్వంతో కోసలరాజైన బృహద్బలుడిని మార్కొన్నాడు. ఆ బృహద్బలుడు కోపించి, అభిమన్యుడి రథసారథిని చంపి అశ్వాలను సంహరించాడు. అంతట అర్జునుడి కొడుకు అభిమన్యుడు ఆ విధంగానే

ఆ బృహద్బలుడి రథసారథిని అశ్వాలను చంపటమే కాకుండా ఆతడి ధనుస్సును ముక్కలు చేసి, అతడి శరీరాన్ని బాణాలతో నింపాడు.

తే. భీమసేనునిపై మనభీష్ముఁ డలుక । నడరె నక్కురుముఖ్యుల యస్త్రశస్త్ర
కౌశలంబులు సూడ నక్కజము లైన । నచ్చెరువు నొంది సేనలు పిచ్చలింప. 253

ప్రతిపదార్థం: భీమసేనునిపైన్= భీముడిమీద; మన భీష్ముఁడు= (మన కౌరవసేనాపతియైన భీష్ముడు); అలుకన్= కోపంతో; అడరెన్= విజృంభించాడు; ఆ+కురు+ముఖ్యుల= కురువంశంలో గొప్పవారైన ఆ ఇరువురి యొక్క అనగా భీమ భీష్ముల యొక్క; అస్త్ర+శస్త్ర+కౌశలంబులు, చూడన్= బాణాలు, మంత్ర పూర్వకములైన బాణాల ప్రయోగంలోని నేర్పులు అరయగా; అక్కజములు+ఐనన్= ఆశ్చర్యకరములుకాగా; అచ్చెరువున్+ఒంది= ఆశ్చర్యం చెంది; సేనలు= పాండవుల సేన మరియు కౌరవుల సేన; పిచ్చలింపన్= భయపడగా.

తాత్పర్యం: భీమసేనుడిపై భీష్ముడు కోపంతో విజృంభించాడు. కురుముఖ్యులిద్దరి (భీమభీష్ముల) అస్త్రశస్త్ర ప్రయోగనైపుణ్యాలు అచ్చెరువు గొల్పగా ఇటు కౌరవ సేన, అటు పాండవసేన ఆశ్చర్య చకితాలు అయ్యాయి.

విశేషం: 1. భీష్ముడు ఆరితేరిన ధానుష్కుడు. అతడికి భీముడు ఎంత? విలువిద్యలో. ఇచ్చట భీముడు గద పట్టక ధనుస్సు పూని భీష్ముడితో యుద్ధం చేయటం ఒక విశేషం. అంతేకాక, భీష్ముడితో సమయుద్ధం చేయగల్గటం వింత.

2. కౌరవులు కురువంశీయులే. పాండవులు గూడ కురువంశీయులే గదా. అయితే దుర్యోధనాదులు రూఢ్యర్థంలో కౌరవులు. ఈ పద్యంలో భీష్ముడు- భీముడు గూడ 'కురుముఖ్యులు'గా అభివర్ణింపబడ్డారు. ఇది గమనించదగిన అంశం.

సీ. వీఁకమై నకులునిఁ దాఁకి దుశ్శాసనుఁ । డత్యుగ్రబాణచయమునఁ బొదివె,
నక్కుమారుఁడు దరహాసాభిరాముఁ డై । భల్ల మొక్కటి దొడ్గి విల్లు దునిమి
యేడ్తెఱ నిరువదియేనుదూపులు వడి । నడరింప రయమున నతఁడు నొండు
విల్లెత్తికొని శరవితతి నంతంతన । నఱకి పాండవుకేతనంబు ద్రుంచె;

తే. దుర్ముఖుఁడు సహదేవునితోడఁ దొడరి । మెఱుఁగు వాలమ్ము లేసిన నుఱక యాతఁ
డన్నియును మగిడించి రథ్యముల నొంచి, । యతని సారథిఁ దెగటార్చి యార్చి పేర్చె. 254

ప్రతిపదార్థం: దుశ్శాసనుఁడు= దుర్యోధనుడి పెద తమ్ముడు; వీఁకమైన్= ఉత్సాహంతో; నకులునిన్+తాఁకి= నకులుడిని యుద్ధంలో మార్కొని; అతి+ఉగ్ర+బాణ+చయమునన్= మిక్కిలి భయంకరమైన అమ్ముల సముదాయంతో; పొదివెన్= కప్పాడు; ఆ+కుమారుడు= ఆ (పాండు కుమారుడు) నకులుడు; దరహాస+అభిరాముఁడై= చిరునవ్వుచే అందం చిందినవాడై; భల్లము= బాణం; ఒక్కటి= ఒకటి; తొడిగి= సంధించి; విల్లున్+తునిమి= ధనువును ఖండించి; ఏడ్తెఱన్= విజృంభించి; ఇరువది+ఏను+తూపులు= ఇరవై అయిదు బాణాలు; వడిన్= వేగంగా; అడరింపన్= ప్రయోగించగా; రయమునన్= వేగంగా; అతఁడు= అతడు (దుశ్శాసనుడు); ఒండు+విల్లు+ఎత్తికొని= ఇంకో ధనువు పుచ్చుకొని; శర వితతిన్= బాణాల సముదాయాన్ని; అంతంతన= క్రమక్రమంగా; నఱకి= ఖండించి; పాండవు+కేతనంబు= పాండవుని జెండాను (నకులుడి పతాకాన్ని); త్రుంచెన్= ఖండించాడు; దుర్ముఖుఁడు= దుర్ముఖుడు (దుర్యోధనుడి తమ్ములలో ఒకడు); సహదేవునితోడన్= సహదేవుడితో; తొడరి= పూని; మెఱుఁగు+వాలు+అమ్ములు+ఏసినన్= వెలుగొందే కఠినమైన బాణాలను ప్రయోగింపగా; ఆతఁడు= అతడు (సహదేవుడు); ఉఱక= లక్ష్యపెట్టక; అన్నియును= అన్ని బాణాలు; మగిడించి= తిరుగగొట్టి; రథ్యములన్+నొంచి= గుర్రాలను నొప్పించి, నొవ్వజేసి; అతని+సారథిన్= దుర్ముఖుడి రథం తోలేవాడిని; తెగటార్చి= చంపి; ఆర్చి= సింహనాదం చేసి; పేర్చెన్= అతిశయించాడు.

తాత్పర్యం: ఈ పద్యంలో దుర్ముఖుడికీ సహదేవుడికీ మధ్య జరిగిన యుద్ధం వర్ణించబడింది. ఉత్సాహంతో దుశ్శాసనుడు నకులుడితో తలపడ్డాడు. అతడిపై మిక్కిలి భయంకరాలైన వాడి బాణాలు ప్రయోగించాడు. నకులుడు చిరునవ్వుతో ఆ బాణాలను అన్నిటినీ ఖండించి వేసి దుశ్శాసనుడి ధనుస్సును ఒక్క బాణంతోనే ఖండించాడు. ఇరువది అయిదు బాణాలు ఆ రకంగా ప్రయోగించాడు. దుశ్శాసనుడు వేగంగా ఇంకో విల్లు ధరించి, నకులుడి బాణాలు నరికి, అతడి జెండాను కూలద్రోశాడు. దుర్ముఖుడు సహదేవుడితో యుద్ధానికి మార్కొన్నాడు. ప్రకాశమానమైన వాడి బాణం ప్రయోగించాడు. సహదేవుడు దుర్ముఖుడి బాణాలు అన్నీ తుత్తునియలు చేసి, అతడి రథం గుర్రాలను నొప్పించి, సారథిని గూల్చి సింహనాదం చేసి విజృంభించాడు.

విశేషం: 1. దరహాసాభిరాముడయ్యాడట నకులుడు - దుశ్శాసనుడు తనపై బాణాలు ప్రయోగించినపుడు. ఆ నవ్వులో ఎంతో అంతరార్థం ఇమిడివుంది. నకులుడి దృష్టిలో దుశ్శాసనుడు తనకు సరియైన ఉజ్జీకాడు. అంతేకాక యుద్ధభూమిలో, దారుణ సంగ్రామం మధ్య చిరునవ్వు చిందించగల వీరులను చిత్రించాడు తిక్కన. తరువాతి పద్యంలో కూడ ధర్మరాజు శల్యుడితో యుద్ధం చేసేటప్పుడు తన విల్లును శల్యుడు ఖండించినపుడు 'కన్నుల నవ్వు' వెలయించాడట. పెదవుల మీది నవ్వు వేరు. కన్నుల నవ్వు వేరు. నకులుడిది పెదవుల మీది నవ్వు. ధర్మరాజు అంతకంటె ప్రగల్భుడు. అతని నవ్వు కన్నులలో మెరిసింది.

చ. **సరభసుఁ డై యుధిష్ఠిరుఁడు శల్యునిఁ దాఁకుడు నాతఁ డమ్మహీ**
శ్వరు మహనీయచాప మనివారణఁ ద్రుంచిన, నొండు విల్లు భీ
కరతరశీఘ్రలీలఁ గొని కన్నుల నవ్వుచుఁ బాండవాగ్రజుం
డరిబల ముక్కు దక్క వడి నాతనిపైఁ గురిసెన్ శితాస్త్రముల్. 255

ప్రతిపదార్థం: ఈ పద్యంలో- ధర్మరాజ శల్యుల మధ్య జరిగిన యుద్ధం వర్ణించబడింది. స+రభసుఁడు+ఐ= వేగిరపాటుతో కూడిన వాడై; యుధిష్ఠిరుఁడు= ధర్మరాజు; శల్యునిన్+తాఁకుడున్= శల్యుడిని మార్కొనగా; ఆతఁడు= ఆ శల్యుడు; ఆ+మహీ+ఈశ్వరు, మహనీయచాపము= రాజు (ధర్మరాజుయొక్క) గొప్పవిల్లు; అనివారణన్= అడ్డగించటానికి వీలులేకుండగా; త్రుంచినన్= ఖండించగా; ఒండు+విల్లు= ఇంకో ధనుస్సు; భీకర, తర, శీఘ్ర, లీలన్= మిక్కిలి భయంకరమైన వేగంతో; కొని= పరిగ్రహించి; కన్నులన్, నవ్వుచున్= కన్నులతో నవ్వుతూ; పాండవ+అగ్రజుండు= పాండవుల అన్నగారు- ధర్మరాజు; అరి+బలము= శత్రుసేన; ఉక్కు+తక్కన్= బలమును కోలుపోయేటట్లుగా; వడిన్= శీఘ్రంగా; శిత+అస్త్రముల్= వాడి అయిన బాణాలు; ఆతనిపైన్= శల్యుడిపై; కురిసెన్= వర్షించాడు.

తాత్పర్యం: ఉత్సాహవేగంతో ధర్మరాజు శల్యుడిని మార్కొన్నాడు. శల్యుడు నకుల సహదేవులకు సాక్షాత్తు మేనమామ. బహుముఖప్రజ్ఞా ధురీణుడు అయిన వీరుడుగా సుప్రసిద్ధుడు. అతడు- ధర్మరాజు విల్లును ఖండించాడు. ధర్మరాజు కన్నులలో చిరునవ్వు మెరిసింది. మరొక విల్లు చేబూని ధర్మరాజు శల్యుడిపై వాడి బాణాలు వర్షించాడు.

విశేషం: 1. ధర్మరాజు ధైర్యంగా శల్యుడిపైకి విజృంభించగలడు. అంత ధైర్యంగా శల్యుడు ధర్మరాజు మీదికి విజృంభించలేడు. శల్యుడు స్వీయాంతరాత్మ పీడితుడు. అతడు దుర్యోధనుడి పక్షంలో చేరటం, తెలిసి చేసిన తప్పు. ఆతడనేక యుద్ధాలలో ఆరి తేరిన వృద్ధవీరుడు. శల్యుడు తన తల నరుక లేడని ధర్మరాజుకు తెలుసు. అది అతడి కన్నుల నవ్వులోని ఆంతర్యం. తిక్కన - నవ్వుల గూర్చి 254 పద్య వ్యాఖ్యానం చూడవచ్చు.

సీ. ఏచి ధృష్టద్యుమ్నుఁ డేడ్తెఱ ద్రోణుపై । నడరిన నవలీల నాతఁ డతని
ఘనశరాసనముఁ ద్రిఖండంబుగాఁ జేసి । నారాచ మొక్కటి నాటె మేన;
వేఱొక్క విల్లెత్తి వెసఁ బదునాలుగు । శాతబాణములఁ బాంచాలసుతుఁడు
గలశజు నేసె; మాగధసహదేవుండు । భూరిశ్రవునిఁ దాఁకి భుజశిఖరము
తే. మెఱుఁగుటమ్ముల నొంచిన నుఱక యతఁడు । వానియురమ్ముగ్రశరమున వ్రయ్యఁజేయ,
వార లిరువురు వృత్రుండు వాసవుండుఁ । బోలెఁ బోరిరి సేనలు వొగడుచుండ. 256

ప్రతిపదార్థం: ఏచి= విజృంభించి; ధృష్టద్యుమ్నుఁడు= ధృష్టద్యుమ్నుడు (పాండవసేనాని ద్రుపద మహారాజు కొడుకు); ఏడ్తెఱన్= పరాక్రమంతో; ద్రోణుపైన్= ద్రోణాచార్యుడిపై; అడరినన్= చెలరేగి మార్కొనగా; అవలీలన్= సులువుగా; ఆతఁడు= ద్రోణుడు; అతని= ఆ ధృష్టద్యుమ్నుడి యొక్క; ఘన, శర+అసనమున్= గొప్ప వింటిని; త్రి+ఖండంబుగాన్+చేసి= మూడు ముక్కలు చేసి; నారాచము+ఒక్కటి= ఒక బాణాన్ని; మేనన్= శరీరంలో (ధృష్టద్యుమ్నుని శరీరంలో); నాటెన్= గ్రుచ్చుకొనునట్లు ప్రయోగించాడు; పాంచాల+సుతుఁడు= పాంచాల దేశరాజుకొడుకు- ధృష్టద్యుమ్నుడు; వేఱు+ఒక్క+విల్లు+ఎత్తి= ఇంకో ధనుస్సు సమకూర్చుకొని; వెసన్= శీఘ్రంగా; పదు నాలుగు, శాత, బాణములన్= పద్నాలుగు వాడి అమ్ములతో; కలశజున్= ద్రోణుడిని; ఏసెన్= కొట్టాడు; మాగధ సహదేవుండు= మగధ దేశాధిపతి అయిన సహదేవుఁడు; భూరిశ్రవునిన్+తాఁకి= భూరిశ్రవునితో తలపడి; భుజ శిఖరమున్= అతని మూపును; మెఱుఁగు+అమ్ములన్= ప్రకాశించే బాణాలతో; నొంచినన్= నొప్పిచేయగా; ఉఱక+అతఁడు= లక్ష్యపెట్టక; అతఁడు(భూరిశ్రవుడు); వాని+ఉరము= అతని (మగధ సహదేవుడి) వక్షఃస్థలం; ఉగ్ర+శరమునన్= భీకరమైన బాణంతో; వ్రయ్యన్+చేయన్= పగులగొట్టగా; వారలు+ఇరువురున్= మాగధ సహదేవుడూ భూరిశ్రవుడూ; వృత్రుండు+వాసవుండున్+పోలెన్= వృత్రుడు అనే రాక్షసుడు మరియు దేవేంద్రుడు వలె; సేనలు+పొగడుచుండన్= పాండవ కౌరవ సైన్యాలు ప్రశంసిస్తూ ఉండగా; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: పాండవ సేనాపతి అయిన ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని తాకాడు ఉత్సాహంతో. ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి ధనుస్సును మూడు ముక్కలు చేశాడు. అంతేకాక అతడి శరీరంలో గ్రుచ్చుకొనేటట్లుగా బాణం వేశాడు. పాంచాల రాజు ద్రుపదుడి కొడుకు ధృష్టద్యుమ్నుడు ఇంకొక ధనుస్సు ఎత్తి పద్నాలుగు వాడి బాణాలు ద్రోణుడిపై ప్రయోగించాడు. మగధ దేశాధిపతి అయిన సహదేవుడు, భూరిశ్రవుడిని తాకి అతడి మూపును ఛేదించాడు. భూరిశ్రవుడు సహదేవుడి వక్షఃస్థలం ఛేదించేటట్లుగా బాణాలు వేశాడు. వారు ఇద్దరూ అలనాడు వృత్రుడు దేవేంద్రుడు పోరాడినట్లుగా యుద్ధం చేశారు. ఇరుపక్షాలలోని సైనికులు ఆ ద్వంద్వయుద్ధం చూచి ప్రశంసించారు.

విశేషం: 1. కలశజుఁడు= కలశంలో పుట్టినవాడు= ద్రోణుడు- మహాభారతంలోని వర్ణనలు కొన్నిటిని నవీనవిజ్ఞానశాస్త్రం ఋజువు పరిచింది. ఇరవయ్యో శతాబ్దంలో టెస్ట్‌ట్యూబ్ సంతానం గూర్చి ప్రయోగాలు జరుగుతున్నాయి. ఫలించాయి కూడా. ద్రోణుడు అయోనిజుడు. ఈ విషయం భావిశాస్త్ర పరిశోధనల వలన ఇంకా తేలవలసి ఉన్నది.

2. పౌరాణిక కాలంలో సుప్రసిద్ధమైన యుద్ధం ఇంద్రుడికీ వృత్రునకు మధ్య జరిగిన ఘోర సంగ్రామం. ఉభయులూ వీరాధివీరులే. మాగధ సహదేవుడు, భూరిశ్రవుడు వీరాధివీరులే.

తే. ధృష్టకేతుండు కౌరవోత్కృష్టుఁ డైన । బాహ్లికుని మాఱుకొని తీవ్రబాణనవక
మేసె; నాతండు లాఘవ మెసక మెసఁగ । ఘనశరంబులు పదినవకములు గురిసె. 257

ప్రతిపదార్థం: కౌరవ+ఉత్కృష్టుఁడు+ఐన= కౌరవులలో గొప్పవాడైన బాహ్లికుని; ధృష్టకేతుండు= ధృష్టకేతుడు; మాఱుకొని= తలపడి; తీవ్ర, బాణ, నవకము+ఏసెన్= వాడి బాణాలు తొమ్మిది ప్రయోగించాడు; ఆతండు= బాహ్లికుడు; లాఘవము+ఎసకము+ఎసఁగన్= సౌలభ్యం శోభిల్లగా; ఘన+శరంబులు= గొప్ప బాణాలు; పది+నవకములు= తొంబై; కురిసెన్= వర్షించాడు.

తాత్పర్యం: ధృష్టకేతుడు కౌరవులలో వృద్ధుడూ వీరుడూ అయిన బాహ్లికుడిపై తలపడ్డాడు. తలపడి వాడి అయిన తొమ్మిది బాణాల వరుస బాహ్లికుడిపై ప్రయోగించాడు. బాహ్లికుడు ధృష్టకేతుడిపై తొంభై బాణాలు ప్రయోగించాడు.

విశేషం: 1. మహాభారత యుద్ధంలో పాల్గొనిన వృద్ధవీరులలో పేర్కొనదగినవాడు బాహ్లికుడు. అతడు శంతనుడి (భీష్ముడి తండ్రికి) తమ్ముడు. అతడితోపాటు భారత యుద్ధంలో అతని కొడుకు సోమదత్తుడు, మనుమడు భూరిశ్రవుడు గూడ పాల్గొన్నారు.

2. ధృష్టకేతుడు శిశుపాలుడి కొడుకు.

క. అచలనిభుఁ డగు నలంబసుఁ। బ్రచలితభూభాగుఁ డగుచుఁ బఱతెంచి ఘటో
త్కచుఁడు దలపడిన నా రజ। నిచరేంద్రుల పోరు కీర్తనీయం బయ్యెన్. 258

ప్రతిపదార్థం: అచలనిభుఁడు+అగు= కొండతో సమానుడైన; అలంబసున్= అలంబసుడు అనే పేరుగల వాడిని; ఘటోత్కచుఁడు= ఘటోత్కచుడు; ప్రచలిత, భూభాగుఁడు+అగుచున్= కంపించిన భూభాగం కలవాడౌతూ (నడుస్తుంటే భూమి కంపించేటట్లుగా దాడి చేసిన వాడౌతూ అని భావం) పఱతెంచి= వచ్చి; తలపడినన్= మార్కొనగా; ఆ+రజనిచర+ఇంద్రుల+పోరు= ఆ రాక్షసుల మధ్య జరిగిన యుద్ధం; కీర్తనీయంబు+అయ్యెన్= పొగడదగినది అయింది.

తాత్పర్యం: కొండలాంటి అలంబసుణ్ణి భూమి కంపించేటట్లు ఘటోత్కచుడువచ్చి మార్కొనగా ఆ రాక్షసుల పోరు ప్రశంసనీయ మయింది.

విశేషం: 1. తిక్కన యుద్ధాన్ని ఒక పరాక్రమ యజ్ఞంగా భావించాడు. ఒక్క చోట కూడా దానిని మారణహోమంగా నరమేధంగా భావించి నిరసించలేదు. యుద్ధభూమి 'రమణీయ' భయానకమని అభివర్ణించాడు తిక్కన. ఇచ్చట రాక్షసవీరుల మధ్య యుద్ధం కీర్తనీయం అని తిక్కన అభివర్ణన.

సీ. గర్వంబు మెఱయ శిఖండి యశ్వత్థామ। నెదిరిన, నాతండు మద మెలర్ప
నారాచ మురమున నాటింప, నొచ్చియు। ద్రుపదనందనుఁ డతిక్రూరశరముఁ
దద్వక్షమునఁ గీలితము సేసె; భగదత్తుఁ। డుఱక విరాటుపై నురవడించి
కదిసిన గగనంబు గప్పె బాణాసార। యుగమును బెరసి మహోగ్రభంగిఁ

తే. గైకయాధీశుఁ డగు బృహత్ క్షత్రవిభుఁడు। గృపుఁడు దలఁపడి యొండొరు కేతనముల
హరుల ధనువులఁ దునిమి నిష్ఠురకృపాణ। దారుణాకారు లై యరదములు డిగిరి. 259

ప్రతిపదార్థం: శిఖండి= ద్రుపదుడి కొడుకు; గర్వంబు+మెఱయన్= మదం వెలుగొందగా; అశ్వత్థామన్= (ద్రోణుడి కొడుకైన) అశ్వత్థామను; ఎదిరినన్= తాకగా; ఆతండు= (అశ్వత్థామ); మదము+ఎలర్పన్= గర్వం శోభిల్లగా; నారాచము= బాణం; ఉరమునన్= వక్షఃస్థలంపై; నాటింపన్= గ్రుచ్చుకొనేటట్లు చేయగా; నొచ్చియున్= బాధపడికూడా; ద్రుపద నందనుఁడు= ద్రుపదుని కొడుకు- శిఖండి; అతిక్రూర శరము= మిక్కిలి కఠినమైన బాణం; తద్+వక్షమునన్= ఆతడి (అశ్వత్థామ) ఉరమందున; కీలితము+చేసెన్= నాటేటట్లు చేశాడు; భగదత్తుఁడు= భగదత్తుడు (అనే వృద్ధవీరుడు); ఉఱక= లెక్కచేయక; విరాటుపైన్= విరాట రాజు మీద; ఉరవడించి= విజృంభించి; కదిసినన్= తాకగా; బాణ+ఆసార యుగమును= ఉభయులు ప్రయోగించిన బాణాల వర్షం; బెరసి= కూడి; మహా+ఉగ్రభంగిన్= మిక్కిలి భయంకరమైన విధంగా; గగనంబున్+కప్పెన్= ఆకాశాన్ని ఆవరించింది; కైకయ+అధీశుఁడు+అగు= కేకయ దేశ ప్రజలకు రాజు అయిన; బృహత్క్షత్ర+విభుఁడు= బృహత్క్షత్రుడు అనే రాజు; కృపుఁడున్= కృపాచార్యుడు; తలపడి= యుద్ధం చేసి; ఒండు+ఒరుల= ఒకరిదింకొకరు; కేతనములన్= జెండాలను; ధనువులన్= విండ్లను; తునిమి= ఖండించి; నిష్ఠుర, కృపాణ, దారుణ+ఆకారులు+ఐ= కఠినమైన కత్తులు ధరించటంచేత భయంకరమైన ఆకారాలు కలవారై; అరదములు డిగిరి= రథాలనుండి నేలపైకి దిగారు.

తాత్పర్యం: గర్వం వెలుగొందగా శిఖండి అశ్వత్థామ నెదిరించాడు. అశ్వత్థామ దర్పం శోభిల్లగా బాణాన్ని అతడి గుండెలో గుచ్చాడు. దెబ్బతిని కూడ శిఖండి మిక్కిలి కఠినమైన బాణాన్ని అశ్వత్థామ వక్షాన నాటేటట్లు వేశాడు. భగదత్తుడు లక్ష్యపెట్టకుండా విరాటుడిపై విజృంభించి తాకగా వారిద్దరి బాణవర్షం ఆకాశాన్ని మహాభయంకంగా ఆచ్ఛాదించింది. కేకయరాజైన బృహత్ క్షత్రవిభుడూ, కృపుడూ తలపడి ఒకరొకరి కేతనాలు, గుఱ్ఱాలు, విండ్లూ త్రుంచుకొని భయంకరాకారాలతో కఠినమైన కత్తులు గైకొని రథాలు దిగారు.

విశేషం: 1. శిఖండి- ద్రుపదుడి కొడుకు. మొదట స్త్రీగా ఉద్భవించి పిదప లింగంమారి పురుషవీరుడైనాడు. పాంచాల ప్రభువు ద్రుపదుడికి ద్రోణాచార్యుడికీగల వైరం సుప్రసిద్ధం. అందుచేత ద్రోణుడి కొడుకు అశ్వత్థామ ద్రుపదుడి కొడుకు శిఖండి ద్వంద్వ యుద్ధానికి పూనుకొన్నారు.

2. భగదత్తుడు- వృద్ధవీరుడు. ఇతడి వాహనం సుప్రతీకం అనే పేరుగల ఏనుగు. అది భయంకరమైనది. భారత యుద్ధంలో భగదత్తుడినీ, అతని ఏనుగు సుప్రతీకాన్నీ అర్జునుడు సంహరిస్తాడు.

ఉ. అట్టియెడం గనుంగొని జయద్రథుఁడున్ ద్రుపదుండు వచ్చి యా
కట్టుపకాసు లిద్దఱకు గ్రక్కున నడ్డము సొచ్చి యొండొరున్
బెట్టుగఁ దాఁకి తీవ్రశరపీడితదేహులఁ జేసి, రెట్టి లా
వెట్టిపరాక్రమస్ఫురణ యెట్టిరయం బని పిచ్చలింపఁగన్. 260

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో (కృపాచార్యుడు - బృహత్ క్షత్ర విభుడూ విరథులూ, నేలకు దిగి కత్తులతో తలపడి యుద్ధం చేసే సమయంలో); జయద్రథుడున్= సైంధవుడూ; ద్రుపదుండు= ద్రుపదుడు; వచ్చి= చేరి; ఆ+కట్టుపకాసులు+ఇద్దరకున్= ఆ వీరులు ఇద్దరకు; గ్రక్కునన్= వేగంగా; అడ్డము+చొచ్చి= మధ్యగా నిలబడి; ఒండు+ఒరున్= ఒకరితో ఒకరూ; బెట్టుగన్+తాకి= తీవ్రంగా మార్కొని; ఎట్టి+లావు= ఎటువంటి బలము; ఎట్టి+పరాక్రమ+స్ఫురణ= ఎటువంటి శౌర్య ప్రదర్శనం; ఎట్టి+రయంబు= ఎటువంటి వేగం; అని= అని (సేనలు); పిచ్చలింపగన్= భయపడునట్లుగా (ఆశ్చర్య చకితంకాగా); తీవ్ర+శర+పీడిత+దేహులన్= మిక్కుటముగా బాణాలచే పీడింపబడిన శరీరాలు కలవారినిగా; చేసిరి= చేశారు;

తాత్పర్యం: ఆ సమయంలో చూచి జయద్రథుడు ద్రుపదుడూ ఆ వీరులిద్దరికీ వేగంగా అడ్డుపడి ఎట్టి బలం, ఎట్టి శౌర్య ప్రదర్శనం, ఎట్టి వేగం అని సేనలు రెండూ భీతి చెందే విధంగా వారు ఒకరినొకరు తీవ్రంగా ఎదుర్కొని మిక్కుటమైన బాణాలతో ఒకళ్ళొకళ్ళ దేహములను గాయపరచుకొన్నారు.

విశేషం: కట్టు పకాసి: కట్టుప కాసుడు= వీరుడు అని శబ్దరత్నాకర నిఘంటువులోని అర్థం. బ్రౌను దొర నిఘంటువులో గట్టుపకాసు- గట్టు= పర్వతము, వంటివాడు - ధీరుడు అని అర్థం ఉన్నది. ఈ శబ్ద స్వరూపంపై ఇంకా పరిశోధన జరగాలి. 'గట్టుపకాసి'యే సాధురూపంగా గ్రహించాలి అని నా అభిప్రాయం.

ఉ. మన్యుసముజ్జ్వలుండు నభిమానియు నైన వికర్ణుఁడున్ యుధా
మన్యుఁడు నేచి యొండొరుల మార్కొని రౌద్రరసం బలోక సా
మాన్యము గాఁగ నస్ఖలితమత్సరముల్ మెఱయంగఁ బోరి ర
న్యోన్యనిశాతసాయక నిరంతరవర్షములన్ మునుంగుచున్. 261

ప్రతిపదార్థం: మన్యు+సమ్+ఉజ్జ్వలుండు= రోషంతో కూడి వెలుగొందే వాడు; అభిమానియున్+ఐన= ఆత్మగౌరవం కలవాడూ అయిన; వికర్ణుండున్= వికర్ణుడు; యుధామన్యుండున్= యుధామన్యుడూ; ఏచి= విజృంభించి; ఒండొరులన్= ఒకరి నొకరు; మార్కొని= ఎదిరించిపోరాడి; రౌద్రరసం= కోపంతో నిండిన రోషం; అ+సామాన్యము+కాఁగన్= సాటిలేనిది అయ్యేటట్లుగా; న+స్ఖలిత, మత్సరముల్= జారిపోని ద్వేషములు; మెఱయంగన్= ప్రకాశించేటట్లుగా, అన్యోన్య, నిశాత, సాయక, నిరంతర, వర్షములన్= ఒండొరులపై ప్రయోగించిన వాడి బాణాల వానతో ఎల్లప్పుడు తడిసిపోతూ; మునుంగుచున్= మునకలువేస్తూ (నిమగ్నులౌతూ); పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: రోషంతో- ఆత్మగౌరవంతో కూడిన వికర్ణుడూ, యుధామన్యుడూ, విజృంభించి ఒండొరులను ఎదిరించి, అలోక సామాన్యమైన రౌద్రరసంతో తగ్గిపోవని పగతో వారిద్దరు ఒకరిపై వొకరు ప్రయోగించుకొన్న ఎడతెరిపి లేని బాణవర్షాలలో మునుకలు వేశారు.

విశేషం: రౌద్రము - నవరసాలలో ఒకటి. రౌద్రానికి స్థాయి భావం - క్రోధం.

ఆ. **ధరణినాథ! చేకితానుండు గడఁగి సు । శర్మమీఁద నిశితశరచయంబు**
గురియ, నితఁడు నతనిఁ గ్రూరాస్త్రనికర సం । పిహితగాత్రుఁ జేసి పేర్చి యార్చె. **262**

ప్రతిపదార్థం: ధరణినాథ!= ఓరాజా! (ఓ ధృతరాష్ట్ర మహారాజా!); చేకితానుండు= చేకితానుడు; కడఁగి= పూని; సుశర్మ మీఁదన్= సుశర్మ (అనే రాజు) మీద; నిశిత+శర+చయంబున్= వాడి బాణాల సముదాయమును; కురియన్= వర్షింపగా; ఇతఁడు= సుశర్మ; అతనిన్= ఆ చేకితానుడిని; క్రూర+అస్త్ర, నికర, సంపిహిత+గాత్రున్+చేసి= కఠోరములైన మంత్ర బాణ సముదాయంచేత పీడించబడిన శరీరంగల వాడినిగా చేసి; పేర్చి= అతిశయించి; ఆర్చెన్= సింహనాదం చేశాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! చేకితానుడు సుశర్మపై వాడియైన బాణాలను ప్రయోగించాడు. అంతట సుశర్మ చేకితానుడి శరీరాన్ని తీవ్రమైన బాణాల సముదాయంతో కప్పివైచి సింహనాదం చేశాడు.

క. **శకుని ప్రతివింధ్యుఁ దాఁకిన । బ్రకటబలుం డా యుధిష్ఠిరప్రియసుతుఁ డు**
ద్భృకుటి యగుచుఁ గవిసెను సిం । హ కిశోరము గజముఁ బొదువున ట్లతనిపయిన్. **263**

ప్రతిపదార్థం: శకుని= శకుని (సుయోధనుడి మేనమామ); ప్రతివింధ్యున్= ధర్మరాజు కొడుకును; తాఁకినన్= మార్కొనగా; ప్రకట+బలుండు= కనిపించిన పరాక్రమం కలవాడు; ఆ+యుధిష్ఠిర, ప్రియ, సుతుఁడు= ధర్మరాజు అనుగు కొడుకు; సింహ+కిశోరము= సింగపు పిల్ల; గజమున్= ఏనుగును; పొదువు+అట్లు= పట్టుకొనినట్లు; అతనిపయిన్= ఆ శకునిపై; ఉద్+భృకుటి+అగుచున్= పైకెత్తిన కనుబొమలు కలవాడౌతూ; కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: ప్రతివింధ్యుడిని శకుని మార్కొన్నాడు పరాక్రమంతో భాసిల్లే ధర్మరాజు ప్రియ పుత్రుడైన ప్రతివింధ్యుడు కొదమసింగం ఏనుగుపై పడినట్లు కనుబొమలు పైకెత్తి ఆ శకునిపై పడ్డాడు.

తే. **భీమనందనుఁ డగు శ్రుతసోముఁ గడిమిఁ । దాఁకెఁ గాంభోజనృపతి సుదక్షిణుండు**
వార లిరువురు నొండొరుం గ్రూరబాణ । జాలముల నెట్లుఁ దెరలుపఁ జాలరైరి. **264**

ప్రతిపదార్థం: కాంభోజ+నృపతి= కాంభోజ దేశం పాలించేరాజు; సుదక్షిణుండు= సుదక్షిణుడు అనే పేరుగలవాడు; భీమ+నందనుఁడు+అగు= భీముడి కొడుకైన; శ్రుతసోమున్= శ్రుతసోముడిని; కడిమిన్= పౌరుషంతో; తాఁకెన్= మార్కొన్నాడు; వారలు+ఇరువురున్= వారు ఇద్దరు (సుదక్షిణుడూ, శ్రుతసోముడూ); ఒండొరులన్= ఒకరి నొకరు; క్రూర, బాణ, జాలములన్= కఠినములైన అమ్ముల సముదాయాలతో; ఎట్లు= ఏ విధంగానూ; తెరలుపన్+చాలరు+ఐరి= చెదర గొట్టలేకపోయారు.

తాత్పర్యం: కాంభోజరాజు భీముడి కొడుకైన శ్రుతసోముడిని మార్కొన్నాడు. ఉభయులు ఒకరిపై ఒకరు వాడి బాణాలు ప్రయోగించుకొన్నారు. ఒకరి ధాటిని ఒకరు అరికట్ట లేకపోయారు. సమయుద్ధం కొనసాగింది.

ఉ. అంతకవిక్రముండు మహిమాస్పదమూర్తి భుజంగకన్యకా
సంతతకీర్తనీయబలశాలి గిరీటితనూభవుం డిరా
వంతుఁడు బాహుగర్వధనవంతు శ్రుతాయువుఁ దాఁకె వార ల
త్యంతరయంబునన్ విరథు లైరి పరస్పరబాణఘట్టనన్. 265

ప్రతిపదార్థం: అంతక+విక్రముండు= యముడి పరాక్రమం వంటి పరాక్రమం కలవాడు; మహిమ+ఆస్పద, మూర్తి= గొప్పతనానికి నెలవైన ఆకృతి గలవాడు; భుజంగ, కన్యకా, సంతత, కీర్తనీయ, బలశాలి= నాగకన్యక ఉలూచి చేత ఎడతెగకుండ పొగడదగిన బలము గలవాడు; కిరీటి, తనూ, భవుండు= అర్జునుడి కొడుకు; ఇరావంతుఁడు= ఇరావంతుడనే పేరుగలవాడు; బాహు+గర్వ, ధనవంతున్= భుజబల పరాక్రమం అనే గొప్ప ధనంతో కూడినవాడిని; శ్రుతాయువున్= శ్రుతాయువు అనే పేరుగలవాడిని; తాఁకెన్= మార్కొన్నాడు; వారలు= ఆ ఇరువురూ - ఇరావంతుడూ, శ్రుతాయువూ; అత్యంత+రయంబునన్= మిక్కిలి వేగంగా; పరస్పర, బాణ ఘట్టనన్= ఒకరి బాణాలచేత మరియొకరు కొట్టబడి; విరథులు+ఐరి= రథాలు పోగొట్టుకొన్నవారైనారు.

తాత్పర్యం: యముడివంటి పరాక్రమం కలవాడూ, గొప్పతనానికి చోటైన ఆకృతి కలవాడూ,నాగకన్యక ఉలూచి చేత ఎల్లప్పుడు కొనియాడదగిన బలముగల వాడునూ అయిన అర్జునుడి కొడుకు ఇరావంతుడు, ధృతరాష్ట్రుడి కుమారుడైన శ్రుతాయువును మార్కొన్నాడు. వారు ఇరువురూ పోరాడారు. ఇరువురి రథాలు కూలిపోయాయి.

విశేషం: అర్జునుడికి నాగకన్యక అయిన ఉలూచికి పుట్టినవాడు ఇరావంతుడు.

సీ. విందానువిందులు గ్రందుగ వెసఁ గుంతి । భోజుని నాతనిపుత్రుఁ దాఁకి
రా పురజిత్తు బాణాసారమున విందుఁ । బొదివె నుగ్రతఁ గుంతిభోజుఁ డేయు
తూపులు పెనుగద దొలఁగంగ జడియుచు । ననువిందుఁ డతనిపై నడరె బెలుచఁ;
గైకేయు లేవురు గాంధారరాజు లే । వురతోడఁ గ్రూరసంగర మొనర్చి;

తే. రుత్తరునిమీఁద నీ తనయుండు దీర్ఘ । బాహుఁ డురవడిఁ గదిసి యుత్సాహలీల
నెఱపె; నకులాత్మజుఁడు శతానీకుఁ డేచి । వడి నులూకునిఁ దలపడి కడిమి మెఱసె. 266

ప్రతిపదార్థం: వింద+అనువిందులు= విందుడూ అనువిందుడూ (అనేవారు); క్రందుగన్+వెసన్= ఒక్కుమ్మడిగా- వేగంగా; కుంతిభోజునిన్+ఆతని పుత్రున్= కుంతిభోజుడిని అతడి కుమారుని; తాఁకిరి= తలపడిరి; ఆ+పురజిత్తు= ఆపురజిత్తు అనేవాడు; బాణ+అసారమునన్= అమ్ముల జడివానచేత; విందున్= విందుని; పొదవెన్= కప్పాడు; ఉగ్రతన్= భయంకరంగా; కుంతి భోజుఁడు+ఏయు= కుంతిభోజుడు ప్రయోగించే; తూపులు= బాణాలు; పెను+గదన్= పెద్ద గదతో; తొలఁగంగన్+జడియుచున్= తొలగిపోయేటట్లు చలింపజేస్తూ; అనువిందుఁడు= అనువిందుడనే వాడు (విందుడి తమ్ముడు); పెలుచన్= అతిశయించి; అతనిపైన్+అడరెన్= అతడిపై విజృంభించాడు; కైకేయులు+ఏవురు= కేకయ దేశానికి చెందిన రాజులు అయిదుగురు; గాంధార, రాజులు+ఏవుర తోడన్= గాంధార రాజ్యానికి చెందిన అయిదుగురు రాజులతో; క్రూర, సంగరము+ఒనర్చిరి= భీకరమైన యుద్ధం చేశారు; ఉత్తరునిమీఁదన్= ఉత్తరుడిపైన; నీ+తనయుండు= నీ కొడుకు; దీర్ఘబాహుఁడు= దీర్ఘబాహుడు; ఉరవడిన్= మిక్కిలి వేగంగా; కదిసి= మార్కొని; ఉత్సాహ, లీలన్+నెఱపెన్= ఆవేశపూరితమైన యుద్ధం చేశాడు; నకుల+ఆత్మజుఁడు= నకులుడి కొడుకు; శతానీకుఁడు= శతానీకుడనేవాడు; ఏచి= విజృంభించి; వడిన్= వేగంగా; ఉలూకునిన్= ఉలూకుడు అనువాడిని; తలపడి= మార్కొని; కడిమి+మెఱసెన్= పరాక్రమంతో వెలుగొందాడు.

తాత్పర్యం: విందుడు అనువిందుడు అనే వీరులు కుంతిభోజుడినీ, అతడి పుత్రుడినీ మార్కొన్నారు. పురజిత్తు విందుడితో తలపడి బాణవర్షంతో అతడిని ముంచెత్తాడు. కుంతిభోజుడు ప్రయోగించిన బాణ పరంపరలను తన గదతో ఎదుర్కొని అనువిందుడు అతడిపై విజృంభించాడు. కేకయ రాజ్యానికి ప్రభువులైన ఐదుగురు వీరులూ గాంధార రాజులు అయిదుగురితో తలపడ్డారు. దీర్ఘబాహుడు (ఓ ధృతరాష్ట్ర మహారాజా, నీ కొడుకు) ఉత్తరుడి మీదికి విజృంభించాడు. నకులుడి కొడుకు శతానీకుడు విజృంభించి ఉలూకుడిని మార్కొన్నాడు.

విశేషం: 1. భారతయుద్ధంలో 'ఎక్కటి కయ్యం' ఒకే వీరుడు మరో వీరుడితో మాత్రమే పోరాడటం. అది ఒక పద్ధతి. ఇద్దరు మరో ఇద్దరితో, ఐదుగురు ఐదుగురితో క్రందడిపోరు. ఇంకొక పద్ధతి. విందానువిందులు కుంతిభోజుడితో ఆతని కొడుకులతో యుద్ధం చేశారు. అట్లే కేకయ పంచకం గాంధారరాజ పంచకంతో.

2. ఉత్తరుడు విరాటరాజు కొడుకు. ఉలూకుడు శకుని కొడుకు. శకుని దుర్యోధనుడి మేనమామ.

వ. **ఇవ్విధంబున వెండియు రెండు సేనలం జేయంగల దండి మగ లొండొరులం దాఁకిన, నధికసంరంభ ద్వంద్వయుద్ధంబు సిద్ధచారణఖేచరులు సూచి పొగడుచుండ నిగిడి, చతురంగంబులుం దనతన జాతిం బదులు పదులును నూఱులు నూఱులును, వేలు వేలును, బెక్కులు పెక్కులునుం దలపడి,యెడనెడంగలయన్ బెరయం గ్రమంబున సందడి కయ్యంబు నూలుకొనినఁ గ్రందునం దమకించి యుభయ సైనికు లున్మత్తుల గతిం గవియ బాణంబులుఁ గృపాణంబులుఁ గరిదంతంబులు నరదంబుల నొగలు నొండొంటిం దాఁకి తుత్తుమురులయిన తుములంబు కతన భయంకరం బగు నతిసంకులంబున సామజవాజిరథంబుల యురవడికి నోసరింపని కాలు బలంబులు, నుత్తుంగమాతంగస్యందన సందోహంబుల పయిం బఱపు రాహుతులును, గరటిఘటావిఘటనంబు గావించు రథికులును, నిది యది యనక యెల్ల బలంబులం జొచ్చిన మొగంబునఁ జిందఱవందఱ సేయు గజారోహకులు నగుచు నిర్మర్యాదంబుగాఁ బెనంగు సైన్యద్వితయంబు మందరక్షుభితాంబుధిచందం బగుటకుం దగి, యుచ్చి పోయెడు శరంబులు నిరుమెయిన్ గెలిచిన కుంతక్షురి కాదులును, బ్రవాళజాలంబులుం బోలి బొలుపు మిగులుచుండ విశిఖంబులు ముఖంబులన్ బెట్టు నాటిన జిబ్బనం దిరుగుశుండాలంబులు ప్రళయకాలంబున సురకరువలిచే దిర్దిరం దిరిగెడు కులనగంబులఁ గ్రేణిసేయఁ గరవాలగదాభల్లప్రముఖంబు లగు శస్త్రాస్త్రంబులఁ గుంభికుంభతురంగముఖ భటకపాలాదు లవియు చప్పుళ్ళును, వివిధాయుధ ప్రహతుల నొఱలు హరినరనాగంబుల రావంబులును, దారుణప్రకారంబున దిక్తటదారణంబు సేయుచుం జెలంగఁ, జేయి దునిసినం దక్కటిచేతం గైదువు గొని కవియువారును, గాలు దునిసిన నెదిరి మీఁదికి లంఘించువారును, దల దునిసినం దారు మును గన్నిడినవారిం బొడిచిపడువారును, దెగిపడియు నవుడు గఱచుటయు బొమముడి వడుటయును సడలని తలల నొప్పువారును, మావంతులు నేనుంగులు వికలంబు లైన సమీపవర్తుల వాహనంబుల సమారోహణంబు సేసి పరాక్రమించువారును, నొచ్చియు నీడం బోక చెలులకుం జుట్టంబులకు నడ్డపడువారును మార్బలంబునం జేరి చుట్టం బని తప్పింపక నొప్పించువారును సుభటులు సొచ్చి చెండిన వండం దఱిగినట్లుండు వేదండహయచయంబులును నాశ్వికులు పైకొని మీఁది మానిసులం దునిమిన వ్రొడుపడు రథంబులును, రథనేమి ఘట్టనంబున దట్టంబు లగు పదాతిగాత్రంబులును, నిభంబులు వొదివి నేలతో వ్రేసియుఁ గాలం జమరియుఁ దూల వైచియుఁ గొమ్ముల గ్రుచ్చి యెత్తియు బారిసమలిన**

వికటాకారంబు లగు ఘోటకంబులునై ఘోరభంగి యగు సంగరంబు సెల్లుచుండ మధ్యాహ్నసమయంబున. 267

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; వెండియున్= మరియునూ; రెండు, సేనలన్= ఉభయ సైన్యాలలో; చేయన్+కల= కార్యశూరులైన - సమర్థులైన; దండి, మగలు= గొప్ప వీరులు; ఒండు+ఒరులన్= ఒకరిని ఒకరు; తాఁకినన్= తలపడగా; అధిక, సంరంభ, ద్వంద్వ, యుద్ధంబు= మిక్కిలి ఉత్సాహంతో కూడుకొనిన ఎక్కటి కయ్యము; సిద్ధ, చారణ, ఖేచరులు= సిద్ధులు, చారణులు, ఖేచరులు అనే వేల్పుతెగలు; చూచి= అరసి; పొగడుచుండన్= ప్రశంసిస్తూ ఉండగా; నిగిడి= అతిశయించి; చతురంగంబులున్= నాలుగు తెగలు (రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాలిభటులు); తన+తన జాతిన్= తమ వర్గాలకు చెందిన (అనగా రథాలు రథాలను, ఏనుగులు ఏనుగులను, గుర్రాలు, గుర్రాలను, కాల్బలంలోని భటులు ఆ భటులను); పదులు పదులును= పది సంఖ్యలు ఆ సంఖ్యలో ఉన్న వాటిని; నూఱులు నూఱులును= వందలు వందలను; వేలు వేలును= నూరుపదుల సంఖ్య- ఆ సంఖ్యలో ఉన్న సమూహాన్ని; పెక్కులు+పెక్కులునున్= పెక్కు సంఖ్యలో ఉన్న అట్టి సంఖ్యాసమూహాన్ని; తలపడి= మార్కొని; ఎడన్+ఎడన్= అప్పుడప్పుడు; కలయన్+బెరయన్= కలసికొంటూ- తారసిల్లుతూ; క్రమంబునన్= వరుసగా; సందడి+కయ్యంబు= సంకుల సమరం; నాలుకొనినన్= విస్తరించగా; క్రందునన్= వేగంగా; తమకించి= ఉత్సహించి; ఉభయ, సైనికులు= రెండు వర్గాలలోని భటులు, కౌరవ పాండవ సేనలలోని భటులు; ఉన్మత్తుల గతిన్= పిచ్చివారివలె; కవియన్= తాకగా; బాణంబులున్= అమ్ములు; కృపాణంబులున్= కత్తులు; కరి, దంతంబులున్= ఏనుగుల దంతాలు; అరదంబుల, నొగలున్= రథాల ముందు భాగాలు; ఒండు+ ఒంటిన్+తాకి= ఒక దానితో మరియొకటి ఎదుర్కొని; తుమురులు+తుమురులు= ముక్కచెక్కలు; అయిన, తుములంబు+కతవన్= సంకుల సమరం కావటం చేత; భయంకరం+బగు= భీకరమైన; అతిసంకులంబునన్= మిక్కిలి దట్టమైన సందడి యుద్ధంలో; సామజ, వాజి, రథంబుల+ఉరవడికిన్= ఏనుగుల యొక్క, గుర్రాలయొక్క, రథాలయొక్క మిక్కిలి వేగానికి; ఓసరింపని= తప్పుకొనలేని; కాలు బలంబులున్= పదాతులు, కాలిభటులును; ఉత్తుంగ, మాతంగ, స్యందన, సందోహంబులపయిన్= ఎత్తైన ఏనుగులు, రథాల గుంపులపై; పఱపు= పరుగెత్తించే; రాహుతులును= రౌతులు (గుర్రాలపై స్వారీ చేసే భటులు); కరటి, ఘటా, విఘటనంబు+కావించు= ఏనుగుల సమూహాలను ముక్కలు ముక్కలుగా చేసే; రథికులును= రథాలపై యుద్ధం చేసే వీరులూ; ఇది+అది+అనక= ఇటు అటు అడ్డులేకుండా లెక్కచేయకుండగా; ఎల్ల+బలంబులన్= అన్ని సైన్యాలలో; చొచ్చిన= ప్రవేశించిన; మొగంబునన్= ముందలి భాగంలో; చిందఱ వందఱ+చేయు= ముక్కలు ముక్కలుగా చీల్చి వేసే, గజ+ఆరోహకులు= ఏనుగులపై ఎక్కి యుద్ధం చేసే వారూ; అగుచున్= అవుతూ; నిస్+మర్యాదంబుగాన్= హద్దు లేకుండగా; పెనగు= యుద్ధం చేసే; సైన్య+ద్వితయంబు= రెండు సేనలూ; మందర, క్షుభిత+అంబుధి+చందంబు+అగుటకున్= మందర పర్వతంచేత తరచబడిన సముద్రంవలె కావటానికి; తగి= ఒప్పి; ఉచ్చి+పోయెడు+శరంబులు= నాటి వెడలే బాణాలు; ఇరు+మెయిన్= రెండు వైపుల; గెలిచిన= చెలరేగిన; కుంత+క్షురిక+ఆదులును= ఈటెలు చిరుకత్తులు మొదలైనవిన్నూ; ప్రవాళ+జాలంబులన్+పోలి= చివుళ్ళను పోలుతూ; పొలుపు+మిగులు= అందంతో అతిశయించే; చండ+విశిఖంబులు= వాడి బాణాలు (బాణాలు); ముఖంబునన్= మొగంపై (కుంభస్థలంపై); బెట్టు+నాటినన్= గట్టిగా గ్రుచ్చుకొనిన; జిఱ్ఱనన్= వేగంగా వెనుకకు; తిరుగు= తిరిగే; శుండాలంబులు= ఏనుగులు; ప్రళయ+కాలంబునన్= ప్రళయం దాపురించిన సమయంలో; సుర+కరువలిచేన్= సుడిగాలిచేత; దిర్దిరన్+తిరిగెడు= చుట్టూ తిరిగే; కుల+నగంబులన్= కులపర్వతాలను; క్రేణి+చేయన్= పరిహసిస్తూ ఉండగా; కరవాల+గదా+భల్ల+ప్రముఖంబులు అగు= కత్తులు, గదలు, ఈటెలు మొదలైనవి అగు; శస్త్ర+అస్త్రంబులన్= ఆయుధాలు మంత్రాయుధాల చేత; కుంభి, కుంభ, తురంగ+ముఖ+భట+కపాల+ఆదులు= ఏనుగు కుంభస్థలాలు, గుర్రాల ముఖాలు, సేనలలోని భటుల తలలు మున్నగునవి; అవియు+చప్పుళ్ళను= పగిలే ధ్వనులూ; వివిధ+ఆయుధ ప్రహతులన్= పెక్కు విధాలైన ఆయుధాల వలన తగిలిన దెబ్బలచేత; ఒఱలు= వ్యాపించే; హరి, నర, నాగంబుల, రావంబులును= గుర్రాల యొక్కయు భటుల యొక్కయు; ఏనుగుల యొక్కయు ధ్వనులు; దారుణ ప్రకారంబునన్= భయంకరమైన విధంగా; దిక్+తట+దారణంబు+చేయుచున్= దిక్కుల యొక్క అంచులు చీలేటట్లుగా చేస్తూ; చెలంగఁగాన్= ధ్వనించగా; చేయి+తునిసినన్= చేయి తెగిపడిపోయినప్పటికీ; తక్కటి+చేతన్= మిగిలిన చేతితో;

కైదువు+కొని= కత్తిపట్టి; కవియు వారును= యుద్ధం చేసేవారూ; కాలు+తునిసినన్= పాదం విరిగిపోయినప్పటికీ; ఎదిరి మీఁదికిన్= శత్రువుపైకి; లంఘించువారును= దూకేవారూ; మును= మునుపు; కన్ను+ఇడిన వారిన్= చూచినవారిని- గురిపెట్టిన వారిని; తల+తునిసినన్= తన తలకాయ తెగిపడిపోయినప్పటికీ; పొడిచి+పడువారును= పొడిచి పడిపోయే వారునూ; తెగిపడియున్= ఖండింపబడి క్రింద పడిపోయినప్పటికీ; అవుడు+కరచుటయున్= పెదవి కరచుటా; బొమముడి+పడుటయును= కనుబొమ్మలు దగ్గరగా చేర్చటం; సడలని= తప్పని; తలల= శిరస్సులతో; ఒప్పువారును= శోభిల్లే వారూ; ఏనుంగులు= ఏనుగులు; వికలంబులు+ఐన= చెడిపోయినప్పటికీ (కూలిపోయినప్పటికీ, చచ్చిపోయినప్పటికీ); సమీప, వర్తుల, వాహనంబులు= దగ్గరగా ఉన్నవారి వాహనాలను; సమారోహణంబు+చేసి= ఎక్కి; పరాక్రమించువారును= వీరత్వం చూపేవారు; నొచ్చియున్= తనకు దెబ్బతగిలి బాధగా ఉన్నప్పటికీ; ఈడంబోక= వెనుదీయక; చెలులకున్= స్నేహితులకూ; చుట్టంబులకున్= బంధువులకు; అడ్డపడు వారలు= సాయం చేసేవారు (శత్రువుల దెబ్బలు తాకకుండా అడ్డగించేవారు); మార్+బలంబునన్+చేరి= శత్రుసైన్యంలోకి చొచ్చుకొనిపోయి; చుట్టంబు+అని+తప్పింపక= తనకు బంధువు అనే ఆలోచనతో విడువకుండా; నొప్పించు వారును= ఎదిరించి యుద్ధం చేసే వారూ; సుభటులు+చొచ్చి= వీరులు ప్రవేశించి; చెండినన్= ఖండించగా; వండన్+తఱిగినట్లు+ఉండు= వండటానికి ముక్కలుగా తరిగినట్లు పడియున్న; వేదండ, హయ, చయంబులును= ఏనుగుల, గుర్రాల సముదాయాలు; ఆశ్వికులు = రౌతులు; పైకొని= విజృంభించి; మీఁది మానిసులన్+తునిమిన= పైనున్న (వీరులను) సంహరింపగా; మ్రోడు, పడిన, రథంబులును= ఆకులులేని చెట్ల కాండంవలె ఉన్న రథాలూ; రథ, నేమి, ఘట్టనంబునన్= రథచక్రాల తాకిడిచేత; దట్టంబులు+ అగు= దళసరిగా అయిన; పదాతి+గాత్రంబులును= కాలిబంటుల కళేబరాలూ; ఇభంబులు= ఏనుగులు; పొదివి= ఢీకొని; నేలతోన్+వ్రేసియున్= నేలపై రాయటం; తూలవైచియున్= విసరివేయటం; కొమ్ములన్+గ్రుచ్చి= దంతాలతో పొడిచి; ఎత్తియున్= పైకి విసరి; బారి సమరిన= హింసించగా; వికట+ఆకారంబులు అగు= వికారమైన రూపాలు ఏర్పడిన; ఘోటకంబులును= గుర్రాలూ; ఐ= కలిగి; ఘోరభంగి+అగు= భయంకరవిధం కలదైన; సంగరంబు+చెల్లుచుండన్= యుద్ధం జరుగుతూ ఉండగా; మధ్యాహ్న+సమయంబునన్= మధ్యాహ్నవేళ.

తాత్పర్యం: "ఈ విధంగా కౌరవపాండవసేనల్లోని గొప్పవీరులు ఒకరితో ఒకరు తలపడగా జరిగిన మిక్కిలి సంరంభంతో కూడిన ద్వంద్వ యుద్ధమును ఆకాశంలో సంచరించే వేల్పు తెగలు సిద్ధులు, చారణులు, ఖేచరులు ప్రశంసించారు. చతురంగబలాలు ఒండొంటిని తాకాయి. రథాలు రథాలతో, ఏనుగుల బలాలు ఏనుగుల బలాలతో, అశ్వికులు అశ్వికులతో, కాలి బంటులు కాలి బంటులతో ఢీకొనడం జరిగింది. ఆ నాలుగు రకాల జాతులూ, తమ తమ జాతులతో పదింటితో పదియూ, వందింటితో వందయూ, వేయింటితో వేయియున్నూ పెక్కింటితో పెక్కులున్నూ అక్కడక్కడా కలసిపోతూ విడిపోతూ తలపడగా క్రమంగా సంకుల సమరం ఏర్పడింది. ఉభయసేనలలోని భటులు పిచ్చివారి వలె పోరాడారు. బాణాలు, కత్తులు, ఏనుగుల దంతాలు, రథాల నొగలూ ఒకదానితో నొకటి కొట్టుకొని తుత్తునియలై యుద్ధభూమిపై పడ్డాయి. ఆ భయంకరయుద్ధంలో ఏనుగుల,గుర్రాల రథాలధాటికి ఓర్వని కాలిబంటులు, ఎత్తైన ఏనుగుల రథాలపై విజృంభించిన రౌతులు, ఏనుగుల గుంపులను చీల్చి చెండాడే రథికులు ఇది అది అనకుండా అన్ని రకాల శత్రు సేనలను ప్రవేశించిన మొనలను చిందరవందర చేసిన గజారోహకులు కలిగి హద్దులేకుండా యుద్ధంచేసే ఆ రెండు సేనలు మందర పర్వతం చిలికిన సముద్రాల వలె కనిపించాయి. దూరిపోయే బాణాలు ఇరువైపుల నుండి ప్రయోగింపబడిన ఈటెలు, వంకర కత్తులూ, రక్తసిక్తమై ప్రవాళజాలంబులను పోలి అందంతో అతిశయించాయి. ముఖాలలో బాణాలు గట్టిగా నాటుకోగా వేగంగా వెనుదిరిగి పోయే ఏనుగులు ప్రళయకాలంలో సుడిగాలి చేత దిర్దిరతిరిగే కుల పర్వతాలవలె కనిపించాయి. కత్తులు గదలు బల్లెములు మొదలగు శస్త్రాస్త్రములచే ఏనుగుల కుంభస్థలాలు, తురంగ బలాల తలలు భటుల పుర్రెలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పగిలేటప్పుడయ్యే ధ్వనులూ మరియు వివిధా యుధముల చేత దెబ్బతిని పడిపోయే గుఱ్ఱాలు భటులు ఏనుగుల ధ్వనులు దారుణంగా దిక్ప్రదేశాలను చీల్చుచు చెలరేగాయి ఒక చేయి తెగిపోయిననూ రెండవచేతితో ఆయుధము పట్టి మీదికి దుముకువారునూ, కాలుతెగిననూ, ఎదుటివాని మీదికి లంఘించువారునూ, తల తెగిననూ, మునుపు కన్నిడినవారిని పొడిచి నేలగూలువారునూ, ఖండింపబడినప్పటికిని పెదవులు కొరుకుతూ ముడివీడని కనుబొమలతో, తలలతో వెలుగువారునూ, తమ వాహనములైన గుఱ్ఱాలు, ఏనుగులు నేలగూలినప్పుడు చెంతనున్నవారి వాహనా లెక్కి పరాక్రమించేవారునూ, బాధచెందినప్పటికీ వెనుదీయక స్నేహితులకూ, బంధువులకూ సాయపడేవారూ, శత్రు పక్షంలో నున్నవారు తనకు చుట్టమని వదలకుండా నొప్పించేవారూ, ఇట్లు వీరభటులు చొచ్చుకొని పోయి ఏనుగుల గుఱ్ఱాల గుంపులను చెండగా వంటకొరకు తరిగినకూరలట్లు అవి కన్పించాయి. ఆశ్వికులు పైబడి రథాలమీది యోధులను చంపగా రథాలు శూన్యాలైనాయి. రథ చక్రాల క్రిందబడినలిగిన భటుల కళేబరాలు దట్టంగా గుట్టలు గుట్టలుగా పడిపోయాయి. ఏనుగులు విజృంభించి గుఱ్ఱాలను నేలపై పడవేసి కాళ్లతో త్రొక్కాయి, విసరివేశాయి, దంతాలతో పొడిచాయి. ఆ గుఱ్ఱాల కళేబరాలు రూపుమాసి తీవ్ర వికారంగా కనిపించాయి. యుద్ధం ఈ రీతిగా మధ్యాహ్న సమయం వరకు సాగింది.

విశేషాలు: 1. ఆ యుద్ధం దేవతలు చూడగోరారు. 2. ఏనుగులు కులపర్వతాలవలె ఉన్నాయి. కులపర్వతాలు భూమిని మోస్తాయి అని పురాణకథనం. మహేంద్రము, మలయము, సహ్యాము, శుక్తి మంతము, గంధమాదనము - వింధ్యము - పారియాత్రము ఈ ఏడు కులపర్వతాలు. 3. ఈ యుద్ధ వర్ణన మహాభారత కాలం నాటిదా? తిక్కన కాలం నాటిదా? తిక్కన తాను కనులార గాంచిన యుద్ధభూమిని వర్ణించినట్లు కన్పిస్తున్నది. (రథాల వర్ణన విడిచిపెడితే) 4. కోపతాపాల వలన బొనుముడిపాటు మొగంపై ఏర్పడటం కద్దు. ఆ ముద్ర వీరుల శవాల ముఖాలలో స్తంభించి కన్పించటం విశేషం. అట్లే ఇరువురు భటుల కత్తి యుద్ధంలో తలతెగిన మొండెం ముందుకు కొన్ని అడుగులు వేసి శత్రువును పొడిచి చంపటం! బహుశః ఇవి అతిశయోక్తులు కావేమో! యుద్ధభూమిని ప్రత్యక్షంగా చూచిన తిక్కన చేసిన వర్ణనలు.

భీష్ముఁడు దుర్యోధన ప్రేరితుండై విజృంభించి పాండవవీరుల నొప్పించుట (సం. 6-45-1)

సీ. మనుజేంద్ర! వినుము నీ తనయుండు వనుపంగ । దుర్ముఖ కృప కృతవర్మ మద్ర
పతి వివింశతులు విస్ఫారబాణార్చులఁ । బంచాగ్నులును బోలెఁ బ్రజ్వరిల్ల
తన కెలంకులఁ గోలుతలసేసి తఱుమంగఁ । దాలకేతువు మహోత్తాలమూర్తి
నాభీల మై క్రాల నడరి పాండవసేనఁ । దఱిసి మందాకినీతనయుఁ డేచి
తే. చేది పాంచాల కేకయు లాది గాఁగఁ । గల్గు భూపాల కోటి మొగ్గరము లెల్లఁ
గలఁగఁ దిరుగుడువడ నోరగిలఁగఁ బెల్ల । గిల్లఁ దల్లడపడ రణక్రీడ సల్పె. 268

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్ర!= మనుజేంద్ర!; ఓ రాజా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; వినుము= ఆలకించుము; నీ+తనయుఁడు= నీ కొడుకు; అనుపంగన్= పంపగా; దుర్ముఖ, కృప, కృతవర్మ, మద్రపతి, వివింశతి= దుర్ముఖుడు, కృపాచార్యుడు, కృతవర్మ, శల్యుడూ; వివింశతీ; విస్ఫార, బాణ+అర్చులన్= ప్రకాశించే బాణాలయొక్క జ్వాలలతో; పంచ+అగ్నులును+పోలెన్= ఐదు నిప్పులవలె; ప్రజ్వరిల్లన్= ప్రకాశించగా; తన+కెలంకులన్= తన ప్రక్కల; కోలుతల+చేసి= యుద్ధం చేయుటానికి సంసిద్ధమై; తఱుమంగన్= ప్రోత్సహించగా; తాలకేతువు= తాడిచెట్టు జెండా కలవాడు (భీష్ముడు); మహా+ఉత్తాలమూర్తి= మిక్కిలి పొడుగైన ఆకృతి కలవాడు; ఆభీలము+ఐ= భయంకరంగా; క్రాలన్= మిరుమిట్లు గొలిపి వెలుగొందగా; అడరి= విజృంభించి; పాండవ+

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సేనన్+తఱిసి= పాండవుల సైన్యాన్ని సమీపించి; మందాకినీ తనయుఁడు= గంగ కొడుకు(భీష్ముడు); ఏచి= అతిశయించి; చేది, పాంచాల, కేకయులు+ఆదిగాఁగన్= చేది దేశం, పాంచాల దేశం, కేకయ దేశం ఏలే ప్రభువులు; కల్గు= ఉన్న; భూపాలకోటి= రాజుల సమూహాలయొక్క; మొగ్గరాలు= వ్యూహాలు; ఎల్లన్= అన్నిటినీ; తిరుగుడు+పడన్= తారుమారగునట్లుగా; ఒరగిలఁగన్= వ్రాలేటట్లుగా; పెల్లగిల్లన్= అడుగునుండి పైకి వచ్చేటట్లుగా; తల్లడ+పడన్= చీకాకుపడగా; రణ+క్రీడ= యుద్ధం అనే ఆట; సల్పెన్= చేశాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! వినుము. నీ కొడుకు దుర్యోధనుడు పంపగా, దుర్ముఖుడు, కృపాచార్యుడు, కృతవర్మ, శల్యుడు, వివింశతి భీష్ముడికి బాసటగా నిలిచి ప్రకాశించే బాణాల మంటలతో పంచాగ్నులవలె ప్రజ్వరిల్లి అతడికి ప్రక్కల నిల్చి శత్రుసైన్యాన్ని తరుముతూ తాటిచెట్టు జెండాతో వెలుగొందేవాడూ, ఎత్తైన విగ్రహం కలవాడూ అయిన భీష్ముడు భయంకరుడై విజృంభించి పాండవసేనదరిజేరి చెలరేగి పాంచాల కేకయ రాజులు మొదలైనవారు పన్నిన వ్యూహాలను అన్నింటిని చెదరిపోయేటట్లు, పారిపోయేటట్లు, ఒరిగిపోయేటట్లు, పెల్లగిలేటట్లు, చీకాకుపడేటట్లు, రణక్రీడ సలిపాడు.

విశేషాలు: 1. పంచాగ్నులు: దక్షిణాగ్ని, ఆహవనీయం, గార్హపత్యం - సభ్యం - అవసథ్యం. 2. రణక్రీడ : యుద్ధాన్ని ఆటగా అభివర్ణించటం తిక్కనకు ఇష్టం.

క. పాయవడఁ జొచ్చు గుంపులు । సేయును మలఁకలఁ జరించి చించును గోణ
వ్యాయామ గతుల వలయము । లై యుండం దిరిగి కలఁచు నరి సైన్యంబున్. 269

ప్రతిపదార్థం: గుంపులు= మూకలు; పాయ+పడన్= చీలికలు ఏర్పడేటట్లుగా; చొచ్చున్= లోపలికి చేరుకొంటాడట; మలకలన్+చరించి= వంకరటింకరగా తిరిగి; చించున్= విడగొట్టుతాడు; అరి సైన్యంబుల్= శత్రువుల సేనలు; కోణ వ్యాయామ గతులన్+వలయములై+ఉండన్= రెండు రేఖలు కలిసే రీతిని యుద్ధం చేస్తూ, చక్రాకారం సృష్టించి; తిరిగి= చరించి; కలఁచున్= కలతపెట్టుతాడు.

తాత్పర్యం: భీష్ముడు యుద్ధ విద్యలో గొప్ప నేర్పరి. శత్రుసేనలను చీలికలు చేస్తూ లోపలికి దూరుతాడు. గుంపులు చేస్తాడు. వంకర టింకరగా తిరిగి చించుతాడు. కోణాలు ఏర్పడేటట్లు, వృత్తాలు ఏర్పడేటట్లు తిరుగుతూ కలత పెడతాడు.

విశేషం: శత్రుసేనలు గుమిగూడి వలయాకారంగా మోహరించవచ్చు, భీష్ముడు 'కోణవ్యాయామ గతి' తిరిగి శత్రుసేనను చెండాడాడు. కోణము: రెండు రేఖలు కలిసేచోటు. వలయము: చక్రాకారము.

క. డొల్లెడు తలయును దునిసెడు । విల్లును ధర కొఱగు మేను విఱిగెడు సిడముం
బెల్లు దొరఁగు నెత్తురు నై । పల్లటిలం దొడఁగె నపుడు పాండవ బలముల్. 270

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో (భీష్ముడు యుద్ధం చేసే సమయంలో); డొల్లెడు= ఊడి క్రిందపడే; తలయును= శిరస్సు; తునిసెడు+విల్లు= ముక్క చెక్కలయ్యే ధనువూ; ధరకున్+ఒఱగు మేను= నేలమీద పడే శరీరం; విఱిగెడు, సిడమున్= ముక్కలయ్యే జెండా; పెల్లు, తొరఁగు, నెత్తురు= మిక్కుటంగా కారే నెత్తురు; ఐ= కలవై; పాండవ+బలముల్= పాండవుల సైన్యాలు; పల్లటిలన్+తొడఁగెన్= చెల్లా చెదురై పోసాగాయి.

తాత్పర్యం: భీష్ముడు యుద్ధం చేసిన సమయంలో పాండవుల సైన్యాలు తల్లడిల్లిపోయాయి. ఎక్కడ చూచినా, డొల్లిన శిరస్సులు, విరిగిన ధనువులు, భూమిపై పడిపోయే శరీరాలు, విరిగిన జెండాలు, మిక్కుటంగా స్రవించే నెత్తురు కన్పించాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు ప్రళయకాలతాండవంబునం బ్రచండమూర్తి యగు నష్టమూర్తియుం బోలె విజృంభించిన భీష్ము మార్కొను మగలు లేక పాండవసైన్యంబు బెండువడియున్న యెడ నభిమన్యుండు గనకవర్ణ తురంగంబులుం గర్ణికారధ్వజంబును మెఱయం దాఁకి. 271

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ప్రళయ+కాల+తాండవంబునన్= ప్రళయకాలంలో నాట్యం చేసే; ప్రచండ+మూర్తి+అగు= భయంకరమైన ఆకృతిగల వాడైన; అష్టమూర్తియున్+పోలెన్= ఎనిమిది ఆకృతులుగల శివుడివలె; విజృంభించిన= అతిశయించిన= చెలరేగిన; భీష్మున్= భీష్ముడిని; మార్కొను= ఎదిరించే; మగలు= వీరులు; లేక= కనిపించక; పాండవ+సైన్యంబు= పాండవులసేన; బెండుపడి+ఉన్న+ఎడన్= నీరసించి, శుష్కించి ఉన్న వేళ; అభిమన్యుండు= అభిమన్యుడు (అర్జునుడి కొడుకు యువవీరుడు); కనక, వర్ణ, తురంగంబులన్= బంగారు రంగు గల గుఱ్ఱాలనూ; కర్ణికార+ధ్వజంబును= కొండగోగు పువ్వు గుర్తుగల జెండా; మెఱయన్= ప్రకాశించగా; తాఁకి= మార్కొని.

తాత్పర్యం: ఈ విధంగా ప్రళయకాలంలో నాట్యం చేస్తూ చెలరేగే ఎనిమిది ఆకృతులుగల శివుడివలె విజృంభించే భీష్ముడిని ఎదుర్కొనే వీరులు లేక, పాండవసైన్యం చెదరి శుష్కించిపోయిన సమయంలో, అభిమన్యుడు బంగారు రంగుగల గుఱ్ఱాలు పూన్చిన రథంపై కొండగోగు పువ్వు గుర్తుగల జెండా వెలుగొందుతుండగా కౌరవసేనను మార్కొన్నాడు.

విశేషం: అష్టమూర్తి : శివుడు - ఎనిమిది ఆకృతులు గలవాడు, పంచభూతాలు, సూర్యచంద్రులు, యజ్ఞంచేసినవాడు వెరసి శివుడి అష్టమూర్తులు.

సీ. శల్యు నారాచ పంచకమున నొప్పించి । యొకకోలఁ గృతవర్మయురము నొంచి,
క్రూరభల్లమున దుర్ముఖు సూతు తల ద్రుంచి । తతిమి వివింశతి ధనువుఁ దునిమి
వెడఁద యమ్మున నేసి వెండియు మూఁడు వా । లికయమ్ము లొడలఁ గీలించి కృపుని
హయముల శరచతుష్టయతాడనమున ను । బ్బడఁగించి భీష్ముపై నడరి మేన

తే. విశిఖ నవకంబు నాటించి వెగడు పఱిచి । పేర్చి యార్చిన సురకోటి పిచ్చలించె;
మెచ్చి భీష్మాదు లెల్ల వివ్వచ్చుఁ బోలు । నెక్కు డగుఁ గాని యసదుగాఁ డీతఁ డనిరి. 272

ప్రతిపదార్థం: నారాచ+పంచకమునన్= అయిదు బాణాలతో; శల్యున్= శల్యుడిని; నొప్పించి= బాధపడేటట్లు చేసి; ఒక+కోలన్= ఒక బాణంతో; కృతవర్మ+ఉరమున్= కృతవర్మ వక్షాన్ని; నొంచి= బాధించి; క్రూర+భల్లమునన్= కఠినమైన బాణంతో; దుర్ముఖు, సూతు, తలన్+త్రుంచి= దుర్ముఖుడి యొక్క రథసారథి శిరసు తునిమి; తతిమి= ఉత్సాహంతో పూని; వివింశతి, ధనువు, తునిమి= వివింశతి విల్లు ముక్కలు చేసి; వెండియున్= మరల; వెడఁద+అమ్మునన్= వాడి బాణంతో; ఏసి= కొట్టి; మూఁడు+వాలిక+అమ్ములన్= మూడు వాడి బాణాలతో; ఒడలన్= దేహమునందు; కీలించి= సంధించి; కృపుని, హయములన్= కృపుడి గుఱ్ఱాలను; శర, చతుష్టయ, తాడనమునన్= నాలుగు బాణాల తాకిడితో; ఉబ్బు+అడఁగించి= అతిశయం అణగగొట్టి; భీష్మపైన్= భీష్మునిపై; అడరి= విజృంభించి; మేనన్= శరీరంపై; విశిఖ+నవకంబు= తొమ్మిది బాణాలు; నాటించి= గ్రుచ్చుకొనేటట్లుగా చేసి; వెగడు+పఱిచి= తల్లడిల్లచేసి; పేర్చి= విజృంభించి; ఆర్చినన్= సింహనాదం చేయగా; సురకోటి= (ఆకాశంలో విమానాలు అధిరోహించి చూచే) వేల్పుల సముదాయం; పిచ్చలించెన్= ఆశ్చర్య చకితం అయింది; భీష్మ+ఆదులు+ఎల్లన్= భీష్ముడు మొదలైన వారు అందరూ; ఈతఁడు= ఈ అభిమన్యుడు; వివ్వచ్చున్+పోలున్= అర్జునుడితో సరితూగుతాడు; ఎక్కుడు+అగున్= అధికుడు అవుతాడు; కాని= అంతేగాని; అసదు+కాడు= తక్కువ కాఁడు; అనిరి= అన్నారు.

తాత్పర్యం: ఈ సీస పద్యంలో అభిమన్యుడి పరాక్రమం వర్ణించబడింది. అభిమన్యుడు శల్యుడిపై అయిదు బాణాలు ప్రయోగించి నొప్పించాడు. కృతవర్మ రొమ్మును ఒక బాణంతో నొప్పించి వాడిబాణంతో దుర్ముఖుని రథసారథిని సంహరించాడు. తరిమి వివింశతి విల్లు దునిమి వెడల్పైన బాణంతో కొట్టి ఇంకా మూడు వాడిబాణాలు శరీరమునందు నాటి, నాల్గు బాణాలతో కృపుని గుర్రాలను కొట్టి అతడి ఉత్సాహాన్ని చెరిచాడు. తరువాత భీష్ముడిపై విజృంభించి అతని దేహమునందు తొమ్మిది అమ్ములు నాటి తల్లడపరచి చెలరేగిసింహనాదం చేశాడు. అభిమన్యుడి పరాక్రమప్రాభవమునకు దేవతలు ఆశ్చర్యచకితులయ్యారు. భీష్ముడు మొదలగు వీరాధివీరులు ఈ అభిమన్యుడు అర్జునుడికి సాటివస్తాడు. అతడి కంటే అధికుడేగాని, తక్కువ వాడుకాడు అని ప్రశంసించారు.

చ. అమరతరంగిణీ తనయుఁ డర్జుననందనుసూతుఁ గేతుదం
డము నిరు మూఁడు దూపులఁ బడం గడు బెట్టిదమేసి యుజ్జ్వలా
స్త్రము లడరింపఁ గూడికొని తక్కటి యేవురుఁ బెక్కులమ్ము లొ
క్కమొగి రయంబునం గురియఁగా గిరి వోలె నతం డుదగ్రుఁడై. 273

ప్రతిపదార్థం: అమర, తరంగిణీ, తనయుఁడు= దేవనదీసూనుడు (భీష్ముడు); అర్జును, నందను, సూతున్= అర్జునుడి కొడుకుయొక్క రథసారథిని; కేతు, దండమున్= జెండా కర్రను; ఇరుమూఁడు తూపులన్= ఆరు బాణాలతో; పడన్= పడిపోయేటట్లుగా; కడు, బెట్టిదము+ఏసి= మిక్కిలి గట్టిగా కొట్టి; ఉజ్జ్వల+అస్త్రములు= ప్రకాశవంతములైన మంత్ర బాణాలను; అడరింపన్= ప్రయోగించగా; కూడికొని= కలిసి; తక్కటి+ఏవురు= మిగిలిన ఐదుగురు= శల్యుడు, కృతవర్మ, దుర్ముఖుడు, వివింశతి, కృపుడు; పెక్కులు+అమ్ములు= అనేక బాణాలు; ఒక్క+మొగిన్= ఒకేసారి; రయంబునన్= వేగంగా; కురియఁగాన్= వర్షించగా; అతండు= అభిమన్యుడు; గిరి+పోలెన్= పర్వతంవలె; ఉదగ్రుఁడు+ఐ= భయంకరుడై.

తాత్పర్యం: గంగాసుతుడు భీష్ముడు అర్జునుడి కొడుకైన అభిమన్యుడి రథసారథిని, జెండాకర్రను ఆరు బాణాలతో ఖండించి వెలుగొందే మంత్ర బాణాలను ప్రయోగించాడు. అంతలో శల్యుడు, కృతవర్మ, దుర్ముఖుడు, వివింశతి, కృపుడు కూడుకొని పెక్కు బాణాలు అభిమన్యుడిపై వర్షించారు. అయితే అభిమన్యుడు పర్వతంవలె చలించక నిలిచాడు.

క. వారల శరవర్షంబులు । వారించుచు వేఱవేఱ వాలంపగముల్
వారలపైఁ గురియుచుఁ గురు । వీరుని తాలధ్వజంబు విఱుగఁగ నేసెన్. 274

ప్రతిపదార్థం: వారల, శర, వర్షంబులు= వానవలె (కురువీరులు) కురిపించిన బాణాలను; వారించుచున్= నిరోధిస్తూ; వేఱ+వేఱన్= వేరువేరుగా (అనగా ఆయా వీరులందరిపై వేరుగా); వాలు+అంపగముల్= వాడియైన బాణాల గుంపులు; కురియుచున్= వర్షిస్తూ; కురు+వీరుని= కౌరవులలో వీరుడైన భీష్ముడి యొక్క; తాల+ధ్వజంబు= తాడిచెట్టు గుర్తుగల జెండా; విఱుగఁగన్= తునకలు అయ్యేటట్లుగా; ఏసెన్= బాణాలు ప్రయోగించాడు.

తాత్పర్యం: వారు తనపై వర్షించిన బాణాలన్నింటినీ నిరోధిస్తూ, వారి వారిపై వేరు వేరుగా బాణాల గుంపులు కురిపిస్తూ, కురువీరుడైన భీష్ముని తాటి చెట్టు జెండా పడిపోయేటట్లు శరాలు ప్రయోగించాడు.

ఆ. తాటిసిడము విఱిగి ధరణిపైఁ గూలినఁ । బాండురాజ సుతుల బలము లెల్ల
నొక్కపెట్ట యార్చె నుక్కటి కౌరవ । సేన జోదుపిండు చిన్నఁబోయె. 275

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తాటి+సిడము= తాడిచెట్టు గుర్తుగా గల జెండా; విఱిగి= ముక్కలై; ధరణిపైన్+కూలినన్= భూమిమీద పడేసరికి; పాండురాజ, సుతుల, బలములు+ఎల్లన్= పాండవుల సేనలు అన్నీ; ఒక్క+పెట్ట= ఒకేసారిగా; ఆర్చెన్= సింహనాదాలు చేశాయి; ఉక్కు+అఱి= బలం క్షీణించి; కౌరవ, సేన, జోదు, పిండు= కౌరవుల సేనలోని యోధుల సమూహం; చిన్నఁబోయెన్= క్రుంగిపోయింది.

తాత్పర్యం: తాటిచెట్టు గుర్తుగల జెండా విరిగి నేలమీద పడిపోయింది. పాండవ సేనలన్నీ ఒక్కసారిగా సింహనాదాన్ని చేశాయి. బలం తగ్గి కౌరవసేనలోని యోధావళి చిన్న వోయింది.

విశేషం: అలనాటి యుద్ధ విద్యలో జెండాను కాపాడుకొనటం వీరుడి కర్తవ్యం; పరాక్రమంలో అంతర్భాగం. జెండా పడిపోవటం అవమానమే. అభిమన్యుడు సేనాపతినే అవమానించగలిగాడు.

తే. సింహనాదంబుతో భీమసేనుఁ డప్పు । డనుజ తనయునిఁ జేకొని యరిబలంబు
దరలఁ దాఁకిన నతని యుత్తాల సింహ । కేతనముఁ గూల్చె సురనదీసూతి యలిగి. 276

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; భీమసేనుఁడు= భీముడు; సింహనాదంబుతోన్= సింహగర్జనవంటి కేకతో; అనుజ, తనయునిన్= తమ్ముడి కొడుకును (అభిమన్యుడిని); చేకొని= స్వీకరించి (అనగా బాసటగా తాను వచ్చి నిలిచి); అరి+బలంబు= శత్రువుల సేన; తరలన్= వెనుకంజవేసేటట్లుగా;తాఁకినన్= తలపడగా; అతని= ఆ భీమసేనుడియొక్క; ఉత్తాల, సింహ, కేతనమున్= ఎత్తైనది సింహం గుర్తు గలది అయిన జెండాను; అలిగి= కోపంతో; సుర, నదీ, సూతి= భీష్ముడు (వేల్పు నది కొడుకు); కూల్చెన్= క్రిందపడేటట్లు (బాణాలు ప్రయోగించి) చేశాడు.

తాత్పర్యం: అభిమన్యుడు భీష్ముడి జెండా కూల్చి, వీర విహారం చేసేటప్పుడు భీముడు సింహనాదం చేస్తూ అక్కడకు వచ్చి, తన తమ్ముడి కొడుకుకు బాసటగా నిలిచి, శత్రుసేనలు వెనుకంజ వేసేటట్లుగా తలపడ్డాడు. ఆ భీముడిపై కోపించి, గంగాసుతుడైన భీష్ముడు ఎత్తుగా సింహం గుర్తుతో ఎగిరే ఆతడి జెండాను నేలపై కూల్చాడు.

క. పవనజుఁడు మూఁడు శరముల । దివిజనదీసూను నేసి దృఢగతిఁ గృపు మే
నవియ నొకటఁ గృతవర్మని । యవయవతతి నెనిమిదింట నార్చుచు నేసెన్. 277

ప్రతిపదార్థం: పవనజుఁడు= వాయుపుత్రుడు (భీముడు); మూఁడు+శరములన్= మూడు బాణాలతో; దివిజ, నదీ, సూనున్= గంగానదీ పుత్రుడిని (భీష్ముడిని); ఏసి= కొట్టి; దృఢగతిన్= గట్టిగా; ఒకటన్= ఒక బాణంతో; కృపుమేను= కృపునిశరీరం; అవియన్= నొచ్చునట్లుగా; ఎనిమిదింటన్= ఎనిమిది(అమ్ముల)తో; కృతవర్మని+అవయవతతిన్= కృతవర్మ యొక్క దేహంలోని అంగాలను; ఆర్చుచున్= సింహనాదం చేస్తూ; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: భీముడు భీష్ముడిపై మూడు బాణాలు వేశాడు. కృపాచార్యుడి శరీరం నొచ్చేటట్లుగా ఒక్క బాణంతో గట్టిగా కొట్టాడు. ఎనిమిది బాణాలు వేసి కృతవర్మ అవయవాలను నొప్పించి సింహనాదం చేశాడు.

వ. మఱియు నమ్మారుతతనయుండు. 278

ప్రతిపదార్థం: మఱియున్= వెండియు; ఆ+మారుత+తనయుండు= వాయుపుత్రుడైన ఆ భీముడు.

తాత్పర్యం: అంతేకాక వాయుపుత్రుడైన ఆ భీముడు.

శా. **మద్రేశున్ వెగడొంద నేసె; నతనిన్ మన్నించు జోదుల్ ప్రతా**
పోద్రేకంబున నొక్కపెట్ట రథవేగోద్దీప్తులై తాఁకినన్
రౌద్రం బాకృతిఁ బొంద సూతహయగాత్రంబుల్ వెసం ద్రుంచి చం
చద్రక్తోదకవీచులం దడిపె నాశ్చర్యంబుగా నందఱన్. 279

ప్రతిపదార్థం: మద్ర+ఈశున్= మద్రదేశరాజు శల్యుడిని; వెగడొందనన్+ఏసెన్= సొమ్మసిల్లి పోయేటట్లుగా బాణాలతో కొట్టాడు; అతనిన్+మన్నించు+జోదుల్= ఆ శల్యుడిని గౌరవించే వీరులు; ప్రతాప+ఉద్రేకంబునన్= పరాక్రమం పొంగి పొరలిపోయేటట్లుగా; ఒక్కపెట్టన్= ఒకేసారిగా (ఒక్కుమ్మడిగా); రథ, వేగ, ఉత్+దీప్తులు+ఐ= రథాల వేగాలతో వెలుగొందేవారై; తాఁకినన్= మార్కొనగా; భీముడు; రౌద్రంబు+ఆకృతిన్+పొందన్= మూర్తీభవించిన రోషమో అనునట్లుగా; సూత, హయ, గాత్రంబుల్= సారథులయొక్కయు, గుర్రాల యొక్కయు శరీరాలు; వెసన్= వేగంగా; త్రుంచి= ఖండించి; అందఱన్= ఆ యోధుల నందరినీ; ఆశ్చర్యంబుగాన్= అబ్బురం కలిగేటట్లు; చంచత్+రక్త+ఉదక, వీచులన్= చలించే నెత్తురుఅనే నీటి కెరటాలతో; తడిపెన్= తడిసేటట్లుగా చేశాడు.

తాత్పర్యం: భీముడు శల్యుడిని సొమ్మసిల్ల చేశాడు. ఆ శల్యుడి మీద గౌరవంతో తన మీదకు ఉరికివచ్చిన యోధులను పరాక్రమ వేగంతో రథాలను తనపైకి మళ్ళించిన వారిని అందరినీ కరడుగట్టిన రోషమో అన్నట్లుగా విజృంభించి, వారి రథసారథులను, గుర్రాలను చీల్చి చెండాడి, ప్రవహించే నెత్తురు అనే నీటి కెరటాలతో తడిపి వేశాడు.

వ. **తదనంతరంబ సాత్యకియు ధృష్టద్యుమ్నుండును గేకయ పంచకంబును విరాటుండు నతని కొడుకులుం దలకడచి యురవడించిన.** 280

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటుపిమ్మట; సాత్యకియున్= సాత్యకీ; ధృష్టద్యుమ్నుండును= ధృష్టద్యుమ్నుడూ; కేకయ, పంచకంబును= కేకయదేశానికి ప్రభువులైన అయిదుగురు రాజులూ; విరాటుండు= విరాటుడు; అతని, కొడుకులున్= అతడి పుత్రులూ; తలకడచి= ముందుకు వచ్చి; ఉరవడించినన్= విజృంభించగా.

తాత్పర్యం: అటు పిమ్మట (అభిమన్యుడికీ, భీముడికీ బాసటగా) సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, కేకయరాజులు అయిదుగురు, విరాటరాజు, అతని కొడుకులు ముందుకు వచ్చి నిలిచి విజృంభించారు.

విశేషం: మొట్టమొదట ఒంటరిగా అభిమన్యుడు కురుసేనలో ప్రవేశించాడు. భీష్ముడు మున్నగు వారితో పోరు సలిపి వారిని అవమానించగలిగాడు. అట్లా ఎంతకాలం నిలువగలడు? భీముడు వచ్చి ఆదుకొన్నాడు అభిమన్యుడిని అంతమంది కురువీరుల మధ్య 'ఇద్దరు' మాత్రం ఏం చేయగలరు? ఆ సంగతి గ్రహించి ఇంతలో పాండవ వీరులు పలువురు అక్కడకు చేరారు.

క. **అందఱ మేనుల గంగా। నందనుఁడు శరత్రయములు నాటించెను; శ**
ల్యుం దాఁకె నుత్తరుఁడు గరి। సందోహముతోడ నధిక సంరంభమునన్. 281

ప్రతిపదార్థం: గంగానందనుఁడు= గంగకొడుకు (భీష్ముడు); అందఱ+మేనులన్= అందరి శరీరములయందు (అనగా సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, కేకయ పంచకం, విరాటుండు, అతని కొడుకుల శరీరాలను); శర+త్రయములు= మూడు బాణాల చొప్పున; నాటించెను= గ్రుచ్చుకొనేటట్లుగా చేశాడు; కరి, సందోహముతోడన్= ఏనుగుల సముదాయంతో; అధిక+సంరంభమునన్= మిక్కుటమైన సన్నాహంతో; ఉత్తరుఁడు= విరాటుడి కొడుకు; శల్యున్+తాఁకెన్= శల్యుడితో తలపడ్డాడు.

తాత్పర్యం: భీష్ముడు తనను మార్కొనిన వీరులు అందరిపై అనగా సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, కేకయపంచకం, విరాటుడు, అతడి కొడుకులపై, ఒక్కొక్కరిపై మూడేసి బాణాలు వారి శరీరాలు నొచ్చేటట్లుగా ప్రయోగించాడు. అంతట ఏనుగుల గుంపుతోపాటుగా ఉత్తరుడు శల్యుడిని మార్కొన్నాడు.

విశేషం: ఉత్తర గోగ్రహణ యుద్ధంలో ఉత్తరుడు పిరికి పందగా కన్పిస్తాడు. నిజమే. ఆనాడు అతడు ఒంటరిగా అంతటి కౌరవ సైన్యాన్ని ఎదిరించటం అసాధ్యం అని భావించాడు. అది మానవసహజమైన భావన. ఇప్పుడు మహాభారతంలో మహావీరుల గుంపులో ఒకడు. తనచుట్టూ ఎందరో వీరులు ఉన్నారు. ఈ సమయంలో అతడికి వచ్చే ఉత్సాహం, కలిగే ధైర్యం వేరు. వ్యక్తిగతంగా ధైర్యహీనులుగూడా, పదిమందితో కూడినపుడు పెద్ద సంఘంలో కలిసిపోయినపుడూ, ఎక్కడ లేని ధైర్యసాహసాలు ప్రదర్శించగలుగుతారు. అట్లాగే. ఉత్తరుడు ఇపుడు ధైర్యంగా, మహావీరుడైన శల్యుడితో తలపడటం మనోధర్మవేత్తలకు ఆశ్చర్యం కలిగించదు.

క. నిజ ఘటకు మిగిలి, యుత్తరు । గజ మమ్మద్రేశు రథము గదిసి తురంగ
వ్రజము పయి కడరి కడు న । క్కజముగ వెస నేలఁ బెట్టి కాలం జమరెన్. 282

ప్రతిపదార్థం: ఉత్తరు, గజము= ఉత్తరుడి ఏనుగు; నిజ, ఘటకున్+మిగిలి= తన తక్కిన ఏనుగు గుంపును మించి; ఆ+మద్రేశు, రథము= ఆ మద్రరాజు (శల్యుడి) రథాన్ని; కదిసి= సమీపించి; తురంగ, వ్రజముపయికిన్= గుర్రాల సముదాయంపైకి; అడరి= విజృంభించి; కడున్= మిక్కిలి; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; వెసన్= శీఘ్రంగా; నేలన్+పెట్టి= భూమిపై పడగొట్టి; కాలన్= కాలితో; చమరెన్= రాసింది.

తాత్పర్యం: ఉత్తరుడి ఏనుగు తక్కిన ఏనుగుల గుంపును మించి శల్యుడి రథాన్ని సమీపించి, గుర్రాల గుంపు పైకి విజృంభించి ఆశ్చర్యకరంగా గుర్రాలను నేలపై పడవేసి తన కాలితో రాసింది.

తే. శల్యుఁ డుగ్రకోపంబున శక్తి యెత్తి । రయము మెఱయ వైరాటి యురఃస్థలంబు
దూఱ వైచిన నంకుశ తోమరములు । విడిచి నడుమన చచ్చుచుఁ బుడమిఁ బడియె. 283

ప్రతిపదార్థం: శల్యుఁడు= శల్యుడు; ఉగ్ర+కోపంబునన్= భయంకరమైన ఆగ్రహంతో; శక్తి+ఎత్తి= శక్తి అనే ఆయుధాన్ని ఎత్తి; రయము+మెఱయన్= వేగం వెలుగొందగా; వైరాటి+ఉరఃస్థలంబున్= విరాటరాజు కొడుకు ఉత్తరుడి వక్షఃస్థలం; దూఱన్+వైచినన్= లోనికి చొచ్చుకొని పోయేటట్లుగా విసరగా; (ఉత్తరుడు) అంకుశ, తోమరములు= ఏనుగును అదుపులో పెట్టి నడిపే కొరముట్టు - ఇనుపగుదియలు; నడుమన= మధ్యలో; విడిచి= వీడి; చచ్చుచున్= మరణిస్తూ; పుడమిన్= భూమిపై; పడియెన్= కూలాడు.

తాత్పర్యం: తాను విరథుడు కావటంచేత ఆగ్రహించి శల్యుడు, ఉత్తరుడి వక్షఃస్థలం చొచ్చుకొని పోయేటట్లు 'శక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించాడు. అంకుశం తోమరం ఏనుగు మీదనే విడిచిపెట్టి ఉత్తరుడు చచ్చి నేలమీద పడిపోయాడు.

విశేషం: 1.శక్తి - ఈటెవంటి ఇనుప ఆయుధం. గురి తప్పకపోతే - ఎదుటివాడి చావు తప్పదు. కత్తి, బల్లెం, బాణం కలిసినట్టి ఆయుధ విశేషం.

క. మద్రేశుఁ డంత నిలువక । రౌద్రంబున వాలు వెఱికి రయము మెఱయ న
త్యుద్రేకత డాసి యుఱికి । భద్రకరిం గరముఁ దునిమి పడవైచె నిలన్. 284

ప్రతిపదార్థం: మద్ర+ఈశుఁడు= మద్రరాజు(శల్యుడు); అంతన్= అంతట; నిలువక= ఆగక; రౌద్రంబునన్= రోషంతో; వాలు+వెఱికి= కత్తిదూసి; రయము+మెఱయన్= వెలుగొందే వేగంతో; అతి+ఉద్రేకతన్= మిక్కుటమైన ఆవేశంతో; డాసి+ఉఱికి=

సమీపించి గంతువేసి; భద్ర+కరిన్= మదించిన ఏనుగుయొక్క; కరమున్+తునిమి= తొండాన్ని ఖండించి; ఇలన్= నేలపై; పడవైచెన్= విసరివేశాడు.

తాత్పర్యం: ఉత్తరుడిని సంహరించటంతో ఆగకుండా, శల్యుడు రోషంతో తన కత్తిదూసి, వేగంగా ముందుకు దూకి, గొప్ప ఆవేశంతో ఆ ఏనుగు తొండం నరికి నేలపైకి విసరివేశాడు.

క. **తన విక్రమంబు సేనలు । వినుతింపఁగ నిట్లు సేసి వేగమ కృతవ**
ర్మని రథము పైకి లంఘిం । చెను శల్యుఁడు గిరికి దాఁటు సింగము భంగిన్. 285

ప్రతిపదార్థం: తన+విక్రమంబు= తన పరాక్రమం; సేనలు= సైన్యాలు; వినుతింపఁగన్= పొగడుతుండగా; ఇట్లు+చేసి= ఈ విధంగా చేసి; వేగము+అ= శీఘ్రంగా; కృతవర్మని+రథముపైకిన్= కృతవర్మ రథం మీదికి; శల్యుఁడు= శల్యుడు; గిరికిన్+దాఁటు= పర్వతానికి లంఘించే; సింగము+భంగిన్= సింహంరీతిగా; లంఘించెను= దూకాడు.

తాత్పర్యం: తన పరాక్రమాన్ని సేనలు పొగడుతుండగా, ఈ విధంగా చేసి (ఉత్తరుడిని 'శక్తి'తో చంపి ఏనుగుతుండం తన కత్తితో నరికి) శల్యుడు, దాపున ఉన్న కృతవర్మ రథంపైకి కొండ మీదికి లంఘించే సింహంవలె చేరుకొన్నాడు.

చ. **అనుజుఁడు వడ్డ శంఖుఁడు మహాగ్రహవృత్తిఁ గడంగి శల్యుపైఁ**
దన రథరాజితోఁ గవియు దారుణ దర్పముఁ జూచి దంతి ము
ట్టినఁ బరికాఱ మొత్తము వడిం బఱతెంచిన మాడ్కి నాపగా
తనయుఁడు లోనుగా రథికదంబము బిట్టడరెన్ సముద్ధతిన్. 286

ప్రతిపదార్థం: అనుజుఁడు= సోదరుడు; పడ్డన్= పడిన (ఈ యుద్ధభూమి యందు పడి మరణించగా); శంఖుఁడు= శంఖుడు, విరటుడి కొడుకు; మహా+ఆగ్రహ, వృత్తిన్= మిక్కుటమైన కోప స్వభావంతో; కడంగి= పూని; శల్యుపైన్= శల్యుడిపై; తన రథరాజితోన్= తన రథాల సమూహంతో; కవియు= మార్కొనే; దారుణ, దర్పము= ఘోరమైన పరాక్రమాడంబరం; చూచి= అరసి; దంతిన్= ఏనుగును; ముట్టినన్= తాకగా; పరికాఱ+మొత్తము= తెగకు ముఖ్యమైన ఏనుగుల సమూహాలు; వడిన్= వేగంగా; పఱతెంచినమాడ్కిన్= పరుగెత్తుకొని వచ్చే తీరుగా; ఆపగా తనయుఁడు= నదీపుత్రుడు= భీష్ముడు; లోనుగా+రథికదంబము= మున్నగు రథికుల సముదాయం; సముద్ధతిన్= మిక్కుటమైన గర్వంతో; బిట్టు+ అడరెన్= ఎక్కువగా విజృంభించింది.

తాత్పర్యం: ఉత్తరుడు యుద్ధభూమిపై కూలిపోగా, అతడి సోదరుడైన శంఖుడు మిక్కుటమైన కోపంతో శల్యుడిని తాకటం చూచి, యేనుగును ఎదుర్కొంటే, ఏనుగుల గుంపుకు నాయకత్వం వహించే పెద్ద యేనుగు, తక్కిన ఏనుగులు పరుగెత్తుకొని వచ్చే విధంగా కౌరవసేనాపతి భీష్ముడు, తదితర రథికులు గర్వంతో కూడుకొని (శంఖుడిపై) విజృంభించారు.

తే. **భీష్మునంపఱ కోర్వక పెల్లగిల్లి । శంఖుతోడి రథావళి జలదపంక్తి**
భూరిమారుతహతిఁ దూలపోవునట్లు । పఱచెఁ గని క్రీడి యడ్డంబు పఱపెఁ దేరు. 287

ప్రతిపదార్థం: భీష్మ+అంపఱకున్= భీష్ముడు ప్రయోగించిన బాణపరంపరకు; ఓర్వక= తాళజాలక; పెల్లగిల్లి= క్షోభించి; శంఖుతోడి= శంఖునితో కూడిన; రథ+ఆవళి= రథాలగుంపు; జలదపంక్తి= మబ్బుల దొంతర; భూరి+మారుత+హతిన్= గొప్పగాలి తాకిడిచే; తూలపోవునట్లు= దూరంగా నెట్టివేయబడునట్లు; పఱచెన్= పారిపోయింది; కని= (దానిని) చూచి; క్రీడి= అర్జునుడు; తేరు= తన రథం; అడ్డంబు+పఱపెన్= అడ్డంగా త్రిప్పించి చేరాడు.

తాత్పర్యం: భీష్ముడు ప్రయోగించిన బాణాలకు తాళజాలక శంఖుడి రథ సమూహం, పెద్దగాలి తాకిడికి చెదరిపోయే మబ్బు దొంతరవలె చెదరిపోయింది. ఆ దృశ్యం చూచి అర్జునుడు తన రథాన్ని అడ్డం తిప్పి ఆ చోటికి చేరుకొన్నాడు.

క. కొఱవియుఁ గొఱవియుఁ దాఁకిన । తెఱఁగున నర్జునుఁడు సురనదీ సూనుఁడుఁ జూ
పఱు వొగడఁ దాఁకుటయు ని । ద్దఱ దిక్కుల సైన్యములును దలపడియె వడిన్. 288

ప్రతిపదార్థం: కొఱవియున్+కొఱవియున్+తాఁకిన+తెఱఁగునన్= మండేకర్ర మండే కర్రతో మార్కొనిన రీతిగా; అర్జునుఁడు= అర్జునుఁడూ; సుర+నదీ+సూనుఁడు= గంగకొడుకు(భీష్ముడూ); చూపఱు= చూచేవారలు; పొగడన్= కీర్తించగా; తాకుటయున్= తలపడగా; ఇద్దఱ, దిక్కుల, సైన్యములును= ఇరువైపుల సేనలూ; వడిన్= వేగంగా; తలపడియెన్= ఎదుర్కొన్నాయి.

తాత్పర్యం: కొఱవీ కొఱవీ మార్కొన్న మాదిరిగా, అర్జునుడూ భీష్ముడూ ఒకరిపై ఒకరు విజృంభించారు. అంతట ఇరుపక్షాల సేనలు సయితం వేగంగా ఒకదానితో ఒకటి ఢీకొన్నాయి.

వ. అంత నపరాహ్ణం బయ్యె నట్టియెడ; 289

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; అపర+అహ్ణంబు+అయ్యెన్= మధ్యాహ్నం అయింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో;

తాత్పర్యం: అంత మధ్యాహ్నసమయం అయింది. ఆ సమయంలో.

క. కృతవర్మ రథము డిగి యు । ద్ధతుఁ డై మద్రపతి ఘనగదామండితహ
స్తత మెఱయఁ గవిసి రథ్య । ప్రతతిన్ ధరఁ గూల్చె శంఖుబలము దలంకన్. 290

ప్రతిపదార్థం: కృతవర్మ+రథము+డిగి= కృతవర్మయొక్క రథంనుండి క్రిందికిదిగి; మద్రపతి= మద్రదేశరాజు (శల్యుడు); ఉద్ధతుఁడు+ఐ= అతిశయించినవాడై; ఘన, గదా, మండిత, హస్తత, మెఱయన్= గొప్ప గదచేత శోభిల్లిన చేయిగలవాడై ప్రకాశించగా; కవిసి= విజృంభించి; రథ్యప్రతతిన్= గుర్రాల సముదాయాన్ని, శంఖు+బలము= శంఖుడిసేన; తలంకన్= తల్లడిల్లునట్లుగా; ధరన్+కూల్చెన్= భూమిపై పడగొట్టాడు.

తాత్పర్యం: కృతవర్మరథం నుండి శల్యుడు క్రిందికి దూకి, గద చేత బట్టి ప్రకాశిస్తూ విజృంభించి, శంఖుడి సేన తల్లడిల్లేటట్లుగా అతడి గుర్రాలను నేలపై పడగొట్టారు.

క. విరథుఁడయి మాత్స్యపుత్రుఁడు । గరవాలము గొని రథంబు గ్రక్కున డిగి యా
తురత సురరాజనందను । నరదము మాటునకు నతిరయంబున నరిగెన్. 291

ప్రతిపదార్థం: మాత్స్యపుత్త్రుఁడు= మత్స్యదేశరాజ పుత్రుడు శంఖుడు; విరథుడు+అయి= రథం లేనివాడయి; కరవాలమున్+కొని= కత్తిని పట్టుకొని; రథంబు, గ్రక్కునన్+డిగి= వేగంగా రథంనుండి దూకి; ఆతురతన్= తొట్రుపాటుతో కూడిన వేగంతో; సుర, రాజ, నందను+అరదము+మాటునకున్= దేవేంద్రుడి కొడుకు అగు అర్జునుడి రథం చాటునకు; అతి రయమునన్= మిక్కుటమైన వేగంతో; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: మత్స్య దేశ రాజు కొడుకు శంఖుడు విరథుడై, కత్తి చేతపట్టుకొని, రథం నుండి దూకి వేగంగా అర్జునుడి రథం వెనుకకు పోయి దాగుకొన్నాడు.

క. దిక్కులఁ దనబాణంబులు । పిక్కటిలఁగ నుల్లసిల్లి భీష్ముఁడు నరు తే
రక్కడ డించి ద్రుపదవిభుఁ । డుక్కఱఁ దత్సేనమీఁద నురవడిఁ గవిసెన్. 292

ప్రతిపదార్థం: భీష్ముఁడు= భీష్ముడు; దిక్కులన్= దెసలయందు; తన+బాణంబులు= తన అమ్ములు; పిక్కటిలంగన్= నిండగా; ఉల్లసిల్లి= శోభిల్లి; నరు+తేరు= అర్జునుని రథం; అక్కడన్= ఆ చోట; డించి= విడిచిపెట్టి; ద్రుపదవిభుఁడు= ద్రుపదరాజు; ఉక్కు+అఱన్= బలం తగ్గగా; తద్+సేనమీఁదన్= ఆతడి సైన్యంపై; ఉరవడిన్= మిక్కుటమైన వేగంతో; కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు తన బాణాలు దెసలలో నిండగా శోభిల్లి, అర్జునుడి రథం విడిచిపెట్టి, ద్రుపదరాజు బలం కోలుపోయి నిస్సహాయుడై చూస్తూ ఉండగా అతడి సేనను మిక్కిలి వేగంతో మార్కొన్నాడు.

వ. ఇట్లు గవిసి. 293

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; కవిసి= విజృంభించి.

తాత్పర్యం: భీష్ముడు ఈ విధంగా విజృంభించి.

క. ఎండిన యడవిన్ దరికొని। మండెడు కార్చిచ్చు మాడ్కి మారి మసఁగిన
ట్లొండొండ నేచి హయవే। దండ స్యందన పదాతి తతిఁ బొడ వడఁచెన్. 294

ప్రతిపదార్థం: ఎండిన+అడవిన్= ఎండిపోయిన చెట్లతో కూడిన అడవిని; దరికొని మండెడు=కాలుస్తూ, ప్రజ్వలించే; కార్చిచ్చు మాడ్కిన్= దావాగ్నివలె; మారి+మసగినట్లు= విజృంభించినట్లు; హయ, వేదండ, స్యందన, పదాతితతిన్= గుర్రాలు, ఏనుగులు, రథాలు, కాలిభటుల మొత్తమును; ఒండుఒండన్= ఒకదాని పిదప ఒకదానిని; ఏచి= విజృంభించి; పొడవు+అడఁచెన్= రూపుమాపినాడు.

తాత్పర్యం: భీష్ముడు ఈ విధంగా విజృంభించి, ఎండిపోయిన చెట్లతో కూడిన అడవిని కార్చిచ్చు తగులబెట్టే రీతిగా, చతురంగ బలాలను ఒకదాని తరువాత ఒకదానిని వరుసగా నాశనం చేశాడు.

క. కేకయు లేవుర బలములు। నాకులతం బొంద మార్గణాసారమునం
జీకాకు పఱిచె భీష్ముఁ డ। నేక గతులఁ దన రథంబు నేడ్తెర మెఱయన్. 295

ప్రతిపదార్థం: కేకయులు+ఏవుర+బలములు= కేకయరాజులు అయిదుగురిసేనలు; ఆకులతన్+పొందన్= చీకాకుపడునట్లుగా; మార్గణ+ఆసారమునన్= బాణాల జడివానచేత; భీష్ముఁడు= భీష్ముడు; అనేక గతులన్= పెక్కు రీతుల; తన రథంబు= తన తేరుయొక్క; ఏడ్తెఱ+మెఱయన్= విజృంభణము ప్రకాశింపగా; చీకాకు+పఱిచెన్= ఆకుల పరిచాడు.

తాత్పర్యం: కేకయరాజులు అయిదుగురి సేనలు చీకాకు పడేటట్లుగా భీష్ముడు తన రథం యొక్క విజృంభణం వెలయగా బాణ వృష్టిలో వారిని ముంచెత్తాడు.

క. ఉఱక విరాటుబలముపై। గొఱియల పిండునకుఁ గవియు కోల్పులిక్రియ బి
ట్టుఱఁ గవిసి నదీసూనుఁడు। నుఱుమాడె వియచ్చరులు వినుతి సేయంగన్. 296

ప్రతిపదార్థం: ఉఱక= లెక్కచేయక; విరాటు, బలముపైన్= విరటుడి సేనపై; గొఱియల పిండునకున్= గొర్రెల మందమీదికి; కవియు= విజృంభించే; కోల్పులి+క్రియన్= పెద్దపులివలె; బిట్టు+అఱన్+కవిసి= పెద్దపెట్టున మార్కొని; నదీ+సూనుఁడు= నదికొడుకు(భీష్ముడు); వియత్+చరులు= ఆకాశ సంచారులు(దేవతలు); వినుతి+చేయంగన్= ప్రస్తుతింపగా; నుఱుమాడెన్= సంహరించాడు.

తాత్పర్యం: గొర్రెలమందమీద పడే పెద్దపులివలె భీష్ముడు లక్ష్య పెట్టకుండా విరాటుడి సైన్యాలపై పెద్ద పెట్టున దుమికి ఆకాశ సంచారులు పొగడే విధంగా సంహరించాడు.

తే. ఇట్లు పాండవ సైన్యంబు లెల్లఁ గలఁగి । యిక్కడక్కడఁ బడుచుండ నక్కజంపుఁ
గడిమి కచ్చెరువడి యొక్క కడకు వచ్చి । పాండుసూనులు నివ్వెఱపాటు నొంద. 297

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; పాండవ+సైన్యంబులు+ఎల్లన్= పాండవుల సేనలు అన్నీ; కలఁగి= చీకాకై; ఇక్కడన్+అక్కడన్= ఇచట అచట; పడుచుండన్= కూలుతుండగా; అక్కజంపు+కడిమికిన్= అద్భుతమైనభీష్ముడి పరాక్రమానికి; అచ్చెరువడి= ఆశ్చర్యం చెంది; ఒక్క, కడకున్, వచ్చి= ఒకేచోటికి వచ్చి; పాండుసూనులు= పాండవులు; నివ్వెఱపాటున్+ఒందన్= మిక్కిలి వెఱగు పొందగా.

తాత్పర్యం: ఈ విధంగా పాండవ సేనలు అన్నీ కలతచెంది, ఇక్కడ అక్కడ కూలిపోతూ ఉండగా, భీష్ముడి అద్భుతపరాక్రమానికి ఆశ్చర్య చకితులై పాండవులందరూ ఒక చోటికి వచ్చి నివ్వెరపాటు పొందగా (తరువాతి పద్యంతో అన్వయం)

క. శాంతనవుఁడు దేజోదు । ర్దాంతుం డై నావెలుంగు ధరకెల్లను జా
లింతు నినుఁ డస్తశైలో । పాంతమునకుఁ జనిన నేమి యనిన ట్లుండెన్. 298

ప్రతిపదార్థం: శాంతనవుఁడు= శంతనుడి కొడుకు భీష్ముడు; తేజస్+దుః+దాంతుండు+ఐ= తేజస్సుచేత అణచరాని వాడవుతూ; నావెలుంగు= నా ప్రకాశం; ధరకున్+ఎల్లను= భూమికి అంతటికిని; చాలింతున్= సరిపోయేటట్లుగా చేయగలను; ఇనుఁడు= సూర్యుడు; అస్త, శైల, ఉపాంతమునకున్= అస్తగిరి ప్రాంతానికి(అస్తమించే కొండదరికి); చనినన్+ఏమి= వెళ్ళితే ఏమిలే; అనిన+అట్లు= అనినరీతిగా; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు సూర్యుడి మాదిరిగా తేజస్సుతో వెలుగొందాడు. 'నా వెలుగు చాలు. ఈ భూమిని అంతటిని ప్రకాశించేటట్లు చేయటానికి. ఇక ఇప్పుడు సూర్యుడు అస్తమిస్తే మాత్రం ఏ లోటు ఉంటుంది?' అని చెప్పేటట్లుగా ఉన్నది. అనగా భీష్ముడు సూర్యుడివలె దేదీప్యమానంగా వెలుగొందాడు.

క. సోమాన్వయ ప్రదీపకుఁ । డీ మెయి దేజో విశేష మెసకం బెసఁగం
గా మెఱయుట గనుఁగొని సి । గ్గై మఱువడుమాడ్కిఁ గ్రుంకె నర్కుం డంతన్. 299

ప్రతిపదార్థం: సోమ+అన్వయ, ప్రదీపకుఁడు= చంద్రవంశాన్ని వెలుగొంద చేసేవాడు(భీష్ముడు); ఈ మెయిన్= ఈ విధంగా; తేజస్+విశేషము+ఎసకంబు+ఎసఁగన్= గొప్ప తేజస్సు అతిశయిల్లగా; మెఱయుట+కనుఁగొని= ప్రకాశించటం చూచి; సిగ్గు+ఐ= సిగ్గుకలిగి, లజ్జతో; మఱుఁగు పడు మాడ్కిన్= చాటగు రీతిగా; అంతన్= ఆ సమయంలో; అర్కుండు= సూర్యుడు; క్రుంకెన్= అస్తమించాడు.

తాత్పర్యం: చంద్రవంశాన్ని ప్రకాశమానం చేసే భీష్ముడు ఈ విధంగా గొప్ప తేజస్సుతో వెలుగొందటం చూచి, సూర్యుడు సిగ్గుపడి తాను కనిపించకుండా వెళ్ళిపోయాడా అన్నట్లు అస్తమించాడు.

తే. జలరుహంబులు పాండవసైనికుల మొ । గంబు లట్టుల విన్ననై కాంతి దఱిఁగె;
వారి మనముల భీత్యంధకార మడరు । కరణిఁ జీఁకటి యెడనెడఁ గవియుఁదెంచె. 300

ప్రతిపదార్థం: జలరుహంబులు= నీటిలో పుట్టినవి(కమలాలు); పాండవ+సైనికుల+మొగంబులు+అట్టులన్= పాండవసేనలోని భటుల మొగాలవలె; విన్ననై= వెలవెలబోయి; కాంతి+తఱిగెన్= తేజస్సును కోల్పోయాయి; వారి+మనములన్= పాండవసైనికుల

మనస్సులలో; భీతి+అంధకారము= భయం అనే చీకటి; అడరు+కరణిన్= వ్యాపించే రీతిగా; చీఁకటి= అంధకారం; ఎడన్+ఎడన్= ఆయా చోటులందు; కవియుఁదెంచెన్= వ్యాపించింది.

తాత్పర్యం: సూర్యుడు అస్తమించాడు. పద్మాలు పాండవసేనలలోని భటుల మొగాలవలె ముడుచుకుపోయాయి. వారి మనస్సులలో భయం అనే చీకట్లు క్రమ్మికొన్నట్లుగా ఆయా చోటులలో చీకట్లు వ్యాపించసాగాయి.

విశేషం: అలం: ఉపమ, ఉత్ప్రేక్ష. 1. పద్మాలు సూర్యాస్తమయంతో ముడుచుకొనిపోతాయి అని కవిసమయం. 2. ప్రబంధ యుగంలో - ఇట్టి ఉత్ప్రేక్షలు తామర తంపరలు. వీటికి తిక్కన ఒజ్జబంతులు తీర్చాడని చెప్పవచ్చును. అయితే తిక్కన వీటిని చాలా అరుదుగా వాడాడు. 3. మహాభారత యుద్ధంలో ఇరుపక్షాల ఒడంబడిక సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు పోరాటం జరగాలి. (ఈ నియమాన్ని అతిక్రమించటం ఒకేసారి జరిగింది. పదునాల్గవ రోజు సైంధవవధా నంతరం రాత్రి యుద్ధం జరిగింది.)

వ. అప్పడు గయ్యంబు సాలించి. 301

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కయ్యంబు= యుద్ధం; చాలించి= విరమించి.

తాత్పర్యం: అప్పుడు యుద్ధం ఆపివేసి.

తే. ఉభయసేనలుఁ దమతమ యునికిపట్ల । కరిగెఁ దాత పరాక్రమ స్ఫురణమునకుఁ
గురువిభుండును దమ్ములుఁ బరమహర్ష । భరితహృదయులై యుండిరి భరతముఖ్య! 302

ప్రతిపదార్థం: భరత ముఖ్య!= భరతవంశంలో ముఖ్యుడైనవాడా, ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఉభయ+సేనలున్= రెండుసైన్యాలూ; తమతమ+ఉనికిపట్లకున్= తమ తమ నివాసాలకు; అరిగెన్= వెళ్ళాయి; తాత, పరాక్రమ, స్ఫురణమునకున్= భీష్మునిడి శౌర్య ప్రసారానికి; కురు+విభుండును= కురురాజు(దుర్యోధనుడు); తమ్ములు= అతని సోదరులు; పరమ, హర్ష, భరిత, హృదయులు+ఐ= మిక్కిలి సంతోషంతో నిండిన గుండెలు కలవారై; ఉండిరి= ఉన్నారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భరతవంశంలో ముఖ్యుడైనవాడా! అప్పుడు యుద్ధం ఆపివేసి రెండు సేనలలోనివారు తమ తమ ఆవాసాలకు వెళ్ళిపోయారు. తమ తాత భీష్ముడి శౌర్య ప్రసారానికి దుర్యోధనుడూ అతడి తమ్ములూ ఆనందంతో నిండిన హృదయాలు కలవారై ఉన్నారు.'

వ. అని సంజయుండు భీష్మాటోపంబు సెప్పెనని పలుకుటయుఁ 'దొలునాఁటి కయ్యంబున గాంగేయుచేత నట్లయినఁ బాండునందనులు పదంపడి యేమి సేసి?'రని యడిగిన 303

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; సంజయుండు= సంజయుడు; భీష్మ+ఆటోపంబు= భీష్ముడియొక్క విజృంభణం; చెప్పెన్+అని= చెప్పాడు; అని; పలుకుటయున్= అని చెప్పటం; తొలునాటి కయ్యంబునన్= మొదటిరోజు యుద్ధంలో; గాంగేయుచేతన్= భీష్ముడిచేతిలో; అట్లు+అయినన్= ఆ విధంగా కాగా (ఆ రీతిగా పరాజయం అనుభవించిన); పాండునందనులు= పాండవులు; పదంపడి= పిదప; ఏమి+చేసిరి?= ఏం చేశారు?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా.

తాత్పర్యం: భీష్ముడి పరాక్రమ విజృంభణం గూర్చి సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పాడు. 'మొదటిరోజు యుద్ధంలో ఆ విధంగా తల్లడిల్లిపోయిన పాండవులు పిదప ఏమి చేశారు?' అని ధృతరాష్ట్రుడు ప్రశ్నించాడు.

ఆశ్వాసాంతము

చ. నిగమశిఖా విహారమహనీయ! మునీశ్వర భావనీయ! స
ర్వగురు మహానుభావ! మధురప్రకటాప్రతిమ స్వభావ! దే
వగణనిషేవ్య! వారిగిరి వాస వినోద విభావ్య! విశ్వలో
కగతవపుర్వికస్వర! వికారవిదూర విలాస భాస్వరా! 304

ప్రతిపదార్థం: నిగమ, శిఖా, విహార, మహనీయ!= ఉపనిషత్తులు విహారరంగాలుగా కలిగిన గొప్పవాడా!; ముని+ఈశ్వర+భావనీయ!= గొప్ప ఋషులచేత భావింపబడదగినవాడా!; సర్వ, గురు, మహానుభావ!= అందరు దేశికుల గొప్ప అనుభవం కలవాడా!; మధుర, ప్రకట+అప్రతిమస్వభావ!= తియ్యగా అభివ్యక్తమయ్యే సాటిలేని స్వభావం కలవాడా!; దేవ, గణ, నిషేవ్య!= వేల్పుల సమూహం చేత సేవింపతగినవాడా!; వారి, గిరి, వాస, వినోదభావ్య!= నీటియందును పర్వతమునందును నివసించి ఆనందించేవాడా!; విశ్వ, లోక, గత, వపుః+వికస్వర!= సమస్త లోకాలకు వ్యాపించిన దేహ వికాసం గలవాడా!; వికార, విదూర, విలాస, భాస్వరా!= స్వభావంలో మార్పులేని భోగములందు ప్రకాశించేవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! ఉపనిషత్తులలో విహరించేవాడా! ముని శ్రేష్ఠులచేత భావించబడేవాడా! గురువులందరి గొప్పతనానికి ఆకారమైనవాడా! సాటిలేని మధురమైన ఆంతర్యం కలవాడా! దేవతల సముదాయంచేత సేవింపబడేవాడా! సముద్రంలో (క్షీరసాగరంలో) (హరి) కొండపై (కైలాసగిరిపై) (హర) నివసించేవాడా! యావత్ ప్రపంచం దేహంగా పరిణమించినవాడా! చెరుపులేని భోగాలలో ప్రకాశించేవాడా!

క. దూరాంతిక దుర్గమ వి ౹ స్తార! సుగమసన్నివేశ! తావదచల స
ర్వారంభక నిష్క్రియ! సం ౹ స్కారోజ్జ్వల విశ్వసంప్రకాశనమూర్తీ! 305

ప్రతిపదార్థం: దూరాంతిక+దుర్గమ+విస్తార!= దవ్వుల ఉండటం, దగ్గరగా ఉండటం, చేరలేకపోవటం, వ్యాపనం కలవాడా!; సుగమ, సన్నివేశ!= సులువుగా పొందదగినవాడా!; తావత్, అచల, సర్వ+ఆరంభక+నిస్+క్రియ= అంతమాత్రమే కదలకుండగా అన్ని ప్రయత్నాల యందు తటస్థంగా ఉండేవాడా! అనగా అన్ని కార్యముల యెడ సాక్షీభూతుడవుగా ఉండేవాడా!; సంస్కార+ఉజ్జ్వల!= పరిశుద్ధతతో ప్రకాశించేవాడా!, విశ్వ సంప్రకాశన మూర్తీ!= సృష్టిని వెలుగొందజేసే ఆకృతి కలవాడా!

తాత్పర్యం: దవ్వుల ఉండటం, దగ్గరగా ఉండటం, చేరలేకపోవటం అనే విభిన్న గుణాలకు సమన్వయ కేంద్రమైనవాడా! సులువుగా పొందదగినవాడా! సర్వకార్యాలకు సాక్షీభూతుడవైన వాడా! పరిశుద్ధతతో ప్రకాశించేవాడా! సర్వసృష్టిని ప్రకాశమానంగా చేసేవాడా!

విశేషం: హరిహరనాథుడు - తిక్కన సమన్వయం వేదాంత తత్త్వానికి ప్రతీక.

మాలిని.

నిరతిశయమహత్త్వోన్మేష! నిర్ధూతదోషా!
విరతి హృదయ రమ్యావేశ! నిత్యప్రకాశా!
భరితభువన తేజోభవ్య యోగానుభావ్యా!
స్ఫురితగుణ నమశ్శ్రీ పుణ్య నైర్గుణ్య గణ్యా! 306

ప్రతిపదార్థం: నిరతిశయ+మహత్త్వ+ఉత్+మేష= సాటిలేని గొప్పతనంచేత మిరుమిట్లు గొలిపేవాడా!; నిర్ధూతదోషా!= చెదరగొట్టబడిన తప్పులు కలవాడా, పవిత్రుడా!; విరతి+హృదయ+రమ్య+ఆవేశా= కోరికలు లేనిగుండెలలో అందమైన పొందిక కలవాడా!; నిత్యప్రకాశా= ఎల్లప్పుడు వెలుగొందేవాడా!; భరిత+భువన+తేజస్+భవ్య+యోగ+అనుభావ్య!= నిండిన లోకప్రకాశంచేత వెలిగే పవిత్రమైన యోగంచేత తెలియదగినవాడా!; స్ఫురిత+గుణ+నమశ్రీ= ప్రకాశించే గుణాలచేత గొప్పతనం చెందినవాడా!; పుణ్య నైర్గుణ్యగణ్యా!= ఏ గుణాలు లేకపోవటం చేత గొప్పదనం పొందినవాడా.

తాత్పర్యం: సాటిలేని గొప్పతనంచేత దేదీప్యమానంగా వెలుగొందేవాడా! దోషరహితుడా! నిష్కామ హృదయాలలో స్ఫూర్తిని కలిగించేవాడా! ఎల్లప్పుడు ఉండేవాడా! సర్వలోకాలలో ప్రకాశించే యోగంవలన తెలిసికొనదగినవాడా! వెలుగొందే గుణాలవలన గొప్పదనం పొందినవాడా! నిర్గుణతత్త్వమునకు లక్ష్యమైనవాడా!

గద్యము.

శ్రీమదుభయకవిమిత్త్ర, కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున భీష్మపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

ప్రతిపదార్థం: శ్రీమత్= మంగళకరమైన; ఉభయకవిమిత్త్ర= సంస్కృత ఆంధ్రభాషలకు చెందిన రెండు రకాల కవులకు-మిత్రుడైనవాడూ; కొమ్మన+అమాత్యపుత్త్ర= కొమ్మనామాత్యుని కుమారుడు; బుధ+ఆరాధన, విరాజి= పండితులను సేవించటం చేత ప్రకాశించేవాడు, లేదా, పండితులు (తమను) సేవించటం చేత ప్రకాశించేవాడు; తిక్కన సోమయాజి; ప్రణీతంబు+అయిన= రచించబడిన; శ్రీమత్+మహాభారతంబునన్= శుభప్రదమైన మహాభారతంలో; భీష్మపర్వంబునందున్= భీష్మపర్వంలో; ప్రథమ+ఆశ్వాసము= మొదటి అశ్వాసం.

తాత్పర్యం: ఉభయ కవిమిత్రుడూ, కొమ్మనామాత్యుడి కుమారుడూ, పండితులచేత ఆరాధించబడుతూ ప్రకాశించేవాడూ, (పండితుల ఆరాధనంచేత ప్రకాశించేవాడూ) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలోని భీష్మపర్వంలో ప్రథమాశ్వాసం.

భీష్మపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

భీష్మపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీ నిర్మాణ విచక్షణతా । నిష్ఠాపర కటాక్ష! ధర్మసరోజా
సీన ! నిరంజన భక్తో । ద్యాన వసంతాయమాన! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ నిర్మాణ+విచక్షణతా నిష్ఠా+పర కటాక్ష= సంపద చేకూర్చటంలో వివేకంతో కూడిన దీక్ష వహించిన దృష్టి కలవాడా! ; హరిహరనాథా!= విష్ణు శివతత్త్వాలు సంగమించిన దేవా!; ధర్మ సరోజ+ఆసీన!= ధర్మం అనే పద్మం కూర్చొనే చోటుగ చేసికొన్నవాడా!; నిరంజన= ప్రాపంచిక విషయాలందు వైరాగ్యం గల; భక్త+ఉద్యాన, వసంతాయమాన!= భక్తులు అనే తోటకు, ఆమని వంటివాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! సంపదలను ప్రసాదించటంలో యుక్తాయుక్త పరిజ్ఞానం కలవాడా! ధర్మం అనే పద్మాన్ని ఆసనంగా చేసికొన్నవాడా! ప్రాపంచిక విషయ విరక్తిగల భక్తులు అనే తోటకు అభ్యుదయ పరంపరాభివృద్ధులు చేకూర్చే వసంత ఋతువు వంటివాడా!

విశేషాలు: 1. శ్రీ శబ్దానికి సంపద, కాంతి మున్నగు ఎన్నో అర్థాలు ఉన్నాయి. 2. పద్మాసనం వేసికొని యోగులు తపస్సు చేస్తారు. హరిహరనాథుడు ధర్మ పద్మాసనుడుగా వర్ణించబడ్డాడు. 3. వసంతఋతువులో చెట్లు చిగిరించి మొగ్గతొడిగి కన్నుల పండువుగా కన్పిస్తాయి. భక్తులు అనే చెట్లకు హరిహరనాథుడు వసంతఋతువు వంటివాడు. 4. భక్తుడు= భక్తి కలవాడు - దేవునియందు ఎడతెగని భక్తి కలవాడు భక్తుడు 5. ధర్మము= పురుషార్థాలలో మొదటిది. భారతీయ సంస్కృతికి ఆత్మ ధర్మం. ధర్మ నిర్వచనం చేయటం మిక్కిలి కష్టం.

ధర్మనిర్వచనం చేసిన సుప్రసిద్ధ ప్రాచీన సంస్కృత శ్లోకం :

- "ధృతిః క్షమా దమోऽ స్తేయం శౌచమింద్రియ నిగ్రహః,

ధీ ర్విద్యా సత్య మక్రోధో దశకం ధర్మలక్షణమ్" - (మనుస్మృతి - 6-92)

6. 'భక్తోద్యాన వసంతాయమాన' అన్న ప్రయోగంలో ఎంతో విశాలమైన అర్థం ఇమిడిఉన్నది. భక్తిలో సౌశీల్యం కూడా ఇమిడి ఉన్నది.

" అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ

నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ" - (భగవద్గీత 12-13)

ఇతరులను ద్వేషించనివాడు, సర్వభూతాల యెడ స్నేహభావం కలవాడు, నిరహంకారుడు, సుఖదుఃఖాతీతుడు, క్షమా బుద్ధిగలవాడు మాత్రమే భక్తుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మజుఁడు గోపాలదేవు పాలికిం జనుట (సం. 6-46-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయుున కిట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ పరమాత్మా! హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయనుడు అనే మహర్షి; జనమేజయునకున్= జనమేజయుడు అనే రాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజుతో ఈ విధంగా అన్నాడు.

తే. అట్లు దనవారు మేలు చే యైన భంగి వినిన ధృతరాష్ట్రుఁ డా సూత తనయుతోడ
నెలమి నటమీఁది వృత్తాంత మెట్లు సెప్పు మనినఁ గురువంశవర్య యిట్లనియె నతఁడు. 3

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; తనవారు= తనకు సంబంధించినవారు(ధృతరాష్ట్రుడు, అతడికి సంబంధించిన వారు- కౌరవులు) మేలుచేయి+ఐనభంగి= పై చేయిగా ఉన్నరీతిని (యుద్ధంలో పాండవులను మించుతున్న రీతిని); వినిన= ఆలకించిన; ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; ఆ సూత+తనయుతోడన్= (తనకు యుద్ధవృత్తాంతం వినిపిస్తున్న సంజయుడితో) సూతుడి కుమారుడితో; ఎలమిన్= ఉత్సాహంతో; అటమీఁదివృత్తాంతము= ఆపైన జరిగిన సంగతి; ఎట్లు+చెప్పుము+అనినన్= ఏ విధంగా జరిగిందో వచింపుము అని అడుగగా; కురువంశవర్య!= కురువంశంలో శ్రేష్ఠుడవైనవాడా(ఓ జనమేజయ మహారాజా)!; అతఁడు= ఆ సంజయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా కౌరవులు యుద్ధంలో పాండవులకంటె పైచేయిగా ఉండటం విని, ధృతరాష్ట్రుడు ఉత్సాహపడి, ఆ తరువాత జరిగిన వృత్తాంతాన్ని వినిపించుమని సంజయుడిని కోరాడు. జనమేజయమహారాజా! అప్పుడు సంజయుడు ఈ విధంగా చెప్పాడు.

వ. ఆ రాత్రి ధర్మతనయుుండు విషణ్ణచిత్తుండై తమ్ములం దగువారలం గూర్చికొని గోపాలదేవుపాలికిం జని యతనితో నిట్లనియె. 4

ప్రతిపదార్థం: ఆ+రాత్రి= ఆ రేయి,(కురుక్షేత్ర సంగ్రామం జరిగిన మొదటినాటి రాత్రి); ధర్మతనయుండు= ధర్మరాజు; విషణ్ణ చిత్తుండు+ఐ= దుఃఖంతో కూడిన మనస్సు కలవాడై; తమ్ములన్= తమ్ములను; తగువారలన్+కూర్చుకొని= తగినవారిని వెంటపెట్టుకొని; గోపాలదేవుపాలికిన్+చని= శ్రీకృష్ణుడి దగ్గరకు వెళ్ళి; అతనితోన్= ఆ శ్రీకృష్ణుడితో; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: కురుక్షేత్ర సంగ్రామంలో మొదటి రోజు యుద్ధంలో కౌరవులు పాండవులను మించారు. అందుచేత ధర్మరాజు మనస్సు దుఃఖభరితమై పోయింది. తన తమ్ములను, మరికొందరు ఆప్తులను వెంటబెట్టుకొని, ధర్మరాజు శ్రీకృష్ణుడి దగ్గరకు వెళ్ళి ఈ విధంగా తన మనోవేదన విన్నవించుకొన్నాడు.

విశేషాలు: తిక్కన తెలుగు మహాభారతానికి శ్రోతలు. 1. కృతిపతి హరిహరనాథ దేవుడు, 2. శౌనకుడు - నైమిశారణ్యంలో సూతుడు చెప్పాడు. 3. జనమేజయుడు - సత్రయాగంలో వైశంపాయన ప్రోక్తం. అంతేకాక, యుద్ధ కథనంలో, 4.ధృతరాష్ట్రుడు- యుద్ధ వృత్తాంతం ధృతరాష్టుడికి నివేదించింది సూతసుతుడు అయిన సంజయుడు. యావద్భారతం నైమిశారణ్యంలో పంద్రెండేండ్లు జరిగిన సత్రయాగంలో శౌనకాది మహర్షులకు వినిపించినది ఉగ్రశ్రవసుడు అనే పేరుగల సూతసూనుడు.

చ. **‘ ఎరగలి చిచ్చు గాఱడవి యెల్లను బెల్లుగ నొక్కపాయగా**
దరికొని రూపడంచిన విధంబున నిక్కడిసేన యంతయుం
దరమిడి చంపె భీష్ము బలదర్ప మహోగ్రతఁ గంటె? నింక నే
బిరుదొకొ నీలమేఘ మనఁ బేర్చి యనిం దెగటార్చు నాతనిన్? **5**

ప్రతిపదార్థం: ఎరగలి+చిచ్చు= దావాగ్ని(కార్చిచ్చు); కాఱు+అడవి= దట్టమైన అరణ్యం; ఎల్లను= అంతటిని; పెల్లుగన్= మిక్కుటంగా; ఒక్క+పాయగాన్= ఏకమొత్తంగా; దరికొని= కాల్చి; రూపు+అడంచిన, విధంబునన్= నాశనం చేసిన రీతిగా; ఇక్కడి, సేన+అంతయున్= ఈ పక్షంలో ఉన్న సైన్యాన్ని అంతటినీ; తరము+ఇడి,చంపెన్= హెచ్చు తగ్గులు లేకుండా సంహరించాడు; భీష్మ, బల, దర్ప, మహా+ఉగ్రతన్= భీష్ముని యొక్క పరాక్రమము యొక్క గొప్ప తీవ్రతను; కంటె!= చూచావుగద!; ఇంకన్= ఇకమీద; అనిన్= యుద్ధంలో; ఆతనిన్= ఆ భీష్ముడిని; నీల,మేఘము+అనన్=నల్లని మబ్బు అనేటట్లుగా; పేర్చి= అతిశయించి; ఏ బిరుదు+ఒకొ= ఏ పరాక్రమవంతుడో; తెగటార్చున్?= సంహరింపగలడు?

తాత్పర్యం: దట్టమైన అడవిని అంతటినీ కార్చిచ్చు ఒకేసారిగా నాశనం చేసే రీతిగా, ఈ సేనను అంతటినీ విచక్షణలేకుండా భీష్ముడు సంహరించాడు గదా! భీష్ముడి ప్రతాపం మిక్కుటమైనది చూశావుగదా! ఇంక కారుమబ్బుతో సమానమైన ఏ శూరుడు అతడిని యుద్ధంలో సంహరింపగలడు?

విశేషాలు: i).ఎరగలి+చిచ్చు - దావాగ్నికి చక్కని చిక్కని తెలుగు పలుకుబడి. ii). ఈ పద్యంలో తెలుగు నుడికారపు సొంపులు, ప్రౌఢ సంస్కృత పదములు తిక్కన అతుకులు కనిపించకుండా చక్కగా సంధించాడు. భావానుగుణమైన భాషకు భావోచితమైన ఛందస్సు ప్రయోగించటంలో తిక్కన నేర్పరి. అలంకారం ఉపమ.

చ. **అలవి యెఱుంగ నేరక మహాత్ముని లోకముతోడి పాటిగాఁ**
దలఁచితి; బేలనైతి; శరతాడనపీడితు లైరి నీ మఱం
దులు; నమరాపగా తనయుతోడి రణంబునకున్ దిశాధినా
థులు నఱుమంగఁ జాల రని తోఁచుచునున్నది నా మనంబునన్. **6**

ప్రతిపదార్థం: అలవి= పరిమితి (శక్తి సామర్థ్యముల కొలది); ఎఱుంగ+నేరక= తెలియజాలక; మహా+ఆత్మునిన్= గొప్ప ఆత్మగల (భీష్ముడిని); లోకము+తోడి+పాటిగాన్= భూలోకంలో నున్న మానవులతో సరిపోలే వాడిగా; తలఁచితిన్= అనుకొన్నాను; బేలన్+ఐతిన్= అవివేకిని అయ్యాను; నీ+మఱందులు= నీ బావలు; శర,తాడన,పీడితులు+ఐరి= (భీష్ముడి) బాణాల తాకిడిచేత బాధింపబడిన వారు అయ్యారు; అమర+ఆపగా,తనయు,తోడి, రణంబునకున్= దేవనదీసూనుడితోడి (భీష్ముడితోడి) యుద్ధానికి; దిశా+అధినాథులున్= దిక్పాలకులుకూడ; అఱుమంగన్+చాలరు+అని= ఎదుర్కొనటానికి సమర్థులు కారు అని; నా+మనంబునన్= నా మనసుకు; తోఁచుచున్+ఉన్నది= తట్టుతున్నది.

తాత్పర్యం: భీష్ముడు మహానుభావుడు, జగదేకవీరుడు. ఏదో లోకంలోని వీరులసాటివాడు అని భ్రమించి ఉన్నాను. అది నా అవివేకం. ఇప్పుడు ఆతని శౌర్యం పరిమితి ఎట్టిదో తెలిసికొనగలిగాను. నీ బావలు అతడి బాణాల తాకిడికి తట్టుకోలేక బాధ చెందారు. మరి దిక్పాలకులు గూడ భీష్ముడితో యుద్ధం చేయటానికి సమర్థులు కారు అని నా అభిప్రాయం.

విశేషాలు: i). దిశాధినాథులు= అష్టదిక్పాలకులు - 1. ఇంద్రుడు, 2. అగ్ని, 3. యముడు, 4. నిర్రుతి, 5.వరుణుడు, 6. మరుత్తు, 7. కుబేరుడు, 8. ఈశుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. అతని జయించు నంచు మన మర్జును నెంతయు నమ్మి యుండఁగా
నితఁడును సంగరంబున నుపేక్షకుఁ డయ్యెఁ; వృకోదరుం డొకం
డ తఱికిఁ జొచ్చి దోర్బలము డాఁపక పోరెడు; నేమి సేయు? నా
కితనిని నీతనిం దడవ నేటికిఁ? గయ్యపుజోలి మానెదన్? 7

ప్రతిపదార్థం: అతనిన్= (భీష్మునిని); జయించున్+అంచున్= గెలువగలడు అని; మనము+అర్జునున్= మనము అర్జునుడిని; ఎంతయున్= మిక్కుటంగా; నమ్మిఉండఁగాన్= విశ్వసించి ఉండగా; ఇతఁడును= అర్జునుడుకూడా; సంగరంబునన్= యుద్ధమునందు; ఉపేక్షకుఁడు+అయ్యెన్= ఉదాసీనుడైనాడు (లెక్కచేయనివాడైనాడు); వృకోదరుండు+ఒకండ= భీముడు ఒక్కడే; తఱికిన్+చొచ్చి= సమయానికి పూనుకొని; దోస్+బలము-దోర్బలము= భుజపరాక్రమం; డాఁపక= దాచుకొనకుండా; పోరెడున్= యుద్ధం చేశాడు; ఏమి+చేయున్?= అంతకుమించి ఏమి+చేయగలడు?; నాకున్= నాకు; ఇతనినిన్+ఈతనిన్= ఇతడినీ, ఇతడినీ; తడవన్+ఏటికిన్?= విమర్శించటం ఎందుకు?; కయ్యపు, జోలి+మానెదన్= యుద్ధం చేసే ప్రసక్తిని విరమించుకొంటాను.

తాత్పర్యం: మన అర్జునుడు భీష్మడిని జయించగలడని ఆశలు పెంచుకొన్నాము కాని ఆతడు యుద్ధరంగంలో ఏమీ చేయలేకపోయాడు. భీష్మడి ధాటిని ఎదుర్కొనలేక ఉదాసీనుడైపోయాడు. భీమసేనుడు ఒక్కడు మాత్రమే యుద్ధంలో తన శక్తి వంచన లేకుండ పోరాడాడు. అంతకంటె ఏమి చేయగలడు? వీరినీ వారినీ నేను ఎందుకు నిందించాలి? యుద్ధం విరమించాలని నాకు అనిపిస్తున్నది.

విశేషం: ఈ పద్యం - ధర్మరాజ - భీమ అర్జునుల శీలానుశీలనానికి ఉపకరిస్తుంది. ధర్మరాజు శాంతి ప్రియుడు. యుద్ధ విముఖుడు. అర్జునుడు వివేకి. వివేకం పరాక్రమంలో అంతర్భాగమే. అసమయ సాహస ప్రదర్శన మంచిది కాదు. అది బూడిదలో పోసిన పన్నీరు. (కర్ణ పర్వంలో చండమార్తాండుడుగ వెలుగొందుతున్న కర్ణుడి వర్చస్సు చూచి, 'మాధవా మన రథమింక మరలనిమ్ము; బ్రతికి యుండిన శుభములు పడయవచ్చు' అని , అప్పుడు యుద్ధము చేయలేదు. సరియైన సమయం చూచుకొని కర్ణుడిని సంహరించాడు. భీముడిలో ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ. చిత్తశుద్ధి పరాక్రమానికి గాని వివేకానికి గాని పర్యాయపదం కాదు.

మహా భారతం- మానవ స్వభావ వైవిధ్యాన్ని హృదయంగమంగా చిత్రించింది. కురుక్షేత్ర సంగ్రామంలో తొలి దినమందు - ధర్మరాజు దృష్టిలో - అర్జునుడు 'ఉపేక్షకుఁడయ్యె'. అది ఉపేక్ష కాదు. అర్జునుడు ఎంత పోరాడినప్పటికీ, భీష్మడి విజృంభణాన్ని అరికట్ట సాధ్యం కాలేదు. సర్వసైన్యాధిపతి భీష్ముడు. అది తొలిదినం. అతడు జగదేక ధనుర్ధరుడు. అర్జును డెంత పరాక్రమోపేతుడైనప్పటికీ ఏమి చేయగలడు? ఒకనాడు - ధర్మజ, భీమ, నకుల సహదేవులు నలుగురు కలిసి, జయద్రథుడి విజృంభణ మరికట్టలేకపోయారు.

అర్జునుడు 'పట్టపగటింటి సూర్యుని పగిది' వెలుగొందే కర్ణుడిని - అప్పుడే మూర్ఖంగా ఎదుర్కొని ఉంటే ఏమయ్యేవాడో ఎవరు చెప్పగలరు? మానవ మానస క్షీర సాగర మథనం మహాభారతంలో కన్పిస్తుంది.

క. నరపతుల నెల్ల భీష్మున । కెరగా నొప్పింపఁజాల; నే నడవులకున్
మరలం బోయెద; నచటం । దిరిగెదఁ; గూరాకు గోసి తినియెద ననఘా! 8

ప్రతిపదార్థం: నరపతులన్+ఎల్లన్= రాజులను అందరనూ; భీష్మునకున్= భీష్మునికి; ఎరగాన్= ఆహారంగా; ఒప్పింపన్+చాలన్= పడవేయ నేరను; ఏన్= నేను; అడవులకున్= అరణ్యాలకు; మరలన్= మళ్ళీ; పోయెదన్=వెళ్ళిపోతాను; అనఘా! పాపరహితుడైనవాడా!= ఓ కృష్ణా!; అచటన్= (ఆ అడవులలో); తిరిగెదన్= తిరుగుతాను; కూర+ఆకు= కూరలు, ఆకులు; కోసి= త్రుంచి; తినియెదన్= తింటాను.

తాత్పర్యం: శ్రీ కృష్ణా! నా పక్షాన యుద్ధం చేయటానికి వచ్చిన రాజులను అందరినీ భీష్ముడికి ఎరగా సమర్పించలేను. నేను తిరిగి అడవులకు పోయి అక్కడే కూరలూ, ఆకులూ తింటూ ఉంటాను.

విశేషాలు: 1. ఎర వాచ్యార్థంలో వానపాము. చేపలను పట్టేందుకు గాలానికి చివర సూదికి 'ఎర' గ్రుచ్చుతారు. చేప ఆ ఎరను తినటానికి వచ్చి సూదికి గ్రుచ్చుకొని పోతుంది. ఎర అనగా పశుపక్ష్యాదులకు వేసే ఆహారం. ఇచ్చట 'ఎర' అనే మాట చాటున చాలా అర్థం దాగుకొని ఉన్నది. ఎర ఒక భ్రమ కల్పిస్తుంది. అట్లాగే, పాండవపక్షంలో పోరాడే రాజులను ఎరగా చూపి భీష్ముడు వచ్చినపుడు ఈ పాచిక పారాలి. ఆతడిని అర్జునుడు పట్టుకొనాలి.

ఈ విధంగా భీష్ముడిని మోసగించటానికి వీలు కాలేదు. మాయోపాయాలు పన్ని యుద్ధం చేయటం కంటె అడవులలో కూరాకు తిని బ్రదకటమే మంచిది అని ధర్మరాజు అభిప్రాయం.

2. లోగడ ధర్మరాజు పంద్రెండు ఏండ్లు వనవాసం చేసి ఉన్నాడు గదా! అందుకే 'మరలన్' అనటం.

క. నీ మాట మెయిన చేయుదు। మే మెయ్యది యైన నెందు నెప్పుడు మాకున్
దామోదర! యశుభస్థితి। లేమి శుభము కలిమి నీదు లీలయ కాదే! 9

ప్రతిపదార్థం: దామోదర!= ఓ శ్రీకృష్ణా!, నీ,మాట, మెయిన్+అ= నీమాట చొప్పున, చేయుదుము= చేయగలం; ఏ+అది+ఐనన్= ఏదైననూ; ఎందున్= ఏ చోటనైనా; ఎప్పుడున్= ఏ సమయంలో అయినా; మాకున్= మాకు; అశుభ+స్థితి+లేమి= అమంగళ పరిస్థితి లేకపోవటం; శుభము= మంచిస్థితి; కలిమి= కలగడం; నీదులీల+అ= నీ ఆట మాత్రమే; కాదు+ ఏ!= కాదా!(అవును)

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! మేము నీవు చెప్పినట్లుగానే నడచుకొంటున్నాం. ఎప్పుడైనా, ఎచటనైనా, దేనినైనా నీ ఇష్టాన్నే పాటిస్తున్నాం. మాకు అశుభం లేకపోవడం, శుభం కలగడం అది అంతా నీ లీలామహిమ మాత్రమే!

వ. చేయం గల పని యెయ్యది? పనుపు' మనినం బద్మనాభుండు పాండవాగ్రజున కిట్లనియె. 10

ప్రతిపదార్థం: చేయన్+కల పని= చేయవలసిన క్రియ- కర్తవ్యం; ఏది+అది=ఎయ్యది= ఏది; పనుపుము= ఆజ్ఞాపించుము; అనినన్= అని అనగా; పద్మనాభుండు= నాభియందు పద్మం కలిగినవాడు, విష్ణువు= శ్రీ కృష్ణుడు; పాండవ+అగ్రజునకున్= పాండవులలో మొదట పుట్టినవాడికి- ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇక కర్తవ్యం ఏది? దయచేసి తెలుపుము' అని ధర్మరాజు అడుగగా శ్రీకృష్ణుడు అతడితో ఈ విధంగా అన్నాడు.

విశేషాలు: 1. పద్మనాభుఁడు= పద్మం నాభియందు కలవాడు శ్రీవిష్ణువు. ఆతడి నాభి కమలం నుండి బ్రహ్మదేవుడు ఉద్భవించాడు. ఇది పురాణ కథ. శ్రీకృష్ణుడు విష్ణుదేవుడి అవతారం అని పురాణ కథనం. సంస్కృత మహాభారత రచనా కాలం నాటికే అందలి పాత్ర అయిన శ్రీకృష్ణుడు, విష్ణువు అవతారంగా సుప్రసిద్ధుడు. 'విష్ణు ర్నారాయణః కృష్ణో వైకుంఠో విష్టరశ్రవాః' - అని అమరకోశం. ఇక తిక్కన తెలుగు మహాభారత కాలం నాటికి ఆ కృష్ణుడికి విష్ణువుకు అభేదం సిద్ధించి యుగయుగాంతరాలయింది.

ఉ. ' నెవ్వగ యింత యేల? విను! నీ కెదు రెవ్వరు? నీదు తమ్ములం
దెవ్వరు సూచినన్ జగము లిన్నియు గెల్వఁ గలారు; లావునం
గ్రొవ్విన భీష్ము నోర్చు రణకోవిదుఁ డైన శిఖండి; యేను నీ
కొవ్వనివారి నెల్లఁ గ్రమయుక్తి లయం బొనరింతు నెమ్మెయిన్. 11

ప్రతిపదార్థం: నెవ్వగ (నెఱ+వగ)= పూర్ణమైన అనగా మిక్కుటమైన దుఃఖం; ఇంత+ఏల?= ఇంతగా నీకు ఎందుకు? (అనగా ఇంతటి ఆవేదన నీకు అనవసరం అన్నమాట); విను= ఆలకించుము; నీకున్+ఎదురు+ఎవ్వరు?= నీకు వ్యతిరేకంగా ఎవరు నిలువగలరు?; నీ+తమ్ములందున్= నీ సహోదరులలో ఎవరైన; చూచినన్= చూడగా; జగములు= లోకాలు; ఇన్నియున్= అన్నింటినీ; గెల్వన్+కలారు= జయించగలరు; లావునన్= పరాక్రమంతో; క్రొవ్విన= గర్వించిన; భీష్మున్= భీష్ముడిని; ఓర్చు= జయించగల; రణ+కోవిదుఁడు+ఐన= యుద్ధమునందు నేర్పుగల; శిఖండి; ఓర్చున్= జయింపగలడు; నేను; నీకున్+ ఒవ్వనివారిన్+ఎల్ల= నీకు ఇష్టులు కాని వారిని అందరినీ; క్రమ+యుక్తిన్= వరుసగా; ఎమ్మెయిన్= ఏదో విధంగా, తప్పకుండా; లయంబు+ఒనరింతున్= సంహరించగలను.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! నీకు ఇంత ఆవేదన ఎందుకు? నీ కెదురెవ్వరు? నీ తమ్ములలో ఎవరినిచూచినా లోకాలన్నిటినీ జయించగలసమర్థులు. బలగర్వితుడైన భీష్మణ్ణి రణకోవిదుడైన శిఖండి జయిస్తాడు. నీకు ఇష్టులు కాని వారినందరినీ నేను వరుసగా ఏదో ఒక తీరున సంహరిస్తాను.

విశేషం: శిఖండి - ద్రుపద మహారాజు పుత్రుడు. పుట్టినపుడు అతడు ఆడశిశువు. పిదప మగవాడైనాడు. పూర్వజన్మంలో అతడు అంబ. ఆమె భీష్ముడిపై పగ వహించి, శివుడిని గూర్చి తపస్సు చేసి, అతడిని సంహరించేటట్లు వరం పొంది, పునర్జన్మలో శిఖండిగా జన్మించినట్లు పూర్వగాథ. ఉస్మానియా ముద్రిత ప్రతిలో పై పద్యములోని రెండవ చరణంలో యతి తప్పింది. 'జగములన్నియు' అనటానికి మారుగా 'జగములిన్నియు' - అనే వారిళ్ళ ప్రతిపాదం సమంజసం.

క. సత్య పరాక్రముఁ డగు నీ । సాత్యకి బాహాబలంబు సమరవిహారౌ
ద్ధత్యముఁ జూచెదు గాదే । యత్యాశ్చర్యంబు లితని యస్త్రవిధంబుల్. 12

ప్రతిపదార్థం: సత్య, పరాక్రముఁడు+అగు= యథార్థమైన గొప్ప శౌర్యం కలవాడైన; ఈ+సాత్యకి= ఈ సాత్యకి; బాహా,బలంబు= భుజబలం - శౌర్యం; సమర,విహార+ఔద్ధత్యము= యుద్ధమునందు విచ్చలవిడిగా సంచరించే అతిశయత్వము; చూచెదు+కాదు+ఏ!= నీవే చూస్తావుగదా!; ఇతని= (ఈ సాత్యకి యొక్క); అస్త్ర+విధంబుల్= మంత్రబాణాలు ప్రయోగించే తీరు తెన్నులు; అతి+ఆశ్చర్యంబుల్= మిక్కిలి వింత గొలిపేవి.

తాత్పర్యం: సత్యపరాక్రముడైన ఈసాత్యకి భుజబలం, ఇతని సమరవిహారంలోని గడుసుతనం చూస్తున్నావుగదా! ఈతని అస్త్ర ప్రయోగనైపుణ్యం అత్యాశ్చర్యకరమైనది.

విశేషం: 1. రామాయణంలో వాల్మీకి పలుసార్లు శ్రీరాముడిని "సత్య పరాక్రముడు" అని అభివర్ణిస్తాడు. ఆ ప్రౌఢ సంస్కృత ప్రయోగాన్ని తిక్కన తెలుగు భారతములో ఇచ్చట ప్రయోగించినాడు. 2. సాత్యకి యాదవవీరుడు. వరుసకు శ్రీకృష్ణుడికి తమ్ముడు, ద్రోణ శిష్యుడు. అర్జునుడికి సతీర్థ్యుడు. కురుక్షేత్ర సంగ్రామంలో చావకుండా మిగిలిన వీరులలో ఒకడు. ఇతడు భారతయుద్ధానంతరం 36 సంవత్సరాలకు సంభవించిన అంతఃకలహంలో కృతవర్మ (కౌరవ పక్షంలో చేరిన యాదవ వీరుడు)తో జరిగిన ద్వంద్వయుద్ధంలో మరణించాడు.

శా. ఉద్యద్విక్రము లైన యీ ద్రుపద మత్స్యోర్వీపతుల్ నిన్ను సం
పద్యోగోజ్జ్వలుఁ జేయఁ బూని కడఁకం బ్రాణంబు లీనున్న ని
ట్లుద్యోగం బెడలంగ నేమిటికి? నీ కుర్వీశ! వే యేల? ధృ
ష్టద్యుమ్నుం డొకరుండ విద్విషదవష్టంభంబు మాన్పింపఁడే?' 13

ప్రతిపదార్థం: ఉద్యత్,విక్రములు+ఐన= ప్రకాశించే శౌర్యం కలిగినవారు అయిన; ఈ+ద్రుపద,మత్స్య+ఉర్వీపతుల్= ఈ ద్రుపదరాజు మరియు విరాటరాజూ; నిన్నున్= నిన్ను; సంపద్+యోగ+ఉజ్జ్వలున్+చేయన్+పూని= ఐశ్వర్యంతో కూడిన యోగంతో మిక్కుటంగా ప్రకాశించేవాడినిగా చేసేదీక్ష గొని; కడఁకన్= పూనికతో; ప్రాణంబులు+ఈన్+ఉన్నన్= అసువులు అర్పించటానికి సిద్ధమై ఉండగా; ఉర్వీ+ఈశ!= రాజా! ధర్మరాజా!; నీకున్= నీకు; ఇట్లు= ఈ విధంగా (నిరుత్సాహం చెంది); ఉద్యోగంబున్= యుద్ధప్రయత్నాన్ని; ఎడలంగన్= వదలటం, విరమించటం; ఏమిటికిన్?= ఎందుకు?; వేయి+ఏల?= వేయిమాటలెందుకు?(ఇన్నిమాటలు అనవసరమని భావం); ధృష్టద్యుమ్నుండు+ఒకరుండు+ అ= ఒక్క ధృష్టద్యుమ్నుడు ఒక్కడే; విద్విషత్+అవష్టంభంబు= శత్రువుల విజృంభణ; మాన్పింపఁడు+ఏ?= అరికట్టడా?

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీ కోసం తమ ప్రాణాలను అర్పించటానికి సంసిద్ధులై, గొప్ప పరాక్రమంతో ప్రకాశించే ద్రుపద మహారాజు, మత్స్య దేశాధీశుడు విరాటరాజు బాసటగా నిలిచి నీకు రాజ్యసంపద కలిగించాలని యత్నిస్తూ ఉండగా నీ విప్పుడు యుద్ధప్రయత్నం మానటమెందుకు? వేయిమాటలెందుకు? జగదేక వీరుడైన ధృష్టద్యుమ్నుడు ఒకడే చాలు, శత్రువుల విజృంభణం అంతా అరికట్టే సమర్థుడు ఆతడు.

విశేషం: 1. ధృష్టద్యుమ్నుడు - ద్రుపద మహారాజు కొడుకు - పాండవుల సర్వసేనాపతి.

వ. అనవుడు ధర్మతనయుండు ధృష్టద్యుమ్ను నాలోకించి. 14

ప్రతిపదార్థం: అనవుడున్= అని శ్రీకృష్ణుడు చెప్పగా; ధర్మతనయుండు= ధర్మసుతుడు= ధర్మరాజు; ధృష్టద్యుమ్నున్+ఆలోకించి= ధృష్టద్యుమ్నుడిని చూచి.

తాత్పర్యం: అని అనగా ధర్మరాజు ధృష్టద్యుమ్నుడివైపు చూచి.

ఉ. పాండవ సైన్య సంఘ పరిపాలన సేయు నితండ యంచుఁ గృ
ష్ణుం డభిషేక సంపదుపశోభితుఁ జేయఁగ, నాధిపత్య ము
ద్దండతఁ బూని తీ నృపులుఁ దమ్ములు నేనును జుట్టి రాఁ; జమూ
మండలి నూలుకొల్పికొని మార్తుర నోర్చినఁ గాక యొప్పనే!' 15

ప్రతిపదార్థం: పాండవ,సైన్య,సంఘ,పరిపాలన,చేయున్= పాండవుల సేనాసమూహాల నెల్లను చేర్చి ఆధిపత్యం వహించగలడు; ఇతండు+అ= ఇతడు(ధృష్టద్యుమ్నుడు); అంచున్= అని చెప్తుతూ; కృష్ణుండు= శ్రీ కృష్ణుడు; అభిషేక+సంపద్+ఉపశోభితున్+చేయఁగన్= శిరస్సుపై శుభజలాలు ప్రోక్షించి-శ్రీమంతుడిని చేసి నిన్ను ప్రకాశమానుడిని చేయగా; ఆధిపత్యము= (సేనపై) అధికారం; ఉద్దండతన్+పూనితి(వి)= గొప్పగా వహించావు; ఈ నృపులు= ఈ రాజులు; తమ్ములు+నేనును= సహోదరులూ, నేనూ; చుట్టిరాన్= పరివేష్టించి యుండగా; చమూ+మండలిన్= సేనా సమూహమును; నూలు కొల్పికొని= ప్రోత్సహించి; మార్తురన్= శత్రువులను; ఓర్చినన్+కాక+ఒప్పును+ఏ?= జయిస్తే తప్ప (నీ సామర్థ్యం) సార్థకం కాదుకదా!

తాత్పర్యం: 'ఓ ధృష్టద్యుమ్నుడా! పాండవసైన్య సమూహాన్ని పరిపాలించగల సమర్థుడితడే - అని శ్రీకృష్ణుడు నిన్ను చూపి సర్వసైన్యాధ్యక్ష పదవిలో అభిషిక్తుడిని చేయగా అధికారాన్ని గొప్పగా వహించావు. ఈ రాజులూ, నా తమ్ములూ, నేనూ కలిసి నిన్ను పరివేష్టించిరాగా సేనాసమూహాన్ని పురికొల్పుకొని శత్రువులను జయించకపోతే ఆ పదవికి వన్నెలభిస్తుందా?

వ. అని యగ్గించినం బొంగి పృషతపౌత్రుండు గుంతీపుత్రున కిట్లనియె. 16

ప్రతిపదార్థం: అని+అగ్గించినన్= అని పొగడగా, పొంగి= ఉత్సాహాన్ని పొంది, పృషతపౌత్రుండు= పృషతరాజు మనుమడు- ధృష్టద్యుమ్నుడు; కుంతీ పుత్రునకున్= ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు తనను పొగడగా, ఆ ధృష్టద్యుమ్నుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

చ. **' జగ మెఱుఁగంగ ద్రోణు ననిఁ జంపుటకై సృజియించె ధాత న;**
న్మగఁటిమి గాఁగ దీనిఁ బలుమాఱు ననం బని లేదు; భీష్ముఁ డా
దిగఁ గురుసేనలోన గణుతింపఁగఁ బేర్చిన యోధకోటి నా
మొగమునఁ బడ్డ నె ట్లడరి ముట్టెదనో యటు సూచుచుండుమీ!' **17**

ప్రతిపదార్థం: జగము+ఎఱుఁగంగన్= ప్రపంచమంతా తెలిసేటట్లుగా; అనిన్= యుద్ధంలో; ద్రోణున్= ద్రోణుడిని; చంపుటకున్+ఐ= సంహరించటం కోసమే; ధాత= బ్రహ్మదేవుడు; నన్= నన్ను సృజియించెన్= సృష్టించాడు; మగటిమి+కాఁగన్= శౌర్యమే కాగా; దీనిన్= ఈ విషయాన్ని; పలుమాఱు= చాలాసార్లు; అనన్+పని+లేదు= చెప్ప నవసరం లేదు; భీష్ముఁడు+ఆది+కన్= భీష్ముఁడు మొదలుకొని; కురు+సేనలోనన్= కౌరవుల సైన్యంలో; గణుతింపఁగన్+పేర్చిన= లెక్కపెట్టగా అతిశయించిన; యోధకోటి= వీరుల సముదాయం; నా+మొగమునన్+పడ్డన్= నాకు ఎదురైనప్పుడు; ఎట్లు+అడరి= ఏ విధంగా అతిశయించి; ముట్టెదనో= పోరాటం చేస్తానో; అటు= ఆ రీతిని; చూచుచుండుమా!= చూస్తూ ఉండుము!

తాత్పర్యం: 'ద్రోణుడిని చంపటానికై నన్ను బ్రహ్మదేవుడు సృష్టించాడన్న సంగతి లోకానికి తెలుసు. దీనిని నా పరాక్రమ సూచకంగా పలుసార్లు పేర్కొన పనిలేదు. అది అట్లా ఉండగా, కౌరవసేనలో భీష్మాదులవంటి పేరుమోసిన యోధులందరూ నాకెదురై నిలిచినప్పుడు ఏ విధంగా విజృంభించి ఎదిరిస్తానో గమనించి చూస్తూ ఉండుము!'

తే. **పృషతకులముఖ్యుఁ డిమ్మెయిఁ బేర్చి పలుకు । సంగరోత్సాహకరవాక్యభంగి కపుడు**
పాండుసుతులును సకల భూపతులు సంత । సంబు నొందిరి, హరియుఁ బ్రియంబు నొందె. **18**

ప్రతిపదార్థం: పృషతకులముఖ్యుఁడు= పృషతుడి వంశంలో జనించిన వారిలో పేర్కొనదగినవాడు- ధృష్టద్యుమ్నుడు; ఈ+మెయిన్= ఈ రీతిగా; పేర్చి= అతిశయించి; పలుకు= మాటలాడే; సంగర+ఉత్సాహకర, వాక్య,భంగికిన్= యుద్ధం చేయటానికి ప్రేరేపణ కలిగించే మాటల తీరుకు; అపుడు= ఆ సమయంలో; పాండు సుతులును= పాండవులును; సకల+భూపతులున్= అందరు రాజులును; సంతసంబున్+ఒందిరి= సంతోషించారు; హరియున్= శ్రీ కృష్ణుడును; ప్రియంబున్+ఒందెన్= ప్రీతిచెందాడు.

తాత్పర్యం: ఈ విధంగా పృషత వంశస్థులలో ముఖ్యుడైన ధృష్టద్యుమ్నుడు అతిశయించి యుద్ధోత్సాహాన్ని కలిగించే పౌరుషవాక్యాల పద్ధతికి, పాండవులు సంతోషించారు, అచటి రాజులు అందరూ ఆనందించారు. శ్రీకృష్ణుడు కూడ మిక్కిలి ప్రీతిచెందాడు.

వ. **తదనంతరంబ యుధిష్ఠిరుండు ధృష్టద్యుమ్నున కిట్లనియె.** **19**

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ధృష్టద్యుమ్ననకున్= ధృష్టద్యుమ్ననకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అటు పిమ్మట యుధిష్ఠిరుడు ధృష్టద్యుమ్నుడితో ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ‘ తొల్లి గురుండు దానవులతోడి రణంబున వజ్రపాణికిన్
దెల్లమి గాఁగఁ జెప్పె నది దీప్తతరం బగు నొడ్డనంబు శో
భిల్లుచు వైరి దృష్టులకు భీకరమై చనుఁ గ్రౌంచనామకం
బెల్లి ఘటింపు నీదు వెర వేర్పడ నమ్మొన యద్భుతంబుగన్.’ 20

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వకాలమునందు; గురుండు= ఒజ్జ(బృహస్పతి); దానవులతోడి+ రణంబునన్= రాక్షసులతోడి యుద్ధంలో; వజ్రపాణికిన్= దేవేంద్రుడికి; తెల్లమి+కాఁగన్= స్పష్టంగా తెలిసేటట్లు; చెప్పెన్= వచించాడు; అది= అది; దీప్త+ తరంబు+అగు= మిక్కుటంగా ప్రకాశించేటటువంటి; ఒడ్డనమ్ము= వ్యూహం; శోభిల్లుచున్= విలసిల్లుతూ; వైరిదృష్టులకున్= శత్రువుల చూపులకు; భీకరము+ఐ= భయం కలిగించేదై; చనున్= ఒప్పును; క్రౌంచ+నామకంబు= క్రౌంచము అనే పేరు గలది; ఎల్లి= రేపు; నీదు,వెరవు+ఏర్పడన్= నీ నేర్పరితనం ప్రస్ఫుటమయ్యేటట్లుగా; అమ్మొన= ఆ వ్యూహం; అద్భుతంబుగన్= ఆశ్చర్యకరంగా; ఘటింపుము= నిర్మించుము.

తాత్పర్యం: పూర్వకాలంలో రాక్షసులకూ దేవతలకూ యుద్ధం జరిగింది. అప్పుడు దేవతల గురువైన బృహస్పతి దేవేంద్రుడితో ‘క్రౌంచ వ్యూహం మిక్కిలి గొప్పది; శత్రువుల దృష్టికి భయం కలిగించగలదు.’ అని స్పష్టం చేశాడు. నీవు రేపు ఆ క్రౌంచ వ్యూహాన్ని నిర్మించి నీ తెలివితేటలు చూపించుము. అది అద్భుతంగా ఉండాలి.’

వ. **అనిన విని యతండట్ల చేయువాఁడ నని పలికె నట్లు గలంక దేఱి కృష్ణు వీడ్కొని యెల్లవారల నిజనివాసం బులకుం బోవం బనిచి ధర్మతనయుం డభ్యంతరావాసంబున కరిగెఁ; బ్రభాతం బగుటయుఁ బాండవసైనికుల డెందంబులతోడన యరవిందంబులు వికాసంబు నొందెం‘బదంపడి తదీయప్రతాపోదయసహవర్తి యగుచు మార్తాండోదయంబు వెలుంగుటయుం గాలోచిత కృత్యంబులు నిర్వర్తించి కౌంతేయాగ్రజుండు వెడలెఁ; గ్రౌంచవ్యూహంబు సంఘటించు నెడం జంచుత్వంబు భజించి ఫల్గునుండు గాండీవకపిధ్వజంబులు మెఱయం బొలిచి నిలిచెఁ; గుంతిభోజుండును శైబ్యుండును జక్షుస్థ్సానంబులం దేజరిల్లిరి; ద్రుపదుండు శిఖకు నమరెఁ; దశార్ణ శూరసేన కిరాత దేశాధీశులు కంఠాకారంబుఁ దాల్చిరి భీమసేనుండును ధృష్టద్యుమ్నుండును దక్షిణవామపక్షంబు లయిరి; సౌభద్ర సాత్యకి ద్రౌపదేయ పౌండ్ర చోళపాండ్యులు భీమసేను వలను నకుల సహదేవ హైడింబశంబర వత్సమహీపతులు ధృష్టద్యుమ్ను దిక్కునం బన్నిరి; కేకయ కాశిరాజులతోడం గూడి విరాటుండు జఘన భాగభంగికిం దగియుండె; హూణపతి ప్రముఖులు పరివేష్టింప వెన్నయి యుధిష్ఠిరుం డొప్పెఁ; నివ్విధంబున మోహరించిన యప్పుడు .** 21

ప్రతిపదార్థం: అనినన్= అని(ధర్మరాజు) చెప్పగా; విని= ఆలకించి; అతండు= అతడు(ధృష్టద్యుమ్నుడు); అట్లు= ఆ రీతిగా; చేయువాఁడన్= చేయగలను; అని+పలికెన్= అని చెప్పాడు; అట్లు= ఆ రీతిగా; కలంకన్+తేఱి= కలతవీడి,(స్వాస్థ్యం చెంది); కృష్ణున్+వీడ్కొని= శ్రీకృష్ణుడిచే సెలవు గైకొని; ఎల్లవారలున్= అందరూ; నిజ+నివాసంబులకున్= తమ తమ విడిదులకు; పోవన్+పనిచి= పంపి; ధర్మతనయుండు= ధర్మరాజు; అభ్యంతర+ఆవాసంబునకున్+అరిగెన్= లోపలనున్న నివాస గృహానికి వెళ్ళాడు; ప్రభాతంబు+అగుటయున్= తెల్లవారగా; పాండవ+సైనికుల+డెందంబులతోడన్+అ= పాండవసేనలలోని భటుల హృదయాలవలెనే; అరవిందంబులు= పద్మాలు; వికాసంబున్+ఒందెన్= వికసించాయి; పదంపడి= పిదప; తదీయ, ప్రతాప+ఉదయ, సహవర్తి+అగుచున్= వారి యొక్క పరాక్రమంతో సాటియైనది అవుతూ; మార్తాండ+ఉదయంబు= సూర్యోదయం; వెలుంగుటయున్= ప్రకాశించింది కాగా; కాల+ఉచిత,కృత్యంబులు= కాలమునకు సరియగు కార్యములు (ఉదయం నిర్వర్తించే పనులు); నిర్వర్తించి= చేసి; కౌంతేయ+అగ్రజుండు= కుంతీ కుమారులలో మొదటివాడు- ధర్మరాజు; వెడలెన్= వెళ్ళాడు; క్రౌంచ+వ్యూహంబు= క్రౌంచము

అనే పేరుగల ఒడ్డనం; సంఘటించు+ఎడన్= నిర్మించే పట్టున; ఫల్గునుండు= అర్జునుడు; చంచుత్వంబు+భజించి= ముక్కు అయి; గాండీవ, కపిధ్వజంబులు, మెఱయన్= గాండీవం అనే విల్లు, కోతి జెండా వెలుగొందుతుండగా; పొలిచి, నిలిచెన్= విలసిల్లాడు; కుంతిభోజుండును= కుంతిభోజుడు; శైబ్యుండును= శైబ్యుడును; చక్షుఃస్థానంబులన్= కన్నులుగా ఉండేచోటులో; తేజరిల్లిరి= వెలుగొందారు; ద్రుపదుండు= ద్రుపదుడు(పాంచాలరాజు); శిఖకున్+అమరెన్= నెత్తిమీది తురాయిగా ఏర్పడ్డాడు; దశార్ణ+శూరసేన+కిరాత+దేశ+అధీశులు= దశార్ణరాజు; శూరసేనరాజు; కిరాతరాజు; కంఠ+ఆకారంబున్= గొంతుక భాగంగా; తాల్చిరి= ధరించారు(ఏర్పడ్డారు); భీమసేనుండును+ధృష్టద్యుమ్నుండును= భీముడు, ధృష్టద్యుమ్నుడు; దక్షిణ,వామ,పక్షంబులు+అయిరి= కుడి ఎడమ రెక్కలవలె ఏర్పడ్డారు; సౌభద్ర,సాత్యకి, ద్రౌపదేయ, పౌండ్ర, చోళ,పాండ్యులు= అభిమన్యుడు, సాత్యకి, ద్రౌపది కొడుకులు, పౌండ్రరాజు, చోళరాజు, పాండ్యరాజు; భీమసేను+వలను= భీముడివైపు; నకుల+సహదేవ+హైడింబ+శంబర+ వత్స+మహీపతులు= నకులుడు, సహదేవుడు, ఘటోత్కచుడు(హిడింబి కొడుకు), శంబరరాజు, వత్సరాజు; ధృష్టద్యుమ్ను దిక్కునన్+పన్నిరి= ధృష్టద్యుమ్నుడి దగ్గర నిలిచి వ్యూహంలో ఒక భాగంగా ఏర్పడ్డారు; కేకయ, కాశిరాజులతోడన్+కూడి= కేకయరాజు కాశీరాజులతో కూడి; విరాటుండు= విరాటరాజు; జఘన,భాగ,భంగికిన్+తగియుండెన్= మొలచోటుగా చేరి ఉన్నాడు; హూణపతి+ప్రముఖులు= హూణరాజు మున్నగు వారిలో ముఖ్యులు; పరివేష్టింపన్= చుట్టుచేరి ఉండగా; వెన్ను+అయి= వెనుకభాగంలో; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఒప్పెన్= విలసిల్లాడు; ఇవ్విధంబునన్= ఈ విధంగా; మోహరించిన+అప్పుడు= వ్యూహం ఏర్పరచిన సమయంలో.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు - తాను ధర్మరాజు చెప్పినట్లే చేస్తానన్నాడు. ధర్మరాజు ఆవేదన తొలగింది. అతడు అందరినీ, వారి వారి నివాసాలకు వెళ్ళండని ఆదేశించి తాను తన లోపలి మందిరానికి వెళ్ళాడు. పిదప తెల్లవారింది. పాండవ సైనికుల హృదయాల వలె, పద్మాలు వికసించాయి. సూర్యుడు పాండవభటుల పరాక్రమం వలె ప్రచండ కిరణాలతో వెలుగొందాడు. ధర్మరాజు కాలకృత్యాలు నిర్వర్తించి, బయలుదేరాడు. ధృష్టద్యుమ్నుడు క్రౌంచ వ్యూహం ఏర్పాటు చేశాడు. అర్జునుడు గాండీవ ధనుస్సుతో కోతి జెండాతో వ్యూహానికి 'ముక్కు'గా నిలిచాడు. కుంతిభోజుడు, శైబ్యుడు కన్నులుగా అమరారు. ద్రుపదుడు తురాయి అయ్యాడు. దశార్ణరాజు, శూరసేనరాజు, కిరాతరాజు కుత్తుకగా ఏర్పడ్డారు. భీముడు, ధృష్టద్యుమ్నుడు కుడి ఎడమ రెక్కలయ్యారు. అభిమన్యుడు, సాత్యకి, ద్రౌపది కొడుకులు పౌండ్ర చోళ పాండ్యులు భీముడి దగ్గరకు చేరారు. నకుల సహదేవులు, ఘటోత్కచుడు, శంబర వత్స రాజులు ధృష్టద్యుమ్నుడి కడ చేరారు. కేకయరాజు కాశిరాజులతో కూడి విరాటుడు మొలస్థానంలో నిలిచారు. హూణపతి మున్నగు వారు ధర్మరాజు చుట్టూచేరి వెనుక ఉన్నారు. ఈ విధంగా ఆ వ్యూహం ఏర్పడింది.

విశేషాలు: 1. కురుక్షేత్ర సంగ్రామంలో హూణులు మున్నగు పాశ్చాత్యులు కూడా పాల్గొనినట్లు మహాభారత కథనం. 2. క్రౌంచము= కొంగను పోలిన ఒకానొక పక్షి. 3. భారత యుద్ధంలోని ఒక విశిష్టత - భటులను వ్యూహంగా తీర్చిదిద్ది నిలపటం. వ్యూహాలు - వివిధ మనుజ జంతు పక్షుల ఆకారాలలో ఉండవచ్చును.

భీష్ముని ద్వితీయదివస యుద్ధక్రమము (సం. 6-47-1)

తే. **పుండరీకంబు లుద్దండపుండరీక । చారుభంగి లేయెండ కెంజాయ నొప్పె**
నంత నక్కడఁ గురుబల మధికరభస । తుములముగఁ ద్రోచి నడతెంచె సమరమునకు. **22**

ప్రతిపదార్థం: పుండరీకంబులు= తెల్లతామరపువ్వులు; ఉద్దండ, పుండరీక, చారు, భంగిన్= గొప్పవైన తెల్ల గొడుగుల వలె అందంగా; లేఁత+ఎండ, కెంపు, చాయన్= లేత ఎండలోని అరుణోదయం రంగుతో; ఒప్పెన్ = విలసిల్లాయి; అంతన్= పిమ్మట; అక్కడన్= ఆ స్థలంలో; కురు+బలము= కౌరవుల సైన్యం; అధిక,రభస, తుములముగన్= మిక్కుటమైన తొందరపాటుతో కూడిన సందడితో; సమరమునకున్= యుద్ధానికి; త్రోచి= ముందుకు దూకి; నడతెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: ఆ సూర్యోదయ సమయంలో తెల్లతామర పువ్వులు తెరచిన తెల్లగొడుగులవలె మనోజ్ఞంగా శోభిల్లాయి. కౌరవ సైన్యం మిక్కుటమైన ఉత్సాహంతో ముందుకు త్రోసుకొంటూ సంరంభంతో యుద్ధభూమికి చేరింది.

విశేషాలు: i. ఈ పద్యంలో 'అంతన్' - 'అక్కడ' అనే చిన్న పదాలలో పెద్ద భావం ఇమిడి ఉంది. అంతన్= సూర్యోదయ సమయంలో. కురుపాండవసేనలు రెండూ కురుక్షేత్ర సంగ్రామంలో సూర్యోదయ సమయంలో యుద్ధం ప్రారంభించేవి. అక్కడ= ఇంతవరకు, అనగా ఈ తేటగీతిపద్యానికి వెనుకనున్న గద్యంలో పాండవసేన వర్ణన ఉన్నది. అది 'ఇక్కడ' నున్న పాండవసేన వర్ణన. ఇక ఈ పద్యంలో 'అక్కడ' - అనగా ఎదురుగా ఉన్న కౌరవసేన వర్ణన ఉన్నది. ii.. సూర్యోదయ సమయంలో తామర పూవులు వికసిస్తాయి. ఇది కవి సమయం.

వ. అయ్యవసరంబున దుర్యోధనుండు భీష్మ ద్రోణాశ్వత్థామ కృప శల్య కృతవర్మల నాలోకించి. 23

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; దుర్యోధనుండు= దుర్యోధనుడు; భీష్మ, ద్రోణ, అశ్వత్థామ, కృప, శల్య, కృతవర్మలన్= భీష్ముడిని, ద్రోణుడిని, అశ్వత్థామను, కృపుడిని, శల్యుడిని, కృతవర్మను; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఆ సమయంలో దుర్యోధనుడు తన పక్షాన ఉన్న వీర ప్రముఖులు - భీష్ముడిని - ద్రోణుడిని, అశ్వత్థామను, కృపుడిని, శల్యుడిని, కృతవర్మను చూచి (ఇట్లు పలికాడు). (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఒకఁ డొకఁడ పాండుపుత్త్రుల । సకల బలంబులను గెలువఁ జాలుదు రుగ్రా
ధిక శౌర్య సత్త్వులందఱు! నొకతల యటె । మిమ్ము నోర్వ నోపునె హరుఁడున్? 24

ప్రతిపదార్థం: ఒకఁడు+ఒకఁడు+అ= ఒకడు ఒకడే; పాండు పుత్త్రుల, సకల, బలంబులను= పాండవుల యొక్క సేనలను అన్నింటినీ; గెలువన్+చాలుదురు= జయించగలరు; ఉగ్ర,అధిక,శౌర్య,సత్త్వులు+అందఱున్= భయంకరమూ, మిక్కుటమూ అయిన పరాక్రమం బలం కలవారు మీరు అందరూ; ఒక, తల+అటె!= (మీరు) ఒక్కటైనారంటే; హరుఁడున్= శివుడు గూడ; మిమ్మున్= మిమ్ము; ఓర్వన్+ఓపును+ఎ= జయించగలడా?(జయించలేడు).

తాత్పర్యం: మీలో ఒక్కొక్కడే పాండవుల సేనలను అన్నింటినీ జయించగలడు. మిక్కిలి భయంకరపరాక్రమము గల్గిన ఇంతమంది మహావీరులు ఒక్కటైనారంటే శివుడు గూడ మిమ్ము యుద్ధంలో జయింపలేడు.

క. ఐనను గ్రౌంచవ్యూహవి । ధానంబున మోహరించి దారుణచారు
స్థానక మై కుంతీసుత । సేన వొలిచె మనము నిర్విశేషంబునకున్. 25

ప్రతిపదార్థం: ఐనను= (మీరు అందరునూ జగదేకవీరులే అయినప్పటికి;) క్రౌంచ, వ్యూహ, విధానంబునన్= క్రౌంచపక్షి ఆకారం ఒనగూడేటట్లుగ ఒడ్డనం; మోహరించి= తీర్చి దిద్ది; దారుణ, చారు, స్థానకము+ఐ= భయంకరమును సుందరమును అయిన తీరుగా; కుంతీ, సుత, సేన= పాండవుల సేన(కుంతి కొడుకుల సైన్యం); పొలిచెన్= శోభిల్లింది; మనము= మనం; నిర్విశేషంబునకున్= సమానంగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: మీరందరు జగదేకవీరులు అయినప్పటికీ, పాండవులు రమణీయ భయానకమైన క్రౌంచవ్యూహంగా తమ సేనలను అమర్చారు. మనం కూడా ఆ వ్యూహానికి తీసిపోనట్లుగా. (ప్రతివ్యూహం ఏర్పరచుకోవాలి). (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: మహాభారత యుద్ధకాలంలో పోరాటంలో "వ్యూహ" నిర్మాణానికి మిక్కుటమైన ప్రాధాన్యం ఉండేది. వ్యూహాలలో క్రౌంచ వ్యూహం గొప్పది.

క. అనురూపము లగు మాఱొ । డ్డనముల్ ప్రస్ఫురితములు ధృఢంబులుగాఁ దీ
ర్చినఁ గాక తెఱం గగునే?' యని మొన లేర్పఱిచెఁ గౌరవాన్వయముఖ్యా! 26

ప్రతిపదార్థం: కౌరవ+అన్వయ,ముఖ్యా!= కురువంశంలో ప్రధానుడైనవాడా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా! అనురూపములు+అగు= సరిపోయే (క్రౌంచ వ్యూహానికి సరితూగునటువంటివి); మాఱు+ఒడ్డనముల్= ప్రతివ్యూహాలు; ప్రస్ఫురితములు= ప్రకాశమానాలు; ధృఢంబులుగాన్= గట్టివి అగునట్టివిగా; తీర్చినన్+కాక= ఏర్పాటు చేస్తే తప్ప; తెఱంగు+అగును+ఏ?= పద్ధతి అవుతుందా?; అని= అని పలికి; మొనలు= వ్యూహాలు; ఏర్పఱిచెన్= ఏర్పాటు చేశాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాండవులు యుద్ధ విద్యలో గొప్పదిగా పేరు కెక్కిన 'క్రౌంచవ్యూహం' ఏర్పాటు చేశారు కదా! మనం గూడ ఆ వ్యూహానికి సరిపోయే మరికొన్ని బలమైన వ్యూహాలు ప్రకాశమానా లైనవి నిర్మించాలి కదా!' అని ఆ విధంగా వ్యూహాలు ఏర్పరిచాడు.

వ. దుశ్శాసన వికర్ణవిందాను విందులును శూరసేనయవన త్రిగర్త కుకురు దేశంబులవారు నొక్కవలనను ద్రోణాచార్యుండును గుంతల దశార్ణ విదర్భులును గాంధార సింధుసౌవీరపతులు నొక్కదిక్కునను భీష్ముండు మహాసైన్యంబుతో నడుమనుం గా మూఁడు మోహరంబులయ్యెఁ; గృతవర్మయు శల్యుండును నశ్మంత కాశ్మీరులు గొందఱు దమ్ములుం దానును మానవేంద్రుండును వెనుక దెస నిలిచె నిత్తెఱంగున రెండు బలంబులు నాయితంబులై శంఖభేరీ మృదంగాది తూర్యస్వనంబులు సెలంగ నొండొంటిం గదియ నడచె' ననిన విని ధృతరాష్ట్రుం 'డివ్విధంబునం గదిసి యెవ్వరెట్లు గయ్యంబు సేసి?' రని యడిగిన నతనికి సంజయుం డిట్లనియె. 27

ప్రతిపదార్థం: దుశ్శాసన,వికర్ణ,వింద, అనువిందులును= దుశ్శాసనుడు, వికర్ణుడు, విందుడు, అనువిందుడున్నూ, శూరసేన, యవన,త్రిగర్త, కుకురు దేశంబులవారున్= శూరసేన దేశీయులు, యవనులు, త్రిగర్తులు కుకురు దేశీయులు, ఒక్క+వలనను= ఒకచోటను; ద్రోణ+ఆచార్యుండును= ద్రోణాచార్యుడూ; కుంతల, దశార్ణ, విదర్భులును= కుంతల దేశీయులూ, దశార్ణ దేశీయులూ; విదర్భ దేశీయులూ; గాంధార,సింధు,సౌవీరపతులు= గాంధార రాజు, సింధురాజు; సౌవీరరాజును; ఒక్కదిక్కునను= ఒకవైపున; భీష్ముండు= భీష్ముడు; మహాసైన్యంబుతోన్= గొప్పసేనతో; నడుమనున్+కాన్= మధ్యగా; మూఁడు+మోహరంబులు= మూడు వ్యూహాలు; అయ్యెన్= (కురుసేన) ఏర్పడింది; కృతవర్మయున్+శల్యుండును= కృతవర్మ మరియు శల్యుడు; అశ్మంత, కాశ్మీరులు= అశ్మంత దేశీయులు మరియు కాశ్మీర దేశీయులు; కొందఱు= కొందరు;తమ్ములున్+తానును= సహోదరులు, తానును,(దుర్యోధనుడు); వెనుక+దెసన్+నిలిచెన్= వెనుక భాగమందు నిలిచారు; ఆ+తెఱంగునన్= ఆ విధంగా; రెండు+బలంబులు= రెండుసేనలు (కురు, పాండవ సేనలు); ఆయితంబులు+ఐ= సంసిద్ధాలు అయి, శంఖ,భేరీ,మృదంగ+ఆది+తూర్య+స్వనంబులు= శంఖాలు, భేరులు, మద్దెలలు, మున్నగు శుభవాద్య స్వరాలు; చెలఁగన్= మ్రోయగా; ఒండు+ఒంటిన్= ఒక దానిని ఒకటి; కదియన్+నడచెన్= ఎదుర్కోవటానికి వెళ్ళాయి; అనినన్+విని= అని(సంజయుడు) చెప్పగా విని; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; కదిసి= ఎదుర్కొని; ఎవ్వరు+ఎట్లు= ఎవరెవరు ఏ విధంగా; కయ్యంబు+చేసిరి?= పోరాడారు?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; సంజయుండు= సంజయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దుశ్శాసనుడు, వికర్ణుడు, విందుడు, అతని తమ్ముడు అనువిందుడు, శూరసేన, యవన, త్రిగర్త దేశపురాజులు వారి సైన్యము, ఒకవైపున నిల్చారు. ద్రోణాచార్యుడు, కుంతలరాజు, దశార్ణరాజు, విదర్భరాజు తమ తమ సేనలతో ఒకచోట నిలబడ్డారు. వీరు ఇరువురికి మధ్యగా గొప్ప సైన్యంతో భీష్ముడు నిలబడ్డాడు. ఈ విధంగా కౌరవసైన్యం మూడు వ్యూహాలుగా ఏర్పడింది. దుర్యోధనుడు తన తమ్ములతో వెనుక నిలిచాడు. అతనికి తోడుగ అశ్మంత కాశ్మీర రాజులు నిలిచారు. కురు పాండవ సేనలు రెండూ, యుద్ధానికి సన్నద్ధాలై, శంఖాలు, భేరులు, మద్దెలలు మున్నగు తూర్య రావాలు చేశాయి అని సంజయుడు చెప్పగా విని, ఇక, 'ఆ రెండు సేనలు ఏ విధంగా పోరాటం కొనసాగించాయో వివరంగా చెప్పుమని ధృతరాష్ట్రుడు కోరగా, సంజయుడు ఈ రీతిగా సమాధానం చెప్పాడు.

తే. **'ఏచి దుర్యోధనుండు చేవీచి యెలుఁగు । సూపి పురికొల్ప నెంతయు నేపు మిగిలి**
మనబలంబులు పాండు కుమారసైన్య । సమితితోఁ దాఁకె నత్యంత సంకులముగ. **28**

ప్రతిపదార్థం: ఏచి= విజృంభించి; దుర్యోధనుండు= దుర్యోధనుడు; చే,వీచి= చేయి ఊపి; ఎలుఁగు+చూపి= గొంతెత్తి; పురికొల్పన్= ప్రోత్సహించగా; ఎంతయున్= మిక్కుటంగా; ఏపు+మిగిలి= అతిశయించి; మన+బలంబులు= మన సేనలు(కౌరవసేనలు); పాండు కుమార+సైన్య+సమితితోన్= పాండవుల సేనా సమూహంతో; అత్యంత+సంకులముగన్= మిక్కుటమైన సందడితో; తాఁకెన్= ఎదుర్కొన్నాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు ఉత్సాహంతో తన చేయి వీస్తూ గొంతెత్తి పురికొల్పగా, మనసేనలు గొప్ప సంరంభంతో పాండవ సైన్యాలను ఢీకొన్నాయి.

వ. **అట్టి యెడ.** **29**

తాత్పర్యం: ఆ సమయంలో.

ఉ. **ఱెక్కలు సించి, కంఠమున ఱేకులు వాపి, శిరంబు వ్రచ్చి పే**
రుక్కునఁ గ్రౌంచచంద మగు నొడ్డు గలంగఁగఁ జేసి భీష్ముఁ డే
దిక్కునఁ దానయై దిశలు దీటుకొనన్ శరకోటి నింపఁ గెం
పెక్కిన కంటిక్రేవ చెలువెక్కుడు సేయఁగఁ గ్రీడి కృష్ణుతోన్. **30**

ప్రతిపదార్థం: (ఆ క్రౌంచపక్షి ఆకారంలో ఉన్న వ్యూహానికి) ఱెక్కలు+చించి= రెక్కలు కత్తిరించి; కంఠమునన్= కుత్తుకలో; ఱేకులు+పాపి= ఈకలు పోగొట్టి; శిరంబు+వ్రచ్చి= తల బ్రద్దలు కొట్టి; క్రౌంచచందమగు= క్రౌంచపక్షి ఆకారంలో ఉన్న; ఒడ్డు= వ్యూహం; కలంగఁగన్+చేసి= కలతపొందించి; భీష్ముఁడు= భీష్ముడు; ఏ+దిక్కునన్= ఎటువైపు చూచినా; తాన+ఐ= తానే అయి; దిశలు+దీటుకొనన్= దెసలందు వ్యాపించగా; శర+కోటి= బాణాల సముదాయం; నింపన్= నిండునట్లు చేయగా; క్రీడి= అర్జునుడు; కెంపు+ఎక్కిన= ఎఱ్ఱబడిన; కంటి+క్రేవ= కన్నుల కొసలు; చెలువు= అందాన్ని; ఎక్కుడు+చేయఁగన్= అతిశయింప చేయగా; కృష్ణుతోన్= శ్రీ కృష్ణుడితో.

తాత్పర్యం: భీష్ముడు పాండవసేనాని పన్నిన క్రౌంచపక్షి ఆకారంలోని ఆ వ్యూహపు రెక్కలు ఛేదించాడు. కంఠంలోని రేకులు ఊడగొట్టాడు. తలను బ్రద్దలు చేశాడు. వ్యూహాన్ని కలచివేశాడు. ఏ వైపు చూచినా తానే కన్పించాడు. దిక్కులు అన్నీ నిండేటట్లుగా బాణాల సమూహాలు ప్రయోగించాడు. భీష్ముడి విజృంభణ చూచి అర్జునుడు ఆగ్రహించాడు.అతడి

కన్నులు ఎఱ్ఱబడ్డాయి. అవి అతడి ముఖానికి అందంపెంచాయి. అప్పుడు అర్జునుడు శ్రీకృష్ణుడితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

అర్జునుఁడు భీష్మునిమీఁదికి రథంబు దోలించి విజృంభించుట (సం-6-48-2)

మ. మన సేనం గలగంగఁ జేయుచు మదిన్ మందాకినీ నందనుం
డు ననుం గైకొనకున్నవాఁ; డితని యాటోపం బడంగించెదన్;
నిను మెప్పించెదఁ జూడు! ఖేచరులు వర్ణింపన్; విజృంభించెదన్
దనుజధ్వంసి! రథంబు వే పఱపు ముద్యద్విక్రమప్రక్రియన్.' 31

ప్రతిపదార్థం: దనుజధ్వంసి!= రాక్షసులను నాశనం చేసేవాడా! శ్రీకృష్ణా!; మందాకినీ+నందనుండు= గంగ కొడుకు భీష్ముడు; మన+సేనన్= మన సైన్యాన్ని; కలగంగన్+చేయుచున్= కలతపెట్టుతూ; మదిన్(తన) మనసులో; ననున్= నన్ను(అర్జునుడిని); కైకొనక+ఉన్నవాఁడు= లెక్కచేయటంలేదు; ఇతని= ఈ భీష్ముడి; ఆటోపంబు= విజృంభణ; అడంగించెదన్= అణచివేస్తాను; నినున్+మెప్పించెదన్= నిన్ను మెప్పిస్తాను; చూడు(ము)= వీక్షించుము; ఖేచరులు= ఆకాశచరులు; వర్ణింపన్= పొగడేటట్లుగా; విజృంభించెదన్= అతిశయిస్తాను; ఉద్యత్+విక్రమ, ప్రక్రియన్= ప్రకాశించే శౌర్యం ప్రతిఫలించేటట్లుగా; రథంబు= రథాన్ని; వే= వేగంగా; పఱపుము= తోలుము.

తాత్పర్యం: శ్రీకృష్ణా! చూడుము. గంగాపుత్రుడైన భీష్ముడు మన సేనను ఛేదించి విజృంభిస్తున్నాడు. నన్ను లెక్కచేయటంలేదు. ఈతడి విజృంభణ ఇంక నేను అరికట్టాలి. నేను గూడ విజృంభిస్తాను. నిన్ను మెప్పిస్తాను. చారణులు నా శౌర్యం పొగడేటట్లు పోరాడుతాను. రథాన్ని వేగంగా భీష్ముడిపైకి పోనిమ్ము.'

విశేషం: లోకోత్తరమైన పరాక్రమం ఎవరైనా ప్రదర్శిస్తే, ఆకాశంలో సంచరించే దేవతా చారణులు ప్రశంసాగీతాలు పాడుతూ ఆ వీరుని కీర్తి వ్యాపింప చేస్తారు అని కవి సమయం.

క. అనిన విని విష్ణుఁ డా జి । ష్ణునిఁ గనుఁగొని 'యేను నీ మనోరథము తెఱం
గునకుఁ దగ రథముఁ గడపెద । విను! తిరమై నాదు పలుకు వీరవినోదీ! 32

ప్రతిపదార్థం: అనినన్+విని= అని అర్జునుడు చెప్పగా ఆలకించి; విష్ణుఁడు= శ్రీకృష్ణుడు; ఆ+జిష్ణునిన్= జయశీలుడైన ఆ అర్జునుడిని; కనుఁగొని= చూచి; ఏను= నేను; నీ+మనోరథము= నీ కోరిక; తెఱంగునకున్= తీరునకు; తగన్= అనువుగా; రథము= తేరు; కడపెదన్= నడుపుతాను; వీర+వినోదీ!= పరాక్రమమునందు విహరించటం ఇష్టమైనవాడా!= ఓ అర్జునా!; తిరము+ఐ= స్థిరంగా (జాగ్రత్తగా); నాదు+పలుకు= నామాట; విను!= ఆలకించుము.

తాత్పర్యం: అనగా విని శ్రీకృష్ణుడు అర్జునుడిని చూచి ఇట్లా అన్నాడు: 'ఓ వీరవినోదీ, నీ కోరిక మేరకు నేను తేరు నడుపుతాను. ముందుగా నేను చెప్పే మాటలు జాగ్రత్తగా వినుము.

చ. ' గజిబిజి లేక, యుబ్బక, యఖండిత శౌర్యము నస్త్రవిద్యయున్
భుజబలముం బొగడ్త వడ, భూరిపరాక్రమశాలి భీష్ము న
క్కజముగఁ దాఁకి యద్దెస నకంపితులై నడతెంచు శల్య కుం
భజ కురురాజు లచ్చెరువుపాటు భయంబును బొందఁ జేయుమీ!' 33

ప్రతిపదార్థం: గజిబిజి+లేక= కలవరం లేకుండా; ఉబ్బక= పొంగిపోకుండగా; అఖండిత,శౌర్యము= మొక్కవోని పరాక్రమం; అస్త్ర+విద్యయున్= మంత్ర బాణాలు ప్రయోగించటంలో గల నేర్పు; భుజబలమున్= పరాక్రమం; పొగడ్త+పడన్= పేరు కెక్కేటట్లుగా; భూరి+పరాక్రమశాలి= గొప్ప శౌర్యం గలవాడు; భీష్మున్= భీష్ముడిని; అక్కజముగన్= ఆశ్చర్యం కలిగేటట్లుగా; తాఁకి= ఎదిరించి; ఆ+దెసన్= ఆతడి వైపు(అతడికి తోడ్పడేందుకు); నడతెంచు= వచ్చునటువంటి; శల్య,కుంభజ,కురురాజులు= శల్యుడు, ద్రోణుడు, దుర్యోధనుడు; అచ్చెరువుపాటు= ఆశ్చర్యం; భయంబును= వెఱపును; పొందన్+చేయుము+ఈ= పొందేటట్లు చేయుము.

తాత్పర్యం: 'నీవు తొట్రుపాటు చెందకుండా, ఉప్పొంగిపోకుండా, మొక్కవోని పరాక్రమాన్నీ, అస్త్రవిద్యనూ, భుజబలాన్నీ ప్రశంసనీయంగా ప్రదర్శించి, మహాపరాక్రమశాలి అయిన భీష్ముడిపై అద్భుతంగా దాడి చేయాలి. అతడికి బాసటగా నిలిచి నిర్భయంగా వచ్చే శల్యుడికీ, ద్రోణుడికీ, దుర్యోధనుడికీ, ఆశ్చర్యం, భయం కలిగేటట్లు చేయాలి.'

విశేషాలు: 1. ఈ పద్యంలో శ్రీకృష్ణుడు చేసిన హెచ్చరిక గమనించదగింది. శ్రీకృష్ణుడు కేవలం సారథిమాత్రుడే కాడు.2. కుంభజుడు= కుంభమునందు పుట్టినవాడు= ద్రోణుడు. ఇరువదియవ శతాబ్ది చివరిభాగమున శోధన నాళికలలో గర్భోత్పత్తి కోసం వినూత్న ప్రయోగాలు జరుగుతున్నవి గదా! 'కుంభజ' ప్రయోగం మరికొంతకాలం గడచాక సుబోధం కావచ్చు.

వ. అని పలికి యచ్చుతుం డుచితరయంబున రథంబు నడప ధనంజయుండు తన కడ్డం బైన శూరసేన సేనా కాననంబు పటుబాణపరంపర యనుమహావాతవేగంబున బడలుపడంజేయుచుఁగవిసినంగని గాంగేయుం డెదిర్చి పేర్చి డెబ్బదేడు క్రూర నారాచంబు లేసిన నప్పుడు గూడుకొని ద్రోణుం డిరువదేనింటను శారద్వతుం డేనూటను వికర్ణుండు మూఁటను శల్యుండు తొమ్మిదింటను దుర్యోధనుం డఱువది నాల్గింటను రభసోల్లాసంబున నేసిన. 34

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; ఉచిత+రయంబునన్= తగిన వేగంతో; రథంబు= తేరు; నడపన్= నడపగా; ధనంజయుండు= అర్జునుడు; తనకున్+అడ్డంబు+ఐన= తనకు ఎదురైన; శూరసేన, సేనా, కాననంబు= శూరసేన దేశానికి సంబంధించిన సైన్యం అనే అరణ్యాన్ని; పటు, బాణ, పరంపర+అను= మిక్కుటమైన అమ్ముల సముదాయం అనే; మహా, వాత, వేగంబునన్= గొప్ప గాలియొక్క త్వరవలన; బడలుపడన్+చేయుచున్= నేలమట్టంగా పడేటట్లు చేస్తూ; కవిసినన్= ఎదుర్కొనగా; కని= చూచి; గాంగేయుండు= భీష్ముడు; ఎదిర్చి= ఎదుర్కొని; పేర్చి= విజృంభించి; డెబ్బది+ఏడు= డెబ్బైయేడు; క్రూర, నారాచంబులు= కఠినమైన బాణాలు; ఏసినన్= ప్రయోగించగా; అప్పుడు= ఆ సమయంలో; కూడుకొని= కలిసి; ద్రోణుండు; ద్రోణుడు; ఇరువదేనింటను= ఇరువది ఐదు(బాణాల)చేతను; శారద్వతుండు= కృపాచార్యుడు; ఏనూటను= ఐదువందల బాణాలతోనూ; వికర్ణుండు= వికర్ణుడు; మూఁటను= మూడు(బాణాలతో); శల్యుండు= శల్యుడు; తొమ్మిదింటను= తొమ్మిది బాణాలతోనూ; దుర్యోధనుండు= దుర్యోధనుడు; అఱువది+నాల్గింటను= అరవై నాలుగు బాణాలతోనూ; రభస+ఉల్లాసంబునన్= సంరంభంతో కూడిన ఉత్సాహంతో; ఏసినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: ఆ విధంగా శ్రీకృష్ణుడు హితోపదేశం చేసి, రథం తగిన వేగంతో నడపాడు. అర్జునుడు తనకు అడ్డంగా వచ్చిన శూరసేన దేశానికి సంబంధించిన సేనలను అవలీలగా జయించాడు. అంత భీష్ముడు అర్జునుడిని ఎదిర్చి విజృంభించి డెబ్బై ఏడు కఠినబాణాలు ప్రయోగించాడు. భీష్ముడికి సాయంగా వచ్చి, ద్రోణుడు అర్జునుడిపై ఇరువది బాణాలు, కృపాచార్యుడు అయిదునూర్ల బాణాలు, వికర్ణుడు మూడింటిని, శల్యుడు తొమ్మిదింటిని, దుర్యోధనుడు అరవై నాల్గింటిని ఉద్వేగపూరితంగా ప్రయోగించారు.

క. అవి యెల్లను బైఁ గురియఁగ । నవికలమూర్తి యగు ననిమిషాధిపతనయుం
డవిరళ వర్షము మీఁదం । గవియంగా నొప్పు నగము కరణిం బొలిచెన్. 35

ప్రతిపదార్థం: అవి+ఎల్లను= ఆ బాణాలు అన్నీ; పైన్= తనపైన; కురియఁగన్= వర్షించగా; అవికలమూర్తి+అగు= చలించని దేహం కలిగినట్టి; అనిమిష+అధిప, తనయుండు= దేవేంద్రుడి కొడుకు- అర్జునుడు; అవిరళ+వర్షము= ఎడతెగని వాన; మీఁదన్+కవియంగాన్+ఒప్పు= మీద కురిసేటప్పుడు శోభిల్లే; నగము, కరణిన్= కొండవలె; పొలిచెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: భీష్ముడూ, అతడికి తోడుగా వచ్చిన కౌరవ వీరులు అందరూ ప్రయోగించిన బాణాలు అన్నీ తనమీద పడినప్పుడు, ఎడతెగని వాన కురిసేటప్పుడు శోభిల్లే కొండవలె అర్జునుడు శోభిల్లాడు.

వ. ఇట్లు సుస్థిరుండై. 36

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; సుస్థిరుండు+ఐ= చలింపని వాడుగా నిలిచి.

తాత్పర్యం: ఈ విధంగా చలించనివాడై.

సీ. ఇరువదేనమ్ముల సురనదీనందను, । ద్రోణుని నఱువది బాణములను,
తొమ్మిది సునిశితాస్త్రమ్ములఁ గృపుని, । వికర్ణశల్యుల విశిఖత్రయముల,
రారాజు నైదు నారసముల నొప్పించె । నప్పుడు గడఁగి సాత్యకియు మత్స్య
జనపాలకుండు ధృష్టద్యుమ్నుఁడును ద్రౌప । దీ సూనులును సుభద్రాసుతుండు

తే భీష్మునకుఁ దోడుపడువారి బెట్టుదాఁక । నతఁడు ఫల్గును నేఁబది శితశరముల
నేసి పేర్చినఁ గౌరవు లెల్ల నార్వ । నుఱక యాతఁడు కురుసేనఁ దఱియఁ జొచ్చె. 37

ప్రతిపదార్థం: ఇరువది+ఏను+అమ్ములన్= ఇరువది అయిదు బాణాలతో; సురనదీ, నందనున్= గంగకొడుకు అయిన భీష్ముడిని; అరువది+బాణములన్= అరువది అమ్ములతో; ద్రోణునిన్= ద్రోణుడిని; కృపునిన్= కృపాచార్యుడిని; తొమ్మిది, సునిశిత+అస్త్రమ్ములన్= తొమ్మిది వాడి అమ్ములతోనూ; విశిఖ, త్రయములన్= మూడేసి బాణాలతో; కర్ణ, శల్యులన్= కర్ణుడిని, శల్యుడిని; రారాజున్= రాజులకు రాజైన దుర్యోధనుడిని; ఐదు, నారసములన్= అయిదు బాణాలతో; నొప్పించెన్= బాధించాడు; అప్పుడు= ఆ సమయంలో; కడఁగి= పూని; సాత్యకియున్= సాత్యకి; మత్స్య జనపాలకుండు= మత్స్య దేశానికి రాజైన విరాటుడు; ధృష్టద్యుమ్నుఁడును= ధృష్టద్యుమ్నుడూ; ద్రౌపదీ, సూనులును= ద్రౌపది కొడుకులును; సుభద్రా, సూనుండు= సుభద్ర కొడుకు అభిమన్యుడును; భీష్మునకున్+తోడు పడువారిన్= భీష్ముడికి సాయం చేసేవారిని; బెట్టు, తాఁకన్= తీవ్రంగా ఎదుర్కొనగా; అతఁడు= ఆ భీష్ముడు; ఫల్గునున్= అర్జునుడిని; ఏఁబది,శిత,శరములన్+ఏసి= ఏభై వాడి బాణాలు ప్రయోగించి; పేర్చినన్= అతిశయించగా; కౌరవులు+ఎల్లన్= కురుసేనలోనివారు అందరూ; ఆర్వన్= పెద్ద ధ్వని చేయగా; ఉఱక= లెక్క చేయకుండగా ; ఆతఁడు= అర్జునుడు; కురుసేనన్= కౌరవ సైన్యాన్ని; తఱియన్+చొచ్చెన్= సమీపించాడు.

తాత్పర్యం: అప్పుడు పలువురు కౌరవవీరులు తన మీదకు వచ్చిపడి యుద్ధం చేసినా అర్జునుడు చలించలేదు. అర్జునుడు భీష్ముడిపై ఇరువది అయిదు బాణాలు ప్రయోగించాడు. ద్రోణుడిపై అరవైబాణాలు వేశాడు. కృపుడిపై, వికర్ణుడిపై, శల్యుడిపై మూడేసి అమ్ములు విసరాడు. రాజరాజు అయిన దుర్యోధనుడిని ఐదు బాణాలతో కొట్టాడు. ఆ సమయంలో అసహాయ శూరుడుగా భీష్ముడితో అతడికి తోడుగా వచ్చిన వీరులతోనూ అర్జునుడు పోరాడుతుండగా చూచి, పాండవ పక్షంలోని వీరులు సాత్యకి, విరాటుడు, ధృష్టద్యుమ్నుడు, ద్రౌపదీ పుత్రులు,

అభిమన్యుడు అర్జునుడికి బాసటగా వచ్చి, భీష్ముడికి సాయం చేసేవారిని తాకారు. అప్పుడు భీష్ముడు అర్జునుడిని ఏభై బాణాలతో కొట్టగా, కౌరవులందరు సింహనాదాలు చేసి సంతోషం వ్యక్తం చేశారు. అర్జునుడు వారిని అందరినీ లెక్కచేయకుండా కౌరవసేనలోకి చొచ్చుకొని పోయాడు.

వ. ఇట్లు క్రేడించి గాంగేయు డించి గాండీవి దనయరదంబు రయంబున. 38

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; క్రేడించి= లెక్క చేయకుండా ఉపేక్షించి; గాంగేయున్= భీష్ముడిని; డించి= విడిచిపెట్టి; గాండీవి= అర్జునుడు(గాండీవం అనే విల్లు తాల్చినట్టివాడు); తన+అరదంబున్= తన రథాన్ని; రయంబునన్= వేగంగా.

తాత్పర్యం: ఈ విధంగా అర్జునుడు భీష్ముడిని లెక్కచేయక, ఆతడిని విడిచిపెట్టి తన రథాన్ని వేగంగా.

క. పఱపి రథికులను సూతుల। నఱకిన మ్రోడుపడియుండె నానారథముల్
వెఱచఱచిరి కురువీరులు। పటిపటి యై మనబలంబు భయముం బొందెన్. 39

ప్రతిపదార్థం: పఱపి= నడపి; రథికులను= రథంపై యుద్ధం చేసే వీరులను; సూతులన్= సారథులను; నఱకినన్= చంపగా; నానారథముల్= పెక్కు తేరులు; మ్రోడుపడి+ఉండెన్= మోడుపడిన చెట్లవలె కనుపించాయి; కురువీరులు= కురుసేనలోని వీరులు; పటిపటి+ఐ= చెల్లా చెదరై; వెఱ చఱచిరి= భీతిచెందారు; మన+బలంబు= మన సైన్యం; భయమున్+పొందెన్= భయపడింది.

తాత్పర్యం: ఈ విధంగా అర్జునుడు భీష్ముడిని సరకుగొనక, ఆతడిని విడిచిపెట్టి తన రథాన్ని వేగంగా తోలించి కౌరవసేనమీద విజృంభించాడు. రథికులను సంహరించాడు, సారథులను చంపివేశాడు, రథాలు మ్రోడులవలె కన్పించాయి. కౌరవ వీరులు చెల్లాచెదరైనారు. మనసైన్యం భయపడింది.

వ. అట్టియెడ నీ కొడుకు నీ తండ్రితో నిట్లనియె. 40

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; నీ కొడుకు= దుర్యోధనుడు; నీ తండ్రితోన్= భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో నీ కొడుకైన దుర్యోధనుడు నీ తండ్రిఅయిన భీష్ముడితో ఈ విధంగా అన్నాడు:

చ. తన భుజసార మేర్పడఁగ దర్పితుఁడై మనయందుఁ జేయఁగ
ల్గిన నృపకోటి నెల్ల నవలీలమెయిన్ మును మించి త్రుంచె న
ర్జునుఁ డదె నీవు సూడ ననురూపమె నీ కిది? మున్ను కర్ణ భం
డనము దొలంగఁ జేసి తకటా! యిటు లొప్పరికింపఁ బాడియే?' 41

ప్రతిపదార్థం: అర్జునుఁడు= అర్జునుడు; అదె= అదిగో; నీవు+చూడన్= నీవు చూస్తూ ఉండగనే తన, భుజ, సారము+ఏర్పడఁగన్= తన పరాక్రమం సుస్పష్టంగా వెల్లడి కాగా; దర్పితుఁడు+ఐ= గర్వం కలవాడై; మన+అందున్= మన సేనలో; చేయన్+కల్గిన= పోరాటం చేయగల్గిన; నృప+కోటిన్+ఎల్లన్= రాజుల సమూహాన్ని అంతటినీ; అవలీల+మెయిన్= సులువుగా; మును, మించి, త్రుంచెన్= ముందు అతిశయించి సంహరించాడు; నీకున్+ఇది= నీ కనుల యెదుట ఈ విధంగా జరగటం; అనురూపము+ఎ?= తగినదేనా?; మున్ను= లోగడ; కర్ణున్= కర్ణుడిని; భండనము= యుద్ధం; తొలంగన్+చేసితి(వి)= విడిచి పోయేటట్లుగా చేశావు; అకటా!= అయ్యో!; ఇటులు= ఈ విధంగా; ఒప్పరికింపన్= ఉపేక్షించటం; పాడియే?= న్యాయమా?

తాత్పర్యం: అదిగో! అర్జునుడు నీవు చూస్తుండగా తన పరాక్రమం స్పష్టంగా వెల్లడికాగా గర్వంతో మనవైపు పోరాడగల్గిన రాజులందరినీ అవలీలగా మునుముపట్టి చంపినాడు. నీ కిదిసమ్మతమా! కర్ణుడిని యుద్ధంచేయకుండాచేసి అకటా ఈ విధంగా ఉపేక్షించడం నీకు న్యాయమా?

వ. అనిన విని యనిమిషనదీ నందనుం 'డితం డింత యొప్పని పల్కువల్కునే?' యని మనంబునం గుత్సించుచు బీభత్సు దెసకు నడరుటయు, దుర్యోధన వికర్ణులు వలపటను గురుపుత్త్రుండు దాపటను గూడుకొని యా క్రీడిపైఁ బటు శరపరంపరలు పరఁగించి; రతనికి నన్నలుఁ దమ్ములు బాసట యయి కడంగి కవిసి రిట్లు దొరలు దలపడిన నిరువాఁగును జిందమ్ములు గర్జిల్ల సందడికయ్యంబుగాఁ బెనంగిన గాండీవి గాంగేయు లొండొరుల చండబాణంబులఁ ద్రుంచుచు వర్మంబులు సించుచు నొకళ్ళొకళ్ళ వెలిమావులం బడగలం దాఁక నేయుచుం జేరి పోరు సమయంబున. 42

ప్రతిపదార్థం: అనినన్+విని= (అని దుర్యోధనుడు చెప్పగా ఆలకించి); అనిమిష+నదీ+నందనుండు= గంగకొడుకు-భీష్ముడు; ఇతండు= (దుర్యోధనుడు); ఇంత+ఒప్పని,పల్కు= ఇంతగా సరిగాని మాట; పల్కును+ఏ?= అంటాడా?; అని= అని; మనంబునన్= మనస్సులో; కుత్సించుచున్= చెడ్డ బాధ పొందుతూ; బీభత్సు,దెసకున్= అర్జునుడు ఉన్న వైపునకు; అడరుటయున్= విజృంభించగా; దుర్యోధన+వికర్ణులు= దుర్యోధనుడు, వికర్ణుడు; వలపటను= కుడివైపున; గురుపుత్త్రుండు= గురువైన ద్రోణాచార్యుడి కొడుకు అశ్వత్థామ; దాపటను= ఎడమవైపున; కూడుకొని= కలిసి; ఆ క్రీడిపైన్= ఆ అర్జునుడిపై; పలు,శర,పరంపరలు= మిక్కుటమైన అమ్ముల సముదాయాలు; పరఁగించిరి= ప్రయోగించారు; అతనికిన్= ఆ అర్జునుడికి; అన్నలున్+తమ్ములున్= సహోదరులు; బాసట+అయి= తోడు అయి; కడంగి= పూని; కవిసిరి= (శత్రువులపై)విజృంభించారు; ఇట్లు= ఈ రీతిగా; దొరలు, తలపడినన్= ప్రభువులు డీకొనగా; ఇరువాగును= ఇరువైపుల; చిందమ్ములు= శంఖాలు; గర్జిల్లన్= పెద్ద ధ్వని చేయగా; సందడి+కయ్యంబుగాన్= సంకుల సమరంగా; పెనంగినన్= పోరాడగా; గాండీవి, గాంగేయులు= అర్జునుడు, భీష్ముడు; ఒండు+ఒరులన్= పరస్పరం (ఒకరిపై ఇంకొకరు వేసే; చండ+బాణంబులన్= తీవ్రమైన అమ్ములను; త్రుంచుచున్= నడుమ నరకుచు; వర్మంబులు= కవచాలు; చించుచున్; ఒకళ్ళొకళ్ళ= ఒక్కొకళ్ళ, వెలిమావులన్ పడగలన్= తెల్ల గుఱ్ఱాలను, జెండాలను; తాఁకన్+ఏయుచున్= తాకేటట్లుగా (బాణాలు) వేస్తూ; చేరి= సమీపించి; పోరు సమయంబునన్= యుద్ధం చేసేటప్పుడు.

తాత్పర్యం: ఆ విధంగా దుర్యోధనుడు అధిక్షేపించగా, 'ఇతడు ఇటువంటి అనుచితమైన మాటలంటాడా?' అని భీష్ముడు తన మనస్సులో నొచ్చుకొన్నాడు. వెంటనే భీష్ముడు అర్జునుడు ఉన్న చోటికి తన రథాన్ని తరలించాడు. దుర్యోధనుడు, వికర్ణుడు భీష్ముడికి కుడివైపున చేరారు. అశ్వత్థామ ఎడమవైపున చేరాడు. వారు అందరూ అర్జునుడిపై అమ్ములు ప్రయోగించారు. అర్జునుడికి తోడుగా అతడి అన్నదమ్ములు చేరారు. ఈ విధంగా ఇరుపక్షాలలోని వీరులు శంఖాలు పూరించి ఉత్సాహంతో యుద్ధం చేశారు. అది దొమ్మియుద్ధంగా పరిణమించింది. భీష్ముడూ, అర్జునుడూ ఒండొరులపై వాడి అమ్ములు ప్రయోగించుకొన్నారు. ఒకరు ఇంకొకరి గుఱ్ఱాలను జెండాలను బాణాలతో కొట్టారు. ఆ సమయంలో.

విశేషం: మహాభారత యుద్ధంలో "సందడి కయ్యము" అనగా ఇరు పక్షాలలోని వీరులు ఒకరిపై ఒకరు వివక్షలు లేకుండా బాణాలు ప్రయోగించి యుద్ధం చేయటం. ద్వంద్వ యుద్ధం అనగా ఒక వీరుడు మరొక వీరుడితో పోరాడటం. ఆ పోరాటంలో ప్రక్క యోధులు జోక్యం కల్పించుకోరు. ఇది అలనాటి కట్టుబాటు.

తే. **ఆపగానందనుండు మురారి యురము । బాణవితతిని భేదింప శోణితమునఁ**
దోఁగి యతఁ డొప్పెఁ దలిరాకు దుఱఁగలింప । మెఱయు నవపారిజాతంబు తెఱఁగు దాల్చి. 43

ప్రతిపదార్థం: ఆపగా, నందనుండు= నదీపుత్రుడు(భీష్ముడు); మురారి+ఉరమున్= శ్రీకృష్ణుని వక్షఃస్థలాన్ని; బాణ వితతిని= అమ్ముల సముదాయంతో; భేదింపన్= గాయం చేయగా; అతఁడు= ఆ శ్రీకృష్ణుడు; శోణితమునన్+దోఁగి= నెత్తుటిలో తడిసి; తలిరాకు= చిగురాకు; తుఱఁగలింపన్= పొటమరించగా; మెఱయు= ప్రకాశించే; నవ, పారిజాతంబు, తెఱఁగు+తాల్చి= నూత్నమైన పారిజాత వృక్షంతీరు ధరించి; ఒప్పెన్= శోభిల్లాడు.

తాత్పర్యం: భీష్ముడు అనేక బాణాలు ప్రయోగించి అర్జునుడి రథసారథి అయిన శ్రీకృష్ణుడి వక్షఃస్థలం ఛేదించాడు. అప్పుడు శ్రీష్ణుడు రక్తంతో తడిసి, ఎర్రని చిగురుటాకులతో శోభిల్లే నవ పారిజాత వృక్షంవలె వెలుగొందాడు.

విశేషాలు: 1. మురారి= ముర+అరి= మురుడు అనే రాక్షసుడికి శత్రువు- విష్ణువు, విష్ణువు అవతారం శ్రీకృష్ణుడు. 2. సారథిని సంరక్షించుకోవలసిన బాధ్యత రథికుడిదే. భీష్ముడు శ్రీకృష్ణుడిని వక్షఃస్థలం ఛేదించటం అంటే - అది అతడు సాధించిన ఘనకార్యంగానే చెప్పవచ్చును. శ్రీకృష్ణుడు, సారథి. నిరాయుధుడు. రాయబారిగా సంధికై యత్నించి, తాను ఆయుధం ధరించనని ప్రతిజ్ఞ చేసినవాడు. రెండవనాటి యుద్ధంలో శ్రీకృష్ణుడు గాయపడ్డాడు. మూడవనాడు శ్రీకృష్ణుడు, ప్రతిజ్ఞాభంగం చేసికొని, చక్రధారియై భీష్ముడిపైకి ఉరికాడు. శ్రీకృష్ణుడి ప్రతిజ్ఞా భంగానికి ఇది పునాదియై పూర్వరంగం సృష్టించింది.

క. **కనుఁగొని కోపంబున న । ర్జునుఁ డమరనదీ తనూజు సూతుని నొప్పిం**
చిన నాతఁ డతని య । రదము మునుగంగాఁ జేసె బాణముల వెల్లువలన్. 44

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి= (శ్రీకృష్ణుడు గాయపడటం చూచి); కోపంబునన్= ఆగ్రహంతో; అర్జునుఁడు= అర్జునుడు; అమర నదీ, తనూజు, సూతునిన్= గంగానది కొడుకు భీష్ముడి రథసారథిని; నొప్పించినన్= బాణాలతో కొట్టగా; ఆతఁడు= ఆ భీష్ముడు; అతని+అరదము= అర్జునుడి తేరును; బాణముల+వెల్లువలన్= అమ్ముల వరదలతో; మునుఁగంగన్+చేసెన్= మునిగిపోయేటట్లు చేశాడు.

తాత్పర్యం: భీష్ముడు ఆ విధంగా తన రథసారథియైన శ్రీకృష్ణుడిని గాయపరచటం చూచి అర్జునుడు ఆగ్రహంతో భీష్ముడి సారథిని నొప్పించాడు. భీష్ముడు గూడ అర్జునుడి రథం కనిపించకుండా అమ్ముల వరదలలో-మునిగిపోయేటట్లు చేశాడు.

క. **ఆ వెల్లువ శరజిహ్వలఁ । ద్రావి ధనంజయ మహాగ్ని దరికొని కవియం**
గా వెగ డొందెడు కురుబల । దావము శాంతనవుఁ డంబుదము క్రియఁ గాచెన్. 45

ప్రతిపదార్థం: ధనుంజయ-మహా+అగ్ని= అర్జునుడనే గొప్ప అగ్ని; ఆ-వెల్లువన్= ఆ(బాణ) ప్రవాహాన్ని; శర-జిహ్వలన్= బాణాలనెడి నాలుకలతో; త్రావి= త్రాగి; దరికొని= సమీపించి; కవియంగాన్= చుట్టుముట్టగా; వెగడు+ఒందెడు= భయపడునట్టి; కురుబల దావమున్= కౌరవసేన అనెడి కార్చిచ్చును; శాంతనవుఁడు= భీష్ముడు; అంబుదము క్రియన్= మేఘంవలె; కాచెన్= రక్షించాడు.

తాత్పర్యం: భీష్ముడు ప్రయోగించిన బాణాల వరదను అర్జునుడు అనే మహాగ్ని బాణాలనే జిహ్వలతో త్రాగి వెలుగొందింది. ఆ అగ్ని కురుసేనలను కార్చిచ్చువలె బాధించింది. అయితే భీష్ముడు మేఘం వలె బాణవర్షం కురిపించి ఆ కార్చిచ్చు నుండి కౌరవసేనలను రక్షించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: రూపకం. ఈ పర్వంలో రూపకాలంకారాన్ని, ఉపమాలంకారాన్ని ప్రయోగించి తిక్కన - భీష్మార్జునుల యుద్ధ కౌశలాన్ని అభివర్ణించాడు. అర్జునుడు-మహాగ్ని వంటివాడయితే, భీష్ముడు - మేఘంవలె ఆ అగ్నిని ఆర్పగలిగాడు.

వ. ఇత్తెఱంగున నెక్కువ దక్కువలు లేక యక్కజంబుగాఁ బోరువారిం జారణ సిద్ధ గంధర్వాదులు గనుంగొనుచుండి తమలో నిట్లనిరి: 46

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ రీతిగా; ఎక్కువ+తక్కువలు+లేక= సరిసమానంగా; అక్కజంబుగాన్= ఆశ్చర్యకరంగా; పోరు వారిన్= యుద్ధం చేసేవారిని(భీష్ముడిని-అర్జునుడిని); చారణ, సిద్ధ, గంధర్వ+ఆదులు= చారణులు, సిద్ధులు, గంధర్వులు మున్నగువారు; కనుంగొనుచుండి= చూస్తూ; తమలోన్= వారిలో వారు; ఇట్లు+అనిరి= ఈ విధంగా అనుకొన్నారు.

తాత్పర్యం: ఈ రీతిగా, ఒకరికి ఒకరు తీసిపోకుండా, గొప్ప సమయుద్ధం చేసే భీష్ముడిని, అర్జునుడిని వేల్పు తెగలకు చెందిన వారు చూచి తమలో తాము ఈ విధంగా అనుకొన్నారు.

విశేషం: లోకోత్తరమైన ప్రతాప ప్రాభవాలు ప్రదర్శించినవారి కీర్తిని పొగడుతూ వేల్పు తెగలకు చెందిన చారణులు సిద్ధులు గంధర్వులు గానం చేస్తారని పురాణకథనం. కవి సమయం.

ఉ. ఒండొరు చండవిక్రమము లోర్తురు వీరల కాక వీరితో
నొండొకరుండు మార్కొనఁగ నోపునె? పూని కృతాంతుఁడైన నా
ఖండలుఁ డైన నివ్విధపుఁ గయ్యము లెక్కడ నైనఁ గంటిమే!
పాండవ కౌరవోత్తముల బాహు విలాసము లిట్టులుండునే!' 47

ప్రతిపదార్థం: ఒండు+ఒరు= ఒకరొకరు; చండ,విక్రమములు+ఓర్తురు= తీవ్రమైన పరాక్రమాలను సహించగలరు; వీరల+కాక= వీరులు ఇర్వురు కాకుండా; వీరితోన్= (ఈ భీష్ముడితో, అర్జునుడితో); ఒండు+ఒకరుండు= మరి ఇంకొకడు; మార్కొనఁగన్+ఓపునె?= యుద్ధం చేయటానికి సమర్థుడు ఉన్నాడా?; పూని= కడగి; కృతాంతుఁడు+ఐనన్= యముడే కావచ్చు; ఆఖండలుడు+ఐనన్= దేవేంద్రుడే కావచ్చు; ఇవ్విధపు+కయ్యములు= ఈ రీతిని జరిగే యుద్ధాలు; ఎక్కడన్+ఐనన్= ఏ స్థలంలో అయినా; కంటిమే?= చూశామా?; పాండవ, కౌరవ+ఉత్తముల,బాహు, విలాసములు= పాండవులలో శ్రేష్ఠుడైన అర్జునుడి యొక్కయు, కౌరవులలో శ్రేష్ఠుడైన భీష్ముడి యొక్కయు పరాక్రమ ప్రాభవాలు; ఇట్టులు= ఈ రీతిగా; ఉండున్+ఏ?= ఉంటాయా?

తాత్పర్యం: 'ఈ భీష్ముడు, అర్జునుడు ఒకరికి ఒకరు దీటైనవారు. ఇతరులు వీరితో సమానులు లేనే లేరు. భీష్ముడితో పోరాడగలవాడు అర్జునుడు ఒక్కడే. అట్లే అర్జునుడితో యుద్ధం చేయగల సమర్థుడు మరి భీష్ముడు ఒక్కడే. వీరితో యముడుగాని దేవేంద్రుడుగాని యుద్ధం చేయలేడు. పాండవోత్తముడైన అర్జునుడి పరాక్రమం, కౌరవ ప్రముఖుడైన భీష్ముడి పరాక్రమం ఇంత గొప్పగా ఉంటాయని అనుకొన్నామా?'

ధృష్టద్యుమ్న ద్రోణాచార్యుల యుద్ధము (సం. 6-49-1)

వ. అని యగ్గించి రంత మార్తాండుండు గగనమధ్యవర్తి యయ్యెఁ; నప్పుడు ధృష్టద్యుమ్నుండు ద్రోణాచార్యు పయిం గవిసిన నతండు. 48

ప్రతిపదార్థం: అని+అగ్గించిరి= అని పొగడారు; అంతన్= పిదప; మార్తాండుండు= సూర్యుడు; గగన,మధ్యవర్తి+అయ్యెన్= ఆకాశంలో మధ్యకు చేరాడు; అప్పుడు= ఆ మధ్యాహ్న కాలంలో; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; ద్రోణాచార్య, పయిన్= గురువైన - ద్రోణుడిపై; కవిసినన్= తాకగా; అతండు= ద్రోణుడు.

తాత్పర్యం: ఆ విధంగా చారణులు, సిద్ధులు, గంధర్వులు భీష్ముడిని, అర్జునుడిని ప్రశంసించారు. అంతలో - మధ్యాహ్నం అయింది. ఆకాశమధ్యంలో సూర్యుడు ప్రకాశించాడు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుడిని మార్కొన్నాడు.

తే. సూతు నొక్క వాలమ్మున స్రుక్క నేసి । యశ్వముల నాలుగింట నుబ్బడఁగఁ జేసి,
సిడము నడిమికి వెసఁ ద్రుంచె వెడఁదవాతి । దొడ్డ తూపునఁ గురుసేన దొంగలింప. 49

ప్రతిపదార్థం: సూతున్= సారథిని(ధృష్టద్యుమ్నుడి సారథిని); వాలు+అమ్మునన్= వాడి బాణంతో; స్రుక్కన్+ఏసి= నొప్పిచేసి; అశ్వములన్= గుర్రాలను; నాలుగింటన్= నాలుగు బాణాలతో; ఉబ్బు+అడఁగన్+చేసి= అతిశయం అణగగొట్టి; వెసన్= వేగంగా; సిడమున్= జెండా; నడిమికిన్= మధ్యకు; వెడద, వాతి, దొడ్డ+తూఁపునన్= నిడివి నోరుగల గొప్ప బాణంతో; కురుసేన= కౌరవ సైన్యం; తొంగలింపన్= అతిశయించగా; త్రుంచెన్= విరుగగొట్టాడు.

తాత్పర్యం: ద్రోణుడు విజృంభించి, ధృష్టద్యుమ్నుడి సారథిని ఒక్క బాణంతో నొప్పిచేశాడు. నాలుగు బాణాలతో గుర్రాలను పడగొట్టాడు. ఒక పెద్ద బాణంతో జెండాను మధ్యకు రెండు ముక్కలు చేశాడు. కౌరవసేన ఉత్సాహంతో ఉరకలు వేసింది.

క. ఆ ధృష్టద్యుమ్నుఁడు స । క్రోధుండై బాణవితతి గురిసిన దృఢ సం
వేధం బగు నారస మ । య్యోధాగ్రణి యేసి నఱకె నుఱక యతండున్. 50

ప్రతిపదార్థం: ఆ+ధృష్టద్యుమ్నుఁడు; సక్రోధుండు+ఐ= కోపంతో కూడినవాడై; బాణ+వితతిన్= అమ్ముల సముదాయాన్ని; కురిసినన్= వర్షించగా; ఆ+యోధ+అగ్రణి= వీరులలో శ్రేష్ఠుడు(ద్రోణుడు); దృఢసంవేధంబు+అగు= గట్టిగా పీడించే శక్తిగల; నారసము= బాణం; ఏసి= ప్రయోగించి; నఱకెన్= తునియలు చేశాడు. అతండున్= (ఆ ధృష్టద్యుమ్నుడు); ఉఱక= లెక్కచేయక; (మీది పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఆ ధృష్టద్యుమ్నుడు ఆగ్రహించి ద్రోణాచార్యుడిపై బాణాలవాన కురిపించాడు. ద్రోణుడు ధృష్టద్యుమ్నుడిపై గొప్ప బలమైన బాణాలు ప్రయోగించాడు. ద్రోణుడు వేసిన బాణాలను ధృష్టద్యుమ్నుడు తునియలు చేశాడు.

క. ఆచార్యుఁ దీవ్ర ఘన నా । రాచము లేయంగఁ ద్రుంచె గ్రక్కున; నవి వ
మ్మై చెడిపోయిన నార్చెం । జూచి భవద్బలముఁ బాండుసుతసైన్యంబున్. 51

ప్రతిపదార్థం: ఆచార్యున్= గురుడిని(ద్రోణుడిని); తీవ్ర, ఘన,నారాచములు= వాడిమిగల గొప్ప బాణాలు; ఏయంగన్= ప్రయోగించి; కొట్టగా, (ద్రోణుడు); గ్రక్కునన్= వెంటనే; త్రుంచెన్= ఖండించాడు; అవి= ఆ వాడి వేడి గల అమ్ములు; వమ్ము+ఐ= వ్యర్థాలై; చెడిపోయినన్= పాడైపోవగా; చూచి= అరసి; భవత్+బలమున్= నీ సేన; పాండుసుత+ సైన్యంబున్= పాండవుల సేన; ఆర్చెన్= పెద్ద పెట్టున ధ్వని చేశాయి.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుడిపై మిక్కిలి వాడిమి గల గొప్ప బాణాలు ప్రయోగించాడు. ద్రోణుడు ఆ బాణాలను అన్నిటినీ ఖండించాడు. అట్టి గొప్ప అమ్ములు వమ్మైపోవటం చూచి, కౌరవసేన పాండవసేన పెద్దపెట్టున నినాదాలు చేశాయి.

విశేషం: ఆచార్యుడు అనగా గురువు అని అర్థం. అయితే ఆచార్య శబ్దం ద్రోణుడికి సార్థకమైన బిరుదుగా సమకాలీన సమాజంలో ప్రచారానికి వచ్చింది. ఆచార్యుడు అన్నా, గురుడు అన్నా, ధనుర్విద్యా గురుడు అన్నా అర్థం- ద్రోణుడే మహాభారతంలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ద్రోణుండలిగి శరాసనంబు ద్రుంచిన . 52

ప్రతిపదార్థం: ద్రోణుండు= ద్రోణుడు; అలిగి= కోపించి; శర+అసనంబున్= విల్లును; త్రుంచినన్= ఖండించగా.

తాత్పర్యం: ద్రోణుడు కోపించి ధృష్టద్యుమ్నుడి విల్లు ఖండించివేయగా.

ఆ. పార్షతుండు శక్తిఁ బరఁగింప నతఁడు ము। త్తునియఁ జేసె మఱియు ద్రుపదసుతుఁడు
పెక్కుశక్తు లొక్కపెట్ట వైచినఁ దును। మాడె రయము మెఱయ నగ్గురుండు. 53

ప్రతిపదార్థం: పార్షతుండు= (పృషతుని వంశీయుడు) ధృష్టద్యుమ్నుడు; శక్తిన్= శక్తి అనే పేరుగల ఒక గొప్ప ఆయుధాన్ని; పరఁగింపన్= ప్రయోగించగా; అతఁడు= (ద్రోణుడు); ముత్తునియన్= మూడు చిన్న చిన్న ముక్కలు; చేసెన్= చేశాడు; మఱియున్= ఇంకను; ద్రుపద+సుతుఁడు= ద్రుపదుడి కొడుకు ధృష్టద్యుమ్నుడు; పెక్కు+శక్తులు= అనేక శక్తులను; ఒక్క+పెట్టన్= ఒకేసారి; వైచినన్= ప్రయోగించగా; ఆ+గురుండు= ఆ గురుడు ద్రోణుడు; రయము+మెఱయన్= వేగం వెలుగొందేటట్లుగా (శీఘ్రముగా); తునుమాడెన్= ఖండించాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిపై 'శక్తి' ఆయుధాన్ని ప్రయోగించాడు. ద్రోణుడు ఆ 'శక్తి' ని మూడుముక్కలుగా చేశాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు ఎన్నో శక్తులను ద్రోణుడిపై ప్రయోగించాడు. ఆ శక్తులను అన్నిటినీ ద్రోణుడు ఖండించాడు.

విశేషం: 1. మహాభారత యుద్ధకాలంలో 'శక్తి' అనే ఆయుధ విశేషం గూర్చి పలుచోట్ల వర్ణన ఉన్నది. పేరును బట్టే అది బాణం కంటె గొప్పది అని చెప్పవచ్చును. కర్ణుడి సహజ కవచ కుండలాలు మాయాబ్రాహ్మణ వేషంలో దానంగా పరిగ్రహించిన దేవేంద్రుడు ప్రత్యామ్నాయంగా 'శక్తి' అనే ఆయుధ విశేషం అతడికి ఇచ్చాడు. దీనినిబట్టి 'శక్తి' ఎంతటి గొప్ప ఆయుధమో ఊహించవచ్చును.

తే. పృషతపౌత్రుండు గద వైవఁ బిడుగుఁ బోలె। నడరునెడఁ బొడిగాఁ జేసె నస్త్రగురుఁడు
భల్లముల గట్టి మైమఱు వెల్లఁ జించి। యతని నెత్తుటిలో ముంచె శితశరముల. 54

ప్రతిపదార్థం: పృషత+పౌత్రుండు= పృషతుడి మనుమడు - ధృష్టద్యుమ్నుడు; గద= గద అనే ఆయుధాన్ని; వైవన్= విసరగా; (అది); పిడుగు+పోలెన్= పిడుగువలె; అడరు+ఎడన్= భయంకరంగా విజృంభించే సమయంలో; అస్త్ర గురుఁడు= ద్రోణుడు; (దానిని= ఆ గదను); పొడిగాన్+ చేసెన్= అణువులుగా ఖండించాడు.(అంతేకాక); భల్లములన్= ఈటె బాణాలతో; మైమఱువు+ఎల్లన్= కవచాన్ని అంతటినీ; చించి= ఖండించి; అతనిన్= ఆ ధృష్టద్యుమ్నుడిని; శిత శరములన్ =వాడి బాణాలతో; నెత్తుటిలోన్+ముంచెన్= రక్తంలో తడిపి వేశాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుడిపై గద విసరాడు. పిడుగువలె మీదకు వచ్చే ఆ గదను ద్రోణుడు పొడి పొడి చేశాడు. అంతేకాక ఈటె బాణాలలో ధృష్టద్యుమ్నుడి కవచం ఛేదించి, వాడి బాణాలు ప్రయోగించి ఆతడిని నెత్తుటిలో ముంచివేశాడు.

విశేషం: గద - ఆయుధ విశేషం. బాణం కంటె బలవత్తరమైనదే. అయితే 'శక్తి' - గదకంటె కూడా గొప్పది. గద - ఆకారరేఖలు నేటివారికి తెలిసినట్టివే కాని 'శక్తి' స్వరూప స్వభావాలు ఊహకు అందనట్టివే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ఒండొక చాప మెత్తికొని యుగ్రత నా పృషతాన్వయాగ్రగ
ణ్యుం డడరించు నారసము లుచ్చి చనంగ గురుండు గ్రొవ్విరుల్
నిండిన కింశుకంబు రమణీయతఁ జూడఁగ నొప్పి వాని వి
ల్వెండియు రెండు సేసి యవలీల హయంబుల సూతుఁ జంపినన్. 55

ప్రతిపదార్థం: ఒండు+ఒక= ఇంకొక; చాపము= విల్లు; ఎత్తికొని= తీసికొని గ్రహించి; ఆ పృషత+అన్వయ+అగ్రగణ్యుండు= ఆ పృషతుని వంశంలో మొదట పరిగణించ దగినవాడు- ధృష్టద్యుమ్నుడు; అడరించు= ప్రయోగించే; నారసములు= బాణాలు; ఉచ్చి చనంగన్= చీల్చుకొనిపోగా; గురుండు= ద్రోణాచార్యుడు; క్రొవ్విరుల్-క్రొత్త+విరుల్= కొత్తగా పూచిన పూవులు; నిండిన= దట్టంగా వ్యాపించిన; కింశుకంబు+రమణీయతన్= చిలుకముక్కురంగు పువ్వులు పూచే మోదుగు వృక్షంయొక్కఅందంతో; చూడఁగన్+ఒప్పి= చూచేందుకు శోభిల్లి; వాని= ఆ ధృష్టద్యుమ్నుడి; విల్= ధనుస్సును; వెండియున్= మరల ఇంకోసారి; రెండు+చేసి= ఖండించి; అవలీలన్= సులువుగా; హయంబులన్= గుర్రాలను; సూతున్= రథసారథిని; చంపినన్= చంపగా.

తాత్పర్యం: ఒకసారి ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి విల్లు ఖండించాడు. ఇంకో విల్లు ఎత్తుకొని ధృష్టద్యుమ్నుడు అమ్ములు వేయగా, ద్రోణుడు గాయపడ్డాడు. ఆ గాయాలలో నుండి నెత్తురు పైకి స్రవించి వచ్చింది. అప్పుడు ద్రోణుడు క్రొత్త పూవులు పూచిన మోదుగ చెట్టువలె అందంగా కనుపించాడు. అయితే ద్రోణుడు ఇంకోసారి ధృష్టద్యుమ్నుడి విల్లు ఖండించి, అతడి రథసారథినీ గుర్రాలను సంహరించాడు.

విశేషం: కింశుక వృక్షం= మోదుగుచెట్టు. దాని పువ్వులు చిలుక ముక్కు రంగువలె ఎర్రగా ఉంటాయి.

మ. విరథుండై పొలివోని బంటుతనమున్ వేగంబు నొప్పంగ బి
ట్టరదంబున్ డిగునప్డు చేతిగద నుగ్గైరాల నేసెన్ ధను
ర్గురుఁ డవ్వీరుఁడు వాలునుం బలుకయున్ ఘోరాకృతిం బుచ్చికొం
చు రయంబారఁ గడంగి బె ట్టడర సంక్షోభించె నీ సైన్యముల్. 56

ప్రతిపదార్థం: విరథుండు+ఐ= రథం లేనివాడై; పొలి+పోని+బంటుతనమున్= మొక్కవోని పరాక్రమంతో; వేగంబున్= తీవ్రతా; ఒప్పంగన్= శోభిల్లగా; బిట్టు= మిక్కుటంగా; అరదంబున్+డిగు+అప్డు= తేరునుండి క్రిందికి దిగే సమయంలో; చేతి+గద= చేతిలో ఉన్న ఆయుధ విశేషం- గద; నుగ్గు+ఐ= పొడి పొడి అయిపోయి; రాలన్= క్రింద పడేటట్లుగా; ధనుస్+గురుఁడు= ధనురాచార్యుడు-ద్రోణుడు; ఏసెన్= బాణాలు ప్రయోగించాడు; ఆ+వీరుడు= ధృష్టద్యుమ్నుడు; వాలునున్+పలుకయున్= కత్తి,డాలు; ఘోర+ఆకృతిన్= భయంకరమైన రూపంతో; పుచ్చికొంచున్= పట్టుకొంటూ; రయంబు+ఆరన్= వేగంగా; కడంగి= పూని; బెట్టు+అడరన్= మిక్కుటంగా విజృంభించగా; నీ సైన్యముల్= నీ సేనలు (కౌరవ సైన్యాలు); సంక్షోభించెన్= వ్యాకులతచెందాయి.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు - ధృష్టద్యుమ్నుడిని విరథుడిని చేశాడు. కాని ధృష్టద్యుమ్నుడు జంకు గొంకులు లేకుండగా పరాక్రమోపేతుడై గద చేబూని క్రిందికి దూకుతుండగా, ద్రోణుడు ఆ గదను నుగ్గు నుగ్గు చేశాడు. అయినా, ఆ మహావీరుడు - ధృష్టద్యుమ్నుడు - కత్తి డాలు పట్టుకొని నేలమీదికి ఉరికి - విజృంభించాడు. ఆతని రౌద్రాకృతి చూచి కౌరవ సైన్యం గజగజ వణకిపోయింది.

క. గురుఁడను నురుతర గిరి ని । ష్ఠుర భంగిం బుట్టి వచ్చు సునిశితబాణో
త్కరచండవేగనదికి నె । దురు చన రాదయ్యె నపుడు ద్రుపదసుతునకున్. 57

ప్రతిపదార్థం: గురుఁడు+అను= ద్రోణాచార్యుడు అనే; ఉరుతర, గిరి= గొప్ప కొండ; నిష్ఠురభంగిన్+పుట్టి,వచ్చు= కఠినరీతిలో ఉద్భవించి వచ్చే; సునిశిత బాణ+ఉత్కర చండవేగ నదికిన్= మిక్కిలి వాడియైన అమ్ముల సముదాయం అనే గొప్ప వేగంతో కూడిన ఏటికి; అపుడు= ఆ సమయంలో; ద్రుపద సుతునకున్= ద్రుపదుడి కొడుకు ధృష్టద్యుమ్నుడికి; ఎదురు చన రాదు+అయ్యెన్= ఎదురుగా వెళ్ళటానికి శక్యం కాలేదు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడి ధాటికి, ధృష్టద్యుమ్నుడు ఆగలేకపోయాడు. ద్రోణుడు ఒక పెద్ద కొండవలె ఉన్నాడు. అతడు ప్రయోగించే బాణాలు కొండనుండి అతివేగంతో క్రిందికి దూకే నదివలె ఉన్నాయి. ఆ ఏటికి ధృష్టద్యుమ్నుడు ఎదురీదలేకపోయాడు.

విశేషం: అలం: రూపకం. గురుడు ఉపమేయం. ఉరుతరగిరి - ఉపమానం. చండవేగనది - ఉపమానం. సునిశిత బాణోత్కరము - ఉపమేయం. పెద్ద కొండనుండి ప్రవహించే నదికి ఎవరు ఎదురేగగలరు?

కొందరు ఇట్లా అన్వయం చెప్పారు: ఇందు గురుఁడు ఉరుతరగిరి. అది ధృష్టద్యుమ్నుడి సునిశిత బాణోత్కర మనెడి చండవేగ నదికి ఎదుర్కొనరానిదయింది.

క. గతి గుందియుఁ బైఁ దొరఁగెడు । శితశరములు పలక జడియఁజేయుచు ద్రుపద
క్షితిపతిసుతుండు మెఱయఁగ । నతిరయమున ననిలతనయుఁ డడ్డము సొచ్చెన్. 58

ప్రతిపదార్థం: గతి= గమనము - వేగము; కుందియున్= తగ్గినప్పటికిని; పైన్+తొరఁగెడు= పైనవచ్చిపడే; శిత+ శరములు= వాడిబాణాలు; పలకన్= డాలుతో; జడియన్+చేయుచున్= ఆపుకొంటూ; ద్రుపద+క్షితిపతి+సుతుండు= ద్రుపద రాజు కొడుకు-ధృష్టద్యుమ్నుడు; మెఱయఁగన్= వెలుగొందగా; అతి+రయమునన్= మిక్కుటమగు వేగంతో; అనిలతనయుఁడు= వాయుసుతుడు(భీముడు); అడ్డము+చొచ్చెన్= అడ్డుపడ్డాడు; అనగా ద్రోణునకు - ధృష్టద్యుమ్నునకు మధ్య వచ్చి నిలబడ్డాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు విరథుడై - గతిలేనివాడయినప్పటికీ - తనపై బడే వాడి బాణాలను తన చేతి డాలుతో నివారించుకొంటూ, ధైర్యంగా నిలబడినప్పుడు - మిక్కుటమైన వేగంతో భీమసేనుడు అతడి దగ్గరకు చేరి, అతడిని ఆదుకోగలిగాడు.

విశేషం: కురుక్షేత్ర సంగ్రామంలో ఇది ఒక అద్భుతఘట్టం. ద్రోణాచార్యుడికి - ద్రుపదుడికి గల వైరం జగత్ప్రసిద్ధం. ద్రుపదసుతుడు, పాండవసేనాధిపతీ అయిన ధృష్టద్యుమ్నుడు యుద్ధంలో మొట్టమొదటిసారి ద్రోణుడిని మార్కొని - పోరాటంలో పొందిన అవమానం - ఈ ఘట్టంలో తిక్కన హృదయంగమంగా వర్ణించాడు.

వ. ఇట్లు సొచ్చి వృకోదరుండు గురుం గ్రూరాస్త్రసప్తకంబున నొప్పించి పాంచాలపతిసుతు నొండొకయరదం బెక్కించుటయుఁ గనుంగొని నీకొడుకు కళింగపతికిం జేయి వీచి వాయుతనయుం దలపడ నియోగించిన నతండు మహాసైన్యసహాయత్వంబునం బేర్చి భీమసేనుపై నురవడించి నడచెఁ గుంభసంభవుండును విజృంభితుం డై విరాటద్రుపదులం దాఁకె ధర్మతనయుండు ధృష్టద్యుమ్నుం గలిసికొని వెన్నుదన్ని నిలిచెఁ జేదికరూశదేశంబులబలంబులు మహాబలనందను ముందటికి వచ్చె నట్టియెడ. 59

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వృకోదరుండు= భీముడు; చొచ్చి= ప్రవేశించి; గురున్= ద్రోణుని; క్రూర+అస్త్ర+సప్తకంబున్= కఠినమైన ఏడు బాణాలతో; నొప్పించి= బాధించి; పాంచాలపతి+సుతున్= పాంచాలరాజపుత్రుని= ధృష్టద్యుమ్నుని; ఒండొక+అరదంబు+ఎక్కించుటయున్= వేరొక రథంపైకి ఎక్కించటాన్ని; కనుంగొని= చూచి; నీకొడుకు= దుర్యోధనుడు; కళింగపతికిన్= కళింగదేశ రాజునకు; చేయి+వీచి= చేతితో సైగచేసి; వాయుతనయున్= భీముడిని; తలపడన్= మార్కొనటానికి; నియోగించినన్= ఆజ్ఞాపించగా; అతండు= ఆ కళింగ దేశరాజు;

మహాసైన్య సహాయత్వంబునన్= గొప్పసేన యొక్క తోడ్పాటుతో; పేర్చి= విజృంభించి; భీమసేనుపైన్= భీమునిపై; ఉరవడించి+నడచెన్= ఉత్సాహంతో మార్కొన్నాడు; కుంభసంభవుండును= ద్రోణాచార్యుడును; విజృంభితుండై= అతిశయించినవాడై; విరాటద్రుపదులన్= విరాటరాజును, ద్రుపదరాజును; తాఁకెన్= మార్కొన్నాడు; ధర్మతనయుండు= ధర్మరాజు; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుని; కవిసికొని; వెన్ను+ తన్ని+నిలిచెన్= బాసటగా నిలబడ్డాడు; చేది, కరూశ, దేశంబుల బలంబులు= చేది దేశానికి. కరూశదేశానికి చెందిన సేనలు; మహాబల నందను ముందటికిన్= భీమసేనుని ముందుకు; వచ్చెన్; అట్టి+ఎడన్= ఆ సమయమందు.

తాత్పర్యం: అప్పుడు భీముడు మిక్కిలి వేగంతో ఆ స్థలానికి వచ్చి ద్రోణుడికీ ధృష్టద్యుమ్నుడికీ మధ్య నిలబడి ద్రోణుడిపై ఏడు వాడి బాణాలు ప్రయోగించి, ధృష్టద్యుమ్నుడిని వేరే రథంపైకి ఎక్కించాడు. అప్పుడు దుర్యోధనుడు-భీమసేనుడు విరథుడైన ధృష్టద్యుమ్నుడిని రక్షించటం చూచి, చేతిసన్నతో కళింగదేశ రాజును అక్కడకు రమ్మని ఆజ్ఞాపించాడు. కళింగదేశ రాజు గొప్పసైన్యంతో వచ్చి, భీమసేనుడిని మార్కొన్నాడు. ద్రోణుడు విజృంభించి విరాటరాజును ద్రుపద రాజును మార్కొన్నాడు. ధర్మరాజు ఆ చోటికి సత్వరం ఏతెంచి, ధృష్టద్యుమ్నుడికి బాసటగా నిలబడ్డాడు. చేది, కరూశ దేశాల సేనలు భీమసేనుడికి బాసటగా చేరి నిలిచాయి. ఆ సమయంలో.

విశేషం: తిక్కన యుద్ధ వర్ణన- ఆంధ్ర వాఙ్మయ జగత్తులో పేరుకెక్కింది. ఈ ఘట్టం ఉదాహరణప్రాయమైనట్టిది. ద్రోణ ధృష్టద్యుమ్నుల మధ్య జరిగిన పోరాటం కన్నులకు కట్టేటట్లు తిక్కన వర్ణించాడు. ఈ తరుణంలో వచ్చి ఆదుకొని భీముడు ధృష్టద్యుమ్నుడిని రక్షించాడు.

తే. **అడరెఁ గాళింగనాయకుం డగు శ్రుతాయు। వునకుఁ దో డయి వీఁకమైఁ దననిషాద**
సైన్యమును దాను భీముపై సరభసముగఁ। గేతుమంతుండు ఫణిరాజకేతుఁ డలర. **60**

ప్రతిపదార్థం: కళింగ నాయకుండు+అగు= కళింగదేశాధీశుడైన; శ్రుతాయువునకున్= శ్రుతాయువు అను పేరుగల రాజునకు; తోడు+అయి= సాయం చేసేందుకు చేరినవాడై; కేతుమంతుండు= కేతుమంతుడు అనే పేరుగల రాజు; తన+నిషాద+ సైన్యమును= ఆటవికులతో కూడిన తన సైన్యాన్ని; తాను= తాను; వీఁకమైన్= ఉత్సాహంతో; ఫణిరాజకేతుఁడు= పాముగుర్తు జెండాయందు కలవాడు, దుర్యోధనుడు; అలరన్= సంతసించునట్లుగా; సరభసముగన్= వేగిరపాటుతో, అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు చేసన్నతో నియోగించగా, కళింగదేశరాజు సేనాసమేతంగా వచ్చి భీమసేనుడిని మార్కొన్నాడు. అప్పుడు కేతుమంతుడు అనే వీరుడు - ఆటవిక సైన్య నాయకుడు, వేగంగా వచ్చి - కళింగరాజు శ్రుతాయువునకు బాసటగా నిలిచాడు. దుర్యోధనుడు ఆ దృశ్యం చూచి ఎంతో సంతోషించాడు.

క. **భీమునిముందటి బల ము। ద్దామతఁ గాళింగసేనఁ దలపడి హేతి**
స్తోమావృత మై వ్రాలెను। భూమిపయిన్ సగముసగము పొలుపఱి విఱిగెన్. **61**

ప్రతిపదార్థం: భీముని+ముందటి+బలము= భీమునకు బాసటగా ముందునకు చేరి నిలిచిన సేన(చేది కరూశ దేశములకు సంబంధించిన సేనలు); ఉద్దామతన్= అతిశయంతో; కాళింగ+సేనన్= కళింగదేశానికి సంబంధించిన సేనను; తలపడి= మార్కొని; హేతి+స్తోమ+ఆవృతమై= కత్తుల సముదాయంలో కూడుకొని; భూమిపయిన్= నేలమీదకు; వ్రాలెను= పడిపోయాయి; సగము+సగము= సగానికి సగం; పొలుపు+అఱి= శోభ తరిగిపోయి; విఱిగెన్= పారిపోయింది.

తాత్పర్యం: భీమసేనుడికి బాసటగా ముందుకు వచ్చి నిలిచిన సేనలు- చేది కరూశ దేశాలకు సంబంధించిన సేనలు- కళింగసేనలను తీవ్రంగా మార్కొని, తమ తమ కత్తులతో గూడ సగం సేననేల కూలింది. మిగిలిన సగం శోభ తిరిగి పారిపోయింది.

ఆ. మదము మిగిలి కేతుమంతుఁడు గౌంతేయు । పైకిఁ గవిసి యతని బాణశిఖల
మ్రందిపోయెఁ గడఁగి మంటలో నుఱికిన । మిడుతవోలె మెలఁగ మిడుక లేక. 62

ప్రతిపదార్థం: మదము+మిగిలి= గర్వం అతిశయించి; కేతుమంతుండు= కేతుమంతుడు; కౌంతేయుపైకిన్= భీమునిపైకి; కవిసి= మార్కొని; అతని బాణ శిఖలన్= భీమునియొక్క బాణ జ్వాలలలో; మంటలోన్= అగ్నిలో; ఉఱికిన= దూకిన; మిడుత+పోలెన్= శలభం వలె; మెలఁగన్= తిరుగ; మిడుక+లేక= వీలులేక; మ్రంది+పోయెన్= నశించిపోయాడు.

తాత్పర్యం: కేతుమంతుడు భీమునిపైకి విజృంభించాడు. కాని, అగ్నిలోపడి తప్పించుకోలేని శలభంవలె భీముని బాణాగ్నిలో పడి నశించిపోయాడు.

విశేషం1. శలభం= (ఒకకీటకం, చిన్న పురుగు - మిడుత) అగ్ని కనిపిస్తే చాలు అందులో పడిపోతుంది. ఇది సుస్పష్టమైన ఆత్మహత్య. శలభం ఎందుకు అగ్నిలోకి దూకుతుంది? అది సృష్టిస్వభావ రహస్యం. కేతుమంతుడు భీమునితో మార్కొనటం అటువంటిదే. అంతేకాదు- మానవ హృదయ కుహరాంతరాల దొంతరలలో ఎక్కడో ఆత్మహత్యా సదృశమైన యుద్ధప్రీతి బహుశః - శలభ స్వభావ సన్నిభమైనట్టిది రహస్యంగా దాగి ఉందేమో! లేకపోతే ప్రపంచ చరిత్రలో - ఎన్నెన్ని యుద్ధాలు జరిగాయి? ఎందరు మరణించారు? ఈ చిన్ని పద్యంలో తిక్కన ఈ అత్యద్భుత సృష్టి రహస్యాన్ని పొందు పరచాడా? తిక్కన ప్రత్యక్షంగా ఎన్నో యుద్ధాలు చూచినట్టివాడు. తిక్కన యుద్ధవర్ణనలలో ఆతని ప్రత్యక్ష పరిజ్ఞానం కనిపిస్తుంది.

చ. పవనసుతుం గళింగనరపాలసుతుం డగు శక్రదేవుఁ డు
గ్రవిశిఖవృష్టిఁ దేల్చి తురగంబులఁ గూల్చినఁ గ్రోధదీప్తుఁ డై
యవిహతభంగి భూరిగద నాతఁడు వైచినఁ గూలె వాఁడు వ
జ్ర విహతిఁ గూలు శైల మన సారథికేతుయుతంబుగా నిలన్. 63

ప్రతిపదార్థం: కళింగ+నరపాల+సుతుండు+అగు= కళింగరాజు కొడుకైన; శక్రదేవుఁడు= శక్రదేవుడు అను పేరుగలవాడు; పవన+సుతున్= వాయుపుత్రుడైన భీముని; ఉగ్ర విశిఖ వృష్టిన్ తేల్చి= భయంకరమైన బాణవర్షంలో తేలునట్లుగా చేసి; తురగంబులన్= గుర్రాలను; గూల్చినన్= సంహరించగా; ఆతఁడు= భీమసేనుడు; క్రోధ దీప్తుఁడు+ఐ= కోపంచే వెలుగొందినవాడై; అవిహత భంగిన్= ఎదురులేని రీతిగా; భూరి+గదన్= పెద్ద గదను; వైచినన్= విసరగా; వాఁడు= ఆ శక్రదేవుడు; వజ్ర+విహతిన్= వజ్రం యొక్క దెబ్బవలన; కూలు= నేలమీదకు పడిపోయే; శైలము+అనన్= కొండ అనునట్లుగా; సారథి కేతు యుతంబుగాన్= సారథితో, జెండాతో పాటుగా; ఇలన్= నేలయందు; కూలెన్= పడిపోయాడు.

తాత్పర్యం: కళింగరాజపుత్రుడు - శక్రదేవుడు భీమసేనుని మార్కొని, భయంకరములైన బాణాలు ప్రయోగించి - గుర్రాలను చంపివేశాడు. భీముడు కోపించి పెద్ద గదను ఆతనిపై విసిరాడు. ఆ దెబ్బకు శక్రదేవుడు సారథితోపాటు, జెండాతోపాటు- వజ్రాయుధం తాకిడికి కూలే కొండ వలె - నేలపై కూలిపోయాడు.

విశేషం: మిక్కలి ప్రాచీన కాలంలో కొండలకు రెక్కలుండేవట. అవి, ఇచ్చ వచ్చిన చోట నేలపై వ్రాలి - అపార జననష్టం కలిగించేవట. అప్పుడు దేవేంద్రుడు - కొండల రెక్కలు తన వజ్రాయుధం చేత నరికివేశాడని, అప్పటినుండీ కొండలు కదలికలేకుండా 'నగము' లై నేలమీద పడి ఉన్నాయనీ పురాణకథ.

వ. ఇవ్విధంబున నద్భుతభయావహం బగు పరాక్రమంబునం బేర్చి భీమసేనుండు ఘటితకాంచన బిందు సందోహసుందరంబును దృఢవిశాలంబును నగు పలకయుం గల్పాంతకృతాంతజిహ్వాభీలం బగు కరవాలంబును బుచ్చికొని హతహయం బగు నరదంబు డిగ్గిన. 64

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; అద్భుత+భయ+ఆవహంబు+అగు= ఆశ్చర్యకరమూ, భయముతో కూడినట్టిదీ అగు; పరాక్రమంబునన్= శౌర్యంతో; పేర్చి= అతిశయించి; భీమసేనుండు; ఘటిత కాంచన+బిందు+సందోహ+సుందరంబును= పొదగబడిన బంగారు చిరువలయ సముదాయంతో అందమైనట్టిదీ; దృఢ విశాలంబును+అగు= గట్టిగా ఉండి నిడివిగా ఉన్నట్టిదీ; పలకయున్= డాలును; కల్ప+అంత+కృతాంత+జిహ్వా+ఆభీలంబు+ అగు= కల్పము చివర(ప్రళయకాలంలో) యముని నాలుకవలె భయంకరమైనదీ అయిన; కరవాలంబును= కత్తిని; పుచ్చికొని= గ్రహించి; హత+హయంబు+అగు= చచ్చిపోయిన గుర్రాలుగల; అరదంబున్= రథమును; డిగ్గినన్= దిగిపోగా.

తాత్పర్యం: ఈ రీతిగా (విరథుడైన) భీమసేనుడు, ఆశ్చర్యకరమూ భయంకరమూ అయిన శౌర్యాన్ని ప్రదర్శించాడు. భీముడు ఒక చేతితో డాలు పట్టుకున్నాడు. ఆ డాలు దృఢమైనదీ, విశాలమైనదీ. మధ్యలో బంగారు బిందువులు ఎన్నో పొదగబడి ఉన్నాయి. ఇంకోచేతితో కత్తి పట్టుకున్నాడు. ఆ కత్తి ప్రళయకాలంలో యమధర్మరాజు నాలుకవలె భయంకరంగా ఉంది. ఆ రీతిగా -గుర్రాలు చచ్చిపోయిన రథం విడిచిపెట్టి భీముడు క్రిందికి దిగాడు.

ఆ. **కొడుకుపాటుఁ జూచి కోపించి కాళింగ। పతి రయమునఁ దేరు వఱపి భీముఁ**
బొదివి పిడుగుఁ గొదమ వోని నారసము బి। ట్టేసె నది యతండు వేసెఁ దునియ. **65**

ప్రతిపదార్థం: కొడుకు+పాటున్= పుత్రుని పతనం; చూచి= కాంచి; కోపించి; కాళింగపతి= కళింగదేశరాజు; రయమునన్= వేగంగా; తేరు+వఱపి= రథాన్నితోలి; భీమున్+పొదివి= భీముని మార్కొని; పిడుగు+కొదమ+పోని నారసము= చిన్న పిడుగువంటి బాణం; బిట్టు+ఏసెన్= గొప్పగా ప్రయోగించాడు; అది= దానిని(ఆ బాణాన్ని); అతండు= భీముడు; తునియన్= ముక్కలుగా; వేసెన్= చేశాడు.

తాత్పర్యం: తన కొడుకైన శక్రదేవుడు మరణించడం చూచి, ఆగ్రహించి, కళింగదేశరాజైన శ్రుతాయువు వేగంగా తన రథాన్ని భీమునిపైకి తరలించాడు. భీమునిపై పిడుగువంటి బాణం ప్రయోగించాడు. అయితే భీముడు ఆ బాణాన్ని తునియలుగా ఖండించాడు.

క. **మదమున శ్రుతాయు వొక్కటఁ। బదునాలుగు తోమరములు వరఁగించిన నే**
ర్పొదవఁగఁ బవనజుఁ డన్నిటిఁ। జిదురుపలుగఁ జేసె ఖడ్గచిత్రనిహతులన్. **66**

ప్రతిపదార్థం: మదమునన్= గర్వంతో, శ్రుతాయువు= శ్రుతాయువు అను పేరుగల కళింగదేశరాజు; ఒక్కటన్= ఒకేసారి; పదునాలుగు+ తోమరములు= పద్నాలుగు చిల్లకోలలు; పరఁగించినన్= ప్రయోగింపగా; నేర్పు+ఒదవఁగన్= సామర్థ్యం బయటపడేటట్లుగా; పవనజుఁడు= వాయుసుతుడు(భీముడు); అన్నిటిన్= ఆ పదునాలుగు చిల్లకోలలనూ; చిదురుపలుగన్= చిన్ని చిన్ని ముక్కలుగా; ఖడ్గ+చిత్ర+నిహతులన్= ఆశ్చర్యకరంగా కత్తితో కొట్టబడిన వాటినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: మిక్కుటమగు గర్వంతో, శ్రుతాయువు ఒకేసారి పదునాలుగు చిల్లకోలలు భీమునిపై ప్రయోగించాడు. భీముడు చాకచక్యంతో అన్నిటినీ చిన్నిచిన్ని ముక్కలుగా ఆశ్చర్యకరంగా తన చేతికత్తితో ఖండించాడు.

భీమసేనునిచేత భానుమంతుండు సచ్చుట (సం-6-50-30)

వ. **అప్పుడా కళింగపతియనుజుం డగు భానుమంతుండు దంతి నికరంబుతో నగ్రజునకుం దలమిగిలి పవమాన సూనుపై నడరి నిజఘటలకుం దలకడచి యతనిమేన నారాచంబులు నాటించుచుఁ గదిసి తన యెక్కిన యేనుంగు నేపునం బురికొల్పిన.** **67**

ప్రతిపదార్థం: అప్పుడు; ఆ కళింగపతి+అనుజుండు అగు= ఆ కళింగరాజైన శ్రుతాయువు యొక్క తమ్ముడు అయిన; భానుమంతుండు= భానుమంతుడు అను పేరుగలవాడు; దంతి+నికరంబుతోన్= ఏనుగుల గుంపుతో; అగ్రజునకున్+తల+మిగిలి= అన్నగారిని అతిక్రమించి; పవమాన సూనుపైన్= భీమునిపై; అడరి= విజృంభించి; నిజ+ఘటలకున్+తలకడచి= తన ఏనుగుల సముదాయాన్ని దాటి; అతని+మేనన్= భీముని శరీరమందు; నారాచంబులు= బాణాలు; నాటించుచున్= గ్రుచ్చుతూ; కదిసి= పూని; తన+ఎక్కిన+ఏనుంగున్= తాను అధివసించిన ఏనుగును; ఏపునన్+పురికొల్పినన్= మిక్కుటముగా ప్రోత్సహించగా.

తాత్పర్యం: ఆ సమయంలో కళింగరాజు శ్రుతాయువు తమ్ముడు భానుమంతుడు, ఏనుగుల సముదాయంలో అన్నను అతిక్రమించి, భీమునిపై వాడిబాణాలు నాటేటట్లు చేశాడు. అంతేగాక - తాను ఎక్కిన ఏనుగును పురికొల్పగా (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: పురాణాలలో, చరిత్రలో కూడా కళింగదేశం ఏనుగులకు ప్రసిద్ధి కెక్కింది. భీముడు ఏనుగులను చంపటంలో సిద్ధహస్తుడు. అందుచే కళింగులకూ భీముడికీ సహజవైరం ఏర్పడింది.

శా. **కుంతీసూనుఁడు సింహనాదమున దిక్కుల్ పిక్కటిల్లంగ దు**
ర్దాంతస్ఫారగతిం గరిం గదిసి రౌద్రస్ఫూర్తి లంఘించి త
ద్దంతంబుల్ వెస నెక్కి త్రొక్కి తునిమెన్ ధారాళరక్తచ్ఛటా
క్రాంతంబై నభమొప్ప వానిఁ బటుఖడ్గస్ఫారధారాహతిన్. 68

ప్రతిపదార్థం: కుంతీసూనుఁడు= కుంతికొడుకు - ఈ సందర్భంలో భీముడు; సింహనాదమునన్= సింహగర్జన వంటి అరుపుతో; దిక్కుల్= దెసలు; పిక్కటిల్లంగన్= మారుమ్రోగగా; దుర్దాంత+స్ఫార+గతిన్= అదుపులో పెట్టుటకు వీలులేకుండా విస్తరించిన నడకతో; రౌద్ర స్ఫూర్తిన్= తీవ్రకోపం భాసించగా; లంఘించి= దూకి; తద్+దంతంబుల్= ఆ ఏనుగు దంతాలు; వెసన్= వేగంగా; ఎక్కి; త్రొక్కి; ధారాళ+రక్త+ఛటా+ఆక్రాంతంబు+ఐ= మిక్కిలి ఎక్కువగా స్రవించే నెత్తుటి ధారల సముదాయంతో కూడి; నభము+ఒప్పన్= ఆకాశం శోభిల్లేటట్లుగా; పటు ఖడ్గ స్ఫార+ధారా+హతిన్= మిక్కుటమగు కత్తికొనల అంచుల దెబ్బలతో; వానిన్= ఆతనిని; తునిమెన్= సంహరించాడు.

తాత్పర్యం: అంతట భీముడు సింహనాదం చేశాడు. దిక్కులు మారుమ్రోగేటట్లుగా, వెనువెంటనే శీఘ్రగమనంతో ఆ ఏనుగు దంతాల మీదికి ఎక్కి, మర్దించాడు తీవ్ర కోపంతో. పిమ్మట ఆకాశంలో రక్తధారలతో చిమ్మేటట్లుగా, అతనిని తన కత్తి అంచులు తళతళ మెరిసేట్లు సంహరించాడు.

వ. **ఇట్లు భానుమంతు నంతకుపురికిం బనిచి.** 69

ప్రతిపదార్థం: అట్లు= ఆ రీతిగా; భానుమంతున్= భానుమంతుని; అంతకుపురికిన్= యముని పట్టణానికి; పనిచి= పంపించి. (అనగా చంపి) (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: భీముడు ఆ విధంగా భానుమంతుని యమలోకానికి పంపించి.

తే. **మలఁగి గజకంధరము ద్రుంచి తొలఁగ నుఱికి । కెంపు దళుకొత్త వాలుతోఁ గ్రేళ్ళువాఱు**
నా వృకోదరుపైఁ గవియంగఁ జేయు । వీచె సేనకుఁ గాళింగవిభుఁడు గడఁగి. 70

ప్రతిపదార్థం: మలఁగి= తిరిగి; గజ+కంధరము= ఏనుగు మెడను; త్రుంచి= ఖండించి; తొలఁగన్+ఉఱికి= తప్పించికొని దూకి; కెంపు+తళుకు+ఒత్తన్= ఎఱ్ఱదనం మెరయగా; వాలుతోన్= ఖడ్గముతో; క్రేళ్ళువాఱు= దుముకు; ఆ+వృకోదరుపైన్= ఆ భీమునిపై;

కవియంగన్= మార్కొనటానికి; కాళింగ+విభుఁడు= కళింగరాజు; కడఁగి= పూని; సేనకున్= సేనవైపు; చేయివీచెన్= తన చేతిని ఎత్తి సన్న చేశాడు.

తాత్పర్యం: భీముడు తిరిగి విజృంభించి, ఏనుగు మెడ ఖండించి, అటునుండి తొలగి క్రిందికి ఉరికి, ఎర్రదనంతో వెలుగొందు కత్తితో ముందుకు ఉరుకుతున్న ఆ భీముని మార్కొనుమని కళింగరాజు తన చేయివీచి సైనికులను పురికొల్పాడు.

వ. ఇట్లు శ్రుతాయువు సేయి వీచినఁ దచ్చతురంగంబులు వొదివినం బవనతనయుండు నిజభుజశిఖరంబులు వెఱుగం దాను బాదచారి యగుటయు నొంటియైన తెఱంగునుం దలంపని దర్పంబునం బేర్చి రణక్రీడకుం జొచ్చి కరవాలంబు శుండాలకుంభస్థలంబులు పగుల వ్రేసిన మెదడంటి మొదుక నైనం గేతుదండంబులు నఱికి, చులుకం జేయుచు రథికసారథి సహితంబుగా నరదంబులు చక్కడంచి, మొక్కలు వోయిన నస్థి సారంబులగు నశ్వశరీరంబులు గోసి, పాఱవైచి, వాఁడి సేయుచు నుబ్బున గుఱ్ఱంబుల కుఱికి బడలుపడ నఱిముఱి విసరిన నోర వోయిన సురియం జెరివి, యవలీలం గాలుబలంబులపైఁ బడి చక్కంజేయుచు మఱియు నానాప్రకారంబులగు చిత్రవధవిహారంబుల నమ్మోహరంబు విఘటితవిభ్రాంతపలాయితంబు గావించి యపరాహ్ణంబునం గళింగపతిం గవియు నవసరంబున. 71

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; శ్రుతాయువు= శ్రుతాయువు(కళింగభూపతి); చేయివీచినన్= చేయి ఊపి పురికొల్పగా; తద్+చతురంగంబులు= ఆతని చతురంగబలములు; పొదివినన్= చుట్టుముట్టగా; పవన తనయుండు= వాయుపుత్రుడు(భీముడు); నిజ భుజ శిఖరంబులు+పెఱుగన్= తన యొక్క మూపులు ఉబ్బగా; తాను; పాదచారి+అగుటయున్= నేలమీద తిరిగేవాడు కావటం; ఒంటి+ఐన+తెఱంగునున్= ఏకాకియైన తీరును; తలంపని= ఆలోచింపని; దర్పంబునన్= గర్వంతో; పేర్చి= విజృంభించి; రణ+క్రీడకున్+చొచ్చి= ఆటవలె యుద్ధం చేయటానికి పూని; కరవాలంబు= కత్తి; శుండాల+కుంభస్థలంబులు= ఏనుగుల కుంభములు; పగుల+వ్రేసినన్= బ్రద్దలు కొట్టగా; మెదడు+అంటి= తలలోపలి మాంసపు గుజ్జు సోకి; మొదుకన్+ఐనన్= మొద్దుబారగా; కేతు దండంబులు= జెండా కొయ్యలు; నఱకి= ఖండించి; చులుకన్+చేయుచున్= అవమానిస్తూ; రథిక+సారథి+సహితంబుగాన్= రథికులతో సారథులతోపాటుగా; అరదంబులు= రథాలు; చక్కడంచి= నాశనంచేసి; మొక్కలు+పోయిన= మ్రోడుపడిన(శిథిలములు అయిన); అస్థిసారంబులు+అగు= ఎముకలు మాత్రమే మిగిలిన; అశ్వ+శరీరంబులు= గుఱ్ఱాల కంకాళాలు; కోసిపాఱవైచి= ఖండించి విసరివేసి; వాఁడి+చేయుచున్= పదను పెట్టుచూ; ఉబ్బునన్= ఉత్సాహంతో; గుఱ్ఱంబులకున్+ఉఱికి= గుఱ్ఱాలపై బడి; బడలుపడన్= శ్రమపడేటట్లుగా; అఱిముఱి+విసరినన్= వేగంగా విసరగా; ఓరవోయిన= మొద్దుబారిన; సురియన్= చిరుకత్తిని; చెరివి= త్రిప్పి; అవలీలన్= సులువుగా; కాలు బలంబులపైన్+పడి= పాదచారులగు భటులపైబడి; చక్కంజేయుచున్= సరిపరచుచూ; మఱియున్= ఇంకను; నానా ప్రకారంబులు+అగు= పెక్కు విధములైన; చిత్రవధ విహారంబులన్= వింతగొలిపే సంహార సంచారములచేత; ఆ+మోహరంబున్= ఆ వ్యూహాన్ని; విఘటిత,విభ్రాంత, పలాయితంబు+ కావించి= చీలిపోవునట్లుగా, కలతచెందునట్లుగా, పారిపోయేటట్లుగా, చేసి; అపర+అహ్ణంబునన్= మధ్యాహ్నకాలమున; కళింగ పతిన్+కవియు+సమయంబునన్= కళింగరాజును మార్కొన్న వేళలో.

తాత్పర్యం: ఈ రీతిగా శ్రుతాయువు చేయివిసరగా చతురంగబలాలు భీమసేనుడిని చుట్టు ముట్టాయి. అపుడు భీముడు మూపులు ఉబ్బగా తాను పాదచారి అగుటనూ, ఏకాకియైన తీరునూ, ఆలోచించని దర్పంతో విజృంభించి యుద్ధం అనే ఆటకు పూనుకున్నాడు. అతడు తన చేతి ఖడ్గంతో ఏనుగుల కుంభస్థలాలను పగుల వేశాడు. ఏనుగుల మెదడు కత్తికి అంటుకొని మొద్దుబారగా జెండాల కొయ్యలను నరికి మొద్దుబారిన కత్తికి పదును

బెట్టుకొన్నాడు. రథికులు సారథులతో కూడ రథాలను నాశనం చేశాడు. అట్లా చేయడం వల్ల కత్తి మొక్క పోయింది. మొక్కవోయిన కరవాలాన్ని ఎముకలతో గూడ గుఱ్ఱాల శరీరాలను కోసిపారవైచి తిరిగి వాడి అయ్యేటట్లు చేస్తూ ఉత్సాహంతో గుఱ్ఱాలమీదికి ఉరికి అవిబడలుపడేటట్లు అడ్డదిడ్డంగా విసరగా మొద్దుబారిన తనకత్తిని త్రిప్పి అవలీలగా కాల్బలంపైబడి పదును బెట్టుకుంటూ ఇంకా రకరకాల చిత్రవధ విహారాలతో ఆ కౌరవ వ్యూహాన్ని చెల్లాచెదరయేట్లుగా, కలతచెందేటట్లుగా, పారిపోవునట్లుగా చేసి అపరాహ్ణకాలంలో కళింగపతి శ్రుతాయువును మార్కొన్న సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషాలు: 1. ఇది భీముడి వీరవిహార వర్ణన.

ఏ యోధుడైనా విరథుడు అయితే - ఇక అతడు నిర్వీర్యుడయినట్లే. కాని భీమసేనుని తీరువేరు. మహాబలవంతుడైన భీమునికి అది తన చేవ- బలం చూపించటానికి ఒక గొప్ప అవకాశం. తాను రథంమీద నిలిచి -విల్లు, అమ్ములు ధరించి- ఎదుటి రథికుడితో యుద్ధం చేయటం కంటె- క్రిందికి దిగి - శత్రువీరుని రథం - సారథితో గుఱ్ఱాలతోపాటు విసరివేయటం - భీమసేనునికి సులువు! రథంమీద విల్లుచేత పట్టిన భీముని కంటె, కత్తి ,డాలు పట్టుకొని పాదచారియైన భీముడు ఎక్కువ బలవంతుడు. 2.చతురంగబలము: రథ-గజ-తురగ-భటులు - రథాలు - ఏనుగులు-గుఱ్ఱాలు-పాదచారులైన భటులు నాలుగు అంగాలుగా ప్రాచీనకాలంలో భారతీయ సేనలో విభజింపబడ్డాయి.

తే. **వివిధ సన్నాహయుతముగాఁ బవనతనయు। తేరు దగురథ్యములఁ బూన్చి తెచ్చి సూతుఁ**
డతనిముందట నిలిపిన నతఁడు వాని। నాదరంబునఁ గనుగొని యరదమెక్కె. 72

ప్రతిపదార్థం: వివిధ+సన్నాహ+యుతముగాన్= పెక్కు పరికరములతో కూడిన;పవనతనయు+తేరు= భీముని రథం; తగు= యోగ్యములైన; రథ్యములన్= గుఱ్ఱాలను; పూన్చి= జతచేసి; తెచ్చి; సూతుఁడు= రథసారథి(భీముని సారథి); అతని ముందటన్= భీముని ఎదురుగా; నిలిపినన్= నిలబెట్టగా; అతడు= ఆ భీముడు; వానిన్= సారథిని; ఆదరంబునన్+కనుఁగొని= గౌరవముతో చూచి; అరదమున్= రథాన్ని; ఎక్కెన్= అధిరోహించాడు.

తాత్పర్యం: భీముని సారథి, క్రొత్తతేరును అన్నిహంగులతో సమకూర్చి, గుఱ్ఱాలు పూన్చి తీసికొనివచ్చి అతని ముందట నిలిపాడు. భీముడు సంతోషించి, సగౌరవంగా సారథిని చూచి ఆ తేరు ఎక్కాడు.

ఉ. **చాపము వేడ్కఁ బుచ్చికొని సజ్యము సేయునెడం గళింగుఁ డ**
ష్టాపద దీప్తపుంఖనవశాతశరంబులు నాట నేసినం
గోపితుఁడై కడంగి బరిగోలలపోటుల నుగ్రవారణా
టోపము పేర్చునట్లుగఁ గడున్ వెస డగ్గఱి భీముఁ డుద్ధతిన్. 73

ప్రతిపదార్థం: చాపమున్= విల్లును; వేడ్కన్= ప్రీతితో; పుచ్చికొని= తీసికొని; సజ్యము+చేయు+ఎడన్= అల్లెత్రాటిని పూన్చే తరుణంలో; కళింగుఁడు= కళింగరాజు; అష్టాపద, దీప్త, పుంఖ, నవ, శాత, శరంబులు= బంగారంవలె మెరిసే ఎనిమిది కొసలుగల క్రొత్త వాడి అమ్ములు; నాటన్+ఏసినన్= భీముడిపై ప్రయోగించగా; కోపితుఁడు+ఐ= భీముడు ఆగ్రహం చెందినవాడై; కడంగి= పూని; బరిగోలల+పోటులన్= అర్ధచంద్రాకారముగల బాణాల ప్రయోగంవల్ల; ఉగ్ర+వారణ+ఆటోపము= మదించిన ఏనుగు విజృంభణ; పేర్చునట్లుగన్= అతిశయించేటట్లుగా; కడున్= మిక్కిలి; వెసన్= శీఘ్రంగా; డగ్గఱి= సమీపించి; ఉద్ధతిన్= గర్వంతో; భీముడు.

తాత్పర్యం: భీముడు ప్రీతితో ధనుస్సు చేత పట్టుకొని, అల్లెత్రాటిని బిగించేటప్పుడు, కళింగరాజు ఎనిమిది పుంఖాలుగల మెరిసేకొంగ్రొత్త బాణాలు ప్రయోగించాడు. భీముడికి కోపం వచ్చింది. అతడు బరిగోలలు ప్రయోగించినపుడు రెచ్చిపోయే ఏనుగువలె విజృంభించాడు. భీముడు అతిశీఘ్రంగా శ్రుతాయువును సమీపించి గర్వంతో (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అష్టాపదదీప్త= బంగారుతో దీపించిన; పుంఖ= చివరిభాగాలు కల క్రొత్త వాడిబాణాలు అని కొందరు అర్థం చెప్పారు. 1. బరిగోల= బరి+కోల - ఏనుగులను తోలేటపుడు పొడిచెడి అర్ధచంద్రాకృతిగల అలుగుగల వేణుదండం. 'బరిగోల చేత మదసింధురముం గదలించినట్లు' భారతం - అరణ్య. 1- 283. బరిగోలల పోటునకు రెచ్చిపోయే మత్తేభంవలె భీముడు కోపించి విజృంభించాడు.

ఆ. అయిదు నారసముల నాతనిఁ జదికిలఁ। బడఁగ నేసి మూర్ఛపాలు సేసి
యతని చక్రరక్షు లైన సత్యుని సత్య। దేవుఁ జంపి నభము దివుర నార్చె. 74

ప్రతిపదార్థం: అయిదు+నారసములన్= అయిదుబాణాలతో; ఆతనిన్= కళింగప్రభువు శ్రుతాయువును; చదికిలన్+పడఁగన్= పిర్రలు నేలమీద ఆనేటట్లుగా; ఏసి= బాణాలు ప్రయోగించి; మూర్ఛపాలు+చేసి= స్పృహతప్పేటట్లు చేసి; అతని= కళింగప్రభువుయొక్క; చక్ర+రక్షకులు+ఐన= రథచక్రాలను కాపాడే వారలైన; సత్యునిన్= సత్యుడు అనుపేరు గలవానిని; సత్యదేవున్= సత్యదేవుడు అనే పేరుగలవానిని; చంపి= సంహరించి; నభము= ఆకాశం; తివురన్= మారుమ్రోగేటట్లుగా; ఆర్చెన్= సింహనాదం చేశాడు.

తాత్పర్యం: భీముడు- కళింగభూపతి శ్రుతాయువుపై అయిదు బాణాలు ప్రయోగించి ఆతనిని చతికిలబడవేశాడు. శ్రుతాయువు స్పృహతప్పి రథంపై పడిపోయాడు. భీముడు అతని రథచక్ర రక్షకుడైన సత్యుడిని, సత్యదేవుడిని సంహరించి, ఆకాశం దద్దరిల్లేటట్లుగా సింహనాదం చేశాడు.

వ. అట్లు శ్రుతాయువు మూర్ఛిల్లినం దదీయ సారథి రథంబు దొలంగం దోలికొనిపోయినఁ గర్ణధారుండు లేని యానపాత్రంబునుం బోలెఁ దద్బలంబు దిరుగుడు వడియె నప్పుడు కిమ్మీరవైరి శంఖంబు పూరించిన. 75

ప్రతిపదార్థం: అట్లు= ఆ రీతిగా; శ్రుతాయువు= కళింగప్రభువు; మూర్ఛిల్లినన్= స్పృహకోలుపోగా; తదీయ రథ సారథి= ఆతని తేరు తోలువాడు; రథంబున్= తేరును; తొలంగన్+తోలికొని పోయినన్= రణభూమిని తొలగి బయటికి తీసికొనిపోగా; కర్ణధారుండు= చుక్కాని పట్టువాడు; లేని= లేనట్టి; యానపాత్రంబునున్+పోలెన్= పడవవలె; తద్+బలంబు= ఆతనిసేన(కళింగసైన్యం); తిరుగుడు+పడియెన్= కలత చెందింది; అప్పుడు= ఆ సమయంలో; కిమ్మీర+వైరి= భీముడు; శంఖంబు పూరించినన్= శంఖము నూదగా

తాత్పర్యం: ఆ విధంగా శ్రుతాయువు మూర్ఛపోయాడు. ఆతని రథసారథి రథాన్ని యుద్ధభూమినుండి తరలించి బయటకు తీసికొనివెళ్ళాడు. అప్పుడు చుక్కాని పట్టేవాడు లేని పడవవలె, కళింగసైన్యం సంక్షోభించింది. భీముడు విజయోత్సాహంతో శంఖం పూరించగా - (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: కిమ్మీర వైరి= భీముడు; భీముడు సంహరించిన రాక్షసులలో పేర్కొనదగినవాడు బకాసురుడు. అతడి సహోదరుడే కిమ్మీరుడు, భీముడు, అరణ్యవాస సమయంలో కిమ్మీరుని ఎదుర్కొని అతడిని సంహరించాడు.

క. విని గాంగేయుం డడరినఁ। గని ధృష్టద్యుమ్నుఁడును శిఖండియు నరిభం
జనుఁ డగు సాత్యకియు మరు త్తనయుఁ। గడచి యతనిఁ దాఁకి దర్ప మెలర్పన్. 76

ప్రతిపదార్థం: విని= ఆలకించి (భీముడు శ్రుతాయువును మూర్ఛిల్లచేసినట్లు ఆలకించి); గాంగేయుండు= గంగకొడుకు(భీష్ముడు); అడరినన్(భీముని) మార్కొనిన; కని= చూచి; ధృష్టద్యుమ్నుఁడును= ధృష్టద్యుమ్నుడును; శిఖండియున్= శిఖండియు; అరి+భంజనుఁడు అగు= శత్రువులను సంహరించు; సాత్యకియున్= సాత్యకియును; మరుత్+తనయున్= వాయుసుతుడగు భీముని; కడచి= దాటి; అతనిన్= భీష్మునిని; దర్పము+ఎలర్పన్= గర్వం అతిశయింపగా; తాఁకి= మార్కొని.

తాత్పర్యం: భీముడు కళింగ భూపతిని మూర్ఛిల్ల చేసిన శంఖారావాన్ని సేనాపతి అయిన భీష్ముడు విన్నాడు. వెంటనే భీముని మార్కొన్నాడు. అంతతట ధృష్టద్యుమ్నుడు, శిఖండి, శత్రుభంజనుడయిన సాత్యకి భీమునిదాటి, గర్వోత్సాహంతో భీష్ముని తాకి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. బెడిదముగ నేయ రథములపిండు మఱియుఁ । గవిసి తోడ్పడ నతఁడు శిఖండి యొకడు
దక్క నందఱ తనువులఁ బెక్కు నిశిత । విశిఖములు నాటి బకరిపు వెగడుపఱిచి . 77

ప్రతిపదార్థం: బెడిదముగన్+ఏయన్= మిక్కుటముగ(బాణాలు) ప్రయోగింపగా; రథముల+పిండు= తేరుల సముదాయం; మఱియున్= ఇంకా; కవిసి= చేరి; తోడ్పడన్= సాయం చేయగా; అతఁడు= భీష్ముడు; శిఖండి+ఒకఁడు+తక్కన్= శిఖండిని ఒకనిని మినహాయించి; అందఱ+తనువులన్= అందరి శరీరాలయందు; పెక్కు= ఎన్నో(అనేక); నిశిత+విశిఖములు= వాడిబాణాలను; నాటి= గ్రుచ్చుకొనేటట్లు చేసి; బక+రిపున్= భీముని(బకాసురుని శత్రువును); వెగడు+పఱిచి= కలచి.

తాత్పర్యం: వారు మిక్కుటంగా బాణాలు ప్రయోగింపగా, రథముల సముదాయం, ఇంకా తనకు సాయం చేయగా, భీష్ముడు శిఖండిపై తప్ప మిగిలినవారందరిపై వాడిబాణాలు ప్రయోగించి, భీముడిని కలత పెట్టాడు.

విశేషం: భీముడు చంపిన రాక్షసవీరులలో పేర్కొనదగినవారు బకుడు, ఏకచక్రపురంలో పాండవులు అజ్ఞాతంలో ఉన్నప్పుడు - సంఘకంటకుడైన బకుని సంహరించి పేరుకెక్కాడు.

వ. అతని యరదంబు గుఱ్ఱంబులం గూల నేసిన నతండు కోపించి. 78

ప్రతిపదార్థం: అతని+అరదంబు గుఱ్ఱంబులన్= అతని తేరుకు కట్టిన అశ్వాలను; కూలన్+ఏసినన్= సంహరింపగా; అతండు= భీముడు; కోపించి.

తాత్పర్యం: భీముడిని కలతచెందించి, అతడి తేరుకు కట్టిన గుర్రాలను సంహరించాడు. భీముడికి కోపం వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఘనశక్తి వైవ నది శాం । తనవుఁడు ముత్తునియ సేయ దానం గోపం
బినుమడిగా నుజ్జ్వలగదఁ । గొని యరదము డిగ్గి కవిసె ఘోరాకృతియై. 79

ప్రతిపదార్థం: ఘనశక్తివైవన్= గొప్పశక్తిని ప్రయోగింపగా; అది= దానిని; శాంతనవుఁడు= (శంతనుని కొడుకైన) భీష్ముడు; మూఁడు+తునియలు+చేయన్= మూడు ముక్కలు చేయగా; దానన్= దానివలన; కోపంబు; ఇనుమడిగాన్= రెండురెట్లు కాగా; ఉజ్జ్వల+గదన్+కొని= ప్రకాశించే గదను చేతపట్టుకొని; అరదము+డిగ్గి= రథం దిగి; ఘోర+ఆకృతి+ఐ= భయంకరమైన రూపం కలవాడై; కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: అప్పుడు భీముడు గొప్ప 'శక్తి' ని భీష్ముడిపై విసరాడు. అయితే ఆ శక్తిని భీష్ముడు మూడు ముక్కలు చేశాడు. దానితో భీముడి కోపం రెండింతలు అయింది. అతడు గదను చేతబూని, రథం దిగి, భయంకరమైన ఆకారంతో, భీష్ముని మార్కొన్నాడు.

విశేషం: 1. విల్లమ్ములు ధరించిన 'ధానుష్కుడు' గా భీముని భూమిక కంటె, గదాధారియైన భీముని భూమిక గొప్పది. 71వ పద్య వ్యాఖ్యాన విశేషాలు అనుశీలించవచ్చు. 2. శక్తి ఆయుధ విశేషం. 53వ పద్య వ్యాఖ్యాన విశేషములు అనుశీలించవచ్చును.

క. తదవసరంబున సాత్యకి । మదమునఁ గౌంతేయుఁ గడచి మంత్రంబున బె
ట్టిదముగఁ బడవైచిన యొ । ప్పిదమున నస్త్రమునఁ గూల్చె భీష్ముని సూతున్. 80

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; సాత్యకి; మదమునన్= గర్వంతో; కౌంతేయున్= కుంతీపుత్రుడైన భీముని; కడచి= దాటి; మంత్రంబునన్= మంత్రముతో; బెట్టిదముగన్= గొప్పగా; పడవైచిన+ఒప్పిదమునన్= పడగొట్టిన సొగసుతో; అస్త్రమునన్= బాణంతో; భీష్ముని సూతున్= భీష్ముని రథసారథిని; కూల్చెన్= సంహరించాడు.

తాత్పర్యం: ఆ సమయంలో సాత్యకి, భీముడినిదాటి, మంత్రప్రయోగంతో గొప్పగా పడగూల్చిన సొగసుతో అస్త్రం ప్రయోగించి భీష్ముని సారథిని కూల్చినాడు.

వ. ఇట్లు సారథి పడుటయు. 81

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; సారథి= భీష్ముడి రథంతోలేవాడు; పడుటయున్= నేలగూలి మరణించగా.

తాత్పర్యం: ఈ రీతిగా భీష్ముడి సారథి హతుడు కాగా.

తే. వాయువేగంబు లైన తద్వాహనములు । భీష్మతే రెత్తికొని పాఱెఁ బృథివి యద్రువ
నపుడు మనసైనికులు గీచకారి నెదుర । నలికి పాసిన బయలయ్యె నతని మునుము. 82

ప్రతిపదార్థం: వాయువేగంబులు+ఐన= గాలితో సమానమైన వేగం గలవిఐన; తద్+వాహనములు= ఆ గుర్రాలు; భీష్మ+తేరు= భీష్ముడి రథాన్ని; పృథివి+అద్రువన్= భూమి కంపింపగా; ఎత్తికొని+పాఱెన్= తమతో తీసికొని వెళ్ళిపోయాయి; అపుడు; మనసైనికులు; కీచక+అరిన్= భీముడిని, ఎదురన్+అలికి= మార్కొనటానికి భయపడి; పాసినన్= పారిపోగా; అతని మునుము= భీముడి ఎదుటి చోటు; బయలు+అయ్యెన్= శూన్యం అయింది.

తాత్పర్యం: గాలివేగంతో సరియైన వేగంగల భీష్ముని గుర్రాలు, ఆతడి రథాన్ని ఎత్తుకొని పారిపోయాయి. ఆ ధాటికి భూమి అదిరిపోయింది. అపుడు మన సేనలోని భటులు పారిపోయారు. భీముడి పురోభాగం వెలితిపడింది.

విశేషం: అద్రువ అనగా అదరుట అని అర్థం. ఇచ్చట ఒక ఛందో విశేషం - తెలుగులో అపురూపమైనట్టిది ఉన్నది. అద్రువ శబ్దంలోని మూడు అక్షరాలూ లఘువులే. ఇందలి 'ద్రు' సంయుక్తాక్షరం కాదు. దీనికి 'శిథిల ద్విత్వం' అని ఛందస్సులో పేరు. ఉచ్చారణలో 'అద్రువ' 'అ' తేల్చి పలకాలి.

వ. అట్టియెడ ధృష్టద్యుమ్నుండు గారవంబున నమ్మారుతిం దనరథం బెక్కించుకొనియె నంతఁ గృష్ణానుజుండు దన తేరు సేరం దెచ్చి యా వృకోదరు నుపలక్షించి. 83

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ తరుణంలో; ధృష్టద్యుమ్నుండు; గారవంబునన్= ప్రేమతో కూడిన ఆదరణతో; ఆ+మారుతిన్= వాయుదేవుని కొడుకైన ఆ భీముని; తన+రథంబు= తనతేరిని; ఎక్కించుకొనియెన్; అంతన్= అటుపిమ్మట; కృష్ణ+అనుజుండు= శ్రీకృష్ణుని తమ్ముడైన సాత్యకి; తన+తేరు= తన రథం; చేరన్+తెచ్చి= (భీముడి) దగ్గరకు చేరేటట్లు చేసి; ఆ+వృకోదరున్+ఉపలక్షించి= ఆ భీముని మన్నించే దృష్టితో చూచి.

తాత్పర్యం: భీముడి వీరవిహారం, భీష్ముడి పరాజయం పాండవుల సేనాని యైన ధృష్టద్యుమ్నుడికి సంతోషం కలిగించాయి. ఆ క్షణంలో కౌరవసేనాపతి భీష్ముడు యుద్ధభూమిలో లేడు. ధృష్టద్యుమ్నుడు భీముడిని తన రథంమీదికి ఎక్కించుకున్నాడు. సాత్యకి కూడా కొంతవరకు భీష్ముని తాత్కాలిక పరాజయానికి కారకుడు. అతడు తన రథాన్ని ధృష్టద్యుమ్నుడు, భీముడు కలిసి ఉన్న రథం దగ్గరకు చేర్చి, భీముడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ' ఒంటిమైఁ గళింగు నురవడిఁ దలపడి । పుత్రసోదరాప్త భూరిసైన్య
హీనుఁ జేసి కౌరవానీకములు సూడ । నుఱక భంగపెట్టి పఱపు టొప్పె.' 84

ప్రతిపదార్థం: ఒంటిమైన్= ఒంటరిగా; కళింగున్= కళింగరాజును; ఉరవడిన్+తలపడి= అతివేగంగా మార్కొని; పుత్రసోదర+ఆప్త భూరి సైన్యహీనున్+చేసి= కొడుకులు, తమ్ములు; దగ్గర బంధువులు, పెద్దసేనలు లేనివానిని చేసి; కౌరవ+అనీకములు= కౌరవుల సేనలు చూడన్= చూస్తూ ఉండగా; ఉఱక= సులువుగా; భంగపెట్టి; పఱపుట+ఒప్పెన్= అవమానపరచి తరమడం జరిగింది.

తాత్పర్యం: సాత్యకి భీముడిని ఈ విధంగా అభినందించాడు. 'ఓ భీమసేనా! నీవు ఎంతో గొప్ప కార్యం నెరవేర్చావు. ఏకాకివై పోరాడి, కళింగ ప్రభువు శ్రుతాయువును జయించి అవమానించి తరమగలిగావు. అతడి తమ్ముడిని, పుత్రుడిని, ఆప్తులను కౌరవసేనలు చూస్తూ ఉండగా సంహరించావు.

వ. అని యగ్గించె నంతఁ గడంగి వచ్చు శల్యకృపాశ్వత్థామలం గని పార్షతుండు దనయరదంబున నున్న భీమసేనుని సవినయంబుగా డించి 'నీవు నన్ను వెన్ను దన్ని చూడు' మని పలికి యద్దెసం దేరు వఱపి యశ్వత్థామరథ్యంబులం బదిబాణంబులం బడ నేసిన నతండు శల్యుని రథంబుపైకిం బోయి పాంచాలపతి సూనుమేన నిశితాస్త్రంబులు నినిచెఁ దక్కటి యిరువురు నట్ల చేసి రివ్విధంబున నమ్ముమ్వురచేత నతం డొక్కరుండును బొదువం బడియుంట దవ్వులంజూచి విజయనందనుండు నిజ స్యందనంబు దోలికొని వచ్చి కృపాశ్వత్థామలం దొమ్మిదేసి యమ్ముల నొప్పించి మద్రపతి యంగమునఁ బంచవింశతి విశిఖంబులు నాటించె వారును నతనిఁ బండ్రెండు శరంబు లేసి రా సమయంబున భవదీయపౌత్త్రుం డగులక్ష్మణకుమారుం డయ్యభిమన్యుం దలపడి మర్మభేదులయిన నారాచమ్ముల నొప్పించిన నతం డక్కుమారుఁ బంచాశత్సాయకంబులం గప్పి తన హస్తలాఘవంబు ప్రకటించిన. 85

ప్రతిపదార్థం: అని+అగ్గించెన్= అని ప్రస్తుతించాడు; అంతన్= అటుపిదప; కడంగివచ్చు= మార్కొనటానికి పూనివచ్చే; శల్య+కృప+అశ్వత్థామలన్+కని= శల్యుడిని; కృపుడిని; అశ్వత్థామను చూచి; పార్షతుండు= ధృష్టద్యుమ్నుడు; తన+అరదంబునన్+ఉన్న= తన రథంమీద ఉన్న; భీమసేనుని; సవినయంబుగాన్= మన్ననతో; డించి= దించి; నీవు+నన్నున్; వెన్ను+తన్ని+చూడుము= వెనుకతట్టుగా నిలిచి వీక్షించుము; అని+పలికి; ఆ+దెసన్= ఆ వైపుగా; తేరు= రథం; పఱపి= నడిపించి;అశ్వత్థామ+రథ్యంబులన్= అశ్వత్థామ రథానికి పూన్చిన గుఱ్ఱాలను; పదిబాణంబులన్= పది అమ్ములతో; పడన్+ఏసినన్= కూల్చగా; అతండు= ఆ అశ్వత్థామ; శల్యుని+రథంబు+పైకిన్+పోయి= శల్యుని తేరుపైకి ఎక్కి; పాంచాలపతి సూను+మేనన్= పాంచాల రాజపుత్రుడైన ధృష్టద్యుమ్నుని శరీరంపై; నిశిత+అస్త్రంబులు= వాడి బాణాలు; నినిచెన్= నిండించాడు; తక్కటి= మిగిలిన; ఇరువురును= ఇద్దరును(కృపుడు, శల్యుడు); అట్ల+చేసిరి= ఆ విధంగానే చేశారు; (అనగా బాణాలు ప్రయోగించారు); ఈ+విధంబునన్= ఈవిధంగా; ఆ+మువ్వురచేతన్= ముగ్గురిచేత; అతండు= ధృష్టద్యుమ్నుడు; ఒక్కరుండును= ఒక్కడే; పొదువంబడియుంట= మార్కొనబడి ఉండటం; దవ్వులన్+చూచి= దూరమునుండి వీక్షించి; విజయనందనుండు= అర్జునుడి కొడుకు - అభిమన్యుడు; నిజ+స్యందనంబు= తన రథాన్ని; తోలికొనివచ్చి= తోడ్కొని అరుదెంచి; కృప+అశ్వత్థామలన్= కృపుడిని, అశ్వత్థామను; తొమ్మిది+ఏసి అమ్ములన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తొమ్మిదిబాణాల చొప్పున; నొప్పించి= ప్రయోగించి బాధించి; మద్రపతి+అంగమునన్= శల్యుని దేహమునందు; పంచవింశతి విశిఖంబులు= ఇరువది ఐదు బాణాలు; నాటించెన్= గ్రుచ్చుకొనేటట్లు చేశాడు; వారును= కృపుడూ అశ్వత్థామా; అతనిన్= అభిమన్యుడిపై; పంద్రెండు+శరంబులు+ఏసిరి= పన్నెండు అమ్ములు వేశారు; ఆ సమయంబుననన్; భవదీయ+పౌత్రుండు+అగు= నీ మనుమడైన; లక్ష్మణ+కుమారుండు= లక్ష్మణకుమారుడు అను పేరుగలవాడు; ఆ+అభిమన్యున్+తలపడి= ఆ అభిమన్యుడిని ఎదుర్కొని; మర్మభేదులు+అయిన+నారాచంబులన్= ఆయువుపట్టులు చీల్చే బాణాలతో; నొప్పించినన్= బాధించగా; అతండు= అభిమన్యుడు; ఆ+కుమారున్= ఆ లక్ష్మణకుమారుని; పంచాశత్+సాయకంబులన్= ఏబదిబాణాలతో; కప్పి; తన+హస్త+లాఘవంబున్= తన చేతి చొరవను; ప్రకటించినన్= వెల్లడిచేయగా.

తాత్పర్యం: సాత్యకి భీముడిని ప్రశంసించాడు. ఇంతలో శల్యుడు, కృపుడు, అశ్వత్థామ మార్కొనటానికి వచ్చారు. అదిచూచి ధృష్టద్యుమ్నుడు తన రథంమీద ఉన్న భీముడిని సగౌరవంగా క్రిందికి దించాడు. అతడితో 'నీవు వెనుక నిలిచి చూస్తూ ఉండుమని' చెప్పాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు వారలవైపు రథం మళ్ళించి, అశ్వత్థామ రథానికి పూన్చిన గుర్రాలను పది బాణాలతో కూల్చాడు. అతడు శల్యుడి తేరునెక్కి, ధృష్టద్యుమ్నుడి శరీరంపై వాడి బాణాలు ప్రయోగించాడు. శల్యుడు, కృపుడు అట్లే బాణాలు గుప్పించారు.

ఈ విధంగా ధృష్టద్యుమ్నుడు ఒక్కడూ ముగ్గురు వీరులతో పోరాడటం దూరం నుంచి చూచి, అభిమన్యుడు తన రథాన్ని తోలుకొని వచ్చి, కృపుడిపై, అశ్వత్థామపై తొమ్మిదేసి అమ్ములు గుప్పినొప్పించారు. శల్యుడి శరీరంపై ఇరువది ఐదు బాణాలు నాటించాడు. వారు కూడ అభిమన్యునిపై పన్నెండు బాణాలు ప్రయోగించారు. ఆ సమయంలో నీ మనుమడు లక్ష్మణ కుమారుడు వచ్చి అభిమన్యుడిని మార్కొని, ఆయువుపట్టులు భేదించే బాణాలు అతడిపై గుప్పించినొప్పించాడు. అభిమన్యుడు - ఏభై అమ్ములు అతనిపై ప్రయోగించి తన చేతి ఒడుపును ప్రకటించాడు.

తే. లస్తకంబున కొలఁదికి లక్ష్మణుండు । వెడఁదయమ్మున నభిమన్యువిల్లు దునియ
నేసి యార్చినఁ గౌరవు లెల్ల నార్వ । నతఁడు వేఱొకబలువింట నతని నొంచె. 86

ప్రతిపదార్థం: లస్తకంబున కొలఁదికి= విల్లు మధ్యభాగాన్ని పిడికిలితో గట్టిగా పట్టుకొని అల్లెత్రాటిని లాగి; లక్ష్మణుండు= లక్ష్మణ కుమారుడు; వెడఁద+అమ్మునన్= నిడివిగల బాణంతో; అభిమన్యు+విల్లు= అభిమన్యుని ధనుస్సు; తునియన్+ఏసి= ఖండించి; ఆర్చినన్= సింహనాదం చేయగా; కౌరవులు+ఎల్లన్+ఆర్వన్= కౌరవులందరు గూడ సింహనాదాలు చేయగా; అతఁడు= అభిమన్యుడు; వేఱు+ఒక= ఇంకొక; బలువింటన్= బలమైన ధనుస్సుతో; అతనిన్= ఆ లక్ష్మణకుమారుని; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: లక్ష్మణకుమారుడు వెడల్పయిన బాణంతో అభిమన్యుడి వింటిని లస్తకము వద్ద తునిగేటట్లుచేసి - సింహనాదం చేశాడు. కౌరవులందరూ గూడ సింహనాదాలు చేశారు. అభిమన్యుడు వేరొక గట్టి వింటితో లక్ష్మణకుమారుని నొప్పించారు.

విశేషం: శత్రువీరుని విల్లు ఖండించడం ఘనకార్యంగా అందరూ భావించేవారు.

క. తనయుఁడు నొచ్చిన దుర్యో । ధనుఁ డర్జునతనయుమీఁదఁ దనతే రలుకం
జన నిచ్చుట గనుఁగొని శాం । తనవద్రోణముఖ రథికతతి వెసఁ గవిసెన్. 87

ప్రతిపదార్థం: తనయుఁడు= కొడుకు; నొచ్చినన్= దెబ్బతినటంచేత; దుర్యోధనుఁడు= దుర్యోధనుడు(లక్ష్మణుడితండ్రి); అర్జున+తనయుమీఁదన్= అభిమన్యునిపై; అలుకన్= కోపంతో; తన+తేరు= తన రథాన్ని; చననిచ్చుట= వెళ్ళేటట్లు చేయటం;

కనుఁగొని= చూచి; శాంతనవ ద్రోణ ముఖ రథిక తతి= భీష్ముడు, ద్రోణుడు, మున్నగు రథికుల సమూహం; వెసన్= శీఘ్రముగా; కవిసెన్= మార్కొనెను.

తాత్పర్యం: తన కొడుకు నొచ్చిన సంగతి తెలిసికొని తండ్రియైన దుర్యోధనుడు అర్జునుని కుమారుడైన అభిమన్యునిపైకి తన రథాన్ని తరలించాడు. దానిని చూచి, భీష్ముడు, ద్రోణుడు మున్నగు వీరులందరూ శీఘ్రంగా అభిమన్యుని మార్కొన్నారు.

క. అతిముతిఁ నడరిన రథికుల । తఱచునకు సుభద్ర కొడుకు దలఁకక తా నం
దఱ కన్నిరూపులై యే । డ్తెఱ నవ్వుచు నేటులాడె ధీరత మెఱయన్. 88

ప్రతిపదార్థం: అతిముతిన్+అడరిన= వేగంగా విజృంభించిన; రథికుల+తఱచునకున్= రథికుల సమూహానికి; సుభద్రకొడుకు= అభిమన్యుడు; తలఁకక= జంకక; తాన్= తాను; అందఱకున్= అందరకు; అన్ని+రూపులు+ఐ= అన్ని ఆకారాలుగా అయి; ఏడ్తెఱన్+నవ్వుచున్= విజృంభణతో నవ్వుతూ; ధీరత+మెఱయన్= ధైర్యం వెలుగొందగా; ఏటులాడెన్= పోరాడాడు.

తాత్పర్యం: వీరాధివీరులు అందరూ చేరి గుంపుగా వచ్చి తన పైబడినప్పటికీ - అభిమన్యుడు ధైర్యంతో వారినందరినీ మార్కొని నవ్వుతూ పోరాటం కొనసాగించాడు.

వ. తదవసరంబున. 89

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

మ. కని తే రుప్పరవీదిఁ దోలుకొని యాకౌరవ్యసైన్యంబు న
జ్జననాథుం దటినీతనూజు గురుఁ జంచద్బాణ వర్షంబులన్
మునుఁగం జేయుచు దేవదత్త మెలమిన్ మ్రోయించుచున్ సంగరా
వని యల్లాడ వియచ్చరుల్ వొగడ వివ్వచ్చుండు వచ్చెన్ వడిన్. 90

ప్రతిపదార్థం: కని= చూచి; తేరు= రథము; ఉప్పర+వీదిన్= ఆకాశమార్గాన; తోలుకొని= నడిపి; ఆ+కౌరవ్య+సైన్యంబున్= ఆ కౌరవసేనను; ఆ+జననాథున్= ఆ రాజునూ(దుర్యోధనుని); తటినీ+తనూజున్= నదీసూనునీ(భీష్ముని); గురున్= ద్రోణాచార్యునీ; చంచత్+బాణ+వర్షంబులన్= చలించే అమ్ములవానలో; మునుఁగన్+చేయుచున్= మునిగేటట్లు చేస్తూ; దేవదత్తము= దేవదత్తం అనే పేరుగల శంఖాన్ని; ఎలమిన్= సంతోషంతో; మ్రోయించుచున్= పూరిస్తూ; సంగర+అవని= రణరంగం; అల్లాడన్= కంపింపగా; వియత్+చరుల్= ఆకాశసంచారులు; పొగడన్= ప్రస్తుతించగా; వడిన్= వేగంగా; వివ్వచ్చుండు= అర్జునుడు; వచ్చెన్= అరుదెంచాడు.

తాత్పర్యం: అభిమన్యుని అనేకవీరులు చుట్టుముట్టడం చూచి, తండ్రియైన అర్జునుడు తన రథాన్ని ఆకాశవీథిలో తోలించుకొని రణరంగానికి వచ్చాడు. వస్తూ వస్తూ కౌరవ సైన్యంపై, దుర్యోధనునిపై, సేనాపతి భీష్మునిపై పలుమారులు బాణవర్షం కురిపించాడు. దేవదత్త శంఖం పూరించాడు. ఆతని ధాటికి రణరంగం కంపించింది. ఆకాశసంచారులు అతనిని కీర్తించసాగారు.

విశేషం: 1. భావాన్ని బట్టి భాషను సంఘటిస్తాడు తిక్కన. 2. అట్లే భావానుగుణంగా ఛందస్సును కూడా ఎన్నుకుంటాడు మహాకవి తిక్కన. ఇక్కడ మత్తేభంలో అర్జునుని రణరంగప్రవేశం వర్ణించటం ఉదాహరణప్రాయం.

వ. అంతయుఁ గనుంగొని యుధిష్ఠిరుండు గడంగి సేనల కెల్లను జేయివీచిన నొక్కపెట్ట యురవడించి కురుసైన్యంబు దలంకం దలపడియె నప్పు డాదిత్యుం గప్పి ధరణీరేణువులు చీఁకట్లు గవియింపం గరితురగనరగాత్ర గళితరుధిరధారాసారం బది యడంగునట్లు సేసె నంత నర్జును వివిధ బాణపాతంబులఁ గౌరవానీకంబునం దునియ లైన శరాసనశరకరవాలపరిఘపరశ్వధాదులును బఱియ లయిన హరిశిరః కుంభికుంభపదాతి కపాలప్రభృతులును దుమురు లైన రథాంగధ్వజఛ్ఛత్రచామర ప్రముఖంబులుం గలిగి కయ్యంపునేల కరంబు ఘోరం బయ్యె నట్టియెడఁ దమమీఁది మానుసులు వడినం జెడి తిరిగెడు హయగజస్యందనంబులును దురంగమాతంగస్యందనంబులు రూపఱిన నేపఱి మెలంగునయ్యె యారోహకులును నై యాకులతం బొంది మనబలంబు దెరలి మరల వెఱచఱచి కనుకనిం బఱచినం గృష్ణార్జునులు పాంచజన్యదేవదత్తంబులు పూరించిన మందాకినీనందనుండు గుంభసంభవున కిట్లనియె. 91

ప్రతిపదార్థం: అంతయున్= సమస్తం; కనుంగొని= చూచి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; కడంగి= పూని; సేనలకున్+ఎల్లను= సైన్యాలకు అన్నిటికీ; చేయి+వీచినన్= చేతిని ఇటునటుకదల్చగా= ప్రోత్సహించగా; ఒక్క+పెట్ట= ఒక్కసారిగా; ఉరవడించి= అతిశయించి; కురు+సైన్యంబు= కౌరవసేన; తలంకన్+తలపడియెన్= చలింపగా మార్కొన్నవి (పాండవసేనలు); అప్పుడు; ఆదిత్యున్+కప్పి= సూర్యుని మరుగుపరచి; ధరణీ రేణువులు= భూమినుండి చెలరేగిన ధూళికణాలు; చీఁకట్లు+కవియింపన్= అంధకారం వ్యాపింపచేయగా; కరి, తురగ, నర, గాత్ర, గళిత, రుధిర, ధారా, ఆసారంబు= ఏనుగులు -గుఱ్ఱాలు, మనుజుల కళేబరాల నుండి జారిన నెత్తుటి చాళ్ళ జడివాన అది= ఆ ధూళిని; అడంగు+అట్లు= సమసిపోయేటట్లుగా; చేసెన్; అంతన్= పిదప; అర్జును, వివిధ, బాణ, పాతంబులన్= అర్జునుని యొక్క పెక్కు అమ్ముల ప్రయోగం వల్ల; కౌరవ+అనీకంబునన్= కౌరవులసేనలో; తునియలు+ఐన= ముక్కలు అయిన; శరాసన, శర, కరవాల, పరిఘ, పరశ్వధ, ఆదులును= ధనువులు, బాణాలు, కత్తులు,ఇనుపగుదియలు, గండ్రగొడ్డళ్ళూ మొదలైనవి; పఱియలు+ఐన= ముక్కలు అయిన; హరి శిరస్+కుంభి కుంభ పదాతి కపాల, ప్రభృతులును= గుఱ్ఱాల తలలు, ఏనుగుల తలలు కాల్బలముల పుఱ్ఱెలు, మొదలయినవి; తుమురులు+ఐన= చిన్న చిన్న ముక్కలు అయిన; రథాంగ ధ్వజ చత్ర చామర ప్రముఖంబులున్= రథచక్రాలు, జెండాలు, ఛత్రాలు, చామరలు మున్నగునవి; కలిగి= ఉండి; కయ్యంపునేల= రణరంగం; ఘోరంబు+అయ్యెన్= భయంకరంగా కనిపించింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; తమ+మీఁది+మానుసులు= తమపై ఎక్కిన మనుష్యులు; పడినన్= కూలగా; చెడి= పాడయి; తిరిగెడు= సంచరించునట్టి; హయ, గజ, స్యందనంబులును= గుఱ్ఱాలు, ఏనుగులు, రథాలున్నూ; తురంగ మాతంగ స్యందనంబులు= గుఱ్ఱాలు, ఏనుగులు, రథాలు; రూపు+అఱినన్= నశించగా; ఏపు+అఱి= అతిశయం నశించి; మెలంగు= తిరుగాడు; అయ్యె= ఆయా; ఆరోహకులును= ఎక్కినవారు; ఐ= అయి; ఆకులతన్+పొంది= కలతచెంది; మన+బలంబు= మన సైన్యం; తెరలి= కలతచెంది; మరలన్= ఇంకను; వెఱచఱచి= భయపడి; కనుకనిన్+పఱచినన్= సంభ్రమంతో పరుగెత్తగా; కృష్ణ+అర్జునులు= కృష్ణుడును, అర్జునుడును; పాంచజన్య+దేవదత్తంబులు= పాంచజన్యం, దేవదత్తం అనే శంఖాలు; పూరించినన్= ఒత్తగా; మందాకినీ నందనుండు= భీష్ముడు; కుంభసంభవునకున్= ద్రోణునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మరాజు చేయెత్తి తనసేనలను పురికొల్పాడు. పాండవసేనలు ఒక్కపెట్టున ఉత్సాహంతో విజృంభించి కౌరవ సేనలను మార్కొన్నాయి. అప్పుడు నేలమీది నుండి రేగిన దుమ్ము సూర్యబింబాన్ని కప్పివేసింది. చీకట్లు క్రమ్మినట్లయింది. అయితే-చనిపోయిన ఏనుగులు, గుఱ్ఱాలు, భటుల దేహాలనుండి స్రవించిన నెత్తుటి ధారలవలన, ఆ దుమ్ము అణగిపోయింది. తరువాత, అర్జునుడు ప్రయోగించిన బాణ పరంపరల వలన కౌరవసేనలో ఖండఖండాలు అయిన విల్లులు, అమ్ములు, కత్తులు, ఇనుపగుదియలు, గండ్రగొడ్డళ్ళు - మరియు ముక్కచెక్కలయిన గుఱ్ఱాల తలలు, ఏనుగుల కుంభస్థలాలు, కాలిభటుల పుఱ్ఱెలు, దట్టంగాపడిపోయిన చక్రాలు, జెండాలు, గొడుగులు, చామరాలు మున్నగు వాటితో రణరంగం భయంకరంగా కన్పించింది.

ఆ సమయంలో, తమమీది మనుష్యులు కూలిపోవటంతో చెడి తిరిగే గుఱ్ఱాలు, ఏనుగులు, రథాలు - గుఱ్ఱాలు, ఏనుగులు, రథాలు చెడిపోతే, దీనులై తిరిగే ఆరోహకులు కలిగి మనసేన భీతితో వెనుకంజ వేసి పారిపోవటం చూచి, కృష్ణుడు, అర్జునుడు విజయగర్వంతో తమ శంఖాలు పాంచజన్యం, దేవదత్తం పూరించారు. అప్పుడు, భీష్ముడు కౌరవసేన దుఃస్థితి గమనించి ద్రోణుడితో ఈ విధంగా చెప్పాడు.

విశేషం: శ్రీకృష్ణుడి శంఖంపేరు పాంచజన్యం. అర్జునుడి శంఖంపేరు దేవదత్తం. వీరులు యుద్ధం చేసేది విల్లు అమ్ములు గదలు మొదలైన ఆయుధాలలో అయినప్పటికీ, శంఖాలు, తప్పెట్లు, భేరులు మొదలైన వాద్యాలు- యుద్ధంలోని ఉత్సాహానికి భారమితులుగా గోచరించేవి. వివిధ వాద్య విశేషాలు పరాక్రమ ప్రతీకలై శౌర్యసంరంభానికి దోహదం కల్పించేవి.

తే. **' కృష్ణసారథ్యమున నొప్పుక్రీడి యిపుడు। కౌరవానీకముల నెల్లఁ గసిమసంగి**
కృష్ణసారథ్యమున నొప్పుక్రీడి యైన। నెట్లు సేయంగవలయుఁ దానట్లు సేసె. **92**

ప్రతిపదార్థం: కృష్ణ+సారథ్యమునన్= శ్రీకృష్ణుడు తన రథాన్ని నడుపుతున్నప్పుడు, ఒప్పు= శోభిల్లు; క్రీడి= అర్జునుడు; ఇపుడు= ఈ సమయంలో; కౌరవ+అనీకములన్+ఎల్లన్= కౌరవసేనలను అన్నింటినీ; కసిమసంగి= సంహరించి; కృష్ణ+సారథ్యమునన్= శ్రీకృష్ణుని నాయకత్వంలో; ఒప్పు= శోభిల్లు; క్రీడి= క్రీడించునట్టివాడు; అయినన్= అయినప్పుడు; ఎట్లు= ఏ రీతిగా; చేయంగవలయున్= చేయాలో; తాను= అర్జునుడు; అట్లు= అదేరీతిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు తన రథానికి సారథియై యుండగా, అర్జునుడు కౌరవసేనలను సంహరించాడు. ఆనాడు- రథం నడపటంలో శ్రీకృష్ణుని మించిన నేర్పుగల సారథి లేడని ప్రసిద్ధి. అంతగొప్ప సారథి లభించటంచేత రథికుడుగా రాణించి అర్జునుడు కౌరవసేనలను చీల్చి చెండాడగలిగాడు. అంతేగాక - శ్రీకృష్ణుని నాయకత్వంలో రథిక వీరుడైన అర్జునుడు గొప్ప ఆటగాడుగా మారిపోయి - ఘోర యుద్ధభూమిని క్రీడారంగంగా చేసికొని వీరవినోద విహారం చేశాడు.

విశేషం: 1. ఈ పద్యంలో మొదటి రెండు పాదాలలో క్రీడి= అర్జునుడు రథికుడు. మూడు నాలుగు పాదాలలో అర్జునుడు= క్రీడి. పద్య పూర్వార్ధంలో కృష్ణుడు - అర్జున విధేయుడు. ఉత్తరార్ధంలో అర్జునుడు శ్రీకృష్ణ విధేయుడు. ఈ మాటలు అన్నది ఎవరు? భీష్ముడు. భీష్ముడి దృష్టిలో శ్రీకృష్ణుడు జగన్నాటక సూత్రధారి. సాక్షాత్తు పరమాత్మ, అవతారమూర్తి. ఆనాడు జగదేక ధనుర్ధరుడుగా ప్రసిద్ధికెక్కిన తాను కౌరవసేనాపతి యైనప్పటికీ - అర్జునుడు తాను చూస్తూ ఉండగనే కౌరవసేనలను చీల్చి చెండాడగలిగాడు. భీష్ముని దృష్టిలో - అర్జునుడికి ఆ శక్తి సామర్థ్యాలు కలగటానికి కారణం శ్రీకృష్ణ సారథ్యం.

2. శ్రీకృష్ణుడు ఆదర్శకర్మయోగి. అతని దృష్టిలో - నీచకర్మ లేనేలేదు. ఉదాహరణకు ఆతడు సారథి భూమికను ధరించేవాడు. గుఱ్ఱాలకు దాణా వేసేవాడు. వాటికి స్నానం చేయించేవాడు. రాజసూయయాగ సూత్రధారి శ్రీకృష్ణుడు. జరాసంధ కథకు హేతువు భీముని శక్తికంటె శ్రీకృష్ణుని యుక్తియే ఎక్కువ కారణం అని చెప్పవచ్చు. రాజసూయయాగంలో అతిథులు భోజనం ముగించిన పిమ్మట శ్రీకృష్ణుడు ఎంగిలి విస్తళ్ళు ఎత్తినట్లు జనశ్రుతిలో ప్రచారంలో ఉన్న జానపద గాథ.

క. **విను మలుక వొడమి మిక్కిలి। కనుదెఱచిన త్రిపురవైరి కైవడి యీ య**
ర్జుననందుఁ దోఁచుచున్నది। మనమొనలున్ వశముగావు మరలుపు మింకన్. **93**

ప్రతిపదార్థం: వినుము= ఆలకింపుము; అలుక+పొడమి= కోపంవచ్చి; మిక్కిలి+కను+తెఱచిన= అధికమైన కన్ను అనగా మూడవకన్ను విప్పిన; త్రిపుర+వైరి+కైవడి= పరమశివుడి రీతి; ఈ+అర్జును+అందున్= ఈ అర్జునుడిలో; తోఁచుచున్నది= కనపడుతున్నది; మన+మొనలున్= మన సేనలు; వశము+కావు= మన అధీనంలో లేవు; ఇంకన్+ఇకమీద; మరలుపుము= (పారిపోయే) సేనలను మళ్ళించుమనది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అర్జునుడినిచూస్తే, అతడు మూడవకన్ను విప్పిన పరమ శివుడుగా కనిపించుతున్నాడు. మన సేనలు మన అధీనంలో లేవు. పారిపోయే సేనలను మళ్ళించుము.

విశేషం: 1. త్రిపుర+వైరి= శివుడు -'త్రిపుర'ములు నాశనం చేసినట్లు పురాణకథనం. కొందరు పండితులు 'త్రిపురములు' హరప్పా నాగరికతకు చెందినవనీ, ఆర్యుల దేవుడు శివుడు వాటిని నాశనం చేశాడనీ, ఆర్యులు గ్రామీణ నాగరికతకు చెందినవారనీ ఒకవాదం లేవదీశారు. ఈవాదంలోని సత్యాసత్యాలు భావి పరిశోధనల వలన తేలవలసినట్టివే. 2. శివుడు ఫాలనేత్రుడనీ - ఆతని మూడవ కన్ను ప్రళయాగ్ని సదృశమనీ పురాణకథనం.

వ. పోక నిలిచిన బలు మానుసులుం బెద్దయు డస్సి యోహటించినయట్లున్నవారు వారిజ మిత్త్రుండు నపరగిరిశిఖరంబునకుం జేరె' నేఁటికిఁ గయ్యంబు సాలింత మని చెప్పి యతం డియ్యకొన నెల్లవారలం దివియ నియమించి నడపించె నప్పడు పాండవులు పాంచాల మాత్స్యాది పరివార సహితంబుగా నార్పులు సెలంగి నింగి ముట్ట మరలి రిట్లు రెండవనాఁటి సంధ్యాసమయంబున రెండుదెఱంగులవారును దమతమ శిబిరంబులకుం జనిరి; మఱునాఁడు. 94

ప్రతిపదార్థం: పోక+నిలిచినన్= పారిపోకుండా నిలువగా; బలుమానుసులు= గొప్ప భటులు; పెద్దయున్= మిక్కుటముగా; డస్సి+ఓహటించిన+అట్లు+ఉన్నవారు= బడలి వేసారినట్లు కన్పించుతున్నారు; వారిజమిత్త్రుండు= పద్మమిత్రుడు, సూర్యుడు; అపర గిరి శిఖరంబునకున్= పడమటికొండ కొనకు; చేరెన్; నేఁటికిన్= ఈరోజుకు; కయ్యంబు+చాలింతము= యుద్ధం విరమించుదాము; అని+చెప్పి; అతండు= ద్రోణుడు; ఇయ్యకొనన్= అంగీకరించగా; ఎల్లవారలన్= అందరినీ; తివియన్+నియమించి= మరలుటకు ఆజ్ఞాపించి; నడపించెన్= సైన్యమును నడపించాడు; అప్పుడు= ఆ సమయంలో; పాండవులు; పాంచాల మాత్స్య+ఆది+పరివార, సహితంబుగాన్= పాంచాలురు, మత్స్యదేశానికి సంబంధించినవారు మున్నగు అనుచరులతో పాటు; ఆర్పులు+చెలంగి+నింగి+ముట్టన్= సింహనాదాలు మ్రోగి ఆకాశం అంటగా; మరలిరి= తమతమ నివాసాలకు వెనుదిరిగి వెళ్ళారు; ఇట్లు= ఈ విధంగా; రెండవనాఁటి= రెండవరోజు; సంధ్యా+సమయంబున్= సంజవేళ(సూర్యాస్తమయ సమయం పిమ్మట); రెండు+తెఱంగుల వారును= రెండు పక్షాలవారును, కౌరవ పాండవసేనలలోని వారలు; తమ తమ శిబిరంబులకున్= తమ తమ స్కంధావారాలకు, తాము విడిదిచేసిన చోట్లకు; చనిరి= వెళ్ళారు; మఱునాఁడు= ఆపై దినమున.

తాత్పర్యం: "పారిపోకుండా రణరంగంలో నిలిచిన పోటరులైన భటులుకూడా, బడలి వేసారి ఉన్నారు. సూర్యుడు అస్తమించుతున్నాడు. నేడు ఇంక యుద్ధం ఆపటం మంచిది' అని భీష్ముడు చెప్పాడు. ద్రోణుడు అతని మాటకు అంగీకరించాడు. అప్పుడు భీష్ముడు అందరినీ యుద్ధభూమి నుండి నిష్క్రమించమని ఆజ్ఞాపించి కౌరవసేనలను మరలించాడు. పాండవులు పాంచాల సేనలు, మత్స్యసేనలు మున్నగు అనుచరులతోపాటు సింహనాదాలు చెలరేగి ఆకాశం అంటుతుండగా తమ తమ శిబిరాలకు తరలివెళ్ళారు. ఇది రెండవనాటి సాయంకాలం జరిగిన యుద్ధంతీరు. మరునాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

భీష్ముని తృతీయ దివస యుద్ధము (సం. 6-52-1)

క. రేపకడ రభసమున గం । గాపుత్త్రుఁడు సేనఁ గూర్చి గరుడవ్యూహం
బేపారఁ దీర్చికొని ము । క్కై పొలుపును బలుపు మెఱయునట్లుగ నిలిచెన్. 95

ప్రతిపదార్థం: రేప+కడ= ప్రొద్దుపొడుపు వేళ; రభసమునన్= తొందరగా; గంగా పుత్రుడు= భీష్ముడు; సేనన్+కూర్చి= సేనను ప్రోగుచేసి; గరుడ వ్యూహంబు+ఏపారన్= గరుడాకారంగా ఉండే వ్యూహాన్ని అతిశయించేటట్లు; తీర్చికొని= తీర్చిదిద్ది; ముక్కు+ఐ=

తాను ఆ గరుడ వ్యూహానికి "ముక్కు" స్థానంలో నిలిచి; పొలుపును+బలుపు+మెఱయు+అట్లుగన్= అందమూ బలమూ ప్రకటమగునట్లుగా; నిలిచెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: తెల్లవారగానే, భీష్ముడు కౌరవసేనలను అన్నిటినీ ప్రోగుచేసి 'గరుడవ్యూహం'గా తీర్చిదిద్దాడు. తాను ఆ గరుడాకారంలో ఉన్న ఆ వ్యూహానికి 'ముక్కు'గా నిలబడ్డాడు. భీష్ముడు 'ముక్కు' స్థానంలో నిలబడడం చేత ఆ వ్యూహానికి అందం, బలం కూడా చేకూరాయి.

వ. దానికి ద్రోణకృతవర్మలు కన్ను లయిరి కృపాశ్వత్థామలు శిరం బయి నిలిచిరి త్రిగర్తులతోఁ గూడి భూరి శ్రవశ్శల్య భగదత్తులును సౌవీరజయద్రథులును గంఠత్వంబు నొందిరి మనుజపతి యనుజులుం దానును వెన్నయ్యె విందానువిందులుం గాంభోజుండును శూరసేనుండునుం బుచ్ఛం బైరి మాగధకళింగాదిగణంబులు దక్షిణపక్షం బయ్యును గర్ణాటకోసలప్రముఖనికాయంబులు వామపక్షం బయ్యును బొలిచిరి తక్కునుం గలవారలుఁ గలయం బన్ని రంతం బాండవబలంబులును భండనంబునకు వెడలె నయ్యవసరంబున నర్జునుండు. 96

ప్రతిపదార్థం: దానికిన్= ఆ గరుడవ్యూహానికి; ద్రోణ+కృతవర్మలు= ద్రోణుడు కృతవర్మ; కన్నులు+అయిరి= నేత్రాలు అయ్యారు; కృప+అశ్వత్థామలు= కృపాచార్యుడు, అశ్వత్థామ;శిరంబు+అయి= తల అయి; నిలిచిరి= నిలబడ్డారు, త్రిగర్తులతోన్+కూడి= త్రిగర్తులు అనేవారితో కలిసి; భూరిశ్రవస్+శల్య భగదత్తులును= భూరిశ్రవుడు, శల్యుడు, భగదత్తుడు, సౌవీర, జయద్రథులును= సౌవీరరాజు; (సింధురాజు); జయద్రథుడు; కంఠత్వంబున్+ఒందిరి= కుత్తుకభావం పొందారు; మనుజపతి= రాజు(దుర్యోధనుడు); తానును+అనుజులున్= తాను తన తమ్ములు; వెన్ను+అయ్యెన్= వీపుగా అయ్యారు; వింద+అనువిందులున్= విందుడును, అనువిందుడును; కాంభోజుండును= కాంభోజరాజూ; శూరసేనుండునున్= శూరసేన రాజూ; పుచ్ఛంబు+అయిరి= తోక అయినారు; మాగధ కళింగాది గణంబులు= మగధకు, కళింగానికి చెందిన సేనలు; దక్షిణ+పక్షంబు+అయ్యును= కుడి రెక్కగాను; కర్ణాట కోసల ప్రముఖ నికాయంబులు= కర్ణాటదేశం, కోసలదేశం - మున్నగు దేశాలకు సంబంధించిన సేనా సమూహాలు, వామపక్షంబు+అయ్యును= ఎడమ రెక్కగాను; పొలిచిరి= శోభిల్లారు; తక్కునున్+కలవారలున్= మిగిలినట్టివారు; కలయన్+పన్నిరి= ఇటూ, నటూ కలిసి పోయేట్లుగా చేరారు; అంతన్= పిమ్మట; పాండవ+బలంబులును= పాండవుల సేనలును; భండనంబునకున్= యుద్ధానికి; వెడలెన్= వెళ్ళాయి; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; అర్జునుండు.

తాత్పర్యం: గరుడాకారంలో ఏర్పడిన ఆ వ్యూహానికి ద్రోణుడు, కృతవర్మ కన్నులుగా నిలిచారు. కృపుడు, అశ్వత్థామ శిరస్సు అయ్యారు. త్రిగర్తులు - భూరిశ్రవుడు - శల్యుడు - భగదత్తుడు సౌవీరరాజు సింధుభూపతి జయద్రథుడు కంఠంగా అయ్యారు. దుర్యోధనుడు - తమ్ములు వీపు అయ్యారు. విందుడు, అనువిందుడు, కాంభోజరాజు, శూరసేనరాజు తోక అయ్యారు. మాగధరాజు - కళింగరాజు మున్నగువారు కుడి రెక్క అయ్యారు. కర్ణాట కోసల సేనలు మున్నగునవి ఎడమరెక్క అయ్యాయి. తక్కినవారు ఇటు అటు సర్దుకున్నారు. అప్పుడు పాండవసేనలు కూడా, యుద్ధభూమికి తరలివెళ్ళాయి. ఆ సమయంలో అర్జునుడు (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మనమొనఁ గని ధృష్టద్యు। మ్నున కిట్లనుఁ బన్నఁబంపు మోహర మర్ధేం
దుని చందంబున దుర్యో। ధనుసైన్యముఁ బొదువుననువు దలకొనవలయున్. 97

ప్రతిపదార్థం: మన+మొనన్= మన సైన్యాన్ని; కని= చూచి; ధృష్టద్యుమ్నునకున్= ధృష్టద్యుమ్నునితో; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; మోహరము= వ్యూహాన్ని; అర్ధ+ఇందుని+చందంబునన్= అర్ధచంద్రుని ఆకారంలో; పన్నన్+పంపు= పన్నుట కాజ్ఞాపించుము; దుర్యోధను+సైన్యమున్= దుర్యోధనుని సైన్యమును; పొదువు= మార్కొనే; అనువు+తలకొనన్+వలయున్= అనుకూలత ఏర్పడాలి.

తాత్పర్యం: అర్జునుడు కౌరవసేనను చూచి ధృష్టద్యుమ్నుడితో ఈ రీతిగా చెప్పాడు. 'అర్ధచంద్రాకారంలో మన వ్యూహాన్ని అమర్చవలసింది. ఎందుకంటే దుర్యోధనుడి వ్యూహాన్ని ఛేదించే ఉపాయం మనం అనుసరించాలి గదా!'

విశేషం: వ్యూహాన్ని బట్టి - ప్రతివ్యూహం ఉంటుంది. కౌరవులు గరుడవ్యూహం పన్నారుకదా! పాండవులు అర్ధచంద్రాకార వ్యూహం పన్నితే-గరుడపక్షి కుత్తుక ఉత్తరించటానికి వీలు కలుగుతుంది.

వ. **అనిన విని యతం డట్లు చేసినం బాండ్యమగధబలపరివృతుం డై భీమసేనుండు దక్షిణశృంగంబున నిలిచెఁ దదనంతరంబ విరాటద్రుపదులును మఱియు నీలుండును గాశకరూశగణసమేతుండై ధృష్టకేతుండును నిలిచిరి శిఖండి సహితుం డగు ధృష్టద్యుమ్ను మున్నిడికొని యుధిష్ఠిరుండు శుండాలమాలికాభీలంబుగా మధ్యప్రదేశం బలంకరించె నవ్వలన సాత్యకి మొదలుకొని యొలిన కవలును ద్రౌపదేయులు నభిమన్యుండు ఘటోత్కచుండుఁ గేకయపతులుం బన్నిరి సకలలోకంబులకు రక్షకుండైన రాజీవాక్షుం డెవ్వానికి రక్షణం బొనర్చు నట్టి రథికశ్రేష్ఠుండు డాపలికొమ్మునం బన్నెఁ దక్కటి దొరలుం గలయమోహరించిరి ట్లుభయసైన్యంబులు సన్నద్ధంబు లయి నడచి నిస్సాణాదుల రావంబులు సెలంగ రౌద్రంబు దలకొనం దార్కొనియెఁ దత్సమయంబున ధనంజయుండు మన పదాతులు బడలువడం దనరథంబు వఱపించి శరంబులు నిగిడించి.** **98**

ప్రతిపదార్థం: అనినన్+విని= అని అర్జునుడు చెప్పగా ఆలకించి; అతండు= ధృష్టద్యుమ్నుడు; అట్లు+అ+చేసినన్= ఆ విధంగా చేయగా; పాండ్య, మగధ, బల పరివృతుండు+ఐ= పాండ్య మగధ సేనలు తన చుట్టూచేరగా; భీమసేనుండు; దక్షిణ+శృంగంబునన్= దక్షిణముననున్న కొసకు; నిలిచెన్; తద్+అనంతరంబు+అ= అటుపిమ్మట; విరాట ద్రుపదులును= విరాటుడు, ద్రుపదుడును; మఱియున్= అదనంగా; నీలుండును= నీలుడును; కాశ కరూశ గణ సమేతుండు+ఐ= కాశీదేశానికి, కరూశదేశానికి సంబంధించిన సేనలతో కూడినవాడై; ధృష్టకేతుండును= ధృష్టకేతుడును; నిలిచిరి; శిఖండి సహితుండగు= శిఖండితో కూడుకొనిన; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుని; మున్ను+ఇడికొని= ముందుపెట్టుకొని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; శుండాల+మాలికా+ఆభీలంబుగా= ఏనుగుల గుంపువలె భయంకరంగా; మధ్య+ప్రదేశంబు= నడిమిచోటును; అలంకరించెన్= అందముగా చోటు చేసుకున్నాడు; ఆవలనన్= అటువైపు; సాత్యకి+మొదలుకొని= సాత్యకి మొదలగువారు; ఓలిన్+ఆ= వరుసగా; కవలును= కూడిన నకుల సహదేవులును; ద్రౌపదేయులు= ద్రౌపది కొడుకులు; అభిమన్యుండు; ఘటోత్కచుండున్; కేకయపతులున్= కేకయరాజులును; పన్నిరి= వ్యూహంలో చేరారు; సకల లోకంబులకున్= అన్ని లోకాలకు; రక్షకుండు+ఐన= కాపాడే వాడైన; రాజీవాక్షుండు= పద్మనయనుడు, శ్రీకృష్ణుడు; ఏ+వానికిన్+రక్షణంబు+ఒనర్చున్= ఎవనిని కాపాడుచుండునో; అట్టి= అటువంటి; రథిక+శ్రేష్ఠుండు= తేరెక్కి యుద్ధం చేసేవారిలో గొప్పవాడు, అర్జునుడు; డాపలి+కొమ్మునన్+పన్నెన్= ఎడమకొసగా చేరాడు; తక్కటి+దొరలున్= మిగిలినరాజులు; కలయన్+మోహరించిరి= కలిసిపోయేటట్లుగా వ్యూహంలో చేరారు; ఇట్లు= ఈ రీతిగా; ఉభయ సైన్యంబులున్= రెండుసేనలు; సన్నద్ధంబులు+ఐ= సంసిద్ధమై; నడచి= దండు వెడలి; నిస్సాణ+ఆదుల+రావంబులు= బూరాలు మొదలగు వాద్యాల ధ్వనులు; చెలంగన్= ధ్వనించగా; రౌద్రంబు= అధికకోపం; తలకొనన్= వ్యాపింపగా; తార్కొనియెన్= మార్కొన్నాయి; తద్+సమయంబునన్= ఆ కాలంలో; ధనంజయుండు= అర్జునుడు; మన పదాతులు= మన కాలిబంటులు; బడలు+పడన్= డస్సిపోవునట్లుగా; తన+రథంబు= తన తేరు; వఱపించి= నడిపించి; శరంబులు= బాణాలు; నిగిడించి= ప్రయోగించి.

తాత్పర్యం: అర్జునుని సూచన మేరకు ధృష్టద్యుమ్నుడు పాండవ సేనను అర్ధచంద్రవ్యూహంగా అమర్చాడు. భీముడు- పాండ్య మగధ సేనలతో కూడిన వాడై, కుడి కొసను నిలిచాడు. అటుపిమ్మట విరాటుడు, ద్రుపదుడు నిలిచారు. నీలునితోపాటుగా ధృష్టకేతుడు కాశీదేశ కరూశదేశ సేనలతో పాటు నిలిచాడు. శిఖండితోపాటు ధృష్టద్యుమ్నుని ముందు పెట్టుకొని, యుధిష్ఠిరుడు తన చుట్టూ ఏనుగుల దండును కాపుగా పెట్టుకొని వ్యూహానికి

మధ్యగా నిలిచాడు. అటు ప్రక్కగా సాత్యకి, నకుల సహదేవులు, ద్రౌపది కొడుకులు, అభిమన్యుడు, ఘటోత్కచుడు, కేకయరాజులు వ్యూహంలో భాగంగా నిలిచారు. జగద్రక్షకుడైన శ్రీకృష్ణుడు రథసారథిగా గల అర్జునుడు ఎడమ కొసను నిలిచాడు. మిగిలిన రాజులు యథోచిత స్థానాలలో నిలిచారు. ఆ విధంగా ఉభయసేనలూ యుద్ధానికి సంసిద్ధమై బూరాలు మొదలైన వాద్యాల ధ్వనులు మిన్నుముట్టగా, మిక్కిలి రోషంతో మార్కొన్నాయి. ఆ సమయంలో అర్జునుడు విజృంభించి, కౌరవసేనలలోని కాల్బలాన్ని చీకాకు పరచాడు.

విశేషం: 1.ఈ వ్యూహ రచనలో గమనింపవలసిన అంశాలు: ఇది కౌరవులు పన్నిన గరుడవ్యూహానికి ప్రతివ్యూహం. గరుడాకృతి వ్యూహంలో కుత్తుక ఉత్తరించటానికి - అర్ధచంద్రవ్యూహం అమర్చబడింది. ఒక కొసలో ధృష్టద్యుమ్నుడు, మరియొక కొసలో అర్జునుడు సుదూరంలో ఉన్నారు. ఇక - మధ్యభాగం ఏమికావాలి? అక్కడ ధర్మరాజు నిలిచాడు. అతనికి తగిన రక్షణ కావాలి. చుట్టూ ఏనుగులు. వాటికి చుట్టు సాత్యకి - కవలు - ద్రౌపదేయులు- అభిమన్యుడు - ఘటోత్కచుడు. 2. ఉపపాండవులు - ఒకేచోట ఉంటారు ఏ వ్యూహంలో అయినా - అట్లే నకుల సహదేవులుకూడా. 3. ఏ దేశానికైనా - ఒక ప్రభువు ఉంటాడు. ఉదాహరణకు విరాటుడు, ద్రుపదుడు మొదలుగా కేకయ దేశానికి మాత్రం కేకయ రాజులు అని బహువచన ప్రయోగమే భారతంలో అన్ని చోట్లా కన్పిస్తుంది. అది 'బహురాజుల' ఆధిపత్యంగల గణతంత్ర రాజ్యాంగం కావున.

క. అరదములు రథికవరులును। హరి సారథి కేతుసహిత మై పొడిపొడిగాఁ
గరులును జోదులు దొల్లఁగఁ। దురగంబులు రావుతులును దుత్తునియలుగన్. 99

ప్రతిపదార్థం: అరదములు= రథాలు; రథిక వరులును= తేరెక్కి యుద్ధం చేసే వీరులు; హరి సారథి కేతు సహితము+ఐ= గుర్రాలు, తేరు నడిపే సూతులు= జెండాలతో కూడ; పొడిపొడిగాన్= చూర్ణము అయ్యేటట్లుగా; కరులును= ఏనుగులు; జోదులు= భటులు; డొల్లఁగన్= కూలిపోగా; తురగంబులు= గుర్రాలు; రావుతులును= గుర్రాలపై ఎక్కి యుద్ధంచేసే భటులూ; తునియలు+తునియలుగాన్= ముక్కలు ముక్కలుకాగా; (అర్జునుడు యుద్ధం చేయగా)

తాత్పర్యం: రథాలు, రథాలపై ఎక్కి యుద్ధం చేసే వీరులూ, గుర్రాలు - సారథులు జెండాలతోపాటు పొడిపొడి అయ్యేటట్లు అర్జునుడు అమ్ములు ప్రయోగించాడు. ఏనుగులు- భటులు కూలారు. గుర్రాలు, గుర్రాలను ఎక్కి యుద్ధం చేసేవాళ్ళూ. ముక్కలుగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. చేయఁ దొడంగిన గాంధా। రేయులు వెస నొక్కపెట్ట రేఁగి యతనిపైఁ
గో యని కవిసినఁ గని కౌం। తేయులు నందఱుఁ గడంగి తేరులు పఱపన్. 100

ప్రతిపదార్థం: చేయన్+తొడంగినన్= ముక్కలు చేయసాగిన; గాంధారేయులు= గాంధారి కొడుకులు(కౌరవులు); వెసన్= వేగంగా; ఒక్క+పెట్ట+రేఁగి= ఒకేమారు విజృంభించి; అతనిపైన్= అర్జునుడిపై; 'కో'+అని+కవిసినన్= గోల చేస్తూ మార్కొనగా; కౌంతేయులు+అందరు= పాండవులు అందరూ; కడంగి= పూని; తేరులు= రథాలు; పఱపన్= తోలగా.

తాత్పర్యం: అర్జునుడు కౌరవసేనను విధ్వంసం చేయగా, కౌరవులు అందరూ ఏకమై అతనిపై మార్కొన్నారు. దానితో పాండవులు అందరూ ఏకమై వారిపైకి తమరథాలను మళ్ళించగా.

విశేషాలు: 'కోయని కవిసిన' - అది ఎక్కటి కయ్యం కాదు. అది సంకుల సమరం. అందరూ కలిసి- శత్రుసేనను తాకేటప్పుడు అది మౌనంగా అమ్ములు ప్రయోగించడం కాదు. ఆ దొమ్మి సంరంభంలో 'హెచ్చరికతో కూడిన 'నినాదం' వహించే భూమిక అర్థం చేసుకోవాలి. 'కో' అని మార్కొనిన అనే ప్రయోగం సార్థకం. 'కో' ధ్వని అనుకరణ.

వ. కని తమకించి బలంబులు రెండును గలయన్ బెరయఁ గెందూళి యెగసిన. 101

ప్రతిపదార్థం: కని= చూచి; తమకించి= ఉత్సహించి; బలంబులు రెండును= ఉభయసైన్యాలు, కౌరవపాండవసేనలు రెండూ; కలయన్ బెరయన్= మార్కొనగా; కెంపు+దూళి= కెందూళి(ఎర్రని దుమ్ము); ఎగసినన్= ఎగురగా;

తాత్పర్యం: కురు పాండవుల సేనలు రెండు తారసిల్లి యుద్ధం చేస్తుండగా కెందూళి ఎగరగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నామములఁ బితృపితామహ । నామంబుల నుగ్రబిరుదనామంబుల సాం
గ్రామికు లెఱిఁగింతురు దము । నా మొన నీ మొనను జూపు లడరక యున్నన్. 102

ప్రతిపదార్థం: నామములన్= పేరులతో; పితృ+పితామహ+నామంబులన్= తండ్రి తాతల పేరులతో; ఉగ్ర+బిరుద+నామంబులన్= భయంకరములైన బిరుదుల పేరులతో; సాంగ్రామికులు= యుద్ధం చేసేవారు; తమున్= తమ్ము; ఆ మొనన్+ఈ మొనన్= ఆ సేనయందు ఈ సేనయందు, (పాండవుల సేనయందు , కౌరవసేనయందు); చూపులు+అడరక+ఉన్నన్= కన్నులు కనుపించక ఉన్నప్పుడు; ఎఱిఁగింతురు= తెలియచేసుకుంటారు.

తాత్పర్యం: ఎవరెవరో - ఎవరికీ తెలియని ఆ సమయంలో యుద్ధం చేసేవారు తామెవరో తెలిసేటట్లుగా - బిగ్గరగా తమ పేరులు - తమ తండ్రుల పేరులు, తాతల పేరులు తమ బిరుదులు ప్రకటించుకుంటారు.

విశేషం: తిక్కన కాలంలో, తదుపరి భారతదేశ చరిత్రలో మధ్యయుగాలలో 'బిరుదావళులు' మిక్కిలి ప్రాముఖ్యం వహించాయి. 'గండరగండ', 'మూరురాయరగండ' ఉదాహరణప్రాయాలు.

తే. ఇవ్విధంబునఁ గ్రందుపా టింతయైన । భీష్ము కడఁక నీ సైన్యంబు భీముబలిమిఁ
జేసి యా సేనయును నప్డు సిక్కు వడక । పోరె నేమని చెప్పదుఁ గౌరవేంద్ర! 103

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కౌరవ శ్రేష్ఠుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఈ+విధంబునన్= ఈ రీతిగా; క్రందుపాటు= సమ్మర్దం; ఇంత+ఐన= ఇంతగా విస్తరించగా; భీష్ము+కడఁకన్= భీష్ముని యొక్క పూనికచే; నీ+సైన్యంబు= నీ సేన; భీము+బలిమిన్+చేసి= భీముని యొక్క శక్తిచేత; ఆ+సేనయును= ఆ పాండవుల సైన్యం; అప్డు= ఆ సమయంలో; చిక్కు+పడక= చీకాకుకాకుండా; పోరెన్= యుద్ధం చేశాయి; ఏమి+అని+చెప్పుదున్= ఇంక ఏమి చెప్పగలను?

తాత్పర్యం: ఈ రీతిగా సమ్మర్దం ఇంతగా సాగింది. భీష్ముడి నాయకత్వంలో కౌరవసేన, భీముడి నాయకత్వంలో పాండవసేన - ఒకరినొకరు మార్కొన్నారు. ఏ పక్షమూ వెనుకంజ వేయలేదు, జంకలేదు. ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఉభయపక్షాల పరాక్రమమూ వర్ణనాతీతం.

విశేషం: 'ఏమని చెప్పుదు' అనే ప్రయోగంలోని సారస్యం గమనింపదగినట్టిది. ఘోరమైన పోరాటంలో ఉభయసేనలు చూపిన తెగువ, తెంపు - చూపరియైన సంజయుడికి ఆశ్చర్యావహాలుగా కనుపించాయి.

క. శోణితము వెల్లి గవిసిన । రేణు వడంగుటయు మొనలు ప్రియపడి వెస గీ
ర్వాణాసురసమరము క్రియ । బాణాదినిశాతహేతిపంక్తులు మెఱయన్. 104

ప్రతిపదార్థం: శోణితము+వెల్లి= నెత్తుటి ప్రవాహం; కవిసినన్= క్రమ్మగా; రేణువు= దుమ్ము; అడంగుటయున్= అణగిపోవుటయు; మొనలు= సేనలు; ప్రియపడి= సంతోషించి; వెసన్= వేగంగా; గీర్వాణ+అసుర+సమరము క్రియన్=

దేవతల రాక్షసుల యొక్క యుద్ధంవలె; బాణ+ఆది+నిశాత+హేతి+ పంక్తులు= అమ్ములు మొదలైన వాడి కత్తుల వరుసలు; మెఱయన్= ప్రకాశింపగా.

తాత్పర్యం: కురు పాండవసేనల తాకిడికి దుమ్ము చెలరేగింది. అంత దుమ్ము ఏ విధంగా అణగారగలదు? యుద్ధంలో ప్రవహించిన నెత్తుటి ధారలచే ఆ దుమ్ము అణగింది. కురు పాండవ సేనల యుద్ధం - దేవతలు రాక్షసులు చేసిన యుద్ధంవలె ఉన్నది. బాణాలు మొదలైన వాడి ఆయుధాల వరుసలు ప్రకాశించాయి.

విశేషం: ఈ పద్యంలో 'ప్రియపడి' అనే ప్రయోగం గమనింపదగినట్టిది. ఘోర సంగ్రామంలో 'ప్రియపడటం' ఏమిటి? దట్టంగా క్రమ్మిన దుమ్ము అణగారటం వీరులకు సంతోషదాయకమే. ఇక నెత్తురు ప్రవాహం మాట ఏమిటి? అది యుద్ధం. వీరులు చావుకు తెగించినవారు. వారికి నెత్తురు అన్న భయంలేదు.

వ. పెనంగునట్టియెడ గాంగేయుండును గురుండును బురుమిత్త్రుండును సైంధవుండును సౌబలుండును వికర్ణుండును బాండవసేనపయి నడరిన భీమసేన ఘటోత్కచసాత్యకిశైబ్యచేకితానద్రౌపదేయులు వారిం దలపడినం బోరు ఘోరం బయ్యె నప్పుడు రథబృందంబులతో భవదగ్రనందనుండు వాయునందన తదీయనందను లున్నయెడకు నురవడించినం గని భీష్మద్రోణు లతని మించి వారలం దాఁకినం జూచి సవ్యసాచి యగ్రజు నగ్రభాగంబునకు వచ్చి. 105

ప్రతిపదార్థం: పెనంగునట్టి+ఎడన్= పోరాడేటపుడు; గాంగేయుండును= భీష్ముడును; గురుండును= ద్రోణుడును; పురుమిత్త్రుండును= పురుమిత్రుడును; సైంధవుండును= సింధురాజును; సౌబలుండును= శకునియు; వికర్ణుండును; పాండవ సేనపయిన్= పాండవుల సైన్యంపై; అడరినన్= విజృంభించగా; భీమసేన ఘటోత్కచ సాత్యకి శైబ్య చేకితాన ద్రౌపదేయులు= భీముడు, ఘటోత్కచుడు, సాత్యకి, శైబ్యుడు, చేకితానుడు, ద్రౌపది కొడుకులూ; వారిన్= కౌరవులను; తలపడినన్= మార్కొనినపుడు; పోరు= యుద్ధం; ఘోరంబు+అయ్యెన్= భీకరం అయింది; అప్పుడు= ఆ సమయంలో; రథ+బృందంబులతోన్= తేరుల గుంపులతో; భవత్+అగ్ర+నందనుండు= నీ పెద్ద కొడుకు(దుర్యోధనుడు);వాయునందన+తదీయనందనులు+ఉన్న+ఎడకున్= భీముడు-అతని కొడుకు ఘటోత్కచుడు ఉన్న చోటికి; ఉరవడించినన్= ఉత్సాహంతో తరలివెళ్ళగా; కని= చూచి; భీష్మ ద్రోణులు= భీష్ముడు, ద్రోణుడు; అతనిన్ మించి= ఆ దుర్యోధనుని దాటి; వారలన్= పాండవపక్షంలోని వీరులను; తాఁకినన్= మార్కొనగా; చూచి; సవ్యసాచి= కవ్వడి(అర్జునుడు); అగ్రజు+అగ్రభాగంబునకున్= అన్నగారైన భీముని ముందునకు; వచ్చి.

తాత్పర్యం: కురుపాండవసేనలు యుద్ధం చేస్తున్నప్పుడు, భీష్ముడు, ద్రోణుడు, పురుమిత్రుడు, సైంధవుడు, శకుని, వికర్ణుడు పాండవసేనపై విజృంభించారు. భీముడు, ఘటోత్కచుడు, సాత్యకి, శైబ్యుడు, చేకితానుడు, ద్రౌపదీపుత్రులు వారిని మార్కొన్నారు. ఘోర యుద్ధం జరిగింది. అప్పుడు, రథసమూహాలతో దుర్యోధనుడు భీముడూ అతడి కొడుకు ఘటోత్కచుడూ ఉన్న చోటికి ఉత్సాహంతో తరలి వెళ్ళటం చూచి, భీష్ముడూ ద్రోణుడూ అతనిని దాటి వెళ్ళి వారిని మార్కొన్నారు. అదిచూచి, అర్జునుడు భీముని ముందర చేరి.

క. భూరిశరాసారంబునఁ । గౌరవుల కడంక యుడిపె గాంధారబలాం
భోరాశిఁ దఱియఁ జొచ్చిరి । వీరాగ్రణి సాత్యకియును విజయసుతుండున్. 106

ప్రతిపదార్థం: భూరి+శర+ఆసారంబునన్= గొప్పదైన అమ్ముల జడివానచే; కౌరవుల+కడంక+ఉడిపెన్= కౌరవుల విజృంభణ అరికట్టెను; గాంధార+బల+అంభస్+రాశిన్= గాంధారసేన అనే సముద్రాన్ని; వీర+అగ్రణి= వీరులలో శ్రేష్ఠుడు; సాత్యకియును= సాత్యకీ; విజయ+సుతుండున్= అర్జునుని కొడుకు అయిన అభిమన్యుడూ; తఱియన్+చొచ్చిరి= మథించసాగారు.

తాత్పర్యం: గొప్ప అమ్ముల జడివాన కురిపించి, కౌరవుల విజృంభణ అరికట్టాడు అర్జునుడు. వీరులలో శ్రేష్ఠుడు అయిన సాత్యకి, అభిమన్యుడు గాంధార సేనతో పరాక్రమం చూపి పోరాడారు.

క. పొదివికొని శకునిబల ము । న్మదగతి సాత్యకి రథంబు నఱికిన నాతం
డది దిగ్గదాఁటి ధైర్యా । స్పదమతి నభిమన్యుతేరిపైకిం జనియెన్. 107

ప్రతిపదార్థం: పొదివికొని= చుట్టుముట్టి; శకుని బలము= శకునిసేన; ఉన్మదగతిన్= గర్వంతో; సాత్యకి+రథంబు= సాత్యకి తేరు; నఱికినన్= ఖండింపగా; ఆతండు= సాత్యకి; దిగ్గదాఁటి= దిగిపోయి; ధైర్య+ఆస్పద+మతిన్= ధైర్యంతో కూడిన బుద్ధితో; అభిమన్యు+తేరిపైకిన్= అభిమన్యుని రథంమీదికి; చనియెన్= వెళ్ళాడు(అధిరోహించాడు).

తాత్పర్యం: శకునిసేన - సాత్యకి రథాన్ని చుట్టుముట్టి ధ్వంసం చేసింది. సాత్యకి రథం దిగి, ధైర్యం విడువకుండా, ఉపాయంగా తప్పించుకొని - అభిమన్యుడి రథం ఎక్కాడు.

క. వా రిరువురుఁ జలమున గాం । ధారపతి ప్రముఖ రథికతతులను జంచ
న్నారాచతతుల నొంచిరి । క్రూరతఁ గవిసెన్ యుధిష్ఠిరుఁడు భీష్మపయిన్. 108

ప్రతిపదార్థం: చలమునన్= పట్టుదలతో; వారు+ఇరువురున్= వారు ఇద్దరును- అభిమన్యుడు, సాత్యకి; గాంధారపతి ప్రముఖ రథిక తతులన్= శకుని మున్నగు వీరుల సముదాయాన్ని; చంచత్ నారాచ తతులన్= చలించే అమ్ముల గుంపులతో; నొంచిరి= నొవ్వజేశారు; యుధిష్ఠిరుఁడు= ధర్మరాజు; క్రూరతన్= కఠినత్వంతో; భీష్మ+పయిన్= భీష్మునిమీద; కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: సాత్యకి, అభిమన్యుడు, మిక్కుటమగు పట్టుదలతో శకుని మున్నగు వీరులపై వాడి అమ్ములు ప్రయోగించి యుద్ధం చేశారు. ధర్మరాజు - క్రౌర్యంతో భీష్ముని మార్కొన్నాడు.

క. భూరిబలఘోర మగు నా । భూరమణుని కోలుతలకుఁ బోవక భీష్మ
స్ఫారబలము ద్రోణుని దో । స్సారంబును నచ్చి నీదుసైన్యము పెనఁగెన్. 109

ప్రతిపదార్థం: భూరి బల ఘోరము+అగు= గొప్ప సైన్యముతో భయంకరమైన; ఆ+భూరమణుని= ఆ రాజుయొక్క(ధర్మరాజుయొక్క); కోలుతలకున్+పోవక= ప్రత్యక్ష యుద్ధమునకు జంకక; భీష్మ, స్ఫార, బలమున్= భీష్ముని యొక్క విస్తారమైన శక్తిని; ద్రోణుని; దోఃసారంబును= భుజబలమును(పరాక్రమమును); నచ్చి= ఇష్టపడి, నమ్మి; నీదు+సైన్యము=నీ సేన; పెనఁగెన్= పోరాడింది.

తాత్పర్యం: గొప్ప సేనతో కూడి ధర్మరాజు -భీష్ముడిపైబడి ప్రత్యక్షయుద్ధం ప్రారంభించాడు. కౌరవసేన- ధర్మరాజు ధాటికి తట్టుకొని పోరాడింది. కౌరవసేన ఆ విధంగా నిలవటానికి కారణం - భీష్ముని యొక్క విస్తారమైన శక్తి, - ద్రోణుడి భుజబలం మీద కౌరవసేనకు గల గౌరవం.

విశేషం: కోలుతల: ఎదుట నిలిచి యుద్ధం చేయటం. ఇది ప్రత్యక్ష యుద్ధం. సంకుల సమరము దొమ్మియుద్ధం.

దుర్యోధనుఁడు భీమునితో యుద్ధము సేసి మూర్ఛిల్లుట (సం. 6-54-15)

చ. తదవసరంబునం బతి యుదగ్రత భీమునిఁ దాఁకి విస్ఫుర
త్ప్రదరము లేసినన్ నగుచుఁ బాండవవీరుఁడు రాజుమేన బె
ట్టిద మగుబాణ మొక్కటి వడింగొని తూఱఁగ నేయఁ దేరిపైఁ
జదికిలఁ బడ్డ మూర్ఛ నృపసత్తము లేవఁగనీక కప్పినన్. 110

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; పతి= రాజు(దుర్యోధనుడు); ఉదగ్రతన్= భీకరంగా; భీమునిన్+తాఁకి= భీముని మార్కొని; విస్ఫురత్+ప్రదరములు= ప్రకాశమానములైన అమ్ములు; ఏసినన్= ప్రయోగింపగా; నగుచున్= నవ్వుచు; పాండవ+వీరుఁడు= భీముడు; రాజు+మేన= దుర్యోధనుని శరీరంపై; బెట్టిదము+అగు= కఠినము అయిన; బాణము+ఒక్కటి= ఒక అమ్ము; వడిన్+కొని= వేగంగా గ్రహించి; తూఱఁగన్+ఏయన్= తూట్లుపడేటట్లు ప్రయోగింపగా; తేరిపైన్= రథముమీద; చదికిల+పడ్డ= కూలబడగా; మూర్ఛ= స్పృహలేని స్థితి; నృప+సత్తమున్= రాజశ్రేష్ఠుడిని - దుర్యోధనుడిని; లేవఁగనీక= నిలుచుండేందుకు వీలు కాకుండా; కప్పినన్= ఆవరింపగా

తాత్పర్యం: ఆ సమయంలో దుర్యోధనుడు భీముని మార్కొని, వెలుగొందే అమ్ములు విసిరాడు. భీముడు నవ్వుతూ - ఒక కఠినమైనబాణంతో దుర్యోధనుని శరీరం తూట్లు పడేటట్లు కొట్టాడు. దుర్యోధనుడు రథముపై చదికిలబడి లేవలేకుండేటట్లుగా మూర్ఛక్రమ్ముకోగా.

ఆ. **సంభ్రమమున నపుడు సారథి యచ్చోటు। దొలఁగ బెలుచఁ దేరు దోలుటయును**
గని భయంబు నొంది కలఁగి యొక్కుమ్మడి। బలములెల్లఁ దెరలి పాఱఁ జొచ్చె. **111**

ప్రతిపదార్థం: సంభ్రమమునన్= తొట్రుపాటుతో; అపుడు= ఆ సమయంలో; సారథి= దుర్యోధనుని రథ చోదకుడు; ఆ+చోటు= ఆ స్థలం; తొలఁగన్= వీడునట్లుగా; పెలుచన్= వేగంగా, తేరు= రథము; తోలుటయును= నడిపించుటయు; కని= చూచి; భయంబున్+ఒంది= భీతిచెంది; కలఁగి= చీకాకై; బలములు+ఎల్లన్= సేనలు అన్నీ, ఒక్కుమ్మడిన్= ఒక్కసారిగా; తెరలి+పాఱన్+చొచ్చెన్= మరలి పారిపోసాగాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు మూర్ఛపోవటం చూచి, సంభ్రమంతో అతని సారథి రథాన్ని వేగంగా తోలుకొని, యుద్ధభూమిని వదలిపోవటం చూచి, కౌరవసేనలు కలతచెంది, భీతిచెంది, వెనుదిరిగిపోయాయి.

క. **వెనుకొని విఱిగిన సైన్యము। గనుకనిఁ బాఱంగఁ జేసి క్రౌర్యోద్రేకం**
బున ధృష్టద్యుమ్నుండును। దన కెలనం దఱుమ వాయుతనయుం డెగిచెన్. **112**

ప్రతిపదార్థం: వెనుకొని= వెనుకకు మరలి; విఱిగిన+సైన్యమున్= ఓడిపోయిన సేనను; కనుకనిన్= సంభ్రమంతో; పాఱంగన్+చేసి= పారిపోయేటట్లు చేసి; క్రౌర్య+ఉద్రేకంబునన్= క్రూరమైన ఆవేశంతో; ధృష్టద్యుమ్నుండును; తనకెలనన్+తఱుమ= తన పార్శ్వాలతో తఱిమి కొట్టగా; వాయు తనయుండు= భీముడు; ఎగిచెన్= విజృంభించాడు.

తాత్పర్యం: ఓడిపోయిన కౌరవసేన - వెనుదిరిగి పారిపోతూ ఉండగా, క్రూరత్వంతో కూడిన ఆవేశంతో తన ప్రక్క ధృష్టద్యుమ్నుడు తరిమికొట్టగా, భీముడు విజృంభించాడు.

క. **అదలిచి ద్రోణుఁడు భీష్ముఁడు। మదమున నిలునిలు మనంగ మఱియును మొగ క**
ట్టద సేన భీమసేనుఁడు। గదిసి పిఱుఁద నంట నార్వఁ గౌరవనాథా! **113**

ప్రతిపదార్థం: కౌరవ+నాథా!= కౌరవరాజా!(ధృతరాష్ట్రమహారాజా); ద్రోణుఁడు= ద్రోణుడు; అదలిచి= బెదరించి; భీష్ముఁడు= భీష్ముడు; మదమునన్= గర్వంతో; నిలునిలుము= ఆగు, మాగుముఅని; అనంగన్= అని చెప్పగా; భీమసేనుఁడు= భీముడు; గదిసి= చేరి; పిఱుఁదన్+అంటన్= వెనుకచేరి తరుమగా; ఆర్వన్= కేకలు వేయగా - సింహనాదం చేయగా; మఱియును= ఇంకను; సేన= సైన్యం; మొగకట్టదు+అ= మూగదు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! కౌరవసేన పారిపోతూ ఉండగా, ద్రోణుడూ భీష్ముడూ మరలించటానికి ప్రయత్నించారు. అయినా - కౌరవ సేన- నిలువ లేకపోయింది. భీముడు పారిపోయే సేనను వెంబడించి తరిమి కొట్టి సింహనాదం చేసినప్పుడు- కౌరవసేన ఎదురుతిరిగి ప్రతిస్పందన చేయక నోరు మూసికొని పారిపోయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మొగకట్టు= మూగు; మొగకట్టదు - అంటే మౌనంగా ఎట్టి ప్రతిస్పందననూ చూపకపోవటం. భీముడు వెన్నాడి తరిమినప్పుడు కౌరవసేన మొగకట్టలేదు. అంటే - భీముడికి అభిముఖంగా కూడి నిలబడలేకపోయిందని భావం.

క. సభయ మయి శకుని సైన్యం । బభిమన్యుఁడు సాత్యకియు రయంబునఁ దోలం
బ్రభ సెడి పఱచుట గని యా । ప్రభువు చలం బెడలి విఱిగె బంధులుఁ దానున్. 114

ప్రతిపదార్థం: అభిమన్యుఁడు= అభిమన్యుడు; సాత్యకియున్; రయంబునన్= వేగంగా; తోలన్= వెన్నాడగా; సభయమయి= భీతిల్లి; శకుని+సైన్యంబు= శకుని సైన్యం(గాంధారసేన); ప్రభ+చెడి= తేజము నశించి, వెలవెలపోయి; పఱచుటన్+కని= పారిపోవటం చూచి; ఆ ప్రభువు= ఆ రాజు(శకుని); చలంబు+ఎడలి= పట్టుదల చెదరి; బంధులు= చుట్టాలు; తానున్= తానును; విఱిగెన్= ఓడిపోయాడు.

తాత్పర్యం: సాత్యకి, అభిమన్యుడు కలిసి వెన్నాడగా, శకుని సైన్యం ధైర్యం కోల్పోయి పారిపోయింది. ఆ సన్నివేశం చూచి, శకుని బంధువులతోపాటు పట్టుదల చెదరి ఓటమికి లోనయ్యాడు.

క. ఊర్జితశాత్రవసేనా । దుర్జయుఁ డగునర్జునుండు దోర్బల లీలా
స్ఫూర్జితుఁ డై యొక్క దెసన్ । గర్జారౌద్రముగఁ దోలెఁ గౌరవబలమున్. 115

ప్రతిపదార్థం: ఊర్జిత, శాత్రవ, సేనా, దుర్జయుఁడు, అగు= పూనికగల శత్రువులసేన చేత జయించుటకు శక్యముగాని; అర్జునుండు= అర్జునుడు; దోస్ బల, లీలా స్ఫూర్జితుఁడు+ఐ= భుజబలము యొక్క అనగా పరాక్రమము యొక్క ఆటచే వెలుగొందునట్టివాడై, మిఱుమిట్లు గొలిపే గొప్ప పరాక్రమము కలవాడై; కౌరవ+బలమున్= కౌరవుల సేనను; ఒక్క+దెసన్= ఒక్కవైపుగ; గర్జా రౌద్రముగన్= భయంకరంగా గర్జించుతూ, భయంకర సింహనాదం చేస్తూ; తోలెన్= తరిమికొట్టాడు.

తాత్పర్యం: అర్జునుని శాత్రవులు - ఎంత పట్టుదలతో మార్కొనినప్పటికీ అతడిని జయింపలేరు. అతడు దుర్జయుడు. అతడు - ఒక ఆటలోవలె పరాక్రమం ప్రదర్శించి సింహనాదం చేస్తూ కౌరవసేనను ఒక వైపునకు చేర్చి - వెన్నాడి తరిమికొట్టాడు.

తే. అంతఁ దెప్పిఱి నీ కొడు కనికి రథము । దొలఁగఁ దెచ్చుట గనుఁగొని యలిగి సూతుఁ
బలికి సరభసముగ నడుకలని కేఁగి । యెలుఁగు సూపిన బలములు నిలిచి పొదివె. 116

ప్రతిపదార్థం: అంతన్= పిదప; తెప్పిరి= సేదతీరి; నీ కొడుకు= నీ పుత్రుడు= దుర్యోధనుడు; అనికిన్+రథము+తొలఁగన్+తెచ్చుట+కనుఁగొని= యుద్ధభూమినుండి తేరును తరలించి తీసికొని రావటం తెలిసికొని; సూతున్= సారథిని; అలిగి= కోపగించి; పలికి= మాటాడి; సరసభసముగన్= తొట్రుపాటుతో; నడు+కలనికిన్+ఏఁగి= యుద్ధ మధ్యమునకు వెళ్ళి; ఎలుఁగు+చూపిన= సింహనాదం చేయగా(కేకవేయగా); బలములు= సేనలు; నిలిచి+పొదివెన్= ధైర్యంతో విలసిల్లి నిలిచాయి.

తాత్పర్యం: అంతట - దుర్యోధనుడు మూర్ఛనుండి తేరుకొన్నాడు. రణరంగంనుండి తేరు తరలించి తనను తెచ్చినందుకు అతడు సారథిని కోపంతో మందలించి, సంభ్రమంతో తిరిగి యుద్ధభూమికి చేరుకొని సింహనాదం చేశాడు. కౌరవసేనలు ధైర్యం పుంజుకొని నిలబడ్డాయి.

తే. ఉన్నచోటన కదలకయున్న ద్రోణ । భీష్ములును గోలుతలసేయఁ బెఱిగి సేన
చంద్రుఁ డుదయింపఁ బెఱిగిన శరధియట్లు । దోడుతోడుతఁ బొంగారి చూడనొప్పె. 117

ప్రతిపదార్థం: ఉన్న+చోటన్+అ= నిలిచియున్న స్థలమునందే; కదలక+ఉన్న= చలింపకుండా నిలిచిన; ద్రోణ+భీష్ములును= ద్రోణుడును, భీష్ముడును; కోలుతల+చేయన్= కట్టెదురుగ నిలిచి యుద్ధం చేయగా; సేన= సైన్యం(కౌరవసేన); పెటిగి= అతిశయించి; చంద్రుడు+ఉదయింపన్= చంద్రుడు పొడిచినప్పుడు; పెటిగిన= పొంగిన; శరధి+అట్లు= సముద్రం వలె; తోడు+తోడుతన్= క్రమక్రమంగా; పొంగారి= అతిశయించి; చూడన్+ఒప్పెన్= శోభిల్లింది.

తాత్పర్యం: ద్రోణుడు, భీష్ముడు (దుర్యోధనుడు మూర్ఛితుడైనప్పటికీ) చలించకుండా ఉన్న చోటులోనే నిలిచి, కట్టెదురుగా ఉన్న పాండవసేనపై విజృంభించారు. అప్పుడు కౌరవసేన- చంద్రుడు ఉదయంచేటప్పుడు పొంగే సముద్రంవలె - అతిశయించి, క్రమక్రమంగా శక్తి పుంజుకొని శోభిల్లింది.

వ. ఇట్లు బలంబుల నిలిపి సుయోధనుండు సత్వరంబుగా భీష్మద్రోణుల పాలికిం జని వారలతో నిట్లనియె. 118

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; బలంబులన్= సేనలను; నిలిపి= ఆపి; సుయోధనుండు; సత్వరంబుగాన్= శీఘ్రంగా; భీష్మద్రోణుల పాలికిన్+చని= భీష్ముడు, ద్రోణుడు ఉన్న చోటికి పోయి; వారలతోన్= భీష్మ ద్రోణులతో; ఇట్లు అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా సేనలను కూడగట్టుకొని, వేగంగా భీష్మద్రోణులు ఉన్న చోటికి వెళ్ళి దుర్యోధనుడు ఈ విధంగా అన్నాడు.

ఉ. ' ఉక్కున మూఁడు లోకములు నొక్కటఁ దాఁకెన యేనిఁ బోర మీ
రొక్కఁ డొకండ గెల్చుటకు నోపుదు రశ్రమవృత్తి నిట్టి మీ
ముక్కున నూర్పు గల్గ మనమోహర మీ దురవస్థఁ బొందునే?
యక్కట మున్న పాండవుల కల్గఁగ నొల్లమిసెప్ప రైతిరే!' 119

ప్రతిపదార్థం: ఉక్కునన్= పరాక్రమంతో; మూఁడులోకములున్= త్రిభువనాలు; ఒక్కటన్= ఏకమై; తాఁకెన+ఏనిన్= మార్కొనినప్పటికీ; పోరన్= యుద్ధంలో; మీరు; ఒక్కఁడు+ఒకండు+అ= ఒకడు ఒక్కడే; అశ్రమవృత్తిన్= సులువుగా; గెల్చుటకున్; ఓపుదురు= చాలుదురు; ఇట్టి= ఇటువంటి; మీ+ముక్కునన్+ఊర్పు+కల్గన్= మీరు బ్రదికి ఉండగానే - మీరు ఊపిరి పీల్చుచుండగానే; మన+మోహరము= మన మొగ్గరము, మన సేనా వ్యూహము; ఈ+దురవస్థన్+పొందునే?= ఈ చెడ్డ స్థితికి వస్తుందా?; అక్కట!= అయ్యో!; మున్ను+అ= ముందుగానే; పాండవులకున్+అల్గఁగన్+ఒల్లమి= పాండవులమీద ఆగ్రహించటం ఇష్టం లేకపోవటం; చెప్పరు+ఐతిరే!= చెప్పలేదుకదా!

తాత్పర్యం: 'మూడు లోకాలు కలిసి ఒక్కపెట్టున మీమీదకు దండెత్తి వచ్చినప్పటికీ- మీలో ఒకడు చాలు వారిని జయించటానికి. మీరు సజీవులై ఉండగా మనసేన ఈ దురవస్థను పొందటం శోచనీయం. పాండవులపై మీకు పక్షపాతం ఉంది. ఆ విషయం మీరు ముందుగానే చెప్పి ఉంటే బాగుండేది కదా!'

విశేషం: మూడు లోకాలు-భూలోకం; పైలోకం - స్వర్గలోకం; క్రిందిలోకం - పాతాళలోకం.

వ. అని పలికి గాంగేయుం గనుంగొని. 120

ప్రతిపదార్థం: అని+పలికి= అని చెప్పి; గాంగేయున్= గంగ కొడుకును= భీష్ముని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: అని చెప్పి దుర్యోధనుడు భీష్ముడిని చూచి.

ఆ. ‘ నాఁడె చెప్పఁగన్న నాకు రాధేయున । కెట్లు సూడఁ బోలె నట్లు వోలెఁ
బడినపాటుఁ బడుదు మడియాస నీచేత । భంగపడితి మింకఁ బలుకు లేల?’ 121

ప్రతిపదార్థం: నాకున్= నాకు; నాఁడె= ఆ దినమే(యుద్ధానికి ముందు- కర్ణుని నిరసించిన నాడే); చెప్పన్+కన్నన్= చెప్పి ఉంటే; రాధేయునకున్= కర్ణునకు; ఎట్లు= ఏ విధంగా; చూడన్+పోలెన్= చూచినట్లుగానే; అట్లుపోలెన్= ఆ విధంగానే; పడినపాటు, పడుదుము= మా పాట్లు మేము పడియుండే వాళ్ళము; అడియాసన్= వ్యర్థమైన ఆశతో; నీచేతన్= నీవలన; భంగపడితిమి= మోసపోయాము; ఇంకన్= ఇక; పలుకులు+ఏల?= మాటలు ఎందుకు?

తాత్పర్యం: ఆనాడే (యుద్ధానికి ముందే) ఆవిషయం (పాండవులపై ఆగ్రహించజాలననే విషయం) చెప్పి ఉంటే నాకూ కర్ణుడికీ ఏది తోస్తే ఆ విధంగా మా పాట్లు మేము పడియుందుము. వ్యర్థమైన ఆశచేత నీ వల్ల భంగపడ్డాము. ఇక మాటలెందుకు?

విశేషం: యుద్ధానికి ముందు భీష్ముడు కర్ణుని ‘ అర్ధరథుడు’ అని నిర్ణయించి అధిక్షేపించాడు. అప్పుడు భీష్ముడు దుర్యోధనుడితో చెప్పినమాట ‘నీవు కర్ణుని వదలుకొంటావా? నన్ను వదలుకొంటావా?’ దుర్యోధనుడు కర్ణుని వదలుకొని భీష్ముడికి, కౌరవ సర్వసేనాధిపతిగా పట్టం కట్టాడు. ఈ పర్వంలో దుర్యోధనుడు ఆ ప్రసక్తి తెచ్చాడు.

వ. అనిన విని చిఱునవ్వు నవ్వుచు మీతండ్రి నీ కొడుకును బ్రియభాషణంబులం దేర్చి యిట్లనియె. 122

ప్రతిపదార్థం: అనిన+విని= అని దుర్యోధనుడు చెప్పగా ఆలకించి; మీ తండ్రి= మీ తండ్రి(భీష్ముడు); నీ కొడుకును= నీ పుత్రుని, దుర్యోధనుడిని; ప్రియ+భాషణంబులన్= ప్రీతి కలిగించే మాటలతో; తేర్చి= సంతృప్తి పరిచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు;

తాత్పర్యం: అనగా విని చిరునవ్వుతో భీష్ముడు దుర్యోధనుడిని ప్రీతి కల్గించే మాటలతో సంతృప్తి పరచియిట్లన్నాడు.

క. పురుహూతసహితమగు ని । ర్జరబలమున కైన గెలువ శక్యమె? సమర
స్థిరులగు పాండుతనూజుల । నరనాయక! నీకు నిట్లనం దగ వగునే? 123

ప్రతిపదార్థం: నరనాయక!= ఓ రాజా; దుర్యోధనా!; పురుహూత సహితము+అగు= దేవేంద్రునితో కూడిన; నిర్జర+బలమునకున్= దేవతలసేనకు; ఐనన్= కూడా; సమర+స్థిరులు+అగు= యుద్ధంలో కదలకుండా నిలబడే; పాండు తనూజులన్= పాండవులను; గెలువన్+శక్యము+ఎ?= జయింప సాధ్యమా?; నీకున్; ఇట్లు+అనన్= ఈ విధంగా మాటాడుట; తగవు+అగును+ఏ?= న్యాయం అవుతుందా?

తాత్పర్యం: ‘దేవేంద్రునితో పాటు దేవతల సేన దండెత్తి వచ్చినా సరే, యుద్ధభూమిలో పాండవులు నిలబడితే జయింప సాధ్యం కాదు. ఓ దుర్యోధనా! నీవు - ఈ విధంగా మాటాడటం న్యాయం కాదు సుమా!

క. వృద్ధులు గతాయువులు దు । ర్బుద్ధులు నగువారిచేతఁ బోదురె శస్త్రా
స్త్రోద్ధతియు బాహుగర్వ సమృ । ద్ధియుఁ గల పాండు సుతు? లమిత్రధ్వంసీ! 124

ప్రతిపదార్థం: అమిత్ర+ధ్వంసీ!= శత్రువులను నాశనము చేసేవాడా - దుర్యోధనా!; వృద్ధులు= ముసలివారు; గత+ఆయువులు= గతించిన ఆయుస్సు కలవారలు; దుస్+బుద్ధులు= చెడ్డబుద్ధిగలవారు; అగువారిచేతన్= అయినట్టి వారిచేత; శస్త్ర+అస్త్ర+ఉద్ధతియున్= బాణముల మంత్రబాణముల గొప్పతనం; బాహు+గర్వ+సమృద్ధియున్= భుజబలము ఉన్నదనే గర్వం ఎక్కువగా; కల= ఉన్న; పాండు+సుతులు= పాండురాజు కొడుకులు; పోదురె?= ఓడిపోతారా?

తాత్పర్యం: శత్రువులను ధ్వంసం చేయగల ఓ దుర్యోధనా! శస్త్రములలో, అస్త్రములలో నిపుణులు, పరాక్రమోపేతులు అయిన పాండవులు, ముసలివారు ఆయువు క్షీణించిన వారిచే ఓడిపోతారా?

విశేషం: మహాభారతంలో - భీష్మపర్వంలో పేర్కొనదగిన పద్యాలలో ఇది ఒకటి. ఈ మాటలు పలికినది భీష్ముడు. ఇందులో- కొంత వ్యంగ్య ధోరణి ఎత్తి పొడుపు ఉంది. భీష్ముడు అంటున్నాడు. 'వృద్ధులు - గతాయువులు' (దుర్బుద్ధులు)పాండవులను గెలువగలరా? ఈ మాటలు భీష్ముడు తనను గూర్చి, ద్రోణుని గూర్చి చేసికొన్న ఆత్మనింద కాజాలదు. ఆ మాటలు దుర్యోధనాదులు, కర్ణుడు లోగడ అన్నవే. ఇప్పుడు దుర్యోధనుడు - ద్రోణుడిని, భీష్ముడిని ఆకాశానికి ఎత్తి పొగడుతున్నాడు. "మిమ్ము దేవతలు గూడ గెలువలేరు - అంటాడు. ఎందుచేత ఇప్పుడు పొగడవలసి వచ్చింది? కౌరవ సేనలు పాండవుల చేత ఓడిపోయి, పారిపోయాయి కాబట్టి. భీష్ముడు - దుర్యోధనుడిని 'అమిత్రధ్వంసీ' అని సంబోధిస్తున్నాడు. ఈ సంబోధనలోని ఎత్తిపొడుపు సుస్పష్టం. ప్రస్తుతం దుర్యోధనుడు మూర్ఛపోయి తిరిగివచ్చాడు. సేనలు పారిపోయాయి. పారిపోకుండా నిలిచింది- ద్రోణుడు, భీష్ముడు మాత్రమే. దుర్యోధనుడు 'అమిత్రధ్వంసి' కానే కాదు. అతనికి ఆ శక్తి లేదని తేలిపోయింది!

తదుపరి దుర్యోధనుడికి భీష్ముడు చీవాట్లు పెట్టాడు. పాండవులు దుర్జయులు అని చెప్పాడు. తాము ఆ విషయం అంతకు ముందే పలుసారులు చెప్పి ఉన్నారు. ఆ విషయం జ్ఞాపకం చేశాడు - భీష్ముడు మరల దుర్యోధనుడికి. 'అయినా ఇక చూడు - శక్తివంచన లేకుండా యుద్ధం చేసి విజృంభించి పాండవసేనను హతమార్చగలను' అని ప్రతిజ్ఞ చేశాడు భీష్ముడు. అయితే భీష్ముడు అంతకుముందే - తన శక్తిని ఎందుకు చూపలేదు? ఒక సమాధానం - పాండవుల శక్తి సామర్థ్యాలు లోకోత్తరాలు. ఆకస్మికంగా వారు విజృంభించారు. ఇంకో సమాధానం:

దుర్యోధనుడు గర్వాంధుడు. అతనికి పాండవుల శక్తి సామర్థ్యాలు తెలియటం మంచిదే. అప్పుడు గాని అతడు భీష్మద్రోణుల గొప్పతనం గుర్తింపలేడు. అందుకని వారు ఉపేక్ష చేసి ఉండవచ్చు. మరియొక సమాధానం - మనోధర్మవేత్తలు సూచించేది. భీష్మ ద్రోణులకు - వారి మనస్సులలో - అంతరాంతరాలలో పాండవులపై అభిమానం, గౌరవం ఉన్నాయి. అంతేగాక - తాము అధర్మపక్షం, వహించి యుద్ధం చేస్తున్నామనే అపరాధశంక వారి హృదయాలను వారికి తెలియకుండానే వేధించుతూ ఉండవచ్చును.

మహాభారతంలో మానవహృదయ క్షీరసాగరమథనం కన్పిస్తుంది.

క. **ఐనను నోపిన భంగిని । భూనాయక! పాండు రాజపుత్ర సముద్య**
త్సేనలఁ గూల్చెదఁ గనుఁగొను । మీ! నీవును బంధులును సమీపస్థులరై. **125**

ప్రతిపదార్థం: భూనాయక!= ఓ రాజా(దుర్యోధనా)!; ఐనను= ఐనప్పటికీ(పాండవులు దుర్జయులు అయినప్పటికీ); పాండురాజపుత్ర+ సముద్యత్+సేనలన్= పాండవులయొక్క ఉద్యమించుచున్న సైన్యాలను; నా+ఓపిన భంగిన్= నా శక్తివంచన లేకుండగా; కూల్చెదన్= సంహరింపగలను; నీవును= నీవూ; బంధులును= చుట్టాలూ; సమీపస్థులరు+ఐ= దగ్గరగా ఉన్నట్టివారై; కనుఁగొనుము+ఈ!= చూడవయ్యా!

తాత్పర్యం: ఓ దుర్యోధన మహారాజా! పాండవులు దుర్జయులే అయినప్పటికీ, నా శక్తివంచన లేకుండా పాండవుల సేనలను సంహరింపగలను. నీవూ నీ బంధువులూ దగ్గరగా నిలిచి చూడవచ్చు.

విశేషం: భీష్ముడు దుర్యోధనుని 'భూనాయక' అని సంబోధించాడు. దుర్యోధనుడు రాజు. భీష్ముడు ఇపుడు 'పితామహుడు కాడు. దుర్యోధనుడు మనుమడూ కాడు. దుర్యోధనుడు రాజు, భీష్ముడు రాజ సేనాధిపతి. భీష్ముడు - తన విధ్యుక్త ధర్మాన్ని 'శక్తివంచన లేకుండా' 'ఓపినభంగి' నిర్వహించగలనని పునరుద్ఘాటించాడు.

వ. **అని పలికి సంరంభంబున విజృంభించిన ధార్తరాష్ట్రులు ముదితమానసులై శంఖంబులు పూరింప భేరీ మృదంగాదితూర్యస్వనంబులుసెలంగుటయును.** **126**

ప్రతిపదార్థం: అని+పలికి= అనిచెప్పి; సంరంభంబునన్= ఆవేశంతో; విజృంభించినన్= అతిశయించగా; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుని కొడుకులు; ముదిత+మానసులు+ఐ= సంతోషించిన మనస్సులు కలవారై; శంఖంబులు+పూరింపన్= శంఖాలు మ్రోగింపగా; భేరీ, మృదంగ+ఆది, తూర్య, స్వనంబులు= భేరులు, (మద్దెలలు మున్నగు బూరాల మ్రోతలు; చెలంగుటయును= మ్రోయగా.

తాత్పర్యం: భీష్ముడు ఆ విధంగా పలికి, విజృంభించాడు. దుర్యోధనుడు మున్నగువారు - సంతోషించిన మనస్సులు కలవారై శంఖాలు పూరించారు. సైనికులు ఉప్పొంగిపోయి భేరులు- మద్దెలలు-తూర్యాలు మున్నగు జంత్రవాద్యాలను మ్రోగించారు.

క. **విని పాండు నందనులు శం । ఖ నినాదము లుల్లసిల్లగా బహుతూర్య**
ధ్వను లడరఁగఁ దిరమై తమ । మొన నిరతముగా నొనర్చి ముదము దలిర్పన్. **127**

ప్రతిపదార్థం: విని= కౌరవుల శంఖరావములు మున్నగు హర్షధ్వానాలు ఆలకించి; పాండు నందనులు= పాండవులు; శంఖ+ నినాదములు= శంఖముల ధ్వనులు; ఉల్లసిల్లఁగాన్= చెలరేగగా; బహు తూర్య ధ్వనులు= పెక్కు బూరాల ధ్వనులు; అడరఁగన్= వ్యాపింపగా; తమ+మొన= తమసేన; తిరము+ఐ= స్థిరమై; నిరతముగాన్= ఎల్లపుడు ఉండేటట్లుగా; ఒనర్చి= చేసి; ముదము+ తలిర్పన్= సంతోషం అతిశయింపగా.

తాత్పర్యం: కౌరవుల శంఖనాదాలు, భేరీమృదంగాది తూర్యస్వనాలు విని, పాండవులు శంఖ నాదాలు చేలరేగగా బహుతూర్య నాదాలు వ్యాపింపగా స్థిరంగా తమ సేన ఎల్లప్పుడుండేటట్లుచేసి సంతోషం ఒప్పగా (తరువాతి వచనంతో అన్వయం)

పాండవులు కూడా- శంఖాలు పూరించి హర్షోద్వేగంతో సేనలను పురికొల్పి వెడలారు.

వ. **నడచి రనిన విని సంజయునకు ధృతరాష్ట్రుం డిట్లనియె.** **128**

ప్రతిపదార్థం: నడచిరి+అనినన్= వెడలిరి అని చెప్పగా; సంజయునకున్; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

క. **దుర్యోధనుమాటకు భుజ । వీర్యోద్ధతి భీష్ముఁడేచి విక్రమలీలా**
ధుర్యతఁ గడఁగినఁ గయ్యం । బార్యస్తవనీయ! యెట్టులయ్యెం జెపుమా.' **129**

ప్రతిపదార్థం: ఆర్యస్తవనీయ!= ఆర్యుల (ఉత్తముల)చేత కీర్తింపబడిన సంజయా!; దుర్యోధను మాటకున్= దుర్యోధనుని పలుకులకు; భుజ+వీర్య+ఉద్ధతిన్= భుజబల పరాక్రమ ప్రకర్షచే; భీష్ముఁడు; ఏచి= విజృంభించి; విక్రమ+లీలా+ధుర్యతన్= శౌర్యం అనే క్రీడను వహించటం చేత; కడఁగినన్= పూనగా; కయ్యంబు= యుద్ధము; ఎట్టులు+అయ్యెన్= ఏ విధంగా అయింది; చెపుమా!= చెప్పవయ్యా!

తాత్పర్యం: పూజ్యుల ప్రశంసలకు పాత్రుడవైన ఓ సంజయా!, దుర్యోధనుడి పలుకులు విని, భీష్ముడు ఏ విధంగా విజృంభించి, తన పరాక్రమం ప్రదర్శించాడో, ఆతడి యుద్ధం ఎట్లా సాగిందో వివరించి చెప్పవయ్యా!'

వ. **అనిన విని సంజయుం డతని కి ట్లనియె నప్పుడు ప్రభాకరుండు నభోమధ్యంబునకు వచ్చి వెలుంగుచున్న నతనితోడిపురుడునం దేజోమహిమ దలకొన్న తెఱంగునం దనమెఱుంగువాలమ్ము లనుకిరణమ్ములు వరఁగించుచుఁ బ్రతాపదీపితుండగు దేవవ్రతుండు దేవేంద్రసుతుం దాఁకిన .** **130**

ప్రతిపదార్థం: అనినన్+విని; సంజయుండు; అతనికిన్= ధృతరాష్ట్రునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అప్పుడు= ఆ సమయంలో; ప్రభాకరుండు= సూర్యుడు; నభస్+మధ్యంబునకున్= నభోమధ్యమునకు= ఆకాశం మధ్యకు; వచ్చి= అరుదెంచి; వెలుంగుచున్నన్= ప్రకాశించుచుండగా; అతనితోడి+పురుడునన్= ఆ సూర్యునితో సమానత్వంతో; తేజస్+మహిమ= ప్రభాప్రభావం; తలకొన్న+తెఱంగునన్= ఏర్పడిన రీతిగా; తన+మెఱుంగు+వాలు+అమ్ములు= తనవైన ప్రకాశించే వాడి బాణాలు; అను+కిరణమ్ములు= అనే మయూఖములు(వెలుగులు); పరఁగించుచున్= ప్రసరిస్తూ; ప్రతాప+దీపితుండు= పరాక్రమంతో వెలుగొందే; దేవవ్రతుండు= భీష్ముడు; దేవేంద్ర+సుతున్= దేవేంద్రుని కొడుకు అర్జునుడిని; తాఁకెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రునితో ఈ విధంగా చెప్పాడు. 'అప్పుడు సూర్యుడు ఆకాశమధ్యానికి వచ్చి ప్రకాశించాడు. ఆ సూర్యుడితో తేజోమహిమలో సమానుడు అయినట్లుగా భీష్ముడు, వాడి బాణాలు అనే తీక్ష్ణ కిరణాలను ప్రసరించాడు. ఈ విధంగా ప్రతాపంతో వెలుగొందుతూ, భీష్ముడు అర్జునుని మార్కొన్నాడు.

విశేషం: దేవవ్రతుడు= భీష్ముని ఔరస నామధేయం. దేవవ్రతుడు తండ్రికోసం - ఆజన్మ బ్రహ్మచర్య దీక్ష వహిస్తానని ప్రతిజ్ఞ చేయటం చేత అతడికి 'భీష్ముడు' అనే బిరుదనామం సంక్రమించింది.

చ. **కడఁగి సుయోధన ప్రభృతి కౌరవవీరులు భీష్ముతోన బె**
ట్టడరిన భీమముఖ్యులగు నక్కడి యోధులు నొక్క యుమ్మడిన్
వడిఁ దలపడ్డ సైన్యము లవారణ రెండును నేచి త్రోచి య
ప్పుడు రభసంబునన్ బెరసి పోరె వియచ్చరకోటి మెచ్చఁగన్. **131**

ప్రతిపదార్థం: కడఁగి= పూని; సుయోధన ప్రభృతి కౌరవవీరులు= దుర్యోధనుడు మున్నగు కౌరవ శూరులు; భీష్ముతోన్+అ= భీష్మునితోపాటుగనే; బెట్టు+అడరినన్= మిక్కుటముగ విజృంభించగా; అక్కడి+యోధులు= అక్కడ పాండవపక్షంలోని వీరులు; ఒక్క ఉమ్మడిన్= ఒకే మారుగా; వడిన్= వేగంగా; తలపడ్డన్= మార్కొనగా; సైన్యములు+రెండును= రెండు సేనలూ; అవారణన్= వారించుటకు వీలులేకుండా; త్రోచి= ముందునకు వచ్చి; అప్పుడు; రభసంబునన్+బెరసి= ఉద్రేకంతో తాకి; వియత్+చర+కోటి= ఆకాశంలో సంచరించే దేవతల సమూహం; మెచ్చఁగన్= ప్రశంసించగా; పోరెన్= యుద్ధం చేశాయి.

తాత్పర్యం: కౌరవవీరులు - సుయోధనుడు మున్నగువారు - భీష్మునితోపాటుగా విజృంభించారు. అటు పాండవ యోధులూ విజృంభించారు. రెండు సేనలూ ఒక్కుమ్మడి తారసిల్లగా ఘోరయుద్ధం జరిగింది. ఉభయ సేనలలోని యోధుల పరాక్రమాన్ని ఆకాశంలో సంచరించే దేవతాగణాలు ప్రస్తుతించాయి.

విశేషం: యుద్ధంలో వీరులు ప్రదర్శించే పరాక్రమాన్ని ఖేచరులైన చారణులు మెచ్చుకోవటం తిక్కన పలుచోట్ల వర్ణించాడు.

వ. **అట్టియెడ.** **132**

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో, యుద్ధభూమిలో.

క. **హుంకారములు నదల్పులు । జంకెలు ధిక్కరణములును సంస్తుతులును వీ**
రాంకోక్తులు నిస్సాణజ । ధాంకృతులును గలిసి యుద్ధటంబుగఁ బెటిగెన్. **133**

ప్రతిపదార్థం: హుంకారములు= హుం అనే ధ్వనులు (రా- నీ ప్రతాపం చూస్తాను అని అర్థం వచ్చేటట్లు యుద్ధవీరులు చేసే నినాదం); అదల్పులు= మందలింపులు; జంకెలు= బెదరింపులు; ధిక్కరణములు= నిరసనలు; సంస్తుతులును= పొగడ్తలు; వీర+అంక+ఉక్తులు= వీరులకు చిహ్నములైన మాటలు; నిస్సాణజ+ఢాంకృతులును= జంత్ర వాద్య విశేషమునుండి పుట్టిన 'ఢాం' శబ్దాలు; కలిసి; ఉద్భటముగన్= భయంకరంగా; పెటిగెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: ఆ సమయంలో - యుద్ధభూమిలో హుంకారాలు - మందలింపులు - నిరసనలు - పొగడ్తలు వీరోచితమైన పలుకులు - జంత్రవాద్యాల ఢాంకృతులతో కలసి భయంకరంగా వ్యాపించాయి.

విశేషం: మూల సంస్కృత భారతంలో శంఖరావాలు మున్నగునవి అక్కడక్కడ యుద్ధంలో అంతర్భాగంగా పేర్కొనబడ్డాయి. ఈ పద్యంలో వర్ణింపబడినవన్నీ - తిక్కన సమకాలీన యుద్ధవృత్తాలుగానే ఎంచవచ్చును.

క. తునిసిన బాహామస్తక । తనుచరణంబులును బాణ తరవారి గదా
ధనువులుఁ గిరీట కంకణ । కనదంగదములును దఱచుగా ధరఁ దొరఁగెన్. 134

ప్రతిపదార్థం: తునిసిన= ముక్కలు ముక్కలయిన; బాహా, మస్తక+తను, చరణంబులును= చేతులు, తలలు, శరీరాలు, పాదాలు; బాణ తరవారి గదా ధనువులున్= అమ్ములు, కత్తులు, గదలు, చాపాలు; కిరీట కంకణ కనత్ అంగదములును= కిరీటాలు, చేతికడియాలు, ప్రకాశించే భుజకీర్తులును; తఱచుగాన్= దట్టముగా; ధరన్= భూమిపై; తొరఁగెన్= పడ్డాయి.

తాత్పర్యం: ఖండింపబడిన చేతులు, తలలు, శరీరాలు, పాదాలు, బాణాలు, కత్తులు, గదలు, విండ్లు, కిరీటాలు, చేతికడియాలు, భుజకీర్తులు దట్టంగా యుద్ధభూమిపై పడ్డాయి.

తే. సగము సచ్చిన యొడళులు జలచరములు । రక్త పూరంబు దోయంబు ప్రచురమాంస
పటలి పంకంబుగాఁగల బహునదీ ప్ర । వాహములు వాఱె సంగరావని నృపాల! 135

ప్రతిపదార్థం: నృపాల!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; సగము+చచ్చిన= సగము మరణించిన; ఒడళులు= కళేబరాలు; జలచరములు= చేపలు; రక్తపూరంబు= నెత్తురు వరద; తోయంబు= నీరు; ప్రచుర, మాంస, పటలి పంకంబుగాన్= అధికమైన మాంసపు ముక్కల బురద సమూహంగా; కల= ఉన్న; బహు+నదీ+ప్రవాహములు= పెక్కు నదుల ప్రవాహాలు; సంగర+అవనిన్= యుద్ధభూమిలో; పాఱెన్= ప్రవహించాయి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సగము చచ్చిన శరీరాలు చేపలుకాగా, నెత్తురు వెల్లువ జలము కాగా, అధికమైన మాంసఖండముల సముదాయం బురదకాగా పెక్కు నదీప్రవాహాలు యుద్ధభూమిలో ప్రవహించాయి.

క. అఱవఱ లైన రథంబులు । నెఱిదప్పఁగఁ బడిన యశ్వనికరంబులుఁ బెం
దఱచుగఁ గూలిన కరులు । న్గిఱిగొనియెన్ సమరమేదినీతల మెల్లన్. 136

ప్రతిపదార్థం: అఱవఱలు+ఐన+రథంబులు= చిన్న చిన్న ముక్కలయిన తేరులు; నెఱి+తప్పఁగన్+పడిన= ఆకారము మారిపోయి పడిన; అశ్వ+నికరంబులున్= గుర్రాల గుంపులూ; పెన్+తఱచుగన్= మిక్కిలి దట్టంగా; కూలిన= పడిపోయిన; కరులున్= ఏనుగులూ; సమర+మేదినీ+తలము+ఎల్లన్= యుద్ధభూమి స్థలము అంతటినీ; గిఱికొనియెన్= ఆవరించాయి.

తాత్పర్యం: చిన్న చిన్న ముక్కలైన తేరులు, ఆకారం మారిపోయిన గుఱ్ఱాలు. మిక్కిలి దట్టంగా మారిన ఏనుగులు - యుద్ధభూమిని ఆవరించాయి.

వ. ఇవ్విధంబున విషమం బగు రణభూభాగంబునం జరియింపం జతురులు గాక రథికజనుఁ లంతంత గుంపులు గట్టిరి గాంగేయుండు ప్రతియోధులం బేరువేరం బిలుచుచు నుక్కుమిగిలి దిక్కు లమ్ములం బిక్కటిల్లం జేయుచు నెక్కడఁ జూచినం దానయై మెఱుంగు మెఱసిన తెఱంగునం గొఱవి ద్రిప్పిన యొప్పున నింద్రజాలంబు సూపిన చందంబునం దన రథంబు నెఱయ శక్తి శౌర్యంబులు నెఱయ నెవ్వరికి నిలువరింపరాక యెదిరిన రూపంబులం బెక్కింటి నొక్కబాణంబునం బెక్కుబాణంబుల నొక్కంటిఁ గూల్చి కేళి సలుపుచు నటిమి పయింబడినవీరులం గీలెడలినజంత్రంబులుం బోలె నేలం గూల నేయుచు దృఢత్వలక్ష్యశుద్ధిలాఘవంబులకు వియచ్చరులు పిచ్చలింప ననేక ప్రకారంబు లగు క్రూరశరంబులఁ జతురంగంబులుం దునియలుం బఱియలుం దుమురులుం గుదులు నై బడలువడం జేయుచుం గార్చిచ్చు పొదివిన పోలిక మాయ గావించిన మాడ్కి మంత్రించి పడవైచిన పగిదిం గసిమసంగి కౌంతేయసేనం గనుపుకొట్టుచుఁ బ్రళయ కాలతాండవ ప్రవర్తి యైన ఫాలలోచనులీల నాజిరంగంబునం బరాక్రమనృత్యంబు సేయుచున్నం బాంచాలయాదవాదియోధులు వెఱఁగుపడి చూచుచుండఁ బాండవులునుం జేయునదిలేక చేష్టలు దక్కినం దదీయసైన్యంబులు రూపఱి భయభ్రాంతంబు లై దీనదశకు వచ్చె నప్పుడు శౌరి యుగ్యంబుల పగ్గంబులఁ బట్టి పార్థునితో ని ట్లనియె. 137

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; విషమంబు+అగు= అడ్డదిడ్డంగా ఉన్న; రణ+భూ+భాగంబునన్= యుద్ధభూమిమీద; చరియింపన్= తిరుగుటకు, చతురులు+కాక= తెలివితేటలు గలవారుగాక; రథిక+జనులు= యోధులు; అంతంతన్= అక్కడక్కడ; గుంపులు+కట్టిరి= మూగారు; గాంగేయుండు= గంగకొడుకు(భీష్ముడు); ప్రతియోధులన్= శత్రువులను; పేరుపేరన్+పిలుచుచున్= వారి వారి పేరులతో పేర్కొనుచు; ఉక్కు+మిగిలి= పరాక్రమం అతిశయించి; దిక్కులు= దెసలు; అమ్ములన్= బాణాలతో; పిక్కటిల్లన్+చేయుచున్= నిండిస్తూ; ఎక్కడన్+చూచినన్= ఏ చోటున అరసినా; తాను+ఐ= తానే కన్పించి; మెఱుంగు+ మెఱసిన+ తెఱంగునన్= మెరపుతీగె మిరుమిట్లు గొల్పినట్లు; కొఱవి+త్రిప్పిన+ఒప్పునన్= మండేకట్టె గిఱగిఱా త్రిప్పినట్లుగా; ఇంద్రజాలంబు+చూపిన+చందంబునన్= గారడీ చేసినట్లుగా; తన+రథంబు+నెఱయన్= తనతేరు మెరయగా; తన+శక్తి+శౌర్యంబులు నెఱయన్= తన బలము పరాక్రమము నిండార భాసింపగా; ఎవ్వరికిన్; నిలువరింపన్ రాక= ఆపవీలుగాక; ఎదిరిన+రూపంబులన్= మార్కొనిన ఆకారాలను; పెక్కింటిన్= చాలావాటిని; ఒక్క+బాణంబునన్= ఒకే అమ్ముతో; పెక్కు+బాణంబులన్= పలు అమ్ములతో; ఒక్కంటిన్= ఒకదానితో; కూల్చి= క్రిందపడవేసి; కేళి సలుపుచున్= ఆట ఆడుచు; అటిమి+పయింబడిన= ఆర్చిపై బడిన; వీరులన్= యోధులను; కీలు+ఎడలిన+జంత్రంబులున్+పోలె= (తిరుగుటకు బొమ్మలలో ఏర్పరచిన); మర సడలిన యంత్రాలవలె; నేలన్= భూమిపై; కూలన్+ఏయుచున్= పడిపోయేటట్లు చేస్తూ; ధృఢత్వ లక్ష్య శుద్ధి, లాఘవంబులకున్= గట్టిగా (లక్ష్యాన్ని) సులువుగా గురిని కొట్టడంలో తప్పని సూటిదనాన్ని; వియత్+చరులు= ఆకాశంలో సంచరించే దేవతలు; పిచ్చలింపన్= భయపడగా; అనేక+ ప్రకారంబులు+అగు= పెక్కు విధాలుగా ఉన్న; క్రూర శరంబులన్= భయంకరమైన బాణాలలో; చతుః+అంగంబులున్= నాలుగు అంగాలు(రథ-గజ-తురగ-పదాతులు); తునియలున్= ముక్కలు; పఱియలున్= బ్రద్దలును; తుమురులును= ముక్కలును; గుదులును+ఐ= గుత్తులుగానై; బడలు+పడన్+చేయుచున్= నొవ్వజేస్తూ; కార్చిచ్చు+పొదివిన పోలికన్= దావానలము క్రమ్ముకున్న రీతిగా; మాయ, కావించిన, మాడ్కిన్= భ్రాంతి కలిగించినట్లుగా; మంత్రించి పడవైచిన పగిదిన్= మంత్రంతో అద్భుతం సృష్టించినట్లుగా; కసిమసంగి= విజృంభించి; కౌంతేయ+సేనన్= పాండవసేనను(కుంతీ పుత్రుల సైన్యాన్ని); కనుపుకొట్టుచున్= పోరాటంలో ముంచుతూ; ప్రళయ కాల తాండవ ప్రవర్తి+ఐన= ప్రళయం ఏర్పడిన సమయంలో

నృత్తం చేసే; ఫాలలోచనులీలన్= ముక్కంటివలె; ఆజి రంగంబునన్= యుద్ధక్షేత్రమునందు; పరాక్రమ+నృత్యంబు+చేయుచున్నన్= శౌర్యనాట్యం చేయుచుండగా; పాంచాల యాదవ+ఆది యోధులు= పాంచాల దేశానికి, యాదవజాతికి చెందిన వీరులు; వెఱఁగుపడి= భయపడి; చూచుచుండన్= వీక్షింపగా; పాండవులు; చేయునదిలేక= చేయగల ప్రక్రియలేక; చేష్టలు+తక్కినన్= నివ్వెఱగంది చూడగా; తదీయ+సైన్యంబులు= వారి సేనలు; రూపఱి= ఆకారములు తప్పి; భయ భ్రాంతంబులు+ఐ= భీతితో సమ్మోహితులై; దీన+దశకున్+వచ్చెన్= హీనస్థితికి చేరాయి; అప్పుడు; శౌరి= శ్రీకృష్ణుడు; యుగ్యంబుల= అశ్వముల; పగ్గంబులన్= గుర్రాలకు వేసిన; త్రాళ్ళు; పట్టి; పార్థునితోన్= అర్జునునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ రీతిగా - అడ్డదిడ్డంగా ఉన్న యుద్ధభూమిలో చరించటానికి వీలుగాక, యోధులు అక్కడక్కడ గుంపులు గూడారు. భీష్ముడు పరాక్రమంతో విజృంభించాడు. దిక్కులు పిక్కటిల్లేటట్లుగా అమ్ములు ప్రయోగించాడు. ఎక్కడ చూచినా భీష్ముడే కన్పించాడు. కొఱవి త్రిప్పిన చందంబున - ఇంద్రజాలము వలె - తన రథం తోలించాడు. అతని ధాటికి ఎవ్వరూ ఆగలేకపోయారు. ఎదిరించిన పెక్కు ఆకారాలను ఒక్క బాణంతో ఛేదించాడు. ఒక్క ఆకృతిని పెక్కు బాణాలతో కూల్చాడు. ఆ విధంగా సంగ్రామ క్రీడ సాగించాడు. తన మీదకు వచ్చి పడిన యోధులను - కీలెడలిన జంత్రాల వలె చేసి క్రింద పడవేశాడు. భీష్ముడి దృఢత్వం - లక్ష్యశుద్ధి - సులువుగా అమ్ములు ప్రయోగించటంలో గల నేర్పు దీనినంతటినీ ఆకాశ సంచారులయిన చారణులు ప్రశంసించారు. శాత్రవుల చతురంగ బలాలను భీష్ముడు నేలమట్టం చేశాడు. అతని క్రూరబాణాలకు - రథాలు విరిగాయి, ఏనుగులు చచ్చాయి. అశ్వాలు ముక్కచెక్కలయ్యాయి. పదాతులు నేలగూలారు. కార్చిచ్చు అడవిని దహించినట్లు అతడు విలయతాండవం చేశాడు. అతడు బాణాలను అభిమంత్రించి వదలాడా? అన్నట్లు ప్రళయకాల రుద్రుడివలె పరాక్రమనృత్యం చేశాడు. పాంచాలయాదవ వీరులు చేష్టలు దక్కి నివ్వెఱగంది చూచారు. పాండవులు ఏమీ చేయలేకపోయారు. పాండవసేనలు భయభ్రాంతితో అలమటించి పోయాయి. అప్పుడు శ్రీకృష్ణుడు తేరుకు కట్టిన గుఱ్ఱాల పగ్గాలు చేతితో పట్టుకొని, అర్జునుడితో ఈ విధంగా అన్నాడు:

చ. **కృపగురుభీష్మయుక్తముగ గెల్తు సుయోధనుసేన నంచు నీ**
వపరిమితోగ్రశక్తి మెఱయం దఱి గోరుచు నుండు దెప్పడుం
గుపితయుగాంతరుద్రుగతిఁ గోలుమసంగినవాఁడు భీష్ముఁ డే
చి పటుభుజాబలంబు విలసిల్లఁగ మార్కొన కున్కి యొప్పనే?' **138**

ప్రతిపదార్థం: కృప, గురు, భీష్మ, యుక్తముగన్= కృపుడు - ద్రోణుడు - భీష్ముడు కలిసియుండగా; సుయోధను సేనన్= దుర్యోధనుని సైన్యాన్ని; గెల్తున్+అంచున్= జయింపగలను అని చెప్పుతూ; నీవు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; తఱిన్= అవకాశమును; కోరుచున్; ఉండుదు= ఉంటావు; అపరిమిత ఉగ్ర శక్తి మెఱయన్= అంతులేని భయంకరమైన సామర్థ్యం వెలుగొందునట్లుగా; భీష్ముఁడు= భీష్ముడు; కుపిత యుగ అంత రుద్రుగతిన్= యుగముల చివరి భాగ సమయంలో కోపించిన ఈశ్వరునివలె; కోలుమసంగిన వాఁడు= మిక్కుటంగా విజృంభించాడు; ఏచి= అతిశయించి; పటు భుజా బలంబు= గొప్పదైన పరాక్రమం; విలసిల్లఁగన్= ప్రకాశించగా; మార్కొనక+ఉన్కి= తాకకుండా ఉండటం; ఒప్పునే?= న్యాయమా?(మంచిదా?)

తాత్పర్యం: 'ఓ అర్జునా!, కృపాచార్యుడు -ద్రోణుడు, భీష్ముడు కలిసియున్న కౌరవ సేనను ఓడించగలనని నీవు ఎన్నోసారులు చెప్పి ఉన్నావుగా! ఇదిగో. ఇప్పుడు అట్టి అవకాశం వచ్చింది. ఇప్పుడు ప్రళయ సమయంలో రుద్రునివలె భీష్ముడు విజృంభించాడు. నీవు నీ పరాక్రమం చూపి అతనిని మార్కొనక యుండటం మంచిదికాదు.

అర్జునుఁడు శ్రీకృష్ణప్రేరితుం డై భీష్మునిపైఁ గవియుట (సం. 6-55-40)

క. ' అనిన విని యర్జునుం డి। ట్లను 'నీ విం తనఁగ నేల? యాతనిమీఁదన్
మనరథముఁ బఱపు మిప్పడ। సునిశితబాణముల నతని సొం పడఁగింతున్.' 139

ప్రతిపదార్థం: అనినన్= అని శ్రీకృష్ణుడు చెప్పగా; విని; అర్జునుండు; ఇట్లు; అనున్= చెప్పాడు; నీవు; ఇంత+అనఁగన్+ఏల?= నీవు ఇంతగా నొక్కి చెప్పాలా?; ఆతనిమీఁదన్= ఆ భీష్ముని మీదకు; మనరథమున్; పఱపుము= తోలునది; ఇప్పుడు+అ= ఈ సమయంలోనే; సు నిశిత బాణములన్= మిక్కిలి వాడిగల అమ్ములతో; అతని+సొంపు= ఆ భీష్ముని అందము; అడఁగింతున్= పోగొట్టగలను.

తాత్పర్యం: అని- శ్రీకృష్ణుడు చెప్పగా విని - అర్జునుడు ఈ విధంగా అన్నాడు. 'నీవు ఇంతగా నొక్కి వక్కాణింపవలెనా? వెంటనే మనరథం భీష్మునిపైకి తరలించుము. నేను మిక్కిలి వాడి అమ్ములు ప్రయోగించి అతని గొప్పదనం - అణగారునట్లు చేయగలను.'

చ. అనుటయు 'నట్లకాక' యని యచ్యుతుఁ డుద్ధతిఁ దేరు వోవని
చ్చినఁ గని పొంగి యా రథికసింహుఁ డుదంచితసింహనాదుఁడై
నినిచెఁ దురంగదేహముల నీరజనాభునిమేనఁ బాండునం
దను నొడలం బ్రదీప్త ఘనదారుణమార్గణపుంజముల్ వడిన్. 140

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; అట్లు+అ= ఆ విధంగానే; కాక+అని= అగునుగాక అని చెప్పి; అచ్యుతుడు= శ్రీకృష్ణుడు; ఉద్ధతిన్= గర్వంగా; తేరు= రథం, పోవనిచ్చినన్= తోలగా; కని= చూచి; ఆ+రథిక+సింహుఁడు= యోధులలో సింహమువంటివాడు (భీష్ముడు); ఉదంచిత+సింహనాదుఁడు+ఐ= గొప్ప సింహనాదం చేసినవాడై; తురంగ+దేహములన్= గుఱ్ఱాల శరీరాలపై; నీరజనాభుని మేనన్= శ్రీకృష్ణుని శరీరంపై; పాండు నందను+ఒడలన్= పాండురాజు కొడుకు అయిన అర్జునుని దేహంపై; వడిన్= వేగంగా; ప్రదీప్త ఘన దారుణ మార్గణ పుంజముల్= మిక్కిలి ప్రకాశంగల, గొప్పవైన, భయంకరములైన అమ్ముల గుంపులు; నినిచెన్= గ్రుచ్చుకొనునట్లు ప్రయోగించాడు.

తాత్పర్యం: అని అర్జునుడు చెప్పగా, శ్రీకృష్ణుడు రథాన్ని భీష్మునిపైకి తరలించాడు. రథికశ్రేష్ఠుడైన భీష్ముడు - సింహనాదం చేసి, గుఱ్ఱాల శరీరాలపై, శ్రీకృష్ణుడిపై, అర్జునుడిపై వెలుగొందే గొప్ప బాణసమూహాలను ప్రయోగించాడు.

తే. తనదు నొవ్వున కలుకక ధైర్యవృత్తి। నయ్యుపేంద్రుండు నొచ్చిన హయచయంబుఁ
దడవి తేర్చి యుదగ్రతఁ దఱుముటయును। గుణరవం బుల్లసిల్ల ఫల్గునుఁడు గడఁగి. 141

ప్రతిపదార్థం: తనదు+తనయొక్క; నొవ్వునకున్=వేదనకు; అలుకక= భయపడక; ధైర్య వృత్తిన్= దీమసముతో, ఆ+ఉపేంద్రుండు= ఆ కృష్ణుడు; నొచ్చిన= దెబ్బతిన్న; హయ చయంబున్= గుఱ్ఱాల సముదాయమును; తడవి= నిమిరి; తేర్చి= సేదదీర్చి; ఉదగ్రతన్ భయంకరంగా; తఱుముటయును= తోలుటతో; ఫల్గునుఁడు= అర్జునుడు; గుణ రవంబు= వింటి అల్లెత్రాటినుండి వెలువడే ధ్వని; ఉల్లసిల్లన్= వ్యాపింపగా; కడఁగి= పూని.

తాత్పర్యం: భీష్ముడు శ్రీకృష్ణుని రథాశ్వాలను, అర్జునుడిని నొప్పించాడు. శ్రీకృష్ణుడు తన బాధ మరచిపోయి, గుఱ్ఱాలను నిమిరి వాటి బాధ పోగొట్టి - రథాన్ని భయంకరంగా తోలాడు. అర్జునుడు అల్లెత్రాటి ధ్వని ఒప్పగా పూని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: శ్రీకృష్ణుడు కర్మయోగి. అతని దృష్టిలో హేయమైన పనిలేదు. సారథిగా ఉండటానికి సమ్మతించడమే గాక - గుర్రాలకు బాధ కలిగినపుడు, తన బాధను కూడా మరచిపోయి వాటికి సేవచేశాడు. సేవాధర్మములోని పవిత్రత గుర్తించిన మహానుభావుడు శ్రీకృష్ణుడు.

క. భల్లంబొకటఁ బితామహు । విల్లు దునుమ వేఁకొకండు వెస నెత్తిన న
వ్విల్లును దునిమినలాఘవ । ముల్లంబునఁ బొగడి యేసె నొండొకవింటన్. 142

ప్రతిపదార్థం: భల్లంబు+ఒకటన్= ఒక ఈటె బాణంతో; పితామహు+విల్లు= భీష్ముని ధనుస్సు; తునుమన్= ఖండింపగా; వేఱు+ఒకండు= ఇంకో విల్లు; వెసన్= వేగంగా; ఎత్తినన్= తీసుకోగా; ఆ+విల్లును= ఆ ధనువునుగూడా(అర్జునుడు); తునిమిన లాఘవము= ఖండించిన నేర్పును; ఉల్లంబునన్= మనస్సులో; పొగడి;(భీష్ముడు); ఒండొక+వింటన్= ఇంకో ధనుస్సుతో; ఏసెన్= అమ్ములు వేశాడు.

తాత్పర్యం: అర్జునుడు ఒక ఈటె బాణంతో భీష్ముడి విల్లు తునిమాడు. భీష్ముడు మరియొక ధనుస్సు పుచ్చుకున్నాడు. మరల ఆ ధనువును ఖండించాడు అర్జునుడు. అర్జునుని ప్రయోగనైపుణ్యాన్నీ శక్తి సామర్థ్యాలనూ భీష్ముడు తన మనస్సులో మెచ్చుకొంటూ - మరియొక విల్లుతో అమ్ములు ప్రయోగించాడు.

విశేషం: ఒకండు= ఒకటి - రెండూ గ్రాంథికాలే. ఏడార్థకమైన ఒకఁడు మహదమహదుభయార్థకంగా ప్రయోగింపబడుతుంది. ఇక్కడ అమహదర్థంగా ప్రయోగించబడింది. పురుషుఁడొక్కడు - ఇక్కడ మహత్తు. పుస్తకమొకఁడు - ఇక్కడ అమహత్తు.

తే. ఇట్లు గాంగేయుఁ డేయుననేక విశిఖ । వితతి యసురారి రథచిత్రగతుల దప్పి
పోవఁ జేయంగ నతఁ డంతఁ బోక నొంచె । నరుని నారాయణుని బలునారసముల. 143

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; గాంగేయుఁడు= గంగకొడుకు(భీష్ముడు); ఏయు= వేసే; అనేక+విశిఖ+వితతి= పెక్కు బాణాల సముదాయం; అసుర+అరి= రాక్షసుల విరోధి, శ్రీకృష్ణుడు; రథ+చిత్ర+గతులన్= అచ్చెరువు గొలిపేటట్లు తేరు నడిపి; తప్పి+పోవన్+చేయంగన్= తప్పిపోయేటట్లు చేయగా; అతండు= భీష్ముడు; అంతన్+పోక= అంతటితో ఆగక; నరునిన్= అర్జునుని; నారాయణునిన్= శ్రీకృష్ణుని; బలు+నారసములన్= గొప్ప అమ్ములతో; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: ఈ విధంగా భీష్ముడు బాణాలు ప్రయోగించగా రథాన్ని చిత్ర విచిత్రంగా నడిపి - ఆ బాణాలు తప్పిపోయేటట్లుగా చేశాడు సారథియైన శ్రీకృష్ణుడు. భీష్ముడు అంతటితో ఊరుకోకుండా కృష్ణుడినీ - అర్జునుడినీ అమ్ములతో నొప్పించాడు.

క. నొచ్చియు భీష్మునిపై వి । వ్వచ్చుఁడు బెడిదముగఁ గురిసె వాలమ్ము లతం
డచ్చెరువుతోడ వెసఁ గా । ర్చిచ్చు గవిసినట్లు పొదివె శితవిశిఖములన్. 144

ప్రతిపదార్థం: నొచ్చియున్= బాధపడుతూనే; భీష్మునిపైన్; వివ్వచ్చుఁడు= అర్జునుడు; బెడిదముగన్= ఎక్కువగా; వాలు+అమ్ములు= వాడి బాణాలు; కురిసెన్= వర్షించాడు; అతండు= భీష్ముడు; అచ్చెరువుతోడన్= ఆశ్చర్యంతో, వెసన్= వేగంగా; కార్చిచ్చు= దావానలం; కవిసినట్లు= పైబడినట్లుగా; శిత+విశిఖములన్= వాడి అమ్ములను; పొదివెన్= చుట్టూ ప్రయోగించాడు.

తాత్పర్యం: తాను బాధపడుతూనే, అర్జునుడు భీష్మునిపై గట్టిబాణాలు గుప్పాడు. భీష్ముడు - ఆశ్చర్యంతో మరలా వాడి బాణాలతో అర్జునుడిని కప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అంత నపరాహ్ణం బయ్యె నట్టియెడ. 145

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; అపర+అహ్ణంబు= మధ్యాహ్న సమయం; అయ్యెన్= ఏర్పడింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అంత మధ్యాహ్నమయింది, ఆ సమయంలో.

క. హరి దాను నొచ్చి నొచ్చిన । నరునితెఱం గెఱిఁగి భీష్మునకు నించుకయుం
గరలాఘవ మెడలమియుం । దిర మై పరికించి తనమదిం దలపోయున్. 146

ప్రతిపదార్థం: హరి= శ్రీకృష్ణుడు; తాను నొచ్చి= బాధింపబడి; నొచ్చిన+నరుని+తెఱంగు= బాధపడుచున్న అర్జునునితీరు; ఎఱిఁగి= తెలిసికొని; భీష్మునకున్= భీష్మునకు; ఇంచుకయున్= ఏ మాత్రమూ; కర+లాఘవము= చేతులందలి సులువు; ఎడలమియున్= తగ్గకపోవటం; తిరము+ఐ+పరికించి= బాగుగా అరసి; తన మదిన్= తన మనస్సులో; తలపోయున్= ఆలోచించాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు తాను దెబ్బతిన్నాడు. అర్జునుడు కూడా దెబ్బతిన్నట్లు తెలుసుకున్నాడు. అయితే భీష్ముని 'కరలాఘవము' (చేతుల ఒడుపు) ఏ మాత్రం తగ్గలేదని గ్రహించి - తన మనస్సులో ఈ విధంగా అనుకున్నాడు.

ఉ. ' పాండవసైన్యముల్ గలఁగి పాఱెడు సిగ్గఱి వీరిలోన నొ
క్కండును భీష్మమార్కొని మగంటిమి సూపఁగ లేఁడ యింద్ర పు
త్త్రుండును జాల నొవ్వడరి తూఁగెడు నిట్టిద యైన నేఁడ తీ
ర్పండె? యితండు కౌరవనృపాలుసమస్తమనోరథంబులున్. 147

ప్రతిపదార్థం: సిగ్గు+అఱి= సిగ్గులేకుండా; పాండవ+సైన్యముల్= పాండవుల సేనలు; కలఁగి= నొచ్చి; పాఱెడున్= పారిపోతున్నాయి; వీరిలోనన్= ఈ పాండవసైనికులలో; ఒక్కండును= ఒక్కడుగూడ; భీష్మున్= భీష్ముని; మార్కొని= ఎదిరించి; మగంటిమి= పౌరుషం; చూపలేడు+అ= చూపించలేకుండా ఉన్నాడు కదా!; ఇంద్రపుత్త్రుండును= ఇంద్రుని కొడుకు(అర్జునుడుకూడా); చాలన్= మిక్కిలి; నొవ్వు+అడరి= నొప్పి అతిశయించి; తూఁగెడున్= వ్రాలుచున్నాడు; ఇట్టిది+అ+ఐనన్= ఈ విధంగానే అయితే; నేఁడు+అ= ఈ దినమే; ఇతండు= ఈ భీష్ముడు; కౌరవ నృపాలు సమస్త మనోరథంబులన్= కౌరవరాజు దుర్యోధనుని కోరికలు అన్నీ; తీర్పండు+ఎ?= నెరవేర్చడా?

తాత్పర్యం: 'పాండవసేనలు సిగ్గులేకుండా పారిపోతున్నాయి. భీష్ముని ఎదిరించి పౌరుషం చూపగల వీరుడు వీరిలో ఒక్కడూ లేడుకదా! అర్జునుడు గూడా వేదనతో తూలిపోతున్నాడు. ఇక - ఈ స్థితిలో దుర్యోధనుడి కోరికలు అన్నీ భీష్ముడు నేడే నెరవేర్చేటట్లు అనిపిస్తున్నది.

క. యాదవకేకయ పాంచా । లాదులు పాఱుటలు సూచి యస మెక్కి జయో
న్మాదంబునఁ గురుసైన్యము । లే దిక్కునఁ దామ యగుచు నేడ్తెఱఁ బొదివెన్. 148

ప్రతిపదార్థం: యాదవ+కేకయ+పాంచాల+ఆదులు= యాదవులు; కేకయ దేశస్థులు; పాంచాల రాజ్యానికి చెందిన వారు- మొదలగు వారు; పాఱుటలు+చూచి= పారిపోవటం వీక్షించి; అసము+ఎక్కి= గర్వం పొంది; జయ+ఉన్మాదంబునన్= విజయం వల్ల వచ్చే పిచ్చితో; కురుసైన్యములు= కౌరవుల సేనలు; ఏ+దిక్కునన్= ఏ వైపున అయినను; తాము+అ+అగుచున్= తామే ఉంటూ; ఏడ్తెఱన్= పరాక్రమంతో; పొదివెన్= చుట్టుముట్టాయి.

తాత్పర్యం: పాండవుల పక్షంలో యుద్ధం చేస్తున్న యాదవుల కేకయుల, పాంచాలుర సేనలు పారిపోవటం చూచి, పొగరెక్కిన విజయోన్మాదంతో కురుసైన్యం అన్నివైపులా చేరి పాండవుల సేనలను చుట్టుముట్టింది.

వ. ఇప్పు డే నూరకున్నం బోవ దీ దేవవ్రతుం జంపి ధర్మతనయు గెలిపింపవలయు' నని యిట్లు దలపోయునెడ మఱియు మందాకినీనందనుండు బెట్టిదమ్ములగు నారసమ్ములు గురియం దేఁకువ సెడి క్రీడి యున్నంగని కృప కృతవర్మాశ్వత్థామలును భూరిశ్రవస్సైంధవ వికర్ణులును నొక్క మొగంబై రథమ్ముల మొత్తమ్ములతోడం గడంగి వచ్చి కవ్వడిపయిం బడి రాసమయంబున సాత్యకి సామజఘటలతో నురవడించి యిరుగెలంకుల యోధుల నాలోకించి. 149

ప్రతిపదార్థం: ఇప్పుడు, ఏను= నేను(శ్రీకృష్ణుడు); ఊరకున్నన్= ఉపేక్షిస్తే; పోవదు= సరిపోదు; ఈ+దేవవ్రతున్+చంపి= ఈ భీష్ముని సంహరించి; ధర్మతనయున్= ధర్మపుత్రుని; గెలిపింపవలయున్= నెగ్గేటట్లు చేయాలి; అని= అని ఈ రీతిగా; తలపోయు+ఎడన్= ఆలోచించేటపుడు; మఱియున్= ఇంకను; మందాకినీ+నందనుండు= గంగకొడుకు(భీష్ముడు); బెట్టిదమ్ములు+అగు= కఠినములు అయిన; నారసమ్ములు= బాణాలు; కురియన్= వర్షింపగా; తేఁకువ+చెడి= ధైర్యం చెడి; క్రీడి+ఉన్నన్+కని= అర్జునుడు ఉండటం చూచి; కృప కృతవర్మ అశ్వత్థామలును= కృపుడు,కృతవర్మ, అశ్వత్థామ; భూరిశ్రవస్ సైంధవ వికర్ణులును= భూరిశ్రవుడు -సింధురాజు జయద్రథుడు; వికర్ణుడు; ఒక్క+మొగంబు+ఐ= ఏకమై; రథమ్ముల+మొత్తమ్ములతోడన్= తమ రథాలు అన్నిటితోపాటు; కడంగి+వచ్చి= పూని అరుదెంచి; కవ్వడి పయిన్+పడిరి= అర్జునునిపై మార్కొన్నారు; ఆ సమయంబునన్= ఆ సమయంలో; సాత్యకి= సాత్యకి; సామజ+ఘటలతోన్= ఏనుగుల యూథాలతో, ఉరవడించి= వేగంగా చేరి; ఇరు+కెలంకుల యోధులన్= ఇరుపక్షాల వీరులను; అవలోకించి= చూచి.

తాత్పర్యం: ఇపుడు నేను ఉపేక్షిస్తే వీలులేదు - భీష్ముడిని చంపి ధర్మతనయునికి జయం చేకూర్చాలి' అని శ్రీకృష్ణుడు ఆలోచించాడు. ఇదిగాక, భీష్ముడు వాడి బాణాలు ప్రయోగించటం చేత అర్జునుడు వాడిపోయాడు. కృపుడు - కృతవర్మ - అశ్వత్థామ -భూరిశ్రవుడు, జయద్రథుడు, వికర్ణుడు, కౌరవ పక్షంలోని గొప్ప వీరులు అందరూ ఏకమై రథారూఢులై వచ్చి అర్జునుని మార్కొన్నారు. ఆ సమయంలో సాత్యకి ఏనుగుల గుంపులతో - వేగంగా చేరి ఇరుపక్షాల వీరులను సమీక్షించి.

విశేషం: యుద్ధంలో ఎంతటి వీరులకైనా ఒక్కొక్కసారి వేసట ఏర్పడవచ్చు. ఈ పట్టున జగదేకవీరుడు కావచ్చు, అర్జునుడు క్రుంగిపోయాడు మానసికంగా. మహాభారతం ఇట్టి మానసికమైన అవస్థా విశేషాల్ని గుర్తించింది. కవ్వడి = కవ+వడి= జోడువడులు కలవాడు ఈ అచ్చతెలుగు పదానికి సంస్కృత పర్యాయపదం - 'సవ్యసాచి' -రెండు చేతులతో వింటినుండి బాణాలు గుప్పింపగలవాడు.

క. ' మఱతురె? యాడిన మాటలు । పిఱుసనిపోఁ దగునె? మీకు బెదరక యెదురై
తఱుముఁడు భీష్ముని గీష్ముని । నెఱుఁగరె? ము న్నేను గలుగ నేలా వెఱవన్?' 150

ప్రతిపదార్థం: ఆడిన+మాటలు= చేసిన బాసలు; మఱతురె= మరచిపోయారా?; మీకున్= మీకు; పిఱుసనిపోన్+తగునె?= వెనుకంజవేయదగునా? బెదరక= భయపడక; ఎదురు+ఐ= ఎదిరించి; భీష్మునిన్+గీష్మునిన్= భీష్ముని(సరకుగొనక); తఱుముఁడు= వెనుకకు తిరిగి పోయేటట్లు త్రిప్పికొట్టండి; ఎఱుఁగరె?= మీకు తెలియదా?; మున్ను+ఏను+కలుగన్= ముందు నేనుండగా; ఏలా+వెఱవన్?= భయం ఎందుకు?.

తాత్పర్యం: 'మీరు చేసిన వాగ్దానాలు - ప్రతిజ్ఞలు మరచిపోయారా? మీరు వెనుకంజ వేయవచ్చా? భీష్ముడు గాని గీష్ముడుగాని ఎవరైనా సరే మీరు బెదరకుండా, ఎదిరించండి - నేనున్నాను - మీకు భయం ఎందుకు?'

విశేషం: భీష్ముడు -గీష్ముడు, నిజానికి గీష్ముడంటూ ఎవడూ లేడు. రాముడు - గీముడు - నిందను తెలిపేటప్పుడు 'గీ' అక్షరం తెలుగులో ముందుకు వస్తుంది. అంతే.

వ. అనుచు నేచి యెదిరిన బలంబుల నిలునిలుమని యదల్చుచు నర్జును తేరికిం దలకడచి వచ్చునతనికి దనుజాంతకుండిట్లనియె : 151

ప్రతిపదార్థం: అనుచున్=అని చెప్పుచు; ఏచి= విజృంభించి; ఎదిరిన+బలంబులన్= ఎదిరించిన సేనలను; నిలునిలుము+అని= ఆగు మాగు మని; అదల్చుచున్= మందలించుచు; అర్జును+తేరికిన్= అర్జునుని రథానికి; తల కడచి వచ్చు+అతనికిన్; దాటి ముందునకు వచ్చే అతనికి= సాత్యకికి; దనుజాంతకుండు= రాక్షసులను చంపువాడు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని విజృంభించి ఎదిరిన సేనలను నిలు నిలుమని అదలించి అర్జును రథానికి ముందుకు వచ్చి చేరిన సాత్యకితో శ్రీకృష్ణుడు ఈ విధంగా అన్నాడు:

క. ' తిరిగినపందల నేటికిఁ । బురికొల్పఁగనున్నవారు వోదురు గా; కేఁ
గురుపతి జయంబు గొని యి । ద్ధరయేలం జూడ నేర్చెదనె? విను నన్నున్. 152

ప్రతిపదార్థం: తిరిగిన= వెనుకంజవేసిన; పందలన్= పారుబోతులను; ఏటికిన్= ఎందుకు; పురికొల్పఁగన్= ప్రోత్సహించాలి?; ఉన్నవారు= నిలిచినవారు; పోదురుగాక= సరిపోతారుగాక; కురుపతి+జయంబున్+కొని= కురురాజు దుర్యోధనుడు జయించి; ఈ+ధరన్= ఈ భూమిని; ఏలన్= పరిపాలించటం; చూడ+నేర్చెదను+ఎ?= చూడజాలుదునా?; నన్నున్+విను= నేను చెప్పే మాటలు విను.

తాత్పర్యం: 'పారిపోయే పిరికిపందలను నిలవండని ఎందుకు హెచ్చరిస్తున్నావు? మిగిలిన వారు గూడ పారిపోతే పోదురు గాక! దుర్యోధనుడు జయించి ఈ భూమిని ఏలుకోవటం చూచి నేను సహించగలనా? నా మాట ఆలకించుము.

శా. గంగానందనుఁ గూల్చి ద్రోణుపని సక్కంజేసి కౌరవ్య వీ
రాంగమ్ముల్ నుఱుమాడి తత్ప్రబలసైన్యం బెల్ల మాయించి యి
త్తుం గౌంతేయుల కిమ్మహీవలయమున్ దుర్దాంతచంచద్భుజా
సంగస్ఫూర్జితచక్రవిక్రమకళాసంక్రీడనోన్మాది నై.' 153

ప్రతిపదార్థం: గంగా+నందనున్+కూల్చి= గంగకొడుకు భీష్ముని సంహరించి; ద్రోణు+పని+చక్కంజేసి= ద్రోణుని పని సరిదిద్ది; కౌరవ్య+వీర+అంగమ్ముల్= కౌరవయోధుల అవయవాలను; నుఱుమాడి= నాశనం చేసి; తద్+ప్రబల+సైన్యంబు+ఎల్లన్= ఆ కౌరవుల గొప్ప సేనను అంతటినీ, మాయించి= నశింపచేసి; కౌంతేయులకున్= కుంతీపుత్రులకు(పాండవులకు); ఈ+మహీ+వలయమున్= ఈ భూమండలాన్ని; దుర్దాంత చంచత్ భుజా సంగ స్ఫూర్జిత చక్ర విక్రమ కళా సంక్రీడన+ఉన్మాదినై= అణచరానిదై కదలుచున్న నా బాహువునందు నెలకొన్న చక్రాయుధము యొక్క వీరవిహారమనే క్రీడయందు, మత్తెక్కిన వాడనై; ఇత్తున్= ఇవ్వగలను.

తాత్పర్యం: భీష్ముడిని సంహరిస్తాను. ద్రోణుడిని పనిబట్టగలను, కౌరవ యోధుల అవయవాలను చీల్చి చెండాడ గలను. కౌరవసేనలను నాశనం చేయగలను. ఈ భూరాజ్యాన్ని కుంతీపుత్రులైన పాండవులకు కట్టబెట్టగలను. నా భుజ పరాక్రమాన్ని చూపి, చక్రాయుధాన్ని ప్రయోగించి, విక్రమ వీరవిహారం చేస్తాను.'

విశేషం: ఇంతవరకు తేటగీతలు వ్రాసిన తిక్కన - ఇక్కడ శ్రీకృష్ణుని ప్రతిజ్ఞ శార్దూల వృత్తంలో చెప్పించాడు. ఈ పద్యం చివర - సుదీర్ఘ సంస్కృత సమాస ప్రయోగం గమనించదగింది. వీర రసోచితంగా - భావానుగుణంగా తిక్కన మహాకవి భాషను వాడటం గుర్తించవచ్చు.

శ్రీకృష్ణుఁడు చక్రంబు ధరించి భీష్మునిమీఁది కుఱుకుట (సం- 6-55-84)

వ. అని పలికి సుదర్శనంబుం దలంచినం దత్క్షణంబ యది సన్నిహితం బగుటయుం బద్మనాభుండు సునాభంబగు నా చక్రంబు గైకొని దక్షిణకరంబున నమర్చి పేర్చి యుగ్యంబుల పగ్గంబులు నొగల ముడిచి యరదంబు డిగ్గ నుఱికి. 154

ప్రతిపదార్థం: అని+పలికి; సుదర్శనంబున్= సుదర్శనం అనే పేరుగల 'చక్ర' ఆయుధాన్ని; తలంచినన్= స్మరింపగా; తద్+క్షణంబు+అ= ఆ క్షణమునందే; అది= ఆ 'సుదర్శన చక్రం'; సన్నిహితంబు+అగుటయున్= దరిచేరగా; పద్మనాభుండు= శ్రీకృష్ణుడు(పద్మం నాభియందుగల విష్ణుదేవుడు); సునాభంబు+అగు= శీఘ్రగమనముగల; ఆ చక్రమున్= ఆ చక్రమును; కైకొని= చేతబట్టి; దక్షిణ+కరంబునన్= కుడిచేత; అమర్చి= పెట్టి; పేర్చి= అతిశయించి; యుగ్యంబుల పగ్గంబులు= గుర్రాల కళ్ళాలు; నొగలన్= రథం నొగమీద; ముడిచి= ముడిపెట్టి; అరదంబు+డిగ్గన్+ఉఱికి= రథంనుండి క్రిందికి దుమికి

తాత్పర్యం: అని చెప్పి- శ్రీకృష్ణుడు తన ఆయుధమైన సుదర్శన చక్రాన్ని సంస్మరించాడు. వెంటనే ఆ చక్రం అతని దగ్గరకు వచ్చింది. శ్రీకృష్ణుడు శీఘ్రగమనం గల ఆ చక్రాయుధాన్ని తన కుడి చేతికి అమర్చుకున్నాడు. గుర్రాల కళ్ళాలు తేరునొగలమీద జాగ్రత్తగా ముడిచి క్రిందికి దూకాడు.

తే. అవని గంపింప లలిత పీతాంబరంబు । చెఱఁగు దూలఁ జక్రాంశులు దుఱఁగలింప
సింహనాదంబు క్రోధరంజితభయంక । రాననంబునఁ జెలఁగంగ నడరుఁ బెలుచ. 155

ప్రతిపదార్థం: అవని+కంపింపన్= భూమి దద్దరిల్లునట్లుగా; లలిత+పీత+అంబరంబు= మృదువైన పట్టుబట్ట; చెఱఁగు+తూలన్= అంచు చెదరిపోగా; చక్ర+అంశులు= చక్రము యొక్క కాంతులు; తుఱఁగలింపన్= మిరుమిట్లు గొలుపగా; క్రోధ రంజిత భయంకర+ఆననంబునన్= కోపముతో ఎర్రనైన వెరపుగొలిపే ముఖమునందు; సింహనాదంబు= సింహనాదము, చెలఁగంగన్= ధ్వనింపగా; పెలుచన్= ఎక్కువగా; అడరున్= విజృంభించాడు.

తాత్పర్యం: భూమి దద్దరిల్లగా, కోమలమైన పట్టుబట్ట అంచులో చలింపగా, చక్రాయుధం కాంతులు వెల్లివిరియగా కోపంతో ఎర్రనైన భయంకర ముఖం నుండి సింహనాదం శోభిల్లగా విజృంభించాడు.

శా. అంహోమర్దనుఁ డాజనార్దనుఁడు మాద్యద్భీష్మకుంభీంద్రుపై
సింహోల్లాసవిలాసి యై కవియు నుత్సేకంబు నాటోపమున్
రంహఃస్ఫూర్తియు దీప్తమూర్తియును సంరంభంబుఁ జూడన్ జగ
త్సంహారోన్ముఖుఁ డైన రుద్రుగతి రౌద్రప్రక్రియం బొల్చినన్. 156

ప్రతిపదార్థం: అంహస్+మర్దనుఁడు= పాపాలను పొగొట్టువాడు; ఆ+జనార్దనుఁడు= ఆ శ్రీకృష్ణుడు; మాద్యత్+భీష్మ+కుంభి+ఇంద్రు పైన్= మదించిన భీష్ముడు అనే గజరాజుపై; సింహ+ఉల్లాస+విలాసియై= సింహం యొక్క ఉత్సాహ పూరితమైన లాలిత్యం కలవాడై; కవియు+ ఉత్సేకంబు= మార్కొనే ఉద్రేకము; ఆటోపమున్= దర్పమును; రంహస్+స్ఫూర్తియున్= వేగోద్వేగం; దీప్తమూర్తియును=

వెలుగొందే ఆకారం; సంరంభంబున్= ఆ వేగం, చూడన్= అరయగా; జగత్+సంహార+ఉన్ముఖుఁడైన= ప్రపంచాన్ని సంహరించటానికి పూనుకున్న; రుద్రుగతిన్= శివునివలె; రౌద్ర+ప్రక్రియన్= రోషముతో కూడిన ప్రవృత్తితో; పొల్చినన్= శోభిల్లగా.

తాత్పర్యం: పాపాలను పొగొట్టునట్టి శ్రీకృష్ణుడు గర్వించి ఉన్న భీష్ముడు అనే మదపుటేన్గుపై సింహం చూపే ఉద్వేగంతో సౌందర్యపుఠీవితో మార్కొన్నప్పుడు స్వయంవ్యక్తమయ్యే ఉద్రేకం - దర్పం- వేగోద్ధతి - వెలుగొందే ఆకృతి - దీనినంతా చూడగా - ప్రపంచాన్ని నాశనం చేయటానికి ఉద్యుక్తుడైన లయకాలరుద్రుని ప్రవృత్తితో ఆయన శోభిల్లుతున్నాడు.

విశేషం: అలం: ఉపమ. రూపకానుప్రాణితం. తెలుగు పద్య శిల్ప సౌష్ఠవమునకు ఈ పద్యం ఉదాహరణప్రాయమైనది. బిందుపూర్వక హకార ప్రాసము యతులు - ప్రౌఢ సంస్కృత సమాసాలు చక్రం చేతపట్టి భీష్మునిపైకి లంఘించిన శ్రీకృష్ణుని ఆకృతిని హృదయంగమంగా సహృదయుల కన్నులకు కట్టిస్తున్నాయి.

చ. **పులిఁ బొడగన్న లేళ్ళగమివోలె సుయోధను నగ్రసైనికుల్**
దలఁకి కలంగి నివ్వెఱఁగు దక్కినఁ జేష్టలు దక్కి చిత్రరూ
పులక్రియ నుండి రక్కురువిభుండును మాఱు దలంపలేని కొం
దలమునఁ బొందుడెందమునఁ దానును రూపఱియుండె వెల్ల నై. **157**

ప్రతిపదార్థం: పులిన్= పెద్దపులిని; పొడగన్న= చూచిన; లేళ్ళ+గమి+పోలెన్= లేళ్ళ గుంపువలె; సుయోధను+అగ్రసైనికుల్= దుర్యోధనుని ముందు ఉన్న భటులు; తలఁకి= భయపడి; కలంగి= కలతచెంది; నివ్వెఱఁగు దక్కినన్= ఆశ్చర్యం కలుగగా; చేష్టలు దక్కి= కదలిక లేక; చిత్ర రూపుల క్రియన్= చిత్ర లేఖనమునందలిఆకృతుల వలె; ఉండిరి= ఉన్నారు; ఆ+కురు+విభుండును= ఆ కురురాజు (దుర్యోధనుడు); మాఱు+తలంపన్‌లేని= మారు ఆలోచించలేని; కొందలమునన్= ఆవేదనను; పొందుడెందమున్= అనుభవించే గుండెతో; తానును= తానుకూడా; వెల్లనై= వెలవెలబోయి; రూపు+అఱి+ఉండెను= మారిన ఆకృతి గలవాడై ఉన్నాడు.

తాత్పర్యం: పులినిచూచిన లేళ్ళగుంపువలె దుర్యోధనుని యోధముఖ్యులు, భయపడి, కలతచెంది నివ్వెఱగున చేష్ట దక్కి చిత్రరూపములవలె వున్నారు. ఆ దుర్యోధనుడు కూడ మారు ఆలోచించలేని ఆవేదన చెందిన హృదయంతో తానుకూడ వెలవెలపాటుతో మారిపోయిన రూపు కలవాడైనాడు.

ఉ. **అప్పుడు భీష్ముఁ డెంతయుఁ బ్రియంబున నిట్లను సంభ్రమంబు లే**
కప్పరమేశుతో నిటు కృతార్థునిఁ జేయుదెఁ నీవు వచ్చి న
న్నిప్పడు నీకుఁ బోలినటు లెల్లను జేయుదు గాని వేగ ర
మ్మెప్పదె నాకు నిట్టి తెఱఁ గుజ్జ్వలపుల్లసరోజలోచనా?' **158**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; భీష్ముడు= భీష్ముడు; ఎంతయున్+ప్రియంబునన్= మిక్కిలి ప్రీతితో; ఆ+పరమేశుతోన్= ఆ కృష్ణుడితో; సంభ్రమంబులేక= తొట్రుపాటు లేక; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; ఇటు= ఈ రీతిగా; కృతార్థునిన్+చేయుదె?= ధన్యుని చేస్తున్నావా; నీవు; వేగన్= శీఘ్రంగా, వచ్చి; నన్నున్; ఇప్పుడు= ఈ సమయంలో; నీకున్+పోలిన+అటులు+ఎల్లను= నీకు తోచినట్లుగా అంతయు; చేయుదుకాని= చేయుదువు కాని; వేగరమ్ము= శీఘ్రమే రమ్ము ఉజ్జ్వల పుల్ల సరోజ లోచనా!= ప్రకాశించేటటువంటి, వికసించినట్టి పద్మముల వంటి కన్నులు గలవాడా; నాకున్= నాకు; ఇట్టి= ఈ విధమైన; తెఱఁగు= రీతి; ఒప్పదు+ఎ?= సరికాదా?

తాత్పర్యం: అప్పుడు భీష్ముడు మిక్కిలి ప్రీతితో తొట్రుపాటు లేకుండా ఆ శ్రీకృష్ణుడితో ఇట్లన్నాడు. ప్రకాశించే, వికసించిన పద్మములవంటి కన్నులుగలవాడా! ఈ విధంగా నన్ను ధన్యుని చేస్తున్నావా? నీవు వచ్చి నన్నిప్పుడు నీకు తోచిన విధంగా చేతువుగాని శీఘ్రంగా రమ్ము. ఈ రీతి నాకు తగినదే గదా!

విశేషం: భీష్ముడు శ్రీకృష్ణుడిని ఎదిరించలేదు - సరికదా వినయంతో స్వాగతం పలికి అర్చించాడు.

వ. అను నట్టియెడ నర్జునుండు రయంబున రథంబు డిగ్గనుఱికి పఱచి పురుషోత్తము పిఱిందిదెసం గ్రుచ్చి పట్టిన నతండు దీర్ఘబాహుం డగునతని నాయతశాఖం బగువిపులశాఖిం గొనిపోవు మహావాతంబునుం బోలెఁ గొనిపోవ నాతండు పదియడుగులకొలఁది నిలాతలంబు చిక్కం ద్రొక్కి యీడిగిలంబడి నిలువం బట్టి యి ట్లనియె. 159

ప్రతిపదార్థం: అను+అట్టి+ఎడన్= భీష్ముడు అట్లా పలుకుతున్నప్పుడు; అర్జునుండు; రయంబునన్= వేగంగా; రథంబు+డిగ్గి= తేరునుండి దిగి; పఱచి= పరుగెత్తి; పురుషోత్తము= శ్రీకృష్ణుని; పిఱింది+దెసన్+(గుచ్చి+పట్టిన= వెనుకనుండి గట్టిగా బంధించి పట్టగా; అతండు= శ్రీకృష్ణుడు; దీర్ఘ+బాహుండు+ అగు= ఆజానుబాహుడు అయిన(పొడుగు చేతులుగల); అతనిన్= అర్జునుడిని - ఆయత+శాఖంబగు= పొడుగు కొమ్మలుగల; విపుల+శాఖిన్= పెద్ద చెట్టును; కొనిపోవు= తీసికొనిపోవు; మహా+వాతంబునున్+పోలెన్= గొప్ప వాయువువలె; కొనిపోవన్= తీసికొని పోగా; ఆతండు= ఆతడు(అర్జునుడు); పది అడుగుల కొలఁది= పది అడుగుల మేర; ఇలాతలంబు= భూమిభాగం; చిక్కన్+త్రొక్కి= గట్టిగా త్రొక్కిపట్టి; ఈడిగిలంబడి= మొండితనంతో కూర్చుండగా; నిలువన్+పట్టి= నిలువబెట్టి; ఇట్లు; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: భీష్ముడట్లా అంటూండగానే అర్జునుడు వేగంగా రథంనుంచి క్రిందికి దుమికి పరుగెత్తి పోయి పురుషోత్తముని వెనుక వైపునుంచి గట్టిగా పట్టుకున్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు పొడవైన చేతులు గల అర్జునుణ్ణి పొడవైన కొమ్మలతో కూడిన పెద్ద వృక్షాన్ని లాగుకొని పోయే పెనుగాలిమాదిరి ఈడ్చుకొని పోయాడు. అంతట అర్జునుడు పది అడుగులమేర నేలను కాళ్ళతో త్రొక్కిపట్టి మొండికేసి కూర్చుండి నిలువరించి శ్రీకృష్ణుడితో ఇట్లన్నాడు.

విశేషం: అలం: ఉపమ. 1. మహాభారతంలో ఈ సన్నివేశం ప్రత్యేక ప్రాముఖ్యం సంతరించుకున్నది. శ్రీకృష్ణుడు ఆయుధం ధరించనని ప్రతిజ్ఞ చేశాడు కదా! మరి చక్రాయుధం ధరించి - భీష్ముని మీదికి లంఘించటం ప్రతిజ్ఞా భంగం కాదా? ప్రతిజ్ఞాభంగమే! ఇది మూడవనాటి యుద్ధంలో - ఒకసారి మాత్రమే గాదు శ్రీకృష్ణుడు తొమ్మిదవనాడు కూడ ఈ విధంగానే ప్రవర్తించాడు. అంతేకాదు 'అశ్వత్థామ' చచ్చిపోయినట్లు ధర్మరాజును అసత్యమాడుమని ఉద్బోధించాడు శ్రీకృష్ణుడు తదుపరి.

'ధర్మం' నిత్య చైతన్య స్రవంతి. స్తబ్ధసూత్రంగాదు. మహాభారతసారంగా చెప్పబడే శ్లోకంలో ధర్మం ఎక్కడ ఉంటే అక్కడ శ్రీకృష్ణుడు ఉంటాడని లేదు సరికదా 'కృష్ణుడు ఎక్కడ ఉంటే అక్కడే ధర్మం ఉంటుంది, అని ఉంది. **'యతో కృష్ణ స్తతో ధర్మః యతో ధర్మస్తతో జయః'** శ్రీకృష్ణుడు శాంతి ప్రియుడు- సంగ్రామ ప్రియుడు కాడు. అందుచే ఆతడు - అచ్చమైన శాంతి సంధాతగా' ఆయుధ విసర్జన చేసి అస్త్రసన్న్యాసం చేశాడు. శ్రీకృష్ణుడు చక్రం పట్టింది - ప్రతిజ్ఞ మీరటానికి కాదు. అర్జునుడికి ప్రోత్సాహం కల్పించటానికే. అది శ్రీకృష్ణుడి తత్క్షణ కర్తవ్యం. అయితే - ప్రతిజ్ఞ - ఉత్తమ లక్ష్యంగా ఉండవలసిందేగాని తప్పించుకోలేని 'బంధం' కాకూడదు. ప్రతిజ్ఞాపాలన గొప్పదే. అయితే - జగద్ధితం కోసం ప్రతిజ్ఞాభంగం చేయటం అహంకార పరిత్యాగమే. ప్రతిజ్ఞకు దాస్యం చేయటం అవివేకమే. భీష్ముడు అధర్మపక్షంలో చేరిన జగదేకవీరుడు. భీష్ముడు ప్రతిజ్ఞకు దాస్యం చేశాడు. తన తండ్రి కోసం - తాను బ్రహ్మచర్య నిష్ఠ స్వీకరించాడు. ఎందుకంటే - తండ్రి వలచిన సత్యవతి సంతానానికి రాజ్యం సంక్రమించేటందుకు. విధి వైపరీత్యం వలన, సత్యవతి సంతానం మరణించి, సింహాసనానికి వారసులు లేకపోయారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీష్మడి ప్రతిజ్ఞకు కాలదోషం పట్టింది. అయినాసరే - అతడు భీష్ముడై సార్థక బిరుదాంకితుడై ప్రతిజ్ఞనే పాటించాడు. అందుచేత అతడు ప్రతిజ్ఞకు దాసుడేగాక- ధృతరాష్ట్రుడికి - తదుపరి దుర్యోధనుడికీ గూడ దాసుడు కావలసివచ్చింది. బహుశః భీష్మడికి ఆ విషయం తెలియుననే అనుకోవచ్చు. భీష్మడు శ్రీకృష్ణుడిని అధిక్షేపించలేదు ప్రతిజ్ఞాభంగం చేసినందుకు. అంతేగాక - శ్రీకృష్ణుడికి భక్తితో స్వాగతం పలికి జేజేలు చెప్పాడు. ధర్మసూక్ష్మం వేరు - అది నిత్య చైతన్యపూరితం. గ్రాంథిక జడధర్మం వేరు. శ్రీకృష్ణుడు అనుష్ఠాన వేదాంతి.

2. ఇంక రెండవ అంశం: ఈ ఘట్టాన్ని తిక్కనా వ్రాశాడు, పోతన్నకూడా వ్రాశాడు. 'కుప్పించి ఎగసిన కుండలమ్ముల కాంతి గగనభాగంబెల్లఁ గప్పికొనఁగ' - శ్రీకృష్ణుడు 'కరికి లంఘించు సింహమ్ము కరణి' భీష్మడి మీదికి ఉరికినట్లు మనోజ్ఞంగా ఆపాతమధురమైన శైలిలో పోతన ఈ సన్నివేశం అభివర్ణించాడు. పోతన్న శైలి - భక్తిరసతుందిలం. తిక్కన తీర్చిదిద్దిన శ్రీకృష్ణుడు లీలా మానుష వేషధారి. 'ధర్మాద్వైతమూర్తి', అనుష్ఠాన వేదాంతి. పోతన్న శ్రీకృష్ణుడు ఆ మహానుభావుడి ఇష్టదైవము.

ఉ. కోపము సంహరింపు యదుకుంజర! పాండవకోటి కెల్లనుం
దేపవు గావె నీ విటు లధీరతఁ బూనికి దప్పినం బ్రతి
జ్ఞాపరుఁడైన ధర్మసుతు శౌర్యము ధైర్యము బాహువీర్యమున్
రూపతిపోక కాదె యనురూపమె నీకిది లోకనాయకా! 160

ప్రతిపదార్థం: కోపము= ఆగ్రహం; సంహరింపు(ము)= విడువుము; యదు+కుంజర!= యదువంశీయులలో ఏనుగువంటివాడా= యాదవ శ్రేష్ఠా!; పాండవ+కోటికిన్+ఎల్లనున్= పాండవులకు పాండవుల అనుయాయులకు; తేపవు+కావె= నావవుకాదా?; నీవు+ఇటులు= నీవు ఈ రీతిగా; అధీరతన్= అధైర్యంతో; పూనిక+తప్పినన్= ప్రతిజ్ఞను ఉల్లంఘించినచో; ప్రతిజ్ఞా+పరుఁడైన= ఆడినమాట తప్పనట్టి, శపథము మీరనట్టి; ధర్మ+సుతు= ధర్మపుత్రుని; శౌర్యము= పరాక్రమం; ధైర్యము= ధీరత్వం; బాహువీర్యమున్= భుజబలం; రూపు+అతి+పోకకాదె= నశించటమే కదా!; లోక+నాయకా!= లోకాలకు అధినేతా(శ్రీకృష్ణా)!; నీకున్+ఇది= నీకు ఈ విధమైన ప్రవర్తన; అనురూపము+ఎ?= తగినట్టిదా?

తాత్పర్యం: 'యదువంశంలో శ్రేష్ఠుడవైన ఓ శ్రీకృష్ణా! నీ కోపం ఉపశమింప చేసుకోవయ్యా! నీవే కదా పాండవులకు అందరకూ సంరక్షకుడవు! నీవే ప్రతిజ్ఞను తప్పితే - ఇక ప్రతిజ్ఞను పాలించే ధర్మరాజు మాట ఏమిటి? ధర్మరాజు పరాక్రమం ఏమి కావాలి? శౌర్యము, ధైర్యము, బాహు వీర్యము అన్నీ నశించి పోవా? ఓ లోకనాయకా - ఈ చర్య నీకు తగినదా?

చ. ఇటు దగునయ్య? కృష్ణ! శమియింపుము సాత్యకిఁ జంపినాఁడ విం
కట చనితేని నీదగు సహాయతఁ గౌరవసేన రూపు మా
పుట యవలీల నాకు ననుఁ బొల్లుగఁ జేయుట నీకుఁ బాడియే?
కటకట! నా పరాక్రమము గాసిగ చక్రము చేతనంటితే! 161

ప్రతిపదార్థం: కృష్ణ!= ఓ శ్రీకృష్ణా!; ఇటు= ఈ విధంగా చేయటం; తగును+అయ్య!= మంచిదా?; శమింపుము= శాంతించునది; ఇంకన్= ఇకమీద; అట+చనితి+ఏనిన్= అక్కడకు (రణరంగానికి) వెళ్ళితే ; సాత్యకిన్= సాత్యకిని చంపినాఁడవు= చంపినట్లే సుమా!; నీది+అగు+సహాయతన్= నీ సాయంవలన; కౌరవ+సేన= కౌరవుల సైన్యాన్ని; రూపు+మాపుట= నశింపచేయటం; నాకున్= నాకు; అవలీల= సులువు; ననున్= నన్ను; పొల్లుగన్+చేయుట= వ్యర్థుడిగ చేయటం; నీకున్= నీకు; పాడియే?= న్యాయమా?; కటకట!= అయ్యో!; నా పరాక్రమము; గాసిగన్= పాడయిపోయేటట్లుగా; చక్రమున్= చక్రమును; చేతన్+అంటితే!= చేతితో పట్టుకున్నావుకదా!

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! ఈ విధంగా ఆయుధం పట్టుకొని - ప్రతిజ్ఞమీరి యుద్ధం చేయటం నీకు తగునయ్యా?, శాంతించుము. ఇక నీవు భీష్ముని మీదకుపోతే సాత్యకిని చంపినట్లే సుమా! నీ సహాయంతో కౌరవసేనను రూపుమాపడం నాకు సులువు. నన్ను దండుగమారిని చేయడం నీకు న్యాయమా! అయ్యయ్యో! నా పరాక్రమము పాలిపోవునట్లుగా చక్రాన్ని చేత ధరిస్తావా?

వ. అనిన సవ్యసాచి సమయనిష్ఠకు శౌరి సంతోషించి రోషం బుడిపికొని యతనికిం బ్రియంబుగా మగిడి నొగలపైకి వచ్చి దిక్కులు పిక్కటిల్లఁ బాంచజన్యంబు పూరింప నాధనంజయుండును దేవదత్తం బొత్తి గాండీవ గుణ చండనిస్వనం బొండొండ నిగిడించుటయుం గౌరవబలంబులు భేరీమృదంగాదితూర్యనాదంబులు సెలంగ మార్కొని కడంగిన. 162

ప్రతిపదార్థం: అనినన్;సవ్యసాచి+సమయ+నిష్ఠకున్= అర్జునునకు ప్రతిజ్ఞపై గల దీక్షకు; శౌరి= శ్రీకృష్ణుడు; సంతోషించి; రోషంబు+ఉడిపికొని= క్రోధము మాని; అతనికిన్= అర్జునునకు; ప్రియంబుగాన్= ప్రీతిగా; మగిడి= వెనుకకు తిరిగి; నొగలపైకిన్= రథమునకు ముందు భాగానికి (సారథి స్థలమునకు); వచ్చి; దిక్కులు+ పిక్కటిల్లన్= దెసలు మారు మ్రోగగా; పాంచజన్యంబు= శ్రీకృష్ణుడి శంఖం; పూరింపన్= ఒత్తగా; ఆ+ధనంజయుండును= ఆ అర్జునుడు కూడా; గాండీవ+ గుణ+చండ+నిస్వనంబు= గాండీవము(అర్జునుని విల్లు) యొక్క అల్లె త్రాటి భయంకర ధ్వని; ఒండు+ఒండ= క్రమంగా; నిగిడించుటయున్= వర్తిల్ల చేయుటయు; కౌరవ+ బలంబులు= కౌరవుల సేనలు; భేరీ+మృదంగ+ఆది+ తూర్యనాదంబులు= భేరులు, మద్దెలలు, మున్నగు బూరాల ధ్వనులు; చెలంగన్= మ్రోయగా; మార్కొని= తాకి; కడంగినన్= పూనిన.

తాత్పర్యం: అర్జునుడికి శపథంపై గల దీక్షకు శ్రీకృష్ణుడు సంతోషించాడు. క్రోధం పోగొట్టుకొని శ్రీకృష్ణుడు వెనుకకు మరలి, తేరు చేరి, సారథి పీఠం మీద కూర్చుని, దెసలు మారు మ్రోగేటట్లుగా పాంచజన్యం పూరించాడు. అర్జునుడు కూడా అదే రీతిలో తన శంఖం దేవదత్తం పూరించి తన విల్లు గాండీవం యొక్క అల్లెత్రాటిని భయంకరంగా మ్రోగించాడు. కౌరవసేనలు కూడా- భేరులు మ్రోగించి, మద్దెలలు వాయించి, బూరాలు ఊది, ఉత్సాహం ప్రకటించారు.

క. అగ్గలిక దూది దరికొను । నగ్గి తెఱం గమర నప్పుడర్జునుఁడు గడున్
డగ్గఱి మెఱుంగుటమ్ముల । మ్రగ్గించె వియచ్చరోత్కరం బగ్గింపన్. 163

ప్రతిపదార్థం: అగ్గలికన్= పూనికతో; అప్పుడు= ఆ సమయంలో; అర్జునుఁడు= అర్జునుడు; దూదిన్+దరికొను= దూదిని కాల్చు; అగ్గి+తెఱంగు+అమరన్= అగ్నిరీతి తోచునట్లుగా; కడున్= మిక్కుటముగ; డగ్గఱి= సమీపానికివచ్చి; వియత్+చర+ఉత్కరంబు= ఆకాశంలో సంచరించే దేవతాచారణ గణములు; అగ్గింపన్= ప్రశంసింపగా; మెఱుంగు+అమ్ములన్= మిరుమిట్లు గొలిపే బాణాలతో; మ్రగ్గించెన్= మాడేటట్లు చేశాడు.

తాత్పర్యం: అర్జునుడు కౌరవసేనను తాకి, పూనికతో, దూదిని దహించే అగ్ని వలె సమీపించి, మిరుమిట్లు గొలిపే బాణాలు ప్రయోగించి ఆ సేనను కూల్చివేశాడు. ఆతడి పరాక్రమాన్ని ఆకాశంలో సంచరించే దేవతాచారణగణాలు ప్రస్తుతించాయి.

విశేషం: చారణులు చేసే ప్రశంస గూర్చి తిక్కన పలుమారులు వర్ణించాడు.

వ. ఆ సేనకుం దలకడచి భీష్మ భూరిశ్రవశ్శల్యదుర్యోధను లడరి యర్జునుపై శక్తిగదాసప్తనారాచతోమరంబులు ప్రయోగించిన నతండు శక్తియు గదయును దోమరంబును నొక్కొక్కభల్లంబునను నేడునారాచంబు లేడింటను

దునిమి పేర్చి యైంద్రాస్త్రంబు ప్రయోగించిన నది నానా ప్రకారక్రూరశరకలాపరూపంబునం గవిసి కౌరవ సైన్యంబు నొప్పింపమఱియును దాను మందాకినీనందను నిశిత నారాచజాలంబునం బొదివి భూరి శ్రవసుని చాపంబు ద్రుంచి తొమ్మిదివాలమ్ములు శల్యుమేనం గీలించి కురుపతి వక్షంబు వెడందవాతి యమ్మున ఛేదించె నప్పుడు పాంచాలపతివిరాటప్రముఖులగు జోదులు గోలుతల సేసిరి మన బలంబులు గాండీవ గుణనిష్ఠుర నినదంబునం జేడ్పడి యొల్లంబోయి వెల్ల నయి యుండ భవదీయ సుతులు శౌర్యోద్రేకంబున నాకేశనందను నరదంబుఁ బొదివి రట్టి సంకులసమరంబున మహేంద్రబాణంబుచేత మనదిక్కున. **164**

ప్రతిపదార్థం: ఆ+సేనకున్= ఆ సైన్యానికి; తలకడచి= దాటి ముందునకు వచ్చి; భీష్మ+భూరిశ్రవస్+శల్య+దుర్యోధనులు= భీష్ముడు; భూరిశ్రవుడు; శల్యుడు; దుర్యోధనుడు; అడరి= విజృంభించి; అర్జునుపైన్= అర్జునుడిపైన; శక్తి+గదా+ సప్త+నారాచ+తోమరంబులును=శక్తి; గద; ఏడు బాణాలు ఇనుప గుదియలును; ప్రయోగించినన్= వేయగా; అతండు= అర్జునుడు; శక్తియున్= శక్తిని; గదను= గదను; తోమరంబును= ఇనుపగుదియను; ఒక్క+ఒక్క భల్లంబునకున్= ఒక్కొక్క ఈటె బాణంతో; ఏడు+నారాచంబులున్= ఏడు బాణాలను; ఏడింటను= ఏడు బాణాలతో; తునియన్= ఖండించి; పేర్చి= అతిశయించి; ఇంద్ర+అస్త్రంబు= ఇంద్రునకు సంబంధించిన మంత్రబాణం; ప్రయోగించినన్= వేయగా; అది= ఆ ఇంద్రాస్త్రము; నానా+ప్రకార+క్రూర+శర+కలాప+ రూపంబునన్= పెక్కు విధములైన భయంకర బాణ సమూహాల రూపంతో; కవిసి= మార్కొని; కౌరవ+సైన్యంబు= కౌరవసేనను; నొప్పింపన్= బాధింపగా; మఱియును= ఇంకను; తాను= అర్జునుడు; మందాకినీ+నందనున్= గంగకొడుకును; నిశిత+నారాచ+జాలంబునన్= వాడియైన బాణాల సముదాయం చేత; పొదివి= చుట్టుముట్టి; భూరిశ్రవసుని+చాపంబు+త్రుంచి= భూరి శ్రవసుని విల్లును తునిమి; తొమ్మిది+వాలు+అమ్ములు= తొమ్మిది వాడి బాణాలు; శల్య+మేనన్= శల్యుని దేహంపై; కీలించి= హత్తుకొనజేసి; కురు+పతి+వక్షంబున్= కురురాజు దుర్యోధనుని ఉరము; వెడంద+వాతి+అమ్మునన్= పెద్ద నోరుగల బాణంతో; ఛేదించెన్= త్రుంచాడు; అప్పుడు= ఆ సమయంలో; పాంచాలపతి+విరాట+ప్రముఖులు+అగు= ద్రుపదుడు విరాటుడు మున్నగు జోదులు= యోధులు; కోలుతల+చేసిరి= కౌరవసేనకు; ఎదురుబొదురుగా నిలిచి యుద్ధం చేశారు; మన+బలంబులు= కౌరవసేనలు; గాండీవ+గుణ+నిష్ఠుర నినదంబులనన్= గాండీవము యొక్క అల్లె త్రాటినుండి వెలువడిన కఠిన శబ్దంచే; చేడ్పడి= నివ్వెరబోయి; ఒల్లంబోయి= కలగి; వెల్లన్+అయి= వెలవెలబోయి; ఉండెన్= ఉండగా; భవదీయ+సుతులు= నీ కొడుకులు; శౌర్య+ఉద్రేకంబునన్= పరాక్రమంతో కూడిన ఉత్సాహంతో; నాక+ఈశ+నందను= అర్జునుని; అరదంబు= తేరు; పొదివిరి= చుట్టుముట్టారు; అట్టి+సంకుల+సమరంబునన్= అటువంటి దొమ్మి యుద్ధంలో, మహేంద్ర బాణంబు చేతన్= ఐంద్రాస్త్రం చేత; మన+దిక్కునన్= మన పక్షంలో.

తాత్పర్యం: కౌరవసేనకు ముందుకువచ్చి భీష్ముడు, భూరిశ్రవసుడు, శల్యుడు, దుర్యోధనుడు విజృంభించి అర్జునుడి మీద శక్తి, గద, ఏడు బాణాలు, ఇనుప గుదియలు ప్రయోగించారు. అర్జునుడు శక్తి, గద, ఇనుప గుదియలకు ఒక్కొక్క బాణంతో, ఏడు బాణాలను ఏడు బాణాలతో ఖండించి - విజృంభించి ఐంద్రాస్త్రం ప్రయోగించాడు. ఆ ఐంద్రాస్త్రం - పెక్కు ఆకారాలుగల భయంకర బాణసముదాయంక్రింద మారి, కౌరవసైన్యాన్ని చీకాకు చేసింది. అంతేకాక, అర్జునుడు భీష్ముడిపై వాడి బాణాలు ప్రయోగించి మార్కొన్నాడు. మరియు భూరిశ్రవసుడి విల్లు ఖండించి, శల్యుడి దేహంపై తొమ్మిది అమ్ములు నాటి, దుర్యోధనుడి, ఉరము ఛేదించి, విక్రమించాడు. అప్పుడు ద్రుపదుడు - విరాటుడు మున్నగు వీరులు కౌరవసేనకు ఎదురుగా నిలిచి పోరాటం సాగించారు. కౌరవసేనలు - అర్జునుడి విల్లు గాండీవం యొక్క నారి నుండి వెలువడిన భీకరధ్వనికి

తట్టుకొనలేక నివ్వెరపాటు చెందారు. నీ కొడుకులు పరాక్రమప్రకర్షతో, అర్జునుడి రథాన్ని చుట్టుముట్టారు. ఆ దొమ్మి యుద్ధంలో-ఇంద్రాస్త్రం చేత మన పక్షంలో -

ఆ. కెడసె హయము లొడ్డగెడ వయ్యె రథములు। చాఁపకట్టు వడియె సామజములు
చదిసెఁ గాలుబలము చామరచ్ఛత్రకే। తువులు నాయుధములుఁ దునియలయ్యె. 165

ప్రతిపదార్థం: హయములు= గుఱ్ఱములు; కెడసెన్= నశించాయి; రథములు+ఒడ్డగెడవు+అయ్యెన్= తలక్రిందులయ్యాయి; సామజములు= ఏనుగులు; చాఁపకట్టు వడియెన్= నేలమీద చాపపరిచినట్లు కూలి పడిపోయాయి; కాలు+బలము= పదాతి; చదిసెన్= నలిగిపోయాయి; చామర+ఛత్ర+కేతువులు= వీవనలు- గొడుగులు-జెండాలు; ఆయుధములు= యుద్ధ పరికరాలు; తునియలు+ అయ్యెన్= ముక్కలై పోయాయి.

తాత్పర్యం: గుర్రాలు నాశనమై పోయాయి. రథాలు ఒరగిపోయాయి. ఏనుగులు నేలమీద కూలిపోయాయి. కాలుబలము నలిగిపోయింది. చామరలు - గొడుగులు - జెండాలు ముక్కలైపోయాయి.

విశేషం: 1.చామరములు = చమరీమృగం జూలుతో చేయబడిన వీవన. 2. ఛత్ర చామరములు= రాజలాంఛనాలు. యుద్ధంలో ఆయుధాలుగదా కావలసినది. అయితే ఆయుధాలకంటె ఈ రాజలాంఛనాలకే ఎక్కువ ప్రాముఖ్యం ఉంది ఆనాటి యుద్ధ సంప్రదాయంలో.

వ. అప్పు డర్జునుండు కేశకలాపంబు శైవాలంబును బ్రేవుల ప్రోవులు ఫేనపుంజంబులును మేదోమాంసమస్తిష్క పటలంబు పంకంబునునగురక్తనదీప్రవాహంబు భవదీయ సేనామధ్యంబునం బఱపి బేతాళక్రవ్యాది భూతంబుల నోలలార్చె నతండు దేవదత్తంబును దామోదరుండు పాంచజన్యంబును బూరించి సింహనాదంబులు సేసి రంత నరుణగభస్తి యస్తగిరి మస్తకాంతరితుం డయ్యె నాసంధ్యాసమయంబున నిజసైన్యంబు నొవ్వునుం గవ్వడి దివ్యబాణజాలంబుల దుర్నివారత్వంబును విచారించి భీష్మద్రోణబాహ్లికదుర్యోధనులు బలంబులఁ దివియం బంచి మరలి కరదీపికలు వెలుంగ విడిదలకు వచ్చిరి పాండవులును గృష్ణసహితంబుగా నుబ్బునం బొంగుచు వందిజనకీర్తనంబులు సెలంగ మగిడి శిబిరంబునకుంజని రమ్మోఁడవనాఁటి రాత్రి గురుపతివీటి జనంబులు గిరీటిపరాక్రమప్రకారంబులం దమదెసనానాదేశంబులచతురంగంబులు వొలిసినపెల్లును నంతంతం గుములుగట్టి చెప్పికొనుచుండ. 166

ప్రతిపదార్థం: అప్పుడు; కేశ కలాపము= వెంట్రుకల సముదాయం; శైవాలంబును= నీటి పాచిగా; ప్రేవుల+ప్రోవులు= ప్రేగుల గుట్టలు, కడుపులోని పేగుల సముదాయం; ఫేన పుంజంబులును= నురుగుల సముదాయములుగా; మేదస్+మాంస+మస్తిష్క+పటలంబు= క్రొవ్వు మాంసం మెదడు వీని సముదాయం; పంకంబును= బురదగా; అగు= అయిన; రక్త+నదీ+ప్రవాహంబు= నెత్తుటి ఏటి వెల్లువ; భవదీయ+సేనా+మధ్యంబునన్= నీ సైన్యం నడుమగా; పఱపి= ప్రవహింపజేసి; బేతాళ+క్రవ్యాత్+ఆది+భూతంబులన్= మృత కళేబరాలను ఆవేశించే పిశాచములను రాక్షసులు మున్నగు దయ్యాలను; ఓలలార్చెన్= మునుగునట్లుచేశారు; అతండు= అర్జునుడు; దేవదత్తంబును= దేవదత్తం అనే శంఖాన్ని; దామోదరుండు= శ్రీకృష్ణుడు; పాంచజన్యంబును= పాంచజన్యం అనే శంఖాన్ని; పూరించి= ఒత్తి; సింహనాదంబులు= సింహగర్జనల వంటి కేకలు; చేసిరి= పెట్టారు; అంతన్= తరువాత; అరుణ+గభస్తి= సూర్యుడు(ఎర్రని కిరణములు కలవాడు); అస్తగిరి+మస్తక+అంతరితుండు+అయ్యెన్= పడమటి కొండ శిఖరంలో దూరినవాడు అయ్యాడు(అనగా అస్తమించాడు.); ఆ+సంధ్యా+సమయంబున్= ఆ సంజవేళ; నిజ+సైన్యంబు+నొవ్వునున్= తమ సేనలు పడిన బాధను; కవ్వడి దివ్య బాణ జాలంబుల దుస్+నివారత్వంబును= అర్జునుడు ప్రయోగించిన వేల్పుటమ్ముల సముదాయం యొక్క అడ్డరానితనమును;

విచారించి= ఆలోచించి; భీష్మ ద్రోణ బాహ్లిక దుర్యోధనులు= భీష్ముడు, ద్రోణుడు, బాహ్లికుడు, దుర్యోధనుడు; బలంబులన్= సేనలను; తివియన్+పంచి= యుద్ధం ఆపించుటకు ఆజ్ఞాపించి; మరలి= వెనుకకు తిరిగి; కర దీపికలు= చేతి దీపాలు(కాగడాలు); వెలుంగన్= ప్రకాశింపగా; విడిదలకున్= నివాస స్థలాలకు; వచ్చిరి; పాండవులును= పాండవులుగూడ; కృష్ణ+సహితంబుగాన్= శ్రీకృష్ణునితో పాటుగా; ఉబ్బునన్+పొంగుచున్= ఉత్సాహంతో అతిశయించుచు; వంది+ జన+ కీర్తనం బులు+చెలంగన్= వృత్తిగా ప్రస్తుతి చేసే వారి ప్రశంసలు ఒప్పగా; మగిడి= తిరిగి; శిబిరంబునకున్+చనిరి= స్కంధా వారములకున్= విడిదులకు వెళ్ళారు; ఆ+మూఁడవ+నాఁటి+రాత్రి; కిరీటి+పరాక్రమ+ప్రకారంబులన్= అర్జునుడు విక్రమం ప్రదర్శించిన రీతులను; కురుపతి వీటి జనంబులు= కురురాజైన దుర్యోధనుడి పక్షానికి సంబంధించిన వారు; తమ+దెసన్= తమ ఎడ; నానా దేశంబుల చతురంగ బలంబులు= వివిధ దేశాలకు సంబంధించిన నాలుగు సైన్య విభాగాలు (రథ - గజ- తురగ -పదాతులు); పొలిసిన పెల్లును= చచ్చిన మొత్తాన్ని; అంతంతన్= అంత అంతగా; గుములు+కట్టి= గుంపులుగా చేరి; చెప్పికొనుచుండన్= మాటాడుకొనుచుండగా.

తాత్పర్యం: ఆ సమయంలో అర్జునుడు నీ సేనల మధ్య నెత్తురు ఏటి వరదలు ప్రవహింప చేశాడు. అందులో వెంట్రుకలు నీటి పాచిగా ఏర్పడ్డాయి. తలకాయల్లోని క్రొవ్వు మాంసం మెదడు అనువాని సముదాయం బురదగా తయారయింది. ఆ రక్తనదిలో పిశాచాలు - రాక్షసులు- దయ్యాలు ఓలలాడాయి. అర్జునుడు దేవదత్తం పూరించాడు. శ్రీకృష్ణుడు పాంచజన్యం ఒత్తాడు. పిమ్మట వారిరువురు సింహనాదాలు చేశారు. అప్పుడు సూర్యుడు పడమటి కొండలలో చేరాడు. ఆ మలిసంజలో - తమ సైన్యాలు పొందిన దీనావస్థ ఆపటానికి సాధ్యం కానట్టి అర్జునుని విజృంభణ - దివ్యాస్త్రప్రయోగం గూర్చి విచారించి, భీష్ముడు ద్రోణుడు బాహ్లికుడు - తమ సేనలను ఉపసంహరించి - కాగడాల వెలుగులో తమ విడిదులకు వెళ్ళారు. పాండవులు శ్రీకృష్ణునితోపాటు, తమ్ములందరు ప్రస్తుతించుతుండగా, ఉత్సాహంతో ఉప్పొంగిపోయి తమ తమ నివాసస్థానాలకు వెళ్ళారు. ఆ మూడవనాటి కురుక్షేత్ర సంగ్రామ విశేషాలను గూర్చి, గుంపులు గుంపులుగా చేరి కౌరవభటులు ముచ్చటించసాగారు. ఆనాడు అర్జునుడు చూపిన పరాక్రమం, అతడు ప్రయోగించిన ఐంద్రాస్త్రం గూర్చి, తమ సైన్యంలో వివిధ దేశాలకు సంబంధించిన చతురంగబలాలు చెడిన తీరు తెన్నుల గూర్చి, వారు చర్చించుకున్నారు. అటు పిమ్మట.

విశేషం: 1. ఐంద్రాస్త్ర ప్రయోగం : మహాభారతంలో పలుచోట్ల -అస్త్రప్రయోగ ప్రస్తావన ఉన్నది. ఇవి అత్యద్భుత మారణాయుధాలు. చాలాకాలం క్రిందట జరిగిన కురుక్షేత్ర సంగ్రామం ఏమిటి? ఇటువంటి మారణాస్త్రాలు ఏమిటి? ఇవి కవి కల్పితాలు మాత్రమేనా? కవుల ఊహలకు కూడా అందనట్లు తోచే ఈ అస్త్రాలు మహాభారతంలో (రామాయణంలో కూడా) ఎట్లా చేరాయి? జల ప్రళయానికి ముందు పెరిగిన నాగరికత అంశాలు కొన్నివేల సంవత్సరాల తదుపరి మానవజాతి భద్రపరచుకొన్న జ్ఞాపక శకలాలు ఇట్టి రచనలకు ఆధారం కావచ్చునని కొందరు విద్వాంసుల అభిప్రాయం.

2. వంది: ప్రస్తుతి వృత్తిగా స్వీకరించినవాడు. రాజులను ఆశ్రయించుకొని వారు బ్రదికేవారు.

3. బేతాళ క్రవ్యాదాది భూతంబులు: మృతశరీరాన్ని ఆవేశించే పిశాచం బేతాళుడు. పీనుగులను తినే రాక్షసులు క్రవ్యాత్తులు.

భూతాలు : మృతశరీరాలను కబళించే పిశాచాలు - అని పురాణ వాఙ్మయ వర్ణన.

4. భీష్మ ద్రోణ బాహ్లిక దుర్యోధనుల మంతనం: భీష్ముడు సేనాపతి. ద్రోణుడు గురువు. దుర్యోధనుడు రాజు. బాహ్లికుడు కౌరవ పక్షంలోనే గాక కురుక్షేత్రంలో చేరిన పదునెనిమిది అక్షౌహిణీబలాల వీరులలో వృద్ధతముడు. అతడు శంతనుని తమ్ముడు. భీష్ముడికి పినతండ్రి. అందుచే ఆ ముగ్గురకు పూజనీయుడు.

భీష్ముని చతుర్థ దివస యుద్ధము (సం. 6-56-1)

క. వేగుటయు సత్వరంబుగ । నా గాంగేయుండు మించి యనికి నడచినన్
సాగరతరంగములగతి । వేగమ తరతరమ మొనలు వెడలఁ దొడంగెన్. 167

ప్రతిపదార్థం: వేగుటయున్= తెల్లవారుటయు; సత్వరంబుగన్= వేగంగా; ఆ+గాంగేయుండు= ఆ భీష్ముడు; మించి= అతిశయించి; అనికిన్= యుద్ధానికి; నడచినన్= వెడలగా; సాగర తరంగముల గతిన్= కడలి కెరటాల వలె; వేగము+అ= శీఘ్రముగా; తరతరమ= క్రమంగా; మొనలు= సేనలు; వెడలన్+తొడంగెన్= వెళ్ళటానికి మొదలుపెట్టాయి.

తాత్పర్యం: తెల్లవారగానే శీఘ్రంగా - సేనాధిపతియైన భీష్ముడు ముందు నడచివెళ్ళాడు రణరంగానికి. అతని వెంట సముద్రపు కెరటాలవలె - కౌరవ సేనలు వరుసగా బారులు తీర్చి కదలి వెళ్ళాయి.

క. అతిరయమున గురుఁడు భవ । త్సుతుఁడును బాహ్లికుఁడు నెయిది తోడ్తో బలసం
తతి గూడికొనఁగఁ బటుబృం । హితహేషానేమి రవము లెసఁగెం దఱచై. 168

ప్రతిపదార్థం: అతి+రయమునన్= మిక్కిలి వేగంతో; గురుఁడు= ద్రోణుడు; భవత్+సుతుఁడును= నీ కొడుకు(దుర్యోధనుడును); బాహ్లికుఁడు= శంతనుని తమ్ముడు, భీష్ముని పినతండ్రి అయిన బాహ్లికుడు; ఎయిది తోడ్తోన్= చుట్టుముట్టి; వెనువెంటనే; బల+సంతతిన్= సేనలను; కూడికొనఁగన్= కలుసుకోగా; పటు+బృంహిత+హేషా+నేమి+రవములు= గొప్పవైన ఏనుగుల ఘీంకారములు; గుర్రాల సకలింపులు; రథచక్రాల ధ్వనులు; తఱచు+ఐ= సాంద్రములై; ఎసగెన్= వర్ధిల్లాయి.

తాత్పర్యం: మిక్కిలి శీఘ్రంగా, ద్రోణుడు - నీ కొడుకు దుర్యోధనుడు, బాహ్లికుడు వెనువెంట కదలి సేనలను కలిసికొన్నారు. ఏనుగుల ఘీంకారాలు, గుర్రాల సకిలింపులు రథచక్రాల ధ్వనులు - దట్టంగా విలసిల్లాయి.

క. కారుకొని మేఘమాలా । కారంబునఁ జాల నొప్పెఁ గౌరవసైన్యం
బారూఢవీరరసవి । స్ఫారం బై యంతఁ దోఁచెఁ బాండవ బలమున్. 169

ప్రతిపదార్థం: కారుకొని= నల్లగా క్రమ్ముకొని; మేఘ+మాలా+ఆకారంబునన్= మబ్బుల దొంతర దండవంటి ఆకారంతో; కౌరవ+సైన్యంబు= కురుసేన; చాలన్= మిక్కుటముగా; ఆరూఢ వీర రస విస్ఫారంబు+ఐ= ప్రసిద్ధమైన పరాక్రమ రసంతో విస్తరించినట్టిదై; ఒప్పెన్= శోభిల్లింది; పాండవ+బలమున్= పాండవసేనకూడా; అంతన్= అంతట; తోఁచెన్= కన్పించింది.

తాత్పర్యం: దట్టమైన మబ్బుల దొంతరవలె కౌరవసేన ప్రసిద్ధమైన వీరరసంతో విస్తరిల్లినదై శోభిల్లినదై అంతటా కన్పించింది.

క. కురుసేనఁ జూచి యప్పుడు । నర నారాయణులు దమ మొనకు మిగిలి సము
ద్ధురలీల సూర్య చంద్ర । స్ఫురణము లొక్కెడన మెఱయుపోలిక నమరన్. 170

ప్రతిపదార్థం: కురుసేనన్= కౌరవసేనను; చూచి; అప్పుడు; నర+నారాయణులు= అర్జునుడు మరియు శ్రీకృష్ణుడు; తమ+మొనకున్= తమసేనకు; మిగిలి= అతిశయించి; సమ్+ఉద్ధుర+లీలన్= మిక్కిలి పట్టరాని విధంగా; సూర్య చంద్ర స్ఫురణములు= సూర్య,చంద్ర ప్రకాశములు; ఒక్క+ఎడమ+అ= ఒకేచోటనే; మెఱయు+పోలికన్= ప్రకాశించే రీతిగా; అమరన్= పొందికపడగా

తాత్పర్యం: కౌరవసేనను చూస్తూ, అప్పుడు అర్జునుడు, శ్రీకృష్ణుడు ఒకేచోట సూర్యుడు, చంద్రుడు కూడి ప్రకాశించినట్లు కన్పించారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఈ పద్యంలో 'నరనారాయణులు - సూర్యచంద్రుల పోలిక నమరన్' అని అసమాపక క్రియ ఉంది. తరువాతి పద్యంలో (171 పద్యంలో) వెలిగిరి అనే క్రియ ఉంది. దానితో అన్వయించుకోవాలి.

క. వెలిఁగిరి; బలములు దూర్యం । బులు నార్పులుఁ జెలఁగ రెండుఁ బురికొని చతురం
గలసద్గతు లొప్పఁగ వడిఁ । దలపడియెం గైదువులు నదరు లెగయంగన్. 171

ప్రతిపదార్థం: వెలిఁగిరి= ప్రకాశించారు; బలములు+రెండున్= రెండుసేనలూ; తూర్యంబులు= జంత్రనాదాలు; ఆర్పులు= సింహనాదాలు; చెలఁగన్= మ్రోయగా; పురికొని= ఉత్సహించి; చతురంగ+లసత్+గతులు+ఒప్పఁగన్= నాలుగు అంగములకు తగిన ప్రకాశమానమైన రీతులు విలసిల్లగా; వడిన్= వేగంగా; కైదువులు= కత్తులు; అదరులు= మిడుగురులు, నిప్పురవ్వలు; ఎగయంగన్= పైకిలేవగా; తలపడియెన్= మార్కొన్నాయి.

తాత్పర్యం: వెలిగారు. (కృష్ణార్జునులు సూర్యచంద్రుల వలె - వెనుకటి పద్యంతో అన్వయం.) కురు పాండవుల రెండు సేనలు - జంత్ర వాద్య నినాదాలతో - సింహనాదాలతో - కత్తుల నుండి నిప్పురవ్వలు పైకిలేవగా-ఒకరి నొకరు మార్కొని యుద్ధం చేశారు.

వ. ఇట్లు దాఁకి తోమరప్రాసప్రముఖంబులం డొల్లవైచుచుఁ గుంతక్షురికాదులఁ గూలం బొడుచుచుం గరవాల పరశ్వథ ప్రభృతులం దునియవ్రేయుచు గదాముసలముద్గరంబులఁ జదియ మోఁదుచు నఖర ప్రాసంబులం బగులవ్రచ్చుచు. 172

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; తాఁకి= మార్కొని; తోమర+ప్రాస+ప్రముఖంబులన్= ఇనుపగుదియలు, ఈటెలు మొదలైన ఆయుధాలను; డొల్లవైచుచున్= నశింపజేస్తూ; కుంత+క్షురిక+ఆదులన్= బల్లెములు-చిరుకత్తులు మొదలైన వాటిచేత; కూలన్+పొడుచుచున్= కూలవేస్తూ; కరవాల+పరశ్వథ+ప్రభృతులన్= కత్తులు, గండ్రగొడ్డళ్ళు మొదలైన వాటిచేత; తునియవ్రేయుచున్= ముక్కలు చేస్తూ; గదా+ముసల+ముద్గరంబులన్= గదలు; రోకళ్ళు, గుదియలచేత; చదియన్+మోఁదుచున్= నేల కూల్చుచూ; నఖర+ప్రాసంబులన్= నఖరం అనే ఆయుధము ఈటెలతో; పగులవ్రచ్చుచున్= శత్రువులను పగులునట్లుగా గ్రుచ్చుతూ.

తాత్పర్యం: ఈ విధంగా మార్కొని తోమర ప్రాసప్రముఖములైన ఆయుధాలచేత తమతమ శత్రువులను పడవైచుచూ, కుంత క్షురి కాదులచేత కూలబొడుస్తూ, కరవాల పరశ్వధాదులతో ముక్కలు చేస్తూ, గదా ముసల ముద్గరాలతో పడమోదుతూ, నఖర ప్రాసములతో పగులగొడుతూ (తరువాతి పద్యంతో అన్వయం)

క. పురికొనుచుం దెరలుచు నో । హరిసాహరి నొక్కచోట నలవడు నొకచో
విరియు నొకచోటఁ దిరుగుం । దిరుగక యొకచోట రెండుదెఱఁగులు నొచ్చున్. 173

ప్రతిపదార్థం: పురికొనుచున్= ఉత్సహిస్తూ; తెరలుచున్= తొలగిపోతూ; ఓహరిసాహరిన్= తండోపతండాలుగా; ఒక్కచోటన్= ఒక స్థలంలో; అలవడున్= చేరును; ఒకచోన్= ఒకచోట; విరియున్= చెదరును; ఒకచోటన్= ఒకచోటను; తిరుగున్= మరలును; ఒకచోటన్= మరోచోట; తిరుగక; రెండు తెఱఁగులు= రెండు పక్షాలు; నొచ్చున్= బాధ చెందుతాయి.

తాత్పర్యం: ఉత్సహిస్తూ - తొలగిపోతూ, తండోపతండాలుగా ఒకచోట చేరుతూ, ఒకచోట విడిపోతూ, ఒకచోట మరలిపోతూ ఇంకోచోట మరలిపోక, రెండు పక్షాలూ నొచ్చాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పలుచోటులఁ బలుభంగులఁ । బలుమొన లిమ్మాడ్కిఁ బోరఁ బార్థునిపై న
గ్గలిక నడరెఁ దాటిసిడము । తలతల మని మెఱయఁ గురుపితామహుఁ డధిపా ! 174

ప్రతిపదార్థం: పలు+చోటులన్= ఎన్నో స్థలాలలో; పలు+భంగులన్= ఎన్నో విధాలుగా; పలు+మొనలు= పెక్కు సైన్యాలు; ఈ+మాడ్కిన్= ఈ రీతిగా; పోరన్= యుద్ధం చేయగా; అధిపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; తాటి+సిడము= తాడిచెట్టు పతాకం; తలతలమని+మెఱయన్=వెలుగు చిమ్ముతూ ప్రకాశింపగా; కురు+పితామహుఁడు= కురువంశానికి చెందిన తాతగారు(భీష్ముడు); పార్థునిపైన్= అర్జునునిపై; అగ్గలికన్= అధికంగా; అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: ఎన్నో తావులలో - ఎన్నో రీతులలో ఎన్నో సేనలు ఈ విధంగా పోరాటం సాగించగా, ఓ ధృతరాష్ట్ర మహారాజా! కురువంశానికే తాతగారైన భీష్ముడు, తాళధ్వజం ప్రకాశించగా అర్జునుడిపై అధికంగా విజృంభించాడు.

క. పతియును ద్రోణుండు వివిం । శతియుం గృపసోమదత్తశల్యులు గంగా
సుతుతోడఁ గడఁగి రర్జున । సుతుఁ డయ్యేడ్వురను దాఁకె సురలు నుతింపన్. 175

ప్రతిపదార్థం: పతియును= రాజును(దుర్యోధనుడును); ద్రోణుండున్= ద్రోణుడు; వివింశతియున్; కృప+సోమదత్త+శల్యులున్= కృపుడు-సోమదత్తుడు-శల్యుడు; గంగాసుతుతోడన్= భీష్మునితో చేరి; కడఁగిరి= పూనిరి(పోరాటం సాగించారు); ఆ+ఏడ్వురను= ఆ ఏడుమందిని; సురలు+నుతింపన్= వేల్పులు అగ్గించునట్లుగా; అర్జునసుతుఁడు= అర్జునుని కొడుకు(అభిమన్యుడు); తాఁకెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు, ద్రోణుడు, వివింశతి - కృపుడు, సోమదత్తుడు - శల్యుడు - భీష్ముడితో కలిసి పూనుకొనగా అభిమన్యుడు - ఆ ఏడుగురినీ దేవతలు ప్రశంసించేటట్లుగా మార్కొన్నాడు.

క. వారల శరనిచయము దు । ర్వార విశిఖపంక్తిఁ దునిమి వాసవపౌత్రుం
డారూఢతేజుఁడై వెలుఁ । గారెను హుతవహ్ని క్రియ రణాంగణవేదిన్. 176

ప్రతిపదార్థం: వారల శర నిచయమున్= వారల అమ్ముల సముదాయమును; దుర్వార విశిఖపంక్తిన్= వారించటానికి వీలులేని తన బాణాల గుంపుతో; తునిమి= ఖండించి; వాసవ+పౌత్రుండు= దేవేంద్రుని మనుమడు, అర్జునుని పుత్రుడు, అభిమన్యుడు; ఆరూఢ+తేజుఁడై= అధికమైన తేజస్సుగలవాడై; హుతవహ్ని క్రియన్= హోమద్రవ్యమును స్వీకరించు అగ్ని హోత్రుడివలె; రణ+అంగణ+వేదిన్= యుద్ధభూమి అనెడు యజ్ఞ వేదికపై; వెలుఁగారెను= ప్రకాశించాడు.

తాత్పర్యం: ఆ ఏడ్గురు వీరుల బాణసముదాయాన్ని - అభిమన్యుడు వారించుటకు వీలులేని తన బాణాలతో ఖండించి, హోమద్రవ్యమును గ్రసించు అగ్నిహోత్రుని వలె ఆ యుద్ధభూమి అనెడు యజ్ఞవేదికపై ప్రకాశించాడు.

తే. భీష్ముఁ డభిమన్యుఁ గడచి యాభీలబాణ । జాలములు దీవ్రతరముగ సవ్యసాచి
మీఁదఁ గురియంగ నాతఁ డమేయభల్ల । తతుల నన్నింటిఁ దునుమాడెఁ దరతరంబ. 177

ప్రతిపదార్థం: భీష్ముఁడు; అభిమన్యున్+కడచి= అభిమన్యుని దాటి వెళ్ళి; ఆభీల+బాణ+జాలములు= భయంకరములైన బాణ సముదాయం; తీవ్రతరముగన్= మిక్కిలి తీక్ష్ణముగా; సవ్యసాచిమీఁదన్= అర్జునుడిపై; కురియంగన్= వర్షింపగా; ఆతఁడు= అర్జునుడు; అమేయ+భల్ల+తతులన్+అన్నింటిన్= సాంద్రమైన ఆ బాణసమూహాలను అన్నింటినీ; తరతరంబ= వరుసగా; తునుమాడెన్= ఖండించాడు.

తాత్పర్యం: భీష్ముడు అభిమన్యుడిని దాటి వెళ్ళి, భయంకరమైన బాణాలు అర్జునుడిపై ప్రయోగించాడు. అర్జునుడు ఆ దట్టమైన బాణసమూహాలను అన్నింటినీ వరుసగా ఖండించాడు.

వ. ఇట్లు దొడంగి యుద్భటప్రకారంబునఁ బెల్లు సెల్లు భీష్మార్జునులకయ్యం బయ్యిరువాఁగును గొండొకసేపు నివ్వెఱపడి చూచుచుండె నశ్వత్థామభూరిశ్రవశ్శల్యపుత్రచిత్రసేనులు మత్తమాతంగంబులు సింగంబు కొదమం బొదువుపోలిక నభిమన్యుం బొదివిన నతండు. 178

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; తొడంగి= పూని; ఉద్భట+ప్రకారంబునన్= పరాక్రమోపేతంగా; పెల్లు+చెల్లు= మిక్కుటముగా కొనసాగే; భీష్మ+అర్జునుల+కయ్యంబు= భీష్ముని యొక్కయు, అర్జునుని యొక్కయూ పోరాటం; ఆ+ఇరు+వాఁగును= ఆ రెండు పక్షాలూ; కొండొక+సేపు= కొంత తడవు; నివ్వెఱపడి= ఆశ్చర్యపడి; చూచుచుండెన్; అశ్వత్థామ+భూరిశ్రవస్+శల్యపుత్ర+చిత్రసేనులు= అశ్వత్థామ - భూరిశ్రవుడు - శల్యపుత్రుడు - చిత్ర సేనుడును; మత్తమాతంగంబులు= మదపుటేనుగులు; సింగంబుకొదమన్= కొదమసింహాన్ని, లేత వయస్సులో ఉన్న సింహాన్ని; పొదువు+పోలికన్= చుట్టుముట్టే రీతిగా; అభిమన్యున్+పొదివినన్= అభిమన్యుని చుట్టుముట్టగా; అతండు= అభిమన్యుడు.

తాత్పర్యం: ఈ విధంగా పరాక్రమోపేతుడైన భీష్ముడు, అర్జునుడు పోరాడుతున్నప్పుడు - ఉభయ పక్షాలలోని వీరులు ఆశ్చర్యం పొంది కొంతసేపు (తాము యుద్ధం చేయటం మాని) వారిని వీక్షించారు. అప్పుడు అశ్వత్థామ , భూరిశ్రవుడు, శల్యపుత్రుడు, చిత్రసేనుడు మదపుటేన్గులు పిల్ల సింగాన్ని చుట్టుముట్టినట్లు అభిమన్యుడిని చుట్టుముట్టారు.

క. కని యల్లన నవ్వుచు గురు । తనయుని యుర మేసి శల్యతనయుని సిడముం
దునిమి వెస నీదుతనయుని । ధనువు నఱకి సోమదత్తతనయుని నొంచెన్. 179

ప్రతిపదార్థం: కని= చూచి; అల్లన+నవ్వుచున్= తిన్నగా నవ్వుతూ; గురు+తనయుని+ఉరము+ఏసి= అశ్వత్థామ వక్షంపై బాణం నాటి; శల్యతనయుని సిడమున్+తునిమి= శల్యుని కొడుకు జెండా త్రుంచి, వెసన్= వేగంగా; నీదు+తనయుని+ధనువు= నీ కుమారుని విల్లు; నఱికి= ఖండించి; సోమదత్త+తనయునిన్= సోమదత్తుని పుత్రుడైన భూరి శ్రవసుని; నొంచెన్= నొప్పి చేశాడు.

తాత్పర్యం: అభిమన్యుడు - తన్ను చుట్టుముట్టిన వారిని చూచి, చిరునవ్వుతో అశ్వత్థామ వక్షంమీద బాణం గ్రుచ్చాడు. శల్యుని కొడుకు జెండా త్రుంచాడు. వేగంగా నీ కొడుకు విల్లు నరికాడు. భూరిశ్రవసుడిని నొప్పించాడు.

క. వారును ముందటి యార్వురు । నీరసమున నొక్కపెట్ట యేయఁగఁ బటుదో
స్సారుండగు సౌభద్రుఁ డు । దార స్ఫురణమున నద్భుతంబుగఁ బోరెన్. 180

ప్రతిపదార్థం: వారును= ఆ వీరులును; ముందటి ఆర్వురు= ముందు అతనిని మార్కొనిన ఆరుగురు; ఈరసమునన్= కోపంతో; ఒక్క+పెట్ట= ఒకేసారి; ఏయఁగన్= బాణాలు వేయగా; పటు+దోస్+సారుండగు= మిక్కిలి భుజపరాక్రమం కలిగిన; సౌభద్రుఁడు= సుభద్రకొడుకు(అభిమన్యుడు); ఉదార+స్ఫురణమునన్= గొప్ప స్ఫూర్తితో; అద్భుతంబుగన్= ఆశ్చర్యకరంగా; పోరెన్= పోరాటం సాగించాడు.

తాత్పర్యం: ఆ వీరులు - అంతకుముందు మార్కొనిన ఆరుగురూ కోపంతో ఒక్కపెట్టున అభిమన్యునిపై బాణాలు వేశారు. అప్పుడు మిక్కిలి భుజ పరాక్రమం గలిగిన సుభద్రా తనయుడు గొప్పస్ఫూర్తితో ఆశ్చర్యకరంగా యుద్ధం చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఉదారస్ఫురణన్= ఉదారత కనిపించేటట్లుగా. అటు కౌరవవీరులు పదిమంది వచ్చి తనమీద పడ్డారు. 'కోపంతో' - 'ఈర్ష్యతో'. అభిమన్యుడు 'అల్లన నవ్వుచు' ఆత్మ సంరక్షణకోసం గొప్పగా యుద్ధం చేశాడు. ఉదారతతో. అనగా వారిని ఎవరినీ సంహరించకుండా యుద్ధం చేశాడన్నమాట.

ఆ. హస్తలాఘవమున నతులబలంబున । శౌర్య మహిమ నధికధైర్యమునను
సవ్యసాచితనయు సరి గార యమ్మహా । వీరు లంతవట్టుఁ గౌరవేంద్ర! 181

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కౌరవులలో శ్రేష్ఠుడవైన ఓ ధృతరాష్ట్రమహారాజా!; హస్తలాఘవమునన్= చేతుల సౌలభ్యంలో; అతుల+బలంబునన్= గొప్ప శక్తిలో; శౌర్య+మహిమన్= పరాక్రమ మహత్త్వంలో; అధిక+ధైర్యమునను= మిక్కుటమగు ఆత్మవిశ్వాసంలో; ఆ+మహా+వీరులు= ఆ మహాశూరులు; అంత+పట్టు= అంతవరకు; సవ్యసాచి+తనయు= కవ్వడి కొడుకు అభిమన్యునితో; సరిగారు+అ= సమానం కారు సుమా!

తాత్పర్యం: కౌరవులలో శ్రేష్ఠుడవైన ఓ ధృతరాష్ట్రమహారాజా! చురుకుగా, సులువుగా చేతినుండి అమ్ములు గుప్పటంలో, మిక్కుటమైన ఆత్మవిశ్వాసంలో అంతగొప్ప వీరులునూ కవ్వడి కొడుకు అభిమన్యునితో సరిగారు.

వ. ఇట్లు పెక్కండ్రతోడం బెనంగుపుత్త్రుం గనుంగొని యర్జునుం డంట నార్చి యడరి యందఱ కన్నిరూపులై నొప్పించి చిక్కువఱిచె నప్పుడు నీ కొడుకు పంపునం ద్రిగర్తులుఁ గృతవర్మయుఁ గేకయులును ముప్పదేనువేల రథంబులవారునుఁ గవిసి కిరీటిం గొడుకునుం బొదివి రట్టియెడ. 182

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; పెక్కండ్రతోడన్= పెక్కుమందితో; పెనంగు= పోరాడే; పుత్త్రున్= కొడుకును; కనుంగొని=చూచి; అర్జునుండు= అర్జునుడు; అంటన్+ఆర్చి= దద్దరిల్లునట్లుగా సింహనాదంచేసి; అడరి= విజృంభించి; అందఱకు; అన్ని+రూపులు+ఐ= ఒక్కొక్కడుగా కన్పించే ఆకృతి గలవాడై; నొప్పించి ; చిక్కు+పఱచెన్= చీకాకు నొందించాడు; అప్పుడు; నీ+కొడుకు+పంపునన్= నీ పుత్త్రుని ఆనతిచే(దుర్యోధనుని ఆజ్ఞచే); త్రిగర్తులు; కృతవర్మయున్= యాదవవీరుడు కృతవర్మయు; కేకయులును= కేకయ దేశ ప్రభువులును; ముప్పది+ఏను+వేల+రథంబులవారును= ముప్పది అయిదువేల తేరుల వీరులును కలిసి; మార్కొని= ఎదుర్కొని; పొదివిరి= చుట్టుముట్టారు; అట్టి+ఎడన్= ఆ సమయమందు.

తాత్పర్యం: ఈ విధంగా, పెక్కుమందితో యుద్ధం చేసే కొడుకును చూచి, అర్జునుడు సింహనాదం చేసి విజృంభించాడు. కౌరవ వీరులు అందరూ, ఎవరికి వారే తాము అర్జునునితో పోరాడుతున్నట్లుగా భ్రమ కల్పించి అర్జునుడు వారిని అందరినీ చీకాకు పరచాడు. అప్పుడు దుర్యోధనుని పంపున త్రిగర్తులు, కృతవర్మ, కేకయులు ముప్పది అయిదువేల రథికులతోపాటు అర్జునుడిని, అతని కొడుకు అభిమన్యుడిని చుట్టుముట్టారు.

మ. తతికిం జొచ్చి కడంగి పోరు విజయున్ దౌదవ్వులం జూచి యే
డ్తెఱఁ బాంచాలసుతుండు సత్వరగతిం దే రద్దెసన్ సారథిం
బఱపం బంచి నిశాతబాణపటలీపాతంబునన్ వైరు లు
క్కఱఁ దాఁకెం దమసైన్యముల్ సెలఁగ శౌర్యస్ఫూర్తి శోభిల్లఁగన్. 183

ప్రతిపదార్థం: తతికిన్= అదనులో; చొచ్చి= చేరి; కడంగి= పూని; పోరు= యుద్ధం చేసే; విజయున్= అర్జునుని; దౌదవ్వులన్+చూచి= దూరదూరంలో చూచి; ఏడ్తెఱన్= వేగంగా; పాంచాల+సుతుండు= ద్రుపదరాజు కొడుకు(ధృష్టద్యుమ్నుడు); సత్వర+గతిన్= వేగంగా; తేరు+అద్దెసన్= రథం ఆవైపుగా;సారథిన్; పఱపన్+పంచి= నడుపుమని ఆజ్ఞాపించి; నిశాత బాణపటలీ పాతంబునన్= వాడి అమ్ముల

సముదాయం ప్రయోగించటం చేత; వైరులు= శత్రువులు; ఉక్కు+అఱన్= బలం నశించగా; తమ+సైన్యముల్= తమసేనలు; చెలఁగన్= సొంపార; శౌర్య స్ఫూర్తి= పరాక్రమ ప్రకటన; శోభిల్లఁగన్= విలసిల్లగా; తాకెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: అదనులో కౌరవసేనను ఎదిర్చి పూని పోరాడే అర్జునుడిని దూరం నుండి చూచి, పాంచాల రాజు పుత్రుడు ధృష్టద్యుమ్నుడు - వేగంగా రథం అచటికి తరలించమని సారథిని ఆజ్ఞాపించాడు. శత్రువుల బలం చెదరిపోగా తన సేనలు ఉప్పొంగగా ధృష్టద్యుమ్నుడు వాడి అమ్ముల గుంపులు ప్రయోగించాడు. పరాక్రమ ప్రకర్షతో శోభిల్లాడు.

వ. ఇట్లు ధృష్టద్యుమ్నుండు పురందరనందనునకుం దలకడచి తాఁకి. 184

ప్రతిపదార్థం: ఇట్లు; ధృష్టద్యుమ్నుండు; పురందర+నందనునకున్= దేవేంద్రుని కొడుకైన అర్జునుడిని; తలకడచి= ముందుదాటి (అతిక్రమించి); (కౌరవసేనను మార్కొన్నాడు.)

క. శరములు మూఁటం గృపుఁ బది । శరముల మద్రేశు నొంచి శరమొక్కట ను
ద్ధురగతి యగు కృతవర్మని । యరదముఁ దురగముల నొకట నవనిం గూల్చెన్. 185

ప్రతిపదార్థం: శరములు మూఁటన్= మూడు బాణాలతో; కృపున్= కృపాచార్యుని; పదిశరములన్= పదిబాణాలతో; మద్ర+ఈశున్= మద్రరాజు శల్యుని; నొంచి= నొప్పించి; శరము+ఒక్కటన్= ఒక బాణంతో; ఉద్ధుర+గతి+అగు కృతవర్మని= శీఘ్రగమనం గల కృతవర్మయొక్క; అరదమున్= రథాన్ని; ఒకటన్= మరొకబాణంతో; తురగములన్= గుర్రాలను; ఒకటన్= ఒక బాణంతో; అవనిన్= భూమిపై; కూల్చెన్= పడవేశాడు.

తాత్పర్యం: ఈ విధంగా ధృష్టద్యుమ్నుడు అర్జునుడిని దాటి కౌరవ వీరుల్ని మార్కొన్నాడు. మూడు బాణాలతో కృపుడిని, పదిబాణాలతో మద్ర ప్రభువు శల్యుడిని నొప్పించి, ఒక బాణంతో కృతవర్మను అతని రథాన్ని, గుర్రాలను భూమిపై పడవేశాడు.

వ. అప్పుడు శల్యనందనుండు. 186

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; శల్య+నందనుండు= శల్యుని కొడుకు.

తాత్పర్యం: ఆ సమయంలో శల్యుడికొడుకు (తరువాతి పద్యంతో అన్వయం).

క. పదిటన్ ధృష్టద్యుమ్నునిఁ । బదియమ్ముల నతని సూతుఁ బటురయమున ను
న్మదుఁడై నొప్పించినఁ గెం । పొదవిన మో మలఁతి నవ్వు నొప్పన నొప్పెన్. 187

ప్రతిపదార్థం: పదిటన్= పది బాణాలతో; ధృష్టద్యుమ్నునిన్= ధృష్టద్యుమ్నుని; పది+అమ్ములన్= పది బాణాలతో; అతని+సూతున్= అతని రథసారథిని; ఉన్మదుఁడై= మిక్కిలి గర్వించినవాడై; పటు+రయమమునన్= మిక్కుటమగు వేగంతో; నొప్పించినన్; కెంపు+ఒదవిన +మోము= ఎర్రబడిన ముఖం; అలఁతి+నవ్వు= మందహాసము యొక్క; ఒప్పునన్+ఒప్పెన్= శోభతో శోభిల్లింది.

తాత్పర్యం: శల్యుడి కొడుకు ధృష్టద్యుమ్నుడిని పదిబాణాలతో, మరో పదిబాణాలతో అతని రథసారథిని - గర్వంతో మిక్కుటమైన వేగంతో నొప్పించాడు. అప్పుడు అతని ముఖం ఎర్రబారింది. అతడి పెదవులపై మందహాసం విరిసింది.

క. ఆ పృషతపౌత్రుఁ డుద్ధత । కోపానలుఁ డగుచు శల్యుకొడుకుధనువు నా
టోపమునఁ దునిమి ఫణిరా । జోపమితాస్త్రంబు లతనియొడలం జొనిపెన్. 188

వ. ఇవ్విధంబున 189

ప్రతిపదార్థం: ఆ+పృషత+పౌత్రుఁడు= పృషతుని మనుమడగు ధృష్టద్యుమ్నుడు; ఉద్ధత+కోప+అనలుఁడు+అగుచున్= మిక్కుటమగు ఆగ్రహము అనే అగ్ని గలవాడగుచు; ఆటోపమునన్= దర్పముతో; శల్యు+కొడుకు+ధనువు= శల్యుని కొడుకుయొక్క విల్లు; తునిమి= ఖండించి; ఫణి+రాజ+ఉపమిత+అస్త్రంబులు= శేషునితో సరిపోల్చదగిన బాణాలను; అతని+ఒడలన్= అతని శరీరము నందు; చొనిపెన్= నాటాడు.

తాత్పర్యం: పృషతుని మనుమడైన ధృష్టద్యుమ్నుడు మిక్కుటమగు ఆగ్రహమనే అగ్ని గలవాడై దర్పముతో శల్యుని కొడుకు వింటిని విరిచి శేషుడితో సమానమైన అస్త్రాలను అతని శరీరంలోనికి నాటాడు.

విశేషం: ఫణిరాజోపమితాస్త్రంబు - సాధారణ బాణమే - వాడి నాలుక గలది. ఫణిరాజు= శేషుడికి వేయి నాల్కలు ఉంటాయని ప్రసిద్ధి.

క. నోనేసి సూతు హయసం । తానముఁ జంపుటయు శల్యతనయుఁడు విరథుం
డై నిరుపమాన మగు తన । మానమ వాహనము గాఁగ మద మెలరారన్. 190

ప్రతిపదార్థం: నోన్+ఏసి= నొచ్చునట్లుగా వేసి; సూతున్= రథసారథిని; హయ+సంతానమున్= గుర్రాల సముదాయాన్ని; (ధృష్టద్యుమ్నుడు) చంపుటయున్= సంహరించుటయు; శల్య+తనయుఁడు= శల్యుని కొడుకు; విరథుండు+ఐ= రథములేనివాడై; నిరుపమానము+అగు= సాటిలేని; తన+మానము+అ= తన ఆత్మగౌరవమే; వాహనము+కాఁగన్= వాహనముకాగా (తనను మోసి నడపునట్టిదిగా); మదము+ఎలరారన్= గర్వం అతిశయింపగా.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు - శల్యతనయుడిని నొప్పించి, అతని రథసారథినీ - గుర్రాలనూ సంహరించాడు. శల్యుడి కొడుకు - విరథుడై సాటిలేని తన ఆత్మాభిమానమే తనకు వాహనంగా చేసికొని గర్వంతో నిలబడ్డాడు.

శల్య నందనుఁడు ధృష్టద్యుమ్నునితో యుద్ధంబు సేసి చచ్చుట (సం.6-57-25)

క. పలకయు వాలును గొని తె । క్కలు గల పెనుఁబాము పగిదిఁ గవిసినఁ గౌంతే
యులు సూచి వెఱగుపడి రా । బలమును నీ బలముఁ బొగడెఁ బటు శౌర్యంబున్. 191

ప్రతిపదార్థం: పలకయున్, వాలును+కొని= డాలును, కత్తినీ పట్టుకొని; తెక్కలు కల పెను పాము, పగిదిన్= రెక్కలు ఉన్న పెద్ద సర్పంవలె; కవిసినన్= విజృంభించగా; కౌంతేయులు= పాండవులు; చూచి; వెఱగుపడిరి= ఆశ్చర్యం చెందారు; పటు+శౌర్యంబున్= గొప్ప పరాక్రమాన్ని; ఆ బలము= అటు పాండవుల సేన; నీ బలమున్= నీ సేనయు; పొగడెన్= ప్రశంసించాయి.

తాత్పర్యం: శల్యుడి కొడుకు - విరథుడైనప్పటికీ జంకుగొంకులు లేకుండా చేతులలో కత్తిని, డాలును పుచ్చుకొని రెక్కలు మొలిచిన పెద్ద పామువలె విజృంభించాడు. ఆతడి ధైర్యసాహసాలకు ఆశ్చర్యపడి అటు పాండవసేన, ఇటు కౌరవసేన అతడిని ప్రశంసించాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. ఇట్లు గవిసి. 192

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కవిసి= ఎదుర్కొని.

తాత్పర్యం: ఈ విధంగా ఎదుర్కొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 1. భారతంలో అభిమన్యుడు అసాధారణంగా శౌర్యం చూపించిన బాలవీరుడు - అర్జునుడి కొడుకు. అటువంటి వాడే శల్యుడి కొడుకు కూడా. ఇతనిపేరు కూడా ప్రకటించలేదు భారత రచయిత. ఇతడు అభిమన్యుడి వలె తండ్రికి పేరు తెచ్చిన తనయుడు.

2. యుద్ధంలో అంత సులువుగా చావరు పెద్దలు! అయితే మహాభారతంలో చిత్తశుద్ధితో చావుకు తెగించి పోరాడినది యువవీరులు. చరిత్రకూడా బాలవీరులే సృష్టించారు. మరో ఉదాహరణ పలనాటి వీరయుద్ధంలో బాలచంద్రుడు.

క. **వెరవున ధృష్టద్యుమ్నుని । శరనికరం బెల్లఁ బలక జడియుచుఁ గిరణ**
స్ఫురణాతిభీషణం బై । కరవాలము మెఱయఁ జిత్రగతులం గవిసెన్. **193**

ప్రతిపదార్థం: వెరవునన్= ఉపాయంతో; ధృష్టద్యుమ్నుని శర నికరంబు+ఎల్లన్= ధృష్టద్యుమ్నుని బాణ సమూహాలను అన్నింటినీ; పలకన్+జడియుచున్= డాలుతో నివారిస్తూ; కిరణ+స్ఫురణ+అతి భీషణంబు+ఐ= సూర్యరశ్మి ప్రకాశంవలె మిక్కిలి భయంకరమైన; కరవాలము= కత్తి; చిత్ర+గతులన్= ఆశ్చర్యకరముగ; మెఱయన్= వెలుగొందగా; కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: శల్యుడి కొడుకు - ధృష్టద్యుమ్నుడు ప్రయోగించిన బాణాలను అన్నిటినీ తన డాలుతో త్రోసివేస్తూ సూర్య కిరణాల వంటి కాంతులు వెదజల్లే తన కత్తి ప్రకాశిస్తూ ఉండగా విజృంభించాడు.

తే. **కవిసి వ్రేసిన గ్రక్కున గద యమర్చి । యాఁగి వజ్రప్రహారంబు ననుకరింప**
ద్రుపదనందనుఁ డడిచినఁ దునియలయ్యెఁ । బలక రెండవవాటునఁ బగిలె శిరము. **194**

ప్రతిపదార్థం: కవిసి= ఎదుర్కొని; వ్రేసినన్= వేయగా; గద; గ్రక్కునన్= శీఘ్రంగా; అమర్చి; ఆఁగి; వజ్ర ప్రహారంబున్= వజ్రము యొక్క దెబ్బను; అనుకరింపన్= పోలునట్లు; ద్రుపద నందనుఁడు= ద్రుపదరాజు కొడుకు (ధృష్టద్యుమ్నుడు); అడిచినన్= కొట్టగా; పలక= శల్యుడి కొడుకు చేతి డాలు; తునియలు+అయ్యెన్= ముక్కలయింది; రెండవ+వాటునన్= రెండవ దెబ్బతో, శిరము= తలకాయ; పగిలెన్= బ్రద్దలయింది.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు విజృంభించి, గద అమర్చికొని - వజ్ర ప్రహారమును అనుకరిస్తూ కొట్టగా - శల్యనందనుడి డాలు ముక్కలై పోయింది. రెండవ దెబ్బకు- అతని శిరస్సు పగిలిపోయింది.

విశేషం: వజ్రము= దేవేంద్రుని ఆయుధం.

క. **తల వ్రయ్య లైనఁ బ్రాణం । బులును గృపాణంబు విడిచి భువిఁ ద్రెళ్ళె నతం**
డలుకొంది కురుబలం బా । కులతం బొందంగఁ గొండ గూలినభంగిన్. **195**

ప్రతిపదార్థం: కురుబలంబు= కౌరవసేన; అలుకు+ఒంది= భయపడి; ఆకులతన్+పొందంగన్= కలతచెందగా; తల= శిరము; వ్రయ్యలు+ఐనన్= ముక్కలైపోగా; ప్రాణంబులును; కృపాణము= కత్తి; విడిచి= వదలి; అతండు= శల్యుని కొడుకు; కొండ+కూలిన+భంగిన్= పర్వతం విరిగి పడిపోయినట్లుగా; భువిన్+త్రెళ్ళెన్= నేలమీద కూలాడు.

తాత్పర్యం: శల్యుడి కొడుకు ప్రాణాలు పోయేవరకు తల ముక్కలై పోయేవరకు చేతిలోని కత్తి వదలకుండా పోరాటం సాగించాడు! అతడు కొండ విరిగి నేలమీద పడిపోయేటట్లుగా కూలిపోవటం చేత - కౌరవసేన కలత చెందింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

**తే. ఇత్తెఱంగున నిజపుత్త్రుఁ డీల్గుటయును। గ్రోధదీప్తుఁ డై శల్యుండు ద్రుపదసూతి
మీఁదఁ గవిసిన నాతఁ డమేయ బాణ। పంక్తి పరఁగించె నుజ్జ్వల ప్రభలు నిగుడ. 196**

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ రీతిగా; నిజ+పుత్త్రుఁడు= తన సొంత కొడుకు; ఈల్గుటయును= మరణించటం చేత; క్రోధ+దీప్తుఁడు+ఐ= ఆగ్రహంతో భాసించేవాడయి; శల్యుండు; ద్రుపదసూతిమీఁదన్= ద్రుపదుని కొడుకుమీద; కవిసినన్= విజృంభింపగా; ఆతడు= ఆ ధృష్టద్యుమ్నుడు; ఉజ్జ్వల+ప్రభలు= గొప్ప కాంతులు; నిగుడన్= వ్యాపించగా; అమేయ+బాణ+పంక్తిన్= దట్టమైన అమ్ముల వరుసను; పరఁగించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: ఈ విధంగా తన పుత్రుడు మరణింపగా, ఆగ్రహావేశ పరవశుడై శల్యుడు - ధృష్టద్యుమ్నుని మీద విజృంభించాడు. ధృష్టద్యుమ్నుడు - దట్టమైనట్టి మిక్కిలి దీప్తి గలిగినటువంటి అమ్ముల గుంపు శల్యునిపై ప్రయోగించాడు.

వ. అనిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె: 197

ప్రతిపదార్థం: అనినన్+విని= అని చెప్పగా ఆలకించి; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్= సంజయుడికి; ఇట్లు+అనియెన్= ఈరీతిగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఈ విధంగా చెప్పాడు:

**క. 'మానుష మేటికిఁ దైవా। ధీనము సర్వంబు నస్మదీయస్ఫాయ
త్సేనలఁ బాండునృపాలక। సూనులు గెల్చెదరు కంటె? సూతతనూజా! 198**

ప్రతిపదార్థం: సూత+తనూజా!= ఓ సంజయా!, మానుషము+ఏటికిన్?;= మానవ ప్రయత్నం దేనికి?; సర్వమ్మున్= అంతా; దైవ+అధీనము= భగవంతునికి లోబడి ఉన్నట్టిదే; అస్మదీయ+ స్ఫాయత్+సేనలన్= మిక్కిలి విస్తరించియున్న నా సేనలను; పాండు నృపాలక సూనులు= పాండురాజు కొడుకులు; గెల్చెదరు= జయింపగలరు; కంటె= చూస్తున్నావా?

తాత్పర్యం: 'ఓ సంజయా, మనుష్య ప్రయత్నం దేనికి? అంతా దైవాధీనమే. చూస్తున్నావుగా. సంఖ్యాబలంలో ఎక్కువై, మిక్కిలి విస్తరించి ఉన్న నా సేనను పాండవులు జయింపగలరు.

విశేషం: విజయసిద్ధికి - మానవ ప్రయత్నం పురుషకారం ముఖ్యమా? దైవబలం ముఖ్యమా? అనే చర్చ మిక్కిలి పురాతనమైనది. ధృతరాష్ట్రుడి అభిప్రాయంలో దైవం మానుషం కంటె బలమైనట్టిది.

**క. చావును నోవును మన యో। ధావలికిన్ గెలుపునుబ్బు నావలికిని నీ
చే వినియెదఁ దుది నెట్టులు। శ్రీవిభవము పాండవకులకుఁ జేపదున కదే! 199**

ప్రతిపదార్థం: చావును= మరణం; నోవును= నొప్పి; మన+యోధ+ఆవళికిన్= మన వీరుల సముదాయానికి (చెల్లుతుంది). గెలుపు+ఉబ్బు= జయము; అతిశయము, ఆవలికిని= అవతలివారికి; నీచేన్; వినియెదన్= వింటున్నాను గదా; తుదిన్= చివరకు; ఎట్టులున్= తప్పకుండా; శ్రీ+విభవము= శుభము, సంపద; పాండవులకున్= పాండవులకు; చేపడును+అ+కదే!= చేకూరగలదు కదా!

తాత్పర్యం: ఇప్పుడే తేలిపోయింది. చావు, బాధ - మన వీరుల సముదాయానికి తప్పదు. చిట్టచివరకు జయము, శుభము, సంపద పాండవులకు చేకూరగలదు కదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. దుర్యోధను దుర్ణయంబున నేను దుర్వార్తలు వినుచు దుఃఖంబులనుభవించువాఁడ నైతిఁ గౌంతేయుల గెలుచునుపాయం బెద్దియుం గన్నవారముగా' మనిన సంజయుం 'డది యట్టిద నీసైన్యంబుల సేనాంగంబు లనేకంబులు వొలిసె దొరలు మడిసెదరు దిర మై విను' మని యి ట్లనియె నట్లు శల్యుచేత బహుబాణంబులం బొదువంబడి పార్షతుం డతని నపరిమిత నిశితశరంబులం బొదువ నతం డతనివిల్లు దునిమి వివిధాస్త్రంబుల వెగడు వఱచిన నాధృష్టద్యుమ్నుండు నొచ్చుటయుఁ జూచి సుభద్రాసూనుండు మద్రపతిం దాఁకె నప్పుడు కురుపతి పురికొల్ప దుర్ముఖుండును దుస్సహుండును దుర్మర్షణుండును సత్యవ్రతుండును జిత్రసేనుండును బురుమిత్త్రుండును వివింశతియును వికర్ణుండును నయ్యభిమన్యు మార్కొనుట కలికి పాంచాల నందనుపై నదరి యొక్కొక్కండ పెక్కమ్ము లేసిన నాపృషతపౌత్రుండు చలింపక యొక్కొక్కరినిం బెక్కమ్ము లేసి కరలాఘవంబు నెఱపి యందఱకుం జాలి సమరంబు సేయుచుండె. 200

ప్రతిపదార్థం: దుర్యోధను+దుర్ణయంబునన్= దుర్యోధనునియొక్క దుర్నీతివలన; నేను; దుర్వార్తలు= చెడ్డ సమాచారములు; వినుచు; దుఃఖంబులు; అనుభవించువాఁడను+ఐతిన్= భరింపవలసినట్టి వాడను అయ్యాను; కౌంతేయులన్= కుంతీపుత్రులను (పాండవులను); గెలుచు= జయించే; ఉపాయంబు; ఎద్దియున్= దేనిని; కన్నవారము+కాము= అరసినట్టివారము కాము; అనినన్= అని చెప్పిన; సంజయుండు= సంజయుడు; అది= పాండవులను జయించే వెరవు కన్పించకపోవటం; అట్టిది+అ= అట్టిదే; నీ సైన్యంబుల సేనా+అంగంబులు= నీ సేనలోని శాఖలు; అనేకంబులు= పెక్కులు; పొలిసెన్= నశించాయి; దొరలు= వీరులు(ప్రభువులు); మడిసెదరు= చనిపోగలరు, తిరము+ఐ= దిట్టముగా (మనస్సు స్థిరంగా ఉంచికొని); వినుము; అని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అట్లు= ఆ రీతిగా; శల్యుచేతన్= శల్యునిచేత; బహు బాణంబులన్= పెక్కు అమ్ములచేత; పొదువంబడి= ఆక్రమించబడి; పార్షతుండు= పృషతుని వంశీయుడు(ధృష్టద్యుమ్నుడు); అతనిన్= శల్యుడిని; అపరిమిత నిశిత శరంబులన్+పొదువన్= అసంఖ్యాకమైన వాడి అమ్ముల నొప్పింపగా; అతండు= శల్యుడు; అతని+విల్లు+తునిమి= ధృష్టద్యుమ్ముని ధనువు ఖండించి; వివిధ+అస్త్రంబులన్= పెక్కు బాణాలతో; వెగడు+ పఱచినన్= తల్లడిల్ల చేయగా; ధృష్టద్యుమ్నుండు; నొచ్చుటయున్= నొప్పి చెందుటయు; చూచి; సుభద్రా సూనుండు= సుభద్ర కొడుకు - అభిమన్యుడు; మద్ర+పతిన్= మద్రరాజును(శల్యుని); తాఁకెన్= మార్కొన్నాడు; అప్పుడు= ఆ సమయంలో; కురుపతి= కురురాజు(దుర్యోధనుడు); పురికొల్పన్= ప్రోత్సహించటంచేత; దుర్ముఖుండును; దుస్సహుండును; దుర్మర్షణుండును; సత్యవ్రతుండును; చిత్రసేనుండును; పురుమిత్రుండును; వివింశతియును; వికర్ణుండును; ఆ+అభిమన్యున్= ఆ అభిమన్యుని; మార్కొనుటకున్= తాకుటకు; అలికి= భయపడి; పాంచాల నందనుపైన్= పాంచాల రాజు ద్రుపదుని కొడుకైన ధృష్టద్యుమ్నునిపై; అదరి= విజృంభించి; ఒక్కొక్కండు+అ= ఒక్కొక్కడే; పెక్కు+అమ్ములు+ఏసిన్= ఎక్కువ బాణాలు ప్రయోగింపగా; ఆ పృషత+పౌత్రుండు= ఆ ధృష్టద్యుమ్నుడు; చలింపక= కదలక(సరకుచేయక); ఒక్కొక్కరినిన్= ఒక్కొక్కరినే; పెక్కు+అమ్ములు+ఏసి= ఎన్నో బాణాలు ప్రయోగించి; కరలాఘవంబు నెఱపి= చేతి నైపుణ్యాం చూపి; అందఱకున్+చాలి= ప్రతివీరులు అందరకు సరిపోయి; సమరంబు+చేయుచుండెన్= యుద్ధం చేస్తున్నాడు.

తాత్పర్యం: 'దుర్యోధనుడి చెడు నిర్ణయం వలన, నేను చెడు వార్తలు వినవలసి వస్తోంది. దుఃఖం అనుభవించవలసి వస్తోంది. పాండవులను జయించే వెరవు ఏదీ కన్పించటంలేదు'. అని ధృతరాష్ట్రుడు పలుకగా సంజయుడు ఈ విధంగా చెప్పాడు - 'నిజమే- నీ సైన్యాంగములు ఎన్నో నశించాయి. దొరలు మరణించారు - గుండె దిటవు చేసుకొని ఆలకింపుము' - అని చెప్పి, మరల ఈ విధంగా అన్నాడు.

'ఆ విధంగా శల్యుడు వేసిన బాణాలచే నొచ్చి, ధృష్టద్యుమ్నుడు అతడిమీద పెక్కు వాడి బాణాలు ప్రయోగించాడు. శల్యుడు ధృష్టద్యుమ్నుడి ధనువు ఖండించాడు. పెక్కు బాణాలు వేశాడు. ఆ సమయంలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధృష్టద్యుమ్నుడు డస్సిపోవటం చూచి అభిమన్యుడు వచ్చి శల్యుని మార్కొన్నాడు. ఆ సమయంలో దుర్యోధనుడు ప్రోత్సహింపగా దుర్ముఖుడు - దుస్సహుడు- దుర్మర్షణుడు - సత్యవ్రతుడు - చిత్రసేనుడు - పురుమిత్రుడు - వివింశతి - వికర్ణుడు ఆ అభిమన్యుడిని ఎదిరించటానికి జంకి - ధృష్టద్యుమ్నుడిపై విజృంభించి - పెక్కువాడి బాణాలు ఒకేసారిగా ప్రయోగించారు. పృషతుని మనుమడైన ఆ ధృష్టద్యుమ్నుడు ఏ మాత్రం చలింపక, ఒక్కొక్కరిమీద పెక్కు బాణాలు ప్రయోగించి తన చేతి నైపుణ్యం ప్రదర్శించాడు. ధృష్టద్యుమ్నుడు - అంతమందికీ సరిపోయి సంగ్రామం చేశాడు.

విశేషం: 1. 'సేనాంగంబులు అనేకంబులు' - సేన రథ గజ తురగ పదాతులు అనే చతురంగములుగా విభజింపబడినప్పటికీ అవిగాక ఎన్నో అంగాలు ఉన్నట్లుగా తిక్కన గుర్తించాడు. తిక్కన సప్తాంగములను గూర్చి నిర్వచనోత్తరరామాయణంలో ప్రస్తావించాడు. సేనాంగములు కాలక్రమంగా పెరిగాయి. 2. కరలాఘవము - లాఘవము అనే మాటకు లఘుత్వము అని తప్పు అర్థం చెప్పకూడదు.

హస్త లాఘవము - అనుమాట ఇంద్రజాలకుని పరంగా లోక వ్యవహారంలో ఉంది. కరలాఘవంలో అంతర్లీనంగా ఉండే అంశాలు - చురుకుదనం - సులువు. అయితే - కరలాఘవం అద్భుతరస పర్యవసాయి.

క. **నకులుఁడు సహదేవుఁడు మా । మకు నచ్చెరువాటుఁ బ్రియము మదిఁ దలకొన నం**
బకవృష్టి గురియ నస్త్ర । ప్రకరంబునఁ బొదివె మద్రపతియును వారిన్. 201

ప్రతిపదార్థం: నకులుఁడు+సహదేవుఁడు; మామకున్= మామయైన శల్యునకు; అచ్చెరువాటు= ఆశ్చర్యము; ప్రియము= సంతోషం; మదిన్= మనస్సులో; తలకొనన్= కలుగగా; అంబక+వృష్టి= బాణాల వాన; కురియన్= కురిపించగా; వారిన్= ఆ నకుల సహదేవులను; మద్రపతియును= (మద్రదేశానికి రాజు అయిన) శల్యుడును; అస్త్రప్రకరంబునన్= మంత్ర బాణాల సముదాయంతో; పొదివెన్= కప్పివేశాడు.

తాత్పర్యం: ఆ సంగ్రామంలో నకులుడు, సహదేవుడు తమ మేనమామైన శల్యుడితో మార్కొనవలసి వచ్చింది. శల్యుడు కౌరవ పక్షంలో యుద్ధం చేస్తున్నాడు. ఆ నకుల సహదేవుల పరాక్రమం చూచి, మేనమామగారైన శల్యుడికి ఆశ్చర్యంతో పాటు ఆనందం కలిగింది. ఆశ్చర్యం ఎందుకంటే, వయస్సులో నకుల సహదేవులు చాలా చిన్నవారు. శల్యుడు బహుముఖ ప్రజ్ఞాధురీణుడు. మహావీరుడు. అంతటివాడిని వయస్సులో చిన్నవారైన నకుల సహదేవులు ఎదుర్కొన్నారు. ఆనందం ఎందుకంటే - తన మేనల్లుళ్ళు అంతటి శౌర్యం ప్రదర్శిస్తున్నారు గదా! అని.

విశేషం: మానవజీవితం - విచిత్ర విరోధాభాస సంయుతం. అందులో యుద్ధం - వింత సన్నివేశాలకు ఆలవాలం. పూజనీయుడైన మేనమామపై ప్రేమ చూపించటానికి బదులు మేనల్లుళ్ళు బాణవర్షం కురిపించవలసి వచ్చింది!

వ. **వారికి బాసట యై పాంచాల మత్స్యపతులు సైన్యోపేతంబుగాఁ దఱిమిన మనయందుఁ గలదండిమగలు శల్యునకు సాహాయ్యంబు సేసి రంత దినమణి యంబరమధ్యం బలంకరించె నట్టియెడ. 202**

ప్రతిపదార్థం: వారికిన్= ఆ నకుల సహదేవులకు; బాసట+ఐ= తోడై; పాంచాల మత్స్య పతులు= పాంచాలరాజైన ద్రుపదుడు, మత్స్యరాజైన విరాటుడు; సైన్య+ఉపేతంబుగాన్= సేనలతోపాటుగా; తఱిమినన్= విజృంభించిన; మనయందున్+కల= మన పక్షంలో ఉన్నట్టి; దండి+మగలు= గొప్ప వీరులు; శల్యునకున్= నకుల సహదేవుల మేనమామ, మద్ర దేశరాజు అగు శల్యుడికి;

సాహాయ్యంబు+చేసిరి= తోడుపడ్డారు; అంతన్; దిన మణి= సూర్యుడు; అంబర+మధ్యంబు+ అలంకరించెన్= ఆకాశ మధ్యంలో ప్రకాశించాడు.

తాత్పర్యం: ఆ నకుల సహదేవులకు సాయంగా ద్రుపదుడు విరాటుడు వచ్చి చేరారు. వారు విజృంభించి కౌరవ సేనలను తరిమి తరిమి కొట్టగా, కౌరవసేనలోని వీరులు పలువురు శల్యుడికి తోడుపడి యుద్ధం చేశారు. అప్పుడు మధ్యాహ్నం అయింది. సూర్యుడు ఆకాశమధ్యంలో ప్రకాశింపసాగాడు.

విశేషం: మహాభారత సంగ్రామం పద్దెనిమిది రోజులు జరిగింది. ప్రతి రోజు సూర్యోదయం పోరాటం ఆరంభమై, సూర్యాస్తమయ సమయంలో ముగిసేది. ఉదయంనుండి మధ్యాహ్నం వరకు - మరల మధ్యాహ్నం నుండి సాయంకాలం వరకు యుద్ధం సాగేది. మహాభారతంలోని యుద్ధవర్ణనలో - మధ్యాహ్నసమయ సూచన కనిపిస్తోంది.

అయితే - మధ్యాహ్న సమయంలో ఆగకుండానే యుద్ధం జరిగేది. మధ్యాహ్నవిరామం గూర్చిగాని, భోజన ప్రస్తావనగాని కన్పించటం లేదు. అనగా నిర్విరామంగా నిరాహారంగా యుద్ధం జరిగినట్లు భావించాలి.

తే. భీమసేనుండు నేఁడు సంగ్రామమునకుఁ । దీఱుదల యగుఁ గా కని తీవ్రకోప
దీప్తుఁడై గద సూచుచుఁ దేరు నీదు । తనయునకు సమ్ముఖంబుగఁ దఱుముటయును. 203

ప్రతిపదార్థం: భీమసేనుండు; నేడు; సంగ్రామమునకున్= యుద్ధానికి; తీఱుదల+అగున్+గాక+అని= అంతము అగుగాక అని పలికి; తీవ్ర కోప దీప్తుఁడు ఐ= మిక్కుటమగు ఆగ్రహముతో వెలుగొందువాడగుచు; గద+చూచుచున్= గదను పరికిస్తూ; తేరు= రథం; నీదు+తనయునకున్= ఓ ధృతరాష్ట్రా - నీ కొడుకైన దుర్యోధనునకు; సమ్ముఖంబుగన్= ఎదురుగా(దగ్గరగా); తఱుముటయును= త్వరితపరచటంతో.

తాత్పర్యం: భీమసేనుడు విజృంభించాడు. గద పట్టుకున్నాడు. తన రథాన్ని దుర్యోధనుని దగ్గరకు - ఎదురుగా తోలించాడు. 'నేడు ఈ యుద్ధం సమాప్తి కావాలి' అన్నాడు. మిక్కుటమగు రోషంతో కౌరవులను మార్కొన్నాడు.

క. నీ కొడుకు లందఱును వెఱ । నాకులతం బొంది రప్ప డగ్రజుఁడు గదా
నీకఘను మగధు వీరో । ద్రేకంబునఁ బనిచె మారుతిం దలపడఁ గన్. 204

ప్రతిపదార్థం: నీ కొడుకులు+అందఱును; వెఱన్= భయముతో; ఆకులతన్+పొందిరి= కలత చెందారు, అప్పుడు; అగ్రజుడు= నీ పెద్ద కొడుకు (దుర్యోధనుడు); గదా+అనీక+ఘనున్= వివిధములగు గదా యుద్ధాలలో ఆరితేరినవాడైన; మగధున్= మగధరాజును; మారుతిన్+తలపడఁగన్= భీముని మార్కొనుటకై; వీర+ ఉద్రేకంబునన్= శౌర్యము విజృంభించునట్లుగా; పనిచెన్= నియమించాడు.

తాత్పర్యం: భీముని విజృంభణ చూచి నీ కుమారులందరు ఆకులత చెందారు. నీ పెద్ద కొడుకు దుర్యోధనుడు వివిధ గదా యుద్ధాలలో ఆరితేరిన మగధుని భీముడిని మార్కొనుటకై నియమించాడు.

వ. పనుచుటయు నతం డురవడించిన. 205

ప్రతిపదార్థం: పనుచుటయున్= ఆజ్ఞాపించగా; అతండు= ఆ మగధుడు; ఉరవడించినన్= విజృంభించగా.

తాత్పర్యం: మగధుడు-తన్ను దుర్యోధనుడు కోరి ఎన్నుకొని పంపటంచేత, ఉత్సాహం ఉరకలు వేయగా. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **గజఘటలం గనుంగొని వికాసము మోమునఁ బల్లవింపఁగా**
భుజశిఖరంబునందు గద పూన్చి మదంబునఁ దేరు డిగ్గి వా
యుజుఁడు గడంగి భీషణసముద్ధతిమైఁ దలపడ్డఁ బర్వత
వ్రజముపయిన్ వెసం గవియు వాసవుచందము దోఁచె నత్తఱిన్. **206**

ప్రతిపదార్థం: గజ+ఘటలన్+కనుంగొని= ఏనుగుల గుంపులను చూచి; వికాసము= సంతోషం; మోమునన్= ముఖమునందు; పల్లవింపఁగా= చిగురించగా; భుజ శిఖరంబునందున్= మూపు కొసయందు; గద+పూన్చి= గదను అమర్చి; మదంబునన్= గర్వంతో; తేరు= రథం; డిగ్గి= దిగి; వాయుజుఁడు= భీముడు(వాయుదేవుని పుత్రుడు); కడంగి= పూనుకొని; భీషణ+సం+ఉద్ధతిమైన్= భయంకరమైన విజృంభణతో; తలపడ్డన్= మార్కొనగా; పర్వత వ్రజము= కొండల సముదాయము; పయిన్= పైన; వెసన్=వేగంగా; కవియు= మార్కొను; వాసవు+చందము= దేవేంద్రుని పోలిక; ఆ+తఱిన్= ఆ సమయంలో; తోఁచెన్= కన్పించింది.

తాత్పర్యం: ఏనుగుల గుంపులపై భీముడు విజృంభించాడు. అతడు తన గదను మూపుపై అమర్చి, గర్వంగా రథం దిగి భయంకరంగా కౌరవసేనలోని ఏనుగులను మార్కొనినపుడు, అతడు కొండలపై మార్కొన్న దేవేంద్రుడి వలె కన్పించాడు.

విశేషం: అలం: ఉపమ. పూర్వకాలంలో కొండలకు రెక్కలుండి - ఆకాశ మార్గంలో విహరించి, క్రిందికి దిగి నేలమీది జనపదాలను ధ్వంసం చేసేవట. అప్పుడు దేవేంద్రుడు వజ్రాయుధంతో కొండల రెక్కలు తునిమేవాడని పురాణకథనం. ఇప్పుడు - కొండలవంటి ఏనుగులను భీముడు ధ్వంసం చేయసాగాడు.

క. **నిజసింహనాదమున న । గ్గజములు గుండియలు వగిలి కలగుండువడన్**
విజయాగ్రజుఁ డి ట్లేచి ది । విజవర్గము పిచ్చలింప విస్ఫురితగతిన్. **207**

ప్రతిపదార్థం: నిజ+సింహనాదమునన్= తాను చేసిన సింహనాదం చేత; ఆ గజములు= ఆ ఏనుగులు; గుండియలు+పగిలి= గుండెలు వ్రక్కలై; కలగుండు+ పడన్= కలత చెందగా; విజయ+అగ్రజుఁడు= అర్జునుని అన్న(భీముడు); ఇట్లు= ఈ విధంగా; విస్ఫురిత గతిన్= ప్రకాశమానమైన రీతిలో; ఏచి= విజృంభించి; దివిజ వర్గము= వేల్పులగుంపు; పిచ్చలింపన్= ప్రశంసించగా.

తాత్పర్యం: తన సింహనాదం వలన, కౌరవసేనలోని ఏనుగులు గుండెలు పగిలి కలత చెందగా. దేవతలు ప్రశంసించగా ప్రకాశమానమైన రీతిలో ఈ విధంగా విజృంభించి (మీది వచనంతో అన్వయం)

విశేషం: 1. ఏనుగులకు సింహం అంటే భయం. సింహస్వప్నం - అంటే కలలో సింహం కన్పించినా సరే ఏనుగులు భయపడతాయట. ఇక సింహగర్జన పట్టపగలే వినిపిస్తే? 2. సింహనాదం : సింహము చేసే గర్జన అని వాచ్యార్థం. కానీ మహాభారతంలో 'సింహనాదం' అంటే సంగ్రామసమయంలో ఉత్సాహంతో వీరులు పెట్టే పెద్ద కేక. అది సింహగర్జనవలె ఉంటుంది. పరాక్రమంలో ఆయుధ విద్యాపాటవానికి ఉన్న ప్రాముఖ్యం - సింహనాదానికి కూడా ఉంది.

వ. **విక్రమవిహారంబునకుం జొచ్చె నప్పుడు ద్రౌపదేయులు నభిమన్యుండును గవలును ధృష్టద్యుమ్నుండును గరిసముత్కరంబుపై శరనికరంబులు నిగిడించుచు భీముని నిరుగెలంకులం జేరి కవిసి రందు నకుల నందనుండగు శతానీకుండు హస్తికులమస్తకంబులు భల్లంబుల డొల్ల నేయుచు నడరె నట్టియెడ.** **208**

ప్రతిపదార్థం: విక్రమ విహారంబునకున్+చొచ్చెన్= శౌర్యము ప్రకటించుచు సంతోషముతో విహరింపసాగాడు; అప్పుడు; ద్రౌపదేయులు= ద్రౌపది కొడుకులూ; అభిమన్యుండును= అభిమన్యుడూ (సుభద్రకొడుకు); కవలును= నకుల సహదేవులూ; ధృష్టద్యుమ్నుండును= ధృష్టద్యుమ్నుడూ; కరి+సమ్+ఉత్కరంబుపైన్= ఏనుగుల పెనుగుంపులపై; శర+నికరంబులు= అమ్ముల

సముదాయాలు; నిగిడించుచున్= వ్యాపింపచేయుచు; భీమునిన్+ఇరు+కెలంకులన్+చేరి= భీముడికి ఇరువైపులకు చేరి; కవిసిరి= మార్కొన్నారు; అందున్= వారిలో; నకుల+నందనుండు+అగు= నకులుని కొడుకు అయిన; శతానీకుండు అనెడువాడు; హస్తి, కుల, మస్తకంబులన్= ఏనుగుల సమూహాల తలలు; భల్లంబులన్= ఈటెబాణాలతో; డొల్లన్+ఏయుచున్= కూలునట్లు ప్రయోగిస్తూ; అడరెన్= విజృంభించాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: భీముడు యుద్ధరంగంలో విహరింపసాగాడు. అతనికి ఇరు ప్రక్కల - నకుల సహదేవులు, అభిమన్యుడు, ధృష్టద్యుమ్నుడు, ద్రౌపది కొడుకులు చేరి ఏనుగుల గుంపులపై బాణాలు ప్రయోగించారు. నకులుడి కొడుకు శతానీకుడు ఏనుగుల తలకాయలు నేలపై పడేటట్లు ఈటె బాణాలు ప్రయోగించాడు.

చ. మగధమహీశుఁ డేచి యభిమన్యునిపైఁ గరిఁ గొల్ప నుజ్జ్వలం
బగు నొక నారసంబు దొడి యాతఁ డుదగ్రత ఫాలకుంభ సం
ధిగతము గాఁగ నేయ నది దీనత మ్రొగ్గఁగ నప్పడక్కజం
బుగ వెస మాగధుం దునిమె భూస్థలి నయ్యిరు పీనుఁగుం బడన్. 209

ప్రతిపదార్థం: మగధ+మహీశుఁడు= మగధరాజు; ఏచి= విజృంభించి; అభిమన్యునిపైన్= అభిమన్యుని మీద; కరిన్= ఏనుగును; కొల్పన్= పురికొల్పగా; ఉజ్జ్వలంబు+అగు= తీవ్రమైన; ఒక+నారసంబు+తొడి= ఒక బాణాన్ని ప్రయోగించి; ఆతఁడు= అభిమన్యుడు; ఉదగ్రతన్= ఉత్సాహంతో; ఫాల కుంభ సంధిగతము+కాఁగన్= ఆ యేనుగుయొక్క తల, కుంభస్థలం కలిసేచోట ఉండేదిగా; ఏయన్= బాణాలు ప్రయోగింపగా; అది= ఆ ఏనుగు; దీనతన్= బాధతో; మ్రొగ్గఁగన్= నేలకూలగా; అప్పుడు; అక్కజంబుగన్= ఆశ్చర్యకరముగా; వెసన్= వేగంగా; మాగధున్= మగధరాజును; ఆ+ఇరు+పీనుఁగున్= ఆ రెండు పీనుగులు (మాగధుడి పీనుగు - ఏనుగు పీనుగు); భూస్థలిన్= భూతలముమీద; పడన్= కూలగా; తునిమెన్= సంహరించెను.

తాత్పర్యం: మగధరాజు విజృంభించి - తన ఏనుగును పురికొల్పి అభిమన్యుడిని మార్కొన్నాడు. అభిమన్యుడు ఒక భయంకరమైన బాణంతో ఆ ఏనుగు కుంభస్థలాన్ని ఛేదించాడు. ఆ ఏనుగు కలగి నేలకూలింది. అప్పుడు ఆశ్చర్యకరంగా అభిమన్యుడు ఒక వాడి బాణంతో మగధరాజును సంహరించాడు. అప్పుడు - ఏనుగు పీనుగు, మగధరాజు పీనుగు నేలమీదకు కూలాయి.

క. ధృష్టద్యుమ్నుఁడు నుజ్జ్వల । దష్టాపదపుంఖ మార్గణావళి నయ్యు
త్కృష్టగజఘటలఁ గలఁచె న । వష్టంభ విజృంభణంబు వైరులు వొగడన్. 210

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్నుఁడున్= ధృష్టద్యుమ్నుడును; ఉజ్జ్వలత్ అష్టాపద పుంఖ మార్గణ+ఆవళిన్= ప్రకాశించే; బంగారు కొనలుగల బాణముల యొక్క సమూహముతో; ఆ+ఉత్కృష్టగజ ఘటలన్= ఆ గొప్ప ఏనుగుల గుంపులను; అవష్టంభ+విజృంభణంబు= గర్వాతిశయం; వైరులు+పొగడన్= శత్రువులు ప్రశంసించేటట్లుగా; కలఁచెన్= నొప్పించాడు, చీకాకు పరచాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ప్రకాశించే బంగారు ములుకులు గల బాణముల సమూహముతో శ్రేష్ఠములయిన ఆ ఏనుగుల గుంపును చీకాకుపరచాడు. అతడి దర్పముతో కూడిన విజృంభణను శత్రువులు ప్రశంసించారు.

విశేషం:. ధృష్టద్యుమ్నుడు ప్రయోగించినట్టివి మామూలు బాణాలు కావు. అవి అష్టాపదపుంఖములు కలవి. అష్టాపద= బంగారు, ఏనుగుల స్థూలకాయాలు చీల్చేందుకు ప్రత్యేకంగా ఉపకరించేవి 'అష్టాపద పుంఖ' బాణాలు. అనగా ఎనిమిది మొనలు గల బాణాలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. కొన్నిటి హస్తముల్ సదియఁ గొన్నిటిఁ గొమ్ములు దుమ్ము ధూళిగాఁ
గొన్నిటిఁ గుంభముల్ వగులఁ గొన్నిటిఁ గాళులు నుగ్గునూచగాఁ
గొన్నిటిఁ బార్శ్వముల్ నలియఁ గొన్నిటి వీఁపులు పిండుపీఁచుగా
నన్నిటి భీముఁ డుద్భటగదాహతి నేనికవేఁట లాడఁగన్. 211

ప్రతిపదార్థం: కొన్నిటిన్= కొన్ని ఏనుగులను; హస్తముల్= తుండములు; చదియన్= నలుగగా; కొన్నిటిన్=కొన్ని ఏనుగులను; కొమ్ములు= దంతాలు; దుమ్ము+ ధూళిగాన్= రేణువులు, అణువులుకాగా; కొన్నిటిన్= కొన్నింటిని; కుంభముల్= ఫాలభాగాలు; పగులన్; కొన్నిటిన్= కొన్నింటిని; కాళులు= కాళ్ళు; నుగ్గు నూచగాన్= ముక్కలు చెక్కలుకాగా; కొన్నిటిన్= కొన్నింటిని; పార్శ్వముల్= కడుపు ప్రక్క భాగాలు, నలియన్= పగిలిపోగా; కొన్నిటిన్= కొన్నింటిని, వీఁపులు; పిండు+పీఁచుగాన్= సన్నని దారపు పింజెలుగా; అన్నిటిన్= అన్ని ఏనుగులను; భీముఁడు= భీముడు; ఉద్భట+గదా+ఆహతిన్= భయంకరములైన గద యొక్క వ్రేటులచేత; ఏనిక+వేఁటలు= ఏనుగుల సంహరించటం అనే వినోద విహారం; ఆడఁగన్= చేయగా.

తాత్పర్యం: భీముడు - భయంకరమైన గదాదండం చేతపూని, ఏనుగులను వేటాడాడు - కొన్నిఏనుగుల తుండాలు నరికివేశాడు. కొన్నిటి దంతాలు పొడి పొడి చేశాడు. కొన్ని ఏనుగుల కుంభస్థలాలు పగులకొట్టాడు. కొన్ని ఏనుగుల కాళ్ళు విరుగ గొట్టాడు. కొన్నిటి వీపులు పింజలుపింజలుగా చేశాడు. కొన్నిటి కడుపు ప్రక్క భాగాలు ముక్కలు చేశాడు.

విశేషం: యుద్ధంలో ఏనుగులను సంహరించటంలో భీముడు సిద్ధహస్తుడుగా ప్రఖ్యాతిని ఆర్జించాడు.

క. అభిమన్యుద్రుపదసుత । ప్రభృతు లతనితోన మెలఁగి బడలువడఁగ న
య్యిభచయము నిశితవిశిఖ । క్షుభితముగాఁ జేసి రేపు సొంపారంగన్. 212

ప్రతిపదార్థం: అభిమన్యు ద్రుపద సుత ప్రభృతులు= అభిమన్యుడు, ద్రుపదుడి కొడుకులు మున్నగువారలు; అతనితోన+ మెలఁగి, = భీముడితో సహకరించి; బడలువడఁగన్= శ్రమపడగా; ఆ+ఇభ+చయమున్= ఆ ఏనుగుల గుంపును; నిశిత, విశిఖ, క్షుభితము గాన్= వాడి అయిన బాణములు సోకుట చేత కలత చెందినట్టివిగా; ఏపు+సొంపారన్= తమ విజృంభణ అందము చిందులాడు నట్లుగా; చేసిరి= చేశారు.

తాత్పర్యం: భీముడు గదపుచ్చుకొని విజృంభించి ఏనుగులను వేటాడుతుండగా, అభిమన్యుడు, ద్రుపదునికొడుకులు అతనితో సహకరించి చెలరేగి ఆ యేనుగుల గుంపును వాడియైన బాణాలచేత మిక్కిలి కలత నొందించారు.

విశేషం: భీముడు - సాహసంతో పాదచారియై గద చేత పుచ్చుకొని ఏనుగుల గుంపులలోనికి చొరబడ్డాడు. అభిమన్యుడు - ద్రుపదపుత్రులు దూరమున రథాలపై నిలిచి - బాణాలు ప్రయోగించి ఏనుగుల గుంపును సంక్షోభింప జేశాడు.

క. ద్విరదము లొఱగెడివియు నె । త్తురు గ్రక్కుచుఁ గూలెడివి గదుపు లై కలయం
దిరుగుడువడియెడివియు భువిఁ । బొర లెడివియు నయ్యెఁ బవనపుత్రు మునుమునన్. 213

ప్రతిపదార్థం: ద్విరదములు= ఏనుగులు (రెండు దంతములు గలవి); ఒఱగెడివియున్= ప్రక్కకు వాలి పడిపోవునట్టివియును; నెత్తురు= రక్తము; క్రక్కుచున్+కూలెడివి= నోటి నుండి వెలువడ చేయుచు చచ్చిపోవునట్టివియు; కదుపులు+ఐ= గుంపులు గుంపులుగా ఏర్పడి; కలయన్+తిరుగుడు+పడియెడివియున్= కలిసిపోవుచు, విడిపోవుచు, మరలిపోయెడివియు అగుచు; భువిన్= భూమిమీద; పొరలెడివియున్= పొరలాడునట్టివియునై; పవన పుత్త్రు+మునుమునన్= భీముని మునుములో; అయ్యెన్= అయ్యాయి.

తాత్పర్యం: భీముడి మునుములో ఏనుగులు కొన్ని ఒరగెడివి, కొన్ని నెత్తురు గ్రక్కుతూ కూలెడివీ, కొన్ని గుంపులై త్రొక్కిసలాటలో తిరుగుడుపడేవి. కొన్నినేలపై పొరలాడేవి అయినాయి.

క. ఏనుఁగు నెత్తుట గదయుం । దానుఁ దడిసి విలయ కాలదండధరుని చం
దానం బావని మాగధ । సేనం బీనుంగుపెంటఁ జేసి చెలంగెన్. 214

ప్రతిపదార్థం: పావని= వాయుపుత్రుడు(భీముడు); ఏనుఁగు+నెత్తుటన్= ఏనుగుల రక్తంలో; తాను= తానును; గదయున్= గదయును; తడిసి= తడిసిపోయి; విలయ కాల దండధరుని చందానన్= ప్రళయ సమయమునందలి యముని వలె; మాగధ సేనన్= మగధ దేశానికి చెందిన సైన్యాన్ని; పీనుఁగు+పెంటన్+చేసి= మృతకళేబరాల కుప్పగా చేసి; చెలంగెన్= విలసిల్లాడు.

తాత్పర్యం: భీముడు ఏనుగుల నెత్తుటిలో తానూ, తన గదాదండం తడిసి, ప్రళయకాలమందలి యముడివలె- మగధసేనను చీల్చి చెండాడుతూ ప్రకాశించాడు.

విశేషం: 'ప్రళయం' - కల్పాంత కాలంలో సంభవిస్తుందనీ అప్పుడు సృష్టి సమస్తం - సర్వనాశనం అయిపోతుందనీ ప్రాచీన భారతీయ పురాణ కథనం. అప్పుడు ప్రకృతిలోని సర్వశక్తులు - విజృంభించి సర్వనాశనం చేయగలవు సృష్టి అంతటినీ. దానికి ' ప్రళయము-ప్ర+లయము= విశేషమైన లయము (నాశనము) అని వ్యపదేశము. 'వి+లయము' ప్రళయమునకు పర్యాయపదం. యముడు సంహారకారుడు. ఇక 'ప్రళయకాలంలో' యముడి మాట వేరే చెప్పాలా?

క. శరములవేగంబున గద । పరుసదనంబునను గలఁగఁబడి చేడ్పడ నా
కరులం దోలెను భీముఁడు । వెరవున గోపకుఁడు గదుపు వెలిచిన మాడ్కిన్. 215

ప్రతిపదార్థం: శరముల వేగంబునన్= వడిగా వేయబడిన అమ్ములచేతను; గద+పరుసదవంబునను= గదయొక్క కఠినత్వమువలనను; కలఁగన్+పడి= కలత చెంది; చేడ్పడన్= దెబ్బతినగా; భీముఁడు; కరులన్= ఏనుగులను; గోపకుఁడు= ఆవుల కాపరి; కదుపు+వెలిచిన+మాడ్కిన్= గోవుల గుంపును మరలించిన విధముగా; వెరవునన్= ఉపాయముతో; తోలెను= తరిమికొట్టాడు.

తాత్పర్యం: అటు అభిమన్యుడు, ద్రుపదరాజు కొడుకులు వేగంగా ప్రయోగించిన బాణాలవల్లను, తన గదా ప్రహరణాల వల్లను కలత చెందిన ఏనుగులను భీముడు గోపాలుడు ఆవులమందను అదలించినట్లుగా ఉపాయంతో మరలించి తరిమికొట్టాడు.

క. పెనుగాలిఁ దూలు మొగిళులో । యన నిభములు విఱిగి నిజబలావలి సదియం
దనమీఁదఁ బాఱ దుర్యో । ధనుఁ డదలిచి సర్వసైన్యతతిఁ బురికొల్పెన్. 216

ప్రతిపదార్థం: ఇభములు= ఏనుగులు; పెనుగాలిన్= పెద్ద వాయువుచే; తూలు= చెదరిపోవు; మొగిళులు+ఒ= మబ్బులో అనునట్లుగా; విఱిగి= దెబ్బతిని; నిజ+బల+ఆవలి= తనయొక్క సైన్య సమూహము; చదియన్= గలిగిపోగా; తనమీఁదన్+పాఱన్= తన మీదికి పరుగెత్తుకొని రాగా; దుర్యోధనుఁడు; అదలిచి= అదలించి; సర్వ సైన్య తతిన్= తన సేనా సమూహము నంతటినీ; పురికొల్పెన్= క్రమ్ముకొనజేశాడు.

తాత్పర్యం: పెద్ద గాలి దుమారం వలన చెల్లాచెదరైన మబ్బులవలె, ఏనుగులు దెబ్బతిని, తన సైన్యం వైపునకు పారిపోగా, దుర్యోధనుడు, ఆ ఏనుగులను అదలించి తన సైన్యాల గుంపు లన్నింటిని ప్రోత్సహించాడు. (క్రమ్ముకొనునట్లు చేశాడు)

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. పతి పురికొలిపిన నమవస । నతిశయముగఁ బొంగు జలధి యనఁ గ్రమ్మిన యు
ద్ధతబలము నిలిపె నమ్మా । రుతి సెలియలికట్టక్రియ నిరూఢస్థితి యై. 217

ప్రతిపదార్థం: పతి= రాజు(దుర్యోధనుడు); పురికొలిపినన్= ప్రోత్సహింపగా; అమవసన్= అమావాస్యనాడు; అతిశయముగన్= ఎక్కువగా; పొంగు= పొంగే; జలధి+అనన్= సముద్రమో అనునట్లుగ; క్రమ్మిన= ఆవరించిన; ఉద్ధత+బలమున్= అతిశయించిన సేనను; ఆ+మారుతి= వాయుపుత్రుడైన ఆ భీముడు; చెలియలికట్ట క్రియన్= చెలియలికట్టవలె; నిరూఢ+స్థితి+ఐ= స్థిరమైన నిలుకడ కలవాడై; నిలిపెన్= అడ్డగించాడు-వారించాడు.

తాత్పర్యం: రాజు అయిన దుర్యోధనుడు ప్రోత్సహించగా, అమావాస్యనాడు ఉప్పొంగే సముద్రమో అనునట్లుగా విజృంభించిన కౌరవసేనలను అరికట్టి చెలియలికట్టగా భీముడు నిలిచాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. 1. చెలియలికట్ట: సముద్రము ఆటు పోటులతో కెరటాలతో ఎల్లపుడు చెలువొందు చున్నప్పటికి - ఒక 'మేర' మీరదు. ఆ రేఖకు చెలియలికట్ట అని పేరు. 2. అమావాస్యనాడు, పౌర్ణమినాడు సముద్రం ఉప్పొంగటం అందరకూ తెలిసినట్టిదే.

వ. ఇట్లు నిలిపి యార్చి తఱియం జొచ్చువృకోదరునకుం దోడయి ధృష్టద్యుమ్న సౌభద్ర ప్రముఖులగు రథికజనంబులు. 218

ప్రతిపదార్థం: ఇట్లు; నిలిపి; ఆర్చి= పెద్దకేకవేసి (సింహనాదం చేసి); తఱియన్+చొచ్చు= తరిమికొట్టే; వృకోదరునకున్= భీముడికి; ధృష్టద్యుమ్న, సౌభద్ర ప్రముఖులు+అగు= ధృష్టద్యుమ్నుడు; అభిమన్యుడు మొదలైన; రథికజనంబులు= రథాన్నెక్కి యుద్ధం చేసే వీరులు; తోడు+అయి= సాయంగా నిలిచి.

తాత్పర్యం: ఈ విధంగా సింహనాదం చేస్తూ, కౌరవసేనలను ఎదిర్చిన భీముడికి ధృష్టద్యుమ్నుడు, అభిమన్యుడు మొదలైన రథికులు సహాయంగా నిలిచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. విడువక దాపట వలపటఁ । గడిమి మెఱయ నిలిచి యపుడు కౌరవ సేనం
గడుఁ జిక్కు వఱిచి రొక్కు । మ్మడి నమ్ములవానఁ గురిసి మదమెలరారన్. 219

ప్రతిపదార్థం: విడువక= వదలిపెట్టక; దాపటన్= ఎడమ ప్రక్కను; వలపటన్= కుడి ప్రక్కను; కడిమి+మెఱయన్= పరాక్రమం ప్రకాశింపగా; నిలిచి= నిలబడి; అపుడు; కౌరవ+సేనన్= కౌరవ సైన్యాన్ని; ఒక్కుమ్మడిన్= ఏకంగా; అమ్ములవానన్= బాణముల వర్షంతో; మదము+ఎలరారన్= గర్వము విలసిల్లునట్లుగా; కడున్+చిక్కు+పఱిచిరి= ఎక్కువగా చీకాకు చేశారు.

తాత్పర్యం: కుడివైపున ఒకరు - ఎడమ ప్రక్క ఇంకొకరు నిలబడి, పరాక్రమం చూపించి, కౌరవసేనపై బాణాలు కురిపించి చీకాకు పరచారు. (వీరు ఎవరు?) అటు ధృష్టద్యుమ్నుడు - ఇటు అభిమన్యుడు అని సమాధానం చెప్పుకోవాలి - వెనుకటి గద్యనుబట్టి.

క. అడవి దరికొనిన పావకు । వడువున భీముండు గౌరవవ్యూహంబుం
బొడిసేయుచుఁ బేర్చెం దన । యొడలు మనము నంతకంత కుబ్బుచునుండన్. 220

ప్రతిపదార్థం: భీముండు; అడవిన్+దరికొనిన= అడవిని చుట్టుముట్టిన; పావకు+వడువునన్= అగ్నివలె; కౌరవ+వ్యూహంబున్= కౌరవులు పన్నిన సేనను; పొడి+చేయుచున్= పిండిచేయుచు, అణువులుగా కొట్టి అణగార చేయుచు; తన+ఒడలు= తన శరీరము; మనము= మనస్సు; అంతకున్+అంతకున్= మాటిమాటికి; ఉబ్బుచున్+ఉండన్= అతిశయించుచుండగా; పేర్చెన్= విజృంభించాడు.

తాత్పర్యం: అడవిని చుట్టుముట్టి దహించే అగ్నిహోత్రుడివలె, భీముడు కౌరవసేనను నాశనం చేశాడు. అతడి శరీరం, మనస్సు అంతకంతకు ఉత్సాహం పుంజుకొన్నాయి.

క. ఉరమునఁ గటిమైఁ దొడలం । జరణములం గౌరవేంద్రు చతురంగంబుల్
ధరఁ జాఁపకట్టు వడ ని । ష్ఠురగతిఁ దాఁకుచు సమీరసుతుఁడు చరించెన్. 221

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్రు, చతురంగంబుల్= దుర్యోధనుడి చతురంగ బలాలు; ధరన్= భూమియందు; చాఁపకట్టు+పడన్= చాపవలె పరుచుకొన్నట్లు పడిపోగా; సమీర సుతుఁడు= వాయునందనుడు - భీముడు; ఉరమునన్= వక్షముతో; కటిమైన్= మొలతో; తొడలన్= తొడలతో; చరణములన్= పాదములతో; నిష్ఠురగతిన్= పరుషమైన విధంగా; తాఁకుచున్= కొట్టుతూ; చరించెన్= విహరించాడు.

తాత్పర్యం: కురురాజు బలాలు నేలపై చాపకట్టుగా సాగిలపడేటట్లు భీముడు రొమ్ముతో, మొలతో, తొడలతో, పాదాలతో పరుషంగా తాకుతూ విహరించాడు.

తే. తుంగ మడువున నాడు మాతంగవిభుని । భంగి భవదీయసైన్యంబు బడలువడఁగ
లీల నిస్సంభ్రముం డయి కేలి సలిపె । గాలిచూ లప్డు గగనచరాలి వొగడ. 222

ప్రతిపదార్థం: తుంగ+మడువునన్= తుంగ మొక్కలు దట్టముగా మొలిచియున్న చెరువులో; ఆడు= వినోదవిహారం చేసే; మాతంగ+విభుని+భంగిన్= ఏనుగులరాజువలె; భవదీయ+ సైన్యంబు= నీ సేన; బడలు+పడఁగన్= డస్సిపోవునట్లుగా; లీలన్= సులువుగా ఆటవలె; నిస్+సంభ్రముండు అయి= తొట్రుపాటు లేనివాడయి; గాలిచూలు= వాయునందనుడు, భీముడు; గగన+చర+ఆలి= ఆకాశ సంచారులగు దేవతల సమూహం; పొగడన్= ప్రశంసింపగా; అప్డు= ఆ సమయాన; కేలి+సలిపెన్= ఆట ఆడాడు.

తాత్పర్యం: తుంగతో నిండిన చెరువులో విహరించే మదపుటేనుగు వలె భీముడు తొట్రుపాటు ఏమాత్రం లేకుండగా - నీ సేనను చీకాకు పరచాడు. భీముని శౌర్యధైర్యసాహసాలు చూచి, చారణులు ప్రశంసించారు.

విశేషం: 1.తుంగ= పెద్ద గడ్డికాడలు గల మొక్క. దానిని పడగొట్టేందుకు కుక్కపిల్ల చాలు. ఇక మదపుటేనుగు మాట చెప్పనక్కరలేదు. 2. గగనచరులు= చారణులు. ఆకాశంలో ఒక తెగకు చెందిన దేవతలు సంచరిస్తారని, వారు గొప్ప సహృదయులు అని - గొప్పతనం ఎక్కడ కన్పించినా వారు గుర్తించి దేశదేశాలలో సంచరించి పొగడగలరని - ప్రాచీన భారతీయ సంప్రదాయం.

క. వెఱచఱచి వెగడువడి ని । వ్వెఱఁగందుచుఁ గురుబలంబువీరు లతని డ
గ్గఱ కంతనంతఁ జూడఁగ । నుఱక నదీసుతుఁడు దాఁకె నుద్భటభంగిన్. 223

ప్రతిపదార్థం: వెఱచఱచి= భయపడి; వెగడు+పడి= ఆశ్చర్యమునంది; నివ్వెఱఁగు+అందుచున్= మ్రాన్పడి(మిక్కిలి అచ్చెరువుతో స్తంభించి పోయి); కురు+బలంబువీరులు= కౌరవసైన్యంలోని శూరులు; అతని+డగ్గఱక= భీముడిని సమీపించలేక; అంతన్+అంతన్+చూడఁగన్= దూర దూరమునుండియే చూచుచుండగా; నదీసుతుఁడు= గంగాపుత్రుడు= భీష్ముడు; ఉఱక= లక్ష్యపెట్టక; ఉద్భటభంగిన్= భయంకర రీతితో(అతడిని); తాఁకెన్= ఎదిరించాడు.

తాత్పర్యం: భీమసేనుడి విజృంభణం చూచి కురుసేనలోని వీరులు ఆశ్చర్యచకితులై నివ్వెరపాటుతో అతడిని సమీపించక దూరమునుండియే చూస్తుండగా అప్పుడు సేనాధిపతి అయిన భీష్ముడు వచ్చి, ఉద్రేకంతో భీముడిని లక్ష్యపెట్టక మార్కొన్నాడు.

క. అరదంబురవము సెలఁగఁగ । శరములు వాయుజునిమీఁద సాంద్రముగ వెసం
గురియుచు నడరెడు భీష్ముని । సరభసముగ మాఱుకొనియె సాత్యకి గడిమిన్. 224

ప్రతిపదార్థం: అరదంబు+రవము= రథము యొక్క ధ్వని; చెలఁగఁగన్= మ్రోయగా; వాయుజుని మీఁదన్= భీముడిపై; శరములు= బాణాలు; సాంద్రముగన్= దట్టముగా; వెసన్=వేగముగా; కురియుచున్= ప్రయోగించుచూ; అడరెడు= విజృంభించెడు; భీష్మునిన్ సరభసముగన్= వేగముగా; సాత్యకి; కడిమిన్= పరాక్రమంతో; మాఱుకొనియెన్= తాకాడు.

తాత్పర్యం: భీష్ముడు తన రథధ్వని మ్రోయుచుండగా భీముడిపై దట్టంగా వేగంగా బాణాలు కురిపిస్తూ విజృంభించే భీష్ముడిని పాండవసేనలోని వీరులలో ప్రముఖుడైన సాత్యకి - వేగంగా పరాక్రమంతో ఎదిరించాడు.

వ. ఇట్లెదిర్చినం జూచి. 225

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఎదిర్చినన్= మార్కొనగా; చూచి= వీక్షించి.

తాత్పర్యం: ఈ విధంగా సాత్యకి భీస్మడిని ఎదుర్కొనటం గమనించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అంబరము వగుల నార్చి జ । నంబు వొగడఁ గృష్ణననుజునకు మార్కొని తీ
వ్రాంబకములు పదియింట న । లంబుసుఁడు దదంగకం బులం గీలించెన్. 226

ప్రతిపదార్థం: అంబరము+పగులన్+ఆర్చి= ఆకాశం చిల్లులు పడేటట్లుగా కేకవేసి; జనంబు+పొగడన్= అందరూ ప్రశంసించుతూ ఉండగా; అలంబుసుడు= కౌరవ పక్షంలోని ఒక రాక్షస వీరుడు; కృష్ణ+అనుజునకున్= శ్రీకృష్ణుని తమ్ముడు అయిన సాత్యకికి; మార్కొని= ఎదురొడ్డి; తీవ్ర+అంబకములు= వాడియైన అమ్ములు; పదియింటన్= పది సంఖ్యగలవాటితో; తద్+అంగకంబులన్= ఆతనియొక్క(సాత్యకియొక్క) శరీరమునందలి అవయవాలలో; కీలించెన్= గ్రుచ్చుకొనునట్లు చేశాడు;

తాత్పర్యం: కౌరవ సేనలోని రాక్షసవీరుడు అలంబుసుడు ఆకాశము పగులునట్లు గొప్ప కేకవైచి, అందరూ ప్రశంసించుతుండగా, కృపుని తమ్ముడైన సాత్యకిని ఎదిరించి పది బాణాలు ఆతని అవయవములందు గ్రుచ్చాడు.

వ. ఇవ్విధంబునఁ దాఁకి బెట్టు నొప్పించినం గోపించి. 227

ప్రతిపదార్థం: ఈ+విధంబున్= ఈ రీతిగా; తాఁకి= మార్కొని; బెట్టు= ఎక్కువగా; నొప్పించినన్= బాధింపగా; కోపించి= ఆగ్రహించి.

తాత్పర్యం: ఈ విధంగా అలంబుసుడు మార్కొని మిక్కిలి నొప్పించగా సాత్యకికి కోపం వచ్చి (తరువాతి పద్యంతో అన్వయం).

చ. శినిమనుమండు నద్దనుజు శీఘ్రమ నాలుగు నారసంబులన్
వెనుక కొదుంగఁజేసి పటువిక్రమ మొప్పఁగ నార్చె నార్చినన్
విని కనుగ్రేవఁ గెంపడర వీరరసోద్ధతిఁ జూచి సోమద
త్తునితనయుండు బి ట్టతనితోఁ దలపడ్డ నుతించె సైన్యముల్. 228

ప్రతిపదార్థం: శిని+మనుమండు= శిని అనేయాదవవీరుని మనుమడైన సాత్యకి; ఆ+దనుజున్=ఆ రాక్షసుని; శీఘ్రము+అ= వేగంగా; నాలుగు+నారసంబులన్= నాలుగు బాణాలతో; వెనుకకున్+ఒదుంగన్+చేసి= వెనుకకు తిరుగునట్లు చేసి; పటు, విక్రమము ఒప్పఁగన్= గొప్ప పరాక్రమం విలసిల్లేటట్లుగా; ఆర్చెన్= సింహనాదం చేశాడు; ఆర్చినన్= అట్లా సింహనాదం చేయగా; విని;

కను+క్రేవన్+కెంపు+అడరన్= నేత్రాంచలములు ఎర్రపడగా; వీర రస+ఉద్ధతిన్+చూచి; పరాక్రమోద్రేకముతో వీక్షించి; సోమదత్తుని+తనయుండు= సోమదత్తుడు అను కౌరవవీరుని కొడుకు - భూరిశ్రవుడు; బిట్టు= ఎక్కువగా; అతనితోన్= ఆ సాత్యకితో; తలపడ్డన్= మార్కొనగా; సైన్యముల్= సేనలు; నుతించెన్= ప్రశంసించాయి.

తాత్పర్యం: సాత్యకి నాలుగు బాణాలు ప్రయోగించి, రాక్షస వీరుడైన అలంబుసుని వెనుకకు మరలేటట్లు చేశాడు. చేసి - విజయగర్వంతో సింహనాదం చేశాడు. ఆ సింహనాదం విని, కురువీరులలో ప్రముఖుడు, సుప్రసిద్ధ రథికుడు అయిన సోమదత్తుడి కొడుకు - భూరిశ్రవుడు - కడకన్ను ఎర్రబడగా పరాక్రమోద్రేకంతో చూచి సాత్యకిని మార్కొనగా సేనలు అతడిని స్తుతించాయి.

వ. ఇత్తెఱంగునం దలపడి. 229

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; తలపడి= మార్కొని

తాత్పర్యం: ఈ విధంగా సాత్యకి - భూరిశ్రవుడు ఒకరినొకరు మార్కొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. భూరిశ్రవుండు దొమ్మిది । నారాచము లతనిమేన నాటించిన నా
కౌరవ్యునిఁ బటు విశిఖా । సారంబున ముంచి నొంచె శైనేయుండున్. 230

ప్రతిపదార్థం: భూరిశ్రవుండు= భూరిశ్రవుడు; తొమ్మిది+నారాచములు= తొమ్మిదిబాణాలు; అతని+మేనన్= సాత్యకి యొక్క శరీరమందు; నాటించినన్= గ్రుచ్చుకొనేటట్లు చేయగా; శైనేయుండున్= శినివంశానికి చెందిన సాత్యకియు; ఆ కౌరవ్యునిన్= కౌరవ పక్షానికి చెందిన ఆ భూరిశ్రవుడిని; పటు+విశిఖ+ఆసారంబునన్= పెక్కు బాణాల వర్షంలో; ముంచి= మునుగునట్లు చేసి; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: ఈ విధంగా సాత్యకి, భూరిశ్రవుడు ఒకరినొకరు మార్కొని యుద్ధం చేశారు. భూరిశ్రవుడు తొమ్మిది బాణాలు ప్రయోగించి సాత్యకి శరీరంపై గ్రుచ్చుకొనేటట్లు చేశాడు. సాత్యకి బాణవర్షంలో భూరిశ్రవుని ముంచి నొప్పించాడు.

విశేషం: కురుక్షేత్రం - కురుపాండవుల మధ్య జరిగిన యుద్ధానికి నిలయమేగాక ఇరుపక్షాలలోని వీరులూ - తమ తమ పూర్వ వైరాలను తీర్చుకునేందుకు అవకాశంగా పరిణమించింది. (తదుపరి పలుసారులు సాత్యకి భూరిశ్రవుల మధ్య ద్వంద్వ యుద్ధాలు - చూపరులకు కనులపండువైనవి జరిగాయి. చివరకు - భూరిశ్రవుడు సాత్యకిని ఓడించి - క్రిందపడ చేసి అతడిపైకెక్కి కత్తి గ్రుచ్చే సమయంలో - అర్జునుడు - శ్రీకృష్ణ ప్రేరితుడై భూరిశ్రవుని చేతిని ఖండించాడు. అది ద్వంద్వయుద్ధనీతికి విరుద్ధం. సాత్యకి - క్రిందపడినవాడు లేచి, నిరాయుధుడైన భూరిశ్రవుని సంహరించాడు.

ఉ. ఈసునఁ దానుఁ దమ్ములు నరేంద్రుఁడు గ్రందుగ సౌమదత్తికిన్
బాసట యై కడంగ నట పాండవులున్ హరితమ్ముఁ గూడి పె
ల్లేసిరి వారిపై నధిప! యేడ్తెఱమీఱ బకారి యప్డు సం
త్రాసన భాసురుం డగుచుఁ దాఁకి తెరల్చె భవత్కుమారులన్. 231

ప్రతిపదార్థం: ఈసునన్= కోపంతో; నరేంద్రుఁడు= దుర్యోధనుడును, తానున్+తమ్ములున్= తాను, తమ్ములును; క్రందుగన్= దట్టముగా; సౌమదత్తికిన్= సోమదత్తుని కొడుకునకు(భూరిశ్రవునకు); బాసటయై= సాయమై; కడంగన్= పూనగా; అట= ఆవైపున; పాండవులున్; హరితమ్మున్= కృష్ణుని సోదరుని(సాత్యకిని); కూడి= కలిసి; వారిపైన్= ఆ కౌరవులపై; పెల్లు+ఏసిరి= మిక్కుటముగా

బాణాలు ప్రయోగించారు; అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అప్డు= ఆ సమయంలో; బక+అరి= బకునకు విరోధి (భీముడు); ఏడ్డెఱ+మీఱన్= పరాక్రమం అతిశయింపగా; సంత్రాసన+భాసురుండు+అగుచున్= భయోత్పాతం కలిగిస్తూ ప్రకాశించునట్టివాడై; భవత్+కుమారులన్= నీ కొడుకులను; తాఁకి= మార్కొని; తెరల్చెన్= మరలించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ సమయంలో దుర్యోధనుడు, తమ్ములు కోపంతో యుద్ధంలో చేరి భూరిశ్రవుడికి తోడుగా నిలిచారు. అటు పాండవపక్షంలో పాండవులు - సాత్యకికి సాయంగా నిలిచి, కౌరవులపై మిక్కుటంగా బాణాలు ప్రయోగించారు. భీముడు భయంకర స్వరూపం ధరించి, నీ కుమారులను అందరినీ వెనుకకు పారద్రోలాడు.

విశేషం: భీముడు అని చెప్పటానికి - 'బకారి' అని ఉల్లేఖించటం వలన - అలనాడు ఏకచక్రపురంలో ఒంటరిగా వెళ్ళి బకుడు అనే రాక్షసుని సంహరించిన వృత్తాంతం - భీముని ఏకాంత పరాక్రమం ప్రస్ఫుటమైనది.

దుర్యోధనుఁడు భీముని మార్కొని మూర్ఛఁ బొందించుట (సం. 6-60-7)

ఉ. **తమ్ములు వీఁగినం బతి యుదగ్రత భీము నెదిర్చి యార్చుచుం**
దొమ్మిది యమ్ములం దనువు దూఁటులు సేసిన సూతుఁ బిల్చి వే
గమ్మ రథమ్ముపై కరిగి కన్నుల నిప్పులు రాల నవ్వి యొ
క్కుమ్మడి నాతఁ డేసె నృపు నుగ్రగతిం బది నారసంబులన్. **232**

ప్రతిపదార్థం: తమ్ములు= సోదరులు; వీఁగినన్= యుద్ధమునుండి పారిపోగా; పతి= రాజు(దుర్యోధనుడు); ఉదగ్రతన్= భయంకరముగా; భీమున్= భీముని; ఎదిర్చి= మార్కొని; ఆర్చుచున్= సింహనాదం చేస్తూ; తొమ్మిది+అమ్ములన్= తొమ్మిది బాణాలతో; తనువు= శరీరం; తూఁటులు+చేసినన్= గ్రుచ్చుకొని గాయాలు ఏర్పడేటట్లు చేయగా; సూతున్+పిల్చి= సారథిని పిలిచి; వేగమ్ము+అ= మిక్కిలి తొందరగా; రథమ్ము పైకిన్+అరిగి= తేరునెక్కి; కన్నుల+నిప్పులు+రాలన్= నేత్రాల నుండి విస్ఫులింగాలు రాలునట్లుగా; నవ్వి; ఒక్కుమ్మడిన్= ఏకంగా(ఒకేసారి); ఆతఁడు= భీముడు, నృపున్= రాజును(దుర్యోధనుని); పది నారసమ్ములన్= పది బాణాలతో; ఉగ్రగతిన్= భయంకరంగా; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: తన తమ్ముడు యుద్ధంలో ఓడిపోయి పారిపోగా, దుర్యోధనుడు మాత్రం ధైర్యంగా నిలబడి భీముడిని ఎదిరించి, ఆతడిపై తొమ్మిది బాణాలు ప్రయోగించి ఆతడి శరీరం చిల్లులు పడేటట్లు చేశాడు. అంతట భీముడు కన్నుల నుండి నిప్పులు రాలగా నవ్వి, సూతుని పిలిచి వేగంగా రథాన్ని ఎక్కి, పదిబాణాలు ప్రయోగించి దుర్యోధనుడిని కొట్టాడు.

విశేషం: ఇంతవరకు - భీముడు నేలమీద దిగి - గద పుచ్చుకొని వీరవిహారం చేశాడు. దుర్యోధనుడి తమ్ములు పారిపోయారు. అయితే దుర్యోధనుడు రథియై తనమీద తొమ్మిది అమ్ములు తన శరీరం తూట్లు పడేటట్లు కొట్టగా, ఇక భీముడు గూడ రథం ఎక్కి విల్లు ధరించవలసివచ్చింది.

సీ. **అంతఁబోవక సూతుఁడగు నందకుని మూఁడుశరముల నేసిన ధరణినాథుఁ**
డరువది యమ్ముల నతని నాతనిరథచోదకుం డైనవిశోకు మూఁట
నటిముటి నో నేసి మఱియు నొక్కమ్మున ఘనశరాసనముఁ ద్రుంచినఁ బ్రదీప్త
కోపుఁ డై యొండొక చాపంబు గైకొని యుగ్రభల్లమున వృకోదరుండు

ఆ. విల్లు దునుముటయును వేఱొక్క వింట వ । జ్రంబుఁ బోని నారసంబు దొడిగి
రాజరాజు వెస నురం బాడ నేసిన । మూర్ఛవచ్చి యతఁడు మ్రొగ్గె నధిప! 233

ప్రతిపదార్థం: అంతన్+పోవక= అంతటితో ఆగక; సూతుఁడు+అగు= సారథి అయిన; నందకుని= నందకుడు అను పేరు గల వాడిని; మూఁడు శరములన్= మూడు బాణాలతో; ఏసినన్= కొట్టిన; ధరణినాథుఁడు= రాజు(దుర్యోధనుడు); అరువది+అమ్ములన్= అరవై బాణాలతో; ఆతనిన్= భీముని; ఆతని+రథ+చోదకుండు+అయిన విశోకున్= భీముడి రథాన్ని తోలే విశోకుడిని; మూఁటన్= మూడు బాణాలతో; ఆటిముటిన్= సంభ్రమంతో; నోన్+ఏసి= నాటునట్లుగా ప్రయోగించి; మఱియున్; ఒక్క+అమ్మునన్= ఒక బాణంతో; ఘన+శరాసనమున్= పెద్దవిల్లు; త్రుంచినన్= ఖండించగా; వృకోదరుండు= భీముడు; ప్రదీప్త+కోపుఁడు+ఐ= హెచ్చయిన ఆగ్రహము కలవాడై; ఒండు+ఒక= మరియొక; చాపంబు= విల్లు; కైకొని= పుచ్చుకొని; ఉగ్ర+భల్లమునన్= భయంకరమైన ఈటె బాణంతో; విల్లు; తునుముటయును= ఖండించుటయు; వేఱు+ఒక్క+వింటన్= మరియొక ధనుస్సుతో; వజ్రంబున్+పోని= వజ్రంతో సమానమయిన; నారసంబు= బాణము; తొడిగి= సంధించి; రాజరాజు= దుర్యోధనుడు; వెసన్= వేగంగా; ఉరంబు= వక్షము; ఆడన్+ఏసినన్= నాటేటట్లు ప్రయోగించగా; అతఁడు= భీముడు; అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; మూర్ఛవచ్చి= స్పృహ కోల్పోయి; మ్రొగ్గెన్= వాలిపోయాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీముడు అంతటితో ఊరుకొనక, దుర్యోధనుడి సారథియైన నందకుని మూడు బాణాలతో కొట్టాడు. దుర్యోధనుడు భీముడి రథసారథియైన విశోకుడిని మూడు బాణాలతో కొట్టి, భీముడిపై అరవై అమ్ములు ప్రయోగించాడు. అంతేకాక ఒక బాణం ప్రయోగించి భీముడి విల్లు ఖండించాడు. భీముడు ఆగ్రహించినవాడై వేరొక విల్లు ధరించి, ఒక ఈటె బాణంతో దుర్యోధనుడి విల్లు త్రుంచాడు. రాజరాజైన దుర్యోధనుడు - ఇంకో విల్లు పూని, వజ్రంతో సమానమైన ఒక బాణంతో భీముడి వక్షాన్ని కొట్టాడు. ఆ అమ్ము తాకిడికి - భీముడు స్పృహ తప్పి పడిపోయాడు.

క. కని కడు నలిగి సుభద్రా । తనయుఁడుఁ బాంచాలరాజతనయుఁడు గృష్ణా
తనయులు నొక్కుమ్మడి నీ । తనయునిఁ బొదివిరి పటుప్రదరపుంజములన్. 234

ప్రతిపదార్థం: సుభద్రా+తనయుఁడున్= సుభద్ర కొడుకగు అభిమన్యుడూ; పాంచాలరాజతనయుఁడున్= ద్రుపదపుత్రుడు ధృష్టద్యుమ్నుడు; కృష్ణాతనయులున్= ద్రౌపది కొడుకులు; కని= చూచి(భీముడు మూర్ఛిల్లుట చూచి); ఒక్కుమ్మడిన్= అందరును ఏకమై; నీ+తనయునిన్= నీ కొడుకును(దుర్యోధనుని); పటు ప్రదర పుంజములన్= పెక్కు అమ్ముల సముదాయాలతో; పొదివిరి= చుట్టు ముట్టినారు.

తాత్పర్యం: అభిమన్యుడు, ధృష్టద్యుమ్నుడు, ద్రౌపదీపుత్రులు మూర్ఛపోవటం చూచి, అందరూ ఏకమై నీ కొడుకైన దుర్యోధనుడిపై పెక్కుబాణాలు ప్రయోగించి చుట్టుముట్టారు.

ఉ. అంతకు సేద దేఱి విలయాంతకు నాకృతి భీముఁడేచి దు
ర్దాంతపరాక్రమస్ఫురణఁ దాఁకి నరేంద్రతనూజు శల్యు న
త్యంతరయంబునం బటుశరావలి నొంచిన నీదుసైనికుల్
సెంతలఁ జేర రైరి బలు సింగముఁ గన్న గజంబులట్ల యై 235

ప్రతిపదార్థం: అంతకున్= కొంతసేపటికి; సేద+తేఱి= స్పృహ వచ్చి; భీముఁడు; విలయ+అంతకు+ఆకృతిన్= ప్రళయ కాలమునందలి యముని రూపంతో; ఏచి= విజృంభించి; దుర్దాంత+పరాక్రమ+స్ఫురణన్= ఎదుర్కొనుటకు వీలులేని శౌర్య

ప్రకటనతో; నరేంద్ర తనూజున్= రాజకుమారుడైన; శల్యున్= శల్యుడిని (మద్రరాజును); అతి+అంత+రయంబునన్= మిక్కిలి వేగంతో; పటు+శర+ఆవలిన్= మిక్కుటమగు అమ్ముల సముదాయంతో; నొంచినన్= నొప్పించగా; నీదు+సైనికుల్= నీ భటులు; బలు+సింగమున్= బలముగల సింహాన్ని; కన్న= చూచిన; గజంబులు+అట్ల+ఐ= ఏనుగుల వలె అయి; చెంతలన్+చేరరు+ఐరి= చేరువకు చేరలేకపోయారు.

తాత్పర్యం: కొంతసేపటికి భీముడు మూర్ఛనుండి తేరుకొన్నాడు. తేరుకొని, ప్రళయకాలమందలి యముడివలె విజృంభించి, మిక్కిలి వేగంగా, పరాక్రమం ప్రకటించి శల్యుడిని మార్కొని ఆతడిపై బాణవర్షం కురిపించాడు. నీ సైనికులు భీముడి ధాటికి జంకి, సింహాన్ని చూచిన ఏనుగుల వలె అతడి సమీపానికి వెళ్ళటానికి జంకారు.

విశేషం: అలం: ఉపమ. ప్రాచీన భారతీయ సారస్వతంలో సింహం ఏనుగును సంహరించగల శక్తి గలదని వర్ణింపబడింది. ఈ వర్ణన ఒక కవి సమయంగా పరిణమించింది. అయితే వాస్తవజగత్తులో సింహానికి - ఏనుగును చంపే శక్తి లేదని తేలిపోయింది.

వ. అప్పు డపరాహ్ణం బయ్యెఁ దత్సమయంబున భవత్సూనులు సేనాపతి సుషేణ జలసంధ సులోచనులు భీమ భీమరథ భీమబాహు దుష్ప్రధర్ష దుర్ముఖులును వివిత్సు వికటోగ్రాలోలు పసములు నీ పదునలువురు బహుశరంబు లడరించుచు నతనిం బొదివిన నజ్జరాసంధమర్దనుండు ఘనశార్దూలంబు బాలమృగంబులం గని కవియు చందంబున నెదుర్కొని సేనాపతి శిరంబు భల్లంబునం ద్రుంచి బాణ త్రయంబున జలసంధు నంతకాలయంబున కనిచి సుషేణువక్షస్స్థలంబున వలుఁదనారసంబు నాటించి పడవైచి భీమబాహు నస్త్రపంచకంబునం జంపి యుగ్రునుత్తమాంగంబు వెడఁదవాతియమ్మునం గుండలమ్ములతోఁ గూల్చి భీమ భీమరథుల నొక్కుమ్మడిం బెక్కమ్ములం గూల నేసి నగుచు మిక్కుటమ్మగు నాలుగమ్ముల సులోచనుం గీ టడంగించిన. 236

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయమున; అపర+అహ్ణంబు+ అయ్యెన్= సాయంకాలం అయింది, తద్+సమయంబునన్= ఆ సమయంలో; భవత్+సూనులు= నీ కొడుకులు; సేనాపతి సుషేణ జలసంధ సులోచనులు= భీమ, భీమరథ, భీమబాహు, దుష్ప్రదర్ష దుర్ముఖులును; ఈ+పదునలువురు= ఈ పద్నాలుగు మంది; బహు+శరంబులు= పెక్కుబాణాలు; అడరించుచున్= ప్రయోగించుతూ; అతనిన్+పొదివినన్= అతడిని (భీముడిని) కవియగా; ఆ+జరాసంధ+మర్దనుండు= ఆ జరాసంధుని సంహరించినవాడు, భీముడు; ఘన+శార్దూలంబు= గొప్ప పెద్ద పులి; బాల మృగంబులన్+కని= చిన్న లేడిపిల్లలను చూచి; కవియు+చందంబునన్= మీద పడునట్లుగా; ఎదుర్కొని; సేనాపతి+శిరంబు= సేనాపతియను పేరుగల వాని తల; భల్లంబునన్= ఈటె బాణంతో; త్రుంచి= ఖండించి; బాణత్రయంబునన్= మూడు బాణాలతో; జలసంధున్= జలసంధుడు అనుపేరు గలవానిని; అంతక+ఆలయంబునకున్= యముని గృహానికి; అనిచి= పంపి; సుషేణు+వక్షస్+స్థలంబునన్= సుషేణుని యొక్క ఉరమున; వలుఁద+నారసంబు= పొడుగు పాటి బాణం; నాటించి= గ్రుచ్చుకొనునట్లు చేసి; పడవైచి= కూల్చి; భీమబాహున్= భీమబాహుడు అను పేరు గలవాని; అస్త్రపంచకంబునన్= అయిదు బాణాలతో; చంపి; ఉగ్రు+ఉత్తమ+అంగంబు= ఉగ్రుడు అనువాని తల; వెడఁద+వాతి+అమ్మునన్= విశాలమగు నోరుగల బాణంతో; కుండలమ్ములతోన్= కుండలాలతోపాటు; కూల్చి= సంహరించి; భీమ, భీమరథులన్= భీముడు, భీమరథుడు అను పేరుగల వారిని; ఒక్కుమ్మడిన్= ఏకంగా; పెక్కు+అమ్ములన్= పలుబాణాలతో; కూలన్+ఏసి= చంపి; నగుచున్= నవ్వుచు; మిక్కుటమ్ము+అగు+అ= గొప్పవి అయిన; నాలుగు+అమ్ములన్= నాలుగు బాణాలతో; సులోచనున్= సులోచనుడు అనువానిని; గీటు+అడంగించినన్= సంహరించగా.

తాత్పర్యం: అప్పుడు అపరాహ్ణ సమయం అయింది. ఆ సమయంలో నీ కొడుకులుపదునాలుగు మంది 1. సేనాపతి, 2. సుషేణుడు, 3. జలసంధుడు, 4. సులోచనుడు, 5. భీముడు, 6. భీమరథుడు, 7. భీమబాహుడు, 8. దుష్ప్రధర్షుడు,

9. దుర్ముఖుడు, 10. వివిత్సుడు, 11. వికటుడు, 12 . ఉగ్రుడు, 13. ఆలోలుపుడు, 14. సముడు అనే వారలు పెక్కుబాణాలు భీమునిపై ప్రయోగిస్తూ అతడిని చుట్టుముట్టారు. అంతట జలసంధుడిని సంహరించిన భీముడు, చిన్న లేడిపిల్లల గుంపుపై బడిన పెద్దపులి వలె వారిని అందరినీ ఎదుర్కొన్నాడు. సేనాపతి తల ఒక ఈటె బాణంతో ఖండించాడు. జలసంధుడిని మూడుబాణాలు ప్రయోగించి సంహరించాడు. పొడుగు బాణంతో సుషేణుడి ఉరము చీల్చాడు. అయిదు బాణాలతో భీమబాహుడిని చంపాడు. కుండలాలతో మెరిసిపోయే ఉగ్రుడి శిరస్సును విశాలమగు నోరుగల ఒక బాణంతో కూల్చాడు. పలు బాణాలు ప్రయోగించి భీముడిని, భీమరథుడిని, చంపాడు. అట్లే, గొప్ప బాణాలతో సులోచనుడిని వధించాడు.

క. పెఱవార లధికభీతిన్ । విఱిగి చనిరి భీష్ముఁ డేచి వీరరథికు లం
దఱఁజూచి రాచకొడుకుల । నఱుమాడెడు భీముఁ డిట్లు నడుఁకం దగునే?' 237

ప్రతిపదార్థం: పెఱవారలు= ఇతరులు; అధికభీతిన్= మిక్కుటమగు భయముతో; విఱిగి+చనిరి= ఓడిపోయి పారిపోయారు; భీష్ముఁడు+ఏచి= భీష్ముడు విజృంభించి; వీర+రథికులు+అందఱన్+చూచి= శూరులైన రథికులలో శ్రేష్ఠులను అందరను చూచి; భీముఁడు+ఇట్లు= భీముడు ఈ విధంగా; రాచకొడుకులన్= రాజపుత్రులను; నఱుమాడెడున్= నశింపచేస్తున్నాడు; నడుఁకన్+తగును+ఏ?= మీరు కంపించదగునా?

తాత్పర్యం: భీముడు దుర్యోధనుడి తమ్ములైన రాజపుత్రులను ఆ విధంగా సంహరించటంచేత - ఇతరులు భయపడి పారిపోయారు. సేనాపతియైన భీష్ముడు ముందరకు వచ్చి 'భీముడు రాజపుత్రులను సంహరిస్తూ ఉండగా, రథికులు భయపడి పారిపోవటం న్యాయమా?'

విశేషం: అలం: ఉపమ.

వ. అని పురికొల్పికొని తొడరునట్టియెడ. 238

ప్రతిపదార్థం: అని= పలికి; పురికొల్పికొని= ఉత్సాహం కల్పించి; తొడరు+అట్టి+ఎడన్= మార్కొనే సమయంలో.

తాత్పర్యం: అని సేనలోని వీరులకు ఉత్సాహవాక్యాలు పలికి, సైన్యాన్ని కూడగట్టుకొని ఎదిరించే సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మిగిలి పవమానసుతుపై । భగదత్తుఁడు మత్తగజముఁ బఱపి యతని నా
శుగములఁ బొదవిన నమ్మెయి । మొగిళులు రవిఁ బొదువు దర్పముం దలఁపించెన్. 239

ప్రతిపదార్థం: మిగిలి= అతిశయించి; పవమాన+సుతుపైన్= వాయునందనునిపై(భీమునిపై); భగదత్తుఁడు; మత్త+గజమున్= మదించిన ఏనుగును; పఱపి= తోలి; అతనిన్= భీముని, ఆశుగములన్= బాణాలతో; పొదివినన్= క్రమ్మిన; ఆ+మెయిన్= ఆ రీతి; మొగిళులు= మేఘాలు; రవిన్= సూర్యుని; పొదువు+దర్పమున్= కప్పివేయు ఆటోపమును; తలఁపించెన్= స్మరింపచేసింది.

తాత్పర్యం: భగదత్తుడు భీముడిపై తన మదపుటేనుగును తోలి, బాణాలతో అతడిని ముంచెత్తాడు. ఆ సన్నివేశం మబ్బులు ప్రకాశించే సూర్యుడిని కప్పివేసే విధాన్ని తలపించింది.

విశేషం: అలం: ఉపమ. 1.భీముడు - సూర్యుడివలె ప్రకాశించాడు. అయితే - ఎంతటి సూర్యుడినయినా మబ్బులు క్రమ్మి సూర్యరశ్మి ప్రసరించకుండా చేయగలవు. అనగా సూర్యరశ్మి తగ్గదు గాని - తగ్గినట్లుగా పైకి కనిపిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

2. ఏనుగులను మార్కొనటంలో భీముడు సుప్రసిద్ధుడు. ఏనుగులను రణరంగంలో నడిపించటంలో అనుభవజ్ఞుడు అయిన వృద్ధవీరుడు భగదత్తుడు. (భగదత్తుడి ఏనుగు పేరు సుప్రతీకం. కురుక్షేత్ర సంగ్రామంలో సుప్రతీకం నిర్వహించిన భూమిక చిరస్మరణీయం. భగదత్తుడికి సుప్రతీకానికి గల అవినాభావ సంబంధం మహాభారత పఠితలకు మరవరానట్టిది. చిట్టచివరకు భగదత్తుడి సుప్రతీకాన్ని అర్జునుడు సంహరిస్తాడు.)

చ. కని యభిమన్యుముఖ్యు లవికంపితవృత్తిఁ గడంగి యేసినం
దనువున నెల్ల రక్తజలధారలు గ్రమ్మఁగ వారణేంద్రుఁ డే
పున సెలయేఱు లొక్కమొగి బోరనఁ బెక్కడరంగ లీలఁ గై
కొని ఘనకేళి సల్పు నడగొండగతిన్ సముదగ్రమూర్తి యై. 240

ప్రతిపదార్థం: కని= చూచి (భగదత్తుడు - ఏనుగును భీముడిపైకి తోలటం చూచి); అభిమన్యు+ముఖ్యులు= అభిమన్యుడు మొదలైనవారు; న+వికంపిత వృత్తిన్= చలింపనట్టి నిలకడగల పరాక్రమంతో; కడంగి= పూని; ఏసినన్= బాణాలు ప్రయోగింపగా; వారణ+ఇంద్రుఁడు= ఏనుగులలో శ్రేష్ఠమైన సుప్రతీకం; తనువునన్+ఎల్లన్= శరీరము నందు అంతటా; రక్త జల ధారలు= నెత్తుటి ప్రవాహాలు; ఒక్క మొగిన్= ఒకే విధంగా, ఆగని ధారగా; క్రమ్మఁగన్= వ్యాపింపగా; ఏపునన్= మిక్కుటముగా; సెల+ఏఱులు= కొండవాగులు; బోరనన్= వేగంగా; పెక్కు+అడరంగన్ లీలన్= మిక్కుటముగా అతిశయించే రీతిగా; కైకొని= పూని; ఘన+కేళి+సల్పు= గొప్ప వినోద విహారం చేసే; నడ+కొండ+గతిన్= నడిచేటటువంటి పర్వతం వలె+ సమ్+ఉదగ్ర+మూర్తి+ఐ= మిక్కిలి భయంకరమైన ఆకృతిగలదియై.

తాత్పర్యం: అభిమన్యుడు మున్నగు వీరులు భగదత్తుడి ఏనుగుపై బాణాలు ప్రయోగించారు. భగదత్తుడి ఏనుగు శరీరంపై రక్త ధారలు ప్రవహించాయి. ఆ ఏనుగు - సెలయేళ్ళు స్రవించే నడకొండవలె మిక్కిలి భయంకరంగా భాసించింది.

విశేషం: అలం: ఉపమ.

క. కవిసి బలముఁ జంపఁగఁ బాం। డవ యోధులు నిల్వరించుటకుఁ జాలక ఱీ
చ్చ వడినఁ గని పెల్లుగఁ గౌ। రవ సైన్యము లడరె నుద్ధురస్ఫురణమెయిన్. 241

ప్రతిపదార్థం: కవిసి= మార్కొని; బలమున్+చంపఁగన్= సేనను సంహరింపగా; పాండవ యోధులు= పాండవుల పక్షములోని వీరులు; నిల్వరించుటకున్+చాలక= ఆపుటకు శక్యముగాక; ఱీచ్చ+పడినన్= బ్రాన్పడగా; కని= చూచి; పెల్లుగన్= మిక్కుటముగా; ఉద్ధుర స్ఫురణ మెయిన్= భయంకరత్వం భాసించునట్లుగా; కౌరవ+సైన్యములు= కౌరవుల సేనలు; అడరెన్= విజృంభించాయి.

తాత్పర్యం: భగదత్తుడి ఏనుగు మార్కొని పాండవసేనలను చంపివేసింది. దానిని ఆపుటకు శక్యం కాక పాండవసేనలు బ్రాన్పడగా చూచి భయంకరస్ఫురణ భాసించేటట్లు కౌరవసేనలు విజృంభించాయి.

తే. అప్పు డుబ్బి దుర్యోధనుఁ డతిరయమునఁ। దేరు వఱపించి మారుతిఁ దెగువతోడఁ
గదిసి బలునారసంబు వక్షమున నాట। నొల్లఁ బోవుచు సిడ మతఁ డూఁత గొనియె. 242

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; దుర్యోధనుఁడు= దుర్యోధనుడు; అతి+రయమునన్= మిక్కిలి వేగంతో, తేరు= రథం; పఱపించి= త్రోలి; మారుతిన్= భీముడిని; తెగువతోడన్= సాహసంతో; కదిసి= మార్కొని; బలు+నారసంబు= పెద్దబాణం; వక్షమునన్= ఉరమున; నాటన్= గ్రుచ్చగా; ఒల్లన్+పోవుచు= వ్రాలి పడిపోతూ; సిడము= జెండా(కొయ్య); అతఁడు= భీముడు; ఊఁత+కొనియెన్= ఆధారంగా చేసికొన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో దుర్యోధనుడు తన రథం తోలించి, భీముడిని మార్కొని, పెనుబాణాన్ని అతని ఉరమున నాటాడు. భీముడు ఆ ధాటికి తట్టుకోలేక జెండా కొయ్యను ఆధారంగా చేసికొనవలసి వచ్చింది.

విశేషం: 1.భీముడు దుర్యోధనుడి బాణఘాతానికి తట్టుకోలేక జెండా కొయ్యను ఆధారంగా చేసికొని రథంమీద కూలబడిపోయాడు. తండ్రి దెబ్బతినటం చూచి - కొడుకైన ఘటోత్కచుడు కౌరవసేనను మార్కొని విజృంభించాడు. కురుక్షేత్ర సంగ్రామంలో వీరుల అసాధారణ విజృంభణకు మానసిక హేతువులు తిక్కన చక్కగా నిరూపించాడు. తిక్కన - గొప్ప మనో ధర్మ పరిజ్ఞాత.

వ. అయ్యవసరంబున. 243

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

ఘటోత్కచుండు మాయాబలంబునఁ గౌరవసేనపై విజృంభించుట (సం. 6-68-40)

క. మనసేన పేర్చి పెల్లా। ర్చినఁ జూచి ఘటోత్కచుండు సెలఁగి జనకుఁ జే
కొని 'యిది మాయ ఘటింపఁగ। ననురూపం బైన వేళ' యని తలఁచి వెసన్. 244

ప్రతిపదార్థం: మన+సేన= కౌరవసైన్యం; పేర్చి= అతిశయించి; పెల్లు+ఆర్చినన్= పెద్దకేకలు వేయటం(సింహనాదాలు చేయటం); చూచి; ఘటోత్కచుండు; చెలఁగి+జనకున్+చేకొని= పూని,తండ్రిని చేరి; ఇది= ఈ సమయం; మాయ+ఘటింపఁగన్= విభ్రాంతిని కల్పించటానికి; అనురూపంబు+ఐన+వేళ= తగిన సమయం; అని తలఁచి; వెసన్= వేగంగా.

తాత్పర్యం: కౌరవసేన విజయగర్వంతో సింహనాదాలు చేసింది. ఘటోత్కచుడు వెంటనే తండ్రియైన భీముడిని చేరాడు. 'ఇది 'మాయ' చేసి - కౌరవసేనలను ఓడించటానికి తగిన సమయం' అని అతడు తలపోశాడు.

విశేషం: 1. ఘటోత్కచుడు - హిడింబ అనే రాక్షస వనితకు భీముడి వలన పుట్టిన కొడుకు. రాక్షసులు మాయాఘటన విశారదులు.

2. మాయ= లేనిది ఉన్నట్లుగా భ్రాంతిని కలుగజేయటం

వ. కైలాస శైలాకారంబును జతుర్దంతసారోదారంబును నుద్దామ గమన దుర్వారంబును నగు వారణంబు నెక్కి వజ్రజ్వాలాభీల బాహుదండుం డగుచు నయనసహస్రంబొప్ప నప్పాండవులకుం దోడుపడ నైరావణారూఢుండై యింద్రుండు చనుదెంచె ననుబుద్ధి వైరులకుం బుట్టునట్టుగా నంజనవామనాది దిగ్గజంబు లెట్టెట్టివి యని వినంబడు నాభంగి మత్తేభంబుల నెక్కితక్కటి దిక్పాలురపోలికం దోడి దానవులు గెలంకుల నేతేరం గురుపతిపైఁ దోఁతెంచి యతని కడ్డుపడుభగదత్తుదంతిం బొదివి. 245

ప్రతిపదార్థం: కైలాస+శైల+ఆకారంబును= కైలాసపర్వతము వంటి రూపం కలిగినట్టిదియు; చతుః+దంత, సార+ఉదారంబును= నాలుగు దంతాల బలంతో గొప్పది అయినట్టిదియు; ఉద్దామ గమన+దుస్+వారంబును= గొప్పదైన నడక చేత అడ్డగించుటకు వీలుకానట్టిదయును; అగు= అయిన; వారణంబున్+ఎక్కి= ఏనుగును అధిరోహించి; వజ్ర జ్వాలా+ఆభీల బాహు దండుండు+ అగుచున్= వజ్రపు జ్వాలలవలె భయంకరమైన పెక్కు దండములు గలవాడు అవుతూ; నయన+సహస్రంబు+ఒప్పన్= వేయి కన్నులు విరాజిల్లగా; ఆ+పాండవులకున్; తోడుపడన్= సాయం చేయటానికి; ఐరావణ+ఆరూఢుండు+ఐ= ఐరావతము అను పేరుగల ఏనుగును ఎక్కినవాడై; ఇంద్రుండు; చనుదెంచెన్= వచ్చెను; అను+బుద్ధి= అను అభిప్రాయం; వైరులకున్= శత్రువులకు; పుట్టునట్లు; అంజన - వామన+ఆది+దిక్+గజంబులు= అంజనము- వామనము మున్నగు దిగ్గజాలు; ఎట్టు+ ఎట్టివి+ అని+వినన్+

పడున్+ఆ+భంగిన్= ఏ రీతిగా ఉంటాయని వింటామో ఆ రీతిగా ఉన్న; మత్త+ఇభంబులన్= మదపుటేనుగులను; ఎక్కి; తక్కటి= మిగిలిన; దిక్+పాలుర+పోలికన్= దిక్కులు పరిపాలించే వారి ఆకారముతో; దానవులు= రాక్షసులు; కెలంకులన్= పార్శ్వములందు; ఏతేరన్= రాగా; కురుపతిపైన్= కురురాజైన దుర్యోధనునిపై; తోఁతెంచి= వచ్చి మార్కొని; అతనికిన్+అడ్డుపడు= దుర్యోధనుడికి; తనకు మధ్యగా వచ్చే; భగదత్తు+ దంతిన్= భగదత్తుడి ఏనుగును; పొదివి= మార్కొని.

తాత్పర్యం: కైలాసపర్వతం వంటి ఆకారంతోనూ, నాలుగు దంతాలతోనూ, నిలువరించటానికి వీలుగాని గొప్పనడక తోనూ ఉన్న ఏనుగునెక్కి వజ్రజ్వాలలవలె భయంకరములైన భుజదండములు కలవాడై, వేయికండ్లతో విరాజిల్లుతూ, పాండవులకు సాయపడటానికి ఐరావతదిగ్గజాన్ని ఎక్కి ఇంద్రుడే వచ్చాడేమో అన్న అభిప్రాయం కౌరవులకు కలిగేటట్లు ఘటోత్కచుడు వచ్చాడు. అంజనము, వామనము మొదలైన దిగ్గజాలు ఎట్లా వుంటాయో అట్లాంటి మదగజాలనెక్కి ఇంద్రుని వెంట తక్కిన దిక్పాలకులలాగా తన తోటి రాక్షసులు ఇరువైపులరాగా అతడు దుర్యోధనుని పైకి వచ్చాడు. అతడు దుర్యోధనునికి అడ్డుపడే భగదత్తుడి ఏనుగును ఆక్రమించి (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: ఉపమ. 1. ఐరావతం - ఇంద్రుడి తెల్ల ఏనుగు. 2. దిగ్గజములు: ఎనిమిది అవి: ఐరావతము, పుండరీకము, వామనము, కుముదము, అంజనము, పుష్పదంతము, సార్వభౌమము, సుప్రతీకము.

క. అమ్ముల నేనుఁగు కొమ్ముల । నమ్మత్తగజమ్ము నొంచి యఱిముఱి మనసై
న్యమ్మెల్లఁ జదియఁ బఱచె భ । యమ్మున మొగతిరిగి దిక్కు లద్రువ నొఱలుచున్. 246

ప్రతిపదార్థం: అమ్ములన్= బాణాలతో; ఏనుఁగు+కొమ్ములన్= ఏనుగు దంతాలతో; ఆ+మత్త+గజమ్మున్+నొంచి= ఆ మదపు టేనుగును లొంగదీసికొని; అఱిముఱిన్= వేగంగా; మన+సైన్యమ్ము+ఎల్లన్= మన(కౌరవ) సైన్యం అంతా; చదియన్= నలగగా; భయమ్మునన్= భీతితో; దిక్కులు; అద్రువన్= అదరగా; మొగతిరిగి= వెనుదీసి; ఒఱలుచున్= అరుస్తూ; పఱచెన్= పారిపోయినది.

తాత్పర్యం: ఘటోత్కచుడు బాణాలతో, తన ఏనుగు దంతాలతో, భగదత్తుడి మదపుటేన్గును నొప్పించాడు. మన సైన్యం నలిగిపోగా అది భయంతో దిక్కులు అదిరేటట్టు అరుస్తూ పారిపోయేటట్లు తరిమాడు.

విశేషం: ఈ కంద పద్యంలో 'అద్రువ' నగణమే. తెలుగు ఛందస్సులోని విశేషం ఇది. 'ద్రు' తేల్చి పలకాలి. దీనికి 'శిథిల ద్విత్వం' అని పేరు.

వ. ఇట్లాభీలంబుగా భగదత్తుశుండాలంబుఁ దోలి యురవడించి. 247

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఆభీలంబుగాన్= భయంకరముగా; భగదత్తు+ శుండాలంబున్= భగదత్తుని ఏనుగును; తోలి= పోవునట్లుచేసి; ఉరవడించి= విజృంభించి.

తాత్పర్యం: పై విధంగా భగదత్తుడి మత్తేభాన్ని ఘటోత్కచుడు పారద్రోలి, ఉత్సహించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. దనుజపతి యేచి దుర్యో । ధనుదెస కడరుటయుఁ దత్పితామహుఁ డాచా
ర్యున కిట్లనుఁ హైడింబుఁడు । దనమాయా గర్వమున నుదగ్రుం డయ్యెన్. 248

ప్రతిపదార్థం: దనుజపతి= రాక్షసరాజు(ఘటోత్కచుడు); ఏచి= విజృంభించి; దుర్యోధను+దెసకున్= దుర్యోధనుని వైపునకు; అడరుటయున్= ఉత్సహించుటతో; తద్+పితామహుఁడు= అతడి తాత(భీష్ముడు); ఆచార్యునకున్+ఇట్లు+అనున్= ద్రోణుడితో ఈ విధంగా అన్నాడు; హైడింబుఁడు= హిడింబ కొడుకు(ఘటోత్కచుడు); తన మాయా గర్వమునన్= ఇతరులకు భ్రాంతిని కొలిపే తన శక్తిచేత; ఉదగ్రుండు+అయ్యెన్= భయం కలిగించేవాడు అయ్యాడు.

తాత్పర్యం: ఘటోత్కచుడు విజృంభించి దుర్యోధనుడి వైపు తన దృష్టి ఉత్సాహంతో సారించాడు. భీష్ముడు ద్రోణుడితో ఈ విధంగా చెప్పాడు. "హిడింబ కొడుకు మాయా యుద్ధ విశారదుడు కావున గర్వించి ఇతరులకు భయోత్పాతం కలిగిస్తున్నాడు.'

విశేషం: 1. ఆచార్యుడు అనగా గురువు అని అర్థం. మహాభారతంలో ఆచార్యశబ్దం ద్రోణరూఢం అయింది. ద్రోణుడు కురుపాండవ రాజ పుత్రులకు ధనుర్విద్యాగురువు కాబట్టి.

క. భగదత్తు నెగిచి కౌరవ । జగతీశ్వరుమీఁదఁ గవిసె సరభసవృత్తిం
దగ నడ్డపడక తడయుట । మగఁటిమియే? పొదువవలయు మనుజాశనునిన్. 249

ప్రతిపదార్థం: భగదత్తున్+ఎగిచి= భగదత్తుని తరిమివేసి; కౌరవ+జగత్+ఈశ్వరుమీఁదన్= కౌరవ రాజుమీద(దుర్యోధనునిపై); సరభస+వృత్తిన్= ఆటోపముతో;(ఘటోత్కచుడు);కవిసెన్= మార్కొన్నాడు; తగన్= సరిగా(యథోచితముగా); అడ్డపడక+తడయుట= అడ్డుకోకుండా ఆలసించటం; మగఁటిమి+ఏ?= పౌరుషమా?; మనుజ+అశనునిన్= మనుష్యులను తినేవానిని, రాక్షసుని, ఘటోత్కచుని; పొదువన్ వలయున్= మార్కొనవలెను.

తాత్పర్యం: భగదత్తుని పారద్రోలి, ఈ ఘటోత్కచుడు - కౌరవరాజు అయిన దుర్యోధనుడిపైకి లంఘించాడు గర్వంతో. ఈ రాక్షసుడి విజృంభణ అరికట్టకపోవటం పౌరుషంకాదు. ఈ ఘటోత్కచుడి విజృంభణం ఆపివేయాలి.

చ. తలఁ కెడువాఁడు గాఁడు భగదత్తుఁడు భీమతనూజుతోడ ని
ట్టలముగఁ బోరఁ జాలు నకటా కరి యోరువదేమి సేయు? వి
చ్చలవిడి భూవిభుం గవిసె సామజమున్ వెసనేయుఁ' డంచు జో
దులకును జేయి వీచి మును దోలె నతండు రథంబు బల్విడిన్. 250

ప్రతిపదార్థం: భగదత్తుఁడు= భగదత్తుడు; తలఁకెడువాఁడు కాఁడు= వెనుతీసెడివాడు కాడు; భీమ+తనూజుతోడన్= భీముని యొక్క కొడుకుతో= ఘటోత్కచునితో; నిట్టలముగన్= అధికముగా; పోరన్+చాలున్= యుద్ధం చేయగలడు; అకటా!= అయ్యో!; కరి= ఏనుగు; ఓరువదు= ఓర్చుకోలేదు (తట్టుకోలేకపోయింది.); ఏమి+చేయున్?= భగదత్తుడు ఏమి చేయగలడు?(ఘటోత్కచుడు); భూవిభున్= దుర్యోధనుడిని; విచ్చలవిడిన్= ఎదురులేకుండగా; కవిసెన్= మార్కొన్నాడు; సామజమున్= ఏనుగును(ఘటోత్కచుని ఏనుగును); ఏయుఁడు+అంచున్= బాణాలతో కొట్టండి అని; జోదులకును= యోధులకు; మును= ముందు; చేయి+వీచి= హస్తము ఊపి; అతండు= భీష్ముడు; బల్విడిన్= గొప్ప పరాక్రమంతో - కోపంతో; రథంబు; ; తోలెన్= నడపించాడు.

తాత్పర్యం: భగదత్తుడు మహావీరుడు. ఆతడు ఘటోత్కచుడిని ఓడించగల సమర్థుడే కాని ఆతడి ఏనుగు వెనుకంజ వేసింది. అయ్యో! పాపం అతడేమి చేయగలడు? ఆ అదను చూచుకొని ఘటోత్కచుడు గర్వంతో రాజైన దుర్యోధనుడి మీదికే లంఘించాడు. 'ఆతడి ఏనుగును ఎదుర్కొనండి' అని భీష్ముడు తన వీరులను ఉత్సాహపరిచి రథాన్ని కోపంతో ముందుకు తోలాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఆచార్యప్రభృతులగు రథికవరులునుం గూడికొని కురుభూపతి కడ్డపడి హిడింబానందనుపైఁ గ్రందుకొని వివిధాస్త్రంబులు పరఁగించి రంత నక్కడ నతనికిఁ దోడై యుధిష్ఠిరాది పాండవులును బాంచాలమాత్స్య ప్రముఖదండనాయకులును బ్రతివీరులపై ననేక విశిఖంబులు గురియ నప్పడు పోరు ఘోరంబయ్యెనందు మందాకినీనందనుం డమంద పరాక్రమ క్రీడం గౌంతేయబలంబులం గనుపు గొట్టె నట్టియెడ నా ఘటోత్కచుం డుత్కటోద్దామవిక్రమాభిరాముం డగుచు సింహనాదంబు సేయ బృంహితోదాత్తంబు లైన తదీయ దంతావళంబులు నలిరేఁగి నీ సైన్యంబుల బడలువడం జేసినం గని గాంగేయుండు గుంభసంభవున కిట్లనియె. 251

ప్రతిపదార్థం: ఆచార్య+ప్రభృతులు+అగు= ద్రోణుడు మున్నగు; రథికవరులునున్= రథములపై నెక్కియుద్ధం చేసే శ్రేష్ఠులగు వీరులును; కూడికొని= కలిసికట్టుగా చేరి; కురు+భూపతికిన్= కురురాజుకు(దుర్యోధనునకు); అడ్డుపడి= అడ్డంగా నిలిచి(ఘటోత్కచుని బారినుండి కాపాడుటకై); హిడింబా+నందనుపైన్= హిడింబయొక్క కొడుకుపై(ఘటోత్కచుడిపై); క్రందుకొని= మూగి; వివిధ+అస్త్రంబులు= ఎన్నో విధములైన బాణాలు; పరఁగించిరి= ప్రయోగించారు; అంతన్; అక్కడన్= అక్కడ (అనగా పాండవపక్షంలో); అతనికిన్+తోడై= ఘటోత్కచుడికి బాసటగా నిలిచి; యుధిష్ఠిర+ఆది+పాండవులును= ధర్మరాజు మున్నగు పాండవులును; పాంచాల మాత్స్య ప్రముఖ దండనాయకులును= ద్రుపదరాజు-విరాటుడు మున్నగు సేనాపతులూ; ప్రతివీరులపైన్= శత్రుయోధులపై; అనేక+విశిఖంబులు= పెక్కు బాణాలు; కురియన్= వర్షింపగా; అప్పుడు= ఆ సమయంలో; పోరు= యుద్ధం; ఘోరంబు+అయ్యెన్= తీవ్రంగా భయంకరంగా సాగింది; అందున్= ఆ యుద్ధంలో; మందాకినీ+నందనుండు= గంగకొడుకు(భీష్ముడు); అమంద+పరాక్రమక్రీడన్= తక్కువకాని మిక్కుటమగు యుద్ధం అనే ఆటలో; కౌంతేయ+బలంబులన్= పాండవసేనలను; కనుపు+కొట్టెన్= ఖండించాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ+ఘటోత్కచుండు= ఆ ఘటోత్కచుడు; ఉత్కట+ఉద్దామ+విక్రమ+అభిరాముండు+అగుచున్; మిక్కిలి ఎక్కువైన పరాక్రమంచే అందగించినవాడగుచు; సింహనాదంబు+ చేయన్= సింహము గర్జించునట్లు పెనుకేకవేయగా; బృంహిత+ఉదాత్తంబులు+ఐన ఘీంకార రావములచే గొప్పవైన; తదీయ+దంతావళంబులు= ఆతని(ఘటోత్కచుని) ఏనుగులు; నలిరేఁగి= విజృంభించి; నీ సైన్యంబులన్= నీ సేనలను; బడలుపడన్+చేసినన్= డస్సిపోవునట్లుగా చేయగా; కని= చూచి; గాంగేయుండు= భీష్ముడు; కుంభసంభవునకున్= ద్రోణుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు:

తాత్పర్యం: భీష్ముడు ద్రోణాచార్యుడు మున్నగు రథికులను కలుపుకొని, దుర్యోధనుడికి ఘటోత్కచుడికి మధ్యగా చేరాడు. వారు అందరూ ఘటోత్కచుడిపై పెక్కు బాణాలు ప్రయోగించారు. ఇక, అటు పాండవపక్షంలో ధర్మరాజు మున్నగు పాండవులు, ద్రుపదుడు విరాటుడు మున్నగు సేనాపతులు శత్రువులైన కౌరవులపై బాణవర్షం కురిపించారు. ఆ విధంగా ఘోరయుద్ధం జరిగింది. కౌరవసేనాధిపతి భీష్ముడు పాండవసేనలను చీల్చి చెండాడాడు. అప్పుడు ఘటోత్కచుడు సింహనాదం చేసి విజృంభించాడు. ఆతడి కేకకు ఉప్పొంగిన అతడి ఏనుగులు ఘీంకారాలు చేసి కౌరవసేనలను చీకాకు పరిచాయి. అప్పుడు భీష్ముడు కౌరవసేనల దీనావస్థను గుర్తించి ద్రోణుడితో ఈ విధంగా చెప్పాడు.

విశేషం: 1. బృంహితము= ఏనుగులు చేసే ఘీంకారానికి బృంహితం అని పేరు. 2. కుంభసంభవుడు : కుంభమునందు జన్మించిన వాడు, ద్రోణుడు. శోధన నాళికలలో - శిశువుల ఉత్పత్తి కోసం ప్రయత్నం జరుగుతోంది. కాబట్టి భవిష్యత్ కాలంలో శాస్త్రజ్ఞుల పరిశోధన ఈ విషయంపై కొంత క్రొత్త వెలుగు వెలార్చవచ్చు. 3. తిక్కన పలుచోట్ల - యుద్ధాన్ని క్రీడగా కల్పించటం కద్దు. ఘోరయుద్ధం చేసే ఘటోత్కచుడు - వాస్తవ జగత్తులో రాక్షసస్వరూపుడే ఐనప్పటికి 'పరాక్రమాభిరాముడు' అని తిక్కన వర్ణించాడు. 'ఘోర' సంగ్రామంలో కూడా తిక్కనకు సౌందర్యస్ఫూర్తి కన్పించటం విశేషం. తిక్కన వర్ణననుబట్టి - ఆ మహాకవికి ప్రత్యక్ష రణరంగపరిచయం ఉన్నట్లు గుర్తింపవచ్చు.

క. ' ఈయనతో రణ మిప్పుడు । సేయఁగ మది గొల్ప దస్తశిఖరికిఁ జేరెం
దోయజమిత్రుఁడు నేఁటికిఁ । బోయి మనము వత్త మెల్లిప్రొద్దున ననికిన్.' 252

ప్రతిపదార్థం: ఈయనతోన్= ఘటోత్కచునితో; రణము= యుద్ధం; ఇప్పుడు; చేయఁగన్; మది+కొల్పదు= మనస్సు అంగీకరించటలేదు; తోయజ+మిత్రుఁడు= సూర్యుడు (పద్మములకు స్నేహితుడు); అస్తశిఖరికిన్+చేరెన్= అస్తాద్రికి చేరాడు - అస్తమించాడు; మనము; నేఁటికిన్+పోయి= ఈ దినమునకు వెళ్ళి (యుద్ధం విరమించి); ఎల్లి+ప్రొద్దునన్= రేపు ఉదయం; అనికిన్= యుద్ధానికి; వత్తము= తిరిగి వద్దాం.

తాత్పర్యం: 'ఈ ఘటోత్కచుడితో ఇప్పుడు యుద్ధం చేయటానికి మనస్సు అంగీకరించటంలేదు. సూర్యుడు అస్తమించాడు. నేటికి యుద్ధం విరమించి తిరిగి రేపు ఉదయం మనం యుద్ధం ప్రారంభిద్దాం.'

విశేషం: 1.భీష్ముడు యుద్ధం చాలించటంలో ఆంతర్యం ఉంది. మొదటిది తాత్కాలికంగా ఓటమి నుండి కౌరవసేనను తప్పించవచ్చును. సాయంసమయానికి యుద్ధవిరమణ చేయాలనే ఒప్పందం ఉభయపక్షాలు అంగీకరించినట్టిదే కదా! ఇక రెండవ ఆంతర్యం - సూర్యాస్తమయం తరువాత రాక్షసులకు బలం ఎక్కువౌతుంది. అందుకని వారికి నిశాచరులనే పేరు వచ్చింది.

ఆ. అనిన నట్లకాక యని ధనురాచార్యుఁ । డప్ప డాత్మపక్షమైన రథిక
కోటి కెఱుఁగఁ జెప్పికొని యని సేయుట । నిలిపి తివియఁ బంచె బలము నెల్ల. 253

ప్రతిపదార్థం: అనినన్= అని(భీష్ముడు) చెప్పగా; అట్లు+అ+కాక+అని= సరే అటులే జరుగుగాక అని; ధనుః+ఆచార్యుఁడు= ధనురాచార్యుడు(ద్రోణుడు); ఆత్మ+పక్షము+ఐన= తన పక్షమునకు చెందిన; రథిక+కోటికిన్= వీరులకు; ఎఱుఁగన్+చెప్పికొని= తెలియచేసి; అని+చేయుట= యుద్ధం చేయటం; నిలిపి; బలమున్+ఎల్లన్= సేనను అంతటినీ; తివియన్+పంచెన్= వెనుకకు మరలుటకు ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: భీష్ముని ప్రతిపాదనను ద్రోణుడు అంగీకరించి కౌరవపక్షంలోని వీరులను అందరినీ యుద్ధం నిలుపుదల చేయుమని ఆజ్ఞాపించాడు.

వ. ఇవ్విధంబున. 254

ప్రతిపదార్థం: ఇవ్విధంబునన్= ఈ రీతిగా (తరువాతి పద్యంతో అన్వయం).

క. కౌరవ బలములు దిరిగిన । భేరీ శంఖాది తూర్య భీషణరావో
దారపటు సింహనాద । స్ఫారవిలాసంబు లయ్యెఁ బాండవ బలముల్. 255

ప్రతిపదార్థం: కౌరవ+బలములు= కౌరవసేనలు; తిరిగినన్= తిరోగమించగా(వెనుకకు మరలగా); పాండవ+బలముల్= పాండవులసేనలు; భేరీ శంఖ+ఆది+తూర్య భీషణ+ఆరావ+ఉదార+పటు సింహనాద స్ఫార విలాసంబులు+అయ్యెన్= భేరులు శంఖములు మొదలైన జంత్రవాద్యనాదాలతో, భయంకర నాదాలతో, గొప్పవైన పెక్కు సింహనాదాలతో వ్యాపించిన ఉత్సాహంతో ఉప్పొంగినట్టివి అయ్యాయి.

తాత్పర్యం: కౌరవసేనలు యుద్ధం విరమించి వెనుకంజ వేయగా పాండవసేనలు సంతోష తన్మయత్వంలో మునిగి, భేరులు, శంఖాలు మొదలగు వాద్య నినాదాలలో చెలరేగిన సింహనాదాలతో ఉత్సాహం ప్రకటించాయి.

తే. చిన్నఁబోయి నీకొడుకులు సేయఁగలుగు। దొరలు విడిదల కరిగిరి పరఁగభీమ
సేనుకొడుకు నగ్గించుచుఁ జెలఁగి వారు। చెన్ను సొంపారఁ జని రాత్మశిబిరములకు.' 256

ప్రతిపదార్థం: నీ కొడుకులు= నీ పుత్రులు(దుర్యోధనుడు మున్నగువారు); చిన్నఁబోయి= దీనత్వం చెంది; చేయగలుగు+దొరలు= సమర్థులైన ప్రభువులు; విడిదలకున్= తమ నివాస స్థలాలకు; అరిగిరి= వెళ్ళారు; పరఁగన్= ఒప్పునట్లుగ; భీమసేను+కొడుకున్= భీముడి పుత్రుడగు ఘటోత్కచుడిని; అగ్గించుచున్= ప్రశంసిస్తూ; చెలఁగి= ఉత్సహించి; వారు= పాండవుల సేనలు; చెన్ను+సొంపారన్= అందం అతిశయించేటట్లు; ఆత్మ+శిబిరములకున్= తమ విడిదులకు; చనిరి= వెళ్ళారు;

తాత్పర్యం: నీ కొడుకులు చిన్నబోయి తమ విడిదులకు వీరులతో కలిసి వెళ్ళిపోయారు. ఘటోత్కచుడిని ప్రశంసిస్తూ పాండవ సేనలు తమ తమ శిబిరాలకు వెళ్ళాయి.

వ. అని యిట్లు నాలవనాఁడు ధార్తరాష్ట్రులు దూలపోవుట సెప్పిన విని సంజయునకు నాంబికేయుం డిట్లనియె. 257

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ విధంగా; నాలవనాఁడు= నాలుగవరోజున; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుని కొడుకులు; తూలపోవుట= చిన్నపోవటం; చెప్పినన్+విని; సంజయునకున్; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని నాలుగవ దినం జరిగిన యుద్ధ వృత్తాంతం చెప్పిన సంజయుడితో ధృతరాష్ట్రుడు ఈ రీతిగా అన్నాడు.

చ. ' అనితల నీవు పాండుతనయావలి కెప్పుడు మేలుచేయు నా
తనయులకుం బరాక్రమము తక్కువయుం బ్రకటింప విందు; భీ
ష్ముని గురు శల్యుఁ దక్కఁగల శూరుల నెల్లను వారు సీరికిం
గొన కిటు లింతవా రగుటకుం గత మెయ్యది? నాకుఁ జెప్పుమా.' 258

ప్రతిపదార్థం: అని+తలన్= రణరంగంలో; నీవు= ఓ సంజయా! నీవు; పాండు+తనయ+ఆవలికిన్= పాండురాజు కొడుకుల సముదాయానికి, ఎప్పుడున్; మేలు= ఆధిక్యం; చేయున్= కలిగించటం; నా తనయులకున్+పరాక్రమము+ తక్కువయున్+ప్రకటింపన్= నా పుత్రులకు శౌర్యలోపమూ వెలువరించటం; విందున్= ఆలకిస్తున్నాను; భీష్మునిన్ గురున్ శల్యున్= భీష్ముని- ద్రోణుని-శల్యుని; తక్కన్+గల+శూరులను+ఎల్లను= మిగిలిన యోధులను అందరినీ; వారు= పాండవులు; మేలుచేయన్-మేలుచే(యి) యున్= ఆధిక్యమును; చీరికిన్ కొనక= లెక్కసేయక; ఇటులు= ఈ విధంగా; ఇంతవారు+అగుటకున్ = ఇంత గొప్ప వారు కావటానికి; కతము= హేతువు; ఎయ్యది?= ఏది?; నాకున్+చెప్పుమా= నాకు తెల్లము చేయుము.

తాత్పర్యం: 'యుద్ధరంగంలో నీవు ఎప్పుడూ పాండవుల ఆధిక్యాన్ని, పౌరుష పరాక్రమాలనూ ఎక్కువగా అభివర్ణించి చెప్పటం, నా కొడుకులను తక్కువ చేస్తూండటం వింటున్నాను. ఆ పాండవులు భీష్ముడిని, ద్రోణుడిని, శల్యుడిని తక్కంగల శూరులను ఏ మాత్రం సరకు చేయకుండా విజృంభించటానికి గల కారణం నాకు తేటతెల్లంగా తెలియచేయుము.

క. అనుటయు నాతం డిట్లను । విను మౌషధగుణము మంత్రవీర్యము మాయా
జనితసమగ్రోద్ధతి గా । దనఘా! నీ కేను మున్న యది యెఱిఁగింతున్. 259

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధృతరాష్ట్రుడు చెప్పగా; ఆతండు= సంజయుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; వినుము; ఔషధ+గుణము= మందుల ప్రభావం; మంత్ర+వీర్యము= మంత్రాల బలం; మాయా+జనిత+సమగ్ర+ఉద్ధతి= మాయవలన పుట్టిన గొప్ప ఆధిక్యం; కాదు; అనఘా!= పాపరహితుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; నీకున్; ఏను= నేను; మున్ను+అ= ముందే; అది; ఎఱిఁగింతున్= చెప్పాను.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు అడిగిన ప్రశ్నకు సంజయుడు సమాధానం చెప్పాడు. 'పాపరహితుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాండవుల ఆధిక్యం ఔషధాల మహిమ వలన, మంత్రాల బలం వలన ఉద్భవించింది కాదు ఈ విషయం నేను ముందుగానే నీకు చెప్పాను.

విశేషం: అనఘా!= అనేది మర్యాద తెలిపే సంబోధన. దానిని యథాక్షరంగా వాచ్యార్థంలో స్వీకరించనక్కరలేదు.

ఉ. పాడియు సత్యముం గలరు పాండుతనూజులు నీదుపుత్త్రు ల
ప్పాడికి నోడ; రత్తెఱఁగు పాపము సేయఁగఁ జూచితీవు; న
క్కీడిటు సేయ కే లుడుగు? గెల్వదె ధర్మువు? వారిగెల్పు మీ
యోడుటయున్ ధ్రువంబు విదురోక్తులు వింటిమి గాదె! యేర్పడన్. 260

ప్రతిపదార్థం: పాండు తనూజులు= పాండవులు; పాడియున్= న్యాయము; సత్యమున్+కలరు= సత్యము కలవారు; నీదు+పుత్త్రులు= నీ కొడుకులు; అ+పాడికిన్= ఆ న్యాయానికి; ఓడరు= లోబడరు; ఆ+తెఱఁగు= ఆ రీతిగా; పాపము చేయఁగన్ చూచితి+ఈవు= పాపం చేస్తుండగా నీవు చూస్తూ ఊరకున్నావు; ఆ+కీడు= ఆ పాపం; ఇటు+చేయక= ఈ విధంగా చేయక; ఏల+ఉడుగున్?= ఏ విధంగా ఊరుకుంటుంది?; ధర్మువు= ధర్మం; గెల్వదు+ఎ?= జయింపదా? (జయిస్తుంది); వారి+గెల్పు= వారి(పాండవుల) విజయం; మీ+ఓడుటయున్= మీరు ఓడిపోవటం; ధ్రువంబు= నిశ్చయం; ఏర్పడన్= స్పష్టముగా; విదుర+ఉక్తులు= విదురుని మాటలు; వింటిమి+కాదె!= విన్నాము గదా!

తాత్పర్యం: పాండవులు న్యాయమూ సత్యమూ కల్గినవారు. నీ పుత్రులు న్యాయమునకు లోబడరు. వారు అంతటి పాపం చేస్తుంటే నీవు చూస్తూ ఉండినావు. ఆ పాపం ఇట్లా చేయక ఎందుకుంటుంది? ధర్మంజయించదా? వారుగెలవడం, మీరు ఓడడం నిశ్చయం. విదురుడిమాటలు స్పష్టంగా విన్నాము గదా?

క. నీయడిగిన భంగిన గాం । గేయు నడిగె నట్లు వారు గెలిచి చనిన యా
రేయి కురునాథుఁ; డాతని । కాయన సెప్పినవిధంబు నభివర్ణింతున్. 261

ప్రతిపదార్థం: నీ+అడిగిన+భంగిన్+అ= నీవు ప్రశ్నించిన తీరుగనే; కురునాథుఁడు= దుర్యోధనుడు; గాంగేయున్= గంగకొడుకును(భీష్ముడిని); అట్లు= ఆ విధంగా; వారు= పాండవులు; గెలిచి; చనిన= వెళ్ళిన; ఆ రేయి= ఆ రాత్రి; అడిగెన్= ప్రశ్నించాడు; ఆతనికిన్= ఆ దుర్యోధనునకు; ఆయన= భీష్ముడు; చెప్పిన+విధంబు= చెప్పిన తీరును; అభివర్ణింతున్= వివరించి చెప్పగలను.

తాత్పర్యం: నీవు నన్ను అడిగిన ప్రశ్ననే దుర్యోధనుడు నాలుగవ నాటి యుద్ధం ముగిసిన పిదప, రాత్రి భీష్ముడిని అడిగాడు. భీష్ముడు చెప్పిన సమాధానాన్నే నేను తిరిగి నీకు వివరించి చెప్పుతాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. భీష్ముండు దుర్యోధనున కి ట్లనియెఁ దొల్లియుం బలుమాఱుంజెప్పుదుఁ బాండవులకు వాసుదేవుండు సహాయుండై యుండు నట్లగుట నెయ్యదియు నసాధ్యంబు లే దప్పరమేశ్వరు మహత్త్వం బున్నరూ పెఱింగెడు వారు పెక్కండ్రు లే రెఱింగినవారల కాపదలు లేవు కౌంతేయు లతని నెఱింగి యాశ్రయింతురు నీవు సరకుసేయవు వినుము చెప్పెద మానససరస్సు నుత్తరపర్వతంబు నగ్ర ప్రదేశంబున దేవతామునిగంధర్వాప్సరోగణంబులు గొలువం గొలువుండి కమలసంభవుండు. 262

ప్రతిపదార్థం: భీష్ముండు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్; తొల్లియున్= పూర్వమే; పలుమాఱున్= పెక్కుసారులు; చెప్పుదున్ = చెప్పి యున్నాను; పాండవులకున్; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; సహాయుండు+ఐ= బాసటయై; ఉండున్= ఉంటాడు; అట్లు+ అగుటన్= ఆ విధంగా ఉండటంచేత; ఏ+అదియున్= ఏదీ; అసాధ్యంబు+లేదు= సాధించలేనిది ఉండదు; ఆ+పరమ+ఈశ్వరు మహత్త్వంబు= ఆ దేవుడి గొప్పదనం; ఉన్నరూపు+ఎఱింగెడువారు= నిజము తెలిసికొనేవారు; పెక్కండ్రులేరు= ఎక్కువమంది లేరు; ఎఱింగినవారలకున్= తెలిసినవారికి; ఆపదలు= విపత్తులు; లేవు= ఉండవు; కౌంతేయులు= కుంతి కొడుకులు(పాండవులు); అతనిన్= శ్రీకృష్ణుని; ఎఱింగి; ఆశ్రయింతురు= శరణు పొందుతారు; నీవు= ఓ దుర్యోధనా! నీవు; సరకు+చేయవు= లెక్కపెట్టవు; వినుము; చెప్పెదన్= చెప్పగలను; మానస సరస్సు+ఉత్తర పర్వతంబు= మానస సరోవరం ఒడ్డున ఉత్తర దిక్కున ఉన్న కొండయొక్క; అగ్ర ప్రదేశంబునన్= శిఖరంపై; దేవతా, ముని, అప్సరస్+గణంబులు= దేవతలు, మునులు, అప్సరసల సమూహాలు; కొలువన్= అర్చింపగా; కొలువు+ఉండి= సభ తీర్చి; కమల+సంభవుండు= పద్మం నుండి పుట్టినవాడు= బ్రహ్మదేవుడు.

తాత్పర్యం: భీష్ముడు దుర్యోధనుడికి ఈ విధంగా చెప్పాడు. 'నీకు ఇదివరకే ఎన్నో సారులు చెప్పి ఉన్నాను. పాండవులకు బాసటగా శ్రీకృష్ణుడు ఉన్నాడు. అందుచే వారు సాధించలేనిది ఏదీ ఉండదు. శ్రీకృష్ణుడు పరమాత్మ అవతారం. ఆతడిని తెలుసుకోగలిగిన వారికి విపత్తులు రావు. పాండవులకు ఆతని మహత్తు తెలియును. వారు ఆతడిని శరణు పొందారు. నీవు శ్రీకృష్ణుడిని లెక్కపెట్టవు. నీకు ఒక రహస్యం చెప్పగలను. వినుము. మానస సరోవర తీరంలో ఉత్తర దిక్కున ఉన్న కొండ శిఖరంపై ఒకసారి దేవతలు, మునులు, అప్సరసలు మున్నగువారు కొలువగా బ్రహ్మదేవుడు సభ తీర్చాడు.

విశేషం: 1. మానస సరోవరం : భారతదేశానికి ఉత్తర దిక్కున హిమాలయ పర్వతశ్రేణుల మధ్య ఉన్న ఒక పెద్ద సరస్సు. ప్రస్తుతం - భారతదేశం - టిబెట్టు సరిహద్దులలో ఉంది. తిక్కన కాలంనాటికి అనగా 13వ శతాబ్దం నాటికే గాక సంస్కృత మహాభారత రచనా కాలం నాటికే క్రీస్తుపూర్వం పలు శతాబ్దులకు పూర్వమే మానససరోవరం సుప్రసిద్ధమైన క్షేత్రం. భారతీయుల ప్రాచీన భూగోళ పరిజ్ఞానానికి ఇది ఒక నిదర్శనం. మానససరోవర ప్రాంతం దేవతలకు ఆటపట్టు అని పురాణ కథనం. 2. ఉత్తరదిశ పవిత్రమైనదని ప్రాచీన భారతీయుల పరిగణన. నదులు ఉత్తర వాహినులు అయిన చోటులు పవిత్ర క్షేత్రాలుగా పరిగణింపబడినాయి. బ్రహ్మాండము ఉత్తరదిశగా పయనిస్తున్నట్లు నవీన ఖగోళజ్ఞుల అభిప్రాయం. మానస సరోవరం ఉత్తరాన్నే ఉంది. బ్రహ్మ కొలువుదీర్చిన కొండ మానససరోవరానికి ఉత్తర దిక్కున ఉంది.

తే. మణిగణోజ్జ్వలమైన విమాన మొకటి । యంబరంబునఁ గాంచి సర్వాత్ముఁ డందు
సన్నిహితుఁ డగు టెఱిఁగి హర్షంబు సంభ్ర । మంబుఁ దలకొన లేచి నమస్కరించి. 263

ప్రతిపదార్థం: మణి+గణ+ఉజ్జ్వలము+ఐన= మణుల సముదాయం చేత మిరుమిట్లు గొలిపే; విమానము+ ఒకటి= ఆకాశంలో సంచరించే వాహనము ఒకటి; అంబరంబునన్= ఆకాశమందు; కాంచి= చూచి; సర్వ+ఆత్ముడు= పరమాత్మ(విష్ణుదేవుడు); అందున్= ఆ విమానంలో; సన్నిహితుఁడు+అగుట= ఉండటం; ఎఱిఁగి= తెలిసికొని; హర్షంబు= సంతోషం; సంభ్రమంబున్= తొట్రుపాటును; తలకొనన్= కూడుకొనగా; లేచి= నిలబడి; నమస్కరించి.

తాత్పర్యం: మణులతో దేదీప్యమానంగా ప్రకాశించే విమానం బ్రహ్మదేవుడు ఆకాశంలో ఉండటాన్ని చూశాడు. ఆ విమానంలో పరమాత్మ ఉన్నట్లు తెలిసికొని సంతోషంతో తొట్రుపాటుతో లేచి నిలబడి వందనం సమర్పించి (తరువాతి పద్యంతో అన్వయం).

క. ' లోకోత్పత్తి స్థితి విల । యాకలనవినోద! మునిగణార్చిత! గుణర
త్నాకల్ప! నిర్గుణాత్మక! । శోకభయాపహపదాబ్జ! శుభకరమూర్తీ!' 264

ప్రతిపదార్థం: లోక+ఉత్పత్తి+స్థితి+విలయ+ఆకలన+వినోద!= జగత్తులను సృష్టించటం - రక్షించటం - నాశనం చేయటం అనే క్రియలయందు వినోదం కలవాడా! ముని+గణ+అర్చిత!= ఋషుల సముదాయాల చేత ఆరాధింపబడేవాడా!; గుణరత్న+ఆకల్ప!= గొప్ప గుణములు అనెడి రత్నాభరణములు కలవాడా!; నిర్గుణ+ఆత్మక!= గుణరహిత స్వరూపుడా!; శోక+భయ+అపహ+పద+అబ్జ!= దుఃఖము భయాల నుండి విముక్తి కల్గించే పద్మములవంటి పాదాలు గలవాడా!; శుభకరమూర్తీ!= మంగళకరమైన ఆకారము గలవాడా!

తాత్పర్యం: 'జగత్తులను సృష్టించడం-కాపాడటం- నాశనం చేయటం అనే క్రియలయందు వినోదించేవాడా! ఋషుల సముదాయం చేత ఆరాధింపబడేవాడా! గొప్ప గుణాభరణాలు కలవాడా! గుణరహితమూర్తీ! దుఃఖములను, భయాలను పోగొట్టే పాదపద్మాలు కలవాడా! శుభము కలుగ చేసే ఆకారము గలవాడా!'

విశేషం: 1. పరమాత్మ స్వరూపం గూర్చి వేదాంతులలో తెగని చర్చ - అతడు నిర్గుణుడా? సగుణుడా? తిక్కన పరమాత్మ స్వరూపం 'సగుణము' - 'నిర్గుణము' అని చెప్పి సమన్వయ సంధాతగానే నిలబడ్డాడు. తిక్కన దృష్టిలో సగుణోపాసన - నిర్గుణోపాసన - ఒకే నాణానికి బొమ్మ - బొరుసు వంటివి.

వ. అని మఱియు ననేక ప్రకారంబుల సంస్తుతించి యి ట్లని విన్నవించె. 265

ప్రతిపదార్థం: అని; మఱియున్; అనేక+ప్రకారంబులన్; సంస్తుతించి= పొగడి; ఇట్లు+అని= ఈ రీతిగా; విన్నవించెన్= విజ్ఞప్తి చేశాడు.

తాత్పర్యం: అని, ఇంకా పెక్కు రీతుల ఆ పరమాత్మను ప్రస్తుతించి - ఈ విధంగా విజ్ఞప్తి చేశాడు.

క. ' నారాయణ! నీకేఁ గడు । గారవమునఁ బుట్టి యిజ్జగము లన్నింటిన్
సారమతిం గావించితి । నీ రక్షణ వీని కెల్ల నిలుపై యుండున్. 266

ప్రతిపదార్థం: నారాయణ!= ఓ విష్ణుదేవా!; నీకున్+ఏన్= నీకు నేను; కడున్+గారవమునన్= మిక్కుటమగు గొప్పతనముతో; పుట్టి= ఉద్భవించి; ఈ+జగములు= ఈ ప్రపంచాలు; అన్నింటిన్= అన్నిటినీ; సారమతిన్= గొప్పదనముతో; కావించితి(న్)= ఏర్పాటు చేశాను; వీనికిన్+ఎల్లన్= వీటి కన్నింటికి; నీ రక్షణ= నీవు కాపాడుట; నిలుపు+ఐ+ఉండున్= ఆధారమై ఉంటుంది.

తాత్పర్యం: నారాయణా! నీకు నేను గౌరవంతో పుట్టి ఈ లోకాలనన్నింటినీ సారవంతమైన బుద్ధితో గావించాను. నీ రక్షణ వీటికాధారం, (బ్రహ్మ సృష్టికర్త, విష్ణువు పోషణకర్త కదా!)

క. ఇత్తఱి మనుష్య భువనం । బుత్తలపడుచున్నయది మహోగ్రాసురదు
ర్వృత్తముల నీవు కరుణా । యత్తమతిం బుట్టవయ్య! యదువంశమునన్. 267

ప్రతిపదార్థం: ఈ+తఱిన్= ఈ అదనులో; మనుష్య+భువనంబు= మనుష్యులు ఉండే లోకము, భూమి(భూలోకం); మహా+ఉగ్ర+అసుర+దుస్ వృత్తములన్= మిక్కుటముగ భయంకరమైన రాక్షసుల చెడు పనుల చేత; ఉత్తల పడుచున్న+అది= చీకాకయి పోవుచున్నది; కరుణా+ఆయత్త+మతిన్= దయగలబుద్ధితో కూడినవాడవై; యదు+వంశమునన్= యాదవకులంలో; పుట్టవయ్య!= జన్మింపవయ్యా!

తాత్పర్యం: ఈ సమయంలో భూలోకం రాక్షసులు చేసే చెడ్డపనుల వలన మిక్కిలి కలత చెందినది. నీవు దయచేసి యదువంశంలో జన్మించవయ్యా.

విశేషం: లోకంలో ధర్మం నశించినపుడు - విష్ణుదేవుడు అవతరించి ధర్మ సంస్థాపన చేయగలడని భగవద్గీతా ప్రవచనం. 'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' - అని శ్రీకృష్ణుడు. (భగవద్గీతలో.)

క. నరసఖుఁడ! నీవు సఖుఁడును। నరలోకమునన్ జనించి నానాదైత్యే
శ్వరుల దెసఁ బీడ లుడుపుము। ధరణీభారంబు వాయఁ దాత్పర్యమునన్.' 268

ప్రతిపదార్థం: నర+సఖుఁడ!= 'నరుడు' అనే ఋషికి మిత్రుడా!; నీవున్; సఖుఁడును= మిత్రుడును; నర లోకమునన్= మనుష్యలోకంలో; జనించి; నానా దైత్య+ఈశ్వరుల+దెసన్= పెక్కుమంది గొప్ప రాక్షసుల యొక్క; పీడలు= బాధలు; ధరణీ భారంబు= భూభారము; పాయన్= తొలగునట్లుగా; తాత్పర్యమునన్= తదేకదీక్షతో(నిష్ఠతో); ఉడుపుము= పోగొట్టుము.

తాత్పర్యం: నరుడికి మిత్రుడవైన ఓ విష్ణుదేవా! నీవూ, నీ మిత్రుడితో పాటు భూలోకంలో పుట్టి గొప్ప రాక్షసుల వలని బాధలు పోగొట్టి, భూభారాన్ని తీసివేయవయ్యా.'

వ. అని వేఁడికొని వినతుండయి యద్దేవుని తోడినీడయుం బోని నరనామధేయుం డగు మహాపురుషుం బ్రార్థించిన నన్నారాయణుండునుం గారుణ్యార్ద్రకటాక్షంబున వీక్షించి యట్ల యయ్యెడుం గాక! యని యానతిచ్చి యంతర్ధానంబు సేసిన నక్కొలువువా రెల్ల నచ్చెరువంది. 269

ప్రతిపదార్థం: అని+వేఁడికొని= అని ప్రార్థించి; వినతుండు+అయి= నమస్కరించినవాడై; ఆ+దేవుని తోడి నీడయున్+పోని= ఆ దేవుని వెంట నీడవలె ఉండే; నర నామధేయుండు+అగు= నరుడు అని పేరు గలిగినట్టి; మహా+పురుషున్= గొప్పవాడిని; ప్రార్థించినన్= వేడుకొనగా; ఆ+నారాయణుండునున్= ఆ విష్ణుదేవుడును; కారుణ్య+ఆర్ద్ర+కటాక్షంబునన్= దయతో తడిసిన క్రీగంటి చూపుతో; వీక్షించి= చూచి; అట్లు+అ= అదే రీతిగా (నీవు ప్రార్థించిన తీరుగనే); అయ్యెడున్+కాక!= జరుగుగాక!; అని+ఆనతిచ్చి= అని ఆజ్ఞాపించి; అంతర్ధానంబు+చేసినన్= మాయంకాగా; ఆ+కొలువువారు+ ఎల్లన్= ఆ సభలోని వారు అందరు; అచ్చెరువు+అంది= ఆశ్చర్యం పొంది.

తాత్పర్యం: ఆ విధంగా బ్రహ్మదేవుడు విష్ణుదేవుడిని, ఆతడికి తోడు నీడగా ఉన్న నరుడు అను పేరుగల మహాత్ముని ప్రార్థించాడు. ఆ నారాయణుడు దయతో కూడిన క్రీగంటి చూపులతో బ్రహ్మదేవుడిని చూచి 'సరే - నీ ప్రార్థన ప్రకారమే జరుగుగాక' అన ఆనతిచ్చి, మాయమయ్యాడు. ఆ బ్రహ్మదేవుడిని చూచి కొలువు కూటంలోని వారందరూ ఆశ్చర్యం పొందారు.

క. ' పరమేష్ఠి! నీవు గడుఁ ద। త్పరతను వినయంబు సేసి ప్రార్థించితి వె
వ్వరొకో వీరలు? నావుడు। సరసిరుహాసనుఁడు సెప్పె సంప్రీతిమెయిన్. 270

ప్రతిపదార్థం: పరమేష్ఠి!= ఓ బ్రహ్మదేవుడా!; నీవు; కడున్+తత్పరతను= మిక్కుటమగు నిష్ఠతో; వినయంబు+చేసి= గౌరవం చూపించి; ప్రార్థించితివి= వేడుకొన్నావు; ఎవ్వరు+ఒకో+వీరలు?= వీరు ఎవ్వరు?(ఈ ఇరువురు); నావుడున్= అని (కొలువు వారలు) అడుగగా; సంప్రీతిమెయిన్= మిక్కుటమగు తృప్తితో; సరసిరుహ+ఆసనుఁడు= పద్మం ఆసనంగా కలవాడు, బ్రహ్మదేవుడు; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'ఓ బ్రహ్మదేవుడా! నీవు మిక్కిలి వినయం చూపించి భక్తితో ప్రార్థించిన వారు ఎవరు?' అని కొలువు కూటంలోనివారు ప్రశ్నించగా, మిక్కిలి సంతృప్తితో బ్రహ్మదేవుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

క. ' పరమమును లాదిపురుషులు । నరనారాయణులు వీరు నా కారాధ్యుల్
నరహితముగఁ బ్రార్థించితి । ధరఁ బుట్టుం డనుచు దానిఁ దలకొనిరి దయన్. 271

ప్రతిపదార్థం: పరమ+మునులు= గొప్ప ఋషులు; ఆది+పురుషులు= మొదటినుండీ ఉన్నవారు; నర+నారాయణులు= నరుడును, నారాయణుడును అనువారలు; వీరు; నాకున్= నాకు(బ్రహ్మదేవునకు); ఆరాధ్యుల్= అర్చింప దగినవారు; నర+హితముగన్= ప్రజలమేలు కొరకు; ధరన్= భూమిపై; పుట్టుండు+అనుచున్= జన్మింపుడు అని; ప్రార్థించితిన్= వేడుకొన్నాను; దానిన్= ఆ ప్రార్థనకు; దయన్= కరుణతో; తలకొనిరి= అంగీకరించారు.

తాత్పర్యం: వీరు గొప్ప ఋషులు, వీరు ఆది పురుషులు. నరనారాయణులు. నాకు పూజనీయులు. ప్రజల మేలు కొరకై - వీరిని భూలోకంలో పుట్టుడని నేను ప్రార్థించాను. వారు దయతో నా ప్రార్థన అంగీకరించారు.

క. ఇలఁ గ్రీడగఁ బుట్టిన వీ । రలఁ గేవల మర్త్యులని సరకు సేయనివా
రలు సెడుదు రెఱిఁగి భక్తిం । గొలిచిన వారలకు శుభ మగును వినుఁ డెందున్.' 272

ప్రతిపదార్థం: ఇలన్= భూమిపై; క్రీడగన్= వినోదముగా(ఆటగ); పుట్టిన= జన్మించిన; వీరలన్= వీరిని(శ్రీకృష్ణుని - అర్జునుని); కేవల+మర్త్యులు+అని= పూర్తిగా మానవ మాత్రులు అని; సరకు+చేయనివారలు= లెక్కచేయకుండా ప్రవర్తించేవారు; చెడుదురు= పాడైపోతారు; ఎఱిఁగి= తెలిసి; భక్తిన్= పూజ్యభావంతో; కొలిచిన+వారలకున్= అర్చించిన వారలకు; ఎందున్= ఎచటనైనను; శుభము= మేలు; అగును= కలుగుతుంది; వినుఁడు= ఆలకింపుడు.

తాత్పర్యం: వినండి. భూమి మీద వినోదంగా పుట్టిన వీరిని కేవలం మానవులని లెక్కచేయనివారు చెడిపోతారు. తెలుసుకొని భక్తితో కొలిచిన వారికి ఎచ్చటకైనా శుభం కలుగుతుంది.

వ. అని యెఱింగించి బ్రహ్మ దనలోకంబున కరిగెఁ గొలువువారలు నిజస్థానంబులకుం జని రిక్కడ నీకథ నారదజామదగ్న్యవ్యాసాదులచేత వింటిం దొల్లియు మహామునులు నిన్ను నరనారాయణుతోడి వైరంబు వలవ దని వారించిర కాదే? నీవు మదాంధుండవై మానవైతి వింకనైనను గృష్ణు నాశ్రయించి పాండవులతోడి పొత్తున మెలంగి బ్రదుకుమని చెప్పి భీష్ముం డూరకుండెఁ గౌరవపతియు నప్పలుకులు పెడచెవులం బెట్టె మీరు దగువారు సేయు హితోపదేశంబు లాచరించెదరె?' యని పలికి సంజయుం డమ్మహీపతి కిట్లనియె. 273

ప్రతిపదార్థం: అని+ఎఱింగించి; బ్రహ్మ; తన+లోకంబునకున్= తన భువనమునకు(అనగా సత్యలోకానికి); అరిగెన్= వెళ్ళిపోయాడు; కొలువువారలు= సభలోనివారు; నిజ+స్థానంబులకున్= తాము నివసించే స్థలాలకు; చనిరి= వెళ్ళారు; ఈ+కడన్= ఇక్కడ; ఈ కథ= ఈ వృత్తాంతం; నారద+ జామదగ్న్య వ్యాసాదుల చేతన్= నారదుడు- పరశురాముడు-వ్యాసుడు మున్నగు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వారిచే; వింటిన్; తొల్లియున్+మహా+మునులు= పురాణకాలం నాటి గొప్ప ఋషులు; నిన్నున్; నర+నారాయణులతోడి+ వైరంబు= నరుడితో, నారాయణుడితో శత్రుత్వం; వలవదు+అని= వద్దు; అని వారించిరి+అ+కాదు+ఏ?= అడ్డుకున్నారు గదా; నీవు; మద+అంధుండవు+ఐ= గర్వంచే గ్రుడ్డివాడవై; మానవు+ఐతివి= ఆవైరం విడనాడలేదు; ఇంకన్+ఐనను= ఇకమీదట అయినప్పటికీ; కృష్ణున్+ఆశ్రయించి= శ్రీకృష్ణుని శరణువేడి; పాండవులతోడి+పొత్తునన్= పాండవులతోడి స్నేహంతో; మెలంగి= సంచరించి; బ్రదుకుము= జీవింపుము; అని+చెప్పి; భీష్ముడు; ఊరకుండెన్; కౌరవపతియున్= కౌరవుల రాజును(దుర్యోధనుడును); ఆ+పలుకులు= భీష్ముని మాటలు; పెడ+చెవులన్ పెట్టెన్= నిర్లక్ష్యం చేశాడు; మీరు= మీరు (నీవు, నీ కొడుకులు దుర్యోధనాదులు); తగువారు= తగినవారు; చేయు= చెప్పే; హిత+ ఉపదేశంబులు= మేలైన మాటలు; ఆచరించెదరె?= అనుష్ఠిస్తారా?; అని పలికి; సంజయుండు; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు(ఆ ధృతరాష్ట్రునకు); ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని తెలియజేసి బ్రహ్మ తనలోకానికి పోయాడు. కొలువులోని వారందరూ వారివారిస్థానాలకు వెళ్లారు. ఇక్కడ ఈ వృత్తాంతము నారదుడు, పరశురాముడు, వేదవ్యాసుడు మొదలైన వారిచేత విన్నాను. ఇంతకుముందే నరనారాయణులతో శత్రుత్వం వద్దని నిన్ను మహా మునులు వారించలేదా? నీవు మదాంధుడవై శత్రుత్వాన్ని మానలేదు. ఇకనైనా కృష్ణుని ఆశ్రయించి పాండవులతోటి పొత్తుతో మెలగి బ్రతుకము అనిచెప్పి భీష్ముడు ఊరకున్నాడు. దుర్యోధనుడు ఆ మాటలను నిర్లక్ష్యంచేశాడు. నీవు, నీ కొడుకులు తగినవారు చేసే హితోపదేశాలు ఆచరిస్తారా? అని చెప్పి సంజయుడు ధృతరాష్ట్రుడితో మళ్ళీ ఇట్లన్నాడు.

భీష్ముని పంచమదివసయుద్ధక్రమము (సం. 6-65-1)

క. వేగినఁ గౌరవసేనలు । వేగమ కైసేసి యనికి వెడలెం దీవ్రో
ద్యోగత భీష్ముని మున్నిడి । సాగరములు మేరదప్పచందం బొందన్. 274

ప్రతిపదార్థం: వేగినన్= సూర్యోదయం కాగానే; కౌరవ+సేనలు= కౌరవుల సైన్యాలు; వేగమ= శీఘ్రంగా; కైసేసి= అలంకరించుకొని; తీవ్ర+ఉద్యోగతన్= పెద్ద ప్రయత్నంతో; భీష్ముని+మున్ను+ఇడి= భీష్ముని ముందు పెట్టుకొని; సాగరములు= సముద్రాలు; మేర+తప్పు+చందంబు+ఒందన్= చెలియలికట్టనుదాటి విజృంభించే విధంగా; అనికిన్= యుద్ధరంగానికి; వెడలెన్= వెళ్ళాయి.

తాత్పర్యం: ప్రొద్దు పొడవగానే కౌరవసేనలు అలంకారాలు చేసికొని - భీష్ముడి నాయకత్వంలో సముద్రాలు చెలియలికట్టను దాటి ఉప్పొంగి పొరలేటట్లు యుద్ధానికి సన్నద్ధమై వెళ్ళాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. యుద్ధరంగానికి - భటులు - 'కైసేసి' వెళ్ళేవారని తిక్కన వర్ణిస్తాడు. భటులు యుద్ధానికి వెళ్ళేటప్పుడు 'పెండ్లి కొడుకుల ఆహార్యం' ధరించేవారట. బహుశ : ఇది తిక్కన - తాను ప్రత్యక్షంగా చూచిన సమకాలీన వృత్తం కావచ్చు.

వ. ఇట్లు వెడలి మకరవ్యూహం బమర్చుకొని నిలిచె నంతఁ బాండవులును శ్యేనవ్యూహంబుగా మోహరించి రందు ముఖంబున భీమసేనుండును నయనంబుల ధృష్టద్యుమ్న శిఖండులును శిరంబున సాత్యకియును గంఠంబునం గిరీటియు వామపక్షంబున విరాటద్రుపదులును దక్షిణపక్షంబునఁ గేకయులును వీఁపున నభిమన్యు ద్రౌపదేయులును బుచ్ఛంబున నకులసహదేవసహితుం డయి యుధిష్ఠిరుండును నిలిచి రివ్విధంబున సన్నద్ధంబు లయిన యుభయవ్యూహంబులు మేదురతూర్యనినాదంబులు రోదసీకుహరంబు నిండ నొండొంటిం గదిసిన. 275

ప్రతిపదార్థం: ఇట్లు+వెడలి= ఈ విధంగా వెళ్ళి; మకర+ వ్యూహంబు= మొసలి ఆకారంగా భటులను ఏర్పరచిన పన్నుగడ; అమర్చుకొని+నిలిచెన్= ఏర్పాటు చేసికొని నిలిచాయి; అంతన్= అటుపిమ్మట; పాండవులును= పాండవులుకూడ; శ్యేన+వ్యూహంబుగాన్= డేగ ఆకారంలో; మోహరించిరి= సేనను పన్నారు; అందున్= ఆ వ్యూహంలో; ముఖంబునన్= మొగమునందు; భీమసేనుండును= భీముడును; నయనంబులన్= కన్నుల దగ్గర; ధృష్టద్యుమ్న శిఖండులును= ధృష్టద్యుమ్నుడును శిఖండియు; శిరంబునన్= తలవద్ద; సాత్యకియున్; గండంబునన్= చెక్కిలివద్ద; కిరీటియున్= అర్జునుడును; వామపక్షంబునన్= ఎడమప్రక్కగ (ఎడమరెక్కగా); విరాట+ద్రుపదులును= విరాటుడు, ద్రుపదుడును; దక్షిణ+పక్షంబునన్= కుడిప్రక్క(కుడిరెక్కగా); కేకయులును= కేకయ రాజ్యాధిపతులును; వీఁపునన్; అభిమన్యు+ ద్రౌపదేయులును= అభిమన్యుడును ద్రౌపది యొక్క కొడుకులును; పుచ్ఛంబునన్= తోక దగ్గర; నకులుడు+సహదేవ సహితుండు+అయి= నకులుడును, సహదేవుడును తోడుగా గలవాడయి; యుధిష్ఠిరుండును= ధర్మరాజును; నిలిచిరి= నిలబడ్డారు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; సన్నద్ధంబులు+అయిన= యుద్ధ ప్రయత్నములు చేసికొన్న; ఉభయ+వ్యూహంబులున్= రెండు మోహరములును, (కురుపాండవసైన్య వ్యూహాలురెండూ); మేదుర+తూర్య నినాదంబులు= దట్టమైన బూరాల ధ్వనులు; రోదసీ+కుహరంబు= భూమి ఆకాశాల మధ్యస్థలం; నిండన్= పూర్తిగా వ్యాపింపగా; ఒండు+ఒంటిన్= ఒకదానిని ఒకటి; కదిసినన్= మార్కొనగా.

తాత్పర్యం: కౌరవసేన మొసలి మోహరంగా ఏర్పడింది. పాండవసేన 'డేగ' ఆకారంగా ఏర్పడింది. పాండవవ్యూహంలో- డేగ ఆకృతి పన్నాగంలో భీముడు ముఖస్థానంలో ఉన్నాడు. ధృష్టద్యుమ్నుడు - శిఖండి రెండు కన్నులుగా ఏర్పడ్డారు. సాత్యకి తల అయ్యాడు. కంఠస్థానంలో అర్జునుడు నిలిచాడు. ఎడమరెక్కగా విరాట ద్రుపదులు, కుడి రెక్కగా కేకయులు ఉన్నారు. వీపున అభిమన్యుడు - ద్రౌపదీపుత్రులు నిలిచారు. తోకగా నకుల సహదేవులతో పాటు ధర్మరాజు నిలిచాడు. ఈ విధంగా కురు పాండవ బలాలు యుద్ధమునకు సన్నద్ధములై నిలిచాయి. భూమి ఆకాశం మధ్య భాగాన్ని, తూర్యరావాలు నిండుగా ఆవరించాయి. ఉభయసేనలూ ఒండొంటిని మార్కొన్నాయి.

క. మకరవ్యూహం బనియెడు । మకరాలయ మపుడు దర్పమహిమోజ్జ్వలుఁడై
మకరక్రీడం జండత । మకరాభీలముగఁ జొచ్చె మారుతి యధిపా! 276

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధృతరాష్ట్రమహారాజా!; మారుతి= వాయుపుత్రుడు (భీముడు); మకర+వ్యూహంబు+అనియెడు= మొసలి మొగ్గరము అనే; మకరాలయము= సముద్రము; అపుడు= ఆ సమయంలో; దర్ప+మహిమ+ఉజ్జ్వలుఁడు+ఐ= గర్వాటోపంతో, ప్రకాశించే వాడై; మకర+క్రీడన్= మొసలి వలె ఆడుతూ; చండతన్= తీక్ష్ణతతో; మకర+ఆభీలముగన్= మొసలివలె భయంకరత్వం చూపిస్తూ; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీముడు మకరవ్యూహంలో ఆటోపంగా మిరుమిట్లు గొలిపే గర్వంతో ప్రవేశించి చేరాడు. ఆ మకరవ్యూహం సముద్రం వలె ఉన్నది. సముద్రంలో వినోదించే మొసలివలె భీముడు భయంకర స్వరూపంతో అందులో ప్రవేశించాడు.

ఉ. చొచ్చి పితామహుంగని యిషుప్రచయంబునఁ గప్పె నాతఁడుం
జిచ్చున నేయి వోసినవిశేషము దోఁపఁగ భీము నొంచి ము
చ్చిచ్చున నేర్చునట్టులుగఁ జేసెఁ దదూర్జితసేన నంత వి
వ్వచ్చుఁడు వచ్చి దివ్యశరవర్గనిరర్గళవిక్రమంబునన్. 277

ప్రతిపదార్థం: చొచ్చి= ప్రవేశించి; పితామహున్+కని= భీష్ముడిని చూచి; ఇషు+ప్రచయంబునన్= బాణాల సముదాయంతో; కప్పెన్= ముంచాడు; ఆతఁడున్= ఆ భీష్ముడూ; చిచ్చునన్= అగ్గిలో; నేయి+పోసిన, విశేషము+తోఁపఁగన్= ఆజ్యం పోసినట్టి గొప్పతనం కనిపించేటట్లుగా; భీమున్= భీముడిని; నొంచి= నొవ్వచేసి; తద్+ఊర్జిత+సేనన్= ఆతడి గొప్ప సైన్యాన్ని; ముచ్చిచ్చును+ ఏర్చునట్టులుగన్= మూడు అగ్నులతో దహించేటట్లుగా; చేసెన్; అంతన్= అటు పిమ్మట; వివ్వచ్చుఁడు= అర్జునుడు; దివ్య శర వర్గ నిరర్గళ విక్రమంబునన్= దేవతలకు సంబంధించిన అమ్ముల సముదాయంతో అడ్డులేని పరాక్రమంతో.

తాత్పర్యం: భీముడు కౌరవులు పన్నిన మకర వ్యూహంలోనికి చొరబడి భీష్ముడిని అమ్ముల గుంపుతో కప్పివేశాడు. భీష్ముడు నేయి పోసిన అగ్గివలె ప్రజ్వలించి, పాండవసేనను ముచ్చిచ్చులో ముంచాడు. అప్పుడు అర్జునుడు వచ్చి, దేవతలు తనకు బహూకరించిన బాణాలు ప్రయోగించి, అడ్డులేని పరాక్రమంతో భీష్ముడిని మార్కొన్నాడు.

విశేషం: అలం: ఉపమ. 1. భీముడు - భీష్మునిపై బాణాలు ప్రయోగిస్తే - అది అగ్నిలో ఆజ్యం పోసినట్లు అయింది. భీష్ముడు ప్రజ్వరిల్లాడు. 2. ముచ్చిచ్చు= మూడు అగ్నుల సమాహారం. త్రేతాగ్నులు. 1. ఆహవనీయం - గార్హపత్యం - దక్షిణాగ్ని.

క. **భీష్ముని గర్వం బుడిపి మ । హోష్మలుఁడై కౌరవేంద్రుయోధుల కెల్లన్**
గ్రీష్మాదిత్యుని క్రియ న । ర్చిష్మత్త్వము సూపి యడరె సేనలు దెరలన్. **278**

ప్రతిపదార్థం: భీష్మని+గర్వంబు+ఉడిపి= భీష్ముని మదము పోగొట్టి; మహా+ఉష్మలుఁడు+ఐ= గొప్ప వేడిమి గలవాడై; కౌరవ+ఇంద్రు యోధులకున్+ఎల్లన్= దుర్యోధనుడి వీరులందరకు; గ్రీష్మ+ఆదిత్యుని+క్రియన్= ఎండాకాలపు సూర్యునివలె; అర్చిష్మత్త్వము= మండుటెండ; చూపి=ప్రదర్శించి; సేనలు+తెరలన్= (కౌరవ) సేనలు వెనుకంజ వేయునట్లుగా; అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: అర్జునుడు వచ్చి మార్కొని భీష్ముడిని అరికట్టాడు. మండుటెండవలె ప్రకాశించి, కౌరవవీరుల నందరను వేసవికాలంలో సూర్యుడివలె వేడిమి చూపి, కౌరవసేనలను వెనుకంజ వేసేటట్లు చేసి విజృంభించాడు.

వ. **అట్టియెడ నీకొడుకు గురునిం గదిసి యతని కి ట్లనియె.** **279**

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; నీ+కొడుకు= నీ పుత్రుడు(దుర్యోధనుడు); గురునిన్= ఆచార్యుడిని (ద్రోణుని); కదిసి= చేరి; అతనికిన్= ద్రోణునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో నీ కొడుకు దుర్యోధనుడు - గురువైన ద్రోణుడి దగ్గరకు చేరి ఈ విధంగా అన్నాడు.

తే. **' పట్టి పాలార్చెదరు మీరు పాండుసుతుల । నీవు భీష్ముండు నలిగిన దేవతలకు**
నైన మార్కొనవచ్చునే? సేన నరుఁడు । నొంపఁగా నిట్టు లొప్పరికింపఁ దగునె?' **280**

ప్రతిపదార్థం: మీరు= మీరు పాండుసుతులన్= పాండవులను; పట్టి పాలార్చెదరు= ఉపేక్షిస్తున్నారు; నీవు= ఓ ద్రోణాచార్యా!; భీష్ముండు= భీష్ముడును; అలిగినన్= కోపిస్తే; దేవతలకున్+ఐనన్= వేల్పులకు అయినా; మార్కొనన్‌వచ్చునే?= ఎదిరించసాధ్యం అవుతుందా? సేనన్= సైన్యమును; నరుఁడు= అర్జునుడు; నొంపఁగాన్= చీకాకు పరచగా; ఇట్టులు= ఈ విధంగా; ఒప్పరికింపన్+ తగును+ఎ?= ఉపేక్షింపవచ్చునా?

తాత్పర్యం: ఓ ద్రోణాచార్యా! మీరు (నీవూ, భీష్ముడూ) పాండవులను ఉపేక్షిస్తున్నారు. నీవు భీష్ముడు, కోపిస్తే- మిమ్ము దేవతలు గూడ ఎదిరించలేరుకదా! అర్జునుడు మన కౌరవసేనను చీకాకు పరుస్తూ ఉంటే - మీరు చూస్తూ ఊరకుంటున్నారేమిటి?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని కుంభసంభవుండు గటకటం బడి యతనితో ని ట్లనియె. 281

ప్రతిపదార్థం: అనినన్+విని; కుంభసంభవుండు= ద్రోణుడు; కటకటంబడి= నొచ్చుకొని; అతనితోన్= దుర్యోధనునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని దుర్యోధనుడు పలుకగా మనస్సులో ఎంతో బాధపడి ద్రోణుడు ఈ విధంగా అన్నాడు.

తే. ' ఎన్నఁడును మున్నువారలయేపు నోపఁ। గానమెట్లు సముద్రంబులోన బుఱ్ఱ
వైవఁ గొన్నంత గొనుఁగాక వారిగెల్వ। మాకు శక్యంబె చవిగాని మాటలేల?' 282

ప్రతిపదార్థం: ఎన్నఁడును+మున్ను= మునుపెప్పుడూ; వారల= పాండవులయొక్క; ఏపు= ఆధిక్యం; ఎట్లున్= ఏ విధంగానూ; ఓపన్+కానము= తట్టుకొనటం చూడలేదు; సముద్రంబులోనన్; బుఱ్ఱవైవన్= సొరకాయబుర్రను వేయగా; కొన్నంత+కొను= అందులో పట్టేటంత నీటిని మాత్రమే అది తీసికొనగలదు; కాక; వారిన్+గెల్వన్+మాకున్= మాకు వారిని గెలవటానికి; శక్యంబె?= సాధ్యమా?; చవి+కానిమాటలు+ఏల?= రుచించని పలుకులు ఎందుకు?

తాత్పర్యం: మునుపెన్నడూ పాండవుల ఆధిక్యాన్ని తట్టుకోవడం చూడలేదుగదా! సముద్రంలో ఒకసొరకాయబుర్ర వేస్తే అదిగ్రహించగలిగినంత నీటినే గ్రహిస్తుంది. అంతేగాని సముద్రపు నీటినంతటనీ గ్రహించలేదు. మా శక్తి ఆ పాటిదే. ఈ రుచిలేని మాటలెందుకు?

విశేషం: 'మాకు' 'కానము' అను బహువచన ప్రయోగం ద్రోణుడి మాటలలోనిది - గమనింపదగును. అతడు భీష్ముడినికూడా తనతోపాటు కలిపికొని మాటాడాడు.

క. అనుచు మొన గడచి నడచినఁ। గని పాండుతనూజు సైనికవ్రాతంబుల్
గనుకని విచ్చిన సాత్యకి। యనిలజవం బెసఁగఁ దాఁకె న స్త్రాచార్యున్. 283

ప్రతిపదార్థం: అనుచున్= అని చెప్పుచు; మొన+కడచి+నడచినన్= కౌరవ సేననుదాటి ముందుకు సాగి రాగా; కని= ద్రోణుని చూచి; పాండు తనూజు సైనిక వ్రాతంబుల్= పాండవుల సేనా సమూహాలు; కనుకనిన్+విచ్చిన= చెల్లాచెదరై పోయిన; సాత్యకి అనిల+జవంబు+ఎసఁగన్= వాయు వేగం అతిశయించగా; అస్త్ర+ఆచార్యున్= ద్రోణుని; తాఁకెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా ద్రోణుడు దుర్యోధనునితో పలికి, కౌరవసేనను దాటి ముందరకు రాగా, చూచి పాండవసేనలు తొట్రుపాటుతో చెల్లాచెదరైపోయాయి. అప్పుడు సాత్యకి వాయువేగంతో విజృంభించి ద్రోణాచార్యుడిని మార్కొన్నాడు.

ద్రోణుండు దుర్యోధన ప్రేరితుండై పాండవ సైన్యంబుపైఁ గవియుట (సం-6-65-21)

సీ. తాఁకి యుజ్జ్వల బాణతతి గవియించిన నవ్వుచు బెడిదంపు నారసములు
గురుఁడు శైనేయుపైఁ గురిసిన నొచ్చియుఁ దెరలక యాతండు తీవ్రభంగిఁ
బెనఁగంగఁ జూచి పావని యేచి గురునిపై నిశితాస్త్రసంతతి నించి నొంచె
నంత శల్యుండును శాంతనవుండును నతనికిఁ దోడ్పడి యదరి భీము

ఆ. నేయఁ దొడఁగుటయును నేడ్తెఱ ద్రౌపదే। యులును దానుఁ గవిసి యుగ్రలీలఁ
బటురయంబుమై సుభద్రాసుతుండు దు। ర్వార విశిఖతతుల వారిఁ బొదివె. 284

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తాఁకి= మార్కొని; ఉజ్జ్వల బాణ తతిన్= ప్రకాశించే అమ్ముల సముదాయం; కవియించినన్= ప్రయోగించగా; నవ్వుచున్; బెడిదంపు+నారసములు= గొప్ప బాణాలు; గురుఁడు= ద్రోణుడు; శైనేయుపైన్= సాత్యకిపై; కురిసినన్= అమ్ముల వాన వర్షింపగా; నొచ్చియున్= బాధపడి కూడ; తెరలక= వెనుకంజ వేయక; ఆతండు= సాత్యకి; తీవ్ర+భంగిన్= మిక్కుటముగా; పెనఁగంగన్+చూచి= పోరాడటం చూచి; పావని= భీముడు; ఏచి= విజృంభించి; గురునిపైన్= ద్రోణుడిపై; నిశిత+అస్త్ర+సంతతిన్= వాడియైన అమ్ముల సముదాయాన్ని; నించి+నొంచెన్= నిండించి నొప్పించాడు; అంతన్= అటుపిమ్మట; శల్యుండును శాంతనవుండునున్= శల్యుడును, భీష్ముడును; అతనికిన్= ద్రోణాచార్యునకు; తోడ్పడి= సాయం చేసి; అడరి= విజృంభించి; భీమున్= భీముని; ఏయన్+తొడఁగుటయును= బాణాలు వేయడానికి పూనుకొనగా; ఏడ్తెఱన్= పరాక్రమంతో; ద్రౌపదేయులును= ద్రౌపదీ పుత్రులును; తాను= తాను(అభిమన్యుడు); కవిసి= మార్కొని; ఉగ్ర+లీలన్= భయంకరంగా; పటు+రయంబుమైన్= గొప్ప వేగంతో; సుభద్రా+సుతుండు= అభిమన్యుడు; దుర్వార విశిఖ తతులన్= అడ్డగించటానికి వీలులేని అమ్ముల సముదాయంతో; వారిన్= వారిని(ద్రోణుడిని, భీష్ముడిని, శల్యుడిని); పొదివెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: సాత్యకి ద్రోణుడిని మార్కొని, వెలుగొందే అమ్ములు అతడిపై గుప్పించాడు. ద్రోణుడు సాత్యకి సాహసానికి నవ్వుకొంటూ గొప్ప బాణంతో అతడిని కొట్టాడు. సాత్యకి దెబ్బతిని కూడా జంకకుండా యుద్ధం చేయటం గమనించి - భీముడు అతడికి సాయం చేయటానికి వెళ్ళాడు. వెళ్ళి ద్రోణుడిపై వాడిబాణాలు కురిపించాడు. అంతట భీష్ముడు, శల్యుడు ద్రోణాచార్యుడికి బాసటగా నిలిచి, భీముడిని మార్కొన్నారు. అప్పుడు భీముడికి బాసటగా ద్రౌపదీసుతులూ అభిమన్యుడూ వచ్చి వాడిబాణాలు ద్రోణుడిపైనా - అతనికి బాసటగా నిల్చిన భీష్మునిపైనా, శల్యుడిపైనా ప్రయోగించారు.

విశేషం: తిక్కన మనఃఫలకంపై - కురుక్షేత్ర సంగ్రామ క్రమం హత్తుకొనినట్లుగా కన్పిస్తుంది - అతడు చేసిన యుద్ధవర్ణనను బట్టి. భీష్మ - ద్రోణ - కర్ణపర్వాలలో ఎచ్చట చూచినా - చెప్పినది చెప్పక - ఒక్కచోటగూడా తబ్బిబ్బు లేకుండగా తిక్కన - చదువరుల కన్నులకు కట్టినట్లుగా వర్ణించడం - గుర్తింప దగినట్టి విశేషం.

చ. **కడువడితోడ నప్పుడు శిఖండి ధనుర్గుణ నిస్వనంబు పె**
ల్లడరఁగ బాణజాలము వియత్తటిఁ గప్పఁగ నీదు సైన్యముల్
సుడివడ భీష్ముఁ దాఁకుటయుఁ జూచి మనంబున నాఁటదానితోఁ
బొడుతునె? యంచు మార్కొనక పోయెఁ దొలంగి యతండు భూవరా! **285**

ప్రతిపదార్థం: భూవరా!= ఓ మహారాజా; కడువడితోడన్= మిక్కిలి వేగంతో; అప్పుడు= ఆ సమయంలో; శిఖండి; ధనుస్+గుణ+నిస్వనంబు= విల్లుయొక్క అల్లెత్రాటి మ్రోత; పెల్లు+అడరఁగన్= ఎక్కువగా విజృంభింపగా; బాణ జాలము= అమ్ముల గుంపు; వియత్+తటిన్= ఆకాశ ప్రదేశాన్ని; కప్పఁగన్= కప్పగా; నీదు+సైన్యముల్= నీ సేనలు; సుడి+పడన్= గుండ్రముగా తిరుగగా; భీష్మున్= భీష్ముడిని; తాఁకుటయున్= మార్కొనుట; చూచి= పరికించి; మనంబునన్= మనస్సులో; ఆటదానితోన్= ఆడుదానితో(స్త్రీతో); పొడుతునె?= ఎదుర్కొంటానా?; అంచున్= అని అంటూ; అతండు= భీష్ముడు; తొలంగి పోయెన్= దూరంగా తొలగి వెళ్ళాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అప్పుడు శిఖండి మిక్కుటమగు వేగంతో, తన వింటినారితో పెద్ద రొద చేస్తూ, ఆకాశం అంతా తన బాణాలతో కప్పుతూ వచ్చి నీ సేనలు సుడిపడేటట్లు చేస్తూ భీష్ముడిని మార్కొన్నాడు. 'ఒక ఆడదానితో నేను యుద్ధం చేస్తానా?' అని తన మనస్సులో భావించి, భీష్ముడు తొలగిపోయాడు.

క. **కనుఁగొని కురుపతి యాచా । ర్యునిఁ బురికొలుపుటయు నాతఁ డుద్దామగతిం**
జని కడిమి మెఱయ నుజ్జ్వల । ఘనమార్గణపుంజముల శిఖండిఁ దెరల్చెన్. **286**

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; కురుపతి= కురురాజు(దుర్యోధనుడు); ఆచార్యునిన్= గురుని(ద్రోణుని); పురికొల్పుటయున్= ప్రోత్సహించగా; ఆతఁడు= ద్రోణుడు; ఉద్దామగతిన్+చని= భయంకరమైన రీతిగా వెళ్ళి; కడిమి+మెఱయన్= పరాక్రమము వెలుగొందగా; ఉజ్జ్వల ఘన మార్గణ పుంజములన్= ప్రకాశమానములైన గొప్పవైన బాణముల సముదాయంతో; శిఖండిన్= శిఖండిని; తెరల్చెన్= మరలునట్లు చేశాడు.

తాత్పర్యం: శిఖండితో యుద్ధం చేయటానికి ఇష్టంలేక - భీష్ముడు వెళ్ళిపోవటం చూచి, దుర్యోధనుడు ద్రోణాచార్యుడిని పురికొల్పాడు. ద్రోణుడు పరాక్రమం ప్రకాశించగా, భయంకరంగా వెళ్ళి, వెలుగొందే అమ్ముల సముదాయం ప్రయోగించి శిఖండిని మరలించాడు.

క. అమ్మెయిఁ గౌరవులును ద । ర్ప మ్మలరఁగఁ జెలఁగుటయును బాండవబలముల్
సమ్ముఖమునఁ దలఁపడినను । సమ్మర్దం బుగ్ర మయ్యె సంగ్రామమునన్. 287

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆరీతిగా; కౌరవులును= కౌరవులు కూడా; దర్పమ్ము+అలరఁగన్= గర్వము విలసిల్లగా; చెలఁగుటయును= ఒప్పుటయును; పాండవ బలముల్= పాండవులసేనలు; సమ్ముఖమునన్+తలపడినను= ప్రత్యక్షంగా మార్కొనటం చేత; సంగ్రామమునన్= యుద్ధమందు; సమ్మర్దంబు= సంకులత్వం; ఉగ్రము+అయ్యెన్= భయకరం అయింది.

తాత్పర్యం: ఆ రీతిగా కౌరవులు కూడా దర్పంగా యుద్ధం చేశారు. పాండవ సేనలు వారిని ఎదిరించాయి. ఇక ఘోరమైన సంకుల సంగ్రామం చెలరేగింది.

క. ధూళుల మేఘంబులుఁ గర । వాలాదినిశాతహేతివర్గాంశుతటి
న్మాలయు గుణరవగర్జలుఁ । గీలాలపువృష్టికిం దగియె నట్టియెడన్. 288

ప్రతిపదార్థం: ధూళుల మేఘంబులు= దుమ్ములు అనే మబ్బులు; కరవాల+ఆది నిశాత హేతి వర్గ అంశు తటిత్+మాలయున్= కత్తులు మొదలైన వాడియైన కత్తుల సమూహాల కాంతులు అనే మెరుపు తీగల దండ; గుణ రవ గర్జలున్= విల్లుకు కట్టిన అల్లె త్రాటి మ్రోతలు అనే (మేఘ) గర్జలు; కీలాలపు+వృష్టికిన్= రక్తము అనే వర్షానికి; అట్టి+ఎడన్= ఆ సమయంలో; తగియెన్= తగినట్టిదిగా కన్పించింది.

తాత్పర్యం: రణరంగంలో చెలరేగిన దుమ్ములే మబ్బులు, కత్తులు మొదలయిన వాడియైన ఆయుధాల నుండి వెలువడే ధగద్ధగలే మెరుపు తీగల దండలు. అల్లెత్రాటి మ్రోతలే మేఘగర్జనలు. ఇక - నెత్తుటి వర్షం కురియటానికి అప్పుడు- అంతా తగినట్లుగా ఉంది.

విశేషం: అలం: రూపకం. కీలాలపు వృష్టి - శ్లిష్టరూపకం. 1. కీలాలము= అనగా నెత్తురు అని ఒక అర్థం. రెండవ అర్థం నీరు. నెత్తురు వాననీరు మాదిరిగా కురవటానికి ఈ సంగ్రామం రంగంగా ఏర్పడింది.

క. ప్రోవులు గట్టిన గుఱ్ఱపుఁ । బ్రేవులు నేనుఁగుల తఱచుఁబీనుంగులు ర
క్తావిలత వెల్లచీరలుఁ । గావులు నై భటనికాయకాయంబులునై. 289

ప్రతిపదార్థం: ప్రోవులు+కట్టిన= గుట్టలుగా ఏర్పడిన; గుఱ్ఱపు+ప్రేవులు= అశ్వాల రక్తనాళాలు; ఏనుఁగుల+తఱచు+పీనుంగులు= ఏనుగుల దట్టమైన మృతకళేబరాలు; రక్త+ఆవిలతన్= రక్తంతో కూడు కొనటంచేత; వెల్ల+చీరలున్= తెల్ల వస్త్రాలు; కావులును+ఐ= కాషాయపు రంగుతో కూడినవై; భట నికాయ కాయంబులును+ఐ= భటుల సముదాయాలయొక్కశరీరాలు అయి.

తాత్పర్యం: గుట్టలుగా పడిపోయాయి గుర్రాల ప్రేవులు. ఏనుగుల మృతకళేబరాలు దట్టంగా కూడుకున్నాయి. తెల్లని వస్త్రాలు నెత్తుటిలో తడిసి జేగురు రంగువిగా మారిపోయాయి. అట్లే భటసముదాయాల శరీరాలు కూడా పడి ఉన్నాయి.

క. సమరాంగణంబు కడుఘో । రముగా నిరువాఁగుఁ బోరురభసంబున ది
క్సమితి వడఁకాడెఁ బొగడెడు । నమరులయులి వడరెఁ జదల నతినిబిడముగాన్. 290

ప్రతిపదార్థం: సమర+అంగణంబు= రణరంగం(పొలికలను); కడున్= మిక్కిలి; ఘోరముగాన్= భయంకరముగా; ఇరువాఁగున్= రెండు పక్షాలు(కౌరవ,పాండవసేనలు); పోరు+రభసంబునన్= యుద్ధంచేసే ఉద్రేకంలో; దిక్+సమితి= దిక్కుల సముదాయం; వడఁకు+ఆడెన్= కంపించింది; చదలన్= ఆకాశమునందు; అతి నిబిడముగాన్= మిక్కిలి దట్టముగా; పొగడెడు= ప్రశంసించే; అమరుల+ఉలివు= వేల్పుల మాటల సవ్వడి; అడరెన్= అతిశయించింది.

తాత్పర్యం: కురుపాండవులు ఇరుపక్షాలు పోరుతున్నప్పుడు రణరంగం మిక్కిలి భయంకరంగా మారింది. దిక్కులు కంపించాయి. చారణుల ప్రశంసాగీతాలతో ఆకాశం మారుమ్రోగింది.

విశేషం: అమరుల ఉలివు= దేవతల ప్రశంసా నినాదం, లోకోత్తరమైన ప్రతిభ-పరాక్రమం ప్రదర్శించినపుడు వేల్పులు - చారణులు ఉప్పొంగిపోయి ప్రశంసాగీతాలు పాడుతారట! ఇది హృదయంగమమైన కవి సమయంగా ప్రాచీన భారతీయ సాహిత్యంలో అవతరించి కన్పిస్తుంది.

క. అనిలజభీష్ములు దమతమ । మొనలకుఁ గన్నాకు లగుచు మునుకొని వడి న
ర్జునకుంభసంభవుల ప్రా । పునఁ జూపిరి విక్రమంబు భూరిబలంబున్. 291

ప్రతిపదార్థం: అనిలజ+భీష్ములు= భీముడు, భీష్ముడు; తమ+తమ+మొనలకున్= తమ తమ సేనలకు; కన్నాకులు+అగుచున్= నాయకులు అగుచు; మునుకొని= ముందున కేగుదెంచి; వడిన్= వేగముగా; అర్జున+కుంభసంభవుల+ప్రాపునన్= అర్జునుడు-ద్రోణుడు తోడ్పడగా; విక్రమంబు= పరాక్రమం; భూరి+బలంబున్= మిక్కుటమగు శక్తిని; చూపిరి= ప్రదర్శించారు.

తాత్పర్యం: భీముడు, భీష్ముడు తమ తమ సేనలకు నాయకత్వం వహించారు. భీముడికి, అర్జునుడు సాయం చేశాడు. భీష్ముడికి ద్రోణుడు తోడైనాడు. వారు ఇరువురూ తమ పరాక్రమం - గొప్పబలం చూపించి పోరాడారు.

విశేషం: అలం: యథాసంఖ్యం.

క. భీమునిదెసఁ గాళింగో । ద్దామగజానీక సంగతత్వస్ఫురణా
భీమగతిం దఱిమెం గురు । భూమీశుఁడు భీష్మగురులు పోరెడు బలిమిన్. 292

ప్రతిపదార్థం: భీష్మగురులు= భీష్ముడును, ద్రోణుడును; పోరెడు+బలిమిన్= యుద్ధం చేసేటప్పుడు ఏర్పడిన బలముతో; భీమునిదెసన్= భీముడివైపునకు; కాళింగ+ఉద్దామ+గజ+అనీక+సంగతత్వ+స్ఫురణా+భీమ+గతిన్= కళింగదేశానికి సంబంధించిన భయంకరమైన ఏనుగుల గుంపు కలయికతో ఏర్పడే భయోత్పాతంతో; కురు+భూమీశుఁడు= కురురాజు(దుర్యోధనుడు); తఱిమెన్= భీముని మార్కొన్నాడు.

తాత్పర్యం: భీముడు, అర్జునుడు ఒకవైపు, వారికి ఎదురుగా భీష్ముడు, ద్రోణుడు పోరాడుతున్నారు. ఆ సమయం చూచి, అది మంచి అదను అని ఎంచి దుర్యోధనుడు భీముడిని మార్కొన్నాడు. కళింగ మత్తేభ యూథాలు భీముడిపై

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక్కుమ్మడి పైబడి యుద్ధం చేయటం పరిపాటి. ఒక్క దుర్యోధనుడు ఆ మత్తేభయూథాల సంకుల శక్తిని మేళవించికొని భీముడిపై దాడి చేశాడు.

చ. అతిమురిఁ నీ కుమారవరు ల। త్తఱి నందఱు నాబకారిపై
నుఱక రథంబులం బఱప నుజ్జ్వలశైలము మేఘబృందముల్
గిఱికొనఁ గప్పిన ట్లయినఁ గ్రీడి గుణస్వన ముల్లసిల్ల నే
డ్తెఱ విశిఖప్రతాప మనుతీవ్రసమీరము నేపు సూపినన్. 293

ప్రతిపదార్థం: అతిమురిన్= సంభ్రమంతో; నీ+కుమారవరులు= నీ పుత్రరత్నములు(నీ కొడుకులలో శ్రేష్ఠులు, గొప్పవారైన నీ పుత్రులు); అందఱున్= అందరునూ; ఆ+తఱిన్= ఆ సమయమున; ఆ+బక+అరిపైన్= ఆ భీమునిపై; ఉఱక= లక్ష్యపెట్టక; రథంబులన్= రథాలను; పఱపన్= తోలగా; ఉజ్జ్వల శైలమున్= ప్రకాశించే కొండను; మేఘ+బృందముల్= మబ్బులగుంపులు; గిఱికొనన్= కూడి; కప్పినట్లు+అయినన్= క్రమ్మినట్లుగా కాగా; క్రీడి= అర్జునుడు; గుణ+స్వనము+ఉల్లసిల్లన్= అల్లెత్రాటి మ్రోత విలసిల్లగా; ఏడ్తెఱన్= పరాక్రమంతో; విశిఖ+ప్రతాపము+అను= బాణాల పరాక్రమం అనే; తీవ్ర+సమీరము+ఏపు+చూపినన్= గొప్ప గాలి విజృంభణ ప్రదర్శించగా.

తాత్పర్యం: దుర్యోధనుడు భీముడిని తాకటం తోడనే నీ కుమారులు అందరూ రథాలను తోలి భీముడిని మార్కొన్నారు. కొండను మబ్బుల దొంతర ఆవరించినట్లయింది. అప్పుడు అల్లెత్రాటిని మ్రోగించి, అర్జునుడు వేగమైన గాలి ఏపు వంటి అమ్ముల సముదాయం ప్రయోగించాడు.

విశేషం: అలం: ఉపమ రూపకం. భీముడు కొండవలె నిలిచాడు. దుర్యోధనుడు, అతడి తమ్ములు మబ్బులవలె ఆ కొండను క్రమ్మారు. అర్జునుడు పెనుగాలి వంటి బాణాలు ప్రయోగించాడు. పెనుగాలి వీచేటప్పుడు చెలరేగే ధ్వనివలె - అర్జునుని వింటినారి మ్రోత (గుణధ్వని) వినిపించింది.

క. ఆరథనివహంబులు న। వ్వారణములుఁ దెరలి మరలి వడిఁ బఱచుటయుం
గౌరవబల మెల్లను రణ। శూరుఁడు గాంగేయుమఱువు సొచ్చె వికలమై. 294

ప్రతిపదార్థం: ఆ+రథ+నివహంబులు= ఆ తేరుల గుంపులు; ఆ+వారణములు= ఆ ఏనుగులు; తెరలి+మరలి= వెనుదిరిగి; వడిన్= వేగంగా; పఱచుటయున్= పారిపోవటంచేత; కౌరవ+బలము+ఎల్లను= కౌరవసేన అంతా; వికలము+ఐ= చీకాకు చెంది; రణ శూరుఁడు= యుద్ధం చేయుటలో వీరుడైన; గాంగేయు+మఱువు+చొచ్చెన్= భీష్ముడి వెనుకకు చేరింది.

తాత్పర్యం: కౌరవ సైన్యంలోని ఆ రథాలు, ఏనుగులు అన్నీ వెనుకంజ వేసి వేగంగా పారిపోయాయి. ఇక మిగిలిన కౌరవసేన అంతా చీకాకై చిట్టచివరకు రణశూరుడూ, సేనాపతీ అయిన భీష్ముడి వెనుకకు చేరి నిలిచింది.

వ. ఇట్లు సేన మొగతిరిగినం గని సుయోధనుండు బరవసంబునం బురికొల్పి చేయి వీచుచు నగ్గలిక నడచినం గాంభోజ గోపాల సింధుగాంధార సౌవీర త్రిగర్త కళింగ ప్రముఖ బలసంగతు లై శకుని సైంధవులు దుశ్శాసనుం బురస్కరించికొని యురవడించి భీమపార్థులం బొదివిన ధర్మనందనుండు వెన్నుదన్నియదల్చినం జేది కాశకరూశపాంచాల సైన్యంబులతో ధృష్టద్యుమ్నపురోగములగు రథికముఖ్యులు గడంగి కవిసి రప్పడు విందానువిందులు గాశిరాజును సైంధవుండు భీమసేనుని వికర్ణుండు సహదేవునిఁ జిత్రసేనుండు శిఖండిని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుర్యోధనుండు విరటునిఁ ద్రిగర్తులు నకులుని ద్రోణుండు చేకితానసాత్యకులను గృపహార్దిక్యులు ధృష్టద్యుమ్నుని సౌభద్రుండు సాల్వకేకయులను ధృష్టకేతుఘటోత్కచులు నీకొడుకులం దలపడిరి యుధిష్ఠిరుండు దాను మద్రేశ్వరుందాఁకె నిట్లు సంకులసమరం బైన నస్త్రశస్త్ర సంఘట్టనంబున వెడలుమంటలు మింట నడరి మధ్యాహ్నప్రచండంబు లై యున్న చండకిరణుకిరణంబుల మగిడింప నరదంబులు దాఁకి పడి పొరలు కరులును కరిహస్తాకర్షణవిధ్వస్తంబు లగు రథంబులును దురగఖురపుటవిఘట్టితగాత్రు లగు పదాతులును బదాతి వర్గానర్గళప్రహారధారాళ రక్తసిక్తంబు లగు ఘోటకంబులు నై చూచుఖేచరులకు వెక్కసం బయ్యె నట్టియెడ. 295

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; సేన= సైన్యం; మొగతిరిగినన్= వెనుకకు మరలటం చేత; సుయోధనుండు; బరవసంబునన్+పురికొల్పి= ధైర్యంతో ప్రోత్సహించి; చేయి+వీచుచున్= హస్తం ఇటునటు త్రిప్పుతూ - ప్రోత్సహిస్తూ; అగ్గలికన్= శౌర్యంతో; నడచినన్; కాంభోజ గోపాల సింధు గాంధార సౌవీర త్రిగర్త కళింగ ప్రముఖ బలసంగతులై= కాంభోజము గోపాలము - సింధువు - గాంధారము; సౌవీరము- త్రిగర్తము కళింగము మున్నగు దేశాలకు సంబంధించిన సేనలతో కూడినవారై; శకుని సైంధవులు= శకుని సైంధవులు; దుశ్శాసనున్= దుశ్శాసనుని; పురస్కరించికొని= ముందు పెట్టుకొని; ఉరవడించి= విజృంభించి; భీమ, పార్థులన్= భీముడిని, అర్జునుడిని; పొదివినన్= మార్కొనగా; ధర్మనందనుండు; వెన్ను+తన్ని+అదల్చినన్= వెనుకనుండి ప్రోత్సహించగా; చేది, కాశ, కరూశ, పాంచాల+సైన్యంబులతోన్= చేది - కాశ - కరూశ - పాంచాల దేశాలకు సంబంధించిన సేనలతో; ధృష్టద్యుమ్న+పురస్+గములు+అగుచున్= ధృష్టద్యుమ్నుని ముందు పెట్టుకొని కదలిన వారగుచు; రథికముఖ్యులు= వీర శ్రేష్ఠులు; కడంగి= పూని; కవిసిరి= మార్కొన్నారు; అప్పుడు; వింద+అనువిందులు; కాశీరాజును సైంధవుండు; భీమసేనుని వికర్ణుండు, సహదేవుడిని చిత్ర సేనుండు; శిఖండిని దుర్యోధనుడు; విరటుని; త్రిగర్తులు; నకులుని ద్రోణుండు; చేకితాన సాత్యకులను= చేకితానుని మరియు సాత్యకిని; కృప, హార్దిక్యులు= కృపుడు, హార్దిక్యుడు(కృతవర్మ); ధృష్టద్యుమ్నుని సౌభద్రుండు= అభిమన్యుడు; సాల్వ, కేకయలను= సాల్వుని కేకయులను; ధృష్టకేతు ఘటోత్కచులు= ధృష్టకేతుడు, ఘటోత్కచుడును; నీ కొడుకులన్= నీ కుమారులను; తలపడిరి= మార్కొన్నారు; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; తాను; మద్రేశ్వరున్= శల్యుని; తాఁకెన్= ఎదిరించాడు; ఇట్లు; సంకుల+సమరంబు+అయినన్= సందడి యుద్ధం జరుగగా; అస్త్ర+శస్త్ర+సంఘట్టనంబునన్= మంత్రబాణాలు బాణాల ఒరపిడి చేత; వెడలు+మంటలు= ఏర్పడిన అగ్నిజ్వాలలు; మింటన్= ఆకాశమందు; అడరి= విజృంభించి; మధ్యాహ్న+ప్రచండంబులై+ఉన్న= పట్టపగలు తీక్ష్ణంగా వెలుగొందే; చండకిరణు+కిరణంబులన్= సూర్యుడి కిరణాలను; మగిడింపన్= పారద్రోలగా; అరదంబులున్= రథాలును; తాఁకి= స్పృశించి; పడి+పొరలు= నేలమీదపడి ఇటునటు కదలు; కరులును= ఏనుగులును; కరి హస్త+ఆకర్షణ+విధ్వస్తంబులు+అగు= ఏనుగుల తొండాలచే ఆకర్షింపబడి - చెడిపోయిన రథంబులును; తురగ ఖుర పుట విఘట్టిత గాత్రులు+అగు= గుర్రాల గిట్టలచే త్రొక్కబడిన కళేబరాలు గల; పదాతులును= కాలి భటులును; పదాతి వర్గ+అనర్గళ ప్రహార ధారాళ రక్త సిక్తంబులు అగు= కాలిభటుల సమూహాల యొక్క ఎడతెగని దెబ్బలచే బాగుగ కారిన నెత్తురుతోతడిసిన; ఘోటకంబులున్+ఐ= గుర్రాలును అయి; చూచు; ఖేచరులకున్= ఆకాశంలో సంచరించే వేల్పులకు; వెక్కసంబు+అయ్యెన్= మిక్కిలిదుస్సహమైంది; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: కౌరవసైన్యం వెనుకకు మరలింది. దుర్యోధనుడు ధైర్యంతో ముందుకు వచ్చి, చేయి ఊపి - తన సేనకు ప్రోత్సాహం కల్పించాడు. శకుని - సైంధవుడు సింధు గాంధార సౌవీర త్రిగర్త కళింగాది దేశాల సేనలను తరలించుకొని వచ్చారు. వారు దుశ్శాసనుడి నాయకత్వంలో భీముడిని, అర్జునుడిని మార్కొన్నారు. ధర్మరాజు - చేది కాశ కరూశ పాంచాల సైన్యాలను ప్రోత్సహించగా, ధృష్టద్యుమ్నుడు ఆ సేనలకు నాయకత్వం వహించాడు. ఆ సంగ్రామంలో విందానువిందులు - కాశీరాజును సైంధవుడు - భీమసేనుడిని వికర్ణుడు, సహదేవుడిని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చిత్రసేనుడు, శిఖండిని - దుర్యోధనుడు, విరాటుడిని - త్రిగర్తులు, నకులుడిని - ద్రోణుడు, చేకితాన సాత్యకులను - కృపుడు - కృతవర్మ, ధృష్టద్యుమ్నుడిని - అభిమన్యుడు, సాల్వుడిని, కేకయులను - ధృష్టకేతువు, ఘటోత్కచుడు - కౌరవరాజు పుత్రులను కృతవర్మ యుధిష్ఠిరుడు - శల్యుడిని ఎదిరించి యుద్ధం చేశారు. ఈ విధంగా సంకుల సమరం మధ్యాహ్నం వరకు సాగింది. అస్త్రశస్త్రాల తాకిడి వలన రేగిన మంటలు పట్టపగలు ప్రకాశించే సూర్యుని వేడి కిరణాలను మరపింప చేశాయి! ఇక - రథాలను తాకి, నేలకు ఒరిగిన ఏనుగుల పీనుగులు, ఏనుగుల తొండాల తాకిడికి నుగ్గునుగ్గు అయిన తేరులు - గుర్రాల గిట్టల సందుల నలిగి చచ్చిపోయిన కాలి భటులు - కాలిభటుల తాకిడికి ఆగకుండా కారిన నెత్తురు ధారలలో పొరలే గుర్రాలు - ఆకాశంలో చరిస్తూ చూచే వేల్పులకు దుస్సహంగా కనిపించాయి.

విశేషం: ఇంతటి సంకుల సమరంలో కూడా - ఉభయ పక్షాలలోని వీరులూ తమ ప్రతివీరులను ఎన్నుకోవటంలో గల నేర్పు గమనింపదగినట్టిది. ఉదాహరణకు ధర్మరాజు శల్యుడిని మార్కొన్నాడు.

క. భీముని పోరుట గడును । ద్దామం బై మెఱయుటయుఁ బితామహుఁడు శర
స్తోమవిదారితుఁ జేసె మ । హామర్షోత్కర్షుఁ డగుచు నతనిం బెలుచన్. 296

ప్రతిపదార్థం: భీముని పోరుట= భీముని యొక్క పోరాటం; కడున్= మిక్కిలి; ఉద్దామంబు+ఐ= భయంకరమై; మెఱయుటయున్= ప్రకాశించటంచేత; పితామహుఁడు= తాతగారు(భీష్ముడు); అతనిన్= భీముని; పెలుచన్= మిక్కుటముగా; మహా+అమర్ష+ఉత్కర్షుఁడు+అగుచున్= మిక్కుటమగు కోపముచే విజృంభించిన వాడు అగుచు; శర స్తోమ విదారితున్ చేసెన్= బాణముల చేత గాయములు పొందినవాడినిగా చేశాడు.

తాత్పర్యం: భీముడి పోరాటం మిక్కిలి భయంకరంగా సాగింది. భీష్ముడికి మిక్కుటమైన కోపం వచ్చి విజృంభించి- భీముడిపై పెక్కు బాణాలు ప్రయోగించి అతని శరీరం తూట్లు పడేటట్లు చేశాడు.

విశేషం: భీష్ముడికి పాండవులమీద ప్రేమ ఉంది. అయితే భీముడికి భీష్ముడిపై ఏమంత ప్రేమలేదు. అందుచే లోకువ చేసి భీముడు విజృంభించి భీష్ముడిని లెక్కచేయలేదు. ఇక - భీష్ముడికి కోపం వచ్చింది. అతడు ప్రేమాభిమానాలు ప్రక్కకు నెట్టి - భీముని గాయపరచాడు. భీష్ముడు అంతపని చేస్తాడని ఎవరూ ఊహించలేదు. సాత్యకికి పట్టరాని కోపం వచ్చింది.

క. కనుఁగొని సాత్యకి యేనుం । గునకు సిడులు సూపినట్లు కోపంబున భీ
ష్మునిమీఁదఁ గవిసి యుజ్జ్వల । సునిశిత భల్లంబు లేసె సురలు నుతింపన్. 297

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి(భీష్ముడు భీముడిని గాయపరచటం చూచి); సాత్యకి; ఏనుంగునకున్= ఏనుగును; సిడులు+చూపినట్లు= బరికోలలు చూపినట్లు; కోపంబునన్= ఆగ్రహంతో; భీష్మునిమీఁదన్= భీష్ముడిమీద; కవిసి= మార్కొని; ఉజ్జ్వల సునిశిత భల్లంబులు= ప్రకాశమానమైన వాడియైన ఈటె బాణాలు; సురలు= దేవతలు; నుతింపన్= ప్రస్తుతింపగా; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: తాతయైన భీష్ముడు - భీముడిపై - మనుమడు అనే అభిమానం ఏమాత్రం లేకుండా వాడి బాణాలు ప్రయోగించి అతని శరీరాన్ని తూటులు పడేటట్లు చేయటం చూచేసరికి సాత్యకి ఒళ్ళుమండిపోయింది. బరికోల చూసిన ఏనుగువలె ఆతడు భీష్ముడిపై - దేవతలు ప్రస్తుతింపగా, గొప్ప వాడి బాణాలు గుప్పించాడు.

విశేషం: అలం: ఉపమ. ఏనుగునకు సిళ్ళు చూపినట్లు . సిళ్ళు అనగా ఏనుగును పొడిచే బరిగోల. సిళ్లు చూస్తే - ఏనుగు రెచ్చిపోతుంది. ఈ ప్రయోగంలోని సారస్యం గమనింపదగినట్టిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. అలిగి యతఁడు సూతుతలఁ దెగనేసిన । నధిప! వృష్ణివీరునరద మిట్టు
నట్టుఁ దిగిచె నప్పు డాకుల గతి ఘోట । కములుఁ దద్బలంబు గలఁగఁ బడఁగ. 298

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అతఁడు= భీష్ముడు; అలిగి= కోపించి; సూతు+తలన్= సాత్యకి యొక్క సారథి తలను; తెగన్+ఏసినన్= తెగేటట్లు బాణం ప్రయోగింపగా; వృష్ణి+వీరు+అరదము= వృష్ణివంశానికి చెందిన వీరుని రథం-సాత్యకి తేరు; అప్పుడు; ఆకుల+గతిన్= కలత చెందిన రీతిగా; ఘోటకములు= గుర్రాలు; తద్+బలంబున్= సాత్యకి సేన; కలఁగన్+పడఁగన్= చీకాకు చెందగా; ఇట్టున్+అట్టున్= ఇటు అటు; తిగిచెన్= మరలిపోయింది;

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! భీష్ముడు కోపంతో సారథి తలను త్రుంచగా సైన్యం కలత చెందింది. భయంతో గుర్రాలు సాత్యకి రథాన్ని అటూ ఇటూ ఈడ్చాయి.

క. మరలుపుఁడు పట్టుఁ డిట తెం । డరదమునకు వేగవేగ యడ్డము సనుఁ డా
తురుఁ డయ్యెను సాత్యకి సె । చ్చెరఁ జొరుఁ డనునులివు వారిసేనఁ జెలంగెన్. 299

ప్రతిపదార్థం: మరలుపుఁడు= మరలించండి; పట్టుఁడు= పట్టుకోండి; ఇటు+తెండు= ఇక్కడకు తీసికొనిరండి; అరదమునకున్= తేరుకు; వేగవేగ= శీఘ్రంగా; అడ్డము+చనుఁడు= అడ్డంగా నిలవండి; సాత్యకి= సాత్యకి; ఆతురుఁడు+అయ్యెను= ఆపన్నుడు అయినాడు; చెచ్చెరన్= వేగంగా; చొరుఁడు= లోపలికి వెళ్ళండి; అను+ఉలివు= అనే ధ్వని; వారిసేనన్= పాండవసేనలో; చెలంగెన్= వ్యాపించింది.

తాత్పర్యం: 'సాత్యకి ఆపదలో చిక్కుకొన్నాడు. అతడిని ఆదుకోండి; రథాన్ని మరలించండి; పట్టుకోండి; ఇక్కడకు తీసికొనిరండి. అతడి రథానికి అడ్డం నిలవండి. వేగంగా లోపలికి చొరబడండి' అనే అరుపులు పాండవసేనలో వినిపించాయి.

తే. వికలరథుఁడగు నావృష్ణివీరు మీఁద । నేయ నొల్లక మీ తండ్రి యెసక మెసఁగ
బాహుబలమునఁ బాండవవ్యూహవిదళ । నంబు సేయఁ దొడంగె భూనాథముఖ్య! 300

ప్రతిపదార్థం: భూనాథముఖ్య!= ఓ రాజ శ్రేష్ఠుడా, ధృతరాష్ట్ర మహారాజా!; వికల+రథుఁడు+అగు= పాడైపోయిన తేరు గలవాడగు; ఆ+వృష్ణి+వీరుమీఁదన్= సాత్యకిమీద; ఏయన్+ఒల్లక= బాణాలు ప్రయోగించటానికి ఇష్టంలేక; మీ+తండ్రి= భీష్ముడు; ఎసకము+ఎసఁగన్= విజృంభించి; బాహు+బలమునన్= పరాక్రమ శక్తితో; పాండవ+వ్యూహ+విదళనంబు= పాండవులు పన్నిన మొగ్గరమును ఖండించటం; చేయన్+తొడంగెన్= సలుపసాగాడు.

తాత్పర్యం: రాజులలో శ్రేష్ఠుడైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!, విరథుడైన సాత్యకి మీద బాణాలు వేయడం ఇష్టపడక, నీ తండ్రియైన భీష్ముడు విజృంభించి పాండవులు పన్నిన వ్యూహాన్ని భుజ బలంతో ఛేదింపసాగాడు.

విశేషం: విరథుడిపై ఆయుధ ప్రయోగం చేయటం వీరమర్యాద కాదు. జగదేకవీరుడు కౌరవ సేనాపతియైన భీష్ముడు- ఆ వీర మర్యాద పాటించటం చేత సాత్యకి సజీవుడై బయటపడ్డాడు.

క. అంత విరాటుఁడు లయకా । లాంతకుఁడుం బోలెఁ బేర్చి యతిరభసమునన్
శాంతనవుఁ గదిసి యేసెం । గుంతీసుతు లలర మూఁడు క్రూరాస్త్రములన్. 301

ప్రతిపదార్థం: అంతన్= పిదప; విరాటుఁడు= విరాటరాజు; లయకాల+అంతకుఁడున్+పోలెన్= ప్రళయకాలము నందలి యమునివలె; అతి+రభసమునన్= మిక్కుటమగు ఆటోపంతో; పేర్చి= అతిశయించి; శాంతనవున్= శంతనుకొడుకును(భీష్ముని);

కదిసి= మార్కొని; కుంతీసుతులు= కుంతీపుత్రులు(పాండవులు); అలరన్= సంతోషించగా; మూఁడు+క్రూర+అస్త్రములన్= మూడు క్రూరములైన మంత్రబాణాలను;ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: పిదప - విరాటరాజు ప్రళయ సమయంలో యముడివలె విజృంభించి - మిక్కుటమైన సంరంభంతో తాకి - పాండవులు సంతోషించేటట్లుగా మూడు ఘోర బాణాలు భీష్ముడిపై ప్రయోగించాడు.

క. ఏసి తురంగంబుల నో। నేసినఁ గోపించి భీష్ముఁ డిషుదశకమునం
జేసె నతని రక్తజలో। ద్భాసితగాత్రుఁడుగ రెండుబలములుఁ బొగడన్. 302

ప్రతిపదార్థం: ఏసి=వేసి; తురంగంబులన్= గుర్రాలను; నోన్+ఏసినన్ = నొచ్చునట్లుగా కొట్టగా; కోపించి= ఆగ్రహం చెంది; భీష్ముఁడు= భీష్ముడు; ఇషు+దశకమునన్= పది బాణాలతో; రక్తజల+ఉద్భాసిత+గాత్రుఁడుగన్= రక్తధారలతో మిక్కుటంగా ప్రకాశించే శరీరంగలవాడిగా; రెండు+బలములున్= ఉభయసేనలు (కౌరవుల సేనలు+పాండవుల సేనలు); పొగడన్= ప్రశంసించేటట్లుగా; అతనిన్= విరాటరాజును; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: విరాటుడు భీష్ముడి గుర్రాలను నొప్పింపగా, ఆయనకు కోపం వచ్చింది. ఆయన విరాటుడిపై పది బాణాలు గుప్పించి, అతడి శరీరంపై రక్తధారలు ప్రకాశించేటట్లు బాణాలు ప్రయోగించాడు. భీష్ముడి శరప్రయోగ విన్యాసం చూచి, కౌరవ సేనలే గాక పాండవ సేనలు కూడా ప్రశంసించాయి.

వ. అట్టి యెడ. 303

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అప్పుడు.

శా. గంగానందనుఁ దాఁక నర్జునుఁడు వోఁగా నడ్డమై రాజు మె
చ్చం గేలీగతి యుల్లసిల్లఁ జని యశ్వత్థామ షడ్బాణవి
ద్ధాంగుం జేసెఁ గిరీటి నవ్వుచుఁ దదీయంబైనచాపంబు ద్రుం
చెం గోదండము వే ఱొకండు గొని యేసెన్ ద్రౌణి పె క్కమ్ములన్. 304

ప్రతిపదార్థం: గంగా+నందనున్= గంగకొడుకును(భీష్ముని); తాఁకన్= మార్కొనుటకు; అర్జునుఁడు= అర్జునుడు; పోఁగాన్= వెళ్ళగా; అడ్డమై= అడ్డుపడుటకు; రాజు= దుర్యోధనుడు; మెచ్చన్= ప్రశంసించేటట్లుగా; కేలీ+గతి= ఆటరీతి; ఉల్లసిల్లన్= శోభిల్లగా; చని= వెడలి; అశ్వత్థామ= అశ్వత్థామ; షట్+బాణ విద్ధ+అంగున్+చేసెన్= ఆరు బాణాలు గ్రుచ్చుకొన్న దేహం గలవానినిగా; చేసెన్= చేశాడు; కిరీటి= అర్జునుడు; నవ్వుచున్; తదీయంబు+ఐన= ఆతని; చాపంబు= విల్లు; త్రుంచెన్= ఖండించాడు; ద్రౌణి= ద్రోణుని కొడుకు; వేఱు+ఒకండు= ఇంకొక; కోదండంబు= విల్లు; కొని= గ్రహించి; పెక్కు+అమ్ములన్= అనేక బాణాలను; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: భీష్ముడిని మార్కొనేటందుకు అర్జునుడు వెళ్ళుతుండగా - ప్రభువైన దుర్యోధనుడు సంతోషించేటట్లుగా; మధ్యలో అశ్వత్థామ అతడిని మార్కొని, ఆరు బాణాలు ప్రయోగించాడు. ఆ ఆరుబాణాలూ అర్జునుడి శరీరంపై గ్రుచ్చుకొన్నాయి. అయితే నవ్వుతూ, అశ్వత్థామ యొక్క విల్లును ఖండించాడు అర్జునుడు. అశ్వత్థామ మరో విల్లు గ్రహించి అర్జునుడిపై ఎన్నో బాణాలు గుప్పించాడు.

క. **గురుసుతు బెడిదపుటంపఱ । నరనారాయణులు నొచ్చినన్ నరుకడ క**
న్నరుణం బగుటయుఁ దద్రుచి । పరంపరలతోన నిగిడె బాణచయంబుల్. **305**

ప్రతిపదార్థం: గురు+సుతు+బెడిదపు+అంపఱన్= అశ్వత్థామ యొక్క కఠినములైన బాణాలసమూహం చేత; నర+నారాయణులు= అర్జునుడు, శ్రీకృష్ణుడు; నొచ్చినన్= దెబ్బతినగా, నరు+కడకన్ను= అర్జునుని కన్ను చివరిభాగం; అరుణంబు అగుటయున్= ఎఱ్ఱబడుటయు; తద్+రుచి+పరంపరలతోన= ఆ ఎఱ్ఱని కాంతుల వరుసలతోనే; బాణచయంబుల్= అమ్ములగుంపులు; నిగిడెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: అశ్వత్థామ ప్రయోగించిన గట్టి బాణాలచేత అర్జునుడు, శ్రీకృష్ణుడు కలత చెందారు. అర్జునుడికి ఆగ్రహం వచ్చి అతని కన్నులు ఎఱ్ఱపడ్డాయి. ఆ ఎఱ్ఱని కన్నుల కాంతులతోనే అమ్ముల గుంపులు అశ్వత్థామపై ప్రసరించాయి.

క. **ఉఱక నరుఁ డట్టు మైమఱు । వఱువుళ్ళుగఁ జేసి లీల నంగము లెల్లం**
బఱియలుగఁ జేయ నాతం । డఱుమెడలక మఱియు నేసె నధికరయమునన్. **306**

ప్రతిపదార్థం: ఉఱక= లెక్కచేయక; నరుఁడు= అర్జునుడు; అట్టు= ఆవిధంగా; మైమఱువు= కవచము; వఱువుళ్ళుగన్= శిథిలముగా; చేసి= ఒనరించి; లీలన్= ఆటగా; అంగములు+ఎల్లన్= అవయవాలు అన్నీ; పఱియలుగన్+చేయన్= బ్రద్దలు కొట్టగా; ఆతండు= అశ్వత్థామ; అధిక+రయమునన్= మిక్కుటమగు వేగంతో; మఱియున్= మరల; అఱుము+ఎడలక= ప్రతిఘటనము వదలక; ఏసెన్= బాణాలు ప్రయోగించాడు.

తాత్పర్యం: నరుడు- లెక్కచేయక, ఆవిధంగా అశ్వత్థామ కవచాన్ని ఛేదించి, ఆటాడు మాదిరిగా, అవయవాలను బీటలువారేటట్లుగా చేశాడు. అశ్వత్థామ ప్రతిఘటన వీడక, మరల మిక్కిలి వేగంగా అమ్ములు అర్జునుడిపై ప్రయోగించాడు.

క. **నొచ్చియుఁ బెనఁగినఁ గృపయును । మెచ్చు గదిరి విప్రుతోడ మెయికొని పో రి**
ట్లచ్చుపడ నేటి కని వి । వ్వచ్చుఁడు గ్రేడించి యొండువలనికి నడచెన్. **307**

ప్రతిపదార్థం: నొచ్చియున్= నొప్పికలిగినప్పటికీ(విడువక); పెనఁగినన్= పోరాడగా; కృపయును= కరుణయు; మెచ్చు= గౌరవభావము; కదిరి= పెరిగి; విప్రుతోడన్= బ్రాహ్మణుడితో; మెయికొని= పూని; పోరు= పోరాటం; ఇట్లు= ఈ విధంగా; అచ్చుపడన్+ఏటికిన్+అని= ఏర్పడనేటికి అని భావించి; వివ్వచ్చుఁడు= అర్జునుడు; క్రేడించి= ప్రక్కకుతొలగి; ఒండు+వలనికిన్= వేరుచోటికి; నడచెన్= వెళ్ళాడు;

తాత్పర్యం: తాను దెబ్బతిని బాధపడుతున్నప్పటికీ, పోరాటం విరమించకుండా కొనసాగించిన అశ్వత్థామపై దయ, గౌరవం కలిగి, అర్జునుడు బ్రాహ్మణుడితో తీవ్రంగా యుద్ధం చేయటం ఎందు కని, లీలగా మరొకచోటికి వెళ్ళిపోయాడు.

వ. **తదనంతరంబ.** **308**

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట.

తాత్పర్యం: ఆ తరువాత.

ఉ. భీముఁ డుదగ్రదర్పమున భీష్మునిపైఁ జన నడ్డమై కురు
గ్రామణి భల్లపంచకయుగంబున నాతని మేను సించుడున్
భీమదృఢక్షురప్రచయభిన్నతనుండుగఁ జేసె నాతఁ డా
భూమిపు నిట్లు నీదు ప్రియపుత్రకు లొండొరుతోడఁ బోరఁగన్. 309

ప్రతిపదార్థం: భీముఁడు= భీముడు; ఉదగ్ర+దర్పమునన్= భయంకర గర్వంతో; భీష్మునిపైన్+చనన్= భీష్మునిమీదికి వెళ్ళగా; అడ్డము+ఐ= మధ్య నిలిచి; కురు+గ్రామణి= కురుపతి(దుర్యోధనుడు); భల్ల+పంచక+యుగంబునన్= పది బాణాలతో; ఆతని+మేను= భీముని శరీరం; చించుడున్= ఛేదింపగా; ఆఁతడు= భీముడు; ఆ భూమిపున్= ఆ రాజును(ఆ దుర్యోధనుడిని); భీమ+దృఢ+క్షుర+ప్రచయ+ భిన్న+తనుండుగన్= భయంకరములు, గట్టివియైన చుర కత్తి బాణాల సముదాయంతో గాయములు పడిన శరీరం గలవాడినిగా; చేసెన్= చేశాడు; ఇట్లు; నీ ప్రియ+పుత్రకులు= నీకు ప్రేమపాత్రులైన భీమదుర్యోధనులు; ఒండు+ఒరుతోడన్= ఒకరితో ఒకరు; పోరఁగన్= యుద్ధం చేయగా.

తాత్పర్యం: భీముడు భయంకరమైన గర్వంతో భీష్ముడిని మార్కొన్నాడు. దుర్యోధనుడు అడ్డం వచ్చి, పది బాణాలతో భీముడి శరీరం తూట్లు పడేటట్లు చేశాడు. భీముడు దుర్యోధనుడి శరరీం తూట్లు పడేటట్లు భయంకరమైన చురకత్తి బాణాలతో కొట్టాడు. ఈ విధంగా భీముడు - దుర్యోధనుడు భీకరమైన పోరాటం కొనసాగించుచుండగా.

వ. కనుంగొను జనంబులు. 310

ప్రతిపదార్థం: కనుంగొను= చూస్తున్న; జనంబులు= జనులు;

తాత్పర్యం: చూస్తున్న జనులు (ఇట్లా అనుకొన్నారు.)

క. ' చండవిరోధితిమిరమా । ర్తాండు లనఁగఁదగినవీరు దమలో ని ట్లు
ద్దండతఁ బెనఁగుట ధృతరా । ష్ట్రుండవినయలోభముష్కరుం డగుటఁ జుమీ!' 311

ప్రతిపదార్థం: చండ+విరోధి+తిమిర+మార్తాండులు= కోపంతో విజృంభించే శత్రువులు అనే చీకటిని పోగొట్టే సూర్యులు; అనఁగన్+తగిన= అని చెప్పదగిన; వీరు= వీరలు; తమలోన్= ఒకరితో ఒకరు; ఇట్లు; ఉద్దండతన్= ఘోరంగా; పెనఁగుట= విడువకుండా పోరాటం కొనసాగించటం; ధృతరాష్ట్రుండు; అవినయ లోభ ముష్కరుండు+అగుటన్ చుమీ!= గర్వంతో, దురాశతో కూడిన మూఢుడు, చెడ్డవాడు కావటంచేత సుమా!

తాత్పర్యం: విజృంభించే విరోధులనే చీకటిని పారద్రోలే సూర్యులనదగిన వీరిద్దరూ ఈ విధంగా ఘోరంగా పోరాడటం ధృతరాష్ట్రుడు గర్వంతో దురాశతో కూడిన మూఢుడు కావడం చేతనే సుమా!

వ. అని రట్టియెడ. 312

ప్రతిపదార్థం: అనిరి= అన్నారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

క. కురుపతికిఁ జిత్రసేనుఁడుఁ । బురుమిత్త్రుఁడు వేల్పుటేటి పుత్త్రుఁడుఁ బ్రా పై
యురవడిఁ దటిమిన వారికి । నరనందనుఁ డెదురుపడె గుణధ్వని సెలఁగన్. 313

ప్రతిపదార్థం: కురుపతికిన్= దుర్యోధనునకు; చిత్రసేనుఁడున్+పురుమిత్రుఁడున్= చిత్రసేనుడు మరియు పురుమిత్రుడు; వేల్పు+ఏటి+పుత్రుఁడున్= మందాకినీ సుతుడు(భీష్ముడు); ప్రాపు+ఐ= తోడై; ఉరవడిన్= మిక్కుటమగు వేగంతో; తఱిమినన్= తోలగా; వారికిన్= వారికి; నర+నందనుఁడు= అర్జునుడి కొడుకు(అభిమన్యుడు); గుణ+ధ్వని= అల్లెత్రాటి మ్రోత; చెలఁగన్= ఒప్పగా; ఎదురుపడెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడికి చిత్రసేనుడు - పురుమిత్రుడు భీష్ముడు తోడుపడ్డాడు. వారు మిక్కిలి వేగంతో, సేనలను తరిమికొట్టగా, వారిని అర్జునకుమారుఁడు అభిమన్యుడు తన వింటి నారిని మ్రోగిస్తూ ఎదుర్కొన్నాడు.

క. పురుమిత్త్రుని నే డుజ్జ్వల। శరముల గంగాతనూజు సప్తతి బాణ
స్ఫురణమునఁ జిత్రసేనునిఁ। బరమాంబకదశకమున విపాటితుఁ జేసెన్. 314

ప్రతిపదార్థం: పురుమిత్రునిన్; ఏడు+ఉజ్జ్వల+శరములన్= ఏడు వాడిబాణాలతో; గంగాతనూజున్= భీష్ముడిని; సప్తతి,బాణ,స్ఫురణమునన్= డెబ్బది బాణాల తాకిడితో; చిత్రసేనునిన్; పరమ+అంబక+దశకమునన్= పదిగొప్ప బాణాలతో; విపాటితున్+చేసెన్= నొవ్వ చేశాడు.

తాత్పర్యం: ఏడు బాణాలతో పురుమిత్రుడిని, డెబ్భై అమ్ములతో భీష్ముడిని, పది వాడి బాణాలతో చిత్రసేనుడిని అభిమన్యుడు బాధించాడు.

తే. ఎన్ని శరముల నభిమన్యుఁ డేసెఁ దమ్ముఁ। దారు నన్నియు శరములఁ దఱిమి చిత్ర
సేనపురుమిత్త్రు లతని నేసిరి నవోగ్ర। విశిఖములు నాటె భీష్ముఁ డవ్వీరు మేన. 315

ప్రతిపదార్థం: తమ్మున్= తమను; అభిమన్యుఁడు= అభిమన్యుడు; ఎన్ని+శరములన్= ఎన్నిబాణాలతో; ఏసెన్= కొట్టాడో; తారున్= తాముకూడ; అన్నియు+శరములన్= అన్ని అమ్ములతో; చిత్రసేన, పురుమిత్త్రులు= చిత్రసేనుడు, పురుమిత్రుడును, అతనిన్= అతనిని, అభిమన్యుని; తఱిమి= ఎదుర్కొని; ఏసిరి= కొట్టారు; భీష్ముఁడు; ఆ+వీరు+మేనన్= ఆ వీరుని శరీరంపై; నవ+ఉగ్ర+విశిఖములు= భయంకరమైన తొమ్మిది బాణాలు; నాటెన్= గ్రుచ్చుకొనేటట్లు ప్రయోగించాడు.

తాత్పర్యం: తమను ఎన్ని బాణాలతో కొట్టాడో, అన్ని బాణాలతో చిత్రసేనుడు, పురుమిత్రుడు అభిమన్యుడిని ఎదుర్కొన్నారు. భయంకరములైన తొమ్మిది అమ్ములు భీష్ముడు అభిమన్యుడిపై ప్రయోగించాడు.

ఉ. ఆతఁడు చిత్రసేనుని శరాసన మేడ్తెఱఁ ద్రుంచి ఘోటక
వ్రాతము నొంచి మైమఱువు వ్రచ్చి శరంబులు మేనఁ గ్రుచ్చి యు
ద్ద్యోతితుఁ డైనఁ జూచి కర ముద్ధతి రాజతనూజవర్గముల్
వే తఱియంగఁ జొచ్చి పొదివెం బటుమార్గణవృష్టి నాతనిన్. 316

ప్రతిపదార్థం: ఆతఁడు= అభిమన్యుడు; చిత్రసేనుని+శరాసనము= చిత్రసేనుని విల్లు; ఏడ్తెఱన్= పరాక్రమంతో; త్రుంచి= ఖండించి; ఘోటక+వ్రాతమున్= గుర్రాల సముదాయాన్ని; నొంచి= నొవ్వచేసి; మైమఱువు= కవచం; వ్రచ్చి= తూట్లుపడునట్లుగా చేసి; శరంబులు= బాణాలు; మేనన్= శరీరంలో; గ్రుచ్చి= నాటి; ఉద్ద్యోతితుఁడు+ఐనన్= ప్రకాశించుచుండగా; చూచి; కరము= మిక్కిలి; ఉద్ధతిన్= ఉరవడితో; రాజ తనూజ వర్గముల్= రాజపుత్రుల సముదాయం (చిత్రసేనుడు మున్నగు వారు); వే+తఱియంగన్+చొచ్చి= వేగంగా సమీపించి; ఆతనిన్= అభిమన్యుడిని; పటుమార్గణ+వృష్టిన్= గొప్ప అమ్ముల వానతో; పొదివెన్= ముట్టడించాయి.

తాత్పర్యం: అభిమన్యుడు - చిత్రసేనుడి ధనుస్సు వేగంగా ఖండించి, తేరు గుర్రాలను నొప్పించి, అతడి కవచాన్ని తూట్లు పడేటట్లుగా చేసి, శరీరాన్ని గాయపరచి ప్రకాశించటం చూచి, మిక్కిలి భయంకరంగా ఇతర రాజపుత్రులు వేగంగా సమీపించి, గొప్ప అమ్ముల వాన అతడిపై కురిపించారు.

క. ఆ సౌభద్రుం డుగ్రపు । వేసవి దావాగ్ని శుష్కవిపినమ్ము నిరా
యాసంబుగ దరికొనుగతి । భాసితశరశిఖలు వారిపైఁ బరగించెన్. 317

ప్రతిపదార్థం: ఆ+సౌభద్రుండు= ఆ అభిమన్యుడు(సుభద్రకొడుకు); ఉగ్రపు+వేసవి+దావాగ్ని= మండువేసవిలోని కార్చిచ్చు; శుష్క+విపినమ్మున్= ఎండిపోయిన అడవిని; నిస్+ఆయాసంబుగన్= ఆయాసం లేకుండా (సులువుగా); దరికొను గతిన్= కాల్చేటట్లుగా; భాసిత శర శిఖలు= ప్రకాశించే అమ్ములు అనే అగ్నిజ్వాలలు; వారిపై= చిత్రసేనుడు మున్నగు రాజకుమారులపై; పరగించెన్= వ్యాపింప జేశాడు.

తాత్పర్యం: ఆ అభిమన్యుడు మండు వేసవి కార్చిచ్చు ఎండిపోయిన అడవిని సులువుగా క్రమ్ముకొని కాల్చేటట్లుగా, ప్రకాశమానములు అయిన బాణాగ్ని జ్వాలలు ఆ కౌరవరాజ పుత్రులపై వ్యాపింప జేశాడు.

క. రంగత్ప్రధనస్తుత్య తు । రంగముఁ డై తాండవాభిరతుఁ డగు హరులీ
లం గడఁగి వీరనృత్యము । సంగరరంగమునఁ జేసె శత్రులు మెచ్చన్. 318

ప్రతిపదార్థం: రంగత్+ప్రధన+స్తుత్య+తురంగముఁడు+ఐ= ప్రకాశించే యుద్ధంలో పొగడదగిన గుర్రాలు కలవాడై; తాండవ+అభిరతుఁడు+అగు= నృత్యమందు ఇష్టం గలవాడైన; హరులీలన్= శివునివలె; కడఁగి= పూని; వీర+నృత్యము= పరాక్రమంతో కూడిన నాట్యం; శత్రులు+మెచ్చన్= శత్రువులు మెచ్చేటట్లుగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: యుద్ధభూమిలో అందరూ పొగడే ప్రకాశమానములు అయిన గుర్రాలు గల అభిమన్యుడు నాట్యకేళీ లోలుడు అయిన శివుడి వలె విజృంభించి శత్రువులు మెచ్చునట్టుగా సంగరరంగంలో పరాక్రమంతో కూడిన నృత్యం చేశాడు.

వ. ఇట్లు పేర్చి కురుబలంబు నేర్చు నభిమన్యుఁ జూచి జనితమన్యుండై శుభలక్షణుండగు లక్ష్మణుండు. 319

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; పేర్చి= విజృంభించి; కురు+బలంబున్= కౌరవసేనను; ఏర్చు= దహించే; అభిమన్యున్+చూచి= అభిమన్యుని చూచి; జనిత+మన్యుండు+ఐ= పుట్టిన రోషం కలవాడై; శుభ+లక్షణుండు= మంగళప్రదమైన లక్షణాలు కలవాడగు; లక్ష్మణుండు= లక్ష్మణకుమారుడు.

తాత్పర్యం: ఈ విధంగా విజృంభిస్తూ, కౌరవసేనను బాధిస్తున్న అభిమన్యుడిని చూచి, రోషంతో శుభలక్షణములు గల లక్ష్మణకుమారుడు (తరువాతి పద్యంతో అన్వయం).

అభిమన్యు లక్ష్మణకుమారుల యుద్ధము (సం. 6-69-30)

క. తలపడి నానాస్త్రము ల । గ్గలికం గురియుటయు నతఁడు కాండము లా టి
ట్టలమైన యలుక నాతని । లలితోరస్ స్థలమునం గలయ నాటించెన్. 320

ప్రతిపదార్థం: తలపడి= మార్కొని; నానా+అస్త్రములు= పెక్కు మంత్రబాణాలు; అగ్గలికన్= ఉత్సాహంతో; కురియుటయున్= వర్షించగా; అతఁడు= అభిమన్యుడు; కాండములు+ఆఱు= ఆరు బాణాలు; ఇట్టలము+అయిన= గొప్పదైన; అలుకన్= కోపంతో; ఆతని= లక్ష్మణ కుమారుని యొక్క; లలిత+ ఉరస్+స్థలమునన్= కోమలమైన వక్షమునందు; కలయన్= వ్యాపించేటట్లుగా; నాటించెన్= గ్రుచ్చుకొనేటట్లు చేశాడు.

తాత్పర్యం: లక్ష్మణకుమారుడు అభిమన్యుని మార్కొని పెక్కు మంత్ర బాణాలను ఉత్సాహంతో వర్షించాడు. అభిమన్యుడు - ఆరుబాణాలను అతిశయించిన కోపంతో లక్ష్మణకుమారుని కోమలమైన ఉరమును నాటునట్లుగా ప్రయోగించాడు.

చ. తెరలక లక్ష్మణుండు దృఢదీప్తశరావలి పార్థపట్టిపైఁ
దొరఁగఁగఁజేసినం గినిసి తొల్త హయంబులఁ జంపి సారథిన్
ధరఁ బడ నాతఁ డేసె విరథత్వము నొందియు నీదు మన్మఁ డు
ద్ధురగతి శక్తి వైవ నది ద్రుంచె మహేంద్రునిమన్మఁ డమ్ములన్. 321

ప్రతిపదార్థం: తెరలక= మరలక; లక్ష్మణుండు= లక్ష్మణకుమారుడు; పార్థ+పట్టిపైన్= అర్జునుడి పుత్రుడిపై(అభిమన్యుడిపై); దృఢ+దీప్త+శర+ఆవలి= గట్టివి ప్రకాశించునట్టివి అయిన అమ్ముల గుంపులు; తొరఁగఁగన్+ చేసినన్= తాకునట్లు చేయగా; కినిసి= కోపగించి; తొల్తన్= ముందుగ; హయంబులన్+చంపి= గుర్రాలను సంహరించి; సారథిన్; ధరన్+పడన్= భూమిమీద పడునట్లు; ఆతఁడు= అభిమన్యుడు; ఏసెన్= బాణాలు ప్రయోగించాడు; విరథత్వమున్+ఒందియున్= రథము లేకపోయినప్పటికీ; నీదు+మన్మఁడు= నీ పౌత్రుడు(లక్ష్మణకుమారుడు); ఉద్ధురగతిన్= వేగముగా; శక్తి= శక్తి అనే ఆయుధాన్ని; వైవన్= వేయగా; అది= ఆ శక్తిని; మహేంద్రుని+మన్మఁడు= దేవేంద్రుని పౌత్రుడు(అభిమన్యుడు); అమ్ములన్= బాణాలతో; త్రుంచెన్= ఖండించాడు.

తాత్పర్యం: లక్ష్మణకుమారుడు - వెనుకంజ వేయక, అర్జునకుమారుడైన అభిమన్యుడిపై గట్టివాడిబాణాలు వేశాడు. అభిమన్యుడు ఆగ్రహంతో లక్ష్మణకుమారుడి గుర్రాలను మొదట సంహరించి తదుపరి సారథిని కూల్చివేశాడు. నీ మనుమడు లక్ష్మణకుమారుడు విరథుడైకూడా జంకక, 'శక్తి' ని అభిమన్యుడిపై విసిరాడు. ఆ శక్తిని దేవేంద్రపౌత్రుడైన అభిమన్యుడు తన బాణాలతో ఖండించాడు.

ఆ. శక్తిఁ ద్రుంచి తీవ్రసాయక హతదేహుఁ। జేయఁ దొడఁగు నతని చేతి బలుపు
సూచి కృపుఁడు రాజసుతుఁ దన తేరిపై। నిడి తొలంగఁ దెచ్చె నెల్లఁ జూడ. 322

ప్రతిపదార్థం: శక్తిన్+త్రుంచి= శక్తి అనే ఆయుధాన్ని ఖండించి; (లక్ష్మణకుమారుడిని-అభిమన్యుడు); తీవ్ర+సాయకహత+దేహున్+చేయన్+తొడంగు= తీవ్రమైన శరాలతో కొట్టబడిన శరీరం గలవానిగా చేయటం మొదలు పెట్టిన; అతని చేతి బలుపు+చూచి= ఆ అభిమన్యుడి చేతిబలం చూచి; కృపుఁడు= కృపాచార్యుడు; రాజసుతున్= రాజపుత్రుని (లక్ష్మణ కుమారుని); ఎల్లన్+చూడన్= అందరూ చూస్తూ ఉండగా; తొలంగన్+తెచ్చెన్= అక్కడనుండి తప్పించి తెచ్చాడు.

తాత్పర్యం: శక్తిని ఖండించి, లక్ష్మణకుమారుని దేహం తూట్లు పడేటట్లుగా అభిమన్యుడు అమ్ములు గుప్పాడు. అభిమన్యుడి చేతి బలం కౌశలం చూచి, కృపుడు రాజకుమారుడైన లక్ష్మణకుమారుని తన రథం మీదికి ఎక్కించుకొని, ఆ స్థలం నుండి తప్పించి తెచ్చాడు.

విశేషం: ఎల్లఁజూడ - ఎల్ల అనునది సర్వశబ్ద అమహద్రూపము. ఇక్కడ అందఱు అనే అర్థంలో మహద్బహువచనరూపం సముచితం. ఎల్లరు - అని. ఇక్కడ 'నృపుఁడు చూడ' అనే పాఠాంతరం ఉన్నది. అది లెస్స.

క. కురురాజు యోధవీరులఁ। బురికొలుపుచు భీష్ముఁ డపుడు పోరికి నడరం
గరిహయనరశరనిబిడత। ధరణి జలదనిబిడగగనతలముం బోలెన్. 323

ప్రతిపదార్థం: కురురాజు యోధ వీరులన్= కౌరవరాజు యొక్క సేనలో యుద్ధం చేసే శూరులను; పురికొలుపుచున్= ప్రోత్సహిస్తూ; భీష్ముఁడు= భీష్ముడు; పోరికిన్= యుద్ధానికి; అడరన్= విజృంభింపగా; కరి, హయ, నర, శవ నిబిడతన్= ఏనుగులయొక్క, గుర్రాలయొక్క, మనుష్యులయొక్క కళేబరాల సాంద్రతచేత; ధరణి= (యుద్ధ) భూమి; జలదనిబిడ గగనతలమున్= మబ్బులతో దట్టంగా నిండిన ఆకాశ ప్రదేశమును; పోలెన్= అనుకరించింది.

తాత్పర్యం: కౌరవసేనలోని యోధవీరులను ప్రోత్సహిస్తూ భీష్ముడు అపుడు పోరాటంలో విజృంభింపగా, ఏనుగుల గుర్రాల, మనుష్యుల పీనుగులతో దట్టమైన నేల మబ్బులతో దట్టంగా కన్పించే ఆకాశంవలె అగుపడింది.

విశేషం: అలం: ఉపమ.

ఉ. సాత్యకి యప్డు దేచి శరజాలము చిత్రలఘుస్ఫుటత్వ సాం
గత్య విరాజమానముగఁ గౌరవసేనఁ గలంగఁ జేసి యౌ
ద్ధత్యమునం దనర్చిన నుదాత్తమనస్కుఁడు సౌమదత్తి యా
హుత్యభిరామవహ్నిక్రియ నుజ్జ్వలుఁ డై వెసఁ దాఁకె నాతనిన్. 324

ప్రతిపదార్థం: అప్పుడు; సాత్యకి; ఏచి= విజృంభించి; శర+జాలము= అమ్ముల సముదాయం; చిత్ర లఘు స్ఫుటత్వ సాంగత్య విరాజమానముగన్= అచ్చెరువుగ, తేలికగా, లక్ష్యశుద్ధితో వెలుగొందునట్లుగా; కౌరవ+సేనన్= కౌరవసేనను; కలంగన్+చేసి= కలతనొందునట్లు చేసి; ఔద్ధత్యమునన్+తనర్చినన్= గర్వముతో విజృంభించగా; ఉదాత్త+మనస్కుఁడు= గొప్ప మనస్సు కలవాడు; సౌమదత్తి= భూరిశ్రవసుడు; ఆహుతి+అభిరామ వహ్నిక్రియన్= హోమంలో ఆహుతి వేయగా అందగించిన అగ్నివలె; ఉజ్జ్వలుఁడు+ఐ= ఎక్కువగా మండినవాడై= మిక్కుటముగా ప్రకాశించినవాడై; ఆతనిన్= సాత్యకిని; వెసన్= వేగంగా; తాఁకెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: అప్పుడు సాత్యకి విజృంభించి బాణసముదాయాన్ని కౌరవసేనపై గుప్పించాడు. అతని బాణప్రయోగ విన్యాసం - ఆశ్చర్యకరం. లక్ష్యములను సులువుగా స్ఫుటంగా తాకి, కౌరవసేనను కలచివేశాయి. గొప్ప మనస్సుగల భూరిశ్రవసుడు కూడా ఆహుతి వేల్చబడిన అగ్నివలె మిక్కుటంగా జ్వలించి, సాత్యకిని మార్కొన్నాడు.

విశేషం: 1. ఆహుతి లేసినపుడు అగ్ని ప్రజ్వలిస్తుంది. అదే విధంగా సాత్యకి వేసిన బాణాలు - భూరిశ్రవసుడిని ప్రజ్వలింపచేశాయి. ఇక్కడ 'క్రియ' ఉపమావాచకం. ఆ అర్థం తెలుగులోనే ఉన్నది. అందుచే 'హ్ని' గురువు కాదు.

చ. తలపడి యంత్య కాల శిఖిదారుణభంగి నమేయమార్గణా
ర్చులు వరగించుడున్ భయము సొచ్చి జనార్దనుతమ్ముతోడి యో
ధులు పిఱుసన్నఁ దత్సుతులు దోర్బలదుర్దములై పదుండ్రు న
గ్గలి నెదిర్చి యి ట్లనిరి కౌరవసత్తముతో నుదగ్రతన్. 325

ప్రతిపదార్థం: తలపడి= ఎదుర్కొని; అంత్య కాల శిఖి దారుణ భంగిన్= ప్రళయకాలమునందలి అగ్నివలె భయంకరంగా; అమేయ+మార్గణ+అర్చులు= అపరిమిత బాణాల జ్వాలలు; పరగించుడున్= వ్యాపింప చేయగా; జనార్దనుతమ్ముతోడి యోధులు= సాత్యకి సహచరులైన వీరులు; భయము+చొచ్చి= వెరచి; పిఱు+సన్నన్; వెనుకకు మరలిపోగా; తద్+సుతులు= ఆతని కొడుకులు; దోర్బల+దుర్దములు+ఐ= అడ్డగింప లేని పరాక్రమం కలవారలై; పదుండ్రు= పదిమంది; అగ్గలికన్+ఎదిర్చి= ఉత్సాహంతో మార్కొని; కౌరవ+సత్తముతోన్= కురు వీరులలోని శ్రేష్ఠుడితో- భూరిశ్రవుడితో; ఉదగ్రతన్= గర్వంతో; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: భూరిశ్రవసుడు - ప్రళయకాలమందలి అగ్నివలె విజృంభించి, అమ్ములనే అగ్నిజ్వాలలు ప్రవర్తిల్లచేయగా భయపడి, సాత్యకితో పాటు యుద్ధం చేస్తున్న యోధులు వెనుకకు మరలారు. అప్పుడు సాత్యకి కొడుకులు పదిమంది - వారింపరాని పరాక్రమంతో ఉత్సహించి, కౌరవశ్రేష్ఠుడైన భూరిశ్రవసుడితో గర్వంగా ఇట్లు అన్నారు:

క. ' భూరిశ్రవసుఁడ! యెక్కటి వీర । వినోదంబు సలుపు వేడుకమెయి దు
ర్వారత వచ్చితి మొక్కరుఁ గోరి । కొనుము సంగరమునకున్ మాలోనన్.' 326

ప్రతిపదార్థం: భూరిశ్రవసుఁడ!= ఓ భూరి శ్రవసుడా!; ఎక్కటి+వీర+వినోదంబు= ఏకాంతయుద్ధమును ప్రీతితో; సలుపు+ వేడుక+మెయిన్= చేయాలనే ఉత్సాహంతో; దుర్వారతన్= అడ్డగించటానికి వీలులేని విధంగా; వచ్చితిమి= అరుదెంచాము; మాలోనన్= మా పదిమందిలో; ఒక్కరున్= ఒకడిని; సంగరమునకున్= యుద్ధానికి; కోరుకొనుము= ఎన్నుకో.

తాత్పర్యం: 'ఓ భూరిశ్రవసుడా! మేము 'ఎక్కటికయ్యం' చేయాలనే సరదాతో వచ్చాము. ఎవరూ మమ్మ అడ్డగించలేరు. మాలో ఎవరో ఒకరిని నీవు ఎన్నుకొని యుద్ధం చేయవచ్చు.'

విశేషం: ఎక్కటి కయ్యము= ద్వంద్వ యుద్ధం. ఒక వీరుడు - మరొక వీరుడితో చేసే ఏకాంత యుద్ధం. వారిరువురి మధ్య జరిగే పోరాటంలో ఇతరులు పాల్గొనరు. ఇది మహాభారత కాలంనాటి వీరమర్యాద.

చ. ' అన విని నవ్వి యొక్కఁడు మదస్త్రబలంబున కోర్వఁ డోపినన్
సునిశిత బాణముల్ వఱపి సూరెల నందఱు నొక్కపెట్ట యే
పు నెఱపుఁ'డన్న నా రథికపుంగవు లేయ నతండు నమ్ము లె
ల్లను దునుమాడి వారిఁ జటులస్ఫురితాంబక వృష్టి ముంచినన్. 327

ప్రతిపదార్థం: అనన్+విని+నవ్వి= అని చెప్పగా ఆలకించి, నవ్వి; ఒక్కఁడు= ఒకడు; మత్+అస్త్ర+బలంబునకున్= నాయొక్క మంత్రబాణశక్తికి; ఓర్వఁడు= సరిపోడు; ఓపినన్= మీకు చేతనైతే; సునిశిత+బాణముల్= మిక్కిలి వాడిఅమ్ములు; వఱపి= ప్రయోగించి; సూరెలన్= ప్రక్కల; అందఱున్= అందరును; ఒక్క+పెట్టన్= ఒకేసారి; ఏపు నెఱపుఁడు+అన్నన్= మీ విజృంభణ చూపుడు అని చెప్పగా; ఆ రథిక పుంగవులు= ఆ వీరవరులు; ఏయన్= బాణాలతో కొట్టగా; అతండు= ఆ భూరిశ్రవసుడు; అమ్ములు+ఎల్లను= ఆ బాణాలను అన్నింటినీ; తునుమాడి= త్రుంచి; వారిన్= వారిని; చటుల+స్ఫురిత+అంబక వృష్టిన్= గాఢత ప్రకటించే అమ్ముల వానలో; ముంచినన్= ముంచగా.

తాత్పర్యం: అని చెప్పగా విని భూరిశ్రవసుడు నవ్వి ఈ రీతిగా అన్నాడు. 'మీలో ఏ ఒక్కరుగాని నా బాణధాటికి ఆగలేరు. మీకు చేతనైతే - మీరందరూ నా చుట్టుప్రక్కల చేరి - నా మీద వాడి బాణాలు ప్రయోగించి పోరాడండి.' అనగా వారు కౌరవ శ్రేష్ఠుడైన భూరిశ్రవసుడిపై బాణాలు ప్రయోగించారు. భూరిశ్రవసుడు వారి బాణాలను ఖండించి వారినందరిని అమ్ముల వానలో ముంచాడు.

క. పొలి వోని శౌర్య రేఖం । జెలఁగుచు వార్ష్ణేయు లతనిఁ జేడ్పడఁ బెక్క
మ్ముల నొవ్వ వేసినం గడు । నలిగి శరాసనము లెల్ల నాతఁడు ద్రుంచెన్. 328

ప్రతిపదార్థం: పొలివోని= మొక్కవోవని (పొలి+పోని); శౌర్య+రేఖన్+చెలఁగుచున్= పరాక్రమ స్ఫూర్తితో ఒప్పుతూ; వార్ష్ణేయులు= వృష్ణివంశానికి చెందిన వారు(సాత్యకి కొడుకులు); అతనిన్= భూరిశ్రవుని; చేడ్పడన్= నొచ్చునట్లుగా; పెక్కు+అమ్ములన్=

బహుబాణాలతో; నొవ్వన్+ఏసినన్= కలత చెందింపగా; ఆతఁడు= భూరి శ్రవసుడు; కడున్+అలిగి= మిక్కిలి కోపించి; శరాసనములు+ఎల్లన్= (వారి); ధనుస్సులను అన్నింటినీ; త్రుంచెన్= ఖండించాడు.

తాత్పర్యం: వృష్ణి వంశీయులు - సాత్యకి కొడుకులు మొక్కవోని పరాక్రమంతో శోభిల్లుతూ, కురువీరుడు భూరిశ్రవసుడిపై పెక్కు బాణాలు వర్షించారు. భూరిశ్రవుడు మిక్కుటమైన కోపంతో వారి ధనువులు అన్నింటినీ ఖండించాడు.

క. కోదండదశకశీఘ్ర । చ్ఛేదం బొనరించి యపుడ శిరములు పదియున్
భూదేవికి బలిగా ని । ష్పాదించెన్ గౌరవేంద్రుబలములు సెలఁగన్. 329

ప్రతిపదార్థం: కోదండ దశక శీఘ్ర+ఛేదంబు+ఒనరించి= వేగంగా పది ధనుస్సులు ఖండించి; అపుడు+అ= అప్పుడే; శిరములు+పదియున్= పది తలకాయలు; భూదేవికిన్= నేలతల్లికి; బలిగాన్= పూజార్పణంగా; కౌరవ+ఇంద్రు+బలములు= కురురాజుసేనలు; చెలఁగన్= శోభిల్లగా; నిష్పాదించెన్= సిద్ధింపజేశాడు.

తాత్పర్యం: పది ధనుస్సులను ఖండించి వెనువెంటనే పదితలకాయలు ఖండించి భూరి శ్రవసుడు - భూదేవికి 'బలి'గా సమర్పించాడు. కౌరవ సేనలు ఉప్పొంగిపోయాయి.

విశేషం: 'బలి' దేవతల ప్రీతి కోసం - సమర్పించే కానుక. మొదట పూజా విశేషంగా ఆరంభించిన 'బలి' ప్రదానం 'జంతుబలిగా' 'నరబలి'గా కూడా యుగయుగాంతరాలలో పరిణమించింది.

వ. ఇట్లు వడిన కొడుకులం గని వృష్ణివీరుండు. 330

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; పడిన= కూలినట్టి; కొడుకులన్= పుత్రులను; కని= చూచి; వృష్ణి+వీరుండు= వృష్ణిజాతికి చెందిన వీరుడు= సాత్యకి.

తాత్పర్యం: ఈ విధంగా నేలకూలిన కొడుకులను సాత్యకి చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. వగపును గోపముం గదుర వైరిబలంబు దలంకఁ దేరు పై
నొగనొగ దాఁకఁగాఁ బఱపి నుగ్గుగఁ గౌరవసూతు నేసి బె
ట్టుగఁ దురగంబులం దునుముడున్ వెస నాతఁడు నట్ల చేసెఁ బా
టిగఁ గరవాలముల్ గొని వడిన్ దిగి నేలకు దాఁటి రిద్దఱున్. 331

ప్రతిపదార్థం: వగపును= దుఃఖమూ, కోపమున్= ఆగ్రహమూ; కదురన్= కూడగా; వైరి బలంబు= శత్రుసేన; తలంకన్= కలత చెందగా; తేరుపైన్= రథంపై; నొగ+నొగ+తాఁకగాన్= కూబరములు ఒకదానితోనొకటి రాపిడి చెందగా(తన రథమును శత్రు రథముతో ఒరయునట్లుగా); పైన్= మీదికి; పఱపి= తోలి; కౌరవ+సూతున్= కౌరవుని సూతుని (భూరిశ్రవసుడి సారథిని); నుగ్గుగన్+ఏసి= చిన్ని ఖండాలుగా చేసి - సంహరించి; బెట్టుగన్= అధికముగా; తురగంబులన్= గుర్రాలను; తునుముడున్= సంహరించగానే; వెసన్= వేగంగా; ఆతఁడున్= భూరిశ్రవుడుగూడ; అట్లు+అ= అదే విధంగా; పాటిగన్= సరిగా; చేసెన్= చేశాడు; కరవాలముల్+కొని= కత్తులు పట్టి; వడిన్= వేగంగా; నేలకున్ దిగి= భూమిపైకి దిగి; ఇద్దఱున్= ఇరువురును; దాఁటిరి= లంఘించారు.

తాత్పర్యం: కోపమూ, దుఃఖమూ పిరిగొనగా, శత్రుసేన కలత చెందగా, భూరిశ్రవసుడి పైకి రథం తోలించాడు సాత్యకి. రెండు రథాలూ ఒక దానితో మరొకటి ఢీకొన్నాయి. సాత్యకి భూరిశ్రవసుడి సారథిని, గుర్రాలను

సంహరించాడు. భూరిశ్రవుడుగూడా అట్లాగే చేశాడు. ఇద్దరూ విరథులై నేలకు లంఘించి కత్తులు దూసి ఒకరినొకరు మార్కొన్నారు.

వ. అట్టి సమయంబున. 332

ప్రతిపదార్థం: అట్టి+సమయంబునన్= అట్టి తరుణంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

ఆ. వేగ మెయిది వృష్ణివీరు భీముఁడు గురు। వీరుఁ గురువిభుండు గారవమున
వెనుకఁ జనఁగఁ దివిచి తనతన రథముపైఁ। బెట్టికొనుచుఁ దొలఁగఁ బ్రీతిఁ జనిరి. 333

ప్రతిపదార్థం: వేగము+ఎయిది= వేగం పుంజుకొని; వృష్ణి+వీరున్= సాత్యకిని; భీముఁడు; కురు+వీరున్= భూరిశ్రవసుని; కురు+విభుండు= దుర్యోధనుడు; గారవమునన్= గౌరవంగా; వెనుకన్+చనఁగన్+తివిచి= వెనుకకు చేర్చి మరలించి; తన+తన+ రథము పైన్+పెట్టికొనుచున్= తమ తమ రథాలపైకి ఎక్కించుకొని; తొలఁగన్= ఆచోటు తప్పించి; ప్రీతిన్= సంతోషంతో; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: సాత్యకి, భూరిశ్రవసుడు - ఇరువురును విరథులై కత్తులతో నిలబడగా, భీముడు వచ్చి సాత్యకిని తన రథం మీదికి ఎక్కించుకొని పోయాడు. అట్లే భూరిశ్రవసుడిని కురురాజైన దుర్యోధనుడు గౌరవంగా తనరథం మీదికి ఎక్కించుకొన్నాడు. అందరూ సంతోషంగా వెళ్ళారు.

వ. అంత. 334

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు.

తాత్పర్యం: అప్పుడు.

క. ' అపరాహ్ణసంగతుండగు। తపనుంగని పొద్దు గ్రుంకెఁ దడ వేఁగుదు రీ
రిపు లని కడంగి నరుఁ డ। స్త్ర పరంపర వఱపి నీదు రథికుల నెల్లన్. 335

ప్రతిపదార్థం: అపర+అహ్ణ+సంగతుండు+అగు= సాయం సంధ్యతో కూడినవాడగు; తపనున్+కని= సూర్యుడిని చూచి; ప్రొద్దు+క్రుంకెన్= సూర్యుడు అస్తమించుతున్నాడు; రిపులు= ఈ శత్రువులు; తడవు+ఏఁగుదురు= వ్యవధి చూచుకొని వెళ్ళిపోతారు; అని= అని యోచించి; కడఁగి= పూని; నరుఁడు= అర్జునుడు; అస్త్ర+పరంపర+పఱపి= మంత్రబాణాలను ప్రయోగించి; నీదు+రథికులను+ఎల్లన్= తేరెక్కి పోరాడే నీ వీరులను అందరనూ.

తాత్పర్యం: 'మలిసంజలో కలిసే సూర్యుణ్ణి చూచి ప్రొద్దు గ్రుంకుతున్నది. ఈ శత్రువులు యుద్ధం విడిచి శిబిరాలకు వెళ్ళి పోతారు- అనుకొని పూని అర్జునుడు నీ రథికులందరిపై మంత్ర బాణాలు ప్రయోగించి. (తరువాతి గద్యంతో అన్వయం.)

వ. నిహతులం జేయుచు విహరించుచున్నం గనుంగొని. 336

ప్రతిపదార్థం: నిహతులన్+చేయుచున్= చంపుతూ; విహరించుచున్నన్+కనుంగొని= వినోదంగా తిరుగుచుండటం చూచి.

తాత్పర్యం: అర్జునుడు కౌరవ సైనికులను సంహరించటం చూచి.

క. సైరింపక యేడ్తెఱఁ గురు । వీరాగ్రణి యిరువదేనువేల రథంబుల్
పోరికిఁ బురికొలిపిన వి । స్ఫారగతిం గూడి కవిసెఁ బార్థునిమీఁదన్. 337

ప్రతిపదార్థం: సైరింపక=తాళజాలక; ఏడ్తెఱన్= పరాక్రమంతో; కురు+వీర+అగ్రణి= కౌరవవీరులలో మొదటివాడు (భీష్ముడు);ఇరువది+ఏను+వేల+ రథంబుల్= ఇరవై ఐదువేల రథాలను, రథికులగు వీరులను; పోరికిన్= యుద్ధానికి; పురికొల్పినన్= ప్రోత్సహించగా; విస్ఫారగతిన్= ఎక్కువగ విస్తరించి; కూడి= కలిసి; పార్థునిమీఁదన్= అర్జునునిపైన; కవిసెన్= మార్కొన్నాయి.

తాత్పర్యం: అర్జునుడు కౌరవసైనికులను సంహరించటం చూచి, సహింపలేక సేనాపతి భీష్ముడు - ఇరవై అయిదువేల రథాలను పోరాటానికి ప్రోత్సహించాడు. ఆ రథికులు కలిసి, విస్తారంగా వ్యాపించి అర్జునుడిని మార్కొన్నారు.

క. కడు వెసఁ గవిసినయవి గ । వ్వడి బాణజ్వాల లడర వడి దావాగ్నిన్
మిడుతలు వొలిసిన క్రియఁ బొడి । పొడి యయ్యెం గురుబలంబు పొం గడఁగంగన్. 338

ప్రతిపదార్థం: కడు+వెసన్= మిక్కుటము అగు వేగంతో; కవిసినయవి= మార్కొనినట్టివి (ఇరవై వేల రథాలు); కవ్వడి+బాణజ్వాలలు= అర్జునుడి అమ్ముల అగ్ని జ్వాలలు; అడరన్= విజృంభింపగా; వడిన్= వేగంగా; దావాగ్నిన్= కార్చిచ్చులో; మిడుతలు= శలభాలు; పొలిసిన+క్రియన్= చచ్చిపోయే రీతిగా; కురు బలంబు పొంగు+అడఁగంగన్= కౌరవ సేనయొక్క అతిశయం అణగారిపోయేటట్లుగా; పొడి+పొడి+అయ్యెన్= చూర్ణం చూర్ణం అయిపోయాయి.

తాత్పర్యం: వేగంగా ఆ ఇరువది అయిదువేల రథాలు మార్కొన్నాయి. కాని అవి అర్జునుని అమ్ములనే అగ్నిలో కార్చిచ్చులో బడి మరణించే శలభాలవలె మాడి పొడిపొడి అయ్యాయి. కౌరవసేన అతిశయం అణగారిపోయింది.

విశేషం: అలం: ఉపమ.

క. కిరణంబు లడఁగి యంతకు । నరుణత్వము మెఱయఁ దరణి యపరాద్రిశిర
స్ఫురణను నధికరణాలం । కరణం బొనరించుటయును గాంగేయుఁ డెదన్. 339

ప్రతిపదార్థం: కిరణంబులు+అడఁగి= వెలుగురేకలు తగ్గి; అంతకున్= అప్పటికీ; అరుణత్వము= ఎర్రదనం; మెఱయన్= ప్రకాశించటంచేత; తరణి= సూర్యుడు; అపర+అద్రిశిరస్+స్ఫురణను= పడమటి కొండనెత్తిపై ప్రకాశించటంచేత; అధికరణ+అలంకరణంబు+ ఒనరించుటయును= మిక్కుటమైన యుద్ధాలంకరణం చేకూర్చినట్లుండగా; గాంగేయుఁడు= భీష్ముడు; ఎదన్= తన హృదయంలో.

తాత్పర్యం: రశ్మి తగ్గి, అంతకుముందే ఎర్రదనం శోభిల్లగా, సూర్యుడు పడమట కొండ శిరస్సున మెరుస్తూ రక్తసిక్తమైన యుద్ధభూమికి మిక్కిలి అలంకారం చేకూర్చాడు. అది సాయంకాల సమయసూచకం. దానితో భీష్ముడు తన హృదయంలో ఈ విధంగా అనుకొన్నాడు.

విశేషం: అపరాద్రి శిరస్సును (ఎర్రనిపూలతో) శృంగారనాయకుడు అయిన సూర్యుడు అలంకరించినట్లుగా ఉందట.

క. 'శ్రాంతం బయ్యెను వాహన । సంతానం బెల్ల నిపుడు సంధ్యాసమయం
బింతట నేఁటికి నని సా । లింతము గా కింకఁ బోర లెస్సె యున్నే?' 340

ప్రతిపదార్థం: వాహన+సంతానంబు+ఎల్లన్= గుర్రాల సముదాయం అంతా; శ్రాంతంబు+అయ్యెను= బడలిపోయింది; ఇపుడు; సంధ్యాసమయంబు= సంజప్రొద్దు, సాయం సమయం; ఇంతటన్= ఈ మేరకు; నేఁటికిన్= ఈ దినమునకు;

అని= పోరాటం; చాలింతముగాక!= విరమించటం మంచిది; ఇంకన్= ఇకమీద; పోరన్= యుద్ధం చేయటం; లెస్స+ఐ+ఉన్నే?= మంచిది అవుతుందా?

తాత్పర్యం: 'వాహనాలు అన్నీ బడలిపోయాయి. సాయంకాలం అవుతోంది. ఇక యుద్ధం చేయటం ఎందుకు? విరమించటం మంచిది.'

విశేషం: వాహన సంతానంబు - గుఱ్ఱాల గుంపు - వాహనములు అంటే వహించేవి - మోసేవి. గుఱ్ఱములు.

వ. **అని తలంచి కుంభసంభవాది యోధముఖ్యుల కెఱింగించి బలంబులఁ దివియ నియమించి.** **341**

ప్రతిపదార్థం: అని తలంచి= అని యోచించి; కుంభసంభవ+ఆది+యోధముఖ్యులకున్= ద్రోణుడు మున్నగు వీరులకు; ఎఱింగించి= తెలిపి; బలంబులన్= సేనలను; తివియన్+నియమించి= మరలింప ఆజ్ఞాపించి.

తాత్పర్యం: అని ఆలోచించి, ఆ విషయాన్ని ద్రోణాదులకు తెలిపి, సేనలను పోరు చాలింపజేయుటకు

క. **సమరక్రీడన లీలం । దమక తమక తనిసి మరలి తమతమ యావా**
సములకు నరిగి రుభయసై । న్యములజనంబులును దీవియలు వెలుఁగంగన్. **342**

ప్రతిపదార్థం: సమర+క్రీడన్+అ= యుద్ధక్రీడయందే; లీలన్= విలాసంగా; తమక తమక= తమకుతామే; తనిసి= తృప్తిపొంది; మరలి= వెనుదిరిగి; తమ+తమ= ఆవాసములకున్= తమ తమ విడిదులకు; ఉభయసైన్యముల+జనంబులును= రెండు సేనలలోని భటులూ; దీవియలు= దివిటీలు(కాగడాలు); వెలుఁగంగన్= ప్రకాశింపగా; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: యుద్ధక్రీడయందే తమకు తామే తహతహ తృప్తి చెంది వెనుకకు తిరిగి రెండు సేనలలోని భటులు కాగడాల కాంతులలో తమ తమ విడుదులకు చేరారు.

తే. **రెండు వీళ్ళ జనంబులు రేలు వివిధ । హృద్యసంగీతములను సాహిత్యమధుర**
లలితగోష్ఠీ వినోదంబులను బ్రమోద । భరితు లై ప్రొద్దు వుత్తురు భరతముఖ్య! **343**

ప్రతిపదార్థం: భరత ముఖ్య!= భరతవంశంలో ముఖ్యమైనవాడా! ఓ ధృతరాష్ట్ర మహారాజా!; రెండు+వీళ్ళ+జనంబులున్= రెండు శిబిరాల మనుష్యులూ; రేలు= రాత్రులయందు; వివిధ హృద్య సంగీతములను= హృదయమును అలరించే పెక్కు గానములచేతను, సాహిత్య మధుర లలిత గోష్ఠీ వినోదంబులను= వాఙ్మయమునకు సంబంధించిన కోమలమైన, మృదువైన, సంతోషదాయకములగు చర్చలచేతను; ప్రమోద, భరితులు+ఐ= సంతోషంతో నిండినవారై; ప్రొద్దు+పుత్తురు= కాలం గడపుతారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! రాత్రులందు కురు పాండవ పక్షాలు రెండింటికీ సంబంధించిన భటులు హృదయానికి ఆనందం కలిగించే సంగీత సభలలో సాహిత్య గోష్ఠులలో కాలక్షేపం చేస్తూ ఉంటారు.

భీష్ముని షష్ఠదివస యుద్ధక్రమము (సం. 6-71-1)

వ. **ఏనవనాఁటి రాత్రి సనుటయుఁ దెలతెల వేగునప్పుడు ధనంజయుండు సేనాపతి రావించి మకరవ్యూహంబు సంఘటింపు మని నియమించిన నఖిలజనంబులకుఁ బ్రీతి నెక్కొన నతం డమ్మోహరంబు దీర్చునెడ దానికిఁ బార్థపాంచాలపతులు శిరంబును గవలు గన్నులును భీమసేనుండు దుండంబును సౌభద్రద్రౌపదేయ**

ఘటోత్కచులు గండస్థలంబులును సాత్యకిసహితుండై యుధిష్ఠిరుండు గంఠంబును ధృష్టద్యుమ్న పురస్సరంబుగా విరాటుండు వెన్నును గేకయులు వామపార్శ్వంబును ధృష్టకేతుండును గరూశపతియును దక్షిణపార్శ్వంబును గుంతిభోజశతానీకులు జఘనంబును శిఖండియు నిరావంతుండును బుచ్ఛంబును నై పన్నిరి; భీష్ముండు దానికిఁ బ్రతివ్యూహం బూహించి క్రౌంచవ్యూహం బమర్చి యందుఁ జంచువునం దాను గురు సహాయుం డైనిలిచి నేత్రంబులఁ గృపగురుపుత్త్రులును మస్తకంబునఁ గృతవర్మయుఁ గాంభోజ బాహ్లికులును గళంబున శూరసేనపరివృతుండై సుయోధనుండును నురంబున సౌవీర సమేతుండై భగదత్తుండును వీఁపున విందానువిందులును వామపక్షంబున సుశర్మయు దక్షిణపక్షంబున యవనపతియు నపరభాగంబున శ్రుతాయురుపేతుండై భూరిశ్రవసుండును నిలిచి రిట్లుభయసైన్యంబులు సన్నద్ధంబు లై నడచి శంఖభేరీ ప్రముఖ తూర్యనాదంబులు సెలంగం దలపడియె నట్టిసమయంబున. 344

ప్రతిపదార్థం: ఏనవ+నాఁటి+రాత్రి= అయిదవరోజు యొక్క రాత్రి; చనుటయున్= వెళ్ళుటయు; తెల+తెల+వేగునప్పుడు= తెల్లవారునప్పుడు; ధనంజయుండు= అర్జునుడు; సేనాపతిన్+రావించి= సేనాపతి ధృష్టద్యుమ్నుని రప్పించి; మకర+వ్యూహంబు= మొసలి మొగ్గరము; సంఘటింపుము+అని+నియమించినన్= ఏర్పరచుము అని ఆజ్ఞాపించగా; అఖిల+జనంబులకున్= అందరు ప్రజలకూ; ప్రీతి= సంతోషము; నెక్కొనన్= ఏర్పడగా; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; ఆ+మోహరంబున్= ఆ వ్యూహమును; తీర్చు+ఎడన్= ఏర్పాటు చేసేటప్పుడు; దానికిన్= ఆ మొగ్గరమునకు; పార్థ+పాంచాల పతులు= అర్జునుడు, ద్రుపదరాజు; శిరంబును= తలగా; కవలు= జంటలు(నకులసహదేవులు); కన్నులును= నేత్రాలుగా; భీమసేనుండు; తుండంబును= నోరు మొదటి భాగముగా; సౌభద్ర ద్రౌపదేయ+ఘటోత్కచులు= అభిమన్యుడు, ఉపపాండవులు, ఘటోత్కచుడు; గండ+స్థలంబులును= కపోల భాగములుగా; సాత్యకి+సహితుండు+ఐ= సాత్యకితో కూడిన వాడై; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; కంఠంబును= కుత్తుకగా; ధృష్టద్యుమ్న+ పురస్సరంబుగాన్= ధృష్టద్యుమ్నుడు ముందుగా గలవాడుగ; విరాటుండు= విరాటరాజు; వెన్నును= వీపుగా; కేకయులు= కేకయ రాజులు; వామపార్శ్వంబును= ఎడమ ప్రక్కయు; కుంతి భోజ,శతానీకులు= కుంతి భోజుడు, శతానీకుడు; జఘనంబును= మొలగా; శిఖండియున్+ఇరావంతుండును= శిఖండి మరియు ఇరావంతుడును; పుచ్ఛంబును= తోకయు; ధృష్టకేతుఁడు+ కరూశ+పతియును= ధృష్టకేతుడు, కరూశరాజు; దక్షిణ+పార్శ్వంబును= కుడి ప్రక్కయు; పన్నిరి= వ్యూహం ఏర్పాటు చేశారు; భీష్ముండున్= భీష్ముడుకూడా; దానికిన్= ఆ మకర వ్యూహానికి; ప్రతి వ్యూహంబు= దీటగు మొగ్గరము; ఊహించి= ఆలోచించి; క్రౌంచ+వ్యూహంబు= క్రౌంచ పక్షిని పోలు మొగ్గరము; అమర్చి= ఏర్పాటు చేసి; అందున్= ఆ క్రౌంచ వ్యూహమునందు; చంచువునన్= ముక్కు దగ్గర; తాను= తాను(భీష్ముడు); గురు+సహాయుండు+ఐ= ద్రోణుడు తోడుగా; నిలిచి= నిలబడి; నేత్రంబులన్= కనులందు; కృప+గురుపుత్త్రులును= కృపుడును, అశ్వత్థామయు; మస్తకంబునన్= శిరస్సుదగ్గర; కృతవర్మయున్= కృతవర్మయు; కాంభోజ, బాహ్లికులును= కాంభోజరాజు, బాహ్లికుడును; గళంబునన్= కుత్తుక దగ్గర; శూరసేన+పరివృతుండు+ఐ= శూరసేనునిచే చుట్టబడినవాడై; సుయోధనుండును= దుర్యోధనుడును; ఉరంబునన్= వక్షమునందు; సౌవీర+సమేతుండు+ఐ= సౌవీర రాజుతో కూడి; భగదత్తుండును= భగదత్తుడును; వీఁపునన్= వెన్నునందును; వింద+అనువిందులు= విందుడు మరియు అనువిందుడును; వామపక్షంబునన్= ఎడమరెక్కగా; సుశర్మయున్; దక్షిణ+పక్షంబునన్= కుడిరెక్క దగ్గర; యవనపతియున్= యవనరాజును; అపరభాగంబునన్= వెనుక భాగమున; శ్రుతాయుః+ఉపేతుండు+ఐ= శ్రుతాయువుతో కూడినవాడై; భూరిశ్రవసుండును; నిలిచిరి= నిలబడ్డారు; ఇట్లు+ఈరీతిగా; ఉభయ సైన్యంబులున్= రెండు సేనలు(కురు పాండవ సైన్యాలు); సన్నద్ధంబులు+ఐ= యుద్ధానికి సంసిద్ధములై; నడచి= వెడలి; శంఖ, భేరీ, ప్రముఖ, తూర్యనాదంబులు= శంఖములు, భేరులు మొదలగు జంత్ర వాద్యాలు; చెలంగన్= మ్రోయగా; తలపడియెన్= మార్కొన్నాయి; అట్టి సమయంబునన్.

తాత్పర్యం: కురుక్షేత్రంలో ఏడవనాటి రాత్రి జరిగిపోయింది. తెల్లవారేటప్పుడు, అర్జునుడు ధృష్టద్యుమ్నుడిని, రావించి 'మొసలి మొగ్గరం' ఏర్పాటు చేయుమన్నాడు. ధృష్టద్యుమ్నుడు అందరూ సంతోషించేటట్లుగా మకరవ్యూహం

తీర్చిదిద్దాడు. అర్జునుడు, ద్రుపదరాజు తలగా ఏర్పడ్డారు. నకుల సహదేవులు నేత్రములు అయ్యారు. భీముడు నోరు చివర నిలబడ్డాడు. అభిమన్యుడు, ద్రౌపది కొడుకులు, ఘటోత్కచుడు - కపోలములు అయ్యారు. సాత్యకితోపాటుగా ధర్మరాజు కంఠం దగ్గర నిలిచాడు. ధృష్టద్యుమ్నుడితోపాటు విరాటరాజు వెన్నుదగ్గర ఉన్నాడు. కేకయరాజులు ఎడమ ప్రక్కగా, ధృష్టకేతుడు కరూశరాజును కుడిప్రక్కగా నిలబడ్డారు. కుంతిభోజుడు, శతానీకుడు మొల దగ్గర ఉన్నారు. శిఖండి, ఇరావంతుడు - తోకగా అయ్యారు.

భీష్ముడు మొసలిమొగ్గరానికి సాటిగా 'క్రౌంచవ్యూహం' ఏర్పాటు చేశాడు. తాను ద్రోణుడితోపాటు ముక్కు దగ్గర నిలిచాడు. కృపుడు, అశ్వత్థామ, కన్నులు అయ్యారు. శిరస్సు దగ్గర కృతవర్మ, కాంభోజుడు, బాహ్లికుడు నిలిచారు. కుత్తుక దగ్గర శూరసేన రాజుతోపాటుగా దుర్యోధనుడు నిలబడ్డాడు. వక్షం దగ్గర సౌవీరరాజుతోపాటు, భగదత్తుడు ఉన్నాడు. వీపున విందుడు, అనువిందుడు నిలబడ్డారు. ఎడమప్రక్క సుశర్మ, కుడిప్రక్క యవనరాజు నిలిచారు. వెనుకగా శ్రుతాయువుతో కలిసి భూరిశ్రవసుడు నిలిచాడు.

ఈ విధంగా కురుసేన పాండవసేన యుద్ధానికి సమాయత్తమై వెళ్ళారు. శంఖాలు - భేరులు మొదలగు జంత్రవాద్యాల ధ్వనులు మిన్నుముట్టాయి. ఆ సమయంలో.

విశేషం: 1. క్రౌంచము= ఒక పౌరాణిక పక్షి. కొంగవంటి ఆకారం కలది.

క. తలకడచి నడచు ద్రోణుని । యలవుఁ బలంబును సహింప కనిలతనయుఁ డి
ట్టలమగు రోషంబునఁ ద । ద్బలముపయిం బఱపె రథముఁ బటువేగమునన్. 345

ప్రతిపదార్థం: తలకడచి+నడచు= పైకి ఉప్పొంగి విజృంభించే; ద్రోణుని= ద్రోణాచార్యుడి; అలవున్+బలంబును= శక్తిని, సామర్థ్యమును; సహింపన్= ఓర్వలేక; అనిల+తనయుఁడు= వాయుసుతుడు(భీమసేనుడు); ఇట్టలము+అగు= అతిశయించిన; రోషమ్మునన్= కోపంతో; తద్+బలముపయిన్= ఆతనియొక్క సేనపై; పటువేగమునన్= మిక్కిలి శీఘ్రముగా; రథమున్= తేరును; పఱపెన్= తోలించాడు.

తాత్పర్యం: పైకి ఎగిరి వెల్లి విరిసే ద్రోణుడి శక్తిసామర్థ్యాలకు ఓర్వలేక, భీముడు మిక్కుటమైన కోపంతో ద్రోణుడి సేన వైపునకు తన రథం వేగంగా నడపించాడు.

విశేషం: కౌరవులు పన్నింది క్రౌంచవ్యూహం. ముక్కుదగ్గర ఉన్నది ద్రోణుడు. ముక్కుకు పొడిచే స్వభావం సహజసిద్ధం. ఇక పాండవులు పన్నింది మొసలిమొగ్గరం. తుండం అంటే నోరు మొదటి భాగం. దానిదగ్గర ఉన్నది భీముడు. ఆ విధంగా భీముడికీ ద్రోణుడికీ సంఘర్షణ తప్పనిసరి అయింది.

వ. ఇట్లు వఱపిన నతనికోల్తలకుం గాక. 346

ప్రతిపదార్థం: ఇట్లు+పఱపినన్= ఈ విధంగా రథాన్ని నడుపగా; అతని కోల్తలకున్+కాక= అతడి ఎదుట నిలిచి యుద్ధం చేయలేక.

తాత్పర్యం: భీముడు ఈ విధంగా రథాన్ని నడిపించగా, అతడికి ఎదురు నిలువలేక. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తనముందటి యోధులు పిఱు । సనుటయుఁ గుంభజుఁడు గినిసి శరనవకము భీ
మునిమేన నాట నాతఁడు । సునిశితభల్లమున నతని సూతుం దునిమెన్. 347

ప్రతిపదార్థం: తన ముందటి యోధులు= తనకు ముందుగా నిలిచిన వీరులు; పిఱు+చనుటయున్= వెనుకంజ వేయటం చేత; కుంభ+జుఁడు= కుండలో పుట్టినవాడు(ద్రోణుడు); కినిసి= కోపించి; శర+నవకము= తొమ్మిది అమ్ములు; భీముని+మేనన్+ నాటన్= భీముని శరీరంపై గ్రుచ్చుకొనేటట్లు వేయగా; ఆతఁడు= ఆ భీముడు; సునిశిత+భల్లమునన్= మిక్కిలివాడియైన ఈటె బాణంతో అతని+సూతున్= ద్రోణుని సారథిని; తునిమెన్= సంహరించాడు.

తాత్పర్యం: తన ముందుగా నిలిచిన వీరులు వెనుకకు తిరిగి పారిపోగా, ద్రోణుడు ఆగ్రహంతో భీముడి శరీరంపై తొమ్మిది అమ్ములు నాటవేశాడు. భీముడు మిక్కిలి వాడియైన ఈటెబాణంతో ద్రోణాచార్యుడి సారథిని సంహరించాడు.

విశేషం: మహాభారత యుద్ధంలో పలుచోట్ల- వీరులు ప్రతివీరుల సారథులను సంహరించటం వర్ణింపబడింది. సారథులు నిరాయుధులే కదా! వారిని సంహరించటం ఏమి న్యాయం? అనిపిస్తుంది. సారథిని సంరక్షించటం - వీరుడి అవశ్యకర్తవ్యం. సారథి సంహరింపబడటం - రథికునకు -పరాభవం. ఇంచుమించు ఓటమితో సమానం. అప్పుడు రథికుడు - సారథ్యం కూడా నడపటం ద్విపాత్రాభినయం నెరపటమే., ద్రోణుడు అప్పుడు అట్లా లోకోత్తర శక్తి ప్రదర్శించాడు..

క. వాహనముఁ దాన నడపుచు । సాహసికత్వమున గురుఁడు సమరక్రీడో
త్సాహము వదలక వైరి । వ్యూహము దలఁకంగ భుజసముద్ధతి గవిసెన్. 348

ప్రతిపదార్థం: వాహనమున్= రథమును; తాను+అ= తానే; నడపుచున్= నడిపిస్తూ; గురుఁడు= ద్రోణుడు; సాహసికత్వమునన్= ప్రమాదంతో కూడిన ధైర్యంతో; సమర+క్రీడా+ఉత్సాహము= యుద్ధం అనే ఆటలోని ఉల్లాసము; వదలక= విడిచి పెట్టకుండా; వైరి వ్యూహము= శత్రువుల సమూహము; తలఁకంగన్= కలత చెందునట్లుగా; భుజ+సముద్ధతిన్= బాహు పరాక్రమంతో (భుజముల+గర్వంతో); కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: సారథి సంహరింపబడగా తానే తన రథాన్ని నడపుతూ అనగా గుఱ్ఱాలను తోలుకొంటూ, యుద్ధ క్రీడ యందలి ఉత్సాహం విడిచిపెట్టకుండా పరాక్రమం చూపిస్తూ, శత్రువుల వ్యూహాన్ని చెదరగొట్టుతూ యుద్ధం కొనసాగించాడు.

క. మీ తండ్రి ద్రోణునకుఁ దో । డై తఱిమినఁ గేకయులు భయాకులత మరు
ద్ధూతాంబుదగతిఁ దెరలఁగ । నాతత సృంజయబలంబు లటిముటి విరిగెన్. 349

ప్రతిపదార్థం: మీ తండ్రి= భీష్ముడు; ద్రోణునకున్= ద్రోణునకు; తోడు+ఐ= బాసటగా నిలిచినవాడై; తఱిమినన్= తరిమివేయగా; కేకయులు= కేకయరాజు సేనలు; భయ+ఆకులతన్= భయంతో ఆందోళనతో; మరుత్+ధూత+అంబుద+గతిన్= గాలిచే చెదరగొట్టబడిన మబ్బులవలె; తెరలఁగన్= మరలగా; ఆతత+సృంజయ బలంబులు= విస్తీర్ణమైన సృంజయసేనలు; అటిముటిన్= శీఘ్రంగా; విరిగెన్= ఓడిపోయాయి.

తాత్పర్యం: నీ తండ్రి అయిన భీష్ముడు ద్రోణుడికి తోడుగా నిలిచి తరుమగా కేకయులు భయంతో, ఆందోళనతో, గాలిచేత చెదరగొట్టబడిన మబ్బులవలె - వెనుకకు తరలారు. విస్తీర్ణాలయిన సృంజయసేనలు వెనువెంటనే ఓడిపోయాయి.

విశేషం: అలం: ఉపమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. అధిప! భీమసేనుఁ డడరినఁ గౌరవ । సైన్య మతనిచేతఁ జాఁపకట్టు
వడియెనపుడు ధరణిపతు లిద్దఱును జేయి । వీచి తటిమి రధిక విక్రమమున. 350

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా(ఓ ధృతరాష్ట్ర మహారాజా)!; భీమసేనుఁడు= భీముడు; అడరినన్= విజృంభింపగా; కౌరవ+సేన= కౌరవులసైన్యం; అతనిచేతన్= ఆ భీమునిచేత; చాపకట్టు+పడియెన్= నేలమట్టమయింది; అపుడు; ధరణిపతులు+ఇద్దరును= ఇద్దరు రాజులు(అటు కౌరవపతి దుర్యోధనుడును, ఇటు పాండవనేత ధర్మరాజును); చేయి+వీచి= హస్తమును ఊపి; అధిక+విక్రమమునన్= గొప్ప పరాక్రమంతో; తటిమిరి= ప్రోత్సహించారు.

తాత్పర్యం: రాజా! భీముడు విజృంభించిన కారణంగా కౌరవసేనకు విపరీతంగా నష్టం కలిగింది. ఇటు దుర్యోధనుడు, అటు ధర్మరాజు - తమసేనలను ప్రోత్సహించసాగారు.

వ. ఇవ్విధంబున ధర్మనందన దుర్యోధను లగ్గలికం బురికొలుప మొగ్గరంబులు రెండును గండు మిగిలి తలపడియె' ననిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 351

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ధర్మనందన, దుర్యోధనులు; అగ్గలికన్= పూనికతో; పురికొలుపన్= ప్రోత్సహింపగా; మొగ్గరంబులు+రెండును= ఉభయవ్యూహాలును; గండు+మిగిలి= పరాక్రమించి; తలపడియెన్= మార్కొన్నాయి; అనినన్+విని= అని సంజయుడు చెప్పగా ఆకర్ణించి; ధృతరాష్ట్రుడు; సంజయునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ రీతిగా ధర్మరాజును దుర్యోధనుడు పూనికతో ప్రోత్సహించగా, మకరవ్యూహంగా క్రౌంచ వ్యూహంగా- ఏర్పడిన పాండవ - కౌరవ సేనలు రెండూ, పరాక్రమంతో మార్కొన్నాయి' అని చెప్పగా విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఈ విధంగా అన్నాడు:

ఆ. ' మనబలంబునందు మంచి మగల్ సాల । గలిగి యా బలంబు గెలువలేమి
దైవకృతము గాదె! తలఁపఁ జోద్యము మున్న! యెఱుఁగఁ జెప్పె విదురుఁ డిట్టు లగుట. 352

ప్రతిపదార్థం: మన+బలంబునందున్= మనసేనలో; మంచి+మగల్= గొప్పవీరులు; చాలన్+కలిగి= ఎందరో ఉండి; ఆ బలమ్మున్= ఆ పాండవసేనను; గెలువన్+లేమి= జయించలేకపోవటం; దైవ+కృతము+కాదె!= దైవము చేసిన పనియే కదా!; తలఁపన్= యోచింపగా; చోద్యము= ఆశ్చర్యం; మున్ను+అ= ముందుగానే; విదురుఁడు; ఇట్టులు+అగుట= ఈ విధంగా జరుగగలదని; ఎఱుఁగన్= తెలిసేటట్లు; చెప్పెన్= వచించాడు.

తాత్పర్యం: 'మన సేనలో గొప్ప యోధులు ఎక్కువగా ఉన్నారుగదా! అయినా ఆ పాండవ సేనను జయింపలేకుండా ఉన్నారు. ఇది దైవకృతమే కదా! పైగా ఆశ్చర్యకరమైనది గదా! ఈ విధంగా జరుగగలదని విదురుడు ముందే చెప్పాడు.

క. అతఁ డెంత సాటి చెప్పిన । మతి హితముగఁ గొనఁడు కీడు మానఁడు కడు దు
ర్మతి యైన నా తనూజుఁడు । మతి కర్మము వెనుకఁ జనక మానునె? యెందున్. 353

ప్రతిపదార్థం: అతఁడు= దుర్యోధనుడు; ఎంత+చాటి+చెప్పినన్= ఎంతగా బహిరంగంగా చెప్పినప్పటికీ; మతి+హితముగన్= బుద్ధికి మంచిదిగా; కొనఁడు= స్వీకరింపడు; కడున్= మిక్కిలి; దుర్మతి+ఐన= చెడ్డబుద్ధి కలవాడైన; నా+తనూజుఁడు= నా కొడుకు; కీడు+మానఁడు= అపాయం తొలగించుకోడు; మతి= బుద్ధి; 'కర్మము' వెనుకన్= కర్మము వెనువెంట; చనన్+మానునె?+ఎందున్= ఎందైనా వెళ్ళక మానుతుందా?

తాత్పర్యం: ఎంతగా నొక్కి వక్కాణించినప్పటికీ దుర్యోధనుడు వినలేదు. కీడు తెచ్చుకున్నాడు. నా కొడుకు చెడ్డవాడు. అయితే - అది వాడి కర్మ. దైవకృతం ఎవరు తప్పించగలరు?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'బుద్ధిః కర్మానుసారిణీ' అనుదానికి తెలుగు: 'మతి కర్మము వెనుకఁ జనక మానునె?'

వ. విధికృతం బెవ్వరికి నుడుప వచ్చు నెట్లు గా నున్నది యట్లయ్యెడుం గాక ' యనిన సంజయుం డతని కి ట్లనియె. 354

ప్రతిపదార్థం: విధి+కృతంబు= దైవము చేసినది; ఎవ్వరికిన్= ఎవరికి; ఉడుపవచ్చున్= తప్పించటానికి వీలు అవుతుంది?; ఎట్లు+కాన్+ఉన్నది= ఏ విధంగా జరగాలో; అట్లు+అ= అట్ల= ఆ విధంగానే; అయ్యెడున్+కాక= జరుగుగాక; అనిన; సంజయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఎంతగా నొక్కి వక్కాణించినప్పటికి దుర్యోధనుడు వినలేదు. కీడు తెచ్చుకొన్నాడు. నా కొడుకు చెడ్డవాడు. అయితే, అది వాడి కర్మ. దైవకృతం ఎవరు తప్పించగలరు? బుద్ధి కర్మను అనుసరిస్తుంది. అంతే. ఏ విధంగా జరుగగలదో ఇక ఆ విధంగానే జరుగుగాక! ' - అని ధృతరాష్ట్రుడు బాధపడుతూ అనగా, సంజయు డిట్లా అన్నాడు:

ఆ. ' నీ తనూభవుండు నెఱిగుఱి యెఱుఁగమి । యెఱిఁగియెఱిఁగి యతని నేలచెప్ప ?
మన యుపేక్షవలన విను నాఁటి జూదంబ । నేఁడు గయ్య మయ్యె నృపవరేణ్య! 355

ప్రతిపదార్థం: నీ+తనూభవుండు= నీ కొడుకు దుర్యోధనుడు; నెఱి గుఱి= మంచినిండులక్ష్యం; ఎఱుఁగమి= తెలియకపోవటం; ఎఱిఁగి+ఎఱిఁగి= తెలిసి తెలిసి; అతనిన్= ఆతనిని; ఏల చెప్పన్?= చెప్పనేల(ఎందుకు నిందించాలి)?; మన+ఉపేక్ష+వలనన్= మన ఔదాసీన్యం వల్ల; నృప+వరేణ్య!= రాజశ్రేష్ఠుడా! (ఓ ధృతరాష్ట్ర మహారాజా); నాఁటి+జూదంబు+అ= అలనాటి జూదమే; నేఁడు= ఈ దినమునకు; కయ్యము= యుద్ధము; అయ్యెన్.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీవు దుర్యోధనుడిని నిందిస్తున్నావు. ఆ నింద వలన ప్రయోజనం ఏముంది? ఈనాడు జరుగుతున్న యుద్ధానికి నీ ఉపేక్షయే కారణం. ఆనాటి జూదమే ఈనాటి యుద్ధంగా పరిణమించింది.

విశేషం: కుహనాకర్మ సిద్ధాంతవాదులకు ఇది చక్కని సమాధానం. అంతా దైవంమీద బాధ్యత నెట్టివేయడం సమంజసం కాదు. ఆనాడు జూదమే జరగకపోతే ఈనాడు కురుక్షేత్ర సంగ్రామమే లేదు. ఆ నాడు జూదం ఆపకపోయిన బాధ్యత ఎవరిది? ధృతరాష్ట్రునిదే కదా! ధృతరాష్ట్రుడు చెప్పింది పరాజయవేదాంతం. పశ్చాత్తాపం కూడా కాదు. సంజయుడు దానికి చక్కని సమాధానం చెప్పాడు.

వ. ఇంకఁ బశ్చాత్తాపం బుడిగి ధీరుండ వై సమర ప్రకారంబు విను మట్టియెడ భీమసేనుండు భవత్సేనాసాగరంబు పాయ వడం దఱిమి చొచ్చి దుశ్శాసనుండును దుర్విషహుండును దుర్మదుండును దుస్సహుండును జయుండును జయత్సేనుండును వికర్ణుండును జిత్రసేనుండును సుదర్శనుండును జారుచిత్రుండును సువర్ముండును దుష్కర్ణుండును నొక్కచో నున్నం గనుంగొని యక్కుమారులం దాఁకిన. 356

ప్రతిపదార్థం: ఇంకన్= ఇకమీద; పశ్చాత్తాపంబు= తరువాత పడే ఆవేదన, చేసిన తప్పునకు చింతించి పడే వేదన; ఉడిగి= మాని; ధీరుండవు+ఐ= ధైర్యం కలిగిన వాడవు అయి (ఓర్పు కలిగినవాడివై); వినుము; అట్టి+ఎడన్= ఆ సమయంలో; భీమసేనుండు; భవత్+సేనా+సాగరంబు= నీ సేన అనే సముద్రం; పాయ+పడన్= చీలికకాగా; తఱిమి= తోలి; చొచ్చి= లోపల ప్రవేశించి; దుశ్శాసనుండును; దుర్విషహుండును; దుర్మదుండును; దుస్సహుండును; జయుండును; జయత్సేనుండును; వికర్ణుండును; చిత్రసేనుండును; సుదర్శనుండును; చారుచిత్రుండును; సువర్ముండును; దుష్కర్ణుండును (వీరందరూ ధృతరాష్ట్రుని కొడుకులు);

ఒక్కచోన్= ఒక స్థలంలోనే; ఉన్నన్+కనుంగొని= ఉండటం చూచి; ఆ+కుమారులన్= ఆ రాచ కొడుకులను, తాఁకినన్= మార్కొనగా.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఇక నీవు పశ్చాత్తాపం విడిచిపెట్టి ఆకర్ణించుము. ఆ సమయంలో భీముడు నీ సేనాసాగరాన్ని పాయలు చేసి ఒక్కచోట పలువురు నీ కుమారులు - దుశ్శాసనుడు, దుర్విషహుడు, దుర్మదుడు, దుస్సహుడు, జయుడు, జయత్సేనుడు, వికర్ణుడు, చిత్రసేనుడు, సుదర్శనుడు, చారుచిత్రుడు, సువర్మడు, దుష్కర్ణుడు - ఒక్కచోట కన్పించగా, మంచి అవకాశం దొరికినట్లు సంతోషించి వారిని మార్కొన్నాడు.

తే. **వారలందఱు నొండొరుఁ బేరువేరఁ । బిలిచికొని వీఁడె సనుదెంచె భీముఁ డీతఁ**
డొంటి యగపడ్డ చోటన యుక్కడంగఁ । బొదివి చంపుద మని యతిస్ఫురణ సేసి. 357

ప్రతిపదార్థం: వారలు+అందఱున్= కౌరవరాజకుమారులు అందరూ; ఒండొరున్= ఒకరినొకరిని; పేరు పేరునన్+పిలిచి+కొని= పేరులు పెట్టి ఆహ్వానించికొని; వీఁడు+ఎ= వీడె(ఇతడే); భీముఁడు; చనుదెంచెన్= వచ్చాడు; ఒంటి= ఒంటరిగా; అగపడ్డ+చోటన్= కనుపించిన స్థలమునందే; ఉక్కు+అడఁగన్= పరాక్రమం అణగారిపోగా; పొదివి= చుట్టుముట్టి; చంపుదము= సంహరిద్దాము; అని= అని చాటుతూ; అతి+స్ఫురణ+చేసి= ఎక్కువగా ఆలోచించి.

తాత్పర్యం: కౌరవ రాజ కుమారులు అందరు 'భీముడు ఒక్కడు ఏకాంతంగా ఒకచోట కనుపించాడు కదా! ఇప్పుడు ఇతడిని వదలరాదు. ఇది మంచి అవకాశం. మనమందరం ఇతడిని ఇప్పుడు చుట్టుముట్టి చంపుదాము' అని ప్రత్యక్షంగా దొరకిన సన్నివేశాన్ని సంగ్రహించి, పేరు పేరున ఒకరినొకరు హెచ్చరించుకొన్నారు.

క. **ఉగ్రగ్రహములు లయకా । లగ్రహపతిఁ బొదువు క్రియ నలఘువిక్రమగ**
ర్వాగ్రహమున ముట్టిరి రిపు । నిగ్రహలంపటుని భీమునిం జటులగతిన్. 358

ప్రతిపదార్థం: ఉగ్ర గ్రహములు= భయంకరమైన గ్రహాలు(ఆకాశంలో తిరిగే గోళాలు); లయకాల+గ్రహపతిన్= ప్రళయకాలంలో సూర్యుడిని; పొదువు+క్రియన్= చుట్టుముట్టేటట్లుగా; అలఘు విక్రమ గర్వ+ఆగ్రహమునన్= తక్కువగాని అనగా గొప్పదైన పరాక్రమంతో కూడిన మదముతో(కోపంతో); రిపు+ నిగ్రహ+లంపటునిన్= శత్రువులను జయించాలనే కోరిక గలవాడైన; భీముని; చటుల+గతిన్= వేగంగా; ముట్టిరి= మార్కొన్నారు.

తాత్పర్యం: భయంకరమైన ఆకాశ గోళాలు, ప్రళయకాలంలో సూర్యుని ముట్టడించేటట్లుగా, కౌరవ రాజకుమారులు గొప్ప పరాక్రమమంతో, గర్వంతో, ఆటోపంతో, శత్రువులను జయించాలనే కోరికతోనే మెలగే భీముడిని వేగంగా మార్కొన్నారు.

విశేషం: అలం: ఉపమ. గ్రహాలు సూర్యుని చుట్టూ తిరుగుతాయి. అందుకని సూర్యుడికి గ్రహరాజు అని పేరు. అయితే ప్రళయకాలంలో - గ్రహాలు - గతులు తప్పుతాయని అంటారు.

వ. **ఇట్లు నీ కొడుకులు చతురంగబలంబుతోడం జుట్టుముట్టిన వృకోదరుండు సంతసంబునం బొదలి సారథిం గనుంగొని 'నీ వీరథం బిచ్చట నిలిపికొని యుండు' మని నియోగించి గద పుచ్చికొని ధరణికి లంఘించి. 359**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నీ కొడుకులు; చతుః+అంగ+బలంబులతోడన్= నాలుగు సేనాంగాలతో; చుట్టుముట్టినన్; వృకోదరుండు= భీముడు (తోడేలు పొట్టవంటి పొట్టగలవాడు); సంతసంబునన్+పొదలి= సంతోషంతో ఒప్పి; సారథిన్+కనుంగొని=

సూతుని చూచి; నీవు; ఈ +రథంబు; ఇచ్చటన్= ఈ స్థలంలో; నిలిపికొని యుండుము= ఆపి ఉంచుము; అని+నియోగించి= అని ఆజ్ఞాపించి; గద+పుచ్చికొని= గద చేతపట్టు కొని; ధరణికిన్+లంఘించి= నేల మీదికి ఉరికి.

తాత్పర్యం: ఈ విధంగా నీ కొడుకులు తమ చతురంగ బలాలతో భీముడిని చుట్టుముట్టారు. భీముడికి - మంచి అవకాశం వచ్చినందుకు సంతోషం కలిగింది. అతడు సారథిని 'నీవు ఈ రథాన్ని ఇక్కడే భద్రంగా పెట్టుకొని ఉండుము' అని ఆజ్ఞాపించి, నేలమీదికి ఉరికాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 1. భీముడు ఒంటరిగా రథంమీద ఉంటే ఏం జరుగుతుంది? కౌరవరాజ కుమారులు పదిమంది చుట్టుముట్టారు. ఒక్కడు అందరితో - వారి చతురంగ బలాలతో యుద్ధం చేయాలి. అప్పుడు రథం భీముడికి మిక్కిలి ప్రమాదకరమైన చెరసాల అవుతుంది. రథంమీద విల్లుపట్టుకున్న భీమునికంటె - నేలమీద గద పుచ్చుకున్న భీముడే బలవంతుడు. స్వేచ్ఛాజీవి. రథంమీద ఉన్న భీముడిని గురిపెట్టి కొట్టవచ్చు. కానీ, నేలమీద ఉన్న భీముడు ఎక్కడ ఉన్నదీ ఎవరికీ తెలియదు. నేలమీద - భీముడు తన గొప్ప శారీరక బలాన్ని - అత్యద్భుతంగా వినియోగించుకోవచ్చు. అందుచేతనే అతడు రథం మీద నుండి నేలమీదకు దూకాడు.

చ. కవిసి యుగాంతదండధరుకైవడిఁ గోలుమసంగి కుంభముల్
పవులఁగఁ దుండముల్ దునియఁ బ్రక్కలు వ్రక్కలు గాఁగ దర్పముం
జవము బలంబు నొప్పఁగ గజంబుల వ్రేసిన నెత్తురొల్కఁగా
నవి వడె ధాతునిర్ఝ రమయాచలపంక్తులఁ బోలి మేదినిన్. 360

ప్రతిపదార్థం: కవిసి= మార్కొని; యుగ+అంత+దండధరుకైవడిన్= ప్రళయకాలంలోని యమునివలె; కోలుమసంగి= అతిశయించి; కుంభముల్= ఏనుగుల తలకాయలు; పవులఁగన్= బ్రద్దలైపోవునట్లుగా; తుండముల్=హస్తములు; తునియన్= ముక్కలుకాగా, ప్రక్కలు= కడుపు పార్శ్వములు; వ్రక్కలు+కాఁగన్= బీటలువారగా; దర్పమున్= ఆటోపము; జవమున్= శక్తి; బలంబున్= బలిమి; ఒప్పఁగన్= శోభిల్లగా; గజంబులన్= ఏనుగులను; వ్రేసినన్= కొట్టగా; నెత్తురు+ఒల్కఁగాన్= రక్తము కారగా; అవి= ఆ ఏనుగులు; ధాతు+నిర్ఝుర+మయ+అచల+పంక్తులన్+పోలి= గైరికాది ధాతువులతో కూడిన సెలయేళ్ళతో కూడిన పర్వతాల వరుసల వలె కన్పించి; మేదినిన్= భూమిమీద; పడెన్= కూలాయి.

తాత్పర్యం: భీముడు ప్రళయకాలంలోని యముడి వలె విజృంభించి, ఏనుగుల కుంభస్థలాలు పగులగొట్టాడు. తుండాలు నరికివేశాడు. కడుపులు వ్రక్కలు వ్రక్కలు చేశాడు. తన జవసత్త్వాలు చూపాడు. రక్తం స్రవించి అవి గైరికాది ధాతువులతో సెలయేరులతో కూడిన పర్వతాలుగా భాసించాయి. ఆ ఏనుగులు నేలమీద కూలిపడి పోయాయి.

విశేషం: అలం: ఉపమ. ఏనుగులు నేలమీద నెత్తురులు కారుతూ కొండలవలె పడి ఉన్నాయి. కొండలలో ధాతువులు ఉంటాయి. కొండలనుండి సెలయేరులు - ఎర్రని గైరికాది ధాతువులు కలిసి ప్రవహిస్తాయి. ఆ సెలయేళ్ళ వలె ఉన్నాయి ఏనుగుల శరీరాల నుండి కారే నెత్తురు ప్రవాహాలు.

క. అరదంబులు పొడిపొడి యై। హరుల గములు నుగ్గునూచ మై మొత్తపుఁగా
ల్వురు సిదురుప లై పడ ని। ష్ఠురగతి విహరించె వాయుసూనుఁడు గదతోన్. 361

ప్రతిపదార్థం: అరదంబులు= రథాలు; పొడి+పొడి+ఐ= చూర్ణమై; హరుల+గమి+లు= గుర్రాల గుంపులు; నుగ్గునూచము+ఐ= ముక్కలు చెక్కలై; మొత్తము+కాల్వురు= కాలుబలము అంతయు; చిదురుపలు+ఐ= చిన్న చిన్న ముక్కలై; పడన్= నేలమీద పడిపోగా; వాయు+సూనుఁడు= భీముడు; గదతోన్= గద చేతపట్టుకొని; నిష్ఠుర+గతిన్= మిక్కిలి కఠినంగా; విహరించెన్= ఇష్టానుసారం తిరిగాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రణరంగంలో భీముడు వీరవిహారం చేశాడు. గదాయుధం ధరించి రథం రణరంగంలో వెళ్ళలేని చోట్లకు భీముడు వెళ్ళగలిగాడు. రథాలను చూర్ణం చేశాడు. గుఱ్ఱాలను సూక్ష్మఖండాలుగా చేశాడు. కాల్బలం ముక్క చెక్కలైపోయింది. పాదచారియైన భీముడి ధాటికి ఎదురులేకపోయింది.

క. **పెక్కండ్రతోడ నిమ్మెయి । నొక్కరుఁడ రథమ్ము డిగ్గి యురవడిఁ జని పే**
రుక్కునఁ బోరుట సూడఁగ । నక్కజమై యుండెఁ గౌరవాన్వయముఖ్యా! 362

ప్రతిపదార్థం: కౌరవ+అన్వయ+ముఖ్యా!= కౌరవవంశంలో శ్రేష్ఠుడవైన వాడా!; ఓ ధృతరాష్ట్ర మహారాజా!; పెక్కండ్రతోడన్= పలువురితో; ఈ+మెయిన్= ఈ విధంగా; ఒక్కరుఁడు+అ= ఒక్కడే; రథమ్ము+డిగ్గి= తేరును దిగి; ఉరవడిన్+చని= వేగముగా వెళ్ళి; పేరు+ఉక్కునన్= గొప్ప పరాక్రమంతో; పోరుట= యుద్ధం చేయటం; చూడఁగన్= వీక్షింపగా; అక్కజము+ఐ+ఉండెన్= ఆశ్చర్యంగా ఉంది.

తాత్పర్యం: భీముడు - రథందిగి - ఒక్కడే పలువురితో పోరాడాడు. ధృతరాష్ట్ర మహారాజా! అతడి గొప్ప పరాక్రమం - చూచేవారికి మిక్కిలి ఆశ్చర్యం కలిగించింది.

ఆ. **భీమసేను నపుడు పెక్కుబలంబులు । పొదువు టెఱిఁగి ద్రుపదపుత్త్రకుండు**
శస్త్రగురునితోడ సరభసవృత్తి మైఁ । బోరిపోరి యుడిగి బుద్ధి గలఁగఁ. 363

ప్రతిపదార్థం: భీమసేనున్= భీముని; అపుడు; పెక్కు+బలంబులు= పెక్కుసేనలు; పొదువుట= చుట్టుముట్టటం; ఎఱిఁగి= తెలుసుకొని; ద్రుపద+పుత్త్రకుండు= ద్రుపదరాజు కొడుకు(ధృష్టద్యుమ్నుడు); శస్త్రగురునితోడన్= ద్రోణునితో; పోరి+పోరి= పోరాడి పోరాడి; ఉడిగి= విరమించి; బుద్ధి+కలఁగన్= మతి కలత చెందగా.

తాత్పర్యం: భీముడిని పలువురు కౌరవరాజుసుతులు తమ సేనలతో పాటు మూర్కొనటం విని, అంతవరకూ ద్రోణుడితో ఎడతెగని పోరాటం కొనసాగించిన ధృష్టద్యుమ్నుడు - ఆ పోరాటం విరమించి, కలత చెందిన బుద్ధితో (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **భూరిరయంబున నద్దెసఁ । దేరు వఱపఁ బనిచి యతని తేరిపయిం ద**
త్సారథిన కాంచి శోకము । గూరన్ గద్గదిక నెలుఁగు గుత్తుకఁ దగులన్. 364

ప్రతిపదార్థం: భూరి+రయంబునన్= గొప్పవేగంతో; ఆ+దెసన్= ఆవైపు(భీముడు ఉన్న దిక్కుగా); తేరు= రథము; వఱపన్+పనిచి= నడుప నియమించి; అతని+తేరిపయిన్= భీముని రథంపై; తద్+సారథిన్+అ= భీముడి సూతుడిని మాత్రమే; కాంచి= చూచి; శోకము+కూరన్= దుఃఖం నిండగా; గద్గదికన్= డగ్గుత్తికతో; ఎలుఁగు= స్వరం; కుత్తుకన్+తగులన్= గొంతుకలో పొరాడగా.

తాత్పర్యం: గొప్పవేగంతో రథం భీముడు ఉన్న దిక్కుగా తోలుమని ధృష్టద్యుమ్నుడు ఆజ్ఞాపించాడు. తేరు ఆ దిక్కుగా తరలింది. అయితే భీముడి రథంమీద భీముడు లేడు - అంతేగాక భీముడి సారథి మాత్రమే ఆ రథం మీద కన్పించాడు. ధృష్టద్యుమ్నుడు దుఃఖంతో డగ్గుత్తిక పడిన కంఠస్వరంతో (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **' ఆర్తుఁ డై యవ్విశోకుని నడిగె భీముఁ । డెచట నున్నాఁడు? నాయొడ లెట్లు ప్రాణ**
సహిత మై యుండు? నతఁడొకచందమైన । నేమిగతిఁ బోదు? నక్కట! యెఱుఁగఁ జెపుమ.' 365

ప్రతిపదార్థం: ఆర్తుఁడు+ఐ= దుఃఖపరవశుడై; ఆ+విశోకుని= ఆ విశోకుడు అను పేరుగల భీముని సారథిని; అడిగెన్= ప్రశ్నించాడు; భీముఁడు; ఎచటన్= ఎక్కడ; ఉన్నాడు; నా+ఒడలు= నా శరీరం; ఏ విధంగా; ప్రాణ+సహితము+ఐ+ఉండున్?= ప్రాణంతో కూడి ఉంటుంది?; అతఁడు= భీముడు; ఒక+చందము= ఒక విధం; ఐనన్= అయితే (ఒకవేళ భీముడు మరణించి ఉంటే - నా శరీరంలో ప్రాణం ఉంటుందా?); ఏమిగతిన్+పోదున్?= ఏ విధంగా నేను ఎక్కడకు వెళ్ళగలను?; అక్కట!= అయ్యో!; ఎఱుఁగన్+చెపుమ= తెలిసేటట్లు చెప్పవయ్యా.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు దుఃఖపరవశుడై విశోకుని ఇట్లా ప్రశ్నించాడు. 'భీముడు ఎక్కడ ఉన్నాడు? అతడు ఏమయినా అయితే నా శరీరంలో ప్రాణాలు నిలుస్తాయా? అకటా! నేనేమి కావాలి? ఏమి జరిగింది చెప్పవయ్యా?'

విశేషం: ఈ సన్నివేశం నాటకీయంగా ఉంది. తిక్కనది నాటకీయ శైలి అని విమర్శకులు అంటున్నారు. కథను సంభాషణ పూర్వకంగా నడపటం మాత్రమే గాక నాటకీయ సన్నివేశాలు సమకూర్చి, సహృదయుల ఉత్కంఠను పెంచటంలో తిక్కన సిద్ధహస్తుడు.

వ. అనిన విశోకుండు ధృష్టద్యుమ్నున కి ట్లనియె. 366

ప్రతిపదార్థం: అనినన్; విశోకుండు; ధృష్టద్యుమ్నునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు

తాత్పర్యం: ధృష్టద్యుమ్ను డీవిధంగా విశోకుడిని ప్రశ్నించగా - విశోకు డీవిధంగా సమాధానమిచ్చాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. గొదగొని ధార్తరాష్ట్రు లతిఘోరవిధంబునఁ జుట్టుముట్టినన్
మదమునఁ దేరు డిగ్గి హరిణంబులపైఁ జను సింహమో యనన్
గదఁ గొని నన్ను నియ్యెడ నకంపితసుస్థితి నిల్వఁ బంచి బె
ట్టిదముగఁ జొచ్చె నాహవ పటిష్ఠుఁడు భీముఁడు వారి సైన్యమున్. 367

ప్రతిపదార్థం: గొద+కొని= గుమిగూడి; ధార్తరాష్ట్రులు; అతి ఘోర విధంబునన్= మిక్కిలి భయంకరంగా; చుట్టు+ముట్టినన్ ; మదమునన్= గర్వంతో; తేరు+డిగ్గి= రథందిగి; హరిణంబులపైన్ చను సింహమో+అనన్= లేళ్ళమీదకు ఉరికే సింహమా? అనేటట్లుగా; గదన్+కొని= గద తీసికొని; నన్నున్; ఈ+ఎడన్= ఈ స్థలంలో; అకంపితసుస్థితిన్= కదలకుండగా; నిల్వన్+పంచి= నిలువుమని ఆజ్ఞాపించి; బెట్టిదముగన్= గొప్పగా; ఆహవ+పటిష్ఠుఁడు= యుద్ధ విశారదుడు(యుద్ధం చేయుటలో గొప్ప సామర్థ్యం కలవాడు; భీముఁడు= భీమసేనుడు; వారి+సైన్యమున్= కౌరవసేనను; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర రాజకుమారులు గుమిగూడి మిక్కిలి భయంకర రీతిలో భీముడిని చుట్టుముట్టారు. భీముడు గర్వంతో గద చేత పట్టుకొని - లేడి గుంపుపై దూకే సింహమో అనునట్లుగా రథం దిగి నన్ను ఇక్కడే కదలకుండా ఉండుమని ఆజ్ఞాపించి - యుద్ధం చేయటంలో శక్తి సామర్థ్యాలు కల భీముడు వారి సైన్యంలో దారుణంగా ప్రవేశించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. అని యవ్వల నెఱింగించిన నతండు. 368

ప్రతిపదార్థం: అని; అవ్వలను= భీముడుండే ఆ వైపు; ఎఱింగించినన్= తెలుపగా; అతండు= ధృష్టద్యుమ్నుడు.

తాత్పర్యం: విశోకుడు భీముడున్న వైపు తెలుపగా, ధృష్టద్యుమ్నుడు (తరువాతి పద్యంతో అన్వయం.)

ధృష్టద్యుమ్నుఁడు భీమసేనునకుఁ దోడ్పడుట (6-73-31)

క. కడువడిఁ జని యంతంతం। బుడమిఁ బడిన కరులగములు పొరలుటకతనన్
వడముడి యరిగిన తెరు వే। ర్పడఁ గని వేవేగ రథము వఱపెం గదియన్. 369

ప్రతిపదార్థం: కడు+వడిన్+చని= మిక్కిలి వేగంగా వెళ్ళి; అంత+అంతన్= అక్కడక్కడ; పుడమిన్= నేలమీద; పడిన= కూలిన; కరుల+గములు= ఏనుగుల గుంపులు; పొరలుటకతనన్= పడి దొర్లటం చేత; వడముడి= భీముడు; అరిగిన+ తెరువు+ ఏర్పడన్= వెళ్ళిన మార్గం స్పష్టంగా; కని= అరసి; వే+వేగన్= మిక్కిలి శీఘ్రంగా; కదియన్= సమీపించుటకై (భీముని దరి చేరుటకై); రథము+ వఱపెన్= రథం నడిపాడు.

తాత్పర్యం: విశోకుడు చూపిన వైపు మిక్కిలి వేగంగా వెళ్ళి అంతంత నేలమీదపడిన యేనుగుల గుంపులు దొర్లుతూ ఉండడంవల్ల భీముడు పోయిన దారి తెలుసుకొని అతడిని సమీపించడానికి శీఘ్రంగా రథాన్ని నడిపాడు.

వ. ఇట్లు భీమసేనుఁ జేరం బోయి. 370

ప్రతిపదార్థం: ఇట్లు+ఈ విధంగా; భీమసేనున్= భీముని; చేరన్+పోయి= సమీపించి.

తాత్పర్యం: ఈ విధంగా భీముని సమీపించి (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'ఇదె యేనుఁ గూడ వచ్చితిఁ। బదిలుఁడ వై పోరు మింక బకమర్దన! యీ
కదిసిన వీరులనెల్లం। గుదియించెద' ననుచుఁ గవిసెఁ గురువితతిపయిన్. 371

ప్రతిపదార్థం: బక+మర్దన!= బకుడు అనే రాక్షసుని సంహరించినవాడా! ఓ భీమా!; ఇదె= ఇదిగో; ఏను= నేను (నిను); కూడన్, వచ్చితిన్= కలిసికొని తోడు పడాలని వచ్చాను; పదిలుడవు+ఐ= క్షేమంగా ఉన్న వాడవు అయి; ఇంకన్+పోరుము= ఇంక యుద్ధం చేయుము; ఈ+కదిసిన+వీరులను+ఎల్లన్= నిన్ను మార్కొనిన ఈ యోధులను అందరనూ; కుదియించెదన్= అణచగలను; అనుచున్= అని చెప్పుచు; కురు+వితతిపైన్= కౌరవుల సమూహంపై; కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: 'బకాసురుడిని సంహరించిన ఓ భీమా! నిన్ను కలుసుకొని నీకు తోడు పడవలెనని నేను వచ్చాను. ఇంక నీవు క్షేమంగా యుద్ధం చేయవచ్చు. నిన్ను మార్కొనిన ఈ యోధులను అందరినీ నేను అణగగొట్టగలను.' అంటూ కౌరవుల సమూహాన్ని ఎదుర్కొన్నాడు.

క. అత్తఱి నీ తనయుం డెలుఁ। గెత్తి రథికవరులతోడ నిట్లను నీదు
ర్వృత్తునిఁ బొదువుఁడు భీముని। యుత్తలపా టుడుపుకడఁక నుడుపుఁడు గడిమిన్.' 372

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= ఆ తరుణమునందు; నీ+తనయుండు= నీ కొడుకు దుశ్శాసనుడు; ఎలుఁగు+ఎత్తి= కంఠస్వరం పెద్దదిగా చేసి; రథిక+వరులతోడన్= యోధ శ్రేష్ఠులతో; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; ఈ దుః+వృత్తునిన్= ఈ దుర్మార్గుని- ధృష్టద్యుమ్నుని; పొదువుఁడు= చుట్టుముట్టండి; భీముని+ఉత్తలపాటు= భీముని ఆవేదన; ఉడుపు+కడఁకన్= పోగొట్టే పూనికను; కడిమిన్= పరాక్రమంతో; ఉడుపుఁడు= పోగొట్టండి.

తాత్పర్యం: ఆ తరుణంలో, నీ కొడుకు దుశ్శాసనుడు, కంఠస్వరం పెద్దదిగా చేసి, యోధ వీరులతో ఈ విధంగా అన్నాడు. 'ఈ దుర్మార్గుని చుట్టుముట్టండి. భీముడి ఉత్తలపాటు పోగొట్టే పూనికను మీరు పరాక్రమంతోమాన్పించండి.

వ. అనిన విని యోధవీరులగు కుమారులు నొకపెట్ట ధృష్టద్యుమ్నుం బొదివిన నతండుఁ ద్రోణదత్తప్రమోహన బాణంబున వారి నందఱ నిశ్చేష్టితులం జేసిన నప్పుడు దప్పి దీర్చుకొన నెడగని యనిలనందనుం డొక్క మడువున మధురశిశిర జలంబులఁ బానంబు సేసి యుల్లసిల్లి యా ద్రుపదపుత్త్రుం గూడికొనియె నట్టియెడ నాచార్యుండు గయ్యంబు సేయుమునుమున ధృష్టద్యుమ్నుండు దొలంగిన తెఱపిం గదియఁ బాంచాలపతిఁ దఱిమిన నప్పు డగ్గురుండు నవ్వుచు. 373

ప్రతిపదార్థం: అనినన్+విని= అని చెప్పిన ఆకర్ణించి; యోధ+వీరులు+అగు= యుద్ధం చేసే శూరులలో శ్రేష్ఠులైన; కుమారులు= రాజపుత్రులు; ఒక్క+పెట్టన్= ఒకేసారిగా; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; పొదివినన్= చుట్టుముట్టగా; అతండు= ధృష్టద్యుమ్నుడు; ద్రోణ దత్త+ప్రమోహన బాణంబునన్= ద్రోణునిచే ఇవ్వబడిన 'ప్రమోహన' బాణంతో; (మూర్ఛ కలిగించే అమ్ముచే); వారిన్+అందఱన్= వారిని అందరినీ; నిస్+చేష్టితులన్+చేసినన్= చేష్టలు లేనివారిగ(మూర్ఛితులుగా) ఒనరించగా; అప్పుడు; ఒక్క మడువునన్= ఒక చెరువులో; దప్పి తీర్చుకొనన్= దాహం తీర్చుకొనటానికి; మధుర+శిశిర+జలంబులన్= తియ్యని చల్లని మంచినీళ్ళను; పానంబు+చేసి= త్రాగి; ఉల్లసిల్లన్= శోభిల్లగా; ఎడన్+కని= వ్యవధి ఏర్పరచుకొని; అనిలనందనుండు= భీముడు; ఆ ద్రుపద+రాజ+పుత్త్రున్= ఆ ధృష్టద్యుమ్నుని (ద్రుపదరాజు పుత్రుని);కూడికొనియెన్= కలిశాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆచార్యుండు= ద్రోణుడు; కయ్యంబు+చేయు+మునుమునన్= యుద్ధం చేసే సేనా ముఖమున; ధృష్టద్యుమ్నుండు; తొలఁగిన; తెఱపిన్+కదియన్= వ్యవధి ఏర్పరచికొని; పాంచాల+పతిన్= పాంచాల రాజును (ద్రుపదుని); తఱిమినన్= తోలగా; అప్పుడు; ఆ+గురుండు= ఆ ద్రోణుడు; నవ్వుచు.

తాత్పర్యం: అని దుశ్శాసనుడు చెప్పగా విని, యోధులలో శ్రేష్ఠులు అయిన ఆ కౌరవ రాజకుమారులు ఒకేసారిగా అందరూ కలిసి ధృష్టద్యుమ్నుడిని చుట్టుముట్టారు. ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిచే తనకు ఇవ్వబడిన 'ప్రమోహన బాణము' ప్రయోగించి రాజపుత్రులను మూర్ఛలో మునిగేటట్లు చేశాడు. భీముడు ఆ వ్యవధిని పురస్కరించుకొని - ఒక మడువులో చల్లని తియ్యని మంచినీరు త్రాగి, సేదతీరి, ధృష్టద్యుమ్నుని కలుసుకున్నాడు. అప్పుడు - ద్రోణుడు సేనాముఖంలో ధృష్టద్యుమ్నుడు కనిపించక, లభించిన వ్యవధిలో ద్రుపద రాజుపై విజృంభించి అతనిని తరిమికొట్టగా - అలవోకగా నవ్వుతూ.

విశేషం: 1. ధృష్టద్యుమ్నుడు ద్రోణుని శిష్యుడే. గురువుగారు ప్రసాదించిన 'ప్రమోహన' బాణమునే అతడు కౌరవులపై ప్రయోగించాడు. 2. అవకాశం దొరికితే చాలు - తన్ను అవమానించిన ద్రుపదుడిపైకి ఉరుకుతాడు ద్రోణుడు. 3. ఒంటరిగా చాలాసేపు యుద్ధం చేయటం చేత భీముడికి దాహం అయింది. ప్రమోహన బాణం ప్రసాదించిన తెరపిలో ఆతడు దాహం తీర్చుకున్నాడు. అనగా భీముడు ఆకలి దప్పులు మరచి యుద్ధం చేసే వీరుడు అన్నమాట.

తే. అస్త్రవర్షంబుఁ గురియంగ నతఁడు పూర్వ । వైరబంధంబుకతన దుర్వార మైన
యతని రోషంబు సైరింప నలవిగాక । జడిసి పోయిన నాతండు శంఖమొత్తె. 374

ప్రతిపదార్థం: అస్త్ర+వర్షంబున్+కురియంగన్= మంత్ర బాణముల వాన వర్షింపచేయగా; అతఁడు= ద్రుపదరాజు; పూర్వ వైర బంధంబు కతనన్= లోగడ ఏర్పడిన శత్రుత్వం అనే బంధం వలన; అతని+రోషంబు= ద్రోణుడి కోపం; సైరింపన్= ఓర్చి కొనుటకు; అలవి కాక= శక్యంగాక; జడిసి= భయపడి; పోయినన్= వెడలిపోగా; ఆతండు= ద్రోణుడు; శంఖము+ఒత్తెన్= శంఖాన్ని పూరించాడు.

తాత్పర్యం: ద్రోణుడు ద్రుపదుడిపై బాణవర్షం కురిపించాడు. ద్రుపదుడు - లోగడ తనకు ద్రోణుడికి ఏర్పడిన శత్రుత్వం వలన ఆతని కోపం భరించలేక భయపడి అక్కడ నుండి వెళ్ళిపోయాడు. విజయగర్వంతో ద్రోణుడు తన శంఖం పూరించాడు.

విశేషం: ద్రుపద మహారాజు, ద్రోణుడు బాల్య మిత్రులు. సతీర్థ్యులు. ఒకే గురువు దగ్గర విలువిద్య నేర్చుకున్నారు. తదుపరి ద్రుపదుడు సింహాసనం ఎక్కి పాంచాలరాజు అయ్యాడు. ద్రోణుడు బీద బ్రాహ్మణుడిగా మిగిలిపోయాడు. తదుపరి తన కొడుకు అశ్వత్థామ పాలకోసం గోదానం అభ్యర్థిస్తూ ద్రోణుడు పాంచాలరాజు దగ్గరకు వెళ్ళి, బాల్య స్నేహం ఉదాహరిస్తాడు. ద్రుపదుడు తన్ను యాచన చేయటానికి వచ్చిన నిర్భాగ్యుడు బాల్య సఖుడుగా తన్ను సంబోధించటం ఇష్టంలేక అతడిని అవమానించి పొమ్మన్నాడు. ఆనాటి నుండి ద్రోణుడు ద్రుపదుడిపై పగబట్టాడు. తదుపరి, అర్జునుడిచేత గురుదక్షిణగా ద్రుపదుడిని తన వద్దకు బందీకృతుడిగా తెప్పించుకొన్నాడు. అంతేగాక, కురురాజులకు పాంచాల ప్రభువులకు తరతరాల నుండీ శత్రుత్వం ఉన్నది. దుర్యోధనుడికి - పాంచాల రాజుపై ఏర్పడిన శత్రుత్వం కలిసివచ్చింది - (చిట్టచివరకు ద్రోణుడి కంఠం ఉత్తరించినది.. ధృష్టద్యుమ్నుడు. ద్రోణుని చంపగల పుత్రుడు కావాలని వరం కోరుకొన్నాడు. ద్రుపదుడి తపఃఫలంగా. కారణజన్ముడైన ధృష్టద్యుమ్నుడు కలిగాడు.)

వ. ఇట్లు ద్రోణుండు ద్రుపదుం దెరల్చి ధృష్టద్యుమ్ను చనినవల నరసి తదీయ ప్రమోహనమార్గణమూర్ఛితం బయిన శూరలోకంబు నాలోకించి కరంబు రయంబునఁ బోయి. 375

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ద్రోణుండు; ద్రుపదున్= ద్రుపదరాజును; తెరల్చి= ఓడించి (మరలించి); ధృష్టద్యుమ్ను+చనిన+వలను+అరసి= ధృష్టద్యుమ్నుడు పోయిన దిక్కు చూచి; తదీయ ప్రమోహన బాణ మూర్ఛితంబు+అయిన= ఆతనియొక్క ప్రమోహన బాణంచే మూర్ఛపోయిన; శూర లోకంబున్= వీరుల సముదాయాన్ని; ఆలోకించి= చూచి; కరంబు+రయంబునన్= మిక్కుటమగు వేగంతో; పోయి.

తాత్పర్యం: ఈ విధంగా ద్రోణుడు ద్రుపదుడిని మరల్చి, ధృష్టద్యుమ్నుడు వెళ్ళిన తెరువుచాలు అరసి, ఆతడి ప్రమోహన బాణంచేత మూర్ఛితులైన యోధులను చూచి, వేగంగా అక్కడకు వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినుతప్రజ్ఞాబాణం । బున మోహనబాణశక్తి వోఁ జేసిన సం
జనిత ప్రాణోజ్జ్వలు లై । యనికిం గ్రమ్మఱ గడంగి రయ్యోధవరుల్. 376

ప్రతిపదార్థం: వినుత ప్రజ్ఞా బాణంబునన్= పొగడబడిన ప్రజ్ఞాబాణంతో; మోహన బాణ శక్తి= మోహన బాణము యొక్క శక్తిని; పోన్+చేసినన్= పోగొట్టగా; సంజనిత+ప్రాణ+ఉజ్జ్వలులు+ఐ= తిరిగి అవతరించిన ప్రాణాలచేత ప్రకాశించునట్టివారై; ఆ+యోధవరుల్= ఆ వీరశ్రేష్ఠులు; అనికిన్= యుద్ధానికి; క్రమ్మఱన్= తిరిగి; కడంగిరి= పూనిక వహించారు.

తాత్పర్యం: ద్రోణుడు ప్రజ్ఞాబాణం ప్రయోగించి, మోహనబాణ శక్తిని పోగొట్టారు. అప్పుడు తిరిగి కోలుకొన్న ప్రాణాలతో ఆ కౌరవరాజపుత్రులు మళ్ళీ యుద్ధం ప్రారంభించారు.

విశేషం: మోహన బాణానికి విరుగుడు ప్రజ్ఞాబాణం.

వ. ఇవ్విధంబున నాచార్యు ప్రాపునం జేసి యేచి నీ కొడుకులు పవనద్రుపదుల కొడుకులపై నడరినం గని యుధిష్ఠిరుండు గేకయు లేవురను ద్రౌపదేయులను ధృష్టకేతునిం జూచి మీ రభిమన్యుండు ముంగలిగా రథంబులు వఱపి భీమసేన ధృష్టద్యుమ్నులకుఁ దోడుపడుం డని పంచిన. 377

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ఆచార్యు+ప్రాపునన్+చేసి= ద్రోణుని సాయం వలన; ఏచి= విజృంభించి; నీ కొడుకులు= నీ పుత్రులు; పవన ద్రుపదుల కొడుకులపైన్= వాయు పుత్రుడైన భీముడిపై, ద్రుపదపుత్రుడైన ధృష్టద్యుమ్నుడిపై; అడరినన్= విజృంభింపగా, కని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; కేకయులు+ఏవురను= కేకయ ప్రభువులు అయిదుగురును; ద్రౌపదేయులను= ఉపపాండవులను ఐదుగురిని; ధృష్టకేతునిన్+చూచి= ధృష్టకేతుని వీక్షించి; మీరు; అభిమన్యుండు; ముంగలిగాన్=

ముందుండువాడుగా; రథంబులు+పఱపి= ఆ రథాలు తోలించి; భీమసేన+ధృష్టద్యుమ్నులకున్= భీముడికీ, ధృష్టద్యుమ్నునకు; తోడుపడుండు= సాయము చేయండి; అని పంచినన్= అని నియమించగా.

తాత్పర్యం: ఈ విధంగా ద్రోణుని సాయం వలన, నీ కొడుకులు భీముడిపై ధృష్టద్యుమ్నుడిపై విజృంభించారు. దానిని చూచి - ధర్మరాజు కేకయులను అయిదుగురిని - ద్రౌపది కొడుకులు అయిదుగురిని - అభిమన్యుడి ముందు పెట్టుకొని వెళ్ళి భీముడికీ ధృష్టద్యుమ్నుడికీ సాయం చేయండి అని ఆదేశించాడు.

క. ఆ పన్నిద్దఱు సైన్యా। టోపసమేతముగఁ గవియుడును బాంచాల
క్ష్మా పాలుసుతుఁడు భీముఁడు। నేపారిరి నీదుసేన యెసకం బడఁగన్. 378

ప్రతిపదార్థం: ఆ+పన్నిద్దఱు= ఆ పన్నెండుమంది; సైన్య+ఆటోప+సమేతముగాన్= తమ సైన్యాలతోపాటు గర్వంగా; కవియుడును= మార్కొనగా; పాంచాల క్ష్మాపాల సుతుఁడు= పాంచాల రాజపుత్రుడు (ధృష్టద్యుమ్నుడు); భీముఁడు; నీదు+సేన+ఎసకంబు= నీ సేన అతిశయం; అడఁగన్= అణగారునట్లుగా; ఏపారిరి= విజృంభించారు.

తాత్పర్యం: ఆ పంద్రెండుగురు అనగా ఐదుమందికేకయులూ, అయిదుగురు ఉపపాండవులు, అభిమన్యుడూ, ధృష్టకేతుడూ తమ సైన్యాలతో సహా గర్వంగా మార్కొనగా, ద్రుపదరాజ పుత్రుడు ధృష్టద్యుమ్నుడు, మరియు భీముడు నీ సేన యొక్క అతిశయం అణగారి పోయేటట్లుగా విజృంభించారు.

వ. తదవసరంబున. 379

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

తే. ' క్రందుఁ గయ్యంబులోన నరాతిభయద। బాహువిక్రమ! నీ విట్లు పాదచారి
వగుట వల దని కేకయునరద మెక్కఁ' బనిచె భీమునిఁ బాంచాలపతిసుతుండు. 380

ప్రతిపదార్థం: క్రందు+కయ్యంబులోనన్= అతిశయించుతున్న యుద్ధంలో(సందడి యుద్ధంలో); అరాతి+భయద+బాహు+విక్రమ!= శత్రువులకు భయం కలిగించే బాహు పరాక్రమం గలవాడా - భీమసేనా!; నీవు; ఇట్లు; పాదచారివి+అగుట= కాలినడక చేసే వాడివి అగుట; వలదు= కూడదు; అని= అని చెప్పి; పాంచాల పతి సుతుండు= పాంచాల రాజు కొడుకు ధృష్టద్యుమ్నుడు; కేకయు= కేకయ రాజు యొక్క; అరదము= రథం; భీమునిన్ ఎక్కన్+పనిచెన్= ఎక్కుమన్నాడు.

తాత్పర్యం: 'శత్రువులకు భయం కలిగించే భుజ పరాక్రమం కల ఓ భీమసేనా! ఇది దొమ్మియుద్ధం. నీవు ఈ రీతిగా పాదచారివి కాకూడదు' అని చెప్పి, ధృష్టద్యుమ్నుడు భీముడిని కేకయుని రథంమీదికి ఎక్కుమన్నాడు.

క. అప్పుడు మధ్యందినమున। నొప్పినయినుతోడఁ జాల నొర వచ్చి గురుం
డప్పాండవబలములపైఁ। దెప్పదెరలఁ గురిసె శరతతిం దీవ్రముగన్. 381

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; మధ్యందినమునన్= మట్టమధ్యాహ్నకాలమున; ఒప్పిన= శోభిల్లిన; ఇనుతోడన్= సూర్యుడితో; చాలన్; ఒర+వచ్చి= సామ్యం గలవాడై, సమానుడై; గురుండు= ద్రోణుడు; ఆ+పాండవ+బలములపైన్= ఆ పాండవు ల సేనలపై; శర తతిన్= బాణాల సముదాయమును; తీవ్రముగాన్= ఉగ్రముగా; తెప్పతెరలన్= అతివేగంగా; కురిసెన్= వర్షించాడు.

తాత్పర్యం: ఆ సమయంలో ద్రోణుడు - మధ్యాహ్న కాలంలోని సూర్యుని పోలుతూ, ఆ పాండవసేనలపై తీవ్రమైన బాణాల సముదాయాన్ని అతివేగంగా ప్రయోగించాడు.

చ. కనుఁగొని పార్షతుం డపుడు గట్టుపకాసయి వీఁకఁ దాఁకినం
దునిమె నతండు తద్ధనువుఁ దోడన పెక్కు శరంబు లేసె నా
తని మెయి నొండువిల్లు ద్రుపదక్షితిపాలసుతుండు గ్రక్కునం
గొని శరసప్తతిం గురిసి కోపముఁ బెంచిన నాతఁ డుగ్రతన్. 382

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; పార్షతుండు= పృషతుని వంశీయుడు - ధృష్టద్యుమ్నుడు; అపుడు; కట్టుపకాసి+అయి= ధీరుడు అయి; వీఁక+తాఁకినన్= ఉత్సాహంతో మార్కొనగా; అతండు= ద్రోణుడు; తద్+ధనువు= అతడి విల్లు (ధృష్టద్యుమ్నుడి విల్లు); తునిమెన్= విరుగగొట్టాడు; తోడన= వెనువెంటనే; పెక్కు+శరంబులు= అనేక బాణాలు; ఏసెన్= ప్రయోగించాడు; ఆతని+మెయిన్= ధృష్టద్యుమ్నుని శరీరంపై; ద్రుపదక్షితిపాల సుతుండు= ద్రుపదరాజపుత్రుడు; ఒండు+విల్లు= ఇంకో ధనుస్సు; గ్రక్కునన్= వేగంగా; కొని= స్వీకరించి; శర+సప్తతిన్+కురిసి= డెబ్భై బాణాలు ప్రయోగించి; కోపమున్= ఆగ్రహం; పెంచినన్= అతిశయింపజేయగా; ఆతఁడు= ద్రోణుడు; ఉగ్రతన్= భయంకరంగా.

తాత్పర్యం: ద్రోణుడి విజృంభణ చూచి ధృష్టద్యుమ్నుడు - ఆ సమయంలో ధీరుడై ఉత్సాహంతో అతడిని మార్కొన్నాడు. ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి విల్లు ఖండించి, వెనువెంటనే ఆతని శరీరంపై అమ్ములు గుప్పాడు. ధృష్టద్యుమ్నుడు వేరొక విల్లు పట్టుకొని ద్రోణుడిపై డెబ్భై బాణాలు వేశాడు. ద్రోణుడు ఆగ్రహించి, భయంకరుడై (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'గట్టుపకాసి' (లేదా) 'కట్టుపకాసు' ఈ మాటకు అర్థం - 'వీరుడు (శూరుడు)'. శబ్దరత్నాకరంలో ఈ శబ్దం 'క'తో మొదలై ఉన్నది. అచలుడు అని అర్థం ఇవ్వబడింది. బ్రౌను నిఘంటువులో 'గ' తో మొదలై - గట్టుపకాసి అని గట్టుపకాసి = గట్టువలె ప్రకాశించువాడు - పర్వత ధీరుడు అని ఉంది. బ్రౌను స్వీకరించిన శబ్దమే సమంజసంగా తోచుతున్నది. సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'ఇది ఇంకను ఆలోచింపదగినది' అని ఉన్నది.

క. ఆ విల్లు ద్రుంచి రౌద్రర । సావేశంబొప్ప నాలుగమ్ముల రథవా
హావలిని సూతు నొక్కట । దేవగణము వొగడ వసుమతిం బడ నేసెన్. 383

ప్రతిపదార్థం: ఆ విల్లున్ త్రుంచి= ఆ ధనుస్సును ఖండించి; రౌద్ర రస+ఆవేశంబు+ఒప్పన్= క్రోధరసం యొక్క సంరంభం శోభిల్లగా; నాలుగు+ అమ్ములన్= నాలుగు బాణాలతో; రథ వాహ+ఆవలిని= తేరుకు పూన్చిన గుర్రాల సముదాయాన్ని; ఒక్కటన్= ఒక బాణంతో; సూతున్= సారథిని; దేవ+గణము= దేవతల గుంపు; పొగడన్= ప్రశంసింపగా; వసుమతిన్+పడన్+ఏసెన్= నేలపై కూల్చాడు.

తాత్పర్యం: ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి ధనువు ఖండించి, మిక్కుటమగు కోపంతో - నాలుగు బాణాలతో అతడి గుర్రాలను, ఒక బాణంతో అతడి సారథిని - దేవతలు కీర్తించేటట్లుగా నేలపై కూల్చాడు.

విశేషం: 'రౌద్ర రస+ఆవేశంబు' - తిక్కన 'రస' శబ్దాన్ని ఎన్నో సారులు ప్రయోగించాడు. 'రసము' అని వాచ్యంగా చెప్పటం కావ్య శిల్పమునకు అపకర్ష అని వాదించే విమర్శకులు ఉన్నారు. 'రస' శబ్దం నవరసపరంగా ఆలంకారికముగానే తిక్కన వాడలేదు. రసమును ఆర్ద్రభావంగా స్వీకరించవచ్చును. రసములు ఎన్ని? 'అనంతో వై రసాః' - 'రసములు అనంతములు' అనే సుప్రసిద్ధ వాదం ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. విరథుండై యభిమన్యు తేరిపయికిన్ వేగంబ పాంచాలభూ
వరసూనుం డరుగం దదీయబల మోర్వం జాల కొక్కుమ్మడిన్
మరలంబాఱె నతండు వాయుసుతుఁడున్ మానింప మానింప న
ప్డు రథానీకముతోడ భీముఁ బొదివెన్ భూమీశ్వరుం డుద్ధతిన్. 384

ప్రతిపదార్థం: విరథుండు+ఐ= రథం లేనివాడై; వేగంబు+అ= వేగంబ= మిక్కిలి శీఘ్రంగా; పాంచాల భూవర సూనుండు= పాంచాల రాజపుత్రుడు(ధృష్టద్యుమ్నుడు); అభిమన్యు+తేరి+పయికిన్= అభిమన్యుని రథంమీదికి; అరుగన్= వెళ్ళగా; తదీయ+బలము= అతని సేన; ఓర్వన్+జాలక= ద్రోణుని ధాటికి సహింపలేక; ఒక్కుమ్మడిన్= కలిసికట్టుగా(అందరూ ఏకంగా); మరలన్+పాఱెన్= మరలిపారిపోయింది; అతండు= ధృష్టద్యుమ్నుడు; వాయుసుతుఁడున్= భీముడును; మానింపన్+మానింపన్= ఆపగా, ఆపగా; అప్డు= ఆ సమయంలో; రథ+అనీకముతోడన్= రథసేనతో; భూమీశ్వరుండు= రాజు(దుర్యోధనుడు); భీమున్; ఉద్ధతిన్= గర్వంతో; పొదివెన్= చుట్టుముట్టాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు - విరథుడై అభిమన్యుడి రథం మీదికి పోయాడు. ఆతడి సేన ద్రోణుడి ధాటికి తట్టుకోలేక పారిపోయింది. అప్పుడు అతడు, భీముడు - పారిపోయే సేనను ఆపారు. ఆ సమయంలో దుర్యోధనుడు తన రథ సేనతో వచ్చి సగర్వంగా భీముడిని చుట్టుముట్టాడు.

ధృష్టద్యుమ్నుఁడు ద్రోణునితో యుద్ధము సేయుట (సం. 6-73-67)

తే. అంత నొం డొకసారథి యతిరయమునఁ। జటులహయములఁ బూన్పఁ బాంచాలసుతుఁడు
దన రథమునకు గ్రక్కునఁ జని పరాక్ర। మాభిరాముఁడై గురునిపై నడరెఁ బెలుచ. 385

ప్రతిపదార్థం: అంతన్= పిదప; ఒండు+ఒక+సారథి= ఇంకొక సూతుడు; అతి రయమునన్= మిక్కిలి వేగంగా; చటుల హయములన్= వేగంగా పోయే గుర్రాలను; పూన్పన్= తన రథానికి కట్టగా; పాంచాల సుతుఁడు= ధృష్టద్యుమ్నుడు; గ్రక్కునన్+చని= వేగంగా వెళ్ళి; పరాక్రమ+అభిరాముడు+ఐ= పరాక్రమము చేత అందగించినవాడై; పెలుచన్= ఆటోపంతో; గురునిపైన్= ద్రోణుడిపై; అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: అంతటఁ, మరియొక సారథి, మిక్కిలి వేగంతో శీఘ్రంగా పరుగెత్తే గుర్రాలను తన రథానికి పూన్పగా, ధృష్టద్యుమ్నుడు తన రథం ఎక్కి, పరాక్రమంతో శోభిల్లి తిరిగి ద్రోణుడిపై విజృంభించాడు.

వ. ఇట్లు ధృష్టద్యుమ్నుండు గడంగి యెప్పటియట్ల కుంభసంభవుతోడం బెనంగుచుండ భీమసేనుండును.386

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; కడంగి= పూని; ఎప్పటి+అట్లు+అ= యథాప్రకారం; కుంభ+సంభవుతోడన్= ద్రోణునితో; పెనంగుచుండన్= విరమించని పోరాటం సలుపుచుండగా; భీమసేనుండును= భీముడు గూడ;

తాత్పర్యం: 'ఈ విధంగా ధృష్టద్యుమ్నుడు తిరిగి వెనుకటి మాదిరిగా ద్రోణునితో పోరాటం ప్రారంభించగా, భీముడు కూడ.

క. తనయరదంబు విశోకుఁడు। గొనివచ్చిన నెలమి నెక్కి క్రూరోత్సాహం
బునఁ దనుఁ బొదివిన దుర్యో। ధనుమీఁద నిశాతవిశిఖతతి నిగిడించెన్. 387

ప్రతిపదార్థం: తన+అరదంబున్= తన రథాన్ని; విశోకుఁడు= భీముని సారథి; కొనివచ్చినన్= తీసికొని రాగా; ఎలమిన్+ఎక్కి= సంతోషంతో ఆరోహించి; క్రూర+ఉత్సాహంబునన్= కఠినమైనట్టి ఉద్వేగముతో కూడిన పూనికతో; తనున్= తన్ను; పొదివిన= చుట్టుముట్టిన; దుర్యోధనుమీఁదన్= దుర్యోధనుడిపై; నిశాత+విశిఖ+తతిన్= వాడియైన అమ్ముల గుంపులు; నిగిడించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: అంతలో విశోకుడు తన రథాన్ని తోలుకొని తెచ్చాడు. భీముడు సగర్వంగా ఆ రథాన్ని ఎక్కి, కరకుదనం ఉప్పొంగే పూనికతో తన్ను చుట్టుముట్టిన దుర్యోధనుడిపై అమ్ములవాన కురిపించాడు.

క. **కురుపతి యొక నారాచం। బురమున నాటింప భీముఁ డుగ్రత నేసెన్**
గురుతరశరత్రయంబున। గరములు వక్షమును నాటఁ గౌరవనాథున్. **388**

ప్రతిపదార్థం: కురుపతి= కురురాజు(దుర్యోధనుడు); ఒక+నారాచంబు= ఒక బాణం; ఉరమునన్= వక్షమునందు; నాటింపన్= గ్రుచ్చుకొనేటట్లు వేయగా; గురుతర+శర+త్రయంబునన్= గొప్పవైన మూడు బాణాలతో; కౌరవనాథున్= దుర్యోధనుడిని; కరములు= చేతులు; వక్షమును= ఉరమును; నాటన్= గ్రుచ్చికొనునట్లుగా; భీముఁడు= భీమసేనుడు; ఉగ్రతన్+ఏసెన్= భయంకరముగా ప్రయోగించాడు.

తాత్పర్యం: ఒక బాణంతో దుర్యోధనుడు భీముడి వక్షమును తాకేటట్లు కొట్టాడు. భీముడు - మూడు బాణాలను, దుర్యోధనుడి రెండు చేతులందు - రొమ్ముపైన గ్రుచ్చుకొనేటట్లుగా, భయంకరంగా ప్రయోగించాడు.

వ. **దాని కతండు చలింపక వృకోదరుపై వివిధశరంబులేసె నతనితమ్ములు దలకడచి యాభీమసేనుం బట్టికొన నుత్సహించి యెప్పటియట్ల బెట్టిదంబుగాఁ గవిసినం గని యక్కుమారుల నభిమన్యు ద్రౌపదేయులును ధృష్టకేతు కేకయులునుం దాఁకి రట్లు వారును నమ్మారుతియుం గూడి దారుణభంగిం దఱుముట సైరింపం జాలక.** **389**

ప్రతిపదార్థం: దానికిన్+అతండు చలింపక= భీముడు వేసిన మూడు బాణాలకు దుర్యోధనుడు కదలక; వృకోదరుపైన్= భీముడిపై; వివిధ శరంబులు= పెక్కు అమ్ములు; ఏసెన్= ప్రయోగించాడు; అతని తమ్ములు= దుర్యోధనుడి సోదరులు; తలకడచి= విజృంభించి; ఆ భీమసేనున్= ఆ భీముని; పట్టికొనన్+ఉత్సహించి= పట్టుకోవాలని ఉత్సాహంతో ప్రయత్నించి; ఎప్పటి+అట్ల+అ= ఎప్పటి మాదిరిగానే(యథాప్రకారంగా); బెట్టిదముగాన్= ఎక్కువగా; కవిసినన్= మార్కొనగా; కని; ఆ+కుమారులన్= ఆ కౌరవరాజపుత్రులను; అభిమన్యు, ద్రౌపదేయులును= అభిమన్యుడు - ద్రౌపది కొడుకులును; ధృష్టకేతు+కేకయులున్; తాఁకిరి= మార్కొన్నారు; అట్లు; వారును= అభిమన్యుడు మున్నగువారును; మారుతియున్= భీముడును; కూడి= కలిసికొని; దారుణ+భంగిన్= భయంకరముగా; తఱుముట= మార్కొనటం; సైరింపన్+చాలక= ఓర్వక.

తాత్పర్యం: దుర్యోధనుడు భీముడి బాణాలకు చలింపక - అతడిపై పెక్కు అమ్ములు ప్రయోగించాడు. దుర్యోధనుడి తమ్ములు పైకి విజృంభించి, ఆ భీమసేనుడిని పట్టుకోవాలని, ఉత్సాహంతో అతడిని యథాప్రకారం మార్కొన్నారు. అప్పుడు అభిమన్యుడు, ద్రౌపది తనయులు ధృష్టకేతుడు, కేకయులు - భీముడికి బాసటగా నిలిచారు. భీముడు, వారందరు కలిసి భయంకరంగా కౌరవరాజకుమారులపై విజృంభించారు. వారి ధాటికి కౌరవరాజకుమారులు తట్టుకోలేకపోయారు.

క. **విఱిగి భవత్సుత నివహం। బఱిముఱిఁ గనుకనిఁ జనంగ ననిలసుతుం డే**
డ్తెఱ నెగచి వగచె వారం। దఱుఁ దనచేఁ జచ్చుటపుడు దప్పుటకుఁ గడున్. **390**

ప్రతిపదార్థం: విఱిగి= ఓడిపోయి; భవత్+సుత+ నివహంబు= నీకొడుకుల సముదాయం; అతిముఱిన్= వేగంగా; కనుకనిన్+చనంగన్= భయపడి వెడలిపారిపోగా; అనిల+సుతుండు= వాయుపుత్రుడు(భీముడు); ఏడ్తెఱన్= పరాక్రమంతో; ఎగచి= విజృంభించి; వారు+అందఱున్= ఆ కౌరవరాజపుత్రులు అందరూ; తనచేన్+చచ్చుట+అపుడు+తప్పుటకున్= అపుడు తనచే చావకుండా తప్పించికొనిపోవటానికి; కడున్= మిక్కుటముగా; వగచెన్= విచారించాడు.

తాత్పర్యం: ఓడిపోయి నీ కుమారవర్గం భయంతో వేగంగా పారిపోయారు. భీముడు తనకు లభించిన అవకాశం తప్పిపోయింది అనీ, వారు అందరు తన చేత చావకుండా తప్పించుకున్నారనీ మిక్కిలి విచారించాడు.

క. తమ్ములఁ దోలిన నతిరౌ । ద్రమ్ముగఁ గోపించి యన్నదలపడియెను సై
న్యమ్ముఁ బురికొలిపికొని రభ । సమ్మున భీమాదియోధసంఘముతోడన్. 391

ప్రతిపదార్థం: తమ్ములన్= సోదరులను(అవరజులను); తోలినన్= పారిపోవునట్లు చేయగా; అతి+రౌద్రమ్ముగన్= మిక్కిలి రోషంతో; కోపించి= ఆగ్రహం చెంది; అన్న= అగ్రసోదరుడు(దుర్యోధనుడు); సైన్యమ్మున్= సేనను; పురికొలిపికొని= ప్రోత్సహించి; రభసమ్మునన్= సంరంభంతో; భీమ+ఆది యోధ సంఘముతోడన్= భీముడు మున్నగు యోధుల గుంపుతో; తలపడియెను= మార్కొన్నాడు.

తాత్పర్యం: తమ్ములను ఓడించి తరిమినందుకు దుర్యోధనుడికి కోపం వచ్చింది. అతడు సేనను ప్రోత్సహించి, సంరంభంతో భీముడు మున్నగు వీరులపై విజృంభించాడు.

క. అపరాహ్ణ సమయమున న । ట్లుపమాతీతాతిఘోరయుద్ధం బయ్యెన్
రిపుభయదభుజుఁడు భీమున । కపరిమితబలుండు గురుధరాధీశునకున్. 392

ప్రతిపదార్థం: అపర+అహ్ణ+సమయమునన్= మధ్యాహ్నము తదుపరి వేళయందు; అట్లు; ఉపమా+అతీత+అతి ఘోర యుద్ధంబు= సాదృశ్యం చెప్పటానికి వీలులేని భయంకర సంగ్రామం; రిపు భయద భుజుఁడు= శత్రువులకు వెఱపుగొలిపే భుజములు కలవాడు (భీముడు)భీమునకును; కురు+ధరా+అధీశునకున్= కురురాజుకు(దుర్యోధనుడికి); అయ్యెన్= జరిగింది.

తాత్పర్యం: మధ్యాహ్నం దాటిన వేళలో, శత్రువులకు భయంకరుడైన భీముడికీ, కౌరవరాజు అయిన దుర్యోధనుడికీ మధ్య ఉపమించటానికి వీలులేని భయంకర సంగ్రామం జరిగింది.

సీ. తదవసరంబునఁ బొదివి వికర్ణుండుఁ జిత్రసేనుఁడుఁ బార్థుపుత్త్రుమీఁదఁ
గవిసిన నతఁడు వికర్ణురథ్యంబులఁ గూల్చి యాతనిపయిఁ గుప్పెకోల
లిరువది నాటింప నరదంబు డిగి భీతి యూన నాతఁడు చిత్రసేనురథము
పై కేఁగె ద్రౌపదిపట్టు లేవురు భీమునకు నడ్డపడి కురునాథుఁ దాఁకి

తే. మేనునెత్తురు వఱ్ఱుగా మెఱుఁగుటమ్ము । లేయ వారలఁ దలపడి యేనునార
సముల రారాజు నొ నేసి సరభసముగఁ । దఱిమె గాంగేయుఁ డరిసేనఁ దఱియఁ జొచ్చె. 393

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; పొదివి= చుట్టుముట్టి; వికర్ణుఁడు; చిత్రసేనుఁడు; పార్థు+పుత్త్రుమీఁదన్= అర్జునుడి కొడుకైన అభిమన్యుడిపై; కవిసినన్= మార్కొనగా, అతఁడు= అభిమన్యుడు; వికర్ణు+రథ్యంబులన్= వికర్ణుడి తేరు గుఱ్ఱాలను; కూల్చి= సంహరించి; ఆతని+పయిన్= వికర్ణుడిపై; కోలలు+ఇరువది= ఇరవై బాణాలు; నాటింపన్= గ్రుచ్చగా; అరదంబు+డిగి= రథం దిగి; భీతి+ఊనన్= భయం పొందగా; ఆతఁడు= వికర్ణుడు; చిత్రసేను+రథముపైకిన్; ఏగెన్= వెళ్ళాడు; ద్రౌపది+పట్టులు+ఏవురున్= ద్రౌపది కొడుకులు అయిదుగురును; భీమునకున్; అడ్డుపడి= అడ్డంగా నిలిచి; కురునాథున్+తాఁకి=

కురుపతి (దుర్యోధనుని); మార్కొని; మేను+నెత్తురు= శరీరంపై రక్తం; వఱ్ఱుగాన్= ప్రవాహంగా; మెఱుఁగు+అమ్ములు= మెరిసే బాణాలు; వేయఁగాన్= ప్రయోగించగా; వారలన్+తలపడి= వారిని తాకి; ఏను+నారసములన్= అయిదు బాణాలతో; రారాజున్= దుర్యోధనుని; నోన్+ఏసి= బాధపడేటట్లు ప్రయోగించి; సరసభసముగన్= సంరంభముతో; తఱిమెన్= కవిశాడు; గాంగేయుఁడు= గంగకొడుకు(భీష్ముడు); అరిసేనన్= శత్రుసేనను; తఱియన్+చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: ఆ సమయంలో వికర్ణుడు, చిత్రసేనుడు అర్జునసుతుడైన అభిమన్యుడిని మార్కొన్నారు. అభిమన్యుడు - ఆ వికర్ణుని గుర్రాలను సంహరించి, విరథుడైన అతడిపై ఇరవై బాణాలు ప్రయోగించి అతనిని నొప్పించగా అతడు భయపడి చిత్రసేనుడి రథంమీదికి వెళ్ళాడు. ద్రౌపది కొడుకులు అయిదుగురూ భీముడికి సాయంగా వచ్చి - కురుపతి దుర్యోధనుడిపై ప్రకాశించే బాణాలను ప్రయోగించి, ఐదు బాణాలతో అతడిని నొప్పించి తరిమివేశారు. అంతలో భీష్ముడు శత్రుసేనలో ప్రవేశించాడు.

క. చొచ్చి చతురంగ వితతులు । విచ్చునటులు సేయుటయును వివ్వచ్చుఁడు వే
వచ్చి తలపడినఁ బురికొని । యచ్చట నిరువాఁగు నట్టలాడం బోరెన్. 394

ప్రతిపదార్థం: చొచ్చి= ప్రవేశించి; చతుః+అంగ+వితతులు= నాలుగు సేనాంగముల సమూహాలు; విచ్చు+అటులు= బ్రద్దలై విచ్చిపోయేటట్లుగా; చేయుటయును= చేయటంచేత; వివ్వచ్చుఁడు= అర్జునుడు; వే+వచ్చి= వేగంగా అరుదెంచి; తలపడినన్= మార్కొనగా; పురికొని= ఉత్సహించి; ఇరువాఁగున్= రెండుపక్షాలూ; అట్టలాడన్= అల్లాడగా (మొండెములాడేటట్లు); పోరెన్= యుద్ధం చేశాయి.

తాత్పర్యం: సేనాపతియైన భీష్ముడు ప్రవేశించి - పాండవ సేన చెదరిపోయేటట్లు చేశాడు. అంతలో అర్జునుడు అరుగుదెంచి భీష్ముడిని మార్కొనగా, ఇరుపక్షాలూ ఉత్సాహంతో (మొండెము లాడగా) పోరాటం కొనసాగించాయి.

ఆ. రక్తనదులలోన రథయానపాత్రముల్ । వఱపి యోధవరులు బాహుబలము
వెలయ సమరకేళి సలిపిరి శూరత । నేచి కడఁగి యోల రాచి రాచి. 395

ప్రతిపదార్థం: రక్త నదులలోనన్= నెత్తురు ప్రవాహాలలో; రథయానపాత్రముల్= రథములు అనే పడవలు; వఱపి= నడపి; యోధవరులు= వీరశ్రేష్ఠులు; బాహు బలము వెలయన్= భుజ పరాక్రమం శోభిల్లగా; శూరతన్= శౌర్యంతో; ఏచి= విజృంభించి; కడఁగి= పూని; ఓల= (రక్త) జల క్రీడలో; రాచి+రాచి= సంఘర్షణ ఘటించి ఘటించి; సమర కేళి సలిపిరి= యుద్ధం అనే ఆట ఆడారు.

తాత్పర్యం: రక్త నదులలో రథాలను పడవలుగా ఉపయోగించి, వీరవరులు భుజబలం శోభిల్లగా పరాక్రమంతో విజృంభించి ఒకరినొకరు ఒరుసు కొంటూ రక్తజలక్రీడగా యుద్ధమనే ఆట ఆడారు.

విశేషం: అలం: రూపకం.

వ. అంత నరుణకిరణుం డన్వర్థాభిధానుం డగుచు వచ్చిన వేగిరపడి వాయునందనుండు సుయోధను నేఁడ సమయింతు ననుసంరంభంబున నతనికి సమ్ముఖంబుగాఁ దేరు వఱపించి కదిసి క్రోధమోదంబులు మనంబునం బెనంగొన నతనిం గనుంగొని. 396

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; అరుణ+కిరణుఁడు= ఎర్రని కిరణాలు కలవాడు(సాయం సూర్యుడు); అను+అర్థ+ అభిధానుండు+అగుచున్= సార్థక నామధేయుడు అగుచు; వచ్చినన్= అరుదెంచగా; వేగిరపడి= తొందరపడి; వాయునందనుండు= మారుతి(భీముడు); సుయోధనున్= దుర్యోధనుడిని; నేఁడు+అ=నేడే, ఈ దినమునందే; సమయింతున్= సంహరింపగలను; అను+సంరంభంబునన్= అనే ఆటోపంతో; అతనికిన్= ఆ దుర్యోధనుడికి; సమ్ముఖంబుగాన్= ఎదురుగా(దగ్గరగా);

తేరు= రథము; పఱపించి= నడపి; కదిసి= కూడి; క్రోధ+మోహంబులు= కోపం, మోహం; మనంబునన్= మనస్సులో; పెనంగొనన్= పెనగొనగా; అతనిన్+కనుంగొని= ఆ దుర్యోధనుడిని చూచి.

తాత్పర్యం: అంత అరుణ కిరణుడు - ఎఱ్ఱని కిరణాలతో తన పేరుకు తగినట్లుగా అరుగుదెంచగా, భీముడు వేగిరపడి - 'నేడే దుర్యోధనుడిని సంహరింపగలను' అనే సరభస వృత్తితో అతడికి చేరువగా తన రథం తోలించాడు. అతడి మనస్సులో కోపం - మోహం పిరిగొన్నాయి.

విశేషం: భీముని వేగిరపాటుకు కారణం - సూర్యుడు అరుణ కిరణుడు కావటం. సూర్యుడు అస్తమించేటప్పుడు ఉభయ పక్షాలు యుద్ధవిరమణ చేయాలి గదా! ఈలోపుగా - 'నేడే' దుర్యోధనుడిని వధించాలని భీముని ఆరాటం.

సీ. **కడుఁ బెద్ద కాలంబు గాంక్షించి యున్నయుత్సవ మిష్టు సమకూర దైవ మిచ్చె**
గొంతిసంకటపాటుఁ గోడలిబన్నంబుఁ దీర్చెదఁ గృష్ణుండు దెలుప నీవు
సరకు సేయమియును సభలో నులూకునిఁ బంచి యాడించిన పరుసములును
గక్కించి బీరంబు దక్కించుకొననీక తెగఁ జూడఁగాంచితి మగతనంబు

తే. **గలిగి మగుడక నిలు మని పలికి యుగ్ర గతి నెదుర్కొని రథతురంగముల సూతుఁ**
జంపి చాపంబు ద్రుంచి విస్ఫారకేతు। దండ మేడ్తెఱ నఱకె భీముండు సెలఁగి. **397**

ప్రతిపదార్థం: కడున్+పెద్ద+కాలంబు= చాలా నాళ్ళుగా; కాంక్షించి+ఉన్న= కోరుకొనినట్టి; ఉత్సవము= పండుగ; ఇష్టు= ఇపుడు; దైవము= అదృష్టము; సమకూరన్+ఇచ్చెన్= సమకూరేటట్లు చేసింది; గొంతి+సంకటపాటు= కుంతీదేవి పడిన కష్టాలు; కోడలి+బన్నంబు= ద్రౌపది అవమానం; తీర్చెదన్= పోగొట్టగలను; కృష్ణుండు; తెలుపన్= చెప్పగా; నీవు; సరకు చేయుమియును= లెక్కచేయకపోవటం; సభలోన్= కొలువుకూటంలో; ఉలూకునిన్+పంచి= ఉలూకుని నియమించి; ఆడించిన= పలికించిన; పరుసములును= కఠిన వాక్యాలు; కక్కించి= కక్కేటట్లుచేసి, వెనుకకు తీసికొనేటట్లు చేసి; బీరంబు= దర్పం; దక్కించుకొననీక= చెల్లటానికి వీలు కలుగనీకుండా; తెగన్+చూడన్+కాంచితిన్= ముక్కలు చేయటం చూడగలిగాను; మగతనము+కలిగి= పౌరుషం కలిగి; మగుడక= వెనుకకు మరలిపోకుండా; నిలుము= నిలిచిఉండుము; అని+పలికి= అని చెప్పి; ఉగ్రగతిన్= భయంకరంగా; ఎదుర్కొని= మార్కొని; రథ+తురంగములన్= అరదమునకు పూన్చిన గుర్రాలను; సూతునిన్= సారథిని; చంపి= సంహరించి; చాపంబున్= విల్లును; త్రుంచి= ఖండించి; భీముండు; చెలఁగి= శోభిల్లి, విస్ఫార కేతు దండము= వెలుగులతో విస్తరించిన పతాకం యొక్క కొయ్యను; ఏడ్తెఱన్= పరాక్రమంతో; నఱకెన్= ఖండించాడు.

తాత్పర్యం: చాలకాలం నుంచి కోరుకుంటున్న పండుగ నేడు భాగ్యవశాన సమకూడింది. కుంతీదేవి పడిన కష్టపాటునూ, ఆమె కోడలు ద్రౌపది యొక్క భంగపాటునూ తీరుస్తాను. కృష్ణుడు రాయబారిగ వెళ్లి చేసిన బోధను నీవు లెక్క చేయకుండా ఉండటం, ఉలూకుని పంపించి సభలో పల్కించిన పరుషవాక్యాలనూ నీచే క్రక్కించి నీవు పౌరుషం దక్కించుకోకుండా నిన్ను చంపే అవకాశం నాకు లభించింది. మగతనం కలిగి పారిపోకనిలువుమని, భీముడు భయంకరంగా దుర్యోధనుణ్ణి ఎదుర్కొని అతని రథానికి పూన్చిన గుర్రాలను, సారథినీ చంపి, దుర్యోధనుడి విల్లు విరిచి వెలిగే జెండా కర్రను పరాక్రమంతో నరికి ప్రకాశించాడు.

ఉ. **వేఱొక విల్లు పుచ్చికొను వేగములోనన కౌరవేంద్రు మైఁ**
దూఱ వృకోదరుండు పదితూపులు పాములు పుట్టలోనికిం
దూఱినయట్లుగాఁ బ్రబలదోర్బల మేర్పడ నేయ నెమ్ములన్
గీఱిన మూర్ఛ వచ్చి యొఱగెం దఱచై రుధిరంబు గ్రమ్మఁగన్. **398**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వేఱు+ఒక+విల్లు= మరియొక ధనుస్సు; పుచ్చికొను+వేగము+లోనన్= పరిగ్రహించే వేగం మధ్యనే; కౌరవ+ఇంద్రు+మైన్+దూఱన్= కౌరవ రాజు అయిన దుర్యోధనుని శరీరంలోకి చొచ్చుకొనేటట్లుగా; వృకోదరుండు= భీముడు; పది+తూపులన్= పది బాణాలను; పాములు= సర్పములు; పుట్టలోనికిన్; తూఱిన+అట్లుగాన్; ప్రబల+దోః+బలము+ఏర్పడన్= గొప్ప భుజశక్తి, పరాక్రమం కలుగగా; ఏయన్= ప్రయోగింపగా; ఎమ్ములన్= ఎముకలతో; గీఱిన= రక్కగా; తఱచు+ఐ= దట్టమై; రుధిరమ్ము= నెత్తురు; క్రమ్మఁగన్= స్రవింపగా; మూర్ఛవచ్చి= స్పృహతప్పి(దుర్యోధనుడు); ఒఱగెన్= వ్రాలాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు వేగంగా మరియొక ధనువు గ్రహించేలోపుగానే, భీముడు పదితూపులతో కొట్టాడు - భుజబలంతో. ఆ బాణాలు-పాములు పుట్టలో చేరినట్లుగా దుర్యోధనుని శరీరంలో ఎముకలను తాకి, గాయాలు చేశాయి. నెత్తురు కారిపోతూ ఉండగా, దుర్యోధనుడు మూర్ఛ చెంది, స్పృహతప్పి పడిపోయాడు.

వ. అట్టియెడ జయద్రథుండు రథికవరులతోడం గడంగి వడముడిపై నడరె నప్పుడు కృపాచార్యుండు దుర్యోధనుఁ దనరథంబుమీఁదం బెట్టికొని తొలంగం గొనిపోయె నభిమన్యుండును ద్రౌపదేయులును గేకయులును మారుతిని మీఱి సైంధవుం దలపడినఁ జిత్రసేనుండును జిత్రుండును జిత్రాక్షుండును జారుచిత్రుండును సులోచనుండును నందుండును నుపనందుండును రౌద్రంబుగా సౌభద్రుం బొదివిన. 399

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; జయద్రథుండు= సింధురాజు; రథికవరులతోడన్+కడంగి= వీర శ్రేష్ఠులతో కలిసిపూని; వడముడిపైన్= భీమునిపై; అడరెన్= విజృంభించాడు; అప్పుడు; కృపాచార్యుండు; దుర్యోధనున్= దుర్యోధనుని; తన+రథంబుమీఁదన్= తన తేరుమీద; పెట్టికొని; తొలఁగన్+కొనిపోయెన్= తప్పించి తీసికొని పోయాడు; అభిమన్యుండును; ద్రౌపదేయులును= ద్రౌపది కొడుకులును; కేకయులును; మారుతిని+మీఱి= భీముడిని దాటి; సైంధవున్= జయద్రథుడిని; తలపడినన్= మార్కొనగా; చిత్రసేనుండును; చిత్రుండును; చిత్రాక్షుండును; చారుచిత్రుండును; సులోచనుండును; నందుండును; ఉపనందుండును; రౌద్రంబుగాన్= భయంకరముగా; సౌభద్రున్= అభిమన్యుడిని; పొదివినన్= చుట్టుముట్టగా.

తాత్పర్యం: ఆ సమయంలో జయద్రథుడు వీరవరులతోపాటు భీముడిపై విజృంభించాడు. అప్పుడు మూర్ఛిల్లిన దుర్యోధనుడిని కృపాచార్యుడు తన తేరుపైకి ఎక్కించుకొని వెళ్ళాడు. అభిమన్యుడు, ద్రౌపదేయులు, కేకయులు, భీముడిని దాటివెళ్ళి, సైంధవుడిని మార్కొన్నారు. చిత్రసేనుడు, చిత్రుడు, చిత్రాక్షుడు, చారుచిత్రుడు, సులోచనుడు, నందుడు, ఉపనందుడు భయంకరంగా అభిమన్యుడిని చుట్టుముట్టారు.

క. బలియుఁ డగు పార్థపుత్త్రుఁడు । వలనేర్పడ నొకనినొకని వడి నైదైద
మ్ముల నేసి నొంప వారలు । దలఁకక వెస ముంచి రస్త్రధారల నతనిన్. 400

ప్రతిపదార్థం: బలియుఁడు+అగు= బలవంతుడగు; పార్థ+పుత్త్రుఁడు= అభిమన్యుడు; వలను+ఏర్పడన్= అవకాశం చూచికొని; ఒకనిన్+ఒకనిన్= ఒక్కొక్కడిని; వడిన్= వేగంగా; ఐదు+ఐదు+అమ్ములన్= ఐదేసి బాణాలతో; ఏసి= ప్రయోగించి; నొంపన్= నొప్పింపగా; వారలు; తలఁకక= వెనుకాడక; అతనిన్= ఆ అభిమన్యుడిని; అస్త్రధారలన్= అమ్ముల జల్లులో; ముంచిరి= తడిపివేశారు.

తాత్పర్యం: బలశాలి అయిన అభిమన్యుడు అవకాశం చూచుకొని ఒక్కొక్కరిని అయిదయిదు బాణాలతో నొప్పించగా వారు భయపడకుండా వేగంగా అతడిని అస్త్ర ధారలలో ముంచారు.

విశేషం: దీనికి 393వ పద్యంతో సరిచూచుకోవాలి. అప్పుడు 'వికర్ణుడు' విరథుడై చిత్రసేనుడి రథంపైకి వెళ్ళాడు. ఇప్పుడు తిరిగి యుద్ధంలో ప్రవేశించాడు. ఇది చదువరులు గ్రహించి జ్ఞాపకం చేసుకోవాలి.

వ. సహోదరులకు సహాయత్వంబు సేయంబూని మున్ను విరథుండై పోయినవాఁడగుటం జేసి. 401

ప్రతిపదార్థం: సహోదరులకున్= తమ్ములకు; సహాయత్వంబు= సాయం; చేయన్+పూని= చేయటానికి ఆయత్తుడై; మున్ను= ఇంతకు ముందు; విరథుండు+ఐ= రథమును కోలుపోయినవాడై; పోయినవాఁడు+అగుటన్+చేసి= యుద్ధరంగము నుండి వెడలినవాడు కావటం చేత.

తాత్పర్యం: సోదరులకు తోడ్పాటు నందించుటకు పూని రథాన్ని కోలుపోవటం చేత వికర్ణుడు యుద్ధరంగము నుండి తొలగిపోయినవాడు కావటంచేత (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. తఱిమి వికర్ణుఁ డప్డు తనుఁ దాఁకిన నా యభిమన్యుఁ డల్గి బి
ట్టుఱ విలుద్రుంచి సారథి పడం దురగంబులఁ జావ నేసి క్రొ
మ్మెఱుఁగులతోడఁ దద్ధ్వజము మేదినిఁ గూలఁగఁ జేసి యంగముల్
గిఱికొన బాణముల్ నినిచెఁ గేలిమెయిం బటు దర్ప మేర్పడన్. 402

ప్రతిపదార్థం: తఱిమి= కవిసి; వికర్ణుఁడు= వికర్ణుడు; అప్డు= అప్పుడు; తనున్= తన్ను; తాఁకినన్= మార్కొనగా; ఆ+అభిమన్యుఁడు; అల్గి= కోపించి; బిట్టు+అఱన్= అతిశయము అణగారునట్లుగా; విలు+త్రుంచి= ధనుస్సు ఖండించి; సారథి; పడన్= కూలగా; తురగంబులన్= గుర్రాలను; చావన్+ఏసి= సంహరించి; క్రొత్త+మెఱుగులతోడన్= క్రొత్త వెలుగులతో; తద్+ధ్వజము= ఆ జెండా; మేదినిన్= భూమిపై; కూలఁగన్+చేసి= పడునట్లుగా చేసి; అంగముల్= అవయవాలు; గిఱికొనన్= చుట్టుకొనగా; కేలి+మెయిన్= లీలగా; పటు+దర్పము+ఏర్పడన్= మిక్కుటమగు గర్వము తెల్లమగునట్లుగా; బాణముల్= అమ్ములు; నినిచెన్= నిండించాడు.

తాత్పర్యం: అంతకుముందు విరథుడై వెడలిన వికర్ణుడు మరల వచ్చి తన్ను మార్కొనగా, అభిమన్యుడు కోపించి అతని అతిశయం అణగారిపోయేటట్లు వింటిని త్రుంచి, సారథిని సంహరించి, గుర్రాలను కూల్చి, కొత్తవెలుగులతో పాటు అతని జెండాను భూమిపై పడగొట్టాడు. అతడి అవయవాలు నొచ్చునట్లు అవలీలగా తన గర్వం వెల్లడి అగునట్లు బాణాలు వేగంగా ప్రయోగించాడు.

వ. ఇట్లు నొచ్చినవికర్ణుం గనుంగొని కురుకుమారు లొక్కపెట్ట కవ్వడి కొడుకుపై నురవడించిన. 403

ప్రతిపదార్థం: ఇట్లు=ఈ విధంగా; నొచ్చిన= కలతచెందిన; వికర్ణున్+కనుఁగొని= వికర్ణుని చూచి; కురు+కుమారులు= కౌరవరాజు కుమారులు; ఒక్క+పెట్టన్= ఏకంగా ఒకేసారి; కవ్వడి+కొడుకుపైన్= సవ్యసాచియైన అర్జునుడి కొడుకు అభిమన్యుడిపై; ఉరవడించినన్= వేగంగా మార్కొనగా.

ఉ. ఏవురు ద్రౌపదేయులును నేడ్తెఱ నాతని కడ్డమై తురం
గావళి నొంచియుం బడగ లన్నియుఁ ద్రుంచియు నంపవానలం
జేవ సెడంగ ముంచియునుఁ జేడ్పడఁ జేయఁగ నీతనూభవుల్
వోవక వారితో మఱియుఁ బోరిరి సిగ్గున బీర మెక్కఁగన్. 404

ప్రతిపదార్థం: ఏవురు+ద్రౌపదేయులును= ద్రౌపదీపుత్రులు అయిదుగురును; ఏడ్తెఱన్= పరాక్రమంతో; ఆతనికిన్+అడ్డమై= అభిమన్యుడికి అడ్డంగా, కురురాజకుమారులకు మధ్య నిలిచి; తురంగ+ఆవళి+నొంచియున్= గుర్రాల గుంపులను నొప్పించి; పడగలు+అన్నియున్+ త్రుంచియున్= జెండాలు అన్నింటినీ ఖండించియూ; అంప+వానలన్= బాణవర్షంచే; చేవ+చెడంగన్= శక్తి అణగారునట్లుగా; ముంచియున్= ముంచియును; చేవ్వడన్+చేయఁగన్= బాధనొందునట్లు చేయగా; నీ+తనూభవులు= నీ కొడుకులు(కౌరవరాజు కుమారులు); పోవక= మరలి వెళ్ళకుండా; వారితోన్= ద్రౌపదీసుతులతో; సిగ్గునన్= లజ్జచేత; బీరము+ ఎక్కఁగన్= అహంకారం అతిశయింపగా; మఱియున్= ఇంకనూ; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: ద్రౌపదీ సుతులు అయిదుమంది పరాక్రమంతో అభిమన్యుడిని దాటి కౌరవ రాజకుమారుల గుర్రాలను నొప్పించారు. జెండాలను త్రుంచారు. వారిచేవ చెడి పోగా అమ్ములవానలో ముంచి నొప్పించారు. అయితే నీ కుమారులు లజ్జ అహంకారాన్ని పెంచగా వెనుదిరిగిపోకుండా నిలిచి ద్రౌపదేయులతో పోరాడారు.

వ. అట్టియెడ నకులనందనుం డగుశతానీకుండు బహుప్రకారబాణంబుల వివిధ విక్రమక్రీడ సలుపు బలుపుఁ గనుంగొని కేకయపాంచాలపతులు బాసటయై చటులతరతురంగమాతంగస్యందనసందోహంబులం బఱపి కడిమి నెఱపి రిప్పరుసునం బ్రతివీరుల నఱుముటయు నప్పుడు పతంగుండు పశ్చిమాచలశృంగంబు మఱుంగుపడుటయుం జూచి గాంగేయుం డంత్యకాలకాలాకృతిం గడంగి పటు విశిఖవితానంబుల వేఁడిమి సూపి యమ్మోహరంబు దెరల్చి తనమొనల మరల్చికొని సమరంబు సాలించి శిబిరంబున కరిగెఁ బాండుసూనులును మేనులు వెడవెడ చెమర్ప విడిదలకుం జని రని సంజయుం డాఱవ దివసంబు నాహవంబు తెఱం గెఱింగించె నప్పుడు. 405

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆసమయంలో; నకుల+నందనుండు+అగు= నకులుని కొడుకు అయిన; శతానీకుండు; బహు+ప్రకారబాణంబులన్= పెక్కు విధములైన బాణాలతో; వివిధ+విక్రమ+క్రీడ= నానా పరాక్రమలీల; సలుపు బలుపున్+కనుంగొని= చేసే అతిశయం చూచి; కేకయ, పాంచాలపతులు= కేకయ దేశాధిపతులు, ద్రుపదుడు; బాసటయై= సాయమై; చటుల తర, తురంగ, మాతంగ స్యందన సందోహంబులన్+పఱపి= వేగంగా కదలే గుర్రాలు, ఏనుగులు, రథాల సమూహములను తరలించి; కడిమి+నెఱపిరి= పరాక్రమం ప్రదర్శించారు; ఈ+పరుసునన్= ఈ విధంగా; ప్రతి వీరులన్= శత్రువులను; అఱుముటయున్= మార్కొనగా; అప్పుడు; పతంగుండు= సూర్యుడు; పశ్చిమ+అచల శృంగంబు మఱుంగు పడుటయున్= పడమటి కొండ కొమ్ముమాటున అదృశ్యుడు కావటం; చూచి; గాంగేయుండు= భీష్ముడు; అంత్యకాల+కాల+ కాల+ఆకృతిన్= ప్రళయ సమయంలోని యముని ఆకృతిని పోలి; కడంగి= పూని; పటు విశిఖ వితానంబులన్= గొప్ప బాణాల సముదాయంతో; వేఁడిమి+చూపి= ఉష్ణత వెలయించి; ఆ+మోహరంబున్= ఆ మొగ్గరమును; తెరల్చి= చెదరగొట్టి; తన మొనలన్= తన సేనలను (కౌరవసేనలను); మరల్చికొని= వెనుకకు తరలించి; సమరంబు+చాలించి= యుద్ధం విరమించి; శిబిరంబునకున్+అరిగెన్= స్కంధావారమునకు, విడిదికి వెళ్ళాడు; పాండుసూనులును= పాండవులుకూడా; మేనులు= శరీరాలు; వెడవెడ చెమర్పన్= ఎక్కువగా చెమటలుకారగా; విడిదలకున్+చనిరి= తమ ఆవాసాలకు వెళ్ళారు; అని, సంజయుండు; ఆఱవ దివసంబు+ఆవహంబు+తెఱంగు= ఆరవదినమున జరిగిన యుద్ధం తీరుతెన్నులు; ఎఱింగించెన్= తెలిపాడు; అప్పుడు.

తాత్పర్యం: ఆ సమయంలో నకులుడి కొడుకైన శతానీకుడు పరాక్రమం ప్రదర్శించి, విజృంభించాడు. కేకయ దేశాధిపతులు, ద్రుపదుడు అతడికి బాసటగా చేరి నిలిచారు. వారు రథతురగగజ సమూహాలతో శత్రువులను

ఎదుర్కొన్నారు. అప్పుడు సూర్యుడు పడమటికొండ మాటునకు చేరి అదృశ్యమయ్యాడు. భీష్ముడు ప్రళయకాలంలోని యమునివలె విజృంభించి పాండవుల మొగ్గరాన్ని చీల్చి, తన సేనలను ఉపసంహరించి, విడిదులకు పొమ్మన్నాడు. తాను తన శిబిరానికి వెళ్ళాడు. ఆనాటికి యుద్ధ విరమణ జరిగింది. పాండవులు డస్సిపోయి, చెమట కారే దేహాలతో తమ విడిదులకు వెళ్ళిపోయారు.' అని సంజయుడు ఆ విధంగా కురుక్షేత్ర సంగ్రామంలోని ఆరవరోజు తీరుతెన్నులు తెలిపాడు. ఆ సమయంలో.

క. ' కిమ్మీరమర్దనునిచే । నిమ్మెయి నోటాఱఁ బెక్కు లేటులు వడి ద
ర్ప మ్మెడలి మూర్ఛ మునిఁగియుఁ । గ్రమ్మఱఁ గురునాథుఁ డెట్లు గడఁగెనొ యనికిన్?' 406

ప్రతిపదార్థం: కిమ్మీర+మర్దనునిచేన్= కిమ్మీరుడు అనే రాక్షసుని సంహరించిన భీమునిచే; ఈ+మెయిన్= ఈ రీతిగా; ఓటారన్= నిస్సత్తువుడుగా; పెక్కులు+ఏటులు+పడి= ఎన్నో దెబ్బలు తిని; దర్పమ్ము+ఎడలి= గర్వము అణగారి; మూర్ఛ+మునిఁగియున్= స్పృహతప్పి కూడా; క్రమ్మఱన్= తిరిగి; అనికిన్= యుద్ధానికి; కురు+నాథుఁడు= కురురాజు(దుర్యోధనుడు); ఎట్లు; కడఁగెన్+ఒ?= పూనినాడో?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఈ విధంగా సంజయుని ప్రశ్నించాడు 'ఓ సంజయా, దుర్యోధనుడు ఆ విధంగా నిస్సత్తువుడై భీమునిచే అన్ని దెబ్బలు తిని, యుద్ధంలో ఓడిపోయి స్పృహతప్పి పడిపోయాడు గదా! మరల ఏ విధంగా యుద్ధానికి వచ్చాడు? ఏం జరిగింది?'

విశేషం: యుద్ధంలో ప్రతి విషయాన్ని - సూక్ష్మాతిసూక్ష్మంగా ఏ విశేషం విడిచి పెట్టకుండా తిక్కన అభివర్ణించగలిగాడు. 397, 398 పద్యాలలో, 399 గద్యంలో భీమసేనుడికీ, దుర్యోధనుడికీ మధ్య జరిగిన పోరాటం వర్ణింపబడింది. అప్పుడు మూర్ఛితుడైన దుర్యోధనుడిని కృపాచార్యుడు తన రథంమీద పెట్టుకొని తొలగిపోయాడు. ఆ తరువాత దుర్యోధనుడు ఏమైనట్లు? ఆ ప్రశ్న ధృతరాష్ట్రుడు అడగటం సమంజసం. అయితే సమాధానం - సంజయుడు చెప్పకుండా ద్వితీయాశ్వాసం ముగిసింది. చదువరుల ఉత్కంఠ అట్లానే ఉండిపోయింది.

వ. అని సకౌతుకంబుగాఁ బలికిన. 407

ప్రతిపదార్థం: అని= అని; స+కౌతుకంబుగాన్= కుతూహలముతో; తెలుసుకోవాలనే ఉబలాటంతో; పలికినన్= అడుగగా.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అడుగగా.

ఆశ్వాసాంతము

ఉ. భూరి తపోవిశేష! పరిపూర్ణమృదుస్థిరహృత్కరండవి
స్తారనివాస! తంత్ర ఘనసారవిధాపరమాభిరామ రే
ఖారమణీయ! లోకహితకారి మహాకరణీయ! ఘోరసం
సారదురామయాపదవసాయక! నిత్యఫలప్రదాయకా! 408

ప్రతిపదార్థం: భూరితపస్+విశేష!= గొప్పదైన తపో విశేషము కలవాడా!; పరిపూర్ణ+మృదు+స్థిర+హృద్+కరండ+విస్తార+నివాస!= మృదుత్వముగా స్థైర్యముతో నిండిన హృదయమనే బరిణలు, విస్తరించి, నివసించేవాడా!; తంత్ర= శైవాగమములనే; ఘనసార, విధా, పరమాభిరామ, రేఖా+రమణీయ!= కప్పురపు పూతచే గొప్పగా అందంగా శోభిల్లేవాడా!; లోక+హితకారి+మహాకరణీయ!=

జగత్తునకు మేలు చేసే కర్తవ్యములు నెరవేర్చువాడా!; ఘోర+సంసార+దుస్+ఆమయ+ఆపద్+అవసాయక!= భయంకరమైన సంసారములోని పీడలను, భ్రమలను, పీడలను నశింపచేయువాడా!; నిత్య+ఫల+ప్రదాయకా!= నిత్యము మేలు చేయునట్టివాటిని ఇచ్చేవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! విస్తారమైన గొప్ప తపస్సుతో కూడినవాడా, మెత్తనిది, పండినది, నిండైనది అయిన గుండెలో నివసించునట్టివాడా, కప్పురము, కప్పురపు పూతచే శోభిల్లి, అందముగా కనిపించేవాడా, లోకమునకు మేలు చేసెడి కర్తవ్యాలను నిర్వహించేవాడా సంసార తాపములను, భ్రమలను, నాశనము చేసేవాడా.

విశేషం: ఇది భీష్మపర్వం - ద్వితీయాశ్వాసాంత పద్యాలలో మొదటిది 1. ఆశ్వాసాంత పద్యాలు అన్నీ సంస్కృతసమాస భూయిష్ఠములే. 2. ఇది హరిహరనాథతత్త్వ ప్రతిపాదకం.

క. **పారాశర్యప్రముఖో। దారమునీంద్రాంతరంగధామాంతర్వి**
స్ఫారప్రభాపటలవి। స్తారోజ్జ్వలదీపరూపతా స్తవనీయా! **409**

ప్రతిపదార్థం: పారాశర్య+ప్రముఖ+ఉదార+ముని+ఇంద్ర+అంతరంగ+ధామ+అంతర్+విస్ఫార+ ప్రభా+పటల+విస్తార+ఉజ్జ్వల+దీప+ రూపతా+స్తవనీయా!= వ్యాసుడు మున్నగు గొప్ప మునివరేణ్యుల మనస్సులు అనే చోటులలో చక్కగా విస్తరించిన వెలుగుల సముదాయంతో ప్రకాశించే దీపమువలె స్తుతింపదగినవాడా!

తాత్పర్యం: వ్యాసుడు మున్నగు గొప్ప ఋషుల మానససీమలలో వెలుగులు వెలార్చు దీపమువలె ఆరాధించి కీర్తించదగినవాడా! ఓ హరిహరనాథా!

విశేషం: 1. ఆశ్వాసాంత పద్యాలు - సంస్కృత సమాసాలతో నింపటం ప్రారంభించింది నన్నయ మహాకవి. ఆ ఒరవడినే తిక్కన, తదుపరి కవులు బహుళంగా పాటించారు.

మాలిని.

అసురదళనలీలావ్యాప్తిదీప్తాభిశోచి
ర్లసితపరశుగాఢాలంకృతప్రౌఢముద్రా
భ్యసనమహితబాహాప్రస్ఫురత్కాంతిహృద్యా!
హసనసురభివిద్యా! హంసనాదైకవేద్యా ! **410**

ప్రతిపదార్థం: అసుర+దళన+లీలా+వ్యాప్తి+దీప్త+అభిశోచిస్+లసిత+పరశు+గాఢా+ అలంకృత+ప్రౌఢ+ముద్రా+అభ్యసనమహిత+ బాహా+ప్రస్ఫురత్+కాంతిహృద్యా!= రాక్షసులను చీల్చి చెండాడే ఆటయందు విస్తరించి ప్రకాశించే, రశ్మిచేత శోభిల్లే గండ్రగొడ్డలి చేత ఎక్కువగా అలంకరింపబడిన, గొప్ప తెలివితో భాసించే భంగిమను అభ్యసించే గొప్ప చేతులలో ప్రకాశించే కాంతి చేత మనోజ్ఞమైన వాడా!; హసన+సురభి+విద్యా!= నవ్వుచే మనోజ్ఞమైన విద్య కలవాడా!; హంస+నాద+ఏక+వేద్యా!= యోగుల నాదబిందుకళోపాసనచేత మాత్రమే తెలియబడగలవాడా!

తాత్పర్యం: రాక్షసులను సంహరించే పరశువును పట్టుకొని విజృంభించే భంగిమతో కూడుకొన్న బాహు పరాక్రమం గలవాడా! ఓ హరిహరనాథా! నవ్వుతో శోభిల్లే విద్యకలవాడా! యోగుల నాదోపాసనచే మాత్రమే తెలియబడగలవాడా!

విశేషం: 1. ఈ పద్యంలోని ఆంతర్యం 'దుష్టశిక్షణ - శిష్టరక్షణ'. లయకారుడు హరుడు. దుష్టశిక్షణ చేయగలవాడు. స్థితికారుడు - శిష్టరక్షకుడు హరి. 'హంస' శబ్ద ప్రయోగం - అర్థవంతమైనది. 'హంస' జీవన్ముక్తుడైన మహర్షికి పర్యాయపదం.

2. 'దీప్తారశోచిర్లసిత', పాఠముకంటె, పాఠాంతరమైన 'దీప్తాభిశోచిర్లసిత' పాఠమే గ్రహింపబడింది. అరము అనగా వేగము. 'అరశోచిస్' కంటె 'అభిశోచిస్' అని గ్రహించటమే మంచిది అనిపించింది.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన

శ్రీ మహాభారతంబున భీష్మపర్వంబునందు ద్వితీయాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఇది; శ్రీమత్+ఉభయ+కవి+మిత్త్ర= శ్రీమంతులైన సంస్కృతం, తెలుగులో కవిత చెప్పే వారికి స్నేహితుడు; - కొమ్మన+అమాత్యపుత్త్ర= కొమ్మన మంత్రి కొడుకు; బుధ+ఆరాధన+విరాజి= బుద్ధిమంతులను పూజించుటచే, శోభిల్లేవాడు; తిక్కన సోమయాజి; ప్రణీతంబు+అయిన= వ్రాయబడినది అయిన, శ్రీమహా+భారతంబునన్= శ్రీమహాభారతంలో; భీష్మ+పర్వంబునందు= భీష్మపర్వంలో; ద్వితీయ+ఆశ్వాసము= రెండవ ఆశ్వాసము.

తాత్పర్యం: శ్రీమంతులైన సంస్కృతాంధ్ర కవీశ్వరులకు హితుడును, కొమ్మన మంత్రికి కుమారుడును, పండితులను పూజించుటచేత ప్రకాశించేవాడును అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శుభకరమైన మహాభారతంలోని భీష్మపర్వంలో రెండవ ఆశ్వాసం ముగిసింది.

విశేషం: 1. 'ఉభయ కవిమిత్త్రుడు'(తిక్కనకు కల బిరుదు) కేతన ఈ విషయం దశకుమార చరిత్ర తిక్కనకు అంకితం చేస్తూ అవతారికలో ఈ విషయం చెప్పాడు. 2. సోమయాజి= యజ్ఞం చేసినవాడు. భారతం వ్రాసేముందు తిక్కన యజ్ఞంచేసి పవిత్ర భావన చేకూర్చుకున్నట్లు విమర్శకుల అభిప్రాయం. యజ్ఞం లోక సంగ్రహదీక్ష. 3. బుధారాధన - విరాజి ఈ ప్రయోగం మహాభారతకర్తయైన తన వ్యక్తిత్వం 'బుధుల పూజచే', ఆరాధన వలన - ప్రకాశమానమైనదని వినయంతో, వివేకంతో తిక్కన చేసిన విజ్ఞప్తి.

భీష్మపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

భీష్మపర్వము - తృతీయాశ్వాసము

శ్రీ విలసనత్వగురు గౌ । రీ విభ్రమ రమ్య చాతురీ స్వీకృత స
ద్భావ! నిరుపాధికానం । దావహ! కరుణానుభావ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= లక్ష్మి యొక్క; విలసనత్వ= విలాసం చేత; గురు= గొప్పదైనదీ; గౌరీ= పార్వతి యొక్క; విభ్రమ= శృంగార చేష్టలయొక్క; రమ్య= అందమైన; చాతురీ= నేర్పుచేత; స్వీకృత= గ్రహించబడిన; సత్+భావ!= ఉనికి కలవాడా!; సాధుభావం కలవాడా!; నిరుపాధిక+ఆనంద+ఆవహ!= ఉపాధిరహితమైన (అపరిమితమైన) ఆనందాన్ని వహించేవాడా!; కరుణా+అనుభావ!= (భక్తులయందు) దయ చూపించే స్వభావం కలవాడా!; హరిహరనాథా!= హరిహరనాథుడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! లక్ష్మీదేవి విలాస చేష్టలనూ, గౌరీదేవి శృంగార చేష్టలనూ అందంగా స్వీకరించే నేర్పుగల సాధుభావం కలవాడా! అనంతమైన ఆనంద స్వరూపం కలవాడా! భక్తుల పట్ల దయచూపే ప్రవర్తన కలవాడా!

విశేషాలు: పరతత్త్వమైన హరిహరనాథుడు నిర్గుణుడైనా, సగుణభావంలో శ్రీ గౌరీ రూపిణి అయిన మహాశక్తి యొక్క విలాస చేష్టలను ఆమోదించి సృష్ట్యాది కార్యాలను నిర్వహిస్తాడని భావం. "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" అని తైత్తిరీయోపనిషత్తు. సర్వజీవులు అనుభవించే ఆనందం బ్రహ్మానందంలో లేశమే కావటం చేత పరబ్రహ్మమైన హరిహరనాథుడు అనంతానందరూపుడని తాత్పర్యం. హరిహరనాథుడి చేష్టలన్నీ భక్తులను కరుణించటానికి ప్రదర్శించేవే కాబట్టి అతడు కరుణానుభావుడు.

భీష్మగాంధారేయుల సంవాదము (సం. 6-76-3)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కి ట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా= ఓ ప్రభూ!; వైశంపాయనుండు= వైశంపాయనుడనే ఋషి; జనమేజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

తే. భండనంబునఁ దనయుండు గం డడంగి । పోక విని తీవ్రఖేదంబుఁ బొంది యంబి
కాతనూభవుఁ డప్పు డాసూతపుత్త్రు । నడిగె నుత్తరవర్తన మాదరమున. 3

ప్రతిపదార్థం: అంబికా తనూభవుఁడు= అంబిక అను నామె కుమారుడైన ధృతరాష్ట్రుడు; అప్పుడు= దుర్యోధనుడు బలం తగ్గి వెనుకకు తిరిగిన సమయాన; భండనంబునన్= యుద్ధమందు; తనయుండు= తన కుమారుడైన దుర్యోధనుడు; గండు+అడంగి= పౌరుషం దక్కి; పోక= వెళ్ళుటను; విని; తీవ్రఖేదంబున్= అధికమైన దుఃఖమును; పొంది= పొందినవాడై; ఆదరమునన్= మన్ననతో; ఉత్తర వర్తనము= దుర్యోధనుని తరువాతి నడవడిని గూర్చి; ఆ సూతపుత్త్రున్= సూతుని కుమారుడైన సంజయుడిని; అడిగెన్= అడిగాడు.

తాత్పర్యం: యుద్ధంలో దుర్యోధనుడు పౌరుషం కోల్పోయి, వెనుకకు మళ్ళాడని విని, ధృతరాష్ట్రుడు మిక్కిలి శోకం చెందినవాడై, తరువాత ఆ దుర్యోధను డేమిచేశాడని సూతపుత్రుడిని అడిగాడు.

వ. అడుగుటయు నతం డతని కి ట్లను 'నాఁటిరేయి గాంగేయుతోడ గాంధారేయుండు. 4

ప్రతిపదార్థం: అడుగుటయున్= ధృతరాష్ట్రు డిట్లడుగగా; అతండు= సంజయుడు; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; నాఁటిరేయి= ఆ నాటి రాత్రి; గాంధారేయుండు= గాంధారీ కుమారుడు దుర్యోధనుడు; గాంగేయుతోడన్= గంగాపుత్రుడైన భీష్ముడితో చెప్పిన విషయమును; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు, భంగపాటు పొందిన దుర్యోధనుడి తరువాతి వృత్తాంతాన్ని గూర్చి సంజయుడిని అడుగగా, ఆతడు ఇట్లా చెప్పాడు: ఆనాటి రాత్రి భీష్ముడితో దుర్యోధనుడు ఇట్లా అన్నాడు.

ఆ. ' మనము పూఁచి పట్టి మొన లేర్చికొని పోవఁ । బాండురాజసుతులబలము గవిసి
గాసి చేయునదియుఁ గాక నీ ముందటఁ । బవనతనయుచేత భంగపడితి. 5

ప్రతిపదార్థం: మనము= కౌరవులైన మనం; పూఁచిపట్టి= ప్రయత్నంతో; మొనలు= వ్యూహములు; ఏర్చికొని= ఏర్పాటు చేసికొని; పోవన్=, ముందుకు సాగుతూంటే; పాండురాజ సుతులబలము= పాండవుల సైన్యము; కవిసి= మార్కొని; గాసిచేయున్= నాశం చేస్తున్నది; అదియున్+కాక= అంతమాత్రమేకాకుండా; నీ ముందటన్= (భీష్ముడవైన) నీ ఎదుటనే; పవన తనయుచేతన్= గాలికొమరుడైన భీమునిచేత; భంగపడితిన్= భంగపాటుపొందాను.

తాత్పర్యం: 'మనమెంతో పూనికతో వ్యూహం చక్కపఱుచుకొంటూ ముందుకుసాగుతున్నా, పాండవ సేన దానిని నాశనం చేస్తున్నది. అందుకు తోడుగా, నీవు చూస్తూండగానే భీముడిచేత భంగపడినాను గదా!

విశేషం: 'నీముందటన్' అనటంలో, 'నీ సాయంతో పాండవులను గెలవగలననే నమ్మకం గలవాడను. నీ ధాటికి దేవతలు కూడా ఎదురు నిలువజాలరు. అట్టి నీవు ఉపేక్ష చేశా'వని, దుర్యోధనుడు భీష్ముడిని ఎత్తిపొడుచుతున్నాడు.

క. నినుఁ గొని గెలిచెదఁ గుంతీ । తనయుల నని యున్న తలఁపు దప్పించెదు నీ
వనిమిషులనైనఁ జేకొన । వనిమొన వా రింత బలియు రగు టేమి యొకో?' 6

ప్రతిపదార్థం: నినున్+కొని= నిన్ను ఆధారంగా చేసికొని; కుంతీ తనయులన్= కుంతి కొడుకులగు పాండవులను; గెలిచెదన్+ అనియున్న తలఁపున్= అనియున్నట్టి నా కోరికను; తప్పించెదు= తప్పగొట్టుతున్నావు; నీవు; అనిమిషులనైనన్= దేవతలనైనను; చేకొనవు= లెక్కచేయవు; అనిమొనన్= యుద్ధపు వ్యూహంలో; వారు= ఆ పాండవులు; ఇంత బలియురు+అగుట= ఇంతగా బలవంతులు కావడం; ఏమి+ఒకో?= ఏమిటో?.

తాత్పర్యం: కొండంత అండగా నీవు ఉండడంచేత పాండవులను గెలుస్తాననే ఆశ నాకుండినది. దానిని నీవు తప్పగొట్టుతున్నావు. నీవు దేవతలను కూడ జయింపగల పరాక్రమంగలవాడవు. యుద్ధరంగంలో ఆ పాండవు లంత పరాక్రమవంతులవటానికి కారణం ఏమిటి?'

విశేషం: దుర్యోధనుని ఈ మాటవలన భీష్ముడి యుద్ధ వైఖరిలో అతడికి కొంత సంశయం కలిగినట్టు తోస్తున్నది. అనిమిషులు= రెప్పపాటులేనివారు (దేవతలు).

అవతారిక: దుర్యోధనుడి అమాయికత్వానికి, మూర్ఖత్వానికి భీష్ముడు నవ్వి ఇట్లంటున్నాడు-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అనిన విని నవ్వి యతఁ డి। ట్లను 'నిం తన నేల? నన్ను నని నా యొడ లో
మినచోటుఁగలదె? పెఱయో। ధనికాయం బైన నకట! తలఁకదె చెపుమా! 7

ప్రతిపదార్థం: అనినన్= దుర్యోధనుడు పై విధముగా చెప్పగా; విని; నవ్వి; అతఁడు= ఆ భీష్ముడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటున్నాడు; నన్నున్= నన్ను; ఇంత+అనన్+ఏల?= నీవు ఇంతగా తూలనాడడం ఎందుకు?; అనిన్= యుద్ధమందు; నా+ఒడలు= నా శరీరము; ఓమిన= రక్షించుకొన్న; చోటు+కలదె?= తావున్నదా?; అకట!= అయ్యో!; పెఱ యోధనికాయంబు+ఐనన్= శత్రువుల యోధుల సమూహమైనను; తలఁకదె?= భయపడదా? చెపుమా!

తాత్పర్యం: దుర్యోధనుడి మాటలు విన్న భీష్ముడు నవ్వి ఇట్లా అంటున్నాడు. 'నీవు ఈ విధంగా న న్ననటందేనికి? యుద్ధంలో నా శరీరం ఎక్కడైనా దాచుకొన్నానా? పాండవులు కాకుండా ఇతర యోధసమూహమై ఉండి వుంటే భయపడదా? చెప్పు.

వ. పాండవుల గెలువ నలవి గా దని యెప్పడుం జెప్పదు నైన నఱలేక నీకు జయంబు గోరి పోరెద వగవ కుండుము.' 8

ప్రతిపదార్థం: పాండవులన్; గెలువన్+అలవి కాదు+అని= గెలవటం సాధ్యం కాదని; ఎప్పుడున్+చెప్పుదున్= ఎల్లవేళలా అంటూనే ఉంటాను; ఐనన్= ఐనా; అఱలేక= కపటంలేకుండ; నీకున్; జయంబు; కోరి; పోరెదన్= యుద్ధం చేస్తాను; వగవక+ఉండుము= దుఃఖపడవద్దు.

తాత్పర్యం: పాండవు లెప్పటికిని జయింపరానివారే అని పలుమారు చెప్పుతుంటాను గదా! అయినప్పటికి నీవు జయించాలనే ఉద్దేశంతో ఒళ్ళు దాచుకోకుండా యుద్ధం చేస్తాను. నీవు దుఃఖపడవద్దు.'

భీష్ముని సప్తమ దివస యుద్ధక్రమము (సం. 6-77-11)

క. అన విని యూఱడి నిద్రా। జనితసుఖంబంది రేప జనపతి యనికిం
జనుటయు భీష్ముఁడు బల మె। ల్లను నెఱయఁగ దీర్చె మండలవ్యూహముగన్. 9

ప్రతిపదార్థం: జనపతి= రాజైన దుర్యోధనుడు; అనన్ విని= భీష్ముడు చెప్పగా విని; ఊఱడి= ఊరటచెంది; నిద్రాజనిత సుఖంబు+అంది= నిద్రచేత కలిగిన సుఖమును పొందినవాడై; రేపు+అ= ఉదయమున; అనికిన్= యుద్ధమునకు; చనుటయున్= పోగా; భీష్ముఁడు; బలము+ఎల్లను= తమ సేననంతటిని; మండల వ్యూహముగన్= మండలాకారంలో తీర్చిన వ్యూహాన్ని; నెఱయఁగన్= యుద్ధభూమినంతా వ్యాపించేటట్లుగా; తీర్చెన్= తీర్చిదిద్దాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు భీష్ముడి మాటలు విని ఊరటజెంది, రాత్రి సుఖంగా నిద్రించి, ఉదయాన లేచి, యుద్ధానికి వెళ్ళాడు. భీష్ముడు కూడా తన సైన్యాన్ని తేరిపారజూచి, యుద్ధరంగాన్నంతా వ్యాపించే విధంగా మండల వ్యూహాన్ని ఏర్పాటు చేశాడు.

విశేషం: వ్యూహభేదములు నాలుగు. 1. దండము; 2.భోగము; 3. మండలము; 4. అసంహతము. చక్రగోమూత్రికాదులు వీటి అంతర్గత భేదాలు వ్యూహమంటే, యుద్ధం కొరకు సైన్యమును ఒక ప్రత్యేక ప్రదేశములో శత్రువులకు చొరటానికి వీలులేకుండా విభజించి నిలుపుట.

వ. అందు నడుమ నరనాథుం డొప్పియుండెఁ దమ్ములుఁ జేయంగలదొరలును సూరెల నిలిచి రంతం బాండవులును భండనంబునకు వెడలి రయ్యుధిష్ఠిరుండు మనమొనలం గనుంగొని వజ్రవ్యూహంబు

గల్పింపుమని సేనాపతిం బనుప నతండును దత్ప్రకారంబున సైన్యంబు సన్నద్ధంబు సేసిన నది పరబలంబు మెచ్చక తఱిమి తూర్యధ్వను లెసఁగం దాఁకె, నప్పుడు ద్రోణుండు విరాటుని, ద్రౌణి శిఖండిని, దుర్యోధనుండు ధృష్టద్యుమ్నుని, మద్రపతి గవలను, విందానువిందులు యుధామన్యునిఁ బెక్కండ్రురాజులు బీభత్సుని మార్కొనిరి. భీమసేనుండు గృతవర్మను, సౌభద్రుండు చిత్రసేన దుశ్శాసన వికర్ణులను, ఘటోత్కచుండు భగదత్తుని, సాత్యకి యలంబుసుని, ధృష్టకేతుండు భూరిశ్రవసునిఁ, జేకితానుండు గృపాచార్యుని, ధర్మసూనుండు శ్రుతాయువును, బలువురు భూపతులు భీష్మునిం దలపడి రట్టియెడఁ గృష్ణునితో జిష్ణుం డిట్లనియె. **10**

ప్రతిపదార్థం: అందున్= ఆ మండలవ్యూహమునందు; నడుమన్= మధ్యభాగాన; నరనాథుండు= దుర్యోధనుడు; ఒప్పి+ఉండెన్= తగినట్లుగా ఉన్నాడు; తమ్ములున్; చేయంగల దొరలును= యుద్ధములో తనకు సాయపడునట్టి రాజులు; సూరెలన్= రాజునకు ఇరు ప్రక్కలందును; నిలిచిరి= నిలిచారు; అంతన్= అంతట; పాండవులును= పాండవులు కూడా; భండనంబునకున్= యుద్ధమునకు; ఆ+యుధిష్ఠిరుండు= (యుద్ధమందు స్థిరంగా ఉండే) ఆ ధర్మరాజు; మన మొనలన్= మన (కౌరవుల) సేనలను; కనుంగొని= చూచి; వజ్రవ్యూహంబున్= వజ్రమనే పేరుగల ఒక వ్యూహమును; కల్పింపుము= చేయుము; అని పనుపన్= ఆజ్ఞాపింపగా; అతండును= ఆ సేనాపతియును; తద్+ప్రకారంబునన్= ఆ విధంగా; సైన్యంబున్= సైన్యమును; సన్నద్ధంబు= యుద్ధమునకు సిద్ధము; చేసినన్= చేయగా; అది= ఆ పాండవులసేన; పరబలంబున్= శత్రువు (కౌరవు)ల సైన్యమును; మెచ్చక= లక్ష్యపెట్టక; తఱిమి= వెంబడించి పరుగెత్తించి; తూర్యధ్వనులు= వాద్యముల శబ్దములు; ఎసఁగన్= అతిశయించగా; తాఁకెన్= ఎదిరించెను; ద్రౌణి= ద్రోణుని కుమారుడు అశ్వత్థామ; శిఖండిని; ద్రోణుండు; విరాటుని; దుర్యోధనుండు; ధృష్టద్యుమ్నుని; మద్రపతి= శల్యుడు; కవలను= నకుల సహదేవులను; వింద+అనువిందులు; యుధామన్యుని; పెక్కండ్రు రాజులు= ఎందరో రాజులు; బీభత్సునిన్= అర్జునుడిని; మార్కొనిరి= ఎదిరించారు; భీమసేనుండు; కృతవర్మను; సౌభద్రుండు= సుభద్ర కొడుకైన అభిమన్యుడు; చిత్రసేన, దుశ్శాసన, వికర్ణులను; ఘటోత్కచుండు- భగదత్తుని; సాత్యకి-అలంబుసుని; ధృష్టకేతుండు- భూరిశ్రవసుని; చేకితానుండు-కృపాచార్యుని; ధర్మసూనుండు-శ్రుతాయువును; పలువురు భూపతులు= చాలామంది రాజులు; భీష్మునిన్= భీష్మునితో; తలపడిరి; అట్టి+ఎడన్= అట్టి సమయంలో; కృష్ణునితో; జిష్ణుండు+ఇట్లు+అనియెన్= అర్జునుడు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ మండలవ్యూహంలో మధ్యభాగాన దుర్యోధనుడున్నాడు. తమ్ములు, అతడికిసాయపడే రాజులూ ఇరు ప్రక్కలా నిలిచారు. అపుడు పాండవులు కూడా యుద్ధానికి వెళ్ళారు. ధర్మరాజు మన మొనలను చూచి తన సేనాపతియైన ధృష్టద్యుమ్నుడిని వజ్రవ్యూహాన్ని ఏర్పరచవలసిందిగా ఆదేశించాడు. ధృష్టద్యుమ్నుడు ఆ వ్యూహాన్ని ఏర్పరిచాడు. పాండవసేన శత్రుబలాన్ని లెక్కచేయకుండా తూర్య ధ్వనులు అతిశయించగా తరిమి మార్కొన్నది.

ద్రోణుడు విరాటుడినీ, అశ్వత్థామ శిఖండినీ, దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడినీ, శల్యుడు నకుల సహదేవులనూ, విందానువిందులు యుధామన్యుడినీ, చాలమంది రాజులు అర్జునుడినీ మార్కొన్నారు. ఇంకా, పాండవసేనలోని భీమసేనుడు కృతవర్మనూ, అభిమన్యుడు చిత్రసేనుడినీ, దుశ్శాసనుడినీ, వికర్ణుడినీ, ఘటోత్కచుడు భగదత్తుడినీ, సాత్యకి అలంబుసుడినీ, ధృష్టకేతుడు భూరిశ్రవసుడినీ, చేకితానుడు కృపాచార్యుడినీ, ధర్మరాజు శ్రుతాయువునూ, చాలా మంది రాజులు - భీష్ముడిని ఎదిరించారు. అప్పుడు శ్రీకృష్ణుడితో అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: 'పెక్కండ్రు రాజులు బీభత్సుని మార్కొనిరి' అని, 'పలువురు భూపతులు భీష్మునిఁ దలపడిరి' అనటంలో విశేషం ఏమిటంటే- మిగతా వీరుల విషయంలో ఒక్కడిని ఒక్కడుగాని, ముగ్గురిని మించకుండా ఎదుర్కొనగా, కౌరవ పక్షంలోని భీష్ముడి విషయంలోను,

పాండవ పక్షంలోని అర్జునుడి విషయంలోను ఆ విధంగా కాక- ఎక్కువ మంది ఎదుర్కొనటం జరిగింది. అనగా వీరిద్దరు వారి వారి పక్షాలలో అజేయులైన ప్రధాన వీరులని తెలుస్తున్నది.

తే. ' భీష్ముఁ డొడ్డన మేర్చిన బెడఁగు సాల । నొప్పెఁ, గౌరవయోధుల యుబ్బు మెఱసె
నృపు లనేకులు నా మీఁద నిగిడి రేను । జిక్కువఱిచెదఁ జూడుమీ యుక్కు మెఱసి.' 11

ప్రతిపదార్థం: భీష్ముఁడు= భీష్మాచార్యుడు; ఒడ్డనము= వ్యూహము; ఏర్చిన బెడఁగు= ఏర్పరచటంలోని అందం; చాలన్+ఒప్పెన్= మిక్కిలి తగియున్నది; కౌరవయోధుల ఉబ్బు= కౌరవ సైన్యములోని వీరులయొక్క పొంగు; మెఱసెన్= ప్రకాశించింది; అనేకులు నృపులు= పలువురు రాజులు; నా మీఁదన్= నా పైకి; నిగిడిరి= విజృంభించారు; ఏను= నేను; ఉక్కు మెఱసి= బలం అతిశయించగా; చిక్కు+పఱిచెదన్= సంకట పరుస్తాను; చూడుమీ= (ఓ కృష్ణా) చూడుము.

తాత్పర్యం: 'భీష్ముడు మండల వ్యూహాన్ని సంఘటించి, అందంగా ఒప్పిదంగా నిలిపాడు. అందుచేతనే కౌరవ సైనికులకు ఉత్సాహం అతిశయించింది. ఆ కారణంచేతనే పలువురు కౌరవ సైనికులు నా మీదకు ఉరుకుతున్నారు. నేను వారి బలానికి భంగం కలిగించి, కష్టం కలిగిస్తాను. ఓ కృష్ణా! చూడుము.'

వ. అని పలికి గొనయంబు సారించి. 12

ప్రతిపదార్థం: అని పలికి; గొనయంబున్= వింటినారిని, సారించి= సరిదీసి.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా పలికి, వింటి నారిని సారించి (తరువాతి పద్యంతో అన్వయం).

క. జననాథులపైఁ బె ల్లే । సిన వారలు నొక్కపెట్ట చెలఁగి ముకుందా
ర్జునులఁ బటుబాణవర్షం । బున ముంచిన నార్చె నీదుపుత్రబలంబుల్. 13

ప్రతిపదార్థం: జననాథులపైన్= కౌరవసేనలోని రాజులపైన; పెల్లు+ఏసినన్= అధికముగా ప్రయోగింపఁగా; వారలున్= ఆ రాజులుకూడ; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; చెలఁగి= ఉత్సాహం చెంది; ముకుంద+అర్జునులన్= శ్రీకృష్ణుడిని, అర్జునుడిని; పటు బాణ వర్షంబునన్= చురుకైన బాణములనెడి వర్షంలో; ముంచినన్= ముంచివేయగా; నీదు పుత్రబలంబుల్= నీ కుమారుడి సేనలు; ఆర్చెన్= బొబ్బలు పెట్టాయి.

తాత్పర్యం: అర్జునుడు రాజులపై అధికంగా బాణాలు ప్రయోగించగా, వారు ఒక్కసారిగా విజృంభించి, పదునైన బాణవర్షంలో ఆ కృష్ణార్జునులను ముంచివేశారు. అప్పుడు నీ కుమారుడి సేనలు పెను బొబ్బలు పెట్టాయి.

వ. అప్పు డింద్రనందనుండు గోపించి యైంద్రాస్త్రంబు ప్రయోగించిన. 14

ప్రతిపదార్థం: అప్పుడు= కౌరవసేనలోని రాజులు కృష్ణార్జునులను బాణవర్షంలో ముంచినప్పుడు; ఇంద్రనందనుండు= ఇంద్రుడి కుమారుడైన అర్జునుడు; కోపించి; ఐంద్ర+అస్త్రంబు= ఇంద్రుడు దేవతగా గల బాణాన్ని; ప్రయోగించినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: కౌరవరాజుల విజృంభణాన్ని చూచి కోపించి, అర్జునుడు ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు.

మ. అది యా బాణములెల్ల మాన్చి నరనా । థాంగంబులన్ గీఱి యు
న్మదశుండాలహయాళిఁ గూల్చి రభసో । న్మాదక్రియన్ సంభ్రమ
ప్రద మై మందర మంబుధిం గలఁచు ద । ర్పం బొప్ప నొప్పించుడుం
దదనీకంబులు వాఱి భీష్మురథ మా । ధారంబుగా నిల్చినన్. 15

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అది= అర్జునుడు ప్రయోగించిన ఐంద్రాస్త్రము; ఆ+బాణములు+ఎల్లన్= కురుసేనలోని రాజులు ప్రయోగించిన అన్ని బాణములను; మాన్చి= నశింపజేసి; నరనాథ+అంగంబులన్= రాజుల శరీరములను; గీఱి= భేదించి; ఉన్మద శుండాల హయ+ఆళిన్= మదముచెందిన ఏనుగుల, గుఱ్ఱాల సమూహమును; కూల్చి= కూలద్రోసి; రభస+ఉన్మాదక్రియన్= చెలరేగిన వెఱ్ఱివలె; సంభ్రమప్రదము+ఐ= మిక్కిలి భ్రాంతి గొల్పుచున్నదై; మందరము= మందర పర్వతము; అంబుధిన్= సముద్రమును; కలఁచు దర్పంబు+ఒప్పన్= కలతనొందించునట్టి గర్వము ఒప్పగా; నొప్పించుడున్= బాధను కలిగించగా; తద్+అనీకంబులు= ఆ కౌరవులసేనలు; పాఱి= పరుగెత్తి; భీష్మరథము= భీష్మునియొక్క తేరు; ఆధారంబు+కాన్= అండకాగా; నిల్చినన్= నిలువగా.

తాత్పర్యం: అర్జునుడు వేసిన బాణం శత్రువులు వేసిన బాణాల ప్రభావాన్ని పోగొట్టింది. శత్రురాజుల శరీరాలను గాయపరచింది. మత్తిల్లిన ఏనుగుల గుంపునూ, గుఱ్ఱాల పౌజునూ కూల్చివేసింది. వెఱ్ఱెత్తినదానివలె శత్రువులకు భయం కలిగిస్తూ మందరమనే పర్వతం సముద్రాన్ని కలచివైచినట్లుగా శత్రుసైన్యాన్ని కలత నొందించగా, కౌరవసేనలు భయపడి పరుగెత్తి, భీష్ముడి రథం మరుగుజొచ్చాయి.

విశేషం: అలం: ఉపమ.

వ. **త్రిగర్తపతి మొదలయిన యమ్మహీపతులుం దెరలి తమతమ సైన్యంబులు సన్న నెలవులకుం జని యొదుంగుటయు గాంగేయుండు గడంగుటయుం గని రాజులతో రారా జిట్లనియె.** 16

ప్రతిపదార్థం: త్రిగర్తపతి= త్రిగర్త దేశపురాజు సుశర్మ; మొదలు+అయిన; ఆ+మహీపతులున్= ఆ రాజులు కూడా; తెరలి= కలత చెంది; తమ తమ సైన్యంబులు= వారి వారి సేనలు; చన్న= వెళ్ళిన; నెలవులకున్= చోటులకు; చని= వెళ్ళి; ఒదుంగుటయున్= తల దాచుకొనగా; గాంగేయుండున్= గంగాపుత్రుడగు భీష్ముడు; కడంగుటయున్= శత్రుసంహారానికి యత్నించగా; కని; రాజులతో; రారాజు= చక్రవర్తియగు దుర్యోధనుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: త్రిగర్తాధిపతి ముఖ్యుడుగా గల పలువురు రాజులు కలతజెంది, తమసైన్యాలు వెళ్ళినచోటులకే వెళ్ళి దాగటాన్ని, భీష్ముడు యుద్ధంలో ప్రయత్నపరుడై ఉండటాన్ని చూచిన దుర్యోధనుడు ఆ రాజులతో ఇట్లా అన్నాడు.

విశేషం: త్రిగర్తము- మూడు అగర్తల దేశం. లాహోరమనే దేశంలోని ఒక భాగం జాలంధరమని కూడా దీనికిపేరు.

అవతారిక: వెనుకంజవేస్తున్న రాజులను రారాజు ఈ విధంగా ప్రోత్సాహపరుస్తున్నాడు.

క. **' సేనాసమేతుఁడగు నరు । పై నొక్కఁడ భీష్ముఁ డడర బలువిడిమైఁ దో**
డై నడవ వలదె? యింతటి । మానుసులకు నేను జూడ మరలం దగునే?' 17

ప్రతిపదార్థం: భీష్ముఁడు ఒక్కఁడు+అ= భీష్ముడొక్కడే; సేనాసమేతుఁడు+అగు= సైన్యముతో కూడినవాడైన; నరుపైన్= అర్జునుని మీదికి; అడరన్= విజృంభించుచుండగా; బలువిడిమైన్= ప్రతాపముతో; ఇంతటి మానుసులకున్= ఇంత గొప్ప పరాక్రమవంతులగు మనుష్య (భటు)లకు; తోడు+ఐ= సహాయులై; నడవన్‌వలదె= వెళ్లనక్కరలేదా?; నేను చూడన్= మీ ఏలికయగు నేను చూచుచుండగనే; మరలన్+తగునే?= వెనుదిరుగుట తగునా?

తాత్పర్యం: 'సైన్యంతో కూడియున్న అర్జునుడిపైకి భీష్ముడు ఒంటరివాడై తలపడుతుండగా, రారాజునైన నా సమక్షంలోనే, వీరులైన మీరు (రాజులు) శౌర్యంతో భీష్ముడికి అండగా ఉండకుండా పెడదారి పట్టటం న్యాయమా?' అని దుర్యోధనుడు రాజులను యుద్ధానికి పురికొల్పుతున్నాడు.

వ. అనిన విని యా భూపాలనికరం బాలంబునకు నూలుకొని సురనదీసూను నిరుగెలంకులం గూడుకొనియె నప్పుడు. 18

ప్రతిపదార్థం: అనినన్= దుర్యోధనుడు పై విధంగా అనగా; విని; ఆ భూపాలనికరంబు= ఆ రాజుల సమూహము; ఆలంబునకున్= యుద్ధమునకు; నూలుకొని= మనసు చక్కపరచుకొని; సురనదీసూనున్= దేవనదియగు గంగపుత్రుడైన భీష్ముని; ఇరు+కెలంకులన్= రెండు ప్రక్కలందు; కూడికొనియెన్= చేరెను; అప్పుడు.

తాత్పర్యం: రాజులందరూ రారాజు మాటవిని, యుద్ధానికి సన్నద్ధులై, భీష్మునికి ఇరుప్రక్కలందు నిలిచారు. ఆ సమయంలో-

సీ. గురుఁడు విరాటుని కోదండకేతుదం । డంబులఁ ద్రుంచె రెండంబకముల
నతఁడు వేఱొకవింట నాచార్యుమేనును । సూతుని మూఁడేసిసునిశితాస్త్ర
ముల నొంచి ఘోటకమ్ములనాలుగింట నో । నేసి చాపము సిడ మెడల రెంట
నేసిన నతఁడు ద న్నెనిమిదియమ్ముల । విరథుఁ జేసిన సుతునరద మెక్కి

తే. యతఁడు దానును గూడి వాలంపవెల్లి । ముంచుటయుఁ గుంభజుండు గోపించి దొడ్డ
నారసం బేయ నమ్మత్స్యనాథతనయు । నురము వడిఁ గాఁడి వీఁపున నుచ్చిపోయె. 19

ప్రతిపదార్థం: గురుఁడు= కౌరవ పాండవులకు విలు విద్య నేర్పిన ఆచార్యుడు- ద్రోణుడు; విరాటుని కోదండకేతుదండంబులన్= విరాట మహారాజుయొక్క వింటిని; టెక్కెము యొక్క కర్రను; రెండు+అంబకములన్= రెండు బాణాలతో; త్రుంచెన్= తునుకలు చేసినాడు; అతఁడు= ఆ విరాటమహారాజు; వేఱు+ఒక వింటన్= మరియొక విల్లుతో; మూఁడు+ఏసి= మూడు మూడు; సునిశిత+అస్త్రములన్= చాల పదునైన బాణములతో; ఆచార్య మేనును= ద్రోణాచార్యుని యొక్క శరీరమును; సూతునిన్= సారథిని; నొంచి= గాయపరచి; నాలుగింటన్= నాలుగు బాణాలతో; ఘోటకమ్ములన్= గుర్రములను; నోన్+ఏసి= నొప్పజేసి; రెంటన్= రెండు బాణాలతో; చాపము= విల్లు; సిడము= టెక్కెము; ఎడలన్= విరిగేటట్లుగా; ఏసినన్= వేయగా; అతఁడున్= ఆ ద్రోణాచార్యుడును; తన్నున్= తనను (విరాటుని); ఎనిమిది+అమ్ములన్= ఎనిమిది బాణాలతో; విరథున్= రథములేని వాడినిగా; చేసినన్= చేయగా; సుతు+అరదము+ఎక్కి= కుమారుడి రథమును ఎక్కి; అతఁడున్= కుమారుడును; తానునున్= విరాటమహారాజును; కూడి= కలిసి; వాలు+అంపవెల్లిన్= పదునైన బాణాల వెల్లువలో, ముంచుటయున్= ముంచివేయగా; కుంభజుండు= కడవనుండిపుట్టినవాడు- ద్రోణుడు; కోపించి= కోపంచెంది; దొడ్డనారసంబు= పెద్దదయిన ఇనుముతో చేయబడిన బాణాన్ని; ఏయన్= ప్రయోగింపగా; ఆ+మత్స్యనాథ తనయున్= ఆ మత్స్యదేశానికి రాజైన విరాటుని కుమారుని యొక్క; ఉరమున్= రొమ్మును; వడిన్= వేగముతో; కాఁడి= త్రవ్వి; వీఁపునన్= వీపునందు; ఉచ్చిపోయెన్= నాటుకొని బయటకు వచ్చినది.

తాత్పర్యం: ద్రోణుడు రెండు బాణాలువేసి, విరాటరాజు యొక్క వింటిని, పతాకము యొక్క కర్రను, త్రుంచివేశాడు. ఆ విరాటుడు మరొక వింటిని అందుకొని, మూడు మూడు మిక్కిలి పదునైన బాణాలతో ద్రోణాచార్యుడి శరీరాన్ని, సారథిని నొప్పించాడు. నాలుగు బాణాలతో గుర్రాలను కొట్టాడు. రెండు బాణాలతో ద్రోణుని ధనుస్సును, టెక్కెమునూ విరిచివేశాడు. ఆ ద్రోణుడు ఎనిమిది బాణాలువేసి, విరాటుని రథాన్ని కూల్చాడు. అప్పు డా విరాటుడు తన కొడుకు రథమెక్కి, తనకొడుకుతో కలిసి, పదునైన బాణాల ప్రవాహంలో ఆ ద్రోణుడిని ముంచాడు. అప్పుడు ద్రోణుడు కోపం చెంది, చాలా పొడవైన ఒక బాణాన్ని వేయగా, అది మత్స్యరాజు కుమారుని రొమ్మును గాయపరచి, వీపును తొలుచుకొని వెలుపలకి వచ్చినది.

వ. ఇట్లు క్రూరనారాచంబు బెట్టు దాఁకిన. 20

ప్రతిపదార్థం: ఇట్లు; క్రూరనారాచంబు= కఠినమైన ఆ బాణం; బెట్టు= గట్టిగా; తాఁకినన్= తగులగా.

తాత్పర్యం: ఈ విధంగా ఆ మత్స్యరాజు ప్రయోగించిన బాణం గట్టిగా తగులగా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. విల్లును నమ్ములు విడుచుచుఁ। ద్రెళ్లుటయును శంఖుఁజూచి ధృతిగలఁగి జనం
బెల్లను జూడ విరాటుఁడు। దల్లడమునఁ బాఱ విచ్చెఁ దత్సైన్యంబుల్. 21

ప్రతిపదార్థం: విల్లును(న్)= ధనుస్సును; అమ్ములున్= బాణములను; విడుచుచున్= వదలిపెట్టుచు; త్రెళ్లుటయున్= పడిపోగా; శంఖున్= ఆ శంఖుని; చూచి; ధృతి= ధైర్యము; కలఁగి= కలతపడి; విరాటుడు; జనంబు+ఎల్లను= జనులందరును; చూడన్= చూచుచుండగా; తల్లడమునన్= భయంతో; పాఱన్= పరుగెత్తగా; తద్+సైన్యంబుల్= ఆ విరాటుని సేనలు; విచ్చెన్= చెదరిపోయాయి.

తాత్పర్యం: ఆ ద్రోణుడు ప్రయోగించిన పెద్ద బాణపు దెబ్బకు శంఖుడు ధనుర్బాణాలను జారవిడిచి నేలపడ్డాడు. ఆ దృశ్యం చూడటంచేత ధైర్యం కోల్పోయి, విరాటుడు జనమంతా చూస్తుండగా, భయంతో పరుగెత్తాడు. ఆతడి సేనలు గూడ చెల్లాచెదరైపోయాయి.

అవతారిక: శిఖండి అశ్వత్థామల పోరు వర్ణిస్తున్నాడు.

వ. అట్టిసమయంబున శిఖండి గురుపుత్త్ర ఫాలంబునఁ బటునారాచత్రయంబు నాటించిన నతం డలిగి యొక్క పెట్ట పెక్కమ్ములఁ దురంగ సూతకేతు చాపంబుల నుగ్గుసేసినం బలకయు వాలునుం గొని నేల కుఱికి పాంచాలనందనుండు సాళువంబు చందంబునం గవిసి యశ్వత్థామ యేయు బాణంబులు గృపాణంబునఁ ద్రుంచుచుం గదిసిన నతండు కోపించి. 22

ప్రతిపదార్థం: అట్టి సమయంబునన్= విరాటుడు పారిపోయినట్టి తరుణంలో (ఆతడి సైన్యం కకావికలైపోయినట్టి ఆ సమయంలో); శిఖండి; గురుపుత్త్రుఫాలంబునన్= ద్రోణుడి కుమారుడైన అశ్వత్థామ యొక్క నుదుట; పటునారాచత్రయంబున్= మంచి శక్తిగల మూడు బాణాలను; నాటించినన్= గ్రుచ్చుకొనునట్లుచేయగా; అతండు= ఆ అశ్వత్థామ; అలిగి= కోపగించి; ఒక్క పెట్టన్= ఒకేసారిగా; పెక్కు+అమ్ములన్= ఎన్నో బాణాలతో; తురంగ= గుఱ్ఱాలు; సూత= సారథి; కేతు= ధ్వజము; చాపంబులన్= ధనుస్సు- వీటిని; నుగ్గు+చేసినన్= పొడిచేయగా; పలకయున్= కేడెమును (ఆయుధ విశేషము); వాలునున్= కత్తియును; కొని= తీసికొని; నేలకున్= భూమి మీదికి; ఉఱికి= దుమికి; పాంచాల నందనుండు= పాంచాలరాజుకుమారుడు శిఖండి; సాళువంబు చందంబునన్= డేగవలె; కవిసి= వ్యాపించి; అశ్వత్థామ= గురుపుత్రుడు; ఏయు= ప్రయోగించునట్టి; బాణంబులన్= బాణాలను; కృపాణంబునన్= కత్తితో; త్రుంచుచున్= తునియలుచేస్తూ; కదిసినన్= దగ్గరకురాగా; అతండు= ఆ అశ్వత్థామ; కోపించి.

తాత్పర్యం: ఆ సమయంలో శిఖండి మూడు పదునైన బాణాలను అశ్వత్థామ నొసట గ్రుచ్చుకొనేటట్లు ప్రయోగించాడు. అశ్వత్థామ కోపం చెంది ఒక్క తడవగా చాలా బాణాలు ప్రయోగించి అతని గుఱ్ఱాలను, సారథిని, టెక్కాన్ని, ధనుస్సును నుగ్గుచేశాడు. దానితో శిఖండి డాలు కత్తి తీసికొని, నేలపైకి ఉరికి, డేగమాదిరిగా ఎగబడుతూ, అశ్వత్థామ వేసే బాణాల నన్నింటినీ తన కత్తితో త్రుంచివేస్తూ మీదికి వచ్చాడు. అప్పుడు అశ్వత్థామ కోపంతో. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. **పలక పటియలుగాఁ జేసి యలుఁగుఁ దునిమి । యొడల వాలంపపొది నింప నొల్లఁబోక**
ద్రుపదపుత్రుండు గరవాలు దునియ వైవ । నడుమఁ బొడి సేసె నాచార్యనందనుండు. 23

ప్రతిపదార్థం: పలక(న్)= కేడెమును; పటియలు+కాన్+చేసి= బద్దలయ్యేటట్లుచేసి; అలుఁగున్= ఖడ్గమును; తునిమి= తునకలుచేసి; ఒడల(న్)= శరీరమందు; వాలు+అంపపొదిన్= పదునైన బాణాల సమూహాన్ని; నింపన్= నింపివేయగా; ఒల్లఁబోక= లెక్కచేయక; ద్రుపదపుత్రుండు= ద్రుపదునియొక్క కుమారుడు- శిఖండి; కరవాలు= కత్తియొక్క; తునియన్ వైవన్= ముక్కను వేయగా; ఆచార్యనందనుండు= ద్రోణపుత్రుడు- అశ్వత్థామ; నడుమన్= మధ్యలోనే; పొడి+చేసెన్= (శిఖండి వేసిన కత్తితుంటను) పొడి పొడి చేశాడు.

తాత్పర్యం: అశ్వత్థామ శిఖండి యొక్క డాలును బద్దలుకొట్టాడు. ఖడ్గాన్ని నరికి పదునైన బాణ సమూహాన్ని అతడి ఒంటినిండా నింపాడు. శిఖండి వెనుదీయకుండా అశ్వత్థామ నరకగా మిగిలిన కత్తి ముక్కను విసరగా అశ్వత్థామ దానిని తన వద్దకు రానీయకుండా మధ్యలోనే పొడిచేసేశాడు.

వ. **శిఖండియు సాత్యకిరథం బెక్కెఁ దదవసరంబున ధృష్టద్యుమ్నుండు.** 24

ప్రతిపదార్థం: శిఖండియున్= శిఖండికూడ; సాత్యకిరథంబున్= సాత్యకి రథాన్ని; ఎక్కెన్; తద్+అవసరంబునన్= ఆ సమయంలో; ధృష్టద్యుమ్నుండు.

తాత్పర్యం: తన ఆయుధాలను అశ్వత్థామ మధ్యలోనే పొడిచేయగా, శిఖండి సాత్యకియొక్క రథంలోకి వెళ్ళాడు. ఆ సమయంలో.

ధృష్టద్యుమ్నునిచే దుర్యోధనుండు విరథుఁ డై పోవుట (సం. 6-78-44)

క. **శరములు గురుపతిమీఁదం । గురిసిన నతఁ డతని మేనఁ గ్రూరాస్త్రంబుల్**
సరభసమున నింపఁగ స । త్వరముగ నాద్రుపదసుతుఁడు దచ్చాపంబున్. 25

ప్రతిపదార్థం: శరములు= (ధృష్టద్యుమ్నుడు) బాణాలను; కురుపతిమీఁదన్= కురురాజైన దుర్యోధనుడిపై; కురిసినన్= వర్షింపగా; అతఁడు= ఆ దుర్యోధనుడు; అతనిమేనన్= ఆ ధృష్టద్యుమ్నుడి శరీరంమీద; క్రూర+అస్త్రంబుల్= కఠినమైన బాణాలను సరభసమునన్= మిక్కిలి వేగంతో; నింపఁగన్= నిండింపగా; ఆ ద్రుపదసుతుఁడు= ద్రుపదుని కుమారుడగు ఆ ధృష్టద్యుమ్నుడు; సత్వరముగన్= త్వరతో; తద్+చాపంబున్= ఆ దుర్యోధనునియొక్క విల్లును.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుడిపై బాణాలు గుప్పించాడు. దుర్యోధనుడు కూడా వెంటనే ధృష్టద్యుమ్నుడి శరీరంమీద కఠినమైన బాణాలను నింపాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుడి విల్లును (విరిచాడు).

వ. **తుండంబులు గావించి.** 26

ప్రతిపదార్థం: తుండంబులు= తునుకలు; కావించి= చేసి.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుని విల్లును తునుకలు చేశాడు.

క. **మఱియు నొక విల్లు గొను న । త్తెఱపిన విరథుఁడుగఁ జేయ ధృతిఁ గరవాలం**
బుఱక గొని విభుఁడు నేలకు । నుఱికి యతనిమీఁద నడరె నుగ్రాకృతియై. 27

ప్రతిపదార్థం: మఱియున్+ఒక+విల్లున్= వేరొక వింటిని; కొను+ఆ+తెఱపినన్= తీసికొనే లోపల; విరథుడుగన్+చేయన్= రథంలేని వాడిగా చేయగా; విభుఁడు= రాజైన దుర్యోధనుడు; ధృతిన్= ధైర్యముతో; కరవాలంబున్= కత్తిని; ఉఱక+కొని= అలవోకగా పట్టుకొని; నేలకున్= నేలమీదికి; ఉఱికి= దూకి; ఉగ్ర+ఆకృతి+ఐ= భయంకరమైన ఆకారంకలవాడై; అతనిమీఁదన్= ఆ ధృష్టద్యుమ్నుడి మీదికి; అడరెన్= విజృంభించెను.

తాత్పర్యం: దుర్యోధనుడు వేరే విల్లు తీసికొనే లోపలనే ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుని రథాన్ని నుగ్గుచేశాడు. అప్పుడు దుర్యోధనుడు తన ఖడ్గాన్ని తీసికొని మహాధైర్యంతో, భయంకరాకారంతో నేలమీదికి దూకి శత్రువుపైకి విజృంభించాడు.

వ. అట్టియెడ సౌబలుండు రయంబున నెయిది యన్నరపతిం దనరథంబు మీఁదికిఁ దిగిచికొని పోయె. సాత్యకి యలంబుసుని నలఘు విశిఖ వృష్టిం బొదివిన నద్దనుజుం డర్ధచంద్రబాణంబున దద్బాణాసనంబు దుండంబులు సేసి యంగమ్ముల వాలమ్ములు గీలించి మాయ లొనర్చి యతిఘోరంబుగాఁ బేర్చిన నా శినివంశవరుం డచలుం డై యైంద్రాస్త్రప్రయోగంబున నమ్మాయ మాయించి యతని వెగడుపఱచిన నతఁడు వెఱచఱచి పఱచిన నయ్యాదవసింహుండు సింహనాదంబు సేసి కురుబలంబులపయిం గవిసెనప్పుడు. 28

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; సౌబలుండు= సుబలుని కుమారుడు-శకుని; రయంబునన్= వేగంగా; ఎయిది= అనుసరించి వెళ్ళి; ఆ+నరపతిన్= ఆ దుర్యోధనుడిని; తన; రథంబుమీఁదికిన్; తిగిచికొని+పోయెన్= లాగుకొని పోయాడు; సాత్యకి= కృష్ణుని సోదరుడు; అలంబుసునిన్= అలంబుసుడను కౌరవపక్షంలోని రాక్షసుణ్ణి; అలఘు విశిఖవృష్టిన్= అధికములగు బాణాల వర్షంతో; పొదివినన్= కప్పివేయగా; ఆ+దనుజుండు= రాక్షసుడైన ఆ అలంబుసుడు; అర్ధచంద్రబాణంబునన్= అర్ధచంద్రుని ఆకారంతో ఉండే బాణంతో; తద్+బాణాసనంబున్= వాని వింటిని; తుండంబులు+చేసి= తునుకలుగా చేసి; అంగమ్ములన్= వాని అవయవాలయందు; వాలు+అమ్ములన్= పదునుగల బాణాలను; కీలించి= నాటి; మాయలు= రాక్షసమాయలు; ఒనర్చి= చేసి; అతి ఘోరంబు+గాన్= మిక్కలి భయంకరంగా; పేర్చినన్= అతిశయించగా; ఆ శినివంశవరుండు= ప్రసిద్ధమైన శినివంశంలో ముఖ్యుడైనవాడు- సాత్యకి; అచలుండు+ఐ= చలనంలేనివాడై; ఐంద్రాస్త్ర ప్రయోగంబునన్= ఇంద్రుడు దేవతగాగల బాణాన్ని ప్రయోగించడంచేత; ఆ+మాయన్= అలంబుసుడు ప్రయోగించిన మాయను; మాయించి= పోగొట్టి; అతనిన్= అలంబుసుడిని; వెగడుపఱిచినన్= తల్లడిల్లజేయగా; అతఁడు= అలంబుసుడు; వెఱచఱచి= భయపడి; పఱచినన్= పారిపోగా; ఆ+యాదవసింహుడు= యదువంశంలోని వాళ్ళలో శ్రేష్ఠుడు- సాత్యకి; సింహనాదంబుచేసి= సింహం మాదిరి గర్జించి; కురుబలంబులపయిన్= కౌరవ బలాల మీదికి; కవిసెన్= విజృంభించాడు; అప్పుడు.

తాత్పర్యం: అప్పుడు శకుని ఆ దుర్యోధనుడిని తన రథంలోనికి ఎక్కించుకొని పోయాడు. పాండవ పక్షంలోని సాత్యకి అలంబుసుడనే రాక్షసుడిని బాణాలవర్షంలో ముంచి వేశాడు. ఆ రాక్షసుడు అర్ధచంద్రాకారంగా ఉండే బాణంతో సాత్యకి వింటిని ముక్కలు చేశాడు. అవయవాలనిండా బాణాలను గ్రుచ్చివేశాడు. రాక్షసమాయలు చేశాడు. చాలా భయంకరంగా మాయాపరంపరలను ఆతనిపైకి ప్రయోగించాడు. వాడింతచేసినా, శినివంశశ్రేష్ఠుడు సాత్యకి స్థిరంగా నిలబడి, ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించి, ఆ రాక్షసుడి మాయను మటుమాయంచేసి అతడిని తల్లడిల్లేటట్లు చేశాడు. ఆ దెబ్బతో అతడు భయపడి పారిపోయాడు. సాత్యకి కురుసైన్యంపైకి ఉరికాడు. అప్పుడు-

అవ. భీముడికి, కృతవర్మకు, యుద్ధం ఇక్కడ చెప్పబడుతోంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కృతవర్మ యేచి మారుత । సుతుపయిఁ దఱుముటయుఁ నతఁడు సూతునిఁ దురగ
ప్రతతిం బడనేసి మహో । ద్ధతి మార్గణమయముసేసెఁ దద్గాత్రంబున్. 29

ప్రతిపదార్థం: కృతవర్మ= కౌరవపక్షపాతియగు కృతవర్మయనువాడు; ఏచి= విజృంభించి; మారుతసుతుపయిన్= వాయుదేవుని కుమారుడు భీముడి మీదికి; తఱుముటయున్= కవియగా; అతఁడు= ఆ భీముడు; సూతునిన్= సారథిని; తురగ ప్రతతిన్= గుఱ్ఱాల గుంపును; పడన్+ఏసి= పడేటట్లుకొట్టి; మహా+ఉద్ధతిన్= చాలా గర్వంతో; తద్+గాత్రంబున్= ఆ కృతవర్మశరీరాన్ని; మార్గణమయము= బాణాలమయంగా; చేసెన్= చేసినాడు.

తాత్పర్యం: కృతవర్మ ఆటోపంగా భీముడిపైకి విజృంభించాడు. భీముడు ఆ కృతవర్మ సారథిని, గుఱ్ఱాల గుంపును కూల్చివేశాడు. గర్వంతో పలు బాణాలు ప్రయోగించి, శత్రువు శరీరాన్ని శరమయం చేశాడు.

వ. ఇట్లు విరథుండును విశిఖక్షతదేహుండు నై యతం డేదు వెరిఁగి నట్లు నీదు మఱందియగు వృషకు నరదంబుమీఁది కరిగె, ననిలతనయుండును మనగజఘటలపైఁ బటురయంబునం దనరథంబుఁ బఱపె' ననిన విని ధృతరాష్ట్రుండు సంజయున కి ట్లనియె. 30

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అతండు= ఆ కృతవర్మ; విరథుండును= రథంలేనివాడుగాను; విశిఖక్షత దేహుండున్+ఐ= బాణాలచే గాయపరచబడ్డ దేహం కలవాడుగానూ అయి; ఏదు+వెరిఁగినట్లు= ముండ్లపంది పెరిగినట్లు; నీదు మఱంది= నీ (ధృతరాష్ట్రుని) బావమరది; అగు= అయిన; వృషకు= వృషకునియొక్క; అరదంబుమీఁదికిన్= రథంపైకి; అరిగెన్= వెళ్ళాడు; అనిలతనయుండును= వాయుపుత్రుడు- భీముడు; మన= (కౌరవులైన) మనయొక్క; గజఘటలపైన్= ఏనుగుల గుంపులమీదికి; పటురయంబునన్= మిక్కిలి వేగంతో; తన= తనయొక్క; రథంబున్= తేరును; పఱపెన్= సాగదోలాడు; అనినన్= అని చెప్పగా; విని; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈవిధంగా విరథుడూ, బాణాలతో గాయపడ్డ శరీరం కలవాడూ అయిన కృతవర్మ నిక్కపొడుచుకున్న ముళ్లు గల ముండ్లపందివలె నీమరదియైన వృషకుడి రథంమీదికి వెళ్లాడు. వాయుపుత్రుడైన భీమసేనుడు మన ఏనుగుల గుంపుమీదికి మిక్కిలి వేగంతో తన రథాన్ని నడిపాడు. అని చెప్పగా విని ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లన్నాడు.

విశేషం: ఘట= యుద్ధంకోసం ఒక నిర్ణీతస్థలంలో చేర్చబడిన ఏనుగుల గుంపు.

అవతారిక: పాండవసేనలు విజృంభించటాన్ని, కౌరవసేనలు తగ్గుముఖం పట్టడాన్ని విని ధృతరాష్ట్రుడు చింతతో సంజయుణ్ణి అడుగుతాడు.

క. ' విఱుగుట నొచ్చుట మనదెసఁ । దఱచుగ నాడెదవు పాండుతనయులబల మే
డ్తెఱ దఱుఁగక పెనఁగుట పలు । మఱుఁ జెప్పెద వకట! యేమి మాయయొ తలఁపన్. 31

ప్రతిపదార్థం: విఱుగుట= ఓడిపోవుట; నొచ్చుట= నొప్పిచెందుట; మనదెసన్= మనదైన కౌరవపక్షంలో; తఱచుగన్= అధికంగా; ఆడెదవు= చెప్పుతున్నావు; పాండు తనయుల బలము= పాండు రాజకుమారుల సైన్యము; తఱుగక= నశించిపోక; ఏడ్తెఱన్= పరాక్రమంతో; పెనఁగుట= యుద్ధముచేయుట; పలుమఱున్= మాటి మాటికి; చెప్పెదవు= పలుకుతున్నావు; అకట!= అయ్యో!; తలఁపన్= ఆలోచింపగా; ఏమి మాయయొ?= ఇది ఏమి మాయో?

తాత్పర్యం: 'ఓ సంజయా! మన పక్షంలో చావడం, బాధపడడం గూర్చి ఎక్కువగా చెప్పుతున్నావు. మరి పాండవ బలమైతే నాశనం లేకుండా గొప్పగా యుద్ధంచేయటాన్ని పదేపదే పలుకుతున్నావు. అయ్యో! ఇది ఏమి మాయో అర్థం కావటంలేదు?'

వ. అనిన విని సంజయుం డతని కిట్లను 'మనవారు దా మోపినభంగిఁ బెనంగుదురు. సముద్రంబుసొచ్చిన యేఱులుంబోలెఁ బాండవసేనం జొచ్చి తమ దర్పంబులు మెఱయలే రది తప్పుగాఁ గొనరాదు. నీ తప్పునఁ బాటిల్లిన చేటునకు శోకింపం బని లేదు. సమరప్రకారం బవధరింపు మవంతిదేశాధీశులగు విందాను విందులం బటుబాణపరంపరలం గప్పి యుధామన్యుం డేచి యనువిందు విరథుం జేసిన నతండు విందు స్యందనం బెక్కుటయు, నప్పాంచాలవంశవరుండు. 32

ప్రతిపదార్థం: అనినన్= అని ధృతరాష్ట్రుడు చెప్పగా; సంజయుండు; విని; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఇట్లు; అనున్= అంటాడు; మనవారు= కౌరవులు; తాము; ఓపిన భంగిన్= శక్తికొలది; పెనంగుదురు= యుద్ధంచేస్తారు; సముద్రంబు= సముద్రంలోకి; చొచ్చిన= ప్రవేశించిన; ఏఱులున్+పోలెన్= నదులమాదిరి; పాండవసేనన్= పాండవుల సైన్యమును; చొచ్చి= ప్రవేశించి; తమ; దర్పంబులు= గర్వాలను; మెఱయలేరు= ప్రకాశింపచేయలేరు; అది= తమ పౌరుషాన్ని ప్రకాశింపచేయలేకపోవుట; తప్పు+కాన్= అపరాధముగా; కొనరాదు= అనుకోకూడదు; నీ తప్పునన్= నీ అపరాధంవల్ల; పాటిల్లిన= కలిగిన; చేటునకున్= నాశనానికి; శోకింపన్= దుఃఖింపగా; పనిలేదు; సమర ప్రకారంబు= యుద్ధ విధానాన్ని; అవధరింపుము; అవంతి దేశాధీశులు+అగు= అవంతిదేశానికి రాజులైన; విందానువిందులన్= విందుడు, అనువిందుడు అనువారిని; పటుబాణ పరంపరలన్= బటువులైన బాణాల వరుసలతో; కప్పి= కప్పివేసి; యుధామన్యుండు= ఆ పేరుగలరాజు; ఏచి= విజృంభించి; అనువిందున్= అనువిందుడనువాడిని; విరథున్= రథంలేనివాడిగా; చేసినన్= చేయగా; అతండు= ఆ అనువిందుడు; విందు స్యందనంబు= విందునియొక్క రథాన్ని; ఎక్కుటయున్= ఎక్కటంతో; ఆ+పాంచాలవంశవరుండు= పాంచాల వంశంలో శ్రేష్ఠుడైన ఆ యుధామన్యుడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు అడిగినదానికి సంజయు డీ విధంగా బదులుచెప్పాడు. 'మనకౌరవ సైన్యమేమో తన శక్తికొద్దీ పోరాడుతున్నది. సముద్రాన్ని చేరిన ఏళ్ళు అందులో కలిసిపోయి తమ స్వరూపాన్ని చూపలేని విధంగా, తమ ప్రతాపాన్ని వీరు చూపలేకపోతున్నారు. అది వారి తప్పుకాదు. నీ తప్పిదంవల్లనే ఈ ముప్పు ముంచుకు వచ్చింది. దానికీ దుఃఖపడనక్కరలేదు. యుద్ధవైఖరిని ఆలకించు. యుధామన్యుడు బాగా విజృంభించి అవంతిదేశపురాజులు విందానువిందులనే వాళ్ళను పుంఖానుపుంఖంగా పదునైన బాణాలతో కప్పివేసి, అనువిందుడనేవాడి రథాన్ని నుగ్గుచేశాడు. వాడు విందుడి రథమెక్కాడు. అప్పుడు పాంచాల రాజు యుధామన్యుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. విందుని సారథి నొక కో । లం దునిమిన వాహములు గలంగంబడి పా
ఱెం దేరు దిగిచికొని మగు । డం దద్బలమెల్లఁ దల్లడముఁ బొందె వడిన్. 33

ప్రతిపదార్థం: ఒక కోలన్= ఒక బాణముతో; విందుని సారథిన్= విందునియొక్క సారథిని; తునిమినన్= చంపివేయగా; వాహములు= గుర్రాలు; కలంగన్+పడి= కలతచెంది; తేరున్= రథమును; తిగిచికొని= లాగికొని; మగుడన్= వెనుదిరిగి; పాఱెన్= పరుగెత్తాయి; తద్+బలము= వాని సైన్యము; ఎల్లన్= అంతయు; వడిన్= వేగంగా; తల్లడమున్= చంచలత్వమును; పొందెన్.

తాత్పర్యం: యుధామన్యుడు విందుడి సారథిని ఒక బాణంతో చంపివేశాడు. అప్పుడు రథానికి పూన్చిన గుర్రాలు కలతచెంది, తేరును లాగికొని వెనుకకు మళ్ళాయి. దానితో విందునిసేన తల్లడిల్లిపోయినది.

వ. అట్టి సంకులసమరంబున. 34

ప్రతిపదార్థం: అట్టి= ఆ విధమైన; సంకులసమరంబునన్= దొమ్మి యుద్ధంలో.

తాత్పర్యం: పద్ధతిని అతిక్రమించి జరిగిన ఆ దొమ్మియుద్ధంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. భగదత్తు నేనుఁ గదరిన । వెగడునఁ బాండవులమొనలు విఱుగుటయు మహా
నగ మేటివేగ మాఁగిన । పగిది ఘటోత్కచుఁడు దాని పరు వుడిగించెన్. 35

ప్రతిపదార్థం: భగదత్తు= భగదత్తుని యొక్క; ఏనుఁగు= గజము; అడరినన్= విజృంభించగా; పాండవులమొనలు= పాండవుల యొక్క సైన్యము; వెగడునన్= తడబాటుతో; విఱుగుటయున్= ఓడిపోవుటమూ; నగము= పర్వతం; ఏటి వేగము= నదీ ప్రవాహాన్ని; ఆఁగిన పగిదిన్= ఆపుచేసిన విధంగా; ఘటోత్కచుఁడు; దాని పరువు= ఆ ఏనుగు యొక్క పరుగెత్తటాన్ని; ఉడిగించెన్= మాన్పింపచేసినాడు.

తాత్పర్యం: భగదత్తుడి ఏనుగు విజృంభించి పరుగెత్తింది. దానివలన పాండవుల సేన తడబడి చిందరవందరైపోసాగింది. అప్పుడు ఘటోత్కచుడు నదీవేగాన్ని గొప్పపర్వతం ఆపినట్టుగా ఆ ఏనుగు పరుగును ఆపాడు.

సీ. దనుజేంద్రు నిలుచుట గని సైన్య మెప్పటి । యట్టుల పురికొని యనికిఁ జొచ్చె
నాఘటోత్కచుఁడు బాణావళి పఱపిన । భగదత్తుఁ డదియెల్ల మగుడఁ జేసి
పటుతోమరంబులు పదునాలు గడరింప । నవి ద్రుంచి డెబ్బది యమ్ములేసి
యసుర యార్చినఁ బేర్చి యాతఁడు విరథుఁ జే । సిన వాఁడు శక్తి వైచిన నతండు

తే. నడుమఁ దునుమాడి వడిఁ బెక్కునారసముల । నొంప దైత్యుండు నముచి నిలింపపతికిఁ
బాఱిన ట్లోడి పాఱె నబ్బలము గడిమి । నెగచెఁ బ్రాగ్జ్యోతిషాధీశుఁ డిభముఁ బఱపి. 36

ప్రతిపదార్థం: దనుజేంద్రు నిలుచుటన్= ఘటోత్కచుడు నిలబడటాన్ని; కని= చూచి; సైన్యము= కౌరవసేన; ఎప్పటి+అట్టులన్= మరల; పురికొని= కమ్ముకొని; అనికిన్= యుద్ధమునకు; చొచ్చెన్= చొరబడినది; ఆ ఘటోత్కచుఁడు; బాణావళిన్= బాణాల సమూహాలను; పఱపినన్= ప్రయోగించగా; భగదత్తుఁడు; అది+ఎల్లన్= దానినంతటినీ; మగుడన్+చేసి= తిప్పికొట్టి; పదునాలుగు; పటు తోమరంబులు= సమర్థములగు చిల్లకోలలను; అడరింపన్= ప్రయోగించగా; అవి= వాటిని; త్రుంచి= తునుకలుచేసి; అసుర= రాక్షసుడు; డెబ్బది+అమ్ములు+ఏసి= డెబ్బై బాణాలువేసి; ఆర్చినన్= పొలికేక పెట్టగా; ఆతఁడు= ఆ భగదత్తుడు; పేర్చి= విజృంభించి; విరథున్+చేసినన్= రథములేనివాడిని చేయగా; వాఁడు= ఆ ఘటోత్కచుడు; శక్తి వైచినన్= శక్త్యాయుధాన్ని ప్రయోగించగా; అతండు= ఆ భగదత్తుడు; నడుమన్= మధ్యలోనే; తునుము+ఆడి= తునుకలుచేసి; వడిన్= వేగంతో; పెక్కు నారసములన్= పలుబాణాలతో; నొంపన్= బాధించగా; నముచి= నముచి అనే రాక్షసుడు; నిలింప పతికిన్= దేవతల రాజగు ఇంద్రుడికి; పాఱినట్లు= పరుగెత్తిన మాదిరిగా; దైత్యుండు= ఘటోత్కచుడు; ఓడి= ఓడిపోయి; పాఱెన్= పరుగెత్తాడు; ప్రాగ్జ్యోతిష+అధీశుఁడు= ప్రాగ్జ్యోతిషమునకు రాజైన భగదత్తుడు; ఇభమున్= తన ఏనుగును; పఱపి= తోలి; ఆ+బలమున్= ఆ రాక్షసుడి సైన్యాన్ని; కడిమిన్= పరాక్రమంతో; ఎగచెన్= తరిమాడు.

తాత్పర్యం: భగదత్తుని ఏనుగు ముందు ఘటోత్కచుడు నిలవడంచూచి, ఆ ఏనుగు యొక్క విజృంభణానికి భయపడిపారిపోయిన పాండవసేన ఎప్పటిలాగానే పూనుకొని యుద్ధం చేసింది. ఆ ఘటోత్కచుడు అతడిపై బాణాలు కురిపించాడు. ఆ బాణాలను భగదత్తుడు తిప్పికొట్టాడు. బలంగల పద్నాలుగు చిల్లకోలలను కూడా వాడిపై ప్రయోగించాడు. ఘటోత్కచుడు, వాటిని త్రుంచి డెబ్బై బాణాలు వేసి, సింహనాదం చేయగా భగదత్తుడు విజృంభించి, ఆ రాక్షసుడి రథాన్ని కూల్చాడు. వాడు భగదత్తుడి మీద 'శక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించాడు. భగదత్తుడు ఆ 'శక్తి' ఆయుధాన్ని మధ్యలోనే త్రుంచివేసి వేగంగా పెక్కు బాణాలతో నొప్పించాడు. అప్పుడు ఘటోత్కచుడు ఇంద్రుడి దెబ్బకు తట్టుకోలేక పారిపోయిన నముచి విధంగా, భయపడి పారిపోయాడు. ఆ సమయంలో భగదత్తుడు ఘటోత్కచుడి సైన్యంమీదికి తన ఏనుగును పురికొలిపి, చిందరవందర చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అవతారిక: శల్యునికి, నకులసహదేవులకు జరిగిన యుద్ధం వర్ణించబడుతోంది.

ఆ. శల్యుమీఁద గవలు శరవృష్టి గురిసిన । నగుచు, విరథుఁ జేసె నకులు నతఁడు
వార లప్పు డొక్క తే రెక్కి యడరిన । రౌద్ర మెసఁగ నొంచె మద్రవిభుఁడు. 37

ప్రతిపదార్థం: కవలు= నకుల సహదేవులు; శల్యుమీఁదన్; శరవృష్టిన్= బాణవర్షాన్ని; కురిసినన్= కురిపింపగా; అతఁడు= ఆ శల్యుడు; నగుచున్= నవ్వుతూ; నకులున్= నకులుడిని; విరథున్= రథంలేనివాడినిగా; చేసెన్= చేశాడు; అప్పుడు= ఆ రథం భగ్నమైన సమయంలో; వారలు= ఆ నకుల సహదేవులు; ఒక్కతేరు= ఒకేరథాన్ని; ఎక్కి; అడరినన్= అతిశయించగా; మద్రవిభుఁడు= శల్యుడు; రౌద్రము= రౌద్రరసము; ఎసఁగన్= అతిశయించగా; నొంచెన్= వారిని బాధించాడు.

తాత్పర్యం: నకులుడు, సహదేవుడు- వీరిద్దరూ శల్యుడిమీద బాణాల వర్షాన్ని కురిపించారు. శల్యుడు నవ్వుతూ సునాయాసంగా నకులుడి రథాన్ని విరిచాడు. తరువాత, నకుల సహదేవులిద్దరూ ఒకే రథాన్నెక్కి విజృంభించారు. శల్యుడు మహారౌద్రంతో వారిని బాధించాడు.

విశేషం: రౌద్రము= శృంగారాది రసాల్లో ఒకటి. నవరసాలు- 1. శృంగారము; 2. హాస్యము; 3.కరుణము; 4.వీరము; 5.రౌద్రము; 6.భయానకము; 7. బీభత్సము; 8.అద్భుతము; 9. శాంతము.

చ. ధృతి బలుపొప్ప నిల్చి సహ । దేవుఁడు వ్రేఁకని నారసంబు గ్రూ
రత నుర మాడనేయ నది । రక్తము సోఁకక యుచ్చిపోవుడున్
మృతుఁడునుబోలెఁ దేరిపయి । మేటిమగండగు మద్రమేదినీ
పతి పడినం గలంగె నర । పాలక! కౌరవరాజ సైన్యముల్. 38

ప్రతిపదార్థం: నరపాలక!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; సహదేవుఁడు; ధృతి= ధైర్యముయొక్క; బలుపు= ఆధిక్యము; ఒప్పన్= ఒప్పియుండగా; నిల్చి= నిలబడి; వ్రేఁకని= బరువైన; నారసంబు= బాణం; క్రూరతన్= కఠినముగా; ఉరము= రొమ్మును; ఆడన్= నాటేటట్లుగా; ఏయన్= వేయగా; అది= ఆ బాణం; రక్తము= నెత్తుటిని; సోఁకక= తాకక; ఉచ్చిపోవుడున్= గ్రుచ్చికొని వెలుపలికి రాగా; మేటిమగండు+అగు= గొప్పవీరుడు అయిన; మద్రమేదినీపతి= మద్రదేశపురాజు- శల్యుడు; తేరిపయిన్= రథంమీద; మృతుఁడునున్+పోలెన్= చచ్చినవాడి మాదిరి; పడినన్= పడిపోగా; కౌరవరాజసైన్యముల్= కౌరవులకు రాజైన దుర్యోధనుడి సైన్యాలు; కలంగెన్= కలతపడినాయి.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! సహదేవుడు ధైర్యాతిశయంతో, కాలునిలదొక్కుకొని, బాగా చూచి ఒక్కబాణాన్ని శల్యుడిమీదికి వేశాడు. రొమ్ము తాకేటట్లు వేయబడ్డ ఆ బాణం రక్తం అంటుకోకుండా గుచ్చుకొని, వెలుపలికి వెళ్ళిపోయింది. ఆ దెబ్బకు శల్యుడు చచ్చినవాడి మాదిరి, రథంలో పడ్డాడు. ఆ దృశ్యం చూచి, కౌరవసేనలు చాలా కలతచెందాయి.

వ. ఇట్లు మూర్ఛితుం డయినశల్యుం జూచి సారథి రథంబు దొలంగందోలికొనిపోయినం గనుంగొని కవలు సింహనాదంబు సేసి, శంఖంబులఁ బూరించి రంతం గమలబాంధవుండు దివసమధ్యోపేతుం డయ్యె నట్టి సమయంబున యమసూనుండు శ్రుతాయువుపైఁ దొమ్మిదియమ్ములు నిగిడించిన నతండు వాని మగిడించి నిశాతసాయకసప్తకంబు శరీరంబున గ్రుచ్చినం గోపించి యుధిష్ఠిరుండు వరాహకర్ణశరాసారంబున వాని వక్షస్ స్థలంబు వ్రచ్చి వెడందవాతియమ్మునం గేతువుం దునిమిన నతండు. 39

ప్రతిపదార్థం: సారథి= శల్యుడి రథసారథి; ఇట్లు= ఈ విధంగా; మూర్ఛితుండు+ఐన= మూర్ఛచెందినవాడైన; శల్యున్= శల్యుడిని; చూచి= గమనించి; రథంబున్= తేరును; తొలంగన్= యుద్ధభూమినుండి తొలగిపోయేటట్లు; తోలికొనిపోయినన్; కవలు= నకుల సహదేవులు; కనుంగొని= చూచి; సింహనాదంబు= సింహగర్జన; చేసి; శంఖంబులన్= తమ తమ శంఖాలను; పూరించిరి= ఊదినారు; అంతన్= అంతలో (ఆ సమయంలో); కమల బాంధవుండు= తామరపూలకు చుట్టమైన సూర్యుడు; దివసమధ్య+ఉపేతుండు+అయ్యెన్= పగటి మధ్యభాగాన్ని పొందినవాడైనాడు; అట్టి సమయంబునన్= ఆ సమయంలో; యమసూనుండు= యమధర్మరాజు కొడుకు- ధర్మరాజు; శ్రుతాయువు+పైన్= శ్రుతాయువు మీద; తొమ్మిది+అమ్ములు= తొమ్మిది బాణాలు; నిగిడించినన్= వ్యాపింపచేయగా; అతండు= ఆ శ్రుతాయువు; వానిన్= ఆ బాణాలను; మగిడించి= మరలింపజేసి; నిశాతసాయక సప్తకంబు= వాడియైన బాణాలు ఏడింటిని; శరీరంబునన్= ధర్మరాజు శరీరంలో; గ్రుచ్చినన్= నాటగా; కోపించి= కోపపడి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; వరాహకర్ణశర+ఆసారంబునన్= పందిచెవివలె ఉండే బాణాల జడివానతో; వాని= ఆ శ్రుతాయువు యొక్క; వక్షస్ స్థలంబున్= రొమ్మును; వ్రచ్చి= చీల్చి; వెడంద+వాతి+అమ్మునన్= వెడల్పుగల నోరు ఉన్న బాణంతో; కేతువున్= టెక్కెమును; తునిమినన్= త్రుంచివేయగా; అతండు= ఆ శ్రుతాయువు.

తాత్పర్యం: శల్యుడు రథంమీద మూర్ఛచెందాడు. దానితో అతడి సారథి రథాన్ని వెంటనే యుద్ధభూమి నుండి అవతలకు తోలుకొనిపోయాడు. కవలు అది చూచి విజయోత్సాహంతో పెనుబొబ్బలు పెట్టుతూ తమ శంఖాలను ఊదారు. ఇంతలో సూర్యుడు ఆకాశం మధ్యభాగానికి చేరుకొన్నాడు. అప్పుడు ధర్మరాజు శ్రుతాయువు మీద తొమ్మిది బాణాలు వేశాడు. వాడు వాటిని తిప్పికొట్టి, పదునుగల ఏడు బాణాలను ఆ ధర్మరాజు శరీరంలో గుచ్చుకొనేటట్లు వేశాడు. అతడు కోపంతో పందిచెవివంటి బాణాలు వేసి, శ్రుతాయువు రొమ్మును చీల్చి, ఒకానొక ప్రత్యేక బాణంతో ఆతడి ధ్వజాన్ని తుంచివేశాడు. అప్పుడు ఆ శ్రుతాయువు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: సింహనాదము= యుద్ధంలో ఏనుగులు మొదలైనవాటిని భయపెట్టేటందుకు వీరులుచేసే ధ్వని (బొబ్బ) వెడదవాతియమ్ము= వెడల్పయిన అగ్రభాగం ఉన్న బాణము; యుధిష్ఠిరుడు= యుద్ధంలో స్థిరంగా నిలబడేవాడు (ధర్మరాజు)

ఉ. వెండియు నేడు బాణములు వే తొడి ధర్మజు నొవ్వ నేయ నా
తండు మహోగ్రకోపమునఁ దత్తురగంబులఁ జంపి తద్ధను
ర్దండముఁ ద్రుంచి తత్తనువు రక్తమయంబుగఁ జేయ వాఁడు భీ
తుండయి పాఱె నీబలము దూలఁగ నబ్బల ముబ్బి క్రాలఁగన్. 40

ప్రతిపదార్థం: వెండియున్= మరియు; ఏడు బాణములు= ఏడు బాణాలను; వే తొడి= వేగంగా వింటిలో సంధించి; ధర్మజున్= ధర్మరాజును; నొవ్వన్= బాధపడునట్లు; ఏయన్= వేయగా; ఆతండు= ధర్మరాజు; మహా+ఉగ్రకోపమునన్= చాలా భయంకరమైన కోపంతో; తద్+తురగంబులన్= వాడి గుర్రాలను; చంపి; తద్+ధనుస్+దండమున్= ఆతని వింటి కర్రను; త్రుంచి= తునుగచేసి; తద్+తనువున్= వాడి శరీరాన్ని; రక్తమయంబు+కన్= నెత్తురు మయంగా; చేయన్= చేయగా; వాఁడు= ఆ శ్రుతాయువు; భీతుండు+అయి= భయంచెందినవాడై; నీ బలము= (ధృతరాష్ట్రుడవైన) నీ సైన్యము; తూలఁగన్= తొలగిపోగా; ఆ+బలము= ఆ పాండవులయొక్క సైన్యం; ఉబ్బి= సంతోషపడి; క్రాలఁగాన్= ప్రకాశించగా; పాఱెన్= పరుగెత్తిపోయినాడు.

తాత్పర్యం: శ్రుతాయువు ఏడు బాణాలతో ధర్మరాజును బాధ కలిగేటట్లు కొట్టాడు. ధర్మరాజుకు చాలా కోపం వచ్చి, వాడి గుర్రాలను చంపాడు. వింటి బద్దను తుంచాడు. అతడి శరీరాన్నంతటినీ రక్తంలో ముంచెత్తాడు. దానికి వాడు భయపడి పారిపోయాడు. అప్పుడు కౌరవసైన్యమంతా చిందరవందరైంది. పాండవుల సైన్యం ఎంతో సంతోషపడింది.

చేకితానకృపాచార్యుల ద్వంద్వయుద్ధము (సం 6-80-20)

**తే. చేకితానుండు గృపునిపై శితశరములు। గురిసె నాతండు విల్లును గుఱ్ఱములను
వ్రయ్యలుగఁ జేయ గద గొని రథము డిగ్గి। సరభసంబుగఁ జని కృపు విరథుఁ జేసి. 41**

ప్రతిపదార్థం: చేకితానుండు= చేకితానుడనే యాదవుడు; కృపునిపైన్= కృపాచార్యుడిమీద; శితశరములు= వాడియైన బాణాలు; కురిసెన్= కురిపించాడు; ఆతండు= కృపాచార్యుడు; విల్లును= చేకితానుడి విల్లును; గుఱ్ఱములను; వ్రయ్యలు+కన్= తునుకలుగా; చేయన్= చేయగా; గదన్+కొని= ఆ చేకితానుడు గదను తీసికొని; రథము డిగ్గి= తన రథాన్నుండి దిగి; సరభసంబుగన్= తొందరగా; చని= వెళ్ళి; కృపున్= కృపాచార్యుని; విరథున్= రథములేనివానిగా; చేసి.

తాత్పర్యం: చేకితానుడు కృపాచార్యుడిమీద పదునైన బాణాలను వర్షంగా కురిపించాడు. అప్పు డాతడు చేకితానుడి, విల్లును, గుర్రాలను తునుకలుగా చేశాడు. అప్పు డా చేకితానుడు గద తీసికొని, రథం దిగి తొందరగా నడిచి, గదతో కృపాచార్యుడి రథాన్ని తునుకలు చేసి. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అయ్యాదవ సింహుండు వెనుకకు లంఘించిపోయినం గృపాచార్యుండు పదాఱమ్ము లెమ్ములం గీలించు టయు, నతండు గదాదండంబు వైవ నగ్గౌతముండు తుండంబులు సేసినఁ జేకితానుండు రయంబున రథంబుమీఁది కరవాలంబుగొని మెఱుంగు మెఱసినట్లు పఱతెంచిన శారద్వతుండు నిశాత కృపాణపాణియై ధరణి కెఱఁగి యేడ్తెఱ నతనిం గవిసి నొప్పించి, యతనిచేత నొచ్చె న ట్లిరువురును మూర్ఛిల్లి మేదిని వ్రాలిన. 42

ప్రతిపదార్థం: ఆ+యాదవసింహుండు= యాదవులలో శ్రేష్ఠుడైన ఆ చేకితానుడు; వెనుకకున్= వెనుక భాగానికి; లంఘించి= దూకి; పోయినన్= పోగా; కృపాచార్యుండు; పదాఱు= పదహారు; అమ్ములు= బాణాలు; ఎమ్ములన్= ఎముకలలో; కీలించుటయున్= తగులుకొనేటట్లు చేయగా; అతండు= ఆ చేకితానుడు; గదా దండంబు+వైవన్= గదాయుధాన్ని ప్రయోగింపగా; ఆ+గౌతముండు= గౌతమవంశంలోనివాడైన కృపాచార్యుడు; తుండంబులు= (ఆ గదను); తునుకలుగా; చేసినన్= చేయగా; చేకితానుండు; రయంబునన్= వేగంతో; రథంబు మీది; కరవాలంబున్= కత్తిని; కొని= తీసికొని; మెఱుంగు మెఱసిన+అట్లు= మెరుపు మెరిసిన మాదిరి; శారద్వతుండు= కృపాచార్యుడు; నిశాత కృపాణపాణి+ఐ= పదునైన ఖడ్గం చేతపట్టుకొనినవాడై; ధరణికిన్= భూమికి; ఎఱఁగి= వాలి; ఏడ్తెఱన్= అతిశయంతో; అతనిన్+కవిసి= అతడిని ఆక్రమించి; నొప్పించి= బాధకలుగునట్లుచేసి; అతనిచేతన్= ఆ చేకితానుడిచేత; నొచ్చెన్= బాధింపబడ్డాడు; అట్లు= ఆ విధంగా; ఇరువురును= ఆ ఇద్దరు వీరులు; మూర్ఛిల్లి= మూర్ఛచెంది; మేదినిన్= భూమిమీద; వ్రాలినన్= వాలిపోగా.

తాత్పర్యం: చేకితానుడు వెనుకకు దూకిపోగా, కృపాచార్యుడు పదహారు బాణాలు అతడి ఎముకలలో గుచ్చుకొనేటట్లు వేశాడు. ఆ చేకితానుడు గదాదండాన్ని విసిరాడు. కృపుడు గదను తునకలు చేశాడు. చేకితానుడు తొందరగా తన రథంలో ఉండిన ఖడ్గాన్ని చేతపట్టుకొని, మెరుపు మెరిసిన చందంగా ఒక క్షణంలో మీదపడి. కృపుడిని నొవ్వజేసి, అతడి చేత తాను కూడా నొప్పించబడ్డాడు. ఇద్దరు మూర్ఛచెంది, నేలపైకి ఒరిగారు.

విశేషం: గౌతముడు= గౌతమ ఋషి యొక్క గోత్రంలో పుట్టినవాడు. కురుకులంలోని కౌరవపాండవ కుమారులకు ఆచార్యుడు కృపుడు. కృపుని పుట్టుకను గూర్చి

అవస్కన్నం శరస్తంబే మిథునం సమపద్యత । కృపయా తచ్చ జగ్రాహ శాన్తను ర్మృగయాగతః॥

కృపః స్మృతః సవై తస్మాత్, గౌతమీ చ కృపీ తథా । ఏతే శారద్వతాః ప్రోక్తాఏతే తే గౌతమాః స్మృతాః॥

(హరివంశే. 32-75-76) శారద్వతుడని కూడా కృపుడికి పేరు.

క. ఇద్దెస సుబలతనూజుఁడు। నద్దెసఁ గరకర్షణుఁడు రయం బెసఁగఁగ న
య్యిద్దఱఁ దమ రథములపై। గ్రద్దన నిడికొని తొలంగఁగాఁ జని రధిపా! 43

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఈ+దెసన్= మన ఈవైపున; సుబల తనూజుఁడు= సుబలుని కుమారుడు శకుని; ఆ+దెసన్= ఆ పాండవులవైపున; కరకర్షణుండు= ఆ పేరుగలవాడు; రయంబు= త్వర; ఎసఁగఁగన్= అతిశయింపగా; ఆ+ఇద్దఱన్= ఆ కృప చేకితానులను; తమ= తమ యొక్క; రథములపైన్= తేరులలో; గ్రద్దనన్= త్వరితంగా; ఇడుకొని= ఉంచుకొని; తొలంగఁగాన్= యుద్ధభూమినుండి తొలగేటట్లుగా; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! మనవైపున సుబలుడి కొడుకు, ఆ వైపున కరకర్షణుడు మూర్ఛచెంది నేలవ్రాలిన ఆ ఇద్దరినీ (కృపాచార్య చేకితానులను) వారి వారి రథాలలోఉంచుకొని తొలగిపోయారు.

వ. చేదిపతి యగు ధృష్టకేతుండు భూరిశ్రవసునిం దొంబదితూపుల నేపారి యేసిన నొచ్చి కోపించి యా సోమదత్తతనయుండు. 44

ప్రతిపదార్థం: చేదిపతి+అగు= చేది దేశానికి రాజైన; ధృష్టకేతుండు= ధృష్టకేతుడనేవాడు; భూరిశ్రవసునిన్= భూరిశ్రవసుడిని; తొంబది తూపులన్= తొంభై బాణాలతో; ఏపారి= విజృంభించి; ఏసినన్= కొట్టగా; నొచ్చి= బాధపడి; కోపించి; ఆ+సోమదత్త తనయుండు= సోమదత్తుని కొడుకు- ఆ భూరిశ్రవుడు.

తాత్పర్యం: చేది దేశరాజు ధృష్టకేతుడు, విజృంభించి తొంభై బాణాలతో కొట్టాడు. ఆ దెబ్బలకు ఆ భూరిశ్రవసుడు బాధపడి కోపంతో-

క. నానాస్త్రంబుల హయముల। మేనులు దునియలుగఁ జేసి మెయి నారసముల్
వే నాటించిన నతఁడు శ। తానీకుని రథముపైకి నరిగెం బెలుచన్ 45

ప్రతిపదార్థం: నానా+అస్త్రంబులన్= పలు విధాలైన బాణాలతో; హయముల= గుర్రాలయొక్క; మేనులు= శరీరాలు; తునియలు+కన్= తునుకలుగా; చేసి; మెయిన్= చేదిరాజు శరీరంపైన; నారసముల్= బాణాలను; వే నాటించినన్= వేగంగా గ్రుచ్చుకొనేటట్లు చేయగా; అతఁడు= ఆ ధృష్టకేతువు; శతానీకుని; రథముపైకిన్; పెలుచన్= శీఘ్రంగా; అరిగెన్= పోయాడు.

తాత్పర్యం: ఆ భూరిశ్రవసుడు పలు బాణాలు ప్రయోగించి ధృష్టకేతుడి గుర్రాలను తునుకలు చేశాడు. అతడి శరీరంలో బాగా గుచ్చుకొనేటట్లుగా బాణాలు వేశాడు. అతడు తట్టుకోలేక శీఘ్రంగా శతానీకుడి రథం మీదికి పోయాడు.

వ. దుశ్శాసనవికర్ణచిత్రసేనులతో సుభద్రాసూనునకు మహాయుద్ధం బయ్యె నందు వారలనందఱ నా సంక్రందన పౌత్రుండు విరథులం జేసి వృకోదరువచనంబులు దలంచి యలంచుచుండెం గాని సమయింపఁ డయ్యె నట్టి సమయంబున శాంతనవుండు వారిం గైకొని యనేకరాజరథికులతోడం గూడ నన్నరనందనుపై నురవడించిన నాభూపతులు పలువురు ప్రౌఢులగుటయు నయ్యభిమన్యుం డొక్కరుండు బాలుండు నగుటయుం జూచి సవ్యసాచి శౌరితో ని ట్లనియె. 46

ప్రతిపదార్థం: దుశ్శాసన వికర్ణ చిత్రసేనులతోన్; సుభద్రాసుతునకున్= సుభద్రకొడుకు అభిమన్యుడికి; మహాయుద్ధంబు= గొప్ప యుద్ధము; అయ్యెన్= జరిగింది; అందున్= ఆ యుద్ధంలో; వారలన్+అందఱన్= ఆ ముగ్గురిని; ఆ సంక్రందన పౌత్రుండు=

ఇంద్రునికి మనుమడైన అభిమన్యుడు; విరథులన్= రథాలులేనివారిగా; చేసి; వృకోదరు వచనంబులు= భీముడి మాటలు; తలంచి= స్మరించి; అలంచుచుండెన్+కాని= కష్టపెట్టాడే కాని; సమయింపండు+అయ్యెన్= చంపలేదు; అట్టి సమయంబునన్= ఆ సమయంలో; శాంతనవుండు= భీష్ముడు; వారిన్= ఆ దుశ్శాసనాదులను; కైకొని= గ్రహించి (చూచి); అనేక రాజరథికుల తోడన్+కూడన్= ఎంతో మంది రాజులతోను; రథికులతోను కూడా; ఆ+నరనందనుపైన్= అర్జునుని కొడుకైన ఆ అభిమన్యుడి మీదికి; ఉరవడించినన్= యుద్ధానికి తొందరపడగా; ఆ భూపతులు= కౌరవసేనలోని ఆ రాజులు; పలువురు= చాలమంది; ప్రౌఢులు= నిపుణులు; అగుటయున్; ఆ+అభిమన్యుండు= ఆ అభిమన్యుడు; ఒక్కరుండు= ఒంటరివాడు; బాలుండున్= పిల్లవాడు; అగుటయున్; చూచి; సవ్యసాచి= అర్జునుడు; శౌరితోన్= కృష్ణునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు, చిత్రసేనుడు, వికర్ణుడు- వీరికి, అభిమన్యుడికి ఘోరంగా యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో అభిమన్యుడు ఆ ముగ్గురి రథాలను ధ్వంసం చేశాడు. భీముడు దుశ్శాసనుడి రొమ్ముచీల్చి రక్తాన్ని తాగుతానని శపథంచేశాడు గదా! అది జ్ఞాపకానికి రాగా నే అతడు వాళ్ళను బాధపెట్టాడేగానీ చంపలేదు. లేకుంటే చంపేవాడే. అప్పుడు భీష్ముడు దుశ్శాసనాదుల దుఃస్థితిని గమనించి పలువురు రథికులైన రాజులు, వెంటరాగా అభిమన్యుడిని ఎదుర్కొన్నాడు. కౌరవసైన్యంలోని పలువురు రాజులు యుద్ధంలో ఆరితేరినవారు కావటాన్నీ, అభిమన్యుడు ఒంటరివాడు, అర్భకుడు కావటాన్నీ చూచి, అర్జునుడు కృష్ణుడితో ఇట్లా అంటున్నాడు.

విశేషం: వృకోదరుడు= తోడేలుపొట్టవంటి పొట్టగలవాడు (భీముడు); సవ్యసాచి= రెండుచేతులతో బాణాలు వేసేవాడు (అర్జునుడు).

క. ఉక్కు మిగిలి జగతీశులు । పెక్కండ్రు రయంబు మెఱయ భీష్మసహితులై
యొక్కటఁ దోతెంచెద రా । దిక్కునఁ బోనిమ్ము రథముఁ దీవ్రస్ఫురణన్. 47

ప్రతిపదార్థం: పెక్కండ్రు= పలువురు; జగతీ+ఈశులు; భూభర్తలు= రాజులు; రయంబు= వేగము; మెఱయన్= అతిశయింపగా; ఉక్కు= శౌర్యము; మిగిలి= అతిశయించి; భీష్మ సహితులు+ఐ= భీష్మునితో కూడినవారై; ఒక్కటన్= ఒకే సమయంలో; తోతెంచెదరు= వస్తున్నారు; తీవ్రస్ఫురణన్= అధికమైన కదలికతో; ఆ దిక్కునకున్= ఆ వైపునకు; రథమున్; పోనిమ్ము= తోలుము.

తాత్పర్యం: 'ఓ కృష్ణా! చాలా మంది కౌరవరాజులు శౌర్యాతిశయంతో, వేగంగా, భీష్ముడితో కలిసి ఒక్కుమ్మడిగా వస్తున్నారు. ఆ గుంపున్నచోటికి మన రథాన్ని శీఘ్రంగా పోనిమ్ము' అని.

వ. అని వారలవలను సూప నచ్యుతుండట్ల చేయం ద్రిగర్తపతి దనమొనలకుం దలకడచి కవ్వడి మార్కొనుటయు నతండు. 48

ప్రతిపదార్థం: అని; వారలవలను= ఆ కౌరవసైన్యముండే దిక్కును; చూపన్= చూపగా; అచ్యుతుండు= కృష్ణుడు; అట్లు+అ= అర్జునుడు చెప్పిన విధంగా; చేయన్= తేరును పోనివ్వగా; కవ్వడిన్= అర్జునుడిని; త్రిగర్తపతి= త్రిగర్త దేశంరాజు; తన మొనలకున్= తనయొక్క సైన్యాలకు; తలకడచి= ముందు భాగమును చేరుకొని; మార్కొనుటయున్= ఎదుర్కొనటంతో; అతండు= ఆ అర్జునుడు.

తాత్పర్యం: కృష్ణుడు అర్జునుడు చెప్పిన విధంగా అభిమన్యుడిమీదికి ఉరుకుతున్న కౌరవసైన్యంవైపు రథాన్ని పోనిచ్చాడు. అప్పుడు త్రిగర్తపతి తన సైన్యానికి ముందుగా నిలిచి, అర్జునుడిని ఎదుర్కొన్నాడు. అప్పుడు అర్జునుడు

క. మీవీటికెల్ల మేటివి । నీ విట్లు గడంగి తిచట నిక్కమ పోరం
గావలయుఁ జుమీ యనుచు శ । రావృతుఁ గావించె సూతహయసహితముగాన్. 49

ప్రతిపదార్థం: మీ వీటికిన్= మీదండునకు; ఎల్లన్= అంతటికి; నీవు= సుశర్మవను నీవు; మేటివి= మొనగాడవు; ఇట్లు= ఈ విధంగా; ఇచ్చటన్= ఈ చోటులో; కడంగితి(వి)= యుద్ధానికి దిగావు; నిక్కము+అ= నిజంగా; పోరంగావలయున్+చుమీ!= యుద్ధం చేయవలెను సుమా!; అనుచున్= అని చెప్పుచూ; సూతహయసహితము+కాన్= సారథి, గుర్రాలతో కూడునట్లుగా; శర+ఆవృతున్= బాణాలతో కప్పబడ్డవాణ్ణిగా; కావించెన్= చేశాడు.

తాత్పర్యం: 'ఓ సుశర్మా! నీవు మీ దండులోకెల్లా చాలా మొనగాడివి. ఇక్కడ ఇప్పుడు నాతో యుద్ధానికి దిగావు. నిజంగా, యుద్ధం చేయవలసిందే సుమా!' అంటూ సుశర్మను, ఆయన సారథిని, గుర్రాలను అర్జునుడు బాణాలతో కప్పివేశాడు.

వ. **అట్టియెడం గౌరవసైన్యంబు గాండీవిపై నొక్క పెట్ట యడరినం బాండవబలంబు లతనికిం దలకడచి తలపడిన సందండికయ్యం బయ్యె నా సంక్రందననందనుండు రాజులగములకుంగవిసి కేతనంబులు నఱికియు, సారథిరథికరథ్యంబులప్రాణంబులు వెఱికియు నాతపత్రచామరంబులు పొడిసేసియుఁ జాపంబులు రూపఱఁజేసియుఁ, వర్మంబులు వ్రచ్చియు, మర్మంబుల మార్గణంబులు గ్రుచ్చియు, సర్వాంగంబులు నొంచియుఁ దలలు ద్రుంచియు, విహరించుచుండ నపరాహ్ణంబయ్యెఁ ద్రిగర్తనాథుండు వెండియుం బేర్చి యెదిర్చిన.** **50**

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో; కౌరవసైన్యంబు= దుర్యోధనునిసేన; గాండీవిపైన్= అర్జునుడిపైన; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; అడరినన్= విజృంభించగా; పాండవ బలంబులు= పాండవుల సేనలు; అతనికిన్= ఆ అర్జునుడికి; తలకడచి= ముందు భాగంలోచేరి; తలపడినన్= ఎదుర్కొనగా; సందడికయ్యంబు= సంకులసమరము; అయ్యెన్= జరిగింది; ఆ సంక్రందననందనుండు= ఇంద్రుడి కొడుకు- అర్జునుడు; రాజులగములకున్= దొరలగుంపును; కవిసి= ఎదుర్కొని; కేతనంబులు= టెక్కాలు; నఱికియున్= తెగగొట్టి; సారథి రథిక రథ్యంబుల= రథంతోలేవాడియొక్క, రథంలోనుండి యుద్ధం చేసేవారియొక్క, రథానికి కట్టి ఉండే గుర్రాలయొక్క; ప్రాణంబులన్= ప్రాణాలను; పెఱికియున్= పోగొట్టి; ఆతపత్ర చామరంబులు= గొడుగులను, చామరాలను; పొడి+చేసియున్= నుగ్గుచేసి; చాపంబులు= విండ్లను; రూపు+అఱన్+చేసియున్= రూపుమాపి; వర్మంబులు= కవచాలు; వ్రచ్చియున్= చీల్చి; మర్మంబులన్= ఆయువుపట్టులందు; మార్గణంబులు= బాణాలు; గ్రుచ్చియున్= పొడిచి; సర్వ+అంగంబులు= అన్ని అవయవాలను; నొంచియున్= పీడించి; తలలు= తలలను; త్రుంచియున్= తుంచివేసి; విహరించుచుండన్= వీరవిహారం చేస్తూండగా; అపరాహ్ణంబు+అయ్యెన్= అపరాహ్ణకాలము అయింది; త్రిగర్తనాథుండు= త్రిగర్తదేశపురాజు; వెండియున్= మరల; పేర్చి= విజృంభించి; ఎదిర్చినన్= ఎదుర్కొనగా.

తాత్పర్యం: అప్పుడు కౌరవ సైన్యం ఒక్కుమ్మడిగా అర్జునుడిమీదికి వచ్చింది. పాండవుల సేనకూడా అర్జునుడికి ముందుగా నిలబడి యుద్ధానికి సన్నద్ధం అయింది. అప్పుడు ఆ రెండుసేనలకు దొమ్మి యుద్ధం జరిగింది. అప్పుడు అర్జునుడు ఎదిరిపక్షంలోని వారి కేతనాలను తెగగొట్టి, రథికుల సారథుల, గుర్రాల ప్రాణాలను తీశాడు. గొడుగులను, చామరాలను నుగ్గుచేశాడు. చాపాలను రూపం లేకుండా చేశాడు. కవచాలను బ్రద్దలుకొట్టాడు. ఆయువుపట్టులలో బాణాలు గ్రుచ్చాడు. శత్రువుల అవయవా లన్నింటికీ బాధ కలిగించాడు. శత్రువుల తలలు త్రుంచాడు. ఈ విధంగా అర్జునుడు స్వైరవిహారం చేస్తూండగా మధ్యాహ్నకాలమైనది. అయినా త్రిగర్తాధిపతి కవిసి ఎదుర్కొన్నాడు.

విశేషం: గాండీవి= గాండీవమనే విల్లు ముఖ్యమైన ఆయుధంగా గలవాడు (అర్జునుడు)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సందడి కయ్యంబు= సంకుల సమరం. ఇరుపక్షాలవారు కలసిపోయి, ఒకరునొకరు భుజాలు ఒరిసికొంటూ ఎవ డే పక్షంవాడో తెలియకుండా యుద్ధంచేయటం.

అపరాహ్ణంబు= ప్రాత, స్సంగము, మధ్యాహ్న, అపరాహ్ణ, సాయాహ్నములని పగటిని అయిదు భాగాలు చేస్తే అందులో నాలుగవ భాగం అపరాహ్ణం.

తే. అతని రథరక్షకులు శక్రసుతుని మీఁదఁ । గడఁగి ముప్పదియిద్దఱు గవియుటయును
నవ్వి యఱువదినాలుగు నారసముల । నక్కిరీటి యా రథికుల నవనిఁ గూల్చె. 51

ప్రతిపదార్థం: అతనిన్= ఆ త్రిగర్తరాజు సుశర్మయొక్క; రథరక్షకులు= తేరును రక్షించే వీరులు; ముప్పది+ఇద్దఱున్= ముప్పై రెండుమంది; కడఁగి= పూనుకొని; శక్రసుతుని మీఁదన్= ఇంద్రపుత్రుడైన అర్జునుడి మీద; కవియుటయును= ఎగబడగా; ఆ+కిరీటి= ఆ అర్జునుడు; నవ్వి= ఎగతాళిచేసి; అఱువదినాలుగు= అరవైనాలుగు; నారసములన్= బాణాలతో; ఆ రథికులన్= తనపై కవిసిన ఆ రథికులను; అవనిన్= నేలమీద; కూల్చెన్= పడద్రోశాడు.

తాత్పర్యం: త్రిగర్తాధీశుడు సుశర్మయొక్క రథ రక్షకులు ముప్పై ఇద్దరు ప్రయత్నంతో అర్జునుడిమీదికి ఎగబడ్డారు. అర్జునుడు ఎగతాళిగా నవ్వి, వారినందరిని, అరవైనాల్గు బాణాలతో కొట్టి నేలపడద్రోశాడు.

క. ఇలఁబడిన సహచరులఁ గని । యలిగి సుశర్ముండు దాఁకె నర్జును నతనిం
దలకడచి శిఖండిప్రభృ । తులు నిగిడిరి వారిమీఁద ద్రుపదజ్ఞాతుల్. 52

ప్రతిపదార్థం: సుశర్ముండు= త్రిగర్తాధిపతి సుశర్మ; ఇలన్= నేలమీద; పడిన= పడినట్టి; సహచరులన్= తనతో కలిసి యుద్ధంచేసే రథికులను; కని= చూచి; అలిగి= కోపించి; అర్జునున్= అర్జునుడిని; తాఁకెన్= ఎదుర్కొన్నాడు; అతనిన్= ఆ అర్జునుడిని; తలకడచి= ముందుభాగానికి వచ్చి; ద్రుపదజ్ఞాతుల్= ద్రుపదుడి దాయాదులు; శిఖండి ప్రభృతులు= ధృష్టద్యుమ్నుడి అన్న శిఖండి మున్నగువారు; వారిమీఁదన్= సుశర్మ మొదలైనవారిమీద; నిగిడిరి= కమ్ముకొన్నారు.

తాత్పర్యం: సుశర్మ నేలవాలిన తనతోడి విలుకాండ్రను చూచాడు. చాలా కోపంవచ్చి, అర్జునుడి మీదికి ఎగబడ్డాడు. అర్జునుడి సేనకు ముందుగా శిఖండి మొదలుగా గల ద్రుపద మహారాజు జ్ఞాతులు సుశర్మ మొదలైన వారిని క్రమ్ముకొన్నారు.

వ. ధనంజయుండును దనకు దుర్యోధన సైంధవు లగ్గంబై యున్నను గ్రేఁగంటం జూచుచు గాంగేయుపై నడరె నప్పుడు దన్నుఁ దొడరవచ్చు శల్యునాదరింపక ధర్మతనయుం డనిలతనయమాద్రీతనయసహితుం డై పార్థునకు బాసట యై భీష్మునిదెసకు నడరె నిట్లు పాండవ పంచకంబుతోఁ బెనంగు శాంతనవుం గనుంగొని కురుపతియును సింధురాజును బరవసంబు సేసి యప్పాండవేయులం దాఁకిన. 53

ప్రతిపదార్థం: ధనంజయుండునున్= అర్జునుడుకూడా; తనకున్= అర్జునుడికి; దుర్యోధన సైంధవులు= దుర్యోధనుడు, సైంధవుడును; అగ్గంబు+ఐ+ఉన్నన్= అధీనమై ఉన్నా; క్రేఁగంటన్= కోరచూపుతో; చూచుచున్= చూస్తూ; గాంగేయుపైన్= భీష్ముడిపైన; అడరెన్= విజృంభించాడు; అప్పుడు= ఆ సమయంలో; ధర్మతనయుండు= ధర్మరాజు; తన్నున్= తనను; తొడరన్ వచ్చు= ఢీకొనడానికి వచ్చే; శల్యున్= శల్యుడిని; ఆదరింపక= లెక్కజేయక; అనిలతనయ మాద్రీతనయ సహితుండు+ఐ= భీముడు, నకుల సహదేవులు- వీరితోకూడినవాడై; పార్థునకున్= అర్జునుడికి; బాసట+ఐ= సహాయుడై; భీష్మని దెసకున్= భీష్ముడుండే వైపునకు; అడరెన్= కదిలాడు; ఇట్లు= ఈ మాదిరి; పాండవ పంచకంబుతోన్= పంచపాండవులతో; పెనంగు= యుద్ధంచేసే;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శాంతనవున్= శంతను మహారాజు కొడుకు భీష్ముణ్ణి; కనుంగొని= చూచి; కురుపతియును= దుర్యోధనుడున్నూ; సింధురాజును= సైంధవుడున్నూ; బరవసంబు+చేసి= ధైర్యం వహించి; ఆ+పాండవేయులన్= ఆ పాండవులను; తాఁకినన్= మార్కొనగా.

తాత్పర్యం: అర్జునుడు తనకు దుర్యోధనసైంధవులు అధీనులైనప్పటికీ క్రీగంటితో చూస్తూ, భీష్ముడిపైకి యుద్ధానికి వెళ్ళాడు. అప్పుడు ధర్మరాజు శల్యుడు తనమీదికి వస్తున్నప్పటికి లెక్కచేయకుండా, భీముడు, నకులుడు, సహదేవుడు వీరితో కలిసి అర్జునుడికి అండగా ఉండటానికి భీష్ముడున్నచోటికి వెళ్ళాడు. ఇంతలో దుర్యోధనుడు, సైంధవుడు పాండవులతో భీష్ముడు యుద్ధంచేస్తూండడం చూచి ఆ పాండవులను ధైర్యంతో ఎదుర్కొన్నారు.

క. **శలశల్యచిత్రసేనులు । బలియుండగు కృపునిఁ గూడి పాండుకుమారా**
వలిమీఁదఁ గవిసి వాల । మ్ములు గురిసి రతండు సూచి మోదం బందన్. **54**

ప్రతిపదార్థం: అతండు= ఆ భీష్ముడు; చూచి= చూచి; మోదంబు+అందన్= సంతోషపడగా; శలశల్యచిత్రసేనులు= శలుడు, శల్యుడు, చిత్రసేనుడు అనేవారు; బలియుండు+అగు= బలవంతుడైన; కృపునిన్+కూడి= కృపాచార్యుడితో కలిసి; వాలు+అమ్ములు= పదునుగల బాణాలను; పాండుకుమార+ఆవలిమీఁదన్= పాండవుల సమూహంమీద; కురిసిరి= కురిపించారు.

తాత్పర్యం: భీష్ముడు సంతోషం చెందేటట్లుగా శలశల్యచిత్రసేనులు బలవంతుడైన కృపుడితోకూడి, పాండవులమీద పదునైన బాణాలు కురిపించారు.

వ. **తదవసరంబున శిఖండి దేవవ్రతున కెదిర్చిన నొండు సేయ నొల్లమి నాతండు కోదండంబు దుండంబులు సేసి పిఱుసనఁజేయుటయుఁ బాండవాగ్రజుండు వాని ప్రతిజ్ఞావచనంబులెత్తి చెప్పి మొగమోడక యదల్చినం బురికొని యప్పాంచాలపతిసూనుండు సురనదీసూను మార్కొనుటయు మద్రనాథుం డెడసొచ్చి మహానలాస్త్రంబు ప్రయోగించిన దానికిం దలంకక వారించి వాఁడును వారుణాస్త్రం బేసిన నతండు తత్ప్రతిహతి గావించె; గాంగేయుండును ధర్మతనయు కేతుచాపదండంబులు ద్రుంచి యార్చినం బేర్చి భీముండు గదగొని రథంబు డిగ్గి రారాజుపయిం గవియుటయుఁ దత్సమయంబునం దలమిగిలి జయద్రథుండు రౌద్రం బెసంగ వేగంబు మెఱసి మెఱుంగుటమ్ము లేనూ అతనిపై నడరింప నతండు సరకుసేయక శరంబులు గదజడియుచుం గదిసి యమ్మారుతి సింధురాజ హయంబులం జదియ మోఁదిన నా సైంధవుండు.** **55**

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; శిఖండి; దేవవ్రతునకున్= భీష్ముడిని; ఎదిర్చినన్= ఎదుర్కోగా; ఆతండు= ఆ భీష్ముడు; ఒండు+చేయన్+ఒల్లక= ఏదీ చేయడానికి ఇష్టపడక (చంపడానికి ఇష్టంలేక); కోదండంబు= వాని వింటిని; తుండంబులు= ముక్కలుగా; చేసి= కావించి; పిఱు+చనన్= వెనక్కు మళ్ళి వెళ్ళేటట్లుగా; చేయుటయున్= చేయగా; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; వాని= ఆ శిఖండియొక్క; ప్రతిజ్ఞావచనంబులు= బాసలను; ఎత్తిచెప్పి= జ్ఞాపకంచేసి; మొగమోడక= దాక్షిణ్యంలేకుండా; అదల్చినన్= గద్దించగా; పురికొని= ఉత్సహించి; ఆ+పాంచాలపతిసుతుండు= ఆ పాంచాల మహారాజు యొక్క కుమారుడు- శిఖండి; సురనదీసూతున్= గంగానదికొడుకు భీష్ముడిని; మార్కొనుటయున్= ఎదిరించగా; మద్రనాథుండు= మద్రదేశానికి రాజు- శల్యుడు; ఎడ+చొచ్చి= సందులో చేరి; మహానల+అస్త్రంబున్= గొప్పదైన ఆగ్నేయాస్త్రాన్ని; ప్రయోగించినన్= వేయగా; దానికిన్= ఆ ఆగ్నేయాస్త్రానికి; తలంకక= జంకక; వాఁడును= ఆ శిఖండి; వారుణాస్త్రంబు+ఏసినన్= వారుణాస్త్రాన్ని ప్రయోగించగా; అతండు= ఆ శల్యుడు; తద్+ప్రతిహతిన్= దాని నాశమును; కావించెన్= చేశాడు; గాంగేయుండును= భీష్ముడు కూడా; ధర్మతనయు= ధర్మరాజుయొక్క; కేతుచాపదండంబులు= పతాకంయొక్క, వింటియొక్క, కర్రలను; త్రుంచి= తునుకలుచేసి; ఆర్చినన్= గర్జించగా; భీముండు; పేర్చి= అతిశయించి; గదన్=+కొని= గదాయుధాన్ని తీసికొని; రథంబున్+డిగ్గి=

తేరునుండి దిగి; రారాజుపయిన్= దుర్యోధనుడి మీదికి; కవియుటయున్= ఎగబడగా; తద్+సమయంబునన్= ఆ సమయంలో; తలమిగిలి= సేనకు ముందువైపు వచ్చి; జయద్రథుండు= సైంధవుడు; రౌద్రంబు+ఎసంగన్= రౌద్రరసం ఎక్కువకాగా; వేగంబు= త్వర; మెఱసి= ప్రకాశింపజేసి; మెఱుంగు+అమ్ములు= తళతళలాడే బాణాలను; ఏనూఱు= అయిదు వందలను; అతనిపైన్= ఆ భీముడి మీద; అడరింపన్= వేయగా; అతండు= ఆ భీముడు; శరంబులు= బాణాలను; సరకు+చేయక= లెక్కపెట్టక; గద= గదను; జడియించుచున్= ఆడించుతూ; కదిసి= దగ్గరకువచ్చి; ఆ+మారుతి= ఆ భీముడు; సింధురాజ హయంబులన్= సైంధవుడి గుర్రాలను; చదియన్+మోఁదినన్= నలిగేటట్లు కొట్టగా; ఆ సైంధవుండు= ఆ సింధుదేశపురాజు.

తాత్పర్యం: ఆ సమయాన శిఖండి భీష్మణ్ణి ఎదుర్కొన్నాడు. అతడు వాడిని ఏమీచేయక, అతడి వింటిని తునాతునకలుచేసి వాడు తిరిగిపోయేటట్లు చేశాడు. అప్పుడు ధర్మరాజు అతడు చేసిన ప్రతిజ్ఞను జ్ఞాపకంచేస్తూ శిఖండిని మొగమాటపడకుండా చీవాట్లు పెట్టాడు. శిఖండి ఉత్సాహం తెచ్చుకొని మళ్లా భీష్మడితో తలపడ్డాడు. ఈ సందడిలో మద్రదేశాధిపతి శల్యుడు దూరి గొప్ప ఆగ్నేయాస్త్రాన్ని శిఖండిమీద ప్రయోగించాడు. దానికి కదలకుండా నిలబడి, శిఖండి వారుణాస్త్రాన్ని వేశాడు. శల్యుడు దానిని పాడుచేశాడు, భీష్ముడు ధర్మరాజు పతాకదండాన్ని వింటి బద్దను ఒక దెబ్బతో విరిచేశాడు, పెనుబొబ్బలు పెట్టాడు. భీముడు ఆవేశంతో గదను పట్టుకొని, రథాన్నుండి దిగి, దుర్యోధనుడికి మీదికి ఉరికాడు. అప్పుడు జయద్రథుడు సేనకు ముందుభాగానికి వచ్చి, ఐదువందలు వాడిబాణాలను భీముడి మీద గుప్పించాడు. భీముడు ఆ బాణాలను లెక్కచేయకుండా గదను ఆడిస్తూ, దగ్గరకు వచ్చి సైంధవుడి గుర్రాలను ఎముకలు నలిగేటట్లు బాదాడు. ఆ సైంధవుడు- (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: దేవవ్రతుడు= దేవుడివలె వ్రతము, స్థిరత్వమైన ప్రతిజ్ఞ కలవాడు. భీష్ముడు,

> **శ్లో॥ చిత్రాంగదం తతో రాజ్యే స్థాపయామాస వీర్యవాన్ ।**
> **స్వయం నకృతవాన్‌రాజ్యం, తస్మాద్దేవవ్రతోఽభవత్॥** (దేవీ భాగవతే 1-20-16)

చిత్రాంగదుడిని పట్టాభిషిక్తుడిగా చేసి ఈ వీరుడు రాజ్యాన్ని పాలించలేదు. అందుచేత దేవవ్రతుడైనాడు.

క. **ఉక్కఱి యొండొకని రథం । బెక్కుటయున్ దొరలు దెరలి యేడ్తెఱ సెడి రా**
దిక్కు ప్రజ విచ్చెనప్పుడు । గ్రక్కునఁ బతి భీము మీఁదఁ గవిసెం బెలుచన్. **56**

ప్రతిపదార్థం: ఉక్కు+అఱి= శౌర్యాన్ని కోలుపోయి (సైంధవుడు); ఒండు+ఒకని= మరియొకని యొక్క; రథంబు= తేరును; ఎక్కుటయున్= ఎక్కగా; దొరలున్= రాజులు; తెరలి= తొలగిపోయి; ఏడ్తెఱ= పరాక్రమమును; చెడిరి= కోల్పోయిరి; ఆ దిక్కు ప్రజ= ఆ వైపున ఉండే జనము; విచ్చెన్= చీలిపోయింది; అప్పుడు= ఆ సమయంలో; పతి= కౌరవ భర్తఅయిన దుర్యోధనుడు; భీముమీఁదన్= భీముడి మీదికి; పెలుచన్= కోపంతో; కవిసెన్= దుమికాడు.

తాత్పర్యం: సైంధవుడు తన రథం కూలిపోగా, మరొకడి రథం ఎక్కాడు. యుద్ధమాడే రాజులందరూ తోడుగా శౌర్యం కోల్పోయారు. వారి వైపున ఉండే సైనికులంతా చెల్లాచెదరైపోయారు. అప్పుడు దుర్యోధనుడు భీముడి మీద దాడి చేశాడు.

క. **ఎడఁ జొచ్చి చిత్రసేనుఁడు । వడముడిపై నేయ నతఁడు వైచెం గోపం**
బడరఁగ గద నది యుగ్రపుఁ । బిడుగు క్రియన్ మెఱసి పఱచె బిట్టుగఁ జదలన్. **57**

ప్రతిపదార్థం: చిత్రసేనుఁడు= ఆ పేరుగల కౌరవపక్షంయోధుడు; ఎడన్= మధ్యలో; చొచ్చి= ప్రవేశించి; వడముడిపైన్= (విరోధులకు పరితాపం కలిగించే) భీముడిని; ఏయన్= బాణాలతో కొట్టగా; అతఁడు= ఆ భీముడు; కోపంబు= క్రోధం; అడరఁగన్= అధికంకాగా; గదన్= తన గదాయుధాన్ని; వైచెన్= విసిరివేశాడు; అది= ఆ గదాయుధం; ఉగ్రపున్= భయంకరమైన; పిడుగు క్రియన్= పిడుగు మాదిరి; చదలన్= ఆకాశంలో; మెఱసి= వెలుగుతూ; బిట్టుగన్= వేగంగా; పఱచెన్= పరుగెత్తి వచ్చింది.

తాత్పర్యం: చిత్రసేనుడు మధ్యలో వచ్చి భీముడిని బాణాలతో కొట్టాడు. భీముడు ఉగ్రుడై తన గదను విసరివేశాడు. అది పిడుగు చందంగా జాజ్వల్యమానంగా ఆకాశంలో వెలుగుతూ, గొప్ప వేగంతో వచ్చింది.

తే. **అట్లు వచ్చునాగదఁ గని యచటి యోధు । లలికి తమతమమీఁదన యడరు ననియుఁ**
దలఁచి యొదిఁగిరి రారాజుఁ దలఁప రైరి; । ప్రాణభయ మెట్టివారిఁ గీడ్పఱుపకున్నె? 58

ప్రతిపదార్థం: అచటి యోధులు= ఆ యుద్ధభూమిలో ఉండే వీరులు; అట్లు వచ్చు= ఆ విధంగా వెలుగుతూ వచ్చుచున్న; ఆ గదన్= భీముని ఆ గదాయుధాన్ని; కని= చూచి; అలికి= భయపడి; తమ తమ మీదన్= తమ తమ మీదనే; అడరున్+అనియున్= పడును అని కూడా; తలంచి= ఎంచి; ఒదిఁగిరి= దాగికొన్నారు; రారాజున్= దుర్యోధనుడిని గురించి; తలఁపరు+ఐరి= తలచనైనా తలచలేదు; ఎట్టివారిన్= ఎంతటి ధీరులనైనప్పటికీ; ప్రాణభయము= ప్రాణాలు పోతాయేమో అనే భయం; కీడ్పఱుపక+ఉన్నె?= తక్కువ వారిగా చేయకుండా ఉంటుందా?

తాత్పర్యం: యుద్ధరంగంలో ఉండే వీరులంతా సెగలు పొగలతో వస్తూన్న భీముడు విసరివేసిన గదను చూచారు. ఎవరికివారు ఆ గద తమ మీదపడుతుందనే. తమ తమ ప్రాణాలు కాపాడుకొనే ప్రయత్నం చేశారేగాని, దుర్యోధనుడి సంగతి ఎవడూ పట్టించుకోలేదు. ప్రాణభయం ఎంత గొప్పవారికి కూడా తక్కువతనాన్ని కలిగిస్తుంది కదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. **అడిదముఁ బలుకయునుం గొని । చిడిముడి వడ కపుడు చిత్రసేనుం డుఱికెం**
బుడమికి రథహయసూతులఁ । బొడిపొడి గావించెఁ బవనపుత్త్రునిగదయున్. 59

ప్రతిపదార్థం: చిత్రసేనుండు= ఆ చిత్రసేనుడనే రాజు; అపుడు= ఆ సమయంలో; చిడిముడి+పడక= తొట్రుపాటు లేకుండా; అడిదమున్= కత్తిని; పలుకయునున్= కేడెమును; కొని= పట్టుకొని; పుడమికిన్= నేలపైకి; ఉరికెన్= దూకాడు; పవన పుత్రుని గదయున్= వాయుదేవుని కొడుకైన భీమునియొక్క గదాయుధము; రథహయసూతులన్= రథాన్నీ, గుర్రాలను, సారథిని; పొడిపొడి= నుగ్గు నుగ్గుగా; కావించెన్= చేసింది.

తాత్పర్యం: ఆ సమయంలో చిత్రసేనుడు తొట్రుపాటులేకుండా కత్తిని, కేడాన్ని పట్టుకొని నేలకు ఉరికాడు. అప్పుడు భీముడిగద చిత్రసేనుడి రథాన్ని, గుర్రాలను, సారథిని పిండిపిండిచేసింది.

వ. **ఇట్లు చిత్రసేనుండు విరథుం డైన వికర్ణుం డతనిం దనరథం బెక్కించుకొనిపోయె నట్టియెడ. 60**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; చిత్రసేనుండు= చిత్రసేనుడనేవాడు; విరథుండు+ఐనన్= రథంలేనివాడుకాగా; వికర్ణుండు= కౌరవులలో ఒకడు; అతనిన్= ఆ చిత్రసేనుడిని; తన రథంబున్= తనయొక్క తేరులోనికి; ఎక్కించుకొనిపోయెన్= కూర్చోపెట్టుకొనిపోయాడు; అట్టి+ఎడన్= అట్టి సమయంలో.

తాత్పర్యం: చిత్రసేనుడీవిధంగా రథంలేనివాడయ్యాడు. అప్పుడు వికర్ణుడు అతడిని తన రథంలోనికి ఎక్కించు కొనిపోయాడు. ఆ సమయంలో- (తరువాతి పద్యంతో అన్వయం)

శా. గంగాపుత్త్రుఁడు పాండవాగ్రజుని యు। గ్యంబుల్ మహిం గూల్చి స
ర్వాంగంబుల్ వెస నొంప నాతఁడు సము। ద్యత్క్రోధుఁడై శక్తి వై
చెం గంపింపక త్రుంచెఁ దాత విభుఁడున్। శీఘ్రంబ మాద్రీసుతో
త్తుంగస్యందనమెక్క నొంచెను సరి। త్సూనుండు మాద్రేయులన్. 61

ప్రతిపదార్థం: గంగాపుత్త్రుఁడు= గంగాదేవి యొక్క కుమారుడు- భీష్ముడు; పాండవ+అగ్రజుని= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజుయొక్క; యుగ్యంబుల్= తేరి గుర్రాలను; మహిన్= నేలమీద; కూల్చి= పడవేసి; సర్వ+అంగంబుల్= ఆ ధర్మరాజుయొక్క అన్ని అవయవాలను; వెసన్= వేగంతో; నొంపన్= బాధింపగా; ఆతఁడు= ఆ ధర్మరాజు; సముద్యత్+క్రోధుఁడు+ఐ= పుట్టుతున్న కోపం కలవాడై; శక్తిన్= శక్తి అనే ఆయుధాన్ని; వైచెన్= విసరినాడు; తాత= తాతయైన భీష్ముడు; కంపింపక= చలనంలేకుండా; త్రుంచెన్= ఆ శక్తి ఆయుధాన్ని తుంచివేసినాడు; విభుఁడున్= ప్రభువైన ధర్మరాజు; శీఘ్రంబ= వేగంగా; మాద్రీసుత+ఉత్తుంగ స్యందనము= మాద్రికొడుకులైన నకుల సహదేవులయొక్క ఎత్తైన రథాన్ని; ఎక్కన్= ఎక్కగా; సరిత్+సూనుండు= గంగానది కుమారుడు- భీష్ముడు; మాద్రేయులన్= నకుల సహదేవులను; నొంచెను= బాధించాడు.

తాత్పర్యం: భీష్ముడు, ధర్మరాజు గుర్రాలను నేలకూల్చాడు. అతని కరచరణాదులైన అవయవాలన్నింటికీ నొప్పికలిగించాడు. ధర్మరాజు కోపం రెచ్చిపోవగా భీష్ముడి మీదికి శక్తిని ప్రయోగించాడు. భీష్ముడు నిబ్బరంగా నిలబడి దాన్ని కూల్చివేశాడు. దానితో ధర్మరాజు గబగబా వెళ్ళి నకుల సహదేవులున్న రథంలోకి ఎక్కాడు. ఆ మాద్రీపుత్రులను కూడా భీష్ముడు బాణప్రయోగంతో బాగా లొంగదీశాడు.

క. తమ్ముల నొంచిన నగ్రజుఁ। డుమ్మలికముతోడ బెరయునుత్సాహమునం
ద మ్మందఱఁ బురికొలుపఁగ। నమ్మొన నృపు లెల్లఁ దాఁకి రప్పుడు భీష్మున్. 62

ప్రతిపదార్థం: తమ్ములన్= తమ్ముళ్ళైన నకుల సహదేవులను; నొంచినన్= బాధించగా; అగ్రజుఁడు= అన్న అగు ధర్మజుడు; ఉమ్మలికముతోడన్= బాధతో; బెరయు= కలుగు; ఉత్సాహమునన్= ఉత్సాహంతో; అప్పుడు= ఆ సమయంలో; ఆ+మొనన్= ఆ సైన్యంలో; నృపులు+ఎల్లన్= రాజులందరు; తమ్ము+అందఱన్= తమర్నందరిని; పురి కొలుపఁగన్= కవ్వించగా; భీష్మున్= భీష్ముడిని; తాఁకిరి= మార్కొనిరి.

తాత్పర్యం: ధర్మరాజు తన సోదరులు నకుల సహదేవులను భీష్ముడు లొంగదీయడం చూచాడు. చాలా దుఃఖంతోను, కలిగిన ఉత్సాహంతోనూ, సైన్యంలోని రాజులందరినీ పురికొలుపగా వారందరూ భీష్ముడిని ఎదిరించారు.

వ. ఇట్లు పలువురు ధరణీశు లురవడించినం బెక్కు మృగంబులు మార్కొనినం జెలంగు సింగంబుచందంబున నలిరేఁగి సురనదీసూనుండు వెరవు గలవనపాలకుండు తాళఫలంబులు దిగఁద్రోచు చందంబున మెఱుంగు లడరు వెడంద వాతియమ్ముల నమ్మహీశుల తలలు డొల్ల నేయుచు మండలచారి యై విహరించుచున్న వెఱఁగుపడి పాండవులు సూచుచుండ శిఖండి కోదండపాండిత్యంబు మెఱయుచుం గదిసినఁ గ్రేడించి యతండు సృంజయసైన్యంబుపయిం దఱిమి దైన్యంబు నొందించె నట్టిసమయంబున. 63

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పలువురు= చాలామంది; ధరణీ+ఈశులు= రాజులు; ఉరవడించినన్= వేగిరపడగా; పెక్కు; మృగంబులు= జంతువులు; మార్కొనినన్= ఎదిరించగా; చెలంగు= విజృంభించు; సింగంబు చందంబునన్= సింహం మాదిరి; నలిరేఁగి= ఎక్కువగా విజృంభించి; సురనదీసూనుండు= గంగాదేవియొక్క కుమారుడు- భీష్ముడు; వెరవుగల= ఉపాయము కలిగినట్టి; వనపాలకుండు= వనాన్ని రక్షించేవాడు; తాళఫలంబులు= తాటి పండ్లను; దిగన్= క్రిందికి; త్రోచుచందబునన్= తోసే

మాదిరి; మెఱుంగులు= తళ తళమనే కాంతులు; అడరు= అతిశయించ; వెడందవాతియమ్ములన్= వెడల్పయిన మొనలు గల బాణాలతో; ఆ+మహీ+ఈశుల తలలు= ఆ రాజులయొక్కతలలు; డొల్లన్+ఏయుచున్= పడవేయుచు; మండలచారి+ఐ= రెండుకాళ్ళతో మండలాకారముగా చరించుచున్నవాడై; విహరించుచున్+ఉన్నన్= క్రీడిస్తూ ఉండగా; పాండవులు= పాండురాజు కొడుకులు; వెఱఁగుపడి= ఆశ్చర్యపడి; చూచుచున్+ఉండన్= చూస్తుండగా; కోదండపాండిత్యంబు= ధనుర్విద్యా నైపుణ్యం; మెఱయుచున్= ప్రకాశింపచేస్తూ; శిఖండి= శిఖండి; కదిసినన్= దగ్గరకు రాగా; క్రేడించి= అలక్ష్యంచేసి; అతండు= ఆ భీష్ముడు; సృంజయ సైన్యంబు పయిన్= సృంజయుడి సైన్యంమీదకు; తఱిమి= వెంటబడి పరుగెత్తించి; దైన్యంబున్+ఒందించెన్= దురవస్థపాలుచేశాడు; అట్టి సమయంబునన్.

తాత్పర్యం: పలురకాలైన మృగాలు ఎదిరించగా విజృంభించి నిశ్చలంగా నిలిచే సింహం మాదిరి, పలువురు రాజులు వేగిరపాటుతో ఎదిరించగా, భీష్ముడు యుక్తిగల తోపుకాపరి తాటిపండ్లను రాల్చినట్లు మిరుమిట్లుగొలిపే బాణాలతో చాలామంది రాజుల తలలు నేలకు రాల్చాడు. మండలచారిగా విహరించాడు. పాండవులు చేష్టలు మాని ఆశ్చర్యంతో చూస్తూండగా, శిఖండి తన విలువిద్యా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఆయన దగ్గరకు వచ్చాడు. వాడిని లెక్కచేయకుండా భీష్ముడు సృంజయుడి సేనమీద పడి దానిని బాధించాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: 'మండలచారి' అంటే రెండుకాళ్ళతో మండలాకారంగా నిలుచున్నవాడు (భీష్ముడు) విలుకాడు యుద్ధంలో భేదాలు 1.ప్రత్యాలీఢము; 2. ఆలీఢము; 3. సమపదము; 4. విశాఖము; 5. మండలము.

సీ. **సాత్యకి యేచి ధృష్టద్యుమ్నుఁడును దాను। గురుసైన్యములఁ గలగుండువెట్ట**
విందానువిందులు వెసఁ దాఁకి ద్రుపదుని। కొడుకుగుఱ్ఱంబులఁ గూల్చుటయును
విరథుఁ డై హరితమ్మునరదంబుపై కతఁ। డేఁగిన ధర్మజుఁ డెల్ల బలముఁ
గవియించి యిరువురఁ గైకొని తఱిమినఁ। బ్రజకుఁ జేవీచి రారాజు గడఁగఁ

తే. **దమ్ములును భీష్ముఁడును ధర్మతనయుసమద। సేనఁ బొదివిన వాసవసూనుఁ డడర**
ద్రోణుఁ డాతని మార్కొని బాణజాల। పిహితముగఁ జేసె రోదసీకుహర మెల్ల. 64

ప్రతిపదార్థం: సాత్యకి= శ్రీకృష్ణుడి తమ్ముడు; తాను, ధృష్టద్యుమ్నుఁడునున్= ధృష్టద్యుమ్నుడు; ఏచి= విజృంభించి; కురుసైన్యములన్= కౌరవుల సైన్యాన్ని; కలగుండు+పెట్టన్= కలచివేయగా; వింద+అనువిందులు= విందుడు, అనువిందుడు అనేవాళ్ళు; వెసన్= వేగంగా; తాఁకి= ఎదుర్కొని; ద్రుపదుని కొడుకు= ద్రుపద మహారాజు కొడుకు ధృష్టద్యుమ్నుని యొక్క; గుఱ్ఱంబులన్; కూల్చుటయున్= పడగొట్టగా; విరథుఁడై= రథంలేనివాడై; అతఁడు= ఆ ధృష్టద్యుమ్నుడు; హరితమ్ము= కృష్ణుడి తమ్ముడైన సాత్యకి యొక్క; అరదంబుపైకిన్= తేరుమీదికి; ఏఁగినన్= పోగా; ధర్మజుఁడు= ధర్మరాజు; ఎల్లబలమున్= సైన్యాన్నంతయు; కవియించి= కవ్వించి; ఇరువురన్= ఆ విందానువిందులను; కైకొని= గురిగాచేసుకొని; తఱిమినన్= వెంబడించి తరుమగా; రారాజు= రాజులకు రాజు దుర్యోధనుడు; ప్రజకున్= జనానికి (సైన్యానికి); చేవీచి= చేతితో సంజ్ఞచేసి (ప్రోత్సాహపరచి); కడఁగన్= యుద్ధానికి దిగగా; తమ్ములును= దుర్యోధనుడి తమ్ములు; భీష్ముఁడును= భీష్ముడున్నూ; ధర్మతనయు= ధర్మరాజుయొక్క; సమదసేనన్= మదంతో కూడిన సైన్యాన్ని; పొదివినన్= కమ్ముకోగా; వాసవసూనుఁడు= ఇంద్రుని కొడుకు అర్జునుడు; అడరన్= సిద్ధంకాగా; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; ఆతనిన్= ఆ అర్జునుడిని; మార్కొని= ఎదిరించి; రోదసీకుహరము+ఎల్లన్= భూమి ఆకాశాలమధ్యభాగాన్ని పూర్తిగా; బాణజాలపిహితముగన్= బాణాల సమూహంతో కప్పబడినదానిగా; చేసెన్= కావించెను.

తాత్పర్యం: సాత్యకి, ధృష్టద్యుమ్నుడు బాగా విజృంభించి కురుసైన్యాన్ని కలతపెట్టారు. విందానువిందులు వేగంతో ఎదుర్కొని ధృష్టద్యుమ్నుడి గుఱ్ఱాలను కూల్చివేశారు. అతడు తన రథం చెడిపోగా సాత్యకి రథమెక్కాడు. ధర్మరాజు తన బలాన్నంతా బాగా పురికొల్పి విందానువిందులను చూచి తరిమాడు. అప్పుడు దుర్యోధనుడు చేయి విసరి తన సైన్యాన్నంతా కవ్వించి తానూ యుద్ధానికి దిగాడు. తాను, తనతమ్ములు భీష్ముడు అందరు ధర్మరాజు సైన్యాన్ని కమ్మివేశాడు. అప్పుడు అక్కడ అర్జునుడు కూడా ప్రత్యక్షమైనాడు. అంతలో ద్రోణాచార్యుడు అర్జునుడిని ఎదిరించి, భూమి ఆకాశం మధ్యభాగాన్ని బాణాలు బాగా గుప్పించి కప్పివేశాడు.

విశేషం: సాత్యకి వృష్ణివంశీయుడు, శినికి మనుమడు, అర్జునుడి శిష్యుడు, యుద్ధంలో పాండవ పక్షాన్ని ఆశ్రయించాడు.

వ. ఇవ్విధంబున నాచార్యుం డేచిన నతనిప్రాపున భవత్సేనలు సెలంగి పైకొనియె, నయ్యవసరంబున ధర్మతనయుండు దనయెలుంగు సూపిన నగ్గలిక నాతనిమొగ్గరంబున మొనలు బెరసి పరుసఁదనంబు సూపి యేపునం బెనంగుచుండ నినుండు దర్శనీయమండలుం డగుచు నపరశైలశిఖరగతుండయ్యె, నయ్యెడ సంజకెంజాయ నెఱయ నెత్తుటేఱులపయి వడిందేలిపోవుపీనుంగులం దివిచికొని చను భూతబేతాళ సమ్మర్దంబులను, సమరతలప్రాంతపతితంబులైన శవంబులం గైకొని చెలంగు సృగాలంబు రవంబులను దత్సమయం బతిఘోరం బగుటయుఁ, ద్రిగర్తపతిప్రముఖు లగు జగతీశుల వెగడు పఱచి మెఱచిన సవ్యసాచియు, సైంధవాదివసుంధరాపతులం జిక్కువడం జేసి యుక్కుమీఱిన మారుతియుం దమ యన్నకుం బొడసూపి నిలిచిన నతండు సైన్యంబుల నివర్తింప నియమించి సమస్తపరిజన పరివృతుం డై. 65

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ఆచార్యుండు= ద్రోణాచార్యుడు; ఏచినన్= విజృంభించగా; అతనిప్రాపునన్= అండగా; భవత్+సేనలున్= నీ యొక్క సేనలు; చెలంగి= విజృంభించి; పైకొనియెన్= ఎదుర్కొన్నవి; ఆ+అవసరంబునన్= ఆ సమయమందు; ధర్మతనయుండు= ధర్మరాజు; తన= తనయొక్క; ఎలుంగున్= గొంతును (కంఠధ్వనిని); చూపినన్= చూపించగా (వినిపించగా); ఆతని మొగ్గరంబునన్= అతడి వ్యూహములోనుండు; మొనలున్= సేనలు; అగ్గలికన్= ఉత్సాహముతో; బెరసి= క్రమ్ముకొని; పరుసఁ దనంబున్= కాఠిన్యాన్ని; చూపి= ప్రదర్శించి (చూపి); ఏపునన్= అధికంగా; పెనంగుచుండన్= పెనగులాడుచుండగా; ఇనుండు= సూర్యుడు; దర్శనీయమండలుండు+అగుచున్= చూడ శక్యమైనబింబముకలవాడౌతూ; అపరశైల శిఖరగతుండు+అయ్యెన్= పడమటి దిక్కునందలి పర్వతముయొక్క కొనను పొందినవాడయ్యాడు; ఆ+ఎడన్= ఆ సమయంలో; సంజ+కెంపు+చాయ= సాయంకాలపు మెరుపురంగు; నెఱయన్= వ్యాపించగా; నెత్తురు+ఏఱులపయిన్= నెత్తురు ప్రవాహాలమీద, వడిన్= వేగంతో; తేలిపోవు; పీనుంగులన్= శవాలను; తివిచికొని= లాగికొని; చను= పోతూండే; భూతబేతాళ సమ్మర్దంబులను= భూతాలు, బేతాళులు- వీటి ఒరపిళ్ళతో; సమర తలప్రాంతపతితంబులు+ఐన= యుద్ధభూమి అంచుల్లో పడి ఉండే; శవంబులన్= పీనుగులను; కైకొని= తీసికొని; చెలంగు= మ్రోసే; సృగాలంబుల రవంబులను= నక్కల ఊళలచేతను; తద్+సమయంబు= ఆ కాలము; అతిఘోరంబు+అగుటయున్= చాలా భయంకరమైనదికాగా; త్రిగర్తపతి ప్రముఖులు+అగు= త్రిగర్త దేశపురాజు మున్నగు; జగతీ+ఈశులన్= భూభర్తల (రాజుల)ను; వెగడుపఱిచి= బాధపెట్టి; మెఱసినన్= ప్రకాశించగా; సవ్యసాచియున్= అర్జునుడున్నూ; సైంధవ+ఆది+వసుంధరాపతులన్+ సైంధవుడు మొదలైన రాజులను; చిక్కు+పడన్+చేసి= కష్టపడేటట్లుగాచేసి; ఉక్కుమీఱినన్= శౌర్యంచే అతిశయించిన; మారుతియున్= భీముడున్నూ; తమ+అన్నకున్= తమ అన్నయైన ధర్మరాజుకు; పొడసూపి= కనుపించి; నిలిచినన్= నిలబడగా; అతండు= ఆ ధర్మరాజు; సైన్యంబులన్= తమసేనలను; నివర్తింపన్= వెనుకకు మళ్ళించుటకు- యుద్ధాన్ని చాలించడానికి; నియమించి= ఆజ్ఞ ఇచ్చి; సమస్త పరిజన పరివృతుండు+ఐ= సకలమైన పరివారంతో కూడినవాడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా ద్రోణాచార్యుడు విజృంభించాడు. నీ సేనలన్నీ ఆయన అండనుచేరి ఉత్సాహంతో శత్రువులపైకి ఎగబడ్డాయి. అప్పుడు ధర్మరాజు బిగ్గరగా అరవగా ఆయన వ్యూహంలోని సైనికులు ఉత్సాహంతో యుద్ధం చేస్తూ ఉండగా సూర్యుడు అస్తపర్వతంపైకెక్కాడు. ఆ సాయంకాలపు ఎర్రని కాంతులు అంతటా వ్యాపించాయి. యుద్ధరంగంలో నెత్తురు ఏరులై పారింది. ఆ ప్రవాహంలో కొట్టుకొని పోతున్న శవాలను లాగుకొనిపోయే భూతబేతాళాల రాపిళ్ళతోనూ, యుద్ధభూమిలో కూలిన పీనుగులను పీక్కొని తింటూ చెలరేగే నక్కల ఊళలతోనూ ఆ సమయం భయంకరంగా ఉండింది. అప్పుడు ఆ త్రిగర్తదేశపురాజు ముఖ్యుడుగా ఉండే రాజులనందరినీ తల్లడిల్లేటట్లు చేసిన అర్జునుడు, సైంధవుడాదిగాగల రాజులనందరినీ అగచాట్లపాలుచేసి శౌర్యాతిశయంతో ఒప్పివున్న భీముడు, అన్నగారైన ధర్మరాజు ఎదుట నిలిచాడు. అప్పుడా ధర్మరాజు, యుద్ధం చాలించుమని అనుజ్ఞ ఇచ్చి, తనదైన సమస్త పరివారంతో కూడా. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: సవ్యసాచి= రెండుచేతులతో బాణాలు వదిలేవాడు.

శ్లో॥ ఉభే మే దక్షిణే పాణీ గాండీవస్య వికర్షణే।
తేన దేవమనుష్యేషు సవ్యసాచీతి మాం విదుః॥(మహాభారతే - 4-12-16)

తే. **విడిదలకుఁ బోయె నపుడు నీ కొడుకులెల్ల । నాపగానందనునికడ కరుగుదెంచి**
బలము లన్నింటిఁ దివియఁగఁబనిచి మరలి । రాత్మసన్నివేశంబుల కతఁడుఁ దారు. **66**

ప్రతిపదార్థం: విడిదలకున్= తన చోటికి; పోయెన్= వెళ్ళాడు; అపుడు= ధర్మజుడు సపరివారంగా వెళ్ళినప్పుడు; నీ కొడుకులు+ఎల్లన్= నీ కుమారులు దుర్యోధనాదులందరున్నూ; ఆపగానందనుని= గంగానదీ కొడుకైన భీష్ముడి; కడకున్= సమీపానికి; అరుగుదెంచి= వచ్చి; బలములు+అన్నిటిన్= సేనలనన్నిటినీ; తివియంగన్+పనిచి= వెనుకకు తిప్పిపంపి (ఉపసంహరించి); అతఁడున్= ఆ భీష్ముడు; తారు= తాము (దుర్యోధనాదులు); ఆత్మసన్నివేశంబులకున్= తమదండు విడిసిన చోటులకు; మరలిరి= తిరిగివెళ్ళారు.

తాత్పర్యం: ధర్మరాజు పరివారంతో తమదండు విడిసియున్న చోటికి వెళ్లాడు. దుర్యోధనాదులుకూడా భీష్ముడివద్దకు పోయి, తమసైన్యాన్నంతా యుద్ధంనుండి విరమింపచేసి, తమ తమ గుడారాలకు వెళ్ళిపోయారు.

వ. **సప్తమదివస రజనీసమయావసానం బగుటయు** **67**

ప్రతిపదార్థం: సప్తమ= ఏడవదైన; దివస= దినముయొక్క; రజనీ= రాత్రియొక్క; అవసానంబు= ముగింపు; అగుటయున్= కావటంతో.

తాత్పర్యం: భీష్ముడు సేనాధిపతిగా జరిగిన యుద్ధంలో ఏడవ దినపు రాత్రి తెల్లవారగా.

భీష్ముని యష్టమదివస యుద్ధక్రమము (సం. 6-83-1)

క. **భూపోత్తమ! విను పాండు । క్ష్మాపాలతనూభవులును గౌరవులును నా**
టోపంబున సంగరకే । ళీపరులై వెడలి రుగ్రలీలలు మెఱయన్. **68**

ప్రతిపదార్థం: భూప+ఉత్తమ= భూమిని పాలించువాళ్ళలో శ్రేష్ఠుడవైన ధృతరాష్ట్రా!; విను; పాండుక్ష్మాపాల= పాండురాజుయొక్క; తనూభవులునున్= పుత్రులూ; కౌరవులునున్= దుర్యోధనాదులూ; ఆటోపంబునన్= సంభ్రమంతో; ఉగ్రలీలలు= భయంకరమైన చేష్టలు; మెఱయన్= అతిశయించగా; సంగరకేళీపరులు+ఐ= యుద్ధమనే క్రీడయందు ఆశకలవారై; వెడలిరి= బయలుదేరారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! వినుము. పాండురాజు కొడుకులున్నూ, నీ కొడుకులు దుర్యోధనాదులున్నూ వేగిరపాటుతో భయం కలిగించే చేష్టలు చేస్తూ, యుద్ధక్రీడలో ఆశగలవారై యుద్ధానికి పోయారు.

వ. అట్టియెడం గురుపితామహుండు గూర్మవ్యూహంబు దీర్చినం గనుంగొని ధర్మతనయుండు ధృష్టద్యుమ్ను నాలోకించి 'కౌరవవ్యూహంబు సూచితే? దీనికిఁ బ్రతివ్యూహం బెయ్యది దాని సంఘటింపు'మనిన నతండు శృంగాటకవ్యూహంబు వన్నె నిట్లు రెండుసైన్యంబులు మోహరించి యుత్సాహంబులు మెఱయ భేరీ మృదంగాదితూర్యంబులు మొరయం దలపడినఁ బటుహేతివ్రాతపరస్పరసంఘట్టనంబులం బొగ లేని మంట లెగయం జటులస్యందనమాతంగతురంగభటకదంబకంబుల గమనవేగంబున నెగయుపరాగపటలంబు లంబరంబునం బరఁగనీక తత్తదనీకానేకరక్తధారాసారంబు లడరి యడంగించిన నతిరౌద్రంబునఁ బెనంగు నాసమయంబున. 69

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో; కురుపితామహుండు= కురుకులానికి తాత భీష్ముడు; కూర్మవ్యూహంబున్= తాబేలు వ్యూహాన్ని; తీర్చినన్= ఏర్పాటుచేయగా; ధర్మతనయుండు= ధర్మరాజు; కనుంగొని= ఆ కూర్మవ్యూహాన్నిచూచి; ధృష్టద్యుమ్నున్= ఆపేరుగల తమసేనా నాయకుణ్ణి; ఆలోకించి= చూచి; కౌరవవ్యూహంబున్= కౌరవులయొక్క సేనా సన్నివేశాన్ని; చూచితే= చూచావా?; దీనికిన్= ఈ కూర్మవ్యూహానికి; ప్రతివ్యూహంబు= ఈ కూర్మవ్యూహాన్ని ఎదిరించగల వ్యూహం; ఏ+అది= ఏదో; దానిన్= అట్టి వ్యూహాన్ని; సంఘటింపుము= ఏర్పాటుచేయి; అనినన్= అని చెప్పగా; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; శృంగాటక వ్యూహంబున్= శృంగాటకమనే ప్రతివ్యూహాన్ని; పన్నెన్= ఏర్పాటుచేశాడు. ఇట్లు= ఈ విధంగా; రెండు సైన్యంబులు= కౌరవపాండవుల సేనలు; మోహరించి= ఎదుర్కొని; ఉత్సాహంబులు మెఱయన్= ఉత్సాహాలు అతిశయించగా; భేరీ మృదంగ+ఆది తూర్యంబులు= నగారాలు, మద్దెలలు మున్నుగాగల వాద్యాలు; మొరయన్= శబ్దించగా; తలపడినన్= ఒకర్నొకరు ఎదిరించగా; సంఘట్టనంబులు= సంఘర్షణలు; పటు= సమర్థతగల; హేతి= ఆయుధాలయొక్క; వ్రాత= సమూహముయొక్క; పరస్పర= ఒండొంటియొక్క; సంఘట్టనంబులన్= ఒరసికొనుటచేత; పొగలేని= పొగలేకయే; మంటలు= జ్వాలలు; ఎగయన్= పైకి వ్యాపించగా; చటుల= కదలుతున్న; స్యందన= రథములు; మాతంగ= ఏనుగులు; తురంగ= గుర్రాలు; భట= భటులు వీటియొక్క; కదంబకంబులన్= గుంపులయొక్క; గమనవేగంబునన్= నడకయొక్క వేగంచేత; ఎగయు= పైకిలేచు; పరాగపటలంబులు= దుమ్ముల గుంపులు; అంబరతలంబునన్= ఆకాశభాగంలో; పరఁగన్+ఈక= వ్యాపింపనీయకుండా; తద్+తద్+అనేక+అనేక= వారి వారి సేనల బాహుళ్యము యొక్క; రక్తధారా= నెత్తురు ధారలనే; ఆసారంబులు= జడివానలు; అడరి= అధికమై; అడంగించినన్= అణగిపోవునట్లుచేయగా; అతిరౌద్రంబునన్= మిక్కిలి కోపముతో; పెనంగు= యుద్ధంచేసే; ఆ సమయంబునన్= ఆ వేళలో

తాత్పర్యం: కౌరవపాండవులు యుద్ధానికి మోహరించినప్పుడు భీష్ముడు కూర్మవ్యూహాన్ని ఏర్పరచాడు. ధర్మరాజు దాన్నిచూచి, ధృష్టద్యుమ్నుడితో 'కౌరవులు పన్నిన కూర్మవ్యూహాన్ని చూచావుకదా! దీనికి ఈడైన వ్యూహం ఏదో దాన్ని నీవు ఏర్పాటుచేయుము' అన్నాడు. ధృష్టద్యుమ్నుడు దానికి ఈడైన శృంగాటకవ్యూహాన్ని పన్నాడు. ఈ విధంగా రెండు సైన్యాలూ వ్యూహాలు తీర్చుకొని ఉత్సాహంతో యుద్ధానికి సిద్ధంకాగా, నగారాల, మృదంగాది వాద్యాల శబ్దాలు మిన్నుముట్టగా- కౌరవపాండవులు తలపడ్డారు. ఆయుధాల సమూహాలు ఒండొంటి ఒరపిడిచేత పొగలేని మంటలు ఎగబాకాయి. తొందరపాటుతో కదలే రథాలు, ఏనుగులు, గుర్రాలు, భటులు. వీటి ఘట్టనలతో లేచిన ధూళి ఆకాశాన్ని ఆవరింపకుండా ఆయా పెక్కు సేనలయొక్క నెత్తురు ధారల వర్షంతో అణగిపోయింది. ఇంతటి పెనగులాట జరిగే సమయంలో- (తరువాతి పద్యంతో అన్వయం)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మీ తండ్రి సింహనాద । స్ఫీతముఖుం డగుచు నాత్మసేన గడచినన్
భీతిం బాండవయోధ । వ్రాతము మార్కొనక యొదిగె వసుధాధీశా! 70

ప్రతిపదార్థం: వసుధా+అధీశా!= భూమికి భర్తవగు ఓ ధృతరాష్ట్ర మహారాజా! మీ తండ్రి= నీయొక్క తండ్రియైన భీష్ముడు; సింహనాద స్ఫీతముఖుండు+అగుచున్= సింహనాదం చేయటంలో ప్రకాశించే ముఖం కలవాడు అయి; ఆత్మసేనన్= తనయొక్క సేనను; కడచినన్= దాటిరాగా; పాండవయోధవ్రాతము= పాండవసైన్యంలోని వీరులయొక్క సమూహము; భీతిన్= భయముతో; మార్కొనన్= ఎదిరించగా; ఒదిగెన్= తొలగినది.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీష్ముడు బాగా బొబ్బలు పెట్టుతూ తన సైన్యానికి ముందుభాగాన్ని చేరగా పాండవసేనలోని మహావీరులందరూ ఆ భీష్ముణ్ణి ఎదిరించలేక మారుమూలలకు తొలగారు.

చ. అనిలతనూజుఁ డొక్కరుఁడు । నార్చుచు భీష్మునెదిర్చి సూతుఁ జం
పిన రథ మీడ్చికొంచుఁ గురు । బృందము గొందల మంద నశ్వముల్
వెనుకకుఁ బాఱె నప్డు పృథి । వీవర! పాండవ సేన యుబ్బె నీ
తనయుఁడు భీముఁ గట్టెదురఁ । దాఁకె సునాభుఁడు విక్రమోద్ధతిన్. 71

ప్రతిపదార్థం: పృథివీవర!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అనిలతనూజుఁడు= వాయుదేవునికొడుకు- భీముడు; ఒక్కరుఁడున్= ఒక్కడే; ఆర్చుచున్= బొబ్బలు పెడుతూ; భీష్మున్; ఎదిర్చి= ఢీకొని; సూతున్= సారథిని; చంపినన్= చంపగా; కురుబృందము= కౌరవుల గుంపు; కొందలము+అందన్= కలతచెందగా; అశ్వముల్= గుర్రాలు; రథమున్= తేరును; ఈడ్చికొంచున్= లాగికొంటూ; వెనుకకున్= వెనుకకు; పాఱెన్= పరుగెత్తాయి; అప్డు= ఆ సమయంలో; పాండవసేన= పాండవులయొక్క సైన్యం; ఉబ్బెన్= సంతోష పడినది; నీ తనయుఁడు= నీ కొడుకు; సునాభుఁడు= సునాభుడనేవాడు; విక్రమ+ఉద్ధతిన్= పరాక్రమం యొక్క అతిశయం తో; భీము కడు+ఎదురన్= భీముడికి చాలా దగ్గరగా; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: భీము డొక్కడే పెనుబొబ్బలుపెట్టుతూ భీష్ముడిని ఎదిరించాడు. ఆతడి సారథిని హతమార్చాడు. కౌరవ సైనికులందరూ కంగారుపడుతూంటే గుర్రాలు రథాన్ని లాక్కొని వెనక్కి పరుగెత్తి వెళ్ళాయి. ఆ పట్టులో పాండవసేన చాల ఉత్సాహంచెందింది. నీ కొడుకు సునాభుడనేవాడు పరాక్రమంతో చాలా దగ్గరకువచ్చి భీముడిని ఎదుర్కొన్నాడు.

సునాభుడు మొదలగు కురుకుమారులు భీమునిచేఁ జచ్చుట (సం. 6-84-12)

ఆ. అట్లు దాఁ కుటయు బకాంతకుఁ డంత్యకా । లాంతకుండు వోలె నలిగి బొమలు
ముడివడంగ నొక్క వెడఁ దయమ్మునఁ దల । నతికి వైచి పెలుచ నవ్వె నధిప! 72

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అట్లు= ఆ విధంగా; తాఁకుటయున్= ఎదుర్కోగా; బక+అంతకుఁడు= బకుడనే రాక్షసుణ్ణి చంపిన భీముడు; అంత్యకాల+అంతకుండున్+పోలెన్= ప్రళయకాలంలోని యముడి మాదిరి; అలిగి= కోపించి; బొమలు ముడి+పడంగన్= కనుబొమ్మలు ముడిఏర్పడగా (కోపసూచకం); ఒక్క= ఒక్కటైన; వెడఁద= విశాలమైన; అమ్మునన్= బాణంతో; తలన్= తలను; నతికివైచి= నరికివేసి; పెలుచన్= బిగ్గరగా; నవ్వెన్= నవ్వాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! ఆ విధంగా సునాభుడు, బకాసురుణ్ణికూడా చంపిన మహావీరుడైన భీముణ్ణి ఎదుర్కొన్నాడు. ఆ భీముడు యమధర్మరాజు మాదిరిగా నిండా అలిగిన లక్షణాన్ని సూచించే కనుబొమలముడి ఏర్పడగా, ఒక్క పదునైన బాణంతో ఆ సునాభుడి తల నరికి విరగబడి నవ్వాడు.

అవతారిక: సునాభుడి సోదరులు ఏడుగుర్ని భీముడు చంపుతాడు.

వ. ఇట్లు సునాభుండు వడుట గనుంగొని కోపాటోపంబునఁ దత్సోదరులగు నాదిత్యకేతుండును, నపరాజితుండును, బహ్వాశియుఁ, బండితుండును, గుండధారుండును, విశాలాక్షుండును, మహోదరుండును వృకోదరుపై నొక్కపెట్ట కదిసి పెక్కు విధమ్ములగునమ్ములం బెక్కింట నొప్పించిన నప్పాండవ వీరుండు రోషాతిభీషణుండై యేరికిం దేఱి చూడ రాక పటుభల్లంబున, నతినిశితక్షురప్రముఖంబున, శితప్రదరంబున, శాతక్షురికాముఖంబున, దీప్తార్ధ చంద్రాంబకంబున, ఖరనారాచంబునఁ గ్రూరబాణంబునఁ నక్కుమారసప్తకంబు సమవర్తి సమీపంబున కనిచినం దక్కటికుమారు లుక్కుదక్కి వెఱఁగుపడి యంతంత నొదిఁగిన. 73

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సునాభుండు= సునాభుడనేవాడు; పడుటన్= చచ్చుటను; కనుంగొని= చూచి; కోప+ఆటోపంబునన్= కోపంతోనైన వేగిరపాటుతో; తద్+సోదరులు+అగు= ఆ సునాభుడికి తోడబుట్టువులైనట్టి 1.ఆదిత్యకేతుండును; 2.అపరాజితుండును; 3.బహ్వాశియు; 4.పండితుండును; 5.కుండధారుండును; 6.విశాలాక్షుండును; 7.మహోదరుండును; వృక+ఉదరుపైన్= భీముడిమీదికి; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; కదిసి= సమీపానికి వెళ్ళి; పెక్కువిధమ్ములు+అగు= నానా ప్రకారాలైన; అమ్ములన్+పెక్కింటన్= అనేకబాణాలతో; నొప్పించినన్= బాధకలిగించగా; ఆ+పాండవవీరుండు= వీరుడైన ఆ భీముడు; రోష+అతి భీషణుండు+ఐ= కోపంచే మిక్కిలి భయంకరుడై; ఏరికిన్= ఎవరికిగాని; తేఱి చూడరాక= ఎగాదిగా చూట్టానికి సాధ్యంకాక; పటుభల్లంబునన్= గట్టి బల్లెంతో; అతి నిశిత క్షుర ప్రముఖంబునన్= అతి పదునైన అర్ధచంద్రబాణపుకొనతో; శితప్రదరంబున(న్)= వాడియైన బాణంతో; శాతక్షురికా ముఖంబునన్= మంగలి కత్తివంటి వాడిఅయిన ఆయుధంతో; దీప్త+అర్ధచంద్ర+అంబకమునన్= బాగా వెలిగే అర్ధచంద్రాకారపు; బాణంతో; ఖరనారాచంబునన్= వాడిబాణంతో; క్రూరబాణంబునన్= కఠినమైన బాణంతో; ఆ+కుమార సప్తకంబున్= ఆ నీ కుమారులు ఏడుగురిని; సమవర్తి సమీపంబునకున్= యమధర్మరాజు దగ్గరకు; అనిచినన్= పంపగా; తక్కటి కుమారులు= మిగిలిన నీ కొడుకులు; ఉక్కు= బలం; తక్కి= వదలిపెట్టి; వెఱఁగుపడి= భయపడి; అంతన్+అంతన్= అక్కడక్కడ; ఒదిఁగినన్= నక్కినవారు కాగా.

తాత్పర్యం: సునాభుడు భీముడిచేత చావటాన్ని అతడి సోదరులు ఏడుగురూ చూచారు. వారందరూ దొమ్మిగా ఒక్కసారిగా ఆ భీముడిమీదపడి, నానావిధాలైన బాణాల వర్షాలు కురిపించి ఆతడికి చాలా బాధకలిగేట్టు చేశారు. దానితో ఆ కుంతీకుమారుడికి అంతా ఇంతా అనరాని రోషం కలిగింది. ఎవరికీ తేరిపారచూడటానికి కూడా సాధ్యంకానివాడై, ఆ సోదరులను క్రమంగా ఉక్కుబల్లెంతో ఆదిత్యకేతుడిని, పదునుగల క్షురప్రముఖమనే ఆయుధంతో అపరాజితుడిని, చురుకుగల బాణంతో బహ్వాశి అనేవాడిని, మంగలికత్తివంటి ఆయుధంతో పండితుడిని, జ్వలించే అర్ధచంద్రాకారపు బాణంతో కుండధారుడిని, కరుకైన బాణంతో విశాలాక్షుడిని, కటువైన బాణంతో మహోధరుడిని, - ఇట్లా ఆ ఏడుగురినీ చంపాడు. దీన్ని చూచి తక్కిన నీ కుమారులందరూ ధైర్యాన్ని వదలి భయంతో తొలగిపోయారు.

తే. 'నాఁడు సభ నాడినంతయు నేఁడ చేయు । నట్టు లున్నాఁడు మొనతల ననిలసుతుఁడు
విదురుపలుకులు దలకూడె వేయు నేల? । యనుచు వెఱఁ జూచుచుండిరి మనుజపతులు. 74

ప్రతిపదార్థం: అనిల సుతుఁడు= భీముడు; నాఁడు= ఆ దినం; సభన్= కౌరవుల సభలో; ఆడిన= పలికనదానిని; అంతయున్= పూర్తిగా; నేఁడు+అ= ఈనాడే; మొనతలన్= యుద్ధంలో; చేయు+అట్టులున్= చేసే మాదిరిగా; ఉన్నాఁడు; విదురుపలుకులు=

విరుదునియొక్క మాటలు; తలకూడెన్= సిద్ధించాయి (కార్యరూపం తాల్చాయి); వేయున్+ఏల?= ఇక వేయి మాటలెందుకు?; అనుచున్= అని అంటూ; మనుజపతులు= రాజులు; వెఱన్= ఆశ్చర్యంతో; చూచుచుండిరి= చూస్తూ ఉండిపోయారు.

తాత్పర్యం: 'భీముడానాడు సభలో చేసిన ప్రతిజ్ఞలన్నీ ఈనాడు యుద్ధంలో నెరవేర్చేటట్లున్నాడు. విదురుడు చెప్పిన నీతి మాటలు ఈ దినం సార్థకం కాబోతున్నాయి. ఇక వెయ్యి మాట లెందుకు?' అని రాజులందరూ ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయారు.

క. ' నీవు తనూజుల దుర్విన । యావేశం బుడుపవైతి వది దుర్దశలం
గావింప నింకఁ జావక । పోవచ్చునె వారి కనిలపుత్త్రుని చేతన్. 75

ప్రతిపదార్థం: నీవు= (ధృతరాష్ట్రుడవైన) నీవు; తనూజుల= కొడుకులైన దుర్యోధనాదులయొక్క; దుర్వినయ+ఆవేశంబున్= అవినీతిచే ఒడలు తెలియకపోవటాన్ని; ఉడుపవు+ఐతివి= పోగొట్టకపోయావు; అది= ఆ అవినీతిని పోగొట్టకపోవడం; దుస్+దశలన్= చెడ్డ అవస్థలను; కావింపన్= కలిగించగా; ఇంకన్= ఇక మీద; వారికిన్= ఆ దుర్యోధనుడు మున్నగువారికి; అనిలపుత్త్రునిచేతన్= భీముడిచేత; చావన్= చనిపోక; పోవచ్చునె?= తప్పించుకొనవచ్చునా?.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! నీ కొడుకులయొక్క అవినీతిచేనైన దుష్టచేష్టలను అరికట్టకపోయావు. ఆ నీ చేతగాని తనం ఇప్పుడిన్ని కష్టాలకు కారణమైంది. ఇక ఆ దుర్యోధనాదులకు, ఆ భీముడివల్ల చావు తప్పుతుందా? తప్పదు.

వ. అది యట్లుండె నప్పుడు సుయోధనుండు దనచుట్టు నున్న యోధవీరులం గలయం గనుంగొని భీమసేను మార్కొనం బంచి భీష్ము కడకుం జని శోకగద్గదకంఠుం డగుచు నతనితో ని ట్లనియె. 76

ప్రతిపదార్థం: అది= ఆ సంగతి; అట్లు+ఉండెన్= అట్లా ఉంది; అప్పుడు= ఆ సమయంలో; సుయోధనుండు; తన= తనయొక్క; చుట్టున్= తనచుట్టూ; ఉన్న= ఉన్నటువంటి; యోధవీరులన్= భటులను, శూరులను; కలయన్+కనుంగొని= కలయజూచి; భీమసేనున్; మార్కొనన్= ఎదిరించుటకు; పంచి= పంపించి; భీష్ము కడకున్= భీష్ముడివద్దకు; చని= వెళ్ళి; శోక గద్గద కంఠుండు+అగుచున్= దుఃఖంచేత బొంగురుపోయిన కంఠస్వరంగలవాడై; అతనితోన్= ఆ భీష్మాచార్యునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ సంగతి అట్లా ఉండినది. అప్పుడు దుర్యోధనుడు తనచుట్టూ ఉన్నట్టి భటులనూ, శూరులనూ చూచి భీముడితో యుద్ధం చేయడానికి వెళ్ళుమన్నాడు. తానేమో భీష్ముడివద్దకు వెళ్ళాడు. దుఃఖంచే బొంగురుపోయిన కంఠస్వరంతో ఆయనతో ఇట్లా అన్నాడు.

అవతారిక: భీముడిచేత తన తమ్ములు చావడం చూచాడు. దుఃఖంతో దుర్యోధనుడు భీష్ముడి దగ్గరకు వెళ్ళి, ఆయన వారిని కాపాడలేదని బాగా యుద్ధంచేయలేదని ఎత్తి పొడుపు మాటలంటాడు.

ఉ. ' ఇమ్మెయిఁ గిట్టి వాయుసుతుఁ । డేపునఁ గోలుమసంగి పొంగి నా
తమ్ములఁ జంపఁగా నకట! । తప్పక చూచెదు గాని రోషశో
కమ్ములు లేవు తోడుపడఁ । గా దని నిల్చితొ యున్నవారు నో
కుమ్మడిఁ జావఁ గోరి యిటు । లూరక యుండితొ కౌరవోత్తమా!' 77

ప్రతిపదార్థం: కౌరవ+ఉత్తమా!= కురువంశపు రాజులలో గొప్పవాడైన ఓ భీష్మా!; వాయుసుతుండు= వాయుదేవుడి కుమారుడు భీముడు; ఈ+మెయిన్= ఈ విధంగా; కిట్టి= దగ్గరకువచ్చి; ఏపునన్= అతిశయంతో; కోలుమసంగి= మిక్కిలి విజృంభించి; పొంగి=

గర్వించి; నా తమ్ములన్= నా యొక్క తోబుట్టువులను; చంపఁగాన్= చంపుతుండగా!; అకట!= అయ్యో!; తప్పక= చేసేదిలేక; చూచెదు= చూస్తున్నావు; కాని= అంతేగాని; రోషశోకమ్ములు= రోషంగాని దుఃఖంగాని; లేవు= (నీలో) అగుపించవు; తోడుపడన్ కాదు+అని= సహాయపడుట తగదని; నిల్చితి+ఒ= ఊరకున్నావో; ఉన్నవారున్= మిగిలి ఉండేవారు కూడా; ఒక్క+ఉమ్మడిన్= ఒకేసారిగా; చావన్+కోరి= చావాలి అని వాంఛించి; ఇటులు= ఈ విధంగా; ఊరక ఉండితి+ఒ= మిన్నకున్నావో!

తాత్పర్యం: ఓ కౌరవోత్తమా! ఈ విధంగా మీదికి వచ్చి భీముడు అతిశయంతో మిక్కిలి విజృంభించి ఉప్పొంగి నా తమ్ములను చంపగా అయ్యో! తప్పకుండా చూస్తున్నావు గాని నీకు కోపం కానీ, దుఃఖం కానీ రాలేదు. తోడ్పడకూడదని నిలబడి పోయావో? లేక ఉన్నవారందరూ ఒక్కసారిగా చావనీయమని ఇట్లా ఊరకున్నావో?

వ. అనిన విని నదీసూనుండు దాను నెదురు శోకించి యతని కి ట్లనియె. 78

ప్రతిపదార్థం: అనినన్= దుర్యోధనుడిట్లా అనగా; విని; నదీసూనుండు= గంగాపుత్రుడు- భీష్ముడు; తానున్= తానుకూడ; ఎదురు= శోకించి; దుర్యోధనుడితోపాటు దుఃఖపడి; అతనికిన్= ఆ దుర్యోధనుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధను డాడిన పలుకులు విని, భీష్ముడు అతనితోపాటు తానూ దుఃఖం చెంది, దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

క. ' ఇది మున్న యేను ద్రోణుఁడు । విదురుండును జెప్పినదియ విన వప్పుడు బె
ట్టిదు లగుపాండుతనూజుల । కెదు రై నిర్జింప వశమె? యీశున కైనన్. 79

ప్రతిపదార్థం: ఇది= పాండవులచే మీరు (దుర్యోధనాదులు) భంగపడుతారనేది; మున్ను+అ= ముందుగానే; ఏను= భీష్ముడనైన నేను; ద్రోణుఁడు= ధనురాచార్యుడైనట్టి ద్రోణుడు; విదురుండునున్= నీతిమంతుడైన విదురుడున్నూ; చెప్పినది+అ= చెప్పినట్టిదే; అప్పుడు= ఆ సమయంలో; వినవు= నీవు వినకపోతివి; బెట్టిదులు+అగు= ఉద్ధతులైన; పాండుతనూజులకున్= పాండురాజు కొడుకులకు; ఎదురు+ఐ= ఎదురుగా నిలబడి; ఈశునకున్+ఐనన్= పరమేశ్వరుడికైనా; నిర్జింపన్= జయించడానికి; వశమె?= సాధ్యమా? కాదని భావం.

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! ఇప్పటి ఈ ఆపత్తు ఉప్పతిల్లుతుందని ఏనాడో నేను, ద్రోణాచార్యుడు, విదురుడు నీకు చెప్పాము. కాని మా మాటలప్పుడు లెక్కచేయకుంటివి. మహాపరాక్రమవంతులైన పాండవులకు ఎదురుగా నిలిచి జయించటానికి ఈశ్వరుడికికూడా సాధ్యం కాదు. ఇక మనబోటి వాళ్ళు ఎంతమాత్రం?

తే. మనకుమారులలోన నయ్యనిలతనయు । బారి కగపడువాని నెవ్వారి కైనఁ
గావఁ దలకొన శక్యంబు గాదు మనకు । నడలఁ బనిలేదు దీనికి నధిపతనయ! 80

ప్రతిపదార్థం: అధిప తనయ!= రాజకుమారా దుర్యోధనా!; మన కుమారులలోనన్= మన ధృతరాష్ట్రుడి కొడుకులలో; ఆ+అనిల తనయు బారికిన్= ఆ భీముడికి యుద్ధపు మార్గంలో; అగపడువానిన్= కనిపించేవాడిని; కావన్= కాపాడ్డానికి; ఎవ్వారికిన్+ఐనన్= ఎలాంటి శూరుడికైనా; తలకొనన్= ప్రయత్నించుటకు; శక్యంబు+కాదు= సాధ్యంకాదు; దీనికిన్= సాధ్యంకాదనే ఈ విషయానికి; మనకున్= కౌరవులైన మనకు; అడలన్= చింతించవలసిన; పనిలేదు= అవసరం లేదు.

తాత్పర్యం: దుర్యోధనా! కౌరవ కుమారులలో ఎవడైనా ఆ భీముడికెదురైతే, అట్టివాడిని కాపాడటానికి ప్రయత్నించడానికి కూడా ఎట్టి శూరుడికైనా సాధ్యం కాదు. ఈ దుస్థితిని గూర్చి మనం ఏడవవలసినపని లేదు.

క. వీరస్వర్గము ధనముగఁ । బోరుము నీ వింక నొండుబుద్ధు లుడుగు మేఁ
బోరెద నోపినమెయిఁ దెగి । పోరఁగ జయమైన దానిఁ బోఁ ద్రోచెదమే! 81

ప్రతిపదార్థం: నీవు= దుర్యోధనుడవైన నీవు; ఇంకన్= ఇక మీదట; వీరస్వర్గము= వీరస్వర్గమే; ధనముగన్= ధనంగా; పోరుము= యుద్ధంచెయ్యి; ఒండు బుద్ధులు= వేరే బుద్ధులు (ఆలోచనలు); ఉడుగుము= వదిలిపెట్టుము; ఏన్= నేను (భీష్ముడు); ఓపినమెయిన్= శక్యమయినంత; తెగి= సాహసించి; పోరెదన్= యుద్ధంచేస్తాను; పోరఁగన్= యుద్ధంచేస్తే; జయము+ఐనన్= మనకు జయం కలిగితే; దానిన్= ఆ జయాన్ని; పోన్+త్రోచెదము+ఏ?= అవతలకు నెట్టివేస్తామా?

తాత్పర్యం: దుర్యోధనా! నీ వింక వీరస్వర్గాన్నే ధనంగా కోరి యుద్ధంచేయుము. అంతేగాని వేరే ఆలోచనలు అనగా రాజ్యంమీద ఆశను విడిచిపెట్టుము. నేనేమో చేతనయినంతగా తెగించి యుద్ధంచేస్తాను. ఒక వేళ జయం మనదైతే ఆ జయాన్ని కాదంటామా!'

వ. అనియె నని చెప్పిన విని వైచిత్రవీర్యుండు. 82

ప్రతిపదార్థం: అనియెన్= భీష్ముడన్నాడు; అని చెప్పినన్= అని సంజయుడు చెప్పగా; విని= ఆలకించి; వైచిత్రవీర్యుండు= విచిత్రవీర్యుని కొడుకు- ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: భీష్ముడు దుర్యోధనుడితో చెప్పిన మాటలను సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు.

తే. ' గురుఁడు భీష్ముడుఁ గలుగంగఁ గురుకుమారు । లిట్టు వొలిసెదరే మున్నయింతవట్టు!
దల్లియును నేనుఁ జెప్పినఁ బొల్ల సేసి । దాని ఫల మిప్పు డా సుయోధనుఁడు గనియె. 83

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యుడు; భీష్ముండున్= భీష్ముడున్నూ; కలుగంగన్= మనపక్షంలో ఉండగా; కురుకుమారులు= కౌరవపుత్రులు; ఇట్టు= ఈ మాదిరి; పొలిసెదరే!= చస్తారా!; మున్ను+అ= మునుపే; ఇంత+పట్టు= ఇదంతా; తల్లియునున్= తల్లియైన గాంధారి; ఏనున్= నేను (ధృతరాష్ట్రుడు); చెప్పినన్= చెప్పగా; పొల్ల+చేసి= వ్యర్థంచేసి; దాని ఫలము= ఆ మాటలు విననిదానియొక్క ఫలాన్ని; ఇప్పుడు= ఈనాడు; సుయోధనుండు= దుర్యోధనుడు; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: 'అస్త్ర గురువు ద్రోణాచార్యుడు, దేవతలకు కూడా అజేయుడైన భీష్మాచార్యుడు ఈ యిద్దరున్నూ మన పక్షాన ఉండి యుద్ధంచేస్తూంటే ఇందరు కుమారులు చావడమా? భవిష్యత్తులో కలిగే ఈ విపత్తునంతా ముందుగానే గాంధారి, నేనూ ఎంతగానో చెప్పినప్పటికి ఆ దుర్యోధనుడు దాన్ని పెడచెవిని పెట్టాడు- దాని ఫలం ఇప్పుడు అనుభవిస్తున్నాడు.

వ. ఇంక నమ్మాటలాడుట గతజలసేతుబంధనంబు దానిం జాలింపు మట్లు కురుకుమారులచావు గనుంగొని గాంగేయకుంభసంభవులు పదంపడి యేమి సేసి రని యడుగుటయు, సూతనందనుం డంబికా నందనున కిట్లను, భీష్ముండు భయంకరాకారుం డై మారుతిపయిం దేరు వఱపె, నతనిం గని ధర్మనందనుండు సేయివీచిన ధృష్టద్యుమ్నశిఖండిసాత్యకులు దలకడచి యతనితోఁ దలపడి రంతకు మున్న

దుర్యోధనుపనుపునఁ గవిసిన రథికులమీఁదం జేకితాన ద్రౌపదేయసహితంబుగా సవ్యసాచి యడరె.
నభిమన్యుండును హైడింబుండును ధార్తరాష్ట్రులదెసం దఱిమి రిత్తెఱంగున మూఁడు గట్టిమొత్తమ్ములు
బెట్టిదంబు సేయ మన బలంబులుం బోక పెనంగుచుండె; నట్టియెడ. 84

ప్రతిపదార్థం: ఇంకన్= ఇకమీదట; ఆ+మాటలు= ఆ పలుకులు; ఆడుట= చెప్పుకోవడం; గతజలసేతు బంధనంబు= ప్రవాహంపోయిన తరువాత కట్టకట్టడంవంటిది (వ్యర్థము); దానిన్= ఆ సమాచారాన్ని; చాలింపుము= వదలిపెట్టుము; అట్లు= ఆ విధంగా; కురు కుమారుల చావున్= కురు కుమారుల మరణాన్ని; కనుంగొని= చూచి; గాంగేయ కుంభసంభవులు= గంగాదేవి కొడుకు- భీష్ముడు, కడవనుండి పుట్టిన ద్రోణుడు- వీరిద్దరు; ఏమిసేసిరి= ఏం చేశారు; అని అడుగుటయున్= అని అడగ్గా; సూత నందనుండు= సూతుని కొడుకు సంజయుడు; అంబికానందనునకున్= అంబికయొక్క కొడుకైన ధృతరాష్ట్రుడికి; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటాడు; భీష్ముండు; భయంకర+ఆకారుండు+ఐ= భయంకలిగించే రూపంకలవాడై; మారుతిపయిన్= భీముడిమీదికి; తేరున్= రథాన్ని; పఱపెన్= తోలాడు; అతనిన్= ఆ భీష్ముడిని; కని= చూచి; ధర్మనందనుండు; చేయివీచినన్= చేతితో సైగచేయగా; ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకులు= ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి; తలకడచి= అతిక్రమించి; అతనితోన్= ఆ భీష్ముడితో; తలపడిరి= ఎదిరించారు; అంతకుమున్ను+అ= అంతకుముందుగానే; దుర్యోధను పనుపునన్= దుర్యోధనుడి ఆజ్ఞచేత; కవిసిన= పర్విన; రథికులమీఁదన్= రథంలో కూర్చొని యుద్ధంచేసేవారి మీదికి; చేకితాన ద్రౌపదేయ సహితంబుగాన్= చేకితానుడు, ద్రౌపది కొడుకులు- వీరితో కూడికొని; సవ్యసాచి= అర్జునుడు; అడరెన్= విజృంభించాడు; అభిమన్యుండును= సుభద్రకొడుకు అభిమన్యుడు; హైడింబుండును= హిడింబ అనే రాక్షసికొడుకున్నూ; ధార్తరాష్ట్రునిదెసన్= దుర్యోధనుడున్న దిక్కునకు; తఱిమిరి= కవిశారు; ఈ+తెఱంగునన్= ఈ మాదిరిగా; మూఁడు; గట్టి= దిట్టమైన; మొత్తమ్ములు= గుంపులు; బెట్టిదంబు= క్రూరత్వాన్ని; చేయన్= చేయగా; మనబలంబులున్= మన కౌరవులయొక్క సైన్యంకూడా; పోక= వెనుకకు తిరగకుండా; పెనంగుచున్+ఉండెన్= యుద్ధం చేస్తున్నాయి; అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఇక ఆ మాటలు చాలించు. ఇక అది గతజలసేతుబంధనంవలె ఉపయోగంలేనిది. ఆ కురుకుమారులు చావటాన్ని చూచి భీష్మద్రోణులు ఆపైన ఏంచేశారు?' అని ధృతరాష్ట్రుడు అడిగాడు. దానికి బదులు సంజయుడిట్లా చెప్పాడు. 'భీష్ముడు భయంకరమైన ఆకారంతో భీముడున్న వైపునకు రథం పోనిచ్చాడు. దాన్ని చూచి ధర్మరాజు చేసన్నచేయగా ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకులు ముందుకువచ్చి ఆ భీష్ముడితో తలపడ్డారు. అంతకుముందే దుర్యోధనుడి ఆజ్ఞతో ఎగబడిన రథికులపైకి అర్జునుడు, చేకితానుడు ద్రౌపదీ పుత్రులతో కూడి ఎగబడ్డారు. అభిమన్యుడు, ఘటోత్కచుడు దుర్యోధనుడిపైకి ఉరికారు. ఈ విధంగా మూడు గట్టి సైన్యాలు చాలా కఠోరంగా యుద్ధం సాగించాయి. కౌరవబలాలు వెనుకంజ వేయకుండా బాగా పోరుతూ వచ్చాయి. అప్పుడు-

విశేషం: భీష్ముడు- అష్టవసువులలో ఒకడు. వసిష్ఠుడి శాపంవల్ల భీష్ముడుగా పుట్టాడు. శంతనురాజు తండ్రి, గంగాదేవి తల్లి. ఇతడు పరమ ధర్మాత్ముడు, మహావీరుడు. తండ్రి శంతనుడు దాసకన్యను వివాహం చేసికొనే సందర్భంలో తాను తండ్రి రాజ్యాన్ని కోరక, వివాహం చేసికొనక, ఊర్ధ్వరేతుడయ్యాడు.

క. ద్రోణాచార్యుఁడు ద్రుపద। క్షోణీశ్వరుమోహరంబు సుడివడ దివి గీ
ర్వాణులు గీర్తింపఁగఁ బటు। బాణపరంపర లనేకభంగులఁ బఱపెన్. 85

ప్రతిపదార్థం: దివిన్= ఆకాశంలో; గీర్వాణులున్= దేవతలు; కీర్తింపఁగన్= పొగడగా; ద్రోణాచార్యుఁడు= విలువిద్యలో గురువు ద్రోణుడు; ద్రుపదక్షోణీశ్వరు= ద్రుపద మహారాజుయొక్క; మోహరంబు= పన్నినవ్యూహాన్ని; సుడివడన్= చలించునట్లుగా; బాణపరంపరలు= బాణాల వరుసలను; అనేక భంగులన్= పెక్కు విధాలుగా; పఱపెన్= ప్రయోగించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ద్రోణాచార్యుడు బలమైన పలురకాలైన బాణాలు ప్రయోగించి, ద్రుపద మహారాజు పన్నిన వ్యూహాన్ని చిందరవందర చేశాడు. అప్పుడు ఆకాశంలో విమానాల నుండి చూస్తున్న దేవతలు ఆయన శౌర్యాన్ని ఎంతో పొగిడారు.

క. కరిఘటలు మీఁద భీముఁడు । సరభసముగ నేయునారసంబుల మ్రో డై
ధరఁ బడి రూపఱినను దిన । కరుకరములఁ దమము విరియుగతిఁ దోఁచె నృపా! 86

ప్రతిపదార్థం: నృపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; భీముఁడు= భీముడు; కరిఘటలు= ఏనుగు గుంపులు; మీఁదన్= మీద; సరభసంబుగన్= వేగంతో; ఏయు= ప్రయోగించునట్టి; నారసంబులన్= బాణాలచేత; మ్రోడు+ఐ= మొద్దుబారి; ధరన్= నేలమీద; పడి= పడి; రూపు+అఱినను= అవయవాలు తెగిపోగా; దినకరు కరములన్= సూర్యుని యొక్క కిరణాలచేత; తమము= చీకటి; విరియుగతిన్= చెదిరిపోయే మాదిరిగా; తోఁచెన్= అనిపించింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! భీముడు బలంగా వేసిన బాణాల దెబ్బకు ఏనుగుల గుంపులు మొద్దుబారి, అవయవాలు తెగిపోగా, నేలమీద పడ్డాయి. అది సూర్యకిరణాలు సోకగా చీకటి చెదరిపోయే విధంగా ఉండింది.

విశేషం: అలంకారం: ఉపమ.

క. అఱిముఱి గుఱ్ఱపుదడముల । కుఱికి కవలు రౌద్రరసమహోగ్రాకృతు లై
నఱకిన నచ్చట రథములు । పఱపఁగరాదయ్యె నుభయబలయోధులకున్. 87

ప్రతిపదార్థం: కవలు= నకుల సహదేవులు; అఱిముఱి= సంభ్రమంతో; గుఱ్ఱపుదడములకున్= గుఱ్ఱాల దండుపైకి; ఉఱికి= దూకి; రౌద్రరస= రౌద్రరసంచేత;మహా= అధికమైన; ఉగ్ర= భయంకరమైన; ఆకృతులు+ఐ= ఆకారంగలవారై; నఱికినన్= నఱికివేయగా; అచ్చటన్= ఆ యుద్ధరంగంలో; ఉభయబలయోధులకున్= రెండు సేనలలోని భటులకు కూడా; రథములున్= రథాలను; పఱపఁగన్= తోలుటకు; రాదు+అయ్యెన్= సాధ్యంకాలేదు.

తాత్పర్యం: నకులుడు, సహదేవుడు శత్రువుల గుర్రపు దళాల మీదికి సంభ్రమంగా దూకి, రౌద్రరసంతో చూచేవారికి చాల భయంకరులై, చాలా గుర్రాలను నరికివేశారు. యుద్ధభూమి అంతా చచ్చిన గుర్రాలతో నిండిపోయింది. అప్పుడు కురుపాండవసేనలలోని భటులు తమ రథాలను తోలడానికి కూడా దారి లేకపోయింది.

తే. నరుఁడు రథికజనంబుపై సరభసముగ । నేయఁ గేయూరహారరతత్కాయశకల
వితతి నిల యొప్పె రాలినవివిధ పుష్ప । పుంజమునఁ బొల్చు నుద్యానభూమి వోలె. 88

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; సరభసముగన్= తొందరపాటుతో; రథికజనంబుపైన్= రథంలో కూర్చుని యుద్ధంచేసేవారిమీదికి; ఏయన్= బాణాలువేయగా; రాలిన= నేలపడినట్టి; వివిధ పుష్పపుంజమునన్= రకరకాల పూల కుప్పలతో; పొల్చు= ఒప్పునట్టి; ఉద్యానభూమిన్+పోలెన్= ఉద్యానవనం మాదిరి; కేయూర= బాహుపురులయొక్క; హార= దండలయొక్క; తద్+కాయ= ఆ చంపబడ్డ రథికుల శరీరాలయొక్క; శకల= తునుకలయొక్క; వితతిన్= సముదాయంచేత; ఇల= భూమి; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: అర్జునుడు త్వరతో బాణాలువేసి రథికులను హతమార్చాడు. అప్పుడా యుద్ధభూమి చచ్చిన రథికులయొక్క బాహుపురులతో, రత్నాలు చెక్కిన హారాలతో, శరీరాల అవయవాల తునుకలతో నేలపై రాలిన పలురంగుల పూల కుప్పలతో ప్రకాశించే ఉద్యానవనంలా ఉన్నది.

విశేషం: అలం: ఉపమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అప్పు డిరావంతుండు. 89

ప్రతిపదార్థం: అప్పుడు= అర్జునుడు చాలామంది రథికుల్ని చంపిన సమయంలో; ఇరావంతుండు= అర్జునుడికి నాగకన్యకు పుట్టినవాడు.

తాత్పర్యం: అట్టి సమయంలో ఇరావంతుడనేవాడు.

క. తురగనికరంబుతోడం । గురుసైన్యము దటియఁ జొచ్చుకోల్తల సూడం
గర మొప్పె ఘనవిహంగో । త్కరముపయిం గవియు డేగతండంబుగతిన్. 90

ప్రతిపదార్థం: తురగ నికరంబుతోడన్= గుర్రాల గుంపుతో; కురుసైన్యమున్= కౌరవులసేనను; తటియన్= దగ్గఱకువచ్చి; చొచ్చు= దూరునట్టి; కోల్తలన్= యుద్ధసన్నాహాన్ని; చూడన్= చూడగా; ఘన= దట్టంగావున్న; విహంగ= పక్షులయొక్క; ఉత్కరము పయిన్= గుంపుమీదికి; కవియు= ఆక్రమించే; డేగతండంబుగతిన్= డేగలగుంపులాగా; కరము= మిక్కిలి; ఒప్పెన్= అమరింది.

తాత్పర్యం: గుర్రాల గుంపుతో ఇరావంతుడు కురుసేన దగ్గరకు వెళ్ళి చొరబడటం చూస్తే దట్టంగా ఉండే పక్షులగుంపుమీదికి ఉరికే డేగ గుంపువలె ఉండింది. కౌరవుల సేన పక్షుల గుంపువలె, ఇరావంతుడి సైన్యం డేగ గుంపువలె అగుపించింది.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇ ట్లుక్కు మిగిలి యెక్కినయర్జుననందనుం గనుంగొని శకునితమ్ములు శుకుండును, శర్మవంతుండును, వృషకుండును, నార్జవుండును, గజుండును, గవాక్షుండును, గుఱ్ఱపు మొత్తంబులతో నగ్గలిక నతనిపై వాహనంబులం బఱపి పిఱుదివియక రాయిరాయి దాఁకినట్లు దాఁకి రయ్యిరువాఁగును విచిత్రంబుగాఁ బోర నయ్యార్వురు గాంధారకుమారులు నయ్యిరావంతుం బొదివి సెలకట్టెలవాట్ల డొంకెనపోట్ల నొప్పించిన బరిగోలలపోటులు దాఁకినం గినిసిన గంధగజంబు చందం బై. 91

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఉక్కుమిగిలి+ఎక్కిన= మిక్కిలి పరాక్రమంతో అతిశయించిన; అర్జుననందనున్= అర్జునుడికొడుకైన ఇరావంతుణ్ణి; కనుంగొని= చూచి; శకుని తమ్ములు; శకుండును; శర్మవంతుడును; వృషకుండును; ఆర్జవుండును; గజుండును; గవాక్షుండును; గుఱ్ఱపు మొత్తంబులతోన్= గుర్రపు సమూహంతో; అగ్గలికన్= పూనికతో; అతనిపైన్= ఆ ఇరావంతుడి మీదికి; వాహనంబులన్= గుర్రాలను; పఱపి= తోలి; పిఱు+తివియక= వెనక్కిమళ్లకుండా; రాయి= శిల; రాయిన్= శిలను; తాఁకినట్లు= ఢీకొన్నవిధంగా; తాఁకిరి= ఎదుర్కొనిరి; ఆ+ఇరువాఁగును= ఆ రెండు సేనలున్నూ; విచిత్రంబుగాన్= ఆశ్యర్యంగా; పోరన్= యుద్ధంచేయగా; ఆ+ఆర్వురు= ఆ ఆర్వురు; గాంధారకుమారులు= గాంధార రాజుయొక్క కొడుకులు; ఆ+ఇరావంతున్= ఆ ఇరావంతుడిని; పొదివి= కమ్ముకొని; సెలకట్టెల= బాణాల; వాట్లన్= దెబ్బలతో; డొంకెన= ఈటెలయొక్క; పోట్లన్= పొడుచుటచేత; నొప్పించినన్= బాధపెట్టగా; బరిగోలల= అంకుశాలయొక్క; పోట్లన్= పొడుపులతో; తాఁకినన్= గ్రుచ్చుకోగా; కినిసిన= కోపంచెందిన; గంధ= మదించిన; గజంబు= ఏనుగుయొక్క చందంబు+ఐ= విధమై.

తాత్పర్యం: ఎక్కువయిన పరాక్రమంతో అతిశయించిన ఇరావంతుడిని చూచారు. శకుని తమ్ముళ్ళు ఆరుగురూ చాలా పూనికతో తమ గుర్రాల గుంపును వాడిమీదికి తోలారు. వెనక్కి తగ్గకుండా, రాయి రాతితో ఢీకొన్నట్లుగా రెండుపక్షాల వారూ చాలా ఆశ్చర్యంగా యుద్ధం చేశారు. ఆరుగురూ ఆ ఇరావంతుడిని చుట్టుముట్టి బాణాలతో బాదారు, వంకర కొనలుగల ఈటెలతో పొడిచారు. అంకుశపు పొడుపు తినిన మదపుటేనుగు విధంగా కోపగించి.

విశేషం: అలం: ఉపమ.

ఆ. అతఁడు ధన్వి యగుట నశ్వంబుఁ దొలఁగ దాఁ। టించి తిరిగి యా కడిందిమగల
నారసములు పెక్కు నాటించి నొప్పించి। వెగడుపఱిచె సురలు వొగడుచుండ. 92

ప్రతిపదార్థం: సురలు= దేవతలు; పొగడుచుండన్= పొగడుచుండగా; అతఁడు= ఆ ఇరావంతుడు; ధన్వి= విలుకాడు; అగుటన్= కావడంచేత; అశ్వంబున్= గుర్రాన్ని; తొలఁగన్= పక్కకు పొయేటట్లుగా; దాఁటించి= తప్పించి; తిరిగి= ప్రక్కకుమళ్ళి; ఆ కడింది= ఆ అసాధ్యులైన; మగలన్= శూరులను; నారసములు= బాణాలు; పెక్కు= అనేకములు; నాటించి= గ్రుచ్చుకొనేటట్లుచేసి; నొప్పించి= బాధకలిగించి; వెగడుపఱిచెన్= తల్లడిల్లజేశాడు.

తాత్పర్యం: ఆ ఇరావంతుడు విలుకాడు కాబట్టి తన గుర్రాలను ప్రక్కకు తప్పించి మరల తిరిగివచ్చి ఆ వీరులపై పలుబాణాలు ప్రయోగించి నొప్పించాడు. అప్పుడు దేవతలందరూ ఆ ఇరావంతుడి శౌర్యాన్ని మెచ్చుకొన్నారు.

వ. అట్టియెడ. 93

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ ఇరావంతుడు, పెక్కుబాణాలువేసి, శత్రువులకు అడలు పుట్టించే సమయంలో.

క. మునుపోటులఁ బడినొచ్చుటఁ। దనగుఱ్ఱము వడినఁ బడక ధరణికి లంఘిం
చెను వెఱపు లేక పే రు। క్కునఁ బటుఖడ్గంబు వెఱికికొనుచు రయమునన్. 94

ప్రతిపదార్థం: మును= ముందే; పోటులన్+పడి= పొడుపులుతిని; నొచ్చుటన్= బాధపడటంచేత; తనగుఱ్ఱము= ఇరావంతునియొక్క గుర్రము; పడినన్= పడిపోగా; పడక= తాను (ఇరావంతుడు) క్రిందపడకుండా; వెఱపులేక= భయపడకుండా; పేరు+ఉక్కునన్= మిక్కిలి స్థైర్యంతో; పటుఖడ్గంబున్= దిట్టమైనకత్తిని; రయమునన్= వేగంతో; పెఱికికొనుచున్= ఒరనుండిపైకి దూస్తూ; ధరణికిన్= భూమిమీదికి; లంఘించెన్= దూకాడు.

తాత్పర్యం: అంతకుముందే ఇరావంతుడి గుర్రం బాగా దెబ్బలుతిని ఉండడంచేత నేలకు ఒరిగిపోయింది. ఇరావంతుడు కిందపడకుండా చాలా జాగ్రత్తగా ధైర్యంతో ఒక గట్టి కత్తిని తీసికొని వేగంగా నేలమీదికి దూకాడు.

వ. ఇట్లు భూచారి యయిన భుజగరాజదౌహిత్రుం జూచి యేచి యా సుబలసూనులు సుట్టుముట్టి. 95

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఆ సుబలసూనులు= గాంధార రాజు సుబలుడి కుమారులు; భూచారి+అయిన= (పదాతి) భూమి మీద ఉండి యుద్ధంచేసే వాడైన; భుజగరాజ దౌహిత్రున్= సర్పాలరాజు కూతురి కొడుకైన ఇరావంతుణ్ణి; చూచి= దర్శించి; ఏచి= విజృంభించి; చుట్టుముట్టి= నాలుగు పక్కల క్రమ్ముకొని;

తాత్పర్యం: భూమిమీద నిలబడి యుద్ధంచేసే ఆ ఇరావంతుడిని చూచి, ఆ ఆరుగురు అన్నదమ్ములు విజృంభించి చుట్టుముట్టారు.

విశేషం: ఇరావంతుడు కౌరవ్యుడనే సర్పరాజుకూతురు కొడుకు.

క. పొడువఁగ వ్రేయఁగ నతఁడుం। గడునుఱ వగు నేర్పు కడిమికలిమిం దనపైఁ
బడకుండఁ గృపాణమ్మునఁ। గడుఁజిత్రపుగతుల జడిసెఁ గైదువు లెల్లన్. 96

ప్రతిపదార్థం: పొడువఁగన్= ఆ సుబల సూనులు(తనను) బల్లాలతో గ్రుచ్చగా; వ్రేయఁగన్= కొట్టగా; అతఁడున్= ఆ ఇరావంతుడు; కడున్= మిక్కిలి; ఉఱవు+అగు= ఎక్కువైన; నేర్పు= సామర్థ్యము; కడిమి= పరాక్రమము వీనిని; కలిమిన్= కలిగియుండుటచేత; తనపైన్= తనమీద; పడక+ఉండన్= తనమీదపడకుండునట్లుగా; కృపాణమ్మునన్= ఖడ్గంతో; కైదువులు+ఎల్లన్= అన్ని ఆయుధాలను; కడున్= మిక్కిలి; చిత్రపుగతులన్= విచిత్రాలైన పోకడలతో; జడిసెన్= నివారించాడు.

తాత్పర్యం: ఆ శకుని తమ్ములు ఆరుగురూ, ఇరావంతుడిని బల్లాలతో పొడిచారు. ఆయుధాలతో కొట్టారు. ఇరావంతుడు ఎక్కువ నేర్పు, సామర్థ్యం, పరాక్రమం కలిగినవాడు కావటంచేత, ఆ శత్రువులు ప్రయోగించిన అన్ని ఆయుధాలనూ, తన ఖడ్గంతో చిత్రవిచిత్రాలైన విధానాలతో అవి తనమీద పడకుండా చేసికొంటూ వాటి నన్నింటినీ ఖండించివేశాడు.

వ. ఆ రౌతులు వీఁడు గాలుమానిసి యగుటం జేసి మనకు నొప్పింప వెరవుగాదయ్యెడు' నను దుర్విచారంబున. 97

ప్రతిపదార్థం: ఆ రౌతులు= గుర్రాలనెక్కి యుద్ధంచేసే ఆ ఆరుగురు; వీఁడు= ఈ ఇరావంతుడు; కాలుమానిసి= నేలపై నిల్చి యుద్ధంచేసేవాడు (పదాతి) అగుటన్+చేసి= కావడంవల్ల; మనకున్= గాంధారరాజు కొడుకులైన మనకు; నొప్పింపన్= బాధపెట్టడానికి; వెరవు= సాధ్యము; కాదు+అయ్యెడున్= కాకుండా ఉన్నది; అను= అనునట్టి; దుర్+విచారంబునన్= చెడ్డ ఆలోచనతో.

తాత్పర్యం: 'ఈ ఇరావంతుడు నేలపై నిలిచి యుద్ధం చేస్తున్నాడు. మనమేమో గుర్రాలపై కూర్చొని యుద్ధం చేస్తున్నాము కాబట్టి మనకు వీడిని హింసించడం సాధ్యంకాదు. అనే చెడ్డ ఊహలో పడినవారై.

ఆ. ఆర్వురును గడంగి హయముల డిగి పటు । ఖడ్గదీప్తు లడరఁ గదియుటయును
బ్రమరి తిరిగి వారిఁ బంద్రెండుదునియలు । సేసి క్రీడికొడుకు సెలఁగి యార్చె. 98

ప్రతిపదార్థం: ఆర్వురునున్= ఆ ఆరుగురు సోదరులున్నూ; కడంగి= ప్రయత్నపడి; హయములన్= గుర్రాల నుండి; దిగి= క్రిందికిదిగి; పటుఖడ్గదీప్తులు= దృఢమైనకత్తుల కాంతులు; అడరన్= వ్యాపించగా; కదియుటయును= దగ్గరకురాగా; క్రీడికొడుకు= అర్జునుడి కుమారుడు; భ్రమరితిరిగి= చుట్టివచ్చి; వారిన్= ఆ శకుని సోదరులు ఆరుమందిని; పంద్రెండు= పన్నెండు; తునియలు= తునుకలుగా; చేసి= సలిపి; చెలఁగి= చెలరేగి; ఆర్చెన్= బొబ్బరించాడు.

తాత్పర్యం: ఆ ఆరుగురు సోదరులు గుర్రాలమీదినుండి నేలపైకి దిగారు. పదునైన దిట్టములైన ఖడ్గాల చేతబట్టుకొని ఆ ఇరావంతుడి దగ్గరకు వచ్చారు. ఆ ఇరావంతుడు, చుట్టివచ్చి ఒక్కొక్కడిని, రెండుతుంటలచొప్పున ఆ ఆరుగుర్ని మొత్తం పన్నెండు తుంటలుగా నరికివేశాడు. వీరావేశంతో పెనుబొబ్బలు పెట్టాడు.

అవతారిక: ఈ దృశ్యాన్ని చూచిన దుర్యోధనుడు ఇరావంతుడి మీదకి యుద్ధానికి అలంబుసుడనే రాక్షసుడిని ఉసిగొల్పుతాడు.

క. వెక్కస మందుచుఁ గురుపతి । రక్కసుతో ననియె 'నియ్యురగ దౌహిత్రుం
డొక్కఁడ మన సైన్యంబు । ల్స్రక్కడఁచుచు నున్నవాఁ డలంబుస! కంటే.' 99

ప్రతిపదార్థం: కురుపతి= కురురాజు దుర్యోధనుడు; వెక్కసము= అసహనము; అందుచున్= పొందుచున్నవాడగుతూ; రక్కసుతోన్= రాక్షసుడితో; అలంబుస!= ఓ అలంబుసుడా!; ఈ+ఉరగదౌహిత్రుండు= ఈ నాగరాజు కూతురి కొడుకు

(ఇరావంతుడు); ఒక్కడు+అ; మన సైన్యంబుల్= మనయొక్క సేనలను; చక్కడఁచుచున్+ఉన్నవాఁడు; సంహరిస్తూ ఉన్నాడు; కంటే?= చూచావా?; అనియెన్= అని అన్నాడు.

తాత్పర్యం: ఆ ఆరుగురు గాంధారరాజు కుమారులను ఇరావంతుడొక్కడే చంపటాన్ని దుర్యోధనుడు చూచాడు. అతడికి వెక్కసపాటు ఎక్కువైంది. తన సమీపానవుండే రాక్షసుడితో "ఓ అలంబుసుడా! చూచావుగదా! అర్జునుడి కొడుకు ఇరావంతుడు ఒక్కడే మనసైన్యం మీద విరుచుకపడి అడగారిపోయ్యేట్టు చేస్తున్నాడు.

అలంబుసునిచేత నిరావంతుఁడు మృతుం డగుట (సం. 6-86-48)

వ. అని యాతని వలను సూపినం గనుంగొని దైతేయనాథుండు. 100

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; ఆతని= ఆ ఇరావంతునియొక్క; వలనున్= ఉన్నవైపును; చూపినన్= చూపించగా; ఆ దైతేయనాథుండు= రాక్షసప్రభువైన ఆ అలంబుసుడు; కనుంగొని.

తాత్పర్యం: దుర్యోధనుడు ఇరావంతుడున్న దిక్కుచూపగా, ఆ అలంబుసుడు చూచి- (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. కడఁగి నడచి మాయ గావింప నయ్యిరా। వంతు నశ్వసేనయంతసేన
పుట్టి వారిమీఁదఁ బురికొని తలపడి। సమయఁ జేసె నదియు సమసె నధిప! 101

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; కడఁగి= ప్రయత్నించి; నడచి= ఆ ఇరావంతుడి సమీపానికిపోయి; మాయన్= రాక్షస మాయను; కావింపన్= చేయగా; ఆ+ఇరావంతున్= ఆ ఇరావంతుడియొక్క; అశ్వసేన+అంత= గుర్రాల సైన్యం ఎంత ఉన్నదో; అంత= ఆ పాటి; సేన= సైన్యం; పుట్టి= ఉప్పతిల్లి; వారిమీఁదన్= ఆ ఇరావంతుడి సైన్యాలమీద; పురికొని= క్రమ్ముకొని; తలపడి= ఎదిరించి; సమయన్+చేసెన్= చంపివేసింది; అదియున్= మాయచేపుట్టిన ఆ సేనకూడా; సమసెన్= నశించింది;

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! ఆ అలంబుసుడు వేగంగా ఆ ఇరావంతుడున్న దిక్కుకు వెళ్ళాడు. తన మాయాబలంతో ఆ ఇరావంతుడి అశ్వసేన ఎంత ఉన్నదో అంత అశ్వసేనను తానూ పుట్టించాడు. మాయతో పుట్టిన ఆ అశ్వసేన ఇరావంతుడి అశ్వసైన్యాన్ని క్రమ్ముకొని, ఎదిరించి చంపివేసింది. తర్వాత ఆ మాయ గుర్రాల దండు కూడా నశించింది.

వ. అయ్యిరావంతుం డొక్కరుండును బొలివోని విక్రమంబున నలంబుసుని మార్కొని రయంబు మెఱయ మెఱుంగు మెఱసినట్లు గవిసి కరవాలంబున విల్లు దునిమిన దనుజుండు వినువీథి కెగసి మాయాశరంబుల నతని నొప్పించినం గోపించి గగనంబునకు లంఘించి. 102

ప్రతిపదార్థం: ఆ+ఇరావంతుండు= ఆ ఇరావంతుడు; ఒక్కరుండునున్= ఒంటరివాడైనప్పటికి; పొలిపోని= వ్యర్థముకాని; విక్రమంబునన్= పరాక్రమంతో; అలంబుసునిన్; మార్కొని= ఎదిరించి; రయంబు= వేగము; మెఱయన్= ప్రకాశింపగా; మెఱుంగు= మెరుపు; మెఱసిన+అట్లు= మెరిసిన విధంగా; కవిసి; కరవాలంబునన్= కత్తితో; విల్లున్= ధనుస్సును; తునిమినన్= తుంచివేయగా; దనుజుండు= రాక్షసుడు; వినువీథికి= ఆకాశమార్గానికి; ఎగసి= ఎగిరి; మాయాశరంబులన్= మాయచే పుట్టిన బాణాలతో; అతనిన్:= ఆ ఇరావంతుణ్ణి; నొప్పించినన్= నొప్పికలిగేటట్లు చేయగా; కోపించి; గగనంబునకున్= ఆకాశానికి; లంఘించి= ఎగిరి.

తాత్పర్యం: ఆ ఇరావంతుడు ఒంటరివాడై పరాక్రమంతో ఆ అలంబుసుడిని ఎదిరించాడు. వేగంగా మెరుపు మెరిసినట్లు ఆ రాక్షసుడిమీద పడ్డాడు. కత్తితో వాడి వింటిని తుంటులు చేశాడు. అప్పుడు అలంబుసుడు ఆకాశానికి ఎగిరిపోయి, మాయాబాణాలు అతడిపై గుప్పించి, నొప్పించాడు. ఇరావంతుడు కూడా కోపంతో ఆకాశానికి ఎగిరి.

క. **ఘనఖడ్గంబున వానిం । దునుమ నలంబుసుఁడు దోడుతో నుజ్జ్వల యౌ**
వనరూపము గ్రొత్తగఁ గై । కొని పెనఁగంబెనఁగఁ బార్థుకొడు కచలుం డై. 103

ప్రతిపదార్థం: పార్థుకొడుకు= అర్జునుడి కొడుకు ఇరావంతుడు; ఘనఖడ్గంబునన్= గొప్ప కత్తితో; వానిన్= ఆ అలంబుసుడిని; తునుమన్= నరికివేయగా; అలంబుసుఁడున్= రాక్షసుడు; తోడుతోన్= వెనువెంటనే; ఉజ్జ్వలయౌవన రూపమున్= ప్రకాశిస్తున్న యౌవనంతో కూడిన రూపాన్ని; క్రొత్తగన్= నూతనంగా; కైకొని= తీసికొని (గ్రహించి); పెనఁగన్= చుట్టుకొని యుద్ధంచేయగా; అచలుండు+ఐ= (ఇరావంతుడు) కదలికలేనివాడై; పెనఁగన్+పెనఁగన్= యుద్ధంచేయగా.

తాత్పర్యం: ఇరావంతుడు బలమైన కత్తితో అలంబుసుడిని నరికివేశాడు. వాడు వెంబడివెంబడిగానే ప్రకాశిస్తుండే యౌవనరూపాన్ని అప్పటికప్పుడు కొత్తగా పొంది, యుద్ధం చేశాడు. ఇరావంతుడుకూడా స్థిరంగా నిలబడి యుద్ధంచేస్తుండగా.

క. **జననీవంశంబునఁగల । యనుపమమాయానుభావ మాత్మఁ దలఁచి శే**
షునిచందంబగు రూపం । బునఁ బేర్చి యనేక నాగపుంజముతోడన్. 104

ప్రతిపదార్థం: జననీవంశంబునన్= తల్లియొక్కవంశంలో; కల= ఉన్నటువంటి; అనుపమ= సాటిలేని; మాయా= ఇంద్రజాలవిద్యలయొక్క; అనుభావము= ప్రభావాన్ని; ఆత్మన్= మనస్సులో; తలఁచి= తలచుకొని; అనేకనాగపుంజముతోడన్= అనేకములైన నాగులయొక్క సమూహముతోకూడా; శేషుని= ఆదిశేషునియొక్క; చందంబు+అగు= విధమైన; రూపంబునన్= ఆకారంతో; పేర్చి= అతిశయించి.

తాత్పర్యం: ఆ ఇరావంతుడు తనతల్లియొక్క నాగవంశంలో ఉండే సాటిలేని ఇంద్రజాల విద్యల ప్రభావాన్ని మనసులో తలచుకొన్నాడు. వెంటనే చాలా నాగుల సమూహంతో ఆదిశేషుడి మాదిరి రూపాన్ని ధరించి.

చ. **అడరిన దానవుండు గరు డాకృతిఁ గైకొని మాయతోడ లోఁ**
బడ భుజగంబులం బొదివి పట్టి రయంబున మ్రింగి యప్డు చే
డ్పడు నరుపట్టి కంఠముఁ గృ పాణమునం దెగవ్రేయ మేదినిం
బడి మొగ మొప్పెఁ బూర్ణశశి భాతి వికారము లేని చెన్నునన్. 105

ప్రతిపదార్థం: అడరినన్= (ఇరావంతుడు) విజృంభించగా; దానవుండు= అలంబుసుడు; గరుడ+ఆకృతిన్= గరుత్మంతునియొక్క ఆకారంవంటి ఆకారాన్ని; కైకొని= గ్రహించి; మాయతోడన్= ఇంద్రజాలంచేత; లోన్+పడన్= అధీనంకాగా; భుజగంబులన్= సర్పాలను; పొదివి= క్రమ్ముకొని; పట్టి= పట్టుకొని; రయంబునన్= వేగంగా; మ్రింగి= తిని; అప్డు= ఆ సమయంలో; చేడ్పడు= బాధపడుతున్న; నరుపట్టి కంఠము= ఇరావంతునియొక్క మెడను; కృపాణమునన్= కత్తితో; తెగన్+వ్రేయన్= నరికివేయగా; మేదినిన్= నేలమీద; పడి; వికారములేని= రూపముయొక్క మారుపాటులేనట్టి; చెన్నునన్= అందంతో; పూర్ణశశిభాతిన్= పున్నమినాటి చంద్రుడువలె; ఒప్పెన్= (అతడి ముఖం) ఒప్పింది.

తాత్పర్యం: ఆ ఇరావంతుడు నాగులగుంపుతో అలంబుసుడిమీదికి ఉరికాడు. అప్పుడు ఆ రాక్షసుడు గరుత్మంతుడి ఆకారం ధరించి, ఇంద్రజాలంతో వాటిని అధీనంలోనికి తెచ్చుకొని, పట్టుకొని, అన్ని పాములనూ తిన్నాడు. అప్పుడు ఇరావంతుడు కొంచెం ఇరుకున పడ్డాడు. ఆ సమయం కనిపెట్టి రాక్షసుడు ఇరావంతునిమెడ నరికివేశాడు. అతడి తల నేలపైబడింది. అయినా ఆ ఇరావంతుడి ముఖానికి చావు కళపట్టకుండా కళకళలాడుతూ పున్నమిచంద్రుడివలె ప్రకాశిస్తూనే ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ.

వ. **అంత వియత్తలం బుదాత్తమిహిరమండలమండితమధ్యం బయ్యె నని చెప్పిన విని ధృతరాష్ట్రుం డయ్యిరావంతుండు వడినం బాండవులును వారి యోధవీరులును జేసిన తెఱంగు సెప్పు మనవుడు సంజయుఁ డతని కిట్లనియె.** **106**

ప్రతిపదార్థం: అంతన్= ఆ సమయంలో; వియత్+తలంబు= ఆకాశము; ఉదాత్త= గొప్పదైన; మిహిర= సూర్యునియొక్క; మండల= మండలంచేత; మండిత= అలంకరింపబడిన; మధ్యంబు+అయ్యెన్= మధ్యభాగం కలిగినదైనది; అని చెప్పినన్= అని చెప్పగా; ధృతరాష్ట్రుండు; ఆ+ఇరావంతుండు= ఆ అర్జునుడి కొడుకు; పడినన్= చావగా; పాండవులును= పాండురాజు కొడుకులున్నూ; వారి= ఆ పాండవ పక్షానికి చెందిన; యోధవీరులును= భటులు, శూరులు; చేసిన= నిర్వహించిన; తెఱంగు= విధానమును; చెప్పుము= తెలియ చెప్పుము; అనవుడున్= అనగా; సంజయుఁడు; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఇట్లు అనియెన్.

తాత్పర్యం: 'ఆ ఇరావంతుడు చచ్చిన సమయంలో మిట్టమధ్యాహ్నమైంది' అని సంజయుడన్నాడు. ధృతరాష్ట్రుడు 'ఇరావంతుడు చచ్చిన పిదప ఆ పాండవులు, వారి భటులు వీరులు అంతా ఏమి చేశారో చెప్పు' అని అడిగాడు సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా చెప్పాడు.

శా. **తోడంబుట్టువుపాటు సూచి యలుకన్ దుర్వారశుం భద్గతిన్**
హైడింబుండు, మహాసురేంద్రులు గజేం ద్రారూఢు లై సంగర
క్రీడాలోలతఁ దన్ను మీఱి విలయా గ్నింబోల దిక్చక్ర మ
ల్లాడన్ బెట్టుగ నార్చి చొచ్చెఁ గురు సై న్యంబున్ మహోగ్రంబుగన్. **107**

ప్రతిపదార్థం: తోడన్+పుట్టువు= తోడపుట్టిన వాడైన ఇరావంతుడి యొక్క; పాటు= చావు; చూచి; అలుకన్= కోపంతో దుర్వార శుంభత్+గతిన్= అడ్డగించలేని చాకచక్యంతో కూడిన పోకడతో; హైడింబుండు= హిడింబ కొడుకైన ఘటోత్కచుడు; గజ+ఇంద్ర+ఆరూఢులు+ఐ= గొప్ప ఏనుగులను ఎక్కినవారై; మహా+అసుర+ఇంద్రులు= గొప్ప రాక్షస శ్రేష్ఠులూ; సంగర క్రీడాలోలతన్= యుద్ధమనే ఆటలోని ఆసక్తిచేత; తన్నున్+మీఱి= ఆ ఘటోత్కచుడిని కూడా అతిక్రమించి; దిక్+చక్రము= దిక్కులయొక్క మధ్యభాగము; అల్లాడన్= కదలిపోవునట్లుగా; బెట్టుగన్= (వారి అండతో) బిగ్గరగా; ఆర్చి= బొబ్బలుపెట్టి; విలయ+అగ్ని+పోలన్= ప్రళయాగ్నిని పోలి; మహా+ఉగ్రంబుగన్= చాలా భయంకరంగా; కురుసైన్యంబున్= కౌరవుల సైన్యంలోకి; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: సోదరుడు మరణించటం చూచి ఘటోత్కచుడు కోపించి అనివార్యమైన వేగంతో ముందుకు వచ్చాడు. అతడి అనుయాయులైన రక్కసులు ఏనుగుల నెక్కి యుద్ధ క్రీడోత్సాహంతో అతడిని తలకడచి ప్రళయాగ్నివలె భాసించాడు. దిక్కులల్లాడగా పెడబొబ్బలు పెట్టుతూ కురుసైన్యంలోకి ఘటోత్కచుడు చొరబడ్డాడు.

చ. **కరమున నున్న శూలమునఁ గ్రమ్ముమెఱుంగులు శత్రు సైన్య భీ**
కరములుగా గజాశ్వభట కాయములన్ గుదిగ్రుచ్చినట్లుగాఁ
జెరువుచు వచ్చువానిఁ గురు సింహుఁడు సూచి మదాంధసింధురో
త్కరరభసాతిభీషణముగాఁ గవిసెం బటువిక్రమోద్ధతిన్. **108**

ప్రతిపదార్థం: కురుసింహుఁడు= దుర్యోధనుడు; కరమునన్= చేతియందు; ఉన్న= పట్టుకొని ఉన్నట్టి; శూలమునన్; క్రమ్ము= పైకి ఉబుకుచున్న; మెఱుంగులు= కాంతులు (తళతళలు); శత్రుసైన్య భీకరములు+కాన్= విరోధుల సైనికులకు భయంకలిగించేవికాగా;

గజ= ఏనుగుల యొక్కయు; అశ్వ= గుర్రాల యొక్కయు; భట= భటులయొక్కయు; కాయములన్= దేహాలను; గుదిగ్రుచ్చిన+అట్లుగాన్= వరుసగా పూలుగ్రుచ్చిన దండవలె; చెరువుచున్= (శూలానికి) గ్రుచ్చుకొంటూ; వచ్చువానిన్= వస్తున్న ఘటోత్కచుణ్ణి; చూచి= తిలకించి; మద= మదంచేత; అంధ= గుడ్డిదైన; సింధుర= ఏనుగుల యొక్క; ఉత్కర= సమూహముయొక్క; రభస= వేగంవంటి వేగంతో; అతిభీషణముగాన్= చాలా భయంకరంగా; పటువిక్రమ+ఉద్ధతిన్= నేర్పుగల పరాక్రమంవల్ల కలిగిన గర్వంతో; కవిసెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: ఘటోత్కచుడు చేత శూలంపట్టుకొని యుద్ధంలోకి ఉరికాడు. ఆ శూలము నుండి పైకి వచ్చిన తళతళకాంతులు శత్రుసైనికులకు చాలా భయం కలిగించాయి. ఆ ఘటోత్కచుడు తన శూలానికి ఏనుగుల, గుర్రాల, భటుల దేహాలను వరుసగా ఒకదారంలోనికి రకరకాల పూలను గ్రుచ్చినట్లుగా గ్రుచ్చుకొంటూ వచ్చాడు. దుర్యోధనుడు ఈ రాక్షసుణ్ణి చూశాడు. మదం పట్టడంవల్ల ముందు వెనుకలు తెలియని ఏనుగుల గుంపువలె మిక్కిలి వేగంతో నేర్పుగల పరాక్రమంచేత చాలా ఉద్ధతితో దుర్యోధనుడు వాని నెదుర్కొన్నాడు.

క. వంగాధిపతియు శౌర్యో । త్తుంగతనుండగుచు నీసుతుం డలరఁగ దై
త్యుం గదిసె గాఢమద మా । తంగ ఘటలతోడ నపుడు దారుణభంగిన్. 109

ప్రతిపదార్థం: నీ సుతుండు= నీ కొడుకు దుర్యోధనుడు; అలరఁగన్= సంతోషపడగా; అపుడు= ఆ సమయంలో; వంగ+అధిపతియున్= వంగదేశపురాజు; శౌర్య+ఉత్తుంగ తనుండు= పరాక్రమంచేత పొడుగుసాగిన శరీరంగలవాడు; అగుచున్= అయి; గాఢ= దట్టమైన; మద= మదంకలిగినట్టి; మాతంగ= ఏనుగులయొక్క; ఘటలతోడన్= గుంపులతో; దారుణభంగిన్= భయంకరమైన విధంగా; దైత్యున్= ఘటోత్కచుడిని; కదిసెన్= సమీపించాడు - ఎదురుకొన్నాడు.

తాత్పర్యం: నీ కొడుకు సంతోషపడుతూండగా వంగదేశరాజు శౌర్యంచేత ఒళ్ళుపెంచుకొని, బాగా మదించినట్టి ఏనుగుల గుంపుల సహాయంతో, శత్రువులకు చాల భయం కలిగే విధంగా- ఆ రాక్షసుడైన ఘటోత్కచుడి సమీపానికి చేరాడు.

వ. ఇట్లు దన్ను బెట్టు గిట్టిన కరినికరంబులం గని పొంగి కరవాలంబు గొని యడరి ఘటోత్కచుండు. 110

ప్రతిపదార్థం: ఘటోత్కచుండు= రాక్షసుడైన ఘటోత్కచుడు; ఇట్లు= ఈ విధంగా; తన్నున్= తనను (ఘటోత్కచుడిని); బెట్టు= అధికంగా; కిట్టిన= సమీపించిన; కరినికరంబులన్= ఏనుగుల గుంపులను; కని; పొంగి= గర్వపడి; కరవాలంబున్= కత్తిని; కొని; అడరి= విజృంభించి.

తాత్పర్యం: ఆ ఘటోత్కచుడు తనను సమీపించిన ఏనుగుల గుంపును చూశాడు. గర్వంతో కత్తి చేతపట్టుకొని, చెలరేగి వాటిపైకి దూకి. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: ఘట+ఉత్+కచుడు- ఘటోత్కచుడు (కుండమాదిరిగా పైకి లేచిన వెంట్రుకలు కలవాడు) భీముడి వలన హిడింబ అనే రాక్షసి గర్భంలో జనించినవాడు.

క. కరదంతకర్ణమస్తక । చరణములవి తోఁపకుండుచందముగా ని
ష్ఠురవిక్రమకేళీ వి । స్ఫురణంబున రూపుమాపె సురలు నుతింపన్. 111

ప్రతిపదార్థం: సురలు= దేవతలు; నుతింపన్= కీర్తింపగా; కర= తొండాలు; దంత= దంతాలు; కర్ణ= చెవులు; మస్తక= తలలు; చరణములు= కాళ్ళు; అవి; తోఁపకుండు చందముగాన్= తెలియకుండా ఉన్న విధంగా; నిష్ఠుర= కఠినమైన; విక్రమ= పరాక్రమమనెడు; కేళీ= ఆటయొక్క; విస్ఫురణంబునన్= స్ఫూర్తితో; రూపుమాపెన్= చంపాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ ఘటోత్కచుడు కఠోరమైన పరాక్రమంతో అవలీలగా ఆ ఏనుగుల తొండాలు, దంతాలు, చెవులు, తలలు, కాళ్ళు వాటి రూపం తెలియకుండా పోయే విధంగా తునాతునకలుచేశాడు. దేవతలు కూడా ఇతని శౌర్యాన్ని ఎంతో మెచ్చుకొన్నారు.

వ. ఇవ్విధంబున గజంబులు వొలిసిన గజపురనాథుండు రోషంబున నురవడించి నారాచవృష్టి ముంచి వేగవంతుండును, విద్యుజ్జిహ్వుండును, బహ్వాశియు, నను దనుజప్రధాననాయకులం బ్రేతపతిపురంబున కనిచి యా భీమసేన తనయుతనువుననిశాతశరములు నించినం గోదండపాణియై క్రోధాగ్నిజ్వాలలు నిగుడువడువునం బటుబాణజ్వాలలు నిగిడించి కదిసి కురుపతి నవలోకించి యా ఘటోత్కచుం డిట్లనియె. 112

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ పైన చెప్పిన రీతిగా; గజంబులు= ఏనుగులు; పొలిసినన్= చావగా; గజపురనాథుండు= హస్తినాపురమునకు రాజైన దుర్యోధనుడు; రోషంబునన్= కోపంతో; ఉరవడించి= వేగిరపడి; నారాచవృష్టిన్= బాణాలవానలో; ముంచి= ముంచివేసి; వేగవంతుండు, విద్యుజ్జిహ్వుండు, బహ్వాశియున్; అను= అనునట్టి; దనుజ ప్రధాన నాయకులన్= రాక్షసులలో ముఖ్యులైన నాయకులను; ప్రేతపతి పురంబునకున్= యమధర్మరాజు నగరానికి; అనిచి= పంపి; ఆ భీమసేనతనయు తనువునన్= ఆ భీముడి కొడుకైన ఘటోత్కచు శరీరంలో; నిశాతశరంబులున్= పదునుగల బాణాలను, నించినన్= నిండచేయగా; అతండు= ఆ ఘటోత్కచుడు; కోదండపాణి+ఐ= విల్లుచేతగలవాడై; క్రోధ+అగ్నిజ్వాలలు= కోపమనే అగ్నియొక్క సెగలు; నిగుడువడువునన్= వ్యాపించే విధంగా; పటు బాణజ్వాలలు= శక్తిగల బాణాల సెగలు; నిగిడించి= వ్యాపించేటట్లుచేసి; కదిసి= దగ్గరకు వచ్చి; కురుపతిన్= దుర్యోధనుడిని; అవలోకించి= చూచి.

తాత్పర్యం: ఈ విధంగా ఘటోత్కచుడు కౌరవసేనలోని ఏనుగులనన్నింటినీ తునుకలు చేశాడు. దీనిని చూచి దుర్యోధనుడు త్వరత్వరగా బాణాలవర్షంలో ముంచి కోపించి, అంతటితో ఊరుకోక వేగవంతుడు, విద్యుజ్జిహ్వుడు, బహ్వాశి అనే ముగ్గురు ప్రముఖులైన రాక్షసులను చంపాడు. ఘటోత్కచుడి శరీరాన్నంతా బాణాలతో నింపేశాడు. అప్పు డా రాక్షసుడు విల్లుచేతపట్టుకొని కోపమనే అగ్నిజ్వాలలు వ్యాపించునట్లు బాణాల కాంతులు ప్రసరింపజేస్తూ దుర్యోధనుడి వద్దకువచ్చి, ఆతడిని చూచి ఇట్లా అన్నాడు.

ఉ. 'పాడియు సత్యముం గలుగు పాండుతనూజుల కీవు దొల్లి యె
ప్పాడిమెయిన్ సభం గరము భంగ మొనర్చితి నాఁటియందఱుం
జూడఁగ నేఁడు తత్ఫలము సూపెద నీ కని మూదలించి మై
నాడఁగ నేసెఁ గృష్ణభుజ గావలిఁ బోలిన నారసంబులన్. 113

ప్రతిపదార్థం: ఈవు= దుర్యోధనుడవైన నీవు; తొల్లి= మునుపు (సభలో); పాడియున్= ధర్మము; సత్యమున్= నిజము చెప్పుటయు; కలుగు; పాండుతనూజులకున్= పాండవులకు; సభన్= కౌరవసభలో; ఏ+పాడిమెయిన్= ఏ మాత్రం న్యాయంతో; కరమున్= మిక్కిలి; భంగము= అవమానము; ఒనర్చితి(వి)= చేశావో; నాఁటి= ఆనాడు సభలోనున్నట్టి; అందఱున్; చూడఁగన్= చూస్తుండగా; నేఁడు= ఈదినం; నీకున్= నీకు; తద్+ఫలమున్= దానియొక్క ఫలాన్ని; చూపెదన్= చూపిస్తాను; అని= అంటూ; మూదలించి= హెచ్చరించి; కృష్ణభుజగ+ఆవలిన్= నల్ల త్రాచులవరుసను; పోలిన= సరిపోలిన; నారసంబులన్= బాణాలను; మైన్= దేహంలో; ఆడఁగన్+ఏసెన్= నాటుకొనేటట్లు వేశాడు.

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! న్యాయం సత్యం కలిగినట్టి పాండవులకు నీవు అనాడు సభలో ఏ న్యాయంతో ఎంతగా అవమానం కలిగించావో, ఆనాడు సభలో ఉండినవారంతా ఈనాడు ఇక్కడ చూస్తూ ఉండగా దానిఫలాన్ని నీకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చూపిస్తాను' అని హెచ్చరిస్తూ నల్లత్రాచుపాముల వరుసతో సమానాలైన బాణాలతో ఆ దుర్యోధనుడి శరీరాన్నంతా నింపివేశాడు.

క. ' దానికిఁ జల మెడలక నీ । సూనుం డా పవనసూనుసూనునిమేనం
దా నుగ్రశరము లిరువది । యేను వెసం గీలుకొలిపె నిభపురనాథా! 114

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= హస్తినాపురానికి రాజైన ధృతరాష్ట్రా!; నీ సూనుండు= నీ కొడుకు దుర్యోధనుడు; దానికిన్= ఆ ఘటోత్కచుడు వేసిన బాణాలకు; చలము= మత్సరము; ఎడలక= వదలిపెట్టకుండా; ఆ పవనసూను సూనునిమేనన్= ఆ భీముడి కొడుకైన ఘటోత్కచుడి శరీరంమీద; తాన్= తాను (దుర్యోధనుడు); ఇరువది+ఏను= ఇరవై అయిదు; ఉగ్రశరములు= భయంకలిగించే బాణాలు; వెసన్= వేగంతో; కీలుకొలుపెన్= నాటినాడు.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ కొడుకు దుర్యోధనుడు- ఆ ఘటోత్కచుడు వేసిన కరుకైన బాణాలకు జంకిపోకుండా, మాత్సర్యాన్ని వదలకుండా, అతడి దేహంలో నాటుకొనేటట్లుగా ఇరవై అయిదు బాణాలు వెంటనే ప్రయోగించాడు.

తే. అసుర కినిసి కృతాంతజిహ్వాయునుబోని । శక్తి యెత్తిన న మ్మహీశ్వరున కపుడు
వంగపతి యడ్డపడుటయు వానిగజముఁ । గూల వైచిన నాతండు నేల కుఱికె. 115

ప్రతిపదార్థం: అసుర= రాక్షసుడు- ఘటోత్కచుడు; కినిసి= అలిగి; కృతాంతజిహ్వాయునున్ పోని= యమధర్మరాజు నాలుకను పోలిన; శక్తి= శక్తి అనే ఆయుధాన్ని; ఎత్తినన్= ఎత్తుకోగా; అపుడు; ఆ+మహీశ్వరునకున్= ఆ దుర్యోధనుడికి; వంగపతి= వంగదేశపురాజు; అడ్డపడుటయున్= అడ్డం తగలగా; వానిగజమున్= ఆ వంగదేశపురాజు ఏనుగును; కూలవైచినన్= పడిపోయేట్టుకొట్టగా; ఆతండు= ఆ వంగదేశరాజు; నేలకున్= భూమిమీదికి; ఉఱికెన్= దూకాడు.

తాత్పర్యం: ఘటోత్కచుడు మహాకోపంతో దుర్యోధనుడిమీద పడవేయటానికి యముడి నాలుకమాదిరి భయంకరమైన శక్త్యాయుధాన్ని ఎత్తాడు. ఇంతలో దుర్యోధనుడికి అడ్డంగా వంగదేశరాజు రాగా, అతడి ఏనుగును రాక్షసుడు దానితో కూల్చాడు. వంగదేశరాజు నేలకు దూకాడు.

విశేషం: అలం: ఉపమ.

క. ఏనుంగు వడిన నచ్చటి । సేనలు దెరలుటయు రాజసింహుఁడు దన్నుం
దాన పురికొల్పికొని వెఱ । పూనక దానవునియెదుర నొక్కడ నిలిచెన్. 116

ప్రతిపదార్థం: ఏనుంగు= ఏనుగు; పడినన్= పడిపోగా; అచ్చటిసేనలు= అక్కడవుండే సైన్యాలు; తెరలుటయున్= తొలగిపోగా; రాజసింహుఁడున్= రాజుల్లో గొప్పవాడు దుర్యోధనుడు; తన్నున్= తనను; తాను+అ= తానే; పురికొల్పికొని= ప్రోత్సాహపరచికొని; వెఱపున్= భయాన్ని; ఊనక= పొందక; దానవుని= ఘటోత్కచుడియొక్క; ఎదురన్= సమక్షంలో; ఒక్కఁడు+అ= ఒంటరివాడుగానే; నిలిచెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: వంగపతి ఏనుగు నేలకూలటంతో కౌరవసేనలు భయంతో పెద్దపెట్టున అరిచాయి. దుర్యోధనుడు తన్నుతానే ప్రోత్సాహపరచికొన్నాడు. (అక్కడ వేరేవీరులు) ప్రోత్సాహపరచే వారులేరన్నమాట- అతడు భయంలేకుండా తాను ఒక్కడే వాడియెదుట నిల్చి ఎదుర్కొన్నాడు.

క. నిలిచి మహాస్త్రం బెఱ మం। టలు గ్రమ్మఁగఁ బెలుచ నేయుటయు నడుమన చె
క్కలు గాఁగ నేసి దిక్కులు। నలిగులిగా నతఁడు సింహనాదము సేసెన్. 117

ప్రతిపదార్థం: నిలిచి= నిలబడి; ఎఱమంటలు= ఎఱ్ఱటి జ్వాలలు; క్రమ్మఁగన్= వ్యాపించగా; పెలుచన్= కోపంతో; మహా+అస్త్రంబు= గొప్ప ఆయుధాన్ని; ఏయుటయున్= ప్రయోగించగా; అతఁడు= ఆ ఘటోత్కచుడు; నడుమన= మధ్యలోనే; చెక్కలు+కాఁగన్= చెక్కలయ్యేటట్లుగా; ఏసి= కొట్టి; దిక్కులు= అన్ని దిక్కులు; నలిగులిగాన్= పిక్కటిల్లేట్టుగా; సింహనాదము= సింహగర్జనాన్ని; చేసెన్= చేసినాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఘటోత్కచుడికి ఎదురుగా నిలబడి, ఎఱ్ఱటి జ్వాలలు అంతటా వ్యాపించే ఒక గొప్ప ఆయుధాన్ని మహాకోపంతో వాడిమీదకు విసిరాడు. వాడు ఆ ఆయుధాన్ని మధ్యలోనే ముక్కలుచెక్కలుచేసి, దిక్కులు పిక్కటిల్లేటట్లుగా సింహంవలె గర్జించాడు.

వ. ఇట్లు సేసిన విని గాంగేయుండు గురుపక్షయోధవీరులం గలయం గనుంగొని. 118

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సేసినన్= సింహనాదం చేయగా; గాంగేయుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; కురుపక్షయోధవీరులన్= కౌరవుల పక్షంలో ఉండేభటులను, శూరులను; కలయన్= అంతటను; కనుంగొని.

తాత్పర్యం: భీష్ముడు ఘటోత్కచుడు చేసిన సింహనాదాన్ని విని, కౌరవపక్షంలోని భటులను, శూరులను తేరిపారచూచి (ఇట్లా అన్నాడు).

క. ' భీముని తనయుం డత్యు। ద్దామగతిన్ రాజుఁ దొడరి తత్కరటిఘటా
స్తోమంబు గూల్చి యాతని। పై మారిమసంగినట్లు బలువిడిఁ గవిసెన్. 119

ప్రతిపదార్థం: భీముని తనయుండు= భీమునియొక్క కొడుకు- ఘటోత్కచుడు; అతి+ఉద్దామగతిన్= హద్దులేని విధంగా; రాజున్= దుర్యోధనుడిని; తొడరి= వెంబడించి; తద్+కరటి ఘటాస్తోమంబున్= ఆ దుర్యోధనుడియొక్క గున్నఏనుగుల గుంపును;కూల్చి= చంపి; ఆతనిపైన్= ఆ దుర్యోధనుడి మీదికి; మారిమసంగినట్లు= మరణదేవత విజృంభించినట్లుగా; బలువిడిన్= అధికంగా; కవిసెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: 'ఘటోత్కచుడు చాలా ఉద్ధతుడై, దుర్యోధనుడిని ఎదుర్కొని అతడి ఏనుగుగున్నల గుంపును చంపి, మహామారి మాదిరి రాజుపైకి ఎగబడ్డాడు

వ. 'ఆ ఘటోత్కచుండు దివిజులకు దుర్జయుండు' మీరు వేవేగ రారాజుం గూడికొనుం డనిన, సేనాపతి పలుకులకు గురుకృపాశ్వత్థామచిత్రసేనులు, బృహద్బల బాహ్లికావంతీనాథభూరిశ్రవసులును, సైంధవసోమదత్త వివింశతివికర్ణులు నేకోద్యోగంబునం దమతమ యనుచరు లైన యోధవీర సహస్రంబులతో రథంబులు దోలికొని చని భవత్తనయుం బరివేష్టించి హిడింబాతనయుం దాఁకిన నతండును దైతేయ బలంబులంగొని బలిమి మెఱసి నిలిచి మార్కొనియె, నారెండు సైన్యంబులు నొండొంటి కెదిర్చి పేర్చి పెనంగుచుండ నా భీమసేన నందనుం డాచార్య ప్రభృతులగు నా పన్నిద్దఱపై బహుప్రకార క్రూరబాణంబులు వరఁగింప నందు. 120

ప్రతిపదార్థం: ఆ ఘటోత్కచుండు; దివిజులకున్= దేవతలకు కూడా; అజయ్యుండు= జయింపరానివాడు; మీరు; వేవేగన్= మిక్కిలి వేగంగా; రారాజున్= దుర్యోధనుడిని; కూడికొనుండు= చేరుకొనండి; అనినన్= అని చెప్పిన; సేనాపతిపలుకులకున్=

సేనాధిపతియైన భీష్ముడి మాటలకు; గురు కృప+అశ్వత్థామ, చిత్రసేనులు; బృహద్బల బాహ్లిక; అవంతీనాథ; భూరిశ్రవసులును, సైంధవ; సోమదత్త; వివింశతి; వికర్ణులు; ఏక+ఉద్యోగంబునన్= ఒకేవిధమైన ప్రయత్నంతో; తమ తమ= వారి వారికి; అనుచరులు+ఐన= సహాయపడేవారైన; యోధవీర సహస్రంబులతోన్= వేలకొలది భటులయొక్క; వీరులయొక్క; రథంబులు= రథాలను; తోలికొని; చని= వెళ్లి; భవత్+తనయున్= నీ కుమారుడు దుర్యోధనుణ్ణి; పరివేష్టించి= చుట్టుకొని; హిడింబా తనయున్= హిడింబ కొడుకు ఘటోత్కచుణ్ణి; తాఁకినన్= ఎదుర్కొనగా; అతండును= ఆ ఘటోత్కచుడున్నూ; దైతేయబలంబులన్= రాక్షస బలగాన్ని; కొని= తీసుకొని; బలిమిన్= దేహబలంతో; మెఱసి= ప్రకాశించి; నిలిచి= నిలబడి; మార్కొనియెన్= ఎదిరించాడు; ఆ రెండు సైన్యంబులున్= ఆ రెండు సేనలున్నూ; ఒండొంటికిన్= ఒకదానికొకటి; ఎదిర్చి= ఎదిరించి; పేర్చి= అతిశయించి; పెనంగుచుండన్= యుద్ధంచేస్తుండగా; ఆ భీమసేననందనుండు= ఆ భీముడి కొడుకు; ఆచార్య ప్రభృతులు+అగు= ద్రోణాచార్యుడు మున్నుగాగల; ఆ పన్నిద్దఱపైన్= ఆ పన్నెండుమందిమీద; బహు ప్రకార= నానా విధాలైన; క్రూర= కఠోరాలైన; బాణంబులు= బాణాలను; పరఁగింపన్= ప్రయోగింపగా; అందున్= ఆ యుద్ధంలో.

తాత్పర్యం: 'ఘటోత్కచుడు దేవతలకుకూడా జయింపరానివాడు, మీరందరూ అతిత్వరగా వెళ్ళి, దుర్యోధనుడికి సాయపడండి' అని సేనాపతి భీష్ముడన్నాడు. ఆ మాటలు విని ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, చిత్రసేనుడు, బృహద్బలుడు, బాహ్లికుడు, అవంతీనాథుడు, భూరిశ్రవసుడు, సైంధవుడు, సోమదత్తుడు, వివింశతి, వికర్ణుడు- వీరందరూ ఒకే ఎత్తున తమకు సహాయులైన అనేక వీరులతో, భటులతో, రథాలు కదిలించికొనిపోయి , దుర్యోధనుడిని గుండ్రంగా చుట్టుకొని, ఆ రాక్షసుడిని ఎదిరించారు. వాడు కూడా తన రాక్షసబలాన్ని వెంట వేసికొని బలంతో దేదీప్యమానుడై ఎదురొడ్డి నిలిచి యుద్ధంచేశాడు. అప్పు డారెండు సైన్యాలు ఒకదాన్నిమించి మరొకటి పోటీపడి ఎదిరిస్తూ విజృంభించుతూ యుద్ధం చేస్తూ ఉండగా, ఆ ఘటోత్కచుడు ద్రోణుడు ప్రధానుడుగా ఉండే ఆ పన్నెండుమంది వీరులపైన పలురకాల క్రూరములైన బాణాలను ప్రయోగించాడు. ఆ యుద్ధంలో.

విశేషం: సేనాపతి-భీష్ముడు- సేనాపతి లక్షణాలు-

శ్లో॥ కులీనః శీలసంపన్నో ధనుర్వేద విశారదః।
హస్తి శిక్షాశ్వశిక్షాసు కుశలః శ్లక్ష్ణ భాషణః॥
నిమిత్తే శకునజ్ఞానే, వేత్తాచైవ చికిత్సితే।
కృతజ్ఞః కర్మణాం శూరః తథాక్లేశ సహోఋజుః॥
వ్యూహతత్త్వ విధానజ్ఞః ఫల్గుసారవిశేషవిత్।
రాజ్ఞాసేనాపతిః కార్యోబ్రాహ్మణః క్షత్రియోథవా॥ మాత్స్యే రాజ ధర్మే.

శ్లో॥ గౌతమాన్మిథునం జజ్ఞే శరస్తంబాచ్ఛరద్వతః।
అశ్వత్థామ్నశ్చ జననీ కృపశ్చైవ మహాబలః"॥ (మహాభారతం)

కృపుడు గౌతమవంశానికి చెందిన శరద్వంతుడి కొడుకు. శంతనునిచే కృపతో కాపాడబడ్డాడు కాబట్టి కృపాచార్యుడనే పేరు వచ్చింది. ఇతడు జీవితపర్యంతం బ్రహ్మచారిగా ఉండిపోయాడు. కురుబాలకులకు ఆచార్యుడుగా భీష్మాదులచేత నియోగింపబడ్డాడు. పాండవులను బాగా ఎదుర్కొన్నాడు. కాని అమరత్వం కలిగిన, కారణంచేత యుద్ధంలో ఇతడు చనిపోలేదు.

అశ్వత్థామ= ద్రోణుడి కొడుకు. చిరంజీవి- మహారథుడు. ఇతడు పుట్టగానే గుఱ్ఱం మాదిరి శబ్దించాడు. కనుకనే అశ్వత్థామ అనే పేరు వచ్చింది.

శ్లో. అలభత్ గౌతమీ పుత్రం అశ్వత్థామానమేవచ ।
స జాతమాత్రో వ్యనదత్, యథైవోచ్చైఃశ్రవాహయః॥
"తత్ శ్రుత్వాంతర్హితంభూతం అంతరిక్షస్థ మబ్రవీత్।
అశ్వస్యేవాస్యయత్ స్థామ నదతః ప్రదిశో గతమ్॥
అశ్వత్థామైవబాలోzయం, తస్మాన్నామ్నా భవిష్యతి॥ (భారతం)

చిత్రసేనుడు= ధృతరాష్ట్రుడి కొడుకు- అతడి కొడుకులలో నలుగురు- దుర్యోధనుడు, దుశ్శాసనుడు, వికర్ణుడు, చిత్రసేనుడు ప్రధానులైనవారు.

ఘటోత్కచుండు ద్రోణాచార్యప్రభృతులతో యుద్ధంబు సేయుట (సం. 6-88-25)

క. కొందఱసూతులు వొలిసిరి । కొందఱిచాపములు దునిసెఁ గొందఱ చటుల
స్యందనహయాలి వడియెను । గొందఱ యంగములు వ్రస్సెఁ గురుకులముఖ్యా! 121

ప్రతిపదార్థం: కురుకులముఖ్యా!= కురు వంశంలో ప్రధానుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; కొందఱ సూతులు= కొంతమంది రథికుల సారథులు; పొలిసిరి= చచ్చారు; కొందఱ చాపములు= కొంతమంది విలుకాండ్ర ధనుస్సులు; తునిసెన్= విరిగిపోయాయి; కొందఱ= మరికొందరియొక్క; చటుల+స్యందన+హయ+ఆలి= చంచలమైన రథాలు, గుర్రాలు- వీటియొక్క వరుస; పడియెన్= కింద పడిపోయాయి; కొందఱ అంగములు= ఇంకా కొందరి శరీరాలు; వ్రస్సెన్= బద్దలయ్యాయి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ ఘటోత్కచుడు ద్రోణుడాదిగాగల పన్నెండుగురితో యుద్ధం చేసేటప్పుడు, కొందరి సారథులు చచ్చారు. మరికొందరి ధనుస్సులు విరిగిపోయాయి. ఇంకా కొందరి రథాలు, గుర్రాలు కూలిపోయాయి. కొందరి శరీరాలే బద్దలైపోయాయి.

వ. ఇ ట్లతిరథమహారథులం జిక్కుపఱిచినరక్కసున కలిగి రయంబున సాధనంబులు సమకట్టికొని రభసంబున నాకుంభసంభవాది ద్వాదశ రథికవరులు నొక్కపెట్ట చుట్టుముట్టి మహాస్త్రజ్వాలా జాలంబులం బొదివిన. 122

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అతిరథమహారథులన్= అతిరథులను, మహారథులను; చిక్కు+పఱిచిన= తంటాలుపెట్టిన; రక్కసునకున్= రాక్షసుడికి; ఆ కుంభసంభవ+ఆది ద్వాదశరథికవరులున్= ద్రోణుడు మొదలుగాగల పన్నెండుమంది రథిక శ్రేష్ఠులు; అలిగి= కోపగించి; రయంబునన్= తొందరగా; సాధనంబులున్= పనిముట్లను; సమకట్టికొని= సమకూర్చుకొని; రభసంబునన్= వేగంతో; ఒక్క పెట్ట= ఒకేసారిగా; చుట్టుముట్టి; మహా+అస్త్రజ్వాలాజాలంబులన్= గొప్పవగు ఆయుధాలనే మంటల సమూహంతో; పొదివినన్= కవియగా.

తాత్పర్యం: ఘటోత్కచుడు కౌరవసైన్యాన్ని చీల్చి చెండాడుతూ, అతిరథమహారథులను కూడా చిక్కుపరిచాడు. అప్పుడు ద్రోణుడు మొదలుగాగల పన్నెండుగురు చాలా కోపపడి, వెంటనే యుద్ధసామగ్రినంతా బాగా సమకూర్చికొని ఒక్కుమ్మడిగా అతడి చుట్టూచేరి, గొప్ప అస్త్రాలనే అగ్నిజ్వాలలను అతడిపై కురిపించుతూ ఎదిరించారు.

విశేషం: మహారథుడు- "ఆత్మానం, సారథించాశ్వాన్ రక్షన్ యుధ్యేత యో నరః। సమహారథ సంజ్ఞః స్యాత్"

ఆ. ఓర్వరాక దానవోత్తముఁ డంబర । వీథి కెగసి పోయి విపులరవము
సెలఁగఁ బెలుచ నడరి జీమూత భంగి దు । ర్దాంతుఁడైనఁ జూచి ధర్మసుతుఁడు. 123

ప్రతిపదార్థం: దానవ+ఉత్తముఁడు= రాక్షసుల్లో శ్రేష్ఠుడు ఘటోత్కచుడు; ఓర్వరాక= తట్టుకోలేక; అంబరవీథికిన్= ఆకాశమార్గానికి; ఎగసిపోయి= ఎగిరిపోయి; విపులరవము= అధికమైనశబ్దము; చెలఁగన్= మ్రోయగా; పెలుచన్= ఆగ్రహంతో; జీమూతభంగిన్= మేఘంమాదిరి; అడరి= వ్యాపించి; దుర్+దాంతుఁడు+ఐనన్= అడచరానివాడు కాగా; ధర్మసుతుఁడు= ధర్మరాజు; చూచి.

తాత్పర్యం: ద్రోణాది మహావీరులు ప్రయోగించిన బాణాల దెబ్బకు తట్టుకోలేక ఘటోత్కచుడు ఆకాశంలోకి ఎగిరాడు. చాల కఠోరంగా పెనుబొబ్బలు పెట్టుతూ, మేఘంమాదిరి ఆకాశాన్ని ఆవరించి అణచరానివా డయ్యాడు. అప్పుడు ధర్మరాజు చూచి (భీముడితో ఇట్లా అంటున్నాడు).

వ. భీమసేనుతో నిట్లనియె నిక్కడ భీష్ముబారిం బడిన పాంచాల బలంబులఁ బరిపాలింపను, నక్కడ నాచార్యాదుల కగపడ్డ ఘటోత్కచుం గావను వలసియున్నయది యివ్వలనికిం గవ్వడి గలం డవ్వలనికి వేగంబ యరుగు మనిన సింహనాదంబు సేయుచు. 124

ప్రతిపదార్థం: భీమసేనుతోన్= భీముడితో; ఇట్లు; అనియెన్= అన్నాడు; ఈ+కడన్= ఈ చోటున; భీష్ముబారిన్= భీష్ముడి నిర్బంధంలో; పడిన= కంటబడిన పాంచాలబలంబులన్= పాంచాలరాజు సేనలను;పరిపాలింపనున్= కాపాడడానికి; ఆ+కడన్= ఆచోట; ఆచార్య+ఆదులకున్= ద్రోణుడు మొదలైన వారికి; అగపడ్డ= కనుపించిన; ఘటోత్కచున్; కావను= రక్షించును; వలసియున్నది= అవసరమైయున్నది; ఈ+వలనికిన్= ఈ వైపునకు; కవ్వడి= అర్జునుడు; కలండు= ఉన్నాడు; ఆ+వలనికిన్= ఆ పక్కకు; వేగంబు+అ= తొందరగా; అరుగుము= వెళ్లుము; అనినన్= అని చెప్పగానే; సింహనాదంబున్= సింహగర్జన; చేయుచున్.

తాత్పర్యం: ధర్మరాజు భీముడితో ఇట్లా అన్నాడు 'ఇక్కడ భీష్ముడి బారినపడ్డ పాంచాల బలాన్ని కాపాడుకొనాలి. అక్కడ ద్రోణుడు ముఖ్యుడుగా ఉండే వారినుండి ఘటోత్కచుడిని రక్షించుకొనాలి. ఈ రెండు పనులూ మనకు ముఖ్యం. ఇక్కడ పాంచాలబలానికేమో రక్షకుడుగా అర్జునుడున్నాడు. ఆ ఘటోత్కచుడున్నచోటికి నీవు వేగంగా వెళ్ళుము' దానితో భీముడు వెంటనే సింహనాదంచేస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం)

క. కౌరవబలములు సుడివడ । మారుతి గవియుటయు మెఱసి మార్కొని కురుధా
త్రీరమణుఁ డర్ధచంద్రా । కారశరము దొడిగి ధనువు గ్రక్కునఁ దునిమెన్. 125

ప్రతిపదార్థం: కౌరవబలములు= కౌరవులసేనలు; సుడి+పడన్= సుడులు తిరిగేలాగా; మారుతి= భీముడు; కవియుటయున్= ఎదుర్కొనగా; కురుధాత్రీరమణుఁడు= కురుదేశానికి రాజైన దుర్యోధనుడు; మెఱసి= బయటకు వచ్చి; మార్కొని= ఎదిరించి; అర్ధచంద్ర+ఆకారశరమున్= సగం చంద్రుడి ఆకారంలోవుండే బాణాన్ని; తొడిగి= సంధించి; ధనువు= భీముడి విల్లును; గ్రక్కునన్= త్వరితంగా; తునిమెన్= త్రుంచివేశాడు.

తాత్పర్యం: భీముడు ఉరకగానే, కౌరవులసేన సుడులు తిరుగసాగినది. అప్పటికప్పుడే దుర్యోధనుడువచ్చి అర్ధచంద్రుడి ఆకారంలోవుండే బాణాన్ని సంధించి భీముడి ధనుస్సును విరుగగొట్టాడు.

తే. తునిమి తోడన క్రొవ్వాడి దొడ్డనార । సంబు భీముని వక్షస్స్థలంబు దూఱ
నేయుటయు సోలఁ గని ద్రౌపదేయు లడరఁ । గడఁగె సౌభద్రుఁడును ఘటోత్కచుఁడుఁ గలసె. 126

ప్రతిపదార్థం: తునిమి= త్రుంచివేసి; తోడన= వెంటనే; దొడ్డనారసంబున్= బలమైన బాణాన్ని; భీముని వక్షస్+స్థలంబు= భీముడి రొమ్ముభాగాన్ని; దూఱన్= దూరిపోయేటట్లుగా; ఏయుటయున్= ప్రయోగింపగా; సోలన్= ఆ భీముడు స్వాధీనం తప్పివాలిపోగా;

కని; ద్రౌపదేయులు= ద్రౌపది కొడుకులు; అడరన్= విజృంభించగా; సౌభద్రుఁడును= అభిమన్యుడు; కడఁగెన్= ప్రయత్నపరుడైనాడు; ఘటోత్కచుండున్= ఘటోత్కచుడు కూడా; కలసెన్= వారితో కలుసుకొన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు, భీముడి విల్లును విరుగగొట్టి, బలమైన బాణాన్ని ప్రయోగించాడు. అది ఆతడి రొమ్ములో దూసికొనిపోయింది. ఆ దెబ్బకు భీముడు ఒడలుమరచి ఒరిగిపోయాడు. భీముడి దీనస్థితిని చూచి, ద్రౌపది పుత్రులు (ఉపపాండవులు) విజృంభించారు. అభిమన్యుడు ఘటోత్కచుడుకూడా వారిని చేరుకొన్నారు.

వ. ఇట్లు దండ్రి నొచ్చినఁ బాండుపౌత్త్రులు నీపుత్త్రునిపై నొక్కపెట్ట మిక్కుటం బగుకోపంబునం గవిసిన. 127

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తండ్రి= తండ్రియగు భీముడు; నొచ్చినన్= నొప్పిచెందగా; పాండుపౌత్త్రులు= పాండురాజుయొక్క కొడుకుల కొడుకులు; నీ పుత్త్రునిపైన్= నీకొడుకుమీద; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; మిక్కుటంబు+అగు= అధికమైన; కోపంబునన్= కోపంతో; కవిసినన్.

తాత్పర్యం: తండ్రి భీముడు నొప్పిచెంది, నేలకు ఒరిగిపోగా, పాండురాజు మనుమలు అందరూ చాలా కోపంతో ఒక్కసారిగా మనసేనపైకి విజృంభించారు.

చ. కని కృపబాహ్లికాది రథి । క ప్రకరంబు గడంగి వారి మా
ర్కొని పెనఁగంగఁ దేఁటి కడుఁ । గ్రూరత నేచిన మారుతాత్మజుం
జెనసి గురుండు రక్తపరి । షిక్తునిఁ జేసిన నాతఁ డల్గి యా
తని నొక నారసంబున ను । దగ్రత మూర్ఛ మునుంగ నేసినన్. 128

ప్రతిపదార్థం: కని= చూచి; కృపబాహ్లిక+ఆది రథిక ప్రకరంబున్= కృపుడు, బాహ్లికుడుమున్నుగా గల రథికుల సమూహం; కడంగి= ప్రయత్నపడి; వారిన్= ఆ పాండుపౌత్రులను; మార్కొని= ఎదిరించి; పెనఁగంగన్= పెనగులాడుతూంటే; తేటి= తెప్పరిల్లుకొని; కడున్= మిక్కిలి; క్రూరతన్= కఠోరంగా; ఏచినన్= విజృంభించినట్టి; మారుతాత్మజున్= భీముడిని; చెనసి= ఎదిరించి; గురుండు= ద్రోణుడు; రక్తపరిషిక్తునిన్= నెత్తుటితో తడిసిన వాడినిగా; చేసినన్= చేయగా; ఆతఁడు= ఆ భీముడు; అల్గి= కోపించి; ఆతనిన్= ఆ ద్రోణుడిని; ఒకనారసంబునన్= ఒకే బాణంతో; ఉదగ్రతన్= చాలా అధికంగా; మూర్ఛన్= మూర్ఛలో; మునుంగన్= మునిగేట్టుగా; ఏసినన్= కొట్టగా.

తాత్పర్యం: పాండవ పుత్రులంతా ఏకమై మీదపడటాన్ని చూచి, కృపుడు, బాహ్లికుడు మున్నగు రాజులు ఎదిరించి యుద్ధం చేస్తూ ఉండగా, ఇంతలో భీముడు తెప్పరిల్లుకొని చాలా కఠోరంగా విజృంభించాడు. అతడిని ద్రోణుడు ఎదిరించి, అతడిని నెత్తురుమయం చేశాడు. దానికి భీముడు కోపంతో ఒకే బాణంతో ద్రోణుడిని కొట్టి మూర్ఛ పోయేలా చేశాడు.

మ. ధనురాచార్యునిఁ జూచి తత్తనయుఁడున్ ధాత్రీశుఁడున్ భీము మా
ర్కొని రాతం డెలనవ్వు చెన్నుగ గదా ఘోరాకృతిం దేరు డి
గ్గిన యాలోనన తేటి ద్రోణుఁడు గడంగెం జూచి తోడై కృపా
ది నికాయంబు గడంగి వాయు సుతుపైఁ దీవ్రాస్త్రముల్ నింపఁగన్. 129

ప్రతిపదార్థం: ధనుః+ఆచార్యునిన్= అస్త్రవిద్యలో గురువైన ద్రోణుడిని; చూచి= గమనించి; తద్+తనయుడున్= ఆ ద్రోణుడి కొడుకు అశ్వత్థామ; ధాత్రీ+ఈశుఁడున్= భూమికి ప్రభువైన దుర్యోధనుడున్నూ; భీమున్= భీముడిని; మార్కొనిరి= ఎదిరించారు;

ఆతండు= ఆ భీముడు; ఎలనవ్వు= చిరునవ్వు; చెన్నుగన్= అందంగా; గదాఘోర+ఆకృతిన్= గదపట్టుకోవటంచేత భయంగొలిపే ఆకారంతో; తేరు డిగ్గినన్= తేరునుండి దిగగా; ఆలోనన= అంతలోనే; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; తేఱి= తెప్పరిల్లుకొని; కడంగన్= యుద్ధానికి సిద్ధమయ్యాడు; కృప+ఆది నికాయంబున్= కృపాచార్యుడు ముఖ్యుడుగాగల సమూహం; చూచి= ద్రోణుడు యుద్ధానికి దిగటాన్నిచూచి; తోడు+ఐ= సహాయులై; కడంగి= ప్రయత్నపడి; తీవ్ర+అస్త్రముల్= చురుకైన ఆయుధాలను; వాయుసుతుపైన్= భీముడి మీద; నింపఁగన్= నిండింపచేయగా.

తాత్పర్యం: అశ్వత్థామ, దుర్యోధనుడు- ద్రోణుడు మూర్ఛపడటాన్ని చూశారు. భీముడిని బాగా ఎదుర్కొన్నారు. భీముడేమో వారిని లెక్కచేయకుండా అందంగా చిరునవ్వునవ్వి, గదనుపట్టుకొని భయంకరంగా తేరును దిగాడు. ఆతడు తేరు దిగే లోపలనే ద్రోణుడు తెలివిపొంది, యుద్ధంచేయడానికి ప్రయత్నపడ్డాడు. కృపుడు ముఖ్యుడుగాగల సైన్యం ద్రోణుడు యుద్ధానికి దిగటాన్ని చూచి, భీముడిని చురుకైన ఆయుధాలతో నింపివేశారు.

క. ఏపున హిడింబసుతుఁడును । ద్రౌపదిపుత్త్రులు సుభద్రతనయుఁడుఁ గోపో
ద్దీపితు లై వారల యా । టోపముఁ గుదియించి రతిపటుప్రదరములన్. 130

ప్రతిపదార్థం: ఏపునన్= ఆటోపంతో; హిడింబసుతుఁడును= ఘటోత్కచుడు; ద్రౌపదిపుత్రులు= ద్రౌపదియొక్క కొడుకులు; సుభద్రతనయుఁడున్= అభిమన్యుడు; కోప+ఉద్దీపితులు+ఐ= కోపంతో మండిపడినవారై; వారల+ఆటోపమున్= ఆ అశ్వత్థామ దుర్యోధనుల విజృంభణాన్ని; అతిపటు ప్రదరములన్= చాల చురుకైన బాణాలతో; కుదియించిరి= తగ్గించారు.

తాత్పర్యం: ఇంతలో- ఘటోత్కచుడు, ఉపపాండవులు, అభిమన్యుడు- వీరందరూ, కోపంతో మండిపడుతూ, మిక్కిలి పదునుగా వుండే బాణాలు అశ్వత్థామ మీద, దుర్యోధనుడి మీద ప్రయోగించి వారి సంబరాన్ని చాలావరకు తగ్గించారు.

వ. అప్పు డనూపభూపాలుండును భీమసేన సఖిత్వలోలుండు నగు నీలుండు నశ్వత్థామం దొడరి నొచ్చినం గని ఘటోత్కచుండు. 131

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; అనూపభూపాలుండును= అనూపదేశపు రాజు; భీమసేన సఖిత్వలోలుండున్= భీముడి స్నేహంలో ఆశగలవాడున్నూ; అగు= అయినట్టి; నీలుండు= నీలుడనేవాడు; అశ్వత్థామన్= అశ్వత్థామను; తొడరి= ప్రయత్నంతో ఎదిరించి; నొచ్చినన్= నొప్పిచెందగా; ఘటోత్కచుండు= రాక్షసుడు ఘటోత్కచుడు; కని= చూచి.

తాత్పర్యం: పాండురాజు మనుమలు ఆ అశ్వత్థామమీద, దుర్యోధనుడిమీద మంచి మంచి బాణాలు ప్రయోగించిన సమయంలో భీముడి నేస్తాన్ని కోరుకొనే అనూపదేశ రాజు నీలుడనేవాడు, అశ్వత్థామను ఎదుర్కొని, చాలా నొచ్చిపోయాడు. అప్పుడు ఘటోత్కచుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. తలపడి యగ్గురునందనుఁ । జలమున నొప్పింప గురుఁడు సరభసముగ ను
జ్జ్వలబాణావృతుఁ జేసిన । బలమఱి దనుజుండు మాయఁ బన్నెఁ గుపితుఁడై. 132

ప్రతిపదార్థం: తలపడి= ఎదిరించి; ఆ+గురునందనున్= ద్రోణుడి కొడుకైన ఆ అశ్వత్థామను; చలమునన్= కసితో; నొప్పింపన్= బంధించగా; గురుఁడు= ద్రోణాచార్యుడు; సరభసముగన్= తొందరతో; ఉజ్జ్వలబాణ+ఆవృతున్= (ఆ ఘటోత్కచుడిని) వెలుగుతూ ఉండే బాణాలతో కప్పబడ్డవాడినిగా; చేసినన్= చేయగా; దనుజుండు= ఆ ఘటోత్కచుడు; బలము+అఱి= బలం కోల్పోయి; కుపితుఁడు+ఐ= కోపం పొందినవాడై; మాయన్= మాయను (ఇంద్రజాలాన్ని); పన్నెన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అశ్వత్థామ యొక్క గొప్పతనాన్ని చూచి ఓర్వలేక ఆ రాక్షసుడు అతడిని బాగా నొప్పించాడు. అంతలో ద్రోణాచార్యుడు తొందరగావచ్చి, మండుతూ ఉన్న బాణాలతో వాడిని బాగా కప్పివేశాడు. అప్పుడు ఘటోత్కచుడు బలం తగ్గిపోవటంచేత కోపంతో మాయలు చేయడానికి పూనాడు.

వ. ఇవ్విధంబున హిడింబాసూనుండు సేసిన మాయం జేసి. 133

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ మాదిరి; హిడింబాసూనుండు= హిడింబయొక్క కుమారుడు; చేసిన= చేసినట్టి; మాయన్+చేసి= మాయవలన.

తాత్పర్యం: ఆ రాక్షసుడు ఈ మాదిరి మాయాజాలాలను చేశాడు. దాని ఫలితంగా.

క. గురుఁడు మొదలైన యా ప । న్నిరువురుఁ గురుపతియు నొవ్వ నేటులఁ బడి నె
త్తురు దొరఁగ సోలి సంగర । ధరణిం బడినట్లు దోఁచెఁ దత్సేనలకున్. 134

ప్రతిపదార్థం: తద్+సేనలకున్= ఆ కౌరవసేనలకు; గురుఁడు= ద్రోణుడు; మొదలు+ఐన; ఆ+పన్నిరువురున్= ఆ పన్నెండుగురు వీరులు; కురుపతియున్= దుర్యోధనుడున్నూ; నొవ్వన్= నొచ్చిపోయ్యేటుగా; ఏటులన్+పడి= దెబ్బలుతిని; నెత్తురు= రక్తము; తొరఁగన్= కారుచుండగా; సోలి= స్వాధీనంతప్పి; సంగరధరణిన్= యుద్ధభూమి మీద; పడినట్లు= పడిన విధంగా; తోఁచెన్= అనిపించింది.

తాత్పర్యం: ఘటోత్కచుడు ద్రోణుడు ముఖ్యుడుగాగల ఆ అతిరథమహారథులు, కృపాశ్వత్థామ, చిత్రసేన, బృహద్బలబాహ్లికావంతీనాథ భూరిశ్రవసులను, సైంధవ సోమదత్త వివింశతి వికర్ణులను, దుర్యోధనుడిని, బాగా ఒళ్ళుబద్ద లయ్యేట్లు చావబాది, అంతటితో వదలక, తన మాయాబలంతో వీళ్ళందరూ నెత్తురు కార్చుకొంటూ చచ్చినేలపై పడ్డట్టుగా కౌరవుల సేనకు కనిపించేటట్లు చేశాడు.

చ. కనుఁగొని సైన్యముల్ విఱిగి క్రందుకొనన్ వెసఁబాఱ నాపగా
తనయుఁడు సేన నాఁగి యివి దైత్యులమాయలు గాని బొంకుబొం
కని యెలుఁగెత్తి చెప్పఁగ భయంబున నమ్మక పోయె నట్లు వో
యినఁ జనుదెంచెఁ గౌరవ మహీశుఁడు దీనత భీష్మపాలికిన్. 135

ప్రతిదార్థం: సైన్యముల్= కౌరవసేనలు; కనుఁగొని= ఆ దృశ్యాన్నిచూచి; విఱిగి= వేరువేరుగా అయి; క్రందుకొనన్= సందడిఏర్పడగా; వెసన్= వేగంగా; పాఱన్= పరుగులు తీయగా; ఆపగాతనయుఁడు= గంగకొడుకు- భీష్ముడు; సేనన్= తన సేనను; ఆఁగి= అడ్డగించి; ఇవి= ఇప్పుడు మీకు భయం కలిగించినట్టివి; దైత్యులమాయలు= రాక్షసుల ఇంద్రజాలాలు; కాని= అంతేకాని; బొంకు బొంకు+అని= అబద్ధము అబద్ధము అని; ఎలుఁగు+ఎత్తి= గొంతెత్తి; చెప్పినన్= చెప్పినప్పటికి; భయంబునన్= భయంచేత; నమ్మక= విశ్వసింపక; పోయెన్= పారిపోయెను; అట్లు= ఆ విధంగా; పోయినన్= సైన్యం వెళ్ళిపోగా; కౌరవమహీ+ఈశుఁడు= కురురాజు దుర్యోధనుడు; దీనతన్= దైన్యంతో; భీష్మపాలికిన్= భీష్ముడి దగ్గరకు; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: కౌరవసేనలోని తమయోధులందరు చచ్చినట్లు పడివుండటాన్ని చూచి గాబరాపడి ఎక్కడివారక్కడ విడివిడిగా పారిపోతూండడాన్ని చూచి, భీష్ముడు వారికి అడ్డుపడి ఇదంతా రాక్షసమాయలు అబద్ధాలు, నమ్మకండి అని గొంతు చినిగేటట్లు అరచి చెప్పినా వాళ్ళు పెడచెవినిబెట్టారు. అప్పుడు దుర్యోధనుడు బెంగగా ముఖం చిన్నపుచ్చుకొని భీష్ముడి దగ్గరకు వచ్చాడు.

వ. వచ్చి యి ట్లనియె. **136**

ప్రతిపదార్థం: వచ్చి= సమీపించి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు భీష్ముడి దగ్గరకు వచ్చి చెప్పబోయే విధంగా అంటున్నాడు.

క. నీవును ద్రోణుఁడు గలుగం । గా వైరులచేత నేను గష్టపడితిఁ గా
దే వారితోడఁ దలపడి । చా వొండెను విజయ మొండె సంపాదింతున్. **137**

ప్రతిపదార్థం: నీవును= భీష్ముడైన నీవున్నూ; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడున్నూ; కలుగంగాన్= నా పక్షంలో ఉండగా; వైరులచేతన్= శత్రువులచేత; ఏను= నేను (దుర్యోధనుడు); కష్టపడితిన్=+కాదే!= కష్టపడ్డాను కదా!; వారితోడన్= ఆ శత్రువులతో; తలపడి= యుద్ధంచేసి; చావు+ఒండెన్= మరణంగానీ; విజయము+ఒండెన్= జయంగానీ; సంపాదింతున్= పొందుతాను.

తాత్పర్యం: దేవతలకూ కూడా అజేయుడవైన నీవు, అస్త్రగురువు ద్రోణుడు కూడా మా పక్షాన ఉండి యుద్ధం సాగిస్తుంటే, శత్రువులచేత ఎంతో కష్టపడ్డాను కదా! ఇక నేనే వాళ్ళతో పోరి, చావనైనా చస్తాను, లేక జయాన్నైనా పొందుతాను. (అన్నాడు).

చ. అన విని నవ్వి పాండవుల యంతటివారికిఁ గాక నీకు మా
ర్కొన నగు నయ్య! యిప్పరుసు కుత్సితవర్తన మిట్టి దుస్తరం
బునఁ దగులావుసేయ మము బోఁటులు లేరె? చలంబు డింపు మీ
వనిపతితోడఁ జెప్పి సరిదాత్మజుఁ డప్పుడు ప్రాభవంబునన్. **138**

ప్రతిపదార్థం: సరిత్+ఆత్మజుఁడు= గంగానది పుత్రుడు భీష్ముడు; అనన్= దుర్యోధనుడు అట్లా అనగా; విని= ఆలకించి; నవ్వి; పాండవుల+అంతటివారికిన్+కాక= (పాండవులను గెలవడానికి) పాండవులంతటివారికేతప్ప; నీకు; మార్కొనన్= ఎదిరించటానికి; అగున్+ అయ్య= సాధ్యమగునా అయ్యా!; ఈ+పరుసు= ఈ విధమైన; కుత్సితవర్తనము= హీనమైన నడవడి; ఇట్టి= ఈ విధమైన; దుస్తరంబునన్= తరింపరాని యుద్ధంలో; తగు= తగినట్టి; లావు= బలం; చేయన్= చేయడానికి; మము+బోఁటులు= మాలాంటి వాళ్ళు; లేరే= లేరె? (ఉన్నారనుట); ఈవు= నీవు; చలంబు= మాత్సర్యాన్ని; డింపుము= వదిలెయ్యి; అని= ఈ విధంగా; పతితోడన్= దుర్యోధనుడితో; చెప్పి= పలికి; ప్రాభవంబునన్= హుందాతనంతో.

తాత్పర్యం: భీష్ముడు దుర్యోధనుడన్నమాటలంతా విన్నాడు, నవ్వాడు. ఇట్లా అన్నాడు "పాండవులను ఎదిరించటానికి పాండవులంతటివార్రై ఉండాలికాని, నీలాంటివాడికి సాధ్యమా! (కాదు). ఈ రకం హీనమైన నడవడి నీకు తగదు. అసాధ్యమైన ఈ యుద్ధంలో తగురీతిగా చేయడానికి మావంటివారులేరా? (ఉన్నారనుట) నీవు మాత్సర్యాన్ని వదిలిపెట్టుము'' అని దుర్యోధనుడితో అంటూ (హుందాగా).

వ. భగదత్తు నాలోకించి. **139**

ప్రతిపదార్థం: భగదత్తున్= భగదత్తుణ్ణి; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: భీష్ముడు భగదత్తుణ్ణి చూచి (ఇట్లా అంటున్నాడు).

క. దనుజు లొనరించు మాయలు । నినుఁ జేరవు వారి గెలుతు వీ విప్పుడ యీ
జనపతి మెచ్చఁగఁ నా దై । త్యుని గెలువుము నీదు సేనతో నడరి వడిన్. **140**

ప్రతిపదార్థం: దనుజులు= రాక్షసులు; ఒనరించు= చేయునట్టి; మాయలు= ఇంద్రజాలాలు; నినున్= నిన్ను (భగదత్తుణ్ణి); చేరవు= అంటవు; నీవు= (భగదత్తుడు); వారిన్= ఆ రాక్షసులను; గెలుతు(వు)= గెలుస్తావు; ఇప్పుడు+అ= ఇప్పుడే; ఈ జనపతి= ఈ దుర్యోధనుడు; మెచ్చఁగన్= మెచ్చుకొనేట్టుగా; నీదు సేనతోన్= నీ యొక్క సైన్యంతో; అడరి= విజృంభించి; వడిన్= వేగంగా; ఆ దైత్యునిన్= ఆ రాక్షసుడిని (ఘటోత్కచుడిని); గెలువుము= జయించుము.

తాత్పర్యం: 'ఓయీ భగదత్తా! రాక్షసులు పన్నే మాయలు నీ దగ్గరకు కూడా రావు. నీవు వాళ్లని గెలుస్తావు. మన రారాజుమెచ్చుకొనేటట్టు ఇప్పుడే నీ సేనతో కూడి త్వరగా బాగా విజృంభించి వాడిని గెలువుము.

వ. అని భీష్ముండు పలికినం బ్రాగ్జ్యోతిషపతి మేటి మగండుగావున నమ్మాటకుం బొంగి సింగం బడరిన చందంబున నార్చి సుప్రతీకంబు నెక్కి సేనా సమేతుండై. 141

ప్రతిపదార్థం: అని= పై విధంగా; భీష్ముండు= భీష్ముడు; పలికినన్= చెప్పగా; ప్రాగ్జ్యోతిషపతి= ప్రాగ్జ్యోతిషమనే దేశానికి రాజు భగదత్తుడు; మేటి మగండున్= శూరుల్లో గొప్పవాడు; కావునన్= కావటంచేత; ఆ+మాటకున్= ఆ భీష్ముడి మాటకు; పొంగి= ఉప్పొంగిపోయి; సింగంబు= సింహము; అడరిన= విజృంభించిన; చందంబునన్= మాదిరి; ఆర్చి= బొబ్బపెట్టి; సుప్రతీకంబున్= సుప్రతీకమనే తన ఏనుగును; ఎక్కి= ఎక్కి; సేనాసమేతుండు+ఐ= సేనతో కూడుకొనినవాడై.

తాత్పర్యం: భీష్ముడి మాటలు విన్నాడు భగదత్తుడు. ఇతడు వీరులలో వీరుడు కావటంచేత ఉబ్బిపోయి సింహంమాదిరి విజృంభించాడు. బొబ్బలు పెట్టాడు. సేనలతో కూడినవాడై, తన ఏనుగును ఎక్కాడు.

తే. పరఁగి తోఁతెంచుపాండవబలముమీఁదఁ। గవియుటయుఁ నంతనంతఁ గౌరవుల మూఁక
మరలి యేర్పడఁ జూచి యమ్మాట యపుడు। నిజముగాఁ గొని యాజికి నిగిడె మగుడ. 142

ప్రతిపదార్థం: పరఁగి= ఒప్పి; తో+తెంచు= వస్తున్న; పాండవ బలము మీఁదన్= పాండవ సైన్యంమీద; కవియుటయున్= భగదత్తుడు ఎదుర్కొనగా; కౌరవులమూఁక= కౌరవులసైన్యం; అంతన్+అంతన్= కొంత కొంతదూరంలో; మరలి; ఏర్పడన్= బాగాతెలిసేటట్టుగా; చూచి= పరికించి; ఆ+మాట= భీష్ముడు చెప్పిన పలుకులు; నిజము+కాన్= యథార్థమని; కొని= గ్రహించి; మగుడన్= మరల; ఆజికిన్= యుద్ధానికి; నిగిడెన్= విజృంభించింది.

తాత్పర్యం: భగదత్తుడు ఎదురువచ్చే పాండవసేనతో యుద్ధంచేయసాగాడు. అది చూచి కౌరవులమూక, భీష్ముడన్న మాటలు నిజమని నమ్మి పాండవసేనకు అభిముఖపై మార్కొనింది

వ. ఇ ట్లుభయసైన్యంబులుం దలపడిన సందడికయ్యంబున నపరాహ్ణం బగుచు నుండ. 143

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ మాదిరి; ఉభయసైన్యంబులున్= రెండు సేనలున్నూ; తలపడిన= ఎదురుకొన్న; సందడికయ్యంబున్= సంకుల సమరంలో; అపర+అహ్ణంబు= పగటిలో నాలుగో భాగం; అగుచున్+ఉండన్.

తాత్పర్యం: ఈ మాదిరి కౌరవపాండవసేనలు తలపడి యుద్ధం సాగించాయి. తన పక్షంవాడు, శత్రుపక్షంవాడు అనేదే తెలియకుండా ఆ యుద్ధం జరిగింది. ఇంతలో అపరాహ్ణకాలం కావడం ఆరంభించింది.

క. నగపతియుఁ బోనిగజపతిఁ। దగ నేడ్తెఱ నెక్కి ప్రబలదైత్యబలముతో
నిగుడఁగ ఘటోత్కచుం డా। భగదత్తునిమీఁదఁ గవిసెఁ బార్థివముఖ్యా! 144

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= రాజులలో ప్రధానుడవైన ధృతరాష్ట్ర మహారాజా!; ఘటోత్కచుండు; నగపతియున్+పోని= మహాపర్వతంలాంటి; గజపతిన్= గొప్ప ఏనుగును; తగన్= ఒప్పిదంగా; ఎక్కి= అధిష్ఠించి; ఏడ్తెఱన్= పరాక్రమంతో; ప్రబలదైత్య బలముతోన్= మిక్కుటమైన రక్కసిమూకతో; నిగుడఁగన్= విజృంభించగా; ఘటోత్కచుడు; ఆ భగదత్తుని మీఁదన్= భగదత్తుడిపైన; కవిసెన్= ఎత్తివచ్చాడు.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ ఘటోత్కచుడు కొండంత పెద్ద ఏనుగునెక్కి, పరాక్రమంతో తన రాక్షససైన్యాన్ని కూడా తీసికొని యుద్ధరంగాన్నంతా కమ్ముకుంటూ భగదత్తుడిమీదికి ఎత్తివచ్చాడు.

వ. తదవసరంబున వృకోదరుం డరదంబు రయంబు మెఱయ నయ్యభిమన్యుద్రౌపదేయ ప్రముఖులుం దానును హైడింబునకుం దో డై కడంగె నట్టియెడ. 145

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; వృక+ఉదరుండు= తోడేలు కడుపువంటి కడుపుకలవాడు (భీముడు); అరదంబు రయంబు= (తన) రథంయొక్క వేగం; మెఱయన్= బయలుపడగా; ఆ+అభిమన్యు ద్రౌపదేయ ప్రముఖులున్= ఆ అభిమన్యుడు, ద్రౌపది కొడుకులు మొదలైనవారు; తానును= భీముడున్నూ; హైడింబునకున్= ఘటోత్కచుడికి; తోడు+ఐ= తోడుపడి; కడంగెన్= యుద్ధానికి దిగాడు; అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో భీముడు తన రథవేగం అధికం కాగా, అభిమన్యుడు, ద్రౌపదికొడుకులు ప్రధానులుగాగల కొందరితో ఘటోత్కచుడికి అండగా నిలబడి, కయ్యానికి సిద్ధపడ్డాడు. ఆ సమయంలో.

ఆ. పొదివి పలువు రేయఁ బొడువ వ్రేయఁగ భగ। దత్తుదంతిరక్తధార లొప్పెఁ
జెలువు రెట్టిగాఁగ జేవుఱుసెలయేఱు। లున్నతాచలమున నురలునట్లు. 146

ప్రతిపదార్థం: పొదివి= చుట్టుముట్టి; పలువురు= చాలామంది; ఏయన్= బాణాలు ప్రయోగించగా; పొడువన్= బల్లాలతో పొడవగా; వ్రేయన్= గుదియలతో కొట్టగా; భగదత్తు= భగదత్తుడియొక్క; దంతి= ఏనుగుయొక్క; రక్త= నెత్తుటియొక్క; ధారలు= ప్రవాహాలు; చెలువు= అందము; రెట్టిగాఁగన్= రెండింతలు కాగా; జేవుఱుసెలయేఱులు= జేవురురంగుసెలయేళ్ళు; ఉన్నత+అచలమునన్= ఎత్తైన పర్వతాన్నుండి; ఉరలునట్లు= కారేటట్టుగా; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: పాండవ పక్షంవారంతా భగదత్తుడి ఏనుగును చుట్టుముట్టి- కొందరు బాణాలతోకొట్టారు, మరికొందరు బల్లెములతో పొడిచారు. మరికొందరు గుదియలతో బాదారు. అతడి ఏనుగు శరీరంనుండి రక్తంకారుతూవుంది. అప్పుడది అదంతా రెట్టింపైన అందంతో జేవురురంగు పిల్లకాల్వలు కొండపైనుండి దిగువకు కార్తున్నట్టుంది.

విశేషం: అలం: ఉపమ.

క. శూలంబున హైడింబుఁడు। గాలాకృతితోడ వైవఁగా నది పొడి యై
రాలెడునట్లుగ మగఁటిమి। వ్రాలినభగదత్తుఁ డేసె వడి భల్లమునన్. 147

ప్రతిపదార్థం: కాల+ఆకృతితోడన్= యముడి ఆకారంవంటి ఆకారంతో; హైడింబుఁడు= ఘటోత్కచుడు; శూలంబున(న్)= శూలాయుధంతో; వైవఁగాన్= గుచ్చగా; మగఁటిమి= పౌరుషము; వ్రాలిన= మీరిన; భగదత్తుఁడు; అది= ఆ శూలం; పొడి+ఐ= చూర్ణమై; రాలెడు+అట్లు+కన్= రాలిపొయ్యే విధంగా; వడిన్= వేగంగా; భల్లమునన్= బల్లెంతో; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: ఘటోత్కచుడు యమధర్మరాజుమాదిరి శూలాన్ని విసిరాడు. భగదత్తుడు పౌరుషం అతిశయంకాగా, వేగంగా ఒక బల్లెమును ప్రతిగావేసి వాడి బల్లెమును నుగ్గునుగ్గు చేశాడు.

వ. ఇ ట్లేసి యార్చి వెండియు. 148

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ మాదిరి; ఏసి= ప్రయోగించి; ఆర్చి= బొబ్బపెట్టి; వెండియున్= మరియు.

తాత్పర్యం: భగదత్తుడీవిధంగా శూలంతో ఘటోత్కచుడి శూలాన్ని నుగ్గుచేసి బొబ్బలుపెట్టి.

ఆ. భీముహరులఁ గూల్చి పేర్చి సౌభద్రాది । యోధవరుల నెల్ల నుఱక తఱచు
టంపవానఁ దడిపి హయరథభట సమూ । హంబుఁ జదిపె సమదహస్తిఁ బఱపి. 149

ప్రతిపదార్థం: భీముహరులన్= భీముడి గుర్రాలను; కూల్చి= కూలద్రోసి; పేర్చి= అతిశయించి; సౌభద్ర+ఆది+యోధవరులన్= అభిమన్యుడు మొదలైన గొప్పవీరులను; ఎల్లన్= అందరినీ; ఉఱక= ఊరకయే; తఱచు= అధికమైన; అంపవానన్= బాణాలతో; తడిపి= ముంచి; సమదహస్తిన్= మదంతో కూడిన ఏనుగును; పఱపి= తోలి; హయరథభటసమూహంబున్= గుర్రాలు, రథాలు; భటులు= సైనికులు; వీరి గుంపును; చదిపెన్= నలిచివేశాడు.

తాత్పర్యం: ఆ భగదత్తుడు భీముడి రథం గుర్రాలను కుప్పకూల్చాడు. చాలా బాగా విజృంభించాడు. అభిమన్యుడు మొదలైన పలువురు యోధులందరినీ గొప్ప బాణాలవానతో తడిపివేశాడు. తన ఏనుగును ఉసికొల్పి గుర్రాలను; భటులను రథాలను నుగ్గు చేశాడు.

క. మందరము మహాంభోనిధి । యందుఁ దిరుగునట్లు పాండవానీకములో
నం దిరిగి సుప్రతీక మ । మందగతిం జంపెఁ బెక్కు మాతంగములన్. 150

ప్రతిపదార్థం: సుప్రతీకము= భగదత్తుడి ఏనుగు; మందరము= మందరమనే పర్వతం; మహా+అంభోనిధి+అందున్= మహాసాగరంలో; తిరుగు+అట్లు= తిరిగేమాదిరి; పాండవ+అనీకములోనన్= పాండవుల సేనలో; తిరిగి= భ్రమించి; అమందగతిన్= వేగవంతమైన నడకతో; పెక్కుమాతంగములన్= చాలా ఏనుగులను; చంపెన్= చంపింది.

తాత్పర్యం: సుప్రతీకం అనే ఏనుగు మహాసముద్రంలో మందరపర్వతం తిరిగేమాదిరిగా పాండవులసేనలోనికి చొచ్చుకొనిపోయి, వేగంతో ఇటూ అటూ తిరుగుతూ శత్రువుల ఏనుగులను ఎన్నింటినో కాలరాచినది.

విశేషం: అలం: ఉపమ. చంపె అనుటకు మారుగా చదిపె అను పాఠాంతరము మేలైనది.

క. అలిగి దశార్ణాధీశుఁడు । గొలిపెను భగదత్తుమీఁదఁ గ్రూరగజము ను
జ్జ్వలము లగునతనితోమర ములతాఁకున నది చలించి మొగతిరిగె వెసన్. 151

ప్రతిపదార్థం: దశార్ణ+అధీశుఁడున్= దశార్ణదేశపురాజు; అలిగి= కోపించి; భగదత్తు మీఁదన్; భగదత్తుడిమీదికి; క్రూరగజమున్= భయంకరమైన (తన) ఏనుగును; కొలిపెన్= ప్రేరేపించాడు; అది= ఆ ఏనుగు; ఉజ్జ్వలములు+అగు= పదునుచేత ప్రకాశిస్తూ ఉన్న; అతని= ఆ భగదత్తుడియొక్క; తోమరముల తాఁకునన్= తోమరాలనే ఆయుధాల దెబ్బతో; చలించి= కదలిపోయి; వెసన్= వెంటనే; మొగతిరిగెన్= వెనక్కితిరిగింది.

తాత్పర్యం: దశార్ణరాజు కోపంచెంది, భగదత్తుడిమీదికి తన ఏనుగును పురికొల్పాడు. అది భగదత్తుడి క్రూరపు తోమరాలతాకిడికి తట్టుకోలేక వెనక్కి మళ్లినది.

వ. ఇవ్విధంబునం బోరు భగదత్తుం గనుంగొని గండుమిగిలి కురువిభుండు గురుకృపాది యోధవీర సమేతంబుగాఁ దఱిమినం దమ బలంబులు గోలాహలబహుళంబు లగుటయుఁ బాండవాగ్రజుండు పార్థపాంచాల పురస్సరుండై యవ్వలనికిం గ్రొ వ్వలరం గోల్తల సేసె నట్టి సమయంబున. 152

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; పోరు= యుద్ధంచేస్తున్న; భగదత్తున్= భగదత్తుణ్ణి; కనుంగొని= చూచి; కురువిభుండు= కురురాజు, దుర్యోధనుడు; గండుమిగిలి= పౌరుషం అధికంకాగా; గురు= ద్రోణాచార్యుడు; కృప= కృపాచార్యుడు; ఆది= మొదలుగాగల; యోధ= భటులు; వీర= వీరులు; (వీరితో) సమేతంబుగాన్= కూడుకొని; తఱిమినన్= వెంబడిపడి తరుమగా; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; తమబలంబులున్= తమ (కౌరవుల); బలంబులున్= సైన్యాలు; కోలాహల బహుళంబులున్= కలకలశబ్దాలతో నిండినవిగా; అగుటయున్= కావడమున్నూ; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; పార్థపాంచాల పురస్సరుండు+ఐ= అర్జునుడు; ద్రుపదుడుముందున్నవారుకాగా; ఆ+వలనికిన్= ఆవైపునకు; క్రొవ్వు+అలరన్= మదం అధికంకాగా; కోల్తల+చేసెన్= ఎదురుగా నిల్చి యుద్ధంచేశాడు; అట్టి సమయంబునన్= అలాంటి సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా యుద్ధం చేస్తూన్న భగదత్తుణ్ణి చూశాడు దుర్యోధనుడు. మహాపౌరుషంతో ద్రోణాచార్య కృపాచార్యులు ముఖ్యులుగా ఉండే యోధవీరులతో కూడి పాండవసేనను వెంబడించి తరిమాడు. అప్పుడు కౌరవసేనలో కోలాహలం పుట్టింది. దానిని గమనించి, ధర్మరాజు - అర్జునుడు, ద్రుపదుడు ముందు నిలువగా ఆ యుద్ధం జరిగే దిక్కుకు వెళ్ళి మదాతిశయంతో యుద్ధం చేశాడు.

అర్జునుఁ డిరావంతునిచచ్చుట భీమునిచే విని దుఃఖించుట (సం. 6-92-1)

**క. నరుఁడు ధనుర్గుణరావ। స్ఫురణంబును దేవదత్తభూరిరవము నం
బరము వగిలింప నానా। శరములఁ గురుసైన్యసరభసత్వం బుడిపెన్. 153**

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; ధనుస్= విల్లుయొక్క; గుణ= అల్లెత్రాటియొక్క; రావ= ధ్వనియొక్క; స్ఫురణంబును= కదలికయు; దేవదత్తభూరిరవమున్= దేవదత్తమనే తన శంఖంయొక్క పెద్దశబ్దమున్నూ; అంబరము= ఆకాశాన్ని; పగిలింపన్= బ్రద్దలుకొట్టగా; నానాశరములన్= పలురకాల బాణాలతో; కురుసైన్య సరభసత్వంబున్= కౌరవసైన్యాలవేగిరపాటును; ఉడిపెన్= మాన్పించాడు.

తాత్పర్యం: అర్జునుడు ధనుష్టంకారం చేశాడు. తన శంఖాన్ని ఊదాడు. ఈ రెంటి చప్పుడు ఆకాశాన్ని బ్రద్దలు కొట్టింది. వెంటనే అర్జునుడు పలురకాల బాణాలు వేసి, కౌరవసేనల ఉద్ధతిని తగ్గించాడు.

**ఆ. అపుడు సేరి భీముఁ డతనికి భుజగేంద్ర। కన్యకాసుతుండు గలనఁ బడుట
నల్లఁ జెప్పటయును నడలి యెచ్చట నని। యడిగి యతఁడు సూప నచటి కరిగి. 154**

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో; భీముఁడు; చేరి= అర్జునుడి దగ్గరకువచ్చి; అతనికిన్= ఆ అర్జునుడికి; కలనన్= యుద్ధంలో; భుజగ+ఇంద్రకన్యకాసుతుండున్= సర్పరాజు కుమార్తెయొక్క కొడుకు ఇరావంతుడు; పడుటన్= చనిపోవటాన్ని; అల్లన్= మెల్లగా; చెప్పుటయున్= తెలియచేయగా; అడలి= శోకించి; ఎచ్చటన్= ఎక్కడ?; అని+అడిగి= అని ప్రశ్నించి; అతఁడున్= ఆ భీముడు; చూపన్= చూపించగా; అచటికిన్= ఆ చోటికి; అరిగి= వెళ్ళి.

తాత్పర్యం: అర్జునుడు ఇట్లా యుద్ధం చేస్తున్న సమయంలో, భీముడు అతడి దగ్గరకు వెళ్ళి మెల్లగా ఇరావంతుడు యుద్ధంలో చావటాన్ని చెప్పాడు. అర్జునుడు విలపించి 'ఎక్కడ' అని అడిగాడు. భీముడు చూపించిన చోటికి తాను వెళ్ళి.

వ. దనుజఖండితుం డయి పడియున్న యయ్యిరావంతు శరీరంబు గనుంగొని యా ధనంజయుండు.155

ప్రతిపదార్థం: ఆ ధనంజయుండు= ఆ అర్జునుడు; దనుజ ఖండితుండు+అయి= రాక్షసుడిచే చంపబడ్డవాడై; పడియున్న= నేలపైపడివున్నట్టి; ఆ+ఇరావంతు శరీరంబున్= ఆ ఇరావంతుడి దేహాన్ని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: అలంబుసుడిచే చంపబడి నేలబడి ఉన్న ఇరావంతుడి దేహాన్ని చూచి అర్జునుడు.

చ. ఘనతరశోకవేగమునఁ గన్నుల నీళులు నించి యా సుయో
ధనునవినీతియుం బిదప ధర్మతనూజుఁడు సంధి గోరి ప
ల్కిన తగవుం గడంగి యనికిం దలకొన్ననిజోద్యమంబుఁ దోఁ
చిన విధిఁ దిట్టుచున్ వినుతి సేయుచు రోయుచునుండె నయ్యెడన్. 156

ప్రతిపదార్థం: ఆ+ఎడన్= ఆ సమయాన; ఘనతరశోకవేగమునన్= మిక్కిలి ఎక్కువైన దుఃఖవేగంతో; కన్నులన్= కండ్లలో; నీళులు= నీరు; నించి= నిండించుకొని; ఆ సుయోధను+అవినీతియున్= ఆ దుర్యోధనుడి అవినీతిని; పిదపన్= అటు తర్వాత; ధర్మతనూజుఁడు= ధర్మరాజు; సంధిన్+కోరి= సంధిని ఇష్టపడి; పల్కిన తగవున్= చెప్పిన న్యాయం; అనికిన్= యుద్ధానికి; కడంగి= ప్రయత్నపడి; తలకొన్న= పూనుకొన్న; నిజ+ఉద్యమంబున్= తనకార్యక్రమం; తోఁచినన్= జ్ఞాపకానికి రాగా; విధిన్= దైవాన్ని; తిట్టుచున్= తిట్టుతూ; వినుతి+చేయుచున్= ధర్మరాజు గొప్పదనాన్ని పొగడుతూ; రోయుచున్= తన యుద్ధచర్యను ఏవగించుకొంటూ; ఉండెన్= ఉండినాడు.

తాత్పర్యం: అర్జునుడు అధిక దుఃఖంతో కన్నులలో నీళ్ళు నింపుకొని, మొదట దుర్యోధనుడు చేసిన జూదంవగైరా అన్యాయాన్ని, తరువాత అన్న ధర్మరాజు ఉదారంగా ఐదూళ్లైనా ఇవ్వమని కోరటాన్ని సంధి కుదరకపోగా తాను చేసే అసహ్యమైన యుద్ధాన్ని ఒకసారి జ్ఞాపకానికి తెచ్చుకొన్నాడు. విధిని తిట్టాడు. పిదప ధర్మరాజు న్యాయాన్ని మెచ్చుకొన్నాడు. తను యుద్ధంలో దిగడంచేత పలువురు చావటాన్ని చూచి తన్ను ఏవగించుకొన్నాడు.

వ. ఇట్లు పుత్త్రశోకానలసంతప్తచిత్తుం డగు సవ్యసాచిం జూచి గోవిందుండు మందస్మితంబు సేసిన. 157

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పుత్త్ర= కొడుకైన ఇరావంతుడి సంబంధమైన; శోక= దుఃఖమనే; అనల= అగ్గిచేత; సంతప్త= తపించిపోయిన; చిత్తుండు+అగు= మనస్సుకలవాడైనట్టి; సవ్యసాచిన్= అర్జునుణ్ణి; చూచి; గోవిందుండు= శ్రీకృష్ణుడు; మందస్మితంబు= చిరునవ్వు; చేసినన్= చేయగా (నవ్వగా).

తాత్పర్యం: అర్జునుడికి కొడుకు చావటంచేత కలిగిన దుఃఖంఅనే అగ్నిచేత ఆతడి మనస్సు బాగా తపించిపోయింది. అట్టి అర్జునుడిని చూచి కృష్ణుడు చిరునవ్వు నవ్వగా.

క. ' కని యతఁడు దెలిసి నీచే। వినినది యిది మున్ను దీని విడిచితి నహిభం
జన! తేరు నడపు కురుబల। వినిపాతనపాటవమున విహరించుటకున్.' 158

ప్రతిపదార్థం: అతఁడు= ఆ అర్జునుడు; కని= కృష్ణుడు నవ్వటాన్ని చూచి; తెలిసి= ఆ నవ్వులోని అర్థాన్ని గ్రహించి; అహిభంజన!= కాళియుడనే సర్పరాజును మర్దించిన ఓ కృష్ణా!; ఇది= ఈ ఆత్మానాత్మ విచారం; మున్ను= ఇంతకు మునుపే; నీచేన్; వినిన+అది= విన్నట్టిదేను; దీనిన్= ఈ కొడుకు చావువల్ల కలిగిన దుఃఖాన్ని; విడిచితిన్= వదలిపెట్టాను; కురు= కౌరవులయొక్క; బల= సేనలయొక్క; వినిపాతన= బాగాపడగొట్టడంలో; పాటవమునన్= నైపుణ్యంతో; విహరించుటకున్= వేడుకగా తిరగడానికి; తేరునడపు(ము)= రథాన్ని ముందుకు పోనిమ్ము.

తాత్పర్యం: కృష్ణుడి నవ్వులోని మర్మాన్ని అర్జునుడు తెలిసికొన్నాడు. 'ఓ కృష్ణా చావు బ్రతుకుల తత్త్వాన్ని నీవు ముందే చెప్పావు, నేను విన్నాను. ఇక వీడి మరణంవల్ల ఏర్పడ్డ దుఃఖాన్ని వదిలివేశాను. ఆ కౌరవసైన్యాన్ని కుప్పకూల్చే సామర్థ్యంతో విహరించటానికి అనువుగా రథాన్ని పోనిమ్ము.

వ. అని పలికినం బద్మనాభుండు రథంబు రయంబున మనమొనపయిం బఱపం బార్థుండు పటుబాణపరంపరలు వరగింప భగదత్తుండును, గృపాచార్యుండును,ద్రిగర్తపతియు భీష్మం గూడుకొని యాక్రీడి నెదిర్చిరి. సాత్యకి యడరినం గృతవర్మ బాహ్లికులు మార్కొనిరి మారుతి గవిసినం గుంభసంభవుండు దలపడియె. నతని ప్రాపున నేపు మిగిలి నీపుత్త్రకు లా బకమర్దను మర్దింపం గడంగి కవిసిన. 159

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికినన్= అర్జునుడు చెప్పగా; పద్మనాభుండు= కృష్ణుడు; రథంబున్; రయంబునన్= వేగంతో; మనమొనపయిన్= మన (కౌరవుల)సేన మీదికి; పఱపన్= తోలగా; పార్థుండు= అర్జునుడు; పటుబాణపరంపరలు= గట్టి బాణాల వరుసలను; పరఁగింపన్= ప్రయోగింపగా; భగదత్తుండును; కృపాచార్యుండును, త్రిగర్తపతియున్; భీష్మున్; కూడుకొని= కలిసికొని; ఆ క్రీడిన్= ఆ అర్జునుడిని; ఎదిర్చిరి= ఎదిరించారు; సాత్యకి; అడరినన్= అతిశయించగా; కృతవర్మబాహ్లికులు= కృతవర్మయు, బాహ్లికుడున్నూ; మార్కొనిరి= ఎదిరించారు; మారుతి= భీముడు; కవిసినన్= ఢీకొనగా; కుంభసంభవుండు= ద్రోణాచార్యుడు; తలపడియెన్= తాకాడు; అతని ప్రాపునన్= ఆ ద్రోణుడి అండన; ఏపు మిగిలి= విజృంభణంచేత అతిశయించి; నీ పుత్త్రకులు= నీ కొడుకులు (కౌరవులు); ఆ బకమర్దనున్= బకుడనే రాక్షసుణ్ణి చంపిన భీముడిని; మర్దింపన్= అణచటానికి; కడంగి= ప్రయత్నపడి; కవిసినన్= ఎదుర్కొనగా.

తాత్పర్యం: అర్జునుడి మాటలు విని కృష్ణుడు వేగంగా రథాన్ని కౌరవసైన్యంవుండే ప్రక్కకు తోలాడు. పార్థుడు గొప్పవైన బాణాలను వరుసగా వేశాడు. అప్పుడు భగదత్తుడు, త్రిగర్తదేశపురాజు, కృపుడు భీష్మడితో కూడుకొని ఆ అర్జునుడిని ఎదిరించాడు. సాత్యకి తలపడగా కృతవర్మ, బాహ్లికుడు అతడిని ఎదిరించారు. భీముడు మీదపడగా ద్రోణుడతనిని ఎదిరించాడు. ఆ ద్రోణుడి అండన ఉన్న నీ కొడుకులు ఆ భీముడిని కొట్టటానికి పెద్ద ప్రయత్నంతో ఎగబడ్డారు.

క. గురునంపవెల్లి నాఁగుచు । సరభసముగ వారిమీఁద శరవర్షంబుల్
గురియుచు వారలయమ్ములఁ । దెరలక భీముండు పటుగతిస్యందనుఁడై. 160

ప్రతిపదార్థం: భీముఁడు= భీముడు; పటుగతి స్యందనుఁడు+ఐ= దిట్టమైన పోకడగల రథంకలవాడై; గురున్= గురువైన ద్రోణాచార్యునియొక్క; అంపవెల్లిన్= బాణాలవెల్లువను; ఆఁగుచున్= అడ్డగిస్తూ; సరభసముగన్= తొందరపాటుతో; వారిమీఁదన్= ఆ కౌరవులమీద; శరవర్షంబుల్= బాణాలవానలను; కురియుచున్= కురిపిస్తూ; వారల= ఆ శత్రువుల; అమ్ములన్= బాణాలను; తెరలక= (దగ్గరకు రానీకుండా) తొలిగించుతూ.

తాత్పర్యం: భీముడు మంచివేగంగల రథాన్నెక్కి, ద్రోణుడు ప్రయోగించే బాణాల ప్రవాహాన్ని ఆపాడు. వాళ్ళమీద బాణాలవానలు కురిపించాడు. శత్రువులు వేసే బాణాలను తొలగించుకుంటూ (తరువాతి వచనంతో అన్వయం).

వ. సమరక్రీడ సలిపి గురుకుమారులు దొరఁగించు నారాచధారల నొచ్చి యాజ్యధారాక్రాంతుం డైన యర్చిష్మంతుండునుంబోలె మండి యుద్దండకోదండనైపుణ్యంబు సూపినం గుండభేదియు, ననాధృష్యుండును, గనకధ్వజుండును, విరావియు, సుబాహుండును, దీర్ఘబాహుండును, దీర్ఘలోచ నుండును దీర్ఘనిద్రం బొందిరి; పెఱవారు వెఱచఱచి విటిగి పఱచిన నజంబుల వెనుకొనువృకంబు విధంబున వృకోదరుండు దోర్విలాసంబు

మెఱసె నప్పుడు బ్రొద్దుగ్రుంకుచుండ నీ పెద్దకొడుకు బలుమొనలం బురికొల్పికొని చలంబునం గోల్తల సేసిన గౌంతేయవ్యూహంబులు నభినవోత్సా హంబునం బోక పెనంగిన. 161

ప్రతిపదార్థం: సమరక్రీడ సలిపి= యుద్ధంలో క్రీడించి; కురుకుమారులు= దుర్యోధనుడి తమ్ముళ్ళు; తొరఁగించు= పడవేస్తున్నట్టి; నారాచధారలన్= బాణాలచేత; నొచ్చి= బాధపడి; ఆజ్యధారా+ఆక్రాంతుండు+ఐన= నేతిధారలచే కప్పబడిన; అర్చిష్మంతుండునున్+పోలెన్= అగ్నిమాదిరి; మండి= వెలిగి; ఉద్దండకోదండ నైపుణ్యంబు= మితిమీరిన విలువిద్యలోని చాకచక్యాన్ని; చూపినన్= ప్రదర్శించగా; కుండభేదియున్; అనాధృష్యుండునున్; కనకధ్వజుండును; విరావియున్; సుబాహుండును; దీర్ఘబాహుండునున్; దీర్ఘలోచనుండును; దీర్ఘనిద్రన్= చావును; పొందిరి; పెఱవారు= తక్కినవారు; వెఱచఱచి= భయంచెంది; విఱిగి= ఓడిపోయి; పఱచినన్= పారిపోగా; అజంబులన్= మేకలను; వెనుకొను= అనుసరించితరుము; వృకంబు విధంబునన్= తోడేలుమాదిరి; వృకోదరుండు= భీముడు; దోస్+విలాసంబు= భుజాల క్రీడలో; మెఱసెన్= ప్రకాశించాడు; అప్పుడు= ఆ సమయంలో; ప్రొద్దు= సూర్యుడు; క్రుంకుచున్+ఉండన్= మరుగైపోతూండగా; నీ పెద్దకొడుకు= దుర్యోధనుడు; బలుమొనలన్= బలంగల సైన్యాలను; పురికొల్పికొని= ప్రోత్సాహపరచికొని; చలంబునన్= మాత్సర్యంతో; కోల్తల+చేసినన్= ఎదుట నిల్చి యుద్ధంచేయగా; కౌంతేయ వ్యూహంబులున్= కుంతికొడుకుల బలాలు; అభినవ+ఉత్సాహంబునన్= కొంగ్రొత్త ఉత్సాహంతో; పోక= వెనుకంజవేయక; పెనంగినన్= యుద్ధంచేయగా.

తాత్పర్యం: భీముడు యుద్ధంలో విచ్చలవిడిగా విహరిస్తూ, కౌరవులువేసే బాణాల దెబ్బకు చాలా బాధపడి నెయ్యిపోస్తే గుప్పుమని మండే అగ్గిలాగా మండిపడుతూ, విలువిద్యలో తనకుండే గొప్పనేర్పును కనపరుచుతూ కౌరవులను ఏడుమందిని చంపివేశాడు. మిగిలినవారందరూ ఓడి, భయపడి పారిపోసాగారు. మేకలను తోడేలు మాదిరిగా వాళ్ళను వెంబడించి తరిమాడు. తన భుజబలాన్ని ప్రకాశింపజేశాడు. అప్పుడే సూర్యుడు అస్తమిస్తున్నాడు. అప్పుడు దుర్యోధనుడు తన బలగంలో బలవంతుల్ని పురికొల్పికొంటూ మాత్సర్యంతో ఎదిరించి యుద్ధంచేయుటకు పూనాడు. పాండవుల దండుకూడా వెనుకకు మళ్ళక అప్పటికప్పుడే ఏర్పడ్డ ఉత్సాహంతో పోరు సాగించగా.

విశేషం: అలం: ఉపమ.

తే. ధరణి నెత్తుటఁ దోఁగి యాభరణ కాయ। శస్త్రఖండజాలంబులఁ జాలఁ బొలిచెఁ
బలుచ గాకుండఁ గుంకుమ మలఁది పెక్కు। తెఱఁగుతొడవులు దొడిగినతెఱవవోలె. 162

ప్రతిపదార్థం: ధరణి= భూమి; నెత్తుటన్= నెత్తురులో; తోఁగి= మునిగి; ఆభరణ= నగలు; కాయ= శరీరాలు; శస్త్ర= ఆయుధాలు- వీటియొక్క; ఖండ= ముక్కల; జాలంబులన్= గుంపులతో; పలుచ+కాకుండన్= పలచగాకాక (దట్టంగా); కుంకుమము= కుంకుమపువ్వును; అలఁది= పూసుకొని; పెక్కు+తెఱఁగు తొడవులన్= పలురకాలైన నగలను; తొడిగిన= ధరించిన; తెఱవ+పోలెన్= ఆడదానిమాదిరి; చాలన్= అధికంగా; పొలిచెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: నెత్తుటితో బాగా తడిసి, నగలు, శరీరాలు, ఆయుధాలు- వీటి తునుకలతో నిండిన భూమి, ఎర్రని కుంకుమలేపనాన్ని దట్టంగా పూసికొని, నానావిధాల నగలు ధరించిన అందగత్తెవలె వెలుగుతూ ఉండినది.

విశేషం: అలం: ఉపమ.

వ. అంత. 163

తాత్పర్యం: ఆ సమయంలో- (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **తిమిరము గవిసినఁ బాండవ । సమితియుఁ గౌరవులు రణము సాలించి నివా**
సములకుఁ దగఁ జని రయ్యు । ష్టమయామిని నుదితపటువిషాదుం డగుచున్. **164**

ప్రతిపదార్థం: తిమిరము= చీకటి; కవిసినన్= క్రమ్ముకోగా; పాండవసమితియున్= పాండవుల సమూహమూ; కౌరవులు= దుర్యోధనాదులు; రణము= యుద్ధం; చాలించి= ముగించి; నివాసములకున్= తమ తమ తావులకు; తగన్= ఒప్పిదంగా; చనిరి= వెళ్ళారు; ఆ+అష్టమ యామినిన్= ఆ ఎనిమిదవనాటి రాత్రిపూట; ఉదిత= పుట్టిన; పటు= గట్టిదైన; విషాదుండు+అగుచున్= ఖేదంకలవాడై.

తాత్పర్యం: చీకటి అంతటా వ్యాపించింది. పాండవులు, కౌరవులు యుద్ధం చాలించి తమ తమ నివాసాలకు వెళ్ళిపోయారు. ఆ ఎనిమిదో నాటిరాత్రి తనసైన్యం చాలా నష్టంకావడంచేత ధుర్యోధనుడి మనస్సు కలతచెందగా (తరువాతి పద్యంతో అన్వయం).

క. **కురువిభుఁడు నగరు సొచ్చియుఁ । జొరమిన గాంధారవిభుని సూతతనూజుం**
ద్వరితముగఁ బిలువు మని యా । తురతం బలుమాఱుఁ జెప్పె దుశ్శాసనుతోన్. **165**

ప్రతిపదార్థం: కురువిభుఁడు= దుర్యోధనుడు; నగరు= తన రాజభవనాన్ని; చొచ్చియున్= ప్రవేశించియు; చొరమిన్+అ= ప్రవేశింపకయే; దుశ్శాసనుతోన్= తన తమ్ముడు దుశ్శాసనుడితో; త్వరితముగన్= వేగంగా; గాంధారవిభునిన్= గాంధారదేశపురాజు శకునిని; సూతతనూజున్= సూతపుత్రుడు కర్ణుడిని; పిలువుము+అని= పిలుచుకొనిరమ్మని; ఆతురతన్= ఆత్రంతో; పలుమాఱున్= చాలాసార్లు; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తన భవనంలోకి అడుగుపెట్టీపెట్టకముందే 'శకునిని, కర్ణుడిని ఇప్పుడే వేగంగా పిలుచుకొనిరమ్ము' అని ఆత్రంతో ఆ దుశ్శాసనుడితో మరీ మరీ చెప్పాడు.

వ. **చెప్పిన నతండు వారిం గూర్చికొని వచ్చుటయు నేకాంతంబున నమ్మహీకాంతుండు వారలతో ని ట్లనియె 'గాంగేయ గురుకృపాశ్వత్థామలు మధ్యస్థు లై పాండవబలంబులం జెఱుచునట్టి సంరంభంబునకుం జొరరు. మనసేనలు నానాఁటికి సన్నంబు లై సమయుచువచ్చె నేమి సేయంగలవార?' మనిన విని రాధేయుండు రణక్రీడాలంపటుం డై.** **166**

ప్రతిపదార్థం: చెప్పినన్= చెప్పగానే; అతండు= ఆ దుశ్శాసనుడు; వారిన్= ఆ శకుని కర్ణులను; కూర్చికొని= చేర్చుకొని; వచ్చుటయున్= రాగానే; ఏకాంతమ్మునన్= రహస్యంగా; వారలతోన్= ఆ వచ్చినవారితో; ఆ+మహీకాంతుండు= ఆ రాజు-దుర్యోధనుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; గాంగేయ, గురుకృప+అశ్వత్థామలు= భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామలు; వీరు; మధ్యస్థులు+ఐ= ఉదాసీనులయి; పాండవబలంబులన్= పాండవులసేనలను; చెఱచు+అట్టి= చంపేటటువంటి; సంరంభంబునకున్= ఆటోపమునకు; చొరరు= పూనరు; మనసేనలు= మన (కౌరవుల) సైన్యాలు; నాఁడు+నాఁటికిన్= దినదినానికి; సన్నంబులు+ఐ= కృశించినవై; సమయుచున్ వచ్చెన్= చచ్చిపోతున్నాయి; ఏమిసేయన్+కలవారము?= మన మేమి చేయగలము?; అనినన్; రాధేయుండు= రాధకొడుకు - కర్ణుడు; విని= ఆలకించి; రణక్రియాలంపటుండు+ఐ= యుద్ధమాడటంలో ఆశ కలవాడై.

తాత్పర్యం: దుర్యోధనుడు అట్లు చెప్పగానే దుశ్శాసనుడు వెళ్ళి శకుని కర్ణులను వెంటబెట్టుకొని వచ్చాడు. వాళ్లతో దుర్యోధనుడు రహస్యంగా 'భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ వీళ్ళు నలుగురును మధ్యస్థంగా ఉంటూ పాండవులసైన్యాలను చంపే సంరంభం కూడా చేయటం లేదు. మనసేనలేమో దినదినానికీ తరిగిపోతున్నాయి. కనుక ఇప్పుడు మనం ఏం చెయ్యాలి?' అని అన్నాడు. ఆ మాటలు విని కర్ణుడు యుద్ధమాడటం అంటే చాలా ఇష్టం కలవాడై

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. నరనాథ! యింక భీష్ముని । దురమునకుం దేకు మేను దోర్బలవిభవో
ద్ధురతం బాండుకుమారో । త్కరముం దత్సేనలన్ మదం బడఁగింతున్.' 167

ప్రతిపదార్థం: నరనాథ!= ఓ ప్రభూ! దుర్యోధనా! ఇంకన్= ఇకమీద; భీష్మునిన్= భీష్మాచార్యుడిని; దురమునకున్= యుద్ధానికి; తేకుము= తేవద్దు; ఏను= నేను (కర్ణుడు); దోః+బలవిభవ+ఉద్ధురతన్= భుజబల సంపత్తి యొక్క ఆధిక్యంతో; పాండుకుమార+ఉత్కరమున్= పాండురాజు కొడుకులగుంపును; తద్+సేనలన్= ఆపాండవుల సేనలను; మదంబు= పొగరును; అడఁగింతున్= అణచివేస్తాను.

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! ఇకమీద ఆ భీష్ముడిని యుద్ధానికి తీసికొని పోవలదు. నేను నా భుజబలసంపత్తి పెంపుతో, ఆ పాండవులు ఐదుగురినీ వారి సేనలను మార్కొని - మదమణిగే విధంగా యుద్ధం చేస్తాను.'

క. అని పలికిన విని దుశ్శా । సనుఁ గనుఁగొని మనము వోయి శాంతనవుని భం
డన ముడిపి వత్త మని చె । ప్పి నరేంద్రుఁడు వీడుకొల్పెఁ బెఱవారిఁ దగన్. 168

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికినన్= (కర్ణుడు) చెప్పగా; విని= ఆలకించి; నర+ఇంద్రుఁడు= రాజైన దుర్యోధనుడు; దుశ్శాసనున్= తమ్ముడు దుశ్శాసనుణ్ణి; కనుఁగొని= చూచి; మనము= మన మిద్దరం; పోయి= వెళ్ళి; శాంతనవుని భండనము= భీష్ముడి యుద్ధాన్ని; ఉడిపి= చాలింపచేసి; వత్తము= వద్దాము; అని చెప్పి= అని పలికి; పెఱవారిన్= ఇతరులను; తగన్= తగినట్లుగా; వీడుకొల్పెన్= పంపివేశాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు కర్ణుడి మాటలు విన్నాడు. దుశ్శాసనుడివైపు తిరిగి, 'మనం భీష్ముడి యుద్ధాన్ని నిలిపివద్దాము' అని చెప్పి, మిగిలినవాళ్ళను అక్కడి నుండి బయటకు పంపాడు.

వ. ఇట్లు కర్ణసౌబలుల నిజనివాసంబులకుం బోవం బనిచి బహుప్రకార సౌరభసంవాసితంబులగు జలంబుల జలకం బాడి పరమసురభిచందనానులేపనంబులను జీనిచీనాంబరపరిధానంబులను మహనీయ మాల్యాభరణంబులను బ్రస్ఫీతమణిమయ భూషణధారణంబులను దగ నలంకృతుం డై తమ్ములుం దగువారలుం బరివేష్టింపఁ బరిమళపరంపరాభాసితనూతనతైలధారాభిషేక ప్రదీపితంబులయిన కరదీపికాసహస్రంబులు వెలుంగ వేత్రహస్తులు దొలంగుఁడు తొలంగుండని సందడి నెడ గలుగ జడియ వందిసందోహంబులు సంకీర్తనంబులు సేయ మాగధమంజులగానంబులు వీనులం బొరయఁ బాఠక పఠనరవంబుల మనంబు రంజిల్ల రమణీయరత్నఖచితం బగు రథం బెక్కి మందగమనంబున మందాకినీనందనుమందిరంబు సేరం జని తదీయద్వారంబునం దేరు డిగ్గి దుశ్శాసను ముంజేయి కరతలంబున నవలంబించి యల్లన నడచి యుచితప్రకారంబునం బ్రవేశించి యప్పితామహు పాదంబులకుం బ్రణామంబులు సేసి తత్పీఠ సమీపంబున సమంచిత కనకాసనంబున నతం డనుప నాసీనుం డై చేతులు మొగిచి యమ్మనుజపతి యతనితో నిట్లనియె. 169

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కర్ణసౌబలులన్= కర్ణుడిని, శకునిని; నిజనివాసంబులకున్= తమ భవనాలకు; పోవన్= పోవడానికి; పనిచి= పంపి; బహుప్రకార= నానావిధాలైన; సౌరభ= వాసనలచేత; సంవాసితంబులు+అగు= వాసనగలవిగా చేయబడిన, జలంబులన్= నీళ్ళతో; జలకంబు+ఆడి= స్నానంచేసి; పరమ= మేలైన; సురభి= వాసనతో కూడిన; చందన= గంధము యొక్క; అనులేపనంబులను= మైపూతల చేతను; చీనిచీనాంబర పరిధానంబులను= పట్టు ధోవతి, పైకండువాలతో; మహనీయమాల్య+

ఆభరణంబులను= జిగేలుమనిపించే పూలదండలతో, ప్రస్ఫీత= మిక్కిలి అధికమైన; మణిమయ= రత్నాలు చెక్కిన; భూషణ= అలంకారాల; ధారణంబులను= ధరించటం చేత; తగన్= ఒప్పిదంగా; అలంకృతుండు+ఐ= అలంకరించుకొన్నవాడై; తమ్ములున్= తన తమ్ములు దుశ్శాసనాదులు; తగువారలున్= ఉండతగ్గవారును; పరివేష్టింపన్= తన్ను చుట్టి ఉండగా; పరిమళ= వాసనలయొక్క; పరంపరా= వరుసలచేత; ఆభాసిత= అంతటను వెలుగునిచ్చే; నూతన= అప్పుడే గానుగ నుండి తెచ్చిన; తైల= నూనెయొక్క; ధారా= ధారల యొక్క; అభిషేక= స్నానంచేత; ప్రదీపితంబులు+అయిన= వెలుగిచ్చేటివైన; కరదీపికా సహస్రంబులు= చేదివిటీలవేలు; వెలుంగన్= వెలుగుతుండగా; వేత్రహస్తులు= బెత్తాలు చేతపట్టుకొన్న సేవకులు; తొలంగుఁడు+తొలంగుఁడు+అని= దూరంగా జరిగి ఉండండి అని; సందడిన్= జనాన్ని తొలగించడంచేత; ఎడన్= అవకాశము; కలుగన్= ఏర్పడునట్లు; జడియన్= తొలగించగా; వందిసందోహంబులు= బట్టువారి గుంపు; సంకీర్తనంబులు+చేయన్= పొగడ్తలు చేయగా; మాగధమంజుల గానంబులు= ప్రభువు వంశాన్ని, వీరత్వాన్ని పొగిడేవారి ఇంపైన పాటలు; వీనులన్= చెవులకు, పొరయన్= సోకగా; పాఠక పఠన రవంబులన్= చదివేవారి చదువుల శబ్దాలచేత; మనంబు= మనస్సు; రంజిల్లన్= రసాన్ని అనుభవించగా; రమణీయ రత్న+ఖచితంబు+అగు= మనోహరాలైన మణులు తాపినట్టి; రథంబున్+ఎక్కి; మందగమనంబునన్= మెల్లగా ప్రయాణిస్తూ మందాకినీ నందను మందిరంబు= భీష్ముడి భవనాన్ని; చేరన్+చని= చేరునట్లు వెళ్ళి, తదీయద్వారంబునన్= ఆ భవనం గడప వద్ద; తేరుడిగ్గి= రథాన్నుండి దిగి; దుశ్శాసనుముందు+చేయి= దుశ్శాసనుడి చేతిని; కరతలంబునన్= తన చేతితో, అవలంబించి= పట్టుకొని; అల్లన= మెల్లగా; నడచి= అడుగులు వేసి; ఉచిత ప్రకారంబునన్= తగినరీతిగా; ప్రవేశించి= లోనికిపోయి; ఆ+పితామహుపాదంబులకున్= ఆ భీష్ముడి పాదాలకు; ప్రణామంబులు= దండాలు; చేసి= పెట్టి; తద్+పీఠసమీపంబునన్= ఆ భీష్ముడి ఆసనానికి దగ్గరగా; సముచిత కనక+ఆసనంబునన్= మేలైన బంగారు పీఠంమీద; అతండు= ఆ భీష్ముడు; అనుపన్= ఆజ్ఞాపించగా; ఆసీనుండు+ఐ= కూరుచున్న వాడై; చేతులు మొగిచి= చేతులు జోడించి; ఆ+మనుజపతి= ఆ దుర్యోధనుడు; అతనితోన్= ఆ భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఈ విధంగా కర్ణుడిని, శకునిని, వారి నివాసాలకు పంపించి వేశాడు. పన్నీరు, అత్తరు వంటి సువాసన ద్రవ్యాలతో గుబాళించే నీటితో స్నానం చేశాడు. మంచి వాసనగల మేలుగంధం, ఒంటికి దట్టంగా పూసుకొన్నాడు. పట్టుబట్టలు కట్టుకొన్నాడు. పట్టుకండువాలుపైన వేసుకొన్నాడు. వాసనగల పూలదండలు తగిలించుకొన్నాడు. వ్యాపించే కాంతిగల రత్నాలు పొదిగిన బాహుపురులు, మెరపుగల నగలు, పెట్టుకొన్నాడు. ఉచితమైన పరివారం అనుసరించగా, వాసనలు విరజిమ్మే కొత్త నూనెలు పోయటంచే జగజ్జేగీయమానంగా వెలిగే చాలా చేదివిటీలు వెలుగుతూండగా, భటులు బెత్తాలు చేత పట్టుకొని, 'తొలగండి తొలగండి' అని జనాన్ని అదలిస్తుండగా, ఏర్పడ్డ అవకాశంలో(సందు) భట్రాజులు పొగడుతు ఉండగా, మాగధులు ప్రభువు యొక్క ప్రాభవాన్ని పాడుతూ ఉంటే ఆలకిస్తూ, చదివే వాళ్ళ చదువులు మనస్సుకు ఇంపుగొల్పుతూ ఉంటే, మేలి రత్నాలు తాపిన తేరెక్కి, మందగమనంతో భీష్ముడి నివాసానికి చేరుకొని, ఆ భవన ద్వారం వద్ద తేరుదిగి, దుశ్శాసనుడి చేతిని ఆధారంగా పట్టుకొని, మెల్లగా అడుగులుపెడుతూ, తగిన విధంగా వినయంగా లోపలికి పోయి, భీష్ముడి అడుగులకు దండాలు పెట్టి, ఆయన పీఠానికి దగ్గరలో, ఒప్పిదమైన బంగారుపీటమీద ఆయన అనుమతితో కూర్చొని చేతులు జోడించి, దుర్యోధనుడు భీష్ముడితో ఇట్లా అన్నాడు.

మ. **నిను మున్నెంతయు నమ్మి పాండవుల యున్మేషంబు నేఁ జీరికిం**
గొన నీపోరెడు చందముల్ దెలియఁ బెక్కుల్ సూచితిం జేరి చే
రి నయం బిచ్చుచు నొంప నూల్కొనక వారిం బట్టి పాలార్చె దొం
డన నేరం గురుముఖ్య! యింక నిట నీ వాలంబు సాలింపవే! **170**

ప్రతిపదార్థం: కురుముఖ్య!= కురువంశంలో ప్రధానుడవైన భీష్మా!; నినున్; మున్ను= మొదట, ఎంతయున్= ఎంతగానో; నమ్మి= విశ్వసించి; పాండవుల యున్మేషంబున్= పాండురాజు కొడుకుల వికాసాన్ని; ఏన్= నేను; చీరికిన్+కొనన్= లెక్కపెట్టను; నీ పోరెడుచందముల్= నీవు యుద్ధం చేసేవిధానాలను; తెలియన్= విశదం కావడానికి; పెక్కుల్= చాలా; చూచితిన్= చూచాను, వారిన్= ఆ పాండవులను; చేరి చేరి= దగ్గరకు చేరికూడా; నయంబు+ఇచ్చుచున్= మెత్తదనాన్ని చూపిస్తూ; నొంపన్= బాధపెట్టడానికి; నూల్కొనక= ఒప్పుకోకుండా; పట్టి పాలార్చెదు= చేత చిక్కించుకొని కూడా ఊరకుంటున్నావు; ఒండు అనన్+నేరన్= ఒక్కటీ నిన్ను అనలేను; ఇంకన్= ఇకమీద; ఇటన్= ఇక్కడ; నీవు; ఆలంబు= యుద్ధం చేయటాన్ని; చాలింపవే!= వదలిపెట్టుము!

తాత్పర్యం: 'ఓ భీష్మా! మొదటి నుండి నిన్ను నమ్మి, పాండవుల వికాసాన్ని లక్ష్యం చేయకుండా ఉంటూ వచ్చాను. అయితే, నీవు చాలా సందర్భాలలో యుద్ధం చేస్తున్న తీరు గమనిస్తే నాకు అర్థమవుతున్నది ఏమిటంటే- నీవు పాండవులపట్ల మెత్తదనాన్నే చూపిస్తున్నావు. వాళ్ళకు నొప్పి కలిగించకుండా ఉంటున్నావు. వాళ్ళు చేత చిక్కినా ఏమీ చేయటం లేదు. కాబట్టి నీవు ఇంక యుద్ధం చేయకుము.

చ. అనిమొన దేవదానవుల కైనను మార్కొనరాదు నిన్ను నేఁ
డెనిమిది నాళ్ళు లయ్యె సమయింపవు నొంపవు సవ్యసాచి న
ప్పని యటులుండనిమ్ము నినుఁ బ్రార్థన సేసెద నింతవట్టు నా
చనవునఁ బోవ నిచ్చి నృపసత్తమ పోరికిఁ గర్ణుఁ బంపవే! 171

ప్రతిపదార్థం: నృపసత్తమ!= రాజుల్లో గొప్పవాడవైన భీష్మా!; అనిమొనన్= యుద్ధరంగంలో; దేవదానవులకున్+ఐనను= దేవతలకుగానీ, రాక్షసులకుగానీ; నిన్ను; మార్కొనన్+రాదు= ఎదిరించడానికి సాధ్యంకాదు; నేఁడు= నేటికి; ఎనిమిదినాళులు+అయ్యెన్= యుద్ధం మొదలుపెట్టి నేటికి, ఎనిమిది దినాలు గడిచినాయి; సవ్యసాచిన్= అర్జునుడిని; సమయింపవు= చంపవు; నొంపవు= బాధకూడా పెట్టలేదు; ఆ+పని= అర్జునుణ్ణి హింసించే ఆ పని; అటులు ఉండనిమ్ము; అట్లా ఉండనీ; నినున్= నిన్ను; ఇంత+పట్టు= ఇంతమాత్రం; ప్రార్థన+చేసెదన్= వేడుకొంటున్నాను; నా చనవునన్= నా కోరిక ప్రకారం; పోవన్+ఇచ్చి= నన్ను నడుచుకునేటట్లు చేసి; కర్ణున్= కర్ణుడిని; పోరికిన్= యుద్ధానికి; పంపవే?= పంపవా?.

తాత్పర్యం: తాతా! భీష్మా! నిన్ను యుద్ధంలో దేవతలుగాని, రాక్షసులుగాని ఎవ్వరూ ఎదుర్కొనలేరు. యుద్ధంమొదలుపెట్టి ఈనాటికి ఎనిమిది రోజులు గడిచాయి. నీవేమో ఈ నాటిదాకా అర్జునుడిని చంపలేదు. చివరకు బాధించనుకూడా లేదు. సరే ఆ పని అట్లా ఉండనిమ్ము. నిన్ను మాత్రం వేడుకొంటున్నాను, అదేమంటే నన్ను నా కోరిక ప్రకారం నడుచుకోనిమ్ము, ఇక యుద్ధానికి కర్ణుడిని పంపించుము.

వ. అనవుడు. 172

తాత్పర్యం: దుర్యోధనుడు ఇట్లా అనగా (తరువాతి పద్యంతో అన్వయం)

క. అమ్మాట మనమునకు వా । లమ్మై తాఁకుటయు భీష్ముఁ డత్యంతవిషా
దమ్మున నించుకవడి మౌ । నమ్ముఁ దగం దాల్చియుండె నతవదనుం డై. 173

ప్రతిపదార్థం: భీష్ముఁడు= భీష్మాచార్యుడు; ఆ+మాట= దుర్యోధనుడన్న ఆపలుకు; మనమునకున్= మనస్సుకు; వాలు+అమ్ము+ఐ= వాడి బాణంగా; తాఁకుటయున్= గ్రుచ్చుకోగా; అత్యంత విషాదమ్మునన్= చాల దుఃఖంతో; ఇంచుక+వడి= కొంచెంసేపు; తగన్= ఆ దుఖానికి తగినట్లుగా; మౌనమ్మున్= మౌనాన్ని; తాల్చి= వహించి; నతవదనుండు+ఐ= వంచబడ్డ ముఖం కలవాడై; ఉండెన్= ఉండినాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు పలికిన పలుకులు ములుకులుగా భీష్ముడి మనస్సున గ్రుచ్చుకొన్నాయి. భీష్ముడు చాలా బాధతో, తలవంచుకొని ఏమీ మాట్లాడకుండా కొంచెంసేపు మౌనంగా ఉండి పోయాడు.

వ. పదంపడి నిట్టూర్పు నిగిడించి మొగం బెగయించి భూపాలు నాలోకించి. 174

ప్రతిపదార్థం: పదంపడి= అటు తర్వాత; నిడు+ఊర్పు= దీర్ఘమైన నిశ్వాసం; నిగిడించి= వదలిపెట్టి; మొగంబు= ముఖాన్ని; ఎగయించి= పైకెత్తి; భూపాలున్= రాజైన దుర్యోధనుడిని; ఆలోకించి.

తాత్పర్యం: భీష్ముడు అంతట పెద్ద నిట్టూర్పు వదలి, ముఖం పైకెత్తాడు. రారాజును చూచి.

క. ' తలకొని నీకుం బ్రాణంబులు డాఁ । పక యోపినట్లు పోరఁగ నిమ్మెఁ
బలుకఁదగునె? యక్కట! నా । వలనం గలభక్తి యెల్ల వమ్మునఁ గలయన్? 175

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో! తలకొని= ప్రయత్నపడి; నీకున్= దుర్యోధనుడవైననీకు; ప్రాణంబులు= ప్రాణాలను; డాఁపక= దాచుకోక; ఓపిన అట్లు= చేతనైనంతవరకు; పోరఁగన్= (నేను) యుద్ధం చేస్తే; నావలనన్= నాపట్ల; కల= ఉన్నట్టి; భక్తి+ఎల్లన్= ప్రభుభక్తి అంతాకూడా; వమ్మునన్+కలయన్= వ్యర్థమైపోగా; ఈ+ మెయిన్= ఈ విధంగా; పలుకన్= మాట్లాడటం; తగునె?= తగునా? (తగదు).

తాత్పర్యం: 'దుర్యోధనా! నీకు జయం కలగాలని నా ప్రాణాలను కూడా దాచుకోకుండా శక్తి వంచన లేకుండా నేను యుద్ధం చేస్తూ ఉంటే నాకుగల ప్రభుభక్తి అంతా బుగ్గిపాలయ్యేట్లు నీవు ఈ విధంగా కఠినంగా మాట్లాడడం ఏమి న్యాయం?' అన్నాడు భీష్ముడు.

వ. అని పలికి యలుక వొడమి వెండియు. 176

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; అలుక= కోపము; పొడమి= పుట్టి; వెండియున్= మరల

తాత్పర్యం: అని, కోపంతో మండిపడుతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ' కాల్పడే మహనీయ ఖాండవం బింద్రుని । నమరగణంబుతో విముఖుఁ జేసి?
బహుదివ్యశరములు వడయఁడే? యెక్కటి । బవరాన మెప్పించి శివునిచేత?
గంధర్వులకు నోడి కర్ణుండు నీ తమ్ము । లును బాఱ విడిపించికొనఁడె నిన్ను?
నిను నను ద్రోణు నాతని పుత్త్రుఁ గృపుఁ గర్ణు । గెలిచి విరాటుగోవులఁ గొనండె?

ఆ. తక్కు పెక్కులెడలఁ బెక్కండ్ర నేమేమి । సేసె వినమె? యట్టి జెట్టి నిన్న
దినము లిట్లు దొడరి పెనఁగియు నీ చేత । నేఁడు వినఁగ వలసె వేఁడిపలుకు. 177

ప్రతిపదార్థం: అమరగణంబుతోన్= దేవతల సమూహంతోపాటు; ఇంద్రునిన్= దేవేంద్రుణ్ణి; విముఖున్+చేసి= యుద్ధానికి పెడమొగం పెట్టేవాడిగా చేసి; మహనీయఖాండవంబున్= మాననీయమైన ఖాండవం అనే అరణ్యాన్ని; కాల్పఁడు+ఏ?= కాల్చలేదా?; ఎక్కటి= తనకు సహాయుడు లేనట్టి; బవరానన్= యుద్ధంలో; మెప్పించి; శివునిచేతన్= ఈశ్వరుడి చేత; బహుదివ్య శరములు= నానావిధాలైన దివ్యములైన బాణాలను; పడయఁడు+ఏ?= పొందలేదా?; కర్ణుండు= సూతపుత్రుడు; నీ తమ్ములునున్= నీ తమ్ముళ్ళు దుశ్శాసనాదులు; గంధర్వులకున్= గంధర్వుల దెబ్బకు; పాఱన్= పరుగుతీయగా; నిన్నున్; విడిపించికొనఁడు+ఎ?= విడిపించుకోలేదా?; నిను(న్)= నిన్ను (దుర్యోధనుడిని); ననున్= నన్ను; ద్రోణున్= ద్రోణాచార్యుడిని; ఆతనిపుత్త్రున్= ద్రోణుడి

కుమారుడు అశ్వత్థామను; కృపున్= కృపాచార్యుడిని; కర్ణున్= కర్ణుడిని; గెలిచి= జయించి; విరాటు గోవులన్= విరాటరాజు ఆవులను; కొనండు+ఎ?= మళ్ళించుకోలేదా?; తక్కు= తక్కిన; పెక్కులు+ఎడలన్= పలు తావులలో; పెక్కండ్రన్= చాలామంది వీరులను; ఏమి+ఏమి+చేసెన్= ఏమేమి చేశాడో; వినము+ఎ?= మనం వినలేదా?; అట్టిజెట్టిన్= అట్టి మహా శూరుడైన అర్జునుడిని; ఇన్ని దినములు= ఈ ఎనిమిది రోజులు; ఇట్లు= ఇంతఘోరంగా; తొడరి= ఎదిరించి; పెనఁగియున్= యుద్ధం చేసికూడా; నేఁడు= ఈ దినం; నీ చేతన్= నీచేత; వేఁడి పలుకు= తీక్ష్ణమైన మాట; వినఁగ+వలసెన్= వినవలసి వచ్చింది.

తాత్పర్యం: 'దేవతలతో పాటు, దేవేంద్రుడంతటి వాడిని కూడా యుద్ధానికి పెడమొగం పెట్టే వాడినిగా చేసి ఖాండవ వనాన్ని కాల్చివేశాడు కదా! తాను ఏకాకిగా యుద్ధం చేసి శివుడంతటి వాడిని మెప్పించి, పాశుపతం మొదలైన దివ్యాస్త్రాలు సంపాదించుకొన్నాడు కదా! నీవు, నీ తమ్ముళ్ళు, కర్ణుడు అందరూ గంధర్వుల దెబ్బకు నిలువలేకపారిపోగా, వారి బారినుండి ఆ అర్జునుడు నిన్ను విడిపించుకొన్నాడు గదా! ఉత్తర గోగ్రహణంలో, నిన్ను, నన్ను, ద్రోణుడిని, ఆయన కొడుకును, కృపుడిని, కర్ణుడిని ఒక్కడే గెలిచాడు కదా! ఇంకా ఎన్నెన్నో చోట్ల ఎందరెందరినో ఏమేమి చేశాడో మనం విన్నాం కదా! అలాంటి వీరుడితో ఈ ఎనిమిది దినాలు ఎదిరించి యుద్ధం చేసినట్టి నేను ఈనాడు, నీచేత చుఱుకుమనిపించే మాటలు వినవలసి వచ్చింది. (అని భీష్ముడు వాపోతున్నాడు.)

క. తగనిపని యని తలంపక । పగ గొంటి వజేయులైన పాండుసుతులతోఁ
దెగి యింక నీవు రణమున । మగఁటిమి వాటింపు రిత్తమాటల నగునే? 178

ప్రతిపదార్థం: తగనిపని+అని= చేయరాని పని అని; తలంపక= ఆలోచించకుండా; అజేయులు+ఐన= జయింపరానివారైన; పాండుసుతులతోన్= పాండురాజు కొడుకులతో; పగ+కొంటివి= విరోధాన్ని పూనావు; ఇంకన్; నీవు; తెగి= సాహసించి; రణమునన్= యుద్ధంలో; మగటిమిన్= పౌరుషాన్ని; పాటింపు(ము)= ప్రకటించుము; రిత్తమాటలన్= ఉత్త ఉత్తమాటలతో; అగునే?= సమకూడునా?

తాత్పర్యం: కాని పని అనే ఆలోచన లేకుండా, జయింపరాని పాండవులతో విరోధాన్ని కొని తెచ్చుకొన్నావు. ఇంక నీవు యుద్ధంలో సాహసంతో పౌరుషాన్ని బాగా చూపుము. అంతేగాని, కల్లబొల్లి మాటలతో ఏమి ప్రయోజనం?

వ. అని మఱియును. 179

తాత్పర్యం: ఇంకను,

క. ' గాండీవి గెలువ రాదు శి । ఖండిని జంపంగ నాకుఁ గాదు వినుము న
న్నొండుమగలు మార్కొనినం । జెండుదు నుగ్రముగ మున్న చెప్పితి నీకున్. 180

ప్రతిపదార్థం: నాకున్= భీష్ముడనైన నాకు; గాండీవిన్= అర్జునుడిని; గెలువన్‌రాదు= జయించ వీలుకాదు; శిఖండిని= ద్రుపదుని కొడుకు శిఖండిని; చంపఁగన్= చంపడానికి; కాదు= నావల్ల కాదు; వినుము; ఒండు+మగలు= వేరే వీరులు, నన్నున్; మార్కొనినన్= ఎదిరిస్తే; ఉగ్రముగన్= భయంకరంగా; చెండుదున్= నరుకుతాను; నీకున్; మున్ను+అ= ముందుగానే; చెప్పితిన్= ఈ మాట చెప్పాను.

తాత్పర్యం: దుర్యోధనా! నేనేమో అర్జునుడిని జయించలేను, శిఖండిని కూడా చంపలేను, బాగా వినుము. తక్కినవారు ఎంతటి వీరులైనా సరే, నన్నెదిరించారంటే చీల్చిచెండాడుతాను. ఈ సంగతి నీకు ఇంతకు ముందే చెప్పాను.

క. ఏనును నాదళమున ద్రుప । దానీకవిరాటసైన్యయాదవబలసం
తానములతోడఁ బెనఁగెదఁ । బూనుఁడు మీ రెల్లఁ బాండుపుత్త్రుల గెలువన్. 181

ప్రతిపదార్థం: ఏనును= నేను; నా దళమునన్= నా సైన్యంలో; ద్రుపద= ద్రుపదమహారాజుయొక్క; అనీక= సైన్యంతో; విరాట= విరాటరాజుయొక్క; సైన్య= దండుతో; యాదవ= యదువంశంలో పుట్టినవారియొక్క; బల= సేనయొక్క; సంతానములతోడన్= సమూహాలతో; పెనఁగెదన్= యుద్ధం చేస్తాను; మీరు+ఎల్లన్= మీరందరుకలిసి; పాండుపుత్త్రులన్= పంచపాండవుల్ని; గెలువన్= జయించటానికి; పూనుఁడు= ప్రయత్నపడండి.

తాత్పర్యం: నేనూ, నా సైన్యం కలిసి ద్రుపద విరాట యాదవ సేనా సమూహాన్ని ఎదుర్కొని యుద్ధం చేస్తాము. తక్కిన మీరందరూ ఏకమై పాండవులను గెలవటానికి ప్రయత్నించండి.

ఆ. నడికిరేయి వచ్చి నను నొవ్వ బలికినఁ । కలుగునయ్య జయము? గడఁగి నీవు
నడవు మనికి నెల్లి నా చేతి బలుపు సూ । చెదవుగాక వేయి సెప్పనేల?' 182

ప్రతిపదార్థం: నడికిరేయి= అర్ధరాత్రివేళలో; వచ్చి= నా సమీపానికి వచ్చి; ననున్= నన్ను; నొవ్వన్= నొప్పి కలిగేట్లుగా; పలికినన్= మాటాడితే; జయము= గెలుపు; కలుగున్+అయ్య?= లభిస్తుందా?; నీవు; కడఁగి= ప్రయత్నించి; అనికిన్= యుద్ధానికి; నడవుము= బయలుదేరుము; వేయి= వెయ్యిమాటలు; చెప్పన్+ఏల?= చెప్పడం ఎందుకు?; ఎల్లి= రేపు; నా చేతి బలుపు= నా బాహుబలాన్ని; చూచెదవుగాక= చూస్తావులే.

తాత్పర్యం: 'దుర్యోధనా! అర్ధరాత్రి సమయంలో వచ్చి నీవు నన్ను బాధకలిగేట్లుగా సూటిపోటి మాటలు మాట్లాడినావుకదా! దీని చేత గెలుపు కలుగుతుందా? నీవు రేపు యుద్ధానికి సన్నద్ధుడవై వెళ్ళుము. వేయి మాటలు పలకటం ఎందుకు? నా బాహుబలాన్ని రేపు నీవు చూస్తావులే!'

క. అనినఁ బ్రియమంది నగరికిఁ । జని పతి సుఖనిద్ర సేసి సముచితసమయం
బున మేలు కాంచి కయ్యం । బున కాయిత మయ్యె మేను పొంగారంగాన్. 183

ప్రతిపదార్థం: అనినన్= భీష్ముడు చెప్పగా; పతి= రాజు; ప్రియము+అంది= సంతోషపడి; నగరికిన్= తన రాజ భవనానికి; చని= వెళ్ళి; సుఖనిద్ర+చేసి= సుఖంగా నిద్రించి; సముచిత సమయంబునన్= తగిన వేళలో; మేలుకాంచి= నిద్రనుండి మేల్కొని; మేను= శరీరం; పొంగు+ఆరంగాన్= ఉబ్బగా; కయ్యంబునకున్= యుద్ధానికి; ఆయితము+అయ్యెన్= సిద్ధపడ్డాడు.

తాత్పర్యం: భీష్ముడన్న మాటలకు దుర్యోధనుడు సంతోషించి, నగరులోనికి వెళ్ళి, బాగా నిద్రపోయి, సకాలంలో లేచి, తన శరీరం ఉప్పొంగిపోతూండగా యుద్ధానికి తయారయ్యాడు.

వ. ఇట్లు సన్నద్ధుం డయి బలంబుతో వెడలి నీ పుత్త్రుండు భీష్ము నుపలక్షించి భూపతిప్రకరంబులతో ని ట్లనియె. 184

ప్రతిపదార్థం: నీ పుత్త్రుండు= నీ కొడుకు దుర్యోధనుడు; ఇట్లు చెప్పిన విధంగా; సన్నద్ధుండు+అయి= సిద్ధపడినవాడై; బలంబుతోన్= సైన్యంతో; వెడలి= బయలుదేరి; భీష్మున్= భీష్ముడిని; ఉపలక్షించి= చూచి; భూపతిప్రకరంబులతోన్= రాజుల సమూహముతో; ఇట్లు+అనియెన్= ఈ చెప్పబోయే విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు యుద్ధానికి సిద్ధపడి, కవచం తొడుగుకొని తన సేనతో వెళ్ళి, భీష్ముడిని చూస్తూ అక్కడ ఉండే రాజులందరితో ఈ విధంగా చెప్పాడు.

భీష్ముని నవమదివస యుద్ధము (సం. 6-95-1)

తే. ' ఇతఁడు పాంచాలు రాదిగ నెల్ల బలముఁ । జంపి పాండుతనూజుల సమరభూమి
గెలువఁ గలవాఁడ నని రాత్రి వలికె నేఁడు । దఱిమి మనలావుఁ జేవయు మెఱయ వలయు.' 185

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ భీష్ముడు; పాంచాలురు+ఆదిగన్= ద్రుపద మహారాజు మొదలుగాగల; ఎల్లబలమున్= సకల సైన్యాన్ని; చంపి; సమరభూమిన్= యుద్ధరంగంలో; పాండుతనూజులన్= పాండవులను; గెలువన్+కలవాఁడన్+అని= గెలుస్తానని, రాత్రి= కడచిన రేయి; పలికెన్= చెప్పాడు; నేఁడు= ఈ దినం; తఱిమి; మనలావున్= మనసామర్థ్యం; చేవయున్= బలంకూడా; మెఱయవలయున్= ప్రకటించవలె.

తాత్పర్యం: 'ఈ భీష్ముడు రాత్రి నాతో ద్రుపద విరాట యాదవుల సైన్యాలను చంపి, యుద్ధరంగంలో అటుపైన పాండవుల గెలిచెదనని అన్నాడు. కాబట్టి మనందరి సామర్థ్యం, బలం ఈ దినమే వెల్లడి కావాలి' అన్నాడు.

క. అని యాడు తులువమాటలు విని । బీభత్సంబు సిగ్గు విపులవిషాదం
బును నొక్కపెట్ట పుట్టఁగ । ననిమిషతటినీతనూజుఁ డతిదుఃఖితుఁడై. 186

ప్రతిపదార్థం: అని; ఆడు= అని పలికే దుర్యోధనుడి యొక్క; తులువమాటలు= కుత్సితపు మాటలు; విని= ఆలకించి; అనిమిషతటినీ తనూజుఁడు= ఆకాశగంగానది కొడుకు- భీష్ముడు; బీభత్సంబు= రోత, సిగ్గు, లజ్జ; విపుల విషాదంబును= అధికమైన దుఃఖము; ఒక్కపెట్ట= ఒక్క సారిగా; పుట్టఁగన్= తనలో పుట్టగా; అతి దుఃఖితుఁడు+ఐ= చాలా దుఃఖం చెందినవాడై.

తాత్పర్యం: దుర్యోధనుడు పలికిన అబద్ధపు మాటలు విన్నాడు భీష్ముడు. ఆయనలో ఒక్కుమ్మడిగా ఏవగింపు, లజ్జ, మనోదుఃఖం అధికంగా కలిగాయి.

వ. తన్నుం దాన యుపశమించుకొనియున్నం గనుంగొని కౌరవేశ్వరుండతని కన్నెఱింగినవాఁడై దుశ్శాసనునితో నిట్లనియె. 187

ప్రతిపదార్థం: తన్నున్= తనను(భీష్ముని); తాను+అ= తానే (భీష్ముడు); ఉపశమించుకొని= ఊరడింపచేసికొని; ఉన్నన్= ఉండగా; కనుంగొని= చూచి; కౌరవ+ఈశ్వరుండు= దుర్యోధనుడు; అతని= ఆ భీష్ముడి; కన్ను+ఎఱింగినవాఁడు+ఐ= జాడను తెలిసికొన్నవాడై; దుశ్శాసనునితోన్= తన తమ్ముడితో, ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు తనను తానే ఓదార్చుకొన్నాడు. దుర్యోధనుడు భీష్ముడి తీరును తెలిసికొని, దుశ్శాసనుడితో ఇట్లా అన్నాడు.

క. ' మనమెల్లఁ బితామహునొ । ద్దన యుండుద మదియుఁ గా కితనిముందటఁ బె
ట్టన వలయు శత్రుబలమ । ర్దను లిరువదిరెండువేలరథములవారిన్. 188

ప్రతిపదార్థం: మనము+ఎల్లన్= మనమందరం (దుర్యోధనాదులు); పితామహు+ఒద్దన్+అ= తాత భీష్ముడి దగ్గరే; ఉండుదము= ఉందాము; అదియున్+కాక= అంత మాత్రమే కాకుండా; ఇతని ముందటన్= ఈ భీష్ముడికి ముందుగా; శత్రుబల మర్దనులు= విరోధుల సైన్యాలను కొట్టగలిగినట్టి; ఇరువది రెండువేల రథములవారిన్= ఇరవై రెండువేలు రథికులను; పెట్టన వలయున్= ఉంచాలి.

తాత్పర్యం: 'మనమందరం భీష్ముడి దగ్గరే ఉందాము. అంతేకాదు, శత్రుసైన్యాలను బాగా కొట్టగలిగినట్టి ఇరవై రెండువేల రథికులను కూడ ఇతని ముందరే ఉంచాలి.

వ. అని నియోగించిన నతండట్ల చేసె. నద్ధరణీశుండు గురుకృపాశ్వత్థామల నాలోకించి గాంగేయుం జూపి "సత్యవ్రతుండగునీతండు శిఖండిపై నేయనని మన మెత్తి విడియునాఁడ చెప్పట మీ రెఱుంగుదుర కాదె! యన్నీచునకు గోచరంబు గాకుండ నిమ్మహానుభావుం బొదివికొని రావలయు" ననిన వారలు నట్లకాకయని రయ్యమరనదీసూనుండు సర్వతోభద్రవ్యూహం బొనర్చె నందుఁ గృపాచార్యకృతవర్మ శల్యశకునిసుదక్షిణ సైంధవులును గురుకుమారులుం దానును ముందట నిలిచెఁ దదనుమతిం గుంభసంభవభూరిశ్రవోభగదత్తులు వలపటను, సోమదత్తద్రోణపుత్రవిందానువిందులు దాపటను హలాయుధాలంబుసశ్రుతాయువులు వెనుకను ద్రిగర్త ప్రకరపరివృతుం డై జననాథుండు నడుమను నిలిచి రంతకు మున్న కౌంతేయులు సైన్యసమేతంబుగా వెడలి రట్టియెడ నర్జునుండు మన మొగ్గరంబు సూచి ధృష్టద్యుమ్నున కి ట్లనియె. 189

ప్రతిపదార్థం: అని= పైన చెప్పిన రీతిగా; నియోగించినన్= ఏర్పాటు చేయగా; అతండు= దుశ్శాసనుండు; అట్లు+అ= దుర్యోధనుడు చెప్పిన మాదిరిగానే; చేసెన్= ఏర్పాటు చేశాడు; ఆ+ధరణీశుండు= ఆ దుర్యోధనుడు; కృప+అశ్వత్థామలన్= కృపుడినీ, అశ్వత్థామను; ఆలోకించి= చూచి; గాంగేయున్= భీష్ముణ్ణి; చూపి= చూపించి; సత్యవ్రతుండు+అగు= సత్యమే వ్రతంగాగల; ఈతండు= ఈ భీష్ముడు; శిఖండి= శిఖండిమీద; ఏయన్+అని= బాణాలు వేయనని; మనము= మనము; ఎత్తి విడియునాఁడు+అ= దండెత్తి వచ్చిననాడే; చెప్పుట= చెప్పటాన్ని; మీరు= కృపాశ్వత్థామలు; ఎఱుంగుదురు+అ+కాదె!= మీరు తెలిసికొన్నదే కదా!; ఆ+నీచునకున్= హీనుడైన ఆ శిఖండికి; గోచరంబు కాకుండన్= కంటపడకుండా; ఈ+మహానుభావున్= గొప్ప ప్రభావం కలిగినట్టి భీష్ముడిని; పొదివికొని రావలయున్= క్రమ్ముకొని ఉండాలి; అనినన్= అనిచెప్పగా; వారలున్= ఆ కృపాశ్వత్థామలు కూడ; అట్లు+అ+కాక= అట్లే కానిమ్ము; అనిరి= అన్నారు; ఆ+అమరనదీసూనుండు= ఆకాశ గంగానది కొడుకు- భీష్ముడు; సర్వతోభద్ర వ్యూహంబున్= సర్వతోభద్రమనే మొగ్గరాన్ని; ఒనర్చెన్= చేశాడు; అందున్= ఆ మొగ్గరంలో; కృపాచార్య, కృతవర్మ, శల్య, శకుని, సుదక్షిణ; సైంధవులును, కురుకుమారులున్= కౌరవులున్నూ; తానును= భీష్ముడున్నూ; ముందటన్= మొగ్గరానికి ముందువైపు; నిలిచెన్= నిలిచాడు; తద్+అనుమతిన్= ఆ దుర్యోధనుడి ఆజ్ఞచొప్పున; కుంభసంభవ= ద్రోణుడు; భూరిశ్రవస్, భగదత్తులు-వీరు; వలపటను= కుడిభాగంలో; సోమదత్త= సోమదత్తుడు; ద్రోణపుత్ర= అశ్వత్థామ; వింద+అనువిందులు; దాపటను= ఎడమవైపునందు; హలాయుధ, అలంబుస, శ్రుతాయువులు; వెనుకను= వెనుకభాగంలోను; త్రిగర్త ప్రకరపరివృతుండు+ఐ= త్రిగర్త దేశపు గుంపుతో చుట్టబడి; జననాథుండు= రాజు దుర్యోధనుడు; నడుమను= మధ్యభాగంలోను; నిలిచిరి= నిల్చారు; అంతకు మున్న= అంతకుముందే; కౌంతేయులు= పాండవులు; సైన్య సమేతంబుగాన్= సేనతోకూడ; వెడలిరి= వచ్చారు; అట్టి ఎడన్= ఆ సమయంలో; అర్జునుఁడు= అర్జునుడు; మన= కౌరవులైన మనయొక్క; మొగ్గరంబున్= వ్యూహాన్ని; చూచి; ధృష్టద్యుమ్ననకున్= తమ సేనాని ధృష్టద్యుమ్నుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు పైవిధంగా చెప్పి, భీష్ముడిని చూపిస్తూ , కృపాశ్వత్థామలతో ఇట్లా అన్నాడు. 'ఈ సత్యవ్రతుడు శిఖండిమీద బాణప్రయోగం చేయనని మనం - దండెత్తి వచ్చిననాడే చెప్పాడు. ఆ సంగతి మీకు తెలుసుకదా! ఆ నీచుడు శిఖండి ఈయన కంటబడకుండా మనం ఈయనను కమ్ముకొని ఉండాలి'. వారు ఆ మాటకు సమ్మతించారు. భీష్ముడు సర్వతోభద్రవ్యూహాన్ని ఏర్పాటు చేశాడు. ఆ వ్యూహంలో కృపాచార్యుడు, కృతవర్మ, శల్యుడు, శకుని, సుదక్షిణుడు, సైంధవుడు, కౌరవులు, భీష్ముడు ముందుభాగంలో నిలిచారు. భీష్ముడి ఆజ్ఞ చొప్పున ద్రోణుడు, భూరిశ్రవుడు, భగదత్తుడు- కుడి భాగంలోను, సోమదత్తుడు, అశ్వత్థామ, విందుడు, అనువిందుడు- ఎడమవైపున నిలుచున్నారు. హలాయుధుడు, అలంబుసుడు, శ్రుతాయువు- వీరు వెనుక వైపున ఉన్నారు. త్రిగర్త సైన్యంతో చుట్టబడి, దుర్యోధనుడు మధ్యభాగంలో నిలిచాడు. అంతకుమునుపే పాండవులు సేనలతో గూడ బయలుదేరారు. అప్పుడు అర్జునుడు మన సర్వతోభద్రవ్యూహాన్ని చూచి ధృష్టద్యుమ్నుడితో ఇలా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం : సర్వతోభద్రవ్యూహం నాలుగువైపుల నుండి శత్రువులను చొరనీక ఎదిరించడానికి అనువైనది.

తే. ' కంటె గాంగేయు? నతనిచక్కటి శిఖండిఁ। బెట్టు మీతని మనమెల్లఁ బిండుగట్టి
పొదివికొనివత్త మివ్విధంబునకుఁ దగ ద। ళంబుగా మోహరింపు బలంబు నెల్ల.' 190

ప్రతిపదార్థం: గాంగేయున్= భీష్ముణ్ణి; కంటె?= చూచావా?; అతని చక్కటిన్= ఆ భీష్ముడుండే దిక్కున; శిఖండిన్= శిఖండిని; పెట్టుము= నిలబెట్టుము; మనము+ఎల్లన్= మనమందరం; ఈతనిన్= ఈ శిఖండిని; పిండుగట్టి= గుంపుగా; పొదివికొని= క్రమ్ముకొని; వత్తము= వద్దాము; ఈ+విధంబునకున్= ఈ విధానానికి; తగన్= తగినట్టుగా; బలంబు+ఎల్లన్= మన సైన్యాన్నంతా; దళంబు+కాన్= దట్టంగా; మోహరింపు(ము)= సిద్ధంచేయుము.

తాత్పర్యం: 'ధృష్టద్యుమ్నా! భీష్ముడిని చూచావా? అతడికి ఎదురుగా ఈ శిఖండిని నిలబెట్టుము. ఇతడిచుట్టూ మనమంతా కమ్ముకొని గుంపుగానిలుద్దాము. దీనికి తగినట్టుగా నీవు మన సైన్యాన్ని దట్టంగా మోహరింపచేయుము'.

వ. అనిన విని యతం డట్ల చేయుదు నని సాత్యకి విరాటులు వలపటను, అభిమన్యు పాంచాల కేకయులు దాపటను, నకులసహదేవ ద్రౌపదేయపురస్సరుండైన యుధిష్ఠిరుండు నడుమను, జేకితానకుంతి భోజులు వెనుకంగా నొనర్చి యగ్రభాగంబున శిఖండి నునిచి యతనికెలంకుల డాసి భీమసేన ఘటోత్కచు లొక్కవలనను, బార్థుండుఁ దాను నొక్కదిక్కున నిలిచి తక్కినయోధవీరులం గలయం జేర్చి గట్టిమొనగా నమర్చె నిట్లుభయ సైన్యంబులుం బన్ని భేరీభాంకారశంఖాదినిస్వనగర్జాస్ఫూర్జిత బహుళంబుగా నొండొంటిం దాఁకె నట్టి సమయంబున. 191

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; అట్లు+అ+చేయుదున్+అని= అర్జునుడు చెప్పిన విధంగానే వ్యూహం పన్నుతానని చెప్పి; సాత్యకి విరాటులు= సాత్యకి, విరాటుడు; వలపటను= కుడివైపునందు; అభిమన్యు; పాంచాల, కేకయులు; దాపటను= ఎడమప్రక్కన; నకుల= నకులుడు; సహదేవ= సహదేవుడు; ద్రౌపదేయ పురస్సరుండు+ఐ= ద్రౌపది కొడుకులు ముందు నిలిచినవారుగా; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; నడుమను= మధ్యభాగంలోను; చేకితాన కుంతిభోజులు; వెనుకను+కాన్= వెనుకవైపు ఉండేటట్లుగా; ఒనర్చి= చేసి; అగ్రభాగంబునన్= ముందుభాగంలో; శిఖండిన్= శిఖండిని; ఉనిచి= పెట్టి; అతని= ఆ శిఖండియొక్క; కెలంకులన్= రెండు ప్రక్క భాగాలలో; డాసి= సమీపించి; భీమసేన ఘటోత్కచులు= భీముడు, ఘటోత్కచుడున్నూ; ఒక్కవలనను= ఒక ప్రక్కను; పార్థుండున్= అర్జునుడున్నూ; తాను= ధృష్టద్యుమ్నుడున్నూ; ఒక దిక్కునన్= ఒక ప్రక్క; నిలిచి= నిలబడి; తక్కిన= మిగిలిన; యోధవీరులన్= యోధులను, శూరులను; కలయన్= గుంపుగా; చేర్చి= చేసి; గట్టిమొనగాన్= అసాధ్యమైన వ్యూహంగా; ఒనర్చెన్= చేశాడు; ఇట్లు= ఈ విధంగా; ఉభయ సైన్యంబులున్= రెండు సేనలున్నూ; పన్ని= యుద్ధానికి, సిద్ధపడి; భేరీ= దుందుభులనే వాద్యముల యొక్క;భాంకార= భాం భాం- అనే శబ్దాలతోను; శంఖ+ఆది= శంఖములోనుగా గలవాని యొక్క; నిస్వన= ధ్వనులతోను; గర్జా= సింహనాదాలయొక్క; స్ఫూర్జిత= అదరుటచేత; బహుళంబుగాన్= అధికంగా; ఒండొంటిన్= ఒక సైన్యాన్ని మరోసైన్యం; తాఁకెన్= ఎదిరించినవి; అట్టి సమయంబున.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు అర్జునుడు అడిగిన ప్రకారం కౌరవుల వ్యూహానికి ప్రతిగా ఒక వ్యూహాన్ని ఏర్పరచాడు. దానిలో కుడివైపున సాత్యకి, విరాటుడు; ఎడమవైపున అభిమన్యుడు, ద్రుపదుడు, కేకయులు, నకులుడు, సహదేవుడు, ఉపపాండవులు. వీరి వెనుక ధర్మరాజు, ధర్మరాజుకు వెనుకగా చేకితానుడు, కుంతిభోజుడు, ముందు భాగంలో శిఖండి, శిఖండికి ఒక ప్రక్కన భీముడు, ఘటోత్కచుడు, శిఖండికి మరొక ప్రక్కన అర్జునుడు, ధృష్టద్యుమ్నుడు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మిగిలిన యోధులు వేరే వేరే చోట్లలో గుంపులుగా- ఈ విధంగా ఆ వ్యూహరచన జరిగింది. ఆ రెండు సేనలూ యుద్ధానికి సిద్ధమై సింహనాదాలతో, దుందుభుల, శంఖాల ధ్వనులతో కూడినవై, పరస్పరం ఎదుర్కొన్నాయి.

క. చెంగట నభిమన్యుండు। పిశంగతురంగప్రచారచంచద్రథుఁడై
పొంగి మనదిక్కు ప్రజమీఁ। దం గవిసెం జిచ్చు దూది దరికొనుమాడ్కిన్. 192

ప్రతిపదార్థం: అభిమన్యుఁడు= సుభద్రకొడుకు; చెంగటన్= దగ్గరలో; పిశంగ= కపిల వర్ణపు; తురంగ= గుర్రాలయొక్క; ప్రచార= సంచారాలచేత; చంచత్= కదులుతున్న; రథుఁడు+ఐ= రథంకలవాడై; పొంగి= గర్వించి; మనదిక్కు= మనపక్షంలో గల; ప్రజమీఁదన్= జనాలమీద; చిచ్చు= అగ్గి; దూదిన్= పత్తిని; దరికొనుమాడ్కిన్= కాల్చే మాదిరి; కవిసెన్= పర్వినాడు.

తాత్పర్యం: అభిమన్యుడు, కపిల వర్ణపు గుర్రాలను పూన్చిన రథాన్నెక్కి మన సైన్యం సమీపంలో చిత్రంగా తిరుగుతూ ఉప్పొంగి, అగ్గి దూదిని కాల్చే మాదిరిగా మన సేనలను మార్కొన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు గవిసి. 193

తాత్పర్యం: ఈ విధంగా ఎదిరించి.

తే. మెఱసి మండలచారి యై కొఱవి ద్రిప్పి। నట్లు గురుకృపసింధురాజాదు లైన
యోధవీరులు వెగడంద నులివు మిగిలి। తరువఁబడు నబ్ధిక్రియ సేన దిరుగఁబడఁగ. 194

ప్రతిపదార్థం: మండలచారి+ఐ= అభిమన్యుడు మండలాకారంలో నిలబడి; మెఱసి= ప్రకాశించి; కొఱవిన్= కొరవికట్టెను; త్రిప్పిన+అట్లు= త్రిప్పిన విధంగా; గురు= ద్రోణుడు; కృప= కృపాచార్యుడు; సింధురాజు= సైంధవుడు; ఆదులు+ఐన= ప్రధానులుగాగల; యోధవీరులు= యోధులైన శూరులు; వెగడు+అందన్= తల్లడపాటు చెందగా; ఉలివుమిగిలి= హెచ్చైన శబ్దంతో; తరువన్+పడు= చిలుకబడేటువంటి; అబ్ధిక్రియన్= సముద్రం వలె; సేన= మన కౌరవసైన్యం; తిరుగన్+పడఁగన్= తల్లడిల్లి పోగా యుద్ధం చేశాడు.

తాత్పర్యం: అభిమన్యుడు వెలుగొందుతూ మండలాకారంలో చరిస్తూ కొరవి త్రిప్పినట్లుగా ద్రోణుడు, కృపుడు, సైంధవుడు మొదలైన యుద్ధ వీరులు తల్లడిల్లగా హెచ్చైన శబ్దంతో చిలుకబడుతున్న సముద్రంచందంగా కౌరవసేన కలత నొందగా (మీది వచనంతో అన్వయం)

వ. ఇట్లు మాఱు లేక తఱుముచున్న సౌభద్రుం గనుంగొని కౌరవపతి యలంబుసుతో నిట్లనియె 'వీఁడు రెండవ యర్జునుం డై మనబలంబులఁ గలంచుచున్నవాఁ డర్జుననందను నెదుర్కొన నీవకాని మాఱు లేదేము పాండవుల కడ్డపడియెదము నీవు వీనిం బొదివి భంజింపుము.' 195

ప్రతిపదార్థం: కౌరవపతి= కురురాజు దుర్యోధనుడు; ఇట్లు= చెప్పిన విధంగా; మాఱులేక= ఎదురులేకుండా; తఱుముచున్+ఉన్న= కవియుచున్న; సౌభద్రున్= సుభద్రకొడుకు అభిమన్యుడిని; కనుంగొని= చూచి; అలంబుసుతోన్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; వీఁడు= ఈ అభిమన్యుడు; రెండవ అర్జునుఁడు+ఐ= రెండో అర్జునుడుగా; మనబలంబులన్= మన కౌరవులయొక్క సైన్యాలను; కలంచుచున్+ఉన్నవాఁడు= కలత పెడ్తున్నాడు; అర్జుననందనున్= అర్జునుడి కొడుకుఅభిమన్యుడిని; ఎదుర్కొనన్= ఎదిరించడానికి; నీవు+అ+కాని= నీవే తప్ప; మాఱులేదు= ఎదురులేరు; ఏము= మేము; పాండవులకున్= పాండురాజు కుమారులకు; అడ్డపడియెదము= అడ్డు తగుల్తాము; నీవు= నీవు (అలంబుసుడు); వీనిన్= ఈ అభిమన్యుడిని; పొదివి= కవిసి; భంజింపుము= ఓడించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దుర్యోధనుడు తన సైన్యాన్ని అభిమన్యుడు తరమటాన్ని చూచి, అలంబుసుడితో 'వీడు రెండో అర్జునుడివలె తయారై మన సైన్యాన్ని కలత పెడుతున్నాడు. వీడిని ఎదిరించటానికి నీవు తప్ప వేరే ఎవరూ లేరు. మేము పాండవులను అడ్డగిస్తాం. నీవు వీడిని ఓడించుము.'

అలంబసుఁడు దుర్యోధన ప్రేరితుండై యభిమన్యునిపైఁ గవియుట (సం. 6-96-24)

క. అనవుడు నతండు దుర్దమ। దనుజావలి మున్ను గాఁగఁ దఱిమెం గుంతీ
తనయబలము గారాకులు। పెనుగాలిం దూలునట్లు భీతిం జెదరన్. 196

ప్రతిపదార్థం: అనవుడున్= దుర్యోధనుడు పై విధంగా చెప్పగా; అతండు= ఆ అలంబసుడు; కారు+ఆకులు= పండిపోయిన ఆకులు; పెనుగాలిన్= పెద్దగాలికి; తూలు+అట్లు= కొట్టుకుపోయే మాదిరి; దుర్దమదనుజావలి= జయింపరాని రాక్షసుల గుంపు; మున్ను+కాఁగన్= తన ముందుండునట్లుగా; కుంతీ తనయుల బలమున్= పాండవుల సైన్యాన్ని; భీతిన్= భయంతో; చెదరన్= చెదిరిపోయేటట్లుగా; తఱిమెన్= వెంబడిబడి పరుగులెత్తించాడు.

తాత్పర్యం: దుర్యోధను డా విధంగా చెప్పగానే, అలంబుసుడు అజేయులైన రాక్షసుల మూకను తన ముందు పెట్టుకొని పాండవ సేనను తరిమాడు. తుఫానుగాలికి పండుటాకులు ఎక్కడికో కొట్టుకుపోయేట్టు పాండవ సైన్యం మూలమూలకు పారిపోయింది.

విశేషం: అలం: ఉపమ.

ఉ. అప్పుడు ద్రౌపదేయులు రయంబున నడ్డము సొచ్చి దైత్యులం
గుప్పలుగా మహిం బెలుచఁ గూల్చిన దానవనాథుఁ డమ్ములం
గప్పెఁ గడంగి వారల నఖండపరాక్రమలీల వారు వాఁ
డొప్పఱి తేరి కూబరమయూఁతగ వ్రాలఁగనేసి యార్చినన్. 197

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ద్రౌపదేయులు= ద్రౌపది కొడుకులు, రయంబునన్= వేగంతో; అడ్డము+చొచ్చి= అడ్డంగా చొరబడి; దైత్యులన్= రాక్షసులను; కుప్పలు+కాన్= కుప్పలుగా; పెలుచన్= సులువుగా; మహిన్= నేలమీద; కూల్చినన్= పడద్రోయగా; దానవనాథుఁడు= రాక్షసరాజు అలంబుసుడు; కడంగి= ప్రయత్నించి; వారలన్= ద్రౌపది కొడుకులను; అమ్ములన్= బాణాలతో, కప్పెన్= కప్పివేశాడు; వారు= ఆ ద్రౌపది కొడుకులు; అఖండ పరాక్రమలీలన్= అంతులేని పరాక్రమం యొక్క విలాసంతో; వాఁడు= ఆ అలంబుసుడు; ఒప్పు+అఱి= సౌందర్యం పోగొట్టుకొని; తేరి కూబరము+అ= రథంయొక్కనొగ; ఊఁతగన్= ఆధారంగా; వ్రాలఁగన్= వాలిపోయేట్టుగా; ఏసి= బాణాలు ప్రయోగించి; ఆర్చినన్= బొబ్బలు పెట్టగా.

తాత్పర్యం: అలంబుసుడి దెబ్బకు పాండవసేన చెల్లాచెదరైపోయినప్పుడు ద్రౌపది కొడుకులు వేగంగా అడ్డంగా చొరబడి, ఆ రాక్షసుల మూకను సునాయాసంగా కుప్పతిప్పలుగా నేలకూల్చారు. అప్పుడు అలంబుసుడు ఆ ద్రౌపదేయులను బాణాలతో కప్పివేశాడు. అప్పు డా ద్రౌపది కొడుకులు, ఆ రాక్షసుడు అందం చెడి, రథపు నొగను ఆధారం చేసికొని, ఒరిగిపోయేటట్లుగా బాణాలతో కొట్టి, బొబ్బలు పెట్టగా.

క. ఆలోనన తెప్పిఱి లయ కాలుండును। బోలె నసుర గన్నుల నిప్పుల్
రాలఁగ వారలసిడములు। నేలం బడనేసి చాపనికరము ద్రుంచెన్. 198

ప్రతిపదార్థం: ఆలోనన్+అ= అంతలోనే; అసుర= రాక్షసుడు- అలంబుసుడు; తెప్పిఱి= తేరుకొని; లయకాలుండునున్+పోలెన్= ప్రళయకాలంలోని యమధర్మరాజువలె; కన్నులన్= కన్నులనుండి; నిప్పుల్= అగ్నులు; రాలఁగన్= రాలుచుండగా; వారల= ఆ ఉపపాండవుల యొక్క; సిడములు= ధ్వజాలు; నేలన్+పడన్+ఏసి= నేలమీద పడేటట్లుగా; ఎన్నో బాణాలు ప్రయోగించి; చాపనికరమున్= ధనుస్సుల సముదాయాన్ని; త్రుంచెన్= విరుగగొట్టాడు.

తాత్పర్యం: అంతలోనే అలంబుసుడు తేరుకొని ప్రళయకాలంలోని యముడి మాదిరి కండ్ల నుండి నిప్పులు కక్కుతూ, బాణాలతో కొట్టి వారి ధ్వజాలను నేలకూల్చాడు. వారి ధనుస్సులను కూడా తునుకలు చేశాడు.

వ. త్రుంచి నవ్వుచు. 199

ప్రతిపదార్థం: త్రుంచి= తునకలు చేసి; నవ్వుచు(న్)= ఎగతాళి చేస్తూ.

తాత్పర్యం: అలంబుసుడు ద్రౌపది కొడుకుల విండ్లను త్రుంచివేసి ఎగతాళిగా నవ్వుతూ. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. ఒకని నొకని నైదైదు మహోగ్ర భాసు। రాస్త్రముల నేసి నొంచిన నతనిమదము
సొంపు సోదరవ్యథయును జూచి। యడరె నప్పు డాతనిపై సుభద్రాత్మజుండు. 200

ప్రతిపదార్థం: ఏచి= విజృంభించి; ఒకనిన్+ఒకనిన్= ఒక్కొక్కడినీ; ఐదు+ఐదు= ఐదేసి చొప్పున; మహా+ఉగ్రభాసుర+అస్త్రములన్= గొప్పవైన, భయం గొలుపుతూ ప్రకాశిస్తూండే ఆయుధాలతో; నొంచినన్= బాధకలిగేటట్లు చేయగా; అప్పుడు; సుభద్రా+ఆత్మజుండు= సుభద్ర కొడుకు అభిమన్యుడు; అతని మదమున్= ఆ రాక్షసుడి మదాన్ని; సొంపు= అందాన్ని; సోదర వ్యథయున్= అన్నదమ్ముల- కుంతీపుత్రుల కష్టాన్ని; చూచి; ఆతనిపైన్= ఆ రాక్షసుడి మీదికి; అడరెన్= ఉరికాడు.

తాత్పర్యం: అలంబుసుడు ఒక్కొక్కడి మీద అయిదేసి చొప్పున కఠినమైన, మండుతున్న బాణాలను వేసి, ఆ ద్రౌపదేయులను చాలా నొప్పించాడు. అభిమన్యుడు ఆ రాక్షసుడి మదాన్ని, అందాన్ని చూశాడు. తన అన్నదమ్ముల కష్టాన్ని కనిపెట్టి, ఆ రాక్షసుడి మీదికి దూకాడు.

వ. అప్పు డుభయ సైన్యంబులవారును వెఱఁగంది. 201

ప్రతిపదార్థం: అప్పుడు ఉభయ సైన్యంబులవారును= కౌరవ పాండవ సేనలలో ఉండే సైనికులు; వెఱఁగు+అంది= ఆశ్చర్యంచెంది.

తాత్పర్యం: ఆ సమయంలో కౌరవ, పాండవసేనలలోని సైనికులు ఆశ్చర్యం చెంది. (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'దనుజుఁడు మాయాధికుఁ డ। ర్జునతనయుండు దివ్యశరధరుం డెట్లగునో?
యనుచుండఁగ నయ్యిరువురు। ననిసేసిరి వృత్రవాసవాకృతి దోఁపన్. 202

ప్రతిపదార్థం: దనుజుఁడు= రాక్షసుడు- అలంబుసుడు; మాయా+అధికుఁడు= మాయచేత గొప్పవాడు; అర్జున తనయుఁడు= అర్జునుడి కొడుకు అభిమన్యుడు; దివ్యశరధరుండు= అమోఘములైన బాణాలు కలవాడు; ఎట్లు+అగును+ఓ?= ఫలితం ఎట్లా ఉంటుందో?; అనుచుండఁగన్= అనుకొంటూండగా; ఆ+ఇరువురు= ఆ ఇద్దరు (అలంబుసుడు, అభిమన్యుడు); వృత్రవాసవ+ఆకృతిన్= వృత్రాసురుడు, ఇంద్రుడు- వీరి రూపాలు ; తోఁపన్= తోచేటట్లుగా; అని= యుద్ధాన్ని; చేసిరి= చేశారు.

తాత్పర్యం: 'మాయలమారివాడు అలంబుసుడు- మంచి మంచి బాణాలు కలవాడు అభిమన్యుడు. మరి వీరిద్దరిలో ఎవడిని, విజయలక్ష్మి వరిస్తుందో?' అని కౌరవపాండవసేనలలోని వారంతా ఆశ్చర్యంగా అనుకొంటూండగా

వారిద్దరూ యుద్ధానికి తలపడ్డారు. అలంబుసుడు వృత్రుడనే రాక్షసుడి మాదిరి అనిపించాడు. అభిమన్యుడు ఇంద్రుడు మాదిరి అగుపించాడు.

క. ఇతరేతరశరకృతశో। ణిత ధారలు నిగుడ నపుడు నిర్భరదావ
ద్యుతు లడరఁ బొలుచునగముల। గతిఁ బొలిచిరి వార లప్రకంపోన్నతు లై. 203

ప్రతిపదార్థం: అపుడు= ఆ యుద్ధ సమయంలో; ఇతర+ఇతర= ఒండొరులయొక్క; శర= బాణాలచేత; కృత= చేయబడ్డ; శోణిత ధారలు= నెత్తుటి యొక్క ధారలు= పైనుండి కిందికి జారే చాళ్ళు; నిగుడన్= అధికంకాగా; నిర్భర= ఓర్చుకోడానికి సాధ్యంకాని; దావ= కార్చిచ్చు యొక్క; ద్యుతులు= మంటలు; అడరన్= వ్యాపించగా; పొలుచు= ఒప్పునట్టి; నగములగతిన్= పర్వతాల మాదిరి; వారలు= అలంబసుడు, అభిమన్యుడున్నూ; అప్రకంప+ఉన్నతులు+ఐ= అచలులై; పొలిచిరి= ఒప్పినారు.

తాత్పర్యం: ఆ అలంబసుడు, అభిమన్యుడు ఒకరిపై ఒకరు బాణాలు వేసికోవటం వల్ల, నెత్తుటి కాల్వలు వారి శరీరాలపై నుండి కిందికి కారటంవల్ల, నిక్కి నిశ్చలంగా నిలబడ్డ ఆ వీరులిద్దరు కార్చిచ్చు అలముకొన్న పర్వతాలను పోలి ఉన్నారు.

విశేషం: అలం: ఉపమ.

క. దనుజేశ్వరుండు మాయం। బొనరించినఁ దమము గవిసె భూనాయక ! ఫ
ల్గున సుతుఁడు భాస్కరాంబక। మున వెలుఁ గొనరించె సురసమూహము వొగడన్. 204

ప్రతిపదార్థం: భూనాయక!= భూమికి ప్రభువైన ధృతరాష్ట్ర మహారాజా!; దనుజ+ ఈశ్వరుండు= రాక్షసులకు రాజైన అలంబుసుడు; మాయన్= మాయను (ఇంద్రజాలాన్ని); పొనరించిన= చేయగా; తమము= చీకటి; కవిసెన్= కమ్ముకొన్నది; ఫల్గున సుతుఁడు= అర్జునుడి కొడుకు; సురసమూహము= దేవతల గుంపు; పొగడన్= పొగడగా; భాస్కర+అంబకమునన్= సూర్యుడు దేవతగా ఉన్నట్టి బాణంతో; వెలుఁగున్+ఒనరించెన్= వెలుతురు వచ్చేటట్లు చేశాడు.

తాత్పర్యం: ఆ రాక్షసుడు పన్నిన మాయచేత ఆ యుద్ధభూమినంతా చీకటి దట్టంగా కమ్ముకొన్నది. అప్పుడు అభిమన్యుడు సూర్యసంబంధమైన అస్త్రాన్ని ప్రయోగించి ఆ చీకటినంతా పటాపంచలు చేశాడు. ఆకాశాన్నుండి యుద్ధాన్ని చూస్తున్న దేవతలందరూ అభిమన్యుడి శౌర్యాన్ని ఎంతో మెచ్చుకొన్నారు.

తే. అసుర వెండియుఁ బెక్కు మాయలు ఘటింప। శక్రపౌత్రుండు దివ్యాస్త్రజాల మడరఁ
జేసి యన్నింటి నడఁగించి చెలఁగి నొంప। రథము డిగి పాఱెఁ బెలుచ నా రాక్షసుండు. 205

ప్రతిపదార్థం: అసుర= రాక్షసుడు అలంబుసుడు; వెండియున్= ఇంకా కూడా; పెక్కు మాయలు= పలు రకాలైన మాయలను; ఘటింపన్= చేయగా; శక్రపౌత్రుండు= ఇంద్రుడి మనుమడు- అభిమన్యుడు; దివ్య+అస్త్రజాలము= దేవ సంబంధాలైన ఆయుధాల సమూహాన్ని; అడరన్+చేసి= వ్యాపింపచేసి; అన్నింటిన్= రాక్షసుడు చేసిన మాయలన్నిటిని; అడఁగించి= రూపుమాపి; చెలఁగి= విజృంభించి; నొంపన్= ఆ రాక్షసుడిని బాధించగా; ఆ రాక్షసుండు= ఆ అలంబుసుడు; పెలుచన్= శీఘ్రంగా; రథము డిగి= తేరునుండి కిందికి దిగి; పాఱెన్= పరుగెత్తాడు.

తాత్పర్యం: అలంబుసుడు ఇంకా ఎన్నో మాయలు చేశాడు. అభిమన్యుడు వాటినన్నిటినీ దివ్యాస్త్రాలు ప్రయోగించి మటుమాయం చేశాడు. వాడికి బాగా నొప్పి కల్గించాడు. అలంబుసుడు ఏమీ చేయలేక శీఘ్రంగా రథాన్నుండి క్రిందికి దిగి, పారిపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. రక్కసుఁడు విఱిగినం గడు । నుక్కున సౌభద్రుఁ డడరునురవడి గని న
ల్దిక్కులఁ బఱచెం దమలోఁ । జిక్కువడుచుఁ గౌరవేంద్రుసేనలు భీతిన్. 206

ప్రతిపదార్థం: రక్కసుఁడు= రాక్షసుడు అలంబుసుడు; విఱిగినన్= ఓడిపోగా; కడున్= అధికమైన; ఉక్కునన్= శౌర్యంతో; సౌభద్రుఁడు= అభిమన్యుడు; అడరు= అతిశయించే; ఉరవడిన్= అతివేగాన్ని; కని= చూచి; కౌరవ+ఇంద్రుసేనలు= దుర్యోధనుడి సైన్యాలు; భీతిన్= భయంతో; తమలోన్= తమలోతాము; చిక్కు+పడుచున్= కష్టపడుతూ; నలు+దిక్కులన్= నాలుగు దిక్కులకు; పఱచెన్= పరుగెత్తాయి.

తాత్పర్యం: అలంబుసుడు అభిమన్యుడి ధాటికి ఓడిపోయాడు. అంతటా అతిశయించిన అభిమన్యుడి వేగానికి తట్టుకోలేక, కౌరవ సైన్యమంతా తమ తమ మనస్సుల్లో చాలా సంకటపడుతూ, దిక్కులకు పరుగెత్తి వెళ్ళారు.

వ. అప్పుడు పెక్కండ్రు రథికులతోడం గూడి గాంగేయుం డభిమన్యు పయిం గవిసిన. 207

ప్రతిపదార్థం: అప్పుడు= కౌరవసేన పారిపోయినప్పుడు; గాంగేయుండు= భీష్ముడు; పెక్కంద్రు= పలువురు, రథికులతోడన్= రథంలో కూర్చుని యుద్ధం చేసేవారితో; కూడి= చేరి; అభిమన్యుపయిన్= అభిమన్యుడి మీదికి; కవిసినన్= పర్వగా.

తాత్పర్యం: అభిమన్యుడి ధాటికి తట్టుకోలేక కౌరవసేన చెల్లాచెదరుకాగా, భీష్ముడు చాలామంది రథికులను వెంటవేసికొని అభిమన్యుడి మీదికి ఎగబడ్డాడు.

తే. అతఁడు దానికిఁ దలఁకక యందఱకును । నన్నిరూపు లై పోరంగ నర్జునుండు
సరభసంబుగ భీష్ముపై నురవడింపఁ । బొంగి యిరువాఁగు నిరువురఁ బొదివె బెరసి. 208

ప్రతిపదార్థం: అతఁడు= ఆ అభిమన్యుడు; దానికిన్= ఆ భీష్ముడి దెబ్బకు; తలఁకక= చలించక(భయపడక); అందఱకును= భీష్ముడు మొదలైన రథికులకందరికిని; అన్ని+రూపులు+ఐ= ప్రతివాడికి ఒక్కొక్క అభిమన్యుడుగా తోపచేసి; పోరంగన్= యుద్ధం చేస్తూ ఉండగా; అర్జునుండు= అర్జునుడు; భీష్ముపైన్= భీష్ముడు మీదికి; సరభసంబుగన్= వేగంతో; ఉరవడింపన్= తొందరపడగా; ఇరువాఁగున్= రెండు సైన్యాలు; పొంగి= గర్వంపొంది; ఇరువురన్= భీష్ముడిని; అర్జునుడిని; బెరసి= దగ్గరగా చేరి; పొదివెన్= క్రమ్ముకొన్నవి.

తాత్పర్యం: ఆ అభిమన్యుడు భీష్ముడి ధాటికి ఏ మాత్రం చలించకుండా నిలబడి, తనమీదికి కవిసే వారికందరికీ అదే సంఖ్యగల అభిమన్యులుగా కనబడి చాకచక్యంగా యుద్ధం చేస్తూ వచ్చాడు. తన కొడుకు పాటు చూచి, అర్జునుడు వేగంగా భీష్ముడిపైకి ఎత్తివచ్చాడు. అప్పుడు కౌరవుల పాండవుల సైన్యాలు గర్వించి, కౌరవసైన్యాలు భీష్ముడి దగ్గరకు, పాండవ సైన్యాలు అర్జునుడి దగ్గరకు చేరుకొని, క్రమ్ముకొన్నాయి.

వ. అట్టి సంకులసమరంబున నభిమన్యుపై నడరు కృపాచార్యుం దాఁకి సాత్యకి బెడిదంపునారసంబు లేసిన వాని నన్నింటిని నశ్వత్థామ తునిమి యతని విల్లు ద్రుంచినం గోపించి. 209

ప్రతిపదార్థం: అట్టి= ఆ విధమైన; సంకుల సమరంబునన్; అభిమన్యుపైన్= అభిమన్యుడి మీదికి; అడరు= విజృంభిస్తున్న; కృపాచార్యున్= కృపుని; సాత్యకి= సాత్యకి; తాఁకి= మార్కొని; బెడిదంపు నారసంబులు= భయంకరాలైన బాణాలు; ఏసినన్= వేయగా; వానిన్=ఆ బాణాలను; అన్నింటిన్= అన్నిటిని; అశ్వత్థామ= ద్రోణుడి కొడుకు; తునిమి= తునుకలు చేసి; అతనివిల్లున్= ఆ సాత్యకి యొక్క విల్లును; త్రుంచినన్= విరిచివేయగా; కోపించి= (సాత్యకి) కోపపడి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రెండు సైన్యాల వారూ కలగా పులగంగా కలిసిపోయి యుద్ధంచేసే సమయంలో సాత్యకి, అభిమన్యుడిపైకి దూకే కృపాచార్యుడిని ఎదిరించి, కఠోరాలైన బాణాలు ప్రయోగించాడు. వాటిని అన్నిటినీ అశ్వత్థామ తుంటలు చేసి, సాత్యకి విల్లును కూడా విరిచివేశాడు. దానికి సాత్యకి ఆగ్రహించి.

క. ఆ సాత్యకి వేఱొక వి । ల్లాసురగతి నెత్తి యుగ్రమగు నారాచం
బేసిన నాతఁడు కేతు । వ్యాసక్తుండయ్యె మూర్ఛవచ్చి నరేంద్రా! 210

ప్రతిపదార్థం: నరేంద్రా!= ధృతరాష్ట్ర మహారాజా! ఆ సాత్యకి; వేఱు+ఒక= మరియొక ; విల్లు= ధనువును; ఆసురగతిన్= రాక్షసంగా; ఎత్తి= తీసికొని; ఉగ్రము+అగు= భయంకరమైన; నారాచంబు= బాణాన్ని; ఏసినన్= వేయగా; ఆతఁడు= ఆ అశ్వత్థామ; మూర్ఛవచ్చి= మూర్ఛతగిలి; కేతువ్యాసక్తుండు+అయ్యెన్= ధ్వజానికి ఆనుకొన్నాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సాత్యకి మరొక విల్లు తీసికొని, రక్కసితనంగా కర్కశమైన ఒక బాణాన్ని అశ్వత్థామ మీదికి ప్రయోగించారు. వెంటనే అశ్వత్థామ మూర్ఛపోయి, తనతేరు ధ్వజానికి అంటుకుపోయాడు.

క. ఆలోనన తెలిసి మెఱుఁగు । వాలిక తూ పాతఁ డతని వక్షమునడుమం
గీలించి సిడము గ్రక్కున । నేలం బడనేసి యార్చె నింగి వడంకన్. 211

ప్రతిపదార్థం: ఆలోనన్+అ= అంతలోపలనే; ఆతఁడు= ఆ అశ్వత్థామ; తెలిసి= తెలివినిపొంది; మెఱుఁగు= తళతళలాడే; వాలిక= పదునైన; తూపు= బాణాన్ని; అతని= ఆ సాత్యకియొక్క; వక్షము= రొమ్ముయొక్క; నడుమన్= మధ్యభాగంలో; కీలించి= గ్రుచ్చి సిడము= ధ్వజము; గ్రక్కునన్= వెంటనే; నేలన్+పడన్+ఏసి= నేలకూల్చి; నింగి= ఆకాశము; వడంకన్= వడకేటట్లుగా; ఆర్చెన్= బొబ్బరించాడు.

తాత్పర్యం: ఆ అశ్వత్థామ అంతలోనే తెప్పిరిల్లికొని, నిగనిగలాడే పదును గల బాణాన్ని ఆ సాత్యకి రొమ్మున గ్రుచ్చాడు. అతడి టెక్కాన్ని నేలకూల్చాడు. ఆకాశం అదిరేటట్లుగా బొబ్బలు పెట్టాడు.

వ. దానికిం గినిసి శినిమనుమండు పొగరు మిగులునారాచనిచయంబులం బొదివిన నశ్వత్థామ రాహుగ్రస్తుం డగు నుగ్రగభస్తియుంబోలె నైనం గనుంగొని. 212

ప్రతిపదార్థం: దానికిన్= అశ్వత్థామచేసిన దానికి; శినిమనుమండు= సాత్యకి; కినిసి= కోపించి; పొగరుమిగులు= మిక్కిలి దారుణములైన; నారాచ నిచయంబులన్= బాణాల సమూహాలతో; పొదివినన్= కప్పివేయగా; అశ్వత్థామ; రాహుగ్రస్తుండు+అగు= రాహువుచే మ్రింగబడినట్టివాడగు; ఉగ్రగభస్తియున్+పోలెన్= కరకు కిరణాలు గల సూర్యుడి చందంగా; ఐనన్= కాగా; కనుంగొని.

తాత్పర్యం: అశ్వత్థామచే చాలా దెబ్బలు తిన్నాడు సాత్యకి. కనుకనే చాలా కోపగించాడు. మెరుస్తున్న వాడి, వేడి బాణాలతో ఆ అశ్వత్థామను బాగా కప్పివేసినపుడు అతడు రాహువుచే కబళింపబడ్డ సూర్యుడిలాగా అనిపించాడు. దీన్ని చూచి. (ద్రోణాచార్యుడు సాత్యకిపైకి కవిశాడు.)

విశేషం: అలం: ఉపమ.

క. ద్రోణాచార్యుండు సుత । త్రాణపరత్వమునఁ గృష్ణుతమ్ముని పై న
క్షీణోద్ధతిఁ గవియుడు గీ । ర్వాణాధిపసుతుఁడు వచ్చి వడి నెడఁ జొచ్చెన్. 213

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ద్రోణాచార్యుండు= ద్రోణుడు; సుతత్రాణ పరత్వమునన్= కొడుకును కాపాడుకోవడంలో ఆశకలవాడు కావటంచేత; కృష్ణుతమ్మునిపైన్= కృష్ణుడి తమ్ముడైన సాత్యకిమీద; అక్షీణ+ఉద్ధతిన్= తక్కువకాని ఆటోపంతో(గర్వంతో); కవియుడున్; గీర్వాణ+అధిపసుతుఁడు= దేవతలకు ప్రభువైన ఇంద్రుడి కొడుకు(అర్జునుడు); వడిన్= వేగంగా; వచ్చి= చేరి; ఎడన్= మధ్యలో; చొచ్చెన్= చొరబడ్డాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు - తన కొడుకు అశ్వత్థామ ప్రాణాలు కాపాడాలనే ఆత్రంతో, గర్వంతో సాత్యకి మీదికి దూకాడు. అప్పుడు అర్జునుడు వేగంగా వచ్చి, సందు చేసికొని చొరబడ్డాడు.

చ. అనవుడు నాంబికేయవసుధాధిపుఁ డిట్లనుఁ 'ద్రోణుఁ డాత్మ న
ర్జుననకుఁ గూర్చునాతఁడు గురుంగని యెంతయు భక్తి సేయు వా
రనిఁ దమలోన నట్లు వెస నప్పడు దార్కొని యెట్లు వోరిరో
వినఁగల దేర్పడం జెపుమ విశ్రుతభంగిగ నాకు సంజయా!' 214

ప్రతిపదార్థం: అనవుడున్= అని జెప్పగా; ఆంబికేయవసుధా+అధిపుఁడు= అంబిక కొడుకు ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటున్నాడు; సంజయా!= ఓ సంజయుడా!; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు, ఆత్మన్= మనసునందు; అర్జుననకున్= అర్జునుడికి; కూర్చున్= ఇష్టం కోరుతాడు; ఆతఁడున్= ఆ అర్జునుడుకూడా; గురున్= గురువైన ద్రోణుడిని; కని= చూచి; ఎంతయున్= ఎంతో అధికంగా; భక్తి+చేయున్= సేవిస్తూ ఉంటాడు; వారు= అట్టివారిద్దరు; అనిన్= యుద్ధంలో; తమలోనన్= తమలో తాము; అట్లు= ఆ విధంగా; అప్పుడు; వెసన్=వేగంతో; తార్కొని= దగ్గరకు చేరుకొని; ఎట్లు= ఏ విధంగా; పోరిరో= యుద్ధం చేశారో; నాకున్; వినన్+కలది= వినవలసి ఉన్నది; విశ్రుతభంగిన్= చక్కగా ప్రఖ్యాతి కెక్కేటట్లుగా; ఏర్పడన్= బాగా తెలిసేటట్లుగా; చెపుము+అ!= పలుకుము.

తాత్పర్యం: ద్రోణుడు, అర్జునుడు - ఇద్దరూ యుద్ధానికి పూనుకొన్నారని సంజయుడు చెప్పగా ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు. 'ఓ సంజయా! ద్రోణుడికి అర్జునుడంటే చాలా ఇష్టం. అర్జునుడికీ ద్రోణుడంటే చాలా భక్తి. అట్టి ఆ గురుశిష్యులిద్దరూ యుద్ధంలో ఒకరినొకరు మార్కొని ఎట్లా యుద్ధం చేశారు? వీరి యుద్ధం ప్రసిద్ధి కెక్కే విధంగా ఉంటుంది, వినతగ్గది కాబట్టి, విపులంగా నాకు తెలుపుము.'

వ. అనిన నా సూతనందనుం డతని కి ట్లనియె. 215

ప్రతిపదార్థం: అనినన్= అని అడగ్గా; ఆ సూతనందనుండు; సంజయుడు; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు భీష్మార్జునుల యుద్ధాన్ని గూర్చి విమర్శగా చెప్పుమని కోరగా, సంజయుడు ఇలా చెప్పసాగాడు.

క. క్షాత్త్రము దలకొని సంగర । ధాత్రికి నేతెంచి గురులు దండ్రులు దమ్ముల్
పౌత్త్రులు శిష్యులు మామలు । పుత్త్రులనం గలదె? తాదరి పోరన వలయున్. 216

ప్రతిపదార్థం: క్షాత్రమున్= క్షత్రియ ధర్మాన్ని; తలకొని= పూని; సంగరధాత్రికిన్= యుద్ధభూమికి; ఏతెంచి= వచ్చి; గురులు= ఉపాధ్యాయులు; తండ్రులు= తండ్రులు; తమ్ముల్= తమ్ముళ్ళు, పౌత్రులు= మనుమలు; శిష్యులు= తమ దగ్గర విద్య

నేర్చుకొన్నవారు; మామలు= కూతులను ఇచ్చినవారు; పుత్రులు= కొడుకులు; అనన్= అనడం; కలదు+ఎ?= సాధ్యమా?; తొడరి= ప్రయత్నించి; పోరనవలయున్= యుద్ధం చేయవలసి ఉంటుంది.

తాత్పర్యం: క్షత్రియధర్మం కలిగి యుద్ధరంగంలోకి దిగినప్పుడు, గురువులు, తండ్రి వరుసవారు, తమ్ముళ్ళు, మనుమలు, శిష్యులు, మామలు, మేనమామలు, కొడుకులు, అనే చుట్టరికం లెక్కించకుండా తెగించి యుద్ధం చేయవలసిందే కదా!

అర్జునుఁడు ద్రోణాచార్యులతో యుద్ధముసేయుట (సం. 6-98-4)

వ. వినుము. 217

ప్రతిపదార్థం: వినుము - ఆలకించుము

తాత్పర్యం: వారి యుద్ధం ఎలా జరిగిందో చెపుతాను వినుము.

సీ. అర్జునుం డడరి ద్రోణాచార్యు మూఁడు నారసముల నేసి యుగ్రంపుటంప
వెల్లువ వఱపిన వెగడొంద కాతఁ డాతనిమేనఁ దూపులు దఱుచు గాఁగ
నాటించె నంత భూనాథుండు పురికొల్పఁ గాఁ ద్రిగర్తులు గురుఁ గడచి కవియ
నరుఁడేచి వాయుబాణమ్మున నమ్మొనఁ దూలింపఁ గుంభజుశైలశరము

ఆ. వచ్చి యుడుప నలిగి వాసవినారాచ। వర్షమునఁ ద్రిగర్తవరునిపుత్ర
చయముఁ దెరలుచుటయు జనపతి కృపశల్య। బాహ్లికులునుఁ దానుఁ బార్థుఁ దాఁకె. 218

ప్రతిపదార్థం: అర్జునుండు; అడరి= పూని; ద్రోణ+ఆచార్యున్= ద్రోణుడిని; మూఁడు నారసములన్= మూడు బాణాలతో; ఏసి= కొట్టి; ఉగ్రము+అంపవెల్లువ= భయంకరములైన బాణాల ప్రవాహాన్ని; పఱపినన్= ప్రయోగించగా; ఆతఁడు= ఆ ద్రోణుడు; వెగడు+ఒందక= తడబాటు చెందకుండా; ఆతనిమేనన్= అర్జునుడి దేహంమీద; తఱుచుగాఁగన్= మిక్కుటముగా; తూపులు=బాణాలను; నాటించెన్= గ్రుచ్చాడు; అంతన్= అటుమీద; భూనాథుండు= భూమికి రాజు-దుర్యోధనుడు; పురికొల్పఁగాన్= ప్రోత్సాహపరచగా; త్రిగర్తులు= త్రిగర్త దేశపు రాజు కొడుకులు; గురున్= ద్రోణుడిని; కడచి= దాటి; కవియన్; నరుఁడు= అర్జునుడు; ఏచి= విజృంభించి; వాయుబాణమ్మునన్= వాయువు దైవంగా గల బాణంచేత; ఆ+మొనన్= ఆ సైన్యాన్ని; తూలింపన్= చలింపచేయగా; కుంభజు= ద్రోణునియొక్క; శైలశరము= పర్వతబాణము; ఉడుపన్= వచ్చి, నశింపచేయగా; వాసవి= ఇంద్రుడి కొడుకు - అర్జునుడు; అలిగి= కోపం చెంది; నారాచవర్షమునన్= బాణాల వానతో; త్రిగర్తవరుని= త్రిగర్తరాజు యొక్క; పుత్రచయమున్= కొడుకుల గుంపును; తెరలుచుటయున్= తొలగింపచేయగా; జనపతి= ప్రభువైన; తానున్= దుర్యోధనుడు; కృపశల్య బాహ్లికులును= కృపుడు, శల్యుడు, బాహ్లికుడున్నూ; పార్థున్= అర్జునుడిని; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు ప్రయత్నంతో ద్రోణాచార్యుడిని మూడు బాణాలతో కొట్టి, పదునైన బాణాల ప్రవాహాన్ని అతడిపైకి ప్రయోగించాడు. భీష్ముడు జంకకుండా చాలా బాణాలను ఆ అర్జునుడి ఒంటిలో గుచ్చుకొనేటట్లుగా వేశాడు. అప్పుడు దుర్యోధనుడు ప్రోత్సాహపరచగా, త్రిగర్తరాజు కొడుకులు ద్రోణుడికి ముందుగా నిలిచి అర్జునుడిని ఎదుర్కొన్నారు. అప్పుడు అర్జునుడు వాయుబాణాన్ని వేసి. దానివల్ల వారంతా కొట్టుకపోయేటట్లు చేశాడు. ద్రోణుడు ఆ వాయుబాణానికి ప్రతిగా శైలాస్త్రం ప్రయోగించాడు. అర్జునుడికి కోపంవచ్చి, బాణవర్షం కురిపించాడు. ఆ

దెబ్బకు త్రిగర్తపతిపుత్రులంతా చెల్లాచెదరై పోయారు. అది చూచి దుర్యోధనుడు, కృపుడు, శల్యుడు, బాహ్లికుడు- వీరంతా అర్జునుడి మీదికి ఎగబడ్డారు.

వ. అట్లు దాఁకుటయు వారల నతండు గన్నె రా కమ్ములం జీకాకు పఱిచె నట్లు గురుండు మొదలైనయందఱకును నా ధనంజయుపోరు దలమునుకలయ్యెఁ గురుపితామహుండు ధర్మసూతి యున్న తిట్ట కుఱికి తలలు చెండాడె శకునిభూరిశ్రవసులు గవలం దలపడిరి కళింగపతియును భగదత్తుండును నిభసేనలతోడం దొడరి భీమసేనుం బొదివిన. 219

ప్రతిపదార్థం: అట్లు= ఆవిధంగా; తాఁకుటయున్= దుర్యోధనాదులు ఎదుర్కొనగా; వారలన్= ఆ వీరులను; అతండు= ఆ అర్జునుడు; కన్నెరాకు+అమ్ములన్= ఒక విధమైన బాణాలతో; చీకాకు పఱిచెన్= శ్రమకలిగించాడు; అట్లు; గురుండు= ద్రోణుడు; మొదలు+ఐన= ముఖ్యుడుగాగల; అందఱకున్= రథికులందరికీ; ధనంజయుపోరు= అర్జునుడితో యుద్ధం; తలమునుకలు+అయ్యెన్= తలకుమించిన(అసాధ్యమైన) దైనది; కురుపితామహుండు= భీష్ముడు; ధర్మసూతి= ధర్మరాజు; ఉన్న; తిట్టకున్= సైన్యం ఉన్నచోటికి; ఉఱికి; తలలు చెండు+ఆడెన్= సైనికుల తలలు నరికివేశాడు; శకుని భూరిశ్రవసులు= శకుని, భూరిశ్రవసుడు; కవలన్= నకుల సహదేవులను; తలపడిరి= ఎదుర్కొన్నారు; కళింగపతియును= కళింగ దేశపు రాజు; భగదత్తుండును; ఇభసేనలతోడన్= ఏనుగుల సైన్యంతో; తొడరి= వెంటపెట్టుకొని; భీమసేనున్= భీముని; పొదివినన్.

తాత్పర్యం: దుర్యోధనాది రథికులు అర్జునుడిని తాకారు. అతడు క్రొత్త క్రొత్త బాణాలు వేసి వారికి చిరాకు పుట్టించాడు. ద్రోణుడు మొదలైన యోధులకందరికి అర్జునుడితో యుద్ధం తలమునకలైంది. భీష్ముడు ధర్మరాజు సైన్యం ఉన్న చోటును దాటిపోయి, సైనికుల తలలు తెగనరికాడు. శకుని భూరిశ్రవసులు కవలలతో మార్కొన్నారు. కళింగదేశపురాజు, భగదత్తుడు- వీరిద్దరూ ఏనుగుల సైన్యంతో భీముడిమీదికి మళ్ళగా.

విశేషం : కళింగపతి: కళింగుడనే రాజు ఏలే దేశానికి కళింగదేశం అని పేరు. ఇతడు కౌరవ పక్షాన చేరి యుద్ధం చేశాడు. **'అంగోవంగః కళింగశ్చ పుండ్రః సుహ్మశ్చతే సుతాః తేషాం దేశాః సమాఖ్యాతాః స్వనామప్రథితా భువి॥ అంగస్యాంగో భవద్దేశో, వంగో వంగస్య చ స్మృతః। కళింగ విషయశ్చైవ కళింగస్య చ స స్మృతః ॥** (మహాభారతే 1 - 104 - 49, 50).

క. గిరి డిగు కేసరి చాడ్పున । నరదము డిగి భ్రమితపటుగదాభీలత నా
కరువలిపట్టియుఁ గవిసినఁ । గరులుఁ దెరలెఁ బవనధూతఘనపంక్తి గతిన్. 220

ప్రతిపదార్థం: గిరిన్= కొండపై నుండి; డిగు= దిగునట్టి; కేసరి చాడ్పునన్= సింహం మాదిరి; ఆ కరువలి పట్టియున్= వాయుదేవుని కొడుకు భీముడు; అరదము డిగి= రథంనుండి దిగి; భ్రమిత= త్రిప్పబడిన; పటు= దృఢమైన; గదా= గదాయుధంచేత; ఆభీలతన్= భయంకరంగా; కవిసినన్=మార్కొనగా; కరులు= ఏనుగులు; పవన= గాలిచేత; ధూత= ఎగురకొట్టబడ్డ; ఘన= మేఘాల యొక్క; పంక్తిగతిన్= వరుసవలె; తెరలెన్= తొలగిపోయాయి.

తాత్పర్యం: భీముడు కొండపైనుండి దిగి వచ్చే సింహం మాదిరిగా రథం నుండి దిగి, తన గదను గిరగిర త్రిప్పుతూ భయంకరంగా ఆ ఏనుగుల గుంపుమీదికి దూకాడు. గాలికి చెల్లా చెదరై పోయే మేఘాల వరుస మాదిరి అవి(ఏనుగులు) దూరంగా వెళ్ళిపోయాయి.

విశేషం: అలం: ఉపమ.

తే. **క్రందుకొని యిట్లు మాతంగ ఘటలు విఱుగ। నా శ్రుతాయువుఁ బ్రాగ్జ్యోతిషాధిపతియుఁ**
బోక నిలిచి యమ్మారుతపు త్త్రుజోడుఁ। దనువుఁ జించిరి వివిధాస్త్రతతులు పఱపి. **221**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా, మాతంగ ఘటలు= ఏనుగుల గుంపులు; క్రందుకొని= అధికంగా; విఱుగన్= బెదిరిపోగా; శ్రుతాయువున్= శ్రుతాయువనేవాడు; ప్రాగ్జ్యోతిషాధిపతియున్= భగదత్తుడు; ఈ ఇద్దరు; పోక= పారిపోకుండా; నిలిచి; ఆ+మారుత పుత్త్రు= ఆ భీముడియొక్క; జోడున్= కవచాన్ని; తనువున్= శరీరాన్ని; వివిధ+అస్త్రతతులు= నానా విధాలైన అస్త్రాలను; పఱపి= ప్రయోగించి; చించిరి= చినిగేట్టు చేశారు.

తాత్పర్యం: భీముడి గద దెబ్బలకు ఏనుగుల గుంపు బెదిరిపోగా శ్రుతాయువు, భగదత్తుడు గట్టిగా నిలబడి, భీముడి మీదికి చాలా ఆయుధాలు ప్రయోగించి అతడి కవచాన్ని, శరీరాన్ని చీలికలు చేశారు.

విశేషం: శ్రుతాయువు-సూర్యవంశపురాజు. ఇతడు కుశుడికి పదునాలుగవ తరంవాడు. **'నాభాగస్యాంబరీషోఽభూత్, సింధుద్వీప స్తతోఽభవత్ । తతః శ్రుతాయు రభవత్ ఋతుపాల స్తతోఽభవత్॥** (మాత్స్యే 13 వ అధ్యాయః)

వ. **అప్పుడు గాంగేయుండు సేయు దారుణరణంబు ధర్మపుత్త్రునకు భరం బైన నతం డెలుంగెత్తి పేరువేరం బిలిచి చేయి వీచిన నా కళింగనాథ భగదత్తుల విడిచి యవుడు గఱచుచు.** **222**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; గాంగేయుండు= భీష్మాచార్యుడు; చేయు= చేస్తున్న; దారుణరణంబు= భయంకరమైనయుద్ధం; ధర్మపుత్త్రునకున్= ధర్మరాజుకు; భరంబు+ఐనన్= బరువైనదికాగా; అతండు= ఆ ధర్మరాజు; ఎలుఁగు+ఎత్తి= గొంతెత్తి; పేరు+పేరన్+పిలిచి= తనవారిని పేరు పేరునా పిలుస్తూ; చేయివీచినన్= చేయి విసరగా; ఆ కళింగనాథభగదత్తులన్= కళింగరాజు; భగదత్తుడు-వీరిద్దరిని; విడిచి= వదలిపెట్టి; అవుడు+కఱచుచున్= పెదవి కొరుక్కుంటూ.

తాత్పర్యం: అప్పుడు భీష్ముడు చేస్తున్న యుద్ధానికి ధర్మరాజు తట్టుకోలేకపోయాడు. వెంటనే, గొంతెత్తి, తమ వారిని పిలిచాడు. రమ్మని చేయి విసిరాడు. వెంటనే భీముడు శ్రుతాయువును, భగదత్తుడిని వదలిపెట్టి, పెదవి కొరుక్కుంటూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **కలయఁగఁ గరములఁ జరణం। బుల నురమున శోణితంబు బోరనఁ దొరఁగం**
దలి రెసఁగిన నడమామిడి । చెలువునఁ బఱతెంచె భీమసేనుఁ డచటికిన్. **223**

ప్రతిపదార్థం: భీమసేనుఁడు= భీముడు; కలయఁగన్= అంతటినుండి; కరములన్= చేతులనుండి; చరణంబులన్= కాళ్ళనుండి; ఉరమునన్= రొమ్మునుండి; శోణితంబు= నెత్తురు; బోరన= వేగంగా; తొరఁగన్= కారుతుండగా; తలిరు+ఎసఁగిన= చిగుళ్ళతో ఒప్పియున్న; నడమామిడి చెలువునన్= నడిచే మామిడిచెట్టుమాదిరి; అచటికిన్= ధర్మరాజున్న చోటికి; పఱతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: భీముడు చేతులు, కాళ్ళు, రొమ్ము - వీటి నుండి నెత్తురు ఎక్కువగా కారుతూ ఉండగా, ఒళ్ళంతా రక్తమయంకాగా ఎర్రని చిగుళ్ళతో ఒప్పినట్టి నడిచే మామిడిచెట్టు మాదిరి ధర్మరాజు కడకు వచ్చి చేరాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. **అంతకు మున్న ధృష్టద్యుమ్న శిఖండి విరాటద్రుపదులు ధర్మనందనున కడ్డపడి భీష్ముపై నడరి బహుప్రకార విశిఖంబుల వెగడు పఱచిన నతం డలిగి శిఖండి నేయనొల్లక యమ్మువ్వురను మూఁడేసి వాఁడితూపుల నేసిన నావీరరథికులు హుతాగ్నిత్రయంబునుం బోలెఁ బ్రజ్వలించి బాణజ్వాలలు నిగిడించి యతని నొప్పించిరి**

వృకోదరుఁడద్దెసం గవియుటం గనుంగొని కేకయగణశైనేయద్రౌపదేయులు గూడుకొని కవిసినం గౌరవసేనం జేయంగలమేటిమగ లెల్లను మిన్నేటికొడుకునకుం దలకడచి వారిం దలపడిన నిరుదెఱంగుల దొరలును, బలంబులును నొక్కుమ్మడిం గ్రందుకొన బెరసి పోట్లాడుచుండం జండరశ్మి వినువీథి చక్క సగంబునకుం జనుదెంచె నట్టియెడ. 224

ప్రతిపదార్థం: అంతకుమున్న= భీముడు రావడానికి ముందుగానే; ధృష్టద్యుమ్న; శిఖండి; విరాట; ద్రుపదులు; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; అడ్డపడి= అడ్డంగా వచ్చి; భీష్మునిపైన్= భీష్ముడిమీదికి; అదరి= విజృంభించి; బహుప్రకారవిశిఖంబులన్= అనేక విధాలైన బాణాలతో; వెగడుపఱచినన్= తల్లడిల్లజేయగా; అతండు= ఆ భీష్ముడు; అలిగి= కోపగించి; శిఖండిన్= శిఖండిని; ఏయన్= కొట్టడానికి; ఒల్లక= ఇష్టపడక; ఆ+ముఫ్వురనున్= ధృష్టద్యుమ్నవిరాటద్రుపదులను; మూఁడేసి= మూడుమూడు; వాఁడి= పదనుగల; తూపులన్= బాణాలతో; ఏసినన్= కొట్టగా; ఆ వీరరథికులు= వీరులూ, రథికులు అయిన ఆ ముగ్గురు; హుతాగ్నిత్రయంబున్+పోలెన్= వేల్చబడిన మూడగ్నుల చందంగా; ప్రజ్వలించి= మండిపడి; బాణజ్వాలలు= బాణాలనే అగ్నిశిఖలను; నిగిడించి= ప్రయోగించి; అతనిన్= ఆ భీష్ముని; నొప్పించిరి= బాధపెట్టారు; వృకోదరుఁడు= భీముడు; ఆ+దెసన్= అటుప్రక్కకు; కవియుటయున్; కనుంగొని= చూచి; కేకయ= కేకయదేశీయుల యొక్క; గణ= గుంపు; శైనేయ= శిని వంశంవాడైన సాత్యకి; ద్రౌపదేయులు= ద్రౌపదికొడుకులున్నూ; కూడుకొని= ఒక్కటై; కవిసినన్; కౌరవసేనన్; చేయంగల= సమర్థులైన; మేటిమగలు= గొప్పవారైన శూరులు; మిన్నేటి కొడుకునకున్= భీష్ముడికి; తలకడచి= ముందువైపునకుదాటి; వారిన్= ఆ ముగ్గురిని; తలపడినన్= ఎదుర్కోగా; ఇరుతెఱంగుల= రెండువైపుల ఉన్నట్టి; దొరలును= రాజులున్నూ; బలంబులును= సైన్యాలున్నూ; ఒక్కుమ్మడిన్= ఒక్కసారిగా; క్రందుకొనన్= అతిశయింపగా; బెరసి= దగ్గరకు చేరుకొని; పోట్లాడుచుండన్= పోట్లాడే సమయంలో; చండరశ్మి= వేడి కిరణాలు కలవాడు(సూర్యుడు); వినువీథిన్= ఆకాశమార్గంలో; చక్క సగంబునకున్= సరిగ్గా మధ్యభాగానికి; చనుదెంచెన్= వచ్చి చేరాడు; అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: భీముడు వచ్చి చేరటానికి ముందే ధృష్టద్యుమ్నుడు, శిఖండి, విరాటుడు, ద్రుపదుడు - వీరు నలుగురూ ధర్మరాజుకు అండగా అడ్డంగా నిలిచి, భీష్మడిపైన నానా విధాల బాణాలు ప్రయోగించి, అతడిని చాలా బాధపెట్టారు. అతడు కోపగించి, శిఖండిని వదలిపెట్టి మిగిలిన ముగ్గురిపైనా మూడేసి పదునైన బాణాలు వేశాడు. దానికి ఆ రథికులు త్రేతాగ్నుల చందంగా మండిపడుతూ, మండుతున్న బాణాలను అతడి మీదికి వేసి బాధించారు. భీముడు ఆ ప్రక్కకు రావటాన్ని చూచి కేకయులు, సాత్యకి, ద్రౌపదేయులు ఒక్కటిగా చేరి కలిశారు. అప్పుడు కౌరవసేనలో ఉండే సామర్థ్యం గల మహా వీరులందరూ భీష్మడికి అండగా ముందుగా నిలబడి ఆ కేకయ సాత్యకి ద్రౌపదేయులను ఎదిరించారు. అప్పుడు పాండవసేనలో, కౌరవసేనలో ఉండే సమర్థులు అయిన రాజులు, వారి వారి సైన్యాలూ ఒక్కపెట్టున ఏకమై విజృంభించి, దగ్గరికి చేరి, యుద్ధం చేస్తూండగా సూర్యుడు ఆకాశం మధ్యకు చేరుకొన్నాడు. (అప్పుడు మిట్టమధ్యాహ్నమైందన్నమాట.)

విశేషం : అగ్నిత్రయంబు= 1. ఆహవనీయము; 2. దక్షిణాగ్ని; 3. గార్హపత్యం.

తే. **రథములను సామజములఁ దురంగమముల। నుఱక నెత్రుటేఱుల నీఁది తఱియ నడచి**
పోరి రేటును వ్రేటును బోటు నొక్క। యలవిఁ జెలఁగంగ నుభయసైన్యములవారు. 225

ప్రతిపదార్థం: ఉభయసైన్యములవారున్= రెండు సైన్యాలలోని యోధులు; రథములను= తేరులను; సామజములన్= ఏనుగులను; తురంగమములన్= గుఱ్ఱాలను; ఉఱక= దాటటానికి; నెత్రు+ఏరులన్= నెత్తురు ప్రవాహాలలో; ఈఁది= ఈతకొట్టి; తఱియనడచి=

దగ్గరకు చేరడానికి నడిచి; ఏటును= బాణాలు ప్రయోగించుకోవడం; వ్రేటును= బాదటం; పోటునున్= పొడుచుకోవటం-వీటిలో; ఒక్క+అలవిన్= ఒకే (సామర్థ్యంలో); చెలఁగంగన్= ఒప్పి ఉండేటట్లుగా; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: పాండవ కౌరవసేనలలోనివారు రథాలు, ఏనుగులు, గుర్రాలు - వీటిని నరికివేయటంచేత ఏర్పడిన రక్తపుటేరులలో కొంతదూరం ఈతాడి, మరికొంత దూరం దూకి, నడచి, బాణప్రయోగంతో కొట్టుకొనటంలో, పొడుచుకొనటంలో ఒకరికొకరు తీసిపోకుండా, సమతూకంగా విజృంభించి యుద్ధం చేశారు.

వ. అప్పుడు మన బలంబుల జనంబులు. 226

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; మనబలంబుల= మన సేనలో ఉండే; జనంబులు= జనులు.

తాత్పర్యం: రెండు సైన్యాలు సమానంగా పోరే సమయంలో, మన కౌరవ సేనలలో ఉండే జనాలు ఏమనుకొంటున్నారంటే.

క. ‘ ధృతరాష్ట్రుండును బుత్త్రులు । నతిలోభంబునఁ బ్రజాక్షయము సేసిరి ధ
ర్మతనూజు గెలువ వచ్చునె? । మతి లేరై రింక నేటిమాటలు? మనకున్’ 227

ప్రతిపదార్థం: అతిలోభంబునన్= మితిమీరిన ఆశతో; ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడు; పుత్త్రులున్= అతని కొడుకులు; ప్రజాక్షయము= జననాశాన్ని; చేసిరి= చేశారు; ధర్మతనూజున్= ధర్మరాజును; గెలువన్ వచ్చునె?= జయించటం సాధ్యమా?(కాదు); మతిలేరు+ఐరి= (కౌరవులు) బుద్ధిలేని వారయ్యారు; ఇంకన్= ఇకమీద; మనకున్= కౌరవపక్షంలోని మనకు; ఏటిమాటలు?= ఏమి భవిష్యత్తు?

తాత్పర్యం: ‘ధృతరాష్ట్రుడు, అతడి కొడుకులు చాలా దురాశాపరులై పాండవులతో యుద్ధానికి దిగారు. ఆ ఆశబోతులవల్ల అమాయిక ప్రజలెందరో యుద్ధంలో మరణిస్తున్నారు. ధర్మరాజు నీతి, నిజాయితీ గలవాడు. ఆయనను జయించటం సాధ్యమయ్యే పనేనా? (కాదు). కౌరవులు ఓడిపోయి, పాండవులు జయిస్తారు. అప్పుడు కౌరవపక్షంలో ఉన్న మన సంగతేమిటి?’

ఆ. అనుచు వగచు పలుకు లాలించు భీష్మాది । యోధవరులతో సుయోధనుండు
‘చెనఁటి మాటలేమి వినియెద?’రనిన వా । ర దియు నదియు విననియట్ల పోలె. 228

ప్రతిపదార్థం: సుయోధనుండు= దుర్యోధనుడు; అనుచున్= అని; వగచు పలుకులు= చింతించే మాటలు; ఆలించు= వినే; భీష్మ+ఆది యోధ వరులతోన్= భీష్ముడు మొదలుగా గల వీరాగ్రేసరులతో; చెనఁటిమాటలు= కుత్సితుల మాటలు; ఏమి వినియెదరు?= ఎందుకు వింటారు? అనినన్= అనగా, వారు= ఆ భీష్మాదులు; అదియున్+అదియున్= ఆయా మాటలను; వినని+అట్ల పోలెన్= ఆలకించని విధంగా.

తాత్పర్యం: దుర్యోధనుడు తనసేనలోని వారి యొక్క నిరుత్సాహపరచే శోకంతో కూడిన మాటలు వినే, భీష్మాదులతో ‘కుత్సితపు మాటలు ఎందుకు వింటారు?’ అన్నాడు. ఆ యోధవరులు, ఆ కుత్సితపు మాటలూ, దుర్యోధనుని మాటలూ వినని విధంగా మామూలుగా యుద్ధం చేస్తున్నారు.

వ. పరాక్రమక్రీడలు సలుపుచుండి రాసందడికయ్యంబునం గిమ్మీరమర్దనుండు గదపండువు సేయుచుండె నప్పుడు. 229

ప్రతిపదార్థం: పరాక్రమ క్రీడలు= పరాక్రమంతో కూడిన ఆటలు; సలుపుచుండిరి= చేస్తూ వుండినారు; ఆ సందడి కయ్యంబునన్= ఆ సంకులసమరంలో; కిమ్మీర మర్దనుండు= కిమ్మీరుడనే రాక్షసుడిని చంపినవాడు(భీముడు); గదపండువు(న్)= (తన) గదకు పండుగను; చేయుచుండెన్= చేస్తూ ఉండినాడు; అప్పుడు.

తాత్పర్యం: వీరులందరూ యథాప్రకారంగా తమ శౌర్యాన్ని చూపిస్తూ, ఆటమాదిరి యుద్ధం చేస్తూ ఉన్నారు. అప్పటి యుద్ధం సంకులసమరంగా ఉన్నది. భీముడు తన గదకు పండుగ చేస్తున్నాడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సరభసముగ సారథి దన । యరదముఁ దెచ్చుటయు నెక్కి యతినిశితశర
స్ఫురణాపరిణతి బాహ్లికు । విరథుం గావించె సురలు వినుతింపంగన్. 230

ప్రతిపదార్థం: సారథి= రథంతోలేవాడు; సరభసముగ(న్)= వేగంగా; తన= (తన) భీమునియొక్క; అరదమున్= రథాన్ని; తెచ్చుటయున్= తేగా; ఎక్కి; అతి= మిక్కుటంగా; నిశిత= పదునైన; శర= బాణాలయొక్క; స్ఫురణా= కదలికయందలి; పరిణతి(న్)= పరిపక్వతతో; సురలు= దేవతలు; వినుతింపంగన్= పొగడుతూ ఉండగా; బాహ్లికున్= బాహ్లికుడిని; విరథున్= రథంలేని వాడినిగా; కావించెన్= చేశాడు.

తాత్పర్యం: తన సారథి తొందరగా రథాన్ని తీసికొని రాగానే, భీముడు దానిలోనికి ఎక్కి, చాలా పదునైన బాణాలు వేశాడు. బాణాలను అడరేటట్లు చేయడంలో తనకు గల నేర్పుతో బాహ్లికుడి రథాన్ని కూల్చాడు. అప్పుడు దేవతలు ఆతడిని పొగిడారు.

తే. చిత్రసేనుండు సౌభద్రుఁ జిత్రబాణ । పాతమున నొంచి యార్చినఁ బాండుపౌత్రుఁ
డతని సారథిఁ బడ నేసి యంతఁ బోక । తురగములఁ జంపి యాతని త్రుళ్ళడంచె. 231

ప్రతిపదార్థం: చిత్రసేనుండు= చిత్రసేనుడు(కౌరవుల పక్షంవాడు); సౌభద్రున్= అభిమన్యుని; చిత్రబాణపాతమునన్= చిత్రములైన బాణాలతో కొట్టడంవల్ల; నొంచి= నొప్పచేసి; ఆర్చినన్= బొబ్బపెట్టగా; పాండుపౌత్రుఁడు= పాండురాజు మనుమడు(అభిమన్యుడు); అతని సారథిన్= ఆ చిత్రసేనుడి సారథిని; పడన్+ఏసి= పడగొట్టి; అంతన్+పోక= అంతటితో ఆగక; తురగములన్= గుర్రాలను కూడా; చంపి= వధించి; ఆతని త్రుళ్ళు= ఆ చిత్రసేనుడి ఎగిరిపాటును; అడంచెన్= నశింపచేశాడు.

తాత్పర్యం: చిత్రసేనుడు అభిమన్యుడిని బలమైన బాణాలతో కొట్టి, నొప్పి కలిగించి గర్జన చేశాడు. అభిమన్యుడు చిత్రసేనుడి సారథిని చంపి, అంతటితో వదలిపెట్టకుండా, గుర్రాలను కూడా చంపి వాడి పొగరణచాడు.

విశేషం : చిత్రసేనుడు: ధృతరాష్ట్రుడి కొడుకులలో ఒకడు - ధృతరాష్ట్రుని కుమారులలో ప్రధానులు నలుగురు: 1. దుర్యోధనుడు, 2. దుశ్శాసనుడు, 3. వికర్ణుడు, 4. చిత్రసేనుడు.

వ. అక్కుమారుండును దుర్ముఖునిరథంబెక్కెఁ బాంచాలపతి గుంభసంభవుపై నడరి యతనిమేన నానాస్త్రంబులు నించిన. 232

ప్రతిపదార్థం: ఆ+కుమారుండును= ఆ చిత్రసేనుడును; దుర్ముఖుని రథంబు; ఎక్కెన్= ఎక్కాడు; పాంచాలపతి= ద్రుపదుడు; కుంభసంభవుపైన్= ద్రోణుడిమీదికి; అడరి= విజృంభించి; అతనిమేనన్= ఆ ద్రోణుడి శరీరంపైన; నానా+అస్త్రంబులు= పలు మంత్రపూర్వకములైన బాణాలు; నించిన(న్)= నింపగా.

తాత్పర్యం: ఆ చిత్రసేనుడు దుర్ముఖుడి రథంలోనికి ఎక్కాడు. ద్రుపదుడు ద్రోణుడి మీదికి విజృంభించి, పలు బాణాలతో అతడి శరీరాన్ని నింపివేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పాంచాలదేశము: అయిదు ముఖ్య నదులచే చుట్టబడినది - పాంచాలములో పంచాలశబ్దం పైన స్వార్థంలో 'అణ్' ప్రత్యయం రాగా, 'పాంచాలము' అనే రూపమైనది. ఆ పాంచాల నగరానికి రాజు ద్రుపదుడు. ఇప్పు డా నగరానికి 'ఫరక్కాబాద్' అని వాడుక.

క. ద్రోణుఁడు గోపించి తను । త్రాణం బఱువుళ్ళు సేసి తనువున రాజ
ద్బాణంబులు గ్రుచ్చిన సం । క్షీణబలుండై యతండు సిగ్గఱి తొలఁగెన్. 233

ప్రతిపదార్థం: ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; కోపించి= కోపంచెంది; తనుత్రాణంబు= ద్రుపదుడి కవచాన్ని; అఱువుళ్ళు+చేసి= శిథిలాలుగా చేసి; తనువునన్= శరీరంలో; రాజత్+బాణంబులు= జ్వలించే బాణాలను; గ్రుచ్చినన్= గ్రుచ్చుకొనేట్లు చేయగా; అతండు= ఆ పాంచాలరాజు; సంక్షీణబలుండు+ఐ= తగ్గిపోయిన బలం గలవాడై; సిగ్గు+అఱి= సిగ్గుచెడి; తొలఁగెన్= తొలగిపోయాడు.

తాత్పర్యం: ద్రోణుడికి గొప్ప కోపం వచ్చింది. ఆ పాంచాలరాజు కవచాలను ఏ భాగాని కాభాగం వదలిపోయేట్లు చేసి, అతడి శరీరాన్ని మెరిసే బాణాలతో నింపేశాడు. అతడు సిగ్గుతో తొలగిపోయాడు.

విశేషం : ద్రోణుడు- కలశం ఇతనికి ఉత్పత్తి స్థానం కనుక ద్రోణుడు. కురు పాండవులకు ఆచార్యుడు. ఇతడి తండ్రి భరద్వాజుడు. అతడొకనాడు గంగానదిలో స్నానం చేయటానికి వెళ్ళి గంగలో స్నానం చేసిన ఘృతాచి అనే అప్సరసను చూచి, మోహించాడు. ఆమెను కలిశాడు. తననుండి స్ఖలించిన రేతస్సును ద్రోణం (కలశం)లోకి పట్టగా, అందు పుట్టాడు ద్రోణుడు. (ఇతడిని ద్రుపదమహారాజు కొడుకు ధృష్టద్యుమ్నుడు యుద్ధంలో సంహరిస్తాడు.)

సీ. తఱిమి సుశర్ముండు దాఁకి యర్జును నొంచి । కృష్ణుపై నమ్ములు గీలుకొలుప
నలిగి యన్నరుఁడు వాలంపకాలువ లోలి । నడరించుటయు వానియఖిలబలముఁ
జేతిసమ్మెటలను జేరుకోలల వ్రేసి । యంకుశంబుల నూఁటి యతిరయమున
వాహనంబులఁ దోలువారును విండ్లును । బలకలు వైచుచుఁ బఱచువారు

తే. నైన మీ తండ్రి క్రీడిపై నడర నడుమఁ । జొచ్చె సాత్యకి యన్నదీసుతుఁడు శక్తి
వైవ మెయి వాల్చి యది పట్టి వైచె మగుడ । నాతఁ డా భీష్ముఁ డెడఁ దునుమాడె నధిప! 234

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా! సుశర్ముండున్= సుశర్మ అనేవాడు; తఱిమి= త్వరపడి; అర్జునున్= అర్జునుడిని; తాఁకి= మార్కొని; నొంచి= నొవ్వచేసి; కృష్ణుపైన్= కృష్ణుడిమీద; అమ్ములు= బాణాలను; కీలుకొలుపన్= గ్రుచ్చగా; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; అలిగి= కోపించి; వాలు+అంపకాలువలు= పొడవైన బాణాల కాలువల; ఓలిన్= వరుసగా; అడరించుటయున్= అతిశయింపచేయగా; వాని+అఖిలబలమున్= ఆ సుశర్మ సైన్యమునంతయు; చేతి సమ్మెటలను; చేరుకోలలన్= జాటీలతోనూ; వ్రేసి= కొట్టి; అంకుశంబులన్; ఊఁటి= పొడిచి; అతిరయమునన్= చాల వేగంతో; వాహనంబులన్= ఏనుగులను, గుర్రాలను; తోలువారును= తోలేటటువంటివారున్నూ; విండ్లును= ధనుస్సులు; పలకలు= కేడెములు; వైచుచున్= పడవేయుచు; పఱచువారున్ ఐనన్= పరుగులు తీసేవారుకాగా; మీ తండ్రి= మీ తండ్రియైన భీష్ముడు, క్రీడిపైన్= అర్జునుడిమీదికి; అడరన్= విజృంభించగా; సాత్యకి= పాండవుల పక్షంవాడు; నడుమన్= మధ్యలో; చొచ్చెన్= చొరబడ్డాడు; ఆ+నదీసుతుఁడు= ఆ భీష్ముడు; శక్తివైవన్= శక్తి అనే ఆయుధాన్ని ప్రయోగించగా; మెయిన్= శరీరాన్ని; వాల్చి= వంచి; ఆతఁడు= ఆ సాత్యకి; అది పట్టి= ఆ శక్తి అనే ఆయుధాన్ని పట్టుకొని; మగుడన్= మరల; వైచెన్= వేశాడు; ఆ+భీష్ముఁడు; ఎడన్= మధ్యలోనే; తునుము+ఆడెన్= త్రుంచివేశాడు.

తాత్పర్యం: సుశర్మ అర్జునుడిని ఎదిరించి, ఆతడికి నొప్పి కలిగించాడు. కృష్ణుడిమీద కూడా బాణాలు గుప్పించాడు. దానితో అర్జునుడికి కోపం వచ్చింది. బాణాలను ప్రవాహాలుగా ప్రయోగించి ఆ ప్రవాహాలలో శత్రువులను

ఓలలాడించాడు. ఆ ధాటికి సుశర్మ సైన్యమంతా కూడా తమ తమ ఆయుధాలతో, సమ్మెటలు, జాటీలు, అంకుశాలు - వీటితో తమ వాహనాలు, గుర్రాలు, ఏనుగులను కొట్టి, పొడిచి, వేగంగా తోలుకొని పోయారు. బంట్లు తమ ధనుస్సులను, కేడెములను పారవైచి, పరుగులు తీశారు. అప్పుడు భీష్ముడు అర్జునుడి మీదికి విజృంభించగా సాత్యకి మధ్యలో అడ్డం తగిలాడు. భీష్ముడు సాత్యకి మీదికి శక్తిని ప్రయోగించాడు. అప్పుడు సాత్యకి వంగి, ఆ శక్త్యాయుధాన్ని పట్టుకొని, మళ్ళీ భీష్ముడిపైకే విసరగా, మధ్యలోనే దాన్ని ఖండించాడు భీష్ముడు.

వ. ఇట్లు ద్రుంచి. 235

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; త్రుంచి= విరుగగొట్టి.

తాత్పర్యం: సాత్యకి తిప్పివేసిన శక్తి ఆయుధాన్ని విరిచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఆలోనన మెయిఁ దొమ్మిది । వాలమ్ములు నాటఁ బాండవవ్యూహము శుం
డాలరథఘోటసుభటా । భీలతఁ దలకడచి పొదివె భీష్ముని నంతన్. 236

ప్రతిపదార్థం: ఆలోనన్+అ= అంతలోపలనే; మెయిన్= సాత్యకి దేహంమీద; తొమ్మిది వాలు+అమ్ములు= తొమ్మిది పదునైన బాణాలు; నాఁటన్= (భీష్ముడు)గ్రుచ్చుకొనేటట్లు చేయగా; అంతన్; పాండవవ్యూహము= పాండవుల సైన్యం; శుండాల= ఏనుగులు; రథ= రథాలు; ఘోట= గుర్రాలు; సుభట= కాల్బలము; ఈ చతురంగ బలం; ఆభీలతన్= భయంకరంగా; తలకడచి= దాటివచ్చి; భీష్మునిన్= భీష్మాచార్యుడిని; పొదివెన్= కమ్ముకొన్నది.

తాత్పర్యం: అంతలోనే భీష్ముడు తొమ్మిది బాణాలు సాత్యకి ఒంటి మీద గ్రుచ్చుకొనేటట్లుగా ప్రయోగించాడు. పాండవసేనలోని ఏనుగులు, రథాలు, గుర్రాలు, కాల్బలం - అంతా భయంకరంగా దాటివచ్చి, ఆ భీష్ముడిని క్రమ్ముకొన్నాయి.

దుర్యోధనుఁడు శకునిదుశ్శాసనుల భీష్మునకు సహాయంబుగాఁ బంపుట (సం. 6-101-1)

క. కని కౌరవపతి దుశ్శా । సనుతో నిట్లనియెఁ గంటె? శాంతనవునిపై
ఘన సేన ద్రోచెఁ జని కై । కొనుఁ డీవును సౌబలుఁడు నకుంఠితవృత్తిన్.' 237

ప్రతిపదార్థం: కౌరవపతి= కురురాజు దుర్యోధనుడు; దుశ్శాసనుతోన్; ఇట్లు+అనియెన్; శాంతనవునిపైన్= శంతనుడి కుమారుడైన భీష్ముడిమీదకి; ఘనసేన= గొప్పదగు సైన్యం; త్రోచెన్= వ్యాపిస్తున్నది; కంటె?= చూచావా?; ఈవును= నీవున్నూ; సౌబలుఁడు= శకుని; చని= వెళ్ళి; అకుంఠితవృత్తిన్= మొక్కపోని విధంగా; కైకొనుఁడు= అతడి సహాయానికి పూనుకోండి.

తాత్పర్యం: దుర్యోధనుడు దుశ్శాసనుడితో ఇట్లా అన్నాడు: 'భీష్ముడి మీదికి పాండవులదైన గొప్ప సైన్యం విరుచుకపడుతూ ఉన్నది. చూచావా? నీవు, శకుని వెళ్ళి, ఏ మాత్రం జంకూగొంకూ లేక ఆయన్ని ఆదుకోండి.'

క. అనవుడు నయ్యిరువురు నే । పునఁ గదియుడుఁ జూచి ధర్మపుత్త్రుఁడు మాద్రీ
తనయులు నడరిన దుర్యో । ధనుఁ డపుడు తురంగమాయుతముఁ బురికొలిపెన్. 238

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; ఆ+ఇరువురున్= ఆ శకుని దుశ్శాసనులిద్దరూ; ఏపునన్= విజృంభణంతో, కదియుడున్= దగ్గరకు రాగా; చూచి; ధర్మపుత్త్రుఁడు= ధర్మరాజు; మాద్రీతనయులున్= మాద్రి కొడుకులు నకుల సహదేవులున్నూ; అడరినన్=

విజృంభించగా; అపుడు= ఆ సమయంలో; దుర్యోధనుఁడు; తురంగమ+అయుతమున్= పదివేల గుర్రాల(రౌతుల)ను; పురికొల్పెన్= కవ్వింపచేశాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు చెప్పగానే, శకుని దుశ్శాసను లిద్దరూ భీష్ముడి దగ్గరకు వచ్చారు. దీన్ని చూచి ధర్మరాజు, నకులుడు, సహదేవుడు అక్కడికి వచ్చి, విజృంభించారు. దాన్ని చూచి దుర్యోధనుడు పదివేల గుర్రపు రౌతుల్ని వారి మీదికి కవ్వింపజేశాడు.

వ. ఆ పదివేవురు నెఱరావుతులును నొక్కపెట్ట శకునిదుశ్శాసనులకుం దలకడచి యెక్కినం బాండవబలంబు మహామత్స్యసమూహవిహారంబునం గలంగు మడువునుంబోలె సంక్షోభించినం గోపించి కౌంతేయాగ్రజుండును గవలును, వివిధవిశిఖపరంపరలు వరగింప ముందటికాళ్ళు దునిసిన మ్రొగ్గ తిలంబడియును మోరలు పఱియలైన నెఱి దప్పం గూలియు, గుండియ లవిసిన నెగసి కెడసియు వాగెలు ద్రెవ్విన వలియం బాఱియు నాశ్వికులు నేల కొఱగినం జెనఁటి దిరిగియు, ననేకఘోటకంబులు రూపఱిన నేపఱి యత్తురంగనికరంబు లేటమొగంబు వడి చెదరి కనుకనిం బఱచిన. 239

ప్రతిపదార్థం: ఆ పదివేవురు= ఆ పదివేలు; నెఱరావుతులును= సమర్థులైన గుర్రపు రౌతులు; ఒక్కపెట్ట= ఒక్కసారిగా, శకుని దుశ్శాసనులకున్; తలకడచి= ముందుకు వెళ్ళి; ఎక్కినన్= అతిశయించగా; పాండవబలంబు= పాండవుల సేన; మహా= గొప్ప; మత్స్య= చేపల; సమూహ= గుంపుయొక్క; విహారంబునన్= తిరగటంచేత; కలంగు= కలత చెందునట్టి; మడువునన్+పోలెన్= మడుగుమాదిరి; సంక్షోభించినన్= కలతచెందగా; కౌంతేయ+అగ్రజుండునున్= ధర్మరాజున్నూ; కవలును= నకుల సహదేవులున్నూ; కోపించి; వివిధ విశిఖ పరంపరలు= నానా విధాలైన బాణాల వరుసలు; పరగింపన్= ప్రయోగించగా; ముందటి కాళ్ళున్= ముందుకాళ్ళు; తునిసినన్= తుంటలుకాగా; మ్రొగ్గతిలన్+పడియును= మోకరిల్లిపడియు; మోరలు= ముఖాలు; పఱియలు+ఐనన్= బద్దలుకాగా; నెఱి= అందం; తప్పన్= తప్పిపోగా; కూలియున్= క్రిందపడియు; గుండియలు= గుండెకాయలు; అవిసినన్= పగిలిపోగా; ఎగసి= ఎగిరి; కెడసియు(న్)= పడియు; వాగెలు(న్)= కళ్ళెమునకు తగిలించే పగ్గాలు; త్రెవ్వినన్= తెగిపోగా; వలియ బాఱియు(న్)= బలహీనపడి; అలసిపోయి; ఆశ్వికులు= రౌతులు; నేలకున్= నేలమీదికి; ఒఱగినన్= వాలిపోగా; చెనఁటి= దండుగగా; తిరిగియున్; అనేక ఘోటకంబులు= పలుగుర్రాలు; రూపఱినన్= అంగహీనాలుకాగా; ఏపు+అఱి= విజృంభణం తగ్గి; ఆ+తురంగనికరంబు= ఆ గుర్రాల గుంపు; లేటమొగంబు+పడి= పక్కకు త్రిప్పుకొనిన ముఖాలు కలవై; చెదరి= కలతపడి; కనుకనిన్= తొందరపాటుతో; పఱచినన్= పారిపోగా.

తాత్పర్యం: ఆ పదివేల మంది రౌతులు ఒక్కసారిగా శకునిదుశ్శాసనుల ముందుకు వచ్చి విజృంభించారు. అప్పుడు పాండవుల సేన అంతా కూడా, గొప్ప గొప్ప చేపల గుంపులు ఇటూ అటూ తిరగటంచేత కలత చెందిన కొలను చందంగా అయింది. అప్పుడు ధర్మరాజుకు, నకులసహదేవులకు తమ సేన పాటు చూచి కోపం వచ్చి, వారు రకరకాలైన బాణాల వరుసలు ఆ గుర్రాలపై గుప్పించారు. దాని ఫలితంగా, చాలా గుర్రాలు ముందు కాళ్ళు విరిగి మోకరిల్లి పడ్డాయి. ఇంకా కొన్ని గుర్రాలు - ముఖాలు బద్దలుగా పగిలిపోగా, అందం తప్పి, కుప్పకూలాయి. మరికొన్ని గుండెకాయలు పగిలి ఎగిరి నేల కూలాయి. పలుగుర్రాలు నోటికి కళ్ళెంతో పాటు తగిలించే తాళ్ళు తెగిపోగా పెడదారిని పారిపోయాయి. మరికొన్ని గుర్రాలు తమ రౌతులు నేలవ్రాలగా ఇటూ అటూ తిరిగాయి. చాలా గుర్రాలు అంగవిహీనాలై, తమ పటాటోపం పాడుకాగా ముఖాలు అడ్డంగా త్రిప్పుకొని కలతపడి తొందరపాటుతో ఇటూ అటూ పరుగెత్తాయి.

క. భేరీశంఖాదిరవ । స్ఫారత నప్పాండుపుత్ర బలమేచుటయుం
గౌరవపతి శల్యునితో । గారవమున నిట్టు లనియెఁ గడు దీనుం డై. 240

ప్రతిపదార్థం: ఆ+పాండుపుత్రబలము= ఆ పాండురాజు కొడుకు సైన్యం; భేరీ= దుందుభులు; శంఖ= శంఖాలు; ఆది= మొదలగు వాద్యాల, రవ= చప్పుళ్ళయొక్క; స్ఫారతన్= ఆధిక్యంతో; ఏచుటయున్= అతిశయించగా; కౌరవపతి= దుర్యోధనుడు; కడు దీనుండు+ఐ= మిక్కిలి శోచనీయమైన స్థితిని పొందినవాడై; శల్యునితోన్; గారవమునన్= ప్రేమతో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్.

తాత్పర్యం: కౌరవుల అశ్వాల హీనస్థితినిచూచి, పాండవుల సేనలో భేరీశంఖాది వాద్యాల ఘోష మిన్నుముట్టింది. దాన్ని చూచి, దుర్యోధనుడు చాలా దీనస్థితికి లోనై, సగౌరవంగా శల్యుడితో ఈ విధంగా అన్నాడు.

క. ' వెలివిరిసి వచ్చు జలనిధి । పొలుపునఁ దోఁతెంచు ధర్మపుత్రుని బలు గో
ల్తల నిలువరింప నీ వొక । చెలియలికట్ట వయి మమ్ముఁ జేకొను మిచటన్.' 241

ప్రతిపదార్థం: వెలివిరిసి= పెల్లుబికి; వచ్చు= పైకి వచ్చెడి; జలనిధి పొలుపునన్= సముద్రం ఒప్పుతో; తోఁతెంచు= వచ్చుచున్నట్టి; ధర్మపుత్రుని= ధర్మరాజుయొక్క; బలుకోల్తలన్= అధికములగు యుద్ధసన్నాహాలను; నిలువరింపన్= ఆపడానికి; ఈవు= నీవు(శల్యుడు); ఒక చెలియలికట్టవు+అయి= ఒక సముద్రపు ఒడ్డుగా తయారై; ఇచటన్= ఈ ప్రమాద స్థలంలో; మమ్మున్; చేకొనుము= ఆదరించుము.

తాత్పర్యం: 'పొంగి పొరలి వచ్చే సముద్రంలాగా, పాండవసేనలు యుద్ధ సన్నాహాలు చేసికొంటూ మన మీదికి వస్తున్నాయి. వారి సన్నాహ ప్రవాహాన్ని ఆపడానికి నీవు ఒక చెలియలి కట్టలాగా మమ్మలను ఈ ఆపత్సమయంలో ఆదుకొమ్ము.'

ఆ. అనుడు నతఁడు పాండవాగ్రజుఁ గవలను । దాఁకి విపులబాహుదర్ప మొప్ప
నారసములఁ బొదివి మారిమసంగిన । ట్లయినఁ జూచి నరుఁడు ననిలసుతుఁడు. 242

ప్రతిపదార్థం: అనుడున్= అని చెప్పగా; అతఁడు= ఆ శల్యుడు; పాండవ+అగ్రజున్= ధర్మరాజును; కవలనున్= నకుల సహదేవులను; తాఁకి= మార్కొని; విపుల బాహుదర్పము= అధికమైన చేతుల పొగరు; ఒప్పన్= తగియుండగా; నారసములన్= బాణాలతో; పొదివి= కప్పి; మారిమసంగిన+అట్లు+అయినన్; మసూరికా రోగం విజృంభించినట్లు కాగా; నరుఁడు= అర్జునుడు; అనిలసుతుఁడు= భీముడు; చూచి.

తాత్పర్యం: దుర్యోధనుడు కోరిన విధంగా శల్యుడు ధర్మరాజుపైకి, నకులసహదేవులపైకి కవిసి తన బాహుబలం చూపి బాణాలతో వారిని కప్పివేయగా, అక్కడ మహమ్మారి రేగినట్లయింది. దాన్ని చూచి అర్జునుడు, భీముడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఒక్కటఁ గడంగి శల్యునిఁ । బెక్కమ్ముల నొంచుటయును భీష్మద్రోణుల్
గ్రక్కునఁ దతిమిన నయ్యిరు । దిక్కులసైన్యములు నత్యుదీర్ణత బెరసెన్. 243

ప్రతిపదార్థం: ఒక్కటన్= ఒకే మాదిరిగా; కడంగి= యత్నించి; శల్యునిన్; పెక్కు+అమ్ములన్= చాలా బాణాలతో; నొంచుటయును(న్)= బాధించగా; భీష్మద్రోణుల్= భీష్ముడు, ద్రోణుడును; గ్రక్కునన్= వెంటనే; తతిమినన్; ఆ+ఇరుదిక్కుల సైన్యములున్= ఆ రెండు పక్షాల సేనలు; అతి+ఉదీర్ణతన్= మిక్కిలి అతిశయంగా; బెరసెన్= తారసిల్లాయి.

తాత్పర్యం: ఆ అర్జునుడు, భీముడు ఒకేసారి శల్యుడిపైకి ఎగబడి చాలా బాధ కలిగించారు. వెంటనే భీష్ముడు, ద్రోణుడు కవియగా ఆ రెండు సేనలూ విజృంభించి పెనగులాడాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు గలయన్ బెరసి యపరాహ్ణంబున నుభయ చతురంగమథనం బగు ప్రధనంబు చెల్లె నట్టియెడ భీష్మ గ్రీష్మాదిత్యుండు వేడి మిగిలి వాఁడి మెఱసిన నారసంబులను కిరణంబుల పరగించి. 244

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కలయన్= కలిసేటట్లుగా; బెరసి= చేరి; అపరాహ్ణంబునన్= దినముయొక్క నాల్గవ భాగాన; ఉభయ= రెండు పక్షాలవారియొక్క; చతురంగ= చతురంగ బలములయొక్క; మథనంబు+అగు= చిలుకుట అగు; ప్రధనంబున్= యుద్ధం; చెల్లెన్= ఒప్పెను; అట్టి+ఎడన్= ఆ సమయంలో; భీష్మ గ్రీష్మ+ఆదిత్యుండు= భీష్ముడనే ఎండకాలంలోని సూర్యుడు; వేఁడి మిగిలి= చురుకుదనంచేత అతిశయించి; వాఁడి= పదనుచే; మెఱసిన= ప్రకాశించే; నారసంబులు+అను= బాణాలనే; కిరణంబులు= కిరణాలను; పరగించి= ప్రసరింపచేసి.

తాత్పర్యం: పాండవసైన్యం, కౌరవసైన్యం రెండూ కలిసి కలియబడి, యుద్ధం చేసేటప్పుడు అపరాహ్ణకాలం అయింది. ఆ రెండు సేనలలోని చతురంగ బలాలు సముద్రాన్ని చిలికినట్టుగా, ఒక దాన్ని మరొకటి బాగా కలత చెందేటట్లుగా చేశాయి. అప్పుడు ఎండాకాలంలో మండుతుండే సూర్యుడిలాగా భీష్ముడు వేడి, వాడిగల బాణాలనే కిరణాలను అంతటా ప్రసరింపచేశాడు.

విశేషం: చతురంగబలము: చతుః +అంగబలము= నాలుగు అంగాలు కల సైన్యం. 1. రథాలు, 2. ఏనుగులు, 3. గుర్రాలు, 4. కాల్బలం. అలంకారం: రూపకం.

సీ. పండ్రెంటఁ బండ్రెంటఁ బాండవాగ్రజుని భీముని మాద్రికొడుకుల మూఁట మూఁట
నేడింట నేడింట నేచి సాత్యకిని ధృష్టద్యుమ్ను నొప్పించి సమదవృత్తి
నార్చిన మాత్స్యపాండ్యానీకములును సోమకవరూథినియును మగధబలముఁ
గాశసైన్యంబుఁ గరూశసేనయు నొక్క పెట్ట రయంబున భీష్మమీఁద

తే. నురవడించినఁ బాండవోత్కరముఁ గృష్ణ । తమ్ముఁ బాంచాలనందను సమ్ముఖమున
కడరనీ కాఁగి యందఱ కన్నిరూపు । లై మహారణ మొనరించె నస్త్రగురుఁడు. 245

ప్రతిపదార్థం: పాండవ+అగ్రజుని(న్)= ధర్మరాజును; భీముని(న్)= భీముడిని; పండ్రెంటన్+పండ్రెంటన్= పన్నెండుపన్నెండు బాణాలతో; మాద్రికొడుకులన్= నకుల సహదేవులను; మూఁటన్+మూఁటన్= మూడేసి బాణాలతో; సాత్యకిన్= సాత్యకిని; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; ఏడింటన్+ఏడింటన్= ఏడేసి ఏడేసి బాణాలతో; ఏచి= విజృంభించి; నొప్పించి= బాధ కలిగించి; సమదవృత్తిన్= మదంతో కూడిన తీరుతో; ఆర్చిన(న్)= బొబ్బరించగా; మాత్స్య, పాండ్య+అనీకములును= మత్స్య, పాండ్య దేశాల రాజుల సేనలు; సోమకవరూథినియును= సోమకుడి సైన్యమున్నూ; మగధబలమున్= మగధ రాజు సేనయు; కాశసైన్యంబున్= కాశదేశపు సేనయు; కరూశసేనయున్= కరూశదేశపు బలమున్నూ; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; రయంబునన్= వేగంతో; భీష్మమీఁదన్= భీష్ముడిమీదికి; ఉరవడించినన్= వేగంగా కవియగా; అస్త్రగురుఁడు= ద్రోణాచార్యుడు; పాండవ+ఉత్కరమున్= పాండవుల గుంపును; కృష్ణతమ్మున్= కృష్ణుడి తమ్ముడు సాత్యకిని; పాంచాల నందనున్= ధృష్టద్యుమ్నుడిని; సమ్ముఖమునకున్= ఎదుటికి; అడరన్+ఈక= రానీకుండా; ఆఁగి= అడ్డగించి; అందఱకున్= ఎదిరించే సైనికులందరికి; అన్నిరూపులు+ఐ= అంతమంది ద్రోణులుగా అయి; మహా+రణము= గొప్ప భయంకరమైన యుద్ధాన్ని; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: భీష్ముడు పన్నెండు బాణాలతో ధర్మరాజును, మరో పన్నెండు బాణాలతో భీముడిని, మూడు బాణాలతో నకులుడిని, మరి మూడింటితో సహదేవుడిని, ఇంకో ఏడు బాణాలతో సాత్యకిని, మరి ఏడింటితో ధృష్టద్యుమ్నుడిని బాగా విజృంభించి, కొట్టి, బాధ కలిగించి, బిగ్గరగా బొబ్బరించాడు. అప్పుడు మాత్స్య, పాండ్య, సోమక, మగధ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కాశ, కరూశ దేశాల సేనలు ఒక్కసారిగా వేగంగా భీష్ముడి మీదికి ఉరికాయి. అప్పుడు ద్రోణాచార్యుడు పాండవులందరినీ, సాత్యకిని, ధృష్టద్యుమ్నుడిని భీష్ముడి ఎదుటికి రానీయకుండా ఆపి, సేనలోని ప్రతివాడికి ఒక్కొక్క ద్రోణుడివలె కనిపిస్తూ చాలా నేర్పుగా భయంకరంగా యుద్ధం చేశాడు.

ఉ. శాంతనవుం డనేకబలసంతతి నుద్భట శౌర్యసారదు
ర్దాంతపరాక్రమస్ఫురణఁ దాఁకి సముజ్జ్వలశాతసాయక
క్రాంతపరీతనిర్మథితకంపితపాతితమూర్తిఁ జేసి య
త్యంతరయంబునం దనరథంబుగతుల్ మెఱయం బ్రదీప్తుఁ డై. 246

ప్రతిపదార్థం: శాంతనవుండు= భీష్ముడు; అనేకబల సంతతిన్= చాలా సైన్యాల సమూహాన్ని; ఉద్భట= అధికమైన; శౌర్య= శూరత్వము యొక్క; సార= బలంచేతను; దుర్+దాంత= అణచరాని; పరాక్రమ= పరాక్రమం యొక్క; స్ఫురణన్= తోచుటచేత; తాఁకి= మార్కొని; సమ్+ఉత్+జ్వల= చక్కగా వెలుగుతున్న; శాత= పదునుగల; సాయక= బాణాలచేత; క్రాంత= ఆక్రమింపబడిన; పరీత= చుట్టబడిన; నిర్+మథిత= బాగా చిలకబడిన; కంపిత= కదలింపబడిన; పాతిత= పడవేయబడిన; మూర్తిన్= శరీరాలు కలవారినిగా; చేసి; అతి+అంత రయంబునన్= చాలావేగంతో; తన= భీష్ముడియొక్క; రథంబుగతుల్= రథము యొక్క పోకడలు; మెఱయన్= ప్రకాశింపగా; ప్రదీప్తుడు+ఐ= మండిపడుతున్నవాడై.

తాత్పర్యం: భీష్ముడు పాండవుల చాలా సేనలను అధికమైన శౌర్యంతో, బలంతో, అడచరాని పరాక్రమంతో ఎదిరించి, మంటలు కక్కుతున్న తన పదునుగల బాణాలు ప్రయోగించి, విరోధిసేనలోని చాలామందిని ఆక్రమించాడు. మరికొందర్ని బాణాలతో చుట్టివేశాడు. ఇంకా కొందరిని చిలికి, తుక్కుచేశాడు. మిక్కిలి వేగంతో తన తేరు నడకలు ప్రకాశిస్తూండగా, తాను కోపోద్దీపితుడై (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. గజరాజోజ్జ్వలఘంటికావళిఁ దురంగప్రస్ఫురత్కింకిణీ
వ్రజముం గాహళ దుందుభిప్రభృతితూర్య శ్రేణులన్ సుందర
ధ్వజఘంటాతతులన్ శరాసనగుణవ్రాతంబుఁ దున్మాడి ధ
ర్మజసేనాతతి ముంపఁ జేసెఁ బటుదోర్గర్వం బఖర్వంబుగన్. 247

ప్రతిపదార్థం: పటు+దోః+గర్వంబు= సమర్థములైన చేతుల పొగరు; అఖర్వంబు+కాన్= అధికంకాగా; గజరాజ= శ్రేష్ఠములగు ఏనుగుల యొక్క; ఉజ్జ్వల= ప్రకాశించెడి; ఘంటికా= గంటలయొక్క; ఆవళిన్= వరుసను; తురంగ= గుర్రాలయొక్క; ప్రస్ఫురత్= కదలుతున్న; కింకిణీ= చిరుగంటలయొక్క; వ్రజమున్= సమూహాన్ని; కాహళ= కొమ్ములు; దుందుభి= భేరులు; ప్రభృతి= మున్నుగాగల; తూర్య= వాద్యవిశేషముల యొక్క; శ్రేణులన్= వరుసలను; సుందర= అందమైన; ధ్వజ= టెక్కెములయొక్క; ఘంటా= గంటలయొక్క; తతులన్= సమూహాలను; శరాసన= ధనుస్సులయొక్క; గుణ= అల్లెత్రాళ్ళయొక్క; వ్రాతంబున్= సమూహాన్ని; తున్ము+ఆడి= తుంటలుచేసి; ధర్మజ సేనాతతి(న్)= ధర్మరాజు యొక్క సేనా సమూహాన్ని; ముంపన్+చేసెన్= బాణాలతో మునిగిపోయేటట్లుగా చేశాడు.

తాత్పర్యం: భీష్ముడు బలమైన తన భుజాలబలగర్వం అతిశయించేటట్టుగా, ఏనుగులకు ఉండే గంటలను, గుర్రాల శరీరాలపైన కదలుతుండే చిరుగంటల సముదాయాన్ని, కొమ్ములు దుందుభులు మొదలైన వాద్యాల సముదాయాన్ని, అందంగా ధ్వజాలకు కట్టి ఉండే గంటల సమూహాన్ని, విండ్లయొక్క అల్లెత్రాళ్ళను తునాతునకలు చేసి, ధర్మరాజు సేనాసమూహాన్ని బాణాలతో ముంచివేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ వచనంలో భీష్ముడి శౌర్యాతిశయాన్నే గాక, యుద్ధవర్ణనలో తనకు గల నేర్పరితనాన్ని కూడా తిక్కన చక్కగా, చిక్కగా ప్రదర్శించాడు. సహజ సుందరాలైన ఉపమానాలను కూడా అక్కడక్కడ చూపాడు.

వ. ఇట్లు బల్లిదుం డయి మల్లడిగొని మార్కొనుమగలు లేక మదంబునం బొంగి గాంగేయుండు పాండవేయులు వెఱఁగుపడియుండ మఱియునుం గడంగి దుర్వారంబు లగు దివ్యాస్త్రంబులు దీటుకొల్పి యే దిక్కు సూచినం దాన యై రథికులను, హాస్తికులను, నాశ్వికులనుం దునిమిన గంధసింధురక్రీడనంబున మ్రోడుపడిన యుద్యానంబు చందంబున నగుచున్న చోట్లును, గాలుబలంబులం గనుపుకొట్టిన గాలు, చేయి, తల, డొక్క యని యేఱుపాటు లేక వండం దఱిగినయ ట్లున్నయెడలును, బెక్కుదెఱంగుల చప్పుళ్ళు నిగుడ రథచయంబు నవయవంబులుం గరిహయనికరంబుల యెమ్ములు విఱుగం గార్చిచ్చు పొదివిన వెదురుటడవి తెఱంగునం దోఁచుపట్లును, దఱచు గొడుగులు విట తాటనంబు సేసినం బెనుగాలిం జిక్కువడిన కుసుమితకాశవనంబునుం బోలు చక్కట్లును, బహురత్నమయ మకుటాది భూషణ వ్రజంబు వివిధ వర్ణ చామరజాతంబు నఱికి పడవైచినం బ్రబలోద్ధతలులాయలులితంబయి కమలకైరవోత్పలాకీర్ణం బగుకొలని ననుకరించు ప్రదేశంబులును నై పాండవసైన్యంబులు దైన్యంబు నొందియుఁ గలగుండుగొనియు బెండువడియుఁ గలంగంబాఱియుఁ దొలంగం దెరలియుం గోలాహలబహుళంబు లగుటం గనుంగొని గోవిందుండు. 248

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; బల్లిదుండు+అయి= మిక్కిలిబలంగలవాడై; మదంబునన్= గర్వంచేత; పొంగి=ఉబ్బి; గాంగేయుండు; మల్లడిగొని యుద్ధం చేయగా; మార్కొనన్= ఎదిరించటానికి; మగలులేక= శూరులు లేకపోగా; పాండవేయులు= పాండురాజకుమారులు; వెఱఁగుపడి ఉండన్= నిశ్చేష్టులు కాగా; మఱియును(న్)= మరలకూడా; కడంగి= పూనుకొని; దుర్వారంబులు+అగు= అడ్డగింపరానివైన; దివ్య+అస్త్రంబులు= అమోఘములైన ఆయుధాలను; దీటుకొల్పి= నిండింపచేసి; ఏ దిక్కు= ఏ వైపు; చూచినన్; తాను+అ+ఐ= తానే(భీష్ముడు) అగపడుతూ; రథికులను= రథంలోని వాళ్ళను; హాస్తికులను= ఏనుగుల నెక్కి యుద్ధం చేసేవారిని; ఆశ్వికులనున్= గుఱ్ఱపు రౌతులను; తునిమిన(న్)= తుంటలు చేయగా; గంధ సింధుర క్రీడనంబున(న్)= మదపుటేనుగు యొక్క విహారంచేత; మ్రోడుపడిన; ఉద్యానంబు చందంబున(న్)= ఉద్యానవనం మాదిరి; అగుచున్+ఉన్న= అవుతూ ఉన్నట్టి; చోట్లును= స్థలాలున్నూ; కాలుబలంబులన్= కాల్బంట్లను; కనుపుకొట్టినన్= ఖండించగా; కాలు; చేయి; తల; డొక్క; అని; ఏఱుపాటు= భేదం; లేక; వండన్= వంటచేయటానికి; తఱిగిన+అట్లు= తరిగిపెట్టిన కూరల మాదిరి; ఉన్న= ఉన్నట్టి; ఎడలును(న్)= చోట్లున్నూ; పెక్కు తెఱంగుల= నానా విధాలైన; చప్పుళ్ళు= శబ్దాలు; నిగుడన్= అతిశయించగా, రథచయంబు= రథాల సమూహాలయొక్క; అవయవంబులున్= భాగాలున్నూ; కరిహయనికరంబుల= ఏనుగుల యొక్క, గుర్రాలయొక్క, ఎమ్ములు= ఎముకలు; విఱుగన్= విరుగుచుండగా; కార్చిచ్చు= దావానలం(అడవిలో పుట్టే అగ్ని); పొదివిన= వ్యాపించినట్టి; వెదురు+అడవి= వెదుళ్ళుగల అరణ్యం; తెఱంగునన్= వలె; తోఁచు= కనిపించునట్టి; పట్లును= చోట్లున్నూ; గొడుగులు= ఛత్రాలు; తఱచు= అధికంగా; విటతాటనంబు+చేసినన్= తారుమారుకాగా; పెనుగాలిన్= పెద్దగాలిచేత; చిక్కుపడిన= చిందరవందరైనట్టి; కుసుమిత కాశ వనంబును(న్)= పూచిన రెల్లు వనాన్ని; పోలు= అనుకరించునట్టి; చక్కట్లును= ప్రదేశాలున్నూ; బహు= అనేకాలైన; రత్నమయ= మణులు తాపిన; మకుట+ఆది= కిరీటాలు మొదలగు; భూషణ= నగలయొక్క; వ్రజంబు(న్)= సమూహము; వివిధ= పలురకాలైన; వర్ణ= రంగులుగల; చామర= చామరాల యొక్క; జాతంబును= సముదాయమున్నూ; నఱికి= ఖండించి; పడవైచినన్= పడవేయగా; ప్రబల= అధికంగా; ఉద్ధత= గర్వించిన; లులాయ= దున్నచేత; లులితంబు= కలత నొందింపబడ్డదై; కమల= పద్మాలు; కైరవ= కుముదాలు; ఉత్పల= కువలయాలు - వీనిచే; ఆకీర్ణంబు+అగు= ఒకదానితో నొకటి కలిసిపోయినదగు; కొలని(న్)= సరస్సును; అనుకరించు= పోలునట్టి; ప్రదేశంబులును(న్)+ఐ= చోట్లును అయి; పాండవ సైన్యంబులు= పాండవుల సేనలు; దైన్యంబున్= నిస్సహాయస్థితిని; పొందియు(న్)= పొందియు; కలగుండు+కొనియున్= కలతచెందియు; బెండు+పడియున్=

తేలికదనం చెందియు; కలంకన్+పాటియు(న్)= కలత చెందియు; తొలంగన్= చలనమునకు; తెరలియున్= తొలగియు; కోలాహల బహుళంబులు= కలకల శబ్దాలచే నిండినట్టివి; అగుటన్= కాగా; గోవిందుండు= కృష్ణుడు; కనుంగొని.

తాత్పర్యం: పాండవ సేనకు పట్టిన దుస్థితిని చూచి, ఎదిరించే మగధీరులు లేకపోగా, భీష్ముడు మహాబలపరాక్రమాలతో కూడుకొన్నవాడై గర్వంతో ఉప్పొంగి, పాండవులు మరీ భయపడేటట్లుగా మరల మరల సమర సన్నాహంతో, అడ్డగింపరాని అమోఘములైన ఆయుధాలతో ఆ యుద్ధభూమిని పూర్తిగా నిండింపచేశాడు. ఏ ప్రక్క చూచినా తానే అగపడుతూ, చకచకా తిరుగుతూ యుద్ధం చేశాడు భీష్ముడు. రథికులను, హాస్తికులను, ఆశ్వికులను తునుకలు చేయగా, అట్టిచోట్లు మదపుటేనుగు విహారంచేత మొక్కపోయిన ఉద్యానవనంవలె కళాహీనమై పోయాయి. అతడు కాల్బలాన్ని తుంటలుతుంటలు చేయగా, కాలు, చెయ్యి, తల, డొక్క అనే అవయవభేదాలు తెలియకుండా, వంటచేయడానికి తరిగిపెట్టిన కూరగాయల ముక్కలలాగా కొన్ని స్థలాలు కన్పడ్డాయి. రథాలనొగలు, చక్రాలు మొదలైనవాటిని, ఏనుగులు, గుర్రాలు - వీటి ఎముకలను విరగబాదేటప్పుడు విస్తరించిన వివిధ శబ్దాలు, కార్చిచ్చు అలముకోగా, చిటచిటమని, పటపట మని మండి బీడుపడిన వెదురు పొదలుగల అరణ్యం మాదిరి కొన్ని తావులు అగపడ్డాయి. గొడుగులు మాటిమాటికి తారుమారై కొన్ని మరికొన్నిటితో పెనవేసికొని ఉండే ప్రదేశాలు పెనుగాలిచేత చిక్కుపడిన పూచిన రెల్లువనం వలె అనిపించాయి. మణులు తాపిన కిరీటాలు, భుజకీర్తులు, హారాలు, పలురంగుల చామరాలు-వీటన్నిటినీ భీష్ముడు తుత్తునియలు చేసి నేలమీద పడవేయగా, అట్టిచోట్లు బలం, గర్వంగల దున్నపోతుచే చిందరవందరచేయబడ్డ ఎర్ర, తెల్ల తామర పూలు, కలువలుగల కొలనుగా తోచింది. పాండవసేన హీనమైన స్థితిని పొందినది, కలతచెందినది. బలహీనమైపోయినది. దాగి ఉండటానికి తొలగిపోయింది. సేనలో పెద్దగా కోలాహలం ఏర్పడింది. శ్రీకృష్ణుడు దీనిని గమనించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలంకారం: ఉపమ. యుద్ధాన్ని వర్ణించడంలో సోమయాజి అందెవేసిన చేయి. కనుకనే ఈ వచనంలో, యుద్ధరంగంలోని పలుతావులను వర్ణించడంలో అయిదు ఉపమానాలతో వాటిని అలంకరించాడు.

ఉ. ' అర్జున! చూచితే? మనబలావళి నెల్లఁ గలంచుచున్నవాఁ
డూర్జితశౌర్యసంపదయు నుగ్రభుజాబలవైభవంబు వి
స్ఫూర్జితవిక్రమోద్ధతియుఁ జూపె నదీసుతుఁ డిట్టి చోట నీ
దుర్జయదర్పవిభ్రమము దోఁ పఁగఁ జేయకయున్కి యొప్పునే?' 249

ప్రతిపదార్థం: అర్జున!= ఓ అర్జునా! నదీసుతుఁడు= భీష్ముడు; మన= మనయొక్క; బల+ఆవళిన్+ఎల్లన్= మన పాండవసేననంతటినీ; కలంచుచున్+ఉన్నవాఁడు= కలతపెట్టుచున్నాడు; చూచితే?= చూచితివా?; ఊర్జిత శౌర్య సంపదయున్= దృఢమైన పరాక్రమముయొక్క సంపత్తియు; ఉగ్ర= భయంకరాలైన; భుజా= చేతులయొక్క; బల= సారముయొక్క; వైభవంబు(న్)= విభవాన్ని; విస్ఫూర్జిత= మిక్కిలి ప్రకాశించిన; విక్రమ= పరాక్రమముయొక్క; ఉద్ధతియున్= గర్వాన్ని; చూపెన్= కనపరుస్తున్నాడు, ఇట్టిచోటన్= ఇట్లాంటి స్థలంలో; విభ్రమమున్= విలాసాన్ని; తోఁపగన్= తెలిపేటట్టుగా; చేయక+ఉన్కి= చేయకుండా ఉండటం; ఒప్పునే?= తగునా?

తాత్పర్యం: 'ఓ అర్జునా! భీష్ముడు మన సైన్యాన్ని ఎంతగా కలత పెడుతున్నాడో చూచావా? స్థిరమైన తన పరాక్రమం యొక్క సమృద్ధిని, భయంకరమైన తన చేతుల బలవైభవాన్ని, ప్రకాశించే పరాక్రమాటోపాన్ని బాగా ప్రదర్శిస్తున్నాడు. ఇట్టిపట్టులో జయింపరాని నీ శౌర్యాన్ని చూపకుండా ఉండడం తగదు.'

వ. అనిన వివ్వచ్చుండు విచారడోలాయత్తం బగుచిత్తంబుతోడ నిరుత్సాహుం డై యున్నం జూచి వెన్నుం డతని కి ట్లనియె. 250

ప్రతిపదార్థం: అనిన(న్)= అని చెప్పగా; వివ్వచ్చుండు= అర్జునుడు; విచార= బాధతో; డోలా+ఆయత్తంబు+అగు= ఊగిసలాడుతున్న; చిత్తంబుతోడన్= మనస్సుతో; నిర్+ఉత్సాహుండు+ఐ= ఉత్సాహంలేనివాడై; ఉన్నన్= ఉండగా; వెన్నుండు= కృష్ణుడు; చూచి; అతనికిన్= ఆ అర్జునుడికి; ఇట్లు+అనియె(న్).

తాత్పర్యం: కృష్ణుడు పై విధంగా అనగా, అర్జునుడు బాధతో ఊగిసలాడే మనస్సుతో ఉత్సాహం లేనివాడై ఉండగా చూచి కృష్ణుడు, అర్జునుడితో ఇట్లా అన్నాడు:

క. ' మును మత్స్యనాథునగరం । బున సంజయుతోడ నీవు పొంగుచు బె ట్టా
డినమాట లెల్ల మఱచిన । నిను నగరే రథికవరు లనింద్యచరిత్రా! 251

ప్రతిపదార్థం: అనింద్య చరిత్రా!= నిందింపరాని చరితగల ఓ అర్జునా!; మును= మునుపు; నీవు; మత్స్యరాజు నగరంబునన్= విరాటరాజు యొక్క పట్టణంలో; సంజయుతోడ(న్); బెట్టు= అధికంగా(గొప్పగా); పొంగుచున్= ఉబ్బిపోతూ; ఆడినమాటలు= పలికిన పలుకులు; ఎల్ల(న్)= అన్నిటిని; మఱచిన(న్)= మరిచిపోతే; రథికవరులు= మహారథులు; నిను(న్)= నిన్నుచూచి; నగరే?= నవ్వరా?

తాత్పర్యం: 'మంచి స్వభావంగల ఓ అర్జునా! నీవు మునుపు మత్స్యరాజు నగరంలో విజృంభించి, భీష్ముడిని గెలుస్తానని సంజయుడితో అన్నావు కదా! ఆ మాట ఇప్పుడు నీవు మరచిపోతే, వీరులందరు నిన్ను చూచి నవ్వుతారు కదా! (కనుక అప్పుడన్న మాట లిప్పుడు గుర్తుకు తెచ్చికొని, బాగా యుద్ధం చేయుము.)

వ. అనుటయు నర్జునుండు. 252

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; అర్జునుండు.

తాత్పర్యం: కృష్ణుడు పైవిధంగా చెప్పగా అర్జునుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ' సకల బంధుజనులఁ జంపి కౌరవ హీన । మైన రాజ్యమహిమ యేను బడసి
యనఘ! యేమిసుకృత మాచరించినవాఁడ । నగుదు? మనసు గొలుపదయ్యె ననికి. 253

ప్రతిపదార్థం: అనఘ!= పాపంలేనట్టి కృష్ణా! ఏను= నేను(అర్జునుడు); సకల బంధు జనులన్= బంధుజాలాన్ని అంతా; చంపి; కౌరవహీనము+ఐన= కురు వంశంవారు లేనట్టి; రాజ్యమహిమన్= రాజ్యము యొక్క మహిమను; పడసి= పొంది; ఏమి సుకృతము= ఏమి పుణ్యాన్ని; ఆచరించినవాఁడన్= చేసినవాడనుగా; అగుదున్?= కాగలను?; అనికి(న్)= యుద్ధానికి; మనసు+కొలుపదు+అయ్యెన్= మనసు ఒప్పదాయెను.

తాత్పర్యం: 'ఓ కృష్ణా! చుట్టాల నందర్నీ మట్టుపెట్టి, కురు వంశం వాడే లేనట్టి ఈ రాజ్యాన్ని నేను సంపాదించికొని, ఎట్టి పుణ్యం చేసిన వాడనౌతాను? పాపమే కదా నాకు మిగిలేది? కాబట్టి యుద్ధం చేయడానికి మనసు పుట్టడంలేదు.

వ. అయిన నీతో నప్పటప్పటి కేటి మాటలు గలవు మిన్నేటి కొడుకుం బడవైచెదం దేరు నడపు' మనుటయు నారాయణుండు నదీనందనుస్యందనంబునకు సమ్ముఖంబుగా రథ్యమ్ములం ద్వరితగతి నడపినం దెరలిన సైన్యంబులు గూడికొని గాంగేయుపయిం గవియ నతండు సెలంగి మహాస్త్రనికరంబులు నిగిడించి యబ్బలంబు నిలువరించి సింహనాదంబు సేసి. 254

ప్రతిపదార్థం: అయినన్; నీతో; అప్పటికిన్+అప్పటికిన్= మాటిమాటికి; ఏటిమాటలు; కలవు= ఉన్నవి?; మిన్ను+ఏటికొడుకు(న్)= ఆకాశగంగా పుత్రుడైన భీష్ముని; పడవైచెదన్= పడగొట్టుతాను; తేరు నడపుము= రథాన్ని పోనిమ్ము; అనుటయు(న్)= అని చెప్పగా; నారాయణుండు= కృష్ణుడు; నదీనందను స్యందనంబునకు(న్)= భీష్ముడి రథానికి; సమ్ముఖంబు+కాన్= ఎదురుగా; రథ్యంబులన్= తేరి గుర్రాలను; త్వరితగతిన్= వేగంతో కూడిన పోకతో; నడపింపన్= పోనీయగా; తెరలిన సైన్యంబులు= తొలగిపోయిన సేనలు; కూడికొని= కలిసికొని; గాంగేయుపయిన్= భీష్ముడిమీద; కవియన్; అతండు(న్)= ఆ భీష్ముడు; చెలంగి= అతిశయించి; మహా+అస్త్రనికరంబులు(న్)= గొప్ప అస్త్రాల సమూహాలను; నిగిడించి= వ్యాపింపజేసి; ఆ+బలంబు(న్)= ఆ సేనను; నిలువరించి= ఆపి; సింహనాదంబు+చేసి.

తాత్పర్యం: అయినా నీతో మాట్లాడటానికి మాటిమాటికి ఏమిమాటలున్నాయి. భీష్ముడిని పడగూలుస్తాను. రథాన్ని పోనిమ్ము అనగా నారాయణుడు భీష్ముడి రథానికి ఎదురుగా గుర్రాలను వేగంగా తోలాడు. అంతట చెదరిపోయిన తనసేనలను కూడుకొని అర్జునుడు భీష్ముని మీదికి విజృంభించాడు. అపుడు గంగా పుత్రుడు చెలరేగి మహాస్త్రముల గుంపులు గుప్పించి ఆ సైన్యాన్ని ఆపి సింహనాదం చేసి (తరువాతి పద్యంతో అన్వయం)

మ. **ఖరనారాచపరంపరోగ్రనిహతిన్ గాండీవియంగంబు లా**
తురతం బొందఁగ నేసి బాణమయగాత్రుం జేసి గోవిందు ని
ష్ఠురలీలం దురగంబులం బటుశరస్యూతాస్యముల్ గాఁగ స
త్వరుఁడై యేసి, రథంబు గూడఁ బొదివెన్ వాలంప మొత్తంబులన్. **255**

ప్రతిపదార్థం: ఖర= పదునైన; నారాచ= బాణాలయొక్క; పరంపరా= వరుసలచేత; ఉగ్ర= భయంకరంగా; నిహతిన్= కొట్టటంచేత; గాండీవి= అర్జునుడియొక్క; అంగంబులు= అవయవాలు; ఆతురతన్= బాధను; పొందఁగన్= పొందేట్టుగా; ఏసి= కొట్టి; గోవిందున్= కృష్ణుని; బాణమయగాత్రున్= బాణాలతో నిండిన శరీరంగలవానిగా; చేసి; సత్వరుఁడై= వేగంతో కూడిన వాడై; నిష్ఠుర లీలన్= క్రూరమైనవిధంగా; తురగంబులన్= గుర్రాలను; పటు= సమర్థములైన; శర= బాణాలచేత; స్యూత= గుచ్చబడిన; ఆస్యముల్+కాఁగన్= ముఖాలు కలుగునట్లుగా; ఏసి= బాణాలు ప్రయోగించి; రథంబు+కూడన్= తేరును కూడా; వాలు+అంప+మొత్తంబులన్= పదునైన బాణాల సమూహాలతో; పొదివెన్= కప్పివేశాడు.

తాత్పర్యం: భీష్ముడు పదునైన బాణాల వరుసలతో భయంకరంగా కొట్టటంవలన, అర్జునుడి అవయవాలు గాయపడ్డాయి. కృష్ణుడి శరీరమంతా బాణమయమైనది. వేగంగా, క్రూరములైన గట్టి బాణాలు ప్రయోగించి గుర్రాల ముఖాలను గ్రుచ్చివేశాడు. పదునైన బాణాల సమూహాలతో అర్జునుడి రథాన్ని కప్పివేశాడు.

వ. **అప్పుడు.** **256**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: భీష్ముడు పై విధంగా చేసినప్పుడు (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **బీఱువోయి రథ్యంబులు మాఱు మొగము। వడినఁ దా నొచ్చి యుండియుఁ దడవి శౌరి**
నూలుకొనఁ జేసి తఱిమిన వ్రాలి తీవ్ర। భల్లమునఁ గ్రీడి భీష్మునివిల్లు దునిమె. **257**

ప్రతిపదార్థం: రథ్యంబులు= గుర్రాలు; బీఱువోయి= ఉపయోగం లేనివై; మాఱుమొగము పడినన్= పెడమొగంపెట్టినవి కాగా; శౌరి= కృష్ణుడు; తాన్= తాను; నొచ్చియుండియున్= బాధచెందికూడా; తడవి= చేతులతో అటూ ఇటూ తాకి; నూలుకొనన్+చేసి=

కుదుటపడజేసి; తటిమిన(న్)= తోలగా; క్రీడి= అర్జునుడు; వ్రాలి= మీరి(అతిశయించి); తీవ్ర భల్లమునన్= తీవ్రమైన బల్లెముతో; భీష్మునివిల్లున్; తునిమెన్= త్రుంచివేశాడు.

తాత్పర్యం: అర్జునుడి రథానికి కట్టిన గుర్రాలు చచ్చుపడి, పెడమొగం పెట్టాయి. కృష్ణుడు తాను బాణాల దెబ్బలతో బాధపడుతూ ఉండి కూడా, తన చేతులతో వాటిని ఇటూ అటూ నిమిరి, తోలగా, ఒక కరుకైన బల్లెంతో అర్జునుడు భీష్ముడి విల్లు తుంటలు అయ్యేటట్లుగా చేశాడు.

క. అతఁ డొండొక విల్లెత్తిన । నతిరయమున నదియుఁ దునుమ నాతం డౌరా
శతమఖనందన! యనుచును' ధృతి వేఱొకవింట శరతతిం బరగించెన్. 258

ప్రతిపదార్థం: అతఁడు= ఆ భీష్ముడు; ఒండు+ఒక= మరొక; విల్లు= ధనుస్సును; ఎత్తినన్; అతిరయమునన్= మిక్కిలివేగంతో; అదియున్= ఆ వింటినికూడా; తునుమన్= ముక్కలు చేయగా; ఆతండు= ఆ భీష్ముడు; శతమఖనందన!= అర్జునా!; ఔరా! అనుచున్= ఆశ్చర్యాన్ని వెలిపుచ్చుతూ; ధృతిన్= ధైర్యంతో; వేఱు+ఒక వింటన్= వేరొక విల్లునుండి; శరతతిన్= బాణ సమూహాన్ని; పరఁగించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: భీష్ముడు మరో విల్లు ఎత్తుకోగా, దాన్ని కూడా అర్జునుడు వేగంగా తుంటలు చేశాడు. భీష్ముడు, 'ఔరా! అర్జునా!' అని మెచ్చుకొంటూ ధైర్యంతో ఇంకొక విల్లెత్తుకొని పెల్లుగా బాణాలు వెల్లువై వెల్లివిరిసేటట్లు ప్రయోగించాడు.

క. ఆ బెట్టిదంపు టంపఱ । చే బీభత్సుండు నొచ్చి చేడ్పడి మఱియుం
దా బంటుతనమ పటుబా । హాబలముగఁ బోరుచుండె నంగము దూలన్. 259

ప్రతిపదార్థం: బీభత్సుండు= అర్జునుడు; ఆ బెట్టిదము+అంపఱచేన్= క్రూరములైన ఆ బాణాల సమూహంచేత; నొచ్చి= నొప్పిచెంది; చేడ్పడి= చలించి; మఱియున్= మరల; తాన్= తాను(అర్జునుడు); బంటుతనము+అ= శూరత్వమే; పటుబాహాబలముగన్= పటువైన భుజబలంగా; అంగము= శరీరము; తూలన్= వాలిపోతుండగా; పోరుచున్+ఉండెన్= యుద్ధంచేస్తుండినాడు.

తాత్పర్యం: భీష్ముడు వేసిన కఠోరబాణాల చేత అర్జునుడు చాలా బాధ అనుభవించాడు. వణకిపోయాడు. అయినా కూడా తన శౌర్యమే బాహుబలంగా కలిగి, శరీరం వాలిపోతూంటే కూడా, యుద్ధం చేస్తూనే ఉన్నాడు.

క. వివ్వచ్చునొవ్వు నెంతయుఁ । గ్రొవ్వున భీష్ముండు గడఁగుకోల్తలయుం ద
క్కెవ్వరు నాతనిఁ జేరక । దవ్వుల నిల్చుటయుఁ జూచి తన చిత్తమునన్. 260

ప్రతిపదార్థం: ఎంతయున్= అధికమైన; వివ్వచ్చునొవ్వున్= అర్జునుడి వేదనను; భీష్ముండు= భీష్ముడు; క్రొవ్వునన్= మదంతో; కడఁగు= ప్రయత్నపడు; కోల్తలయున్= ఎదుట నిలచియుద్ధం చేయటాన్ని; తక్క+ఎవ్వరున్= మిగిలినవారు ఎవరుగాని; ఆతనిన్= ఆ భీష్ముడిని; చేరక= దగ్గరకురాక; దవ్వులన్= దూరంగా; నిల్చుటయున్= నిలబడి ఉండటాన్ని; చూచి; తన చిత్తమునన్= (కృష్ణుడు) తన మనస్సులో.

తాత్పర్యం: శ్రీ కృష్ణుడు అర్జునుడు చాలా బాధపడుతూండటాన్ని చూచాడు. భీష్ముడు మదంతో ప్రయత్నంతో అర్జునుడికి ముఖాముఖిగా నిలబడి యుద్ధం చేస్తూండడం గమనించాడు. వేరే ఎవరూకూడా భీష్ముడి అండచేరకుండా దూరంగా ఉండటాన్ని కూడా తిలకించి, తన మనస్సులో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. దారుణరోషం బడరఁగ । నారాయణుఁ డపుడు సైరణం దొఱఁగి వెసం
దేరి నొగలఁ బగ్గము లిడి । క్రూరత మునికోల యెత్తికొని యిల కుఱికెన్. 261

ప్రతిపదార్థం: అపుడు; నారాయణుఁడు= శ్రీకృష్ణుడు; దారుణరోషంబు= భయంకరమైన కోపం; అడరఁగన్= అధికం కాగా; సైరణన్= ఓర్పును; తొఱఁగి= విడిచిపెట్టి; వెసన్= వేగంతో; పగ్గములు; తేరినొగలన్= రథం నొగలమీద; ఇడి= పెట్టి; మునికోల= జాటీని; ఎత్తికొని= తీసికొని; క్రూరతన్= భయంకరంగా; ఇలకున్= నేలమీదికి; ఉఱికెన్= దూకాడు.

తాత్పర్యం: ఆ దృశ్యాన్ని చూచిన కృష్ణుడికి భయంకరమైన కోపం వచ్చింది. ఓర్పు కోల్పోయాడు. గుర్రాల కళ్ళాలకు కట్టి ఈడ్చి పట్టే పగ్గాలను రథం నొగలమీద పడవేశాడు. జాటీ పట్టుకొన్నాడు. భయం కలిగిస్తూ నేలకు దూకాడు.

శ్రీకృష్ణుఁడు రథంబు డిగి భీష్మునిపైకిఁ బోవుట (సం. 6-102-52)

వ. ఇట్లు లంఘించి. 262

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; లంఘించి= దూకి

తాత్పర్యం: ఈ మాదిరి కృష్ణుడు నేలపైకి దూకి. (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. ధరణీచక్రము గ్రక్కునం గదల దిగ్దంతావళశ్రేణి కం
ధరముల్ మ్రొగ్గఁబడన్ దిశావలయ ముత్కంపంబుగా నీబలం
బురులం బాఱఁగ భీష్ముపైఁ గవిసె రౌద్రోద్రేకముం జూచి ఖే
చరలోకంబును సంచలింప హరి చంచద్బాహుఘోరాకృతిన్. 263

ప్రతిపదార్థం: ధరణీచక్రము= చక్రం మాదిరి గుండ్రంగా వుండే భూమి; గ్రక్కునన్= వెంటనే; కదల(న్)= చలించగా; దిక్= దిక్కులందుండే; దంతావళ= ఏనుగుల యొక్క; శ్రేణి= వరుసయొక్క; కంధరముల్= మెడలు; మ్రొగ్గన్+పడన్= వంగిపోగా; దిశావలయము= దిక్చక్రము; ఉత్+కంపంబు+కాన్= మిక్కుటంగా వణికేది కాగా; నీ బలంబు= (ధృతరాష్ట్రుడవైన) నీ యొక్క సైన్యము; ఉరులన్+పాఱఁగన్= చలించిపోగా; రౌద్ర+ఉద్రేకమున్= రౌద్ర రసాధిక్యాన్ని; చూచి= తిలకించి; ఖేచరలోకంబును= దేవలోకం కూడా; సంచలింపన్= వణకగా; హరి= శ్రీకృష్ణుడు; చంచత్= అదురుచున్న; బాహు= భుజాలచేత; ఘోర= భయంకరమైన; ఆకృతిన్= ఆకారంతో; భీష్మపైన్= భీష్ముడిమీదికి; కవిసెన్= దుమికాడు.

తాత్పర్యం: భూమండలం కదలుతూ ఉండగా, దిక్కులందుండే ఏన్గుల మెడలు వంగిపోగా, దిక్కులు వణకిపోగా, నీసైన్యం బెదురుతూ చెదిరిపోతూండగా, తన రౌద్రావేశాన్ని చూచి దేవతలు కూడా గడగడలాడగా కృష్ణుడు, అదురుతూ ఉన్న బాహువులతో, భయంకరమైన ఆకారంతో భీష్ముడిపైకి లంఘించాడు.

తే. లలితపీతాంబరంబు విలాస మొప్పసింహనాదోద్భటం బగు చెలువుతోడ
మెఱుఁగు వెలుఁగును గర్జయు మెఱయ వచ్చు కారుమొగిలనఁ గృష్ణునాకార మొప్పె. 264

ప్రతిపదార్థం: లలితపీత+అంబరంబు= సుందరమైన పసుపు వస్త్రం యొక్క; విలాసము= హొయలు; ఒప్పన్= తగియుండగా; సింహనాద+ఉద్భటంబు+అగు=సింహనాదం చేత మిక్కుటమైన; చెలువుతోడన్= అందంతో; మెఱుఁగు వెలుఁగును= మెరుపువంటి కాంతియు; గర్జయున్= ఉరుమున్నూ; మెఱయన్= ప్రకాశింపగా; వచ్చు= వచ్చునట్టి; కారుమొగిలు+అనన్= వర్షాకాలంలోని మేఘంవలె; కృష్ణ+ఆకారము= కృష్ణుడి ఆకారం; ఒప్పెన్= తగి ఉండింది.

తాత్పర్యం: ధరించిన పచ్చటి పచ్చడం అందాలు చిలుకుతూంటే, సింహనాదంతో చెలరేగిన సౌందర్యంతో భీష్ముడి మీదికి వస్తూఉన్న కృష్ణుడి ఆకారం వర్షాకాలంలో మెరుపులతో, ఉరుములతో దిగివచ్చే మేఘాన్ని పోలి ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం : పసుపురంగు వస్త్రాన్ని ధరించి సింహనాదం చేస్తూ నల్లని శరీరచ్ఛాయ కలిగిన కృష్ణుడు మెరుపులతో, ఉరుములతో కన్పించే కారు మేఘం లాగా ఉన్నాడనటంలో ఉపమాలంకారం.

వ. అట్టియెడ. 265

తాత్పర్యం: ఆ సమయంలో.

క. బలు జీవము వోయిన వెల వెలఁ బాఱుచు నీదుయోధవీరులు పొలిసెం
బొలిసె నదె భీష్ముఁ డనుచును గలఁగంబడి యఱ్ఱు లెత్తి కనుఁగొనుచుండన్. 266

ప్రతిపదార్థం: నీదు యోధవీరులు= నీ (ధృతరాష్ట్రుని) యొక్క భటులు శూరులున్నూ; బలుజీవము= అధికమగు జీవశక్తి; పోయినన్= చెడిపోగా; వెలవెల+ పాఱుచున్= తెల్లపోయి (వివర్ణత చెంది); అదె= అల్లదిగో; భీష్ముఁడు= భీష్ముడు; పొలిసెన్ పొలిసెన్= చచ్చాడు, చచ్చాడు; అనుచునున్= అంటూ; కలఁగన్+పడి= కలతచెంది; అఱ్ఱులు+ఎత్తి= మెడలు పైకెత్తి; కనుఁగొనుచున్+ఉండన్= చూచుచుండగా.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! కృష్ణుడు భీముడిపైకి దూకినప్పుడు నీ భటులు, శూరులు అందరూ బలాన్నీ, ధైర్యాన్నీ కోల్పోయి, ముఖాల నెత్తురు లేనివారై, కలతచెంది, అదిగో భీష్ముడు చచ్చాడు చచ్చాడు అని మెడలు పైకి చాచి చూడసాగారు.

చ. కనుఁగొని భీష్ముఁ డుల్లము వికాసము నొందఁగ నల్ల నవ్వి యి
ట్లనుఁ 'జనుదెమ్ము వేగమ మహాత్మ! వికస్వరపుండరీకలో
చన! యిది లెస్స నా కిచట శాశ్వత మైనయశంబు నచ్చట
న్వినుతికి నెక్కు సద్గతియు నీ దయఁ జేకుఱఁజేయు మిష్టమున్.' 267

ప్రతిపదార్థం: భీష్ముఁడు= భీష్ముడు; కనుఁగొని= చూచి; ఉల్లము= మనస్సు; వికాసమున్= ప్రసన్నతను; ఒందఁగన్= పొందగా; అల్లనవ్వి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; మహాత్మ!= మాహాత్మ్యం కలవాడా!; వికస్వర పుండరీక లోచన!= పూచిన తెల్లతామరలవంటి కన్నులుగల కృష్ణా! వేగము+అ= త్వరితంగా; చనుదెమ్ము= రమ్ము; ఇది= ఈపని; లెస్స= మంచిది; నాకున్; ఇచటన్= ఈ లోకంలో; శాశ్వతము+ఐన= స్థిరమైన; యశంబున్= కీర్తియు; అచ్చటన్= పై లోకంలో; వినుతికిన్+ఎక్కు= పొగడ్తకెక్కునట్టి; సత్+గతియున్= ఉత్తమగతీ; ఇష్టమున్= నాకిష్టమగు ఈ రెంటిని; నీదయన్= నీ దయచేత; చేకురన్= కలిగేటట్టుగా; చేయుము.

తాత్పర్యం: కృష్ణుడు తన పైకి దూకటాన్ని భీష్ముడు చూచాడు. మనస్సులో ఉల్లాసం కలిగింది. ఒక్క నవ్వు నవ్వి ఇట్లా అన్నాడు. 'మహాత్మా! పూచిన తెల్ల తామరలను పోలిన కన్నులుగల ఓ కృష్ణా! వేగంగా రమ్ము. నన్ను కడతేర్చుము. ఇది నాకు ఇష్టమైనది. ఈ లోకంలో నాకు స్థిరమైన కీర్తీ, పరలోకంలో పొగడిక కెక్కే ఉత్తమ గతీ, పునరావృత్తిరహితమైన మోక్షం, కూడా నీ దయావిశేషంచేత నాకు అబ్బేటట్లు చేయుము.'

వ. అని పలుకు నంత జంభాంతకసూనుండు సరభసంబుగా రథంబు డిగ్గనుఱికి వెన్నుని వెనుక నెయిది కరంబులఁ గ్రుచ్చి పట్టిన నతండును దిగిచికొని వెండియుం బోవం బోవఁ బదియడుగులకొలంది నా కౌంతేయుండు పదస్థైర్యంబును, బాహు వీర్యంబును మెఱయ మహీతలం బూని మెట్టి నిలువం బట్టి నిట్టూర్పు నిగిడించుచు నద్దనుజమర్దనుతో ని ట్లనియె. 268

ప్రతిపదార్థం: అని పలుకు+అంతన్= అని చెప్పేలోపల; జంభ+అంతక సూనుండు= జంభుడనే రాక్షసుడిని చంపిన యింద్రుడి కుమారుడు - అర్జునుడు; సరభసంబు+కాన్= తొందరగా; రథంబున్= రథాన్నుండి; డిగ్గన్= దిగటానికి; ఉటికి= గంతువేసి; వెన్నుని వెనుకన్= కృష్ణుడి వెనుక ప్రక్క; ఎయిది= వెంబడించి; కరంబులన్= చేతులను; గ్రుచ్చి= దూర్చి; పట్టినన్= పట్టుకోగా; అతండునున్= ఆ కృష్ణుడుకూడా; తిగిచికొని= లాగికొని; వెండియున్= మరియు; పదియడుగుల కొలంది= పదడుగుల దూరం; పోవన్+పోవన్= పోతూ పోతూ ఉండగా; ఆ కౌంతేయుండు= ఆ అర్జునుడు; పదస్థైర్యంబును= అడుగుల గట్టిదనం; మెఱయన్= ప్రకాశింపగా; మహీతలంబు= భూమిని; ఊని= ఆనించి; మెట్టి= తొక్కిపట్టి; బాహువీర్యంబును= భుజబలం; మెఱయన్= ప్రకాశింపగా; నిలువన్+పట్టి= (కృష్ణుని) ఆగేటట్లుగా చేసి; నిడుద+ఊర్పున్= దీర్ఘ నిశ్వాసాన్ని; నిగిడించుచున్= వ్యాపింపజేస్తూ; ఆ+దనుజమర్దనుతోన్= ఆ కృష్ణునితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు పై విధంగా అంటూండగా, అర్జునుడు తొందర తొందరగా రథంనుండి క్రిందికి దూకి, కృష్ణుడిని వెంబడించి, చేతులతో గ్రుచ్చి పట్టుకొన్నాడు. అయినప్పటికీ కృష్ణుడు అతడి చేతులు లాగికొని ఇంకా పదడుగుల దూరం పోతూ ఉండగా, తనపాదాల బలంతో నేలను గట్టిగా తొక్కిపట్టి, భుజబలంతో కదలకుండా నిలబెట్టి, పెద్దగా నిట్టూర్చుతూ కృష్ణుడితో అన్నాడు.

ఉ. కయ్యము సేయ నే నని యకల్మషబుద్ధిఁ బ్రతిజ్ఞ సేసి నీ
వియ్యెడఁ దప్పితేని జగ మేమను? నించుకసేపు పోరులన్
డయ్యుట దప్పె? నాపయిఁ గడంగిన భీష్మునిపాటు సూతు రా
వయ్య, రథంబుమీఁది కిటు లాశ్రితమానము వీటిఁబుత్తురే?' 269

ప్రతిపదార్థం: ఏను= నేను; కయ్యము= యుద్ధమును; చేయన్+అని= చేయనంటూ; అకల్మషబుద్ధిన్= పాపంలేని బుద్ధితో; ప్రతిజ్ఞన్+చేసి= ప్రతినబూని; నీవు; ఈ+ఎడన్= ఈ చోటున, తప్పితి(వి)+ఏనిన్= ప్రతిజ్ఞ తప్పితే; జగము= లోకము; ఏమి+అనున్?= ఏమంటుంది?; పోరులన్= యుద్ధాలలో; ఇంచుకసేపు= కొంచెంసేపు; డయ్యుట+తప్పు+ఎ?= శ్రమచెందడం కూడా తప్పేనా?; నాపయిన్= నాపైకి; కడంగిన= ఉద్యమించిన; భీష్మునిపాటు= భీష్ముడి ఆపదను; చూతు(వు)= చూస్తావు; రథంబు మీఁదికిన్= తేరుపైకి; రావయ్యా= రమ్ము; ఇటులు= ఈ మాదిరి; ఆశ్రిత మానమున్= ఆశ్రయించినవారి అభిమానాన్ని; వీటిన్+పుత్తురు+ఏ?= (ఎవరైనా) పోగొట్టుతారా?

తాత్పర్యం: 'ఓ కృష్ణా! నేను యుద్ధంచేయను-అని నీవు శుద్ధమైన బుద్ధితో, ప్రతిజ్ఞ చేశావుగదా! నీవు ఇప్పుడా ప్రతిజ్ఞను పాటించకపోతే (లోకం) జనం నిన్నేమంటుంది? దూషించదా? కొంచెం సేపు యుద్ధాలలో బడలిక చెందడం తప్పవుతుందా? కాదుకదా! నా మీదికి కవిసిన ఆ భీష్ముడికి ఇప్పు డే గతిపట్టిస్తానో చూతువుగాని, రమ్ము, రథంమీదికి వచ్చి కూర్చొనుము. నీవంటి మహాత్ములు ఆశ్రయించి ఉండేవారి యొక్క ఆత్మాభిమానానికి నష్టం, కష్టం కలిగిస్తారా?'

వ. అని ప్రార్థించినం బార్థుపలుకులకుం బ్రియం బంది ముకుందుం డూరక మరలె నయ్యిరువురు నెక్కిన యరదంబు శిఖరద్వయసుందరం బైన శైలంబునుంబోలెఁ బొలిచి నిలిచినం బ్రళయకాలభైరవరవం బగు వారిదంబు కరణి గర్జిల్లుచుఁ బటునారాచపటలాసారంబు నిగిడించి వారల వెగడు వఱిచి యచ్చట నొండొరుల మెచ్చక యఱిమి తఱిమిన వైరుల రూపు మాపి భీష్ముండు భీషణాకారుం డై పరిశ్రాంతులయిన కృష్ణార్జునులును, భీతు లగు భీమసేన ప్రముఖులును, జేయునది లేక చూచుచుండం బాంచాలబలంబుల బారిసమరునప్పడు బలుమానిసి చలిచీమలం గాలం జమురు చందంబు దోఁచె నయ్యవసరంబున. 270

ప్రతిపదార్థం: అని= పై విధంగా; ప్రార్థించినన్= వేడుకోగా; పార్థుపలుకులకున్= అర్జునుడి మాటలకు; ప్రియంబు+అంది= ఇష్టపడి; ముకుందుండు= కృష్ణుడు; ఊఱక= బదులు చెప్పకుండా; మరలెన్= వెనక్కి తిరిగాడు; ఆ+ఇరువురున్= ఆ కృష్ణార్జునులిద్దరు; ఎక్కిన= ఎక్కినట్టి; అరదంబు= రథము; శిఖరద్వయ సుందరంబు+ఐన= శిఖరాల రెంటిచే అందమైన; శైలంబునున్+పోలెన్= పర్వతం మాదిరి; పొలిచి= ఒప్పి; నిలిచినన్= ఉండగా; భీష్ముండు; భీషణ+ఆకారుండు+ఐ= భయం కలిగించే ఆకారం కలవాడై; ప్రళయకాలభైరవరవంబు+అగు= యుగంయొక్క అంతంలోని భయంకరమైన గర్జనగల; వారిదంబు కరణిన్= మేఘంవలె; గర్జిల్లుచున్= గర్జన చేస్తూ; పటు= సమర్థమైన; నారాచ= బాణాలయొక్క; పటల= సమూహమనే; ఆసారంబున్= జడివానను; నిగిడించి= క్రమ్ముకొనచేసి; వారలన్= ఆ కృష్ణార్జునులను; వెగడు పఱిచి= తల్లడపడచేసి; అచ్చటన్= ఆచోట; ఒండు+ఒరులన్= ఒకరినొకరిని; మెచ్చక= లెక్కచేయక(లక్ష్యపెట్టక); అఱిమి= ఆక్రమించి; తఱిమిన= వెంబడిపడి పరుగుదీయించిన; వైరులన్= శత్రువులగు యోధులను; రూపుమాపి= నశింపజేసి; పరిశ్రాంతులు+ఐన= మిక్కిలి బడలిక చెందినవారైన; కృష్ణ+అర్జునులునున్= కృష్ణుడు, అర్జునుడును; భీతులు+అగు= భయపడ్డవారైన; భీమసేన ప్రముఖులును= భీముడు ప్రధానుడుగా గలవారును; చేయునది లేక= ఏమీ చేయడానికి చేతగాక; చూచుచున్+ఉండన్= చూస్తూ ఉండగా; పాంచాల బలంబులన్= పాంచాల రాజు సేనలను; బారి+చమరు+అప్పుడు= హింసించే సమయంలో; బలుమానిసి= బలంగల మనుష్యుడు; చలిచీమలన్= చలిచీమలను; కాలన్= అరికాలితో; చమురు చందంబున్= రాచే విధంగా; తోఁచెన్= అనిపించింది; ఆ+అవసరంబునన్= అట్టి సమయంలో.

తాత్పర్యం: అర్జునుడు పై విధంగా ప్రార్థించగా, కృష్ణుడు ప్రియపడి, ఏమీ మాట్లాడకుండా వెనుకకు తిరిగి వచ్చాడు. ఆ కృష్ణార్జునులు ఇద్దరూ ఎక్కిన తేరు రెండు శిఖరాలు కల పర్వతంలా అండగా నిలిచి ఉన్నది. భీష్ముడు భయంకరమైన ఆకారంతో ప్రళయకాలంలో భయంకరంగా గర్జించే మేఘం మాదిరి బొబ్బలు పెట్టుతూ, బాణ పరంపర లనే జడివాన కురిపించి ఆ ఇద్దరినీ తల్లడిల్లచేశాడు. అక్కడుండే వారినెవరినీ లెక్కచేయకుండా, మీదపడి పరుగులెత్తించాడు. శత్రువుల భటులను నశింపజేశాడు. బాగా బడలికచెందిన కృష్ణార్జునులు, భయపడ్డ భీమాదులు ఏమీ చేయలేక ఊరక చూస్తూండగా, పాంచాలరాజు సేనను అప్పుడు భీష్ముడు చంపటాన్ని చూస్తుంటే ఒక బలవంతుడైనవాడు అరికాలితో చీమల్ని రాచివేసే మాదిరి గోచరించింది. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. 1.కృష్ణార్జునులు ఇద్దరెక్కిన రథం, రెండు శిఖరాలు గల పర్వతం మాదిరి ఉన్నది - అనటంలో, రథం - ఉపమేయం. పర్వతం - ఉపమానం, కృష్ణార్జునులు - ఉపమేయాలు, రెండు శిఖరాలు - ఉపమానం. పోలెన్ - అనేమాట ఉపమావాచకం. ఒప్పియుండుట సాధారణ ధర్మము- ఇది పూర్ణోపమాలంకారము.

2. భీష్ముడు - ఉపమేయం; వారిదము - ఉపమానము; కరణి అనేమాట ఉపమావాచకం. కురియడం సాధారణ ధర్మం. ఉపమాన ఉపమేయ - సాధారణ ధర్మ ఉపమావాచకాలు అప్పటంగా చెప్పటంచేత ఇక్కడకూడా పూర్ణోపమాలంకారమే. మేఘం కొండ శిఖరాలను తాకి వర్షిస్తుంది. భీష్ముడు కృష్ణార్జునులను చేరి బాణ వర్షం కురిపించాడు.

3. భీష్ముడు - ఉపమేయం; బలుమానిసి - ఉపమానం; పాంచాల బలాలు - ఉపమేయం ; చలిచీమలు - ఉపమానం హింసించడం - సాధారణధర్మం. 'చందంబు' అనే మాట ఉపమావాచకం. ఇచ్చట కూడా పై వాటి వలె పూర్ణోపమాలంకారమే.

క. తా నస్తశిఖరి మఱువడఁ । బోనియపుడు పాండురాజపుత్త్ర విరాజ
త్సేన పొడవడఁగు ననుకృప । నో నలినాప్తుండు గ్రుంకె నుర్వీనాథా! 271

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= భూమికి భర్తయైన ధృతరాష్ట్రమహారాజా!; తాన్= తాను(సూర్యుడు); అస్తశిఖరి= పడమటి కొండలో; మఱు+పడన్= అస్తమించటానికి; పోని+అపుడు= పోకుండా ఉన్నప్పుడు; పాండురాజు= పాండురాజుయొక్క; పుత్త్ర= కొడుకులైన

ధర్మరాజాదులయొక్క; విరాజత్= ప్రకాశించెడి; సేన= సైన్యము; పాడవు+అడఁగున్= రూపుచెడిపోవును; అనుకృపనో?= అనే దయతోనే ఏమో?; నలిన+ఆప్తుండు= తామరలకు మిత్రుడు అయిన సూర్యుడు; క్రుంకెన్= అస్తమించాడు.

తాత్పర్యం: తాను (సూర్యుడు) అస్తగిరిని చేరి మరుగుపడకపోతే ఈ పాండవ సైన్యమంతా రూపుమాసిపోతుంది. అనే దయతో కాబోలు - సూర్యుడు అస్తమించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. సూర్యుడు సహజంగా అస్తమించడాన్ని కవి ఈ విధంగా ఉత్ప్రేక్షించాడు. సూర్యాస్తమయానికి, పాండవసేన రూపుమాసిపోవడం కారణం కాకపోయినా, దాన్ని కారణంగా చెప్పాడు.

వ. అట్టియెడ ధర్మతనయుం డతిఘోరం బగు సంధ్యాసమయంబునం బంకనిర్మగ్నయైన గోవునుం బోలె నున్న నిజసేనం జూచి యొక్కింతసేపు చింతా క్రాంతుండై యప్పటికిం దిగుటయ కర్జంబుగాఁ దలంచి తగువారల నెల్లం దివియ నియమించి. 272

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్=ఆలాంటి సమయంలో; ధర్మతనయుండ; అతి ఘోరంబు+అగు=మిక్కిలిభయంకరమైనట్టి; సంధ్యాసమయంబునన్=సంధ్యాకాలంలో; పంక నిర్మగ్న+ఐన=బురదలోబాగాదిగబడిన; గోవునున్+పోలెన్=ఆవువలె; ఉన్న=ఉన్నట్టి; నిజసేనన్=తన యొక్క సైన్యాన్ని; చూచి; ఒక్క+ఇంతసేపు= కొంచెంకాలం, చింతా+ఆక్రాంతుండు+ఐ= బాధచేత ఆక్రమింపబడినవాడై; అప్పటికిన్=ఆసమయానికి; తిగుట+అ=వెనక్కు తగ్గటమే; కర్జంబు+కాన్=చేయతగ్గపనిగా; తలంచి; తగువారలన్=తగినవారిని; ఎల్లన్=అందరిని; తివియన్=వెనుదిరుగుటకు; నియమించి=ఆజ్ఞాపించి;

తాత్పర్యం: అప్పుడు మిక్కిలి దారుణమైన సంధ్యాసమయంలో బురదలో బాగా దిగబడ్డ ఆవు మాదిరి తన సైన్యం చాలా సంకటపడుతూండగా ధర్మరాజు చూచి, కొంచెంసేపు, బాధపడి, యుద్ధం నుండి తన బలాన్ని చాలిం(ఉపసంహరిం)ప చేయటమే ఆసమయానికి తగినపని అని అనుకొని, సైన్యాన్ని వెనుదిరగటానికి ఆజ్ఞాపించాడు.

విశేషం: అలం: ఉపమ.

క. గాంగేయుచేత నెంతయు । భంగపడితి మనుచు వగచు పార్థాదులు ద
న్నుం గొలిచి చనఁగ విడిదల । కుం గడువిన్ననయిపోయెఁ గురువంశనిధీ! 273

ప్రతిపదార్థం: కురువంశనిధీ= కురుకులానికిగనియైన ధృతరాష్ట్రమహారాజా!; గాంగేయుచేతన్= భీష్ముడిచేత; ఎంతయున్= ఎంతో అధికంగా; భంగము+పడితిమి+అనుచున్= అవమానపడ్డామని అనుకుంటూ; వగచు=దుఃఖపడుతున్న; పార్థ+ఆదులున్= అర్జునుడు మున్నగు పాండవులు; తన్నున్= తన(ధర్మరాజు)ను; కొలిచి= సేవించి(అనుసరించి); చనఁగన్= నడువగా; విడిదలకున్= తమ నివాసస్థానాలకు; కడున్= మిక్కిలి; విన్నన+అయి= వెలవెలబారినవాడై; పోయెన్= (ధర్మరాజు) వెళ్ళాడు.

తాత్పర్యం: అర్జును డాదిగా గల మహామహులందరు భీష్ముడిచేత, చాలా అవమానపడ్డామని దుఃఖపడుతూ, తన్ను (ధర్మరాజును) అనుసరించిరాగా, ముఖం చిన్నబుచ్చుకొని ధర్మరాజు తన నివాసానికి చేరుకొన్నాడు.

వ. ఇట్లు పాండవ వ్యూహంబు లోహటించి పోయినం దారును దమబలంబులఁ దివియ నియమించి.274

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవవ్యూహంబులు= పాండవుల సేనలు; ఓహటించి= వెనుకకు తిరిగి; పోయినన్= పోగా; తారునున్= తాము(కౌరవులు)న్నూ; తమ బలంబులన్= తమయొక్క సేనలను; తివియన్= యుద్ధం నిలపడానికి; నియమించి= ఆజ్ఞచేసి.

తాత్పర్యం: పై విధంగా పాండవసేనలు వెనుకకు మరలి వెళ్ళాయి. అప్పుడు కౌరవులుకూడా తమ బలాలకు యుద్ధం చాలించండి అని ఉత్తరువు చేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. ఎలమి నమస్కరించుచు నహీనపరాక్రమభంగు లేర్పడం
బలికి యుదాత్తవాక్యములఁ బ్రస్తుతి సేయుచు భీష్ము నందఱున్
బలసి భవత్తనూజులు మనంబులు నిండి ముదంబు మోములన్
వెలి విరియంగ నేఁగిరి నవీనవిభూతి నివాసభూమికిన్. 275

ప్రతిపదార్థం: భవత్+తనూజులు= నీ (ధృతరాష్ట్రుని) యొక్క కుమారులు; అందఱున్= యావన్మంది; భీష్మున్= భీష్ముని; బలసి= చుట్టుకొని; ఎలమిన్= సంతోషంతో; నమస్కరించుచున్= దండాలు పెట్టుతూ; అహీన= తక్కువకాని; పరాక్రమ= భీష్ముని పరాక్రమముయొక్క; భంగులు= విధాలు; ఏర్పడన్= తేటతెల్లంగా; పలికి= చెప్పి; ఉదాత్తవాక్యములన్= గొప్ప గొప్ప మాటలతో; ప్రస్తుతి+చేయుచున్= పొగడుతూ; ముదంబు= సంతోషము; మనంబులు నిండి= మనస్సులందు నిండిపోయి; మోములన్ = ముఖాలయందు; వెలివిరియంగన్= ఉబ్బుచుండగా; నవీన= క్రొత్తదైన; విభూతిన్= ఐశ్వర్యంతో; నివాసభూమికిన్= తాము ఉండేచోటుకు; ఏఁగిరి= వెళ్ళిపోయారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ కుమారులందరూ భీష్ముడిని చుట్టి నిలిచి, దండాలు పెడుతూ, ఆయన యొక్క గొప్ప పరాక్రమాల పోకడలను ఎత్తి చెప్పుతూ, అర్థయుక్తమైన పదజాలంతో అతడిని పొగడుతూ, తమ మనస్సులలోని ఆనందం ముఖాలలో తాండవిస్తూ ఉండగా తమ తమ నివాసభవనాలకు వెళ్ళిపోయారు.

వ. ఇట్లు ధర్మతనయుండు దొమ్మిదవ నాఁటి బవరంబున బెండువడి యా నిశాసమయంబునందు రహస్య ప్రకారంబున. 276

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ మాదిరిగా; ధర్మతనయుండు= ధర్మరాజు; తొమ్మిదవనాటి= తొమ్మిదో దినం యొక్క; బవరంబునన్= యుద్ధమందు; బెండు+పడి= బలహీనపడి; ఆ+నిశా సమయంబునందున్= ఆనాటి రాత్రి కాలంలో; రహస్యప్రకారంబునన్= రహస్యమైన రీతిలో.

తాత్పర్యం: తొమ్మిదవనాటి యుద్ధంలో ధర్మరాజు చాలా బలహీనపడ్డాడు. ఆనాటి రాత్రి ఆతడు రహస్యంగా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మనమున విషాద మడరఁగ । ననుజులఁ గూర్చికొని దానవాంతకుసదనం
బునకుం జని యి ట్లను నా । తనితో నాత్మీయకార్యదశ దెలియుటకున్. 277

ప్రతిపదార్థం: మనమునన్= మనస్సులో; విషాదము= దుఃఖము; అడరఁగన్= అధికంకాగా; అనుజులన్= తమ్ముళ్ళను; కూర్చికొని= వెంటబెట్టుకొని; దానవ+అంతకు సదనంబునకున్= రాక్షసులను చంపిన కృష్ణుడి భవనానికి; చని= వెళ్ళి; ఆత్మీయ కార్యదశన్= తనదైన చేయతగ్గ పని యొక్క స్థితిని; తెలియుటకున్= తెలుసుకోవడానికి; ఆతనితోన్= ఆ కృష్ణుడితో; ఇట్లు+అనున్.

తాత్పర్యం: ధర్మరాజుకి మనస్సులో దుఃఖం పెచ్చురేగింది. తన తమ్ముళ్ళను వెంటతీసికొని శ్రీకృష్ణుడి భవనానికి వెళ్ళాడు. తను ఇకముందు చేయదగ్గ పనిని తెలిసికోవటానికి ఆయనతో ఇట్లా అన్నాడు:

క. 'కార్చిచ్చు గవిసి మృగతతి । నేర్చుకరణి నేఁడు భీష్ముఁ డేచిన కడిమిం
బేర్చి మనసేనఁ బొదివె శ । రార్చుల నవ్వీరుఁ గన్నులారం గంటే? 278

ప్రతిపదార్థం: భీష్ముఁడు; నేఁడు= ఈనాడు; ఏచినకడిమిన్= అతిశయించిన పరాక్రమంతో, పేర్చి= అతిశయించి; మనసేనన్= మన పాండవుల యొక్క సైన్యాన్ని; కారు+చిచ్చు= అడవిలో పుట్టే అగ్ని; కవిసి; మృగతతిన్= జంతు సముదాయాన్ని; ఏర్చు కరణిన్= కాల్చే మాదిరిగా; శర+అర్చులన్= బాణాలనే అగ్ని జ్వాలలతో; పొదివెన్= కప్పివేశాడు; ఆ+వీరున్= ఆ వీరుడిని; కన్నులారన్= నీ కండ్లతో చక్కగా; కంటే?= చూచావా?

తాత్పర్యం: 'భీష్ముడు ఈ దినం యుద్ధంలో బాగా విజృంభించిన పరాక్రమంతో మనసేనను వరుసపెట్టి, దావాగ్ని అరణ్యంలోని జంతుజాలాన్ని భస్మంచేసే విధంగా బాణాగ్నిజ్వాలలతో కప్పివేశాడు. ఓ కృష్ణా! నీవు ప్రత్యక్షంగా కన్నులారా ఆ వీరుడిని చూచావుగదా!

విశేషం : అలం: ఉపమ. 'భీష్ముడు మనసేనన్'... పొదువుట - ఉపమేయవాక్యం. 'కార్చిచ్చు మృగతితిన్...' ఏర్చుట - ఉపమానవాక్యం; ఏర్చుట, పొదువుట - సాధారణ ధర్మం; కరణి - ఉపమావాచకం. శరార్చులు అనే చోట రూపకం. శరములనెడి అర్చులు.

మ. **మనవా రెవ్వరు నోర్వ రాతనికి దుర్మానంబునం జేసి యే**
మును గార్యస్థితిఁ గాన నైతి విను నిర్మూలంబుగాఁ బోరఁ జ
చ్చిన సామ్రాజ్యము గొన్న యట్లగునె? నిశ్చింతంబునం గాననం
బునకుం బోయెదఁ దమ్ములం గొని తపఃపూజ్యుండ నై యుండెదన్. **279**

ప్రతిపదార్థం: ఆతనికిన్= ఆ భీష్ముడికి; మనవారు= పాండవపక్షంలోనివారు; ఎవ్వరున్= ఎవరుగాని; ఓర్వరు= ఎదురు నిలబడలేరు; ఏన్= నేను; మును= ముందు; దుర్+మానంబునన్+చేసి= దురహంకారంతో; కార్యస్థితిన్= కాగల కార్యం యొక్క నిజస్థితిని; కానన్+ఐతిన్= తెలియలేకపోయాను; విను= ఓ కృష్ణా!, ఆలకించు; పోరన్= యుద్ధంలో; నిర్+మూలంబు+కాన్= మొదలంట; చచ్చినన్= బందుగులు చనిపోగా; సామ్రాజ్యమున్= సకల భూమికి రాజగుట(చక్రవర్తిత్వము); కొన్న+అట్లు+అగునె?= తీసికొన్నట్లగునా?; నిస్+చింతంబునన్= చింతలేనట్లుగా; తమ్ములన్= నా తమ్ముళ్ళను - భీమాదులను; కొని= తీసికొని; కాననంబునకున్= అరణ్యానికి; పోయెదన్= వెళ్ళుతాను; తపః+పూజ్యుండన్+ఐ= తపస్సుచేత పూజింపతగ్గవాడనై; ఉండెదన్= ఉంటాను.

తాత్పర్యం: ఓ కృష్ణా! మన పాండవులసేనలో ఏ ఒకడూ కూడా భీష్ముడు ఢీకొంటే ఎదుట నిలబడగలవాడు లేడు. యుద్ధానికి దిగేముందే, వ్యర్థమైన అహంకారంతో భీష్ముడి తాకిడికి తట్టుకోలేమనే సంగతిని నేను ఊహించలేకపోయాను. యుద్ధంలో బంధుజనం, జనం అసలు లేకుండా చావగా వచ్చిన సామ్రాజ్యం ఎందుకు? జనంలేని సామ్రాజ్యాన్ని తీసుకోవటం, ఒక రాచరికమౌతుందా? కనుక జనం లేని సామ్రాజ్యం నాకు అక్కరలేదు. నేను నిశ్చింతగా నా తమ్ముళ్ళను వెంటబెట్టుకొని అరణ్యానికి వెళ్ళుతాను. అక్కడ తపస్సు చేసికొంటూ, పూజార్హుడుగా ఉండిపోతాను. ఇక్కడ ఈ యుద్ధంవల్ల నాకు నింద కలుగుతుంది.

క. **మున్నును నేఁగారణముగ । నన్నియిడుమ లనుభవించి రనుజులు వీరిం**
గన్నారఁ జూతుఁ గాని జ । గన్నుత! భీష్మునకుఁ గోలుగా నీఁ జాలన్. **280**

ప్రతిపదార్థం: జగత్+నుత!= లోకంచేత కీర్తింపబడే ఓ కృష్ణా!; మున్నునున్= మునుపు; ఏన్+కారణముగన్= నేను కారణంకాగా; అనుజులు= నా తమ్ములు; అన్ని+ఇడుమలు= అన్ని కష్టాలను; అనుభవించిరి= అనుభవించారు; వీరిన్= అట్టి ఈ నా తమ్ముళ్ళను; కన్నారన్= కనులపండువుగా; చూతున్+కాని= చూస్తానుగాని; భీష్మునకున్= భీష్ముడికి; కోలు+కాన్= దోపిడి అయ్యేటట్లుగా; ఈన్+చాలన్= ఈయలేను.

తాత్పర్యం: ఓ కృష్ణా! జూదమాడిన నావల్ల నా తమ్ముళ్ళు ఎన్నో కష్టాలు అనుభవించారు. అట్టివారిని కన్నులార చూచి, సంతోషించుతానుగాని భీష్ముడికి దోపిడిగా ఒప్పగించలేను.

వ. నీకు మా దెస ననుగ్రహంబు గలదేని కయ్యంబు దక్కి ధర్మ విరోధంబు గాకుండునట్టి యొక్క తెరువు సెప్పు' మని సకరుణంబుగాఁ బలికిన విని శౌరి సాంత్వనవచనంబుల ననునయించి యతని కి ట్లనియె. 281

ప్రతిపదార్థం: నీకున్= (కృష్ణుడవగు) నీకు; మాదెసన్= మాయందు; అనుగ్రహంబు= దయ; కలదు+ఏనిన్= ఉన్నట్లయితే; కయ్యంబు= యుద్ధాన్ని; తక్కి= వదలిపెట్టి; ధర్మవిరోధంబు= ధర్మానికి విరోధము; కాక+ఉండు+అట్టి= కాకుండా ఉండేటువంటి; ఒక్క తెరువు= ఒక మార్గాన్ని; చెప్పుము+ అని= సెలవీయవలెనని; సకరుణంబు+కాన్= దయతో కూడునట్లుగా; పలికినన్= చెప్పగా; విని; శౌరి= కృష్ణుడు; సాంత్వనవచనంబులన్= ఊరడింపు మాటలతో; అనునయించి= బుజ్జగించి; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు+అనియె.

తాత్పర్యం: ఓ కృష్ణా! నీకు మా పట్ల దయ ఉంటే, యుద్ధాన్ని తప్పనిచ్చి, ధర్మానికి విరోధం లేకుండా ఉండే ఏదో ఒక ఉపాయాన్ని (మార్గం) చెప్పు' అని చాలా జాలిగా ధర్మరాజన్నాడు. కృష్ణ డితడి మాటలు విని, అతన్ని ఊరడింపు మాటలతో బుజ్జగించి, ఈ విధంగా అన్నాడు.

క. ' సత్యప్రతిజ్ఞుఁడవు నీ । వత్యద్భుత బాహువీర్యు లనుజన్ములు దౌ
ర్గత్యము గల్గునె? నీకు న । మాత్యుఁడ నై యేను రాజ్యమహిమ నొనర్తున్. 282

ప్రతిపదార్థం: నీవు; సత్యప్రతిజ్ఞుఁడవు= సత్యమైన ప్రతిజ్ఞ కలవాడివి; అనుజన్ములు= నీ తోబుట్టువులు; అతి+అద్భుత బాహు వీర్యులు= చాలా గొప్ప భుజబలం గలవారు; నీకున్= నీకు; దౌర్గత్యము= దుర్గతి (హీనత్వము); కల్గునె?= ఏర్పడునా?; ఏర్పడదనుట; ఏను= నేను (శ్రీకృష్ణుడు); అమాత్యుఁడన్+ఐ= మంత్రిగా ఉండి; రాజ్యమహిమన్= నీ రాజ్యానికి ఐశ్వర్యాన్ని; ఒనర్తున్= కలిగించుతాను.

తాత్పర్యం: 'ధర్మరాజా! నీవు సత్యమైన ప్రతిజ్ఞ కలవాడివి, అంటే నీవు ప్రతిజ్ఞ చేశావంటే దాన్ని తప్పక నెరవేర్చేవాడివి. ఇక నీ తమ్ముళ్ళూ ఆశ్చర్యం కలిగించే బాహుబలంగలవారు. అటువంటి నీకు (దుఃస్థితి) హీనదశ కలుగనేరదు. పైగా నేను మంత్రిగా ఉండి నీ రాజ్యానికి ఐశ్వర్యాన్ని సమకూరుస్తాను.

క. వగవఁగ నేటికిఁ బార్థుఁడు । దెగువకుఁ జొరకున్న భీష్ముఁ దెగఁ జూచి వెసం
బగ యడఁగించెద నన్నున్ । మగిడింపక చూచుచుండు మనుజాధీశా! 283

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= ఓ ప్రభూ ధర్మరాజా!; వగవఁగన్+ఏటికిన్= దుఃఖించడం ఎందుకు?; పార్థుఁడు= అర్జునుడు; తెగువకున్= సాహసానికి; చొరక+ఉన్నన్= దిగకుండా ఉంటే; భీష్మున్= భీష్ముడిని; తెగన్+చూచి= చంపి; వెసన్= వెంటనే; పగ= విరోధాన్ని; అడగించెదన్= పోగొడతాను; నన్నున్= కృష్ణుడగునన్ను; మగిడింపక= మరల్చకుండా; చూచుచుండుము.

తాత్పర్యం: ధర్మజా ! దుఃఖ పడటమెందుకు? అర్జునుడు భీష్ముడిని చంపడానికి తెగించకపోతే నేనే భీష్ముడిని చంపి పగను పోగొడతాను. అర్జునుడు నన్ను వెనుకకు మరల్చకుండా చూడు.

తే. సఖుఁడు సంబంధి శిష్యుండు సవ్యసాచి । నాకు, నతనికి నై యేను నరవరేణ్య!
కూర్మిమై నిత్తుఁ గండలు గోసి యైన । నరయ నాతండు నాయెడ నట్టివాఁడ. 284

ప్రతిపదార్థం: నరవరేణ్య!= ఓ మానవశ్రేష్ఠుడా!; సవ్యసాచి= అర్జునుడు; నాకున్; సఖుఁడు= చెలికాడు; సంబంధి= చుట్టం; శిష్యుండు; ఏను= నేను; అతనికిన్+ఐ= ఆతడికొరకై; కూర్మిమైన్= ప్రేమతో; కండలుకోసి+ఇనన్= నా శరీరంలోని కండలు కోసి అయినా; ఇత్తున్; అరయన్= చూడగా; ఆతండున్= ఆ అర్జునుడుకూడా; నా+ఎడన్= నా విషయంలో; అట్టివాఁడు+అ= అట్టివాడే.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నాకు అర్జునుడు - స్నేహితుడు, సంబంధి (మా సోదరి సుభద్రకు భర్త) అంతేకాదు. నాకు శిష్యుడు కూడా. అతని మేలు కోసం సంతోషంతో నా శరీరంలోని కండలైనా కోసి ఇస్తాను. ఆలోచించి చూడగా అర్జునుడు కూడా నాపట్ల అంతప్రేమకలవాడే. మా ఇద్దరి కలయిక అంత దృఢమైనది.

వ. ఉపప్లావ్యంబున నతండు సంజయుతో నాడినబలుమాటలకు, నులూకుండు వచ్చినప్ప డతని పలుకులం బుట్టిన బెట్టిదంపుఁదనంబునకుం దగినయంత నాకుం జేయవలయు నేను నీరెండెడలం బెక్కులు వలికినవాఁడ మా కిరువురకు నొండొరువుల పలుకులు పరిపాలించుట సమయంబయి యుండు ననిన వసుదేవనందనునకు ధర్మనందనుం డి ట్లనియె. 285

ప్రతిపదార్థం: ఉపప్లావ్యంబునన్; ఇతండు= అర్జునుడు; సంజయుతోన్; ఆడిన= పలికిన; బలుమాటలకున్= పెద్దమాటలకు; ఉలూకుండు; వచ్చిన+అప్పుడు= వచ్చిన సమయంలో; అతని పలుకులన్= అతడి మాటలవల్ల; పుట్టిన= కలిగిన; బెట్టిదము+తనంబునకున్= క్రూరత్వానికి; తగిన+అంత; నాకున్+చేయవలయున్= నేను చేయవలసివుంది; ఏనున్= నేను(కృష్ణుడు)కూడా; ఈ రెండు+ఎడలన్= ఈ రెండు చోట్ల; పెక్కులు= చాలా చాలా; పలికినవాఁడన్= మాట్లాడాను; ఒండు+ఒరుల; ఒకరొకరియొక్క; పలుకులు= మాటలు; పరిపాలించుట= నెరవేర్చుట; మాకున్+ఇరువురకున్= మా ఇద్దరికి; సమయంబు+అయి+ఉండున్= ఒడంబడికగా ఉన్నది; అనినన్; ధర్మనందనుండు; వసుదేవనందనునకున్= వసుదేవుడి కొడుకు - కృష్ణుడికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఉపప్లావ్యంలో అర్జునుడు సంజయుడితో అన్న మాటలకు, ఉలూకుడు వచ్చిన సమయంలో అతడి మాటల వల్ల ఏర్పడ్డ క్రూరత్వానికి తగినట్లుగా నేను కూడా చేయవలసి ఉన్నది. ఈ రెండు సందర్భాలలో నేను కూడా హెచ్చులు పలికాను. మా ఇద్దరిలో, ఒకరి మాటలను మరొకరు నెరవేర్చడమనేది మా ఇద్దరి ప్రతిజ్ఞ' అనగా విని, ధర్మరాజు కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఉలూకుడు: ఇతడు భారత యోధుడు. శకుని యొక్క కొడుకు. **"ఆహూయోపహ్వరే రాజన్నులూక మిదమబ్రవీత్ । ఉలూక గచ్ఛకౌరవ్య పాండవాన్ సహసోమకాన్"** ॥ (మహాభారతం)

క. ' కయ్యము సేయక తగు సా । హాయ్యము సేయఁగలవాఁడ నని పలికితి ని
న్ని య్యెడ నేఁ బొంకింతునె? । దయ్యము నా కేల యిట్టి దైన్యము దెచ్చెన్? 286

ప్రతిపదార్థం: కయ్యము= యుద్ధం; చేయక; తగు= తగినట్టి; సాహాయ్యమున్= సహాయాన్ని; చేయన్+కలవాఁడన్+అని= చేస్తానని; పలికితి(వి)= చెప్పావు; నిన్నున్= అట్లా చెప్పినట్టి నిన్నున్; ఈ+ఎడన్= ఈ పట్టులో; ఏన్= నేను (ధర్మరాజు); బొంకింతున్+ఎ?= అబద్ధమాడించగలనా?; దయ్యము= విధి; నాకున్= ధర్మరాజగు నాకు; ఇట్టి దైన్యమున్= ఈలాంటి హీనస్థితిని; ఏల తెచ్చెన్?= ఎందుకు తెచ్చిపెట్టింది?

తాత్పర్యం: 'ఓ కృష్ణా! నీవు యుద్ధం చేయకుండా ఉండి, తగు సహాయంచేస్తానని అన్నావుకదా! ఈ కష్టసమయంలో నిన్ను అబద్ధాలాడే వాడినిగా నేనెట్లా చేయను? నీవు యుద్ధం చేస్తే నా కోసం నీవు అబద్ధాలాడే వాడవవుతావు కదా! దైవం నాకు ఇంతగా సంకటమైన స్థితిని తెచ్చిపెట్టింది కదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. నాకు దేవవ్రతునకు నొక్క సమయంబు గల దమ్మహాత్ముండు కౌరవులకు నయి కయ్యంబు సేయుటకును, నాకు హితం బగు కార్యంబు బుద్ధిం దలకొనుటకుం బూనినవాఁ డతండు రాజ్యం బొసంగు నని పలికి సఖేదంబుగా ని ట్లనియె. 287

ప్రతిపదార్థం: నాకున్= ధర్మరాజైన నాకు; దేవవ్రతునకున్= భీష్ముడికిని; ఒక్క సమయంబు+కలదు= ఒక ఒడంబడిక ఉన్నది; ఆ+మహాత్ముండు; కౌరవులకున్+అయి= కౌరవులకొరకు; కయ్యంబున్= యుద్ధాన్ని; చేయుటకును= చేయడానికి; నాకున్; హితంబు+అగు= మంచిదైనట్టి; కార్యంబు= పనిని; బుద్ధిన్=బుద్ధియందు; తలకొనుటకున్= కలిగియుండుటకు; పూనినవాఁడు= పూనుకొన్నవాడు; అతండు= ఆ భీష్ముడు; రాజ్యంబున్= రాజ్యాన్ని; ఒసంగున్= ఇచ్చును; అని; పలికి; సఖేదంబు+గాన్= దుఃఖంతో కూడుకొన్నవాడై; ఇట్లు+అనియెన్= ఇలాగన్నాడు.

తాత్పర్యం: నాకున్నూ, భీష్ముడికీ ఒక ఒడంబడిక ఉన్నది. అదేమంటే, అతడు కౌరవుల పక్షంలో ఉండి యుద్ధం చేస్తాడు. నాకు మంచి కలిగించే ఆలోచన కలిగియుంటాడు. కాబట్టి రాజ్యం నాకు దక్కే ఉపాయం చెప్పుతాడు.' అని ధర్మరాజు అని, దుఃఖంతో మరలా ఇట్లా అన్నాడు:

విశేషం : దేవవ్రతుడు - దేవుని యొక్క వ్రతంవంటి వ్రతం గలవాడు. అనగా స్థిరమైన ప్రతిజ్ఞ కలవాడు. **'చిత్రాంగదం తతో రాజ్యే స్థాపయామాస వీర్యవాన్ । స్వయం న కృతవాన్ రాజ్యం తస్మాద్దేవవ్రతోऽభవత్ ॥** దేవీ భాగవతే (1 - 20 - 16)

ఆ. ' అకట! తండ్రి సచ్చినంతనుండియు మమ్ము । నరసి ప్రోచినట్టి యనుఁగుఁ దాతఁ
జంప మదిఁ దలంచుతెంపు సూచితె? రాజ । ధర్మ మింత క్రూరకర్మమగునె?' 288

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; తండ్రి= తండ్రియైన పాండురాజు; చచ్చిన+అంతన్+ఉండియున్= చచ్చిపోయింది మొదలు; మమ్మున్= పాండురాజు కొడుకులమైన మమ్ములను; అరసి= విచారించి, (చూచి); ప్రోచిన; అట్టి= కాపాడినట్టి; అనుఁగు= ప్రియమైన; తాతన్= తాతగారిని; చంపన్= చంపటానికి; మదిన్= మనస్సులో; తలంచుతెంపు= తలచే తెగువ; చూచితే?= (ఓకృష్ణా!); చూచావా?; రాజధర్మము= క్షత్రియులయొక్క ధర్మం; ఇంత= ఇంతగా; క్రూరకర్మము= భయంకరమైన పని; అగునె?= అగునా?

తాత్పర్యం: అయ్యయ్యో! తండ్రి చనిపోయింది మొదలు మమ్మలను ఎంతో గారాబంగా చూచుకొంటూ వచ్చినవాడు, మాకు చాలా ప్రియమైనవాడు, అయిన తాతగారినే చంపాలనే తలంపు మనస్సులో పుట్టడం - చూశావా? రాజధర్మం ఇంత ఘోరమైనదా?

వ. అనవుడు. 289

ప్రతిపదార్థం: అనవుడు(న్)= అని చెప్పగానే.

తాత్పర్యం: ధర్మరాజు ఈ విధంగా కృష్ణుడితో చెప్పగానే (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. విని మురాంతకుఁ డితఁడు శాంతనవుకడకు । నరుగఁ జూచినవాఁ డని యాత్మ నెఱిఁగి
క్రమ్మఱంగ 'నేతెంచెదు గాక!' యనిన । యన్నదీసూనుతొంటి వాక్యములు దలఁచి. 290

ప్రతిపదార్థం: ముర+అంతకుఁడు= మురుడనే రాక్షసుడిని చంపిన శ్రీకృష్ణుడు; విని= ధర్మరాజు మాటలు ఆలకించి; ఇతఁడు= ఈ ధర్మరాజు; శాంతనవు కడకున్= భీష్ముడి దగ్గరికి; అరుగన్= వెళ్ళడానికి; చూచినవాఁడు+అని= యత్నిస్తున్నాడని; ఆత్మన్=

మనస్సులో; ఎఱిఁగి= తెలుసుకొని; క్రమ్మఱంగన్= మరల తిరిగివచ్చుటకు; ఏతెంచెదుగాక!= వచ్చెదవులెమ్ము!; అనినన్= అంటూ; ఆ+నదీసూను= ఆ భీష్ముడియొక్క; తొంటి వాక్యములు= మొదట అన్న మాటల్ని; తలఁచి= జ్ఞప్తికి తెచ్చికొని.

తాత్పర్యం: కృష్ణుడు ధర్మరాజన్న మాటలు విన్నాడు. ఇతడు భీష్ముడి దగ్గరకు పోవాలని ఉన్నాడని మనస్సులో గ్రహించాడు. తరువాత వచ్చెదవుగాక అని భీష్ముడు యుద్ధ ప్రారంభానికి ముందు ధర్మజునితో అనిన వాక్యాలు జ్ఞప్తికి తెచ్చుకొని (తరువాతి పద్యంతో అన్వయం)

వ. అజాతశత్రున కిట్లనియె. 291

ప్రతిపదార్థం: అజాత శత్రునకున్ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఈ చెప్పబోయే విధంగా అన్నాడు.

విశేషం: అజాతశత్రుడు(వు) - పుట్టని శత్రువులు కలవాడు - ధర్మరాజు (ఇతడికి శత్రువులే లేరన్నమాట.)

ధర్మరాజు రహస్యప్రకారంబున భీష్మునియొద్దకుఁ బోవుట (సం. 6-103-50)

ఆ. నీ తలంపు లెస్స నీవు మున్ననినట్ల । కాక భీష్ముఁ డలుక గదిరిపోరఁ
జక్కఁ జూచెనేని శత్రువుల్ వొలియరె? । యిప్పుడతని పాలికేఁగు మధిప! 292

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; నీ తలంపు= నీ యొక్క ఆలోచన; లెస్స= మంచిది; నీవు= ధర్మరాజు; మున్ను= ముందు; అనిన+అట్లు+అ+కాక= నీవు అన్నట్లే; భీష్ముఁడు = భీష్మాచార్యుడు; అలుక= కోపం; కదిరి= విజృంభించి; పోరన్= యుద్ధంలో; చక్కన్+చూచెన్+ఏని= చంపదలచుకుంటే; శత్రువుల్= విరోధులు; పొలియరె?= చావరా?; ఇప్పుడు; అతని పాలికిన్= ఆ భీష్ముడి దగ్గరకు; ఏఁగుము= పొమ్ము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! భీష్ముడి వద్దకు వెళ్ళాలనే నీ ఆలోచన చాలామంచిది. భీష్ముడు కౌరవుల వైపు ఉండి, యుద్ధం చేస్తాడని, మనస్సులో మీ హితాన్ని కోరుతూ మంచి కలిగించడానికి పూనుకొని ఉంటాడని, అతడు నీకు రాజ్యం చెందేట్టు చేస్తాడని - అన్నావు కదా! అట్లా కాకపోతే, అతడనుకుంటే శత్రులనందరినీ చంపివేయగలడు. కాబట్టి నీవు ఇప్పుడు అతనివద్దకు వెళ్ళటం చాలా మంచిది.

సీ. నీవు దన్నడిగిన నిజవధోపాయం బవశ్యంబుఁ జెప్పు దేవవ్రతుండు
మనము రహస్యవర్తనమున నందఱమును జని య మ్మహాత్మునకు భక్తి
నెరఁగి తెల్లంబుగ హితకార్యగతి వినయంబుమైఁ బ్రార్థించి యడిగి యతని
సదయమంత్రోపదేశంబున నెగడుద' మని యిట్లు హరి నిశ్చయంబు సేయ

ఆ. నయ్యజాతశత్రుఁ డనుజులు నతఁడును । దాను సౌమ్యవేషధరణమొప్ప
నతినిగూఢ వృత్తి నాపగాసుతుమంది । రమున కరిగి సముచితముగఁ జొచ్చి. 293

ప్రతిపదార్థం: నీవు= ధర్మరాజైనట్టి నీవు; తన్నున్= ఆ భీష్ముడిని; అడిగిన(న్)= అడిగితే; దేవవ్రతుండు= భీష్ముడు; నిజవధ+ఉపాయంబున్= తన మరణానికి ఉపాయాన్ని; అవశ్యంబున్= తప్పకుండా; చెప్పున్= చెప్తాడు; మనము; మనమందరం; రహస్య వర్తనమునన్= చాటుగా; చని= అతడివద్దకుపోయి; ఆ+మహాత్మునకున్= ఆ మహానుభావుడికి; భక్తిన్= భక్తితో; ఎరఁగి=

నమస్కరించి; తెల్లంబుగన్= స్పష్టంగా; హితకార్యగతిన్= మేలు గల్గించు కార్యవిధానమును; వినయంబుమైన్= వినయంతో; ప్రార్థించి; అడిగి; అతని= ఆ భీష్ముడియొక్క; సదయమంత్ర+ఉపదేశంబునన్= దయతో కూడిన రహస్యమైన హితవచనంతో; నెగడుదము+అని= వృద్ధి పొందుదామని; ఇట్లు; నిశ్చయంబు= నిర్ణయాన్ని; చేయన్= చేయగా; అతఁడునున్; ఆ+అజాతశత్రుఁడున్= ఆ ధర్మరాజు; అనుజులున్= తమ్ములు; తాను= కృష్ణుడు; సౌమ్యవేషధరణము= సాధారణమైన వస్త్రాదులు ధరించుట; ఒప్పన్= తగియుండగా; అతి నిగూఢమైన వృత్తిన్= అతి రహస్యమైన రీతిలో; ఆపగాసుతుమందిరమునకున్= భీష్ముడి భవనానికి; అరిగి= వెళ్ళి; సమ్+ఉచితముగన్= చక్కగా, తగిన రీతిగా; చొచ్చి= లోనికి వెళ్ళి.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీవు ఆ భీష్ముడిని తన వధకు ఉపాయమేమిటో అడిగితే అతడు నీకు తప్పకుండా చెప్పుతాడు. మన మందరం కలిసి, ఎవ్వరికి తెలియకుండా ఆయన దగ్గరకు వెళ్ళాలి. ఆ మహాత్ముడికి భక్తితో దండాలు పెట్టాలి. మనకు మేలు కలిగే కార్యవిధానాన్ని బాగా మనకు తెలియజెప్పవలెనని ఆయనను వేడికొని అడగాలి. అప్పు డతడు దయగలవాడై, మనకు మేలు కలిగించే ఉపాయాన్ని చెప్పగలడు. ఆయన ఉపదేశంతో పెంపొందెదము" అని కృష్ణుడు నిశ్చయించగా, ధర్మరాజు, అతడి తమ్ములు, తాను (కృష్ణుడు) ఆర్భాటం లేకుండా, సాధారణమైన వస్త్రాలు, అలంకారాలు ధరించి, ఎవరికంటా పడకుండా రహస్యంగా భీష్ముడి భవనానికి వెళ్ళి, తగిన రీతిగా వినయంగా లోపలికి ప్రవేశించారు.

వ. అతనిం గాంచి యధికభక్తిం బ్రస్తవనపూర్వకంబుగాఁ దత్పాదంబులకుం బ్రణమిల్లిన నతం డత్యాదరంబునఁ
బేరుపేర వారలందఱసేమంబు లడిగి యి ట్లనియె. 294

ప్రతిపదార్థం: అతనిన్= ఆ భీష్ముడిని; కాంచి= చూచి; అధికభక్తిన్= మిక్కుటమగు భక్తితో; ప్రస్తవన పూర్వకంబుగాన్= పొగడ్త ముందు కలుగునట్లుగా; తద్+పాదంబులకున్= ఆయన పాదాలకు; ప్రణమిల్లినన్= నమస్కారం చేయగా; అతండు= ఆ భీష్ముడు; అతి+ఆదరంబునన్= మిక్కిలి ఆదరణతో; పేరు+పేరన్= పేరుపేరునా; వారల+అందఱ= వారందరియొక్క; సేమంబులు= క్షేమాలను; అడిగి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కృష్ణుడూ, పాండవులూ ఆ భీష్ముడిని చూచి చాలా భక్తితో పొగడుతూ, ఆతడి పాదాలకు దండాలు పెట్టారు. భీష్ముడు చాలా ఆప్యాయంగా వారందరినీ ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పిలిచి, పలుకరించి, వారి క్షేమాలను గూర్చి అడిగి, ఇట్లా అన్నాడు:

క. ' ఇచ్చటికి మీర లందఱు । వచ్చిన పనియేమి? యేది వలసిన నడుగుం
డిచ్చెద దుష్కరమైనను । జెచ్చెరఁ దలకొని ఘటింపఁ జేసెదఁ బ్రీతిన్.' 295

ప్రతిపదార్థం: ఇచ్చటికిన్= ఈ నా ఉన్న చోటికి; మీరలు+అందఱున్; కృష్ణుడు, పాండవులు అగు మీరు యావన్మందిన్నీ; వచ్చిన పని+ఏమి?; ఏది వలసినన్= ఏది కావలసి ఉంటే అట్టిదానిని; అడుగుండు= కోరండి; ఇచ్చెదన్= ఇస్తాను; దుష్కరము+ ఐనను= చేయరాని పని అయినా గూడా; చెచ్చెరన్= త్వరగా; తలకొని= ప్రయత్నించి; ప్రీతిన్= ప్రీతితో; ఘటింపన్+చేసెదన్= కలిగేటట్టు చేస్తాను.

తాత్పర్యం: 'మీరందరూ కలిసి ఇక్కడికి నేనుండే చోటికి ఏం పనిమీద వచ్చారో, మీకేం కావాలో అడగండి - ఇస్తాను. అదెంత కష్టసాధ్యమైన పనైనా సరే - ప్రేమతో యత్నించియైనా మీకా పని నెరవేరేటట్లుగా చేస్తాను.'

వ. అని తెలివొందిన మొగంబుతో నడిగిన దీనాననుం డగుచు ధర్మసూనుం డతని కి ట్లనియె. 296

ప్రతిపదార్థం: అని= పై చెప్పినరీతిగా; తెలివి+ఒందిన మొగంబుతోన్= ప్రసన్నమైనముఖంతో; అడిగినన్; ధర్మసూనుండు= ధర్మరాజు; దీన+ఆననుండు+అగుచున్= దీనత్వంతో కూడిన ముఖం గలవాడౌతూ; అతనికిన్= ఆ భీష్ముడికి; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: 'మీకేం కావాలన్నా ఇస్తా'నని భీష్ముడు నవ్వు ముఖంతో వాళ్ళని అడిగాడు. అప్పుడు ధర్మరాజు ముఖం చిన్నబుచ్చుకొని భీష్ముడితో ఇలా అన్నాడు.

క. ' మా కెమ్మెయి సామ్రాజ్యము । సేకుఱు నెబ్భంగి బహుళసేనోత్పాద
వ్యాకులత రాక తక్కుం । జేకొని యత్తెఱఁగు కరుణఁ జెప్పఁగ వలయున్.' 297

ప్రతిపదార్థం: మాకున్= పాండవులైనట్టి మాకు; ఏ+మెయిన్= ఏ విధంచేత; సామ్రాజ్యము= సార్వభౌమత్వము; చేకుఱున్= కలుగునో; ఏ+భంగిన్= ఏ విధంచేతనైతే; బహుళ= అధికమైన; సేనా= సైన్యంయొక్క; ఉత్పాద= నాశముచేసేన; వ్యాకులత= కలవరపాటు; రాక= రాకుండా; తక్కున్= తప్పిపోవునో; చేకొని= ఆదరించి; ఆ+తెఱఁగు= ఆ మార్గాన్ని; కరుణన్= దయతో; చెప్పఁగన్ వలయున్= చెప్పాలి.

తాత్పర్యం: 'మాకు ఏ విధంగా సామ్రాజ్యం వస్తుందో, ఏ మాదిరి, ఎక్కువ సేన నాశమైనదనే వ్యాకులత(కలవరపాటు) లేకుండా పోతుందో అట్టి ఉపాయాన్ని ఆదరభావంతో, దయతో మాకు సెలవీయుమని కోరాడు ధర్మరాజు.

క. అనవుడు'నేఁ బెనఁగఁగ మీ । కనఘా! సైన్యక్షయంబు నగు సామ్రాజ్యం
బును గానేరదు గావున । నను నిర్జింపంగ శోభనము లెల్ల నగున్.' 298

ప్రతిపదార్థం: అనవుడన్= అని చెప్పగా; అనఘా!= పాపములేని ధర్మజా!; ఏన్= నేను(భీష్ముడు); పెనఁగఁగన్= యుద్ధం చేస్తూండగా; మీకున్= పాండవులైన మీకు; సైన్యక్షయంబున్= సేనయొక్క నాశమున్నూ; అగున్= కలుగును; సామ్రాజ్యంబునున్= సామ్రాజ్యంకూడా; కానేరదు= ప్రాప్తించదు; కావునన్= కాబట్టి; ననున్= భీష్ముడనగు నన్ను; నిర్జింపంగన్= జయిస్తే; ఎల్లన్= సకల విధాలైన; శోభనములు= శుభములు(మేళ్ళు); అగున్= కలుగును.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! నేను యుద్ధం చేస్తూండేదాకా మీకు, సైన్యం నాశనం కాక తప్పదు. మరి సామ్రాజ్యం కూడా మీకు దక్కదు. కాబట్టి నన్ను జయిస్తే మీకు అన్నివిధాల శుభాలు సైన్యం బ్రతకడం, సామ్రాజ్యం ప్రాప్తించడం జరుగుతుంది.'

విశేషం: భీష్ముడు, ధర్మజుడిని, 'అనఘా!' అనటంలో అతడిపై అంతరంగంలో గల అభిమానం బాగా తేటతెల్లమౌతున్నది.

వ. అని పలికిన శాంతనవునకుం గౌంతేయాగ్రజుం డి ట్లనియె. 299

ప్రతిపదార్థం: అని పలికిన= అని చెప్పిన; శాంతనవునకున్= భీష్ముడితో; కౌంతేయ+అగ్రజుండు= కుంతీపుత్రులలో మొదటివాడైన ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని పలుకగగా, కుంతీపుత్రులలో మొదటివాడైన ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు:

ఉ. ' చిచ్చఱకన్ను మూసికొని చేతిత్రిశూలము డాఁచి లీలమై
వచ్చిన రుద్రుచందమున వ్రాలుదు వీ వనిలోన నోర్వఁగా
వచ్చునె నిన్ను నెట్టి మగవారికి? నీకృప నాశ్రయింపఁగా
వచ్చితి మెవ్విధిన్ గెలువవచ్చు మహాత్మ! యెఱుంగఁ జెప్పవే?' 300

ప్రతిపదార్థం: మహాత్మ!= ఓ మహాత్ముడా!; చిచ్చఱ+కన్ను= అగ్నిమయమైన మూడో నేత్రాన్ని; మూసికొని; చేతి త్రిశూలమున్= చేతనుండే త్రిశూలాన్ని; డాఁచి= దాచిపెట్టి; లీలమైన్= విలాసంగా; వచ్చిన= యుద్ధానికి వచ్చినట్టి; రుద్రుచందమునన్= ఈశ్వరుడి మాదిరిగా; ఈవు= నీవు, వ్రాలుదువు= యుద్ధంలోకి దిగుతావు; అని లోనన్= యుద్ధంలో; నిన్నున్= భీష్ముడవైన నిన్ను; ఎట్టిమగవారికిన్= ఎంతటి శూరులకైనా; ఓర్వఁగాన్+వచ్చునె?= ఎదిరించడానికి సాధ్యమా?; నీ కృపన్= నీ దయను; ఆశ్రయింపఁగాన్= ఆశ్రయించటానికి; వచ్చితిమి= వచ్చాము; ఏ+విధిన్= ఏ విధంగా; గెలువన్‌వచ్చున్; ఎఱుంగన్= తెలిసేవిధంగా; చెప్పవు+ఏ= చెప్పుము.

తాత్పర్యం: 'ఓ మహానుభావా, భీష్మా! మూడో కన్ను మూసికొని, చేతిలో ఉండే త్రిశూలాన్ని దాచిపెట్టి, విలాసంగా యుద్ధం చేయటానికి వచ్చిన ఈశ్వరుడి మాదిరి నీవు యుద్ధానికి దిగితే, ఎంత ధీరుడైనా, శూరుడైనా నిన్నెదిరించగలడా? మేము నీ దయకు పాత్రులం కావటానికే వచ్చాము. నిన్ను ఏ విధంగానైతే గెల్వవచ్చునో - మాకు తెలియచెప్పాలి.'

విశేషం: అలం: ఉపమ.

క. **అనుటయు ని ట్లను గంగా । తనయుఁడు 'నీ చెప్పినట్ల తథ్యం బది న**
న్ననిమిషులు గెలుతు రే? చే । ధనువుండఁగ వినుము తద్విధము దేటపడన్. **301**

ప్రతిపదార్థం: అనుటయున్= ధర్మరాజు పైవిధంగా అనగా; గంగాతనయుఁడు= భీష్ముడు; ఇట్లు+అనున్; నీచెప్పిన+అట్ల= నీవు చెప్పిన విధంగానే; అది= ఆ మాట; తథ్యంబు= నిజము; చే ధనువుండఁగన్= చేతిలో ధనుస్సు ఉండగా; నన్నున్= నన్ను(భీష్ముడిని); అనిమిషులు= దేవతలు; గెలుతురు+ఏ?= గెలుస్తారా?; తద్+విధమున్= నన్ను గెలిచే రీతిని; తేటపడన్= బాగా తెలిసేట్లుగా; వినుము= ఆలకింపుము.

తాత్పర్యం: ధర్మరాజు అడిగినదానికి భీష్ముడు ఇట్లా అన్నాడు: 'ధర్మజా! నీవన్నమాట నిజమే. నా చేతిలో ధనుస్సు ఉన్నంతసేపు నన్ను దేవతలు కూడా జయించలేరు సుమా! నా వధోపాయం చెప్తాను. బాగా తెలిసికొనుము.

తే. **ఇట్టివానిఁగ నన్ను మీరెఱిఁగి యిచటి । కిందఱును వచ్చి యక్కటా! యిట్టు లడుగ**
మీకుఁ బ్రియమైన కార్యంబు మెయికొనంగఁ । గనుట కంటెను సుకృతంబు గలదె నాకు? **302**

ప్రతిపదార్థం: నన్నున్= భీష్ముడగు నన్ను; ఇట్టివానిఁగన్= ఇంతగొప్పవీరునిగా; మీరు= పాండవాదులైన మీరు; ఎఱిఁగి= తెలిసికొని; ఇచటికిన్= నేనుండే ఈ చోటికి; ఇందఱును= ఇంతమందికూడా; వచ్చి= వచ్చి; అక్కటా!; ఇట్టులు= ఇంత దీనంగా; అడుగన్= ప్రార్థిస్తూంటే; మీకున్= కృష్ణుడు; పాండవులు అగుమీకు; ప్రియము+ఐన= ఇష్టమైన; కార్యంబున్= పనిని; మెయికొనంగన్= సమ్మతమయ్యేటట్లు; కనుటకంటెను= తెలిసికొనటంకంటె; నాకున్= నాకు; సుకృతంబు= పుణ్యము; కలదె?= కలదా?

తాత్పర్యం: మీరందరు నన్నింత గొప్పవాడుగా అనుకొని, నా దగ్గరికి వచ్చి, అయ్యో పాపం - ఎంతో దీనంగా బతిమాలుతుంటే, మీకు ఇష్టమైన కార్యాన్ని, అందరికి సమ్మతంగా వుండేదాన్ని తెలుసుకొని మీకు చెప్పటానికంటే మించిన పుణ్యం నాకేముంటుంది? (ఉండదని భావం.)

వ. **ఏ నా యుధ వ్యాపారంబువలన నుదాసీనత్వంబు నొందిన నన్ను జయింప సమకూరు జోడు వుచ్చినవానిని, గైదువు బెట్టినవానిని, సిడంబు డించినవానిని, నంగనను, నంగనాపూర్వుని, నంగనాభిధానునిఁ దలచీర వీడినవానిని, భ్రాతృహీనుని, నపుత్రకునిం గని యేటుఁ బోటుఁ దక్కి సమరంబు సేయ మానుదు. మఱియు**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నొక్క వ్రతంబు పూనినవాఁడం బుట్టి నప్పుడు లేక నడుమ దైవం బిచ్చిన పురుషత్వంబు గలవానితోడఁ గయ్యంబు సేయం గావున మీకు నొక్కయుపాయంబు సెప్పెద. ద్రుపదు నపత్యం బైన శిఖండి యట్టివాఁడగుట మీరెఱుంగు దుర కాదె? విశేషించి ముందటి పుట్టువున నంగన యగుట వాని కెదు రేయకుండుదు నర్జునుండు వానిం బురస్కరించుకొని వచ్చి యే నేయుట మానినయెడ నొప్పించి పడవైచునది. పదంపడి బంధుమిత్త్రు లగు ధార్తరాష్ట్రుల గెలుచుట సుకరం బగునిది నాపను పేను బనిచి నట్ల చేయుం డని సహృదయంబుగాఁ జెప్పిన నట్లు దేవవ్రతుచేత ననుజ్ఞాతు లై వార లతనికి నమస్కరించి వీడ్కొని విడిదలకుం బోవుచున్న సమయంబున బీభత్సుండు. 303

ప్రతిపదార్థం: ఏను= నేను; ఆయుధవ్యాపారంబు వలనన్= ఆయుధాలు ప్రయోగించే పని నుండి; ఉదాసీనత్వంబున్= ఉపేక్షా భావాన్ని; ఒందినన్; పొందినప్పుడున్ను; నన్నున్= భీష్ముడగు నన్ను; జయింపన్ సమకూరున్= జయించడం సిద్ధిస్తుంది; జోడు+ పుచ్చిన వానినిన్= కవచం తీసివేసినవాడిని; కైదువున్ పెట్టిన వానినిన్= ఆయుధాన్ని దిగువపెట్టేసినవాడిని; సిడంబున్= ధ్వజాన్ని; డించినవానినిన్= కిందికి దించినవాడిని; అంగననున్= ఆడుదానిని; అంగనా పూర్వునిన్= ముందు అంగన ఐనవానిని; అంగనా+ అభిదానునిన్= ఆడదాని పేరుగలవాడిని; తలచీర వీడినవానిని= తలపాగా వీడిపోయినవాడిని; భ్రాతృహీనునిన్= అన్నదమ్ములు లేనివాడిని; అపుత్రకునిన్= బిడ్డలు లేనివాడిని; కని= చూచి; ఏటున్= బాణప్రయోగాన్ని; పోటున్= పొడవటాన్ని; తక్కి= మాని; సమరంబు= యుద్ధం; సేయమానుదున్= చేయడం మానివేస్తాను; మఱియున్= ఇంకా కూడా; ఒక్క వ్రతంబున్= ఒక నియమాన్ని; పూనిన వాఁడన్= కలిగి ఉన్నాను; పుట్టిన+అప్పుడు= పుట్టిన సమయంలో; లేక= లేకుండా; నడుమన్= మధ్యకాలంలో; దైవంబు= దేవుడు; ఇచ్చిన= ఇచ్చినట్టి; పురుషత్వంబున్= మగతనాన్ని; కలిగినవానితోడన్= పొందినట్టివాడితోకూడా; కయ్యంబున్=యుద్ధాన్ని; చేయన్= చేయను; కావున; మీకున్; ఒక్క; ఉపాయంబున్; చెప్పెదన్=చెప్తాను; ద్రుపదు+అపత్యంబు+ఐన= ద్రుపదుని కొడుకైనట్టి; శిఖండి; అట్టివాఁడు; అగుటన్= కావటాన్ని; మీరు= పాండవులు; ఎఱుంగుదురు+అ+కాదు+ఎ?= తెలిసికొన్నవారే కదా!; విశేషించి= మీదు మిక్కిలి;ముందటి పుట్టువునన్= కడచిపోయిన జన్మలో, అంగన+అగుటన్= ఆడుది కాబట్టి; వానికిన్+ ఎదురు+ ఏయక+ఉండుదున్= వాడికి ఎదురుగా బాణాలు వేయను; అర్జునుండు; వానిన్= ఆ శిఖండిని; పురస్కరించుకొనివచ్చి= ముందు పెట్టుకొనివచ్చి; ఏన్= నేను; ఏయుటన్= బాణాలు ప్రయోగించడాన్ని;మానిన+ఎడన్= మానుకొన్న వేళలో; నొప్పించి= బాధ కల్గించి; పడన్ వైచునది= నన్ను పడగొట్టవలెను; పదంపడి= అటుపైన; బంధుమిత్త్రులు+అగు= చుట్టాలు, స్నేహితులు అయినట్టి; ధార్త రాష్ట్రులన్= ధృతరాష్ట్రుడి కొడుకులను; గెలుచుట; సుకరంబు+అగున్= సులభమౌతుంది; ఇది నా పనుపు= నాయొక్క ఉత్తరువు; నేను పనిచిన+అట్లు+అ= నేను ఉత్తరువు చేసిన విధంగానే; చేయుండు; అని+సహృదయంబు+కాన్= మనస్ఫూర్తిగా; చెప్పినన్; అట్లు; దేవవ్రతుచేతన్= భీష్ముడిచేత; అనుజ్ఞాతులు+ఐ= ఆజ్ఞాపించబడినవారై; వారలు= ఆ ధర్మరాజాదులు; ఆతనికి(న్)=ఆ భీష్ముడికి; నమస్కరించి; వీడ్కొని= పోయి వచ్చెదమని చెప్పి; విడిదలకున్= తమ నివాసాలకు; పోవుచున్న సమయంబునన్=వెళ్ళే సమయంలో; బీభత్సుండు= అర్జునుడు.

తాత్పర్యం: నేను ఆయుధం పట్టకుండా ఉండే సమయంలో నన్ను జయించవచ్చును. కవచంలేనివాడిని, ఆయుధం క్రిందపడవేసిన వాడిని, ధ్వజాన్ని క్రిందికి దించినవాడిని, ఆడదాన్ని, పూర్వం ఆడది అయినవాడిని, ఆడదానిపేరుగలవాడిని, తలపాగా ఊడిపోయినవాడిని, అన్నదమ్ములు లేనివాడిని, బిడ్డలు లేనివాడిని - బాణాలతో కొట్టను. ఆయుధాలతో పొడువను. అట్లాంటివారితో యుద్ధం చేయను. మరొక వ్రతం కూడా నాకున్నది. అదేమిటంటే పుట్టినప్పుడు మగతనం లేకుండా మధ్యలో దైవంచేత మగతనం పొందినవాడితో కూడా యుద్ధం చేయను. కాబట్టి మీకో ఉపాయం చెపుతాను. ద్రుపదుడి కొడుకు శిఖండి అట్లాంటి వాడనే సంగతి మీకు కూడా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తెలియునుకదా! పైపెచ్చు - వాడు గడచిన జన్మలో ఆడుది కాబట్టి, వాడిని ముందు పెట్టుకొని అర్జునుడు వచ్చి, నేను బాణాలు వేయడం చాలించినప్పుడు నన్ను బాధించి పడవేయాలి. అటు తరువాత చుట్టపక్కాలైన ధృతరాష్ట్రుడి సంతానాన్ని గెలవటం సులభమౌతుంది. ఇది నా ఉత్తరువు. ఈ విధంగా చేయండి.' అని హృదయపూర్వకంగా భీష్ముడు చెప్పాడు. వెళ్ళటానికి ఆయనచేత ఆజ్ఞాపింపబడ్డవారై నమస్కారంచేసి సెలవు తీసికొని పాండవులు తమ తమ స్థావరాలకు వెళ్ళే సమయంలో అర్జునుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. సురనదీసుతుండు పరలోకగతి నిరీ । క్షించుటకును దాను గృతకవృత్తిఁ
జంపవలయుటకును సవిషాదమానసుం । డగుచు నిట్టు లనియె నచ్యుతునకు. 304

ప్రతిపదార్థం: సురనదీసుతుండు= భీష్ముడు; పరలోకగతి= ఇతర(స్వర్గ) లోకానికి వెళ్ళటానికి; నిరీక్షించుటకునున్= ఎదురుచూడటానికి; తాను= అర్జునుడు; కృతకవృత్తిన్= మోసపు విధానంతో; చంపవలయుటకును= చంపవలసి వచ్చినదానికిన్నీ; సవిషాదమానసుండు +అగుచున్= బాధతో కూడిన మనస్సుగలవాడౌతూ; అచ్యుతునకున్= కృష్ణుడికి, ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు స్వర్గానికి వెళ్ళటానికి ఎదురుచూస్తూండటానికి, తాను మోసంగా ఆయనను చంపవలసిందిగా ఏర్పడ్డందుకు, మనస్సులో చాల చింత కలవాడై కృష్ణుడితో అర్జునుడు ఈ విధంగా అన్నాడు.

క. ' గురునిఁ గృతప్రజ్ఞుని ధ । ర్మ రతు వయోవృద్ధు లోకమాన్యు దయాళున్
సురతటినీసుతు వంచనఁ । బురుషోత్తమ! చంపబుద్ధి వుట్టదు నాకున్. 305

ప్రతిపదార్థం: పురుషోత్తమ!= పురుషులలో ఉత్తముడవగు ఓ కృష్ణా!; గురునిన్= శ్రేష్ఠుడిని; (గురువుతో సమానుని) కృతప్రజ్ఞునిన్= గొప్ప బుద్ధి కలవాడిని; ధర్మరతున్= ధర్మమందు+ఆశ గలవాడిని; వయః+వృద్ధున్= వయసుచేత పెద్దవాడిని; లోకమాన్యున్= జనులచేత పూజింపదగ్గవాడిని; దయాళున్= కరుణగలవాడిని; సురతటినీ సుతున్= ఆకాశగంగానది కొడుకైన భీష్ముడిని; వంచనన్= మోసంతో; చంపన్= చంపడానికి; నాకున్= (అర్జునుడగు)నాకు, బుద్ధి పుట్టదు= బుద్ధి పుట్టటంలేదు.

తాత్పర్యం: 'ఓ కృష్ణా! చాలా గొప్పవాడు, మంచి ప్రజ్ఞ గలవాడు, ధర్మాత్ముడు, వయసులో చాలా పెద్దవాడు, జనులచే పూజింపదగ్గవాడు, దయామయుడు, అయినట్టి భీష్ముడిని మోసంతో చంపడానికి నాకు బుద్ధి పుట్టడంలేదు.

ఆ. నన్నుఁ బాంసుకేళి నున్న నర్మిలి నెత్తి । మేనిధూళి దనదు మేను వొరయఁ
బ్రీతిఁ గౌఁగిలించి మా తండ్రి గుణము ల । గ్గించి కన్నునీరు నించునతఁడు. 306

ప్రతిపదార్థం: అతఁడు= ఆ భీష్ముడు; పాంసుకేళిన్= మట్టి ఆటలో; ఉన్నన్= ఉండగా; నన్నున్; ఆర్మిలిన్= ప్రేమతో; ఎత్తి= ఎత్తుకొని; మేనిధూళిన్= నా శరీరం దుమ్ము; తనదు= తన (భీష్ముడి) యొక్క; మేనున్= శరీరాన్ని; ఒరయన్= రాచుకొంటూండగా; ప్రీతిన్= ప్రేమతో; కౌఁగిలించి= ఆలింగనం చేసికొని; మా తండ్రిగుణములు= మా తండ్రియైన పాండురాజు యొక్క గుణాలను; అగ్గించి= పొగడి; కన్ను నీరు నించున్= కన్నులందు నీరు నింపికొనేవాడు.

తాత్పర్యం: ఆ భీష్ముడు నేను మట్టిలో ఆడుకొంటూ ఉంటే, ప్రేమతో నన్ను ఎత్తికొనేవాడు. నా ఒంటిమీది మట్టి ఆతడి శరీరానికి రాచికొంటూండగా కౌగిలించుకొని, మా తండ్రి పాండురాజు గుణాలను పొగడుతూ, కన్నుల నిండా నీరు నింపుకొనేవాడు.

ఉ. అక్కట! తండ్రి లేని మము నమ్మెయిఁ బెంచిన తాత ని మ్మెయిం
ద్రెక్కొనఁగా దతండు సముదీర్ణభుజాబలశౌర్యశాలియై
యిక్కడి సేనఁ జక్కడిచెనేనియుఁ జూతున కాక ధర్మముం
దక్కుట కోర్వఁ జాలుదునె? ధర్మజుతమ్ములు క్రూరకర్ములే?' 307

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో! తండ్రిలేని మమున్= తండ్రిలేనట్టి పాండవులైన మమ్ములను; ఆ+మెయిన్= ఆ విధంగా; పెంచిన= పెద్దచేసినట్టి; తాతన్= తాతగారిని; ఈ+మెయిన్= ఈ విధమైన మోసంతో; త్రెక్కొనన్+కాదు= చంపదగదు; అతండు= ఆ భీష్ముడు; సముదీర్ణ= మిక్కిలి గొప్పదైన; భుజాబల= బాహుబలము; శౌర్య= శూరత్వము - వీటిచే; శాలి+ఐ= ప్రకాశించెడివాడై; ఇక్కడిసేనన్= ఇక్కడ ఉన్నట్టి మన సైన్యాన్ని; చక్కడిచెన్+ఏనియున్= చంపినప్పటికిని; చూతును+అ కాక= చూస్తానేకాని; ధర్మమున్= యుద్ధ ధర్మాన్ని; తక్కుటకున్= విడువటానికి; ఓర్వన్+చాలుదున్+ఎ?= ఓర్చుకోగలుగుదునా?; ధర్మజు తమ్ములు= ధర్మరాజు యొక్క తమ్ముళ్ళు; క్రూరకర్ములు+ఏ?= క్రూరమైన పనులు చేసేవారా?; కాదనుట.

తాత్పర్యం: అక్కటా! చిన్ననాడే తండ్రిని పోగొట్టుకొన్నట్టి పాండవులను మమ్ములను ఏ విధంగానో చాలా ప్రయాసతో పెంచి పెద్ద చేసినట్టి తాతగారినే ఈ మాదిరి మోసంగా చంపటం ఏ మాత్రం న్యాయంకాదు. ఆ భీష్ముడు తన భుజబలంతో, శౌర్యంతో, ఈ మన సేననంతా బాగా నశింపచేసినప్పటికీ చూస్తూ ఉంటానే కాని, యుద్ధధర్మాన్ని తప్పటానికి మాత్రం నే నొప్పుకొనను. ధర్మాత్ముడని ప్రసిద్ధి కెక్కిన ధర్మరాజు తమ్ముళ్ళమగు మేము, క్రూరపు పనులు చేస్తామా?'

వ. అనిన విని కృష్ణుం డా జిష్ణున కిట్లనియె. 308

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని; కృష్ణుండు; ఆ జిష్ణునకున్= ఆ అర్జునుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు పై విధంగా చెప్పగా, కృష్ణుడు అర్జునుడితో ఈ విధంగా అన్నాడు.

ఉ. ' క్రూరత కోర్చి యించుకయు రోయక పైకొని యెల్లభంగులన్
వైరులఁ జంపి భూప్రజకు వర్ధనముం గలిగించి పాడిమైఁ
గో రరి గొంచు సద్వ్యయము గోరి యొనర్చుట రాజధర్మవి
స్తారముగా బలారికి వచస్పతి సెప్పట యప్రసిద్ధమే? 309

ప్రతిపదార్థం: క్రూరతకున్= కఠినత్వానికి; ఓర్చి= సహించి; ఇంచుకయున్= కొంచెంకూడా; రోయక= ఏవగించుకొనక; పైకొని= కవిసి; ఎల్లభంగులన్= అన్నివిధాలా; వైరులన్= శత్రువులను; చంపి= వధించి; భూప్రజకున్= భూమిపై ఉండే జనానికి; వర్ధనమున్= అభివృద్ధిని; కలిగించి= కలుగచేసి; పాడిమైన్= న్యాయంగా; కోరు= పంటలో కొంతభాగము; అరిన్= సిస్తుగా; కొంచున్= తీసికొంటూ; సత్+వ్యయమున్= ఉత్తమవ్యయం; కోరి= ఇష్టపడి; ఒనర్చుట= చేయటం; రాజధర్మ విస్తారముగాన్= రాజుల ధర్మం యొక్క అతిశయంగా; బల+అరికిన్= బలుడనే రాక్షసుడికి విరోధియైన ఇంద్రుడికి; వచస్+పతి= బృహస్పతి; చెప్పుట= చెప్పడం; అప్రసిద్ధము+ఏ?= ప్రసిద్ధి చెందినది కాదా?.

తాత్పర్యం: కఠినత్వానికి ఓర్చికొని, కొంచెం కూడా ఏవగింపు లేకుండా, ఎదిరించి ఏ విధంచేతనైనా శత్రువులను చంపాలి. జనానికి అభివృద్ధి కలిగించాలి. న్యాయంగా ప్రజలనుండి పంటలో కొంతభాగము సిస్తుగా వసూలు

చేసికొని, దానితో ప్రజలకు, దేశానికి ఉపయోగపడే మంచి మంచి పనులు చేయాలి. ఇది మంచి రాజుల ధర్మం అని బృహస్పతి (దేవగురువు) దేవేంద్రుడికి చెప్పాడు. అది ప్రసిద్ధమైన విషయమే కదా!

చ. అనిమొన నోర్తు భీష్ము నని యాడిననీదగు పూన్కి లోక మె
ల్లను వినియుండఁగా నిటు చలం బెడలం జన దెట్టు లైనఁ జం
పన తగు రాజధర్మపరిపాలన గా కిది క్రూరకర్మమే?
నిను విధిపంచె శాంతనవునిం దెగటార్పఁగ వేయు నేటికిన్.' 310

ప్రతిపదార్థం: అనిమొనన్= యుద్ధంలో ప్రముఖమైన తావులో; భీష్మున్= భీష్ముడిని; ఓర్తున్+అని= ఓడిస్తానని; ఆడి= చెప్పినట్టి; నీది+అగు పూన్కి= నీ యొక్క పట్టుదల; లోకము ఎల్లనున్; జనులందరు; వినియుండఁగాన్= ఆలకించి ఉండగా; ఇటు= ఈ విధంగా; చలంబు= మాత్సర్యం; ఎడలన్+చనదు= విచ్ఛిన్నం కారాదు; ఎట్టులు+ఐనన్= ఏ విధంచేతనైనా; చంపన+తగున్= చంపడమే తగినది; ఇది= ఈ భీష్ముడిని చంపటం; రాజధర్మ పరిపాలన+కాక= రాజధర్మాన్ని పాలించటం గాక; క్రూరకర్మము+ఏ?= క్రూరమైనపనా?; వేయున్+ఏటికిన్= వెయ్యి మాటలెందుకు?; శాంతనవునిన్= భీష్ముడిని; తెగటార్పఁగన్= చంపటానికి; విధి= దైవము; నినున్; పంచెన్= పంపించాడు.

తాత్పర్యం: ఓ అర్జునా! యుద్ధ మధ్యంలో భీష్ముడిని ఓడిస్తానని నీవన్నమాటలు జనానికంతా బాగా తెలుసు. ఇప్పుడు నీవన్న మాట ఆ పూనికను సడలించివేస్తున్నది. నీవు ఆ మాత్సర్యానికి భంగం కలిగిస్తే జనమంతా నిన్ను ఎగతాళి చేస్తారు. ప్రత్యక్షంగాకాని పరోక్షంగాకాని ఏ విధంగానైనా నీవు భీష్ముడిని చంపవలసినదే. అట్లా చంపడం రాజధర్మమే కాని, క్రూరమైన పని కానే కాదు. ఇంతెందుకు? ఆ విధి యీ భీష్ముడిని చంపడానికే నిన్ను పంపించినది.'

చ. అనుటయుఁ గ్రీడి యిట్టు లను నాద్రుపదాత్మజుజన్మ మాపగా
తనయవధార్థ మం డ్రదియుఁ దప్ప దతండును వాని నేయఁ డే
ను నతని నేయుచందమున నూల్కొని యన్యుల నేయుచుండు వాఁ
డనితరవధ్యకాయుఁ డగు నాయనఁ దాఁ బడ నేయు నుగ్రతన్. 311

ప్రతిపదార్థం: అనుటయున్= కృష్ణు డీ విధంగా చెప్పగా; క్రీడి= అర్జునుడు; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నాడు; ఆ ద్రుపద+ఆత్మజు జన్మము= ద్రుపదుని కొడుకు ఆ శిఖండియొక్క పుట్టుక; ఆపగాతనయ వధ+అర్థము= భీష్ముని చంపటానికే; అండ్రు= అని అంటారు; అదియున్= ఆ మాట; తప్పదు= పొల్లుకాదు; అతండునున్= ఆ భీష్ముడున్నూ; వానిన్= ఆ శిఖండిని; ఏయఁడు= కొట్టడు; ఏనున్= నేనుకూడా; అతనిన్= ఆభీష్ముడిని; ఏయుచందమునన్= కొట్టే మాదిరిగా, నూల్కొని= కుదురుకొని; అన్యులన్= ఇతరులమీద; ఏయుచు+ఉందున్= బాణాలు ప్రయోగిస్తూ ఉంటాను; వాఁడు= ఆ శిఖండి; అనితర వధ్యకాయుఁడు+అగున్= ఇతరులచే చంప తగని శరీరం కలవాడు అగును; ఆయనన్= ఆతని(భీష్ముడిని); ఉగ్రతన్= భయంకరంగా; తాన్= తాను(శిఖండి); పడన్+ఏయున్= పడగొట్టుతాడు.

తాత్పర్యం: కృష్ణుడన్న మాటలు విని అర్జునుడు ఇట్లా అన్నాడు: 'శిఖండి పుట్టుక భీష్ముడిని చంపటానికే అని అంటారు కదా! ఆ మాట అబద్ధమౌతుందా? ఆ భీష్ముడేమో శిఖండిని బాణాలతో కొట్టడు - నేను భీష్ముడిని కొట్టుతున్నట్లు నటన చేస్తూ ఇతరులను బాణాలతో కొట్టుతాను. శిఖండిని తప్పించి ఇతరులచే చంపబడని ఆ భీష్ముడిని, ఆ శిఖండి భయంకరంగా తానే కూల్చుతాడు.

వ. అనవుడు నవ్వి కవ్వడికిం గమలనాభుం డి ట్లనియె. 312

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; కమలనాభుండు= కమలం బొడ్డున గలవాడు - కృష్ణుడు; నవ్వి= ఎగతాళిచేసి; కవ్వడికిన్= అర్జునుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడన్న మాటలు కృష్ణుడు విని, ఎగతాళిగా నవ్వి అతడితో ఇట్లా అన్నాడు.

ఉ. ' నీ వొకరుండు దక్కఁగ ననింద్య పరాక్రమశాలి భీష్మునిం
జావఁగ నేయ నెవ్వఁడును జాలఁడు నీతలఁ పెన్నిభంగులన్
దైవము చూపువోలెఁ దుదిదాఁకునె? యవ్విధ మిట్టు లుండఁగాఁ
ద్రోవఁగ వచ్చునే? యెటులు ద్రోచినఁ బోవదు చూచి యుండుమీ.' 313

ప్రతిపదార్థం: అనింద్య పరాక్రమశాలి= నిందింప తగని పరాక్రమం చేత ప్రకాశించునట్టి; భీష్మునిన్= భీష్ముడిని; చావఁగన్+ఏయన్= చావగొట్టడానికి; నీవు ఒకరుండున్+తక్కఁగన్= నీ వొకడవు తప్పితే; ఎవ్వఁడునున్= మరెవ్వడుగాని; చాలఁడు= సమర్థుడు కాలేడు; ఎన్ని భంగులన్= ఎన్ని విధాలచేతనైనా; నీతలఁపు= నీ యొక్క కోరిక; దైవము చూపు+పోలెన్= విధి దృష్టి విధంగా; తుదిన్+తాఁకునె?= తుదముట్టునా?; ఆ+విధము= భీష్ముడిని చంపే ఆ విధానము; ఇట్టులు= ఈ విధంగా; ఉండఁగాన్; త్రోవఁగన్ వచ్చునే?= ఆ విధానాన్ని త్రోసివేయటానికి సాధ్యమౌతుందా?; ఎటులు+త్రోచినన్= ఎట్లాగైనా త్రోచివైచినా కూడా; పోవదు= నీవు భీష్ముడిని చంపటమనేది తప్పదు; చూచి+ఉండుమీ.

తాత్పర్యం: 'పొగడ్తకెక్కిన పరాక్రమంతో ప్రకాశించే ఆ భీష్ముడిని నీవు తప్ప మరెవ్వరూ చంపలేరు. భీష్ముడిని కొట్టననే నీతలంపు ఎన్నటికి నెరవేరదు. నీవే భీష్ముడిని కూలద్రోస్తావు. నీవు భీష్ముడిని చంపవలసిందిగా దైవ నిర్ణయం ఉండగా ఆ నిర్ణయాన్ని కాదనటానికి నీ తరమా? కాదంటే మాత్రం అది తప్పుతుందా? అంతా నీవే మున్ముందు చూడగలవులెమ్ము.'

వ. అని పలికిన విని యతండట్లకాకయప్పటికి నెట్లయిననట్లయ్యెడు నని యర్జునుండియ్యకొనిన గోవిందుండును, ధర్మనందనాదులుం బ్రమోదంబు నొంది రివ్విధంబున శిబిరంబున కరిగి పాండవులు పుండరీకాక్షుని నిజ నివాసంబున కనిచి తమ తమ నికేతనములకుం జని యా రాత్రి సుఖనిద్ర సేసి' రని చెప్పిన సంజయునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. 314

ప్రతిపదార్థం: అని పలికినన్= అని చెప్పగా; విని; అతండు= ఆ అర్జునుడు; అట్లు+అ+కాక= ఆ విధంగానే అగుగాక; అప్పటికిన్= ఆ సమయానికి; ఎట్లు+అయినన్= ఎట్లాగయితే; అట్లు+అయ్యెడున్= అట్లా అవుతుంది; అని; అర్జునుండు; ఇయ్యకొనినన్= ఒప్పుకోగా; గోవిందుండును= కృష్ణుడునూ; ధర్మనందన+ఆదులున్= ధర్మరాజు మొదలుగా గల పాండవులు; ప్రమోదంబున్= సంతోషాన్ని; ఒందిరి= పొందారు; ఈ+విధంబునన్= ఈ మాదిరిగా; శిబిరంబునకున్= గుడారానికి; అరిగి= వెళ్ళి; పాండవులు; పుండరీక+అక్షుని(న్)= కృష్ణుని; నిజనివాసంబునకు(న్)= అతడుండే చోటికి; అనిచి= పంపి; తమ తమ నికేతనములకున్= వారి వారి భవనాలకు; చని; ఆ రాత్రి; సుఖ నిద్ర+చేసిరి; అని చెప్పిన= అని చెప్పగా; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: కృష్ణుడు పై విధంగా అనగా, ఆ మాటలు విని, అర్జునుడు 'అటులే కానిమ్ము. కానున్నది కాకమానదు.' అని ఒప్పుకొన్నాడు. దానితో గోవిందుడు, పాండవులు సంతోషపడ్డారు. అందరూ గుడారానికి వెళ్ళారు. పాండవులు కృష్ణుడిని ఆయన నివాసానికి పంపి, వారి వారి భవనాలకు చేరుకొన్నారు. అర్జునుడు భీష్ముడిని చంపడానికి

ఒప్పుకొన్నాడు కాబట్టి, అందరూ ఆ రాత్రి బాగా నిద్రపోయారు.' అని సంజయుడు చెప్పాడు. అది విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

క. పాండుసుతు లేమిభంగి శి । ఖండిం గూర్చికొని యాపగాసుతుపై ను
ద్దండగతి నడచి రెట్లు? ప్ర । చండతతో సమరకేలి సలిపిరి? చెపుమా.' 315

ప్రతిపదార్థం: పాండుసుతులు= పాండురాజు కుమారులు ధర్మరాజాదులు; శిఖండిన్; ఏమిభంగిన్= ఏ విధంగా; కూర్చికొని= కూడగట్టుకొని; ఆపగాసుతుపైన్= భీష్ముడి మీదికి; ఉద్దండగతిన్= ఎక్కువైన పోకడతో; నడచిరి?; ప్రచండతతోన్= సాధ్యంకాని విధంగా; ఎట్లు= ఏ మాదిరి; సమరకేళిన్= యుద్ధ క్రీడను; సలిపిరి?= చేశారు?; చెపుమా= ఓ సంజయా! తెలుపుము.

తాత్పర్యం: సంజయా! పాండవులేవిధంగా శిఖండిని తమతో చేర్చికొన్నారో, వేగంతో కూడిన గమనంతో భీష్ముడి మీదికి ఏ విధంగా వచ్చారో, ఏ విధంగా అసాధ్యమైన రీతిలో యుద్ధం చేశారో బాగా చెప్పుము.'

భీష్ముని దశమ దివసయుద్ధానుక్రమము (సం. 6-104-2)

వ. అనుటయు నా సూతనందనుం డతని కిట్లను సూర్యోదయ సమయంబునఁ బాండుసూనులు సేనా సమేతులై వెడలి మోహరించునప్పుడు ముందట శిఖండిని నిలిపి యతనికెలంకుల భీమార్జునులును, వెనుక నభిమన్యు ద్రౌపదేయులును వారియిరువంకలం జేకితాన శైనేయులును, నట పిఱుంద ధృష్టద్యుమ్నాది పాంచాల కుమారుల మున్నిడుకొని కవల నుభయపార్శ్వంబులం బెట్టికొని, యుధిష్ఠిరుండును వీరి సూరెలం బొదివికొని విరాటద్రుపదముఖ్యులగు పృథ్వీపతులును గేకయపంచక ధృష్టకేతులును నిలిచి రిత్తెఱంగున గట్టి మోహరంబు దీర్చుకొని నడచి రంతకు మున్న మనవారును వెడలి భీష్ముం డగ్ర భాగంబున నుల్లసిల్ల నీ కుమారు లమ్మహాత్ముం బరివేష్టింపఁ గుంభసంభవతత్సంభవులుం దక్షిణవామభాగంబులను, గృపకృతవర్మ భగదత్తపురస్సరుండై కురురాజు మధ్యభాగంబునను, బృహద్బల కాంభోజ ముఖ్యు లైన మహీపతు లమ్మనుజేంద్రు చుట్టును, ద్రిగర్తు లపరభాగంబునను, బన్ని బలుమొన యమర్చి కొని త్రోచి నడచి రి ట్లిరువాఁగునుం గవిసి వివిధతూర్యస్వనంబులు నింగిముట్ట నొండొంటిం దాఁకిన. 316

ప్రతిపదార్థం: అనుటయున్= అని అడగ్గా; ఆ సూతనందనుండు= సంజయుడు; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఇట్లు+అనున్; సూర్య+ఉదయ సమయంబునన్= సూర్యుడు ఉదయించే సమయంలో; పాండు సూనులు= పాండురాజు కొడుకులు; సేనా+సమేతులు+ఐ= సేనలతో కూడినవారై; వెడలి= బయలుదేరి; మోహరించు+అప్పుడు= వ్యూహం పన్నేటప్పుడు; ముందటన్= ముందు భాగంలో; శిఖండిన్= శిఖండిని; నిలిపి; అతని కెలంకులన్= ఆ శిఖండి ప్రక్కలందు; భీమ+అర్జునులున్నూ; వెనుకన్; అభిమన్యు ద్రౌపదేయులును; వారి+ఇరువంకలన్= వారికి రెండువైపుల; చేకితాన శైనేయులునున్= చేకితానుడు, సాత్యకి; అట పిఱుందన్= ఆ వెనుక; ధృష్టద్యుమ్న+ఆది పాంచాలకుమారులన్= ధృష్టద్యుమ్నుడు మొదలైన పాంచాలకుమారులను; మున్ను+ఇడుకొని= ముందుంచికొని; కవలన్= నకుల సహదేవులను; ఉభయ పార్శ్వంబులన్= రెండువైపులా; పెట్టికొని= ఉంచికొని; యుధిష్ఠిరుండునున్= ధర్మరాజున్నూ; వీరి సూరెలన్= వీరికి ప్రక్క భాగములందు; పొదివికొని= క్రమ్ముకొని; విరాట ద్రుపద ముఖ్యులు+అగు= విరాటుడు, ద్రుపదుడు, ముఖ్యులుగా గల; పృథ్వీపతులును= రాజులున్నూ; కేకయ పంచక ధృష్టకేతులును= కేకయ దేశీయులగు అయిదుగురు, ధృష్టకేతువున్నూ; నిలిచిరి= నిలబడ్డారు; ఈ+తెఱంగునన్= ఈ మాదిరిగా; గట్టి మోహరంబున్= దృఢమైన వ్యూహాన్ని; తీర్చుకొని= ఏర్పాటు చేసికొని; నడచిరి; అంతకున్‌మున్ను+అ= దానికి ముందుగానే; మనవారును= మన కౌరవులుకూడా; వెడలి= బయలుదేరి; భీష్ముండు; అగ్రభాగంబునన్= ముందుప్రక్క; ఉల్లసిల్లన్= ప్రకాశిస్తూండగా; నీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కుమారులు= కౌరవులు; ఆ+మహాత్మున్= ఆ పూజ్యుని; పరివేష్టింపన్= చుట్టియుండగా; కుంభసంభవ తద్+సంభవులున్= ద్రోణుడు అతడి కుమారుడు అశ్వత్థామయు; దక్షిణ వామభాగంబులనున్= కుడి యెడమలందును; కృపకృతవర్మ భగదత్త పురస్సరుండు+ఐ= కృపుడు, కృతవర్మ, భగదత్తుడు ముందు భాగంలో కలవాడై; కురురాజు= దుర్యోధనుడు; మధ్యభాగంబునన్= నడిమి భాగంలో; బృహద్బల కాంభోజ ముఖ్యులు+ఐన= బృహద్బలుడు, కాంభోజరాజు ప్రధానులుగా గల; మహీపతులు= రాజులు; ఆ+మనుజేంద్రు చుట్టునున్= ఆ దుర్యోధనుడి చుట్టున్నూ; త్రిగర్తులు= త్రిగర్త దేశపు వీరులు; అపరభాగంబునను(న్)= వెనుకవైపునందు; పన్ని= యుద్ధానికి సిద్ధపడి; బలుమొన అమర్చికొని= బలమైన వ్యూహాన్ని ఏర్పాటు చేసికొని; త్రోచి; నడచిరి= ముందుకు సాగారు; ఇట్లు= ఈ విధంగా; ఇరువాఁగునున్= రెండు సేనలున్నూ; కవిసి; వివిధ తూర్యస్వనంబులు= నానా విధాలైన వాద్యాల చప్పుళ్ళు, నింగిముట్టన్= ఆకాశాన్నంటగా, ఒండొంటిన్= ఒకసేన మరొక సేనను; తాఁకినన్= ఎదుర్కొనగా;

తాత్పర్యం: పాండవులు భీష్ముడితో యుద్ధం చేసిన రీతిని గూర్చి ధృతరాష్ట్రు డడుగగా సంజయు డిట్లా బదులు చెప్పాడు. 'సూర్యోదయం కావటంతోనే పాండవులు తమ తమ సేనలతోపాటు యుద్ధరంగానికి వెళ్ళి మోహరించేటప్పుడు శిఖండిని ముందు నిలిపారు. ఆతడికి రెండు ప్రక్కల - భీమార్జునులు, వెనుకప్రక్క- అభిమన్యుడు, ద్రౌపది కొమాళ్ళున్నూ, వారికి రెండువైపుల - చేకితానుడు, సాత్యకియూ నిలిచారు. వారికి వెనుకవైపు ధర్మరాజు, ధృష్టద్యుమ్నుడాదిగా గల పాంచాల కుమారులను ముందు ఉంచికొని, నకుల సహదేవులను ఇరు ప్రక్కల పెట్టుకొన్నాడు. వీరికి ప్రక్క భాగాలలో క్రమ్ముకొని విరాటుడు, ద్రుపదుడు ప్రధానులుగా ఉండే రాజులున్నూ, కేకయపంచకం, ధృష్టకేతువు నిలిచారు. ఈ మాదిరి గట్టి మోహరాన్ని ఏర్పాటుచేసికొని పాండవులు యుద్ధానికి సిద్ధమయ్యారు. అంతకుముందే కౌరవులు కూడా యుద్ధ రంగానికి వెళ్ళారు. భీష్ముడు అగ్రభాగంలో ఉండగా, నీ కొడుకులు కౌరవులు అతని చుట్టూ చేరారు. ద్రోణుడు, అశ్వత్థామ కుడి ఎడమ భాగాల్లోను, దుర్యోధనుడు కృపుడు, కృతవర్మ - వీరుముందు నిలబడగా తాను మధ్యభాగంలో నిలిచాడు. బృహద్బలుడు, కాంభోజుడు ముఖ్యులుగా గల రాజులు ఆ దుర్యోధనుడి చుట్టూ నిలిచారు. త్రిగర్తులు వెనుకవైపు నిలిచి, బలిష్ఠమైన సేనను ఏర్పాటుచేసికొని, ముందుకు నడిచారు. ఈ విధంగా రెండు పక్షాలవారూ కవియగా, నానా విధాలైన వాద్యాల శబ్దాలు ఆకాశాన్ని అంటుతూండగా ఒకరినొకరు డీకొన్నారు.

క. సమరం బప్పుడు దనుజులు । నమరులునుం బెనఁగుచందమై తోఁపఁగ భూ
రమణ! విను మేమిసెప్పుదు? । జముపురమున నగ్గలంపుసందడి యయ్యెన్. 317

ప్రతిపదార్థం: భూరమణ!= భూమికి భర్తవైన ధృతరాష్ట్ర మహారాజా; వినుము= ఆలకింపుము; ఏమి చెప్పుదున్?= ఏమి చెప్పగలను; అప్పుడు= ఆ సమయంలో; సమరంబు= కౌరవపాండవయుద్ధం; దనుజులును= రాక్షసులున్నూ; అమరులునున్= దేవతలున్నూ; పెనఁగు చందము+ఐ= యుద్ధం చేసే మాదిరిగా; తోఁపగన్= తోపింపచేయగా; జముపురమునన్= యమధర్మరాజు పట్టణంలో; అగ్గలము+సందడి= అధికమైన జనాల తోపిడి; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! వినుము. కౌరవపాండవుల యుద్ధం దేవదానవయుద్ధంవలె కన్పించింది. అప్పుడు, యమధర్మరాజుపట్టణంలో జనాల తోపిడి ఎక్కువయింది.

వ. అట్టియెడ. 318

ప్రతిపదార్థం: అట్టి= అట్లాంటి, ఎడన్= సమయంలో.

తాత్పర్యం: అట్లా కౌరవపాండవులు యుద్ధం చేసే సమయంలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. కవ లుద్దామపరాక్రమస్ఫురణమైఁ గౌరవ్యసైన్యంబు సి
క్కువడంజేయఁగ భీమపార్థులును గోకొమ్మంచు నొక్కుమ్మడిం
గవియం బాండవసేన యుబ్బి యడరంగాఁ జూచి కల్పాంతభై
రవభీమాకృతి నేచి భీష్ముఁడు శరవ్రాతంబు గుప్పించినన్. 319

ప్రతిపదార్థం: కవలు= నకుల సహదేవులు; ఉద్దామ= గొప్ప; పరాక్రమ స్ఫురణమైన్= పరాక్రమం తోచుటచేత; కౌరవ్య సైన్యంబు= కౌరవులసేనను; చిక్కు+పడన్+చేయఁగన్= చిక్కులో పడేటట్లు చేయగా; భీమపార్థులునున్= భీముడు, అర్జునుడున్నూ; కో కొమ్ము+అంచున్= 'కో' అనే ధ్వనిని అనుకరిస్తూ; ఒక్క+ఉమ్మడిన్= ఒకేసారిగా; కవియన్; పాండవసేన= పాండవుల సైన్యం; ఉబ్బి= పొంగి; అడరంగాన్= విజృంభించగా; భీష్ముఁడు; చూచి; కల్ప+అంత= ప్రళయకాలంలోని; భైరవ= రుద్రుడివలె; భీమ+ఆకృతిన్= భయంకరమైన ఆకారంతో; ఏచి= విజృంభించి; శరవ్రాతంబున్= బాణాలసమూహాన్ని; గుప్పించినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: నకుల సహదేవులు హద్దుమీరిన పరాక్రమం గలవారై, అప్పటికప్పటికి తోచే విధంగా యుద్ధం చేసి కౌరవసేనను ఇరకాటంలో పెట్టారు. అదే సమయంలో భీముడు, అర్జునుడు 'కో' అని అరచుచూ ఒకేసారిగా కౌరవుల సేన మీదకు ఎగబడ్డారు. దీన్ని చూచి, పాండవసేన ఉత్సాహంతో పొంగి, కురుసేన మీదకు విజృంభించింది. ఇంతలో భీష్ముడు ఈ పరిస్థితిని చూచి, ప్రళయకాలంలో రుద్రుడివలె భయానకమైన ఆకారంతో బాణాల మొత్తాన్ని వారిపైన కుప్పలు తెప్పలుగా పడవైచాడు.

ఆ. కాలుకాలు పెనఁగి కాలుబలంబులు । నొడ్డగెడవుగా రథోత్కరంబు
మ్రొగ్గతిలఁగ గుఱ్ఱములు నేల యద్రువ మా । తంగఘటలు గూలెఁ దత్క్షణంబ. 320

ప్రతిపదార్థం: తద్+క్షణంబు+అ= యుద్ధం చేసే ఆ సమయంలోనే; కాలుబలంబులు= పదాతిసేన; కాలుకాలు పెనఁగి= ఒకడి కాలితో మరొకడి కాలు పెనవైచికొని; రథ+ఉత్కరంబు= రథాల సమూహము; ఒడ్డగెడవు కాన్= ఒక ప్రక్క కిందికి ఒరిగి మరొక ప్రక్క పైకి లేచి; గుఱ్ఱములు; మ్రొగ్గతిలఁగన్= పెడమొగంపెట్టినవై; మాతంగ ఘటలు= ఏనుగుల గుంపులు; నేల= భూమి; అద్రువన్= అదిరిపోయేటట్లుగా; కూలెన్= కూలిపోయాయి.

తాత్పర్యం: భయంకరంగా యుద్ధం జరిగే ఆ సమయంలో కాలిబంట్లు ఒకరి కాళ్ళు మరొకరి కాళ్ళతో పెనవేసుకొని, రథాలు హెచ్చుతగ్గులుగా ఒరిగి, గుర్రాలు పెడమొగం పెట్టికొని, ఏనుగు గుంపులు నేల అదిరిపోయేటట్లుగా కింద పడ్డాయి.

క. కనుఁగొని శిఖండి వెస మా । ర్కొని భీష్ముని నేసె మూఁడు క్రూరాస్త్రములం
గని యతఁడు మరల చూడ క । తని నుద్దేశించి పలికె దరహాసముతోన్. 321

ప్రతిపదార్థం: శిఖండి; భీష్మునిన్= భీష్మాచార్యుడిని; కనుఁగొని= చూచి; వెసన్= వేగంగా; మార్కొని= ఎదిరించి; మూఁడు= మూడైన; క్రూర+అస్త్రములన్= గట్టి బాణాలతో; ఏసెన్= కొట్టాడు; అతఁడు= ఆ భీష్ముడు; కని= చూచి; మరలచూడక= తిరిగిచూడకుండా; అతనిన్= ఆ శిఖండిని; ఉద్దేశించి; దరహాసముతోన్= చిరునవ్వుతో; పలికెన్= పలికాడు.

తాత్పర్యం: శిఖండి భీష్ముడిని గుర్తు పట్టి, వెంటనే ఎదిరించి, మూడుబాణాలతో అతడిని కొట్టాడు. భీష్ముడు శిఖండిని ఒక్కసారి చూచి, మరలా వాడి ముఖం చూడకుండా అతడిని ఉద్దేశించి చిరునవ్వుతో ఇట్లా అన్నాడు:

ఉ. 'ఎవ్వత నేని ధాత సృజియించెఁ దగన్ మగవానిఁ గాఁగ నా
కొవ్వమిఁ జేసి యట్టి నిను నుగ్మలి నేయఁగ నొల్ల నాపయిం
గ్రొవ్వెసలార నీవు శరకోటి వెసం బరగించితేని నే
నవ్వుదుఁ గాని కోపము మనంబునఁ బుట్టదు సూ శిఖండినీ!' 322

ప్రతిపదార్థం: శిఖండినీ!= ఓ శిఖండినీ!; ఎవ్వతన్+ఏనిన్= ఏ ఆడదాన్నయితే; ధాత= బ్రహ్మదేవుడు; తగన్= ఒప్పిదంగా; మగవానిన్+కాఁగన్= మగవాడుగా; సృజియించెన్= సృష్టిచేశాడో; నాకున్= భీష్ముడనైన నాకు; ఒవ్వమిన్+చేసి= గిట్టనికారణంగా; అట్టి= ఆలాంటి; ఉగ్మలిన్ నినున్= ఆడుదైన నిన్ను; ఏయఁగన్ ఒల్లన్= కొట్టడానికి ఇష్టపడను; నీవు= శిఖండివైన నీవు; క్రొవ్వు+ఎసలారన్= మదము హెచ్చగా; శరకోటిన్= బాణాలకోట్లను; వెసన్= వేగంతో; పరఁగించితి+(వి)+ఏనిన్= ప్రయోగించినప్పటికి; ఏన్= ఏను; నవ్వుదున్+కాని= నవ్వుతూ ఉంటానేగాని; మనంబునన్= నా మనస్సులో; కోపము= క్రోధము; పుట్టదుసూ= కలుగదు సుమా!

తాత్పర్యం: ఓ శిఖండినీ! నీవు ద్రుపదమహారాజుకు కూతురుగా పుట్టావు. పిదప బ్రహ్మదేవుడు నిన్ను మగవాడుగా సృష్టి చేశాడు. అట్లాంటి ఆడుదియైన నీ మీద బాణాలు వేయడం నాకు ఇష్టంకాదు. కాబట్టి నీవు నీకు గల మదం కొద్దీ నా మీద ఎన్ని బాణాలు వేసినా సరే - నేను నవ్వుతూ ఊరక ఉంటానే గాని, నా మనస్సులో నీ మీద కోపం పుట్టదు సుమా!

విశేషం: శిఖండిని - ద్రుపదరాజు కూతురు. 'కన్యా శిఖండినీ జాతా, పురుషో వై నివేదితః (సం. మహాభారతం). యక్షుని మగతనాన్ని ఆ శిఖండిని గ్రహించటంచేత 'శిఖండి' అని ప్రసిద్ధి చెందినది.

వ. అనినం గోపించి శిఖండియు నతని కిట్లనియె. 323

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; శిఖండియున్= శిఖండికూడా; కోపించి= కోపం చెంది; అతనికిన్= భీష్ముడితో; ఇట్లు+అనియె(న్)= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు పై విధంగా చెప్పగా, శిఖండి కోపగించినవాడై అతనితో ఇట్లా అన్నాడు.

క. 'గెలిచితి రాజుల నెల్లను। బలియుండగు పరశురాముప్రతివీరుఁడవై
యలవుకలిమి నెఱపిన। నీ చలము బలము నాకుఁ జూపఁ జాలవు కంటే? 324

ప్రతిపదార్థం: రాజులన్= రాచవారిని; ఎల్లను= అందరినీ; గెలిచితివి= గెలిచావు; బలియుండు+అగు= బలవంతుడైనట్టి; పరశురాము ప్రతివీరుఁడవు+ఐ= పరశురాముడికి సమానుడైన వీరుడుగా అయి; అలవు+కలిమిన్= బలముయొక్క అతిశయాన్ని; నెఱపిన= వ్యాపింపజేసిన; నీ చలము= నీ యొక్క మాత్సర్యాన్ని; బలము= బలాన్ని; నాకున్= శిఖండినైన నాకు; చూపన్+చాలవు= చూపలేకున్నావు; కంటే?= చూచావా!

తాత్పర్యం: 'ఓ భీష్మా! నీవు రాజుల నందరినీ గెలిచావు. మహాబలపరాక్రమం గల పరశురాముడికి సమ ఉజ్జీ అయినవాడివి. నీ బలాతిశయాన్ని లోకంలో బాగా విస్తరింపజేశావు, అట్టి నీవు నీబలం, చలం నాకు చూపలేకున్నావు కదా!

క. ఏయు మొకనేర్పుమై ని। ట్లేయక క్రీడించి యరుగు మెట్లయినను మ
త్సాయకముల నినుఁ గూల్చెదఁ। జూ యెవ్వత నైతి నేమి సూచెదు? నన్నున్. 325

ప్రతిపదార్థం: ఒక నేర్పుమైన్= ఏ కొద్ది నేర్పుతోనైనా; ఏయుము= బాణాలతో కొట్టుము; ఇట్లు= ఈ విధంగా; ఏయక= బాణాలు ప్రయోగించక; క్రేడించి= తొలగి; అరుగుము= వెళ్ళు; ఎట్లు+అయిననున్= ఏ విధంచేతనైనా; మత్+సాయకములన్= నా బాణాలతో; నినున్= నిన్ను; కూల్చెదన్= చంపుతాను; చూ= సుమా!; ఎవ్వతన్+ఐతిన్= నేనెవరైతే నేమి?; నన్నున్= నన్ను; ఏమి చూచెదు?= ఏమి చూస్తావు?

తాత్పర్యం: ఓ భీష్మా! నీలో ఏ కొద్ది నేర్పున్నా నా పైన బాణాలు ప్రయోగించు. చేతకాకపోతే బాణాలు ప్రయోగించకుండా అవతలికి వెళ్ళిపొమ్ము. నీవు నిలిచి బాణాలు వేసినా, తొలగిపోయినా - ఎట్లయినా సరే నేను బాణాలు వేసి నిన్ను చంపుతాను. నేను ఆడదాననైతేనేమి? మగవాడనైతేనేమి? నన్నేం చూస్తావు?

క. నేఁ డెమ్మెయి నైనను నీ । పోఁడిమిఁ సెడఁ దోన తవిలి పొదువుదు నిన్నున్
వాఁడిమగఁ డనుట యుడుపుదు । వేఁడిమి సొం పెసఁగ నస్త్రవిద్య మెఱయుదున్. 326

ప్రతిపదార్థం: నేఁడు= ఈనాడు; ఏ+మెయిన్+అయిననున్= ఏ విధంగానైనా సరే; నీ పోఁడిమి= నీ యొక్క ఒప్పిదము; చెడన్= చెడిపోయేట్లుగా; తోనన్ తవిలి= వెంబడి తగులుకొని; నిన్నున్ నిన్ను; పొదువుదున్= క్రమ్ముకొంటాను; వాఁడి మగఁడు+అనుటన్= చురుకుతనం గల మగవా డనే ప్రసిద్ధిని; ఉడుపుదున్= పోగొట్టుతాను; అస్త్రవిద్యకున్= ఆయుధాల విద్యలో; వేఁడిమి సొంపు= తీక్ష్ణతయొక్క ఆధిక్యం; ఎసఁగన్= అతిశయించగా; మెఱయుదున్= ప్రకాశిస్తాను.

తాత్పర్యం: ఓ భీష్మాచార్యా! ఈ దినం ఏవిధంగానైనా, నీ వాక్యం చెడిపోయేటట్లుగా నీ వెంబడిపడి నిన్ను క్రమ్ముతాను. చురుకుదనం గల మగవాడివనే ప్రసిద్ధిని రూపుమాపుతాను. ఆయుధాలు ప్రయోగించే విద్యలో నాకున్న నిశితత్వం ప్రదర్శిస్తాను.'

వ. అనుచు మఱియు నైదమ్ము లేసె నప్పలుకులు విని ఫల్గునుం డాత్మగతంబున నేఁడు శిఖండి చందంబు వింత యయియున్న యది. నదీనందనుండు సమయుటకు సమయం బైన దైవదత్తోత్సాహంబున నేచి పలికెం గావలయు'నని యూహించి యుపోద్బలంబుగా నతని కిట్లనియె. 327

ప్రతిపదార్థం: అనుచున్= అని చెప్పుచు; మఱియున్= ఇంకాకూడా; ఐదు+అమ్ములు= ఐదు బాణాలను; ఏసెన్= ప్రయోగించాడు; ఫల్గునుండు= అర్జునుడు; ఆ+పలుకులు= ఆ మాటలు; విని; నేఁడు= ఈనాడు;శిఖండి చందంబు= శిఖండియొక్క విధము; వింత+అయి= ఆశ్చర్యమై; ఉన్న+అది; నదీనందనుండు= భీష్ముడు; సమయుటకున్= చావడానికి; సమయంబు+ఐనన్= సమయంకాగా; దైవదత్త+ఉత్సాహంబునన్= విధిచే ఈయబడ్డ ఉత్సాహంబుతో; ఏచి= విజృంభించి; పలికెన్+కావలయున్+అని= పలికాడు కాబోలు అని; ఆత్మగతంబునన్= తనలో; ఊహించి; ఉప+ఉద్బలంబు+కాన్= ప్రోత్సాహం కలిగేట్టుగా; అతనికిన్= ఆ శిఖండికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని ఈ విధంగా శిఖండి భీష్ముడిని తూలనాడుతూ మరల ఐదు బాణాలతో అతడిని కొట్టాడు. అప్పుడు వాడాడిన మాటలు అర్జునుడు విని, 'ఓహో! నేడు వీడి విధానం వింతగా కన్పిస్తున్నది. భీష్ముడు చావటానికి సమయం ఆసన్నమైంది కాబట్టే, దైవ ప్రేరణచేత ఉత్సాహం కలిగి విజృంభించి పలికాడు, కాబోలు' అని తన మనస్సులో ఊహించి వాడి ఉత్సాహాన్ని హెచ్చుచేసేట్లుగా ఇట్లా అన్నాడు:

అర్జునుఁడు శిఖండికిఁ బ్రోత్సాహంబు గలిగించి భీష్ముపైఁ గవియించుట (సం. 6-104-51)

ఆ. ' ఇట్టు లాడి పిదప నేమియుఁ జేయంగఁ । జాలకున్న మనల జగము నవ్వు
నేను గలుగ నిన్ను నెవ్వరి కేమియుఁ । జేయరాదు భీష్ము నేయు మదరి.' 328

ప్రతిపదార్థం: ఇట్టులు= ఈ మాదిరి; ఆడి= మాటలాడి; పిదపన్= అటుపైన; ఏమియున్= ఏమీకూడా; చేయంగన్+చాలక= చేయలేక; ఉన్నన్= ఉన్నట్టయితే; మనలన్= మనలను; జగము= లోకము; నవ్వున్= నవ్వుతుంది; ఏనున్= అర్జునుడనగు నేను; కలుగన్= ఉండగా; నిన్నున్; ఎవ్వరికిన్= ఎవరికిగాని; ఏమియున్+చేయరాదు= ఏమీ చేయడానికి సాధ్యంకాదు; అడరి= విజృంభించి; భీష్మున్+ఏయుము= భీష్ముడిని బాణాలతో కొట్టుము.

తాత్పర్యం: 'ఓ శిఖండీ! ఈ విధంగా బీరాలు పలికి అటుపై బలంగా యుద్ధం చేయకుండా ఊరకుంటే, మనలను చూచి జనం నవ్వుతారు. నేను నీకు అండగా ఉండగా నీ కేమి భయం? ఎవ్వరూ నిన్నేమీ చేయలేరు. విజృంభించి భీష్ముడితో తలపడు'మని అర్జునుడు అన్నాడు.

వ. అనియె నప్పుడు గాంగేయుండు దొలంగి పాంచాలబలంబులపైఁ దటిమినం దెఱపి గని పాండవబలంబులు గాండీవి మున్నుగాఁ గవిసినం గౌరవసేన దెరలి మరలినం జూచి కురురాజు సురనదీసూనుతోడ 'నీవు గలుగ మన సైన్యంబు దైన్యంబు నొంద నగునే?' యనవుడు రారాజుతో నతండు. 329

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అప్పుడు; గాంగేయుండున్; తొలంగి; పాంచాల బలంబులపైన్= పాంచాల రాజు సేనలపైకి; తటిమినన్= కవియగా; పాండవ బలంబులు= పాండవుల సేనలు; తెఱపిన్+కని= సందుచూచికొని; గాండీవిమున్ను+కాన్= అర్జునుడు ముందు నిలబడగా; కవిసినన్; కౌరవసేన; తెరలి= తొలగి; మరలినన్= వెనుకకు మళ్ళగా; కురురాజు= దుర్యోధనుడు; సురనదీసూనుతోడన్= భీష్ముడితో; నీవు+కలుగన్= నీవు ఉండగా; మన సైన్యంబు= మనయొక్క సేన; దైన్యంబున్= హీనమైన దశను; పొందన్+అగున్+ఏ?= చెంద తగునా?; అనవుడున్= అని చెప్పగా; అతండు= ఆ భీష్ముడు; రారాజుతోన్= దుర్యోధనుడితో.

తాత్పర్యం: పై విధంగా అర్జునుడు శిఖండితో చెప్పిన సమయంలో, భీష్ముడు తొలగిపోయి పాంచాలరాజు సేనల మీద పడ్డాడు. ఆ సందు చూచికొని పాండవబలాలు, గాండీవి ముందు నిలబడగా శత్రు సైన్యం మీదికి కవిశాయి. అప్పుడు కౌరవుల బలం భయంతో ఒదిగి ఒదిగి, వెనుకకు మళ్ళింది. దుర్యోధనుడు చూచి, 'నీవు ఉండగానే మన సేనలకు ఇంత దుఃస్థితి పట్టటమా? అని భీష్ముడితో అన్నాడు. దానికి భీష్ముడు దుర్యోధనుడికి ఈ విధంగా బదులు చెప్పాడు.

విశేషం: భీష్ముడు తాను ఋణం తీర్చుకొన్నానని, పాండవు లజేయులని దుర్యోధనుడితో అంటాడు.

క. ' ముసు పదివేవురఁ జంపుదు । ననియిచ్చినబాసవచ్చె నవనీశ్వర! నీ
మనిచినఋణంబు దీర్చితి । విను లా విటమీఁదఁ దఱుఁగువిధమై తోఁచెన్. 330

ప్రతిపదార్థం: అవనీశ్వర!= ప్రభువగు దుర్యోధనా! పదివేవురన్= పదివేల మందిని; చంపుదున్+అని= చంపుతానని; మును= ముందు; ఇచ్చిన= ఒసగిన; బాస= ప్రతిజ్ఞ; వచ్చెన్= పూర్తి అయింది; నీ మనిచిన ఋణంబు= నీవు పోషించడంచేతనైన అప్పును; తీర్చితిన్; తీర్చివేశాను; విను= వినుము; ఇటమీఁదన్= ఇకమీదట; లావు= బలము; తఱుఁగు విధము+ఐ= తగ్గిపోయే మాదిరిగా; తోఁచెన్= అనిపిస్తోంది.

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! మునుపు పదివేల యోధులను చంపుతానని నేను చేసిన ప్రతిజ్ఞ పూర్తయింది. నీవు ఇన్నాళ్ళు నన్ను పోషించావు. ఆ ఋణం తీర్చికొన్నాను. అయ్యా, విను! ఇక నా బలం తగ్గిపోతూన్నట్లుగా అనిపిస్తున్నది.

ఆ. నేఁటిభంగి సూడ నృపవర । పాండవు లొండె నన్ను, వారి నొండె నేను
సమయఁజేత గలుగు సమసెదరే? యొక । మర్త్యుచేత వా రమర్త్యబలులు. 331

ప్రతిపదార్థం: నృపవర!= రాజులలో గొప్పవాడైన దుర్యోధనా!; నేఁటిభంగిన్= ఈ నాటి విధానాన్ని; చూడన్= చూడగా; పాండవులు; నన్ను ఒండెన్= నన్నుగాని; నేను; వారిన్ఒండెన్= వాళ్ళను గాని; సమయన్+చేఁత= చంపటం; కలుగున్= జరుగుతుంది; అమర్త్యబలులు= చావులేని దేవతల బలంవంటి బలంగలవారైన; వారు= ఆ పాండవులు; ఒక మర్త్యుచేతన్= ఒక మానవుడిచేత; సమసెదరు+ఏ?= చస్తారా?

తాత్పర్యం: ఓ దుర్యోధన మహారాజా! నేటి పరిస్థితి చూస్తే, పాండవులు నన్నుగాని, నేను పాండవులనుగాని చంపడం తప్పకుండా జరుగుతుంది. ఆ పాండవులు దేవతల బలంవంటి బలంగలవారు కావటంచేత, ఒకానొక మానవుడైన నావంటి వాడిచేత చస్తారా? (ఈ పద్యంలో తాను చావటం ఖాయమని, పాండవులు జయించడం నిజమని నిక్కచ్చిగా భీష్ముడు దుర్యోధనుడికి చెప్పాడు.)

వ. ఐనను నా చేతి బలుపు సూడుమీ యని పలికి పేర్చి పటుతరశరార్చులం బ్రచండ నరనాథ యూథంబులం బొదివికొని పాండవులకుం దేఱిచూడరాక నిర్ధూమదహనస్వభావుండైన పితామహు ప్రాపున భవత్పుత్త్రులు శత్రుబలంబుల బడలువడంజేయందొడంగిన వారిం గనుంగొని. 332

ప్రతిపదార్థం: ఐనను= అయినప్పటికి; నా చేతి బలుపు= నా చేతియొక్క బలాన్ని; చూడుమీ= చూడు; అని పలికి; పేర్చి= విజృంభించి; పటుతరశర+అర్చులన్= మిక్కిలి సమర్థములైన బాణాల జ్వాలలతో; ప్రచండ నరనాథ యూథంబులన్= అసాధ్యమైన రాజుల గుంపును; పొదివికొని= ఆక్రమించి; పాండవులకున్; తేఱిచూడరాక= రెప్పవేయక చూడటానికి సాధ్యంకాక; నిర్+ధూమ= పొగలేని; దహన+అగ్నియొక్క; స్వభావుండు+ఐ= స్వభావంగలవాడైన; పితామహు ప్రాపునన్= తాతగారైన భీష్ముని ఆశ్రయం(అండ)తో; భవత్+పుత్త్రులు= నీ కొడుకులు కౌరవులు; శత్రుబలంబులన్= శత్రువులైన పాండవుల సేనలను; బడలు+పడన్+చేయన్= బడలిక చెందేటట్లు చేయటానికి; తొడంగినన్= మొదలుపెట్టగా; వారిన్= ఆ కౌరవుల సేనలను; కనుంగొని= చూచి.

తాత్పర్యం: అయినప్పటికీ నా బాహుబలం చూడు, అని అంటూ బాగా దిట్టమైన బాణాల జ్వాలలతో అసాధ్యమైన రాజుల గుంపును ఎదుర్కొన్నాడు భీష్ముడు. అప్పు డాయనను పాండవులు తేరిపార చూడలేకపోయారు. అప్పుడు భీష్ముడు పొగలేని అగ్నిలా మండిపడుతూ ఉండగా నీ కొడుకులందరూ అతని అండన చేరి, పాండవుల బలగాలను నొచ్చిపోయేటట్లు చేయసాగారు. ఆ కౌరవసేనలను చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. పాండవేయమాత్స్యపాంచాలయాదవ । పాండ్యకేకయాదిబలము లొక్క
మొగిన త్రోవ నీదుమొనలు మార్కొనుటయు । నపుడు పోరు ఘోర మయ్యె నధిప! 333

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్రా!; పాండవేయ= పాండవులకొడుకుల; మాత్స్య= మత్స్యదేశపురాజు; పాంచాల= పాంచాలరాజు; యాదవ= యాదవులు; పాండ్య= పాండ్య దేశపురాజు; కేకయ= కేకయరాజు; ఆది= మొదలుగాగల వారియొక్క; బలములు= సేనలు; ఒక్క మొగిన= ఒక్కసారిగా; త్రోవన్= కవియగా; నీదు= నీయొక్క; మొనలు= సైన్యాలు; మార్కొనుటయున్= ఎదిరించగా; అపుడు; పోరు= కౌరవ పాండవుల యుద్ధం; ఘోరము= భయంకరమైందిగా; అయ్యెన్.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాండవుల కొడుకులు, మత్స్యదేశపురాజు, పాంచాలరాజు, యాదవులు, పాండ్యుడు, కేకయరాజు మొదలుగా గల వారి సైన్యాలు ఒక్కుమ్మడిగా కవియగా, నీ కొడుకు దుర్యోధనుడి సేనలు కూడా ఎదిరించగా యుద్ధం చాలా భయంకరంగా జరిగింది.

వ. అట్టియెడ నర్జునుండు శిఖండి నాలోకించి. 334

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్; అర్జునుండు; శిఖండిన్; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడు శిఖండిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ' నీవు భీష్మున కలికినఁ బోవ దేను । గలుగ వెఱపేల? యతనిపైఁ గవియు మెయిది
కొని మదీయబాణంబులఁ గుప్పఁగూరఁ । బఱపి కూల్చెద నీతనిఁ బటురయమున.' 335

ప్రతిపదార్థం: నీవు; భీష్మునకున్= భీష్ముడికి; అలికినన్= భయపడినా కూడా; పోవదు= భీష్ముడి మరణం తప్పదు; ఏను= నేను; కలుగన్= ఉండగా; వెఱపు+ఏల?= నీకు భయమెందుకు?; ఎయిదికొని= వెంబడించి; అతనిపైన్= ఆ భీష్ముడి మీదికి; కవియుము= పర్వుము; మదీయబాణంబులన్= నా దగ్గరుండే బాణాలను; కొని= తీసికొని; కుప్పఁగూరన్= కుప్పలుకుప్పలుగా; పఱపి= ప్రయోగించి; పటురయమునన్= మిక్కిలి వేగంతో; ఈతనిన్= ఈ భీష్ముడిని; కూల్చెదన్= చంపుతాను.

తాత్పర్యం: 'ఓ శిఖండీ! నీవు భీష్ముడి దెబ్బకు భయపడినా కూడా ఆతడి చావు తప్పదు. నే నున్నానుకదా! ఇక నీకు భయం దేనికి? అతడి వెంటపడుము. నేను నా బాణాలన్నీ ప్రయోగించి కుప్పలు కుప్పలుగా గుప్పించి చాలా వేగంతో ఈనా డీ భీష్ముడిని కడతేర్చుతాను.

వ. అనిన నాతని పలుకులు విని యెలుంగెత్తి ధృష్టద్యుమ్నుండు. 336

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆతని పలుకులు= ఆ అర్జునుడి మాటలు; విని; ఎలుంగు+ఎత్తి= గొంతెత్తి; ధృష్టద్యుమ్నుడు.

తాత్పర్యం: అని అనగా , ఆ అర్జునుడి మాటలను విన్నట్టి ధృష్టద్యుమ్నుడు బిగ్గరగా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ' మన యోధులందఱును శాం । తనవునిపైఁ దఱుముఁ డింద్రతనయుఁడు గలుగన్
మన మతనికి శంకింపఁగఁ । బనిలే' దని పలికి యార్చి బలువిడి నడరెన్. 337

ప్రతిపదార్థం: మన యోధులు= మన పక్షంలోని వీరులు; అందఱును= అందరూకూడా; శాంతనవునిపైన్= భీష్ముడిమీదికి; తఱుముఁడు= కవియుడు; ఇంద్ర తనయుఁడు= ఇంద్రుడి కుమారుడు - అర్జునుడు; కలుగన్= ఉండగా; మనము; అతనికిన్= ఆ భీష్ముడికి; శంకింపఁగన్+పనిలేదు= భయపడనక్కరలేదు; అని పలికి; ఆర్చి= బొబ్బరించి; బలువిడిన్= బలంగా; అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: 'మన యోధులందరు ఏకంగా భీష్ముడిని చుట్టుముట్టండి. అర్జును డుండగా మనకేం భయం? ఆ భీష్ముడిని చూచి మనం జంక పనిలేదు' అని అంటూ, పెనుబొబ్బపెట్టి ధృష్టద్యుమ్నుడు బలంగా విజృంభించాడు.

వ. అప్పుడు ధర్మజభీమనకులసహదేవులును సుభద్రాతనయద్రౌపదేయులును ద్రుపదవిరాటులును, సాత్యకి చేకితాన ధృష్టకేతు కేకయ మాగధులును మఱియునుం జేయంగల దొరలు నొక్కపెట్ట బెట్టఁదరిన నిక్కడ గురుపుత్రభూరిశ్రవసులును, కృతవర్మకృపకాంభోజపతులును, వికర్ణదుర్ముఖ వివింశతిచిత్రసేనులును లోనైన యోధులు దేవవ్రతునకుం దలకడచి వారిం దలపడి రిట్లు మందాకినీనందనుపయిం గవియు పాండవసైనికులను నతని కడ్డుపడు కౌరవ్యవీరులును జూచునెడ సురల కనిమిషత్వంబు సార్థకం బయ్యె నయ్యవసరంబున. 338

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అప్పుడు; ధర్మజ; భీమ; నకుల; సహదేవులును సుభద్రాతనయ= సుభద్ర కుమారుడు అభిమన్యుడు; ద్రౌపదేయులును= ద్రౌపదికుమారులునూ; ద్రుపద విరాటులును; సాత్యకి; చేకితాన; ధృష్టకేతు; కేకయ; మాగధులును; మఱియునున్; చేయన్+కల= సమర్థులైన; దొరలును; ఒక్కపెట్టన్= ఒకేసారిగా; బెట్టు= అధికంగా; అడరినన్= విజృంభించగా; ఇక్కడ= ఈ కౌరవసేనలో; గురుపుత్ర భూరిశ్రవసులును= అశ్వత్థామయు, భూరిశ్రవసుడును; కృతవర్మ; కృప; కాంభోజ పతులును; వికర్ణ; దుర్ముఖ; వివింశతి అనే వారు; చిత్రసేనులును; లోను+ఐన యోధులు= మొదలుగా గల వీరులు; దేవవ్రతునకున్= భీష్ముడికి; తలకడచి= అతిక్రమించి; వారిన్= ఆ పాండవపక్షంలోనివారలను; తలపడిరి= ఎదుర్కొన్నారు; ఇట్లు; మందాకినీ నందను పయిన్= భీష్ముడిమీద; కవియు; పాండవసైనికులను= పాండవుల సేనలో ఉండేవారిని; అతనికిన్= ఆ భీష్ముడికి; అడ్డుపడు= అండగా ముందు అడ్డుకొనే; కౌరవ్యవీరులునున్= కౌరవుల సేనలోని శూరులను; చూచు+ఎడన్ చూచే సమయంలో; సురలకున్= దేవతలకు; అనిమిషత్వంబు= రెప్పపాటు లేకుండుట; సార్థకంబు+అయ్యెన్= సఫలమైంది; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు బొబ్బలుపెట్టుతూ విజృంభించినప్పుడు ధర్మరాజు, భీముడు, నకులుడు, సహదేవుడున్నూ, అభిమన్యుడు, ద్రౌపది కొడుకులున్నూ, సాత్యకి, చేకితానుడు, కేకయమాగధరాజులున్నూ ఇంకా ఉండే రాజులందరూ ఒకే ఊపుతో బాగా విజృంభించారు. ఇక్కడ కౌరవసేనలో అశ్వత్థామ, భూరిశ్రవసుడు, కృతవర్మ, కృపాచార్యుడు, కాంభోజరాజున్నూ, వికర్ణుడు, దుర్ముఖుడు, వివింశతి, చిత్రసేనుడు మొదలుగా కలిగిన శూరులు, భీష్ముడికి రక్షణగా ముందు భాగంలో నిలిచి, పాండవ సైనికులను ఎదిరించారు. ఈ యుద్ధపుపట్టును చూస్తున్న దేవతలకు రెప్పపాటు లేకుండటం సఫలమైంది. (అంటే ఘోరంగా యుద్ధం జరిగిందని, దేవతలు ఆ యుద్ధాన్ని రెప్పవేయకుండా చూశారని భావం.)

క. మొనసి శిఖండిని మున్నిడి । కొనియురవడిఁ దఱుము నరునకును వెస దుశ్శా
సనుఁ డడ్డపడియెఁ బొంగిన । వననిధికిని వేలవోలె వసుధాధీశా! 339

ప్రతిపదార్థం: వసుధా+అధీశా!= భూమికి భర్తవైన ధృతరాష్ట్ర మహారాజా!; మొనసి= పూనుకొని; శిఖండిని= శిఖండి అనేవాడిని; మున్ను+ఇడికొని= ముందుగా పెట్టుకొని; ఉరవడిన్= చాలావేగంగా; తఱుము= కవియుచున్నట్టి; నరునకున్= అర్జునుడికి; వెసన్= వేగంతో; దుశ్శాసనుఁడు; పొంగిన= ఉబ్బిన; వననిధికిన్= సముద్రానికి; వేల+పోలెన్= చెలియలికట్టలాగా; అడ్డపడియెన్= అడ్డువచ్చాడు.

తాత్పర్యం: ప్రయత్నంతో శిఖండిని ముందు ఉంచికొని వేగంగా ముందుకు దూసుకొనిపోతున్న అర్జునుడికి - సముద్రానికి చెలియలికట్ట మాదిరిగా దుశ్శాసనుడు అడ్డుతగిలాడు.

విశేషం: అలం: ఉపమ. సముద్రానికి చెలియలికట్ట ఎట్లాగో - వేగంగా ముందుకు పోతున్న అర్జునుడికి దుశ్శాసనుడు అట్లాగ.

వ. ఇట్లు నిలువరించి. 340

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నిలువరించి= ఆపి.

తాత్పర్యం: పైన చెప్పినరీతిగా దుశ్శాసనుడు పాండవసేనను నిలబడేటట్లుగా చేసి (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఇరువురఁ గృష్ణుల నాతం । డిరువదిబలునారసముల నేసెం గ్రోధ
స్ఫురితుఁ డయి నొంచెఁ గ్రీడియు । నరనాయక! యతని నూఱునారాచములన్. 341

ప్రతిపదార్థం: నరనాయక!= ప్రభూ; ఆతండు= ఆ దుశ్శాసనుడు; ఇరువురన్= ఇద్దరైన; కృష్ణులన్= కృష్ణుడిని, అర్జునుడిని; ఇరువది బలు నారసములన్= ఇరవై వాడి బాణాలతో; ఏసెన్= కొట్టాడు; క్రీడియు(న్)= అర్జునుడున్నూ; క్రోధస్ఫురితుఁడు+అయి= కోపంచే అదరుతున్నవాడై; నూఱు నారాచములన్= నూరు బాణాలతో; అతని(న్)= ఆ దుశ్శాసనుడిని; నొంచెన్= బాధించాడు.

తాత్పర్యం: రాజా! ఆ దుశ్శాసనుడు ఇరువది బాణాలతో, ఆ కృష్ణార్జును లిద్దరినీ కొట్టాడు. అర్జునుడు మిక్కిలి కోపించి నూరు బాణాలు వేసి దుశ్శాసనుడిని నొవ్వజేశాడు.

తే. అతఁడు నొచ్చియు నాటించె నైదుతూపు । లింద్రసుతుఫాలమున నాతఁ డేచి విల్లు
దునిమి పెల్లేయఁ దలఁకక దుస్ససేనుఁ । డన్యధనువున నిరువదేనమ్ము లేసె. 342

ప్రతిపదార్థం: అతఁడు= ఆ దుశ్శాసనుడు; నొచ్చియున్= బాధపొందికూడా; ఇంద్రసుతు ఫాలమునన్= అర్జునుడి నొసటన; ఐదు+తూపులు= అయిదు బాణాలు; నాటించెన్= గుచ్చినాడు; ఆతఁడు= ఆ అర్జునుడు; ఏచి= విజృంభించి; విల్లున్= దుశ్శాసనుడి వింటిని;తునిమి= తునకలు చేసి; పెల్లు= అధికంగా; ఏయన్= బాణాలతో కొట్టగా; దుస్ససేనుఁడు= దుశ్శాసనుడు; తలఁకక= చలించకుండా; అన్యధనువునన్= వేరే విల్లుతో; ఇరువది+ఏను= ఇరవై అయిదు;అమ్ములు= బాణాలు; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు చాలా దెబ్బతినికూడా, అర్జునుడి నొసట అయిదు బాణాలు గ్రుచ్చాడు. ఆ అర్జునుడు మిక్కిలి విజృంభించి, దుశ్శాసనుడి వింటిని తునుకలు చేసి, చాలా బాణాలు వేశాడు. కాని దుశ్శాసనుడు ఏ మాత్రం చలించకుండా, వేరే విల్లందుకొని ఇరవైఅయిదు బాణాలు ప్రయోగించాడు.

క. ఆ తూపులు నఱికి పరి । స్ఫీతంబగు నారసంబు పృథుతరవక్ష
స్స్యూతంబు సేసి విజయుఁడు । నీ తనయుని మూర్ఛ వుచ్చె నిష్ఠురవృత్తిన్. 343

ప్రతిపదార్థం: విజయుఁడు= అర్జునుడు; ఆ తూపులు= దుశ్శాసనుడు వేసిన ఆ బాణాలను; నఱికి= తుంటలు చేసి; పరిస్ఫీతంబు+అగు= మిక్కిలి విశాలమయిన; వక్షస్= రొమ్మున; స్యూతంబున్+చేసి= గ్రుచ్చుకొనేటట్లుగా చేసి; నీ తనయునిన్= దుశ్శాసనుడిని; నిష్ఠురవృత్తిన్= కఠోరంగా; మూర్ఛపుచ్చెన్= మూర్ఛ చెందేట్లుగా చేశాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు తనపై ప్రయోగించిన బాణాలను అర్జునుడు తుంటలు చేసి, చాలా శక్తి గల ఒక బాణాన్ని ప్రయోగించాడు. ఆ బాణం దుశ్శాసనుడి విశాలమైన రొమ్ములో బాగా గ్రుచ్చుకొన్నది. ఆ దెబ్బతో నీ కొడుకు దుశ్శాసనుడు మూర్ఛపోయాడు.

వ. ఇట్లు దుశ్శాసనుండు సోలి వ్రాలుటయు. 344

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ మాదిరి; దుశ్శాసనుండు= దుశ్శాసనుడు; సోలి= సొమ్మసిల్లి; వ్రాలుటయున్= ఒరిగిపోగా.

తాత్పర్యం: దుశ్శాసనుడు మూర్ఛ చెంది, రథంలో వాలిపోగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. సారథి యరదము భీష్ముని । తేరివెనుక కెగిచె నంతఁ దెలివొంది ధృతి
స్ఫారుఁ డగు న కుమారుఁ డు । దారగతిన్ మగిడి వచ్చి తాఁకెం గ్రీడిన్. 345

ప్రతిపదార్థం: సారథి= దుశ్శాసనుడి సారథి; అరదమున్= రథాన్ని; భీష్ముని తేరి వెనుకకున్= భీష్ముడి రథం వెనుకప్రక్కకు; ఎగిచెన్= తరిమాడు; అంతన్= అంతలోపల; ధృతిస్ఫారుఁడు+అగు= ధైర్యంచే గొప్పవాడైన; ఆ+కుమారుఁడు= ఆ దుశ్శాసనుడు; తెలివి+ఒంది= స్పృహపొంది; ఉదారగతిన్= గొప్పదైన గమనంతో; మగిడివచ్చి= తిరిగివచ్చి; క్రీడిన్= అర్జునుడిని; తాఁకెన్= మార్కొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దుశ్శాసనుడు మూర్ఛ చెందగానే, అతడి సారథి భీష్ముడి రథానికి వెనుక ప్రక్కకు తన రథాన్ని తరుముకొని పోయాడు. అంతలోనే, మహాధైర్యవంతుడైన ఆ దుశ్శాసనుడు తెప్పరిల్లుకొని, హుందాగా తిరిగివచ్చి అర్జునుడిని ఎదుర్కొన్నాడు.

వ. **తదవసరంబున సాత్యకితో నలంబుస భగదత్తులును, నభిమన్యునితో సుదక్షిణుండును, విరాటద్రుపదులతో నశ్వత్థామయు, సహదేవునితోఁ గృపాచార్యుండును, నకులునితో వికర్ణుండును, ఘటోత్కచునితో దుర్ముఖుండును, భీమసేనుతో భూరిశ్రవసుండును, జేకితానుతోఁ జిత్రసేనుండును, ధర్మనందనుతో నస్త్రగురుండును దలపడిన బెట్టిదంబగు బవరం బయ్యె నందిరుదెఱంగుల యోధులు నన్యోన్యధ్వజభంజనంబును, బరస్పరతురగహననంబును, నితరేతరసూతనిపాతనంబును, మిథఃకోదండ ఖండనంబును జేయుచుండం బటుతరశరసంపాతసంపాదితశంపాజాలకాభీలంబును, భీషణ గుణరణనగర్జాస్ఫూర్జితంబును, రక్తధారాసారఘోరంబును, నగు నపూర్వ పర్జన్యసమయంబు దోఁచె నప్పుడు గయ్యంబు కలరూపంతయుం గనుంగొనుటకు మింటి క్రేవ నున్న వెరవు గా దను పరుసున సవిత్రుండు సగమింటికిం జనుదెంచె; నట్టియెడ. 346**

ప్రతిపదార్థం: తద్+అవసరంబున్= ఆ సమయంలో; సాత్యకితోన్; అలంబుస భగదత్తులునున్; అభిమన్యుతో; సుదక్షిణుండునున్= సుదక్షిణుడనేవాడున్నూ; విరాటద్రుపదులతోన్; అశ్వత్థామయున్; సహదేవునితోన్; కృపాచార్యుండును; నకులునితో; వికర్ణుండును; ఘటోత్కచునితోన్; దుర్ముఖుండును; భీమసేనుతోన్ ; భూరిశ్రవసుండున్; చేకితానుతోన్; చిత్రసేనుండును; ధర్మనందనుతోన్= ధర్మరాజుతో; అస్త్రగురుండున్= విలు విద్య నేర్పిన గురువైన ద్రోణాచార్యుడున్నూ; తలపడినన్= మార్కొనగా; బెట్టిదంబు+అగు= క్రూరమైన; బవరంబు+అయ్యెన్= యుద్ధం జరిగింది; అందున్= ఆ యుద్ధంలో; ఇరు+తెఱంగుల యోధులున్= రెండు పక్షాలలోని వీరులున్నూ; అన్యోన్య ధ్వజ భంజనంబును= ఒండొరుల యొక్క టెక్కెములను విరుచుకోవడం; పరస్పర తురగ హననంబునున్= ఒకరి గుర్రాలను మరొకరు చంపుకోవడం; ఇతరేతర సూత నిపాతనంబును= ఒండొరుల సారథులను పడవేయటం; మిథః కోదండ ఖండనంబును= అన్యోన్యం ధనువులను త్రుంచివేయటం; చేయుచుండన్= చేస్తూండగా; పటుతర= మిక్కిలిగట్టివైన; శర= బాణాలయొక్క, సంపాత= బాగా పడవేయటంచేత; సంపాదిత= కలుగజేయబడిన; శంపా= మెరుపుతీగల యొక్క; జాలక= సమూహంచేత; ఆభీలంబును= భయంకరమైనదిన్నీ, భీషణ= భయంకరమైన; గుణ= అల్లెత్రాళ్ళయొక్క; రణన= ధ్వనుల; గర్జా= ఉరుములయొక్క; స్ఫూర్జితంబును= ప్రతిధ్వనులు కలదియు; రక్తధారా= నెత్తుటిధారలనే; ఆసార= జడివానచేత; ఘోరంబును(న్)= భయంకరమైనదియు; అగు= అగునట్టి; అపూర్వ పర్జన్యసమయంబు= మునుపు లేనట్టి వర్షాకాలం; తోఁచెన్= తోపింపచేసింది; అప్పుడు= ఆ సమయంలో; కయ్యంబుకలరూపు= యుద్ధం ఉన్నదున్నట్టుగా; అంతయున్= పూర్తిగా; కనుంగొనుటకున్= చూడటానికి; మింటి క్రేవన్= ఆకాశంలో ఒక వైపు; ఉన్నన్= ఉండగా; వెరవు గాదు= సాధ్యం కాదు; అనుపరుసునన్= అనే విధంగా; సవిత్రుండు= సూర్యుడు; సగమింటికిన్= ఆకాశం మధ్యభాగానికి; చనుదెంచెన్= వచ్చాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ యుద్ధంలో సాత్యకితో అలంబుసుడు, భగదత్తుడు; అభిమన్యుడితో సుదక్షిణుడు; విరాటరాజు,ద్రుపదుడు - వీరిద్దరితో అశ్వత్థామ; సహదేవుడితో - కృపుడున్నూ, నకులుడితో - వికర్ణుడు; ఘటోత్కచుడితో దుర్ముఖుడు; భీముడితో భూరిశ్రవసుడు; చేకితానుడితో చిత్రసేనుడు; ధర్మరాజుతో ద్రోణాచార్యుడు తలపడ్డారు. పోరుఘోరంగా ఉండినది. ఆ యుద్ధంలో రెండుపక్షాల వారు ఒకరొకరి ధ్వజాలను విరచటం, ఒండొరుల గుర్రాలను చంపుకోవటం, ఇరుపక్షాలవారి సారథులను పడవేయటం, వీరి విండ్లను వారు, వారి విండ్లను వీరు

త్రుంచివేయటం జరుగుతూ ఉంటే, విరివిగా బాణాలు విసురుకోవటం చేత కలిగిన మెరుపుల గుంపులచే భయంగొలిపేది, భయంకరమైన అల్లెత్రాళ్ళ ధ్వనులనెడి ఉరుముల కదలికలు కలది, నెత్తుటి ధారలనే జడివానచే ఘోరమైనది అవుతూ, మునుపెన్నడూ లేని వర్షాకాల సమయంగా అనిపించింది. అప్పుడు సూర్యభగవానుడు ఆకాశంలో ఒకవైపు యుద్ధం జరుగుతున్నట్టిది జరుగుతున్నట్టుగా చూడటానికి సాధ్యంకాదని అనుకొన్నాడో అన్నట్లు ఆకాశంలో మధ్య భాగానికి చేరుకొన్నాడు. అట్టి సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉత్ప్రేక్షం.

మ. **పటుదుశ్శాసనబాణపంక్తి నతిదర్పస్ఫూర్తిమైఁ ద్రుంచి యు**
త్కటకోపానలదీప్తవక్త్రుఁ డగుచున్ గాండీవి పెల్లేయుడుం
ద్రుటితజ్యాలతికాధనుర్ధ్వజుఁడు నిర్లూనాఖిలాంగుండు నై
రటదశ్వం బగుతేరితో నతఁడు సంత్రాసంబునం బాటినన్. **347**

ప్రతిపదార్థం: గాండీవి= అర్జునుడు; పటు; దుశ్శాసన= దుశ్శాసనుడిచే ప్రయోగింపబడ్డ, బాణ= బాణాలయొక్క; పంక్తిన్= వరుసను; అతిదర్ప స్ఫూర్తిమైన్= మిక్కుటమైన గర్వంచేతనైన కదలికతో; త్రుంచి= తునుకలు చేసి; ఉత్కట= ఎక్కువైన; కోప= కోపమనెడి; అనల= అగ్గిచే; దీప్త= జ్వలించెడి; వక్త్రుఁడు+అగుచున్=ముఖంగల వాడౌతూ; పెల్లు= అధికంగా బాణాలను; ఏయుడున్= ప్రయోగించగా; అతఁడు= ఆ దుశ్శాసనుడు; త్రుటిత= తునిగిపోయిన; జ్యాలతికా= తీగవంటి అల్లెత్రాడు; ధనుః= విల్లు; ధ్వజుఁడు+ఐ= ధ్వజం ఇవి అన్నీకలవాడై; నిర్లూన+అఖిల+అంగుండున్+ఐ= గాయపరచబడిన ఎల్ల అవయవాలు కలవాడై; రటత్+అశ్వంబు+అగు= సకిలిస్తున్న గుర్రాలుగల; తేరితోన్= రథంతో; సంత్రాసంబునన్= మిక్కుటమైన భయంతో; పాటినన్= పారిపోగా.

తాత్పర్యం: దుశ్శాసనుడు వేసిన గొప్ప బాణాలన్నిటినీ, అర్జునుడు చాలా కోపంతో త్రుంచివేశాడు. కోపాగ్నితో జ్వలిస్తుండే ముఖంతో చాలా బాణాలను దుశ్శాసనుడి మీద ప్రయోగించాడు. దానితో ఆ దుశ్శాసనుడి అల్లెత్రాడు, విల్లు - ధ్వజం తునాతునక లయ్యాయి. అంతేకాదు, అతడి అవయవాలన్నీ దెబ్బతిన్నాయి. తన తేరి గుర్రాలు భయంతో సకిలిస్తుండగా, భయపడి అతడు పారిపోయాడు.

తే. **ఫల్గునుఁడు భీష్మముందటిబలము నెల్లఁ । జటులరథవల్గనుం డయిఁ చంపుచున్నఁ**
జూచి ద్రోణుండు గుణరవస్ఫురణఘూర్ణ । రోదసీభాగుఁ డగుచు మార్కొనఁ గడంగి. **348**

ప్రతిపదార్థం: ఫల్గునుఁడు= అర్జునుడు; చటుల= చలించుచున్న; రథంయొక్క+వల్గనుండు+అయి= గుర్రాల గమన భేదం కలవాడై; భీష్మ ముందటి బలమున్+ఎల్లన్= భీష్ముడి ముందు నిలబడియుండే సైన్యాన్నంతా; చంపుచున్+ఉన్నన్= చంపుతుండగా; ద్రోణుండు; చూచి; గుణ= అల్లెత్రాటియొక్క; రవ= శబ్దముయొక్క; స్ఫురణ= అనుకంపనాల చేత; ఘూర్ణ= తిరుగుడు పడుతూ ఉండే; రోదసీభాగుఁడు+అగుచున్= భూమ్యాకాశమధ్యభాగం కలవాడౌతూ; మార్కొనన్= ఎదుర్కోవటానికి; కడంగి= ప్రయత్నపడి.

తాత్పర్యం: అర్జునుడు, తన రథాల గుర్రాలు గతిభేదాలతో నడుస్తూ ఉండగా, భీష్మాచార్యుడికి ముందుండే సైన్యాన్నంతా చంపుతూ వచ్చాడు. దాన్ని చూచి ద్రోణాచార్యుడు తన వింటినారిని బాగా శబ్దింపజేశాడు. ఆ శబ్దం వల్ల ఏర్పడ్డ కంపనం భూమి, ఆకాశాల మధ్యభాగాన్ని తిరుగుడు పడేటట్లు చేసింది. అప్పుడు ద్రోణుడు ఎదుర్కొనటానికి సిద్ధపడుతూ ఉండగా (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్రోణాచార్యు లశ్వత్థామను భీష్మునకు సహాయంబుగాఁ బంపుట (సం. 6-108-1)

వ. అక్కడ నడచినం గౌంతేయాగ్రజుండు తోడన తవిలి సేనాసమేతంబుగా నడ్డపడి పోనీక పెనంగుచుండ నక్కుంభసంభవుండు. 349

ప్రతిపదార్థం: ఆ+కడన్= ఆ చోటికి; నడచినన్= ద్రోణుడు వెడుతూ ఉండగా; కౌంతేయ+అగ్రజుండు= ధర్మరాజు; తోడన్+అ= వెంటనే; తవిలి= వెంబడించి; సేనాసమేతంబుగాన్= సైన్యంతో కూడుకొని ఉన్నట్లుగా; అడ్డపడి= ఎదురునిలిచి; పోనీక= పోనీకుండా; పెనంగుచున్+ఉండన్= యుద్ధం చేస్తూ ఉండగా; ఆ+కుంభసంభవుండు= ఆ ద్రోణాచార్యుడు.

తాత్పర్యం: ద్రోణుడు అర్జునుడున్న దిక్కుకు నడుస్తూ ఉండగా, ధర్మరాజు తనసేనతో కూడా, ద్రోణుడిని వెంబడించి, అడ్డు తగిలి అతడిని పోనీయక యుద్ధం చేస్తూ ఉండగా, ద్రోణాచార్యుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అప్పుడు క్రోధమునం గను। నిప్పులు రాలంగఁ దనకు నెఱసంగడ మై
యొప్పిన తనయున కి ట్లని। చెప్పెం దత్కాలగతి విశేషము లెల్లన్ 350

ప్రతిపదార్థం: అప్పుడు; క్రోధమునన్= కోపంచేత; కను నిప్పులు= కన్నుల నుండి నిప్పు కణికలు; రాలంగన్= రాలుతూ ఉండగా; తనకున్= ద్రోణుడికి; నెఱసంగడము+ఐ= చాలా చేరికగా; ఒప్పిన= ఉన్నటువంటి; తనయునకున్= కొడుకైన అశ్వత్థామకు; తద్+కాలగతి విశేషములు= ఆ సమయాన జరుగుతుండే విశేషాలను; ఎల్లన్= అన్నింటిని; ఇట్లు+అని+చెప్పెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ సమయాన ద్రోణాచార్యుడు, కన్నులనుండి నిప్పులు రాలుతుండగా, చాలాకోపంగా తనకు చాలా దగ్గరలో ఉన్న తన కొడుకైన అశ్వత్థామను చూచి, ఆ సమయంలో తనకు ఏర్పడ్డ పరిస్థితిని గూర్చి ఈ విధంగా చెప్పాడు.

చ. 'తడఁబడె దివ్యబాణముల తంత్రము, మంత్రముఁ దప్పెడుం గడు
న్వడఁకెడుఁ జాపదండము, మనంబును నాకు వశంబుగాదు, వీ
డ్వడియెడుఁ జెయ్వు లంగము గడంక దొఱంగెడు, నేఁటి భంగిఁ గ
వ్వడి తనపూన్కిఁ దీర్చుట ధ్రువంబని బుద్ధి జనించెఁ బుత్రకా! 351

ప్రతిపదార్థం: పుత్రకా!= ఓ కుమారుడా! అశ్వత్థామా!; దివ్యబాణముల తంత్రము= అమోఘాలైన బాణాల కార్యసాధనోపాయం; తడఁబడెన్= తడబాటు చెందుతున్నది; మంత్రము= అస్త్రాలకు సంబంధించిన మంత్రము; తప్పెడున్= తప్పిపోతూ ఉన్నది; చాపదండము= ధనుస్సుయొక్క దండము; కడున్= మిక్కిలిగా; వడఁకెడున్= వణకుతున్నది; నాకున్; మనంబును= మనస్సు కూడా; వశంబు+కాదు= అధీనంలో ఉండటంలేదు; చెయ్వులు= పనులు; వీడు+పడియెడున్= వదలిపెట్టిపోతున్నవి; అంగము= శరీరం; కడంకన్= ప్రయత్నాన్ని; తొఱంగెడున్= విడిచిపెట్టుతున్నది; నేఁటిభంగిన్= ఈ నాటి యుద్ధపురీతితో; కవ్వడి= అర్జునుడు; తన పూన్కిన్= తన యొక్క ప్రయత్నాన్ని; తీర్చుట= నెరవేర్చటం; ధ్రువంబు+అని= నిజమని; బుద్ధి= ఆలోచన; జనించెన్= పుట్టింది.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు తత్కాలంలో తనకు కల్గిన తారుమారు స్థితిని తన కొడుకుతో ఈ విధంగా తెలుపుతున్నాడు. 'కుమారా! అమోఘాలైన బాణాలన్నీ తడబడుతున్నాయి. ఆయా ఆయుధాల అధిదేవతల మంత్రాలు మరచిపోతున్నాను. ధనుస్సున ఉండే దండం వణకుతున్నది. నా మనస్సు నా అధీనంలో ఉండటం

లేదు. ఆయా సమయంలో చేయవలసిన పనులు జ్ఞప్తికి రావటంలేదు. శరీరం ప్రయత్నాన్ని విడిచిపెట్టుతున్నది. ఈనాటి యుద్ధ విధానాన్ని చూస్తే అర్జునుడు తన (భీష్ముడిని చంపుతాననే) నిర్ణయాన్ని నిజంగా నెరవేర్చుతాడని నాకు తోస్తున్నది.

వ. అతని మును మటు తలయెత్తి చూడుము. 352

ప్రతిపదార్థం: అటు= అటువైపు; అతని మునుము= ఆ అర్జునుడి సేన యొక్క అగ్రభాగాన్ని; తలయెత్తి= తలను పైకెత్తి; చూడుము.

తాత్పర్యం: ఓ అశ్వత్థామా! అటు బాగా తల పైకెత్తి, అర్జునుడు చేసే బీభత్సాన్ని చూడుము.

క. కూలెడు గుఱ్ఱంబులు ధర । వ్రాలెడు నేనుఁగులుఁ గెడయు రథములు నై యా
భీల యుగాంత సముద్భట । కాలపురోభాగరేఖ గానఁగనయ్యెన్. 353

ప్రతిపదార్థం: కూలెడు= పడిపోతున్న; గుఱ్ఱంబులు= గుర్రాలు; ధరన్= నేలమీద; వ్రాలెడు= వాలిపోతుండే; ఏనుఁగులున్= ఏనుగులున్నూ; కెడయు= పడిపోతున్న; రథములున్+ఐ= రథములున్నూ కలిగి; ఆభీల= భయంకరమైన; యుగాంత= మహా ప్రళయ కాలంలోని; సమ్+ఉద్భట= భయంకరమైన; కాల= సమయము యొక్క; పురోభాగ= ముందటి భాగమందు ఏర్పడే; రేఖ= గుర్తు గీర; కానఁగన్+అయ్యెన్= కన్పిస్తుంది.

తాత్పర్యం: గుర్రాలు కుప్పకూలుతున్నాయి. ఏనుగులు నేలమీదికి ఒరిగిపోతున్నాయి. రథాలు పడిపోతున్నాయి. భయం కలిగించే మహాప్రళయంలో దానికిముందు కాలంలో కన్పించే చిన్నెలు ఎన్నో అగుపడుతున్నాయి.

వ. అదియునుం గాక. 354

ప్రతిపదార్థం: అదియునున్+కాక= అంతమాత్రమే కాకుండా.

తాత్పర్యం: సేనానష్టమే కాకుండా, చాలా దుశ్శకునాలు కూడా కలుగుతున్నాయి.

తే. అడరి కురుసేనపై గ్రద్దలాడఁ జొచ్చెఁ । బడుచునున్నవి యుల్క లిక్కడ వినంగ
వచ్చె నతిరూక్షభంగి శివారుతంబు । లాపగానందనునకుఁ గీ డావహిల్లు. 355

ప్రతిపదార్థం: గ్రద్దలు= గద్దలు; అడరి= విజృంభించి; కురుసేనపైన్= కురురాజుల సేనమీద; ఆడన్+చొచ్చెన్= తిరుగాడ సాగాయి; ఇక్కడన్; ఉల్కలు= కొరవులు; పడుచున్+ఉన్నవి= పడిపోతున్నాయి; శివారుతంబులు= ఆడనక్కల ఊళలు; అతిరూక్షభంగిన్= చాలా కరకుగా; వినంగన్ వచ్చెన్= వినవస్తున్నాయి; ఆపగానందనునకున్= భీష్ముడికి; కీడు= చెడ్డ(అశుభం); ఆవహిల్లున్= కలుగును.

తాత్పర్యం: కురుసేనపైన గద్దలు తిరుగుతున్నాయి. మనం ఉన్న తావులో నిప్పులేని కొరవులు పడుతున్నాయి. చాలా కటువుగా ఆడనక్కల అరుపులు వినవస్తున్నాయి. అందుచేత భీష్ముడికి ముప్పు తప్పదు.

వ. యుధిష్ఠిరు మొగంబునం గ్రోధం బగ్గలం బై తోఁచుచున్నయది ద్రౌపదేయ నకులసహదేవసహితుం డయి తఱుము నతని మిగిలి నాకు రా రాదు నీవు దేవవ్రతుపాలికిం బోయి యతనికి దాపట వలపటం బ్రాపై నిలువు మిది ప్రాణంబులు డాఁచు సమయంబు గా దని పలికి పనిచిన నశ్వత్థామ యుద్ధామగతిం జనియె నక్కడ భీమసేనుండు. 356

ప్రతిపదార్థం: యుధిష్ఠిరు మొగంబునన్= ధర్మరాజు ముఖంలో; క్రోధంబు= కోపం; అగ్గలంబు+ఐ= ఎక్కువై; తోచుచున్నయది= కనుపించుచున్నది; ద్రౌపదేయ; నకుల; సహదేవ; సహితుండు+అయి= వీరందరితో కూడుకొన్నవాడై; తఱుము= కవియుచుండే; అతనిన్= ఆ ధర్మరాజును; మిగిలి= అతిశయించి; నాకున్; రారాదు= రావటానికి సాధ్యంకాదు; నీవు; దేవవ్రతుపాలికిన్= భీష్ముడి దగ్గరకు; పోయి; అతనికిన్= ఆ భీష్ముడికి; దాపటన్= ఎడమప్రక్క; వలపటన్= కుడిప్రక్క; ప్రాపు+ఐ= అండగా(ఆధారంగా); నిలువుము; ఇది= ఈ సమయం; ప్రాణంబులు; డాఁచు సమయంబు+కాదు= దాచుకోడానికి అదనుగాదు; అని పలికి; పనిచినన్= పంపగా; అశ్వత్థామ; ఉద్దామగతిన్= గొప్ప నడకతో; చనియెన్= వెళ్ళాడు; అక్కడన్= భీష్ముడు యుద్ధం చేస్తూ ఉన్నచోట; భీమసేనుండు.

తాత్పర్యం: ధర్మరాజు ముఖం కోపావేశంతో కూడుకొని ఉన్నట్లు అనిపిస్తోంది. అతడు ద్రౌపది కొడుకులు, నకుల సహదేవులతో కూడి నాపైకి ఉరుకుతున్నాడు. అతడిని దాటుకొని రావటానికి నాకు సాధ్యంకాదు. కనుక నీవు ఆ భీష్ముడి దగ్గరకు వెళ్ళి, అతనికి కుడియెడమ భాగాలలో అండగా నిలబడు. ప్రాణాలు దాచుకోడానికి ఇది సమయంకాదు.' అని చెప్పగానే, అశ్వత్థామ తీవ్రమైన గమనంతో అక్కడికి వెళ్ళాడు. అక్కడ భీముడు (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నరుఁ డేచి శిఖండిఁ బుర । స్సరుఁగాఁ గొని యపుడు భీష్ము సమయింపఁగ స
త్వరుఁ డగుటకుఁ దగ రణత । త్పరుఁ డై కురుసేనమీఁదఁ దఱిమెం బెలుచన్. 357

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో; నరుఁడు= అర్జునుడు+ఏచి= విజృంభించి; శిఖండిన్= శిఖండిని; పురస్సరుఁగాన్+కొని= ముందు పెట్టుకొని; భీష్మున్= భీష్ముడిని; సమయింపఁగన్= చంపడానికి; సత్వరుఁడు+అగుటకున్= వేగిరపాటుతో కూడిన వాడు కావటానికి; తగన్= తగునట్లు(అనుకూలం)గా; రణతత్పరుఁడు+ఐ= యుద్ధమందాసక్తి గలవాడై; కురుసేనమీఁదన్= కౌరవసైన్యం మీదికి; పెలుచన్= ఆగ్రహంతో; తఱిమెన్= కవిశాడు.

తాత్పర్యం: అర్జునుడు విజృంభించి, శిఖండిని ముందుంచుకొని, భీష్ముడిని చంపటానికి త్వరపడేదానికి అనుకూలంగా భీముడు యుద్ధంమీది ఆసక్తితో, కురుసేనమీదికి ఉరికాడు. (భీముడు కురుసేనమీదికి కవియటం వలన, అర్జునుడికి భీష్ముడిని చంపడానికి మంచి అవకాశం కలిగిందన్నమాట.)

వ. ఇట్లు దఱిమి గాంగేయుముందటిబలంబుల బారిసమరం దొడంగిన భగదత్తకృపకృతవర్మశల్యసైంధవ చిత్రసేనదుర్మర్షణవిందానువిందవికర్ణులు పదుండ్రు నొక్కపెట్ట భీమునిం బొదివి నానాస్త్రసంతానంబుల నొప్పించిన నొచ్చియుం జలింపక పోరునమ్మారుతిం గనుంగొని క్రీడి తోడై తఱియ నుఱికి ధనువుల తునియలను, బాణంబులపఱియలను, గేతుచ్ఛత్త్రచామరంబులచెక్కలను, భూషణంబులపొళ్ళను, బుడమిం గప్పినం జూచి సుయోధనుండు సుశర్మాదిభూపాలకుల నాలోకించి యా భీమార్జునులం దాఁక నియోగించిన. 358

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తఱిమి= కవిసి; గాంగేయు ముందటి బలంబులన్= భీష్ముడి ముందుండే సేనలను; బారి+చమరన్= చంపటానికి; తొడంగినన్= ఆరంభించగా; భగదత్త; కృప; కృతవర్మ; శల్య; సైంధవ; చిత్రసేన; దుర్మర్షణ; వింద; అనువింద; వికర్ణులు; పదుండ్రున్= పదిమందికూడా; ఒక్కపెట్ట= ఒకేసారిగా; భీమునిన్= ఆ భీముడిని; పొదివి= క్రమ్ముకొని; నానా+అస్త్ర సంతానంబులన్= పలురకాల ఆయుధాల గుంపులతో; నొప్పించినన్= బాధించగా; నొచ్చియున్= బాధపడికూడా; చలింపక= కదలకుండా; పోరు= యుద్ధం చేస్తుండే; ఆ+మారుతిన్= ఆ భీముడిని; క్రీడి= అర్జునుడు; కనుంగొని= చూచి; తోడు+ఐ=

భీముడికి సహాయుడై; తఱియన్= దగ్గరకు రావటానికి; ఉఱికి; ధనువుల తునియలను= విండ్లతునుకలతో; బాణంబుల పఱియలను= బాణాల బద్దలతో; కేతుచ్ఛత్ర చామరంబుల చెక్కలను; ధ్వజాలు, గొడుగులు చామరాలు - వీటియొక్క ముక్కలతో; భూషణంబుల పొళ్ళను= ఆభరణాల చూర్ణంతోను; పుడమిన్= భూమిని; కప్పినన్= కప్పివేయగా; చూచి; సుయోధనుండు; సుశర్మ+ఆది భూపాలకులన్= సుశర్మ మొదలైన రాజులను; ఆలోకించి= చూచి; ఆ భీమ+అర్జునులన్= ఆ భీముడిని, అర్జునుడిని; తాఁకన్= ఎదిరించటానికి; నియోగించినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఈ విధంగా భీముడు కవిసి, భీష్ముడికి ముందు భాగాన ఉండే సైన్యాన్ని చంపటాన్ని ఆరంభించాడు. భగదత్తుడు, కృపుడు, కృతవర్మ, శల్యుడు, సైంధవుడు, చిత్రసేనుడు, దుర్మర్షణుడు, విందుడు, అనువిందుడు, వికర్ణుడు - అనే పదిమంది ఒక్కసారిగా ఆ భీముడిని చుట్టుముట్టి, పలు రకాల ఆయుధాలు ప్రయోగించి, బాధించారు. తాను బాధపడి కూడా కదలకుండా నిలబడి యుద్ధం చేస్తున్న భీముడిని చూచి సాయపడటానికై అర్జునుడు తోడుగా వచ్చాడు. ధనుస్సుల తునుకలతో, బాణాల బద్దలతో, ధ్వజాల తుంటలతో, గొడుగుల తునుకలతో, చామరాల ముక్కలతో, నగల పొడులతో నేలను కప్పివేశారు. సుయోధనుడు ఆ దృశ్యాన్ని చూచాడు. సుశర్మ ముఖ్యుడుగా గల రాజులను చూచి, ఆ భీమార్జునులను ఎదుర్కొనుడని ఆజ్ఞాపించాడు.

క. ముందటిపదుండ్రు నా నృపు । లందఱునుం గూడి పెనఁగి యయ్యిరువురచే
తం దూలపోవఁ జొచ్చినఁ । గ్రందుగ బలుమొనల నెల్లఁ గవియం బనిచెన్. 359

ప్రతిపదార్థం: ముందటి పదుండ్రున్= ముందు చెప్పిన ఆ పదుగురు రాజులున్నూ; ఆ నృపులు= దుర్యోధనుడు ఆజ్ఞాపించిన సుశర్మ మున్నగు రాజులున్నూ; అందఱునున్= వారు, వీరు - అందరున్నూ; కూడి= ఏకమై; పెనఁగి= యుద్ధం చేసి; ఆ+ఇరువురచేతన్= ఇద్దరైన ఆ భీమార్జునులచేత; తూలపోవన్= చిన్నపోవడానికి; చొచ్చినన్= ఆరంభించగా; క్రందుగన్= ఎక్కువగా; బలు మొనలన్+ఎల్లన్= నానావిధాలైన సైన్యాన్నంతయు; కవియన్; పనిచెన్= ఆజ్ఞ చేశాడు.

తాత్పర్యం: మొదట భీముడిని ఎదుర్కొనటానికి వచ్చిన భగదత్తాదులు పదిమంది రాజులు, ఇప్పుడు దుర్యోధనుడి ఆజ్ఞచే వచ్చిన సుశర్మ మొదలుగా గల వీరులు - వీరందరూ కూడా, ఆ భీమార్జునుల దెబ్బలకు తూలిపోసాగారు. దీన్ని గమనించి, దుర్యోధనుడు తనకు గల సకలవిధాలైన సైన్యాలను ఆ భీమార్జునులను ఎదుర్కోవలసిందిగా ఆజ్ఞాపించాడు.

వ. ఇవ్విధంబునం బెక్కు మొనలు పయింబడిన నయ్యిరువురకుఁ బోరు భరం బగుట యెఱింగి సౌభద్రసాత్యకి ప్రముఖులగు రథికజనంబులు సైన్యోపేతంబుగాఁ ద్రోచి యేచిన. 360

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ మాదిరిగా; పెక్కు= అనేకములైన; మొనలు= సేనలు; పయిన్= మీద; పడినన్= పడగా; ఆ+ఇరువురకున్= ఆ భీమార్జునుల కిద్దరికి; పోరు= యుద్ధము; భరంబు= బరువైనదిగా; అగుట= కావటాన్ని; ఎఱింగి= తెలిసికొని; సౌభద్ర సాత్యకి ప్రముఖులు+అగు= అభిమన్యుడు, సాత్యకి ముఖ్యులుగా గల; రథికజనంబులు= రథాన్నెక్కి యుద్ధం చేసేవారు; సైన్య+ఉపేతంబు+కాన్= సేనలతో కూడునట్లుగా; త్రోచి= ముందుకు నడిచి; ఏచినన్= విజృంభింపగా.

తాత్పర్యం: కౌరవసేన మొత్తంగా కూడి, భీమార్జునుల మీదికి కవియగా - వారిద్దరికి అపుడు యుద్ధం చాలా దుర్భరమైంది. ఈ పరిస్థితిని గుర్తించి, అభిమన్యుడు సాత్యకి ముఖ్యులుగా గల పాండవసేనలో గల రథికులందరూ, తమ తమ సైన్యాలతో బాగా ముందుకు సాగి విజృంభించి యుద్ధం చేయసాగారు.

క. పాండవబలముల యత్యు । ద్దండపరాక్రమము సూచి దర్పోద్ధతవే
దండములఁ గనిన కేసరి । చండత భీష్ముండు వొదివె శరనఖరములన్. 361

ప్రతిపదార్థం: భీష్ముండు= భీష్ముడు; పాండవబలముల= పాండవుల సేనలయొక్క; అతి+ఉద్దండ పరాక్రమము= మిక్కిలి అధికమైన శౌర్యాన్ని; చూచి; దర్ప+ఉద్ధత= గర్వం యొక్క అతిశయంగల; వేదండములన్= ఏనుగులను; కనిన= చూచిన; కేసరి చండతన్= సింహం యొక్క కోపం వంటి కోపం గలవాడై; శరనఖరములన్= బాణాలవంటి గోళ్ళతో; పొదివెన్= క్రమ్ముకొన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు పాండవసేనల యొక్క ఉద్దండ పరాక్రమాన్ని చూచాడు. దానితో ఆయనకు దర్పం పెల్లుబికింది. కోపగించిన సింహం ఎట్లాగయితే తనవాడి గోళ్ళతో ఏనుగులను కప్పివేస్తుందో ఆ మాదిరి తన పదునైన బాణాలతో పాండవుల సేనలను కప్పివేశాడు.

విశేషం: అలం: ఉపమ. 'శరనఖరములన్' అనేమాటలో రూపకాలంకారం. దీనిచే ఉపమాలంకారం ఉపజీవ్యమైంది.

క. డొల్లెడుసూతులుఁ బెలుచం । ద్రెళ్ళెడు తురగములుఁ గా నతిక్రూరగతిం
బె ల్లేయుచు సత్వరముగ । నెల్లెడలం దాన యగుచు నేడ్తెఱఁ బొదివెన్. 362

ప్రతిపదార్థం: డొల్లెడు= పడునట్టి; సూతులున్= సారథులున్నూ; పెలుచన్= అధికంగా; త్రెళ్ళెడు= ఎగిరిపడేటువంటి; తురగములున్+కాన్= గుర్రాలు కలుగునట్లుగా; అతి క్రూరగతిన్= మిక్కిలి కఠోరమైన రీతితో; పెల్లు= అధికంగా; ఏయుచున్= బాణాలతో కొట్టుతూ; సత్వరముగన్= వేగంతో కూడునట్లుగా; ఎల్ల+ఎడలన్= అన్నిచోట్ల; తాను+అ= తానే; అగుచున్= ఉంటున్నవాడై; ఏడ్తెరన్= పరాక్రమంతో; పొదివెన్= కవిశాడు.

తాత్పర్యం: సారథులు కిందపడేటట్లుగా గుర్రాలు ఎగిరిపడేటట్లుగా చాలా కఠినంగా విజృంభించి, వేగంతో అన్ని చోట్లా తానే ఔతూ, బాణాలతో పాండవసేనను పరిమార్చుతూ, భీష్ముడు ఆశ్చర్యకరంగా యుద్ధం చేశాడు.

వ. ఇట్లు పెద్దయుంబ్రొద్దు విహరించి యపరాహ్ణం బగుటయు నతం డాత్మగతంబున. 363

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ చెప్పిన విధంగా; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; విహరించి= విహారం చేసి;అపరాహ్ణంబు+అగుటయున్= పగటిలో నాల్గవభాగంకాగా; అతండు= ఆ భీష్ముడు; ఆత్మగతంబునన్= తనలో.

తాత్పర్యం: ఈ విధంగా చాలాసేపు యుద్ధం చేసి, భీష్ముడు అపరాహ్ణ కాలం కాగా తన మనసులో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ' ఉత్తమక్షత్రియుల నెల్ల నుగ్రవృత్తి । నేడు పదినాళ్ళగోలె నా నిశితశరచ
యములఁ గూల్చితి వేసరినట్టులయ్యె । మేనితోడి పొత్తిం కిట మానుటొప్పు.' 364

ప్రతిపదార్థం: ఉత్తమ క్షత్రియులన్= ఉత్తములైన రాజులను; ఎల్లన్= అందరిని; ఉగ్రవృత్తిన్= భయంకరమైన ప్రవర్తనతో; నేడు పదినాళ్ళగోలెన్= ఈ పది దినాలు మొదలుకొని; నా నిశిత శరచయములన్= నాయొక్క పదునైన బాణాల సమూహాలతో; కూల్చితిన్= చంపివేశాను; వేసరినట్టులు+అయ్యెన్= విసుగుచెందినట్లైంది; ఇంకన్= ఇకమీదట; ఇటన్= ఈ లోకంలో; మేని తోడిపొత్తు= శరీరంతోడి సంబంధాన్ని; మానుట= వదలిపెట్టడం; ఒప్పున్= తగినది.

తాత్పర్యం: భీష్ముడు ఇట్లా అనుకొన్నాడు 'ఈనాటితో పది దినాలుగా చాలా భయంకరంగా మహామహా రాజుల నెందరినో పదునైన బాణాలు గుప్పించి చంపాను. ఇప్పుడు నాకే విసుగు పుట్టుతున్నది. ఇక ఈ శరీరాన్ని వదలిపెట్టటం తగినపని.'

వ. అని తలంచి తొలంగి బలంబులం దెరల్చికొనుచుం గయ్యంబు సేయు చందంబునం గౌంతేయాగ్రజుం గదిసి యల్లన యతనితో ని ట్లనియె. 365

ప్రతిపదార్థం: అని తలంచి= పై విధంగా అనుకొని; తొలంగి= అవతలకు వెళ్ళి; బలంబులన్= సేనలను; తెరల్చికొనుచున్= తొలగించుకొంటూ; కయ్యంబు= యుద్ధాన్ని; చేయు చందంబునన్= చేసే మాదిరిగా; కౌంతేయ+అగ్రజున్= ధర్మరాజును; కదిసి= సమీపించి; అల్లన= మెల్లగా; అతనితోన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+ అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు పై విధంగా అనుకొని, అక్కడినుంచి అవతలికి పోయి, సైన్యాలను ఇటూ అటూ నెట్టుకొంటూ - యుద్ధం చేసే మాదిరి కనిపించుతూ ధర్మరాజు దగ్గరకువెళ్ళి ఎవరికీ వినబడకుండా సన్నగా అతడితో యిట్లా అన్నాడు:

క. ‘ జనియించినంతనుండియు। జనపతులం గ్రూరవృత్తిఁ జంపుచు నుండం
జనియెం గాలము విసివితి। ననఘా! యే నింకఁ జాల నాసురవిధికిన్. 366

ప్రతిపదార్థం: అనఘా!= పాపములేని ధర్మజా! జనియించిన+అంత+ఉండియున్= పుట్టినది మొదలుకొని; జనపతులన్= రాజులను; క్రూరవృత్తిన్= కఠినంగా; చంపుచున్+ఉండన్= చంపుతూ ఉండగా; కాలము= సమయము; చనియెన్= కడచిపోయింది; విసివితిన్= విసుగుచెందాను; ఏను= నేను; ఇంకన్= ఇకమీదట; ఆసురవిధికిన్= రాక్షసకృత్యానికి; చాలన్= సమర్థుడనుకాను.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నేను పుట్టినది లగాయతు ఇంతవరకు ఎంతోమంది రాజులను చాలా క్రూరంగా చంపటంతోనే నా కాలం గడచిపోయింది. ఇప్పుడు నేను బాగా విసుగుచెందాను. ఇకమీద ఈ రాక్షసకృత్యానికి నేను ఒప్పుకోను; యుద్ధంలో సైనికులను నేను చంపజాలను.

ఆ. మీరు నా హితంబుఁ గోరుదురేని శి। ఖండి మున్ను గాఁగఁ గడఁగి యంత
వట్టు వారు నొక్క పెట్టకాఁ బైఁబడి। యేయుఁ డింకఁ దడవు సేయ వలదు.’ 367

ప్రతిపదార్థం: మీరు= పాండవులైనట్టి మీరు; నా హితంబున్= నాయొక్క మేలును; కోరుదురు+ఏనిన్= కోరేవారైతే; శిఖండిమున్ను+కాఁగన్= శిఖండి ముందుండేటట్లుగా; కడఁగి= ప్రయత్నించి; అంత+వట్టువారున్= అందరున్నూ; ఒక్కపెట్టకాన్= ఒకేసారిగా; పైన్+పడి= నామీద పడి; ఏయుఁడు= బాణాలు ప్రయోగించండి; ఇంకన్= ఇకపైన; తడవు= ఆలస్యం; చేయవలదు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! మీరు నామేలు కోరేవారైతే, శిఖండిని ముందుపెట్టుకొని, పూనికతో మీ సేనలోని వారందరూ ఒక్కుమ్మడిగా నా పైకి ఉరికి, బాణాలతో కొట్టండి. ఇంక ఏ మాత్రం ఆలస్యం చేయకండి.

వ. అని పలికి సమరప్రకారంబునం దేరు గ్రేక్కుదోలి పాంచాలబలంబులపయి నడరె నప్పు డయ్యజాతశత్రుండు సమీపవర్తి యగు ధృష్టద్యుమ్ను నాలోకించి. 368

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; సమరప్రకారంబునన్= యుద్ధం చేసే మాదిరిగా; తేరున్= రథాన్ని; క్రేళ్ళు+తోలి= పరుగులెత్తించి; పాంచాలబలంబులపయిన్= పాంచాలరాజుయొక్క సేనలమీదికి; అడరెన్= విజృంభించాడు; అప్పుడు= అట్టి పట్టులో; ఆ+అజాతశత్రుండు= ఆ ధర్మరాజు; సమీపవర్తి+అగు= దగ్గరగానున్నట్టి; ధృష్టద్యుమ్నున్; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: భీష్ముడు పైవిధంగా ధర్మరాజుతో చెప్పి, తానేమో యుద్ధంచేసే విధంగా, తన రథాన్ని జోరుగా పోనిచ్చి, పాంచాలరాజు సేనల మీదికి విజృంభించాడు. అప్పుడు ధర్మరాజు తనకు సమీపంలో ఉండే ధృష్టద్యుమ్నుడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ' దేవవ్రతు పలుకులు విం । టే? వేగమ పనుపు మొక్కటిగఁ దఱుమఁగ యో
ధావళి నెల్లను భీముఁడు । నీవును నరుతోడఁ గూడి నిగుడుఁడు పెలుచన్.' 369

ప్రతిపదార్థం: దేవవ్రతు పలుకులు= భీష్ముడు చెప్పినమాటలు; వింటే?= విన్నావా?; యోధ+ఆవళిన్+ఎల్లనున్= వీరుల సమూహాన్నంతటిని; ఒక్కటిగన్= ఒకే మారుగా; తఱుమఁగన్= కవియటానికి; వేగము+అ= వెంటనే(త్వరితంగా); పనుపుము= ఆజ్ఞాపించుము; భీముఁడు; నీవును= నీవు (ధృష్టద్యుమ్నుడు)న్నూ; నరుతోడన్+కూడి= అర్జునుడితో చేరి; పెలుచన్= ఆటోపంతో; నిగుడుఁడు= విజృంభించండి.

తాత్పర్యం: 'ధృష్టద్యుమ్నా! భీష్ముడు చెప్పిన మాటలు విన్నావు గదా! మన సేనలో ఉన్న యోధులందరినీ ఒకేసారిగా భీష్ముడి మీదికి కవియవలసినదిగా ఆలస్యం చేయకుండా వెంటనే ఆజ్ఞాపించుము. భీముడు, నీవు అర్జునుడితోకూడి, కోపోద్దీప్తులై, ఆతడి మీదికి బాగా విజృంభించండి.'

వ. అనవుడు నతండు. 370

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు.

తాత్పర్యం: ధర్మరాజు పై విధంగా చెప్పగానే ఆ ధృష్టద్యుమ్నుడు (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. మాత్స్య కైకేయాది మనుజేంద్రులకుఁ జేయఁ । గలయట్టి యోధవీరులకుఁ జేయి
సూపి మరున్నదీసూనుపైఁ గవియింపఁ । బవనజపార్థుల ప్రాపుకలిమి
వెఱ పేది యందఱుఁ దఱుమఁ గౌరవపతి । తమ్ములు దొరలును, దానుఁ దాతఁ
గడచి తాఁకినఁ బోరు ఘన మయ్యె నప్పడు । సౌభద్రుఁ డమ్మహీశ్వరుని నొంచె;

తే. ద్రోణతనయుండు శైనేయు బాణమయ శ । రీరుఁ గావించెఁ జేదీశ పౌరవు లస
మాన విక్రము లై యొప్ప మారుతాత్మ । జుండు రారాజు నేనిక పిండుఁ జదిపె. 371

ప్రతిపదార్థం: మాత్స్య= మత్స్య దేశపురాజు; కైకేయ= కేకయదేశపురాజు; ఆది= ముందుగాగల; మనుజ+ ఇంద్రులకున్= రాజులకు; చేయన్+కల+అట్టి= సమర్థులైనట్టి; యోధవీరులకున్= యోధులకును, వీరులకును; చేయి+చూపి= చేతితో చూపించి; మరుత్+నదీసూనుపైన్= భీష్మాచార్యుడి మీదికి; కవియింపన్; పవనజపార్థుల= భీమార్జునులయొక్క; ప్రాపుకలిమి= అండ అధికంగా ఉండటంచేత; వెఱపు+ఏది= భయంలేకుండా; అందఱున్= పాండవసేనలోని వారందరున్నూ; తఱుమన్= వెంబడిబడగా; కౌరవపతి; అతడి తమ్ములు; దొరలును= ఇతర రాజులును; తాను; తాతన్= తాతను(భీష్ముడిని); కడచి= అతిక్రమించి; తాఁకినన్= మార్కొనగా; పోరు= యుద్ధం; ఘనము+అయ్యెన్= భయంకరంగా ఉండినది; అప్పుడు= అట్టి సమయంలో; సౌభద్రుఁడు= అభిమన్యుడు; ఆ+మహీ+ఈశ్వరునిన్= ఆ దుర్యోధనుడిని; నొంచెన్= నొప్పించాడు; ద్రోణతనయుండు= ద్రోణాచార్యుడి కొడుకు అశ్వత్థామ; శైనేయున్= శినివంశం వాడైన సాత్యకిని; బాణమయ శరీరున్= బాణాలతో నిండిన శరీరం కలవాడినిగా; కావించెన్= చేశాడు; చేదీశ పౌరవులు= చేదిరాజు, పురువంశపురాజు; అసమాన విక్రములు+ఐ= సాటిలేని పరాక్రమం కలవారై; ఒప్పన్= ఒప్పియుండగా; మారుత+ఆత్మజుండు= వాయుపుత్రుడు భీముడు; రారాజు+ఏనికపిండున్= దుర్యోధనుడి యొక్క ఏనుగుల గుంపును; చదిపెన్= చంపివేశాడు.

తాత్పర్యం: ధర్మరాజు చెప్పినట్లుగా, ధృష్టద్యుమ్నుడు చేసైగతో మత్స్యదేశపురాజు, కేకయరాజు మొదలైన రాజులను, బాగా యుద్ధం చేయగల యోధులను వీరులను భీష్ముడి మీదికి కవ్వింపజేశాడు. వీరందరూ భీమార్జునులు అండగా

ఉండడంచేత ఎంతమాత్రం జంకుగొంకు లేకుండా భీష్ముడి మీదికి విరుచుకపడ్డారు. దీన్ని చూచి, దుర్యోధనుడి అందరు తమ్ముళ్ళు, ఇంకా ఉన్న రాజులు, దుర్యోధనుడు - వీరంతా ఏకమై భీష్ముడికి ముందుగా ఆయనకు రక్షణగా నిలిచి, పాండవసేనను ఎదుర్కొన్నారు. అప్పుడు యుద్ధం చాలా భయంకరంగా జరిగింది. అభిమన్యుడు దుర్యోధనుడిని నొచ్చిపోయేట్టు చేశాడు. అశ్వత్థామ సాత్యకి శరీరాన్ని బాణమయం చేశాడు. చేదిపౌరవుల యుద్ధం సాటిలేనిదిగా ఒప్పినది. భీముడేమో దుర్యోధనుడి ఏనుగుల గుంపునంతటినీ చంపివేశాడు.

వ. మఱియు నందు నిందును మందాకినీనందనుపయిం ద్రోవను నతనిం గావను దలంచి గడంగిన సైనికు లనేకులు నానాప్రకారంబుల వివిధాయుధంబులం బెనంగుచుండ. 372

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా కూడా; అందున్= ఆ పాండవుల సైన్యంలో; ఇందును(న్)= ఈ కౌరవసేనలోను; మందాకినీ నందనుపయిన్= భీష్ముడి మీదికి; త్రోవను= పడదోయడానికి; అతనిన్= ఆ భీష్ముడిని; కావను= కాపాడటానికి; ఉద్దేశించి; కడంగిన= పూనుకొన్న; అనేకులు= పలువురు; సైనికులు= భటులు; నానా ప్రకారంబులన్= పలు రకాలుగా; వివిధ+ఆయుధంబులన్= పలు విధాలైన ఆయుధాలతో; పెనంగుచున్+ఉండన్= యుద్ధం చేస్తూండగా.

తాత్పర్యం: పాండవ పక్షంలోని చాలామంది భటులు ఆ భీష్ముడిని కూలదోయడానికి, కౌరవుల భటులు పలువురు ఆ భీష్ముడిని కాపాడటానికి, ప్రయత్నించుచుతూ నానా విధాలుగా, నానా విధాలైన అస్త్రశస్త్రాలతో యుద్ధం చేస్తుండగా.

**క. మొనసి మృగేంద్రుఁ మృగేంద్రుఁడు । చెనయంజను పగిది నరుఁడు శీఘ్రగతిన్ శాం
తనవుపయిఁ గవియ దుశ్శా । సనుఁ డడ్డము సొచ్చె దేవసంఘము వొగడన్. 373**

ప్రతిపదార్థం: మృగ+ఇంద్రుఁడు= మృగములకు రాజు - సింహము; మొనసి= పూనుకొని; మృగ+ఇంద్రున్= మృగాల రాజు సింహాన్ని; చెనయన్= ఎదిరించటానికి; చనుపగిదిన్= వెళ్ళే మాదిరి; నరుఁడు= అర్జునుడు; శీఘ్రగతిన్= వేగంతో కూడిన నడకతో; శాంతనవుపయిన్= భీష్ముడి మీదికి; కవియ(న్); దేవసంఘము= దేవతలసమూహం; పొగడన్= పొగడగా; దుశ్శాసనుఁడు; అడ్డము+చొచ్చెన్= అడ్డంగా ప్రవేశించాడు.

తాత్పర్యం: పూనికతో సింహం మరో సింహాన్ని ఎదుర్కొనటానికి వెళ్ళేమాదిరి అర్జునుడు త్వరత్వరగా భీష్ముడి మీదికి కవిశాడు. అంతలో శాంతనవుడిని కాపాడటానికి దుశ్శాసనుడు ఇద్దరికీ అడ్డంగా వచ్చాడు. ఈ సన్నివేశాన్ని తిలకించిన దేవతలు దుశ్శాసనుడి శౌర్యాన్ని పొగిడారు.

విశేషం: అలం: ఉపమ.

**ఆ. ఆతని కప్పు డెదుర నమ్మొన నెవ్వరుఁ । జాలరైరి సవ్యసాచి యొకఁడ
నిశితవిశిఖపంక్తి నిగిడించి నొప్పించి । యొత్తి భీష్మువెనుక కొదుఁగఁ జేసె. 374**

ప్రతిపదార్థం: అప్పుడు; ఆ+మొనన్= ఆ పాండవుల సేనలో; ఎవ్వరున్= ఏ యోధులుగాని; ఆతనికిన్= ఆ దుశ్శాసనుడికి; ఎదురన్= ఎదిరించడానికి; చాలరు+ఐరి= సమర్థులు కాలేకపోయారు; సవ్యసాచి= అర్జునుడు; ఒక్కఁడు+అ= ఒకడే; నిశిత విశిఖ పంక్తిన్= పదునైన బాణాల వరుసలను; నిగిడించి= వ్యాపింపచేసి; నొప్పించి= బాధపెట్టి; ఒత్తి= పొడిచి; భీష్మ వెనుకకున్= భీష్ముడి వెనుకవైపునకు; ఒదుఁగన్+చేసెన్= తొలగేట్లుగా చేశాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు దేవతల పొగడ్తలందుకుంటూ యుద్ధంచేస్తున్నాడు. అప్పుడు అతన్ని ఎదిరించగల వీరుడే పాండవసేనలో ఎవడూ లేకపోయాడు. ఒక్క అర్జునుడు మాత్రం ఎదుట నిల్చి, పదునుగల బాణాల కుప్పలు గుప్పించి, నొప్పించి, దుశ్శాసనుడిని నొక్కి భీష్ముడి వెనుక నక్కేటట్లు చేశాడు.

వ. తదవసరంబున సరభసంబున. 375

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; సరభసంబునన్= తొందరపాటుగా.

తాత్పర్యం: అర్జునుడు బాణాలు గుప్పించే సమయంలో తొందరపాటుతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. భగదత్తుని నా కవ్వడి । వెగ డొందఁగఁ జేసి యతని వెల్లేనుఁగుఁ గెం
పుగఁ జేసిన నాతండును । నిగిడెం బాంచాలమేదినీపతిమీఁదన్. 376

ప్రతిపదార్థం: ఆ+కవ్వడి= ఆ అర్జునుడు; భగదత్తునిన్= నరకాసురుడి కొడుకును; వెగడు+ఒందఁగన్+చేసి= తల్లడపడేటట్లు చేసి; అతని వెల్ల+ఏనుఁగున్= అతడి తెల్ల ఏనుగును; కెంపుగన్+చేసినన్= ఎర్ర బారేటట్లు చేయగా; ఆతండునున్= ఆ భగదత్తుడున్నూ; పాంచాల మేదినీ పతి మీఁదన్= ద్రుపదుడి మీదికి; నిగిడెన్= విజృంభించాడు.

తాత్పర్యం: అర్జునుడు భగదత్తుడిని తల్లడిల్లజేశాడు. అతడి తెల్ల ఏనుగును బాణాలతో కొట్టి రక్తసిక్తం చేసి ఎరుపురంగు గల దానినిగా చేశాడు. ఆ భగదత్తుడు ద్రుపదమహారాజు మీదికి విజృంభించాడు.

వ. ఆఖండలనందనుండును శిఖండిం దటిమి తెఱపి సూపి దేవవ్రతు నేయుమని పురికొలిపె నంత. 377

ప్రతిపదార్థం: ఆఖండల నందనుండును= ఇంద్రుని కొడుకు అర్జునుడును; శిఖండిన్; తటిమి= వెంబడిబడి ; తెఱపి= అవకాశాన్ని, చూపి= కనుపరచి; దేవవ్రతున్= భీష్ముడిని; ఏయుము+అని= బాణాలతో కొట్టుము అని; పురికొలిపెన్= ప్రోత్సహించాడు; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: అర్జునుడు శిఖండిని బలాత్కరించి, అవకాశాన్ని చూపించి 'భీష్ముడిని బాణాలతో కొట్టుము' అని ప్రోత్సాహపరిచాడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మనయోధప్రకరము శాం । తనవుం దలకడచి యత్యుదగ్రత నయ్య
ర్జునుఁ బొదివె నతం డలిగినఁ । బెనుగాలిం దూలు మొగిలుపిండునుబోలెన్. 378

ప్రతిపదార్థం: మనయోధప్రకరము= మన(కౌరవ) వీరులసమూహం; శాంతనవున్= భీష్ముడిని; తలకడచి= అతిక్రమించి ముందునిలబడి; అతి+ఉదగ్రతన్= చాలాభయంకరంగా; ఆ+అర్జునున్= ఆ అర్జునుడిని; పొదివెన్= కప్పివేసింది; అతండు= ఆ అర్జునుడు; అలిగినన్= కోపించినవాడుకాగా; పెనుగాలిన్= తుపానుగాలిచేత; తూలు= తొలగిపోవు; మొగిలుపిండును+పోలెన్= మబ్బులసమూహం మాదిరి (చెదరిపోయింది).

తాత్పర్యం: కౌరవసేనలోని యోధులందరూ భీష్ముడిని కాపాడడానికి ఆయనకు ముందుభాగంలో నిలబడి చాలా భయంకరంగా అర్జునుడిని కమ్మివేశారు. ఆ అర్జునుడు అలుగగా, మనసేనలంతా పెనుగాలికి తుత్తునియలై చెదిరిపోయే కారుమబ్బుల మాదిరి చెదరిపోయాయి.

విశేషం : ఈ పద్యంలో 'పెనుగాలిం దూలు మొగిలిపిండును బోలెన్' అను ఉపమానవాక్యం వాచ్యంగా చెప్పబడినది. 'అర్జునుడలిగితే మన సేనాసమూహం చెల్లాచెదరై పోతుంది' అనే ఉపమేయవాక్యం, గమ్యమానంగా ఉన్నది. ఇది ఒక విధమైన రచనా వైఖరి అనుకోదగినది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. (తూలె) నట్లు దూలిన. **379**

ప్రతిపదార్థం: తూలెన్; అట్లు+తూలిన= ఆ విధంగా తొలగిపోగా.

తాత్పర్యం: ఆ విధంగా మన సేనలు తొలగిపోగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. అట్టియెడ శిఖండి యాపగాసుతుమీఁద । వాలుటమ్ము లేయ వాని నేయ
నొల్ల కతఁడు గెలని యోధవీరావళి । నేయుచుండె శౌర్య మెసకమెసఁగ. **380**

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్; శిఖండి; ఆపగాసుతుమీఁదన్= భీష్ముడిమీద; వాలు+అమ్ములు= పదునుగల బాణాలు; ఏయన్= ప్రయోగించగా; వానిన్= ఆ శిఖండిని; ఏయన్+ఒల్లక= బాణాలతో కొట్టడానికి ఇష్టపడక; అతఁడు= ఆ భీష్ముడు; కెలని= ప్రక్కన ఉన్న; యోధవీర+ఆవళిన్= యోధవీరుల వరుసను; శౌర్యము= పరాక్రమము; ఎసకము= విజృంభణము; ఎసఁగన్= అతిశయింపగా; ఏయుచుండెన్= బాణాలతో కొట్టుతూ ఉన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో శిఖండి భీష్ముడి మీద పదునైన బాణాలు ప్రయోగించాడు. భీష్ముడు వాడిమీద బాణాలు వేయకుండా, యుద్ధభూమిలోనుండే వీరులమీద, యోధులమీద, తన శౌర్య విజృంభణం అతిశయించగా, బాణాలు చాలా ప్రయోగించాడు.

క. నరుఁడు శిఖండిం దటిమిన । శరము లతఁడు భీష్మునురుభుజామధ్యమునం
గురియఁగ నవ్వుచునుండెం । గరి యంత్రజలంబు దొరఁగఁగా నున్న క్రియన్. **381**

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; శిఖండిన్; తటిమినన్= బలవంతపెట్టగా; అతఁడు= శిఖండి; భీష్మున్= భీష్మునియొక్క; ఉరు భుజామధ్యమునన్= విశాలమైన రొమ్ముపై; శరములు= బాణాలను; కురియఁగన్= వర్షింపజేయగా; యంత్రజలంబు= యంత్రమునుండి నీరు; తొరఁగన్+కాన్= ప్రవహించుచుండగా; కరి= ఏనుగు; ఉన్న క్రియన్= ఉండే విధంగా; నవ్వుచున్+ఉండెన్= నవ్వుతున్నాడు.

తాత్పర్యం: అర్జునుడు నిర్బంధపెట్టగా, శిఖండి భీష్ముడి విశాలమైన వక్షస్ స్థలంపైన బాణవర్షం కురిపించాడు. దానికి, జలయంత్రం నుండి నీరు బయటికి వస్తూ ఉంటే వినోదిస్తున్న ఏనుగుమాదిరిగా భీష్ముడు నవ్వసాగాడు. కాని, ఏ మాత్రమూ కష్టపడలేదు.

వ. ఇట్లు దేవవ్రతుండు శిఖండి యేయుట సరకుసేయక యతం డగ్గమైననేయక సాయకంబులు సవ్యసాచిపయి నిగిడింప మగిడి దుశ్శాసనుండు గడంగి కవ్వడి వెగడుపడునంతకయ్యంబు సేసి నొచ్చి పాసినం గౌరవపతి గనుంగొని యెలుంగు సూపి చేయివీచి పురికొల్పినం గళింగమాళవ బాహ్లిక విదేహ శూరసేన ప్రముఖ బలంబులు బలమర్దనుతనయు దెసకుం గవిసిన **382**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దేవవ్రతుండు= భీష్ముడు; శిఖండి+ఏయుట= శిఖండియొక్క బాణ ప్రయోగాన్ని; సరకు+చేయక= లెక్కచేయకుండా; అతండు= ఆ శిఖండి; అగ్గము+ఐనన్= అధీనం(అందుబాటు)లో ఉన్నప్పటికీ; ఏయన్= బాణాలతో కొట్టక; సవ్యసాచిపయిన్= అర్జునుడిమీదికి; సాయకంబులు= బాణాలు; నిగిడింప(న్)= వ్యాపింపజేయగా; దుశ్శాసనుండు; మగిడి= తిరిగి; కడంగి= పూనుకొని; కవ్వడి= అర్జునుడు; వెగడుపడునంత= తల్లడపడేటంతగా; కయ్యంబు+చేసి= యుద్ధంచేసి; నొచ్చి= బాధచెంది; పాసినన్= తొలగిపోగా; కౌరవపతి= దుర్యోధనుడు; కనుంగొని= తెలిసికొని; ఎలుంగు+చూపి= కంఠస్వరాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వినిపింపజేసి(గొంతిచ్చి); చేయివీచి= చేతితో సైగచేసి; పురికొల్పినన్= ప్రోత్సాహపరచగా; కళింగ= కళింగదేశపురాజు; మాళవ= మాళవదేశపురాజు; బాహ్లిక= బాహ్లిక దేశపురాజు; విదేహ= ఆ పేరుగల దేశపురాజు; శూరసేన= ఆ దేశపురాజు; ప్రముఖ= మొదలుగాగల రాజుల యొక్క; బలంబులు= సేనలు; బలమర్దను తనయు దెసకున్= అర్జునుడున్న వైపునకు; కవిసిన(న్).

తాత్పర్యం: భీష్ముడు శిఖండి తన మీద ప్రయోగించే బాణాలను లెక్కచేయలేదు. ఆ శిఖండి అందుబాటులో దగ్గరగా ఉన్నాకూడా బాణాలతో కొట్టలేదు. అర్జునుడి మీద బాణాలు ప్రయోగించాడు. దుశ్శాసనుడు తిరిగి, వచ్చి అర్జునుడు ఓర్చుకోలేనంతగా యుద్ధంచేసి, తాను నొచ్చి, పారిపోయాడు. ఈ విషయం తెలిసికొన్నట్టి దుర్యోధనుడు ఎలుగెత్తి అరచి చేయి విసరుతూ, కళింగ మాళవ బాహ్లిక విదేహ శూరసేనులు ముఖ్యులుగా, గల బలాలను ప్రోత్సాహపరచాడు. వీరందరు అర్జునుడి మీదికి కవియగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. అతఁడు దివ్యాస్త్రజాలంబు నతిశయంబు । చూపి చతురంగబలముల రూపు మాపి
యుఱక తటిమి శిఖండికిఁ దెఱపి చూప । వాఁడి తూపులు భీష్ముపై వాఁడు నినిచె. 383

ప్రతిపదార్థం: అతఁడు= ఆ అర్జునుడు; దివ్య+అస్త్రజాలంబున్= అమోఘాలైన ఆయుధాల సమూహంయొక్క; అతిశయంబున్= గొప్పతనాన్ని; చూపి= కనపరచి; చతురంగబలములన్= రథ, గజ, తురగ పదాతులనే నాలుగు రకాల సేనలను; రూపుమాపి= నాశనంచేసి; ఉఱక= మాటాడక; తటిమి= పరుగెత్తించి; శిఖండికిన్= శిఖండికి; తెఱపి= అవకాశాన్ని; చూపన్= చూపించగా; వాఁడు= ఆ శిఖండి; వాఁడితూపులు= పదునైన బాణాలు; భీష్ముపైన్= భీష్ముడిమీద; నినిచెన్= నింపాడు.

తాత్పర్యం: ఆ అర్జునుడు దివ్యాస్త్రాల గొప్పతనాన్ని చూపించుతూ, మన చతురంగ బలాన్ని నాశనంచేసి, పరుగెత్త చేశాడు. శిఖండికి సందు చూపాడు. అప్పుడు అతడు భీష్ముడిపైన పదునైన బాణాలను బాగా నాటాడు.

వ. ఆ సమయంబునం గృపశల్యవివింశతివికర్ణులం గూర్చికొని పేర్చి దుశ్శాసనుండు శాంతనవున కడ్డపడినం బార్థుం డయ్యేవురను విరథులం జేసిన. 384

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అట్టి సమయంలో; దుశ్శాసనుండు; కృప; శల్య; వివింశతి; వికర్ణులన్= వికర్ణుడు అనే నలుగురిని; కూర్చికొని= వెంటతీసికొని; పేర్చి= విజృంభించి; శాంతనవునకున్= భీష్ముడికి; అడ్డపడినన్= అడ్డంగా నిలబడగా; పార్థుండు= అర్జునుడు; ఆ+ఏవురను= ఆ ఐదుగురిని; విరథులన్= రథాలు లేనివాళ్ళనుగా; చేసినన్= చేయగా.

తాత్పర్యం: అప్పుడు దుశ్శాసనుడు, కృపుడిని, శల్యుడిని, వివింశతిని, వికర్ణుడిని వెంటబెట్టుకొని విజృంభించుతూ, భీష్ముడికి రక్షణగా ఆయనముందు నిలబడ్డాడు. అర్జునుడు ఆ ఐదుగురు యోధుల రథాలనూ ధ్వంసం చేయగా.

క. కురుపతియు ననుజవర్గముఁ । బరమక్రోధమునఁ దెంపు బలుపును మెఱయన్
సురనాథనందనునిపై । నురవడిఁ ద్రోచుటయు సేన లుగ్రత నడరెన్. 385

ప్రతిపదార్థం: కురుపతియున్= కురురాజు దుర్యోధనుడు; అనుజవర్గమున్= అతని తమ్ముళ్ళగుంపు; పరమక్రోధమునన్= అధికమైన కోపంతో; తెంపు= తెగువ; బలుపును= బలము; మెఱయన్= బయల్పడగా; సురనాథనందనుని పైన్= అర్జునుడిమీద; ఉరవడిన్= అతివేగంతో, త్రోచుటయున్= కవియగా; సేనలు= సైన్యాలు; ఉగ్రతన్= భయంకరంగా; అడరెన్= విజృంభించాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు, అతడి సోదరులూ కోపోద్దీపితులై, తమ తెగువ, బలం బయటపడేటట్లు అర్జునుడి మీదికి చాలా వేగంతో కవిశారు. అప్పుడు రెండు పక్షాల సేనలూ బాగా విజృంభించాయి.

క. పాండవ బలములు దలపడి । భండన మొనరింప నగ్ర భాగంబున ను
ద్దండతఁ బోరెడు మనుమల । తండము గని మెచ్చి య ప్పితామహుఁడు వెసన్. 386

ప్రతిపదార్థం: పాండవబలములు= పాండవులయొక్క సేనలు; తలపడి= తాకి; భండనము+ఒనరింపన్= యుద్ధంచేయగా; అగ్రభాగంబునన్= తనకు ముందరభాగంలో; ఉద్దండతన్= అతిశయంగా; పోరెడు= యుద్ధంచేస్తూ ఉండే; మనుమల తండమున్= దుర్యోధనాదులగు మనుమల గుంపును; ఆ+పితామహుండు= ఆ భీష్ముడు; కని= చూచి; మెచ్చి= మెచ్చుకొని; వెసన్= వేగంతో.

తాత్పర్యం: పాండవులు ఎదురెక్కి యుద్ధం చేస్తూండగా, తనముందు భాగంలో నిలిచి అతి గొప్పయుద్ధం చేస్తూ ఉన్న తన మనుమళ్ళందరినీ భీష్ముడు చూచి, మెచ్చుకొంటూ వెంటనే. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. అరిబలంబుపై నొక్క దివ్యాస్త్ర మేయఁ । దలఁచి యరిఁబోసి తిగిచి యుదగ్రవృత్తిఁ
గవిసి ముందట నున్నశిఖండిచూడ్కి । దొడరుటయుఁ దాల్మిమైఁ దెగ యుడిపె నధిప! 387

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా! అరిబలముపైన్= శత్రుసైన్యంమీద; ఒక్క= ఒకానొక అపూర్వమైన; దివ్య+అస్త్రము= దివ్యమైన ఆయుధాన్ని; ఏయన్= ప్రయోగించాలని; తలఁచి= అనుకొని; అరి= శరసంధానస్థానమైన అల్లెత్రాటి నడిమిభాగంలో; పోసి= బాణాన్ని సంధించి; తిగిచి= ఆకర్షించి(లాగి); ఉదగ్రవృత్తిన్= భయంకరమైన నడవడితో; కవిసి= మార్కొని; ముందటన్+ఉన్న= తనకు ముందు ప్రక్కన ఉన్నట్టి; శిఖండి; చూడ్కి= కంటికి; తొడరుటయున్= కనపడగానే; తాల్మిమైన్= ఓర్పుతో; తెగ= ఎక్కుపెట్టిన అల్లెత్రాటిని; ఉడిపెన్= ఉడిగింపజేశాడు. (దించివేశాడు)

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రమహారాజా! భీష్ముడు ఒకానొక మహాస్త్రాన్ని శత్రుసైన్యాల మీద వేయాలని అనుకొన్నాడు. విల్లు ఎక్కుపెట్టాడు. అల్లెత్రాటి మధ్యలో బాణాన్ని పెట్టాడు. ఆ బాణం వేగంగా దూరంగా పోవడానికి బాగా లాగాడు. భయంకరంగా కవిశాడు. ఇంతలో తనకు ముందు (పేడి) శిఖండి తన కంటికి అగుపడ్డాడు. దానితో, భీష్ముడు ఎంత కోపంతో ఉరికాడో, అంత శాంతంతో వెనుకకు తగ్గాడు. ఎక్కుపెట్టిన వింటిని దించివేశాడు.

వ. అంత. 388

తాత్పర్యం: ఆ తరువాత.

క. సోమక మాత్స్యప్రముఖో । ద్దామబలము లేచి పెలుచఁ దఱుముటయును సం
గ్రామతలము సేనాంగ । స్తోమాంగమయంబు సేసె దుర్దాంతగతిన్. 389

ప్రతిపదార్థం: సోమక= ద్రుపదుడు; మాత్స్య= విరటుడు; ప్రముఖ= ముఖ్యులుగా గలవారి యొక్క; ఉద్దామబలములు= గొప్ప సేనలు; ఏచి= విజృంభించి; పెలుచన్= కోపంతో; తఱుముటయునున్= కవియగా; (భీష్ముడు)దుర్దాంతగతిన్= అణచరాని పోకడతో; సంగ్రామతలమున్= యుద్ధభూమిని; సేనా= సైన్యానికి; అంగ= అంగాలైన రథ, గజ, తురగ, పదాతులయొక్క; స్తోమ= సమూహాలయొక్క; అంగమయంబున్= అవయవా(శరీరా)లతో నిండిన దానినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ద్రుపదుడు, విరాటుడు మొదలైనవారి బలాలు విచ్చలవిడిగా విజృంభించి భీష్ముడిపై కవిశాయి. అప్పుడు భీష్మాచార్యుడు అడచరాని పోకడతో ఆ యుద్ధభూమినంతా శత్రువుల చతురంగబలాల అంగాలతో నింపివేశాడు. అనగా శత్రువుల, రథాలను, ఏనుగులను, గుఱ్ఱాలను, కాల్బలాన్ని తునాతునకలు చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. సేనల నిమ్మెయి భీష్ముఁడు । దీనతఁ బొందింప నలిగి ధీరత్వము వీ
రానీకం బగ్గింప శతానీకుఁ । డెదిర్చె నతని నాసురభంగిన్. 390

ప్రతిపదార్థం: భీష్ముఁడు; ఈ+మెయిన్= ఈ విధంగా; సేనలన్= సైన్యాలను; దీనతన్= భయాన్ని; పొందింపన్= కలిగింపగా; అలిగి= కోపించి; వీర+అనీకంబు= శూరులసమూహం; ధీరత్వము= (తన) ధైర్యాన్ని; అగ్గింపన్= పొగడుతుండగా;శతానీకుఁడు= విరాటరాజు తమ్ముడు; అతనిన్= ఆ భీష్ముడిని; ఆసురభంగిన్= రాక్షస సంబంధమైన రీతిలో; ఎదిర్చెన్= ఎదిరించాడు.

తాత్పర్యం: భీష్ముడు పైన చెప్పిన విధంగా పాండవుల సేనలకన్నింటికీ మహాభయాన్ని కలిగించాడు. అక్కడ ఉన్న వీరులందరూ తన ధైర్య శౌర్యాలను పొగడగా శతానీకుడు (విరాటరాజు తమ్ముడు) రాక్షసుడి మాదిరి ఆ భీష్ముడి మీదికి ఎగబడినాడు.

విరటుతమ్ముఁడగు శతానీకుండు భీష్మునిచేఁ జచ్చుట(సం. 6-113-24)

వ. ఇట్లు దాఁకి విరటుతమ్ముండు వాలమ్ముల నొప్పించినం గోపించి. 391

ప్రతిపదార్థం: విరటు తమ్ముండు= విరాటరాజు తమ్ముడు శతానీకుడు; ఇట్లు= పైన చెప్పిన ప్రకారం; తాఁకి= మార్కొని; వాలు+అమ్ములన్= పదునుగల బాణాలతో; నొప్పించినన్= నొప్పి కలిగేటట్లు చేయగా; కోపించి= భీష్ముడు కోపంచెంది.

తాత్పర్యం: పైన చెప్పిన విధంగా శతానీకుడు భీష్ముడిని మార్కొని, చురుకైన బాణాలను ప్రయోగించి, అతడికి బాధను కలిగించగా భీష్ముడు కోపించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

శా. విల్లుం గేతువుఁ ద్రుంచి సూతు వెస నుర్విం గూల్చి రథ్యంబులన్
డొల్లం దీవ్రత నేసి యాతఁడు భుజాటోపంబు శౌర్యంబు శో
భిల్లన్ వైచిన శక్తియుం దునిమి యాభీలద్యుతిప్రస్ఫుర
ద్భల్లం బొక్కటి భీష్ముఁ డేసి నఱకెం దన్మస్తకం బుగ్రతన్. 392

ప్రతిపదార్థం: భీష్ముఁడు; విల్లున్= వింటిని; కేతువున్= ధ్వజాన్ని; త్రుంచి= తునుకలు చేసి; వెసన్= వెంటనే; సూతున్= సారథిని; ఉర్విన్= నేలమీద; కూల్చి= కూలదోసి; రథ్యంబులన్= గుఱ్ఱాలను; డొల్లన్= కిందపడేట్టుగా; తీవ్రతన్= గట్టిగా; ఏసి= బాణాలు ప్రయోగించి; ఆతఁడు= ఆ శతానీకుడు; భుజ+ఆటోపంబు= చేతుల విజృంభణం; శౌర్యంబు= శూరత్వము; శోభిల్లన్= ప్రకాశింపగా; వైచిన= ప్రయోగించినట్టి; శక్తియున్= శక్తి అనే ఆయుధాన్ని; తునిమి= తుంటలుగా చేసి; ఒక్కటి= ఒకానొకటైన; ఆభీల= భయంకరమైన; ద్యుతి= కాంతితో; ప్రస్ఫురత్= ప్రకాశిస్తున్న; భల్లంబున్= బల్లెమును; ఏసి= ప్రయోగించి; ఉగ్రతన్= భయంకరంగా; తద్+మస్తకంబు= ఆ శతానీకుడి తలను; నఱకెన్= ఖండించాడు.

తాత్పర్యం: భీష్ముడు ఆ శతానీకుడి వింటిని, పతాకాన్ని తునకలు చేశాడు. అతడి సారథిని నేలపై పడేటట్లు కొట్టాడు. రథానికుండే గుఱ్ఱాలను నేల దొరలేటట్లుగా చేశాడు. ఆ శతానీకుడు, భుజబలం, శూరత్వం ఒప్పుతూ ఉండగా 'శక్తి' అనే ఆయుధాన్ని భీష్ముడి మీదికి ప్రయోగించగా, భీష్ముడు దాన్ని తునుకలు చేశాడు. కాంతితో జ్వలిస్తూండే ఒకానొక బల్లేన్ని అతడి మీదికి ప్రయోగించి, భయంకరంగా ఆ శతానీకుడి తలను భీష్ముడు ఖండించాడు.

వ. ఇవ్విధంబున శతానీకుం జంపిన. 393

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ చెప్పిన ప్రకారంగా; శతానీకున్; చంపినన్.

తాత్పర్యం: పైన చెప్పిన ప్రకారంగా భీష్ముడు విరాట మహారాజు తమ్ముడగు శతానీకుడిని చంపివేశాక. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మొనలెల్ల విఱుగ మధ్యం । దినమున యినుమాడ్కి బయలఁ దేజోనిధి శం
తను సూనుఁ డొప్పె నప్పుడు । గనుఁగొని యిట్లనియె శౌరి గాండివితోడన్. 394

ప్రతిపదార్థం: మొనలు= సైన్యాలు; ఎల్లన్= అన్నియు; విఱుగన్= ఓడిపోగా; తేజోనిధి= తేజస్సుకు గనివంటివాడైన; శంత నుసూనుఁడు = శంతను మహారాజు యొక్క కుమారుడు - భీష్ముడు; బయలన్= శూన్య ప్రదేశంలో (ఆకాశంలో); మధ్యందినమునన్= మధ్యాహ్న సమయంలోని; ఇనుమాడ్కిన్= సూర్యుడి విధంగా; ఒప్పెన్= ప్రకాశించాడు; అప్పుడు= అట్టి సమయంలో; శౌరి= కృష్ణుడు; కనుఁగొని= చూచి; గాండివితోడన్= అర్జునుడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శతానీకుడు చావగానే, సైన్యాలు భయపడి పారిపోయాయి. ఆ సమయంలో నిర్మానుష్యంగా ఉన్న ఆ యుద్ధరంగంలో తేజఃపుంజంతో వెలిగే భీష్ముడు ఆకాశంలో ప్రకాశించే సూర్యుడి మాదిరి అగుపడ్డాడు. శ్రీకృష్ణుడు, ఈ పరిస్థితిని బాగా గమనించి, అర్జునుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉపమాలంకారం. భీష్ముడికి సూర్యుడితో పోలిక. ఇద్దరూ తేజోనిధులే. 'మాడ్కి' ఉపమావాచకం, ఒప్పి ఉండటం సమానధర్మం.

క. ' మనమోహరములు సెడి, కను । కనిఁ బాఱెడు నిప్పు డాపగాసుతునకు గ్ర
క్కున నీవు మార్కొనక త । క్కినఁ గార్యము దప్పుఁ బొదివి గెలువుము కడఁకన్.' 395

ప్రతిపదార్థం: ఇప్పుడు= ఈ సమయంలో; మనమోహరములు= మనయొక్క వ్యూహాలు; కనుకనిన్= తొట్రుపాటుతో; చెడి= కనబడకుండా పోయి; పాఱెడున్= పరుగెత్తిపోతున్నాయి; గ్రక్కునన్= వెంటనే; నీవు; ఆపగాసుతునకున్= భీష్ముడికి; మార్కొనక= ఎదురు నిలబడకుండా; తక్కినన్= తప్పుకొన్నట్లయితే; కార్యము= పని; తప్పున్= చెడిపోవును; కడఁకన్= ప్రయత్నంతో; పొదివి; గెలువుము= జయించుము.

తాత్పర్యం: 'ఓ అర్జునా! మన సైన్యాలు శతానీకుడి మరణం రణంలో చూచి, అదిరి, బెదిరి, కనబడకుండా పారిపోతున్నాయి. కనుక ఇప్పుడు నీవు భీష్ముడిని మార్కొనకుండాపోతే మన పని చెడిపోతుంది. కాబట్టి, నీవు ప్రయత్నంతో భీష్ముడిని కవిసి జయించుము.

వ. అనిన విని యతండు రథరథ్యసారథిసహితంబుగా సురనదీనందను నమందమార్గణపుంజంబునం బొదివె శిఖండియుం జేరి నారాచంబుల నొప్పించిన దేవవ్రతుండు వాని నేయ నొల్లనిసందున నాసవ్యసాచి యతని విల్లు దునిమి పెల్లేయుచున్నం జూచి సైరింపక శలశల్యకృప కృతవర్మచిత్రసేనభూరిశ్రవః ప్రభృతివీరలోకం బతిలోకంబుగ దివ్యాస్త్రజాలంబులు నెఱపుచు నేయుచు భీష్మున కడ్డపడుండు దలకడవుం'డను నెలుంగులు నింగి ముట్ట బలసమేతంబుగా నడరినం గని సమీర నందన సాత్యకి సౌభద్ర విరాట ద్రుపద ఘటోత్కచ ప్రముఖ యోధవర్గం బనర్గళభంగిం దఱుమం దత్సైన్యంబులు గూడుకొని కవిసిన దివిజదానవసంపాతసమయ సమరం బయ్యె నందుఁ బురందరనందనుండు మన సైనికుల కందఱ కన్నిరూపులయి యైంద్రవారుణాగ్నేయాది

మహాశరంబులం దెరల్చుచు సురక్షితుం డైన శిఖండిం బురికొల్పికొని మీ తండ్రి నేయించుచు నతండెన్ని విండ్లెత్తిన నన్నిటిం దోడ్తోన తునుమాడుచుండె నా క్రీడిపై నతం డుగ్రశక్తి ప్రయోగింప నదియునుం ద్రుంచి సూతునిం గేతనంబునుం గూల్చిన. 396

ప్రతిపదార్థం: అనినన్; విని; అతండు= ఆ అర్జునుడు; రథ= రథాలు; రథ్య= గుర్రాలు; సారథి= రథంనడిపేవాడు - వీటితో; సహితంబుగాన్= కూడునట్లుగా; సురనదీనందనున్= భీష్ముడిని; అమందమార్గణ పుంజంబునన్= తక్కువకాని బాణాల సమూహంతో; పొదివెన్= కప్పివేశాడు; శిఖండియున్= శిఖండికూడా; చేరి= కలిసికొని; నారాచంబులన్= బాణాలతో; నొప్పించినన్= బాధను కలిగించగా; దేవవ్రతుండు= భీష్ముడు; వానిన్= ఆ శిఖండిని; ఏయన్= బాణాలతో కొట్టడానికి; ఒల్లని సందునన్= ఇష్టపడకుండా ఉండే సమయంలో; ఆ సవ్యసాచి= ఆ అర్జునుడు; అతని విల్లున్= ఆ భీష్ముడి వింటిని; తునిమి= తుంటలు చేసి; పెల్లు= అధికంగా; ఏయుచున్నన్= బాణాలు ప్రయోగిస్తూ ఉండగా; చూచి; సైరింపక= ఓర్చుకోకుండా; శల; శల్య; కృప; కృతవర్మ; చిత్రసేన; భూరిశ్రవః= భూరిశ్రవసుడు; ప్రభృతి= ముఖ్యులుగాగల; వీరలోకంబు= వీరులయొక్క సమూహం; అతిలోకంబుగ(న్)= లోకాతీతంగా; దివ్య+అస్త్రజాలంబులు= అమోఘాలైన ఆయుధాల సమూహాలను; నెఱపుచు(న్)= వ్యాపింప జేయుచు; ఏయుచున్= బాణాలు ప్రయోగిస్తూ; భీష్మునకున్= భీష్ముడికి; అడ్డపడుండు= అడ్డుపడండి; తలకడవుండు= ఉన్నచోటిని దాటిరండి; అను= అనునట్టి; ఎలుంగులు= కంఠస్వనాలు; నింగిముట్టన్= ఆకాశాన్నంటుతూ ఉండగా; బలసమేతంబుగాన్= సైన్యాలతో కూడునట్లుగా; అడరినన్= విజృంభించగా; కని; సమీరనందన= భీముడు; సాత్యకి; సౌభద్ర= సుభద్రకుమారుడు - అభిమన్యుడు; విరాట; ద్రుపద; ఘటోత్కచ ప్రముఖ= ప్రధానులుగాగల; యోధవర్గంబు= యోధులగుంపు; అనర్గళభంగిన్= అడ్డులేని విధంగా తఱుమన్= ఎదుర్కొనగా; తద్+సైన్యంబులు(న్)= ఆ కౌరవసైన్యాలు; కూడుకొని= ఏకమై; కవిసిన(న్); దివిజదానవ= దేవతలరాక్షసులయొక్క; సంపాత= చక్కని పాటు కల్గిన; సమయ= సమయమందలి; సమరంబు+అయ్యెన్= యుద్ధంవంటి యుద్ధం జరిగింది; ఆలాటి యుద్ధంలో; పురందర నందనుండు= అర్జునుడు; మన సైనికులకున్= మన(కౌరవ) సైన్యంలోని వారికి; అందఱకున్= అందరికీ కూడా; అన్ని రూపులు+అయి= అంతమంది అర్జునులుగా అగపడి; ఐంద్ర= ఇంద్ర దేవతాకములు; వారుణ= వరుణ దేవతాకములు; ఆగ్నేయ= అగ్ని దేవతాకములు; ఆది= మున్నుగాగల; మహాశరంబులన్= గొప్ప బాణాలతో; తెరల్చుచు(న్)= తొలగించుకొంటూ; సురక్షితుండు+ఐన= బాగా కాపాడబడ్డవాడైన; శిఖండిన్; పురికొల్పికొని= ప్రోత్సాహపరిచి; మీ తండ్రిన్= మీ తండ్రియైన భీష్ముని; ఏయించుచున్= బాణాలతో కొట్టించుతూ; అతండు= ఆ భీష్ముడు; ఎన్ని విండ్లు= ఎన్ని ధనుస్సులను; ఎత్తినన్= ఎత్తికొన్నప్పటికీ; అన్నింటిన్= అన్ని విండ్లనూ; తోడ్తోన= వెంటనే; తునుమాడుచుండెన్= తునుకలు చేస్తూ వచ్చాడు; అతండు= ఆ భీష్ముడు; ఆ క్రీడిపైన్= ఆ అర్జునుడిమీద; ఉగ్రశక్తిన్= భయంకరమైన శక్త్యాయుధాన్ని; ప్రయోగింపన్= వేయగా; అదియునున్= ఆ శక్తి ఆయుధాన్ని కూడా; త్రుంచి= తునుకలుచేసి; సూతునిన్= సారథిని; కేతనంబునున్= ధ్వజాన్ని కూడా; కూల్చిన(న్)= కూలద్రోయగా.

తాత్పర్యం: అర్జునుడు కృష్ణుడన్న మాటలు విన్నాడు. భీష్ముడిని, ఆయన రథాన్ని, గుర్రాలను, సారథిని, చురుకైన బాణాల సమూహంతో కప్పివేశాడు. శిఖండి కూడా అర్జునుడితో కూడా చేరుకొని బాణాలతో భీష్ముడిని నొప్పించాడు. శిఖండి పేడి కాబట్టి వాడిమీద బాణాలు వేయడానికి భీష్ముడు ఇష్టపడకుండా ఉండే సమయంలో అర్జునుడు అతడి విల్లును విరిచివేసి, పెల్లుగా బాణాలను గుప్పించాడు. దీన్ని చూచి, శలశల్యాదులైన వీరులందరూ ఓర్చుకోలేక చాలా భయంకరాలైన, అమోఘాలైన అస్త్రశస్త్రాలతో యుద్ధభూమినంతా కప్పివేస్తూ, బాణాలతో కొట్టుతూ, భీష్ముడికి అండగా ముందు నిలబడండి, మీరుండే చోటినుండి కదలిరండి.' అనే అరుపులు ఆకాశాన్ని అంటుతుండగా, సేనలతో వారు విజృంభించారు. భీముడు, సాత్యకి, అభిమన్యుడు ముఖ్యులుగా ఉండే యోధవర్గం వారి విజృంభణాన్ని చూచారు. అడ్డు, ఆపు లేకుండా శత్రుసైన్యాన్ని తరిమారు. శత్రుసేనలంతా ఒక్కటిగా చేరుకొని కవిశారు. అప్పటివారి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యుద్ధం దేవతల రాక్షసుల యుద్ధంవలె అనిపించింది. అట్టిపట్టులో అర్జునుడు మన సైనికులకు ఒక్కొక్కడికి ఒక్కొక్క అర్జునుడుగా అగుపడుతూ, ఇంద్రవారుణాగ్నేయాది దివ్యాస్త్రాలు ప్రయోగించి దారి ఏర్పరచుకొంటూ, తనచే చక్కగా కాపాడబడుతూ ఉన్న శిఖండిని దండిగా ప్రేరేపించి, (మీతండ్రి) భీష్ముడిని బాణాలతో కొట్టించాడు. భీష్ముడు ఎన్ని విండ్లెత్తుకున్నా అన్నిటిని వెంట వెంటనే తునాతునుకలు చేశాడు. ఆ భీష్ముడు అర్జునుడి మీదికి భయంకరమైన ఒక శక్తి ఆయుధాన్ని ప్రయోగించాడు. అర్జునుడు దాన్నికూడా తునుమాడి, అంతటితో ఊరకొనక, ఆ భీష్ముడి సారథిని, రథటెక్కాన్ని కూడా కూల్చివేశాడు.

సీ. మనమున భీష్ముఁ డిట్లని వితర్కించుఁ । 'బాండవుల నాయొక్క వింటన కడంగి
గెలువనే? వీరికిఁ గృష్ణుండు ప్రాపు గా । కున్న నిం కది యట్టు లుండనిమ్ము
కృష్ణుఁ దోడుగఁ గొని కీడ్పడి వీరలు । వచ్చినఁ జెప్పితి వధవిధంబు
సమర ముపేక్షించి శాంతిమై నుండెద । నడిచిపాటేటికి?' ననఁగ నెఱిఁగి

తే. చదల సుర లిట్లు 'మే లిది సమ్మతంబు । మాకు' నని ప్రీతిమైఁ జెప్పుమాట లాతఁ
డొక్కరుండును వినియె; నే నొకఁడు వింటి । మునిమహానుభావంబున మనుజనాథ! 397

ప్రతిపదార్థం: మనుజనాథ!= ప్రభువగు ధృతరాష్ట్ర మహారాజా!; మనమునన్= మనస్సులో; భీష్ముఁడు; ఇట్లు+అని; వితర్కించున్= ఊహించుకొంటున్నాడు; వీరికిన్= ఈ పాండవులకు; కృష్ణుండు= కృష్ణుడు; ప్రాపు= ఆశ్రయము; కాక+ఉన్నన్= కాకుండా ఉంటే; పాండవులన్= పాండురాజు కొడుకులను; నా+ఒక్కవింటన్+అ= నా ఒక్క ధనుస్సుతోనే; కడంగి= యత్నించి; గెలువనే?= గెలువనా?; ఇంకన్= ఇకమీద; అది= ఆ సంగతి; అటులు+ఉండనిమ్ము= అట్లా ఉండనీ; వీరలు= ఈ పాండవులు; కీడు+పడి= తక్కువపాటు చెంది; కృష్ణున్= కృష్ణుడిని; తోడుగన్+కొని= సహాయంగా తీసికొని; వచ్చినన్= రాగా; వధవిధంబున్= నన్ను చంపేరీతిని; చెప్పితిన్= చెప్పాను; సమరము= యుద్ధమును; ఉపేక్షించి; అశ్రద్ధచేసి; శాంతిమైన్= ఓర్పుతో; ఉండెదన్= ఉంటాను; అడిచిపాటు= తొందరపడటం; ఏటికిన్?= ఎందుకోసం?; అనఁగన్= అని వితర్కించుకుంటూ ఉండగా; చదలన్= ఆకాశాన; సురలు= దేవతలు; ఎఱిఁగి= భీష్ముడి తర్కాన్ని తెలుసుకొని; ఇట్లు;మేలు+ఇది= ఇది బాగున్నది; మాకున్= దేవతలమగు మాకు; సమ్మతంబు= ఇష్టం; అని= అంటూ; ప్రీతిమైన్= ప్రేమతో; చెప్పుమాటలు= చెప్పెడి మాటలను; ఆతఁడు= ఆ భీష్ముడు; ఒక్కరుండును= ఒక్కడు మాత్రమే, వినియెన్= విన్నాడు; మునిమహానుభావంబునన్= వ్యాస మహర్షి యొక్క మహిమవల్ల; ఏన్+ఒకఁడు= నే నొకడు మాత్రమే; వింటిన్= విన్నాను.

తాత్పర్యం: భీష్ముడు తన మనస్సులో ఈ విధంగా అనుకొంటున్నాడు. 'ఈ పాండవులకు కృష్ణుడు ఆశ్రయంగా లేకుండా ఉండిఉంటే నా ఒక్క ధనుస్సుతోనే వీరినంతా నేను గెలువనా? సరే, ఆ సంగతి అట్లా ఉండనీ. ఈ పాండవులందరూ లొచ్చుపడి, చచ్చుదేలి, కృష్ణుడిని సహాయంగా తీసికొని నా దగ్గరకు వచ్చారు. నా మరణానికి ఉపాయాన్ని వీరికి చెప్పాను. ఇకమీద యుద్ధంలో శ్రద్ధ చూపకుండా ప్రశాంతంగా ఉంటాను. వేగిరపాటెందుకు?' అనే ఈ మాటలు ఆకాశంలో ఉండే దేవతలు విన్నారు. 'ఇదే మేలైనపని. మా ఇష్టం కూడా ఇదే' అని ప్రేమతో వారు చెప్పే మాటలు ఆ భీష్ముడు ఒకడు మాత్రమే విన్నాడు. వ్యాసమహర్షి ప్రభావం వలన నేను కూడా విన్నాను.

వ. తదవసరంబున సూక్ష్మజలశీకరశిశిరంబగు మారుతంబు మరుత్తటినీతనయు మీఁద సుడిసె సురదుందుభులు మ్రోసెఁ గుసుమవర్షంబులు గురిసె నవియు ననన్యగోచరంబులయ్యె నిట్లు నిశ్చయించియు న మ్మహాత్ముం డూరకున్నం గెలని కొకభంగియై తోఁచు నని తలంచి. 398

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆనాటి సమయంలో; మరుత్+తటినీతనయుమీఁదన్= దేవనదికొడుకైన భీష్ముడిమీద; సూక్ష్మ= కొద్దిపాటివైన; జల= నీటియొక్క; శీకర= తుంపరల చేత; శిశిరంబు+అగు= చల్లనైన; మారుతంబు= గాలి; సుడిసెన్= చుట్టిముట్టి వీచింది; సురదుందుభులు= దేవదుందుభులు; మ్రోసెన్= మ్రోగాయి; కుసుమవర్షంబులు= పూలవానలు; కురిసెన్; అవియున్= ఈ చెప్పినవన్నీ; అనన్యగోచరంబులు+అయ్యెన్= ఇతరులకు అగుపడకుండా ఉండినాయి; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; ఇట్లు= ఈ విధంగా; నిశ్చయించియున్= నిశ్చయం చేసికొని కూడా; ఊరక+ఉన్నన్= యుద్ధం చేయకుండా వుంటే; కెలనికి(న్)= తన పక్షంవారికి; ఒక భంగి+ఐ= ఒక విధంగా(మోసం)గా; తోఁచున్+అని= అనిపించవచ్చునని; తలంచి= అనుకొని.

తాత్పర్యం: భీష్ముడు దేవతలన్న మాటలు విన్న సమయంలో, ఆ భీష్ముడి మీద నీటి బిందువులతో నిండిన చల్లని పిల్లగాలులు వీచాయి. దేవదుందుభులు మ్రోగాయి. పూలవానలు కురిశాయి. ఈ వింతలంతా వేరెవరికీ అగుపించలేదు. ఆ మహాపురుషుడు తానిక యుద్ధం చేయకూడదని, ప్రశాంతంగా ఉండాలని నిశ్చయం చేసికొని కూడా ఊరకనే ఉంటే తన పక్షంవారికి, కౌరవులకు తన వైఖరి మోసం(కపటం)గా అనిపిస్తుందేమో అని తన విల్లు ఎక్కుపెట్టాడు.

తే. ఒక్క వి ల్లెక్కుపెట్టంగ నుఱక వెస శి । ఖండి పటు మార్గణంబులఁ గడఁగి యేయ
నతఁడు మిసిమింతుఁడును గామి కల్ల నవ్వి । పఱపెఁ దనయమ్ము లతనిపై ఫల్గునుండు. 399

ప్రతిపదార్థం: ఒక్కవిల్లు= ఒకవింటిని; ఎక్కుపెట్టంగన్; శిఖండి= ద్రుపదుని పుత్రుడు; ఉఱక= లెక్కచేయక; కడఁగి= ప్రయత్నించి; వెసన్= వేగంగా; పటుమార్గణంబులన్= సమర్థములైన బాణాలను; ఏయన్= ప్రయోగింపగా; అతఁడు= ఆ భీష్ముడు; మిసిమింతుఁడునున్= అలసిపోయినవాడుగా కూడా; కామికిన్= కాకున్నదానికి; ఫల్గునుండు= అర్జునుడు; అల్ల నవ్వి= సన్నగా నవ్వి; తన+అమ్ములు= తన బాణాలను; అతనిపైన్= ఆ భీష్ముడిమీద; పఱపెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: భీష్ముడు ఒక వింటిని ఎక్కుపెట్టాడు. అంతలో శిఖండి దానిని లెక్కచేయక ప్రయత్నంతో వేగంగా మంచి మంచి బాణాలను ఆ భీష్ముడిమీదికి ప్రయోగించాడు. ఆ బాణాల దెబ్బలకు భీష్ముడు కొంచెం కూడా అలసట చెందలేదు. దీన్ని చూచి అర్జునుడు నవ్వి, తన బాణాలను అతడి మీద ప్రయోగించాడు.

వ. శాంతనవుండును సముల్లాసంబున నేసిన. 400

ప్రతిపదార్థం: శాంతనవుండును= శంతనుమహారాజు కుమారుడు భీష్ముడును; సమ్+ఉల్లాసంబునన్= ఉత్సాహంతో; ఏసినన్= బాణాలు ప్రయోగించగా.

తాత్పర్యం: అర్జునుడు తనపై బాణాలు ప్రయోగించగా, భీష్ముడున్నూ ఉత్సాహంతో మళ్ళీ బాణాలు ప్రయోగించగా. (తరువాత పద్యంతో అన్వయంతో.)

క. నరుఁడు, దనమీఁదఁ దొరఁగెడు । శరములు వారించి యతని చాపం బధిక
త్వరితగతిఁ ద్రుంచి యతిని । ష్ఠుర నారాచంబు దనువు సొర నేయుటయున్. 401

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; తనమీఁదన్= తన(అర్జునుడి)మీద; తొరఁగెడు శరములు= పడునట్టి బాణాలను; వారించి= అడ్డగించి(నివారించి); అధిక త్వరితగతిన్= మిక్కిలి వేగంతో కూడిన విధంగా; అతని చాపంబున్= ఆ భీష్ముడి ధనుస్సును; త్రుంచి= తునుకలు చేసి; అతినిష్ఠుర నారాచంబున్= మిక్కిలి క్రూరమైన బాణాన్ని; తనువు+చొరన్= భీష్ముడి శరీరంలోకి చొచ్చుకొని పోయేటట్లుగా; ఏయుటయున్= వేయగా.

తాత్పర్యం: భీష్ముడు తనమీద ప్రయోగించే బాణాలను నివారిస్తూ, అర్జునుడు చాలావేగంతో ఆ భీష్ముడి వింటిని విరుగగొట్టాడు. ఒక కఠోరమైన బాణాన్ని ఆ భీష్ముడి శరీరంలోనికి చొచ్చుకుపోయేటట్లుగా ప్రయోగించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. తమకుం దమ యోధవరులకును వారింపం జేరం జెనయం గొలఁది గాక వెల్లివిరిసిన శరనిధిభంగిం బొంగిన వివ్వచ్చు వెఱఁగుపడి చూచుచుం దన్ను విడువక కెలంకులనున్న నీ కొడుకులం గలయం గనుంగొని మీ తండ్రి రారాజుతో నిట్లనియె. 402

ప్రతిపదార్థం: తమకున్= తమకుగాని; తమ యోధవరులకును= తమ పక్షంలోని వీరాగ్రేసరులకుగాని; వారింపన్= అడ్డగించడానికి; చేరన్= దగ్గరకువచ్చుటకుగాని; చెనయన్= ఎదిరించడానికి గాని; కొలఁదికాక= సాధ్యం కాకుండా; వెల్లివిరిసిన= పెల్లుగా ఉబ్బిన; శరనిధిభంగిన్= సముద్రం(బాణాల గని)వలె; పొంగినన్= అతిశయించగా; వివ్వచ్చున్= అర్జునుడిని; వెఱఁగుపడి= చేష్టలుమాని; చూచుచున్= కనుగొంటూ; తన్నున్= (భీష్ముడగు) తనను; విడువక= వదలిపెట్టకుండా; కెలంకులన్= ప్రక్కభాగాలలో; ఉన్న= ఉన్నటువంటి; కొడుకులన్= కుమారులను; కలయన్+కనుంగొని= కలయజూచి; తండ్రి= మీ తండ్రియగు భీష్ముడు; రారాజుతోన్= దుర్యోధన మహారాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: తనకు(భీష్ముడికి), దుర్యోధనాదులకు, తమ పక్షంలో వుండే గొప్పవీరులకుగాని, అడ్డగించటానికి, దగ్గరకు పోవటానికి, ఎదిరించటానికి సాధ్యం కాకుండా ఉప్పొంగిన సముద్రంలాగా, ఆటోపంతో వస్తున్న అర్జునుడిని చూచి భీష్ముడు చేష్టలుడిగి, తననెప్పుడూ వదలకుండా రక్షణగా రెండుప్రక్కల ఉండే కుమారు (వయసువార)లను చూస్తూ, దుర్యోధనమహారాజుతో ఇట్లా అన్నాడు:

మ. ' అని దేవాసురకోటి కైనను నశక్యం బిమ్మహావీరు మా
ర్కొన వీఁ డల్గిన మర్త్యు లే యెదు రుదారుండైన యీ క్రీడి ద
క్కిన ని ప్పాండవసైన్య మింతయును ద్రుగ్గింపంగ నేఁ జాలుదున్
విను, సత్యం బిది వీని వింటి కెదురన్ విల్లెత్తలేఁ డెవ్వఁడున్.' 403

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధమందు; ఈ+మహావీరున్= గొప్ప వీరుడైన యీ అర్జునుడిని; మార్కొనన్= ఎదిరించడానికి; దేవ+అసురకోటికైననున్= కోటి సంఖ్యగల దేవతలకు గాని, రాక్షసులకుగాని; అశక్యంబు= సాధ్యంకాదు; వీఁడు= ఈ అర్జునుడు; అల్గినన్ కోపంచెందిన వాడైతే; మర్త్యులు= మనుష్యులు; ఏయెదురు= ఎదుట నిల్తురా?; నిలువలేరు; ఉదారుండు+ఐన= గొప్పవాడైనట్టి; ఈ క్రీడి= ఈ అర్జునుడు; తక్కినన్= లేకుంటే; ఏన్= నేను(భీష్ముడు); ఈ+పాండవ సైన్యము= ఈ పాండవుల సేనను; ఇంతయును= అంతటిని; ద్రుగ్గింపంగన్= చంపటానికి; చాలుదున్= సమర్థుడనగుదును; విను= ఆకర్ణించుము; వీని వింటికిన్= ఈ అర్జునుడి ధనుస్సుకు; ఎదురన్= ఎదురుగా; ఎవ్వఁడున్= ఎట్లాంటి వీరుడైనా సరే; విల్లు+ఎత్తలేడు= విల్లు పట్టుకొనలేడు (ఎక్కుపెట్టలేడు); ఇది= ఈ మాట; సత్యంబు= నిజము.

తాత్పర్యం: 'కోటిమంది దేవతలుగాని, కోటిమంది రాక్షసులుగాని ఈ అర్జునుడిని ఎదిరించలేరు. ఈ అర్జునుడిని ఎదుర్కోవటానికి దేవరాక్షసకోటికే సాధ్యం కాదంటే ఇక మానవులకెట్లు సాధ్యం? (మానవులకు, అర్జునుడిని ఎదిరించడం ఎంతమాత్రం సాధ్యంకాదన్నమాట.) మహావీరుడైన ఈ అర్జునుడు ఒక్కడు పాండవసైన్యంలో లేకుంటే, ఈ సైన్యాన్ని మొదలంటా మట్టుపెట్టటానికి నేనొకడనే చాలేవాడిని. ఓ దుర్యోధనా! నా మాట విను. ఈ అర్జునుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధనుస్సు చేతపట్టుకొంటే, వీడికి ఎదురుగా ఏ మహావీరుడూ కూడా ధనుస్సు పైకెత్తలేడు. ఇక వీడిపై బాణాలు ప్రయోగించే దెక్కడ? ఇది నిజం.'

క. అనునెడ శిఖండిచాపము । వెనుకం దనవిల్లు నిల్పి వెస నాతం డే
సిన భంగిగ నరుఁ డేసెను । జననాయక! దొడ్డనారసంబులు భీష్మున్. 404

ప్రతిపదార్థం: జననాయక!= జనులకు ప్రభువువైన ధృతరాష్ట్రా!; అనున్+ఎడన్= భీష్ముడు ఈవిధంగా చెప్పుతున్న సమయంలో; నరుఁడు= అర్జునుడు; వెసన్= వేగంగా; శిఖండి చాపము వెనుకన్= శిఖండియొక్క వింటికి వెనుకప్రక్కన; తనవిల్లు= తన (అర్జునుడి) యొక్క ధనుస్సును; నిల్పి= ఉంచి; ఆతండు= ఆ శిఖండి; ఏసిన భంగిగన్= బాణాలు ప్రయోగించిన మాదిరిగా; దొడ్డ నారసంబులు= గొప్ప బాణాలతో; భీష్మున్= భీష్మాచార్యుడిని; ఏసెను= కొట్టినాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీష్ము డీ విధంగా దుర్యోధనుడితో చెపుతున్న సమయంలో సందు చూచికొని అర్జునుడు శిఖండి వింటికి వెనుకనే తనవింటిని ఎవ్వరికీ కనిపించకుండా ఆనించి, ఆ శిఖండే బాణాలు ప్రయోగిస్తున్నట్లు చూచేవారికి అనిపించేటట్లుగా గొప్ప బాణాలను ఆ భీష్ముడి మీద ప్రయోగించాడు.

వ. అప్పుడు దేవవ్రతుండు దుశ్శాసను నాలోకించి. 405

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; దేవవ్రతుండు= భీష్ముడు; దుశ్శాసనున్= దుశ్శాసనుని; ఆలోకించి= చూచి

తాత్పర్యం: ఆ విధంగా బలమైన బాణాలను తన మీదికి అర్జునుడు ప్రయోగించినప్పుడు భీష్ముడు దుశ్శాసనుడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. "అశనికల్పము లివి యర్జును బాణముల్ । గాని శిఖండివి గావు సుమ్ము;
కర్కటిగర్భంబు కరణి గాత్రము వ్రచ్చె । నిట్టివి వీనికి నెందుఁ గలవు?
బహ్మాదండంబులపాటి యై మర్మంబు । లిట్టు నోనాటునే? యితని చేత
జముదూత లట్లు ప్రాణముల వెలార్పంగ । నీ ద్రుపదాత్మజుఁ డెన్నఁ డేసె?

ఆ. దృఢవిముక్తములును దీప్తాకృతులు లక్ష్య । శుద్ధిమంతములును సునిశితములు
నైననారసంబు లతనివి గాక యీ । తనివి యగునె? యెవ్విధమునఁ జూడ.' 406

ప్రతిపదార్థం: ఇవి= ఈ బాణాలు; అశనికల్పములు= పిడుగులతో సమానాలు; అర్జును బాణముల్+కాని= అర్జునుడి బాణాలే గాని; శిఖండివి= శిఖండి ప్రయోగించినట్టివి; కావుసుమ్ము= కావుసుమా!; కర్కటిగర్భంబు కరణిన్= ఎండ్రకాయ కడుపులోని పిండంవలె; గాత్రము= శరీరాన్ని; వ్రచ్చెన్= చీల్చివేస్తున్నది; ఇట్టివి= ఈలాంటి బాణాలు; వీనికిన్= ఈ శిఖండికి; ఎందున్+కలవు= ఎక్కడున్నాయి?; బ్రహ్మాదండంబుల పాటియై= బ్రహ్మాదండాలతో సమానమై; ఇతనిచేతన్= ఈ శిఖండిచేత; మర్మంబులు= జీవస్థానాలను; ఇట్టు= ఇంతగా; నోనాటున్+ఏ?= నొప్పించేటట్టు గుచ్చుకుంటాయా?; జముదూతలు+అట్లు= యముడి దూతల మాదిరిగానే; ప్రాణములన్; వెలార్పంగన్= బయటికి లాగేట్టుగా; ఈ ద్రుపద+ఆత్మజుఁడు= ఈ శిఖండి; ఎన్నఁడు= ఏనాడు; ఏసెన్?= బాణాలు ప్రయోగించాడు?; దృఢవిముక్తములునున్= గట్టిగా ఎక్కువగా వదలబడ్డవియు; దీప్త+ఆకృతులు= మండుతూ ఉండే ఆకారం కలవియు; లక్ష్యశుద్ధిమంతములును= గురితప్పకున్నట్టివియు; సునిశితములున్+ఐన= బాగా పదునుగలవియునైన; నారసంబులు= బాణాలు; అతనివిగాక= ఆ అర్జునుడివి కాకపోతే; ఏ+విధమునన్= ఏ విధంగా గాని; చూడన్= చూచినప్పటికీ; ఈతనివి= ఈ శిఖండికి సంబంధించినట్టివి; అగున్+ఎ?= అగునా?

తాత్పర్యం: భీష్ముడు, దుశ్శాసనుడితో ఇట్లా అంటున్నాడు: 'ఇప్పుడు నా మీదపడ్డ బాణాలు పిడుగుల్లా ఉన్నాయి. ఇవి అర్జునుడు ప్రయోగించిన బాణాలే గాని, శిఖండి వేసిన బాణాలు ఎంత మాత్రం కావుసుమా! ఎండ్రకాయ గర్భంలోనుండే పిండం మాదిరి శరీరాన్ని పేల్చివేస్తున్నది. ఇంత ప్రభావంగల బాణాలు వీడి(శిఖండి)కి ఎక్కడున్నాయి? పలు బ్రహ్మదండాలు పైన పడినట్లు ఆయువు పట్టులందు గాఢంగా నాటి నొవ్వజేసే బాణాలు వేయటానికి వీడి (శిఖండి) చేత ఏమౌతుంది? యముడి దూతలు పలువురు ప్రాణి ప్రాణాలను వెలికిలాగే మాదిరి బాణాలు ఈ శిఖండి ఏనాడు ప్రయోగించగలిగాడు? నాపైన బడ్డ ఈ బాణాలు గట్టిగా ఎక్కువగా వేగంగా వదలబడ్డవి, జ్వలిస్తున్నవి, గురితప్పకుండా ఛేదించేవి, చాలా పదును గల్గినట్టివి, అయిన - ఈ బాణాలు అర్జునుడివే సుమా! మన అనుభవంలో ఏనాడూ శిఖండి ఇట్టి తీవ్రమైన ఆయుధాలు ప్రయోగించినవాడు కాడు. పైగా శిఖండి బాణాలకు ఇంతగట్టితనం, వెలుగు, గురితప్పకుండటం, పదును, లేనేలేవు. ఎన్ని విధాల చూచినా ఈ బాణాలు శిఖండివి కానేకావు.'

విశేషం: అలంకారం: మాలోపమ. కర్కటి గర్భము. (ఇది ఒక న్యాయము) ఎండ్రి గర్భం ధరించడం అని అర్థం. ఎండ్రకాయ,గర్భంలో వుండే ప్రాణి, తల్లిఎండ్రిని బ్రద్దలుచేసి బయట పడుతుంది. ఈ బాణాలు మనిషిని చంపిగాని ఇవతలకు రాకున్నవన్నమాట.

బ్రహ్మదండము: బ్రాహ్మణుడి చేత ఉండే యష్టికి సాధారణంగా ఈ పేరు. వసిష్ఠమహర్షిచేతిలోని యోగదండాన్ని కూడా బ్రహ్మదండమంటారు. శ్రీమద్రామయణంలో 'ధి క్బలం క్షత్రియబలం బ్రహ్మతేజోబలం బలమ్। ఏకేన బ్రహ్మదండేన బహవోనాశితా మమ' అని విశ్వామిత్రు డంటాడు. ఒక్క బ్రహ్మదండంతోనే విశ్వామిత్రుడి వాళ్ళు చాలామంది చచ్చారట. ఇక్కడ అనేక బ్రహ్మదండాలతో సాటియైన బాణాలు ఒక్క భీష్ముడి మీద పడ్డాయంటే ఇక వాటి బాధ ఎంతగా వుంటుందో, అట్టి బాధను ఓర్చుకోగలవాడు ఎంత మహావీరుడో ఊహించుకొనవచ్చును. 'జముదూతలట్ల' అని బహువచనంవల్ల, ఒక వ్యక్తిపైన పలువురు యమకింకరులు పడ్డారంటే, ఆ యాతన ఎంతగా ఉంటుందో, అట్టి యాతనను ఓర్చుకోగలిగిన దిట్ట ఎట్టి దేవాంశతో పుట్టాడో ఊహించుకోవచ్చు.

శిఖండి వేసినట్టుగా అర్జునుడు, భీష్ముడి మీదికి ప్రయోగించిన బాణాలను, క్రమంగా, అశనికల్పాలు, కర్కటిగర్భం, బ్రహ్మదండాలు, జముదూతలు, అని నాలుగు ఉపమానాలతో క్రమంగా చెప్పబడింది. మొదటి ఉపమానం వలన శరీరంపై భాగానికి బాగా దెబ్బఅని, రెండవ ఉపమానంవల్ల కడుపులో బాధ అని, మూడోదానివలన ఆయువుపట్టుకు ఆపత్తని, నాలుగో ఉపమానం వలన శరీరంలోని ప్రాణాలు బైటపడతాయని సూచిస్తూ ఇన్నిటిని ఓర్చుకోగల్గిన మహానుభావుడు ముమ్మాటికీ దేవాంశ వల్ల పుట్టిన వాడేనని ఊహించుకోవచ్చును. ఇంతకుముందు వచ్చిన ఒక పద్యంలో 'విను సత్యం బిది వీని వింటికెదురన్ విల్లెత్తలేఁ డెవ్వఁడున్' అని భీష్ముడు రారాజుతో అంటాడు. ఈ పద్యంలో అర్జునుడి బాణాల ధాటికి తట్టుకోలేమంటూ నాలుగు ఉపమానాలతో చక్కగా దుశ్శాసనుడికి నొక్కిచెప్పాడు భీష్ముడు. ఈ అనర్థానికి కారకులైన వారిలో ఈ ఇద్దరూ (దుర్యోధన దుశ్శాసనులు) ముఖ్యులు. ఎంతో సామర్థ్యంతో యుద్ధం చేసి, శత్రుసైన్యాన్ని చించి చెండాడి, ఇప్పుడు విరమించుకుంటూ, ఇక మీరు పాండవులను జయించడం కల్ల. సంధి చేసికొని ప్రాణాలతో బ్రతికి బయటపడండి' అనే సంగతిని వారికి చెప్పక చెప్పినట్లు అనిపిస్తుంది.

క. అనుచుఁ బటుశక్తి నప్పా। ర్థుని వైచిన నది యతండు దునుమాడుడు శాం
తనవుఁడు వాలుం బలకయుఁ। గొని యరదము డిగ్గఁజూచుకొలఁదిం బెలుచన్. 407

ప్రతిపదార్థం: అనుచున్= అని చెపుతూ; పటుశక్తిన్= బలిష్ఠమైన శక్త్యాయుధంతో; ఆ+పార్థుని= ఆ అర్జునుడిని; వైచినన్= విసిరికొట్టగా; అతండు= ఆ అర్జునుడు; అది= ఆ శక్త్యాయుధాన్ని; తునుమాడుడున్= తుంటలు చేయగానే; శాంతనవుఁడు= భీష్ముడు; వాలున్= కత్తిని; పలకయున్= కేడెమును; కొని; అరదము= రథాన్ని; డిగ్గన్= దిగటానికి; చూచుకొలఁదిన్= అనుకొనేంత సమయంలో; పెలుచన్= తేలికగా;

తాత్పర్యం: భీష్ముడు దుశ్శాసనుడితో పై విధంగా చెప్తుతూ ఒక దృఢమైన శక్త్యాయుధాన్ని అర్జునుడిపైకి ప్రయోగించాడు. దాన్ని అర్జునుడు తుంటలు చేశాడు. భీష్ముడు కత్తి, డాలు తీసికొని రథంనుండి దిగేటంతలోపలనే, కోపంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **ఏసి యా రెంటిఁ దునియలు సేసి యెలుఁగు । సూపి యే నుండ వెఱ పేల? నాపగాత**
నూజుఁ బొదువుఁడు మీ' రని యోజఁ జెప్పె । శక్రతనయుండు దనయోధజనుల కెల్ల. **408**

ప్రతిపదార్థం: శక్రతనయుండు= ఇంద్రపుత్రుడు - అర్జునుడు; ఏసి= బాణాలు ప్రయోగించి; ఆరెంటిన్= ఆ కత్తిని, కేడెమును; తునియలు+చేసి= ముక్కలు చేసి; తన యోధ జనులకున్+ఎల్లన్= తన పక్షంలోని వీరులందరికీ; ఎలుఁగున్+చూపి= తన గొంతు సవ్వడి వినిపించి; ఏను+ఉండన్; వెఱపు+ఏల?= భయమెందుకు?; మీరు= మా వైపున ఉండే వీరులైన మీరు; ఆపగాతనూజున్= భీష్ముడిని; పొదువుఁడు= కవియండి; అని; ఓజన్= ఉత్సాహంతో; చెప్పెన్= చెప్పినాడు.

తాత్పర్యం: అర్జునుడు బాణప్రయోగం చేసి, భీష్ముడికత్తిని, పలకను పలుకులు చేసి, గొంతెత్తి తనవైపు ఉన్న వీరవరులకందరితో "నేనున్నానుగా? మీకేమి భయం? మీరందరూ భీష్ముడిని కమ్ముకొనండి' అని ఉత్సాహంతో పలికాడు.

వ. **అ ప్పలుకు లాకర్ణించి.** **409**

ప్రతిపదార్థం: ఆ+పలుకులు= ఆ మాటలు, ఆకర్ణించి= విని.

తాత్పర్యం: అర్జునుడన్న ఆ మాటలు యోధులు విని. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **ఏయుఁడు పొడువుం డడువుఁడు । వ్రేయుఁ డనుచు వారు జాహ్నవీతనయుఁ గడున్**
డాయుఁడు, మన సైనికులుం । గో యని తలపడ్డఁ బోరు ఘోరం బయ్యెన్ **410**

ప్రతిపదార్థం: వారు= ఆ పాండవయోధులు; ఏయుఁడు= బాణాలు ప్రయోగించండి; పొడువుండు= పొడవండి; అడువుఁడు= కొట్టండి; వ్రేయుఁడు= నరకండి; అనుచున్= అంటూ; జాహ్నవీతనయున్= భీష్ముడిని; కడున్ డాయుఁడు= చాలా దగ్గిరికి చేరగా; మన సైనికులున్= మన(కౌరవ) సేనలోనివారున్నూ; కో+అని= 'కో' అని అరుస్తూ; తలపడ్డన్= తాకగా; పోరు= యుద్ధం; ఘోరంబు+అయ్యెన్= భయంకరంగా జరిగింది.

తాత్పర్యం: పాండవపక్షంలోని యోధులు 'బాణాలు ప్రయోగించండి. బల్లేలతో పొడవండి. గుదియలతో కొట్టండి. కత్తులతో నరకండి' అని కేకలు వేస్తూ, భీష్ముడికి చాలా దగ్గిరికి వచ్చారు. అప్పుడు మన(కౌరవ) సైనికులు కూడా బొబ్బలు పెడుతూ శత్రుసైన్యంతో తలపడ్డారు. దానితో యుద్ధం చాలా భయంకరంగా కనిపించింది.

వ. **అప్పుడు.** **411**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: కౌరవ పాండవులకు ఘోరంగా యుద్ధం జరిగే ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **ఏసి గాండీవి కురుసేన నెగువ నతని । వారు వెఱవక భీష్మునిఁ జేరి యొడల**
వ్రేలెఁ డెడ లేనియట్లుగ వివిధభంగి । నిష్ఠురాస్త్రశస్త్రంబుల నినిచి రధిప! **412**

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; గాండీవి= అర్జునుడు; ఏసి= బాణప్రయోగం చేసి; కురుసేనన్= కౌరవుల సైన్యాన్ని; ఎగువన్= తరుమగా; అతనివారు= ఆ అర్జునుడికి సంబంధించిన వీరులు; వెఱవక= భయంలేకుండా; భీష్మునిన్+చేరి= భీష్ముడి దగ్గరకువచ్చి; ఒడలన్= శరీరంమీద; వ్రేలెఁడు+ఎడ= వేలుపట్టే మాత్రంసందు కూడా; లేని+అట్లుగన్= లేకుండా వుండేట్లుగా; వివిధభంగిన్= నానా విధాలుగా; నిష్ఠుర+అస్త్రశస్త్రంబులన్= కఠినములైన బాణాలను ఆయుధాలను; నినిచిరి= నింపేశారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! అర్జునుడు బాగా విజృంభించి, కౌరవ సైనికులను చిందరవందర చేశాడు. అప్పుడు అర్జునుడి పక్షపు వీరులందరూ ఏ మాత్రం జంకూ గొంకూ లేకుండా భీష్ముడికి చాలా దగ్గరగా మూగారు. ఆతడి శరీరంలో వేలెడు చోటు కూడా కాళీ లేకుండా బాణాలతో పరిఘాదులగు ఆయుధాలతో నింపివేశారు.

భీష్ముఁడు శరతల్పగతుఁ డగుట (సం. 6-114-80)

వ. అంతనంశుమంతుండు శాంతుండగుచు వచ్చె; నట్టియెడం గదిసి కవ్వడి గాంగేయుపైఁ గ్రూరనారాచనికరంబు నిగిడించి పడం ద్రోచిన. 413

ప్రతిపదార్థం: అంతన్= ఆ సమయంలో; అంశుమంతుండు= సూర్యుడు; శాంతుండు+అగుచున్‌వచ్చెన్= చల్లబడుతూ వచ్చాడు; అట్టి+ఎడన్= ఆలాంటి సమయంలో; కవ్వడి= అర్జునుడు; గాంగేయుపైన్= భీష్ముడిమీద; క్రూరనారాచనికరంబులు= కఠినములైన బాణాల పరంపరను; నిగిడించి= ప్రయోగించి; పడన్+త్రోచినన్= పడద్రోయగా.

తాత్పర్యం: అట్టి సమయంలో తన ప్రతాపాన్ని బాగా చూపిన సూర్యుడు శాంతించి అస్తమించబోతున్నాడు. అప్పుడు అర్జునుడు సమీపానికి వచ్చి భీష్ముడి మీద కఠోరమైన బాణాల వరుసను గుప్పించి, కూలద్రోశాడు.

క. తూర్పు తలఁ గాఁగ నీ సుతు । లేర్పడఁ గనుఁగొనుచునుండ నిల గంపింపన్
దర్పోజ్జ్వలుఁ డా భీష్ముఁ డహర్పతి । యస్తాద్రి సేరునట్లుగఁ బడియెన్. 414

ప్రతిపదార్థం: నీ సుతులు= ధృతరాష్ట్రుడవైన నీ యొక్క కుమారులు; ఏర్పడన్= బాగా తెలిసేటట్టు; కనుఁగొనుచున్+ఉండన్= చూస్తూ ఉండగా; ఇల= భూమి; కంపింపన్= వడకుచుండగా; దర్ప+ఉజ్జ్వలుఁడు= పౌరుషంతో ప్రకాశిస్తుండే; ఆ భీష్ముఁడు; అహర్పతి= సూర్యుడు; అస్త+అద్రి= పడమటికొండను; చేరు+అట్లుగన్= చేరేమాదిరిగా; తూర్పుతలఁగాఁగన్= తూర్పుదిక్కు తల ఉండేటట్లుగా; పడియెన్= పడ్డాడు.

తాత్పర్యం: కౌరవకుమారులందరు చూస్తూ ఉండగా, భూమి వణకిపోతూ ఉండగా, దర్పంతో వెలిగే ఆ భీష్ముడు సూర్యుడు పడమటికొండకు చేరే విధంగా, తూర్పుతలగా ఒరిగాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. తనువు ధరఁ బొందకుండఁగఁ దల్పభంగి । శరము లూఁత యై పొలుపారె నరవరేణ్య!
యట్లు శరతల్పగతుఁ డగు నమ్మహాను । భావు దేవవ్రతుని దేవభావ మొందె. 415

ప్రతిపదార్థం: నరవరేణ్య!= ధృతరాష్ట్రమహారాజా! తనువు= శరీరం; ధరన్= భూమిని; పొందక+ఉండఁగన్= తాకకుండా ఉండేటట్లుగా; తల్పభంగి= పాన్పుమాదిరి; శరములు= బాణాలు; ఊఁత+ఐ= ఆధారంగా; పొలుపు+ఆరెన్= ఒప్పింది; అట్లు= ఆ విధంగా; శరతల్పగతుఁడు+అగు= బాణాలపాన్పును కలిగినట్టి; ఆ+మహానుభావున్= ఆ మహానుభావుడైన; దేవవ్రతునిన్= భీష్ముడిని; దేవభావము= దేవత్వము(దేవునితనము); ఒందెన్= పొందింది.

తాత్పర్యం: భీష్ముడి శరీరం భూమిని తాకకుండా, పానుపుమాదిరి, బాణాలు ఆధారంగా అమరాయి. ఆ విధంగా బాణాల పాన్పుపై పరుండిన ఆ మహాశయుడిని దేవత్వం ఆవహించింది. అంటే ఆయన దేవుడుగా అగుపడ్డాడు.

చ. **అనిమిషు లప్డు సూచి 'మృతుఁ డయ్యెడు నక్కట! దక్షిణాయనం**
బునఁ గృతపుణ్యుఁ డంచు వగఁ బొందిన భీష్ముఁ డెఱింగి వారి కి
ట్లను 'సురలార! కాలగతి నాత్మఁ దలంచియ కాదె? మేనిలో
నునిచినవాఁడఁ బ్రాణముల నుమ్మలికింపకుఁ డించుకేనియున్. **416**

ప్రతిపదార్థం: అప్డు= ఆ సమయంలో; అనిమిషులు= దేవతలు; చూచి= భీష్ముడు పడటం తిలకించి; అక్కట!= అయ్యో! కృతపుణ్యుఁడు= చేయబడ్డ పుణ్యాంకలవాడు(పుణ్యాత్ముడు); దక్షిణ+అయనంబునన్= దక్షిణాయనంలో; మృతుఁడు+అయ్యెడున్= చనిపోతాడు; అంచున్= అనుకొంటూ; వగన్= పరితాపాన్ని; పొందినన్= చెందగా; భీష్ముఁడు; ఎఱింగి; వారికిన్= ఆ దేవతలకు; ఇట్లు+అనున్= ఇట్లా అంటాడు; సురలార!= ఓ దేవతలారా!; కాలగతిన్= కాలముయొక్క గతిని(మరణాన్ని); ఆత్మన్= మనస్సులో; తలంచి+అ+కాదె?= ఎరిగేకదా; ప్రాణములన్= ప్రాణాలను; మేనిలోన్= శరీరంలో; ఉనిచినవాఁడన్= ఉంచికొన్నాను; ఇంచుక+ఏనియున్= కొంచెంకూడా; ఉమ్మలికింపకుఁడు= బాధపడకండి.

తాత్పర్యం: ఆ భీష్ముడు నేల కొరగడాన్ని దేవతలు చూచి 'అయ్యో! పాపం ఇతడెంతో పుణ్యాత్ముడే! నరకానికి మార్గమైన దక్షిణాయనంలో మరణిస్తున్నాడే!' అని వాపోవటాన్ని భీష్ముడు తెలిసికొని వారితో 'దేవతలారా! దక్షిణాయనకాలము యొక్క గమనా(మరణాన్ని)న్ని మనస్సున ఎరిగేకదా - ప్రాణాలను నా బొందిలో నిల్పుకొన్నాను. మీరు కొంచెం కూడా విచారించకండి'.

వ. **సత్యవతీవివాహం బొనర్చుటకు మాతండ్రి మెచ్చి నా కవధ్యత్వంబును స్వచ్ఛందమరణంబును నిచ్చినవాఁడు గావునఁ దద్వరప్రభావంబున నావధంబున కే నొడంబడక కానేరదయ్యెఁబ్రాణంబులు నా వశంబ' యనిన విని వారలు సంతోషించి రాసమయంబున భాగీరథి పనుపునం గొందఱు మునివరులు హంసరూపంబుల నమ్మహాత్మునకు దక్షిణాయనం బెఱింగింపం జనుదెంచి యతండు దెలిసియునికి నతనిచేత నెఱింగి ప్రియం బంది యేఁగి రట్టియెడ దుర్యోధనుండు వుచ్చిన దుశ్శాసనుండు గుంభసంభవుపాలికింబోయి భీష్ముపాటు సెప్పిన నతండు మూర్ఛిల్లి యొక్కింత దెఱి దీనాననుం డగుచు నమ్మహీనాథుకడకుం జనియె నయ్యవసరంబున.** **417**

ప్రతిపదార్థం: సత్యవతీ వివాహంబున్= దాశరాజ కన్యక సత్యవతితో పెండ్లిని; ఒనర్చుటకున్= చేసినదానికి; మా తండ్రి= మా తండ్రి శంతను మహారాజు; మెచ్చి= సంతోషపడి; నాకున్= నాకు; అవధ్యత్వంబును= చంపబడకుండటాన్ని; స్వచ్ఛందమరణంబునున్= ఇష్టం వచ్చినపుడు చనిపోవడాన్ని; ఇచ్చినవాఁడు= ఇచ్చాడు; కావునన్= కాబట్టి; తద్+వరప్రభావంబునన్= ఆ వరాల మహిమవల్ల; నా వధంబునకున్= నా యొక్క మరణానికి; ఏన్+ఒడంబడక= నే నొప్పుకోకుండా; కానేరదు+అయ్యెన్= జరగదాయెను; ప్రాణంబులు= ప్రాణాలు; నా వశంబు+అ= నా అధీనమే; అనినన్= అని చెప్పగా; వారలు= ఆ దేవతలు; సంతోషించిరి; ఆ సమయంబునన్; భాగీరథి పనుపునన్= గంగానది పంపగా; హంసరూపంబులన్= హంసల ఆకారాలతో; కొందఱు మునివరులు= కొంతమంది ఋషిపుంగవులు; ఆ+మహాత్మునకున్= ఆ మహాత్ముడికి; దక్షిణాయనంబు= ఇప్పుడు దక్షిణాయనమని; ఎఱింగింపన్= తెలియచెప్పడానికి; చనుదెంచి= వచ్చి; అతండు= ఆ భీష్ముడు; తెలిసియునికిన్= తెలిసికొని ఉండటాన్ని; అతనిచేతన్= ఆ భీష్ముడిచేత; ఎఱింగి= తెలిసికొని; ప్రియంబు+అంది= సంతోషంచెంది; ఏఁగిరి= వెళ్ళారు; అట్టి+ఎడన్; దుర్యోధనుండు;

పుచ్చిన(న్)= ఆజ్ఞాపించగా; దుశ్శాసనుండు; కుంభసంభవు పాలికిన్= ద్రోణాచార్యుడి దగ్గరకు; పోయి= వెళ్ళి; భీష్మపాటు= భీష్ముడు పడడాన్ని; చెప్పినన్= చెప్పగా; అతండు= ఆ ద్రోణుడు; మూర్ఛిల్లి= మూర్ఛచెంది; ఒక్క+ఇంతన్= ఒక కొంచెం; తేఱి= తెప్పిరిల్లుకొని; దీన+ఆననుండు+అగుచున్= తెల్లబోయిన మొగం కలవాడై; ఆ+మహీనాథుకడకున్= ఆ భీష్ముడి వద్దకు; చనియెన్= వెళ్ళాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయాన.

తాత్పర్యం: సత్యవతిని పెండ్లాడడానికి అనుకూలపడటం వల్ల మా తండ్రి శంతనుడు సంతోషపడి నాకు ఎవ్వరిచేతనూ చంపబడకుండటం, నా ఇష్టానుసారంగా చనిపోవటం - అనే రెండు వరాలిచ్చాడు. ఆ వరాల ప్రభావంవల్ల నేననుకొంటేనే గాని నాకు మరణం కలుగదు. నా ప్రాణాలు నా చెప్పుచేతల్లో ఉంటాయి' అన్నాడు భీష్ముడు. దేవతలు విన్నారు - సంతోషపడ్డారుకూడా. అదే సమయంలో గంగానది చెప్పి పంపగా కొందరు ఋషులు హంసల రూపాలలో భీష్ముడి దగ్గరకు అది దక్షిణాయనమని తెల్పడానికి వచ్చారు. భీష్ముడది ఎరిగి ఉన్నాడని అతనివల్లే తెలిసికొని, ప్రియంతో వెళ్ళిపోయారు. అప్పుడు దుర్యోధనుడు ఆజ్ఞచేయగా దుశ్శాసనుడు ద్రోణాచార్యుడి వద్దకు వెళ్ళి, భీష్ముడి పతనాన్ని గూర్చి చెప్పాడు. ద్రోణుడు మూర్ఛపోయి, కొంచెం సేపటికి తెప్పిరిల్లాడు. బిక్కమొగం వేసికొని తొందరగా భీష్ముడి దగ్గరకు వెళ్ళాడు. (ఆ సమయంలో పాండవులు సంతోషపడ్డారు. కౌరవులు ఏడ్చారు.)

సీ. పాండవేయులు మాత్స్య పాంచాలయాదవ। సహితంబుగా సంతసమునఁ బొదలి;
రాదెస బొబ్బలు నార్పులు బహుతూర్య। కోటియుఁ జెలఁగె; నీకొడుకుగమియు
నీదిక్కుదొరలును నెలుఁగెత్తి యేడ్వంగ। నంబరచరుల హాహారవంబు
లులియంగ రోదసి గలయంతవట్టును। ఘనశబ్దమయమయ్యె మనుజనాథ!

తే. కాలుసేయార్చుటలు లేక కన్నుఁగవల। నశ్రు లొలుకంగఁ జిత్తంబు లడలఁ బాండు
సూనుతతిఁ జూచుచుండిరి గాని యించు। కయును గడఁగరు మనవారు గయ్యమునకు. **418**

ప్రతిపదార్థం: మనుజనాథ!= ప్రభువగు ధృతరాష్ట్రా!; ఆ దెస= పాండవపక్షంలో; పాండవేయులు= పాండవుల సంతానము; మాత్స్య= మత్స్య దేశరాజు; పాంచాల= ద్రుపదుడు; యాదవ= యదువంశంవారు; వీరితో; సహితంబుగాన్= కూడుకొన్నట్లుగా; సంతసమునన్= ఆనందంతో; పొదలిరి= ఉప్పొంగిపోయారు; బొబ్బలు= గర్జనలు; ఆర్పులు= బిగ్గరగా అరవటాలు; బహుతూర్య కోటియున్= నానావిధాలైన వాద్య విశేషాల అనేకాలున్నూ; చెలఁగెన్= చెలరేగాయి; నీ కొడుకు గమియున్= నీ కొడుకుల సమూహం; ఈ దిక్కుదొరలును= ఈ కౌరవుల పక్షాన ఉన్న రాజులున్నూ; ఎలుఁగు+ఎత్తి= గొంతెత్తి; ఏడ్వంగన్; అంబరచరుల= ఆకాశంలో తిరిగేవారి యొక్క; హాహారవంబులు= హాహా అనే అరుపులు; ఉలియంగన్= మ్రోయగా; రోదసిగలయంత+పట్టును= భూమి ఆకాశాల మధ్యభాగం అంతా కూడా; ఘనశబ్దమయము+అయ్యెన్= గొప్ప(మేఘములయొక్క అని అర్థాంతరము) ధ్వనితో నిండిపోయింది; మనవారు= కౌరవసేనలోనివారు; కాలు+చే= కాలు చేతులు; ఆర్చుటలులేక= కదలించటాలు లేకుండా; కన్ను+కవలన్= రెండుకళ్ళనుండి; అశ్రులు= కన్నీటిబొట్లు; ఒలుకంగన్= చిందగా; చిత్తంబులు= మనస్సులు; అడలన్= భయంచెందగా; పాండుసూనుతతిన్= పాండవుల సంఘాన్ని; చూచుచుండిరి+కాని= చూస్తూ నిలబడ్డారేగాని; కయ్యమునకున్= యుద్ధానికి; ఇంచుకయున్= కొంచెంకూడా; కడఁగరు= పూనుకొనరు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా!, పాండవులు, వారి సంతానం, మత్స్య ద్రుపద యాదవులతోపాటు ఆనందంతో ఉబ్బిపోయారు. గర్జనలు చేశారు. పొలికేకలు పెట్టారు. దీనికి తోడు వారి బహువిధాలైన భేరీ భాంకారాదుల చప్పుళ్ళు ఉప్పతిల్లాయి. నీ అందరు కొడుకులు, ఈ పక్షంలో ఉండే రాజులు గొంతు విప్పి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బోరుమంటూ ఏడవసాగారు. ఆకాశంలో సంచారం చేసే దేవగంధర్వకిన్నరాదుల హాహాకారాలు దీనికి తోడు కాగా, భూమి ఆకాశాల మధ్య గల భాగమంతా పెద్ద (మేఘ) ధ్వనితో నిండిపోయింది. ఇక మన (కౌరవ) పక్షంలోని వారు కాలు, చేయి కూడా కదల్చలేక పోయారు. కన్నీటి ధారలను కార్చుతున్నారు. మనస్సుల్లో హడలెత్తగా, ఊరకే పాండవుల దండును చూస్తూ ఉండిపోయారే గానీ, యుద్ధం చేయడానికి కొంచెం కూడా యత్నించనే లేదు.

విశేషం: 'ఘనశబ్దమయమయ్యె' - గొప్ప ధ్వనితో నిండినదయ్యెను - ఉఱుములతో నిండిన దయ్యెనని అర్థాంతరము, ఘన శబ్దము శ్లిష్ట పదము గొప్పదని, మేఘమని దానికర్థము.

వ. తదవసరంబున నంబరమణి యపరరత్నాకరంబు సొచ్చె ననిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 419

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; అంబరమణి= సూర్యుడు; అపరరత్నాకరంబున్= పడమటి సముద్రాన్ని; చొచ్చెన్= ప్రవేశించాడు; అనినన్= అని చెప్పగా; విని; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అప్పుడు సూర్యుడు అస్తమించాడు.' అని సంజయు డనటాన్ని విన్నట్టి ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు:

క. ' నాయుల్ల మరయ నినుమో? । ఱాయో? కా కిట్లు రూపఱక విన నోర్చెన్
సాయకసముదయఖరభవ । దీయవచనచయము గవియుదేరం దిర మై. 420

ప్రతిపదార్థం: అరయన్= చూడగా; నా ఉల్లము= నాయొక్క మనస్సు; ఇనుము+ఓ?= ఇనుపముద్దయో?; ఱాయి+ఓ?= బండయో?; కాక= కాకుంటే; సాయక= బాణాలయొక్క; సముదయ= వరుసవలె; ఖర= పదునైన; భవదీయ= నీ నుండి వచ్చేవైన; వచన= మాటలయొక్క; చయము= గుంపు; కవియుదేరన్= వ్యాపిస్తూ ఉన్నప్పటికి; తిరము+ఐ= స్థిరంగా ఉన్నట్టిదై; ఇట్లు; రూపు+అఱక= నశించిపోకుండా; వినన్+ఓర్చెన్= వినగల్గింది.

తాత్పర్యం: 'ఓ సంజయా! ఆలోచిస్తే నా మనస్సు (హృదయం) ఇనుప ముద్దయో, రాయియో అయి ఉంటుంది. లేకపోతే అనేక బాణాల వలె కఠకైన నీ మాటల వరుసలు నాపై వ్యాపించినా కూడా దిట్టంగా, బద్దలు కాకుండా ఉండి వినగల్గుతున్నది.

వ. ఇంక నేనేమియుం జెప్పం గొఱంత గలదే' యనుటయు నాసూతనందనుం డి ట్లనునప్పుడు కౌరవులుం దారును దమవారును మైమఱువులూడ్చి యాయుధంబులు వెట్టి గాంగేయుకడకుం బోయిరి. కౌంతేయులు నట్ల బంధుమిత్త్రసహితు లయి యచటికిం జనిరి. ధనంజయుం డొక్కరుండును ధనుష్పాణి యై యరిగె ని ట్లయ్యిరుదెఱంగులవారలుం దత్కాలప్రశాంతస్వాంతులైయన్యోన్యవిషయరోషంబులు దక్కితన్నుం బరివేష్టించినం గులగురుం డగు నమ్మందాకినీనందనుండు వారి నభినందించి కొలిపించికొని యుండె. 421

ప్రతిపదార్థం: ఇంకన్= ఇకమీద; ఏను= నేను(ధృతరాష్ట్రుడు); ఏమియున్= ఏమైనా; చెప్పన్= చెప్పడానికి; కొఱంత= తక్కువ; కలదు+ఏ?= ఉన్నదా?; అనుటయున్= అని చెప్పగా; సూతనందనుండు= సంజయుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; అప్పుడు= ఆ సమయంలో; కౌరవులున్= కౌరవులును; తారును= తామున్నూ; తమవారును= తమకు సంబంధించిన వారున్నూ; మైమఱువులు= కవచాలు; ఊడ్చి= తీసిపెట్టి; ఆయుధంబులు= అస్త్రశస్త్రాలను; పెట్టి= ప్రక్కనపెట్టి; గాంగేయుకడకున్= భీష్ముడివద్దకు; పోయిరి= వెళ్ళారు; కౌంతేయులు= కుంతికొడుకులు; అట్లు+అ= ఆవిధంగా; బంధుమిత్ర సహితులు+ అయి=

చుట్టాలతో, స్నేహితులతోకూడి; అచటికిన్= భీష్ముడున్న ఆ చోటికి; చనిరి= పోయారు; ధనంజయుండు= అర్జునుడు; ఒక్కరుండును= ఒకడు మాత్రం; ధనుస్+పాణియై= విల్లుచేతియందు కలవాడై; అరిగెన్= వెళ్ళాడు; ఇట్లు= ఈ విధంగా, ఆ+ఇరుతెఱంగులవారలున్= ఆ రెండు పక్షాలవారున్నూ; తద్+కాల ప్రశాంత స్వాంతులు+ఐ= ఆ సమయానికి కోపం లేని మనస్సు కలవారై; అన్యోన్య విషయ రోషంబులు= ఒండొరుల విషయమైన కోపం; తక్కి= వదలి; తన్నున్= ఆ భీష్ముడిని; పరివేష్టించినన్= చుట్టి ఉండగా; కులగురుండు+అగు= వంశానికే, (గొప్పవాడు); గురువు అయినట్టి, ఆ+మందాకినీ నందనుండు= ఆ భీష్ముడు; వారిన్= ఆ వచ్చిన కౌరవ పాండవులను; అభినందించి= పొగడి; కొలిపించుకొని యుండెన్= సేవలు చేయించుకొన్నాడు.

తాత్పర్యం: ఇంక నేనేమైనా చెప్పడానికి ఉన్నదా?' అన్నాడు ధృతరాష్ట్రుడు. దానికి సంజయుడు ఇట్లా అన్నాడు: 'అప్పుడు తాము కౌరవులు, వారికైనవారు, కవచాలు ఊడదీసిపెట్టి, ఆయుధాలన్నీ ఒకచోట పెట్టి, భీష్ముడి వద్దకు వెళ్ళారు. ధర్మరాజాదులు కూడా తమ బంధువులతో, మిత్రులతో కూడా ఆ భీష్ముడున్న చోటికి వెళ్ళారు. ఒక్క అర్జునుడు మాత్రం ధనుస్సు చేతబట్టుకొని ఆయన దగ్గరికి వెళ్ళాడు. ఇట్లు ఆ ఇరువర్గాలవారున్నూ ఆ సమయానికి వారికి గల కోపాలు మానుకొని ఆ భీష్ముడి చుట్టూ మూగారు. కులానికంతా పెద్దయైన ఆ భీష్ముడు వారిని కొనియాడి, తత్కాలానికి తనకు కావలసిన ఉపచారాలను వారిచే చేయించికొన్నాడు.

తే. **తనకుఁ గ్రిందల యని భవత్తనయులకు నె । ఱుఁగఁ జెప్పిన వారు గడంగి మెత్తఁ**
దనముగల తలగడలు దేఁబనుచుటయును । జూచి చిఱునవ్వుతో సవ్యసాచిఁ బిలిచె.' 422

ప్రతిపదార్థం: తనకున్= భీష్ముడికి; క్రిందల= తల అడుగు భాగం - తలగడ; అని; భవత్తనయులకున్= నీ కొడుకులకు; ఎఱుంగన్+చెప్పినన్= (తనకు తలగడ కావాలని) తెలియచెప్పగా; వారు= నీ కొడుకులు; కడంగి= ప్రయత్నించి; మెత్త(దనమున్+కల= మృదుత్వం కలిగినట్టి; తలగడలున్= దిండ్లు; తేన్+పనుచుటయునున్= తేవటానికి పంపగా; చూచి= భీష్ముడు తిలకించి; చిరునవ్వుతో; సవ్యసాచిన్= అర్జునుడిని; పిలిచెన్= పిలిచాడు.

తాత్పర్యం: భీష్ముడు తనకు తల క్రిందకు దిండు(తలగడ) కావాలని నీ పుత్రులతో చెప్పాడు. వారు మెత్తని దిండ్లు తెండని పనివారికి ఉత్తరువు చేశారు. భీష్ముడు చిరునవ్వుతో అర్జునుడిని చూచి దగ్గరకు పిలిచాడు.

క. **పిలుచుటయు నతఁడు బాష్పము । లొలుకఁగ గాండివము వెట్టి యొయ్యన చనినం**
'దలగడతూపులు సెజ్జకు । నలవడఁ బెట్టు' మని భీష్ముఁ డాతనిఁ బనిచెన్. 423

ప్రతిపదార్థం: పిలుచుటయున్= పిలువగా; అతఁడు= ఆ అర్జునుడు; బాష్పములు= కన్నీళ్ళు; ఒలుకఁగన్= కారుతుండగా; గాండివమున్= గాండీవమనే తన వింటిని; పెట్టి= ప్రక్కన ఉంచి; ఒయ్యనన్= మెల్లగా; చనినన్= దగ్గరకుపోగా; సెజ్జకున్= పాన్పునకు; తలగడ తూపులు= దిండైన బాణాలు; అలవడన్= తగినట్టుగా; పెట్టుము+అని= ఉంచుము అని; భీష్ముడు; ఆతనిన్= ఆ అర్జునుడిని; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: భీష్ముడు తనను పిలవగానే, అర్జునుడు కంటనీరు కార్చుకొంటూ, తన గాండీవాన్ని (వింటిని) అవతలపెట్టి, వినయంతో మెల్లగా అతడి దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు భీష్ముడు 'ఈ బాణాల పాన్పునకు సరిపడేటట్లుగా తూపుల దిండుపెట్టుము' అని ఆనతిచ్చాడు.

వ. **ఇట్లు పనిచినం బార్థుం డట్ల చేయుదు నని గాండివంబు పుచ్చికొని మఱియు ననుజ్ఞ గొని మూఁడు వాలమ్ము లభిమంత్రించి పెడతలఁ దాకి యెత్తి పట్టుకొని పుంఖంబులు భూమి మోచి నిలుచునట్లుగా నేసినం దాత**

ప్రీతుండై తల్పంబునకుందగిన యుపధానంబు వెట్టితని యతనింగొనియాడి సకలపౌత్రులను ధాత్రీపతులను నవలోకించి. 424

ప్రతిపదార్థం: ఇట్లు; పనిచినన్= ఉత్తరువు చేయగా; పార్థుండు; అట్ల చేయుదున్+అని= అట్లే చేస్తానని అంటూ; గాండివంబున్; పుచ్చికొని= తీసికొని; మఱియున్= మరల; అనుజ్ఞన్= ఆజ్ఞను; కొని= పొంది; మూఁడు; వాలు+అమ్ములు= పదునుగల బాణాలు; అభిమంత్రించి= మంత్రంవేసి; పెడతలన్= తలయొక్క వెనుక ప్రక్క; తాఁకి= ముట్టి; ఎత్తిపట్టుకొని= పైకెత్తి పట్టుకొని; పుంఖంబులు= బాణాల క్రిందికొనలు; భూమి(న్)= నేలమీద; మోచి= ఆనుకొని; నిలుచున్+అట్లు+కాన్= నిలబడే విధంగా; ఏసినన్= బాణాలు వేయగా; తాత= పితామహుడైన భీష్ముడు; ప్రీతుండు+ఐ= ప్రీతి చెందినవాడై; తల్పంబునకున్= పానుపునకు; తగిన= తగ్గట్టి; ఉపధానంబున్= తలగడను; పెట్టితి(వి)+అని= పెట్టావని; అతనిన్= ఆ అర్జునుడిని; కొనియాడి= పొగడి; సకలపౌత్రులను= అందరు మనుమలను; ధాత్రీపతులనున్= దొరలను; అవలోకించి= చూచి.

తాత్పర్యం: పై విధంగా భీష్ముడు అర్జునుడిని ఆజ్ఞాపించాడు. అట్లే చేస్తానని అర్జునుడు తన గాండీవాన్ని ఎత్తుకొన్నాడు. మళ్ళీ అనుజ్ఞ తీసికొన్నాడు. మూడు పదునుగల బాణాలను బాగా మంత్రించి, భీష్ముడి తలయొక్క వెనుక భాగాన్ని ఎత్తి పట్టుకొని, ఆ మంత్రించిన బాణాలను ప్రయోగించాడు. వాటి కొనలు నేలకు గట్టిగా గుచ్చుకొని, చక్కగా నిలబడ్డాయి. భీష్ముడు చూచి, సంతోషపడ్డాడు. అంపశయ్యకు అనువైన దిండు పెట్టినందుకు అతడిని పొగిడాడు. తన మనుమ లందరనూ దొరలనూ చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ' రవిఁ గొల్చి యుత్తరాయణ । మవునంతకు నంపపాన్పునం దిట్లు మహో
త్సవలీల నిలుతు నా కీ । దివసంబులఁ జేయవలయుఁ దృఢతరరక్షన్. 425

ప్రతిపదార్థం: రవిన్= సూర్యుడిని; కొల్చి= ఆరాధించి; ఉత్తర+అయనము= ఉత్తరాయణము; అవు+అంతకున్= అయ్యేటంతవరకు; అంపపాన్పునందున్= బాణాల శయ్యపై; ఇట్లు= ఈ విధంగానే; మహా+ఉత్సవలీలన్= మహానందాన్ని కలిగించే రీతులతో; నిలుతున్= ప్రాణాలతో ఉంటాను; నాకున్= భీష్ముడనైన నాకు; ఈ దివసంబులన్= పాన్పున ఉండే ఈ దినాలలో; తగన్= తగినట్లుగా; దృఢతర రక్షన్= గట్టికాపలాను; చేయవలయున్.

తాత్పర్యం: 'సూర్యుడిని ఆరాధిస్తాను. ఉత్తరాయణం వచ్చేదాకా ఈ బాణాల పడకపైన ఇట్లాగే ఉండి ఆనందంతో, ఉత్సాహంతో కాలం గడుపు ఈ దినాలలో నాకు తగినవిధంగా చక్కని కాపలా మీరు ఏర్పాటు చేయాలి.

క. అలయ కరయ నోపినవా । రలు గ్రక్కునఁ బరిఖతోడి ప్రాకారం బి
ట్టలముగఁ గావింపుఁ' డనుడుఁ । దలకొని నీసుతులుఁ బాండు తనయులు భక్తిన్. 426

ప్రతిపదార్థం: అలయక= శ్రమము లేకుండా; అరయన్= చూసుకోవడానికి; ఓపినవారలు= చాలినవారు; గ్రక్కునన్= వెంటనే; పరిఖతోడి= అగడ్తలతో కూడిన; ప్రాకారంబున్= ప్రహరీగోడలను; ఇట్టలముగన్= బాగా ఎత్తుగా; కావింపుఁడు= ఏర్పరచండి; అనుడున్= అని చెప్పగా; భక్తిన్= భక్తితో; నీ సుతులు= నీ కుమారులు, పాండుతనయులు= పాండురాజు కొడుకులు; తలకొని= ప్రయత్నపడి

తాత్పర్యం: శ్రమ లేకుండా చూచుకొనగల వారు నాకు బాగా కాపుగా ఉండాలి. వెంటనే అగడ్తలు గల ప్రాకారాన్ని ఎత్తుగా నా చుట్టూ కట్టించండి'. అనగానే భక్తితో కౌరవులు, పాండవులు కూడా ప్రయత్నపడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అత్తెఱం గాచరింపనుం దాత్పర్యంబున రక్షింపనుం దమతమయందుఁ దగినవారల నియోగించి రంతఁ జికిత్సకులు వచ్చి శల్యచికిత్స సేసెద మని తొడంగిన గాంగేయుండు వారించి వారి కభిమతార్థంబు లొసంగి వీడుకొల్పె గీతవాద్యనృత్తప్రవీణంబు లగు పాత్రంబు లమ్మహాత్మునకు వినోదంబు సలుపుచుండె నట్టియెడ నాదేవవ్రతుండు నీళ్ళు ద్రావ నడిగినం దనుపారు నీ రనేకులు గొనివచ్చిన నతండు. 427

ప్రతిపదార్థం: ఆ+తెఱంగు= ఆ విధంగా; ఆచరింపనున్= చేయటానికిన్నీ; తాత్పర్యంబునన్= తత్పరతతో; రక్షింపనున్= కాపాడ్డానికి; తమ తమ యందున్= వారి వారిలో; తగినవారలన్= అర్హులైనవారిని; నియోగించిరి= ఏర్పాటు చేశారు; అంతన్= అంతట; చికిత్సకులు= వైద్యులు; వచ్చి= సమీపించి; శల్యచికిత్సన్= ఎముకలకు సంబంధపడిన వైద్యాన్ని; చేసెదము+అని= చేస్తామని; తొడంగినన్= ఆరంభించగా; గాంగేయుండు= భీష్ముడు; వారించి= వద్దని చెప్పి; వారికిన్= ఆ వైద్యులకు, అభిమత+ అర్థంబులు= ఇష్టమైన వస్తువులు; ఒసంగి= ఇచ్చి; వీడుకొల్పెన్= పంపివేశాడు; గీతవాద్యనృత్త ప్రవీణంబులు+అగు= పాటలో; వాద్యంలో; ఆటలో నేర్పరులైన; పాత్రంబులు= వేషధారులు; ఆ+మహాత్మునకున్= ఆ మహానుభావుడి(భీష్ముడి)కి; వినోదంబు= కాలక్షేపాన్ని(వేడుకను); సలుపుచుండెన్= కలిగిస్తూ ఉండిరి; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; నీళ్ళు= నీటిని; త్రావన్= త్రాగటానికి; అడిగినన్= కోరగా; అనేకులు= చాలామంది; తనుపు+ఆరు= తృప్తిగలిగించే; నీరు= నీళ్ళను; కొనివచ్చినన్= తీసికొని రాగా; ఆతండు= ఆ భీష్ముడు.

తాత్పర్యం: అగడ్తతోపాటు ప్రాకారాన్ని కట్టటానికి, కంటిని రెప్పవలె ఏమరకుండా కాపాడుతూ ఉండటానికి, ఇరుపక్షాలవారు (కౌరవపాండవులు) తమలో సమర్థులైన వారిని నియమించారు. ఇంతలో వైద్యులు దెబ్బతిన్న ఎముకలకు వైద్యం చేస్తామంటూ వచ్చారు. భీష్ముడు వైద్యం అక్కరలేదంటూ, వారికి కావలసిన అమూల్యాలైన వస్తువుల నిచ్చి సత్కరించి పంపించివేశాడు. సంగీతం పాడేవారు, వీణా వేణు మృదంగాది వాద్యాలు బాగా వాయించేవారు, నాట్యం, అభినయం బాగా చేయగలవారు ఆ మహనీయుడికి ఉబుసుపోక (వేడుక)ను కల్గిస్తున్నారు. ఇంతలో ఆతడికి (భీష్ముడికి) గొంతెండిపోయింది. త్రాగటానికి నీళ్ళు కావాలన్నాడు. చాలామంది చల్లని పానీయాలు తెచ్చి ఇచ్చారు. కాని ఆతడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'వినుఁడు శరతల్పగతుఁడ నై యునికిఁజేసి । యన్యసలిలంబు సేవించు టనుచితంబు
నాకుఁదేజోమయాస్త్రవిన్యాసవిధి స । ముత్థితం బైన భూజల మొకఁడు దక్క'. 428

ప్రతిపదార్థం: వినుఁడు= వినండి; శరతల్పగతుఁడన్+ఐ= బాణాల పాన్పులో పడుకొన్నవాడనై; ఉనికిన్+చేసి= ఉండే కారణం వల్ల; నాకున్= నాకు; తేజోమయ= తేజస్సుతో నిండిన; అస్త్ర= మంత్రపూతమైన బాణం యొక్క; విన్యాసవిధి= ప్రయోగించే విధానము చేత; సముత్థితంబు+ఐన= పుట్టినట్టి; భూజలము= భూమిలోపలినుండి వెలువడినట్టి నీరు; ఒకఁడు= ఒకటి; తక్కన్= తప్ప; అన్యసలిలంబు= ఇతరమైన నీరు; సేవించుట= త్రాగుట; అనుచితంబు= తగదు.

తాత్పర్యం: 'వినండి. నేనిప్పుడు బాణాల పాన్పుపై పడుకొని ఉన్నాను కాబట్టి, తేజోమయమైన బాణాన్ని ప్రయోగించడం వల్ల భూమి లోపలినుండి వెలికి పుట్టుకొనివచ్చే నీళ్ళను మాత్రమే త్రాగుతాను కానీ ఇతరమైన నీటిని త్రాగను. కావున మీరిచ్చిన ఈ నీరు నాకు తగదు'.

తే. అనుటయుఁ గౌరవులును దక్కటి రాజులును వెఱఁగుపడియున్నం గవ్వడిం గనుంగొని గాంగేయుండు. 429

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; కౌరవులును(న్)= దుర్యోధనుడు మున్నుగా గలవారు; తక్కటి రాజులును= ఇతరులైన దొరలున్నూ; వెఱఁగుపడి= ఆశ్చర్యపడి; ఉన్నన్= ఉండగా; గాంగేయుండు= భీష్ముడు; కవ్వడిన్= అర్జునుడిని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: ఆ మాటలు విని కౌరవులు, వారివైపుండే దొరలందరు ఆశ్చర్యపోగా; ఆ సమయంలో భీష్ముడు అర్జునుడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ' శరవేదన సర్వాంగము । లెరియఁగ నా కిపుడు పెదవు లెండెడుఁ దృష్ణా
భర ముడుపఁదగిన నీళులు । వెరవునఁ దే నేర్తు వీవ వే తె మ్మనఘా!' 430

ప్రతిపదార్థం: అనఘా!= పాపంచేయని అర్జునా!; శరవేదనన్= బాణాల వలని బాధవల్ల; సర్వ+అంగములున్= శరీరభాగాలన్నీ; ఎరియఁగన్= మండుతూ ఉండగా; ఇపుడు; నాకున్; పెదవులు; ఎండెడున్= ఎండిపోతున్నాయి; ఈవు+అ= నీవే; తృష్ణాభరము= దప్పి యొక్క అతిశయాన్ని; ఉడుపన్= పోగొట్టడానికి; తగిన= అనువైన; నీళులు= నీళ్ళు; వెరవునన్= ఉపాయంతో; తేనేర్తువు= తీసికొని రాగలవు; వేతెమ్ము= వేగంగా తీసికొనిరా.

తాత్పర్యం: 'అర్జునా! బాణాల బాధవల్ల నా శరీరమంతా మండిపోతున్నది. దప్పిక ఎక్కువైనది. పెదవులు కూడా ఎండిపోతున్నాయి. నా ఈ సహింపరాని దప్పికను పోగొట్టటానికి తగినట్టి నీటిని ఉపాయంతో తేవటానికి నీ కొక్కడికే చేతనౌతుంది. కనుక, ఆలస్యం చేయకుండా నాకు తగ్గనీరు తీసికొనిరమ్ము.'

వ. అనిన నట్లకాక యని యతం డతనికిం బ్రదక్షిణంబు సేసి తేజోమయంబయిన మార్గణంబు పర్జన్యమంత్రాభిమంత్రితంబు గావించి మహీతలంబు గాఁడనేసిన భాసురచ్ఛాయం బగుతోయంబు ధారా రూపంబున దివ్యగంధరసోపేతం బయి యెగసిన. 431

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; అట్ల+కాక అని = ఆ విధంగానే అగునుగాక అని; అతండు= ఆ అర్జునుడు, అతనికిన్= ఆ భీష్ముడికి; ప్రదక్షిణంబు+చేసి= చుట్టూ తిరిగి; తేజోమయంబు+అయిన= తేజోరూపమైనట్టి; మార్గణంబున్= బాణాన్ని; పర్జన్యమంత్ర= వర్షాధిదేవత ఇంద్రుడు దేవతగా గల మంత్రాలతో; అభిమంత్రితంబున్= బాగా మంత్రింపఁబడిన దానినిగా; కావించి= చేసి; మహీతలంబున్= నేలమీదను; కాడన్= సందుపడేట్టుగా; ఏసినన్= ప్రయోగింపగా; భాసురచ్ఛాయంబు+అగు= పటికరాయి కాంతివంటి కాంతిగల; తోయంబు= నీరు; ధారారూపంబునన్= ప్రవాహరూపంగా; దివ్య గంధరస+ఉపేతంబు+అయి= దివ్యమైన వాసనతో, రుచితో కూడినదై; ఎగసినన్= పైకిరాగా.

తాత్పర్యం: పై విధంగా భీష్ముడు చెప్పగా, అర్జునుడు అలాగే చేస్తానని భీష్ముడికి ప్రదక్షిణం చేశాడు. తేజోరూపంగా ఉండే ఒక బాణాన్ని తీసికొన్నాడు. దాన్ని మేఘాలకునాయకుడైన ఇంద్రుడు దేవతగా గల మంత్రాలతో బాగా మంత్రించాడు. ఆ బాణాన్ని నేలలో బాగా గుచ్చుకొనేటట్లుగా ప్రయోగించాడు. దానితో, పటిక మాదిరి తెల్లగా ఉండే నీరు పైకి ఎగజిమ్మినది. దివ్యమైన సువాసన, రుచి కలిగి ఉన్న నీరు ప్రవాహరూపంగా పైకిరాగా.

ఆ. కౌరవులు ప్రకంపగాఢ విస్మయు లైరి । పాండుసుతులు వారిబలము నుబ్బి
యార్చి సంకు లొత్తి రా జలంబుల నమ్మ । హాత్ముఁ దృప్తుఁ జేసె నర్జునుండు. 432

ప్రతిపదార్థం: కౌరవులు= ధార్తరాష్ట్రులు; ప్రకంపగాఢ విస్మయులు= ఎక్కువ వణకు, అధికంగా ఆశ్చర్యం కలవారు; ఐరి= అయ్యారు; పాండుసుతులు= పాండురాజు కొడుకులు; వారి బలము= ఆ పాండవుల సేన; ఉబ్బి= సంతోషపడి; ఆర్చి= బొబ్బలు పెట్టి; సంకులు= శంఖాలు; ఒత్తిరి= ఊదారు; అర్జునుండు; ఆ జలంబులన్= పాతాళం నుండి వచ్చిన ఆ నీటితో; ఆ+మహాత్మున్= మహాత్ముడైన ఆ భీష్ముడిని; తృప్తున్= తృప్తి చెందినవాడినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: కౌరవులకు బాగా వణకు, ఆశ్చర్యం కలిగింది. పాండవులు, వారి బలగం సంతోషంతో ఉబ్బిపోయారు. గర్జించారు. శంఖాలు పూరించారు. అర్జునుడు ఆ జలంతో భీష్ముడికి తృప్తి కలిగించాడు.

వ. ఇట్లు తృప్తిఁ బొంది మందాకినీనందనుండు పురందరనందనున కి ట్లనియె. 433

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా మందాకినీ నందనుండు= భీష్ముడు; తృప్తిన్= తనివిని; పొంది= చెంది; పురందర నందనునకు(న్)= అర్జునుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు, ఈ విధంగా పైకి వచ్చిన నీరు త్రాగి తృప్తి చెంది అర్జునుడితో ఇట్లా అన్నాడు.

ఉ. ' నారదుచేత నిన్ను మునినాథునిఁ గాఁగ నెఱింగి యుండుదున్
శౌరియు నీవుఁ గూడిన నసాధ్యము లెవ్వియు లేవు దర్పదు
ర్వారుఁడ వైన నీవలనివైరము గీ డని చెప్పఁ జెప్ప నీ
కౌరవరాజు మానఁడు దెగం జెడుఁ గా కిటమీఁద భీముచేన్.' 434

ప్రతిపదార్థం: నిన్నున్; నారదుచేతన్= నారదమహర్షివల్ల; మునినాథునిన్+కాఁగన్= ఋషిపుంగవుడినిగా; ఎఱింగి ఉండుదున్= తెలిసికొని ఉన్నాను; శౌరియున్= శ్రీకృష్ణుడున్నూ; నీవున్+కూడినన్= నీవున్నూ చేరితే; అసాధ్యములు= సాధింపరానివి; ఎవ్వియున్ లేవు= ఏవీకూడా ఉండవు; దర్ప దుర్వారుఁడవు+ఐ= గర్వంచేత అడ్డగింపరానివాడవైన; నీవలని వైరమున్= నీతోడి విరోధం; కీడు+అని= చెడుపు అని; చెప్పన్ చెప్పన్= ఎంతగా చెప్పినా కూడా; ఈ కౌరవరాజు= ఈ దుర్యోధనుడు; మానఁడు= వదలిపెట్టడు; ఇటమీఁదన్= ఇకపైన; భీముచేన్= భీముడిచేత; తెగన్+చెడున్+కాక= సమూలంగా నశించిపోతాడు.

తాత్పర్యం: 'అర్జునా! నీవు నరనారాయణావతారంలోని నరుడనే మహర్షివని నారదుడు చెప్పగా విని ఉన్నాను. నీవు, శ్రీకృష్ణుడు ఒకచోట చేరారంటే ఇంక మీకు సాధ్యం కాని పనులంటూ ఏవీ ఉండవు. గర్వంతో ని న్నెవరూ ఏమీ చేయలేరు. నీ తోడి విరోధం నాశనానికి కారణమని ఎన్నో మార్లు చెప్పినా ఈ దుర్యోధనుడు నీతో విరోధం మానుకోలేదు. ఇక ఇతడు భీముడిచేత బొత్తిగా సమూలంగా వినాశం పొందుతాడు.'

వ. అని పలికి దీనమానసుం డగుచున్న భవత్సూనుతో ని ట్లనియె. 435

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; దీన మానసుండు+అగుచున్న= చిన్నపోయిన మనస్సు కలవాడౌతున్న; భవత్+సూనుతోన్= నీ కొడుకుతో; ఇట్లు+అనియెన్= ఈ మాదిరి అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు అర్జునుడితో పై రీతిగా చెప్పగా మనస్సు చిన్నబుచ్చుకొని ఉన్న నీ కుమారుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

మ. ' నరుఁ డత్యద్భుతవిక్రముం డతని కానారాయణుం డాప్తుఁ డె
వ్వరికిన్ వీరి జయింపరాదు సమరావష్టంభముం దక్కి ధ
ర్మరతుం డైనయజాతశత్రునకు నింద్రప్రస్థ మి మ్మర్థరా
జ్యరమం బొందుము మీరు గొందఱయినం జాకున్న నీ కొప్పదే?' 436

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; అతి+అద్భుతవిక్రముండు= మిగుల ఆశ్చర్యకరమైన పరాక్రమం కలవాడు; అతనికిన్= ఆ అర్జునుడికి; ఆ నారాయణుండు= జగత్ప్రసిద్ధి చెందిన కృష్ణుడు; ఆప్తుఁడు= ఎప్పుడు వదలక వెంట ఉండేవాడు; వీరిన్=

అట్టి ఇద్దరినీ; ఎవ్వరికిన్= ఎట్టి శూరులకు గాని; జయింపన్+కాదు= జయించడానికి సాధ్యంకాదు; సమర+అవష్టంభమున్= యుద్ధసంబంధమైన గర్వా (ప్రయత్నా)న్ని; తక్కి= వదలిపెట్టి; ధర్మరతుండు+ఐన= ధర్మమందు ఆసక్తిగల; అజాతశత్రునకున్= శత్రువులే లేనట్టి ధర్మరాజుకు; ఇంద్రప్రస్థము+ఇమ్ము= ఇంద్రప్రస్థాన్ని ఇచ్చివేయుము; అర్ధరాజ్యరమన్= సగపాలు రాజ్యలక్ష్మిని; పొందుము= కలిగి ఉండుము; కొందఱు+అయినన్= కొంతమందైనప్పటికీ; మీరు= కౌరవులు; చాక+ఉన్నన్= చావకుండా వుంటే; నీకున్; ఒప్పదు+ఏ?= ఒప్పిదం(సమ్మతం) కాదా?

తాత్పర్యం: 'అర్జునుడు చాలా ఆశ్చర్యం కొలిపే పరాక్రమం కలిగినవాడు. అతడికి అనుక్షణం తోడు నీడగా ఉండేవాడు ప్రఖ్యాతి కెక్కిన శ్రీకృష్ణుడు - సాక్షాత్తు నారాయణమూర్తి. ఇక వీరిద్దరూ ఏకమై నిలిస్తే ఎంత గొప్ప వీరులైనా జయించలేరు. కాబట్టి అట్టి యుద్ధ ప్రయత్నాన్ని, గెలుస్తామనే గర్వాన్ని ఇకనైనా విడిచిపెట్టుము. ధర్మదేవత అంశాన పుట్టినవాడు, పుట్టని శత్రువులు గలవాడు అయిన ఆ ధర్మరాజుకు ఇంద్రప్రస్థాన్ని ఇచ్చివేయుము. మిగిలిన సగంరాజ్యాన్ని నీవు ఏలుకొమ్ము. యుద్ధాన్ని చాలిస్తే మీలో కొందరైనా బ్రతుకుతారు కదా! అది నీకు మంచిది.'

విశేషం: నరుఁడు: అద్భుత విక్రముడు; నారాయణుడు: ఆప్తుడు; ధర్మరతుడు - అజాతశత్రుడు; ఇవి సాభిప్రాయాలు. నరుడు నరనారాయణులలో ఒకడు. అనగా భగవంతుడి అంశతో పుట్టినాడనుట. అద్భుత విక్రముడే అంపశయ్యకు అనువైన తలగడ ఏర్పాటు చేయటం, పాతాళగంగను పైకి రప్పించటం వంటి అద్భుతకార్యాలను చేయగలడు. నారాయణుడు సాక్షాత్తు పరమాత్మస్వరూపుడు - ఆప్తుడు - భగవంతుడే ఆప్తుడైన వారికి కొదవేమిటి? ధర్మరతుడు - ధర్మరాజు ధర్మం వదలనివాడు, **'యతో ధర్మస్తతో జయః'** అనే వాక్యం వల్ల **'యత్రయోగేశ్వరః కృష్ణః యత్ర పార్థో ధనుర్ధరః తత్ర శ్రీర్విజయోభూతిః ధ్రువా నీతిర్మతిర్మమ.'** అనే న్యాయం చేత పాండవులకు విజయం తప్పదని సూచిస్తున్నాడు. అజాతశత్రుడు: సహజంగా ఆయనకు శత్రువులంటూ ఎవరూలేరు- 'నీ మూర్ఖత్వం వలన యుద్ధం ఏర్పడింది. ఇకనైనా వైరం మానుకొని ఇంద్రప్రస్థం వారికిచ్చి, మిగిలిన సగం రాజ్యాన్ని ఏలుకుంటూ మిగిలిన మీ వారితో సుఖంగా ఉండుము అని భీష్ముడు దుర్యోధనుడికి బుద్ధి చెప్పాడు.

వ. అని పలికి యూరకుండెం; గౌరవ పాండవులును మాఱు పలుకక యతనికి నమస్కరించి నిజనివాసంబులకుం జని; రట్లు సనునెడ గోవిందుండు కౌంతేయాగ్రజుం గనుంగొని. 437

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఊరక+ఉండెన్= ఏమీ మాట్లాడకుండా ఉన్నాడు; కౌరవపాండవులును= కౌరవులు, పాండవులు; మాఱుపలుకక= బదులుమాట్లాడక; అతనికిన్= ఆ భీష్ముడికి; నమస్కరించి; నిజనివాసంబులకున్= తమతమ ఉనికిపట్టులకు; చనిరి= వెళ్ళారు; అట్లు= ఆ విధంగా; చను+ఎడన్= వెళ్ళే సమయంలో; గోవిందుండు= కృష్ణుడు; కౌంతేయ+అగ్రజున్= కుంతి కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజును; కనుంగొని= చూచి.

తాత్పర్యం: భీష్ముడు పై విధంగా దుర్యోధనుడికి బుద్ధి చెప్పి, ఏమీ పలకకుండా ఊరుకొన్నాడు. కౌరవులు, పాండవులు కూడా ఏమీ బదులు చెప్పకుండా భీష్ముడికి నమస్కారాలు చేసి వారి వారి నివాసాలకు వెళ్ళిపోయారు. అట్లా పోతూ ఉండేటప్పుడు శ్రీకృష్ణుడు ధర్మరాజును చూచి (ఇట్లా అన్నాడు.)

క. ' సురలకు నజయ్యుఁ డగు నీ । సురసరిదాత్మజుని గెలువఁ జొప్పడునే? యె
వ్వరికైన నద్భుతావహ । పరికరులగు మీకుఁ దక్కఁ బౌరవముఖ్యా!' 438

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశంలో ప్రముఖుడైన ధర్మరాజా!; సురలకున్= దేవతలకు; అజయ్యుఁడు+అగు= జయించటానికి అసాధ్యుడైన; ఈ సురసరిత్+ఆత్మజునిన్= దేవనది కొడుకైన ఈ భీష్ముడిని; గెలువన్= జయించటానికి;

అద్భుత+ఆవహపరికరులు+అగు= ఆశ్చర్యం కలిగించే; ఆయుధాలు, పరివారం కల్గినట్టి; మీఁకున్+తక్కన్= మీకుతప్ప; ఎవ్వరికిన్+ఐనన్= ఏ వీరులకైనా; చొప్పడును+ఏ?= సరిపడునా? (సరిపడదు)

తాత్పర్యం: 'ధర్మరాజా! భీష్ముడిని, గెలవటానికి దేవతలకు కూడా అలవికాదు. అట్టివానిని జయించడానికి ఆశ్చర్యకరములైన అస్త్రశస్త్రాది పరికరాలు, పరివారాలు కలిగి ఉండే మీకు తప్పితే, మరెవ్వరికీ శక్యంగాదు.'

క. అనుటయు నతఁడిట్లను 'నే । మనఁగా నొక మానిసులమె? యప్రతిహతవీ
రుని నిన్నుఁ బడసి యింతటి । పనులకుఁ జాలితిమి గాక భక్తాధీనా! 439

ప్రతిపదార్థం: అనుటయున్= అని శ్రీకృష్ణుడంటే; అతఁడు= ఆ ధర్మరాజు; ఇట్లు+అనున్= ఇట్లా అంటాడు; భక్త+అధీనా!= భక్తులకు అధీనుడవైన కృష్ణా!; ఏము+అనఁగాన్= మేమంటే; ఒక మానిసులము+ఎ?= మానవమాత్రులమే?; అప్రతిహతవీరునిన్= అడ్డులేని వీరుడవైన; నిన్నున్= శ్రీకృష్ణుడవైన నిన్ను; పడసి= పొంది; ఇంతటి పనులకున్= ఇంతింత గొప్ప పనులకు; చాలితిమి+కాక= సమర్థులమయ్యాము తప్ప వేరుకారణం లేదు.

తాత్పర్యం: కృష్ణుడు పై విధంగా అన్నప్పుడు ధర్మరాజు అంటున్నాడు. 'భక్త పరాధీనుడవైన కృష్ణా! మేమంటే మనుష్య మాత్రులమే కదా! ఎదురులేని పరాక్రమం గల నీవు మాకు చేదోడు వాదోడుగా ఉండటం బట్టిగానీ, లేకుంటే ఇంతింత అసాధ్యాలైన పనులు చేయగలిగేవాళ్ళమా?'

కర్ణుఁడు భీష్మునియొద్దకుఁ బోయి వినతుం డగుట (సం. 6-117-1)

వ. అని యిట్లయ్యిరువురు నొండొరులం బ్రశంసించుచు నఖిలజన పరివృతు లై శిబిరంబుల కరిగిరి తదనంతరంబ కర్ణుండు గాంగేయుకడకుం బోయి భక్తివినయంబులు దోఁపం బాదప్రణామం బాచరించి. 440

ప్రతిపదార్థం: అని; ఇట్లు; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరున్నూ; ఒండొరులన్= ఒకరినొకరు; ప్రశంసించుచున్= పొగడుకుంటూ; అఖిలజన పరివృతులు+ఐ= సమస్తజనంచేత చుట్టబడినవారై; శిబిరంబులకున్= తమ గుడారములకు; అరిగిరి= పోయారు; తద్+అనంతరంబు+అ= ఆ వెనువెంటనే; కర్ణుండు= రాధేయుడు; గాంగేయుకడకున్= భీష్ముడివద్దకు; పోయి; భక్తివినయంబులు= భక్తియు, వినయమున్నూ; తోఁపన్= తెలిసేట్లుగా; పాదప్రణామంబు= అడుగులకు నమస్కారాన్ని; ఆచరించి= చేసి.

తాత్పర్యం: ఈ ప్రకారం కృష్ణుడు, ధర్మరాజు ఒకరినొకరు పొగడుకొంటూ, జనమంతా మూగిరాగా తమ స్థావరాలకు వెళ్ళారు. ఆ వెంటనే కర్ణుడు భీష్ముడి దగ్గరకువచ్చి భక్తి వినయాలతో ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ' అలుక దక్కి నన్ను నధికవాత్సల్యశీ । తలము గాఁగఁ జూచి తగినమాట
లాడవే? మహాత్మ!' యనుటయు నాతండు । గారవమున నతనిఁ జేరఁ బిలిచి. 441

ప్రతిపదార్థం: మహాత్మ!= మహానుభావా!; అలుక+తక్కి= కోపం విడిచిపెట్టి; అధికవాత్సల్య శీతలము+కాఁగన్= మిక్కుటమైన పుత్రాదులందుండెడు స్నేహంతో చల్లగా; చూచి; తగిన మాటలు= ఉచితమైన మాటలు; ఆడవు+ఏ?= పలుకవా?; అనుటయున్= అనిచెప్పగానే; ఆతండు= ఆ భీష్ముడు; గారవమునన్= గౌరవంతో; అతనిన్= ఆ కర్ణుడిని; చేరన్+పిలిచి= దగ్గరకు రమ్మని పిలిచి.

తాత్పర్యం: 'కోపం మానుకొని, పుత్రవాత్సల్యంతో, చల్లని చూపుతో చూచి, ఒప్పిదమైన పలుకులతో నను పలుకరింపవా మహాత్మా!' అని కర్ణు డనగానే భీష్ముడతడిని దగ్గరకు రమ్మని పిలిచి. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. ఒక్కకరంబు మలంచి కౌఁగిలించుకొని యచ్చట నున్నరక్షకాదిజనంబుల నవులం బోవం బనిచి యతనితో ని ట్లనియె. 442

ప్రతిపదార్థం: ఒక్క కరంబు= ఒకచేతిని; మలంచి= తిప్పి; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; అచ్చటన్= ఆ భీష్ముడివద్ద; ఉన్న= ఉన్నట్టి; రక్షక+ఆది జనంబులన్= కాపలాగా ఉండే వారిని; అవులన్+పోవన్+పనిచి= అవతలకు వెళ్ళుడని ఆజ్ఞచేసి; అతనితోన్= ఆ కర్ణుడితో; ఇట్లు+అనియె(న్)= ఇలా అన్నాడు.

తాత్పర్యం: ఒక చేతిని అడ్డంగా తిప్పి కర్ణుడిని కౌగిట చేర్చికొని, అక్కడ ఉన్న రక్షకాది పరివారాన్నంతా అవతలకు దూరంగా వెళ్ళండని చెప్పి, కర్ణుడితో భీష్ముడిలా అన్నాడు.

క. ' నీ దెసఁ గోపింతునె? కుల । భేదముగాఁ బలుకుటయును బిడ్డలఁ జెఱుపం
గా దని కినియుదు లే దన । రా దదలుతు నిన్ను నిష్ఠురంపుఁ బలుకులన్. 443

ప్రతిపదార్థం: నీ దెసన్= నీపట్ల; కోపింతును+ఎ?= కోపపడతానా?; కులభేదముగాన్= కులం పేరిట వ్యత్యాసంతో; పలుకుటయును= పలకటంచేతను; బిడ్డలన్= కౌరవసంతానాన్ని; చెఱుపన్+కాదు+అని= చెరచటం మంచిదికాదని; కినియుదున్= కోపపడతాను; నిష్ఠురంపు+పలుకులన్= కటువైన మాటలతో; నిన్ను= కర్ణుడవైన నిన్ను; అదలుతున్= గద్దిస్తాను; లేదు అనరాదు= అది వాస్తవమే.

తాత్పర్యం: 'కర్ణా! నీ మీద నాకేమి కోపం? పాండవులపట్ల కౌరవులకు భేదబుద్ధి కలిగించే మాటలు మాట్లాడుతావని, కురుసంతానాన్ని చెరచటం తగదని నిన్ను కఠినమైన మాటలతో అదలించిన మాట నిజం. అంతేకాని, నాకు నీ మీద నిజంగా కోపం లేదు.

వ. అది శిక్షగాని రోషంబు గా దట్లుం గాక. 444

ప్రతిపదార్థం: అది= ఆ కోపించడం, విసిగించడం; శిక్షగాని= బోధించటమేగాని; రోషంబు= కోపం; కాదు= కాజాలదు; అట్లున్+కాక= అదీకాకుండా.

తాత్పర్యం: ఆ విధంగా నేను కోపపడినది, నిన్ను విసిగించినది, నీకు మంచిని నేర్పించటానికే గాని నీపైన నాకు కోపంలేదు. అదీగాక. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నీ యుదయము దైవిక గ । ర్భాయత్తము నీకు మర్త్యు లసదృక్షులు గౌం
తేయుఁడవు గాని విను రా । ధేయుండవు గావు నీవు ధీరవిచారా! 445

ప్రతిపదార్థం: ధీరవిచారా!= స్వతంత్రంగా ప్రమాణ రీతితో విషయాన్ని పరిశీలించగల కర్ణా!; నీ+ఉదయము= నీయొక్క పుట్టుక; దైవిక+గర్భ+ఆయత్తము= దేవసంబంధమైన గర్భానికి అధీనమైనది; నీకున్; మర్త్యులు= మానవులు; అసదృక్షులు= సాటివారుకారు; విను; నీవు; కౌంతేయుఁడవుగాని= కుంతికొడుకువేగాని; రాధేయుండవుకావు= రాధ కొడుకువుకావు.

తాత్పర్యం: మంచి చెడ్డలు స్వయంగా ఆలోచించగల కర్ణా!, నీ పుట్టుక దేవ సంబంధంతో ఏర్పడిన గర్భం వల్ల కలిగినట్టిది కాబట్టి, మానవులెవ్వరూ నీకు సమానులు కారు. నా మాట బాగా ఆలకించు. నీవు కుంతి కొడుకువేగాని రాధ కొడుకువు కానేకావు.

వ. ఇది కృష్ణద్వైపాయనుండు నాకు నేకాంతంబున నెఱింగించె. నేనును భవదీయతేజోవిశేషంబువలనను గనుంగొనియుండుదుఁ బాండుతనయుండ వగుటంజేసి నీ యెడ వాత్సల్యంబు కాని మాత్సర్యంబు లే దింక నొక్కటి సెప్పెద విను మేను గురుపాండవులవైరం బుడిపిపుచ్చితి నప్పాండవేయు లజయ్యు లప్రమేయుండగు కృష్ణుండు వారికి విధేయుండు గావున వారలతోడి విరోధం బొప్పదు నీవును నొండుదలంపు దక్కి య క్కౌంతేయులం గలిసి యుండు మనినఁ గర్ణుం డతని కి ట్లనియె. 446

ప్రతిపదార్థం: ఇది= ఈ విషయం; కృష్ణద్వైపాయనుండు= వేదవ్యాస మహర్షి; నాకున్= (భీష్ముడనైన) నాకు; ఏకాంతంబునన్= ఒంటరిగా వుండేటప్పుడు; ఎఱింగించెన్= తెలియచెప్పాడు; ఏనును= నేనుకూడా; భవదీయ తేజః+విశేషంబు వలననున్= నీదైన తేజస్సుయొక్క అతిశయంవల్లకూడా; కనుంగొని; ఉండుదున్= తెలిసికొని ఉన్నాను; పాండుతనయుండవు= పాండురాజు కుమారుడివి; అగుటన్+చేసి= కావటంవల్ల; నీ+ఎడన్= నీమీద; వాత్సల్యంబు+అ+కాని= పుత్రప్రేమయేగాని; మాత్సర్యంబులేదు= ద్వేషములేదు; ఇంకన్+ఒక్కటి+చెప్పెదన్= మరొకమాట చెప్తాను; వినుము; ఏను= భీష్ముడనగు నేను; కురుపాండవుల వైరంబున్= కౌరవులకు పాండవులకు గల విరోధాన్ని; ఉడిపి పుచ్చితిన్= తగ్గింపజేశాను; ఆ+పాండవేయులు= ఆ పాండురాజు సంతతివారు; అజయ్యులు= జయింపశక్యం కానివారు; అప్రమేయుండు+అగు= ఈపాటివాడనటానికి వీలుపడని; కృష్ణుండు; వారికి; విధేయుండు+కావునన్= లోబడ్డవాడు కావడంచేత; వారలతోడి= ఆ పాండవులతో; విరోధంబు= వైరము; ఒప్పదు= తగదు; నీవునున్= నీవు(కర్ణుడవు)కూడా; ఒండు+తలంపు+తక్కి= వేరే ఆలోచన మాని; ఆ+కౌంతేయులన్= ఆ కుంతి కొడుకులను; కలిసి యుండుము= చేరుకొని ఉండుము; అనినన్= అని చెప్పగా; కర్ణుండు; అతనికిన్= ఆ భీష్ముడికి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: కర్ణా! నీ పుట్టుకను గూర్చి వేదవ్యాస మహర్షి నాకు రహస్యంగా చెప్పాడు. నేనుకూడా నీ దివ్యతేజస్సును చూచి, దేవాంశ వలన పుట్టావని తెలిసికొన్నాను. పాండురాజు కొడుకువు కాబట్టి, నీమీద నాకు పుత్రవాత్సల్యమే ఉన్నదిగానీ ద్వేషం కొంచెం కూడా లేదు. నే నొకమాట చెపుతాను బాగా వినుము. నేను కురు పాండవుల వైరాన్ని అంతమయ్యేటట్లు చేశాను. ఆ పాండవేయులా జయింపశక్యం కానివారు. పైపెచ్చు ఈపాటి వాడనడానికి వీలుకాని కృష్ణుడే వారికి విధేయుడై ఉన్నాడు. కనుక వారితో విరోధం మానుకొమ్ము. నీవు వేరే ఆలోచన పెట్టుకొనకుండా పాండవులతో కలిసి మెలిసి ఉండుము' అన్నాడు. కర్ణుడు భీష్ముడితో ఇట్లా అంటున్నాడు.

క. 'కౌంతేయుండ నగుదు నిది । యంతయుఁ దొల్లియును వింటి నార్యులచే ని
ట్లింతయు నెఱిఁగినఁ గుంతీ । సంతానముతోడి పొత్తు సనునే? నాకున్. 447

ప్రతిపదార్థం: కౌంతేయుండన్= కుంతికొడుకు; అగుదున్= ఔతాను; ఇది అంతయున్= ఈ విషయమంతా; తొల్లియును= ముందుకూడా; ఆర్యులచేన్= పెద్దలవల్ల; వింటిన్= విన్నాను; ఇట్లు+ఇంతయున్= ఈ విధంగా నా పుట్టుకనంతా కూడా; ఎఱిఁగినన్= తెలిసినప్పటికినీ; కుంతీసంతానముతోడి పొత్తు= పాండవులతో స్నేహం; నాకున్; చనును+ఏ?= తగునా? (తగదు).

తాత్పర్యం: ' నేను కుంతికొడుకునే. ఆ సంగతి ముందే పెద్దలు చెప్పగా విన్నాను. ఈ సంగతి అంతా బాగా తెలిసి యుండగా పాండవులతో నాకు స్నేహం ఎట్లా పొసగుతుంది? బొత్తిగా పొత్తు పొసగదు.

ఉ. వారు మహాబలుల్ హరియు వారికిఁ బ్రాపు గలండు వారలం
బోర జయింపరామియును బుద్ధి నెఱుంగుదు నైనఁ గౌరవ
క్ష్మారమణుండు సేయుతగుమన్నన లెల్లఁ దలంచి చూచినన్
భూరివివేక! యే విడిచిపోవుట ధర్మమె? వీరకర్మమే? 448

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భూరి వివేక!= అధికమైన జ్ఞానం కల భీష్మా!; వారు= ఆ పాండవులు, మహాబలుల్= గొప్పబలంగలవారు; హరియు(న్)= కృష్ణుడున్నూ; వారికిన్= ఆ పాండవులకు; ప్రాపు= అండగా; కలండు= ఉన్నాడు; వారలన్= ఆ పాండవులను; పోరన్= యుద్ధంలో; జయింపరామియును= జయించలేక పోవటం; బుద్ధిన్= మనస్సులో; ఎఱుంగుదున్; ఐనన్= అట్లయినప్పటికీ; కౌరవక్ష్మారమణుండు= కురురాజు దుర్యోధనుడు; చేయు= చేస్తున్న; తగు మన్ననలు= ఉచితమైన సత్కారాలు; ఎల్లన్= అన్నిటిని; తలంచి= ఆలోచించి; చూచినన్= చూడగా; ఏన్= నేను(కర్ణుడు); విడిచిపోవుట= కౌరవుల్ని వదలివేసి వెళ్ళటం; ధర్మము+ఎ?= న్యాయమా?; వీరకర్మము+ఏ?= వీరులు చేసే పనేనా?

తాత్పర్యం: ఆ పాండవులు మంచిబలం గలవారు. అదీగాక, కృష్ణుడు వారికి అండగా ఉన్నాడు. అట్లాంటివారిని యుద్ధంలో జయించలేమనే విషయం కూడా నాకు బాగా తెలియును. అయినా దుర్యోధనుడు నాకు చేసే సమ్మానాలు, గౌరవాలు ఎన్నో! వాటిని అంతా తలచుకొని ఆలోచిస్తే, కౌరవులను వదలిపెట్టి, పాండవుల పక్షంలో చేరటం ఏం న్యాయం? అది వీరులకు ఉచితమైన పని కానే కాదు.

వ. అదియునుం గాక. 449

ప్రతిపదార్థం: అదియునున్+కాక= అంతమాత్రమే కాకుండా,

తాత్పర్యం: అంతేకాకుండా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. మాటలు పెక్కు లాడి యనుమానము లేక సభం గడంగి ప
ల్మాటుఁ బరాభవించితిఁ జలంబునఁ బాండవకోటి కెప్పడుం
జేటు దలంచి యే బలువు సేసితి వైరము నాకు నింక నీ
వీటికి వారివీటికిని వెక్కస మయ్యెడు కయ్య మొప్పగున్. 450

ప్రతిపదార్థం: సభన్= కొలువుకూటంలో; కడంగి= ప్రయత్నపడి; అనుమానములేక= సందేహంలేకుండా; పెక్కులు మాటలు= నానా మాటలు; ఆడి= పలికి; పలు+మాటున్= చాలా తడవులు; పరాభవించితిన్= అవమానపరచాను; ఏన్= నేను; చలంబునన్= మాత్సర్యంతో; పాండవకోటికిన్= పాండవుల బృందానికి; ఎప్పుడున్= ఎల్లప్పుడు; చేటు= వారి నాశనాన్నే; తలంచి= కోరి; వైరము= విరోధాన్ని; బలువుచేసితిన్= బలపడేటట్టు చేశాను; నాకున్= అటువంటి నాకు; ఇంకన్; ఈ వీటికిన్= ఈ కౌరవసైన్యానికి; వారి వీటికినిన్= ఆ పాండవుల సైన్యానికిన్నీ; వెక్కసము+అయ్యెడు= దుస్సహమైన; కయ్యము= యుద్ధం; ఒప్పు+అగున్= సమ్మతమైనదౌతున్నది.

తాత్పర్యం: నేను కొలువుకూటంలో కావాలని ఎన్నోసార్లు జంకూగొంకూ లేకుండా దుర్భాషలాడి వారిని అవమానపరచాను. వారిమేలు(గొప్ప) చూచి ఓర్చుకోలేక వారు చెడిపోవాలని విరోధాన్ని బాగా పెంచాను. ఈ కౌరవసేనకు, ఆ పాండవసేనకు, దుస్సహమైన యుద్ధమే తగింది.

శా. దైవాధీనము సర్వమున్ మనమతిం దప్పింపఁగా వచ్చునే?
నీ వింకన్ నను నొండు వల్కక పరానీకంబుపైఁ బంపు మ
త్సేవాధర్మము నిర్వహించెద బలోత్సేకంబు లోకంబు సం
భావింపన్ విహరించెదన్ మురరిపుం బార్థుం దలంకించెదన్.' 451

ప్రతిపదార్థం: సర్వమున్= అంతా కూడా; దైవ+అధీనము= దైవానికి అధీనమే; మనమతిన్= మనయొక్క కోరికను; తప్పింపఁగాన్= తొలగించడానికి; వచ్చును+ఏ?= సాధ్యమా?; ఇంకన్= ఇకమీద; నీవు= (భీష్ముడవైన) నీవు; ఒండు+పల్కక= వేరేమాటలు

చెప్పకుండా; ననున్; పర+అనీకంబుపైన్= శత్రువుల సేనమీదికి; పంపుము= పంపించుము; మత్+సేవాధర్మము= నా సేవాధర్మాన్ని; నిర్వహించెదన్= నెరవేరుస్తాను; బల+ఉత్సేకంబున్= నా బలాతిశయాన్ని; లోకంబు= జనము; సంభావింపన్= గౌరవించేటట్లుగా; విహరించెదన్= రణరంగంలో విహరిస్తాను; మురరిపున్= కృష్ణుడిని; పార్థున్= అర్జునుడిని; తలంకించెదన్= అదురగొట్టుతాను.

తాత్పర్యం: అంతా దైవాధీనం. 'బుద్ధిః కర్మానుసారిణీ' ఒక్కొక్కడి కర్మకు తగినట్టు వాడికి బుద్ధి పుడుతూ ఉంటుంది. దానిని తప్పించడం ఎవరి వల్లా కాదు. నీవిక వేరే మాటలు చెప్పడం చాలించి, శత్రుసైన్యాల మీదికి నన్ను పంపించు. నేను దుర్యోధనుడికి చేయవలసిన సేవారూపమైన ధర్మాన్ని నెరవేర్చికొంటాను. నా బలాధిక్యాన్నిలోక మంతా కీర్తించేటట్లుగా యుద్ధ రంగంలో స్వైరవిహారం చేస్తాను. ఆ కృష్ణుడిని, అర్జునుడిని కల్లోలపెట్టుతాను'.

చ. అన విని భీష్ముఁ డిట్టులను నంతకుఁ జాలు టెఱుంగనే? సుయో
ధనునకు నెప్డు నీదుభుజదర్పమ కాదె? సహాయ మెద్ది యా
తనికిఁ బ్రియంబు దానిన యుదాత్తమతిం దగ నాచరింపు నీ
మనమున సంతసిల్లు మనుమానము దక్కు మనుజ్ఞ యిచ్చితిన్.' 452

ప్రతిపదార్థం: అనన్= అని చెప్పగా; విని= ఆలకించి; భీష్ముఁడు= భీష్ముడు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు; అంతకున్= నీవన్నంత పనికి; చాలుట= తగినవాడవగుట; ఎఱుంగన్+ఏ= ఎరుగనా?(ఎరుగుదును); ఎప్డున్= ఎప్పుడున్నూ; సుయోధనునకున్= దుర్యోధనుడికి; నీదు= నీ యొక్క; భుజదర్పము+అ= బాహుబలమే; సహాయముకాదు+ఎ?= తోడు కాదా?; ఆతనికిన్= ఆ దుర్యోధనుడికి; ఎద్ది ప్రియంబు= ఏది ఇష్టమో; దానిన్+అ= అట్టిదానినే; ఉదాత్తమతిన్= ఉదారమైన బుద్ధితో; తగన్= తగినట్లుగా; ఆచరింపు(ము)= చేయుము; నీ మనమునన్= నీ మనస్సులో; సంతసిల్లుము= సంతోషపడుము; అను మానమున్= సందేహాన్ని; తక్కుము= వదలుము; అనుజ్ఞ= అనుమతిని; ఇచ్చితిన్= ఇచ్చాను;

తాత్పర్యం: కర్ణుడన్న మాటలు విన్న తరువాత భీష్ముడు ఇట్లా అన్నాడు: 'కర్ణా! నీ వన్న మాదిరి అన్నీ చేయటానికి నీవు సమర్థుడవే అని నాకు బాగా తెలియును. నీ భుజబలమే కదా దుర్యోధనుడికి ఎప్పుడూ సహాయం! అతడికి ఏది ఇష్టమో దానినే నీవు చేయుము. నీవు మనస్సులో ఆహ్లాదంగా ఉండుము. సందేహం వదలివేయుము. అనుజ్ఞ ఇచ్చాను. (ఇక ముందుకు సాగుము.)

విశేషం : భీష్ముడు కర్ణుడిని అర్ధరథుడన్నాడు. అందుకు అలిగి కర్ణుడు - భీష్ముడు యుద్ధం చేసే రోజులలో, తనుగాని తన పరివారంగాని యుద్ధంలో పాల్గొనమని, భీష్ముడు జయిస్తే తాను అడవిపాలౌతానని, లేక భీష్ముడు ఓడిపోతే, అతడిని జయించినవాడిని తాను జయిస్తానని శపథం చేశాడు. కనుకనే ఇప్పుడు అలుక మాని, వాత్సల్యంతో చూచి, మంచిమాటలు వచించుమని ఆ మహాత్ముడిని కోరాడు. భీష్ముడు కూడా కర్ణుడిని బుజ్జగించి ఎన్నో హితోక్తులు పలికాడు. కాని, దైవనిర్ణయాన్నే కాక, కర్ణుడి నిర్ణయాన్ని కూడా భీష్ముడు మార్చలేకపోయాడు.

వ. అని తెలి వొంది పలికిన దేవవ్రతుబంధుభావంబునకుం బరమానందంబు నొంది రాధేయుండును నిజ నివాసంబునకుం జనియె'నని సంజయుండు ధృతరాష్ట్రునకుం జెప్పెనని జనమేజయునకు వైశంపాయనుండు సెప్పుటయు. 453

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; తెలివిఒంది= ప్రజ్ఞ కలిగి; పలికిన= చెప్పినట్టి; దేవవ్రతుబంధుభావంబునకున్= భీష్ముడి చుట్టరికపు వాత్సల్యానికి; పరమ+ఆనందమున్= మిక్కుటమైన సంతోషాన్ని; ఒంది= పొంది; రాధేయుండును= కర్ణుడు; నిజ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నివాసంబునకున్= తన నివాసానికి; చనియెన్+అని= వెళ్ళాడని; సంజయుండు; ధృతరాష్ట్రునకున్; చెప్పెన్+అని= చెప్పాడని; జనమేజయునకున్= పరీక్షిత్తు కుమారుడికి; వైశంపాయనుండు; చెప్పుటయున్= చెప్పగా.

తాత్పర్యం: ప్రజ్ఞతో గూడిన భీష్ముడు చెప్పిన మాటలు కర్ణుడు విన్నాడు. ఆయనకు గల బంధుప్రీతికి చాలా సంతోషపడ్డాడు. తన నివాసానికి వెళ్ళాడు' అని సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పా డని జనమేజయుడికి వైశంపాయనుడు చెప్పగా.

ఆశ్వాసాంతము

ఉ. మర్దితతాపసంకలన మంజులనామ! దురంత దుర్దశా
కర్దమలేప నిర్దళనకారి కృపామృత పూర! కర్మసం
మర్ద నిరాస కర్మఠ! సమత్వ పరిస్ఫుట రూప భావనా
నిర్దళితారి వర్గ! మహనీయ! మనోరమణీయవైభవా! 454

ప్రతిపదార్థం: మర్దిత= అణచబడిన; తాప= ఆధ్యాత్మికం, ఆధిదైవికం, ఆధిభౌతికం అనే మూడు రకాల తాపాలయొక్క; సంకలన= సంబంధం కల; మంజులనామ!= మనోహరమైన నామం (పేరు) కలవాడా!; (హరిహరనాథ నామం స్మరిస్తే చాలు తాపత్రయాల సంబంధం నశిస్తుందని భావం); దురంత= దుఃఖాంతమైన లేదా దాటటానికి శక్యం కాని; దుర్దశా= దురవస్థ అనెడి; కర్దమలేప= బురదపూతను; నిర్దళనకారి= పోగొట్టే; కృప+అమృతపూర!= దయ అనే అమృత ప్రవాహరూపం కలవాడా!; కర్మ= సంసార హేతువులైన కర్మలయొక్క; సంమర్ద= సమూహాన్ని; నిరాస= పోగొట్టటమనే; కర్మఠ!= కార్యాన్ని ఆచరించేవాడా!; సమత్వ= సుఖదుఃఖాలవంటి ద్వంద్వాల పట్ల సమభావంచేత; పరిస్ఫుటరూప= స్పష్టంగా తెలియబడేరూపం గల; భావనా= మనోవ్యాపారరూపమైన భావంచేత; నిర్దళిత= పోగొట్టబడిన; అరివర్గ!= కామక్రోధాదులైన అంతశ్శత్రువులు కలవాడా!; (సుఖదుఃఖాలపట్ల సమభావం కలిగిన చిత్తం కలవారి అరిషడ్వర్గాన్ని నశింపచేసేవాడని భావం); మహనీయ!= గొప్పవాడా!; మనోరమణీయ= మనస్సును రంజింపజేసే; వైభవా!= వైభవం కలవాడా! - హరిహరనాథా!

తాత్పర్యం: భక్తుల తాపత్రాయలను పోగొట్టే మనోహరమైన నామం కలవాడా! దుఃఖదాయకమైన దురవస్థలనే బురద పూతను పోగొట్టే కృప అనే అమృత ప్రవాహం కలవాడా! బలమైన కర్మల బారినుండి భక్తులను తప్పించే సత్కార్యాలను నిర్వహించేవాడా! సుఖదుఃఖాది ద్వంద్వ భావాలయందు సమభావం కలవారి అంతశ్శత్రువులను నశింపజేసేవాడా! భావించిన కొలది మనస్సుకు ఆనందం కలిగించే గొప్పదైన మహిమ కలవాడా! హరిహరనాథా!

క. భసిత పరభాగ! హేలా । లసిత శ్రీవత్స లలిత లాంఛన! పింఛ
ప్రసృమర రుచి శబలోరగ । విసృమర దీధితి కలాప వేష్టిత మౌళీ! 455

ప్రతిపదార్థం: భసిత= బూడిదతో ఒప్పారే; పరభాగ!= శరీరంలోని ఒక (సగ) భాగం కలవాడా! (హరుడా!); హేలా= విలాసంగా; లసిత= ఒప్పారే; శ్రీవత్స= శ్రీవత్సమనే; లలిత= కోమలమైన, అందమైన; లాంఛన= గుర్తు (గుండెమీద పుట్టుమచ్చవంటి గుర్తు) కలవాడా!; (హరిరూపా); పింఛ= నెమలి ఈక యొక్క; ప్రసృమర= వ్యాపించే; రుచి= కాంతిచేత; శబల= చిత్రమైన వర్ణం కల; ఉరగ= (మెడలో హారంగా వ్రేలాడే) పాముయొక్క; విసృమర= వ్యాపించే; దీధితి= కాంతిగల; కలాప= చంద్రవంకచేత; వేష్టిత= చుట్టబడిన(అలంకరించబడిన); మౌళీ!= శిరస్సు కలవాడా!

తాత్పర్యం: శరీరంలో ఒక భాగం భస్మంతో అలంకరించుకొన్నవాడా! (హరరూపుడా!), మరొకవైపు విలాసంగా ఒప్పారే శ్రీవత్సమనే అందమైన గుర్తును అమర్చుకొన్నవాడా!(హరిరూపుడా!) తలపై ధరించిన పింఛం నుండి వెలువడే

కాంతులచేత చిత్రవర్ణాలతో వెలుగొందే సర్పహార కాంతులు ప్రసరించే చంద్రవంకతో అలంకరించబడిన శిరస్సుకలవాడా! హరిహరనాథా!

విశేషం: మొదటి రెండు సంబుద్ధులలో వరుసగా హరుడిని, హరిని కీర్తించి. ఆ తరువాత సంబుద్ధితో హరిహరనాథులను సంయుక్తంగా వర్ణించి తిక్కన హరిహరాభేద తత్త్వాన్ని ప్రదర్శించాడు.

మాలిని.

క్షరణరహిత వృత్తీ! గ్రాహ్యభక్త ప్రవృత్తీ !
కరణ గమన లీలా! గాఢకారుణ్య శీలా!
స్మరణ శుభదమూర్తీ! మధ్యరశ్మి ప్రవర్తీ !
చరణ వినమదింద్రా! సంతతానంద సాంద్రా! 456

ప్రతిపదార్థం: క్షరణ= నాశనం; రహిత= లేని; వృత్తీ!= ప్రవృత్తి కలవాడా!; గ్రాహ్య= తెలియదగిన; భక్త, ప్రవృత్తీ!= భక్తుల ప్రవృత్తి కలవాడా!; కరణ= ఇంద్రియాల యొక్క; గమన= ప్రసరణం యొక్క; లీలా!= విలాసం కలవాడా!; గాఢ, కారుణ్య, శీలా!= దట్టమైన దయాస్వభావం కలవాడా!; స్మరణ= తలచిన మాత్రంచేతనే; శుభ,ద, మూర్తీ!= మంగళం చేకూర్చే ఆకారం కలవాడా!; మధ్యరశ్మి= ఇడ, పింగళ, సుషుమ్న అనే మూడు నాడులలో మధ్య స్థానంలో ప్రసరించే సుషుమ్నా నాడి ద్వారంలో; ప్రవర్తీ!= ప్రసరించేవాడా!; చరణ, వినమత్+ఇంద్రా!= పాదాలకు నమస్కరించే ఇంద్రుడు కలవాడా! (అంటే పాదాలకు ఇంద్రాదులు సదా నమస్కరిస్తూ ఉంటారని భావం); సంతత+ఆనంద, సాంద్రా!= ఎడతెగని ఆనందంచేత సాంద్రమైనవాడా!

తాత్పర్యం: నాశనం లేని ప్రవృత్తి కలవాడా! భక్తులచేత తెలియదగిన ప్రవృత్తి కలవాడా! ఇంద్రియ ప్రసరణముయొక్క విలాసం కలవాడా! పరమ దయాస్వభావం కలవాడా! తలచినంత మాత్రంలోనే శుభాన్ని ప్రసాదించేవాడా! సుషుమ్నా నాడిలో ప్రవర్తిల్లేవాడా! ఇంద్రాదులు పాదాలకు చేసే నమస్కారాలను స్వీకరించేవాడా! నిరంతరమైన ఆనంద సాంద్రమైన స్వరూపం కలవాడా! హరిహరనాథా!

విశేషం: మాలిని వృత్త లక్షణం: ఒక్కొక్క చరణంలో న,న,మ,య,య గణాలు వరుసగా ఉంటాయి. తొమ్మిదవ అక్షరం యతిమైత్రి. ప్రాస నియమం ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమదుభయ కవి మిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున భీష్మపర్వంబునందు సర్వంబును తృతీయాశ్వాసము.
శ్రీమదాంధ్ర మహాభారతమునందలి భీష్మపర్వము సమాప్తము.

తాత్పర్యం: ఇది శుభంకరంగా ఉభయకవి మిత్రుడు, కొమ్మనామాత్యుడి పుత్రుడు, పండితులను గౌరవించటం వలన విరాజిల్లేవాడు అని కీర్తించబడే తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలోని భీష్మపర్వం ముగిసే మూడవ అశ్వాసం.

భీష్మపర్వంలోని తృతీయాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతంలోని భీష్మపర్వం ముగిసింది.

శ్రీమదాంధ్ర మహాభారతము

భీష్మ పర్వము

గద్య పద్య ప్రథమ పాద సూచి

పద్యము	పుట
అ	
అంచిత తాలకేతు కిరణాళి	25
అంత	267
అంత	267
అంత	353
అంత	430
అంతఁ దెప్పిరి నీ కొడు కనికి	189
అంతఁ బోవక సూతు	231
అంతక విక్రముండు	125
అంతకుమున్న ధృష్టద్యుమ్ను	374
అంతకు సేదదేటి	232
అంత నంశుమంతుండు	440
అంత నపరాహ్ణంబయ్యె	137
అంత నపరాహ్ణంబయ్యె	200
అంత నరుణకిరణుం డన్వర్థా	287
అంత నొండొక సారథి	284
అంతయుఁ గనుంగొని	179
అంత వియత్తలం బుదాత్త	335
అంత విరాటుఁడు లయ	257
అందఱమేనుల గంగా	134
అందు నడుమ నరనాథుం	298
అంబకై పూనివచ్చి	27
అంబరము వగుల నార్చి	229
అంబు పవమానసూర్య	103
అంహోమర్దనుఁ డాజనార్దనుఁడు	203
అకట తండ్రి సచ్చినంత	397
అకట నితాంతలోభమున	87
అక్కట తండ్రిలేని మము	404
అక్కట పూజార్హులగు	90
అక్కడ నడచినం గౌంతేయా	419
అక్కడి బంధులఁ జంపుచు	86
అక్కుమారుండును దుర్ముఖుని	376
అగ్గలిక దూది దరికొను	207
అచలనిభుఁడగు నలంబసుఁ	122
అజాతశత్రున కిట్లనియె	398
అట్టియెడ	37
అట్టియెడ	117
అట్టియెడ	155
అట్టియెడ	194
అట్టియెడ	258
అట్టియెడ	331
అట్టియెడ	389
అట్టియెడ	408
అట్టియెడం గనుంగొని	123
అట్టియెడం గురుపితా	322
అట్టియెడం గౌరవసైన్యంబు	313
అట్టియెడఁ గృష్ణార్జునులు	65
అట్టియెడ జయద్రథుండు	289
అట్టియెడ ధర్మతనయుం	392
అట్టియెడ ధృష్టద్యుమ్నుండు	175
అట్టియెడ నకులనందనుం	291
అట్టియెడ నర్జునుండు	413
అట్టియెడ నీకొడుకు	159
అట్టియెడ నీకొడుకు	249
అట్టియెడ భీష్ముండు	44
అట్టియెడ శిఖండి	428
అట్టియెడ సౌబలుండు	304
అట్టి సంకులసమరంబున	306
అట్టి సంకులసమరంబున	368
అట్టి సమయంబున	267
అట్టి సమయంబున శిఖండి	302
అట్లు దనవారు మేలుచే	144
అట్లు దాఁకుటయు వారల	372
అట్లు దాఁకుటయు	323
అట్లు వచ్చునా గదఁగని	317
అట్లు శ్రుతాయువు మూర్ఛిల్లినం	173
అదరి కురుసేనపై	420
అదరిన దానవుండు	334
అదరెఁ గాళింగనాయకుం	167
అడవి దరికొనిన	227
అడిదముఁ బలుకయునుం	317
అడుగుటయు నతండతని	296
అతఁడు దానికిఁ దలఁకక	368
అతఁడు దివ్యాస్త్రజాలంబు	429
అతఁడు ధన్వియగుట	331

పద్యము	పుట
అతఁడు నొచ్చిన తఱి	27
అతఁడు నొచ్చియు నాఁటించె	416
అతఁడు మఱియును	106
అతఁ డెంత సాటిచెప్పిన	273
అతఁడొండొక విల్లెత్తిన	387
అతనింగాంచి యధిక	399
అతని కప్పుడెదుర	426
అతని జయించునంచు	146
అతనితో నిట్లనియె	59
అతని మునుమటు	420
అతని యరదంబు	174
అతని రథరక్షకులు	314
అతిగుహ్యం బిది	97
అతి దృఢంబగు పాఁతు	13
అతిరయమున గురుఁడు	211
అతులిత రథప్రతానో	50
అత్తఱి నీతనయుం	279
అత్తఱి సురఖచరాదుల	68
అత్తెఱంగాచరింపనుం	446
అదలిచి ద్రోణుఁడు భీష్ముఁడు	188
అది యట్లుండెనప్పుడు	325
అది యట్లుండె నమానుష	60
అది యా బాణములెల్ల	299
అదియునుంగాక	11
అదియునుంగాక	420
అదియునుంగాక	453
అదియునుంగాక	11
అది శిక్షగాని రోషంబు	451
అధిప నానాప్రకార	10
అధిప నీ తనయుండు	65
అధిప నీవు సెప్పినట్టిద	31
అధిప పాండుసుతుల	17
అధిప భీమసేనుఁ డడరిన	273

పద్యము	పుట
అధిప యోగీశ్వరేశ్వరుండైన	111
అనఘ నీకెదిర్చి యని	71
అనయము నుగ్రంబగు	83
అనల జ్వాలలు పర్వు	102
అన విని గాంగేయుఁ డక్కట	72
అన విని నవ్వి పాండవుల	346
అన విని నవ్వి యొక్కఁడు	265
అన విని భీష్ముఁ డిట్టులను	454
అని విని యీఱడి నిద్రా	297
అనవుడు	357
అనవుడు	397
అనవుడు ధర్మతనయుండు	149
అనవుడు నతండు	425
అనవుడు నతండు దుర్దమ	365
అనవుడు నప్పరమేశ్వరుం	102
అనవుడు నప్పలుకులకు	77
అనవుడు నయ్యిరువురు	378
అనవుడు నవ్వికవ్వడికిం	405
అనవుడు నాంబికేయ	370
అనవుడు నేఁబెనఁగఁగ	400
అని తలంచి కుంభసంభవాది	269
అని తలంచి తొలంగి	424
అనితల నీవు పాండు	241
అని తెలివొందిన మొగంబుతో	399
అని తెలివొంది పలికిన	454
అని దేవాసురకోటి	436
అనినం గోపించి శిఖండియు	410
అనినం బ్రాగ్జ్యోతిషపతి	347
అనినఁ బ్రియమంది నగరికి	360
అనిన గుడాకేశు పలుకు	84
అనిన నట్లకాక యని	447
అనిన నట్లకాక యని	240
అనిన నాంబికేయుండు	32

పద్యము	పుట
అనిన నాతని పలుకులు	414
అనిన నా సూతనందనుండు	370
అనిన విని కుంభసంభవుండు	250
అనిన విని కృష్ణుం	404
అనిన విని చిఱునవ్వు	191
అనిన విని దేవకీనందనునకు	77
అనిన విని ధృతరాష్ట్రుం	64
అనిన విని ధృతరాష్ట్రుం	111
అనిన విని ధృతరాష్ట్రుండు	219
అనిన విని నదీసూనుండు	326
అనిన విని నవ్వి యతఁడి	297
అనిన విని నీ పుత్త్రుండు	78
అనిన విని పరాశర	08
అనిన విని యచ్యుతుం	97
అనిన విని యతండట్ల	151
అనిన విని యతండట్ల	183
అనిన విని యతండట్ల	363
అనిన విని యతండు	432
అనిన విని యనిమిష	160
అనిన విని యమ్మనుజపతికి	17
అనిన విని యర్జునుం	198
అనిన విని యాంబికేయుండు	22
అనిన విని యాంబికేయుఁడు	58
అనిన విని యా భూపాల	301
అనిన విని యోధవీరులగు	280
అనిన విని వారలందఱు	45
అనిన విని విష్ణుఁడాజిష్ణుని	156
అనిన విని వైచిత్త్రవీర్యుండు	15
అనిన విని సంజయుండతని	10
అనిన విని సంజయుండతని	31
అనిన విని సంజయుండతనికి	80
అనిన విని సంజయుండతనికి	193
అనిన విని సంజయుం	306

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనిన విప్పచ్చుండు	385
అనిన విశోకుండు	278
అనిన సవ్యసాచిసమయ	207
అని నియమించి కొలువు	35
అని నియోగించిన నతం	362
అని పలికి గాంగేయుం	190
అని పలికి గొనయంబు	299
అని పలికి దీనమానసుండగు	448
అని పలికినం బద్మనాభుండు	352
అని పలికిన విని	406
అని పలికిన విని దుశ్శా	355
అని పలికిన శాంతనవునకుం	400
అని పలికి పారాశర్యుం	32
అని పలికి పార్థునిం	91
అని పలికి యచ్యుతుండుచిత	157
అని పలికి యప్పరమ	110
అని పలికి యలుకవొడమి	358
అని పలికి యూరకుండెం	449
అని పలికి సంజయు కరంబు	30
అని పలికి సంరంభంబున	192
అని పలికి సమరప్రకారంబునం	424
అని పలికి సుదర్శనంబుం	203
అని పలుకునంత	389
అని పలుమాటలాడి	29
అని పురికొల్పికొని	234
అని ప్రార్థించినం	390
అని బహుప్రకారంబులం	27
అని భీష్ముండు పలికినం	347
అని మఱియు ననేక	244
అని మఱియు నీదృశంబు	96
అని మఱియును	89
అని మఱియును	359
అనిమిషులప్డు సూచి	441
అనిమొన దేవదానవుల	357
అనిమొన నోర్తుభీష్మ	405
అని యగ్గించినం బొంగి	149
అని యగ్గించిరంత	162
అని యగ్గించెనంత	176
అని యతనికి దివ్యదృష్టి	98
అని యవ్వల నెఱింగించిన	278
అని యాడుతులువ మాటలు	361
అని యాతనివలనను	333
అని యిట్లయ్యిరువురు	450
అని యిట్లు నాలవనాఁడు	241
అనియె నని చెప్పిన	327
అనియె నప్పుడు గాంగేయుండు	412
అని యెఱింగించి బ్రహ్మ	246
అని రట్టియెడ	260
అనిలజ భీష్ములు దమతమ	253
అని తనూజుఁ డొక్కరుఁడు	323
అని వారలవలను సూప	312
అని వెండియు	64
అని వెండియుఁ బుండరీకాక్షుండు	109
అని వెండియు వివిధ	94
అని వేడికొని వినతుండయి	245
అని సంజయుండు పలవించు	25
అని సంజయుండు భీష్మ	140
అని సంప్రార్థనంబు సేసి	104
అని సకౌతుకంబుగా	292
అని సమయంబుసేసి	67
అనుచుఁ బటుశక్తి నప్పార్థుని	438
అనుచు నేచి యెదిరిన	202
అనుచు మఱియు నయిదమ్మ	411
అనుచు మొన గడచి	250
అనుచు వగచు పలుకు	375
అనుజుఁడు వడ్డ శంఖుఁడు	136
అనుటయుఁ గౌరవులును	446
అనుటయుఁ గ్రీడియిట్టు	404
అనుటయు నట్లకాక	198
అనుటయు నతఁడిట్లను	450
అనుటయు నర్జునుండు	385
అనుటయు నాతండిట్లను	242
అనుటయు నా సూతనందనుం	407
అనుటయు నిట్లను గంగా	401
అనుటయు వైశంపాయను	03
అనుటయు సంజయుండతని	111
అనుటయు సంజయుండది	58
అనుడు దయార్ద్రచిత్తు	105
అనుడు నతండు	04
అనుడు నతఁడు పాండవా	380
అను నట్టియెడ నర్జునుండు	205
అనునెడ శిఖండి చాపము	437
అనురూపములగుమాటొడ్డనముల్	154
అపరాహ్ణసంగతుండగు	267
అపరాహ్ణసమయమున	286
అపుడు సేరి భీముఁడతనికి	350
అప్పలుకు లాకర్ణించి	439
అప్పుడనూపభూపాలుండును	344
అప్పు డపరాహ్ణంబయ్యె	233
అప్పు డర్జునుండు కేశ	209
అప్పు డా కళింగపతి	169
అప్పుడింద్రనందనుండు	299
అప్పుడిరావంతుండు	330
అప్పుడు	386
అప్పుడు	439
అప్పుడు కృష్ణార్జునులు	83
అప్పుడు క్రోధమునంగను	419
అప్పుడు గయ్యంబు సాలించి	140
అప్పుడు గాంగేయుండు సేయు	373

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అప్పుడు దేవవ్రతుండు	437
అప్పుడు ద్రౌపదేయులు	365
అప్పుడు ధర్మజ భీమ నకుల	414
అప్పుడు పెక్కండ్రు రథికుల	368
అప్పు డుబ్బి దుర్యోధనుఁ డతి	235
అప్పు డుభయ సైన్యంబుల	366
అప్పుడు భీష్ముఁ డెంతయు	204
అప్పుడు మధ్యందినమున	282
అప్పుడు మన బలంబుల	375
అప్పుడు రెండు సైన్యములు	67
అప్పుడు శల్యనందనుండు	216
అభిమన్యు ద్రుపదసుత	225
అమరతటినీతనూజుపై	77
అమరతరంగిణీ తనయు	132
అమరు తొడవుల వజ్రాంశు	43
అమ్మాట మనమునకు	357
అమ్ముల నేనుఁగు కొమ్ముల	237
అమ్మెయిఁ గౌరవులును	252
అయిదు నారసముల	173
అయిన నీతో నప్పటికప్పటి	385
అయ్యవసరంబున	236
అయ్యవసరంబున గాంగేయుండు	45
అయ్యవసరంబున దుర్యోధనుండు	153
అయ్యాదవసింహుండు	310
అయ్యిరావంతుం డొక్కరుండును	333
అయ్యేడ్పుతో నిట్లని	23
అరదంబు రవము సెలఁగఁగ	229
అరదంబులు పొడిపొడియై	276
అరదములు దీవులున్నత	62
అరదములు రథికవరులును	184
అరదములు సవరణలతో	37
అరిబలంబుపై నొక్క దివ్యాస్త్ర	430
అరుణములును సితంబులు	63

పద్యము	పుట
అర్కునుదయాస్తమయముల	06
అర్జున చూచితే మన	384
అర్జునుం డడరి ద్రోణాచార్యు	371
అర్జునుఁ డప్డు భీష్ముఁ గని	117
అఱవఱలైన రథంబులు	195
అటిముటి గుఱ్ఱపుదడముల	325
అటిముటి నడరిన	178
అటిముటి నీకుమారవరు	254
అలయ కరయనోపిన	445
అలవి యెఱుంగనేరక	145
అలికి యతఁడు సూతుతల	257
అలిగి దశార్ణాధీశుఁడు	349
అలుకదక్కి నన్ను నధిక	450
అవని గంపింప లలిత	203
అవియెల్లను బైఁగురియఁగ	158
అశని కల్పము లివి యర్జును	437
అసుర కినిసి కృతాంత	338
అసురదళన లీలావ్యాప్తి	293
అసుర వెండియుఁ బెక్కు	367
అస్త్రవర్షంబుఁ గురియంగ	280

ఆ

పద్యము	పుట
ఆఖండల నందనుండును	427
ఆ ఘటోత్కచుండు దివిజులకు	339
ఆచార్య ప్రభృతులగు	239
ఆచార్యుఁ దీవ్రఘననారాచము	163
ఆతఁడు చిత్రసేనుని	261
ఆ తూపులు నటికి పరిస్ఫీతం	416
ఆత్మయోధులకెల్ల	23
ఆ ధృష్టద్యుమ్నుండును గలయ	61
ఆ ధృష్టద్యుమ్నుండు సక్రోధుండై	163
ఆ నినదము విని పాండవ	66
ఆపగానందనుండు మురారి	161
ఆ పదివేవురు నెఱ	379
ఆ పన్నిద్దఱు సైన్యాటోప	282
ఆ పృషతపౌత్రుఁ డుద్ధత	216
ఆ బెట్టిదంపుటంపఱచే	387
ఆ రథనివహంబులు	254
ఆరయ వివృత స్వర్గద్వారము	44
ఆ రాత్రి ధర్మతనయుండు	144
ఆ రాత్రి నిన్ను వీడుకొని	33
ఆ రెండు బలములందును	64
ఆ రౌతులు వీఁడు గాలుమానిసి	332
ఆర్తుఁడై యవ్విశోకుని	277
ఆర్వురును గడంగి హయముల	332
ఆలోనన తెప్పిటిలయ	365
ఆలోనన తెలిసి మెఱుఁగు	369
ఆలోనన మెయిఁ దొమ్మిది	378
ఆ విల్లు ద్రుంచి రౌద్రరసావేశం	283
ఆ వెల్లువ శరజిహ్వల	161
ఆ శౌర్యం బాసత్త్వం బాశీలం	27
ఆ సమయంబునం గృపశల్య	429
ఆ సాత్యకి వేటొక విల్లాసుర	369
ఆ సేనకుం దలకడచి	207
ఆ సౌభద్రుం డుగ్రపు వేసవి	262

ఇ

పద్యము	పుట
ఇంకఁ బశ్చాత్తాపం బుడిగి	274
ఇంక నమ్మాటలాడుట	327
ఇంక నేమేనియుం జెప్పఁ	443
ఇంటం దెవులనఁ జచ్చుట	44
ఇంత పాపంబు సేయంగ	88
ఇచ్చటికి మీర లందఱు	399
ఇటు దగునయ్య కృష్ణ	206
ఇట్టి వానిఁగ నన్ను మీరెటిఁగి	401
ఇట్టు లగుటఁ జేసి యెవ్వరి	92
ఇట్టులాడి పిదప నేమియు	411
ఇట్లతిరథ మహారథులం	341

పద్యము	పుట
ఇట్లాభీలంబుగా భగదత్తు	237
ఇట్లు కర్ణసౌబలుల	355
ఇట్లుక్కు మిగిలి యెక్కిన	330
ఇట్లు క్రూర నారాచంబు	302
ఇట్లు క్రీడించి గాంగేయు	159
ఇట్లు గలయన్‌బెరసి	381
ఇట్లు గవిసి	138
ఇట్లు గవిసి	217
ఇట్లు గవిసి	364
ఇట్లు గాంగేయుఁ డేయు	199
ఇట్లు చిత్రసేనుండు	317
ఇట్లు తృప్తిఁ బొంది మందాకినీ	448
ఇట్లు దండ్రినొచ్చినఁ బాండు	343
ఇట్లు దన్ను బెట్టుగిట్టిన	336
ఇట్లు దఱిమి గాంగేయు	421
ఇట్లు దాఁకి తోమరప్రాస	212
ఇట్లు దాఁకి విరటు తమ్ముండు	431
ఇట్లు దుశ్శాసనుండు సోలి	416
ఇట్లు దేవవ్రతుండు	428
ఇట్లు దొడంగి యుద్భట	214
ఇట్లు ద్రుంచి	378
ఇట్లు ద్రోణుండు ద్రుపదుం	281
ఇట్లు ధర్మతనయుండు	393
ఇట్లు ధృతరాష్ట్రునకుం	05
ఇట్లు ధృష్టద్యుమ్నుండు	216
ఇట్లు ధృష్టద్యుమ్నుండు	284
ఇట్లు నడచి కురుక్షేత్రంబు	56
ఇట్లు నిలిపి యార్చి	227
ఇట్లు నిలువరించి	415
ఇట్లు నీ కొడుకులు	275
ఇట్లు నొచ్చిన వికర్ణుం	290
ఇట్లు పనిచినం బార్థుం	444
ఇట్లు పలువురు ధరణీశు లురవ	318
ఇట్లు పాండవవ్యూహంబు	392
ఇట్లు పాండవ సైన్యంబు	139
ఇట్లు పితామహునెత్తి	46
ఇట్లు పుత్రశోకానల	351
ఇట్లు పెక్కండ్రతోడం	215
ఇట్లు పెద్దయుం బ్రొద్దు	423
ఇట్లు పేర్చి కురుబలంబు	262
ఇట్లు ప్రతిభటతురంగ	113
ఇట్లు ప్రళయ కాలతాండవం	131
ఇట్లు బలంబుల నిలిపి	190
ఇట్లు బల్లిదుండయి	383
ఇట్లుభయ సైన్యంబులుం	347
ఇట్లు భానుమంతునంతకు	170
ఇట్లు భీమసేనుఁ జేరంబోయి	279
ఇట్లు భూచారియయిన	331
ఇట్లు మాఱులేక తఱుము	364
ఇట్లు మూర్ఛితుండయిన	308
ఇట్లు మెఱసిన	117
ఇట్లు లంఘించి	388
ఇట్లు వడిన కొడుకులం	266
ఇట్లు వఱపిన నతని	271
ఇట్లు విరథుండునువిశిఖ	305
ఇట్లు వెడలి మకరవ్యూహం	247
ఇట్లు శ్రుతాయువు సేయివీచిన	171
ఇట్లు సన్నద్ధుండయి	360
ఇట్లు సారథి వడుటయు	175
ఇట్లు సునాభుండువడుట	324
ఇట్లు సుస్థిరుండై	158
ఇట్లు సేన మొగ తిరిగినం	255
ఇట్లు సేసిన విని	339
ఇట్లు సొచ్చి వృకోదరుండు	166
ఇట్లెదిర్చినం జూచి	229
ఇట్లేసి యార్చి వెండియు	349
ఇట్లొప్పి సేనాపతియగు	55
ఇతఁడు పాంచాలురాదిగ	361
ఇతని తలం పే నెఱింగితి	70
ఇతరేతర శరకృత	367
ఇత్తఱి మనుష్యభువనం	244
ఇత్తెఱంగునం దలపడి	230
ఇత్తెఱంగున నిజ పుత్రుఁ	219
ఇత్తెఱంగున నెక్కువ	162
ఇది కృష్ణద్వైపాయనుండు	452
ఇది మున్న యేనుద్రోణుఁడు	326
ఇదె యేనుఁ గూడవచ్చితి	279
ఇద్దెస సుబల తనూజుఁడు	311
ఇనుమును రాగియుఁ దగరం	19
ఇప్పరమోపాయంబు	108
ఇప్పు డే నూరకున్నం	201
ఇమ్మెయిఁ గిట్టి వాయుసుతు	325
ఇరుపదేనమ్ముల	158
ఇరువురఁ గృష్ణుల	415
ఇలఁ గ్రీడగఁ బుట్టిన	246
ఇలఁబడిన సహచరుల	314
ఇల ధూళి యెగసిన	55
ఇవ్విధంబున	240
ఇవ్విధంబున	217
ఇవ్విధంబునం జెప్పిన	97
ఇవ్విధంబునం బెక్కు	422
ఇవ్విధంబునం బోరు	350
ఇవ్విధంబున బ్రతి	52
ఇవ్విధంబునఁ గ్రందు	185
ఇవ్విధంబునఁ బార్థున	106
ఇవ్విధంబున గజంబులు	337
ఇవ్విధంబున ధర్మనందన	273
ఇవ్విధంబునఁ దాఁకి	229
ఇవ్విధంబున నద్భుత	168

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఇవ్విధంబున నాచార్యుం	320
ఇవ్విధంబున నాచార్యు	281
ఇవ్విధంబున భూమధ్యంబున	13
ఇవ్విధంబున విషమంబగు	196
ఇవ్విధంబున వృకోదరు	113
ఇవ్విధంబున వెండియు	126
ఇవ్విధంబున శతానీకుం	431
ఇవ్విధంబున శోకసంవిగ్న	88
ఇవ్విధంబున హిడింబాసూనుండు	345
ఇవ్విధమున నాయితమై	111
ఈ	
ఈయనతో రణ మిప్పుడు	240
ఈసునఁ దానుఁ దమ్ములు	230
ఉ	
ఉక్కటి యొండొకనిరథం	316
ఉక్కున మూఁడు లోకములు	190
ఉక్కు మిగిలి జగతీశులు	312
ఉగ్ర గ్రహములు లయకాల	275
ఉత్తమ క్షత్రియులనెల్ల	423
ఉత్తర సముద్రంబు	14
ఉద్యతులై కవలును	113
ఉద్యద్విక్రములైన	148
ఉన్నచోటన కదలక	189
ఉపప్లావ్యంబున నితండు	396
ఉభయ బలదీప్త కేతు	62
ఉభయసేనలుఁ దమ	140
ఉరమునఁ గటిమైఁ దొడలం	228
ఉరవడించు సమయంబున	112
ఉఱక నరుఁ డట్టు	259
ఉఱక విరాటుబలముపై	138
ఊ	
ఊర్జిత శాత్రవసేనా	189
ఎ	
ఎండిన యడవిన్ దరికొని	138
ఎడఁజొచ్చి చిత్రసేనుఁడు	316
ఎడనెడఁ బఱపై యొప్పెడి	20
ఎన్నఁడును మున్ను వారల	250
ఎన్ని శరముల నభిమన్యు	261
ఎరగలి చిచ్చు గాఅడవి	145
ఎలమి నమస్కరించుచు	393
ఎలసి పయివారి దంతి	65
ఎల్లభంగుల గురు	90
ఎల్లభువనములను	87
ఎల్లవారిఁ గాచు	34
ఎవ్వతనేని ధాత	410
ఎవ్వరికిఁగాఁగ ధరణియు	86
ఏ	
ఏచి దుర్యోధనుండును	155
ఏచి ధృష్టద్యుమ్నుఁ డేడ్తెఱ	121
ఏనవనాఁటి రాత్రి సనుటయు	269
ఏ నాయుధవ్యాపారంబువలన	401
ఏనిక మదమున	48
ఏనుంగు వడిన నచ్చటి	338
ఏనుఁగు నెత్తుట గదయుం	226
ఏనుఁగుల మదము తావియు	57
ఏనును నాదళమున	360
ఏపున హిడింబసుతుఁడును	344
ఏమఱి రక్షసాలని	35
ఏ మెల్లనుండ నీ విట్లుంటి	69
ఏయుఁడు పాడువుం	439
ఏయుమొక నేర్పుమై	410
ఏవురు ద్రౌపదేయులును	290
ఏసి గాండీవి కురుసేన	439
ఏసి తురంగంబుల	258
ఏసి యా రెంటిఁ దునియలు	439
ఐ	
ఐనను గ్రౌంచవ్యూహ	153
ఐనను నాచేతి బలుపు	413
ఐనను నోపిన భంగిని	192
ఒ	
ఒంటిమైఁ గళింగు నురవడి	176
ఒండొక చాపమెత్తి	165
ఒండొరు చండవిక్రమము	162
ఒండొరుల గెలుచు తలఁపున	02
ఒకఁ డొకఁడ పాండుపుత్త్రుల	153
ఒకని నొకని నై దైదు	366
ఒక్క విల్లెక్కుపెట్టంగ	435
ఒక్క కరంబు మలంచి	451
ఒక్కటఁ గడంగి శల్యుని	380
ఓ	
ఓర్వరాక దానవోత్తము	341
క	
కంటె గాంగేయు నతని	363
కడఁగి నడచి మాయగావింప	333
కడఁగి సుయోధన ప్రభృతి	194
కడుఁ బెద్దకాలంబు గాంక్షించి	288
కడు వడిఁ జని యంతంతం	279
కడువడితోడ నప్పుడు	251
కడువెసఁ గవిసిన	268
కనక భూషణజాలంబు	36
కని కడు నలిగి సుభద్రా	232

పద్యము	పుట
కని కృప బాహ్లికాది	343
కని కౌరవపతి దుశ్శాసనుతో	378
కని తమకించి బలంబులు	185
కని తే రుప్పరవీధిఁ దోలుకొని	178
కని యతఁడు దెలిసి నీచే	351
కని యభిమన్యు ముఖ్యు	235
కని యల్లన నవ్వుచు	214
కనుంగొను జనంబులు	260
కనుఁగొని కురుపతి	251
కనుఁగొని కోపంబున	161
కనుఁగొని పార్షతుం డపుడు	283
కనుఁగొని భీష్ముఁడుల్లము	389
కనుఁగొని శిఖండి వెస	409
కనుఁగొని సాత్యకి యేనుం	256
కనుఁగొని సైన్యముల్ విఱిగి	345
కన్నాకు మనకు భీష్ముం	34
కప్పారు రేణువు గమలాప్త	114
కయ్యము సేయక తగు	396
కయ్యము సేయనేనని	390
కరదంత కర్ణమస్తక	336
కరమున నున్న శూలమున	335
కరికర శీకర తురగో	116
కరిఘంటా నిచయస్వనంబులు	115
కరిఘటలు మీఁద భీముఁడు	329
కరుల సందడి నొప్పు	52
కలయఁగఁ గరముల	373
కల్పిత దృఢ చతురంగా	39
కవలుద్దామ పరాక్రమ	409
కవిసి బలముఁ జంపఁగ	235
కవిసి యుగాంతదండధరు	276
కవిసి వ్రేసిన గ్రక్కున	218
కాంచనమయ వేదికా	38
కాంభోజరాజగు సుదక్షిణుం	41
కారుకొని మేఘమాలా	211
కార్చిచ్చు గవిసి మృగతతి	393
కాలంబగుటయు నృపులకు	04
కాలు కాలు పెనఁగి కాలు	409
కాల్పఁడే మహనీయఖాండవం	358
కావున	63
కావునఁ గౌరవపాండవు	22
కావున నీ యుద్భటరథి	35
కినుక వొడమి గంగా	77
కిమ్మీరమర్దనునిచే	292
కిరణంబు లడఁగి యంతకు	268
కీడొనరించిన వారికి	31
కుంతీసూనుఁడు సింహనాదమున	170
కురుపతికిఁ జిత్రసేనుఁడు	260
కురుపతియు ననుజవర్గము	429
కురుపతి యొక నారాచంబు	285
కురు పాండవ సైన్యంబుల	116
కురురాజు యోధవీరుల	263
కురువిభుఁడు నగరు సొచ్చియు	354
కురుసేనఁ జూచి యప్పుడు	211
కులగురువృద్ధు నిర్మలచిత్తు	28
కులనాశము సేసిన	87
కూలెడు గుఱ్ఱంబులు ధర	420
కృతవర్మ యేచి మారుత సుతు	305
కృతవర్మ రథము డిగి	137
కృపగురు భీష్మయుక్తముగ	197
కృష్ణసారథ్యమున నొప్పు	180
కృష్ణార్జునాదులుం దోడన	74
కెడసె హయము లొడ్డగెడవయ్యె	209
కేకయు లేవుర బలములు	138
కైలాస శైలాకారంబును	236
కొందఱ సూతులు వొలిపిరి	341
కొడుకుపాటుఁ జూచి కోపించి	169
కొడుకుల దెస నెవ్వగ	22
కొడుకులుఁ దమ్ములు గుఱ్ఱపు	40
కొన్నిటి హస్తముల్ సదియ	225
కొన్ని భూముల బలములు	63
కొఱవియుఁ గొఱవియు	137
కోదండదళక శీఘ్రచ్ఛేదం	266
కోపము సంహరింపు యదుకుం	206
కౌంతేయుండు నగుదునిది	452
కౌరవబలములు దిరిగిన	203
కౌరవబలములు నుడివడ	342
కౌరవ వ్యూహమునకు	61
కౌరవులలోన నిప్పు డెవ్వారితోడ	84
కౌరవులు ప్రకంపగాఢ	447
క్రందుఁ గయ్యంబులోన నరాతి	282
క్రందుకొని యిట్లు మాతంగ	373
క్రందుకొను సర్వధర్మ	107
క్రమ్మఱంగ నేతెంచుగాక	73
క్రూరతకోర్చి యించుకయు	404
క్షరణ రహిత వృత్తి	456
క్షాత్రము దలకొని సంగర	370

గ

పద్యము	పుట
గంగయుఁ దుంగభద్రయు	19
గంగానందనుఁ గూల్చి ద్రోణుపని	202
గంగానందనుఁ దాఁక నర్జునుఁడు	258
గంగాపుత్రుఁడు పాండవాగ్రజుని	318
గజఘటలం గనుంగొని	223
గజారాజోజ్జ్వల ఘంటికావళి	382
గజిబిజి లేక యుబ్బక	156
గతి గుందియుఁ బైదొరఁగెడు	166
గర్వంబు మెఱయ శిఖండి	122
గాంగేయుచేత నెంతయు	392
గాండీవం బింద్రచాపంబు	50

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
గాండీవి గెలువరాదు	359
గిరి డిగు కేసరి చాడ్పున	372
గురుఁడను నురుతరగిరి	165
గురుఁడు భీష్మండుఁ గలుగంగ	327
గురుఁడు మొదలైన	345
గురుఁడు విరాటుని కోదండ	301
గురు వంపవెల్లి నాఁగుచు	352
గురునిఁ గృతప్రజ్ఞుని	403
గురుసుతు బెడిదపు	259
గెలిచితి రాజులనెల్లను	410
గొదగొని ధార్తరాష్ట్ర లతిఘోర	278
ఘ	
ఘోరఖడ్గంబున వానిం దునుమ	339
ఘనతర గర్జాధ్వనులును	112
ఘనతర శోకవేగమున	351
ఘనమయి తోఁచుచున్న యది	59
ఘనశక్తి వైవ నది	174
చ	
చండభుజాబలంబు	53
చండవిరోధి తిమిరమార్తాండు	260
చంద్రార్కులు లోచనంబులుగా	101
చలదుర్వీధరలీలఁ గ్రాలు	40
చలముకొని యొరుల	45
చాపము వేడ్కఁ బుచ్చికొని	172
చాపవక్త్రుండు భల్లదంష్ట్రా	24
చావును నోవును మన	219
చిచ్చఱ కన్నుమూసికొని	400
చిత్రసేనుండు సౌభద్రు	376
చిన్నఁబోయి నీ కొడుకులు	241
చుట్టరికంబునన్ మనసుసొచ్చి	73
చూడు మాచార్య నీదు	81
చెంగట నభిమన్యుండు పిశంగ	364
చెప్పిన నతండు వారిం	354
చేకితానుండు గృపునిపై	310
చేదిపతియగు ధృష్టకేతుండు	311
చేయంగల పని యెయ్యది	147
చేయఁ దొడంగిన గాంధారేయులు	184
చొచ్చి చతురంగ వితతులు	287
చొచ్చి పితామహుంగని	248
జ	
జంబూనది యనంబరఁగిన	12
జగములకు నాదికారణమగు	101
జగ మెఱుగంగ ద్రోణు నని	150
జననాథులపైఁ బెల్లేసిన	299
జననీవంశంబునఁగల	334
జనియించినంతనుండియు	424
జలరుహంబులు పాండవ	139
డ	
డొల్లెడు తలయును	130
డొల్లెడు సూతులు	423
త	
తగని పనియని తలంపక	359
తగునె యర్జున యీ	89
తడఁబడె దివ్యబాణముల	419
తదనంతరంబ	116
తదనంతరంబ	178
తదనంతరంబ	259
తదనంతరంబ యుధిష్ఠిరుండు	150
తదనంతరంబ శస్త్ర	83
తదనంతరంబ సాత్యకియు	134
తదవసరంబునం బతి	187
తదవసరంబునఁ బొదివి	286
తదవసరంబున	282
తదవసరంబున నంబర	443
తదవసరంబున నితని	79
తదవసరంబున నుభయ	67
తదవసరంబున వృకోదరుం	348
తదవసరంబున శిఖండి	315
తదవసరంబున సరభసంబున	427
తదవసరంబున సాత్యకి	175
తదవసరంబున సాత్యకితో	417
తదవసరంబున సూక్ష్మజల	434
తనకుఁ గ్రీఁదల యని	443
తనతన శంఖంబును	82
తనతోఁ గాల్వురు సాల	41
తనదు నొవ్వున కలుకక	198
తన భుజసార మేర్పడఁగ	159
తన ముందటి యోధులు	271
తన యరదంబు విశోకుఁడు	284
తనయుఁడు నొచ్చిన	177
తన విక్రమంబు సేనలు	136
తనువుధరఁ బొందకుండఁగఁ	440
తన్నుం దాన యుపశమించుకొని	361
తమకుం దమ యోధవీరులకు	436
తమతమ దేశంబులకై	17
తమ్ములఁ దోలిన నతిరౌద్ర	286
తమ్ముల నొంచిన నగ్రజు	318
తమ్ములు వీఁగినం బతి	231
తఱికింజొచ్చి కడంగి	215
తఱిమి వికర్ణుడప్డు	290
తఱిమి సాత్యకి గృతవర్మ	118
తఱిమి సుశర్ముండు దాఁకి	377
తలఁకెడు వాఁడు గాఁడు	238
తలకడచి నడచు ద్రోణుని	271

పద్యము	పుట
తలకొని నీకుం బ్రాణంబులు	358
తలపడి నానాస్త్రముల	262
తలపడి యంత్యకాలశిఖి	264
తలపడి యగ్గురు నందను	344
తల వ్రయ్యలైనఁ బ్రాణంబులును	218
తాఁకి యుజ్జ్వలబాణతతి	250
తాటి సిడము విఱిగి	132
తాతల మామలన్ సుతుల	86
తాన స్తశిఖరి మఱువడ	399
తిమిరము గవిసినఁ బాండవ	354
తిరిగిన పందల నేటికి	206
తుంగమడువున నాడు	228
తుండంబులు గావించి	303
తునిమి తోడన క్రొవ్వాఁడి	342
తునిసిన బాహా మస్తక	195
తురగనికరంబు తోడం	89
తూర్పు తలగాఁగ నీ సుతు	440
(తూలె) నట్లు దూలిన	428
తెరలక లక్ష్మణుండు	263
తొమ్మిది ఖండములై	14
తొల్లి గురుండు దానవులతోడి	151
తోడంబుట్టువుపాటు సూచి	335
త్రిగర్తపతి మొదలయిన	300
త్రుంచి నవ్వుచు	366

ద

పద్యము	పుట
దనుజ ఖండితుండయి పడి	351
దనుజపతి యేచి దుర్యో	237
దనుజుఁడు మాయాధికుఁ డర్జున	366
దనుజు లొనరించు మాయలు	347
దనుజేంద్రు నిలుచుట	307
దనుజేశ్వరుండు మాయం	367
దాని కతండు చలింపక	285
దాని కయ్యుధిష్ఠిరుండు	57
దానికిం గినిసి శినిమనుమండు	369
దానికిఁ జల మెడలక	338
దానికి ద్రోణకృతవర్మలు	182
దారుణరోషం బడరఁగ	387
దిక్కులఁ దన బాణంబులు	137
దివ్యరథస్ఫార దీప్తిజాలంబులు	49
దుర్యోధను దుర్ణయంబున	220
దుర్యోధను మాటకు భుజ	193
దుశ్శాసన వికర్ణ చిత్రసేనులతో	311
దుశ్శాసన వికర్ణ విందాను	354
దూరాంతిక దుర్గమ విస్తార	141
దెప్పరపుఁజోట నీకీయొప్పని	89
దేవ నీదగు దివ్యదేహంబు	100
దేవవ్రతుండు దెగిన	28
దేవవ్రతు పలుకులు	425
దేవా వైశంపాయనుండు	144
దేవా వైశంపాయనుండు	295
దేవా జనమేజయ వసుధా	02
దేవా సురవరు లొక్కటియై	25
దొల్లెడు సూతులుఁ బెలుచం	423
దైవాధీనము సర్వమున్	453
ద్విరదము లొఱగెడివియు	225
ద్రోణాచార్యుండు సుతత్రాణ	369
ద్రోణాచార్యుండు ద్రుపద	328
ద్రోణుండలిగి శరాసనంబు	164
ద్రోణుఁడు గోపించి తనుత్రాణం	377

ధ

పద్యము	పుట
ధనంజయుండును దనకు	314
ధనురాచార్యునిఁ జూచి	343
ధరణినాథ చేకితానుండు	124
ధరణి నెత్తుటఁ దోఁగి	353
ధరణీచక్రము గ్రక్కునం గదల	388
ధాత్రీశ మేరువు దక్షిణంబున	11
ధూళుల మేఘంబులు	352
ధృతరాష్ట్రుండును బుత్రులు	375
ధృతి బలుపొప్ప నిల్చి	308
ధృష్టకేతుండు కౌరవోత్కృష్టుఁడైన	121
ధృష్టద్యుమ్నుఁడు నుజ్జ్వల	224

న

పద్యము	పుట
నకులుఁడు సహదేవుఁడు	221
నగపతియుఁ బోని గజతతి	347
నడచిరనిన విని సంజయునకు	193
నడికిరేయి వచ్చినను నొవ్వ	360
నను మార్కొని గెలువఁగ	73
నన్నుఁ బాంసుకేళి నున్న	403
నరనాథ యింక భీష్ముని	355
నరపతులనెల్ల భీష్మున	146
నరసఖుఁడ నీవు సఖుఁడును	245
నరుఁడత్యద్భుత విక్రముం	448
నరుఁడు దనమీఁదఁ దొరఁగెడు	435
నరుఁడు శిఖండిం దఱిమిన	428
నరుఁడేచి శిఖండి	421
నరుఁడు ధనుర్గుణరావ	350
నరుఁడు రథికజనంబుపై	329
నలువురు నేవురు బిడ్డలు	06
నాఁడు సభనాడి నంతయు	324
నాఁడె చెప్పఁగన్న నాకు	191
నాకు దేవవ్రతునకు	397
నానాస్త్రంబుల హయముల	311
నానాస్ఫుటవర్ణంబులు	98
నామములఁ బితృపితామహ	185
నాయుల్లమరయ నిను	443

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
నారదుచేత నిన్ను	448
నారాయణ నీకేఁ గడు	244
నిగమ శిఖావిహార మహనీయ	141
నిజఘటకు మిగిలి యుత్తరు	135
నిజసింహనాదమున	223
నిడుపునఁ దూర్పును బడమరనై	12
నినుఁగొని గెలిచెద	296
నిను నెఱుఁగకుండి	104
నిను మున్నెంతయు నమ్మి	356
నియతియుఁ దపమును	108
నిరతిశయ మహాత్మ్యోన్మేష	141
నిలిచి మహాస్త్రంబెఱమంటలు	339
నిహతులంజేయుచు	267
నీకు మా దెస ననుగ్రహంబు	395
నీకు హృదయవ్యథఁ బొంద	105
నీకొడుకు లందఱును	222
నీతనూభవుండు నెఱిగుఱి	274
నీతలంపు లెస్సనీవు	398
నీదెసఁ గోపింతునె	451
నీమాట మెయిన చేయుదు	147
నీయడిగిన భంగిన గాంగేయు	252
నీయుదయము దైవిక	451
నీవు తనూజుల దుర్వ్రన	325
నీవు ద న్నడిగిన నిజవధోపాయం	398
నీవును ద్రోణుఁడు గలుగంగా	346
నీవు భీష్మున కలికిన	414
నీవొకరుండు దక్కఁగ	406
నెట్టన యూపగాసుతుఁడు	30
నెవ్వగ యింతయేల విను	147
నేటి భంగిసూడ నృపవర	412
నేఁడెమ్మెయి నైనను నీ	411
నొచ్చియుఁ బెనఁగిన	259
నొచ్చియు భీష్మునిపై	199
నోనేసి సూతుహయసంతానము	217

ప

పద్యము	పుట
పండ్రెంటఁ బండ్రెంట	381
పటుదుశ్శాసన బాణపంక్తి	418
పట్టి పాలార్చెదరు మీరు	249
పతి పురికొలిపిన	227
పతియును ద్రోణుండు	213
పదంపడి నిట్టూర్పునిగిడించి	358
పదపడి దుర్యోధనుఁడు	114
పదిటన్ ధృష్టద్యుమ్నుని	216
పదివేవురు రాజులు దన	24
పనుచుటయు నతండు	222
పరఁగి తోఁతెంచు పాండవ	347
పరమ మును లాదిపురుషులు	246
పరమేష్ఠి నీవు గడు	245
పరాక్రమ క్రీడలుసలుపు	375
పరిధానంబును దేరు	37
పఱపి రథికులను సూతుల	159
పలక పఱియలుగాఁ జేసి	303
పలకయు వాలును గొని	217
పలు చాయల నొప్పిన	68
పలుచోటులఁ బలుభంగుల	213
పవనజుఁడు మూఁడు శరముల	133
పవనసుతుం గళింగ	168
పాంచాల బర్బర వత్స	20
పాండవబలముల యత్యు	423
పాండవబలములు దలపడి	430
పాండవ సైన్యముల్ దలఁగ	200
పాండవసైన్య సంఘపరిపాలన	149
పాండవుల గెలువ నలవి	297
పాండవేయ మాత్స్య పాంచాల	413
పాండవేయులు మాత్స్య	442
పాండునృపాలనందనులు	112
పాండుసుతుల శిఖండియు	28
పాండుసుతులేమి భంగి	407
పాండ్యపతియును గేకయ	54
పాడియు సత్యముం గలరు	242
పాడియు సత్యముం గలుగు	337
పాయవడఁ జొచ్చు గుంపులు	130
పారాశర్య ప్రముఖోదార	293
పార్షతుండు శక్తిఁ బరఁగింప	164
పిలుచుటయు నతఁడు	444
పుండరీకంబు లుద్దండ	152
పుణ్యక్షేత్రోత్తమంబయిన	03
పురికొనుచుం దెరలుచు	212
పురుమిత్త్రుని నేడుజ్జ్వల	261
పురుషుఁడన వేఱొకండే	93
పురుషుఁడు సెడు ననువాఁడును	93
పురుహూత సహితమగు	191
పులిఁ బొడగన్న లేళ్ళగమి	204
పుష్పోదంచిత సారవీర	55
పృషతకుల ముఖ్యుఁ డిమ్మెయి	150
పృషత పౌత్రుండు గద వైవ	164
పెక్కండ్రతోడ నిమ్మెయి	277
పెనంగు నట్టియెడ గాంగే	186
పెనుగాలిఁ దూలు మొగిళు	226
పెరిఁగి పాండవాంబుధి	26
పెఱవార లధికభీతిన్	234
పొదువఁగ వ్రేయఁగ నతఁడుం	331

పద్యము	పుట
పొదివికొని శకుని బలము	187
పొదివి పలువురేయఁ బొడువ	348
పొలివోని శౌర్యరేఖం	265
పోక నిలిచిన బలు	181
ప్రమదం బాననకాంతి	48
ప్రాంశుఁబయోదనీల	32
ప్రోవులు గట్టినగుఱ్ఱపు	252
ఫ	
ఫలములయెడ బ్రహ్మార్పణ	95
ఫల్గునుఁడు భీష్మ ముందటి	418
బ	
బధిరిత దిఙ్ముఖంబగుచు	53
బలియుఁడగు పార్థపుత్త్రుఁడు	289
బలు జీవమువోయిన	389
బవరము సేయుచుండియును	67
బాలురు వృద్ధులుఁ దక్కఁగ	63
బీఱువోయి రథ్యంబులు	386
బెడిదముగ నేయ రథముల	174
భ	
భండనంబునఁ దనయుండు	295
భగదత్తు నాలోకించి	346
భగదత్తుని నాకవ్వడి	427
భగదత్తు నెగిచి కౌరవ	238
భగదత్తు నేనుఁగడరిన	307
భల్లం బొకటఁ బితామహు	199
భసిత పరభాగహేలా	455
భారతవర్షంబున నుదార	18
భారతవర్షమునకుఁ గా	17
భారతవర్షము దొడఁగి	15
భారమున నులచి త్రెంపక	96
భీమనందనుఁ డగు శ్రుతసోము	124
భీమసేనుండు నేఁడు	222
భీమసేనుతో నిట్లనియె	342
భీమసేను నపుడు పెక్కు	277
భీమసేనునిపై మన భీష్మ	119
భీముఁ డుదగ్రదర్పమున	206
భీముని తనయుం డత్యుద్దామ	339
భీమునిదెసఁ గాళింగోద్దామ	253
భీముని పోరుట గడు	256
భీముని ముందటిబలము	167
భీము హరులఁ గూల్చి పేర్చి	349
భీష్ముండు దుర్యోధనున	243
భీష్ముఁ డభిమన్యుఁ గడచి	213
భీష్ముఁ డొడ్డన మేర్చిన	299
భీష్మ దెసకుం జనుచున్నం	68
భీష్మ నంపఱ కోర్వక	136
భీష్ముని గర్వంబుడిపి	249
భూపోత్తమ విను పాండు	329
భూమికిఁ గాఁగఁ బ్రాణముల	09
భూరి తపోవిశేష	292
భూరి బలఘోరమగు	187
భూరి రయంబున నద్దెస	277
భూరి శరాసారంబున	186
భూరిశ్రవసుఁడ యెక్కటి	265
భూరిశ్రవుండు దొమ్మిది	230
భేరీ శంకాదిరవ స్ఫారత	380
మ	
మందరము మహాంభోనిధి	349
మకరవ్యూహం బనియెడు	248
మగఁడు లేనిమగువ	29
మగధ మహేశుఁ డేచి	224
మణి గణోజ్జ్వలమైన	243
మదమునఁ గోసలేంద్రు	118
మదమున శ్రుతాయువొక్కటి	169
మదము మిగిలి కేతుమంతుఁడు	168
మద్రేశుఁ డంత నిలువక	135
మద్రేశున్ వెగడొంద నేసె	134
మనకుఁ బాండురాజతనయ	33
మన కుమారులలోని నయ్యనిల	326
మన బలంబునందు మంచి	273
మనమున భీష్ముఁడిట్లని	434
మనమున విషాదమడరఁగ	393
మనము పూఁచిపట్టి	296
మన మెల్లఁ బితామహు	391
మన మొనఁ గని ధృష్టద్యుమ్నున	182
మన మోహరములు సెడి	432
మన యోధప్రకరముశాం	427
మన యోధులందఱునుశాం	414
మన వారెవ్వరునోర్వ	394
మన సేనం గలగంగ	156
మన సేన పేర్చి పెల్లార్చిన	236
మనుజేంద్ర వినుము	129
మన్యు సముజ్జ్వలుండు	123
మమ్ము నెమ్మి మైఁ గలయ	78
మరలుపుఁడు పట్టుఁ డిట	257
మర్దిత తాప సంకలన	455
మఱియుఁ బెక్కులు లోక	104
మఱియు నందు నిందును	426
మఱతురె యాడిన మాటలు	201
మఱియు ననేకదుర్ని మిత్తంబులు	66
మఱియు నమ్మారుత	133
మఱియు నొక విల్లుగొను	303
మలఁగి గజ కంధరము	170

పద్యము	పుట
మలయ మనఁగ శుక్తి	18
మాకెమ్మెయి సామ్రాజ్యము	400
మాటలు పెక్కులాడి	453
మాత్స్య కైకేయాది మను	425
మానుగ ధర్మక్షేత్రంబైన	80
మానుషమేటికి దైవాధీనము	219
మిగిలి పవమానసుతుపై	234
మీతండ్రి ద్రోణునకుఁ దోడై	272
మీతండ్రి భవత్సుతులకు	117
మీతండ్రి సింహనాదస్ఫీత	323
మీరు నా హితంబు గోరుదురేని	424
మీ వీటికెల్ల మేటివి	312
ముందటి పదుండ్రునాన్నపు	422
మునివరుఁడైన నారదుఁడు	59
మును పదివేవురఁ జంపుదు	412
మునుపోటులఁ బడినొచ్చుట	331
మును మత్స్యనాథు నగరం	385
మున్నును నేఁ గారణముగ	394
మెఱసి మండలచారియై	364
మొగుళులు లేకయు నుఱుములు	06
మొనల వినోదంబునకుం	76
మొనలెల్ల విఱుగ మధ్యం	432
మొనసి మృగేంద్రుఁ	426
మొనసి శిఖండిని మున్నిడి	415
మోహతమంబు వాసె	109
య	
యాదవ కేకయ పాంచాలాదులు	200
యుధిష్ఠిరు మొగంబునం	420
ర	
రంగత్ప్రథన స్తుత్యతురంగ	262
రక్కసుఁడు విఱిగినం	368
రక్తనదులలోన రథయాన	287
రథము మీఁదికిఁ జనుదెంచి	79
రథములను సామజముల	374
రథములు దఱచై చెలువగు	40
రభస క్షోభిత మేదినీ	51
రవిఁ గొల్చి యుత్తరాయణ	445
రాజులు మంత్రులు ననియెడు	29
రెండు బలంబుల వారలు	64
రెండు వీళ్ళ జనంబులు	269
రేపకడ రభసమున	181
ఱ	
ఱిచ్చవడి యుభయబల	114
ఱెక్కలు సించి కంఠమున	155
ల	
లలిత పీతాంబరంబు	388
లస్తకంబున కొలఁదికి	177
లోకోత్పత్తి స్థితి విల	244
వ	
వంగాధిపతియు శౌర్యో	336
వగపును గోపముం గదుర	266
వగవఁగ నేఁటికిఁ బార్థుఁడు	395
వగవఁగ నేమియుం దగని	91
వచ్చి యిట్లనియె	346
వాయువేగంబులైన	175
వారలందఱు నొండొరు	275
వారల శర నిచయము	213
వారల శర వర్షంబులు	132
వారికి బాసటయై పాంచాల	221
వారి ననఁనేల తొల్లియు	17
వారిరువురుఁ జలమున	187
వారును ముందటి యార్వురు	214
వారు మహాబలుల్ హరియు	452
వారెవ్వరంటేని వినుము	39
వాహనముఁ దాన నడపుచు	272
విందానువిందులు గ్రందుగ	125
విందుని సారథినొక	306
వికలరథుఁడగు నావృష్ణి	257
విక్రమ విహారంబునకుం	223
విచలద్దండధరోపమాశ్రయ	54
విడిదలకుఁ బోయెనపుడు	321
విడువక దాపట వలపట	227
విధికృతం బెవ్వరికి నుడుప	274
వినికి గలిగి రక్షించుచు	21
విని గాంగేయుం డడరిన	173
విని నదియును నెయ్యెడ	33
విని పాండునందనులు	193
విని మురాంతకుఁ డితఁడు	397
వినుఁ డన్యు లెవ్వరును	34
వినుఁడు శరతల్పగతుఁడనై	446
వినుత ప్రజ్ఞాబాణంబున	281
విను మలుక వొడమి	180
విను మానుష చక్షుర్గతి	98
వినుము	371
విరథుండై పొలివోని	165
విరథుండై యభిమన్యు	284
విరథుఁడయి మాత్స్యపుత్రుఁడు	137
విఱిగి భవత్సుత	285
విఱుగుట నొచ్చుట	305
విల్లుంగేతువుఁ ద్రుంచి	431
విల్లును నమ్ములు విడుచుచు	302
వివిధ సన్నాహయుతముగా	172
వివిధోద్దామ హయావళీ	51

పద్యము	పుట
వివ్వచ్చు నొవ్వు నెంతయుఁ	387
విశేషించియుం గౌరవ	07
వీఁకమై నకులునిఁ దాఁకి	119
వీనియందు వివిధమణి	18
వీర రసాంబు పూరమును	26
వీరస్వర్గము ధనముగ	327
వృద్ధులు గతాయువులు	191
వెండియు ధనార్జనంబులు	19
వెండియు నేడు బాణములు	309
వెక్కసమందుచుఁ గురుపతి	332
వెనుకొని విఱిగిన	188
వెరవున ధృష్టద్యుమ్నుని	218
వెరవు లావుఁ గలుగు	21
వెఱచఱచి వెగడువడి	228
వెలిఁగిరి బలములు	212
వెలివిరిసివచ్చు	380
వేగమెయిది వృష్ణివీరు	267
వేగినఁ గౌరవసేనలు	247
వేగుటయు సత్వరంబుగ	211
వేదవ్యాసమునీశ్వరు	31
వేఱొక విల్లు పుచ్చికొను	288
వైరమున నలిచి	98

శ

పద్యము	పుట
శకుని ప్రతివింధ్యుఁ దాఁకిన	124
శక్తి ద్రుంచి తీవ్రసాయక	263
శరముల వేగంబున	226
శరములు గురుపతి	303
శరములు మూఁటం గృపు	216
శరవేదన సర్వాంగము	447
శల శల్య చిత్రసేనులు	315
శల్యుఁ డుగ్ర కోపంబున	135
శల్యు నారాచ పంచకమున	113
శల్యుమీఁదఁ గవలు	308
శాంతనవుం డనేకబల	382
శాంతనవుండును సముల్లా	435
శాంతనవుఁడు దేజో	139
శిఖండియు సాత్యకిరథం	303
శినిమనుమండు నద్దనుజు	229
శూలంబున హైడింబుఁడు	348
శోణితము వెల్లిగవిసిన	185
శ్రాంతంబయ్యెను వాహన	268
శ్రీ నిర్మాణ విచక్షణ	143
శ్రీ విలసనత్వ గురు	295
శ్రీ సంపాది పదాంబుజ	01

స

పద్యము	పుట
సంభ్రమమున నపుడు	188
సకల బంధుజనుల	385
సఖుఁడు సంబంధి శిష్యుండు	395
సగము సచ్చిన యొడళులు	195
సత్యపరాక్రముఁడగు నీ	148
సత్యప్రతిజ్ఞుఁడవు	395
సత్యవతీ వివాహం బొనర్చు	441
సత్యవ్రతుండగు నిమ్మహా	34
సప్తమదివస రజనీ	321
సభయమయి శకుని సైన్యం	189
సమరం బప్పుడు దనుజులు	317
సమరంబు రాజులకు	94
సమరకౌతుకి యైన	68
సమరక్రీడన లీలం	269
సమరక్రీడ సలిపి	352
సమరక్రీడా సన్నాహము	38
సమరాంగణంబు కడు	253
సరభసముగ సారథి	376
సరభసుఁడై యుధిష్ఠిరుఁడు	120
సరసిజనాభ బంధుజన	85
సహోదరులకు సహాయత్వంబు	290
సాత్యకి యప్పు డేచి	264
సాత్యకియేచి ధృష్టద్యుమ్నుఁడును	391
సాత్యకి విరాటుండు	81
సారథి యరదము భీష్ముని	416
సింహనాదంబుతో భీమసేను	133
సురనదీసుతుండు పరలోక గతి	403
సురలకు నజయ్యుఁడగు	449
సూతు నొక్క వాలమ్మున	163
సేనల నిమ్మెయి భీష్ముఁడు	431
సేనాసమేతుఁడగు నరుపై	300
సైరింపక యెద్దెఱఁగురు	268
సోమక మాత్స్య ప్రముఖోద్దామ	430
సోమాన్వయ ప్రదీపకు	139

హ

పద్యము	పుట
హరి దాను నొచ్చి నొచ్చిన	200
హస్తలాఘవమున నతుల	215
హితమును ధర్మముం దలఁచి	07
హుంకారములు నదల్పులు	194

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 9

ద్రోణపర్వము

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డాక్టర్ జి.హరిహరనాథ్

శ్రీ సింగరాజు సచ్చిదానందం

డా॥ మల్లెల గురవయ్య

డా॥ కె. రాజన్నశాస్త్రి

ప్రధాన సంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Drona parvamu of Tikkana Somayaji
Vol.IX .

Commentary by
Dr. G. Hariharanath - 1st Canto
Dr. Mallela Guravaiah - 2nd Canto
Sri Singaraju Sachidaanandam - 3rd and 4th Cantos
Dr. K. Rajanna Sastry - 5th Canto

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Publications Series No.608
First Edition : August 2004
First Re-print : 2006

Second Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D., Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుదు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారి సేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

భీష్మపర్వం కురుక్షేత్ర యుద్ధారంభమైతే ద్రోణపర్వం యుద్ధంలోని రెండవ ఘట్టం. పంతాలు పట్టింపులు, పగ, ప్రతీకారం పరాకాష్ఠకు చేరుకున్నఘట్టం. ఇక్కడ ముఖ్యపాత్రధారి ద్రోణుడు. ఇరు పక్షాలకు గురువు. ఆయన నేర్పిన పాఠాలను ఆయన ముందు వాస్తవంగా ప్రదర్శించి మెప్పు పొందేందుకు, జయించేందుకు ఇరుపక్షాల రాకుమారులు పాటుపడటం ఒకవైపు వుంటే, పాండవ పక్షంలో ద్రుపద, విరాట, సాత్యకి ప్రభృతులకూ కౌరవపక్షంలోని భగదత్త, భూరిశ్రవ, సైంధవ ప్రభృతులకూ వేరువేరు ద్వేషాసూయలు పంతాలు. ఇచ్చట సర్వోపరిగ నిలిచేది కృష్ణుడి ధ్యేయవాక్యం. 'ధర్మ సంస్థాపన'. దానికొరకు అతడు ఏమైనా చేస్తాడు; ఎన్నైనా చేస్తాడు. అభిమన్యు, ఘటోత్కచులను కూడా ఆహవాగ్నిలో సమిధలను చేసేందుకు వెనుకాడడు. భగదత్తుని వైష్ణవ అస్త్రాన్ని తాను భరించినట్లే అశ్వత్థామ నారాయణాస్త్రాన్ని పాండవ సైన్యం ఆయుధాలను విడిచి నిలబెట్టేట్టు చేసి నిష్ఫలం చేశాడు, యుద్ధం చేయనన్నాడేగాని, సూర్యుని కప్పి సైంధవుని చంపడానికి అనుకూల్యం కలిగిస్తాడు.

మొత్తంమీద ఈ పర్వమంతా కృష్ణుని కాపుగడలో పాండవులు పరిఢవిల్లిన వైనమే కనబడుతుంది. అనితర సాధ్యుడైన కులగురుని అబద్ధంతో అంతమొందించేందుకు కూడా వెనుకాడని కృష్ణుని 'కైతవం శిక్షాగురు' అని ప్రీతిగా పిలవడంకూడ కద్దు. ఇంతచేసి మనిషిగానే పార్థుని జతలో మెలిగినవాడు శ్రీకృష్ణుడు అంటే పాఠకుల మనసు నిండుతుంది, ఆర్ద్రమౌతుంది.

వ్యాసులవారి 'జయ' కావ్యాన్ని తెలుగులో తేటపరచిన తిక్కన ద్రోణపర్వాన్ని వ్యాఖ్యానంతో అందించినవారు నలుగురు ప్రఖ్యాత పండితులు డా॥ జి. హరిహరనాథ్, డా॥ మల్లెల గురవయ్య, శ్రీ సింగరాజు సచ్చిదానందం, డా॥ కే. రాజన్న శాస్త్రిగారలు. వీరికి దేవస్థానం తరఫున అభినందనలు. ద్రోణపర్వానికి సంపాదకత్వం వహించినవారు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు. వీరికి శుభాభినందనలు.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతీ సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమస్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు:

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 - 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జూలై 11వ తేదీన హైదరాబాదు బాలాజీభవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం:

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్యపర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయముగైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అరసున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయతల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసియున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్పురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిగమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగాపర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జూలై 3వ తేదీన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన:

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డిగారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ నివేదిక సారాంశం:

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యవంలో 1992 నవంబరు 5వ తేదీన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥ కె. సర్వోత్తమరావు	**శ్రీ డి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం:

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిన అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జూలై 15వ తేదీన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీ డి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు:

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్నభిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీస్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలోని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం:

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి

మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్ల కొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పండ్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులుబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి. విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి".

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాస్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదకమండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంపాదకమండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు — శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య — డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
డా॥ కె.జె. కృష్ణమూర్తి — డా॥ కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే. — డా॥ బిరుదురాజు రామరాజు
అన్నమాచార్యప్రాజెక్ట్ డైరెక్టర్, తి.తి.దే. — డా॥ ఎం. కులశేఖరరావు
ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి, తి.తి.దే. — డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలుల లోని సభ్యులయొక్క సంయుక్తసమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటాలన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్తపాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ప్రథమసంపుటం ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం-సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి. సుబ్బారావుగారి తరువాత కార్యనిర్వహణాధికారి అయిన డా॥ పి. కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారు వచ్చిన తత్క్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణనుగూర్చి ఆస్తకితో గమనిస్తూ అన్ని విధాల సహకరించి ఆది,సభా పర్వాల విడుదలకు ఏర్పాటుచేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాలనిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ప్రణాళిక వ్యాఖ్యాసహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. అప్పట్లో తీవ్రతరం అయిన ప్రయత్నంతో గోదావరి పుష్కరాల సమయానికి ఆరణ్యపర్వం (2 భాగాలు), విరాటపర్వం విడుదల అయ్యాయి. తర్వాత శ్రీ అజేయ కల్లంగారు కార్యనిర్వహణాధికారిగా విచ్చేసిన వెనువెంటనే ఈ మహాభారత వ్యాఖ్యానసహిత ప్రచురణ ప్రణాళికను మరింత వేగిరపరచి కృష్ణాపుష్కరాల లోపల యుద్ధపంచకాన్ని విడుదల చేయాలనీ, 2004 సంవత్సరం చివరకు మిగిలిన పర్వాష్టకము వెలుగు చూడాలనీ నిర్ణయించడం జరిగింది. ఆ మార్గదర్శక సూత్రానుగుణంగా ఇప్పుడిప్పుడే ఉద్యోగ, భీష్మపర్వాలు వెలువడ్డాయి. ప్రస్తుతం ద్రోణపర్వం కూడ వెలుగు చూడబోతున్నది. మున్ముందు అనగా కృష్ణాపుష్కరాలలోపల శాంతిపర్వంవరకు వెలుగుచూచే అవకాశం ఉన్నది. 2004 సంవత్సరంలోపల మిగిలిన పర్వాలన్నీ విడుదల చేయడానికి సర్వయత్నాలు సాగుతున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారత' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. సాహిత్యప్రియులూ, తి.తి.దేవస్థానం సంయుక్తకార్యనిర్వహణాధికారిగా ఉండిన శ్రీ ఆర్. అప్పారావు, ఐ.ఏ.ఎస్., గారికి వందనములు.

సంబంధిత విభాగాధిపతిగా, సలహామండలి ఎక్స్ అఫిషియోసభ్యులైన డా॥పి రంగారావు, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి-వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయ సహకారాలందించిన తదితర అధికారిగణానికి నమస్సులు. ఈ ప్రణాళికద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధానపాత్ర వహించిన-వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదకమండలి, సలహామండలి) విద్యావేత్తలకు, ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారికి- నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి.దేవస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడంలో వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్ కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానిక పండితవర్యుల ఉప సంఘం (ఎడిటోరియల్ సెల్) నిర్మాణానికి సిఫారసు చేయగా, దేవస్థానం ఆమేరకు **పండితవరేణ్యులు డా॥ కె.సర్వోత్తమరావు, శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీ ముదివర్తి కొండమాచార్యులు గారలతో** ఎడిటోరియల్‌సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈ సెల్ ఉపకారం మరువరానిది. వీరు వర్క్‌షాపువలె నిర్వహింపబడుతున్న కవిత్రయ మహాభారత యజ్ఞంలో పాలుపంచుకుంటున్నారు. ఆ కారణంగానే తక్కిన పర్వాలు త్వరితంగా వెలువరించగలుగుతున్నాం.

"సప్తగిరి" సంపాదకులుగా, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి అమరులయ్యేవరకూ ప్రముఖపాత్ర వహించిన కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె. రాధారమణ, డాక్టర్ ఎ. సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి. ఎన్. శ్రీనివాసన్ గారలకు, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పాఠకులకు తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయాధికారి శ్రీ ఐ. పార్వతీశ్వరరావుగారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగుచూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ఎన్.ఎస్. రామమూర్తి
కన్వీనర్
సంపాదకుడు - సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదకమండలి

అధ్యక్షులు

శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకులు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం

సంపాదక మండలి సభ్యులు

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కే. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆచార్య ఎం. బుద్ధన్న

డా॥ పి. రంగారావు, (పౌరసంబంధాధికారి) (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ మేడసాని మోహన్, డైరెక్టర్ అన్నమాచార్య ప్రాజెక్టు, (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద, కార్యదర్శి ధర్మప్రచార పరిషత్తు (ఎక్స్ అఫిషియో సభ్యులు)

కన్వీనర్

డా॥ ఎస్.ఎస్.రామమూర్తి,

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా. 1,2
4. డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్నశాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా. 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	ఆను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	ఆను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఆను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది.	-	ఆదిపర్వం
సభా.	-	సభాపర్వం
అర.	-	ఆరణ్యపర్వం
విరా.	-	విరాటపర్వం
ఉద్యో.	-	ఉద్యోగపర్వం
భీష్మ.	-	భీష్మపర్వం
ద్రోణ.	-	ద్రోణపర్వం
కర్ణ.	-	కర్ణపర్వం
శల్య.	-	శల్యపర్వం
సౌప్తి.	-	సౌప్తికపర్వం
స్త్రీ.	-	స్త్రీ పర్వం
శాంతి.	-	శాంతిపర్వం
అను.	-	అనుశాసనికపర్వం
అశ్వ.	-	అశ్వమేధపర్వం
ఆశ్ర.	-	ఆశ్రమవాసపర్వం
మౌస.	-	మౌసలపర్వం
మహా.	-	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	-	స్వర్గారోహణపర్వం
సం.	-	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	-	సంస్కృత మహాభారతము
అను.	-	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	-	ప్రధాన సంపాదకుడు

క.	-	కందపద్యం
వ.	-	వచనం
ఆ.	-	ఆటవెలది
తే.	-	తేటగీతి
సీ.	-	సీసం
ఉ.	-	ఉత్పలమాల
చ.	-	చంపకమాల
మ.	-	మత్తేభవిక్రీడితం
శా.	-	శార్దూలవిక్రీడితం
ఆశ్వా.	-	ఆశ్వాసం
క్రీ.శ.	-	క్రీస్తుశకం
య.	-	యగణం
మ.	-	మగణం
త.	-	తగణం
ర.	-	రగణం
జ.	-	జగణం
భ.	-	భగణం
న.	-	నగణం
స.	-	సగణం
ల.	-	లఘువు
గ.	-	గురువు
అలం.	-	అలంకారం
సం.	-	సంవత్సరం
మొ.	-	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పీఠిక

[**పీఠిక విషయసూచిక**-1.ద్రోణపర్వం రౌద్రరసమహార్ణవం - పు. 1* 2. ద్రోణుడి చరిత్రలో క్రోధబీజం - పు.2* 3.ద్రోణుడి సాత్త్విక రాజసప్రవృత్తి - పు.4* 4.కర్ణ దుర్యోధనులు ప్రక్కలో బల్లాలు- పు.6* 5. గురుశిష్య ధర్మవర్తనం - పు.8* 6.ద్రోణాచార్యుడి యుద్ధవీరమూర్తి - పు.9* 7. ద్రోణుడి వరం: వాఙ్మయ పద్మవ్యూహం- పు.11* 8. ద్రోణుడు తన వ్యూహంలో తానే చిక్కుకొన్నాడు- పు. 13* 9. అయిదునాళ్ళ యుద్ధం: అయిదంకాల రూపకం -పు.15* 10. మొదటినాటి యుద్ధం: ముఖసంధి: శకట క్రౌంచ వ్యూహాలు - పు.17* 11. రెండవనాటి యుద్ధం: ప్రతిముఖసంధి: గరుడ - అర్ధమండల వ్యూహాలు- పు.18* 12. మూడవనాటి యుద్ధం: గర్భసంధి: పద్మవ్యూహం - పు.21* 13. నాల్గవనాటి యుద్ధం: విమర్శసంధి: శకటపద్మ సూచీ వ్యూహాలు - పు.26* 14. అయిదవనాటి యుద్ధం: నిర్వహణసంధి: ద్వంద్వయుద్ధాలు - పు. 30* 15. ద్రోణపర్వంలో శ్రీకృష్ణుడు నాయకుడా?- పు. 31*16. ద్రోణపర్వంలో ఎనిమిది రకాల రౌద్రం -పు. 33* 17. ద్రోణపర్వం: అంతరార్థం-పు. 36* 18. కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం. - పు.38 * ద్రోణపర్వ కథాసారం - 40]

ఉ. ‘ నీలగళుండు, శంకరుఁడు, నిత్యుఁడు, సత్యసురూపుఁ, డుజ్జ్వల
త్కాలమహానల ప్రశమక ప్రచురామృత వృష్టి విస్ఫుర
ద్వాల మృగాంక శేఖరుఁడు, దైత్యకుల ప్రవిదారణ క్రియా
లోల పరశ్వథుండు, సకలుం, డమలుండు, ప్రియుండు శాంతికిన్.’ **(ద్రోణ. 5.428)**

1. ద్రోణపర్వం రౌద్రరస మహార్ణవం:

భీష్మపర్వం వీరరస మహాసాగర మైతే, ద్రోణపర్వం రౌద్రరస మహార్ణవం. పై పద్యం ద్రోణపర్వాంతంలో వ్యాసమహర్షి చేసిన రుద్ర ప్రశంస. ఆ ఆదిమ ధనుర్ధరుడు ముందుగా వైరివధ చేస్తూ పోతూ ఉండగా, పార్థుడు హరహతులైన వారిని నిహతులను చేస్తూ వైరి సంహార యజ్ఞాన్ని సాగించిన రౌద్రకర్మ ఈ పర్వ కథా తాత్పర్యం. రౌద్రానికి స్థాయిభావం క్రోధం; వర్ణం రక్తవర్ణం; దైవతం రుద్రుడు. “శత్రు కృతాపచారేణ మనః ప్రజ్వలనం క్రోధః” అని ప్రతాప రుద్ర యశోభూషణం. కౌరవులు చేసిన అపచారం (అభిమన్యు వధ) వలన పాండవుల హృదయాలలో - ప్రత్యేకించి పార్థుడి హృదయంలో ఉప్పొంగిన ప్రజ్వలన రూపమైన క్రోధం ఈ పర్వకథా కేంద్రం. దీనికి బలాన్ని చేకూర్చే వివిధ సన్నివేశ వర్తులాలు కథాగతికి క్రమంగా కారకా లయినట్లు వర్తిల్లటం ఈ పర్వంలోని ఇతివృత్త వైభవం.

ద్రోణపర్వంలోని కథ పాత్రల క్రూరస్వభావ ప్రదర్శకంగా సాగుతుందని వ్యాసమహర్షియే సూచించాడని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు పేర్కొన్నారు. “మహాభారతమునందు ద్రోణపర్వమునకు సముచిత ప్రాధాన్యము కలదు. సంస్కృత భారతమున ద్రోణపర్వ ప్రాశస్త్య మిట్లు చెప్పబడినది.

“సంగ్రహాధ్యాయ బీజో వై పౌలోమాస్తీక మూలవాన్
సంభవస్కంధ విస్తారః సభారణ్య విటంకవాన్
ఆరణీపర్వ రూపాఢ్యో విరాటోద్యోగ సారవాన్
భీష్మపర్వ మహాశాఖో ద్రోణపర్వ పలాశవాన్”. **(సం. 1-1. 88-89)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పలాశవాన్ అనునది ద్రోణపర్వమునకు వేయబడిన విశేషణము. పలాశము అనగా 1. పచ్చనిది; 2. క్రూరమైనది - నిర్ఘృణమైనది; 3. ఒక రాక్షసుడు; 4. కింశుకము; 5. పత్రము, రేకు మున్నగు అర్థములను ఆప్టే నిఘంటువు ఇచ్చుచున్నది. ద్రోణపర్వమునకు ఈ విశేషణ మెంతయు తగియున్నది. ద్రోణపర్వమునందు విస్తారముగా వీరుల నాశము జరిగినది. ఉభయ పక్షయోధులును క్రౌర్యావిష్టులై జయము గొనుటకై పోరాడిరి. కావున ఈ పర్వము క్రౌర్యభూయిష్ఠ మనుట యుక్తమే. ఇందు రాక్షసులైన అలంబుస ఘటోత్కచులు హెచ్చుగా విజృంభించి మరణము నొందిరి. కౌరవ పాండవ వాహినులు అపారముగా మడిసి రక్తనదులు ప్రవహించుటచే ఈ పర్వము కింశుకమువంటి దనుటయు చారుభీషణముగా ఉన్నది. ద్రోణాచార్యుడు సేనానిగా ఉన్నప్పుడు విస్తారముగా జననాశమైనట్లు వ్యాసమహర్షి వివరించెను.

> "ద్రోణపర్వం తత శ్చిత్రం బహువృత్తాంత ముచ్యతే
> సప్తమం భారతే పర్వ మహ దేత ముదాహృతమ్
> యత్ర తే పృథివీపాలాః ప్రాయశో నిధనం గతాః'. **(సం. 1-2-254)**

(శ్రీమదాంధ్ర మహాభారతము (ఆం.ప్ర.సా.అ. ప్రచురణ 1971) ద్రోణపర్వము - ఉపోద్ఘాతము పు. 1-2)

ద్రోణపర్వంలోని క్రూరస్వభావం రౌద్రరస స్వభావమే. రక్తపాతం రౌద్ర కర్మఫలితమే. ఈ స్వభావాన్ని బట్టి పరిశీలించి చూస్తే రౌద్రరస విభూతి ప్రదర్శనమే ద్రోణపర్వ రసశిల్పం.

సంస్కృత మహాభారతంలోని ద్రోణపర్వంలో ఎనిమిది ఉపపర్వా లున్నాయి. అవి: ద్రోణాభిషేకం, సంశప్తక వధ, అభిమన్యు వధ, ప్రతిజ్ఞాపర్వం, జయద్రథవధ, ఘటోత్కచ వధ, ద్రోణ వధ, నారాయణాస్త్ర ప్రయోగం. నన్నయ ఈ ప్రధానాంశాలను వివరిస్తూ మరికొన్ని విశేషాలను సర్వపర్వ సంగ్రహవచనంలో పేర్కొన్నాడు. తిక్కన ఆ అంశాల నన్నింటిని తన రచనలో సందర్భోచితంగా వివరించి రచించాడు. అంతేకాక తన రచన కొక కావ్య కళా సౌందర్యాన్ని కల్పించి వన్నె పెట్టాడు.

రౌద్రరస ప్రధానమైన ఈ కథ తద్రసాధిదేవత అయిన పరమేశ్వర మహత్త్వ కీర్తనంతో, శరణాగత భక్తితత్త్వంతో ముగుస్తుంది. రుద్రుడు అష్టరూపుడు. అష్టవిధ రౌద్రముద్రితంగా సంస్కృత ద్రోణపర్వం ఉపపర్వాష్టకంతో రాణిస్తున్నట్లు చిత్రించబడింది. తిక్కన దానిని పంచాశ్వాస పరివ్యాప్తమైన ప్రబంధంగా రూపొందించటమే కాకుండా పంచాంక వినిర్మితమైన దృశ్యకావ్యంగా భాసింపచేసి ఉభయకవిత్వతత్త్వ విభవోజ్జ్వలు డనిపించుకొన్నాడు.

2. ద్రోణుడి చరిత్రలో క్రోధ బీజం:

భారత వీరులలో భీష్ముడి తరువాత గౌరవపాత్రుడు ద్రోణుడు. అతడి పుట్టుక విచిత్రం. అతడి చరిత్ర విశిష్టం. వాత్సల్య స్నేహ రసాల కుదురులో ఉద్భవించిన ద్రోణుడు క్రోధబీజంతో మొలకెత్తిన జీవన వృక్షాన్ని ధర్మరక్షణతో పెంచాడు.

భరద్వాజ మహర్షి సద్వినుత చరిత్రుడు. పుణ్యాత్ముడు. గంగాస్నాన సందర్భంలో జలక్రీడ లాడుతున్న ఘృతాచిని చూచి కామోద్రిక్తుడయ్యాడు. తత్క్షణమే శుక్లపాతమయింది. దానిని ఆతడు ద్రోణంలో సంగ్రహించి రక్షించాడు. ఆ పుణ్యమూర్తి వత్సలరసం కారణంగా ద్రోణుడి జన్మ ద్రోణంలో జరిగింది. అందువలన ద్రోణుడు సార్థక నామధేయు డయ్యాడు.

భరద్వాజుడికి ఒక ప్రాణమిత్రు డున్నాడు. అతడి పేరు వృషతుడు; పాంచాల రాజు. అత డొకనాడు తోటలో పూలుసేకరిస్తున్న మేనకను చూచి మదనావేశం పొంది రేతస్స్కందనానికి గురి అయ్యాడు. నేలపై బడిన రేతస్సును పాదంతో కప్పి ఉంచాడు. ఆ రేతస్సునుండి ద్రుపదుడు పుట్టాడు. ఆప్తమిత్రుల పుత్రు లిద్దరూ మిత్రులుగా కలసి మెలసి పెరిగారు. భరద్వాజాశ్రమంలో కలిసి వేదవిద్యనూ, ధనుర్వేదాన్నీ అధ్యయనం చేసి పండితులయ్యారు. అంతలో వృషతుడు మృతుడయ్యాడు. ద్రుపదుడు పాంచాల రాజ్యానికి రాజయ్యాడు. మిత్రుడైన ద్రోణుడికి స్నేహాహ్వానాన్ని అందించాడు. వారిరువురు కారణజన్ములు. ద్రోణుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శుక్రాచార్యాంశంలోను, ద్రుపదుడు వాయుదేవుడి అంశంలోనూ పుట్టారు. వారి ప్రవృత్తులు కూడా ఆయా అంశలకు అనుగుణంగానే ఉండటం సహజం కూడా.

ద్రోణుడు భరద్వాజుడివలన సకల ధనుర్విద్యలు నేర్చికొని అగ్నివేశుడనే మహర్షిని సేవించి అనేక దివ్యాస్త్రాలను పొందాడు. తండ్రి ఆనతి మేరకు కృపాచార్యుడి చెల్లెలైన కృపిని వివాహమాడి అశ్వత్థామను పుత్రుడిగా పొందాడు. అయితే ద్రోణుడు ఎంతటి విద్యావంతుడైనా పేదరికంలో మగ్గుతూ ఉండేవాడు. మహేంద్రాచలంలో తపస్సు చేసికొంటున్న పరశురాముడు బ్రాహ్మణులకు కోరిన సంపద లిస్తున్నాడని విని, ఆయనను ఆశ్రయించి సంపద నర్థించాడు. అయితే అప్పటికే ఆయన సంపదలన్నింటిని దానంచేశాడు. ధాత్రిని కూడా కశ్యపుడికి ఇచ్చివేశాడు. ఇక మిగిలినవి శరీరం, శస్త్రాలు. ఆ రెండింటిలో దేనినైన కోరుకొమ్మన్నాడు పరశురాముడు. అప్పుడు ద్రోణుడు -

క. ‘ ధనములలో నత్యుత్తమ । ధనములు శస్త్రాస్త్రములు; ముదంబున వీనిం
గొని కృతకృత్యుఁడ నగుదును । జననుత! నా కొసఁగు మస్త్రశస్త్ర చయంబుల్’. **(ఆది. 5.201)**

అని కోరుకొని దివ్యాస్త్ర సంపదను పొందాడు. అప్పటినుండి అస్త్రాచార్యుడిగానే జీవితం సాగించాడు.

అశ్వత్థామ బాలుడు. రాచబిడ్డలు ప్రతిరోజూ పాలు త్రాగటం చూచి తనకూ పాలు కావాలని మారాం చేయటం మొదలు పెట్టాడు. గోసంపదను పొందాలంటే ధనం కావాలి. ద్రోణుడికి బాల్యమిత్రుడు ద్రుపదుడు జ్ఞాపకం వచ్చాడు. అతడి ఆహ్వానం మనసులో ఆశలు రేపింది. అతడు ద్రుపదనగరానికి వెళ్ళి అతడిని కలిసి స్నేహపురస్సరంగా సంభావించాడు. ఆ చనవును సహించలేక, ప్రభుత్వగర్వంతో ద్రుపదుడు ద్రోణుడిని తృణీకరించాడు.

చ. “కొలఁది యెఱుంగ కిట్టి పలుకుల్ వలుకం దగుఁ గాదు నాక నన్
బలుగుఁదనంబునం బలుకఁ బాడియె నీ సఖి నంచుఁ? బేద వి
ప్రులకును ధారుణీశులకుఁ బోలఁగ సఖ్యము సంభవించునే?
పలుకక వేగ పొ; మ్మకట! పాఱుఁడు సంగడికాఁడె యెందునున్?’ **(ఆది. 5. 203)**

వియ్యానికీ కయ్యానికీ హోదాలుండాలనీ, మిత్రామిత్ర సంబంధాలు కార్యవశంగా ఏర్పడేవే కాని శాశ్వతాలు కావనీ చెప్పి, ఐశ్వర్య గర్వంతో ద్రోణుడిని తూలనాడాడు. స్నేహార్ద్రమైన ద్రోణుడి హృదయం మిత్ర కృత తిరస్కారంతో ప్రజ్వలించింది. జీవితాంతం రగులుతూ నిప్పురవ్వలు రేపే క్రోధాగ్నిని ప్రకోపిస్తూనే ఉండేది. ద్రుపదుడిని సంహరించిన దాకా అది ప్రస్ఫుటంగానూ, గూఢంగానూ ఆయనలో రౌద్రరసాన్ని కలిగిస్తూనే ఉండేది. తండ్రి శిక్షణలో సాత్త్వికుడుగా ఉత్తమ సంస్కారాన్ని ఉన్మీలింపజేసికొన్న ద్రోణుడు ద్రుపదధిక్కారంతో గూఢమైన రాజసమూర్తిగా పరివర్తనం చెందాడు. అతడిలోని శుక్రాచార్యాంశ ప్రతీకార ప్రజ్వలన రూపంగా ప్రకోపించి అతడిలో అసుర ప్రవృత్తిని ఆవిర్భవింపజేసి, కౌరవపక్షంలోనే ఉండి యుద్ధాలలో పాల్గొనే జీవిత విధానానికి దారితీసింది. అతడికోపం నివురుకప్పిన నిప్పు. ద్రుపదుడనే గాలి సోకితే చాలు నివురు తొలగుతుంది. నిప్పులు క్రక్కుతుంది. ఇది ద్రోణుడి నైజమైపోయింది.

ద్రుపదుడు చేసిన అవమానంవలన ప్రజ్వలించిన కోపాగ్నిని కొంత ఉపశమింపజేశాయి భీష్ముడి ఆదరాభిమానాలు, కౌరవ పాండవుల అస్త్రశస్త్ర విద్యా విన్యాసాలు. అయినా క్రోధాగ్ని పూర్తిగా చల్లారలేదు. విద్యారంభంలోనే ద్రోణుడు ఒక వాగ్దానాన్ని అడిగాడు కురుకుమారులను. ‘నా దగ్గర అస్త్ర విద్యలు నేర్చిన మీలో నా ఇష్టాన్ని కోరినవెంటనే ఎవరు తీర్చగలరు?’ అని అందరినీ మూకుమ్మడిగా అడిగాడు. కౌరవులందరూ నిరుత్తరులై నిలిచారు. అర్జునుడొక్కడే తన అంగీకారాన్ని తెలిపాడు. శిష్యుడంటే అతడే అని ఉప్పొంగి అభిమానించాడు ఆచార్యుడు. ‘శిష్యా దిచ్ఛేత్ పరాజయమ్’ - అన్న స్ఫూర్తితో దివ్యాస్త్ర శస్త్ర విద్యలన్నీ తన కొడుకుకంటె మిన్నగా పార్థుడికి నేర్పాడు. జగదేకవీరుడిగా అతడిని తీర్చిదిద్దుతానని మాట ఇచ్చాడు. ద్వంద్వ సంకీర్ణ యుద్ధాలను,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రథ గజ తురంగ సంహార రహస్యాలను, బహువిధ వ్యూహ భేదనోపాయాలను, ప్రయోగ రహస్యాతిశయంగా ఉపదేశించాడు. తనంతటివాడినిగా తయారు చేశాడు. పార్థుడితో పోటీపడగలిగిన ఏకలవ్యుడి సామర్థ్యాన్ని కుంటుపరిచాడు. పార్థుడికి ఎన్నో పరీక్షలు పెట్టాడు. వాటిలో నెగ్గిన శిష్యుడిని శిఖరప్రాయుడిగా తీర్చిదిద్దాడు.

కుమారాస్త్ర విద్యా ప్రదర్శన సందర్భంలో అర్జునుడికి దీటుగా కర్ణుడు రంగంలో నిలిచాడు. కర్ణార్జునులకు ద్వంద్వయుద్ధం సాగింది. కర్ణుడి పుట్టుకను హోదాను గురించిన చర్చను రేపి, అతడిని అనర్హుడని ప్రకటించటానికి ద్రోణాచార్యుడు యత్నించాడు. కాని, దుర్యోధనుడు కర్ణుడికి అంగరాజ్య మిచ్చి, అభిషేకించి, ప్రాణమిత్రుడిగా మన్నించి అర్జునుడికి ప్రతివీరుడిగా నిలిపాడు. ఆ చర్య ఆచార్యుడి ఆత్మాభిమానాన్ని బాగా దెబ్బతీసింది. అయితే, కురుకుమారులతో విరోధం సమయోచితం కాదని మనసులోనే ఆ మంటను దాచుకొన్నాడు. దానితో కర్ణుడూ, అతడిని సమర్థించిన దుర్యోధనాదులూ ఆయనకు అహిత వర్గంలో చేరారు. కాని, ఆ గుట్టును బయటపెట్టకుండా ప్రభుసేవలో బ్రతుకు సాగిస్తూ, భీష్ముడి అండన ఆచార్యత్వాన్ని సంరక్షించుకొంటూ వచ్చాడు. శుక్రుడు ఎంతటి ధర్మవేత్త అయినా అతడి కృషి అంతా రాక్షససేవకే అంకితమౌతుందన్న సూక్తి తదంశతో పుట్టిన ద్రోణుడి పట్ల అన్వర్థమయింది.

అస్త్రవిద్యాబోధనానంతరం ద్రోణుడు ధార్తరాష్ట్రులనూ, పాండవులనూ ఒక విచిత్రమైన గురు దక్షిణను కోరాడు. 'అవివేక కారణ దారుణైశ్వర్యావలిప్తుండైన ద్రుపదు నోడించి పట్టి తెండు' - అని ఆజ్ఞాపించాడు. కౌరవులు గుంపులు గుంపులుగా ముందుగా సాగిపోయి ద్రుపదుడిపై దాడిచేశారు. కాని, అతడి ధాటికి ఆగలేక పలాయనం చిత్తగించారు. అర్జునుడు ఆ తరువాత వీరోచితంగా పోరాడి, ద్రుపదుడిని పట్టి రథచక్రానికి కట్టి తెచ్చి ద్రోణుడి ముందుంచాడు. అర్జునుడి పరాక్రమాన్ని చూచి ఆచార్యుడు పరమహర్షాన్ని ప్రకటించాడు. ద్రుపదుడిని చూచి అవహేళనగా నవ్వాడు. వ్యంగ్యంగా అధిక్షేప గర్భితంగా ఈ విధంగా పలికాడు.

క.. 'వీ రెవ్వరయ్య? ద్రుపద మ । హారాజులె? యిట్లు కృపణులయి పట్టువడన్
వీరికి వలసెనె? యహహా! మ । హారాజ్యమదాంధకార మది వాసె నొకో!' **(ఆది. 6. 90)**

'ఇంకనైన మమ్ము నెఱుఁగంగఁ నగు నొక్కొ!' అని వ్యంగ్యంగా ఎత్తిపొడిచాడు. ఆ తరువాత, ఏహానీ తలపెట్టక వెంటనే అతడిని విడిచిపుచ్చాడు. 'విప్రుల యలుకయుఁ దృణహుతాశనంబు దీర్ఘమగునె?' (ఆది. 6.91) అని నన్నయ అర్థాంతరన్యాసంలో ఆచార్యుడి క్రోధస్వభావాన్ని ధ్వనింపజేశాడు. దీర్ఘకోపవృత్తి లేని బ్రాహ్మణుడే అయినా గూఢకోపవృత్తి లేని సాత్త్వికుడు మాత్రం కాడు ద్రోణాచార్యుడు.

3. ద్రోణుడి సాత్త్విక రాజసప్రవృత్తి:

ద్రోణుడి సాత్త్విక రాజస ప్రవృత్తి ధర్మరాజుకు ఎన్నో వెలుగుబాటలు చూపింది. శత్రువును బంధించి తెచ్చిన తనవారిని మెచ్చుకొని, అతడిని అధిక్షేపించి బంధవిముక్తుడిని చేసి బుద్ధి చెప్పి పంపిన సన్నివేశం అతడి కొక ఉపదేశమయింది. ఆరణ్యపర్వం లోని ఘోషయాత్రా ఘట్టంలో ధర్మరాజు దుర్యోధనుడి పట్ల అటువంటి ప్రవృత్తియే ప్రదర్శించి ఆచార్యుడికి అచ్చమైన శిష్యు డనిపించుకొన్నాడు. అర్జునుడు కూడా ఈ లక్షణాన్ని ఎడనెడ రణరంగంలోనూ ప్రదర్శించాడు.

ద్రుపదుడు పరితాపాన్ని ప్రదర్శించి ఉంటే ద్రోణుడి క్రోధం ఉపశమించి ఉండేదేమో! కాని, ద్రుపదుడు 'కోపపాశబద్ధు' డయ్యాడు. అవమానతప్తు డయ్యాడు. అవమాన భూమిక నుండి క్రోధబీజం ప్రజ్వలించింది. బ్రాహ్మణోపాస్తిని దీక్షగా నిర్వహించి, హోమాగ్ని గర్భంనుండి ద్రోణుడిని చంపగలిగిన పుత్రుడు ధృష్టద్యుమ్నుడినీ, అర్జునుడిని చేపట్టగల పుత్రిక - ద్రౌపదినీ సంతానంగా పొందగలిగాడు. ఇది క్రోధం నుండి పుట్టిన క్రోధం. దీనివలన ద్రోణుడిలో క్రోధం మరల కుళ్ళగించినట్లయింది. తనను వధించటానికి పుత్రుడిని కన్న ద్రుపదుడినీ, అతడి పుత్రుడినీ యుద్ధంలో సంహరించేంతవరకు చల్లారని క్రోధం కోరలు చాస్తూ లోలోన బుసలు కొట్టుతూ ద్రోణుడిని గూఢక్రోధమూర్తిగా మార్చి పడగవిప్పని పాములవలె ప్రవర్తిల్ల జేసింది.

అర్జునుడికి 'బ్రహ్మశిర'మనే మహాస్త్రాన్ని ప్రసాదించి తనతో సమానుడిగా సమ్మానించాడు ద్రోణుడు. అయితే తనతో అర్జునుడు ప్రతియుద్ధం చేయకుండా కట్టడి చేశాడు. అందుకనే, అర్జునుడు తనంతట తాను ఆచార్యుడిపై ముందుగా యుద్ధం ప్రారంభించడు. ఒక్కొక్కసారి నమస్కార బాణాలతో అభివాదనంచేసి, ముందుకు సాగుతాడు. లేదా యుద్ధం చేయటానికి అనుమతిని వేడి గాండీవాన్ని సారిస్తాడు. లేదా ఆయనను తప్పించి ప్రక్కగా మొగ్గరంలోకి ప్రవేశించి పురోగమిస్తాడు. భారత కథను గమనిస్తే - అర్జునుడు ధర్మజ కృష్ణుల తరువాత గౌరవించే మహాత్ముడు ద్రోణుడు. పార్థుడికి పితామహు డంటే భయం. ఆచార్యుడంటే భక్తి.

పాండవులు లాక్షాగృహ దహనంలో ప్రాణాలు కోల్పోయారని తెలిసి ద్రోణుడు దుఃఖించాడు. కాని, అది దుర్యోధనుడి కపటోపాయ మని ఆయనకు తెలియదు. ఆ తరువాత పాండవులు సజీవులై ఉన్నారనీ, ద్రౌపదిని పెండ్లాడి ద్రుపదనగరంలో క్షేమంగా ఉన్నారనీ తెలిసి ఆనందించాడు. అయితే, ధృతరాష్ట్రుడు దుష్టచతుష్టయ ప్రేరణతో పాండవులపై యుద్ధం ప్రకటించి ద్రుపదులను ఓడించి వారిని బందీలుగా చేసితేవటమో, లేక చంపివేయటమో చేయాలన్న వ్యూహాన్ని ఖరారు చేసి, సలహాకొరకు ధర్మవేత్తలైన భీష్మ విదుర ద్రోణాదులను పిలిచి సభ చేశాడు. పాండవులను పిలిపించి తండ్రిపాలైన సగం రాజ్యాన్ని వారికి ఇవ్వటం ధర్మమని భీష్ముడు సలహా చెప్పాడు. ద్రోణుడు ఆయనను సమర్థించాడు. బలవంతులైన పాండవులతో కలిసి ఉండటం మేలని హితవు చెప్పాడు. దానికి కర్ణుడు మండిపడ్డాడు.

తే. 'ముదుసళులు తమ కిమ్ముగాఁ జదివికొంద్రు । గాక పతులకు హిత మగు కర్జ మేల
యొలసి చెప్పుదు?; రహితులఁ గలసికొనుట । ధర్మువని; రిది నయవిరుద్ధంబు గాదె!'.**(ఆది.8. 38)**

అని పలికి ద్రోణుడి సలహా అసాధువని అధిక్షేపించాడు. ఆతడి తిరస్కారం ద్రోణుడిలో క్రోధాన్ని ప్రజ్వలింపజేసింది. రోషంతో ఇట్లా అన్నాడు.

క. 'ఉడుగక యే మహితముఁ బలి । కెడు వారము, నీవు హితవు క్రియ గొనఁగాఁ బ
ల్కెడువాఁడవు మాకంటెను । గడు హితుఁడవు నీవ కావె కౌరవ్యులకున్?'

క. 'నీ కఱపుల నిక్కురుకుల । మాకుల్యముఁ బొందు టేమి యాశ్చర్యము సౌ
మ్యాకృతులు గాని వారల । వాకులు శిక్షలు నుపద్రవమ్ములు కావే?' **(ఆది. 8. 40-41)**

కాకువుతో శత్రువును వ్యంగ్యంగా అధిక్షేపించటంలో, బాణాలకంటె వాడిగా వాగ్బాణాలను సంధించటంలో ద్రోణుడు నేర్పరి. ద్రుపదుడిని ఎత్తిపొడిచిన మాట వ్యంగ్యోక్తి. కర్ణుడిని ఈసడించిన మాట వక్రోక్తి. రెంటికీ కాకువు జీవాతువు. నన్నయ ద్రోణుడి నోట పలికించిన ఈ పద్యాలు తెలుగునాట సంభాషణలలో వ్యంగ్యోక్తులుగా నేటికీ ప్రచారంలో ఉన్నాయి.

దుర్యోధనుడు కర్ణాదుల ప్రబోధంతో ద్రోణుడిని హితుడిగా నమ్మి వ్యవహరించలేదు; పాండవ పక్షపాతిగా పరిగణించి, తమ ఆలోచనలకు ఆయనను దూరంగా ఉంచాడు. ద్రోణుడు దుష్టచతుష్టయాన్ని ఎన్నడూ సమర్థించలేదు. అయితే, తానే ముందుపడి వారికి హితవు చెప్పలేదు. భీష్ముడి మాటను సమర్థిస్తూ తన పాత్రను పోషించుకొన్నాడు. ధృతరాష్ట్రుడు ద్రోణుడిపట్ల గౌరవాన్ని ప్రదర్శించాడు. అందువలన రాజసభా గౌరవానికి అతడు దూరం కాలేదు. దుష్టచతుష్టయ ప్రవర్తనం పాండవులపట్ల ద్రోణుడు సానుభూతిని పెంచుకొనటానికి దోహదం చేసింది. తనువు ధృతరాష్ట్రుడికీ, మనసు పాండవులకూ అంకితం చేశాడు. కాని, ద్రౌపదీ పాండవులను అభిమానించినంతగా ఆయన ఎన్నడూ ద్రుపదుడినీ, ధృష్టద్యుమ్నుడినీ గౌరవించలేదు. వారిమీద గూఢమైన క్రోధం కొనసాగుతూనే ఉన్నది. అది పాండవ పక్షంలో బాహాటంగా చేరటానికి అడ్డం వచ్చింది. దీనికి మించి తనకు ఆచార్య పదవి నిచ్చి గౌరవించిన భీష్ముడిని వీడి వెళ్ళటం ఆయనకు ఇష్టం లేదు. భీష్మ ద్రోణులు విడదీయరాని మిత్రద్వయం. అయినా ద్రోణుడు భీష్ముడివలె స్వతంత్రుడు కాడు. యజమానుడి వెనుక ఉన్న విజ్ఞాని.

4. కర్ణ దుర్యోధనులు ప్రక్కలో బల్లాలు:

పాండవులు హస్తినాపురానికి వచ్చారు. భీష్మద్రోణుల కోర్కె ఫలించింది. ధార్తరాష్ట్ర పాండుసుతులు కలతలు పడకుండా జీవించటానికి తగిన ఉపాయంగా ధర్మరాజును యువరాజును చేసి, ఇంద్రప్రస్థపురాన్ని పాండవులకిచ్చి సుఖంగా నివసించే ఏర్పాటును ద్రోణుడు సమర్థించాడు. కురువంశంలో శాంతి సౌమనస్యాలు వృద్ధి చెందాలని ఆశించిన హితు డాయన. పాండవులు రాజసూయం చేసినప్పుడు సంతోషించాడు. మాయాద్యూతంలో పాండవు లోడినప్పుడు, ద్రౌపదీ వస్త్రాపహరణాది ఘట్టాలలో ఆయన కటకట పడ్డాడు. కాని, రాజకీయంలో భీష్ముడు చొరవతీసికొన్నంతగా అతడు ముందుకు రాలేడు. వచ్చినా దుర్యోధనుడు రానీయడు; కర్ణుడు నిష్ఠురంగా నిందిస్తాడు. అందువలన వలసినప్పుడు హితవు పలకటం తప్ప ద్రోణుడు కౌరవులతో స్నేహం పెంచుకొనలేకపోయాడు; పాండవులకు ప్రత్యక్షంగా మేలు చేయలేకపోయాడు. ఆయన మౌనంవలన పాండవులకు కొంత అన్యాయం జరిగిందని మాత్రం బాధపడేవాడు. పునర్ద్యూతంలో ఓడి పాండవులు అరణ్య అజ్ఞాతవాసాలకు వెళ్ళవలసి వచ్చింది. విదురాదులవలె ద్రోణుడు కూడా నిశ్శబ్దంగా నిట్టూర్చి ఉండిపోయాడు. హస్తినాపురాన్ని, ధృతరాష్ట్రుడి కొలువును, భీష్ముడి స్నేహాన్ని ఆయన వదలుకొనలేకపోయాడు. అయితే, మనసులో ధర్మరాజంటే నిండు గౌరవముండేది; అర్జునుడంటే ఆత్మీయమైన అభిమానం ఉండేది. అర్జున విజయమే ఆచార్యుడి అంతరంగం.

అరణ్యవాసంలో అర్జునుడు తపస్సుచేసి పరమేశ్వరుడిని యుద్ధంలో మెప్పించి పాశుపతాస్త్రాన్ని సంపాదించి, ఇంద్రుడి సింహాసనంమీద అతడితోపాటు అధివసించి, దివ్యాస్త్రాలనెన్నో సాధించి, నివాతకవచాది రాక్షసులను సంహరించి జగద్విఖ్యాతి కాంచిన వృత్తాంతం ద్రోణుడికి సంతోషం కలిగించింది. పాశుపతాస్త్ర సంపాదియొక్క అతిలోక పరాక్రమశక్తిని తెలిసిన ఆచార్యుడు ద్రోణుడు. అందుకే అజ్ఞాతవాసకాలంలో మత్స్యనగరంమీద సాగిన ఉత్తర గోగ్రహణ యుద్ధంలో ఉత్తరకుమారుడి సారథిగా పేడిరూపాన కానవచ్చిన అర్జునుడిని ద్రోణుడు గుర్తించి, అత డావేశంతో సమయభంగ మయ్యే సాహసం చేపట్టినందుకు లోలోన బాధపడి, 'అజ్ఞాతవాసపు గడువు తీరిందా?' అని భీష్ముడిని ప్రశ్నించి, తీరిందని అతడు చేసిన సూచనను గ్రహించి, అన్నేళ్ళ తరువాత శిష్యుడిని చూచిన సంతోషంతో ఉప్పొంగిపోయి అర్జునుడిని ఎలుగెత్తి కీర్తించాడు. తిక్కన కవితలో ఆణిముత్యాల వంటి పద్యాలు ఆవిర్భవించాయి.

శా. 'సింగం బాఁకటితో గుహాంతరమునం జేడ్పాటుమై నుండి మా
తంగస్ఫూర్జిత యూథదర్శన సముద్యత్క్రోధ మై వచ్చునో
జం గాంతార నివాస ఖిన్నమతి నస్మత్సేనపై వీఁడె వ
చ్చెం గుంతీసుత మధ్యముండు సమరస్థేమాభిరామాకృతిన్.'

ఉ. 'ఈతని తోడి కయ్యమున కియ్యకొనం దగువార లస్మదీ
యాతత సేనలోఁ గలుగు టారయ సంశయ; మెల్లభంగి గో
వ్రాతనివర్తనంబు సుకరంబ కిరీటి; కితండు రుద్రునిం
బ్రీతునిఁ జేసె నా వినమె పెంపెసలారెడు బాహు సంపదన్?' **(విరా. 4. 95,96)**

కోదండ పాండిత్యంలో గురువును మించిన శిష్యుడు తారసిల్లినప్పుడు అవ్యాజవాత్సల్య పూర్ణమైన మనస్సుతో చేసిన వీర ప్రశంస ఇది. ద్రోణుడు తనకు సాధ్యంగాని పాశుపతాన్ని పొందిన పార్థుడిని జగదేకవీరుడిగా గుర్తించి చేసిన గుణకీర్తన మిది. గుణాన్ని మెచ్చే గురువు ద్రోణాచార్యుడు. ద్రోణుడి ఈ గుణం కర్ణ దుర్యోధనులకు నచ్చదు. ఆయన చేసిన ప్రశంస పాండవ పక్షపాతంతో నోటికి వచ్చినట్లు పలికిన శత్రుప్రశంసగా, స్వపక్షనిందగా వారికి తోచింది. ద్రోణు డప్పుడు ప్రభుపక్షంవారిచేత అవమానించబడ్డాడు. అయినా, అతడి మనసు మారలేదు; మాట మారలేదు. ఆచార్యుడు గుర్తించిన అర్హత అర్జున పరాక్రమం.

అజ్ఞాతవాస కాలం పూర్తికాకుండానే బయలు మెరుస్తున్న అర్జునుడిని గుర్తించి, పాండవులను మరల అరణ్యాజ్ఞాతవాసాలకు పంపవచ్చుననే దురాలోచనలో మునిగి, వాస్తవాన్ని గుర్తించక పెనుముప్పు నెదుర్కొనబోయే దుర్యోధనుడికీ, కౌరవసేనకూ సమయోచిత రక్షావ్యూహాన్ని సూచించి రణవిద్యాచార్యు డనిపించుకొన్నాడు ద్రోణుడు.

ఉ. ‘ముందర రాజుఁ బుచ్చి బలములఁ గలయంబడి గోవ్రజంబులన్
దందడి వెట్టకుండఁ బిఱుఁదన్ నడపింపఁగఁ బంచి గట్టిమై
నందఱు నింతకున్ వెనుకయై మొనలేర్చి చనంగ నెప్డు సం
క్రందనసూతి డగ్గఱియెఁ గయ్యము సేయుట కప్పు డిమ్మగున్’. **(విరా. 4.184)**

ఈ మాటలకు దుర్యోధనుడు దురహంకారంతో మండిపడి ద్రోణాచార్యులను తూలనాడాడు. ‘ఆచార్యులైన వారలు కార్యంబు దవ్వులం గనియెడువారు గాన కయ్యంబు తెఱంగు వారల నడుగవలవదు; బుద్ధిమంతు లిండ్లకడ నుండి భోజనావసరంబుల, నాయుధ శ్రమ సమయంబుల, నీతి శాస్త్ర గోష్ఠీ కాలంబుల నుచితాలాపంబులు పలుకుదురు గాని పోట్లాడువారు గారు; వారిం గలనం గలసి నిలువనీక పిఱిందిదెస నిలిపిన మనకు వారు విజయంబు గోరుచుండుట లెస్స’ - (విరా.) అని అవహేళనం చేశాడు. ఈ మాటలకు ఆచార్యుడికంటె అశ్వత్థామకే ఆగ్రహం పొంగివచ్చింది. ఆచార్యుడు నిగ్రహించుకొన్నాడు.

కర్ణ దుర్యోధనుల చిన్నచూపునకు పాలైన ద్రోణుడు పార్థుడి గురుప్రశంసలకు పాత్రుడయ్యాడు. ఉత్తర గోగ్రహణ యుద్ధంలో కౌరవవీరులను ఉత్తరకుమారుడికి పరిచయం చేస్తూ పార్థుడు ద్రోణాచార్యుడిని అందరికంటె మిన్నగా (మూడు పద్యాలలో) ప్రశంసించాడు. భీష్మాదుల నెదుర్కొనటానికి ఎటువంటి నియమాలు లేవు. కాని, పార్థుడు ద్రోణుడిని తనంతటతాను ఎదుర్కొనరాదనే నియతి గురుశిష్యుల నడుమ కుదురుకొని ఉన్నది. అర్జును డా నియతిని ఎప్పుడూ తప్పలేదు. ఉత్తరకుమారుడితో చెప్పిన ఈ మాటలు గమనించదగినవి.

క. ‘గురునకుఁ బ్రదక్షిణంబుగ । నరదముఁ బోనిత్తు; మిమ్మహాపురుషు నెడం
బరిభవము వలవ; దీతఁడు । కురుకుల నృపతనయ శిక్షకుఁడు సు మ్మనఘా!’

క. ‘శస్త్ర ప్రకార నిపుణుం । డస్త్ర విదుఁడు దూరపాతనాభీలుఁడు వ
ర్చ స్త్రాసిత రిపుఁడు ధను । శ్శాస్త్ర పరిజ్ఞాన ఘనుఁ డసదృశుఁడు శక్తిన్.’

ఉ. ‘ఈతనితోడి కయ్యమున కియ్యకొనం దగ; దేను దుష్పృథ
ద్యూత జయోద్ధతుం డగు సుయోధనునిం బరిమార్పఁ బోవుచో
శాతశరోత్కరం బతఁడు చక్కఁగ నేయునొ నన్ను నేయఁడో
చూతము; దాన ము న్ననికిఁ జొచ్చినఁ జొత్తుము గాక పిమ్మటన్’. **(విరా. 5. 5-7)**

అస్త్రవిద్యాగురువును అవమానించరాదు; గురువుకు ఎదురు నడిచి అవినయాన్ని ప్రకటించరాదు; ప్రదక్షిణంగా పయనిస్తే ఆచార్యుడి అనుగ్రహం లభిస్తుంది. శిష్యు లెప్పుడూ అధికులు కాలేరు. కాబట్టి గురువుతో పోరు తగదు. దుర్యోధనుడిని చంపే లక్ష్యంతో సాగటం కర్తవ్యం. ఆచార్యుడు అర్జునుడిపై అస్త్రశస్త్రాలు ప్రయోగించిన తరువాతే ఆయనమీద బాణప్రయోగం; యుద్ధం ఆచార్యుడు మొదలు పెట్టితేనే అర్జునుడు ప్రారంభించేది. ఇది గురు శిష్య ప్రతిజ్ఞలకు భంగం కాని విధం. కష్టకాలంలో కూడా నియతిని పాటించిన పార్థుడి పరాక్రమశీలం ద్రోణాచార్యుల ఆశీస్సుల నందుకొన్నది. శిష్యవాత్సల్యం గురువులకు నైజం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

5. గురుశిష్య ధర్మవర్తనం :

ఉత్తర గోగ్రహణ యుద్ధంలో ద్రోణుడు ముందుగా అర్జునుడిపై ఇరవై బాణాలు సంధించాడు. వాటిని అర్జునుడు మధ్యలోనే త్రుంచివేశాడు. ఇరువురనడుమ ద్వంద్వయుద్ధం ఘోరంగా మొదలయింది. ముందు నీవా నేనా అన్నట్లు ప్రారంభమైనా కొంతసేపటికి ఇరువురూ సమానులే అన్నట్లు చూపరులకు తోచింది.

శా. 'శ్రావ్యంబై చెలఁగన్ గభీరమధుర జ్యానాద ముద్దామవీ
రవ్యాపార నిరూఢతం బ్రతిశరారంభంబు మర్దించుచున్
సవ్యప్రౌఢి దృఢాపసవ్యగతి నాశ్చర్యంబుగా నేయుచున్
దివ్యాస్త్రంబులఁ బోరి రిద్దఱును సాదృశ్యం బదృశ్యంబుగన్'. **(విరా. 5. 132)**

కొంతసేపటికి ద్రోణాచార్యుడికి సాయంగా పెద్దసైన్యం వచ్చి అర్జునుడిని అడ్డగించింది. వారందరిని క్షణంలో చంపి రక్తసముద్రాన్ని రణరంగంలో కల్పించాడు అర్జునుడు. ఆతడి నేర్పరితనం ఆచార్యుడికే ఆశ్చర్యం కలిగించింది.

క. 'అర్జునుని నాహవంబున। నిర్జింపఁగ నగునె ఫాలనేత్రున కైనం;
బర్జన్యసుతుఁడు శరవ। ర్వోర్జితమూర్తి యగు టరయ నుచితము కాదే!' **(విరా. 5.134)**

అని ప్రశంసించాడు. ఆకాశంలో నిలబడి వారిరువురి యుద్ధాన్ని చూస్తున్న దేవగణాలు అర్జునుడి ముందు నిలబడి అంతసేపు యుద్ధం చేయటమే ద్రోణుడి దొడ్డతనం - అని భావించేటంతవరకు వచ్చింది. అంతలో అర్జునుడు ద్రోణుడి రథాన్నీ, గుర్రాలనూ, సూతుడినీ, చివరకు ఆయన దేహాన్నీ బాణాలతో నింపి ఆచార్యుడిని అస్త్రాబ్ధిలో ముంచివేశాడు. అతడిని రక్షించటానికి అశ్వత్థామ యుద్ధంలోకి దూకవలసి వచ్చింది. ఈ సన్నివేశం ద్రోణపర్వంలోని చివరి ఘట్టానికి తొలి సూచికగా భాసించింది. విశేషమేమంటే - అర్జునుడు యుద్ధంలో ఎంతటి వీరాన్ని ప్రదర్శించినా గురువుకు క్రోధం రాదు. సరికదా ఆనందప్రదం. అర్జునుడిది - గురుభక్తి వలన కలిగిన శక్తి. అతడు గురువును మించిన శిష్యుడన్న సత్యం ద్రోణుడు స్వానుభవం వలన తెలిసికొన్నాడు. అతడి చిరకాలవాంఛ ఫలించినట్లయింది.

శ్రీకృష్ణుడు రాయబారం సలిపిన నిండుసభలో భీష్మద్రోణులు దుర్యోధనుడికి హితవు చెప్పారు. చివరగా వారు చేసిన హెచ్చరిక మహాభారత యుద్ధఫలితాన్ని ధ్వనింపజేసేది.

క. 'ఈ కృష్ణుని సారథ్యము। నా కృష్ణుని గాండివంబునై తోఁపక ము
న్నీ కొలఁదిఁ జక్కఁబడి వీ। కురువంశంబు గావు మిభపురనాథా!' **(ఉద్యో. 3. 351)**

ఎన్ని హితవులు చెప్పినా పెడచెవిని బెట్టిన దుర్యోధనుడికి జంటకవులవలె భీష్మద్రోణులు చేసిన బోధ ఇది.

శా. 'మాకుం జూడఁగఁబోలు కార్య మిది; ధర్మ ప్రీతి నీ వేఁగి సు
శ్లోకుండైన యుధిష్ఠిరుం గని జనస్తుత్యంబుగా శాంతిమై
నీ కౌరవ్యుల నెల్లఁ గాచికొనవే! యే పొప్ప దెందుం; దుదిన్
శోకం బొందక వేగమైఁ గదలి కృష్ణుం గూడఁ బోవే నృపా!' **(ఉద్యో. 4.24)**

ఈ మాటలు విని దుర్యోధనుడు మొగం రాజుతూ ఉండగా మాటాడక ఊరకుండిపోయాడు. అది గురుహిత తిరస్కార సూచకమైన అభినయం. దుర్యోధనుడి దుర్వివేకానికి భీష్మద్రోణులు మండిపడ్డారు. దిగ్గన లేచి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ‘ కురునృప! విను; సంసారము । దరి ద్రొక్కినవార; మింక దలఁకెదమే సం
గరమునకు నేము నీకై । పొరలితి; మెట్లైన నగును బోయెద మనుచున్’ **(ఉద్యో. 4.26)**

సభను వదలి వెళ్ళిపోయారు. దుర్యోధనుడు కొరకరాని కొయ్య. యుద్ధం తప్పదు. అందులో మరణం తప్పదు. దీనిని తెలియజెప్పినా తెలిసికొనలేని తెలిసి తెలియని మూర్ఖుడు దుర్యోధనుడు. అతడు చావబోతూ వంశాన్నంతా బలిపెట్టుతున్న దుర్నయుడు. ఆతడి మీది కోపం. అతడి అవివేకం మీది కోపం. ‘ఎట్లైన అగును, పోయెదము’ - అనే మాటలు నైరాశ్యసూచకాలే కాదు, విషాదాంత సూచకాలు కూడా! ఏదైతే అది అవుతుంది. మేం పోతున్నాం - అని ఒక అర్థం. ఏదో మార్గంతో కానున్నది కాకమానదు. మేము పోవటం (చనిపోవటం) నిజం - అని ఒక అర్థం. ఇవి గూఢమైన రౌద్రరస బీజాక్షరాలు.

6. ద్రోణాచార్యుడి యుద్ధవీరమూర్తి:

పితామహుడు ద్రోణాచార్యుడి యుద్ధవీరమూర్తిని సుస్పష్టరేఖలతో చిత్రించాడు.

సీ. ‘ అతిరథోత్తముఁడు ద్రోణాచార్యుఁ డందలి । యిందలి విలుకాండ్ర కెల్లఁ గురుఁడు,
హితుఁడు నీ, కెంతయు నేర్చిన మొన లితం । డడరినఁ జమరిన యట్ల ప్రమందు;
వృద్ధని యితని భావింప రాఁ దనిలోన । నంగవిస్ఫురణంబు భంగి సూడ;
నర్జునుపైఁ గూర్మి నతని నో నేయఁడు; । సచరాచరం బైన జగము లెల్ల

తే. నొక్క మొగమై కడంగినఁ జిక్కువడుచు । దివ్య బాణ జాలంబుల దీటుకొలిపి;
ప్రాణములు డాఁపఁ; డీతని పాటి దొరలఁ । గాన మే రాజ్యములయందుఁ గౌరవేంద్ర!’**(ఉద్యో. 4.230)**

భీష్మద్రోణ పర్వాలలో ద్రోణుడి యుద్ధవీర వ్యక్తిత్వం శతపత్రంవలె వికసించటం గమనించగలం. ధర్మరాజు యుద్ధారంభంలో భీష్ముడి తరువాత ద్రోణుడిని దర్శించి అతడి అనుజ్ఞను కోరాడు. అందులో మూడంశా లున్నాయి.

1. యుద్ధం చేయటానికి ద్రోణుడు ధర్మరాజును అనుమతించుమని కోరటం.
2. యుద్ధంలో ధర్మరాజుకు జయం కలగాలని ఆశాసించుమని ద్రోణుడిని కోరటం.
3. యుద్ధంలో నిజవధోపాయం చెప్పుమని ద్రోణుడిని ధర్మరాజు కోరటం.

యుద్ధానికి సిద్ధమై కురుక్షేత్రంలో ఉభయపక్షసేనలు మోహరించి ఎదురెదురుగా నిలువబడిన తరువాత అనుమతికోరటం ఎందుకు? అనే ప్రశ్న సామాన్యంగా కలుగుతుంది. ధర్మరాజు భీష్మ, ద్రోణ, కృప, శల్యులను మాత్రమే అనుమతిని అడిగాడు. దీని కేదో నీతి సూత్రమో, ధర్మసూత్రమో, యుద్ధమంత్రమో, ఉపాయ విశేషమో కారణమై ఉండాలి. అందులోనూ నలుగురిని క్రమంగా అడగటంలో వేరు వేరు ప్రయోజనాలు కూడా ఉండి ఉండాలి. వాటిలో ద్రోణుడికి సంబంధించిన అంశాలు ఇక్కడ ప్రస్తుతాలు.

శస్త్రాస్త్ర విద్యాబోధకు పారితోషికంగా ద్రోణుడు కోరిన కోరికలలో ఒకటి పార్థుడు అతడిపై యుద్ధానికి తనంతటతాను పూనుకొనరాదు. ద్రోణుడు అనుమతిస్తే దోషంలేదు. ఈ కట్టడి అర్జునుడితో చేసికొన్నదయినా, పాండవుల కందరికీ అది వర్తిస్తుందని ధర్మజుడు భావించి వారి భావసమైక్యమును ప్రకటింపదలచి ఉండవచ్చును. అందువలన అందరికీ ఆయన అనుజ్ఞ లభించటంవలన యుద్ధాన్ని నిరాఘాటంగా సాగించవచ్చునని ధర్మజుడి వ్యూహమై ఉంటుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యుద్ధంలో ధర్మరాజుకు జయం కలిగేటట్లు ఆశాసించాలని రెండవ ప్రార్థన. కౌరవపక్ష ప్రధానులలో ఒకడైన ద్రోణుడు ప్రతిపక్షనాయకుడి విజయాన్ని ఆకాంక్షించటం ధర్మవిరుద్ధం; నైతిక ప్రవర్తనకు విరుద్ధం. అందుకే ఆయన ప్రత్యక్షాశీర్వాదం ఇవ్వటానికి బదులు పరోక్షాశీస్సునే అందించాడు. 'ధర్మజా! నీకు కృష్ణుడు మంత్రి అయి ఉండగా జయం కలిగేటట్లు మరొకరిని ఆశీర్వదించుమని కోరనవసర మేముంది? ధర్మం ఏ పక్షంలో ఉంటుందో కృష్ణు డా వైపున ఉంటాడు. జయం ఆ పక్షానికితథ్యం' అన్నాడు. ద్రోణుడు పాండవులదే ధర్మవిజయమని అంతరాత్మ సాక్షిగా చెప్పాడు. అయినా, కౌరవులపక్షాన పోరాడుతున్నాడు. అతడు విల్లు పట్టి నిలిచి ఉండగా శత్రువులకు విజయం అసాధ్యం. కాబట్టి పాండవ విజయానికి అవకాశం కలిగించేది ఆచార్యుడి అస్తమయమే. ఆయన మరణ రహస్యం ఆయనకే తెలుసు. అందువలన తద్ వధోపాయాన్ని ధర్మరాజు ఆయననే అడిగాడు. ఆచార్యుడు కపటంలేని కరుణామయుడు. పాండవులయందు వాత్సల్యం కలవాడు. అర్జునుడి విజయాన్ని కోరేవాడు. బంధుమిత్రులకంటె గురువులు శిష్యుల కోర్కెలు తీర్చటంలో అత్యంత ఉదారహృదయులుగా ఉండటం లోక సహజం. పాండవ విజయం స్వీయవధ రహస్యం మీదనే ఆధారపడి ఉండటంచేత వెంటనే మెత్తబడి గట్టిగా, సూటిగా, స్పష్టంగా చెప్పాడు. 'నా చేతిలో ఆయుధం ఉండగా నన్ను చంపటానికి ఎవ్వరికీ శక్యం కాదు. నేను ప్రాయోపవేశంలో ప్రవేశించి అస్త్రశస్త్రాలను సన్న్యసించి ఉన్నప్పుడు మాత్రమే నన్ను చంపగల శక్తికలవాడికి ఆ అవకాశం లభిస్తుంది. బాగా నమ్మదగినవాడు అత్యంత దుస్సహమైన కీడుమాటను చెప్పినప్పుడు మాత్రమే నేను ప్రాయోపవేశానికి దిగుతాను. నేను ప్రాయోపవేశంలో ఉన్నప్పుడే నన్ను చంపే క్రూరకర్మ సాధ్యమౌతుంది!'

ద్రోణుడిచ్చిన మూడు వరాల వలన కలిగిన ఫలితాంశాలను విశ్లేషించుకొంటే కొన్ని విశేషాలు స్పష్టమౌతాయి. 1. పాండవులు ద్రోణుడిమీద యుద్ధం సాగించి ప్రయత్నిస్తే విజయం తప్పక లభిస్తుంది. 2. కౌరవ పక్షాన ద్రోణుడు యుద్ధం చేస్తున్నా పాండవులకు విజయం కలగాలన్న ఆయన ఆశీస్సుకు విరుద్ధంగా యుద్ధ విజృంభణం సాగరాదు. ఎంతటి అసాధ్యమైన వ్యూహమైనా అది భగ్నం అయ్యేద్వారాలను ద్రోణుడు తెరువవలసి ఉంటుంది. 3. ద్రోణుడిని చంపటానికే వరపుత్రుడుగా పుట్టిన ధృష్టద్యుమ్నుడు పాండవపక్షంలో ఉన్నాడు. అయినా, ద్రోణుడు ప్రాయోపవేశంలో ప్రవేశిస్తే తప్ప అతడు చంపలేడు. నమ్మదగిన వ్యక్తి వినగూడని కీడు మాట పలికితే కాని ద్రోణుడు అస్త్రసన్న్యాసం చేయడు. ఆ వ్యక్తి ఎవరు? ఆ కీడుమాట ఏమిటి? ఇవి కాలం చెప్పవలసిన రహస్యాలు. కథలో ఉత్కంఠను పెంచే ఉచ్చుముడులు. పాండవ విజయానికి భద్రమార్గాలైన ఈ మూడు అంశాలూ కౌరవుల ఓటమికి సంకేతాలు. ఇవి ద్రోణుడి ప్రభుభక్తికి వ్యతిరేక చిహ్నాలు. ద్రోణుడి తనుత్యాగానికి తరణోపాయాలు. వంశనాశనం జరుగుతుందని పెద్దలు హెచ్చరించినా వినిపించుకొనక యుద్ధానికి సిద్ధమైన దుర్యోధనుడు స్వీయ (వంశ)నాశనానికే పురోగమిస్తున్నాడు. అతడు అర్థపురుషార్థ సాధనలో ఉద్ధతుడివలె వ్యవహరిస్తున్నాడు. అతడు చనిపోవాలంటే అతడి పక్షాన ఉన్న మేటి వీరులందరూ చనిపోవాలి. అందులో ద్రోణుడు కూడా ఒకడు. ఆ పని ఎంత త్వరగా జరిగితే అంత మంచిది. కాబట్టి ఈ వాగ్దానాలు దుర్యోధనుడి దుర్నీతిని త్రుంచే ఉపాయాలు. ద్రోణుడిపట్ల అతడు ప్రకటించే అవినయాన్నీ, అపనమ్మకాన్నీ, అవజ్ఞతనూ సహనంతో సహించి అతడిపై అంతరాంతరాలలో రగిలే క్రోధాగ్నిని ప్రచ్ఛన్నంగా అతడి పతనానికై ప్రయోగించే రహస్య రౌద్రప్రవృత్తి ద్రోణుడి ప్రవర్తనకు ప్రధాన కారణమయింది. గూఢరౌద్రం కురుక్షేత్రంలో క్రమంగా కోరలు విచ్చుకొన్నది. మచ్చుకు భీష్మపర్వంలోని కొన్ని సన్నివేశాలు.

1. కౌరవ సైన్య మహాధ్యక్షుడు భీష్ముడూ, ఆతడికి నీడవలె ద్రోణుడూ రణరంగంలో వీరవిహారం సాగించారు. నాలుగు రోజుల యుద్ధం సాగింది. ఇద్దరూ అర్జునుడి తీవ్ర ప్రతాపాన్ని అడ్డుకొనలేకపోయారు. దానికి కారణం వారి పార్థపక్షపాతమే అని దుర్యోధనుడి అనుమానం. పార్థుడి అనన్యపరాక్రమమే కారణమని భీష్మద్రోణుల భావం. ఈ రెండింటికి వెనుక భీష్మద్రోణులకు అర్జునుడిపై ఉన్న అపారప్రేమ వాత్సల్యాలు ప్రత్యక్షకారణాలుగానూ, దుర్యోధన కర్ణాదులపై వారికున్న క్రోధభావం పరోక్ష కారణంగానూ ఉన్నాయన్నది కాదనరాని వాస్తవం.

2. భీష్ముడి అయిదవనాటి యుద్ధారంభంలో కౌరవుల మకరవ్యూహాన్ని ఛేదించి భీముడు చొరబడి భీష్ముడితో తలపడి ఆయనను బాణవర్షంతో క్రమ్మివేశాడు. భీష్ముడు భీముడి గర్వాన్ని అణచి, సైన్యాన్ని మంటలలో కాల్చి వేధించాడు. అంతలో అర్జునుడు రంగప్రవేశం చేసి భీష్ముడి విజృంభణాన్ని వెనుకంజ వేయించి దుర్యోధనాది వీరులను కలతపెట్టాడు. సేనలను చంపి కుప్పలు పోశాడు. అప్పుడు దుర్యోధనుడు ద్రోణుడితో ఇట్లా అన్నాడు.

తే. 'పట్టి పాలార్చెదరు మీరు పాండు సుతుల । నీవు భీష్ముండు నలిగిన దేవతలకు
నైన మార్కొనవచ్చునే? సేన నరుఁడు । నొంపఁగా నిటు లొప్పరికింపఁ దగునె?'

ఈ మాట ద్రోణుడి మనస్సును కలత పెట్టింది. కోపం మోసులెత్తింది.

తే. 'ఎన్నఁడును మున్ను వారలయేపు నోపఁ । గాన మెట్లు సముద్రంబులోన బుఖ్ఖి
వైవఁ గొన్నంత గొనుఁగాక వారి గెల్వ । మాకు శక్యంబె? చవిగాని మాట లేల?'(**భీష్మ. 2. 280,282)**

దుర్యోధనుడి అధిక్షేపం ఆచార్యుడి హృదయంలో అణచబడిన ఆగ్రహాన్ని కుళ్ళగించింది. ఈ వాక్యంతో 'పాండవులను గెల్వలేము!' అన్నది అసమర్థోక్తి కాదు. దుర్యోధనుడిపై ప్రయోగించిన ఆగ్రహోక్తి, పార్థుడి పరాక్రమం తెలియక ఆచార్యుడిని ఆడిపోసుకొనటంలోని అవివేకం, గూఢ క్రోధభావాన్ని పైకి రేపింది. అత్తమీది కోపం దుత్తమీద చూపిన సామెతగా ద్రోణుడు పాండవసైన్యాన్ని నురుమాడసాగాడు. దుర్యోధను డతనిని మరింత పురికొల్పాడు. అతడిని సంతోషపెట్టటానికి భీముడిపై ద్రోణుడు విరుచుకపడ్డాడు. పోరు ఘోరంగా సాగింది. భీష్ముడు ప్రతాపమూర్తిని ప్రదర్శించాడు. భీష్మపర్వంలో భీష్ముడి ప్రతాపాగ్ని. ద్రోణ సహాయంతో తీవ్రతరం అయ్యేది.

3. ద్రోణుడి దృష్టి ప్రధానంగా ధృష్టద్యుమ్నుడి మీదే ఉండేది. ఆరవనాటి యుద్ధంలో ఆతడితోడ యుద్ధంచేసే మంచి అవకాశం దొరికింది. ధృష్టద్యుమ్నుడి ప్రధాన లక్ష్యం ద్రోణవధ. దానికి దొరికిన అవకాశాన్ని అతడు వదలుకొనేవాడు కాడు. తీవ్రయత్నం చేసేవాడు. అతడికి భీమార్జునులు సహాయపడుతూ ఉండేవారు. ద్రోణుడి ధాటికి ధృష్టద్యుమ్ను డాగేవాడు కాడు. ద్రోణవధకై అతడు జన్మించినా ద్రోణుడు అస్త్రశస్త్ర సన్న్యాసం చేస్తేగాని ఆ అవకాశం దొరకదన్న వాస్తవం తెలిసిన పాండవులు తగిన జాగ్రత్తలో ఎప్పుడూ ఉండేవారు. అందువలననే ద్రోణుడు ఘటోత్కచాదులతోనూ, చివరకు అర్జునుడితోనూ తలపడి పోరు ఘోరంగా చేయవలసి వచ్చింది. భీష్ముడి దశమ దివస యుద్ధంలో ధర్మజ భీమార్జునులు అరిభయంకరంగా విజృంభించి, భీష్ముడికి రక్షగా ఉన్న బలాన్ని మట్టుబెట్టి, పితామహుడితో హుటాహుటిగా ఎదుర్కొన్నారు. ఆయనకు పోరు భారమయ్యేటట్లు చేశారు. ఆ సమయంలో ద్రోణుడు క్రుద్ధుడై అశ్వత్థామను భీష్ముడికి సహాయంగా పంపాడు. కృతజ్ఞత ఆయన ఆచార్యత్వానికి అమరిన అనర్ఘ శిరోరత్నం.

7. ద్రోణుడి వరం: వాఙ్మయ పద్మవ్యూహం:

భీష్ముడు లేని కౌరవసేనలో ద్రోణుడి బాధ్యత పెరిగింది. భీష్ముడి తరువాత సర్వసైన్యాధ్యక్ష పదవికి అన్నివిధాలా అర్హుడు ఆయనే. ఆ సత్యాన్ని కర్ణుడు బోధిస్తేగాని దుర్యోధనుడు గ్రహించలేకపోయాడు. దుర్యోధనుడి కర్ణాభిమానం ద్రోణుడికి అవమానంగామారటం పూర్వకథ చెప్పిన సత్యం. దానిని రహస్యంగా కడుపులో దాచుకొన్న ద్రోణుడు దుర్యోధనుడి ప్రార్థన మన్నించి సర్వసైన్యాధ్యక్ష పదవిని స్వీకరించాడు. కర్ణుడిని కాదని తన నాపదవిలో నియోగించినందుకు ద్రోణుడు సంతోషించి దుర్యోధనుడిని ఒక వరం కోరుకొమ్మని అనుగ్రహించాడు. అసలు ద్రోణపర్వకథ ఇక్కడి నుండి మొదలవుతుంది.

భీష్ముడు వరమిస్తా ననలేదు. ద్రోణుడు వరమివ్వటానికి ముందుకు వచ్చాడు. దుర్యోధనుడు ఆ మాటను నమ్మలేక నమ్మి ఆ అవకాశాన్ని రాజనీతితో సఫలం చేసికొనవలెనని ప్రయత్నించాడు. కర్ణదుశ్శాసనాదులతో రహస్యమంతనాలు చేసి ఒక నిర్ణయానికి వచ్చాడు. 'యుద్ధంలో ధర్మరాజును ప్రాణాలతో పట్టి దుర్యోధనుడి వద్దకు తీసికొని రావాలి' అని గురువును కోరాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ కోరిక వినగానే అనేకవిధాల ఆలోచనలు అందరికీ కలగటం సహజం. ఘోషయాత్రా యుద్ధంలో చిత్రసేనుడు దుర్యోధనాదులను బంధించి ఇంద్రుడి వద్దకు తీసికొనిపోతున్నప్పుడు ధర్మరాజు దుర్యోధనుడిని శత్రువులనుండి విడిపించి సజీవంగా తన వద్దకు తెమ్మని భీమార్జునులను కోరాడు. దానికి ప్రతీకారంగా దుర్యోధనుడు కోరుతున్నాడా? అని భావించటానికి వీలున్నది. లేదా - ధర్మరాజు ద్రోణుడికి నమస్కరించి యుద్ధంలో విజయం కలిగేటట్లు ఆశీర్వదించుమని కోరాడు కదా! అతడినే బందీగా పట్టి దుర్యోధనుడికి అప్పజెప్పితే ద్రోణుడికి స్వప్రతిజ్ఞాభంగం ఏర్పడుతుంది. ద్రోణుడి వ్రేలితో అతడి కన్నునే పొడిచినట్లౌతుంది అని దుర్యోధనుడు ఆ పన్నాగం పన్నాడని భావించటానికి వీలున్నది.

ద్రోణాచార్యు డింతటి దురాలోచన చేయలేదు. కాని, తాను ధర్మరాజు కిచ్చిన ఆశీస్సులను మరచిపోలేదు. ధర్మరాజుకు విజయం కలిగితే ఫలంగా రాజ్యం వస్తుంది. ఆ ఫలాన్ని అందిస్తే ద్రోణుడికి ఆ వరాన్ని తీర్చటంలో అభ్యంతరం ఉండబోదు. దానిని నిశ్చయించుకొనటానికే ఇట్లా అన్నాడు -

చ. ‘ అకట! యజాతశత్రుఁ డను నప్పలు కిప్పుడు నిక్కమయ్యె వా
నికిఁ; గురునాథ! యిట్టు లతనిం దెగఁ జూచుట గోర కాజిఁ బ
ట్టి కొనుట గోరి; తివ్విధము డెప్పర మెంతయు నిత్తెఱంగు గో
ర్కికిఁ గత మేమి? పాండవుల గెల్చి ధరన్ సగ మీఁ దలంచితే?’ **(ద్రోణ. 1. 109)**

‘అని అడిగి ‘ధర్మరాజును పట్టి తేస్తే ఏం చేస్తావో నీ నిశ్చయాన్ని చెప్పు’ మని దుర్యోధనుడిని సూటిగా అడిగాడు. అందుకు దుర్యోధనుడు సంతోషించి తన మనసులోని మాటను బయటపెట్టాడు. ‘ఆ ధర్మరాజును యుద్ధంలో చంపితే అర్జునుడు ఆగ్రహోదగ్రుడై కురుబలాన్ని సర్వనాశనం చేస్తాడు. మనం ప్రయత్నించి పాండవుల నందరినీ చంపినప్పటికీ గోవిందుడు తన చక్రాయుధంతో మనలనందరినీ చెండాడి కుంతీదేవికైనా పట్టం కట్టుతాడు. కాబట్టి ధర్మరాజును చంపకుండా పట్టి తెచ్చి, జూదమాడేటట్లు చేసి, అతడితోపాటు భీమాదులనందరినీ అరణ్యవాసానికి పంపితే, శత్రుపీడ వదలి కలకాలం ఈ విశాల రాజ్య సంపదను అనుభవిస్తాను’ అని అన్నాడు.

దుర్యోధనుడి కోరిక వెనుక నున్న కుటిలనీతిని ద్రోణుడు పసికట్టాడు. వరమిచ్చే గురువుకే ఆ కోరిక వెగటువేసింది. దుర్యోధనుడి అంచనా ప్రకారం భీష్మద్రోణులకు అర్జునుడు యుద్ధంలో అసాధ్యుడు. కర్ణు డొక్కడే అతడిని చంపగలవాడు. ద్రోణుడు సేనా నాయకుడైనప్పుడు అర్జునుడిని చంపటం కుదరదు. కర్ణాదులు రణరంగంలో అతడిచేత చంపబడకుండా రక్షించుకొనే భారం కూడా ఏర్పడుతుంది. అందువలన యుద్ధంకంటె తేలికైన కపటోపాయం ద్యూతం. దానిని మరల ప్రయోగించదలచి యుధిష్ఠిరుడిని ప్రాణాలతో పట్టి తెమ్మన్నాడు. దుర్యోధన పక్షాన ఈ వ్యూహం పటిష్ఠమైనదే. ద్రోణుడు తలచుకొంటే ధర్మరాజును బంధించటం పెద్ద పనికాదు. దానితో పాండవ పరాజయం, కౌరవ విజయం ఒక్కసారిగా సిద్ధించే అవకాశం ఉంటుంది. కాని, ఇది ద్రోణుడికి ఇష్టమైనది కాదు. ధర్మబద్ధమూ కాదు. ఎట్లాగంటే - యుద్ధంలో ధర్మజుడికి విజయం కలిగే ప్రయోజనం కూకటివేళ్ళతో దీనివలన వీగిపోతుంది. పార్థపరాక్రమ ప్రదర్శనం వ్యర్థమైపోతుంది. పార్థుడిని కాదని ధర్మజుడిని పట్టటం అసాధ్యం. అర్జునుడు ప్రాణాలతో ఉండగా ధర్మరాజును ఎవరికీ చిక్కనివ్వడు. అందువలన పాండవాగ్రజుడిని పట్టటం అసంభవం - అని ద్రోణుడు భావించాడు. వరమిచ్చిన తరువాత కాదనటానికి వీలులేదు. చిక్కుసమస్య తెచ్చిపెట్టినందుకు కపట దుర్యోధనుడిపై గుండెలో క్రోధం కుంపటివలె మండుతున్నది. దానిని కప్పిపుచ్చుకొని వరంకాని వరంగా మార్చి ఇట్లా పలికాడు ద్రోణుడు.

చ. ‘ నరుఁ డెడ సొచ్చెనేని విను! నా కది దుష్కర మే నొకండనే
సురగణ మైన వ్రేలిఁగొని చూపఁగఁ జాలరు; వాఁడు లేనిచోఁ
దిరమయి పోర నిల్చిన యుధిష్ఠిరు ద్రౌపది పుట్టి నింటి వే
వురు వెఱఁగంది చూడ నలవుం జలముం జెడఁ బట్టి తెచ్చెదన్’. **(ద్రోణ. 1.113)**

అర్జునుడు యుద్ధంలో అడ్డగిస్తే ధర్మరాజును పట్టటం నాకు దుష్కరం. నా కొక్కడికే కాదు. దేవతలందరూ కలిసి వచ్చినా అతడిని వేలెత్తి చూపలేరు. ఆ అర్జునుడు లేకపోతే యుద్ధంలో యుధిష్ఠిరుడు ఎంత స్థిరంగా నిలిచినా పాంచాలురు వేయిమంది కన్నులప్పగించి చూస్తూ ఉండగా అతడి చలం, బలం నశించగా బంధించి తెస్తాను' అని అన్నాడు. ఈ పద్యం ద్రోణపర్వ కార్యనీతికి కీలకం వంటిది. ఈ పర్వకథా గతికి మార్గదర్శకం వంటిది. 'ధర్మజుడిని పట్టి తెస్తా ననటం' ఇందులో ప్రతిజ్ఞ. దీనినే గ్రహించి నిజమని నమ్మి స్కంధావారంలో చాటబంచిన దుర్యోధనాదులు అవివేకు (బాలిశు)లని సంజయుడు వ్యాఖ్యానించటం గమనార్హం. ద్రోణుడి యుద్ధంలో కీలకం ధర్మరాజును పట్టుకొనటం. ఇది మూడు రకాల నియమాలతో ముడిపడి ఉన్నది. 1.అర్జునుడు ధర్మరాజుకు అడ్డుపడరాదు; 2. అతడు అడ్డుపడకుండా కౌరవవీరులు క్రమ్ముకొని నొప్పించాలి లేదా దూరం చేయాలి; 3. అర్జునుడిని ఏదైనా మిషతో ధర్మరాజున్న చోటినుండి చాలా దూరం తీసికొని పోయి అన్నగారికి ఆపత్సమయంలో కూడా అందుబాటులోకి రాని విధంగా వ్యూహం పన్నాలి; 4. లేదా అర్జునుడిని లేకుండా చేయాలి (చంపివేయాలి). అది ద్రోణుడికి సాధ్యపడేది కాదు. కాబట్టి ఆ భారం మరెవరైనా స్వీకరించాలి. ఈ పరిస్థితు లనుకూలిస్తే ద్రోణుడు తా నిచ్చిన వరాన్ని నిలుపుకొంటాడు. లేదా, ఆ వైఫల్యం ఆయనది కాదు దుర్యోధనాదులదే. ఈ లోతైన సూక్ష్మాంశాలను గ్రహించని బాలిశుడు దుర్యోధనుడు. ఆతడికంటె ఘనులు అధికులు ఆయన ఆతడి మిత్రులూ, సోదరులూ.

రహస్య మేమంటే - అర్జునుడు ధర్మజు రక్షణలో ఏమరుపాటు ప్రదర్శించడు. కౌరవులు ఎన్ని ఎత్తులు వేసినా వాటిని చిత్తుచేసే ఎత్తులు తిరిగి వేయగలడు. ఒకవేళ అర్జునుడు దూరంగా ఉన్నా ధర్మజుడు ఒంటరిగా దొరకటం కూడా అంత సులభమైన పనికాదు. దొరికినా, ఆతడిని బంధించటం ద్రోణుడు ఆతడి కిచ్చిన మాటకు విరుద్ధం. కాబట్టి అతడిని బంధించటం ద్రోణుడి అభిమతం కాదు. అట్లని ధర్మజుడిని బాధించక వదలిపెట్టటానికి వీలులేదు. ద్రోణాచార్యుడి చేతిలో ఓడిపోయే పరిస్థితి రణరంగంలో ఏర్పడితే ధర్మజుడు వశుడౌతాడా? లేక ఉపాయాంతరంచేత రక్షించుకొంటాడా? ఈ విషయంలో కృష్ణార్జునులు ఆతడికి తగిన సలహాలిస్తారు. అందువలననే రథం విరిగితే వెంటనే మరొక రథం ఎక్కే ఏర్పాట్లు చేయవచ్చును. పరిస్థితులు ప్రతికూలమైతే చేతులు పై కెత్తి ఆత్మరక్షణ చేసికొనవచ్చును. అట్టి పరిస్థితులలో ధర్మజుడిపై బాణాలు వేయటం యుద్ధనీతి కాదు. ఇవన్నీ కలిపి ఆలోచిస్తే ధర్మజుడు పట్టుపడకుండ ఉండటమే ద్రోణుడి అభిమతంగా తోస్తున్నది. దానిని గూఢంగా వాక్యార్థంలో దాచటం ద్రోణుడి ప్రజ్ఞ. ఆ రహస్యం తెలియక దుర్యోధనుడు ద్రోణుడిని నిందించే సందర్భాలు రావచ్చును. అవి ఆతడికి క్రోధకారకాలై తారసిల్లవచ్చును. దుర్యోధనుడి దుర్భాషలే ద్రోణుడి రౌద్రాగ్నికి సమిధలుగా సన్నద్ధమయ్యే భావి యుద్ధ యజ్ఞానికి ఈ ద్రోణ ప్రతిజ్ఞ వాఙ్మయ వేదిక! దుర్యోధనుడు దూరాలోచనం లేకుండా దురాలోచనతో ప్రవేశించిన వాఙ్మయ పద్మవ్యూహం.

8. ద్రోణుడు తన వ్యూహంలో తానే చిక్కుకొన్నాడు:

మహాభారతంలోని యుద్ధపంచకంలో ద్రోణపర్వంలో జరిగినంత రౌద్రకర్మ మరొకపర్వంలో జరుగలేదు. రౌద్రరస ప్రధానమైన ఈ పర్వంలో ధీరోదాత్త ప్రవృత్తులకంటె ధీరోద్ధత ప్రవృత్తుల ప్రాచుర్యం, ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. పాండవులు ధీరోదాత్తులు; కౌరవులు ధీరోద్ధతులు. కౌరవ సైన్యాధ్యక్షులు ధీరోద్ధతుడైన దుర్యోధనుడి అభిమతానికి అనుగుణంగా యుద్ధవ్యూహాలు సాగించారు. వారు సహజంగా ఉదాత్తులైనా అర్థసాధకుడైన దుర్యోధనుడి స్వార్థసాధన కొరకే యుద్ధయత్నం సాగించారు. అర్థసాధనలో ధర్మసాధనను కూడా సాధించాలని యత్నించారు. కాని, కృతకృత్యులు కాలేకపోవటంతో తమంతట తాము ఉపాయాంతరాన్ని శత్రువులకు సూచించి రణరంగంలో వీరోచితంగా ఒరిగిపోయారు. ధర్మపురుషార్థం అర్థపురుషార్థానికి అంగంగా మారితే పరిణామం మరణమన్న వాస్తవాన్ని తమ జీవిత సందేశంగా ప్రజలకు అందించారు. దుర్యోధనుడికి కూడ చెప్పి చూచారు. ధర్మహాని ఆత్మహానికి దారితీస్తుందన్న సత్యాన్ని దుర్యోధనుడు మదాంధుడై గ్రహించలేకపోయాడు. అందువలన ధీరోద్ధతుడివలె యుద్ధంలో కూడా "దర్పమాత్సర్య భూయిష్ఠో మాయా ఛద్మపరాయణః । ధీరోద్ధత స్త్వహంకారీ చల శ్చండో వికత్థనః" (దర్ప మాత్సర్యభూయిష్ఠుడూ, మాయావి, మోసగాడు, అహంకారి, చపలుడు, ప్రచండుడు, ఆత్మశ్లాఘానిరతుడు, శూరుడు, మత్సరి, అవలిప్తుడు, సులభకోపి) అనే లక్షణాల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నన్నింటినీ అర్థసాధనలో ప్రదర్శించాడు. అతడి ప్రయోజనాన్ని సాధించే సర్వసేనాపతులు అర్థపురుషార్థం కొరకే పోరు సాగించాలి. అదే ద్రోణపర్వంలో ద్రోణుడికి కలిగిన దురవస్థ.

మహాభారతంలో ప్రతినాయకుడు దుర్యోధనుడు. అతడిది ఉద్ధతమార్గం. దానిని తమశక్తియుక్తుల పోషించినవారు కౌరవవీరులు. ఈ పర్వంలో దుర్యోధనుడు ద్రోణుడికి చూపిన లక్ష్యం ధర్మరాజును ప్రాణాలతో పట్టితేవటం. పట్టితెస్తానన్న ద్రోణుడు వీరుడైన యోధుడే కావచ్చును. అది అతడి ఆత్మధర్మానికి విరుద్ధమైనది. అయినా దుర్యోధనుడిని సంతోషపెట్టేందుకు ధర్మరాజును పట్టి ఇస్తానని ప్రతిజ్ఞ చేశాడు. అయితే అర్జునుడి దాడినుండి ద్రోణుడిని తప్పించగలిగే పరిస్థితులు దుర్యోధనుడు కల్పించాలని అతడు భావించాడు. అర్జునుడిని కూడ ఓడించే బాధ్యత ద్రోణుడే స్వీకరించాలని దుర్యోధనుడు తలంచాడు. ఈ విషయంలో బాహాటంగా ఏ కట్టడీ వారు చేసికొనలేదు. కథాసందర్భాలలో వారు వాటిని బయటపెట్టుకొన్నారు. అప్పు డొకరిపై మరొకరికి కోపతాపాలు ఏర్పడ్డాయి. అవి కౌరవసేనకు అపకారం కూడా చేశాయి. ఏమైనా ద్రోణుడు ధీరోద్ధత ప్రభావంతో యుద్ధం సాగించా డన్నది వాస్తవం. ఇదే ద్రోణపర్వం చివర ద్రోణుడు వధార్హుడని ధర్మజుడు నిశ్చయించటానికి దోహదపడింది. నరుడు గురువధకు అంగీకరించలేదు. గురువధ చేసిన ధృష్టద్యుమ్నుడిని అభినందించకపోగా అభిశంసించాడు, తండ్రి మరణవార్త విని క్రుద్ధుడై నారాయణాస్త్ర ప్రయోగం చేసిన అశ్వత్థామను సమర్థిస్తున్నట్లుగా అర్జునుడు ఆ అస్త్రాన్ని ఉపసంహరింపచేయకుండా ఊరక ఉండిపోయాడు. ద్రోణవధకు ఏకైక కారకుడు ధర్మరాజనీ, అతడు ఉదాత్తుడైన ద్రోణుడిని చంపే ఉపాయం చేయటం ధర్మవిరుద్ధమనీ వీరులందరూ విమర్శించేటట్లు యుద్ధరంగంలో కృష్ణార్జునులు ఒక సన్నివేశాన్ని కల్పించారు. అప్పుడు ధర్మరాజు ఎలుగెత్తి ఇట్లా ప్రకటించాడు.

సీ. ‘ఆ సభఁ బాంచాలి గాసి సేయఁగ నుపే । క్షకుఁ డయి చూచెఁ, బెక్కండ్రఁ గూర్చి
కొని బాలు నభిమన్యుఁ గూల్చె; నించుకవడి । యాఁగిన నర్జునుఁ డగ్నిఁ జొచ్చు
ననువగ మనల నాతనికిఁ దోడ్పడఁ బోవ । నీ కాఁగె నమ్మెయి; నిట్టి ధర్మ
పరుఁ డైన కలశసంభవుతోడ సరివచ్చు । టుచితంబె? యావచ్చు నుజ్జ్వలాగ్ని

తే. వలని కరిగెద; మీరు, మీ వాహినులును । బాఱిపొం డెక్కడేని; న ప్పార్థుకోర్కె
యంత సఫలతఁ బొందెడు; నచ్యుతుండు । నెట్లు దనకు రుచించెఁ దా నట్లు సేయు.**(ద్రోణ. 5. 380)**

శాంతమూర్తి అయిన ధర్మరాజులోని కోపం ప్రళయాగ్నిగా మండిన మాట లివి. వ్యంగ్య నిష్ఠురోక్తికి ఈ పద్యం నిండైన ఉదాహరణం. మాటనేర్పరితనంలో ఇతడు గురువునే మించాడు. నారాయణాస్త్రం కంటె ఈ అధిక్షేపం శక్తిమంతమైనది. ‘ఇట్టి ధర్మపరుడైన కలశసంభవు’ డనే మాట వ్యతిరేక వ్యంగ్యోక్తి. ద్రోణుడియందు క్షమించరాని మూడు దోషాలను చూపించి, అతడు ఉద్ధతుడివలె వ్యవహరించా డని ఆరోపించాడు. వధ్యుడని క్రుద్ధుడై అన్నాడే కాని ధర్మరాజు దుర్యోధనుడివలె ఆయనను నిందించలేదు. గురువధలో కూడా ఒక ధర్మం ఉన్నదని ప్రతిపాదించిన ధర్మరాజు అర్జునుడిమీద వాఙ్మయాస్త్రాన్ని ప్రయోగించాడు. శ్రీకృష్ణుడిమీద ధర్మచక్రం విసిరాడు. అప్పుడు కృష్ణార్జునులు జాగృతులై కార్యాన్ని ముగింపునకు తెచ్చారు. ధర్మరాజు నిందుకుండ. ద్రోణుడి మొదటిదోషం అతడిమీద యుద్ధం చేయటానికి పాండవులకు నైతికమైన అర్హతను కలిగించింది. దానిని ద్రోణుడు అంగీకరించాడు కూడా. అభిమన్యువధ ద్రోణుడి ధర్మప్రవర్తనాన్ని కలుషితం చేసింది. అందువలన మోసాన్ని మోసంతో జయించే ఉపాయాన్ని ఆయనమీద ప్రయోగించే అర్హత పాండవులకు కలిగింది. అర్జునుడు సైంధవవధను చేయకుండా అడ్డపడి అతడి మరణానికి దోహదం చేసిన ద్రోణుడియత్నం ఆయన సత్యవ్రతాన్నే భగ్నం చేసింది. ధర్మం తప్పినవాడు ఎంతటి మహనీయుడైనా వధకు అర్హుడని ధర్మరాజు తీర్పు చెప్పినట్లయింది. ఇందులో ధర్మజుడు ద్రోణుడిని ధర్మనిష్ఠాపరుడైన గురుమూర్తిగా కాక,

అర్థసాధనకై అడ్డదారులు త్రొక్కిన ఉద్ధతుడిగా అభివర్ణించాడు. ఇది ద్రోణపర్వంలో ద్రోణపాత్ర చిత్రణకు కీలకమైన కథాంశం. తిక్కన దీనిని కథా నిర్వహణంలో చెప్పించి కథను ఉత్కంఠభరితంగా ఉన్మీలింప చేశాడు.

9. అయిదునాళ్ళ యుద్ధం : అయిదంకాల రూపకం:

మూలభారతంలోనే ముచ్చటగా కుదిరిన దృశ్యకావ్య స్వభావాన్ని తిక్కన తేటపడేటట్లు చిత్రించాడు. ద్రోణుడు అయిదునాళ్ళు యుద్ధం చేశాడు. ఒక్కొకనాటి యుద్ధం ఒక్కొక అంకంగా భావించే అవకాశం ఉన్నది. సామాన్యంగా అయిదంకాల నాటకంలో పంచసంధులు ప్రవర్తిల్లే కథను చిత్రించటం రూపకసంప్రదాయం. ద్రోణపర్వంలో ఆ సంప్రదాయచ్ఛాయలు గోచరిస్తాయి. అయితే, సంస్కృత రూపకాలలో కూడా ఒక్కొక్క అంకంలో ఒక్కొక సంధి ప్రవర్తిల్లుతుందనే నియమం ఉండదు. మొత్తంమీద దానిని కథాగతిని బట్టి అన్వయించుకొనాలి. ద్రోణపర్వంలో కూడా అంతే.

ప్రథమాశ్వాసంలో - ద్రోణుడి మొదటి రెండు రోజులయుద్ధం వర్ణించబడింది. తొలినాటి యుద్ధంలో ముఖసంధీ, రెండవనాటి యుద్ధంలో ప్రతిముఖసంధీ గోచరిస్తాయి.

ద్వితీయాశ్వాసంలో - ద్రోణుడి మూడవనాటి యుద్ధం - అందులో అభిమన్యుడివధ, అర్జునుడు సైంధవవధకు ప్రతిజ్ఞ చేయటం వర్ణించబడ్డాయి. ఈ ఘట్టంలో గర్భసంధి రసవత్తరంగా చిత్రించబడింది. అంటే కథ క్లైమాక్స్ ఇందులో కనబడుతుంది.

తృతీయ చతుర్థాశ్వాసాలలో - అవమర్శ సంధి పోషించబడింది. సైంధవ సంహారఘట్టం విస్తారంగా రసవత్తరంగా చిత్రించబడింది.

పంచమాశ్వాసంలో - ద్రోణుడి అయిదవనాటి యుద్ధం చెప్పబడింది. ఇందులో ద్రోణనిర్యాణం, అశ్వత్థామ రౌద్రప్రదర్శనం చిత్రించబడ్డాయి. చివరకు కృష్ణార్జునులయొక్క, పరమేశ్వరుడి యొక్క మహిమలను వ్యాసుడు వివరించే ఘట్టంతో కథ ముగుస్తుంది. మూడురకాల అద్భుతాలతో ముప్పేటగా ముగిసే మహనీయ ఘట్టం నిర్వహణసంధి.

యుద్ధరీతులలో సామాన్యంగా అయిదురకాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. 1. ఎదురుదాడి యుద్ధరీతి, 2. ఆత్మరక్షణ యుద్ధరీతి, 3. మాయాయుద్ధరీతి, 4. ద్వంద్వ యుద్ధరీతి, 5. మూకుమ్మడి యుద్ధరీతి. ఆయా యుద్ధరీతుల అవసరాలనుబట్టి వ్యూహరచనలు చేసికొనటం సహజం. ద్రోణపర్వంలో పైన పేర్కొన్న యుద్ధరీతులన్నీ ప్రవర్తిల్లాయి. అందులోకూడ ఒక విశేషాన్ని గమనించవచ్చును. కౌరవపక్షం మొదటి మూడురోజులూ పాండవసైన్యం మీద దాడిచేసి కార్యసాధన చేసికొనాలనే ఉత్సాహాన్ని ప్రదర్శించింది. పాండవసేన ఆ కాలంలో ఆత్మరక్షణ యుద్ధరీతిని అనుసరించింది. చివరి రెండునాళ్ళూ దీనికి విరుద్ధంగా సాగింది. ఇందులో ఎక్కువతక్కువలను లెక్కకట్టటం కంటె కార్యసాధనకు ఉపయోగించే ప్రయోజనాలను పరిగణించటమే సమంజసం.

ద్రోణుడు కౌరవసేనకు సర్వసైన్యాధ్యక్షుడైన వెంటనే అతడిని యుద్ధంలో సంహరిస్తానని ధృష్టద్యుమ్నుడు శపథం చేయలేదు. చేసే పరిస్థితు లున్నాయని పాండవులు భావించలేదు. ద్రోణవధోపాయం తెలిసిన ధర్మరాజుకూడా సమయం అనుకూలించిందని అనుకొనలేదు. పాండవులు కార్యలక్ష్యాన్ని నిర్ణయించుకొనకముందే దుర్యోధనుడు ధర్మరాజును ప్రాణాలతో బందీచేసే లక్ష్యాన్ని సేనాపతికి నిర్దేశించాడు. దానికి అర్జునుడు అడ్డుగా ఉన్నాడని తెలిసినా ద్రోణుడు ధర్మరాజును పట్టుకొనబోతున్నాడని రాజరాజు చాటింపు వేయించాడు. దానికి ప్రయోజనం కూడా ఉన్నది. భీష్మపతనానంతరం పాండవులు విజయగర్వంతో కౌరవులపై కాలు దువ్వుతూ ఉంటారు. వారికి తగిన భయోత్పాతాన్ని కలిగించి వారి ఉత్సాహాన్ని నీరుకార్చే ఉపాయం అది. పాండవ విజయం తథ్యమని ఆచార్యాశీర్వాదం పొందిన ధర్మరాజు కూడ భయంతో గడగడలాడి, అర్జునుడితో మొరబెట్టుకొని, తనను వదలి రణరంగంలో దూరంగా పోకుండా కవచంవలె రక్షించుమని అతడిని కోరాడు. అర్జునుడు అన్నకు అభయాన్ని అందించి ధైర్యం చెప్పాడు. ఆయన మాటలు ద్రోణపర్వ కథాకార్యానికి ఆయువుపట్టులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ‘ గురుని వధియించుటయు భూ । వర! నీ వని నొవ్వ నొండువలను సనుటయుం
బరికింప నొక్కరూ పవి । దురితంబులు; వీనిఁ జేయుదునె నే నెందున్?’ **(ద్రోణ. 1.119)**

అర్జునుడి అభిప్రాయంలో ద్రోణవధ ఎంతపాపమో, ధర్మరాజు పట్టుబడి శత్రుశిబిరం చేరటం అంత పాపమట! ఆ రెండు పాపాలూ ఎన్నడూ, ఎప్పుడూ ఆయన చేయడట! అటు గురుభక్తి, ఇటు భ్రాతృభక్తి ఆయనకు సమానమన్నమాట! దీనిని బట్టి గ్రహించదగిన సారాంశం మరొకటి ఉన్నది. ద్రోణపర్వంలో అర్జునుడు ద్రోణవధకు తాను ప్రయత్నించడు. ధృష్టద్యుమ్నుడు చేస్తే అతడు అంగీకరించకపోవచ్చును. అంటే - ద్రోణపర్వంలో పాండవుల లక్ష్యం ద్రోణవధ కాదన్నమాట! కౌరవపక్షంలో సత్వరకర్తవ్యం ధర్మజుడిని ప్రాణాలతో పట్టుకొనిపోవటం. ఆ కార్యం అర్జునుడు జరగనివ్వడు. దాని బాధ్యతకూడా అతడిదే అన్నట్లు స్పష్టపరిచాడు. ఈ వాక్యంలో ఉత్తరార్ధం ధర్మజుడికి తృప్తిని కలిగించినా, పూర్వార్ధం ఆయనకు అభిమతం కాదు. దానిని ప్రస్తావించటం ప్రస్తుతం కాదు కాబట్టి ధర్మరాజు ఊరకున్నాడు. అర్జునుడు కూడ కౌరవకార్యం సఫలం కాదని ధర్మజుడి ఎదుట గట్టిగా చెప్పాడు.

క. ‘ క్షోణీవల్లభ! విను మేఁ । బ్రాణముతో నుండ నిన్నుఁ బట్టుకొనఁగ నా
ద్రోణునకుఁ గాదు సగణ । స్థాణునకైనను వశంబె తలఁ కేమిటికిన్? **(ద్రోణ. 1.120)**

ధర్మరాజు పట్టుబడాలంటే అర్జునుడు ముందుగా యుద్ధంలో ప్రాణాలు కోల్పోవాలి. అది జరగని పని. అందువలన ధర్మరాజు పట్టుబడటం కూడా జరగనిపని. సర్వసేనాపతులు కలిసిరాగా ద్రోణుడు ప్రయత్నించినా, అతడి ప్రార్థనపై ప్రమథగణంతో పరమేశ్వరుడే ముందుకు వచ్చినా విజయు డుండగా కౌరవులకు విజయం లభించటం అసంభవం! అని వీరోక్తిని ప్రకటించాడు. ఇది ప్రతినాయకుడికీ, అతడి సర్వసేనాధిపతికీ, అతడిని అనుసరించే కౌరవవీరులకూ ప్రతిగా చేస్తున్న ప్రతినవంటిది. ఇందులోనూ ద్రోణుడిని ఓడిస్తా నన్నాడే కాని, చంపుతా ననలేదు. అస్త్రగురువును, ఎదిరించి ఓడించటమే వీరధర్మ మనుకొన్నాడు కాని, చంపటం మహాపాతక మనుకొన్నట్లు స్థిరపరచా డిక్కడ అర్జునుడు.

పై మాటలతో పార్థుడు ధర్మరాజుభయాన్ని దూరం చేశాడు. ఆ పైన విజయం తథ్యమనే ధైర్యాన్ని కల్పించేటట్లు పలికాడు. ‘ధార్తరాష్ట్రులు తమ శక్తియుక్తులను తెలిసికొనకుండా దురాశతో నిన్ను పట్టాలని తలచారు కాని, మూడు లోకాలను వెంటబెట్టుకొని సగర్వంగా యుద్ధానికి కదలివచ్చినా ధర్మరాజా! నీవు యుద్ధంలో భంగపడటం జరగదు. అట్లా జరిగితే ఈ భూమి బ్రద్దలైపోదా? సముద్రాలు ఇంకిపోవా? ఆకాశం నేలపై కూలిపోదా? కాబట్టి, వారి సంకల్పం ఫలించదు. ఆ దురాత్ములు యుద్ధంలో మనలను పరాభవించలేరు. నా సంకల్పం ఇట్లా ఉన్నది-’ అని ధర్మరాజుకు నిండైన ధైర్యాన్ని కలిగించి యుద్ధానికి ఉత్సాహంగా ముందుకు సాగించాడు.

కౌరవపక్షంలో ద్రోణుడి ప్రతిజ్ఞ పాండవులపై దాడిచేసే పద్ధతిని ప్రదర్శించగా, అర్జునుడు చేసిన ప్రతిజ్ఞ ఆత్మరక్షణకై చేసే యుద్ధరీతిని ప్రదర్శించింది. ఇదే వైఖరి ద్రోణపర్వంలో మూడు రోజులు సాగుతుంది. అభిమన్యుడి మరణానంతరం అర్జునుడు ఆత్మరక్షణరీతిని వదలి సైంధవవధను లక్ష్యంగా చేసికొని శత్రుసేనమీద దాడికి పూనుకొంటాడు. ద్రోణుడు అప్పుడు ఆత్మరక్షణరీతిలో పడ్డాడు. అర్జునుడి ప్రతిజ్ఞ తీరకుండా ఎన్ని ఆటంకాలు కలిగించాలో అన్నిటినీ సప్రయత్నంగా సాగించాడు. అయినా, శ్రీకృష్ణార్జునుల అద్భుత పరాక్రమానికీ, వ్యూహచాతుర్యానికీ, మహిమలకూ, దివ్యశక్తులకూ ఎదురు నిలువలేక భంగపాటుకు గురి ఔతాడు. కథలోని ఈ మలుపు అర్జునుడు సాధించే వీరకార్యమే.

ఈ వివరణం వలన తెలిసే మరొక సూక్ష్మాంశం ఇది - ద్రోణపర్వంలో కార్యం మొదలుపెట్టేది ప్రతినాయకుడు. దానిని ప్రవర్తింపజేసేది ద్రోణుడు (సేనాపతి). నాయకుడైన ధర్మరాజు సేనాపతి యత్నాన్ని తన సేనాపతితో కాక సమర్థుడైన అర్జునుడిచే భగ్నం చేయించాడు. ప్రతినాయక ప్రయత్నం భగ్నం ఈ పర్వంలోని కార్యస్వభావం. ఈ ప్రయత్నాన్ని వ్యక్తీకరింపజేసేవి ఆయా వీరుల వ్యూహరచనలు, యుద్ధక్రీడలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

10. మొదటినాటి యుద్ధం: ముఖసంధి: శకట క్రౌంచవ్యూహాలు:

ప్రథమాశ్వాసంలో ద్రోణుడు ధర్మరాజును పట్టుకొనటానికి బీజం నాటి కార్యారంభం చేశాడు. ముఖసంధి మూర్తికట్టింది. దానికి తగ్గట్లు ఆయా సైన్యాధిపతుల స్వభావాలు వ్యక్తమయ్యేటట్లు వ్యూహాలు రచించబడ్డాయి. మొదట వ్యూహరచన చేసింది ద్రోణుడు. అతడు శుక్రాచార్యాంశతో పుట్టినవాడు కావటంచేత అతడి వ్యూహరచనలో రాక్షసాచార్య స్వభావం ప్రతిఫలిస్తూ ఉంటుంది. ద్రోణుడు శకటవ్యూహాన్ని పన్నాడు. 'పక్షౌ, ఉరస్యం, ప్రతిగ్రహః ఇత్యౌశనసో వ్యూహవిభాగః. పక్షౌ, కక్షౌ, ఉరస్యం, ప్రతిగ్రహః ఇతిబార్హస్పత్యః' - అని కౌటిల్యుడి అర్థశాస్త్రం చెప్పుతున్నది. (అర్థశాస్త్రమ్. సాంగ్రామికం, దశమాధికరణమ్: షష్ఠోధ్యాయః) వ్యూహంలో రెండుపక్షాలూ, ఉరస్యం (మధ్యప్రదేశం), ప్రతిగ్రహం (సైన్యపృష్ఠదేశం) - ఈ నాలుగు అవయవాలూ ఉంటాయని శుక్రాచార్యులమతం. రెండు పక్షాలూ, రెండు కక్షాలూ, ఉరస్యం, ప్రతిగ్రహం అని ఆరు అవయవాలు ఉంటాయని బృహస్పతి మతం. ఈ లక్షణాన్ని పట్టిచూస్తే ద్రోణుడు పన్నిన శకటవ్యూహం శుక్రాచార్య సమ్మతమైనది. ఆసురమైనది. దానికి ప్రతిగా పాండవులు పన్నినవ్యూహం క్రౌంచవ్యూహం. ఇది బృహస్పతి మతానుకూలంగా ఉండే దివ్యవ్యూహం. వ్యూహస్వభావాలే కౌరవపాండవుల ఆసురీదైవీ ప్రవృత్తులను ధ్వనింపజేస్తున్నాయి.

ధర్మరాజును పట్టి సురక్షితంగా గమ్యం చేర్చటానికి సైన్యవ్యూహాన్ని బండిగా రూపొందించాడు ద్రోణుడు. ముందుభాగంలో కర్ణుడు నిలిచిఉన్నాడు. ఆతడు బండిని లాగే అశ్వం వంటివాడు. అతడి వెనక దుర్యోధనుడు ఉన్నాడు బండితోలేవాడివలె. అతడి ఇష్టప్రకారం బండి ఎదుటివారి వ్యూహంలోకి దూసికొని పోవాలి. ఈ వ్యూహంలో ముందుభాగానికి (దీనిని పురఃపృష్ఠం అనవచ్చును) చొరవచేసికొని పోయే గుణం ఉంటుంది. కర్ణదుర్యోధనులు ఆ స్థానాలలో ఉన్నారు. ద్రోణుడు మధ్యభాగంలో ఉన్నాడు. కర్ణుడు చూపే చొరవతో ముందుకు సాగి ధర్మరాజును వెంటాడి నిపుణంగా పట్టి వ్యూహమధ్యభాగాన పెట్టాలి. అప్పుడతడు వెనుకకు మరలుతాడు. ఆయనకు ఇరుప్రక్కలా కురువీరు లున్నారు. కుడిప్రక్క జయద్రథ, భగదత్త, వికర్ణులూ, వారికి సాయంగా శకునీ ఉన్నారు. ఎడమప్రక్క కృతవర్మ, వివింశతి, చిత్రసేనులతో కూడిన దుశ్శాసనుడు, అతడికి సాయంగా కాంభోజశకయవన దేశాధీశు లున్నారు. మధ్యభాగంలో త్రిగర్త, మద్ర, శిబి, శూరసేన దేశాధిపతులు చుట్టూ ఉన్న ద్రోణుడు రాణించాడు. ఈ వ్యూహంలో కార్యసాధనోపాయం కూడా ఉన్నది. పాండవసేనలో ధర్మజుడు పట్టువడాలంటే ముందుగా అర్జునుడిని సమర్థంగా అడ్డుకొని, అతడి సహాయం అగ్రజుడికి అందకుండా చూడాలి. అందుకు శకటవ్యూహంలో కర్ణుడు ముందు నిలిచి ఉన్నాడు. భీముడిని ఎదుర్కొని అతడి సాయం ధర్మరాజుకు అందకుండా చేయాలని సుయోధనుడు కర్ణుడి వెంట వ్యూహంలోకి చొరబడటానికి సిద్ధమయ్యాడు. వీరిద్దరూ ద్వంద్వ యుద్ధాలలో అర్జున భీములను నిలువరించగలిగితే ధృష్టద్యుమ్నాది పాంచాలవీరులు ధర్మరాజుకు అండగా నిలుస్తారు. వారిని చెండాడి, మనస్సులోని మంట తీరేటట్లు ద్రుపదాదులను బాధించి ధర్మరాజును ఒంటరివాడిని చేసి పట్టుకొనటానికి ప్రయత్నించాలని ద్రోణుడు మధ్యప్రదేశంలో నిలబడి అవకాశం కొరకు వ్యూహాన్ని ముందుకు నడపసాగాడు. ప్రాణాలతో పట్టిన శత్రువును భద్రంగా తరలించాలంటే శకటవ్యూహం ప్రశస్తమని ద్రోణుడి అభిప్రాయం.

శకటవ్యూహానికి ప్రతిగా పాండవులు పన్నింది క్రౌంచవ్యూహం. తిక్కన క్రౌంచవ్యూహంలో ఎవరెవరు ఏయే స్థానాలలో నిలిచారో స్పష్టంగా వివరించకపోయినా సూచనాప్రాయంగా పేర్కొన్నాడు. బండి నేలమీద నడుస్తుంది. పక్షి ఆకసంలో ఎగురుతుంది. క్రౌంచ, గరుడ, శ్యేనాది వ్యూహాలు పక్షివ్యూహాలు. పక్షికి రెండు రెక్కలు, తోక, కడుపు, కంఠం అందులో ముఖ్యంగా ముక్కు - అనే అంగాలు ముఖ్యం. ఈ అంగాలన్నీ ఉంటే అది బృహస్పతి సమ్మతమైన దివ్యవ్యూహం. ధర్మరాజును బండిలో బందీగా తీసికొనిపోతున్నప్పుడు ఎక్కడికైనా ఎగిరి వ్యూహాన్ని ఎదుర్కొని భేదించి బందీని విడిపించి శత్రువ్యూహాన్ని ధ్వంసం చేయటానికి తోడ్పడేది పక్షివ్యూహం.

పాండవవ్యూహం ప్రత్యర్థుల పథకాన్ని భగ్నం చేయగలిగిన అవకాశాలను కలిగించేది. అందులో క్రౌంచపక్షి వాడి అయిన ముక్కువలె అగ్రభాగంలో నిలిచాడు అర్జునుడు. కంఠప్రదేశం వలె నిలిచాడు ధృష్టద్యుమ్నుడు. ఒకవైపు భీమాది సోదరులున్నారు,

మరొకవైపు అభిమన్యు ప్రభృతి కుమారు లున్నారు. ధృష్టకేతువు మొదలైనవారు పృష్ఠభాగంలో నిలిచారు. ధర్మజుడు గర్భస్థానంలో సురక్షితంగా ఉన్నాడు. ఇది శకటవ్యూహం కంటె సమగ్రమైనది, వేగవంతమైనది, ఎట్టి క్లిష్టపరిస్థితులలోనైనా శత్రువుమీద మెరుపుదాడి చేయటానికి వీలైనది. వ్యూహస్వభావాన్ని బట్టి గమనిస్తే ధర్మజుడిని పట్టేయత్నం బలంగా సాగినా, పార్థాదుల మెరపు దాడులలో అది ఫలించదని ఊహించటానికి వీలుంది. కథలో ఈ ఊహ నిజమౌతుంది కూడా.

శకటవ్యూహంలో ముందున్న కర్ణుడిని, క్రౌంచవ్యూహంలో ముందున్న అర్జునుడు ఢీకొని యుద్ధం చేస్తూ ఉండగా, ద్రోణుడు వారిద్దరివైపు కాకుండా ధర్మరాజున్న వైపు సంకులసమరాన్ని సాగించాడు. ధర్మజరక్షణలో పాండవవీరులు కూడి ఒక్కుమ్మడిగా ద్రోణుడి పరాక్రమాన్ని ఎదురొడ్డి పోరు ఘోరంగా చేశారు. మధ్యాహ్నానికి ద్రోణుడి ప్రతాపం దేదీప్యమానమైపోయింది. ధర్మరాజును రక్షించే వీరులు రంగంలో నిలువలేకపోయారు. అప్పుడు ధర్మరాజు ద్రోణుడిని ఎదిరించి అతడిని నిలువరించటానికి అర్జునుడినీ, ధృష్టద్యుమ్నుడినీ ఆజ్ఞాపించాడు. వారిద్దరూ తాము కర్ణాదులతో చేస్తున్న యుద్ధాలను మాని ద్రోణుడివైపు లక్ష్యాన్ని మళ్ళించి ఆయనతో శస్త్రాస్త్ర ప్రయోగ పాండిత్యంతో పోరి ధర్మజుడి దరికిచేరకుండ నిలువరింపచేశారు. ప్రక్కలనుండి దూరి ధర్మజుడికి హాని చేయాలనుకొన్న శల్యాదులకు భీమాదులు తగిన గుణపాఠం చెప్పారు. ద్రోణుడు పాండవవీరుల సంఘటిత శక్తిని ఎదుర్కొనవలసి వచ్చింది. అతడు సాహసంతో తెగించి ధర్మరాజును లక్ష్యంగా పెట్టుకొని సూటిగా యుద్ధం సాగించాడు. చుట్టుముట్టి ఆతడిని సమీపించాడు. సైనికులందరూ ధర్మజుడు చిక్కాడని కేకలుపెట్టారు. ఆ కేకలు అర్జునుడిని ఆగ్రహోదగ్రుడిగా చేశాయి. ద్రోణుడిమీద, కౌరవసైన్యంమీద కొరవివలె, కార్చిచ్చువలె విరుచుకుపడ్డాడు. సైన్యాన్ని రక్తప్రవాహంగా మార్చాడు. అస్తమయ సమయంలో రణరంగం రక్తవర్ణంతో భయంకరంగా మారింది. యుద్ధం ఆగిపోయింది.

మొదటినాటి యుద్ధంలో కార్యారంభం సమర్థనీయంగా సాగింది. కాని అర్జునుడి ప్రతిజ్ఞమేరకు ధర్మజుడు పట్టువడకుండ రక్షించబడ్డాడు. ధర్మజరక్షణలో పాండవవీరులు ద్రోణుడిపై దాడి చేసినప్పుడు అతడు క్రోధమూర్తిగా విజృంభించి పాండవసైన్యాన్ని వేటాడాడు. అయినా కార్యం కుంటువడింది. ఇటువంటి ఘట్టమే ముఖసంధిని ప్రదర్శిస్తుంది.

11. రెండవనాటి యుద్ధం: ప్రతిముఖసంధి: గరుడ - అర్ధమండల వ్యూహాలు:

ప్రారంభించిన కార్యం ఏదో బలమైన కారణంచేత ముందుకు సాగకపోతే తీవ్రమైన ప్రయత్నంచేసి బహుప్రయోజనాలు సాధించే వ్యూహాన్ని ప్రయోగించే కథాఘట్టంలో ప్రతిముఖసంధి ప్రకాశిస్తుంది. అది ద్రోణుడి రెండవనాటి యుద్ధంలో ప్రస్ఫుటమయింది.

మొదటినాటి యుద్ధంలో ధర్మజుడిని పట్టివ్వలేనందుకు ద్రోణుడు లజ్జావిషాదాలను పొందాడు. దుర్యోధను డాయనను ఏమీ అనక పూర్వమే ఇట్లా పేర్కొన్నాడు.

చ. ‘ నరవర! మున్న చెప్పితి రణంబున నర్జునుఁ డొద్ద నున్న నె
వ్వరికిని ధర్మసూనుఁ బొదువంగ నశక్య; మొకండు పార్థు ను
ద్ధురుఁ డయి నేల వాపికొని దోర్బల మొప్పఁగఁ బోవఁ జాలినన్
వెరవునఁ బట్టెదం; బరులు వేవురు మార్కొనినం గలంచెదన్’. **(ద్రోణ. 1.216)**

ఆ. ‘ నరుఁడు లేనిచోట ననుఁ గని వెన్నిచ్చి । పాఱకున్నఁ బట్టువడియెఁ గాఁగఁ
దలఁపు ధర్మపుత్త్రు ధరణీశ!; పాఱుట । గలిగెనేని నంతకంటె మేలు’ **(ద్రోణ. 1.217)**

యుద్ధారంభంలో చేసిన ద్రోణుడి ప్రతిజ్ఞకు ఈ వాక్యాలు అనుబంధాలు. అర్జునుడు దగ్గర ఉంటే ధర్మజుడిని పట్టటం అసాధ్యం. అందువలన మొదటిరోజున కార్యం పూర్తికాలేదు. దానిని కొనసాగించి ఫలింపజేయాలంటే అర్జునుడు ధర్మజుడికి దూరంగా పోవాలి. అట్లా ఎవరైనా చేయగలిగితే ద్రోణుడికి ధర్మరాజును పట్టటం సాధ్యమౌతుంది. అయితే, ధర్మజుడు ద్రోణుడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతాపానికి భయపడి వెన్నిచ్చి పారిపోకుండా యుద్ధం చేస్తే పట్టటం తథ్యం. ఒకవేళ పలాయనం చిత్తగిస్తే అంతకంటె (పట్టుబడటంకంటె) మరీ మంచిది. అంటే ఓడి పారిపోవటం మరణంకంటె హీనం. ద్రోణుడి మాటలలో రెండుమూడు సూక్ష్మాంశాలున్నాయి. ప్రతిజ్ఞ తీర్చకపోవటానికి ద్రోణుడు విధించిన నియమం అడ్డం వచ్చింది. అర్జునుడు ధర్మరాజును ఆదుకొన్నాడు. దానికి ద్రోణుడు బాధ్యుడు కాడు. అర్జునుడిని ఎదిరించి విజయం సాధించటం తనకు సాధ్యంకాదని ద్రోణుడు ముందే ప్రకటించి ఉన్నాడు కాబట్టి అర్జునుడిని దూరంగా తీసికొని వెళ్ళే బాధ్యత దుర్యోధనుడిదే అని ఆచార్యుడి భావం. ఆ పనిని కర్ణుడు నిర్వహించగలడని దుర్యోధనుడి ధైర్యం. కర్ణుడు అర్జునుడిని జయించలేడని ద్రోణుడికి తెలుసు. అందువలన అది ఆచరణ యోగ్యమైన ప్రతిపాదన కాదని కూడ తెలుసు. అయితే, దానినిగురించి దుర్యోధనుడు స్పందించే లోపలే సుశర్మ తన బలగంతో, సంశప్తకులతో అర్జునుడిని ఎదిరించే అవకాశం ఇమ్మని దుర్యోధనుడిని అడగటం, అందు కాయన అంగీకరించటం ఒకేసారి జరిగిపోయాయి. ద్రోణుడి ప్రయత్నం ఫలించే అవకాశం లభించింది. సుశర్మా, సంశప్తకులూ పార్థుడిని పోరుకు ఆహ్వానించారు. యుద్ధాహ్వానాన్ని ఆదరించకపోవటం వీరధర్మం కాదు. అందువలన అర్జునుడు ధర్మరాజును ఒప్పించి, అగ్రజరక్షణకై సర్వజిత్తు మొదలైన పాంచాల వంశీయులను నియమించి, సంశప్తకులపై సమరానికి వెళ్ళాడు.

ద్రోణుడు గరుడవ్యూహాన్ని పన్నితే ధర్మరాజు ధృష్టద్యుమ్నుడిచేత మండలార్ధ వ్యూహాన్ని పన్నింపజేశాడు. ఈ రెండూ సందర్భోచిత వ్యూహాలే. వ్యూహంలోని రెండుపక్షాలనూ వాటిస్థానంలోనే ఉంచి ఉరస్యం శత్రుబలం వైపు ముందుకు వెళ్ళే యుద్ధరీతిని ప్రదర్శించేది గరుడవ్యూహం.

కౌటిల్యుడి అర్థశాస్త్రంలో వ్యూహప్రతివ్యూహాల చర్చ కొంత సాగింది. శ్యేన గరుడవ్యూహాలను చాప, బాణ, అర్ధచంద్రాకార, మండలార్ధాది వ్యూహాలతో ఎదుర్కొనవచ్చునని సూచనలు చేశాడు. వ్యూహమర్మజ్ఞుల పన్నాగాలు యుద్ధం రౌద్రోద్రేకంతో సాగే విధానానికి దోహదం కలిగిస్తాయి. ద్రోణుడి ద్వితీయ దివసయుద్ధం ఈ తంత్రానికి అద్దం పట్టింది.

1. అర్జునుడు సంశప్తకులను చీల్చి చెండాడుతున్నా వారు మొండికి పడి ఎదురాడుతూ ఉండగా వారిని నిర్దాక్షిణ్యంగా నరుకుతూ విజయపథంలో సాగుతున్నాడు. ఇవి కౌరవపాండవుల ప్రత్యక్ష వ్యూహాలలో భాగం కాదు.

2. గరుడవ్యూహంలో ముక్కుగా నిలిచిన ద్రోణుడు మొట్టమొదట ధృష్టద్యుమ్నుడిని ఎదుర్కొనవలసి వచ్చింది. కాని, ఆచార్యుడు అతడి మొగం చూడటం తనకు అరిష్టమని భావించి, అతడిని తప్పించి పాంచాలురమీద బాణపరంపరలు సారించాడు.

3. ద్రోణుడికి బదులు దుర్ముఖుడు ధృష్టద్యుమ్నుడిని ఢీకొని ఆచార్యుడికి సంతోషం కలిగించాడు.

4. ద్రోణుడు అసంఖ్యాకమైన పాండవబలాన్ని నుగ్గునుగ్గు చేసి ధర్మరాజువైపు దూసుకొని వెళ్ళాడు. ధర్మరాజుకు రక్షాకవచం వలె నిలిచిన సత్యజిత్తు ఘోరయుద్ధం చేసి ద్రోణుడి క్రోధానికి గురి అయి, అతడి చేతిలో మరణించాడు. సత్యజిత్తు తరువాత సూర్యదత్తు వీరోచితంగా పోరాడి ద్రోణుడి ఆగ్రహజ్వాలలకు అసువులను కోల్పోయాడు. ధర్మరాజుకు రక్షణ తక్కువయింది. ద్రోణుడు ధర్మరాజును పట్టుకొనటానికి అప్పళించి తరుమనారంభించాడు.

5. అంతలో యుధామన్యుడు, ఉత్తమౌజుడు, వసుధానుడు, శిఖండి మొదలైనవారు ద్రోణుడిని ఎదిరించి ధర్మజుడికి రక్షగా నిలిచారు. అంతలో ధర్మరాజు ధృష్టద్యుమ్నుడిని, సాత్యకిని ముందుంచుకొని యుద్ధానికి

సిద్ధమయ్యాడు. ద్రోణుడు పాండవవీరుల నందరినీ బాణాలచేత బాధించి ధర్మరాజును మరల సమీపించాడు. ధర్మజుడు భయపడి ఏదో ఒక మిషతో యుద్ధఘట్టాన్ని వీడి ప్రక్కకు తొలగిపోయాడు. ద్రోణుడి పరాక్రమాన్ని సహించక వికావికలౌతున్న పాండవ సైన్యాన్ని కూడగట్టుకొంటూ చిత్రసేనాదులు ఎదురుదాడి చేశారు కాని, ద్రోణుడి ధాటికి ఎదురు నిలువలేకపోయారు. వారిని చూచి దుర్యోధనుడు కలకల నవ్వుతూ కర్ణుడితో ఇట్లా అన్నాడు.

క. ‘పెనుగాలికి వెసఁగూలిన । వనము క్రియం బడిన పాండవ బలముఁ గంటే?
విను మింక నెన్నఁడును మొగ । కొన రీ యోడి చనువారు గురుకోల్తలకున్.’

చ. ‘పవన తనూజుఁ గంటె! నిజపార్శ్వములం దనవారు లేక కౌ
రవులు మహోగ్రభంగి నడరం గడు దైన్యముఁ బొందియున్న వాఁ
డవిరళ దివ్య మార్గణ దురాసదు ద్రోణులఁ జూచి వీఁడు రా
జ్యవిభవకాంక్ష యెల్లఁ దెగటాఱఁగఁ బాఱెడు నట్లు సూడుమీ!’ **(ద్రోణ. 1. 201, 202)**

ఆ మాటలు విని కర్ణుడు భీమాదులను తక్కువగా అంచనా వేయవద్దని రారాజుకు హితవు చెప్పి, పాండవులు ఉద్దామబలాఢ్యులు కావటంతో ప్రాణాలైనా త్యజిస్తారు కాని రణరంగంలో పరాజయాన్ని పొందటానికి అంగీకరించరు. దుర్యోధనుడి వలన మున్ను పడ్డ పాట్లను తలచుకొంటే వారికి లేనిబలం పొంగివస్తుంది అని మొగమోటం లేకుండా చెప్పాడు. కర్ణుడు చెప్పినట్లుగానే పాండవవీరులు సైన్యాలను సేకరించుకొని ద్రోణుడిపై యుద్ధానికి సిద్ధమయ్యారు. కురుపాండవ వీరులమధ్య ద్వంద్వయుద్ధాలు భీకరంగా సాగాయి. భీముడు దుర్యోధనుడిని నొప్పించాడు. మధ్యాహ్న సమయానికి ద్రోణుడు ద్వంద్వయుద్ధంలో ధృష్టద్యుమ్నుడిని అవలీలగా ఓడించాడు. భీముడు కౌరవసైన్యాన్ని కలతపెట్టాడు.

6. భగదత్తుడు గజబలంతో పాండవసేనపై దాడిచేశాడు. భీముడు అతడి సైన్యాన్ని ధ్వంసం చేశాడు. అయితే అతడి భద్రగజం సుప్రతీకం భయంకరంగా విజృంభించి పాండవసైన్యాన్ని త్రొక్కివేయనారంభించింది. ఆ విపత్తునుండి తనవారిని తప్పించటానికి అర్జునుడు సంశప్తకులతో చేస్తున్న యుద్ధం మధ్యలో ఆపి రణరంగానికి రావలసివచ్చింది. అతడు వస్తూ ఉండగా పదునాల్గువేలమంది సంశప్తకులు వెన్నంటి బాణాలు వేశారు. వారినందరిని పార్థుడు హతమార్చి, భగదత్తుడిపై విజృంభించి పరాక్రమస్ఫూర్తితో అతడినీ, అతడి సుప్రతీకాన్నీ వధించి పాండవపక్షానికి క్రొత్తచేవను తెప్పించాడు. ధృష్టద్యుమ్నుడు ద్రోణుడికి అడుగడుగున అడ్డుపడి గడ్డు సమస్యలు సృష్టించాడు.

7. రెండవనాడు చెప్పుకోదగిన చివరి ద్వంద్వయుద్ధం కర్ణార్జునులపోరు. కర్ణుడు యుద్ధంలో శత్రువుల మధ్య చిక్కుకొన్నాడు. ద్రోణాదులు ఆతడిని రక్షించి బయటపడవేశారు. అర్జునుడు విజృంభించి కౌరవసేనలను నురుము చేయనారంభించాడు. సాయంకాలం కావటంతో యుద్ధం ఆపటం జరిగింది.

8. రెండవనాడు కూడా ద్రోణుడి ప్రతిన పూర్తి కాలేదు. దానికి కారణం ద్రోణుడి పాండవ పక్షపాత వర్తన మని దుర్యోధనుడు దూషించాడు; ఆచార్యుడికి కోపం వచ్చింది. అర్జునుడు తిరిగిరాకుండా నియమించలేని దుర్యోధనుడిదే లోపమని ద్రోణుడు ప్రకటించాడు. మూడవనాడు సాయంకాలం యుద్ధం ముగిసేవరకు అర్జునుడు తిరిగి రాకుండే ఉపాయం ఆలోచించుమని దుర్యోధనుడికి సూచించాడు ద్రోణుడు. పార్థుడి నా విధంగా రోజంతా ఆపగలమని సంశప్తకులు ప్రతిజ్ఞ చేశారు.

కౌరవపక్షం ప్రారంభించిన కార్యం ఆరంభంలో విఫలంకాగా దానిని రెండవనాటి యుద్ధంలో మరొకసారి తీవ్రయత్నంతో కొనసాగించే కథాభాగం ఉండటంచేత ఇది ప్రతిముఖసంధి. ఇందులో కార్యం ఫలవంతం కాకపోగా, ఔతుంది అనే నమ్మకం కుదరలేదు. ద్రోణుడి ప్రతిజ్ఞ ఫలిస్తుందా లేదా అనే అనుమానం అందరి మనస్సులలో ఆరాటం కలిగిస్తూనే ఉంటుంది. అయినా విస్తృతవ్యాప్తి కలిగిన ఏదో తీవ్రయత్నంకోసం అన్వేషణ సాగుతుంది. అందులోనుండే గర్భసంధి కథ పుట్టుకొస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

12. మూడవనాటి యుద్ధం: గర్భసంధి: పద్మవ్యూహం:

ద్రోణాచార్యుడు మూడవనాడు పద్మవ్యూహాన్ని పన్నాడు. దాని వెనుక బహుముఖ ప్రయోజనం సాధించే పటిష్ఠమైన ఆలోచన ఉన్నది. ధర్మజుడికి నిరంతర రక్షాకవచంవలె రాణించే పార్థుడు ఎట్టి పరిస్థితులలోనూ అన్నకు సహాయమందించే అవకాశం లేని దూరప్రాంతానికి పంపి సంశప్తకులచేత చావటమో లేక వారితో యుద్ధంలో తలమునకలై ఉండటమో జరగాలని మొదటియోచన. దానివలన అర్జునుడు లేని పాండవసైన్యంలో వీరులందరూ ధర్మజరక్షలోనే నిమగ్నులై ఉంటారు. వారు దానికి తగిన వ్యూహాన్ని ఎన్నుకొనవచ్చును. కాని, దానికి అవకాశం ఇవ్వకుండా ముందుగానే పద్మవ్యూహాన్ని ప్రకటించాడు ద్రోణుడు. వ్యూహాలలో పద్మవ్యూహం దుర్భేద్యమైనది. మండలాకార వ్యూహాలలో మహాపటిష్ఠమయింది. మహాజటిలమూ, సంశ్లిష్టమూ అయింది. దానిని భేదించగలిగినవారు పాండవపక్షంలో ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారు కృష్ణుడు, అర్జునుడు. వారిరువురూ దూరంగా వెళ్ళారు. ఇక మిగిలింది అభిమన్యుడు. అతడికి మొగ్గరాన్ని ఛేదించి, లోనికి ప్రవేశించి కలచివేసే రహస్యాలు తెలుసు. కాని, వెనుకనుండి క్రమ్ముకొని వచ్చి మార్గాలు బంధించే వ్యూహవిధానాన్ని ఛేదించుకొంటూనో, లేక క్రమ్ముకొనకుండా చేసే పద్ధతినో పాటించి క్షేమంగా తిరిగివచ్చే రహస్యం అతడికి తెలియదు. అందువలన అభిమన్యుడిని ముందు పెట్టుకొని కాని, లేక వీరులందరూ కలిసి ఒక్కుమ్మడిగా సాహసించిగాని పద్మవ్యూహాన్ని ఛేదించి లోనికి రావచ్చును. వచ్చిన తరువాత ఒక ధర్మరాజునే కాదు అందరినీ బంధించవచ్చును. పాండవవీరులను నిస్సహాయస్థితిలో పెట్టి ధర్మజగ్రహణం చేయటం పద్మవ్యూహ పరమప్రయోజనం. ప్రతివ్యూహం లేని పాండవసేన మూకుమ్మడిగా మృత్యుముఖంలోకి ప్రవేశించినట్లౌతుందని ద్రోణుడి ఆలోచన. ఆనాటితో యుద్ధం ముగియక తప్పదనే ధైర్యం, నమ్మకం దుర్యోధనుడికి కలిగించి తన వీరధర్మాన్ని చాటుకొనటం కూడా మరొక ప్రయోజనం.

పద్మవ్యూహ పరికల్పనలో ద్రోణుడు పాటించిన పద్ధతి ప్రశస్తమైనది. పద్మస్వభావాన్ని ఆ వ్యూహంలో ప్రవర్తింపజేయటం పరమార్థం. సూర్యోదయం కాగానే పద్మం వికసిస్తుంది. దానిలోని మకరందాన్ని ఆస్వాదించటానికి తుమ్మెదలు వస్తాయి. లోనికి ప్రవేశించి మధువును త్రాగటంలో తనువులు మరచి అట్లాగే ఉండిపోతాయి. రాత్రికి కమలం ముకుళించుకొంటుంది. తుమ్మెదలు బందీలైపోతాయి. ఇదేవైఖరి పద్మవ్యూహంలో ప్రదర్శించబడుతుంది. అయితే, ద్రోణుడు పన్నిన వ్యూహం వికసించిన పద్మాకారంలో లేదు. అభేద్యంగా ఉండే పద్ధతిలో రచించిన పద్మవ్యూహం వలయాకారంగా ఉండటంచేత చక్రవ్యూహమా అనే భ్రాంతి కలిగించేటట్లు ఉన్నదట! అందులోకి ప్రవేశించాలంటే ఒకే ఒక మార్గం ఉన్నదట! అక్కడ ద్రోణుడు నిలిచి ఉన్నాడట! అంటే - ఆ పద్మవ్యూహం ముకుళించిన పద్మంవంటిదన్నమాట! అందులోనికి ప్రవేశించే తుమ్మెద మొనను చించుకొని లోనికి పోవలసిందే. ఇక లోనికి ప్రవేశిస్తే చుట్టూ దళాలు క్రమ్ముకొనే ఉంటాయి. ఆ దళాలుగా వివిధ దేశాలరాజులు నిలిచి ఉన్నారు. పద్మకేసరాలు లోన బారులు తీరి ఉంటాయి. ఆయాస్థానాలలో రాజకుమారులు ఆసన్నులై ఉన్నారు. పద్మమూలస్థానం కర్ణిక. కర్ణదుశ్శాసనాది మహావీరులు అందరూ పరివేష్టించి ఉండగా దుర్యోధనుడు ఆ స్థానంలో నిలిచి ఉన్నాడు. ద్రోణుడిని ఓడించి లోనికి ప్రవేశించిన వీరులు కేసరాల బారిని పడకుండా కర్ణికకు చేరి వీరమండలాన్ని ఎదుర్కొని నిలవాలి. ఆ వర్తులాన్ని భేదించి, చొరవచేసికొని, మూసికొని ఉన్న ద్వారాన్ని శిథిలంచేసి బయటపడాలి. ప్రవేశించటం ఎంత కష్టమో తిరిగిరావటం కూడా అంత కష్టం. అటువంటి జటిలవ్యూహంలో చివరకు ధర్మరాజు దుర్యోధనుడి కర్ణికలోనే పట్టుపడవచ్చును. దానివలన ద్రోణుడికి పట్టియిచ్చిన పరువూ దక్కుతుంది. దుర్యోధనుడికి పట్టుకొన్న బిరుదూ దక్కుతుంది. దురాలోచనా పరుడైన దుర్యోధనుడి ఆశ తీరటానికి పద్మవ్యూహం అనువైనది కాబట్టి ద్రోణుడు దానిని పన్నాడు.

పద్మవ్యూహం పాండవులకు పరువును, పౌరుషాన్నీ, చివరకు ప్రాణాలను నిలుపుకొనే జటిల సమస్యగా మారింది. అర్జునుడు లేని సమయంలో భీముడు సమరసన్నాహానికి సారథ్యం వహించటం సర్వసామాన్యమే. భీముడు ముందు నిలువగా వరుసగా సాత్యకి ధృష్టద్యుమ్న కుంతిభోజులు ఒక జట్టుగా, చేకితాన క్షత్త్రధర్మ క్షత్త్రవర్మలు ఒక జట్టుగా, ధృష్టకేతు నకుల సహదేవులు ఒక జట్టుగా, ఉత్తమౌజశ్శిఖండి యుధామన్యులు మరొకజట్టుగా, ఘటోత్కచ విరాట ద్రుపదులు ఇంకొక జట్టుగా, ద్రౌపదేయ కేకయ

సృంజయాది బృందాలు చివరి జట్టుగానూ యుద్ధస్ఫూర్తితో ముందుకు సాగి ద్రోణుడితో డీకొన్నారు. ఆచార్యుడు వారి ప్రయత్నాన్ని చూచి నవ్వి వారినందరినీ బాణవర్షంతో బడలుపడేటట్లు చేశాడు. పద్మవ్యూహముఖం పాశవికబలంతో పగిలిపోయేది కాదని పాండవులకు అర్థమయింది. ఆ వ్యూహాన్ని భేదించే ఉపాయం కొరకు ధర్మజుడు అన్వేషించి అభిమన్యుడిని ఆశ్రయించాడు.

సీ. ‘ఈ యొడ్డు భేదింప నే మెవ్వరము నేర; । మర్జునుండును నీవు నచ్యుతుండుఁ
ప్రద్యుమ్నుఁడును దక్కఁ; బార్థుఁడు మనల ను । ల్లస మాడకుండ నీలావు మెఱసి
భేదించి మా కెల్లఁ బ్రియ మొనర్పు కుమార!’ యనవుడు నతఁ డాననాబ్జ మలర
‘దీని ముఖంబు భేదించు తెఱంగు నా । కెఱిఁగించె మా తండ్రి; యేను దెఱపి

ఆ. సేయ నేర్తుఁ; జొచ్చి చించి చెండాడెద; । మూఁక లెల్లఁ జుట్టుముట్టినపుడు
వెడలునట్టి వెరవు విన; దాని కేమి? నా । చొచ్చు నేర్పు బలువుఁ జూడు మధిప!’ (ద్రోణ. 2. 5)

అభిమన్యుడి మాటలలో పద్మవ్యూహ భేదనోపాయం స్పష్టంగా గోచరిస్తుంది. తిరిగివచ్చే పద్ధతి ఆతడికి తెలియదు, పాండవులకు తెలియదు. ఆ సమయానికి అర్జునుడు వచ్చి సాయపడే అవకాశం కూడా లేదు. ఈ పరిస్థితిలో అభిమన్యుడి వెంట పాండవులు ప్రవేశించి దుర్భేద్యమైన పద్మవ్యూహ నిర్మాణాన్నే భగ్నం చేయటం తప్ప మార్గాంతరం లేదని తెలిసింది. అది భేదించటం సాధ్యమా? అసాధ్యమా? అనే మీమాంసకు అప్పుడు తావు లేదు. భీముడు తమబలంతో దానిని సాధించగలననే విశ్వాసాన్ని ప్రకటించాడు. “ధైర్యే సాహసే లక్ష్మీ” అనే న్యాయంతో అభిమన్యుడిని ముందు నడిపించారు.

పాండవవీరులందరిలో అభిమన్యుడి కున్న ప్రత్యేకశక్తికి అప్పుడు గుర్తింపు వచ్చింది. తాతలకంటె, తండ్రులకంటె అతడికి ఆనాడు ఉన్నతస్థితి ఏర్పడింది. అర్జునుడు లేనినాడు పాండవసైన్యంలో అభిమన్యుడే అభినవార్జును డన్నట్లు స్ఫురించింది. శ్రీకృష్ణు డుంటే అభిమన్యుడికి అవకాశం ఉండేది కాదు. పద్మవ్యూహ పరిజ్ఞానం సగం మాత్రమే తెలిసిన పండితుడే ఆనాడు మహాపండితుడైనాడు. అతడి ప్రతాపాన్ని సంపూర్ణంగా ప్రదర్శించే అదను లభించింది; తన బలంమీద, నేర్పరితనం మీద విశ్వాసం పెరిగింది. దానివలన ఒక్కనాటిలో ఒక జీవితకాలం సంపాదించుకొనే కీర్తిని సాధించవచ్చునని యశోవీరం ఉప్పొంగింది. పాండవసైన్యముఖంలో నిలబడి ఉన్న భీముడితో తానా స్థానంలో నిలిచి యుద్ధాన్ని ముందుకు సాగిస్తా నని ప్రతాపోక్తులు పలికాడు.

చ. ‘నను విను కీచకాంతక! మనంబున ద్రోణుఁడు మెచ్చఁ జొచ్చి య
మ్మొనఁ గలఁగింప కిట్లు కురుముఖ్యుఁడు ధర్మసుతుండు గారవిం
చిన జతనంబు నిష్ఫలము సేయుదునే? నరుఁడున్ సుభద్రయుం
దనయునిఁ గాంచి సంతసము దాల్చుట యంతయు రిత్తఁ బుత్తునే?’

చ. ‘ఇదె యొక పిన్నవాఁ డడరి యెక్కుడు మూఁకల క్రందు దోలెడుం
గదుపుల వెల్చు గోపకుని కైవడి నంచు జనుల్ నుతింపఁ జే
సెద; విని మామ ప్రీతి విలసిల్లఁగఁ దండ్రియు సంతసిల్లఁ బె
ట్టిదుఁ డగు కౌరవేంద్రునకు డెప్పర మయ్యెడు భంగిఁ బేర్చెదన్’ (ద్రోణ. 2. 10-11)

ఇవన్నీ అభిమన్యుడు పేర్కొన్న లక్ష్యాలు. వాటిని సాధించి వీరులను యుద్ధంలో కలతపెట్టి పాండవులకు గెలుపుబాట చూపటమే ఆతడి లక్ష్యం. గెలుపును వారు సాధించుకొని విజయఫలాన్ని పొందాలని ఆతడి అభిప్రాయం. ఈ పూనిక అంత భద్రమైనది కాదని సారథి అపశకునం పలికాడు. అయినా, ఆతడు వెనుకాడలేదు. అనుమానించలేదు. పద్మవ్యూహం భేదించాలని అభిమన్యుడు రౌద్రరసోల్లసితమూర్తి అయినాడు. మెరుపువలె మెరిసి ద్రోణుడిని బాధించి మొగ్గరంలోకి ప్రవేశించాడు. మహాసాగరంలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మందరపర్వతం తిరిగినట్లు పద్మవ్యూహంలోని వీరులను పరాక్రమంతో చిలకటం మొదలుపెట్టాడు. అలంకార ధ్వని నాశ్రయించి ముందుగా హాలాహలం పుడుతుంది. అభిమన్యుడు మరణిస్తాడు. ఆ తరువాత అమృతం ఆవిర్భవిస్తుంది. అర్జునుడు సైంధవుడిని సంహరిస్తాడు ఆ తరువాత ద్రోణుడు ప్రాణత్యాగం చేస్తాడు. విజయాన్ని విజయుడు సాధిస్తాడు.

పద్మవ్యూహఘట్టం నాటకంలోని గర్భసంధి స్వభావాన్ని కమనీయంగా సంతరించుకొని ఉన్నది. గర్భసంధిలో ప్రాప్త్యాశ అనే అవస్థ ప్రధానంగా ప్రవర్తిలుతుంది. ఫలం సిద్ధిస్తుందో లేదో అనే సంశయంతో కార్యసిద్ధి అనిశ్చితంగా ఉండటం ప్రాప్త్యాశ. పాండవులకు పద్మవ్యూహం కార్యసిద్ధినిగురించి అనిశ్చిత మానసికావస్థను సృష్టించింది. అందుకే వారు 'అభూతాహరణ'మనే అంగాన్ని ఎన్నుకొన్నారు. శత్రువ్యూహానికి ప్రతిక్రియ చేయటానికి ఒక వంచన కృత్యంవంటి ఉపాయాన్ని పన్నారు. అదే అభిమన్యుడిని వ్యూహభేదానికి నియోగించటం. ప్రాప్త్యాశలో అభిమన్యుడే ఆశాకిరణంవలె ప్రకాశించాడు. అతడు తన శక్తియుక్తులను గురించి యాథార్థ్యాన్ని చెప్పటంవలన ఫలసిద్ధి అనుమానమైనా ఆశాజనకంగా నిలిచింది. ఆతడు స్వయంగానూ శత్రువీరుల చేతనూ ప్రదర్శింపజేసే క్రోధ సంభ్రమాదులు తోటకాన్ని పోషించాయి. రూపం, ఉదాహృతి, క్రమం, అనుమానం, అధిబలం, ఉద్వేగం, సంభ్రమం, ఆక్షేపంవంటి సంధ్యంగాలన్నీ పాండవ పక్షంలోనే కాక కౌరవపక్షంలో కూడా ప్రత్యక్షమౌతాయి. అందువలన మూడవనాటి యుద్ధం సమగ్ర గర్భసంధిని ప్రదర్శించింది.

ద్రోణుడు ధర్మరాజును పట్టటానికి పద్మవ్యూహాన్ని పన్నాడు. దానివెనుక కౌరవుల ప్రాప్త్యాశ ఉన్నది. కాని, అభిమన్యుడు రంగంలోనికి ప్రవేశించి పద్మవ్యూహాన్ని సంక్షోభపెట్టటంతో ధర్మజుడిని బంధించటం మరుగునపడిపోయింది. అభిమన్యుడు విజృంభిస్తే ధర్మజుడిని పట్టే వీరులే కౌరవపక్షంలో మిగులుతారా? అనే అనుమానం ధార్తరాష్ట్రులకు కలిగింది. అందువలన అధర్మయుద్ధంలో ఆతడిని మూకుమ్మడిగా కూడి చంపట మొక్కటే ప్రాప్త్యాశకు దోహదమయింది. గర్భసంధ్యంగాలన్నీ పాండవ కౌరవ పక్షాలకు అన్వయించటం అద్భుతం.

గర్భసంధిలో అర్థప్రకృతి పతాక. స్వీయప్రయోజనాన్ని సాధించుకొంటూనే ప్రధానకథకు అంగమై దాని ప్రయోజనాన్ని కూడా కొంతసాధిస్తూ కొంతవరకు వ్యాపించే ఉపకథ పతాకా. దానిని పతాకా కథ అంటారు. ఆ ఘట్టానికి నాయకుడిని పతాకానాయకుడనీ అంటారు. పాండవపక్షంలో పతాకా వృత్తాంతం అభిమన్యుడు పద్మవ్యూహాన్ని భేదించి కురువీరులను కలతపెట్టి, చివరకు వారి అధర్మ యుద్ధంలో చనిపోయిన గాథ. దానివలన పాండవులకు తీవ్రంగా బీజాన్వేషణం చేసికొనవలసిన అవసరం ఏర్పడింది. అభిమన్యువధ పాండవులచేత వరుసగా సైంధవుడినీ, ద్రోణుడినీ చంపటానికి కారణమై పర్వ ప్రయోజనాన్ని సాధించింది.

ఇటు కౌరవ పక్షంలో ప్రకరీ నాయకుడుగా నిలిచినవాడు సైంధవుడు. అతడు శివుడివరంవలన పొందిన అవకాశం - అర్జునుడు లేని పాండవులను ఒకనాడు యుద్ధంలో నిలువరించగలగటం. ఆ వరం అర్జునుడు సంశప్తకులను వధించబోగా అభిమన్యుడు పద్మవ్యూహంలో ప్రవేశించిననాడే వర్తిల్లే అవకాశం ఏర్పడింది. ఆనాడు పాండవుల సహాయం అభిమన్యుడి కందకుండా చేసి అభిమన్యుడి మరణానికి తోడ్పడ్డాడు. అది అతడు స్వయంగా సాధించిన ప్రయోజనమే. దానివలన అభిమన్యుడి మరణం సంభవించినా ధర్మరాజు పట్టుబడటం జరగలేదు. అందువలన ద్రోణుడు మరునాడు మరొక ఉపాయాన్ని పన్నుకొనవలసి వచ్చింది. ఈ విధంగా ప్రకరిఘట్టాలు ద్రోణపర్వంలో ప్రసిద్ధి చెందాయి. గర్భసంధిని గంభీరంగా పోషించాయి.

అభిమన్యుడు పద్మవ్యూహాన్ని భేదించిన విధానాన్ని తిక్కన కన్నులకు కట్టేటట్లు రచించాడు. వర్తులాకారంగా, చక్రవ్యూహంవలె పన్నబడిన పద్మవ్యూహంలో ప్రవేశించగానే దానిలో మహార్ణవంలో తిరిగే మందరపర్వతంవలె తిరిగి ఆ వ్యూహాన్ని కలతపెట్టాడు. అడవిలో చరించే తీవ్రానలంవలె వ్యాపించి సైన్యాలను పొడిచేశాడు. ప్రళయకాలంలో లోకాలను సంహరించే క్రీడ సలిపే శూలి వలె సైనిక సమూహాలను రూపుమాపాడు. ఈ మూడు రకాల రణక్రీడలు మండలాకారవ్యూహ రచనలధ్వంసనానికి ఉపయోగించేవి. మొదట కేసరాలుగా, దళాలుగా నిలిచినవారిని నిరాఘాటంగా చంపటం వలన పద్మవ్యూహంలో మూలస్థానమైన కర్ణికను చేరే

మార్గాన్ని సుగమం చేసికొన్నాడు. హుటాహుటిగా కర్ణికను చేరికొనటంవలన కొన్ని ప్రయోజనా లుండవచ్చును. 1.దళాలుగా ఉన్న వివిధ దేశాధిపతులను, కేసరాలుగా ఉన్న రాజకుమారులను అవలీలగా దాటిపోవటంవలన ఆ స్థానాలలో ఉన్నవారందరూ, ద్రోణుడివలెనే ఆశ్చర్యపోతారు. 2. మొన చించిన తరువాత తనవెంట వచ్చే భీమాదిపాండవ వీరులకు త్రోవ సుకరంచేయట మౌతుంది. 3. పద్మవ్యూహంలో లక్ష్యం దగ్గరికి సూటిగా పోవటం సబబు కాదన్నట్లున్నది. వక్రంగా, వర్తులాకారంగా సాగే రణ సంప్రదాయాన్ని అభిమన్యుడు పాటించాడు. 4. పద్మంలో ప్రవేశించే తుమ్మెద కేసరాలకంటె కర్ణికమీదనే వాలుతుంది. అట్లాగే పద్మవ్యూహంలో కర్ణికను భేదిస్తే మొత్తం నిర్మాణం శిథిలమౌతుందని అభిమన్యుడు అట్లా చేసి ఉంటాడు. 5. ధర్మరాజును పట్టివ్వాలని పగబట్టి అడిగిన కుటిలవర్తనుడు దుర్యోధనుడిని హుటాహుటిగా ఎదుర్కొని అతడిని ఓడించి బంధించి తెస్తే ధర్మరాజుకు సంతోషం కలుగుతుందని భావించి ఉండవచ్చును. 6. సామాన్యంగా ఇతరవీరులు వ్యూహభేదనం చేసిన దానికంటె విలక్షణంగా వ్యవహరిస్తే శ్రీకృష్ణార్జునుల మెప్పు పొందవచ్చును. ఇన్ని ప్రయోజనాల నాశించి అభిమన్యుడు కర్ణికలో మహావీరులచేత రక్షించబడుతున్న దుర్యోధనుడికి ఎదురుగా పోయాడు. ఆ వ్యూహంలో అభిమన్యుడిని ఎదుర్కొనవలసిన అవసరం దుర్యోధనుడికి రావటం విశేషం. మెరుపుదాడితో కర్ణికను నాశనం చేసి దుర్యోధనుడిని ఓడించబోతున్న అభిమన్యుడిని ఎదుర్కోవటాన్ని ద్రోణుడు కర్ణికస్థానంలో ఉన్న మహావీరులనందరినీ ఎలుగెత్తి హెచ్చరించాడు. దానితో ఆ మూలస్థానంలో ఉన్న వీరులు వలయాకారంగా అభిమన్యుడిని ఆవరించారు. కాని, అతడిని నిలువరించలేకపోయారు. ఆ స్థితిని గమనించి ద్రోణుడు తాను మోహర ముఖస్థానాన్ని వదలి కర్ణిక రక్షణకు స్వయంగా వచ్చాడు. పద్మవ్యూహ సమగ్ర నిర్మాణం శిథిలం కావటం మొదలైనదనటానికి ఇది ప్రథమసూచన.

దుర్యోధనాది వీరులందరూ ఒక్కుమ్మడిగా అభిమన్యుడిని చుట్టుముట్టి మరల దాడి చేయనారంభించారు. అప్పుడు సేనాపతుల సంహారం మొదలు పెట్టాడు అభిమన్యుడు. మొదట అతడిచేత చచ్చినవాడు అశ్మకుడు. అతడి పతనంతో భయపడి పరుగెత్తే సైన్యాలను పురికొల్పి కురుకుమారులు ఢీకొన్నారు. వీరు కర్ణికకు అండగా నిలిచి ఉన్న కేసరస్థానీయులలో కొందరు. వారందరినీ అభిమన్యుడు నురుమాడాడు. అంటే కొన్ని కేసరస్థానాలు ధ్వంసమయ్యాయన్నమాట! దానితో కర్ణిక మీద భారం పడటం మొదలయింది. మహావీరులలో ఒకడైన శల్యుడు విజృంభించి అభిమన్యుడిని ఎదుర్కొన్నాడు. కాని, ఆతడి వాడి అయిన బాణాలకు నిలువలేక మూర్ఛపోయాడు. అతడిని చూచి అతడి తమ్ముడు కోపించి అభిమన్యుడిపై యుద్ధానికి వచ్చాడు. అతడి తలను నరసుతుడు భల్లంతో త్రుంచాడు. ఆ దెబ్బతో పెద్దలందరూ గగ్గోలుపడ్డారు. ద్రోణకృపద్రౌణి కృతవర్మ బృహద్బల కర్ణాది వీరులందరూ పరస్పరం పేర్లుపెట్టి పిలుచుకొని ఏకమై, సైన్యాలను కూర్చుకొని పోరు ఘోరంగా సాగించినా ఆ బాలుడి పరాక్రమానికి ఎదురు నిలువలేకపోయారు. అభిమన్యుడు కొరవి త్రిప్పినట్లు తిరిగి వారిసేనలను పీనుగు పెంటలు చేశాడు. కర్ణికా స్థానానికి నాయకుడుగా ఉండవలసిన దుర్యోధనుడు, అతడికి అండగా నిలువవలసిన యోధగణం వికావికలు కాగా, కర్ణికను కూడా సర్వసైన్యాధ్యక్షుడు రక్షించుకొనవలసిన దుఃస్థితి ఏర్పడటం రెండవ క్షీణ దశ.

ఆ దీనస్థితి దుర్యోధనుడి దురాశవలన ఏర్పడిందని ద్రోణుడు భావించాడు. రారాజును ఓదార్చటానికి బదులు అభిమన్యుడి ప్రతాపాన్ని కృపాచార్యుడిముందు ప్రశంసించి అతడి గుండెలు మండేటట్లు చేశాడు. ఇది ద్రోణుడి గూఢకోప వ్యంగ్యాభివ్యక్తి.

ఉ. ‘ తమ్ములు నన్నలుం జెలులుఁ దండ్రులు మామలు భృత్యులుం బ్రమో
దమ్మునఁ దేల నిట్లు వడిఁ దాఁకెడునే విజయాత్మజుండు ఘో
టమ్ములుఁ గుంజరమ్ములు బడల్పడఁ దేరులు నుగ్గు గాఁగ నా
నమ్మిన యోధవీరులు వినాశము, భంగము నొంద నొక్కఁడున్’ **(ద్రోణ. 2. 43)**

అభిమానధనుడైన రారాజు ఆ మాటలు విని వెలవెలబోయాడు. దీనమైన ముఖంపెట్టాడు. దానిని కప్పుకొనటానికి నవ్వుగాని నవ్వు నవ్వుతూ ద్రోణుడిని గురించి మిత్రులతో ఇట్లా నేరాలు చెప్పాడు.

చ. ‘పలుకులు వింటిరే ధనువు పట్టెడి వారికి నెల్ల నొజ్జ దో
ర్బల విదితుండు గుంభజుఁడు బాలుని నొక్కరుఁ జంచలాత్ము వెం
గలిఁ గడుఁ బెద్దఁ జేయుచుఁ బొగడ్తకుఁ జొచ్చె? నితండు నొంపఁగాఁ
దలఁపడు వీనిఁ, బార్థునకుఁ దాఁ గడుఁ గూర్చుట నెంత త్రుళ్ళినన్.’

చ. ‘గురుని యుపేక్షఁ జేసి తనకున్ సమరోద్ధతి సెల్ల దాని నీ
వెరవిఁడి గానలేఁడు; దన వీరము కాఁ గొని విఱ్ఱవీఁగెడుం;
బొరిగొనుఁ డండఱుం గడఁగి పోవఁగనీక దృఢాస్త్ర శస్త్ర ని
ష్ఠురపరిపాతనోగ్రముగఁ జుట్టును ముట్టి చలం బెలర్పఁగన్’. **(ద్రోణ. 2. 45,46)**

ఆచార్యుడి అర్జున పక్షపాతమే అభిమన్యు డింతగా పెచ్చుపెరిగిపోవటానికి కారణమని మిత్రులకు నమ్మబలికి దుర్యోధనుడు ద్రోణుడికి అలక తెప్పించాడు. అందరూ కలిసి అభిమన్యుడిని చుట్టుముట్టటానికి పూనుకొనేటప్పుడు అన్నగారి మీద అభిమానంతో దుశ్శాసనుడు ముందుకు వచ్చి అభిమన్యుడితో తలపడి, పోరి, నిలువలేక రథంమీద చచ్చినవాడివలె మూర్ఛలోపడ్డాడు. సారథి అతడి రథాన్ని దూరంగా తీసికొనిపోయాడు. కర్ణికాస్థానంలో ఉన్నవీరులకు ప్రతినిధిగా పోరిన దుశ్శాసనుడు తరువాత చాలమందికి బాట చూపాడు. కర్ణుడు అట్లాగే యుద్ధంచేసి అలసిపోయాడు. అతడి తమ్ముడు అన్నకు సాయంగా వచ్చి యుద్ధంలో ప్రాణాలు కోల్పోయాడు. దుర్యోధనుడిని రక్షించవలసిన మహావీరులందరూ పరుగులు తీస్తుంటే సర్వసేనాధ్యక్షుడు ఇట్లా మొరపెట్టుకొనవలసి వచ్చింది.

చ. ‘నిలు నిలు కర్ణ! యో కృపుఁడ! నీ విటు లేల కడంక దక్క? సౌ
బల! ధృతి దూల నేమిటికి? బాహ్లిక! యిత్తఱిఁ గౌరవేంద్ర! నీ
బలముఁ జలంబుఁ జూపి నిలుపం దగు సేనల నంచుఁ బెక్కు భం
గులఁ బురికొల్ప నెవ్వరును గోల్తలఁ సేయర; యేమి సెప్పుదున్!’ **(ద్రోణ. 2. 59)**

సంజయుడు చెప్పిన ఈ కథనం వలన కర్ణికాస్థానం ఎంత శిథిలమయిందో సర్వసేనాని పిలుపు ఎంతటి అరణ్య రోదనమయిందో తెలుస్తుంది. ఇది శోచనీయమైన మూడవ దశ.

కౌరవ వీరులకు యశస్సో, మరణమో తేల్చికొనవలసిన తరుణం ఏర్పడింది. సైంధవు డడ్డుపడటంవలన భీమాదుల సాయం అభిమన్యుడికి అందకపోవటంతో అతడికి ఏకవీరయుద్ధం తప్పనిదైపోయింది. తిరిగిపోలేని వ్యూహంలో చేతికందినంతవరకు శత్రుసంహారం చేసి వ్యూహాన్ని నిర్వీర్యం చేయటమే ఆతడికి మిగిలింది. అందులో యశస్సో, మృత్యువో - దేనికైనా తెగించి పోరవలసిన సమయం ఆసన్నమయింది. వ్యూహం బలమైనదైనా వ్యూహరక్షకులు బలమైనవారు కాలేకపోయారు. వృషసేనుడు సాహసించి పోరాడి మూర్ఛితుడయ్యాడు. వసాతిభూపతి రణంలో ప్రాణాలు వదిలాడు. రుక్మధరుడు యుద్ధంలో కూలిపోయాడు. దానిని చూచి పెక్కురు రాజులు అభిమన్యుడిని పగతో ముట్టడించి క్రమ్ముకొన్నారు. అభిమన్యుడు చనిపోయాడని అందరూ అనుకొన్నారు. కాని, ఆ మూకదాడినుండి గాంధర్వమాయతో విజయస్ఫూర్తితో బైటపడి వారిని తరిమికొట్టాడు. దుర్యోధనుడు పెనుబలంతో అభిమన్యుడిని ఢీకొని మంచిపోరు నిచ్చాడు. కాని, అభిమన్యుడి ఆగ్రహానికి తాళలేక వెనుదిరిగిపోయాడు. ఆ సన్నివేశం గమనించి రోషంతో దుర్యోధన పుత్రుడైన లక్ష్మణకుమారుడు అభిమన్యుడిపై విరుచుకొనిపడి పోరు సాగించాడు. కాని, అతడి చేతిలో మరణించాడు. కొడుకును చంపిన అభిమన్యుడిపై దుర్యోధనుడు మండిపడ్డాడు. కృపాశ్వత్థామాది వీరులు అందరూ కలిసి అతడి మీదపడి నిర్దయగా చంపండి అని ఆజ్ఞనిచ్చాడు. వా రా ప్రయత్నంచేసి విఫలులయ్యారు. అభిమన్యుడు సైంధవుడిమీద విజృంభించి పాండవులకు అడ్డంకి తొలగించే ప్రయత్నం చేశాడు. కాని, దళస్థానాలలో ఉన్న నిషాదులు, కళింగులు మొదలైన

గజసైన్యాధిపతులు ఎదుర్కొన్నారు. జయద్రథుడు పాండవుల నడ్డగించి దూరంగా తీసికొనిపోయాడు. అభిమన్యుడు ఒంటరిపోరు సాగించాడు. కేసరస్థానీయులైన శత్రుంజయుడు, చంద్రకేతుడు, సువర్చసుడు, సూర్యభానుడు, మేఘవేగుడు, గాంధారపతి మొదలైన వీరులు అతడిని చుట్టుముట్టి పోరాడారు. వారందరినీ అభిమన్యుడు బాణాలతో జర్జరిత దేహులనుగా చేయగా, వారందరూ కలిసి దుర్యోధనుడి వద్దకు వచ్చి అభిమన్యుడి వీరాన్ని ప్రశంసించారు. అతడు అభినవ అర్జునుడుగా ద్రోణుడు పొగిడాడు. దీనితో పద్మవ్యూహం నిర్వీర్యమైనట్లు అందరూ భావించారు. అది చివరి నిరాశా దశ.

అభిమన్యు వధోపాయాన్ని చెప్పమని దుర్యోధనుడు ద్రోణుడిని అడిగాడు. అతడు నవ్వి ఈ విధంగా చెప్పాడు: 'కవచధారణమనే విద్యను నేను అర్జునుడికి ఇచ్చాను. అతడు అభిమన్యుడి కిచ్చాడు. అందువలన అతడిని నొప్పించటం శక్యంకాదు. అయితే, కపటోపాయంతో అతడి అల్లెత్రాడును త్రెంచాలి, విల్లును విరవాలి, ఆ తరువాత గుర్రాలను, సారథిని చంపి అతడిని వధించే యత్నం చేయాలి. అతడి చేత ధనువుంటే దేవతలు కూడా దరిచేరలేరు. నీ వట్లా అధర్మయుద్ధం చేయగలిగితే కార్యాన్ని సాధించగలము' అని దుర్యోధనుడిని ద్రోణుడు పురికొల్పాడు.

కర్ణుడు వంచనతో వెనుకనుండి అభిమన్యుడి విల్లును విరిచాడు. ద్రోణుడు గుర్రాలను చంపాడు. కృపుడు సారథిని చంపాడు. శకుని, కృతవర్మ, శల్య, బాహ్లిక, అశ్వత్థామాదులు అతడిపై బాణాలను గుప్పించారు. విరథుడైన అభిమన్యుడు కత్తీ, డాలూ తీసికొని గగనానికి ఎగిరి మండలాకారంలో తిరుగుతూ యోధులను వేధించాడు. ద్రోణుడు కత్తిని విరుగకొట్టాడు. కర్ణుడు పలకను పగులకొట్టాడు. శకుని, కృతవర్మాదులు చక్రాన్ని ముక్కలు చేశారు. ఆపైన గదను చేపట్టి అశ్వత్థామపై ఉరికాడు. అతడు పరుగెత్తాడు. గాంధారులు, వసాతీయులు, కేకయులు మొదలైనవారు దాడిచేశారు. వారిని అభిమన్యుడు వీరవ్రతంతో ధీరత్వంతో నొప్పించాడు. అంతలో దుశ్శాసనుడి కొడుకు అతడిపై దాడిచేశాడు. వారిద్దరూ క్రోధమూర్తులై రౌద్రరసం చిప్పిల్లగా ద్వంద్వయుద్ధంచేసి రణరంగంలో ఒకేసారి చనిపోయారు. 'శౌర్యసార సంపాదిత రౌద్రుండైన సౌభద్రుడు' పడిపోవటంతో పద్మవ్యూహం ఎంత గెలిచిందో, అంత ఓడింది. అధర్మయుద్ధంలో పెక్కురు కలిసి ఒక్కడిని చంపారని పంచభూతాలు అరచాయి. సాయంకాల మయింది. యుద్ధం ఆగింది. కౌరవులు ఉప్పొంగారు; పాండవులు శోకమూర్తు లయ్యారు.

కౌరవుల రౌద్రకర్మ ద్రోణుడి నాయకత్వంలో సాగింది. ఆ పాపకర్మలో ఆయన పాత్ర బలీయమైనది కూడా. దుర్యోధనుడి సైన్యాధ్యక్షుడిగా ఆయన ఒక అధర్మయుద్ధానికి నాందిపలికాడు. అది ధర్మరాజు మనస్సును బాధించింది. ఆచార్యుడి ప్రవర్తనమీదకంటె అభిమన్యుడికి సహాయం అందకుండా పాండవుల నడ్డగించిన సైంధవుడి మీద అర్జునుడు ఆగ్రహించాడు. పుత్రవియోగ దుఃఖంలోనుండి శత్రుసంహార రౌద్రం ఉద్భవించింది. శ్రీకృష్ణుడి దివ్యానుగ్రహంతో పరమేశ్వర వరప్రసాదంతో అర్జునుడు మరునాడు సూర్యాస్తమయంలోపల జయద్రథవధ చేస్తానని ప్రతిజ్ఞచేశాడు. అట్లా చేయలేకపోతే గాండీవంతోసహా అగ్నిలో ప్రవేశిస్తానని ప్రకటించాడు.

పార్థుడి ప్రతిజ్ఞ కౌరవపాండవుల కిద్దరికీ పెద్ద సమస్య అయింది. ఒకరికి సైంధవ ప్రాణరక్షణ. మరొకరికి పార్థ ప్రాణరక్షణ. ఈ రెండింటి నడుమ ధర్మరాజును పట్టితెచ్చే కార్యం తెరవెనుకకు పోయింది. అర్జునుడు ప్రతిజ్ఞానిర్వహణంలో విఫలుడైతే చనిపోతాడు కాబట్టి మర్నాడు అర్జునుడు లేని యుద్ధంలో ధర్మరాజును పట్టికొనటం సులభమని ద్రోణుడు భావించాడు. గర్భసంధిలో కథ భావికార్య విమర్శలో పడింది.

13. నాల్గవనాటి యుద్ధం: విమర్శ సంధి : శకటపద్మసూచీవ్యూహాలు :

చ. 'అనిమిష దైత్య కింపురుషు లాదిగ నెవ్వరు వచ్చి కాచినం
దునుముదు నెల్లి సైంధవునిఁ దోయజమిత్రుఁడు గ్రుంకకుండు ము
న్న నరవరేణ్య! యిత్తెఱఁగు నా కొనరింపఁగ రాక యున్న నే
ననలము సొచ్చువాఁడ నృపులందఱుఁ జూడఁగఁ గాండివంబుతోన్'. (ద్రోణ. 2. 281)

ద్రోణుడి నాల్గవనాటి యుద్ధానికి అర్జునుడి ప్రతిజ్ఞ కేంద్ర బిందువు. ఇది విమర్శ సంధికి కీలకం. గర్భసంధిలో ప్రకాశించిన బీజార్థాలను గురించి క్రోధవ్యసనాదులతో చేసే పర్యాలోచనం విమర్శసంధిలో ప్రకటితమౌతుంది. వాటి స్వరూప స్వభావాలు ఇట్లా ఉంటాయి.

1. గర్భసంధిలో పలువురు కూడి అన్యాయంగా అభిమన్యుడిని చంపారు. వారు చేసిన అన్యాయానికి వారు అన్యాయపు చావులు చచ్చే యోగ్యతలను సంపాదించుకొన్నారని ధార్మికులు భావించారు.

2. అభిమన్యుడి వ్యూహం ప్రకారం పాండవ సహాయం అతడికి అందకుండా అవరోధం కలిగించిన సైంధవుడు చేసిన నేరం క్షంతవ్యం కానిది. కాబట్టి అతడి చావుకు అర్జునుడు ముహూర్తంపెట్టటం, ఆ ప్రతిన సాధ్యమా? అని అనేకులు అనేక విధాలుగా కలతచెందటం. శ్రీకృష్ణానుగ్రహంవలన పార్థుడు పాశుపతాస్త్రాన్ని సమంత్రకంగా పొంది ఫలావాప్తికి మార్గం ఏర్పరచుకొనటం.

3. ద్రోణుడు నాల్గవనాటి యుద్ధంలో ధర్మరాజును పట్టటం కంటె, సైంధవుడిని రక్షించే యత్నానికే ప్రాధాన్యం ఏర్పడటం.

4. సైంధవుడు యుద్ధభూమినుండి వైదొలగటానికి పూనుకొనగా అతడిని వారించి, అతడి రక్షణకు ద్రోణుడూ పూచీ వహించటం. దానికై ద్విముఖవ్యూహాన్ని సిద్ధం చేయటం. ఒకటి - సైంధవుడిని అర్జునుడికి అందుబాటులో లేకుండ దూరంగా ఉన్న వ్యూహంలో సురక్షితుడిగా ఉంచటం. రెండు-అర్జునుడు అతడిని చేరకుండా అవరోధాల నెన్నో కల్పించి సూర్యాస్తమయం వరకు నిగ్రహించగలిగితే అతడు అగ్నిలో ప్రవేశిస్తాడు. కాబట్టి ధర్మజుడిని పట్టటం సులభమౌతుందని భావించటం.

5. ద్రోణుడు సైంధవ రక్షణకై వ్యూహత్రయ సంపుటిని సమీకరించాడు. సైంధవుడు, భూరిశ్రవుడు, కర్ణుడు, అశ్వత్థామ, వృషసేనుడు, కృపాచార్యుడు కలిసి ఉండాలి. వారి అధీనంలో ఉత్తమజాతివైన పదునాలుగువేల ఏనుగులు, అరువదివేల రథాలు, లక్ష గుర్రాలు, పది లక్షల పదాతులు ఉండాలి. వారి స్థావరం ప్రధానవ్యూహానికి వెనుకగా మూడు యోజనాల దూరంలో ఉండాలి అని ముందుగా నిర్దేశించటం.

ప్రధాన వ్యూహంగా శకటవ్యూహాన్ని పన్నాడు. దాని పొడుగు పన్నెండు గవ్యూతులు. వెడల్పు అయిదు గవ్యూతులు. దీనిలో పడమటి సగభాగంలో పద్మవ్యూహాన్ని గర్భవ్యూహంగా అమర్చాడు. ఆ మధ్యభాగంనుండి సేనాముఖం వరకు కలిపేవిధంగా ఉండేటట్లు సూచీవ్యూహాన్ని అమర్చాడు. సూచీముఖంలో కృతవర్మ నుంచాడు. అతడి వెనుక కాంభోజరాజును, అతడి వెనుక శతసహస్రయోధులను ముందుంచుకొని దుర్యోధనుడిని, సూచీమూలస్థానంలో జయద్రథుడిని నిలిపాడు. ఇది అద్భుతమైన వ్యూహమని దేవతలు కూడా మెచ్చుకొన్నారు. వ్యూహత్రయంలో సూచీవ్యూహం కీలకపాత్రను నిర్వహిస్తుందని తెలుస్తున్నది. దీనిని రక్షించుకొంటే అర్జునుడిని ప్రవేశించకుండా అడ్డగించవచ్చును. దీని ద్వారా సైంధవుడి రక్షణలో స్వీయబలాలను వలసిన చోట్లకు ప్రసారం చేసికొనవచ్చును.

దుర్మర్షణుడు ద్రోణుడు పన్నిన వ్యూహాలను కాదని తాను స్వంతంగా పదిహేనువందల విండ్లదూరంలో మరొక వ్యూహం పన్ని అర్జునుడిని హుటాహుటి ఎదిరించటానికి సిద్ధమయ్యాడు. దుశ్శాసన వికర్ణులు సైంధవ రక్షణార్థం నిజ బలాలతో ఆ సమీపంలో నిలిచి ఉన్నారు. ద్రోణుడు శకటవ్యూహముఖంలో ఉన్నాడు.

6. అర్జునుడు దీనికి దీటుగా మరొక మహావ్యూహాన్ని పన్నలేదు. దర్మజుడి రక్షణకు సాత్యకి నాయకత్వంలో ఒక దృఢవ్యవస్థను ఏర్పాటు చేయటం. కౌరవులకు సైంధవరక్షణ మెంత ముఖ్యమో పాండవులకు ధర్మజ రక్షణమంత ముఖ్యమని చెప్పి, దానిపై ప్రత్యేక శ్రద్ధవహించటం. తన వెంట కొందరు వీరులు కలిసి రాగా ఒంటరిగా కౌరవవ్యూహాన్ని భేదించి గడువులోపల సైంధవవధ చేసే దృఢయత్నం చేయటం. అతడికి తోడుగా ధృష్టద్యుమ్నుడు, నకులుని సుతుడు శతానీకుడు ముందుకుసాగుతూ ఆయా సమయాలకు అనుగుణమైన మొగ్గరాన్ని కల్పించటం.

7. అర్జునుడు కౌరవవ్యూహాన్ని అంచెలంచెలుగా ధ్వంసం చేసిన విధం అపూర్వం. ఆ క్రమాన్ని పరిశీలిస్తే శత్రువ్యూహరహస్య విచారం ఆయన కెంత గాఢంగా ఉన్నదో స్పష్టమౌతుంది. రేఖామాత్రంగా గమనించటం ప్రస్తుత కర్తవ్యం.

8. ద్రోణవ్యూహానికి ముందే దుర్మర్షణుడి వ్యూహం ఉండటంచేత, బాహుగర్వంతో అతడు అర్జునుడిపై దూసుకొని వచ్చాడు. అర్జునుడు నవ్వుతూ 'వీడే ఈనాటి తొలిముద్ద' అని నవ్వుతూ అతడిని చంపాడు. దుర్మర్షణుడి సహాయకులందరూ ఒక్కుమ్మడి పార్థుడిని క్రమ్ముకొని దొమ్మియుద్ధం చేశారు. వారిని పార్థుడు నుగ్గు నుగ్గు చేసి సేనలను తరిమికొట్టాడు. దీనితో ద్రోణవ్యూహానికి కంచెగా నిలిచిన దుర్మర్షణుడి బలగం నశించి, దారి ఏర్పడింది.

9. దుర్మర్షణుడి వెనుకభాగంలో వ్యూహంలో భాగం కాకపోయినా అనుబంధ వ్యూహంగా నిలిచి ఉన్నారు దుశ్శాసన వికర్ణులు. దుశ్శాసనుడు బహుళగజ సైన్యంతో అర్జునుడిని ఎదుర్కొన్నాడు. అతడి బలాన్ని అణచి అతడు ద్రోణుడి మొగంచూస్తూ వెనుదిరిగి పరుగెత్తాడు. దానితో ద్రోణవ్యూహానికి ఉన్న రెండవ కంచె కూలింది. సైంధవుడివైపు పురోగమించాలని అర్జునుడు యత్నించాడు.

10. శకటవ్యూహముఖంలో ఉన్న ద్రోణాచార్యుడి నతిక్రమించాలని అర్జునుడు ఆయన అనుమతి కోరాడు. 'నన్ను గెలవకుండా సైంధవుడిని ఎట్లా సమీపించగలవు?' అని శస్త్రాస్త్రాలను ప్రయోగించి శ్రీకృష్ణార్జునులను బడలేటట్లు చేశాడు ద్రోణుడు. అర్జునుడు ఆచార్యుడి చాపాన్ని విరుగగొట్టాడు. అల్లెత్రాడును తెంపాడు. శ్రీకృష్ణుడి సూచనమేరకు వెంట వెంటనే విజృంభించి ద్రోణుడికి ప్రదక్షిణం చేసి దాటి శకటవ్యూహంలో ప్రవేశించాడు. 'శత్రువును గెలవకుండా ఇట్లా పోవటం ఎక్కడైనా ఉన్నదా?' అంటూ నవ్వుతూ ద్రోణుడు అర్జునుడిని వెంటాడాడు. 'యుద్ధంలో పోరే నిన్ను పరమేశ్వరుడు కూడా ఎదురొడ్డలేడు' అంటూ వినయంతో కీర్తించి మొగ్గరంలోనికి ప్రవేశించాడు. అతడివెంట పాంచాలకుమారులు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు వ్యూహంలోకి చొచ్చుకొనిపోయారు. శకటవ్యూహం శిథిలంకావటం మొదలయింది. ఆచార్యుడి కన్నులముందే, ఆయన అర్జునుడిని వెంటాడిపోరినంత పోరి, వ్యూహముఖాన్ని రక్షించుకొనటానికి తిరిగి వెళ్ళాడు. అంటే శకటవ్యూహంమీద అర్జునుడు పట్టుసాధించా డన్నమాట.

11. మధ్యభాగంలో సూచీవ్యూహం ఉన్నది. దాని అగ్రభాగంలో కృతవర్మ ఉన్నాడు. అతడు వక్రమార్గంలో అర్జునుడిని వెనుకనుండి ఎదుర్కొన్నాడు. శ్రీకృష్ణుడి సలహా మేరకు పార్థుడు కృతవర్మను మూర్ఛలో ముంచి ముందుకు సాగాడు. కృతవర్మ మూర్ఛనుండి తేరుకొని నరుడిమీద, అతడి అనుచరులమీద బాణాలు కురిపించాడు. అర్జునుడు అతడి విల్లును విరిచాడు. అతడికీ, కృతవర్మకూ తోడుగా సూచీముఖంలో ఉన్న శ్రుతాయుధుడు పోరు సాగించాడు. వరుణ తనయుడైన ఆతడి బాణప్రయోగం వికటించి ఆతడినే చంపింది. అంతకు పూర్వమే అర్జునుడు అతడి చేతులు నరికాడు.

12. సూచీముఖంలో కృతవర్మకు సాయంగా నిలిచిన మరొక వీరుడు కాంభోజరాజు. అతడు అర్జునుడితో పోరి ఆతడి చేతులలో చనిపోయాడు. ఆ తరువాత దూసుకొని వచ్చిన నియుతాయువు, దీర్ఘాయువు అనేవారిని తేలికగా పార్థుడు చంపాడు. మొత్తంమీద అర్జునుడు ద్రోణుడిని దాటి వచ్చాడు. కృతవర్మను బాధించాడు, శ్రుతాయుధుడిని కూల్చాడు, కాంభోజపతిని చంపాడు, శ్రుతాయువు మొదలైన వారిని హతమార్చాడు. సూచీవ్యూహ ప్రవేశానికి మార్గం ఏర్పరచుకొన్నాడు.

13. సూచీవ్యూహ గర్భంలో నూరువేల యోధులను చుట్టూ ఉంచుకొని దుర్యోధనుడు ఉన్నాడు. తరువాతి దాడి అతడిమీద జరుగబోతుంది. అంతవరకు అర్జునుడిని రానిచ్చిన ద్రోణాచార్యుడిమీద దుర్యోధనుడికి కోపం వచ్చింది. అతడిని పాండవ పక్షపాతి అని నిందించాడు. అతడిని నమ్మి మరొకచోటికి పారిపోకుండా సైంధవుడు రణరంగంలో నిలిచినందుకు ఫలం అతడి మృత్యువా? అని ప్రశ్నించాడు. ద్రోణుడు 'తేనె పూసిన కత్తి' అని దూషించాడు. అయినా, అది సమయం కాదని శాంతించి పార్థుడి రాకవలన రాజలోకం వెలవెలపోతున్నదనీ, సైంధవరక్షణకు ఉపాయం చెప్పుమనీ వేడాడు. ద్రోణుడు శ్రీకృష్ణపాండవుల మహిమను చెప్పి, తాను వ్యూహముఖంనుండి వెనుకకు రాగూడదని తెలిపి, వృద్ధుడైన ద్రోణుడు అర్జునుడి వేగాన్ని అనుకరించలేడని పేర్కొని, సమ

వయస్కుడైన దుర్యోధనుడిని నరుడిమీద యుద్ధం చేయటానికి పురికొల్పాడు. రక్షాకవచాన్ని ఒకదానిని ప్రసాదించాడు. దానిని పొందిన దుర్యోధనుడు అర్జునుడిని అడ్డగించాడు. దానితో సైంధవరక్షకులలో ముఖ్యుడైన దుర్యోధనుడే నరుడితో యుద్ధానికి దిగవలసి వచ్చింది. అర్జునుడు సూచీవ్యూహాన్ని నిపుణంగా విచ్చి అందులో ప్రవేశించి ముందుకు సాగాడు.

14. అర్జునుడి వెంట వస్తున్న ధృష్టద్యుమ్నుడితో ద్రోణుడు తలపడ్డాడు. యుద్ధంలో అతడిని చంపబోయాడు. కాని, సాత్యకి అడ్డుపడి మిత్రుడిని రక్షించాడు. ద్రోణుడు అతడిపై పోరు సాగించాడు. ధర్మజభీమనకులసహదేవులు సాత్యకికి తోడువచ్చారు. అంటే ద్రోణుడి దృష్టిని సైంధవుడినుండి పాండవులు మళ్ళించారు. ఆ అదనుచూచి అర్జునుడు రథాన్ని సైంధవుడిమీద లంఘించుమని శ్రీకృష్ణుడిని కోరాడు.

15. రథం ముందుకు సాగింది. అర్జునుడి వాడి బాణాలతో విరథుడు, వికలహస్తుడు అయిన దుర్యోధనుడు అవివేకంగా ఈ కవచం నిష్ఫలమని భావించి తనకు తానే ఆ కవచాన్ని తీసివేసి, వేరొక కవచాన్ని ధరించాడు. ఆ విధంగా ద్రోణుడు, దుర్యోధనుడికి చేసిన కవచప్రదానంవలన కలిగిన అడ్డంకి అర్జునుడికి తొలగిపోయింది.

16. ధర్మరాజు ద్రోణుడిని ఎదుర్కొని విరథుడై చేతులెత్తి నిలిచాడు. ద్రోణుడు అతడిపై బాణాలు వేయక చుట్టూ ఉన్న సేనను చెండాడాడు. ఆ విధంగా ధర్మరాజును పట్టుకొనటానికి అందివచ్చిన మంచి అవకాశాన్ని వదలుకొన్నాడు. దానికి యుద్ధనియమంతో పాటు ధర్మరాజుకు ఇచ్చిన వరంకూడా కారణం కావటం విశేషం.

17. కర్ణ దుర్యోధనులు అర్జునుడి ధాటికి నిలిచి సైంధవ రక్షణం చేయలేకపోతుండగా అశ్వత్థామ, శల్య, వృషసేనులు సైంధవుడికి పెట్టనికోటగా నిలిచారు. అర్జునుడు, సాత్యకి, భీముడూ కలిసి వారిని బలంగా ఎదిరించి వ్యూహాన్ని బలహీనం చేశారు. దుర్యోధనుడు ద్రోణుడిని నిందించాడు.

18. ద్రోణుడు నొచ్చుకొన్నాడు. కోపంతో దుర్యోధనుడికే సైంధవుడిని రక్షించుకొనే బాధ్యత వదలిపెట్టాడు. వ్యూహముఖంలో ఉండి పాండవసైన్యం లోనికి రాకుండా చూచాడు. దానితో సైంధవరక్షణ కౌరవులకు భారమై పోయింది. కథ అడ్డంతిరిగింది. కర్ణుడు, అశ్వత్థామ, శల్యుడు, వృషసేనుడు - మొదలైనవారు సైంధవ రక్షణలో దడికట్టి నిలిచి పోరు ఘోరంగా సాగించారు. కౌరవవీరులు ఎట్లాగైనా కాలయాపనం చేసి సూర్యాస్తమయమయ్యేంతవరకు యుద్ధం సాగించాలని ప్రయత్నం చేశారు. శ్రీకృష్ణుడు వారి వ్యూహాన్ని గమనించి ఉపాయాంతరాన్ని ఆలోచించాడు. మాయా తిమిరాన్ని కల్పించాడు. సూర్యు డస్తమించాడన్న భ్రాంతిని అందరికీ కలిగించటంతో ఆ దృశ్యాన్ని ఆశ్చర్యంతో తలెత్తి చూస్తున్న సైంధవుడి తలను అర్జునుడు బాణంతో నరికాడు. పాశుపతాస్త్రంతో ఆ తల క్రిందబడకుండా వృద్ధక్షత్రుడి ఒడిలో పడేటట్లు చేశాడు.

19. ద్రోణుడు నాలుగవరోజు కల్పించిన వ్యూహం సంశ్లిష్టమయింది. సంక్లిష్టమయింది. అయినా అర్జునుడు అందులోని ఆయువుపట్టును గ్రహించి సూచీవ్యూహాన్ని భేదిస్తే మిగిలిన వ్యూహాలు తమంతటతాము విచ్ఛిన్నమై పోతాయన్న ప్రతివ్యూహాన్ని పాటించాడు. కార్యాన్ని సాధించాడు.

20. ద్రోణుడు శకటవ్యూహం ముఖాన నిలబడి ఉన్నాడు. అర్జునుడు తనను తప్పించుకొని వ్యూహంలోకి ప్రవేశించగా అతడిని వెన్నంటాడు. కాని, అతడిని నిలువరించలేకపోయాడు. దానికి కారణం అతడికి శక్తిలేక కాదనీ, అర్జునుడి మీద మమకారమనీ దుర్యోధనుడు దూషించాడు. అర్జునుడు కౌరవవ్యూహాన్ని ధ్వంసం చేస్తుండగా ద్రోణుడు ధర్మరాజును పట్టాలని ప్రయత్నం చేశాడు. అతడు విరథుడై నేలమీద నిలిచి చేతులెత్తి ఉన్నప్పుడు పట్టుకొనవచ్చును కాని, యుద్ధనీతిని అనుసరించి ఆచార్యు డాపని చేయలేదు. దుర్యోధనుడు దానికీ కోపగించాడు. ఎంతటి వ్యూహం కౌరవులకొరకు పన్నినా ద్రోణుడి అంతర్వ్యూహం మరొకటున్నదని దుర్యోధనుడికి తెలిసింది. ఆచార్యుడిని అనుమానించే దుష్టచతుష్టయాన్ని సంబాళించుకొంటూ ఆడినమాట తప్పకుండా ఇటు దుర్యోధనుడినీ, అటు ధర్మరాజునూ మెప్పించే క్లిష్టపాత్ర ద్రోణుడు. ధర్మం కొరకు నిందలు పడినా చలించని దృఢవ్రతుడు.

ఎంతటి క్లిష్టవ్యూహం పన్నినా శ్రీకృష్ణుడి మహిమముందు, అర్జునుడి పరాక్రమం ముందు అది నిలవటం కష్టమనీ, కౌరవులకు విజయం అసాధ్యమనీ భావించి మనకు అనేకాంశాలలో బీజార్థాలను గురించిన విమర్శలను మిగిలించి, పాండవులకు విజయం కలిగే ప్రాప్త్యాశను కలిగించిన యోధుడు ద్రోణుడు. అయిదవనాటి యుద్ధంలో ప్రాణత్యాగం చేసి పాండవ విజయమార్గాన్ని సుకరం చేసిన పుణ్యశ్లోకుడు ద్రోణుడు.

14. అయిదవనాటి యుద్ధం: నిర్వహణ సంధి: ద్వంద్వ యుద్ధాలు :

1. ద్రోణపర్వ నిర్వహణం అద్భుతంగా సాగింది. పాండవులమీద పగబట్టిన రాజరాజు అర్జునుడి పరాక్రమాన్ని లోలోన ప్రశంసించినా బయటపడడు. ద్రోణుడు అర్జునుడిమీది అభిమానంతో అతడిని చంపడని తేలింది. అతడు చావకపోతే ధర్మజుడిని పట్టడని స్పష్టమయింది. అందువలన యుద్ధభారాన్ని ద్రోణుడు కర్ణుడికి ఇస్తే అతడు పౌరుషంతో యుద్ధం చేస్తాడని రారాజు ప్రతిపాదించాడు. ద్రోణుడు ఆ మాటలకు కలతపడ్డాడు. శ్రీకృష్ణార్జునుల ప్రతాపాన్నీ, కౌరవులు చేసిన పాపాలనూ, పాండవుల ధర్మనీతినీ ప్రశంసించాడు. అయితే, సర్వసైన్యాధ్యక్షుడు యుద్ధలక్ష్యాన్ని సాధించలేనందుకు తన బలహీనతను అంగీకరిస్తూ తాను బ్రతికి ఉండగా మరొకరికి ఆ బాధ్యతను ధారాదత్తం చేయటం వీరధర్మం కాదన్నాడు. అట్లని లక్ష్యాన్ని వీడటం న్యాయం కాదనుకొన్నాడు. పౌరుషంతో ద్రోణుడు పాంచాలురను చంపకుండా కవచం విడువనని ప్రతిజ్ఞచేశాడు. మొదటినాడు పాంచాలురు చూస్తూ ఉండగా ధర్మరాజును పట్టుకొంటానన్నవాడు. అయిదవనాడు పల్లవి మార్చాడు. లక్ష్యం మారింది. అది ఆ నాడే తీరుతుందని కవచం మీది శపథం సూచించింది. ఇది కౌరవపక్షంలో ఒక వైఫల్యం.

2. ఆ వైఫల్యాన్ని దుర్యోధనుడు సహించలేక, ద్రోణుడిని నమ్మలేక కర్ణుడి వద్దకు వెళ్ళి, ఆచార్యుడు అభేద్యమైన వ్యూహం పన్నికూడా అర్జునుడిని అందులోకి చొరనిచ్చి పక్షపాతవైఖరి ప్రదర్శించాడని నేరం మోపి, కయ్యపు పగ్గాలు పట్టుమని కోరాడు. కర్ణుడు అతడిని వారించి ద్రోణుడు యథాశక్తి పోరాడుతున్నాడనీ, అర్జున పరాక్రమం అమోఘ మనీ, వాస్తవాన్ని నచ్చచెప్పాడు. అయిదవనాడు ఈ ఉదయ సన్నివేశం భవిష్యత్కథా సూచకంగా ఉండటం విశేషం. కర్ణుడు పోరినా అర్జునుడిని సంహరించటం సాధ్యం కాదని సూచన.

3. అయిదవనాడు ద్రోణుడు ఏ వ్యూహమూ పన్నలేదు. పన్ని ప్రయోజనమూ లేదని తెలిసికొన్నాడు. అందువలన ప్రధానంగా ద్వంద్వయుద్ధాలే జరిగాయి.

4. పాండవవీరులు ద్వంద్వయుద్ధాలలో కౌరవవీరులను కొందరిని సంహరించారు. భీమసేనుడు దుర్మదదుష్కర్ణులను, బాహ్లికుడిని, సాత్యకి సోమదత్తుడిని, ఘటోత్కచుడు అలంబుసుడిని, అలాయుధుడిని వధించారు.

5. అట్లాగే కౌరవవీరులు పాండవపక్షంలోని వీరులను కూడా చంపారు. అశ్వత్థామ అంజనపర్వుడిని, కర్ణుడు ఘటోత్కచుడిని, ద్రోణుడు విరాట ద్రుపదులను హతమార్చారు.

6. ద్వంద్వయుద్ధాలన్నింటిలో ద్రోణార్జునుల యుద్ధం పరాకాష్ఠ. అక్కడ ఫలాగమాన్ని గురించి తీవ్రమైన ఆలోచన జరిగింది. అది అర్జునుడుగాని, ధర్మరాజుగాని చేసింది కాదు. అది మానవీయంకూడా కాదు. శ్రీకృష్ణుడు దివ్యశక్తిచేత కల్పించింది. అది ఒక క్రమంగా సాగి పర్వం ముగియటం విశేషం.

7. ద్రోణుడు తన వ్యూహాలన్నీ భగ్నం కావటంతో నిరాశచెందాడు. దుర్యోధనుడి అధిక్షేపాలతో మనసులో కలతచెందాడు. కర్ణుడు తనకంటె సమర్థుడనే మాట వినేసరికి మండిపడ్డాడు. పరువు దక్కించుకొనటానికి పాంచాలురను సంహరిస్తానని శపథం చేశాడు. ద్రుపదుడూ, ధృష్టద్యుమ్నుడూ పాంచాలురలో ముఖ్యులు. వారిని చంపకుండా ఆయన కవచం విడువనన్నాడు. ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిచేత చావడు. ద్రోణుడు పగబట్టిన ద్రుపదుడు మరణించాడు. కథ ముగియదు. దానికి ఉపాయంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కృష్ణుడు మహర్షులచేత ద్రోణుడికి యుద్ధ విముఖత గురించి ప్రబోధింపజేశాడు. 'భారద్వాజా! నీవు బ్రాహ్మణుఁడవు; వేదవేదాంగ విదుఁడవు; నీకు సంగ్రామంబు సేయ ధర్మంబగునే? యింతకు మున్ను చేసితేనియుఁ జేసితిగాని కాలంబు పూర్ణంబయ్యెఁ గాన నింక సమరంబు నుడుగుట మేలు మా మాటలు వట్టి, యాయుధంబులు వెట్టి శాంతిం బొందుము' - అన్నది వారి ప్రబోధం. ఇది దివ్యోపాయం.

8. దీనికంటె ముందే శ్రీకృష్ణుడు మానుషోపాయం ప్రారంభించాడు. ద్రుపదవధ జరిగిన తరువాత ద్రోణుడు ధృష్టద్యుమ్నుడిని వదలడు. అతడిని చంపగలిగిన శక్తికూడా అతడి కున్నది. ఆయుధం చేతిలో ఉండగా ఆచార్యుడిని ఎవరూ చంపలేరు. కాబట్టి ద్రోణవధోపాయం అవశ్యకర్తవ్యం. అశ్వత్థామ హతుడయ్యాడన్న దుర్వార్తకంటె ద్రోణుడిని యుద్ధవిముఖుడిగా చేసే ఉపాయం మరొకటిలేదు. అందువలన కృష్ణుడు అర్జునుడు వినేటట్లుగా ధర్మజ భీమాదులకు వినవచ్చేటట్లుగా ఆ ఉపాయాన్ని చెప్పాడు. ఆ పని చేయకపోతే సాయంకాలంలోపల పాండవసైన్యాన్ని ద్రోణుడు మట్టుపెట్టటం తథ్యమన్నాడు. భీముడు ఆ ఉపాయాన్ని అశ్వత్థామ అనే గజం మిషగా ప్రవర్తిల్లజేశాడు. ద్రోణుడికి దుఃఖం కలిగింది. కాని, ఆ మాటను నమ్మలేకపోయాడు. అంతలో మహర్షులు బోధించారు. ఎదురుగా ధృష్టద్యుమ్నుడు కనపడ్డాడు. కటకట పడ్డాడు. వికలచిత్తు డయ్యాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజుచేత భీముడివలె 'అశ్వత్థామాః హతః కుంజరః' అని చెప్పించటానికి యుద్ధనీతిని ప్రయోగించి అంగీకరింప జేశాడు. 'కుంజరః' అనే పదం వినపడకుండా భేరీభాంకారాలు మ్రోయించాడు. ఉపాయం ఫలించింది. ద్రోణుడు ఆయుధ పరిత్యాగంచేసి, రథంమీద యోగదీక్షలో నిలిచి, శరీరంనుండి ప్రాణాలను వెడలించి, మహాసిద్ధుడు పొందే విదేహప్రాప్తిని పొందాడు. ఆ తరువాత ధృష్టద్యుమ్నుడికి యోగ్యత వచ్చింది. ద్రోణుడిని చంపటానికి పుట్టినవాడే ఆయుధ విసర్జనానంతరం ఆతడిని చంపగలడు కాబట్టి ద్రోణవధ ముగిసింది.

9. కథ ఇంతటితో ముగియదు. ద్రోణుడి మరణవార్త తెలిసికొని అశ్వత్థామ పాండవ సైన్యంమీద విరుచుకొనిపడ్డాడు. మహాస్త్రాలను ప్రయోగించాడు. పాండవవీరులలో కొందరు ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని వధించిన తీరుకు గర్హించారు. సాత్యకి వంటి యాదవవీరులే కాక అర్జునుడివంటి పాండవవీరులూ అందులో ఉన్నారు. చివరకు ద్రోణవధను సమర్థించుకొనే అవస్థ ధర్మరాజుకే కలిగింది. ఆ తరువాత కాని పాండవపక్షం అశ్వత్థామను కలిసికట్టుగా ఎదిరించలేకుండాపోయింది. అశ్వత్థామ ప్రయోగించిన నారాయణాస్త్రాన్ని తప్పించుకొనటానికి అందరూ భూమిమీద దిగి నమస్కరించారు. అశ్వత్థామ ప్రయుక్త ఆగ్నేయాది మహాస్త్ర సంపద విఫలమైపోయింది. ద్రోణాశ్వత్థామల వైఫల్యాలు దైవవ్యూహఫలాలు కాని మానవ వ్యూహఫలాలు కావని తెలిసింది.

10. ద్రోణ పర్వాంతంలో వ్యాసుడు అశ్వత్థామకు శ్రీకృష్ణార్జునుల మహిమను చెప్పటం, అర్జునుడికి పరమేశ్వర మహిమను చెప్పటం ఒక తాత్త్వికమైన ముగింపు నందించాయి. తిక్కనగారి హరిహరాభేదతత్త్వం వస్తుధ్వని నాశ్రయించి ప్రతీయమానమయింది.

15. ద్రోణపర్వంలో శ్రీకృష్ణుడు నాయకుడా?

ద్రోణపర్వ కథనంతా పరిశీలిస్తే అది సహజంగా సాగిందా? లేక శ్రీకృష్ణుడు వెనుకనుండి నడిపించాడా? అనే అనుమానం సామాన్యంగా కలుగుతుంది. శ్రీకృష్ణుడు సాక్షాత్ నారాయణాంశ సంభూతుడు కాబట్టి చక్రం పట్టకపోయినా యుద్ధచక్రం త్రిప్పగలడు. శిష్టరక్షణ కొరకు దుష్టశిక్షణ చేయగలడు. ఈ పర్వంలో మొదటినాడు పార్థుడి పరాక్రమమే ధర్మజుడిని రక్షించింది. రెండవనాడు సంశప్తకులతో యుద్ధం, భగదత్తుడితో యుద్ధం చేయవలసి వచ్చినప్పుడు పార్థుడికి శ్రీకృష్ణుడి సహకారం కావలసి వచ్చింది. మూడవనాడు అభిమన్యుడి మరణానంతరం పార్థుడి పుత్రశోకాన్ని మాన్పటానికీ, సైంధవవధవంటి దుష్కరకార్యాన్ని సాధించటానికీ అర్జునుడిలోని రౌద్రశక్తిని మేల్కొల్పి, పాశుపతాస్త్ర మంత్రఫలసిద్ధిని కల్పించి కౌరవవ్యూహ విధ్వంసనానికీ మార్గదర్శి అయిన దైవశక్తి శ్రీకృష్ణుడు. శివ కేశవులకు గల అభేదతత్త్వాన్ని స్వప్నంలో ఆవిష్కరించి యుద్ధంలో దర్శింపజేసిన మహాదేవుడు శ్రీకృష్ణుడు. ద్రోణుడు పన్నిన సంశ్లిష్టవ్యూహంలో శకటవ్యూహాన్ని భేదించి సూచీవ్యూహాన్ని ఆశ్రయించి దాని చివర సురక్షిత ప్రాంతంలో ఉన్న సైంధవుడిని చంపే మార్గం సుగమం చేయటంలో, దుర్యోధనాదులను ఓడించటంలో, మాయా తిమిరాన్ని కల్పించి సైంధవుడిని పైకి రప్పించటంలో, అతడి తలను పార్థుడిచేత ఖండింపజేయటంలో, అది నేలమీదపడకుండా వృద్ధక్షత్రుడి ఒడిలో పడేటట్టు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేయటంలోనూ శ్రీకృష్ణుడి దివ్యసంకల్పమే విజయకారణం. అభిమన్యుడి మరణం పాశుపతాస్త్ర మంత్రసిద్ధికి మూలమయింది. ఆ మహాస్త్రసిద్ధి సైంధవుడితల నేలమీద పడకుండా, పార్థుడి శిరస్సు వ్రక్కలు కాకుండా రక్షించింది. సైంధవ వధానంతరం పాండవపక్షంలోనే కాక కౌరవపక్షంలోకూడా వీరులందరు శ్రీకృష్ణార్జునుల మహిమను ప్రశంసించారు. సాత్యకి భీమసేన ధర్మరాజాదులను అదనెరిగి రక్షించే సూక్ష్మేక్షిక శ్రీకృష్ణుడిదే.

ఈ సన్నివేశాలన్నీ శ్రీకృష్ణుడి దివ్యత్వాన్ని తెలుపుతున్నాయి. దీనితోపాటు కురుక్షేత్రయుద్ధంలో పార్థుడి విజయానికి కలిగే అడ్డంకులను క్రమంగా తొలగించటం ఆయన దివ్యవ్యూహాన్ని తెలుపుతాయి. పంచమాశ్వాసంలో ఇంద్రదత్తమైన శక్తిచేత ఘటోత్కచుడు మరణించినందుకు శ్రీకృష్ణుడు మనశ్శాంతిని పొందుతాడు. దానికి కారణం శక్తివలన అర్జునుడికి సంభవించే మరణం తప్పింది కాబట్టి. ఆ శక్తిని అర్జునుడిమీద ప్రయోగించకుండా కర్ణుడికి ప్రతిరోజూ మరపును కలిగించే శక్తికూడా ఆయన వ్యూహమే. ఇది మాయాతిమిర వ్యూహంకంటె మహాశక్తిమంతమైనది. దీనికంటె మించింది ద్రోణవధ వ్యూహం. సమయానికి దానిని సూచించిందీ, సమయోచితంగా నిర్వహింపజేసిందీ, ఆ శ్రీకృష్ణుడే. ఆ తరువాత అశ్వత్థామ దివ్యాస్త్ర ప్రయోగాన్ని నిర్వీర్యం చేసిందీ శ్రీకృష్ణుడి వ్యూహపాండిత్యమే. ఆనాడు అశ్వత్థామను ఆపకపోయినట్లయితే ద్రోణుడి తరువాత ఆతడే సేనా నాయకుడయ్యేవాడేమో! చావులేని అతడిని చంపటం పాండవపక్షానికి సాధ్యమయ్యేది కాదేమో! 'శక్తి'ని కోల్పోయిన కర్ణుడే తరువాతి వరుసలో రావాలని శ్రీకృష్ణుడి దివ్యసంకల్పమని స్పష్టమౌతున్నది.

ఇంతటి కథ నడిపిన శ్రీకృష్ణుడు కథానాయకుడా? అన్నది హిమాలయమంత ప్రశ్న. ఆయన కథా సూత్రధారుడే కాని కథానాయకుడు కాడు. నాయక సహాయకుడే కాని నాయకుడు కాడు. కథలో దీనికి సాక్ష్యాలు కోకొల్లలు. ధర్మరాజు విజయార్థియై ద్రోణుడి ఆశీర్వాదం కోరగా 'నీ మంత్రి శ్రీకృష్ణుడుండగా నన్నెందుకు అడుగుతా?'వని అన్నాడు. దుర్యోధనుడు ధర్మరాజును ప్రాణాలతో పట్టి తెమ్మన్నాడే కాని శ్రీకృష్ణుడిని కాదు. అట్లా అడగటానికి కారణం శ్రీకృష్ణుడి మాహాత్మ్యం తెలియక కాదు .కౌరవులు పాండవుల నందరినీ చంపినా శ్రీకృష్ణుడు చక్రంతో కౌరవులను మట్టుపెట్టి కుంతికి పట్టాభిషేకం చేస్తాడని గుర్తించి, మాయాద్యూతంలో ధర్మజుడిని ఓడిస్తే శ్రీకృష్ణార్జునుల శక్తులు నిష్ఫలాలై పోతాయని భావించాడు. కాబట్టి నాయకుడు ధర్మరాజే. శ్రీకృష్ణార్జునులు పరమేశ్వరుడిని దర్శించి వచ్చినా, సైంధవుడిని చంపినా, శత్రువులను సంహరించినా శిబిరానికి తిరిగివచ్చి ధర్మజుడికి నివేదించుకొనేవారు. ఆయన ఆజ్ఞలమేరకు మసలుకొనేవారు. ఆయనకే విపత్తువస్తే తాము అతడిరక్షణ కొరకు అన్ని జాగ్రత్తలూ తీసికొనేవారు. ధర్మరాజుకు భీముడు మానుష శక్తి, అర్జునుడు దైవీశక్తి, శ్రీకృష్ణుడు జ్ఞానశక్తి. ఈ మూడు శక్తులు ధర్మశక్తికి ఉపాంగాలే.

మరొక విశేషం, భాగవతం వంటి మహాపురాణాలలో విష్ణువుగాని, అవతారపురుషులు గాని నాయకులై భక్తులను రక్షించే దివ్యలీలలను ప్రదర్శిస్తారు. ఆ పురాణంలో శ్రీకృష్ణుడు దివ్యుడు. కాని, భారతం కావ్యేతిహాసం. ఇందులో కృష్ణుడు దివ్యాదివ్యుడు. పాండవులతో కలిసిమెలసి తిరుగుతూ వారిని విపత్తులనుండి తరింపజేస్తూ ఉంటాడు. స్కంధావారంలో దర్భాసనం మీద శ్రీకృష్ణుడి శరీరం మీద ఉంచిన పూజాద్రవ్యాలు కైలాసంలో శివుడి మేనిమీద గోచరించటం అద్భుతలీలయే. అంతటి లీల అర్జునుడికి అంగమౌతుంది. వారిద్దరి ప్రతాపం ధర్మరాజుకు ఉపాంగమౌతుంది.

మచ్చుకు ధర్మజ శ్రీకృష్ణుల ఈ సంభాషణ గ్రహించవచ్చును.

ధర్మరాజు:

ఉ. 'పంకజనాభ! మా పడినపాటులు రాజ్యము గోలుపోకయుం
గింకకు మూలమై కడఁగి గెల్పు కిరీటికి నీఁ దలంచి యీ
వంకకు వ్రాలి భక్తజనవత్సలతన్ రథచోదకుండ వై
తిం కిట మమ్ముఁ గావు మని యేటికిఁ జెప్పఁగ మాటిమాటికిన్'.

వ. ‘ అర్జును ప్రతిన చిత్తంబున నిలుపుము; దుఃఖామర్షమహార్ణవ మగ్నులమైన మమ్ముం దీరంబు సేరుపం దేవవు నీవ కావె?’ **(ద్రోణ. 3.13, 14)**

శ్రీకృష్ణుడు:

మ. ‘ విను నేఁ డర్జునుఁ డన్యసైన్యముల నుర్విం గూల్చుచుం బ్రేత భూ
త నికాయంబులు మాంసభక్షణము రక్తస్వైర పానంబుఁ జే
సి నలిం గ్రాలఁగఁ గ్రీడ సల్పు; నిను మెచ్చించుం దుదిన్ సైంధవుం
డనువానిం దెగటార్చి పేర్చు రిపు ధైర్యక్షేపణాటోపతన్.’

వ. క్రోధ శోకజ్వర విముక్తుండవై శాంతిం బొందుము’. **(ద్రోణ. 3. 15, 16)**

సైంధవవధ చేసింది అర్జునుడైనా, చేయించింది శ్రీకృష్ణుడైనా దానివలన కలిగే ఫలం క్రోధ శోకజ్వర విముక్తి. దానిని పొందేది మాత్రం నాయకుడైన ధర్మరాజు. సచివాయత్త సిద్ధి అయిన నాయకుడి స్వభావం కూడా అదే.

16. ద్రోణపర్వంలో ఎనిమిది రకాల రౌద్రం:

పాత్రల స్వభావాన్నిబట్టి, అభినయాన్నిబట్టి రౌద్రాన్ని మూడు రకాలుగా విభజించటం భరతుడి కాలం నుండి సంప్రదాయంగా వస్తూనే ఉన్నది. అయితే కథలో కార్యసాధనోపాయాలనుబట్టి కూడా రౌద్రవివేచనం చేయటానికి వీలున్నది. ఆ దృష్టితో ఈ పర్వంలో ప్రవర్తిల్లిన రౌద్రం ఎనిమిది విధాలు: అవి -

1. అర్థసాధన కొరకు కపటోపాయాన్ని ఆశ్రయించి శత్రువును జయించే క్రోధాన్ని ప్రకటించటం. ఈ క్రోధం ఈ పర్వంలోని అన్నిరకాల రౌద్రాలకు మూలం. దుర్యోధనుడు ధర్మరాజును పట్టుకొని, వంచనతో జూదమాడి అరణ్యాజ్ఞాతవాసాలకు శాశ్వతంగా పంపే యత్నం, అసాధ్యుడైన అభిమన్యుడిని వంచనతో సంహరించే వ్యూహం పన్ని నిర్దాక్షిణ్యంగా అతడిని వధించే యత్నం, మాయాతిమిరాన్ని సృష్టించి సైంధవవధకు పాల్పడటం, ‘అశ్వత్థామా హతః కుంజరః’, అన్న వాక్యంతో ద్రోణుడిని అస్త్రసన్న్యాసం చేసేటట్లు చేసి అతడి తలను నరకేయత్నం; ఇవన్నీ అర్థసాధనోపాయాలే, ధర్మం ఇందులో గౌణం. అయితే రౌద్రం వలన రౌద్రం ఉత్పన్నమయితే ఇటువంటి సన్నివేశాలు తప్పవు. ఇవి ద్రోణపర్వంలోనే ఒక్కచోట ప్రోగువడ్డాయి.

2. తీవ్రమైన కోపం వచ్చినప్పుడు సాధ్యాసాధ్యాలు గమనించకుండా శత్రుసంహార యత్నం చేయటం. అర్జునుడు సైంధవ వధకై అసాధ్యమైన ప్రతిజ్ఞచేసి దానిని సాధించటం కొరకు శత్రువ్యూహాలను భగ్నంచేసి తీవ్రకోపంతో యుద్ధంచేయటం. ఇటువంటివి ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ, దుర్యోధనుడు మొదలైనవారు ప్రదర్శించినా అవి సఫలంకాకపోవటంచేత రౌద్రరసాభాసాన్ని కలిగించటం గమనిస్తాం.

3. మాయాయుద్ధంలో మారణహోమానికి పూనుకొనటం. మాయాయుద్ధం రాక్షసుల సొత్తు. వారిది నిలువెల్ల కోపం. ఎదుటివారిని హింసించటమే వారి స్వభావం. ఈ పర్వంలో హిడింబాసుతుడూ, అలంబుసుడూ ప్రదర్శించిన బీభత్స ప్రధానమైన యుద్ధం రౌద్రానికి చక్కని ఉదాహరణం.

4. ఆజన్మ శత్రువులు కనపడితే చాలు, వారి మాటలు స్మరిస్తేచాలు అగ్నిలో ఆజ్యంపోసిన విధంగా క్రోధంతో భగ్గునమండి యుద్ధానికి కాలుదువ్వేవారు. పాండవులలో భీముడు, కౌరవులలో ద్రోణుడు, కర్ణుడూ మొదలైన వీరులు దుర్యోధన, ధృష్టద్యుమ్న, అర్జునాది వీరులను చూస్తే వారిలో తోచేది యుద్ధవీరం కంటె రౌద్రం అధికం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

5. ఆత్మీయులను అవమానించిన వారిని గాని, చంపినవారినిగాని ఎదుర్కొన్నప్పుడు ప్రతీకారవాంఛతో ద్విగుణీకృత క్రోధవిస్ఫూర్తితో పోరాడటం మరొకభేదం. అభిమన్యుడు పద్మవ్యూహంలో కురువీరులను అధిక్షేపిస్తూ క్రోధమూర్తి అయి విజృంభించిన రౌద్రఘట్టం అపూర్వోదాహరణం. లక్ష్మణకుమారుడిని, దుశ్శాసన కుమారుడిని అభిమన్యుడు చంపినప్పుడు వారి తండ్రులు కోపోద్రిక్తులైనారు.

6. తన నిజాయితీనీ, వాస్తవస్థితి గతులనూ గమనించకుండా అడుగడుగునా అనుమానిస్తూ అధిక్షేపించే ప్రభువుపై సేనాపతులు అంతర్గత కోపాన్ని కార్యంలో ప్రదర్శించి, కార్యవైఫల్యానికి తోడ్పడే రౌద్రకర్మ - ద్రోణుడి సర్వసేనాపతిత్వం మొదటినుండి చివరిదాకా ఈ అంతర్గత కోపంతోనే సాగింది. ఆచార్యుడు వ్యూహముఖ రక్షణం వరకే తాను పరిమితమై వ్యూహభారమంతా దుర్యోధనుడిపై ఉంచాడు. చివరకు అకస్మాత్తుగా అస్త్రసన్న్యాసం చేస్తూ దుర్యోధనుడికి అప్పగింతలు చెప్పి కన్నుమూశాడు. ఇది వీరలక్షణం కాదు. రౌద్ర లక్షణం.

7. జనకరసాలనుండి జన్యరసాలు పుట్టిన ఘట్టాలలో రౌద్రకర్మ ప్రభావాన్ని విపులంగా వర్ణించి రసపోషణం చేయటం.

రౌద్రరసంనుండి కరుణరసం జనిస్తుందని లాక్షణికులు చెప్పుతారు. ఇది నిజం. అభిమన్యు వధ రౌద్రకర్మకు అక్షరోదాహరణం. దానివలన పాండవపక్షంలో అపారశోకం ఉద్భవిల్లింది. ధర్మరాజు, అర్జునుడు, సుభద్రాది రాణివాసపు స్త్రీలు, మిగిలిన పాండవులు, ఆప్తులు ప్రకటించిన శోకం వ్యాస శ్రీకృష్ణులే స్వయంగా ఓదార్చవలసినంత తీవ్రస్థాయిలో వర్ణించబడింది. అభిమన్యువధ ఎంత విస్తృతంగా వర్ణించబడిందో అతడిని గురించి బంధువులు శోకించిన ఘట్టం కూడా అంత విపులంగా ప్రదర్శించబడింది. ఆ ఘట్టంలోని కొన్ని పద్యాలను నేటికి ఆంధ్రులు ఆర్ద్రనయనాలతో చదువుకొంటూ ఉంటారు. మచ్చుకు కొన్ని:

ధీరోదాత్తుడైన ధర్మరాజు సైతం దీనుడై ఇట్లా దుఃఖించాడు.

మ. ‘గురుశారద్వత ముఖ్యయోధవర సంగుప్తంబు నిర్భేద్య ము
ద్ధుర మా సైన్యము; దానిఁ జొచ్చి ననుఁ బ్రీతుం జేయఁగాఁ బూని యొ
క్కరుఁడున్ గోవులలోనఁ జొచ్చు బలుసింగం బొక్కొ నా నట్లు సొ
చ్చి రయంబార ననేక వీర శిరముల్ చెండాడె నుద్దండుఁడై’. (ద్రోణ. 2. 138)

ఈ పద్యం పైకి చూస్తే వీరరసపోషకంగా ఉంటుంది. మహాయోధులు గుమికూడిన వ్యూహంలో ఒంటరిగా ప్రవేశించి, ఎందరితలలో నరికాడు అన్నది ఇందులోని వీరకృత్యం. చిన్నవాడయినా అంతటి పెద్దపని ఎందుకు చేశాడు? కారణం? ‘ననుఁ బ్రీతుంజేయగాన్’ అని చెప్పటంలో ఆత్మీయత, తనకోసం ఆ పని చేశాడు. మహావీరులు కూడా అతడి ముందు గోవులవలె గోచరించారు. అతడు సింహంవలె చెలువొందాడు. అభిమన్యుడు బ్రతికి ఉన్నట్లయితే ఇది వీర ప్రశంస అయ్యేది, మరణానంతరం ఇది స్మృతి రూప దుఃఖభావమయింది. పార్థతనయుడి పరాక్రమమే ఆయన శోకంలోని ప్రధానాంశం.

ఫల్గునుడు కూడా ధీరోదాత్తుడే. అయినా కన్నతండ్రి. పుత్రశోకంతో అతడు నేలమీద చతికిలపడి ఎలుగెత్తి ఏడ్చాడు. తిక్కనమాటలలో -

ఉ. ‘హా యను, ధర్మరాజ తనయా యను, నన్నెడఁ బాయ నీకుఁ జ
న్నే యనుఁ, దల్లి నేఁపఁ జనునే యను; గృష్ణుఁడు వీఁడె వచ్చె రా
వే యను, నొంటి వోక దగవే యను; నే గతిఁ బోవు వాఁడ నే
నో యభిమన్యుఁడా యనుఁ; బ్రియోక్తుల నుత్తరఁ దేర్పవే యనున్’ (ద్రోణ. ద్వి. 242)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతి పిలుపులో ప్రేగు బాధ విషాద గీతిగా వినిపించింది. బాంధవ్యం, ఆత్మీయత, ఆక్రందనలో వినిపించింది. ధర్మరాజు బుద్ధిమంతుడివలె దుఃఖించాడు. పార్థుడు గుండెపగిలినట్లు శోకించాడు.

కరుణరసాన్ని ప్రకటించేవారు కూడా త్రిగుణాత్మకంగా ఉంటారేమో? ద్రోణపర్వంలో విచిత్ర మేమంటే - చచ్చిన ఆత్మీయులను చూచి అందరూ అర్జునుడివలె, ధర్మరాజువలె దుఃఖించరు. వారు సాత్త్విక ప్రవృత్తులు కాబట్టి వారిలో ఉద్బుద్ధమైన శోకం అవలీలగా రసస్థాయికి చేరుకొంటుంది. భీముడి కొడుకు ఘటోత్కచుడు వీరమరణం పొందినప్పుడు పాండవులు దుఃఖించారు గాని శోకించలేదు. పైపెచ్చు శ్రీకృష్ణుడు సంతోషించాడు. ఘటోత్కచుడు చచ్చి అర్జునుడిని బ్రతికించాడు. అందువలన ఆ ఘట్టంలో దుఃఖాన్ని రేఖామాత్రంగా ప్రకటించారు. వీరు రాజస ప్రవృత్తులు. ఇక కౌరవులలో దుర్యోధన దుశ్శాసనుల కొడుకులు కూడా అభిమన్యుడి రౌద్రకర్మకు బలి అయ్యారు. కాని, వారు దుఃఖించిన దానికంటె శత్రువుమీద మండిపడటం ఎక్కువగా కనబడింది. దుఃఖంనుండి కోపం పుట్టటం ఉదాత్తలక్షణం. దుఃఖం లేకుండా కోపం కలగటం ఉద్ధత లక్షణం, లేదా తమోగుణ లక్షణం.

అన్నిటికంటె మించి పేర్కొనదగింది ధృతరాష్ట్రుడి శోకం. మహాభారత యుద్ధకాలంలో మహావీరుల మరణవార్తలు విన్న ఆంబికేయుడు కన్నీరుమున్నీరుగా శోకించటం గమనిస్తాం. దుఃఖనదులన్నీ ధృతరాష్ట్ర హృదయక్షేత్రంలో కలిసి శోకమహాసాగరమౌతున్నట్లుంటుంది. జన్యరసచిత్రణలో ఇది ఒక మెలకువ.

8. జన్య మిత్ర రసాలనుండి రౌద్రం ప్రబుద్ధమైనట్లు వర్ణించటం.

జనకరసమైన రౌద్రం ఒక్కొక్కసారి జన్యరసస్థానంలో ఉండవచ్చును. క్రోధోద్రేకంలో విజృంభించే వీరులు పలికే వాక్యాలకూ, చేసే శపథాలకూ ప్రతిగా వీరులు రౌద్రాన్ని ప్రదర్శించవచ్చును. ఇవి భీమ దుర్యోధనుల నడుమా, ద్రోణ ధృష్టద్యుమ్నుల నడుమా, సాత్యకి కర్ణుల మధ్యా, అశ్వత్థామ ధృష్టద్యుమ్నుల మధ్యా సామాన్యంగా ఇటువంటి సన్నివేశాలు గోచరిస్తాయి. ఈ పర్వంలో సుశర్మకూ, సంశప్తకులకూ అర్జునుడికీ నడుమ సాగిన రౌద్రరస విజృంభణం పరస్పర జనకంగానూ, పోషకంగానూ ఉన్నాయి.

శత్రుకృతమైన రౌద్రకర్మలకు శోకం కలిగినా దానిని అధిగమించి క్రోధోద్రేకంతో పగసాధించే ప్రయత్నంలో శత్రువధకు ఘోరప్రతిజ్ఞ చేయవచ్చును. ద్రోణపర్వంలోనే కాదు మహాభారతయుద్ధం మొత్తంలో కూడా పేరెన్నికగన్నది. సైంధవుడిని వధిస్తానని చేసిన పార్థ ప్రతిజ్ఞ పుత్రశోక కారకుడైన విరోధిపై ప్రకటించిన రౌద్ర విస్ఫూర్తి.

రౌద్రరసపోషణంలో భయానక బీభత్సరసాలు వర్తిల్లటం యుద్ధరంగంలో సహజం. ద్రోణార్జునాది మహావీరుల విజృంభణం వలన యుద్ధభూమి బీభత్సంగా కనబడుతుంది. ఆ మహావీరుల ద్వంద్వయుద్ధాలు చూపరులకు భయంకరాలుగా కనబడతాయి.

రౌద్రఘట్టాలలో వీరులు కొందరు శత్రువుల బలాబలాలను అపహాస్యం చేస్తూ గంభీర హాస్యాన్ని ఉత్పత్తి చేస్తారు. మచ్చు కొక్కటి:

కర్ణుడి పౌరుషోక్తి: (దుర్యోధనుడితో)

శా. ‘ చంపం జాలుదు నే నొకండన భుజాశక్తిన్ నరున్, వెండి మ
ర్దింపం జుల్కన భీమముఖ్యుల; భవత్తేజంబు రాజ్యంబుఁ బా
లింపం బూనిక యేను గల్గఁగ రిపు ల్జృంభింతురే? చూడు నా
తెంపుం బెంపును’ నంచుఁ గర్ణుఁడు మహోదీర్ణాకృతిం బొల్చినన్.

వ. కనుంగొని గృపాచార్యుం డలంతి నవ్వుతో నతని కిట్లనియె.

చ. ‘ అగు నగు మేలు మేలు మనుజాధిపుఁడున్ మహి యేలు మాటల
నృగఁటిమి యిమ్మెయిన్ నెఱపినం జెడుఁ బాండుతనూజకోటియుం
దగు మును ఘోషయాత్రను బదంబడి గోగ్రహణంబునందుఁ బే
రు గొనిన నీకు ని ట్లనుట క్రొవ్వులు దక్కుము సాలు నిన్నియున్’. (ద్రోణ. 5. 97-99)

కర్ణుడు పల్కినవి పౌరుషోక్తులు కావని అవి ప్రగల్భోక్తులని అవహేళన చేసిన కృపాచార్యుడి మాటలు లలిత హాస్య జనకాలు.

సర్వాంగ సుందరమైన రౌద్ర రసావతారం ద్రోణపర్వం.

17. ద్రోణపర్వం: అంతరార్థం

మహాభారత కథను ముక్తిసాధనమార్గంగా అన్వయించి తాత్త్వికదర్శనాన్ని చేసే అధ్యాత్మ విదులున్నారు. వారు ద్రోణపర్వంలోని అభిమన్యుడి వధకూ, ద్రోణవధకూ తాత్త్విక వ్యాఖ్యానం చేస్తారు. అభిమన్యువధ పూర్ణయోగ సాధనకూ, ద్రోణవధ అసమగ్రమైన జ్ఞానాన్ని సమగ్రజ్ఞానంతో విలీనం చేసే సాధనకూ ప్రతీకలుగా పేర్కొంటారు.

సాధకుడు ముక్తిసాధన చేసేటప్పుడు అతడిలో ఆ సాధనకు ప్రతిరోధకంగా ఉండే పాక్షిక సాత్త్విక వృత్తులే భీష్మ, ద్రోణ, కర్ణులుగా గ్రహించాలి. భీష్ముడు అసమగ్ర కర్మమార్గానికీ, ద్రోణుడు అసమగ్ర జ్ఞానమార్గానికీ, కర్ణుడు అసమగ్ర యోగమార్గానికీ చిహ్నాలుగా గోచరిస్తారు. పాక్షిక వృత్తులంటే అటు కేవలం సాత్త్వికాలు, ఇటు కేవలం తామసికాలూ కాని వృత్తులని భావం. వాటిని గుర్తించి నాశనం చేయటం కష్టసాధ్యం.

దుర్యోధనుడు ధర్మరాజును చంపకుండా పట్టి తెమ్మని ద్రోణుడిని అడిగాడు. అతడిని మరల జూదంలో ఓడించి శాశ్వతంగా అడవులకు పంపాలని ఆశించాడు. ధర్మరాజును చంపితే అర్జునుడు విజృంభిస్తాడనీ, పాండవులనందరినీ చంపితే శ్రీకృష్ణుడు చక్రప్రయోగంతో కౌరవులనందరినీ సంహరించి రాజ్యాన్ని కుంతికైనా కట్టబెట్టుతాడనీ దుర్యోధనుడు భావించాడు. ద్రోణపర్వంలో ఈ సంకల్పం బీజం. దీనిని తాత్త్వికంగా ఇట్లా వ్యాఖ్యానించవచ్చును.

ధర్మరాజు అష్టాంగపరమైన శారీరక సాధనకు చిహ్నం. అర్జునుడు ఋజువృత్తికీ, శ్రీకృష్ణుడు నివృత్తికీ ప్రతీకలు. ధర్మరాజును కృష్ణార్జునులకు దూరం చేసి, ఉన్న స్థితిలోనే ఉంచటం దీని అంతరార్థం. అంటే - ఋజువృత్తికీ, నివృత్తికీ దూరమైన అష్టాంగ శారీరకసాధన పెరగకుండా ఉండేటట్లు బ్రతికించి ఉంచటం కొరకు అసమగ్ర జ్ఞానవృత్తిని ప్రోత్సహించటం దుర్యోధనుడి లక్ష్యం! ఈ అవరోధం సామాన్యంగా మోక్షసాధనలోని చివరిదశలో ఏర్పడుతుంది. తీవ్రమైన విఘ్నాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. అందుకే ద్రోణవధ పెద్ద ప్రయత్నమైపోయింది.

వ్యూహాలలో పద్మవ్యూహానికి ప్రత్యేకత ఉన్నది. పత్+మా+వ్యూహం= పద్మవ్యూహం. పతనశీలమైన ప్రవృత్తికీ, సంపదలకూ సంబంధించిన ఊహలను పుట్టించే మాయాజాలం - అని పద్మవ్యూహానికి అంతరార్థం. ముక్తిసాధనను భ్రష్టంచేసే తామసిక వృత్తిచేత ప్రేరేపించబడే ప్రకృతి వ్యామోహం కలిగించే మాయావృత్తియే పద్మవ్యూహం. ఆ వ్యూహం అసమగ్ర జ్ఞానవృత్తి (ద్రోణుడి) వలన కల్పించబడింది. దానిని అభిమన్యుడు భేదించాడు. ‘అభితః మనుతే ఇతి అభిమన్యుః’ అని వ్యుత్పత్తి. అభిమన్యు సాధన అంటే ‘అహం బ్రహ్మాస్మి’ ‘సర్వం ఖల్విదం బ్రహ్మ’ అనేవాటి సమష్టి సాధన. దానిని పూర్ణయోగం అంటారు. ఋజుప్రవృత్తి అయిన అర్జునుడివలన అతడు ఆరోహణమార్గాన్నే తెలిసికొన్నాడు. అంటే పద్మవ్యూహంలోకి ప్రవేశించటమే తెలుసు. కాని, భయరహితమనః ప్రవృత్తులు (భీమాదులు) వెళ్ళిన మార్గాననే తిరిగిరావచ్చునని ధైర్యం చెప్పటంతో అభిమన్యుడు పూనుకొన్నాడు. అంటే వారికి పూర్ణయోగం తెలియదన్నమాట!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిరిగి వచ్చేటప్పుడు పెక్కుమంది కూడి అభిమన్యుడిని అన్యాయంగా చంపారు. దీని అంతరార్థాన్ని ఈ విధంగా భావించవచ్చును. బ్రహ్మత్వసిద్ధి సాధకుడికి అవరోహణక్రమం తెలియనప్పుడు - అంటే - ప్రకృతినంతనూ ఇది బ్రహ్మకాదు అని, 'అహం బ్రహ్మాస్మి' అనే సాధనలో నిషేధించుకొంటూ పోవటం మాత్రమే తెలిసి, సర్వప్రకృతినీ (పద్మవ్యూహాన్ని) బ్రహ్మస్వరూపంగా సాధకుడు చూడలేనప్పుడు, సాధకుడిచేత అంతక్రితం నిషేధించబడిన ప్రకృతికి చెందిన వాసనామనోవృత్తులే ఒక్కుమ్మడిగా సాధనను భ్రష్టంచేసి వేస్తాయన్న సాధనా విఘ్నదశా రహస్యాన్ని తెలుపుతున్నది. ఇక్కడ చనిపోవటం అంటే సాధన వ్యర్థం అయిందని అంతరార్థంగా గ్రహించాలి.

సూర్యు డస్తమించే లోగా సైంధవుడిని (జయద్రథుడిని) వధిస్తా నని అర్జునుడు శపథం చేశాడు. సూర్యు డంటే జ్ఞానప్రకాశం. సాధకుడిలోని జ్ఞానప్రకాశం నశించకుండా కర్మమార్గం వలన కలిగే జనన మరణ కర్మ వాసనలను నాశనం చేయటం (జయద్రథ వధ) ఋజుప్రవర్తనా (అర్జునుడి) సాధన (ప్రతిజ్ఞ) లక్షణంగా బోధపడుతున్నది.

ద్రోణవధలో అసమగ్రమైన జ్ఞానాన్ని సమగ్రజ్ఞానంతో విలీనంచేసే సాధన గోచరిస్తుంది. ద్రు+ఊన= ద్రోణ - అంటే ప్రకృతినుండి విడిపోయినది, మాయాసంబంధాన్ని విడిచిపెట్టింది - అనే అర్థం గల జ్ఞానదీప్తిగా చెప్పాలి. కొన్నాళ్ళ తరువాత అశ్వత్థామ పుట్టాడు. ఆ తరువాత ఆచార్యుడైన ద్రోణుడు కౌరవపక్షంలోనే ఉండిపోయాడు. కురుక్షేత్రయుద్ధంలో సర్వసేనానిగా అభిషిక్తుడయ్యాడు. అశ్వత్థామ (అశ్వత్+థామ) అంటే ప్రకృతిగా ఆచరించే కర్మవాసనల ప్రకాశం అని అర్థం. అశ్వత్థామకు ద్రోణుడు తండ్రి. అంటే - అసమగ్రమైన జ్ఞానం ప్రకృతిలో చరించే కర్మవాసనలకు ఉత్పత్తిస్థానం - అని అంతరార్థం. ఈ విధంగా కౌరవపక్షాన్ని కోరి యుద్ధభారాన్ని వహించిన ద్రోణుడు జీవనవృత్తికి ఐహికవాంఛలకు లోనై ప్రకృతికర్మ వాసనలకు జనకుడై ఉండటంచేత అసమగ్ర జ్ఞానదీప్తి గల పాక్షిక సాత్త్విక మనోవృత్తి అన్నమాట. ఎంత అసమగ్రమైనదైనా, వింతగా ప్రకృతివాంఛలు కలిగిఉన్నా జ్ఞానం అనేది మనస్సును జయించి సంపాదించిందే కావటంవలన మనస్సుచేత జయించబడని శక్తిసామర్థ్యాలు దానికి ఉండే ఉంటాయి.

అర్జునుడంటే ఋజుమనోవృత్తి. ఎంత ఋజువృత్తి అయినా అది మనస్సునుండి కలిగిన జ్ఞానవృత్తివలన కలిగినదే కావటంవలన, జ్ఞానస్వరూపానికి అది అసమగ్రమైనదే అయినా, ఋజుమనోవృత్తి గురుభావంతో మ్రొగ్గి విధేయతను వహించి లొంగి ఉండవలసిందే.

అర్జునుడు ఎంత ఘోరంగా తలపడి యుద్ధంచేసినా ద్రోణుడిని జయించలేకపోయాడు. అంటే - ఎంతటి ఋజుమనోవృత్తికి కూడా ఆత్మజ్ఞానాన్ని (అది అసమగ్రమైనదే అయినా) మించి ఉండగలిగే సామర్థ్యం ఉండనే ఉండదు. ఋజువృత్తి అనేది విషయాలకు సంబంధించినదే కావటంవలన జ్ఞానవృత్తికి అది క్రింది స్థాయిదే. అది జ్ఞానాన్ని గెలవాలంటే దానిలోని దౌర్బల్యంవలన మధ్యలో ఏర్పడిన ప్రకృతి లోలత్వాన్ని (అశ్వత్థామ పట్ల అభిమానాన్ని) అసమగ్రమైన జ్ఞానంచేతనే గ్రహింపజేసి పశ్చాత్తాపంతో నిర్మలతను పొంగింపజేసి, ప్రకృతిపైని మమకారాన్ని పోగొట్టి, స్వచ్ఛందంగా అది ముక్తిని పొందాలనే స్థితిని దానికి కలిగించాలి. లోగడ దౌర్బల్యంవలన దానిలో కలిగిన ప్రకృతి లోలత్వాన్ని (అశ్వత్థామాభిమానాన్ని) విడిపించాలి.

ఈ అంతరార్థాన్ని అన్వయించుకొంటే ద్రోణవధలోని సాధన రహస్యం వివృతమౌతుంది. విశ్వామిత్రాది మహర్షులు ఏడుగురు ద్రోణుడికి ప్రసన్నులై ప్రబోధించారు. అంటే సప్తవిధమనోవృత్తులు అశ్వత్థామయందు అమితప్రేమగల ద్రోణుడిని (ప్రకృతి వాంఛలతో అమితంగా కూడిన సాధకుడిలోని అసమగ్రజ్ఞానాన్ని) ప్రబుద్ధపరిచాయి. అంటే ప్రకృతిమీది ఆసక్తిని నశింపజేసికొని ముక్తిని పొందవలసిందిగా సాధకుడిని హెచ్చరించాయన్నమాట! అప్పుడు 'అశ్వత్థామః హతః కుంజరః' అనే ధర్మరాజు మాట వినిపించింది. అంటే ప్రకృతి ప్రకాశం హతమైనది, సాధకుడిలో నుండి నశించిపోయింది, ఆత్మజ్ఞానం ప్రబుద్ధమయింది, అంతః ప్రబోధం కలిగింది- అని గ్రహించాలి. ఆ ఉపాయం (కృష్ణుడు) నివృత్తితత్త్వం చూపించిందని కూడా గ్రహించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇక్కడ ఒక విశేషం గ్రహించాలి. ధర్మరాజు అబద్ధమాడాడు అన్నది వాచ్యార్థంలోనే తప్పు అంతరార్థంలో కాదు. అంతరార్థంలో అది సత్యం చెప్పటమే ఔతుంది. ఎట్లాగంటే - ప్రకృతిలోనే పరమాత్మ ఉంటాడు. కాబట్టి ప్రకృతి నశించిపోవటం అనేది సత్యం కాదు. ప్రకృతి నిత్యమే. అందుకే ఇక్కడ కుంజర (కుం= ఐహికవృత్తిని; జరః= నాశనం చేసేది) శబ్దం వాడబడింది. ఆ కారణంగా జీవన్ముక్తావస్థను చెప్పటంగా జరిగింది.

ధర్మరాజు అంటే ధర్మతేజస్సు అని అర్థం. ధర్మతేజస్సు ఎప్పుడూ సత్యమైన ప్రకృతిని నశించిందని చెప్పదు. తరువాత ధృష్టద్యుమ్నుడు (దృఢమైన జ్ఞానప్రకాశం) ద్రోణుడిని యోగనిష్ఠలో ఉండగా తల తెగనరికాడు. అంటే అసమగ్రజ్ఞానం ధ్యానస్థితిలో ఉండగా పరిపూర్ణ జ్ఞానంలో విలీనం చేయటం జరిగిందని భావం.

ద్రోణుడి వధను అసమగ్రజ్ఞానం పూర్ణజ్ఞానంలో భగవద్ధ్యానం వలన వాసనానివృత్తి పొంది ఉన్న సమయంలో జ్ఞాన దీప్తిలో విలీనం చేసే సాధనంగా గ్రహించి సంపూర్ణజ్ఞానం పొందటానికి సాధకులు సాధనలు సాగించాలి. ఇది ద్రోణపర్వం మన కందించే అంతరార్థం. (మరిన్ని వివరాలకు డాక్టర్ వేదుల సూర్యనారాయణ శర్మగారి 'అంతరార్థ మహాభారతము' అనే గ్రంథాన్ని చూడండి).

18. కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం:

తెలుగులో ఆదికావ్యమైన ఆంధ్రమహాభారతం అవతరించి దాదాపు వెయ్యేళ్ళు కావస్తున్నా, ఇంతవరకు దానికి సమగ్రవ్యాఖ్య వెలువడలేదు. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో కవిత్రయ మహాభారతానికి తెలుగులో శిష్టవ్యావహారిక భాషలో సరళవ్యాఖ్య వెలువడటం ఆంధ్రావళి మోదముంబొరసే అపూర్వ సాహిత్యోత్సవం. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు భారతీయ వైదిక ధర్మప్రచార మహోద్యమాన్ని చేపట్టి మహనీయంగా సాగిస్తున్నారు. అందులో ఈ పంచమవేద వ్యాఖ్యాన ప్రణాళిక ఒక మహత్తర సారస్వత యజ్ఞం. ఏడుకొండలరాయడు మాత్రమే చేపట్టి, ధర్మరక్షణ కళాప్రావీణ్యంతో ఈ బృహత్తర ధర్మకార్యాన్ని ప్రజలకు ప్రసన్నంగా ప్రసాదించగలిగిన పరమ దయాళువు. ఆ దేవదేవుడి కృపాకటాక్షంతో పండితులు పదునెనిమిది పర్వాల ఈ దివ్య ప్రబంధమండలిని పరిష్కరించి, ప్రతి పద్యానికి వ్యాఖ్యానం వెలయించి, సవిమర్శకమైన పీఠికలు సమకూర్చి, కథాసారాదులను చేర్చి సర్వార్థసాధకంగా సంతరించి, సర్వాంగసుందరంగా ప్రచురించి, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారు చేసికొన్న వెలుగుల పుణ్యం. ఈ పవిత్ర మహత్తర ప్రయత్నానికి శ్రీ తిరుమలేశుడి పక్షాన బాధ్యత వహించి, అభ్యుదయ పరంపరను విజయవంతంగా సమకూరుస్తున్న మాన్యులు, మహనీయులు టి.టి.డి.బోర్డు ఛైర్మన్, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, వారి సహకారులూ, సంపాదక సలహామండలుల సభ్యులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, ఎడిటోరియల్ సెల్ సభ్యులూ, పలురకాలుగా ఈ కార్యక్రమంలో తోడ్పడుతున్న అధికార, అనధికారులూ ధన్యులు, వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటి. అది రెండు భాగాలుగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపుదిద్దుకొన్నది. విస్తృతమైన ఆరణ్యపర్వం మూడవసంపుటిగా రెండు భాగాలలలో ప్రచురించబడింది. మొదటి భాగం నన్నయ రచించిన ఆరణ్యపర్వభాగం. రెండవభాగం ఎఱ్ఱాప్రెగడ పూరించిన ఆరణ్యపర్వశేషం. ఈ విధంగా ఆరణ్యపర్వం విభజించబడి ప్రచురించబడటం తెలుగులో ప్రథమం. నాల్గవ, అయిదవ, ఆరవ సంపుటులుగా విరాట, ఉద్యోగ, భీష్మపర్వాలు వెలువడ్డాయి. ఇప్పటి ఈ ఏడవసంపుటి ద్రోణపర్వం.

ద్రోణపర్వ వ్యాఖ్యానంలో నలుగురు మహాపండితులు పాల్గొన్నారు. ప్రథమాశ్వాసానికి డాక్టర్ జి. హరనాథ్‌గారూ, ద్వితీయా శ్వాసానికి డాక్టర్ మల్లెల గురవయ్యగారూ, తృతీయ చతుర్థాశ్వాసాలకు శ్రీ సింగరాజు సచ్చిదానందంగారూ, పంచమాశ్వాసానికి డాక్టర్ కె. రాజన్న శాస్త్రిగారూ వ్యాఖ్యానం వ్రాశారు. మనీషులైన వీరు మధుర రచన చేశారు. ఈ పర్వానికి తగిన పీఠికను నేను సంతరించాను. ఇవి ఆంధ్రుల ఆమోదాన్ని పొందుతాయని ఆశిస్తున్నాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ సంపుటి ఈ విధంగా రూపొందటానికి తోడ్పడిన మిత్రులు విద్వన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారికీ, శ్రీ కె. సత్యరామ ప్రసాదు గారికీ, డాక్టర్ దాసు అచ్యుతరావు గారికీ, శ్రీ ఎన్.ఎస్. హరనాథ్ గారికి, శ్రీ జి. రాధాకృష్ణగారికి, శ్రీమతులు సుశీలా లక్ష్మీ విద్యానాథులకూ, డాక్టర్ వి.యస్. లక్ష్మిగారికీ నా హార్దిక కృతజ్ఞతలు.

పరమకల్యాణ భద్రమూర్తి అయిన శ్రీ పద్మావతీ సహిత శ్రీ వేంకటేశ్వరస్వామివారు వేదవేద్యులు, వేదాంతగమ్యులు, పరమతత్త్వరూపులు అయిన భక్త సులభులు, సాహిత్య సంగీత కళాప్రియులు, రసానందమూర్తులు. ఆ స్వామికి ఈ పంచమవేదం అక్షరమైన తోమాలసేవ. వ్యాఖ్యానం సుగంధ పరిమళసేవ. ద్రోణపర్వ విశేషాంశాలు ఉజ్జ్వలాలంకారసేవ. పీఠిక విరాణ్మూర్తికి మంగళనీరాజనం. ఈ పర్వం స్వామివారికి సారస్వతమైన అక్షరార్చనం.

సత్య శివ సుందర రూపులైన స్వామివారి దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యా సంపుటిని వాఙ్మయారాధనలోని భాగంగా పుణ్యపూజాకుసుమ మంజరిగా సమర్పించుకొంటున్నాను. విశ్వశ్రేయస్సును ప్రసాదించుమని స్వామివారిని వేడుకొంటున్నాను

హైదరాబాదు

10.5.2004

జి.వి. సుబ్రహ్మణ్యం

ప్రధాన సంపాదకుడు,

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు,

తిరుమల తిరుపతి దేవస్థానం..

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్రోణపర్వ కథాసారం

భీష్ముడు రణరంగంలో కూలి అంపశయ్యమీద ఉండటం విని ధృతరాష్ట్రుడు మిక్కిలి శోకించి కౌరవులకు విజయం కలుగుతుందనే ఆశతో తరువాతి యుద్ధవార్తలను తెలిసికొని రమ్మని సంజయుడిని యుద్ధభూమికి పంపాడు. ఆ తరువాత ఒకనాటి అర్ధరాత్రి సమయంలో సంజయుడు యుద్ధభూమినుండి తిరిగివచ్చి ద్రోణుడి మరణవార్తను తెలిపాడు. పిడుగువంటి ఆ వార్తను విని ధృతరాష్ట్రుడు దిగ్భ్రాంతి చెంది, మూర్ఛపోయి, తేరుకొని పరిపరి విధాల ద్రోణుడి గుణగణాలు స్మరిస్తూ దుఃఖించాడు. కౌరవులకు ఇక విజయం కలగటం కష్టమని భావించి నిట్టూర్చాడు. తరువాతి కథను వినిపించుమని కోరగా సంజయుడు ద్రోణవధ కథను వివరించి చెప్పాడు.

భీష్ముడు కూలిన తరువాత కౌరవసైన్యం గోపాలుడు లేని గోగణంవలె వెలవెలపోయింది. దుర్యోధనాదులకు, కౌరవసైనికులకు కర్ణుడు జ్ఞాపకం వచ్చాడు. భీష్ముడు పడిపోయేంతవరకు రణరంగంలోకి అడుగుపెట్టనని ప్రతిజ్ఞచేసిన కర్ణుడు దుర్యోధనుడి ఆహ్వానంమీద రథమెక్కి యుద్ధం చేయటానికి సిద్ధమయ్యాడు. అంపశయ్యపై శయనించి ఉన్న భీష్ముడివద్దకు వెళ్ళి ఆతడి అభినందనలు పొందాడు. సర్వసైన్యాధ్యక్షుడవు కమ్మని దుర్యోధనుడు కోరగా కర్ణుడు ధనురాచార్యుడైన ద్రోణుడిని అభిషిక్తుడిని చేయుమని సలహా ఇచ్చాడు. సుయోధనుడు సేనాపతుల నందరిని వెంటబెట్టుకొని ద్రోణాచార్యుడి వద్దకు వెళ్ళి, అతడిని అర్చించి, అతడి అంగీకారంపొంది సర్వసైన్యాధ్యక్షుడిగా అభిషేకించాడు. ద్రోణుడు ఉప్పొంగిపోయి దుర్యోధనుడిని ఒక వరం కోరుకొమ్మన్నాడు. అతడు కర్ణ దుశ్శాసనాదులతో ఆలోచించి 'ధర్మరాజును పట్టి ఇ'మ్మని కోరాడు. అందుకు ఆచార్యుడు ఆశ్చర్యపోయి 'ధర్మరాజును సంహరించుమనకుండా ప్రాణాలతో పట్టితెమ్మని ఎందుకు అడుగుతున్నావు? అర్ధరాజ్యమీయాలని అనుకొంటున్నావా?' అని ప్రశ్నించాడు. దుర్యోధను డందుకు ఇట్లా బదులిచ్చాడు. 'ధర్మరాజును సంహరిస్తే అర్జునుడు కోపించి కౌరవులనందరినీ యుద్ధరంగానికి బలిచేస్తాడు. ఒకవేళ మనం పాండవులను సంహరించినా కృష్ణుడు చక్రంతో కౌరవసేనను మట్టుపెట్టి రాజ్యాన్ని కుంతికైనా ఇస్తాడు. కాబట్టి ధర్మరాజును ప్రాణాలతో పట్టితెస్తే అతడితో తిరిగి జూదమాడి అతడి నందులో ఓడించి అలవోకగా దీర్ఘకాలం అడవులకు పంపి, రాజ్యాన్ని సుఖంగా ఏలుకొనవచ్చునని నా అభిప్రాయం.' ఆ మాటలు విని దుర్యోధనుడి కుటిల చింతనకు మనసులో రోసి తన వరాన్ని నిపుణంగా తప్పించుకొనగలిగేటట్లు ప్రతిజ్ఞచేశాడు. 'అర్జునుడు సమీపంలో లేకుండా ఉంటే, ధర్మరాజు రణరంగంనుండి పారిపోకుండా ఉంటే, అతడిని పట్టి ఇస్తాను' అని పలికి దుర్యోధనుడిని తృప్తిపరిచాడు. ద్రోణుడి ప్రతిజ్ఞను రారాజు సైనికులందరికీ చాటించాడు. దానిని గూఢచారులవలన ధర్మరాజు విని అర్జునుడిని పిలిచి ద్రోణ శపథాన్ని గురించి చెప్పాడు. తానున్న చోటును ఎప్పుడూ వదలకుండా పాదివికొని యుద్ధం సాగించుమని కోరాడు. 'అగ్రజా! నేను ప్రాణాలతో ఉండగా నిన్ను పట్టుకొనటానికి ఆ ద్రోణుడికి కాదు కదా! ఆ స్థాణువుకైనా సాధ్యం కాదు. నీకు భయ మెందుకు?' అని అర్జునుడు ధర్మరాజుకు ధైర్యం చెప్పాడు. ఆనాడు పాండవులు క్రౌంచవ్యూహం పన్ని సైన్యాలను నడిపారు. సేనాముఖంలో అర్జునుడు గాండీవాన్ని ధరించి నిలిచాడు. కౌరవులు శకటవ్యూహాన్ని పన్నారు.

ద్రోణుడి మొదటినాటి యుద్ధం:

ద్రోణుడు పాండవసైన్యంమీద దివ్యాస్త్రాలతో విరుచుకొని పడ్డాడు. నరుడు గురుడిమీద దివ్యాస్త్రాలతో తలపడ్డాడు. పోరు మహాఘోరంగా మొదలైంది, సంకుల సమరంగా సాగింది. భీమసేనుడూ, శల్యుడూ గదాద్వంద్వయుద్ధం భీకరంగా చేశారు.పాండవ సేనాపతులు తమతమ పరాక్రమాలను ప్రచండంగా ప్రదర్శించారు. ద్రోణుడు మండిపడ్డాడు. భీమ సాత్యకి పాంచాలాదులచేత

పరిరక్షితుడైన ధర్మరాజుమీద దారుణంగా దాడి మొదలుపెట్టాడు. పాండవ సేనానులు పెక్కురు ధర్మరాజును రక్షించుకొంటూ ఆచార్యుడిమీద యుద్ధం సాగించారు. ద్రోణుడు కార్చిచ్చువలె వ్యాపించి వీరులనందరినీ కలతపెట్టి ధర్మరాజును సమీపించి సంకులసమరం చేశాడు. 'ధర్మరాజు పట్టుపడ్డాడు' అని సైనికులందరూ కేకలు వేశారు. కర్ణుడితో పోరు ఘోరంగా చేస్తున్న అర్జునుడు మెరుపువలె ద్రోణాచార్యుడికి అడ్డుపడ్డాడు. క్షీరసముద్రాన్ని మందరపర్వతం కలచివేసినట్లుగా కౌరవసైన్యాన్ని అర్జునుడు సంక్షోభపరిచాడు. కురువీరులందరూ ఆచార్యుడికి అండగా నిలిచి పోరాడినా గాండీవి పరాక్రమానికి ఎదురునిలిచి నెగ్గలేకపోయారు. ఈ విధంగా ద్రోణుడి మొదటినాటి యుద్ధం ముగిసింది.

ద్రోణుడి రెండవనాటి యుద్ధం:

రెండవనాడు ద్రోణాచార్యుడు గరుడవ్యూహాన్ని పన్నాడు. పాండవులు మండలార్ధ వ్యూహాన్ని మోహరించారు. కౌరవపక్షాన సుశర్మ నాయకత్వంలో సంశప్తకులు పదివేలమంది రథికులు ఒక్కటిగా కూడి అర్జునుడిపై పగసాధించటానికి దుర్యోధనుడి అనుమతిని కోరారు. అత డంగీకరించాడు. అర్జునుడిని ధర్మరాజుకు దూరంగా పంపటానికి సంశప్తకులు తోడ్పడ్డారు. దక్షిణదిశగా దూరంగా మోహరించిన సంశప్తకులు అర్జునుడిని యుద్ధానికి ఆహ్వానించారు. పార్థుడికి గడ్డుప్రశ్న ఏర్పడింది. అటు యుద్ధాహ్వానాన్ని కాదనటానికి వీలులేదు. ఇటు అన్న ధర్మరాజు రక్షణను వదలటానికి వీలులేదు. వీరుడైన అర్జునుడు పాంచాలవరుడైన సత్యజిత్తు రక్షణలో ధర్మరాజును ఉంచి తాను సంశప్తకులపై యుద్ధానికి వెళ్ళాడు. సంశప్తకులందరూ కలిసి అర్జునుడిమీద ఒక్కుమ్మడి దాడిచేసి దొమ్మియుద్ధం సాగించారు. బాణాలతో అర్జునుడిని కప్పివేశారు. సారథి అయిన కృష్ణుడికే అర్జునుడు కనబడటం కష్టమయింది. ఫల్గునుడు అనిలాస్త్రాన్ని ప్రయోగించి క్రమ్మిన బాణమేఘాలను వమ్ముచేశాడు. సంశప్తకులను చీకాకుపరిచాడు.

అర్జునుడు సంశప్తకులవైపు పోగానే ద్రోణాచార్యుడు ధర్మరాజువైపు దాడి సాగించాడు. అపారబలాఢ్యుడు సత్యజిత్తు ధర్మరాజుకు రక్షగా నిలిచి విజృంభించాడు. కాని, శస్త్ర కళాచార్యుడైన ద్రోణుడు అతడి విల్లును విరిచాడు. అతడు విల్లందినప్పుడెల్లా దానిని తునకలు చేశాడు. చివరకు అర్ధచంద్రాకార బాణంతో అతడి తల తెగగొట్టాడు. సత్యజిత్తు చనిపోగానే ధర్మరాజు ద్రోణుడి పరాక్రమానికి భయపడి రణరంగంనుండి రథం మీద తొలగిపోసాగాడు. అంతలో మత్స్యరాజు తమ్ముడు సూర్యదత్తుడు ద్రోణుడి నెదుర్కొన్నాడు. అతడికి చేది మగధ కేకయరాజులసైన్యాలు అండగా నిలిచాయి. ద్రోణుడు సూర్యదత్తుడిని చంపి, ధర్మరాజును పట్టుకొనటానికి అతడిని తరుముకొని పోజొచ్చాడు. అప్పుడు ధర్మరాజుకు అండగా యుధామన్యుడు, ఉత్తమౌజుడు, వసుదానుడు, శిఖండి, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, చేకితానుడు క్రమ్ముకొని ద్రోణుడిని ఎదిరించారు. సుడిగాలికి కూలిన చెట్లవలె పాండవసైన్యాలు పడిపోయాయి. ధర్మజుడు భయపడి యుద్ధభూమినుండి తొలగిపోయాడు. మిగిలిన రాజులు భీముడి అండజేరి పోరు సాగించారు.

దుర్యోధనుడు గజసైన్యాన్ని భీముడిమీదకు పురికొల్పాడు. భగదత్తుడు ఇంద్రగజంవంటి సుప్రతీకాన్ని భీముడిపైకి ఉరికించాడు. భీముడు ఏనుగులను మట్టుపెట్టాడు. భగదత్తుడి గజం పాండవసైన్యాన్ని కలచివేసింది. అర్జునుడు భగదత్తుడిపైకి రథాన్ని మళ్ళించాడు. అర్జునుడి విజృంభణంచూచి భగదత్తుడు తన అంకుశాన్ని అభిమంత్రించి అతడి మీద ప్రయోగించాడు. శ్రీకృష్ణుడు అర్జునుడికి అడ్డంగా తన దేహాన్ని నిలిపి, తన హృదయం మీద ఆ అంకుశాన్ని ధరించాడు. అందుకు అర్జునుడు శ్రీకృష్ణా! నీవు సారథ్యం చేయాలిగాని, ఈ విధంగా యుద్ధంలో పాలు పంచుకోవచ్చునా! ఇది నన్ను చులకన చేయటమే కదా అని మనస్సు నొచ్చుకొంటే-శ్రీకృష్ణుడు ఆ అంకుశ వృత్తాంతం అంతా చెప్పి, ఘోరమైన ఆ వైష్ణవాస్త్రాన్ని తాను తప్ప ఇతరులు సహించలేరని తెలియచేసి, సవ్యసాచిని సమాధానపరిచాడు. ఘోరయుద్ధం చేసి సుప్రతీకాన్నీ, భగదత్తుడినీ అర్జునుడు నేలకొరిగించాడు. అర్జునుడిని కర్ణుడు ఢీ కొన్నాడు. మహాస్త్రాలతో మారణయుద్ధం చేశాడు. సూర్యాస్తమయం అయింది. యుద్ధం చాలించారు.

ఆనాడు కూడా ధర్మరాజును పట్టి ఇవ్వనందుకు దుర్యోధనుడు ద్రోణుడిని నిందించాడు. అందు కాతడు కటకటపడి 'నరుడి పరాక్రమం, నారాయణుడి మాహాత్మ్యం తెలిసికూడా ఇట్లా మాట్లాడటం న్యాయమా! ధర్మరాజుమీద చేయి పడకుండా పాండవ వీరులు వరుసగా ఎట్లా కాపాడుకొంటున్నారో గమనించావు కదా! రేపు అర్జునుడిని దూరంగా పంపివేయాలి. ధర్మరాజును పట్టాలి' అంటూ వ్యూహాన్ని పన్నాడు.

ద్రోణుడి మూడవనాటి యుద్ధం:

మరునాడు ద్రోణుడు పద్మవ్యూహాన్ని పన్నాడు. సంశప్తకులు అర్జునుడిని ఆహవానికి ఆహ్వానించి దూరప్రాంతానికి తీసికొని వెళ్ళారు. వ్యూహం వలయాకారంగా ఉండటంచేత దుర్భేద్యమైన చక్రవ్యూహం ఏర్పడింది. పాండవులలో పద్మవ్యూహాన్ని భేదించి విజయాన్ని సాధించే నేర్పు అర్జునుడికీ, శ్రీకృష్ణుడికే ఉన్నది. అభిమన్యుడికి పద్యవ్యూహాన్ని భేదించి లోనికి ప్రవేశించటం తెలుసు గాని విజయవంతంగా తిరిగిరావటం తెలియదు. ద్రోణుడు పాండవసైన్యాన్ని బాణాలతో బాధించాడు. వ్యూహంలో ప్రవేశించటం పాండవవీరులకు శక్యం కాలేదు. అప్పుడు ధర్మరాజు భీమాదులను వెంటబెట్టుకొని అభిమన్యుడి వద్దకు వెళ్ళి పద్మవ్యూహాన్ని భేదించి పాండవుల గౌరవాన్ని నిలుపుమనీ, పార్థగోవిందుల ప్రశంసలు పొందుమనీ కోరాడు. అభిమన్యుడివెంట భీమాదులందరూ వ్యూహంలో ప్రవేశించి దానిని ధ్వంసం చేయగలరని ధైర్యం చెప్పాడు. అభిమన్యుడు తనకు దొరికిన అవకాశానికి ఆనందావేశాలతో ఊగిపోయాడు. భీముడిముందు ఈ విధంగా శపథం చేశాడు.

'ధర్మరాజు నన్ను అభిమానించిన ఈ ప్రయత్నాన్ని నిష్ఫలంచేయకుండా ద్రోణుడు మెచ్చేటట్లు నేను మొగ్గరంలో ప్రవేశించి సైన్యాలను కలతపెట్టుతాను. సుభద్రార్జునులు తమ కొడుకు ప్రదర్శించే పరాక్రమాన్ని చూచి మురిసిపోయేటట్లు చేస్తాను. 'చూడండి! ఒక చిన్నవాడు పెద్ద సైన్యసమూహాలను గోపకుడు ఆవులమందను తోలినట్లుగా అదుపుచేస్తున్నా'డని ప్రజలందరూ ప్రశంసించగా విని మామ (శ్రీకృష్ణుడు) సంతోషంతో పొంగియేటట్లు, తండ్రి (అర్జునుడు) ఆనందించేటట్లు, శత్రువైన దుర్యోధనుడికి పోరు భారమయ్యేటట్లు యుద్ధం చేస్తాను' - అని వీరప్రతిజ్ఞ చేశాడు. ధర్మజు డతడిని అనుమతించి ఆశీర్వదించాడు. అభిమన్యుడు సమరోత్సాహంతో రథాన్ని ద్రోణ సైన్యం మీదికి నడిపించాడు.

మెరుపు మెరిసినట్లు ఆచార్యుడిమీద బాణాలను కురిపించి ఆయనను దాటి అభిమన్యుడు పద్మవ్యూహంలోకి ప్రవేశించాడు. అడవిని కాల్చే కార్చిచ్చువలె, ప్రళయకాలంలో సంహారక్రియకు పూనుకొన్న రుద్రుడివలె పద్మవ్యూహంలోని వీరవరులనందరినీ కలవరపెట్టటం మొదలుపెట్టాడు. ఎదురుపడ్డ కురువీరులనందరినీ బాణాలతో బాధించాడు. అందులో వరుసగా సుయోధనుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, కృతవర్మ, కర్ణుడు మొదలైనవారందరూ ఉన్నారు. విలువిద్యలో వివ్వచ్చుడిని మించిన అభిమన్యుడిని ఆపటం అసాధ్యమని ఆచార్యుడు భావించాడు. అభిమన్యుడి అపూర్వపరాక్రమాన్ని కృపాచార్యుడి ఎదుట పొగిడాడు. దుర్యోధనుడు దానికి కటకటపడి కవ్వడి కొడుకును దొమ్మిగా దాడిచేసి చంపాలని పన్నాగం పన్ని, కర్ణాదివీరులను ప్రోత్సహించి ఒక్కుమ్మడి క్రమ్ముకొనబోయాడు. అంతలో దుశ్శాసనుడు అభిమానంతో పార్థుని కొడుకును ద్వంద్వయుద్ధంలో చంపుతానని తలపడ్డాడు. ఇద్దరూ బలంగా ఎదుర్కొన్నారు. ధర్మరాజాదులను ఆనాడు కురుసభలో అవమానించి పలికిన మాటలను స్మరించి, దుశ్శాసనుడిని మూర్ఛపోయేటట్లు బాణంతో కొట్టాడు అభిమన్యుడు. సారథి దుశ్శాసనుడి రథాన్ని ఆవలికి తోలుకొనిపోయాడు. అభిమన్యుడు కొరవి త్రిప్పిన విధంగా మొగ్గరంలో యథేచ్ఛగా తిరుగ నారంభించాడు. మేటి వీరులనందరిని వాడి బాణాలతో నొప్పించాడు. పేరుపేరునా పిలుస్తూ వారిని అధిక్షేపించాడు. కాని, ఎవ్వరూ అతడిని ఎదిరించలేకపోయారు. ఎదురులేని వీరుడివలె, ఆర్పలేని కార్చిచ్చువలె, మీదపడిన మహా ప్రళయంవలె అభిమన్యుడు అరిభయంకరంగా యుద్ధం సాగించాడు.

పద్మవ్యూహం భేదించిన అభిమన్యుడివెంట భీమాదులు మోహరంలో ప్రవేశించి సైన్యాన్ని నురుమాడటం మొదలుపెట్టారు. వారికి సైంధవు డడ్డం పడ్డాడు. పాండవులను (అర్జునుడిని తప్ప) ఒక రోజు నిలువరించగలిగే శక్తిని శివుడివలన వరంగా పొంది ఉన్నాడు సైంధవుడు. ఆనాడే ఆ ఒక ఒకరోజు అయింది. పాండవు లెంత భయంకరంగా పోరాడినా సైంధవుడిని దాటి ఒక అడుగు ముందుకు వేయలేకపోయారు. అభిమన్యుడు వెనుకాడకుండా ముందుకు చొచ్చుకొనిపోయేకొద్దీ పాండవ సహాయం అందకపోవటంతో ఒంటరివాడయ్యాడు. అయినా అభిమన్యుడు అగ్గిపిడుగు. వృషసేనుడిని మూర్ఛపోగొట్టాడు; దుర్యోధనుడి కొడుకైన లక్ష్మణుడిని ద్వంద్వయుద్ధంలో ఓడించి చంపాడు. మధ్యాహ్నమార్తాండ తేజంతో వెలుగొందే అభిమన్యుడిని అర్జునతుల్యుడిగా ఆచార్యుడు ఆశ్చర్యంతో ప్రశంసించాడు.

అభిమన్యుడిని చంపే ఉపాయం అడిగాడు సుయోధనుడు. 'అతడి చేతిలో విల్లమ్ములుండగా జయించటం కష్ట'మని ద్రోణాచార్యుడు పేర్కొన్నాడు. 'కవచధారణ' మనే విద్య - నేను అర్జునుడికి చెప్పిందే - అభిమన్యుడు నేర్చుకొన్నాడు. ఆ విద్య నేర్చినవాడిని ఓడించటం కష్టం. అయినా మోసంతో అల్లెత్రాడును త్రెంచి, విల్లును విరుగకొట్టి, గుర్రాలను కూలగొట్టి, సారథిని చంపి, ఒక్కసారిగా ఇతడిని క్రమ్ముకొని చంపితే చంపవచ్చునుగాని లేకపోతే ఇతడివైపు దేవతలకు కూడా తేరిపార చూడటం సాధ్యం కాదని ఉపాయాన్ని అందించాడు. దాని ఆచరణకు కర్ణాదులు పూనుకొన్నారు. భయపడినవాడివలె కర్ణుడు అభిమన్యుడి వెనుకకుపోయి, అతడి విల్లు త్రుంచాడు. వెంటనే ద్రోణుడు గుర్రాలను కూల్చాడు. కృపాచార్యుడు సారథిని చంపాడు. శకుని, కృతవర్మ, బాహ్లికుడు, అశ్వత్థామ మొదలుగా అనేకులు ఒక్కసారి అతడిమీద అస్త్రశస్త్రాలను కుండపోతగా కురిపించారు.

అభిమన్యుడు కత్తీ డాలూ తీసికొని గగనానికి ఎగసి, మండలాకారంగా తిరుగుతూ వీరులనందరినీ ఒంటిగా ఎదుర్కొన్నాడు. అతడి కత్తిని ద్రోణుడు, డాలును కర్ణుడు ముక్కలు చేశారు. అభిమన్యుడు రథచక్రాన్ని తీసికొని భూమిపై నిలిచి మండలాకారంగా తిరుగుతున్న మహాజ్వాలవలె విజృంభించాడు. అతడి శరీరం రక్తప్లావితమైంది. కాని, పౌరుషంతో ఎర్రగా జేవురించి శత్రువులకు భయంకరంగా ఉన్నది. అతడి యుద్ధక్రీడను దేవతలు మెచ్చుకొన్నారు. కౌరవవీరులందరు కలిసి అభిమన్యుడి చక్రాన్ని తునియలు చేశారు. అతడు గదను తీసికొని అశ్వత్థామపై దాడిచేశాడు. అశ్వత్థామ భయపడి రథం దిగి పరుగుతీశాడు. ఏడు వందలమంది రథికులను గదతో చావమోదాడు. దుశ్శాసనుడి కొడుకును యమలోకానికి పంపించాడు. ఇట్లా మదించిన ఏనుగు సరోవరంలో దిగి పద్మాలను చిందరవందర చేసినట్లు పద్మవ్యూహ రక్షకులైన మహావీరుల నందరినీ మహాసంక్షోభంలో ముంచాడు. అభిమన్యుడి చేత అవమానించబడినవారంతా అన్యాయంగా అతడిని చంపటానికి ఏకమయ్యారు. లోతైన నీటిలో దిగిన గజాన్ని బోయలు దయమాలి కొట్టి చంపినట్లు వీరులందరూ అభిమన్యుడిని చుట్టుముట్టి ఆయుధాలతో కొట్టి చంపారు. అపరాద్రిపై అస్తమించిన సూర్యబింబంవలె, అడవినంతా కాల్చి చల్లారిన కార్చిచ్చువలె, అలలు ఎండబారిన మహాసముద్రంవలె, నేలమీద పడిన చంద్రబింబంవలె - అరివీర భయంకరంగా యుద్ధం చేసిన అభిమన్యుడు నేలకొరిగాడు. రక్తసిక్తమైన ఆ నేలమీద పడి ఉన్న అభిమన్యుడు యోగనిద్రలో ఉన్న విష్ణువువలె వెలుగొందాడు. "పెక్కండ్రు గూడి ఇమ్మెయి నొక్కనిఁ జంపుట అధర్మ మహో!" - అని దిక్కులు పిక్కటిల్లేటట్లు భూత సమూహాలు కేకలు వేశాయి.

అభిమన్యుడి మరణానికి శోకించని మానిసి లేడు. అతడి పరాక్రమాన్ని కీర్తించని వీరుడు లేడు. ధర్మరాజు శోకం కట్టలు తెగిపోయింది. వ్యాసమునీంద్రుడు వచ్చి అతడిని ఊరడించాడు. శోకోపశమనంకొరకు సువర్ణష్ఠీవి చరిత్రాన్ని చెప్పాడు. షోడశ మహారాజుల చరిత్రలు వినిపించాడు. వారందరూ కాలంతీరిపోయారు కాబట్టి స్థిరంకాని శరీరం కొరకు వివేకవంతులు విషాదం పొందకూడదని బోధించాడు.

సాయంకాలానికెల్ల సంశప్తకులను సంహరించి సవ్యసాచి శిబిరానికి తిరిగివస్తూ అపశకునాలను గమనించి ఏదో కీడు జరిగి ఉంటుందని అనుమానించాడు. స్కంధావారానికి చేరాడు. దీనవదనాలతో ఉన్న తనవారిని చూచాడు. వారిలో అభిమన్యుడు కానరాలేదు. 'ద్రోణుడు పన్నిన పద్మవ్యూహాన్ని భేదించటానికి ధర్మరాజు అభిమన్యుడిని పంపలేదు కదా! వాడికి ఛేదించటం వచ్చుకాని, వీరులు చుట్టుముట్టినప్పుడు విడిపంచుకొనటం తెలియదు. మీ ఉపాయం మాసిపోను! నా కొడుకును రణభూమికి అర్పించలేదు కదా! చెప్పండి. వాడు లేకుండా నే నెట్లా బ్రతికేది?' అని ఆవేదనపడుతూ, నిజం తెలిసికొని,

'హా! యను, ధర్మరాజతనయా! యను, నన్నెడఁబాయ నీకుఁ జ
న్నే? యను, తల్లి నేపఁజనునే! యనుఁ, గృష్ణుఁడు వీఁడె వచ్చె రా
వే! యను, నొంటి వోక తగవే! యను, నేగతిఁ బోవువాఁడ నే
నో యభిమన్యుఁడా! యనుఁ బ్రియోక్తుల నుత్తరఁ జేర్పవే! యనున్'.

ఇట్లా అనేక విధాల ప్రియపుత్రుడి కొరకు విలపించి విలపించి అర్జునుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు - 'భీముడు దగ్గర లేడా? బాలుడిని ఒంటరిగా పంపారా? ద్రుపదుడు, సాత్యకి, విరటుడు - వీరంతా ఎక్కడికి పోయారు? ఇందరు ఉండగా అభిమన్యుడు

చనిపోవటానికి కారణం ఏమిటి? చనిపోయాడు సరే, యుద్ధంలో వెనుకాడకుండా విక్రమాన్ని ప్రకటించి పేరు పొందాడా? పలువురు తనను చుట్టుముట్టి అస్త్రశస్త్రాలతో బాధిస్తున్నప్పుడు తోడుపడేవా రెవ్వరూ లేక నాన్నా! నాన్నా! అని ఎన్నిసార్లు నన్ను పిలిచి ఉంటాడో! తప్పు, తప్పు నేను పొరపాటన్నాను. గోవిందుడి మేనల్లుడు యుద్ధంలో ఓడతాడా? మిన్ను మీదపడ్డా బాహాగర్వాన్ని వదలుతాడా? అని పలురకాల ప్రశ్న పరంపరలు కురిపించాడు పార్థుడు. ధర్మజుడు జరిగినదంతా వివరంగా చెప్పాడు. అభిమన్యుడికి భీమాదుల సహాయం అందకపోవటానికి సైంధవుడడ్డగించటమే కారణమని స్పష్టం చేశాడు. అర్జునుడు సైంధవకృత్యానికి మండిపడి అతడిని చంపుతానని భయంకర శపథం చేశాడు.

‘ అనిమిషదైత్య కింపురుషు లాదిగ నెవ్వరు వచ్చి కాచినం
దునుముదు నెల్లి సైంధవునిఁ దోయజమిత్రుఁడు గ్రుంకకుండ ము
న్న నరవరేణ్య! యిత్తెఱఁగు నా కొనరింపఁగ రాకయున్న నే
ననలము సొచ్చువాఁడ నృపులందఱుఁ జూడఁగ గాండివంబుతోన్’.

శపథంతో పాటు అర్జునుడు గాండీవజ్యారావాన్ని మ్రోగించాడు. పద్మనాభుడు పాంచజన్యాన్ని పూరించాడు.

అర్జునుడి ప్రతిజ్ఞ కౌరవ స్కంధావారంలో ప్రకంపనలు కలిగించింది. సైంధవుడు ప్రాణభయంతో గజగజలాడిపోయి పారిపోవ ప్రయత్నించాడు. ద్రోణాదులది క్షత్రియధర్మం కాదని, తమ రక్షణలో తన కెట్టి కీడు రానీయమని మాట ఇచ్చి మోహరంలో నడుమ భద్రంగా రక్షించటానికి నిశ్చయించారు.

అర్జునుడు తన ప్రతిజ్ఞ ఏ విధంగానైనా సఫలమయ్యేటట్లు వరమిమ్మని శ్రీకృష్ణుడిని ప్రార్థించాడు. నరనాయణు లిద్దరూ క్రోధపూరిత హృదయాలతో బుసలుకొట్టేపాములవలె కనుపించారు. వారి రూపాలు చూచి దేవతలు భయపడ్డారు. ప్రకృతి సంక్షోభించింది. కౌరవస్కంధావారంలో అనేక దుర్నిమిత్తాలు కలిగాయి.

ఆనాటికి ఒకరోజు ముందే శిబిరానికి సుభద్ర, పాంచాలి, ఉత్తర వచ్చి ఉన్న సంగతి తెలిసి అర్జునుడు శ్రీకృష్ణుడిని వారి నోదార్చటానికి పంపాడు. శ్రీకృష్ణుడు వారివద్దకు పోయి పుత్రశోకాతుర అయిన సుభద్రను ఎంతో ప్రయత్నంమీద ఓదార్చాడు. మిగిలినవారిని తగిన మాటలతో శాంతింపజేశాడు. శ్రీకృష్ణుడు అర్జునుడిని వెంట తీసికొని వెళ్ళాడు. తన మందిరంలో శ్రీకృష్ణుడు కాళ్ళు కడిగికొని, ఆచమనంచేసి, ఒకదర్భశయ్య నలంకరించి అక్షతగంధపుష్పాలతో పూజించి ఆయుధాల నక్కడ చుట్టూ ఉంచి అర్జునుడిని అక్కడ ఉండుమని చెప్పాడు. నిత్యం రాత్రివేళ చేసే దేవపూజ ఇంతకుముందు చేయలేదని అతడికి జ్ఞాపకం చేశాడు. అర్జునుడు పాదప్రక్షాళనం చేసికొని శుచి అయి, నిత్యమూ చేసే శివపూజను షోడశోపచార సమన్వితంగా శ్రీకృష్ణుడికి అర్పించాడు. జనార్దనుడు సంతోషించి అర్జునుడిని అక్కడే ఉండుమని నియోగించి, తగిన రక్షణను అతడికి కల్పించాడు. అర్జునుడికి శుభం కోరుతూ ఉంటానని శ్రీకృష్ణుడు చెప్పి తన శయ్యపై పరుండి చాలసేపు దీర్ఘయోచనలో మునిగిపోయాడు. తెల్లవారితే నరనారాయణు లేవిధంగా సైంధవవధను నిర్వహిస్తారో, ఎటువంటి కీడు కలుగుతుందో! అని కలవరపడుతూ ఉభయస్కంధావారాలలో అందరూ తమ పూర్వపుణ్యఫలాలన్నీ సైంధవవధకు అర్జునునికి తోడ్పడాలని గట్టిగా అంటూ, శుభాన్నిచేకూర్చే పవిత్రగ్రంథాలను పఠిస్తూ కంటిమీద కునుకు లేకుండా తెల్లవార్చారు.

శ్రీకృష్ణుడు దారుకుడితో అర్జునుడి ప్రతిజ్ఞ విషయం చెప్పి అంతటి అసాధ్యమైన ప్రతిజ్ఞను తీసికొన్న అర్జునుడిని తానెట్లాగైనా కృతార్థుడిని చేస్తానని చెప్పాడు. తనలో సగభాగం అర్జునుడనీ, అతడు బ్రతికితేనే తాను బ్రతుకుతాననీ తెలిపి సూర్యాస్తమయంలోగా సైంధవవధ జరిపించి పాండవకీర్తిని నిలుపుతానని ప్రతిజ్ఞ చేశాడు. మరునాడు రథాన్ని సర్వసన్నాహం చేసి ఉంచుమనీ, తన పాంచజన్యనాదం సంకేతంగా విని అ రథాన్ని రణస్థలికి తీసికొని రమ్మని శ్రీకృష్ణుడు దారుకుడితో చెప్పాడు. సకల భూతాలు తన శక్తిసామర్థ్యాలను, పాండవులపట్ల తనకున్నప్రేమనుతెలుసుకొనే విధంగా రేపు యుద్ధరంగంలో తానే రౌద్రరసాకారంతో విజృంభించి, సైంధవుణ్ణి సూర్యాస్తమయంలోగా సంహరిస్తానన్నాడు. అందుకు దారుకుడు మీరు ఆ విధంగా చేయవలసిన అవసరం ఉండదని, మీరు సారథ్యం వహిస్తూ శుభాన్నికూర్చే స్థితిని కలిగిస్తుంటే అర్జునుడు అడ్డుకోలేని వీరుడు ఆ వైపు ఎవడున్నాడు అని సవినయంగా, చాకచక్యంగా మాట్లాడి శ్రీకృష్ణుని ఆవేశాన్ని తొందరపాటును తగ్గించాడు. మీ ఆజ్ఞను పాటిస్తానని వెళ్ళాడు.

అర్జునుడు శ్రీకృష్ణుడు అమర్చిన దర్భశయ్యమీద పరున్నాడు. ప్రతిజ్ఞానిర్వహణాన్ని గురించి ఆలోచిస్తూ శోకనిద్రా పరవశుడయ్యాడు. కలలో శ్రీకృష్ణు డతని సమీపానికి వచ్చాడు. అతడు శయ్యనుండి లేచి కృష్ణుడికి నమస్కరించి తన శయ్యమీద

కూర్చుండబెట్టాడు. శ్రీకృష్ణుడు అర్జునుడికి శోకభావాన్ని తొలగించి ఉత్సాహాన్ని పెంచాడు. నరుడి శుభాన్ని కోరి అతడిని తూర్పుదిక్కు మొగమై కూర్చొనుమన్నాడు. పరమేశ్వరు డిచ్చిన పాశుపతాస్త్రాన్ని సమంత్రకంగా ఆరాధించి పరమశివుడిని ధ్యానించుకొమ్మని నిర్దేశించాడు. అత డట్లాగే చేశాడు. శ్రీకృష్ణుడు అర్జునుడి చేతిని పట్టుకొని గగనపథంలోకి తీసికొనిపోయాడు. అనేక లోకాల ఆవల ఉన్న కైలాసాన్ని చేరారు. అందులో పరమేశ్వరుడిని దర్శించి ప్రార్థించాడు. అర్జునుడు శ్రీకృష్ణుడిని పూజించిన పూజాద్రవ్యాలు శివుడి శరీరంమీద చూచి శివకేశవాభేద భక్తి పారవశ్యాన్ని పొందాడు. పాశుపతాస్త్ర మంత్ర సిద్ధిని ప్రసాదించ వేడుమని అర్జునుడిని శ్రీకృష్ణుడు ప్రోత్సహించాడు. పార్థుడు పరమేశ్వరుడిని ప్రార్థించగా ఆ మహాదేవు డనుగ్రహించాడు. శివభటులు ఆతడిని ఒక దివ్యసరస్సువద్దకు చేర్చారు. అందులోనుండి రెండు విషసర్ప జిహ్వాలజ్వాలలు రెండు వెలువడ్డాయి. అర్జునుడు శుచి అయి ఆ మహాసర్పాలకు నమస్కరించి, శతరుద్రీయాన్ని మనసులో జపిస్తూ శివుడిని ధ్యానించాడు. ఆ సర్పాలు రెండూ క్రమంగా విల్లుగా, బాణాలుగా మారాయి. శివుడి పార్శ్వంనుండి ఒక మహాతేజస్వి అయిన బాలుడు వెలువడి వచ్చి ఆ బాణప్రయోగవిధానాన్ని ప్రదర్శించి చూపించాడు. దానిని గ్రహించిన అర్జునుడికి మంత్రస్వరూపాన్ని అనుగ్రహించాడు. ఇక పాశుపతాస్త్రానికి తిరుగులేదని మహాదేవుడు ప్రకటించాడు. ఇక తన ప్రతిజ్ఞానిర్వహణకు తిరుగులేదని అర్జునుడు సంతోషించాడు. నరనారాయణు లిద్దరూ శివుడికి నమస్కరించి తిరిగి వచ్చారు. తెల్లవారింది. అర్జునుడు ధర్మరాజువద్ద కేగి రాత్రి జరిగిన స్వప్నవృత్తాంతాన్ని తెలిపాడు. పాండవులందరూ శ్రీకృష్ణుడిని పరమాత్మగా భావించి ప్రస్తుతించారు. గోవిందుడు వారికి విజయం తథ్యమని అభయం అందించాడు.

ద్రోణుడి నాల్గవనాటి యుద్ధం:

ధర్మరాజ రక్షణకు సాత్యకిని నియోగించి సైంధవవధకు విజయుడు విజృంభించాడు. ద్రోణుడు శకటవ్యూహాన్ని పన్నాడు. దానికి పడమటిభాగంలో గర్భవ్యూహంగా పద్మవ్యూహం పన్నాడు. దాని మధ్యభాగం మొదలుకొని సేనాముఖం వరకు సూచీ వ్యూహాన్ని అమర్చాడు. సూచీవ్యూహంలోని కేంద్రస్థానంలో సైంధవుడిని నిలిపాడు.ద్రోణుడు సూచీవ్యూహం పన్నాడు. అర్జునుడు మొట్టమొదట ద్రోణుడికి నమస్కరించి ఆశీస్సులను కోరాడు. ఆచార్యుడు నవ్వి 'నన్ను గెలవకుండా సైంధవుడి దరికి ఎట్లా చేరగలవు?' అని చిరునవ్వు నవ్వాడు. దానిని అనుమతిగా గ్రహించి విజయుడు యుద్ధాన్ని ఆరంభించి ఆచార్యుడిని అతిక్రమించి మొగ్గరంలో ప్రవేశించాడు. కర్కశంగా యుద్ధం చేస్తూ శ్రుతాయుధాదులను, విందానువిందులనూ పోరులో చంపాడు. ద్రోణుడు అర్జునుడి పట్ల పక్షపాతాన్ని చూపుతున్నాడని దుర్యోధనుడు ఆచార్యుడిని నిందించాడు. ఆచార్యుడు ఆ మాటలకు వెగటు ప్రకటించాడు. అర్జునుడి వెంట తానూ వస్తే సేనాముఖం వికలమై పాండవులను నిగ్రహించటం, సైంధవుడిని రక్షించటం కష్టమని పేర్కొని, అర్జునుడి పరాక్రమాన్ని ప్రశంసించాడు. సమవయస్కుడైన గాండీవిని దుర్యోధనుడినే ఎదురించుమని ఒక సహజ కవచాన్ని ప్రసాదించాడు. దాని ప్రభావంతో దుర్యోధనుడు నిర్భయంగా అర్జునుడిపై దాడి చేశాడు. ద్రోణుడు పాంచాలవీరులవైపు పోరు సాగించాడు.

ద్రోణుడు ధృష్టద్యుమ్నుడిని దాటి పాండవసైన్యాన్ని చంపనారంభించాడు. ధృష్టద్యుమ్నుడు విజృంభించాడు. కాని, నిపుణమైన యుద్ధంలో ద్రోణుడు అతడిని విరథుడిని చేసి, బాణప్రయోగంతో చంపబోయాడు. అంతలో సాత్యకి అడ్డుపడి ధృష్టద్యుమ్నుడిని రక్షించాడు. దానిని సహించక ద్రోణుడు సాత్యకిపై బాణాలవర్షం కురిపించాడు. ధృష్టద్యుమ్నుడు ద్రోణుడి విల్లు విరిచాడు. ఇరువురి నడుమ అస్త్రశస్త్రాలతో పోరు ఘోరమయింది. ధర్మజ భీమ నకుల సహదేవులు సాత్యకికి తోడుగా వచ్చారు. అంతలో ధృష్టద్యుమ్నుడు మరల విజృంభించి వీరందరినీ దాటి ముందుకు సాగి ద్రోణుడి నెదుర్కొన్నాడు. ఈ విధంగా ఇరువర్గాలవారూ యుద్ధం చేస్తూ ఉండగా అర్జునుడు తన రథాన్ని సైంధవుడున్న దెసకు నడుపుమని శ్రీకృష్ణుడిని కోరాడు. రథం ముందుకు సాగిపోతున్నది. వారికి విందానువిందులు అడ్డపడి పోరు సాగించారు. వారిని అర్జునుడు సంహరించాడు. అప్పటికి అర్జునుడి రథాశ్వాలు బాగా దప్పిగొన్నాయి. వాటికి దప్పిక తీరిస్తే విజయుడికి విజయం తథ్యమని కృష్ణుడు సూచించాడు. అర్జునుడు దివ్యాస్త్రాలతో ఒక సరోవరాన్ని కల్పించాడు. కృష్ణుడు గుర్రాలకు నీరుపట్టి, ఒడలు తట్టి, రథానికి కట్టి సిద్ధపరిచాడు. పోరుసాగింది. కవచధారణశక్తిచేత దుర్యోధనుడు అర్జునాదులపై అద్భుత విజృంభణం సాగించాడు. ఆ బలానికి కారణమేమిటో గ్రహించిన అర్జునుడు ఇంద్రుడిచ్చిన మహాస్త్రంతో ద్రోణుడు దుర్యోధనుడి కిచ్చిన కవచాన్ని ఛేదించటానికి ప్రయోగించాడు. అశ్వత్థామ దానిని

మరొక మహాస్త్రంతో వమ్ముచేశాడు. అప్పుడు అర్జునుడు ప్రయోగించిన బాణాలతో రారాజు విరథుడయ్యాడు. అతని అరచేతి నిండా గాయాలయ్యాయి. దుర్యోధనుడు అవివేకంగా ద్రోణుడిచ్చిన కవచం నిష్ఫలమని భావించి తనకుతానే దాన్ని తొలగించుకొని మరొక కవచాన్ని ధరించాడు. అది అర్జునుడికి ఎంతో అనుకూలించింది. అతడు ముందుకు వెళ్ళాడు.

అర్జునుడిపై వృషసేనాది వీరులు ఎనిమిదిమంది క్రమ్ముకొని యుద్ధం ప్రారంభించారు. అర్జునుడు వారిని సంహరించి కౌరవసైన్యాన్ని కకావికలు చేశాడు. అశ్వత్థామ విజృంభించి క్రూరబాణాలను పరచాడు. అర్జునుడికీ ఆతడికీ మధ్య శస్త్రాస్త్రయుద్ధం సాగింది. అట్లే కౌరవపాండవ వీరుల మధ్య ద్వంద్వయుద్ధాలు సాగాయి. ధర్మరాజు ద్రోణుడితో తలపడి రథాన్ని కోల్పోయి నేలపై దిగి నిరాయుధుడై చేతులు పైకెత్తి ఊరుకొన్నాడు. అతడిపై బాణాలు ద్రోణుడు సంధించలేక చుట్టూ ఉన్న గుర్రాలను, ఏనుగులను సంహరించాడు. అంతలో సహదేవుడు ధర్మజుడిని తన రథంమీద ఎక్కించుకొని తొలగిపోయాడు. ద్రోణుడు పాండవసైన్యాన్ని చెండాడటం మొదలుపెట్టాడు.

ఘటోత్కచుడు తనసేనతో కలిసి ద్రోణుడితో యుద్ధానికి పూనుకొన్నాడు. అతడిమీద అలంబుసుడు విరుచుకొనిపడ్డాడు. ఇరువురి నడుమ మాయాయుద్ధం మహా భయంకరంగా సాగింది. ఘటోత్కచుడు అలంబుసుడిని చంపి ధర్మరాజుకు సంతోషం కలిగించాడు.

అర్జునుడి ప్రతిజ్ఞ అందరికీ ముఖ్యాంశమై నిలిచింది. అతడికి అండదండలుగా నిలిచి సాయపడటానికి సాత్యకిని పంపాడు ధర్మరాజు. అతడు మొగ్గరంలో ప్రవేశించి దుశ్శాసనాదులను ఓడించి ముందుకు సాగాడు. అతడికి తోడుగా భీముడు ద్రోణాదుల నతిక్రమించి అర్జునుడివైపు దాడి సాగించాడు. కర్ణుడు భీమసేనుడిని ఢీకొని ఓడించి, అధిక్షేపించి, బాధించి, చివరకు చంపకుండా వదిలాడు. కర్ణార్జునులు ద్వంద్వయుద్ధంలో తారసిల్లారు. పోరు ఘోరంగా సాగింది. దుర్యోధనాదులు కర్ణుడికి సాయంగా నిలిచి యుద్ధం చేయసాగారు. వారిని బలహీనపరచి అర్జునుడు ముందుకు పోగా అశ్వత్థామ శల్య వృషసేనులు సైంధవుడికి పెట్టని కోటగా నిలిచారు.

దుర్యోధనుడు ద్రోణుడిని తూలనాడాడు. 'అర్జునుడు, సాత్యకి, భీముడు మొదలైనవారు కౌరవసేనను చీకాకుపరచి సైంధవుడివైపు వేగంగా దూసికొనిపోతున్నారు. యుద్ధంలో నీవు ఓడటమంటే సముద్రం ఇంకిపోవటం వంటిదే కదా! సాత్యకి నిన్ను జయించాడని జనులు భావించటం మంచిదా? ఈ విధంగా నీవు వ్యవహరించటం మా దురదృష్టం. ఆ మాట అటుండనిమ్ము నీ పరాక్రమం, నీతి చాతుర్యం ప్రకాశించేటట్లు ఈ సంక్షోభంనుండి బైటపడే ఉపాయం చెప్పుము' - అని నిలదీసి అడిగాడు. అందుకు ద్రోణుడు ఇట్లా అన్నాడు. 'నాకు రెండువైపులవారూ ఒక్కటే. కాని, మనసేన కేర్పడిన విపత్తును నాకు చేతనైనంతవరకు తొలగించే యత్నం చేస్తాను. రారాజా! నీకిప్పుడు సైంధవుడిని కాపాడుకొనే పెద్ద పందెం మిగిలింది. ఈ యుద్ధమనే జూదంలో నీవు దానిని కాపాడుకొనాలి. కాని, నీకు ఇప్పుడు శకుని పనికిరాడు. అతడివలన నీకు కలిగిన లాభం తాత్కాలికం. ఇప్పటి గెలుపే సుస్థిరమైనది. కాబట్టి నీవు కర్ణాదులను సహాయం తీసికొని అర్జునుడితో యుద్ధంచేసి విజయాన్ని సాధించుము. నేను సేనాముఖంలో నిలిచి మిగిలినవారి నందరినీ అడ్డగిస్తాను. నేను నీతో కలిసి రావటం కార్యం కాదు నీవు పొమ్ము' అని నిక్కచ్చిగా చెప్పాడు.

దుర్యోధనుడు యుద్ధం సాగించాడు. కర్ణుడు సాత్యకితో యుద్ధంచేసి ఓడిపోయాడు. అర్జునుడు విజృంభించి కౌరవసేనను ఎదుర్కొన్నాడు. దుర్యోధన కర్ణ వృషసేన శల్య కృపాశ్వత్థామలందరు ఏకమై అర్జునుడిని చుట్టుముట్టారు. వారిని పార్థుడు పెక్కుమ్ములతో స్రుక్కించాడు. కర్ణుడి ప్రాణాలు తీయగల వాడిబాణాన్ని పార్థుడు వేయగా దానిని అశ్వత్థామ వమ్ముచేశాడు. కర్ణార్జునులకు ద్వంద్వయుద్ధం బలంగా సాగింది. రారాజు తనవారిని కర్ణుడికి సాయంచేయుడని ఎలుగెత్తి పిలిచాడు. అర్జునుడు వారందరికి మధ్యాహ్న సూర్యుడివలె దుర్నిరీక్షుడై బాణాలతో చెండాడాడు. జయద్రథుడిని ఢీకొన్నాడు. అయినా తెంపుచేసి కృపాశ్వత్థామ శల్య వృషసేనులు సైంధవుడికి రక్షగా దడిగట్టినట్లు నిలిచి పోరు సాగించారు. అర్జునుడు సైంధవుడిని చంపే అవకాశం దొరకక అవుడుగరుస్తూ ప్రొద్దువైపు చూచాడు. శ్రీకృష్ణుడు దానిని గమనించి 'అర్జునా! నీవు వెనుకాడక ముందుకు సూటిగా సాగుము. భయపడవద్దు. సూర్యుడు పడమటి కొండపైకి చేరబోతున్నాడు. దీనికి నేను ఒక ఉపాయం కల్పిస్తాను. అప్పుడుగాని సైంధవుడు చావడు' అని చెప్పి, మాయాతిమిరంతో సూర్యబింబాన్ని కప్పివేశాడు. సూర్యుడస్తమించాడని

కౌరవవీరులు ఉప్పొంగిపోయారు. సైంధవుడు తలఎత్తి పడమరవైపున ఆశ్చర్యంతో చూస్తూ నిలిచాడు. శ్రీకృష్ణుడి సూచనమేరకు అర్జునుడు ఆ అదనెరిగి వాడిబాణంతో సైంధవుడి తలను తెగనరికాడు. దానిని క్రిందపడకుండా ఆకాశంలోనే చిత్రవిచిత్ర బాణవిద్యానైపుణ్యంతో నిలుపుతూ వచ్చాడు. శ్రీకృష్ణుడు మాయా తిమిరం తొలగించాడు. సూర్యు డస్తమించకుండానే సైంధవుడిని చంపి అర్జునుడు తన శపథాన్ని నిలపుకొన్నాడు. ఆ తరువాత శ్రీకృష్ణుడి నిర్దేశంతో పాశుపతాస్త్రాన్ని ప్రయోగించి సైంధవ శిరాన్ని అతడి తండ్రి అయిన వృద్ధక్షత్రుడి ఒళ్ళో పడేటట్లు చేశాడు. అత డాశిరస్సును నేలమీద పడవేశాడు. వెంటనే వృద్ధక్షత్రుడి శిరస్సు వేయి వ్రక్కలైపోయింది. సైంధవుడి శిరం ఎవరివలన నేలమీద పడుతుందో అతడి శిరస్సు వేయి వ్రక్కలౌతుందని వృద్ధక్షత్రుడి శాపమే ఉన్నది. అతడి శాపంతోనే అతడిని దండింపజేసి, అర్జునుడికి ఆ కీడు కలుగకుండా శ్రీకృష్ణుడు చాతుర్యంతో రక్షించాడు. ధర్మజుడు సంతసించాడు.

ద్రోణుడి అయిదవనాటి యుద్ధం:

అయిదవనాటి యుద్ధం ప్రారంభించేముందు ద్రోణుడు పాంచాలురను చంపనిదే కవచం విడువనని శపథం చేసి, యుద్ధంలో విరాట ద్రుపదులను కడతేర్చాడు. భీమసేనుడు దుర్మద దుష్కర్ణులను చంపాడు. అశ్వత్థామ అంజనపర్వుడిని యుద్ధంలో అంతమొందించాడు. భీమకుమారుడైన ఘటోత్కచుడు విజృంభించి అశ్వత్థామను ఎదుర్కొన్నాడు. ఇరువురు ఘోరంగా యుద్ధం చేశారు. అశ్వత్థామ ఒక అక్షౌహిణి సైన్యాన్ని చంపి ఘటోత్కచుడిని కాలదండంవంటి బాణంతో మూర్ఛపడేటట్లు చేశాడు. అతడిని ధృష్టద్యుమ్నుడు యుద్ధరంగంనుండి రథంమీద తప్పించాడు. దానిని చూచి అశ్వత్థామ సింహగర్జనం చేసి విజృంభించాడు. ధర్మజ భీమ సాత్యకు లొక్కటై అతడిని ఎదుర్కొన్నారు. బాహ్లికుడు సాత్యకిని డీ కొన్నాడు. భీముడు ఉద్రిక్తుడై ముద్గరంతో బాహ్లికుడి తల పగులగొట్టి చంపాడు. దుర్యోధన ప్రేరితుడైన ద్రోణుడు ధర్మరాజుతో తలపడ్డాడు. ఇరువురూ దివ్యాస్త్రాలను ప్రయోగించి ప్రతాపాన్ని ప్రదర్శించారు. ధృష్టద్యుమ్ను డడ్డుకొని ద్రోణుడితో యుద్ధం సాగించాడు. భీమార్జునులు అతడికి సాయం చేశారు. కౌరవబలాన్ని గడగడ వణకేటట్లు చేశారు. అప్పుడు దుర్యోధనుడు కర్ణుడిని తన పరాక్రమాన్ని ప్రదర్శించి సేనను కాపాడుమని కోరాడు. కర్ణుడు పాండవులను పరిభవిస్తానని ప్రగల్భాలాడాడు. అందుకు కృపాచార్యుడు అతడి బడాయి మాటలు గమనించి ఉపాలంభించాడు. వారి వాదును మాన్పి దుర్యోధనుడు తానే యుద్ధం చేయటానికి ముందుకు సాగాడు. కృపాచార్యుడి సలహామేరకు అశ్వత్థామ దుర్యోధనుడి సాహసాన్ని మాన్పాడు, కృతవర్మాదులు యుద్ధభారాన్ని వహించారు.

సాత్యకి సమరంలో సింహంవలె చెలరేగాడు. సోమదత్తుడిని ద్వంద్వబాణ యుద్ధంలో చంపాడు. అదే సమయంలో పెక్కురు కౌరవ పాండవవీరుల నడుమ ద్వంద్వయుద్ధాలు ప్రవర్తిల్లాయి. కర్ణుడు సహదేవుడిని ఓడించి అవమానించాడు. అశ్వత్థామకూ ధృష్టద్యుమ్నుడికీ, సాత్యకికీ కర్ణ దుర్యోధనులకూ పోరు విరివిగా సాగింది. మాయాయుద్ధంలో ఘటోత్కచుడు అలంబుసుడు అలాయుధుడు అనే రాక్షసులను సంహరించాడు. ఆపై కౌరవవీరులమీద విరుచుకొనిపడ్డాడు. అతడి పోరు మరికొంతసేపు జరిగితే కౌరవసేనలో జనం మిగిలేటట్లు కనబడలేదు. అప్పుడు కౌరవవీరులూ, దుర్యోధనాదులూ 'శక్తిని ప్రయోగించి ఘటోత్కచుడిని చంపు'మని కర్ణుడిని కోరారు. 'ముందు ఘటోత్కచుడి చావునుండి బ్రతికితే అర్జునుడిని చంపే ఉపాయం ఆలోచించవచ్చు'నని భావించారు. గత్యంతరం లేక కర్ణుడు ఇంద్రదత్తమైన శక్తిని ప్రయోగించి ఘటోత్కచుడిని వధించాడు. పాండవపక్షంలో అందరూ దుఃఖించారు. కృష్ణుడు మాత్రం ఘటోత్కచుడివలన ఇంద్రశక్తి వమ్మై అర్జునుడి ప్రాణ రక్షణచేసిందని హర్షించాడు. క్రుద్ధులైన భీమ నకుల సహదేవులూ, అర్జునుడూ కలిసి ద్రోణుడిపై విజృంభించారు. ద్రోణార్జునుల మధ్య శస్త్రాస్త్ర ద్వంద్వయుద్ధం భయంకరంగా సాగింది. ఇరువురిలో గెలుపోటములు నిర్ణయించటం అసాధ్యమై యుద్ధం సాగుతూపోయింది. శ్రీకృష్ణుడు ధర్మజ భీముల దరికి రథం పోనిచ్చి వారికి వినవచ్చేటట్లు అర్జునుడితో ఇట్లా అన్నాడు. 'ద్రోణుడు దేవదానవులకు కూడా జయించశక్యం కానివాడు. ఇతడిని అంతమొందించాలంటే ఒక ఉపాయం ఉన్నది. 'నీ కొడుకు హతు డయ్యా'డనేమాట మన మంటే అతడు వింటే వెంటనే ఆయుధాలను దిగవిడిచి నిశ్చేష్టుడై నిలిచిపోతాడు. అప్పు డతడిని చంపవచ్చును. అంతకంటె అనువైన ఉపాయం మరొకటి లేదు' అన్నాడు. అందరూ అది మంచి ఉపాయమని మెచ్చుకొన్నారు. కాని, అర్జునుడు దాని కంగీకరించలేదు. ధర్మరాజు విషాదంతో

మిన్నకుండిపోయాడు. అప్పు డద నెరిగి భీముడు తానుచంపిన అశ్వత్థామ అనే ఏనుగును మిషగాచేసికొని అశ్వత్థామ హతమయ్యెనని బిగ్గరగా ద్రోణుడు వినేటట్లు అరచాడు. ఆ మాటలు విని ద్రోణుడి హృదయం ఝల్లుమన్నది. అశ్వత్థామ పరాక్రమాదులను స్మరించి భీముడి మాటలు నమ్మక ధృష్టద్యుమ్నుడిపై దారుణంగా యుద్ధం ప్రారంభించాడు.

అప్పుడు ఆకాశమార్గాన విశ్వామిత్ర, జమదగ్ని, భరద్వాజ, గౌతమ, కశ్యప, వసిష్ఠాత్రి ప్రభృతి మునివరులందరూ ద్రోణుడిని కనుపించి 'ద్రోణా! నీవు బ్రాహ్మణుడవు. వేదవేదాంగాలు చదివినవాడవు. నీకు యుద్ధం చేయటం ధర్మమా? ఇంతకుముందు చేస్తే చేశావు కాని, నీకు కాలం పూర్ణమయింది. కాబట్టి నీవు యుద్ధం మానటం మంచిది' అని హెచ్చరించి అంతర్ధానమయ్యారు. ద్రోణుడు మునుల మాటలను గురించి యోచించాడు. భీమసేనుడి మాటలు తలపోశాడు. ధృష్టద్యుమ్నుడిని కనుగొన్నాడు. మనస్సు వికలమైపోగా శోకాయత్తుడయ్యాడు. తన కొడుకు చచ్చినవార్త నిజమా కాదా అని ధర్మరాజు నడిగి తెలిసికొనదలచాడు. అడిగాడు.

ఆ సమయంలో శ్రీకృష్ణుడు ధర్మరాజును ఈ విధంగా హెచ్చరించాడు. 'యుధిష్ఠిరా! ఈనాటి అపరాహ్ణం వరకు ద్రోణుడు యుద్ధం చేస్తే మనవైపు ఇక ఎవ్వరూ మిగలరు. ఇది నిజం. మమ్ములను ద్రోణుడి బాణాలకు బలిపెట్టకుండా సముచితంగా కాపాడుకొమ్ము. ప్రాణరక్షణ సమయంలో అసత్యవచనదోషం లేదు. అశ్వత్థామ చచ్చె నని చెప్పుము!' అన్నాడు. భీముడు కూడా తాను పలికిన మాటలు అసత్యాలు కావని చెప్పాడు. భీముడు మాళవరాజైన ఇంద్రవర్మ గజాన్ని - అశ్వత్థామ పేరుగల దానిని - చంపి గజంమీద పెట్టి 'అశ్వత్థామా హతః' అని పలకటం జరిగిందని చెప్పి ధర్మరాజును కూడా గజంమిషతో అశ్వత్థామ మరణవార్తను తెలియజెప్పుమని సూచించాడు. వారిద్దరి మాటలు విని ధర్మరాజు ఏమైతే అది ఔతుందని సమ్మతించి, ఉపాయ మాలోచించి 'అశ్వత్థామా హతః' అనే వాక్యాన్ని ధర్మజుడు ఎలుగెత్తి పలికి 'కుంజరః' అనే పదాన్ని వాద్యాల చప్పుళ్ళలో కలిసిపోయేటట్లు మెల్లగా పలికాడు. ఆ మాట విని ద్రోణుడు అస్త్రసన్న్యాసం చేసి యోగాసనంలో రథంమీద కూర్చుండి తనువు త్యజించాడు. ధృష్టద్యుమ్నుడు-ధర్మరాజాదులు వారిస్తున్నా వినకుండా - ద్రోణుడి తలజుట్టును నిటారుగా పట్టి కుత్తుకను కత్తితో కోశాడు. ద్రోణుడి తేజస్సు ఆరిపోయింది.

ధృష్టద్యుమ్నుడి చర్యను అందరూ గర్హించారు. ఆ విషయం తరువాత తెలిసికొన్న అశ్వత్థామ కోపోద్రిక్తుడై పాండవసైన్యాన్ని మట్టుపెట్టటానికి పూనుకొని, సైన్యసన్నాహంతో యుద్ధభూమిలో విజృంభించాడు. పాండవ సైన్యంమీద నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు. శ్రీకృష్ణుడి సూచనపై పాండవవీరులందరూ నేలపై దిగి, ఆయుధాలు వీడి, నమస్కరించి, నారాయణశక్తిని భక్తితో గౌరవించారు. భీముడు మొదట తిరగబడినా కృష్ణార్జునుల హితోక్తులతో నారాయణాస్త్రానికి తలవంచాడు. నారాయణాస్త్రం ఉపశమించింది. అందరూ ప్రాణాలు దక్కించుకొన్నారు. అశ్వత్థామ అంతటితో ఆగక ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. అర్జునుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి దానిని వమ్ముచేశాడు. దానితో అశ్వత్థామ చేసేదిలేక రణరంగం నుండి తిరిగిపోయాడు. అతడి ఎదుట వేదవ్యాసుడు ప్రత్యక్షమయ్యాడు. అశ్వత్థామ ఆ మహర్షికి నమస్కరించి గద్గదకంఠంతో 'మునీంద్రా! నా ఆగ్నేయాస్త్రం వృథ అయింది. దానికి కారణ మేమో తెలియదు. సురాసురగంధర్వాదులకు కూడా దుస్సహమైన ఆ అస్త్రం మానవులైన కృష్ణార్జునులను ఎందుకు దహించలేకపోయింది?' అని అడిగాడు.

వ్యాసమహర్షి ఇట్లా చెప్పాడు: 'ఆదిదేవుడైన శ్రీమహావిష్ణువు అఖిలలోక రక్షణార్థం భూలోకంలో జన్మించి మైనాక పర్వతంమీద శివుడిని గూర్చి తపస్సు చేశాడు. పరమశివుడు ప్రత్యక్షం కాగా ఆతడిని అనేకవిధాల ప్రస్తుతించాడు. 'ఇతరులకెవ్వరికీ లేని ప్రభావాన్ని నాకు ప్రసాదించు'మని వరం కోరాడు. పరమేశ్వరుడు కరుణించాడు. సురాసురగంధర్వ కిన్నర గరుడోరగాదులను అవలీలగా గెలువగలిగిన పరమతేజస్సుతో ప్రకాశిస్తూ వర్తించే మహిమ నిచ్చాడు. అస్త్రశస్త్రాలవలనగాని, అగ్నిజలాదులవలనగాని ఎటువంటి కీడు జరుగని మహిమ నిచ్చాడు. యుద్ధంలో శివుడినైన నిర్జించగల మహిమను ప్రసాదించాడు. అందువలన నారాయణుడు అజయ్యుడై ఉన్నాడు. అతడినుండి పుట్టిన నరుడు కూడా ఆ లక్షణాలనే కలిగి ఉన్నాడు. నరుడితో కూడిన నారాయణుడు నిజమాయా విశేషంచేత జగన్మోహనాకారుడై విహరిస్తూ ఉంటాడు. వారిరువురూ దానవులను సంహరించి ధర్మసంస్థాపనం చేయటానికి పుట్టారు. వారే కృష్ణార్జునులు' - అని తెలియచెప్పాడు.

ఆగ్నేయాస్త్రాదులు అశ్వత్థామయందు అసమగ్రం కావటానికి కారణంకూడా వ్యాసుడు చెప్పాడు. అశ్వత్థామ మట్టితో చేసిన శివుని ప్రతిమను అర్చించేవాడు. కృష్ణార్జునులు లింగరూపశివారాధనం చేసేవారు. కాబట్టి అతడికంటె వారు శ్రేష్ఠు లయ్యారని పేర్కొన్నాడు. అశ్వత్థామ పులకితుడై రుద్రుడిని ధ్యానించాడు. కేశవుడిని ప్రస్తుతించాడు. వ్యాసమహర్షికి నమస్కరించాడు. రథమెక్కి స్కంధావారం చేరాడు. కౌరవులు విషణ్ణులయ్యారు. పాండవులు మహానందభరితులయ్యారు.

స్కంధావారంలో రాత్రి వేదవ్యాసుడు అర్జునుడికి ప్రత్యక్షమయ్యాడు. పార్థు డా మహర్షిని పూజించి ఒక ప్రశ్న అడిగాడు. 'మహర్షీ! నేను యుద్ధం చేస్తున్నప్పుడు నా ముందు అగ్నివంటి ఒక మహాపురుషుడు నేలపై కాళ్ళానకుండా నడుస్తూ యోధులనందరినీ ఆతడే సంహరిస్తూ ఉండగా నేను తరువాత వారిని చంపుతూ ఉంటాను. ఆ మహాపురుషు డెవ్వరో నాకు తెలుపుము'.

ఆతడు సర్వలోక ప్రభువైన పరమేశ్వరుడైన రుద్రుడని తెలిపి, అటువంటి మహాదేవుడు అర్జునుడికి ప్రసన్నుడయ్యాడనీ, భక్తపరాధీనుడైన అతడు తానే వీరులను సంహరిస్తూ కిరీటికి కీర్తి కలిగేటట్లు చేస్తున్నాడని తెలిపాడు. సర్వలోక శరణ్యుడైన ఆ దేవదేవుడిని శరణుజొచ్చి సర్వశుభాలను పొందుమని అర్జునుడిని దీవించి వ్యాసమహర్షి అంతర్ధానమయ్యాడు. అర్జునుడు శివధ్యానమగ్ను డయ్యాడు.

- జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రధాన సంపాదకుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ద్రోణపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
సంజయుఁడు యుద్ధభూమికిఁ బోయి మరలివచ్చి యందలి వృత్తాంతంబు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట	7 - 1 - 5	01
ద్రోణాచార్యులకు సర్వసేనాధిపత్యంబు నిర్ణయించుట	7 - 5 - 8	20
ద్రోణాచార్యుని మరణంబు విని ధృతరాష్ట్రుండు పరితపించుట	7 - 8 - 1	27
ద్రోణుఁడు దుర్యోధనునకు ధర్మరాజుం బట్టి యిచ్చునట్లు వరం బిచ్చుట	7 - 11 - 1	35
అర్జునుండు ధర్మరాజుతో ద్రోణునిప్రతిజ్ఞకు వెఱవకుండునట్లు సెప్పుట	7 - 12 - 7	40
ద్రోణుఁడు పాండవసైన్యంబుపై రేఁగి దివ్యాస్త్రంబులశక్తి సూపుట	7 - 13 - 1	49
భీమసేనశల్యుల గదాయుద్ధము	7 - 14 - 4	60
ద్రోణాచార్యులు ధర్మరాజుతో యుద్ధంబు సేయుట	7 - 5 - 19	67
ద్రోణాచార్యుల రెండవనాఁటి యుద్ధము	7 - 16 - 3	73
అర్జునుఁడు ధర్మరాజుచే ననుజ్ఞాతుండై సంశప్తకులపైఁ బోవుట	7 - 16 - 44	78
సంశప్తకు లందఱు నొక్క పెట్ట యర్జునురథంబుపైఁ బడుట	7 - 18 - 20	87
ద్రోణాచార్యునిచేత సత్యజిత్తు సచ్చుట	7 - 20 - 1	95
ద్రోణాచార్యునిచేత సూర్యదత్తుఁడు సచ్చుట	7 - 20 - 20	98
భగదత్తుఁడు సుప్రతీకముఁ బఱపి పాండవసైన్యంబులం గలంచుట	7 - 25 - 19	108

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అర్జునుఁడు భగదత్తునిదెస రథంబు దోలు మని కృష్ణునితోఁ జెప్పుట	7 - 26 - 1	114
భగదత్తుండు సుప్రతీకంబుతోడ నర్జునుచేఁ జచ్చుట	7 - 28 - 40	123
కర్ణార్జునుల యుద్ధము	7 - 31 - 49, 50	131

ద్వితీయాశ్వాసము

ద్రోణుని మూఁడవనాఁటి యుద్ధము	7 - 32 - 25	140
అభిమన్యుఁడు పద్మవ్యూహంబు భేదించుకొని చొచ్చుట	7 - 35 - 12	149
దుర్యోధన ప్రభృతి మహారథికు లందఱు నొక్కుమ్మడి నభిమన్యునిపైఁ గవియుట	7 - 36 - 22	154
దుశ్శాసనుఁ డభిమన్యునితోడం బోరి పాఱిపోవుట	7 - 38 - 26	162
పద్మవ్యూహంబు సొచ్చు పాండవులకు సైంధవుం డడ్డపడుట	7 - 41 - 3	169
వృషసేనుం డభిమన్యుం దాఁకి మూర్ఛితుం డగుట	7 - 43 - 5	175
దుర్యోధనపుత్రుం డగు లక్ష్మణకుమారుం డభిమన్యునిచేఁ జచ్చుట	7 - 45 - 8	181
కర్ణుఁడు మొదలగు యోధులు వంచనచే నభిమన్యుని విరథుఁ జేయుట	7 - 47 - 31	190
అభిమన్యుదుశ్శాసనసుతు లిరువురుఁ జచ్చుట	7 - 48 - 8	195
అభిమన్యుని మరణమునకు ధర్మరాజు దుఃఖించుట	7 - 49 - 1	202
నారదుఁ డకంపనునకు మృత్యుదేవతాప్రభావం బెఱింగించుట	1 - 8 - 67	212
వేదవ్యాసమునీంద్రుఁడు ధర్మజునకు సువర్ణష్ఠీవి చరిత్రంబు సెప్పుట	1 - 8 - 300	226
షోడశరాజచరిత్రము	1 - 8 - 360	229
అర్జునుఁడు శిబిరంబునకు వచ్చునెడ దుర్నిమిత్తంబులం గని కృష్ణునితోఁ జెప్పుట	7 - 50 - 1	246
అర్జునుఁడు ధర్మరాజు నభిమన్యుండు సచ్చిన విధంబు నడుగుట	7 - 50 - 45	254
ధర్మ రా జర్జునుని కభిమన్యుండు సచ్చిన విధంబు చెప్పుట	7 - 51 - 1	264
అర్జునుని ప్రతిజ్ఞ విని సైంధవుఁడు భయపడి దుర్యోధనునితోఁ జెప్పికొనుట	7 - 52 - 1	272
అర్జునుఁడు కృష్ణునితోఁ దన ప్రతిజ్ఞావిషయంబు లైన వాక్యంబులు సెప్పుట	7 - 53 - 31	281

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీకృష్ణుఁడు పుత్రశోకాతుర యైన సుభద్ర నూఱడించుట	7 - 54 - 11	287
శ్రీకృష్ణుఁడు దారుకుతో నర్జును ప్రతిజ్ఞావిషయంబు లైన వాక్యంబులం గొన్ని సెప్పుట	7 - 56 - 27	300
కృష్ణార్జునులు స్వప్నమందుఁ గైలాసంబునకుఁ బోవుట	7 - 57 - 24	306

తృతీయాశ్వాసము

అర్జునుఁడు నిజస్వప్నవృత్తాంతంబు ధర్మరాజాదులతోఁ జెప్పుట	7 - 58 - 1	319
అర్జునుఁడు సాత్యకిని ధర్మరాజురక్షణంబునకు నియోగించుట	7 - 60 - 27	326
ద్రోణుని నాల్గవనాటి యుద్ధము	7 - 63 - 28	332
అర్జునుఁడు ద్రోణునిచే ననుజ్ఞాతుండై మొగ్గరంబు సొచ్చుట	7 - 66 - 1	340
అర్జునుఁడు ద్రోణాచార్యుల నతిక్రమించి కురుసైన్యంబు సొచ్చుట	7 - 66 - 30	344
అర్జునుఁడు శ్రుతాయుధ ప్రముఖ మహారథికులం జంపుట	7 - 67 - 36	349
దుర్యోధనుఁడు ద్రోణుని దూఱనాడుట	7 - 69 - 1	356
ధృష్టద్యుమ్న ద్రోణాచార్యులయుద్ధము	7 - 72 - 22	363
విందానువిందు లర్జునుచేత మృతిఁబొందుట	7 - 74 - 17	368
అర్జునుఁడు దివ్యాస్త్రముల ధరఁ బగిల్చికొల నుత్పాదించుట	7 - 74 - 32	374
కవచధారణంబున దుర్యోధనుం డర్జునుతోఁ దలపడుట	7 - 76 - 37	380
దుర్యోధనుఁ డర్జునుం దలపడి యధిక్షేపించుట	7 - 77 - 35	384
వృషసేనుండు లోనగు నెనమండ్రు రథికు లొక్కపెట్ట యర్జునుపైఁ గవియుట	7 - 79 - 1	391
ధర్మరాజు ద్రోణునితో యుద్ధముసేసి యోడిపోవుట	7 - 81 - 18	398
అలంబుసుండు ఘటోత్కచునితో యుద్ధముసేసి చచ్చుట	7 - 84 - 1	406
ధర్మరాజు సాత్యకి నర్జుననకుఁ దోడ్పడఁ బొమ్మని ప్రార్థించుట	7 - 85 - 41	412
సాత్యకి ధర్మరాజు వేఁడిన చొప్పున నర్జునుకడకుఁ బోవ సమ్మతించుట	7 - 86 - 1	419

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చతుర్థాశ్వాసము

సాత్యకి మొగ్గరంబు సొరం దొడంగుట	7 - 89 - 38	425
జలసంధుం డనురాజు సాత్యకితో యుద్ధంబు సేసి చచ్చుట	7 - 91 - 24	436
సుదర్శనుం డనురాజు సాత్యకితో యుద్ధంబు సేసి చచ్చుట	7 - 94 - 6	444
దుశ్శాసనుఁడు సాత్యకితో యుద్ధము సేసి పాఱిపోవుట	7 - 97 - 29	450
దుశ్శాసనుఁడు సాత్యకితో యుద్ధంబు సేసి యోడుట	7 - 99 - 28	457
ధర్మరాజు భీముని నర్జునునకుఁ దోడ్పడఁ బుచ్చుట	7 - 102 - 4	463
భీముఁడు ద్రోణాది రథికుల నతిక్రమించి యర్జునుఁ జేరఁబోవుట	7 - 102 - 88	471
దుర్యోధనుఁడు ద్రోణుని దూఱనాడుట	7 - 105 - 1	474
భీమసేనుచేత శత్రుంజయాది కురుకుమారులు చచ్చుట	7 - 112 - 30	493
కర్ణుండు భీమసేను నవమానించి నీచోక్తులు పలుకుట	7 - 114 - 69	499
భూరిశ్రవుండు సాత్యకితో యుద్ధంబుసేసి మడియుట	7 - 117 - 1	505
సంజయుఁడు ధృతరాష్ట్రునకు సాత్యకిపరాభవ కారణంబు చెప్పుట	7 - 119 - 1	513
కర్ణుఁడు సాత్యకితో యుద్ధంబు సేసి యోడిపోవుట	7 - 120	516
కర్ణార్జునుల ద్వంద్వయుద్ధము	7 - 120	522
అర్జునుఁడు సైంధవునితలఁ దునుముట	7 - 121 - 31	529

పంచమాశ్వాసము

కృష్ణార్జునులు సల్లాపము లొనరించుచు ధర్మజుకడ కరుగుచుండుట	7 - 122 - 1	537
సైంధవుని సంహరించి కృష్ణార్జునులు వచ్చి ధర్మరాజునకు నమస్కరించుట	7 - 124 - 1	542
ద్రోణుఁడు పాంచాలురఁ జంపక కవచంబు విడువ నని ప్రతిజ్ఞ సేయుట	7 - 126 - 32	552
భీమసేనుఁడు దుర్మద దుష్కర్ణులం జంపుట	7 - 130 - 22	562
అంజనపర్వుం డశ్వత్థామతో యుద్ధంబు సేసి చచ్చుట	7 - 131 - 44	568
భీమసేనునిచేత బాహ్లికుఁడు సచ్చుట	7 - 132 - 8	576

కృపాచార్యుండు కర్ణు నుపాలంభించుట	7 - 133 - 12	581
సోమదత్తుఁడు సాత్యకితో యుద్ధంబు సేసి చచ్చుట	7 - 136 - 12	594
పాండవకౌరవవీరుల ద్వంద్వయుద్ధము	7 - 139 - 22	601
కర్ణుఁడు సహదేవుని వింటికోపునం బొడుచుచు నవమానించుట	7 - 141 - 12	607
కర్ణదుర్యోధనులు దురాలోచన సేసి సాత్యకిం దలపడుట	7 - 145 - 55	618
అలంబుసుండు ఘటోత్కచునిచేతఁ జచ్చుట	7 - 149 - 15	626
అలాయుధాసురుండు ఘటోత్కచునితో యుద్ధము సేసి చచ్చుట	7 - 151 - 1	632
కర్ణుఁ డింద్రదత్తం బైన శక్తిచేత ఘటోత్కచునిం జంపుట	7 - 154 - 5	643
కృష్ణుండు ఘటోత్కచుండు వడఁ దాను సంతసించుటకు నిమిత్తం బర్జుననితోఁ జెప్పుట	7 - 155 - 11	647
విరాటద్రుపదులు ద్రోణునిచేతఁ జచ్చుట	7 - 161 - 34	670
ద్రోణార్జునుల ద్వంద్వయుద్ధము	7 - 163 - 20	675
ధర్మజుఁడు ద్రోణునితో నశ్వత్థామ సచ్చెనని యేనుఁగు నెపంబునఁ జెప్పుట	7 - 164 - 105	687
ధృష్టద్యుమ్నుండు మృతుం డైన ద్రోణుని కంఠంబుఁ దునుముట	7 - 165 - 47	693
అశ్వత్థామ పూన్కివలనఁ గౌరవయోధులు మరల ననికిఁ గడంగుట	7 - 166 - 43	702
ద్రోణు పరిభవంబునకుఁ గోపించి సాత్యకి ధృష్టద్యుమ్ను నాక్షేపించుట	7 - 169 - 8	710
నారాయణాస్త్రపీడితుం డగు భీముఁ గృష్ణార్జునులు రథంబు డిగ్గఁ జేయుట	7 - 171 - 12	721
అశ్వత్థామకు వ్యాసుఁడు కృష్ణార్జునుల మహిమ సెప్పుట	7 - 172 - 43	729
వేదవ్యాసమునీంద్రుఁ డర్జుననకుఁ బరమేశ్వరుమహిమ సెప్పుట	7 - 173 - 2	737

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ద్రోణపర్వము

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్రమహాభారతము

ద్రోణపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీసంశ్రయ మంగళ గౌ । రీసంగమ విభవ పుణ్యరేఖా సంప
ద్భాసిత వక్షోవామాం । గా! సూత్రితచిత్ర మహిమ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: హరిహరనాథా!= శివకేశవాత్మకుడవైన దేవా!; శ్రీ సంశ్రయ= లక్ష్మీదేవి ఆశ్రయం; మంగళగౌరీ సంగమ=శుభప్రదయగు గౌరీదేవి కూడిక అనే; విభవ= ఐశ్వర్యానికి చెందిన; పుణ్యరేఖా= అదృష్టరేఖయొక్క; సంపద్= శోభతో; భాసిత= ప్రకాశించే; వక్షోవామాంగా!= హృదయమూ ఎడమ మేనూ కలవాడా!; సూత్రిత చిత్రమహిమ!= సూత్రప్రాయంగానే తెలుపబడిన చిత్ర విచిత్రమైన మహిమలు కలవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీ భాగ్యరేఖను నేను ఏమని వర్ణించగలను? సర్వసుఖాలను ఇచ్చే లక్ష్మీదేవి నీ రొమ్మునందు, సర్వశుభాలను ఒసగే మంగళగౌరీదేవి నీ వామాంగంలోను నెలకొని ఉన్నారు. చిత్రాతి చిత్రమైన నీ మహిమను వేదాలు కూడా వర్ణించలేక సూత్రప్రాయంగానే తెలియజేస్తున్నవి.

విశేషం: సర్వభువనాలలోని జడచేతనాల స్వరూప స్వభావాలన్నీ పరాత్పరుడి చిత్రాతిచిత్రమహిమలే. శ్రీసంశ్రయం హరిభాగం. గౌరీసంగమం హరుని వామ శరీరం. వక్షస్సు హరిది. వామాంగం హరుడిది అని క్రమాన్వయం.

లక్ష్మీగౌరీ సమాశ్రయం శృంగార రసాన్నీ, ఆశ్చర్యంగొలిపే ఇట్టి దివ్యమంగళ విగ్రహం, 'చిత్రమహిమ' అద్భుత రసాన్నీ వ్యక్తీకరిస్తున్నవి. ఈ శృంగారాద్భుత రసాలు హరిహరనాథుడి యెడ ప్రదర్శించే భక్తిభావానికి పోషకాలుగా ఉన్నాయి.

సంజయుఁడు యుద్ధభూమికిఁ బోయి మరలి వచ్చి యందలి వృత్తాంతంబు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట (సం. 7-1-5)

వ. దేవా! వైశంపాయనునకు జనమేజయుం డి ట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనునకున్= వ్యాసమహర్షికి శిష్యుడైన వైశంపాయనుడితో; జనమేజయుండు= పరీక్షిన్మహారాజు పుత్రుడైన జనమేజయుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: హరిహరనాథా! వ్యాస శిష్యుడైన వైశంపాయనుడితో పరీక్షిన్మహారాజుపుత్రుడైన జనమేజయుడు ఈ విధంగా అన్నాడు.

విశేషం: వేదవ్యాసుడు మహాభారతం రచించి భూలోకంలో దానిని ప్రవర్తింపజేయడానికై తన శిష్యుడైన వైశంపాయనుడిని నియమించాడు. తర్వాత ఒకసారి వ్యాసమహర్షిని జనమేజయుడు తమ పూర్వుల చరిత్రను చెప్పవలసినదని కోరగా, వ్యాసుడి కోరికపై వైశంపాయనుడు జనమేజయుడికి భారతకథ చెప్పటం ప్రారంభించాడు. ఈ విధంగా భారతేతిహాసానికి వైశంపాయనుడు వక్త. జనమేజయుడు శ్రోత.

మళ్ళీ కవిబ్రహ్మ తిక్కన, తెలుగు మహాభారతానికి కృతిపతి అయిన హరిహరనాథుడిని 'దేవా!' అని సంబోధిస్తూ భారత కథను వివరిస్తున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'ముని జన వల్లభ! యివ్విధ । మున దేవవ్రతుఁడు శాంతిఁ బొందినక్రమ మె
ల్లను ధృతరాష్ట్రమహీశుఁడు । విని యెయ్యది యాచరించె వినిపింపు తగన్.' 3

ప్రతిపదార్థం: మునిజన వల్లభ!= మౌనులలో శ్రేష్ఠుడవైన వైశంపాయనా!; ఈ+విధమునన్= ఇట్లా; దేవవ్రతుఁడు= భీష్ముడు; శాంతిన్+పొందిన= యుద్ధం చాలించిన; క్రమము= విధం; ఎల్లను= అంతా; ధృతరాష్ట్ర మహీశుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; విని=ఆలకించి; ఏ+అది= ఏది; ఆచరించెన్= చేశాడో; తగన్= తగినవిధంగా; వినిపింపు(ము)= తెలియజెప్పుము.

తాత్పర్యం: వైశంపాయన మునిశ్రేష్ఠా! కౌరవ సేనాధిపతి అయిన భీష్ముడు యుద్ధం చాలించిన విషయాన్ని సంజయుడి వలన విని ధృతరాష్ట్రుడు ఏమి చేశాడో చెప్పుము.

వ. అని యడిగిన జనమేజయునకు వైశంపాయనుం డిట్లనియె. 4

ప్రతిపదార్థం: అని+అడిగిన= అట్లు ప్రశ్నించిన; జనమేజయునకున్= జనమేజయ మహారాజుతో; వైశంపాయనుండు= వ్యాసశిష్యుడైన వైశంపాయనుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అని ప్రశ్నించిన జనమేజయ మహారాజుతో వైశంపాయనమునీంద్రుడు ఇట్లా అన్నాడు.

క. అనిమిష నదీ తనూజుఁడు । సనుటయు విని యవ్విభుండు సంజయుఁ బోవం
బనిచెను దనయుని కడకు న । తని విజయము కాంక్ష దన హృదయమున మొలవన్. 5

ప్రతిపదార్థం: అనిమిష నదీతనూజుఁడు= దేవ నదీ పుత్రుడైన భీష్ముడు; చనుటయున్= యుద్ధ రంగంనుండి తొలగిపోవటం; విని; ఆ+విభుండు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; అతని= దుర్యోధనుడి; విజయము= గెలుపుయొక్క; కాంక్ష= కోరిక; తన హృదయమునన్= తన మనస్సులో; మొలవన్= పొడసూపగా; తనయుని కడకున్= పుత్రుడైన దుర్యోధనుడి దగ్గరకు; సంజయున్= భారతయుద్ధ విశేషాలు వినిపించే సంజయుడిని; పోవన్= వెళ్ళటానికై; పనిచెన్= నియమించాడు.

తాత్పర్యం: భీష్ముడు యుద్ధ రంగంనుండి తొలగిపోవటం విని, దుర్యోధనుడి విజయకాంక్ష తన మనస్సులో మొలకెత్తగా, ధృతరాష్ట్రుడు తన కొడుకు వద్దకు సంజయుడిని పంపించాడు.

క. పనిచి కృతపడిన గాంగే । యుని దెస యుమ్మలిక నాతఁ డుల్లము నానా
ఘనతర చింతాభర మొం । దినఁ గుందుచు నుండఁ గొన్ని దివసంబులకున్. 6

ప్రతిపదార్థం: పనిచి= పంపి; కృతపడిన= కడచిన (యుద్ధం నుండి తొలగిన); గాంగేయుని దెస= గంగాపుత్రుడైన భీష్ముడిని గూర్చిన; ఉమ్మలికన్=దుఃఖంతో; ఆతఁడు= ధృతరాష్ట్రుడు; ఉల్లము= మనస్సు; నానా= అనేక విధాలైన; ఘనతర= మిక్కుటమైన; చింతా భరము= విచార భారం; ఒందినన్= పొందగా; కుందుచున్= క్రుంగుతూ; ఉండన్= ఉండగా; కొన్ని= కొద్ది; దివసంబులకున్= రోజులకు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు సంజయుడిని యుద్ధరంగానికి పంపి, భీష్ముడు యుద్ధంనుండి తొలగటం చేత దుఃఖించి, మిక్కిలి చింతాభారంతో క్రుంగిపోతుండగా, కొన్నిదినాలకు.

క. వ్యాసప్రసాదమహిమం । జేసి యుభయ సైన్యగత విశేషజ్ఞుం డై
యా సంజయుఁ డొకనాఁటి ని । శా సమయమునందుఁ గడు వెసం జనుదెంచెన్. 7

ప్రతిపదార్థం: వ్యాసప్రసాదమహిమన్+చేసి= వ్యాసమహర్షియొక్క అనుగ్రహపు గొప్పతనం వలన; ఉభయ= కౌరవుల, పాండవుల; సైన్యగత= సేనలకు సంబంధించిన; విశేషజ్ఞుండు+ఐ= విశేషాలన్నీ తెలిసినవాడై; ఆ సంజయుఁడు= అట్టి సంజయుడు; ఒకనాఁటి; నిశాసమయమునన్= రాత్రివేళ; కడువేసన్= మిక్కిలి వేగంగా; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: వ్యాసమహర్షి అనుగ్రహం వలన కౌరవపాండవ శిబిరాలలోని విశేషాలన్నీ తెలిసికొని, ఒకనాటి రాత్రి సంజయుడు ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చాడు.

వ. **ఇట్లు శిబిరంబుననుండి సూతనందనుండు గరినగరంబునకు వచ్చి యంతఃపురంబున నున్న ధృతరాష్ట్రు నుచిత ప్రకారంబునం గనిన నమ్మనుజవల్లభుం డతనిం దన చేరువ నునిచికొని యాదరించి.** **8**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; శిబిరంబుననుండి= దండు విడిసిన చోటునుండి; సూతనందనుండు= సూతవంశీయుడి పుత్రుడైన సంజయుడు; కరినగరంబునకున్= హస్తినాపురానికి; వచ్చి=వచ్చి; అంతఃపురంబునన్+ఉన్న= అంతఃపురంలో ఉన్న; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్రుడిని; ఉచిత ప్రకారంబునన్= తగు విధంగా; కనినన్= చూడగా; ఆ+మనుజవల్లభుండు= ఆ రాజు; అతనిన్= సంజయుడిని; తన చేరువన్= తన సమీపంలో; ఉనిచికొని= ఉంచుకొని; ఆదరించి= మన్నించి.

తాత్పర్యం: ఈ విధంగా సంజయుడు హస్తినాపురానికి వచ్చి, అంతఃపురంలో ఉన్న ధృతరాష్ట్ర మహారాజును సగౌరవంగా దర్శించాడు. అపుడు ఆ రాజు అతడిని దగ్గరికి తీసికొని ఆదరించి.

చ. **అమరనదీతనూజు సమరావనిఁ గోల్పడి నాదు యోధవ**
ర్గము మఱి యెవ్వరిం గొని పరాక్రమ దుర్దమ పాండుపుత్ర సై
న్యమునకు మార్కొనం దలఁచె? నక్కట! కౌరవు లేమి సేసి రా
సమయమునన్ బలప్రచయ సంఘటనం బెటులయ్యె సంజయా! **9**

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; సంజయా!= ఓ సంజయా!; అమర నదీ తనూజు= గంగాదేవి పుత్రుడైన భీష్ముడిని; సమరావనిన్= యుద్ధభూమిలో; కోల్పడి= కోల్పోయి; నాదు= నా యొక్క; యోధవర్గము= వీరుల సమూహం; మఱి= మళ్ళీ; ఎవ్వరిన్= ఏ వీరుడిని; కొని= సేనానిగా నియమించి; పరాక్రమ= శత్రువులను వశపరచుకొనే; దుర్దమ= అణచశక్యముకాని; పాండుపుత్ర= పాండవుల; సైన్యమునకున్= సేనను; మార్కొనన్= ఎదుర్కొనవలెనని; తలఁచెన్?= అనుకొన్నది?; కౌరవులు= కురువంశీయులైన దుర్యోధనాదులు; ఏమి+చేసిరి?= ఏమి చేశారు; ఆ సమయమునన్= అట్టి ఆపదవేళలో; బల ప్రచయ సంఘటనంబు= సైన్య సమూహంయొక్క కూర్పు; ఎటులు+అయ్యెన్?= ఏ విధంగా జరిగింది?

తాత్పర్యం: అయ్యో సంజయా! యుద్ధరంగంలో భీష్ముడిని కోల్పోయిన కౌరవ వర్గం మళ్లీ ఎవ్వరిని సేనాపతిగా నియమించి, పరాక్రమంలో సాటిలేని పాండవసైన్యాన్ని ఎదుర్కొనవలెనని అనుకొన్నది? చెదరిపోయిన సైన్యాన్ని, కౌరవులు అపుడు ఒకచోటికి ఎట్లా కూర్చుకొన్నారు? తెలుపవలసింది.

విశేషం: 'అక్కటా!' అనటంతో ధృతరాష్ట్రుడిలోని చింతా, విషాదాలు వ్యక్తమవుతున్నవి.

క. **అనిన విని సూతసుతుఁ డి । ట్లను నక్కురునాథుతోడ 'నవహితమతివై**
విను మంతయుఁ జెప్పెదఁ గ్రమ । మున నీ యడిగిన తెఱంగు భూవర! తెలియన్.' **10**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; సూతసుతుఁడు= సూతుడి కుమారుడైన సంజయుడు; ఆ+కురునాథుతోడన్= ఆ ధృతరాష్ట్రుడితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటాడు; భూవర= రాజా! ; నీ+అడిగిన తెఱంగు= నీవు అడిగిన విధం; క్రమమునన్= వరుసగా; అంతయున్= మొత్తం; తెలియన్= (నీకు) స్పష్టంగా తెలిసేటట్లుగ; చెప్పెదన్= చెపుతాను; అవహితమతివి+ఐ= సావధానుడవై; విను= వినుము

తాత్పర్యం: ఇది విని సంజయుడు, 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీవు అడిగినదంతా వరుసగా వివరిస్తాను, సావధానంగా వినుము' అన్నాడు.

వ. **దేవవ్రతుండు దేవభావంబునం బొందిన యప్పుడు కురుపాండవులతని కడకు వచ్చుటయు నా సమయంబునం బుట్టిన విశేషంబులు నాఁడు నీ కెఱింగించితి; శరతల్పగతుం డైన శాంతనవుండు సెప్పిన హితవచనంబు లాదరింపక రోషసంరక్త నయను లగుచు నతని వీడ్కొని యట్లు సనిన కౌరవులు నాటి వేకువ నీ కడనుండి యేను బోయి శిబిరంబు సొచ్చు నవసరంబున.** **11**

ప్రతిపదార్థం: దేవవ్రతుండు= భీష్ముడు; దేవభావంబునన్= దేవత్వాన్ని; పొందిన; అప్పుడు= ఆ సమయంలో; కురుపాండవులు= ధృతరాష్ట్రుడి పుత్రులు, పాండురాజు కుమారులు; అతని కడకున్= ఆ భీష్ముడి వద్దకు; వచ్చుటయున్= రాగా; ఆ సమయంబునన్= అప్పుడు; పుట్టిన= కలిగిన; విశేషంబులు= భీష్ముడు శరతల్పగతుడు కావటం, అర్జునుడు భీష్ముడు త్రాగడానికి పర్జన్యాస్త్రం వేసి భూమినుండి జలధారలు పుట్టించటం వంటి విశేషాలు; నాఁడు= భీష్ముడు యుద్ధంలో కూలిననాడు; నీకున్; ఎఱింగించితిన్= తెలిపాను; శరతల్పగతుండు+ఐన= అంపశయ్యపై పడ్డ; శాంతనవుండు= శంతనుడి పుత్రుడైన భీష్ముడు; చెప్పిన= పలికిన; హితవచనంబులు= మంచిమాటలు; ఆదరింపక= పాటించక; రోష= కోపంతో; సంరక్త= మిక్కిలి ఎరుపెక్కిన; నయనులు= కన్నులు గలవారు; అగుచున్= అవుతూ; అతనిన్= ఆ భీష్ముడిని; వీడ్కొని= వదలి; అట్లు= ఆ విధంగా; చనిన= పోయిన; కౌరవులు= దుర్యోధనాదులు; నాఁటి= ఆనాటి; వేకువన్= ఉదయాన; నీ కడనుండి= నీ వద్దనుండి; ఏను= నేను; పోయి= వెళ్ళి; శిబిరంబు= దండు విడిసిన చోటు; చొచ్చు+అవసరంబునన్= ప్రవేశించే సమయంలో.

తాత్పర్యం: భీష్ముడు శరతల్పగతుడై దేవత్వాన్ని పొందినపుడు, కౌరవులు, పాండవులు ఆయన వద్దకు రాగా, ఆ సమయంలో అర్జునుడు పర్జన్యాస్త్రాన్ని వేసి భూమి నుండి జలధారలు పుట్టించటంవంటి విశేషాలు ఆనాడు నీకు తెలిపాను. అప్పుడు భీష్ముడు చెప్పిన మంచిమాటలు లెక్కించక కోపంతో కౌరవులు అచటినుండి వెళ్లిపోయారు. ఆనాటి ఉదయం నేను నీవద్ద నుండి కౌరవ శిబిరాన్ని ప్రవేశించే సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. **సమరోద్యోగము వీటికిం దెలుపు నిస్సాణాది తూర్యంబు లొ**
క్కమొగిన్ మ్రోయఁగ వారణాది చతురంగస్ఫార సన్నాహ సం
గమనాటోపము మిక్కుటంబుగఁ గడంకన్ వీరనైపథ్య వి
భ్రమలోలాకృతు లైరి మోముల వివర్ణత్వంబు సంధిల్లఁగాన్. **12**

ప్రతిపదార్థం: సమర+ఉద్యోగము= యుద్ధానికి పూనుకోవటం; వీటికిన్= సైన్యం విడిసిన చోటుకు; తెలుపు= తెలియజేసే; నిస్సాణ= నిస్సాణమనే పేరుగలది; ఆది= మొదలైన; తూర్యంబులు= చర్మవాద్యాలు; ఒక్కమొగిన్= ఒకేసారి; మ్రోయఁగన్= ధ్వనించగా; వారణ+ఆది= ఏనుగులు మొదలైన; చతురంగ= రథాలు, గజాలు, గుర్రాలు, పదాతి దళాలయొక్క; స్ఫార= అధికమైన; సన్నాహ= ప్రయత్నంలోని; సంగమన= క్రమబద్ధంగా వెళ్ళటంలోని; ఆటోపము= వేగిరపాటు; మిక్కుటంబుగన్= ఎక్కువగా; కడంకన్= పూనగా; మోములన్= ముఖాలలో; వివర్ణత్వంబు= తెల్లదనం; సంధిల్లఁగాన్= తోచగా; వీర= శూరులకు సంబంధించిన; నైపథ్య= వస్త్రాద్యలంకారాల యొక్క; విభ్రమ= విలాసముచే; లోల= చలించే; ఆకృతులు+ఐరి= ఆకారాలు కలవారయ్యారు.

తాత్పర్యం: సైన్య శిబిరాలకు యుద్ధసన్నాహాన్ని తెలిపే నిస్సాణాది వాద్యాలు ఒక్క పెట్టున మ్రోయగా, గజాది చతురంగ బలాలు క్రమబద్ధంగా వేగిరపాటుతో ముందుకు సాగటానికి ప్రయత్నిస్తుండగా, తెల్లముఖాలు వేసిన కౌరవులు, వీరుల వస్త్రకవచాద్యలంకారాల కదలికలతో చలించే రూపాలు కలవారయ్యారు.

విశేషం: వివర్ణత్వం సాత్త్వికభావం. ఇది మనస్సులోని చింతావిషాదాదులను వ్యక్తీకరించేది. సేనాధిపతి అయిన భీష్ముడు యుద్ధరంగంలో కూలిపోవటం వలన ముందు జరిగే యుద్ధానికై సన్నద్ధమవుతున్న కౌరవుల ముఖాలలో విషాదం అలముకొనటాన్ని 'వివర్ణత్వము' అనే పదం సూచిస్తున్నది.

వ. ఇట్లు సన్నద్ధులై వెడలి యసమెడలిన బలంబులం గూర్చుకొనుచుండి. 13

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సన్నద్ధులు+ఐ= యుద్ధానికి సిద్ధమైనవారై; వెడలి= శిబిరాలలో నుండి వెలికివచ్చి; అసము= ఉత్సాహం; ఎడలిన= తొలగిన; బలంబులన్= సైన్యాన్ని; కూర్చుకొనుచున్+ఉండి= ప్రోగుచేసికొంటూ.

తాత్పర్యం: ఈ విధంగా యుద్ధానికి సిద్ధమై శిబిరాలలో నుండి వెలుపలికి వచ్చి, దర్పహీనమైన సైన్యాలను సమీకరిస్తూ.

ఉ. అప్పుడు భీష్ములేమి హృదయంబుల నుమ్మలికంబు గూరఁగా
నెప్పటి చందముల్ విడిచి యేడ్తెఱఁ దక్కిన చూడ్కు లొండొరు
న్రెప్పల మాటునం బొలయ నీ సుతు పాలికి వచ్చు రాజులం
దిప్పు డతండు రా వలవదే యని కర్ణుఁ దలంచి రందఱున్. 14

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; భీష్ములేమి= భీష్ముఁడు లేకుండటం; హృదయంబులన్= మనస్సులలో; ఉమ్మలికంబు= దుఃఖము; కూరఁగాన్= కలుగగా; ఎప్పటి చందముల్= ఎల్లవేళలలో ఉండే తీరు; విడిచి= వదలి; ఏడ్తెఱన్= కాంతిని; తక్కిన= వీడిన; చూడ్కులు= చూపులు; ఒండు+ఒరున్= ఒకటికొకటి; రెప్పలమాటునన్= కంటి రెప్పల చాటున; పొలయన్= వ్యాపించగా; నీ= నీయొక్క; సుతు= పుత్రుడైన దుర్యోధనుడి యొక్క; పాలికిన్= వద్దకు; వచ్చు= వచ్చే; రాజులందున్= రాజులలో; ఇప్పుడు= భీష్ముడు యుద్ధంలో కూలిన తర్వాత; అతండు= ఆ కర్ణుడు; రావలవదే+అని= రాగూడదా అని; అందఱున్= కౌరవులు అందరు; కర్ణున్= కర్ణుడిని; తలంచిరి= తలచుకొన్నారు.

తాత్పర్యం: ఆ సమయంలో యుద్ధరంగంలో భీష్ముడు లేకపోవటం అందరికీ దుఃఖాన్ని కలిగించగా, సహజమైన దర్పాదులను విడిచి, ఒకరికొకరు కాంతివిహీనమైన చూపులు రెప్పలమాటుననే నిగిడించి, నీ పుత్రుడైన దుర్యోధనుడి వద్దకు ఇతర రాజులందరు వచ్చారు. 'భీష్ముడు పడిపోయిన తర్వాతనైనా కర్ణుడు యుద్ధ రంగానికి రావచ్చుగదా!' యని అందరు కర్ణుడిని తలచుకొన్నారు.

వ. అట్టి యెడ. 15

ప్రతిపదార్థం: అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: భీష్ముడు లేని ఆ విషాదసమయంలో.

చ. పతిరహితాత్మ యైన సతి భంగియు గోపక హీనమైన గో
ప్రతతి విధంబు, సస్య విధుర స్థితి యైన ధరిత్రి చాడ్పు, ను
ద్ధత హరి శూన్యమైన వసుధాధర కందర భూమి చందమున్
మతి మనసేనఁ దోఁచె బుధమాన్యుఁడు భీష్ముఁడు లేకయుండుటన్. 16

ప్రతిపదార్థం: బుధమాన్యుఁడు= పండితులలో శ్రేష్ఠుడైన; భీష్ముఁడు= భీష్ముడు; లేక+ఉండుటన్= లేకపోవటంవలన; మనసేన= మన యొక్క సైన్యం; పతిరహిత+ఆత్మ+ఐన= భర్తలేని; సతి= భార్యయొక్క; భంగియున్= విధమునను; గోపకహీనము+ఐన= గోపాలుడు లేని; గోప్రతతి= గోవుల సమూహం; విధంబున్= వలెను; సస్య= పంటలు; విధురస్థితి+ఐన= లేని; ధరిత్రి= భూమి; చాడ్పున్= వలెను; ఉద్ధత= గర్వించిన; హరి= సింహం; శూన్యము+ఐన= లేని; వసుధాధర= భూమిని ధరించే పర్వతం యొక్క; కందర= గుహయొక్క; భూమి= స్థలం; చందమున్= వలెను; మతిన్= మనస్సుకు; తోఁచెన్= అనిపించింది.

తాత్పర్యం: జ్ఞానులలో శ్రేష్ఠుడైన భీష్ముడు లేని మన సేన వైధవ్యం పొందిన స్త్రీవలెను, కాపరిలేని ఆవులమందవలెను, పంటలు లేని పొలంవలెను, సింహం లేని పర్వత గుహవలెను నా మనస్సుకు తోచింది.

విశేషం: అలం: మాలోపమ. భీష్ముడు లేని కౌరవసైన్యాన్ని పతిలేని సతిగా, కాపరిలేని గోగణంగా, సింహం లేని గుహగా ఉపమించి చెప్పటంవలన సైన్యం యొక్క దీనస్థితి వ్యక్తమౌతున్నది.

ఉ. అంగద నాథు మ్రింగిన వృకావలి దన్ వెస ముట్టికొన్న స
ర్వాంగములుం జలింప వెగడందుచు దిక్కులు సూచుచున్న సా
రంగియ పోలె నుండెఁ గురురాజ! భవత్సుతు సేన భీష్ము నా
జిం గబళించి పాండవులు జృంభిత విక్రమలీలఁ బొల్చుటన్. 17

ప్రతిపదార్థం: కురురాజ!= ధృతరాష్ట్ర మహారాజా!; పాండవులు; భీష్మున్= భీష్ముడిని; ఆజిన్= యుద్ధంలో; కబళించి= మ్రింగి; జృంభిత= అతిశయించిన; విక్రమ= పరాక్రమం యొక్క; లీలన్= విలాసంతో; పొల్చుటన్= ఒప్పిదముతో ఉండటం; అంగదన్= ఆకలితో; నాథున్+మ్రింగిన= పతిని చంపిన; వృకావలి= తోడేళ్ళగుంపు; తన్= తనను, (సారంగిని); వెసన్ ముట్టికొన్నన్= వేగంగా చుట్టుముట్టగా; సర్వాంగములున్= అన్ని అవయవాలూ; చలింపన్= వణకగా; వెగడు+అందుచున్= భయపడుతూ; దిక్కులు= నలువైపుల; చూచుచున్+ఉన్న= చూస్తున్న; సారంగి+అ పోలెన్= ఆడు జింకవలె; భవత్= తమయొక్క; సుతు= కుమారుడైన దుర్యోధనుడి యొక్క; సేన= సైన్యం; ఉండెన్= ఉండినది.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆకలితో ప్రియుడిని మింగిన తోడేళ్ళగుంపు వేగంగా తనను చుట్టుముట్టగా, భయంతో వణకుతూ దిక్కులు చూస్తున్న ఆడజింకవలె నీ పుత్రుడి సైన్యం, భీష్ముడిని యుద్ధంలో కూలనేసి విజృంభించిన పాండవుల పరాక్రమాన్ని చూచి బెదరిపోయింది.

విశేషం: అలం: ఉపమ. సేనాని అయిన భీష్ముడు పడిపోవటం వలన అనాథ అయిన కౌరవసేనను నాథుడిని కబళించి చుట్టుముట్టిన తోడేళ్ళ గుంపును చూచి భయపడ్డ సారంగితో ఉపమించటం ద్వారా భయానక రసం వ్యక్తమౌతున్నది.

ఆ. 'కర్ణ! కర్ణ! వచ్చి కావు మనాథుల। మైతి'మను నెలుంగు లగ్గలముగ
బలములోన నెల్లఁ గలయంగ వీతెంచె। నార్తి దెల్లముగ జనాధినాథ! 18

ప్రతిపదార్థం: జన+అధినాథ!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఆర్తి= బాధ; తెల్లముగన్= స్పష్టంగా- బాగా తెలిసేవిధంగా; కర్ణ! కర్ణ!= ఓ కర్ణుడా!; అనాథులము+ఐతిమి= దిక్కులేని వారమయ్యాము; కావుము= రక్షించుము; అను= అనే; ఎలుంగులు= ఆర్తనాదాలు; అగ్గలముగన్= అధికంగా; బలములోనన్= సైన్యంలో; కలయంగన్= అంతట; వీతెంచెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అప్పుడు 'కర్ణా! ఓ కర్ణా! మేమంతా దిక్కులేనివారం అయ్యాం. వేగంగా వచ్చి కాపాడు' అనే ఆర్తనాదాలు స్పష్టంగా సైన్యంలో అంతటా వ్యాపించాయి.

విశేషం: 'కర్ణ! కర్ణ' అని కౌరవసైన్యం చేసే ఆర్తనాదాల వలన ధైర్య విషాదాది భావాలు వ్యక్తమై భయానక రసం అభివ్యక్తమౌతున్నది.

వ. తదనంతరంబున. 19

ప్రతిపదార్థం: తద్+అనంతరంబునన్= ఆ తరువాత.

తాత్పర్యం: కౌరవసైన్యం అంతటా ఆర్తనాదాలు వ్యాపించిన తర్వాత.

క. 'పిలువుఁడు దడయక కర్ణుని; । బలవిక్రమశాలి యతఁడు; పది దివసములుం
గలనికి రాఁడు నదీసుతు । పలుకులకుం గనలి సచివబంధుయుతముగన్.' 20

ప్రతిపదార్థం: తడయక= ఆలస్యం చేయక; కర్ణునిన్= కర్ణుడిని; పిలువుఁడు= పిలవండి; అతఁడు= ఆ కర్ణుడు; బలవిక్రమశాలి= బలపరాక్రమాలు కలవాడు; నదీసుతు= గంగాపుత్రుడైన భీష్ముడి యొక్క; పలుకులకున్= మాటలకు; కనలి= కోపించి;ప 3ది దివసములున్=యుద్ధం మొదలైన పది దినాలు; సచివ= మిత్రులతో; బంధుయుతముగాన్= చుట్టాలతోపాటు; కలనికిన్= యుద్ధానికి; రాఁడు= రాలేదు.

తాత్పర్యం: 'కర్ణుడు బలపరాక్రమశాలి, ఆలస్యం చేయక అతడిని యుద్ధం చేయటానికి ఆహ్వానించండి. భీష్ముని మాటలకు అలిగి ఆయన యుద్ధరంగంలో ఉన్నంత వరకు ఆ పదిరోజులు తాను బంధుమిత్రులతో కలిసి యుద్ధానికి రాలేదు కదా!

వ. అని కౌరవులును దక్కటి జనపతులును దగుజనంబులును నతని నాసపడి పలుకుచుండి; రాతని తెఱంగు దొల్లియు నీ వాకర్ణించి తది యెయ్యది యనిన. 21

ప్రతిపదార్థం: అని= పై విధంగా పలికి; కౌరవులును= ధృతరాష్ట్రుడి కుమారులు; తక్కటి= మిగిలిన; జనపతులును= రాజులును; అతనిన్= కర్ణుడిని; ఆసపడి= కోరి; పలుకుచుండిరి= అనుకొంటూ ఉన్నారు; ఆతని= ఆ కర్ణుని యొక్క; తెఱంగు= తీరు; నీవు= ధృతరాష్ట్రుడవైన నీవు; ఆకర్ణించితివి= విన్నావు; అది= ఆ విషయం; ఏ+అది+అనిన్= ఏమిటంటే.

తాత్పర్యం: పై విధంగా పలికి దుర్యోధనాదులు, తక్కిన రాజులు కర్ణుడు తమ రక్షణార్థం రావాలని అనుకొన్నారు. కర్ణుడు యుద్ధరంగం వదలటానికి గల కారణం నీవూ విన్నావు. అది ఏమిటంటే.

చ. అనఘ! సరిత్సుతుండు దను నర్ధరథుండని పల్కినన్ మనం
బునఁ గడునొచ్చి 'నీ వనికిఁ బోయిన నద్దెస రాను; నీ జయం
బున వనవాసి నయ్యెద; రిపుల్ నిను నోర్చిన వారి నోర్చెదన్
ఘన భుజశక్తి నేననియెఁ గాదె! నృపుల్ విన నమ్మహాత్ముతోన్. 22

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ధృతరాష్ట్ర మహారాజా!; సరిత్+సుతుండు= నదీపుత్రుడైన భీష్ముడు; తనున్= కర్ణుడిని; అర్ధరథుండు+అని= అతిరథ, మహారథులకంటె, సమరథుడికంటె తక్కువవాడని; పల్కినన్= అనగా; మనంబునన్= మనస్సులో; కడున్+నొచ్చి= మిక్కిలి బాధపడి; నీవు= భీష్ముడవైన నీవు; అనికిన్= యుద్ధానికి; పోయినన్= వెళ్ళితే; ఆ+దెస= ఆ వైపు; రాను= రాజాలను; నీ= నీయొక్క; జయంబునన్= గెలుపుచే; వనవాసిని= అడవులలో నివసించేవాడిని; అయ్యెదన్= అవుతాను; రిపుల్= శత్రువులు; నినున్= నిన్ను; ఓర్చినన్= ఓడిస్తే; ఘనభుజశక్తిన్= గొప్ప భుజబలంతో; ఏను= నేను; వారిన్= ఆ శత్రువులను; ఓర్చెదన్= జయిస్తాను అని; నృపుల్= రాజులు; వినన్= వినేటట్లుగా; ఆ+మహాత్ముతోన్= ఆ మహాత్ముడైన; భీష్ముడితో; అనియెన్+కాదె!= అన్నాడు గదా!

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీష్ముడు తనను అర్ధరథుడని కించపరుచగా కర్ణుడు మనస్సులో మిక్కిలి బాధపడి, ఓ భీష్మాచార్యా! 'నీవు యుద్ధానికి వెళ్ళితే నే నా వైపు రాను; యుద్ధంలో నీవు జయిస్తే అడవుల పాలౌతాను; ఓడిపోతే నా బాహుబలంతో శత్రువులను జయిస్తా'నని రాజులంతా వింటుండగా, మహాత్ముడైన భీష్ముడితో అన్నాడు గదా!

వ. కావున నతం డంతకు మున్నుకయ్యంబునకుం దొలంగియుండె; నాఁ డట్లు మా మనంబులెల్ల నా సూతనందను దెసకుం బాఱె'ననిన విని యాంబికేయుండు సంజయున కిట్లనియె. 23

ప్రతిపదార్థం: కావునన్= ఈ కారణాలవలన; అతండు= ఆ కర్ణుడు; అంతకున్ మున్ను= అప్పటి వరకు; కయ్యంబునకున్= యుద్ధమునకు; తొలంగిఉండెన్= దూరంగా ఉన్నాడు; నాఁడు= భీష్ముడు యుద్ధం నుండి తొలగిన మరునాడు; అట్లు= ఆ విధంగా; మనవారి= మన కౌరవపక్షం వారి; మనంబులు= మనస్సులు; ఎల్లన్= అన్ని; ఆ సూతనందను దెసకున్= ఆ కర్ణుడివైపు; పాఱెన్= ప్రసరించాయి; అనినన్= అనగా విని; ఆంబికేయుండు= అంబికా పుత్రుడైన ధృతరాష్ట్రుడు; సంజయునకున్= సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు కర్ణుడిని అర్ధరథుడనటం వలన యుద్ధరంగంలో భీష్ముడు ఉన్నంత వరకు అతడు యుద్ధానికి రాలేదు. భీష్ముడి పతనానంతరం మన కౌరవుల మనస్సులన్నీ కర్ణుడివైపు ప్రసరించాయి' అనగా విని ధృతరాష్ట్రుడు సంజయుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'తను నిమ్మెయిఁ దలచిన య। మ్మను జేంద్రులఁ గౌరవులను మన మూఁకల న
య్యనిఁ గర్ణుఁడు గాచెనె? తన। మనోరథము లెల్ల ఫలసమగ్రతఁ బొందన్.' 24

ప్రతిపదార్థం: తనున్= కర్ణుడిని; ఈ+మెయిన్= ఈ విధంగా; తలఁచిన= స్మరించిన; ఆ+మనుజేంద్రులన్= ఆ రాజులను; కౌరవులన్= దుర్యోధనాదులను; మన మూఁకలన్= మన సేనలను; ఆ+అనిన్= ఆ యుద్ధంలో; కర్ణుఁడు= కర్ణుడు; తన= తనయొక్క; మనోరథములు= కోర్కెలు; ఎల్లన్= అన్ని; ఫలసమగ్రతన్= పూర్ణఫలాన్ని; పొందన్= పొందగా; కాచెనె?= కాపాడెనా?

తాత్పర్యం: 'కర్ణుడిని ఈ విధంగా స్మరిస్తే, అతడు ఆ రాజులను, దుర్యోధనాది కౌరవులను, మన సైన్యాన్ని తాను భీష్ముడు పడిపోతే రక్షిస్తానని చెప్పి ఉన్నాడు గదా! అట్లా తన మనోరథం నెరవేరగా రక్షించాడా?'

వ. అనవుడు నమ్మనుజపతికి నతం డిట్లనియె. 25

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; ఆ+మనుజ పతికిన్= ఆ ధృతరాష్ట్రుడితో; అతండు= ఆ సంజయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా, ధృతరాష్ట్ర మహారాజుతో సంజయుడు ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వననిధి నడు నీటఁ గలము । మునిఁగిన బెగడందు చిత్తములు గలిగిన త
జ్జనుల క్రియ నున్న సేనలు । గనుఁగొన దీవిగతిఁ దోఁచెఁ గర్ణుం డంతన్. 26

ప్రతిపదార్థం: వననిధిన్= సముద్రంలో; నడు నీటన్= నీటి నడుమ; కలము= పడవ; మునిఁగినన్= మునిగిపోగా; బెగడు+అందు= భయపడే; చిత్తములు= మనస్సులు; కలిగిన= కల; తద్+జనుల క్రియన్= ఆ మనుష్యులవలె; ఉన్నసేనలు= ఉన్నటువంటి సైన్యాలు; కనుఁగొనన్= పరిశీలించగా; అంతన్= అప్పుడు; కర్ణుండు= కర్ణుడు; దీవి గతిన్= ద్వీపంవలె; తోఁచెన్= కనిపించినాడు.

తాత్పర్యం: సముద్ర మధ్యంలో పడవ మునిగితే బెదరిపోయిన వారివలె ఉన్న కౌరవ సేనలకు కర్ణుడు ద్వీపంవలె కనిపించినాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు పురంబు వెడలి యతండు కురుపతి కడ కేతెంచి ప్రీతుం డగు నతని చేత నభినందితుండై రాజలోకంబు నాలోకించి. 27

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పురంబు= హస్తినాపురం నుండి; వెడలి= వెళ్లి; అతండు= ఆ కర్ణుడు; కురుపతి కడకున్= దుర్యోధనుడి వద్దకు; ఏతెంచి= వచ్చి; ప్రీతుండు+అగు= సంతోషించిన; అతనిచేతన్= ఆ దుర్యోధనుడి చేత; అభినందితుండు+ఐ= ప్రశంసించబడినవాడై; రాజలోకంబున్= రాజుల సమూహాన్ని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఈ విధంగా హస్తినాపురం నుండి కర్ణుడు దుర్యోధనుడి వద్దకు వచ్చి, సంతసించిన అతడిచేత ప్రశంసించబడి, అచటి రాజులను చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'దమమును సత్యముం దపము దానము శీలము నస్త్రవీర్య శౌ
ర్యములును భీష్మునంద కల; వట్టి మహాత్ముఁడు పోర నీల్గె; నిం
క మనకు నేటి బాహు బల గర్వము లెక్కడి సేన లక్కటా!
సమసెనె కౌరవేశ్వరుని సంపద?' యంచు విషణ్ణమూర్తియై. 28

ప్రతిపదార్థం: దమమును= ఇంద్రియనిగ్రహం; సత్యమున్= సత్యము; తపమున్= తపస్సు; దానమున్= దానం; శీలమున్= సత్ప్రవర్తన; అస్త్ర= మంత్రపూర్వకంగా ప్రయోగించే ఆగ్నేయాస్త్రాదులు; వీర్య= బలము; శౌర్యములును= యుద్ధంలో భయపడని గుణం; భీష్ము+అందు+అ= భీష్ముడియందే; కలవు= ఉన్నవి; అట్టి మహాత్ముఁడు= ఆ విధమైన సద్గుణ సంపన్నుడైన; మహనీయుడు; పోరన్= యుద్ధంలో; ఈల్గెన్= కూలెను; ఇంకన్= ఆపై; మనకున్= కౌరవులకు; ఏటి= ఎక్కడి; బాహుబలగర్వము= భుజబలం వలన కలిగిన అహంకారం; ఎక్కడి సేనలు= ఎక్కడి సైన్యాలు; అక్కట!= అయ్యో!; కౌరవేశ్వరుని= దుర్యోధనుడియొక్క; సంపద= సౌభాగ్యం; సమసెనె?= నశించెనే?; అంచున్= అంటూ; విషణ్ణమూర్తి+ఐ= విషాదమే రూపంగా కలవాడై.

తాత్పర్యం: ఇంద్రియనిగ్రహం, సత్యవాక్పరిపాలన, తపస్సు, దాతృత్వం, సత్ప్రవర్తన, అస్త్రాలను ప్రయోగించే సామర్థ్యం వంటి సద్గుణాలు ఒక్క భీష్ముడిలోనే ఉన్నవి. అటువంటి మహనీయుడు యుద్ధంలో కూలిపోయాడు. ఇంక మనకు బాహుబలగర్వం ఎక్కడ? ఎక్కడి సేనలు? అయ్యో! కౌరవేశ్వరుడైన దుర్యోధనుడి ఐశ్వర్యం నశించింది కదా! అని కర్ణుడు భీష్ముడిని తలచుకొని విచారగ్రస్తుడై.

విశేషం: భీష్ముడి ధర్మవీర, యుద్ధవీర గుణాలను స్మరించటంవలన కర్ణుడిలో శోకం ఉద్దీప్తమై విషాదం అలముకొన్నది. ఇక్కడ వీరరసం కరుణ రసానికి పోషకంగా ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **కన్నీ రొలుకఁగ వగచిన। నన్నరపతులెల్ల నేడ్చి రార్తరవంబుల్**
మిన్నంద నశ్రుజలములు। విన్నని వదనంబులందు వెల్లిగొనంగన్. 29

ప్రతిపదార్థం: కన్నీరు= కంటినీరు; ఒలుకఁగన్= కారగా; వగచినన్= ఏడ్వగా; ఆ+నరపతులు= ఆ కౌరవపక్షంలోని రాజులు; ఎల్లన్= అందరు కూడా; ఆర్తరవంబుల్= దుఃఖధ్వనులు; మిన్ను+అందన్= ఆకాశాన్ని తాకగా; అశ్రుజలంబుల్= కన్నీరు; విన్నని= వెలవెలపోయిన; వదనంబులందున్= ముఖములందు; వెల్లిగొనంగన్= జాలువారగా; ఏడ్చిరి=శోకించారు.

తాత్పర్యం: కర్ణుడు కన్నీరు కారేవిధంగా ఏడ్వగా, అక్కడఉన్న రాజులందరు ఆర్తరవాలు మిన్ను ముట్టేటట్లు, వివర్ణాలైన మొగాలపై అశ్రువులు జాలువారగా శోకించారు.

విశేషం: ఆర్తరవాలు, అశ్రువులు, తెల్లబోయిన వదనాలు అనే అనుభావాలవలన దైన్య విషాదాదులు వ్యక్తమై ఇందు కరుణరసం ఉట్టిపడుతున్నది.

వ. **అప్పుడు దన్నుం దాన యుపశమించుకొని యందఱడెందంబుల యుమ్మలికంబులు వాయ రాధేయుం డిట్లనియె.** 30

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; తన్నున్= తనను; తాను+అ= తానే; ఉపశమించుకొని= ఓదార్చుకొని; అందఱ= అందరియొక్క; డెందంబుల= మనస్సులలోని; ఉమ్మలికంబులు= బాధలు; పాయన్= పోయేటట్లుగా; రాధేయుండు= రాధా కుమారుడైన కర్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కర్ణుడు ఆ సమయంలో తనను తాను ఓదార్చుకొని, అక్కడగల వారందరిలోని బాధలు తొలగిపోయేటట్లు ఈ విధంగా అన్నాడు.

క. **'మీ రెల్లఁ జూచుచుండఁగఁ। గౌరవ నికురంబమునకుఁ గన్నాకై యొ**
ప్పారెడు భీష్ముఁడు వడియెను। మేరు వొఱఁగినట్టు లసము మిగుల నరునకున్. 31

ప్రతిపదార్థం: మీరు; ఎల్లన్= అందరు; చూచుచుండఁగన్= చూస్తుండగా; కౌరవ= కౌరవులయొక్క; నికురుంబమునకున్= సమూహానికి; కన్నాకు+ఐ= ముఖ్యుడై; ఒప్పారిన= ఉన్న; భీష్ముఁడు= భీష్ముడు; నరునకున్= అర్జునుడికి; అసము= దర్పం; మిగులన్= అతిశయించగా; మేరువు= మేరుపర్వతం; ఒఱగినట్టులు= వంగిన విధంగా; పడియెన్= పడిపోయాడు.

తాత్పర్యం: మీరంతా చూస్తుండగా, కౌరవ సైన్యంలో అగ్రేసరుడైన భీష్ముడు, అర్జునుడి దర్పం అతిశయించగా మేరు పర్వతం విరిగినట్లు పడిపోయాడు.

వ. **నా తెఱంగు వినుండు.** 32

ప్రతిపదార్థం: నా= నా యొక్క; తెఱంగు= విధం; వినుండు= వినండి.

తాత్పర్యం: కర్ణుడు తన శౌర్యధైర్య పరాక్రమములను గూర్చి వినండి అని కౌరవసేనతో అంటున్నాడు.

క. **కలఁగిన సేనలఁ గాచెద;। నిలిపెద నర్జునుని కడఁక నెఱపెద; బాహా**
బల మా భీష్ముం డె ట్లు। గ్గలిక మెఱసె నట్ల మీకుఁ గన్నులు దనియన్. 33

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కలఁగిన= చెదరిన; సేనలన్= సైన్యాలను; కాచెదన్= రక్షిస్తాను; అర్జునుని= అర్జునుని యొక్క; కడఁక= ప్రయత్నాన్ని; నిలిపెదన్= అడ్డగిస్తాను; ఆ భీష్ముండు= ఆ భీష్ముడు; ఎట్లు= ఏ విధంగా; అగ్గలికన్= ఆధిక్యంతో; మెఱసెన్= ప్రకాశించాడో; అట్లు+అ= ఆ విధంగానే; మీకున్= కౌరవ సైన్యానికి; కన్నులు; తనియన్= తృప్తిపొందేటట్లు; బాహాబలము= భుజబలం; నెఱపెదన్ = ప్రదర్శిస్తాను.

తాత్పర్యం: నేను మన చెదరిపోయిన సైన్యాన్ని కాపాడుతాను. అర్జునుడి పూనికను ప్రతిఘటిస్తాను. భీష్ముడు ఏ విధంగా శౌర్యంతో ప్రకాశించాడో అట్లా నా భుజబలాన్ని ప్రదర్శిస్తాను.

ఉ. **ధర్మజ భీమ పార్థులును దమ్ములు నుద్భట సంగరక్రియా**
కర్మఠు లచ్యుతానుజుని గర్వము దుర్విషహంబు వారి మ
త్కార్ముక ముక్త చండశర ఖండిత దేహులఁ జేసి యిత్తు నేఁ
బేర్మిగఁ గౌరవేంద్రున కభీష్టత రాజ్యరమా విలాసమున్. **34**

ప్రతిపదార్థం: ధర్మజ= ధర్మరాజు; భీమ= భీముడు; పార్థులును= అర్జునుడును; తమ్ములున్= వారి తమ్ములైన నకుల సహదేవులును; ఉద్భట= గొప్ప; సంగరక్రియా= యుద్ధం చేయటంలో; కర్మఠులు= సఫలమయ్యే వరకు పనిచేసేవారు; అచ్యుత+అనుజుని= కృష్ణుడి తమ్ముడైన సాత్యకియొక్క; గర్వము= అహంకారం; దుర్విషహంబు= సహించరానిది; వారిన్= పాండవులను, సాత్యకిని; మత్= నా యొక్క; కార్ముక= ధనుస్సు నుండి; ముక్త= వదలబడిన; చండ= తీవ్రమైన; శర= బాణాలచేత; ఖండిత= త్రుంచబడిన; దేహులన్= శరీరాలు కలవారిగా; చేసి= చేసి; పేర్మిగన్= గౌరవంగా; కౌరవ+ఇంద్రునకున్= దుర్యోధన మహారాజుకు; అభీష్టతన్= కోరికతో; రాజ్య= రాజ్యమనే; రమా= లక్ష్మియొక్క; విలాసమున్= లీలను; ఏన్= నేను; ఇత్తున్=ఇస్తాను.

తాత్పర్యం: ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు యుద్ధం చేయడంలో వెనుదిరుగని శూరులు. సాత్యకి గర్వం సహించరానిది. వీరందరిని నా ధనుస్సునుండి వెలువడే ప్రచండ బాణాల చేత తునాతునకలు చేసి, నేను కౌరవేశ్వరుడైన దుర్యోధనుడికి అతడు కోరినట్లుగా రాజ్యలక్ష్మి విలాసాలను అందిస్తాను.

విశేషం: పాండవుల యొక్క, సాత్యకియొక్క ధైర్యపరాక్రమాదుల స్మరణ వలన ఉద్దీప్తమైన కర్ణుడిలోని ఉత్సాహం అతడి ధైర్యశౌర్యాదులచేత పోషింపబడి వీరరసంగా వ్యక్తమౌతున్నది.

క. **కాదేని గాండివజ్యా। నాదము సురదుందుభి ప్రణాదంబును నిః**
ఖేదుఁడనై వించు నధిక। మోదంబున నిత్య సౌఖ్యముం గైకొందున్. **35**

ప్రతిపదార్థం: కాదు+ఏనిన్= పాండవులను జయించలేకపోతే; గాండివ= గాండీవం అనే పేరుగల అర్జునుడి ధనుస్సుయొక్క; జ్యా= అల్లెత్రాటి; నాదమున్= ధ్వనియు; సురదుందుభి= దేవతలు మ్రోగించే దుందుభి అనే వాద్యం యొక్క; ప్రణాదంబును = తీవ్రతరమైన ధ్వనిని; నిఃఖేదుఁడను+ఐ= దుఃఖం ఏమాత్రం లేనివాడినై; వించున్= వింటూ; అధిక= మిక్కిలి; మోదంబునన్= సంతోషంతో; నిత్య= శాశ్వతమైన; సౌఖ్యమున్= ఆనందాన్ని, వీరస్వర్గాన్ని; కైకొందున్= పొందుతాను.

తాత్పర్యం: నేను పాండవులను జయించలేకపోతే, అర్జునుడి గాండీవం నుండి వచ్చే నాదాన్ని, దేవదుందుభుల మ్రోతను ఆనందంతో వింటూ, సంతోషంతో వీరస్వర్గాన్ని అలంకరిస్తాను.

క. **కౌరవులం గాచుచు రణ। శూరులఁ బాండవుల నోర్చుచుం గీర్తి కర**
స్ఫారవిహారత భీష్మునిఁ। జేరంజను కంటె నొప్పు సెప్పం గలదే?' **36**

ప్రతిపదార్థం: కౌరవులన్= దుర్యోధనాదులను; కాచుచున్= కాపాడుతూ; రణ= యుద్ధంలో; శూరులన్= శౌర్యంగలవారైన; పాండవులన్= ధర్మజుడు మొదలైన పాండురాజు పుత్రులను; ఓర్చుచున్= ఓడిస్తూ; కీర్తికర= యశస్సును కలిగించే; స్ఫార= అధికమైన; విహారతన్= విహరించే గుణంతో, స్వైరవిహారం చేసి; భీష్మునిన్= భీష్మపితామహుడిని; చేరన్+చనుకంటెన్= చేరబోవటం కంటె; ఒప్పు= యోగ్యమైనది; చెప్పన్+కలదే?= చెప్పడాని కేముంది?

తాత్పర్యం: దుర్యోధనాది కౌరవవర్గాన్ని రక్షిస్తూ, రణశూరులైన పాండవులను ఓడిస్తూ, యుద్ధంలో ప్రశంసాపూర్వకంగా స్వైరవిహారం చేస్తూ భీష్ముడిని చేరబోవటంకంటె వేరే చెప్పవలసిం దేమున్నది?'

వ. అని పలికి తన సారథిం గనుంగొని. 37

ప్రతిపదార్థం: అని పలికి= ఆ విధంగా చెప్పి; తన సారథిన్= తన రథసారథిని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: కర్ణుడు పై విధంగా పలికి, తన సారథిని చూచి.

సీ. 'మణిగణోజ్జ్వలమైన మన యరదంబున । జవనాశ్వములఁ బూన్పు; చాప బాణ
ఖడ్గాది సాధనోత్కర మొడఁగూర్పుము । రత్నధ్వజం బెత్తు రశ్ములడర
శంఖ మృదంగ నిస్సాణాది తూర్యముల్ । సంఘటింపుము రభసమున' ననుడు
వాఁ డట్ల చేయ దుర్వార గర్వోద్ధతి । నగ్నిప్రభంబగు నారథంబు

తే. పటురయంబున నెక్కి భూపతికి మ్రొక్కి । యాతఁ డెల్ల కౌరవులును నఖిల నృపులుఁ
దన్నుఁ గొనియాడఁ గర్ణుఁ డుత్సాహ లీల । నిజ బలాభీల సుందర ధ్వజము లొప్ప. 38

ప్రతిపదార్థం: మణిగణ= రత్న సమూహంతో; ఉజ్జ్వలము+ఐ= మిక్కిలి ప్రకాశించే; మన+అరదంబునన్= మన రథమునందు; జవనాశ్వముల్= వడిగల గుర్రాలను; పూన్పు= కట్టుము; చాప= ధనుస్సులు; బాణ= అమ్ములు; ఖడ్గ+ఆది= కత్తులు మొదలైన; సాధన+ఉత్కరము= పరికరాల సమూహం; ఒడన్+కూర్పుము= సమకూర్చుము; రశ్ములు= కిరణాలు; అడరన్= అతిశయించగా; రత్నధ్వజంబు= మణులుగల టెక్కెపు స్తంభం; ఎత్తు(ము)= పైకెత్తుము; శంఖ= శంఖం; మృదంగ= మద్దెల; నిస్సాణ+ఆది= నిస్సాణం మొదలైన; తూర్యముల్= వాద్యవిశేషాలను; రభసమునన్= వేగంగా; సంఘటింపుము= కూర్చుము; అనుడున్= అనగా; వాఁడు= ఆ సారథి; అట్లు+అ= ఆ విధంగానే; చేయన్= చేయగా; దుర్వార= వారించటానికి వీలుకాని; గర్వ+ఉద్ధతిన్= గర్వం యొక్క ఉద్రేకంతో; అగ్ని= అగ్ని యొక్క; ప్రభంబు= ప్రకాశంకలది అగు; ఆ రథంబు= ఆ రథాన్ని; పటురయంబునన్= మిక్కిలి వేగంగా, ఎక్కి; భూపతికిన్= దుర్యోధన మహారాజుకు; మ్రొక్కి= నమస్కరించి; ఆతఁడు= ఆ కర్ణుడు; ఎల్ల కౌరవులున్= కౌరవులందరు; అఖిల నృపులున్= రాజులందరు; తన్నున్= తనను; కొనియాడన్= ప్రశంసించగా; ఉత్సాహలీలన్= ఉత్సాహంయొక్క విలాసంతో; నిజ= తన; బల= సైన్యం యొక్క; ఆభీల= భయం గొలిపే; సుందర= అందమైన; ధ్వజములు= టెక్కెపు కంబాలు; ఒప్పన్= ఒప్పగా.

తాత్పర్యం: మణులతో ప్రకాశించే మన రథానికి వడిగల గుర్రాలను పూన్చుము. ధనుర్బాణాలు, ఖడ్గాలు మొదలైన ఆయుధ సామగ్రిని సమకూర్చుము. మిలమిలలాడే రత్నధ్వజాన్ని ఎత్తుము. శంఖం, మృదంగం, నిస్సాణం మొదలైన వాద్యాలను త్వరగా చేర్చుము' అనగా, ఆ సారథి వాటి నన్నింటిని రథంలో సిద్ధపరచాడు. కర్ణు డపుడు అనివార్యమైన గర్వంతో అగ్నిహోత్రుడివలె ప్రకాశించే ఆ రథాన్ని వెంటనే ఎక్కి, దుర్యోధన మహారాజుకు నమస్కరించి, కౌరవులు, రాజులు బహుముఖాల ప్రశంసిస్తుండగా, ఉత్సాహం మించగా, తన సైన్యంలో భయం గొలిపే సుందరమైన ధ్వజాలు వెలుగొందుతుండగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇందుగల అగ్ని ప్రభమైన రథం, ధ్వజ, బాణ, శంఖాది సామగ్రి అంతా కర్ణుడిలోని యుద్ధవీరాన్ని ఉద్దీపనం చేసేది.

వ. నడచి, నదీనందనుం డున్న యెడకుఁ జేర ంబోయి, శోషించిన సముద్రంబు చందంబున, విమానంబు విఱిగిపడిన దివ్యుని తెఱంగున, భూతల పతితుండైన పతంగు భంగిని, భగ్నపక్షంబైన మైనాకంబు మాడ్కిం బొలుచు నతని కడకుం బాదచారియై యరిగి, ఫల్గును నారాచనిచయంబునం బొదువంబడి యమునానదీ హ్రదస్థితంబును మదనిమీలితాక్షంబునునై శోభిల్లుశుండాలంబు ననుకరించుచు వీరశయన మహనీయుండైనయమ్మహానుభావుని యడుగులపైఁ గన్నీరు దొరఁగం బ్రణమిల్లి, కేలు మొగిచి, వినయ వినమిత శరీరుండై. 39

ప్రతిపదార్థం: నడచి; నదీనందనుండు= భీష్ముడు; ఉన్న+ఎడకున్= ఉన్నచోటికి; చేరన్+పోయి= సమీపించి; శోషించిన= ఎండిపోయిన; సముద్రంబు= సముద్రం; చందంబునన్= వలె; విమానంబు= విమానం; విరిగిపడిన= విరిగిపోయి క్రిందపడిన; దివ్యుని= దేవలోకస్థుడి; తెఱంగునన్= విధంగా; భూతల= భూమిపై; పతితుండు+ఐన= పడిపోయిన; పతంగు= పక్షి; భంగిని= వలె; భగ్నపక్షంబు+ఐన= రెక్కలు విరిగిన; మైనాకంబు= హిమవత్పర్వతుడి పుత్రుడైన మైనాక పర్వతం; మాడ్కిన్= వలె; పొలుచు= ఒప్పు; అతని కడకున్= ఆ భీష్ముడి దగ్గరకు; పాదచారి+ఐ= కాళ్ళతో నడుస్తూ; అరిగి= వెళ్ళి; ఆ ఫల్గును= అర్జునుడి యొక్క; నారాచ= బాణాల; నిచయంబునన్= సమూహంతో; పొదువన్+పడి= కప్పబడి; యమున= యమున అనే పేరుగల; నదీ= నదియొక్క; హ్రద= మడుగులో; స్థితంబును= ఉన్న; మద= మదంచేత; నిమీలిత+అక్షంబునున్+ఐ = కన్నులు మూసికొని; శోభిల్లు= ప్రకాశించే; శుండాలంబున్= ఏనుగును; అనుకరించుచున్= పోలుచు; వీరశయన= శరతల్పంపై పరుండిన; మహనీయుండు+ఐన= మహాత్ముడైన; ఆ+మహానుభావుని= ఆ గొప్ప ప్రభావంగల భీష్మునియొక్క; అడుగులపైన్= పాదాలపై; కన్నీరు= కంటినీరు; తొరఁగన్= జారగా; ప్రణమిల్లి= నమస్కరించి; కేలు మొగిడ్చి= చేతులు జోడించి; వినయ= వినయంతో; వినమిత= మిక్కలి వంగిన; శరీరుండు+ఐ= దేహం కలవాడై.

తాత్పర్యం: కర్ణుడు నడచి భీష్ముడు ఉన్నచోటికి వచ్చాడు. అక్కడ ఎండిపోయిన సముద్రంవలె, విమానం విరుగగా పడిపోయిన అమరుడివలె, భూమిపై పడిన పక్షివలె, రెక్కలు విరిగిన మైనాక పర్వతంవలె ఒప్పుతున్న ఆ కురుపితామహుడి వద్దకు వెళ్లి, అర్జునుడి బాణాలచేత పొదువబడి, యమునానది మడుగులో మదంచేత కన్నులు మూసికొని ఉన్న ఏనుగువలె శరతల్ప గతుడైన ఆ మహానుభావుడి పాదాలపై కన్నీరు రాలగా నమస్కరించి, చేతులు జోడించి, వినయంతో వంగిన శరీరం కలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: మాలోపమ. యుద్ధంలో కూలిన భీష్ముని రెక్కలు తెగిన మైనాకుడితో ఉపమించడంలో ఎంతో ఔచిత్యం ఉంది. మైనాకుడు మేనా హిమవంతుల పుత్రుడు, పర్వతాలకు పూర్వం రెక్కలు ఉండేవట. అవి పక్షులవలె ఎగిరి నగరాదులపైబడి ఉపద్రవం కలిగించేవి. లోకరక్షకుడైన ఇంద్రుడు పర్వతాల ఆగడాన్ని మాన్పడానికై వజ్రాయుధంతో పర్వతాల రెక్కలను ఛేదించేటప్పుడు మైనాకుడు ఎగిరిపోయి దక్షిణ సముద్రంలో దాగి తన రెక్కలు కాపాడుకొన్నాడు. ఇట శరతల్ప గతుడైన భీష్ముడిని రెక్కలు తెగి దీనస్థితికి చేరిన మైనాకునిగా భావించి శోకాన్ని వెలిబుచ్చినాడు కర్ణుడు.

క. 'వచ్చితి రాధేయుఁడఁ; గను । విచ్చి ననుం జూడు భరత వీరాగ్రణి! నీ
సచ్చరితము ఫలమే యి । ట్లిచ్చట నీ యునికి? ధాత నేమన నేర్తున్? 40

ప్రతిపదార్థం: భరత= భరతవంశానికి చెందిన; వీర= వీరులలో; అగ్రణి!= శ్రేష్ఠా!; రాధేయుఁడన్= రాధా పుత్రుడనైన కర్ణుడిని; వచ్చితిన్= వచ్చాను; కనువిచ్చి= కన్నులు తెరిచి; నన్నున్= నన్ను; చూడు(ము)= చూడవలసింది; ఇట్లు= ఈ విధంగా; ఇచ్చట= ఈ యుద్ధభూమిలో; నీ+ఉనికి= నీవు పడి ఉండటం; నీ= నీయొక్క; సత్+చరితము= మంచి నడత; ఫలమే= ఫలమా; ధాతన్= బ్రహ్మదేవుడిని; ఏమి+అననేర్తున్?= ఏమనగలను?

తాత్పర్యం: 'ఓ భరతకుల శ్రేష్ఠా! నీ దర్శనార్థం కర్ణుడిని వచ్చినాను. కన్నులు తెరిచి నన్ను చూడవలసింది. నీ సచ్చరిత్రకు యుద్ధభూమిలో దైన్యంగా పడి ఉండటమా ఫలం? విధిని ఏమనాలి?

విశేషం: 'భరత వీరాగ్రణి!' అనే సంబోధన సాభిప్రాయంతో, ఔచిత్యంతో కూడుకొన్నది. కర్ణుడి మాటలలో క్రోధ, విషాద, నిర్వేదాది భావాలు గోచరిస్తున్నవి.

ఆ. పావనంబు లయిన పలుకులు నా చెవు । లార నెమ్మి నన్ను నాదరింపు
మయ్య! ధర్మనిత్య! యంచితసత్య! శం । తను కుమార! గాఢ ధైర్యసార! 41

ప్రతిపదార్థం: ధర్మనిత్య!= ధర్మాన్ని ఎల్లవేళలా ఆచరించేవాడా!; అంచితసత్య!= సత్యాన్ని పూజించేవాడా!; గాఢ ధైర్యసార!= నిబిడమైన ధైర్యశక్తి కలవాడా!; శంతను కుమార!= శంతనుడి పుత్రుడా!; పావనంబులైన= పవిత్రమైన; పలుకులు= మాటలు; నా= నాయొక్క; చెవులు+ఆరన్= చెవుల తనివి దీరేటట్లుగా (పలికి); నెమ్మిన్= ప్రేమతో; నన్నున్= నన్ను; ఆదరింపుము+అయ్య!= మన్నించవయ్య!

తాత్పర్యం: సత్యాన్ని, ధర్మాన్ని సర్వకాల సర్వావస్థలలో పాటించేవాడా! అపార ధైర్యనిధీ! శంతను పుత్రా! పవిత్రమైన నీ వాక్కులచేత వీనులవిందు గావించి నన్ను ఆదరించుము.

విశేషం: ధర్మనిత్యాది విశేషణాలు సాభిప్రాయాలై భీష్ముడి మహనీయతను చాటుతున్నవి.

ఉ. పేర్చిన మూఁకఁగూడ నడపింపఁగఁ గోల్తలసేయఁ దీవ్ర బా
ణార్చుల మార్బలంబుల రయంబున నీఱుగఁ గాల్ప నాజి నీ
నేర్చిన భంగి నొండొకఁడు నేర్చునె? పాండవ బాహు సంపదల్
పేర్చు నెలర్చు నింకఁ గురుబృందము లెల్లనుఁ దల్లడిల్లఁగన్. 42

ప్రతిపదార్థం: పేర్చిన= విజృంభించిన; మూఁకన్= సైన్యాన్ని; కూడన్= కూడగట్టుకొని; నడిపింపఁగన్= నడిపించటంలో; కోల్తల+చేయన్= ముందుండి యుద్ధం చేయుటంలో; తీవ్ర= ప్రచండమైన; బాణ= బాణాలనే; అర్చులన్= మంటలచేత; మార్బలంబులన్= శత్రు సైన్యాలను; రయంబునన్= వెంటనే; నీఱుగన్= బూడిద అయ్యేటట్లు; కాల్పన్= కాల్చటంలో; ఆజిన్= యుద్ధంలో; నీ నేర్చిన= నీవు తెలిసికొన్న; భంగిన్= విధంగా; ఒండు+ఒకఁడు= మరొకడు; నేర్చునె?= నేర్చాడా?; కురుబృందములు= కౌరవ సైన్యాలు; ఎల్లనున్= అన్నీ; తల్లడిల్లఁగన్= బాధపడగా; ఇంకన్= ఇంకముందు; పాండవ= పాండురాజు పుత్రులైన ధర్మజాదులయొక్క; బాహుసంపదల్= భుజ బలాలు; పేర్చున్= విజృంభిస్తాయి; ఎలర్చున్= అతిశయిస్తాయి.

తాత్పర్యం: యుద్ధంలో విజృంభించిన సైన్యాన్ని కూడగట్టుకొని నడిపించటంలో, ముందుండి యుద్ధం చేయుటంలో, ప్రచండమైన బాణాగ్నులతో ఆ క్షణంలోనే శత్రుసైన్యాలను భస్మీపటలం చేయుటంలో నిన్ను మించినవాడు మరొక డెవ్వడు? ఇకమీద కౌరవసైన్యం తల్లడిల్లేటట్లు పాండవుల బాహుబలాలు మిక్కిలి విజృంభిస్తాయి.

క. శర జిహ్వా భీకరుఁ డగు । నరుఁ డను శిఖి నిగుడఁ జేసి నారాయణ దు
ర్ధర పవనుఁ డింక బంధుర । కురుసేనా కాననంబు క్రొ వ్వడఁగించున్. 43

ప్రతిపదార్థం: శర= బాణాలనే; జిహ్వా= నాలుకలచేత; భీకరుఁడు+అగు= భయంకరుడైన; నరుఁడు= అర్జునుడు; అను= అనే; శిఖి= అగ్నిహోత్రుడిని; నిగుడన్+చేసి= వృద్ధిచేసి; నారాయణ= శ్రీకృష్ణుడు అనే దుర్ధర= భరించవీలుగాని; పవనుఁడు= గాలి; ఇంకన్= ఇకముందు; బంధుర= దట్టమైన; కురుసేనా= కౌరవసేన అనే; కాననంబు= అడవి; క్రొవ్వు= బలుపును; అడఁగించున్= అణచివేస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: బాణాలు అనే నాలుకలచేత భీకరుడైన అర్జునుడు అనే అగ్నిహోత్రుడిని వ్యాపింపజేసి, శ్రీకృష్ణుడు అనే భరించరాని వాయుదేవుడు ఇకముందు కౌరవసేన అనే అరణ్యంయొక్క బలుపును అణచివేస్తాడు.

విశేషం: అలం: రూపకం. కృష్ణార్జునులు ఇద్దరూ పూర్వజన్మలో నరనారాయణులనే మహాతపస్వులైన మునులు. కనుక వారితో వీరికి అభేదాన్ని సూచించడానికి పూర్వపు పేర్లు ఇట వాడబడినవి.

మ. **భరితాశాంతర పాంచజన్యరవ దృప్యద్దేవదత్త ధ్వని**
స్ఫురణన్ వీనులు వ్రయ్యఁ గేతన కపిస్ఫూర్జత్ప్రభం జూడ్కు లా
తురతం బొందఁగఁ జండగాండివ సముద్భూతాస్త్రజాలంబు లె
వ్వరు సైరింతురు? నీవు దక్క భుజగర్వస్ఫూర్తి నిర్వాహకా! **44**

ప్రతిపదార్థం: భుజ= బాహువుల; గర్వస్ఫూర్తి= అహంకారస్ఫురణముయొక్క; నిర్వాహకా!= నిర్వహించే భీష్ముడా!; భరిత= నిండిన; ఆశా+అంతర= దిక్కుల లోపలి విభాగంగల; పాంచజన్య= పాంచజన్యం అనే శ్రీకృష్ణుడి శంఖం యొక్క; రవ= చప్పుడు; దృప్యత్= దర్పిస్తున్న; దేవదత్తధ్వని= అర్జునుడి శంఖమైన దేవదత్తంయొక్క నాదంయొక్క; స్ఫురణన్= తోచటంవలన; వీనులు= చెవులు; వ్రయ్యన్= పగులగా; కేతన= ధ్వజంపై గల; కపి= హనుమంతుడి యొక్క; స్ఫూర్జత్= ప్రకాశిస్తున్న; ప్రభన్= వెలుగులవలన; చూడ్కులు= చూపులు; ఆతురతన్= బాధను; చండ= భయంకరమైన; గాండివ= గాండీవం అనే అర్జునుడి ధనుస్సువలన; సముద్భూత= పుట్టిన; అస్త్రజాలంబులు= మంత్రపూతాలైన బాణసమూహాలు; నీవు+తక్క= నీవు తప్ప; ఎవ్వరు= ఇతరు లెవ్వరు; సైరింతురు?= ఓర్చుకొంటారు?

తాత్పర్యం: బాహు బల గర్వం స్ఫురించేటట్లు పోరుసల్పే భీష్మా! కౌరవ సైన్యం నలువైపులా పాంచజన్య, దేవదత్త ధ్వనులు మోయటం వలన చెవులు పగులగా, అర్జునుడి ధ్వజంపైగల హనుమంతుడి మెరిసే వెలుగు వలనచూపులు చెదరిపోగా; భయంకరమైన గాండీవంనుండి దూసుకొనివచ్చే అస్త్రసమూహాన్ని నీవు తప్ప ఎవ్వరు సహిస్తారు?

విశేషం: ఇట శత్రువులైన కృష్ణార్జునుల అతిలోక పరాక్రమాన్ని ప్రశంసించడంవలన కర్ణుని ఔదార్యం వ్యక్తమౌతున్నది.

ఆ. **మెయి మెయిం బెనంగి మెచ్చించి ముక్కంటి । చే వరంబు గొని విశిష్ట దివ్య**
కర్మదీప్తుఁ డైన గాండీవి నొరుఁ డాజిఁ । జెనయఁ జాలకునికి సెప్ప నేల?' **45**

ప్రతిపదార్థం: ముక్కంటిచేన్= మూడు కన్నులు కలవాడిచేత - శివుడిచేత; మెయిమెయిన్= దేహాన్ని దేహంతో; పెనంగి= యుద్ధం చేసి; మెచ్చించి= మెప్పించి; వరంబు+కొని= వరం సంపాదించి; విశిష్ట= శ్రేష్ఠమైన; దివ్య= దేవతా సంబంధమైన; కర్మ= పనులచేత; దీప్తుఁడు+ఐన= ప్రకాశించేవాడు అయిన; గాండీవిని= గాండీవమనే ధనుస్సును ధరించే అర్జునుడిని; ఒరుఁడు= ఇతరుడు; ఆజిన్= యుద్ధంలో; చెనయన్+చాలక= ఎదుర్కొనలేక; ఉనికి= ఉండటాన్ని గూర్చి; చెప్పన్+ఏల?= చెప్పేది ఏముంది?

తాత్పర్యం: మహేశ్వరుడితో శరీరాన్ని శరీరంతో కలిపి ద్వంద్వ యుద్ధం చేసి, అతడి మెప్పువడసి, వరాలు పొంది, ఇంద్రుడి కోర్కెపై నివాతకవచాదులను హతమార్చటంవంటి దివ్యకర్మలచేత వెలుగొందిన గాండీవిని ఇతరు లెవ్వరు ఎదిరించజాలకపోవటంలో ఆశ్చర్యమేమున్నది?

విశేషం: అరణ్యవాసంచేసే సందర్భంలో, దివ్యాస్త్రాలను సంపాదించేకొరకై ఇంద్రకీలాద్రిపై ఘోరతపస్సు చేసి, కిరాతుడి రూపంలో వచ్చిన రుద్రుడిపైబడి పోరి, అతని ప్రశంసలనంది, పాశుపతాది దివ్యాస్త్రాలనుపొందిన గాథ ఇందులో సూచించబడింది. ఇందులో ముక్కంటి శబ్దమూ, గాండీవి శబ్దమూ సాభిప్రాయాలు.

క. అని పెక్కు మాట లాడిన । విని యాదరభరితనేత్ర విస్తారుం డై
యనిమిష నదీతనూజుఁడు । గనుఁగొనుటయు మఱియు మ్రొక్కి కర్ణుఁడు పలికెన్. 46

ప్రతిపదార్థం: అని= కర్ణుడు ఇట్లు అని; పెక్కుమాటలు+ఆడిన= బహు విధాలుగా పలుకగా; విని; అనిమిష నదీ తనూజుఁడు= దేవనదీ పుత్రుడైన భీష్ముడు; ఆదర= మన్ననతో; భరిత= నిండిన; నేత్ర విస్తారుండు+ఐ= కన్నుల విప్పుగలవాడై; కనుఁగొనుటయున్= చూడగా; మఱియున్= మరల; మ్రొక్కి= నమస్కరించి; కర్ణుఁడు= కర్ణుడు; పలికెన్= ఇట్లన్నాడు.

తాత్పర్యం: కర్ణుడు ఈ విధంగా పలురీతుల భీష్ముడిని ప్రశంసించగా, ఆదరంతో అతడు కన్నులు విచ్చి కర్ణుడిని చూచాడు. అపుడు కర్ణుడు ఆ మహనీయుడికి మ్రొక్కి ఇంకా ఇట్లా అన్నాడు.

ఉ. 'ఆ నరు నే నొకండన విషానల దుస్సహ దృష్టి భీషణం
బైన మహా భుజంగమము నద్భుత మంత్ర నిరస్త దర్పముం
గా నొనరించునట్లు భుజ గర్వ మడంచెద నస్త్ర శస్త్ర వి
ద్యా నిపుణత్వ సంపద నుదాత్త గుణోత్తర! నీవు పంపఁగన్.' 47

ప్రతిపదార్థం: ఉదాత్తగుణ+ఉత్తర!= శ్రేష్ఠగుణాలతో ఉత్తముడవైన భీష్మా!; నీవు; పంపఁగన్= ఆజ్ఞాపించగా; ఆ నరున్= అట్టి దివ్యాస్త్రోపేతుడైన అర్జునుడిని; ఏన్+ఒకండన్+అ= నేనొక్కడినే; విష+అనల= విషమనే అగ్నిచేత; దుస్సహ= ఓర్వరాని; దృష్టి= చూపులచేత; భీషణంబు+ఐన= భయంకరమైన; మహాభుజంగమమున్= గొప్ప పామును; అద్భుత= ఆశ్చర్యంగొల్పే; మంత్ర= మంత్రముచేత; నిరస్తదర్పమున్+కాన్= తొలగిన దర్పం కలదానిగా; ఒనరించునట్లు= చేసినట్లు; భుజ గర్వము= బాహువుల అహంకారాన్ని; అస్త్ర= మంత్రపూర్వకంగా ప్రయుక్తమయ్యే వాయవ్యాద్యస్త్రాల; శస్త్ర= ఖడ్గాద్యాయుధాల; విద్యా= విద్య అందలి; నిపుణత్వ సంపదన్= నైపుణ్యం అనే సంపత్తుచేత; భుజగర్వము= బాహువుల పొగరును; అడంచెదన్= అణచివేస్తాను.

తాత్పర్యం: 'ఓ సద్గుణశ్రేష్ఠా! నీవు ఆజ్ఞాపిస్తే దివ్యాస్త్రోపేతుడైన అర్జునుడి బాహుగర్వాన్ని నేనొక్కడినే, విషాగ్నిని వెలిగ్రక్కే భయంకరమైన చూపులుగల మహాసర్పం యొక్క దర్పాన్ని అద్భుతమైన మంత్రశక్తితో అణచివేసినట్లు, నా అస్త్ర శస్త్ర విద్యానైపుణ్యంతో అణచివేస్తాను.'

విశేషం: అలం: ఉపమ. ఇందులో భీకరవిషసర్పంతో అర్జునుడిని పోల్చటంవలన కర్ణుడిలోని ఉత్సాహం ధైర్యశౌర్యాదులతో పోషించబడి వీర రస రూపంలో వ్యక్తమౌతున్నది.

వ. అనిన గాంగేయుండు రాధేయున కిట్లనియె. 48

ప్రతిపదార్థం: అనినన్= అనగా; గాంగేయుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; రాధేయునకున్= రాధాపుత్రుడైన కర్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడిని ఓడించటానికి తనను యుద్ధరంగానికి పంపుమని అడిగిన కర్ణుడితో భీష్ముడు ఈ విధంగా అన్నాడు.

మ. 'తగఁ బర్జన్యుని సొంపునన్ బ్రతుకు భూతవ్రాతముల్ వార్ధి సో
చ్చి గరిష్ఠస్థితి నుండు నేఱులును, సంక్షీణంబులై యుర్వి ని
ల్చి గుణాధిక్యముఁ బొందు బీజములుఁ బోలెం గౌరవుల్ విశ్రుతం
బగు నీప్రోపును బ్రాపుఁ గాపుఁ గని సౌఖ్యం బొందు టొప్పుం గడున్. 49

ప్రతిపదార్థం: తగన్= తగువిధంగా; పర్జన్యుని= మేఘుడి; సొంపునన్= సమృద్ధితో; బ్రతుకు= జీవించే; భూతవ్రాతమున్ పోలెన్= ప్రాణికోటివలెను; వార్ధి+చొచ్చి= సముద్రంలో ప్రవేశించి; గరిష్ఠ స్థితిన్= అత్యున్నత స్థాయిలో; ఉండు+ఏఱులున్ పోలెన్= ఉండే నదులవలెను; సంక్షీణంబులు+ఐ= మిక్కిలి ఎండిపోయినవై; ఉర్విన్ నిల్చి= నేలలో ఉండి; గుణ+ఆధిక్యమున్+పొందు= గుణముల ఆధిక్యమును పొందు; బీజములున్+పోలెన్= విత్తనాలవలెను; కౌరవుల్= దుర్యోధనాదులు; విశ్రుతంబు+అగు= ప్రసిద్ధమైన; నీ ప్రోపున్= నీ పోషణను; ప్రాపున్= ఆశ్రయాన్ని; కాపున్= రక్షణను; కని= పొంది; కడున్= మిక్కిలి; సౌఖ్యంబు= సుఖం; ఒందుట= పొందటం; ఒప్పున్= తగును.

తాత్పర్యం: ప్రాణికోటి వానలు సమృద్ధిగా కురియటం వలన రక్షించబడినట్లు, నదులు సముద్రాన్ని ఆశ్రయించి అత్యున్నత స్థితి పొందినట్లు, విత్తనాలు బాగా ఎండి భూమిలో ఉండి పెంపొందేటట్లు, కౌరవులు నీ పేరుగాంచిన పోషణలో ఉండి, నీ ఆశ్రయాన్ని పొంది, నీ రక్షణలో సౌఖ్యాన్ని పొందటం ఎంతైనా ఒప్పుకొనదగింది.

విశేషం: అలం: మాలోపమ.

చ. **అరయఁగ బంధుకోటులకు నక్కురునాథుని యట్లకావె, నీ**
వరిబలభేది! జన్మమున నయ్యెడు చుట్టఱికంబుకంటె సు
స్థిరతరమైన సంగడము చే నగు బాంధవ మెక్కుడండ్రు రా
నరపతి రాజ్యభారము మనంబున నీయదిగాఁ దలంపుమీ! **50**

ప్రతిపదార్థం: అరి= శత్రువులయొక్క; బల= సైన్యాన్ని; భేది!= చీల్చే కర్ణా!; నీవు; అరయఁగన్= పరిశీలించగా; బంధుకోటులకున్= చుట్టాలందరికి; ఆ+కురునాథుని+అట్లు+అ= ఆ దుర్యోధనుడి వంటి వాడవే; కావె?= కావా?; జన్మమునన్= పుట్టుకతో; అయ్యెడు= కలిగే; చుట్టఱికంబుకంటెన్= బంధుత్వం కంటె; సుస్థిరతరము+ఐన= మిక్కిలి దృఢమైన; సంగడముచేన్= స్నేహంతో; అగు= కలిగే; బాంధవము= చుట్టరికం; ఎక్కుడు= ఎక్కువ; అందురు= అంటారు; ఆ నరపతి= ఆ దుర్యోధనుడి యొక్క; రాజ్యభారము= రాజ్యాన్ని మోయటం; మనంబునన్= మనస్సులో; నీ+అదిగాన్= నీదే అని; తలంపుమీ= భావించుము.

తాత్పర్యం: శత్రుసైన్యాన్ని భేదించే కర్ణా! బంధువర్గానికంతా నీవు కూడా దుర్యోధనుడి వంటి వాడవే కదా! పుట్టుకతో కలిగే బంధుత్వం కంటె దృఢమైన స్నేహంతో కలిగే ఆత్మీయతయే ఎక్కువ అని పెద్దలు అంటారు. దుర్యోధనుడి రాజ్యరక్షణభారం నీపైననే ఉన్నదని తెలిసికొనుము.

వ. **అంబష్ఠ విదేహ పౌండ్రాది దేశాధీశుల గెల్చి, దుర్యోధనాధీన వర్తులంగా నిర్వర్తించిన నీకు నిట్లు సెప్పవలయునే? యండజంబులు పండినవృక్షంబు నుపజీవించు చందంబున నిన్నుం జెంది బంధువులు సుహృజ్జనులు సుఖులై యుండువారుగాక! నాకు నీవును సుయోధనునట్ల కావున మేలాడెదఁ; గౌరవుల నడపికొని, యమ్మహీ విభునకు విజయంబు గావింపుము పొ'మ్మని సమ్మదంబునం బలికిన సూతనందనుండు ప్రీతుండై యద్దేవవ్రతుచరణంబులు శిరంబు సోఁక వినతుండై వీడ్కొని, యరదం బెక్కి యరుగుదెంచి, భవదీయ సైన్యంబు దైన్యంబు వాపి, యే పగ్గలించి కలయం గనుంగొని.** **51**

ప్రతిపదార్థం: అంబష్ఠ= అంబష్ఠ దేశం; విదేహ= విదేహమనే పేరుగల దేశం; పౌండ్ర+ఆది= పౌండ్ర+ఆది= పౌండ్రదేశం మొదలైన; దేశాధీశులన్= దేశాధిపతులను; గెల్చి= జయించి; దుర్యోధన= దుర్యోధనుడి యొక్క; అధీనవర్తులన్+కాన్= వశంలో ఉన్నవారినిగా; నిర్వర్తించిన= చేసిన; నీకున్= నీకు (కర్ణునకు); చెప్పవలయునే?= చెప్పవలసినదేమున్నది?; అండజంబులు= గ్రుడ్లనుండి పుట్టే

పక్షులు; పండిన వృక్షంబున్= ఫలించిన చెట్టును; ఉపజీవించు= ఆశ్రయించే; చందంబునన్= విధంగా; నిన్నున్+చెంది= నిన్ను పొంది; బంధువులు= చుట్టాలు; సుఖులు+ఐ= సుఖంగా; ఉండువారుగాక= ఉంటారుగాక; నాకున్= (భీష్ముడనగు) నాకు; నీవును= కర్ణుడవగు నీవుగూడ; సుయోధనున్+అట్లు+అ= దుర్యోధనుడి వంటి వాడవే; కావునన్= కాన; మేలు+ఆడెదన్= మేలు పలుకుతాను; కౌరవులను= దుర్యోధనాదులను; నడపికొని= ముందుకు నడిపించి; ఆ+మహీవిభునకున్= ఆ మహారాజుకు; విజయంబు= గెలుపు; కావింపుము= కలిగేటట్లు చేయవలసింది; పొమ్ము+అని= యుద్ధానికి పొమ్మని; సమ్మదంబునన్= సంతోషంతో; పలికినన్= పలుకగా; సూతనందనుండు= కర్ణుడు; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; ఆ దేవవ్రతు= ఆ భీష్ముడి యొక్క; చరణంబులు= పాదాలు; శిరంబుసోఁకన్= తల తాకునట్లు; వినతుండు+ఐ= నమస్కరించినవాడై; వీడ్కొని= సెలవు తీసికొని; అరదంబు+ఎక్కి= రథంపై ఎక్కి; అరుగుదెంచి= వచ్చి; భవదీయ= తమ యొక్క; సైన్యంబు= సేనయొక్క; దైన్యంబు= దీనత్వాన్ని; పాపి= తొలగించి; ఏపు+అగ్గలించి= విజృంభణం అధికమై; కలయన్+కనుంగొని= అంతటా చూచి.

తాత్పర్యం: అంబష్ఠ, విదేహ, పౌండ్రాది దేశాల రాజులను జయించి దుర్యోధనుడి వశంలో ఉండేటట్లు చేశావు కనుక నీ కింక ఎక్కువగా చెప్పనవసరం లేదు. పక్షులు పండ్లుండే వృక్షాన్ని ఆశ్రయించి జీవించే విధంగా నిన్ను ఆశ్రయించి బంధువర్గమంతా సుఖంగా ఉండాలి. నాకు నీవుకూడా దుర్యోధనుడి వంటి వాడవే కనుక నీ క్షేమాన్ని కోరుతాను; కౌరవులను ముందుకు నడిపించి ఆ మహారాజుకు విజయాన్ని చేకూర్చు; పో!' అని సంతోషంతో భీష్ముడు పలికేసరికి, కర్ణుడు సంతోషపడి, భీష్ముడి పాదాలపై శిరస్సు మోపి నమస్కరించి, సెలవు తీసికొని, రథంపై వచ్చి నీ సైన్యంయొక్క దీనావస్థను తొలగించి, మిక్కిలి ఉత్సాహంతో అంతటా చూచి.

క. **నరపతి యలరఁగ రథకరి । తురగ సుభట సముదయముల దోర్గర్వధురం**
ధరలీల మెఱసి యతి బం । ధురములుగా సంఘటించె దురమునకుఁ దగన్. **52**

ప్రతిపదార్థం: నరపతి= దుర్యోధన మహారాజు; అలరఁగన్= సంతోషించగా; రథ= రథాల; కరి= ఏనుగుల; తురగ= గుర్రాల; సుభట= సైనికుల; సముదయముల= సమూహాలయొక్క; దోస్(ః)+గర్వ= పొగరుయొక్క; ధురం ధర= బరువును మోసే; లీల= విలాసంతో; మెఱసి= ప్రకాశించగా; అతి బంధురములుగాన్= మిక్కిలి దట్టంగా; దురమునకున్= యుద్ధానికి; తగన్= సరిపోయే విధంగా; సంఘటించెన్= సమకూర్చాడు.

తాత్పర్యం: కర్ణుడు దుర్యోధన మహారాజు సంతోషపడేటట్లు తనపై బాధ్యత మోపుకొని, బాహుబల గర్వం మెరిసేటట్లు చతురంగబలాలను సంఘటించాడు.

వ. **అట్టి యెడ.** **53**

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: కర్ణుడు సైన్యాన్ని సంఘటించిన ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **అరుణాశ్వములు రుచిర రు । క్మరథంబుఁ బ్రదీప్తవేదికాధ్వజమును ను**
ద్ధుర గాత్ర కలిత సిత భా । సుర బంధుర కంకటంబు శోభిల్లంగన్. **54**

ప్రతిపదార్థం: అరుణ+అశ్వములు= ఎర్రని గుర్రాలు; రుచిర= సుందరమైన; రుక్మ= బంగారు, రథంబున్= రథమూ; ప్రదీప్త= మిక్కిలి వెలుగొందే; వేదికా= తిన్నెగల; ధ్వజమునున్= పతాకం; ఉద్ధుర= మిక్కిలి బరువైన; గాత్ర= దేహంతో; కలిత= కూడిన; సిత= తెల్లనైన; భాసుర= ప్రకాశించే; కంకటంబున్= కవచమూ; శోభిల్లంగన్= ఒప్పగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఎర్రని గుర్రాలు, అందమైన బంగారు రథం, వెలుగొందే వేదిక గుర్తు గల పతాకం, దృఢమై తెల్లగా ప్రకాశించే కవచం అందాన్ని కలిగించగా.

క. మొగమునఁ గయ్యపు వేడుక । చిగురొత్త నుదాత్తమూర్తిఁ జెలువొందు గురుం
దగు రాజులుఁ గౌరవులును । పొగడి రులివు మిగులఁ బ్రమద పూర్ణ హృదయులై. 55

ప్రతిపదార్థం: మొగమునన్= ముఖంపై; కయ్యపు వేడుక= యుద్ధంపై అభిలాష; చిగురు+ఒత్తన్= పొడసూపగా; ఉదాత్తమూర్తిన్= గొప్పరూపంతో; చెలువు+ఒందు= ఒప్పునట్టి; గురున్= ద్రోణాచార్యుడిని; తగు= యోగ్యులైన; రాజులు= రాజులు; కౌరవులును= దుర్యోధనాదులును; ప్రమద= సంతోషంతో; పూర్ణ= నిండిన; హృదయులు+ఐ= మనస్సులు కలవారై; ఉలివు మిగులన్= ధ్వని అతిశయింపగా; పొగడిరి= ప్రశంసించారు.

తాత్పర్యం: ముఖాన యుద్ధాభిలాష పొడసూపగా, ఉదాత్తరూపంతో ప్రకాశించే ఆ ద్రోణాచార్యుని రాజశ్రేష్ఠులూ, కౌరవులూ సింహనాదాలు చేస్తూ ప్రశంసించారు.

తే. అపుడు నీ యగ్రనందనుఁ డల్లఁ దనదు । తేరు రాధేయు నరదంబు సేరఁ బోవ
నిచ్చి మనమున సంతస మెసక మెసఁగ । నాదరంబున నిట్లను నతనితోడ. 56

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో; నీ= నీ యొక్క; అగ్రనందనుఁడు= పెద్దకొడుకైన దుర్యోధనుడు; అల్లన్= మెల్లగా; తనదు= తనయొక్క; తేరు= రథం; రాధేయు= కర్ణుడి యొక్క; అరదంబు= రథాన్ని; చేరన్= దగ్గరకు; పోవనిచ్చి= పోనిచ్చి; మనమునన్= మనస్సులో; సంతసము= సంతోషం; ఎసకము= విజృంభణ; ఎసఁగన్= అతిశయించగా; ఆదరంబునన్= గారవంతో; అతనితోడన్= కర్ణుడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో దుర్యోధనుడు మెల్లగా తన రథాన్ని కర్ణుడి రథం కడకు పోనిచ్చి, మనస్సులో సంతోషం పెంపొందగా, సాదరంగా అతడితో ఇట్లా అన్నాడు.

క. నీ వలన సనాథంబై । యీ వీడెంతయును మెఱసె నిం కిట మనకుం
గావింప వలయు కార్యము । నీ వెఱిఁగింపంగ వలయు నెయ్య మెలర్పన్. 57

ప్రతిపదార్థం: నీవలనన్= నీ కారణంగా; సనాథంబు+ఐ= నాథుడు కలదై; ఈ వీడు= ఈ సైన్యం; ఎంతయును= ఎంతయో; మెఱసెన్= ప్రకాశించింది; ఇంకన్= ఇక; ఇటన్= ఇచ్చట; మనకున్= మనకు; కావింపవలయు= చేయదగిన; కార్యము= పని; నెయ్యము= స్నేహం; ఎలర్పన్= మీరగా; నీవు; ఎఱిఁగింపంగ వలయున్= తెలియజేయవలెను.

తాత్పర్యం: 'ఓ కర్ణా! దిక్కులేని ఈ సైన్యం నీ వలన నాథుడుగలదై ఎంతో ప్రకాశిస్తున్నది. ఇప్పుడు మనం ముందు చేయదగిన పని ఏదో తెలియజేయుము.'

క. అనిన నతం డిట్లను 'బహు । జనరక్షకులైన నృపులు సద్బుద్ధులు గా
వున నీవు సెప్పఁగా నే । వినియెద; నెయ్యది దలంపు వివరింపు తగన్.' 58

ప్రతిపదార్థం: అనినన్= దుర్యోధనుడు పై విధంగా అనగా; అతండు= ఆ కర్ణుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; బహుజన= సర్వప్రజలకు; రక్షకులు+ఐన= కాపాడేవారైన; నృపులు= రాజులు; సద్బుద్ధులు= మంచి జ్ఞానం కలవారు; కావునన్= కనుక; నీవు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెప్పఁగాన్= చెప్పితే; ఏన్= నేను; వినియెదన్= వింటాను; ఏ+అది= ఏది; తలంపు= అభిప్రాయం; తగన్= తగు విధంగా; వివరింపు(ము)= తెలియజేయుము.

తాత్పర్యం: పై విధంగా పలికిన దుర్యోధనుడితో కర్ణుడు ఈ విధంగా అన్నాడు. 'సర్వజనరక్షకులైన రాజులు ఉత్తమజ్ఞానం కలవారు కనుక నీ యభిప్రాయ మేమిటో తెలియజేయుము. నేను వింటాను.'

ఉ. నావుడుఁ గర్ణుతోడ నరనాయకుఁ డిట్లను 'సర్వయోధ సం
భావితుఁ డైన శాంతనవు బాహుల మాటున నస్మదీయ సే
నా విభవంబు సెల్లెఁ బదినాళ్లును; నీ మదికెక్క నాదు యో
ధావలిలోన నింకఁ బృతనాధిపుఁగాఁ గొన నెవ్వఁ డర్హుఁడో? 59

ప్రతిపదార్థం: నావుడున్= అనగా; కర్ణుతోడన్= కర్ణుడితో; నరనాయకుఁడు= దుర్యోధన నృపతి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; సర్వయోధ= వీరులందరిచేత; సంభావితుఁడు+ఐన= గౌరవించబడిన; శాంతనవు= భీష్ముడి యొక్క; మాటునన్= చాటున; అస్మదీయ= మనయొక్క; సేనా= సైన్యంయొక్క; విభవంబు= వైభవం; పదినాళ్ళును= పది రోజులు; చెల్లెన్= గడిచాయి; నీ= నీయొక్క; మదికిన్= మనస్సునకు; ఎక్కన్= నచ్చేటట్లు; నాదు= నాయొక్క; యోధావలిలోనన్= వీరుల సమూహంలో; ఇంకన్= ఇకముందు; పృతనాధిపున్+కాన్= సైన్యాధిపతిగా; కొనన్= ఎన్నుకొనటానికి; ఎవ్వఁడు= ఎవరు; అర్హుఁడో?= యోగ్యుడో?

తాత్పర్యం: అని అనగా, అపుడు కర్ణుడితో దుర్యోధనుడు ఇట్లన్నాడు. 'వీరులందరిచేత గౌరవించబడిన భీష్మపితామహుడి ఆధిపత్యంలో మహావైభవంగా మన సేనలు పది దివసాలు యుద్ధం చేసినవి. ఇక మన యోధులలో సేనాధిపతినిగా నియమించడానికి నీకు నచ్చినవా డెవ్వడో తెలుపుము?

ద్రోణాచార్యులకు సర్వసేనాధిపత్యంబు నిర్ణయించుట (సం. 7-5-8)

క. సేనాపతిత్వమునకుం । బూని యొకఁడు నడపకున్నఁ బొడవడఁగదె? యా
సేన యనిఁ గర్ణధార వి । హీనం బగు కలము జలధి నెడలిన భంగిన్.' 60

ప్రతిపదార్థం: కర్ణధార= ఓడ నడుపువాడు; విహీనంబు+అగు= లేని; కలము= ఓడ; జలధిన్= సముద్రంలో; ఎడలిన= భగ్నమైన; భంగిన్= విధంగా; సేనాపతిత్వమునకున్= సైన్యాధిపత్యాన్ని; పూని= బాధ్యత వహించి; ఒకఁడు= ఎవరైనా ఒకరు; నడపక+ఉన్నన్= నడపకపోతే; అనిన్= యుద్ధంలో; ఆసేన= ఆ సైన్యం; పొడవు+అడఁగదె?= నశింపదా?

తాత్పర్యం: కర్ణధారుడు లేని నావ సముద్రంలో మునిగిపోయినట్లు సైన్యాధిపతి లేని సైన్యం బలం తగ్గి యుద్ధంలో భగ్నమైపోదా?'

విశేషం: అలం: ఉపమ.

వ. కావున నొక్కరు నిరూపింపు మనవుడు గాంధారేయునకు రాధేయుం డిట్లనియె. 61

ప్రతిపదార్థం: కావునన్= కనుక; ఒక్కరున్= ఒకడిని; నిరూపింపుము= నిర్ణయించుము; అనవుడున్= అనగా; గాంధారేయునకున్= గాంధారి పుత్రుడైన దుర్యోధనుడితో; రాధేయుండు= రాధాపుత్రుడైన కర్ణుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కనుక సేనాధిపతిగా ఒకరిని నిర్ణయించుము - అని అనగా దుర్యోధనుడితో కర్ణుడు ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. ‘అధిప! నీయోధులయందు సేనాపతి । త్వమునకుఁ జాలని వారుఁ గలరె?
యందఱు నయ విక్రమాది గుణంబుల । మాననీయుల యట్టు లైన నెల్ల
వారి ముఖ్యులఁ జేయవచ్చునే? యొక్కరుఁ । గైకొన్న మత్సరగ్రస్తబుద్ధి
నన్యులు విపరీతులై కలంగకయుండు । వాఁడు గావలయు; నెవ్వరును ద్రోణుఁ

తే. డనినఁ గాదన; రాతండ యర్హుఁ డాధి । పత్యమునకు; నాచార్యుండు బ్రాహ్మణుండు
వివిధ రణ కోవిదుఁడు వయోవృద్ధుఁ డధిక । బలుఁడు శూరుండు గట్టుము పట్ట మతని.’ 62

ప్రతిపదార్థం: అధిప!= దుర్యోధన మహారాజా!; నీ= నీ యొక్క; యోధుల అందున్= వీరులలో; సేనాధిపతిత్వమునకున్= సైన్యానికి అధిపతిగా ఉండటానికి; చాలని వారున్= తగనివారు; కలరె?= ఉన్నారా?; అందఱున్= వీరులంతా; నయ= నీతి; విక్రమ+ఆది= విక్రమం మున్నగు; గుణంబులన్= మంచి గుణాల చేత; మాననీయులు+అ= మన్నింపదగినవారే; అట్టులు+ఐనన్= అట్లైనను; ఎల్లవారిన్= అందరిని; ముఖ్యులన్= అధిపతులను; చేయవచ్చునే?= చేయడానికి వీలౌతుందా?; ఒక్కరున్= ఏ ఒకరిని; కైకొన్నన్= ఎన్నుకొన్నా; మత్సరగ్రస్త బుద్ధిన్= అసూయచే నిండిన బుద్ధితో; అన్యులు= ఇతరులు; విపరీతులు+ఐ= వ్యతిరేకులై; కలంగక= కలతపొందక; ఉండువారు= ఉండేవారు; కావలయున్= అవసరం; ఎవ్వరున్= ఎవరు కూడా; ద్రోణుఁడు+అనినన్= ద్రోణాచార్యుడంటే; కాదు+అనరు= వద్దనరు; ఆతండు+అ= అతడే; ఆధిపత్యమునకున్= సేనాపతిత్వానికి; అర్హుఁడు= యోగ్యుడు; ఆచార్యుండు= గురువు; బ్రాహ్మణుండు; వివిధ= అనేక విధాలైన; రణ= యుద్ధాలలో; కోవిదుఁడు= నేర్పరి; వయోవృద్ధుఁడు= వయస్సుచేత పెద్దవాడు; అధికబలుఁడు= మిక్కిలి బలం కలవాడు; శూరుండు= శౌర్యంగలవాడు; అతనిన్= అతడికి; పట్టము= సైన్యాధిపతి పదవి; కట్టుము= ఇమ్ము.

తాత్పర్యం: ఓ మహారాజా! నీ యోధులలో సేనాధిపతి పదవిని నిర్వహించడానికి యోగ్యత లేని వా రెవ్వరు? యుద్ధనీతిలోను పరాక్రమాది గుణాలలోను అందరు సమర్థులే. అంతమాత్రంచేత అందరిని సేనాధిపతులనుగా చేయలేము గదా! ఏ ఒక్కరిని సేనాపతినిగా చేసినా ఇతర యోధులు అసూయచేత వ్యతిరేకులై, కలత చెందకుండా ఉండటం అవసరం. ద్రోణాచార్యుడిని ఎవ్వరూ కాదనరు. ఆయన సేనాపతిత్వానికి అర్హుడు. అందరికి గురువు, బ్రాహ్మణుడు, అన్నియుద్ధ విద్యలందు మహానిపుణుడు, వయోవృద్ధుడు, మిక్కిలి బలశాలి, మహావీరుడు. అతడికే సర్వసేనాధిపతిపట్టం కట్టుము.

వ. అనుటయుం గురురాజు దగు రాజులం గూర్చుకొని గురుం డున్న యెడకుం జని సవినయంబుగా నతని
కిట్లనియె. 63

ప్రతిపదార్థం: అనుటయున్= కర్ణుడు ఈ విధంగా అనగా; కురురాజు= కౌరవ రాజైన దుర్యోధనుడు; తగు= యోగ్యులైన; రాజులన్= నృపులను; కూర్చుకొని= వెంట పెట్టుకొని; గురుండు+ఉన్న= ద్రోణాచార్యుడు ఉన్న; ఎడకున్= చోటికి; చని= పోయి; సవినయంబుగాన్= వినయంతో; అతనికిన్= గురువైన ద్రోణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కర్ణుడు ఈ విధంగా అనేసరికి, దుర్యోధనుడు యోగ్యులైన రాజులను తన వెంట బెట్టుకొని ద్రోణాచార్యుడివద్దకు వచ్చి, వినయపూర్వకంగా ఇట్లా అన్నాడు.

ఉ. ‘ప్రాయము కల్మి నొక్కటన భవ్యధృతిన్ మహనీయశీలతన్
సాయక సంపదం బటు భుజావిభవంబునఁ గార్యతంత్ర శి
క్షాయుత బుద్ధి వృద్ధుఁడవు గావె? ధరాసురవర్య! మున్ను గాం
గేయుఁడు మాకు నెల్ల నెఱిఁగింపఁడె నీదు మహానుభావమున్.’ 64

ప్రతిపదార్థం: ధరాసురవర్య!= బ్రాహ్మణోత్తమా!; ప్రాయము కల్మిన్= వయస్సు కలిగి ఉండటం; ఒక్కటి+అని+అ= ఒకదానిలోనేనా?; భవ్యధృతిన్= గొప్ప ధైర్యంలోను; మహనీయ శీలతన్= మంచి ప్రవర్తనలోను; సాయక సంపదన్= బాణ సంపత్తిలోను; పటు= గొప్ప; భుజా= బాహువులయొక్క; విభవంబునన్= వైభవంలోను; కార్యతంత్ర= కార్య నిర్వహణలో; శిక్షాయుత బుద్ధిన్= సుశిక్షితమైన జ్ఞానంలోను; వృద్ధుఁడవు= గొప్పవాడవు; కావె?= కావా?; మున్ను= పూర్వం; గాంగేయుఁడు= భీష్ముడు; మాకున్; ఎల్లన్= అందరికి; నీదు= నీ యొక్క; మహానుభావమున్= గొప్పతనాన్ని; ఎఱిఁగింపఁడె!= తెలిపినాడుగదా!

తాత్పర్యం: 'ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! ద్రోణాచార్యా! ఒక్క ఈడులోనే కాదు అపారమైన ధైర్యంలోను, సౌశీల్యంలోను, అస్త్రశస్త్ర సంపదలోను, బాహుబలవైభవంలోను, సుశిక్షితమైన జ్ఞానంలోను నిన్ను మించినవారు లేరు. భీష్ముడు నీ మహనీయతను మాకంతా ఇది వరకే తెలియజేశాడు.'

వ. అని వెండియు. **65**

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: దుర్యోధనుడు ద్రోణాచర్యుడిని ప్రశంసించి, మరల.

క. 'కనువెలుఁగు నీవు గానీ । వెనుక భవన్మతము యూఁది వీరలు నేనుం
జనుదెంచెద మూఱట నెల । కొన వృషభము పజ్జ నడచు గోవుల పగిదిన్.' **66**

ప్రతిపదార్థం: కను వెలుఁగు= మార్గదర్శకుడవు; నీవు+కాన్= నీవు కాగా; నీ వెనుకన్= నీవెంటనే; భవత్+మతము+అ= తమ అభిప్రాయాన్నే; ఊఁది= అనుసరించి; వీరలు= ఈ యోధులు; నేనున్; ఊరట= ఓదార్పు; నెలకొనన్= కలుగగా; వృషభము= కోడె; పజ్జన్= వెనుక; నడచు= వచ్చు; గోవుల= ఆవుల; పగిదిన్= వలె; మేము= కౌరవపక్ష సైన్యాలం; చనుదెంచెదము= వస్తాము.

తాత్పర్యం: 'నీవే మాకు మార్గదర్శకుడవు. నీయభిప్రాయాన్ననుసరించే మేమంతా వృషభం వెంట వచ్చే గోవుల వలె ముందుకు సాగుతాం.'

విశేషం: అలం: ఉపమ.

ఆ. అనుచు నచట నున్న యవనీపతులఁ జూపి । మఱియు నిట్టులనియె మనుజ విభుఁడు
'దేవసేన నడపి దితిజుల గెలిచిన । షణ్ముఖుండు నీవు సరియ కాదె! **67**

ప్రతిపదార్థం: అనుచున్= దుర్యోధనుడు ద్రోణునితో పైవిధంగా అంటూ; అచటన్+ఉన్న= అక్కడ ఉన్న; అవనీ పతులన్= రాజులను; చూపి; మనుజ విభుఁడు= దుర్యోధన మహారాజు; మఱియున్= ఇంకా, మరల; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికాడు; దేవసేన= దేవతల సైన్యాన్ని; నడపి; దితిజులన్= రాక్షసులను; గెలిచిన= జయించిన; షణ్ముఖుండు= ఆరు ముఖాలుగల కుమారస్వామి; నీవు; సరియకాదె!= సమానులుకారా!

తాత్పర్యం: దుర్యోధనుడు ద్రోణుడితో ఈ విధంగా అంటూ, అక్కడ ఉన్న రాజులందరిని చూపి, దేవతల సైన్యానికి నాయకత్వం వహించి, రాక్షసులను గెలిచిన కుమారస్వామీ, నీవూ సమానులు కదా!

విశేషం: దేవతల ప్రార్థనపై శివపార్వతులకు పుట్టి, దేవతలకు సేనాధిపతియై తారకాసురుడిని సంహరించినవాడు షణ్ముఖుడు. ఆ కథ ఇట సూచించబడింది.

వ. కావున. 68

తాత్పర్యం: కనుక.

తే. సర్వసేనాధిపత్యంబు నిర్వహింప । వలయు' ననవుడు నమ్మహీశ్వరులు నట్ల
చెప్పి, 'గెలువుము నీ'వని చెలఁగి యతనిఁ । బ్రస్తుతించి ప్రార్థించిరి భరతముఖ్య! 69

ప్రతిపదార్థం: భరతముఖ్య!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; సర్వసేనాధిపత్యంబు= సేనలన్నింటిపై దొరతనం; నిర్వహింపవలయున్= చేయవలెను; అనవుడున్= అనగా; ఆ+మహీశ్వరులును= ఆ రాజులును; అట్లు+అ+చెప్పి= ఆ విధంగా పలికి; నీవు; గెలువుము+అని; చెలఁగి= ఉత్సహించి; అతనిన్= ఆ ద్రోణుడిని; ప్రస్తుతించి= మిక్కిలి పొగడి; ప్రార్థించిరి= వేడుకొన్నారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ పుత్రుడు ద్రోణుడిని సర్వసేనాధిపత్యం చేపట్టవలసిందని కోరగా, అచట ఉన్న రాజులందరు కూడా అదే మాట పలికి, విజయాన్ని సాధించవలెనని అతడిని ప్రార్థించారు.

వ. మఱియు నమ్మహీశ్వరుండు. 70

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఆ+మహీశ్వరుండు= రాజు - దుర్యోధనుడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఇంకా ద్రోణుడితో ఇట్లా అంటున్నాడు.

క. 'సేనా సముదయ వర్తకుఁ । గా నిను నేఁ బడసినపుడ కౌంతేయులు నా
చే నడఁగ రెట్లు? భీష్మవి । హీనుల మగు మమ్ముఁ గావు మెల్ల విధములన్.' 71

ప్రతిపదార్థం: సేనా= సేనలయొక్క; సముదయ= సమూహాన్ని; వర్తకుఁగాన్= నడిపేవాడినిగా; నిను= నిన్ను; నేన్= నేను; పడసినపుడు+అ= పొందినపుడే; కౌంతేయులు= కుంతీ పుత్రులైన ధర్మజాదులు; నాచేన్= నాచేత; అడఁగరు+ఎట్లు?= ఎట్లు అణగిపోరు?; భీష్మ విహీనులము+అగు= భీష్ముడు లేని; మమ్మున్= మమ్ములను; ఎల్లవిధములన్= అన్ని విధాల; కావుము= రక్షించుము.

తాత్పర్యం: సర్వసైన్యాధిపతిగా నిన్ను నేను పొందినపుడు ధర్మజాదులైన కౌంతేయులు నాచేత నశించకుండా ఎట్లుంటారు? భీష్ముడు లేక దిక్కులేని వారమైన మమ్ము అన్ని విధాల కాపాడుము.'

వ. అని వేడికొనిన నయ్యందఱం గలయం గనుంగొని యాచార్యుం డి ట్లనియె. 72

ప్రతిపదార్థం: అని వేడికొనినన్= అని ప్రార్థించగా; ఆ+అందఱన్= అక్కడివారందరిని; కలయన్+కనుంగొని= కలయచూచి; ఆచార్యుండు= ద్రోణాచార్యుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని దుర్యోధనుడు ప్రార్థించగా అందరినీ కలయజూచి ద్రోణాచార్యు డిట్లా అన్నాడు.

ఉ. 'వేదములుం దదంగములు వింతలుగా నొక కొన్ని నేర్తు ధై
ర్యాది గుణంబు లెందుఁ గల వైనను నింతటి వానిఁ గాఁగ న
త్యాదర వృత్తి మీరు విజయాశ ననుం గొనియాటఁ జేసి యోఁ
గాదన కియ్యకొంటిఁ దగఁ గౌరవనాథుని కోర్కి దీర్పఁగన్. 73

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వేదములన్= ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణ వేదాలను; తద్= వాటియొక్క; అంగములున్= శిక్ష; వ్యాకరణం, ఛందస్సు, జ్యోతిషం, నిరుక్తం, కల్పం అనే వేదాంగాలు; వింతలుగాన్= ఆశ్చర్యం గొల్పేటట్లు; ఒక కొంత= కొంత భాగం; నేర్తున్= నేర్చుకొన్నాను; ధైర్య+ఆదిగుణంబులు= ధైర్యం మొదలైన మంచి గుణాలు; ఎందున్+కలవు= ఎక్కడున్నవి; ఐనను= అయినప్పటికి; ఇంతటివానిన్+కాఁగన్= ఇంత గొప్పవాడినిగా భావించి; అతి+ఆదరవృత్తిన్= మిక్కిలి గౌరవంతో; మీరు= మీరంతా; విజయ+ఆశన్= గెలుపు మీది ఆశతో; ననున్= నన్ను; కొనియాటన్+చేసి= ప్రశంసించటం వలన; ఔను+కాదు+అనక= మారుమాట్లాడక; తగన్= తగువిధంగా; కౌరవనాథుని కోర్కి= దుర్యోధనుడి కోర్కెను; తీర్పఁగన్= తీర్చుట కొరకు; ఇయ్యకొంటిన్= ఒప్పుకొన్నాను.

తాత్పర్యం: నేను నాలుగు వేదాలను, శిక్షాది షడంగాలను కొంతవరకు నేర్చుకొన్నాను. అయినా నాలో ధైర్యాది గుణా లెక్కడ? మీరు విజయాన్ని కోరి ఇంతగా ప్రశంసించటం వలన మారుమాట్లాడక దుర్యోధనుడి కోర్కె తీర్చుట కొరకు సైన్యాధిపత్యాన్ని అంగీకరించాను.

విశేషం: అస్త్ర శస్త్రాది సర్వవిద్యాపారంగతుడనైనా, 'ఏదో కొద్దిగా చదువు కొన్నానే తప్ప ధైర్య శౌర్యాదులు నాలో ఎక్కడివి?' అనటంలో ద్రోణాచార్యుడి వినయసంపద వ్యక్తమౌతున్నది.

శా. **భవ్యంబైన బలాధిపత్యమునకుం బట్టంబు గట్టుండు న;**
న్నవ్యాకీర్ణ గజాదియై మెఱయు సైన్య శ్రేణిఁ బాలించి, కౌ
రవ్యోత్సాహముఁ బెంచి, మార్కొనిన, వీరవ్రాతముం ద్రుంచి, నా
దివ్యాస్త్రంబులఁ బంచి పాండవుల దీప్తిన్ మాయఁజేయించెదన్. **74**

ప్రతిపదార్థం: నన్నున్; భవ్యంబు+ఐన= మహత్తరమైన; బలాధిపత్యమునకున్= సైన్యాధిపత్యానికి; పట్టంబు+కట్టుండు= పట్టం కట్టండి; అవ్యాకీర్ణ= చెదరిపోని; గజ+ఆది+ఐ= ఏనుగులు మొదలైన చతురంగ బలాలు కలదై; మెఱయు= ప్రకాశించే; సైన్యశ్రేణిన్= సేనా సమూహాన్ని; పాలించి= రక్షించి; కౌరవ్య+ఉత్సాహమున్= దుర్యోధనాదుల ఉత్సాహాన్ని; పెంచి= పెద్దజేసి; మార్కొనిన= ఎదుర్కొన్న; వీర= వీరుల; వ్రాతమున్= సమూహాన్ని; త్రుంచి= చంపి; నా= నాయొక్క; దివ్యాస్త్రంబులన్= దేవతలచేత పొందిన ఆగ్నేయాద్యస్త్రాలను; పంచి= ప్రయోగించి; పాండవుల= పాండవుల యొక్క; దీప్తిన్= ప్రకాశాన్ని; మాయన్+చేయించెదన్= మాసిపోయేటట్లు చేస్తాను.

తాత్పర్యం: నన్ను అక్షౌహిణుల కొలదిగా గల ఈ గొప్ప సైన్యానికి అధిపతినిగా చేయండి. చతురంగబల సమేతమైన సేనా సమూహాన్ని నడిపి కౌరవుల ఉత్సాహాన్ని పెద్దజేసి, ఎదుర్కొన్న శత్రు సమూహాన్ని హతమార్చి, నా దివ్యాస్త్రాలను ప్రయోగించి పాండవుల తేజస్సును మాసిపోయ్యేటట్లు చేస్తాను.

విశేషం: ఇందులో ద్రోణాచార్యుడి అపారమైన ఉత్సాహం వ్యక్తమౌతున్నది. ఇందులో 'పాలించి, పెంచి, త్రుంచి, పంచి, చేయించెదన్ - అనే పూర్ణబిందు పూర్వక చకారముల పౌనరుక్త్యం పద్యాన్ని అందగించింది.

వ. **అని పలికినం బ్రీతచేతస్కుండై నీ తనూభవుండు గనకకలశంబులం బావన జలంబులు దెప్పించి, మంగళోపకరణ శోభితంబు గావించి, పుణ్యాహనాదంబులుం బరమాశీర్వాదంబులున్ మాగధ గీతంబులున్, వందిజనస్తుతి వ్రాతంబులుం జెలంగఁ బ్రభూత భూపతులుం దానును ద్రోణాచార్యునకు సేనాధిపత్యాభిషేక పట్టబంధం బొనర్చి పేర్చినం గని, రథికవరు లార్చి, నిజశంఖంబులు పూరించిన, నఖిలసైన్యంబులందును భేరీ మృదంగ పణవాది తూర్య నినాదంబులు నిగిడి నింగి ముట్టె; నిట్లు సకల చమూపతిత్వపదభాసితుండై భారద్వాజుండు.** **75**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని పలికినన్= అని ద్రోణుడు పలుకగా; నీ తనూభవుండు= నీ యొక్క కుమారుడైన దుర్యోధనుడు; ప్రీతచేతస్కుండు+ఐ= సంతోషించిన మనస్సు కలవాడై; కనక కలశంబులన్= బంగారు బిందెలతో; పావన జలంబులు= పవిత్రమైన నీరు; తెప్పించి; మంగళ= కళ్యాణ ప్రదమైన; ఉపకరణ= సామగ్రిచేత; శోభితంబు= అలంకృతం; కావించి= చేసి; పుణ్యాహనాదంబులున్ = పుణ్యకరమైన దివసమని వేదమంత్రపూర్వకంగా ఉచ్చరించటం; పరమ+ఆశీర్వాదంబులున్= గొప్ప దీవెనలును; మాగధ గీతంబులున్= ప్రశంసాత్మకమైన పాటలును; వందిజన= స్తుతించేవారి యొక్క; స్తుతి= స్తోత్రాల; వ్రాతంబులున్= సమూహమును; చెలంగన్= చెలరేగగా; ప్రభూత= చాలామంది; భూపతులున్= రాజులును; తానును= దుర్యోధనుడును; ద్రోణాచార్యునకున్= గురువైన ద్రోణుడికి; సేనాధిపత్య= సేనాపతిత్వానికి చెందిన; అభిషేక= స్నానం; పట్టబంధంబు= నొసటగట్టే పట్టి; ఒనర్చి= కట్టి; పేర్చినన్= పెంపుజేయగా; కని= చూచి; రథికవరులు= రథాన్నెక్కి యుద్ధం చేసేవారిలో శ్రేష్ఠులు; ఆర్చి= సింహనాదాలు చేసి; నిజ= తమ యొక్క; శంఖంబులు= శంఖాలను; పూరించినన్= ఊదగా; అఖిల సైన్యంబులందును= సర్వసేనలందును; భేరీ= దుందుభులు; మృదంగ= మద్దెలలు; పణవ+ఆది= ఉడక మొదలైన; తూర్య= వాద్యాల; నినాదంబులు= మ్రోతలు; నిగిడి= చెలరేగి; నింగి= ఆకాశాన్ని; ముట్టెన్= తాకినవి; ఇట్లు= ఈ విధంగా; సకల= సర్వవిధాలైన; చమూపతిత్వ= సేనల ఆధిపత్యపు; పద= పదవి చేత; భాసితుండు+ఐ= ప్రకాశించినవాడై; భారద్వాజుండు= భరద్వాజ మహర్షి పుత్రుడైన ద్రోణుడు.

తాత్పర్యం: ద్రోణుడు సేనాధిపత్యానికి అంగీకరించగా, దుర్యోధనుడు సంతసించి బంగారు కలశాలలో పుణ్య జలాలను తెప్పించి, మంగళ ద్రవ్యాలతో అలంకరించి, పుణ్యాహ నాదాలు, ఆశీర్వచనాలు, వందిమాగధ స్తుతులు చెలగగా, సర్వనృపులు, తాను ద్రోణాచార్యుడికి సేనాధిపత్యాన్ని అభిషేకించాడు. అపుడు రథిక శ్రేష్ఠులు జయధ్వానాలు చేసి, శంఖాలు పూరించగా సర్వసైన్యాలలో భేరీ మృదంగాది నాదాలు సర్వత్ర వ్యాపించినవి. ఇట్లా సర్వసేనాధిపత్యాన్ని వహించిన ద్రోణుడు.

సీ. **కౌరవసేనా ముఖంబునఁ దిలకమై । యొప్పిరాధేయాది యోధవరులఁ**
గొని పాండురాజ నందనుల సైన్యములతోఁ । దొడరి ధైర్యంబు నద్భుత మహాస్త్ర
వీర్యంబు ననివార్య శౌర్యంబు దోర్బలౌ । దార్యంబు మెఱయ నీతనయు వలని
కూరిమి వెలయ నక్షోహిణిపైఁ గొంత । బలమును దొర లనేకులను గూల్చి

తే. **చామర ఛత్ర కేతు భూషణ తురంగ । దంతి రథహేతి వర్మయోధ వ్రజంబు**
తునియ లిల నించి కతిపయదినము లరులు । సురలు వినుతింప విహరించె ధరణినాథ! **76**

ప్రతిపదార్థం: ధరణినాథ!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; కౌరవసేనా= కౌరవుల సేన అనే; ముఖంబునన్= ముఖానికి; తిలకము+ఐ= బొట్టుగా; ఒప్పి= ప్రకాశించి; రాధేయ= కర్ణుడు; ఆది= మొదలైన; యోధవరులన్= శ్రేష్ఠులైన వీరులను; కొని= వెంట తీసికొని; పాండురాజ= పాండురాజు యొక్క; నందనుల= పుత్రులైన ధర్మజాదుల యొక్క; సైన్యములతోన్= సేనలతో; తొడరి= ఎదిరించి; ధైర్యంబున్= ధైర్యం; అద్భుత= ఆశ్చర్యం గొలిపే; మహా+అస్త్ర= గొప్ప అస్త్రాల యొక్క; వీర్యంబున్= బలం; అనివార్య= వారించవీలుగాని; శౌర్యంబు= శూరత్వం; దోఃబల= బాహువుల బలం యొక్క; ఔదార్యంబు= గొప్పతనం; మెఱయన్=ప్రకాశించగా; నీ= ధృతరాష్ట్రుడవైన నీయొక్క; తనయు వలని= కొడుకుపైగల; కూరిమి= ప్రేమ; వెలయన్= ప్రకాశించగా; అక్షోహిణిపైన్= అక్షోహిణిపైగా; కొంత బలమునున్= కొంత సైన్యాన్ని; దొరలన్= రాజులను; అనేకులను= చాలా మందిని; కూల్చి= చంపి; చామర= చమరీ మృగపు వాలాలతో చేసిన వీవనల; ఛత్ర= గొడుగులు; కేతు= పతాకాలు; భూషణ= సొమ్ములు; తురంగ= గుర్రాల; దంతి= ఏనుగుల; రథ= రథాల; హేతి= ఆయుధాల; వర్మ= కవచాల; యోధ= వీరుల; వ్రజంబు= సమూహం; తునియలు= తునుకలు; ఇలన్= భూమిపై; నించి= నింపి; కతిపయ దినములు= కొన్ని దినాలు; అరులు= శత్రువులు; సురలు= దేవతలు; వినుతింపన్= ప్రశంసించగా; విహరించెన్= యుద్ధం చేశాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ద్రోణాచార్యుడు సర్వసేనాపతి అయి, కౌరవసేనా ముఖానికి అలంకారంగా ప్రకాశిస్తూ, కర్ణాది వీరులు తోడై నిలువగా, పాండవ సైన్యాన్ని ఎదిరించి, ధైర్యం, అద్భుతమైన అస్త్రబలం, ఎదురులేని శౌర్యం, గొప్ప బాహుబలం మెరయగా, నీ కుమారుడిపై ప్రేమమీరగా, అక్షౌహిణికిపైగా సైన్యాన్ని, ఎందరో రాజులను సంహరించాడు. వారి చామరాలను, ఛత్రాలను, పతాకాలను, సొమ్ములను, గుర్రాలను, ఏనుగులను, రథాలను, ఆయుధాలను, కవచాలను, వీరవర్గాన్ని ముక్కలు ముక్కలు చేసి యుద్ధభూమినిండా కుప్పలు పోశాడు.

విశేషం: యుద్ధంలో విజృంభించిన ద్రోణుడి ఉత్సాహం, శౌర్య, ధైర్య, గర్వ, క్రోధాదులచే పోషించబడి, వీరరసంగా వ్యక్తమౌతున్నది. ఆగ్నేయాది దివ్యాస్త్రాల ప్రయోగించి అచ్చెరువు గొలిపేటట్లు యుద్ధం చేయటంలో అద్భుతరసం, రథగజాశ్వాలను, ఛత్ర, చామర, రథాదులను, ఆయుధాలను, అలంకారాలను తునాతునకలు చేసి కుప్పలు పోయడంలో బీభత్సరసం ధ్వనిస్తున్నది.

క. **అడవుల దవశిఖి దరికొను । వడువున ని ట్లరిబలం బవారణఁ బొడిగా**
నడరి యతఁడాఱె ద్రుపదుని । కొడు కార్వ నుభయ జనములకున్ వగ మిగులన్. **77**

ప్రతిపదార్థం: అడవులన్= అడవులలో; దవశిఖ= దావాగ్ని; దరికొను= మండే; వడువునన్= విధంగా; ఇట్లు= ఇట్లా; అరి= శత్రువుల యొక్క; బలంబు= సైన్యం; అవారణన్= నిరాటంకంగా; పొడిగాన్= పొడిపొడికాగా; అడరి= విజృంభించి; ద్రుపదుని కొడుకు= ధృష్టద్యుమ్నుడు; ఆర్వన్= విజయగర్జ చేయగా; ఉభయ= కౌరవ, పాండవ పక్షాలలోని; జనములకున్= ప్రజలకు; వగ= దుఃఖం; మిగులన్= అతిశయించగా; అతఁడు= ఆ ద్రోణాచార్యుడు; ఆఱెన్= మరణించాడు.

తాత్పర్యం: ద్రోణుడు దావాగ్నివలె మండి, శత్రు సైన్యాన్ని నిరాటంకంగా తుత్తునియలు చేసి, విజృంభించి, కౌరవ పాండవ పక్షాలు రెండునూ దుఃఖించగా, ధృష్టద్యుమ్నుడు విజయగర్వంతో గర్జించగా అస్తమించాడు.

క. **దుష్ట మనస్కుం డగు నా । ధృష్టద్యుమ్నుండు దక్క దేవా! సుజనో**
త్కృష్టుఁడగు గురుని తెగుటకు । నిష్టాపముఁ బొందె భూతనికరము లెల్లన్. **78**

ప్రతిపదార్థం: దేవా!= ధృతరాష్ట్ర మహారాజా!; దుష్టమనస్కుండు+అగు= క్రూరమైన మనస్సుగల; ఆ ధృష్టద్యుమ్నుండు= ఆ హంతకుడైన ధృష్టద్యుమ్నుడు; తక్క= తప్ప; సుజన+ఉత్కృష్టుఁడు+అగు= సజ్జనులలో శ్రేష్ఠుడైన; గురుని= ద్రోణాచార్యుడి యొక్క; తెగుటకున్= వినాశానికి; భూత= ప్రాణులయొక్క; నికరములు= సమూహాలు; ఎల్లన్= అన్నీ; నిష్టాపమున్= దుఃఖం; పొందెన్= పొందాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్ర నృపతీ! దుష్టాత్ముడైన ధృష్టద్యుమ్నుడు తప్ప సర్వప్రాణులు సజ్జన శ్రేష్ఠుడైన ద్రోణాచార్యుడి మరణానికి మిక్కిలి దుఃఖించాయి.

వ. **అనిన విని యాంబికేయుండు హృదయంబు జల్లనఁ జెదర, వదనంబు వెల్లనై మొగుడ నివ్వెఱఁగంది, కొండొక ప్రొద్దు నిశ్చేష్టితుండై యుండి, గద్గద వికల కంఠుం డగుచు సంజయునితో నిట్లనియె.** **79**

ప్రతిపదార్థం: అనినన్= ద్రోణుడు మరణించినాడని చెప్పగా; విని; ఆంబికేయుండు= అంబికా పుత్రుడైన ధృతరాష్ట్రుడు; హృదయంబు= మనస్సు; జల్లనన్= అదరగా; చెదరన్= చెదరిపోగా; వదనంబు= ముఖము; వెల్లనై= తెల్లబడి; మొగుడన్= ముడుచుకొనిపోగా; నివ్వెఱఁగు+అంది= ఆశ్చర్యపడి; కొండొకప్రొద్దు= కొంతసేపు; నిశ్చేష్టితుండు+ఐ= చేష్టలు దక్కినవాడై; ఉండి; గద్గద= వణుకుతున్న; వికల= విచ్ఛేదము పొందిన; కంఠుండు+అగుచున్= కంఠం గలవాడు అవుతూ; సంజయునితోన్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ద్రోణుని మరణవార్త విని ధృతరాష్ట్రుడు మనస్సు చెదరిపోగా నిశ్చేష్టుడై, గద్గద కంఠంతో సంజయుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: హృదయం చెదరడం, ముఖం తెల్లబడడం, నిశ్చేష్టత, కంఠం వణకడం వంటి సాత్త్వికభావాలు భయం, విషాదం, జడత్వం మొదలైన భావాలను వ్యక్తపరుస్తూ కరుణ రసాన్ని జాలువారిస్తున్నవి.

ద్రోణాచార్యుని మరణంబు విని ధృతరాష్ట్రుండు పరితపించుట (సం.7-8-1)

సీ. 'అస్త్రశస్త్రంబుల నధికుండు, వెరవరి, । భుజబలవిక్రమంబుల ఘనుండు
గురుఁ; డట్టివానిఁ దేఁకువలేక కదిసిరే । పాంచాలు? రతని చాపంబు దునిసె
నో! తేరు విఱిగెనో! సూతుండు పడియెనో! । యేమఱి యలసత నెదిరి సరకు
సేయమి మఱ పాత్మఁ జెందెనో! హీనాత్ముఁ । డైన ధృష్టద్యుమ్నుఁ డతనిఁ జంపె

తే. నట్టె! యచ్చెరు విది; దైవ మగ్గలంబు; । పౌరుషము కంటె ద్రోణుని పాటు వినియు
వేయిపఱియ లై పోవదు ఱాయి గాఁగ । నోపు నా గుండె; యే మని యుమ్మలింతు?' 80

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యుడు; అస్త్ర= ఆగ్నేయాస్త్రాదులు; శస్త్రంబులన్= ఖడ్గం మొదలైన ఆయుధాలలో; అధికుండు= గొప్పవాడు; వెరవరి= ఉపాయశీలి; భుజ= బాహువుల; బల= బలంతో; విక్రమంబులన్= పరాక్రమములందు; ఘనుండు= గొప్పవాడు; అట్టివానిన్= అంతటివాడిని; తేఁకువలేక= భయంలేక; పాంచాలురు= ధృష్టద్యుమ్నుడు మొదలైన పాంచాల దేశీయులు; కదిసిరే?= ఎదురించారో?; అతని= ఆ ద్రోణుడి యొక్క; చాపంబు= విల్లు; తునిసెనో= తెగిందో; తేరు= రథం; విరిగెనో= విరిగిపోయిందో; సూతుండు= రథసారథి; పడియెనో= పడిపోయినాడో; ఏమఱి= అకస్మాత్తుగా; అలసతన్= ఆలస్యం వలన; ఎదిరి= విరోధిని; సరకు+చేయమి= లక్ష్యపెట్టకపోవటం; మఱపు= మరచిపోవటం; ఆత్మన్= తనను; చెందెనో?= పొందెనో?; హీనాత్ముఁడు+ఐన= నీచుడైన; ధృష్టద్యుమ్నుఁడు= ద్రుపద మహారాజు కొడుకు; అతనిన్= ఆ ద్రోణుడిని; చంపెను+అట్టె!= చంపినాడా!; అచ్చెరువు+ఇది= ఇది ఆశ్చర్యము; పౌరుషము కంటెన్= పురుష ప్రయత్నానికంటె; దైవము= విధి; అగ్గలంబు= గొప్పది; ద్రోణుని పాటు= ద్రోణుడు పడిపోవటం; వినియున్= విని కూడ; వేయి పఱియలు= వేయి తునకలు; ఐపోవదు= ఐపోదు; నా గుండె= నా యొక్క హృదయం; ఱాయి= బండ; కాఁగన్+ఓపు= అయి ఉండవచ్చు; ఏమి+అని= ఏమని; ఉమ్మలింతున్?= దుఃఖిస్తాను?

తాత్పర్యం: ద్రోణుడు అస్త్రశస్త్రాల ప్రయోగంలో సాటిలేని మేటి; ఉపాయశాలి, పరాక్రమంలో ఘనుడు. అట్టివాడిని పాంచాలవీరులు భయంలేక ఎదిరించారో? ధనుస్సు విరిగిందో? రథం విచ్ఛిన్నమైందో? సారథి పడిపోయాడో? ఏమరిపాటు వలననో? అలసత వలననో? ఎదుటివాడిని లక్ష్యపెట్టకపోవటం వలననో! మరపు ఆవేశించిందో! దుష్టాత్ముడైన ధృష్టద్యుమ్నుడు అతడిని చంపగలిగాడా! ఇది ఆశ్చర్యం! పురుషకారం కంటె విధి బలీయమైంది గదా! ద్రోణుడి మరణవార్త విని కూడా నాగుండె వేయి ముక్కలు కాకుండా ఉన్నది. ఇది రాయి కావచ్చును. ఏమని దుఃఖింతును?'

వ. అని యడ లూని పొగిలి వెండియు. 81

ప్రతిపదార్థం: అని= ధృతరాష్ట్రుడు ఈ విధంగా అని; అడలు+ఊని= ఏడ్చి; పొగిలి= పరితపించి; వెండియున్= మరల.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఈ విధంగా పలికి, దుఃఖించి, పరితాపం పొంది, మరల.

తే. **'మేరు వొఱగుట యినుఁడిలమీఁదఁ బడుట। యబ్ధి యింకుట గాదె ధైర్యమునఁ బేర్చి**
ప్రభ వెలింగి గభీరత రాశి కెక్కి। యెందుఁ బొగడొందునాచార్యుఁ డిట్టు లగుట. 82

ప్రతిపదార్థం: ధైర్యమునన్= ధైర్యంతో; పేర్చి= విజృంభించి; ప్రభన్= తేజస్సుతో; వెలింగి= ప్రకాశించి; గభీరత= గాంభీర్యానికి; రాశికిన్+ఎక్కి= అధికమై; ఎందున్= ఎచ్చటైన; పొగడొందు= కీర్తించబడే; ఆచార్యుఁడు= గురువైన ద్రోణుడు; ఇట్టులు+అగుట= ఇట్లా దీనంగా హతుడు కావటం; మేరువు= మేరుపర్వతం; ఒఱగుట= వంగటం; ఇనుఁడు= సూర్యుడు; ఇలమీఁదన్= భూమిపై; పడుట= పడిపోవటం; అబ్ధి= సముద్రం; ఇంకుట= ఇగిరిపోవటం; కాదె!= కాదా!

తాత్పర్యం: 'ధైర్యంతో విజృంభించి, తేజస్సుతో వెలిగి; గాంభీర్యానికి పేరుగాంచి సర్వత్ర కీర్తించబడే ఆచార్యుడు ఇట్లా కావటం, ధైర్యానికి ప్రసిద్ధి కెక్కిన మేరు పర్వతం ఒరగడం, ప్రభలచేత వెలుగొందే సూర్యుడు భూమిపై పడిపోవటం, గాంభీర్యానికి పేరుగాంచిన సముద్రం ఇంకిపోవటంవలె ఉన్నది!

విశేషం: అలం: ఉపమ. మేరువు ఒరగటం, సముద్రం ఇంకటం వంటి అఘటనలు ఘటించటం ఎట్లో ద్రోణుడు ఒరగడం కూడా అట్లే అని ధృతరాష్ట్రుడు వాపోతున్నాడు.

క. **అతిలోక పరాక్రమనిధి। మతి సురగురు మిగులుఁ గురుకుమార గురుఁడు దు**
ర్మతులగు మత్సుతులకుఁగా। మృతుఁ డయ్యెఁ బరోపకారమృతి యొప్పుఁ గదా! 83

ప్రతిపదార్థం: అతిలోక= లోకాతీతమైన; పరాక్రమ= శౌర్యానికి; నిధి= నిలయం; మతి= జ్ఞానంలో; సురగురున్= దేవగురుడైన బృహస్పతిని; మిగులున్= మించినవాడు; కురు= కౌరవ వంశీయులైన; కుమార= పుత్రులకు; గురుఁడు= ఆచార్యుడు; దుర్మతులు+అగు= దుష్టబుద్ధులైన; మత్= నా యొక్క; సుతులకున్+కాన్= కొడుకులకై; మృతుఁడు+అయ్యెన్= మరణించాడు; పర= ఇతరులకు; ఉపకార= మేలుగూర్చే; మృతి= మరణం; ఒప్పున్+కదా!= ప్రశంసనీయం కదా!

తాత్పర్యం: లోకాతీతమైన పరాక్రమానికి నిధి, బుద్ధిలో బృహస్పతిని మించినవాడు, కురువంశ బాలకులకు ఆచార్యుడు అయిన ద్రోణుడు దుష్టబుద్ధులైన నా పుత్రులకై మరణించాడు. పరోపకారార్థం ప్రాణాలు అర్పించటం అన్నింటికంటె ప్రశంసార్హం కదా!

విశేషం: అలం: అప్రస్తుత ప్రశంస. ద్రోణుడి అతిలోక పరాక్రమాదులు స్మృతికి రావటం ధృతరాష్ట్రుడి శోకానికి హేతువులైనవి. 'దుర్మతులగు సుతులు' అనటంలో ఆత్మనింద గోచరిస్తున్నది.

తే. **విల్లు పట్టెడు వారెల్ల వెరవు గఱచి। పోవ నెలవైన ద్రోణుని భుజము నిలువ**
రించి పాంచాలనందనుఁ బంచి పార్థుఁ। డిట్లు సేయించెఁగా; కొరుఁ డేల చాలు? 84

ప్రతిపదార్థం: విల్లు= ధనుస్సు; పట్టెడువారు= ధరించేవారు; ఎల్లన్= అందరు; వెరవు= ప్రాణరక్షణోపాయాన్ని; కఱచి= నేర్చుకొని; పోవన్= పారిపోగా; నెలవు+ఐన= ఆధారభూతుడైన; ద్రోణుని= ద్రోణుడి యొక్క; భుజము= చేతిని; నిలువరించి= ఆడకుండ జేసి; పాంచాల నందనున్= పాంచాల దేశ రాజపుత్రుడైన ధృష్టద్యుమ్నుడిని; పంచి= ఆజ్ఞాపించి; పార్థుఁడు= అర్జునుడు; ఇట్లు= ఈ విధంగా; చేయించెన్+కాక= చేయించి ఉంటాడు; ఒరుఁడు= ఇతరుడు; ఏల చాలున్?= ఏ విధంగా సమర్థుడు?

తాత్పర్యం: ధనుర్ధరులంతా ప్రాణాలపై తీపితో పారిపోగా; సుపరిచితుడైన ద్రోణుడి చేతులు ఆడకుండా జేసి; ధృష్టద్యుమ్నుడిని నియమించి అర్జునుడే ఈ పన్నాగం పన్ని ఉంటాడు. ఇట్లా చేయడం మరొకరి వలన కాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పాముఁ బొదివి పడఁ దిగిచిన । చీమలగములట్లు ద్రోణుఁ జిక్కు పఱిచెఁ గా
కేమి బహుదేశసైన్యము; । లే మనఁ గల దింక సూత! యెవ్వరు మనకున్?' 85

ప్రతిపదార్థం: పామున్= పామును; పొదివి= క్రమ్ముకొని; పడన్+తిగిచిన= పడగొట్టిన; చీమలగముల= చీమల గుంపుల; అట్లు= ఆ విధంగా; బహుదేశ= అనేక దేశాల; సైన్యములు= సైన్యాలు; ద్రోణున్= ద్రోణుడిని; చిక్కు+పఱిచెన్+కాక+ఏమి= చిక్కుపరచి ఉంటాయి; ఏమనన్+కలదు?= అనవలసిందేముంది?; సూత!= సంజయా!; ఇంకన్= ఇకముందు; మనకున్= మన పక్షానికి; ఎవ్వరు?= దిక్కెవ్వరు?

తాత్పర్యం: పామును కమ్ముకొని పడగొట్టిన చీమల గుంపువలె అనేక దేశ సైన్యాలు ద్రోణుడిని చిక్కుపరచి ఉంటాయి. ఇక చెప్పవలసింది ఏముంది? సంజయా! మన పక్షానికి దిక్కెవ్వరు?

విశేషం: అలం: ఉపమ.

వ. అని పలుమాట లాడి యొల్లంబోయి యాలోనన కొంత దెప్పిఱి, యంగంబులు వడంకుచుండ మఱియు నమ్మానవేశ్వరుండు సూతనందనున కిట్లనియె. 86

ప్రతిపదార్థం: అని= పైవిధంగా పలికి; పలుమాటలు+ఆడి= అనేక విధాల మాట్లాడి; ఒల్లన్+పోయి= మూర్ఛపోయి; ఆలోనన్+అ= ఆలోపుగనే; కొంత= కొంచెం; తెప్పిఱి= తెప్పరిల్లి; అంగంబులు= అవయవాలు; వడంకుచుండన్= వణుకుచుండగా; మఱియున్= ఇంకా; ఆ+మానవేశ్వరుండు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; సూతనందనునకున్= సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా అనేక విధాల పలికి, మూర్ఛిల్లి, ఇంతలోనే కొంత తేరుకొని, అవయవాలన్నీ వణుకుతుండగా ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

తే. 'ప్రథమ గిరిమీఁదఁ దోఁతెంచు భానుఁ బోలి । ధర్మపుత్రుండు దోఁచినఁ దమము విరియు
నట్లు విరియక గురునకు నడ్డపడఁగ । వచ్చునే? తమ్ము మెఱసి యెవ్వరికి నైన? 87

ప్రతిపదార్థం: ప్రథమగిరిమీఁదన్= ఉదయపర్వతంపై; తోఁతెంచు= ఉదయించే; భానున్+పోలి= సూర్యుడివలె; ధర్మపుత్రుండు= ధర్మరాజు; తోఁచినన్= కనిపించగా; తమము= చీకటి; విరియునట్లు= తొలగునట్లు; విరియక= తొలగిపోక; తమ్మున్= తాము; మెఱసి= తేజస్సును చూపి; ఎవ్వరికిన్+ఐనన్= ఎవరికైన; గురునకున్= ద్రోణుడికి; అడ్డపడఁగన్= ఆదుకొనటానికి; వచ్చునే?= వీలౌతుందా?

తాత్పర్యం: 'పొడుపుకొండమీద ఉదయించే సూర్యుడివలె ధర్మరాజు తేజాన్ని ప్రదర్శిస్తుంటే, చీకట్లు తొలగిపోయినట్లు ప్రక్కకు తొలగిపోకుండా పరాక్రమాన్ని ప్రదర్శించి ద్రోణుడిని ఆదుకోవటం మన వారిలో ఎవరివలన అవుతుంది?

విశేషం: అలం: ఉపమ.

క. సింధురము మహోద్రేకమ । దాంధంబై వచ్చులీల నాచార్యునిపై
గంధవహసుతుఁడు గవియ న । మంథరగతి నెవ్వఁ డాఁగు మన యోధులలోన్? 88

ప్రతిపదార్థం: సింధురము= ఏనుగు; మహా+ఉద్రేక= మిక్కిలి విజృంభణతో; మద+అంధంబు+ఐ= మదించి కన్నులు కానరానిదై; వచ్చులీలన్= వచ్చే విధంగా; ఆచార్యునిపైన్= ద్రోణాచార్యుడిమీద; అమంథరగతిన్= మిక్కిలి తీవ్రంగా; గంధవహసుతుఁడు=

వాయుపుత్రుడైన భీముడు; కవియన్= మార్కొనగా; మన= మనయొక్క; యోధులలోన్= వీరులలో; ఎవ్వఁడు= ఎవడు; ఆగున్?= తట్టుకోగలడు?

తాత్పర్యం: ఉద్రేకించిన మదపుటేనుగు కన్నుమిన్నుగానక త్రోసుకొని వచ్చేటట్లు, అతివేగంగా భీముడు వచ్చి తాకితే మన యోధులలో అతడిని అడ్డుకొనే వారెవరు?

విశేషం: అలం: ఉపమ.

చ. **ఉఱుముచు నెల్లెడం బిడుగు లుగ్రగతిం బడ ఘోరమూర్తి యై**
యఱిముఱిఁ గప్పుదెంచు విలయాభ్రము చాడ్పున మౌర్వినాద మే
డ్తెఱఁ జెలఁగన్ వడిం దొరఁగు దివ్యశరంబులు ద్రోణు తేరిపైఁ
బఱపు కిరీటి మీ ధరణిపాలకు జోదులచేత నిల్చునే? 89

ప్రతిపదార్థం: ఉఱుముచున్= గర్జిస్తూ; ఎల్ల+ఎడన్= అంతట; పిడుగులు= పిడుగులు; ఉగ్రగతిన్= భయంకరంగా; పడన్= పడగా; ఘోర= భయంకరమైన; మూర్తి+ఐ= రూపం కలవాడై; అఱిముఱిన్= సంభ్రమంతో; కప్పుదెంచు= క్రమ్ముకొనివచ్చే; విలయ= ప్రళయ కాలమందలి; అభ్రము= మేఘం; చాడ్పునన్= వలె; మౌర్వి= అల్లెతాటి; నాదము= మ్రోత; ఏడ్తెఱన్= మిక్కిలి; చెలఁగన్= మెరయగా; వడిన్= వేగంగా; తొరఁగు= దూసుకొనివచ్చు; దివ్యశరంబులు= ఆగ్నేయాస్త్రాది దివ్యాస్త్రాలు; ద్రోణ= ద్రోణాచార్యుడియొక్క; తేరిపైన్= రథంమీద; పఱపు= వేసే; కిరీటి= అర్జునుడు; మీ= మీ యొక్క; ధరణిపాలకు= రాజగు దుర్యోధనుడి యొక్క; జోదులచేతన్= వీరులతో; నిల్చునే?= అడ్డగించబడగలడా?

తాత్పర్యం: గర్జిస్తూ, అంతటా పిడుగులు కురుస్తూ, ఘోరమూర్తి అయి సంభ్రమంతో కమ్ముకొని వచ్చే ప్రళయకాల మేఘంవలె అల్లెత్రాటి మ్రోత మ్రోయగా, వేగంగా దూసుకొనివచ్చే ఆగ్నేయాస్త్రాదులు ద్రోణుడి రథంమీద పరిచే అర్జునుడిని, దుర్యోధనుడి యోధులు అడ్డుకొనగలరా?

క. **ఎవ్వఁడు దెరలెనొ? తిరుగక । యెవ్వఁడు నిల్చెనొ? కడంగి యెవ్వఁడు బిరు దై**
క్రొవ్వునఁ జచ్చెనొ? కుంభజు । నెవ్వఁడు గావంగలేఁడ? యెయ్యది దుదియో? 90

ప్రతిపదార్థం: ఎవ్వఁడు= ఏ వీరుడు; తెరలెనొ?= వెనుతిరిగెనో? ఎవ్వఁడు= ఏ యోధుడు; తిరుగక= వెనుదిరుగక; కడంగి= ప్రయత్నించి; నిల్చెనొ?= గట్టిగా నిలబడ్డాడో? ఎవ్వఁడు= ఏ వీరుడు; బిరుదు+ఐ= వీరుడై; క్రొవ్వునన్= మదించి; చచ్చెనొ?= చనిపోయినాడో?; కుంభజున్= ద్రోణుడిని; ఎవ్వఁడు= ఏ వీరుడు; కావంగలేఁడు+అ?= రక్షించలేకపోయినాడా?; ఏ+అది= ఏది; తుదియో?= పర్యవసానమో?.

తాత్పర్యం: ఏ వీరుడు వెనుదిరిగాడో? ఎవ్వరు వెనుదిరుగక పోరాడాడో? ఏ యోధుడు పట్టుదల వీడక గట్టిగా నిలబడ్డాడో? ఎవడు ప్రతిజ్ఞచేసి మదించి పోరి మరణించాడో? ఆ మహనీయుడిని ఎవ్వడూ రక్షించలేకపోయారా? చివరికి ఏం జరిగిందో?

విశేషం: ఇట ద్రోణుడి మరణ వార్త విని శోకిస్తున్న ధృతరాష్ట్రుడిలో శంక, వితర్కం, విషాదం అనే భావాలు వ్యక్తమౌతున్నవి.

ఆ. **గురుఁడు వడిన యపుడ కురుసైన్యములఁ గల । వారణాశ్వసుభట వర్గములును**
బడియెఁ గాక; యేల పడకుండు? నా ధర్మ । పుత్త్రుభాగ్య మలఁతిఁ బోవునెట్లు? 91

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణుడు; పడినయపుఁడు+అ= పడిపోయినపుడే; కురుసైన్యములన్+కల= కౌరవసైన్యంలోగల; వారణ= ఏనుగుల; అశ్వ= గుఱ్ఱాల; సుభట= ఉత్తమ సైనికుల; వర్గములును= సమూహాలు కూడా; పడియెన్+కాక= పడిపోయి ఉంటవి; ఏల= ఎట్లా; పడకుండున్?= పడిపోవు?; ఆ ధర్మపుత్త్రు భాగ్యము= ఆ ధర్మరాజు అదృష్టం; ఎట్లు= ఏ విధంగా; అలఁతి పోవున్?= తగ్గుతుంది?.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు పడిపోయినపుడే కౌరవుల చతురంగ బలాలన్నీ పడిపోయి ఉంటాయి. పడకుండా ఉండేదెట్లా? ఆ ధర్మరాజు భాగ్యం ఎట్లా తేలికగా పోతుంది?

చ. **నడిఁకెడువాఁడు గాఁడు గురునందనుఁ; డక్కట! తండ్రిచావు న**
ప్పుడు మొగ తప్పి యొండుఁగడఁ బోరుచునుండెనో? యడ్డపాటు క
వ్వడికతనన్ ఫలింపమి నవారణ నాద్రుపదాత్మజుండు బె
ట్టడరి వధింపఁగా వికలుఁ డై దురపిల్లుచుఁ జూచుచుండెనో?' **92**

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; గురునందనుఁడు= గురువైన ద్రోణుడి పుత్రుడైన అశ్వత్థామ; నడిఁకెడువాఁడు కాఁడు= ఊరుకొనేవాడు కాడు; తండ్రి= ద్రోణుడు; చావున్+అప్పుడు= మరణ సమయంలో; మొగతప్పి= ఎదురుగా లేక; ఒండున్+కడన్= వేరొకచోట; పోరుచున్+ఉండెనో?= యుద్ధం చేస్తున్నాడో?; అడ్డపాటు= అడ్డుపడటం; కవ్వడి= అర్జునుడి; కతనన్= కారణంగా; ఫలింపమిన్= ఫలించకపోవటం వలన; అవారణన్= ఎదురులేక; ఆ ద్రుపదాత్మజుండు= ఆ ద్రుపదుడి పుత్రుడైన ధృష్టద్యుమ్నుడు; బెట్టు+అడరి= మిక్కిలి విజృంభించి; వధింపఁగాన్= చంపగా; వికలుఁడు+ఐ= చెదరిన మనస్సు కలవాడై; దురపిల్లుచున్= దుఃఖిస్తూ; చూచుచుండెనో?= చూస్తూ ఉండిపోయాడో?

తాత్పర్యం: ద్రోణుడి పుత్రుడైన అశ్వత్థామ ఊరుకొనేవాడు కాడు, తండ్రి మరణించే వేళకు ఎక్కడో యుద్ధం చేస్తూ ఉండి ఉంటాడు. లేదా, అడ్డం వెళ్ళినపుడు అర్జునుడు నిరోధించి ఉంటాడు. అందుకే ఎదురు లేకపోవటం వలన ధృష్టద్యుమ్నుడు మిక్కిలి విజృంభించి ద్రోణుడిని చంపగా దుఃఖిస్తూ, చూస్తూ ఉండిపోయాడేమో?

క. **అని పనవి వనట నలఁదురి। 'నిను నెద్దియు నడుగ నాకు నీవేమియుఁ జె**
ప్పను వలవదు సంజయ! మఱి। వినియెద మది గలఁగె' ననుచు వివశాత్మకుఁ డై. **93**

ప్రతిపదార్థం: అని= ఇట్లా పలికి; పనవి= ప్రలాపించి; వనటన్= శోకంతో; అలఁదురి= పరితపించి; సంజయ!= ఓ సంజయా!; నినున్= నిన్ను; ఎద్దియున్= ఏది కూడా; అడుగన్= అడుగను; నాకున్; నీవు; ఏమియున్= ఏదికూడ; చెప్పవలవదు= చెప్పవద్దు; మది= మనస్సు; కలఁగెన్= చెదిరి పోయింది; మఱి వినియెదన్= తర్వాత వింటాను; అనుచున్= అంటూ; వివశాత్మకుఁడు+ఐ= వశం తప్పినవాడై.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఈ విధంగా పరితపించి, 'ఓ సంజయా! నేను నిన్నేదీ అడుగను, నీవు నాకేమీ చెప్పకుము, ఇపుడు నా మనస్సు చెదరిపోయింది. తర్వాత వింటాను' అంటూ వశం తప్పినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇందులో ధృతరాష్ట్రుడిలోని చింతా, విషాద, దైన్య, జడతాదులు వ్యక్తమవుతున్నవి.

వ. **తన కొడుకుల గెలుపు నెడ నాసమాలుటం జేసి.** **94**

ప్రతిపదార్థం: తన= తనయొక్క; కొడుకుల= దుర్యోధనాదుల యొక్క; గెలుపు ఎడన్= గెలుపు విషయమై; ఆస= ఆశ; మాలుటన్+చేసి= నశించటంచేత.

తాత్పర్యం: తన కొడుకులు గెలుస్తారన్న ఆశ వదలుకొనటం వలన.

ఆ సొమ్మవోయి పడిన సుదతు లాక్రందన । రవముతోడ సత్వరముగ నెత్తి
యా నృపాలు సెజ్జయం దిడి మెలపున । శిశిర విధులు సేయ సేద తేఱి. 95

ప్రతిపదార్థం: సొమ్మ+పోయి= సొమ్మసిల్లి; పడినన్= పడగా; సుదతులు= స్త్రీలు; ఆక్రందన= ఏడ్పుయొక్క; రవముతోడన్= అరుపులతో; సత్వరముగన్= వేగంగా; ఆ నృపాలున్= ఆ ధృతరాష్ట్రుడిని; ఎత్తి= పైకెత్తి; సెజ్జ అందున్= పరుపుపై; ఇడి= పడుకొనేటట్లుంచి; మెలపునన్= జాగరూకతతో; శిశిర విధులు= శైత్యోపచారాలు; చేయన్= చేయగా; సేద తేరి= అలసట తీరి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు సొమ్మసిల్లి పడిపోగా, స్త్రీలు ఆక్రందిస్తూ వెంటనే అతడిని పైకెత్తి, పరుపుపై పరుండపెట్టి, జాగ్రత్తగా శైత్యోపచారాలు చేయగా, అలసట తీరి. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఆసీనుండై యాతండు సూతసుతున కిట్లనియె: 'నరనారాయణులు రథిసారథులైన యా రథం బెందు సిద్ధమనోరథం బగుఁ; గవలుగడింది మగలు; సాత్యకి సత్యపరాక్రముండు; పాంచాలోత్తముండగు నుత్తమౌజుం డుదాత్తబలుండు; శిశుపాలతనయుం డగు ధృష్టకేతుండు ధీరుండు; భీష్మపాతన హేతువైన శిఖండి యఖండ పరాక్రముండు; సౌభద్రుండు రెండవరుద్రుండు, యాదవశ్రేష్ఠుండగు చేకితానుండు మానధనుండు; ద్రౌపదేయు లజేయులు; గేకయు లేవురు వేవురపెట్టు; యుయుత్సుండు బహుళ మత్సరుండు; ద్రోణవధంబ పనిగాఁ బుట్టిన ధృష్టద్యుమ్నుండు భుజసారద్యుమ్నుండు; ఘటోత్కచుండు ఘనఘోరమూర్తి; కృష్ణాశ్రితంబైన వృష్ణికుమార లోకం బలోకమాన్యంబన మిగిలిన బిరుదుతనంబునం బేర్చినయది; భీమగదాభీషణుండైన భీమసేనుండు నెవ్వరికి నలవిగాక యుండుఁ; బాండవ సేనఁ గావను గౌరవ సైన్యంబు సమయింపను దాన చాలునట్టి పరికరంబును గలదను కొలంది గాదు; కార్యవివేక శౌర్యోద్రేకధుర్యుండు ధర్మదేవత కొడుకు ధార్మికత్వసత్యాది మహాగుణ గరిష్ఠుండు యుధిష్ఠిరుం; దతని గెలువ దేవతలకు నశక్యంబు; మఱియు నొక్క విశేషంబు సెప్పెద నాకర్ణింపుము. 96

ప్రతిపదార్థం: ఆసీనుండు+ఐ= కూర్చొని; ఆతండు= ఆ ధృతరాష్ట్రుడు; సూతసుతునకున్= సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లన్నాడు; నరనారాయణులు= కృష్ణార్జునులు; రథి= రథంపైనుండి యుద్ధం చేసేవాడు; సారథి= రథం నడుపువాడు; ఐన; ఆ రథంబు= అట్టి రథం; ఎందును= ఎచ్చటనైన; సిద్ధమనోరథంబు+అగున్= సిద్ధించిన కోర్కెలు గలది అవుతుంది; కవలు= నకుల సహదేవులు; కడింది= గొప్ప; మగలు= వీరులు; సాత్యకి= కృష్ణుడి తమ్ముడైన సాత్యకి; సత్యపరాక్రముండు= నిజమైన పరాక్రమం కలవాడు; పాంచాల+ఉత్తముఁడు+అగు= పాంచాలదేశ వీరులలో శ్రేష్ఠుడగు; ఉత్తమౌజుండు= ఉత్తమౌజుడు; ఉదాత్త బలుండు= గొప్పబలశాలి; శిశుపాల తనయుండు+అగు= శిశుపాలుని కుమారుడైన; ధృష్టకేతుండు= ధృష్టకేతువు; ధీరుండు= ధైర్యవంతుడు; భీష్మ= భీష్ముడియొక్క; పాతన= పడగొట్టటానికి; హేతువు+ఐన= కారణమైన; శిఖండి= శిఖండి; అఖండ పరాక్రముండు= మొక్కవోని పరాక్రమం కలవాడు; సౌభద్రుండు= సుభద్ర పుత్రుడైన అభిమన్యుడు; రెండవ రుద్రుండు= ఈశ్వరునంతటివాడు; యాదవశ్రేష్ఠుండు+అగు= యాదవులలో ఉత్తముడైన; చేకితానుండు= చేకితానుడు; మానధనుండు= అభిమానమే ధనంగా గలవాడు; ద్రౌపదేయులు= ద్రౌపది పుత్రులైన ప్రతివింధ్యాదులు; అజయ్యులు= జయించవీలుగానివారు; కేకయులు= కేకయ దేశవీరులు; ఏవురు= ఐదుగురు; వేవురపెట్టు= వేయిమందితో సమానం; యుయుత్సుండు= ధృతరాష్ట్రుడి కొడుకైన యుయుత్సుడు; బహుళ మత్సరుండు= మిక్కిలి క్రోధం కలవాడు; ద్రోణవధంబు+అ= ద్రోణుడిని చంపటమే; పనిగాన్= కర్తవ్యంగా; పుట్టిన= జన్మించిన; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; భుజ= బాహువుల; సార= శక్తియే; ద్యుమ్నుండు= ధనంగా కలవాడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఘటోత్కచుడు; ఘన= గొప్పనైన; ఘోర= భయంకరమైన; మూర్తి= రూపంకలవాడు; కృష్ణా+ఆశ్రితంబు+ఐన= శ్రీకృష్ణుడి ఆధీనంలో ఉన్న; వృష్ణికుమార లోకంబు= వృష్ణివంశ వీరుల సమూహం; అలోక= లోకాతీతమైన; మాన్యంబు= గౌరవం కలది; అనమిగిలిన= అనజాలిన; బిరుదుతనంబునన్= ప్రసిద్ధితో; పేర్చిన+అది= పెంపు కలది; భీమ= భయంకరమైన; గదా= గదచేత; భీషణుండైన= భయంకరుడైన; భీమసేనుండు= భీముడు; ఎవ్వరికిన్= ఎవ్వరికికూడా; అలవికాక+ఉండున్= సాధ్యంకాక ఉంటాడు; పాండవసేనన్= పాండవసైన్యాన్ని; కావను= రక్షించటానికి; కౌరవసైన్యంబు= కౌరవుల సేనను; సమయింపను= చంపటానికి; తాను+అ= తానె; చాలునట్టి= తగిన; పరికరంబును= సాధనం; కలదు+అను= ఉన్నదన్న; కొలంది+కాదు= పరిమితియేకాదు; కార్య= పని నడపు; వివేక= జ్ఞానం; శౌర్య= శూరత్వం; ఉద్రేక= విజృంభణ; ధుర్యుండు= ధరించినవాడు; ధర్మదేవత కొడుకు= యమధర్మరాజు అంశలో పుట్టినవాడు; ధార్మికత్వ= ధర్మాన్ని అనుసరించే గుణంలో; సత్య+ఆది= సత్యం మొదలైన; మహాగుణ= గొప్ప గుణాలచేత; గరిష్ఠుండు= మిక్కిలి గొప్పవాడు; యుధిష్ఠిరుండు= యుద్ధంలో స్థిరుడైన ధర్మరాజు; అతనిన్+గెలువన్= ఆ ధర్మజుడిని జయించటానికి; దేవతలకున్= అమరులకు కూడ; అశక్యంబు= వీలుకాదు; మఱియున్= ఇంకా; ఒక్క విశేషంబు= ఒక అతిశయం; చెప్పెదన్= చెపుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు కూర్చొని సంజయునితో ఇట్లా అన్నాడు. 'నారాయణుడైన కృష్ణుడు సారథి, నరుడైన అర్జునుడు రథాధిష్ఠితుడై యుద్ధం చేసేవాడు. ఇట్టి రథం ఎచటనైనా కోర్కెలను తీర్చగలదు. నకుల సహదేవులు మహావీరులు. సాత్యకి నిజమైన పరాక్రమం కలవాడు. పాంచాలురలో ఉత్తముడైన ఉత్తమౌజుడు ఉదాత్తబలుడు. శిశుపాలుడి కొడుకు ధృష్టకేతుడు ధీరుడు. భీష్ముడు పడిపోవటానికి కారణమైన శిఖండి మొక్కవోని పరాక్రమవంతుడు. అభిమన్యుడు రెండవ రుద్రుడు. యాదవ శ్రేష్ఠుడైన చేకితానుడు మానధనుడు. ప్రతివింధ్యాదులైన ద్రౌపది పుత్రులు అజేయులు. కేకయ నృపులు ఐదుగురు వెయ్యిమంది పెట్టు. యుయుత్సుడు మిక్కిలి క్రోధం కలవాడు. ద్రోణుడిని వధించటానికి పుట్టిన ధృష్టద్యుమ్నుడు భుజబలమే ధనంగా కలవాడు. ఘటోత్కచుడు భయంకర రూపుడు. కృష్ణుడిని ఆశ్రయించి ఉన్న వృష్ణిసంఘం లోకాతీత గౌరవంగల బిరుదు కలది. భయంకరమైన గదచేత భీకరుడైన భీముడు ఎవరికీ అలవికానివాడు. పాండవసేనను కాపాడటంలో కౌరవసేనను నశింపజేయటంలో ఇత డొక్కడే సరిపోతాడు. ఇతర పరికరాలెన్ని ఉన్నా ఇతడి ముందు సరితూగవు. ధర్మజుడు, కార్యం సాధించే వివేకం, శౌర్యోద్రేకం పుష్కలంగా కలవాడు. ధార్మికత్వం, సత్యం మొదలైన మహాగుణాలలో సాటిలేనివాడు. యుద్ధంలో స్థిరుడైన అతడిని గెలవటం దేవతలకు కూడా అశక్యం. మరొక విశేషం చెప్పుతాను వినుము.

మ. **యదు వంశంబున లోకరక్షణ పరుండై పుట్టి వ్రేపల్లె ను**
న్మద బాల్యంబు నటించి, కంసముఖ నానాదైత్యులం ద్రుంచి బ
ల్లిదుఁ డా యింద్రుని పారిజాత మిలకున్ లీలాగతిం దెచ్చి శి
ష్టదయాళుత్వము పూనియున్న హరి నిష్ఠం జెంది రప్పాండవుల్. **97**

ప్రతిపదార్థం: ఆ+పాండవులు= ఆ పాండురాజు పుత్రులు; యదువంశంబునన్= యాదవకులంలో; లోకరక్షణ పరుండు+ఐ= లోకాన్ని కాపాడేవాడై; పుట్టి= జన్మించి; వ్రేపల్లెన్= గొల్లపల్లెలో; ఉన్మద బాల్యంబు= చపల బాల్యం; నటించి= కపటంగా వర్తించి; కంస= కంసుడు; ముఖ= మొదలైన; నానా= అనేకులైన; దైత్యులన్= రాక్షసులను; త్రుంచి= చంపి; బల్లిదుఁడు= బలవంతుడైన; ఆ+ఇంద్రుని= ఆ ఇంద్రుడియొక్క; పారిజాతము= పారిజాతవృక్షం; ఇలకున్= భూమిపైకి; లీలాగతిన్= అవలీలగా; తెచ్చి= తీసికొని వచ్చి; శిష్టదయాళుత్వము= మంచివారిపై కారుణ్యం; పూని ఉన్న= కలిగి ఉన్న; హరి= శ్రీకృష్ణుడియొక్క; నిష్ఠన్= ఆశ్రయాన్ని; చెందిరి= పొందారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: లోకరక్షణపరుడై, యదువంశంలో జన్మించి, వ్రేపల్లెలో బాల్యావస్థను నటించి, కంసాది రాక్షసులను చంపి, బలశాలియైన ఇంద్రుడి పారిజాతవృక్షాన్ని అవలీలగా దెచ్చి, సాధువులపై కారుణ్యం కలవాడైయున్న శ్రీకృష్ణుడిని ఆ పాండవులు ఆశ్రయించారు.

వ. కావున వారల గెలుచు టరిది; యట్లుంగాక. 98

ప్రతిపదార్థం: కావునన్= కనుక; వారలన్= ఆ పాండవులను; గెలుచుట= జయించటం; అరిది= అశక్యం; అట్లున్+కాక= అదీకాక.

తాత్పర్యం: కనుక ఆ పాండవులను జయించటం అశక్యం. అదేకాక. (తరువాతి పద్యంతో అన్వయం)

క. హరి యాత్మ యర్జునునకు; కా। హరి కర్జునుఁ డాత్మ; హరియు నర్జునుఁడును నా
నిరువు రగుట క్రీడార్థం; । బరయఁగ నది యొక్క వెలుఁగ యతులం బెందున్. 99

ప్రతిపదార్థం: అర్జునునకున్= అర్జునుడికి; హరి= కృష్ణుడు; ఆత్మ= జీవం; హరికిన్= శ్రీకృష్ణునికి; అర్జునుఁడు= అర్జునుడు; ఆత్మ= జీవం; హరియున్= కృష్ణుడును; అర్జునుడును నాన్= అర్జునుడు అనగా; ఇరువురు= ఇద్దరు; అగుట= కావడం; క్రీడా+అర్థంబు= ఆట కొరకే; అరయఁగన్= విచారించగా; అది= వారి ఆత్మ; ఒక్క= ఒక; వెలుఁగు+అ= ప్రకాశమే; ఎందున్= ఎచటనైనా; అతులంబు= సాటిలేనిది.

తాత్పర్యం: అర్జునుడికి కృష్ణుడు ఆత్మ, శ్రీకృష్ణుడికి అర్జునుడు ఆత్మ. హరి అని, అర్జును డని వేరుగా కనిపించటం ఒక క్రీడ. అదంతా సాటిలేని ఒకే ప్రకాశం.

క. ఆ వెలుఁగు గనువెలుంగుగఁ। దా వెలసిన పుణ్యమూర్తి ధర్మసుతుం డే
లా వెఱచు? రణమునకు; నా। చే వచ్చెం గౌరవులకుఁ జే; టే మందున్?' 100

ప్రతిపదార్థం: ఆ వెలుఁగు= ఆ కృష్ణార్జునులనే తేజస్సు; కనువెలుంగుగన్= కంటి వెలుగుగా; తాను+ఐ= తానే అయి; వెలసిన= ప్రసిద్ధికెక్కిన; పుణ్యమూర్తి= పుణ్యమే రూపంగా కలవాడు; ధర్మసుతుండు= ధర్మరాజు; రణమునకున్= యుద్ధానికి; ఏలా= ఎట్లు; వెఱచున్?= భయపడతాడు?; నాచేన్= నా వలన; కౌరవులకున్= దుర్యోధనాదులకు; చేటు= కీడు; వచ్చెన్= కలిగింది; ఏమి+అందున్?= అనవలసింది ఏమున్నది?

తాత్పర్యం: ఆ కృష్ణార్జునుల తేజస్సు కనువెలుగుగా తానై ప్రసిద్ధికెక్కిన పుణ్యరూపుడు ధర్మరాజు. అతడు యుద్ధానికి భయపడతాడా? నా వలన కౌరవులకంతా కీడు మూడింది. ఇక నేను చెప్పేదేమున్నది?'

వ. అని వెచ్చనూర్చి యూరకుండి వెండియు. 101

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా అని; వెచ్చన్+ఊర్చి= వేడి నిట్టూర్పు వదలి; ఊరకుండి= మౌనంగా ఉండి; వెండియున్= మరియు.

తాత్పర్యం: ఇట్లని, వేడి నిట్టూర్పు వదలి, మౌనంగా ఉండి, మరల.

చ. 'గురుఁడును భీష్ముడుం గలనఁ గూలుదు రట్టె, కిరీటి కింక నె
వ్వ రెదురు? కౌరవక్షయ మవశ్యము నయ్యెడు; వార్త లేమిగాఁ
బురబురఁ బొక్కుచున్ వినఁగ బుద్ధిఁ దలంచెద; నైన ద్రోణు సం
గర పరిపాటి యెల్ల వినఁగా వలతున్ వివరించి చెప్పుమా!' 102

ప్రతిపదార్థం: గురుఁడును= ద్రోణుడును; భీష్ముఁడున్= భీష్ముడును; కలనన్= యుద్ధంలో; కూలుదురు+అట్టె= కూలిపోతారా; కిరీటికిన్= అర్జునుడికి; ఇంకన్= ఇకముందు; ఎవ్వరు= ఏ వీరులు; ఎదురు= పోటీ; కౌరవక్షయము= కౌరవులయొక్క నాశనం; అవశ్యమున్= తప్పక; అయ్యెడున్= అవుతుంది; వార్తలు= సమాచారాలు; ఏమిగాన్= ఏవైనా; (లేదా) వార్తలు= వార్తలు; ఏమిగాన్= ఏమని; పురపురన్= మిక్కిలి; పొక్కుచున్= ఏడుస్తూ; వినఁగన్= వినాలని; బుద్ధిన్= మనస్సులో; తలంచెదన్= అనుకొంటాను; ఐనన్= ఐనా; ద్రోణు= ద్రోణాచార్యునియొక్క; సంగర= యుద్ధపు; పరిపాటి= క్రమం; వినగాన్= వినాలని; వలతున్= ఇష్టపడతాను; వివరించి= వివరంగా; చెప్పుమా!= చెప్పవలసింది!

తాత్పర్యం: 'అజేయులైన భీష్మద్రోణులు యుద్ధంలో పడిపోయారా! ఇక అర్జునుడిని ఎదుర్కొనే వారెవ్వరు? కౌరవులు తప్పక నశిస్తారు. దుఃఖపడుతూ ఎటువంటి వార్తలైనాసరే అన్నీ వినదలచుకొన్నాను. ద్రోణుడి యుద్ధక్రమమంతా వివరించుము'.

తే. **అనిన సంజయుఁ డిట్లను నాంబికేయు । తోడ 'నేను దెల్లంబుగ ద్రోణుసమర**
మెఱిఁగి వచ్చితిఁ; జెప్పెద నెల్లఁ దెలియ । వినుము థిరమయి; మాటలు వేయు నేల? 103

ప్రతిపదార్థం: అనినన్= ధృతరాష్ట్రుడు ఇట్లనగా; సంజయుఁడు= సంజయుడు; ఆంబికేయుతోడన్= ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటాడు; నేను; తెల్లంబుగాన్= విశదంగా; ద్రోణుసమరము= ద్రోణుడియొక్క యుద్ధాన్ని గూర్చి; ఎఱిఁగి వచ్చితిన్= తెలిసికొని వచ్చాను; ఎల్లన్= అంతా; చెప్పెదన్= తెలియజేస్తాను; థిరమయి= స్థిరచిత్తంతో; తెలియ వినుము= బాగా వినుము; మాటలు= పలుకులు; వేయున్+ఏల?= ఎక్కువ ఎందుకు?

తాత్పర్యం: 'ఎక్కువ మాట లెందుకు? ద్రోణాచార్యుడి యుద్ధాన్ని గూర్చి చక్కగా తెలిసికొని వచ్చాను. స్థిరచిత్తుడవై విశదంగా వినుము'. అని ధృతరాష్ట్రుడితో సంజయు డన్నాడు.

ద్రోణుఁడు దుర్యోధనునకు ధర్మరాజుం బట్టి యిచ్చునట్లు వరం బిచ్చుట (సం. 7-11-1)

వ. **అట్లుసేనాధిపత్యంబు పూని కుంభసంభవుండు ముదితమనస్కుండై గారవంబునం గౌరవేంద్రునకు నరేంద్రులు విన నిట్లనియె. 104**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; సేనాధిపత్యంబు= సైన్యాధిపత్యం; పూని= వహించి; కుంభసంభవుండు= ద్రోణుడు; ముదితమనస్కుండు+ఐ= సంతోషించిన మనస్సుగలవాడై; గౌరవంబునన్= ప్రేమతో; కౌరవేంద్రునకున్= దుర్యోధనుడితో; నరేంద్రులు= రాజశ్రేష్ఠులు; వినన్= వినగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా ద్రోణాచార్యుడు సర్వసేనాపతి అయి, సంతోషపడి, రాజశ్రేష్ఠులంతా వింటుండగా దుర్యోధనుడితో ఈ తీరున అన్నాడు.

క. **'నను భీష్ముని పిదప బలం । బున కెల్లను ముఖ్యుఁ జేసి పూజించితి వీ**
వినుతాచరణఫలంబును । గనువాఁడవు; వరము గోరు కౌరవనాథా!' 105

ప్రతిపదార్థం: కౌరవనాథా!= దుర్యోధన మహారాజా!; ననున్= నన్ను; భీష్ముని= భీష్మునియొక్క; పిదపన్= తరువాత; బలంబునకున్= సైన్యానికి; ఎల్లను= అంతటికి; ముఖ్యున్= అధిపతినిగా; చేసి= కావించి; పూజించితివి= గౌరవించావు; ఈ= ఈ; వినుత= ప్రశంసించదగిన; ఆచరణ= నడవడికి; ఫలంబును= ఫలితాన్ని; కనువాఁడవు= పొందగలవు; వరము= వరాన్ని; కోరు= కోరుకొమ్ము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'దుర్యోధన మహారాజా! భీష్ముడి తరువాత నన్ను సైన్యానికంతా అధిపతిని చేసి గౌరవించావు. ఈ ప్రశంసనీయమైన ప్రవర్తనకు తగిన సత్ఫలితాన్ని పొందగలవు, వరాన్ని కోరుకొమ్ము!' అని ద్రోణుడు అన్నాడు.

వ. అనిన విని యతండు కర్ణ దుశ్శాసనాది సుహృజ్జనంబులతో నాలోచనంబు సేసి సవినయంబుగా గురున కిట్లనియె. 106

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= విని; అతండు= దుర్యోధనుడు; కర్ణ= కర్ణుడు; దుశ్శాసన= దుశ్శాసనుడు; ఆది= మొదలైన; సుహృద్+జనంబులతోన్= మిత్రులందరితోను; ఆలోచనంబు చేసి= ఆలోచించి; సవినయంబుగాన్= వినయంతో; గురునకున్= ద్రోణాచార్యుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని దుర్యోధనుడు, కర్ణుడు, దుశ్శాసనుడు మొదలైన మిత్రవర్గంతో ఆలోచించి, వినయపూర్వకంగా ద్రోణాచార్యుడితో ఇట్లా అన్నాడు.

క. 'వర మిచ్చెదేనిఁ గోరెదఁ । బరమహితము ధర్మపుత్త్రుఁ బ్రాణముతోడన్
దురమునఁ బట్టి భుజాభీ । కర! కొని రావలయు మత్సకాశంబునకున్.' 107

ప్రతిపదార్థం: భుజా= బాహువులచే; భీకర!= భయం గొలుపేవాడా!; వరము= వరం; ఇచ్చెదు+ఏని= ఇవ్వదలచుకొంటే; పరమ= మిక్కిలి; హితము= మేలునే; కోరెదన్= కోరుతాను; ధర్మపుత్త్రున్= ధర్మరాజును; ప్రాణముతోడన్= ప్రాణాలతో; దురమునన్= యుద్ధములో; పట్టి= బంధించి; మత్= నా యొక్క; సకాశంబునకున్= ఎదుటికి; కొని రావలయున్= తేవలెను.

తాత్పర్యం: 'భుజబలంతో భయం గొలిపే ద్రోణాచార్యా! నీవు వరమిస్తే చాలా మేలైనదాన్నే కోరుతాను. యుద్ధంలో ధర్మరాజును సజీవంగా బంధించి నా ముందుకు తీసికొని రావాలి'.

విశేషం: 'భుజాభీకర' అనే సంబోధన సాభిప్రాయమై ధర్మజుడిని బంధించే సామర్థ్యాన్ని తెలుపుతున్నది.

వ. అని కోరుటయు భారద్వాజుండు నీ కొడుకువదనం బవలోకించి. 108

ప్రతిపదార్థం: అని కోరుటయున్= అని కోరగా; భారద్వాజుండు= భరద్వాజుడి పుత్రుడైన ద్రోణుడు; నీ= నీ యొక్క; కొడుకు= పుత్రుడైన దుర్యోధనుడియొక్క; వదనంబు= ముఖం; అవలోకించి= చూచి.

తాత్పర్యం: ధర్మజుడిని బంధించి తెమ్మని దుర్యోధనుడు కోరగా, ద్రోణుడు అతడి వైపు చూచి.

చ. అకట! యజాతశత్రుఁ డను నప్పలు కిప్పుడు నిక్కమయ్యె వా
నికిఁ గురునాథ! యిట్టు లతనిం దెగఁ జూచుట గోర కాజిఁ బ
ట్టికొనుట గోరి తివ్విధము డెప్పర మెంతయు నిత్తెఱంగు గో
ర్కికిఁ గతమేమి, పాండవుల గెల్చి ధరన్ సగ మీఁ దలంచితే? 109

ప్రతిపదార్థం: కురునాథ!= దుర్యోధనా!; అకట!= ఆహా!; వానికిన్= ఆ ధర్మరాజుకు; అజాతశత్రుఁడు+అను= శత్రువులు లేనివాడనే; ఆ+పలుకు= ఆ మాట; ఇప్పుడు= ఈ సమయంలో; నిక్కము+అయ్యెన్= నిజమైనది; ఇట్టులు= ఈ విధంగా;

అతనిన్= ఆ ధర్మజుడిని; తెగఁజూచుట= చంపటం; కోరక= అడుగక; ఆజిన్= యుద్ధంలో; పట్టికొనుట= బంధించటం; కోరితి(వి)= కోరావు; ఈ+విధము= ఈ రీతి; ఎంతయున్= ఎంతో; డెప్పరము= ఆశ్చర్యకరం; ఈ+తెఱంగు= ఈ విధమైన; కోర్కికిన్= కోర్కెకు; కతము+ఏమి?= కారణమేమిటి?; పాండవులన్= పాండురాజు పుత్రులైన ధర్మజాదులను; గెల్చి= జయించి; ధరన్= భూమిని; సగము= అర్ధభాగము; ఈన్+తలంచితే?= ఇవ్వదలచావా?

తాత్పర్యం: 'దుర్యోధనా! ధర్మరాజుకు అజాతశత్రువనే పేరు ఇప్పుడు నిజమైందిగదా! అతడిని వధించుమని కోరక యుద్ధంలో బంధించుమని చెప్పుతున్నావు. ఇది ఆశ్చర్యకరమైన విషయం. ఇట్లా కోరటానికి కారణమేమిటి? పాండవులను జయించి, సగం రాజ్యాన్ని ఇవ్వదలచావా?

వ. **నీదు నిశ్చయంబెట్టిది? యతనిం బట్టిదెచ్చిన నేమి సేయంగల వాఁడ?' వని యడిగిన నమ్మనుజవరుం డుప్పొంగి తన మనంబున నున్న కార్యం బాచార్యునకుం దక్కటి దొరలకుం దేటపడ నిట్లనియె. 110**

ప్రతిపదార్థం: నీదు= నీ యొక్క; నిశ్చయంబు= నిర్ణయం; ఎట్టిది?= ఎటువంటిది?; అతనిన్= ఆ ధర్మరాజును; పట్టితెచ్చినన్= బంధించి తెస్తే; ఏమి చేయన్+కలవాఁడవు= ఏమి చేస్తావు; అని అడిగినన్= అని అడుగగా; ఆ+మనుజవరుండు= ఆ రాజగు దుర్యోధనుడు; ఉప్పొంగి= సంతోషించి; తన= తనయొక్క; మనంబునన్= మనస్సులో; ఉన్న= ఉన్నటువంటి; కార్యంబు= అభిప్రాయం; ఆచార్యునకున్= ద్రోణుడికి; తక్కటి దొరలకున్= మిగిలిన రాజులకు; తేటపడన్= విశదమయ్యేటట్లు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఓ దుర్యోధనా! నీ నిర్ణయం ఏమిటి? ధర్మరాజును బంధించి తెస్తే ఏం చేస్తావు?' అని ద్రోణుడు అడుగగా, దుర్యోధనుడు సంతోషించి, తన మనస్సులో ఉన్న అభిప్రాయాన్ని ద్రోణుడికీ, అక్కడ ఉన్న దొరలకూ తేటపడేటట్లు ఈ విధంగా అన్నాడు.

సీ. **'ఆ ధర్మసూనుఁ గయ్యంబునఁ జంపినఁ । గోపించి గాండీవి కురుబలంబు**
సమయించు; మన మోపి సర్వపాండవులనుఁ । జంపితిమేనిఁ బ్రచండ చక్ర
ధారఁ గౌరవకోటి తలలేఱి రాజ్యంబు । గోవిందుఁ డీకున్నె గొంతికయినఁ;
గాన యుధిష్ఠిరుఁ గాయంబు నొంపక । తెచ్చి జూదంబాడు తెఱఁ గొనర్చి

తే **మగుడ నడవికి ననిచినఁ దగిలి యతని । తోడఁ దమ్ములుఁ బో నంతతోన యెల్ల**
దొసఁగు మాలు; నప్రతిహత దోర్విభూతిఁ । బెద్దకాల మే నేలుదుఁ బృథివి యెల్ల.' 111

ప్రతిపదార్థం: ఆ ధర్మసూనున్= ఆ ధర్మరాజును; కయ్యంబునన్= యుద్ధంలో; చంపినన్= చంపితే; కోపించి= కోపంతో; గాండీవి= అర్జునుడు; కురుబలంబున్= కౌరవసైన్యాన్ని; సమయించున్= చంపుతాడు; మనము= మనం; ఓపి= సమర్థతతో; సర్వపాండవులను= పాండవులందరిని; చంపితిమి+ఏనిన్= చంపితే; గోవిందుఁడు= శ్రీకృష్ణుడు; ప్రచండ= మిక్కిలి తీక్ష్ణమైన; చక్ర= చక్రాయుధంయొక్క; ధారన్= అంచుచేత; కౌరవ= దుర్యోధనాదుల యొక్క; కోటి= సమూహం యొక్క; తలలు= శిరస్సులు; ఏఱి= ఖండించి; రాజ్యంబు= రాజ్యాన్ని; గొంతికయినన్= కుంతీదేవికైనా; ఈకున్నె!= ఇయ్యకుండా ఉంటాడా!; కానన్= కావున; యుధిష్ఠిరున్= ధర్మరాజును; కాయంబున్= దేహాన్ని; నొంపక= హతమార్చక; తెచ్చి= బంధించి తెచ్చి; జూదంబు= జూదం; ఆడు తెఱఁగు+ఒనర్చి= ఆడేటట్లు చేసి; మగుడన్= మళ్ళీ; అడవికిన్= అరణ్యానికి; అనిచినన్= పంపితే; అతనితోడన్+తగిలి= అతడివెంట; తమ్ములున్= తమ్ములైన భీమాదులు; పోన్= పోగా; అంతతోన్= అంతటితో; ఎల్లదొసఁగున్= ఆపద అంతా; మాలున్= తొలగిపోతుంది; అప్రతిహత= ఎదురులేని; దోః= బాహువులయొక్క; విభూతిన్= సంపదతో; పెద్ద కాలము= చాలా కాలం; ఏన్= నేను; పృథివిన్= భూమిని; ఎల్లన్= అంతయు; ఏలుదున్= పాలిస్తాను.

తాత్పర్యం: 'ఆ ధర్మరాజును మనం యుద్ధంలో చంపితే అర్జునుడు కోపంతో కౌరవ సైన్యాన్ని హతమారుస్తాడు. మనం పాండవుల నందరినీ చంపితే, శ్రీకృష్ణుడు చక్రాయుధంతో కౌరవుల నందరినీ చంపి, కుంతికైనా రాజ్యాన్ని సమర్పిస్తాడు. కనుక ధర్మరాజును సజీవంగా బంధించి తెచ్చి, జూదమాడించి, మళ్ళీ అడవులకు పంపితే, అతడితోబాటు తమ్ములు కూడా పోతారు. దీనితో మన ఆపదలన్నీ తొలగిపోతాయి. అపుడు ఎదురులేని భుజబలంతో భూమండలాన్ని చాలా కాలం పరిపాలిస్తాను.'

వ. అనిన విని కుటిలంబగు నతని యభిప్రాయంబునకు రోసి, యస్త్రగురుం డవ్వరంబునకు నేమేనియు నెడవెట్టియిచ్చువాఁడుగా నూహించి, యొక్క తెఱంగుఁ గాంచి, యన్నరనాథున కిట్లనియె. 112

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; కుటిలంబు+అగు= కుచ్ఛితమైన; అతని= ఆ దుర్యోధనుడియొక్క; అభిప్రాయంబునకున్= ఉద్దేశమునకు; రోసి= ఏవగించి; అస్త్రగురుండు= ద్రోణాచార్యుడు; ఆ+వరంబునకున్= ఆ వరానికి; ఏమేనియున్= ఏదైన; ఎడవెట్టి= అడ్డువెట్టి; ఇచ్చువాఁడుగాన్= ఇవ్వాలని; ఊహించి= అనుకొని; ఒక్క తెఱంగున్= ఒక ఉపాయాన్ని; కాంచి= కనుగొని; ఆ+నరనాథునకున్= ఆ దుర్యోధనుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఆ విధంగా చెప్పగా కుచ్ఛితమైన అతని అభిప్రాయాన్ని విని అసహ్యించుకొని, ద్రోణాచార్యుడు ఆ వరాన్ని ఏదైనా అడ్డువెట్టి ఇవ్వాలనుకొని, ఒక ఉపాయాన్ని ఆలోచించి దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

చ 'నరుఁ డెడ సొచ్చెనేని విను నా కది దుష్కర మేనొకండనే
సురగణమైన వ్రేలఁ గొని చూపఁగఁ జాలరు వాఁడు లేనిచోఁ
దిరమయి పోర నిల్చిన యుధిష్ఠిరు ద్రౌపది పుట్టినింటి వే
వురు వెఱఁగంది చూడ నలవుం జలముం జెడఁ బట్టి తెచ్చెదన్.' 113

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; నరుఁడు= అర్జునుడు; ఎడ+చొచ్చెన్+ఏని= అడ్డువస్తే; నాకున్= నాకు; అది= ధర్మరాజును బంధించటం; దుష్కరము= వీలుగానిది; ఏను= నేను; ఒకండనే= ఒక్కడినే కాదు; సురగణమైనన్= దేవతా సమూహమైనా; వ్రేలన్+కొని= వ్రేలెత్తి; చూపఁగన్+చాలరు= చూపలేరు; వాఁడు= ఆ అర్జునుడు; లేనిచోన్= లేకుంటే; తిరమయి= స్థిరంగా; పోరన్= యుద్ధంలో; నిల్చిన= నిలబడ్డ; యుధిష్ఠిరున్= ధర్మరాజును; ద్రౌపది= ద్రౌపదియొక్క; పుట్టినింటి= పుట్టింటివారైన పాంచాలురు; వేవురు= వెయ్యిమంది; వెఱఁగంది= ఆశ్చర్యపడి; చూడన్= చూస్తుండగా; అలవున్= బలం; చలమున్= మాత్సర్యం కూడ; చెడన్= నశించగా; పట్టి= బంధించి; తెచ్చెదన్= తెస్తాను.

తాత్పర్యం: 'దుర్యోధనా! వినుము. అర్జునుడు యుద్ధంలో అడ్డగిస్తే ధర్మజుడిని బంధించడం నాచేతగాదు. నేనొక్కడినే కాదు దేవతలు కూడా అతడిని వేలెత్తి చూపలేరు. అర్జునుడు లేకుంటే యుద్ధంలో స్థిరంగా నిల్చిన ధర్మజుడిని పాంచాలురు వెయ్యిమంది ఆశ్చర్యంతో చూస్తుండగా చలం, బలం నశించగా బంధించి తెస్తాను'

తే. అనుడు బాలిశులైన నీ తనయు లెల్ల । ధర్మజుఁడు పట్టువడున కాఁదలచి రపుడు
పాండుసుతులకు మొగమోడకుండ గురుని । ప్రతిన యెల్లెడఁ జాటించె రాజరాజు. 114

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; బాలిశులు+ఐన= మూర్ఖులైన; నీ= నీ యొక్క; తనయులు= కుమారులు; ఎల్లన్= అందరు; ధర్మజుఁడు= ధర్మరాజు; పట్టువడున్+అకాన్= పట్టువడుతాడనే; అపుడు= ఆ సమయంలో; తలఁచిరి= అనుకొన్నారు; రాజరాజు=

దుర్యోధన మహారాజు; పాండుసుతులకున్= పాండవులకు; మొగమోడకుండన్= సంకోచపడకుండా; గురుని= గురువైన ద్రోణుడి యొక్క; ప్రతిన= ప్రతిజ్ఞ; ఎల్లెడన్= అంతట; చాటించెన్= ప్రకటించాడు.

తాత్పర్యం: ద్రోణుడు ఈ విధంగా అనేసరికి, మూర్ఖులైన నీ కొడుకులంతా ధర్మరాజు బంధించబడుతాడనే అనుకొన్నారు. దుర్యోధనుడు పాండవులను గూర్చి సంకోచించకుండా ద్రోణుడి ప్రతిజ్ఞను అంతటా చాటించాడు.

వ. ఇట్లు శిబిరంబునను, సేనాస్థానంబునను గలయ నాఘోషణంబు సేయించినం జెలంగి, సకల సైనికులును సింహనాదంబులు సేయ, శంఖభేరీరవంబు లుల్లసిల్లం గౌరవ సైన్యంబు వొంగె; నది యంతయుం గౌంతేయాగ్రజుండు దన చారుల చేత విని యనుజులం గూర్చి వినిపించి, వివ్వచ్చు నాలోకించి. 115

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; శిబిరంబునను= ప్రముఖులు విడిసినచోటను; సేనాస్థానంబునను= సేనలు ఉండే చోటను; కలయన్= అంతట; ఆఘోషణంబు= చాటింపు; చేయించినన్= చేయించగా; చెలంగి= ఉత్సాహించి; సకలసైనికులును= సైనికులందరు కూడా; సింహనాదంబులు+చేయన్= వీరనాదాలు చేయగా; శంఖ= శంఖాలయొక్క; భేరీ= దుందుభుల యొక్క; రవంబులు= ధ్వనులు; ఉల్లసిల్లన్= చెలరేగగా; కౌరవ= కౌరవులయొక్క; సైన్యంబు= సేన; పొంగెన్= ఉబ్బిపోయింది; అది+అంతయున్= అక్కడి సంగతులన్నీ; కౌంతేయ+అగ్రజుండు= కుంతి పెద్ద కొడుకైన ధర్మరాజు; తన= తనయొక్క; చారులచేతన్= గూఢచారుల వలన; విని; అనుజులన్+కూర్చి= తమ్ములను సమావేశపరచి; వినిపించి= ఈ విషయాలన్నీ తెలియజేసి; వివ్వచ్చున్= అర్జునుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఈ విధంగా తామున్న శిబిరాలలో, సైనికు లుండే చోట అంతటా చాటించగా, ఉత్సాహంతో సైనికులు సింహనాదాలు చేశారు. శంఖ, దుందుభి ధ్వనులు చెలరేగగా కౌరవ సైన్యం ఉబ్బిపోయింది. అదంతా ధర్మరాజు తన గూఢచారులవలన విని, తమ్ములతో సమావేశమై సంగతంతా వినిపించి, అర్జునుడిని చూచి.

ఆ. 'గురుని ప్రతిన వింటె? వెరవున లావునఁ। జేసి దీని బొంకు సేయవలయు;
నెఱుఁగు నతఁడు నిన్ను నెడవెట్టి పలికిన। వాఁడు గానఁ జెప్పవలసె నీకు. 116

ప్రతిపదార్థం: గురుని= ద్రోణాచార్యుడి యొక్క; ప్రతిన= ప్రతిజ్ఞ; వింటె?= విన్నావా?; వెరవునన్= ఉపాయంతో; లావునన్= బలంతోనైనా; చేసి= ఏదైనా చేసి; దీనిన్= ఈ ప్రతిజ్ఞను; బొంకు= అసత్యం; చేయవలయున్= చేయాలి; అతఁడు= ఆ ద్రోణాచార్యుడు; ఎఱుఁగున్= తెలిసినవాడు; నిన్నున్= నిన్ను; ఎడవెట్టి= అడ్డుపెట్టి; పలికినవాఁడు= ప్రతిజ్ఞ చేశాడు; కానన్= కావున; నీకున్= నీకు; చెప్పవలసెన్= చెప్పవలసి వచ్చింది.

తాత్పర్యం: 'ఓ అర్జునా! ద్రోణాచార్యుడి ప్రతిజ్ఞ విన్నావా! ఉపాయం వలననైనా, బలంతో ఐనా దీనిని అసత్యం చేయాలి. అతడికి నీ సంగతి తెలుసు. నిన్ను అడ్డం పెట్టి పలుకటం వలన నీకు ప్రత్యేకించి చెప్పవలసి వచ్చింది.

క. నాయున్నచోట నెప్పుడుఁ। బాయక కనుగలిగి నిలిచి భండనము దగం
జేయంగవలయు నక్కురు। నాయకు కోరికి ఫలంబునకు విముఖముగన్.' 117

ప్రతిపదార్థం: ఆ+కురు నాయకు= ఆ దుర్యోధనుడి; కోరికి= కోర్కె యొక్క; ఫలంబునకున్= ఫలితానికి; విముఖముగన్= వ్యతిరేకంగా; ఎప్పుడున్= ఎల్లవేళల; నా= నాయొక్క; ఉన్నచోటన్= ఉన్న స్థలాన్ని; పాయక= విడువక; కనుగలిగి= జాగరూకతతో; నిలిచి= ఉండి; తగన్= తగినట్లు; భండనము= యుద్ధం; చేయంగవలయున్= చేయాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ దుర్యోధనుడి కోర్కె విఫలమయ్యేటట్లు ఎప్పుడూ నన్ను యుద్ధరంగంలో వదలక కనిపెట్టి ఉండి, తగిన విధంగా పోరు సాగించాలి'.

అర్జునుండు ధర్మరాజుతో ద్రోణుని ప్రతిజ్ఞకు వెఱవకుండునట్లు సెప్పుట (సం. 7-12-7)

వ. అనుటయు నర్జునుం డతని కిట్లనియె. 118

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; అర్జునుండు= అర్జునుడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా, అర్జునుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

క. 'గురుని వధియించుటయు, భూ । వర! నీ వని నొవ్వ నొండువలను సనుటయుం
బరికింప నొక్కరూప; వవి । దురితంబులు; వీనిఁ జేయుదునె యే; నెందున్? 119

ప్రతిపదార్థం: భూవర!= ధర్మరాజా!; గురుని= గురువైన ద్రోణుడిని; వధియించుటయున్= చంపటం; నీవు; అనిన్= యుద్ధంలో; నొవ్వన్= బాధపడేటట్లు; ఒండువలను= వేరేచోటికి; చనుటయున్= పోవటమూ; పరికింపన్= పరిశీలించగా; ఒక్కరూపు= ఒకే విధమైనవి; అవి= ఈ రెండు; దురితంబులు= పాపాలు; వీనిన్= వీటిని; ఏన్= నేను; ఎందున్= ఎక్కడైనా; చేయుదునె?= చేస్తానా?

తాత్పర్యం: 'భూవరా! ఆచార్యుడిని వధించటం, నీవు యుద్ధంలో బాధలు పాలు కాగా నేను వేరే చోటికి పోవటం అనే ఈ రెండూ ఒకే విధమైన పాపాలు. ఈ రెంటిని నే నెక్కడైనా చేస్తానా?

క. క్షోణీవల్లభ! విను మేఁ । బ్రాణముతో నుండ నిన్నుఁ బట్టి కొనఁగ నా
ద్రోణునకె కాదు సగణ । స్థాణున కైనను వశంబె? తలఁ కేమిటికిన్? 120

ప్రతిపదార్థం: క్షోణీవల్లభ!= ధర్మరాజా! వినుము= విను; ఏన్= నేను; ప్రాణముతోన్= జీవించి; ఉండన్= ఉండగా; నిన్నున్= నిన్ను; పట్టికొనఁగన్= బంధించటానికి; ఆ ద్రోణునకున్+ఎ= ఆ ద్రోణునికే; కాదు= కాదు; సగణ= భూతగణాలతో కూడిన; స్థాణునకైనను= రుద్రుడికి కూడ; వశంబె?= వీలౌతుందా? (కాదని భావం); తలఁకు= భయం; ఏమిటికిన్?= ఎందుకు?

తాత్పర్యం: ఓ ధర్మరాజా! వినుము. నేను జీవించి ఉండగా నిన్ను ప్రాణాలతో బంధించటం ఆ ద్రోణుడికే కాదు- భూతగణాల తోడి రుద్రుడికి కూడా సాధ్యంకాదు. నీవు భయపడవద్దు.

విశేషం: ఇక్కడ 'స్థాణుశబ్దం' సాభిప్రాయం. శివుడనే కాక నిశ్చలుడు అనీ అర్థం.

చ. అలవి యెఱుంగ కిమ్మెయి దురాశఁ దలంచిరి గాక, ధార్తరా
ష్ట్రులు త్రిజగంబులుం గొని పటుస్ఫురణం జనుదెంచి రేనియున్
బలవదరాతి పుంజ మదభంజన! నీ వని భంగపడ్డ నీ
యిల శకలంబులై చెడదె, యింకదె వారిధి, నింగి గూలదే? 121

ప్రతిపదార్థం: బలవత్= బలంగల; అరాతి= శత్రువుల; పుంజ= సమూహాల యొక్క; మద= అహంకారాన్ని; భంజన!= భగ్నం చేసేవాడా!; అలవి= బలం; ఎఱుంగక= తెలియక; ఈ+మెయిన్= ఈ విధంగా; దురాశన్= పేరాసచేత; తలంచిరి+కాక= అనుకొని ఉండవచ్చుగాక; ధార్తరాష్ట్రులు= దుర్యోధనాదులు; త్రిజగంబులున్= మూడులోకాలను; కొని= వెంబడిపెట్టుకొని; పటు= మిక్కిలి; స్ఫురణన్= స్ఫూర్తితో; చనుదెంచిరి+ఏనియున్= వచ్చినా; నీవు; అనిన్= యుద్ధంలో; భంగపడ్డన్= అవమానపడితే; ఈ+ఇల=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ భూమి; శకలంబులు+ఐ= ముక్కలు ముక్కలై; చెడదె?= నశించదా?; వారిధి= సముద్రం; ఇంకదె?= ఇంకిపోదా?; నింగి= ఆకాశం; కూలదే?= కూలిపోదా?

తాత్పర్యం: బలవంతులైన శత్రు సమూహాల మదాన్ని అణచే ఓ ధర్మరాజా! వారు తమ బలాన్ని తెలిసికొనలేక దురాశతో ఈ విధంగా అనుకొని ఉంటారు. దుర్యోధనాదులు మూడు లోకాలను వెంటబెట్టుకొని మిక్కిలి బలంతో వచ్చినా, నీవు యుద్ధంలో భంగపడితే ఈ భూమి ముక్కలైపోదా? సముద్రాలు ఇంకవా? ఆకాశం కూలదా?

విశేషం: యుధిష్ఠిరుడిని 'బలవదరాతి పుంజ మదభంజన!' అని అర్జునుడు సంబోధించటం సాభిప్రాయమైన విశేషణం. దీనివలన అతడి అద్భుత బలపరాక్రమాలు వెల్లడి అయి, అతడు శత్రువులచేత భంగపడటం అశక్యం అని తెలుతున్నది.

ఆ. **వారి తలఁపు వొసఁగ నేరదు, పోరఁ బ । రాభవంబు మనకు రా దెఱుంగు**
కలుగ దద్దురాత్మకులచేత; నాతలం । పిట్టు'లున్నయది, నరేంద్రముఖ్య! **122**

ప్రతిపదార్థం: నరేంద్ర ముఖ్య!= రాజశ్రేష్ఠా!; వారి= కౌరవుల; తలఁపు= కోరిక; పొసఁగనేరదు= తీరేది కాదు; మనకున్= పాండవులకు; పోరన్= యుద్ధంలో; పరాభవంబు= అవమానం; రాదు= కలుగదు; ఎఱుంగు= తెలిసికొమ్ము; ఆ+దురాత్మకుల చేతన్= ఆ దుర్బుద్ధులైన కౌరవులచేత; కలుగదు= సంభవించదు; నా= నా యొక్క; తలంపు= ఆలోచన; ఇట్టులు+ఉన్న అది= ఈ విధంగా ఉన్నది.

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడవైన ధర్మజా! కౌరవుల కోర్కె తీరజాలదు. యుద్ధంలో మనకు పరాభవమనేది లేనేలేదు. ఆ దుర్బుద్ధులచేత అసలు అది కలిగేదే కాదు. ఇది నా నిశ్చితమైన అభిప్రాయం.'

వ. **అని పలికిన విని యుధిష్ఠిరుండు సంతుష్టాంతరంగుండై, శంఖభేరీ మృదంగాది సంగర మంగళ తూర్య స్వనంబులు సెలంగ సకల సైన్య సమేతంబుగా వెడలి, నడచి, మొగంబున నెలమి నెలకొనం గ్రౌంచవ్యూహం బమర్చె; నం దగ్రభాగంబున.** **123**

ప్రతిపదార్థం: అని పలికినన్= అట్లనగా; విని; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; సంతుష్ట= సంతోషించిన; అంతరంగుండు+ఐ= మనస్సుకలవాడై; శంఖ= శంఖములు; భేరీ= దుందుభులు; మృదంగ= మద్దెలలు, ఆది= మున్నగు; సంగర మంగళ= యుద్ధంలో శుభకరమైన; తూర్య= వాద్యాల; స్వనములు= ధ్వనులు; చెలంగన్= ధ్వనింపగా; సకల= మొత్తం; సైన్య= సేనలతో; సమేతంబుగాన్= కూడుకొనినట్లుగా; వెడలి= కదలి; నడచి= ముందుకు సాగి; మొగంబునన్= ముఖంలో; ఎలమి= వికాసం; నెలకొనన్= తోచగా; క్రౌంచవ్యూహంబు= క్రౌంచపక్షిరూపంలో సైన్యాన్ని కూర్చటం; అమర్చెన్= సిద్ధపరచాడు; అందున్= ఆ వ్యూహంలో; అగ్రభాగంబునన్= ముందరి.

తాత్పర్యం: అర్జునుడు ఈ విధంగా అనగా, ధర్మరాజు సంతోషించి, శంఖ,భేరీ, మృదంగాది మంగళ ధ్వనులు చెలరేగగా, సర్వసైన్యంతో ముందుకు సాగి, ముఖంలో వికాసం కనిపించగా, క్రౌంచ వ్యూహాన్ని రచించాడు. అందు ముందు భాగంలో.

మ. **ధవళాశ్వంబులఁ బూని కేతన కపీంద్ర స్ఫూర్తి మార్తాండ మూ**
ర్తి విడంబింపఁగఁ జక్రగాండివధరుల్ దేజోమయాకార వై
భవమారం దనపై వెలుంగ నతి దీప్తంబైన తే రొప్పె శా
త్రవ సంఘంబు మనంబునన్ భయము గూరం గాలచక్రాకృతిన్. **124**

ప్రతిపదార్థం: ధవళ+అశ్వంబులన్= తెల్లని గుర్రాలను; పూని= సంధించి; కేతన= పతాకంమీది; కపీంద్రస్ఫూర్తి= హనుమంతుడి స్ఫురణ; మార్తాండమూర్తిన్= సూర్యుడి రూపాన్ని; విడంబింపఁగన్= పోలగా; చక్ర= చక్రాయుధాన్ని; గాండివ= గాండీవాన్ని; ధరుల్= ధరించిన వారైన కృష్ణార్జునులు; తేజోమయ= తేజస్సుతో నిండిన; ఆకార= రూపంయొక్క; వైభవము= ఐశ్వర్యం; ఆరన్= నిండగా; తనపైన్= తనమీద; వెలుంగన్= ప్రకాశించగా; శాత్రవ= శత్రువుల; సంఘంబు= సమూహంయొక్క; మనంబునన్= మనస్సులో; భయము= భీతి; కూరన్= నిండగా; కాలచక్ర+ఆకృతిన్= కాలచక్రం వంటి ఆకారంతో; అతిదీప్తంబు+ఐన= మిక్కిలి ప్రకాశించేది అయిన; తేరు= రథం; ఒప్పెన్= ఒప్పింది.

తాత్పర్యం: తెల్లని గుర్రాలతో, ధ్వజంపైగల మారుతి వెలుగులు సూర్యబింబాన్ని అనుకరిస్తుండగా, చక్రధారి అయిన శ్రీకృష్ణుడు, గాండీవధారి అయిన అర్జునుడు తేజస్సులతో నిండిన ఆకారాలతో తేరును అధిష్ఠించగా, శత్రువుల మనస్సులలో భయం నిండగా, కాలచక్రాకారంతో రథం మిక్కిలి ప్రకాశించింది.

విశేషం: ధవళాశ్వముల పూనినవాడు చక్రధరుఁడు. కేతన కపీంద్ర స్ఫూర్తి(న్) మార్తాండమూర్తి విడంబించినవాడు - గాండివధరుడు.

క. ఆ రథముకెలన నుజ్జ్వల । ధీరోద్భట రేఖ మెఱసె ధృష్టద్యుమ్నో
దారస్యందన ముద్ధత । సారథికముఁ జారురంగచటులాశ్వమునై. 125

ప్రతిపదార్థం: ఆ రథము= ఆ అర్జునుడి రథం; కెలనన్= ప్రక్కన; ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నుడి యొక్క; ఉదార= గొప్ప; స్యందనము= రథం; ఉద్ధత సారథికమున్= గర్వితుడైన సారథి కలదీ; చారు= అందమైన; రంగ= స్థానం కలదీ; చటుల= చలించే; అశ్వమును+ఐ= గుర్రాలు కలదీ అయి; ఉజ్జ్వల= మిక్కిలి ప్రకాశించునదీ; ధీర= ధైర్యం కలదీ; ఉద్భట= గొప్పదీ అయిన; రేఖన్= అందముతో; మెఱసెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: అర్జునుడి రథం ప్రక్కన, ఉద్ధతుడైన సారథితో, అందమైన రంగంతో, అశ్వాలు కదలుతుండగా, ఉజ్జ్వలం, ధీరం, మహనీయం అయిన రేఖతో ధృష్టద్యుమ్నుడి రథం ప్రకాశించింది.

వ. మఱియు వృకోదరాది సోదరులను, నభిమన్యు ప్రభృతి కుమారులను, పాంచాలపతి ప్రముఖ బాంధవులను, ధృష్టకేతు ముఖ్యదండనాయకులను, దక్కునుం గల పరివారంబును దగ నయ్యెయెడల బలుపును, బొలుపును గలుగ నిలిపి, యుధిష్ఠిరుం డమ్మోహరంబు నడుమ నుదాత్త సన్నాహంబునను, గంభీరోత్సాహంబునను గొలిచి నిలిచె; నంతకు మున్న యక్కడ. 126

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; వృకోదర= భీముడు; ఆది= మొదలైన; సోదరులనున్= తమ్ములను; అభిమన్యు= అభిమన్యుడు; ప్రభృతి= మొదలైన; కుమారులను= కొడుకులను; పాంచాలపతి= ద్రుపదుడు; ప్రముఖ= మొదలైన; బాంధవులను= చుట్టాలను; ధృష్టకేతు= ధృష్టకేతువు; ముఖ్య= మొదలైన; దండనాయకులను= దండనాథులను; తక్కున్+కల= తక్కిన; పరివారంబును= సేనను; తగన్= తగినట్లుగా; అయ్యై+ఎడలన్= ఆయా స్థలాలలో; బలుపును= బలమూ; పొలుపును= అందమూ; కలుగన్= కలిగేటట్లుగా; నిలిపి= ఉంచి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఆ+మోహరంబు= ఆ వ్యూహం; నడుమన్= మధ్యలో; ఉదాత్త= గొప్పదైన; సన్నాహంబునను= ఏర్పాటుతోనూ; గంభీర= లోతైన; ఉత్సాహంబునను= ప్రయత్నంతోనూ; పొలిచి= ప్రకాశించి; నిలిచెన్= నిలబడ్డాడు; అంతకుమున్న+అ= అంతకు ముందే; అక్కడన్= ఆ యుద్ధరంగంలో.

తాత్పర్యం: ఇంకా, భీముడు మొదలైన తోబుట్టువులను, అభిమన్యుడు మొదలైన పుత్రులను, ద్రుపదాది బంధువులను, ధృష్టకేతువు మున్నగు దండనాథులను, మిగిలిన సైన్యాన్నీ తగు రీతిలో ఆయా స్థానాలలో బలం,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అందం కలిగేటట్లు నిలిపి, ధర్మరాజు ఆ వ్యూహం మధ్యలో మంచి ఏర్పాట్లతో, గట్టి ప్రయత్నంతో వచ్చి నిలబడ్డాడు. అంతకు ముందే అక్కడ.

క. మనవారును రణకౌతుక । జనితోద్యమ తీవ్రు లగుచు శకటవ్యూహం
బొనరించిరి యొప్పును బెం । పును దర్పము నుల్లసిల్ల భూవరముఖ్యా! 127

ప్రతిపదార్థం: భూవరముఖ్యా!= రాజులలో శ్రేష్ఠుడవగు ధృతరాష్ట్రా!; మనవారును= కౌరవ పక్షంవారు కూడా; రణ= యుద్ధమందలి; కౌతుక= కుతూహలంవల్ల; జనిత= కలిగిన; ఉద్యమ= పూనికచే; తీవ్రులు+అగుచున్= తీవ్రతకలవారు అవుతూ; ఒప్పును= అందమూ; పెంపును= ఔన్నత్యమూ; దర్పమును= అహంకారమూ; ఉల్లసిల్లన్= ప్రకాశించగా; శకట వ్యూహంబు= శకట వ్యూహాన్ని (బండిరూపంలో పన్నిన మొగ్గరాన్ని); ఒనరించిరి= ఏర్పరచారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! మనవాళ్ళు తీవ్రమైన యుద్ధ కుతూహలం కలవారై అందం, ఔన్నత్యం, దర్పం ఉట్టిపడేటట్లు శకటవ్యూహాన్ని రచించారు.

వ. అందు వలపట సింధురాజ కళింగపతి సంగతుండయిన వికర్ణుండును, నతనికి బాసటయై చటుల హయ బహుళంబగు బలంబులతో నక్కెలన సౌబలుండును, డాపటఁ గృతవర్మ వివింశతి చిత్రసేన సమేతుండై దుశ్శాసనుండును, నతనికిఁ బ్రాపై తత్పార్శ్వంబునఁ గాంభోజ, శక, యవన మహీశ్వరులును, నడుమం ద్రిగర్తమద్ర శిబి శూరసేన దేశాధీశ పరివృతుండును, గుంభసంభవపురఃసరుండునునై కురువిభుండును, నా ముందట నంగ జనపద చతురంగ ప్రధాన సేనా సముదీర్ణుండై కర్ణుండును నిలిచిరి; వెండియుం గలవార లెడనెడం బన్నిః రట్టియెడ. 128

ప్రతిపదార్థం: అందున్= ఆ శకటవ్యూహంలో; వలపటన్= కుడిప్రక్క; సింధురాజ= సింధుదేశపు రాజైన జయద్రథుడు; కళింగపతి= కళింగదేశపురాజైన భగదత్తుడితో; సంగతుండు+అయిన= కూడినవాడైన; వికర్ణుండునున్= వికర్ణుడూ; అతనికిన్= ఆ వికర్ణుడికి; బాసట+ఐ= సహాయంగా; చటుల= చలించే; హయ= గుర్రాలచేత; బహుళంబు+అగు= నిండిన; బలంబులతోన్= సేనలతో; ఆ+కెలనన్= ఆ ప్రక్కన; సౌబలుండును= శకునియు; డాపటన్= ఎడమ ప్రక్కను; కృతవర్మ= కృతవర్మ; వివింశతి= దుర్యోధనుడి తమ్ముడైన వివింశతి; చిత్రసేన= దుర్యోధనుడి తమ్ముడైన చిత్రసేనుడితో; సమేతుండు+ఐ= కూడినవాడై; దుశ్శాసనుండునున్= దుశ్శాసనుడును; అతనికిన్= ఆ దుశ్శాసనుడికి; ప్రాపై= సహాయుడై; తద్+పార్శ్వంబునన్= అతడి ప్రక్కన; కాంభోజ= కాంభోజదేశపు; శక= శకదేశపు; యవన= యవనదేశపు; మహీ+ఈశ్వరులును= రాజులును; నడుమన్= మధ్యన; త్రిగర్త= త్రిగర్తదేశపు; మద్ర= మద్రదేశపు; శిబి= శిబిదేశపు; శూరసేన= శూరసేన దేశపు; దేశాధీశ= రాజులచేత; పరివృతుండునున్= చుట్టబడినవాడై; కుంభసంభవ పురఃసరుండును+ఐన= ద్రోణుడు ముందుగా కలవాడై; కురువిభుండునున్= దుర్యోధనుడును; ఆ ముందటన్= ఆ ముందర; అంగజనపద= అంగదేశపు; చతురంగ ప్రధాన= ముఖ్యంగా కల రథాలు, గజాలు, గుర్రాలు, కాల్బలాలు; సేనా= సేనలచేత; సముదీర్ణుండు+ఐ= ఉన్నతుడై; కర్ణుండునున్= కర్ణుడును; నిలిచిరి= మోహరించారు; వెండియున్+కలవారలు= ఇంకా తక్కిన వారు; ఎడనెడన్= అక్కడక్కడ; పన్నిరి= నిలిచారు; అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ శకటవ్యూహంలో కుడిప్రక్క జయద్రథ, భగదత్తులతో కూడినవాడై వికర్ణుడు, అతడికి సహాయంగా ఆశ్వికబలంతో శకుని, ఎడమప్రక్క కృతవర్మ, వివింశతి, చిత్రసేనులతో కూడి దుశ్శాసనుడు, అతడికి సహాయంగా ప్రక్కన కాంభోజ, శక, యవన దేశాధీశులు, నడుమ త్రిగర్త, మద్ర, శిబి, శూరసేన దేశాల రాజులు చుట్టూ ఉండగా, ద్రోణుడు ముందుండగా దుర్యోధనుడూ, ఆ ముందర అంగదేశపు చతురంగబలాలతో ఉన్నతుడైన కర్ణుడూ నిలిచారు. ఇతరులు అక్కడక్కడ నిలిచారు. ఆ సమయంలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. దర్పదుస్సహతేజు రాధాతనూజుఁ । దిలకమై సైన్యముఖమునఁ బొలుచువాని
సైనికులు సూచి కడుసంతసమున నేచి । యెలుఁగు లడరంగఁ దమలోన నిట్లు లనిరి. 129

ప్రతిపదార్థం: దర్ప= అహంకారంచేత; దుస్సహ= సహించరాని; తేజున్= తేజస్సుగల; రాధాతనూజున్= కర్ణుడిని; సైన్య= సైన్యంయొక్క; ముఖమునన్= ముఖంపై; తిలకము+ఐ= అలంకారమై; పొలుచువానిన్= ప్రకాశించేవాడిని; సైనికులు= బంట్లు; చూచి; కడున్= మిక్కిలి; సంతసమునన్= సంతోషంతో; ఏచి= చెలరేగి; ఎలుఁగులు= ధ్వనులు; అడరంగన్= అతిశయించగా; తమలోనన్= తమలో తాము; ఇట్టులు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: దర్పంవలన దుస్సహమైన తేజస్సు కలిగి, సైన్యం ముఖానికి అలంకారంగా ఒప్పే కర్ణుడిని చూచి సైనికులు సంతోషంతో ఉప్పొంగి, తమలో తాము ఇట్లా అనుకొన్నారు.

మ. 'అని రాధేయుఁడు పాండునందనుల బాహాశక్తి మాయించు; నీ
తని దేవావలియైన మార్కొనునె? దుర్దాంతుండు భీష్ముండు పో
రిన యన్నాళ్ళును బక్షపాతమున వారిం బట్టి పాలార్చెఁ గా
క నిజం బల్గ నితండు ధీరులగు టింకం జెల్లునే వారికిన్?' 130

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధంలో; రాధేయుఁడు= కర్ణుడు; పాండునందనుల= పాండవుల యొక్క; బాహాశక్తిన్= భుజబలాన్ని; మాయించున్= నశింపజేస్తాడు; ఈతనిన్= ఈ కర్ణుడిని; దేవ+ఆవలి+ఐనన్= దేవతల సమూహమైనా; మార్కొనునె?= ఎదిరిస్తుందా?; దుర్దాంతుండు= ఎవరికిని లొంగనివాడైన; భీష్ముండు= భీష్ముడు; పోరిన= యుద్ధంచేసిన; అన్నాళ్ళును= అన్ని దినాలు; పక్షపాతమునన్= పక్షపాతంవలన; వారిన్= ఆ పాండవులను; పట్టి పాలార్చెన్= ఉపేక్షించాడు; కాక= అట్లుకాక; ఇతండు= ఈ కర్ణుడు; నిజంబు+అల్గన్= నిజంగా కోపిస్తే; వారికిన్= ఆ పాండవులకు; ధీరులు+అగుట= ధైర్యవంతులు కావటం; ఇంకన్= ఇకముందు; చెల్లునే?= సాగుతుందా?

తాత్పర్యం: యుద్ధంలో కర్ణుడు పాండవుల బాహుబలాన్ని నశింపజేస్తాడు. ఈతడిని దేవతలు కూడా ఎదుర్కొనలేరు. భీష్ముడు అజేయుడయినప్పటికీ పక్షపాతంతో పాండవులను ఉపేక్షించాడు. కర్ణుడే నిజంగా కోపిస్తే పాండవులకు ధీరులన్న పేరు చెల్లుతుందా?

వ. అని యుబ్బుచుండి; రివ్విధంబున సన్నాహంబు సువిహితంబైన యనంతరంబ. 131

ప్రతిపదార్థం: అని= సైనికు లీ విధంగా పలికి; ఉబ్బుచుండిరి= సంతోషిస్తుండిరి; ఇవ్విధంబునన్= ఈ రీతిగా; సన్నాహంబు= యుద్ధ ప్రయత్నం; సువిహితంబు+ఐన= చక్కగా కుదిరిన; అనంతరంబు+అ= వెంటనే.

తాత్పర్యం: సైనికులంతా ఈ విధంగా అనుకొని ఉబ్బిపోతుండిరి. ఇట్లా యుద్ధ ప్రయత్నాలు చక్కగా జరిగిన వెంటనే.

చ. తగ మన సైన్యమున్ గురుఁ డుదగ్రగతిన్ నడపింపఁ జొచ్చుడున్,
గగనతలంబు నెత్తురులుఁ గండలు నెమ్ములు నొక్క యుమ్మడిన్
మొగిళులు లేకయుం గురిసె మొత్తములై పెనుగ్రద్దలాడె, బె
ట్టుగ వినిచెన్ శివారుతము, డుల్లెఁ గడున్ వడి నుల్క లెల్లెడన్. 132

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యుడు; మన= కౌరవుల; సైన్యమున్= సైన్యాన్ని; తగన్= తగునట్లు; ఉదగ్రగతిన్= భయంకరంగా; నడిపింపన్+చొచ్చుడున్= నడిపించటానికి పూనుకొనగా; గగనతలంబు= ఆకాశం; మొగిళులు= మేఘాలు; లేకయున్= లేకుండగనే; ఒక్క+ఉమ్మడిన్= ఒక్కసారిగా; నెత్తురులున్= రక్తములును; కండలున్= మాంసఖండములును; ఎమ్ములున్= ఎముకలును; కురిసెన్= వర్షించాయి; మొత్తములు+ఐ= గుంపులై; పెనుగ్రద్దలు= పెద్దగ్రద్దలు; ఆడెన్= తిరుగులాడినవి; బెట్టుగన్= గట్టిగా; శివా= నక్కల యొక్క; రుతము= ఊళ; వినిచెన్= వినిపించినవి; ఉల్కలు = నిప్పుకలు; ఎల్ల+ఎడన్= అంతట; కడున్= మిక్కిలి; వడిన్= వేగంగా; డుల్లెన్= రాలెను.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు తగురీతిలో భయంకరంగా మన సైన్యాన్ని నడిపించేసరికి, ఆకాశం మేఘాలు ఆవరించకుండానే మాంసఖండములూ, ఎముకలూ, నెత్తురులూ ఒక్కపెట్టున కురిసింది. పెనుగ్రద్దలు గుంపులు గుంపులుగా తిరుగులాడాయి. నక్కల ఊళలు గట్టిగా వినిపించాయి. మిక్కిలి వేగంగా ఉల్కలు అంతటా రాలాయి.

విశేషం: రక్తం, మాంసఖండములు, ఎముకలు కురియటం, ఉల్కలు రాలటం, నక్కలు కూయటం వంటి అపశకునాలు కౌరవులకు ముందు కలుగబోయే ఉపద్రవాలను సూచించేవి, భయాన్ని గొలిపేవి.

తే. **అమ్మహోత్పాతములకు భయంబు గొనక । కౌరవులు శంఖములు మ్రోయ భేరు లులియ**
నగ్గలిక సేన నడిపించి; రంత సమద । గమనమున వారి సేనయుఁ గదియ నడచె. 133

ప్రతిపదార్థం: కౌరవులు= దుర్యోధనాదులు; ఆ+మహా+ఉత్పాతములకున్= ఆ అపశకునాలకు; భయంబు+కొనక= భయపడక; శంఖములు= శంఖాలు; మ్రోయన్= ధ్వనింపగా; భేరులు= దుందుభులు; ఉలియన్= ధ్వనించగా; అగ్గలికన్= ఆధిక్యంతో - గొప్పగా; సేనన్= సైన్యాన్ని; నడిపించిరి; అంతన్= అప్పుడు; సమదగమనమునన్= గర్వంతో కూడిన నడకతో; వారి= ఆ పాండవుల యొక్క; సేనయున్= సైన్యంకూడా; కదియనడచెన్= చేరనడిచింది.

తాత్పర్యం: కౌరవులు ఆ మహోత్పాతాలకు భయపడక, శంఖాలు మ్రోయగా, దుందుభులు ధ్వనించగా, ప్రశంసాపూర్వకంగా సైన్యాలను నడిపించారు. అపుడు పాండవుల సేనలు కూడా సగర్వంగా చేర నడిచాయి.

వ. **అప్పుడు. 134**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: కౌరవ, పాండవ సేనలు సమానంగా ముందుకు నడిచినపుడు.

క. **నరుఁడును రాధేయుఁడు నొం । డొరువులతోఁ బెనఁగు వేడ్క లుల్లంబులలో**
గురువులు వాఱగ నిలిచిరి । యిరుదెఱఁగుల సైనికులకు నేడ్తెఱ మిగులన్. 135

ప్రతిపదార్థం: నరుఁడును= అర్జునుడును; రాధేయుఁడున్= కర్ణుడును; ఒండు+ఒరువులతోన్= ఒకరితో ఒకరు; పెనఁగు= యుద్ధంచేసే; వేడ్కలు= వినోదాలు; ఉల్లంబులలోన్= మనస్సులలో; గురువులు వాఱగన్= అతిశయించగా; ఇరుదెఱఁగుల= రెండు వైపుల; సైనికులకున్= సేనలోని వారికి; ఏడ్తెఱ= పరాక్రమం; మిగులన్= పెరుగగా; నిలిచిరి= నిలబడ్డారు.

తాత్పర్యం: రెండు పక్షాల సైనికులకు పరాక్రమం అతిశయించగా, కర్ణార్జునులు ఒకరితో ఒకరు యుద్ధంచేసే కొరకు ఉబలాటపడి నిలిచారు.

తే. **ఇట్టు లొండొంటిఁ గదియంగ నెలమి నడచి । బలము లొక్కింత సేపు నిశ్చలతఁ బొలిచె**
మవ్వమెసఁగు వనంబుల మావు లెంత । యైనఁ జెలువార సొగసి యున్నట్లు పోలె. 136

ప్రతిపదార్థం: ఇట్టులు= ఈ విధంగా; ఒండు+ఒంటిన్= ఒకదానితో ఒకటి; కదియంగన్= కలియబడటానికి; ఎలమిన్= వికాసంతో; నడచి= ముందుకు నడిచి; బలములు= సేనలు; మవ్వము= కోమలత్వం; ఎసఁగు= ఒప్పు; వనంబులన్= తోటలలో; మావులు= మామిళ్ళు; ఎంత ఐనన్= ఎంతగానో; చెలువారన్= అందము మీర; సొగసి ఉన్నట్లు+అ పోలెన్= ఒప్పి ఉన్న విధంగానే; ఒక్కింత సేపు= కొంతసేపు; నిశ్చలతన్= కదలకుండ; పొలిచెన్= ఒప్పాయి.

తాత్పర్యం: ఈ విధంగా రెండు వైపులగల సైన్యాలు ఒకదాన్నొకటి ఎదుర్కోటానికి వికాసంతో ముందుకు సాగినవై, చిగురు తొడిగిన మామిళ్ళు, తోటలలో అందంతో ఒప్పినట్లు తోచి, కొద్దిసేపు నిశ్చలత్వాన్ని పొందాయి.

విశేషం: అలం: ఉపమ.

క. **తదనంతరంబ ద్రోణుం । డుదితార్కునిఁ గ్రేణిసేయు నుజ్జ్వల రథ మె**
ల్ల దిశలు వెలిఁగింపఁగ బె । ట్టిదముగ మును గవిసె మొన గడిమితోఁ గదియన్. **137**

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; ఉదిత+అర్కునిన్= ఉదయించిన సూర్యుడిని; క్రేణి+చేయు= పరిహసించు; ఉజ్జ్వల రథము= మిక్కిలి వెలుగొందే రథం; ఎల్లదిశలు= దిక్కులన్నిటిని; వెలిఁగింపఁగన్= ప్రకాశించేటట్లు చేయగా; మొన= సైన్యం; కడిమితోన్= పరాక్రమంతో; కదియన్= సమీపించగా; బెట్టిదముగన్= ఉద్ధతితో; మును= మొదట; కవిసెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: ఆ తరువాత ద్రోణుడు, ఉదయించిన సూర్యుడి వంటి తన ఉజ్జ్వలమైన రథం దిక్కులన్నిటిని వెలిగించగా, సైన్యం పరాక్రమంతో దగ్గరికి చేరగా, ఉద్ధతితో మొదట శత్రుసైన్యాన్ని ఢీకొన్నాడు.

క. **మన బలము గదియు బలువిడిఁ । గనుఁగొని యర్జునుఁడు దొలుతఁ గవియఁగఁ బేరు**
బ్బునఁ దాఁకె వారి సైన్యము । వినువీథి నమర్త్య గణము వేడుకఁ జూడన్. **138**

ప్రతిపదార్థం: మన బలము= మన సైన్యం; కదియు= పైకురికే; బలువిడిన్= విధమును; కనుఁగొని= చూచి; అర్జునుఁడు; తొలుతన్= మొదట; కవియఁగన్= తాకగా; వినువీథిన్= ఆకాశమార్గంలో; అమర్త్య= దేవతల; గణము= సమూహం; వేడుకన్= వినోదంతో; చూడన్= చూడగా; పేరు+ఉబ్బునన్= మిక్కిలి ఉత్సాహంతో; వారి సైన్యము= పాండవుల సైన్యం; తాఁకెన్= ఎదుర్కొన్నది.

తాత్పర్యం: మన సైన్యం తాకే విధాన్ని తెలిసికొని అర్జునుడు తొలుత ఆక్రమించగా, ఆకాశం నుండి దేవతలు వినోదంతో చూడగా, పాండవ సైన్యం మిక్కిలి ఉత్సాహంతో మార్కొన్నది.

సీ. **రథకరి తురగోత్థ పృథివీ పరాగంబు । దెసల నాకసమున దీటుకొనఁగ,**
బాణాది హేతి సంపాత జాతములగు । మంట లర్కాంశుల మరలఁ ద్రోవ,
హస్తికపాల రథావయవములు భ । గ్నములగు రవము లుగ్రముగఁ జెలఁగ,
వివిధ సేనాం గాంగ విదళనంబునఁ గ్రమ్ము । రక్తపూరములు ఘోరంబు గాఁగఁ

తే. **గలయ బెరసిన పాండవ కౌరవ ప్ర । చండ సైన్యద్వయంబు నుద్దండ సమర**
గతులు వెక్కస మొనరించె ఖచరసాధ్య । సిద్ధులకు; ననుబోంట్లకుఁ జెప్ప నేల? **139**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: రథ= రథాల; కరి= ఏనుగుల; తురగ= గుర్రాల నుండి; ఉత్థ= లేచిన; పృథివీ= నేలయొక్క; పరాగంబు= దుమ్ము; దెసలన్= దిక్కులలో; ఆకసమునన్= ఆకాశంలో; దీటుకొనఁగన్= కమ్ముకొనగా; బాణ= బాణాలు; ఆది= మొదలైన; హేతి= ఆయుధాలు; సంపాత= పడటం వలన; జాతములు+అగు= పుట్టిన; మంటలు= జ్వాలలు; అర్క= సూర్యుడియొక్క; అంశులన్= కిరణాలను; మరలన్+త్రోవన్= వెనుకకు నెట్టగా; హస్తి= ఏనుగుల; కపాల= పుర్రెలయు; రథ= రథాలయొక్క; అవయవములు= అంగాలు; భగ్నములు+అగు= విరిగిపోయే; రవములు= చప్పుళ్ళు; క్రమముగన్= వరుసగా; చెలఁగన్= ధ్వనింపగా; వివిధ= బహువిధాలైన; సేనా+అంగ= రథ, గజ, తురగ, పదాతి సేనల యొక్క; అంగ= అవయవాలు; విదళనంబునన్= ఛేదింపబడటం వలన; క్రమ్ము= కమ్ముకొన్న; రక్త= నెత్తుటి యొక్క; పూరములు= ప్రవాహాలు; ఘోరంబు= భయంకరం; కాఁగన్= కాగా; కలయ బెరసిన= కలిసి వ్యాపించిన; పాండవ= పాండవుల; కౌరవ= కౌరవ పక్షంవారి; ప్రచండ= సహించరాని; సైన్యద్వయంబున్= రెండు సైన్యాలు; ఉద్దండ= తీవ్రమైన; సమర= యుద్ధంయొక్క; గతులు= నడకలు; ఖచర= ఆకాశంలో తిరిగే; సాధ్య= సాధ్యులు; సిద్ధులకున్= సిద్ధులనే దేవ జాతులకు; వెక్కసము= దుస్సహం; ఒనరించెన్= చేసింది; మము బోంట్లకున్= మావంటివారిని గూర్చి; చెప్పన్+ఏల?= చెప్పవలసిందేముంది?

తాత్పర్యం: రథాలు, ఏనుగులు, గుర్రాల నుండి లేచిన దుమ్మంతా దిక్కులన్నింటా, ఆకాశమంతటా వ్యాపించింది. బాణాలు మొదలైన ఆయుధాల తాకిడిచేత రేగిన మంటలు సూర్యకిరణాలను వెనుకకు నెట్టాయి. ఏనుగుల పుర్రెలు, రథాల అంగాలు విరిగిపోయే చప్పుడులు భయంకరంగా అలముకొన్నవి. చతురంగ బలాల విచ్ఛేదం వలన కమ్ముకొన్న రక్త ప్రవాహాలు భయం గొలిపినవి. ఈ విధంగా కౌరవ, పాండవ సైన్యాలు మహోగ్రంగా పోరాడుతుంటే సిద్ధ సాధ్యాది దేవ వర్గానికే సహించరానిదిగా ఉంటే మావంటివారి సంగతి చెప్పవలసింది ఏమున్నది?'

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. పాండవ, కౌరవ యోధులు మహోగ్రంగా యుద్ధం చేస్తుండగా వీరరౌద్రాలు ఉప్పొంగాయి. వీరరస విజృంభణ వలన సర్వత్రా ధూళి అలముకోవటం, ఆయుధజ్వాలలకు సూర్యకిరణాలు వెనుదిరిగిపోవటం వంటి అద్భుత దృశ్యాలు ఏర్పడ్డవి. ఏనుగుల తలలు నుగ్గు కావటం, రథావయవాలు తునాతునకలు కావటం, రక్తపుటేరులు పారటం వంటి సన్నివేశాల వలన బీభత్సం వ్యక్తమౌతున్నది. ఇందులో వీర, రౌద్రాద్భుత, బీభత్సరసాలు కన్నులకు కట్టినట్లు వర్ణించబడ్డాయి.

వ. ఇవ్విధంబునం దొడంగి చెల్లు సంకుల సమరంబునం దన కనకరథం బరుణ తురంగంబుల చటుల చిత్ర సంచారంబులం గౌఱవి ద్రిప్పిన తెఱంగున నేదిక్కు సూచినం దానయై పెక్కు రథంబులను బుద్ధి పాండవ పాంచాల యోధులకుఁ బుట్టునట్లుగా విహరించి, వివిధ విశిఖనిచయంబులు నిగిడించుచుఁ గుంభ సంభవుండు. 140

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఇట్లా; తొడంగి= పూని; చెల్లు= నడచే; సంకుల సమరంబునన్= ఘోర యుద్ధంలో; తన= తనయొక్క; కనక రథంబు= బంగారు తేరు; అరుణ తురంగంబుల= ఎర్రని గుర్రాల యొక్క; చటుల= చలించే; చిత్ర= విచిత్రమైన; సంచారంబులన్= విహరించటంవలన; కొఱవి+త్రిప్పిన= కొరవిని త్రిప్పిన; తెఱంగునన్= విధంగా; ఏ దిక్కు= ఏ వైపు; చూచినన్= చూచినా; తాను+అ+ఐ= తానేఅయి; పెక్కు రథంబులు= అనేక రథాలు; అను బుద్ధి= అనే తలపు; పాండవ= ధర్మజాదులకు; పాంచాల= పాంచాలురైన ద్రుపదాది; యోధులకున్= వీరులకు; పుట్టునట్లుగాన్= కలుగు విధంగా; విహరించి= విహారం చేసి; వివిధ= అనేకాలైన; విశిఖ= బాణాల; నిచయంబులు= సమూహాలు; నిగిడించుచున్= ప్రయోగిస్తూ; కుంభసంభవుండు= ద్రోణుడు.

తాత్పర్యం: ఈ విధంగా జరిగే రెండు పక్షాల యుద్ధంలో తన బంగారు తేరు, ఎర్రని గుర్రాలు చేసే విచిత్ర విహారాలు, కొరవి త్రిప్పినట్లు ఏ దిక్కు చూచినా తానే అయి, పాండవ, పాంచాల యోధులకు అనేక రథాలలో విహరిస్తున్నట్లు తోచి, అనేక బాణజాలాలను ప్రయోగిస్తూ ద్రోణుడు.

విశేషం: అలంకారం ఉపమ.

క. కూల్చుచు గజముల నెత్తుటఁ। దేల్చుచుఁ దురగముల వీఁకఁ దేరులు మరలన్
వెల్చుచుఁ గాల్బలములఁ బొరి। మాల్చుచు రౌద్రముగ మారిమసఁగిన భంగిన్. 141

ప్రతిపదార్థం: గజములన్= ఏనుగులను; కూల్చుచున్= సంహరిస్తూ; తురగములన్= గుర్రాలను; నెత్తుటన్= రక్తంలో; తేల్చుచున్= తేలేటట్లు చేస్తూ; వీఁకన్= బలంతో; తేరులు= రథాలు; మరలన్ వెల్చుచున్= వెనుకకు మరలిపోయేటట్లు చేస్తూ; కాల్బలములన్= పదాతి సైన్యాన్ని; పొరిమాల్చుచున్= చంపుతూ; రౌద్రముగాన్= భయంకరంగా; మారి మసఁగిన= మారి వ్యాధితో జనక్షయం జరిగిన; భంగిన్= విధంగా.

తాత్పర్యం: మహా భయంకరంగా మారి వ్యాధికి (ప్లేగువ్యాధికి) జన క్షయం జరిగినట్లు, ఏనుగులను కూలుస్తూ, గుర్రాలను నెత్తుట తేలుస్తూ, పరాక్రమంతో రథాలను వెనుకకు మరలిపోయేటట్లు చేస్తూ, పదాతి దళాన్ని చంపుతూ (ద్రోణుడు స్వైరవిహారం చేశాడు).

విశేషం: అలం: ఉపమ.

వ. సంగర క్రీడ సలుపు నయ్యవసరంబున. 142

ప్రతిపదార్థం: సంగర= యుద్ధం అనే; క్రీడ= ఆట; సలుపు= ఆడే; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ద్రోణుడు యుద్ధ క్రీడ సలిపే ఆవేళ.

క. పాయవడు రథచయంబులు। సాయక హతిఁ జెదరుఁ బ్రళయ జలధర పటు గ
ర్జాయత తర్జన లీలఁ బ। లాయిత మగు పాండుసుత బలంబు నరేంద్రా! 143

ప్రతిపదార్థం: నరేంద్రా!= ధృతరాష్ట్ర మహారాజా!; రథ= రథాల; చయంబులు= సమూహాలు; పాయవడున్= చీలిపోతాయి; పాండుసుత= పాండవుల; బలంబు= సైన్యం; సాయక= బాణాల; హతిన్= దెబ్బకు; చెదరున్= చెదరిపోయాయి; ప్రళయ= ప్రళయకాలమందలి; జలధర= మేఘాల యొక్క; పటు= గొప్పవైన; గర్జా= ఉరుములనే; ఆయత= దీర్ఘములైన; తర్జన= అదలింపుల చేతవలె; పలాయితము+అగున్= పారిపోతుంది.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! బాణాల దెబ్బకు రథ సమూహాలు చీలిపోయి, పాండవుల సైన్యం చెదరి పోయి ప్రళయకాలంలోని మేఘాల గర్జనలనే దీర్ఘమైన అదలింపులచేత వలె పలాయనం చిత్తగించింది.

విశేషం: అలం: ఉపమ - రూపకానుప్రాణితం. గర్జాయత తర్జన - రూపకం. లీలన్ - ఉపమ.

క. పొదువుచు విచ్చుచు బలువిడి। నెదురుచుఁ బాఱుచును మఱి మహీభాగము గ్ర
క్కదలం గార్ముక విద్యా। విదుఁ డగు గురుతోడఁ బోరె వివిధ బలంబుల్. 144

ప్రతిపదార్థం: వివిధ బలంబుల్= అనేక సైన్యాలు; పొదువుచున్= ఆక్రమిస్తూ; విచ్చుచున్= చీలుతూ; బలువిడిన్= బలంతో; ఎదురుచున్= ఎదుర్కొంటూ; పాఱుచును= పరుగెత్తుతూ; మఱి= మళ్ళీ; మహీభాగము= భూభాగం; గ్రక్కదలన్= మిక్కిలి కదలగా; కార్ముకవిద్యా= ధనుర్విద్యను; విదుఁడు+అగు= తెలిసిన; గురుతోడన్= ద్రోణాచార్యుడితో; పోరెన్= యుద్ధం చేశాయి.

తాత్పర్యం: పాండవుల చతురంగ బలాలు శత్రువులను ఆక్రమిస్తూ, చీలిపోతూ, బలంతో ఎదుర్కొంటూ, పరుగెత్తుతూ, భూమి అంతా చలించగా ధనుర్విద్యావిదుడైన ద్రోణాచార్యుడితో పోరాడాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్రోణుఁడు పాండవ సైన్యంబుపై రేఁగి దివ్యాస్త్రంబుల శక్తి సూపుట (సం. 7-13-1)

వ. అట్టియెడ నాచార్యుం డసమాన శౌర్యంబును, మాననీయదోస్సారంబును, దివ్యాస్త్ర ప్రభావంబును జూపినం గౌంతేయ సైన్యంబునందు. 145

ప్రతిపదార్థం: అట్టి ఎడన్= అప్పుడు; ఆచార్యుండు= ద్రోణుడు; అసమాన= సాటిలేని; శౌర్యంబును= శూరత్వాన్ని; మాననీయ= మన్నించదగిన; దోఃసారంబునున్= బాహుబలాన్ని; దివ్య= దేవతా సంబంధమైన; అస్త్ర= అస్త్రాలయొక్క; ప్రభావంబునున్= మహిమను; చూపినన్= చూపగా; కౌంతేయ= కుంతీపుత్రుల; సైన్యంబు+అందున్= సైన్యంలో.

తాత్పర్యం: అప్పుడు ద్రోణుడు సాటిలేని శూరత్వాన్ని, గౌరవించదగిన బాహుబలాన్ని, దివ్యాస్త్రాల మహిమను చూపగా పాండవ సైన్యంలో.

సీ. తఱుచుగాఁ దెగిపడ్డ ధవళ చామరములు । డిండీరముల యొప్పుఁ బుండరీక
ములు మరాళంబుల పోలుపును గరవాల । ములు మీన భంగియుఁ, దలలు శిలల
చాడ్పును, గేశముల్ శైవాలరేఖయు, । మాంసంబు పంక సమానతయును,
దాల్ప భటాశ్వమాతంగాంగ భగ్నర । థముల తిట్టలు పులినములు గాఁగఁ

తే. ధీరవరకోటి ద్రెళ్ళిన వీరతతికి । సంభ్రమము వుట్ట సంభృతోత్సాహ లీల
నుబ్బి భూతబేతాళంబు లోలలాడ । నిట్టలంబగు నెత్తురు టేఱు వఱపె. 146

ప్రతిపదార్థం: తఱుచుగాన్= ఎక్కువగా; తెగిపడ్డ= విరిగిపడ్డ; ధవళ= తెల్లని; చామరములు= చమరీ మృగపు వాలాలతో చేసిన వీవనలు; డిండీరముల= నురుగుల; ఒప్పున్= ఒప్పును; పుండరీకములు= తెల్లగొడుగులు; మరాళంబుల= హంసల; పోలుపును= విధమును; కరవాలములు= కత్తులు; మీన= చేపల; భంగియున్= రీతిని; తలలు= శిరస్సులు; శిలల= రాళ్ళ; చాడ్పును= విధమును; కేశముల్= వెంట్రుకలు; శైవాలరేఖయున్= నాచువలెను; మాంసంబు= మాంసం; పంకసమానతయును= బురదతోడి సమానత్వమును; తాల్పన్= ధరింపగా; భట= కాల్బలాల; అశ్వ= గుర్రాల; మాతంగ= ఏనుగుల; అంగ= అవయవాలయు; భగ్న= విరిగిన; రథముల= రథాల యొక్క; తిట్టలు= కుప్పలు; సైకతములు= ఇసుక తిన్నెలు; కాఁగన్= కాగా; ధీర= ధైర్యవంతులలో; వర= శ్రేష్ఠులయొక్క; కోటి= సమూహం; త్రెళ్ళిన= చచ్చిపడిన; వీర= యోధుల యొక్క; తతికిన్= సంఘానికి; సంభ్రమము= ఆశ్చర్యం; పుట్టన్= కలుగగా; సంభృత= నిండిన; ఉత్సాహ= ఉత్సాహం యొక్క; లీలన్= విలాసంతో; ఉబ్బి= సంతసించి; భూత= దయ్యములు; బేతాళంబులు= పిశాచాలు; ఓలలాడన్= తేలియాడగా; ఇట్టలంబు+అగు= అధికమైన; నెత్తురు+ఏఱు= రక్తపువాగు; పఱపెన్= ప్రవహింపచేశాడు.

తాత్పర్యం: ఏపుగా తెగిపడ్డ తెల్లని చామరాలు నురుగువలె, తెల్లని గొడుగులు హంసలవలె, కత్తులు చేపలవలె, తలలు రాళ్ళవలె, వెంట్రుకలు నాచువలె, మాంసం బురదవలె ఒప్పగా, భటుల, గుర్రాల, ఏనుగుల, రథాల అంగాల రాసులు ఇసుక తిన్నెలుకాగా, ధీరవరుల సమూహం పడిపోవుటవలన వీరులకు ఆశ్చర్యం కలుగగా, ఉత్సాహ విలాసంతో ఉబ్బి భూతబేతాళగణాలు తేలియాడేటట్లు ద్రోణుడు రక్తపుటేరును ప్రవహింపజేశాడు.

విశేషం: ఇక యుద్ధవీరాన్ని ఉద్దీపింపజేసే చామరాలు, గొడుగులు, కత్తులు మొదలైన సామగ్రి తునాతునకలైపోయి నెత్తురుటేరులో నురుగు, చేపలు, రాళ్ళు, నాచు మున్నగునవిగా మారి బీభత్సరసానికి ఉద్దీపకాలుగా మారిపోయినవి.

వ. అప్పుడు. 147

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు మహాపరాక్రమంతో విజృంభించి పాండవ సైన్యాన్ని బీభత్సం పాలు చేసిన సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. గగన మధ్యంబునకు వచ్చి ఖరకరుండు । దేఱి చూడంగ రాక యుద్దీప్తుఁ డగుచు
నెట్లు వెలుఁగొందు ద్రోణుండు నట్ల వెలుఁగు । చున్నఁ గనుఁ గొని ధర్మజుం డురవడించి. 148

ప్రతిపదార్థం: ఖరకరుండు= తీక్ష్ణమైన కిరణములు గల సూర్యుడు; గగన= ఆకాశంయొక్క; మధ్యంబునకున్= నడిమికి; వచ్చి= ఏతెంచి; తేఱిచూడంగరాక= చక్కగా చూడటానికి వీలుగాక; ఉద్దీప్తుఁడు+అగుచున్= మిక్కిలి ప్రకాశిస్తూ; ఎట్లు= ఏ విధంగా; వెలుఁగొందున్= వెలుగునో; ద్రోణుండున్= ద్రోణాచార్యుడు కూడా; అట్లు+అ= అట్లే; వెలుగుచున్నన్= ప్రకాశిస్తుండగా; కనుఁగొని= చూచి; ధర్మజుండు= ధర్మరాజు; ఉరవడించి= మిక్కిలి వేగిరపడి.

తాత్పర్యం: సూర్యుడు నట్టనడిమి ఆకాశంలోకి వచ్చి మండిపోతూ తేరి చూడరాకుండ వెలిగినట్లు, ద్రోణుడు యుద్ధరంగంలో వెలిగి పోవటం చూచి, ధర్మరాజు వేగిరపడ్డవాడై.

విశేషం: అలంకారం ఉపమ.

వ. ధనంజయ ధృష్టద్యుమ్నుల నాలోకించి యమ్మహావీరు వారించుటకు నియోగించిన. 149

ప్రతిపదార్థం: ధనంజయ= అర్జునుడిని; ధృష్టద్యుమ్నులను= పాండవ సేనానియైన ధృష్టద్యుమ్నుడిని; ఆలోకించి= చూచి; ఆ+మహావీరున్= ఆ మహాయోధుడైన ద్రోణుడిని; వారించుటకున్= అడ్డుకొనటానికి; నియోగించినన్= నియమించగా.

తాత్పర్యం: అర్జునుడిని, తమ సేనానియైన ధృష్టద్యుమ్నుడిని చూచి, ఆ మహావీరుడైన ద్రోణుడిని అడ్డగించటానికి నియమించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

శా. చంచత్తుంగ తురంగ సత్వరగతి స్ఫారీభవత్కేతనో
దంచద్దీప్తులు ప్రజ్వరిల్ల నతిసాంద్రంబై శరశ్రేణికా
సంచారంబు నితాంత ఘోరముగ నాచార్యున్ వడిం దాఁకె న
ప్పాంచాల క్షితిపాల నందనుఁడు శుంభద్వీర్యసంరంభుఁడై. 150

ప్రతిపదార్థం: ఆ+పాంచాల= ఆ పాంచాల దేశపు; క్షితిపాల= రాజుయొక్క; నందనుఁడు= కుమారుడైన ధృష్టద్యుమ్నుడు; శుంభత్= ప్రకాశించే; వీర్య= బలంతో; సంరంభుఁడు+ఐ= వేగిరపాటు కలవాడై; చంచత్= చలిస్తున్న; తుంగ= ఎత్తైన; తురంగ= గుర్రాలయొక్క; సత్వర= వేగంతోకూడిన; గతి= నడకచేత; స్ఫారీభవత్= అధికమగుచున్న; కేతన= పతాకంయొక్క; ఉదంచత్= పైకెగసే; దీప్తులు= వెలుగులు; ప్రజ్వరిల్లన్= మిక్కిలి ప్రకాశించగా; అతి సాంద్రంబు+ఐ= మిక్కిలి దట్టమైన; శర= బాణాలయొక్క; శ్రేణికా= సమూహముయొక్క; సంచారంబు= ప్రసారం; నితాంత= మిక్కిలి; ఘోరముగన్= భయంకరంగా; ఆచార్యున్= ద్రోణుడిని; వడిన్= వేగంగా; తాకెన్= తాకినాడు.

తాత్పర్యం: పాంచాల రాజపుత్రుడైన ధృష్టద్యుమ్నుడు బల సంరంభంతో, చలిస్తున్న ఉన్నతాశ్వాలయొక్క తీవ్రమైన నడకచేత కదల్చబడిన పతాకం యొక్క దీప్తులు మిక్కిలి ప్రకాశించగా, తీవ్ర బాణజాలాన్ని విరజిమ్ముతూ మహాభయంకరంగా ద్రోణాచార్యుడిని ఢీకొన్నాడు.

విశేషం: ఇందలి వర్ణన వీర రసాన్ని ఉద్దీపింపజేసేది.

వ. తదనంతరంబ. 151

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ వెంటనే.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని ఎదుర్కొన్నంతలోనే. (తరువాతి పద్యంతో అన్వయం).

క. నరుఁ డగ్గలికం దఱుముచుఁ। బురికొలిపిన గండుమిగిలి భూరిబలంబుల్
గురునిఁ బొదివె నప్పార్షతు। నరదమునకు మించి రభస మత్యుగ్రముగన్. 152

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; అగ్గలికన్= పూనికతో; తఱుముచున్= వెంబడిస్తూ; పురికొలిపినన్= ప్రోత్సహించగా; గండు మిగిలి= అధిక పౌరుషంతో; భూరిబలంబుల్= అధికమగు సైన్యాలు; ఆ+పార్షతు= ఆ ధృష్టద్యుమ్నుడి; అరదమునకున్= రథాన్ని; మించి= దాటి; రభసము= వేగం; అతి+ఉగ్రముగన్= మిక్కిలి భయం గొలుపగా; గురునిన్= ద్రోణాచార్యుడిని; పొదివెన్= ఆక్రమించాయి.

తాత్పర్యం: అర్జునుడు పూనికతో వెంబడించి ప్రోత్సహించగా భూరిసైన్యాలు ధృష్టద్యుమ్నుడి రథాన్ని దాటి, భయంకర వేగంతో మిక్కిలి ద్రోణాచార్యుడిని ఆక్రమించాయి.

క. పొదువుటయుం గనుఁగవఁ గెం। పొదవఁగ మెయి పొంగి ద్రోణుఁ డున్మదలీలం
దదనీకములఁ గలంచుచు। ముదుకం డయ్యును కుమారమూర్తిం బొలిచెన్. 153

ప్రతిపదార్థం: పొదువుటయున్= ఆక్రమించగా; కనుఁగవన్= రెండు కన్నులలో; కెంపు= ఎరుపు; ఒదవఁగన్= కలుగగా; మెయి= దేహం; పొంగి= ఉప్పొంగి; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; ఉన్మత్తుగతిన్= పిచ్చివాడివలె; తద్+అనీకములన్= ఆ పాండవుల సేనలను; కలంచుచున్= కలత పెడుతూ; ముదుకండు= ముసలివాడు; అయ్యును= అయికూడ; కుమార= కుమారస్వామియొక్క, యువకుడి యొక్క; మూర్తిన్= రూపంతో; పొలిచెన్= ఒప్పాడు.

తాత్పర్యం: అర్జునుడి సేనలు ఆక్రమించగానే, కన్నులు ఎర్రవారగా, శరీరం ఉప్పొంగిపోయి ద్రోణాచార్యుడు, పిచ్చివాడివలె అర్జున, ధృష్టద్యుమ్నుల సైన్యాలను కలత పెడుతూ ముసలివాడైనప్పటికీ కుమారస్వామివలె కనిపించాడు.

విశేషం: అలం: ఉపమ.

క. విను మప్పుడు నిజశక్తుల। కనురూపము గాఁగ నిలిచి యద్దెస వీరుల్
పెనఁగిరి రథ్యంబులు నా। తని సూతుని మేను శోణితంబునఁ దోఁగన్. 154

ప్రతిపదార్థం: వినుము= ధృతరాష్ట్రా! వినుము; అప్పుడు= ఆ వేళ; ఆ+దెస= ఆ పాండవ పక్షపు; వీరుల్= యోధులు; నిజ= తమ; శక్తులకున్= బలాలకు; అనురూపము+కాఁగన్= అనుకూలంగా; నిలిచి= నిలబడి; రథ్యంబులు= గుర్రాలు; ఆతని= ద్రోణుడి; సూతుని= సారథియొక్క; మేను= దేహం; శోణితంబునన్= రక్తంలో; తోఁగన్= తేలగా; పెనఁగిరి= పోరాడారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! వినుము. అప్పుడు పాండవ వీరులు తమ తమ శక్తులకు తగినట్లు సైన్యాలకు అండగా నిలిచి, పోరి, ద్రోణుడి సారథి శరీరాన్ని, గుర్రాలను రక్తంలో ముంచారు.

క. గురుఁ డలిగి పెలుచ నడరినఁ। గరిఘోటక భటనికాయ కాయముల సమి
ద్ధరణి వొలిచె నరుణపయో। ధరసంవృతమైన గగనతలము చెలువునన్. 155

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యుడు; అలిగి= కోపించి; పెలుచన్= తీవ్రంగా; అడరినన్= విజృంభించగా; కరి= ఏనుగుల; ఘోటక= గుర్రాల; భట= సైనికుల; నికాయ= సమూహాల; కాయములన్= దేహాలతో; అరుణ= ఎర్రని; పయోధర= మేఘాలచేత; సంవృత= కమ్ముకొనిన; గగనతలము= ఆకాశం; చెలువునన్= విధంగా సమిత్+ధరణి= యుద్ధభూమి; పొలిచెన్= ఒప్పారింది.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు కోపంతో విజృంభించగా, ఏనుగుల, గుర్రాల, భట సమూహాల రక్తంతో నిండి యుద్ధభూమి ఎర్రని మేఘాలతో కమ్ముకొన్న ఆకాశంవలె ఒప్పారింది.

విశేషం: అలం: ఉపమ.

క. అప్పుడు ధృష్టద్యుమ్నుఁడు। నిప్పు లురులు చూపు లడర నిశితాస్త్రములం
గప్పె గురునిఁ దత్సైన్యం। బొప్పఱి తన బెట్టిదంపు టురవడిఁ దెరలన్. 156

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ధృష్టద్యుమ్నుఁడు= పాండవ సేనాని అయిన ధృష్టద్యుమ్నుడు; నిప్పులు= అగ్నికణాలు; ఉరలు= రాలే; చూపులు= దృష్టులు; అడరన్= వ్యాపించగా; గురునిన్= ద్రోణాచార్యుడిని; తద్+సైన్యంబులన్= అతడి సేనలను; ఒప్పు+అఱి= ఒప్పునశించి; తెరలన్= పోగా; తన= తనయొక్క; బెట్టిదంపు= ఉద్ధతమైన; ఉరవడిన్= వేగంతో; నిశిత+అస్త్రములన్= వాడి బాణాలతో; కప్పెన్= ఆక్రమించాడు.

తాత్పర్యం: అపుడు పాండవసేనాని అయిన ధృష్టద్యుమ్నుడు, నిప్పులురాలే చూపులను సారించి, ద్రోణుడిని, అతడి సైన్యాన్ని, కలత చెందిపోయేటట్లుగా, ఉద్ధతమైన వేగంతో, వాడి బాణాలతో ఆక్రమించాడు.

క. ద్రోణుని శరములు నిలుపుచు। బాణవితతి సేనమీఁదఁ బరఁగించుచు గీ
ర్వాణనుతు లెసఁగ నతఁ డ। క్షీణోద్ధతి నట్లు సమరకేళి సలుపఁగన్. 157

ప్రతిపదార్థం: ద్రోణుని= ద్రోణాచార్యుడి; శరములు= బాణాలు; నిలుపుచున్= ఆపుతూ; బాణవితతిన్= బాణాల సమూహాన్ని; సేనమీఁదన్= సైన్యంపై; పరఁగించుచున్= ప్రసరింపజేస్తూ; గీర్వాణ= దేవతల; నుతులు= ప్రశంసలు; ఎసఁగన్= అతిశయించగా; అతఁడు= ధృష్టద్యుమ్నుడు; అక్షీణ+ఉద్ధతిన్= తరగని అహంకారంతో; అట్లు= ఆ విధంగా; సమరకేళి= యుద్ధమనే ఆట; సలుపఁగన్= ఆడగా.

తాత్పర్యం: ద్రోణాచార్యుడి బాణపరంపరను అడ్డుకొంటూ, తన బాణ సమూహాన్ని శత్రుసేనల మీద ప్రయోగిస్తూ, దేవతలు ప్రశంసించగా తరగని అహంకారంతో ధృష్టద్యుమ్నుడు యుద్ధక్రీడ సలుపగా.

క. ఏచిన రథికవరులు ధను। రాచార్యుని యిరుగెలంకులందుఁ దఱిమినం
జూచి వడి సవ్యసాచి శ। రాచిత దేహులుగఁ జేసె నందఱఁ గడిమిన్. 158

ప్రతిపదార్థం: ఏచిన= రెచ్చిపోయిన; రథికవరులు= రథాలపైగల శ్రేష్ఠులైన వీరులు; ధనురాచార్యుని= ద్రోణాచార్యుడి; ఇరు+కెలంకులందున్= రెండు వైపుల నుండి; తఱిమినన్= పరుగెత్తిరాగా; చూచి= కని; వడిన్= వేగంగా; సవ్యసాచి= అర్జునుడు; అందఱన్= రథికులనందరిని; కడిమిన్= పరాక్రమంతో; శర= బాణాలచేత; ఆచిత= కప్పబడిన; దేహులుగన్= శరీరం కలవారిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: రెచ్చిపోయిన కౌరవులవైపుగల రథిక శ్రేష్ఠులు ద్రోణాచార్యుడి రెండు ప్రక్కల నుండి ధృష్టద్యుమ్నుడిని తరుముకొనగా, ఇది చూచి, అర్జునుడు వెంటనే ఆ రథికవరులందరి దేహాలను బాణాలతో నింపివేశాడు.

వ. ద్రోణుండు పది బాణములు ద్రుపదసూనుమేనం గీలించినం దూలక యతం డతనిపై నిశిత విశిఖవర్షంబు గురిసె; నయ్యిరువుర శరనికరంబు లంబరంబు గప్పె; నట్టియెడఁ బాండవాగ్రజ పురోగములగు దొరలు గడంగి కుంభసంభవుదెసకుం దఱిమిన మన వలని ఘనయోధవరులు వారిం దలపడి; రందు శకుని సహదేవుం దాఁకి. 159

ప్రతిపదార్థం: ద్రోణుండు= ద్రోణుడు; పదిబాణములు= పది బాణాలు; ద్రుపదసూను= ద్రుపదుని పుత్రుడైన ధృష్టద్యుమ్నుని; మేనన్= శరీరంపై; కీలించినన్= నాటింపగా; తూలక= చలించక; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; అతనిపైన్= ద్రోణుడిమీద; నిశిత= వాడి అయిన; విశిఖ= బాణాలయొక్క; వర్షంబు= వాన; కురిసెన్= కురిపించినాడు; అయ్యిరువుర= ఆ ఇద్దరి యొక్క; శరనికరంబులు= బాణాల సమూహాలు; అంబరంబు= ఆకాశాన్ని; కప్పెన్= కప్పినవి; అట్టియెడన్= అప్పుడు; పాండవ+అగ్రజ= ధర్మరాజుకు; పురోగములగు దొరలు= ముందునడచు రాజులు; కడంగి= పూనుకొని; కుంభసంభవు= ద్రోణుడి; దెసకున్= వైపునకు; తఱిమినన్= తరుమగా; మనవలని= మన వైపున ఉన్న; ఘన= గొప్పవారైన; యోధవరులు= వీరశ్రేష్ఠులు; వారిన్= పాండవులను; తలపడిరి= తాకారు; అందున్= వారిలో; శకుని; సహదేవున్= సహదేవుడిని; తాఁకి= ఎదుర్కొని.

తాత్పర్యం: ద్రోణుడు పది బాణాలను ధృష్టద్యుమ్నుడిపై వేయగా, అతడు కదలక ద్రోణుడిపై తీక్ష్ణమైన బాణవర్షాన్ని కురిపించాడు. ఆ ఇద్దరి బాణ సమూహాలు ఆకాశాన్ని కమ్మివేశాయి. అట్టి సమయంలో ధర్మరాజు ముందున్న యోధులు ద్రోణుడివైపు ఉరకగా, కౌరవ వీరులు వారితో పోరాడారు. అందులో శకుని సహదేవుడిని తాకి.

మ. తురగవ్రాతము నొంచి కేతువు వెసం ద్రుంపంగ నాతండు గ్రో
ధరయం బుగ్రము గాక యుండియును గాంధారేశు వీతధ్వజున్
విరథున్ విస్ఫురితాస్త్రఘట్టితునిఁ గావింపన్ గదాభీల మూ
ర్తి రథం బుద్ధతి డిగ్గపాఱి యతఁ డుర్విం గూల్చెఁ దత్సారథిన్. 160

ప్రతిపదార్థం: తురగ= గుఱ్ఱాల; వ్రాతమున్= సమూహాన్ని; నొంచి= బాధించి; కేతువున్= ధ్వజాన్ని; వెసన్= వెంటనే; త్రుంపంగన్= విరువగా; ఆతండున్= ఆ సహదేవుడును; క్రోధరసంబు= రోషభావం; ఉగ్రము= తీవ్రం; కాక+ఉండియును= కాకుండికూడ; గాంధార+ఈశున్= గాంధారదేశపు రాజైన శకునిని; వీతధ్వజున్= పతాకం లేనివాడినిగా; విరథున్= రథంలేనివాడినిగా; విస్ఫురిత= చలించిన; అస్త్ర= బాణాలచేత; ఘట్టితునిన్= పొదువబడినవాడినిగా; కావింపన్= చేయగా; గదా= గదచేత; ఆభీల= భయంకరమైన; మూర్తి= రూపంకలవాడు; రథంబు= రథాన్ని; ఉద్ధతిన్= అహంకారంతో; డిగ్గపాఱి= క్రిందికి ఉరికి; అతఁడు= ఆ శకుని; తద్+సారథిన్= ఆ సహదేవుడి యొక్క రథం నడుపువాడిని; ఉర్విన్= నేలపై; కూల్చెన్= కూలనేశాడు.

తాత్పర్యం: (శకుని సహదేవునిపై కురికి), అతడి గుఱ్ఱాలను చంపి, పతాకాన్ని విరువగా, సహదేవుడు కోపతీవ్రత లేకయే శకునియొక్క రథాన్ని, ధ్వజాన్ని విరిచి, బాణజాలంతో అతడిని ఆక్రమించాడు. అపుడు గదచేత భీకరాకారంగల వాడైన శకుని ఉద్ధతితో రథాన్ని దిగి, పరుగెత్తి సహదేవుడి సారథిని చంపాడు.

క. సహదేవుండును గదఁ గొని । మహి కెరఁగిన యప్పు డొప్పె మనుజేశ్వర! య
మ్మహిత సుభట యుగము శిఖర । సహిత మహాశైలయుగ్మ సదృశాకృతియై. 161

ప్రతిపదార్థం: మనుజేశ్వర!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; సహదేవుండును= సహదేవుడు కూడ; గదన్+కొని= గద చేతపట్టి; మహికిన్= భూమిపైకి; ఎరఁగినయప్పుడు= దిగినప్పుడు; ఆ+మహిత= ఆ గొప్పనైన; సుభట యుగము= వీరుల జత; శిఖర= శిఖరాలతో;

సహిత= కూడిన; మహా= గొప్ప; శైల= పర్వతముల; యుగ్మ= జంటతో; సదృశ= సమానమైన; ఆకృతి+ఐ= రూపము కలదై; ఒప్పెన్= ఒప్పారింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! సహదేవుడు గద తీసికొని భూమిపైకి దిగగా, మహావీరులైన శకుని సహదేవుల జంట శిఖరాలుగల రెండు పర్వతాల జంటవలె రాణించింది.

విశేషం: అలం: ఉపమ.

క **వింశతి శరముల నేసి వి । వింశతి ననిలజుఁ డతండు వీఁకనగుచుఁ ద**
త్ప్రాంశుధనుర్దండము రెం । డంశములుగ నేసె వెడఁదయమ్మునఁ బెలుచన్. **162**

ప్రతిపదార్థం: అనిలజుఁడు= భీముడు; వివింశతిన్= వివింశతి అనేవాడిని; వింశతి= ఇరవై; శరములన్= బాణాలతో; ఏసెన్= పరాక్రమంతో వేశాడు; అతండు= ఆ వివింశతి; వీఁకన్= పరాక్రమంతో; నగుచున్= నవ్వుతూ; తత్= ఆ భీముడి యొక్క; ప్రాంశు= ఉన్నతమైన; ధనుస్+దండము= దండం వంటి ధనుస్సును; వెడఁద= పెద్ద; అమ్మునన్= బాణంతో; పెలుచన్= ఆటోపంగా; రెండు= రెండైన; అంశములుగన్= తునుకలుగా; ఏసెన్= వేశాడు.

తాత్పర్యం: భీముడు ఇరవై బాణాలను వివింశతిపై ప్రయోగించగా, అతడు ఆటోపంతో ఉన్నతమైన అతడి ధనుస్సును పెద్ద బాణంతో రెండుగా విరిచాడు.

సీ. **మన బల మార్చినఁ గినిసి భీముఁడు గద । నతని యశ్వంబుల నవనిఁ గూల్చె;**
భూరిశ్రవుఁడు పొలుపారి ధృష్టద్యుమ్నుఁ । గప్పె నస్త్రములఁ; శిఖండి యేచి
యాతని నిలు నిలుమని తాఁకి శరవృష్టిఁ । బొదివెఁ; బిశాచముల్ పూనుతేరు
లెక్కి కప్పారెడు నెలువు చర్మపుఁ గత్త । ళములతో ఖరనిస్స్వనములు సెలఁగ

తే. **నసుర వల్లభు లగు నలంబుస ఘటోత్క । చులు సముద్ధతిఁ దొడరి మాయలు వొనర్చి**
పేర్చి యొండొరు నొంచుచుఁ బెనఁగి పెనఁగి । తెల్లముగఁ జూడఁ జూడ నదృశ్యు లైరి. **163**

ప్రతిపదార్థం: మన= మనయొక్క; బలము= కౌరవసైన్యం; ఆర్చినన్= బొబ్బలు పెట్టగా; భీముడు; కినిసి= కోపించి; గదన్= గదచేత; అతని= ఆ వివింశతి; అశ్వంబులన్= గుర్రాలను; అవనిన్= నేలపై; కూల్చెన్= పడవేశాడు; భూరిశ్రవుఁడు; పొలుపారి= ఒప్పారి; అస్త్రములన్= బాణాలచేత; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; కప్పెన్= ముంచాడు; శిఖండి; ఏచి= చెలరేగి; ఆతనిన్= భూరిశ్రవుడిని; నిలునిలుము+అని= ఆగు మాగు మని; తాఁకి= ఎదుర్కొని; శరవృష్టిన్= బాణాల వర్షంచేత; పొదివెన్= ఆక్రమించాడు; పిశాచముల్= పిశాచాలు; పూను= కట్టిన; తేరులు= రథాలు; ఎక్కి; కప్పు+ఆరెడు= నల్లని; ఎలువు= ఎలుగుగొడ్డు; చర్మపున్= తోలుతో చేసిన; కత్తళముతోన్= కవచంతో; ఖర= గాడిదల యొక్క; నిస్స్వనములు= ఓండ్రలు; చెలఁగన్= రేగగా; అసుర వల్లభులు+అగు= రాక్షస రాజులగు; అలంబుస= అలంబుసుడు; ఘటోత్కచులు= ఘటోత్కచుడు; సముద్ధతిన్= అహంకారంతో; తొడరి= పూని; మాయలు+ఒనర్చి= మాయాజాలం పన్ని; పేర్చి= విజృంభించి; ఒండొరున్= ఒకరినొకరు; నొంచుచున్= బాధిస్తూ; పెనఁగిపెనఁగి= మిక్కిలి పోరి; తెల్లముగన్= విశదంగా; చూడన్+చూడన్= చూస్తుండగా; అదృశ్యులు+ఐరి= కనిపించకుండా పోయారు.

తాత్పర్యం: మన సైన్యం సంతోషంతో కేకలు పెట్టగా భీముడు కోపించి వివింశతి రథాశ్వాలను నేలగూల్చాడు. భూరిశ్రవుడు అస్త్రజాలంతో ధృష్టద్యుమ్నుడిని కప్పాడు. అప్పుడు శిఖండి చెలరేగి భూరిశ్రవుడిని బాణాలతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆక్రమించాడు. అలంబుసుడు, ఘటోత్కచుడు పిశాచాలు పూన్చిన రథాలెక్కి, నల్లని ఎలుగుబంటి చర్మంతో చేసిన కవచాలు ధరించి, గాడిదలు ఓండ్రపెడుతుండగా, అహంకారంతో మాయాజాలం పన్ని, విజృంభించి, ఒకరినొకరు అణుస్తూ, మిక్కిలిగా పోరి, అందరు చూస్తుండగా అదృశ్యులయ్యారు.

వ. అయ్యవసరంబున. 164

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= అప్పుడు.

తాత్పర్యం: ఆ యుద్ధం జరిగేటపుడు.

సీ. క్షత్రదేవుండు లక్ష్మణుతోడ సమరంబు । సేసె నుగ్రంబుగఁ; జేకితానుఁ
డనువిందుఁ దలపడి యద్భుతగతిఁ బోరె; । శల్యుండు నవ్వుచు శరచయమున
నకులు నొంచినఁ గేతనము నాతపత్రంబు । వెసఁ ద్రుంచి యాతని విరథుఁ జేసి
శంఖంబు పూరించె శారద్వతుని మీఁద । ధృష్టకేతుఁడు సప్తతీవ్ర దీప్త

తే. విశిఖములు నింప నతఁ డస్త్రవృష్టి పెల్లు । గురిసె; సాత్యకి కృతవర్మ యురము నార
సముల నొప్పించి డెబ్బది సాయకంబు । లేయ డెబ్బదియేడమ్ము లేసె నతఁడు. 165

ప్రతిపదార్థం: క్షత్రదేవుండు= క్షత్రదేవుడనేవాడు; లక్ష్మణు తోడన్= దుర్యోధనుడి కొడుకైన లక్ష్మణుడితో; ఉగ్రంబుగన్= భయంకరంగా; సమరంబు= యుద్ధం; చేసెన్= చేశాడు; చేకితానుఁడు; అనువిందున్= అనువిందుడిని; తలపడి= ఎదుర్కొని; అద్భుతగతిన్= ఆశ్చర్యం కొలిపేటట్లు; పోరెన్= యుద్ధం చేశాడు; శల్యుండు; నవ్వుచున్= నవ్వుతూ; శరచయంబులన్= బాణ సమూహాలచేత; నకులున్= నకులుడిని; నొంచినన్= బాధించగా; కేతనము= పతాకం; ఆతపత్రంబు= గొడుగు; వెసన్= వెంటనే; త్రుంచి= విరిచి; అతనిన్= శల్యుడిని; విరథున్= రథంలేనివాడినిగా; చేసి; శంఖంబు= శంఖం; పూరించెన్= ఊదాడు; శారద్వతునిమీఁదన్= కృపాచార్యుడిమీద; ధృష్టకేతుఁడు; సప్త= ఏడు; తీవ్ర= తీక్ష్ణమైన; దీప్త= మండే; విశిఖములు= బాణాలు; నింపన్= నిండించగా; అతఁడు= ఆ కృపాచార్యుడు; అస్త్రవృష్టి= బాణాల వర్షం; పెల్లు= ఎక్కువగా; కురిసెన్= కురిపించాడు; సాత్యకి= కృష్ణుడి తమ్ముడైన సాత్యకి; కృతవర్మ= కృతవర్మ యొక్క; ఉరమున్= వక్షస్సును; నారసములన్= బాణాలతో; నొప్పించి= బాధించి; డెబ్బది; సాయకంబులు= బాణాలు; ఏయన్= వేయగా; అతఁడు= కృతవర్మ; డెబ్బదియేడు; అమ్ములు= బాణాలు; ఏసెన్= వేశాడు.

తాత్పర్యం: క్షత్రదేవుడు దుర్యోధనుడి పుత్రుడైన లక్ష్మణుడితో యుద్ధం చేశాడు. చేకితానుడు అనువిందుడితో ఆశ్చర్యం గొలిపేటట్లు పోరాడాడు. శల్యుడు నవ్వుతూ బాణాలతో నకులుడిని క్రుంగదీయగా, అతడు శల్యుడి పతాకాన్ని, గొడుగును వెంటనే విరిచి, రథంలేని వాడిగా చేసి శంఖాన్ని పూరించాడు. ధృష్టకేతువు కృపాచార్యుడిపై ఏడు తీవ్రమైన బాణాలు వేయగా అతడు గొప్ప బాణవర్షాన్ని కురిపించాడు. సాత్యకి కృతవర్మ రొమ్మును బాణాలతో నొప్పించి డెబ్బది బాణాలను వేయగా, కృతవర్మ సాత్యకిపై డెబ్బైయేడు అమ్ములు వేశాడు.

క. సేనాపతి యగు ద్రుపద । క్ష్మానాథతనూభవుఁడు సుశర్మునిమర్మ
స్థానంబు నొంచె నాతఁ డ । దీనుండై యతని జత్రుదేశం బేసెన్. 166

ప్రతిపదార్థం: సేనాపతి అగు= సేనాధిపతి అయిన; ద్రుపద క్ష్మానాథ= ద్రుపదరాజు యొక్క; తనూభవుఁడు= కొడుకైనధృష్టద్యుమ్నుడు; సుశర్ముని మర్మస్థానంబున్= సుశర్మ యొక్క ఆయువుపట్లను; నొంచెన్= బాధించాడు; అతఁడు= ఆ సుశర్మ; అదీనుండు+ఐ= ధైర్యవంతుడై; అతని= ఆ ధృష్టద్యుమ్నుడి యొక్క; జత్రుదేశంబు= మూపులయొక్క సంధి ఎముకలుగల చోట; ఏసెన్= కొట్టాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పాండవ సేనాని అయిన ధృష్టద్యుమ్నుడు త్రిగర్తాధిపతి అయిన సుశర్మ యొక్క మర్మస్థానాలను నొప్పించాడు. అతడు ధైర్యవంతుడై ధృష్టద్యుమ్నుడి మూపుల సంధి ఎముకలుగల చోట నొప్పించాడు.

చ. **బలమును దాను మత్స్యనరపాలుఁడు కర్ణునిఁ దాఁకి రెండు సే**
నలు వినుతింప నుద్భటరణం బొనరించినఁ గంటిక్రేవఁ గెం
పొలయఁగ నీతనూభవుల కుబ్బుగఁ దద్రథదంతి ఘోటకం
బుల నుఱుమాడె నా రథికపుంగవుఁ డంబరచారు లార్వఁగన్. **167**

ప్రతిపదార్థం: మత్స్యనరపాలుఁడు= విరాటరాజు; తాను= తానున్నూ, బలమును= తన సైన్యం; కర్ణునిన్+తాఁకి= కర్ణునిఎదుర్కొని; రెండు సేనలు= కౌరవ పాండవ సేనలు; వినుతింపన్= ప్రశంసించగా; ఉద్భటరణంబు= తీవ్రమైన యుద్ధం; ఒనరించినన్= చేయగా; ఆ రథిక పుంగవుఁడు= ఉత్తమ రథికుడైన కర్ణుడు; అంబరచారులు= ఆకాశంలో విహరించే దేవతలు; ఆర్వఁగన్= మెచ్చుకోలుగా అరవగా; కంటిక్రేవన్= కంటికొనలందు; కెంపు+ఒలయఁగన్= ఎరుపెక్కగా; నీతనూభవులకున్= నీ కుమారులైన దుర్యోధనాదులకు; ఉబ్బుగన్= సంతోషం కలుగగా; తద్= ఆ విరాటరాజు యొక్క; రథ= రథాలను; దంతి= ఏనుగులను; ఘోటకంబులన్= గుర్రాలను; నుఱుమాడెన్= చంపాడు.

తాత్పర్యం: విరాటరాజు తాను, తన సైన్యం కర్ణుడిని ఎదుర్కొని కౌరవ పాండవ సేనలు ప్రశంసించగా తీవ్రమైన యుద్ధం చేశాడు. అపుడు రథిక శ్రేష్ఠుడైన కర్ణుడు దేవతలు ప్రశంసిస్తుండగా, క్రోధమూర్తి అయి నీ కుమారులైన దుర్యోధనాదులకు సంతోషం కలిగేటట్లు ఆ విరాటరాజుయొక్క చతురంగ బలాలను సంహరించాడు.

క. **వేడుకమైఁ దలపడి పో । రాడిరి ద్రుపదభగదత్తు లస్త్రబలము శౌ**
ర్యాడంబరమును నెలుఁగులుఁ । జూడను వినఁ జిత్రములుగ శుంభద్భంగిన్. **168**

ప్రతిపదార్థం: ద్రుపద భగదత్తులు= ద్రుపదుడు, భగదత్తుడు; అస్త్రబలము= అస్త్ర సామర్థ్యం; శౌర్య= శౌర్యము యొక్క; ఆడంబరమునున్= ఆటోపాన్ని; ఎలుఁగులున్= బొబ్బలు; చూడను= చూడటానికి; వినన్= వినుటకు; చిత్రములుగన్= విచిత్రంకాగా; శుంభత్+భంగిన్= వెలుగొందుతూ; వేడుకమైన్= వినోదంగా; తలపడి= ఎదిరించి; పోరాడిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: ద్రుపదుడు, భగదత్తుడు తమ అస్త్ర సామర్థ్యం, శౌర్యాడంబరం, వీరనాదాలు చూడటానికి, వినటానికి విచిత్రంగా తోచగా వెలుగొందుతూ, వినోదంగా ఒకరినొకరు ఎదుర్కొని యుద్ధం చేశారు.

సీ. **పౌరవుం డభిమన్యు బలువిడిఁ దాఁకి బా । ణాసారమున ముంప నతఁడు గినిసి**
యతని ధనుఃకేతనాతపత్రంబులు । ద్రుంచి యేనింటఁ దత్తురగములను
సారథి నొప్పించి శరము లేడిట స్రుక్కఁ । జేసి దర్పంబున శిరముఁ ద్రుంచు
టకు భల్లమరిఁ బోయుటయుఁ గృతవర్మ రెం । డమ్ముల విల్లు నయ్యమ్ముఁ దునిమెఁ

తే. **బలకయును వాలుఁ గొని నరుపట్టి గవిసి । పౌరవుని రథ్యముల నేలపాలు సేసి**
యుఱికి సూతుని బడఁదన్ని యురగ విభునిఁ । బట్టు గరుడుని క్రియఁ దల వట్టికొనియె. **169**

ప్రతిపదార్థం: పౌరవుండు= పౌరవుడు; అభిమన్యున్= అభిమన్యుడిని; బలువు+ఇడిన్= బలంతో; తాఁకి= మార్కొని; బాణాసారమునన్= బాణాల వర్షంలో; ముంపన్= ముంచగా; అతఁడు= అభిమన్యుడు; కినిసి= కోపించి; అతని= పౌరవుడి యొక్క;

ధనుః= ధ నుస్సు; కేతన= పతాకం; ఆతపత్రంబులు= గొడుగులు; త్రుంచి= విరిచి; ఏనింటన్= ఐదు బాణాలతో; తద్= ఆ పౌరవుడి యొక్క; తురగములను= గుర్రాలను; సారథిన్= సారథిని; నొప్పించి= బాధించి; శరములు= బాణాలు; ఏడింటన్= ఏడింటితో; స్రుక్కన్= బాధపడేటట్లు; చేసి; దర్పంబునన్= గర్వంతో; శిరము= తల; త్రుంచుటకున్= ఖండించటానికి; భల్లము+అరిబోయుటయున్= బాణం ఎక్కుపెట్టగా; కృతవర్మ; రెండు+అమ్ములన్= రెండు బాణాలతో; విల్లును= ధనుస్సును; ఆ+అమ్మున్= ఆ బాణాన్ని; తునిమెన్= త్రుంచాడు; పలకయును= డాలును; వాలున్= కత్తిని; కొని= గ్రహించి; నరుపట్టి= అభిమన్యుడు; కవిసి= విజృంభించి; పౌరవుని= పౌరవుడి; రథ్యములన్= గుర్రాలను; నేలపాలు చేసి= కూల్చి; ఉరికి= పైకురికి; సూతునిన్= సారథిని; పడన్+తన్ని= పడిపోయేటట్లు తన్ని; ఉరగవిభునిన్= సర్పరాజును; పట్టు= పట్టుకొనే; గరుడుని= గరుత్మంతుడి; క్రియన్= వలె; తల+పట్టికొనియెన్= తలను పట్టుకొన్నాడు.

తాత్పర్యం: పౌరవుడు అభిమన్యుడిని బలంతో తాకి బాణవర్షంలో ముంచగా, అతడు కోపించి, పౌరవుడి పతాకాన్ని, గొడుగులను, ధనుస్సును త్రుంచి, ఐదు బాణాలతో సారథిని, గుర్రాలను నొప్పించి, ఏడు బాణాలతో బాధించి, గర్వంతో శిరస్సు ఖండించటానికి ధనుస్సు ఎక్కువెట్టగా; కృతవర్మ రెండు బాణాలతో అభిమన్యుడి ధనుర్బాణాలను విరుగ గొట్టాడు. డాలు, కత్తి తీసికొని అభిమన్యుడు విజృంభించి, పౌరవుడి గుర్రాలను కూల్చి, పైకురికి సూతుడిని పడదన్ని, సర్పరాజును పట్టుకొనే గరుత్మంతుడివలె అతడి తలపట్టుకొన్నాడు.

వ. ఆలోన సైంధవుండు సంభ్రమంబున శాతకృపాణ చర్మంబులు గొని, రథంబు డిగ్గనుఱికి, రయంబున నెయిది యదల్చినం గని, జనకద్వేషియగు నతని వలని రోషం బగ్గలింప నా పురందరపౌత్రుండు పౌరవుని విడిచి, యద్దెసకు లంఘించి కవిసె నప్పుడు. 170

ప్రతిపదార్థం: ఆలోనన్= అంతలో; సైంధవుండు= సింధుదేశపు రాజైన జయద్రథుడు; సంభ్రమంబునన్= వేగిరపాటుతో; శాత= తీక్ష్ణమైన; కృపాణ= బాణాలను; చర్మంబులు= డాలులు; కొని= తీసికొని; రథంబున్= రథాన్ని; డిగ్గన్+ఉఱికి= దిగి ఉరికి; రయంబునన్= వేగంగా; ఎయిది= వెంబడించి; అదల్చినన్= గద్దించగా; కని= చూచి; జనక= తండ్రులైన పాండవులకు; ద్వేషి+అగు= శత్రువైన; అతని వలని= అతడిమీద; రోషంబు= కోపం; అగ్గలింపన్= ఎక్కువ కాగా; ఆ పురందర పౌత్రుండు= ఇంద్రుడి మనుమడైన అభిమన్యుడు; పౌరవునిన్= పౌరవుడిని; విడిచి= వదలి; ఆ+దెసకున్= జయద్రథుడివైపు; లంఘించి= దూకి; కవిసెన్= ఎదుర్కొన్నాడు; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ లోపుగా జయద్రథుడు వేగిరపాటుతో తీక్ష్ణమైన కత్తిని, డాలును తీసికొని, రథం దిగి ఉరికి, వెన్నంటి గద్దించాడు. అది చూచి అభిమన్యుడు తన తండ్రులకు శత్రువైన జయద్రథుడిమీద కోపం ఎక్కువకాగా, పౌరవుడిని విడిచి, ఆవైపు దూకి ఆక్రమించాడు. అప్పుడు.

తే. వికట విస్ఫుర దసి చర్మ వివిధ చిత్ర । గతులు చూపఱ యెడఁద కద్భుతమొనర్ప
నార్జునియు సింధురాజుఁ బక్షాభిరామ । సింహ శార్దూలగతి విలసిల్లి రధిప! 171

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; వికట= కుటిలమైన; విస్ఫురత్= ప్రకాశిస్తున్న; అసి= కత్తుల; చర్మ= డాలులయొక్క; వివిధ= అనేకాలైన; చిత్రగతులు= విచిత్రమైన పోకడలు; చూపఱ= చూచేవారి; ఎడఁదకున్= మనస్సుకు; అద్భుతము+ఒనర్పన్= ఆశ్చర్యం గొలుపగా; ఆర్జునియున్= అభిమన్యుడూ; సింధురాజున్= జయద్రథుడూ; పక్ష= కౌరవపాండవ పక్షాలకు; అభిరామ= మనోజ్ఞమైన; సింహ= సింహం; శార్దూలం= పెద్దపులి; గతిన్= వలె; విలసిల్లిరి= ఒప్పారారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అభిమన్యు, జయద్రథుల కుటిలమైన, ప్రకాశిస్తున్న కత్తుల, డాళ్ళ అనేక చిత్రవిచిత్రగతులు చూచేవారికి ఆశ్చర్యం గొలుపగా, కౌరవ పాండవ పక్షాలకు వారు సింహం వలె, పులివలె మనోజ్ఞంగా ప్రకాశించారు.

వ. అట్టియెడ. 172

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= అప్పుడు.

తాత్పర్యం: అభిమన్యు జయద్రథులు యుద్ధం చేసే ఆ సమయంలో.

క. అతిముతి వ్రేసినఁ బలకం । గఱచిన సైంధవుని యలుఁగు గని నరసుతుఁ డే
డ్తెఱ ముఱిసిన నది రూపఱి । విఱుగుటయును వెస నతండు వెనుకకు విఱిగెన్. 173

ప్రతిపదార్థం: అతిముఱి= సంభ్రమంతో; వ్రేసినన్= కొట్టగా; పలకన్= డాలును; కఱచినన్= గ్రుచ్చుకోగా; సైంధవుని= జయద్రథుడి; అలుఁగు= ఖడ్గము; కని= చూచి; నరసుతుఁడు= అభిమన్యుడు; ఏడ్తెఱన్= పరాక్రమంతో; ముఱిసినన్= గర్వించగా; అది= ఆ డాలు; రూపు+అఱి= పాడై; విఱుగుటయును= విరిగిపోగా; వెసన్= వెంటనే; అతండు= ఆ జయద్రథుడు; వెనుకకున్= వెనుకకు; విఱిగెన్= పారిపోయాడు.

తాత్పర్యం: సైంధవుడు సంభ్రమంతో ఖడ్గాన్ని విసరగా అది అభిమన్యుని డాలుకు గ్రుచ్చుకొనివిరిగింది. ఆ విరిగిన ఖడ్గాన్ని చూచి అభిమన్యుడు పరాక్రమంతో గర్వించాడు. ఆ ఖడ్గము పాడై విరుగగా జయద్రథుడు వేగంగా వెనుకకు పారిపోయాడు.

క. విఱిగినచో నిలువక వెఱ । నుఱికెం దన రథము మీఁది 'కోడితి పో పో
పిఱికి' యని పలికి నుఱుముగ । నఱికెం దత్సేనఁ బార్థనందనుఁడు వడిన్. 174

ప్రతిపదార్థం: విఱిగిన చోన్= పారిపోయిన చోట; నిలువక= నిలబడక; వెఱన్= భయంతో; తన= తన యొక్క; రథము మీఁదికిన్= తేరుపైకి; ఉఱికెన్= ఉరికాడు; ఓడితి= ఓడిపోయావు; పోపో= వెళ్ళు, వెళ్ళు; పిఱికి!= పిరికివాడా!; అని పలికి= అని చెప్పి; పార్థనందనుఁడు= అభిమన్యుడు; తద్+సేనన్= జయద్రథుడి సైన్యాన్ని; వడిన్= వేగంగా; నుఱుముగన్= ముక్కలు ముక్కలుగా; నఱికెన్= ఖండించాడు.

తాత్పర్యం: డాలు విరిగిపోగా జయద్రథుడు అట నిలువక భయంతో తన రథంపైకి ఉరికాడు. అప్పుడు అభిమన్యుడు 'ఓరి పిరికిపంద! నీవు ఓడిపోయావు. పోపో!' అని జయద్రథుడితో పలికి, వాడి సైన్యాన్ని ముక్కలు ముక్కలుగా ఖండించాడు.

క. తెరలిన సైంధవుఁ గని నృప । వరులు పలువు రొక్కపెట్ట వాసవిసుతుపై
నురవడిఁ దఱిమిరి; మద్రే । శ్వరుఁడు గదిసి దీప్తశక్తి వైచెం బెలుచన్. 175

ప్రతిపదార్థం: తెరలిన= పారిపోయిన; సైంధవున్= జయద్రథుడిని; కని= చూచి; నృపవరులు= రాజశ్రేష్ఠులు; పలువురు= అనేకులు; ఒక్కపెట్టన్= ఒకేసారి; వాసవిసుతుపైన్= అభిమన్యుడి మీదికి; ఉరవడిన్= అతివేగంగా; తఱిమిరి= ఉరికిరి; మద్రేశ్వరుఁడు= శల్యుడు; కదిసి= మార్కొని; పెలుచన్= ఆగ్రహంతో; దీప్తశక్తిన్= మండుచున్నట్టి శక్తి అనే ఆయుధాన్ని; వైచెన్= వేశాడు.

తాత్పర్యం: పారిపోతున్న సైంధవుడిని చూచి కౌరవపక్షంలోని రాజులు అనేకులు ఒకేసారి అభిమన్యుడి పైకి అతివేగంగా ఉరికారు. శల్యుడు కూడ ఎదురొడ్డి, కోపంతో వెలుగులు చిమ్మే శక్తి అనే ఆయుధాన్ని అతడిపై విసిరాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఉరగాంగన నలిఁ బట్టెడు । గరుడుని క్రియ శక్తి వట్టి క్రమ్మఱ వైచెన్
నరసుతుఁడు శల్యసూతునిఁ । బొరివోవఁగ నార్చెఁ బాండుపుత్రబలంబుల్. 176

ప్రతిపదార్థం: ఉరగ+అంగనన్= ఆడపామును; నలిన్+పట్టెడు= లాఘవంతో పట్టుకొను; గరుడుని క్రియన్= గరుత్మంతుడి వలె; శక్తి+పట్టి= శక్త్యాయుధాన్ని పట్టుకొని; క్రమ్మఱన్= తిరిగి; నరసుతుఁడు= అభిమన్యుడు; శల్యసూతునిన్= శల్యుడి సారథిని; పొరి+పోవఁగన్= చచ్చునట్లు; వైచెన్= వేశాడు; పాండుపుత్ర బలంబుల్= పాండవుల సైన్యాలు; ఆర్చెన్= వీరనాదాలు చేశాయి.

తాత్పర్యం: ఆడపామును లాఘవంతో పట్టుకొనే గరుత్మంతుడివలె అభిమన్యుడు ఆ శక్త్యాయుధాన్నే పట్టుకొని శల్యుడి సారథిని చచ్చేటట్టు కొట్టాడు. పాండవ సైన్యాలు వీరనాదాలు చేశాయి.

వ. అయ్యవసరంబున విరాటుండును ద్రుపదుండును ధృష్టకేతుండును యుధిష్ఠిరుండును సాత్యకియును గేకయపతులును భీమసేనుండును ధృష్టద్యుమ్నుండును శిఖండియుం గవలును ద్రౌపదేయులును సౌభద్రుం బొగడు నెలుంగులు సింహనాదంబులు నింగి ముట్ట నతనికి నుల్లాసంబును నీ కొడుకులకు రోసంబును జనియింప, నతనిం బరివేష్టించిన నవ్విజయంబు సైరింపక కూడుకొని నీ కొడుకు లతనిపైఁ బటు శరంబులు గురియ, నక్కుమారసంతతికి సంతసంబుగా శల్యుండు గద గొని యభిమన్యున కభిముఖుండై కవిసె' ననిన విని ధృతరాష్ట్రుండు సంజయున కి ట్లనియె. 177

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= అప్పుడు; విరాటుండును= విరాటరాజు; ద్రుపదుండును= ద్రుపదుడును; ధృష్టకేతుండును= ధృష్టకేతుడును; యుధిష్ఠిరుండును= ధర్మరాజును; సాత్యకియును; కేకయపతులును= కేకయదేశరాజులును; భీమసేనుండును= భీముడును; ధృష్టద్యుమ్నుండును= ధృష్టద్యుమ్నుడును; శిఖండియున్= శిఖండియును; కవలును= నకుల సహదేవులును; ద్రౌపదేయులును= ద్రౌపదీ పుత్రులైన ప్రతివింధ్యాదులును; సౌభద్రున్= అభిమన్యుడిని; పొగడు= ప్రశంసించే; ఎలుంగులు= బొబ్బలు; సింహనాదంబులు= ఉత్సాహనాదాలు; నింగిముట్టన్= ఆకాశాన్ని తాకగా, అతనికిన్= ఆ అభిమన్యుడికి; ఉల్లాసంబును= ఉత్సాహం; నీ= నీయొక్క; కొడుకులకున్= పుత్రులకు; రోసమును= కోపము; జనియింపన్= కలుగగా; అతనిన్= అభిమన్యుడిని; పరివేష్టించినన్= చుట్టుముట్టగా; తద్+విజయంబు= ఆ విజయాన్ని; సైరింపక= ఓర్వక; కూడుకొని= కలిసికొని; నీ కొడుకులు= కౌరవులు; అతనిపైన్= అభిమన్యుడిమీద; పటుశరంబులు= బలమైన బాణాలు; కురియన్= కురిపించగా; ఆ+కుమారసంతతికిన్= ఆ నీ కొడుకులకు; సంతసంబుగాన్= సంతోషం కలిగేటట్లు; శల్యుండు= శల్యుడు; గద+కొని= గద తీసికొని; అభిమన్యునకున్= అభిమన్యుడికి; అభిముఖుండు+ఐ= ఎదురునిలిచి; కవిసెన్= మార్కొన్నాడు; అనినన్ విని= అనగా విని; ధృతరాష్ట్రుండు;= సంజయునకున్= సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అప్పుడు పాండవులు, వారివైపుగల విరాట ద్రుపదాదియోధులు అభిమన్యుడిని ప్రశంసించగా, ఆ నినాదాలు ఆకాశాన్నంటి అతడికి ఉల్లాసాన్ని, నీ కొడుకులకు రోషాన్ని కలిగించాయి. అటువంటి గెలుపును సహించక, నీ పుత్రులు అతడిపై తీవ్రబాణాలు ప్రసరింపజేయగా, వారికి సంతోషం కలిగేటట్లు శల్యుడు గద తీసికొని, అభిమన్యుడిని ఎదుర్కొన్నాడు- అనగా, విని ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

తే. ఎక్కటెక్కటి పెనఁగిన నింతవట్టు । పెనఁకువలు నిట్టు లేచునే? పృథివి నింక
జనము లీ కురుపాండవ సంగరంబు । సెప్పికొండ్రు మనంబు లచ్చెరువు నొంద.' 178

ప్రతిపదార్థం: ఎక్కటి+ఎక్కటి= ఒక్కొక్కరు; పెనఁగినన్= యుద్ధం చేస్తే; ఇంతవట్టు= ఇంతమాత్రం; పెనఁకువలు= కలహాలు; ఇట్టు= ఈ విధంగా; ఏచునే?= విజృంభిస్తాయా?; పృథివిన్+ఇంకన్= భూలోకంలో ఇకముందు; జనములు= ప్రజలు; మనంబులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనస్సులు; అచ్చెరువున్+ఒందన్= ఆశ్చర్యపడగా; ఈ కురు= ఈ కౌరవుల; పాండవ= పాండవుల; సంగరంబు= యుద్ధం; చెప్పికొంద్రు= చెప్పుకొంటారు.

తాత్పర్యం: ఒకరితోఒకరు యుద్ధం చేస్తే ఇంతింత పెనగులాటలు ఎక్కడైనా విజృంభిస్తాయా! భూలోకంలో అందరు ఆశ్చర్యంతో ఈ కురుపాండవ సంగ్రామాన్ని గూర్చి ఇక ముందు ఎంతగానో చెప్పుకొంటారు!

క. అని సొంపు వినియు 'నాకుం । దనివి సనదు శల్యపార్థతనయుల సమరం
బున తెఱఁగు సెప్పు మేర్పడ' । ననవుడు సూతసుతుఁ డిట్టు లనుఁ బతితోడన్. 179

ప్రతిపదార్థం: అని= యుద్ధం యొక్క; సొంపు= సమృద్ధి; వినియున్= విన్నా; నాకున్= నాకు; తనివి+చనదు= తృప్తి తీరదు; శల్య= శల్యుడి; పార్థతనయుల= అభిమన్యుడి యొక్క; సమరంబున= యుద్ధం యొక్క; తెఱఁగు= విధం; ఏర్పడన్= వివరంగా; చెప్పుము= తెలియజేయుము; అనవుడున్= అనగా; పతితోడన్= ధృతరాష్ట్రుడితో; సూతసుతుఁడు= సంజయుడు; ఇట్టులు+అనున్= ఈ విధంగా అంటాడు.

తాత్పర్యం: యుద్ధాన్నిగూర్చి ఎంత విన్నా తనివి తీరటం లేదు. శల్యాభిమన్యుల యుద్ధాన్ని వివరించుమనగా ధృతరాష్ట్రుడితో సంజయుడు ఈ విధంగా అన్నాడు.

భీమసేన శల్యుల గదా యుద్ధము (సం. 7-14-4)

ఉ. అమ్మెయి సూతుఁ డీల్గుటయు నగ్గలికం గద పుచ్చుకొంచు రౌ
ద్రమ్మున వచ్చు శల్యుఁ గని తానును జండ గదా విలాస నో
గ్రమ్ముగ లీల మార్కొనియె రమ్మిట రమ్మనుచున్ సమస్త సై
న్యమ్ములుఁ బిచ్చలింపఁగ సురాధిప పౌత్రుఁడు దీప్త గాత్రుఁడై. 180

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ విధంగా; సూతుఁడు= సారథి; ఈల్గుటయున్= చనిపోగా; అగ్గలికన్= శౌర్యంతో; గద= గదను; పుచ్చుకొంచున్= తీసికొని; రౌద్రమ్మునన్= క్రోధంతో; వచ్చు= వచ్చే; శల్యున్= శల్యుడిని; కని= చూచి; సురాధిప పౌత్రుఁడు= దేవతలకు రాజైన ఇంద్రుడి మనుమడైన అభిమన్యుడు; దీప్తగాత్రుఁడు+ఐ= జ్వలించే శరీరంగలవాడై; తానును= తానుకూడ; చండ= భయంకరమైన; గదా= గద యొక్క; విలాసన= మిక్కిలి ప్రకాశించే; ఉగ్రమ్ముగన్= తీవ్రతతో; రమ్ము+ఇట= ఇచటికి రా; రమ్ము= రా; అనుచున్= అంటూ; సమస్త సైన్యమ్ములున్= సైన్యాలన్నీ; పిచ్చలింపఁగన్= భయపడగా; లీలన్= విలాసంగా; మార్కొనియెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా సారథి మరణించగా, శౌర్యోపేతుడై గదను చేపట్టి క్రోధం వెలిగక్కుతూ వచ్చే శల్యుడిని చూచి, జ్వలించే దేహంగల వాడైన అభిమన్యుడు మహాభయంకరంగా గదను తిప్పుతూ, సేనలన్నీ భయపడగా; రా! ముందుకు రా! అంటూ అవలీలగా అతడిని యెదుర్కొన్నాడు.

ఉ. అంతకు భీమసేనుఁడు రయం బెసఁగన్ గద నెయ్యి పట్టి య
త్యంత బలంబుమైఁ బిఱిఁది కాతనిఁ ద్రోచి కనద్గదాపరి
భ్రాంతి వెలుంగ నిల్చినఁ దిరంబయి శల్యుఁ డుదాత్తరేఖఁ గా
లాంతక దీప్తమూర్తి యగు నాతనిఁ దాఁకె బలంబు లార్వఁగన్. 181

ప్రతిపదార్థం: అంతకు= అప్పుడు; భీమసేనుఁడు= భీముడు; రయంబు+ఎసఁగన్= వేగం మీర; గదన్= గదను; ఎయ్యిపట్టి= ఒత్తిపట్టి; అత్యంత= మిక్కిలి; బలంబుమైన్= బలంగా; పిఱిఁదికిన్= వెనుకకు; ఆతనిన్= అభిమన్యుడిని; త్రోచి= త్రోసివేసి; కనత్=

ప్రకాశించే; గదా= గదయొక్క; పరిభ్రాంతి= త్రిప్పటం; వెలుంగన్= వెలుగగా; నిల్చినన్= నిలువగా; తిరంబు+అయి= స్థిరుడై; శల్యుఁడు; ఉదాత్తరేఖన్= ఔన్నత్యంతో; కాల= ప్రళయకాలంలోని; అంతక= యముడివలె; దీప్త= ప్రకాశించే; మూర్తి అగు= రూపంగల; ఆతనిన్= ఆ భీముడిని; బలంబులు= కౌరవ సేనలు; ఆర్వఁగన్= బొబ్బలు పెట్టగా; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: అంతలో భీముడు గదను ఒత్తిపట్టి, అభిమన్యుడిని మిక్కిలి వేగంగా వెనుకకు త్రోసి, ధగధగమెరిసేటట్లు గదను గిర్రున త్రిప్పుతూ నిలువగా, శల్యుడు స్థిరుడై, ఔన్నత్యం మెరయగా, కౌరవసేనలు ప్రశంసాపూర్వకంగా బొబ్బలు పెడుతుండగా, ప్రళయకాలంలోని యముడివలె వెలిగే భీముడిని ఎదుర్కొన్నాడు.

వ. అట్టియెడ. 182

ప్రతిపదార్థం: అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: భీముడు, శల్యుడు యుద్ధం చేసే ఆ సమయంలో.

క. 'ఇతనికి నితండ యితనికి । నితఁడ యెదురుఁ గాక యొరుల కీ యిరువురయు
ద్ధతి కెదుర వశమె' యనువా । క్తతియును దూర్యస్వనములుఁ గడుఁ బె ల్లెసఁగెన్. 183

ప్రతిపదార్థం: ఇతనికిన్= ఈ భీముడికి; ఇతండు+అ= ఈ శల్యుడే; ఇతనికిన్= ఈ శల్యుడికి; ఇతఁడు+అ= ఈ భీముడే; ఎదురున్= ఉజ్జీ; కాక= అట్లా కాక; ఒరులకున్= ఇతరులకు; ఈ+ఇరువుర= ఈ ఇద్దరి; ఉద్ధతికిన్= గర్వాన్ని; ఎదురన్= ఎదుర్కొనడానికి; వశమె?= వీలౌతుందా?; అను= అనే; వాక్+తతియును= మాటల సమూహమూ; తూర్య= వాద్యాలయొక్క; స్వనములున్= ధ్వనులును; కడున్+పెల్లు= అత్యధికంగా; ఎసఁగెన్= రేగినవి.

తాత్పర్యం: 'భీముడికి శల్యుడే, శల్యుడికి భీముడే ఉద్ది తప్ప ఇతరు లెవ్వరు వీరి తీవ్రతను ఎదుర్కొనలేరు' అనే ప్రశంసలూ, వాద్యధ్వనులూ అంతటా వ్యాపించాయి.

వ. ఇట్లు దలపడి శల్య సమీరనందనులు మండల ప్రచారంబులను విచిత్ర గదా ప్రసారణంబులను మెఱయుచు. 184

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తలపడి= పోరి; శల్య= శల్యుడు; సమీరనందనులు= వాయుపుత్రుడైన భీముడు; మండల ప్రచారంబులను= రెండు కాళ్ళతో మండలాకారంగా నిలిచి చేసే నడకలతోను; గదా= గదల యొక్క; ప్రసారణంబులను= చాచుటతోను; మెఱయుచున్= వెలుగొందుతూ.

తాత్పర్యం: ఈ విధంగా పోరి భీముడు, శల్యుడు కాళ్ళతో మండలాకారంగా కదలటం, గదలను చాచటం వంటి గదాయుద్ధ నైపుణ్యంతో ప్రకాశిస్తూ.

క. గద లన్యోన్య సమాగతిన్ మిడుఁగుఱుల్ గ్రక్కంగ సారించుచుం
గదియం బాయఁగ వ్రేటు దప్ప నుసులంగా నేర్పు లంగంబులం
దొదవన్ ఘోర పరస్పర ప్రహతు లత్యుగ్రంబుగా నెత్తురుల్
సెదరింపం బదశబ్ద హుంకృతులు దిక్సీమంబులన్ దాఁటఁగన్. 185

ప్రతిపదార్థం: గదలు= గదాయుధాలు; అన్యోన్య= పరస్పరం; సమాగతిన్= తాకటం; మిడుఁగుఱుల్= మిణుగురులు; క్రక్కంగన్= వెదజల్లుతుండగా; సారించుచున్= విసురుతూ; కదియన్= సమీపించగా; పాయఁగన్= ప్రక్కకు తొలగగా; వ్రేటు= దెబ్బ; తప్పన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తప్పిపోగా; నుసులంగా= మెదలగా; అంగంబులందున్= అవయవాలలో; నేర్పులు= నైపుణ్యాలు; ఒదవన్= నిండగా; ఘోర= భయంకరమైన; పరస్పర= ఒకరికి ఒకరు; ప్రహతులు= దెబ్బలు; అతి+ఉగ్రంబుగాన్= మిక్కిలి భీషణంగా; నెత్తురుల్= రక్తాలను; చెదరింపన్= చిమ్మగా; పదం= అడుగుల; శబ్ద= చప్పుళ్ళు; హుంకృతులు= హుంకారాలు; దిక్+సీమంబులన్= దిక్కుల కొనలను; దాఁటఁగన్= దాటగా.

తాత్పర్యం: గదలు ఒకదాని కొకటి తాకటం వలన మిణుగురులు రాలుతుండినవి. గదలను విసురుతూ దగ్గరికి రాగా, ప్రక్కకు ఒరిగేసరికి వ్రేటు తప్పగా- మెదిలేసరికి అంగాలలో నైపుణ్యం పెరిగింది. భీకరమైన పరస్పర ప్రహారాలు మిక్కిలి తీవ్రంగా రక్తాన్ని చిమ్మినవి. కాలి అడుగుల ధ్వనులు, హుంకారాలు దిక్కుల కొనలను దాటాయి. ఇట్లు కాగా.

విశేషం: ఇందు గదా యుద్ధంలోని నైపుణ్యం వర్ణించబడింది. భీమ శల్యుల పోరు యుద్ధవీరాన్ని వ్యక్తీకరిస్తున్నది.

క. పోరెడు నప్పుడు లావును । వీరోద్రేకంబుఁ జలము వెరవును సరియై
మారుతియు మద్రపతియు ను । దారగతుల మెఱసి రమరతతి వినుతింపన్. 186

ప్రతిపదార్థం: మారుతియున్= భీముడు; మద్రపతియును= శల్యుడును; పోరెడు+అప్పుడు= యుద్ధం చేసేటప్పుడు; లావును= బలమూ; వీర+ఉద్రేకంబున్= వీరులలోని విజృంభణమూ; చలము= మాత్సర్యం; వెరవును= ఉపాయం కూడా; సరి+ఐ= సమానమై; అమరతతి= దేవతల సమూహం; వినుతింపన్= పొగడగా; ఉదార గతులన్= గొప్ప రీతులతో; మెఱసిరి= ప్రకాశించారు.

తాత్పర్యం: భీముడు, శల్యుడు యుద్ధం చేసేటప్పుడు బలం, ఆ వీరులిద్దరి విజృంభణం, మాత్సర్యం, ఉపాయం కూడ సమానమై, దేవతల సమూహం పొగడగా, ఉదార ప్రవర్తనతో ప్రకాశించారు.

వ. ఇట్లు పెద్దయుంబ్రొద్దు పెనంగి. 187

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; పెనంగి= పోరాడి.

తాత్పర్యం: ఈ రీతిగా భీమ శల్యులు చాలా సేపు యుద్ధం చేసి.

క. అతిమురి నొండొరు వ్రేసిన । నెఱఁకులు దాఁకుటయు నొచ్చి నేలఁ కొఱగె బి
ట్టటి యా సుభట ద్వితయము । వెఱచఱచి బలద్వయంబు వెగ డందంగన్. 188

ప్రతిపదార్థం: బలద్వయంబు= కురు పాండవ సేనలు; వెఱచఱచి= భయపడి; వెగడు+అందంగన్= తల్లడిల్లగా; ఆ; సుభట= వీరుల; ద్వితయము= జంట; అతిమురిన్= సంభ్రమంతో; ఒండొరున్= ఒకరినొకరు; వ్రేసినన్= కొట్టగా; నెఱఁకులు= మర్మస్థానాలు; తాఁకుటయున్= తాకగా; నొచ్చి= బాధపడి; బిట్టు+అటి= వేగం తగ్గి; నేలకున్= భూమిపై; ఒఱగెన్= వాలింది.

తాత్పర్యం: కురు పాండవసేనలు భయపడి తల్లడిల్లగా భీమ శల్యులు సంభ్రమంతో ఒకరినొకరు గదలతో కొట్టుకోగా, మర్మాలకు తగిలి, బాధతో వేగం తగ్గి క్రింద పడ్డారు.

వ. అయ్యవసరంబున. 189

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: భీమ శల్యులు నేలపై పడిన సమయంలో.

క. కృతవర్ముఁడు మద్రమహీ । పతి గ్రక్కున గ్రుచ్చి యెత్తి పాయంగొని యు
ద్ధతి వాయఁ జనియె మారుత । సుతుఁ డాలోఁ దెలిసి లేచి శోభిల్లెఁ గడున్. 190

ప్రతిపదార్థం: కృతవర్ముఁడు= కృతవర్మ; మద్రమహీపతిన్= శల్యుడిని; గ్రక్కునన్= వెంటనే; గ్రుచ్చి యెత్తి= చేతులు దూర్చి పైకెత్తుకొని; పాయన్+కొని= దారిచేసికొని; ఉద్ధతి+పాయన్= దర్పం తొలగగా; చనియెన్= వెళ్ళిపోయాడు; మారుతసుతుఁడు= వాయు పుత్రుడైన భీముడు; ఆలోన్= అంతలో; తెలిసి= తేరుకొని; లేచి= నిలిచి; కడున్= మిక్కిలి; శోభిల్లెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: కృతవర్మ వెంటనే శల్యుడిని చేతులు చంకల్లో దూర్చి పైకెత్తుకొని, సైన్యంలో నుండి దారిచేసికొని, దర్పం తొలగగా వెళ్ళిపోయాడు. భీముడు అంతలోనే తేరుకొని లేచి మిక్కిలి ప్రకాశించాడు.

క. గద సారించుచు జయమునఁ । బొదలు నతనిఁ జూచి నీదు పుత్త్రులు గోపం
బొదవ నడరి రుద్ధటగతి । మదవత్కరి చటుల రథ సమాజంబులతోన్. 191

ప్రతిపదార్థం: గద సారించుచున్= గదను చాపుతూ; జయమునన్= విజయంతో; పొదలు= ఒప్పు; అతనిన్= భీముడిని; చూచి= చూచి; నీదు= నీయొక్క; పుత్రులు= కొడుకులు; కోపంబు= క్రోధం; ఒదవన్= కలుగగా; మదవత్= మదంగల; కరి= ఏనుగుల; చటుల= చలించే, రథ= రథాల యొక్క; సమాజంబులతోన్= సమూహాలతో; అడరిరి= విజృంభించారు.

తాత్పర్యం: గదను చాపుతూ జయంతో వర్ధిల్లే భీముడిని చూచి, దుర్యోధనాదులు కోపం మీరగా; మదించిన ఏనుగులతో, చలించే రథబలంతో విజృంభించారు.

వ. ఇ ట్లడరి వివిధాస్త్ర శస్త్రంబు లేయుచుం బొదివిన. 192

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; అడరి= విజృంభించి; వివిధ= అనేక విధాలైన; అస్త్ర= ఆగ్నేయాస్త్రాదులు; శస్త్ర= ఖడ్గాదులు; ఏయుచున్= వేస్తూ; పొదివినన్= ఆక్రమించగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా విజృంభించి కౌరవులు భీముడిపై అస్త్రశస్త్రాలు ప్రయోగించి ఆక్రమించగా.

మ. కవలుం దానును నేచి యుద్ధురగతిం గౌంతేయముఖ్యుండు వీ
రవరానీకము వీఁకఁ గూడికొని సంరంభంబు శోభిల్లఁ గౌ
రవసంఘుంబుఁ గలంచినన్ విఱిగె దర్పం బేది నీ సేన య
బ్దవితానంబు మహాసమీరణ నిరస్తంబైన చందంబునన్. 193

ప్రతిపదార్థం: కవలున్= నకుల సహదేవులును; తానును= భీముడును; ఏచి= విజృంభించి; ఉద్ధురగతిన్= తీవ్రంగా; కౌంతేయముఖ్యుండు= భీముడునూ; వీరవర= శ్రేష్ఠులైన వీరుల; అనీకము= సమూహమూ; వీఁకన్= ఉత్సాహంతో; కూడికొని= కలిసికొని; సంరంభంబు= ఆటోపం; శోభిల్లన్= ప్రకాశించగా; కౌరవసంఘంబున్= కౌరవుల సమూహాన్ని; కలంచినన్= కలతపెట్టగా; నీ= నీ (ధృతరాష్ట్రుడి) యొక్క; సేన= సైన్యం; అబ్ద= మేఘాల; వితానంబు= సమూహం; మహా= గొప్ప; సమీరణ= వాయువుచేత; నిరస్తంబైన= తొలగించబడిన; చందంబునన్= విధంగా, దర్పంబు= గర్వం; ఏది= నశించి; విఱిగెన్= పాఱెను.

తాత్పర్యం: నకుల సహదేవులు, తాను విజృంభించి, ఉత్సాహంతో వీరవరులను కూడుకొని, ఆటోపం ప్రకాశించగా భీముడు కౌరవ సైన్యాన్ని కలత పెట్టాడు. అపుడు నీ సైన్యం, మేఘ సమూహం తీవ్రమైన వాయువుచేత పటాపంచలైనట్లు దర్పహీనమై చెల్లాచెదరైంది.

విశేషం: అలంకారం ఉపమ.

వ. **అంత నపరాహ్ణంబయ్యె; నప్పుడు శంఖ భేరీ మృదంగాది తూర్యస్వనంబులు సెలంగ సింహనాదంబులం బేర్చినపాండవసేనం జూచి వృషసేనుండు రోషావేశభీషణుండై మార్కొని మార్గణనికరంబులు నిగిడించిన. 194**

ప్రతిపదార్థం: అంతన్= అంతలో; అపరాహ్ణంబు+అయ్యెన్= మధ్యాహ్నం దాటింది; అప్పుడు= ఆ సమయంలో; శంఖ= శంఖాలు; భేరీ= దుందుభులు; మృదంగ+ఆది= మద్దెల మొదలైన; తూర్య= వాద్యాల; స్వనంబులు= ధ్వనులు; చెలంగన్= చెలరేగగా; సింహనాదంబులన్= సింహగర్జనలతో; పేర్చిన= అతిశయించిన; పాండవసేనన్= పాండవుల సైన్యాన్ని; చూచి; వృషసేనుండు= వృషసేనుడు; రోష= కోపం; ఆవేశ= కలుగుటవలన; భీషణుండు+ఐ= భయం గొలిపేవాడై; మార్కొని= ఎదుర్కొని; మార్గణ= బాణాల; నికరంబులు= సమూహాలు; నిగిడించినన్= వేయగా.

తాత్పర్యం: ఇంతలో మధ్యాహ్నమయింది. శంఖాలు, భేరులు, మద్దెలలు మొదలైన వాద్యాలు మ్రోగగా, సింహనాదాలు చెలగిన పాండవ సైన్యాన్ని చూచి వృషసేనుడు కోపం ఆవేశించగా భయంకరుడై ఎదుర్కొని బాణజాలాన్ని ప్రయోగించగా.

మ. **కరిగాత్రంబుల ఘోటకాంగకములం గప్పెన్ సమిద్భూమి య**
చ్చెరువై యుండఁగ రథ్యసూత రథిక శ్రేణీవపుఃఖండముల్
దొరఁగెం, దుత్తుమురయ్యెఁ గాల్బలము, లస్తోక ప్రవాహంబులై
పరఁగెన్ రక్తనదుల్, పిశాచకుల మంభః కేలిలోలంబుగన్. 195

ప్రతిపదార్థం: సమిత్+భూమి= యుద్ధ రంగము; అచ్చెరువు+ఐ+ఉండఁగన్= ఆశ్చర్యం కలదై; కరిగాత్రంబులన్= ఏనుగుల అవయవాలతోను; ఘోటక+అంగములన్= గుర్రాల అంగాలతోను; కప్పెన్= నిండింది; రథ్య= గుర్రాల; సూత= సారథుల; రథిక= రథంపై ఉండేవారి యొక్క; శ్రేణీ= సమూహాల; వపుః+ఖండముల్= దేహభాగాలు; తొలఁగెన్= విరిగిపోయాయి; కాల్బలములు= పదాతి సైన్యాలు; తుత్తుమురు+అయ్యెన్= చిన్నచిన్నముక్కలైంది; రక్తనదుల్= నెత్తురు వాగులు; అస్తోక= గొప్పగా; ప్రవాహంబులు+ఐ= పారినవై; పిశాచకులము= దయ్యాల గుంపు; అంభఃకేలి= జలక్రీడలందు; లోలంబుగన్= ఆసక్తి కలవిగా; పరఁగెన్= ఒప్పినవి.

తాత్పర్యం: యుద్ధభూమి ఏనుగుల, గుర్రాల అవయవాలతో నిండి ఆశ్చర్యం గొలుపుతూ ఉన్నది. గుర్రాల, సారథుల, రథికుల - ఖండించబడిన దేహభాగాలు రాలిపడ్డాయి. పదాతి దళం చిన్నచిన్నముక్కలైంది. పిశాచ గణానికి జలక్రీడలందు ఆసక్తి కలిగేటట్లు గొప్ప రక్తపుటేరులు ప్రవహించాయి.

విశేషం: ఇట యుద్ధవీరం వలన బీభత్సరసం ఉదయించింది.-

తే. **కర్ణనందనుఁ డి ట్లత్యుదీర్ణభంగిఁ । బాండురాజ తనూజుల బలము నెల్లఁ**
గనుపు గొట్టంగఁ జొచ్చినఁ గినిసి నకులు । నాత్మజుండు శతానీకుఁ డతనిఁ దాఁకి. 196

ప్రతిపదార్థం: కర్ణనందనుఁడు= కర్ణుడి పుత్రుడైన వృషసేనుడు; ఇట్లు= ఈ విధంగా అతి+ఉదీర్ణభంగిన్= మిక్కిలి గొప్ప పద్ధతిలో; పాండురాజ తనూజుల= పాండవుల; బలమును= సైన్యమును; ఎల్లన్= అంతయు; కనుపు+కొట్టంగన్= ఖండించటానికి; చొచ్చినన్= పూనుకోగా; నకులుని= నకులుడి యొక్క; ఆత్మజుండు= కుమారుడైన; శతానీకుడు; కినిసి= కోపించి; అతనిన్= ఆ వృషసేనుడిని; తాఁకి= ఎదుర్కొని.

తాత్పర్యం: కర్ణుడి పుత్రుడైన వృషసేనుడు మిక్కిలి తీవ్రంగా పాండవుల సైన్యాన్నంతా ఖండించటానికి పూనుకొనగా, నకులుడి పుత్రుడైన శతానీకుడు కోపించి అతడిని ఎదుర్కొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **వాలమ్ములు పది మేనం । గీలించిన నాతఁ డతని కేతనము ధరం**
గూలిచి చాపముఁ ద్రుంచిన । నాలోనన ద్రౌపదేయులందఱుఁ బెలుచన్. **197**

ప్రతిపదార్థం: వాలు+అమ్ములు= వాడిగల బాణాలు; పది; మేనన్= దేహంపై; కీలించినన్= నాటగా; ఆతఁడు= వృషసేనుడు; అతని= శతానీకుడి; కేతనమున్= పతాకాన్ని; ధరన్= భూమిపై; కూలిచి= పడవేసి; చాపమున్= ధనుస్సును; త్రుంచినన్= ఛేదించగా; ఆలోనన్+అ= అంతలోనే; ద్రౌపదేయులు= ద్రౌపది పుత్రులు; అందరున్= అంతా; పెలుచన్= కోపంతో.

తాత్పర్యం: శతానీకుడు వాడిగల పది బాణాలు వృషసేనుడి శరీరంపై నాటగా; వృషసేనుడు అతడి పతాకాన్ని విరిచి, ధనుస్సును త్రుంచాడు. అంతలోనే ద్రౌపదిపుత్రులైన ప్రతివింధ్యాదులందరు సింహనాదాలతో.

వ. **తోడంబుట్టువునకుం దలకడచి వివిధ విశిఖంబుల వృషసేనుం గప్పిన నశ్వత్థామ ప్రముఖంబై కదిసి, కౌరవానీకంబు శతానీకునిం దత్సోదరుల ననేక క్రూరాస్త్ర నిచయావృతులం జేసినం గని కౌంతేయాగ్రజుండు గడంగి, కేకయ మాత్స్య పాంచాల ప్రభృతి బలంబులతో నురవడించిన, సురాసుర సంగ్రామ సదృశ సమరం బయ్యె; నందు భీమ కర్ణ కృప ద్రోణ ద్రౌణి ధృష్టద్యుమ్న విరాటులు ప్రతాప దీపితులై మార్తాండుండు సప్తమూర్తులు దాల్చి ధరణి విహరించినట్లు వెలింగిరి; కొండొక సేపునకుఁ బాండవ సేనా సాగర సంరంభంబు సహింపం జాలక మన మొన దెరలి మరలినం జూచి యాచార్యుండు గోపాటోపంబును బటువిక్రమంబును నావేశింప నీ సైనికుల నిలు నిలు మని యదల్చి, తూణీరంబు బిగియించి, గుణంబు సారించి, సారథితో నిట్లనియె.**
198

ప్రతిపదార్థం: తోడంబుట్టువునకున్= తోబుట్టువైన శతానీకుడిని; తలకడచి= దాటి; వృషసేనున్= వృషసేనుడిని; వివిధ విశిఖంబులన్= అనేక బాణాలతో; కప్పినన్= ముంచగా; కౌరవ+అనీకంబు= కౌరవులసేన; అశ్వత్థామ ప్రముఖంబు+ఐ= అశ్వత్థామ ముఖ్యంగా కలదై; కదిసి= సమీపించి; శతానీకునిన్= శతానీకుడిని; తద్+సోదరులన్= అతని తోబుట్టువులను; అనేక= బహువిధాలైన; క్రూర+అస్త్ర= భయంకరమైన ఆయుధాల; నిచయ= సమూహంచేత; ఆవృతులన్= కప్పబడినవారలను; చేసినన్= చేయగా; కని= చూచి; కౌంతేయ+అగ్రజుండు= కుంతి పెద్ద కొడుకైన ధర్మరాజు; కడంగి= పూనుకొని; కేకయ= కేకయ దేశపు; మాత్స్య= మత్స్యదేశపు; పాంచాల= పాంచాలదేశపు; బలంబులతోన్= సైన్యాలతో; ఉరవడించినన్= విజృంభించగా; సుర= దేవతల; అసుర= రాక్షసుల; సంగ్రామ= యుద్ధంతో, సదృశ= సమానమైన; సమరంబు= యుద్ధం; అయ్యెన్= జరిగింది; అందున్= ఆ యుద్ధంలో; భీమ; కర్ణ; కృప; ద్రోణ; ద్రౌణి= అశ్వత్థామ; ధృష్టద్యుమ్న; విరాటులు; ప్రతాప= పరాక్రమంతో; దీపితులై= వెలుగొందినవారై; మార్తాండుండు= సూర్యుడు; సప్తమూర్తులు= ఏడు రూపాలు; తాల్చి= ధరించి; ధరణిన్= భూమియందు; విహరించినట్లు= తిరిగినట్లు; వెలింగిరి= ప్రకాశించారు; కొండొకసేపునకున్= కొంత సేపటికి; పాండవ= పాండవుల; సేనా= సైన్యం యొక్క; సంరంభంబు= ఆటోపాన్ని; సహింపన్+చాలక= ఓర్వలేక; మనమొన= మనయొక్క సైన్యం; తెరలి= కలతపడి; మరలినన్= వెనుకకు

తిరుగగా; చూచి; ఆచార్యుండు= ద్రోణుడు; కోప+ఆటోపంబునున్= కోపం యొక్క తీవ్రతయు; పటువిక్రమంబునున్= పరాక్రమమును; ఆవేశింపన్= విజృంభించగా; నీ సైనికులన్= నీయొక్క భటులను; నిలు నిలుము+అని= ఆగండాగండి అని; అదల్చి= బెదిరించి; తూణీరంబు= అమ్ములపొది; బిగియించి= బిగియగట్టి; గుణంబు= అల్లెత్రాడు; సారించి= లాగి; సారథితోన్= రథసారథితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ద్రౌపదిపుత్రులైన ప్రతివింధ్యాదులు సోదరుడైన శతానీకుడిని దాటి, వృషసేనుడిని అనేక బాణాలతో ముంచగా, కౌరవసేన అశ్వత్థామను ముందుంచుకొని సమీపించి శతానీకుడిని, అతడి తోబుట్టువులను బహువిధాలైన క్రూరాస్త్రజాలంతో కప్పగా చూచి, ధర్మరాజు ప్రయత్నపూర్వకంగా కేకయ, మత్స్య, పాంచాలాది సైన్యాలతో విజృంభించగా, దేవ, రాక్షస యుద్ధంతో సమానమైన యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో భీమ, కర్ణ, కృప, ద్రోణ, అశ్వత్థామ, ధృష్టద్యుమ్న, విరాటులు పరాక్రమంతో వెలిగి, సూర్యుడు ఏడు రూపాలు తాల్చి భూమిపై విహరించినట్లు ప్రకాశించారు. కొంతసేపటికి పాండవ సేన యొక్క ఆటోపాన్ని సహించజాలక మన కౌరవసైన్యం కలతపడి వెనుదిరుగగా, ఆచార్యుడు అది చూచి కోప తీవ్రత, పరాక్రమం విజృంభించగా, నీ భటులను నిలు, నిలు మని అదల్చి, అమ్ములపొది బిగియగట్టి, అల్లెత్రాడు సవరించి, సారథితో ఈ విధంగా అన్నాడు.

సీ. **'చలమేది కౌరవ సైన్యముల్ పాఱెడు। ధర్మనందనుని యుద్దండ వృత్తిఁ**
గంటె? యీతనిఁ దాఁకి గర్వంబు మాన్పక। నిలిచిన నిమ్మూఁక నిలుచు నెట్లు?
ధర్మజ భీమ సాత్యకి మాత్స్యపాంచాల। తత్తనూజులు నాకుఁ దరమె? క్రీడి
చాపంబు వెరవు నా చూపినయది గాదె?। విను మట్లు గాకయుఁ దనువు దాఁచు

తే. **సమయమే యిది? సంభృతోత్సాహలీల। జయముఁ గీర్తియుఁ గోరి యస్ఖలితభంగిఁ**
దేరు నడుపుము; చేతుల తీఁట వోవ। నడరి రథిక జనంబు వేఁటాడవలయు.' 199

ప్రతిపదార్థం: చలము= మాత్సర్యం; ఏది= నశించి; కౌరవసైన్యముల్= కౌరవుల సేనలు; పాఱెడున్= పారిపోతున్నవి; ధర్మనందనుని= ధర్మరాజు యొక్క; ఉద్దండ వృత్తిన్= భయంకరమైన ప్రవర్తనను; కంటె?= చూచినావా?; ఈతనిన్= ఈ ధర్మరాజును; తాఁకి= ఎదుర్కొని; గర్వంబు= అహంకారాన్ని; మాన్పక= తగ్గించక; నిలిచినన్= ఊరకుంటే; ఈ+మూఁక= ఈ సైన్యం; నిలుచును +ఎట్లు?= ఎట్లా నిలుస్తుంది?; ధర్మజ= ధర్మరాజు; భీమ= భీముడు; సాత్యకి; మాత్స్య= విరాటుడు; పాంచాల= ద్రుపదుడు; తద్+తనూజులు= వారల కుమారులు; నాకున్= నాకు; తరమె= నాకు సాధ్యమే; క్రీడి= అర్జునుడి; చాపంబు= ధనుస్సు యొక్క; వెరవు= నైపుణ్యం; నా చూపిన+అది= నేను చూపింది; కాదె!= కాదా!; వినుము= విను; అట్లు+కాకయున్= అదేగాక; తనువు= దేహం; దాచు= కాపాడుకొనే; సమయమే+ఇది?= సమయమా ఇది?; సంభృత= నిండిన; ఉత్సాహ= ఉత్సాహం యొక్క; లీలన్= విలాసంతో; జయమున్= విజయాన్ని; కీర్తియున్= యశస్సును; కోరి= కాంక్షించి; అస్ఖలిత భంగిన్= చలించని విధంగా; తేరు= రథాన్ని; నడుపుము= తోలుము; చేతుల తీఁట= చేతుల యొక్క దురద; పోవన్= పోయేటట్లుగా; అడరి= పూని; రథిక జనంబున్= రథంపై ఉండే వీరులను; వేఁటాడవలయున్= వధించాలి.

తాత్పర్యం: 'కౌరవ సైన్యాలు మాత్సర్యం తొలగి పారిపోతున్నాయి. ధర్మరాజు యొక్క విజృంభణాన్ని చూచావా? ఈ ధర్మజుడిని ఎదుర్కొని గర్వాన్ని అణచకుంటే ఈ సైన్యం నిలిచేదెట్లా? ధర్మరాజు, భీముడు, సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు, వారల పుత్రులను ఓడించటం నాకు అసాధ్యమైన దేమీ కాదు. అర్జునుడికి ధనుర్విద్యా నైపుణ్యం నేను నేర్పించిందే కదా! వినుము. అదేగాక, ఈ దేహాన్ని కాపాడుకొనే సమయమా ఇది? ఉత్సాహ విలాసంతో విజయాన్ని, కీర్తిని కోరి, స్థిరుడవై రథాన్ని నడుపుము. చేతుల తీట పోయేటట్లు రథికవరులను వేటాడాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్రోణాచార్యులు ధర్మరాజుతో యుద్ధంబు సేయుట (సం.7-15-19)

చ. అన విని మేను వెంచి రయమారఁగ సూతుఁడు దేరు వోవని
చ్చినఁగని వారి సైన్యములు చెచ్చెర ధర్మజు మించి త్రోవఁ, బే
ర్చిన భుజసంపదం గడఁగి, సింధుర లీలఁ దెరల్చి, తాఁకె న
మ్మనుజ విభున్ గురుండు, పటుమార్గణ సంపిహితాంబరంబుగన్. 200

ప్రతిపదార్థం: అనన్+విని= ద్రోణుడు అనగా విని; మేను= శరీరం; పెంచి= ఉబ్బించి; సూతుఁడు= సారథి; రయము+ఆరఁగన్= వేగంగా; తేరు= రథాన్ని; పోవనిచ్చినన్= నడిపించగా; కని= చూచి; వారి సైన్యములు= పాండవుల సైన్యాలు; చెచ్చెరన్= త్వరత్వరగా; ధర్మజు= ధర్మరాజును; మించి= అధిగమించి; త్రోవన్= త్రోయగా; గురుండు= ద్రోణుడు; పేర్చిన= అధికమైన; భుజ సంపదన్= బాహుబలంతో; కడఁగి= పూనుకొని; సింధుర లీలన్= ఏనుగువలె; తెరల్చి= విజృంభించి; పటుమార్గణ= బలమైన బాణాలచేత; సంపిహిత= కప్పబడిన; అంబరంబుగన్= ఆకాశం కలదిగా; ఆ+మనుజ విభున్= ఆ ధర్మరాజును; తాఁకెన్= ఢీకొన్నాడు.

తాత్పర్యం: ద్రోణుడు అట్లనగా విని, సారథి శరీరం ఉప్పొంగగా రథాన్ని ముందుకు నడిపాడు. అది చూచి పాండవ సేనలు త్వర త్వరగా ధర్మరాజును దాటి త్రోసికొని ముందుకు సాగాయి. అపుడు ద్రోణాచార్యుడు అతిశయించిన బాహుబలంతో ప్రయత్నపూర్వకంగా ఏనుగు వలె విజృంభించి, ఆకాశమంతటా బాణాలను పరిచి, ధర్మరాజును ఢీకొన్నాడు.

క. తాఁకినఁ బొగడం దగియెడు । వీఁకం బతి ద్రోణు బాణవృతుఁ జేయ నతం
డాఁక గొనక యతని ధనువు । వ్రేఁకని భల్లమునఁ ద్రుంచి వెస డగ్గఱియెన్. 201

ప్రతిపదార్థం: తాఁకినన్= ఎదుర్కొనగా; పొగడన్+తగియెడు= ప్రశంసించదగిన; వీఁకన్= పరాక్రమంతో; పతి= ధర్మరాజు; ద్రోణున్= ద్రోణుడిని; బాణవృతున్= బాణాలచేత కప్పబడినవాడినిగా; చేయన్= చేయగా; అతండు= ఆ ద్రోణుడు; ఆఁక+కొనక= ఆగక; అతని ధనువున్= ఆ ధర్మజుడి ధనుస్సును; వ్రేఁకని= బరువైన; భల్లమునన్= బల్లెంతో; త్రుంచి= విరిచి; వెసన్= వేగంగా; డగ్గఱియెన్= సమీపించాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు ఆగక, బరువైన బల్లెంతో ధర్మజుడి ధనుస్సును విరిచి, వేగంగా అతడిని సమీపించాడు.

వ. ఇ ట్లుద్ధతుండై యగ్గురుండు పొంగిన జలధియుం బోలెం గవిసిన ధర్మనందను చక్ర రక్షకుండగు సుకుమారుండు చెలియలికట్ట తెఱంగున నిలువరించి, నిశితశరం బతని యురంబున నాటించిన, నప్పాంచాలవరుం బ్రశంసించు నెలుంగులు సెలంగఁ బాండవ బలంబులు పేర్చి యార్చిన. 202

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఆ+గురుండు= ఆ ద్రోణాచార్యుడు; ఉద్ధతుండు+ఐ= గర్వించినవాడై; పొంగిన= ఉప్పొంగిన; జలధియున్+పోలెన్= సముద్రంవలె; కవిసినన్= విజృంభించగా; ధర్మనందను= ధర్మరాజుయొక్క; చక్రరక్షకుండు+అగు= రథచక్రాలను కాపాడే; సుకుమారుండు= సుకుమారుడనేవాడు; చెలియలికట్ట= సముద్రపు గట్టు; తెఱంగునన్= విధంగా, నిలువరించి= అడ్డుకొని; నిశిత శరంబు= తీక్ష్ణమైన బాణాన్ని; అతని= ద్రోణుడి; ఉరంబునన్= రొమ్ములో; నాటించినన్= గ్రుచ్చగా; ఆ+పాంచాలవరున్= పాంచాల దేశపు శ్రేష్ఠుడైన సుకుమారుడిని; ప్రశంసించు+ఎలుంగులు= పొగడే నినాదాలు; చెలంగన్= వ్యాపించగా; పాండవ బలంబులు= పాండవుల సైన్యాలు; పేర్చి= మిక్కిలి; ఆర్చినన్= బొబ్బలు పెట్టగా.

తాత్పర్యం: ఇట్లా ద్రోణాచార్యుడు గర్వించి సముద్రంవలె విజృంభించగా, ధర్మజుడి చక్రరక్షకుడైన సుకుమారుడు, చెలియలికట్ట సముద్రపు నీటిని ఆపినట్లు అడ్డుకొని, ద్రోణుడి రొమ్మున తీక్ష్ణమైన బాణాన్ని నాటాడు. అపుడు ఆ పాంచాల వీరుడైన సుకుమారుడిని ప్రశంసించే ధ్వనులు చెలరేగాయి. పాండవ సైన్యాలు జయజయధ్వానాలు చేయగా.

విశేషం: అలం: ఉపమ.

క. పెనుగాలిఁ బెఱుగు కార్చి । చ్చును బోలెం బొదలి గురుఁడు సుకుమారునిఁ గాం
చన పుంఖ శరజ్వాలా । వినిపాతితుఁ జేసి తఱిమి విభునిం గదిసెన్. 203

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యుడు; పెనుగాలిన్= గొప్పవాయువుచేత; పెఱుగు= పెంపొందే; కార్చిచ్చు= దావానలం; పోలెన్= వలె; పొదలి= ఒప్పి; సుకుమారునిన్= సుకుమారుడిని; కాంచన= బంగారపు; పుంఖ= క్రింది చివరగల; శర= బాణపు; జ్వాలా= మంటలచేత; వినిపాతితున్+చేసి= పడగొట్టి; తఱిమి= వేగంగా వచ్చి; విభునిన్= ధర్మజుడిని; కదిసెన్= ఆక్రమించాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు పెనుగాలికి రేగే దావానలంవలె చెలరేగి, సుకుమారుణ్ణి బంగారపు పుంఖంగల బాణజ్వాలలతో కూలనేసి, పరుగున వచ్చి ధర్మజుడిని తాకినాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. అప్పుడు పాండవ యోధు లొండొరుల మీఁతి యుధిష్ఠిరు ముందరికి వచ్చి యాచార్యుం బొదివిన నతండు నలిరేఁగి. 204

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; పాండవ యోధులు= పాండవ వీరులు; ఒండొరులమీఁతి= ఒకరిని మించి ఒకరు; యుధిష్ఠిరు= ధర్మజుడి; ముందరికిన్= ముందుకు; వచ్చి= ఏతెంచి; ఆచార్యున్= ద్రోణాచార్యుడిని; పొదివినన్= చుట్టుముట్టగా; అతండు= ద్రోణుడు; నలిరేఁగి= మిక్కిలి విజృంభించి.

తాత్పర్యం: ఆ సమయంలో పాండవవీరులు ఒకరిని మించి ఒకరు ధర్మరాజు ముందుకు వచ్చి, ద్రోణాచార్యుడిని చుట్టుముట్టగా, అతడు మిక్కిలి రెచ్చిపోయి.

సీ. నకులుని నైదుసాయకముల స్రుక్కించి, । సహదేవు నేడింట సాధుఁ జేసి,
నవవిశిఖముల మాత్స్యవరేణ్యు నడఁగించి, । యేనింట సాత్యకియేపు మాపి
ద్రౌపదేయుల శరత్రయములఁ గలఁచి, విం । శతి నుత్తమౌజుని చలము మాన్చి,
పండ్రెండు పండ్రెండు పటు మార్గణంబులఁ । బాండవాగ్రజుని శిఖండి నొంచి

తే. మఱియు మార్కొన్న రథికుల మదము సెఱిచి । మెఱుఁగుఁ దూపు లాధర్మజుమీఁద నిగుడ
నడర నఱిమి యుగంధరుఁ డడ్డపడిన । నవ్వి యవ్విభుఁ దెగటార్చె నారసమున. 205

ప్రతిపదార్థం: నకులునిన్= నకులుడిని; ఐదు సాయకములన్= ఐదు బాణాలచే; స్రుక్కించి= బాధించి, సహదేవునిన్= సహదేవుడిని; ఏడింటన్= ఏడు బాణాలతో; సాధున్+చేసి= చక్కఁజేసి; మాత్స్యవరేణ్యుని= విరాటరాజును; నవ= తొమ్మిది; విశిఖములన్= బాణాలచేత; అడఁగించి= అణచివేసి; ఏనింట= ఐదింట; సాత్యకి= సాత్యకియొక్క; ఏపుమాపి= ఆధిక్యాన్నితొలగించి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్రౌపదేయులన్= ద్రౌపది పుత్రులైన ప్రతివింధ్యాదులను; శరత్రయములన్= మూడేసి బాణాలతో; కలఁచి= కలతపడేటట్లు చేసి; ఉత్తమౌజునిన్= ఉత్తమౌజుడిని,; వింశతిన్= ఇరవై బాణాలతో; చలము= మాత్సర్యం; మాన్చి= తొలగించి; పాండవ+అగ్రజున్= ధర్మజుడిని; పంద్రెండు= పన్నెండు; పటుమార్గణంబులన్= బలమైన బాణాలచేత; శిఖండిన్= శిఖండిని; పంద్రెండు పంద్రెండు= పన్నెండు పన్నెండు బాణాలచేత; నొంచి= బాధించి; మఱియున్= ఇంకా; మార్కొన్న= ఎదుర్కొన్న; రథికుల= రథంపై నుండి పోరేవారియొక్క; మదము= గర్వం; చెఱిచి= పోగొట్టి; మెఱుఁగు+తూపులఁన్= ప్రకాశించే బాణాలతో; ఆ ధర్మజు= ఆ ధర్మరాజు యొక్క; మేనన్= శరీరంలో; నిగుడన్= గ్రుచ్చగా; యుగంధరుఁడు= యుగంధరుడనే వీరుడు; నఱిమి= చూరుచేసి; అడరన్= ఎదుర్కొనగా; అడ్డపడిన= అడ్డగించిన; ఆ+విభున్= ఆ యుగంధరుడిని; నవ్వి; నారసమునన్= ఒక్క బాణంతో; తెగటార్చెన్=చంపాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు నకులుడిని ఐదు బాణాలతో బాధించి, సహదేవుడిని ఏడు బాణాలతో చక్కపరచాడు. విరాటరాజును తొమ్మిది బాణాలతో అణచి, సాత్యకిని ఏడు బాణాలతో బాధించాడు. ద్రౌపదిపుత్రులైన ప్రతివింధ్యాదులను మూడేసి బాణాలతో కలచివేసి, ఇరవై అమ్ములతో ఉత్తమౌజుడి మాత్సర్యాన్ని కుంచించాడు. పంద్రెండు బాణాల చొప్పున ప్రయోగించి ధర్మజుడి, శిఖండి పొగరణగించాడు. ఎదుర్కొన్న రథికులందరి మదాన్ని అణచి, వెలిగిపోయే బాణాలను ధర్మజుడిపై ప్రసరించగా, యుగంధరుడు వాటిని ముక్కలుముక్కలు చేశాడు. అడ్డుపడ్డ యుగంధరుడి చర్యకు ద్రోణుడు నవ్వి ఒక్క బాణంతో అతడిని హతమార్చాడు.

వ. **అట్టియెడఁ గేకయపతులును, బాంచాల నాథుండును, దదీయ జ్ఞాతులగు సింహసేన వ్యాఘ్రదత్తులు లోనైన యోధు లనేకు లాచార్యుం బొదివి, శౌర్యబాహువీర్యంబులు నెఱపి; రందు సింహసేనుండును; వ్యాఘ్రదత్తుండును నెట్టన నానాస్త్రంబుల నొప్పించిన నా ధనుర్ధర గురుండు.** **206**

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో; కేకయ పతులును= కేకయ దేశపు రాజులను; పాంచాలనాథుండును= ద్రుపదుడూ; తదీయ జ్ఞాతులును+అగు= ద్రుపదుడి పాలివారగు; సింహసేన వ్యాఘ్రదత్తులు= సింహసేనుడూ, వ్యాఘ్రదత్తుడూ; లోనైన= మొదలైన; యోధులు= వీరులు; అనేకులు= చాలా మంది; ఆచార్యున్= ద్రోణుడిని; పొదివి= చుట్టుముట్టి; శౌర్య= శూరత్వం; బాహువీర్యంబులు= భుజబలం; నెఱపిరి= చూపారు. అందున్= వారిలో; సింహసేనుండును= సింహసేనుడును; వ్యాఘ్రదత్తుఁడును= వ్యాఘ్రదత్తుడూ; నెట్టన= అడ్డులేక; నానా+అస్త్రంబులన్= అనేకాలైన బాణాలతో; నొప్పించినన్= బాధించగా; ఆ ధనుర్ధర గురుండు= ధనుస్సును పట్టినవారికి ఆచార్యుడు అయిన ద్రోణుడు.

తాత్పర్యం: అప్పుడు కేకయ దేశరాజులు, ద్రుపదుడు, అతని పాలివారైన సింహసేనుడు, వ్యాఘ్రదత్తుడు మొదలైన వీరులు అనేకులు ద్రోణుడిని చుట్టుముట్టి, శూరత్వాన్ని, భుజబలాన్ని ప్రదర్శించారు. వారిలో సింహసేనుడు, వ్యాఘ్రదత్తుడు అడ్డులేక అనేక బాణాలచేత నొప్పించగా ద్రోణాచార్యుడు-

తే. **కన్నుఁగవఁ గెంపు గదురంగఁ గౌరవులకుఁ। జిత్త మలరంగ నా వ్యాఘ్రదత్త సింహ**
సేన మస్తకములు రెండు శితశరములఁ। గుండలంబులతో నేలఁ గూల నేసి. **207**

ప్రతిపదార్థం: కన్ను+కవన్= రెండు కన్నులలో; కెంపు= ఎరుపు; కదురంగన్= అతిశయించగా; కౌరవులకున్= దుర్యోధనాదులకు; చిత్తము+అలరంగన్= మనస్సు సంతసించగా; ఆ వ్యాఘ్రదత్త= వ్యాఘ్రదత్తుడి; సింహసేన= ఆ సింహసేనుడి; మస్తకములు= తలలు; రెండు; శితశరములన్= తీక్ష్ణమైన బాణాలతో; కుండలంబులతోన్= చెవిపోగులతో సహా; నేలన్= భూమిపై; కూలన్+ఏసి= పడగొట్టి.

తాత్పర్యం: తనకు కోపం అతిశయించగా, కౌరవులకు సంతోషం కలుగగా, వ్యాఘ్రదత్త, సింహసేనుల శిరస్సులను కుండలాలతో సహా తీక్ష్ణమైన బాణాలతో (ద్రోణుడు) క్రిందపడవేసి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తక్కటి రథికుల నెల్లను। జిక్కువడం జేసి పురుషసింహుండు మదం
బెక్కి యుధిష్ఠిరుఁ బొదివెడు। నెక్కుడు తమకమునఁ గదిసె నేడ్తెఱ మెఱయన్. 208

ప్రతిపదార్థం: పురుషసింహుండు= పురుషులలో శ్రేష్ఠుడైన ద్రోణుడు; తక్కటి= తక్కిన; రథికులన్= రథంపైనుండి యుద్ధం చేసే వీరులను; చిక్కు+పడన్+చేసి= బాధించి; మదంబు+ఎక్కి= గర్వించి; యుధిష్ఠిరున్= ధర్మజుడిని; పొదివెడున్=ఆక్రమించటానికి; ఏడ్తెఱ= పరాక్రమం; మెఱయన్= ప్రకాశించగా; ఎక్కుడు= మిక్కిలి; తమకమునన్= వేగంతో; కదిసెన్= సమీపించినాడు.

తాత్పర్యం: వీరశ్రేష్ఠుడైన ద్రోణుడు రథికులందరిని బాధించి, గర్వించి, పరాక్రమం ప్రకాశించగా ధర్మజుడిని ఆక్రమించటానికి అతివేగంతో సమీపించాడు.

వ. అయ్యవసరంబున నా సైన్యంబుల జనంబులు. 209

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= అప్పుడు; ఆ సైన్యంబుల= పాండవ సేనలలోని; జనంబులు= సైనికులు.

తాత్పర్యం: అపుడు పాండవ సేనలోని సైనికులు.

క. 'అదె పట్టువడియె ధర్మజుఁ। డదయుం డగు ద్రోణుచేత నక్కట! నేఁ డు
న్మదుఁడై సుయోధనుఁడు దం। డ్రి దలిర్పఁగ నేఁగుఁ గరిపురికిఁ గొని యెలమిన్.' 210

ప్రతిపదార్థం: అదె= అదే; ధర్మజుఁడు= ధర్మరాజు; అదయుండు+అగు= దయలేని; ద్రోణుచేతన్= ద్రోణుడిచేత; నేఁడు= ఈవేళ; పట్టువడియెన్= పట్టుపడ్డాడు; అక్కట!= అయ్యో!; సుయోధనుఁడు= దుర్యోధనుడు; ఉన్మదుఁడు+ఐ= మిక్కిలి గర్వించినవాడై; తండ్రి= తండ్రి అయిన ధృతరాష్ట్రుడు; తలిర్పఁగన్= సంతోషించగా; ఎలమిన్= వికాసంతో; కరిపురికిన్= హస్తినాపురానికి; కొని= తీసికొని; ఏఁగున్= పోతాడు.

తాత్పర్యం: 'అదుగో! నేడు ధర్మరాజు క్రూరుడైన ద్రోణుడికి పట్టువడ్డాడు. అయ్యో! దుర్యోధనుడు తండ్రి అయిన ధృతరాష్ట్రుడు సంతోషించగా సగర్వంగా అతడిని హస్తినాపురానికి తీసికొని పోతాడు.'

వ. అనుచు సంభ్రమాకులచిత్తు లగుచు నున్నంత. 211

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; సంభ్రమ= భయంతో; ఆకుల= చెదరిన; చిత్తులు= మనస్సుకలవారు; అగుచున్= అవుతూ; ఉన్నంతన్= ఉన్నంతలో.

తాత్పర్యం: అంటూ పాండవ సేనలలోని సైనికులు భయంతో చెదరిపోయిన మనస్సు కలవారై ఉన్నంతలో. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. ధరణీభాగము గ్రక్కునం గదల రథ్యవ్రాత చంచద్గతి
స్ఫురణం బొప్పఁగ బాణజాలము నభంబుం గప్ప నత్యంత ని
ష్ఠుర సంతర్జన ఘోషభీషణ మహాటోపంబు దిగ్దంతు లా
తురతం బొందఁగఁ జేరవచ్చి వడిఁ బార్థుం డగ్గురుం దాఁకినన్. 212

ప్రతిపదార్థం: ధరణీ భాగము= భూభాగం; గ్రక్కునన్= అతివేగంగా; కదలన్= చలించగా; రథ్య= గుర్రాల; వ్రాత= సమూహం యొక్క; చంచత్= ఎగిరే; గతి= నడక యొక్క; స్ఫురణంబు+ఒప్పఁగన్= స్ఫురించగా; బాణజాలము= బాణాల సమూహం;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నభంబున్= ఆకాశాన్ని; కప్పన్= కమ్ముకొనగా; అత్యంత= మిక్కిలి; నిష్ఠుర= కఠోరమైన; సంతర్జన= అదల్పే; ఘోష= ధ్వనిచేత; భీషణ= భయంకరమైన; మహా+ఆటోపంబు= మిక్కిలి వేగిరపాటు; దిక్+దంతులు= దిగ్గజాలు; ఆతురతన్+పొందఁగన్= భయపడేటట్లు; చేయన్= చేయగా; వడిన్ వచ్చి= వేగంగా వచ్చి; పార్థుండు= అర్జునుడు; ఆ+గురున్= ఆ ద్రోణాచార్యుడిని; తాఁకినన్= ఎదుర్కొనగా.

తాత్పర్యం: భూభాగం తీవ్రంగా కదలగా, అశ్వసమూహం యొక్క దూకే గమనం స్ఫురించగా, బాణజాలం ఆకాశాన్ని క్రమ్ముకొనగా, మిక్కిలి కఠోరమైన అదల్పే ధ్వని వలన కలిగిన మహాటోపం దిగ్గజాలకు భయం గొలుపగా, వేగంతో వచ్చి అర్జునుడు ద్రోణాచార్యుడిని ఎదుర్కొన్నాడు. అప్పుడు.

విశేషం: అర్జునుడు యుద్ధరంగంలో విజృంభించటం వలన వీరరసం, భూమి చలించటం, దిగ్గజాలు బెదరటం వంటి విస్మయం గొలిపే చర్యల వలన అద్భుతరసం వ్యక్తమౌతున్నది.

వ. కౌరవయోధవరు లొక్కపెట్ట భారద్వాజునకు బాసటయై ససైన్యంబుగా సవ్యసాచిం బొదివిన, నవ్వీరుండు ఘోరాకారుండయి గాండీవచండ నిస్వనంబు లొండొండ నిగుడ, నిశిత సాయకపరంపరలు గురిసి కపాలోపలంబును, మేదో మాంస పంకంబును, నస్థిచూర్ణసికతంబును నగు శోణిత నదీ ప్రకరంబును బఱపె; నంత గభస్తిమంతుం డస్తశైలాంతరితుండైనఁ బార్థు బాణాంధకారంబునకుఁ దోడు సంధ్యాసంతమసంబు గవిసినం గురుసైనికులకుఁ దమవార లె రివారలని నిరూపింప నశక్యం బగుటయు ద్రోణ దుర్యోధనులు సమరంబు సాలించి వాహినులఁ దివియించినం, దిరంబై ధనంజయుండును, జయతూర్యస్వనంబులును, బాంచాల కేకయాది బంధుమిత్త్ర ప్రశంసా వచనంబులును, వీనులం బొలయఁ దనబలంబుల మరల్చి, ధర్మనందనుం గొలిచి చనియె; నిత్తెఱంగున రెండు సేనలుఁ దమ తమ విడిదలల కరిగి యథోచిత వ్యాపారంబుల నుండి నాఁటిరాత్రి సనిన మఱునాఁడు. 213

ప్రతిపదార్థం: కౌరవయోధవరులు= కౌరవ పక్షంలోని వీరశ్రేష్ఠులు; ఒక్కపెట్టు+అ= ఒకేసారి; భారద్వాజునకున్= ద్రోణుడికి; బాసట+ఐ= సహాయంగా; ససైన్యంబుగాన్= సేనలతో; సవ్యసాచిన్= అర్జునుడిని; పొదివినన్= చుట్టుముట్టగా; ఆ+వీరుండు= యోధుడైన అర్జునుడు; ఘోర+ఆకారుండు+అయి= భయంకరమైన రూపం కలవాడై; గాండీవం= గాండీవమనే ధనుస్సు యొక్క; చండ= భయంకరమైన; నిస్వనంబులు= ధ్వనులు; ఒండొండు+అ= క్రమక్రమంగా; నిగుడన్= వ్యాపించగా; నిశిత= పదునైన; సాయక= బాణాల; పరంపరలు= వరుసలు; కురిసి= వర్షించి; కపాల+ఉపలంబును= పుర్రెలనే రాళ్ళుగలదియు; మేదన్= క్రొవ్వు; మాంస పంకంబునన్= మాంసం అనే బురద గలదియు; అస్థి= ఎముకల; చూర్ణ= పొడి అనే ఇసుక గలదియు; అగు= ఐన; శోణిత= రక్తం యొక్క; నదీ= నదుల; ప్రకరంబునున్= సమూహాన్ని; పఱపెన్= పారేటట్లు చేశాడు; అంతన్= అప్పుడు; గభస్తిమంతుండు= సూర్యుడు; అస్తశైల= అస్తమించే కొండలో; అంతరితుండు+అయినన్= కనిపించనివాడు కాగా; పార్థు= అర్జునుడి; బాణ+అంధకారంబునకున్= బాణాలు కమ్మటం వలన కలిగిన చీకటికి; తోడు= జతకు; సంధ్యాసమయంబు= సాయంకాలం; కవిసినన్= చుట్టుముట్టగా; కురుసైనికులకున్= కౌరవుల భటులకు; తమ వారలు= తమ దిక్కువారు; ఎదిరివారలు+అని= శత్రువులు అని; నిరూపింపన్= తెలిసికొనుటకు; అశక్యంబు= వీలుగానిది; అగుటయున్= కాగా; ద్రోణ దుర్యోధనులు; సమరంబు= యుద్ధం; చాలించి= ఆపి; వాహినులన్= సైన్యాలను; తివియించినన్= వెనుకకు మరల్చగా; తిరంబు+ఐ= స్థిరుడై; ధనంజయుండును= అర్జునుడు కూడా; జయ= జయధ్వానాలు; తూర్య= వాద్యాల; స్వనంబులును= ధ్వనులును; పాంచాల= పాంచాలురు; కేకయ= కేకయదేశీయులు; ఆది= మొదలైన; బంధు= చుట్టాల; మిత్ర= స్నేహితుల; ప్రశంసా= పొగడే; వచనంబులును= మాటలును; వీనులన్= చెవులలో; పొలయన్= చొరగా; తన= తన యొక్క; బలంబులన్= సేనలను;

మరల్చి= వెనుకకు త్రిప్పి; ధర్మనందనున్= ధర్మరాజును; కొలిచి= సేవించి; చనియెన్= వెళ్ళాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; రెండు సేనలున్= రెండు సైన్యాలు కూడ; తమ తమ= వారి వారి; విడిదలలకున్= శిబిరాలకు; అరిగి= పోయి; యథా+ఉచిత= తగిన; వ్యాపారంబుల నుండి= పనులలో ఉండి; నాఁటి రాత్రి= ఆ రాత్రి; చనినన్= గడువగా; మఱునాఁడు= మరుసటి దినమున.

తాత్పర్యం: కౌరవవీరులు ఒక్కుమ్మడిగా ద్రోణుడికి తోడై సైన్యాలతో అర్జునుడిని చుట్టుముట్టగా, ఆ వీరుడు ఘోర రూపంతో భయం గొలిపే గాండీవ ధ్వనులు అంతటా క్రమంగా వ్యాపించగా వాడిగల బాణజాలాన్ని కురిపించి, పుర్రెలనే రాళ్లు, క్రొవ్వు, మాంసం అనే బురద, ఎముకల పొడి అనే ఇసుక గల రక్తనదులను ప్రవహింపజేశాడు. అంతలో సూర్యుడు అస్తమించగా, అర్జునుడి బాణాంధకారానికి తోడు సంధ్యా సమయం వ్యాపించగా, కురు సైన్యాలకు తమ వారు, ఎదుటి వారు అని తెలిసికొన వీలుగాక, ద్రోణ దుర్యోధనులు యుద్ధం ఆపి సైన్యాలను వెనుకకు మరల్చారు. అర్జునుడు స్థిరుడై, జయధ్వానాలు, తూర్యస్వనాలు, బంధుమిత్రుల ప్రశంసలు వినిపించగా తన సైన్యాలను మరల్చి, ధర్మజుడిని సేవించి వెళ్ళాడు. ఈ విధంగా రెండు సైన్యాలు తమ తమ శిబిరాలకు చేరి, ఆయా పనులలో నిమగ్నమయ్యాయి. ఆ రాత్రి గడువగా మరునాడు.

విశేషం: అలం: రూపకం.

క. **రేపకడ యుభయ బలములు । నేపును నెలమియును నెసకమెసఁగ వెడలి యా**
టోపంబున రణ సన్నా । హోపక్రమలీల మెఱయ నుజ్జ్వల భంగిన్. **214**

ప్రతిపదార్థం: రేపకడ= ప్రాతఃకాలంలో; ఉభయ బలములున్= కౌరవ, పాండవ సేనలు రెండును; ఏపునున్= ఆధిక్యం; ఎలమియును= వికాసం; ఎసకము= విజృంభణం; ఎసఁగన్= పెరుగగా; వెడలి= బయలుదేరి; ఆటోపంబునన్= సంభ్రమంతో; రణ= యుద్ధము యొక్క; సన్నాహ= ప్రయత్నానికి; ఉపక్రమ= ప్రారంభించే; లీల= విలాసం; ఉజ్జ్వల భంగిన్= గొప్పనైన విధంగా; మెఱయన్= ప్రకాశించగా.

తాత్పర్యం: ప్రాతఃకాలంలో పాండవ కౌరవ సైన్యాలు పెంపు, వికాసం, విజృంభణ అతిశయించగా బయలుదేరి, సంభ్రమంతో యుద్ధ ప్రయత్నం ప్రారంభించే విలాసం బాగా వెలుగగా.

వ. **ఉన్న సమయంబున లజ్జా విషాదంబులు మొగంబునం దోఁప ద్రోణుండు దుర్యోధనున కిట్లనియె.** **215**

ప్రతిపదార్థం: ఉన్న సమయంబునన్= మెరుస్తున్నప్పుడు; లజ్జా విషాదంబులు= సిగ్గు, శోకం; మొగంబునన్= ముఖంపై; తోఁపన్= కనిపించగా; ద్రోణుండు= ద్రోణుడు; దుర్యోధనునకున్= దుర్యోధనుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: రెండు సైన్యాలు యుద్ధ సన్నాహంతో మెరుస్తునప్పుడు-సిగ్గు, దుఃఖం ముఖంపై కనిపించగా ద్రోణుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

చ. **'నరవర! మున్న చెప్పితి రణంబున నర్జునుఁ డొద్దనున్న నె**
వ్వరికిని ధర్మసూనుఁ బొదువంగ నశక్య; మొకండు పార్థు ను
ద్ధురుఁ డయి నేల వాపికొని దోర్బల మొప్పఁగఁ బోవఁ జాలినన్
వెరవునఁ బట్టెదం బరులు వేవురు మార్కొనినం గలంచెదన్. **216**

ప్రతిపదార్థం: నరవర!= దుర్యోధన మహారాజా!; మున్ను+అ= మొదటే; చెప్పితి= చెప్పాను; రణంబునన్= యుద్ధంలో; అర్జునుఁడు= అర్జునుడు; ఒద్దన్+ఉన్నన్= దగ్గరున్నచో; ఎవ్వరికిని= ఎంతటివాడికి గూడ; ధర్మసూనున్= ధర్మరాజును; పొదువంగన్= ఆక్రమించటానికి; అశక్యము= వీలుకాదు; ఒకండు= ఒక వీరుడు; పార్థున్= అర్జునుడిని; ఉద్ధురుఁడు+అయి= పరాక్రమోపేతుడై; నేల+పాపికొని= యుద్ధభూమి నుండి తొలగించుకొని; దోర్బలము= బాహుబలం; ఒప్పఁగన్= ఒప్పునట్లు; పోవన్+చాలినన్= పోగలిగితే; పరులు= ఇతరులు; వేవురు= వేయిమంది; మార్కొనిన్= ఎదుర్కొన్నా; కలంచెదన్= కలచివేస్తాను; వెరవునన్= ఉపాయంగా; పట్టెదన్= బంధిస్తాను.

తాత్పర్యం: 'దుర్యోధన మహారాజా! అర్జునుడు దగ్గర ఉన్నప్పుడు ధర్మరాజును బంధించటం ఎవరి వలన కూడా కాదని మొదటే చెప్పాను. వీరు డెవడైనా ఒకడు పరాక్రమంతో యుద్ధభూమి నుండి అర్జునుడిని దూరంగా కొనిపోతే, ధర్మజుడిని ఉపాయంగా పట్టుకొంటాను. ఇతరులు వెయ్యిమంది ఎదుర్కొన్నా ముప్పుతిప్పలు పెట్టుతాను.

ద్రోణాచార్యుల రెండవ నాఁటి యుద్ధము (సం. 7-16-3)

ఆ. **నరుఁడు లేని చోట ననుఁ గని వెన్నిచ్చి । పాఱకున్నఁ బట్టువడియెఁ గాఁగఁ**
దలఁపు ధర్మపుత్త్రు ధరణీశ! పాఱుట । గలిగెనేని నంత కంటె మేలు.' **217**

ప్రతిపదార్థం: ధరణీశ!= దుర్యోధన మహారాజా!; నరుఁడు= అర్జునుడు; లేనిచోటన్= లేని స్థలంలో; ననున్= నన్ను; కని= చూచి; వెన్ను+ఇచ్చి= వెన్నుభాగం చూపి; పాఱకున్నన్= పారిపోకుంటే; పట్టు+పడియెన్+కాఁగన్= పట్టుపడినట్లుగా; తలఁపు= భావించుము; ధర్మపుత్త్రు= ధర్మరాజు; పాఱుట+కలిగెన్+ఏనిన్= పారిపోవటమే జరిగితే; అంతకంటె మేలు= అంతకంటె మంచిది.

తాత్పర్యం: దుర్యోధన మహారాజా! అర్జునుడు లేనిచోట నన్ను చూచి పారిపోకుంటే ధర్మజుడు పట్టువడ్డట్టే అని భావించుము. అతడు పారిపోతే అంతకంటె మంచిది.'

వ. **అనిన విని సుశర్మ దుర్యోధనున కిట్లనియె.** **218**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; సుశర్మ= త్రిగర్తాధిపుడైన సుశర్మ; దుర్యోధనునకున్= దుర్యోధనుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ద్రోణు డిట్లనగా సుశర్మ దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

క. **'ఆ నరుఁ డెప్పుడు మము నవ । మానించుచు నునికిఁ జేసి మనుజేశ్వర! కో**
పానలము సంతతము మా । మానసములఁ బొదువ నతని మార్కొను కడఁకన్. **219**

ప్రతిపదార్థం: మనుజేశ్వర!= దుర్యోధన మహారాజా!; ఆ నరుఁడు= ఆ అర్జునుడు; ఎప్పుడున్= ఎల్లవేళల; మమున్= మమ్ములను; అవమానించుచున్+ఉనికిన్+చేసి= అవమానిస్తుండటం చేత; కోప+అనలము= క్రోధమనే అగ్ని; సంతతము= ఎల్లవేళలా; మా= మా యొక్క; మానసములన్= మనస్సులను; పొదువన్= ఆక్రమించగా; అతనిన్= ఆ అర్జునుడిని; మార్కొను= ఎదుర్కొనే; కడఁకన్= పూనికతో.

తాత్పర్యం: 'ఓ దుర్యోధన మహారాజా! ఆ అర్జునుడు ఎల్లప్పుడూ మమ్ములను అవమానిస్తుండటం వలన కోపమనే అగ్ని ఎల్లవేళలా మా మనస్సులను ఆక్రమించగా, అతడిని ఎదుర్కొనే ప్రయత్నంతో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. తమకించుచుందుము. నీకు బాస యిచ్చి పెద్ద కాలంబయ్యె; నేఁడు రణభూమియందు నర్జునుం డొండెఁ द్రిగర్తు లొండెం గావలయు; నే మతనిఁ బెద్ద కయ్యంబులోనం బాపికొని పోవుట నీ చిత్తంబునకు వచ్చున కాదె.' యనవుడు నతని తమ్ములు సత్యవ్రతుండును సత్యకర్ముండును సత్యవర్ముండును నిబ్బంగిన పలికిరి; వారల పక్షంబైన రథిక వర్గంబు నత్తెఱంగున నియ్యకొని యుల్లసిల్లె; నిమ్మెయిం ద్రిగర్తులు పదివేవురు దొరలు గడంగినం గని తుండికేరళ మాళవ శిలీంధ్ర మగధ మచ్ఛిల్లికాది దేశాధీశులును, బంధు మిత్త్రసహితంబుగా నివ్విధంబున వారి తోడి వారై పంతంబులు పలికి యుబ్బునం బొంగి; రిట్లప్పరుసున నగణ్య రథికోత్తము లుత్సహించి కృతస్నానులై యగ్నులం బూజించి తత్సన్నిధి సర్వయోధులు నాకర్ణింప నందఱు నిట్లనిరి. 220

ప్రతిపదార్థం: తమకించుచుందుము= త్వరపడుతుంటాము; నీకున్= దుర్యోధనుడవగు నీకు; బాస+ఇచ్చి= మాట ఇచ్చి; పెద్దకాలంబు+అయ్యెన్= చాలా కాలం అయింది; నేఁడు= ఈ రోజు; రణభూమి అందున్= యుద్ధరంగంలో; అర్జునుండు= అర్జునుడు; ఒండెన్= అయినా; త్రిగర్తులు+ఒండెన్= త్రిగర్తులైనా; కావలయున్= ఉండాలి; ఏము= మేము; అతనిన్= ఆ అర్జునుడిని; పెద్ద= గొప్ప; కయ్యంబులోనన్= యుద్ధంలో; పాపికొని పోవుట= దూరంగా కొనిపోవటం; నీ చిత్తంబునకున్= నీ మనస్సుకు; వచ్చున్+అ కాదె!= వచ్చిందేకదా!; అనవుడున్= అనగా; అతని తమ్ములు= ఆ సుశర్మ తమ్ములు; సత్యవ్రతుండును= సత్యవ్రతుడు; సత్యకర్ముండును= సత్యకర్ముడు కూడ; ఇబ్బంగిన్+అ= ఈ విధంగానే; పలికిరి= అన్నారు; వారల= వారి; పక్షంబైన= వైపుగల; రథికవర్గంబున్= రథసేనను నడిపేవారి సమూహం కూడా; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఇయ్యకొని= అంగీకరించి; ఉల్లసిల్లెన్= సంతసించింది; ఈ+మెయిన్= ఈ తీరున; త్రిగర్తులు= త్రిగర్త దేశానికి చెందిన; పదివేవురు= పదివేల మంది; దొరలు= అధిపతులు; కడంగినన్= పూనుకోగా; కని= చూచి; తుండి= తుండి; కేరళ; మాళవ; శిలీంధ్ర; మగధ; మచ్ఛిల్లక; ఆది= మొదలైన; దేశాధీశులును= దేశాధిపతులును; బంధు= చుట్టాల; మిత్ర సహితంబుగాన్= స్నేహితులతో కూడి; ఈ+విధంబునన్= ఈ విధంగా; వారి= త్రిగర్తుల; తోడివారై= అనుయాయులై; పంతంబులు= ప్రతిజ్ఞలు; పలికి= చేసి; ఉబ్బునన్= ఉత్సాహంతో; పొంగిరి= విజృంభించారు; ఇట్లు= ఈ విధంగా; ఆ+పరుసునన్= ఆ రీతిగా; అగణ్య= లెక్కించరాని; రథిక+ఉత్తములు= రథికులలో శ్రేష్ఠులు; ఉత్సహించి= ఉత్సాహాన్ని పొంది; కృతస్నానులు+ఐ= స్నానాలు చేసి; అగ్నులన్= గార్హపత్యం మొదలైన అగ్నులను; పూజించి= అర్చించి; తద్+సన్నిధి= ఆ అగ్నుల సమీపంలో; సర్వయోధులున్= వీరులందరును; ఆకర్ణింపన్= వినగా; అందఱున్= రథికులంతా; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: 'మేము అర్జునుడిని ఎదుర్కోవాలని ఉబలాటపడుతుంటాము. నీకు మాట ఇచ్చి కూడా చాలా కాలం అయింది. నేడు యుద్ధరంగంలో అర్జునుడైనా ఉండాలి లేదా త్రిగర్తులైనా ఉండాలి. మేము అర్జునుడిని పెద్ద యుద్ధంనుండి తొలగించుకొనిపోవడం నీ కిష్టమైనదే కదా' అనగా, అతడి తమ్ములైన సత్యవ్రతుడు, సత్యకర్ముడు, సత్యవర్ముడు కూడా అదే మాట అన్నారు. వారివైపు గల రథికులంతా దాని కంగీకరించి సంతోషించారు. ఈ విధంగా పదివేలమంది త్రిగర్తాధిపులు సంసిద్ధులు కాగా, కేరళ, మాళవ, శిలీంధ్ర, మగధ, మచ్ఛిల్లికాది దేశాధిపతులు తమ బంధుమిత్రులతో బాటు వారికి తోడ్పడుతూ, శపథాలు చేసి, పొంగిపోయారు. ఇట్లా అసంఖ్యాకులైన రథిక శ్రేష్ఠులు ఉత్సాహంతో స్నానాలు చేసి, అగ్నిహోత్రాలను పూజించి, వాటి సమీపంలో వీరులంతా వినగా అందరూ ఇట్లా అన్నారు.

సీ. 'అర్జునుఁ జంపుదు మతని కోడితిమేని । గోవధంబును వనితా వధంబు
బ్రహ్మవధంబును బరదార గమనంబు । బ్రహ్మస్వ హరణంబుఁ బరధనాప
హరణంబు గురుజన త్యాగంబు శరణాగ । తారక్షణము నన్నృతాభిరతియు
మద్యపానము నర్థిమానవవైముఖ్య । మును గృహదాహంబు జనుల నెట్టి

ఆ. గతులఁ బుచ్చు నట్టి గతులు వాటిలు నక్కి । రీటి కోలుతలకు నోట లేక
దురము సేసి తగిన తుది గన్న పుణ్యాత్మ । కలితగతుల మేలు గలుగు మాకు.' 221

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అర్జునున్= అర్జునుడిని; చంపుదుము= చంపుతాము; అతనికిన్= అతడితో; ఓడితిమి+ఏనిన్= ఓడిపోతే; గోవధంబును= ఆవును చంపటం; వనితావధంబు= స్త్రీని చంపటం; బ్రహ్మవధంబును= బ్రాహ్మణుడిని చంపటం; పర= ఇతరుడి;దార= భార్యను; గమనంబు= పొందటం; బ్రహ్మస్వ= బ్రాహ్మణుల ధనం; హరణంబున్= దోచుకొనటం; పర= ఇతరుల; ధన= ధనాన్ని; అపహరణంబు= దొంగిలించటం; గురుజన= తల్లిదండ్రులను, పెద్దలను; త్యాగంబు= వదిలిపెట్టటం; శరణాగత= శరణు పొందిన వారిని; అరక్షణము= కాపాడకుండటం; అనృత= అసత్యంపై; అభిరతి= అభిలాష; మద్యపానమున్= కల్లు త్రాగటం; అర్థి=యాచకులైన; మానవ= మనుష్యుల యెడ; వైముఖ్యమును= విముఖతయు; గృహదాహంబు= ఇల్లు కాల్చటం; జనులన్= ప్రజలను; ఎట్టి= ఎటువంటి; గతులన్= చెడుత్రోవలకు; పుచ్చున్= తీసికొనిపోవునో; అట్టి గతులు= అట్టి దుర్గతులు; వాటిలున్= కలుగుతాయి; ఆ+కిరీటి= ఆ అర్జునుడితో; కోలుతలకున్= ఎదురు నిలిచి యుద్ధం చేయటానికి; ఓట= భయం; లేక= లేకుండ; దురము+చేసి= యుద్ధంచేసి; తుది+కన్న= మరణించినట్టి; పుణ్యాత్మ కలిగతుల మేలు= పుణ్యాత్ములు పొందే మేలు; మాకున్+కలుగున్= మాకు కలుగుతుంది.

తాత్పర్యం: 'మేమంతా అర్జునుడిని హతమారుస్తాము. అతడిచేత ఓడిపోతే-గోవధ, స్త్రీవధ, బ్రాహ్మణవధ, పరభార్యాగమనం, బ్రాహ్మణ వృత్తుల హరణం, పరధనాపహరణం, పెద్దలను దూరం చేయటం, శరణాగతుడిని రక్షించకపోవటం, అసత్యమాడటం, కల్లు త్రాగటం, యాచకులైన మనుష్యుల యెడ విముఖంగా ఉండటం, గృహాలను దహించటం వంటి దుష్కర్మలు చేసినవారు ఎట్టి దుర్గతి పాలౌతారో అట్టి దుర్గతిని పొందగలము. అర్జునుడికి భయపడక యుద్ధంలో ఎదుర్కొని సాహసాన్ని ప్రదర్శించి హతమైతే పుణ్యాత్ములకు కలిగే మేలు మాకు కలుగుతుంది.'

విశేషం: 'దురముసేసి తగిన....' అని దీనికి వావిళ్ళవారి ప్రతిలోను, తెలుఁగు విశ్వవిద్యాలయ ప్రతిలోను పాఠాంతరం ఉన్నది. అది 'దుష్కరంబు సేసి'. అనఁగా - 'చేయశక్యం కాని పనిని - అనగా అర్జునుడితో యుద్ధమును - చేసి' అని అర్థం.

వ. **అని సంశాపంబులు పలికి సంశప్తకు లనేక రథికముఖ్యులు బహుళ చతురంగ బలపరివృతులై కురురాజు సంతసిల్ల నుల్లాసంబునం జనిరి; గురుండును గరుడవ్యూహంబు సమకట్టి, దానికిఁ జంచువై తాను నిలిచె; దుర్యోధనుండును దమ్ములుం దలయును, గృప కృతవర్మలు గన్నులును, సింహళాభీర శూరసేన కేకయ ప్రముఖులు మెడయును, బాహ్లిక భూరిశ్రవస్సోమదత్త శల శల్యులు వలపలి ఱెక్కయు, నశ్వత్థామ సుదక్షిణ విందానువిందులు దాపలి ఱెక్కయు, శకుని పౌండ్ర కళింగాంబష్ఠమాగధులు వెన్నును, నానాజనపదసేనా సమన్వితుండై సూతపుత్త్రుండు పుచ్ఛంబును, సైంధవాది వివిధ దేశాధీశులు నెడనెడం గలయన్ బెరసి యొడలి పొలుపును బలుపునునై నిలువ నియోగించిన నమ్మోహరంబు మహాపవన సముద్ధూత సాగరాకారంబై యుత్సాహ నృత్యంబు సేయు చందంబునం జూడనొప్పె నందు మధ్యమ ప్రదేశంబున భగదత్తుండు గజారూఢుండై యుదయాచలంబుపైఁ బొలుచు భానుండునుంబోలెఁ దేజరిల్లుచునుండె నంత నక్కడం ద్రిగర్తాదులు పాండవసేన దక్షిణ దిక్కునకుం జని సమరంబునకు సవ్యసాచిం దొలంగం బిలుచుటయు నన్నర శార్దూలుం డన్నతో నిట్లనియె.** **222**

ప్రతిపదార్థం: అని= సుశర్మాదులు పైవిధంగా అని; సంశాపంబులు= శపథాలు; పలికి= చేసి; సంశప్తకులు= వెనుదిరుగమని ఒట్టు పెట్టుకొన్నవారు; అనేక= చాలామంది, రథిక ముఖ్యులు= రథిక శ్రేష్ఠులు; బహుళ= అధికమైన; చతురంగబల= రథ, గజ, తురగ, పదాతి దళాలతో; పరివృతులు+ఐ= చుట్టబడినవారై; కురురాజు= దుర్యోధనుడు; సంతసిల్లన్= సంతోషించగా; ఉల్లాసంబునన్= ఉత్సాహంతో; చనిరి= పోయారు; గురుండును= ద్రోణాచార్యుడును; గరుడ వ్యూహంబు= గరుడాకారమైన మొగ్గరము; సమకట్టి= ఏర్పరచి; నిలబడ్డాడు; దుర్యోధనుండును; తమ్ములున్= అతడి తమ్ములు; తలయును= శిరస్సుగా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కృపకృతవర్మలు= కృపాచార్యుడు, కృతవర్మ; కన్నులును= కన్నులుగా; సింహళ= సింహళదేశపు; ఆభీర= ఆభీర దేశపు; శూరసేన= శూరసేన దేశపు; కేకయ= కేకయ దేశపు; ప్రముఖులు= ముఖ్యయోధులు; మెడయును= మెడగా; బాహ్లిక; భూరిశ్రవస్; సోమదత్త; శల; శల్యులు; వలపలి ఱెక్కయున్= కుడిరెక్కగా; అశ్వత్థామ; సుదక్షిణ; విందు; అనువిందులు; దాపలి ఱెక్కయున్= ఎడమరెక్కగా ; శకుని; పౌండ్ర; కళింగులు; అంబష్ఠ; మాగధులు; వెన్నును= వీపుగా; నానా= అనేకమైన; జనపద= గ్రామప్రాంతాల; సేనా= సైన్యములతో; సమన్వితుండు+ఐ= కూడినవాడూ; సూతపుత్రుండు= కర్ణుడు; పుచ్ఛంబును= తోకగా; సైంధవ+ఆది= సైంధవుడు మొదలైన; వివిధ అనేకులైన; దేశ+అధీశులు= దేశాధిపతులు; ఎడన్+ఎడన్= అక్కడక్కడ; కలయన్+బెరసి= కలిసేటట్లు వ్యాపించి; ఒడలి= శరీరపు; పొలువును= స్థైర్యము; బలుపునున్+ఐ= బలంగా; నిలువన్; నియోగించినన్= నియమించగా; ఆ+మోహరంబు= ఆ వ్యూహం; మహాపవన= గొప్ప వాయువుచేత; సముద్ధూత= కల్లోలితమైన; సాగర+ఆకారంబు+ఐ= సముద్రపు రూపం కలదై; ఉత్సాహ నృత్యంబు= ఉత్సాహంతో నాట్యం; చేయు చందంబునన్= చేస్తున్నట్లు; చూడన్+ఒప్పెన్= చూడటానికి తగి ఉండినది; అందున్= ఆ వ్యూహంలో; మధ్యమప్రదేశంబునన్= నడిమిభాగంలో; భగదత్తుండు; గజ+ఆరూఢుండు+ఐ= ఏనుగుపై ఎక్కినవాడై; ఉదయ+అచలంబుపయిన్= ఉదయాద్రిమీద; పొలుచు= ఒప్పు; భానుండునున్= సూర్యుని; పోలెన్= వలె; తేజరిల్లుచున్+ఉండెన్= ప్రకాశిస్తున్నాడు; అంతన్= అపుడు; అక్కడన్= అచట; త్రిగర్తాదులు= సుశర్మాదులు; పాండవసేన= పాండవసేనయొక్క; దక్షిణ దిక్కునకున్= దక్షిణపు వైపునకు; చని= వెళ్ళి; సమరంబునకున్= యుద్ధానికి; సవ్యసాచిన్= అర్జునుడిని; తొలంగన్+పిలుచుటయున్= తొలగుటకై పిలువగా; ఆ+నరశార్దూలుండు= ఆ నరశ్రేష్ఠుడు అర్జునుడు; అన్నతోన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పై విధంగా ప్రతిజ్ఞలు చేసి సంశప్తకులు, అనేక యోధులు చతురంగ బలాలతో దుర్యోధనుడు సంతసిల్లగా ఉత్సాహంతో బయలుదేరారు. ద్రోణుడు గరుడవ్యూహం ఏర్పరచి; అందులో ముక్కుగా తాను నిలబడ్డాడు. దుర్యోధనుడు, అతడి తమ్ములు తలగా; కృప, కృతవర్మలు కన్నులుగా; సింహళులు, ఆభీర, శూరసేన, కేకయ దేశప్రముఖులు మెడగా; బాహ్లిక, భూరిశ్రవస్, సోమదత్త, శల, శల్యులు కుడిరెక్కగా; అశ్వత్థామ, సుదక్షిణ, విందానువిందులు ఎడమ రెక్కగా; శకుని, పౌండ్ర, కళింగ, అంబష్ఠ, మాగధులు వెన్నుగా; నానాజనపదసేనలతో కర్ణుడు తోకగా; సైంధవాది వివిధ దేశాధిపతులు అటనట కలయవ్యాపించగా, దేహసౌష్ఠవానికి, బలానికి తగినట్లు నియమించాడు. అపుడు ఆ వ్యూహం ఝంఝూమారుతం వలన మిక్కిలి ఉప్పొంగిన సముద్రంవంటి రూపం కలదై, ఉత్సాహంతో నాట్యం చేసినట్లు కనిపించింది. ఆ వ్యూహంలో నడిమి భాగాన భగదత్తుడు ఏనుగునెక్కి, పొడుపు కొండమీద వెలిగే సూర్యుడివలె ప్రకాశిస్తున్నాడు. అపుడు అక్కడ త్రిగర్తాధిపతి అయిన సుశర్మ మొదలైన సంశప్తకులు పాండవసేనకు దక్షిణంగా వెళ్ళి ఆ యుద్ధం నుండి తొలగునట్లు తమతో యుద్ధానికై రావలసినదిగా అర్జునుడిని పిలవగా, అతడు ధర్మజుడితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

చ. **'తఱిమి సుశర్మ దమ్ములును దానును నాజికి నన్నుఁ బిల్వ నే**
నెఱుఁగని యట్టు లుండు టిది యే పురుషార్థము? వారి నెల్ల నే
డ్తెఱ నుఱుమాడఁ బంపుము; కడిందిగఁ జూడకు; నీకు నేమియుం
గలగొలఁ గాదు; పోమి గడుఁగష్టము నాకు నుదాత్తమానసా!' **223**

ప్రతిపదార్థం: ఉదాత్తమానసా!= గొప్ప మనస్సుగల ధర్మరాజా!; తఱిమి= ఉరువడిగా; సుశర్మ; తమ్ములును= తమ్ములూ; తానును= తానూ; ఆజికిన్= యుద్ధానికి; నన్నున్= నన్ను; పిలువన్= పిలువగా; ఏన్= నేను; ఎఱుఁగని+అట్టులు= తెలియనట్లు;

ఉండుట= ఉండటం; ఇది; ఏ పురుషార్థము?= ఏ పురుష ప్రయోజనం?; వారిని+ఎల్లన్= వారందరిని; ఏడ్తెఱన్= పరాక్రమంతో; నుఱుమాడన్= వధించటానికి; పంపుము= పంపించుము; కడిందిగన్= అసాధ్యమైనదిగా, చూడకు(ము)= భావించకుము; నీకున్= నీకునూ; ఏమియున్= ఏ విధమైన; కఱగొఱ కాదు= లోపం రాదు; పోమి= పోకుండటం; నాకున్= నాకునూ; కడున్= మిక్కిలి; కష్టము= బాధాకరం.

తాత్పర్యం: 'గొప్ప హృదయంగల ధర్మజా! సుశర్మ, అతని తమ్ములు నన్ను యుద్ధానికి పిలువగా వినన ట్లుండటం ఏ పురుషార్థమూ కాదు. కాబట్టి వారినందరిని పరాక్రమించి వధించటానికి నన్ను పంపించుము. ఇది నాకు అసాధ్యమైనదిగా భావించకుము. నీకే లోపమూ రాదు. పోకపోవటం నాకు కష్టాన్ని కలిగిస్తుంది.'

వ. అనుటయు నయ్యుధిష్ఠిరుండు. 224

ప్రతిపదార్థం: అనుటయున్= అర్జునుడు ఇట్లనగా; ఆ యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు.

తాత్పర్యం: అర్జునుడు ఇట్లా అనగా ధర్మరాజు అపుడు.

తే. 'గురుని బల శౌర్యములు నెఱుంగుదుము; మనకు । నతని పూనికి బొంకు సేయంగవలయు;
దీని కెయ్యది కార్యంబు దాని నీవు । బుద్ధి నుచితంబుగాఁ దలపోయు'మనుడు. 225

ప్రతిపదార్థం: గురుని= ద్రోణాచార్యుడి; బలశౌర్యములు= బలం, వీరత్వం; ఎఱుంగుదుము= తెలిసినవాళ్ళం; అతని= ద్రోణుడి; పూనికి= ప్రయత్నం; బొంకు= అసత్యం; చేయంగన్ వలయున్= చేయాలి; దీనికిన్= ప్రతిజ్ఞను భంగపరచటానికి; మనకున్; ఏ+అది= ఏది; కార్యంబు= చేయదగింది; దానిన్= దానిని; ఈవు= నీవు; బుద్ధిన్= మనస్సులో; ఉచితంబుగాన్= తగినవిధంగా; తలపోయుము= యోచించుము; అనుడున్= అనగా.

తాత్పర్యం: 'ద్రోణాచార్యుడి బలశౌర్యాలు మనకు తెలియనివి కావు. అతడి ప్రతిజ్ఞను మనం వమ్ము చేయాలి. దానికి తగిన విధంగా మనస్సులో ఆలోచించుము' అనగా.

వ. ధనంజయుం డతని కిట్లనియె. 226

ప్రతిపదార్థం: ధనంజయుండు= అర్జునుడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు.

చ. 'పిలిచినఁ బోవకుండు టిది బీదతనం బగుఁ గాన నేర్పుగాఁ
దలఁపదు లోక; మే నరివధం బొనరింపఁగ నెట్లుఁ బోయెదం
జలము బలంబు ధైర్యమును శౌర్యమునుం గలవాఁడు వీఁడు నేఁ
డలఘుఁడు కుంభసంభవుని నాఁగు భవత్పరిరక్షణార్థి యై.' 227

ప్రతిపదార్థం: పిలిచినన్= పిలవగా; పోవకుండుట= పోకుండటం; ఇది; బీదతనంబు= పిరికితనం; అగున్= అవుతుంది; కానన్= కనుక; నేర్పుగాన్= సమర్థమైనదిగా; లోకము= లోకం; తలఁపదు= అనుకొనదు; ఏన్= నేను; అరివధంబు= శత్రు సంహారం; ఒనరింపఁగన్= చేయుటానికి; ఎట్లున్= ఎట్లైనా; పోయెదన్= పోతాను; వీఁడు= ఈ సత్యజిత్తు; చలము= మాత్సర్యం; బలంబు= శక్తి; ధైర్యమును= ధైర్యం; శౌర్యమునున్= శౌర్యం కూడ; కలవాఁడు= కలిగినవాడు; అలఘుఁడు= గొప్పవాడు; నేఁడు= ఈ వేళ; భవత్= తమ యొక్క; పరిరక్షణ+అర్థి+ఐ= కాపాడుటకై; కుంభసంభవునిన్= ద్రోణుడిని; ఆఁగున్= అడ్డుకొనును.

తాత్పర్యం: 'శత్రువులు యుద్ధానికి ఆహ్వానిస్తే పోకపోవటం పిరికితనం. దీనిని లోకం మెచ్చదు. నేను శత్రువులను సంహరించడానికి ఎట్లైనా పోతాను. ఈ సత్యజిత్తు మాత్సర్యం, శక్తి, ధైర్యం ఉన్నవాడు; గొప్పవాడు. నేడు నిన్ను రక్షించి ద్రోణుడిని అడ్డుకొనటానికి ఇతడు కడు సమర్థుడు.'

వ. అని పాంచాలవరుం డగు సత్యజిత్తుం జూపి. 228

ప్రతిపదార్థం: అని= ఇట్లని; పాంచాల వరుండగు= పాంచాలదేశపు వీరశ్రేష్ఠుడైన; సత్యజిత్తున్= సత్యజిత్తును; చూపి= చూపించి.

తాత్పర్యం: అని పాంచాలదేశపు వీరశ్రేష్ఠుడైన సత్యజిత్తును చూపించి.

క. ఇతఁ డున్న యంతసేపును। మతి నేమియు వెఱవవలదు మార్తుర చేతన్;
హతుఁ డయ్యెనేని నిలుచుట। చతురతగా దనికిఁ దొలఁగి చనవలయు నృపా!' 229

ప్రతిపదార్థం: నృపా!= ధర్మరాజా!; ఇతఁడు= ఈ సత్యజిత్తు; ఉన్న+అంతసేపును= బ్రతికి ఉన్నంత సేపు; మతిన్= మనస్సులో; ఏమియున్= ఏమాత్రం; వెఱవవలదు= భయపడవద్దు; మార్తుర చేతన్= శత్రువులచేత; హతుఁడు+అయ్యెన్+ఏనిన్= చనిపోతే; నిలుచుట= యుద్ధంలో నిలవటం; చతురత+కాదు= నేర్పరితనం కాదు; అనికిన్= యుద్ధం నుండి; తొలఁగి= ప్రక్కకు జరిగి; చనవలయున్= వెళ్ళిపోవాలి.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఈ సత్యజిత్తు ఉన్నంతసేపూ నీ వేమాత్రం భయపడవలసిన అవసరం లేదు. ఒకవేళ ఇతడు శత్రువుల చేత హతుడైతే నీవు యుద్ధంలో నిలువటం నేర్పరితనం కాదు. వెంటనే యుద్ధం నుండి తప్పుకొనటం మేలు.

అర్జునుఁడు ధర్మరాజుచే ననుజ్ఞాతుం డై సంశప్తకులపైఁ బోవుట (సం. 7-16-14)

తే. అనిన నొడఁబడి యట్లకా కనుడు నన్న। రేంద్రునకు భక్తి మ్రొక్కి సురేంద్రపుత్త్రుఁ
డతనిచేత దీవన గొని యవ్విరోధు। లున్న దెస కేఁగె సంతోష ముత్కటముగ. 230

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఒడఁబడి= ఒప్పుకొని; అట్ల+అ+కాక= అట్లే అని; అనుడున్= అనగా; ఆ+నరేంద్రునకున్= ఆ ధర్మరాజుకు; భక్తిన్= భక్తితో; మ్రొక్కి= నమస్కరించి; సుర+ఇంద్రసుతుఁడు= దేవేంద్రుడి పుత్రుడైన అర్జునుడు; అతని చేతన్= ఆ ధర్మజుడితో; దీవన+కొని= ఆశీస్సు పొంది; సంతోషము= సంతసం; ఉత్కటముగన్= పెంపొందగా; ఆ+విరోధులు= ఆ శత్రువులు; ఉన్నదెసకున్= ఉన్న వైపునకు; ఏఁగెన్= పోయాడు.

తాత్పర్యం: దీనికి ధర్మరాజు అంగీకరించగా, అర్జునుడు అన్నకు భక్తితో మ్రొక్కి, దీవెనలు గొని, సంతోషంతో ఆ శత్రువులున్న వైపునకు వెళ్ళాడు.

వ. ఇట్లు ధర్మజుని యొద్ద వాసి విజయుండు చనుటకు నుబ్బిన మన సైన్యంబులం గనుంగొని యమ్మహీపతి ధృష్టద్యుమ్నుతోఁ 'గౌరవులు గరుడ వ్యూహంబుగా మోహరించిన వారు; దీనికి నీవుం దగ మండలార్ధ వ్యూహంబు సమకట్టు'మని పనిచిన నతం డట్ల చేసె; నివ్విధంబున నుభయవ్యూహంబులును గాఢసన్నాహంబులై శంఖ భేరీ ప్రముఖ తూర్యస్వనంబులు సెలంగ నడు వాన కాలంబునం బొంగిన గంగా యమునలుం బోలె నొండొంటిం దార్కొను సమయంబున నయ్యజాతశత్రుండు ద్రుపదపుత్త్రు నాలోకించి గురుం జూపి. 231

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ధర్మజుని యొద్ద= ధర్మరాజు సమీపం నుండి; పాసి= తొలగి; విజయుండు= అర్జునుడు; చనుటకున్= వెళ్ళినందుకు; ఉబ్బిన= సంతోషించిన; మన సైన్యంబులన్= మన కౌరవ సైన్యాలను; కనుంగొని= చూపి; ఆ+మహీపతి= ఆ ధర్మరాజు; ధృష్టద్యుమ్నుతోన్= ధృష్టద్యుమ్నుడితో; కౌరవులు; గరుడ వ్యూహంబుగాన్= గరుడ వ్యూహరూపంలో; మోహరించినవారు= సైన్యాన్ని కూర్చారు; దీనికిన్= ఈ వ్యూహానికి; నీవున్= నీవు కూడా; తగన్= తగినట్లు; మండల+అర్ధవ్యూహంబు= అర్ధవలయాకారంగా తీర్చిన వ్యూహం; సమకట్టుము+అని= రచించుమని; పనిచినన్= ఆజ్ఞాపించగా; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; అట్లు+అ= ఆ విధంగానే; చేసెన్= చేశాడు; ఆ+విధంబునన్= ఆ రీతిగా; ఉభయ వ్యూహంబులును= రెండు మొగ్గరాలు; గాఢ సన్నాహంబులు+ఐ= బాగా సిద్ధమై; శంఖ= శంఖాలు; భేరీ= దుందుభులు; ప్రముఖ= మొదలైన; తూర్య= వాద్యాల; స్వనంబులు= ధ్వనులు; చెలంగన్= చెలరేగగా; నడువానకాలంబునన్= వానాకాలం మధ్యలో; పొంగిన= ఉప్పొంగిన; గంగాయమునలున్+పోలెన్= గంగా, యమునా నదుల వలె; ఒండు+ఒంటిన్= ఒకదాని నొకటి; తార్కొను=ఎదుర్కొనే; సమయంబునన్= వేళలో; ఆ+అజాతశత్రుండు= ఆ ధర్మరాజు; ద్రుపదపుత్రున్= ధృష్టద్యుమ్నుడిని; ఆలోకించి= చూచి; గురున్= ద్రోణాచార్యుడిని; చూపి= చూపించి.

తాత్పర్యం: అర్జునుడు ధర్మరాజుకు దూరంగా వెళ్ళాడు. దానికి కౌరవసైన్యం ఉప్పొంగిపోయింది. ధర్మరాజు ధృష్టద్యుమ్నుడితో 'కౌరవులు గరుడవ్యూహం పన్నారు. దానికి దీటుగా నీవు అర్ధమండలాకార వ్యూహం నిర్మించుము' అని ఆజ్ఞాపించాడు. అత డట్లాగే చేశాడు. ఆ విధంగా ఉభయ వ్యూహాలూ సమర్థంగా సన్నద్ధమయ్యాయి. శంఖభేరీమృదంగాది వాద్యాలు మ్రోగాయి. వానకాలం నడుమ ఉప్పొంగే గంగాయమునలవలె రెండుసైన్యాలు ఎదుర్కొనబోయే వేళలో ధర్మరాజు ధృష్టద్యుమ్నుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలంకారం ఉపమ.

క. **'నేఁ డీ బ్రాహ్మణు చేతం । బోఁడిమి సెడి యేను జిక్కిపోవక యుండన్**
వేఁడిమి మెఱయు శరంబుల । వాఁడిమి సొంపెల్లఁ జూప వలయుం జుమ్మీ!' **232**

ప్రతిపదార్థం: ఏను= నేను; నేఁడు= ఈ దినం; ఈ బ్రాహ్మణు చేతన్= బ్రాహ్మణుడైన ఈద్రోణుడిచేత; పోఁడిమి+చెడి= ఒప్పుచెడి; చిక్కిపోవక ఉండన్= పట్టుపడకుండ; వేఁడిమి= ప్రతాపం; మెఱయు= ప్రదర్శించే; శరంబులన్= బాణాలతో; వాఁడిమి= తీక్ష్ణత యొక్క; సొంపు= సమృద్ధిని; ఎల్లన్= అంతయు; చూపవలయున్+చుమ్మీ= చూపించవలెను సుమా!

తాత్పర్యం: 'నే నీనాడు అవమానం పాలై ద్రోణాచార్యుడి చేత చిక్కకుండా, వాడిగల బాణాలతో నీ పరాక్రమాన్నంతా ప్రదర్శించాలి సుమా!'

క. **అనుడు నతఁడు నవ్వుచు ని । ట్లను 'నే నాఁగంగ ద్రోణుఁ డని నిను గదియం**
జనువాఁడె? యింత యేటికి? । నను నీతఁడు గెలువలేఁడు నమ్ము మధీశా!' **233**

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; అతఁడు= ధృష్టద్యుమ్నుడు; నవ్వుచున్= నవ్వుతూ; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అధీశా!= మహారాజా!; నేను; ఆఁగంగన్= నిలువగా; ద్రోణుఁడు; అనిన్= యుద్ధంలో; నినున్= నిన్ను; కదియన్+చనువాఁడె?= దగ్గరికి రాగలడా?; ఇంత+ఏటికిన్?= ఇంతెందుకు?; ననున్= నన్ను; ఈతఁడు= ద్రోణుడు; గెలువలేఁడు= జయించలేడు నమ్ముము= విశ్వసించుము.

తాత్పర్యం: అనగా, ధృష్టద్యుమ్నుడు నవ్వుతూ ఇట్లా అన్నాడు. 'ధర్మరాజా! నేను అడ్డుకొంటే ఆ ద్రోణుడు నిన్ను సమీపిస్తాడా? ఇం తెందుకు? అతడు నన్ను గెలువలేడు. ఇది నిశ్చయం.'

వ. అని పలికి పారావత వర్ణాశ్వ వర్ణనీయ రథుండగు నయ్యతిరథుండు గుంభసంభవునకు సమ్ముఖంబుగా నడుచుటయు, నా ధృష్టద్యుమ్ను దర్శనంబు దనకు నరిష్టం బగుటయు నగ్గురుం డొక్కింత విన్ననై యతని దిక్కు దేఱిచూడం జాలక క్రేడించి పాంచాల బలంబుపై నిశిత విశిఖంబులు పరఁగించుచుం బాయవడ నడరె నంతనక్కడ. 234

ప్రతిపదార్థం: అని పలికి= ఇట్లని పలికి; పారావత= పావురాల; వర్ణ= రంగుగల- బూడిదరంగుగల; అశ్వ= గుర్రాలచేత; వర్ణనీయ= ప్రశంసించదగిన; రథుండు+అగు= రథంగల; ఆ+అతిరథుండు= రథిక శ్రేష్ఠుడగు ధృష్టద్యుమ్నుడు; కుంభసంభవునకున్= ద్రోణుడికి; సమ్ముఖంబుగాన్= ఎదురుగా, నడచుటయున్= నడవగా; ఆ ధృష్టద్యుమ్ను= ఆ ధృష్టద్యుమ్నుడి యొక్క; దర్శనంబు= కనిపించటం; తనకున్= తనకు; అరిష్టంబు+అగుటయున్= కీడు కాగా; ఆ+గురుండు= ఆ ద్రోణాచార్యుడు; ఒక్కింత= కొద్దిగా; విన్ననై= చిన్నవోయి; అతని దిక్కు= ధృష్టద్యుమ్నుడివైపు; తేఱిచూడంజాలక= చక్కగా చూడలేక; క్రేడించి= ప్రక్కకు తొలగి; పాంచాల బలంబుపైన్= పాంచాలుర సైన్యంపై; నిశిత విశిఖంబులు= తీక్ష్ణమైన బాణాలు; పరఁగించుచున్= వేస్తూ; పాయవడన్= చీలేటట్లు; అడరెన్= మించిపోయాడు; అంతన్= అప్పుడు; అక్కడన్= సంశప్తకులపైకి అర్జునుడు యుద్ధానికి పోయినచోట.

తాత్పర్యం: అని ధృష్టద్యుమ్నుడు పలికి, బూడిదరంగుగల అశ్వాలను పూన్చిన అందమైన రథాన్ని ఎక్కి, ఆ మహావీరుడు ద్రోణుడికి ఎదురుగా నడువగా; ఆ ధృష్టద్యుమ్నుడి దర్శనం తనకు కీడు కలిగించేది కావటం వలన ద్రోణాచార్యుడు చిన్నవోయి, అతడి దిక్కు తేరి చూడలేక ప్రక్కకు తొలగి, పాంచాల సైన్యంపై తీవ్రములైన బాణాలను ప్రసరింపజేస్తూ చీల్చుకొని ముందుకు సాగాడు. అప్పుడు అర్జునుడు యుద్ధానికి పోయినచోట. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. క్రీడి యాఁకొనియున్న కేసరి హరిణ చ । యము మీఁదఁ జనునట్లు లా త్రిగర్త
వరులపై నరుగంగ వా రట మున్నర్థ । చంద్రాకృతిగఁ నొడ్డు సంఘటించి
కొనియుండి యాతనిఁ గని ప్రీతి నార్పులు । బొబ్బలుఁ జెలఁగంగఁ బొంగుటయును
జూచుచు నా సవ్యసాచి మందస్మితుఁ । డై కృష్ణుతోడ నిట్లనియెఁ 'జూడు

ఆ. మెక్కుడైన రవము నెసకంపుటుబ్బునఁ । బొదలుచున్నవారు మదము కతన;
నెదిరిఁ దమ్ము నించుకేనియు నెఱుఁగరు । వీరు క్రొవ్వి చావ వేఁడి రకట!' 235

ప్రతిపదార్థం: క్రీడి= అర్జునుడు; ఆఁకొని+ఉన్న= ఆకలిగొన్న; కేసరి= సింహం; హరిణ= జింకల; చయము= గుంపు; మీఁదన్= పైకి; చనునట్టులు= పోయేటట్లు; ఆ త్రిగర్తవరులపైన్= ఆ త్రిగర్తదేశపు వీరులపైకి; అరుగంగన్= పోగా; వారు= ఆ సంశప్తకులు; అటమున్ను+అ= అంతకుముందే; అర్ధచంద్ర+ఆకృతిగన్= అర్ధచంద్రుడి రూపంలో; ఒడ్డు= వ్యూహం; సంఘటించికొని ఉండి= కూర్చుకొని ఉండి; ఆతనిన్= ఆ అర్జునుడిని; కని= చూచి; ప్రీతిన్= సంతోషంతో; ఆర్పులు= అరుపులు; బొబ్బలున్= సింహనాదాలును; చెలగంగన్= రేగగా; పొంగుటయును= ఉబ్బగా; చూచుచున్= చూస్తూ; ఆ సవ్యసాచి= అర్జునుడు; మందస్మితుఁడు+ఐ= చిరునవ్వు గలవాడై; కృష్ణుతోడన్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; చూడుము; ఎక్కుడైన= అధికమైన; రవమున్= ధ్వనులును; ఎసకంపు+ఉబ్బునన్= ఎక్కువైన సంతోషంతో; పొదలుచున్నవారు= అతిశయిస్తున్నారు; మదము= మదం; కతనన్= కారణంగా; ఎదిరిన్= ఎదుటివారిని; తమ్మున్= తమను; ఇంచుక+ఏనియున్= ఏమాత్రం; ఎఱుఁగరు= తెలిసికొనరు; అకట!= అయ్యో! వీరు= ఈ సంశప్తకులు; క్రొవ్వి= బలిసి; చావన్ వేఁడిరి= చావదలచుకొన్నారు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అర్జునుడు ఆకలిగొన్న సింహం లేళ్లగుంపుపై పడినట్లు ఆ సంశప్తకులపైకి పోగా, వారు అంతకుముందే అర్ధచంద్రాకారంలో వ్యూహాన్ని పన్ని ఉన్నారు. అప్పుడు అర్జునుడిని చూచి సంతోషంతో ఆర్పులు, సింహనాదాలు చెలరేగగా వారు ఉబ్బిపోయారు. అది చూచి అర్జునుడు చిరునవ్వు నవ్వి శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు: 'చూడుము కృష్ణా! సంతోషంతో అరుస్తున్నారు. కాని ఎదుటి వారిని గూర్చి కానీ, తమను గూర్చికానీ వీరి కేమీ తెలియదు. అయ్యో! వీరంతా చావును కోరుకొంటున్నారు.'

విశేషం: అలం: ఉపమ.

వ. **అని మఱియును.** **236**

ప్రతిపదార్థం: అని= ఇట్లని; మఱియును= ఇంకా.

తాత్పర్యం: అర్జునుడు ఇంకా అంటున్నాడు.

క. **'తగు సంతసింపఁ గుజనుల । కగపడని విశిష్టగతికి నస్మద్దివ్యా**
శుగములచేఁ బోఁగనుటకు । విగత భయత్వంబు సమరవిధి కొప్పుఁగదా!' **237**

ప్రతిపదార్థం: సంతసింపన్= సంతోషపడటం; తగున్= యోగ్యమే; కుజనులకున్= నీచులకు; అగపడని= చూడజాలని; విశిష్టగతికిన్= యోగ్యమైన స్థానానికి; అస్మద్= నాయొక్క; దివ్య+ఆశుగములచేన్= దివ్యమైన బాణాలచేత; పోన్+కనుటకున్= పోవటానికి; సమర విధికిన్= యుద్ధక్రియకు; విగత భయత్వంబు= భయపడకపోవటం; ఒప్పున్+కదా!= తగును కదా!

తాత్పర్యం: 'సంశప్తకులు సంతోషపడటం యోగ్యమే. నీచులకు అందని వీరస్వర్గాన్ని నా దివ్యాస్త్రాలచేత పొందటానికి వారు యుద్ధరంగంలో నిర్భయత్వాన్ని ప్రదర్శించటం సమర్థనీయమే కదా!'

వ. **అనుచుం జేర నడచి దేవదత్తంబు పూరించిన.** **238**

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; చేరనడచి= ముందుకు సాగి; దేవదత్తంబు= దేవదత్తమనే శంఖాన్ని; పూరించినన్= ఊదగా.

తాత్పర్యం: ఈ విధంగా అంటూ అర్జునుడు ముందుకు సాగి దేవదత్తమనే శంఖాన్ని ఊదగా.

ఉ. **ఆ నినదంబు సాంద్రముగ నాకసమంతయు నిండఁ బర్వుడున్,**
మానసముల్ గలంగి, యభిమానము ధైర్యముఁ దూలి, విద్విష
త్సేన నితాంత నిశ్చలతఁ జిత్ర సమర్పిత మూర్తియో యనం
గా, నులి వేది యుండియును గ్రమ్మఱఁ దేఱె రవంబు మీఱఁగన్. **239**

ప్రతిపదార్థం: ఆ నినదంబు= ఆ శంఖధ్వని; సాంద్రముగన్= దట్టంగా; ఆకసము= ఆకాశం; అంతయున్= అంతటు; నిండన్= నిండేటట్లుగా; పర్వుడున్= వ్యాపించగా; మానసముల్= మనస్సులు; కలంగి= కలతపడి; అభిమానము= అహంకారం; ధైర్యమున్= ధీరత్వం కూడ; తూలన్= తొలగగా; విద్విషత్+సేన= శత్రువుల సైన్యం; నితాంత= మిక్కిలి; నిశ్చలతన్= కదలికలేనిదై; చిత్ర చిత్తరువులో; సమర్పిత= దింపిన; మూర్తియో= రూపమో; అనన్+కాన్= అనగా; ఉలివు= చలనం; ఏది= నశించి; ఉండియును= ఉండి కూడ; క్రమ్మఱన్= మరల; రవంబు= శంఖధ్వని; మీఱఁగన్= అతిశయించగా; తేఱెన్= తేరుకొన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అర్జునుడి శంఖనాదం దట్టంగా ఆకాశమంతా నిండగా మనస్సులు కలతపడి, గర్వం, ధైర్యం తొలగిపోయి, శత్రుసైన్యం ఏమాత్రం కదలక, చిత్తరువులోని బొమ్మయో అన్నట్లు చలనం లేనిదై కూడా, శంఖధ్వని ఆగిపోయేసరికి మరల తేరుకొన్నది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. ఇట్లు దెలివొంది యొండొరులం బురికొల్పికొని సంశప్తకు లొక్కపెట్ట ఫల్గునుపయిం బటు శరపరంపరలు గురిసి; రతండు దవ్వుదవ్వులఁ బదియేను వేల రథంబుల వారిం గూల్చినం బెలుచ నబ్బలంబు లడరి.240

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తెలివి+ఒంది= తేరుకొని; ఒండు+ఒరులన్= ఒకరినొకరు; పురికొల్పికొని= ప్రోత్సహించుకొని; సంశప్తకులు= శపథం పూనిన త్రిగర్తాది వీరులు; ఒక్క పెట్టు+అ= ఒకేసారి; ఫల్గునుపయిన్= అర్జునుడిపై; పటు= బలమైన; శర= బాణాల; పరంపరలు = సమూహాలు; కురిసిరి= కురిపించారు; అతండు= ఆ అర్జునుడు; దవ్వు దవ్వులన్= దూర దూరంగా; పదియేనువేల= పదిహేనువేల; రథంబుల వారిన్= రథికులను; కూల్చినన్= హతమార్చగా; పెలుచన్= మిక్కిలి; ఆ+బలంబులు= ఆ సైన్యాలు; అడరి= వ్యాపించి.

తాత్పర్యం: ఈ విధంగా తేరుకొని ఒకరినొకరు ప్రోత్సహించుకొని, సంశప్తకులు ఒకేసారి అర్జునుడిపై బలమైన బాణజాలాన్ని కురిపించారు. అర్జునుడు దూరం నుండే పదిహేను వేల రథికులను కూల్చివేశాడు. అపుడు శత్రుసైనికులు అంతటా వ్యాపించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. శరము లొకఁడొకఁడు పదిపది । పరఁగింపఁగ మూఁట మూఁటఁ బార్థుఁడు నొంచెన్;
సరి నైదై దేయఁగ న । న్నరుఁ డందఱ రెంట రెంట నలి నొప్పించెన్. 241

ప్రతిపదార్థం: ఒకఁడు+ఒకఁడు= ఒక్కొక్కడు; పది పది; శరములు= బాణాలు; పరఁగింపఁగన్= వేయగా; మూఁటమూఁటన్= మూడు మూడు బాణాలచేత; పార్థుఁడున్= అర్జునుడును; నొంచెన్= బాధించాడు; సరిన్= సరిగా; ఐదు+ఐదు= ఐదైదు బాణాలను; ఏయఁగన్= వేయగా; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; అందఱన్= సైనికులందరినీ; రెంటరెంటన్= రెండు రెండు బాణాలచేత; నలిన్= యోగ్యంగా; నొప్పించెన్= బాధించాడు.

తాత్పర్యం: ఒక్కొక్క శత్రు సైనికుడు పది పది బాణాలు వేయగా అర్జునుడు మూడు మూడు బాణాల చొప్పున ప్రయోగించి వారిని నొప్పించాడు. వారు ఒక్కొక్కరు ఐదైదు బాణాలు వేయగా వారందరిని అతడు రెండు రెండు బాణాలు వేసి మిక్కిలి బాధించాడు.

వ. అట్టియెడ సుబాహుండు గ్రీడి కిరీటంబు దశవిశిఖంబుల నేయ నతం డతనిపై ననేక శరంబులు పరఁగించిన సుశర్ముండును సురథుండును సుధన్వుండును బాసటయై యప్పార్థుం దాఁకిన. 242

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; సుబాహుండు; క్రీడి= అర్జునుడియొక్క; కిరీటంబు= కిరీటాన్ని; దశ= పది; విశిఖంబులన్= బాణాలతో; ఏయన్= వేయగా; అతండు= అర్జునుడు; అతనిపైన్= ఆ సుబాహుడిపై; అనేక= చాలా; శరంబులు= బాణాలు; పరఁగించినన్= వేయగా; సుశర్ముండును= సుశర్మ; సురథుండును= సురథుడు; సుధన్వుండును= సుధన్వుడు కూడ; బాసట+ఐ= సహాయులై; ఆ+పార్థున్= ఆ అర్జునుడిని; తాఁకినన్= ఎదుర్కొనగా.

తాత్పర్యం: అపుడు సుబాహుడు అర్జునుడి కిరీటాన్ని పది బాణాలతో కొట్టగా, అర్జునుడు అతడిపై అనేక బాణాలను ప్రయోగించాడు. సుశర్మ, సురథుడు, సుధన్వుడు సుబాహుడికి సహాయులై అర్జునుడిని ఎదుర్కొన్నారు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. వారి కేతనములు వడిఁ ద్రుంచి యవ్వీరుఁ । డా సుధన్వు హయ శరాసనముల
తునియ లవనిమీఁదఁ దొరఁగించి తన్మస్త । కంబుఁ దునిమె తేరుగముల కుఱికి. 243

ప్రతిపదార్థం: వారి= సుశర్మాదులయొక్క; కేతనములు= పతాకాలు; వడిన్= వేగంగా; త్రుంచి= విరిచి; ఆ+వీరుఁడు= ఆ అర్జునుడు; సుధన్వు= సుధన్వుడి; హయ= గుర్రాలు; శరాసనముల= ధనుస్సుల యొక్క; తునియలు= తునుకలు; అవని మీఁదన్= భూమిపై; తొరఁగించి= పడేటట్లు చేసి; తేరు= రథాల; గములకున్= సమూహాలలోకి; ఉఱికి= పరుగెత్తి; తత్+మస్తకంబు= ఆ సుబాహుడి యొక్క తలను; తునిమెన్= ఖండించాడు.

తాత్పర్యం: అర్జునుడు సుశర్మాదుల యొక్క పతాకాలు వెంటనే విరిచి, సుధన్వుడి గుర్రాల, ధనుస్సు యొక్క ఖండాలు భూమిపై పడేటట్లు చేసి, రథాల మధ్యకు ఉరికి, సుబాహుడి తలను ఖండించాడు.

క. ఇరువే యుద్భట రథములఁ । బొరిగొనుటయుఁ బెఱ బలంబు పురికొనక వెఱం
దెరలుచు గుంపులు గట్టుచుఁ । గురుపతి సైన్యంబు పొంతకుం జనుచుండెన్. 244

ప్రతిపదార్థం: ఇరువేయి= రెండువేల; ఉద్భట= గొప్ప; రథములన్= రథాలను; పొరిగొనుటయున్= నశింపజేయగా; పెఱబలంబు= శత్రుసైన్యం; పురికొనక= ఆక్రమించక; వెఱన్= భయంతో; తెరలుచున్= తొలగిపోతూ; గుంపులు+కట్టుచున్= గుమిగూడి; కురుపతి= దుర్యోధనుడి యొక్క; సైన్యంబు= సేన; పొంతకున్= కడకు; చనుచుండెన్= పోతుండినది.

తాత్పర్యం: రెండు వేల రథాలను అర్జునుడు నశింపజేసేసరికి శత్రుసేన విజృంభించటం మాని భయంతో తొలగిపోతూ, గుంపులు గుంపులుగా దుర్యోధనుడి సేన కడకు వచ్చి చేరింది.

వ. ఇట్లు భయభ్రాంతులైన సైనికులం గనుంగొని సుశర్మ యెలుంగెత్తి. 245

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; భయభ్రాంతులు+ఐన= బెదరిపోయిన; సైనికులన్= భటులను; కనుంగొని= చూచి; సుశర్మ= త్రిగర్తాధిపతి అయిన సుశర్మ; ఎలుంగు+ఎత్తి= గొంతెత్తి

తాత్పర్యం: ఈ రీతిగా బెదరిపోయిన సైనికులను చూచి సుశర్మ పెద్దకంఠధ్వనితో.

క. 'వెఱవకుఁ డిట మరలుఁడు ము । న్నెఱుఁగరె? యర్జునునిఁ గురుమహీపతి కడ నే
డ్తెఱఁ బలికిన పంతంబులు? । మఱతురె నో రెద్ది రిత్త మరలిన మనకున్?' 246

ప్రతిపదార్థం: వెఱవకుఁడు= భయపడకండి; ఇట= ఈవైపు; మరలుఁడు= తిరిగి రండి; అర్జునునిన్= అర్జునుడిని; మున్ను= పూర్వం; ఎఱుఁగరె?= తెలిసినవారు కారా?; కురుమహీపతి= దుర్యోధనుడి; కడన్= దగ్గర; ఏడ్తెఱన్= పరాక్రమంతో; పలికిన= చెప్పిన; పంతంబులు= శపథాలు; మఱతురె?= మరిచిపోయినారా?; మనకున్= మనందరికి; రిత్త= వట్టిగా; మరలినన్= మళ్ళిపోతే; నోరు+ఎద్ది?= మాట నిలుస్తుందా?

తాత్పర్యం: 'సైనికులారా! భయపడకండి. యుద్ధంవైపు మళ్ళండి. అర్జునుడు మీకు కొత్తా? దుర్యోధన సార్వభౌముడి ముందు మీరు చేసిన శపథాలు మరచిపోయారా? వట్టిగా తిరిగి పోతే మన మాటలకు విలువ ఉంటుందా?'

వ. అని బరవసంబు సేసిన నా సైనికులు గోల్తలసేసి; రప్పుడు నారాయణ గోపాలు రెక్కడెక్కడ యని వారిం గూడి కడంగిన నిస్సాణాది తూర్యరావంబులు సెలంగుటయు వాసవి వాసుదేవు నాలోకించి. 247

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా పలికి; బరవసంబు= ధైర్యం; చేసినన్= చెప్పగా; ఆ సైనికులు= ఆ భటులు; కోల్తల= యుద్ధసన్నాహం; చేసిరి= చేశారు; అప్పుడు= ఆ సమయంలో; నారాయణ గోపాలురు= యాదవ వర్గానికి చెందిన నారాయణ, గోపాల సైన్యాలు; ఎక్కడ+ఎక్కడ= ఎక్కడున్నాయి; అని; వారిన్= వారందరిని; కూడి= కలిసికొని; కడంగినన్= పూనుకోగా; నిస్సాణ+ఆది= నిస్సాణం మొదలైన; తూర్య= వాద్యాల; రావంబులు= ధ్వనులు; చెలంగుటయున్= చెలరేగగా; వాసవి= అర్జునుడు; వాసుదేవునిన్= శ్రీకృష్ణుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అని సుశర్మ ధైర్యాన్ని ప్రబోధించగా సైనికులు యుద్ధ సన్నాహం చేశారు. అపుడు నారాయణ గోపాల సైనికులు ఎక్కడెక్కడ అని, వారితో కలిసి యుద్ధానికి పూనుకొనగా, నిస్సాణాది వాద్య ధ్వనులు చెలరేగాయి. అర్జును డపుడు శ్రీకృష్ణుడిని చూచి.

చ. **'ఒడలను బ్రాణముల్ గలుగ నూరక యుండుదురే త్రిగర్తు లి**
ప్పుడ నుఱుమాడి పోద మటు వోవఁగనిమ్ము రథమ్ము' నావుడుం
గడువెస నా ధనంజయుని కాంక్షిత మెక్కడ నక్క డెల్ల నె
క్కుడు ముదమొప్పఁ దేరు రథికోటులపైఁ బఱపెన్ ముకుందుఁడున్. **248**

ప్రతిపదార్థం: ఒడలను= దేహంలో; ప్రాణముల్= ప్రాణాలు; కలుగన్= ఉన్నంత వరకు; త్రిగర్తులు= త్రిగర్త దేశపు వీరులు; ఊరక= ఊరికే; ఉండుదురే?= ఉంటారా?; ఇప్పుడు+అ= ఇప్పుడే; నుఱుమాడి= చంపి; పోదము= పాదాం; అటు= ఆ వైపు; రథమ్ము= రథాన్ని; పోవఁగనిమ్ము= పోనిమ్ము; నావుడున్= అనగా; ముకుందుఁడున్= శ్రీకృష్ణుడు కూడా; కడువెసన్= వెంటనే; ఆ ధనంజయుని= ఆ అర్జునుడి; కాంక్షితము= కోరిక; ఎక్కడ= ఏవైపో; అక్కడ= ఆ వైపు; ఎల్లన్= అంతట; ఎక్కుడు= మిక్కిలి; ముదము+ఒప్పన్= సంతోషం మీరగా; తేరు= రథాన్ని; రథికోటులపైన్= రథికుల సమూహాలపైకి; పఱపెన్= నడిపించాడు.

తాత్పర్యం: 'దేహంలో ప్రాణాలు ఉన్నంత వరకు త్రిగర్త దేశపు వీరులు ఊరుకోరు. రథాన్ని వారివైపు నడిపించుము. వారినంతా ఇప్పుడే హతమారుద్దాము' అనగా, శ్రీకృష్ణుడు అర్జునుడి అభిమతానుసారం, ఎక్కడంటే అక్కడ సంతోషంతో; రథికసమూహాలపై రథాన్ని నడిపించాడు.

క. **విమలాంబుదములు పూనిన । విమానమో నాఁగ మెఱసె వెలిమావుల వే**
గము సొంపున నయ్యరదం; । బమరేంద్రుని లీలఁ బొలిచె నతని సుతుండున్. **249**

ప్రతిపదార్థం: ఆ+అరదంబు= ఆ రథం; వెలిమావుల= ఉచ్చైశ్రవం వంటి తెల్లని గుర్రాల; వేగము= జవం యొక్క; సొంపునన్= సమృద్ధిచేత; విమల+అంబుదములు= తెల్లని మేఘాలు; పూనిన= కట్టిన; విమానమో= ఆకాశంలో విహరించే రథమో; నాఁగన్= అనునట్లు; మెఱసెన్= ప్రకాశించింది; అమరేంద్రుని= ఇంద్రుడి; లీలన్= వలె; అతని= ఇంద్రుడి యొక్క; సుతుండున్= కొడుకైన అర్జునుడును; పొలిచెన్= వెలుగొందాడు.

తాత్పర్యం: ఆ అర్జునుడి రథం ఇంద్రుడి ఉచ్చైశ్రవం వంటి తెల్లని గుర్రాల వేగసమృద్ధి వలన, తెల్లని మేఘాలు పూనిన విమానమో అన్నట్లు ప్రకాశించింది. ఇంద్రుడివలె అర్జునుడు ఒప్పారాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష - ఉపమానుప్రాణితం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు మండల ప్రచారగత ప్రత్యాగతాది వివిధ గతులం దేరు సంచరింపం జేయుచు నిలింపకోటికిం గన్నుల పండువు సేయం బుండరీకాక్షుం గనుంగొని నారాయణ గోపాలురు గుపితాత్ముల్లై యర్జున దుర్యోధనులు ద్వారకా నగరంబునకుం బోయిన నాఁడు కృష్ణుతోడి సరిగా దుర్యోధనుఁడు దమ్ముఁ గోరికొనిన వాఁడగుటం జేసి యీసునం బేర్చి య న్నరనారాయణుల మేనుల నానాస్త్రంబులు నినిచిన నరుండు దేవదత్తంబు పూరించి యవష్టంభంబునం ద్వష్టయిచ్చిన మహాస్త్రంబు ప్రయోగించినం దత్ప్రభావంబున. 250

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మండల= గుండ్రంగా; ప్రచార= తిరుగటం; గత= పోవడం; ప్రత్యాగత= తిరిగి రావటం; ఆది= మొదలైన; వివిధ= అనేకమైన; గతులన్= నడకలచేత; తేరు= రథం; సంచరింపన్+చేయుచున్= త్రిప్పుతూ; నిలింపకోటికిన్= దేవతా సమూహానికి; కన్నుల పండువు= కనువిందు; చేయన్= చేయగా; పుండరీక+అక్షున్= తెల్లతామరల వంటి కన్నులు గల కృష్ణుడిని; కనుంగొని= చూచి; నారాయణ గోపాలురు= నారాయణులు అనేపేరుగల గోపాలురు (కృష్ణుడి సైనికులు;) కుపితాత్ములు+ఐ= కోపించినవారై; అర్జున; దుర్యోధనులు; ద్వారకానగరంబునకున్= ద్వారకాపురికి; పోయిననాఁడు= వెళ్ళిననాడు; కృష్ణుతోడి= కృష్ణుడితో; సరిగాన్= సమానంగా; దుర్యోధనుఁడు; తమ్మున్= తమను; కోరికొనినవాఁడు= కోరుకొన్నవాడు; అగుటన్+చేసి= కావటం వలన; ఈసునన్= అసూయతో; పేర్చి= విజృంభించి; ఆ+నరనారాయణుల= ఆ కృష్ణార్జునుల యొక్క; మేనుల= దేహాలపై; నానా+అస్త్రంబులు= అనేకాలైన బాణాలు; నినిచినన్= నింపగా; నరుండు= అర్జునుడు; దేవదత్తంబు= దేవదత్తమనే శంఖాన్ని; పూరించి= ఊది; అవష్టంభంబునన్= గర్వంతో; త్వష్ట= విశ్వకర్మ; ఇచ్చిన= ఇచ్చినట్టి; మహా+అస్త్రంబు= గొప్ప అస్త్రం; ప్రయోగించినన్= వేయగా; తద్+ప్రభావంబునన్= దాని మహిమచేత.

తాత్పర్యం: ఈ విధంగా వర్తులాకారంగా తిరగటం, పోవటం, తిరిగి రావటం వంటి బహువిధాలైన గమనాలతో రథాన్ని నడుపుతూ, దేవతలకు కనువిందు చేయగా, కృష్ణుడిని చూచి, నారాయణ గోపాలాది కృష్ణుడి సైనికులు కోపించినవారై, అర్జునుడు, దుర్యోధనుడు ద్వారకా నగరానికి పోయిననాడు కృష్ణుడికి సరిగా దుర్యోధనుడు తమను కోరుకొనటం వలన ఈర్ష్యతో విజృంభించి, కృష్ణార్జునులపై బహువిధాలైన అస్త్రాలను ప్రయోగించారు. అపుడు అర్జునుడు దేవదత్త శంఖాన్ని పూరించి గర్వంతో విశ్వకర్మ ఇచ్చిన మహాస్త్రాన్ని ప్రయోగించగా, దాని మహిమతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. గాండీవి చందమయి వా । రొండొరులకుఁ దోఁచి యొకళు లొకళుల నానా
చండాస్త్ర శస్త్రసముదయ । ఖండితులుగఁ జేసి పడిరి కలనం గలయన్. 251

ప్రతిపదార్థం: గాండీవి= గాండీవం ధనుస్సుగా గల అర్జునుడి; చందమయి= విధమయి; వారు= ఆ సైనికులు; ఒండు+ఒరులకున్= ఒకరికొకరు; తోఁచి= కనిపించి; ఒకళులన్= ఒకరిని; ఒకళులు= ఒకరు; చండ= వాడిగల; అస్త్ర= మంత్రపూర్వకంగా వేసే బాణాల; శస్త్ర= ఖడ్గాదుల; సముదయ= సమూహంచేత; ఖండితులుగన్= తెగినవారుగా; చేసి= ఒనర్చికొని; కలనన్= యుద్ధభూమిలో; కలయన్+పడిరి= అంతటా నేలకూలారు.

తాత్పర్యం: ఆ సైనికులు ఒకరికొకరు గాండీవధారి అయిన అర్జునునివలె తోచి, ఒకరినొకరు వాడిగల శస్త్రాలతో ఖండించుకొని యుద్ధభూమిలో అంతటా నేలకూలారు.

వ. ఇమ్మెయిఁ గృతార్థంబైన దివ్యాస్త్రంబు పదంపడి శాంతం బగుటయు హతశేషులు వోక పొదివి రథరథ్యకేతు సహితంబుగా సవ్యసాచి నాభీల శరజాల సంవృతుం జేసిన. 252

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; కృతార్థంబు+అయిన= సఫలమైన; దివ్య+అస్త్రంబు= దేవతా సంబంధమైన అస్త్రం; పదంపడి= తర్వాత; శాంతంబు+అగుటయున్= శాంతించగా; హతశేషులు= చావగా మిగిలినవారు; పోక= పారిపోవక; పొదివి= ఆక్రమించి; రథ= రథం; రథ్య= గుర్రాలు; కేతుసహితంబుగాన్= పతాకతోబాటు; సవ్యసాచిన్= అర్జునుడిని; ఆభీల= భయంకరమైన; శరజాల= బాణాల సమూహంతో; సంవృతున్= కప్పినవాడిగా; చేసినన్= చేయగా.

తాత్పర్యం: ఈ విధంగా శత్రువులను సంహరించటంలో సఫలమైన ఆ మహాస్త్రం శాంతించగా, మరణించగా మిగిలినవారు పారిపోక - రథం, గుర్రాలు, కేతనంతో సహా అర్జునుడిని భయంకరమైన బాణజాలంతో చుట్టుముట్టగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆ పార్థుఁడు గోపానల। దీపితుఁడై విశిఖశిఖల తీవ్రనిహతి న
త్తూపులగమి నేర్చి జముని। ప్రోపు గుడువఁ బుచ్చె వారిఁ బురువంశనిధీ! 253

ప్రతిపదార్థం: పురువంశనిధీ!= ధృతరాష్ట్ర మహారాజా!; ఆ పార్థుఁడు= ఆ అర్జునుడు; కోప= కోపమనే; అనల= అగ్నిచే; దీపితుఁడు+ఐ= వెలుగొందినవాడై; విశిఖ= బాణాలనే; శిఖల= మంటల యొక్క; తీవ్ర= తీక్ష్ణమైన; నిహతిన్= దెబ్బచేత; తూపుల= బాణాల యొక్క; గమిన్= సమూహాన్ని; ఏర్చి= దహించి; వారిన్= ఆ భటులను; జముని= యముడి; ప్రోపు= పోషణం; కుడువన్= అనుభవించేటట్లు; పుచ్చెన్= చంపాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఆ అర్జునుడు కోపమనే అగ్నిచేత మండినవాడై, బాణాలనే జ్వాలల దెబ్బతో ఆ బాణ సమూహాన్ని దహించి, శత్రు సైనికులను యమధర్మరాజును సేవించటానికి పంపించాడు.

విశేషం: అలం: రూపకం. అర్జునుడు వారిని చంపాడనటానికి మారుగా - 'జముని ప్రోపు గుడువఁ బుచ్చె' ననటంచేత అలంకారం పర్యాయోక్తం. ప్రకారాంతరము చేత గమ్యార్థ సిద్ధి అయ్యేనేని పర్యాయోక్తాలంకారం. శత్రుసైనికులపైకి విజృంభించి వారిని హతమార్చడంలో వీరరసం వ్యక్తమౌతున్నది.

వ. ఇవ్విధంబున విజృంభించి యట్టహాసంబు సేయుటయుం దుండి మగధ కేరళ మచ్ఛిల్లికాదు లదరి సాయక నికాయంబులం గప్పిన. 254

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; విజృంభించి= పైకెగసి; అట్టహాసంబు+చేయుటయున్= పెద్దగా నవ్వగా; తుండి, మగధ, కేరళ, మచ్ఛిల్లికాదులు= తుండి, మగధ, కేరళ, మచ్ఛిల్లికాది దేశాల వీరులు; అదరి= విజృంభించి; సాయక= బాణాల; నికాయంబులన్= గుంపులతో; కప్పినన్= ఆక్రమించగా.

తాత్పర్యం: అర్జునుడు ఇట్లా విజృంభించి పెద్దగా నవ్వేసరికి, తుండి, మగధ, కేరళ, మచ్ఛిల్లికాది దేశాల వీరులు పైకెగసి, అతడిని బాణజాలంతో కప్పివేయగా.

క. నానాస్త్రంబుల నాతఁడు। పీనుఁగు పెంటలుగఁ జేయఁ బిరుసనక మహా
సేనలు దోడ్తో డగ్గరి। యా నరుపైఁ బెల్లుగురిసె నమ్ముల వానల్. 255

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ అర్జునుడు; నానా+అస్త్రంబులన్= అనేక బాణాలతో; పీనుఁగు పెంటలుగన్= శవాల కుప్పలుగా; చేయన్= చేయగా; మహాసేనలు= గొప్ప సైన్యాలు; బిఱుసనక= గర్వం తగ్గక; తోడ్తోన్= వెంబడే; డగ్గరి= సమీపించి; ఆ నరుపైన్ ఆ అర్జునుడిపై; అమ్ములవానల్= బాణవర్షాలు; పెల్లు= అధికంగా; కురిసెన్= కురిపించాయి.

తాత్పర్యం: అర్జునుడు బహువిధాలైన బాణాలతో శత్రువుల మూకలను పీనుగు పెంటలుగా మార్చగా, ప్రబలములైన ఆ సేనలు అహంకారం ఏమాత్రం తగ్గక వెంటనే అతడిని చేరి బాణవర్షాన్ని కురిపించాయి.

క. కరి తురగ రథపదాతులు । బెరసి కదిసి చుట్టుముట్టి భీషణ హేతి
స్ఫురణ మెఱయఁ జేరిన న । చ్చెరువుగ విజయుండు సించి చెండాడె వడిన్. 256

ప్రతిపదార్థం: కరి= ఏనుగులు; తురగ= గుర్రాలు; రథ= రథాలు; పదాతులు= కాల్బలాలు; బెరసి= కలిసి; కదిసి= సమీపించి; చుట్టుముట్టి= ఆక్రమించి; భీషణ= భయంకరమైన; హేతి= ఆయుధాల యొక్క; స్ఫురణ= అదరటం; మెఱయన్= ప్రకాశించగా; చేరినన్= సమీపించేసరికి; విజయుండు= అర్జునుడు; అచ్చెరువుగన్= ఆశ్చర్యం కలిగేటట్లు, చించి= చీల్చి; వడిన్= వెంటనే; చెండాడెన్= ఖండించాడు.

తాత్పర్యం: శత్రువుల చతురంగ బలాలు కలిసి, సమీపించి చుట్టుముట్టి, భయంకరమైన ఖడ్గాద్యాయుధాలు చకచక మెరుస్తుండగా చేరేసరికి, అర్జునుడు వాటన్నిటినీ ఆశ్చర్యం గొలిపేటట్లు వెంటనే చీల్చి చెండాడాడు.

వ. సంశప్తకులు మఱియును. 257

ప్రతిపదార్థం: సంశప్తకులు= ఆ శపథాలు చేసిన వీరులు; మఱియును= ఇంకా.

తాత్పర్యం: సంశప్తకులు ఇంకా విజృంభించి.

క. పెరయీఁగలగతిఁ గవియుచుఁ । బొరిఁ బొరిఁ గడుఁదురుల పగిదిఁ బొదువుచు నెరకై
వెరవునఁ గాకులుఁ గ్రోఁతులుఁ । బరువడిఁ జీకాకుపఱుచు భంగి నలఁచుచున్. 258

ప్రతిపదార్థం: పెర ఈఁగల= తేనెటీగల; గతిన్= వలె; కవియుచున్= మీదికి ఉరుకుతూ; పొరిన్+పొరిన్= మాటిమాటికి; కడుఁదురుల= కందిరీగల; పగిదిన్= వలె; పొదువుచున్= కమ్ముతూ; ఎరకై= ఆహారానికై; వెరవునన్= ఉపాయంగా; కాకులున్= కాకులు; క్రోఁతులున్= కోతులును; పరువడిన్= వరుసగా; చీకాకుపఱుచు= బాధించే; భంగిన్= విధంగా; అలఁచుచున్= కలతపెట్టుతూ.

తాత్పర్యం: సంశప్తకులు తేనెటీగలవలె మీది కురుకుతూ, మాటిమాటికి కందిరీగల వలె కమ్ముకొంటూ, కాకులు, కోతులు తిండికై ఉపాయంగా చికాకు పరిచేటట్లు కలతపెట్టుతూ.

విశేషం: అలం: ఉపమ.

వ. పెనంగిరి; రందుఁ గొందఱు వీరావేశంబున. 259

ప్రతిపదార్థం: పెనంగిరి= పోరారు; అందున్= వారిలో; కొందఱు= కొంతమంది సైనికులు; వీర+ఆవేశంబునన్= మిక్కిలి మైమరచి.

తాత్పర్యం: సంశప్తకులు యుద్ధం చేశారు. అందులో కొందరు సైనికులు పూర్తిగా మైమరచి ఆవేశంతో.

సంశప్తకులందఱు నొక్కపెట్ట యర్జునురథంబుపైఁ బడుట (సం. 7-18-20)

క. అరదంబులు మొదలగు ను । ద్ధుర వాహనకోటి డిగ్గి దుర్దాంత గతిం
దురగంబులపై హరిపై । నరుపై నూడుకొనఁ బడిరి నలి నార్పులతోన్. 260

ప్రతిపదార్థం: అరదంబులు= రథాలు; మొదలగు= మొదలైన; ఉద్ధుర= సమర్థమైన; వాహన= వాహనాల; కోటి= సమూహం; డిగ్గి= దిగి; దుర్దాంతగతిన్= అణచరాని విధంగా; తురగంబులపైన్= గుర్రాలమీద; హరిపైన్= కృష్ణుడిమీద; నరుపైన్= అర్జునుడిమీద; ఊడుకొనన్= కుచ్చుకొనేట్లు; నలిన్= అధికమైన; ఆర్పులతోన్= అరుపులతో; పడిరి= పడ్డారు.

తాత్పర్యం: రథాలు మొదలైన వాహనాలు దిగి సంశప్తకులు అరుస్తూ, అతివేగంగా గుర్రాలెక్కి, కృష్ణుడి మీద, అర్జునుడి మీద విరుచుకొని పడ్డారు.

వ. ఇత్తెఱంగునం జేయి గాలార్పనుం జూడ్కి వఱపను రాకుండునట్లుగా గుంపులు గొనం బైపైం దొరంగినం గృష్ణు లగపడిరి తెగిరి మడిసిరి మ్రగ్గిరను మాటలతోఁ దత్సైన్యంబుల సింహనాదంబులుఁ దూర్యనినదంబులుఁ జెలంగె; నప్పుడు సెమర్చి చేడ్పడి వసుదేవ నందనుండు. 261

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; చేయి; కాలు; అర్పనున్= ఆడుటకు; చూడ్కి= చూపు; వఱపనురాక+ఉండునట్లుగాన్= ప్రసరించనీయకుండా; గుంపులు+కొనన్= గుంపులు గట్టి; పైపైన్= మీద మీద; తొరంగినన్= పడగా; కృష్ణులు= కృష్ణార్జునులు; అగపడిరి= దొరికారు; తెగిరి= ఖండితులైనారు; మడిసిరి= చచ్చారు; మ్రగ్గిరి= నశించారు; అను= అనే; మాటలతోన్= పలుకులతో; తద్= ఆ సంశప్తకుల; సైన్యంబులన్= సేనలలో; సింహనాదంబులున్= సింహగర్జలును; తూర్యనినదంబులున్= వాద్యాల మ్రోతలును; చెలంగెన్= ధ్వనించాయి; అప్పుడు= ఆ సమయంతో; చెమర్చి= చెమటబట్టి; చేడ్పడి= బాధపడి; వసుదేవనందనుండు= వసుదేవుడి పుత్రుడైన శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: ఇట్లు కాళ్ళు చేతులు ఆడకుండా; చూపులు ప్రసరించటానికి కూడ అవకాశంలేకుండా గుంపులు గుంపులుగా మీద విరుచుకుపడగా, 'కృష్ణార్జునులు దొరికారు, ఖండించబడ్డారు, చచ్చారు, నశించారు' అనే మాటలతోపాటు ఆ సంశప్తకుల సైన్యంలో సింహనాదాలు, వాద్యధ్వనులు చెలరేగాయి. అప్పుడు కృష్ణుడు చెమటబట్టి, బాధతో.

ఆ. 'ఎచట నున్నవాఁడ? వేమైతి? ప్రాణానఁ। గలవె? యేను నిన్నుఁ గానకునికిఁ
దలఁకుచున్నవాఁడ ధైర్యధౌరేయ! నీ। యెలుఁగు సూపవే సురేంద్ర తనయ!' 262

ప్రతిపదార్థం: ధైర్యధౌరేయ!= ధైర్యభారాన్ని మోసే అర్జునా!; ఎచటన్= ఎక్కడ; ఉన్నవాఁడవు?= ఉన్నావు?; ఏమి+ఐతి?= ఏమైనావు?; ప్రాణానన్= ప్రాణంతో; కలవె?= ఉన్నావా?; నిన్నున్= నిన్ను; కానక+ఉనికిన్= చూడలేనందుకు; తలఁకుచున్నవాఁడన్= భయపడుతున్నాను; ఓ సురేంద్ర తనయ!= దేవేంద్రుడి కుమారుడవైన అర్జునా!; నీ= నీయొక్క; ఎలుఁగు= కంఠ ధ్వనిని; చూపవే!= వినిపించవా!

తాత్పర్యం: 'మహాధైర్యవంతుడవైన అర్జునా! ఎక్కడున్నావు? ఏమైనావు? ప్రాణంతో ఉన్నావా? నీవు కనిపించకపోవటం వల్ల భయపడుతున్నాను. ఓ సురేంద్ర తనయా! నీ స్వరం వినిపించుము.'

విశేషం: 'ధైర్యధౌరేయ!' 'సురేంద్రతనయ!' అనే సంబోధనలు సాభిప్రాయాలు. వీటివలన అర్జునుడి శౌర్యం, అమరత్వం వ్యక్తమై ఎంతటి విపత్తులోనైనా అతడు ఎవ్వరికి లొంగేవాడు కాడని తెలుస్తున్నది. కృష్ణుడి మాటలలో చింత, విషాదం, ఉద్వేగం వ్యక్తమవుతున్నవి.

వ. అనిన విని యతండు ముకుందుని మానుషభావం బూహించుచు నుత్సాహంబు వాటించి. 263

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; అతండు= ఆ అర్జునుడు; ముకుందుని= కృష్ణుడియొక్క; మానుషభావంబు= మనుష్యుడు అనే భావాన్ని; ఊహించుచున్= తలుస్తూ; ఉత్సాహంబు= ఉత్సాహాన్ని; పాటించి= చూపి.

తాత్పర్యం: అనగా విని అర్జునుడు శ్రీకృష్ణుడి మానవభావాన్ని మనసులో భావించి ఉత్సాహం పొంగగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అనిలాస్త్రంబు ప్రయోగిం। చిన సంశప్తకులు దెసలఁ జెదరి చొరువు చా
డ్పునఁ దూలఁగ బహువిధ శర। వినిహతి బడలువడఁ జేసె వెన్నుఁడు మెచ్చన్. 264

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వెన్నుఁడు= శ్రీకృష్ణుడు; మెచ్చన్= ప్రశంసించేటట్లు; అనిల+అస్త్రంబు= వాయవ్యాస్త్రం; ప్రయోగించినన్= వేయగా; సంశప్తకులు= సుశర్మాదులు; దెసలన్= దిక్కులకు; చెదరి= చెదిరిపోయి, చొరువు= ఎండిన ఆకు; చాడ్పునన్= వలె; తూలఁగన్= రాలగా, బహువిధ= పెక్కురకాల; శర= బాణాల; వినిహతి= దెబ్బలతో; బడలుపడన్+చేసెన్= బాధపడేటట్లు చేశాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ప్రశంసించేటట్లు అర్జునుడు వాయవ్యాస్త్రం ప్రయోగించగా, సంశప్తకులు అంతటా చెదరిపోయి ఎండుటాకులవలె తూలిపడ్డారు. అపుడు అతడు అనేక బాణాలను వేసి వారిని బాధించాడు.

విశేషం: అలం: ఉపమ. ఇట అర్జునుడి పరాక్రమం వలన వీర రసం వ్యక్తమౌతున్నది.

క. **శిరము లురంబులు గరములు। చరణంబులు రూపు మాయ శకలములై సం**
గరధరఁ దొరఁగిరి యోధులు। గరితురగ రథాస్త్ర శస్త్ర ఖండంబులతోన్. **265**

ప్రతిపదార్థం: శిరములు= తలలు; ఉరంబులు= గుండెలు; చరణంబులు= కాళ్ళు; రూపుమాయన్= ఆకారాలు చెడిపోయేటట్లు; శకలములు+ఐ= ముక్కలై; సంగరధరన్= యుద్ధభూమిలో; కరి, తురగ, రథ+అస్త్ర, శస్త్ర ఖండములతోన్= ఏనుగుల, గుర్రాల, రథాల, మంత్రసహితమైన బాణాల, మంత్ర సహితంగాని బాణాల ముక్కలతో సహా; యోధులు= వీరులు; తొరఁగిరి= కూలారు.

తాత్పర్యం: యుద్ధభూమిలో శూరులు వారి తలలూ, గుండెలూ, కాళ్ళూ ఆకారాలు గుర్తుపట్టలేనట్లుగా ముక్కలు ముక్కలై, ఏనుగుల, గుర్రాల, రథాల, అస్త్రశస్త్రాల శకలాలతో సహా నేల కూలారు.

వ. **అట్లు గసిమసంగి కిరీటి కల్పాంతపురాంతకుండునుంబోలె బారిసమరుచుండ వెండియు వెఱచఱవక తఱిమి పెనంగు నబ్బలంబు లతని బాణపరంపరల బలితంపుఁ బరపునం జేసి.** **266**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; కసిమసంగి= విజృంభించి; కిరీటి= అర్జునుడు; కల్పాంత= ప్రళయకాలంలోని; పుర+అంతకుండునున్= రుద్రుడి; పోలెన్= వలె; బారిసమరుచుండన్= చంపుతుండగా; వెండియున్= మరియు; వెఱచఱవక= భయపడక; తఱిమి= వెనుదగిలి; పెనంగు= యుద్ధం చేసే; ఆ+బలంబులు= ఆ సంశప్తక సైన్యాలు; అతని= అర్జునుడి యొక్క; బాణ పరంపరల= బాణ సమూహాలయొక్క; బలితంపు= బలిష్ఠమైన; పరపునన్+చేసి= వ్యాప్తిచేత.

తాత్పర్యం: ఆ విధంగా విజృంభించి, అర్జునుడు ప్రళయకాలంలోని రుద్రుడివలె వధిస్తుండగా, శత్రుసైన్యాలు భయపడక వెనుదగిలి పోరు సాగించాయి. అపుడు అర్జునుడు బాణజాలాన్ని దట్టంగా ప్రసరింపజేయగా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. **కూలురూపుఁ, దన్నికొనియెడు రూపును,। నొఱలు రూపు, నేల కొఱగు రూపు,**
బొరలు రూపు నయ్యె నరవాజి గజములు। ప్రధనభూమి ఘోరభంగి గాఁగ. **267**

ప్రతిపదార్థం: నర= భటులు; వాజి= గుర్రాలు; గజములు= ఏనుగులు; ప్రధనభూమి= యుద్ధపు నేల; ఘోరభంగి= భయంకరమైన విధం; కాఁగన్= కాగా; కూలురూపున్= కూలే రూపం; తన్నికొనియెడు= గిలగిలతన్నుకొనే; రూపునున్= రూపం; ఒఱలు= ఏడ్చునట్టి; రూపున్= రూపం; నేలకున్= భూమిపైకి; ఒఱగు= ఒరిగిపోయిన; రూపున్= ఆకారం; పొరలు= పొరలాడే; రూపున్= రూపం కలవి; అయ్యెన్= అయినవి.

తాత్పర్యం: యుద్ధభూమి భయంకర రూపం తాల్చగా, భటులు, గుర్రాలు, ఏనుగులు కూలిపోయి, గిలగిల తన్నుకొంటూ, విలపిస్తూ, నేలకు ఒరిగి పొర్లాడే రూపాలు ధరించాయి.

విశేషం: అర్జునుడి పరాక్రమం వలన బీభత్సం పాలైన కౌరవసైన్యం ఇందులో వర్ణించబడింది.

వ. ఇవ్విధంబున నసమ సమర తత్పరులై తనవలన నేమఱి యా మఱంది యు బావయు నట్లుండ, నిక్కడ ధర్మజుండు పురికొల్ప నుదగ్ర సైన్యంబులు మన మొనలు దలంకం దఱిమె; నాచార్యుండును ధర్మసూను సైన్యంబులు దలంకఁ దఱిమె; నప్పుడు నీ కొడుకు దుర్ముఖుం డతనికిఁ బ్రియంబుగా ధృష్టద్యుమ్నుం దలపడినం గురుపాంచాల కుమార వర్గంబు లగ్గలికం గవిసి పోరె; నట్టియెడ. 268

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఇట్లా; అసమ= సాటిలేని; సమర= యుద్ధంలో; తత్పరులు+ఐ= లీనమైనవారై; తనవలనన్= తనను; ఏమఱి= ఉపేక్షించి; మఱందియున్= మరది అయిన అర్జునుడును; బావయున్= బావ అయిన కృష్ణుడును; అట్లు+ఉండన్= శత్రువులతో తగులు కొని ఉండగా; ఇక్కడన్= పాండవ పక్షంలో; ధర్మజుండు= ధర్మరాజు; పురికొల్పన్= ప్రోత్సహించగా; ఉదగ్ర సైన్యంబులు= గొప్ప సేనలు; మన= మన కౌరవుల; మొనలు= సైన్యాలు; తలంకన్= భయపడగా; తఱిమెన్= పరుగెత్తించాయి; ఆచార్యుండును= ద్రోణుడును; ధర్మసూను సైన్యంబులు= ధర్మరాజు యొక్క సేనలు; తలంకన్= చలించగా; తఱిమెన్= ఉరికించాడు; అప్పుడు; నీ కొడుకు= నీ పుత్రుడైన; దుర్ముఖుండు= దుర్ముఖుడనే వాడు; అతనికిన్= ద్రోణుడికి; ప్రియంబుగాఁన్= సంతసమయ్యేటట్లు; ధృష్టద్యుమ్నున్= పాండవసేనాని అయిన ధృష్టద్యుమ్నుడిని; తలపడినన్= ఎదుర్కొనగా; కురు= కౌరవుల, పాంచాల= పాంచాల దేశపు; కుమార= పుత్రుల; వర్గంబులు= సమూహాలు; అగ్గలికన్= ఉత్సాహంతో; కవిసి= ఉరికి; పోరెన్= యుద్ధం చేశాయి; అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఇట్లా సాటిలేని యుద్ధంలో తగుల్కొని ధర్మజుడి నుండి దూరమై కృష్ణార్జునులు పోరు సల్పుతుండగా, పాండవ పక్షాన ధర్మరాజు ప్రోత్సాహంతో మహాసైన్యాలు కౌరవ సేనలు బెదరిపోయేటట్లు తరిమాయి. ద్రోణుడును ధర్మరాజు సైన్యాలు బెదరేటట్లు తరిమి కొట్టాడు. అప్పుడు నీ పుత్రుడైన దుర్ముఖుడు ద్రోణుడికి సంతోషమయ్యేటట్లు ధృష్టద్యుమ్నుడిని ఎదుర్కొనగా కురు కుమారులు, పాంచాల వీర కుమారులు ఉత్సహించి పోరుసల్పారు. అపుడు.

చ. గురుఁ డను తీవ్రమారుతము కోల్తల కోర్వక ధర్మపుత్ర బం
ధుర బల వారిదోత్కరము దూలుడు నాతఁ డదల్చి వీర సుం
దరముగఁ జేయి వీచిన నుదగ్ర గతిం బురికొన్నఁ గౌరవ
స్ఫురణము నుద్ధటం బగుడు సూర్యుని మ్రింగె ధరా పరాగముల్. 269

ప్రతిపదార్థం: గురుఁడు+అను= ద్రోణాచార్యుడనే; తీవ్ర మారుతము= వేగంగల గాలియొక్క; కోల్తలకున్= పరాక్రమానికి; ఓర్వక= సహించక; ధర్మపుత్ర= ధర్మరాజు యొక్క; బంధుర= దట్టమైన; వారిద= మేఘాల; ఉత్కరము= సమూహం; తూలుడున్= తూలగా; ఆతఁడు= ఆ ధర్మరాజు; అదల్చి= అదలించి; వీర= వీరత్వం; సుందరముగన్= ఒప్పగా; చేయి= చెయ్యి; వీచినన్= వీచగా; ఉదగ్ర= భయంకరమైన; గతిన్= నడకతో; పురికొన్నన్= క్రమ్మగా; కౌరవ స్ఫురణమున్= కౌరవుల సంచలనం; ఉద్భటంబు= అధికం; అగుడున్= కాగా; ధరా= నేలయొక్క; పరాగముల్= దుమ్మురేణువులు; సూర్యునిన్= సూర్యుడిని; మ్రింగెన్= కప్పాయి.

తాత్పర్యం: ద్రోణాచార్యుడనే తీవ్రమైన వాయువు యొక్క పరాక్రమానికి సహించక ధర్మరాజుయొక్క దట్టమైన సైన్యమనే మేఘ సమూహం తూలింది. అపుడు ధర్మజుడు అదలించి వీరత్వం ఒప్పేటట్లు చెయ్యి వీచగా, అతడి సైన్యం ఉద్ధతమైన గమనంతో క్రమ్ముకొనగా, కౌరవుల సంచలనం మితిమీరటం వలన, ధూళికణాలు సూర్యుడిని క్రమ్మివేశాయి.

విశేషం: గాలికి మేఘాలకు గల పరస్పర వైరుధ్యాన్ని కౌరవ పాండవ సైన్యాలపై ఆరోపించి, వాయువు, మేఘాలు ఒకదానిని మించి ఒకటి ఆధిక్యం పొందినట్లు, ఆయా సైన్యాలు ఒకదానిని మించి మరొకటి పైచెయ్యిగా ఉన్నట్లు వర్ణించబడింది. ఉభయ సైన్యాల యుద్ధోత్సాహం వలన వీరరసం వ్యక్తమౌతున్నది. 'వీర సుందరము' - చేయివీచుటలో ధర్మజుడి వీరమూర్తి ప్రత్యక్షమవుతున్నది.

వ. ఇబ్భంగి నుభయ సైనికులును గలయన్ బెరసిన మణిభూషణ కిరణ జాలంబుల కతంబున ధూళికృతంబు లగు తిమిరంబుల గెలిచి పోరుచుండ ధారాళ రక్తసిక్తం బై యారజఃపటలం బడంగుటయు. 270

ప్రతిపదార్థం: ఈ+భంగిన్= ఈ విధంగా; ఉభయ సైనికులును= కౌరవుల, పాండవుల భటులు కూడా; కలయన్ బెరసినన్= కలిసి చొచ్చుకొనిపోగా; మణి= మణులతో చేసిన; భూషణ= ఆభరణాల; కిరణ= వెలుగులయొక్క; జాలంబుల= సమూహాల; కతంబునన్= కారణంగా; ధూళికృతంబులు+అగు= దుమ్మువల్ల కలిగిన; తిమిరంబులన్= చీకట్లను; గెలిచి= జయించి; పోరుచుండన్= యుద్ధం చేస్తుండగా; ధారాళ= మిక్కిలి; రక్త= నెత్తురుచేత; సిక్తంబు+ఐ= తడిసి; ఆ రజః= ఆ దుమ్ము యొక్క; పటలంబు= గుంపు; అడంగుటయున్= అణగిపోగా.

తాత్పర్యం: ఇట్లా కౌరవ పాండవ సైనికులు పరస్పరం చొచ్చుకొని పోయి, రత్నాలు పొదిగిన ఆభరణాల వెలుగులతో దుమ్ముచేత ఏర్పడ్డ చీకట్లను గెలిచి యుద్ధం చేస్తుండగా, మిక్కుటమైన రక్తంతో తడిసి ఆ ధూళికణజాలం అణగిపోగా.

క. ఇరు వాఁగును దార్కొని వి। స్ఫురణ మెఱయ నాయుధముల పొగ లేని శిఖల్
దరతరమ యెగయఁ బోరఁగ। ధరఁ జతురంగములు నద్భుతంబుగఁ గెడసెన్. 271

ప్రతిపదార్థం: ఇరు వాఁగును= రెండు పక్షాల వారును; తార్కొని= సమీపించి; విస్ఫురణ= విశేషంగా చలించటం; మెఱయన్= ప్రకాశించగా; ఆయుధముల= ఖడ్గ, బాణాది శస్త్రాల యొక్క; పొగలేని= ధూమం లేని; శిఖల్= మంటలు; తరతరము+అ= క్రమంగా; ఎగయన్= పైకిలేచేటట్లు; పోరఁగన్= యుద్ధం చేయగా; ధరన్= భూమిపై; చతురంగములున్= రథాలు, గజాలు, గుఱ్ఱాలు, పదాతులు అనే నాల్గు విధాలైన సేనలును; అద్భుతంబుగన్= ఆశ్చర్యపడేటట్లు; కెడసెన్= కూలాయి.

తాత్పర్యం: కౌరవ, పాండవ సేనలు రెండును సమీపించి, తీవ్రమైన చలనం బయలుపడగా, ఖడ్గాద్యాయుధాల నుండి జ్వాలలు అంతులేకుండా పైకెగయుగా పోరు సల్పేసరికి, రథాది చతురంగ బలాలు ఆశ్చర్యం గొలిపేటట్లు భూమిపై పడిపోయాయి.

క. కరిఘటలు దురగముల దళ। మరదంబుల మొత్త మనక యడరి వడిం గా
ల్వురు మ్రగ్గఁ జేయుచును మ్ర। గ్గిరి విస్మయ మొలయఁ జూచు ఖేచర తతికిన్. 272

ప్రతిపదార్థం: కరిఘటలు= ఏనుగుల సమూహాలు; తురగముల= గుఱ్ఱాల; దళము= సైన్యం; అరదంబుల= రథాల; మొత్తము= సమూహం; ఆనక= ఆనకుండా; అడరి= అతిశయించి; వడిన్= వేగంగా, కాల్వురు= కాలిభటులు; మ్రగ్గన్+చేయుచును= హతమారుస్తూ; చూచు= చూచునట్టి; ఖేచర తతికిన్= ఆకాశంలో చరించే దేవతల సమూహానికి; విస్మయము= ఆశ్చర్యం; ఒలయన్= కలుగగా; మ్రగ్గిరి= నశించారు.

తాత్పర్యం: సైనికులు, ఏనుగుల సమూహాలు, ఆశ్విక దళం, రథసేన అనక మిక్కిలి విజృంభించి హతమారుస్తూ ఆకాశంలో విహరించే దేవతలకు ఆశ్చర్యం కలిగిస్తూ వినాశానికి గురి అయ్యారు.

ఉ. తేరుల యొప్పు మ్రోడుపడఁ దేఁకువ లేని పదాతి కోటి ను
గ్గై రుధిరంబులో మునుఁగ నానిన యేనిక పిండు పక్షముల్
ఘోరముగాఁగఁ ద్రెవ్వి వెసఁ గూలు కులాద్రులఁ బోల నాశ్వికుల్
వీర వినోదముల్ సలుపు వేడుక సొంపునఁ గూడి యెక్కినన్. 273

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తేరుల= రథాల యొక్క; ఒప్పు= సౌందర్యం; మ్రోడుపడన్= నశించగా; తేఁకువ లేని= ధైర్యం లేని; పదాతి కోటి= కాలిబంటుల సమూహం; నుగ్గు+ఐ= చూర్ణై; రుధిరంబులోన్= రక్తంలో; మునుఁగన్= మునుగగా; ఆనిన= ఉన్న; ఏనికపిండు= ఏనుగుల సమూహం; పక్షముల్= రెక్కలు; ఘోరముగాఁగన్= భయంకరంగా; త్రెవ్వి= ఖండితమై; వెసన్= వేగంగా; కూలు= కూలిపోయే; కుల+అద్రులన్= కుల పర్వతాలను; పోలన్= పోలగా; ఆశ్వికుల్= గుర్రపు రౌతులు; వీరవినోదముల్= శూరులకు సంబంధించిన క్రీడలు; సలుపు= ఆడునట్టి; వేడుక= కుతూహలం యొక్క; సొంపునన్= సమృద్ధితో; కూడి= కలిసి; ఎక్కినన్= ఎక్కగా;

తాత్పర్యం: రథాలు కుప్పగూలగా, పదాతి సైన్యం ధైర్యం సడలి ముక్కలు ముక్కలై రక్తంలో మునుగగా, గజ సమూహం రెక్కలు తెగి, భయం గొలిపేటట్లు కూలిపడే కులపర్వతాలవలె తోచగా, ఆశ్వికదళం వీరవినోదం సలిపే విధంగా కూడి ఎక్కువగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఆశ్వికదళం విజృంభించేసరికి రథ, గజ, పదాతి దళాలు విచ్ఛిన్నమై బీభత్సానికి గురికావడం ఇందులో వర్ణించబడింది.

చ. నిలిచిన రూపు డొల్లి ధరణింబడి యున్న శరీర మింత లిం
తలు శకలంబులై నెఱయ దందడి మూఁక గలంగ నొంటి గుం
పులు పటివోవ రక్త జలపూరము రొంపులు ధూళిగా రథం
బులు రభసంబునం బఱపి పోరిరి యోధులు గ్రోధ దీప్తులై. 274

ప్రతిపదార్థం: నిలిచిన= నిలబడిన; రూపు= ఆకారం; డొల్లి= దొరలి; ధరణిన్= భూమిపైన; పడి ఉన్న= కూలి ఉన్న; శరీరము= దేహం; ఇంతలు+ఇంతలు= చిన్న చిన్న; శకలంబులై= తునుకలై; నెఱయన్= వ్యాపించగా; దందడి= తరచైన; మూఁక= సైన్యం; కలంగన్= కలతపడగా; ఒంటిన్= ఒంటరివై; గుంపులు= సమూహాలు; పటిపోవన్= నశించగా; రక్త= నెత్తురనే; జల= నీటియొక్క; పూరము= ప్రవాహం; రొంపులు= బురదలు; ధూళిగాన్= దుమ్ముగా; యోధులు= వీరులు; క్రోధదీప్తులు+ఐ= కోపంతో వెలిగినవారై; రథంబులు= రథాలు; రభసంబునన్= వేగంగా; పఱపి= నడిపి; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: నిలబడ్డ ఆకారాలు దొరలి నేలపై పడియున్న దేహాలు చిన్న చిన్న తునకలై అంతట వ్యాపించగా. తరచు సైన్యం కలతపడగా, ఒంటరిగా గుంపులు కూలగా, రక్తపు నీటి ప్రవాహం బురదలు దుమ్ముగా మారగా. ఇట్లా వీరులు కోపంతో మండుతున్నవారై అతి తీవ్రంగా యుద్ధరంగంలో పోరాడారు.

విశేషం: ఇక్కడ యుద్ధం వలన సైనికుల దేహాలకు పట్టిన దుర్గతి జుగుప్సాకరంగా వర్ణించబడింది.

క. కొమ్ములఁ గ్రుమ్మియుఁ బాదత । లమ్ములఁ జమరియును గరములం బటిపటి యై
యి మ్మెడలఁగఁ దిగిచియు నర । దమ్ముల నేనుఁగులు వీటతాటము సేసెన్. 275

ప్రతిపదార్థం: ఏనుఁగులు; అరదమ్ములన్= రథాలను; కొమ్ములన్= దంతాలతో; క్రుమ్మియున్= పొడిచియు; పాదతలమ్ములన్= అరకాళ్ళ చేత; చమరియును= కొట్టియు; కరములన్= తుండాలతో; పటిపటి+ఐ= చెల్లా చెదరై; ఇమ్ము= అందం; ఎడలఁగన్= తొలగగా; తిగిచియున్= లాగియు; వీటతాటము= భగ్నం; చేసెన్= చేశాయి.

తాత్పర్యం: ఏనుగులు రథాలను దంతాలతో పొడిచి, అరకాళ్ళచే అదిమి, తుండాలతో ముక్కలు ముక్కలు చేసి అందం తొలగేటట్లు లాగి భగ్నం చేశాయి.

క. తురగమున నరుని వ్రేయుచుఁ । గరిదంతము వెటికి యన్యకరి వైచుచు ను
ద్ధుర రథము చదలఁ ద్రిప్పుచుఁ । గరులు వినోదంబు సేసెఁ గనుఁగొను ప్రజకున్. 276

ప్రతిపదార్థం: తురగమునన్= గుఱ్ఱముపైగల; నరుని= సైనికుని; వ్రేయుచున్= కొడుతూ; కరిదంతము= ఏనుగు యొక్క కోరలు; పెటికి= ఊడపీకి; అన్యకరిన్= మరొక ఏనుగుపై; వైచుచున్= విసరుతూ; ఉద్ధుర రథము= బరువైన రథాన్ని; చదలన్= ఆకాశంలో; త్రిప్పుచున్= తిప్పుతూ; కరులు= ఏనుగులు; కనుఁగొను= చూచే; ప్రజకున్= జనులకు; వినోదంబు= వేడుక; చేసెన్= కలిగించాయి.

తాత్పర్యం: ఏనుగులు, గుఱ్ఱంపైగల భటుడిని దెబ్బ వేస్తూ, ఏనుగు దంతాన్ని పెరికి వేరే ఏనుగుపై విసరుతూ, బరువైన రథాన్ని ఆకాశంలో గిర్రున తిప్పుతూ చూచేవారికి వినోదం కలిగించాయి.

క. ఒక్కొక్క చోట. 277

ప్రతిపదార్థం: ఒక్క+ఒక్క చోటన్= ఒక్కొక స్థానంలో.

తాత్పర్యం: యుద్ధం జరిగే ఒక్కొకచోట.

చ. మెఱుఁగులు గర్జితంబులును మిక్కిలి సోనయుఁ గల్గు మేఘముల్
గిఱికొన నొప్పు నాకసము లీల రణక్షితి సూడఁ బొల్పగుం
దఱచగు భూషణద్యుతి వితానము పర్వ గజవ్రజంబు పె
ల్లొఱలుచు నెత్తురుల్ దొరఁగుచుండ నొగిం బడి యున్కి నత్తఱిన్. 278

ప్రతిపదార్థం: మెఱుఁగులు= మెరుపులు; గర్జితంబులును= ఉరుములును; మిక్కిలి= అధికమైన; సోనయున్= వర్షం; కల్గు= కల; మేఘముల్= మబ్బులు; గిఱికొనన్= చుట్టుకొనగా; ఒప్పు= ఒప్పిదమైన; ఆకసము= ఆకాశం; లీలన్= వలె; తఱచు+అగు= అధికమైన; భూషణ= అలంకారాల యొక్క; ద్యుతి= వెలుగులు; వితానము= సమూహం; పర్వన్= ప్రసరించగా; గజవ్రజంబు= ఏనుగుల గుంపు; పెల్లు= ఎక్కువగా; ఒఱలుచున్= అరుస్తూ - ఘీంకరిస్తూ; నెత్తురుల్= రక్తాలు; తొరఁగుచుండన్= కారుతుండగా; ఒగిన్= వరుసగా; పడి+ఉన్కి= పడి ఉండటం వలన; అత్తఱిన్= అపుడు; రణక్షితి= యుద్ధ భూమి; చూడన్= చూడటానికి; పొల్పు+అగున్= ఒప్పింది.

తాత్పర్యం: మెరుపు తీగలు, ఉరుములు, మిక్కిలి వర్షంచేత మేఘాలు కమ్ముకొనగా ఒప్పే ఆకాశంవలె, అధికమైన భూషణాల వెలుగుల సమూహం ప్రసరించగా, ఏనుగుల గుంపు మిక్కిలి ఘీంకరిస్తూ, రక్తాలు కారుతుండగా వరుసగా పడి ఉన్నప్పటి యుద్ధం చూడటానికి ఒప్పి ఉండింది.

విశేషం: అలం: ఉపమ. ఇక్కడ మేఘాలతో నిండిన ఆకాశంతో ఏనుగులతో నిండిన యుద్ధ భూమి పోల్చబడింది.

ఆ. అశ్వసుభట తతుల యంగ ఖండంబులు । రుధిర కర్దమమున బ్రుంగియున్న
పెల్లు చూడ రౌద్ర బీభత్స కరుణ భ । యానకైక హేతువయ్యె నధిప! 279

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అశ్వ= గుఱ్ఱాల; సుభట= సైనికుల; తతుల= సమూహాల; అంగ ఖండంబులు= అవయవాల తునకలు; రుధిర= రక్తపు; కర్దమమునన్= బురదలో; బ్రుంగి ఉన్న= మునిగి ఉన్న; పెల్లు= అతిశయం; చూడన్= చూడగా; రౌద్ర= రౌద్రరసానికి; బీభత్స= బీభత్సరసానికి; కరుణ= కరుణ రసానికి; భయానక= భయానక రసానికి; ఏకహేతువు+అయ్యెన్= ఒకే కారణ మైనది.

తాత్పర్యం: గుఱ్ఱాల, భటుల సమూహాల అవయవ ఖండాలు రక్తపు బురదలో మునిగి ఉన్న అతిశయం చూడగా రౌద్ర, బీభత్స, కరుణ, భయానక రసాలకు అది ఒకే కారణంగా తోచింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్టిసమయంబున నారోహకులు పడినం దెరలంబారు వారణహయంబులును, వాహనంబులు నిహతంబులైన వెడవెడ మెలంగు వివిధయోధులును, రుధిరమాంస మస్తిష్కమయ మహాపంకంబునం గలయ మునింగియుం, గాళులు పెఱుక రాకుండియు, గౌరిజ దిగంబడియును రథకరి ఘోటకంబులు సంచరింప నేరకునికి వెడంగు పడుచుం బెనంగు కడింది మగలును రక్తాంబు తురగా వర్త కరిగిరి కలితంబైన సమరాంగణ సాగరంబు నానావిధ వాహన యానపాత్ర గతులం దరియం జొచ్చి తమయట్టివారు గొందఱు మునింగినను వెండియు విజయధన వాంఛంజేసి వెఱవక వర్తించు వీరవ్యవహారులు నయి యెయ్యది సూచిన నెత్తుటం గెంపెక్క సైనికు లుక్కునం బొంపిరి వోవుచున్న సంకుల సంగ్రామంబునఁ జెక్కు సెమర్పక దర్పంబునం జెలంగుచు ద్రోణుం డెలుంగు సూపి కడంగి. 280

ప్రతిపదార్థం: అట్టి సమయంబునన్= అప్పుడు; ఆరోహకులు= ఎక్కినవారు; పడినన్= కూలగా; తెరలన్+పారు= తొలగిపరుగెత్తే; వారణ= ఏనుగులు; హయంబులును= గుర్రాలును; వాహనంబులు= రథాలును; నిహతంబులు+అయిన= కొట్టబడగా; వెడవెడ= కొలదిగా; మెలంగు= తిరిగే; వివిధ యోధులును= వేరు వేరు వీరులును; రుధిర= రక్తం; మాంస= మాంసం; మస్తిష్క= మెదడులతో; మయ= నిండిన; మహాపంకంబునన్= మిక్కుటమైన బురదలో; కలయమునింగియున్= కలిసిపోయేటట్లు మునిగి; కాళులు= కాళ్ళు; పెఱుకరాక+ఉండియున్= లాగడానికి రాకుండియు; గౌరిజ= గిట్ట; దిగంబడియును= దిగబడి; రథ= రథాలు; కరి= ఏనుగులు; ఘోటకంబులు= గుర్రాలు; సంచరింపనేరక= తిరుగలేక; ఉనికి= ఉండి; వెడంగు+పడుచున్= వికారం పొందుతూ; పెనంగు= పెనగులాడే; కడింది= కఠినులైన; మగలును= వీరులును; రక్త= నెత్తురనే; అంబు= నీరు; తురగ= గుర్రాలు అనే; ఆవర్త= సుడులు; కరి= ఏనుగులనే; గిరి= పర్వతాలతో; కలితంబైన= కూడిన; సమర= యుద్ధపు; అంగణ= రంగం అనే; సాగరంబు= సముద్రం; నానా= పలు; విధ= రకాలైన; వాహన= వాహనాలు అనే; యానపాత్ర= పడవల; గతులన్= నడకలతో; తఱియం జొచ్చి= సమీపించి; తమ అట్టివారు= తమవంటివారు; కొందఱు; మునింగినను= మునిగిపోయినా; వెండియున్= మరల; విజయ= విజయమనే; ధన= ధనమందలి; వాంఛన్+చేసి= కోరికతో; వెఱవక= భయపడక; వర్తించు= ఉండే; వీర= వీరులనే; వ్యవహారులును= బేహారులును; అయి= అయి; ఎయ్యది= ఏది; చూచినన్= చూచినా; నెత్తుటన్= రక్తంతో; కెంపు+ఎక్కన్= ఎఱ్ఱబడఁగా; సైనికులు= భటులు; ఉక్కునన్= శౌర్యంతో; పొంపిరి+పోవుచున్న= విజృంభిస్తున్న; సంకుల సంగ్రామంబునన్= వ్యాప్తమైన యుద్ధంలో; చెక్కు+చెమర్పక= ఏమాత్రం చలించక; దర్పంబునన్= గర్వంతో; చెలంగుచున్= విజృంభిస్తూ; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; ఎలుంగు= కంఠస్వరం; చూపి= ప్రదర్శించి; కడంగి= పూని.

తాత్పర్యం: అపుడు, వాహనాలపై ఉన్నవారు క్రిందపడిపోగా, పారిపోయే ఏనుగులు, గుర్రాలు, వాహనాలు హతమయ్యేసరికి అటనట తిరిగే పలు రకాలైన వీరులును; రక్తం, మాంసం, మెదళ్ళతో నిండిన మిక్కుటమైన బురదలో కలయమునిగి కాళ్ళు పెరకటానికి రాక గిట్టలు దిగవడి రథాలు, ఏనుగులు, గుర్రాలు తిరుగలేకపోవటం వలన తికమక పడుతూ పెనగులాడే వీరశ్రేష్ఠులు, నెత్తురు అనే నీరు, గుర్రాలనే సుడులు, ఏనుగులనే పర్వతాలు గల యుద్ధభూమి అనే సముద్రం బహువిధాలైన వాహనాలనే పడవల నడకతో సమీపించి, తమ వంటి వారు కొందరు మునిగినా ఇంకా విజయమనే ధనంమీదగల కోరికతో భయపడకుండే వీరులనే బేహారులై, ఏది చూచినా రక్తంతో ఎరుపెక్కగా, భటులు శౌర్యంతో విజృంభిస్తున్న మహాయుద్ధంలో ఏమాత్రం చలించక, గర్వంతో ఉత్సహించే ద్రోణాచార్యుడు సింహనాదం చేసి పూనుకొని.

విశేషం: అలం: రూపకం.

క. కరియూథనాథుఁ బొదువం । ద్వరితోద్ధతి యానదుర్నివారం బై కే
సరి సనియెడు పగిది యుధి । ష్ఠిరు దెసకుం జనియె నతని సేన దలంకన్. 281

ప్రతిపదార్థం: కరి= ఏనుగుల; యూథ= సమూహం యొక్క; నాథున్= అధిపతిని; పొదువన్= ఆక్రమించటానికి; త్వరిత= వడిగలది; ఉద్ధతి= దర్పంగలది అయిన; యాన= నడకతో; దుర్నివారంబు+ఐ= వారించటానికి వీలుగానిదై; కేసరి= సింహం;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చనియెడు= పోయే; పగిదిన్= విధంగా; అతని= అతడి యొక్క; సేన= సైన్యం; తలంకన్= వణకగా; యుధిష్ఠిరు = ధర్మజుడి; దెసకున్= వైపునకు; చనియెన్= పోయాడు.

తాత్పర్యం: గజరాజును ఆక్రమించటానికి త్వరితం ఉద్ధతం అయిన వారింపరాని గమనంతో సింహం పోయేటట్లు ధర్మరాజు సేన వణకగా ద్రోణుడు అతడి వైపునకు వెళ్ళాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **అతి కోలాహల వికల । స్థితి యగు తన బలము మిగిలి ధీరత్వమహో**
న్నతుఁ డగు నతండు విశిఖ । ప్రతతి వఱపె గురునిపై నరాతులు వొగడన్. 282

ప్రతిపదార్థం: అతి= మిక్కిలి; కోలాహల= కలకలంచేత; వికలస్థితి అగు= చెదరిన; తన= తనయొక్క; బలమున్= సేనను; మిగిలి= దాటి; ధీరత్వ= ధైర్యంచేత; మహా+ఉన్నతుఁడు+అగు= గొప్ప ఔన్నత్యంగల వాడగు; అతండు= ఆ ధర్మజుడు; అరాతులు= శత్రువులు; పొగడన్= ప్రశంసించగా; గురునిపైన్= ద్రోణుడిపై; విశిఖ= బాణాల; ప్రతతి= సమూహం; పఱపెన్= ప్రసరింపచేశాడు.

తాత్పర్యం: మిక్కిలి కలకలంతో చెదరిన తన సైన్యాన్ని దాటి, ధైర్యంతో అత్యున్నతుడైన ధర్మజుడు శత్రువులు పొగడగా ద్రోణాచార్యుడిపై బాణజాలాన్ని ప్రయోగించాడు.

ద్రోణాచార్యునిచేత సత్యజిత్తు సచ్చుట (సం.7-20-1)

చ. **కని ద్రుపదాన్వయోత్తముఁ డకంపిత శౌర్యుఁడు సత్యవిక్రముం**
డనుపమ ధైర్యధుర్యుఁడు మహాబల దీప్తుఁడు సత్యజిత్తు ద్రో
ణుని వెసఁ దాఁకి తత్తనువు నొవ్వ దశోగ్ర శరంబు లేసి సూ
తుని మెయిఁ గ్రుచ్చెఁ జేర్చి పది తూపులు ధర్మజుఁ డుల్లసిల్లఁగన్. 283

ప్రతిపదార్థం: కని= ఇది చూచి; ద్రుపద+అన్వయ+ఉత్తముఁడు= ద్రుపదుడి యొక్క వంశంలో శ్రేష్ఠుడు; అకంపిత శౌర్యుఁడు= చలించని శౌర్యంకలవాడు; సత్యవిక్రముండు= సత్యమైన పరాక్రమం కలవాడు; అనుపమ= సాటిలేని; ధైర్య= ధీరత్వంయొక్క; ధుర్యుఁడు= భారం మోసేవాడు; మహాబలదీప్తుఁడు= గొప్పదైన శక్తిచే వెలుగొందేవాడగు; సత్యజిత్తు= సత్యజిత్తు అనేవాడు; ధర్మజుఁడు= ధర్మరాజు; ఉల్లసిల్లఁగన్= సంతోషించగా; ద్రోణుని= ద్రోణాచార్యుడిని; వెసన్= వేగంతో; తాఁకి= ఎదుర్కొని; తద్+తనువు= అతని దేహం; నొవ్వన్= బాధపడగా; దశ= పది; ఉగ్ర= భయంకరమైన; శరంబులు= బాణాలు; ఏసి= ప్రయోగించి; పది తూపులు= పది అమ్ములు; పేర్చి= అతిశయించి; సూతుని= సారథియొక్క; మెయిన్= దేహంపై; గ్రుచ్చెన్= నాటాడు.

తాత్పర్యం: ధర్మజుడూ ద్రోణుడూ యుద్ధం చేయటం చూసి, ద్రుపదవంశశ్రేష్ఠుడు, చలించని శౌర్యం కలవాడు, సత్యపరాక్రముడు, సాటిలేని ధైర్యవంతుడు, మహాబలంతో ప్రకాశించేవాడు అయిన సత్యజిత్తు, ధర్మజుడు సంతోషపడగా ద్రోణాచార్యుడిని తీవ్రంగా ఎదిరించి, అతడికి బాధ కలిగేటట్లు పది భయంకరాలైన బాణాలను ప్రయోగించి, అతడి సారథి శరీరంపై పది బాణాలను నాటాడు.

ఆ. **గురుఁడు సత్యజిత్తు కోదండ దండంబు । దునుముటయును వేఱుధనువు పుచ్చి**
కొని యుదాత్తరేఖఁ గ్రూరభల్లంబులు । ముప్పదింట నతనిఁ గప్పె నతఁడు. 284

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యుడు; సత్యజిత్తు= సత్యజిత్తు యొక్క; కోదండ దండంబు= ధనుర్దండాన్ని; తునుముటయును= త్రుంచగా; వేఱు= వేరే; ధనువు= ధనుస్సు; పుచ్చికొని= తీసికొని; ఉదాత్తరేఖన్= ఉన్నతమైన పద్ధతిలో; అతఁడు= సత్యజిత్తు; క్రూరభల్లంబులు= భయంకరమైన బాణాలు; ముప్పదింటన్= ముప్పైతో; అతనిన్= ద్రోణుడిని; కప్పెన్= ఆక్రమించాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు సత్యజిత్తు ధనుర్దండాన్ని తునుమగా, వేరొక ధనుస్సు అందుకొని ఉదాత్తమైన రీతిలో అతడు ముప్పది బాణాలతో ద్రోణుడిని ఆక్రమించాడు.

వ. తదవసరంబున సత్యజిత్తుం గూడికొని. 285

ప్రతిపదార్థం: తత్+అవసరంబునన్= ఆ సమయంలో; సత్యజిత్తున్= సత్యజిత్తును; కూడికొని= కలిసికొని.

తాత్పర్యం: అప్పుడు సత్యజిత్తుతో కలిసి.

క. వృకుఁడను పాంచాలకుమా । రకుఁ డఱువది తూపులం గరం బరుదుగ న
స్త్ర కళాచార్యుం బొదివిన । వికాసముం బొందెఁ బాండవేయ బలంబుల్. 286

ప్రతిపదార్థం: వృకుఁడు+అను= వృకుడనే; పాంచాల కుమారకుఁడు= పాంచాల రాజ కుమారుడు; అఱువది తూపులన్= అరవై బాణాలతో; కరంబు= మిక్కిలి; అరుదుగన్= అసాధారణమైన రీతిలో; అస్త్రకళ= అస్త్రవిద్యయందు; ఆచార్యున్= గురువైన ద్రోణుడిని; పొదివినన్= ఆక్రమించగా; పాండవేయ బలంబుల్= పాండవ సైన్యాలు; వికాసమున్+పొందెన్= సంతోషించాయి.

తాత్పర్యం: వృకుడనే పాంచాల రాజకుమారుడు అసాధారణంగా అరవై బాణాలతో ద్రోణాచార్యుడిని కప్పగా, పాండవ సైన్యాలు వికాసాన్ని పొందాయి.

చ. ఘనతర కోపవేగమునఁ గన్నుల నిప్పులు రాల సత్యజి
త్తనువు వృకాంగమున్ విశిఖ ధారల ముంచె గురుండు, వార లా
తని వడి కోర్చి మై గలయఁ దాఁకఁగ సారథి యు బ్బడంగ వా
హనములు బీఱువోవ సిడ మల్లల నాడఁగ సేసి రుద్ధతిన్. 287

ప్రతిపదార్థం: గురుండు= ద్రోణాచార్యుడు; ఘనతర= మిక్కిలి విరివి అయిన; కోప= క్రోధం యొక్క; వేగమునన్= వేగంతో; కన్నుల= కన్నుల నుండి; నిప్పులు; రాలన్= రాలగా; సత్యజిత్+తనువు= సత్యజిత్తుయొక్క దేహాన్నీ; వృకాంగమున్= వృకుడియొక్క తనువును; విశిఖ= బాణాల యొక్క; ధారలన్= ధారలలో; ముంచెన్= మునుగ జేశాడు; వారలు=ఆ యిరువురు; ఆతని= ద్రోణుడి; వడికిన్= తీవ్రతకు; ఓర్చి= సహించి; మై= శరీరం; కలయన్= అంతటను; తాఁకఁగన్= తగిలేటట్లు; సారథి= రథాన్ని నడిపేవాడి; ఉబ్బు= పెంపు; అడంగన్= అణగగా; వాహనములు= అశ్వాది వాహనాలు; బీఱు+పోవన్= వ్యర్థంకాగా; సిడము= ధ్వజం; అల్లలన్+ఆడఁగన్= చలించగా; ఉద్ధతిన్= గర్వంతో; ఏసిరి= కొట్టారు.

తాత్పర్యం: మిక్కిలి కోపతీవ్రతచేత కన్నులనుండి నిప్పులు రాలగా ద్రోణాచార్యుడు సత్యజిత్తు దేహాన్ని, వృకుడి దేహాన్ని బాణధారలతో ముంచివేశాడు. ఆ ఇద్దరు ద్రోణుడి తీవ్రతను సహించి, అతడి దేహమంతటా తాకగా, సారధి పెంపు అణగిపోగా, వాహనాలు పాడుకాగా, ధ్వజం చలించగా గర్వంతో బాణజాలాన్ని వేశారు.

ఆ. సత్యజిత్తు మేన సాయక దశకంబు । నాటి కుంభజుండు నగుచు విల్లు
దునుమ, నొండు వింట ద్రోణుని నొప్పించె । నతఁడు; వృకుఁడుఁ బెలుచ నడరి యేసె. 288

ప్రతిపదార్థం: కుంభజుండు= ద్రోణుడు; సత్యజిత్తు= సత్యజిత్తు యొక్క; మేనన్= శరీరంపై; సాయక దశకంబు= పది బాణాలను; నాటి= గ్రుచ్చి; నగుచున్= నవ్వుతూ; విల్లు= ధనుస్సు; తునుమన్= త్రుంచగా; అతఁడు= ఆ సత్యజిత్తు; ఒండు= మరొక; వింటన్= ధనుస్సుతో; ద్రోణునిన్= ద్రోణాచార్యుడిని; నొప్పించెన్= బాధించాడు; వృకుఁడున్= వృకుడు కూడా; వెలుచన్= ఆగ్రహంతో; అడరి= విజృంభించి; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు సత్యజిత్తుపై పది బాణాలు నాటి నవ్వుతూ అతడి వింటిని త్రుంచివేయగా, అతడు మరొక ధనుస్సుతో ద్రోణుడిని బాధించాడు; అంత వృకుడు ఆగ్రహంతో విజృంభించి ద్రోణుడిపై బాణాలు ప్రయోగించాడు.

క. **కినిసి వెసన్ సత్యజితుని । ధనువు నఱికి గురుఁడు వృకునితల దునియఁగ నా**
తని హయములు సారథియును । మును డొల్లఁగ నాఱు బాణముల్ బిట్టేసెన్. **289**

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యుడు; కినిసి= కోపించి; వెసన్= వెంటనే; సత్యజితుని= సత్యజిత్తుయొక్క; ధనువు= ధనుస్సును; నఱికి= త్రుంచి; వృకుని= వృకుడియొక్క; తల= శిరస్సు; తునియఁగన్= తెగేటట్లు; ఆతని= వృకుడి; హయములు= గుర్రాలు; సారథియును= రథచోదకుడును; మును= ముందు; డొల్లఁగన్= పడగా; ఆఱు బాణముల్= ఆరు బాణాలు; బిట్టు= వెంటనే; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు కోపించి, వెంటనే సత్యజిత్తు వింటిని త్రుంచి, వృకుని తల తెగేటట్లు, అతడి గుర్రాలు, సారథి ముందు పడిపోయేట్లు ఆరు బాణాలను శీఘ్రంగా ప్రయోగించాడు.

ఆ. **అన్యచాప హస్తుఁడై సత్యజిత్తు సం । రంభజృంభణమునఁ గుంభజన్ముఁ**
దరల నేయుటయు నతండు గెంపారెడు । నాననంబు తోడ నవుడు గఱచి. **290**

ప్రతిపదార్థం: అన్య= వేరొక; చాప= ధనుస్సు; హస్తుఁడు+ఐ= చేతగలవాడై; సత్యజిత్తు= సత్యజిత్తు; సంరంభ= ఆటోపంయొక్క; జృంభణమునన్= అతిశయంతో; కుంభజన్మున్= ద్రోణుడిని; తరలన్+ఏయుటయున్= తొలగేటట్లు చేయగా; అతండు= ద్రోణుడు; కెంపు+ఆరెడు= కోపంతో ఎర్రబడిన; ఆననంబు+తోడ= ముఖంతో; అవుడు= పెదవి; కఱచి= కొరికి.

తాత్పర్యం: సత్యజిత్తు వేరొక ధనుస్సును చేతబట్టి, ఆటోపం మీరగా ద్రోణుడు తరలి పోయేటట్లు బాణాన్ని ప్రయోగించగా, అతడు మోము ఎర్రబడగా పెదవి గరచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. **ఖండములై పడం ధనువు గ్రక్కున నేయుడు సత్యజిత్తు వి**
ల్లొండు గొనం గొనం దునియ నుద్ధతి నేయుచుఁ బెక్కు విండు లు
ద్దండత నుగ్గు సేసి భుజదర్పధురంధరుఁ డీతఁ డింత ద
క్కం దని యర్ధచంద్ర విశిఖ ప్రహతిం దల డొల్ల నేసినన్. **291**

ప్రతిపదార్థం: ధనువు= ధనుస్సు; ఖండములై పడన్= ముక్కలై పడేటట్లు; గ్రక్కునన్= త్వరితంగా, ఏయుడున్= వేయగానే; సత్యజిత్తు; ఒండు= మరొక; విల్లు= ధనుస్సును; కొనన్= అందుకొనగా; ఉద్ధతిన్= గర్వంతో; కొనన్= చివరిభాగాన్ని; తునియన్= ముక్కలయ్యేటట్లు; ఏయుచున్= వేస్తూ; పెక్కువిండులు= అనేక ధనుస్సులు; ఉద్దండతన్= భయం గొలిపేటట్లు; నుగ్గు+చేసి=

పొడి చేసి; భుజదర్ప= బాహుగర్వంయొక్క; ధురంధరుఁడు= భారం మోసేవాడు; ఈతఁడు= ఈ సత్యజిత్తు, ఇంత= ఇంతటితో; తక్కండు+అని= విడువడని; అర్ధచంద్ర= అర్ధ చంద్రాకారంగల; విశిఖ= బాణంయొక్క; ప్రహతిన్= దెబ్బతో; తల= శిరస్సును; డొల్లన్= దొల్లిపోయేటట్లు; ఏసినన్= వేయగా.

తాత్పర్యం: ద్రోణుడు సర్వజిత్తు యొక్క ధనుస్సు ముక్కలై పడేటట్లు శీఘ్రంగా బాణం వేయగా, అతడు వేరొక విల్లు అందుకొన్నాడు. దాని కొనను కూడ ద్రోణుడు త్రుంచి సత్యజిత్తు వెంట వెంటనే అనేక ధనుస్సులు తీసుకోగా, వాటిని కూడ వరుసగా ఖండించి, బాహుగర్వధురంధరుడైన సత్యజిత్తు ఇంతటితో ఆగడని, అర్ధచంద్రాకారబాణంతో అతడి తల తెగిపడేటట్లు కొట్టాడు.

క. సాహంకారుం డగు గురు । బాహు బలంబునకు నులికి పాఱఁ దొలంగెన్
వాహములఁ దోలుకొని యు । త్సాహంబుఁ జలంబు నెడల ధర్మజుఁ డధిపా! 292

ప్రతిపదార్థం: అధిపా!= ధృతరాష్ట్ర మహారాజా!; సాహంకారుండు+అగు= అహంకారంగల; గురు= ద్రోణాచార్యుడియొక్క; బాహుబలంబునకున్= భుజాల శక్తికి; ఉలికి= బెదరువలన చలించి; ధర్మజుఁడు= ధర్మరాజు; వాహములన్= గుర్రాలను; తోలుకొని= నడిపించుకొని; ఉత్సాహంబున్= పూనికయు; చలంబున్= మాత్సర్యమూ; ఎడలన్= తొలగగా; పాఱన్+తొలంగెన్= పారిపోయాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అహంకరించిన ద్రోణాచార్యుడి యొక్క బాహుబలానికి ఉలికిపడి ధర్మరాజు గుర్రాలను తోలుకొని, ఉత్సాహం, మాత్సర్యం తొలగగా పారిపోయాడు.

ద్రోణాచార్యునిచేత సూర్యదత్తుఁడు సచ్చుట (సం. 7-20-20)

సీ. ఆతని వెనుకొన నాచార్యునకు నడ్డ । పడి వారిమొన లెల్లఁ గడఁక నొక్క
పెట్ట త్రోచిన దూదితిట్టలపైఁ బ్రాఁకు । నగ్గి చందంబున ముగ్గఁజేయు
నగ్గురుఁ దాఁకి మాత్స్యానుజుఁ డాఱు దూ । పుల నొంచి యార్చిన నలిగి యతని
తల కుండలములతో నిలఁ బడ నతఁ డేసె । ధరణి నాయక! సూర్యదత్తుఁ డిట్లు

ఆ. పడినఁ జూచి మత్స్యబలకోటి విచ్చినఁ । జేది మగధ కేకయాదిసేన
లెల్లఁ జెదరఁ దలరఁ దల్లడపడఁ గల । గుండుఁ గొనఁగఁ జేసెఁ గుంభజుండు. 293

ప్రతిపదార్థం: ఆతనిన్= ధర్మజుని; వెనుకొనన్= వెంటబడగా; ఆచార్యునకున్= ద్రోణుడికి; అడ్డపడి= అడ్డగించి; వారి= పాండవుల; మొనలు+ఎల్లన్= సైన్యాలన్నీ; కడఁకన్= ప్రయత్నంతో; ఒక్క పెట్ట= ఒకేసారి; త్రోచినన్= ముందుకు త్రోయగా; దూదితిట్టలపైన్= ప్రత్తిరాసులపై; ప్రాఁకు= ప్రసరించే; అగ్గిచందంబునన్= మంటల వలె; మ్రగ్గన్+చేయు= నశింపజేసే; ఆ+గురున్= ఆ ద్రోణాచార్యుడిని; తాఁకి= ఎదుర్కొని; మాత్స్య+అనుజుఁడు= విరాటరాజు తమ్ముడు సూర్యదత్తుడు; ఆఱు= ఆరు; తూపులన్= బాణాలతో; నొంచి= అణచి; ఆర్చినన్= బొబ్బ పెట్టగా; అలిగి= కోపించి; అతని= సూర్యదత్తుడి; తల= శిరస్సు; కుండలములతోన్= చెవిపోగులతో సహా; ఇలన్= నేలపై; పడన్= పడేటట్లు; అతఁడు= ద్రోణుడు; ఏసెన్= కొట్టాడు; ధరణి నాయక!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; సూర్యదత్తుఁడు; ఇట్లు= ఈ విధంగా; పడినన్= పడగా; చూచి; మాత్స్య= మాత్స్యదేశపు; బల= సైన్యం యొక్క; కోటి= సమూహం; విచ్చినన్= చీలిపోగా; చేది= చేదిదేశపు; మగధ= మగధ దేశపు; కేకయ+ఆది= కేకయాది దేశాల; సేనలు= సైన్యాలు; ఎల్లన్= అన్నియు; చెదరన్= చెల్లాచెదరు కాగా; తలరన్= సంభ్రమించగా; తల్లడపడన్= చలించగా; కలంగుండుగొనఁగన్= క్షోభపడగా; కుంభజుండు= ద్రోణుడు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ధరణినాయకుడవైన ధృతరాష్ట్రా! ద్రోణుడు ధర్మజుడి వెంటబడగా విరాటుని తమ్ముడైన సూర్యదత్తుడు అతడిని అడ్డగించి, పాండవ సైన్యాలను ఒక్క పెట్టున ముందుకు త్రోశాడు. ద్రోణుడు ఆ సైన్యాలను దూది కుప్పలపై ప్రాకే మంటలవలె వ్యాపించి నశింపజేయగా; అతడిని ఎదుర్కొని సూర్యదత్తుడు ఆరు బాణాలతో అణచి కేకపెట్టాడు. అపుడు ద్రోణుడు కోపించి సూర్యదత్తుడి శిరస్సు కుండలాలతో సహా క్రిందపడేటట్లు కొట్టాడు. సూర్యదత్తు డిట్లా పడిపోవటం చూచి విరాటరాజు సైన్యం చీలిపోగా, ద్రోణుడు చేది, మగధ, కేకయాది దేశాల సేనలు చెల్లాచెదరయ్యేటట్లు, సంభ్రమించేటట్లు, తల్లడిల్లేటట్లు, క్షోభపడేటట్లు చేశాడు.

విశేషం: ఆంధ్ర మహాభారత సంశోధిత ముద్రణప్రతిలో పాదసూచిగా ఈ అంశాలు చెప్పబడ్డాయి. 'ఇచ్చట మూలమునందు ద్రోణునెదిర్చి యతనిచే సంహరింపబడినవాడు శతానీకుఁ డని యున్నది.

శ్లో॥ నిర్దహంత మనీకాని తాని తాని పునః పునః।
ద్రోణం మత్స్యాదవరజః శతానీకోऽ భ్యవర్తత॥' (భం. 7-20-20)

చిత్రశాలాప్రతి (7-21-25), కుంభకోణప్రతి 7-21-25. భండార్కరు ప్రతి పాదసూచియందు 'మత్స్యావరజః' అనుటకు 'మాత్స్యావరజః' అను పాఠము ప్రదర్శింపబడినది, T1, G2, 5 ప్రతులు.

శతానీకుఁ డనువాఁడు (విరటుని తమ్ముడు) భీష్మునిచే నిహతుడైనట్లు భీష్మపర్వము తృతీయాశ్వాసమున గలదు. భీష్మ-।3-391 తిక్కన భారతము. 6-113-24 భండార్కరు ప్రతి.

భీష్మపర్వములోనే సంహరింపబడిన శతానీకుడు ద్రోణపర్వమునందు తిరిగి కన్పించుట అసంగతముగా తోచును. దీనిని గుర్తించియే కాబోలు కొన్ని సంస్కృత ప్రతులలో (T1, G2, 5) 'మాత్స్యాదవరజః' అను పాఠము గ్రహింపబడినది. మాత్స్యుడనగా మత్స్యరాజు కుమారుడగు ఉత్తరు డని గ్రహించినచో శతానీకుడు వాని తమ్ము డగును. ఇట్లు విరటుని తమ్ముడొకడును, కుమారు డొకడును శతానీకనామము గలవారు ఇద్దఱుండిరని గ్రహించినచో వైరుధ్యము తొలగును.

తిక్కన సోమయాజి దీనిని గుర్తించియే కాబోలు ఈ సందర్భమున శతానీకుని పేరు విడిచి 'సూర్యదత్తుడు' అను పేరు గ్రహించెను. ఈతడు విరటుని తమ్ము డనియే తిక్కన భావము. 'మాత్స్యానుజుఁ డాఱుదూపుల' (ద్రోణ-1-293). సూర్యదత్తుని పేరు ఈ ఘట్టమున మూల సంస్కృత ప్రతులందు కాన్పించుట లేదు.

సూర్యదత్తు డనువాడు విరటుని యనుచరు డనియు ద్రోణునిచే వధింపబడె ననియు సోరన్సన్ 'మహాభారత నామానుక్రమణిక'యందు కలదు. పు. 664. మత్స్య అనగా విరాటు డనియు మాత్స్య అనగా ఉత్తరుడనియు సోరన్సన్ వివరించెను.' (పు. 299)

క. మెఱుమ ధనుర్దండము గుణ । ముఱుముఁగ విశిఖతతి దొరుఁగ నొక్కటఁ దఱచై
పఱవ రుధిరంపుఁ గాలువ । లతిముఱి ఘనభుజుఁడు ద్రోణుఁ డడరె నరేంద్రా! 294

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ధృతరాష్ట్ర మహారాజా!; ధనుః+దండము= వింటి దబ్బ; మెఱుమన్= మెరయగా; గుణము= అల్లెత్రాడు; ఉఱుముఁగన్= గర్జించగా; విశిఖ= బాణాల; తతి= సమూహం; తొరుఁగన్= కురియగా; ఒక్కటన్= ఏకమై; రుధిరంపు= రక్తపు; కాలువలు= ఏరులు; తఱచు+ఐ= దట్టమై; పఱవన్= పారగా; అతిముఱి= ఉత్సాహంతో; ఘనభుజుఁడు= గొప్పనైన బాహువులు గల; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! వింటిదబ్బ మెరయగా, అల్లెత్రాడు ఉరుమగా, బాణాలు కురియగా, రక్తపుకాలువలు ఏకమై బాగా ప్రవహించగా ఉత్సాహంతో ద్రోణాచార్యుడు విజృంభించాడు.

విశేషం: ఇందు మెఱుములు, ఉఱుములు, వర్షము - కాలువలు ఉండుటవలన బాణవర్షము స్ఫురించుచున్నది.

క. వీరాస్థిశర్కరాఘన । భేరీ మండూక కవచ పృథులోర్మి రథ
స్ఫారావర్త గజ మకర । ఘోర మహిమ రక్తనదులకుం దగియె నృపా! 295

ప్రతిపదార్థం: నృపా!= ధృతరాష్ట్ర మహారాజా!; వీర= వీరులయొక్క; అస్థి= ఎముకలనే; శర్కరా= ఇసుకయొక్క; ఘన= గొప్పవైన; భేరీ= దుందుభి వాద్యాలనే; మండూక= కప్పలయొక్క; కవచ= కవచాలనే; పృథుల= విరివి అయిన; ఊర్మి= అలల యొక్క; రథ= తేరులనే; స్ఫార= గొప్పవైన; ఆవర్త= సుడులయొక్క; గజ= ఏనుగు లనే; మకర= మొసళ్ళయొక్క; ఘోర= భయంకరమైన; మహిమ= గొప్పతనం; రక్త= నెత్తుటి; నదులకున్= ఏరులకు; తగియెన్= సరిపోలినది.

తాత్పర్యం: వీరుల ఎముకలనే లావుఇసుక యొక్క, గొప్పవైన దుందుభి వాద్యాలనే కప్పల యొక్క, విరివిగాగల కవచాలనే అలల యొక్క, రథాలనే గొప్ప సుడుల యొక్క; ఏనుగు లనే మొసళ్ళ యొక్క భయానకమైన మహిమ రక్తపు నదులకు సరిపోలింది.

విశేషం: రూపకం. యుద్ధపర్యవసానంగా కలిగిన జుగుప్సాకరమైన అస్థులు, విచ్ఛిన్నమైన భేరులు, కవచాలు, రథాలు, గజాలు, రక్తప్రవాహాలపై శర్కరా, మండూక, తరంగ, ఆవర్త, మకర, నద్యాదులను సుందరంగా ఆరోపించి బీభత్సరసాన్ని ఆస్వాదింపజేస్తున్నాడు కవిబ్రహ్మ.

వ. ఇవ్విధంబునం బాండవాగ్రజుం బట్టికొన నప్పళించి తఱుము నమ్మహావీరు మార్కొని యుధామన్యుండును, నుత్తమౌజుండును, వసుదానుండును, శిఖండియును నైదైదు శరంబు లేసిరి; సాత్యకి క్షత్రధర్ములు వరుసన నూటయిరువదింటఁ బదింటం గప్పి రయ్యుధిష్ఠిరుండును; మరలి బాణ శతత్రయ ప్రయోగ తీవ్రులగు ధృష్టద్యుమ్న చేకితానుల మున్నిడుకొని పొంగి తానును బండ్రెంట నొప్పించె; నప్పు డా భారద్వాజుని మఱియునుం బలువురు పాండవ పక్షయోధవీరులు వొదివినం గని మన్నించు రాజులు రాజకుమారులు నతనికి బాసటయై కలిసి; రతండు వసుదాను వసుధం గూల్చి క్షేము జముకడ కనిచి యుధామన్యు నుత్తమౌజుని శిఖండిని సాత్యకిని బెక్కమ్ము లెమ్ములం గీలించి తన్నుం గదిసినం గని యయ్యజాతశత్రుండు వెండియుఁ గైతవంబున రణంబునకుం దొలంగం బాఱిన. 296

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఇట్లా; పాండవ+అగ్రజున్= పాండవులకు అన్న అయిన ధర్మజుడిని; పట్టికొనన్= పట్టుకొనటానికి; అప్పళించి= ఉత్సహించి; తఱుము= వెనుదగిలి ఉరికించే; ఆ+మహావీరున్= ఆ గొప్పవీరుడైన ద్రోణుడిని; మార్కొని= ఎదుర్కొని; యుధామన్యుండునన్= యుధామన్యుడూ; ఉత్తమౌజుండును= ఉత్తమౌజుడూ; వసుదానుండును= వసుదానుడూ; శిఖండియునున్= శిఖండియు; ఐదైదు= ఐదేసి; శరంబులు= బాణాలు; ఏసిరి= ప్రయోగించారు; సాత్యకి; క్షత్రధర్ములు= క్షత్రధర్ముడు; వరుసన= క్రమంగా; నూట ఇరువదింటన్= నూట ఇరవైబాణాలతో; పదింటన్= పదిబాణాలతో; కప్పిరి= పొదివారు; ఆ+యుధిష్ఠిరుండు= ధర్మజుడు కూడ; మరలి= మళ్ళీ; బాణశతత్రయ= మూడు వందల బాణాలను; ప్రయోగ= వేయుటలో; తీవ్రులు+అగు= అధికులైన; ధృష్టద్యుమ్న చేకితానుల= ధృష్టద్యుమ్నుడిని, చేకితానుడిని; మున్ను+ఇడికొని= ముందుంచుకొని; పొంగి= ఉబ్బి; తానును= ధర్మరాజు కూడా; పండ్రెంటన్= పన్నెండు బాణాలతో; నొప్పించెన్= బాధించాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ భారద్వాజుని= ఆ ద్రోణుని; మఱియునున్= ఇంకనూ; పలువురు= అనేకులు; పాండవ= ధర్మజాదుల; పక్ష= వైపుగల; యోధ= యుద్ధం చేసే; వీరులు= శూరులు; పొదివినన్= చుట్టుముట్టగా; కని= చూచి; నీ మన్నించు= నీవు గౌరవించే; రాజులు= నృపులు; రాజకుమారులున్= రాజపుత్రులును; అతనికిన్= ఆ ద్రోణుడికి; బాసట+ఐ= సహాయులై; కవిసిరి= ఎదుర్కొన్నారు; అతండు= ద్రోణుడు; వసుదానున్=

వసుదానుడిని; వసుధన్= భూమిపై; కూల్చి= పడవేసి; క్షేమున్= క్షేముడిని; జముకడకున్= యముడి వద్దకు; అనిచి= పంపి; యుధామన్యునిన్= యుధామన్యుడిని; ఉత్తమౌజునిన్= ఉత్తమౌజుడిని; శిఖండిని; సాత్యకిన్= సాత్యకిని; ఎక్కు+అమ్ములు= ఎక్కుపెట్టిన బాణాలు; ఎమ్ములన్= ఎముకలందు; కీలించి= తగిల్చి; తన్నున్= తనను; కదిసినన్= ఆక్రమించగా; కని= చూచి; ఆ+అజాతశత్రుండు= ధర్మజుడు; వెండియున్= మరల; కైతవంబునన్= ఉపాయంతో; రణంబునకున్= యుద్ధం నుండి; తొలంగన్+పాటినన్= తొలగిపోగా .

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజును పట్టుకొనటానికి ఉత్సహించి తరిమే మహావీరుడైన ద్రోణుడిని ఎదుర్కొని యుధామన్యుడు, ఉత్తమౌజుడు, వసుదానుడు, శిఖండి కలిసి, ఐదైదు బాణాలు వేశారు. సాత్యకి, క్షత్రధర్ముడు వరుసగా నూట ఇరువది బాణాలతోను, పది బాణాలతోను పొదివారు. ధర్మజుడు కూడ మరలి మూడు వందల బాణాలను వేయటంలో అధికులైన ధృష్టద్యుమ్నుడిని, చేకితానుడిని ముందుంచుకొని, ఉత్సహించి, తాను కూడా పన్నెండు బాణాలతో నొప్పించాడు. అపుడు ఆ ద్రోణుడిని ఇంకా పాండవ పక్షంలోగల యోధులు చుట్టుముట్టగా చూచి నీవు గౌరవించే రాజులు, రాజకుమారులు ఆ ద్రోణుడికి సహాయులై పరుగెత్తారు. ఆ ద్రోణుడు కూడ వసుదానుడిని నేలపై కూల్చి, క్షేముడిని యమలోకానికి పంపి, యుధామన్యుడిని, ఉత్తమౌజుడిని, శిఖండిని, సాత్యకిని బాణాలతో గ్రుచ్చి, తనను ఆక్రమించటం చూచి ఆ ధర్మజుడు ఉపాయంగా యుద్ధభూమినుండి తొలగిపోగా.

క. గురు దృఢసేనుఁడు దాఁకిన । హరి సారథి కేతురథ శరాసన శకలో
త్కరములతోడ నతండును । దొరఁగించెఁ దదీయ తనువు దునియలు ధరణిన్. 297

ప్రతిపదార్థం: గురున్= ద్రోణుడిని; దృఢసేనుఁడు= దృఢసేనుడనేవాడు; తాఁకినన్= ఎదుర్కొనగా; అతండును= ఆ ద్రోణుడును; హరి= గుర్రాలు; సారథి= రథచోదకుడు; కేతు= పతాకం; రథ= రథం; శరాసన= ధనుస్సులయొక్క; శకల= తునకల; ఉత్కరముల తోడన్= సమూహాలతో; తదీయ తనువు= ఆ దృఢసేనుడి దేహం యొక్క; తునియలు= ముక్కలను; ధరణిన్= నేలపై; తొరఁగించెన్= పడగొట్టాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడిని దృఢసేనుడు తాకగా, ఆచార్యుడు అతడి గుర్రాలు, సారథి, కేతువు, రథం, ధనుస్సుల యొక్క ఖండాల సమూహంతోపాటు ఆ దృఢసేనుడి మేని ముక్కలను కూడ నేలపై పడవేశాడు.

వ. ఇత్తెఱంగునం దునిమి తఱుము నతని దోర్విలాసంబు దుస్సహం బగుటయుం బాండవ బలంబులు దెరలినం గురు సైనికులు నలుగడలకు నెగచి; రట్లు విజృంభించిన కుంభసంభవు నెదుర్కొని వార్ధక్షేమియుఁ జిత్రసేనుండును సేనాబిందుండును సువర్చసుండును ధృష్టద్యుమ్నుండును జేకితానుండును శిఖండియు సాత్యకియును సుమిత్రుండును సాయక జాలంబులు నిగిడించిన. 298

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఇట్లు; తునిమి= సంహరించి; తఱుము= తరిమికొట్టే; అతని= ఆ ద్రోణుడి; దోః+విలాసంబు= బాహువుల క్రీడ; దుస్సహంబు= ఓర్వరానిది; అగుటయున్= కాగా; పాండవ బలంబులు= పాండవ సేనలు; తెరలినన్= తొలగిపోగా; కురుసైనికులు= కౌరవుల భటులు; నలుగడలకున్= నాల్గు దిక్కులకు; ఎగచిరి= తరిమారు; అట్లు= ఆ విధంగా; విజృంభించిన= చెలరేగిన; కుంభసంభవున్= ద్రోణుడిని; ఎదుర్కొని= ఎదిరించి; వార్ధక్షేమియున్= వార్ధక్షేమి అనేవాడు; చిత్రసేనుండును= చిత్రసేనుడు; సేనాబిందుండును= సేనాబిందుడు; సువర్చసుండును= సువర్చసుడు; ధృష్టద్యుమ్నుండును= ధృష్టద్యుమ్నుడు; చేకితానుండును= చేకితానుడు; శిఖండియున్= శిఖండి; సాత్యకియును= సాత్యకి; సుమిత్రుండును= సుమిత్రుడును; సాయక= బాణాల; జాలంబులు= సమూహాలు; నిగిడించినన్= ప్రసరింపజేయగా.

తాత్పర్యం: ఇట్లా శత్రువులను సంహరించి, తరిమికొట్టే ద్రోణుడి భుజవిలాసం సహించరానిది కావటం వలన పాండవ సేనలు తొలగిపోగా, కురు సైనికులు నాల్గు దిక్కులకు వారిని తరిమికొట్టారు. అట్లా విజృంభించిన ద్రోణుడిని ఎదిరించి వార్ధక్షేమి, చిత్రసేనుడు, సేనాబిందుడు, సువర్చసుడు, ధృష్టద్యుమ్నుడు, చేకితానుడు, శిఖండి, సాత్యకి, సుమిత్రుడు వరుసగా బాణాలు ప్రయోగించగా.

తే. **అందఱకు నన్నిరూపులై యతఁడు వోరి । యా సుమిత్త్రునిఁ గూల్చిన నతనిఁ గేక**
యులును మాత్స్యపాంచాలురు నొక్కపెట్ట । కవిసి విరిసిరి తచ్ఛరాఘాత భీతి. **299**

ప్రతిపదార్థం: అతఁడు= ఆ ద్రోణుడు; అందఱకున్= శత్రువులందరికి; అన్ని రూపులు+ఐ= అన్ని ఆకారాలు గలవాడై; పోరి= యుద్ధం చేసి; ఆ సుమిత్త్రునిన్= ఆ సుమిత్రుడనేవాడిని; కూల్చినన్= చంపగా; తద్= ఆ ద్రోణుడి; శర+ఆఘాత= బాణపు దెబ్బల వలని; భీతిన్= భయంతో; అతనిన్= ఆ ద్రోణుడిని; కేకయులును= కేకయ దేశపు వారును; మాత్స్య= మత్స్య దేశ సైనికులును; పాంచాలురున్= పాంచాల దేశ భటులును; ఒక్కపెట్టు+అ= ఒకేసారి; కవిసి= చుట్టుముట్టి; విరిసిరి= చెదరిపోయారు.

తాత్పర్యం: ఆ ద్రోణుడు శత్రువులందరికి అన్ని రూపాలై పోరు సల్పి సుమిత్రుడిని చంపేసరికి, అతడిని కేకయ, పాంచాల సైనికులు ఒకేసారి చుట్టుముట్టి, అతడి బాణాల దెబ్బకు భయపడి చెదరిపోయారు.

వ. **ధృష్టద్యుమ్నసాత్యకి సేనాబిందు ప్రముఖ రథిక వరులును వసమఱియుండిరనిన విని, ధృతరాష్ట్రుం డచ్చెరువడి 'యిట్లు పేర్చిన యాచార్య శౌర్యభుజ వీర్యంబులు సైరింప నక్కడ నెవ్వరు లేరైరి గదే, యనుటయు సంజయుం డది సెప్పెద నాకర్ణింపు'మని యిట్లను నట్లు గలంగిన కౌంతేయ సేనఁ గనుంగొని కలకల నవ్వుచుఁ గురువిభుండు కర్ణునితో నిట్లనియె.** **300**

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నుడు; సాత్యకి; సేనాబిందు; ప్రముఖ= మున్నగు; రథిక= రథమెక్కి యుద్ధం చేసేవారిలో; వరులును= శ్రేష్ఠులును; వసము+అఱి= స్వాధీనం తప్పి; ఉండిరి= ఉన్నారు; అనినన్= అనగా; విని; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; అచ్చెరువు+పడి= ఆశ్చర్యపడి; ఇట్లు= ఈ విధంగా; పేర్చిన= అతిశయించిన; ఆచార్య= ద్రోణుడి; శౌర్య= శూరత్వం; భుజ= బాహువుల; వీర్యంబులు= బలాలు; సైరింపన్= సహించటానికి; అక్కడన్= ఆ పాండవ పక్షంలో; ఎవ్వరు= ఎవరు గూడ; లేరు+ఐరి+కదే= లేకుండినారు కదా; అనుటయున్= అనగా; సంజయుండు; అది= ఆ సంగతి; చెప్పెదన్= చెపుతాను; ఆకర్ణింపుము+అని= వినుమని; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; అట్లు= ఆ విధంగా; కలంగిన= కలతపడిన; కౌంతేయసేనన్= కుంతీపుత్రుల సైన్యాన్ని; కనుంగొని= చూచి; కలకల నవ్వుచున్= సంతోషంగా నవ్వుతూ; కురువిభుండు= దుర్యోధన మహారాజు; కర్ణునితోన్= కర్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు, సాత్యకి, సేనాబిందువు మొదలైన రథిక శ్రేష్ఠులు స్వాధీనం తప్పి ఉన్నారనగా విని, ధృతరాష్ట్రుడు ఆశ్చర్యపడి, 'ఇట్లా విజృంభించిన ద్రోణాచార్యుడి శూరత్వ, బాహుబలాలను సహించి ఎదుర్కొనటానికి పాండవ పక్షంలో ఎవ్వరూ లేకుండాపోయారా? అని అన్నాడు. సంజయుడు ఆ విషయం తెలుపుతాను వినుమని ఇట్లా అన్నాడు. అట్లా కలతపడ్డ పాండవ సేనను చూచి కలకల నవ్వుతూ దుర్యోధనుడు కర్ణుడితో ఇట్లా అన్నాడు.

క. **'పెనుగాలిని వెసఁ గూలిన । వనము క్రియం బడిన పాండవ బలముఁ గంటే?**
విను మింక నెన్నఁడును మొగ । కొన రీ యోడి చనువారు గురుకోల్తలకున్. **301**

ప్రతిపదార్థం: పెనుగాలిని= ఝంఝామారుతానికి; వెసన్= వేగంగా; కూలిన= పడిపోయిన; వనము= తోట; క్రియన్= వలె; పడిన= కూలిన; పాండవ బలమున్= పాండవుల సైన్యాన్ని; కంటే?= చూచినావా?; వినుము; ఇంకన్= ఇక; ఎన్నఁడును= ఎన్నడు కూడ; గురు= ద్రోణుడి; కోల్తలకున్= ఎదుట నిల్చి యుద్ధం చేయటానికి; ఓడి చనువారు= ఓడి పారిపోయేవారు; మొగకొనరు= పూనుకొనరు.

తాత్పర్యం: 'ఝంఝామారుతానికి వెంటనే కూలిన తోటవలె ఉన్న పాండవ సేనను చూశావా? వినుము. ద్రోణాచార్యుడి ముందు నిలిచి యుద్ధం చేయటానికి ఎన్నడు కూడ ఓడి పారిపోయేవారు ఎదుటికి రాజాలరు.

విశేషం: ఉపమ.

చం. **పవనతనూజుఁ గంటె? నిజపార్శ్వములం దనవారు లేక కౌ**
రవులు మహోగ్రభంగి నడరం గడు దైన్యముఁ బొందియున్న వాఁ
డవిరళ దివ్యమార్గణ దురాసదు ద్రోణునిఁ జూచి వీఁడు రా
జ్యవిభవకాంక్ష యెల్లఁ దెగటాఱఁగఁ బాఱెడు నట్లు సూడుమీ!' **302**

ప్రతిపదార్థం: పవన తనూజున్= భీముడిని; కంటె?= చూచినావా?; నిజపార్శ్వములన్= తన ప్రక్కల; తన వారు= ఆత్మీయులు; లేక= లేకుండటంచేత; కౌరవులు= కౌరవపక్షంవారు; మహా+ఉగ్రభంగిన్= మిక్కిలి భయంకరంగా; అడరన్= విజృంభించగా; కడున్= మిక్కిలి; దైన్యమున్= దీనత్వాన్ని; పొంది ఉన్నవాఁడు= పొందాడు; అవిరళ= విస్తారమైన; దివ్య= దేవతాసంబంధమైన; మార్గణ= ఆగ్నేయాది బాణాలచేత; దురాసదున్= ఎదుర్కొన వీలుగాని వాడగు; ద్రోణునిన్= ద్రోణాచార్యుడిని; చూచి; వీఁడు= ఈ భీముడు; రాజ్య= రాజ్యానికి చెందిన; విభవ= సౌఖ్యపు; కాంక్ష= కోరిక; ఎల్లన్= అంతయు; తెగటాఱఁగన్= నశించగా; పాఱెడున్+అట్లు= పారిపోయేటట్లు; చూడుమీ!= చూడుమా!

తాత్పర్యం: 'ఓ కర్ణా! భీముడిని చూశావా! చుట్టూ తన వారు లేక కౌరవులు మహాభయంకరంగా విజృంభించగా మిక్కిలి దీనత్వాన్ని పొందాడు. విస్తారమైన దివ్యాస్త్రాలు కలవాడు కావటం వలన ఎదుర్కొనటానికి వీలుగాని ద్రోణాచార్యుడిని చూచి వీడు రాజ్యసుఖకాంక్ష నశించగా పారిపోయేటట్లు చూడుమా!'

వ. **అనిన విని కర్ణుం డతని కిట్లనియె.** **303**

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విని; కర్ణుండు= కర్ణుడు; అతనికిన్= ఆ దుర్యోధనుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని కర్ణుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

ఉ. **'భీముఁడు నట్టివాఁడె? యరిభీషణ విక్రముఁ డస్మదీయ సం**
గ్రామ జయంబు ప్రాణములు గల్గఁగ సైఁచునె? పాండవేయు లు
ద్దామ బలాఢ్యు; లాహవము దక్కుదురే? యదిగాక వారు నీ
చే మును పడ్డపాట్లు దమ చిత్తములన్ మఱవంగ నేర్తురే? **304**

ప్రతిపదార్థం: భీముఁడున్= భీమసేనుడు; అట్టివాఁడె?= అట్లా వెనుకంజ వేసేవాడా?; అరి= శత్రువులకు; భీషణ= భయంకరమైన; విక్రముఁడు= పరాక్రమశాలి; అస్మదీయ= మనయొక్క; సంగ్రామ= యుద్ధమందలి; జయంబు= విజయం; ప్రాణములు=ప్రాణాలు; కల్గఁగన్= ఉండగా; సైఁచునె?= సహిస్తాడా?; పాండవేయులు= పాండవులు; ఉద్దామ= గొప్ప; బలాఢ్యులు= శ్రేష్ఠమైన బలంగలవారు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆహవము= యుద్ధం; తక్కుదురె?= వదులుదురా?; అదిగాక= అంతేగాక; నీచేన్= నీ వలన; మును= పూర్వం; పడ్డ= అనుభవించిన; పాట్లు= కష్టాలు; తమ= తమ యొక్క; చిత్తములన్= మనస్సులలో; మఱవంగన్+నేర్తురే?= మరచిపోతారా?

తాత్పర్యం: 'భీముడు వెనుదిరిగి పోయేవాడా? అతడు శత్రువులకు భయం గొలిపే పరాక్రమం కలవాడు. ప్రాణాలుండగా మనం యుద్ధంలో గెలవటం సహిస్తాడా? పాండవులు గొప్ప బలశాలులు; యుద్ధాన్ని వదలుకొంటారా? అదిగాక, వారు నీ చేత పూర్వం పడ్డ కష్టాలు మరచిపోతారా?

చ. **వినుము తదీయ యోధులును వీర గుణాఢ్యులు భీము మున్నుగాఁ**
గొని గురుఁ దాఁక కుండుదురె? కూడుద మీతఁడు నొవ్వకుండఁగా
మనమును నీతనిం బలసమగ్రులమై; యటు గాక యోడి రం
చునికి ప్రమాద; మేను మొగమోడక చెప్పితిఁ గౌరవేశ్వరా!' **305**

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= దుర్యోధన మహారాజా!; వినుము; తదీయ= పాండవుల; యోధులును= వీరులును; వీర= వీరులకుండే; గుణాఢ్యులు= గుణాలలో గొప్పవారు; భీమున్= భీముడిని; మున్నుగాన్+కొని= ముందుంచుకొని; గురున్= ద్రోణాచార్యుడిని; తాఁకక+ఉండుదురె?= ఎదుర్కొనక ఉంటారా?; ఈతఁడు= ద్రోణాచార్యుడు; నొవ్వకుండగాన్= బాధపడకుండగా; మనమును= మనం కూడ; బలసమగ్రులము+ఐ= సమస్తమైన సేనలు కలవారమై; ఈతనిన్= ద్రోణుడిని; కూడుదము= కలిసికొందము; అటుగాక= అట్లాకాకుండా; ఓడిరి+అంచున్= ఓడిపోయినారని; ఉనికి= ఊరుకొనటం; ప్రమాదము= ఆపత్కరం; ఏను= కర్ణుడనగు నేను; మొగము+ఓడక= మొగమాటం లేకుండ; చెప్పితిన్= చెప్పాను.

తాత్పర్యం: దుర్యోధన మహారాజా! విను. పాండవ పక్షయోధులంతా వీరగుణాలలో గొప్పవారు. భీముడిని ముందుంచుకొని ద్రోణాచార్యులను ఎదుర్కొనకుండా ఉంటారా? ఈతడు బాధపడకుండా మనం కూడా సమస్త సైన్యాలతో ఈ ఆచార్యుడిని కలిసికొందాం. అట్లా కాక పాండవులు ఓడిపోయినారని ఊరుకొనడం ప్రమాదమని నేను మొగమాటం లేకుండా చెప్పాను.'

వ. **అని పలుకునంతకుం గూడుకొని.** **306**

ప్రతిపదార్థం: అని పలుకునంతకున్= అని అన్నంతలోనే; కూడుకొని= కలిసికొని.

తాత్పర్యం: అని కర్ణుడు దుర్యోధనుడితో అన్నంత లోపలనే పాండవ వర్గమంతా కలిసికొని.

సీ. **హంస గౌరములగు హయములు నమృతాంశు । కేతువు మెఱయ నజాతరిపుఁడు**
రురునిభాశ్వంబులు హరికేతనంబును । బ్రస్ఫురితములుగఁ బవనసుతుఁడు,
శుకవర్ణహరులు ప్రస్తుత శరభధ్వజం । బును నొప్ప సహదేవ పూర్వజుండు,
నంబుద చ్ఛాయ రథ్యములు శుండాల ప । తాకయు శోభిల్లఁ దదనుజుండుఁ

తే. **గడఁగి తమ తమ సిడములు గ్రాల ద్రుపద । మాత్స్యసాత్యకి ముఖ యోధ మండలములు**
దారుణాటోప విక్రమోత్సాహ లీలఁ । దోడు నడవంగ నడరిరి ద్రోణు మీఁద. **307**

ప్రతిపదార్థం: హంస= హంసవలె; గౌరములు+అగు= తెల్లనివగు హయములున్= గుర్రాలును; అమృత+అంశు= అమృత కిరణుడైన చంద్రుడుగల; కేతువు= పతాకం; మెఱయన్= ప్రకాశించగా; అజాతరిపుఁడు= ధర్మరాజు; రురు= నల్లచారల

దుప్పితో; నిభ= సమానమైన; అశ్వంబులు= గుఱ్ఱాలు; హరి= సింహపు; కేతనంబును= పతాకం; ప్రస్ఫురితములుగన్= వెలుగొందగా; పవనసుతుఁడు= భీముడు; శుక= చిలుక యొక్క; వర్ణ= రంగుగల; హరులు= గుఱ్ఱాలు; ప్రస్తుత= ప్రశంసించదగిన; శరభ= సింహానికంటె బలంగల ఎనిమిది కాళ్ళ జంతువు; ధ్వజంబునున్= పతాకంగా; ఒప్పన్= ఒప్పగా; సహదేవ= సహదేవుడి కంటె; పూర్వజుండున్= అన్నయైన నకులుడును; అంబుద= మేఘాలవంటి; ఛాయ= వన్నెగల; రథ్యములు= గుఱ్ఱాలు; శుండాల= ఏనుగుగల; పతాకయున్= ధ్వజం; శోభిల్లన్= ఒప్పగా; తద్+అనుజుండున్= ఆ నకులుడి యొక్క తమ్ముడగు సహదేవుడును; కడఁగి= పూని; తమ తమ= వారి వారి; సిడములు= పతాకాలు; క్రాలన్= వెలుగొందగా; ద్రుపద= ద్రుపదుడు; మాత్స్య= విరటుడు; సాత్యకి; ముఖ= మొదలైన; యోధ= వీరుల; మండలములు= సమూహాలు; దారుణ= భయంకరమైన; ఆటోప= విజృంభణ; విక్రమ= పరాక్రమం; ఉత్సాహ= పూనికతోడి; లీలన్= విలాసంతో; తోడు నడవంగన్= వెంట రాగా; ద్రోణుమీఁదన్= ద్రోణుడిపై; అడరిరి= విజృంభించారు.

తాత్పర్యం: హంసలవంటి తెల్లని గుఱ్ఱాలు, చంద్ర పతాకం ప్రకాశిస్తుండగా ధర్మరాజు, కృష్ణసారమృగపు వన్నెగల గుఱ్ఱాలు, సింహధ్వజం వెలుగగా భీముడు, చిలుకవంటి రంగు గల గుఱ్ఱాలు, ప్రశంసనీయమైన శరభ పతాకంగల నకులుడు, మేఘవర్ణంగల అశ్వాలు, గజధ్వజం గల సహదేవుడు ఉత్సహించి, తమ తమ పతాకాలు ప్రకాశిస్తుండగా ద్రుపదుడు, విరాటుడు, సాత్యకి మొదలైన వీర సమూహాలు భయానకమైన విజృంభణ, పరాక్రమం, ఉత్సాహం, విలాసం ఒప్పగా తోడు నడవగా ద్రోణుడిపై దూకారు.

వ. ఇట్లు పాండవ బలంబులు జలధరంబులు శైలంబు గప్పుకరణిం గుంభసంభవుం బొదివిన దృష్టిపథం బవరుద్ధం బగుటయు నతండు దెగియె నను దిగులు మన వారికిం బుట్టె; నట్టియెడ నీ కొడుకు గడంగి సేనలకుం జేయి వీచి యందు ముంగలియై నడచు వడముడిం దాఁకినం దమకించి సాత్యకిని గృతవర్మయు, క్షత్త్రధర్ముని సైంధవుండును, యుయుత్సుని సుబాహుండును , నకులుని దుశ్శాసనుండును, సహదేవునిఁ జిత్రవర్ముండును, ధర్మనందను శల్యుండును, ద్రుపదుని బాహ్లికుండును, విరాటుని విందానువిందులును, శ్రుతకీర్తిని వివింశతియు, శ్రుతసేనుని సాల్వుండును, శ్రుతసోమునిఁ జిత్రసేనుండును, శతానీకుని శ్రుత వర్మయుఁ, బ్రతివింధ్యుని నశ్వత్థామయు, సౌభద్రుని లక్ష్మ ణుండును, శిఖండిని వికర్ణుండును, గుంతిభోజుని దుర్ముఖుండును, గేకయ, పంచకంబును, గర్ణుండును, గాశీశ్వరుని జయుండును, బాండ్యుని జయత్సే నుండును, ధృష్టద్యుమ్నపుత్రుల బృహద్ధనుర్జయ మిత్రులును, వార్ధక్షేమిని గృపాచార్యుండును, మణిమంతుని భూరిశ్రవుండును, ఘటోత్కచుని నలంబుసుండును దలపడి; రెన్నం గొలఁదిగాదు గాని మఱియు ననేకుల మార్కొని; రిబ్బంగి భారద్వాజునిం బరిమార్పను గావను బూని యక్కడి యిక్కడి వీరు లుక్కు మిగిలి యొండొరుల కేతనంబులు గూల్చియు, ఘోటకంబుల ప్రాణంబులఁ బీల్చియు, సారథుల రూపు మాపియు, నరదంబులు పఱియలు వాపియు నాతపత్ర చామరంబుల బడలువఱిచియుఁ, జాపంబులు విఱిచియుఁ గత్తళంబుల తునియలు ధరన్ దొరలించియు, నెత్తురు లురలించియు నిత్తెఱంగున ఘోర సంగ్రామంబు సేయుచుండ మధ్యాహ్నం బయ్యె, నప్పుడు దన్నుం గవిసిన ధృష్టద్యుమ్ను నమ్ముల నవలీలం గుదియించి యగ్గురుండు వెండియుం గొందఱం జిక్కువఱిచె' ననిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె.308

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవ బలంబులు= పాండవుల సైన్యాలు; జలధరంబులు= మేఘాలు; శైలంబు= పర్వతాన్ని; కప్పు కరణిన్= ఆక్రమించిన విధంగా; కుంభసంభవున్= ద్రోణాచార్యుడిని; పొదివినన్= కప్పగా; దృష్టిపథంబు= చూచే మార్గం; అవరుద్ధంబు+అగుటయున్= అడ్డగించబడగా; అతండు= ద్రోణుడు; తెగియెన్= హతమైనాడు; అను దిగులు= అనే భయం;

మనవారికిన్= మన కౌరవ పక్షం వారికి; పుట్టునట్టి ఎడన్= కలిగినపుడు; నీ కొడుకు= నీ యొక్క పుత్రుడు; కడంగి= పూని; సేనలకున్= సైన్యాలకు; చేయి వీచి= ప్రోత్సహించి; అందున్= పాండవ సైన్యంలో; ముంగలి+ఐ= ముందుగా; నడచు= నడుచునట్టి; వడముడిన్= భీముడిని; తాఁకినన్= ఎదుర్కొనగా; తమకించి= త్వరపడి; సాత్యకిని; కృతవర్మయున్= కృతవర్మ; క్షత్రధర్మునిన్= క్షత్రధర్ముడిని; సైంధవుండును= సైంధవుడు; యుయుత్సునిన్= యుయుత్సుడిని; సుబాహుండును= సుబాహుడు; నకులునిన్= నకులుడిని; దుశ్శాసనుండును= దుశ్శాసనుడు; సహదేవునిన్= సహదేవుడిని; చిత్రవర్ముండును= చిత్రవర్మయు; ధర్మనందనున్= ధర్మరాజును; శల్యుండును= శల్యుడును; ద్రుపదునిన్= ద్రుపదుడిని; బాహ్లికుండును= బాహ్లికుడును; విరాటునిన్= విరాట రాజును, విందానువిందులును= విందుడు, అనువిందుడును; శ్రుతకీర్తిని; వివింశతియున్; శ్రుతసేనుని; సాల్వుండును; శ్రుత సోమునిన్; చిత్రసేనుండును; శతానీకున్; శ్రుతవర్మయున్; ప్రతివింధ్యునిన్; అశ్వత్థామయున్; సౌభద్రునిన్= అభిమన్యుడిని; లక్ష్మణుండును; శిఖండిని; వికర్ణుండును; కుంతిభోజుని; దుర్ముఖుండును= దుర్ముఖుడు; కేకయ పంచకంబును= కేకయ దేశానికి చెందిన వీరులు ఐదుగురిని; కర్ణుండును= కర్ణుడును; కాశీశ్వరునిన్= కాశీరాజును; జయుండును; పాండ్యుని= పాండ్యదేశరాజును; జయత్సేనుండును; ధృష్టద్యుమ్నుని పుత్రులన్= ధృష్టద్యుమ్నుడి కొడుకులను; బృహద్ధనుర్జయ మిత్రులును= బృహద్ధనుర్జయుడి స్నేహితులును; వార్ద్ధక్షేమిని; కృపాచార్యుండును= కృపాచార్యుడు; మణిమంతుని; భూరిశ్రవుండును; ఘటోత్కచున్; అలంబుసుండును; తలపడిరి= ఎదుర్కొన్నారు; ఎన్నన్+కొలఁదికాదు= లెక్కింప వీలుగాదు; కాని; మఱియున్= ఇంకను; అనేకులు= చాలా మంది; మార్కొనిరి= ఎదుర్కొన్నారు; ఈ+భంగిన్= ఈ విధంగా; భారద్వాజునిన్= ద్రోణుడిని; పరిమార్పను= చంపటానికి; కావను= కాపాడటానికి; పూని= యత్నించి; అక్కడి= పాండవపక్షపు; ఇక్కడి= కౌరవ పక్షపు; వీరులు= యోధులు; ఉక్కు= శౌర్యం; మిగిలి= మీరగా; ఒండొరులు= పరస్పరం; కేతనంబులు= పతాకాలు; కూల్చియున్= పడవేసి; ఘోటకంబుల= గుర్రాల; ప్రాణంబులన్= ప్రాణాలను; పీల్చియున్= హరించియు; సారథుల= రథం నడిపేవారిని; రూపుమాపియున్= చంపి; అరదంబులు= రథాలు; పఱియలు= పర్రెలు; పాపియున్= చేసియు; ఆతపత్ర= ఛత్రాలను; చామరంబులన్= వీవనలను; బడలు వఱిచియున్= చించి; చాపంబులు= బాణాలు; విఱిచియున్= ఖండించి; కత్తళంబుల= కవచాల యొక్క; తునియలు= ముక్కలు; ధరన్= భూమిపై; దొరలించియున్= పడవేసి; నెత్తురు= రక్తం; ఉరలించియున్= కార్చియు; ఇత్తెఱంగున్= ఈ విధంగా; ఘోర సంగ్రామంబు= భయంకరమైన యుద్ధం; చేయుచుండన్= చేస్తుండగా; మధ్యాహ్నంబు= పట్టపగలు; అయ్యెన్= అయింది; అప్పుడు= ఆ సమయంలో; తన్నున్= తనను; కవిసిన= ఆక్రమించిన; ధృష్టద్యుమ్ను= ధృష్టద్యుమ్నుడి; అమ్ములన్= బాణాలతో; అవలీలన్= సులభంగా; కుదియించి= బాధించి; ఆ+గురుండు= ఆ ద్రోణాచార్యుడు; వెండియున్= మరల; కొందఱన్= కొందరు వీరులను; చిక్కువఱిచెన్= బాధించాడు; అనినన్= అనగా; విని; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్= సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా పాండవ సైన్యాలు మేఘాలు పర్వతాన్ని క్రమ్మినట్లు ద్రోణుడిని కప్పగా, చూపులు ప్రసరించక అతడు హతుడయ్యేనన్న భయం మన కౌరవ వర్గానికి తోచగా, నీ కుమారుడైన దుర్యోధనుడు ముందుకు వచ్చి చెయ్యి వీచి, అందు ముందున్న భీముడిని ఎదుర్కొన్నాడు. అపుడు త్వరపడి సాత్యకిని కృతవర్మ, క్షత్రధర్ముడిని సైంధవుడు; యుయుత్సుడిని సుబాహుడు, నకులుడిని దుశ్శాసనుడు, సహదేవుడిని చిత్రవర్మ, ధర్మరాజును శల్యుడు, ద్రుపదుడిని బాహ్లికుడు, విరాటుని విందానువిందులు, శ్రుతకీర్తిని వివింశతి, శ్రుతసేనుడిని సాల్వుడు, శ్రుతసోముని చిత్రసేనుడు, శతానీకుడిని శ్రుతవర్మ, ప్రతివింధ్యుని అశ్వత్థామ, సౌభద్రుడిని లక్ష్మణుడు, శిఖండిని వికర్ణుడు; కుంతిభోజుడిని దుర్ముఖుడు, కేకయులైదుగురిని కర్ణుడు, కాశీరాజును జయుడు, పాండ్యుడిని జయత్సేనుడు, ధృష్టద్యుమ్నుడి పుత్రులను బృహద్ధనుర్జయ మిత్రులు, వార్ద్ధక్షేమిని కృపాచార్యుడు, మణిమంతుని భూరిశ్రవుడు, ఘటోత్కచుడిని అలంబుసుడు ఎదుర్కొన్నారు. ఇట్లా లెక్కించటానికి వీలుకానంతమంది వీరులు ఒకరిపై ఒకరు యుద్ధానికి దిగారు. ఈ విధంగా ద్రోణుడిని సంహరించటానికి, రక్షించటానికి పూనుకొని పాండవ, కౌరవ పక్ష వీరులు శౌర్యం మీరగా పరస్పరం పతాకాలను కూల్చి, అశ్వాలను చంపి, సారథులను హతమార్చి, రథాలను విరుగగొట్టి, ఛత్రచామరాలను త్రుంచి, ధనుస్సులను ఖండించి, కవచాల ముక్కలను నేలపై పడవేసి,

రక్తాలు చిందిస్తూ, భయానకమైన యుద్ధం చేస్తుండగా పట్టపగలు అయింది. ద్రోణుడు అప్పుడు తనను ఎదుర్కొన్న ధృష్టద్యుమ్నుడిని బాణాలతో తేలికగా బాధించి, మరి కొందరిని చీకాకు పరచినాడని చెప్పగా విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

క. 'వీ రిచట నివ్విధంబునఁ । బోరఁగ నర్జునునితోడఁ బోక పెనఁగు న
వ్వీరులు సంశప్తకు లె । ట్లైరొకో? యాతని పరాక్రమాతిశయమునన్.' 309

ప్రతిపదార్థం: వీరు= కౌరవులు, పాండవులు; ఇచటన్= ఈ యుద్ధరంగంలో; ఈ+విధంబునన్= ఈ రీతిగా; పోరఁగన్= యుద్ధం చేయగా; అర్జునుని తోడన్= అర్జునుడితో; పోక= వెనుదిరుగక; పెనఁగు= పోరాడే; ఆ+వీరులు= ఆ వీరులైన; సంశప్తకులు= సంశప్తకులైన సుశర్మాదులు; ఆతని= అర్జునుడియొక్క; పరాక్రమ+అతిశయమునన్= శౌర్యం యొక్క ఆధిక్యంవలన; ఎట్లు+ఐరి+ఒకొ!= ఏమైనారో!

తాత్పర్యం: 'కౌరవ పాండవ సైన్యాలు యుద్ధరంగంలో ఈ విధంగా పోరాటం సల్పుతుండగా, అర్జునుడితో వెనుదిరుగక యుద్ధంచేసే సుశర్మాది సంశప్తకులు అతిశయించిన అతడి పరాక్రమంముందు ఏమైనారో?'

చ. అనవుడు నాతఁ డిట్టులను నవ్విభుతో 'నది వెండి చెప్పెదన్
వినుము నరేంద్ర! యట్టి యెడ వీరరసస్ఫురణంబునన్ భవ
త్తనయుఁడు గంధసింధుర వితానముపై నడరించి భీమసే
నునిఁ గినియించె నాతఁడు గనుంగవ నిప్పులు రాలుచుండఁగన్. 310

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆతఁడు= సంజయుడు; ఆ విభుతోన్= ఆ రాజుతో; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; నరేంద్ర!= ఓ ధృతరాష్ట్ర నృపా!; వినుము; అది= సంశప్తకుల యుద్ధాన్ని గూర్చి; వెండి= మరల; చెప్పెదన్= చెపుతాను; అట్టి ఎడన్= కౌరవ, పాండవ వీరులు యుద్ధం చేస్తుండగా; భవత్+తనయుఁడు= తమ కుమారుడైన దుర్యోధనుడు; వీరరస= వీరరసం; స్ఫురణంబునన్= తోచునట్లుగా; గంధ= మదించిన; సింధుర= ఏనుగుల; వితానము= సమూహం; పైన్+అడరించి= మీదికి పంపి; భీమసేనునిన్= భీముడిని; కినియించెన్= కోపింపజేశాడు; ఆతఁడు= ఆ భీముడు; కనుంగవ= రెండు కన్నులలో; నిప్పులు= అగ్నికణాలు;రాలుచుండఁగన్=కురుస్తుండగా.

తాత్పర్యం: అపుడు సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'ఓ మహారాజా! వినుము. సంశప్తకుల యుద్ధాన్ని గూర్చి తర్వాత వివరిస్తాను. ఇట కౌరవ పాండవ సైన్యాలు యుద్ధం చేస్తుండగా మీ కొడుకు, వీరరసం ప్రస్ఫుటమయ్యేటట్లు మదించిన ఏనుగుల గుంపును పైకి నడిపి భీముడికి క్రోధం కలిగేటట్లు చేశాడు. భీముడు అపుడు రెండు కన్నులనుండి నిప్పులు రాలుతుండగా.

క. శరజాల మహావాత । స్ఫురణంబున నుగ్రదంతి భూరి ఘటా బం
ధుర వారివాహపటలము । విరియించుచు బెట్టు గవిసి విభు నొప్పించెన్. 311

ప్రతిపదార్థం: శర= బాణాల; జాల= సమూహమనే; మహావాత= గొప్ప వాయువు యొక్క; స్ఫురణంబునన్= చలనం వలన; ఉగ్ర= భయంకరమైన; దంతి= ఏనుగుల; భూరి= గొప్పనైన; ఘటా= గుంపులనే; బంధుర= దట్టమైన; వారి వాహ= మేఘాల; పటలము= గుంపు; విరియించుచున్= విడిపోయేటట్లు చేస్తూ; కవిసి= ఎదుర్కొని; విభున్= దుర్యోధనుడిని; నొప్పించెన్= బాధించాడు.

తాత్పర్యం: భీముడి బాణజాలం అనే మహావాయువు వీచడం వలన భయంకరమైన ఏనుగుల కుంభస్థలాలు అనే దట్టమైన మేఘాల సమూహం విచ్ఛిన్నమయ్యేటట్లు చేస్తూ ఎదుర్కొని, దుర్యోధనుడిని బాధించాడు.

విశేషం: అలం: రూపకం.

వ. **అట్లు కురురాజు నొచ్చిన నడ్డంబు సొచ్చి.** **312**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; కురురాజు= దుర్యోధనుడు; నొచ్చినన్= బాధపడగా; అడ్డంబు= అడ్డం; చొచ్చి= ప్రవేశించి.

తాత్పర్యం: ఆ విధంగా దుర్యోధనుడు బాధపడగా అడ్డం వచ్చి.

శా. **వంగాధీశ్వరుఁ డేనుఁగుం గొలిపి గర్వస్ఫూర్తి దివ్యాస్త్ర వి**
ద్ధాంగుం జేసె మరుత్తనూజు; నతఁ డుద్యత్క్రోధుఁ డై వాని మా
తంగంబుం బడనేసి వాఁ డొఱగుచోఁ దన్మస్తకం బుర్వి డొ
ల్లం గేలీ విధ మొప్ప నేయ బల మెల్లం బెల్లగిల్లెన్ వడిన్. **313**

ప్రతిపదార్థం: వంగ+అధీశ్వరుఁడు= వంగదేశపు రాజు; ఏనుఁగున్= ఏనుగును; కొలిపి= పురికొల్పి; గర్వస్ఫూర్తిన్= గర్వం స్ఫుటమయ్యేటట్లు; దివ్య= దేవతాసంబంధమైన; అస్త్ర= బాణాలచేత; మరుత్+తనూజున్= భీముడిని; విద్ధ+అంగున్= ఛేదించబడిన అవయవాలుగల వాడినిగా; చేసెన్= చేశాడు; అతఁడు= ఆ భీముడు; ఉద్యత్ క్రోధుఁడు+ఐ= రేగిన కోపం కలవాడై; వాని= వంగదేశపు రాజు యొక్క; మాతంగంబున్= ఏనుగును; పడనేసి= కూల్చి; వాఁడు= వంగదేశపు రాజు; ఒఱగుచోన్= ఒరిగిపోగా; తద్+మస్తకంబు= వాడి తల; ఉర్విన్= భూమిపై; డొల్లన్= దొరలగా; కేలీ విధము= ఆటరీతిగా; ఒప్పన్= ఒప్పేటట్లు; ఏయన్= వేయగా; బలము= సైన్యం; ఎల్లన్= అంతా; వడిన్= వేగంగా; పెల్లగిల్లెన్= పారిపోయింది.

తాత్పర్యం: వంగదేశపు రాజు ఏనుగును పురికొల్పి, అహంకారం బయలు పడేటట్లు దివ్యాస్త్రాలచేత భీముడిని బాధించాడు. భీము డపుడు క్రోధం రెచ్చిపోగా, వంగనృపతి ఏనుగును కూల్చి, వాడు నేలకు ఒరగగా, వాడి తలను అవలీలగా కూల్చేసరికి సైన్యమంతా పారిపోయింది.

వ. **ఆ సమయంబున.** **314**

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అప్పుడు.

తాత్పర్యం: భీముడు వంగనృపతిని చంపగా అతడి సైన్యం పారిపోయినప్పుడు.

భగదత్తుఁడు సుప్రతీకముఁ బఱపి పాండవ సైన్యంబులం గలంచుట (సం. 7-25-19)

క. **దానవజయ మింద్రున కె। ద్దానివలనఁ గలిగె మున్ను దానోగ్రము న**
య్యేనుఁగు భగదత్తుఁడు పవ। మాన తనయుఁ దెసకుఁ గొలిపె మద మెలరారన్. **315**

ప్రతిపదార్థం: దానవ జయము= రాక్షసులను గెలుచుట; ఇంద్రునకున్= ఇంద్రుడికి; ఎద్దానివలనన్= దేనివలన; మున్ను= పూర్వం; కలిగెన్= కలిగిందో; దాన+ఉగ్రమున్= మదజలంచేత భయం గొలిపే; ఆ+ఏనుఁగున్= ఆ ఏనుగును; భగదత్తుఁడు; మదము= మదం; ఎలరారన్= అతిశయించగా; పవనమానతనయున్= భీముడి; దెసకున్= దిక్కునకు; కొలిపెన్= పురికొల్పాడు.

తాత్పర్యం: రాక్షసులతోడి యుద్ధంలో పూర్వం ఇంద్రుడికి దేనివలన జయం కలిగిందో, మదజలంచేత భయం గొలిపే అట్టి ఏనుగును భగదత్తుడు మదం అతిశయించగా భీముడివైపు పురికొల్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు మన సైన్యంబు దైన్యంబు వాయం గొలుపుటయు నగ్గజంబు. 316

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మన= కౌరవుల; సైన్యంబు= సేనయొక్క; దైన్యంబు= దీనత్వం; పాయన్+కొలుపుటయున్= పోగొట్టగా; ఆ+గజంబు= ఆ సుప్రతీకమనే ఏనుగు.

తాత్పర్యం: ఈ విధంగా మన కౌరవసేనలోని దీనత్వాన్ని తొలగించి సుప్రతీకమనే ఆ ఏనుగు. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. కినుకమై నిగిడిన కనుఁగవ మెఱుఁగుల । గములు ముందటఁ గెంపు గడలుకొనఁగఁ
జెవులు మ్రొగ్గించి పూఁచిన రౌద్రతరరేఖ । వినువీథిఁ జూపఱ వేడ్కఁ బెనుప
గడునఁ జాఁగిన తొండంబు లయసమ । వర్తిదండము లీలఁ బట్టువఱుపఁ
గడు బెట్టిదపు టురవడిఁ బదన్యాస మి । లాస్థలి గ్రక్కదలంగఁ జేయ

ఆ. ననిలపుత్రుదెసకు నడరినఁ గని ధర్మ । తనయు సేన జనులు దల్లడిల్లి
చంపెఁ జంపె భీము సామజం బనియెడు । నులివు గలయఁ జెలఁగఁ గలఁగి రథిప! 317

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; కినుకమైన్= కోపంతో; నిగిడిన= విస్తరిల్లిన; కను+కవ= కన్నుల జంట వలన; మెఱుఁగులు= వెలుగుల; గములు= గుంపులు; ముందటన్= ముందుభాగంలో; కెంపు= ఎరుపును; గడలు కొలువన్= వ్యాపింపజేయగా; చెవులు; మ్రొగ్గించి= వంచి; పూఁచిన= వ్యాపించిన; రౌద్రతర రేఖ= క్రోధపు గీర; వినువీథిన్= ఆకాశమార్గంలో; చూపఱ= చూచేవారికి; వేడ్కన్= వినోదాన్ని; పెనుపన్= పెంచగా; గండునన్= పౌరుషం వలన; చాఁగిన= సాగిన; తొండంబు= తుండం యొక్క; లయ= విలయం; సమవర్తి= యమధర్మరాజు యొక్క; దండము లీలన్= దండం వలె; పట్టుపఱుపన్= చిక్కుపెట్టగా; కడున్= మిక్కిలి; బెట్టిదపు= క్రూరమైన; ఉరవడిన్= వేగంతో; పదన్యాసము= కాళ్ళు మోపటం; ఇలాస్థలిన్= భూమిని; గ్రక్కదలంగన్+చేయన్= మిక్కిలి కదలేటట్లు చేయగా, అనిలపుత్రు= భీముడి; దెసకున్= వైపునకు; అడరినన్= సాగగా; కని= చూచి; ధర్మతనయుసేన= ధర్మజుడి సైన్యం; జనులు= ప్రజలు; తల్లడిల్లి= చలించి; సామజము= ఏనుగు; భీము= భీముడిని; చంపెన్= చంపింది; అనియెడు= అనే; ఉలివు= మ్రోత; కలయన్+చెలఁగన్= అంతటా ధ్వనించగా; కలఁగి= కలతపడి.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! సుప్రతీక గజం కోపంతో నిక్కిన కన్నులనుండి వెడలే వెలుగుల గుంపులు ముందు భాగంలో అరుణవర్ణాన్ని ప్రసరింపజేయగా, చెవులు వంచి వ్యాపింపజేసిన క్రోధరేఖ ఆకాశం నుండి చూచే దేవతలకు వినోదాన్ని కలిగించగా, పౌరుషంవలన సాగిన తొండం లయకాలపు యమధర్మరాజు దండం వలె చిక్కు వరుపగా; క్రౌర్యపు వేగంతో కాళ్ళు మోపేసరికి భూభాగం చలించగా, భీముడి వైపునకు సాగగా చూచి సైన్యం, ప్రజలు తల్లడిల్లి, ఆ ఏనుగు భీముడిని 'చంపె, చంపె' అనే కలకలం అంతటా చెలరేగగా కలతపడి.

విశేషం: అలం: ఉపమ, అతిశయోక్తి. ఈ పద్యంలో సుప్రతీక గజం యుద్ధరంగంలో చేసిన స్వైరవిహారం వర్ణించబడింది.

వ. తదనంతరంబున యుధిష్ఠిరుండు. 318

ప్రతిపదార్థం: తద్+అనంతరంబునన్= ఆ వెంటనే; యుధిష్ఠిరుండు= ధర్మరాజు.

తాత్పర్యం: ఆ వెంటనే ధర్మజుడు.

క. **అలుకొందు మనముతోఁ దన । బలముం బురికొలిపి పొదివి భగదత్తుని న**
మ్ములఁ గప్పెఁ; నతఁడు వానిన్ । విలసిల్లు మహాంకుశమున విరియ జడియుచున్. 319

ప్రతిపదార్థం: అలుక+ఒందు= కోపించిన; మనముతోన్= మనస్సుతో; తన= తనయొక్క; బలమున్= సైన్యాన్ని; పురికొలిపి= ప్రోత్సహించి; పొదివి= ఆక్రమించి; భగదత్తుని= భగదత్తుడిని; అమ్ములన్= బాణాలతో; కప్పెన్= కప్పాడు; అతఁడు= భగదత్తుడు; వానిన్= ధర్మజుడిని; విలసిల్లు= ప్రకాశించే; మహా+అంకుశమునన్= గొప్ప అంకుశంతో; విరియన్= విప్పారగా; జడియుచున్= బెదిరిస్తూ.

తాత్పర్యం: ధర్మజుడు కోపంతో తన సైన్యాన్ని పురికొలిపి ఆక్రమించి, భగదత్తుడిని బాణాలతో కప్పివేశాడు. భగదత్తుడు అపుడు విరాజిల్లే గొప్ప అంకుశంతో ఆ బాణాలు దూరంగా పడిపోయేటట్లు విదిలిస్తూ . (తరువాతి పద్యంతో అన్వయం).

క. **గజముఁ గొలిపి యాదిక్కున । గజఘోటక భటనికాయ కాయములు రథ**
వ్రజములుఁ బొడిపొడిగా న । క్కజముగ విహరించె బాహు గర్వ స్ఫూర్తిన్. 320

ప్రతిపదార్థం: గజమున్= సుప్రతీక గజాన్ని; ఆ దిక్కునన్= ఆ వైపుకు; కొలిపి= పురికొల్పి; గజ= ఏనుగుల; ఘోటక= గుర్రాల; భట= సైనికుల; నికాయ= సమూహపు; కాయములు= దేహాలు; రథవ్రజములున్= రథాల సమూహాలు; పొడిపొడిగాన్= పొడి పొడి కాగా; బాహు= భుజపు; గర్వ= అహంకారం యొక్క; స్ఫూర్తిన్= ప్రకాశంతో; అక్కజముగన్= ఆశ్చర్యం గొలిపేటట్లు; విహ రించెన్= సంచరించాడు.

తాత్పర్యం: సుప్రతీక గజాన్ని ఆ వైపు పురికొలిపి ఏనుగుల, గుర్రాల, భటుల గుంపుల దేహాలను, రథసమూహాలను పొడి పొడి చేసి, బాహుగర్వం ప్రకాశించగా భగదత్తుడు ఆశ్చర్యం గొలిపేటట్లు యుద్ధరంగంలో విహరించాడు.

వ. **అప్పు డాలోకించి.** 321

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అప్పుడు భగదత్తుడి సైర్వవిహారం చూచి.

చ. **అలిగి దశార్ణ భూరమణుఁ డాతనిఁ దాఁకినఁ జూడ నొప్పె ఱె**
క్కలు గల పర్వత ద్వయము కైవడి వారల దంతియుగ్మ మి
ట్టల మగు వీఁకఁ దత్కరిఁ బడం బొడిచెన్ వడి సుప్రతీక ము
త్తలపడువానిఁ జంపె భగదత్తుఁడు దోమరసప్తకంబునన్. 322

ప్రతిపదార్థం: దశార్ణ= దశార్ణదేశానికి; భూ రమణుఁడు= రాజు; ఆతనిన్= భగదత్తుడిని; తాఁకినన్= ఎదుర్కొనగా; ఱెక్కలు+కల= రెక్కలున్న; పర్వత ద్వయము= రెండు పర్వతాల; కైవడి= వలె; వారల= దశార్ణనృపుడి, భగదత్తుడి; దంతియుగ్మము= ఏనుగుల జంట; చూడన్+ఒప్పెన్= చూడదగింది అయినది; సుప్రతీకము= సుప్రతీక గజం; ఇట్టలమగు= మిక్కిలి; వీఁకన్= పరాక్రమంతో; తద్= దశార్ణ దేశ నృపుడి యొక్క; కరిన్= ఏనుగును; వడిన్= వేగంగా; పడన్+పొడిచెన్= కూలనేసింది; భగదత్తుఁడు; ఉత్తల పడువానిన్= పరితపించే దశార్ణ నృపుడిని; తోమర సప్తకంబునన్= ఏడుతోమరాలనే ఆయుధాలతో; చంపెన్= హతమార్చాడు.

తాత్పర్యం: దశార్ణ దేశపు రాజు భగదత్తుడిని ఎదుర్కొనగా వారల ఏనుగు జంట రెక్కలుగల పర్వతాల జంటవలె చూడముచ్చటగా ఉండినది. సుప్రతీకగజం అపుడు మిక్కిలి పరాక్రమించి, దశార్ణాధీశుడి ఏనుగును పడిపోయేటట్లు పొడిచింది. భగదత్తుడు ఏడు తోమరాలతో చింతాక్రాంతుడైన అతడిని చంపివేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలంకారం: ఉపమ.

ఆ. **చంపి విక్రమంబు సొంపారఁ బాండవ । బలము బడలువడఁగ భద్రదంతిఁ**
జటుల గతులఁ బఱప సాత్యకి యడ్డంబు । నడచి యేసె దొడ్డ నారసమున. 323

ప్రతిపదార్థం: విక్రమంబు= పరాక్రమం; సొంపు+ఆరన్= అతిశయించగా; చంపి= హతమార్చి; పాండవ బలము= పాండవ సైన్యం; బడలు పడఁగన్= శ్రమపడగా; భద్రదంతిన్= శ్రేష్ఠమైన సుప్రతీక గజాన్ని; చటుల గతులన్= దూకే నడకలతో; పఱపన్= ముందుకు సాగించగా; సాత్యకి; అడ్డంబు నడచి= ఎదుర్కొని; దొడ్డనారసమునన్= గొప్ప బాణంతో; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: విక్రమం మీర దశార్ణ రాజును చంపి, పాండవ సైన్యం శ్రమపడగా, భగదత్తుడు సుప్రతీక గజాన్ని దూకిస్తూ ముందుకు సాగించేసరికి సాత్యకి అడ్డం వచ్చి పెద్ద బాణాన్ని ప్రయోగించాడు.

చ. **కరిపతి జిఱ్ఱనం దిరిగి క్రమ్మఱ నూల్కొని వృష్ణివీరు ను**
ద్ధురరథ ముద్ధతిం బెనఁచి తొండమునన్ వెస నెత్తి వీచి వై
చె రయముమై నతం డిలకుఁ జిత్రముగా నెడ దాఁటి పోయెఁ జె
చ్చెర గజ మొండుమైఁ గవిసి చిందఱ వందఱ సేసె మూఁకలన్. 324

ప్రతిపదార్థం: కరిపతి= గజరాజము సుప్రతీకము; జిఱ్ఱనన్= శీఘ్రంగా; తిరిగి పరిభ్రమించి; క్రమ్మఱన్= మరల; ఊల్కొని= కుదురుకొని; వృష్ణివీరు= సాత్యకియొక్క; ఉద్ధుర రథము= ఉద్ధతమైన రథాన్ని; ఉద్ధతిన్= గర్వంతో; పెనఁచి= పెనగజేసి; తొండమునన్= తొండంతో; వెసన్= వేగంగా; ఎత్తి= పైకెత్తి; రయముమైన్= వేగంగా; వీచివైచెన్= విసరివేసింది; అతండు= సాత్యకి; ఇలకున్= నేలపైకి; చిత్రముగాన్= విచిత్రంగా; ఎడ= దూరంగా; దాఁటిపోయెన్= తప్పించుకొని పోయాడు; చెచ్చెరన్= శీఘ్రంగా; గజము= సుప్రతీకం; ఒండుమైన్= మరొకవైపునకు; కవిసి= ఉరికి; మూఁకలన్= సేనలను; చిందర వందఱ= గందరగోళం; చేసెన్= చేసింది.

తాత్పర్యం: సుప్రతీక గజం గిర్రున తిరిగి, మరల కుదుటపడి, సాత్యకి యొక్క బలమైన రథాన్ని గర్వంతో పెనగజేసి తొండంతో పైకెత్తి తీవ్రంగా విసరివేసింది. సాత్యకి ఆశ్చర్యం గొలిపేటట్లు నేలపై దూకి దూరంగా దాటుకొన్నాడు. వెంటనే ఆ ఏనుగు మరొకవైపునకు ఉరికి సైన్యాన్ని చిందరవందర చేసింది.

క. **సారథి తురంగముల మెలు । పారం గాఁ బూన్చి తేర్చి యవికలమగు నా**
తే రల్లఁ దేర సాత్యకి । బీరము వొలివోవకుండఁ బ్రియమున నెక్కెన్. 325

ప్రతిపదార్థం: సారథి= సాత్యకి రథసారథి; తురంగములన్= గుర్రాలను; మెలపు+ఆరంగాన్= జాగరూకతతో; పూన్చి= కూర్చి; తేర్చి= తేరుకొనేటట్లు చేసి; అవికలమగు= చెదరని; ఆ తేరు= ఆ రథాన్ని; అల్లన్= మెల్లగా; తేరన్= తేగా; బీరము= పరాక్రమం; పొలివోవకుండన్= చెడకుండా; సాత్యకి; ప్రియమునన్= సంతోషంతో; ఎక్కెన్= ఎక్కాడు.

తాత్పర్యం: సారథి అశ్వాలను జాగరూకతతో తేర్చి పూన్చి, చెదరని ఆ రథాన్ని మెల్లగా తేగా, సాత్యకి పరాక్రమం చెడకుండా సంతోషంతో ఆ రథాన్ని ఎక్కాడు.

ఉ. **భీముఁ డుదగ్రతం గవియఁ బెల్లగు నా కరిచేతి శీకర**
స్తోమమునం దురంగములు దోఁగి కడున్ వెగడంది యీడ్చె సం
గ్రామ వినోద లీలకు విఘాతము గాఁగ రథంబు నప్పు డు
ద్దామ పరాక్రమ స్ఫురణఁ దాఁకి సుపర్వుఁడు సచ్చె హస్తిచేన్. 326

ప్రతిపదార్థం: భీముఁడు= భీముడు; ఉదగ్రతన్= భయంకరంగా; కవియన్= మార్కొనగా; పెల్లగు= అధికమైన; ఆ కరి= ఆ సుప్రతీక గజం యొక్క; చేతి= తుండములోని; శీకర= ఏనుగుతొండం చివర పుట్టు మదంయొక్క; స్తోమమునన్= సమూహంతో; తురంగములు= గుర్రాలు; తోఁగి= మునిగి; కడువెగడు+అంది= మిక్కిలి తల్లడిల్లి; సంగ్రామ= యుద్ధమనే; వినోద= క్రీడయొక్క; లీలకున్= చర్యకు; విఘాతము= అడ్డంకి; కాఁగన్= ఏర్పడగా; రథంబున్= రథాన్ని; ఈడ్చెన్= లాగాయి; అప్పుడు= ఆ సమయంలో; సుపర్వుఁడు; ఉద్దామ= అడ్డులేని; పరాక్రమ= శౌర్యం యొక్క; స్ఫురణన్= ప్రకాశంతో; తాఁకి= ఎదుర్కొని; హస్తిచేన్= ఏనుగుచేత; చచ్చెన్= మరణించాడు.

తాత్పర్యం: భీముడు భయంకరంగా ఎదుర్కొనగా ఆ సుప్రతీక గజము యొక్క తొండంనుండి కారే మదపు జల్లుకు అతడి రథపు గుర్రాలు నాని తల్లడిల్లి, యుద్ధక్రీడకు ప్రతిబంధకం కలిగేటట్లు రథాన్ని ఈడ్చుకొని పోయాయి. అపుడు సుపర్వుడు ఎదురులేని శౌర్యం ప్రదర్శించి కూడా సుప్రతీకంచేత మరణించాడు.

వ. అతని పడుట గనుంగొని సౌభద్రుండును ద్రౌపదేయ పంచకంబును జేకితానుండును ధృష్టకేతుండును యుయుత్సుండును గడంగి సామజంబుపై శరవర్షంబులు గురిసిన నది కోపించి యురవడించి.327

ప్రతిపదార్థం: అతని= ఆ సుపర్వుని యొక్క; పడుట= చావు; కనుంగొని= చూచి; సౌభద్రుండును= సుభద్రాపుత్రుడైె అభిమన్యుడును; ద్రౌపదేయ పంచకంబును= ప్రతివింధ్యాదులైన ద్రౌపది యొక్క ఐదుగురు కుమారులు; చేకితానుండును= చేకితానుడు;ధృష్టకేతుండును = ధృష్టకేతువు; యుయుత్సుండును= యుయుత్సుడు ; కడంగి= పూని; సామజంబుపైన్= సుప్రతీక గజంమీద; శరవర్షంబులు=బాణపు జల్లులు; కురిసినన్= కురిపించగా; అది= ఆ సుప్రతీకం; కోపించి=క్రోధంగలదై; ఉరవడించి= మిక్కిలి వేగిరపడి.

తాత్పర్యం: సుపర్వుడి మరణం చూచి అభిమన్యుడు, ప్రతివింధ్యాది ద్రౌపది పుత్రులు ఐదుగురు, చేకితానుడు, ధృష్టకేతువు, యుయుత్సుడును పూనుకొని గజంపై బాణవర్షాన్ని కురిపించారు. అప్పుడు అది కోపించి, అతివేగంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. పదముల రథవాహంబులఁ । జదుపుచుఁ బైకొని యుయుత్సుసారథిఁ జంపెన్;
బెదరక యభిమన్యుని తే । రొదవిన నది యెక్కి యాతఁ డుద్ధతి నేసెన్. 328

ప్రతిపదార్థం: పదములన్= పాదాలతో; రథ= రథానికిగల; వాహంబులన్= గుర్రాలను; చదుపుచున్= చంపుతూ; పైకొని= కవిసి; యుయుత్సు సారథిన్= యుయుత్సుడి రథచోదకుడిని; చంపన్= చంపగా; బెదరక= భయపడక; అభిన్యుని తేరు= అభిమన్యుడి రథం; ఒదవినన్= అందగా; అది= ఆ రథాన్ని; ఎక్కి; ఆతఁడు= యుయుత్సుడు; ఉద్ధతిన్= గర్వంతో; ఏసెన్= బాణాలను వేశాడు.

తాత్పర్యం: సుప్రతీక గజం తన పాదాలతో రథాశ్వాలను హతమార్చి, పైబడి యుయుత్సుడి రథసారథిని చంపగా, యుయుత్సుడు బెదరక అభిమన్యుడి రథం అండగా ఎక్కి గర్వంతో ఆ ఏనుగును కొట్టాడు.

క. నరతనయ ప్రముఖ రథిక । వరులు నిభముమీఁద నేయు వాలమ్ములు ని
ష్ఠురగతి శరదభ్రముపైఁ । బరఁగు తరణికిరణ చయము పగిదిం బొలిచెన్. 329

ప్రతిపదార్థం: నరతనయ= అర్జునుడి కుమారుడైన అభిమన్యుడు; ప్రముఖ= మున్నగు; రథికవరులున్= శ్రేష్ఠులైన వీరులు; ఇభము మీఁదన్= సుప్రతీక గజంపై; ఏయు= విసరునట్టి; వాలు+అమ్ములు= వాడిబాణాలు; నిష్ఠురగతిన్= తీవ్రమైన గమనంతో; శరద్+అభ్రముపైన్= శరత్కాలమందలి మేఘంపై; పరఁగు= ప్రసరించే; తరణి= సూర్యుడి యొక్క; కిరణ= కిరణాల; చయము= సమూహం; పగిదిన్= వలె; పొలిచెన్= ఒప్పారాయి.

తాత్పర్యం: అభిమన్యుడు మున్నగు మహావీరులు సుప్రతీకగజంమీద వేసే తీక్ష్ణమైన బాణాలు తీవ్రమైన గమనంతో శరత్కాలమందలి మేఘంమీద ప్రసరించే సూర్యకిరణాలవలె ఒప్పారాయి.

క. రభసంబునఁ బ్రాగ్జ్యోతిష । విభుఁడు గరిం గొలుపుటయును వెస నది యరి వీ
రభయంకరముగ వారల । ప్రభ సెడ నరదములు వైచెఁ బలుదెసలఁ బడన్. 330

ప్రతిపదార్థం: రభసంబునన్= వేగంగా; ప్రాగ్జ్యోతిషవిభుఁడు= భగదత్తుడు; కరిన్= సుప్రతీక గజాన్ని; కొలుపుటయును= పురికొల్పగా; అది= సుప్రతీకం; వెసన్= వేగంగా; అరివీర= శత్రువీరులకు; భయంకరముగన్= భయం కలిగేటట్లు; వారల= అభిమన్యుడు మొదలైన వారల; ప్రభ+చెడన్= తేజం నశించగా; అరదములు= రథాలు; పలుదెసలన్= అన్ని దిక్కులందు; పడన్= పడేటట్లుగా; వైచెన్= వేసింది.

తాత్పర్యం: భగదత్తుడు సంతోషంతో సుప్రతీక గజాన్ని పురికొల్పగా, ఆ గజం వేగంగా శత్రు భయంకరంగా వారల తేజస్సు నశించే విధంగా రథాలన్నింటిని అన్ని దిక్కుల పడేటట్లు విసరివేసింది.

ఆ. ఇట్లు భీమసేను నేపు నర్జున సుత । ప్రముఖులైన యలఘు రథికవరుల
జృంభణంబుఁ జెడినఁ జేడ్పడి చెడి పాఱఁ । జొచ్చెఁ బాండురాజ సుతుల సేన. 331

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; భీమసేనుని= భీమునియొక్క; ఏపున్= విజృంభణ; అర్జునసుత= అభిమన్యుడు; ప్రముఖులు+ఐన= మొదలైన; అలఘు= గొప్ప; రథికవరుల= వీరశ్రేష్ఠుల; జృంభణంబున్= ఆధిక్యం; చెడినన్= నశించగా; పాండురాజ= పాండరాజు యొక్క; సుతుల= పుత్రులైన భీముడు మున్నగు వారల; సేన= సైన్యం; చేడ్పడి= బాధపడి; చెడి= పాడై; పాఱన్+చొచ్చెన్= పారిపోదొడగింది.

తాత్పర్యం: ఈ విధంగా భీముడి విజృంభణ, అభిమన్యుడు మున్నగు మహావీరుల ఆధిక్యం నశించగా, భీమసేనాదుల సైన్యం బాధపడి, పాడై పారిపోదొడగింది.

క. నలి భగదత్తుఁడు గదుపుల । వెలుచు పసులవాని యట్ల విలసద్గతి న
బ్బలము నెగువ ధూళియు నా । కుల సంరావంబు గగన కుహరము నిండెన్.' 332

ప్రతిపదార్థం: నలిన్= యోగ్యంగా; భగదత్తుడు; కదుపులన్= గోవుల గుంపును; వెలుచు= తోలే; పసులవాని= పసులకాపరి; అట్లు+అ= వలె; విలసత్+గతిన్= ఒప్పునట్లు; ఆ+బలమున్= ఆ పాండవ సైన్యాన్ని; ఎగువన్= తరుమగా; ధూళియున్= దుమ్ము, మరియు; ఆకుల= బాధతో కూడిన; సంరావంబు= మ్రోత; గగన కుహరము= ఆకాశపు గుహ; నిండెన్= నిండింది.

తాత్పర్యం: భగదత్తుడు గోవుల గుంపును తోలే పసుల కాపరివలె ఒప్పి, పాండవ సైన్యాన్ని తరుమగా, దుమ్ము మరియు బాధతో కూడిన మ్రోత ఆకాశమంతటా నిండింది.'

విశేషం: అలం: ఉపమ./

క. అని చెప్పి సంజయుఁడు 'గురు । జన నాయక! యపుడు సవ్యసాచి రణము ది
క్కునఁ జిత్తం బిడి యడిగితి; । విను మయ్యోధవరు తెఱఁగు విస్పష్టముగాన్. 333

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వివరించి; సంజయుఁడు; కురుజననాయక!= ధృతరాష్ట్ర మహారాజా!; అపుడు= ఇంతకుముందు; సవ్యసాచి= అర్జునుడి; రణము= యుద్ధం; దిక్కునన్= వైపు; చిత్తంబు+ఇడి= మనస్సుంచి; అడిగితి(వి)= అడిగావు; ఆ+యోధవరు= ఆ వీరుడి; తెఱఁగు= విధం; విస్పష్టముగాన్= తేటపడగా; విను(ము).

తాత్పర్యం: అని సంజయుడు చెప్పి, 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! అప్పుడు అర్జునుడు యుద్ధం చేసే వైపు ఏం జరుగుతుండినదో చెప్పవలసినది' అని అడిగావు. ఆ యోధుని సంగతి వివరంగా వినుము.'

వ. అనవుడు నాంబికేయుండు డాకర్ణనవాంఛ మిగుల 'నది సెప్పు' మనుటయు నాతనికి నా సూతనందనుం డిట్లనియె. 334

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆంబికేయుండు= అంబికాపుత్రుడైన ధృతరాష్ట్రుడు; ఆకర్ణన వాంఛ= వినే కోరిక; మిగులన్= మిక్కుటం కాగా; అది= ఆ విషయం; చెప్పుము= వివరించుము; అనుటయున్= అనగా; ఆతనికిన్= ఆ ధృతరాష్ట్రుడితో; సూతనందనుండు= సంజయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అపుడు ధృతరాష్ట్రుడు వినే కోరిక మిగులగా, ఆ విషయం వివరించవలసిందని కోరగా అతడితో సంజయు డిట్లా అన్నాడు.

అర్జునుఁడు భగదత్తునిదెస రథంబు దోలు మని కృష్ణునితోఁ జెప్పుట (సం. 7-26-1)

క. అంతకు మును భగదత్తుని । దంతి యసమ సమరకేళిఁ దాఁ గని హరితోఁ
గుంతీసుతుఁ డిట్లను 'మన । మెంతయు వెస బలములోని కేఁగఁగ వలయున్. 335

ప్రతిపదార్థం: అంతకున్ మును= అంతకు ముందు; భగదత్తుని= భగదత్తుడి యొక్క; దంతి= ఏనుగు; అసమ= అసాధారణమైన; సమర= యుద్ధమనే; కేళిన్= క్రీడను; తాన్= తాను; కని= చూచి; హరితోన్= కృష్ణుడితో; కుంతీ సుతుఁడు= అర్జునుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; మనము; ఎంతయున్= ఎంతో; వెసన్= వేగంగా; బలములోనికిన్= సైన్యంలోకి; ఏఁగఁగవలయున్= వెళ్ళవలెను.

తాత్పర్యం: అర్జునుడు అంతకు ముందు భగదత్తుడి సుప్రతీక గజం యొక్క అసాధారణమైన యుద్ధ క్రీడను చూచి, శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు. 'మనం వేగంగా సైన్యంలోకి చొచ్చుకొని పోవాలి!'

వ. అది యెట్లంటేని. 336

ప్రతిపదార్థం: అది= ఆ సంగతి; ఎట్లు= ఏ విధంగా; అంటి(వి)+ఏని= అంటే.

తాత్పర్యం: అది ఎట్లంటే.

చ. బిరుదు జితశ్రమంబు బలభేదనశాలి మహాస్త్ర శస్త్ర పా
తరయము సైఁపనోపు భగదత్తుని యేనుఁగు; దాని కోల్తలం
దిరుగక పోర నెవ్వరికిఁ దీఱదు; నీవును నేను లేనిచో
భరమగు నేఁడు రాజునకుఁ బావనికిం దలఁకొందెడున్ మదిన్.' 337

ప్రతిపదార్థం: భగదత్తుని= భగదత్తుడి యొక్క; ఏనుఁగు= సుప్రతీక గజం; బిరుదు= సమర్థమైనది; జితశ్రమంబు= అలసట లేనిది; బల= సైన్యాన్ని; భేదనశాలి= ఓడించే శక్తి కలది; మహా+అస్త్ర= గొప్ప బాణాల; శస్త్ర= ఖడ్గం మున్నగు ఆయుధాల; పాత= పడుటవలన; రయము= వేగాన్ని; సైఁపన్= సహించటానికి; ఓపున్= సమర్థమైనది; దాని= ఆ ఏనుగుయొక్క; కోల్తలన్+ తిరుగక= యుద్ధసన్నాహంలో వెనుదిరుక; పోరన్= యుద్ధం చేయటం; ఎవ్వరికిన్= ఎవ్వరికీ; తీఱదు= సాధ్యంకాదు; నీవును=నీవు (కృష్ణుడు) నేను(అర్జునుడు); లేనిచోన్= లేకుంటే; రాజునకున్= ధర్మరాజుకు; నేఁడు= ఈనాడు; భరము+అగున్= బరువు అవుతుంది; పావనికిన్= భీముడికి; మదిన్= మనస్సులో; తలఁకు+ఒందెడున్= బాధ కలుగుతుంది.

తాత్పర్యం: భగదత్తుడి సుప్రతీకగజం సమర్థమైనది. అలసట లేనిది. సైన్యాన్ని చీల్చే శక్తిగలది. బలమైన శస్త్రాస్త్రాల వేగాన్ని తట్టుకొనగలది. దానికి ఎదురై పారిపోకుండా పోరాడడం ఎవరి వల్లాకాదు. నీవు, నేను లేకుంటే ధర్మజుడికి భారం ఎక్కువౌతుంది. భీముడు మనస్సులో నొచ్చుకొంటాడు.'

ఆ. అనిన నట్లకాక యని శౌరి యరదంబు । ద్రిప్పి యాత్మసేన దిక్కుఁబోవ
నిచ్చుటయును వెనుక నెయిది సంశప్తకు । లార్చిపేర్చి కురిసి రస్త్రసమితి. 338

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అట్లు+కాక= అట్లే అగుగాక; అని; శౌరి= కృష్ణుడు; అరదంబు= రథం; త్రిప్పి= మరల్చి; ఆత్మసేన= తన సైన్యం; దిక్కు= వైపు; పోవనిచ్చుటయును= పోనిస్తుంటే; వెనుకన్= వెనుకనుండి; ఎయిది= వెంబడించి; సంశప్తకులు= శపథం పూనిన సుశర్మాదులు; ఆర్చి= అరిచి; పేర్చి= అతిశయించి; అస్త్ర సమితి= దివ్య బాణాల సమూహాన్ని; కురిసిరి= కురిపించారు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అర్జునుడి మాటవిని రథాన్ని మరల్చి తమ సైన్యం వైపు పోనిస్తుంటే, సంశప్తకులు వెంబడించి, అరుస్తూ దివ్యాస్త్రాలను వారిపై కురిపించారు.

వ. ఇట్లు చతుర్దశసహస్ర రథిక ముఖ్యులు బెట్టు ముట్టిన. 339

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; చతుర్దశ= పదునాలుగు; సహస్ర= వేల; రథిక ముఖ్యులు= రథికశ్రేష్ఠులు; బెట్టు= అతిశయంగా; ముట్టినన్= చుట్టు ముట్టగా.

తాత్పర్యం: ఈ తీరున పద్నాలుగు వేల రథిక వీరవరులు గట్టిగా చుట్టు ముట్టగా.

క. 'బలములఁ గావఁగఁ జనుటయు । నలవు మెఱయ మగిడి వీరి నడఁగించుటయున్
వలయు పనులయం దిప్పుడు । దలఁకొని యెద్దానిఁ జేయఁ దగవో నాకున్.' 340

ప్రతిపదార్థం: బలములన్= సైన్యాలను; కావఁగన్= రక్షించటానికి; చనుటయున్= వెళ్ళటం; అలవు= బలం; మెఱయన్= ప్రకాశించగా; మగిడి= మరల; వీరిన్= సంశప్తకులను; అడఁగించుటయున్= అణచివేయటం; వలయు= చేయదగిన; పనుల అందున్= పనులలో; తలఁకొని= పూని; నాకున్= నాకు; ఏ+దానిన్= ఏ పనిని; చేయన్= చేయటం; తగవో= న్యాయమో.

తాత్పర్యం: 'మా సేనలను కాపాడటానికి వెళ్లటమా? మరల బలప్రదర్శన చేసి సంశప్తకులను అణచివేయడమా? ఈ రెండూ చేయదగినవే. ముందు ఏ పనికి పూనుకోవటం న్యాయం?'

వ. అని వితర్కించి వివ్వచ్చుండు సంశప్తక వధంబ యుచితంబుగా నిశ్చయించి, మరలి గాండీవ గుణక్వణ మేదుర రోదసీకుహరుండును,దేవదత్త ధ్వాన విదళిత దశదిశా సందోహుండునునై దివ్యబాణంబులు పరఁగించినం గేత నాతపత్ర చామర వ్యజనంబులును, భేరీ శంఖ కాహళ మృదంగంబులును, యుగాక్ష రథాంగ కూబరంబు లును, దంతశుండాల కుంభవంశ దండంబులును, ఖురస్కంధ వాలంబులును, ధనుశ్శర ముసల ముద్గర, క్షురి కాకుంతంబులును, దనుత్రాణ కంకట మస్తక చ్ఛేదంబులును, మకుట కేయూర హార కంకణాంగు ళీయంబులును, శిరః కరవక్షః కుక్షి కటి చరణంబులును, దునియలుం బఱియలుం దుమురుళ్ళుం బొళ్ళు నైరాలిన నన్నేల ఘోరంబును, నభిరామంబునునై యుండె; సర్వభూతంబులును బీభత్సుం బ్రశంసించెఁ; గంసారి విస్మయ ప్రమదమగ్న మానసుండయి కిరీటిం గరతలంబున నప్పళించి యగ్గించె; నివ్విధంబుననవ్వీర రథికులం బిలుకు మార్చి పేర్చి రథాంగపాణిం జూచి 'రథం బింక రయంబున నక్కడకు నడపు' మనుటయు..341

ప్రతిపదార్థం: అని; వితర్కించి= ఊహించి; విపచ్చుండు= అర్జునుడు; సంశప్తక వధంబు+అ= సంశప్తకులను చంపటమే; ఉచితంబుగాన్= తగిందని; నిశ్చయించి= నిర్ణయించి; మరలి= వెనుకకు తిరిగి; గాండీవ= గాండీవమనే ధనుస్సుయొక్క; గుణ= అల్లెత్రాటి; క్వణన= ధ్వనిచేత; మేదుర= దట్టమైన; రోదసీ= భూమ్యాకాశముల; కుహర= నడిమి భాగంగలవాడును; దేవదత్త= దేవదత్తమనే శంఖపు; ధ్వాన= ధ్వనిచేత; విదళిత= చీల్చబడిన; దశదిశా= పది దిక్కుల; సందోహుండును= సమూహం కలవాడును; ఐ= అయి; దివ్యబాణంబులు= దేవతా సంబంధమైన బాణాలు; పరఁగించినన్= ప్రయోగించగా; కేతన= పతాకాలు; ఆతపత్ర= గొడుగులు; చామర= చమరీ మృగపు వాలాలతో చేసిన; వ్యజనంబులును= వీవనలు; భేరీ= దుందుభులు; శంఖ= శంఖాలు; కాహళ= కాహళ వాద్యాలు; మృదంగములును= మద్దెలలును; యుగ= కాడిమ్రాకులు; అక్ష= ఇరుసులు; రథాంగ= చక్రాలు; కూబరంబులును= నొగలులును; దంత= ఏనుగుయొక్క దంతాలు; శుండ= తొండాలు; కుంభ= కుంభస్థలాలు; వంశదండంబులును= వెన్నెముకలును; ఖుర= గిట్టలు; స్కంధ= మూపులు; వాలంబులు= తోకలు; ధనుః= విండ్లు; శర= బాణాలు; ముసల= రోకళ్ళు; ముద్గర= ఇనుపగుదియలు; క్షురిక= చురకత్తులు; అంకుశంబులు= అంకుశాలు; తనుత్రాణ= కవచాలు; కంకట= కవచాలు; మస్తకచ్ఛేదంబులును= శిరస్త్రాణాలు (తలపైని కప్పులు); మకుట= కిరీటాలు; కేయూర= అంగదాలు; హార= మాలలు; కంకణ= కడియాలు; అంగుళీయకంబులును= ఉంగరాలు; శిరః= తలలు; కర= చేతులు; వక్షస్= ఎదలు; కుక్షి= కడుపులు; కటి= మొలలు; చరణంబులును= కాళ్ళును; తునియలున్= తునుకలు; పటీయలు= పఱెలు; తుమురుళ్ళున్= చిన్నఖండాలు; పొళ్లన్+ఐ= చూర్ణాలై; రాలినన్= రాలగా; ఆ+నేల= ఆ యుద్ధభూమి; ఘోరంబునున్= భయంకరం; అభిరామంబున్+ఐ= మనోజ్ఞమై; ఉండెన్= ఉండింది; సర్వభూతంబులును= సమస్త ప్రాణులును; బీభత్సున్= అర్జునుడిని; ప్రశంసించెన్= పొగిడాయి; కంసారి= కంసుడికి శత్రువైన శ్రీకృష్ణుడు; విస్మయ= ఆశ్చర్యంతోను; ప్రమద= ఆనందంలోను; మగ్న= మునిగిన; మానసుండు+అయి= మనస్సుగలవాడై; కిరీటిన్= అర్జునుడిని; కరతలంబునన్= అరచేత; అప్పళించి= చరచి; అగ్గించెన్= ప్రశంసించాడు; ఈ+విధంబునన్= ఈ రీతిని; ఆ+వీరరథికులన్= ఆ శూరులైన; రథంపై నిలిచి యుద్ధం చేసేవారిని; పిలుకు మార్చి= చంపి; పేర్చి= విజృంభించి; రథాంగపాణిన్= చక్రహస్తుడైన శ్రీకృష్ణుడిని; చూచి; రథంబు= రథాన్ని; ఇంకన్= ఇక; రయంబునన్= వేగంగా; అక్కడకున్= పాండవులు యుద్ధం చేసేకడకు; నడుపుము= నడిపించుము; అనుటయున్= అనగా.

తాత్పర్యం: అని యోచించి అర్జునుడు సంశప్తకులను వధించడమే తగునని నిర్ణయించి వెనుకకు మళ్ళి, గాండీవ ధనుష్టంకారంచేత భూమ్యాకాశాల మధ్యభాగాన్ని నునుపు జేసి, దేవదత్తమనే శంఖ ధ్వనిచేత దశదిశలను చీల్చివేసి, దివ్య బాణాలను ప్రయోగించాడు. ఈ బాణజాలపు దెబ్బకు పతాకాలు, గొడుగులు, చామరాలు, దుందుభులు; శంఖాలు, కాహళులు, మద్దెలలు, కాడిమాకులు, ఇరుసులు, చక్రాలు, నొగలులు, ఏనుగు దంతాలు, తొండాలు, కుంభస్థలాలు, వెన్నెముకలు, గిట్టలు, మూపులు, తోకలు, విండ్లు, బాణాలు, రోకళ్ళు, ఇనుపగుదియలు, చురకత్తులు, అంకుశాలు, దేహరక్షణ కవచాలు, శిరస్త్రాణాలు, కిరీటాలు, కేయూరాలు, హారాలు, కడియాలు, ఉంగరాలును, తలలు, చేతులు, ఎదదలు, కడుపులు, నడుములు, కాళ్ళు, తునుకలు, పఱెలు, సూక్ష్మఖండాలు, పొళ్ళుగా మారి రాలగా ఆ యుద్ధభూమి భయంకరమూ, సుందరమూనై ఒప్పింది. సర్వప్రాణులు అర్జునుడిని ప్రశంసించాయి. శ్రీకృష్ణుడు ఆనందాశ్చర్యాలలో మునిగినవాడై అర్జునుడిని తన చేత చరచి మెచ్చుకొన్నాడు. ఇట్లా ఆ వీరరథికులను చంపి, విజృంభించి, శ్రీకృష్ణుడివైపు చూచి 'వెంటనే రథాన్ని పాండవులు యుద్ధం చేసే వైపు నడుపు'మని అర్జును డనగా.

విశేషం: అర్జునుడు సంశప్తకులను వధించి బీభత్సం సృష్టించటం వలన బీభత్సుడు అనే పేరును ప్రయోగించడం సాభిప్రాయంగా ఉన్నది.

ఆ. ఆతఁ డట్ల చేయ నరవాయి గొనక సు । శర్మ దాను ననుజచయముఁ బెలుచ
నెయిది 'పార్థ పార్థ యిట్లు వోఁదగునె యే । మనికిఁ బిలువఁ బిలువ' ననిన నతఁడు. 342

ప్రతిపదార్థం: అతఁడు= ఆ అర్జునుడు; అట్లచేయన్= ఆ విధంగా బీభత్సాన్ని సృష్టించగా; అరవాయి+కొనక= భయపడక; సుశర్మ= త్రిగర్తదేశాధిపుడైన సుశర్మ; తాను= తను; అనుజచయమున్= సోదరవర్గం; పెలుచన్= ఆగ్రహంతో; ఎయిది= వెంబడించి; పార్థ! పార్థ!= ఓ అర్జునా! అర్జునా!, అనికిన్= యుద్ధానికి; ఏము= మేము; పిలువన్, పిలువన్= మళ్ళీ మళ్ళీ పిలువగా; ఇట్లు= ఈ విధంగా; పోఁదగునె?= పోవచ్చా?; అనినన్= అనగా; అతఁడు= ఆ అర్జునుడు.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా యుద్ధ రంగంలో బీభత్సాన్ని సృష్టించగా సుశర్మ, అతడి సోదరవర్గం భయపడక ఆగ్రహంతో వెంబడించి, 'పార్థా! పార్థ! మేము యుద్ధానికి మళ్ళీ మళ్ళీ పిలువగా నీ విట్లా పోవచ్చునా?' అనగా; అపు డర్జునుడు.

క. 'పిలిచిన మరలమి దగ ద । బ్బలములఁ గాచుటయు వలయు; పని; యైనది; నీ
వలసిన విధంబు సేసెదఁ । దలఁకొను మొక తెఱఁగు దైత్యదర్పధ్వంసీ!' 343

ప్రతిపదార్థం: పిలిచినన్= పిలిస్తే; మరలమి= మరల రాకుండటం; తగదు= మంచిది కాదు; ఆ+బలములన్= ఆ మన సైన్యాలను; కాచుటయున్= రక్షించటం కూడా; వలయు పని= ఆవశ్యకం; ఐనది= అయినది; దైత్యదర్పధ్వంసీ!= రాక్షసుల గర్వాన్ని అణచే ఓ కృష్ణా!; నీ= నీకు; వలసిన= కావలసిన; విధంబు= విధంగా; చేసెదన్= చేస్తాను; ఒక తెఱఁగు= ఒక మార్గం; తలఁకొనుము= చూపుము.

తాత్పర్యం: 'యుద్ధానికి ఆహ్వానిస్తే తిరిగి రాకుండటం తగదు, మన సైన్యాలను కాపాడటం కూడా ఆవశ్యకమే. కృష్ణా! నీవు ఎట్లా చెపితే అట్లా చేస్తాను. ఒక త్రోవ చూపుము.'

చ. అనుచు మురారిఁ జూచుటయు నాతఁడు దేరు మరల్ప మోమునం
గినుక మునుంగు న వ్వొలయఁ గ్రీడి త్రిగర్తుని చాపదండకే
తనములు ద్రుంచి పైపడిన తమ్ముల నంతకు ప్రోలి కన్చి యా
తని నవలీల నొంచిన నతండు వెసంబడి మూర్ఛవోవుడున్. 344

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; మురారిన్= శ్రీకృష్ణుని; చూచుటయున్= చూడగా; ఆతఁడు= కృష్ణుడు; తేరు= రథం; మరల్పన్= వెనుకకు మళ్ళింపగా; మోమునన్= ముఖంపై; కినుక= కోపం; మునుంగు= నిండిన; నవ్వు; ఒలయన్= వెలుగగా; క్రీడి= అర్జునుడు; త్రిగర్తుని= సుశర్మయొక్క; చాప దండ= ధనుస్సు దబ్బను; కేతనములు= పతాకాలను; త్రుంచి= విరిచి; పైపడిన= మీదపడ్డ; తమ్ములన్= సుశర్మ తమ్ములను; అంతకు ప్రోలికిన్= యమధర్మరాజు యొక్క నగరానికి; అన్చి= పంపి; ఆతనిన్= ఆ సుశర్మను; అవలీలన్= తేలికగా; నొంచినన్= బాధింపగా, అతండు= ఆ సుశర్మ; వెసన్= వెంటనే; పడి= కూలి; మూర్ఛ+పోవుడున్= మూర్ఛిల్లగా.

తాత్పర్యం: అంటూ అర్జునుడు కృష్ణుడిని చూడగా, అతడు రథాన్ని మరల్చాడు. ముఖాన కోపంతో నిండిన నవ్వు ప్రకాశించగా అర్జునుడు, సుశర్మ వింటి దబ్బను, పతాకాలను విరిచి, పైనవడ్డ సుశర్మ సోదరులను చంపి, అతడిని అవలీలగా బాధింపగా, అతడు వెంటనే మూర్ఛపోగా.

వ. మగిడి యట నిరూపించి నారాయణు నుద్దేశించి. 345

ప్రతిపదార్థం: మగిడి= తిరిగి; అట= అక్కడ; నిరూపించి= చూపి; నారాయణున్= శ్రీకృష్ణుడిని; ఉద్దేశించి= గురించి.

తాత్పర్యం: అర్జునుడు మరల పాండవులు యుద్ధం చేసేవైపు చూచి, శ్రీకృష్ణునితో. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'పాఱెడు మన సేన పరఁగెడుఁ బెంధూళి । నభము గోలాహల క్షుభిత మయ్యె
భగదత్తు శుండాల మెగచుచు నున్నది । పఱపుము వెస దానిపై రథంబు'
నావుడు నతఁడు మహావేగమున రథ్య । ములఁ దోలఁగఁ గిరీటి యలవుఁ జలము
మెఱయంగ నీమొన మెఱుఁగు వాలమ్ముల । నఱుము సేయుచు సింహనాదమునకుఁ

తే. బ్రాపులై దేవదత్తంబు రవము గుణము । రావమును దిక్తటంబుల వ్రయ్యఁ జేయ
వచ్చి వివ్వచ్చుఁ డడ్డంబు సొచ్చె వీఁకఁ । జండచేష్టితోద్దండ వేదండమునకు. 346

ప్రతిపదార్థం: పాఱెడు= పారిపోయే; మనసేన= మనసైన్యం; పెంధూళి= మిక్కిలిదుమ్ము; పరఁగెడున్= లేస్తున్నది, నభము= ఆకాశం; కోలాహల= సందడిచేత; క్షుభితము+అయ్యెన్= కల్లోలితమైనది; భగదత్తు= భగదత్తుడి; శుండాలము= సుప్రతీకగజము; ఎగచుచునున్నది= ఎగిరిపడుతున్నది; రథమును= తేరును; వెసన్= వేగంగా; దానిపైన్= ఆ ఏనుగుపైకి; పఱపుము= నడిపించుము; నావుడున్= అనగా; అతఁడు= శ్రీకృష్ణుడు; మహావేగమునన్= మిక్కిలి వేగంగా; రథ్యములన్= గుఱ్రాలను; తోలఁగన్= నడపగా; కిరీటి= అర్జునుడు; అలవున్= బలము; చలము= మాత్సర్యం; మెఱయంగన్= ప్రకాశించగా; నీమొన= నీ (ధృతరాష్ట్రుని) సైన్యాన్ని; మెఱుఁగు= ప్రకాశించే; వాలు+అమ్ములన్= వాడిగల బాణాలతో; నఱుము+చేయుచున్= పొడి చేస్తూ; సింహనాదమునకున్= పెనుబొబ్బకు; ప్రాపులై= తోడై; దేవదత్తంబు= దేవదత్త శంఖము యొక్క; రవము= ధ్వని; గుణము= అల్లెత్రాటి; రావమును= నాదాన్ని; దిక్+తటంబులన్= దిక్కుల కొనలను; వ్రయ్యన్+చేయన్= చీల్చగా; వచ్చి; వివ్వచ్చుఁడు= అర్జునుడు; వీఁకన్= ఉత్సాహంతో; చండ= క్రూరమైన; చేష్టిత= చేష్టలుగల; ఉద్దండ= భయం గొలిపే; వేదండమునకున్= సుప్రతీక గజానికి; అడ్డంబు= అడ్డంగా; చొచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: 'మన సేన పారిపోతున్నది. దుమ్ము అపారంగా పైకెగయటం వలన ఆకాశమంతా సందడిచే కల్లోలితమైనది. భగదత్తుడి సుప్రతీక గజం విజృంభిస్తున్నది. రథాన్ని వేగంగా ఆ ఏనుగుపైకి నడిపించుము' అనగానే శ్రీకృష్ణుడు మహావేగంగా గుఱ్రాలను నడిపేసరికి, అర్జునుడు బలం, మాత్సర్యం ప్రకాశించగా నీ సైన్యాన్ని ప్రకాశించే వాడిగల బాణాలతో పొడి పొడి చేస్తూ, సింహనాదానికి దేవదత్త శంఖ ధ్వానం, అల్లెత్రాటి నాదం తోడై దిగంతాలను చీల్చగా ఉత్సహించి, క్రూర చేష్టలు చేసే భయంకరమైన సుప్రతీకగజానికి అడ్డంగా వెళ్ళాడు.'

క. అన విని ధృతరాష్ట్రుం డి । ట్లను సంజయుతోడ 'భీషణాటోపత న
ర్జునుఁ డి ట్లెయిదిన భగద । త్తుని కతనికి నేమి భంగి దురమయ్యె నొకో!' 347

ప్రతిపదార్థం: అనన్ విని= అనగావిని; ధృతరాష్ట్రుండు; సంజయు తోడన్= సంజయుడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అర్జునుఁడు; భీషణ+ఆటోపతన్= భయంకరమైన వేగిరపాటుతో; ఇట్లు= ఈ విధంగా; ఎయిదినన్= వెంబడించగా; భగదత్తునికిన్= భగదత్తుడికి; అతనికిన్= అర్జుననికి; ఏమి భంగి= ఏ విధంగా; దురము= యుద్ధం; అయ్యెన్+ఒకో!= అయిందో!

తాత్పర్యం: అనగా విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు. 'అర్జునుడు భయంకరమైన వేగిరపాటుతో వెంబడించగా భగదత్తుడికీ, అర్జునుడికీ ఏ విధంగా యుద్ధం జరిగిందో!'

ఉ. నావుడు నాతఁ డా ధరణినాథున కిట్లను'నట్లు దాఁకినం
జేవ దలిర్ప విక్రమవిశృంఖలుఁడై భగదత్తుఁ డుగ్ర బా
ణావలిఁ బార్థుపైఁ బఱపె; నన్నియు నవ్వుచుఁ ద్రుంచివైచి య
ద్దేవసముండు నొంచె దృఢ దీప్తశరంబుల దంతి నాతనిన్. 348

ప్రతిపదార్థం: నావుడున్= అనగా; ఆతఁడు= సంజయుడు; ఆ ధరణినాథునకున్= ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అట్లు= ఆ విధంగా; తాఁకినన్= ఎదుర్కొనగా; చేవ= బలం; తలిర్పన్= అతిశయించగా; విక్రమ విశృంఖలుఁడు+ఐ= పరాక్రమం చేత అడ్డులేనివాడై; భగదత్తుఁడు= భగదత్తుడు; ఉగ్రబాణావలిన్= భయంకరమైన బాణ సమూహాన్ని; పార్థుపైన్= అర్జునుడిపై; పఱపెన్= ప్రసరింపజేశాడు; ఆ+దేవసముండు= దేవతలతో సమానుడైన ఆ అర్జునుడు; నవ్వుచున్= నవ్వుతూ; అన్నియున్= బాణాలన్నింటిని; త్రుంచి= విరిచి; దంతిన్= సుప్రతీకగజాన్ని; ఆతనిన్= భగదత్తుడిని; దృఢ= కఠినమైన; దీప్త= ప్రకాశించే; శరంబులన్= బాణాలతో; నొంచెన్= బాధించాడు.

తాత్పర్యం: అనగా సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'అట్లా అర్జునుడు ఎదుర్కొనగా, అతిశయించిన బలంతో విక్రమంచేత అడ్డులేనివాడై భగదత్తుడు, అర్జునుడిపై భయంకరమైన బాణాలను ప్రయోగించాడు. దేవసముడైన అర్జునుడు నవ్వుతూ ఆ బాణాలన్నిటిని ఖండించి, సుప్రతీక గజాన్నీ, భగదత్తుడినీ బలమైన ప్రకాశించే బాణాలతో బాధించాడు.

తే. **అలుఁగుటమ్ములు దాఁకిన నలిగి భద్ర। కుంభి రౌద్రంబు సొంపారఁ గొలిపె నతఁడు**
వారి సేనల గోపికావరుఁడు నరుఁడు। దెగిరి తెగి రను పలుకుల దిగులు వుట్ట. **349**

ప్రతిపదార్థం: అలుఁగు+అమ్ములు= కత్తి పదునువంటి పదునుగల బాణాలు; తాఁకినన్= తాకగా; అలిగి= కోపించి; అతఁడు= భగదత్తుడు; భద్రకుంభి= శ్రేష్ఠమైన భద్రగజం - సుప్రతీక గజం; రౌద్రంబు= క్రోధము; సొంపు+ఆరన్= అందంమీరగా; కొలిపెన్= పురికొలిపాడు; వారి సేనలు= పాండవ సేనలు; గోపికావరుఁడున్= కృష్ణుడును; నరుఁడును= అర్జునుడు; తెగిరి, తెగిరి= చనిపోయారు, చనిపోయారు; అను పలుకులన్= అను మాటలచేత; దిగులు+పుట్టన్= భయం కలుగగా.

తాత్పర్యం: అతి తీక్ష్ణములైన బాణాలు తాకగా కోపించి ఆ భగదత్తుడు, పాండవ సేనలో కృష్ణార్జునులు చచ్చారు, చచ్చారు అనే మాటలతో భయపడేటట్లు, సుప్రతీక గజం యొక్క క్రోధం సొంపు మీరగా వారలపైకి దానిని పురికొల్పాడు.

క. **బలువిడిఁ గరి గవియుఁడు వెసఁ। దొలఁగించె రథంబు వెరవుతో హరి యదియి**
ట్టలమగు రయమునఁ జని త। ద్బలము బడల్పడఁగఁ జేసెఁ బార్థివముఖ్యా! **350**

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= ధృతరాష్ట్ర మహారాజా!; బలువిడిన్= పరాక్రమంతో; కరి= సుప్రతీకగజం; కవియుడున్= ఎదిరించగా; వెసన్= వెంటనే; హరి= శ్రీకృష్ణుడు; వెరవుతోన్= ఉపాయంతో; రథము= రథాన్ని; తొలఁగించెన్= దూరం కొనిపోయినాడు; అది= ఆ సుప్రతీకం; ఇట్టలమగు= మిక్కిలి; రయమునన్= వేగంతో; చని= పోయి; తద్+బలము= ఆ పాండవుల సైన్యం; బడల్పడఁగన్+చేసెన్= ఆయాసపడేటట్లు చేసింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! పరాక్రమం మీర సుప్రతీక గజం విజృంభించగా శ్రీకృష్ణుడు వెంటనే ఉపాయంగా రథాన్ని ప్రక్కకు తొలగించాడు. ఆ ఏనుగు మిక్కిలి వేగంగా వెళ్ళి ఆ పాండవ సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టింది.

క. **హరి నేమియు ననసేరక। కరిదెసఁ గనుఁగొనుచు నవుడు గఱచుచుఁ 'బో ని**
మ్మరద'మని పలికెఁ గవ్వడి। హరులను సమ్ముఖము సేసె నతఁడుఁ గరటికిన్. **351**

ప్రతిపదార్థం: కవ్వడి= అర్జునుడు; హరిన్= కృష్ణుడిని; ఏమియున్= ఏమీ; అననేరక= అనజాలక; కరి= సుప్రతీకం; దెస= వైపు; కనుఁగొనుచున్= చూస్తూ; అవుడు= పెదవి; కఱచుచున్= కొరుకుతూ - కోపంతో; అరదము= రథాన్ని; పోనిమ్ము= పోనిమ్ము; అని పలికెన్= అని అన్నాడు; అతఁడు= శ్రీకృష్ణుడు; హరులను= గుర్రాలను; కరటికిన్= సుప్రతీకగజానికి; సమ్ముఖము+చేసెన్= ఎదురుగా పోనిచ్చాడు.

తాత్పర్యం: అర్జునుడు కృష్ణుడిని ఏమీ అనలేక సుప్రతీకగజంవైపు చూస్తూ, కోపంతో పెదవి కొరుకుతూ, రథాన్ని పోనిమ్మన్నాడు. కృష్ణుడు రథాన్ని సుప్రతీకానికి ఎదురుగా తీసుకొనిపోయాడు.

విశేషం: 'కరిదెస కనుగొనుట, పెదవి గరచుట' వంటి చర్యల వలన అర్జునుడిని ఆవేశించిన క్రోధాదులు వ్యక్తమవుతున్నాయి.

క. శౌరి మెయిని భగదత్తుఁడు । నారసములు నినిచి యేసె; నరుఁ డల్గి మహో
దారోద్ధతిఁ దచ్చాపవి । దారణ మొనరించి గ్రుచ్చెఁ దనువునఁ దూపుల్. 352

ప్రతిపదార్థం: భగదత్తుఁడు= ప్రాగ్జ్యోతిషాధిపతి అయిన భగదత్తుడు; శౌరి= కృష్ణుడి; మెయిని= దేహంపై; నారసములు= బాణాలు; నినిచి ఏసెన్= నింపివేశాడు; నరుఁడు= అర్జునుడు; అల్గి= కోపించి; మహోదార= మిక్కిలి సూటి అయిన; ఉద్ధతిన్= గర్వంతో; తద్+చాప= ఆ భగదత్తుడి వింటిని; విదారణము+ఒనరించి= చీల్చి; తనువునన్= దేహంపై; తూపుల్= బాణాలు; గ్రుచ్చెన్= నాటాడు.

తాత్పర్యం: భగదత్తుడు శ్రీకృష్ణుడి దేహంమీద బాణాలను నింపివేశాడు. అపుడు అర్జునుడు కోపించి మిక్కిలి గర్వంతో అతడి ధనుస్సును విరిచి, అతడి శరీరంపై బాణాలను నాటాడు.

సీ. కోపంబు గదిరి ప్రాగ్జ్యోతిషపతి చతు । ర్దశ తోమరము లింద్రతనయు మీఁద
నడరించుటయు, నవి పొడిసేసి క్రీడి యే । నుంగు పక్కెర చిఱునుగ్గు సేయ
నది గప్పియున్న మేఘావలి విచ్చిన । కొండ చందంబున నుండె; శక్తి
గొని భగదత్తుండు దనుజభంజను వైవ । నడుమ ముత్తునియగా నఱకెఁ బార్థుఁ;

తే. డాతపత్త్రంబు దునిమిన నతని మకుట । మతఁడు ఘన తోమరంబున నగలఁ జేయ
మెచ్చుఁ గినుకయుఁ బొడమ వివ్వచ్చుఁ డుగ్ర । విశిఖసప్తతిఁ జొనిపె నవ్వీరుమేన. 353

ప్రతిపదార్థం: కోపంబు= క్రోధం; కదిరి= అతిశయించి; ప్రాగ్జ్యోతిషపతి= భగదత్తుడు; చతుర్దశ తోమరములు= పధ్నాలుగు ఇనుపగుదియలు; ఇంద్రతనయుమీఁదన్= అర్జునుడి మీద; అడరించుటయున్= వేయగా; క్రీడి= అర్జునుడు; అవి= ఆ ఇనుప గుదియలను; పొడిచేసి= పొడిగా చేసి; ఏనుంగు= సుప్రతీకగజం యొక్క; పక్కెర= అంగీని; చిఱునుగ్గు= సన్ననిపొడిగా; చేయన్= చేయగా; అది= ఆ సుప్రతీకం; కప్పి ఉన్న= కమ్ముకొనిన; మేఘావలి= మబ్బులగుంపు; విచ్చినన్= తొలగిన; కొండ= పర్వతం; చందంబునన్= విధంగా; ఉండెన్= ఉండినది; భగదత్తుండు; శక్తి= శక్తి అనే ఆయుధాన్ని; కొని= తీసికొని; దనుజభంజను= కృష్ణుడిని; వైవన్= కొట్టగా; పార్థుఁడు= అర్జునుడు; నడుమ= మధ్యలోనే; ముత్తునియగాన్= మూడు ముక్కలయ్యేటట్లుగా; నఱకెన్= ఖండించాడు; ఆతపత్రంబు= ఛత్రాన్ని; తునిమినన్= విరువగా; అతని= అర్జునుడి; మకుటము= కిరీటాన్ని; అతఁడు= ఆ భగదత్తుడు; ఘనతోమరంబునన్= గొప్ప చిల్లకోలతో; అగలన్+చేయన్= భేదించగా; మెచ్చున్= పొగడ్త; కినుకయున్= కోపమును; పొడమన్= కలుగగా; వివ్వచ్చుఁడు= అర్జునుడు; ఉగ్ర= భయంకరమైన; విశిఖసప్తతిన్= డెబ్భైబాణాలను; ఆ+వీరు= ఆ వీరుడైన భగదత్తుడి; మేనన్= దేహంలో; జొనిపెన్= నాటాడు.

తాత్పర్యం: భగదత్తుడు మిక్కిలి కోపంతో పదునాల్గు ఇనుప గుదియలు అర్జునుడి మీద వేయగా , అర్జునుడు ఆ ఇనుపగుదియలను పొడిగా చేసి, తరువాత సుప్రతీకగజం యొక్క అంగీని తుక్కు తుక్కు చేశాడు. అపుడా సుప్రతీక గజం కమ్ముకొన్న మబ్బులు తొలగిన పర్వతం వలె ఉండింది. భగదత్తుడు శక్తి అనే ఆయుధాన్ని తీసికొని కృష్ణుడిపై వేయగా; అర్జునుడు మధ్యలో దానిని మూడు ముక్కలయ్యేటట్లు నరికాడు. అంతేకాక, అతడి గొడుగును కూడ తునుమగా, భగదత్తుడు అర్జునుడి కిరీటాన్ని ఘనతోమరంతో భేదించాడు. పొగడ్త, కోపం కలుగగా అర్జునుడు భయంకరమైన డెబ్బది బాణాలను భగదత్తుడి దేహంలో నాటాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. రభసోదగ్రతఁ బూన్చి దీప్తు లడరం బ్రాగ్జ్యోతిషాధీశ్వరుం
డభిమంత్రించి నిజాంకుశంబు దివిజేంద్రాపత్యవక్షంబు సూ
చి భుజోల్లాస విభాసియై పెలుచ వైచెం దద్బలం బెల్ల భూ
రి భయోద్రేక తరంగితం బగుచు ఘూర్ణిల్లంగ రౌద్రాకృతిన్. 354

ప్రతిపదార్థం: రభస= తీవ్రమైన; ఉదగ్రతన్= అహంకారంతో; ప్రాగ్జ్యోతిష+అధీశ్వరుఁడు= భగదత్తుడు; నిజ+అంకుశంబు= తన అంకుశాన్ని; అభిమంత్రించి= మంత్రంతో సంస్కరించి; దీప్తులు= మెరుగులు; అడరన్= చిమ్మగా; పెలుచన్= ఆగ్రహించి; తద్+బలంబు+ఎల్లన్= అర్జునుడి యొక్క సైన్యం అంతయు; భయ+ఉద్రేక తరంగితంబు+అగుచున్= భయంయొక్క ఆధిక్యంతో చలిస్తున్నదై; ఘూర్ణిల్లంగన్= తిరుగగా; రౌద్రాకృతిన్= భయంకర రూపంతో; భుజ= బాహువుల; ఉల్లాస= విజృంభణచేత; విభాసి+ఐ= వెలుగుతున్నవాడై; దివిజ+ఇంద్ర+అపత్యవక్షంబు= దేవేంద్రుడి పుత్రుడైన అర్జునుడి హృదయాన్ని, చూచి= గురిచూచి; వైచెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: తీవ్రమైన అహంకారంతో భగదత్తుడు తన అంకుశాన్ని అభిమంత్రించి, మెరుగులు చిమ్మగా, ఆగ్రహించి, బాహువుల విజృంభణచేత ప్రకాశిస్తూ, భయంకరాకారుడై అర్జునుడి హృదయాన్ని గురిచూచి దాన్ని ప్రయోగించాడు. అపుడు పాండవ సైన్యమంతా మితిమీరిన భయంతో గడగడలాడింది.

విశేషం: ఇందులో రౌద్రరసం కన్నులకు గట్టినట్లు వర్ణించబడింది.

ఉ. అప్పుడు శౌరి పార్థునకు నడ్డముగాఁ దన మే నమర్చి ను
స్గ ప్పెసలారు పేరురమునం ధరియించిన నమ్మహాస్త్ర మం
దొప్పె నవారుణాంబుజ కృతోజ్జ్వల మాలికయై చిరస్థితిం
జొప్పడి నూతనాభ్రతల శోభితమైన మెఱుంగు చాడ్పునన్. 355

ప్రతిపదార్థం: అప్పుడు= భగదత్తుడు అంకుశం వేసినప్పుడు; శౌరి= శ్రీకృష్ణుడు, పార్థునకున్= అర్జునుడికి; అడ్డముగాన్= అడ్డంగా; తన= తన యొక్క; మేను= దేహం; అమర్చి= పెట్టి; నున్+కప్పు+ఎసలు+ఆరు= నున్నటి నల్లదనం అతిశయించే; పేరు+ఉరమునన్= విశాలమైన హృదయమునందు; ధరియించినన్= తాల్చగా; ఆ+మహా+అస్త్రము= ఆ గొప్పదైన అంకుశం; అందున్= ఆ హృదయంలో; నవ= క్రొత్తదగు; అరుణ= ఎఱ్ఱని; అంబుజ= కమలాలచేత; కృత= చేయబడిన; ఉజ్జ్వల= ప్రకాశించే; మాలిక+ఐ= హారమై; చిరస్థితిన్= చిరస్థాయిగా; చొప్పడి= ఉండి; నూతన+అభ్రతల శోభితము+ఐ= క్రొత్తగా ఆకాశంలో అలంకృతమైన; మెఱుంగు= విద్యుల్లత; చాడ్పునన్= వలె; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: భగదత్తుడు అంకుశాన్ని ప్రయోగించినపుడు శ్రీకృష్ణుడు అర్జునుడికి అడ్డంగా తన దేహాన్ని నిలిపి, నల్లనై నిగనిగలాడే హృదయంమీద ఆ అంకుశాన్ని ధరించాడు. అప్పు డా మహాస్త్రం శ్రీకృష్ణుడి వక్షస్థలంలో అప్పుడే వికసించిన అరుణ కమలాల మాల అయి ప్రకాశిస్తూ స్థిరంగా ఉండి, క్రొత్తగా ఆకాశంలో అలంకృతమైన విద్యుల్లతవలె ఒప్పింది.

విశేషం: అలం: ఉపమ. భయావహమైన భగదత్తుడు ప్రయోగించిన అంకుశం శ్రీకృష్ణుడి హృదయంలో అరుణ కమలహారంగా మారడం విస్మయాన్ని కలిగించే దృశ్యం. దీని వలన అద్భుతరసం వ్యక్తమౌతున్నది.

చ. కనుఁగొని ఫల్గునుండు 'మురఘస్మర! యి ట్లగునయ్య సొంపు నొం
దిన కరుణా విశేషమునఁ దేరికి సారథి వైతి గాక యే
పనులును బూని చేయు టిది పాడియె? తేజము నీవు దప్పఁ జూ
చినఁ జెడదే? ననుం జులుకఁ జేసితి మాటలు వేయు నేటికిన్? 356

ప్రతిపదార్థం: ఫల్గునుఁడు= అర్జునుడు; కనుఁగొని= ఈ అద్భుతాన్ని చూచి; మురఘస్మర!= మురాసురవధ జేసిన శ్రీకృష్ణా!; సొంపును+ఒందిన= సమృద్ధమైన; కరుణా విశేషమునన్= విశేషమైన దయవలన; తేరికిన్= రథానికి; సారథివి= రథాన్ని నడిపేవాడవు; ఐతి+కాక= అయినావు గాక; ఇట్లు+అగునయ్యా!= ఇట్లా జరుగుతుందా!; ఏ పనులును= చిన్నది పెద్దది అనక ఏ పని అయినా; పూని= ప్రయత్నించి; చేయుట= చేయటం; ఇది; పాడియె?= తగునా?; తేజము= శౌర్యం; నీవు= మహిమాన్వితుడవైన నీవు; తప్పన్+చూచినన్= అన్న మాటను తప్పితే; చెడదే?= నశించదా?; ననున్= నన్ను; చులుకన్+చేసితి(వి)= తేలిక పరిచాను; మాటలు, వేయున్+ఏటికిన్= పెక్కు మాటలెందుకు?

తాత్పర్యం: అర్జునుడు ఈ అద్భుతమైన సన్నివేశాన్ని చూచి 'ఓ కృష్ణా! ఇట్లా నీవు చేయటం సమంజసమేనా? నాపైగల అపారమైన కరుణావిశేషంచేత నాకు సారథివైతే కావచ్చుగాక! నేను చేయదగిన శత్రు సంహారాదులను కూడా నీవే చేయటం ధర్మమా? నీవు మాట తప్పితే నా పరాక్రమానికి లోటు రాదా? వేయి మాటలు ఏల? నన్ను చులుకనచేశావు.'

వ. **అని దూఱినం గృష్ణుండు 'దొల్లి భూమిదేవి గామించి యోగనిద్రా సమయావసాన సుప్రబుద్ధుండై యున్న విష్ణుకడకుం జనుటయు, నతండు తత్సంగతిం బ్రీతుండై యన్నాతికి వరంబిచ్చుటయు, నవ్వరంబున నవ్వెలంది యం దుదయించిన నరకునకు వైష్ణవాస్త్రంబు విధేయం బగుటయు, నది భగదత్తాయత్తంబై యునికియుం, దద్ఘోర సాధనంబు దనకుఁ దక్క నొరులకు నోర్వరామియు నెఱింగించి, యిది యట్లకాక దీన నేమి యని మఱియుం దగు మాటలం గిరీటి ననునయించి విరోధిం జూపి వీఁ డిప్పరమసాధనంబు వృథయగుటం జేసి వెఱంగు పడియున్నవాఁడు ; వీని తండ్రిని నేను దెగఁజూచిన ట్లీ క్రూరకర్మునిఁ బిలుకు మార్పు మనినఁ గొండొకతేఁటి యాతండు గాండీవ గుణంబు సారించి దృఢముష్టి నేయుటయు. 357**

ప్రతిపదార్థం: అని; దూఱినన్= మందలించగా; కృష్ణుండు; తొల్లి= పూర్వం; భూమిదేవి= భూదేవి; కామించి= కోరి; యోగనిద్రా= యుగాంతంలో విష్ణువు పొందే నిద్ర; సమయ= కాలంయొక్క; అవసాన= సమాప్తంలో; సుప్రబుద్ధుండై= మేల్కొన్నవాడై; ఉన్న; విష్ణుకడకున్= విష్ణుమూర్తివద్దకు; చనుటయున్= వెళ్ళగా; అతండు= ఆ విష్ణువు; తద్+సంగతిన్= భూదేవియొక్క కూడికతో; ప్రీతుండై= సంతుష్టుడై; ఆ+నాతికిన్= ఆ భూదేవికి; వరంబు= వరం; ఇచ్చుటయున్= ఇవ్వగా; ఆ+వరంబునన్= ఆ వరంవలన; ఆ+వెలందియందున్= ఆ భూదేవియందు; ఉదయించిన= పుట్టిన; నరకునకున్= నరకాసురుడికి; వైష్ణవ+అస్త్రంబు= విష్ణు సంబంధమైన- అస్త్రం; విధేయంబు= స్వాధీనం; అగుటయున్= కావటం వలన; అది= ఆ వైష్ణవాస్త్రం; భగదత్త+ఆయత్తంబు+ఐ= భగదత్తుడి వశమై; ఉనికియున్= ఉండటం వలన; తద్+ఘోరసాధనంబు= ఆ భయంకరమైన అస్త్రం; తనకున్= కృష్ణుడికి;తక్కన్= తప్ప; ఒరులకున్= ఇతరులకు; ఓర్వరామియున్= సహించరాకుండటం; ఎఱింగించి= తెలిపి; ఇది+అట్లకాక= ఇది ఆ విధంగా కావలసింది; దీనన్= దీనివలన; ఏమి?= ఐనదేమిటి?; అని; మఱియున్= ఇంకా; తగుమాటలన్= తగిన మాటలతో; కిరీటిన్= అర్జునుడిని; అనునయించి= ఓదార్చి; విరోధిన్= శత్రువైన భగదత్తుడిని; చూపి= చూపించి; వీఁడు= ఈ భగదత్తుడు; ఈ+పరమ సాధనంబు= ఈ గొప్ప అస్త్రం; వృథ= వ్యర్థం; అగుటన్+చేసి= కావటం వలన; వెఱంగుపడి= ఆశ్చర్యపడి; ఉన్నవాఁడు= ఉన్నాడు; వీని= వీడియొక్క; తండ్రిని= నరకాసురుడిని; నేను; తెగన్+చూచినట్లు= చంపినట్లు; ఈ క్రూరకర్మునిన్= దుష్కార్యాలు చేసే వీడిని; పిలుకు మార్పుము= సంహరించుము; అనినన్= అనగా; కొండొక తేఁటి= కొంచెం ప్రసన్నుడై; ఆతండు= ఆ అర్జునుడు; గాండీవగుణంబు= గాండీవమనెడు ధనుస్సు యొక్క అల్లెత్రాటిని; సారించి= ఎక్కువెట్టి; దృఢముష్టిన్= బలమైన పిడికిలితో; ఏయుటయున్= వేయగా.

తాత్పర్యం: అని అర్జునుడు మందలించగా, శ్రీకృష్ణుడు, 'పూర్వం యుగాంతంలో పోయే నిద్రా సమయంముగియగా మేల్కొన్న విష్ణుమూర్తి కడకు భూదేవి కామించి వెళ్ళింది. అపుడు ఆ విష్ణువు భూదేవి కూడికతో ప్రసన్నుడై ఆమెకు వరాన్ని ప్రసాదించాడు. దానివలన భూదేవికి పుట్టిన నరకాసురుడికి వైష్ణవాస్త్రం స్వాధీనమైనది. అది తర్వాత అతని పుత్రుడైన భగదత్తుడి వశమైంది. కాబట్టి ఆ ఘోరమైన వైష్ణవాస్త్రం తనకు తప్ప ఇతరులకు సహించరానిది. అందుకే తాను దానిని అడ్డుకొనవలసి వచ్చింది. దీనివలన అయిందేమి?'టని శ్రీకృష్ణుడు అర్జునుడిని ఓదార్చి, శత్రువైన

భగదత్తుడిని చూపించి, వీడు ఈ దివ్యాస్త్రం వ్యర్థం కావటం వలన ఆశ్చర్యపడ్డాడు. నేను వీడి తండ్రిని చంపినట్లు నీ వీ క్రూరకర్ముడిని తెగటార్చవలసినదని చెప్పాడు. ఇది విని ప్రసన్నుడై అర్జునుడు తన గాండీవ ధనుస్సును ఎక్కుపెట్టి శక్తి కొలది వేయగా. (తరువాతి పద్యంతో అన్వయం).

భగదత్తుండు సుప్రతీకంబుతోడ నర్జునుచేఁ జచ్చుట (సం. 7-28-40)

ఉ. వాలిక దొడ్డనారసము వజ్రము శైలము దాఁకునాకృతిన్
ఫాలము మీదఁ దాఁకిన నిభంబు వెసం బడి కొమ్ము లూఁతగా
వ్రాలుడు నర్ధచంద్రరుచిర ప్రదరంబునఁ ద్రుంచె బాణ వి
ద్యాలసితుండు గ్రీడి భగదత్తుని కంఠ మకుంఠితోద్ధతిన్. 358

ప్రతిపదార్థం: వాలిక= వాడి అయిన; దొడ్డ= పెద్ద; నారసము= బాణం; వజ్రము= వజ్రాయుధం; శైలము= పర్వతాన్ని; తాఁకు= తాకునట్టి; ఆకృతిన్= విధంగా; ఫాలముమీఁదన్= నొసటిపై; తాఁకినన్= తాకగా; ఇభంబు= సుప్రతీకగజం; వెసన్+పడి= వెంటనే పడి; కొమ్ములు= దంతాలు; ఊఁతగాన్= ఆధారంగా; వ్రాలుడున్= వాలగా; బాణవిద్యా= అస్త్రవిద్యచేత; లసితుండు= ఒప్పువాడగు; క్రీడి= అర్జునుడు; అకుంఠిత= మొక్కవోని; ఉద్ధతిన్= గర్వంతో; అర్ధచంద్ర= అర్ధచంద్రుడివలె; రుచిర= ఒప్పే; ప్రదరంబునన్= బాణంతో; భగదత్తుని= భగదత్తుడి యొక్క, కంఠము= తలను; త్రుంచెన్= నరికాడు.

తాత్పర్యం: వాడి అయిన గొప్ప బాణం, వజ్రాయుధం పర్వతాన్ని తాకినట్లు నొసటిని తాకగా ఆ సుప్రతీక గజం దంతాలు ఊతగా ఒరిగిపోయింది. అపుడు అస్త్రవిద్యానిపుణుడైన అర్జునుడు గర్వాతిశయంతో పొంగి, అర్ధచంద్రుడివలె ఒప్పే బాణంతో భగదత్తుడి కంఠాన్ని ఛేదించాడు.

వ. ఇట్లు దంతిని భగదత్తునిం బరిమార్చి మాఱులేక మలయు మధ్యమ పాండవునిం గనుంగొని శకుని తమ్ములు వృషకుండును, నచలుండును దాఁకిన నతండు వృషకుని రథరథ్య సూత ధ్వజచ్ఛత్రచామరంబులు రూపఱ నఱకుటయు, నాతండు సోదరుని రథంబెక్కె నప్పుడు వారి కడ్డపడిన గాంధార వీరరథిక పంచశతంబుఁ బంచత్వంబు నొందించిన సంక్రందననందను నురవడికిం దెరలక యేకరథస్థులగు నయ్యిరువురుం బరాక్రమించిన. 359

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దంతిని= సుప్రతీక గజాన్ని; భగదత్తునిన్= భగదత్తుడిని; పరిమార్చి= చంపి; మారులేక= ఎదురులేక; మలయు= ఒప్పే; మధ్యమ పాండవునిన్= అర్జునుడిని; కనుంగొని= చూచి; శకుని తమ్ములు= శకునియొక్క సోదరులు; వృషకుండును= వృషకుడును; అచలుండును= అచలుడును; తాఁకినన్= ఎదుర్కొనగా; అతండు= అర్జునుడు; వృషకుని= వృషకుడి యొక్క; రథ= రథం; రథ్య= గుర్రాలు; సూత= సారథి; ధ్వజ= పతాకం; చామరంబులు= వీవనలు; రూపఱన్= నశించగా; నఱకుటయున్= ఖండించగా; ఆతండు= వృషకుడు; సోదరుని= సోదరుడి యొక్క; అరదంబు= రథం; ఎక్కెన్= ఎక్కాడు; అప్పుడు= ఆ సమయంలో; వారికిన్= వృషకునికి, అచలునికి; అడ్డపడిన= సహాయంగా వచ్చిన; గాంధార= గాంధారదేశపు; వీర= శూరులైన; రథిక= రథంపై నిలిచి యుద్ధం చేసే; పంచశతంబున్= ఐదు వందలమందిని; పంచత్వంబున్+ఒందించిన= చంపిన; సంక్రందన నందనుని= ఇంద్రుడి పుత్రుడైన అర్జునుడియొక్క; ఉరవడికిన్= అతి వేగానికి; తెరలక= తొలగిపోక; ఏకరథస్థులు+అగు= ఒకే రథంపై ఉన్న; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరు కూడ; పరాక్రమించినన్= పరాక్రమం చూపగా.

తాత్పర్యం: ఇట్లా సుప్రతీక గజాన్ని, భగదత్తుడిని చంపి ఎదురులేకున్న అర్జునుడిని చూచి శకుని తమ్ములైన వృషకుడు, అచలుడు ఎదుర్కొన్నారు. అపుడు అర్జునుడు వృషకుడి రథాన్ని, గుర్రాలను, సారథిని, పతాకాన్ని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గొడుగును, చామరాలను ఖండించగా, వాడు తమ్ముడి రథం ఎక్కాడు. అంతలో వారికి సహాయంగా వచ్చిన ఐదు వందల గాంధార రథిక వీరులను హతమార్చిన అర్జునుడి తీవ్రతకు తొలగిపోక, ఒకే రథంపై ఉన్న ఆ ఇద్దరు పరాక్రమాన్ని చూపగా.

తే. **చేరియుండుట ననువైన వారి నొక్క। నారసంబునఁ బడనేసె నరుఁడు; దానిఁ**
జూచి కన్నీరు నించి నీ సుతులు సాలఁ। గుంది రర్జును నపుడు మార్కొనియె శకుని. 360

ప్రతిపదార్థం: చేరి ఉండుటన్= దగ్గర ఉండటం వలన; అనువైన వారిన్= అందుబాటులో ఉన్నవారిని; నరుఁడు= అర్జునుడు; ఒక్క= ఒకే; నారసంబునన్= బాణంతో; పడన్+ఏసెన్= కూల్చాడు; దానిన్+చూచి= ఆ విషాద సంఘటనను చూసి; నీ సుతులు= నీ కొడుకులైన దుర్యోధనాదులు; కన్నీరు నించి= కన్నీరు కార్చి; చాలన్= మిక్కిలి; కుందిరి= బాధపడ్డారు; శకుని; అపుడు= ఆ సమయంలో; అర్జునుని= అర్జునుడిని; మార్కొనియెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు సమీపాన అందుబాటులో ఉన్న శకుని సోదరు లిద్దరిని ఒకే బాణంతో కూల్చాడు. అది చూచి నీ కొడుకులు దుర్యోధనాదులు కన్నీరు గార్చి శోకించారు. అపుడు శకుని అర్జునుడిని ఎదుర్కొన్నాడు.

వ. **అతండు మాయావి యగుట ననేక మాయలు గల్పించిన మొగిళ్ళు వరపి పాషాణ వృక్ష వివిధాయుధంబులు వివ్వచ్చు పైఁ గురిసెం బదంపడి తమం బడరెఁ బిదప నీళ్ళు వెల్లిగొనియె; మఱియు మహోరగ శార్దూలాది క్రూరసత్త్వంబులు గవిసె; వారి నెల్లను దోడ్తోన దివ్యాస్త్రవేదియగు నా సవ్యసాచి యడంగించి యల్లనినగవుతో నిట్లనియె. 361**

ప్రతిపదార్థం: అతండు= ఆ శకుని; మాయావి= మాయలు పన్నేవాడు; అగుటన్= కావటం వలన; అనేక మాయలు= ఎన్నియో మాయలు; కల్పించినన్= సృష్టించగా; మొగిళ్ళు+పరపి= మేఘాలు కమ్ముకొని; పాషాణ= రాళ్ళు; వృక్ష= చెట్లు; వివిధ= అనేకములైన; ఆయుధంబులు= శస్త్రాలు; వివ్వచ్చుపైన్= అర్జునుడిపై; కురిసెన్= వర్షించాడు; పదంపడి= తర్వాత; తమంబు= చీకటి; అడరెన్= వ్యాపించింది; పిదప= తర్వాత; నీళ్ళు= నీరు; వెల్లిగొనియెన్= ప్రవహించింది; మఱియున్= ఇంకా; మహా+ఉరగ= పెద్దపాములు; శార్దూల= పెద్దపులులు; ఆది= మొదలైన; క్రూర= దుష్టములైన; సత్త్వంబులు= మృగాలు; కవిసెన్= విజృంభించాయి; వానిన్= వాటిని; ఎల్లన్= అన్నిటిని; తోడ్తోన్= వెనువెంటనే; దివ్య= దేవసంబంధమైన; అస్త్ర= బాణాలు; వేది+అగు= తెలిసినవాడగు; ఆ సవ్యసాచి= అర్జునుడు; అడంగించి= అణచివేసి; అల్లని నగవుతోన్= చిరునవ్వుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ శకుని మాయలు పన్నేవాడు కావటం వలన అనేక మాయలు సృష్టించగా, మేఘాలు క్రమ్మి, రాళ్ళు, చెట్లు, పలువిధాలైన ఆయుధాలు, అర్జునుడిపై కురిశాయి. ఇంతలో చీకట్లు క్రమ్మినవి. తర్వాత నీరు ప్రవహించింది. ఇంకా పెద్ద పెద్ద పాములు, పులులు, క్రూరమృగాలు విజృంభించాయి. వాటి నన్నిటిని వెనువెంటనే అణచివేసి దివ్యాస్త్ర వేదియైన అర్జునుడు చిరునవ్వుతో ఇట్లా అన్నాడు.

క. **'మాయలు జూదము తోడన। పోయెంగా, కింక నిచటఁ బొసఁగునె యవి? మ**
త్సాయకము లడ్డసాళ్ళే?। నీయాచవి లేదు పొమ్ము నిలువక మామా!' 362

ప్రతిపదార్థం: మామా!= శకునిమామా!; మాయలు= వంచనలు; జూదము తోడన్+అ= జూదంతోనే; పోయెన్+కాక= పోయినవిలే; ఇంకన్= ఇక; అవి= ఆ మాయలు; ఇచటన్= యుద్ధరంగంలో; పొసఁగునె?= సాగుతాయా?; మత్+సాయకములు= నా బాణాలు; అడ్డసాళ్ళే?= పాచికలా?; నీ= నీకు; ఆ చవి= ఆ కపటపు జూదంలోని రుచి; లేదు= ఇట లేదు; నిలువక= ఆగకుండ; పొమ్ము= వెళ్ళిపొమ్ము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'శకునిమామా! నీ మాయలన్నీ జూదంతోనే పోయినవిలే! అవి యుద్ధరంగంలో పొసగవు. నా బాణాలంటే పాచిక లనుకొన్నావా? నీకా కపటపు జూదంలోని రుచి ఇచట దొరుకదు. ఆగక ఇటనుండి వెళ్ళి పొమ్ము.'

క. అని పలికి వాలుటమ్ములు । తనువున నినుచుటయుఁ గలఁగి ధైర్యము మానం
బును వీటిఁబోవఁ బాఱెను । జననాయక! నీ మఱంది సరివారు నగన్. 363

ప్రతిపదార్థం: జననాయక!= ధృతరాష్ట్ర మహారాజా!; అని పలికి= ఆ విధంగా పలికి; వాలుటమ్ములు= నిశితమైన బాణాలు; తనువునన్= దేహంలో; నినుచుటయున్= నింపగా; నీ మఱంది= నీ మరిది అయిన శకుని; కలఁగి= బాధపడి; ధైర్యము= ధీరత్వం; మానంబును= అభిమానం; వీటిన్+పోవన్= వ్యర్థంకాగా; సరివారు= తోడివారు; నగన్= నవ్వగా; పాఱెను= పారిపోయాడు.

తాత్పర్యం: జననాయకుడవైన ధృతరాష్ట్రా! అర్జునుడు ఆ విధంగా పలికి, నిశితమైన బాణాలు దేహం నిండా నింపగా, నీ మరది అయిన శకుని కలతపడి, ధైర్యాభిమానాలు విడిచి, తోడివారు నవ్వగా పారిపోయాడు.

ఉ. ఆతఁడు పాఱినం దెరలు నచ్చటి సేనలఁ గాల్కొనంగ నీ
కాతత బాహువీర్యులు బకారియు సాత్యకియుం గడంగి తో
డై తన పార్శ్వభాగముల నార్చుచుఁ దోలఁగఁ దోలె ఖేచర
వ్రాతము మెచ్చఁ గ్రీడి కురురాజును ద్రోణుఁడు నున్న నేలకున్. 364

ప్రతిపదార్థం: ఆతఁడు= శకుని; పాఱినన్= పారిపోగా; తెరలు= కలతపొందే; అచ్చటి= అక్కడి; సేనలన్= సైన్యాలను; కాల్కొనంగ నీక= నిలువనియ్యక; ఆతత= విరివి అయిన; బాహు= భుజములలో; వీర్యులు= బలం కలవారగు; బక+అరియున్= భీముడును; సాత్యకియున్= సాత్యకియు; కడంగి= పూని; తోడై= సహాయులై; తన= అర్జునుడి యొక్క; పార్శ్వభాగములన్= ప్రక్కలయందు; ఆర్చుచున్= సింహనాదాలు చేస్తూ; తొలఁగన్= తరుమగా; క్రీడి= అర్జునుడు; ఖేచరవ్రాతము= ఆకాశంలో విహరించే దేవతాది సమూహం; మెచ్చన్= పొగడగా; కురురాజును= దుర్యోధనుడూ; ద్రోణుఁడున్= ద్రోణాచార్యుడూ; ఉన్న నేలకున్= ఉన్నచోటికి; తోలెన్= తరిమాడు.

తాత్పర్యం: శకుని పారిపోగా కలతపొందే అచ్చటి సైన్యాలను నిలువనీయక బాహుబలం గల భీమ, సాత్యకులు తోడై అర్జునుడి పార్శ్వభాగాలలో సింహనాదాలు చేస్తూ తరిమారు. అపుడు అర్జునుడు ఆకాశంలో దేవతా సమూహం ప్రశంసిస్తుండగా, దుర్యోధనుడు, ద్రోణుడు ఉన్న చోటికి ఆ సైన్యాలను తరిమివేశాడు.

ఆ. బలము విఱిగి రెండు పాయలై యిట్లు ల । మ్మనుజవిభుని గురుని మఱువు సొచ్చె;
ద్రోణుఁ బొదువుఁ డనుచు దుర్దమలీల నీ । ధిక్కువారు గవిసి రుక్కు మిగిలి. 365

ప్రతిపదార్థం: బలము= సేన; విఱిగి= తునియలై; రెండు పాయలు+ఐ= రెండుగా చీలి; ఇట్టులు= ఈ విధంగా; ఆ మనుజ విభుని= దుర్యోధన మహారాజుయొక్క; గురుని= ద్రోణాచార్యుడి యొక్క; మఱువు+చొచ్చెన్= చాటుకు చేరింది; ద్రోణున్= ద్రోణాచార్యుడిని; పొదువుఁడు= చుట్టు ముట్టండి; అనుచున్= అంటూ; దుర్దమలీలన్= అణచరాని విధంగా; ఆ దిక్కువారు= పాండవ పక్షంవారు; ఉక్కు మిగిలి= శౌర్యం మీరి; కవిసిరి= ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: శకునిసైన్యం తునియలై, రెండుగా చీలి దుర్యోధనుడి, ద్రోణాచార్యుడి చాటుకు చేరింది. శౌర్యం మీర, అడ్డుకొనరాని విధంగా పాండవపక్షవీరులు 'ద్రోణుడిని చుట్టుముట్టండి' అంటూ విజృంభించారు.

క. చనుఁ దడ్డం బాచార్యున । కనునెలుఁగులతోడ నీసుతావళి వెస మా
ర్కొనుటయు మన సేనలు పురి । కొని పాండవబలముఁ దాఁకెఁ గురువంశనిధీ! 366

ప్రతిపదార్థం: కురువంశనిధీ!= ధృతరాష్ట్ర మహారాజా!; ఆచార్యునకున్= ద్రోణుడికి; అడ్డంబు= సహాయంగా; చనుఁడు= వెళ్ళండి; అను= అనే; ఎలుఁగులతోడన్= అరుపులతో; నీ సుత+ఆవళి= నీ కుమారులు; వెసన్= వేగంగా; మార్కొనుటయున్= ఎదుర్కొనగా; మన సేనలు= కౌరవ సైన్యాలు; పురికొని= ఉత్సహించి; పాండవ బలమున్= పాండవసైన్యాన్ని; తాఁకెన్= అడ్డుకొన్నాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! నీ కుమారులు 'ద్రోణాచార్యుడికి సహాయంగా వెళ్ళండి' అనే అరుపులతో వేగంగా ఎదుర్కొనగా; మన కౌరవసేనలు ఉత్సహించి పాండవసైన్యాన్ని అడ్డుకొన్నాయి.

క. **గురుఁ డొడ్డుగఁ దమకంబునఁ । గురువీరులుఁ బాండుపుత్రకుల యోధులు ని**
ర్భర సమరద్యూత కళా । నిరతిం గ్రీడించి రుగ్రనిపుణత మెఱయన్. **367**

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యుడు; ఒడ్డుగన్= పందెంగా; తమకంబునన్= మోహంతో; కురువీరులున్= కౌరవవీరులును; పాండుపుత్రకుల= పాండవపక్షపు; యోధులు= వీరులు; నిర్భర= నిండిన; సమర= యుద్ధమనే; ద్యూతకళా= జూదమనే ఆటయందు; నిరతిన్= మిక్కిలి ఆసక్తితో; ఉగ్రనిపుణత= భయం గొలిపే నిపుణత్వం; మెఱయన్= ప్రకాశించగా; క్రీడించిరి= ఆడారు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు పందెంగా, మోహంతో కౌరవవీరులు, పాండవ యోధులు యుద్ధమనే జూదంలోని ఆసక్తితో, భయం గొలిపే నేర్పు ప్రకాశించగా క్రీడించారు.

విశేషం: అలం: రూపకం.

వ. **శరగురుఁ డెచటికిఁ దఱిమిన । వెరవున నచ్చటికి నెల్ల విక్రాంతి ధురం**
ధరుఁ డగు ధృష్టద్యుమ్నుఁడు । బరవసము దలిర్ప నడ్డపడి పోరాడెన్. **368**

ప్రతిపదార్థం: శరగురుఁడు= ద్రోణాచార్యుడు; ఎచటికిన్= ఎక్కడికి; తఱిమినన్= తరిమితే; అచ్చటికిన్= అక్కడికి; ఎల్లన్= అంతా; వెరవునన్= ఉపాయంగా; విక్రాంతి= పరాక్రమ; ధురంధరుఁడు+అగు= భారం వహించిన; ధృష్టద్యుమ్నుఁడు= పాండవ సేనాని ఐన ధృష్టద్యుమ్నుడు; బరవసము= ధైర్యం; తలిర్పన్= అతిశయించగా; అడ్డపడి= ఎదిర్చి; పోరాడెన్= యుద్ధం చేశాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు తరిమిన చోటికెల్లా వెళ్ళి, ఉపాయంతో, పరాక్రమంతో నేర్పరి అయిన ధృష్టద్యుమ్నుడు ధైర్యం అతిశయించగా ఎదిరించి పోరాడాడు.

చ. **కురుపతి ధర్మనందను లకుంఠిత విక్రమ కౌతుకంబునం**
బురికొలుపంగ సైన్యములు వోక పెనంగెడు రౌద్రభంగి క
చ్చెరువడి యున్కి నిట్టు లని చెప్పఁగ నిప్పుడు నేర నయ్యెదం
గరిపురనాథ! చూడ వినఁ గల్గునె యమ్మెయి కయ్య మెయ్యెడన్! **369**

ప్రతిపదార్థం: కరిపురనాథ!= ధృతరాష్ట్ర మహారాజా!; కురుపతి ధర్మనందనులు= దుర్యోధనుడును, ధర్మరాజును; అకుంఠిత= మొక్కవోని; విక్రమ= పరాక్రమమందలి; కౌతుకంబునన్= కుతూహలంతో; పురికొలుపంగన్= ప్రోత్సహించగా; సైన్యములు= కౌరవ, పాండవ సైన్యాలు; పోక= వెనుదిరుగక; పెనంగెడు= పోరాడే; రౌద్రభంగికిన్= భయంకరమైన పద్ధతికి; అచ్చెరువడి= ఆశ్చర్యపడి; ఉన్కిన్= ఉండటం వలన; ఇట్టులని= ఇట్లైనదని; చెప్పఁగన్= చెప్పడానికి; ఇప్పుడు= ఈ సమయంలో; నేరను+అయ్యెదన్= శక్యం కాదు; ఆ+మెయి= అటువంటి; కయ్యము= యుద్ధం; చూడన్= చూడటానికి; వినన్= వినటానికి; ఎయ్యెడన్= ఎచటనైన; కల్గునె?= ఉంటుందా?

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! దుర్యోధనుడు, ధర్మజుడు అకుంఠిత పరాక్రమమందలి కుతూహలంతో ప్రోత్సహించగా, కౌరవ పాండవ సేనలు వెనుదిరుగక పోరాడే భయంకరమైన పద్ధతికి ఆశ్చర్యచకితుడిని కావటంచేత ఈ విధంగా జరిగిందని ఇపుడు చెప్పలేకపోతున్నాను కాని, అటువంటి యుద్ధం ఇదివరకు కన్నది విన్నది ఎక్కడైనా ఉన్నదా!

వ. అట్టియెడ. 370

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: కౌరవ పాండవులు భయవిస్మయాలు కలిగేటట్లు పోరాడే సమయంలో.

క. నీలుఁ డను రాజు గురుసుతు । పై లీలం దేరు వఱపఁ బటువిశిఖమునం
గీ లెడపిన జంత్రముక్రియ । నేలం బడ నేసె నతఁడు నృపుఁ డగ్గింపన్. 371

ప్రతిపదార్థం: నీలుఁడు+అను రాజు= నీలుడు అనే రాజు; గురుసుతుపైన్= గురుపుత్రుడైన అశ్వత్థామపై; లీలన్= లీలగా; తేరు= రథం; వఱపన్= నడపగా; అతఁడు= ఆ అశ్వత్థామ; నృపుఁడు= దుర్యోధనుడు; అగ్గింపన్= ప్రశంసించగా; కీలు= మర; ఎడపిన= తొలగిన; జంత్రము= యంత్రం; క్రియ= వలె; పటువిశిఖమునన్= బలమైన బాణంతో; నేలన్= భూమిపై; పడనేసెన్= కూల్చాడు.

తాత్పర్యం: నీలుడనే రాజు అశ్వత్థామపై లీలగా తేరు నడిపేసరికి, అశ్వత్థామ దుర్యోధనుడు ప్రశంసించగా బలమైన బాణంతో, మర తొలగిన యంత్రంవలె అతడు భూమిపై పడేటట్లుకొట్టాడు.

విశేషం: అలం: ఉపమ.

క. చచ్చిన నీలునిఁ గనుఁగొని । విచ్చిన సైన్యంబు గురుఁడు వెనుకొనుటయు వే
వచ్చిన ధృష్టద్యుమ్నుని । నచ్చిన యబ్బలము మగిడినం బో రొప్పెన్. 372

ప్రతిపదార్థం: చచ్చిన= చనిపోయిన; నీలునిన్= నీలుడిని; కనుఁగొని= చూచి; విచ్చిన= చీలిన; సైన్యంబు= సేనను; గురుఁడు= ద్రోణుడు; వెనుకొనుటయున్= వెన్నంటగా; వే వచ్చిన= వేగంగా వచ్చిన; ధృష్టద్యుమ్నునిన్= ధృష్టద్యుమ్నుడిని; నచ్చిన= నమ్మిన; ఆ+బలము= పాండవసేన; మగిడినన్= మరలిరాగా; పోరు= యుద్ధం; ఒప్పెన్= జరిగింది.

తాత్పర్యం: చనిపోయిన నీలుడిని చూచి చీలిన పాండవ సైన్యాన్ని ద్రోణుడు వెనుదగులగా, వేగంగా వచ్చిన ధృష్టద్యుమ్నుడిని నమ్మిన ఆ సేన మరలి వచ్చింది. అపుడు యుద్ధం చెలరేగింది.

వ. అప్పుడు సంశప్తకులు నారాయణగోపాల బలంబులం గూడికొని పఱతెంచి. 373

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; సంశప్తకులు= సుశర్మాదులు; నారాయణ గోపాల= నారాయణ నామధేయులైన యాదవ వర్గానికి చెందిన; బలంబులన్= సేనలను; కూడికొని= కలిసికొని; పఱతెంచి= వచ్చి.

తాత్పర్యం: ఆ సమయంలో సంశప్తకులు నారాయణ గోపాల సేనలను కలిసికొని వచ్చి.

క. 'ఓడితిమె మేము రణమునఁ । గ్రీడికిఁ? గ్రేడించి రాక గెలుపే? యతఁ డేఁ
డీ? డాఁగి పోయెనొకొ! మా । తోడి బవర మిట్లు దాను దొలఁగినఁ దెగునే?' 374

ప్రతిపదార్థం: క్రీడికిన్= అర్జునుడికి; మేము= సంశప్తకులమైన మేము; రణమునన్= యుద్ధంలో; ఓడితిమె?= ఓడిపోయామా?; క్రేడించి= లక్ష్యపెట్టకుండా; రాక= రావటం; గెలుపే?= గెలిచినట్లా?; అతఁడు= ఆ అర్జునుడు; ఏఁడీ?= ఎక్కడున్నాడు?; డాఁగిపోయెన్+ఒకో= దాగున్నాడా?; మాతోడి= మాతో; బవరము= యుద్ధం; ఇట్లు= ఈ విధంగా; తాను= ఆ అర్జునుడు; తొలఁగినన్= తప్పించుకొన్న; తెగునే?= తీర్పు జరిగినట్లేనా?

తాత్పర్యం: 'అర్జునుడికి మేము ఓడినామా? యుద్ధం సాగుతుంటే లక్ష్య పెట్టకుండ రావటం గెలుపా? ఆ అర్జునుడెక్కడున్నాడు? దాగుకొన్నాడేమో! తాను తొలగిపోతే మాతో యుద్ధం ముగుస్తుందా?'

వ. **అను నెలుంగులు నింగిముట్ట దక్షిణ భాగంబునం గవిసినం గవ్వడి యట నడచి వారికిం గయ్యం బిచ్చిన నత్తెఱపి గని తఱుము కౌరవయోధులకోలుతలకుం గాక తమ సేనలు దెరలిన భీమసేనుం డదల్చి మార్కొని.375**

ప్రతిపదార్థం: అను+ఎలుంగులు= అనే ధ్వనులు; నింగిముట్టన్= ఆకాశము నంటగా; దక్షిణ భాగంబునన్= దక్షిణపువైపున; కవిసినన్= క్రమ్మగా; కవ్వడి= అర్జునుడు; అట= వారివైపు; నడచి= పోయి; వారికిన్= సంశప్తకులకు; కయ్యంబు+ఇచ్చినన్= యుద్ధము నివ్వగా; ఆ+తెఱపి= ఆ అవకాశం; కని= చూచికొని; తఱుము= తరిమే; కౌరవ యోధులు= కౌరవ వీరులతో; కోలుతలకున్+కాక= యుద్ధం చేయలేక; తమ సేనలు= పాండవ సైన్యాలు; తెరలినన్= తొలగగా; భీమసేనుండు= భీముడు; అదల్చి= గద్దించి; మార్కొని= ఎదుర్కొని.

తాత్పర్యం: సంశప్తకులు, కృష్ణార్జునులను ఎత్తిపొడిచే ధ్వనులు మిన్ను ముట్టగా, దక్షిణ భాగాన కవిసేసరికి, అర్జునుడు వారి వైపునకు పోయి యుద్ధానికి రమ్మన్నాడు. ఆ అవకాశం చూచికొని తరిమే కౌరవసేనలను పాండవ సేనలు ఎదిరించజాలక తొలగగా, భీముడు పాండవ సేనలను గద్దించి, శత్రువులను ఎదిరించి.

క. **తల మిగిలి వచ్చు బాహ్లికు। నిలు మని విశిఖముల నొంచె; నృపతియు గురు క**
ర్ణులు నశ్వత్థామయు న। మ్ముల వానలు గురిసి రొక్క మొగి నతనిపయిన్. 376

ప్రతిపదార్థం: తల మిగిలి= ముందుకు దూసికొని; వచ్చు= వచ్చునట్టి; బాహ్లికున్= బాహ్లికుడిని; నిలుము+అని= నిలువుమని; విశిఖములన్= బాణాలతో; నొంచెన్= బాధించాడు; అతనిపయిన్= ఆ భీముడిపై; నృపతియున్= దుర్యోధనుడును; గురు= ద్రోణుడు; కర్ణులున్= కర్ణుడును; అశ్వత్థామయున్= అశ్వత్థామయు; అమ్ములు= బాణాల; వానలు= వర్షాలు; ఒక్కమొగిన్= ఒక్కసారిగా; కురిసిరి= కురిపించారు.

తాత్పర్యం: భీముడు దూసికొని వచ్చే బాహ్లికుడిని నిలువు మని చెప్పి బాణాలతో అణచాడు. ఆ భీముడిపై దుర్యోధనుడు, ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ - ఒకేసారి బాణవర్షాన్ని కురిపించారు.

వ. **అతం డందఱ కన్నిరూపులై యార్చుచు నేట్లాడె; నిట్లొక్కనిం బెక్కండ్రు బొదివినం గనుంగొని కౌంతేయాగ్రజుండు పురికొలుప నకుల సహదేవ సాత్యకి సౌభద్రు లా సమీరపుత్త్రునకు బాసటయై దుర్యోధనాదులం దలపడుటయు రెండు సేనలు గలయన్ బెరసె ని ట్లపరాహ్ణంబునం గ్రందు కయ్యంబయ్యె నం దరదంబులు దాఁకు పెల్లున డొల్లు కరులును కరవాల ధారలఁ గాననగు కుంభి కుంభమౌక్తికంబులును దురగ ఖురంబులం గరటి రదంబులను బెనంగొనుచు వ్రేలు ప్రేవులును దెగిపడియు నంకుశంబులు విడువక మిట్టిమిట్టిపడు బాహువులును దొండంబులం బెనఁచి యెత్తినం దొరఁగు హయంబులు వ్రేలు రాహుతులును ముందఱి కాళ్ళు దెగవ్రేసినఁ గూలు శుండాలంబులును సామజంబు లడరి రథ్యసారథి రథిక సహితంబుగా మల్లడి గొనం ద్రొక్కిన నేలం గలిసిన రథంబులును నాశ్వికు లొక్కమొగిఁ జెక్కినం దునిసి పడి యేమిటి యంగంబులో యను సందేహంబునకుం బట్టయి యున్న పదాతి గాత్రఖండంబులును జూచి ఖేచరులకు వెక్కసం బొనర్చె; నట్టి సంకుల సమరంబున ధృష్టద్యుమ్నుండు. 377**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అతండు= ఆ భీముడు; అందఱకున్= దుర్యోధనాదులకు; అన్ని రూపులు+ఐ= అన్ని ఆకారాలై; ఆర్చుచున్= సింహనాదాలు చేస్తూ; ఏట్లు+ఆడెన్= కొట్లాడాడు; ఇట్లు= ఈ విధంగా; ఒక్కనిన్= ఒక్క భీముడిని, పెక్కం్రడు= అనేకులు; పొదివినన్= ఆక్రమించగా; కనుంగొని= చూచి; కౌంతేయ+అగ్రజుండు= ధర్మజుడు; పురికొలుపన్= ప్రోత్సహించగా; నకుల; సహదేవ; సాత్యకి; సౌభద్రుడు= అభిమన్యుడు; ఆ సమీరపుత్త్రునకున్= ఆ భీముడికి; బాసట+ఐ= సహాయులై; దుర్యోధనాదులన్= దుర్యోధనుడు మున్నగువారిని; తలపడుటయున్= ఎదుర్కొనగా; రెండు సేనలు= కౌరవ, పాండవ సైన్యాలు; కలయన్+బెరసెన్= కలిసి చొచ్చుకొనిపోయాయి; ఇట్లు= ఈ విధంగా; అపరాహ్ణంబునన్= మధ్యాహ్నం మీరిన తర్వాత; క్రందుకయ్యంబు= దొమ్మియుద్ధం; అయ్యెన్= జరిగింది; అందున్= ఆ యుద్ధంలో; అరదంబులు= రథాలు; తాఁకు= తాకే; పెల్లునన్= ఆధిక్యంవలన; డొల్లు= పడిపోయే; కరులును= ఏనుగులును; కరవాలధారలన్= కత్తుల అంచులందు; కానన్+అగు= కనిపించే; కుంభి= ఏనుగుల; కుంభ= కుంభస్థలాలలోని; మౌక్తికంబులును= ముత్యాలూ; తురగఖురంబులన్= గుర్రాల గిట్టలయందు; కరటిరదంబులను= ఏనుగుల దంతాలయందును; పెనంగొనుచున్= పెనవేసికొని; వ్రేలు= వ్రేలాడే; ప్రేవులును= ప్రేగులు; తెగిపడియున్= విరిగిపడియు; అంకుశంబులు= అంకుశాలు; విడువక= వదలక; మిట్టిమిట్టి పడు= ఎగిరెగిరి పడే; బాహువులును= చేతులు; తొండంబులన్= తొండాలతో; పెనచి ఎత్తినన్= చుట్టి యెత్తగా; తొరఁగు= పడే; హయంబులున్= గుర్రాలును; వ్రేలు= వ్రేలాడే; రాహుతులును= రౌతులును; ముందరి కాళ్ళు= ముందు కాళ్ళు; తెగవేసినన్= ఖండించగా; కూలు= పడిపోయే; శుండాలంబులును= ఏనుగులును; సామజంబులు= ఏనుగులు; అడరి= విజృంభించి; రథ్య సారథి రథిక సహితంబుగాన్= గుర్రాలు, సారథులు, రథంపై నుండి యుద్ధం చేసే వీరుల; సహితంబుగాన్= తోడ; మల్లడిగొనన్= పెనగొనగా; త్రొక్కిన; నేలన్+కలిసిన= మట్టిలో గలిసిన; రథంబులును= రథాలు; ఆశ్వికులు= రౌతులు; ఒక్కమొగిన్= ఒకేసారి; చెక్కినన్= ఖండించగా; తునిసిపడి= రాలిపడి; ఏమిటి+అంగంబులో= దేని అవయవాలో; అను= అనే; సందేహంబునకున్= సంశయానికి; పట్టు+ఐ= నెలవై; ఉన్న= ఉన్నట్టి; పదాతి= భటుల; గాత్ర= దేహపు; ఖండంబులును= ముక్కలును; చూచు= చూచే; ఖేచరులకున్= ఆకాశంలో తిరిగే దేవాదులకు; వెక్కసంబు= బాధ; ఒనర్చెన్= కలిగించింది; అట్టి= అటువంటి; సంకుల సమరంబునన్= దొమ్మియుద్ధంలో; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు.

తాత్పర్యం: దుర్యోధనాదివీరులు ఒక్కసారిగా పైబడగా, భీముడు వారికందరికి అన్ని రూపాలై సింహనాదాలు చేస్తూ యుద్ధం చేశాడు. ఇట్లా ఒక్కడిని ఇంతమంది ఆక్రమించటం చూచి ధర్మజుడు పురికొలుపగా, నకుల సహదేవులు, సాత్యకి, అభిమన్యుడు ఆ భీముడికి తోడై దుర్యోధనాదులతో తలపడగా రెండు సేనలు కలియబడ్డాయి. ఇట్లా మధ్యాహ్నం దాటిన తర్వాత సంకులసమరం జరిగింది. రథాలు అతివేగంగా వచ్చి తాకేసరికి ఏనుగులు పడిపోయాయి. ఏనుగులను నరకటం చేత వాటి కుంభస్థలాలలోని ముత్యాలు ఖడ్గాల అంచులపై మెరవసాగాయి. గుర్రాల గిట్టలకు, ఏనుగుల దంతాలకు పెనవేసికొని వ్రేలాడే ప్రేగులు, తెగిపడి కూడ అంకుశాలను వదలక ఎగిరిపడే చేతులు, తొండాలతో, పెనవేసి ఎత్తగా పడిపోయే గుర్రాలు, రౌతులు ఒకచో కనిపించాయి.

ముందరి కాళ్ళు తెగవేసేసరికి ఏనుగులు కూలిపోసాగాయి, ఏనుగులు విజృంభించి రథికులను, సారథులను, గుర్రాలను పెనగొనగా ఆ తొక్కిడిలో అవి మట్టిలో కలిసిపోయాయి. రౌతులు ఒక్క దెబ్బతో ఖండించగా రాలిపడిన భటుల దేహపు ఖండాలు వేటి అవయవాలో అనే సందేహాన్ని కలిగిస్తున్నవి. ఇట్టి బీభత్స దృశ్యాలు ఆకాశంలో చరించే దేవ గంధర్వాదులకు బాధకలిగించాయి. అట్టి సామూహిక యుద్ధంలో ధృష్టద్యుమ్నుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'మన కిది సమయము సుండీ' । యని ద్రోణునిఁ జూపి తఱుమ నమ్మొన రథికుల్
గని 'పొదువుఁడు సంపుఁడు పొరి । గొనుఁడు దునుముఁ డనుచుఁ 'గూడుకొని యతనిపయిన్.' 378

ప్రతిపదార్థం: మనకున్= మన సైన్యానికి; ఇది; సమయము= మంచి అదను; సుండీ!= సుమా!; అని; ద్రోణునిన్= ద్రోణాచార్యుడిని; చూపి; తఱుమన్= వెనుదగులగా; ఆ+మొన= పాండవ పక్షంలోని; రథికుల్= రథంపై ఉండి యుద్ధం చేసేవారు; కని= చూసి;

పొదువుఁడు= చుట్టుముట్టండి; చంపుఁడు= చంపండి; పొరిగొనుఁడు= నశింపజేయండి; తునుముఁడు= ఖండించండి; అనుచున్= అంటూ; కూడికొని= కలిసికొని; అతనిపయిన్= ఆ ద్రోణుడిపై.

తాత్పర్యం: 'మన పాండవ పక్షానికి ఇది మంచి అదను సుమా!' అని ద్రోణుడిని చూపి తరుమగా, పాండవ రథికులు ఇది చూచి, 'చుట్టుముట్టండి, చంపండి, నశింపజేయండి, ఖండించండి' అంటూ ఆ ద్రోణుడిపై. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **కవిసిన నమ్మహాభుజుఁడు గన్నుల దట్టపుఁ గెంపు పెలర్ప భై**
రవముగ దివ్యబాణ నికరం బడరించినఁ దేఱి చూడ రా
క వెఱఁగునొంది చిత్రములకైవడి నా ఘనయోధు లుండ నీ
రవుతులు జోదులున్ రథికరాజియు వారి మొనల్ గలంపఁగాన్. **379**

ప్రతిపదార్థం: కవిసినన్= విజృంభించగా; ఆ మహాభుజుఁడు= గొప్ప బాహువులు గల ద్రోణుడు; కన్నులన్= కన్నులలో; దట్టపున్= చిక్కనైన; కెంపు= ఎఱ్ఱదనం; ఎలర్పన్= కలుగగా; భైరవముగన్= భయంగొలిపేటట్లు; దివ్య= దేవతా సంబంధమైన; బాణ= బాణాల యొక్క; నికరంబు= సమూహం; అడరించినన్= ప్రయోగించగా; తేఱిచూడ రాక= బాగుగా చూడరాక; వెఱఁగున్+ఒంది= ఆశ్చర్యపడి; చిత్రముల కైవడిన్= బొమ్మలవలె; ఆ ఘన యోధులు+ఉండన్= ఆ మహావీరులయిన పాండవ పక్షీయులు ఉండగా; నీ= నీ యొక్క; రవుతులు= ఆశ్వికులు; జోదులున్= యోధులు; రథిక రాజియున్= రథికుల సమూహం; వారి= పాండవుల; మొనల్= సైన్యాలను; కలంపఁగాన్= కలచివేయగా.

తాత్పర్యం: వారు ద్రోణుడిపై విజృంభించగా, ఆ మహాబలశాలి కన్నులు ఎఱ్ఱజేసి భయంకరంగా దివ్య బాణాలను ప్రయోగించగా, తేరిచూడలేక ఆశ్చర్యపడి, ఆ పాండవవీరులు చిత్రాలవలె నిలిచిపోయారు. అపుడు నీ రథాశ్వపదాతి యోధులు వారి సైన్యాలను కలచివేయగా.

మ. **తను నత్యుద్ధతిఁ బిల్చి దుర్దమభుజా దర్పంబు శోభిల్లఁ దాఁ**
కిన సంశప్తకకోటి నొంచి సమర క్రీడా కళా కౌతుకం
బున నాభీల కపీంద్రకేతన పరిస్ఫూర్జత్ప్రభా జాలముల్
వినువీథిం బరఁగంగ వచ్చె మగుడన్ వివ్వచ్చుఁ డచ్చోటికిన్. **380**

ప్రతిపదార్థం: తనున్= తనను; అత్యుద్ధతిన్= మిక్కిలి అహంకారంతో; పిల్చి= ఆహ్వానించి; దుర్దమ= అణచరాని; భుజా= బాహువుల; దర్పంబు= గర్వం; శోభిల్లన్= ఒప్పుగా; తాకిన= ఎదుర్కొన్న; సంశప్తకకోటిన్= సంశప్తకుల సమూహాన్ని; నొంచి= బాధించి; సమర= యుద్ధమనే; క్రీడా= ఆట అందలి; కౌతుకంబునన్= కుతూహలంతో; ఆభీల= భయంకరమైన; కపీంద్ర= హనుమంతుడుగల; కేతన= పతాకంయొక్క; పరిస్ఫూర్జత్= ఉరిమే; ప్రభా= వెలుగుల; జాలముల్= సమూహాలు; వినువీథిన్= ఆకాశమార్గంలో; పరఁగంగన్= ప్రసరించగా; వివ్వచ్చుఁడు= అర్జునుడు; ఆ+చోటికిన్= ఆ యుద్ధం జరిగే చోటికి; మగుడన్= మరల; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: తనను గర్వంమీర పిలిచి, తీవ్రమైన బాహు బల గర్వం ఒప్పగా ఎదిరించిన సంశప్తక సమూహాన్ని, యుద్ధ క్రీడా కుతూహలంతో అణచి, భయంకరమైన హనుమత్పతాకం విరజిమ్మే వెలుగులు ఆకాశంలో ప్రసరించగా అర్జునుడు ఆ యుద్ధరంగంలోకి వచ్చాడు.

క. **చిచ్చునకుఁ దోడు గరువలి । వచ్చిన క్రియ భీముకడకు వాసవి యిమ్మై**
వచ్చిన మన యోధావళి । ఱిచ్చపడియె; వారిమొన దఱిమికొని వచ్చెన్. **381**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: చిచ్చునకున్= మంటకు; తోడు= సహాయంగా; కరువలి= గాలి; వచ్చిన క్రియన్= వచ్చినట్లు; భీముకడకున్= భీముడివద్దకు; వాసవి= అర్జునుడు; ఇమ్ము+ఐ= అనుకూలంగా; వచ్చినన్= రాగా; మన= కౌరవుల; యోధావళి= వీరసమూహం; ఊచ్చవడియెన్= క్రియాశూన్యమైనది; వారి= పాండవుల; మొన= సైన్యం; తఱిమికొని వచ్చెన్= తరుముకొంటూ వచ్చింది.

తాత్పర్యం: అగ్నికి తోడై వాయువు వచ్చినట్లు భీముడి వద్దకు అర్జునుడు తోడుగా రాగా మన కౌరవయోధులు నిశ్చేష్టులయ్యారు. పాండవసైన్యం తరుముకొని వచ్చింది.

ఉ. **బాసట యై వృకోదరుఁడు పార్శ్వమునం దఱుమంగ వైరి సం**
త్రాసనమూర్తి వాసవి శరప్రతతిం దొరఁగించి ద్రోణు ను
ల్లాసము మాన్చి కౌరవ బలంబులు నెత్తురు వెల్లిఁ దేలఁగాఁ
జేసినఁ 'గర్ణ కర్ణ మముఁ జేకొనవే' యనుచున్ భయంబునన్. **382**

ప్రతిపదార్థం: వృకోదరుఁడు= భీముడు; బాసట+ఐ= సహాయంగా; పార్శ్వమునన్= ప్రక్కనుండి; తఱుమంగన్= తరుమగా; వైరిసంత్రాసనమూర్తి= శత్రువులకు భయం గొలిపే; మూర్తి= ఆకారంగల; వాసవి= అర్జునుడు; శరప్రతతిన్= బాణ సమూహాన్ని; తొరఁగించి= వేసి; ద్రోణుని= ద్రోణుడియొక్క; ఉల్లాసము= సంతోషం; మాన్చి= తొలగించి; కౌరవ బలంబులు= కౌరవ సైన్యాలు; నెత్తురు= రక్తపు; వెల్లిన్= ప్రవాహంలో; తేలఁగాన్= తేలేటట్లు; చేసినన్= చేయగా; భయంబునన్= భయంతో; కర్ణ, కర్ణ= ఓ కర్ణా, ఓ కర్ణా; మమున్= మమ్ములను; చేకొనవే!= కాపాడవే!; అనుచున్= అంటూ.

తాత్పర్యం: భీముడు తోడై ప్రక్కనుండి తరుమగా శత్రుభయంకరుడైన అర్జునుడు బాణజాలాన్ని ప్రయోగించి ద్రోణుడి ఉల్లాసాన్ని మాన్చి, కౌరవసైన్యాలను రక్తప్రవాహంలో తేల్చగా; భయంతో వారు 'కర్ణా! ఓ కర్ణా! మమ్ము కాపాడవే' అంటూ. (తరువాతి పద్యంతో అన్వయం).

కర్ణార్జునుల యుద్ధము (సం. 7-31-49, 50)

క. **తన వెనుక దెసకు పాఱిన । ఘన యోధులఁ జూచి బాహుగర్వస్ఫూర్తిన్**
దనరుచు నోడకుఁ డోడకుఁ । డని పలుకుచుఁ దాఁకెఁ గర్ణుఁ డమరేంద్రసుతున్. **383**

ప్రతిపదార్థం: తన= తన యొక్క; వెనుకకున్= చాటుకు; ఓడి పాఱిన= ఓడిపోయి పారివచ్చిన; ఘనయోధులన్= గొప్ప వీరులను; చూచి; బాహు= భుజాలయొక్క; గర్వ= అహంకారపు; స్ఫూర్తిన్= ప్రకాశంతో; తనరుచున్= ఒప్పుతూ; ఓడకుఁడు+ఓడకుఁడు= భయపడకండి, భయపడకండి; అని; పలుకుచున్= అంటూ; కర్ణుఁడు= కర్ణుడు; అమరేంద్రసుతున్= అర్జునుడిని; తాఁకెన్= ఎదిరించాడు.

తాత్పర్యం: తన వెనుకకు ఓడిపోయి పారివచ్చిన వీరశ్రేష్ఠులను చూచి, బాహుగర్వం ప్రకాశించగా, 'భయపడకండి! భయపడకండి!' అంటూ కర్ణుడు అర్జునుడిని ఎదిరించాడు.

వ. **ఇట్లు దాఁకి యతనిపై నాగ్నేయాస్త్రంబు ప్రయోగించిన నతండు వారుణ బాణంబున వారించి వాలమ్ములు గురియం గూడుకొని భీమ సాత్యకి ధృష్టద్యుమ్నులు శరత్రయంబులు సూత సూను మేన నాటించిన, నతండు గాండీవ నిర్గత చండమార్గణంబుల మగిడించుచు నమ్మువ్వుర చాపంబులు నవ్వుచుం ద్రుంచి, వారలు శక్తులు వైవ వానిం దునిమి పేర్చియార్చిన నర్జునుండు నారాచసప్తకంబున నవ్వీరు నొప్పించి యతనిం దల కడచి తన్నుఁ దలపడిన యతని తమ్ముల తలలు మూఁడును భూమిదేవికి బలిసేసె నంత భీముండు రథంబు డిగ్గివచ్చి గదాదండంబునఁ గర్ణబంధువులం బదివేవురం బడలు వఱిచి మరల రథస్థుఁడై వేఱొక్కవిల్లు గొని**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశిఖంబులు వఱపి యంగపతి యంగంబులం దురంగ శరీరంబులను నొప్పించె నాలోనన యప్పాంచాల వరసుతుండును శైనేయుండును నొండు విండ్లు గొని యతని సారథి యొఱగను జాపంబు విఱుగను నేసి; రా సమయంబున దుర్యోధనుండును ద్రోణ జయద్రథులును నెయిది శాత్రవ సముద్రంబున మునుంగకుండ నారాధేయు నుద్ధరించి రట్టియెడ. 384

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తాఁకి= ఎదుర్కొని; అతనిపైన్= అర్జునుడిపై; ఆగ్నేయ+అస్త్రంబు= అగ్నిదేవతాకమైన బాణాన్ని; ప్రయోగించినన్= వేయగా; అతండు= ఆ అర్జునుడు; వారుణ బాణంబునన్= వారుణాస్త్రంతో; వారించి= శాంతింపజేసి; వాలు+అమ్ములు= వాడి బాణాలు; కురియన్= కురియగా; కూడుకొని= అతడితో కలిసి; భీమ; సాత్యకి; ధృష్టద్యుమ్నులు; శరత్రయంబులు= మూడు మూడు బాణాలు; సూతసూను= కర్ణుడి; మేనన్= దేహంపై; నాటించినన్= గ్రుచ్చగా; అతండు= ఆ కర్ణుడు; గాండీవ= గాండీవ ధనుస్సు నుండి; నిర్గత= వెడలిన; చండ= భయంకరమైన; మార్గణంబులన్= బాణాలను; మగిడించుచున్= మరల్చుతూ; ఆ మువ్వుర= ఆ ముగ్గురియొక్క; చాపంబులు= విండ్లు; నవ్వుచున్= నవ్వుతూ; త్రుంచి= విరిచి; వారలు= భీమాదులు; శక్తులు= శక్త్యాయుధాలను; వైవన్= వేయగా; వానిన్= ఆ ఆయుధాలను; తునిమి= ఖండించి; పేర్చి= విజృంభించి; ఆర్చినన్= సింహనాదం చేయగా; అర్జునుండు; నారాచసప్తకంబునన్= ఏడు బాణాలతో; ఆ+వీరున్= ఆ కర్ణుడిని; నొప్పించి= బాధించి; అతనిన్= కర్ణుడిని; తలకడచి= అతిక్రమించి; తన్నున్= అర్జునుడిని; తలపడిన= ఎదుర్కొన్న; అతని= కర్ణుడి; తమ్ములు= సోదరుల; తలలు= శిరస్సులు; మూఁడును= మూడు; భూమిదేవికిన్= నేలతల్లికి; బలిచేసెన్= బలి ఇచ్చారు; అంతన్= అపుడు; భీముండు; రథంబు డిగ్గివచ్చి= రథాన్ని దిగివచ్చి; గదాదండంబునన్= గదతో; కర్ణ బంధువులను= కర్ణుడి చుట్టాలను; పదివేవురన్= పదివేలమందిని; బడలు+పఱిచి= అలియునట్లు చేసి; మరలి= తిరిగి; రథస్థుఁడు+ఐ= రథమెక్కి; వేఱు+ఒక్క+విల్లున్= ఇంకొక ధనుస్సు; కొని= తీసికొని; విశిఖంబులు= బాణాలు; పఱపి= ప్రసరింపజేసి; అంగపతి= కర్ణుడి; అంగంబులన్= అవయవాలను; తురంగ శరీరంబులను= గుర్రాల దేహాలను; నొప్పించెన్= బాధించాడు; ఆలోనన్+అ= ఆలోపుగా; ఆ+పాంచాల వరసుతుండును= ఆ పాంచాల రాజపుత్రుడైన ధృష్టద్యుమ్నుడును; శైనేయుండునున్= సాత్యకియు; ఒండు= వేరే; విండ్లు= ధనుస్సులు; కొని= తీసికొని; అతని= కర్ణుడి; సారథి= రథచోదకుడు; ఒఱగను= చనిపోవునట్లును; చాపంబు= ధనుస్సు; విఱుగనున్= విరుగునట్లు; ఏసిరి= కొట్టిరి; ఆ సమయంబునన్; దుర్యోధనుండును= దుర్యోధనుడు; ద్రోణ జయద్రథులునున్= ద్రోణుడు; జయద్రథుడును; ఎయిది= వెంటపడి; శాత్రవసముద్రంబునన్= శత్రువు లనే సముద్రంలో; మునుంగకుండన్= మునిగిపోకుండ; ఆ రాధేయున్= ఆ కర్ణుడిని; ఉద్ధరించిరి= పైకెత్తారు; అట్టి ఎడన్= అప్పుడు.

తాత్పర్యం: ఈ విధంగా కర్ణుడు ఎదుర్కొని అర్జునుడిపై ఆగ్నేయాస్త్రం ప్రయోగించగా అతడు వారుణాస్త్రంతో దానిని శాంతింపజేసి వాడి అయిన బాణాలను కురిపించగా, భీముడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు అతడితో కలిసి మూడేసి బాణాలు కర్ణుడి దేహంమీద నాటారు. అపుడు గాండీవం నుండి వెడలిన భయంకరమైన బాణాలను కర్ణుడు మరలింపజేస్తూ, ఆ ముగ్గురి ధనుస్సులను కూడ నవ్వుతూ విరిచివేశాడు. భీమాదులు ముగ్గురూ శక్త్యాయుధాలను ప్రయోగించగా వాటిని ఖండించి సింహనాదం చేయగా, అర్జునుడు ఏడు బాణాలతో ఆ వీరుడిని నొప్పించి, అతడిని అతిక్రమించి తనతో తలపడ్డ కర్ణుడి తమ్ముల శిరస్సులను మూడింటిని భూదేవికి బలిగావించాడు. అపుడు భీముడు రథం దిగివచ్చి గదతో కర్ణుడి చుట్టాలను పదివేలమందిని అలసిపోయేటట్లు చేసి, మరల రథంపైకి చేరుకొని వేరొక ధనుస్సును తీసికొని బాణాలు ప్రసరింపజేసి, కర్ణుడి అవయవాలను, గుర్రాల శరీరాలను నొప్పించాడు. ఆలోపుగా పాండవ సేనాని అయిన ధృష్టద్యుమ్నుడు, సాత్యకి వేరు వేరుగా ధనుస్సులు తీసికొని కర్ణుడి సారథిని కూల్చి, అతడి ధనుస్సును ఖండించారు. ఆ సమయంలో దుర్యోధనుడు, ద్రోణుడు, జయద్రథుడును వెంటబడి, శత్రుసముద్రంలో మునిగిపోకుండా ఆ కర్ణుడిని పైకెత్తారు. అప్పుడు.

క. ఉభయ బలంబులుఁ బురికొని । యిభరథ తురగ భటతతి మహిం గూలఁగ న
క్షుభితములై పోరాడెం । బ్రభువులు వెనుదన్ని చూడఁ బార్థివముఖ్యా! 385

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= ధృతరాష్ట్ర మహారాజా!; ఉభయ బలంబులున్= కౌరవ, పాండవ సైన్యాలు రెండును; పురికొని= క్రమ్మి; ఇభ= ఏనుగుల; రథ= రథాల; తురగ= గుర్రాల; భట= సైనికుల; తతి= సమూహం; మహిన్= నేలపై; కూలంగన్= పడగా; అక్షుభితములు+ఐ= కలత పొందనివై; ప్రభువులు= రాజులు; వెనుదన్ని చూడన్= వెనుక నిల్చి చూడగా; పోరాడెన్= యుద్ధం చేశాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! కౌరవ పాండవ సైన్యాలు రెండూ కూడా క్రమ్ముకొని, ఏనుగులు, రథాలు, గుర్రాలు, సైనికుల సమూహం నేలపై కూలగా కలత పొందనివై, రాజులు వెనుక నిలిచి చూస్తుండగా యుద్ధం చేశాయి.

సీ. **కాలువలై పాఱు కీలాల జలములఁ । దేలిపోయెడు మృతదేహములును,**
బ్రేవుల ప్రోవుల పెల్లునఁ జిత్రత । చ్ఛాయంబులగు మాంస సంచయములుఁ,
గరి హయంబుల కళేబరముల క్రిందఁ గొం । డొక తోఁచు భట గాత్ర నికరములును
దలల పెండఱచులో మిలమిల మెదలెడు । కర పదంబుల నవఖండములును

తే. **రౌద్ర బీభత్సనర్తన రంగభంగి । నపుడు సమరాంగణము ఘోరమయ్యెఁ జూడ**
ద్రోణఫల్గున నిష్ఠురోద్ధురనిపాత । జాతమగు నమ్మహోద్భట సంకులమున. **386**

ప్రతిపదార్థం: కాలువలు+ఐ= కాలువలుగట్టి, పాఱు= ప్రవహించే; కీలాల జలములన్= రక్తమనే నీటిలో; తేలిపోయెడు= తేలిపోయే; మృతదేహములును= పీనుగులును; ప్రేవుల= ప్రేగుల; ప్రోవుల= కుప్పల; పెల్లునన్= ఆధిక్యం వలన; చిత్రత+ఛాయంబులు+అగు= చిత్రించబడిన రంగులుగా తోచు; మాంససంచయములున్= మాంసపు కుప్పలును; కరి= ఏనుగుల; హయంబుల= గుర్రాల; కళేబరముల= దేహాల; క్రిందన్= క్రింద; కొండొక= చిన్నగా; తోఁచు= కనిపించే; భట= సైనికుల; గాత్ర= శరీరాల; నికరములును= గుంపులును; తలల= శిరస్సుల; పెండఱచులో= పెద్దకుప్పలో; మిలమిల మెదలెడు= మిలమిల మెదలే; కరపదంబుల= చేతుల, కాళ్ళ; నవఖండములును= క్రొత్త ముక్కలును; ద్రోణ= ద్రోణాచార్యుడి; ఫల్గున= అర్జునుడి; నిష్ఠుర= కఠినమైన; ఉద్ధుర= దట్టమై; నిపాత= పడటంవలన; జాతము+అగు= కలిగిన; ఆ మహా+ఉద్భట= ఆ మిక్కిలి అధికమైన; సంకులమునన్= దొమ్మియుద్ధంలో; రౌద్ర= రౌద్రరసం; బీభత్స= బీభత్సరసం; నర్తన= నాట్యం చేసే; రంగ= రంగం; భంగిన్= వలె; అపుడు= ఆ సమయంలో; సమర+అంగణము= యుద్ధభూమి; చూడన్= చూడటానికి; ఘోరము+అయ్యెన్= భయంకరమైనది అయింది.

తాత్పర్యం: కాలువలైన రక్తపు జలాలలో తేలియాడే పీనుగులు, ప్రేవుల కుప్పల ఆధిక్యంచేత చిత్రించబడిన రంగులను పోలు మాంసపు దిబ్బలు, ఏనుగుల, అశ్వాల మృతదేహాల క్రింద చిన్నవిగాతోచే భటుల దేహ సమూహాలు, తలల రాసులలో మిలమిల మెదలే కాలుసేతుల క్రొత్త ముక్కలు, ద్రోణుడు, అర్జునుడు ఆ సంకులసమరంలో అతికఠినంగా విజృంభించటంవలన యుద్ధరంగం, రౌద్ర, బీభత్సరసాల నాట్యరంగంవలె చూపునకు ఘోరమై తోచింది.

వ. **అంత పతంగుండు పశ్చిమాచలంబునవులకుం జనిన సంధ్యారాగంబు సొంపునఁ గెం పినుమడించు నెత్తురు మడువుల నోలలాడు భూతబేతాళంబులను, శవకబళన లోలంబులగు సృగాలంబులను, మాంసచర్వణ కోలాహల బహుళంబులగు కంకగృధ్రాది పక్షి కులంబులనుం జూచియుఁ బాండవబలంబు సమయ సముచితంబగు సమర విరామంబునకు నున్ముఖం బగుట యెఱింగియు మున్న సవ్యసాచి యురవడికింగాక తమ మొన దెరలుచునికిం జేసియు నదియ మెయిగా నాచార్యుండు దొరలకుం జెప్పి సేనలఁ దివియ నియోగించెఁ; బాండవ సైన్యంబులును మరలె; నివ్విధంబున నుభయ సైన్యంబులు నిజస్కంధావారంబులకుం జను నవసరంబున మన జనంబులు ద్రోణు ప్రతిజ్ఞాభంగంబును ఫల్గును పరాక్రమ స్ఫురణంబును నతని యెడ నచ్యుతునకుం గల సౌహార్ద విశేషంబును నుగ్గడించుచు విన్ననై పోయిరి. వేగుటయుఁ గయ్యంబునకు వెడలునప్పుడు విషాద వివర్ణవదనుం డగుచు నీ తనయుఁ డెల్ల యోధులు వినం గుంభసంభవున కి ట్లనియె.** **387**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అంతన్= అంతలో; పతంగుండు= సూర్యుడు; పశ్చిమ+అచలంబు= పశ్చిమగిరి, అస్తగిరి; అవులకున్= వెనుకకు; చనినన్= పోగా; సంధ్యా= సంధ్యాకాలమండలి; రాగంబు= ఎఱ్ఱదనం యొక్క; సొంపునన్= శోభకు; కెంపు= ఎఱ్ఱదనం; ఇనుమడించు= రెట్టింపగు; నెత్తురు మడువులన్= రక్తపు గుంటలలో; ఓలలాడు= తేలియాడే; భూతబేతాళంబులను= భూత బేతాళములను; శవకబళనలోలంబులు+అగు= పీనుగులను తినటంలో తగుల్కొన్న; సృగాలంబులను= నక్కలను; మాంస= మాంసాన్ని; చర్వణ= తినటంలో; కోలాహల బహుళంబులు+అగు= మిక్కిలి కలకలం చేసే; కంక= రాపులుగులు; గృధ్ర= గద్దలు; ఆది= మున్నగు; పక్షికులంబులనున్= పక్షిసమూహాలను; చూచియున్= చూచియు; పాండవ బలంబు= పాండవసేన; సమయ సముచితంబు+అగు= కాలానికి తగిన; సమరవిరామంబునకున్= యుద్ధాన్ని ఆపటానికి; ఉన్ముఖంబు+అగుట= సిద్ధం కావటం; ఎఱింగియున్= తెలిసియు; మున్ను= పూర్వం; సవ్యసాచి= అర్జునుడి; ఉరవడికిన్= తీవ్రతకు; కాక; తమ మొన= తమ సైన్యం; తెరలుచున్+ఉనికిన్+చేసియున్= పారిపోతుండటం వలన; అదియ= అదే; మెయిగాన్= సమ్మతంగా, ఆచార్యుండు+అ= ద్రోణాచార్యుడే; దొరలకున్= నాయకులకు; చెప్పి; సేనలన్= సైన్యాలను; తివియన్= మరల్చటానికి; నియోగించెన్= ఆజ్ఞాపించాడు; పాండవసైన్యంబులును= పాండవసేనలును; మరలెన్= వెనుదిరిగాయి; ఈ+విధంబునన్= ఇట్లా; ఉభయ సైన్యంబులు= కౌరవ పాండవ సేనలు రెండును; నిజస్కంధావారంబులకున్= తమ శిబిరాలకు; చను+అవసరంబునన్= వెళ్ళునప్పుడు; మన జనంబులు= కౌరవులవైపువారు; ద్రోణు= ద్రోణుడి; ప్రతిజ్ఞా భంగంబును= ప్రతిజ్ఞ వమ్ముకావటం; ఫల్గును= అర్జునుడి; పరాక్రమ స్ఫురణంబునున్= శౌర్యంయొక్క ప్రకాశం; అతని ఎడన్= అర్జునుడిపై; అచ్యుతునకున్+కల= శ్రీకృష్ణుడికి గల; సౌహార్ద విశేషంబునున్= ప్రత్యేకమైన స్నేహాన్ని; ఉగ్గడించుచున్= ప్రశంసిస్తూ; విన్ననై పోయిరి= వివర్ణులై పోయారు; వేగుటయున్= తెల్లవారగా; కయ్యంబునకున్= యుద్ధానికి; వెడలునప్పుడు= బయలుదేరేటప్పుడు; విషాద= దుఃఖం వలన; వివర్ణవదనుండు+అగుచున్ = పాలిపోయిన మొగం కలవాడౌతూ; నీ తనయుండు= దుర్యోధనుడు; ఎల్లయోధులు= వీరులందరు; వినన్= వినేటట్లు; కుంభసంభవునకున్= ద్రోణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అంతలో సూర్యుడు అస్తమించగా, సంధ్యారాగపు శోభకు ఎఱ్ఱదనం పెరిగే రక్తపు మడుగులలో తేలియాడే భూతబేతాళాలను, పీనుగులను మెక్కటంలో ఆసక్తిగల నక్కలను, మాంసం నమలటంలో సందడిగా ఉన్న రాపులుగులు, గ్రద్దలు మొదలైన పక్షిసమూహాలను చూచియు, పాండవసేన సమయోచితమైన యుద్ధ విరామానికి సిద్ధం కావటం తెలిసియు, మొదట అర్జునుడి తీవ్రతకు కాక, తమ సైన్యం పారిపోతూ ఉండటం వలన, అదియే సమ్మతమని ద్రోణుడే సేనానులకు చెప్పి సేనలను మరల్చటానికి ఆజ్ఞాపించాడు. పాండవ సైన్యాలు కూడా వెనుకకు మరలాయి. ఇట్లా రెండు సేనలు కూడా తమ శిబిరాలకు చేరే సమయంలో మన కౌరవ వర్గంవారు ద్రోణుడి ప్రతిజ్ఞ వమ్ముకావటం, అర్జునుడి శౌర్యం ప్రకాశించటం, అతడిపై శ్రీకృష్ణుడికి గల విశేషమైన ప్రేమను ప్రశంసిస్తూ వివర్ణులైపోయారు. మరునాడు ప్రాతఃకాలంలో యుద్ధానికి వెళ్ళేటప్పుడు ఖేదంతో వెల్లనైన మోముగల నీ కుమారుడు దుర్యోధనుడు వీరులంతా వినగా ద్రోణాచార్యుడితో ఇట్లా అన్నాడు.

మ. **'పెనుపారన్ వర మిచ్చి తట్లు గడిమిన్ భీమాగ్రజుం డాజిఁ గి**
ట్టినఁ బట్టం గడు నగ్గ మైన యెడఁ గ్రేడిం తెప్డు ని ట్లైనఁ జా
లని వాఁడందురు నిన్ను; నన్నుఁ గుటిలాలాపంబులన్ వెట్టిఁ జే
సిన నీ కైనది యేమి? యాశ్రితగుణశ్రేష్ఠుండు వంచించునే?' **388**

ప్రతిపదార్థం: పెనుపు+ఆరన్= ఔన్నత్యం మీరగా; అట్లు= ఆ విధంగా; వరము= వరం; ఇచ్చితి(వి)= ఇచ్చావు; భీమ+అగ్రజుండు= భీముడి అన్న అయిన ధర్మరాజు; ఆజిన్= యుద్ధంలో; కిట్టినన్= సమీపించగా, పట్టన్= బంధించటానికి; కడున్= మిక్కిలి; అగ్గమైన= అనుకూలించిన; ఎడన్= సందర్భంలో; ఎప్డున్= ఎప్పటికి; క్రేడింతు(వు)= ఉపేక్షిస్తావు; ఇట్లు+ఐనన్= ఈ విధంగా జరిగితే; నిన్నున్; చాలనివాఁడు= చేతగానివాడు; అందురు= అంటారు; నన్నున్= నన్ను; కుటిల+ఆలాపంబులన్= కపటపు మాటలతో; వెట్టిన్= అవివేకిని; చేసినన్= చేస్తే; నీకున్+ఐనది+ఏమి?= ఏమిలాభం?; ఆశ్రితగుణశ్రేష్ఠుండు= తన్ను ఆశ్రయించిన సుగుణములచే శ్రేష్ఠుడైనవాడు; వంచించునే?= మోసగిస్తాడా?

తాత్పర్యం: 'గొప్పతనం ప్రకటమయ్యేటట్లు ధర్మజుడిని బంధించి అప్పగిస్తానని మొదట వరమిచ్చావు. ధర్మజుడు యుద్ధంలో సమీపించగా, మిక్కిలి అనుకూలించినప్పుడేమో బంధించక ఉపేక్షిస్తావు. ఇట్లా అయితే నిన్ను అందరు అసమర్థు డంటారు. కపటపు మాటలతో నన్ను అవివేకుడిని చేస్తే నీ కేమి లాభం? ఆశ్రయించినవారిని ఉత్తము డెక్కడైనా మోసం చేస్తాడా?'

వ. అనిన విని గురుం డప్రీతుం డయ్యును గటకటం బడక యతనితో నిట్లనియె. 389

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విని; గురుండు= ద్రోణాచార్యుడు; అప్రీతుండు+అయ్యును= సంతోషింపని వాడయికూడ; కటకటంబడక= బాధపడక; అతనితోన్= దుర్యోధనుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని ద్రోణాచార్యుడు సంతోషించనివాడై కూడ, బాధపడక దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'నరుని విక్రమంబు నారాయణుని మహ ।త్త్వంబు నెఱిఁగి యెఱిఁగి తగునె యిట్లు
వలుక? ధర్మపుత్రుపైఁ జేయి వదలక । వారు రారె పెక్కు వరుస లధిప! 390

ప్రతిపదార్థం: అధిప!= దుర్యోధన మహారాజా!; నరుని విక్రమంబు= అర్జునుడి పరాక్రమం; నారాయణుని= శ్రీకృష్ణుడి; మహత్త్వంబున్= గొప్పతనం; ఎఱిఁగి, ఎఱిఁగి= బాగా తెలిసి కూడా; ఇట్లు= ఈ విధంగా; పలుకన్+తగునె?= పలుక వచ్చా?; ధర్మపుత్రుపైన్= ధర్మరాజుపై; చేయి వదలక= చేయి తీయకుండా; వారు= కృష్ణార్జునులు; పెక్కువరుసలు= పలుసార్లు; రారె?= రాలేదా?

తాత్పర్యం: దుర్యోధన మహారాజా! అర్జునుడి పరాక్రమం శ్రీకృష్ణుడి మహత్త్వం తెలిసి కూడా నీ విట్లా పలుకవచ్చా? కృష్ణార్జునులు ధర్మజుడిపై చేయితీయకుండా పలుసార్లు రాలేదా!

ఉ. ఎవ్వరి నెట్లు సేసెదనొ యేర్పడఁ జూడుము; నేఁడు పోరికిం
గవ్వడి రాక యుండఁ దొలఁగంగొని పోవఁగఁ జాలువారి నీ
వెవ్వరి నైనఁ బంపు; మిదిఁ యేటికి? నొండొక బుద్ధి సేసెదే?
నవ్వుచుఁ బల్కినన్ ధరణినాథ! యసత్యము గల్గ నేర్చునే?' 391

ప్రతిపదార్థం: ధరణినాథ!= దుర్యోధన మహారాజా!; ఎవ్వరిని= ఏ వీరుడిని; ఎట్లు+చేసెదనొ= ఏం చేస్తానో; ఏర్పడన్+చూడుము= తేటపడచూడుము; నేఁడు= ఇవ్వేళ; పోరికిన్= యుద్ధానికి; కవ్వడి= అర్జునుడు, రాక ఉండన్= రాకుండ; తొలఁగన్= తొలగేటట్లు; కొనిపోవఁగన్= తీసికొని పోవటానికి; చాలువారిన్= తగినవారిని; ఈవు= నీవు; ఎవ్వరినైనన్= ఎవరినైనా; పంపుము= పంపించుము; ఇది+ఏటికిన్?= ఇదంతా ఎందుకు?; ఒండొక బుద్ధి+చేసెదు?= వేరే విధంగా ఆలోచిస్తావు?; ఏ= నేను; నవ్వుచున్= నవ్వుతూ; పల్కినన్= మాట్లాడినా; అసత్యము= అసత్యం; కల్గనేర్చునే?= కలుగగలదా?

తాత్పర్యం: దుర్యోధన మహారాజా! ఎవరిని ఏం చేస్తానో బాగా చూడుము. నేడు యుద్ధానికి అర్జునుడు రాకుండా దూరం తొలగ దీసికొనిపోయే సమర్థుడిని ఎవ్వరినైనా పంపించుము. ఇదంతా ఎందుకు? వేరే విధంగా ఎందు కాలోచిస్తావు? నేను నవ్వుతూ మాట్లాడినా అందులో అసత్యం ఉంటుందా?'

వ. అనవుడు. 392

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు అట్లనగానే. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. **విని సంశప్తకు 'లేము దక్క నొరు లా విప్వచ్చు భంగించి బె**
ట్టనికిం బాపి యలంపనేర్పుగలరే!' యంచున్ వెసం బోయి పి
ల్చిన నప్పార్థుఁడు నుద్ధతిం జనుడు నక్షీణోగ్రశస్త్రాస్త్ర వ
ర్తన ఘోరంబగు సంగరం బచట రౌద్రస్ఫూర్తిమై జెల్లఁగన్. **393**

ప్రతిపదార్థం: విని; సంశప్తకులు= శపథం పూనిన సుశర్మాదులు; ఏము= మేము; తక్కన్= తప్ప; ఒరులు= ఇతరులు; ఆ విప్వచ్చున్= ఆ అర్జునుడిని; భంగించి= భంగపరిచి; బెట్టు= తీవ్రమైన; అనికిన్= యుద్ధానికి; పాపి= తొలగేటట్లు; అలంపన్= శ్రమపెట్టే; నేర్పు= నైపుణ్యం; కలరే?= కలవారున్నారా?; అంచున్= అంటూ; వెసన్= వెంటనే; పోయి పిల్చినన్= వెళ్ళి ఆహ్వానించగా; ఆ+పార్థుఁడు= ఆ అర్జునుడు; ఉద్ధతిన్= గర్వంతో; చనుడున్= పోగా; అక్షీణ= నశించని; ఉగ్ర= భయంకరమైన; శస్త్ర+అస్త్ర= ఖడ్గాదుల, ఆగ్నేయాస్త్రాదుల; వర్తన= ప్రసారంతో; ఘోరంబు+అగు= భయంకరమైన; సంగరంబు= యుద్ధం; అచటన్= ఆ స్థలంలో; రౌద్రస్ఫూర్తిమైన్= క్రోధం ప్రకాశించేటట్లు; చెల్లఁగన్= ప్రవర్తించగా.

తాత్పర్యం: ఇది విని సంశప్తకులు, 'మేము తప్ప ఇతరు లెవరైనా ఆ అర్జునుడిని భంగపరిచి, యుద్ధానికి తొలగేటట్లు చేసి శ్రమపెట్టే నేర్పు కలవారున్నారా?' అంటూ వెంటనే పోయి పిలువగా, అర్జునుడు గర్వంతో వెళ్ళగా; తరిగిపోని భయం గొలిపే శస్త్రాస్త్ర ప్రసారం వలన ఘోరమైన యుద్ధం రౌద్రం స్ఫురించేటట్లు ప్రవర్తిల్లింది.

వ. **ఇక్కడ భారద్వాజుండు పద్మవ్యూహంబు గావించినం గౌంతేయాగ్రజు ననుమతి నభిమన్యుం డయ్యొడ్డు భేదించి సొచ్చి, బృహద్బల లక్ష్మణ ప్రభృతులగు భూపతులను భూపకుమారులను బెక్కండ్రం బారిసమరి యనేక యోధ వీర విక్రమ సంకులంబునం జిక్కువడి యుక్కుమురిసినట్లు సమసిన మన మొనలు సెలంగుచుం బాండవ బలంబులు పొగులుచుం దమ తమ యునికిపట్లకుం జనియె నని సంజయుండు ధృతరాష్ట్రునకు సౌభద్రుండు వడుట సెప్పె ననిన విని నాఁటి కయ్యంబు కలరూపంతయు నేర్పడ నెఱింగింపు మనుటయు.** **394**

ప్రతిపదార్థం: ఇక్కడన్= కౌరవ పాండవులు యుద్ధం చేసే చోట; భారద్వాజుండు= ద్రోణుడు; పద్మవ్యూహంబు= పద్మం రూపంలో తీర్చిన మొగ్గరం; కావించినన్= పన్నగా; కౌంతేయ+అగ్రజుని= ధర్మజుడి; అనుమతిన్= ఆజ్ఞతో; అభిమన్యుండు; ఆ+ఒడ్డు= ఆ వ్యూహం; భేదించి= చీల్చి; బృహద్బల= బృహద్బలుడు; లక్ష్మణ= లక్ష్మణుడు; ప్రభృతులు+అగు= మొదలైన; భూపతులను= రాజులను; భూపకుమారులను= రాకుమారులను; పెక్కండ్రన్= చాలా మందిని; బారిసమరి= హింసించి; అనేక= పెక్కురు; యోధ= యుద్ధం చేసే; వీర= శూరుల; విక్రమ= పరాక్రమపు; సంకులంబునన్= దొమ్మిలో; చిక్కువడి= బాధపడి;ఉక్కుమురిసినట్లు= శౌర్యం ప్రకాశించేటట్లు; సమసిన= మరణించగా; మన మొనలు= మన సైన్యాలు, కౌరవసైన్యాలు; చెలంగుచున్= విజృంభిస్తూ; పాండవ బలంబులు= పాండవసేనలు; పొగులుచున్= బాధపడుతూ; తమ తమ= వారి వారి; ఉనికిపట్లకున్= స్థావరాలకు; చనియెన్= పోయాయి; అని; సంజయుండు; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రుడికి; సౌభద్రుండు= సుభద్రా పుత్రుడైన అభిమన్యుడు; పడుట= కూలటం; చెప్పెన్+అనిన= చెప్పాడనగా; విని; నాఁటి కయ్యంబు= ఆనాటి యుద్ధం; కలరూపు= జరిగింది; అంతయున్= అంతా; ఏర్పడన్+ఎఱింగింపుము= వివరంగా తెలియజేయుము; అనుటయున్= అనగా.

తాత్పర్యం: కౌరవ పక్షాన ద్రోణుడు పద్మవ్యూహం పన్నగా ధర్మరాజు ఆజ్ఞానుసారం అభిమన్యుడు ఆ వ్యూహాన్ని భేదించి బృహద్బలుడు, లక్ష్మణుడు మున్నగు రాజులను, రాజకుమారులను అనేకులను హింసించి, అనేక వీరులను సంకుల సమరంలో చిక్కుపడి పరాక్రమం ప్రకాశించేటట్లు కూలిపోగా, మన సైన్యాలు మురుస్తూ, పాండవ సేనలు విషాదపడుతూ తమ తమ శిబిరాలకు పోయాయి. సంజయుడు ధృతరాష్ట్రుడికి అభిమన్యుడు మరణించటాన్ని చెప్పాడనగా విని, నాటి యుద్ధ వివరాలను చక్కగా చెప్పుమనగా. (ద్వితీయాశ్వాసంలోని వచనంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. సాత్త్వవతేయ వాఙ్మయవిశాల గృహస్ఫురిత ప్రదీపితా!
ప్రత్త్వయ గోచరా! విహృతి భగ్న నిశాచర! శాంత బోధసం
పత్త్వవినాభవన్మహిమ భాసుర! సంభృత భూసురాళి సాం
గత్త్వ! వివిక్త యుక్త జనకౌశల భావిత! దేవసేవితా! 395

ప్రతిపదార్థం: సాత్త్యవతేయ= సత్యవతికి పుత్రుడైన వ్యాసమహర్షియొక్క; వాఙ్మయ= ఉత్తర మీమాంస, పురాణేతిహాసాలు మున్నగు వాఙ్మయ మనే; విశాల= విపులమైన; గృహ= ఇంటియందు; స్ఫురిత= వెలిగే; ప్రదీపితా!= ఉత్తమమైన దీపంవంటివాడా!; ప్రత్త్యయ గోచరా!= జ్ఞానం చేత తెలిసేవాడా!; విహృతి భగ్న నిశాచర!= విహారమాత్రం చేతనే- లీలద్వారానే నశింపజేయబడిన రక్కసులు గలవాడా!; శాంత= శాంతమును; బోధ= జ్ఞానరూపమును అగు; సంపత్తి+అవినా భవత్= సంపదను ఎడబాయనట్టి; మహిమ= గొప్పదనంతో; భాసుర!= ప్రకాశించేవాడా!; సంభృత భూసురాళి సాంగత్త్య!= బ్రాహ్మణసంఘం యొక్క సాంగత్యం కలవాడా!; వివిక్త యుక్త= ఏకాంతప్రదేశంలో యోగనిష్ఠులై ఉన్న; జనకౌశల= జనుల జ్ఞానంచేత; భావిత= భావించబడేవాడా!; దేవసేవితా!= ఇంద్రాది దేవతలచేత కొలువబడేవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వ్యాసమహర్షిచేత రచించబడిన బ్రహ్మమీమాంసయందు, పురాణేతిహాసాది వాఙ్మయంలోను నీవే ప్రకాశిస్తున్నావు. కేవల జ్ఞానంతోనే తెలియవస్తున్నావు. ధర్మధ్వంసకులైన రాక్షసులను భగ్నం చేయటం నీకు విలాసం మాత్రమే. శాంతి, జ్ఞానాలు అనే నీ నిజస్వరూపంతో వెలుగువాడవు. నీవు జ్ఞానాత్ములు, ధర్మాత్ములు అయిన బ్రాహ్మణులతో ఉంటావు. ఏకాంతంలో సమాధియందుండే యోగులే నిన్ను భావించగలరు. నీవు ఇంద్రాది దేవతలచేత సేవించబడేవాడవు.

విశేషం: "పద్యమునఁ దృతీయ పాదమునందలి 'సంపత్తి+అవినాభవత్ - సంపత్త్వావినాభవత్ అను పదమున సంపత్తి శబ్దము తకారద్వయయుక్త మగుటచేఁ బ్రాసమునందు తకారద్వయ యకారములు ప్రాసవర్ణముగా నున్నట్లు స్పష్టము. దానినిబట్టి తక్కిన పాదములయందలి ప్రాసవర్ణములు గూడా తకార ద్వయ యకారములతో నుండవలయును, కాని 'సాత్యవతేయ, ప్రత్యయ, సాంగత్య శబ్దములు సహజముగ ఏక తకార యకారయుతములే గాని తకారద్వయ యుక్తములు గావు. అట్లయినచోఁ బ్రాసము ఉపపన్నమగునా అను సందేహము గలుగవచ్చును. కాని ఆ శబ్దములయందలి తకారమునకు "అనచిచ" (8-4-47- పాణిని) సూత్రముచే ద్విత్వము రాఁగా, తకార ద్వయము గలుగును గావునఁ బ్రాసదోషము సంభవింపనేరదు." - తిక్కయజ్వ హరి హరనాథ తత్త్వము - శ్రీ ఓరుగంటి నీలకంఠ శాస్త్రిగారు.

క. వేదశిరోమణి చరణా! । నా దాంత స్ఫారకరణ నైష్ఠికతరణా!
భేద రహిత ప్రకారా! । వాద విదూరా! విరించివర్య విహారా! 396

ప్రతిపదార్థం: వేద శిరోమణి చరణా!= వేదాలకు శిరస్సులైన ఉపనిషత్తులకు అలంకారాలైన పాదాలుగలవాడా!; నాదాంత+స్ఫారకరణ!= నాదానికి (విశ్వాన్ని సృజించే) అంతఃశక్తిని కలిగించే వాడా; నైష్ఠికతరణా!= వ్రతనిష్ఠయందుండే వారిని తరింపజేసేవాడా!; భేదరహిత ప్రకారా!= భేదంలేని సాదృశ్యము కలవాడా!; వాదవిదూరా!= వివాదాలకు అందనివాడా!; విరించివర్య విహారా!= సృష్ట్యాదులను కావించే బ్రహ్మాదులగు ఉత్తమ దేవతలందు వెలసిన విహారం కలవాడా!

తాత్పర్యం: ఉపనిషత్తులు ప్రధానంగా నిన్నే తెలుపుతున్నవి. నాదానికి జగత్తును సృజించేశక్తి నీ వల్లనే కలుగుతున్నది. వ్రతనిష్ఠులను నీవే తరింపజేస్తున్నావు. నీవంటిది మరొకటి లేకపోవడం వల్ల నీకు నీవే సాటి. వాక్కు మున్నగు ఇంద్రియాలకు అందనివాడవు. నీ క్రీడా రూపమైన విశ్వాన్ని సృజించటం వంటివి మూర్తిత్రయంలో వెలయుచున్నవి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మాలిని:

అనుపమ హితవిద్యావ్యక్త! యోగానురక్తా!
దనుజ మథనలీలా! స్తవ్యశాంతానుభావ్యా!
జననమరణ దుఃఖోత్సారి! సర్వోపకారీ!
సనకముఖయతీంద్రాసన్న! నిత్యప్రసన్నా! **397**

ప్రతిపదార్థం: అనుపమ= సాటిలేనంత; హిత= హితాన్ని కలుగజేసే; విద్యా= వేదవిద్యచేత; వ్యక్త!= స్పష్టమయ్యేవాడా!; యోగ+అనురక్తా!= యోగవిద్యయందు అనురాగం కలవాడా!; దనుజ= రాక్షసులను; మథన= సంహరించటమే; లీలా!= విలాసంగాకలవాడా!; స్తవ్య= స్తుతించదగిన; శాంత= శాంతరసం చేతనే; అనుభవ్యా!= అనుభవించదగినవాడా!; జనన= పుట్టుక; మరణ= చావుల రూపమైన; దుఃఖ= సంసార దుఃఖాన్ని; ఉత్సారి!= పోగొట్టువాడా!; సర్వ= స్వపరభేదం లేక విశ్వానికంతకు; ఉపకారీ!= ఉపకారం చేసేవాడా!; సనక ముఖయతీంద్ర= సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతాది జ్ఞానులకు; ఆసన్న!= దగ్గరివాడా!; నిత్యప్రసన్నా!= ఎల్లప్పుడు అనుగ్రహం కలవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! హితాన్ని బోధించే వేదాలందే నీవు వ్యక్తమౌతుంటావు. కర్మజ్ఞానయోగాలు రెండు కూడ నీకు ప్రియమైనవి. రాక్షససంహారం నీకు విలాసమాత్రం. శాంతాత్ములే నిన్ను అనుభవిస్తారు. మోక్షమొసగి భక్తుల జనన మరణ దుఃఖాలను పోగొట్టి లోకోపకారం చేస్తుంటావు. సనకాది జ్ఞానులకు ఎల్లప్పుడు సన్నిహితుడవై నిత్య ప్రసన్నుడవు అవుతావు.

గద్యము:

ఇది శ్రీమ దుభయకవి మిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున ద్రోణపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈ గ్రంథభాగం; శ్రీమత్= మంగళకరుడైన; ఉభయ కవిమిత్త్ర= సంస్కృతాంధ్ర కవులకు స్నేహితుడైన (సూర్యుడైన)వాడూ; కొమ్మన+అమాత్యపుత్త్ర= కొమ్మనామాత్యుడి కుమారుడూ; బుధ+ఆరాధన విరాజి= పండితులు చేసే పూజల చేత ప్రకాశించేవాడు; పండితులను పూజించటంచేత ప్రకాశించేవాడూ; తిక్కన సోమయాజి= సోమయాజి అయిన తిక్కనచేత; ప్రణీతంబు+అయిన= రచించబడిన; శ్రీ మహాభారతంబునన్= మంగళకరమైన మహాభారతంలో; ద్రోణపర్వంబునన్= ద్రోణపర్వంలో; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసం.

తాత్పర్యం: ఇంతవరకు ఉభయకవిమిత్రుడు, కొమ్మనామాత్యపుత్రుడు, పండితులను పూజించుటచేత ప్రశస్తిపొందినవాడు (పండితుల చేత గౌరవింపబడుటచేత ప్రకాశించేవాడూ) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలోని ద్రోణపర్వంలో ప్రథమాశ్వాసం.

ద్రోణపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్రమహాభారతము

ద్రోణపర్వము - ద్వితీయాశ్వాసము

క. శ్రీకర! భక్తాంభోధిసు । ధాకర! చక్ర త్రిశూల ధారణ రక్షో
భీకర! నిర్భరతర కరు । ణాకర దృగ్దీప్తి నికర! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీకర!= మోక్షమును సంపదను కలిగించేవాడా!; భక్త+అంభోధి= భక్తులు అనే సముద్రానికి; సుధాకర!= చంద్రుడా!; చక్ర= సుదర్శనం అనే చక్రాన్ని; త్రిశూల= మూడు మొనలు ఉండే ఆయుధాన్ని; ధారణ= ధరించటంచేత; రక్షః= రాక్షసులకు; భీకర!= భయాన్ని కలిగించేవాడా!; నిర్భరతర+కరుణా+ఆకర+దృక్+దీప్తి+నికర!= మిక్కిలి ఎక్కువైన దయకు నెలవైన కన్నులయొక్క, కాంతుల మొత్తం కలవాడా!; హరిహరనాథా!= హరియొక్క, హరుడియొక్క, స్వరూపం కల ప్రభువా!

తాత్పర్యం: అద్వైతమూర్తి వైన ఓ హరిహరనాథా! నీవు సంపత్కరుడవు. మోక్ష ప్రదుడవు. భక్తులు అనే సముద్రానికి పుట్టిన చంద్రుడవు. సుదర్శనం అనే చక్రాన్ని, త్రిశూలం అనే ఆయుధాన్ని ధరించి రాక్షసులకు భయం కలిగించే వాడవు. మిక్కిలి అతిశయించిన దయకు నెలవైన కన్నుల కాంతుల సమూహం కలవాడవు.

విశేషం: హరిగా మోక్షాన్ని, హరుడుగా ఐశ్వర్యాన్ని ఇచ్చేవాడా! "ఐశ్వర్య మీశ్వరా దిచ్ఛే న్మోక్షమిచ్ఛే భజ్జనార్దనాత్" అని స్మృతి. విష్ణు శివ భక్తులనే సముద్రానికి హరిహరనాథుడు చంద్రుడైనవాడు. అంటే చంద్రుడు సముద్రాన్ని ఉప్పొంగచేసే విధంగా హరిహరనాథుడు భక్తులనే సముద్రాన్ని ఉప్పొంగ చేస్తాడని భావం. అలంకారం రూపకం. శ్రీకర, సుధాకర, భీకర, నికర - లఘు పూర్వక రేఫం అన్ని సమాసాల చివర ఉంది. కాబట్టి అంత్యప్రాసమనే శబ్దాలంకారం. 'చక్రత్రిశూల.... హరిహర' - చక్రం హరిదీ, త్రిశూలం హరుడిదీ అని క్రమంగా అన్వయించుకోవాలి కాబట్టి యథాసంఖ్యాలంకారం.

అమృతమయుడూ ఆనందప్రదుడూ అనే భావాన్ని 'సుధాకర' శబ్దంలో తిక్కన ధ్వనింపజేశాడు.

భక్తుల విషయంలో ఎంత చల్లగా ఆనందామృతాన్ని వర్షిస్తాడో, శత్రువుల విషయంలో అంత భీకరంగా వాళ్ళను తుదముట్టించటానికి చక్రం, త్రిశూలం వంటి ఆయుధాలను హరిహరనాథుడు ధరించాడని తిక్కన యుద్ధఘట్టం ప్రాముఖ్యాన్ని 'చక్ర... భీకర' అనే సంబోధనలో సూచించాడు.

అనివార్యం అయినప్పుడే దుష్టులను శిక్షించటానికి ఆయుధాలు ప్రయోగిస్తాడు కాని స్వతస్సిద్ధంగా భగవంతుడు కరుణామయుడు. ఆయన ఎల్లప్పుడూ దయ కలిగిన చూపుల కాంతులను ప్రసరిస్తూనే ఉంటాడు. అది ఆయన విధి. దయానిధి అయిన హరిహరనాథుడి తత్త్వం చివరి సంబోధనలో ఎంతో చక్కగా నిరూపించబడింది.

'కరుణాకర' అనే ప్రయోగాన్ని కేవలం భగవంతుడి దయాదృష్టి పరంగానే కాకుండా, ప్రకృత కథలోని అభిమన్యుడి వధకు అన్వయిస్తే ఇది కరుణరస స్వరూపం కూడా అవుతుంది. అపుడు ద్వితీయాశ్వాసంలోని ప్రధాన వృత్తాంతం 'నిర్భరతర కరుణాకరం' . అభిమన్యుని మరణానికి ధర్మరాజాదుల కళ్ళు, పాఠకుల కళ్ళూ, కన్నీళ్ళ కడకళ్ళు అయ్యాయి.

ఈ ఆశ్వాసంలో హరిహరుల ప్రసక్తికూడా అప్రయత్నంగా కథా సందర్భంలో చోటు చేసుకొన్నది. అర్జునుడు కైలాసానికి పోయి శివుడి కరుణ పొందినట్లు కల గనటం, శ్రీకృష్ణుడు దయాళువై సుభద్రను ఊరడించి, దారుకుడితో అర్జునుడి ప్రతిజ్ఞా

వాక్యాలను ప్రస్తావించటం, పుత్రశోకంతో కుమిలే ధర్మరాజును ఓదార్చటానికి 'వ్యాసో నారాయణో హరిః'అని ప్రస్తుతించబడే కరుణామూర్తి అయిన వేదవ్యాసుడు వచ్చి ఎన్నో ఉపకథలను చెప్పి ఉపశమింపచేయటం ఈ ఆశ్వాసంలో ప్రధానాంశాలు. వీరరస పరంగా హరిహరుల ఆయుధాల ప్రసక్తి, కరుణరసపరంగా అభిమన్యుడి మరణానంతర విశేషాలూ ఈ ప్రారంభపద్యంలో సూచించ బడ్డాయి.

ద్రోణుని మూఁడవనాఁటి యుద్ధము (సం. 7-32-25)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె నట్లు దనమనుమండు మృతిం బొందుట విని ధృతరాష్ట్రుండు. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా! ప్రభూ!; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= జనమేజయ మహారాజుకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అట్లు= ఆ విధంగా; తన మనుమండు= తన మనమడైన అభిమన్యుడు; మృతిన్= మరణాన్ని; పొందుట= పొందటం; విని; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: ప్రభూ! హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయ మహారాజుతో ఇట్లా అన్నాడు. ' ఆ విధంగా తన మనమడైన అభిమన్యుడు మరణించా డని విన్న ధృతరాష్ట్రుడు.

ఉ. 'చిత్తము వొక్కెడుం బురుషసింహునిఁ, బౌత్త్రకులాగ్రగణ్యు, న
త్యుత్తమతేజు, భూరిగుణు, నొప్పెడు మెత్తని మేనివాని, నె
ట్లుత్తల పెట్టిరో పలువు రుగ్రమనస్కులు గూడి యక్కటా!
యత్తెఱఁ గెల్లఁ దేటపడునట్టులుగా వివరించి చెప్పుమా!' 3

ప్రతిపదార్థం: అక్కటా!= అయ్యో!; పలువురు= చాలామంది; ఉగ్రమనస్కులు= క్రూరమైన హృదయం కలవాళ్ళు అనగా దయలేని వాళ్ళు; కూడి= ఒకటిగా గుమిగూడి; పురుష సింహునిన్= పురుషులలో శ్రేష్ఠుడిని; పౌత్రకుల+అగ్రగణ్యున్= మనుమల మొత్తంలో మొట్టమొదటగా లెక్కించదగిన వాడిని; అతి+ఉత్తమతేజున్= మిక్కిలి శ్రేష్ఠమైన పరాక్రమం కలిగినవాడిని; భూరిగుణున్= గొప్పగుణాలు కలవాడిని; ఒప్పెడు= అందగించే; మెత్తని మేనివానిన్= మృదువైన శరీరం కలవాడిని, అభిమన్యుడిని; ఎట్లు= ఏ విధంగా; ఉత్తలపెట్టిరో?= బాధపెట్టారో?; చిత్తము= నా మనస్సు; పొక్కెడున్= మిక్కిలి బాధపడుతూ ఉన్నది; అత్తెఱఁగు+ఎల్లన్= (ఆ+తెఱఁగు) ఆ విధం అంతా; తేటపడునట్టులుగాన్= తేటతెల్లమయ్యేటట్లు(స్పష్టంగా); వివరించి= విశదపరచి; చెప్పుమా= తెలుపుము.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు సంజయుడిని చూచి 'అయ్యో! క్రూర మనస్సు కలిగిన చాలామంది, అందరూ ఒక్కటిగా గుమిగూడి పురుషశ్రేష్ఠుడూ, నా మనుమలు అందరిలో మొట్టమొదట లెక్కించదగినవాడూ, మిక్కిలి శ్రేష్ఠమైన పరాక్రమం కలవాడూ, గొప్ప గుణాలతో ఒప్పేవాడూ, అందమైన అతి సుకుమార శరీరం కలవాడూ అయిన అభిమన్యుడిని ఏ విధంగా బాధపెట్టారో కదా! ఆ విషయం అంతా నాకు సవిస్తరంగా స్పష్టంగా విశదీకరించి చెప్పుము. నా మనస్సు చాలా బాధపడుతూ ఉన్నది' అన్నాడు.

విశేషం: ఈ పద్యంలో అతి ముఖ్య విషయం 'చిత్తం పొక్కటం'. అందుకే తిక్కన 'చిత్తము వొక్కెడున్' అనే ఎత్తుగడతో ఉత్పలమాలా వృత్తాన్ని ఎన్నుకొన్నాడు. సుకుమారమూ సుందరమూ అయిన భావాన్ని ఎంతో సున్నితంగా తేటపడేటట్లు చెప్పటానికి ఉత్పలం సర్వసమర్థం అయిందని శిల్పకళా మర్మజ్ఞుడైన తిక్కన ఇక్కడ చక్కగా నిరూపించాడు. 'ఒప్పెడు మెత్తని మేనివాని', 'ఎట్లుత్తలపెట్టిరో?' 'అత్తెఱఁగెల్ల' అనే అచ్చ తెలుగు పదాల కూర్పులో అభిమన్యుడి అందచందాలూ, గుణ గణాలూ వ్యంజింపబడ్డాయి. ద్విరుక్తతకార ప్రాసం విషయాన్ని ఒత్తి చెప్పటానికి ఉద్దిష్టమైనది. ఐదు విశేషగుణాలలో అభిమన్యుడి ఉదాత్తగుణాలూ, అతని తేజస్సూ, ఓజస్సూ సౌకుమార్యం ఉట్టంకించబడ్డాయి.

పాండవులంటే సరిపడని ధృతరాష్ట్రుడికి అర్జునుడి కుమారుడిపై అంత అభిమానం కలగటానికి కారణం ఏమై ఉంటుందని మనకు ఆశ్చర్యం కలుగవచ్చు. ఆ సందేహం అభిమన్యుడికి ప్రయోగించిన ఐదు విశేషణాల వలననే నివృత్తి అవుతుంది. మానవుడికి సహజమైన జాలిగుణం అనికానీ, మొసలి కన్నీరు కారుస్తున్నాడని కానీ అనుకోవాలి. తరువాతి (4) గద్యంలో ధృతరాష్ట్రుడికి ప్రయోగించిన విశేషణం 'మానవపతి' కావటంచేత మానవతా గుణమనే అనుకోవాలి.

వ. **అనుటయు నమ్మానవపతికి సూతసూనుం డిట్లను: నట్లు భరద్వాజుండు పద్మవ్యూహంబు సంఘటించు నెడ వివిధ దేశంబుల రాజులు దళంబులును, రాజకుమారులు గేసరంబులును, గర్ణ దుశ్శాసన బహుళ సేనా పరివృతుండయి కురువిభుండు గర్ణికయునుంగా నభేద్యభంగి నొనర్చిన నది వలయాకారం బగుటం జేసి చక్రవ్యూహంబు ననంజను, నమ్మొగ్గరంబు మొగంబునం దాను దర్పంబు మెఱయ నెఱయం బొలిచి నిలిచె; మఱియు వలయు నెడలకు లావై జయద్రథ గురుపుత్త్ర కృప శకుని కృతవర్మ భూరిశ్రవ శ్శల శల్యులును, నీ కొడుకులును, మనుమలును రక్తమాల్యానులేపనాంబరాభరణంబులు శోభిల్ల నిలిచి; రంత భీమసేన ప్రముఖంబైన పాండవబలంబులు గదియ నడచె; నందు సాత్యకి ధృష్టద్యుమ్న కుంతిభోజులును, జేకితానక్షత్ర ధర్మక్షత్ర వర్మ్యలును, ధృష్టకేతు నకుల సహదేవులును, నుత్తమౌజ శ్శిఖండి యుధామన్యులును ఘటోత్కచ విరాట ద్రుపదులును, ద్రౌపదేయ కేకయ సృంజయ సముదయంబును నుక్కునం దఱిమి యక్కుంభసంభవుం దలపడిన నవ్వి యవ్వీరుండు వాఁడి మిగులు బలుతూపులం దన వేఁడిమి సూపిన నమ్మేటి విలుకాని మొగంబున నిలువ నోర్వక యా సైనిక ప్రకరంబు దిరుగుడువడిన వెక్కసంబును వెఱఁగుపాటును వెల్లఁదనంబునుం గదురఁ గౌంతేయాగ్రజుం డూరకుండి, కర్ణికార కేతు స్ఫీతుండును, నుత్సాహ శౌర్యసంపద్దుర్నిరీక్ష్యుండును నగు సౌభద్రుం గనుంగొని, 'వీఁడు దక్కనొరు లీ దృఢవ్యూహంబు భేదింపంజాల' రని మనంబున నిశ్చయించి యక్కుమారు నుద్దేశించి.** **4**

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధృతరాష్ట్రుడు అనగానే; ఆ మానవపతికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; సూతసూనుండు= సంజయుడు ; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; అట్లు= ఆ రీతిగా; భరద్వాజుండు= భరద్వాజుడి కొడుకైన ద్రోణాచార్యుడు; పద్మ వ్యూహంబు= పద్మం మాదిరిగా సైన్యాన్ని పన్నటం; సంఘటించు+ఎడన్= కూర్చే సందర్భంలో; వివిధ దేశంబుల రాజులు= నానా దేశాల నుండి వచ్చిన రాజులు; దళంబులును= రేకులుగాను; రాజకుమారులు= రాకుమారులు; కేసరంబులును= కింజల్కములుగాను; కర్ణ+దుశ్శాసన+బహుళ+సేనా+పరివృతుండు+అయి= కర్ణుడు, దుశ్శాసనుడు, అనేకములైన సైన్యాలచేత చుట్టబడ్డవాడై; కురువిభుండు= దుర్యోధనుడు; కర్ణికయునున్+కాన్= తామర మధ్యలో ఉండే దుద్దుగాను కాగా; అభేద్యభంగిన్= భేదించటానికి వీలుకాని విధంగా; ఒనర్చినన్= చేయగా; అది= ఆ సైన్యం; వలయ+ఆకారంబు= గుండ్రమైన ఆకారం కలిగింది; అగుటన్+చేసి= కావటం చేత; చక్రవ్యూహంబును= చక్రం ఆకారం కలిగిన వ్యూహం అని కూడా; అనన్+చనున్= అనటానికి చెల్లుతుంది; ఆ+మొగ్గరంబు+ మొగంబునన్= అట్టి ఆ పద్మవ్యూహం యొక్క ముఖభాగంలో; తాను= ద్రోణుడు; దర్పంబు+ మెఱయన్= గర్వం అతిశయించగా; నెఱయన్= నిండుదనం చెలరేగగా; పొలిచి= ప్రత్యక్షంగా కనబడి; స్థిరమై నిలిచెన్= గట్టిగా నిలిచాడు; మఱియున్= ఇంకా; వలయు+ఎడలకున్= తగిన చోట్లకు; లావు+ఐ= బలమై; జయద్రథ+ గురుపుత్త్ర+ కృప+శకుని+ కృతవర్మ+భూరిశ్రవః+శల+శల్యులును= సైంధవుడు (ధృతరాష్ట్రుడి అల్లుడు, దుస్సల మగడు) అశ్వత్థామ (ద్రోణుడి కొడుకు); కృపాచార్యుడు (ద్రోణాచార్యుల బావమఱది; ద్రోణుడికి మునుపు కౌరవులకు అస్త్రగురువు); శకుని= గాంధార దేశపురాజు (గాంధారికి తోబుట్టువు); కృతవర్మ (హృదికుడి కొడుకు - ఇతడు యదు వంశపురాజు); భూరిశ్రవుడు= సోమదత్తుడి రెండవ కుమారుడు; శలుడు= సోమదత్తుడి మూడవ కొడుకు; శల్యుఁడు= మద్రదేశపురాజు, మాద్రికి తోబుట్టువు; నీ కొడుకులును= దుర్యోధన దుశ్శాసనులతో పాటు తక్కిన నీఅందరు కుమారులున్నూ; మనుమలును= మనుమళ్ళు అందరున్నూ; రక్తమాల్య+ అనులేపన+అంబర+ఆభరణంబులు= ఎర్రని దండలు,

గంధపు పూతలూ, వస్త్రాలూ, భూషణాలూ; శోభిల్లన్= ప్రకాశిస్తూ ఉండగా; (పొలిచి) నిలిచిరి= (ఒప్పుగా) ఎదుట నిలిచారు; అంతన్= ఆ సమయంలో; భీమసేన ప్రముఖంబు+ఐన= భీముడు ముఖ్యంగా ఉండేది అయిన; పాండవబలంబును= పాండవసైన్యం కూడా; కదియన్= మార్కొనగా లేక సమీపించునట్లుగా; నడచెన్= నడిచింది; అందున్= ఆ పాండవ సైన్యంలో; సాత్యకి= సత్యకుడి కొడుకు (ఇతడికే శైనేయుడు, యుయుధానుడూ అనే పేర్లు కూడా ఉన్నాయి); ధృష్టద్యుమ్న= ద్రుపదుని కొడుకు (ఇతడు అగ్ని అంశంలో పుట్టినవాడు; నకుల= నకులుడు; సహదేవులును= సహదేవుడు అనే ముగ్గురున్నూ; ఉత్తమౌజః= ఉత్తమౌజుడు (ధృష్టద్యుమ్నుడి తమ్ముడు); శిఖండి= శిఖండి (ధృష్టద్యుమ్నుడి అన్న); యుధామన్యులును= యుధామన్యుడు (ధృష్టద్యుమ్నుడి తమ్ముడు); అను ముప్వురున్నూ; ఘటోత్కచ= ఘటోత్కచుడు (భీమసేనుడికి హిడింబయందు పుట్టిన కుమారుడు); విరాట= విరటుడు (విరాట దేశపురాజు); ద్రుపదులును= పాంచాల దేశపురాజు ద్రుపదుడున్నూ; ద్రౌపదేయ= ద్రౌపది కుమారులు; కేకయ= కేకయుడు (శిబి చక్రవర్తి నలుగురు కుమారులలో ఒకడు); సృంజయ= సృంజయుడు అనే రాజుయొక్క; సముదయంబును= సమూహమునూ; ఉక్కునన్= గర్వంతో; తఱిమి= వెంబడించి; ఆ+కుంభసంభవున్= ఆ ద్రోణుడితో; తలపడినన్= డీకొనగా; ఆ+వీరుండు= వీరుడైన ఆ ద్రోణుడు; నవ్వి= గేలిగా నవ్వి; వాఁడి+మిగులు= మిక్కిలి పదునుగల; బలు= బలమైన; తూపులన్= బాణాలచేత; తన వేఁడిమి= తన శౌర్యాన్ని; చూపినన్= ప్రకటించగా; ఆ+మేటి విలుకాని మొగంబునన్= ఆ గొప్ప ధనుస్సును ధరించిన అతడి ఎదుట; నిలువన్+ఓర్వక= ఎదిరించి నిలవటానికి ఓపలేక; ఆ+సైనిక+ప్రకరంబు= ఆ సైనికుల మొత్తం; తిరుగుడు పడినన్= వెనుకకు మళ్ళగా; వెక్కసంబును= సహించలేకపోవటం; వెఱఁగుపాటును= ఆశ్చర్యపడటం; వెల్లఁదనంబునున్= వెలవెలపోవటమున్నూ; కదురన్= కలుగగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతీ కుమారులలో పెద్దవాడైన ధర్మరాజు; కర్ణికార+కేతు+స్ఫీతుండును= కొండగోగు చెట్టు గుర్తుగా గల జెండా చేత; అతిశయించిన వాడున్నూ; ఉత్సాహ శౌర్య సంపద్+దుర్నిరీక్షుండును= ఉత్సాహం, శూరత్వం అనే సంపద చేత చూడటానికి వీలుకాని వాడున్నూ; అగు= అయిన; సౌభద్రున్= సుభద్రాపుత్రుడైన అభిమన్యుడిని; కనుంగొని= చూచి; వీఁడు+తక్కన్= ఇతడు తప్ప; ఒరులు= ఇతరులు; ఈ+దృఢ వ్యూహంబు= ఈ గట్టిమైనను; భేదింపన్+చాలరు= భేదించటానికి (చీల్చటం చేత పగులగొట్టటానికి) సమర్థులు కారు; అని మనమునన్+నిశ్చయించి= అని మనస్సులో నిర్ణయానికి వచ్చి; ఆ+కుమారున్= ఆ అభిమన్యు కుమారుడిని; ఉద్దేశించి= తలచి లేదా భావించి.

తాత్పర్యం: 'పలువురు ఒక్క బాలుడిని చుట్టుముట్టి ఎట్లా బాధపెట్టారో చెప్పుము' అని ధృతరాష్ట్రుడు సంజయుడిని అడగగానే అతడు ఇట్లా అన్నాడు: ద్రోణాచార్యుడు వలయాకారంగా పద్మ(చక్ర) వ్యూహాన్ని పన్నాడు. అందులో రేకులు వివిధ దేశాలనుంచి వచ్చిన రాజులు, కింజల్కాలు రాకుమారులు, తామర నడిమిదిమ్మె కర్ణ దుశ్శాసనాదులతో కూడుకొన్న దుర్యోధనుడు. ఎవ్వరికీ భేదించటానికి వీలుకాని ఆ మొగ్గరం ముఖభాగంలో ద్రోణుడు మహాదర్పంతో మెరుస్తూ నిలిచాడు. ఎక్కడెక్కడ తగు సైన్యాన్ని ఏర్పాటు చేయాలో దానికి అనుగుణంగా సైంధవుడు, అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ, శకుని, భూరిశ్రవుడు, శలుడు, శల్యుడు - తక్కిన ధృతరాష్ట్రుడి కుమారులూ, మనుమళ్ళూ అందరూ అన్ని హంగులతో అలంకరించుకొని యుద్ధానికి సంసిద్ధు లయ్యారు.

ఇక పాండవసైన్యంలో భీమసేనుడు ప్రముఖపాత్ర వహించాడు. ఆయనకు అండదండగా సాత్యకి, ధృష్టద్యుమ్న, కుంతిభోజులూ, చేకితాన క్షత్రధర్మ క్షత్రవర్మలూ, ధృష్టకేతు నకుల సహదేవులూ, ఉత్తమౌజుడూ, శిఖండీ, యుధామన్యువూ, ఘటోత్కచుడు, విరటుడూ, ద్రుపదుడూ, ద్రౌపదేయులు, కేకయుడూ, సృంజయుడూ మహాపరాక్రమంతో ద్రోణుడిని మార్కొన్నారు. అతడు చిరునవ్వుతో పాండవులపై తీవ్రబాణాలు ప్రయోగించాడు. దానితో పాండవసైన్యం సంభ్రమాశ్చర్యాలతో వెలవెల్లనై వెనుకకు మళ్ళింది. అప్పుడు ధర్మరాజు ఈ మొగ్గరాన్ని ప్రవేశించటానికి సాటిలేని ధైర్య శౌర్య సాహసాలూ, సముత్కటమైన ఉత్సాహమూ ఉన్న సమర్థుడు ఒక్క సౌభద్రుడే అని నిశ్చయించుకొని, ఆ అభిమన్యుడిని ఉద్దేశించి ఇట్లా అన్నాడు:

విశేషం: పద్మాకారంలో సైన్యాన్ని ఒకచోట చేర్చి, ఎక్కడెక్కడ ఏయే యోధులను కట్టుదిట్టంగా ఎట్లా ఉంచాలో అట్లా ఉంచి, ద్రోణుడు ఏర్పరిచిన వ్యూహం సమరసన్నాహం శత్రువులకు దురవగాహమైందనీ, అటువంటి దృఢ వ్యూహాన్ని అవలీలగా చొచ్చుకొని పోగలిగే సామర్థ్యం ఒక్క సౌభద్రుడికి మాత్రమే ఉన్నదని ధర్మరాజు గ్రహించటం ఈ వచనభాగంలోని విశేషం. అభిమన్యుడి శక్తి సామర్థ్యాలను ఉట్టంకిస్తూ ప్రయోగించిన విశేషణాలు అటు వీరరస స్ఫూర్తినీ, ఇటు కావ్యకళా సౌందర్యాన్నీ సముజ్జ్వలంగా ప్రకాశింప జేస్తున్నాయి.

సీ. **'ఈ యొడ్డు భేదింప నే మెవ్వరము నేర। మర్జునుండును నీవు నచ్యుతుండుఁ**
బ్రద్యుమ్నుఁడును దక్కఁ ; బార్థుండు మనల ను। ల్లసమాడకుండ నీ లావు మెఱపి
భేదించి మా కెల్లఁ బ్రియ మొనర్పు కు। మార!' యనవుడు నతఁ డాననాబ్జ మలర
'దీని ముఖంబు భేదించు తెఱంగు నా। కెఱిఁగించె మా తండ్రి; యేను దెఱపి

ఆ. **సేయనేర్తుఁ, జొచ్చి చించి చెండాడెద। మూఁక లెల్లఁ జుట్టు ముట్టినపుడు**
వెడలు నట్టి వెరవు విన ; దాని కేమి? । నా చొచ్చు నేర్పు బలువుఁ జూడు మధిప!' 5

ప్రతిపదార్థం: కుమార!= పుత్రా! అభిమన్యూ!; ఈ ఒడ్డున్= ఈ వ్యూహాన్ని; భేదింపన్= చీల్చటానికి (పగులకొట్టటానికి); అర్జునుండును= మీ తండ్రియైన అర్జునుడున్నూ; నీవున్= నీవున్నూ; అచ్యుతుండున్= శ్రీకృష్ణుడున్నూ; ప్రద్యుమ్నుఁడును= శ్రీకృష్ణుడి కుమారుడైన ప్రద్యుమ్నుడున్నూ; తక్కన్= తప్ప; ఏము= మేము - అంటే ధర్మరాజాదులం; ఎవ్వరమున్= ఎవ్వరమున్నూ; నేరము= సమర్థులం కాము (ఆ కాలంలో పద్మవ్యూహాన్ని అర్జునుడు, అతడి కొడుకు అభిమన్యుడూ, శ్రీకృష్ణుడు, అతడి కొడుకు ప్రద్యుమ్నుడూ తప్ప మరెవ్వరూ పాండవ శిబిరంలో భేదించే వాళ్ళు లేరని తెలుస్తూ ఉన్నది); పార్థుండు= పృథా పుత్రుడైన అర్జునుడు; మనలన్= ప్రస్తుతం పాండవ శిబిరంలో ఉండే మనలను అందరినీ; ఉల్లసము+ఆడకుండన్= మనస్సు నొచ్చేటట్లు గేలిచేస్తూ పొడిచి పొడిచి మాటాడకుండా; నీలావున్= నీ బలాన్ని; మెఱపి= ప్రకటించి; భేదించి= పద్మవ్యూహాన్ని పగులగొట్టి; మాకున్+ఎల్లన్= మాకు అందరికీ; ప్రియము+ఒనర్పు= మేలు కలిగించుము; అనవుడున్= అని ధర్మరాజు అనగానే; అతఁడు= అభిమన్యుడు; ఆనన+అబ్జము= ముఖపద్మం; అలరన్= వికసించగా; మా తండ్రి= నా జనకుడైన అర్జునుడు; దీని+ముఖంబున్= ఈ వ్యూహం యొక్క ముఖాన్ని; భేదించు తెఱంగున్= పగులగొట్టే తీరును; నాకున్= నాకు; ఎఱిఁగించెన్= తెలిపాడు; ఏను= నేను; చొచ్చి= ప్రవేశించి; తెఱపి చేయన్= అవకాశం కలిగించటానికి లేదా సందు చేసికొనటానికి అంటే వ్యూహాన్ని పగులగొట్టి(ఛేదించ) టానికి; నేర్తున్= చాలి ఉన్నాను; మూఁకలు+ఎల్లన్= సేనలు అన్నీ; చుట్టుముట్టినపుడు= చుట్టూ నన్ను పొదివిన సమయంలో; చించి= చీల్చి, భేదించి; చెండాడెదన్= హతమారుస్తాను; వెడలునట్టి వెరవు= వ్యూహం నుండి బయటకు వచ్చే ఉపాయం; వినన్= వినలేదు; దాని కేమి?= అంత మాత్రాని కేమి?; అట్లా తెలియకపోయినంత మాత్రాన ఏమౌతుందిలే; అధిప!= రాజా! (ధర్మరాజా!); నా చొచ్చు నేర్పున్= వ్యూహాన్ని భేదించి లోపలికి పోయే నా చాకచక్యాన్ని; బలువున్= అతిశయాన్ని; చూడుము= చూడుము.

తాత్పర్యం: 'ఈ మొగ్గరాన్ని భేదించటానికి నీవూ, మీ తండ్రి అర్జునుడూ, కృష్ణుడూ, ఆయన కుమారుడు ప్రద్యుమ్నుడూ తప్ప మే మెవ్వరమూ చాలం. నీ తండ్రి మమ్మలను గేలిచేసి మనస్సు గాయపడేటట్లు మాటాడకుండా నీ బలాన్ని ప్రకటించి, మాకు అందరికీ ప్రీతి కలిగించుము'. ఆ మాటలు వినగానే అభిమన్యుడి ముఖపద్మం విప్పారింది. అప్పు డతడు 'ఈ వ్యూహ ముఖాన్ని భేదించే పద్ధతి మాత్రమే నా తండ్రి నాకు తెలిపాడు. కాబట్టి ఆ అవకాశాన్ని ఇప్పుడు వినియోగించుకొంటాను. వ్యూహాన్ని భేదించి ఇదిగో ఇప్పుడే లోనికి ప్రవేశిస్తాను. నన్ను చుట్టుముట్టిన సేనల్ని హతమారుస్తాను. అయితే నాకు పద్మవ్యూహం నుండి వెలుపలికి వచ్చే ఉపాయం తెలియదు. తెలియనంత మాత్రాన ఏమౌతుంది? దాని కేమి గాని, ఇప్పుడు నేను వ్యూహాన్ని భేదించి లోపలికి చొచ్చుకొని పోయే నా నేర్పు, అతిశయం ఎలాంటివో చూడండి' అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: దేశీయచ్ఛందస్సులో అచ్చ తెలుగు పదాల కూర్పు నేర్పుతో ఆంధ్రావళికి మోదాన్ని కలిగించటం తిక్కన ధ్యేయం. ఈ పద్యంలో భేదించు, ముఖము, ఆననాబ్జము, ప్రియము అనే తత్సమపదాలు, వ్యక్తుల పేర్లు, సంబోధనలు తప్ప తక్కినదంతా తిక్కన నుడికారపు సొంపునకు తారకాణ. విషయమంతా చెప్పి చివరలో సంబోధనలు వాడటం ఈ పద్యంలోని మరొక విశేషం. కుమార! అధిప! అనే సంబోధనాంత శబ్దాలలో రణధర్మానికి సంబంధించిన నియమం సూచితం.

వ. అనిన విని ధర్మనందనుండు ధనంజయ నందనున కి ట్లనియె. 6

ప్రతిపదార్థం: అనినన్= అని అభిమన్యుడు చెప్పగా; విని= ఆకర్ణించి; ధర్మనందనుండు= యమధర్మరాజు కొడుకైన ధర్మరాజు; ధనంజయ నందనునకున్= అర్జునుడి కుమారుడైన అభిమన్యుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా అభిమన్యుడు చెప్పిన మాటలు విన్న ధర్మరాజు తాను మళ్ళీ అభిమన్యుడితో ఇట్లా అంటున్నాడు:

విశేషం: వచన రచనలో సమత అనే లక్షణానికి ఈ వాక్యం చక్కని నిదర్శనం. పద్య రచనలో మధ్య మధ్య వచనం వ్రాయకూడదని ఒకనాటి తిక్కన అభిప్రాయం. రచనలో పరిపక్వత, మానసిక పరిపూర్ణత నెలకొన్న తర్వాత పూర్వాభిప్రాయానికి పూర్తిగా స్వస్తి పలికి నన్నయ మాదిరిగనే 'పద్యముల గద్యములన్ రచించెదన్ గృతుల్' అని భారతాంధ్రీకరణం గావించాడు. ప్రస్తుత వాక్యంలో ధర్మనందనుడు అంటే యమధర్మరాజు కుమారుడని మాత్రమే కాకుండా ధర్మంచేత ఆనందాన్ని కలిగించేవాడని భావం.

క. తెఱపిగొని నీవు సొచ్చినఁ । బిఱుఁదన చొచ్చెదము రిపులు పెల్లగిలఁగ నం
దఱమును మా కిది యెంతయు । నుఱునట్టి వరంబు దీని నొసఁగుము పుత్త్రా! 7

ప్రతిపదార్థం: పుత్త్రా!= కుమారా! (అభిమన్యు సంబోధనం); నీవు; తెఱపిగొని= ఎడం చేసికొని; చొచ్చినన్= వ్యూహంలో ప్రవేశిస్తే; అందఱమును= మేము అందరమూ; రిపులు= శత్రువులు; పెల్లగిలఁగన్= తొలగిపోయే విధంగా; పిఱుఁదనన్+అ= వెంటనే లేక వెనుకనే; చొచ్చెదము= ప్రవేశిస్తాము; ఇది= ఇట్లా మెలగటం; మాకున్= మాకు; ఎంతయున్= మిక్కిలి; ఉఱు+అట్టి= తగినటువంటి వరంబు= వరం; దీనిన్= ఈ వరాన్ని; ఒసఁగుము= ఇమ్ము.

తాత్పర్యం: కుమారా! అభిమన్యూ! నీవు ఎడం చేసికొని వ్యూహంలోకి చొరబడితే మేము అందరమూ కూడా నీ వెనుకనే శత్రువులు తొలగిపోయేటట్లు వస్తాము. ఇది మాకు తగినట్టి శ్రేష్ఠమైన వరం. ఇట్టి వరం నీవు మాకు ఇవ్వాలి.

విశేషం: తిక్కన కంద పద్య రచనలో సిద్ధహస్తుడు. ఎంతటి భావాన్నైనా కందంలో అందంగా పొదిగించే శిల్పకళా పారమ్యంలో ఆయనకు ఆయనే సాటి. 'ఉఱు' అనే అచ్చతెలుగు పదాన్ని 'తగు' అనే అర్థంలో తగు స్థానంలోనే తిక్కన ప్రయోగించాడు.

చ. అనవుడు భీముఁ డిట్టులను 'నర్జుననందన! నీవు ముంద ఱి
మ్మొన యొకయింత సించిన నమోఘరయంబునఁ బార్షతుండు నే
నును ద్రుపదుండు సత్యకతనూభవుఁడున్ విరటుండు నంత నం
త నడరి చింతు మెల్లెడలు దారుణవిక్రమజృంభణంబునన్.' 8

ప్రతిపదార్థం: అనవుడున్= అని ధర్మరాజు చెప్పగానే; భీముఁడు= భీమసేనుడు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అన్నాడు; అర్జుననందన!= ఓ అభిమన్యూ!; నీవు; ముందఱ= ముందుగా; ఈ+మొనన్= ఈ పద్మ(చక్ర) వ్యూహాన్ని; ఒక ఇంత= కొంచెం; చించినన్= భేదిస్తే; అమోఘరయంబునన్= అడ్డుకోలేని వేగంతో; పార్షతుండున్= ద్రుపదుడున్నూ; సత్యక తనూభవుఁడున్= సాత్యకియున్నూ (ఇతడు వృష్ణివంశంలో పుట్టినవాడు); విరటుండున్= విరాట మహారాజున్నూ; అంతన్+అంతన్= అంతంతలో-

అంటే కొంతదూరంలోనే; అడరి= విజృంభించి; దారుణ= భయంకరమైన; విక్రమజృంభణంబునన్= పరాక్రమంయొక్క అతిశయంతో; ఎల్లెడలు= అన్ని వైపులూ (ప్రక్కలూ); చింతుము= చీల్చివేస్తాం (వ్రక్కలిస్తాం).

తాత్పర్యం: ఆ విధంగా ధర్మరాజు చెప్పిన వెంటనే భీమసేనుడు ఇట్లా అన్నాడు: 'అభిమన్యూ! నీవు ముందుగా వ్యూహాన్ని కొంచెం భేదిస్తే వెంటనే ఎవ్వరూ అడ్డుకోలేని వేగంతో నేనూ, ద్రుపదుడూ, సాత్యకీ, విరాటమహారాజూ అతి సమీపంలోనే విజృంభించి భయంకరమైన పరాక్రమస్ఫూర్తితో అన్ని దిక్కులూ (ప్రక్కలూ) వ్రక్కలిస్తాం.'

విశేషం: ఇది చంపకమాలావృత్తం. ఇందులోని పదాల కూర్పులో సన్నివేశానికి అనుగుణంగా మహావేగం స్ఫురిస్తూ ఉన్నది. 'అర్జున నందన!' అని సంబోధించటం సాభిప్రాయం. సంబోధనలోనే కాకుండా మొత్తం పద్యంలోని నకారాలు ద్రుతగతికి ఎంతో ఉపకరించాయి. పద్యంలో పదపదమూ తునిగిన ట్లున్నప్పటికీ 'అమోఘరయం' తో సాగినట్లు రచించటం తిక్కన సందర్భశుద్ధి గల ఔచిత్యాన్ని, భావ కళాసౌందర్యాన్ని పట్టి యిస్తున్నాయి. ఎక్కడి కక్కడ ముక్కలు ముక్కలుగా పదసముదాయాన్ని నిబంధించటంలో కూడా సైన్యాన్ని వ్రక్కలు వ్రక్కలుగా అన్ని ప్రక్కలా చీల్చి చెండాడటం అనే ప్రధాన ప్రయోజనం సాధించబడింది.

వ. అనిన విని యభిమన్యుం డాతని యాననం బాలోకించి. 9

ప్రతిపదార్థం: అనినన్= అని భీముడు అనగా; విని= సావధానంగా విని; అభిమన్యుండు= అర్జునుడి కొడుకైన అభిమన్యుడు; ఆతని= భీమసేనుడి; ఆననంబు= ముఖం; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: భీముడు చెప్పిన మాటలు విని అభిమన్యుడు అతడి ముఖాన్ని ఆసక్తికరంగా చూచాడు.

విశేషం: తర్వాతి పద్యానికి అనుబంధ ప్రాయంగా రచించబడ్డ ఈ వచనంలో అకారం మళ్ళీ మళ్ళీ వచ్చేటట్లు శబ్దాలంకార సౌందర్యాన్ని ప్రకటించటమే కాకుండా అందులో ఒక విధమైన ఆవేగాన్ని కూడా తిక్కన ధ్వనింపజేశాడు.

చ. 'నను విను కీచకాంతక! మనంబున ద్రోణుఁడు మెచ్చఁ జొచ్చి య
మ్మొనఁ గలఁగింప కిట్లు కురుముఖ్యుఁడు ధర్మసుతుండు గారవిం
చిన జతనంబు నిష్ఫలము సేయుదునే? నరుఁడున్ సుభద్రయున్
దనయుని గాంచి సంతసము దాల్చుట యంతయు రిత్తఁబుత్తునే? 10

ప్రతిపదార్థం: కీచకాంతకా!= భీమసేనా; ననున్+విను= నన్ను ఉద్దేశించి వినుము (అనగా నామాట ఆలకించుము); ద్రోణుఁడు= ప్రస్తుతం పద్మవ్యూహాన్ని పన్నిన సర్వసైన్యాధ్యక్షుడైన ద్రోణాచార్యుడు; మనంబునన్= మనస్సులో; మెచ్చన్= పొగడగా; ఆ+మొనన్+చొచ్చి= ఆ పద్మవ్యూహాన్ని ప్రవేశించి; కలఁగింపక= కలత కలిగించకుండా; ఇట్లు= ఈ విధంగా; కురుముఖ్యుఁడు= కురువంశంలో ప్రధానమైన వాడగు ధర్మరాజు; గారవించిన= గౌరవించినటువంటి; జతనంబున్= ప్రయత్నాన్ని; నిష్ఫలము+చేయుదునే?= వ్యర్థం చేస్తానా?; నరుఁడున్= తండ్రి అయిన అర్జునుడూ; సుభద్రయున్= తల్లి అయిన సుభద్రా; తనయునిన్= కుమారుడిని; కాంచి= చూచి; సంతసము తాల్చుట+అంతయున్= సంతోషాన్ని పొందటం అంతా; రిత్తపుత్తునే?= వ్యర్థం గావిస్తానా?

తాత్పర్యం: భీమసేనా! వినుము. ద్రోణుడు మెచ్చేవిధంగా వ్యూహాన్ని భేదించి లోపలికి ప్రవేశిస్తాను. ధర్మరాజు మన్ననతో తలపెట్టిన ప్రయత్నాన్ని వమ్ము చేస్తానా? తల్లిదండ్రులు నన్ను చూసి సంతోషించటాన్ని వ్యర్థం చేయను.

విశేషం: కీచకాంతకా! అనే ప్రయోగంలో ప్రస్తుతం తన ప్రయత్నం ఫలించటం అనే స్ఫురణ అభివ్యక్తం. కీచకుడి పీచమణచినట్లు-ప్రస్తుతం పద్మవ్యూహాన్ని చీల్చివేస్తానని ధ్వని. పాండవపక్షంలో కురువంశానికి చెందిన ప్రధానవ్యక్తి ధర్మరాజు. ఆయనే అభిమన్యుడిని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యూహం భేదించే ప్రయత్నానికి పురికొల్పాడు. కాబట్టి అది వ్యర్థం కాదు. అట్లాగే తల్లిదండ్రులకు ఆనందాన్ని కలిగించలేనివాడు ఏ విధంగా నందనుడు అవుతాడు? అందువలన తల్లిదండ్రులు సంతోషించేటట్లు తన ప్రయత్నం ఫలవంతమౌతుంది అన్నాడు.

చ. ఇదె యొక పిన్నవాఁ డడరి యెక్కుడు మూఁకల క్రందుఁ దోలెడున్
గదుపుల వెల్చు గోపకుని కైవడి నంచు జనుల్ నుతింపఁ జే
సెద; విని మామ ప్రీతి విలసిల్లఁగఁ దండ్రియు సంతసిల్ల బె
ట్టిదుఁ డగు కౌరవేంద్రునకు డెప్పర మయ్యెడు భంగిఁ బేర్చెదన్. 11

ప్రతిపదార్థం: కదుపులన్= ఆవులమందలను; వెల్చు= వెడలించే(తోలే); గోపకుని కైవడిన్= గొల్లవాడివలె; ఇదె= ఇదిగో; ఒక పిన్నవాఁడు= ఒక బాలుడు; అడరి= విజృంభించి; ఎక్కుడుమూఁకల+క్రందున్= మిక్కుటమైన సేనలసందడిని; తోలెడున్= తరుముతూ ఉన్నాడు; అంచున్= అని అంటూ; జనుల్= ప్రజలు; నుతింపన్= పొగిడేటట్లు; చేసెదన్= చేస్తాను; విని= నేను చేసిన పనిని గురించి విని; మామ= మేనమామ అయిన శ్రీకృష్ణుడు; ప్రీతిన్+విలసిల్లఁగన్= సంతోషం లేక ప్రేమతో ఒప్పగా (ప్రీతిని పొందగా); తండ్రియున్= తండ్రి అయిన అర్జునుడున్నూ; సంతసిల్లన్= సంతోషించగా; బెట్టిదుఁడు+అగు= క్రూరుడూ, ఉద్ధతుడూ అయిన; కౌరవ+ఇంద్రునకున్= కౌరవులలో శ్రేష్ఠుడైన ఆ దుర్యోధనుడికి; డెప్పరము+అయ్యెడు+భంగిన్= దుస్సహం అయ్యే విధంగా; పేర్చెదన్= విజృంభిస్తాను.

తాత్పర్యం: 'గొల్లవాడు ఆవులమందలను అదలించి తోలేవిధంగా ఒక బాలుడు సందడిగా ఉండే మిక్కుటమైన సైన్యాన్ని తరుముతూ ఉన్నా' డంటూ ప్రజలు పొగడేటట్లు పరాక్రమిస్తాను. ఇది విని మేనమామ శ్రీకృష్ణుడూ, నా తండ్రీ ఎంతో సంతోషిస్తారు. క్రూరుడైన దుర్యోధనుడికి దుస్సహం అనిపించే విధంగా విజృంభిస్తాను.

విశేషం: గోవులను మళ్ళించటం అనేది ఇక్కడ ఉపమానంగా ప్రయోగించబడింది. కాని భారత యుద్ధం ప్రారంభం కాకముందు ఆవుల మందలను వెనక్కు తోలటం ఒక మహావీరకార్యంగా నిరూపించబడింది. ముఖ్యంగా ఉత్తరగోగ్రహణ సందర్భంలో అర్జునుడు ప్రదర్శించిన అవక్రపరాక్రమం ప్రజలకూ, రాజుకూ అందరికీ ఆనందాన్ని కలిగించింది. దుర్యోధనుడికి ఆనాటి సంఘటన దుస్సహంగా పరిణమించింది. సేనలను కదుపులతో పోల్చటం వలన అర్జునుడి ఆనాటి పరాక్రమాన్ని అభిమన్యుడిలో ఆరోపించినట్లయింది. గోపకులలో అతి ముఖ్యుడు శ్రీకృష్ణుడు. ఆయనకు ఆలమందలను తోలటం ఒక సరదా. అది ఆయనకు ఎంతో ప్రీతికరం. అట్లాగే అభిమన్యుడున్నూ ఎంతో సరదాగా, అవలీలగా ఆలమందలను తోలినట్లు సైన్యాన్ని తోలాడని చెప్పటం వలన పూర్వ విషయాన్ని స్ఫురణకు తెచ్చినట్లయింది. 'ఇదె' అను ఎత్తుగడలో పద్యాన్ని ప్రారంభించి అది ఏ విధంగా పలువురికి సంభ్రమాశ్చర్య సంతోషాలను కలిగించిందో తిక్కన ఎంతో నాటకీయంగా సన్నివేశాన్ని మన కళ్ళముందు సాక్షాత్కరింపజేశాడు.

క. అనిన విని ధర్మసూనుఁడు । దను ప్రీతిం జూచి 'నీదు ధైర్యము శౌర్యం
బును బలమును గీర్తియు వ । ర్ధన మొందెడు' మనుడుఁ బార్థతనయుం డెలమిన్. 12

ప్రతిపదార్థం: అనినన్= అని అభిమన్యుడు చెప్పగా; ధర్మసూనుఁడు= ధర్మతనయుడు; విని= ఆకర్ణించి; ప్రీతిన్= ప్రేమతో; తనున్= తనను అనగా అభిమన్యుడిని; చూచి; నీదు+ధైర్యమున్= నీ యొక్క ధీరత్వమూ; శౌర్యంబును= శూరత్వమూ; బలమును= సత్తువా; కీర్తియున్= యశస్సూ; వర్ధనము+ఒందెడున్= అభివృద్ధి పొందుగాక; అనుడున్= అని అనిన వెంటనే; పార్థతనయుండు= అభిమన్యుడు; ఎలమిన్= ప్రీతితో.

తాత్పర్యం: అభిమన్యుడి మాటలు విని ధర్మరాజు ఎంతో ప్రీతితో అతడిని చూచి 'నీ ధీరత్వమూ, శూరత్వమూ, బలమూ, యశస్సూ వర్ధిల్లుగాక!' అని ఆశీర్వదించాడు. అటుపై అభిమన్యుడు ఎంతో సంతోషంతో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మహాపరాక్రమశాలికి ఏయే గుణాలు ఉండాలో అవి అభిమన్యుడిలో ఉన్నాయి అని చెబుతూ ఆ విశిష్ట లక్షణాలతో ఇంకా వర్ధిల్ల వలసిందని దీవించటం వీరుడిని మరికొంత ప్రేరేపించటమే కాకుండా సంతోషభరితుడిని కూడా చేస్తుంది అనే విషయం ఈ పద్యంలో వెల్లడించబడింది. 'వర్ధన మయ్యెడున్' అనటంలో అభిమన్యుడి భవిష్యన్మరణ సూచనను అవితథవాక్కు అయిన ధర్మరాజునోట పలికించాడు తిక్కన. 'వర్ధన' శబ్దమునకు వృద్ధిపొందుట అని ఒక అర్థం. ఖండనము, ఛేదనము అనే అర్థాలు కూడా ఉన్నాయి. 'వృధ్' ధాతువునకు ఖండించుట ఛేదించుట అనే అర్థాలు కూడా ఉన్నాయి. అందుచేత 'వర్ధన' శబ్దం ఇక్కడ శ్లిష్టమై ప్రకరణానుగుణమైనది.

వ. తన సారథిఁ గనుంగొని 'మన యరదంబు ద్రోణానీకంబుపైఁ బఱపు' మనుటయు నా సుమిత్రుం డర్జున పుత్త్రున కి ట్లనియె. 13

ప్రతిపదార్థం: తన+సారథిన్= (అభిమన్యుడు) తన రథాన్ని నడిపే అతడిని; కనుంగొని= చూచి; మన+అరదంబున్= మన రథాన్ని; ద్రోణ+అనీకంబు+పైన్= ద్రోణాచార్యుడి సైన్యం మీదికి; పఱపుము= తోలుము (పరువెత్తేటట్లు చేయుము); అనుటయున్= అని చెప్పగా; ఆ+సుమిత్రుండు= సుమిత్రుడు అను పేరుగల ఆ సారథి; అర్జునపుత్త్రునకున్= అభిమన్యుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అభిమన్యుడు తన సారథి అయిన సుమిత్రుడిని చూచి 'మన రథాన్ని ద్రోణసైన్యం మీదికి దూకించుము' అన్నాడు. అప్పుడు ఆ రథసారధి అభిమన్యుడితో ఈ విధంగా అన్నాడు:

తే. 'బాలుఁడవు నీవు; కుంభజ ప్రముఖ సైన్య । పతులు ప్రౌఢులు; పెక్కులు బవరములకుఁ
జొచ్చి యెఱుఁగని నీచేతఁ జచ్చువారు । గారు; బహువిధ సమర కర్కశులు వారు.' 14

ప్రతిపదార్థం: నీవు; బాలుఁడవు= పసివాడవు; కుంభజ+ప్రముఖ+సైన్యపతులు= ద్రోణాచార్యుడు మొదలైన సేనాధిపతులు; ప్రౌఢులు= ప్రౌఢి కలిగినవాళ్ళు - గొప్ప నేర్పరులు; పెక్కులు+బవరములకున్= అనేక యుద్ధాలలో; చొచ్చి= ప్రవేశించి; ఎఱుఁగని= తెలియని అనగా ప్రవేశించని (అనుభవం లేని); నీచేతన్= నీచేతిలో; చచ్చువారు కారు= చచ్చేవారు కారు అంటే చంపబడరు; వారు= ఆ ద్రోణాదులు; బహువిధ సమర కర్కశులు= అనేక విధాలైన యుద్ధాలలో కఠినులు (ఎన్నో యుద్ధాలలో పాల్గొని బాగా అనుభవాన్ని సంపాదించి ఆరితేరి ఉన్నారు అని భావం).

తాత్పర్యం: ' నీవా? బాలుడివి. ద్రోణాదులా? మహాప్రౌఢులు. నీచేత వాళ్ళు చావరు. నీకు యుద్ధపరిజ్ఞానం చాలదు. ఎక్కువ యుద్ధాలలో నీవు ఇంతవరకూ పాల్గొనలేదు. వాళ్ళు అనేక యుద్ధాలలో పాల్గొని ఆరితేరి ఉన్నారు.'

విశేషం: బాలుడివి. తెలియనివాడవు అని అభిమన్యుడిని గురించి చెప్పేటప్పుడు అచ్చ తెలుగు పదాలను ప్రయోగిస్తూ ప్రౌఢులైన ద్రోణాదులను తెలిపే సందర్భంలో సంస్కృత సమాసాలను తిక్కన ప్రయోగించటం ఎంతో ఔచిత్యంగా ఉన్నది. విషయాన్ని విడమరచి తేటతెల్లంగా చెప్పటంలో తేటగీతి పద్యం యొక్క సామంజస్యాన్ని తిక్కన చక్కగా ఇందులో నిరూపించాడు. సారథిచేత ఇట్లా అనిపించటం ఒక అపశకునంగా భావించవచ్చును.

చ. అనవుడు నల్లనవ్వి యతఁ డాతని కిట్లను; 'దేవయుక్తుఁడై
యనికి బలారివచ్చినఁ బురారి గణంబులుఁ దానుఁ బన్నినం
గినిసి కడంగి క్రీడియును గృష్ణుఁడుఁ దాఁకిన నే జయింతు మా
ర్కొని యనుచుండుదున్; సరకు గొందునె ద్రోణునిఁ దోడియోధులన్?' 15

ప్రతిపదార్థం: అనవుడున్= అని సుమిత్రుడు చెప్పగా; అల్ల= మందంగా, మెల్లగా; అతండు= ఆ అభిమన్యుడు; నవ్వి; ఆతనికిన్= సారథికి; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; బల+అరి= బలుడు అనే రాక్షసుడికి శత్రువైన ఇంద్రుడు; దేవయుక్తుఁడు+ఐ= దేవతలతో కూడుకొన్నవాడై; అనికిన్= యుద్ధానికి; వచ్చినన్= దండెత్తి వచ్చినప్పటికీ; పురారి= శివుడు (త్రిపురాసురులకు శత్రువు); గణంబులున్= ప్రమథ గణాలూ; తానున్= తానున్నూ; పన్నినన్= ఎదుర్కొన్నప్పటికీ; కినిసి= కోపించి; కడంగి= పూనుకొని; క్రీడియును= అర్జునుడున్నూ; కృష్ణుఁడున్= శ్రీకృష్ణుడున్నూ; తాఁకినన్= ఎదుర్కొనినప్పటికీ; ఏన్= నేను; మార్కొని= ఎదిరించి; జయింతున్= జయిస్తాను; అనుచున్+ఉండుదున్= అంటూ ఉంటాను; ద్రోణునిన్= ద్రోణాచార్యుడిని; తోడి యోధులన్= అతడితో కూడి ఉండే యుద్ధవీరులను; సరకు గొందునె?= లక్ష్యపెడతానా? (లెక్కపెడతానా?).

తాత్పర్యం: సుమిత్రుడు ఆ విధంగా అనగానే అభిమన్యుడు మెల్లగా నవ్వి సారథితో ఇట్లా అన్నాడు: 'దేవతలతో కలిసి ఆ దేవేంద్రుడు దండెత్తి వచ్చినా, ఈశ్వరుడు ప్రమథ గణాలతో కలిసికొని వచ్చి పోరాడినా, కోపించి ఆ కృష్ణార్జునులే నన్ను ఎదుర్కొన్నా, నేను జయించి తీరుతాను. ఇక ఆ ద్రోణుడూ, అతడి పరివారమూ నా కొక లెక్కా?'

విశేషం: బలారి, పురారి వాళ్ళ వాళ్ళ సైన్యాలతో దండెత్తటం ఒక ఎత్తు. కానీ తన తండ్రీ, మేనమామా దండెత్తి వచ్చినా జయిస్తాను అనటం విశేషం. ఇక్కడ తిక్కన 'కినిసి, కడంగి' - క్రీడీ, శ్రీకృష్ణుడూ ఎదిరించి రావటాన్ని సమర్థమైన అచ్చ తెలుగు అసమాపక క్రియాపదాలలో ఎంతో ఔచిత్యంగా కూర్చాడు.

వ. **అని పలికి వాని యాలాపంబు నాలంబుసేసి యభిమన్యుండు పెలుచం దఱిమిన వాఁ డనుమానించుచు మన సైన్యంబునకు సమ్ముఖంబుగాఁ దేరు నడపుటయు, వారి సేనయుం దోడన కడంగుటయుం గనుంగొని భారద్వాజ ప్రముఖ యోధు లొండొరులకుం దల మిగిలి యేచి యెదుర్కొని పెలుచ నిలిచిన, సంకుల సమరం బయ్యెఁ; నట్టియెడ.** **16**

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలికి= చెప్పి; వాని= ఆ సారథియొక్క; ఆలాపంబున్= మాటను; ఆలంబు+చేసి= ఉపేక్షచేసి (ఒప్పరికించి లేదా నిర్లక్ష్యం చేసి); అభిమన్యుండు= అభిమన్యుడు; పెలుచన్= ఆగ్రహముతో (ఆటోపంతో); తఱిమినన్= వెంబడించి పరుగెత్తగా; (తోలుకొనిపోగా); వాఁడు= ఆ సారథి; అనుమానించుచున్= సందేహిస్తూ; మన సైన్యంబునకున్= మన సేనకు; సమ్ముఖంబుగాన్= ఎదురుగా; తేరు= రథం; నడపుటయున్= నడిపించటమున్నూ; వారి+సేనయున్= వాళ్ళ సైన్యం కూడా; తోడన= వెంటనే; కడంగుటయున్= పూనుకోవటమున్నూ; కనుంగొని= చూచి; భారద్వాజ ప్రముఖయోధులు= ద్రోణుడు మొదలుగాగల యుద్ధవీరులు; ఒండొరులకున్= ఒకరి కొకరు; తలమిగిలి= మీరి; ఏచి= అతిశయించి; ఎదుర్కొని= తలపడి; పెలుచన్= ఆధిక్యంతో (క్రౌర్యంతో); నిలిచినన్= నిలువగా; సంకుల సమరంబు= దొమ్మియుద్ధం; అయ్యెన్= జరిగింది; అట్టి+ఎడన్= అటువంటి సమయంలో.

తాత్పర్యం: సుమిత్రుడి మాటలను అభిమన్యుడు లెక్కచేయకుండా ఆటోపంతో వెంబడించగా, రథసారథి అనుమానిస్తూ మన సైన్యానికి ఎదురుగా రథాన్ని నడిపాడు. వాళ్ళ సైన్యం కూడా వెంటనే పూనుకొనగా ద్రోణాదులు ఒకరిని మించి ఒకరు అతిశయిస్తూ ఎదుర్కొన్నారు. ఈ విధంగా దొమ్మియుద్ధం జరిగింది. అప్పుడు - (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అభిమన్యుఁడు పద్మవ్యూహంబు భేదించుకొని చొచ్చుట (సం. 7-35-12)

ఆ. మెఱుఁగు మెఱచినట్లు మెఱయంగ నరదంబు। కర్ణికార కేతు కాంతి వెలుఁగ
నంపగముల గురుని నలయించి కడచి యిం। ద్రజుని కొడుకు మొగ్గరంబు సొచ్చె. 17

ప్రతిపదార్థం: అరదంబు= రథం; మెఱుఁగు మెఱచినట్లు= మెరుపు మెరిసిన విధంగా; మెఱయంగన్= ప్రకాశించగా; కర్ణికార, కేతు, కాంతి= కొండగోగు గుర్తుగల జెండాయొక్క వెలుగు; వెలుఁగన్= మెఱసిపోగా; అంపగములన్= బాణాల గుంపులచేత; గురునిన్= ద్రోణాచార్యుడిని; అలయించి= అలసట పొందేటట్లు చేసి; కడచి= దాటి; ఇంద్రజుని కొడుకు= అర్జునుడి కుమారుడైన అభిమన్యుడు; మొగ్గరంబున్= వ్యూహాన్ని; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: రథం మెరుపు మెరిసినట్లు ముందుకు దూకింది. రథంపై ఉండే కొండగోగు గుర్తు గల జెండా ప్రకాశించింది. అభిమన్యుడు బాణ పరంపరలతో ద్రోణాచార్యుడిని అలతపెట్టి పద్మవ్యూహంలో ప్రవేశించాడు.

విశేషం: ఈ ఆటవెలది దేశీయమైన ఛందస్సు. అందువలన ఎక్కువగా అచ్చ తెలుగు పదాలే ఉంటే అందం అని తిక్కన ఊహించినట్లుంది. 'కర్ణికారకేతు కాంతి'; 'గురుని', 'ఇంద్రజు' అనే పదాలు తప్ప పద్యమంతా తేట తెనుగు ఇంపుసొంపులతో నింపబడింది. బాలుడైన అభిమన్యుడిలో ధైర్యశౌర్యాల గుణాలు ఉన్నా, మార్దవం అనేది ఎక్కడికి పోతుంది? ఈ మార్దవమే రచనలో కూడా చోటు చేసుకొనింది. 'ఇంద్రజుని' అనే పదంలోని విరుపు తళుక్కుమనే మెరుపులోని ఝటితి స్ఫూర్తిని సూచిస్తూ ఉన్నది.

వ ఇ ట్లనన్యభేద్యం బగు నా పద్మవ్యూహంబు భేదించి సొచ్చి సౌభద్రుండు రౌద్ర రసోల్లసితమూర్తియై యందు మహార్ణవంబునం దిరుగు మందరనగంబు చందంబునం, గాననంబునం జరియించు తీవ్రానలంబు తెఱంగునఁ గాలపక్వజనసమాజ సంహరణ క్రీడనంబు సలుపు శూలిపోలికం గేలీగతుల మెలంగి, యమ్మెయి నమ్మోహరంబు ద్రిప్పుకొలిపియుం బొడిసేసియు రూపుమాపియు రణవిహారం బొనరింప, నవ్వీరవరు నారాచాది నానావిధ విశిఖ వ్రాతంబులు, హేతి సంఘట్టనంబున మండుచుఁ, గరుల నుచ్చిపోవుచుఁ, దేరుల విఱుచుచు, హయంబుల ఘట్టంబుల నుఱుము సేయుచుఁ గాల్బలంబులఁ జిదుపుచు, గేతువులం ద్రుంచుచు, నాతపత్రంబుల నుఱుమాడుచు, రథ్యంబులం గూల్చుచు, సూతుల గీటడంగించుచు, ధనువులు దునుముచు, మైమఱువుల వ్రచ్చుచు, భూషణంబుల డుల్చుచుఁ గరవాలంబులఁ ద్రోయుచు, మేనులు సించుచుఁ దూపులు దూలించుచు, జేతులు నఱకుచుఁ, సబళంబులు జడియుచు, దలలు చిదుముచు, నంకుశంబులు రాల్చుచు, నెత్తురు లురలించుచుఁ, గండలు సెక్కుచు, నెమ్ములు నలఁచుచుఁ బరఁగిన నమ్మొన చిక్కువడియును, నుడివడియును, గలంగియుఁ, దొలంగియు, వెఱచఱచియు, విచ్చిపఱచియు దీనదశకు వచ్చినం గనుంగొని. 18

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అనన్యభేద్యంబు+అగు= ఇతరులచేత భేదించటానికి వీలుకానిది అగు; ఆ+పద్మవ్యూహంబున్= పద్మాకారం గల ఆ మొగ్గరాన్ని; భేదించి= చీల్చి; చొచ్చి= ప్రవేశించి; సౌభద్రుండు= అభిమన్యుడు; రౌద్రరస+ఉల్లసితమూర్తి+ఐ= రౌద్రం అనే రసంచేత ఒప్పిన ఆకారం కలవాడై; అందున్= ఆ సైన్యంలో; ఆ వ్యూహంలో; మహా+అర్ణవంబునన్= గొప్ప సముద్రంలో; తిరుగు మందరనగంబు చందంబునన్= తిరిగే మందర పర్వతంవలె; కాననంబునన్= అడవిలో; చరియించు= వ్యాపించు; తీవ్ర+అనలంబు+తెఱంగునన్= తీక్ష్ణమైన కార్చిచ్చు మాదిరి; కాలపక్వజన= జీవితకాలం ముగిసిన జనులయొక్క; సమాజ= సమూహాన్ని;సంహరణ క్రీడనంబు= చంపటం అనే ఆటను; సలుపు= నిర్వర్తించే; శూలిపోలికన్= శివుడివలె; కేలీగతులన్= విలాసంగా విహరించే నడకలతో; మెలంగి= మెలగి; ఆ+మెయిన్= ఆ రీతిగా; ఆ+మోహరంబున్= ఆ వ్యూహాన్ని;త్రిప్పుకొలిపియున్= వెనుకకు మళ్ళేటట్లు చేసి; పొడిచేసియున్= నుగ్గుగావించి; రూపుమాపియున్= నశింపజేసి; రణవిహారంబు= యుద్ధంలోవిహరించటం;

ఒనరింపన్= చేయగా; ఆ+వీరవరు= వీరశ్రేష్ఠుడైన ఆ అభిమన్యుడి; నారాచాది నానా విధవిశిఖ వ్రాతంబులు= నారసము మొదలగు అనేక విధాలైన బాణాల గుంపులు; హేతిసంఘట్టనంబునన్= ఆయుధాల రాపిడి వలన; మండుచున్= మంటలు రేగుతూ; కరులన్= ఏనుగులను; ఉచ్చిపోవుచున్= చీల్చుకొని పోతూ; తేరులన్= రథాలను; విఱుచుచున్= విరగగొట్టుతూ; హయంబుల ధట్టంబులన్= గుర్రాల మొత్తాన్ని; నుఱుము సేయుచున్= తుత్తుమురు చేస్తూ; కాల్బలంబులన్= పదాతి సైన్యాన్ని (సైనికులను); చదుపుచున్= చంపుతూ (అణచివేస్తూ); కేతువులన్+త్రుంచుచున్= జెండాలను విరిచివేస్తూ; ఆతపత్రంబులన్= గొడుగులను; నుఱుమాడుచు= నుగ్గుచేస్తూ; రథ్యంబులన్= గుర్రాలను; కూల్చుచున్= నేల కూలేటట్లు చేస్తూ; సూతులన్= సారథులను; గీటు+అడంగించుచున్= చంపుతూ; ధనువులన్= విండ్లను; తునుముచున్= ముక్కలు ముక్కలు చేస్తూ; మైమఱువులన్= కవచాలను; వ్రచ్చుచున్= చీల్చివేస్తూ; భూషణంబులన్= ఆభరణాలను; డుల్చుచున్= రాలుస్తూ; కరవాలంబులన్= ఖడ్గములను; త్రోయుచున్= నెట్టివేస్తూ; మేనులు= శరీరాలు; చించుచున్= చీల్చుతూ; తూపులు= బాణాలు; తూలించుచున్= చెదరగొడుతూ; చేతులన్= హస్తాలను; నఱకుచున్= ఖండిస్తూ; సబళంబులు= ప్రాసములు అనే ఆయుధాలను; జడియుచున్= త్రిప్పుతూ; తలలు= శిరస్సులు; చిదుముచున్= త్రుంచివేస్తూ; అంకుశంబులు= బరిగోలలు; రాల్చుచున్= క్రిందపడేటట్లు చేస్తూ; నెత్తురులు= రక్తం; ఉరలించుచున్= ప్రవహింపజేస్తూ; కండలు= మాంసఖండాలు; చెక్కుచున్= ఖండిస్తూ; ఎమ్ములు= ఎముకలు; నలఁచుచున్= నలిగేటట్లు చేస్తూ; పరఁగిన= ఒప్పినటువంటి; ఆ+మొన= ఆ మొగ్గరం; చిక్కువడియును= సంకటపడియూ; సుడివడియును= చలించియు; కలంగియున్= కలతపడియు; తొలంగియున్= తొలగిపోయియు; వెఱచఱచియున్= భయపడియు; విచ్చి= చెదరి; పఱచియున్= పరుగెత్తియు; దీనదశకున్= దీనమైన పరిస్థితికి; వచ్చినన్= రాగా; కనుంగొని= చూచి.

తాత్పర్యం: భేదించటానికి వీలుకాని పద్మవ్యూహాన్ని అభిమన్యుడు ప్రవేశించి, సముద్రాన్ని మథించే మందరపర్వతం రీతిలో, అడవులను కాల్చివేసే కార్చిచ్చు మాదిరి, కాలం ఆసన్నమైన వాళ్ళను సంహరించే శివుడి విధంగా, యుద్ధాన్ని ఒక క్రీడగా ఎక్కడ చూచినా తానే అనే రీతిలో రణరంగ విహారం చేశాడు. మొగ్గరాన్ని మళ్ళించాడు. అతడి బాణాలు, ఖడ్గాలు మంటలు గ్రక్కుతూ రథ, గజ, తురగ, పదాతివర్గాలను చీల్చి చెండాడాయి. ఎక్కడ జెండాలు అక్కడ కూలిపోయాయి. గొడుగులు నుగ్గు అయ్యాయి. గుర్రాలు, సారథులు నశించారు. ధనుస్సులు ముక్కలయ్యాయి. కవచాలూ, ఆభరణాలు చీలి రాలిపోయాయి. రకరకాల ఆయుధాలు నామరూపాలు లేకుండా నుగ్గు నుగ్గు అయ్యాయి. తలలు తెగాయి. నెత్తురు ప్రవహించింది. కండలు చెక్కబడ్డాయి. ఎముకలు పిండి అయ్యాయి. ఆ విధంగా ఆ మొగ్గరం పూర్తిగా చిక్కుబడిపోయింది. కలతతో, భయంతో విడివడి పరుగులెత్తింది. ఇట్టి దైన్యపరిస్థితిని చూచి.

విశేషం: అలం: మాలోపమ.

క. **వీఁకమెయిఁ గ్రీడి కొడుకుం । దాఁకఁగ నీ కొడుకు తలఁచి తఱిమి కవిసెఁ బే**
రాఁకలితో నున్న హరిం । దేఁకువ సెడి చేరు కరిగతిం గురుముఖ్యా! **19**

ప్రతిపదార్థం: కురుముఖ్యా!= ధృతరాష్ట్రా!; పేరు+ఆఁకలితోన్+ఉన్న+హరిన్= మిక్కిలి ఆకలితో ఉండే సింహాన్ని; తేఁకువ+చెడి= భయంవీడి; చేరు= సమీపించే; కరిగతిన్= ఏనుగు మాదిరి; వీఁకమెయిన్= గర్వంతో; క్రీడికొడుకున్= అర్జునుడి కొడుకైన అభిమన్యుడిని; తాఁకఁగన్= ఎదిరించటానికి; నీకొడుకు= నీ పెద్ద కొడుకైన దుర్యోధనుడు; తలఁచి= ఎంచి; తఱిమి= తరుముకొని వచ్చి; కవిసెన్= చుట్టుముట్టాడు; ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: ఓ రాజా! ఆకలితో ఉండే సింహాన్ని ఏనుగు సమీపించేటట్లుగా నీ కొడుకు దుర్యోధనుడు అభిమన్యుడిని తరుముకొని వచ్చి (ఎదుర్కొన్నాడు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ. 'కురుముఖ్యా!' అని ధృతరాష్ట్రుడిని సంజయుడు సంబోధిస్తున్నాడు. కౌరవపక్షంలో ధృతరాష్ట్రుడు కురుముఖ్యుడయితే పాండవపక్షంలో కురుముఖ్యుడు ధర్మరాజు. ఉభయపక్షాల వారికీ కురువు మూలవంశకర్త. సందర్భానుసారంగా కురుముఖ్యులు భేదిస్తూ వుంటారు. దుర్యోధనుడు ఆకారంలో పెద్దవాడు. అతడు పసిపిల్లవానిపై దండెత్తుతూ వున్నాడు. సింహం ఆకృతిలో ఏనుగు కంటె చిన్నది. గర్వం పొంగి ఉత్సాహం ఉరకలు వేసినప్పుడు తన ఆటోపమే కాని ఎదుటివాళ్ళ శక్తి సామర్థ్యాలు తెలియవు. 'వీఁకమెయిన్' అనే ప్రయోగంలో ఇదే భావం పాఠకులకు స్ఫురిస్తుంది. 'తేఁకువ సెడి' అనే పదబంధం కూడా ఎంతో అర్థవంతంగా ఉన్నది.

వ. ఇట్లు సౌభద్రుఁ జెనయం జూచు సుయోధనుం జూచి శరాసనగురుండు సైనికవరులకుం జేయి వీచి యెలుంగెత్తి. 20

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సౌభద్రున్= అభిమన్యుడిని; చెనయన్= ఎదిరించటానికి; చూచు= ఆలోచించే; సుయోధనున్= దుర్యోధనుడిని; శరాసనగురుండు= ధనురాచార్యుడైన ద్రోణుడు; చూచి= కనుగొని; సైనికవరులకున్= సైన్యంలో శ్రేష్ఠులైన వారికి; చేయివీచి= చే సైగ చేసి; ఎలుంగెత్తి= బిగ్గరగా.

తాత్పర్యం: అభిమన్యుడిని ఎదుర్కొనటానికి ఆలోచించే సుయోధనుడిని ద్రోణుడు చూచి, తన సైనికులలో ముఖ్యులైన వాళ్ళకు చేసైగ చేసి, గొంతెత్తి బిగ్గరగా ఇట్లా అన్నాడు:

విశేషం: ఇచ్చట సుయోధనుడు అనే ప్రయోగం గమనింపదగింది. మంచి యోధనం - యుద్ధం చేసేవాడు సుయోధనుడు. అతడు మంచి యుద్ధమే చేసే పక్షంలో ఒక్కడే అభిమన్యుడిని ఎదుర్కొని అతడి ధాటికి తట్టుకోలేడు అని సర్వ సైన్యాధ్యక్షుడు ఊహించాడు.

క. 'నరసుతున కగ్గమయ్యెం । గురుధరణీవల్లభుం డకుంఠితగతి మీ
రరుగుం డేయుం డడ్డము । చొరుఁడు వెరవు లావు నెఱయ శూరత మెఱయన్.' 21

ప్రతిపదార్థం: కురు ధరణీవల్లభుండు= దుర్యోధనుడు; నరసుతునకున్= అభిమన్యుడికి; అగ్గము+అయ్యెన్= కంటపడ్డాడు; మీరు= సైనిక వీరులైన మీరు అందరూ; అకుంఠితగతిన్= మొక్కవోని విధంగా; వెరవు= ఉపాయం; లావు= బలం; నెఱయన్= నిండుకొనేటట్లుగా; శూరత= శౌర్యం; మెఱయన్= ప్రకాశించే విధంగా; అరుగుండు= పొండి; ఏయుండు= బాణాలను ప్రయోగించండి; అడ్డము చొరుఁడు= అడ్డుపడండి (అడ్డుకొనే విధంగా ప్రవేశించండి).

తాత్పర్యం: 'దుర్యోధనుడు అభిమన్యుడి దృగ్గోచరుడయ్యాడు. సైనిక వీరులైన మీరు కుంటువోని ఉపాయాన్ని, బలాన్ని నెరపండి. శౌర్యాన్ని నిరూపించండి. త్వరగా పొండి. బాణాలు వేయండి. అడ్డుపడండి.'

విశేషం: అనుకోని సంఘటన యుద్ధరంగంలో సంభవించినప్పుడు, అందులోనూ ఆ ముఖ్యమైన వ్యక్తి ఆపదలో ఉన్నాడని తెలిసినప్పుడు, సర్వసైన్యాధ్యక్షుడు ఏ విధంగా ప్రధాన సైనికులను ఆదేశిస్తాడో ఈ పద్యంలో తిక్కన చాలా చక్కగా వక్కాణించాడు. ఆపదలో ఉన్న వ్యక్తిని ఏ విధంగా ఆదుకొనాలో ద్రోణుడిచ్చిన సూచనలు ఈ కంద పద్యంలో ఒక విలక్షణ గతిలో తిక్కన తెలిపాడు. 'అకుంఠితగతి' అనే ప్రయోగం అటు సైనికవీరులను ఉద్దేశించే కాకుండా పద్య గమనానికి కూడా అన్వయించుకొనాల్సి ఉంది.

వ. అనుచుఁ దనయరదం బద్దెస మొగంబు సేసి పురికొల్పిన. 22

ప్రతిపదార్థం: అనుచున్= అని ఆ విధంగా; సైనికవీరులకు తెలుపుతూ; తన+అరదంబు= తన రథం; ఆ+దెస+మొగంబు+చేసి= ఆ వైపు మళ్ళించి; పురికొల్పినన్= ప్రేరేపించగా.

తాత్పర్యం: ద్రోణుడు ఆ విధంగా సైనిక వీరులకు తెలుపుతూ, తాను తన రథాన్ని ఆ వైపు మళ్ళించి వాళ్ళను ఎంతో ప్రేరేపించగా - (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. కృపుఁడు గురు సుతుండుఁ గృతవర్మ గర్ణుండు । సౌమదత్తి శలుఁడు సౌబలుండు
పౌరవుండు మద్రపతి వృషసేనుండు । గౌరవేశ్వరుండుఁ గడఁగి రపుడు. 23

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో; కృపుఁడు= కృపాచార్యుడు; గురుసుతుండు= అశ్వత్థామ; కృతవర్మ= యదువంశంలోని వాడైన హృదికుడి కొడుకు; కర్ణుఁడు; సౌమదత్తి= సోమదత్తుడి కొడుకైన భూరిశ్రవుడు; శలుఁడు= సోమదత్తుడి కొడుకు; సౌబలుండు= శకుని; పౌరవుండు= యయాతి కొడుకైన పురుసంతతివాడు; మద్రపతి= మద్రదేశాధిపతి అయిన శల్యుడు; వృషసేనుండు= కర్ణుడి కొడుకు; కౌరవేశ్వరుండు= దుర్యోధనుడు; కడఁగిరి= పూనుకొన్నారు.

తాత్పర్యం: ద్రోణుడి ప్రేరణతో కృపుడు, అశ్వత్థామ, కృతవర్మ, కర్ణుడు, భూరిశ్రవుడు, శలుడు, శల్యుడు, పౌరవుడు, కౌరవేశ్వరుడు, వృషసేనుడు మొదలైన ప్రముఖులు ఒకటిగా చేరి పోరాటానికి ఉపక్రమించారు.

వ. అట్లు గడంగి. 24

తాత్పర్యం: ఆ విధంగా పూనుకొని.

చ. ప్రకటబలాఢ్యు లొక్కటఁ దిరంబయి పల్వురు వీఁక భూమి పా
లకునకు నడ్డమైనఁ దవులంబడి హుమ్మని నోరికండ నాఁ
చికొనిన మ్రోఁగు బెబ్బులి విశేషము దోఁపఁగఁ బార్థుపట్టి సా
యకముల నొంచినం దెరలి రందఱు లేళులపిండు నాకృతిన్. 25

ప్రతిపదార్థం: పల్వురు= అనేకులు; ప్రకట+బల+ఆఢ్యులు= ప్రసిద్ధి కెక్కిన బలంచేత శ్రేష్ఠులు; ఒక్కటన్= ఒక్కుమ్మడిగా, ఒక్కపెట్టుగా; తిరంబు+అయి= స్థిరమై; వీఁకన్= గర్వంతో; భూమిపాలకునకున్= దుర్యోధనుడికి; అడ్డము+ఐనన్= అడ్డం రాగా; తవులన్+పడి= తగిలి; హుమ్మని= హుంకరించి; నోరికండ+నాఁచికొనినన్= నోటిలోని ఆహారాన్ని అపహరించగా; మ్రోఁగు= అరచే; బెబ్బులి= పెద్దపులి; విశేషము+తోఁపన్+కన్= విధం (అతిశయం) స్ఫురించేటట్లు; పార్థుపట్టి= అర్జునుడి కొడుకైన అభిమన్యుడు; సాయకములన్= బాణాలతో; నొంచినన్= బాధపెట్టగా; అందఱున్= ఎదిరించిన శూరులందరూ, లేళులపిండు+ఆకృతిన్= జింకల గుంపువలె; తెరలిరి= చెదరిపోయారు.

తాత్పర్యం: మహాబలవంతులైన అనేకులు ఒక్కుమ్మడిగా దుర్యోధనుడికి రక్షగా అడ్డంనిలబడ్డారు. ఆ విధంగా అడ్డంగా ప్రవేశించిన సందర్భంలో అభిమన్యుడు, నోటిలోని మాంసపుకండను లాగుకొంటే ఆక్రోశించే పెద్దపులి వలె హుంకారం చేసి బాణాలు ప్రయోగించగా, ఎదిరించిన శూరులు అందరూ జింకల గుంపులవలె(జంకి) అదరి బెదరి చెదరిపోయారు.

విశేషం: ఈ పద్యం ఎత్తుగడ 'ప్రకట బలాఢ్యులు'. కానీ, వారు చివరికి ఏమయ్యారు? 'లేళులపిండు' వలె తెరలిపోయారు. ఈ మధ్యలో జరిగిన విశేషం. అదే 'హుమ్మని నోరికండ నాఁచికొనిన మ్రోఁగు బెబ్బులి విశేషం. ఇచ్చట 'విశేషము' అనటంలోనే ఎంతో విశేషం ఉన్నది. 'విశేషము' అనే పదానికి అతిశయమూ, వింతరూపమూ, భేదమూ, వృత్తాంతమూ అనే అర్థాలున్నాయి. తినే తిండిని లాగినప్పుడు బెబ్బులి గాండ్రిస్తూ అంతకుముందు లేని ఒక వింతరూపాన్ని, అతిశయమైన అవయవ విన్యాసాన్ని ప్రదర్శిస్తుంది. ఈ భేదం ఎట్లా కలిగింది? పరిస్థితుల ప్రభావం వలన. ఇట్లా అభిమన్యుడి వృత్తాంతాన్ని కూడా సమన్వయం చేసికొనవచ్చు. అలతి అలతి పదాలలో అనల్పమైన అర్థ గౌరవాన్ని శిల్పకళా పారమ్యంతో ప్రతిపాదించటం తిక్కన రచనా విశేషం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇ వ్విధంబున నయ్యోధవరులు విచ్చిన, వివ్వచ్చుకొడుకు పేర్చి యార్చిన నాచార్యుండు వీఁడు వీరిచేత నిలువండని తా నరిగి యన్నరనందను నెదుర్కొనిన వారును గూడుకొని పొదివిన. 26

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ఆ+యోధవరులు= ఆ యుద్ధవీరులు; విచ్చినన్= చెదరి విడివడిపోగా; వివ్వచ్చు కొడుకు= అర్జునుడి కుమారుడైన అభిమన్యుడు; పేర్చి= విజృంభించి; ఆర్చినన్= గర్జించగా; ఆచార్యుండు= ద్రోణుడు; వీఁడు= ఈ అభిమన్యుడు; వీరిచేన్= ఈ యోధులచేత; నిలువండు+అని= ఆగడని; తాన్= తాను; అరిగి= పోయి; ఆ+నరనందనున్= ఆ అభిమన్యుడిని; ఎదుర్కొనినన్= మార్కొనగా; వారును= ఆ యోధవరులున్నూ; కూడుకొని= ఒకటిగా కలిసికొని; పొదివినన్= చుట్టుముట్టగా.

తాత్పర్యం: ఈ విధంగా యుద్ధవీరులను చెదరగొట్టి, అభిమన్యుడు మిక్కిలి విజృంభించి గర్జించగా, ఆ యోధులు ఇతడిని అరికట్టలేరని ద్రోణుడు స్వయంగా తానే అభిమన్యుడిని ఎదుర్కొన్నాడు. ఇంతలో ఆ యోధవీరులు కూడా వచ్చి ద్రోణుడిని కలిసికొన్నారు. అందరూ చుట్టుముట్టగా.

క. అతఁ డందఱ మార్గణములు । నతిరయమునఁ ద్రుంచుచుం దదంగముల శర
ప్రతతులు నించుచుఁ బోరఁగఁ । బతి సేనకుఁ జేయి వీచె బరవస మలరన్. 27

ప్రతిపదార్థం: అతఁడు= అభిమన్యుడు; అందఱ మార్గణములున్= అందరి బాణాలను; అతిరయమున్= మిక్కిలి వేగంగా; త్రుంచుచున్= ఖండిస్తూ; తద్+అంగములన్= వాళ్ళ అవయవాలలో; శరప్రతతులు= బాణాల మొత్తము; నించుచున్= నిండిస్తూ (చేరేటట్లు చేస్తూ); పోరన్= యుద్ధం చేయగా; బరవసము= ధైర్యం; అలరన్= అతిశయించగా; పతి= దుర్యోధనుడు; సేనకున్= సైన్యానికి; చేయి వీచెన్= చేసైగ చేశాడు.

తాత్పర్యం: అభిమన్యుడు అందరి బాణాలను వెంటనే త్రుంచివేస్తూ, తాను అందరి అవయవాలలో బాణాల మొత్తం నింపి పోరాడుతూ ఉండగా అంతలో దుర్యోధనుడు ధైర్యం పుంజుకొని సైన్యానికి చేయి వీచాడు.

క మనసేన పెలుచఁ గడఁగిన । వననిధి పొంగెడు విధంబు వాసవిసుతుఁ డే
చినఁ జెలియలికట్ట తెఱం । గును గానఁగనయ్యె నపుడు కురువంశనిధీ! 28

ప్రతిపదార్థం: కురువంశనిధీ!= ఓ ధృతరాష్ట్రా!; అపుడు= ఆ సమయంలో; మనసేన= మనసైన్యం; పెలుచన్= అధికంగా; కడఁగినన్= ప్రయత్నించగా; వననిధి= సముద్రం; పొంగెడు విధంబున్= పొంగే రీతి; వాసవి, సుతుఁడు= అర్జునుడి కొడుకు - అభిమన్యుడు; ఏచినన్= విజృంభించగా; చెలియలికట్ట, తెఱంగును= ఒడ్డు విధమూ; కానఁగనయ్యెన్= చూపట్టింది.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! మన సైన్యాలు సముద్రం పొంగినట్లు అతిశయించి రాగా, వాటిని అడ్డగిస్తూ అభిమన్యుడు సముద్రపు గట్టు వలె కనిపించాడు.

విశేషం: ద్రోణుడి ప్రేరణతో కౌరవసైన్యం సముద్రం వలె విజృంభించి పొంగింది. వననిధితో కౌరవసైన్యాన్ని పోల్చటం వలన అది ఎంతో విస్తారమూ, గాంభీర్యమూ అయినదని తెలుస్తూ ఉన్నది. సముద్రం మాత్రం విజృంభించి చెలియలికట్ట మామూలుగానే ఉంటే ముంపు తప్పదు. అందుకే 'ఏచిన చెలియలికట్ట' తో అభిమన్యుడిని పోల్చాడు. సముద్రం, ఎంత పొంగుతూ ఉన్నదో అంతకు మించి సముద్రపు గట్టు కూడా మిక్కిలి విజృంభించిం దని చెప్పటం ఔచితీమంతంగా ఉన్నది.

వ. ఆ సమయంబున. 29

తాత్పర్యం: ఆ సందర్భంలో.

సీ. **రారాజుఁ గృపుఁడును భూరిశ్రవుండు మూఁ। డేసి యమ్ములు పదియేడు గురుఁడు**
వినుము! వివింశతి వింశతి విశిఖంబు। లాచార్యసుతుఁడు బృహద్బలుండు
నైదు నెన్మిదియును నాఱు శల్యుఁడు, సప్త। శరములు గృతవర్మ సౌబలుండు
రెండు బాణములు పండ్రెండు తొమ్మిదియును। దుశ్శాసనుండును దుస్సహుండు

తే. **నేసి రర్జునసుతుమీఁద నెల్లవారి। తనువులందును సాయక త్రయము లతఁడు**
గ్రుచ్చె; నశ్మకుఁ డదరినఁ గూల నేసెఁ। దురగసూతకేతనములతోడఁగూడ. 30

ప్రతిపదార్థం: వినుము= వినుము; రారాజున్= దుర్యోధనుడూ; కృపుఁడును= కృపాచార్యుడూ; భూరిశ్రవుండు= శంతనుడి సోదరుడైన బాహ్లికుడి కొడుకు; మూఁడేసి అమ్ములున్= ఒక్కొక్కరు మూడేసి బాణాలు; గురుఁడు= ద్రోణుడు; పది ఏడున్= పదిహేడున్నూ; వివింశతి= చాక్షుషుడి కొడుకు; వింశతి విశిఖంబులున్= ఇరవై బాణాలున్నూ; ఆచార్యసుతుఁడు= అశ్వత్థామ; ఐదు= ఐదు బాణాలు; బృహద్బలుండు= బృహద్బలుడు (శకుని తమ్ముడు); ఎన్మిదియును= ఎనిమిది బాణాలు; శల్యుండు= శల్యుడు; ఆఱు= ఆరు బాణాలు; కృతవర్మ; సప్త శరములున్= ఏడు బాణాలు; సౌబలుండు= శకుని; రెండు బాణములు= రెండు బాణాలు; దుశ్శాసనుండును= దుశ్శాసనుడు; పండ్రెండున్= పండ్రెండు బాణాలు; దుస్సహుండు= దుర్యోధనుడి తమ్ముడు దుస్సహుడు అనేవాడు; తొమ్మిదియును= తొమ్మిది బాణాలు; అర్జునసుతుమీఁదన్= అభిమన్యుడిపై; ఏసిరి= ప్రయోగించారు; అతఁడు= ఆ అభిమన్యుడు; ఎల్లవారి= అందరి; తనువులందును= దేహాలలో; సాయకత్రయములు= మూడేసి బాణాలు; గ్రుచ్చెన్= నాటాడు; అశ్మకుఁడు= కల్మాషపాదుడి కొడుకు అశ్మకుడు; అదరినన్= పైకొనగా(పైకిరాగా); తురగ+సూత+కేతనము+తోడన్+కూడన్= గుర్రాలు, సారథి, జెండాలతో కలిసే విధంగా; కూలన్+ఏసెన్= అతడిని కూలేటట్లు (పడగొట్టాడు), బాణాలు ప్రయోగించాడు.

తాత్పర్యం: అభిమన్యుడిమీద దుర్యోధన, కృప, భూరిశ్రవులు ఒక్కొక్కరు మూడేసి బాణాలు, ద్రోణుడు పదిహేడు, వివింశతి ఇరవై, అశ్వత్థామ, బృహద్బల, శల్య, కృతవర్మ, శకుని, దుశ్శాసన, దుస్సహులు వరుసగా ఐదు, ఎనిమిది, ఆరు, ఏడు, రెండు, పండ్రెండు, తొమ్మిది బాణాలు ప్రయోగించారు. అప్పుడు అతడు అందరిమీదా మూడేసి బాణాలను తీవ్రంగా గ్రుచ్చాడు. అశ్మకుడు పైకి రాగా అతడినీ, అతడి గుర్రాలను, రథసారథిని, జెండాను నేలకూలేటట్లు చేశాడు.

దుర్యోధన ప్రభృతి మహారథికు లందఱు నొక్కుమ్మడి నభిమన్యునిపైఁ గవియుట (సం. 7-36-22)

వ. **ఇవ్విధంబున నశ్మకుండు పడినఁ దెరలు బలంబుల మరలనీక పురికొల్పుకొని యప్పటి యాచార్య ప్రభృతి యోధులును నీ కొడుకులలోనఁ గొందఱును గ్రందుగం దటిమి యనేకాస్త్రశస్త్ర పరంపరలం బొదివిన నొదవిన కినుకం గిరీటినందనుం డందఱమేనులు నానా నిశిత విశిఖ వేగంబున నెత్తుట జొత్తిల్లం జేసి కర్ణుపయిం గవిసె.** 31

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఇట్లా; అశ్మకుండు= కల్మాషపాదుడి కొడుకు; పడినన్= నేలకు ఒరుగగా; తెరలు+బలంబులన్= తొలగిపోయే సైన్యాలను; మరలన్+ఈక= వెనుకకు తిరగనీయకుండా; పురికొల్పుకొని= ప్రేరేపించుకొని; అప్పటి+ఆచార్య ప్రభృతి యోధులును= ఆ సందర్భంలో అక్కడ ఉన్న ద్రోణాచార్యుడు మొదలైన యుద్ధవీరులు; నీ కొడుకుల లోనన్+కొందరును= నీ కుమారులలో కొంతమంది; క్రందుగన్= అధికంగా(దట్టంగా); తటిమి= తోలి; అనేక+అస్త్ర+శస్త్ర పరంపరలన్= అనేకములైన అస్త్రాలు, ఖడ్గాల వరుసలతో; పొదివినన్= ఆవరించగా; ఒదవిన+కినుకన్= కలిగిన కోపంతో; కిరీటి నందనుండు= అభిమన్యుడు; అందఱమేనులు= ఆ యోధుల అందరి శరీరాలు; నానా+నిశిత+విశిఖ వేగంబునన్= రకరకాల వాడిఅయిన బాణాల వేగంతో; నెత్తుటన్= రక్తంలో; జొత్తిల్లన్+చేసి= ఎర్రబారేటట్లు చేసి; కర్ణుపయిన్= కర్ణుడి మీదికి; కవిసె= దాడిచేసె.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అశ్మకుడు నేలకూలగానే, వెనుకంజ వేసే సైన్యాన్ని తిరిగి పోనీకుండా పురికొల్పి, ద్రోణాది యోధులు, మరికొంతమంది నీ కుమారులు మిక్కిలి తీవ్రంగా ఎదుర్కొని రకరకాల అస్త్రాలతో, శస్త్రాలతో క్రమ్ముకోగా, కోపించిన అభిమన్యుడు, అప్పుడు అక్కడ ఉండే అందరి శరీరాలపైన పదునైన బాణాలు మహాతీక్ష్ణంగా నాటి నెత్తురు పారేటట్లు చేశాడు. అటుపిమ్మట కర్ణుడిపైకి దూకి.

తే. **కంకటము దూఱి యంగంబు గాఁడిపోవఁ । గ్రూరనారాచ మేసిన స్రుక్కె నతఁడు**
లీల నట్టివ పఱపి భూపాల! నీదు । సుతుల వెనుకకుఁ బఱపె నుద్ధతి దలిర్ప. **32**

ప్రతిపదార్థం: భూపాల!= రాజా! ధృతరాష్ట్రా!; కంకటము దూఱి= కవచంలోకి ప్రవేశించి; అంగంబు= శరీరం; కాఁడి= రంధ్రం చేసికొని; పోవన్= పోగా; క్రూర నారాచము= వాడియైన బాణం; ఏసినన్= ప్రయోగింపగా; అతఁడు= కర్ణుడు; స్రుక్కెన్= సోలి పడిపోయాడు; లీలన్= విలాసంగా; అట్టివ= అటువంటి బాణాలే; పఱపి= ఏసి; ఉద్ధతి తలిర్పన్= గర్వం అతిశయించగా; నీదు సుతులన్= నీ కొడుకులను; వెనుకకున్= వెనుకకు; పఱపెన్= తరిమాడు.

తాత్పర్యం: ఓ రాజా! కవచంలోకి దూరి, శరీరం తూటు పడేటట్లు వాడియైన బాణాన్ని ప్రయోగించగా కర్ణుడు సోలి పడిపోయాడు. సవిలాసంగా అటువంటి బాణాలే నీ కుమారుల మీద కూడా ప్రయోగించి వెనుకకు పరువులు తీసేటట్లు చేశాడు.

చ. **అడరి నరేంద్రకోటి నుఱుమాడఁగ నత్తఱి శల్యుఁ డెంతయున్**
వడిఁ దనుఁ దాఁకినన్ మెఱుఁగు వాలిక తూపుల మూర్ఛవుచ్చి క
వ్వడికొడు కేచి యుద్భట రవంబున నార్చినఁ బెల్లగిల్లి న
ల్గడలకుఁ బాఱె నిల్వక బలంబులు ద్రోణుఁ డెలుంగు సూపఁగాన్. **33**

ప్రతిపదార్థం: అడరి= అతిశయించి; నరేంద్రకోటిన్= రాజులమొత్తాన్ని; నుఱుమాడఁగన్= తుత్తుమురు చేయగా; ఆ+తఱి= అప్పుడు; శల్యుఁడు= మద్రదేశాధిపతి అయిన శల్యుడు; ఎంతయున్= మిక్కిలి; వడిన్= వేగంగా; తనున్= తనను; తాఁకినన్= ఎదుర్కొనగా; మెఱుఁగు+వాలిక+తూపులన్= మెరుస్తూ ఉండే పొడవైన బాణాలతో; మూర్ఛపుచ్చి= మూర్ఛ కలిగించి; ఏచి= విజృంభించి; కవ్వడి కొడుకు= అభిమన్యుడు; ఉద్భట రవంబునన్= పెద్దసవ్వడితో; ఆర్చినన్= గర్జించగా; బలంబులు= సైన్యాలు; పెల్లగిల్లి= కలతచెంది; ద్రోణుఁడు= సర్వసైన్యాధిపతి అయిన ద్రోణాచార్యుడు; ఎలుంగు+చూపఁగాన్= అఱచి పిలుస్తూ ఉన్నప్పటికీ; నిల్వక= ఒకచోట స్థిరంగా ఉండకుండా; నల్గడలకున్= నాలుగు వైపులకూ; పాఱెన్= పరుగెత్తాయి.

తాత్పర్యం: అభిమన్యుడు అతిశయించి రాజ సమూహాన్ని తుత్తుమురు చేస్తూ ఉన్న సమయంలో మద్రాధిపతి శల్యుడు అతడిని ఎదుర్కొన్నాడు. అప్పుడు అతడు మెరుస్తూ ఉండే పొడవైన బాణాలతో శల్యుడిని మూర్ఛనొందించాడు. ఆ విధంగా విజృంభించి గట్టిగా గర్జిస్తూ ఉండగా సైన్యాలు చెల్లాచెదరై పరుగెత్తాయి. ద్రోణుడు ఎంతగా అరచి పిలుస్తూ ఉన్నా నిలవకుండా పలాయనం చిత్తగించాయి.

విశేషం: ఈ పద్యం చివరి రెండు పాదాలలో రెండు రకాల అరపులున్నాయి. 'ఉద్భటరవంబున' 'కవ్వడి కొడుకు' చేసిన అరపు సైన్యాలకు వెరపు గొలిపి పరుగులెత్తేటట్లు చేసింది. సర్వసైన్యాధ్యక్షుడు ద్రోణుడు 'పరువు నిలపండి పరువులెత్తకండి' అని ఎంతగా అరుస్తూ పిలిచినా నిలువకుండా వెళ్ళిపోయాయి. 'కవ్వడి కొడుకు', 'నల్గడలకు' అనే పదాలను మూడు నాల్గు పాదాల ఆరంభంలో వచ్చేటట్లు విరిచిన విరుపులు పద్యంలో ఉరవడినే కాక సైన్యం పరుగులెత్తిన విధానాన్ని ధ్వనింపజేస్తున్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అప్పుడు. **34**

తాత్పర్యం: ఆ సమయంలో.

క. సురలును సిద్ధులు విద్యా। ధరులుఁ బొగడు నులివుఁ జూచు ధరణీశుల బం
ధురనుతి నాదంబుల నం। బరధరణీ మధ్యభాగ భరితము లయ్యెన్.' **35**

ప్రతిపదార్థం: సురలును= దేవతలును; సిద్ధులున్= సిద్ధులూ; విద్యాధరులున్= విద్యాధరులూ; పొగడు+ఉలివున్= పైనుండి పొగడుతూ ఉండే ధ్వని; చూచు= చూస్తూ ఉన్న; ధరణీశుల= రాజుల; బంధురనుతి నాదంబులున్= అధికమైన పొగడ్తల ధ్వనులూ; అంబరధరణీ మధ్యభాగ= భూమ్యాకాశాల మధ్య ప్రదేశంలో; భరితములు= నిండినవి; అయ్యెన్= అయ్యాయి.

తాత్పర్యం: అపుడు దేవతలు, సిద్ధులు, విద్యాధరులు పొగడే శబ్దమూ, రాజులు ప్రశంసిస్తూ చేసిన నినాదాలూ భూనభోంతరం నిండుకొన్నాయి'.

విశేషం: పై నుండి దేవతలూ క్రిందినుండి రాజులూ చేసిన ప్రశంసాపూర్వక ధ్వనులు భూమ్యాకాశ మధ్యభాగంలో నిండుకొన్నాయి. దివికీ భువికీ మధ్య నెలకొన్న పొగడ్తల నినాదాలు అంతటా ఆవరించిన విషయాన్ని తెలుపుతూ ఉన్నాయి.

చ. అన విని యాంబికేయుఁడు 'మహాద్భుత విక్రమశాలిఁ బార్థనం
దను మఱి యెవ్వ రట్టి యెడఁ దాఁకిరొ?' నావుడు సూతపుత్త్రుఁ డి
ట్లను 'నటులైన శల్యుఁ గని యాతని తమ్ముఁడు మేను వెంచి మా
ర్కొని పది తీవ్రబాణములు గ్రుచ్చెఁ దదంగములం జెలంగుచున్. **36**

ప్రతిపదార్థం: అనన్= అని సంజయుడు చెప్పగా; విని; ఆంబికేయుఁడు= అంబికాపుత్త్రుఁడైన ధృతరాష్ట్రుడు; మహా+అద్భుత+విక్రమశాలిన్= మిక్కిలి ఆశ్చర్యకరమైన పరాక్రమంతో ప్రకాశించే వానిని; పార్థనందనున్= అర్జునుడి కొడుకైన అభిమన్యుడిని; అట్టి+ఎడన్= అటువంటి సందర్భంలో; మఱి= తర్వాత; ఎవ్వరు తాఁకిరొ= ఎవరు ఎదుర్కొన్నారో; నావుడున్= అని అడిగిన వెంటనే; సూతపుత్త్రుఁడు= సంజయుడు; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; అటులు+ఐన= ఆ విధంగా అయినటువంటి (అట్లు మూర్ఛ చెందిన); శల్యున్= శల్యుడిని; కని= చూచి; ఆతని తమ్ముఁడు= అతడి తమ్ముడు; మేను= శరీరం; వెంచి= పొంగించి; మార్కొని= ఎదిరించి; చెలంగుచున్= మిక్కిలి ఉత్సాహాన్ని చూపుతూ (బొబ్బరిస్తూ); తద్+అంగములన్= ఆ అభిమన్యుడి అవయవాలలో; పది+తీవ్రబాణములు= పది పదునైన బాణాలు; గ్రుచ్చెన్= నాటాడు.

తాత్పర్యం: ఆ విధంగా సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు, అంతటి ఆశ్చర్యకరమైన పరాక్రమం గల అభిమన్యుడిని ఆ సందర్భంలో అటుపైన ఎవరు ఎదుర్కొన్నారో?' అని అడిగాడు. వెంటనే సంజయుడు ఇట్లా అన్నాడు: 'ఆ విధంగా శల్యుడిని మూర్ఛ చెందేటట్లు చేయటం చూచి అతడి తమ్ముడు ఓర్చుకోలేక దేహాన్ని పెంచి ఎదిరించి, అభిమన్యుడిపై పది పదునైన బాణాలు గాఢంగా నాటాడు.

వ. అట్లు బెట్టేసిన వాసవికొడుకు కోపించి.

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; బెట్టు= తీవ్రంగా; ఏసినన్= బాణాలు ప్రయోగించగా; వాసవి కొడుకు= అభిమన్యుడు; కోపించి= కోపపడి.

తాత్పర్యం: ఆ విధంగా తీవ్రంగా బాణాలు వేయగా అభిమన్యుడు కోపించి.

చ. హయములఁ జంపి, సూతుఁ దెగటార్చి, పతాక ధరిత్రిఁ గూల్చి, చా
పయుతము గాఁగ వానిఘనబాహులు రెండును ద్రుంచి, యెంతయున్
రయమునఁ దేరు చక్కడిచి, రాజులు రాజతనూజులుం గడున్
భయమునఁ దూలిపోవఁ బటు భల్ల హతిన్ దల డొల్ల నేసినన్. 38

ప్రతిపదార్థం: హయములన్= గుర్రాలను; చంపి= హతమార్చి; సూతున్= రథసారథిని; తెగటార్చి= చంపి; పతాకన్= జెండాను; ధరిత్రిన్+కూల్చి= నేలపైన పడేటట్లు చేసి; చాపయుతము కాఁగన్= వింటితో కూడి యుండేటట్లు; వాని= అతని; ఘనబాహులు= పెద్దచేతులు; రెండునున్= రెండింటినీ; త్రుంచి= ఖండించి; ఎంతయున్= మిక్కిలి; రయమునన్= వేగంతో; తేరు+చక్కడిచి= రథాన్ని పగులగొట్టి; రాజులు= ప్రభువులు; రాజతనూజులున్= రాజపుత్రులున్నూ; కడున్= అధికమైన; భయమున్= భయంతో; తూలిపోవన్= పడిపోగా; పటు+భల్ల+హతిన్= తీక్ష్ణమైన బల్లెంయొక్క వ్రేటుతో; తల= శిరస్సు; డొల్లన్+ఏసినన్= క్రిందపడేటట్లు చేశాడు.

తాత్పర్యం: శల్యుడి తమ్ముడి గుర్రాలను, సూతుడిని చంపి, జెండాను నేలపై పడేటట్లు చేశాడు. అటుపైన వింటితో కూడుకొని ఉన్నట్లుగానే అతడి రెండు చేతులను నరికి, మిక్కిలి వేగంతో తేరును పగులగొట్టి, రాజులూ, రాజకుమారులూ భయంతో తూలిపడిపోగా, వాడియైన బల్లెంతో అతడి, తల దుల్లిపడేటట్లుగా కూల్చాడు.

వ. ద్రోణ కృప ద్రౌణి కృతవర్మ బృహద్బల కర్ణ ప్రముఖ యోధవరు లొండొరులఁ బేరువేరం బిలిచి బలంబులం బురికొలిపిన రథనేమి గజఘంటా తురంగ కింకిణీ స్వన సింహనాదమేదుర రోదోంతర రౌద్రంబుగా సౌభద్రుం జుట్టు ముట్టిన నతం డట్టహాసంబు చేసి లాఘవలక్ష్య శుద్ధి చిత్రత్వ దృఢత్వంబులు మెఱయఁ గృష్ణార్జునులు గావించు నేర్పు మెఱయం బోరు నవసరంబున మండలీకృత కోదండుండును బటు సంధాన స్ఫురిత శరనికరుండును నైపరివేషవలయంబులోనం గిరణస్ఫురణ దుర్నిరీక్ష్యుండగు తపను ననుకరించుచు గుణఘోషభీషణంబుగా బెడిదంపు నారసంబులు వరఁగించి యార్చి యూర్జితగర్జితం బగుచున్ బలు పిడుగులు దొరఁగించు విలయకాల వలాహకంబు విడంబించుచు విజృంభించి భల్లాంజలీక క్షుర ప్రకూర్మ నఖర ప్రభృతి బాణ వేణికా వితానంబుల వెగడు పఱచిన విచ్చిన వాహినుల నిలువరింప నేరక నివ్వెఱపడి యాచార్యుండు సూచుచుండె' ననవుడు ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 39

ప్రతిపదార్థం: ద్రోణ, కృప, ద్రౌణి, కృతవర్మ, బృహద్బల, కర్ణ, ప్రముఖ యోధవరులు= ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, కృతవర్మ, శకుని తమ్ముడైన బృహద్బలుడు, కర్ణుడు, మొదలైన యుద్ధవీర శ్రేష్ఠులు; ఒండొరులన్= ఒకరినొకరు; పేరు+పేరన్= వాళ్ళ వాళ్ళ పేర్లతో; పిలిచి; బలంబులన్= సైన్యాలను; పురికొలిపినన్= ప్రేరేపించగా; రథనేమి= బండికంటి కడికమ్ములు; గజఘంటా= ఏనుగుల గంటలు; తురంగ కింకిణీ= గుర్రాలకు కట్టి ఉండే చిరుగంటలు; స్వన= శబ్దాలచేతనూ; సింహనాద= సింహాల గర్జనలవంటి వీరుల ధ్వనుల చేతనూ; మేదుర= దట్టమైన; రోదః+అంతర= భూమి ఆకాశాల మధ్య ప్రదేశాల చేతనూ; రౌద్రంబుగాన్= భయంకరంగా; సౌభద్రున్= అభిమన్యుడిని; చుట్టుముట్టినన్= చుట్టుకోగా; అతఁడు= ఆ అభిమన్యుడు; అట్టహాసంబు+చేసి= పెద్దనవ్వు నవ్వి; లాఘవ+లక్ష్యశుద్ధి+చిత్రత్వ+దృఢత్వంబులు= లఘుత్వమూ, సూటి అయిన గురీ, ఆశ్చర్యమూ, పటుత్వమూ; మెరయన్= ప్రకాశింపగా; కృష్ణ+అర్జునులు= కృష్ణుడూ, అర్జునుడూ; కావించు నేర్పు= చేయు చాకచక్యం; మెఱయన్=

ప్రకాశించేటట్లు; పోరు+అవసరంబునన్= పోరాడే సమయంలో; మండలీకృత కోదండుండును= వలయాకారం చేయబడ్డ అనగా గుడుసువడ్డ విల్లు కలిగినవాడూ; పటు+సంధాన+స్ఫురిత+శర+నికరుండును+ఐ= బాణాలను వింటిలో కూర్చే నేర్పుతో ఒప్పుతూ ఉన్న బాణాల మొత్తం కలవాడూ అయి; పరివేష వలయంబులోనన్= గాలిగుడి లేక పరివేష్టనం వంటి కుండలాకారంలో; కిరణ+స్ఫురణ+దుర్నిరీక్ష్యుండు+అగు= వెలుగుల యొక్క స్ఫురణ(తోచుట) స్ఫూర్తిచేత చూడటానికి వీలుకాని వాడైన; తపనున్= సూర్యుడిని; అనుకరించుచున్= సరిపోలుతూ; గుణ+ఘోష+భీషణంబుగాన్= అల్లెత్రాటి శబ్దంచేత భయంకరంగా; బెడిదంపు నారసంబులు= భీతిని కలిగించే బాణాలు; పరఁగించి= ప్రయోగించి; ఆర్చి= గర్జించి; ఊర్జిత+గర్జితంబు+అగుచున్= ఎడతెగకుండా ఉరుములు కలిగింది అవుతూ; బలుపిడుగులు= మిక్కిలి బలము లేదా అధికమూ, విస్తారమూ, తీవ్రమూ అయిన పిడుగులు; తొరఁగించు= రాల్చే; విలయకాల= ప్రళయకాలంలోని; వలాహకంబున్= మేఘాన్ని; విడంబించుచున్= పోలుతూ; విజృంభించి= అతిశయించి; భల్ల+అంజలీక, క్షురప్ర, కూర్మ, నఖర, ప్రభృతి, బాణ, వేణికా+వితానంబులన్= బల్లెం, అంజలికం, అర్ధచంద్రబాణము, తాబేటి ఆకారంగల ఆయుధం, మొదలైన బాణాలతో అల్లిన జడల మొత్తాన్నీ; వెగడు పటిచినన్= తల్లడపడేటట్లు చేయగా; విచ్చిన+వాహినులన్= చెల్లాచెదరైన సేనలను; నిలువరింపన్+నేరక= స్థిరంగా ఒకచోట నిలబెట్టటానికి చాలక; నివ్వెఱపడి= మిక్కిలి భయపడి (చేష్టలుడిగి); ఆచార్యుండు= ద్రోణాచార్యుడు; చూచుచుండెన్= చూస్తూ ఉన్నాడు; అనవుడున్= అనిన వెంటనే; ధృతరాష్ట్రుండు; సంజయునకున్= సంజయునికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, కృతవర్మ, బృహద్బలుడు, కర్ణుడు మొదలయిన యుద్ధవీరులందరూ ఒకరినొకరు పేర్లతో పిలుచుకొంటూ సైన్యాలను పురికొల్పారు. అపుడు రథనేమిధ్వనులూ, ఏనుగుల గంటల చప్పుళ్ళూ, గుర్రాల చిరుగంటల శబ్దాలూ, సింహనాదాలూ భూమ్యాకాశాలు నిండుకొన్నాయి. అందరూ భయంకరంగా అభిమన్యుడిని చుట్టుముట్టారు. అభిమన్యుడు అట్టహాసం చేస్తూ లఘుత్వంతో లక్ష్యశుద్ధితో చిత్రత్వ దృఢత్వాలతో మెరసిపోతూ, కృష్ణార్జునులు చూపే నేర్పును ప్రకటిస్తూ పోరాడాడు. గుడుసువడ్డ కోదండంతో బాణాల్ని చాకచక్యంగా గుంపులు గుంపులుగా ప్రయోగిస్తూ, వలయాకార పరివేషంలో వెలుగుతూ చూడడానికి వీలుకాని సూర్యుడిని అనుకరిస్తూ, అల్లెత్రాటి మోతతో భయంకరంగా తీవ్రమైన బాణాలు ప్రయోగించాడు. గట్టిగా గర్జిస్తూ పిడుగులు రాల్చే ప్రళయకాల మేఘం వలె విజృంభించి, రకరకాల ఆయుధాలతో చెల్లాచెదరైన సేనల్ని ఒక్కచోట నిలవనీయకుండా భయపడి పరుగెత్తేటట్టు చేశాడు. ఆ సన్నివేశాన్ని ద్రోణుడు చూస్తూ ఉండిపోయాడు' అని ధృతరాష్ట్రుడికి సంజయుడు చెప్పాడు. అపుడు ధృతరాష్ట్రుడు సంజయుడిని మళ్ళీ ఇట్లా అడిగాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **'మనమున ఖేదము మోదముఁ । బెనఁగొనియెడు మద్బలంబుఁ బీడించెడు నా**
మనుమఁడని వినికి నాతని । యని పని యటమీఁద నెట్టు లయ్యెం జెపుమా!' **40**

ప్రతిపదార్థం: నా మనుమఁడు= అభిమన్యుడు; మత్+బలంబున్= నా సైన్యాన్ని; పీడించెడున్= హతమారుస్తున్నాడు (బాధిస్తూ ఉన్నాడు); అని= ఆ ప్రకారంగా; వినికిన్= వినటంచేత; మనమునన్= మనస్సులో; ఖేదమున్= దుఃఖమూ; మోదమున్= సంతోషమూ; పెనఁగొనియెడున్= ఒకటిగా పెనవేసికొన్నాయి (మెలిగొన్నాయి); అటమీఁదన్= అటుపైన(ఆ పిమ్మట); ఆతని= ఆ అభిమన్యుడి; అనిపని= యుద్ధకార్యం; ఎట్టులు+అయ్యెన్?= ఏ విధంగా అయింది?; చెపుమా!= తెల్పుమా!

తాత్పర్యం: 'నా మనుమడు అభిమన్యుడు ఆ విధంగా నా సైన్యాన్ని అవలీలగా ఎదిరించి పీడించాడని విని నా మనస్సులో దుఃఖమూ, సంతోషమూ పెనగొన్నాయి. అటు పిమ్మట అభిమన్యుడి యుద్ధకార్యం ఎట్లయిందో తెల్పు' మని సంజయుడిని అడిగాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అంతటి మహాయోధులు ఒక్కుమ్మడిగా పసిబాలుడిపై తలపడినప్పటికీ అతడు అందర్నీ ఎదిరించి సైన్యాన్ని చీకాకు పరచాడు అన్న వార్త ఆనందాన్ని ఆ ధృతరాష్ట్రుడికి కలిగించింది. అయితే వెంటనే 'నా సైన్యాన్ని పీడించాడు' అనే విషయం విని దుఃఖమూ కలిగింది. ఈ విధంగా రెండు విరుద్ధ భావాల సమ్మేళనం ఆ ధృతరాష్ట్రుని మనస్సులో తిష్ఠవేసికొనింది. సంకల్ప వికల్పాలకు మనస్సు కూడలి. మంచిచెడ్డలు రెండూ మనస్సులో కలుగుతూ తొలగుతూ ఉంటాయి. నిలకడ లేని మనస్సులో ఎల్లప్పుడూ ద్వైధీ భావం అంటే ద్వంద్వస్థితి కొట్టుమిట్టాడుతూనే ఉంటుంది. మనస్సుకు మారుపేరైన ధృతరాష్ట్రుడి తత్త్వాన్ని తిక్కన సూత్రప్రాయంగా సూచించాడు. మళ్ళీ మళ్ళీ ప్రయోగించిన నకారాలు ధృతరాష్ట్రుని మనోవికారానికి సూచనలు.

నా బలాన్ని పీడించాడని ఖేదమూ, అది చేసింది నా మనుమడేయని మోదమూ - అని క్రమంగా అన్వయించుకోవాలి. కావున అలంకారం - యథాసంఖ్యం.

క. అనుటయు సంజయుఁ డిట్లను । 'వినుము జనాధీశ! యిట్లు వితిఁగిన సేనం
గనుఁగొని పోవఁగనీ క । ర్జున తనయుఁడు దనరథంబు చుట్లం బఱపున్. 41

ప్రతిపదార్థం: అనుటయున్= ధృతరాష్ట్రుడు ఈ విధంగా అనగా; సంజయుఁడు; ఇట్లు= ఈ రీతిగా; అనున్= అన్నాడు; జన+అధీశా!= రాజా!; వినుము; ఇట్లు= ఈ విధంగా; వితిఁగిన సేనన్= చెదరిన (ఓడిన) సైన్యాన్ని; కనుఁగొని= చూచి; అర్జునతనయుఁడు= అభిమన్యుడు; పోవఁగనీక= పోనీకుండా; తన రథంబు= తన రథము; చుట్లన్+పఱపున్= చుట్టూ పరుగెత్తించాడు.

తాత్పర్యం: ఆ విధంగా ధృతరాష్ట్రుడు అడిగిన వెంటనే సంజయుడు ఇట్లు చెప్పాడు. 'ఓ రాజా! వినుము. ఈ విధంగా చెల్లా చెదరై ఓడిన సైన్యాన్ని చూచి అభిమన్యుడు దానిని పోనీయకుండా తన రథం దాని చుట్టూ తిరిగేటట్లు చేశాడు.

వ. కొఱవి ద్రిప్పిన తెఱంగు దోఁపఁ బొదివి, పోనీక పీనుంగు పెంటలు సేసిన నప్పు డక్కుమారు నాలోకించి వికాస భాసిత వదనుం డగుచు గురుండు గురుపతి నెఱను దాఁకఁబలుకవలయు నను తలంపున నతండు వినుచుండఁ గృపాచార్యుతో నిట్లనియె. 42

ప్రతిపదార్థం: కొఱవి త్రిప్పిన తెఱంగు= కొరవి (నిప్పు కొఱకచ్చు) త్రిప్పినవిధం; తోఁపన్= తోచునట్లుగా; పొదివి= చుట్టుముట్టి; పోనీక= అటు ఇటు కదలనీకుండా; పీనుంగుపెంటలు= శవాలకుప్పలు; చేసినన్= చేయగా; అప్పుడు; ఆ+కుమారున్= ఆ అభిమన్యు కుమారుడిని (బాలుడైన అభిమన్యుడిని); ఆలోకించి= చూచి; వికాస,భాసిత,వదనుండు= వికాసంచేత ప్రకాశించే ముఖం కలిగినవాడు; అగుచున్= అగుచు; గురుండు= ద్రోణుడు; కురుపతి= దుర్యోధనుడి; నెఱను= (మర్మస్థానం) జీవస్థానం; తాఁకన్= గ్రుచ్చు(నాటుకొను)నట్లు; పలుకవలయున్= మాటాడవలెను; అను తలంపునన్= అనే అభిప్రాయంతో; అతండు= ఆ దుర్యోధనుడు; వినుచుండన్= వింటూ ఉండగా; కృపాచార్యుతోన్= కృపాచార్యుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: నిప్పుకట్టెను త్రిప్పే విధం తోచేటట్లుగా ముట్టడించి, అటునిటు పోనీకుండా సైన్యాన్ని శవాలకుప్పలు చేయగా, అప్పుడు ఆ అభిమన్యుడిని చూచి వికసించిన ముఖంతో ద్రోణుడు, దుర్యోధనుడి మర్మస్థానం గ్రుచ్చుకొనేటట్లుగా పలకాలి అనే ఉద్దేశంతో ఆ దుర్యోధనుడు వినేటట్లు కృపాచార్యుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉపమ.

ఉ. తమ్ములు నన్నలుం జెలులుఁ దండ్రులు మామలు భృత్యులుం బ్రమో
దమ్మునఁ దేల నిట్లు వడిఁ దాఁకెడునే? విజయాత్మజుండు, ఘో
టమ్ములుఁ గుంజరమ్ములు బడల్పడఁ దేరులు నుగ్గుగాఁగ నా
నమ్మిన యోధవీరులు వినాశము భంగము నొంద నొక్కఁడున్ . 43

ప్రతిపదార్థం: విజయ+ఆత్మజుండు= అభిమన్యుడు; తమ్ములున్= తమ్ములూ; అన్నలున్= అన్నలూ; చెలులున్= స్నేహితులూ; తండ్రులున్= తండ్రులూ; మామలున్= మామలూ; భృత్యులున్= సేవకులునూ; ప్రమోదమ్మునన్= సంతోషంతో; తేలన్= తేలిపోగా; ఘోటమ్ములు= గుర్రాలూ; కుంజరమ్ములున్= ఏనుగులూ; బడల్పడన్= బడలిక (అలసట) చెందగా; తేరులు= రథాలు; నుగ్గుకాఁగన్= పొడికాగా; నా నమ్మిన యోధవీరులు= నాకు విశ్వాసపాత్రులైన యుద్ధవీరులు; వినాశమున్= చావును; భంగమున్= భంగపాటును(అవమానాన్ని); ఒందన్= పొందగా; ఒక్కఁడున్= ఒకడే; ఇట్లు= ఈ విధంగా; వడిన్= వేగంతో; తాఁకెడునే?= ఎదిరించునా?

తాత్పర్యం: అన్నలూ, తమ్ములూ, ఆప్తమిత్రులూ, తండ్రులూ, మామలూ, సేవకులూ అందరూ సంతోషంలో తేలిపోగా, గుర్రాలూ, ఏనుగులూ బడలిక చెందగా, తేరులు పొడి అయిపోగా, నాకు విశ్వాసపాత్రులైన యోధవీరులు చావూ, భంగపాటూ చెందగా అభిమన్యుడు ఒక్కడే ఇంతవడిగా ఎదుర్కొన్నాడు కదా!

ఆ. అనిన వెలుకఁబాఱి యతిదీనమగు నాన । నమున నవ్వుగాని నవ్వు నెఱయ
సౌమదత్తి కర్ణ శల్యాదులగు యోధ । జనులతోడ నిట్టు లనియె విభుఁడు. 44

ప్రతిపదార్థం: అనినన్= అని ద్రోణుడు తనకు వినబడునట్లు అనగా; విభుఁడు= దుర్యోధనుడు; వెలుకన్+పాఱి= వెలవెలబోయి, వెల్లనై(వైవర్ణ్యాన్ని పొంది); అతిదీనము+అగు= మిక్కిలి దీనత్వాన్ని పొందిన; ఆననమునన్= ముఖంలో; నవ్వుకాని నవ్వు= నవ్వు అనటానికి వీలులేని నవ్వు; నెఱయన్= నిండగా(వ్యాపింపగా); సౌమదత్తి= భూరిశ్రవుడు; కర్ణ= కర్ణుడు; శల్య= శల్యుడు; ఆదులు+అగు= మొదలైనవారు అగు; యోధజనులతోడన్= యుద్ధవీరులతో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని ద్రోణు డనగానే దుర్యోధనుడు వెలవెలబోయి, దీనమైన ముఖంలో వెలవెలపోయేనవ్వు వ్యాపించగా, భూరిశ్రవుడు, కర్ణుడు, శల్యుడు మొదలైన యుద్ధవీరులతో ఇట్లా అన్నాడు:

విశేషం: ద్రోణుడు మర్మస్థానం నాటుకొనేటట్లు మాటాడేటప్పటికి దుర్యోధనుడిలో దైన్యమూ, వైవర్ణ్యమూ ఏదో బాధతో కూడుకొన్న వెడనవ్వూ కలిగాయి. 'వెలుకఁబాఱు', 'నవ్వుగానినవ్వు' వంటి క్రొత్త ప్రయోగాలతో దుర్యోధనుడిలో ఏర్పడ్డ ఒక వినూత్నమైన మార్పును తిక్కన వ్యక్తం చేశాడు. దుర్యోధనుడు దురభిమాని. అతడు బాధ కలిగించేమాట విని సహించలేడు. అందులోనూ మర్మస్థానాన్ని గ్రుచ్చుకొనేటట్లు సర్వసైన్యాధిపతీ, గురువూ అయిన ద్రోణుడు మాట్లాడడంతో మిక్కిలి చలించిపోయాడు. అందువలననే ఒకటికి మూడు విలక్షణాలు అతడిలో చోటు చేసుకొన్నట్లు తిక్కన అభివర్ణించాడు. ఈ నవ్వుకాని నవ్వునే లోకంలో ఏడవలేక నవ్వటం అంటారు.

అలంకారం: స్వభావోక్తి.

చ. 'పలుకులు వింటిరే ధనువు వట్టెడివారికి నెల్లనొజ్జ, దో
ర్బలవిదితుండు గుంభజుఁడు బాలుని నొక్కరుఁ జంచలాత్ము వెం
గలిఁ గడుఁ బెద్దఁ జేయుచుఁ బొగడ్తకుఁ జొచ్చె నితండు నొంపఁగాఁ
దలఁపడు వీనిఁ బార్థునకుఁ దాఁ గడుఁ గూర్చుట నెంత త్రుళ్ళినన్. 45

ప్రతిపదార్థం: పలుకులు+వింటిరే!= ద్రోణుని మాటలు విన్నారు కదా!; ధనువుపట్టెడి వారికిన్+ఎల్లన్= విల్లును పట్టుకునే ఎల్లవారికి అనగా విలుకాండ్రు అందరికీ; కుంభజుఁడు= ద్రోణుడు; ఒజ్జ= ఉపాధ్యాయుడు; దోః+బల విదితుండు= భుజబలంచేత ప్రసిద్ధుడు; బాలునిన్= పసివాడిని; ఒక్కరున్= ఒక్కడిని; చంచల+ఆత్మున్= చలించే మనస్సు కలవాడిని; వెంగలిన్= మూఢుడిని; కడున్= మిక్కిలి; పెద్దన్+చేయుచున్= పెద్దగా చేస్తూ; పొగడ్తకున్+చొచ్చెన్= పొగడడానికి పూనుకొన్నాడు; పార్థునకున్= అర్జునుడికి; తాన్= తాను; కడున్+కూర్చుటన్= మిక్కిలి ప్రేమించటం చేత (ప్రియము, ఇష్టము అగుటచేత); ఎంత త్రుళ్ళినన్= అభిమన్యుడు ఎంతగా మిడిసిపడినప్పటికీ; వీనిన్= ఈ అభిమన్యుడిని; ఇతండు= ఈ ద్రోణుడు; నొంపఁగాన్+తలఁపఁడు= నొప్పించటానికి ఆలోచించడు.

తాత్పర్యం: ద్రోణుడి మాటలు విన్నారు కదా! ధనుస్సును పట్టిన ప్రతివ్యక్తికీ ఆయన గురువు. బాహుబలం చేత ప్రసిద్ధుడు. ఆయన ఒక అల్పుడైన బాలుడిని, చలించే మనస్సు కలవాడిని, మూఢుడిని, ఎంతో పెద్దచేసి పొగడటానికి పూనుకొన్నాడు. తాను అర్జునుడిని ఎంతో ఇష్టపడతాడు కాబట్టి అతని కుమారుడైన అభిమన్యుడు ఎంతగా త్రుళ్ళిపడినా, అతడిని నొప్పించాలని అనుకోడు.

విశేషం: దుర్యోధనుడు అసూయాగ్రస్తుడు. మహా దురభిమాని. ఇతరులలో ఉండే మంచిని గురించి ఏ మాత్రం చెప్పినా ఓర్చుకొనలేడు. 'పలుకులు వింటిరే' అని ప్రారంభించడంలోనే దుర్యోధనుడి కుళ్ళు పాఠకులకు వ్యక్తమౌతుంది. అభిమన్యుడిలో అన్ని మంచిగుణాలు ఉంటే వాటిని కాదంటూ అతడు బాలుడనీ, చంచలాత్ముడనీ, వెంగలి అనీ తక్కువపరచి మాట్లాడాడు. 'ఒక అర్భకుడిని ఆ విధంగా పెద్దచేసి పొగడుతూ ఉన్నాడే!' అని, చివరకు ద్రోణాచార్యులనే తప్పుపట్టాడు. అర్జునుడి మీద ఉండే వల్లమాలిన అభిమానం అతడి పిల్లవానిమీద కూడా ఇతనికి కొల్లగా ఉన్నది. కాబట్టి ఇతడు అభిమన్యుడిని నొప్పించడానికి ఒల్లడు అంటూ తన తప్పిదాన్ని కప్పిపుచ్చుకొనటమే గాకుండా ద్రోణుడిపై ఒక అపవాదు కూడా మోపాడు.

చ. **గురుని యుపేక్షఁ జేసి తనకున్ సమరోద్ధతి సెల్లె; దాని నీ**
వెరవిఁడి గానలేఁడు దన వీరమకాఁ గొని విఱ్ఱవీఁగెడుం
బొరిగొనుఁ డందఱుం గడఁగి పోవఁగనీక దృఢాస్త్రశస్త్రని
ష్ఠుర పరిపాతనోగ్రముగఁ జుట్టును ముట్టి చలం బెలర్పఁగన్' **46**

ప్రతిపదార్థం: గురుని= ద్రోణుడియొక్క; ఉపేక్ష+చేసి= అశ్రద్ధ(నిర్లక్ష్యం) చేత; సమర+ఉద్ధతి= యుద్ధంలో దుడుకుతనం(గర్వం); తనకున్= ఆ అభిమన్యుడికి; చెల్లెన్= చెల్లింది; దానిన్= ఆ చనవును; ఈ+వెరవిఁడి= ఈ తెలివితక్కువవాడు; కానలేఁడు= తెలిసికొనలేకున్నాడు; తన+వీరము+అ+కాన్= తన శౌర్యమే అని; కొని= తలంచి; విఱ్ఱవీఁగెడున్= గర్విస్తున్నాడు; అందఱున్= మీరందరూ; కడఁగి= పూనుకొని; పోవఁగనీక= పారిపోనీకుండా; దృఢ+అస్త్ర+శస్త్ర+నిష్ఠుర+పరిపాతన+ఉగ్రముగన్= గట్టివైన, బాణాలచేతను, ఆయుధాలచేతనూ, కఠినంగా పడవైచుట చేతను, భయంకరంగా; చుట్టును= ఆ అభిమన్యుని చుట్టూ; ముట్టి= ముట్టడించి; చలంబు+ఎలర్పఁగన్= పట్టుదల అతిశయింపగా; పొరిగొనుఁడు= చంపండి.

తాత్పర్యం: ద్రోణాచార్యుడి అశ్రద్ధవలన వాడి దుడుకుతనం చెల్లింది. అది ఆ తెలివితక్కువ దద్దమ్మ తెలిసికొనలేక అంతా తన శూరత్వమే అని విర్రవీగుతూ ఉన్నాడు. మన యోధవీరులందరూ ప్రయత్నించి వాడిని పారిపోనీయకుండా చూడండి. గట్టి బాణాలతో, ఆయుధాలతో, బిగువైన దెబ్బలతో పడవైచి పట్టుదల సడలకుండా, భయంకరంగా వాడిని చుట్టుముట్టి మట్టుపెట్టండి.'

వ. **అనిన విని వార లందఱు న వ్వాసవపౌత్రుం బొదువం బోవ నవ్వీరుల వారించి దుశ్శాసనుం డిట్లనియె.47**

ప్రతిపదార్థం: అనినన్= అని దుర్యోధనుడు చెప్పగా; విని; వారలు= ఆ యోధవీరులు; అందఱున్= అందరున్నూ; ఆ+వాసవపౌత్రున్= ఆ ఇంద్రుని మనుమడైన అభిమన్యుడిని; పొదువన్+పోవన్= చుట్టుముట్టుటకై పోగా; ఆ+వీరులన్= ఆ యుద్ధవీరులను అందరినీ; దుశ్శాసనుండు= దుర్యోధనుడి తమ్ముడు; వారించి= నిలిపి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా దుర్యోధనుడు యుద్ధవీరులకు చెప్పగా విని వారు అందరూ అభిమన్యుడిని చుట్టుముట్టటానికి బయలుదేరారు. అప్పుడు ఆ వీరవరులను దుశ్శాసనుడు నిలిపి ఈ విధంగా అన్నాడు:

చ. **'ఇనుఁ గబళించు రాహు క్రియ నే నొకరుండన పోయి పార్థపు**
త్త్రునిఁ బరిమార్తు నీతఁడు మృతుం డగు టేర్పడ విన్నఁ గేశవా
ర్జునులును బిట్టు సత్తు రతిశోక భరంబునఁ జేసి యంతతో
మన పగ దీఱుఁ దీవ్రమగు మద్భుజదర్పము సొంపు సూడుఁడీ!' **48**

ప్రతిపదార్థం: ఇనున్= సూర్యుడిని; కబళించు= మ్రింగే; రాహు+క్రియన్= రాహువువలె; ఏను= నేను; ఒకరుండన= ఒక్కడనే; పోయి= అభిమన్యుడి కడకు వెళ్ళి; పార్థపుత్త్రునిన్= అర్జునుడి కొడుకును; పరిమార్తున్= హతమారుస్తాను; ఈతఁడు= ఈ అభిమన్యుడు; మృతుండు+అగుట= (చచ్చుట) మరణించటం; ఏర్పడ+విన్నన్= స్పష్టంగా వింటే; కేశవ+అర్జునులును= శ్రీకృష్ణుడూ, అర్జునుడూ; అతి+శోక+భరంబునన్+చేసి= అధికమైన దుఃఖభారంచేత; బిట్టు= వెంటనే, శీఘ్రంగా; చత్తురు= చస్తారు; అంతతోన్= అంతటితో అంటే వారి మరణంతో; మన పగ= మన విరోధం (ద్వేషం); తీఱున్= నశిస్తుంది; తీవ్రము+అగు= తీక్ష్ణమైన; మత్+భుజ+దర్పము+సొంపున్= నా భుజగర్వం యొక్క అందాన్ని; చూడుఁడీ!= చూడండి!

తాత్పర్యం: సూర్యుడిని మ్రింగే రాహువు మాదిరి నేను ఒక్కడినే పోయి, ఆ అభిమన్యుడిని చంపుతాను. వాడి చావు వినగానే కృష్ణార్జును లిద్దరూ శోకభారంతో వెంటనే చస్తారు. అంతటితో మన పగ అంతరించిపోతుంది. ఇప్పుడు నా భుజగర్వం యొక్క విజృంభణాన్ని చూడండి.

విశేషం: 'ఇనుఁ గబళించు రాహుక్రియ' అనే ప్రయోగంలోని పోలికలే అభిమన్యు-దుశ్శాసనుల ప్రవృత్తులను తెలుపుతూ ఉన్నాయి. అభిమన్యుడు సూర్యుడివలె తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. అతడిని రాహువు మాదిరి గ్రసిస్తాను అని దుశ్శాసనుడు తన రాక్షస ప్రవృత్తిని వెల్లడించాడు. పదభంగంతో రెండు మూడు పాదాలు ఆరంభించటం, దుశ్శాసనుడి మాటల తీరును బట్టి 'పార్థపుత్రుడిని తునుమాడటాన్ని -దాని కారణంగా అర్జునుడి హానిని ధ్వనింపజేస్తున్నాయి. రాహువుతో పోలిక కాబట్టి తన బాహువుల దర్పపు సొంపు చూడండి అనటం ఎంతో ఔచిత్యవంతంగా ఉంది.

దుశ్శాసనుఁడు అభిమన్యుడితోడం బోరి పారిపోవుట (సం. 7-38-26)

వ. **అని పలికి యార్చి యమ్ములు నిగిడించుచు, ధనంజయ నందనుం దాఁకిన నతండు షడ్వింశతి సాయకంబులు దనువునం జొనిపినం గనలి దుశ్శాసనుండు శరాసార ఘోరంబుగాఁ గవిసినం, గిరీటి కొడుకునుం బేర్చి పెనంగ నయ్యిరువుర కరలాఘవ శరలాఘవ ప్రకారంబులు రథ చిత్ర ప్రచారంబులుఁ జూప అగ్గించి; రప్పు డగ్గలిక సొంపున సుభద్రాసూనుండు నీ సుతువిల్లు ద్రుంచి, భల్లంబుల మేను సెక్కి స్రుక్కించి యతనితో నిట్లనియె.** **49**

ప్రతిపదార్థం: అని పలికి= ఆ ప్రకారముగా మాట్లాడి; ఆర్చి= గర్జించి; అమ్ములు= బాణాలు; నిగిడించుచున్= ప్రయోగిస్తూ; ధనంజయనందనున్= అర్జునుడి కొడుకు అభిమన్యుడిని; తాఁకినన్= మార్కొనగా; అతండు= అభిమన్యుడు; షట్+వింశతి+సాయకంబులు= ఇరవైఆరు బాణాలు; తనువునన్= శరీరంలో; చొనిపినన్= గ్రుచ్చగా; కనలి= కోపించి; దుశ్శాసనుండు; శర+ఆసార+ఘోరంబుగాన్= బాణవర్షంచేత భయంకరంగా; కవిసినన్= ఎదుర్కొనగా; కిరీటి కొడుకునున్= అభిమన్యుడున్నూ; పేర్చి= అతిశయించి; పెనంగన్= పోరాడగా; ఆ+ఇరువుర+కర+లాఘవ+శర+ లాఘవ+ప్రకారంబులు= ఆ ఇద్దరి చేతిలాఘవం, బాణలాఘవం యొక్క పద్ధతులు; రథచిత్ర ప్రచారంబులున్= రథములయొక్క విచిత్రములైన సంచారాలను; చూపఁటు= చూచేవారు; అగ్గించిరి= పొగడారు; అప్పుడు= ఆ సమయంలో; అగ్గలిక+సొంపునన్= శౌర్యం(ఉత్సాహం, పూనిక) యొక్క సొంపుతో; సుభద్రాసూనుండు= సుభద్రకొడుకు; నీ+సుతు+విల్లు= నీ కుమారుడి చాపాన్ని; త్రుంచి= విరిచి; భల్లంబులన్= బల్లెములతో; మేను= శరీరం; చెక్కి= ఖండించి; స్రుక్కించి= సోలిపోయేటట్టు చేసి; అతనితోన్= దుశ్శాసనుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అట్లు మాట్లాడి, అరచి, బాణాలు ప్రయోగిస్తూ అభిమన్యుడిని ఎదుర్కొన్నాడు. అప్పుడు అభిమన్యుడు ఇరవై ఆరుబాణాలు దుశ్శాసనుడి శరీరంలోకి చొప్పించాడు. అందుకు దుశ్శాసనుడు కోపించి బాణవర్షాన్ని కురిపిస్తూ భయంకరంగా ఎదిరించాడు. అంత అభిమన్యుడు అతిశయించి పోరాడాడు. ఆ ఇద్దరున్నూ కరలాఘవాన్ని, శరలాఘవాన్ని ప్రదర్శిస్తూ రథాలను చిత్రవిచిత్రంగా నడిపించారు. వారి యుద్ధాన్ని చూచి చూపరులు ఎంతో పొగడారు. అప్పుడు శౌర్యపు సొంపుతో సుభద్రకొడుకు నీ కుమారుడి విల్లు విరిచి, బల్లెములతో శరీరాన్ని చెక్కి సోలిపోయేటట్లు చేసి ఈ విధంగా అన్నాడు:

చ. **'అనఘుని ధర్మనందనుని నా సభ నమ్మెయి నీవు నొవ్వఁ బ**
ల్కిన ఫల మందఁజేసెదఁ జలింపక యించుక సేపు నిల్వుమీ !
నిను లఘుచిత్తుఁ గ్రూరు నవినీతు మదాంధునిఁ ద్రుంచి నన్నుఁ బెం
చిన గరువంపుఁ దండ్రులకుఁ జిత్త మెలర్ప ఋణంబుఁ దీర్చెదన్.' **50**

ప్రతిపదార్థం: అనఘునిన్= పాప రహితుడిని; ధర్మనందనునిన్= ధర్మరాజును; ఆ సభన్= ఆ కౌరవసభలో; అమ్మెయిన్= ఆ విధంగా; నీవు; నొవ్వన్= బాధకలిగేటట్లు; పల్కిన ఫలము= మాటాడిన ఫలితాన్ని; అందన్+చేసెదన్= అందేటట్లు చేస్తాను; చలింపక= కదలక; ఇంచుకసేపు= కొంచెంసేపు; నిల్వుమీ!= నిలువుము!; నినున్= నిన్ను; లఘుచిత్తున్= అల్పబుద్ధిని; క్రూరున్= ఇతరులను పీడించేవాడిని; అవినీతున్= నీతిమాలినవాడిని; మద+అంధునిన్= గర్వంచేత కళ్ళు కనిపించని వాడిని; త్రుంచి= చంపి; నన్నున్= నన్ను; పెంచిన= పోషించిన; గరువంపు+తండ్రులకున్= గొప్ప వారైన జనకులకు; చిత్తము= మనస్సు; ఎలర్పన్= సంతోషించగా; ఋణంబు+తీర్చెదన్= అప్పు తీరుస్తాను.

తాత్పర్యం: పాపరహితుడైన ధర్మరాజును సభలో ఆ విధంగా నొప్పించి మాటాడిన ఫలితాన్ని ఇప్పుడు అందజేస్తాను. కదలకుండా కొంచెంసేపు నిలువుము. అల్పబుద్ధివి, క్రూరుడవు, అవినీతిపరుడవు, గర్వాంధుడవు అయిన నిన్ను చంపి, నన్ను పోషించిన ఆ మహనీయులైన తండ్రులకు సంతోషాన్ని కలిగించి వారి అప్పు తీరుస్తాను.(ఉద్ధరిస్తాను)

విశేషం: దుశ్శాసనుడికి ప్రయోగించిన విశేషణాలు పొడిపొడిగా అతి స్వల్పంగా ఉండే సమాసాలలో ఉన్నాయి. అవి వాడి అల్పత్వానికి నిదర్శనాలు. పాపరహితులను నొప్పించిన ఫలితం ఊరకపోదు. అది వడ్డీతో కూడా తీర్చవలసి ఉంటుంది. 'నన్ను పెంచిన మహనీయుల ఋణం తీర్చుకొనటానికి నీవే నాకు తగిన సాధనం' అని అభిమన్యుడు దుశ్శాసనుడిని హెచ్చరించిన విధానం అతడి మనస్తత్వానికి అనుగుణంగానే ఉన్నది.

క. **అని యతని జత్రుదేశం । బున నొకవాలమ్ము వక్షమునఁ బెక్కును గ్రు**
చ్చినఁ ద్రెళ్ళి యెన్నఁడో చ । చ్చిన యట్లు రథంబు మీఁదఁ జేష్టడి యుండెన్. **51**

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా పలికి; అతని= ఆ దుశ్శాసనుడి; జత్రుదేశంబునన్= మూపులయొక్క సంధి ఎముక లుండే ప్రదేశంలో; ఒకవాలు+అమ్మున్= ఒక వాడి అయిన బాణాన్ని; వక్షంబునన్= రొమ్మునందు; పెక్కును= చాలా బాణాలను; గ్రుచ్చినన్= నాటుకొనేటట్లు ప్రయోగించగా; త్రెళ్ళి= సోలిపడి; ఎన్నడో చచ్చిన అట్లు= ఎంతోకాలం ముందుగానే చచ్చినట్లు (చచ్చి పాతబడినట్లు); రథంబుమీఁదన్= రథంపై; చేష్టడి+ఉండెన్= చేష్టలుడిగి ఉండిపోయాడు.

తాత్పర్యం: ఆ విధంగా అంటూ దుశ్శాసనుడి మూపున సంధి ఎముకల స్థానంలో ఒక వాడి అయిన బాణాన్ని, రొమ్మునందు అనేక బాణాలను అభిమన్యుడు ప్రయోగించాడు. దానితో అతడు రథంపై పడి, ఎప్పుడో చచ్చిన వాడివలె వ్యాకులపాటుతో భంగపడి అట్లే ఉండిపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు మూర్ఛిల్లిన దుశ్శాసను తేరు సారథి తొలంగఁ దోలుకొని పోయె; నంతకుమున్న కౌంతేయులు సౌభద్రుండు సొచ్చిన పథంబున నా పద్మవ్యూహంబు సేనాసందోహ సహితులై చొచ్చి యెడనెడ నడ్డపడు సైన్యంబులతో సంగరంబు సేయుచు నక్కుమారుం దలలెత్తి చూచుచు నతం డరిబలంబులం గలంచుటకు సంప్రీతులగుచుఁ దోఁతెంచువారు ముందట దుశ్శాసనుండు భంగపడుట గనుంగొని పొంగి యార్పులు నింగిముట్ట నయ్యభిమన్యు ననేక భంగులం బ్రశంసించుచుం దఱిమి; రట్టియెడ. 52

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మూర్ఛిల్లినన్= మూర్ఛచెందగా; దుశ్శాసను+తేరున్= దుశ్శాసనుని రథాన్ని; సారథి; తొలంగన్= ఆ ప్రదేశం నుండి తొలగిపోయేటట్లు; తోలుకొని పోయెన్= దూరంగా తరుముకొని పోయాడు; అంతకుమున్న= అంతకు మునుపే; కౌంతేయులు= కుంతీపుత్రులు అనగా పాండవులు; సౌభద్రుండు= అభిమన్యుడు; చొచ్చిన= ప్రవేశించిన; పథంబునన్= దారిలో; ఆ పద్మవ్యూహంబున్= ఆ పద్మవ్యూహాన్ని; సేనాసందోహ సహితులై= సైన్య సమూహాలతో కూడుకొన్న వారై; చొచ్చి= ప్రవేశించి; ఎడన్+ఎడన్= అక్కడక్కడా; అడ్డపడు+సైన్యంబులతోన్= అడ్డగించే సైన్యాలతో; సంగరంబు= యుద్ధం; చేయుచున్= చేస్తూ; ఆ+కుమారున్= కుమారుడైన ఆ అభిమన్యుడిని; తలలు+ఎత్తి+చూచుచున్= తమ శిరస్సులు పైకెత్తి చూస్తూ; అతండు= ఆ అభిమన్యుడు; అరి+బలంబులన్= శత్రువుల సైన్యాలను (పగవారి సేనలను); కలంచుటకున్= కలత కలిగించటానికి; సంప్రీతులు+అగుచున్= మిక్కిలి సంతోషాన్ని పొందినవాళ్ళు అవుతూ; తోఁతెంచువారు= వస్తూ ఉన్నవాళ్ళు; ముందటన్= ఎదురుగా; దుశ్శాసనుండు; భంగపడుటన్= భంగపాటు పొందటాన్ని; కనుంగొని= చూచి; పొంగి= సంతోషించి; ఆర్పులు= గట్టిగా అరుస్తూ చేసే నినాదాలు; నింగిన్+ముట్టన్= ఆకాశాన్ని అంటుకోగా; ఆ+అభిమన్యున్= ఆ అభిమన్యుడిని; అనేకభంగులన్= అనేక విధాలుగా; ప్రశంసించుచున్= పొగడుతూ; తఱిమిరి= విజృంభించారు; అట్టి+ఎడన్= అటువంటి సందర్భంలో.

తాత్పర్యం: దుశ్శాసనుడు సొమ్మసిల్లి చచ్చినట్లు పడిపోగానే అతడి సారథి రథాన్ని దూరంగా తోలుకొని పోయాడు. అంతకుముందే పాండవులు అభిమన్యుడు ప్రవేశించిన మార్గంలో తమ సైన్యంతో ప్రవేశించి, అక్కడక్కడా అడ్డగించే సేనలతో యుద్ధంచేస్తూ, అప్పుడప్పుడూ అభిమన్యుడిని తలలెత్తి చూస్తూ, ఆ అభిమన్యుడు పగవారి సేనలను కలత నొందించటాన్ని చూచి చాలా సంతోషిస్తూ, ముందుకు చొచ్చుకొని వచ్చారు. ఆ విధంగా వస్తూ పాండవులు తమకు ఎదురుగా అభిమన్యుడిచేత దుశ్శాసనుడు భంగపాటు పొందటాన్ని చూచి ఎంతో సంతోషించి గట్టిగా అరచారు. ఆ అరపులు ఆకాశం దాకా వ్యాపించాయి. వాళ్ళు అభిమన్యుడిని ఎన్నో విధాలుగా పొగడుతూ అతడిని వెంబడించారు. అటువంటి తరుణంలో.

సీ. రాధేయుఁ జూచి రారాజు 'దుశ్శాసనుఁ । డభిమన్యుచే నొచ్చె నకట! కంటె!
యనవుడు నతఁడు సేనాన్వితంబుగ నక్కు । మారు పై నడర నవ్వీరుఁ డేచి
ముందటి మూఁకల ద్రుంచి కదిసి డె । బ్బది మూఁడు దూఁపులఁ బటురయమున
నొంచిన రక్తాననుండయి దివ్యాస్త్ర । జాలంబు వఱపు నా జామదగ్న్య

తే. శిష్యు భుజవీర్యశౌర్య విశేషభంగి । సరకుగొనక య బ్బాలుండు సమదలీలఁ
బెనఁగ న య్యంగరాజు డస్సిన, నెఱింగి । యతని తమ్ముఁ డయ్యర్జునసుతునిఁ దాఁకి. 53

ప్రతిపదార్థం: రారాజు= దుర్యోధనుడు; రాధేయున్+చూచి= కర్ణుడిని చూచి; దుశ్శాసనుండు= నా తమ్ముడు దుశ్శాసనుడు; అకట!= ఔరా!; అభిమన్యుచేన్+నొచ్చెన్= అభిమన్యుడిచేత నొచ్చినాడు; కంటె!= చూచావా?; అనవుడున్= అని అనగానే; అతఁడు= ఆ కర్ణుడు; సేనా+అన్వితంబుగన్= సైన్యంతో కూడి; ఆ+కుమారుపైన్= ఆ అభిమన్యుడిపై; అడరన్= విజృంభించగా; ఆ+వీరుఁడు=

వీరుడైన ఆ అభిమన్యుడు; ఏచి= అతిశయించి; ముందటి మూఁకలన్= కర్ణుడికి ముందుండే సేనలను; ద్రుంచి= చంపి; కదిసి= చేరి, సమీపించి; డెబ్బది మూఁడు తూఁపులన్= డెబ్బైమూడు బాణాలతో; పటురయమునన్= మిక్కిలి తొందరగా; నొంచినన్= బాధపెట్టగా; రక్త+ఆననుండు+అయి= ఎర్రని ముఖం కలవాడై (కోపించినవాడై); దివ్య+అస్త్ర+జాలంబున్= దివ్యములైన బాణాల మొత్తాన్ని; పఱపు= ప్రయోగించే; ఆ+జామదగ్న్య+శిష్యు= ఆ పరశురాముడి శిష్యుడియొక్క; భుజవీర్య= బాహుబలంయొక్కయు; శౌర్య= శూరత్వం యొక్కయు; విశేషభంగిన్= ఆధిక్యం గల తీరును; సరకుగొనక= లక్ష్యపెట్టకుండా; ఆ+బాలుండు= ఆ అభిమన్యుడు; సమదలీలన్= గర్వంతో (సంతోషపూర్వకమైన విలాసంతో); పెనఁగన్= యుద్ధం చేయగా; ఆ+అంగరాజు= ఆ కర్ణుడు; డస్సినన్= అలసిపోగా; ఎఱింగి= తెలిసికొని; అతని తమ్ముఁడు= కర్ణుని తమ్ముడు; ఆ+అర్జున సుతునిన్= ఆ అభిమన్యుడిని; తాఁకి= మార్కొని, ఎదిరించి.

తాత్పర్యం: దుర్యోధనుడు కర్ణుడిని చూచి 'అయ్యో! దుశ్శాసనుడు అభిమన్యుడిచేత నొప్పించబడ్డాడు. చూచావా!' అన్నాడు. వెంటనే కర్ణుడు సైన్యంతో ఆ అభిమన్యుడి మీదికి దూకగా ఆ వీరుడు విజృంభించి కర్ణుడికి ముందుండే సేనలను చంపి, కర్ణుడిని సమీపించి డెబ్బైమూడు బాణాలను ఎడతెరిపి లేకుండా మహావేగంగా ప్రయోగించి నొప్పించాడు. దానితో కర్ణుడు కోపించినవాడై ఎర్రని మొగంతో దివ్యాస్త్రాలను ప్రయోగించాడు. పరశురాముడి శిష్యుడైన ఆ కర్ణుడి భుజబలాన్ని, శౌర్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ అభిమన్యుడు గర్వంతో యుద్ధం చేశాడు. దానితో అంగరాజు (కర్ణుడు) అలసిపోయాడు. ఇది తెలిసికొని కర్ణుడి తమ్ముడు అభిమన్యుడిని ఎదుర్కొన్నాడు.

విశేషం: ఈ సీసపద్యంలో అభిమన్యుడిని ఒకరి తర్వాత మరొకరు ఏ విధంగా ఎదుర్కొన్నారో, వాళ్ళనందరినీ ఆ బాలుడు ఎట్లా చీల్చి చెండాడాడో తిక్కన అభివర్ణించాడు. కర్ణు డెదుర్కొన్న విధానాన్ని, అతడి భుజబల శౌర్యాన్ని అభివర్ణిస్తూ అతడు పరశురాముడి శిష్యుడనే విషయాన్ని కూడా సూచించాడు.

చ. **హయముల మీఁద సూతుపయి నాతని యంగములందు నస్త్రసం**
చయ మడరించినం గమలచారు ముఖంబున నెఱ్ఱనవ్వు చె
న్నయి విలసిల్ల భల్లమున నన్నరసూనుఁడు ద్రుంచె విద్విష
ద్భయద విలాస బాహు సముదగ్రత వాని శిరంబు గ్రక్కునన్. 54

ప్రతిపదార్థం: హయములమీఁదన్= గుర్రాలపైన; సూతుపయిన్= సారథిమీద; ఆతని+అంగములందున్= ఆ అభిమన్యుడి అవయవాలలో; అస్త్రసంచయము= బాణాల మొత్తం; అడరించినన్= ప్రయోగించగా; కమల+చారు+ముఖంబునన్= తామరవంటి అందమైన మొగంలో; ఎఱ్ఱనవ్వు= కోపంతోడి నవ్వు; చెన్ను+అయి= అందగించి; విలసిల్లన్= ప్రకాశింపగా; ఆ+నరసూనుఁడు= ఆ అర్జునుడి కుమారుడు; విద్విషత్+భయద= పగవాళ్ళకు భయాన్ని ఒసగునటువంటి (కలిగించునట్టి); విలాస= విలసనంతోడి; బాహు+సముదగ్రతన్= భుజబలంయొక్క అతిశయంతో; గ్రక్కునన్= తటాలున (తత్క్షణం); భల్లమునన్= బల్లెంతో; వాని శిరంబున్= అతడి తలను; త్రుంచెన్= నరికాడు.

తాత్పర్యం: గుర్రాలపైన, సారథిమీద అభిమన్యుడి అవయవాలందు అనేక బాణాలను ప్రయోగించగా తామరవంటి అందమైన జేవురించిన మొగంలో ఎర్రని నవ్వు ఎంతో అందగించగా, అర్జున కుమారుడు శత్రువులకు భయం కలిగించే బాహు బలాధిక్యంతో వెంటనే బల్లెం తీసికొని అతడి తల నరికాడు.

విశేషం: 'కమలచారు ముఖంబు' 'ఎఱ్ఱ నవ్వు చెన్ను' వంటి ప్రయోగాలలో బాలుడైన అభిమన్యుడి సహజసౌందర్యం కోపించిన సమయంలో కూడా ఏ విధంగా విలాసంతో శోభించిందో తిక్కన చక్కగా ప్రకటించాడు. నవ్వుకు సంబంధించి తిక్కన స్వయంగా

కల్పించిన ఎన్నో వినూత్న ప్రయోగాలలో 'ఎఱ్ఱనవ్వు' ఒక రసోచిత మృదుమధుర పదబంధం. కోపం వర్ణం ఎరుపు అనటం కవి సమయం. నవ్వు గాని నవ్వు వంటిదే విలక్షణమైన నవ్వు. తిక్కన తన భాగంలో రకరకాల నవ్వులనెన్నిటినో ధరించాడు. ఇది ఆతడి అభినయ కౌశలానికి నిదర్శనం. అలంకారం: స్వభావోక్తి.

ఉ. ఇమ్మెయిఁ దమ్మునిం దునుము నేపు గనుంగొని యోహటించి, శీ
ఘ్రమ్మునఁ బెంపఱం దొలఁగెఁ గర్ణుఁడు పెక్కు బలంబు లప్పు డొ
క్కుమ్మడిఁ ద్రోచి యుద్ధత మహోదధిఁ బోలఁగ మందరమ్ము చం
దమ్మున నొప్పె నుద్భటవిధస్ఫురణుం డగు పార్థపుత్త్రుఁడున్. 55

ప్రతిపదార్థం: కర్ణుఁడు= కర్ణుడు; ఈ+మెయిన్= ఇట్లా; తమ్మునిన్= తమ్ముడిని; తునుము+ఏపున్= వధించే గర్వాన్ని; కనుంగొని= చూచి; ఓహటించి= వెనుకంజవేసి; పెంపు+అఱన్= గర్వం నశింపగా; శీఘ్రమ్మునన్= త్వరగా; తొలఁగెన్= తొలగిపోయాడు; అప్పుడు= ఆ సందర్భంలో; పెక్కుబలంబులు= అనేక సైన్యాలు; ఒక్కుమ్మడిన్= ఒక్క పెట్టున; త్రోఁచి= ఒకరికొకరు మీరి; ఉద్ధత మహా+ఉదధిన్= పొంగే గొప్ప సముద్రాన్ని; పోలఁగన్= పోలి ఉండగా; ఉద్భట+విధ= ఆధిక్యంయొక్క విధానాన్ని; స్ఫురణుండు= తోచుట గలవాడు; అగు= అయినటువంటి; పార్థపుత్త్రుఁడున్= అభిమన్యుడున్నూ; మందరమ్ము+చందమ్మునన్= మందరపర్వతం మాదిరిగా; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: అభిమన్యుడు తమ్ముడిని సంహరించే ఆటోపాన్ని చూచి, కర్ణుడు వెంటనే వెనుదిరిగి వెళ్ళిపోయాడు. అప్పుడు అనేక సైన్యాలు అన్నీ ఒకటిగా చేరి మహాసముద్రంవలె పైన బడ్డాయి. ఆ సమయంలో అర్జునుడి కొడుకు తన ఆధిక్యాన్ని తెలుపుతూ మందరపర్వతం మాదిరి ఆ సైన్య సముద్రాన్ని మథింపజొచ్చాడు.

విశేషం: అలం: ఉపమ. సైన్యం ఉద్ధతమహోదధి అయితే పార్థుని పుత్త్రుడు 'ఉద్భట విధస్ఫురణు' డై మందర పర్వతాన్ని అనుకరించాడనీ, పదప్రయోగంలో సన్నివేశానుగుణంగా తిక్కన వీరరస స్ఫోరకమైన భాషాపటిమను ప్రదర్శించాడు.

వ. ఇట్లు మూఁకలం గలంచి. 56

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మూఁకలన్= సేనలను; కలంచి= కలతనొందించి

తాత్పర్యం: ఈ విధంగా సేనలను కలత నొందించి.

క. వెస రాధేయుని తొలఁగిన । దెసకుం జనుటయు నతండు ధృతిచెడి విఱిగెం
బస పొడవడఁగఁగఁ బెఱయో । ధ సమూహము పాఱె ధరణితల మద్రువంగన్. 57

ప్రతిపదార్థం: రాధేయుని+తొలఁగిన+దెసకున్= కర్ణుడు తొలగిపోయిన దిక్కుకు; వెసన్= తొందరగా(వెంటనే); చనుటయున్= (అభిమన్యుడు) పోవటమున్నూ; అతండు= ఆ కర్ణుడు; ధృతి+చెడి= ధైర్యం నశించి; విఱిగెన్= పారిపోయాడు; పెఱ+యోధ+సమూహము= ఇతర వీరుల మొత్తమూ; పస+పొడవు+అడఁగఁగన్= గర్వంయొక్క అతిశయం నశించగా; ధరణితలము= భూప్రదేశం; అద్రువంగన్= అదరిపోయేటట్లుగా; పాఱెన్= పరుగెత్తింది.

తాత్పర్యం: కర్ణుడు ఏ వైపు తొలగివెళ్ళాడో ఆ దిక్కుకే అభిమన్యుడూ పోయాడు. అపుడు ఆ కర్ణుడు ధైర్యం చెడి పారిపోయాడు. వెంటనే ఇతర వీరులు కూడా తమ దర్పాన్ని వీడి, భూమి అదిరిపోయేటట్లుగా పరుగులు తీశారు.

విశేషం: రసోచిత పద ప్రయోగంలో తిక్కన నేర్పు అసాధారణం. అందులోనూ సమయ సందర్భాలకు అనుగుణంగా అచ్చతెలుగు పదాలను సమకూర్చడంలో ఆయనకు ఆయనయే సాటి. కర్ణుడు ధైర్యం చెడి పారిపోగా, అతడిని ఆశ్రయించిన తక్కిన యోధులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏ విధంగా బిక్కురుమని దిక్కు కొకరుగా పరువులెత్తి పోయారో, డకారంగల పదాలలో సూచించారు. 'యోధ సమూహ' మనే పదాన్ని ఛందశ్శిల్ప మర్మజ్ఞుడైన తిక్కన విఱిచి, ఆ సందర్భాన్ని ధ్వనింపజేశాడు.

వ. ఇ వ్విధంబున సైన్యంబులు దారును బఱచు దొరలం జూచి యాచార్యుండు. 58

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; సైన్యంబులు= సైన్యాలు; తారును= తామూ; పఱచు= పరుగులెత్తే; దొరలన్= వీరులను; చూచి= కనుగొని; ఆచార్యుండు= ద్రోణాచార్యుడు.

తాత్పర్యం: ఈ విధంగా సైన్యాలూ తామూ పరుగులెత్తే వీరులను చూచి ద్రోణాచార్యుడు.

చ. నిలు నిలు కర్ణ! యో కృపుఁడ! నీ విటు లేల కడంక దక్క, సౌ
బల! ధృతి దూల నేమిటికి? బాహ్లిక! యిత్తఱిఁ గౌరవేంద్ర! నీ
బలముఁ జలంబుఁ జూపి నిలుపందగు సేనల' నంచుఁ బెక్కు భం
గులఁ బురికొల్ప నెవ్వరును గోల్తల సేయర యేమి సెప్పుదున్! 59

ప్రతిపదార్థం: కర్ణ!= ఓ కర్ణుడా!; ఓ కృపుఁడ!= ఓ కృపాచార్యా!; నిలు నిలు= నిలువుము నిలువుము(పాఱిపోకు); సౌబల=ఓ శకునీ! నీవు= నీవు; ఇటులు= ఈ విధంగా; కడంకన్= పూనికను; తక్కన్+ఏల?= వదలటం ఎందుకు?; బాహ్లిక!= బాహ్లికుడా!; ఇత్తఱిన్(ఈ+తఱిన్)= ఈ సమయంలో; ధృతిన్= ధైర్యాన్ని; తూలన్+ఏమిటికిన్?= విడవటం ఎందుకు?; కౌరవేంద్ర!= దుర్యోధనా !; నీ+బలమున్= నీ బలాన్ని; చలమున్= పట్టుదలను లేదా మాత్సర్యాన్ని; చూపి= ప్రకటించి; సేనలన్= సైన్యాలను; నిలుపన్ +తగున్= తప్పక నిలుపవలసి ఉంది; అంచున్= అని తెలుపుతూ; పెక్కు+భంగులన్= అనేక విధాలుగా; పురికొల్పన్= ప్రేరేపించగా; ఎవ్వరును= ఎవరుగానీ; కోల్తల+చేయర= (ఎదిరింపరైరి) మార్కొనటం చేయలేదే!; ఏమి+చెప్పుదున్?= ఏమి చెప్పగలను?

తాత్పర్యం: 'ఓ కర్ణా! ఓ కృపుడా! మీరు నిలవండి. పారిపోవద్దు. ఓ శకునీ! నీవెందుకు ప్రయత్నాన్ని విడిచావు? బాహ్లికా! నీవెందుకు ధైర్యాన్ని వదలిపెట్టావు? దుర్యోధనా! ఇప్పుడు నీవు నీ బలాన్నీ పట్టుదలనూ చూపి సేనలను నిలుపవలసి ఉన్నది' అని అంటూ అనేక విధాలుగా ప్రేరేపించినా ఎవ్వరూ ఎదుర్కొనటానికి ముందుకు రాలేదు. ఇంకేమి అనాలి?

విశేషం: పరుగులెత్తుతూ, ప్రయత్నించక, ధైర్యాన్ని కోల్పోయిన అందరినీ పేరుపేరునా పిలుస్తూ, ప్రత్యేకించి దుర్యోధనుడితో 'నీవైనా నీ బలాన్నీ, చలాన్నీ చూపి సేనలను నిలుపవలసి ఉంది' అని ద్రోణుడు చెప్పిన విధానం ఈ చంపకమాలలో అప్రయత్నస్ఫూర్తితో అతిసహజంగా ప్రదర్శితమైనది.

వ. ఇట్లు ప్రళయ సమయ ధారాధరస్ఫీత నిర్ఘాతచ్ఛటాభీలంబగు నబ్బాలుని బెడిదంపు టంపఱ సైరింపంజాలక నీబలంబులువాఱిన నక్కుమార కంఠీరవుండు సింహనాదంబు సేసి శంఖంబు పూరించి గుణంబుసారించి యనికిం దనివి సనక వెనుకం దవిలి వట్టియడవి ముట్టి యేర్చు కార్చిచ్చు చందంబునం జతురంగబలంబులం బారిసమరినం దేరులు నలియం ద్రెళ్ళిన శుండాలంబులును గాలుబలంబుల పీనుంగుపెంటలమీఁద నూఁదుకొనం గూలిన ఘోటకంబులును, గుట్టపు టట్టలరాసులు మూసికొని యఱవఱలైనయరదంబులును గరటి కళేబరంబులు వొదవినంగాలుగాలం బెనఁచుకొని పడియున్న సుభట సమూహంబులును,గంకణాంగద కాంతంబులైనకరకాండంబుల గములును, ముసుంగు వడ డొల్లిన సకుండల మస్తకంబులును, వీరకటకంబులు మెఱయఁ జిక్కువడియున్న చరణంబులును, గ్రిందుపడం దొరంగిన గాత్ర ఖండంబులును దునియలైన

ధనురాది హేతివ్రాతంబులపైఁ బొడవు సెడక బాహువుల తోడం బొలుచు కృపాణ ప్రముఖ ప్రహరణంబులును, గొడుగుల కుప్పలును జామరంబుల ప్రోవులును, సిడంబుల తిట్టలును, నయి సంగరాంగణంబు ఘోరభంగి యయ్యెః నప్పుడు గగనమధ్యభాగంబున భాసమానుం డయిన మార్తాండు రెండవ మూర్తియుం బోలె నయ్యేకవీరుండు వెలింగె' ననవుడు నాంబికేయుండు సంజయున కిట్లనియె. 60

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ప్రళయసమయ+ధారాధరస్ఫీత, నిర్ఘాత, ఛటా+ఆభీలంబు+అగు= ప్రళయకాలంలోని మేఘాలయొక్క కఠినమైన పిడుగుల మొత్తంవలె భయంకరమైనది అగు; ఆ+బాలుని+బెడిదంపు+అంపఱు= బాలుడైన ఆ అభిమన్యుడి భయంకరాలైన బాణాలు; సైరింపన్+చాలక= ఓర్చుకొనలేక; నీ బలంబులు= నీ సైన్యాలు; పాఱినన్= పరుగెత్తగా; ఆ+కుమారకంఠీరవుండు= ఆ కుమార శ్రేష్ఠుడు; సింహనాదంబు+చేసి= గర్జించి; శంఖంబు+పూరించి= శంఖాన్ని ఊది; గుణంబు సారించి= అల్లెత్రాటిని మీటి; అనికిన్= యుద్ధానికి; తనివి చనక= తృప్తిపడక; వెనుకన్+తవిలి= వెంబడించిపోయి; వట్టి అడవి= ఎండిన అడవిని; ముట్టి= తాకి; ఏర్చు= కాల్చే; కార్చిచ్చు చందంబునన్= దావానలంవలె; చతురంగబలంబులన్= రథ,గజ,తురగ పదాతివర్గం అనే నాలుగు రకాల సేనలను; బారిసమరినన్= సంహరించగా; తేరులు+నలియన్= రథాలు విరుగగా; త్రెళ్ళిన+ శుండాలంబులును= పడి చచ్చిన ఏనుగులునూ; కాలుబలంబుల+పీనుంగు పెంటలమీఁదన్= పదాతిసైన్యం యొక్క శవాలకుప్పలపైన; ఊఁదుకొనన్= పట్టుకొనగా; కూలిన ఘోటకంబులును= నేలకూలిన గుఱ్ఱాలును; గుజ్జుపు+అట్టలరాసులు+మూసికొని= గుఱ్ఱాల మొండెముల రాసులు కప్పివేసి; అఱవఱలు+ఐన అరదంబులున్= చిన్న చిన్న ముక్కలైన రథాలు; కరటి+కళేబరంబులు= ఏనుగుల శవాలు; పొదివినన్= క్రమ్ముకోగా; కాలుకాలన్+పెనఁచుకొని= కాలూ కాలూ పెనవేసికొని; పడి+ఉన్న= నేలకూలి ఉన్న; సుభటసమూహంబులును= కాల్బలాల మొత్తములును; కంకణ+అంగద+కాంతంబులు+ఐన= కడియాలు, బాహుపురులు (భుజాలకు కట్టుకొనే నగలు) వీనిచే ప్రకాశమానాలైన; కరకాండంబుల+గములును= బాహుదండాల మొత్తాలును; ముసుంగు+పడన్+ డొల్లిన= కప్పబడగా రాలిన; సకుండల మస్తకంబులును= కుండలాలతోడి తలలును; వీరకటకంబులు= శూరత్వానికి గుర్తులైన అందెలు అనగా గండపెండేరాలు; మెఱయన్= ప్రకాశింపగా; చిక్కువడి+ఉన్న+చరణంబులును= మెలికలుపడి ఉండే కాళ్ళును; క్రిందుపడన్= అడుగునపడి; తొరంగిన= వ్రాలిన; గాత్ర ఖండంబులును= దేహాల తునుకలును; తునియలు+ఐన+ధనుః+ఆది+హేతి+ వ్రాతంబులపైన్= ముక్కలైన విల్లు మొదలైన ఆయుధాల మొత్తములపైన; పొడవు+చెడక= రూపం నశించక; బాహువులతోడన్= భుజాలతో కూడా; పొలుచు= ఒప్పు; కృపాణ, ప్రముఖ, ప్రహరణంబులును= కత్తి, మొదలైన ఆయుధాలును; గొడుగుల కుప్పలును= ఛత్రముల రాసులును; చామరంబుల ప్రోవులును= విసనకఱ్ఱల కుప్పలును; సిడంబుల+తిట్టలును= జెండాల మొత్తాలను; అయి= కలది అగుచు; సంగర+అంగణంబు= యుద్ధభూమి; ఘోరభంగిన్+అయ్యెన్= భయంకరమైన విధం కలది అయింది; అప్పుడు= ఆ సమయంలో; గగన మధ్యభాగంబునన్= ఆకాశంయొక్క మధ్యప్రదేశంలో; భాసమానుండు+అయిన= ప్రకాశించే వాడైన; మార్తాండు= సూర్యుడి; రెండవ మూర్తియున్+పోలెన్= రెండవరూపం వలె; ఆ+ఏకవీరుండు= ఒకేఒక వీరుడైన ఆ అభిమన్యుడు; వెలింగెన్= ఒప్పినాడు; అనవుడున్= అని చెప్పిన అనంతరం; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్= సంజయుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా ప్రళయకాలంలో మేఘాల నుండి వెలువడే పిడుగుల మాదిరి భయంకరంగా ఆ బాలుడు ప్రయోగించే బాణాలకు నీ సైన్యాలు తట్టుకోలేక పరుగెత్తాయి. కానీ, ఆ కుమారసింహం సింహనాదం చేస్తూ శంఖాన్ని పూరించి, అల్లెత్రాటిని సారించి, అప్పటి ఆ యుద్ధానికి తృప్తిపడక, సైన్యాన్ని వెంబడించి, కార్చిచ్చువలె చతురంగ బలాన్ని కాల్చి మసి చేశాడు. అప్పుడు తేరులు నలిగి పోయేటట్లు ఏనుగులు త్రెళ్ళిపడ్డాయి. చచ్చిన సైనిక భటులమీద గుఱ్ఱాలు కూలిపడ్డాయి. గుఱ్ఱాలను రథాలు మూసివేశాయి. ఏనుగుల కళేబరాలు, కాలూకాలూ పెనవేసికొని పడి ఉండే భటులూ, కడియాలతో బాహుపురులతో మెరిసే బాహుదండాలూ, కుండలాలలో ఉండే మొండెములూ,

గండపెండేరాలు మెరుస్తూ ఉండగా చిక్కుపడ్డ కాళ్ళూ, రాలిన శరీరాల ముక్కలూ, తునాతునకలైన విండ్లూ మొదలైన ఆయుధాలూ, కత్తులూ మొదలైన ఆయుధాలు అట్లాగే తమ చేతులలో మెరుస్తూ రూపం చెడకుండా పడి ఉండే వీరులూ, ఎక్కడ చూచినా కుప్పలు కుప్పలుగా గొడుగులూ, చామరాలూ, జెండాలూ - ఈ విధంగా యుద్ధభూమి మహా భయంకరంగా పరిణమించింది. అప్పుడు ఆకాశ మధ్యభాగంలో ప్రకాశించే రెండో సూర్యుడా అన్నట్లు అభిమన్యుడు వెలిగాడు' ఇట్లా చెప్పిన తర్వాత ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. స్వభావోక్తి.

ఆ. 'బాలుఁడొంటి యిట్లు పలువురతోడఁ బో। రంగఁ జూచి పాండురాజతనయు
లందుఁ దోడు పడుటకై యొకరుండును। గడఁగ కునికి కేమి కారణంబు?' 61

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; బాలుఁడు= బాలుడైన అభిమన్యుడు; పలువురతోడన్= అనేకులతో; ఒంటి+పోరంగన్= ఒక్కడే పోరాడగా; చూచి; పాండురాజ తనయులు= పాండవులు; అందున్= ఆ సమయంలో; తోడుపడుటకై= సహాయపడటానికై; ఒకరుండును= ఒక్కడైనా; కడఁగక= పూనుకొనకుండా; ఉనికికిన్= ఉండటానికి; ఏమి కారణంబు?= కారణం ఏమిటి?

తాత్పర్యం: 'ఒంటిగా బాలుడు ఇట్లా పలువురితో పోరాడుతూ ఉంటే చూస్తూ ఉండిన పాండవులలో ఒక్కరు కూడా సహాయపడటానికి ఎందుకు పూనుకొనలేదు. కారణం ఏమిటి?'

వ. అనవుడు సంజయుం డిట్లనియె. 62

ప్రతిపదార్థం: అనవుడున్= అని అడిగిన అనంతరం; సంజయుండు= సంజయుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని అనగా సంజయుడు ఇట్లా అన్నాడు:

పద్మవ్యూహంబు సొచ్చు పాండవులకు సైథవుం డడ్డ పడుట (సం. 7-41-3)

చ. 'వినుము నరేంద్ర! పాండవులు విక్రమ దుర్దముఁ డైన పార్థనం
దనునకుఁ దోడ్పడం గడఁగి దంతితురంగ రథోత్కరంబులం
దునుముచు సత్వరస్ఫురణఁ ద్రోఁచిన నీ పెనుమూఁక పాయవి
చ్చి నిలిచి చూచుచుండె నవిచేష్టితులైరి బలాధినాథులున్. 63

ప్రతిపదార్థం: నరేంద్ర!= ధృతరాష్ట్ర మహారాజా!; వినుము; పాండవులు; విక్రమ+దుర్దముఁడు+ఐన= పరాక్రమంచేత అణచటానికి వీలుకాని వాడైన; పార్థనందనునకున్= అభిమన్యుడికి; తోడ్పడన్= సహకరించటానికి; కడఁగి= పూని; దంతి= ఏనుగులు; తురంగ= గుర్రాలు; రథ= రథాలు(వీటి); ఉత్కరంబులన్= మొత్తాలను (సమూహాలను); తునుముచున్= ఖండిస్తూ;సత్వర+స్ఫురణన్= వేగంతో కూడికొన్న ఆలోచనతో (తలంపుతో); త్రోఁచినన్= త్రోసికొనిరాగా; ఈ+పెను+మూఁక= ఆ గొప్పసేన; పాయ+విచ్చి= దారిచీలి; నిలిచి= నిలబడి; చూచుచున్+ఉండెన్= చూస్తూ ఉండిపోయింది; బల+అధినాథులున్= సైన్యాధిపతులున్నూ; అవిచేష్టితులు+ఐరి= చేతలు ఉడిగినవారైనారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! వినుము. పాండవులు మహాపరాక్రమశాలి అయిన అభిమన్యుడికి సహాయపడటానికి ప్రయత్నించి, ఏనుగులూ, గుర్రాలూ, రథాలూ వీటి సమూహాలను ఖండిస్తూ త్రోసికొని రాగా, నీ పెద్ద సైన్యం దారి చీలి నిలిచి చూస్తూనే ఉండిపోయింది. సైన్యాధిపతులున్నూ చేష్టలుడిగి అట్లాగే ఉండిపోయారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పాఠాంతరము: చూచుచుండి రవిచేష్టితులైన బలాధినాథులున్; ఈ+పెను+మూఁక= ఈ పెద్ద సైన్యసమూహం; పాయ+విచ్చి= దారి చీలి; నిలిచి= నిలువబడి; చూచుచుండెన్= చూస్తూ ఉండింది; బల+అధినాథులున్= సైన్యాధిపతులున్నూ; అవిచేష్టితులు+ఐరి= చేష్టలు ఉడిగినవారైరి.

వ. **పాంచాల యాదవ పాండ్య కేకయ మాత్స్యప్రముఖ మహనీయ సైన్యంబులతో న ట్లురవడించిన నయ్యుధిష్ఠిరుండను మహావాయువునకు జయద్రథుం డద్రియపోలె నడ్డపడియె' నని చెప్పుటయు విస్మితుం డగుచు వైచిత్రవీర్యుం డతని కిట్లనియె.** **64**

ప్రతిపదార్థం: పాంచాల, యాదవ, పాండ్య, కేకయ, మాత్స్య, ప్రముఖ= పాంచాలురు, యాదవులు, పాండ్యులు, కేకయులు, విరాటుడు మొదలైన; మహనీయ+సైన్యంబులతోన్= గొప్పసేనలతో; అట్లు= ఆ విధంగా; ఉరవడించినన్= వేగిరపడగా; ఆ+యుధిష్ఠిరుండు= యుద్ధంలో స్థిరంగా నిలిచేవాడైన ఆ ధర్మరాజు; అను+మహావాయువునకున్= అనే పెద్దగాలికి; జయద్రథుండు= సైంధవుడు; అద్రి+అ+పోలెన్= కొండవలె; అడ్డపడియెన్= అడ్డుపడ్డాడు; అని= ఈ ప్రకారంగా; చెప్పుటయున్= చెప్పడమున్నూ; విస్మితుండు+అగుచున్= ఆశ్చర్యం కలిగినవాడౌతూ; వైచిత్రవీర్యుండు= విచిత్రవీర్యుని కొడుకైన ధృతరాష్ట్రుడు; అతనికిన్= ఆ సంజయునికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: పాంచాలురు, యాదవులు, పాండ్యులు, కేకయులు, మత్స్యదేశపురాజు విరాటుడూ మొదలైన మహనీయుల సైన్యాలతో ఆ విధంగా త్వరపడిన యుధిష్ఠిరుడు(ధర్మరాజు) అనే పెద్దగాలికి సైంధవుడు కొండవలె అడ్డుపడ్డాడు' అని సంజయుడు చెప్పగానే ఆశ్చర్య చకితుడైన ధృతరాష్ట్రుడు అతడితో ఈ విధంగా అన్నాడు:

విశేషం: అలంకారం ఉపమ.

చ. **తనయునిమీఁది కూరిమి నుదగ్రత సేనలతోడఁ బాండునం**
దనులు రయంబుమై నడరఁ దా నొకరుండ భుజాబలంబు నే
పునఁ గుదియించెనే యతఁడపో! కురుసేనకు మేటి సింధురా
జున కది యేమహాతపము సొంపున నత్తఱి సంభవించెనో! **65**

ప్రతిపదార్థం: తనయునిమీఁది కూరిమిన్= కొడుకుమీది ప్రేమతో; ఉదగ్రతన్= భయంకరంగా; పాండునందనులు= పాండవులు; సేనలతోడన్= సైన్యాలతో; రయంబుమైన్= వేగంతో; అడరన్= క్రమ్మగా; తాన్= తాను; ఒకరుండు+అ= సైంధవుడు ఒక్కడే; భుజాబలంబు+ఏపునన్= బాహుబల విజృంభణంతో; కుదియించెనే?= భంగపరచాడా?; కురుసేనకున్ మేటి= కౌరవసైన్యానికి అధికుడు; అతఁడపో!= ఆ సైంధవుడే; అది= ఆ శౌర్యాతిశయం; ఏ మహాతపము+సొంపునన్= ఏ గొప్ప తపస్సుయొక్క సమృద్ధితో; సింధురాజునకున్= సైంధవుడికి; ఆ+తఱిన్= ఆ సమయంలో; సంభవించెనో!= కలిగిందో!

తాత్పర్యం: కొడుకుమీద ప్రేమతో భయంకరంగా పాండవులు సేనలతో సైంధవుడిని క్రమ్ముకొన్నారు. కాని, సైంధవుడు ఒక్కడే తన భుజబలంతో భంగపరచాడా! కౌరవసైన్యానికి తానే అధికుడు. అతడికి ఆ శౌర్యాతిశయం ఏ మహాతపస్సు ఫలితంగా ఆ సమయంలో ఆ విధంగా సంభవించింది?'

వ. **అనిన విని సూతసూనుఁ డమ్మానవపతి కిట్లనుఁ బాండవు లరణ్యంబున నున్ననాఁ డతండు ద్రౌపదికతంబున భీమసేనుచేత భంగపడి, సంతప్త చిత్తుండై చిత్తజారాతి నారాధించిన నతని గరిష్ఠ నిష్ఠాతిశయంబునకు భక్తవత్సలుండగు నప్పరమేశ్వరుండు ప్రీతుండై పొడసూపిన జయద్రథుండును గౌంతేయుల నివారించునట్లుగా**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వరం బొసంగవలయునని విన్నవించిన, నద్దేవుండు '(నర్జునుండు దక్కదక్కిన నలువురు) పాండవులు నీచేత నివారితులగుట యొక్క దివసంబునం గలుగుఁగాక!' యని పలికి యంతర్హితుం డయ్యె; నదికారణంబుగా నట్టి గౌరవం బా రథికవరునకు దొరకొనియెఁ దత్పరాక్రమంబు తెఱం గెఱింగించెద నాకర్ణింపుము.66

ప్రతిపదార్థం: అనినన్= అని ధృతరాష్ట్రుడు అనగా; విని= ఆకర్ణించి; సూతసూనుఁడు= సంజయుడు; ఆ+మానవపతికిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజుకు; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; పాండవులు; అరణ్యంబునన్= అడవిలో; ఉన్ననాఁడు= ఉన్నప్పుడు; అతండు= ఆ సైంధవుడు; ద్రౌపదికతంబునన్= ద్రౌపది కారణంగా; భీమసేనుచేతన్= భీముడిచేత; భంగపడి= అవమానం పొంది; సంతప్తచిత్తుండు+ఐ= మిక్కిలి తపించినమనస్సు కలవాడై; చిత్తజ+అరాతిన్= మన్మథశత్రువైన ఈశ్వరుడిని; ఆరాధించినన్= సేవించగా; అతని; గరిష్ఠ, నిష్ఠా+అతిశయంబునకున్= ఆ సైంధవుడి గొప్ప నిష్ఠ వలని ఆధిక్యానికి; భక్తవత్సలుండు+అగు= భక్తులపై వాత్సల్యం కలవాడగు; ఆ+పరమ+ఈశ్వరుండు= ఆ పరమశివుడు; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; పొడచూపినన్= కనిపించగా; జయద్రథుండును= సైంధవుండునూ; కౌంతేయులన్= కుంతీకుమారులైన పాండవులను; నివారించునట్లుగాన్= అడ్డగించేటట్లు; వరంబు+ఒసంగవలయును+అని= వరమియ్యాలి అని; విన్నవించినన్= విజ్ఞప్తిచేసుకోగా; ఆ+దేవుండు= ఆ పరమేశ్వరుడు; అర్జునుండు తక్కన్= అర్జునుడు తప్ప; తక్కిన నలువురు= మిగతానలుగురు; పాండవులు; నీచేతన్= నీచేత; నివారితులు+అగుట= అడ్డగించబడినవారు కావటం; ఒక్క+దివసంబునన్= ఒక్కదినంలో; కలుగున్+కాక!= జరుగును గాక!; అని= ఆ ప్రకారంగా; పలికి= చెప్పి(మాటాడి); అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడయ్యాడు; అదికారణంబుగాన్= ఆ వరం కారణంగా; అట్టి గౌరవంబు= అటువంటి గౌరవం; ఆ+రథికవరునకున్= ఆ రథిక శ్రేష్ఠుడికి; దొరకొనియెన్= కలిగింది; తద్+పరాక్రమంబు+తెఱంగు= అతడియొక్క పరాక్రమ విధం; ఎఱింగించెదన్= తెలియజేస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అనగా విని సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'పాండవులు అరణ్యంలో ఉన్నప్పుడు సైంధవుడు ద్రౌపది కారణంగా భీముడిచేత భంగపడి, మిక్కిలి పరితపించి, పరమేశ్వరుడిని సేవించాడు. అతడి గొప్ప నిష్ఠకు శివుడు ప్రీతిచెందినవాడై కనిపించాడు. అపుడు సైంధవుడు కుంతీపుత్రులను అడ్డగించేటట్లు వరం ఇమ్మన్నాడు. అపుడు శివుడు 'ఒక్క అర్జునుడు తప్ప తక్కిన పాండవులు నీచేత అడ్డగింపబడతారు అదీ ఒక్కదినం మాత్రమే' అని పలికి అదృశ్యమయ్యాడు. ఆ పరమశివుడి వరం కారణంగా అతడికి అటువంటి గౌరవం కలిగింది.ఇక అతడి పరాక్రమము ఎట్లాంటిదో వివరిస్తాను వినుము.

సీ. **సింధుదేశోద్భవ స్థిర వాహనంబులఁ । బూనిన యరదంబు పొలుపు మిగుల,**
రత్నమయోగ్ర వరాహధ్వజంబు న । భస్థలిఁ జంచల ప్రభల మెఱయ,
సాంద్ర చంద్రాతప సదృశమై యుజ్జ్వల । ఛత్ర చామరముల చాయ నిగుడ,
వజ్రముక్తాఫల వ్రజకిరణావళి । కలిత భూషణములు వెలుఁగుచుండఁ ,

తే. **జిత్తమున వరగర్వంబు చిగురు లొత్తఁ । బాండుపుత్త్రుల దుర్దాంత బాహుబలము**
మొనలపెల్లును సరకుగాఁ గొనక యేచి । యార్చి వారికి నీయల్లుఁ డడ్డపడియె. 67

ప్రతిపదార్థం: సింధుదేశ+ఉద్భవ= సింధుదేశంలో పుట్టిన; స్థిరవాహనంబులు= మేలైన గుర్రాలు; పూనిన అరదంబు= కట్టినరథం; పొలుపు మిగులన్= అందం అతిశయించగా; రత్నమయ= రత్నాలచేత ప్రాచుర్యం చెందిన; ఉగ్ర, వరాహ, ధ్వజంబు= భయంకరమైన పంది గుర్తుగల జెండా; చంచల+ప్రభలన్= కదులుతూ ఉండే కాంతులతో; నభః+స్థలిన్= ఆకాశ ప్రదేశంలో; మెఱయన్= ప్రకాశింపగా; సాంద్ర= దట్టమైన; చంద్రాతప+సదృశమై= వెన్నెలకు సాటియై; ఉజ్జ్వలత్= ప్రకాశిస్తూ ఉన్న; ఛత్ర+చామరములు= గొడుగులు, వింజామరలు, చాయ+నిగుడన్= కాంతి నింపగా (వ్యాపింపజేయగా); వజ్ర= వజ్రాలయొక్క; ముక్తాఫల= ముత్యాలయొక్క; వ్రజ=

సమూహాల; కిరణ+ఆవళిన్= కాంతుల మొత్తంచేత; కలిత భూషణములు= కూడిన ఆభరణాలు; వెలుఁగుచుండన్= ప్రకాశిస్తూ ఉండగా; చిత్తమునన్= మనస్సులో; వరగర్వంబు= వరం వలని దర్పం; చిగురులొత్తన్= మోసులెత్తగా; పాండుపుత్రులు= పాండవుల; దుర్దాంత, బాహు, బలమున్= అణచటానికి వీలుకాని భుజబలాన్ని; మొనల+పెల్లును= సేనల ఆధిక్యాన్ని; సరకుగాన్+కొనక= లక్ష్యపెట్టకుండా; ఏచి= విజృంభించి; ఆర్చి= గర్జించి; వారికిన్= పాండవులకు; నీ+అల్లుఁడు= నీ అల్లుడైన సైంధవుడు (దుస్సల భర్త); అడ్డపడియెన్= (ఎదిరించి నిలిచాడు) అడ్డగించాడు.

తాత్పర్యం: సింధు దేశానికి సంబంధించిన ఉత్తమజాతి గుర్రాలు కట్టిన రథం అందగించగా, రత్నమయమై భయంకరమైన పందిగుర్తు గల జెండా కదులుతూ రెపరెపలాడగా, నిండు వెన్నెలకు సమానంగా ప్రకాశించే గొడుగుల, వింజామరల కాంతులు వ్యాపించగా, వజ్రాల, ముత్యాల ఆభరణాల కాంతులు వెలుగుతూ ఉండగా, మనస్సులో వర గర్వం చెలరేగగా, అణచటానికి వీలుకాని పాండవుల భుజబలాన్నీ, వారి సేనల ఆధిక్యాన్నీ లెక్కచేయకుండా నీ అల్లుడు విజృంభించి, గర్జిస్తూ అడ్డుకొన్నాడు.

వ. ఇవ్విధంబున నడ్డపడి సాత్యకిని సాయకత్రయంబునను, భీమసేనుని బాణాష్టకంబునను, ధృష్టద్యుమ్నుని నిరువది యమ్ములను, విరాటుని శిఖండిని బదిపదితూపులను, బాంచాలపతి నేడింటను, ద్రౌపదేయుల బదియేనింటను, గేకయుల నిరువదేనింటను, ధర్మసూను సప్తతి శరంబులను నేసి యాసేన నానాస్త్రంబులం గప్పెనప్పుడప్పాండవాగ్రజుం డతని కోదండంబు దుండంబులు సేసిన నా సైంధవుం డొండువింట మంటలుం బోని మార్గణమ్ము లమ్మనుజపతి మీఁదను, దదనుచరుల యంగంబులందును, బరఁగించినం బవనతనయుండు దలకడచి రభసంబున. 68

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; అడ్డపడి= అడ్డగించి; సాత్యకిని+సాయకత్రయంబునన్= సాత్యకిని మూడుబాణాలతో; భీమసేనున్, బాణ+అష్టకంబుననున్= భీమసేనుడిని ఎనిమిది బాణాలతో; ధృష్టద్యుమ్నునిన్+ఇరువది+అమ్ములనున్= ధృష్టద్యుమ్నుడిని ఇరవై బాణాలతో; విరాటునిన్, శిఖండినిన్+పది పది తూపులనున్= విరాటుడిని, శిఖండినీ పది పది బాణాలతో; పాంచాలపతిన్= ద్రుపదరాజును; ఏడింటనున్= ఏడు బాణాలతో; ద్రౌపదేయులన్= ఉపపాండవులను; పది+ఏనింటనున్= పదునైదు బాణాలతో; కేకయులన్+ఇరువది+ఏనింటనున్= కేకయులను ఇరవై ఐదు బాణాలతో; ధర్మసూనున్+సప్తతి+శరంబులనున్= ధర్మరాజును డెబ్భైబాణాలతో; ఏసి= ప్రయోగించి; ఆ సేనన్= ఆ సైన్యాన్ని; నానా+అస్త్రంబులన్= అనేకాలైన అస్త్రాలతో; కప్పెన్= కప్పివేశాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ ధర్మరాజు; అతని+కోదండంబు= ఆ సైంధవుడి విల్లు; తుండంబులు+చేసినన్= ముక్కలు చేయగా; ఆ సైంధవుండు= ఆ జయద్రథుడు; ఒండువింటన్= మరొక వింటితో; మంటలున్+పోని, మార్గణమ్ములు= మంటలను పోలిన బాణాలు; ఆ+మనుజపతి మీఁదను= ఆ రాజుపైన; తద్+అనుచరుల+అంగంబులందును= అతడిని అనుసరించి వచ్చే వాళ్ళ అవయవాలందు; పరఁగించినన్= ప్రయోగించగా; పవనతనయుండు= భీముడు; తలకడచి= మీరి, అతిశయించి; రభసంబునన్= వేగంతో.

తాత్పర్యం: ఈ రీతిగా సైంధవుడు అడ్డగించి సాత్యకిని మూడు బాణాలతో, భీముడిని ఎనిమిది బాణాలతో, ధృష్టద్యుమ్నుడిని ఇరవై బాణాలతో, విరాటుడిని, శిఖండిని పదేసి బాణాలతో, ద్రుపదుడిని, ఏడు బాణాలతో, ఉపపాండవులను పదునైదు బాణాలతో, కేకయులను ఇరవై అయిదు బాణాలతో, ధర్మరాజును డెబ్భైబాణాలతో నొప్పించి ఆ సైన్యాన్ని రకరకాల అస్త్రాలతో కప్పివేశాడు. అప్పుడు ధర్మరాజు సైంధవుడి వింటిని తుంటలు చేయగా, ఆ సైంధవుడు మరో విల్లు ధరించి మంటలను పోలిన బాణాలను రాజుపైనా, అతడి అనుచరుల అవయవములందు ప్రయోగించాడు. అంతలో భీముడు విజృంభించి వేగంతో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఆ బాణాల సంఖ్య శత్రుయోధుల సామర్థ్యానికి అనుగుణంగా ఉన్నాయనుకొనాలి.

క. భల్లముల మూఁట గొడుగును । విల్లును బడగయును ద్రుంప వేఱొక విలు నీ
యల్లుఁడు గొని భీము గొడుగు । విల్లును బడగయును ద్రుంచి విరథుం జేసెన్. 69

ప్రతిపదార్థం: భల్లముల+మూఁటన్= మూడు బల్లెములతో; గొడుగును= ఛత్రాన్ని; విల్లును= వింటిని; పడగయును= జెండాను; త్రుంపన్= త్రుంచివేయగా (ఖండించగా); నీ+అల్లుఁడు= నీ అల్లుడైన సైంధవుడు; వేఱు+ఒకవిలున్= మరో వింటిని; కొని= తీసికొని; భీముని గొడుగున్= భీముడి ఛత్రాన్ని; విల్లున్= ధనుస్సును; పడగయును= జెండాను; త్రుంచి= విరిచి; విరథున్+చేసెన్= రథంలేని వాడినిగా చేశాడు.

తాత్పర్యం: మూడు బల్లెములతో భీముడు ఛత్రాన్ని, ధనుస్సునూ, జెండాను ఖండించగా, నీ అల్లుడు మరో ధనుస్సును పూని భీముడి ఛత్రాన్ని వింటిని జెండాను త్రుంచి తేరు లేని వాడినిగా చేశాడు.

వ. ఇట్లు వికల సాధనుం డై. 70

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకార; వికలసాధనుండు+ఐ= భగ్నమైన సాధనములు కలవాడై

తాత్పర్యం: ఈ విధంగా (ముక్కలైన) పగిలిన పరికరాలు కలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. అనిలసుతుండు సాత్యకి తేరిమీఁదికి । నరిగిన నీ సేన యార్చుటయును
సైంధవుపై వారి సైనికోత్తము లనే । కాస్త్రముల్ వఱపిన, నతఁడు వాని
మరలింప ము న్నభిమన్యుచేఁ గూలిన । రథదంతి హయ భటరాజికతన
నతి విషమంబైన యానేల నవిహత । గతి నరదంబులు గ్రందు వఱపి

ఆ. వారు సేసి రాహవము; దాని కోర్చి యం । దఱును దమక తమక దనిసి వెనుక
కొదుఁగునట్లు గాఁగ నుజ్జ్వల శరనికా । యములు గురిసె నా జయద్రథుండు. 71

ప్రతిపదార్థం: అనిలసుతుండు= భీముడు; సాత్యకి, తేరిమీఁదికిన్= సాత్యకి రథంపైకి; అరిగినన్= పోగా; నీసేన= నీ సైన్యం; ఆర్చుటయును= గర్జించగా; వారి, సైనిక+ఉత్తములు= పాండవుల సైన్యంలోని శ్రేష్ఠులు; అనేక+అస్త్రముల్= పెక్కు బాణాలు; సైంధవుపైన్+పఱపినన్= సైంధవుడిమీద, ప్రయోగించగా; అతఁడు= ఆ సైంధవుడు; వానిన్= ఆ బాణాలను; మరలింపన్= వెనక్కిపోయేటట్లు చేయగా; మున్ను= ముందు; అభిమన్యుచేన్= అభిమన్యుడిచేత; కూలిన= పడిన; రథ,దంతి,హయ,భట, రాజి= తేరులు, ఏనుగులు, గుర్రాలు, కాలరులు, మొత్తం(అనగా చతురంగబలాలు); కతనన్= కారణంగా; అతి+విషమంబు+ఐన+ఆ+నేలన్= మిక్కిలి ఒడుదుడుకైన ఆ ప్రదేశంలో; అవిహతగతిన్= తిరుగులేని నడకతో; అరదంబులు= తేర్లు; క్రందు+పఱపి= దట్టంగా తోలి; వారు= పాండవసైనికులు; ఆహవము+చేసిరి= యుద్ధం చేశారు; అందఱును= అందరూ; దానికిన్= ఆ పాండవ సైన్య విజృంభణానికి; ఓర్చి= సహించి; అందఱును= ఆ పాండవులందరూ; తమక, తమక, తనిసి= తమకు తాము సమాధానపడి; వెనుకకున్= వెనకకు; ఒదుఁగునట్లు+కాఁగన్= దాగుకొనేటట్లుగా; ఆ+జయద్రథుండు= ఆ సైంధవుడు; ఉజ్జ్వల, శర, నికాయములు= మండుతూ ఉండే బాణాల మొత్తాలు; కురిసెన్= వర్షించాడు.

తాత్పర్యం: భీముడు సాత్యకి రథంపైకి పోగా, నీ సైన్యం గర్జించింది. అపుడు పాండవ సైన్యంలోని వీరులుఅనేక బాణాలు సైంధవుడి మీద ప్రయోగించారు. సైంధవుడు వాటిని అన్నింటినీ వెనక్కి మళ్ళించి, అంతకుముందు అభిమన్యుడిచేత చతురంగబలం పడిపోయిన కారణంగా, ఎగుడు దిగుడుగా ఉండే ఆప్రదేశంలో అప్రతిహతగమనంతో

రథాలను దట్టంగా తోలి పాండవులు పోరాడారు. ఆ పాండవులు అందరూ తమకు తాము చాలా సమాధానపడి. సైంధవుడు వారందరినీ వెనక్కు తగ్గేటట్లు మండుతూ ఉండే బాణాలు ప్రయోగించాడు.

విశేషం: సైంధవుడు పాండవులను అడ్డగించాడు. వారిపోరు ఘోరంగా పరిణమించింది. ఈ సందర్భంలో అంతకుమునుపు అభిమన్యుడు చతురంగ బలాన్ని చిందరవందర చేసిన సంఘటన స్మరణకు తేబడింది. అభిమన్యుడు కూల్చిన చతురంగ బలం కారణంగా అక్కడ ప్రదేశం అతి విషమంగా ఉందని అంటే సమతలంగా లేకుండా హెచ్చుతగ్గులుగా ఒడుదుడుగ్గా ఉందనీ అందువలన సైన్యం నడవటానికి కష్టంగా ఉందనీ వర్ణించబడింది. 'అవిహత గతి' అని తిక్కన ఇక్కడ తత్సమపద ప్రయోగం చేశాడు. సైన్యంలో అందరూ సంతృప్తిగా పోరాడారు అనే అభిప్రాయాన్ని 'తమక తమక తనిసి' అని అచ్చ తెలుగు పదాలలో తెలపడం విశేషం. సైంధవుడు తన బాణ ప్రయోగంతో వారందరూ వెనుకకు తగ్గేటట్లు చేయగలిగాడు.

వ. ఇత్తెఱంగున సింధురాజు పాండవుల వేఁడిమి యుడిపిన, నుభయపార్శ్వంబులకు మున్ను దొలంగియున్న నీ బలంబులు గోల్తల సేసి య కౌంతేయ సైన్య సంతానంబుతోఁ దలపడినం బోరు ఘోరంబయ్యె; నక్కడఁ గుంభసంభవ ప్రయత్న విశేషంబునం జేసి వాహిని మగుడ నడరి యభిమన్యుం బొదివిన నక్కుమారుండు నుక్కునం గడంగి. 72

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; సింధురాజు= సైంధవుడు; పాండవుల వేఁడిమి= పాండవుల ప్రతాపాన్ని; ఉడిపినన్= పోకార్చగా; ఉభయ పార్శ్వంబులకున్= ఇరుప్రక్కలకు; మున్ను= ముందు; తొలంగి ఉన్న= తప్పి ఉన్న; నీబలంబులు= నీ సైన్యాలు; కోల్తలచేసి= ఎదుట నిలిచి యుద్ధం చేసి (యుద్ధసన్నాహం గావించి); ఆ+కౌంతేయసైన్య సంతానంబుతోన్= పాండవసేనా సమూహంతో; తలపడినన్= ఎదుర్కొనగా; పోరు= యుద్ధం; ఘోరంబు+అయ్యెన్= భయంకరమయింది; అక్కడన్= ఆ కౌరవ పక్షంలో; కుంభసంభవ= ద్రోణుడి; ప్రయత్న విశేషంబునన్+చేసి= విశేషమైన ప్రయత్నంచేత; వాహిని= సైన్యం; మగుడన్= మళ్ళీ; అడరి= విజృంభించి; అభిమన్యున్= అభిమన్యుడిని; పొదివినన్= కలిసి చుట్టుకోగా; ఆ+కుమారుండున్= ఆ బాలుడుకూడా; ఉక్కునన్= శౌర్యంతో; కడంగి= పూని.

తాత్పర్యం: ఈ విధంగా సైంధవుడు పాండవుల ప్రతాపాన్ని పోకార్చాడు. అటుపై ఇరుప్రక్కలకు దూరంగా తొలగి ఉన్న నీ సైన్యాలు యుద్ధానికి సంసిద్ధం అయ్యాయి. పాండవుల సేనాసమూహాలను ఎదుర్కొనడంతో యుద్ధం భయంకరంగా పరిణమించింది. అంతలో ద్రోణుడు ఎంతో ప్రయత్నంతో సైన్యాన్ని మళ్ళీ విజృంభించేటట్లు చేసి అభిమన్యుడిని చుట్టుముట్టగా, అతడు శౌర్యంతో పూనుకొని.

**క. అభిముఖ సంవృత్తములగు । నిభతురగ స్యందనంబు లిలఁ గూల్పఁగ న
క్షుభితుం డగు వృషసేనుఁడు । రభసంబున నతనిఁ బటు శరంబుల నొంచెన్. 73**

ప్రతిపదార్థం: అభిముఖ, సంవృత్తములు+అగు= ఎదురుగా చుట్టుముట్టేవి అయిన; ఇభ= ఏనుగులు; తురగ= గుర్రాలు; స్యందనంబులు= రథాలు; ఇలన్= నేలపై; కూల్పఁగన్= కూలగొట్టగా; అక్షుభితుండు= క్షోభించనివాడు(కలతచెందనివాడు); అగు= అయిన; వృషసేనుఁడు= వృషసేనుడు; రభసమునన్= వేగిరపాటుతో; పటుశరంబులన్= తీవ్రబాణాలతో; అతనిన్= అభిమన్యుడిని; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: ఇట్లా ఎదురుగా వచ్చి చుట్టుముట్టిన ఏనుగులనూ, గుర్రాలనూ, రథాలనూ అభిమన్యుడు నేలకూల్చగా ఏ మాత్రమూ చలించని వృషసేనుడు మహావేగంగా తీవ్రబాణాలతో అభిమన్యుడిని ఎదుర్కొని నొప్పించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వృషసేనుం డభిమన్యుం దాఁకి మూర్ఛితుం డగుట (సం. 7-43-5)

ఉ. నొంచినఁ గెంపు సొంపునఁ గనుంగవ యొప్పఁగ సూతుఁద్రుంచి, విల్
ద్రుంచి తురంగ వక్త్రములఁ దూఁపులు నించి, యలంచి, మేను నొ
ప్పించినఁ దేరితోడ నఱపీనుఁగు నీడిచికొంచుఁ బాఱె సే
నాంచలభూమికిం బెలుచ నత్తురగంబులు విహ్వలంబులై. 74

ప్రతిపదార్థం: నొంచినన్= బాధించగా; కెంపుసొంపునన్= కెంపువలె; కనుంగవ+ఒప్పఁగన్= కళ్ళు రెండూ ప్రకాశించగా; సూతున్+త్రుంచి= సారథిని చంపి;విల్+త్రుంచి= ధనుస్సు విరిచి; తురంగ వక్త్రములన్= గుర్రాల ముఖాలలో; తూఁపులు+నించి= బాణాలు నింపి; అలంచి= అలసట కలిగించి; మేనున్= శరీరాన్ని; నొప్పించినన్= బాధపెట్టగా; పెలుచన్= మిక్కుటంగా; ఆ+తురగంబులు= ఆ గుర్రాలు; విహ్వలంబులు+ఐ= భయంచేత అవయవాలు స్వాధీనం తప్పినవై; తేరితోడన్= రథంతో కూడా; అఱపీనుఁగున్+ఈడిచి కొంచున్= సగం చచ్చిన వృషసేనుడిని ఈడ్చుకొంటూ (లాగుకొంటూ); సేనా+అంచల+భూమికిన్= సేన చివరి ప్రదేశానికి; పెలుచన్= వేగంగా; పాఱెన్= పరుగెత్తాయి.

తాత్పర్యం: అట్లా నొప్పించగా, రెండు కళ్ళూ కెంపులవలె మెరసిపోతుండగా సారథిని చంపి, విల్లు విరిచి, గుర్రాల నోళ్ళలో బాణాలు నింపి, అలసట కలిగించి, వాటి శరీరాలను నొప్పించాడు. అప్పుడు భయంతో అవయవాలు స్వాధీనం తప్పిన ఆ గుర్రాలు రథంతో కూడా సగం చచ్చిన వృషసేనుడిని సేనల చివరి ప్రదేశానికి ఈడ్చుకుంటూ పరుగెత్తాయి.

విశేషం: అంతకుముందు పద్యం 'నొంచెన్' అని ప్రయోగించటం ఎత్తుగడలో ఒక విశేషం. సగం చచ్చిన వృషసేనుడిని ఈడ్చుకొంటూ గుర్రాలు పరుగెత్తిన సన్నివేశాన్ని తిక్కన ఎంతో నాటకీయంగా మన కళ్ళముందు నిలిపాడు. 'అఱపీనుఁగు' అనే ప్రయోగం ఎంతో వినూత్నంగా ఉన్నది.

వ. ఇట్లు వృషసేను నరదంబు పఱచిన తెఱపిన యభిమన్యుండు నిజస్యందనంబు పఱపించినం బటు సంరంభంబున నెదుర్కొని. 75

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వృషసేను+అరదంబు= వృషసేనుడి రథం; పఱచిన+తెఱపిన= పరుగెత్తిన అవకాశంలోనే; అభిమన్యుండు= అభిమన్యుడు; నిజ+స్యందనంబు= తన రథం; పఱపించినన్= పరుగెత్తించగా; పటు+సంరంభంబునన్= తీవ్రమైన సన్నాహంతో; ఎదుర్కొని= ఎదిరించి.

తాత్పర్యం: ఈ విధంగా వృషసేనుడి రథం పరుగెత్తిన దారిలోనే అభిమన్యుడు తన రథాన్ని పరుగెత్తించగా తీవ్ర సన్నాహంతో ఎదిరించి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. శౌర్యధుర్యుఁ డగు వసాతి భూపతి షష్టి। శితశరంబు లేయ నతఁడు దొడ్డ
నారసమున వాని నలిఁ దూల నేసినఁ। గూలి పెలుచఁ దన్నికొనుచుఁ జచ్చె. 76

ప్రతిపదార్థం: శౌర్యధుర్యుఁడు+అగు= శూరత్వాన్ని భరించేవాడైన; వసాతిభూపతి= వసాతి రాజు; షష్టి శిత శరంబులు= అరవై వాడి అయిన బాణాలు; ఏయన్= ప్రయోగించగా; అతఁడు= అభిమన్యుడు; వానిన్= ఆ వసాతి రాజును; దొడ్డ నారసమునన్= గొప్పబాణంతో; నలిన్= విజృంభణంతో; తూలన్+ఏసినన్= పడిపోయేటట్లు ప్రయోగించగా; కూలి= క్రిందపడి; పెలుచన్= మిక్కుటంగా; తన్ని కొనుచున్= తన్నుకొంటూ; చచ్చెన్= చచ్చాడు.

తాత్పర్యం: శూరుడైన వసాతిరాజు అరవై తీవ్రబాణాలు ప్రయోగించగా అభిమన్యుడు ఆ వసాతి రాజును ఒక గొప్ప బాణంతో మిక్కిలి తూలిపడేటట్లు నేలకూల నేశాడు. దానితో వాడు తన్నుకొంటూ చచ్చాడు.

క. **చచ్చిన వసాతిఁ గనుఁగొని । యచ్చటి భూపతులు పెలుచ నడరుటయును వి**
వ్వచ్చుకొడుకు కోపించినఁ । జిచ్చు మిడుతపిండు నేర్చు చెలువము దోఁచెన్. 77

ప్రతిపదార్థం: అచ్చటి భూపతులు= అక్కడ ఉండే రాజులు; చచ్చిన+వసాతిన్= మరణించిన వసాతి రాజును; కనుఁగొని= చూచి; పెలుచన్= మిక్కుటంగా; అడరుటయును= చుట్టుముట్టటమున్నూ(కవియటం); వివ్వచ్చు కొడుకు= అర్జునుడి పుత్రుడు; కోపించినన్= ఆగ్రహించగా, చిచ్చు= నిప్పు(అగ్ని); మిడుత పిండున్= మిడుతల గుంపును; ఏర్చు= కాల్చు; చెలువము= విధం; తోఁచెన్= స్ఫురించింది.

తాత్పర్యం: అప్పుడు అక్కడ ఉండే రాజులంతా చచ్చిన వసాతి రాజును చూచి రెచ్చిపోయి, అందరూ ఒక్కుమ్మడి అభిమన్యుడిని ఆక్రమించారు. అభిమన్యుడు ఆ సందర్భంలో ఆగ్రహించటం అగ్గి మిడుతల గుంపును కాల్చిన తీరును స్ఫురింపజేసింది.

విశేషం: అలం: ఉపమ.

వ. **ఆ సమయంబునం జేడ్పడి నీ సేనలు దీనదశకు వచ్చిన నానాదేశాధీశులు పరస్పరాహ్వాననాదంబులు సింహనాదంబులు శింజినీ స్వనంబులుం జెలంగ ధనంజయతనయుపై నొక్కుమ్మడి నురవడించిన నయ్యతిరథవర్యుండు లేళ్ళగమిం గనిన బెబ్బులి యుబ్బుదోఁప నలిరేఁగి యందఱ నుఱుమాడిన నంగకంబుల వివిధ ఖండంబుల కెంపునను గరితురగ నరశవంబుల వికృతాకారంబుల నాయుధంబుల మెఱుంగుల నాభరణంబుల తఱచునం దత్ప్రదేశంబు దారుణ ప్రియదర్శనంబయ్యెఁ; నప్పుడు దెరలిన మూఁకలు దన్నుఁ దేఱి చూడనుం జాలక యంతంత ఱిచ్చవడిన నా గుంపులకుం గవిసి, నిలింపపతి మనుమండు సత్యశ్రవఃప్రభృతి భూపాల లోకంబు జములోకంబున కనిచినం జుట్లనుండి చూచు మానధను లగు మానవపతులు నేన నేన యని కడంగి యక్కుమారుని మీఁద నుఱికి పెనుజోఱు మొగంబునం బడిన చిఱుచేప తండంబుల చందంబున దావానలంబు దఱియం బాఱిన మృగకులంబు చాడ్పున సముద్రంబు సొచ్చిన యేఱుల చందంబున నతని యంద డిందిన.** 78

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అప్పుడు; చేడ్పడి= చలించి, వ్యాకులపడి; నీ సేనలు= నీ సైన్యాలు; దీనదశకున్+వచ్చినన్= దీనస్థితికి రాగా; నానా, దేశ+అధీశులు= అనేక దేశాల రాజులు; పరస్పర+ఆహ్వాన+నాదంబులు= ఒకరిని ఒకరు పిలుచుకొనే శబ్దాలు; సింహనాదంబులు= గర్జించుటలు; శింజినీ స్వనంబులు= అల్లెత్రాటి మ్రోతలు; చెలంగన్= ధ్వనించగా; ధనంజయ తనయుపైన్= అభిమన్యుడి మీద; ఒక్కుమ్మడిన్= ఒక్కపెట్టున; ఉరవడించినన్= పరాక్రమించగా(వేగిరపడగా); ఆ+అతిరథ వర్యుండు= అతిరథులలో శ్రేష్ఠుడైన ఆ అభిమన్యుడు; లేళ్ళ+గమిన్= జింకల గుంపును;కనిన= చూచిన; బెబ్బులి= పెద్దపులి; ఉబ్బు= విజృంభణ(అతిశయం); తోఁపన్= తోచేటట్లుగా; నలి+రేఁగి= మిక్కిలి రెచ్చిపోయి; అందఱన్= అందరినీ; నుఱుమాడినన్= పిండిచేయగా (పొడి, చూర్ణం); అంగకంబుల= అవయవాల; ఖండంబుల+కెంపునను= తునకల (ముక్కల) ఎర్రదనం చేతనూ; కరి, తురగ, నర, శవంబుల= ఏనుగులు; గుర్రాలు, భటులయొక్క పీనుగుల; వికృత+ఆకారంబులన్= వికారములైన ఆకృతుల చేతనూ; ఆయుధంబుల+మెఱుంగులన్= ఆయుధాల కాంతుల చేతనూ; ఆభరణంబుల+తఱచునన్= భూషణాల ఆధిక్యం చేతనూ; తద్+ప్రదేశంబు= ఆ స్థలం; దారుణ+ప్రియ+దర్శనంబు+అయ్యెన్= భయానకమూ, రమణీయమూ అయింది; అప్పుడు= ఆ సమయంలో; తెరలిన మూఁకలు= విచ్చిపోయిన సైన్యాలు; తన్నున్= తనను; తేఱి+చూడనున్+చాలక= పరికించి చూడలేక;

అంతంతన్= కొంతదూరంలో; ఱిచ్చవడినన్= చేష్టలు వదిలి వెనుదీయగా; ఆ గుంపులకున్= ఆ(సైన్యానికి) సమూహాలపై; కవిసి= ఎదుర్కొని; నిలింపపతి మనుమండు= ఇంద్రుడి మనుమడైన అభిమన్యుడు; సత్యశ్రవః, ప్రభృతి, భూపాల, లోకంబున్= సత్యశ్రవుడు (నరిష్యంతుడి వంశంలోనివాడు, సుమతికొడుకు) మొదలగు రాజుల సమూహాన్ని; జములోకంబునకున్= యమలోకానికి; అనిచినన్= పంపగా; చుట్లనుండి= నలుప్రక్కలనుండి; చూచు మానధనులు అగు= చూస్తూ ఉన్న అభిమాన ధనులైన; మానవపతులు= రాజులు; నేన, నేన అని= అహమహమికతో; కడంగి= పూని; ఆ+కుమారుని మీఁదకున్= ఆ బాలుడిపైకి; ఉఱికి= దూకి; పెనుజోఱ+మొగంబునన్= సొఱ అనే పెద్దచేప ముఖంలో; పడిన= చిక్కుపడిన; చిఱుచేపల, తండంబుల, చందంబునన్= చిన్న చేపల మొత్తాల రీతిగా; దావ+అనలంబు= కార్చిచ్చు; తఱియన్= సమీపించగా (ఎదుర్కొనగా); పాఱిన= పరుగెత్తిన; మృగ+కులంబు+చాడ్పునన్= జింకల గుంపువలె; సముద్రంబు= సముద్రంలో; చొచ్చిన= ప్రవేశించిన; ఏఱుల+చందంబునన్= వాగులవలె; అతని+అందు+అ= అతడి అందే; డిందినన్= నశించగా (లీనమైపోగా).

తాత్పర్యం: అప్పుడు జడిసి దైన్యస్థితిలో నీ సైన్యం ఉండగా నానా దేశరాజులు ఒకరిని మరొకరు పిలిచికొనే శబ్దాలు, సింహనాదాలు, అల్లెత్రాటి టంకారాలూ విన్పించాయి. అందరూ ఒక్కపెట్టున అర్జునుడి కుమారుడిని ఆక్రమించారు. అతిరథ శ్రేష్ఠుడైన అభిమన్యుడు జింకల గుంపుపై బెబ్బులివలె మిక్కిలి విజృంభించి అందరినీ నుగ్గునూచం చేశాడు. అప్పుడు యుద్ధభూమి, ముక్కలు ముక్కలుగా తెగిపడ్డ అవయవాలతో, చచ్చిన ఏనుగుల గుర్రాల భటుల వికృతాకారాలతో, ఆయుధాల ఆభరణాల కాంతులతో, దట్టంగా మహాదారుణ ప్రియదర్శనంగా మారిపోయింది. విచ్చిపోయిన సైన్యాలు అతడిని తేఱిపార చూడలేక అంతంతలోనే ఱిచ్చపాటుతో ఉండగా, వాటిపై అభిమన్యుడు దూకాడు. అప్పుడు నలుప్రక్కలనుండి మానధనులైన రాజులు 'నేను నేను' అంటూ ఆ బాలుడి మీదికి ఉరికి పెద్దసొర చేప ముఖంలో పడ్డ చిన్న చేపల గుంపువలె, కార్చిచ్చు అలముకోగా పరుగెత్తే జింకల రీతిగా సముద్రంలో ఉరవడితో చొచ్చుకొనిపోయే వాగులు మాదిరిగా అతనిలోనే అందరూ అణగిపోయారు.

విశేషం: అలం: మాలోపమ.

ఉ. **అచ్చట సైన్యమంతయు భయాకులతన్ నలుదిక్కులన్ వెసన్**
విచ్చిన శల్యనందనుఁడు 'వీనికి నోడఁగ నేల మీకు? నే
వచ్చితిఁ బట్టి తెచ్చెద; నవారణ బెట్టు పెనంగె నేనియుం
జచ్చు మదీయ భూరిభుజశక్తిఁ గనుంగొనుఁ డంచు నుద్ధతిన్. **79**

ప్రతిపదార్థం: అచ్చటన్= ఆ రణరంగంలో; సైన్యము+అంతయున్= సేన మొత్తమూ; భయ+ఆకులతన్(భయం); భీతివలన కలిగిన కలతతో; వెసన్= వెంటనే (త్వరగా); నలుదిక్కులన్+విచ్చినన్= నాలుగు వైపులకూ; చెదరగా; శల్యనందనుడు= శల్యుడి కొడుకు (రుక్మరథుడు అనేవాడు); ఉద్ధతిన్= గర్వంతో; నేన్+వచ్చితిన్= నేను వచ్చాను; వీనికిన్= ఈ అభిమన్యుడికి; ఓడఁగన్+ఏల?= వెనుదీయటం ఎందుకు?; పట్టి+తెచ్చెదన్= బంధించి తెస్తాను; అవారణన్= అడ్డగించలేని విధంగా; బెట్టు= అధికంగా; పెనంగెన్+ఏనియున్= పోరాడినప్పటికీ; చచ్చున్= చస్తాడు; మదీయ, భూరి, భుజ, శక్తిన్= నా యొక్క అధికమైన భుజాల బలాన్ని; కనుంగొనుఁడు= చూడండి; అంచున్= అని అంటూ.

తాత్పర్యం: అప్పుడు యుద్ధరంగంలో సైన్యమంతా భయంతో బెదరి నలుదిక్కులకూ చెదరిపోయింది. అంతలో శల్యుడి కొడుకు రుక్మరథుడు గర్వంతో 'ఇదిగో! నేను వచ్చాను. వీడికి మీరు వెనుకంజ వేయటం ఎందుకు? వెంటనే పట్టి తెస్తాను. వారించలేని విధంగా పోరాడినప్పటికీ వాడు నా చేతులలో చస్తాడు. చూడండి నా భుజబలాన్ని' అంటూ. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. రుక్మరథుం డనువాఁడు పాండుపౌత్త్రుం దలపడి తొమ్మిదియమ్ము లురమ్మున భుజమ్ముల రెండును నాఁటించి వెండియు నేయం గడంగునెడ నా సుభద్రాసూనుండు. 80

ప్రతిపదార్థం: రుక్మరథుండు+అనువాఁడు= రుక్మరథుడు అనే పేరుగల శల్యుడి కొడుకు; పాండుపౌత్త్రున్= పాండురాజు మనుమడిని; తలపడి= ఎదుర్కొని; ఉరమ్మునన్= వక్షఃస్థలంలో; తొమ్మిది+అమ్ములు= తొమ్మిదిబాణాలు; భుజమ్ములన్= భుజాలలో; రెండును= రెండు బాణాలున్నూ; నాఁటించి= గ్రుచ్చుకొనేటట్లు చేసి; వెండియున్= మళ్ళీ; ఏయన్+కడంగు+ఎడన్= ప్రయోగించటానికి ప్రయత్నించే సందర్భంలో; ఆ+సుభద్రాసూనుండు= ఆ అభిమన్యుడు.

తాత్పర్యం: రుక్మరథుడు పాండురాజు మనుమడిని ఎదిరించి (రొమ్ము) ఎదపైన తొమ్మిదీ, భుజాలపై రెండూ, బాణాలు గ్రుచ్చుకొనేటట్లు చేసి, మళ్ళీ ప్రయోగించబోయే సమయంలో అభిమన్యుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. శరముతోడ నొక్క కరము చాపము తోడ । నొకటి బొమలు గదిసి యున్న యుగ్ర
రేఖతోడఁ దల ధరిత్రిపైఁ బడనేసె । రయము మెఱయఁ బటు శరత్రయమున. 81

ప్రతిపదార్థం: శరముతోడన్= బాణంతో కూడి ఉన్న; ఒక్క కరమున్= ఒక చేతినీ; చాపముతోడన్= వింటితోకూడిన; ఒకటిన్= ఒకచేతినీ; బొమలు+కదిసి+ఉన్న= కనుబొమలు ముడివడి ఉండే; ఉగ్రరేఖ+తోడన్= భయంకరమైన రీతితో; తలన్= శిరస్సునూ; పటు+శర+త్రయమునన్= వాడి అయిన మూడు బాణాలతో; రయము+మెఱయన్= వేగం అతిశయించగా; ధరిత్రిపైన్= నేలపై;పడన్= పడేటట్లు; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: అభిమన్యుడు రుక్మరథుడి బాణసహితమైన ఒక చేతిని ఒకబాణంతోనూ, విల్లుతో కూడిన అతడి మరొకచేతిని వేరొక బాణంతోనూ, కను బొమలు ముడివడి ఉన్న అతడి తలను వేరొక బాణంతోనూ - ఇట్లా మూడు బాణాలతో వడిగా నేలగూల్చాడు.

వ. ఇ ట్లర్జునపుత్త్రుండు చిత్రకౌశలంబు సూపిన. 82

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అర్జునపుత్త్రుండు= అర్జునుడి కొడుకైన అభిమన్యుడు; చిత్రకౌశలంబు= వింత అయిన నేర్పు; చూపినన్= ప్రదర్శింపగా.

తాత్పర్యం: ఈ విధంగా అభిమన్యుడు నేర్పు ప్రదర్శించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. రుక్మరథుడు పడిన రోషాత్తచిత్తులై । యతని చెలులు పలువు రవనిపతులు
గవిసి రపుడు తేరుగములతో వడి భవ । త్పౌత్త్రుమీఁద నీదు పుత్త్రు లలర. 83

ప్రతిపదార్థం: రుక్మరథుఁడు= శల్యుడి కొడుకు రుక్మరథుడు; పడినన్= నేలకూలగా; అతని+చెలులు= అతడి స్నేహితులు; పలువురు+అవని పతులు= చాలామంది రాజులు; రోష+ఆత్త+చిత్తులు+ఐ= కోపాన్ని పొందిన మనస్సులు కలవారై; అపుడు= ఆ సమయంలో;నీదు పుత్త్రులు= నీ కొడుకులు; అలరన్= సంతోషించగా; భవత్+పౌత్త్రుమీఁదన్= నీ మనుమడిపై; వడిన్= తొందరగా; తేరుగములతోడన్= రథ సమూహాలతో; కవిసిరి= విజృంభించారు.

తాత్పర్యం: రుక్మరథుడు ఆ విధంగా నేలకూలగా అతడి స్నేహితులు చాలామంది రాజులు కోపం పొందిన మనస్సులు కలవారై, నీ కుమారులు సంతోషించేటట్లు నీ మనుమడి పైకి వడివడిగా తమ రథ సమూహాలతో విజృంభించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ ఆటవెలది పద్యంలోని పదాల కూర్పులో తిక్కన చూపిన నేర్పు అప్పటి సన్నివేశాన్ని స్ఫురింపజేస్తూ ఉన్నది. ముఖ్యంగా పద్యగమనం గమనించదగింది. 'అతని చెలులు పలువు రవని పతులు గవిసిరపుడు తేరుగములతో వడి' ఇందులోని లఘువులు వడివడిగా పలువురు చెలులు ఎట్లా వచ్చి చేరారో ధ్వనింపజేస్తూ ఉన్నాయి. 'భవత్+పౌత్త్రు'లోని ఔత్వం వారందరూ అభిమన్యుడిపైకి దూకి కవిసిన విధానాన్ని వ్యంజింపజేస్తూ ఉన్నది.

క. **అమ్మనుజవిభుల బహుల శ। రమ్ములచే సూత కేతు రథ రథ్య సమే**
తమ్ముగఁ బొదువంబడు తన। తమ్మునిసుతుఁ జూచి పతి ముదమ్మునఁ దేలెన్. 84

ప్రతిపదార్థం: ఆ+మనుజవిభుల= ఆ రాజులయొక్క; బహుల, శరమ్ములచేన్= అనేక విధాలైన బాణాలచేత; సూత= సారథి; కేతు= జెండా(ధ్వజం); రథ= తేరు; రథ్య= గుఱ్ఱాలు(వీటితో); సమేతమ్ముగన్= కూడి ఉండేటట్లు; పొదువన్+పడు= క్రమ్మబడే; తన తమ్ముని సుతున్= అర్జున కుమారుడిని; చూచి= పరికించి; పతి= దుర్యోధనుడు; ముదమ్మునన్+తేలెన్= సంతోషంలో తేలిపోయాడు.

తాత్పర్యం: ఆ రాజులు అనేకవిధాలైన బాణాలతో రథమూ, గుఱ్ఱాలు , సూతుడూ, జెండా మొదలైన వాటితో అభిమన్యుడిని కమ్ముకొన్నారు. అట్లా వారిచే కలియబడ్డ అర్జునపుత్రుడిని చూచి దుర్యోధనుడు సంతోషంలో తేలిపోయాడు.

వ. **ఇట్లభిమన్యుండు మడిసెనకాఁ దలంచి దుర్యోధనుండు సంతోషింప నా సౌభద్రుండు భద్రగజంబు బరిగోలల పోట్లం గనలు కైవడిం గినిసి, గాంధర్వియైన మాయ గావించె; నది దొల్లి ధనంజయు తపంబునకుం బ్రియం బంది తుంబురు ప్రభృతు లొసంగినట్టిది; దానం జేసి యమ్మానవనాథుల యాలోకనంబులకుం బెక్కు రథమ్ములవారు దమ్ముఁ బొదివికొని యనేకాస్త్ర శస్త్రంబులు ప్రయోగించిన చందంబు దోఁచిన వారు వెగడుపడి చూచుచుండ నతండు మండల ప్రచారంబులం దేఱు మెఱయ మెఱుంగు వాలమ్ములం గూల నేసియు, వెడందతూపులం ద్రుంచి పడవైచియు, బడలు వఱచిన నన్నరపతులు నఱుకుడు వడిన యెలమావి జొంపంబుల చందంబగుటయు, నుబ్బు దక్కి వెక్కసంబును వెల్లఁబాటునుం గదిరి యక్కురువిభుండు దన కొడుకు కడిమి సైరింపంజాలక యతనిపై నడరి కొండొకసేపు గన్నుల పండువుగా భండనంబు సేసి సంరంభ విజృంభితుండగు నవ్వీరవరు విశిఖ వేగంబునకుం గాక విముఖుండయ్యె' ననిన విని యాంబికేయుండు సంజయున కిట్లనియె: 85**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అభిమన్యుండు= అభిమన్యుడు; మడిసెను+అ= మరణించాడు; కాన్= అని; తలంచి= భావించి; దుర్యోధనుండు; సంతోషింపన్= సంతసిల్లగా; ఆ సౌభద్రుండు= సుభద్రా పుత్త్రుడైన ఆ అభిమన్యుడు; భద్రగజంబు= భద్రజాతి ఏనుగు; బరిగోలల+పోట్లన్= అంకుశాల పొడుపులచేత; కనలు= కోపించే; కైవడిన్= విధంగా; కినిసి= కోపించి; గాంధర్వి+ఐన మాయన్= గంధర్వ సంబంధమైన గాంధర్వి అనే పేరుగల మాయ; కావించెన్= చేశాడు; అది= ఆ విద్య; తొల్లి= పూర్వం; ధనంజయు, తపంబునకున్= అర్జునుడి తపస్సుకు; ప్రియంబు+అంది= ఇష్టపడి; తుంబుర, ప్రభృతులు= తుంబురుడు మొదలైన వాళ్ళు; ఒసంగినట్టిది= ఇచ్చినటువంటిది; దానన్+చేసి= దానిచేత; ఆ+మానవనాథ+ఆలోకనంబులకున్= ఆ రాజుల చూపులకు; పెక్కు, రథమ్ములవారు= పెక్కండ్రు రథికులు; తమ్మున్= తమ్ము; పొదివికొని= క్రమ్ముకొని; అనేక+అస్త్ర+శస్త్రంబులు= చాలా బాణాలు, ఆయుధాలు; ప్రయోగించిన+చందంబు= ఏసినట్లుగా; తోఁచినన్= కనిపించగా; వారు= ఆ రాజులు; వెగడుపడి= (వెరగొంది) భయపడి; చూచుచుండన్= చూస్తూ ఉండగా; అతండు= అభిమన్యుడు; మండల ప్రచారంబులన్= చుట్టివచ్చుటలచేత; తేరు+మెఱయన్= రథం ప్రకాశింపగా; మెఱుంగు వాలు+అమ్ములన్= మెఱిసే వాడి అయిన బాణాలచేత; కూలన్+ఏసియున్= క్రిందపడేటట్లు ప్రయోగించియు; వెడంద+తూపులన్= పెద్ద బాణాలతో; త్రుంచి+పడవైచియున్= విరిచి క్రింద పడేటట్లు చేసి; బడలు పఱచినన్= శ్రమకలిగించగా; ఆ+నరపతులు= ఆ రాజులు; నఱుకుడు+పడిన= నరికివేయబడ్డ;

ఎలమావి, జొంపంబుల, చందంబు= లేతమామిళ్ళ చిగుళ్ళమాదిరి; అగుటయున్= కాగా; ఉబ్బు, తక్కి= గర్వం నశించి; వెక్కసంబునున్= సహించలేకుండా పోవటం; వెల్లఁబాటునున్= వెలవెల పోవటమున్నూ; కదిరి= అతిశయించి; ఆ+కురువిభుండు= ఆ దుర్యోధనుడు; తనకొడుకు+కడిమిన్= తన కుమారుడి శౌర్యాన్ని; సైరింపన్+చాలక= సహించలేకుండా; అతనిపైన్= ఆ బాలుడిపై; అడరి= విజృంభించి; కొండొకసేపు= కొంతసేపు; కన్నుల పండువుగాన్= నేత్రపర్వంగా; భండనంబు+చేసి= యుద్ధం చేసి; సంరంభ విజృంభితుండు+అగు= ఆటోపంతో చెలరేగిన వాడైన; ఆ+వీరవరు= ఆ వీరశ్రేష్ఠుని యొక్క; విశిఖ వేగంబునకున్= బాణాలవేగానికి; కాక= తట్టుకోలేక; విముఖుండు+అయ్యెన్= పెడమోము పెట్టాడు; అనినన్+విని= అనగా విని; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్= సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అభిమన్యుడు చనిపోయాడు గదా! అని భావించి దుర్యోధనుడు సంతోషించగా, ఆ అభిమన్యుడు భద్రజాతి ఏనుగును అంకుశంతో పొడిస్తే ఏ విధంగా కోపపడుతుందో ఆ విధంగా కోపపడి, గాంధర్వి అనే మాయను ప్రయోగించాడు. ఆ విద్య పూర్వం అర్జునుడి తపస్సుకు మెచ్చి తుంబురుడు మొదలైన వాళ్ళు ఇచ్చినటువంటిది. దానివలన చూచే రాజులకు అనేక రథాల వాళ్ళు చుట్టుముట్టి ఎన్నో అస్త్రశస్త్రాలు తమపై ప్రయోగించినట్లు అనిపించింది. అందుకు వాళ్ళు భయపడి చూస్తూ ఉండగా, అభిమన్యుడు వలయాకారంగా తిరిగి రథం మెరసిపోగా వాడి అయిన బాణాలతో, వెడల్పైన తూపులతో వారిని కూలనేసి, త్రుంచి, పడవైచి శ్రమకలిగించాడు. అప్పుడు ఆ రాజులు నరికివేయబడిన లేత మామిడి చిగుళ్ళ మాదిరి అయ్యారు. ఓర్వలేనితనంతో, వెలవెలబోయిన దుర్యోధనుడు తన కొడుకు శౌర్యాన్ని చూచి ఓర్వలేక అతడిపై దూకి, కొంతసేపు కన్నుల పండువుగా యుద్ధంచేసి, ఆటోపంతో చెలరేగిన ఆ అభిమన్యుడి బాణవేగాలకు తట్టుకోలేక పెడమొగం పెట్టాడు' అనగా విని ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉపమ. బరిగోల= ఏనుగును బెదిరించడానికై ప్రక్కల పొడుచు, అర్ధచంద్రాకారముగా ఉక్కుతో చేసిన అలుగుగల వేణుదండం.

ఉ. **'ఇమ్మెయి బాలుఁ డొక్కరుఁడ యిందఱఁ దోలి వధించె నన్న నే**
నమ్మఁగఁ నేరనయ్యెద; వినం గడు నక్కజ; మట్టు లేల చి
త్తమ్మున సంశయింప? విను: ధర్మ మధర్మము నోర్వకున్నె క
య్యమ్ము తెఱంగు సెప్పు మెటులయ్యెఁ బదంపడి సూతనందనా! **86**

ప్రతిపదార్థం: సూతనందనా!= సంజయా!; ఈ+మెయిన్= ఈ రీతిగా; బాలుఁడు+ఒక్కరుఁడు+అ= బాలుడు ఒక్కడే; ఇందఱన్= ఇంతమందిని; తోలి+వధించెన్= తరిమి చంపాడు; అన్నన్= అంటే; నేన్= నేను; నమ్మఁగ నేరన్+అయ్యెదన్= నమ్మటానికి శక్యం లేనివాడ నౌతున్నాను; వినన్= వినగా; కడున్= మిక్కిలి; అక్కజము= ఆశ్చర్యం; అట్టులు+ఏల, చిత్తమ్మునన్+సంశయింపన్= అట్లు ఎందుకు మనస్సులో సందేహించటం; విను= వినుము; ధర్మము= ధర్మం(న్యాయం); అధర్మమున్= అధర్మాన్ని; ఓర్వక+ఉన్నె?= జయించకుండా ఉంటుందా?; పదంపడి= అటుపైన; కయ్యమ్ము+తెఱంగు= యుద్ధంయొక్క విధం; ఎటులు+అయ్యెన్= ఏ విధంగా అయింది; చెప్పుము= చెప్పవలసింది.

తాత్పర్యం: 'ఈ విధంగా ఒక్క బాలుడే ఇందరిని తరిమి చంపాడు అంటే నమ్మటానికి వీలుకాకుండా ఉన్నది. ఇది వినటానికి కూడా చాలా ఆశ్చర్యంగా ఉన్నది. ఆ విధంగా మనస్సులో సందేహించటం ఎందుకు? వినుము. ధర్మం అధర్మాన్ని జయించకుండా ఉంటుందా? ఆపైన యుద్ధపుతీరు ఏ విధంగా అయిందో చెప్పవలసింది.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. అనిన నమ్మనుజవల్లభునకు సంజయుం డిట్లను 'నట్లు పెక్కండ్రురాజులు సచ్చుటయును సుయోధనుండు దెరలుటయును గని భవత్కుమారవర్గంబును దోడియోధవరులును మేనులు సెమర్ప మొగంబులు వెలవెలంబాఱ నోళ్ళెండం గాళ్ళు వడంక నలుదిక్కులుం జూచుచు ధృతి దఱిగిపోయిన వెఱచఱచి విఱిగి; రప్పుడు మగుడం గోల్తలసేసి కురువిభుండు గురుపుత్త్ర కృప కర్ణ కృతవర్మ బృహద్బల సౌబల సమేతంబుగా సౌభద్రు నెదుర్కొనిన. నతండు గెలుపు నుబ్బునం గొండొక పెద్ద యనక పిడుగు చందంబునన్ గర్జిలి యుఱికిన నయ్యరదంబుల తండంబులు లేటమొగంబు వడియె; నట్టియెడ. 87

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+మనుజవల్లభునకున్= ఆ రాజుకు(ధృతరాష్ట్రుడికి); సంజయుండు= సంజయుడు; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; అట్లు= ఆ విధంగా; పెక్కండ్రు+రాజులు= అనేక రాజులు; చచ్చుటయును= చావటమున్నూ; సుయోధనుండు= దుర్యోధనుడు; తెరలుటయును= తొలగటం లేదా కలత చెందటమున్నూ; కని= చూచి; భవత్+కుమారవర్గంబును= నీ కుమారులందరు; తోడి యోధవరులును= సహకరించే యుద్ధవీరులున్నూ; మేనులు+చెమర్పన్= శరీరాలు చెమటపట్టగా; మొగంబులు+వెలవెలంబాఱన్= ముఖాలు వెల్లబాటు (వైవర్ణ్యాన్ని) చెందగా; నోళ్ళు+ఎండన్= నోళ్ళు ఎండిపోగా; కాళ్ళు వడంకన్= కాళ్ళు వణకగా; నలు+దిక్కులన్+చూచుచున్= నాలుగువైపుల చూస్తూ; ధృతి= ధైర్యం; తఱిగిపోయినన్= నశించిపోగా; వెఱచఱచి= భయపడి; విఱిగిరి= ఓడిపోయారు; అప్పుడు= ఆ సమయంలో; మగుడన్= మళ్ళీ; కోల్తల చేసి= యుద్ధసన్నాహం కావించి; కురువిభుండు= దుర్యోధనుడు; గురుపుత్ర, కృప, కర్ణ, కృతవర్మ, బృహద్బల, సౌబల, సమేతంబుగాన్= అశ్వత్థామ, కృపాచార్యులు, కర్ణుడు, కృతవర్మ, బృహద్బలుడు, శకుని (అనువీరితో) కూడుకొన్నట్లుగా; సౌభద్రున్= అభిమన్యుడిని; ఎదుర్కొనినన్= మార్కొనగా; అతండు= అభిమన్యుడు; గెలుపు+ఉబ్బునన్= విజయోత్సాహంతో; కొండొక= అదొక; పెద్ద; అనక= అనుకోకుండా; పిడుగు చందంబునన్= పిడుగువలె; గర్జిలి= గర్జించి; ఉఱికినన్= దూకగా; ఆ+అరదంబుల+తండంబులు= ఆ రథాల సమూహాలు; లేటమొగంబు+పడియెన్= విముఖత్వాన్ని పొందాయి; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అని అడుగగా ధృతరాష్ట్రుడితో సంజయుడు ఇట్లా అన్నాడు: 'ఆ విధంగా పలువురు రాజులు చావగా, దుర్యోధనుడు మరలిపోగా, తక్కిన నీ కుమారులూ, యుద్ధవీరులూ చెమటలు గ్రక్కుతూ తెల్లమొగాలు వేసికొని, ఎండిన నోళ్ళతో, వణికే కాళ్ళతో నలువైపుల చూస్తూ ధైర్యం చెడి భయపడి ఓడిపోయారు. అపుడు మళ్ళీ దుర్యోధనుడు యుద్ధసన్నాహం చేసి అశ్వత్థామ కృపాచార్య కర్ణ కృతవర్మ శకుని బృహద్బలులతో అభిమన్యుడిని ఎదిరించగా, అతడు విజయోత్సాహంతో అదొక పెద్ద తాకిడి అని అనుకోకుండా, పిడుగువలె గర్జించి, దూకగానే, రథాలు పెడమోము పెట్టాయి. ఆ సమయంలో.

విశేషం: అలం: ఉపమ.

దుర్యోధనపుత్రుం డగు లక్ష్మణకుమారుం డభిమన్యునిచేఁ జచ్చుట (సం. 7-45-8)

చ. అదలిచి లక్ష్మణుండు విజయాత్మజుఁ దాఁకినఁ జూచి యుమ్మలం
బొదవఁగఁ బుత్త్రుఁ బెట్టి చన నోపక క్రమ్మఱు రాజుఁ గాంచి యం
బుదములు గొండపై నడరు పోలిక నన్నరుపట్టి నందఱుం
బొదువ, నతండు ఘోరశర భూరి సమీరమునం దెరల్చుచున్. 88

ప్రతిపదార్థం: అదలిచి= అదలించి; లక్ష్మణుండు= దుర్యోధనుడి కొడుకు; విజయ+ఆత్మజున్= అర్జునకుమారుడైన అభిమన్యుడిని; తాఁకినన్= ఎదుర్కోగా; చూచి= కనుగొని; ఉమ్మలంబు+ఒదవఁగన్= దుఃఖం కలుగగా; పుత్త్రున్+పెట్టి, చనన్+ఓపక= కొడుకును వదలిపోవటానికి ఇష్టపడక; క్రమ్మఱు+రాజున్+కాంచి= వెనక్కి మళ్ళీ దుర్యోధనుడిని చూచి; అంబుదములు+కొండపైన్+ఆడరు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పోలికన్= మేఘాలు, కొండపై అతిశయించే విధంగా; ఆ+నరు, పట్టిన్= ఆ అర్జునుడి కుమారుడిని; అందఱున్= అందరూ; పొదువన్= చుట్టుముట్టగా; ఘోర= భయంకరమైన; శర= బాణాలనే; భూరి సమీరమున్= పెను గాలిచేత; తెరల్చుచున్= వెనకకు మరలిస్తూ.

తాత్పర్యం: దుర్యోధనుడి కొడుకు లక్ష్మణకుమారుడు అదలిస్తూ అభిమన్యుడిని ఎదుర్కొన్నాడు. అది చూచి దుఃఖం కలుగగా పుత్రుడిని వదలిపెట్టి పోవటానికి మనస్సు రాక వెనుకకు మళ్ళే దుర్యోధనుడిని చూచి, మేఘాలు కొండపై విజృంభించే విధంగా, ఆ అభిమన్యుడిని అందరూ కమ్ముకొని ఎదుర్కొనగా, అతడు భయంకరమూ, అధికమూ అయిన బాణాలు అనే పెనుగాలిచేత వారిని వెనుకకు మరలిస్తూ.

విశేషం: అలం: ఉపమ. ఈ చంపకమాలా వృత్తంలో అభిమన్యుడు అనటానికి మారుగా 'విజయాత్మజు' 'అన్నరుపట్టి' అని తిక్కన ప్రయోగించాడు. తన్నెదుర్కొన్న లక్ష్మణుడిని మట్టుపెట్టటం, తాను విజయాన్ని పొందటం తథ్యం. అందువలన 'విజయాత్మజు' అనే ప్రయోగం సాభిప్రాయం. 'ఘోర శర భూరి సమీర' ప్రయోగం కూడా ఎంతో ఔచిత్యవంతంగా ఉన్నది. 'శర' శబ్దానికి వాడిన విశేషణం 'ఘోర'. 'సమీర' ప్రయోగానికి కూడా వాడిన విశేషణం 'భూరి', భూరి శబ్దోచ్చారణలోనే సమీరమెంతో తీవ్రంగా వెలువడుతున్నది. ఊది పారవేయడం ఈ విశేషణంలోని విశేషం. ప్రభంజన శబ్ద లక్ష్యాన్ని ఇది పరోక్షంగా నిరూపిస్తూ ఉన్నది.

క. కదిసిన లక్ష్మణునిం బులి । కొదమను సింగంపుఁ గొదమ గొదగొని లీలం
బొదువుగతిఁ గిట్టి మోదము । మదము నెలర్పంగ నింద్రు మనుమఁడు గడిమిన్. 89

ప్రతిపదార్థం: కదిసిన= సమీపించిన; లక్ష్మణునిన్= దుర్యోధనుడి కుమారుడైన లక్ష్మణుడిని; పులికొదమను= పులిపిల్లను; సింగంపుఁగొదమ= సింహపుపిల్ల; గొదగొని= విజృంభించి; లీలన్= అలవోకగా; లక్ష్మణునిన్= లక్ష్మణుడిని; కదిసి= చేరి; పొదువుగతిన్= కమ్మివేసేటట్లు; కిట్టి= సమీపించి; మోదమున్= సంతోషం; మదమున్= గర్వం; ఎలర్పంగన్= అతిశయించగా; ఇంద్రుమనుమఁడు= అభిమన్యుడు; కడిమిన్= శౌర్యంతో.

తాత్పర్యం: పులిపిల్లపై సింహపు పిల్ల విజృంభించే విధంగా తనమీదికి వచ్చే లక్ష్మణకుమారుడిని చేరి, అతడిపై దూకి, సంతోషమూ గర్వమూ అతిశయించగా ఇంద్రుడి మనుమడు శౌర్యంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

చ. ఉఱక యురంబు బాహువులు నొక్కొక యమ్మున నొవ్వనేసి నీ
వెఱిఁగి యెఱింగినన్ దొడరి తెక్కడఁ బోవఁగ వచ్చు? నంచు నే
డ్తెఱఁ దలఁ గుండలస్ఫురితదీప్తులతో నిల డొల్ల నేసె నం
దఱుఁ బతియుం గనుంగొనఁగ దైన్యరవంబు సెలంగ సేనలన్. 90

ప్రతిపదార్థం: ఉఱక= మిన్నక; ఉరంబున్= రొమ్మును; బాహువులున్= భుజాలను; ఒక్కొక+అమ్మునన్= ఒక్కొక్క బాణంచేత; నొవ్వన్= నొచ్చేటట్లు; ఏసి= ప్రయోగించి; నీవు= నీవు (లక్ష్మణుడు అనిభావం); ఎఱిఁగి ఎఱింగి= తెలిసి తెలిసి; నన్= నన్ను; తొడరితి(వి)= మార్కొన్నావు; ఎక్కడన్+పోవఁగన్+వచ్చున్?= ఎక్కడకు పోవచ్చు?; అంచున్= అంటూ; ఏడ్తెఱన్= పరాక్రమంచేత; కుండల, స్ఫురిత, దీప్తులతోన్= కుండలాలచేత కలుగు కాంతులతో; సేనలన్= సైన్యాలలో; దైన్యరవంబు= దీనారావం; చెలంగన్= అతిశయించగా; అందఱున్= అందరూ; పతియున్= దుర్యోధనుడున్నూ; కనుంగొనఁగన్= చూస్తూ ఉండగా; తలన్= తలను; ఇలన్= నేలపై; డొల్లన్+ఏసెన్= దొర్లిపడేటట్లు చేశాడు.

తాత్పర్యం: రొమ్ముపై, భుజాలపై ఒక్కొక్క బాణం నొచ్చేటట్లుగా అభిమన్యుడు ప్రయోగించి లక్ష్మణుడితో 'నీవు తెలిసి తెలిసి నన్ను ఎదిరించావు. ఇంకెక్కడకు తప్పించుకొని పోగలవు?' అంటూ పరాక్రమంతో సైన్యంలో దైన్యాన్ని కలిగిస్తూ, దుర్యోధనుడూ తక్కిన అందరూ చూస్తూ ఉండగానే, కుండల కాంతులతో వెలుగొందే అతడి తలను నేలపై, దొర్లిపడేటట్లు చేశాడు.

తే. **మిడుక మిడుక ని త్తెఱఁగునఁ గొడుకుఁ దునిమి। యక్కుమారుండు మెఱయుట నడలుఁ గనలుఁ**
గడలుకొను మదితోడ నీ కొడుకు 'వీని। నొంపుఁ డందఱుఁ బైపడి చంపుఁ' డనుడు. **91**

ప్రతిపదార్థం: ఈ+తెఱఁగునన్= ఈ విధంగా; ఆ+కుమారుఁడు= ఆ అభిమన్యుడు; కొడుకున్+తునిమి= లక్ష్మణకుమారుడిని చంపి; మిడుక మిడుకన్= త్రుళ్ళి త్రుళ్ళి; మెఱయుటయును= విజృంభించగా; నీకొడుకు= దుర్యోధనుడు; అడలున్= దుఃఖమూ; కనలున్= కోపమూ; కడలుకొను+మదితోడన్= వ్యాపించే మనస్సుతో; అందఱున్= అందరూ; పైపడి= పైనపడి; వీనిన్= ఈ అభిమన్యుడిని; నొంపుఁడు= నొప్పించండి; చంపుఁడు= చంపండి; అనుడున్= అని అనిన అనంతరం.

తాత్పర్యం: ఈ విధంగా అభిమన్యుడు లక్ష్మణ కుమారుడిని చంపి త్రుళ్ళి త్రుళ్ళి విజృంభించగా, నీ కొడుకు దుర్యోధనుడు దుఃఖమూ, కోపమూ ముడివడ్డ మనస్సుతో, 'అందరూ ఆ అభిమన్యుడి పైన బడి నొప్పించండి చంపండి' అన్నాడు.

క. **కృతవర్మయుఁ గృపుఁడు గురుఁడు। నతని సుతుఁడుఁ గర్ణుఁడును బృహద్బలుఁడును భా**
సిత శరములు గురియుచు న। చ్యుతు నల్లునిఁ బొదివి రొక్కయుమ్మడిఁ బెలుచన్. **92**

ప్రతిపదార్థం: కృతవర్మయున్= కృతవర్మయునూ; కృపుఁడున్= కృపుడునూ; గురుఁడున్= ద్రోణాచార్యుడున్నూ; అతని సుతుఁడున్= అశ్వత్థామయున్నూ; కర్ణుఁడును= కర్ణుడున్నూ; బృహద్బలుఁడును= కోసల దేశాధిపతి అయిన బృహద్బలుడున్నూ; భాసిత శరములు= ప్రకాశవంతాలైన బాణాలు; కురియుచున్= వర్షిస్తూ; అచ్యుతు+అల్లునిన్= అభిమన్యుడిని; పెలుచన్= అతిశయంతో; ఒక్క ఉమ్మడిన్= ఒక్కపెట్టున; పొదివిరి= క్రమ్ముకొన్నారు.

తాత్పర్యం: కృతవర్మా, కృపుడూ, ద్రోణాచార్యుడూ, అశ్వత్థామా, కర్ణుడూ, బృహద్బలుడూ తమ తమ ప్రకాశవంతాలైన బాణాలను కురిపిస్తూ అతిశయంతో అందరూ ఒక్కుమ్మడిగా అచ్యుతుడి అల్లుడైన అభిమన్యుడిని క్రమ్ముకొన్నారు.

క. **అతఁ డందఱ విశిఖమ్ములు। వితథమ్ములు సేసి, వారి వెగడు పఱిచి యు**
ద్ధతి సైంధవు పోరెడు నెడ। కతిరయమునఁ దేరు నడపు నా సమయమునన్. **93**

ప్రతిపదార్థం: అతఁడు= ఆ అభిమన్యుడు; అందఱ విశిఖమ్ములున్= అందరి బాణాలను; వితథమ్ములు చేసి= వ్యర్థం చేసి; వారిన్= ఎదిరించిన వారినందరినీ; వెగడుపఱిచి= తల్లడపడేటట్లు చేసి; ఉద్ధతిన్= గర్వంతో; సైంధవు పోరెడు+ఎడకున్= సైంధవుడు యుద్ధం చేసే చోటుకు; అతిరయమునన్= మిక్కిలి వేగంతో; తేరు+నడపు= రథాన్ని నడిపే; ఆ సమయమునన్= ఆ సందర్భంలో.

తాత్పర్యం: అభిమన్యుడు అందరి బాణాలను వ్యర్థం చేసి, ఎదిరించిన అందరికీ తల్లడపాటు కలిగించి, మిక్కిలి ఔద్ధత్యంతో సైంధవుడు యుద్ధం చేసే ప్రదేశానికి రథాన్ని నడుపుతూ ఉన్న సందర్భంలో. (తరువాతి వచనంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. నిషాదులు గళింగులు గజబృందంబులతో నడ్డపడిన నయ్యతిరథసింహుండు దరువాయి గొని తునుమాడ నెప్పటి యోధవీరు లెయిది పె క్కాఁబోతు లొక్కపులిం జుట్టుముట్టిన చందంబునం బొదివి పెనంగ నా జయద్రథుండును బాండవ బలంబులం ద్రోచి రానీక రభసాతిశయ ఘోరంబుగాఁ బోరుచుండె; నక్కుమారుండు గురుం బంచాశద్బాణంబులను గృతవర్మ, నశీతి సాయకంబులను, గురుతనయు దశవిశిఖంబులను, గర్ణు నొక్కబలు నారసంబునను స్రుక్కించి, కృపుని విరథుం జేసి, బృహద్బలుమేన ముప్పది నారసంబులు నాటించి, వారలకు బాసట యయి కదిసిన సైనికులం బెక్కు తెఱంగుల తూపులఁ జిక్కువఱిచి యుక్కునం గ్రోధపుత్త్ర బృందారకు లనురాజులను రూపడంచె; నప్పుడు శారద్వతుండు దే రాయితంబు సేసికొని కడంగి తోడి యేవురం గూడుకొని యాక్రీడి కొడుకు మీఁద మార్గణ పరంపరలు పరఁగింపం బెరిఁగిన దర్పంబునం గసిమసంగి యతండు నొప్పింపఁ బెఱవారు బీఱువోవ బృహద్బలుండు బిట్టు గవిసి నిశిత శరంబులు నిగిడించిన నన్నరనందనుండు. 94

ప్రతిపదార్థం: నిషాదులున్= బోయవాళ్ళు; కళింగులున్= కళింగదేశం వాళ్ళు; గజబృందంబులతోన్= ఏనుగుల గుంపుతో; అడ్డపడినన్= అడ్డగించగా; ఆ+అతిరథ, సింహుండు= ఆ అతిరథ శ్రేష్ఠుడు (ఇచ్చట సింహశబ్దం శ్రేష్ఠవాచకం); (అతిరథుడు; అంటే పెక్కు విలుకాండ్రతో పోరాడే యోధుడు; మహారథుడు పదకొండు వేలమంది విలుకాండ్రతో పోరాడుతూ సారథినీ, గుర్రాలనూ కాపాడుతూ పోరాడేవాడు) తరువాయి= అనంతరం; కొని= పూని; స్వాధీనం చేసికొని; తునుమాడన్= తుంచగా; ఎప్పటి+యోధవీరులు= అప్పటి (లేదా ఎప్పటివలె) యుద్ధవీరులు; ఎయిది= వెంబడించి; పెక్కు+ఆఁబోతులు= చాలా ఎద్దులు; ఒక్క పులిన్= ఒక పులిని; చుట్టుముట్టిన+చందంబునన్= చుట్టుకొన్న విధంగా; పొదివి= క్రమ్ముకొని; పెనంగన్= యుద్ధం చేయగా; ఆ జయద్రథుండును= ఆ సైంధవుడునూ; పాండవ బలంబులన్= పాండవసైన్యాలను; త్రోచి+రానీక= మీరి రానీకుండా; (తన్నుదాటిపోనీకుండా); రభస+అతిశయ+ఘోరంబుగాన్= వేగంయొక్క అతిశయంచేత భయంకరంగా; పోరుచుండెన్= యుద్ధం చేస్తూ ఉన్నాడు; ఆ+కుమారుండు= ఆ బాలుడు (అభిమన్యుడు); గురున్= ద్రోణాచార్యుడిని; పంచాశత్+బాణంబులను= ఏభైబాణాలతో; కృతవర్మన్= కృతవర్మను; అశీతి+సాయకంబులను= ఎనభై బాణాలతో; గురు తనయున్= అశ్వత్థామను; దశవిశిఖంబులను= పదిబాణాలతో; కర్ణున్= కర్ణుడిని; ఒక్క+బలు+నారసంబునను= ఒక దృఢమైన బాణంతో; స్రుక్కించి= సోలిపోయేటట్లు చేసి; కృపునిన్= కృపాచార్యుడిని; విరథున్+చేసి= రథంలేని వాడినిగా చేసి; బృహద్బలు= కోసల దేశంరాజైన బృహద్బలుడి యొక్క; మేనన్= శరీరంపై; ముప్పది+నారసంబులు+నాటించి= ముప్పైబాణాలు నాటుకొనేటట్లు చేసి; వారలకున్= వారికి; బాసట+అయి= తోడై; కదిసిన+సైనికులన్= సమీపించిన సైనికులను; పెక్కు, తెఱంగుల, తూపులన్= పలురకాల బాణాలతో; చిక్కువఱిచి= తొట్రుపెట్టి (చిక్కులోపెట్టి); ఉక్కునన్= శౌర్యంతో; క్రోధపుత్ర, బృందారకులు+అను, రాజులను= క్రోధపుత్రుడు, బృందారకుడు అనే పేర్లుగల రాజులను; రూపు+అడంచెన్= రూపులేకుండా చేశాడు (చంపాడు); అప్పుడు= ఆ సమయంలో; శారద్వతుండు= కృపాచార్యుడు; తేరు= రథం; ఆయితంబు+చేసికొని= సిద్ధం చేసికొని; కడంగి= పూని; తోడి+ఏవురన్+కూడుకొని= వెంబడి ఉన్న అయిదుగురు వీరులను కలిసికొని; ఆ+క్రీడికొడుకు మీఁదన్= ఆ అర్జునుడి కొడుకుపైన; మార్గణ+పరంపరలు= బాణాల వరుసలు; పరఁగింపన్= ప్రయోగించగా; పెరిగిన+దర్పంబునన్= అతిశయించిన గర్వంతో; కసి మసంగి= ఖండించి; అతండు= ఆ అభిమన్యుడు; నొప్పింపన్= బాధపెట్టగా; పెఱవారు= ఇతరులు; బీఱుపోవన్= వ్యర్థంకాగా; బలహీనత చెందగా; బృహద్బలుండు= కోసలదేశపు రాజు బృహద్బలుడు; బిట్టు+కవిసి= తీవ్రంగా చుట్టుముట్టి; నిశిత, శరంబులు, నిగిడించినన్= తీవ్రములైన (తీక్ష్ణములైన) బాణాలు ప్రయోగించగా; ఆ+నరనందనుండు= ఆ అర్జునుడి కుమారుడు.

తాత్పర్యం: బోయవాళ్ళు, కళింగదేశం వాళ్ళు ఏనుగుల గుంపుతో అడ్డుకొన్నారు. అతిరథ శ్రేష్ఠుడైన అభిమన్యుడు అటుపైన పూనుకొని సైన్యాన్ని సంహరించాడు. ఎప్పటివలె అప్పటి యుద్ధవీరులు వెంబడించి పెక్కు ఎద్దులు ఒక్క పులిని చుట్టుకొన్నట్లుగా క్రమ్ముకొని పోరాడుతూ ఉండగా, అక్కడ సైంధవుడు పాండవసైన్యాన్ని తననుమీరి పోనీకుండా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వేగాతిశయంతో భయంకరంగా యుద్ధంచేస్తూ వచ్చాడు. అప్పుడు అభిమన్యుడు ద్రోణాచార్యుడిని ఏభై, కృతవర్మను ఎనభై, అశ్వత్థామను పది బాణాలతో, కర్ణుడిని ఒక దృఢమైన బాణంతో సొక్కిపోయేటట్లు చేశాడు. కృపుడిని తేరులేని వాడినిగా చేశాడు. బృహద్బలుడి శరీరంపై ముప్పై బాణాలు నాటాడు. పై చెప్పిన అందరికీ తోడుగా పోరాడుతూ ఉండే సైనికులను రకరకాల బాణాలతో చిక్కుపెట్టాడు. క్రోధపుత్రుడూ, బృందారకుడూ అనే రాజులను మట్టుపెట్టాడు. అంతలో కృపాచార్యుడు మళ్ళీ రథాన్ని సిద్ధం చేసికొని, తనతో కూడా ఐదుగురు యోధులను తీసికొని, ఆ అభిమన్యుడి మీద వరుసలు వరుసలుగా బాణాలు గుప్పించాడు. అభిమన్యుడు అతిశయించిన గర్వంతో ఆ బాణాలను ఖండించి తాను నొప్పించగా తక్కినవాళ్ళు బలహీనులైపోయారు. ఇంతలో కోసలదేశాధిపతి బృహద్బలుడు తీవ్రంగా చుట్టుముట్టి వాడి బాణాలు ప్రయోగించగా అభిమన్యుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

ఉ. **చాపము కేతువుం దునిమి సారథి నశ్వములన్ వధించుడుం**
గోప మెలర్ప ఖేటకముఁ గ్రూర కృపాణముఁ గొంచుఁ దేరు సా
టోపత డిగ్గి వే కవియుడుం బటు భల్ల హతిం గృతాంత సే
వాపరుఁ జేసె హృత్పుటము వ్రచ్చి బృహద్బలు భూరిదోర్బలున్. **95**

ప్రతిపదార్థం: చాపమున్= వింటిని; కేతువున్= జెండాను; తునిమి= ఖండించి; సారథిన్= సూతుడిని; అశ్వములన్= గుఱ్ఱాలను; వధించుడున్= చంపగానే; కోపము+ఎలర్పన్= క్రోధము అతిశయించగా; ఖేటకమున్= డాలును, క్రూర కృపాణమున్= తీవ్రమైన ఖడ్గాన్ని; కొంచున్= తీసికొంటూ; స+ఆటోపతన్= ఆటోపంతో; తేరున్+డిగ్గి= రథాన్ని దిగి; వే+కవియుడున్= వేగంగా సమీపించగా; భూరి+దోర్బలున్= అధికమైన భుజబలం కలవాడైన; బృహద్బలున్= కోసల దేశాధీశుడిని; పటు, భల్ల, హతిన్= గట్టి బల్లెంయొక్క పోటుచేత; హృద్+పుటమున్= దొప్పవంటి హృదయమును; వ్రచ్చి= చీల్చి; కృతాంత+సేవాపరున్= యముడిని సేవించడంలో ఆసక్తి కలవాడినిగా అనగా చచ్చినవాడినిగా; చేసెన్= కావించాడు- అర్జునకుమారుడు అభిమన్యుడు తన్నెదిరించిన బృహద్బలుడిని చంపివేశాడు.

తాత్పర్యం: చాపాన్నీ, ధ్వజాన్నీ (జెండాను) ఖండించి సారథినీ, గుఱ్ఱాలనూ చంపగానే కోపంతో డాలునూ, ఖడ్గాన్నీ తీసికొని ఆటోపంతో రథం దిగి, వేగంగా బృహద్బలుడు సమీపించాడు. బాహుబలంతో సమీపించిన ఆ బృహద్బలుడిని అభిమన్యుడు తీవ్రమైన బల్లెంతో, దొప్పవంటి అతడి హృదయాన్ని చీల్చి యమలోకానికి పంపాడు.

వ. **ఇ ట్లింద్రపౌత్త్రుండు గోసలేంద్రునిం దెగఁ జూచినఁ జూచి యేచి తదీయ బంధు భూపతు లొక్క మొగి నురవడించిన నతండు వారల యేపు మాపి కర్ణుండు డాసినం గర్ణోపాంతంబు గర్ణికానారాచంబుల నొప్పించె; నయ్యిరువురు నొండొరుల మేనులు నెత్తురుల జొత్తిల్లం జేసిన సంధ్యా సమయ సూర్యబింబ ప్రతిబింబంబులుం బోలె బొలిచి; రా సమయంబున సూతనందను నాయకు లార్వురు గర్వంబునఁ దన్నుం గదిసినం గవ్వడి కొడుకు చిత్రవధ విహారంబు సలుపు నప్పుడు కుంభసంభవ ప్రభృతి రథికవరుల శరంబులు మగిడించుచు వారిపైఁ దూపులు నిగిడించుచునికి యద్భుతంబయ్యె; నట్టియెడ.** **96**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఇంద్రపౌత్త్రుండు= ఇంద్రుడి మనుమడైన అభిమన్యుడు; కోసల+ఇంద్రునిన్= కోసల దేశాధిపతి అయిన బృహద్బలుడిని; తెగన్+చూచినన్= తునుమాడగా; చూచి= ఆ సన్నివేశాన్ని పరికించి; ఏచి= అతిశయించి; తదీయ, బంధు, భూపతులు= అతడి చుట్టాలైన రాజులు; ఒక్కమొగిన్= ఒక్క పూనికతో; ఉరవడించినన్= వేగిరపడగా (పరాక్రమించగా); అతండు= ఆ అభిమన్యుడు; వారల= చుట్టుముట్టిన బృహద్బలుని చుట్టాలయొక్క; ఏపు మాపి= గర్వాన్ని తొలగించి; కర్ణుండు+డాసినన్=

కర్ణుడు సమీపించగా; కర్ణ+ఉపాంతంబున్= చెవికొనలో; కర్ణికా, నారాచంబులన్= కర్ణికలు అనే బాణాలతో; నొప్పించెన్= బాధపెట్టాడు; ఆ+ఇరువురున్= ఆ అభిమన్యుడు, కర్ణుడు; ఒండొరుల= ఇరువురి; మేనులు= శరీరాలు; నెత్తురులన్= నెత్తుటితో; జొత్తిల్లన్+చేసినన్= ఎర్రనయ్యేటట్లు చేయగా; సంధ్యా సమయ= సంజవేళలో; సూర్య= సూర్యుడియొక్క; బింబ+ప్రతిబింబంబులున్+పోలెన్= బింబం ప్రతిబింబం విధంగా; పొలిచిరి= మసిలారు; ఆ+సమయంబునన్= ఆ సందర్భంలో; సూతనందను= కర్ణుడియొక్క; నాయకులు= దళపతులు (పంద్రెండుమంది భటుల అధిపతిని నాయకుడంటారు); ఆర్వురు= ఆరుమంది; గర్వంబునన్= ఆటోపంతో; తన్నున్= తనను; కదిసినన్= సమీపించగా (మార్కొనగా); కవ్వడి కొడుకు= అర్జునుడి కుమారుడు; చిత్రవధ విహారంబు= విచిత్రంగా చంపుతూ తిరగటం; సలుపు+అప్పుడు= చేస్తూ ఉన్నసమయంలో; కుంభసంభవ+ప్రభృతి= ద్రోణుడు మొదలైన; రథికవరుల= రథికశ్రేష్ఠుల; శరంబులు= బాణాలు; మగిడించుచున్= మరలిస్తూ; (వెనుకకు పంపుతూ); వారిపైన్= ద్రోణుడు మొదలైన వారిపై; తూపులు= బాణాలు; నిగిడించుచున్+ఉనికి= ప్రయోగిస్తూ ఉండటం; అద్భుతంబు+అయ్యెన్= ఆశ్చర్యకరం అయింది; అట్టి+ఎడన్= అటువంటి సమయంలో.

తాత్పర్యం: బృహద్బలుడు మరణించగానే అది చూచి అతడి బంధువులు రెచ్చిపోయి, అందరూ ఒక్కపూనికతో పరాక్రమించారు. అపుడు అభిమన్యుడు అందరి గర్వాన్ని తుదముట్టించి, కర్ణుడు తన్ను ఎదుర్కొనగా అతడి చెవికొనను కర్ణికలు అనే బాణాలతో నొప్పించాడు. ఇరువురూ,శరీరాలు నెత్తురు కారుతూ సంధ్యాకాలంలోని సూర్యబింబం, దాని ప్రతిబింబంవలె ప్రకాశించారు. ఆ సమయంలో కర్ణుడి దళపతులు ఆరుమంది తనను ఎదుర్కొన్నారు. వెంటనే అభిమన్యుడు చిత్రవిచిత్రంగా వారిని వధిస్తూ విహారం చేశాడు. ద్రోణాదులు ప్రయోగించిన బాణాలను వెనుకకు మళ్ళించి వారిపై తానూ బాణాల వర్షం కురిపించాడు.అది చాలా ఆశ్చర్యకరంగా ఉన్నది. ఆ సమయంలో.

తే. మగధపతి సూనుఁడైన యశ్మంతకుండు । బాలుఁ డయ్యును బ్రౌఢదోర్బలము మెఱయఁ
దాఁకుటయు, సూతు తలయు రథ్యముల తలలు । నతని తలతోన యభిమన్యుఁ డవనిఁ గూల్చె. 97

ప్రతిపదార్థం: మగధపతి సూనుఁడు+ఐన= జరాసంధుడి కొడుకైన; అశ్మంతకుండు= అశ్మంతకుడు అనే పేరుగలవాడు; బాలుఁడు+అయ్యును= పసివాడైనప్పటికీ; ప్రౌఢ దోః+బలము= ప్రౌఢులయొక్క మిక్కిలి నేర్పుగల భుజ బలం; మెరయన్= ఒప్పుచుండగా; తాఁకుటయున్= ఎదిరించటమున్నూ; సూతు, తలయున్= సారథి శిరస్సును; రథ్యముల తలలు= గుర్రాల తలలు; అతని+తలతోన్+అ= ఆ అశ్మంతకుడి శిరస్సుతోనే; అభిమన్యుఁడు; అవనిన్= నేలపైన; కూల్చెన్= పడవైచాడు.

తాత్పర్యం: మగధపతి కొడుకు అనగా జరాసంధుని కుమారుడు, అశ్మంతకుడు అనేవాడు బాలుడైనప్పటికీ మహాప్రౌఢుడి వలె భుజబలంతో అభిమన్యుడిని ఎదిరించాడు. అపుడు అభిమన్యుడు అతడి సారథి శిరస్సునూ గుర్రాల తలలను అతడి శిరస్సుతో పాటు నేలకూల్చాడు.

వ. ఇట్లు పూర్వ వైరంబు దలంచి తలపడిన మాగధు కుమారు నవలీల నేలం గలిపి సింహనాదంబు సేసినం దత్సంరంభంబు సైరింపంజాలక దుశ్శాసన సూనుండు సరభసంబుగాఁ గవిసి ఘోటకంబుల నంబక చతుష్టయంబునను, సారథి నొక్కనారసంబుననుం దదీయ తనువు పది బాణంబులను బెలుచ నొప్పించినం జంచదరుణ కమలచారు విలోచనుం డగుచు సౌభద్రుం డతనిఁ బ్రదీప్త సప్త నారాచ నిపాత పీడితుం జేసి డగ్గఱి. 98

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పూర్వవైరంబున్+తలంచి= ఇంతకు మునుపు జరాసంధుడిని భీముడు చంపిన విరోధాన్ని (శత్రుత్వాన్ని) భావించి; తలపడిన= ఎదిరించిన; మాగధుకుమారున్= మగధదేశ ప్రభువైన జరాసంధుడి కొడుకు అశ్మంతకుడిని; అవలీలన్= సులభంగా (చులకనగా); నేలన్+కలిపి= చంపి; సింహనాదంబు+చేసినన్= సింహంవలె గర్జించగా; తద్+సంరంభంబు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ వేగిరపాటు; సైరింపన్+చాలక= సహించలేక; దుశ్శాసన సూనుండు= దుశ్శాసనుని కొడుకు; సరభసంబుగాన్= వేగంతో; కవిసి= చుట్టుముట్టి; ఘోటకంబులన్= గుఱ్ఱాలను; అంబక+చతుష్టయంబునన్= నాలుగు బాణాలతో; సారథిన్= సూతుని (రథమును నడపువానిని); ఒక్క నారసంబుననున్= ఒక బాణముతో; తదీయ+తనువు= అతడి శరీరాన్ని; పదిబాణంబులను= పది బాణాలతో; పెలుచన్= అధికంగా, నొప్పించినన్= బాధపెట్టగా; చంచత్+అరుణ, కమల, చారు విలోచనుండు= ప్రకాశిస్తూ ఉండే ఎఱ్ఱని తామరలవంటి మనోహరమైన కన్నులు కలవాడు; అగుచున్= అవుతూ; సౌభద్రుండు= సుభద్ర కొడుకు; అతనిన్= దుశ్శాసన కుమారుడిని; ప్రదీప్త, సప్త, నారాచ, నిపాత, పీడితున్= మండుతూ ఉండే ఏడు బాణాలు పడటం చేత పీడించబడే వాడినిగా; చేసి= ఒనర్చి; డగ్గఱి= సమీపించి.

తాత్పర్యం: పూర్వం జరాసంధుడిని భీముడు చంపిన పగను తలచుకొని తలపడ్డ అశ్మంతకుడిని అవలీలగా చంపి సింహగర్జన చేయగా, ఆ ఆటోపాన్ని సహించలేని దుశ్శాసనుడి కొడుకు అతివేగంతో చుట్టుముట్టి గుఱ్ఱాలను నాలుగు బాణాలతో, సారథిని ఒక బాణంతో, అతడి శరీరాన్ని పదిబాణాలతో నొప్పించగా, ఎఱ్ఱదామరల వంటి కళ్ళు కలిగినవాడై అభిమన్యుడు ఆ దుశ్శాసన కుమారుడిని ప్రకాశవంతములైన ఏడు బాణాలు ప్రయోగించి పీడించి, సమీపించి.

ఉ. **ఇంతకు మున్న నీ జనకుఁ డెంతయు నోటఱి పాఱె; నీవె నా**
పొంతకు వచ్చి; తింక నెట వోనగు? నం' చొక దొడ్డనారసం
బెంతయు బెట్టిదంపు వడి నేయుడు ద్రోణసుతుండు దాని నిం
తింతలు సెక్కలై యిలపయిం దొరఁగన్ వెస నేసె; నేసినన్. **99**

ప్రతిపదార్థం: ఇంతకుమున్న+అ= ఇంతకు మునుపే; నీ జనకుఁడు= నీ తండ్రి అయిన దుశ్శాసనుడు; ఎంతయున్= మిక్కిలి; ఓటఱి+పాఱెన్= ఓడి పరుగెత్తాడు; నీవు+ఎ= నీవే; నా పొంతకున్= నా సమీపానికి; వచ్చితి(వి)= వచ్చావు; ఇంకన్= ఇకపైన; ఎట, పోన్+అగున్?= ఎక్కడికి పోవటానికి వీలవుతుంది?; అంచున్= అంటూ; ఒక+దొడ్డ+నారసంబున్= ఒక గొప్ప బాణాన్ని; ఎంతయున్= మిక్కిలి; బెట్టిదంపు+వడిన్= భయం కలిగించే వేగంతో; ఏయుడున్= ప్రయోగించగానే; ద్రోణసుతుండు= అశ్వత్థామ; దానిన్= ఆ బాణాన్ని; ఇంతింతలు, చెక్కలు+ఐ= చాలా అల్పములైన ముక్కలై - అనగా నుగ్గునూచములై; ఇలపయిన్= నేలమీద; తొరఁగన్= పడేటట్లు; వెసన్+ఏసెన్= వేగంగా ప్రయోగించాడు; ఏసినన్= అట్లు ప్రయోగించగా.

తాత్పర్యం: 'ఇంతకు ముందే నీ తండ్రి ఓడి పరుగెత్తి పారిపోయాడు. ఇప్పుడు నీవే నా సమీపానికి వచ్చావు. ఇక నీవు ఎక్కడికి పోవటానికి అవుతుంది?' అంటూ ఒక గొప్ప బాణాన్ని అభిమన్యుడు ప్రయోగించాడు. వెంటనే అశ్వత్థామ దాన్ని నుగ్గునూచం చేసి నేలమీద పడేటట్లు చేశాడు. అట్లు చేయగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **అతని దిక్కును జూడక యతఁడు రయము । మెఱసి నీ పౌత్త్రుచాపంబు నఱికి, సూతుఁ**
గూల్చి, యాఱమ్ము లురమున గ్రుచ్చుటయును । నొండు దేరిపై కబ్బాలుఁ డుఱికె నధిప! **100**

ప్రతిపదార్థం: అతఁడు= అభిమన్యుడు; అతని దిక్కును= అశ్వత్థామవైపు; చూడక= చూడకుండా; రయము+మెఱసి= వేగం అతిశయించి; నీ, పౌత్త్రు, చాపంబు+నఱికి= నీ మనవడి విల్లు ఖండించి; సూతున్= సారథిని; కూల్చి= చంపి; ఉరమునన్= రొమ్మునందు; ఆఱు+అమ్ములు= ఆరు బాణాలు; గ్రుచ్చుటయును= గాఢంగా నాటుకొనేటట్లు చేయగా; అధిప!= ఓ ధృతరాష్ట్రా!; ఆ+బాలుఁడు= ఆ దుశ్శాసనుడి కొడుకు; ఒండు తేరిపైకిన్= మరొక రథంమీదికి; ఉఱికెన్= దూకాడు.

తాత్పర్యం: అభిమన్యుడు అప్పుడు అశ్వత్థామవైపు చూడకుండా మహావేగంతో నీ మనవడి విల్లు త్రుంచి, సారథిని చంపి, రొమ్మున ఆరుబాణాలు నాటుకొనేటట్లు చేశాడు. అప్పుడు బాలుడైన ఆ దుశ్శాసనుడి కొడుకు మరో రథం మీదికి దూకాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అంత నపరాహ్ణం బయ్యె; నా సమయంబున శత్రుంజయుండును, జంద్రకేతుండును, సువర్చసుండును, సూర్యభానుండును, మేఘవేగుండును, మొత్తం బై, తాఁకిన ధనంజయ తనయుండు మేటి మగలగు నమ్మహీశుల మేనులు నానాస్త్రంబుల ననేక ఖండంబులు గావించి గాంధారపతి సేరినం గ్రూరనారాచ జాలంబుల జర్జరిత శరీరుం జేసి దుర్యోధను దెసకు నడరుటయు నంగపతి యాచార్యున కిట్లనియె.101

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; అపర+అహ్ణంబు+అయ్యెన్= మధ్యాహ్నం అయింది; ఆ సమయంబునన్= ఆ సందర్భంలో; శత్రుజయుండును= శత్రుంజయుడూ; చంద్రకేతుండును= చంద్రకేతువూ; సువర్చసుండును= సువర్చసుడూ; సూర్యభానుండును= సూర్యభానుడూ; మేఘవేగుండును= మేఘవేగుడూ(వీరందరూ శకుని అనుచరులు); మొత్తంబు+ఐ= ఒకటై (గుంపుగా కలిసి ఒకటై); తాఁకినన్= ఎదుర్కొనగా; ధనంజయ తనయుండు= అర్జునుడి కుమారుడు; మేటి మగలు= గొప్పశూరులు; అగు= అయినటువంటి; ఆ+మహీశుల= ఆ రాజుల; మేనులు= శరీరాలు; నానా+అస్త్రంబులన్= అనేకాలైన అస్త్రాలతో; అనేకఖండంబులు= పెక్కు ముక్కలు; కావించి= చేసి; గాంధారపతి+చేరినన్= శకుని చేరగా; క్రూర, నారాచ, జాలంబులన్= భయంకరములైన (కఱకైన) బాణాల మొత్తంతో; జర్జరిత, శరీరున్+చేసి= శిథిలమూ లేక జీర్ణమూ అగు దేహం కలవాడిని గావించి; దుర్యోధను+దెసకున్= దుర్యోధనుడివైపుకు; అడరుటయున్= విజృంభించటమున్నూ; అంగపతి= కర్ణుడు; ఆచార్యునకున్= ద్రోణాచార్యుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అంతలో మధ్యాహ్న సమయమయింది. అప్పుడు శత్రుంజయుడూ, చంద్రకేతుడూ, సువర్చసుడూ, సూర్యభానుడూ, మేఘవేగుడు అనే శకుని అనుచరులంతా కలిసి అభిమన్యుడిని ఎదుర్కొన్నారు. అభిమన్యుడు ఆ గొప్ప శూరుల శరీరాలను అనేక బాణాలతో పెక్కు ముక్కలు చేసి, శకుని తనను సమీపించగా భయంకరములైన బాణాల సమూహంతో అతడి శరీరాన్ని తూట్లు పొడిచి, నెత్తుటితో తడిసిపోయేటట్లు చేశాడు. పిమ్మట దుర్యోధనుడివైపు విజృంభించాడు. అది చూచి కర్ణుడు ద్రోణాచార్యుడితో ఇట్లా అన్నాడు:

క. 'చండగతి వీరరథికులఁ । జెండుచు నేతెంచి రాజుఁ జేరెడు సౌభ
ద్రుం డిట్టులు నీ కూరక । యుండ నగునె? ప్రతివిధాన మొనరింపు తగన్'. 102

ప్రతిపదార్థం: సౌభద్రుండు= అభిమన్యుడు; చండగతిన్= తీవ్రమైన రీతిలో; వీర రథికులన్= శూరులైన రథికులను; చెండుచున్= చంపుతూ; ఏతెంచి= వచ్చి; రాజున్= దుర్యోధనుడిని; చేరెడున్= సమీపించాడు; ఇట్టులు= ఈ విధంగా; నీకున్= నీకు; ఊరక+ఉండన్+అగునె?= మిన్నక ఉండవచ్చునా?; తగన్= తగునట్లు; ప్రతివిధానము= బదులు చేయటం (మారుసేత); ఒనరింపు= కావించుము(చేయుము).

తాత్పర్యం: 'అభిమన్యుడు తీవ్రమైన విధంగా శూరులైన రథికులను చెండాడుతూ వచ్చి, దుర్యోధనుడిని సమీపించాడు. ఈ విధంగా నీకు ఊరక ఉండవచ్చునా? దీనికి ప్రతిగా తగినపని ఏదో దాన్ని వెంటనే చేయుము.'

క. అని పలికి పతికి నడ్డము । సనుటయు గురుఁ డచటి యోధచయముం గలయన్
గనుఁగొని 'యభిమన్యుఁడు న । ర్జునుఁడును నని నొక్కరూప చుండీ! తలఁపన్. 103

ప్రతిపదార్థం: అని+పలికి= ఆ విధంగా మాటాడి; పతికిన్+అడ్డము+చనుటయున్= దుర్యోధనుడికి అడ్డంగా పోగా; గురుఁడు= ద్రోణాచార్యుడు; అచటి, యోధ, చయమున్= అక్కడ ఉండే వీరుల మొత్తాన్ని; కలయన్+కనుఁగొని= అంతటా లేక బాగా చూచి; తలఁపన్= ఆలోచించగా; అభిమన్యుఁడున్= ఈ అభిమన్యుడూ; అర్జునుఁడునున్= ఆ అర్జునుడూ; అనిన్= యుద్ధం చేయటంలో; ఒక్కరూప+చుండీ!= ఒక్క విధమే సుమా! (అనగా భేదం లేనివారే).

తాత్పర్యం: ఆ విధంగా అని, దుర్యోధనుడికి అడ్డం పోగా, ద్రోణుడు అక్కడ ఉండే యోధులను అందరినీ కలియ చూచి, 'ఆలోచించగా అర్జునుడూ, అభిమన్యుడూ యుద్ధం చేయటంలో ఒక్క విధమే. వీరిరువురూ భేదం లేనివారే.

వ. చూడం బిన్నవాఁడు గాని యలంతులం బోయెడు వాఁడు గాఁడు, మన మందఱముం గూడికొని యొక్కపెట్ట యక్కుమారుపై నురవడింపవలయు' నని పురికొలిపి బరవసంబు సేసె; నప్పు డప్పాండు పొత్త్రు బాణంబులం బీడితుండై సూతపుత్త్రుండు గుంభసంభవు నాలోకించి 'నా దెస సూడుము; వీఁడు నొప్పించె; నిలువం దగు నెలవగుట నసము డింపక యీల గఱచుకొని యున్నవాఁడ; గాండీవిఁ గలనం గలిసి యెఱుంగుదుమ కాదె! యతనిచే యింత బెట్టిదంబుగా, దని చెప్పిన విని యల్లన నగి యతం డతని కిట్లనియె. 104

ప్రతిపదార్థం: చూడన్= చూడటానికి; పిన్నవాఁడు+కాని= బాలుడుకాని; అలంతులన్+పోయెడువాఁడు+కాఁడు= అంత తేలిగ్గా (నశించే) చచ్చేవాడు కాడు - లేదా సాధించబడేవాడు కాడు; మనము+అందఱమున్= మనమంతా; కూడికొని= కలిసికొని; ఒక్కపెట్ట= ఒక్కుమ్మడిగా; ఆ+కుమారుపైన్= ఆ బాలుడిపై; ఉరవడింపవలయున్= పరాక్రమించాలి; అని+పురికొలిపి= అని ప్రేరేపించి; బరవసంబు+చేసెన్= ధైర్యాన్ని కలిగించాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+పాండుపౌత్త్రు+బాణంబులన్= పాండురాజు మనుమడైన అభిమన్యుడి బాణాలతో; పీడితుండు+ఐ= పీడింప (బాధింప) బడ్డవాడై; సూతపుత్త్రుండు= కర్ణుడు; కుంభసంభవున్= ద్రోణుడిని; ఆలోకించి= చూచి; నా+దెస+చూడుము= నావైపు చూడుము; వీఁడు= ఈ అభిమన్యుడు; నొప్పించెన్= బాధిస్తూ ఉన్నాడు; నిలువన్+తగు+నెలవు+అగుటన్= నిలవటానికి, యోగ్యమైన, ప్రదేశం, కావటంచేత; అసము+డింపక= దర్పం చెడకుండా; ఈలకఱచుకొని= ప్రాణాన్ని బిగబట్టుకొని; ఉన్నవాఁడన్= ఉన్నాను; గాండీవిన్= అర్జునుడిని; కలనన్= యుద్ధంలో; కలిసి= ఎదుర్కొని; ఎఱుంగుదుమ+కాదె!= తెలిసికొని ఉన్నాం కదా!; అతని+చే= ఆ అర్జునుడి చేయి; ఇంత, బెట్టిదంబు+కాదు= ఇంత భయంకరం కాదు; అని+చెప్పినన్= అని అనగా; విని; అల్లనన్= మెల్లగా; నగి= నవ్వి; అతండు= ద్రోణాచార్యుడు; అతనికిన్= కర్ణుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వీడు చూడటానికి బాలుడు కాని, అంత తేలికగా వశం అయ్యేవాడు కాడు. అసాధ్యుడైన వీడిపైకి మనమంతా గుమిగూడి ఒక్కుమ్మడిగా పరాక్రమించాలి' అని ప్రేరేపించి ధైర్యాన్ని కలిగించాడు. ఆ సమయంలో అభిమన్యుడి బాణాలతో పీడించబడ్డ కర్ణుడు ద్రోణాచార్యుడిని చూచి 'నా వైపు చూడుము. వీడు నన్ను బాధిస్తూ ఉన్నాడు. ఇది నిలువలసిన ప్రదేశం అయినందువలన దర్పం చెడకుండా ప్రాణాన్ని బిగబట్టుకొని ఉన్నాను. గాండీవితో యుద్ధానికి తలపడి ఉన్నాం. అతడి శక్తి సామర్థ్యాలు మనకు తెలుసు. కాని, అర్జునుడిచేయి వీడి చేయంత బెట్టిదంకాదు' అనగానే విని మెల్లగా నవ్వుతూ ద్రోణుడు కర్ణుడితో ఈ విధంగా అన్నాడు:

సీ. 'కవచధారణ మను ఘనవిద్య, గవ్వడి । కే నెఱింగించితి; నితఁడు దాని
నేర్చుట నీతని నెట్టన నొప్పింప । శక్యంబు గాదు; వంచన గుణంబు
నఱకంగఁ జాపంబు విఱుగ నేయఁగ ఘోట । కములఁ జంపఁగ, సూతు సమయఁ జేయ
నగుఁ; జాలు దేని నీ వట్ల సేయుము; చేత । ధనువుండ న వ్వీరుఁ జెనయ వశమె

ఆ. దేవతలకు నైనఁ? గావున నొక్క మై । విల్లు ద్రుంచి తఱిమి విరథుఁ జేసి
చూచికొంద మలవు చొప్పనఁ దెగునె యీ । రథికవరుని పటుపరాక్రమంబు?' 105

ప్రతిపదార్థం: ఏను= ద్రోణుడనైన నేను; కవచ ధారణము+అనువిద్యన్= 'కవచధారణం' అనే పేరుగల విద్యను; కవ్వడికిన్= అర్జునుడికి; ఎఱింగించితిన్= తెలియజేశాను; ఇతఁడు= ఈ అర్జునుడి కొడుకు; దానిన్= ఆ విద్యను; నేర్చుటన్= నేర్చుకొనటం

వలన; నెట్టనన్= నిజంగా లేదా తెగువవూని; ఈతనిన్= అభిమన్యుడిని; నొప్పింపన్= బాధపెట్టటానికి; శక్యంబుకాదు= వీలుకాదు(సాధ్యం కానే కాదు); వంచనన్= మోసంచేత; గుణంబున్= అల్లెత్రాటిని;నఱకంగన్= త్రెంచటం చేతనూ; చాపంబున్= వింటిని; విఱుగన్+ఏయఁగన్= విరగగొట్టటం చేతనూ; ఘోటకములన్+చంపఁగన్= గుర్రాలను చంపటం చేతనూ; సూతున్+సమయన్+చేయన్= సారథిని హతమార్చటం చేతనూ; అగున్= అవుతుంది; చాలుదు(వు)+ఏని= సమర్థుడవే అయితే-లేదా శక్తి కలదేని;నీవు; అట్లు+చేయుము= ఆ విధంగా చేయవచ్చును; చేతన్+ధనువు= చేతిలో విల్లు; ఉండన్= ఉండగా; ఆ+వీరున్= వీరుడైన ఆ అభిమన్యుడిని; దేవతలకున్+ఐనన్= అమరులకైనా; చెనయన్+వశమె?= ఎదిరించటానికి (తాకటానికి) సాధ్యమా?; కావునన్= కాబట్టి; ఒక్కమైన్= ఒక్కపెట్టున; విల్లున్+త్రుంచి= ధనుస్సును ముక్కలు చేసి; తఱిమి= పరుగెత్తించి లేదా కవిసి; విరథున్+చేసి= రథంలేని వాడినిగా చేసి;చూచికొందము= ఆలోచిద్దాం; ఈ రథికవరుని= రథికశ్రేష్ఠుడైన ఈ వీరునియొక్క; పటు పరాక్రమంబు= తీవ్రమైన శౌర్యం; అలవుచొప్పునన్= పరిశ్రమించటం చేత; తెగును+ఎ?= నశిస్తుందా?

తాత్పర్యం: నేను కవచధారణం అనే విద్యను అర్జునుడికి తెలియజేశాను. అభిమన్యుడు ఆ విద్యను తండ్రివలన నేర్చుకొన్నాడు. ఆ విద్యవలన అతడిని నొప్పించటానికి సాధ్యంకాదు. వంచనచేత, అల్లెత్రాటిని త్రెంచాలి, విల్లు విరవాలి, గుర్రాలను, సూతుడిని కూల్చాలి. ఇవన్నీ ఒక్కుమ్మడి జరగాలి. నీ చేతనైతే ఈ పని చేయుము. చేతిలో ధనువుండగా దేవతలైనా అతడిని సమీపించలేరు. మనం అతడిని ఎదిరించి జయించలేము.'

విశేషం: కవచధారణ విద్యా ప్రభావం ఈ సీసపద్యంలో వివరించబడింది. కవచాన్ని ధరించి ఉన్నంతకాలం ఎవ్వరూ అభిమన్యుడిని ఏమీ చెయ్యలేరు. ముందు అతడి చేతిలో విల్లు లేకుండా చెయ్యాలి. ద్రోణాచార్యుడి అధర్మయుద్ధానికి ఇదే నాంది. వంచనతో ఏమేమి చేయాలో ద్రోణుడు ఇందులో తెలిపాడు. 'ఒక్కమై విల్లు ద్రుంచి విరథుఁజేసి' అనే ప్రయోగం వలన ఏదో ఒక విధంగా అతడిని హతమార్చాలి అనే నిర్ణయానికి వచ్చారు. 'చూచికొందము' అనే మాట వ్యావహారికంగా ఎంతో అర్థవంతమైనది. 'వాడి సంగతి నేను చూచుకొంటాను' వంటి ప్రయోగాలు మనం వింటూనే ఉంటాం. అదే అర్థంలోనే ఇక్కడ కూడా ప్రయోగించినట్లు విదితమౌతూ ఉన్నది.

కర్ణుఁడు మొదలగు యోధులు వంచనచే అభిమన్యుని విరథుఁ జేయుట (సం. 7-47-31)

చ. **అన విని సూతసూనుఁడు భయం బెదఁ గూరినవాఁడ పోలె నై**
వెనుక కొదింగి యా రథికవీరు పిఱిందికిఁ జుట్టి వచ్చి వం
చనకు సహాయులై యచటి సైనికు లన్నరపుత్త్రు బిట్టు మా
ర్కొని పెనఁగంగఁ జేరి యలఘు ప్రదరంబున విల్లు ద్రుంచినన్. **106**

ప్రతిపదార్థం: అనన్= అనగా; సూతసూనుఁడు= కర్ణుడు; విని; భయంబు= భీతి; ఎదన్+కూరినవాఁడ+పోలెన్+ఐ= మనస్సులో నాటుకొన్నవాడి వలె అయి; వెనుకకున్+ఒదింగి= వెనుకకు ముడుచుకొని (దాగి); ఆ రథికవీరు+పిఱిందికిన్= ఆ రథిక శ్రేష్ఠుడి వెనుకకు; చుట్టివచ్చి= తిరుగుకొని వచ్చి; వంచనకున్= తన మోసానికి; సహాయకులు+ఐ= సహాయపడేవారై; సైనికులు= యోధులు; ఆ+నరపుత్త్రున్= ఆ అర్జున కుమారుడిని; బిట్టు= మిక్కిలి; మార్కొని= ఎదుర్కొని; పెనఁగంగన్= పోరాడగా; చేరి= కర్ణుడు సమీపించి; అలఘు+ప్రదరంబునన్= గొప్ప బాణంతో; విల్లున్+త్రుంచినన్= విల్లు త్రుంచగా.

తాత్పర్యం: అని ద్రోణుడనగానే విని కర్ణుడు మనస్సులో భీతి నాటుకొన్నవాడు మాదిరిగా వెనుకకు ఒదిగి, ఆ రథికశ్రేష్ఠుడైన అభిమన్యుడి వెనుకకు మరలివచ్చి, వంచనకు సహకరించే సైనికులందరూ ఆ అర్జునకుమారుడిని ముందువైపు ఎదుర్కొని పోరాడుతూ ఉండగా, కర్ణుడు గొప్ప బాణంతో అభిమన్యుడి విల్లు త్రుంచాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఆ లోన. **107**

తాత్పర్యం: అంతలో.

క. గురుఁ డశ్వంబులఁ గూల్చెను । సరభసముగఁ గృపుడు సంపె సారథి నిమ్మై
నరసుతుఁ డనాయుధుండును । విరథుండును నగుట సూచి వెఱపేది వడిన్. **108**

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణుడు; అశ్వంబులన్= గుర్రాలను; కూల్చెన్= చంపాడు; కృపుఁడు= కృపాచార్యుడు; సరభసముగన్= మిక్కిలి వేగంతో; సారథిన్+చంపెన్= సూతుడిని హతమార్చాడు; ఈ+మైన్= ఈ విధంగా; నరసుతుఁడు= అభిమన్యుడు; అనాయుధుండును= ఆయుధాలు లేనివాడునూ; విరథుండును= రథం లేని వాడున్నూ; అగుటన్+చూచి= కావటం గ్రహించి; వెఱపు+ఏది= భయం తొలగి; వడిన్= తొందరగా.

తాత్పర్యం: ద్రోణుడు గుర్రాలను, కృపుడు రథసారథినీ క్షణంలో కూల్చారు. ఆ విధంగా అభిమన్యుడు ఆయుధాలూ, రథమూ లేనివా డయ్యాడు. ఇది గ్రహించి, భయాన్ని వదిలి, తొందరగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. శకుని కృతవర్మ శల బా । హ్లిక గురుసుతు లాదిగా ననేకు లడరి య
స్త్ర కలాపంబుల శస్త్ర । ప్రకరంబుల నొంచి చిక్కువఱిచి యలఁచినన్. **109**

ప్రతిపదార్థం: శకుని= గాంధారపతి; కృతవర్మ= యదువంశపురాజైన కృతవర్మ; శల= బాహ్లికుడి కొడుకైన శలుడు; బాహ్లిక= శంతనుడి సహోదరుడైన బాహ్లికుడు; గురుసుతులు= అశ్వత్థామ; ఆదిగాన్= మొదలుగా; అనేకులు= పలువురు; అడరి= చుట్టుముట్టి; అస్త్రకలాపంబులన్= బాణాల మొత్తాలచేత; శస్త్రప్రకరంబులన్= ఆయుధాల సమూహాలచేత; నొంచి= బాధించి; చిక్కుపఱిచి= తొట్రుపెట్టి (చిక్కులు కలిగించి); అలఁచినన్= కలత కలిగించగా - అనగా శ్రమపరచగా.

తాత్పర్యం: శకుని, కృతవర్మ, శలుడూ, బాహ్లికుడూ (సోమదత్తుడి తండ్రి) అశ్వత్థామ మొదలుగా పలువురు అదే అదనుగా విజృంభించి రకరకాల అస్త్రాల శస్త్రాల సమూహాలతో బాధించి, చిక్కులుపెట్టి శ్రమ కలిగించగా.

విశేషం: తిక్కన వరుసగా క్రియాపదాలు కూర్చి రచనకు అందాన్ని సమకూర్చటమే కాకుండా, అప్పటి ఆ సన్నివేశం యొక్క చందాన్ని అక్కడక్కడా తన రచనలో ధ్వనింపజేస్తూ ఉంటాడు. అది ఆయన శిల్పకళ లోని ఒక వైచిత్రి. ప్రస్తుతం కంద పద్యాంతంలో ఉన్న మూడు అసమాపక క్రియలూ అట్టి శిల్పకళాదృష్టిని స్ఫురింపజేస్తున్నాయి.

క. వాలును బలకయుఁ గొని య । బ్బాలుఁడు రయమార గగనభాగంబున కు
న్మీలిత ధృతిసారుండై । లీల నెగసిపోయె మండలీభూతగతిన్. **110**

ప్రతిపదార్థం: వాలును+పలకయున్+కొని= కత్తినీ, పలకనూ(కేడెమునూ) గ్రహించి; ఆ+బాలుఁడు= అభిమన్యుడు; రయము+ఆరన్= వేగం అతిశయించగా; గగన భాగంబునకున్= ఆకాశవీథికి; ఉన్మీలిత, ధృతి, సారుండు+ఐ= విరిసిన ధైర్యంయొక్క చేవ కలవాడై; మండలీభూత+గతిన్= వలయాకారం అయిన గమనంతో; లీలన్= విలాసంగా; ఎగసిపోయెన్= ఎగిరాడు.

తాత్పర్యం: కత్తీ, పలకా తీసికొని అభిమన్యుడు మహావేగంతో ఆకాశవీథికి, విరిసిన ధైర్యసారం కలవాడై మండలాకార గమనంతో ఎగిరాడు.

క. తన విద్య కలిమి వినతా । తనయుని భంగిం జరింపఁ దమతమపైఁ దెం
పున నుఱుకు నను తలంపున । మన యోధులు భయము గొనిరి మనుజాధీశా! **111**

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= రాజా!; తన విద్య కలిమిన్= తన విద్యయొక్క పేర్మిచేత; వినతాతనయుని భంగిన్= (వైనతేయుడి) గరుత్మంతుడి వలె; చరింపన్= తిరుగుతూ ఉండగా; తెంపునన్= సాహసంతో; తమ తమ పైన్= తమ తమ మీదికి; ఉఱుకును= దూకుతాడు; అను తలంపునన్= అనే భావంతో; మన యోధులు= మన యుద్ధవీరులు; భయము కొనిరి= భీతిచెందారు.

తాత్పర్యం: ఓ రాజా! ధృతరాష్ట్రా! అభిమన్యుడు తన విద్యయొక్క పేర్మిచేత గరుత్మంతుడి వలె తిరుగుతూ ఉండగా, సాహసంతో ఇతడు ఎక్కడ తవమీదికి దూకుతాడో అని భావిస్తూ యుద్ధవీరులు మిక్కిలి భయపడ్డారు.

విశేషం: అలంకారం ఉపమ.

చ. **ఎడగని వాలు బల్లెమున నేసె వెసం దునియంగఁ ద్రోణుఁ డ**
ప్పుడు శకలంబులై పలక భూమిపయిం దొరఁగంగఁ జేసె నె
క్కుడువడిఁ గర్ణుఁ; డా శిశు వకుంఠగతిన్ దన తేరిమీఁద నొ
ప్పెడు ఘనచక్రముం గొని యుపేంద్రుఁడు లీల నటించు చాడ్పునన్. **112**

ప్రతిపదార్థం: ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; ఎడన్+కని= సమయం చూచి; వెసన్= వేగంగా; తునియంగన్= తునకలు అగునట్లు; బల్లెమునన్= బల్లెముతో; వాలున్= అభిమన్యుడి చేతి ఖడ్గాన్ని; ఏసెన్= కొట్టాడు; అప్పుడు= ఆ సమయంలో; కర్ణుఁడు; ఎక్కుడు+వడిన్= అధికమైన వేగంతో; శకలంబులు+ఐ= తునియలై; పలక= కేడెము; భూమిపయిన్+తొరఁగంగన్= భూమిమీద పడేటట్లు; చేసెన్= చేశాడు; ఆ+శిశువు= అభిమన్యుడు; అకుంఠగతిన్= కుంటుపోని (మొక్కవోని) విధంగా; తన తేరిమీఁదన్= తనరథంపై; ఒప్పెడి, ఘన, చక్రమున్= ఒప్పుచుండిన గొప్ప చక్రాన్ని; కొని= పూని(గ్రహించి); ఉప+ఇంద్రుఁడు= శ్రీ మహావిష్ణువు; లీలన్, నటించు,చాడ్పునన్= క్రీడించే విధంగా.

తాత్పర్యం: ద్రోణుడు అదను చూచి మహావేగంగా అభిమన్యుడి చేతి కత్తిని బల్లెంతో తునుకలయ్యేట్లు చేశాడు. అదే సమయంలో కర్ణుడు మిక్కిలి వేగంతో పలక ముక్కలై నేల పడేటట్లు చేశాడు. బాలుడైన ఆ అభిమన్యుడు ఏ మాత్రం చలించకుండా, కుంటువోని విధంగా తన రథంమీద ఉండే గొప్ప చక్రాన్ని తీసికొని శ్రీ మహావిష్ణువు క్రీడించే విధంగా. (తరువాతి గద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

వ. **సంరంభ విజృంభితుండై.** **113**

ప్రతిపదార్థం: సంరంభ= ఆటోపముతో; విజృంభితుండు+ఐ= చెలరేగినవాడై

తాత్పర్యం: ఆటోపంతో చెలరేగినవాడై.

సీ. **నెత్తుటఁ జొత్తిల్లి నెఱసిన యలుక ను । గ్రంబైన వదనంబు కాంతి పరఁగఁ,**
గౌరవ సైనికోత్కరమున కతి భయ । దంబగు సింహనాదంబు సెలఁగ,
నింగికి నిగుడు రథాంగరోచులు మణి । కంకణద్యుతులతోఁ గలసి వెలుఁగ,
సిక్కు సూపిన గంధసింధురం బను రేఖ । దలఁపించు పటుగతి చెలువు మెఱయఁ,

తే. **కుంభసంభవుఁ దున్న దిక్కునకుఁ గవిసి । యడ్డపడు సేనఁ జించి చెండాడు నక్కు**
మారవరుమేని యొప్పును మగతనంబుఁ । జలము బలముఁ గీర్తించె నిర్జరగణంబు. **114**

ప్రతిపదార్థం: నెత్తుటన్+జొత్తిల్లి= నెత్తురుచేత; ఎట్టనై నెఱసిన+అలుకన్= నిండిన కోపంతో; ఉగ్రంబు+ఐన, వదనంబు= భయంకరమైన ముఖంయొక్క; కాంతి+పరఁగన్= కాంతి ఒప్పారగా; కౌరవసైనిక+ఉత్కరమునకున్= కౌరవసైన్యసమూహానికి; అతి+భయదంబు+

అగు= మిక్కిలి భీతిని (ఇచ్చేది) కలిగించేది అగు; సింహనాదంబు+చెలఁగన్= సింహపుగర్జన ధ్వనించగా; నింగికిన్+నిగుడు= ఆకాశానికి వ్యాపించే; రథాంగ+రోచులు= చక్రం యొక్క కాంతులు; మణి,కంకణ, ద్యుతులతోన్= రత్నపు కడియాల కాంతులతో; కలసి+వెలుఁగన్= చేరి ప్రకాశించగా; సిళ్ళు+చూపిన= బరిగోల లేదా అంకుశం చూపిన; గంధసింధురంబు= మదపుటేనుగు; అను+రేఖ+తలపించు= అనే విధంగా తోచు; పటు+గతి+చెలువు= ఆటోపం గల గమన విశేషం యొక్క అందం; మెఱయన్= వెలుగొందగా; కుంభసంభవుఁడు= ద్రోణుడు; ఉన్న+దిక్కునకున్= ఉండేవైపుకు; కవిసి= చేరి; అడ్డపడుసేనన్= అడ్డం వచ్చిన సైన్యాన్ని; చించి= ఛేదించి; చెండాడు= హతంచేసే; ఆ+కుమారవరు= కుమార శ్రేష్ఠుడైన ఆ అభిమన్యుడి; మేని+ఒప్పును= శరీరం యొక్క సౌందర్యాన్ని; మగతనంబున్= శౌర్యాన్ని; చలమున్= మాత్సర్యాన్ని (పట్టుదలను); బలమున్= శక్తినీ; నిర్జర+గణంబు= దేవతలసమూహం; కీర్తించెన్= పొగడింది.

తాత్పర్యం: నెత్తుటితో తడిసి ఎర్రనై, నిండిన కోపంతో భయంకరంగా ఉన్న ముఖము యొక్క కాంతి దీపించగా, కౌరవసైన్య సమూహానికి భీతి కలిగించే సింహనాదాలు ఒప్పుచుండగా, ఆకాశానికి వ్యాపించే చక్రకాంతులు రత్న కంకణ కాంతులతో కలిసి ప్రకాశించగా; (బరిగోలను) అంకుశాన్ని చూపిన మదపుటేనుగు అనే విధంగా తోచు ఆటోపంతో కూడిన గమన విశేషం యొక్క అందం ఒప్పుతుండగా ద్రోణుడుండే దిక్కుచేరి అడ్డంవచ్చే సైన్యాన్ని చీల్చి చెండాడుతూ ఉన్న ఆ అభిమన్యుడి ముఖ సౌందర్యాన్ని, శౌర్యాన్ని, మాత్సర్యాన్ని, బలాన్నీ దేవతలు కీర్తించారు.

విశేషం: అప్రతిమాన ప్రతాపంతో ప్రకాశించే అభిమన్యుడి ప్రతికదలికా, ప్రతిభావమూ, ప్రతిశబ్దమూ ఎంతో శోభాయమానంగా, సంతోషాన్ని కలిగించింది. ప్రస్తుత సీసపద్యం అభిమన్యుడి సౌందర్యదీప్తికీ, శౌర్యపటుత్వానికీ ప్రతీక. ఇందులోని తేటగీతి తేటతెల్లమైన దేవతల ప్రశంసాగీతికి సాంకేతిక సూచన. అలంకారం: ఉపమ.

వ. అట్టియెడ. 115

తాత్పర్యం: అటువంటి సందర్భంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. శకుని కృతవర్మ కృప కర్ణ శల్య ముఖ్యు । లైన యోధులు పెక్కండ్రు రఖిల దిశలఁ
పొదివి యతని కరంబునఁ బొలుచు చక్ర । మలఁతి తునియలుగా నేసి రాగ్రహమున. 116

ప్రతిపదార్థం: శకుని, కృతవర్మ, కృప, కర్ణ, శల్య, ముఖ్యులు+ఐన+యోధులు= శకుని, కృతవర్మ, కృపాచార్యుడు, కర్ణుడు, శల్యుడు వంటి ప్రముఖులైన యుద్ధవీరులు; పెక్కండ్రురు= అనేకులు; అఖిల దిశలన్= అన్నివైపులందు; పొదివి= ఆక్రమించి (చుట్టుముట్టి); అతని+కరమునన్= ఆ అభిమన్యుడి చేతిలో; పొలుచు+చక్రమున్= అందగించే లేక ప్రకాశించే చక్రాన్ని; ఆగ్రహమునన్= కినుకతో; అలఁతి+తునియలు+కాన్= చిన్న ముక్కలుగా (తుత్తుమురుగా); ఏసిరి= బాణాలు ప్రయోగించారు.

తాత్పర్యం: శకుని, కృతవర్మ, కృపుడు, కర్ణుడు, శల్యుడు మొదలైన ప్రసిద్ధ యుద్ధవీరులు అనేకులు అన్నివైపులా అభిమన్యుడిని ఆక్రమించి, అతడి చేతిలోని చక్రాయుధాన్ని ఆగ్రహంతో చిన్న చిన్న ముక్కలై పడేటట్లు చేశారు.

వ. ఏసిన నతండు రయంబున. 117

తాత్పర్యం: (ఆ విధంగా చక్రాయుధాన్ని ముక్కలు అయ్యేటట్లు) ప్రయోగించగా, అభిమన్యుడు వేగంతో.

క. గద గొని యశ్వత్థామం । గదియుడు దంభోళికొదమ కైవడి మెఱుఁగుల్
పొదలించు దానిఁ గని కడు । బెదరి యతఁడు రథము డిగ్గి పిఱిఁదికిఁ జనియెన్. 118

ప్రతిపదార్థం: గద కొని= గదాయుధాన్ని పూని; అశ్వత్థామన్= అశ్వత్థామను; కదియుడున్= సమీపించగా(చేరగా); దంభోళి+కొదమ+కైవడిన్= వజ్రాయుధపు పిల్ల మాదిరి; మెఱుఁగుల్= కాంతులు; పొదలించు+దానిన్= వెదజల్లే ఆ గదను; కని= చూచి; అతఁడు= అశ్వత్థామ; బెదరి= భయపడి; రథము డిగ్గి= రథాన్ని దిగి; పిఱిందికిన్= వెనుకకు; చనియెన్= వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: గదాయుధాన్ని తీసికొని అశ్వత్థామను సమీపించగా, వజ్రాయుధపు కూనవలె మెఱుగులు గ్రక్కే ఆ గదను అశ్వత్థామ చూచి, బెదరిపోయి, రథం దిగి వెనుకకు మళ్ళాడు.

విశేషం: కందపద్యాన్ని వివిధగతి భేదాలతో నడిపించే సామర్థ్యం తిక్కనగారికి ఉన్నంతగా తక్కిన కవులకు లేదు అనటం అతిశయోక్తి కాదు. 'దంభోళి' అనే పదం యొక్క ఉచ్చారణే కొంత భీకరం అనిపిస్తుంది. ఈ పద్యం చివరిపాదం యొక్క నడక అశ్వత్థామ బెదరి వెనుకకు వెళ్ళిన పద్ధతిని ధ్వనింపజేస్తూ ఉన్నది.

వ. **సుభద్రాతనయుం డతని రథ్యంబులను సారథినిం జదియ మోఁది మనజోదుల యమ్ముల నేదు వెఱిఁగిన చందంబున సౌబలుని దెసకు నడచి యాతనికి నడ్డపడిన గాంధారుల సప్తవింశతి రథికులం బొరిగొనుటయుం, బురికొని తన్ను మార్కొనిన వసాతీయులం బదుండ్ర నేనుంగుల తోడన పీనుంగులఁ గావించి, యందంద తఱిమిన కేకయ సప్తకంబు రథ సహితంబుగా నగ్గలిక నుగ్గు (గ్గ)సేసి, డస్సి తూఁగాడుచుఁ దొలంగిన యోధుల నుల్లసం బాడుచు, నఱిమిన వారి నుఱుమాడుచు, వీరవ్రతంబు ధీరత్వ నిష్ఠం జలుపుచుండె.** **119**

ప్రతిపదార్థం: సుభద్రాతనయుండు= అభిమన్యుడు; అతని+రథ్యంబులను= అశ్వత్థామయొక్క గుఱ్ఱాలనూ; సారథినిన్= సూతుడినీ; చదియన్+మోఁది= చచ్చేటట్లు మోది; మన+జోదులన్= మన యుద్ధవీరులను; అమ్ములన్= బాణాలతో; ఏదు= ముండ్లపంది; పెఱిఁగిన చందంబునన్= విజృంభించిన విధంగా, సౌబలుని+దెసకున్= శకునివైపు; నడచి= నడిపించి; ఆతనికిన్= ఆ శకునికి; అడ్డపడిన+గాంధారులన్= రక్షణగా అడ్డుపడ్డ గాంధారదేశం వారిని; సప్తవింశతి+రథికులన్= ఇరవై ఏడుమంది (రథికులను) శూరులను; పొరిగొనుటయున్= చంపగా; పురికొని= క్రమ్ముకొని; తన్నున్= తనను; మార్కొనిన= ఎదుర్కొన్న; వసాతీయులన్= వసాతిరాజులను; పదుండ్రన్= పదిమందిని; ఏనుంగులతోడన్+అ= ఏనుగులతో కూడా; పీనుంగులన్+కావించి= శవాలుగా చేసి; అందంద= అక్కడక్కడ; తఱిమిన= తనమీదికి వచ్చిన; కేకయసప్తకంబున్= ఏడుమంది కేకయులను; రథసహితంబుగాన్= తేరులతోకూడా; అగ్గలికన్= విలాసంగా (పూనికతో); నుగ్గుచేసి= పొడిచేసి; డస్సి= అలసి; తూఁగాడుచున్+పోరు తొలంగిన+యోధులన్= ఊగుతూ యుద్ధం వీడి ప్రక్కకుపోయే యుద్ధవీరులను; ఉల్లసంబు+ఆడుచున్= ఎత్తిపొడుపు మాటలు పలుకుతూ; ఆఱిమిన వారిన్= ఆక్రమించిన (బాధించిన) వాళ్ళను; నుఱుమాడుచున్= చూర్ణం గావిస్తూ; వీరవ్రతంబున్= వీరుడు ఆచరించే పుణ్యకార్యాన్ని; ధీరత్వనిష్ఠన్+సలుపుచుండెన్= ధైర్యం యొక్క పూనికతో నిర్వర్తించాడు.

తాత్పర్యం: అభిమన్యుడు అశ్వత్థామ గుఱ్ఱాలను, రథసారథినీ చావమోదాడు, మన యోధుల బాణాలతో ముండ్లపందివలె అయి శకునివైపుకు మరలాడు. అతడికి రక్షగా ఉండి అడ్డపడ్డ ఇరవై ఏడుగురు శూరులైన గాంధారులను చంపాడు. ఆవరించి తనను ఎదుర్కొన్న పదిమంది వసాతి రాజులను ఏనుగులతోపాటు పీనుగులను చేశాడు. అక్కడక్కడా మీదికి ఉరుకుతున్న ఏడుగురు కేకయులను రథాలతో పాటు సవిలాసంగా నుగ్గునూచం కావించాడు. అలసి యుద్ధానికి విముఖంగా తొలగిపోయే యోధులను ఎత్తిపొడుపు మాటలతో నొప్పించాడు. ఆక్రమించిన వాళ్ళను చూర్ణం చేస్తూ వీరవ్రతాన్ని మహాధీరత్వంతో నిర్వర్తించాడు.

ఉ. **ఆ సమయంబునం గడఁగి । యాయిత మైన రథంబుతోడ దౌ**
శ్శాసని రా నతం డడరి సారథిఁ జంపి హయంబులం బడన్
వ్రేసిన నాతఁ డల్గి గద వే కొని యుద్ధతిఁ దేరు డిగ్గ ను
ద్భాసితమూర్తులం బొలిచె భ్రాతృకుమారయుగం బుదాత్తమై. **120**

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ సందర్భంలో; కడఁగి= ప్రయత్నించి; ఆయితము+ఐన, రథంబుతోడన్= సిద్ధమైన తేరుతో; దౌశ్శాసని= దుశ్శాసనుడి కొడుకు; రాన్= రాగా; అతండు= అభిమన్యుడు; అడరి= విజృంభించి; సారథిన్+చంపి= సూతుడిని సంహరించి; హయంబులన్= గుర్రాలను; పడన్ వ్రేసినన్= చంపగా; ఆతడు= దుశ్శాసనుడి కొడుకు; అల్గి= కోపపడి; గదన్= గదాయుధాన్ని; వేకొని= శీఘ్రంగా తీసికొని; ఉద్ధతిన్= గర్వంతో; తేరున్+డిగ్గన్= రథాన్ని దిగగా; భ్రాతృ+కుమార, యుగంబు= అన్నదమ్ముల కొడుకుల జంట; ఉదాత్తము+ఐ= ప్రియమైనదై (ఒప్పిదమై); ఉద్భాసితమూర్తులన్= మిక్కిలి ప్రకాశమానాలైన రూపాలచేత; పొలిచెన్= అందగించింది.

తాత్పర్యం: అంతలోనే రథాన్ని సిద్ధం చేసికొని దుశ్శాసనుడి కొడుకు రాగా, అభిమన్యుడు విజృంభించి అతడి సారథినీ, గుర్రాలనూ హతమార్చాడు. అపుడు దౌశ్శాసని కోపపడి గదను తీసికొని రథం దిగిరాగా ఆ అన్నదమ్ముల కొడుకుల జంట ఎంతో ఒప్పిదమై ప్రకాశమాన రూపాలతో అందగించింది.

అభిమన్యు దుశ్శాసన సుతు లిరువురుఁ జచ్చుట (సం. 7-48-8)

తే. **ఇవ్విధంబునఁ గదిసి నరేంద్రముఖ్య! । నీదు మనుమలు సూపఱ నెమ్మనముల**
కద్భుతంబును శోకంబు నావహిల్ల । లావు వెరవును మెఱయఁ జలంబు నెఱయ. **121**

ప్రతిపదార్థం: నర+ఇంద్రముఖ్య!= రాజశ్రేష్ఠా!(ధృతరాష్ట్ర మహారాజా!); ఈ+విధంబునన్= ఇట్లా; కదిసి= సమీపించి; నీదు మనుమలు= నీ మనుమళ్ళు; చూపఱ+నెఱ+మనములకున్= చూచేవాళ్ళ నిండైన మనస్సులకు; అద్భుతంబును= ఆశ్చర్యమూ; శోకంబున్= దుఃఖమూ; ఆవహిల్లన్= కలిగేటట్లు; లావు= బలం; వెరవు= ఉపాయం; మెఱయన్= ప్రకాశించగా; చలంబు= (మత్సరం) పట్టుదల; నెఱయన్= నిండుకోగా.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఇట్లా ఒకరినొకరు కదనంలో కవిసిన నీ మనుమళ్ళు చూచేవాళ్ళకు ఆశ్చర్యం, శోకం కలిగేటట్లు, బలమూ, ఉపాయమూ ప్రకాశించగా పట్టుదల నిండుకోగా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. **ఒండొరుమీఁది కోపమున నుగ్రతఁ బోరి రుదగ్రులై గదల్**
మండఁగ, నెత్తురుల్ సెదర మాంసము పిండిగ నెంపనుగ్గు లొం
డొండ ధరిత్రిపైఁ దొరఁగ నొప్పెడు మేనులు వ్రాల వానిలో
నుండక ప్రాణముల్ వెడలె నుబ్బునఁ గ్రాలఁగ దేవకామినుల్. **122**

ప్రతిపదార్థం: ఒండొరు మీఁది కోపమునన్= ఒకరిపై మరొకరికి ఉండే క్రోధం (అలుక) చేత; ఉదగ్రులు+ఐ= భయంకరులై; గదల్+మండఁగన్= గదలు మంటలు రేగగా; నెత్తురుల్+చెదరన్= రక్తం చిందిపడగా; మాంసము+పిండిగన్= మాంసం ముద్దయినట్లుగా; ధరిత్రిపైన్= నేలమీద; ఎమ్ము+నుగ్గులు= ఎముకల చూర్ణం (పొడి); ఒండు+ఒండ= క్రమక్రమంగా; తొరఁగన్= రాలగా; ఉగ్రతన్= భయంకరంగా; పోరిరి= పోరాడారు; ఒప్పెడు మేనులు= అందమైన శరీరాలు; వ్రాలన్= పడిపోగా; దేవకామినుల్= అప్సరసలు; ఉబ్బునన్+క్రాలఁగన్= సంతోషంతో తేలగా; వానిలోన్= ఆ శరీరంలో; ఉండక= ఉండలేక; ప్రాణముల్+వెడలెన్= ప్రాణాలు పోయాయి. (అనగా ఆ ఇరువురూ మరణించారు).

తాత్పర్యం: ఒకరిపై ఒకరు కోపంతో గదలు నిప్పులు రాలేటట్లు, నెత్తురు చిందేటట్లు, మాంసం ముద్ద అయ్యేటట్లు, ఎముకలపొడి నేలపై రాలేటట్లు భయంకరంగా యుద్ధం చేశారు. ఆ ఇరువురి అందమైన శరీరాలు నేలరాలగా అప్సరసలు చాలా సంతోషించారు. వాళ్ళ ప్రాణాలు శరీరాలలో నిలవలేక వెలుపలికి వెళ్ళాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇ త్తెఱంగున. 123

తాత్పర్యం: ఈ విధంగా.

చ. వనగజ మంబుజాకర మవారణఁ జొచ్చి కలంచి యాడఁగా
మనమునఁ గొంకులేక కృప మాలిన బోయలు ముట్టి చంపు చా
డ్పున భవదీయ సేన పొరిపుచ్చఁగ జుట్టునుముట్టి పార్థనం
దను నలయించి నిర్దయ విధంబునఁ జంపి రనేక సైనికుల్. 124

ప్రతిపదార్థం: వనగజము= అడవి యేనుగు; అంబుజాకరమున్= తామరకొలనిని; అవారణన్+చొచ్చి= అడ్డులేకుండా ప్రవేశించి; కలంచి= కలత కలిగించి; ఆడఁగాన్= వినోదించగా; మనమునన్= మనసులో; కొంకు+లేక= జంకులేకుండా; కృపమాలిన+బోయలు= దయవదలిపెట్టిన బోయవాళ్ళు; ముట్టి= సమీపించి; చంపుచాడ్పునన్= చంపేవిధంగా; భవదీయసేనన్= నీ సైన్యాన్ని; పొరిపుచ్చఁగన్= చంపగా; అనేకసైనికుల్= పలువురు భటులు; పార్థనందనున్= అభిమన్యుడిని; చుట్టునుముట్టి= చుట్టుకొని; అలయించి= అలసట కలిగించి; నిర్దయ విధంబునన్= దయ లేనివిధంగా; చంపిరి= చంపారు.

తాత్పర్యం: అడవి యేనుగు కొలనులోకి అడ్డులేకుండా ప్రవేశించి క్రీడిస్తూ ఉండగా, మనస్సులో జంకు లేకుండా దయలేని బోయవాళ్ళు దగ్గరచేరి చంపే విధంగా అభిమన్యుడు నీ సైన్యాన్ని చంపగానే, అనేక సైనికులు అభిమన్యుడిని చుట్టుముట్టి అలసట కలిగించి దయమాలి చంపారు.

వ. అట్టి యెడ. 125

తాత్పర్యం: ఆ సందర్భంలో.

సీ. జగము లన్నియును దేజంబున వెలిఁగించి । యపరాద్రి సేరిన తపనుమాడ్కిఁ,
దఱచైన కానలు దరికొని నీఱుగాఁ । జేసి యాఱిన దవశిఖి విధమున,
గగనంబుతో రాయు కరడులుగల జలం । బివురఁ బాఱిన మహార్ణవము కరణి,
నున్నతగతి సెడి యుర్విపైఁ గడు విన్న । నై పడియున్న సుధాంశుభంగి

తే. బీరమునఁ దమవారికిఁ బెం పొనర్చి । యరుల సమయించి వసమతి యనువు దప్పి
తెగియుఁ జూడ్కికిఁ జాల వ్రేఁగగుచుఁ బొలిచె । మహితమూర్తిశోభితుఁ డభిమన్యుఁ డధిప! 126

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; మహిత+మూర్తి+శోభితుఁడు= ఒప్పిదమైన ఆకారంచేత ప్రకాశించేవాడు (అయిన); అభిమన్యుఁడు; తేజంబునన్= తన కాంతిచేత; జగములు+అన్నియున్= లోకాలు అన్నీ; వెలిఁగించి= వెలిగేటట్లు చేసి; అపర+అద్రిన్= పడమటి కొండను(అస్తగిరిని); చేరిన= పొందిన; తపను, మాడ్కిన్= సూర్యుడివలె; తఱచు+ఐన కానలు= దట్టము అయినట్టి అడవులు; దరికొని= కాల్చి; నివుఱు(నీఱు)+కాన్+చేసి= బూడిద కావించి; ఆఱిన= ఆరిపోయిన; దవశిఖి+విధమునన్= కార్చిచ్చు మాదిరి; గగనంబుతోన్+రాయు= ఆకాశంతో ఒరసికొనే; కరడులు= అలలు; కల= కలిగిన; జలంబు= నీరు; ఇవురన్+పాఱిన= ఇంకిపోయిన; మహా+అర్ణవము, కరణిన్= పెద్ద సముద్రంవలె; ఉన్నత,గతి,చెడి= ఉపరి(పై) (లేదా గొప్ప) సంచారాన్ని విడిచి; ఉర్విపైన్= నేలమీద; కడు+విన్ననై= మిక్కిలి దైన్యాన్ని పొంది; పడి+ఉన్న= పడిపోయి ఉన్న; సుధాంశు+కరణిన్= చంద్రుడివలె; బీరమునన్= శౌర్యంచేత; తమవారికిన్= తన పక్షంవారైన పాండవులకు; పెంపు+ఒనర్చి= పేర్మిని కలిగించి; అరులన్= శత్రువులను; సమయించి= చంపి;

వసము+అఱి= వశం తప్పి (స్వాధీనతను కోల్పోయి); అనువు తప్పి= అవకాశం లేదా ఆనుకూల్యం చెడి; తెగియున్= చచ్చియు; చూడ్కికిన్= చూపునకు; చాలవ్రేఁగు+అగుచున్= మిక్కిలి బరువు అవుతూ; పొలిచెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! మహనీయమైన ఆకారంతో ప్రకాశించే అభిమన్యుడు తన తేజస్సుతో లోకాల నన్నిటినీ వెలిగించి పడమటి కొండను చేరిన సూర్యుడి మాదిరి, దట్టమైన అడవులను కాల్చి బూడిదచేసి ఆరిపోయిన దావాగ్ని వలె, ఆకాశంతో ఒరుసుకొనే అలలుండే నీళ్ళు ఇంకిపోయిన మహాసముద్రం మాదిరిగా, పై సంచారాన్ని విడిచి, నేలపైన మిక్కిలి దీనంగా పడి ఉండే చంద్రుడివలె, శౌర్యంతో పాండవులకు ఎంతో పెంపు కలిగించి, శత్రువులను సంహరించి, వశంతప్పి, అనుకూలత చెడి మరణించికూడా, చూపునకు మిక్కిలి భారం అవుతూ ప్రకాశించాడు.

విశేషం: అలం: మాలోపమ. ఒకటికి నాలుగు సీసపద్య పాదాలలో మాలోపమాలంకార శోభితంగా మహిత శోభితుడైన అభిమన్యుడి ఆకార గుణ విశేషాదులు అభివర్ణించబడ్డాయి. తేజస్సు, ప్రతాపం, సౌందర్యం అనే లక్షణాలు వశం తప్పి (స్వాధీనత చెడి) అనుకూలత్వాన్ని కోల్పోయినా, చూచేవారికి మహాభారంగా యుద్ధరంగంలో పడివుండే దృశ్యాన్ని తిక్కన ఇక్కడ వర్ణించాడు. అభిమన్యుడి మరణాన్ని తెలిపే మొదటిపద్యం ఇది.

ఉ. **నెత్తుటఁ దోఁగి నేల యెఱనింగి తెఱంగున నుండె; నక్కుమా**
రోత్తముఁ డందుఁ జంద్రుక్రియ నొప్పె సితాయుధ ఖండభూషణో
దాత్తమణిప్రతానములు తారల చందము నొంది యంద మై
యత్తఱి నుల్లసిల్లె వసుధాధిప! చూపఱపిండు చూడ్కికిన్. **127**

ప్రతిపదార్థం: వసుధా+అధిప!= రాజా! చూపఱ, పిండు, చూడ్కికిన్= చూచేవాళ్ళయొక్క మొత్తం చూపులకు; నెత్తుటన్+తోఁగి= రక్తంతో తడిసి; నేల= భూమి; ఎఱ, నింగి, తెఱంగునన్= ఎర్రటి ఆకాశం మాదిరి; ఉండెన్= ఉండింది; ఆ+కుమార+ఉత్తముఁడు= కుమారశ్రేష్ఠుడైన ఆ అభిమన్యుడు; అందున్= ఆ నేలమీద; చంద్రు క్రియన్= చంద్రుడివలె; ఒప్పెన్= ప్రకాశించాడు; సిత+ఆయుధ+ఖండ= విరిగిన తెల్లని ఆయుధాల ముక్కలు; భూషణ= నగలైన; ఉదాత్త, మణి, ప్రతానములు= గొప్ప రత్నాల మొత్తాలు; తారల, చందమున్= నక్షత్రాలవలె; ఒంది= పొంది; ఆ+తఱిన్= ఆ సందర్భంలో; అందము+ఐ= చక్కదనమూ, సౌందర్యమూ కలిగినదై; ఉల్లసిల్లెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: రాజా! చూచేవాళ్ళ చూపులకు నెత్తుటితో తడిసిన నేల, ఎర్రని ఆకాశంవలె ఉండింది. అభిమన్యుడు ఆ నేలమీద చంద్రుడి విధంగా ఒప్పారాడు. తెల్లటి ఆయుధాల ముక్కలూ, విరిగిన ఆభరణాలలోని గొప్పగొప్ప మణులూ నక్షత్రాల మాదిరి ఉండగా ఎంతో అందంగా ఆ సందర్భంలో అగుపించాడు.

విశేషం: అంతకుముందు సీసపద్యం చివరిపాదంలో 'సుధాంశుభంగి' అని ఉన్నది. ప్రస్తుత పద్యం ఉత్పలమాలా వృత్తంలో 'చంద్రుక్రియ' విరిగిన వివిధాయుధాలు నగలలోని, మణులూ నక్షత్రాల మాదిరి పడి ఉండగా ప్రకాశించినట్లు తిక్కన అభివర్ణించాడు. చంద్రుడి ప్రసక్తికి అనుగుణంగా 'ఉత్పలమాల' లో విషయాన్ని వివరించటం తిక్కన ఛందశ్శిల్పజ్ఞతను సూచిస్తూ ఉన్నది.

సీ. **కరికళేబరములు ధరణీధరములు, దు । రంగ గాత్రమ్ములు గ్రాహసమితి,**
నరశరీరములు మీనములు, గౌక్షేయక । క్షురికాది శస్త్రంబు లురగకులము,
రుధిరార్ద్రశరములు రుచిర ప్రవాళముల్, । ప్రేవుల ప్రోవులు ఫేనతతులు,
నెత్తురు వెల్లువ నీరులు భూషణ । స్తోమాస్థిచయము తుమురు లిసుక

ఆ. గాఁగ నంబురాశి కరణి సంగ్రామ భూ । భాగ మొప్పు మిగుల భవ్యయోగ
నిద్ర నున్న విష్ణునికిఁ బాటి యగుచు శో । భిల్లె నమ్మురారియల్లుఁ డందు. 128

ప్రతిపదార్థం: కరి+కళేబరములు= ఏనుగుల దేహాలు; ధరణీధరములు= కొండలు; తురంగ+గాత్రమ్ములు= గుఱ్ఱాల శరీరాలు; గ్రాహ+సమితి= మొసళ్ళ గుంపు; నరశరీరములు= మానవుల దేహాలు; మీనములు= చేపలు; కౌక్షేయక+క్షురిక+ఆది, శస్త్రంబులు= ఖడ్గాలూ, క్షురికలూ (మంగలికత్తి వంటివి) మొదలైన ఆయుధాలు; ఉరగకులము= పాములమొత్తం; రుధిర+ఆర్ద్ర, శరములు= నెత్తుటితో తడిసిన బాణాలు; రుచిర+ప్రవాళముల్= ప్రకాశించే పగడాలు; ప్రేవుల+ప్రోవులు= పేగుల మొత్తాలు; ఫేన+తతులు= నురుగుల గుంపులు; నెత్తురు+వెల్లువ= రక్తంయొక్క ప్రవాహం; నీళులు= నీళ్ళు; భూషణ, స్తోమ అస్థి చయముల తుమురు= ఆభరణాల మొత్తం యొక్కయూ, ఎముకల మొత్తం యొక్కయూ పొడుము (రాలినపొడి); ఇసుక+కాఁగన్= ఇసుక కాగా (అయినట్లుగా); అంబురాశి+కరణిన్= సముద్రం మాదిరి; సంగ్రామ+భూభాగము= యుద్ధంయొక్క రంగస్థలం; ఒప్పు+మిగులన్= అందం అతిశయించగా; భవ్య, యోగనిద్రన్+ఉన్న= శ్రేష్ఠమైన యోగనిద్రలోఉండే; విష్ణునికిన్+పాటి+అగుచున్= విష్ణుదేవుడితో సాటి అవుతూ; అందున్= ఆ రణరంగంలో; ఆ+మురారి+అల్లుఁడు= శ్రీకృష్ణుడి మేనల్లుడు; శోభిల్లెన్= వెలుగొందాడు.

తాత్పర్యం: ఆ రణరంగం ఒక మహాసముద్రం వలె ఉన్నది. అందులో ఏనుగుల దేహాలే కొండలు, గుఱ్ఱాల శరీరాలే మొసళ్ళు, మానవుల దేహాలే చేపలు, ఖడ్గాలూ కత్తులూ మొదలైన ఆయుధాలే పాములు, నెత్తుటితో తడిసిన బాణాలే పగడాలు, ప్రేగులే నురుగు, రక్త ప్రవాహమే నీరు, ఆభరణాల ఎముకల పొడియే ఇసుక. అటువంటి రణరంగం అనే మహాసముద్రంలో యోగనిద్రలో ఉండే విష్ణువునకు సాటిగా శ్రీకృష్ణుడి మేనల్లుడు అభిమన్యుడు వెలుగొందాడు.

విశేషం: భవ్యయోగనిద్రలో ఉండే మహావిష్ణువుతో అభిమన్యుడిని పోల్చడం ఇందులోని విశేషం. అర్జున పుత్రుడనో, సుభద్రాతనయుడనో, బాలుడనో అనకుండా మురారి అల్లుడని పేర్కొనటం ఎంతో ఔచిత్యవంతం. మామపోలికలు మేనల్లుడిలో కన్పించాయి అనే సూచన 'అమ్మురారి యల్లుఁడు' అనే ప్రయోగంలో సుస్పష్టం. అలంకారం: రూపకం.

వ. అ బ్బాలుండు. 129

తాత్పర్యం: బాలుడైన అభిమన్యుడు.

విశేషం: అభిమన్యుడిని తిక్కన ఎక్కువగా ఆ శిశువు, ఆ బాలుడు, ఆ కుమారశ్రేష్ఠుడు వంటి విశేషగుణాలతోనే పేర్కొన్నాడు. ఒక్క పిల్లవాడిని అంతమంది మహాయోధులు ఆ విధంగా చుట్టుముట్టి అన్యాయంగా హతమార్చారే అన్న అభిప్రాయానికి ఇటువంటి విశేషణాలే ఎంతో రసస్ఫోరకంగా ఉంటాయి అని తిక్కన ఉద్దేశం. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. మహితలావణ్యమును, సుకుమారమైన । యంగమును, బూర్ణచంద్ర నిభాననంబుఁ
గ్రొత్తపెంపుగ నెంతయుఁ గొమరు మిగిలి । చెన్నుఁ దలకట్టునై పడియున్నఁ జూచి. 130

ప్రతిపదార్థం: మహిత, లావణ్యమునున్= మిక్కిలి ఒప్పిదమైన శరీరకాంతితో; సుకుమారము+ఐన= కోమలమైన; అంగమును= దేహమున్నూ; పూర్ణచంద్ర, నిభ+ఆననంబున్= నిండుచందురుడితో సమానమైన ముఖమున్నూ; క్రొత్త పెంపుగన్= నవోదయంగా; ఎంతయున్= మిక్కిలి; కొమరు మిగిలి= అందం అతిశయించి; చెన్ను+తలకట్టును+ఐ= అందమైన తలపాగా కలిగి; పడి+ఉన్నన్+చూచి= (రణరంగంలో నేలపై) పడి ఉండగా చూచి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: గొప్ప సౌందర్యంతో కోమలమైన దేహాన్నీ, నిండు చందురుడితో సమానమైన ముఖాన్నీ కలిగి అందం అతిశయించగా, తలపాగాతో నేలపై పడి ఉండే అభిమన్యుడిని చూచి.

విశేషం: అలం: ఉపమ. 'మహిత' అనే విశేషణాన్ని అభిమన్యుడిని ఉద్దేశించి తిక్కన పలుమారులు ప్రయోగించాడు. 'లావణ్యం' అనటంవలన అభిమన్యుడిలోని నైగనిగ్యం విదితం. అందగాళ్ళలో చంద్రుడు అందరికంటె మేలుబంతి. అందుకే అభిమన్యుడి అందాన్ని అనేక సందర్భాలలో కవి చంద్రుడితో పోల్చాడు. అందమైన తలపాగాతో పడి ఉండటం మరొక విశేషం. అది పరివేషం వలె అందాన్ని ఇనుమడింపజేస్తూ ఉన్నదని ధ్వని.

క. నీ సైనికు లెంతయు సం । తోసిల్లుచు నార్చి రపుడు దుఃఖితులై కుం
తీ సుతులవారు, దీనద । శాసంగతులైరి బాష్పజలములు దొరఁగన్. 131

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో; నీ సైనికులు= నీ సేనలు(యుద్ధవీరులు); ఎంతయున్= మిక్కిలి; సంతోసిల్లుచున్= సంతోషిస్తూ (ఆనందపడుతూ); ఆర్చిరి= గర్జించారు; కుంతీసుతులవారు= పాండవులు అనే నీకు సంబంధించినవాళ్ళు; దుఃఖితులు+ఐ= దుఃఖాన్ని పొందినవారై; బాష్పజలమును= కన్నీటిని; తొరఁగన్= కారుస్తుండగా; దీనదశా సంగతులు+ఐరి= దైన్యంతో కూడినవారు అయ్యారు.

తాత్పర్యం: అప్పుడు నీ సైనికులు ఎంతో సంతోషంతో అరచి బొబ్బలు పెట్టారు. కుంతీ కుమారులైన పాండవులు మిక్కిలి దుఃఖంతో కన్నీరు కారుస్తూ దైన్యాన్ని పొందారు.

విశేషం: 'కుంతీసుతులవారు' అనటం ఒక క్రొత్త ప్రయోగం. 'పాండవులు అనే నీకు సంబంధించిన బంధువుల' అనే అర్థంలో 'వారు' అనే పదం ప్రయుక్తం.

క. నెఱి దప్పంబడి పెల్లుగ । నొఱలెడి నరవాజికరుల యులి వభిమన్యుం
డఱిముఱిఁ బడుటకు వగ మదిఁ । బఱిగొన నిల పెలుచ నఱచుభంగిఁ జెలంగెన్. 132

ప్రతిపదార్థం: నెఱి+తప్పంబడి= ప్రజ్ఞ తప్పి; పెల్లుగన్= అధికంగా; ఒఱలెడి= పడిపోయే; నర,వాజి, కరుల= సైనికుల, గుర్రాల, ఏనుగుల; ఉలివు= శబ్దం; అభిమన్యుండు= అభిమన్యుడు; పడుటకున్= ఒరిగి నేలపై పడటానికి; అఱిముఱిన్= కలతతో; మదిన్= మనస్సులో; వగ+పఱిగొనన్= దుఃఖం బాధించగా; ఇల= భూమి; పెలుచన్= అధికంగా; అఱచుభంగిన్= అఱచినట్లుగా; చెలంగెన్= ఒప్పింది.

తాత్పర్యం: ప్రజ్ఞ తప్పి మిక్కిలి విలపిస్తూ భటులు, గుర్రాలు, ఏనుగులు చేసే శబ్దం, అభిమన్యుడు నేలకు ఒరిగినందుకుగా మనస్సులోని కలతతో దుఃఖం బాధించగా భూమి (నేల) యే అధికంగా అరుస్తూ ఉన్నట్లు అనిపించింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. గజతురగ పదాతివర్గం చేసే ఘోషకు నేలయే విలపిస్తుందన్నట్లు ఊహించటం ఈ పద్యంలోని విశేషం.

వ. ఆ సమయంబున. 133

తాత్పర్యం: ఆ సందర్భంలో.

క. 'పెక్కండ్రు గూడి యిమ్మెయి । నొక్కనిఁ జంపుట యధర్మ మోహో!' యని న
ల్దిక్కులను బెద్దయెలుఁగున । నక్కజముగ భూత సంచయంబులు వలికెన్. 134

ప్రతిపదార్థం: పెక్కండ్రు+కూడి= అనేకులు ఒకటిగా గుమిగూడి; ఈ+మెయిన్= ఈ విధంగా; ఒక్కనిన్= ఒకే ఒక పసిబాలుడిని; చంపుట= చంపటం; ఓహో!= అయ్యో; అధర్మము= అవినీతి(అన్యాయం); అని= అంటూ; నల్+దిక్కులను= నాలుగువైపులా; అక్కజముగన్= ఆశ్చర్యంగా; పెద్ద ఎలుఁగునన్= పెద్దశబ్దంతో (బిగ్గరగా); భూతసంచయంబులు= భూతాల మొత్తాలు (అనగా సమస్త ప్రాణికోటి, పంచభూతాలు); పలికెన్= ఘోషించాయి.

తాత్పర్యం: 'ఈ విధంగా అనేకులు గుమిగూడి ఒక్కడిని చంపటం అధర్మం' అంటూ నాలుగు దిక్కుల నుండి ఆశ్చర్యంగా పెద్దధ్వనితో సమస్త భూతకోటి ఘోషించింది.

వ. ఇట్లు శౌర్య సార సంపాదిత రౌద్రుండైన సౌభద్రుండు పడుటయు, వారి బలంబులు ఊచ్చవడి, భండనంబు దక్కి తలరిన, ధర్మపుత్త్రుండు ప్రబలయోధవీరలోకంబు నాలోకించి యిట్లనియె. 135

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; శౌర్య, సార, సంపాదిత, రౌద్రుండు+ఐన= పరాక్రమం యొక్క అతిశయంచేత సంపాదించబడిన రౌద్రరసం కలవాడైన; సౌభద్రుండు= సుభద్రాపుత్రుడైన అభిమన్యుడు; పడుటయున్= (నేలకు ఒరగగా) నేలకూలగా; వారి+బలంబులు= ఆ పాండవుల సేనలు; ఊచ్చవడి= చేష్టలు దక్కి (సంభ్రమపాటు చెంది); భండనంబు దక్కి= యుద్ధాన్ని ఉడిగి (విరమించి); తలరినన్= కలతచెందగా; ధర్మపుత్త్రుండు= ధర్మరాజు; ప్రబల, యోధవీర, లోకంబున్= మిక్కిలి బలవంతులైన; యుద్ధవీరుల సమూహాన్ని; ఆలోకించి= చూచి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా పరాక్రమాతిశయంచేత రౌద్ర రసాకారుడైన అభిమన్యుడు నేలకొరగటం చేత పాండవసేనలు చేష్టలు దక్కి, పోరు మాని, కలతచెంది ఉండగా ధర్మరాజు యుద్ధవీరులను చూచి ఇట్లా అన్నాడు:

విశేషం: సౌభద్రుడికి ప్రయోగించిన విశేషణం ఎంతో గంభీరంగా ఉన్నది. కానీ, వెంటనే 'పడుటయు' అనే క్రియాపదం ఎంతో దైన్యాన్ని సూచిస్తూ ఉన్నది. ఇచ్చట ఆదేశంచేత కలిగిన వకారం వలన దైన్యస్థితి వలె ఆవిష్కరించబడింది. అదే పరుషాన్ని ప్రయోగించి ఉంటే అంతగా ఆ దైన్యం అభివ్యక్తం అయి ఉండేది కాదు.

సీ. 'మార్బలంబులు సొచ్చి, మాతంగములఁ గూల్చి, రథరాజిఁ గలఁచి, తురంగమములఁ
ద్రుంచి, పదాతులం దునుమాడి పెక్కండ్రు । సైనిక ప్రవరుల సమయఁ జూచి
మూఁకల విరియించి, వీఁక నాచార్యాది । యోధుల నెల్లను నొక్కదెసకు
వెలిచి, వియచ్చరుల్ వినుతింప నాకంబు । చూఱగొన్నట్టి యర్జునతనూజుఁ

ఆ. జూచి మనకు నేల శోకింప! వైరుల । గం డడంచి గెలుపు గంద ముచిత
భంగిఁ; బ్రొద్దుకొలఁది పరికించి మనసైన్య । ముల మరల్త మెలమి దలకొనంగ.' 136

ప్రతిపదార్థం: మార్బలంబులు+చొచ్చి= శత్రుసైన్యాలలో దూరి; మాతంగములన్+కూల్చి= ఏనుగులను పడగొట్టి; రథరాజిన్= రథాల వరుసను; కలఁచి= కలతకలిగించి; తురంగమములన్= గుఱ్ఱాలను; త్రుంచి= చంపి; పదాతులన్= కాల్బలాన్ని; తునుమాడి= సంహరించి (ఇట్లు చతురంగ బలాలనూ హతంచేసి అని భావం); పెక్కండ్రు= అనేకులు; సైనిక ప్రవరులన్= సేనలలో ఉండే శూరులను; (సైనిక శ్రేష్ఠులను); సమయన్+చూచి= చంపజూచి; మూఁకలన్+విరియించి= దట్టంగా గుమిగూడి ఎదిరించిన భటులను చెదరగొట్టి; వీఁకన్= ఉత్సాహంతో; ఆచార్య+ఆది, యోధులన్+ఎల్లను= ద్రోణుడు మొదలైన శూరులను అందరినీ; ఒక్క, దెసకున్, వెలిచి= ఒకవైపు తెచ్చి; వియత్+చరుల్= దేవతలు; వినుతింపన్= పొగడుతూ ఉండగా; నాకంబు= స్వర్గాన్ని; చూఱగొన్నట్టి= కొల్లగొట్టినటువంటి; అర్జునతనూజున్= అభిమన్యుడిని; చూచి= కనుగొని; మనకున్= మనకు; శోకింపన్?+ఏల?= దుఃఖపడటం ఎందుకు?; వైరుల, గండు+అడంచి= శత్రువుల గర్వం (పోకార్చి) అణచి; గెలుపు కందము= గెలుపును పొందుదాం;

ఉచితభంగిన్= తగినవిధంగా; ప్రొద్దుకొలఁది= ప్రొద్దు ఉన్నంతవరకూ; పరికించి= చూచి; ఎలమి+తలకొనంగన్= ధైర్యం కలుగగా(వికాసం ఒనగూడేటట్లు); మన సైన్యములన్= మన సేనలను; మరల్తము= శిబిరానికి మరలిద్దాం.

తాత్పర్యం: 'శత్రు సైన్యాలలో దూరి, ఏనుగులను, రథాలను, గుర్రాలను, కాల్బలాన్ని నేలకూల్చి అనేక శూరులు కలిసి తనను చంపజూచినప్పుడు ఆ మూకలను చెదరగొట్టి, ద్రోణాదియోధులందరినీ ఒక దిక్కుకు తెచ్చి, దేవతలు పొగడుతూ ఉండగా, స్వర్గాన్ని కొల్లగొట్టిన అభిమన్యుడిని చూచి మన కెందుకు దుఃఖం? శత్రువుల గర్వాన్ని అణచి మనం జయిద్దాం. ప్రొద్దు ఎంతఉందో చూచి, ధైర్యంగా మన సేనలను శిబిరాలకు మరలిద్దాం.'

విశేషం: 'యుద్ధం అన్నప్పుడు విజయమో, వీరస్వర్గమో! ఆ వీరస్వర్గాన్ని విజయుడి కొడుకు తన అసమాన పరాక్రమాన్ని చూపి పొందగలిగాడు. అందుకు మనం దుఃఖపడాల్సిన పనిలేదు. ఇక విజయం మనం సాధించాలి' అంటూ ధర్మరాజు చెప్పిన మాటలలో అతడికి యుధిష్ఠిరుడనే పేరు ఏ విధంగా సార్థకమో సూచించబడింది. 'అర్జునతనూజు' అనే ప్రయోగంలో తండ్రి నుండి పుణికి పుచ్చుకొన్న అభిమన్యుడి కీర్తిధావళ్యం ప్రతిబింబిస్తూ ఉన్నది.

వ. **అని పలికి బరవసంబు సేసి సేనలం బురికొల్పికొని యవష్టంభ విజృంభితుండయి నిలిచెఁ; బదంపడి యరుణకిరణుం డపరమహీధరంబు మౌళికి సరసీరుహశేఖరంబై చెలువారం, దదనంతరంబ రిత్తచోట్లును నెత్తుటన్ జొత్తిల్లుచున్నట్లుండెఁ; బిండుగట్టి పిశాచనిశాచరులు నలిరేఁగి రక్తపానంబును మాంసఖాదనంబునుం జేయుచు మోదంబునం బొందుచు నాడుచు పాడుచుండు కలకలంబునను గుణపభక్షణవ్యగ్ర విహంగ సముదయతుములంబునను, బలలఖాదన సంరంభ శివా నివహ కోలాహలంబునను, బరమాభీలంబైన సంధ్యాకాలంబు నిరూపించి నిజ శిబిరంబులకు నుభయబలంబులుం బోయె; నప్పుడు నీ కొడుకు లుబ్బునం గొమరు మిగిలి యరిగిరి; కౌంతేయులు చిన్నఁబోయిన యాననంబులతో శోకసంతప్త చిత్తులయి చని; రివ్విధంబున ధర్మతనయుండు దననికేతనంబున కరిగి యచట నిఖిల పరిజనంబులుం దానును సన్నాహంబు లెడలించి శూన్యాకారులై యున్న సమయంబునం దమ్ముని దెస కూరిమి నారం గూరినవగ పెంపున ధైర్యంబు సొంపఱి వివర్ణవదనుం డగుచు నిట్లనియె.** **137**

ప్రతిపదార్థం: అని+పలికి= ఆ ప్రకారంగా మాటాడి; బరవసంబు+చేసి= ధైర్యం చేసి; సేనలన్= సైన్యాలను; పురికొల్పికొని= కలిసేటట్లు గావించి (ప్రేరేపించి); అవష్టంభ+విజృంభితుండు+అయి= గర్వంతో విజృంభించినవాడై; నిలిచెన్= నిలిచాడు;పదంపడి= పిదప; అరుణకిరణుండు= సూర్యుడు; అపరమహీధరంబు మౌళికిన్= అస్తాద్రిశిఖరానికి (పడమటి కొండ కొనకు); సరసీరుహశేఖరంబు+ఐ= తామర సిగదండమై; చెలువారన్= ఒప్పగా; తద్+అనంతరంబు+అ= ఆ పిదప; రిత్తచోట్లును= శూన్యప్రదేశాలున్ను; నెత్తుటన్= రక్తంతో; జొత్తిల్లుచున్నట్లు+ఉండెన్= ఎఱ్ఱవారినట్లుగా తోచాయి; పిండుగట్టి= గుంపుగాచేరి; పిశాచ, నిశాచరులు= ప్రేతాలు, రాక్షసులు; నలిరేఁగి= విజృంభించి; రక్తపానంబును= నెత్తురు త్రాగటం; మాంసఖాదనంబునున్= మాంసం తినటం; చేయుచున్= చేస్తూ; మోదంబునన్ పొందుచున్= సంతోషిస్తూ; ఆడుచున్, పాడుచుండు కలకలంబునను= ఆడుతూ పాడుతూ చేసిన అలజడి చేతను; కుణప; భక్షణ, వ్యగ్ర, విహంగ, సముదయ, తుములంబునను= పీనుగులను తినటంలో ఆసక్తిగల పక్షుల దొమ్మి పోరాటం వలనను; పలల, ఖాదన, సంరంభ, శివా నివహ కోలాహలంబునను= మాంసాన్ని తినటంలో తొందరపాటుగల ఆడునక్కల మొత్తం చేసే పెద్ద రొదచేతను; పరమ+ఆభీలంబు+ఐన= మిక్కిలి భయంకరమైన; సంధ్యాకాలంబున్= సంధ్యాసమయాన్ని; నిరూపించి= తెలిపి; నిజశిబిరంబులకున్= తమ విడిది గృహాలకు; ఉభయ సైన్యంబులును+పోయెన్= ఇరువురి సేనలున్నూ పోయాయి; అప్పుడు= ఆ సందర్భంలో; నీ కొడుకులు= దుర్యోధనుడు మొదలైన నీ కొడుకులు; ఉబ్బునన్= సంతోషంతో; కొమరు మిగిలి= అందం అతిశయించి; అరిగిరి= పోయారు; కౌంతేయులు= కుంతీపుత్రులు; చిన్నఁబోయిన+ఆననంబులతోన్=(దుఃఖించు)

కాంతిహీనాలైన ముఖాలతో; శోక, సంతప్త, చిత్తులు+అయి= దుఃఖంతో మిక్కిలి తపించిన మనస్సులు కలవారై; చనిరి= పోయారు; ఈ+విధంబునన్= ఇట్లా; ధర్మతనయుండు= ధర్మరాజు; తన, నికేతనంబునకున్+అరిగి= తన నివాసానికి- శిబిరానికి పోయి; అచటన్= అక్కడ; నిఖిల పరిజనంబులున్= పరివారం అంతయు; తానును= తానూ; సన్నాహంబులు= ప్రయత్నాలు; ఎడలించి= సడలించి; శూన్య+ఆకారులు+ఐ= శూన్యమైన ఆకారాలు కలవారై; ఉన్న, సమయంబునన్= ఉండే సందర్భంలో; తమ్మునిదెస= అర్జునుడి యెడ; కూరిమిన్= ప్రేమతో; ఆరన్= నిండుకోగా; కూరిన, వగ, పెంపునన్= నాటుకొన్న దుఃఖాతిశయంతో; ధైర్యంబు= ధైర్యం; సొంపు+అఱి= ఒప్పు నశించి; వివర్ణవదనుండు+అగుచున్= వన్నె చెడిన ముఖం గలవాడై.

తాత్పర్యం: అని ధర్మరాజు పలికి, సేనలకు ధైర్యం కలిగించి గర్వాటోపంతో నిలిచాడు. తరువాత సూర్యుడు అస్తమించాడు. శూన్యప్రదేశాలు నెత్తుటితో ఎర్రబారిన ట్లగుపించాయి. భూతప్రేతాలు, రాక్షసులు విజృంభించి రక్తపానం, మాంసభక్షణం చేస్తూ ఆనందంతో ఆడిపాడి అలజడి కలిగించాయి. మాంసాన్ని తినే తొందరపాటులో పక్షులు దొమ్మిపోరాటానికి దిగాయి. మాంసభక్షణపు తొట్రుపాటులో ఆడునక్కల గుంపు పెద్దరొదలు చేశాయి. ఆ విధంగా సంధ్యాసమయం భయంకరంగా పరిణమించింది. ఉభయ పక్షాలవారు వారి వారి శిబిరాలకు తరలారు. అపుడు నీ కొడుకులు సంతోషాన్ని పొందగా కుంతీపుత్రులు సంతాపంతో క్రుంగిపోయారు. తన శిబిరానికి పోయిన ధర్మరాజు, పరిజనమూ తానూ అప్పటికి అన్ని సన్నాహాలు చాలించి, శూన్యాకారులై ఉండే సందర్భంలో అర్జునుడిపై ప్రేమ నిండుకోగా మనస్సులో నాటుకొన్న దుఃఖాతిశయంచేత ధైర్యానికి సంబంధించిన సొంపుచెడి, వన్నె తరిగిన మొగంతో: (తరువాతి పద్యంతో అన్వయం).

అభిమన్యుని మరణమునకు ధర్మరాజు దుఃఖించుట (సం. 7-49-1)

మ. **'గురు శారద్వత ముఖ్యయోధ వరసంగుప్తంబు, నిర్భేద్య, ము**
ద్ధుర మా సైన్యము; దానిఁ జొచ్చి ననుఁ బ్రీతుం జేయఁగాఁ బూని యొ
క్కరుఁడున్ గోవులలోనఁ జొచ్చు బలు సింగం బొక్కొ నా నట్లు సా
చ్చి రయంబార ననేకవీరశిరముల్ చెండాడె నుద్దండుఁ డై. **138**

ప్రతిపదార్థం: ఆ+సైన్యము= ఆ కౌరవసేన; గురు= ద్రోణాచార్యుడు; శారద్వత= కృపాచార్యుడు; ముఖ్య= ప్రధానులు ముఖ్యులుగా గల; యోధవర= వీరశ్రేష్ఠులచేత; సంగుప్తంబు= బాగుగా రక్షించబడేది; నిర్భేద్యము= భేదించటానికి వీలుకానిది; ఉద్ధురము= బరువైనది లేదా నిలకడ కలిగింది; నన్= నన్ను; ప్రీతున్+చేయఁగాన్+పూని= సంతుష్టుడిని చేయటానికి; ప్రయత్నించి; ఒక్కరుఁడున్= ఒక్కడే; దానిన్+చొచ్చి= ఆ సైన్యాన్ని ప్రవేశించి; గోవులలోనన్= ఆవులలో; చొచ్చు= ప్రవేశించే; బలుసింగంబు+ఒక్కొ+ నాన్= మిక్కిలి బలం గలిగిన సింహమో అనునట్లు; అట్లు+చొచ్చి= ఆ విధంగా ప్రవేశించి; రయంబు+ఆరన్= వేగం యొక్క అతిశయంతో; అనేక వీర శిరముల్= పలువురు యోధుల తలలు; ఉద్దండుఁడు+ఐ= గొప్పవాడై - భయంకరుడై; చెండాడెన్= నరికి నేల కూల్చాడు.

తాత్పర్యం: ద్రోణుడు, కృపుడు మొదలైన మహాయోధులచేత రక్షించబడేది, భేదించటానికి వీలుకానిది, నిలకడ కలది అయిన కౌరవసైన్యాన్ని, నాకు ప్రీతి కలిగించటానికి తా నొక్కడే ఆ సైన్యంలో దూరి ఆవుల మందలోకి సింహం చొచ్చినట్లుగా చొచ్చుకొని పోయి, మహావేగంతో ఎందరో వీరుల తలలను ఉద్దండుడై నరికి నేలకూల్చాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఈ సందర్భంలోని గతి అభిమన్యుడు రణరంగంలోనికి చొచ్చుకొని పోయిన స్థితికి సూచన. 'ఒక్కరుఁడున్', 'చొచ్చిరయంబార' అనే ప్రయోగాలలో పదాలు విరిచి పాదారంభంలో కూర్చిన వైనం ఏ విధంగా పద్మవ్యూహాన్ని ఛేదించి లోనికి దూసుకొని పోయాడో 'శిల్పకళాపారగుఁ' డైన తిక్కన మత్తేభవిక్రీడితం యొక్క ఛందోరీతిలో ధ్వనింపజేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **ఈసును రోసముఁ గల దు । శ్శాసను నొప్పించి పఱపి చతురంగములన్**
గాసిలఁ జేయుచు న ట్లు । ల్లాసముతో మెలఁగఁగాఁ దలంబె యొరులకున్! **139**

ప్రతిపదార్థం: ఈసును= ఈర్ష్యయూ; రోసమున్= రోషమున్నూ; కల, దుశ్శాసనున్= కలిగిన దుశ్శాసనుడిని; నొప్పించి= బాధించి;పఱపి= పరుగు లెత్తేటట్లు చేసి; చతుః+అంగములన్= రథ, గజ, తురగ, పదాతిబలాన్ని; గాసిలన్ చేయుచున్= నాశనం చేస్తూ (బాధపెడుతూ); అట్లు= ఆ విధంగా; ఉల్లాసముతోన్= సంతోషంతో; మెలఁగఁగాన్= మెలగటానికి; ఒరులకున్= ఇతరులకు; తలంబు+ఎ!= శక్యమా!

తాత్పర్యం: ఈర్ష్యా, రోషమూ ఉన్న దుశ్శాసనుడిని నొప్పించి, పరుగులు తీయించి, చతురంగ బలాన్ని (అనగా రథ, గజ, తురగ పదాతి సైన్యాలను) నేలకూల్చి ఆ విధంగా సంతోషంతో వీరవిహారం చేయటానికి ఇతరులకు శక్యమా?

విశేషం: ఈ కందపద్యంలో అభిమన్యుడి సమరోల్లాసం సకారప్రాసలో ఎంతో హృద్యంగా వ్యంజితమైనది. ఆ ఉల్లాసంలో దుశ్శాసనుడిని నొప్పించిన వైనం కూడా అభివ్యక్తం.

తే. **కొడుకుఁ బొడగాన కర్జునుఁ డడిగె నేని । వానితో నింక నే మనువాఁడ? హరికి**
నతని గారాబు చెలియలి కధికదుఃఖ । మేన చేసితి; వగవంగ నేమి గలదు? **140**

ప్రతిపదార్థం: అర్జునుఁడు= అర్జునుడు; కొడుకున్+పొడఁగానక= అభిమన్యుడిని కాన(చూడ)లేక; అడిగెన్+ఏని= అడిగితే; ఇంకన్= ఇకపైన; వానితోన్= ఆ అర్జునుడితో; ఏమి+అనువాఁడన్?= ఏమని చెప్పగలను?; హరికిన్= శ్రీకృష్ణుడికి; అతని, గారాబు, చెలియలికిన్= అతడికి ప్రియమైన (ముద్దు) చెల్లెలికి అనగా సుభద్రకు; ఏను+అ= నేనే; అధిక దుఃఖమున్= మిక్కిలి శోకాన్ని; చేసితిన్= కలిగించాను; వగవంగన్+ఏమి కలదు?= దుఃఖించటం వలన ఏమి ప్రయోజనం?

తాత్పర్యం: అర్జునుడు వచ్చి ఏడీ - నా కొడు కెక్కడ? అగుపించడంలేదే? అని అడిగితే ఏమని చెప్పగలను? శ్రీకృష్ణుడికీ అతడి కూరిమి చెల్లెలు సుభద్రకు నేనే ఇంత వంత కలిగించాను. ఇపుడు దుఃఖించి ఏమి ప్రయోజనం?

విశేషం: అభిమన్యుడిని అధికంగా అభిమానించే అర్జునుడూ, అచ్యుతుడూ, అతడి చెల్లెలు సుభద్రా - వీళ్ళకందరికీ నేనే ఆరని తీరని ఆవేదన కలిగించా నని ధర్మరాజు బాధపడుతూ 'వగచినందువలన ఏమౌతుంది?' సాధారణంగా లోకంలో అనుకొనే ఊరట వాక్యం పలికాడు.

క. **బాలుఁడు సుకుమారుఁడు పె । క్కాలములం జొచ్చి యెఱుఁగఁ డనక మొన సొరం**
జాలుదు చొరు మని పనిచితి; । నేలా న న్నాస దోస మెఱుఁగఁగ నిచ్చున్? **141**

ప్రతిపదార్థం: బాలుఁడు= పసివాడు; సుకుమారుఁడు= కోమలదేహం కలవాడు; పెక్కు= అనేకములైన; ఆలములన్= యుద్ధాలలో; చొచ్చి= ప్రవేశించి; ఎఱుఁగఁడు= తెలియడు; అనక= అని తలచక; మొన+చొరన్= సైన్యంలోకి చొరబడటానికి; చాలుదు(వు)= తగి ఉన్నావు; అని+పనిచితిన్= అని అంటూ పంపాను; ఆస= ఆశ; నన్నున్= నన్ను; ఏలా, దోసము+ఎఱుఁగఁగన్+ఇచ్చున్?= దోషాన్ని ఏ విధంగా తెలిసికొననిస్తుంది?

తాత్పర్యం: అభిమన్యుడు చిదిమిన పాలుగారే చిన్నారి బాలుడూ, కోమలదేహం కలవాడూ, ఎన్నడూ యుద్ధాలలో ప్రవేశించనివాడూ అనికూడా ఆలోచించకుండా 'సైన్యంలో చొచ్చుకొని పోవటానికి నీవు సమర్థుడ' వని పంపాను. నన్ను ఆశ, దోషాన్ని తెలియనీయకుండా చేసింది.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ఆశ దోషాన్ని కప్పివేస్తుంది. అది సాధ్యమా? కాదా? అనే విషయాన్ని కూడా తెలియనీయదు. సరిగ్గా అభిమన్యుడి విషయంలో ఇదే జరిగింది. యుద్ధాలలో పాల్గొన్న అనుభవం ఎంతమాత్రమూ లేని ఒక సుకుమారుడైన పసిబాలుడిని యుద్ధానికి పురికొల్పటం ఎంత అవివేకం? అని ధర్మరాజు తన దోషపూరితమైన దురాశను గూర్చి దురపిల్లటం ఈ పద్యంలోని విశేషం. 'ఆస-దోసమని అనుప్రాసలో పైకి శాబ్దిక సౌందర్యం అభివ్యక్తమైనా - అంతరాంతరాలలో అది ప్రాసవలె ఏ విధంగా బాధిస్తున్నదో కూడా చివరి వాక్యంలో సూచించబడింది.

క. కుడువను గట్టను బూయను। దొడువను బోఁబనిచి కాక తొలుత మొన సౌరం
గొడుకుం బనుచుట కెవ్వఁడు। గడఁగునె! నాయట్టి పాపకర్ముఁడు దక్కన్. 142

ప్రతిపదార్థం: కుడువను= భుజించటానికిన్నీ;కట్టను= మేలిబట్టలు కట్టుకొనటానికిన్నీ; పూయను= గంధద్రవ్యాలు పూసికొనటానికిన్నీ;తొడువను= ఆభరణాలు ధరించటానికిన్నీ; పోన్= పోవగా; పనిచి+కాక= పంపకుండా; తొలుతన్= మొదటగా; మొనచొరన్= యుద్ధానికి పోవగా; కొడుకున్= కుమారుడిని; పనుచుటకున్= పంపటానికి; నా+అట్టి= నావంటి; పాపకర్ముఁడు+తక్కన్= పాపి తప్ప; ఎవ్వఁడున్= ఎవ్వడుగానీ; కడఁగునె!= ప్రయత్నిస్తాడా!

తాత్పర్యం: కూడు తినటానికో, గుడ్డ కట్టుకొనటానికో, మైపూతలు పూసికొనటానికో, నగలు తొడుగుకొనటానికో పంపాలిగాని, అలా కాకుండా తొలుతగా యుద్ధానికి పొమ్మని పంపటానికి నావంటి పాపి తప్ప మరెవ్వరైనా ప్రయత్నిస్తారా?

విశేషం: ముద్దు ముద్దుగా చిన్నపిల్లలను అలరించటానికో లేక ముద్దూ మురిపెమూ చెల్లించుకొనటానికో చెప్పే పనులు, చేసే విధులూ ఎన్నో ఉన్నాయి. అవి కాదని భీకరమైన సంగరభూమికి పోరా! అని పంపేవాడు ఎంత పాపాత్ముడై ఉండాలి?అని ధర్మరాజు తన్ను తాను ఆత్మ విమర్శ చేసికొంటూ ఆవేదన చెందటం ఈ కందపద్యంలోని విశేషం. ధర్మరాజు తా నెంత పాపకర్మకు పూనుకొన్నాడో దానికతడు ఎంత ఆవేదన పొందాడో చిట్టచివరి పాదాలలో చక్కగా అభివ్యక్తమైంది. కందపద్యాన్ని నడపటంలో, అందులో విభిన్న భావాలకు అనుగుణంగా మనస్తత్త్వాన్ని అభివ్యక్తం చేయటంలో తిక్కనగారిని మించిన కవి 'న భూతో న భవిష్యతి'.

తే. వానితోడిద లోకమ్మై యేను బోవ। నైతిఁ బోఁగన్నఁ బుత్త్ర శోకాతురత్వ
మున నితాంత వివర్ణతఁ బొందుచుండఁ జూడకుండెడివాఁడ నర్జును మొగంబు. 143

ప్రతిపదార్థం: ఏను= ధర్మజుడైన నేను; వానితోడిద లోకము+ఐ= వాడిని విడువకుండా వాడే లోకమై లేదా వాడిని అనుసరిస్తూ అదే లోకమై; పోవన్+ఐతిన్= పోలేకపోయాను (వాడివలె నేను కూడా వాడితో చావలేకపోయాను అని భావం); పోన్+కన్నన్= పోవటం చూడగలిగితే(అలా పోగలిగి ఉంటే, లేదా పోవటం సంభవించి ఉంటే); పుత్త్రశోక+ఆతురత్వమునన్= పుత్రశోకం వలన కలిగిన బాధచేత; నితాంత, వివర్ణత= అధికంగా వెల్లబాటు చెందటం, లేదా మిక్కిలి వన్నె చెడటం; పొందుచుండన్= కలుగుతూ ఉండే; అర్జును మొగంబున్= అర్జునుడి ముఖాన్ని; చూడకుండెడివాఁడన్= చూడకపోయేవాడిని.

తాత్పర్యం: నేను అభిమన్యుడితో కూడా వాడే లోకమై పోలేకపోయాను. అట్లా పోగలిగి ఉంటే పుత్ర శోకంతో కుమిలి మిక్కిలి వివర్ణుడై ఉండే అర్జునుడి ముఖాన్ని చూడకుండా ఉండేవాడిని.

విశేషం: ఈ పద్యంలోని భావమంతా 'వానితోడిదలోకమ్మై' అనే జాతీయమైన పలుకుబడితో ముడిపెట్టబడి ఉన్నది. పుత్రమరణవార్త విన్న అర్జునుడిని ఏ విధంగా చూడగలను అనే ధర్మరాజు ఆవేదన ఈ తేటగీతి పద్యంలో తేటతెల్లం చేయబడింది. వాడితో కూడా నేనూ పోకపోతినే అనే వాక్యంలో ఎంతగా భరింపరాని బాధ చోటు చేసుకొని ఉన్నదో తిక్కన ఎంతో చక్కగా హృదయం ముక్కలయ్యే తీరులో, అతి సహజంగా మొదట తేటగీతి పాదంలో తెలిపాడు. కుమారుడి మరణానికి మిక్కిలిగా విలపించే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అర్జునుడిని ఏ విధంగా చూడగలను? అభిమన్యుడితో పాటు నేను కూడా మరణించి ఉంటే సరిపోయేది. అప్పుడు అర్జునుడి దుఃఖపూరిత వదనాన్ని చూడకుండే వాడిని గదా! అనే భావం చక్కగా హృదయాన్ని హత్తుకొనే రీతిలో వర్ణించబడింది.

ఉ. వాసవునంత వానికిని వచ్చిన యాపదఁ దీర్చుఁ గాలకే
యాసురు లట్టి బల్పగఱ నైనను వ్రేల్మిడిఁ ద్రుంచు నాజి న
వ్వాసవి యాత్మజుండు పగవారలచే హతుఁడైన దుర్దశం
జేసి యలంతఁ జేద్పడఁగఁ జేసె; విధాతృని నేమి సెప్పుదున్! 144

ప్రతిపదార్థం: ఆ+వాసవి= ఆ అర్జునుడు; వాసవు+అంతవానికిన్= ఇంద్రు నంతటి వాడికి; వచ్చిన+ఆపదన్= కలిగిన విపత్తును;తీర్చున్= తొలగిస్తాడు; కాలకేయ+అసురులు+అట్టి= కాలకేయ రాక్షసులవంటి; బల్పగఱన్+ఐనను= గొప్ప శత్రువులనైనా; వ్రేల్మిడిన్= చిటికె వేయునంతలో; ఆజిన్= యుద్ధంలో; త్రుంచున్= సంహరించాడు; ఆత్మజుండు= కుమారుడు; పగవారలచేన్= శత్రువులచేత; హతుండు+ఐన= చంపబడిన; దుర్దశన్+చేసి= కష్టదశచేత; అలంతన్= అలసటతో; చేద్పడఁగన్= చేటును పొందేటట్లు; చేసెన్= చేశాడు; విధాతృనిన్= బ్రహ్మను; ఏమి చెప్పుదున్?= ఏమి అనగలను?

తాత్పర్యం: ఆ అర్జునుడు ఇంద్రునంతటి వాడికి కలిగిన విపత్తును తొలగించాడు. కాలకేయాదులంతటి రాక్షసులను చిటికెవేసే లోపల యుద్ధంలో కూల్చాడు. అలాంటి అర్జునునికి కడుపు కోత కలిగేటట్లు అతని కొడుకు శత్రువులచేత హతుడయ్యేటట్లు విధాత చేస్తే ఆ విధాత చేతలను ఏమనాలి?

విశేషం: కాలకేయులు: వీరు మరీచిపుత్రులు. తల్లి కాలక. వీరు మునులను, దేవతలను బాధిస్తూ పగలు సముద్రం యొక్క అడుగున దాగిఉండేవారు. అగస్త్యుడు సముద్రజలపానం చేయగానే వీరు బయటపడ్డారు. ఈ కాలకేయాసురుల సంతతి వాళ్ళనే అర్జునుడు సంహరించాడు. తన పరాక్రమంతో దేవేంద్రుడికి కష్టాన్ని కలిగించే కాలకేయులను త్రుటిలో చంపిన అర్జునుడికి, ఇప్పు డింతటి దుర్దశ, చేటు కలిగించిన బ్రహ్మను ఏమనాలి? అనే ధర్మజుడి మానసికవేదన ఈ ఉత్పలంలో వివరించబడింది.

చ. కొడుకు వధించి రన్నఁ గురుకోటికి నెట్టన యల్గి రూపుమా
పెడున కడంగి పార్థుఁ డెద బేర్చిన శోకము నార్పఁ జాలునే?
పుడమి ధనంబు నాకము విభూతియుఁ జేరెన యేని నల్ల న
వ్వెడు నభిమన్యు నెమ్మొగము వే యగు పాలును బోల నేర్చునే? 145

ప్రతిపదార్థం: పార్థుఁడు= అర్జునుడు; కడంగి= పూని; కొడుకున్+వధించిరి+అన్నన్= అభిమన్యుడిని చంపారు అని చెప్పగానే; కురుకోటికిన్= కౌరవుల మొత్తానికి; నెట్టన= వెంటనే (తొందరగా); అల్గి= కోపించి; రూపుమాపెడున= చంపితీరుతాడు; ఎదన్= మనస్సులో; పేర్చిన, శోకమున్= అతిశయించిన పుత్రశోకాన్ని; ఆర్పన్+చాలును+ఏ?= పోకార్చ గలుగునా?; పుడమిన్ ధనంబు= భూలోక ఐశ్వర్యం; నాకము+విభూతియున్= స్వర్గసంపదయున్నూ; చేరిన ఏనిన్= దొరికినప్పటికిన్నీ; అల్ల+నవ్వెడు+అభిమన్యు+నెమ్మొగము= మందంగా నవ్వే అభిమన్యుడినిండు మొగం; వేయగు పాలును= సహస్రాంశము నైనా (వెయ్యోభాగమునైనా); పోలనేర్చునే?= సరిపోలునా?

తాత్పర్యం: కొడుకును చంపారని వినగానే అర్జునుడు కౌరవుల మొత్తాన్నీ వెంటనే హతమార్చకుంటాడా! అయినా అది అర్జునునిమనస్సులో రేగినపుత్రశోకాన్ని ఆర్పగలదా! భూలోక సంపదా, స్వర్గలోకంలోని ఐశ్వర్యమూ అంతా లభించినప్పటికీ ఆ అభిమన్యుడి చిరునవ్వు తోడి నిండుమొగానికి వెయ్యో భాగమైనా సరిపోలుతుందా?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ చంపకమాలావృత్తంలో అభిమన్యుడి చావు విని కౌరవులందరిని అర్జునుడు చంపక వదలిపెట్టుతాడా! ఆతడి పుత్రశోకాన్ని ఆర్పటానికి వీలవుతుందా? అని అర్జునుడిని గురించి ధర్మజుడు మొదట భావించి, వెంటనే ఎన్ని సంపదలున్నా, స్వర్గ సంపద లభించినా అభిమన్యుడి ముఖ సౌందర్యానికి అవి ఏ మాత్రమూ సాటిరావు అని ఈ పద్యం చివరి పాదంలో తిక్కన ధర్మజసంతాప రూపంలో నిరూపించాడు.

వ. అని మఱియు ననేక ప్రకారంబులం బలవించుచున్న సమయంబునం గృష్ణద్వైపాయన మునీంద్రుం డయ్యెడకు విజయంచేయుటయు, నవ్విభుండు ప్రత్యుత్థానంబు సేసి, దండప్రణామం బాచరించి, యాసన విన్యాసన ప్రముఖ పూజావిశేషంబుల నారాధించి య మ్మహాత్ముతో నిట్లనియె. 146

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; మఱియున్= ఇంకా; అనేక ప్రకారంబులన్= అనేక విధాలుగా; పలవించుచున్న= విలపిస్తూ ఉండే; సమయంబునన్= సందర్భంలో; కృష్ణద్వైపాయన మునీంద్రుండు= వ్యాస మునీంద్రుడు; ఆ+ఎడకున్= ఆ చోటుకు; విజయం చేయుటయున్= విచ్చేయగా; ఆ+విభుండు= ఆ రాజు(ధర్మరాజు); ప్రత్యుత్థానంబు+చేసి= పైకిలేచి స్వాగతంపలికి; దండప్రణామంబు+ఆచరించి= కర్ర నేలపై పడినట్లు సాష్టాంగ నమస్కారం చేసి; ఆసన, విన్యాసన, ప్రముఖ, పూజా, విశేషంబులన్= ఆసనం ఉంచటం మొదలైన విశేషార్చనలతో; ఆరాధించి= పూజించి; ఆ+మహాత్ముతోన్= ఆ వేదవ్యాస మునీంద్రుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని పలురకాలుగా దుఃఖిస్తూ ఉండగా వ్యాసమునీంద్రుడు అక్కడికి వచ్చాడు. ధర్మరాజు లేచి, ఎదురేగి సాష్టాంగ దండప్రణామం చేసి, ఆసనాది విధులతో పూజించి, ఆ మహామునితో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. ప్రస్తుత వచనభాగంలో వేదవ్యాసుని రాక - ఆయన్ని ధర్మరాజు అతిథిపూజా విశేషాలతో ఆహ్వానించిన విషయం అభివర్ణితం. నన్నయ రచనా విధానంలో ఉండే ఔచిత్యాన్ని గుర్తించిన తిక్కన, సందర్భానుసారంగా వ్యర్థ పదరహితంగా వచన రచన ఏ విధంగా నిర్వర్తించాడో విస్పష్టం. వేదవ్యాసుని ఆగమనాన్ని ఏదో ఒక పద్యంలో నిబంధించి ఉండవచ్చును. కానీ, కథాగమన వైచిత్రికి వచనం ఎంత అనుకూలమో ఈ వచన భాగంలో తిక్కన సూచించాడు.

2. 'వేదవ్యాసాగమనము,నారదుఁ డకంపననకు మృత్యుదేవతా ప్రభావం బెఱింగించుట, సువర్ణష్ఠీవి చరిత్రము, షోడశరాజ చరిత్రము, అను వృత్తాంతములతో కూడిన కథాభాగము (ద్రోణ.2. 146-224) భండార్కరు ప్రతి ప్రధాన పాఠమునందు విడువబడినది.అనుబంధమునందు 220 పంక్తులు గల ఈగ్రంథ భాగము చేర్చఁబడినది. (అను-1-8 పుట 264). ఈ భాగము చిత్రశిలాప్రతి, పి.పి.యస్. శాస్త్రి ప్రతి. కుంభకోణ ప్రతి - వీనియందు ప్రధాన పాఠముగా చేర్చఁబడియున్నది.

భండార్కరు ప్రతి సంపాదక వర్గమువా రీలోపము నీ క్రింది విధముగా సమర్థించియున్నారు. 'ఈ కథలన్నియు శాంతి పర్వమున కన్పించుచున్నవి. శారదాప్రతియందు ద్రోణపర్వమున నీ భాగము విడువబడినది. శాంతిపర్వమునం దీకథలు సందర్భోచితముగా కాన్పించుచున్నవి. ద్రోణపర్వమునం దివి యంతగా తగి యుండలేదు. ద్రోణపర్వమునందలి షోడశరాజ వృత్తాంతమున ఒక అసందర్భమును కలదు. పరశురాముడిని పదునార్గురు మహారాజులలో చేర్చుట యుక్తము కాదు. సంస్కృత శాంతి పర్వమునందు పరశురాముడి స్థానమున సగరుడు పేర్కొనఁబడి యున్నాడు. ఇది యుచితముగా కాన్పించును. మృత్యుదేవతా ప్రభావము తరువాత ద్రోణపర్వమున ఫలశ్రుతి కూడ చేర్చబడియున్నది. ఈ అంశములను బట్టి చూడఁగాఁ బైవృత్తాంతము లన్నియు శాంతిపర్వమున మొదట వ్రాయఁబడె ననియు, తరువాత ద్రోణపర్వమునందు ప్రక్షిప్తములుగా చేర్పఁబడినట్లును విశదమగుచున్నది.'

తెలుగుభారతమున వేదవ్యాసాగమనము, నారదుఁ డకంపననకు మృత్యుదేవతా ప్రభావం బెఱింగించుట, సువర్ణష్ఠీవి చరిత్రము, షోడశరాజ చరిత్రము అను ఘట్టములు కలవు. శాంతిపర్వమున నీ కథాంశములు కొన్ని మార్పులతో తిరిగి కాన్పించును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇచట అకంపనుని వృత్తాంతము లేదు. పర్వత నారద వృత్తాంత మధికముగా నున్నది (శాంతి 229- 290). తెలుఁగు భారతమున ద్రోణపర్వమునగాని, శాంతి పర్వమునగాని, షోడశరాజ చరిత్రమునందు సగరుని ప్రశంస చేర్చబడలేదు. పరశురాముని వృత్తాంతమే యున్నది. షోడశరాజ వృత్తాంతమునకు సంబంధించిన పద్యములు తెనుఁగున రెండు పర్వములందును ఒకే రీతిగానున్నవి.' (ఆంధ్రమహాభారతము. సంశోధితముద్రణము. ద్రోణపర్వము. ద్వితీయాశ్వాసము. పాదసూచి. పు. 354 - 355).

సీ. **'పరసేన భేదింపఁ బనిచితి నేను సౌ। భద్రుని వాఁడు నబ్బలము సొచ్చె;**
వెనుక నేమును జొచ్చి చనఁగ సైంధవుఁడు మ। మ్మాఁగినఁ దోడ్పడ ననువు దప్పె;
నప్పుడు పెక్కండ్రు రప్పాడి న వ్వీరుఁ। బొదివిన నాఁఅడిఁ బోయె నట్లు
సుకుమారమూర్తిఁ బుత్త్రకు నొంటిమైఁ బిన్న। పాపని నలుఁగుల పాలు పడఁగఁ

ఆ. **బనిచి తాను బ్రతుకు పాపాత్ముఁ డెందును। గలఁడె? విపుల శోకజలధి మునిఁగి**
పేర్చు తల్లడమున బిమ్మిటి కొనియెడుఁ। జిత్త; మింక నేమి సేయువాఁడ?' **147**

ప్రతిపదార్థం: ఏను= ధర్మజుడనైన నేను; సౌభద్రునిన్= అభిమన్యుడిని; పరసేనన్= శత్రుసైన్యాన్ని; భేదింపన్= భేదించటానికై; పనిచితిన్=పంపాను; వాఁడున్= ఆ అభిమన్యుడుకూడా; ఆ+బలము= ఆ సైన్యం; చొచ్చెన్= ప్రవేశించాడు;వెనుకన్= అతడి వెనుక; ఏమును= మేమున్నూ; చొచ్చి+చనఁగన్= ప్రవేశించి పోగా; మమ్మున్= మమ్ము; సైంధవుఁడు= జయద్రథుడు; ఆఁగినన్= అడ్డగించగా; తోడ్పడన్= సహాయ పడటానికి; అనువు= (అనుకూల్యం) అవకాశం; తప్పెన్= తప్పిపోయింది; అప్పుడు= ఆ సందర్భంలో; పెక్కండ్రురు= అనేకులు; ఆ+పాడిన్= ఆ వివాదంలో; ఆ+వీరున్= వీరుడైన అభిమన్యుడిని; పొదివినన్= చుట్టుముట్టగా; ఆఁఅడిఁబోయెన్= మరణించాడు; అట్లు= ఆ విధంగా; సుకుమారమూర్తిన్= కోమలమైన స్వరూపం కలవాడిని; పుత్త్రకున్= కుమారుడిని; పిన్నపాపనిన్= పసిపిల్లవాడిని; ఒంటిమైన్= ఒంటిగా; అలుఁగులపాలు+పడఁగన్= బాణాల వశం అయ్యేటట్లు; పనిచి= పంపి; బ్రతుకు= జీవించునట్టి; పాపాత్ముఁడు= కఠినుడు; ఎందునన్= ఎందైనా; కలఁడె?= ఉన్నాడా?; విపుల, శోక, జలధిన్= విస్తారమైన శోకం అనే సముద్రంలో; మునిఁగి= మునిగి; పేర్చు+తల్లడమునన్= అతిశయించే బాధ (కలత)తో; చిత్తము= మనస్సు; బిమ్మిటి కొనియెడున్= స్మారకం తప్పిపోతూ ఉన్నది; ఇంకన్= ఇకపై;ఏమి+చేయువాఁడన్?= ఏమి చేయగలను?

తాత్పర్యం: 'నేను అభిమన్యుడిని శత్రుసేనను భేదించటానికి పంపాను.వాడున్నూ ఆ సైన్యంలో ప్రవేశించాడు. అతడి వెనుక మేము పోవటానికి ప్రయత్నించగా సైంధవుడు మమ్మల్ని అడ్డగించాడు. అభిమన్యుడికి సహకరించే అవకాశం అంతటితో తప్పిపోయింది. అప్పుడు పలువురు ఆ వీరుడిని చుట్టుముట్టి అన్యాయంగా హతమార్చారు. కోమల స్వరూపుడూ, పసిపాపడూ అయిన కుమారుడిని ఆ విధంగా ఒంటిగా బాణాలపాలు కావటానికి పంపి, తాను జీవించే కఠినాత్ము డెక్కడైనా ఉన్నాడా? అతి విస్తారమైన శోకసముద్రంలో మునిగి మిక్కిలి తల్లడపాటు చెంది మనస్సు ప్రజ్ఞ కోల్పోగా ఇంక చేసే దేముంది?'

వ. **అనిన విని మునీశ్వరుం డమ్మనుజేశ్వరున కిట్లనియె :** **148**

ప్రతిపదార్థం: అనినన్= అని ధర్మరాజు అనగా; విని; మునీశ్వరుండు= వేదవ్యాసుడు; ఆ+మనుజ+ఈశ్వరునకున్= ఆ రాజుకు (ధర్మరాజుకు); ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని ధర్మరాజు పలుకగా వేదవ్యాసుడు విని అతడితో ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. 'పలువురు రాజులం దునిమె బల్లిదుఁ డాతఁడు పిన్నపాపఁడే?
యలుగుల పాలు సేయకభియాతులు పువ్వుల కోల సాఁతురే?
కలఁగుదురే విపద్దశల కాఱియ నార్యులు సావు లింత విం
తలె? గరుడోరగ ద్యుచర దానవకోటుల చావుఁ జూడమే?' 149

ప్రతిపదార్థం: బల్లిదుఁడు= మిక్కిలి బలవంతుడు;పలువురు+రాజులన్= పెక్కుమంది రాజులను; తునిమెన్= సంహరించాడు; ఆతఁడు= ఆ అభిమన్యుడు; పిన్నపాపఁడు+ఏ?= పసిబాలుడా?; అభియాతులు= శత్రువులు లేదా పైకి దండెత్తి వచ్చేవాళ్ళు; అలుఁగుల+పాలు+చేయక= బాణాలపాలు కావించకుండా; పువ్వులకోల= పూలబాణం; చాఁతురే?= ప్రయోగిస్తారా?; ఆర్యులు= పెద్దలు, పూజ్యులు; విపద్+దశలన్= ఆపదలయొక్క పరిస్థితులలో; కాఱియన్= బాధతో; కలఁగుదురు+ఏ?= కలత చెందుతారా?; చావులు= మరణాలు; ఇంత వింతలు+ఏ?= ఇంత ఆశ్చర్యకరమైనవా?; గరుడ+ఉరగ, ద్యుచర, దానవ, కోటుల, చావున్= గరుడులు, నాగులు, ఖేచరులు (దేవతలు); రాక్షసులయొక్క మరణాన్ని; చూడమే!= చూస్తూనే ఉన్నాం గదా!

తాత్పర్యం: 'మిక్కిలి బలవంతుడైన ఆ అభిమన్యుడు చిన్నబాలుడా? అంతమంది రాజులను అంతం చేశాడు. పైకి దండెత్తి వచ్చే శత్రువులు బాణాలు ప్రయోగించకుండా పూలబాణాలు ప్రయోగిస్తారా?అన్నీ తెలిసిన పెద్దలు ఆపదలలో బాధతో కలత చెందుతారా? చావులు ఆశ్చర్యకరములా! గరుడులు, నాగులు, ఖేచరులు (ఆకాశంలో సంచరించే దేవతలు) రాక్షసులు మొదలైన వారి చావును మనం చూడటం లేదా?'

క. 'ఎప్పాట నెవ్వరికి విధి । దప్పింప వశంబె? ధైర్యధనఘనుఁ డవు నీ
విప్పరుసున నడలుట గడు । నొప్పదు; శమియింప వలయు నుర్వీనాథా!' 150

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= రాజా! (ధర్మరాజా అని సంబోధన); ఎప్పాటన్(ఏ+పాటన్)= ఏవిధంగానైనా; ఎవ్వరికిన్= ఎవ్వరికైనా; విధిన్= కాలానుగుణంగా ప్రవర్తించే కర్మ పరిస్థితిని; తప్పింపన్+వశంబె?= తప్పించుకొనటానికి వీలౌతుందా?; నీవు; ధైర్యధన ఘనుఁడవు= ధైర్యమే ధనంగా కలిగిన వాళ్ళలో గొప్పవాడవు; ఈ+పరుసునన్= ఈ విధంగా; అడలుట= శోకించటం; కడున్= మిక్కిలి; ఒప్పదు= తగదు; శమియింపన్ వలయున్= శాంతించాలి.

తాత్పర్యం: 'ఓ రాజా! ఎక్కడైనా, ఎవ్వరికైనా విధిని తప్పించుకోవటం సాధ్యమా? నీవు ధీరులలో మేటివి. ఈ విధంగా వ్యథ చెందటం తగదు. నీవు శాంతించాలి.'

విశేషం: ఉర్వీనాథా! అనే సంబోధనలో నీవు క్షమ(ఓర్పు) వహించాలి అని సూచన. భూమి (ఉర్వి) సహనానికి మారుపేరు. అట్టి ఉర్వికి అధినాథుడవైన నీవు బేలవు కావటం తగదు. ఉత్తమవీరుడికి ఉండవలసిన ప్రసిద్ధగుణం ధైర్యం, అట్టి ధైర్యధనులలో నీవు ఘనుడవై ఉండి కూడా ఈ విధంగా శోకించటం ఎంతమాత్రమూ సబబు కాదు. వ్యాసుడు శమప్రాధాన్యాన్ని నొక్కి వక్కాణించాడు. ద్విత్వపకార ప్రాస నొక్కి చెప్పటానికి ఎంతో దోహదకారిగా ప్రయుక్తం.

వ. అనిన సాత్యవతేయునకుం గౌంతేయాగ్రజుం డిట్లనియె. 151

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; సాత్యవతేయునకున్= సత్యవతీపుత్రుడైన వ్యాస మునీంద్రుడికి; కౌంతేయ+అగ్రజుండు= కుంతీపుత్రులలో అందరికంటే ముందుపుట్టిన వాడైన ధర్మరాజు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా ధర్మరాజు వ్యాసుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: వ్యాస ధర్మజుల పేర్లు నేరుగా చెప్పకుండా ఫలానావాళ్ళ కుమారులని ఇరువురి తల్లుల పేర్లను స్ఫురింపజేయటం ఇందులోని విశేషం.

చ. 'వెరవును లావునుం గలిగి విక్రమసంపద నొప్పి ధీరు లై
పరఁగిర కాని తమ్ము మృతభావ వికారము వొందకుండ సు
స్థిరముగఁ బ్రాణరక్షణము సేయఁగ రాజులు సాల రైరె? యె
వ్వరుఁ దలపోయ మృత్యు వనివార్యమె? తాపసముఖ్య! యిమ్మెయిన్.' 152

ప్రతిపదార్థం: తాపసముఖ్య!= మౌనులలో ప్రధానమైనవాఁడా! (వేదవ్యాస మునీంద్రా!); వెరవును= ఉపాయమున్నూ; లావున్= బలమున్నూ;కలిగి= ఉండి; విక్రమసంపదన్= పరాక్రమం యొక్క సంపత్తుచేత; ఒప్పి= ప్రకాశించి; ధీరులు+ఐ= ధైర్యం కలవారై; పరఁగిరి+అ+కాని= ఒప్పినారే కాని; తమ్మున్= తమను; మృతభావ వికారము= చస్తాం అనే అభిప్రాయం వలన కలిగిన మానసికమైన గిట్టనితనాన్ని (వికృతి); పొందకుండన్= కలుగకుండా; ఎవ్వరున్= ఎవ్వరుకూడా; సుస్థిరముగన్= దృఢంగా లేదా నిలకడగా; ప్రాణరక్షణము+చేయఁగన్= ప్రాణాలను కాపాడటం చేయటానికి; రాజులు= ప్రభువులు; చాలరు+ఐరె?= సమర్థులు కాకపోయారా?; ఈ+మెయిన్= ఈ విధంగా; తలపోయన్= ఆలోచించగా; మృత్యువు= మరణం; అనివార్యము+ఎ?= నివారించటానికి సాధ్యం కానిదా?

తాత్పర్యం: 'మునివర్యా! ఉపాయమూ బలమూ ఉండి పరాక్రమంతో ధీరులై ప్రకాశించారే కాని, చస్తాం అనే మనోవికారం తమ్ము పొందకుండా రాజులు నిలకడగా ప్రాణరక్షణ చేయటానికి సమర్థులు కాలేకపోయారు గదా! బాగా ఆలోచిస్తే మృత్యువును అవశ్యం అనుభవించి తీరవలసిందే!'

విశేషం: వ్యాసుడి ఓదార్పు మాటలతో కొంత ఉపశమనాన్ని పొందిన ధర్మజుడు రాజులు యుద్ధంలో తమ పరాక్రమాన్ని ప్రకటించటం సహజం. విజయమో, వీరస్వర్గమో! రణరంగంలో ప్రాణరక్షణ ప్రయత్నం అవసరం. విధి వక్రించినప్పుడు మృత్యువు అనివార్యమే కదా! అని సమాధాన పడినట్లు తిక్కన చంపకమాలా వృత్తంలో వివరించాడు. ఈ పద్యంలో రకారం ప్రాసస్థానంలోనే కాక అక్కడక్కడా ఒకింత విరివిగా ప్రయోగించబడింది. అది అగ్నివంటి పరాక్రమ స్ఫూర్తినే గాక మానసికంగా పొందే దుఃఖాగ్నికి కూడా సూచన.

వ. అనుటయుఁ, బారాశర్యుండు పాండవాగ్రజున కిట్లనుఁ 'దొల్లి యిట్లు పుత్త్రమరణశోకాతురుండైన యకంపనుం డనురాజు నారదమునిచేత మృత్యుప్రకారంబు దెల్లంబుగా విని యుపశమితశోకుం డయ్యె నని విందు మయ్యితిహాసంబు తెఱం గెఱింగించెద; నది నీయంతఃకరణంబు సంతాపంబు మాన్చి శాంతి యొనర్చు నవహితుండ వై యాకర్ణింపుము. 153

ప్రతిపదార్థం: అనుటయున్= అని అనగా; పారాశర్యుండు= పరాశరమహర్షి కుమారుడైన వ్యాసుడు; పాండవ+అగ్రజునకున్= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజుకు; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటూ ఉన్నాడు; తొల్లి= పూర్వం; ఇట్లు= ఈ విధంగానే; పుత్రమరణ శోక+ఆతురుండు+ఐన= కుమారుడి చావువలన దుఃఖంతో బాధపడేవాడైన; అకంపనుడు+అను, రాజు= అకంపనుడు అనే పేరుగల ప్రభువు; నారదమునిచేతన్= నారదమునీంద్రుడి చేత; మృత్యుప్రకారంబు= మృత్యువుయొక్క విధము; తెల్లంబుగాన్= స్పష్టంగా; విని; ఉపశమిత, శోకుండు+అయ్యెన్= అణగిన లేదా నశించిన దుఃఖం కలవాడు అయ్యాడు; అని+విందుము= అని వింటూ ఉన్నాం; ఆ+ఇతిహాసంబు= పరంపరగా చెప్పుకొనే ఆ పూర్వకథయొక్క; తెఱంగు= క్రమం; ఎఱింగించెదన్= తెలియజేస్తాను; అది= ఆ కథ; నీ+అంతఃకరణంబు= నీ ఆత్మ(మనస్సు) యొక్క; సంతాపంబు= వ్యథ; మాన్చి= మానేటట్లు చేసి; శాంతి+ఒనర్చున్= శాంతి కలిగిస్తుంది; అవహితుండవు+ఐ= సావధానుడవై; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అనగానే వ్యాసమహర్షి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: 'పూర్వం ఇట్లాగే పుత్రుడి మరణం వలన కలిగిన దుఃఖంతో బాధపడే అకంపనుడు అనే రాజు, నారదుడు తెలిపిన మృత్యుప్రకార విధానాన్ని స్పష్టంగా విని చిత్తశాంతి పొందాడు. ఆ కథను నీకు చెప్పుతాను ఏకాగ్రతతో వినుము. అది నీ మనసులోని బాధను తొలగించి శాంతిని కలిగిస్తుంది.

విశేషం: 1. సాధారణంగా లోకంలో శోకంతో విలపించే వ్యక్తులు తమకు కలిగిన దుఃఖం మరెవ్వరికీ కలిగి ఉండదని భావిస్తూ ఉంటారు. అటువంటి సందర్భంలో పూర్వం ఎందరో ప్రసిద్ధులు పొందిన కష్టపరంపరలను ప్రస్తుత సంఘటనలకు అన్వయిస్తూ చెప్పటం వలన ఎంతో ఉపశమనం కలుగుతుంది. వ్యాసుడు ధర్మరాజుకు అకంపనవృత్తాంతం - అందులో ఉన్న పుత్రశోకం వివరించటానికి అదే కారణం.

2. వ్యాస - ధర్మరాజుల పేర్లను వాళ్ళ తండ్రుల పేర్లు స్ఫురించేటట్లు అపత్యార్థంలో ప్రయోగించటం ఇందులోని విశేషం. అకంపన వృత్తాంతంలోని కథ పుత్ర మరణానికి సంబంధించినదే కావటం వలన ప్రస్తుత సందర్భానికి చక్కగా అదికింది.

సీ. **పగతు రకంపను పై నెత్తి వచ్చి క । య్యము సేసి యాతని నడఁగఁ బట్టి**
కొనుటయుఁ జూచి తత్తనయుండు హరియను । వాఁడు దోర్దర్పదుర్వారమూర్తి
యవ్విరోధులమీఁద నడరి బల్విడిఁ దండ్రి । విడిపించి విక్రమ విహరణమునఁ
దనివోక మఱియు నుద్ధతిఁ గరిరథఘోట । భటనికాయంబుల బడలు పఱుప

ఆ. **నుగ్రు లగు ననేకయోధులు చలమునఁ । గూడుకొని మహాస్త్ర ఘోరశస్త్ర**
తతుల నక్కుమారు మృతుఁ జేసి; రప్పుడు । గనలి రభసమున నకంపనుండు. 154

ప్రతిపదార్థం: పగతురు= శత్రువులు; అకంపనుపైన్= అకంపనుడిమీదికి; ఎత్తివచ్చి= దండెత్తివచ్చి; కయ్యము+చేసి= యుద్ధం చేసి; ఆతనిన్= ఆ అకంపనుడిని; అడఁగన్= లోబడేటట్లు; పట్టికొనుటయున్= బంధించటాన్ని; చూచి= కనుగొని; తద్+తనయుండు= ఆ అకంపనుడి కొడుకు; హరి+అనువాఁడు= హరి అనే పేరుగలవాడు; దోః+దర్ప+దుర్వార మూర్తి= బాహువుల (భుజముల)యొక్క గర్వంచేత అడ్డగించటానికి వీలుకాని స్వరూపం కలవాడు; ఆ+విరోధులమీఁదన్= ఆ శత్రువులపైన; అడరి= విజృంభించి; బల్విడిన్= శౌర్యంతో (లేదా వెంటనే); తండ్రిన్= తండ్రిని; విక్రమ విహరణమునన్= పరాక్రమం యొక్క విహారంతో; విడిపించి= విమోచన కలిగించి;తనివోక= తృప్తిపడక; మఱియున్= మళ్ళీ; ఉద్ధతిన్= గర్వంతో; కరి, రథ, ఘోట, భట, నికాయంబులన్= ఏనుగులు, తేరులు, గుర్రాలు, కాలుబలము యొక్క గుంపులను; బడలుపఱుపన్= శ్రమపెట్టగా (నొప్పించగా); ఉగ్రులు+అగు+అనేకయోధులు= భయంకరులైన పెక్కుమంది యుద్ధవీరులు; చలమునన్= పట్టుదలతో;కూడుకొని= ఒకటిగా క్రమ్ముకొని; మహా, అస్త్ర,ఘోర, శస్త్ర, తతులన్= గొప్ప, బాణాల (భయంకరాలైన) తీవ్రములైన ఆయుధాల సమూహాలతో; ఆ+కుమారున్= ఆ అకంపనుడి కొడుకును; మృతున్+చేసిరి= చచ్చినవాడిని చేశారు; అప్పుడు= ఆ సందర్భంలో; అకంపనుండు; కనలి= కోపించి; రభసమునన్= వేగంతో.

తాత్పర్యం: శత్రువులు అకంపనుడి మీదికి దండెత్తి అతడిని స్వాధీనం చేసికొని బంధించారు. అది చూచి అతడి కొడుకు హరి అనేవాడు వారింప సాధ్యంకాని భుజగర్వంతో ఆ శత్రువులపైన విజృంభించి వెంటనే తండ్రిని తన పరాక్రమంతో విడిపించి, అంతటితో తృప్తిపడక మళ్ళీ గర్వంతో చతురంగబలాల్ని శ్రమపెట్టగా భయంకరులైన శత్రుయోధులు వివిధాస్త్రశస్త్రాలతో అతడిని చంపారు. అప్పుడు అకంపనుడు మిక్కిలి కోపించి వేగంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **విపినంబు నడఁచు దవశిఖి । కుపమాస్థానమయి పగఱ యొప్పు సెఱిచి యా**
త్మపురము సొత్తెంచెం దూ । ర్యపటు ధ్వను లెసఁగ ననిమిషాధిపు భంగిన్. **155**

ప్రతిపదార్థం: విపినంబున్= అడవిని; అడఁచు= అణచు(హరించే); దవశిఖికిన్= కార్చిచ్చుకు; ఉపమస్థానము+అయి= పోలిక చోటై (నిధానమై); పగఱ= శత్రువుల; ఒప్పున్= అందాన్ని; చెఱిచి= నశింపజేసి; అనిమిష+అధిపు భంగిన్= దేవతల ప్రభువైన ఇంద్రుడివలె; తూర్య పటు ధ్వనులు= వాద్యాల బలమైన శబ్దాలు; ఎసఁగన్= అతిశయించగా; ఆత్మపురము= తన నగరం; చొత్తెంచెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: అడవిని కాల్చే దావాగ్నితో పోల్చదగినవాడై శత్రువుల అందాన్ని నశింపజేసి, వాద్యాల మ్రోతలు అతిశయించగా దేవేంద్రుడి వలె తన నగరంలో ప్రవేశించాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. **ఇట్లు గెలిచి వచ్చియు.** **156**

తాత్పర్యం: ఈ విధంగా జయించి వచ్చియున్నా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. **పుత్త్రుఁ దలఁచి తలఁచి పొగులుచు నున్న య । న్నరవరేణ్యు కడకు నారదుండు**
నెమ్మి వచ్చుటయును నిభృతుఁడై యాసనా । ర్ఘ్యాది పూజనంబు లాచరించి. **157**

ప్రతిపదార్థం: పుత్త్రున్= కొడుకును; తలఁచి, తలఁచి= పదే పదే స్మరించి; పొగలుచున్= దుఃఖిస్తూ; ఉన్న= ఉండే; ఆ+నరవరేణ్యు కడకున్= ఆ రాజశ్రేష్ఠుడి దగ్గరకు; నెమ్మిన్= ప్రీతితో(అనుగ్రహంతో); నారదుండు= నారద మహర్షి; వచ్చుటయును= రాగా; నిభృతుఁడు+ఐ= వినయం కలవాడై; ఆసన+అర్ఘ్య+ఆది, పూజనంబులు= పీటవేయటం, పాదాలు కడగటం మొదలైన సేవలు; ఆచరించి= చేసి.

తాత్పర్యం: కుమారుడిని పదే పదే తలచుకొని బాధపడుతూ ఉండే ఆ అకంపనమహారాజు దగ్గరకు నారదుడు ఎంతో ప్రీతితో రాగా, ఆ మహర్షికి వినయంతో ఆసనం వేసి అన్ని మర్యాదలూ చేసి. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. **అతనికడ నుండి యమ్మహీపతి యత్తాపస ముఖ్యునకు నిజవృత్తాంతం బెఱింగించి, కొడుకు గుణంబు లగ్గించి వానిం గోలుపోవుటం జేసి విజయంబు ప్రియంబు సేయకున్నదని తన వగపును తెలిపి మఱియును.** **158**

ప్రతిపదార్థం: అతని కడన్+ఉండి= ఆ నారదుడి దగ్గరనే ఉండి; ఆ+మహీపతి= ఆ అకంపన మహారాజు; ఆ+తాపసముఖ్యునకున్= ఆ మునిశ్రేష్ఠుడికి; నిజ+వృత్తాంతంబు= తన కథ; ఎఱింగించి= తెలియజేసి; కొడుకు గుణంబులు= పుత్రుడి సుగుణాలు; అగ్గించి= పొగడి; వానిన్= ఆ కుమారుడిని; కోలుపోవుటన్+చేసి= పోగొట్టుకొనటం చేత; విజయంబు= జయించటం; ప్రియంబు= ప్రీతి; చేయకున్నది= కలిగించకుండా ఉన్నది; అని= ఆ ప్రకారంగా; తన+వగపును= తన దుఃఖాన్ని; తెలిపి= వెల్లడించి; మఱియును= ఇంకా.

తాత్పర్యం: నారదుడి దగ్గర కూర్చుండి తన వృత్తాంతాన్ని చెప్పాడు. కొడుకు గుణాలను కీర్తించాడు. అతడిని పోగొట్టుకొనటం వలన విజయం కలిగినా అది సంతోషాన్ని కలిగించటం లేదని దుఃఖాన్ని ప్రకటించాడు. అంతేకాక.

విశేషం: అకంపనుడు పుత్రమరణంతో ప్రకంపను డయ్యాడు. విస్తారంగా సామ్రాజ్యాన్ని వ్యాపింపజేశాడు. కానీ, అతడికి విజయం ప్రియం కలిగించలేదని తనకడకు విజయం చేసిన నారదుడికి విన్నవించటం ఈ వచనరచనలోని విశేషం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'మునినాయక! మృత్యువు ప్రభు । వని విందుము లోకమునకు; నది యెట్లొకొ! త
జ్జననంబుఁ దత్ప్రభావము । వినఁ దలఁచెద; నుచితమేని వినిపింపు తగన్. 159

ప్రతిపదార్థం: మునినాయక!= మునిశ్రేష్ఠుడవైన నారదా!; లోకమునకున్= సమస్త ప్రపంచానికి; మృత్యువు= మృత్యుదేవత; ప్రభువు= రాజు; అని+విందుము= అని వింటూ ఉన్నాం; అది+ఎట్లు+ఒకొ!= అది ఏ విధంగానో!; తద్= ఆ మృత్యువుయొక్క; జననంబు= పుట్టుక; తద్= దానియొక్క; ప్రభావము= మాహాత్మ్యం; వినన్= వినటానికి; తలఁచెదన్= కోరుతున్నాను; ఉచితము+ఏని= తెలియదగినది అయితే; తగన్= తగునట్లు (యుక్తం అగునట్లు); వినిపింపు= వినిపించుము.

తాత్పర్యం: 'నారదమునీంద్రా! ఈ లోకానికి మృత్యుదేవత ప్రభువు అని వింటున్నాం. అది ఎట్లాగో, దాని పుట్టుకనూ, మాహాత్మ్యాన్నీ వినాలని ఆసక్తిగా ఉన్నది. నేను అడిగింది సమంజసము, తెలియదగినది అని అనుకొంటే సముచితంగా వివరించవలసింది.'

విశేషం: ఏ విషయమైనా శ్రోతయొక్క అభ్యర్థననూ అందులో ఉండే ఔచిత్యాన్నీ పురస్కరించుకొనే మహనీయులు సమాధానమిస్తారు. ఆసక్తికరమైన విషయాన్ని అడగటం శ్రోతయొక్క ధర్మం. చెప్పటం కథకుడి విధి. తెలిసిన వారు తమకు తెలుసును గదా అని ఊరక ఎదుటివారికి చెప్పటం నిష్ప్రయోజనం. నిరర్థకం. అందులోనూ తాత్త్విక విషయం ఊరక తేరక చెప్పరాదు. శ్రోత పదే పదే ఆసక్తితో ఉత్కంఠతో అడిగినప్పుడే చెప్పాలి. మృత్యువు యొక్క పుట్టుకనూ, దాని ప్రభావాన్నీ చెప్పవలసిందని అకంపనుడు నారదుడిని అర్థించిన విధానం ఈ వచన రచనలో ప్రధానాంశం.

నారదుఁ డకంపనునకు మృత్యుదేవతా ప్రభావం బెఱింగించుట (సం. అను. 1-8-67 పంక్తి)

వ. అనిన విని యమ్మహాత్ముండు గరుణాయత్తచిత్తుండై యతనికిట్లను ' బంధుమరణ శోకం బుడుపం జాలెడు మృత్యుప్రకారకథ వినుట మేలు; నీ వవధానపరుండవై వినుము సెప్పెదం; బ్రజాపతి ప్రజల సృజియించి పదంపడి సంహారంబు లేమిం జేసి భూమికిఁ దదీయభారంబు దుర్భరం బగుటయు, ననుసంధించి చింతాక్రాంతుండై తత్సంహారంబునకు నుపకరణంబు గానక కటకటంబడిన నతని యింద్రియంబుల వలన మహాజ్వలనంబు జనియించి యెల్ల దిక్కులం బరఁగి చరాచరాత్మకంబైన భూతవ్రాతంబు దహింపం గడంగుటయు భువన హితార్థంబుగా భవుండు సని కమలభవు శరణు సొచ్చినం, బ్రజ్వరిల్లుచున్న యమ్మహానుభావుం డద్దేవు నాలోకించి యాదరభరితాంతఃకరణుం డై. 160

ప్రతిపదార్థం: అనినన్= అని అకంపనుడు అడుగగా; విని; ఆ+మహాత్ముండు= (త్రికరణశుద్ధి గల త్రిలోక సంచారి అగు) ఆ నారదుడు; కరుణా+ఆయత్త+చిత్తుండు+ఐ= దయకు అధీనమైన మనస్సు కలవాడై; అతనికిన్= ఆ అకంపనుడికి; ఇట్లు= ఇట్లా; అనున్= అంటున్నాడు; బంధుమరణ శోకంబు= చుట్టాల చావుకు సంబంధించిన; మానసికమైన దుఃఖము; ఉడుపన్+చాలెడు= పోగొట్టగలిగే; మృత్యు ప్రకార కథ= మృత్యుదేవత యొక్క విధమునకు చెందినట్టి వృత్తాంతం; వినుట= వినటం; మేలు= శుభం; నీవు; అవధాన పరుండవు+ఐ= మనస్సును నిలపటంలో ఆసక్తి కలవాడవై (అనగా శ్రద్ధాసక్తులు కలవాడవై); వినుము; చెప్పెదన్= చెబుతున్నాను; ప్రజాపతి= బ్రహ్మ; ప్రజలన్= సంతతిని (జనాన్ని); సృజియించి= పుట్టించి; పదంపడి= పిదప; సంహారంబు లేమిన్+చేసి= వినాశం లేకపోవటం చేత; భూమికిన్= భూదేవికి; తదీయభారంబు= ఆ సంతతియొక్క బరువు; దుర్భరంబు+అగుటయున్= భరించటానికి వీలుకాకపోవటాన్ని; అనుసంధించి= మనస్సులో యోచించి; చింతా+ఆక్రాంతుండు+ఐ= దిగులుతో ఆవరింపబడ్డవాడై; తద్+సంహారంబునకున్= ఆ ప్రాణికోటియొక్క వినాశానికి; ఉపకరణంబు= సాధనం; కానక= చూడలేక; కటకటంబడినన్= కోపించగా; అతని+ఇంద్రియంబులవలనన్= బ్రహ్మయొక్క ఇంద్రియాలనుండి; మహాజ్వలనంబు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పెద్దమంట; జనియించి= పుట్టి; ఎల్లదిక్కులన్= అన్నివైపులా; పరఁగి= వ్యాపించి; చర+అచర+ఆత్మకంబు+ఐన= స్థావర జంగమాత్మకమైన; భూతవ్రాతంబున్= ప్రాణిసమూహాన్ని; దహింపన్+కడంగుటయున్= కాల్చటానికి పూనుకోవటమున్నూ; భువన+హితార్థంబుగాన్= లోకాల మేలు కొరకై; భవుండు= శివుడు; చని= పోయి; కమలభవున్, శరణు, చొచ్చినన్= బ్రహ్మకు శరణాగతుడు కాగా; ప్రజ్వరిల్లుచున్న= మండుతూ ఉండే; ఆ+మహా+అనుభావుండు= గొప్పవాడూ మిక్కిలి ఉదారుడూ అయిన బ్రహ్మ; ఆ+దేవున్ = ఆ పరమశివుడిని; ఆలోకించి= చూచి; ఆదరభరిత+అంతఃకరణుండు+ఐ= దయతో కూడిన హృదయం కలవాడై.

తాత్పర్యం: అని అకంపనుడు అడిగిన వెంటనే మహాత్ముడైన నారదమహర్షి దయాళువై ఈ విధంగా చెప్పాడు.'బంధు మరణానికి కలిగే దుఃఖాన్ని పోగొట్టే మృత్యువు యొక్క వృత్తాంతాన్ని వినటం శుభప్రదం. నీవు శ్రద్ధాసక్తులతో వినుము. చెప్పుతున్నాను. బ్రహ్మ ప్రాణికోటిని సృష్టించి ఆ ప్రాణికోటికి సంహారం లేకపోవటంతో అది భూమికి భారమైంది. ఎట్లా ఈ భారాన్ని నివారించటమా? అని ఆలోచించి చింతతో అందుకు తగిన సాధనం అగుపించక కోపించగా, అతడి ఇంద్రియాలనుండి మంటపుట్టి అన్నివైపులా వ్యాపించి జీవ, నిర్జీవ ప్రపంచాన్నంతా దహించటానికి పూనుకొన్నది. అపుడు లోకాల మేలు కొరకు శివుడు బ్రహ్మను శరణువేడగా, అతడు పరమశివుడిని చూచి ఎంతో మన్ననా, దయా కలవాడై.

క. 'నీ కోరికి యప్రతిహత । మే కార్యముఁ గోరి వచ్చి తెలిఁగింపు మమే
యాకార! కామహర! యది । సేకొని యీక్షణమ యేను జేసెద' ననుడున్. 161

ప్రతిపదార్థం: నీ+కోరికి= నీయొక్క ఇచ్ఛ; అప్రతిహతము= అనివార్యం (అడ్డం చెప్పరానిది); ఏ కార్యము= ఏమి పని; కోరి= ఇష్టపడి; వచ్చితి(వి)= వచ్చావు?; అమేయ+ఆకార!= తెలిసికొనటానికి శక్యంకాని (లేదా పరిమితం కాని) ఆకారం కలవాఁడా!; కామహర!= మన్మథుడిని హరించినవాడా!; ఎఱిఁగింపుము= తెల్పుము అది= నీవు కోరిన ఆ కార్యం; చేకొని= గ్రహించి; ఈ క్షణము+అ= ఇప్పుడే; ఏను= నేను; చేసెదన్= నిర్వర్తిస్తాను; అనుడున్= అన చెప్పిన వెంటనే.

తాత్పర్యం: తెలిసికొనటానికి వీలుకాని స్వరూపం కలవాడా! మన్మథుడిని దహించినవాడా! పరమశివా! నీ ఇచ్ఛ అనివార్యం. అడ్డు చెప్పరానిది. ఏ పని ఆశించి మీరు వచ్చారో చెప్పండి. వెంటనే ఆ పని నేను చేస్తాను' అన్నాడు. బ్రహ్మదేవుడు. ఆ విధంగా అనిన అనంతరం. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అభవుఁ డిట్టు లనియె 'నఖిల సృష్టిక్రియా । కర్త వగుట నీవ కలుగఁ జేయఁ
గలిగి భూతకోటి యెలమిఁ బొందఁగఁ గోప । మెత్తి రూపుమాప నేల యిపుడు? 162

ప్రతిపదార్థం: అభవుఁడు= ఈశ్వరుడు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అఖిల, సృష్టి, క్రియా, కర్తవు+అగుటన్= సమస్తమైన సృష్టియొక్క కార్యాన్ని చేసేవాడవు కావటం చేత; ఈవు+అ= నీవే; చేయన్+కలిగి= సృష్టి చేయటానికి సమర్థత ఉండి; భూతకోటి= ప్రాణిప్రపంచం; ఎలమిన్= సంతోషాన్ని; పొందఁగన్= పొందుతూ ఉండగా; ఇపుడు= ఈ సమయంలో; కోపము+ఎత్తి= కోపం పూని (కోపాన్ని ప్రసరింపజేసి); రూపుమాపన్+ఏల?= సంహారం చేయుటం ఎందుకు? (నశింపచేయుటం లేదా చంపటం ఎందుకు?)

తాత్పర్యం: శివు డీ విధంగాఅన్నాడు: 'సమస్తసృష్టినీ చేయగలిగిన నీవు ప్రాణికోటి సంతోషాన్ని పొందుతూ ఉండగా ఎందుకు కోపం పూని నశింపజేస్తున్నావు?

విశేషం: సృష్టించినవాడే సంహారం గావించటం సమంజసంగా లేదు అని అంటూ సంహార కారకుడుగా భావింపబడే శివుడే సంరక్షణ చేయటానికి సముద్యుక్తుడు కావటం ఇందులోని విశేషం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. **నాకుంగా 'లోకంబులం గరుణాలోకంబున నా(వ)దరింపు' మనిన విని యంబుజాసనుండు 'నాయందుఁ గోపంబును గామంబును లేవు; వినుము! ప్రజాభారపీడితయైన భూమిదేవి దన డప్పి యెఱింగించినం దదీయహితంబు సేయం బూని సంహారంబు గావించువాఁడనైదానికి నుపాయంబు విచారించి, యెద్దియుం గాననైతి; నది కారణంబుగా నన్నుఁ గ్రోధంబు వొందె' ననవుడు భూతనాథుండు.** **163**

ప్రతిపదార్థం: నాకున్ కాన్= నా కోసంగా; లోకంబులన్= (నీచే సృష్టించబడ్డ ఈ లోకాన్ని); కరుణా+ఆలోకంబునన్= దయాదృష్టితో; ఆదరింపుము= అనుగ్రహించుము; అనినన్= అనగా; అంబుజ+ఆసనుండు= పద్మం ఆసనంగా కలవాడైన బ్రహ్మ; విని; నాయందున్= నాలో; కోపంబును= క్రోధమున్నూ; కామంబును= కోరికయున్నూ; లేవు; వినుము; ప్రజా, భార, పీడిత+ఐన+భూమిదేవి= జనం (సంతతి) యొక్క బరువుచేత; పీడింప (బాధింప) బడేది అయిన భూదేవి; తన, డప్పి= తన శ్రమ; ఎఱింగించినన్= తెలుపగా; తదీయ హితంబు= ఆమెయొక్క మేలు; చేయన్+పూని= చేయటానికి ప్రయత్నించి; సంహారంబు+కావించువాఁడను+ఐ= చంపటం చేస్తూ ఉండేవాడిని; దానికిన్= అందుకు; ఉపాయంబు+విచారించి= ఉపాయాన్ని ఆలోచించి; ఎద్దియున్= దేనినీ; కానన్+ఐతిన్= చూడలేకపోయాను; అది కారణంబుగాన్= ఆ కారణంచేతనే; క్రోధంబు= కోపం; నన్నున్= నన్ను; పొందెన్= చేరింది; అనవుడున్= అనిన వెంటనే; భూతనాథుండు= శివుడు.

తాత్పర్యం: నా కొరకైనా నీవు ఈ లోకాలను దయతో అనుగ్రహించాల్సింది' అని శివుడు అడుగగా, బ్రహ్మ 'నాలో నిజానికి కోపంగానీ, మరే కోరికగానీ లేవు. వినుము. నా సృష్టివలన కలిగిన ప్రజయొక్క భారాన్ని మోయలేక శ్రమపడే భూదేవి తన బాధను తెలుపగా ఆమె మేలుకోరి సంహారం చేస్తూ ఉన్నాను. ఎంత ఆలోచించినా ఏదీ ఉపాయం కనిపించటంలేదు. ఆ కారణం చేతనే కోపం వచ్చి నన్ను చేరింది' అనగా, ఆ మాటలు వినిన వెంటనే శివుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'నాకుంగా' - భూతనాథుడు అనే ప్రయోగాలు ఎంతో అర్థవంతంగా, ఔచిత్యస్ఫోరకంగా కూర్చబడ్డాయి. 'ఆవరింపు' అనే ప్రయోగం కన్నా 'ఆదరింపు' అన్నదే అర్థవంతం, నిజానికి బ్రహ్మలో కామక్రోధాలు లేవు కాని, భూదేవి మేలు కోరి తాను సంహారానికి పూనుకొన్నానని బ్రహ్మ శివుడికి చెప్పటం ఈ వచనంలోని విశేషం.

ఉ. **'అనఘవిచార! నీ వరయు మన్నఁ దగం గడు నిష్ఠ లోక పా**
లన మొనరింతుఁ గాన యనలం బయి నీ దగు నల్క లోక ము
న్మనుమిడి కాల్పఁ జొచ్చినఁ గనుంగొని యేఁగృప పుట్టి చెప్పెదం
జనునె మహోగ్రకోపవివశత్వము నీకుఁ ద్రిలోకనాయకా! **164**

ప్రతిపదార్థం: అనఘ విచార!= పాప రహితమైన ఆలోచనకలవాడా!; నీవు+అరయుము+అన్నన్= నీవు రక్షింపు మనగా; తగన్= తగునటుల; కడునిష్ఠన్= మిక్కిలి నిష్ఠతో; లోకపాలనము= లోకాలను పాలించటం; ఒనరింతున్+కాన= కావిస్తున్నాను కాబట్టే అనలంబు+అయి= నిప్పై; నీది+అగు+అల్కన్= నీదైన కోపంతో; లోకమున్= లోకాన్ని; మునుము+ఇడి+కాల్పన్= వరుసపెట్టి కాల్చటానికి; చొచ్చినన్= పూనుకొనగా; కనుంగొని= చూచి; ఏన్= నేను; కృప+పుట్టి= దయకలిగి; చెప్పెదన్= చెప్పుతూ ఉన్నాను; త్రిలోకనాయకా!= మూడు లోకాలకు ప్రభువైనవాడా!; మహా+ఉగ్ర, కోప, వివశత్వము= (మిక్కిలి)గొప్ప భయంకరమైన క్రోధంతో వశం తప్పిపోవటం; నీకున్= నీకు; చనునె!= తగునా!

తాత్పర్యం: 'పాపరహితమైన ఆలోచన కలవాడా! నీవు రక్షింపు మనగా తగునట్లు మిక్కిలి నిష్ఠతో లోకాన్ని పాలిస్తున్నాను కాబట్టే నీ కోపంతో నిప్పై లోకాన్ని వరుసపెట్టి కాల్చటానికి పూనుకోగా చూచి, నేను దయ కలిగి చెబుతూ ఉన్నాను. ముల్లోకాలకు ప్రభువైన వాడా! భయంకరమైన కోపంతో వశం తప్పిపోవటం నీకు తగునా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. **చరాచరంబు లన్నియు నొక్కపెట్ట భస్మీభూతంబులు సేయ నేల? ధరణీభారంబు వాయుటకై యుచిత సంహారంబు గలుగునట్లుగ నొండుదెఱంగు దలంపుము; కోపం బుపసంహరింపు; మివ్వరంబు నా కొసంగు' మనవుడు నిహత పాపకళంకుండైన యా శంకరు పలుకులకు నతం డయ్యలుక నడంచిన నయ్యనలం బాఱుటయును భువనంబులు ప్రమోదంబు నొంది యా శంకర శతానందుల నభినందించె; నట్లు క్రోధోపశమనం బాచరించు సమయంబున.** **165**

ప్రతిపదార్థం: చరాచరంబులు= తిరుగునవి, తిరుగనివి (జీవ-నిర్జీవములు అజడములు జడములు); అన్నియున్= అన్నీ; ఒక్కపెట్ట= ఒక్కుమ్మడిగా; భస్మీభూతంబులు+చేయన్+ఏల?= బూడిద చేయటం ఎందుకు?; ధరణీభారంబు+పాయుటకై= భూమియొక్క భారాన్ని తొలగించటానికై; ఉచితసంహారంబు= తగు విధంగా మితంగా వినాశం; కలుగునట్లుగన్= కలిగేటట్లు; ఒండుతెఱంగు= మరొకక్రమం (పద్ధతి); తలంపుము= యోచించుము; కోపంబు+ఉపసంహరింపుము= కోపాన్ని అణచుకొమ్ము (మరలించుము); ఈ+వరంబు= ఈ వరాన్ని; నాకున్+ఒసంగుము= నాకు ఇమ్ము; అనవుడున్= అనిన వెంటనే; నిహత, పాప, కళంకుండు+ఐన= నిర్మూలించబడ్డ పాపం యొక్క మచ్చ కలవాడైన; ఆ+శంకరు= ఆ పరమేశ్వరుడి; పలుకులకున్= మాటలకు; అతండు= ఆ బ్రహ్మ; అలుకన్= కోపాన్ని; అడంచినన్= అణచివేయగా; ఆ+అనలంబు= ఆ అగ్ని; ఆఱుటయును= నశించటమున్నూ; భువనంబులు= లోకాలు; ప్రమోదంబున్+ఒంది= సంతోషాన్ని పొంది;ఆ+శంకర, శతానందులన్= ఆ శివుడినీ, బ్రహ్మనూ; అభినందించెన్= పొగిడాయి; అట్లు= ఆ విధంగా; క్రోధ+ఉపశమనంబు= కోపాన్ని అణచివేయటం; ఆచరించు+సమయంబునన్= చేసిన సందర్భంలో.

తాత్పర్యం: ఎందుకిట్లా ఒక్కుమ్మడిగా చరాచరజగత్తును బూడిదచేయటం? భూభారం తొలగటానికి తగిన సంహారకార్యం మరొక్కటి ఆలోచించుము. కోపాన్ని వదలిపెట్టుము' అని పరమశివుడు పలికాడు. పాపకళంకం తొలగిన ఆ శివుని మాటలతో బ్రహ్మ తన కోపాన్ని అణచుకొన్నాడు. అగ్గి ఆరిపోయింది. లోకాలు సంతోషించి బ్రహ్మనూ పరమేశ్వరుడినీ కీర్తించాయి.

విశేషం: 'కోపాన్ని ఉపసంహరించు' మని శంకరుడు అడిగాడు. శతానందుడు క్రోధాన్ని ఉపశమింపజేశాడు. ఇక్కడ శంకరుడు అనగా సంతోషాన్ని కలిగించేవాడు అట్లా శతానందుడు శబ్దంలో కూడా ఆనందం కలిగించే వాడు అనే అర్థం ప్రస్ఫుటం. లోకాలకు ఆనందం కలిగించిన సందర్భంలో ఈ ఇరువురినీ తిక్కన ఇట్లా పేర్కొనటం ఎంతో ఔచిత్యవంతంగా ఉన్నది.

సీ. **కమలాసనుని యింద్రియముల రక్తాస్యయు । నసితాంగియును నరుణాంబరయును**
నగు నింతి జనియించి యల్లన నగుచుఁ గెం । జాయ రంజిల్లు లోచనము లలర
నా జగన్నాథుల నలవోకవోలెఁ గ । న్గొని దక్షిణమునకుఁ జన నజుండు
మెలపుతో 'మృత్యువ! మృత్యువ! యెట వోయె?' । దని పలుమాఱు సాంత్వనము దోఁపఁ

తే. **బిలిచి 'సంహారబుద్ధి నా కొలయఁ బొడము । కనలునం దుద్భవించితి గాన నీవు**
దొడరి (గి) వాసి లేకెల్ల జంతువుల సంహా । రింపు నా పంపుమై; నీకుఁ బెంపు గలదు.' **166**

ప్రతిపదార్థం: కమల+ఆసనుని= బ్రహ్మయొక్క; ఇంద్రియములన్= ఇంద్రియాల నుండి; రక్త+ఆస్యయున్= ఎర్రటి ముఖం కలదియున్నూ; అసిత+అంగియునున్= నల్లటి అవయవాలు కలదియున్నూ; అరుణ+అంబరయునున్= ఎర్రటి వస్త్రాలు కలదియున్నూ; అగు+ఇంతి= ఐన స్త్రీ; జనియించి= పుట్టి; అల్లనన్= మెల్లగా; నగుచున్= నవ్వుతూ; కెంజాయ+రంజిల్లు= ఎర్రటి రంగుతో ప్రకాశించే; లోచనములు+అలరన్= కళ్ళు వికసించగా; ఆ జగన్నాథులన్= ఆ లోక నాయకులను; అలవోక+పోలెన్= (లీలవలె) నిర్లక్ష్యంగా; కన్గొని= చూచి; దక్షిణమునకున్= దక్షిణంవైపు; చనన్= పోగా; అజుండు= బ్రహ్మ; మెలపుతోన్= నేర్పుతో;

మృత్యువ!, మృత్యువ!= ఓ మృత్యువా! మృత్యువా!; ఎట+పోయెదు?= ఎక్కడికి పోతావు; అని= ఆ ప్రకారంగా; పలుమారు= అనేక పర్యాయాలు; సాంత్వనము+తోఁపన్= ఓదార్పు తోచేటట్లుగా; పిలిచి= ఆహ్వానించి; నాకున్= నాకు; సంహారబుద్ధి= వినాశం చేయాలనే సంకల్పం; ఒలయన్= కలుగగా; (ప్రవేశించగా); పొడము+కనలునందున్= పుట్టిన కోపం నుండి; ఉద్భవించితి(వి)= పుట్టావు; కానన్= కాబట్టి; నీవు; తొడగి= యత్నించి(పూని); వాసిలేక= తారతమ్యం(భేదం) లేకుండా; ఎల్ల జంతువులన్= అన్ని ప్రాణులనూ; నా పంపుమైన్= నా ఆజ్ఞచేత; సంహరింపు(ము)= నాశనం గావించుము; నీకున్= నీకు; పెంపు= గౌరవం; కలదు= కలుగుతుంది.

తాత్పర్యం: బ్రహ్మదేవుడి ఇంద్రియాల నుండి ఎర్రటి మొగంతో, నల్లటి అవయవాలతో, ఎర్రటి వస్త్రంతో ఒక స్త్రీ జన్మించి, మెల్లగా నవ్వుతూ ఎర్రబారిన కళ్ళతో ఆ లోకనాయకులను చూచి, నిర్లక్ష్యభావంతో దక్షిణంవైపు పోసాగింది. అప్పుడు బ్రహ్మ ఆమెను ఓదార్చుతూ మృత్యువా! మృత్యువా! అని నేర్పుగా పిలిచి, 'సంహరించే సంకల్పం నాలో కలిగినప్పుడు ఆ కోపంనుండి నీవు పుట్టావు కాబట్టి, తారతమ్యం లేకుండా అన్ని ప్రాణులను సంహరించుము. నా ఆజ్ఞతో చేసే ఈ పనివలన నీకు గౌరవం సిద్ధిస్తుంది.'

వ. అనిన విని మృత్యుదేవత దుఃఖిత యయినం గన్నీరు దొరంగె; నయ్యశ్రుబిందువులు పద్మజుండు పాణిపుటంబునం బట్టి లోకహితార్థంబుగా ననేకభంగుల ననునయించిన, నక్కాంత గాడ్పున నల్లాడు తీఁగ తెఱంగునం జలించి, యంజలి ఘటించి య వ్విరించి కి ట్లనియె. 167

ప్రతిపదార్థం: అనినన్= అని బ్రహ్మ చెప్పగా; విని; మృత్యుదేవత= మృత్యువు; దుఃఖిత+అయినన్= దుఃఖించింది కాగా; కన్నీరు తొరంగెన్= కన్నీరు కారింది; ఆ+అశ్రుబిందువులు= ఆ కన్నీటి చుక్కలు; పద్మజుండు= బ్రహ్మ; పాణి+పుటంబునన్= దొప్పవంటి చేతిలో; పట్టి= పట్టుకొని; లోక హితార్థంబుగాన్= లోకం యొక్క మేలు కొఱకుగా; అనేక భంగులన్= వివిధ విధాలుగా; అనునయించినన్= ఓదార్చగా; ఆ+కాంత= ఆ స్త్రీ; గాడ్పునన్= గాలిచేత; అల్లాడు= మిక్కిలిగా కదలు; తీఁగ+తెఱంగునన్= తీగవలె; చలించి= కదలిపోయి; అంజలి ఘటించి= చేతులు జోడించి; ఆ+విరించికిన్= ఆ బ్రహ్మ దేవుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పింది.

తాత్పర్యం: అనగా విని మృత్యుదేవత శోకించగా కన్నీరు కారింది. ఆ కన్నీటి బిందువులను బ్రహ్మ చేతిలో పట్టి లోకశ్రేయస్సు నుద్దేశించి ఆమెను పలురకాలుగా ఓదార్చాడు. ఆమె గాలికి కదలాడే తీగవలె వణకుతూ చేతులు జోడించి ఆ బ్రహ్మతో ఇట్లా అన్నది:

తే. 'నీవు సృజియించి తటె నన్ను దేవదేవ! । యేను గ్రూరకర్మములకు నెట్టు లోర్తు?
బంధు మరణ శోకార్తులై పనవు జనుల । వివిధ భంగుల యెలుఁగులు వినఁగఁ జాల. 168

ప్రతిపదార్థం: దేవదేవ!= (దైవాలకు దైవమైన ఓ మహానుభావా!) బ్రహ్మదేవా!; నన్నున్= నన్ను; నీవు; సృజియించితి(వి)+అటె!= సృష్టించావటకదా!; ఏను= నేను; క్రూరకర్మములకున్= నొప్పించే (దయలేని) పనులకు; ఎట్టులు= ఏ విధంగా; ఓర్తున్?= సహించగలను?; బంధు,మరణ,శోక+ఆర్తులు+ఐ= చుట్టాల చావు వలన దుఃఖంతో ఆర్తిచెందిన వాళ్ళయి; పనవు= ప్రలాపించే (మిక్కిలిగా దుఃఖించే); జనుల= ప్రజల; వివిధ భంగుల+ఎలుఁగులు= రకరకాల కంఠధ్వనులు (ఆర్తనాదాలు); వినఁగన్+చాలన్= వినలేను.

తాత్పర్యం: 'ఓ దేవదేవా! నీవు నన్ను పుట్టించినావటగా! నేను దయమాలిన పనులకు ఎట్లా ఓర్చుకొనగలను? చుట్టాల (మరణానికి) చావుకు మిక్కిలి మానసిక దుఃఖంతో ఆర్తులైన వాళ్ళు, చచ్చిపోయిన బంధువులను మాటిమాటికి స్మరిస్తూ చేసే రకరకాల ఏడ్పులతోడి కంఠస్వరాలు నేను వినజాలను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఈ యధర్మంబునకు వెఱతు; నీవు నా మీఁదఁ గృపసేయు; మిట్లు నన్నుం బనుపక తపశ్చరణంబునకుం బనుపవలయు; నివ్వరం బిమ్ము; భవదనుజ్ఞ వడసి ధేనుకాశ్రమంబునకుం జనియెద' నని పలికినం బరమేష్ఠి య న్నీరజాక్షి నిరీక్షించి. 169

ప్రతిపదార్థం: ఈ+అధర్మంబునకున్= (ఈ ధర్మవిరుద్ధ కార్యానికి) ఈ పాపానికి; వెఱతున్= భయపడుతూ ఉన్నాను; నీవు; నామీఁద= నాపై; కృప+చేయుము= దయచూపుము; ఇట్లు= ఈ విధంగా; నన్నున్= నన్ను; పనుపక= పంపక (నియోగించక) తపస్+చరణంబునకున్= తపస్సు చేసికొనటానికి; పనుపవలయున్= పంపాలి; ఈ+వరంబు+ఇమ్ము= ఈ వరం ఇమ్ము; భవత్+అనుజ్ఞ= నీ యొక్క అనుమతి; పడసి= పొంది; ధేనుక+ఆశ్రమంబునకున్= ధేనుక అనే పేరుగల ఆశ్రమానికి; చనియెదన్= పోతాను; అని= ఆ ప్రకారంగా; పలికినన్= మాటాడగా; పరమేష్ఠి= బ్రహ్మ; ఆ+నీరజాక్షిన్= కమలాలవంటి కన్నులు గలదైన ఆ స్త్రీని; నిరీక్షించి= చూచి.

తాత్పర్యం: ఈ ధర్మంకాని పనికి జంకుతాను. నామీద దయయుంచి ఈ పనికి నన్నుపంపకుండా తపస్సు చేయటానికి పంపుము. నాకీ వరం ఇమ్ము. నేను ధేనుకాశ్రమానికి వెళ్ళుతాను' - అని అనగా బ్రహ్మ ఆమెను చూచి.

సీ. 'నినుఁ బ్రజా సంహారమునకునై కల్పించి । నాఁడఁ గావున నీ మనంబునందుఁ
బొడము విచారంబు నుడిగింపు; మిట్లు గాఁ । గలయది యైన యిక్కార్యమునకు
నన్యథాత్వం బేల యగుఁ? బ్రజా సంహర । ణము ననిందిత సమయముగఁ జేయు
మీ వవశ్యంబును' నావుడుఁ గడుభయం । బున నప్పటికి నియ్యకొని మృగాక్షి

తే. నలువ వదనంబు సూచుచు నిలిచె; నతఁడు । ప్రీతుఁడై లోకములఁ గృప పెంపుతోడి
దృష్టిఁ గనుఁగొన నవి పరితుష్టిఁ బొందెఁ । జంద్రమౌళియుఁ దన యిచ్చఁ జనియెఁ బ్రీతి. 170

ప్రతిపదార్థం: నినున్= నిన్ను; ప్రజాసంహారమునకున్+ఐ= ప్రజల (ప్రాణుల) యొక్క వినాశానికై; కల్పించినాఁడన్= కలిగించాను; కావునన్= కాబట్టి; నీ+మనంబునందున్= నీ మనస్సులో; పొడము= పుట్టే; విచారంబున్= సంతాపాన్ని (ఆలోచనను లేదా సందేహాన్ని); ఉడిగింపుము= మానివేయుము (అణచివేయుము); ఇట్లుకాన్= ఈ విధంగానే; కల+అదియైన= జరగవలసిందైన; ఈ+కార్యమునకున్= ఈ పనికి; అన్యధాత్వంబు= మరొకవిధంగా కావటం; ఏల+అగున్?= ఎందుకౌతుంది?; ప్రజాసంహరణమున్= ప్రాణి సంహారాన్ని (జన వినాశనాన్ని); అనిందిత+సమయముగన్= నిందించబడని (దూషించబడని) ఆజ్ఞగా; ఈవు= నీవు; అవశ్యంబును= తప్పకుండా; చేయుము= ఆచరించుము; నావుడున్= అనగానే; కడు+భయంబునన్= మిక్కిలి భీతితో; మృగ+అక్షి= జింకకన్నుల వంటి కన్నులు కలిగిన ఆ మృత్యువు; అప్పటికిన్= ఆ సమయానికి; ఇయ్యకొని= సమ్మతించి(ఒప్పుకొని); నలువ వదనంబున్= బ్రహ్మముఖాన్ని; చూచుచున్= చూస్తూ; నిలిచెన్= నిలిచింది; అతడు= ఆ బ్రహ్మ; ప్రీతుఁడు+ఐ= సంతోషించినవాడై; లోకంబులన్= లోకాలను; కృప పెంపు తోడి దృష్టిన్= దయయొక్క అతిశయంతోడి చూపుతో; కనుఁగొనన్= చూడగా; అవి= ఆ లోకాలు; పరితుష్టిన్= మిక్కిలి సంతృప్తిని; పొందెన్= పొందాయి; చంద్రమౌళియున్= శివుడున్నూ;తన+ఇచ్చన్= తన కోరిక మేరకు; ప్రీతిన్= సంతోషంతో; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: నిన్ను జన వినాశానికై నేనే కల్పించాను. కాబట్టి నీ మనస్సులో కలిగే విచారాన్ని విడువుము. ఇది ఈ విధంగా జరగవలసి ఉన్న పని. దీనికి విరోధం ఎందుకు ఏర్పడుతుంది? జన వినాశాన్ని నిందలేని ఆజ్ఞగా నీవు తప్పకుండా నిర్వర్తించాలి' అని అనగానే మృత్యువు మిక్కిలి భీతితో ఆ సమయానికి సరే అని ఒప్పుకొని,

బ్రహ్మ మొగాన్ని చూస్తూ అట్లే నిలిచిపోయింది. అందుకు బ్రహ్మ సంతోషించాడు. లోకాల నన్నింటినీ ఎంతో దయగల చూపుతో చూడగానే అవి ఎంతో సంతృప్తిచెందాయి. పరమేశ్వరుడున్నూ మనస్సులో ఎంతో సంతోషించి మరలివెళ్ళాడు.

విశేషం: ఇందులో మృగాక్షి అనే పదం సాభిప్రాయం. మృత్యువు మిక్కిలి భీతితో ఉన్న సందర్భం. కాబట్టి ఆ సందర్భంలో ఆమె చూపులు కూడా జింకచూపుల వలె మిక్కిలి సంచలించాయి అని ధ్వని. సంచలించే చూపులు నలుదిక్కులూ చూస్తాయి. కాబట్టి 'నలువ' అనే ప్రయోగం కూడా ఔచిత్యస్ఫోరకం. చంద్రుడు ఆహ్లాదకారి.అతడిని నెత్తిమీద పెట్టుకొన్న శివుడు కూడా లోకాలకు ఆహ్లాదాన్ని కలిగించాలనే ఉద్దేశంతోనే నలువ దగ్గరకు వచ్చాడు. వచ్చిన పని సానుకూలం కావటంతో అతడు కువలయానందకరుడై శంకరుడై మరలివెళ్ళాడు.

వ. మృత్యుదేవియుం బరమేష్ఠికిం బ్రణమిల్లి. 171

తాత్పర్యం: మృత్యుదేవత కూడా బ్రహ్మకు నమస్కరించి.

తే. అచటు వాసి రయంబున నరిగి ధేను । కాశ్రమంబున నియమంబు లాచరించి
నందకౌశికి యనియెడు నదులఁ బెక్కు । వ్రతము లొనరించి మఱియుఁ దీర్థముల నెల్ల. 172

ప్రతిపదార్థం: అచటు+పాసి= ఆ ప్రదేశం విడిచి (తొలగి); రయంబునన్= వేగంతో; అరిగి= పోయి; ధేనుక+ఆశ్రమంబునన్= ధేనుకాశ్రమంలో; నియమంబులు+ఆచరించి= వ్రతనిష్ఠలు చేసి; నంద+కౌశికి+అనియెడు+నదులన్= నంద, కౌశికి అనే పేర్లుగల నదులలో; పెక్కు వ్రతములు+ఒనరించి= అనేకములైన (ఉపవాసాది పుణ్యకార్యాలు) నోములు నోచి; మఱియున్= ఇంకా; ఎల్ల+తీర్థములన్= అన్ని పుణ్యక్షేత్రాలలో (మహర్షులు స్నానం చేసే పుణ్యోదక స్థలాలలో).

తాత్పర్యం: వెంటనే మృత్యువు ఆ ప్రదేశం విడిచి ధేనుకాశ్రమంలో ఎన్నో వ్రతాలు చేసి, నంద, కౌశిక అనే నదులలో అనేక పుణ్యకార్యాలు చేసి, ఇంకా చాలా పుణ్యక్షేత్రాలలో (తీర్థాలలో).

విశేషం: శుంభ నిశుంభులను చెండాడేందుకు గౌరి నుండి పుట్టిందే కౌశికి. శుంభనిశుంభాది రాక్షసులను తునుమాడినతర్వాత నదీ రూపంలో వెలసింది. నంద - అంటే ఆనందాన్ని కలిగించేది. వ్రతాలు నిర్వహించటానికి కౌశికి, నంద అనే రెండు నదులూ ఎంతో అనుకూలంగా ఉన్నట్లు - అక్కడ చేసిన వ్రతాలు త్వరలో ఫలిస్తాయి అని సూచన.

వ. అద్దేవు నుద్దేశించి పెద్దకాలం బనేక విధంబుల దుష్కరంబులగు తపంబులు సేయుచుం బోయి హిమశైల శిఖరంబున సంయతాత్మయై యున్నఁ, జతురాననుం డమ్మానినికిం బొడసూపి, 'మృత్యువ! నీ వత్యంతనిష్ఠుర నిష్ఠా నియమంబు లేల యనుష్ఠించెద?' వనిన నయ్యంగన 'సమాధానంబున నున్న ప్రజల మెడలు నులిచి చంపంజాల; నన్ను నీ పనికిం బంపకు; మధర్మభయంబున ని న్నాశ్రయించెద; నార్తనైన నాకు శరణంబ వగు' మని ప్రణమిల్లిన నతం డి ట్లనియె. 173

ప్రతిపదార్థం: ఆ+దేవున్+ఉద్దేశించి= ఆ దైవాన్ని గురించి; పెద్దకాలంబు= చాలాకాలం; అనేకవిధంబులన్= పెక్కురకాల; దుష్కరంబులు+అగు+తపంబులు= చేయశక్యంకాని అనగా కఠినములైన తపస్సులు; చేయుచున్= చేస్తూ; పోయి= చని; హిమశైల శిఖరంబునన్= హిమవత్పర్వతంయొక్క చివరిభాగంలో; చతుః+ఆననుండు= నలువ (బ్రహ్మ); పొడసూపి= కన్పించి; మృత్యువ!= ఓ మృత్యువా!; నీవు; అత్యంత, నిష్ఠుర, నిష్ఠా, నియమంబులు+ఏల?= మిక్కిలి కఠినములైన వ్రతనిష్ఠలు నియమములు ఎందుకు?; అనుష్ఠించెదవు?= నిర్వర్తిస్తున్నావు?; అనినన్= అనగా; ఆ+అంగన= ఆ మృత్యువు; సమాధానంబునన్+ఉన్న= చక్కగా ఉంటూ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉన్న; ప్రజల+మెడలు= జీవుల కుత్తుకలు; నులిచి= మెలిపెట్టి; చంపన్+చాలన్= చంపలేను; నన్నున్= నన్ను; ఈ+పనికిన్+పంపకుము= ఈ కార్యానికి నియోగించవద్దు; అధర్మభయంబుననన్= అధర్మం వలని భీతిచేత; నిన్నున్+ఆశ్రయించెదన్= నిన్ను పొందాను; ఆర్తను+ఐన+నాకున్= (ఆర్తురాలు) దుఃఖిత అయిన నాకు; శరణంబవు+అగుము+అని= శరణం కమ్ము అని; ప్రణమిల్లినన్= నమస్కరించగా; అతండు= ఆ బ్రహ్మ; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: దైవాన్ని ఉద్దేశించి పెక్కురీతుల కఠిన తపస్సులు చేస్తూ హిమవత్పర్వత శిఖరం మీద నియమనిష్ఠలతో ఉండగా, బ్రహ్మదేవుడు ఆమెకు ప్రత్యక్షమై, 'ఓ మృత్యువా! నీవెందుకు కఠిన నియమనిష్ఠలతో తపస్సు చేస్తున్నావు?' అని అడిగాడు. ఆమె ఇట్లా అన్నది: 'సుఖంగా ఉన్న ప్రజల మెడలు నులిమి చంపలేను. న న్నీ పనికి పంపబోకండి. అధర్మ భయంతో నిన్ను శరణువేడుతున్నాను. ఆర్తురాలను నన్ను కరుణించుము' అని నమస్కరించింది. అప్పుడా బ్రహ్మ మృత్యువుతో ఇట్లా అన్నాడు:

ఆ. **'ఇంతి! నీ కధర్మ మేల యయ్యెడు? నాదు । పనుపు సేయ నిన్నుఁ బరమధర్మ**
మొందు, విమల కీర్తియును జెందు; నట్లుగా । వరము లిత్తు మేను హరుఁడు నీకు. **174**

ప్రతిపదార్థం: ఇంతి!= ఓ స్త్రీ! (మృత్యువా! అని సంబోధన); అధర్మము= ధర్మవిరుద్ధం, లేక పాపం; నీకున్= నీకు; ఏల+అయ్యెడున్?= ఎందుకు అవుతుంది?; నాదు+పనుపు= నా ఆజ్ఞ; చేయన్= నిర్వర్తించగా (ఆచరింపగా); నిన్నున్= నిన్ను; పరమ+ధర్మము+ఒందున్= ఉత్కృష్టమైన ధర్మమే పొందుతుంది; విమలకీర్తియును= నిర్మలమైన యశస్సున్నూ; చెందున్= కలుగుతుంది; అట్లుగాన్= అట్లా అయ్యేటట్లు; ఏను= నేనూ; హరుఁడున్= శివుడూ; నీకున్= నీకు; వరములు+ఇత్తుము= వరాలు ఇస్తాం.

తాత్పర్యం: ఓ మృత్యుదేవతా! నీ కిది అధర్మం ఎందు కౌతుంది? నా ఆజ్ఞ నిర్వర్తించటం వలన నిన్ను ధర్మమే పొందుతుంది. నీకు దీనివలన నిర్మలమైన యశస్సుకూడా కలిగేటట్లు నేనూ, శివుడూ వరాలు ఇస్తున్నాం.

విశేషం: 'ఇంతి' అని మృత్యుదేవతను బ్రహ్మ సంబోధిస్తూ, 'ప్రజల మెడలు నులిచి చంపుట' పాపకార్యం కాదని, అది పరమధర్మమై విమలకీర్తి కలిగిస్తుంది. అని తెల్పిన విషయం- ఆటవెలది ఛందస్సులో తిక్కన వివరించటం సందర్భసముచిత ఛ్ఛందశ్శిల్ప పారీణతకు చక్కని నిదర్శనం.

వ. **ఏ మనుసంధించిన పనికి నీకు భయం బేల? చతుర్విధ భూతకోట్ల నుపసంహరింపు' మనిన నత్తన్వి 'దేవా! దేవర యాజ్ఞ దలమోచి చేయుదానం గాక! యొక్క విన్నపం బవధరింపుము; లోభంబును గ్రోధంబును నీర్ష్యయు నసూయయు కలిగించి జంతువుల శరీరంబుల వికృతిం బొందింపవలయు' ననవుడు నతం డట్ల యయ్యెడు; నదియునుంగాక నీ యశ్రుబిందువు లెన్ని యన్నియు రోగంబులై జనంబులం జావం జేయంగలయవి; దానం జేసి యధర్మంబు నిన్నుం బొరయనేరదు; ప్రాణి మారణంబు నీకుం బరమధర్మంబగు; భవదీయశుభం బేను గోరెద; నీవు ధర్మస్వరూపంబ; వీ విశ్వంబునకు నీశ్వరి; వట్లు గావునఁ బ్రాణ సంయమనంబు భవదధీనంబు; సర్వజీవులయెడం గామరోషంబు లుడిగి జీవంబుల నాకర్షింపుము; తత్ప్రకారంబు ధర్మతత్త్వంబు; నీకు భయం బేమి? మిథ్యావర్తనుల నధర్మంబ సమయించుఁ బొ' మ్మనిన నమ్మానిని శాపభీతిని దన్ను నధర్మంబు వొంద దనుమాటను దన్నియోగం బంగీకరించె; నవ్విరించి వచనంబుల తెఱంగున నాధివ్యాధులు గాత్రహానిం జేయ నా మృత్యుదేవత ప్రాణాపహారిణి యగుటం బ్రాణంబులు దేహంబులం బాసి, దేవాదిభావంబులం బొందుచు మగుడ మనుష్యత్వంబు నొందుచుండు.** **175**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఏము= నేనూ, పరమేశ్వరుడూ; అనుసంధించిన+పనికిన్= నియమించే కార్యానికి; నీకున్+భయంబు+ఏల?= నీకు జంకు ఎందుకు?; చతుః+ విధ+భూతకోట్లన్= నాలుగు రకాల ప్రాణిసమూహాలను; ఉపసంహరింపుము= సంహరించుము; అనినన్= అనగా; ఆ+తన్వి= ఆ మృత్యువు; దేవా!= ప్రభూ!; దేవర ఆజ్ఞ= ప్రభువుయొక్క ఆనతి; తలమోచి= శిరసా వహించి; చేయుదానన్+కాక= ఆచరించేదానిని అగుదును కానీ; ఒక్క+విన్నపంబు= ఒక విజ్ఞప్తి; అవధరింపుము= వినుము; లోభంబును= అత్యాశయున్నూ; క్రోధంబునున్= కోపమున్నూ; ఈర్ష్యయున్= ఓర్వలేనితనమున్నూ; అసూయయున్= మంచి గుణాలలో దోషాన్ని ఆరోపించటమూ; కలిగించి= కలిగేటట్లు చేసి; జంతువుల శరీరంబులన్= ప్రాణుల దేహాలలో; వికృతిన్+పొందింపన్ వలయున్= వికారాన్ని కలిగించాలి; అనవుడున్= అనిన అనంతరం; అతండు= బ్రహ్మ; అట్లు+అ+అయ్యెడున్= అట్లే అగుగాక!; అదియునున్+కాక= అంతేకాకుండా; నీ అశ్రు బిందువులు= నీ కన్నీటిబొట్లు; ఎన్ని= ఎన్నో; అన్నియున్= అన్నీ; రోగంబులు+ఐ= వ్యాధులై; జనంబులన్= ప్రజలను; చావన్+చేయన్+కలయవి= చచ్చేటట్లు కావింపగలవు; దానన్+చేసి= అందువలన; అధర్మంబు= పాపం; నిన్నున్= నిన్ను; పొరయన్ నేరదు= పొందజాలదు; ప్రాణి మారణంబు= ప్రాణులను చంపటం; నీకున్= నీకు; పరమ ధర్మంబు= ఉత్కృష్టమైన ధర్మం (పుణ్యం); అగున్= అవుతుంది; భవదీయ+శుభంబు= నీ క్షేమం (మేలు); ఏను+కోరెదన్= నేను కోరుతున్నాను; నీవు; ధర్మస్వరూపంబవు= ధర్మమే మూర్తిగా ఉండేదానివి; ఈ+విశ్వంబునకున్= ఈ జగత్తుకు; ఈశ్వరివి= యజమానురాలివి; అట్లు+కావునన్= ఆ విధంగా కావటంచేత; ప్రాణ+సంయమనంబు= ప్రాణాలను బంధించటం; భవత్+అధీనంబు= నీ స్వాధీనం; సర్వ+జీవుల+ఎడన్= అన్నిప్రాణుల విషయంలో; కామ, రోషంబులు+ఉడిగి= కోరిక, కోపం విడిచి; జీవంబులన్= ప్రాణాలను; ఆకర్షింపుము= నీవైపు లాగుకొమ్ము; తద్+ప్రకారంబు= అట్లా చేయటం; ధర్మతత్త్వంబు= ధర్మంయొక్క స్వభావం (యథార్థస్థితి); తద్+ప్రకారంబు= ఆ విధం; నీకున్+భయంబు+ఏమి?= నీకు భీతి ఎందుకు?; మిథ్యావర్తనులన్= కపటంగా ప్రవర్తించేవాళ్ళను; అధర్మంబు+అ= అధర్మమే; సమయించున్+పొమ్ము= నశింపజేస్తుంది పో; అనినన్= అనగానే; ఆ+మానిని= మానవతి అయిన ఆ మృత్యువు; శాపభీతిని= శాపభయంచేత; తన్నున్= తనను; అధర్మంబు+పొందదు= పాపం కలుగదు; అనుమాటన్= అనే మాటను బట్టి; తద్+నియోగంబున్= ఆ బ్రహ్మయొక్క ఆదేశాన్ని; అంగీకరించెన్= సమ్మతించింది; ఆ+విరించి= ఆ బ్రహ్మ; వచనంబుల+తెఱంగునన్= మాటల క్రమాన్నిబట్టి; ఆధి+వ్యాధులు= మానసికరోగాలు, శారీరకములైన జబ్బులు; గాత్ర+హానిన్= శరీరానికి కీడు; చేయన్= కావించగా; ఆ+మృత్యుదేవత= ఆ మరణదేవత; ప్రాణ+అపహారిణి+అగుటన్= ప్రాణాలు తీసేది కావటం వలన; ప్రాణంబులు= ప్రాణాలు; దేహంబులన్+పాసి= శరీరాలను వదలి; దేవ+ఆది+భావంబులన్= దేవతా స్వరూపాలను; పొందుచున్= ప్రాపిస్తూ; మగుడన్= మళ్ళీ; మనుష్యత్వంబున్+ ఒందుచుండున్= మానవత్వాన్ని పొందుతూ ఉంటాయి.

తాత్పర్యం: 'ఇది మేము నియమించిన పని. దీనికి నీకు భయ మెందుకు? నాలుగు విధాలైన ప్రాణులసమూహాన్ని సంహరించుము' అని బ్రహ్మ చెప్పగా మృత్యుదేవత 'దేవా! నీ ఆజ్ఞ శిరసావహిస్తాను. నా విన్నపం ఒకటి ఉన్నది ఆలకించండి. లోభక్రోధాలు, ఈర్ష్యాసూయలు ప్రాణుల దేహాన్ని వికారం చెయ్యాలి' అని అడిగింది. అందుకు బ్రహ్మ సరే! అంటూ ఇట్లా చెప్పాడు: 'నీ కన్నీటి చుక్కలన్నీ రోగాలై జననాశనం చేస్తాయి. దీనివలన నీ కే పాపమూ అంటదు. ప్రాణిసంహారం నీ పరమధర్మం. నీ శుభాన్ని నేను ఆకాంక్షిస్తున్నాను. ధర్మంయొక్క స్వరూపమే నీవు. ఈ విశ్వానికి నీవే యజమానురాలివి. కామక్రోధాలు విడిచి ప్రాణులను ఆకర్షించుము. ఇది ధర్మతత్త్వం యొక్క క్రమపద్ధతి. నీకు భయ మెందుకు? కపట ప్రవర్తన గలవాళ్ళను ఆ అధర్మమే నిర్మూలిస్తుంది' అనగానే అధర్మం తనను అంటుకోదు అనే అభయవాక్యంతో మృత్యువు, బ్రహ్మ ఆదేశాన్ని అంగీకరించింది. ఆ బ్రహ్మవాక్కులను అనుసరించి మానసికరోగం, శారీరకమైన జబ్బు (ఆధివ్యాధులు) శరీరాలకు కీడు కలిగించగా మృత్యుదేవత ప్రాణాలను అపహరించటంతో ప్రాణాలు శరీరాలను విడిచి దేవత్వాన్ని పొందుతూ మళ్ళీ మానవత్వాన్ని చేరుకొంటున్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ వచనంలో మృత్యువుయొక్క తత్త్వం దాని మహత్త్వం వివరింపబడ్డాయి. 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి' అనే భగవద్గీతలోని భావం 'మగుడ మనుష్యత్వంబు నొందుచుండు' అనే తుదివాక్యంలో సూచించబడింది. సాంత్వనానికీ, ఉపదేశానికీ వచనం ఏ విధంగా అనుకూలమో ప్రస్తుత వచనభాగం నిరూపిస్తుంది.

తే. **భీమనాదుండు భీముఁ డుద్దాముఁ డప్ర। తర్క్యతేజోమయుఁడు జగత్ప్రాణుఁ డొడలు**
మనుపఁ జెఱుపంగ నొడయండు సనుట మగుడ। నరుగుదెంచుట వింతగా దతని కెందు. **176**

ప్రతిపదార్థం: భీమనాదుండు= భయంకరమైన శబ్దం కలవాడూ; భీముఁడు= భయంకరమైనవాడూ; ఉద్దాముఁడు= స్వతంత్రుడూ, మరియు గంభీరుడూ; అప్రతర్క్య+తేజోమయుఁడు= తర్కించటానికి వీలుకాని పరాక్రమం కలవాడూ (అయిన); జగత్ప్రాణుఁడు= వాయువు; ఒడలున్= శరీరాన్ని; మనుపన్= కాపాడటానికీ; చెఱుపంగన్= నశింపచేయటానికీ; ఒడయండు= ప్రభువు!; చనుట= పోవుట; మగుడన్= మరలా; అరుగుదెంచుటన్= వచ్చుట; ఎందున్= ఎక్కడా; అతనికిన్= ఆ వాయువుకు; వింత+కాదు= ఆశ్చర్యం కాదు.

తాత్పర్యం: భయంకరంగా హోరుమని శబ్దంచేసే వాడూ, భయంకరుడూ, సర్వ స్వతంత్రుడూ, గంభీరుడూ ఊహించటానికి వీలుకాని పరాక్రమమూ తేజస్సూ కలవాడూ అయిన వాయువు ఈ శరీరాన్ని కాపాడటానికీ, నశింపజేయటానికీ సమర్థుడైన ప్రభువు. పోవటం మళ్ళీ రావటం అతడి కేమీ వింత కాదు.

విశేషం: జగత్ప్రాణుడైన వాయువు యొక్క స్వభావాలు నాలుగు విశేషణాలలో చెప్పబడ్డాయి. అతడు జీవకోటిలో ప్రవేశించటం నిర్గమించటం పర్యాయక్రమంగా ఆచరిస్తూ ఉన్నాడని సూచించబడింది. వాయువుకు ఎన్నో పర్యాయపదాలు ఉండగా జగత్ప్రాణుడని ప్రస్తుత సందర్భానికి సముచితంగా ఉన్న పదం ప్రయోగించటం విశేషం.

క. **నరు లమరు లగుదు, రమరులు। నరు లగుదురు; గాన నీదు నందనునకు భూ**
వర! వగవ నేల? యతనికిఁ। జిరవీరస్వర్గ సుఖము సేకుఱి యుండున్. **177**

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; నరులు= మానవులు; అమరులు+అగుదురు= దేవతలు ఔతారు; అమరులు= దేవతలు; నరులు+అగుదురు= మానవులు అవుతూ ఉంటారు; కాన= కాబట్టి; నీదు+నందనునకున్= నీ కుమారుడి కొరకై; వగవన్+ఏల?= దుఃఖించటం ఎందుకు?; అతనికిన్= నీ కొడుకైన అభిమన్యుడికి; చిర, వీర, స్వర్గ, సుఖము= శాశ్వతమైన వీరులకు లభించే స్వర్గసౌఖ్యం; చేకుఱి+ఉండున్= లభించి ఉంటుంది.

తాత్పర్యం: ఓ రాజా! మానవులు దేవతలుగా, దేవతలు మానవులుగా అవుతూ ఉంటారు. కాబట్టి నీ కుమారుడికై దిగులు పడవద్దు. అతడికి శాశ్వతమైన వీరస్వర్గం లభించి ఉంటుంది. అతడు స్వర్గంలో సౌఖ్యం అనుభవిస్తూ ఉండగా, నీవు ఇక్కడ అతడి కోసం విలపించటం ఎందుకు? అని భావం.

విశేషం: ఎంత పుణ్యం చేస్తే అంత స్వర్గసౌఖ్యం. పుణ్యఫలాన్ని స్వర్గంలో అనుభవించిన తర్వాత మళ్ళీ కర్మభూమిలో మానవత్వం. అభిమన్యుడు పుణ్యపురుషుడు. అతడు స్వర్గసౌఖ్యాన్ని అందుకొన్నాడు - అని అంటూ దేవత్వ-మానవత్వాల పర్యాయక్రమాన్ని వ్యాసుడు ధర్మజుడికి తెలిపాడు. నరులు అమరులు కావటానికి, ఆ అమరులే మరల మానవులు కావటానికి వారి వారి కర్మఫల సంస్కారాలే కారణం అనే విషయం ఇందు సూచితం. వీరుడైన అభిమన్యుడికి స్వర్గసౌఖ్యం తప్పక లభించి ఉంటుందనే నిర్ధారణ ఈ పద్యంలో తుదివాక్యం.

క. **అగణిత దుఃఖాత్మక మి। జ్జగ; మాతఁడు దీనిఁ దొఱఁగి సౌఖ్యాత్మకమై**
వగ చెంతలఁ జేరని య। జ్జగమునఁ బుణ్యాత్మ పురుష సంగతి వడసెన్. **178**

ప్రతిపదార్థం: ఈ+జగము= ఈ లోకం; అగణిత దుఃఖ+ఆత్మకము= ఎన్నరాని వగపుతో కూడుకొన్నది; ఆతఁడు= ఆ అకంపనుడి కొడుకు; దీనిన్= దుఃఖభూయిష్ఠమైన ఈ లోకాన్ని; తొఱఁగి= విడిచి; సౌఖ్య+ఆత్మకము+ఐ= సుఖంతో కూడుకొన్నదై; వగ+చెంతలన్= దుఃఖంయొక్క దరిదాపులలో (సమీపంలో); చేరని= సమీపించని; ఆ+జగమునన్= ఆ లోకంలో; పుణ్యాత్మ, పురుష, సంగతిన్= పుణ్యాత్ములైన పురుషులయొక్క సహవాసాన్ని (చేరికను); పడసెన్= పొందాడు.

తాత్పర్యం: ఈ జగత్తు దుఃఖంతో కూడుకొన్నది. అతడు ఈ లోకాన్ని విడిచి, కేవలం సుఖంతో కూడుకొన్న, దుఃఖం దరి చేరని ఆ లోకంలో పుణ్యపురుషుల సాంగత్యాన్ని పొందాడు.

విశేషం: పుణ్యాత్ము లందరూ చేరేది సౌఖ్యాత్మక లోకం. అందుకే దాన్ని నాకం అంటారు. అక్కడ దుఃఖంయొక్క స్పర్శ రవంతకూడా ఉండదు. దీనినే తిక్కన 'వగచెంతలఁజేరని' అని ఎంతో సొగసుగా చెప్పాడు. మహోదాత్తములైన భావాలను తేటతెల్లం చేయటానికి అచ్చ తెలుగు ఏ విధంగా సర్వ సమర్థమో పై ప్రయోగం ద్వారా నిరూపించాడు.

వ. **నీకు వగవఁ బని లేదు; బ్రహ్మ కల్పితంబైన యీ నిశ్చయంబు నిరూపించి ధీరులు దెగిన వారలకు వగవ' రని చెప్పిన నారదునకు నయ్యకంపనుం డిట్లనియె.** **179**

ప్రతిపదార్థం: నీకున్= నీకు; వగవన్+పని, లేదు= బాధపడాల్సిన పనిలేదు; బ్రహ్మ, కల్పితంబు+ఐన= బ్రహ్మదేవుడిచేత కల్పించబడినదైన; ఈ+నిశ్చయంబు= ఈ నిర్ణయం; నిరూపించి= తెలిసికొని; ధీరులు= అన్నీ తెలిసినవాళ్ళు (ధైర్యం కలవారు); తెగినవారలకున్= మరణించిన వాళ్ళకై; వగవరు= దుఃఖించరు; అని= ఆ ప్రకారంగా; చెప్పినన్= చెప్పగా; నారదునకున్= నారదమహర్షికి; ఆ+అకంపనుండు= ఆ అకంపనమహారాజు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు:

తాత్పర్యం: బ్రహ్మ కల్పిత నిశ్చయాన్ని గ్రహించి, ధీరులు మృతులను గూర్చి దుఃఖించరన్న నారదుడితో అకంపనుడు ఈ విధంగా అన్నాడు:

క. **'మునినాథ! నీవు సెప్పఁగ । ననఘం బగు నీ సమంచితాఖ్యానం బే**
విని గతశోకుఁడ నైతిని; । మనము ప్రియంబందె నతి సమాధానమునన్.' **180**

ప్రతిపదార్థం: మునినాథ!= ముని శ్రేష్ఠుడవైన ఓ నారదా!; నీవు; చెప్పఁగన్= చెబుతూ ఉండగా; అనఘంబు+అగు= పాపరహితమైన దైన; ఈ+సమంచిత+ఆఖ్యానంబున్= మిక్కిలి యోగ్యమైన ఈ కథను; ఏన్= నేను; విని; గత శోకుఁడను+ఐతిని= పోగొట్టబడ్డ దుఃఖం కలవాడిని అయ్యాను; అతి+సమాధానమునన్= మిక్కిలి అంగీకారంతో; మనము= మనస్సు; ప్రియంబు+అందెన్= ప్రీతి చెందింది.

తాత్పర్యం: 'ఓ మునిశ్రేష్ఠా! నీవు సమయ సముచితంగా చెప్పిన పవిత్రమైన, యోగ్యమైన కథ విని, నా శోకం నశించింది. మనస్సు ఎంతో సమ్మతితో ప్రీతి చెందింది.'

విశేషం: సందర్భానికి అనుగుణంగా చెప్పిన కథవలన వ్యథ తీరటమే కాకుండా మనస్సెంతో ప్రీతిని పొందిందనటం ఈ పద్యంలోని విశేషం. కేవలం 'సమాధానం' అనకుండా దానికి ముందు 'అతి' ని చేర్చటం ఈ సందర్భంలో ఎంతో అర్థవంతంగా ఉన్నది. అది ఎంతో విశిష్టార్థంలో ప్రయుక్తం కావటం వలన 'గతశోకుఁడు' కావటానికి పరిపుష్టిని కలిగించింది. ఆఖ్యానం ఎంతో సందర్భశుద్ధి, ఔచిత్యం కలిగి ఉన్నది కాబట్టి అది 'అనఘం' కాగలిగింది. సముచితమైన ఆఖ్యానాన్ని విన్నందువలన మనస్సుకు ప్రశాంతి, శోకరాహిత్యం, అఘరహితమైన ఆత్మానందం సిద్ధిస్తాయి అని ఈ పద్యంలో సూచించబడ్డాయి. కథను అందరూ చెప్పవచ్చు. కాని, దానిలో స్వారస్యం ఉండాలంటే దాన్ని ద్రష్టలైన మునులే చెప్పాలి. ఇక్కడ దివ్యర్షి నారదుడు విజ్ఞానప్రదుడు. సమంచితాఖ్యానాన్ని సమయసముచితంగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనుచు వినతుం డగుటయు, నమ్ముని దనదైన యశోక వనంబునకుం జనియె నని పలికి పారాశర్యుండు. 181

ప్రతిపదార్థం: అనుచున్= ఆ విధంగా అంటూ; వినతుండు+అగుటయున్= నమ్రుడు (వినయంతో వంగినవాడు); కావటమున్నూ; ఆ+ముని= ఆ నారదుడు; తనదైన= తనకు సంబంధించినదైన; అశోకవనంబునకున్= అశోకవనానికి; చనియెన్= వెళ్ళాడు;అని= ఆ ప్రకారంగా; పలికి= చెప్పి; పారాశర్యుండు= వేదవ్యాసుడు.

తాత్పర్యం: అని వినయంతో నమస్కరించాడు. నారదుడు తనదైన అశోకవనానికి వెళ్ళాడని చెప్పి, వ్యాసమునీంద్రుడు.

విశేషం: ఈ సందర్భంలో నారదుడు ఆత్మజ్ఞానాన్ని ఇచ్చినవాడుగా స్పష్టం. ఆత్మజ్ఞాని ఐహిక దుఃఖానికి అతీతుడు. ఇట్లు చెప్పిన కథ శోకరాహిత్యానికి సంబంధించినది. కాబట్టి, కథ చివరలో కూడా నారదుడు 'తనదైన అశోకవనంబునకుంజనియె' ననటం సమయ సముచితంగా ఉన్నది. పూర్వం గతశోకుడిని చేసే అభ్యాసాన్ని చెప్పిన నారదుడు ప్రస్తుత వచనంలో 'అశోక వనమునకు' చనినాడని వ్యాసుడు చెప్పటం అర్థమహితం.

క. ఈ యితిహాసం బాయువు, । శ్రీయును, నారోగ్యమును, విశిష్టగుణంబుం
జేయు జనములకు జగతీ । నాయక! వ్రాసినఁ బఠించినం దగ వినినన్. 182

ప్రతిపదార్థం: జగతీనాయక!= రాజా!; జనములకున్= ప్రజానీకానికి; ఈ+ఇతిహాసంబు= ఈ కథ; వ్రాసినన్= వ్రాసిననూ; పఠించినన్= చదివిననూ; తగన్= తగునట్లు; వినినన్= వినిననూ; ఆయువున్= పరిపూర్ణమైన ఆయుస్సునూ; శ్రీయునున్= సంపదయున్నూ; ఆరోగ్యమున్= రోగములు లేకుండుటయున్నూ; విశిష్ట గుణంబున్= శ్రేష్ఠమైన గుణమున్నూ; చేయున్= కలుగజేస్తుంది.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ కథను వ్రాసినా, చదివినా, విన్నా, మానవాళికి ఆయుస్సు, సంపద, ఆరోగ్యం, శ్రేష్ఠమైన గుణం కలుగుతుంది.

విశేషం: ఫలశ్రుతి రూపంలో అకంపనోపాఖ్యానం ముగిసింది. ప్రస్తుతాఖ్యాన శ్రవణం వలన ఆయురారోగ్య సంపదలే కాకుండా వాటిని మించిన శ్రేష్ఠగుణం కలుగుతుంది అనటం గమనార్హం.

వ. అభిమన్యుండును భండనంబున పిఱుసనక శరశరాసనాది వివిధాయుధంబులఁ బరబలంబుల బడలువఱిచి వీరస్వర్గ సౌఖ్యంబును ప్రఖ్యాతియుం బడసె; నీకు నడలం బని లే దని చెప్పిన విని ధర్మతనయుండు దనమనంబున నుత్తమక్షత్త్రధర్మంబు తెఱం గిట్టిద యగుట దలపోసియు, శూరులు పుణ్యలోకంబున సుఖంబుండుటయుం దెలిసియు, నెవ్వగ విడిచి, వెండియు వేదవ్యాసమునీశ్వరుతో నిట్లనియె. 183

ప్రతిపదార్థం: అభిమన్యుండును= నీ కుమారుడైన అభిమన్యుడున్నూ; భండనంబునన్= యుద్ధంలో; పిఱుసనక= వెనుదీయక; శర+శరాసన+ఆది+వివిధ+ఆయుధంబులన్= బాణం; విల్లు మొదలైన అనేకాలైన ఆయుధాలతో; పరబలంబులన్= శత్రుసేనలను; బడలు వఱిచి= శ్రమపెట్టి; వీర స్వర్గసౌఖ్యంబున్= వీరస్వర్గానికి సంబంధించిన సుఖాన్ని; ప్రఖ్యాతియున్= ప్రసిద్ధియునూ; పడసెన్= పొందాడు; నీకున్= నీకు; అడలన్+పని, లేదు= దుఃఖించాల్సిన పనిలేదు; అని= ఆ ప్రకారంగా; చెప్పినన్= చెప్పగా; విని; ధర్మతనయుండు= ధర్మరాజు; తన, మనంబునన్= తన మనస్సులో; ఉత్తమ, క్షత్ర, ధర్మంబు, తెఱంగు= శ్రేష్ఠమైన క్షత్రియులయొక్క ధర్మవిధానము; ఇట్టిది+అ+అగుటన్= ఇటువంటిదే కావటం; తలపోసియున్= తలచుకొనియు; శూరులు= శూరత్వం కలవారు; పుణ్యలోకంబునన్= పుణ్యలోకంలో; సుఖంబు+ఉండుటయును= సుఖంగా ఉండుటమున్నూ; తెలిసియున్= గ్రహించియు; నెఱ+వగ= నిండైన దుఃఖం; విడిచి= వదలిపెట్టి; వెండియున్= మరల; వేదవ్యాసమునీశ్వరుతోన్= వ్యాసమునీంద్రుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అభిమన్యుడు యుద్ధంలో వెనుకాడక వివిధాయుధాలతో శత్రుబలాలను ఓడించి, వీరస్వర్గ సౌఖ్యాన్నీ, కీర్తినీ పొందాడు. కాబట్టి, నీవు శోకించ నవసరం లేదు' - అని చెప్పగా విని ధర్మరాజు ఉత్తమక్షత్రియ ధర్మపద్ధతి అటువంటిదే కదా అని మనస్సులో తలపోసి, శూరులు పుణ్యలోకాలలో సుఖిస్తారని తెలిసి, తీవ్రమైన శోకాన్ని విడిచి, మరల వేదవ్యాస మునీంద్రుడితో ఇట్లా అన్నాడు:

ఆ. **'మును ప్రసిద్ధిఁ బొంది చనిన భూపాలక । శ్రేష్ఠు లెవ్విధమునఁ జేసి రొక్కొ**
క్రతువు? లవ్విశిష్ట కర్మజాతముఁ దెలి । యంగఁ జెప్పి నన్ను నాదరింపు.' 184

ప్రతిపదార్థం: మును= పూర్వం; ప్రసిద్దిన్+పొంది= కీర్తిని గడించి; చనిన= పోయిన; భూపాలక శ్రేష్ఠులు= ఉత్తములైన రాజులు; క్రతువులు= యజ్ఞాలు; ఏ+విధమునన్= ఎట్లా ; చేసిరి+ఒక్కొ= చేశారో; ఆ+విశిష్ట, కర్మ, జాతమున్= అట్టి శ్రేష్ఠములైన కర్మలయొక్క సమూహాన్ని; తెలియంగన్= తెలిసేటట్లుగా; చెప్పి= వివరించి; నన్నున్= నన్ను; ఆదరింపు(ము)= అనుగ్రహించుము.

తాత్పర్యం: 'పూర్వం మిక్కిలి ప్రఖ్యాతి కెక్కి మరణించిన రాజశ్రేష్ఠులు యజ్ఞాలు ఏ విధంగా చేశారో, ఆ ఉత్తమకర్మ లేవో నాకు తెలియజేసి నన్ను అనుగ్రహించవలసింది.'

వ. **అనిన విని యమ్మనుజపతి తలంపు గనుంగొని కృష్ణద్వైపాయనుండు నీ విట్లడుగుట నీ కొడుకు దొంటి మహారాజుల యట్టివాఁడు గావున న క్కుమారునకు వారలకుం బుణ్యగతి దారతమ్యం బెట్టిదియో యని యరయుటగా నోపు నని యూహించెద' ననవుడు నతండు' మీ దివ్యచిత్తంబున నవధరించినదానిం గాదన నెట్లు వచ్చు? న వ్వానిని వినవలతు నానతియిండు.'** 185

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ఆ+మనుజపతి, తలంపు= ఆ రాజుయొక్క (ధర్మజుడి) అభిప్రాయం; కనుంగొని= తెలిసికొని; కృష్ణద్వైపాయనుండు= వేదవ్యాసుడు; నీవు; ఇట్లు+అడుగుట= ఈ విధంగా అడగటం; నీకొడుకు= నీ కుమారుడైన అభిమన్యుడు; తొంటి= పూర్వపు; మహారాజుల+అట్టివాఁడు= చక్రవర్తుల వంటివాడు; కావునన్= కాబట్టి; ఆ+కుమారులకున్= ఆ అభిమన్యుడికీ; వారలకున్= ఆ పూర్వరాజులకూ; పుణ్యగతిన్= పుణ్యం పొందటంలో; తారతమ్యంబు= భేదం; ఎట్టిదియో= ఎటువంటిదో; అని; కాన్+ఓపును+అని= తెలుసుకొనటానికిగా అభిప్రాయపడినట్లుందని; ఊహించెదన్= ఊహిస్తున్నాను; అనవుడున్= అని చెప్పిన వెంటనే; అతండు= ధర్మరాజు; మీ+దివ్య+చిత్తంబునన్= మీ శ్రేష్ఠమైన మనస్సులో; అవధరించిన+దానిన్= తలచిన(నిశ్చయించిన)దాన్ని; కాదు+అనన్+ఎట్లు+వచ్చున్?= కాదని ఎట్లా అనగలను?; ఆ+వానిని= మీరూహించిన లేక తలచిన వాటినే; వినన్= వినటానికి; వలతున్= ఇష్టపడుతూ ఉన్నాను; ఆనతి+ఇండు= సెలవియ్యండి (చెప్పండి).

తాత్పర్యం: అనగానే వ్యాసుడు విని ఆ ధర్మరాజు అభిప్రాయం తెలిసికొని ఇట్లన్నాడు: 'నీ విప్పుడు ఈ విధంగా అడగటం నీ కుమారుడు పూర్వపు మహారాజుల వంటివాడు కాబట్టి వారికీ అభిమన్యుడికీ పుణ్యగతిలో తారతమ్యం ఎటువంటిదో తెలియటానికే అని ఊహిస్తున్నాను' అన్నాడు. అపుడు ధర్మరాజు, 'మీ దివ్యమైన మనస్సులో మీ రేది తలచి, నిశ్చయించుకొన్నారో దానిని నేను ఎట్లా కాదనగలను? మీరు తలచిన దాన్నే వినాలని ఎంతో ఇష్టపడుతూ ఉన్నాను. సెలవియ్యండి.'

చ. **అనుటయు న మ్ముని ప్రవరుఁ డాతని కిట్లను 'నధ్వర ప్రవ**
ర్తనులుఁ దపఃప్రదీప్తులును దానసమగ్రు లుదాత్తశీలురుం
జనియెడు నట్టిచోటు లొక సంపదయే? రణశూరకోటి క
ర్జునసుతుఁ డత్యుదాత్త మగు చోట సుఖస్థితి నుండు భూవరా! 186

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధర్మరాజు అడుగగా; ఆ+ముని+ప్రవరుఁడు= మునిశ్రేష్ఠుడైన ఆ వ్యాసుడు; ఆతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; భూవరా!= రాజా!; అధ్వరప్రవర్తనులున్= యజ్ఞాలు ప్రవర్తింపజేసినవాళ్ళూ(యజ్ఞాలు నడిపేవాళ్ళూ); తపః+ప్రదీప్తులున్= తపస్సుచేత మిక్కిలి ప్రకాశించేవాళ్ళూ; దానసమగ్రులున్= దానంచేత పరిపూర్ణమైన వాళ్ళూ; ఉదాత్తశీలురున్= గొప్పశీలం కలవాళ్ళూ; చనియెడు+అట్టి+చోటులు= పోయే ప్రదేశాలు; రణశూరకోటికిన్= యుద్ధంలోని శూరుల సమూహానికి; ఒక సంపదయే?= ఒక సంపత్తేనా? (సంప్రతి అని పాఠాంతరం - సంప్రతియే?= లెక్కయా?); అర్జునసుతుఁడు= అర్జునుడి కొడుకైన అభిమన్యుడు; అతి+ఉదాత్తము+అగుచోటన్= మిక్కిలి గౌరవప్రదం, ప్రియమైనట్టి ప్రదేశంలో; సుఖస్థితిన్= సంతోషస్థితిలో; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: అనగానే ఆ ముని శ్రేష్ఠుడు (వ్యాసుడు) అతడితో (ధర్మరాజుతో) ఇట్లా అన్నాడు: 'ఓ రాజా!యజ్ఞాలు నిర్వర్తించే వాళ్ళూ, తపస్సుచేత ప్రకాశించే వాళ్ళూ, దానం చేసేవాళ్ళూ, గొప్పశీలం కలవాళ్ళూ పోగలిగే ప్రదేశాలు యుద్ధంలో మరణించే శూరులకు (ఒక లెక్కా?) ఒక సంపత్తేనా? అర్జునుడి కొడుకు మహోదాత్తమైన చోట సౌఖ్యస్థితిలో ఉన్నాడు.

విశేషం: యజ్ఞం, తపస్సు, దానం చేసినవారు మహోన్నత శీలం కలవారు ఏ ఉదాత్తమైన ప్రదేశాన్ని చేరి సౌఖ్యాన్ని పొందుతారో, అట్టి మిక్కిలి ఉదాత్తమైన ప్రదేశంలోనే అభిమన్యుడు సౌఖ్యంగా ఉన్నాడని ప్రస్తుత పద్య సారాంశం. అర్జునసుతుడు - అత్యుదాత్తమైన చోట, సుఖస్థితి' అనే ఈ మూడు పద ప్రయోగాలు గ్రహించదగినవి. అర్జునసుతుడనే ప్రయోగంలో కీర్తిధావళ్యం సూచితం. కీర్తిని పొందినవారు అందరికీ అతీతమైన సామాన్యులకు లభ్యంకాని మిక్కిలి ఉదాత్తస్థానంలో స్వర్గసౌఖ్యాన్ని అనుభవిస్తారనే విషయాన్ని అభిమన్యుడి విషయంలో రూఢిచేయటం ప్రస్తుత పద్యంలోని ప్రధానమైన విశిష్టమైన విశేషం.

వ. అది యట్లుండె, మహితాత్ము లయిన మహీపతుల వరిష్ఠకర్మానుష్ఠానంబు తెఱం గెఱుంగుట మేల కాదె! యంతలంతలు మానుసులు మడిసిరి గాని పుడమి నిత్యులై నిలువంబడ; రది వినుటయు నీ మనశ్శోకోప శమనంబు సేయుం; జెప్పెద నాకర్ణింపుము. 187

ప్రతిపదార్థం: అది+అట్లు+ఉండెన్= అది అట్లా ఉండనీ; మహిత+ఆత్ములు+అయిన= గొప్ప మనస్సు కలవారైన (మహాత్ములైన); మహీపతుల= రాజుల; వరిష్ఠ, కర్మ+అనుష్ఠానంబుల తెఱంగు= మిక్కిలి శ్రేష్ఠమైన కర్మల నడవడుల (నడపుటలందుగల) తీరు; ఎఱుంగుట= తెలియటం; మేలు+అ+కాదె!= శ్రేయస్కరమే కదా!; అంతలంతలు+మానుసులు= అంతంతటి యోధులు; మడిసిరి+కాని= మరణించారు కాని; పుడమిన్= భూమియందు; నిత్యులు+ఐ= శాశ్వతులై; నిలువంబడరు= స్థిరంగా ఉండలేకపోయారు; అది= ఆ విషయం; వినుటయున్= వినుటయున్నూ; నీ, మనఃశోక+ఉపశమనంబు= నీ మనస్సునందలి దుఃఖానికి ఊరట; చేయున్= కలిగిస్తుంది; చెప్పెదన్= చెబుతూ ఉన్నాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అది అట్లా ఉండనీ. గొప్పవారైన రాజులు మిక్కిలి గొప్ప కార్యాలు చేసిన పద్ధతిని తెలిసికొనటం మంచిదే కదా! అంతటి మహానుభావులు సైతం గతించారు కాని, భూమిమీద శాశ్వతంగా నిలిచి ఉండలేదు. వారి కథలు వినటం చేత నీ మనోదుఃఖం తగ్గుతుంది. చెప్పుతాను వినుము.

విశేషం: మహనీయులైన మహీశుల శ్రేష్ఠకర్మానుష్ఠాన విధానాలు తెలిసికొనటం ఎంతో మంచిది. ఎంత మహోన్నతులైనా, ఈ లోకంలో శాశ్వతంగా నిలిచినవారు లేరు. మానసికమైన దుఃఖాన్ని ఉపశమింపజేసే దృష్టాంత పూర్వకమైన ఉపాఖ్యానం మరొకటి వినుము- అని సువర్ణష్ఠీవి వృత్తాంతాన్ని చెప్పటానికి పూనుకొన్నాడు. సావధానంగా వినుమని హెచ్చరిస్తూ ఉన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వేదవ్యాస మునీంద్రుఁడు ధర్మజునకు సువర్ణష్ఠీవి చరిత్రంబు సెప్పుట (సం. అను 1-8-300 పంక్తి)

క. 'జనపాలక! సృంజయుఁ డను। మనుజేంద్రుఁడు పుణ్యమూర్తి మహిమాస్పదుఁ డి
వ్వననిధి వలయములోని య। వని నొక్కఁడ యేలు దుర్నివారస్ఫురణన్. 188

ప్రతిపదార్థం: జనపాలక!= రాజా!; పుణ్యమూర్తి= పుణ్యస్వరూపుడూ; మహిమ+ఆస్పదుఁడు= మహిమకు (గొప్పతనానికి) నెలవైన వాడూ (అయిన); సృంజయుండు+అను, మనుజ+ఇంద్రుఁడు= సృంజయుడు అనే పేరుగల రాజు; దుర్నివార+స్ఫురణన్= నివారించలేని స్ఫూర్తితో; ఈ+వననిధి వలయములోని+అవనిన్= వలయాకారంగల సముద్ర మధ్యభాగంలోని భూమిని (సముద్రంచేత చుట్టబడిన సమస్త భూప్రపంచాన్ని); ఒక్కఁడు+అ= ఒక్కడే; ఏలున్= పాలిస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: 'ఓ రాజా! పుణ్యస్వరూపుడూ, మహిమకు నివాసమైనవాడూ అయిన సృంజయుడు అనే రాజు సముద్రంచేత ఆవరించబడిన సమస్త భూమినీ తా నొక్కడే (ఏకచ్ఛత్రాధిపత్యంగా) పరిపాలిస్తూ ఉన్నాడు.

విశేషం: 'మహిమాస్పదుఁడు' అనే ప్రయోగం ఈ కథలో కావ్యార్థ సూచనవంటిది. 191 వచనభాగంలోని 'అసమాన మహిమానందంబునం బ్రకాశుండై' అనేది సృంజయుడి సంపద్వైభవాన్ని ప్రస్తుత ప్రయోగం తెలుపుతూ ఉన్నది. 'చతురబ్ధి వేలావలయిత భూమి'ని 'అవ్వననిధి వలయములోని అవని' అని తిక్కన ఎంతో సంగ్రహంగా పేర్కొన్నాడు. ఏకచ్ఛత్రాధిపతియై పరిపాలిస్తున్నాడనే భావాన్ని 'అవని నొక్కఁడ యేలు' నని తిక్కన ప్రయోగించాడు. 'దుర్నివార స్ఫురణన్' అనే చివరి ప్రయోగంలో అనివార్య స్ఫూర్తిని తెలిపాడు.

వ. సంతానార్థి యయి సంతతంబును భూసుర పూజనంబులు సేయుచుండు నా నరపతికి నారదుండు సఖుం డగుట నతని పాలికిఁ బలుమాఱు నరుగుదెంచుచుండు; నొక్కనాఁడు విప్రవరు లతిప్రయత్నంబునం గూడికొని యమ్మునివరునితో నిమ్మహీపతి కోర్కి దీర్పవలదే యని చెప్పిన. 189

ప్రతిపదార్థం: సంతాన+అర్థి+అయి= సంతానాన్ని కోరినవాడై; సంతతంబును= ఎల్లప్పుడున్నూ; భూసుర, పూజనంబులు= బ్రాహ్మణపూజలు; చేయుచుండున్= చేస్తూ ఉన్నాడు; ఆ+నరపతికిన్= ఆ రాజుకు; నారదుండు= నారదమహర్షి; సఖుండు+అగుటన్= మిత్రుడు కావటంచేత; అతని పాలికిన్= ఆ రాజుకడకు; పలుమాఱున్= (అనేక పర్యాయాలు) చాలామార్లు; అరుగుదెంచుచుండున్= వస్తూ ఉంటాడు; ఒక్కనాఁడు= ఒకదినం; విప్రవరులు= బ్రాహ్మణశ్రేష్ఠులు; అతి ప్రయత్నంబునన్= మిక్కిలి ప్రయత్నంతో; కూడికొని= అందరూ కలిసికొని; ఆ+మునివరునితోన్= ఆ మునిశ్రేష్ఠుడితో; ఈ+మహీపతి కోర్కి= ఈ రాజు కోర్కెను; తీర్పవలదే= తీర్చవచ్చుగదా!; అని+చెప్పినన్= అని చెప్పగా.

తాత్పర్యం: సంతాన వాంఛగల సృంజయుడు నిరంతర బ్రాహ్మణార్చనలు చేశాడు. అతడికి నారదుడు మిత్రుడు కావటం వలన అప్పుడప్పుడూ ఇరువురూ సమావేశం అయ్యేవారు. ఒక సందర్భంలో బ్రాహ్మణులందరూ నారదుడితో సృంజయుడి కోర్కె తీర్చవలసిందని చెప్పారు.

విశేషం: భూసురార్చన చేశాడు కాబట్టి ఆ విప్రులే సృంజయుడి కోర్కెను నారదుడికి చెప్పటం సమంజసంగా ఉన్నది. ప్రభువు ప్రత్యేకంగా అడుగకుండా బ్రాహ్మణు లడగటం ఏమిటి? అని అనిపించవచ్చును. నిరంతరం రాజు క్షేమాన్ని కోరే పురోహితులు ఆ రాజు లోలోపల కుమిలిపోతూ ఉంటే అతడి కాంక్షను విన్నవించటం సముచితమే కదా!

క. 'అతఁ డతనితోడ 'భవదీ। ప్సిత మెయ్యది నాకు నేల చెప్ప?' వనుడు 'నం
చితగుణుఁడు రూపసియు నగు। సుతుఁ గోరుదు నెపుడు నేను సురగణవంద్యా! 190

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అతఁడు= ఆ నారదమహర్షి; అతనితోడన్= ఆ సృంజయుడితో; భవత్+ఈప్సితము= నీయొక్క కోర్కె; ఎయ్యది?= ఏది?; నాకున్= నాకు; ఏల= ఎందుకు; చెప్పవు?= చెప్పకున్నావు?; అనుడున్= అనిన వెంటనే; సురగణవంద్యా!= దేవతా సమూహంచేత నమస్కరించబడేవాడా!; ఏను= నేను; ఎపుడున్= ఎల్లప్పుడూ; అంచిత+గుణుఁడు= ఒప్పిదములైన గుణాలు కలవాడూ; రూపసియున్= రూపు (అందం) కలవాడున్నూ; అగు= అయినట్టి; సుతున్= కుమారుడిని; కోరుదున్= ఇష్టపడతాను.

తాత్పర్యం: నారదముని సృంజయుడితో ' నీకోర్కె ఏమిటి? ఎందుకు నాకు చెప్పకుండా ఉన్నావు? అనగానే 'దేవతా గణంచేత కీర్తింపబడే నారదమునీంద్రా! నేను నిరంతరమూ సద్గుణ సంపన్నుడు, రూపవంతుడూ అయిన కుమారుడిని కోరుకుంటూ ఉంటాను.

విశేషం: ఈ కందపద్యం తుదిలో 'సురగణవంద్యా!' అని ఉన్నది. 'సురగుణ' అనే పాఠాంతరం ఒకటి ఉన్నది. అదికొంత అన్వయక్లిష్టం. అయినా అర్థవైశిష్ట్యం కలదిగా అనిపిస్తూ ఉన్నది. అర్థవంతంగా ఉంటుంది. సృంజయుడు తనకు 'అంచిత గుణు' డైన సుతుడు కావాలని కోరుతూ ఉన్నాడు. ఆతడి కోరికను తీర్చే నారదుడిలో కూడా వంద్యములైన సురగుణాలు ఉన్నాయనటం సాభిప్రాయం.

వ. **అక్కుమారుండును మూత్రపురీష లాలాశ్రుస్వేదంబులు సువర్ణంబు లగునట్టివాఁడు గావలయు' ననిన నమ్మహీపతికి నమ్మహాత్ముం డవ్వరం బిచ్చె; నా సృంజయుండు నత్తెఱంగుతనయుం బడసి సువర్ణష్ఠీవి యను పేరిడి ప్రియంబునం బెనుచుచు వానివలనం గనకం బనుదినంబు నుత్తరోత్తరాభివృద్ధి యగుచుండ సమృద్ధి నొంది, శయనాసన సదన ప్రాకార ప్రభృతి సమస్త వస్తువులను కాంచన మయంబులు గావించికొని యసమాన మహిమానందంబునం బ్రకాశుం డై.** **191**

ప్రతిపదార్థం: ఆ+కుమారుండునున్= ఆ పుత్రుడున్నూ; మూత్ర, పురీష, లాలా+స్వేదనంబులు= మూత్రమూ, మలమూ, లాలాజలమూ, కన్నీరు, చెమటలు; సువర్ణంబులు+అగు+అట్టివాఁడు= బంగారాలు అయ్యేటటువంటివాడు; కావలయున్= కావాలి; అనినన్= అనగా; ఆ+మహీపతికిన్= ఆ రాజుకు; ఆ+మహాత్ముండు= మహనీయుడైన ఆ నారదుడు; ఆ+వరంబు+ఇచ్చెన్= ఆ వరం ఇచ్చాడు; ఆ సృంజయుండున్; ఆ+తెఱంగు+తనయున్= ఆ విధమైన కొడుకును; పడసి= పొంది; సువర్ణష్ఠీవి+అను పేరు+ఇడి= సువర్ణష్ఠీవి అనే నామకరణం చేసి; ప్రియంబునన్= ప్రేమతో; పెనుచుచున్= పోషిస్తూ; వానివలనన్= అతడి వలన; కనకంబు= బంగారు; అనుదినంబున్= ప్రతిదినమూ; ఉత్తరోత్తర+అభివృద్ధి= మరీమరీ ఎడతెగని పెంపు; అగుచుండన్= అవుతూ ఉండగా; సమృద్ధిన్+ఒంది= పెంపును పొంది; శయన+ఆసన, సదన ప్రాకార, ప్రభృతి= పడకా, పీటా, ఇల్లూ ప్రహరీ మొదలైన; సమస్త వస్తువులును= అన్ని పదార్థాలు; కాంచనమయంబులు= బంగారుమయంగా; కావించుకొని= చేసికొని; అసమాన, మహిమ+ఆనందంబునన్= సాటిలేని; మహిమవలని సంతోషంతో; ప్రకాశుండు+ఐ= వెలుగుతూ ఉన్నవాడై.

తాత్పర్యం: ఆ కొడుకు యొక్క మూత్రం, మలం, కన్నీరు, చెమట - ఇవన్నీ బంగారంగానే కావాలి' అన్నాడు. నారదుడు అతడికి ఆ వరం ఇచ్చాడు. ఆ సృంజయుడు అట్లాంటి కొడుకును పొంది, సువర్ణష్ఠీవి అనే పేరు పెట్టి అనురాగంతో పెంచసాగాడు. ఆ కొడుకు వలన ప్రతిరోజూ బంగారాన్ని పొందుతూ క్రమక్రమాభివృద్ధి పొంది, పడకలు, గద్దెలు, ఇండ్లు, ప్రాకారాలు, మొదలైన వస్తువులన్నీ బంగారుమయం చేసికొని సాటిలేని మహిమతో, ఆనందంతో ప్రకాశిస్తూ.

క. **విలసిల్లుచు నుండఁగ మ్రు । చ్చిలి పట్టి కుమారునోరఁ జీర దుఱిమి వెం**
గలు లగు క్రూరులు కొందఱు । వెలువడఁ గొనిపోయి యొక్క విపినములోనన్. **192**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: విలసిల్లుచున్+ఉండఁగన్= ప్రకాశిస్తూ ఉండగా; వెంగలులు= తెలివితక్కువవాళ్ళు (మూఢులు); అగు= అయిన; కొందఱు= కొంతమంది; క్రూరులు= పీడించే నీచులు; ముచ్చిలిపట్టి= దొంగతనంతో పట్టుకొని; కుమారు+నోరన్= ఆ పసిపిల్లవాడి నోటిలో; చీరన్= గుడ్డను; తుఱిమి= క్రుక్కి; వెలువడన్= వెలుపలికి; కొనిపోయి= తీసికొనిపోయి; ఒక్క+విపినము లోనన్= ఒక అడవిలో.

తాత్పర్యం: ఆ విధంగా సృంజయుడు ప్రకాశిస్తూ ఉండగా అవివేకులైన కొందరు క్రూరులు ఆపిల్లవాడిని దొంగ తనంగా పట్టుకొని, నోటిలో గుడ్డ తురిమి వెలుపలికి తీసికొని వెళ్ళి ఒక అడవిలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: దొంగిలించిన వ్యక్తులను తిక్కన వెంగలులు, క్రూరులు అని ప్రయోగించాడు. పిల్లవాడివలన కొల్లగా బంగారం కలుగుతూ ఉన్నది అని విన్న దొంగలు అతడి మేనంతా బంగారం ఉంటుందని అవివేకంతో అపహరించారు. పీడించే మనస్తత్వం ఉన్న క్రూరులు కాబట్టి పిల్లవాడిని చంపారు. అంతేకాదు. తమలో తాము పోట్లాడుకొని చంపుకొనటం వారి వెంగలితనాన్ని, క్రూరత్వాన్ని మరీ ప్రస్ఫుటం చేస్తూ ఉన్నది. పిల్లవాడి అరుపుపైకి వినిపించకుండా దొంగలు నోటిలో గుడ్డ తురుముట అనే విషయాన్ని శబ్దాలంకారం గల 'కుమారు నోరఁ జీర దుఱిమి' అనే ప్రయోగంలో తిక్కన స్పష్టం చేశారు. 'తుఱిమి' లోని శకట రేఫ క్రూరుల క్రౌర్యాన్ని ధ్వనింపజేస్తూ ఉన్నది.

ఆ. **కడుపు (వ) వ్రచ్చి యొడలు గలయంగ జల్లించి । పాపి పాపి చూచి, పసిఁడి గాన**
కచట శవము వైచి యరుగుచునుండి త । త్కర్మ ఫలముఁ దమ్ముఁ గలఁచుటయును. **193**

ప్రతిపదార్థం: కడుపున్= పొట్టను; వ్రచ్చి= చీల్చి; ('వచ్చి' అని ఉస్మానియా ప్రతి. వ్రచ్చి అని పాఠాంతరమే అర్థవంతం); ఒడలు= శరీరం; కలయంగన్= అంతటా(అందరూ); జల్లించి= శోధించి(చంపి); పాపి, పాపి= విడదీసి విడదీసి; చూచి= చూచి; అచటన్= ఆ శరీరంలో; పసిఁడి+కానక= బంగారును చూడక; శవమున్= పీనుగును; వైచి= పడవేసి; తద్+కర్మ+ఫలమున్= ఆ క్రూర కార్యంయొక్క ఫలితమున్నూ; తమ్మున్= తమను (అనగా ఆ దొంగలను); కలఁచుటయును= కలత కలిగించటమూ.

తాత్పర్యం: కడుపును చీల్చి, ఒళ్ళంతా గాలించి, అక్కడ బంగారు కనిపించకపోవటంతో శవాన్ని పారవైచి పోతూ ఉండగా, వాళ్ళు చేసిన కర్మఫలం వారిలో కలత కలిగించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అర్థగౌరవం దృష్టితో పరిశీలిస్తే ఈ పద్యంలో కొన్ని పదాలకు నానార్థాలు స్ఫురిస్తాయి. కలయ శబ్దానికి అంతటా అనియే కాకుండా ప్రస్తుత సందర్భాన్ని బట్టి 'అందరూ' అనే అర్థాన్ని కూడా అన్వయించుకొనవచ్చును. అట్లే 'జల్లించి' అనటానికి 'చంపి' అనే అర్థంకూడా సరిపోతుంది. 'పాపి పాపి' అనే ప్రయోగం క్రూరులైన దొంగల పరంగా పాపాత్ముడు అనే అర్థంలో సందర్భ సముచితంగా ఉన్నది.

వ. **ఆ పాపాత్ములు తమలోనం గలహించి, యొండొరుల వధియించి, యందఱు నధోగతిం జెందిరి; సృంజయుండును గొడుకుం గానక వెదకి తత్కళేబరంబు గని పరలోక క్రియలు నిర్వర్తించి, శోకంబునం బలవించుచున్న న న్నరేంద్రు కడకు నారదుం డరుగుదెంచి యతనిచేత నర్చితుండై.** **194**

ప్రతిపదార్థం: ఆ+పాపాత్ములు= ఆ పాపచిత్తులు; తమలోనన్= తమలో తాము; కలహించి= తగవులాడి; ఒండొరులన్= ఒకరినొకరు; వధియించి= చంపుకొని; అందఱున్= అందరూ; అధోగతిన్= నాశనం (తక్కువస్థితిని); చెందిరి= అయ్యారు (పొందారు); సృంజయుండునున్= సృంజయుడున్నూ; కొడుకున్= కుమారుడిని; కానక= కాంచక; వెదకి= అన్వేషించి; తద్+కళేబరంబున్= అతడియొక్క శవాన్ని; కని= చూచి; పరలోకక్రియలు= ఉత్తరలోక క్రియలు (అంత్యకర్మలు); నిర్వర్తించి= జరిపి; శోకంబునన్= దుఃఖంతో; పలవించుచున్నన్= విలపిస్తూ ఉండగా; ఆ+నరేంద్రుకడకున్= ఆ రాజు దగ్గరకు; నారదుండు= నారదముని; అరుగుదెంచి= వచ్చి; అతనిచేతన్= ఆ సృంజయుడి చేత; అర్చితుండు+ఐ= పూజించబడినవాడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ పాపాత్ములైన దొంగలు తమలో తాము కలహించుకొని ఒకరినొకరు చంపుకొన్నారు. సృంజయుడు తన కుమారుడికై వెదకి, కళేబరానికి పరలోక క్రియలు నిర్వర్తించాడు. కుమారుడి మరణానికి ఎంతో విలపించాడు. అప్పుడు నారదుడు అతడి కడకు వచ్చి అర్ఘ్యాసనాది విధులతో అర్చించబడి.

క. 'జననాథ! యిట్లు శోకం । బునఁ గుందినఁ దనువు విడిచి పోదె యుసుఱు? స
చ్చిన వారలు వత్తురె యే । డ్చినఁ? జెలిమిం జేసి హితము సెప్పెద నీకున్. 195

ప్రతిపదార్థం: జననాథ!= రాజా!; ఇట్లు= ఈ విధంగా; శోకంబునన్= దుఃఖంతో; కుందినన్= తపించినచో; ఉసుఱు= ప్రాణం; తనువు+విడిచి= శరీరం వదలిపెట్టి; పోదె!= పోదా!; చచ్చినవారలు= మరణించిన వాళ్ళు; ఏడ్చినన్= దుఃఖిస్తే; వత్తురె?= వస్తారా?; చెలిమిన్+చేసి= స్నేహంచేత; నీకున్= నీకు; హితము= (తగినది) మేలు; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: 'రాజా! ఎందుకిట్లా దుఃఖంతో తపిస్తావు? ప్రాణం శరీరాన్ని విడిచిపోకుండా ఉంటుందా? ఎంత ఏడ్చినా చచ్చినవాళ్ళు మళ్ళీ తిరిగి వస్తారా? చెలిమిచేత నీకు నేను హితం చెప్పుతున్నాను.

విశేషం: ప్రాణాలు శరీరాన్నివిడిచిపోవటం తథ్యం, ఎంత ఏడ్చినా చచ్చినవాళ్ళు మళ్ళీ తిరిగి రారు - అనే రెండు వాక్యాలు చావు నిత్యం అనే సత్యాన్ని చాటుతూ ఉన్నాయి. ఒక స్నేహధర్మం హితం చెప్పటం. హితం చెప్పటమే అతడి లక్ష్యం కాబట్టి హితుడౌతాడు. ఈ విధంగా ఇందులో మార్మికమూ, ధార్మికమూ అయిన జీవితసత్యాలు సూచించబడ్డాయి.

షోడశ రాజ చరిత్రము (సం. అను. 1-8-360 పంక్తి)

వ. అవధానాయత్తం బగు చిత్తంబుతో విను' మని యి ట్లనియె. 196

ప్రతిపదార్థం: అవధాన+ఆయత్తంబు+అగు+చిత్తంబుతోన్= అవధానం చేత సంసిద్ధం అయిన మనస్సుతో; వినుము= ఆకర్ణింపుము; అని; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: నిలకడ గల మనస్సుతో వినుము' - అని ఇట్లా అన్నాడు:

సీ. సంవర్తుఁ డను మహాసంయమి దేవతా । గురుతోడి యీసున నరుగుదెంచి
పూని యుపద్రష్టయై నడపంగ, హి । మాచల పాదంబునందు శక్ర
వరుణ ప్రభృతులైన సురలు మహామునీం । ద్రులును సహాయులై మెలఁగుచుండ
శాలా ప్రముఖ భవ్య సాధనంబులు గన । కమయంబులుగ వస్త్రకాంచనాజ్య

ఆ. దధి పయః ఫలాది తర్పణ ద్రవ్య స । మృద్ధి సకల జనులు మెచ్చఁ, బెక్కు
లధ్వరములు సేసె; నట్టి మరుత్తుండు । నిత్యపదవి నుండ నేర్చెనయ్య? 197

ప్రతిపదార్థం: సంవర్తుఁడు+అను, మహాసంయమి= సంవర్తుడు అనే పేరుగల గొప్ప ముని; దేవతాగురు తోడి+ఈసునన్= బృహస్పతి తోడి ఈర్ష్యతో (ఓర్వలేనితనంతో); అరుగుదెంచి= వచ్చి; ఉపద్రష్ట+ఐ= యజ్ఞకార్యం నిర్వర్తించే ఋత్విక్కై; పూని= ప్రయత్నించి; నడపంగన్= యజ్ఞం నిర్వర్తించగా; హిమ+అచల, పాదంబునందున్= హిమాలయ పర్వతంయొక్క అడుగుభాగంలో; శక్ర, వరుణ, ప్రభృతులు+ఐన, సురలు= దేవేంద్రుడు, వరుణుడు మొదలైన దేవతలు; మహామునీంద్రులును= గొప్ప ఋషీశ్వరులున్నూ; సహాయులు+ఐ= తోడుగా ఉన్నవారై; మెలఁగుచుండన్= ఒప్పుచుండగా; శాలా, ప్రముఖ, భవ్య సాధనంబులు= చావడి మొదలైన శ్రేష్ఠములైన ఉపకరణాలు; కనకమయంబులుగన్= బంగారుమయాలుగా; వస్త్ర, కాంచన+ఆజ్య దధి పయః

ఫల+ ఆది తర్పణ+ద్రవ్య సమృద్ధిన్= గుడ్డలూ, బంగారు, నెయ్యి, పెరుగు, పాలు, పండ్లు మొదలైన దేవతలకు తృప్తి కలిగించే, మంచిపదార్థాల పెంపుచేత; సకల జనులు= సమస్త ప్రజలూ; మెచ్చన్= పొగడగా; పెక్కు+లు+అధ్వరములు= అనేక యజ్ఞాలు; చేసినట్టి= నిర్వర్తించినట్టి; మరుత్తుండు= మరుత్తుడు అనే పేరుగల సార్వభౌముడు; నిత్యపదవిన్= శాశ్వతమైన స్థానంలో; ఉండనేర్చెన్+అయ్యె= ఉండగలిగాడా?

తాత్పర్యం: సంవర్తుడనే మహర్షి బృహస్పతితో ఈర్ష్యపడి, ఉపద్రష్ట (ఋత్విక్కు) అయి వచ్చి పూనికతో యజ్ఞకార్యం నిర్వహించగా, హిమాలయ పర్వతంయొక్క అడుగుభాగంలో దేవేంద్రుడు, వరుణుడు మొదలైన దేవతలూ, మునీంద్రులూ సహాయంగా ఉంటూ ఉండగా యజ్ఞానికి కావాల్సిన శాలాదులు బంగారుమయాలుగా, వస్త్రాలు, బంగారు, నెయ్యి, పెరుగు, పాలు, పండ్లు మొదలైన తర్పణానికి అవసరమైన మంచివస్తువులు నిండుగా ఉండగా, అందరూ పొగడేటట్లు అనేక యాగాలు చేసిన మరుత్తుడు అనే చక్రవర్తి శాశ్వతమైన పదవిలో ఉండగలిగాడా?

విశేషం: షోడశ చక్రవర్తులలో మరుత్తుడు నిర్వహించిన యజ్ఞయాగాదులు అతడు పొందిన శాశ్వత పదవి ఈ పద్యంలో తెలుపబడినవి. సంవర్తు డుపద్రష్టగా శక్రవరుణాది సురులు మునీంద్రులు సహాయులుగా సాగిన యజ్ఞంలో తర్పణ ద్రవ్య సమృద్ధి సమస్త జనులను అలరింపజేసింది. షోడశరాజుల చరిత్రలను వారి మహత్తర కార్యకలాపాలను తిక్కన సీసపద్యాలలో వివరించాడు. ఇదే మొదటి సీసం.

సీ. **సన్మార్గమున రాజ్యసంపద నొంది భూ । సురపూజ లొనరించి, సువ్రతముల**
బృందారకులఁ బ్రీతిఁ బొందించెఁ దన కర్థిఁ । బర్జన్యుఁ డేఁ టేఁటఁ బసిఁడివాన
కనకమయములైన కర్కట ఝుషనక్ర। కూర్మచయముతోడఁ గురియుచుండ
నయ్యర్థ మెల్ల ధనార్థుల కిచ్చుచుఁ । గురు జాంగలంబునఁ బరమనిష్ఠ

ఆ. **నశ్వమేధముఖము లైన రాజార్హయ । జ్ఞములు పెక్కు సేసె సకలజనులుఁ**
బొగడునట్టి పాడి(ట) నెగడె సుహోత్రుఁ డ । వ్విభుఁడు దెగియె ననఁగ వినమె అధిప! **198**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; సుహోత్రుఁడు= సుహోత్రుడనే పేరుగల రాజు; సన్మార్గమునన్= మంచిమార్గంలో; రాజ్యసంపదన్+ఒంది= సామ్రాజ్య సంపత్తిని పొంది; భూసుర+పూజలు= బ్రాహ్మణ సేవలు; ఒనరించి= చేసి; సువ్రతములన్= మంచి వ్రతాలతో; బృందారకులన్= దేవతలను; ప్రీతిన్+పొందించెన్= సంతోషపెట్టాడు; అర్థిన్= ప్రీతితో (ఆసక్తితో); తనకున్= తనకు; పర్జన్యుఁడు= వరుణదేవుడు; ఏఁటేఁటన్= ప్రతిసంవత్సరమూ; కనకమయములు+ఐన= బంగారు మయములైన; కర్కట= ఎండ్రకాయలు; ఝుష= చేపలు; నక్ర= మొసళ్ళు; కూర్మ= తాబేళ్ళు; చయములతోడన్= మొత్తంతో; పసిఁడివానన్= బంగారువానను; కురియుచుండన్= వర్షిస్తూ ఉండగా; ఆ+అర్థము+ఎల్లన్= ఆ ధనమునంతటినీ; ధన+అర్థులకున్= ధనాన్ని యాచించేవారికి; ఇచ్చుచున్= ఇస్తూ; పరమనిష్ఠన్= మిక్కిలి ఎడతెగని శ్రద్ధతో; కురు+జాంగలంబునన్= కురుక్షేత్రానికి సంబంధించిన మెరకనేలలో (ఒకానొక దేశంలో); అశ్వమేధ ముఖములు+ఐన= అశ్వమేధాలు మొదలైన; రాజ+అర్హ యజ్ఞములు= రాజులకు తగిన యజ్ఞాలు; పెక్కు+చేసెన్= అనేకాలు చేశాడు; సకలజనులున్= సమస్త ప్రజలున్నూ; పొగడు+అట్టి= నుతించే; పాడి(ట)న్= విధంగా; నెగడెన్= ఒప్పినాడు; ఆ+విభుఁడు= ఆ ప్రభువు; తెగియెన్= మరణించాడు; అనఁగన్= అంటూ ఉండగా; వినమె!= వింటున్నాం కదా!

తాత్పర్యం: సుహోత్రుడనే రాజు సక్రమమార్గంలో రాజ్యాన్ని సంపాదించి, బ్రాహ్మణులకు సేవలు చేసి, మంచి మంచి వ్రతాలతో దేవతలను సంతృప్తి పరచాడు. ఎంతో ప్రీతితో వరుణుడు ప్రతిసంవత్సరమూ, బంగారుమయాలైన ఎండ్రకాయలను, చేపలను, తాబేళ్ళను వర్షింపజేస్తూ ఉండగా, తన ధనాన్ని యాచకులకు ఇస్తూ, మిక్కిలి నిష్ఠతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కురుభూములకు సంబంధించిన మెరకనేలలో అశ్వమేధాది యజ్ఞాలు చాలా నిర్వర్తించాడు. సమస్త ప్రజలూ ఎంతో కీర్తించారు. ఆ ప్రభువున్నూ చివరకు మరణించాడని వింటూనే ఉన్నాం గదా.

సీ. **కాంచనాలంకార కాంతంబులై రూఢి । కెక్కిన గజములు పెక్కువేలు,**
జవసత్త్వ రూపాది సకల గుణములఁ బెం । పెసఁగిన హయము లనేక లక్ష,
లమల సువర్ణమయము లగు కొమ్ములం । గొమరారు పశువులు గోటు, లూర్జి
తాంగక విలసదజావికంబులు గణ । నాతీతములు, గన్య లప్రమేయ

ఆ. **లఖిల రత్నవిరచితాభరణంబు ల । నల్పములు, మహీసురావళులకు**
నిచ్చి చేసెఁ గ్రతువు లెన్నియేనియు నంగుఁ । డతఁడు నన్యలోక గతుఁడు గాఁడె? 199

ప్రతిపదార్థం: అంగుఁడు= అంగుడు అనేరాజు; కాంచన+అలంకార; కాంతంబులు+ఐ= బంగారు ఆభరణాలచేత ప్రకాశించేవై; రూఢికిన్+ఎక్కిన గజములు= ప్రసిద్ధి కెక్కిన ఏనుగులు; పెక్కువేలు= ఎన్నో (అనేకములైన) వేలు; జవ, సత్త్వ, రూప+ఆది, సకల, గుణంబులన్= వేగమూ, బలమూ, రూపమూ మొదలైన అన్ని గుణాలతో; పెంపు+ఎసఁగిన+హయములు= ఆధిక్యంతో అతిశయించే గుర్రాలు; అనేకలక్షలు= పెక్కు లక్షలు; అమల, సువర్ణమయములు+అగు+కొమ్ములన్= నిర్మలమైన బంగారుమయాలైన కొమ్ములతో; కొమరారు, పశువులు= అందగించే గొడ్లు; కోటులు= కోట్లు; ఊర్జిత+అంగక+విలసత్+అజ+అవికంబులు= దృఢమైన శరీరాలతో ప్రకాశించే మేకలు, గొర్రెలు; గణన+అతీతములు= లెక్కకు మిక్కుటాలు; కన్యలు= వివాహం కాని స్త్రీలు; అప్రమేయలు= ఊహించశక్యంకాని వారు; అఖిల, రత్న, విరచిత+ఆభరణంబులు= అన్ని రత్నాలతో బాగుగా కూర్చబడిన నగలు; అనల్పములు= విస్తారములు లేదా అల్పములు కానివి; మహీసుర+ఆవళులకున్= బ్రాహ్మణుల సమూహాలకు; ఇచ్చి= దానం చేసి; ఎన్ని ఏనియున్= ఎన్నో (లెక్కలేనన్ని); క్రతువులు= యజ్ఞాలు; చేసెన్= చేశాడు; అతఁడు= ఆ అంగుడు; అన్యలోక+గతుఁడు+కాఁడె?= పరలోకగతుడు అనగా దివంగతుడు కాలేదా?

తాత్పర్యం: అంగుడు అనే రాజు ఎన్నోవేల బంగారు ఆభరణాలతో ప్రకాశించే ప్రసిద్ధికెక్కిన ఏనుగులనూ, వేగమూ, బలమూ, రూపమూ మొదలైన అన్ని సుగుణాలతో మిక్కిలి అతిశయించే అనేక లక్షల గుర్రాలనూ, స్వచ్ఛమైన బంగారు కొమ్ములతో అందగించే కోట్లకొలది పశువులనూ, లెక్కకు మిక్కిలిగా, గొప్ప శరీరాలతో ఒప్పుతూ ఉండే మేకలనూ గొర్రెలనూ, మితిలేని కన్నెలనూ, విలువగలిగిన సకల రత్నాలతో పొదిగిన ఎన్నో నగలనూ బ్రాహ్మణ బృందాలకు ఇచ్చి, ఎన్నో యజ్ఞాలు చేశాడు. అట్టిరాజు అంగుడు దివంగతుడు కాలేదా?

సీ. **ఏడు దీవులయందుఁ గ్రీడాగతులఁ దన । రథము చరింప నరాతు లనఁగ**
వినియు నెఱుంగక విభవ మార్జించుచోఁ । బ్రజల నొప్పింపని పరమపుణ్య
కర్మంబునకు మెచ్చి గారవంబునఁ దన । కక్షయధనము ఫాలాక్షుఁ డొసఁగ
నశ్వమేధములు జాహ్నవిపొంత శిష్టజ । నాకీర్ణములుగఁ బె క్కాచరించెఁ;

ఆ. **దారకములు వృష్టిధారలు లెక్కింప । వచ్చుఁగాని యతని యిచ్చుగోవు**
లెన్నఁ గొలఁది గాదు; సన్నుతిపాత్ర మా । శిబికి నుర్వి నునికి సెల్లె నయ్య? 200

ప్రతిపదార్థం: ఏడు దీవుల అందున్= సప్తద్వీపాలలో; క్రీడాగతులన్= విహారలీలలతో (ఆటలనడకలతో); తన, రథము, చరింపన్= తన తేరు తిరుగగా; అరాతులు+అనఁగన్= శత్రువులు అనే పేరు; వినియున్+ఎఱుంగక= ఏనాడూ వినక (శత్రువులు లేకుండా); విభవము+ఆర్జించుచోన్= సంపదను(గొప్పతనాన్ని) సంపాదించే సందర్భంలో; విభవమున్+ఆర్జించుచోన్= సంపదను గడించేటప్పుడు;

ప్రజలన్= ప్రజలను; నొప్పింపని= బాధించని; పరమ, పుణ్య, కర్మంబునకున్= ఉత్కృష్టములైన ధర్మముయొక్క కార్యానికి; మెచ్చి= పొగడి; గారవంబునన్= ప్రీతితో; తనకున్= తనకు; ఫాలాక్షుఁడు= శివుడు; అక్షయ ధనము= తరగని సంపద; ఒసఁగన్= ఈయగా; జాహ్నవి+పొంతన్= గంగ+ఒడ్డున; శిష్టజన+ఆకీర్ణములుగన్= సజ్జనుల సందడి (ఎడం లేక నిండినవి) కలవిగా; అశ్వమేధములు= గుర్రాలను పశువులుగా చేసే యజ్ఞాలు; పెక్కు= చాలా; ఆచరించెన్= నిర్వహించాడు; తారకములు= నక్షత్రాలు; వృష్టిధారలు= వానచినుకులు; లెక్కింపన్ వచ్చున్= లెక్కపెట్టవచ్చును; కాని= కానీ; అతని+ఇచ్చు గోవులు= అతడు దానం చేసే ఆవులు; ఎన్నన్= లెక్కించటానికి; కొలఁదికాదు= పరిమితి లేదు; సన్నుతి పాత్రము= మిక్కిలి పొగడదగింది అగు; ఆ శిబికిన్= ఆ శిబిచక్రవర్తికి; ఉర్విన్= భూమియందు; ఉనికి= ఉండటం; చెల్లెనయ్యె?= చెల్లినదా?; (సూ॥ తద్ధర్మ భూతక్రియ లార్వార్థ పదకంబులు ప్రశ్నార్థకంబులగు. - ప్రౌఢ. క్రియ -3) వీలయినదా?; (భూలోకంలోనే శాశ్వతంగా ఉండటం జరగలేదు కదా!)

తాత్పర్యం: సప్త ద్వీపాలలో విహారలీలలతో తేరు నడవగా, శత్రువు లనేమాట వినీ తెలియక, ధనార్జనవేళ ప్రజలను బాధించక, అతడి పుణ్యకార్యాలకు మెచ్చి పరమశివుడు అక్షయధనాన్ని ప్రసాదించగా, శిష్టులతో ఎడం లేకుండా నిండిపోయిన గంగ ఒడ్డున ఎన్నో అశ్వమేధయాగాలు శిబి చక్రవర్తి నిర్వర్తించాడు. చుక్కలను, వాన చినుకులను లెక్కించవచ్చునేమో కాని అతడు చేసిన గోవుల దానానికి మితిలేదు. అట్లా పొగడదగిన శిబిచక్రవర్తి శాశ్వతంగా ఈ లోకంలో ఉండగలిగాడా?

సీ. **యౌవనంబునఁ దప మాచరింపఁగఁ దండ్రి । పంపున నరిగిన పెంపు కలిమి,**
సేతువు జలధిఁ బ్రఖ్యాతంబుగా నొన । ర్చిన మర్త్యలోక పావన విభూతి,
త్రైలోక్య కంటకు దశముఖు బంధుయు । క్తంబుగాఁ జంపిన కలితనమ్ము,
బాలురమరణంబు వాటిల్ల కుండంగఁ । జేసిన యత్యంత చిత్రమహిమ

ఆ. **గలిగి యశ్వమేధములు మున్నుగా ననే । కాధ్వరము లొనర్చి యఖిల జనులఁ**
దల్లి వోలె నరసి దశరథ రాముండు । గాలవశత నొందెఁ గాదె యధిప! **201**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; యౌవనంబునన్= యుక్తవయస్సులో; తపము+ఆచరింపఁగన్= తపస్సు చేయుటకు; తండ్రి+పంపునన్= తండ్రియొక్కఆజ్ఞతో; అరిగిన= (అడవులకు) పోయిన; పెంపు+కలిమి= గౌరవసంపద; జలధిన్= సముద్రముపై; సేతువున్= వంతెనను; ప్రఖ్యాతంబుగాన్= మిక్కిలి ప్రసిద్ధిగా; ఒనర్చిన= చేసిన; మర్త్యలోక= మానవలోకమందలి; పావన+విభూతి= పవిత్రమైన ఐశ్వర్యం; త్రైలోక్యకంటకున్= ముల్లోకాలకు కఠినుడూ, క్షుద్రశత్రువూ అయిన; దశముఖున్= రావణుడిని; బంధుయుక్తంబుగాన్= బంధుసమేతంగా; చంపిన+కలితనమ్ము= సంహరించిన సామర్థ్యం; బాలుర మరణంబు= పసిపిల్లల చావు; పాటిల్లకుండంగన్= కలుగకుండా; చేసిన= కావించిన; అత్యంత, చిత్ర, మహిమ= మిక్కిలి ఆశ్చర్యకరమైన (ప్రసిద్ధి ఐన) మహత్త్వం; కలిగి= పొంది; అశ్వమేధములు= అశ్వమేధయజ్ఞాలు; మున్నుగాన్= మొదలుగా; అనేక+అధ్వరములు+ఒనర్చి= పెక్కు యజ్ఞాలు చేసి; అఖిలజనులన్= సమస్త ప్రజలను; తల్లిపోలెన్= తల్లివలె; అరసి= కాపాడి; దశరథరాముండు= దశరథుడి కొడుకైన రాముడు; కాలవశతన్= చావుకు అధీనం కావటం; పొందెన్+కాదె!= పొందాడు కదా!

తాత్పర్యం: ఓ రాజా! యౌవనంలోనే తపస్సు చేయడానికి, తండ్రి ఆజ్ఞతో అడవులకు పోయిన గౌరవమూ, సముద్రంపైన ప్రసిద్ధంగా వంతెన నిర్మించిన ప్రసిద్ధ పవిత్రవైభవం, ముల్లోకాలకు కంటకుడైన రావణుడిని బంధుసమేతంగా కూల్చిన సామర్థ్యం, శిశుమరణాలు కలగకుండా కావించిన ఆశ్చర్యకరమైన మహత్త్వం కలిగి ఉండి, అశ్వమేధాది యజ్ఞాలు ఎన్నోచేసి, సమస్త ప్రజానీకాన్ని తల్లివలె పోషించిన దశరథ రాముడు కాలధర్మం చెందాడుకదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: శ్రీరాముడి అశ్వమేధాది యజ్ఞ నిర్వహణదక్షత, యౌవనంలోనే తండ్రి ఆజ్ఞను పాటించి, అడవుల కేగి, వారధి నిర్మించి దశకంఠుని దునుమాడిన వృత్తాంతాలు 'కట్టె, కొట్టె, తెచ్చె' అని మూడు ముక్కలలో చెప్పబడ్డాయి. శ్రీరాముడి ప్రత్యేక గుణాలలో ప్రస్తుత సందర్భానికి తగినది 'బాలుర మరణంబు వాటిల్లకుండంగఁ జేయుట' సమస్త ప్రజలను తల్లివలె నరయటం విశేషం. తండ్రి అనటం కంటె తల్లి అనటంలో వాత్సల్యానికి ప్రాముఖ్యం. సహజవాత్సల్యంలో సారళ్యానికి, నైర్మల్యానికి, నిర్వ్యాజప్రేమకు స్థానం. అప్పుడే అది 'రామరాజ్యం' అనే ప్రసిద్ధిని చాటగలుగుతుంది.

సీ. **పూర్వవంశ్యులఁ గావఁ బూని వియద్గంగ । నవని భాగీరథి యనఁగఁ బఱపి**
శక్రుండు మెచ్చఁ బరాక్రమంబునఁ బేర్చి । యప్రతిహతముగ నశ్వమేధ
యాగంబు లొనరించునప్పుడు వేయు వే । లరదంబులందుఁ గన్యల నలంకృ
తలఁ జేసి యునిచి, రథంబు రథంబున । కిభములు నూఱు నూఱేసి, యేనుఁ

తే. **గేనుఁగునకు గుఱ్ఱములు వేయేసి పాటి । హయము హయమున కట్ల గోచయ మమర్చి,**
భూరి భూరి యుతంబుగ భూసురులకు । నొసఁగినట్టి భగీరథుం డున్నవాఁడె? 202

ప్రతిపదార్థం: పూర్వవంశ్యులన్= పూర్వులైన తన వంశంలోని వాళ్ళను; కావన్= కాపాడటానికి; పూని= ప్రయత్నించి; వియద్గంగన్= ఆకాశగంగను; అవనిన్= భూలోకంలో; భాగీరథి+అనఁగన్= భాగీరథి అనగా; పఱపి= ప్రవహింప (పరువెత్త) జేసి; శక్రుండు= దేవేంద్రుడు; మెచ్చన్= పొగడగా, పరాక్రమంబునన్= మగటిమి (విక్రమం)తో; పేర్చి= అతిశయించి; అప్రతిహతముగన్= అనివార్యంగా (అడ్డులేకుండా); అశ్వమేధయాగంబులు= అశ్వమేధయజ్ఞాలు; ఒనరించు+అప్పుడున్= చేసే సందర్భంలో; వేయువేలు= వేలు వేలు; అరదంబులందున్= రథాలలో; కన్యలన్= అవివాహితలైన స్త్రీలను; అలంకృతలన్= అలంకరించబడిన వాళ్ళుగా; చేసి, ఉనిచి= రథాలలో కూర్చోబెట్టి; రథంబు, రథంబునకున్= తేరు తేరుకు; నూఱు, నూఱు+ఏసి= వందవంద వంతున; ఇభములు= ఏనుగులు; ఏనుఁగు+ఏనుఁగునకున్= ఒక్కొక్క ఏనుగుకూ; వేయి+ఏసి పాటి= వేయివంతున; గుఱ్ఱములు= గుఱ్ఱాలు; హయమునకున్= గుఱ్ఱానికి, గుఱ్ఱానికీ; అట్లు+అ= ఆ విధంగానే; గో, చయము+అమర్చి= గోవులమొత్తం ఏర్పాటు చేసి; భూరి, భూరి, యుతంబుగన్= అధికమైన బంగారంతో కూడా; భూసురులకున్= బ్రాహ్మణులకు; ఒసఁగినట్టి= దానం కావించినట్టి (ఇచ్చినటువంటి); భగీరథుండు= భగీరథుడు; ఉన్నవాఁడె?= ఉన్నాడా?

తాత్పర్యం: తన పూర్వులైన సగరులకు ఉత్తమగతి కలిగించటానికై అంతకుముం దెవ్వరూ చేయలేని పనికి తాను పూనుకొని, ఆకాశగంగను భాగీరథి అనే పేరుతో భూలోకంలో ప్రవహింపజేసి, దేవేంద్రుడు ప్రశంసించేటట్లు తన పరాక్రమంతో అడ్డులేకుండా అశ్వమేధయజ్ఞాలు కావించే సందర్భంలో వేలవేల రథాలలో అలంకరించిన కన్నెలను ఉంచి, రథరథానికి నూరు నూరువంతున ఏనుగులను, ఏనుగు ఏనుగుకీ వెయ్యేసి గుఱ్ఱాలను, ప్రతి గుఱ్ఱానికీ అదే విధంగా వెయ్యి గోవులను ఏర్పాటు చేసి, అధికంగా బంగారుతో కూడ బ్రాహ్మణులకుఇచ్చిన భగీరథుడు ఉన్నాడా?

సీ. **అర్థి విశ్వావసుం డాదిగాఁ గలుగు గం । ధర్వులు హృద్యవాదన మొనర్ప,**
నప్సరోనికురుంబ మాటలుఁ బాటలు । నై వినోదింపంగ, నమరగణము
బహువిధాలంకార భంగుల విన్నాణ । ములు సూప, దివ్యమునులు నుతింప
మనుజలోకం బెల్లఁ గనకాన్నవస్త్రభూ । షణ దానములఁ దృప్తి సనఁగ నశ్వ

ఆ. **మేధ సమితిఁ జేసి మెప్పించె నింద్రుని; । శతతమాధ్వరమున నతఁడు హయము**
నాస పడిన నిచ్చె నా దిలీపునిఁ జూపు । మా! ధరిత్రి నిపుడు మనుజనాథ! 203

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; విశ్వావసుండు+ఆదిగాన్+కలుగు, గంధర్వులు= విశ్వావసుడు మొదలుగా ఉన్న గంధర్వులు; అర్థిన్= కోరిక; హృద్య, వాదనము+ఒనర్పన్= మనోహరంగా వీణ మొదలగువాటిని వాయించటం చేయగా; అప్సరస్+నికురుంబము= అప్సరసల సమూహం; ఆటలున్+పాటలున్+ఐ= ఆటపాటలు కలిగి; వినోదింపంగన్= ఆనందించగా; అమరగణము= దేవతల మొత్తం; బహువిధ+అలంకార భంగులన్= పలురకాల ఆభరణాల విధాలతో; విన్నాణములు+చూపన్= అందాలు (నేర్పులు) ప్రదర్శించగా; దివ్యమునులు= దేవర్షులు; నుతింపన్= పొగడగా; మనుజ లోకంబు+ఎల్లన్= మానవ సమూహమంతా; కనక+అన్న, వస్త్ర, భూషణ, దానములన్= బంగారమూ, కూడూ, గుడ్డా, నగల దానాలచేత; తృప్తిన్ చనఁగన్= సంతుష్టి చెందగా; అశ్వమేధ సమితిన్= అశ్వమేధాల సమూహాన్ని (అనేకాలైన అశ్వమేధాలను); చేసి= కావించి; ఇంద్రునిన్+మెప్పించెన్= దేవేంద్రుడిని మెప్పించాడు; శతతమ+అధ్వరమునన్= నూరవయజ్ఞంలో; అతఁడు= ఇంద్రుడు; హయమున్= గుర్రాన్ని; ఆసపడినన్= కోరగా; ఇచ్చెన్= ఇచ్చాడు; ఆ+దిలీపునిన్= ఆ దిలీపమహారాజును; ధరిత్రిన్= ఇలలో; ఇపుడు= ఇప్పుడు; చూపుమా!= చూపగలవా!

తాత్పర్యం: ఓ రాజా! విశ్వావసుడు మొదలైన గంధర్వు లెంతో సంతోషంతో వీణ మొదలైన వాద్యాలు వాయించగా, అప్సరసస్త్రీలు ఆడుతూ పాడుతూ అలరించగా, దేవతలు రకరకాల అలంకారాలు ధరించి అందాలు చూపగా, ఋషులు కీర్తించగా, మానవులు పసిడీ, కూడూ, గుడ్డా, తొడవులూ మొదలైన దానాలు గ్రహించి సంతృప్తి పడగా, ఎన్నో అశ్వమేధాలు చేసి దిలీపుడు ఇంద్రుడిని మెప్పించాడు. నూరవ యజ్ఞాన్ని చేస్తూ ఉండగా, ఆ గుర్రాన్ని తన కిమ్మని దేవేంద్రుడు అడుగగానే ఇచ్చివేశాడు. అట్టి ఆ దిలీపుడిని ఇపుడు మనం చూడగలమా?

సీ. **జనన మాదిగఁ బాకశాసనుకరమునఁ । బ్రవహించు నేయును బాలుఁ ద్రావి,**
ద్వాదశదినము లాతఁడు గారవింపంగ । వర్ధిల్లి, పండ్రెండు వత్సరముల
ప్రాయ మై రాజ్యసంప్రాప్తికి నేతెంచి, । యర్కుని యుదయంబు నస్తమయము
నగునట్లు పొలిమేర లైన మహాక్షేత్ర । మంతయు నొక్కండ యనుభవించి,

ఆ. **యన్న పర్వతముల నాజ్యనదుల విప్ర । భోజనము లొనర్చి, రాజసూయ**
ములును నశ్వమేధములుఁ జేసి మాంధాతృఁ డింద నిలిచెనే నరేంద్రముఖ్య! 204

ప్రతిపదార్థం: నర+ఇంద్రముఖ్యా!= రాజశ్రేష్ఠుడా!; జననము+ఆదిగన్= పుట్టింది మొదలుగా; పాకశాసను కరమునన్= ఇంద్రుడి చేతిలో; ప్రవహించు= ప్రవహించునట్టి; నేయునున్+పాలున్+త్రావి= నెయ్యీ, పాలూ త్రాగి; ద్వాదశదినములు= పండ్రెండు దినాలు; ఆతఁడు= ఆ ఇంద్రుడు; గారవింపంగన్= ఆదరించగా; వర్ధిల్లి= అభివృద్ధి చెంది; పండ్రెండు, వత్సరముల, ప్రాయము+ఐ=పండ్రెండు సంవత్సరాల వయస్సై; రాజ్య, సంప్రాప్తికిన్+ఏతెంచి= రాజ్యాన్ని పొందటానికై వచ్చి; అర్కుని ఉదయంబున్= సూర్యుడి ఉదయమూ; అస్తయమున్= అస్తమించటమూ; అగునట్లు= అయ్యేటట్లు; పొలిమేరలు+ఐన= హద్దులుగా ఉండే; మహాక్షేత్రము+ అంతయున్= విస్తారమైన భూవలయమంతటినీ; ఒక్కండు+అ= ఒక్కడే; అనుభవించి= భోగించి; అన్న పర్వతములన్= అన్నపు కొండలతో; ఆజ్యనదులన్= నేతి నదులతో; విప్ర భోజనములు+ఒనర్చి= బ్రాహ్మణుల భోజనాలు కూర్చి; రాజసూయములును= రాజసూయ యాగాలూ; అశ్వమేధములున్= అశ్వమేధయజ్ఞాలూ; మాంధాతృడు= మాంధాతృ చక్రవర్తి; చేసెన్= నిర్వహించాడు; ఇందు+అ= ఇక్కడే (ఇహలోకంలోనే); నిలిచెనే?= ఉండినాడా?

తాత్పర్యం: రాజముఖ్యా! మాంధాతృ చక్రవర్తి తాను పుట్టింది మొదలు ఇంద్రుడి చేతి నుండి ప్రవహించునట్టి, నెయ్యీ, పాలూ త్రాగి పదిరెండు దినాలు ఆయన ఆదరించగా పెరిగి, పండ్రెండు సంవత్సరాల వయస్సులోనే రాజ్యాన్ని పొంది, ఉదయాస్త పర్వతాలే హద్దులుగా విశాలమైన భూమండలాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా అనుభవించి,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పర్వతాల అంతటి అన్నరాసులతో నదులవలె ప్రవహించే నేతులతో బ్రాహ్మణులకు అన్న సంతర్పణం చేశాడు. రాజసూయాలూ, అశ్వమేధాలూ చేశాడు. కాని, అతడు ఈ లోకంలో శాశ్వతంగా నిలిచాడా?

సీ. **అనిమిషాసుర యుద్ధమున నసురావళి । సమయించి, వర్ణాశ్రమముల నేర్ప**
రించి, భూమి యలంకరించి, యగ్నిష్టోమ । హయమేధ వాజపేయాతిరాత్ర
పౌండరీకము లనఁ బరఁగిన యధ్వరం । బు లనేకములు సేసి, భూసురులకు
నఖిల భూములఁ గలయర్థంబు లెల్లను । దనకని యేమియు నునుప కిచ్చె;

ఆ. **శుక్రునల్లుఁ డనఁగ శోభిల్లు తనయందు । ధర్మతత్త్వ మూర్జితముగ నియమ**
నిష్ఠుఁడై యయాతి నెగడె శాశ్వతుఁ డయ్యె । నే నృపాల! య మ్మహీశ్వరుండు. **205**

ప్రతిపదార్థం: నృపాల!= రాజా; యయాతి= యయాతి మహారాజు; అనిమిష+అసుర, యుద్ధమునన్= దేవ, దానవుల యుద్ధంలో; అసుర+ఆవళిన్= రాక్షసుల సమూహాన్ని; సమయించి= చంపి; వర్ణ+ఆశ్రమములన్= వర్ణాలను, ఆశ్రమాలను; ఏర్పరించి= నిర్ణయించి; భూమి+అలంకరించి= (యజ్ఞ యాగాదులు చేయటానికై) భూ ప్రదేశాన్ని సింగారించి; అగ్నిష్టోమ, హయమేధ, వాజపేయ+అతిరాత్ర, పౌండరీకములు+అనన్= అగ్నిష్టోమం, హయ(అశ్వ)మేధం, వాజపేయం, అతిరాత్రం, పౌండరీకం అని; అనన్= అనగా; పరఁగిన= ఒప్పిన; అనేకములు= పెక్కు; అధ్వరములు= యజ్ఞాలు; చేసి= నిర్వహించి; అఖిల+భూములన్= అన్ని ప్రాంతాలలో; కల+అర్థంబులు= ఉండే ధనాలు; ఎల్లను= అన్నింటినీ; తనకున్+అని+ఏమియున్+ఉనుపక= తన కొరకు అని ఏమీ ఉంచుకొనక; భూసురులకున్= బ్రాహ్మణులకు; ఇచ్చెన్= ఇచ్చాడు; నియమనిష్ఠుఁడు+ఐ= ఏర్పరచుకొన్న నిశ్చయాన్ని (ప్రతిజ్ఞ) ఎడతెగని శ్రద్ధతో నెరవేర్చేవాడై; శుక్రు+అల్లుఁడు+అనఁగన్= శుక్రాచార్యుల అల్లుడు అనగా; శోభిల్లు= ప్రకాశించే; తన అందున్= తనలో; ఊర్జితముగన్= గొప్పగా; ధర్మతత్త్వము= ధర్మస్వరూపం; నెగడెన్= ఒప్పింది; ఆ+మహీశ్వరుండు= ఆ రాజు; శాశ్వతుఁడు+అయ్యెనే?= స్థిరంగా నిత్యంగా ఉన్నారా?

తాత్పర్యం: ఓ రాజా! యయాతి, దేవాసురుల యుద్ధంలో పాల్గొని రాక్షసులను సంహరించాడు. వర్ణాశ్రమ ధర్మాలు, ఏర్పాటు చేశాడు. భూమిని సింగారించి అగ్నిష్టోమం, అశ్వమేధం, వాజపేయం, అతిరాత్రం, పౌండరీకం వంటి ఎన్నో యజ్ఞ యాగాదులు చేశాడు. సమస్త భూములలో సంప్రాప్తించే సంపదలను తనకని ఏమీ ఉంచుకొనకుండానే మొత్తం సంపత్తినీ బ్రాహ్మణులకు దానం చేశాడు. శుక్రుడి అల్లుడని ప్రసిద్ధికెక్కి ఎంతో శోభించే అతడు, నియమాలను నిష్ఠతో అనుష్ఠిస్తూ గొప్పగా ధర్మతత్త్వంతో ప్రకాశించాడు. ఆ రాజు ఈ లోకంలో శాశ్వతంగా ఉండగలిగాడా?

విశేషం: యయాతి అనేక విధాల యజ్ఞాలు నిర్వర్తించాడు. అందులో అతి ముఖ్యమైనవి హయమేధం, అగ్నిష్టోమం, అతిరాత్రం, వాజపేయం, పౌండరీకం అనేవి.

హయమేధం: దీనినే అశ్వమేధం అనికూడా పిలుస్తారు. నూరు అశ్వమేధాలు చేస్తే ఇంద్రపదవి లభిస్తుంది. మేధ్య అనగా హింసించటం. గుర్రాలను హింసించటం వలన దీని కా పేరు వచ్చింది. ఇటువంటిదే నరమేధం మొదలైనవి.

అగ్నిష్టోమం : ఇది జ్యోతిష్టోమంలో ఒక భాగం. ఎక్కువగా వసంత ఋతువులో ఆచరించబడే యజ్ఞం. అగ్నికి సంబంధించిన స్తోత్రాలు ఇందులో అధికంగా ఉంటాయి.

అతిరాత్రం : ఇది రాత్రి గడిచిపోతూ ఉన్నదనే సందర్భంలో చేయటంవలన దీనికీ పేరు వచ్చింది. ఇది కూడా జ్యోతిష్టోమంలోని ఒక భాగమే. ఇంతటికి జ్యోతిష్టోమం అంటే ఏమిటి? జ్యోతిస్సుల స్తోమం - జ్యోతిష్టోమం అని అర్థం. జ్యోతిస్సులు సామలు - అంటే సామమంత్రాలు. ఇందులో సంస్థ ముఖ్యావయవం. దీనికి పదహారుమంది ఋత్విక్కులు కావాలి. ముఖ్యంగా స్వర్గాన్ని కోరేవాళ్ళు దీనిని నిర్వహిస్తారు. దీనినే సోమయాగం అని కూడా అంటారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వాజపేయం : వాజంపేయం వాజపేయం అయినది. ఇది నెయ్యిని మాత్రమే త్రాగి చేయవలసిన యాగం.

పౌండరీకం : ఇది ఒక యజ్ఞభేదం. పుండరీక సంబంధమైనది పౌండరీకం. ఈ యజ్ఞాదు లన్నీ ఆయా పేర్లకు అనుగుణంగా నిర్వర్తించబడుతూ ఉంటాయి.

సత్త్రయాగం : ఇది 13 దినాలు మొదలు 100 దినాల వరకు జరిపే యజ్ఞం.

సీ. ఓర్వక పెక్కండ్రు రుర్వీశు లొక్కటఁ బైనెత్తి వచ్చిన భండనమున
వారి హేతిచ్ఛత్ర వాహన ధ్వజములు। నఱికిన నడు నడు నడిఁకి వార
లభయంబు వేఁడిన నందఱఁ గృపఁ గాచి। యేలె; నీ పెన్నేల యెల్లఁ దాన
కొని యధ్వరములు పెక్కు లొనర్చి వేడుకఁ। బాయసమ్ములు నపూపములు మోద

ఆ. కములు లోనుగాఁగఁ గల వంటకముల ను। ర్వీసురావళులకుఁ బ్రీతిఁ జేసి
దక్షిణలుగ మణివితానంబు లిచ్చిన। యంబరీషుఁ డేమి యయ్యెఁ? జెపుమ. 206

ప్రతిపదార్థం: పెక్కండ్రురు= అనేకులు; ఉర్వీశులు= రాజులు; ఓర్వక= సహించక; ఒక్కటన్= ఒక్కుమ్మడిగా; పైన్+ఎత్తి వచ్చినన్= దండెత్తి పైకి రాగా; భండనమునన్= యుద్ధంలో; వారి= ఆ శత్రురాజుల; హేతి, ఛత్ర, వాహన, ధ్వజములు= ఆయుధాలు, గొడుగులు, గుర్రాలు, జెండాలు; నఱికినన్= ఖండించగా; వారలు= ఆ శత్రురాజులు; నడునడు+నడిఁకి= నడునడు మంటూ వణకి (నడునడు= ధ్వన్యనుకరణ శబ్దం); అభయంబున్= భయంలేకుండా ఉండటాన్ని; వేఁడినన్= ప్రార్థించగా; అందఱన్= వాళ్ళను అందరినీ; కృపన్= దయతో; కాచి= కాపాడి; తాను+అ= తానే; ఈ+పెను నేల ఎల్లన్= ఈ (విశాలమైన) గొప్ప రాజ్యాన్ని అంతటినీ; ఏలెన్= పరిపాలించాడు; కొని= పూని; పెక్కులు= అనేకాలు; అధ్వరములు= యాగాలు; ఒనర్చి= చేసి; వేడుకన్= సంతోషంతో; పాయసమ్ములు= పరమాన్నాలూ; అపూపములు= పిండివంటలు; మోదకములు= కుడుములు; లోనుగాఁగన్+కల= మొదలుగా ఉన్న; వంటకములన్= వంటకాలతో; ఉర్వీసుర+ఆవళులకున్= బ్రాహ్మణుల సమూహాలకు; ప్రీతిన్+చేసి= ప్రీతి కలిగించి; మణివితానములు= మణుల మొత్తాలు; దక్షిణలుగన్+ఇచ్చిన= కానుకలుగా ఇచ్చిన; అంబరీషుఁడు= అంబరీషమహారాజు; ఏమి+అయ్యెన్?= ఏమైనాడు?; చెపుము!= చెప్పుమా!

తాత్పర్యం: ఎందరో రాజులు ఒక్కసారిగా ఓర్వలేక యుద్ధంలో దండెత్తి పైకి రాగా, వాళ్ళ ఆయుధాలు, గొడుగులు, వాహనాలు, జెండాలు నరికి, గజగజ వణికే ఆ రాజులు శరణు వేడగా అందరినీ దయతో కాపాడి, తానే ఇంతపెద్ద సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. లెక్కలేనన్ని యాగాలు చేశాడు. మణులను బ్రాహ్మణులకు దక్షిణలుగా ఇచ్చాడు. అట్టి ఆ అంబరీష మహారాజు ఇపు డేమైనాడో! నీవే చెప్పుము.

సీ. లక్షభార్యల నుపలాలించి యొక్కొక్క। వెలఁదికి వేవురు వేవు రాత్మ
జులు గాఁగఁ బదికోటు లలఘుమూర్తులఁ గాంచె;। వారును దోర్బలోజ్జ్వలులు నార్య
చరితులునై పేర్చి తురగమేధంబు లం। దఱు బహుదక్షిణోదాత్త భంగిఁ
జేయుచుఁ దనపంపు సేసి వర్తింపంగఁ। దానును విశ్రుతాధ్వరము లొప్పఁ

తే. బెంపు సొంపును సువ్రత సంపదయును। నిర్మల శ్రద్ధయును గర్మనిపుణతయును
నెఱయ శశిబిందుఁ డొనరించి నెగడె; నతఁడు। వడయఁ జాలెనె యెన్నఁడుఁ జెడని యొడలు? 207

ప్రతిపదార్థం: శశిబిందుఁడు= శశిబిందుడు అనే రాజు; లక్షభార్యలన్= లక్షమంది భార్యలను; ఉపలాలించి= బుజ్జగించి; ఒక్కొక్క వెలఁదికిన్= ఒక్కొక్క భార్యకు;వేవురు+వేవురు= వెయ్యిమంది, వెయ్యిమంది; ఆత్మజులు+కాఁగన్= కుమారులు కాగా;

పదికోటులు= పదికోట్లమంది; అలఘు+మూర్తులన్= గొప్ప స్వరూపం కలిగినవాళ్ళను; కాంచెన్= కన్నాడు; వారునున్= వారున్నూ; దోస్+బల+ఉజ్జ్వలులున్= భుజశక్తిచేత (అడ్డులేనివాళ్ళు) ప్రకాశించేవాళ్ళు; ఆర్యచరితులున్+అయి= పూజ్యమైన నడవడి కలవారున్నూ అయి; పేర్చి= విజృంభించి; అందరున్= అందరూ; తురగ మేధంబులు= అశ్వమేధాలు; బహు, దక్షిణ+ఉదాత్త భంగిన్= అనేక దక్షిణలను ధారాళమైన (ప్రియమైన) విధంతో; చేయుచున్= నిర్వహిస్తూ; తన పంపు చేసి= తన ఆజ్ఞ నెరవేర్చి; వర్తింపంగన్= ఉండగా; తానును= తానున్నూ; వి(శుత+అధ్వరములు= ప్రసిద్ధి కెక్కిన యాగాలు; ఒప్పన్= తగునట్లు; పెంపుసొంపును= అతిశయ సంతోషాన్నీ (పాలన సమృద్ధిని); సువ్రతసంపదయును= మంచి వ్రతములయొక్క సంపత్తియున్నూ; నిర్మలశ్రద్ధయును= నిష్కపట మయిన శ్రద్ధయున్నూ; నెఱయన్= నిండుకొనగా; ఒనర్చి= చేసి; నెగడెన్= ఒప్పారాడు; అతఁడు= ఆ శశిబిందుడు; ఎన్నఁడున్= ఎప్పుడున్నూ; చెడని ఒడలు= నశించని శరీరాన్ని; పడయన్+చాలెనె?= పొందగలిగాడా?

తాత్పర్యం: శశిబిందుడు లక్షమంది భార్యలను బుజ్జగించి ఒక్కొక్కరి వలన వేయిమంది కలుగగా పదికోట్ల మంది కుమారులను కన్నాడు. వారు బాహుబలంతో ప్రకాశిస్తూ పవిత్రచరిత్రులై అందరూ అనేక దక్షిణలు ధారాళంగా ఇచ్చి అశ్వమేధయాగాలు చేశారు. తండ్రి ఆజ్ఞ కుమారులు ఆ విధంగా పాటించి ప్రవర్తించగా, ఆ శశిబిందుడున్నూ వ్రతనిష్ఠల, శ్రద్ధపాలన సమృద్ధి ఒప్పగా ప్రసిద్ధ యాగాలు నిర్వర్తించాడు. కాని, అతడు శాశ్వత శరీరాన్ని పొందగలిగాడా!

విశేషం: 'కర్మనిపుణత' అనే ప్రయోగం 'యోగః కర్మసు కౌశలం' అనే గీతావాక్యాన్ని స్ఫురింపజేస్తూ ఉన్నది. పదికోట్ల పుత్రులను కని ఎన్నో వ్రతాలు, యాగాలు నిర్వహించిన శశిబిందు చక్రవర్తి కూడా తుట్టతుదకు మట్టిలో కలిసిపోయాడు. శాశ్వత శరీరు లెవ్వరూ లేరు అని ప్రస్తుతపద్య సారాంశం.

సీ. **అధికతపంబున నగ్ని నారాధించి । ప్రత్యక్ష మగుటయు బ్రహ్మచర్య**
వృత్తంబు దమమును వేదవిత్త్వము నహిం । సయుఁ బాత్రదానంబు శమము వరము
గాఁ గోరికొని వేదికాస్థలి మణికన । కాత్మిక యై ముప్పదాఱు యోజ
నముల దైర్ఘ్యము నంత కమరు విస్తారంబుఁ । గలుగంగ నొనరించి క్రతువు సేసి

తే. **విప్రతతులకు దాని నతిప్రియముగ । నిచ్చి, తనపేర గయ నుతి కెక్క వటము**
పొగడు వడయంగఁ బుణ్యుఁడై నెగడె గయుఁడు । భూవరోత్తమ! యతఁ డెందుఁ బోయెఁ జెపుమ!208

ప్రతిపదార్థం: భూవర+ఉత్తమ!= రాజశ్రేష్ఠా!; గయుఁడు= గయుడనే రాజు; అధికతపంబునన్= గొప్ప తపస్సుతో; అగ్నిన్= అగ్నిదేవుడిని; ఆరాధించి= సేవించి; ప్రత్యక్షము+అగుటయున్= అగ్ని సాక్షాత్కరించటమున్నూ; బ్రహ్మచర్యవృత్తంబున్= బ్రహ్మ చర్యంగల జీవనమూ; దమమును= ఇంద్రియ నిగ్రహమూ; వేదవిత్త్వమున్= వేదాలను తెలిసికొనే భావమున్నూ; అహింసయున్= హింస చేయకుండటమున్నూ; పాత్రదానంబు= యోగ్యులైన వాళ్ళకు దానం చేయటమున్నూ; శమమున్= అంతరింద్రియ నిగ్రహమున్నూ; వరముగాన్= వరంగా; కోరికొని= ఇష్టపడి గ్రహించి; వేదికాస్థలి= యజ్ఞంచేసే తిన్నెయొక్క ప్రదేశం; మణి, కనక+ఆత్మిక, ఐ= మణులూ బంగారంతో కూడుకొన్నదై; ముప్పదాఱు యోజనముల దైర్ఘ్యమున్= ముప్పైఆరు ఆమడల పొడవును; అంతకున్+అమరు= అనే కొలతలో; ఒప్పునట్టి(కుదురునట్టి); విస్తారంబున్= వెడల్పున్నూ; కలుగంగన్+ఒనరించి= అయ్యేటట్లు చేసి; క్రతువు+చేసి= యజ్ఞం కావించి; విప్రతతులకున్= బ్రాహ్మణుల మొత్తాలకు; ఇచ్చి= ఒసగి; తనపేరన్= తన పేరుతో; వటము= మర్రిచెట్టు; గయన్= గయాక్షేత్రంలో; నుతికెక్కన్= ప్రశస్తి కెక్కగా; పొగడు+పడయంగన్= కీర్తిని పొందగా; పుణ్యుఁడు+ఐ= ధార్మికుడై; నెగడెన్= వర్ధిల్లాడు; అతఁడు= ఆ గయుడు; ఎందున్+పోయెన్= ఎక్కడికి పోయాడో; చెపుమ!= చెప్పుమా!

తాత్పర్యం: రాజశ్రేష్ఠా! గయుడు తీవ్రమైన తపస్సు చేసి అగ్నిని ఆరాధించాడు. అతడు ప్రత్యక్షం కాగానే తనకు బ్రహ్మచర్య జీవనం, అంతరింద్రియ, బహిరింద్రియ నిగ్రహం, వేద విజ్ఞానం, అహింసా స్వభావం, పాత్రత నెరిగిన దానం చేసే గుణం వరాలుగా ఇమ్మని కోరుకొన్నాడు. ముప్పైఆరు యోజనాలు పొడవూ అంతే వెడల్పు ఉండే యజ్ఞవేదిక రత్నాలతో బంగారుతో కూడుకొని ఉండేటట్లుగా నిర్మించి యజ్ఞం చేసి బ్రాహ్మణులకు ఎంతో ప్రీతి కలిగించాడు. తన పేరుతో గయాక్షేత్రంలో మఱ్ఱిచెట్టు ప్రసిద్ధి కెక్కగా ధార్మికుడై కీర్తికెక్కాడు. కాని, ఇప్పుడు అతడుఎందు బోయాడో!

సీ. **ఇరువది యేవురు పరిణత పాచకు । లభ్యాగతులకును నతిథులకును**
బాటించి క్రొత్తగాఁ బవలును రేలును । వలయు నన్నము లిడ వెలసెఁ బశువు
లర్థి నుత్తమగతికై తామ చనుదేర । విశసించు నమరులు వేడ్కతోడఁ
బొడసూపి కడుపారఁ గుడువ హవిర్భాగ । ములు వెట్టు నివ్విధమున మహాద్భు

తే. **తముగ నొనరించె సత్త్రయాగము దదుత్స । వంబుఁ గొనియాడ వచ్చిన వార లెల్లఁ**
బ్రచుర పుణ్యాత్ముఁ డన నొప్పె రంతిదేవుఁ । డవ్విభునకును వలసె లోకాంతరంబు. 209

ప్రతిపదార్థం: పరిణతపాచకులు= ఆరితేరిన వంటగాళ్ళు; ఇరువది వేవురు= ఇరవైవేలమంది; అభ్యాగతులకును= భోజనానికి రండని స్వయంగా సాదరంతో పిలువబడే ఆహూతులకు; అతిథులకును= నిర్దిష్ట సమయంలో కాకుండా భోజనానికై అనుకొనకుండా ఆగంతకులై వచ్చే యాచకులకున్నూ; పాటించి= ఆదరించి; క్రొత్తగాన్= ఎప్పటికప్పుడు రుచులు కొత్తగా; పవలును= పగలూ; రేలునూ= రాత్రులున్నూ; వలయు= కావలసిన; అన్నములు= చతుర్విధాలైన భోజనాలు (అన్నాలు); ఇడన్= పెట్టగా; పశువులు= గోవులు; అర్థిన్= ఇష్టంతో; ఉత్తమగతికై= సద్గతి కోసమై (అనగా స్వర్గాపేక్షతో); తాము+అ= తమకు తామే; వెలసెన్= చేరాయి; చనుదేరన్= బయలుదేరగా; విశసించు= చంపు; అమరులు= దేవతలు; వేడ్కతోడన్= కుతూహలంతో (అభిలాషతో); పొడచూపి= ప్రత్యక్షమై; కడుపారన్= కడుపునిండా; కుడువన్= తినటానికి; హవిస్+భాగములు= యజ్ఞద్రవ్యాల విభాగాలు; పెట్టున్= ఉంచును; ఈ+విధమునన్= ఇట్లా; సత్త్రయాగము= మంచివారిని కాపాడే యాగం; మహా+అద్భుతముగన్= మిక్కిలి ఆశ్చర్యకరంగా; ఒనరించెన్= చేశాడు; తద్+ఉత్సవంబున్= ఆ యాగానికి సంబంధించిన ఉత్సవాన్ని; కొనియాడన్= పొగడటానికి; వచ్చిన వారలు+ఎల్లన్= వచ్చినవారంతా; ప్రచుర, పుణ్యాత్ముఁడు+అనన్= ప్రసిద్ధి కెక్కిన ధర్మాత్ముడు అనగా; ఒప్పెన్= ప్రకాశించాడు; ఆ+విభునకున్= ఆ ప్రభువునకున్నూ; లోక+అంతరంబు= అన్యలోకం; వలసెన్= తప్పనిది అయింది.

తాత్పర్యం: రంతిదేవుడు, ఇరవైవేలమంది ఆరితేరిన వంటవాళ్ళను నియమించి రాత్రింబవళ్ళూ అభ్యాగతులకూ, అతిథులకూ క్రొత్త క్రొత్త రుచులతో వారి వారికి ఇష్టమైన భోజనాలు ఏర్పాటు కావించాడు. సద్గతికోసం తమకు తామై ఎంతో సంతోషంతో గోవులు అతడి యాగానికి వచ్చి చేరాయి. దేవతలు వేడుకతో ప్రత్యక్షమై, కడుపార భుజించటానికి అతడు యజ్ఞద్రవ్యాలు మనకు పిలిచి పెడతా డని సంతోషపడ్డారు. ఆ విధంగా సత్రయాగాన్ని ఎంతో ఆశ్చర్యం కలిగేటట్లు రంతిదేవుడు నిర్వహించాడు. ఆ ఉత్సవాన్ని చూచి మెచ్చినవారంతా ఇత డెంత పుణ్యాత్ముడో అన్నారు. అట్టి పుణ్యాత్ముడు కూడా పరలోకానికి పోక తప్పలేదు.

సీ. **శరభసింహవ్యాఘ్ర సత్త్వ చయంబుల । నేడిక లె ట్లట్ల యెక్కి యాడి**
కట్టుచు విడుచుచుఁ గణ్వాశ్రమంబున । దమియింపఁగా సర్వదమన నామ
మిడియె నమ్ముని; పదంపడి మహారాజ్య ప । దస్థుఁడై కాళింది తటమునందు
భాగీరథీ తీర భాగంబునను సర । స్వతి సమీపంబున వాజిమేధ

తే. **రాజసూయాది వివిధాధ్వరము లొనర్చి । కనక నిర్మిత కరితురంగమ రథంబు**
లసదృశప్రీతి విప్రులఁ కొసఁగె భరతుఁ । డన్నరేంద్ర చంద్రుండును జన్నవాఁడ. 210

ప్రతిపదార్థం: శరభ, సింహ, వ్యాఘ్ర, సత్త్వ+చయంబులన్= మీగండ్ల మెకం, సింహం, పులి, మొదలైన జంతువుల మొత్తాలను; ఏడికలు= పొట్టేళ్ళు; ఎట్లు= ఏ విధమో; అట్లు+అ= ఆ విధంగా; ఎక్కి ఆడి= పైకెక్కి ఆడి; కట్టుచున్= బంధిస్తూ; విడుచుచున్= విడిపిస్తూ; కణ్వ+ఆశ్రమంబునన్= కణ్వమహర్షి యొక్క ఆశ్రమంలో; దమియింపన్+కాన్= అణచగా; ఆ+ముని= ఆ కణ్వమహాముని; సర్వదమన, నామము= సర్వదమనుడు (అన్నింటిని అణచేవాడు అని భావం) అనేపేరు; ఇడియెన్= పెట్టాడు; పదంపడి= అటుపైన; మహారాజ్యపదస్థుఁడు+ఐ= గొప్ప సామ్రాజ్యపదవిలో ఉన్నవాడై; కాళింది తటమునందున్= యమునానది ఒడ్డున; భాగీరథీతీర భాగంబునను= గంగానదియొక్క ఒడ్డు ప్రదేశంలో; సరస్వతి సమీపంబునన్= సరస్వతీనది చెంత; రాజసూయ+ఆది, వివిధ+అధ్వరములు= రాజసూయం మొదలైన అనేక విధాలైన యజ్ఞాలు; ఒనర్చి= చేసి; కనక, నిర్మిత, కరి, తురంగ, రథంబులు= బంగారుతో నిర్మించబడ్డ ఏనుగులు, గుర్రాలు, తేరులు; అసదృశ+ప్రీతిన్= సాటిలేని సంతోషంతో; విప్రులకున్= బ్రాహ్మణులకు; ఒసఁగెన్= ఇచ్చాడు; ఆ+నర+ఇంద్ర(నరేంద్ర) చంద్రుండును= ఆ రాజశ్రేష్ఠుడున్నూ; చన్నవాఁడు+అ= పోయినవాడే కదా!

తాత్పర్యం: శరభం, సింహం, పులివంటి క్రూరజంతువులను పొట్టేళ్ళవలె బంధిస్తూ, విడిపిస్తూ, వాటిపై కెక్కి ఆడుతూ, కణ్వాశ్రమంలో వాటిని అణచివేయటాన్ని చూచి కణ్వుడు సర్వదమనుడు అనే పేరు పెట్టాడు. అతడే తర్వాత మహారాజ్య పదవిని అధిష్ఠించి, గంగా, యమునా, సరస్వతీ నదీ తీరాలలో రాజసూయం మొదలైన అనేక యజ్ఞాలు నిర్వర్తించాడు. అతడు బంగారుతో నిర్మించబడ్డ ఏనుగులను, గుర్రాలను, తేరులను సాటిలేని సంతోషంతో సవన కార్యకలాపాలలో పాల్గొన్న సద్బ్రాహ్మణులకు ఇచ్చాడు. ఆ రాజ శ్రేష్ఠుడున్నూ ఇహలోకాన్ని విడిచి వెళ్ళినవాడే.

సీ. **మిట్టుఁ బల్లంబు నై మెలఁగంగఁ దనరథ । ప్రముఖ వాహనములఁ బఱప ననువు**
గా కున్న మేదినిఁ గడుసమస్థలి గాఁగ । వెరవున నొనరించి, విశ్రుతముగఁ
దనపేరఁ బృథివినాఁ జనఁ జేసి, గోరూప । యైన యవ్వసుమతి నమరగణముఁ
బనిచి యోషధులును బహురత్నములుఁ బిది । కించి జగంబుఁ బోషించె పృథుఁడు;

తే. **సేసె నానాధ్వరము లవి సెప్ప నేల, । సకల ధాత్రియు బ్రాహ్మణసమితి కిచ్చె;**
నమ్మహానుభావునకును నతుల యశము । కాక సుస్థిరమయ్యెనే కాయ మనఘ 211

ప్రతిపదార్థం: మిట్టున్+పల్లంబున్+ఐ= మిట్ట, పల్లం (హెచ్చుతగ్గులు కలదియై); మేదిని= భూమి; మెలఁగఁగన్= వర్తించగా (ఉండగా); తన= తనయొక్క; రథ, ప్రముఖ, వాహనములన్= తేరు మొదలైన వాహనాలను; పఱపన్= పరువెత్తించటానికి; అనువు+కాకున్నన్= అనుకూలంగా లేకుండగా; కడున్= మిక్కిలి; సమస్థలి+కాఁగన్= చదునైనస్థలం అయ్యేటట్లుగా; వెరవునన్= ఉపాయంతో; ఒనరించి= చేసి; విశ్రుతముగన్= మిక్కిలి ప్రసిద్ధి కెక్కిందిగా; తనపేరన్= తన పేరుతో; పృథివి+నాన్= పృథివి అనగా; చనన్+చేసి= చెల్లే (ఒప్పే) టట్లు ఒనర్చి; గోరూప+అయిన= గోవుయొక్క ఆకారంలో ఉన్నది అయిన; ఆ+వసుమతిన్= ఆ భూమిని; అమరగణమున్= దేవతాసమూహాన్ని; పనిచి= పంపి; ఓషధులును= ఓషధులూ (మందుచెట్లు); బహురత్నములును= అనేక రత్నాలును; పిదికించి= పిండించి; జగంబున్= లోకాన్ని; పృథుఁడు= పృథు చక్రవర్తి; పోషించెన్= పోషించాడు; నానా+అధ్వరములు= అనేక యజ్ఞాలు; చేసెన్= చేశాడు; అని+చెప్పన్+ఏల?= వాటిని చెప్పటం ఎందుకు?; సకలధాత్రియున్= సమస్త భూమినీ; బ్రాహ్మణులకున్= బ్రాహ్మణులకు; ఇచ్చెన్= ఇచ్చాడు; ఆ+మహానుభావునకున్= మిక్కిలి ఉదారుడైన ఆ

మహనీయుడికి; అతుల, యశము+అ= సాటిలేని కీర్తియే; కాక= తక్క (కాని); కాయము= శరీరం; సుస్థిరము= మిక్కిలి శాశ్వతం; అయ్యెనే?= అయిందా?

తాత్పర్యం: మిట్ట పల్లాలుగా ఉండి రథం మొదలైన వాహనాలు పోవటానికి అనుకూలంగా లేని భూమిని చదునుచేసి, దానిని తన పేర పృథ్వి అని ఒప్పారేటట్లు చేసి, గోరూపంలో ఉన్న భూదేవిని, ఓషధులూ, రత్నాలూ పిదుకవలసిందిగా ఆజ్ఞాపించి, లోకాన్ని పృథువు పోషించాడు. అతడు చేసిన వివిధ యజ్ఞాలను గురించి చెప్పవలసిన పనిలేదు. సమస్త భూమినీ అతడు బ్రాహ్మణులకు దానమిచ్చాడు. మహోదారుడైన ఆ మహనీయుడి యశస్సు నిలిచింది కాని శరీరం సుస్థిరం కాగలిగిందా!

సీ. **బ్రహ్మవిద్వేషంబు పరికించి కోపించి । యవిధేయుఁ డైన సహస్రబాహుఁ**
బరిమార్చి నృపతులఁ దర మిడి తునుమాడె । నిరువది యొక్కమా ఱెల్లచోట
నందఱ యేలెడు నన్ని భూములుఁ దాన । యేలె ధర్మోజ్జ్వల పాలనమున;
రాజయోగ్యములు ధరాసురార్హంబులు । నగు నధ్వరములు పె క్కాచరించెఁ

ఆ. **గశ్యపునకు నిచ్చి కాశ్యపి యను పేరఁ । జనఁగఁ జేసె నుర్వి జామదగ్న్యు**
వినమె యమ్మహాత్ముఁడును బరితోష వి । భ్రాంతి గలిగెనేని బ్రదుక లేఁడు. **212**

ప్రతిపదార్థం: బ్రహ్మవిద్వేషము= బ్రాహ్మణుడి యెడ కోపం; పరికించి= చూచి; కోపించి= క్రోధం వహించి; అవిధేయుఁడు+ఐన= వినయం లేనివాడైన; సహస్రబాహున్= వెయ్యి చేతులున్న కార్తవీర్యార్జునుడిని; పరిమార్చి= చంపి; నృపతులన్= రాజులను; తరమిడి= వరుసపెట్టి విడువకుండా; ఇరువది ఒక్కమాఱు= ఇరవై ఒక్కసారులు; తునుమాడెన్= సంహరించాడు; ఎల్లచోటన్= అన్నిచోట్ల; అందఱ ఏలెడు= అందరూ పరిపాలించే; అన్ని భూములున్= అన్ని ప్రదేశాలున్నూ; తాన= తానే; ధర్మ+ఉజ్జ్వల, పాలనమునన్= ధర్మంచేత ప్రకాశించే రక్షణతో; ఏలెన్= పోషించాడు; రాజ యోగ్యములు= రాజులకు తగినవి; ధరాసుర+అర్హంబులున్= బ్రాహ్మణులకు తగినవియున్నూ; అగు+అధ్వరములు= అయిన యజ్ఞాలు; పెక్కు= అనేకములు; ఆచరించెన్= చేశాడు; ఉర్విన్= భూమిని; కశ్యపునకున్= కశ్యపమహర్షికి; ఇచ్చి= ఒసగి; కాశ్యపి అనుపేరన్= కాశ్యపి అనే పేరుతో; చనఁగన్= ఒప్పేటట్లుగా; చేసెన్= చేశాడు; జామదగ్న్యున్= జమదగ్ని కుమారుడైన పరశురాముడి గురించి; వినమె!= వినలేదా?; ఆ+మహాత్ముఁడును= ఆ మహనీయుడున్నూ; పరితోష= సంతోషంయొక్క; విభ్రాంతి కలిగెన్+ఏని= విభ్రాంతి కలిగితే; బ్రదుకలేఁడు= జీవించబోడు.

తాత్పర్యం: అవిధేయుడైన కార్తవీర్యుడిలో ఉన్న బ్రాహ్మణద్వేషాన్ని చూచి, కోపించి అతడిని సంహరించాడు. అంతటితో ఊరుకోక రాజులనందరినీ విడువకుండా పరిమార్చి ఇరవై ఒక్క పర్యాయాలు దండెత్తి వారి రాజ్యాలను తానే ధర్మనిష్ఠతో ఉజ్జ్వలంగా పరిపాలించాడు. రాజులూ, బ్రాహ్మణులూ చేయవలసిన వివిధ యజ్ఞాలూ తాను చేశాడు. ఈ సమస్త భూమినీ కశ్యపుడికి ధారాదత్తం చేసి, కాశ్యపి అనే పేరు భూమికి కలిగేటట్లు చేశాడు. ఆ పరశురాముడిని గురించి విన్నాముకదా! అట్టి ఆ మహాత్ముడున్నూ పరితోష భంగం కలిగితే కాని శాశ్వతంగా జీవించలేకపోయాడు.

చ. **నలుమడి నీకు నమ్మనుజ నాయకు లేమిటఁ జూడ వచ్చినం**
దలఁప భవత్సుతుండును ను (నను) దాత్తుఁడు వారలకంటె, నెందునుం
గలయది, దీని కేల యధికంబగు నెవ్వగ నింత నొవ్వ; ని
త్తెలివి మనంబునం జొనుపు ధీరతసారత గూర్పు నేర్పునన్. **213**

ప్రతిపదార్థం: ఏమిటన్= ఏ విషయంలో; చూడన్+వచ్చినన్= ఆలోచించవచ్చినా (ఏ విషయంలో చూచినప్పటికిన్నీ); ఆ+మనుజనాయకులు= ఆ రాజులు; నీకున్= నీకు; నలుమడి= నాలుగు రెట్లు అధికం; తలఁపన్= ఆలోచించగా; వారలకంటెన్= వారందరికంటె; భవత్+సుతుండునున్= నీ కుమారుడును; ఉదాత్తుఁడు= గొప్పవాడు(అనుదాత్తుఁడు అనే ఉస్మానియా ప్రతిలోని ప్రయోగం వలన; విపరీతార్థం స్ఫురిస్తూ ఉన్నది); ఎందునున్= ఎక్కడా; కల+అది= ఉండేది; దీనికిన్= సర్వసాధారణమైన ఈ విషయానికి; అధికంబు+అగు+నెవ్వగన్= మిక్కిలి సంతాపంతో; ఇంత నొవ్వన్+ఏల?= ఇంతగా బాధపడటం ఎందుకు?; ధీరత సారత= ధైర్యం యొక్క చేవదనాన్ని; కూర్చు= కలిగించే; నేర్పునన్= నైపుణ్యంతో; ఈ+తెలివిన్= దేహాత్మాది భేదజ్ఞానాన్ని లేదా ప్రసన్నత్వాన్ని; మనంబునన్= మనస్సులో; చొనుపు= చొప్పించుము.

తాత్పర్యం: ఏ విషయంలో చూచినా ఆ రాజులు నీకు నాలుగురెట్లు అధికులు. ఆలోచించగా నీ కొడుకు ఆ రాజులకంటె గొప్పవాడు, ధీరోదాత్తుడూ. ఎక్కడా మరణం ఉండేదే! దీనికొరకు ఎందుకు ఇంతగా బాధపడి తపించిపోతావు? ధైర్యం తెచ్చుకొని దేహాత్మలకు సంబంధించిన జ్ఞానాన్నీ, ప్రసన్నతనూ నీ మనస్సులోకి చొప్పించుము.

విశేషం: నలుమడి అనే ఎత్తుగడతో చంపకమాలను ప్రారంభించటం ఒక విశేషం. 'ఎందునుం గలయది' అనేది చక్కని జాతీయం. 'ఎక్కడా ఉండేదే ఇది' అనే అర్థంలో సర్వసాధారణమైన లోకసహజమైన నిత్య సత్యాన్ని చెప్పేటప్పుడు ఇటువంటి జాతీయాన్ని మామూలుగా మనం ప్రయోగిస్తూ ఉంటాం. ముఖ్యంగా ఓదార్పు చెప్పేటప్పుడు ఈ వాక్యాన్ని అంటూ ఉండటం అతి సహజం.

వ. అని నారదుండు. 214

తాత్పర్యం: ఆ ప్రకారంగా నారదమహర్షి.

తే. ఆయువును బుణ్యమును జిరశ్రీయుఁ జేయఁ । జాలు షోడశరాజన్య చరిత మిట్లు
సెప్ప, నేర్పడఁగా విని సృంజయుండు । పాండవాగ్రజ! యేమియుఁ బలుక కుండె. 215

ప్రతిపదార్థం: పాండవ+అగ్రజ!= పాండవులలో మొదట పుట్టినవాడా!(ధర్మరాజా! అని సంబోధన); ఆయువునున్= ఆయుస్సునూ; పుణ్యమును= పుణ్యాన్నీ (సుకృతాన్నీ); చిరశ్రీయున్= శాశ్వతమైన సంపదనూ; చేయన్+చాలు= కలిగించటానికి సమర్థమైన; షోడశరాజన్య చరితము= పదహారుమంది పట్టభద్రులైన ప్రభువుల చరిత్ర; ఇట్లు= ఈ విధంగా; చెప్పన్= వక్కాణించగా; ఏర్పడఁగాన్= తేటపడేటట్లుగా; విని; సృంజయుండు; ఏమియున్= ఏమీ; పలుకక+ఉండెన్= మాటాడకుండా ఉండిపోయాడు.

తాత్పర్యం: ధర్మరాజా! ఆయుస్సూ, పుణ్యమూ, శాశ్వతసంపదా కలిగించటానికి సర్వసమర్థమైన షోడశరాజ చరిత్రను చెప్పగా సృంజయుడు తేటతెల్లంగా విని ఏమీ మాటాడకుండా ఉండిపోయాడు.

విశేషం: అంత మహామహులైన ఆ మహారాజులు అందరూ అంతరించిపోగా ఇక తన కుమారుడి సంగతి ఏముంది? అని సృంజయుడికి ఆ రాజుల చరిత్ర వినగానే అవగతమయింది. దేహం శాశ్వతం కాదనే నిశ్చయానికి వచ్చాడు. నారదుడు చెప్పినదంతా అంగీకారయోగ్యమే. పరిపూర్ణమైన సమ్మతికి సూచనగా మారుమాటాడకుండా - అనగా కుమారుడి ప్రస్తావనే ఎత్తకుండా మౌనం వహించాడు.

చ. పలుకక యున్న యద్ధరణిపాలుఁ గనుంగొని యమ్మునీంద్రుఁ 'డేఁ
దెలియఁగఁ జెప్పినంతయు నతిస్థిరమై భవదీయ బుద్ధియం
దొలసెనొ? బూదిలోనఁ గ్రమ మొందఁగ వేల్చిన నేయి వోలె ని
ష్ఫల మయి పోయెనో' యనుడుఁ బ్రాంజలియై తగ నాతఁ డిట్లనున్. 216

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పలుకక+ఉన్న= మాటాడకుండా ఉండే; ఆ+ధరణిపాలున్= ఆ రాజును; కనుంగొని= చూచి; ఆ+మునీంద్రుఁడు= మునిశ్రేష్ఠుడైన ఆ నారదుడు;ఏన్= నేను; తెలియఁగన్+చెప్పిన+అంతయున్= తేటపడగా తెలిపినదంతా; అతి స్థిరము+ఐ= మిక్కిలి నిలుకడ కలిగినదిగా అయి; భవదీయ+బుద్ధి అందున్= నీ యొక్క మనస్సులో; ఒలసెనో= చేరిందా (ప్రవేశించిందా)?; బూదిలోనన్= బూడిదలో; క్రమము+ఒందఁగన్= సొరిది, ప్రవేశించగా; వేల్చిన= హోమాదులలో సమర్పించిన; నేయి+పోలెన్= నెయ్యివలె; నిష్ఫలము+అయి+పోయెనో?= వ్యర్థమైపోయిందా?; అనుడున్= అనగానే; ఆతఁడు= సృంజయుడు; ప్ర+అంజలి+ఐ= మిక్కిలి చేతులు జోడించినవాడై (నమస్కరించినవాడై); తగన్= ఒప్పిదంగా; ఇట్లు= ఇట్లా; అనున్= అంటున్నాడు.

తాత్పర్యం: మారు మాటాడకుండా ఉండే సృంజయుడిని చూచి ఆ నారదుడు 'నేను తేటతెల్లంగా చెప్పిన విషయమంతా నీ మనస్సులో నిలకడగా ప్రవేశించిందా? లేక బూడిదలో పోసిన నెయ్యివలె వ్యర్థమైపోయిందా?' అన్నాడు. వెంటనే సృంజయుడు చేతులు జోడించి నమస్కరిస్తూ తగు రీతిలో ఇట్లా అంటున్నాడు:

విశేషం: మిత్రుడి హితాన్ని కోరి నారదుడు షోడశరాజుల చరిత్రను వివరించాడు. అంతా చెప్పిన తర్వాత అది ఆదేశం కాదు కాబట్టి, మైత్రీధర్మంతో చివరలో మరల మెల్లగా తాను చెప్పినదానికి మతి సమ్మతి పడిందా? అని అడుగుతున్నాడు. మూలంలో 'శూద్రాపతి కొనర్చిన శ్రాద్ధమువలె వ్యర్థమయ్యెనా' అని ఉండగా తిక్కన 'బూడిదలోన గ్రమ మొందఁగ వేల్చిన నేయివోలె నిష్ఫలమయిపోయెనో?' అని ఎంతో చక్కని ఉపమానంతో సుందరంగా తేటతెల్లం కావించాడు. అలంకారం: ఉపమ.

తే. **'పుత్రశోకాపహంబును బుణ్యతమము । నైన యాఖ్యానమున నాదు మానసంబు**
కలఁక యంతయుఁ బాసె; నిష్కల్మషుండ । నైతి నీ దయఁ జేసి సంయమివరేణ్య!' 217

ప్రతిపదార్థం: సంయమివరేణ్య!= మునిశ్రేష్ఠా!; నీ దయన్+చేసి= నీ కరుణచేత; పుత్రశోక+అపహంబునున్= పుత్రమరణశోకాన్ని పోగొట్టగలిగేదిన్నీ; పుణ్యతమమున్= మిక్కిలి పవిత్రమైనదిన్నీ; ఐన+ఆఖ్యానమునన్= అయినట్టి కథచేత; నాదు మానసంబు+కలఁక= నా మనస్సులోని పాపం లేదా సందేహం; పాసెన్= తొలగింది; నిష్కల్మషుండన్+ఐతిన్= నిర్మలుడిని అయ్యాను.

తాత్పర్యం: 'నారదమునీంద్రా! నీ దయచేత పుత్రశోకాన్ని పోగొట్టేది, పుణ్యాన్ని కలిగించేది అయిన కథ విన్నాను. దానివలన నా మనస్సులోని సందేహం తొలగిపోయింది. నేను కల్మషం లేనివాడినయ్యాను.'

వ. **అనిన విన యత్తపోధనుండు ప్రీతుండై 'నీ కెద్ది వలయు నడుగు; మిచ్చెద' ననుటయు సృంజయుండును 'దేవా! నీవు ప్రసన్నుండ వగు నంతకంటె మిక్కిలి వలయునది యెయ్యది? భవత్ప్రసాద భాజనంబు లయిన వారికి దుర్లభంబులగు వస్తువులుం గలవే?' యనుటయు నమ్మునివరుండు.** 218

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ఆ+తపోధనుండు= తపస్సే ధనంగా కలిగిన ఆ నారదుడు; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; నీకున్+ఎద్ది+కావలయున్= నీకు ఏది(మి) కావాలి; అడుగుము= కోరుము; ఇచ్చెదన్; అనుటయున్= అని అనగా; సృంజయుండునున్= సృంజయుడున్నూ; దేవా= ప్రభూ; నీవు; ప్రసన్నుండవు+అగు+అంతకంటెన్= దయగలిగినవాడవు (సంతోషించినవాడవు) అయినదానికంటె; మిక్కిలి, వలయు+అది= అధికంగా కావలసింది; ఎయ్యది?= ఏది(ఏముంది?); భవత్= మీయొక్క; ప్రసాద= అనుగ్రహానికి; భాజనంబులు= పాత్రులు; అయినవారికిన్= అయినటువంటి వాళ్ళకు; దుర్లభంబులు+అగు+వస్తువులున్= పొందటానికి శక్యంకాని వైన పదార్థాలున్నూ; కలవే?= ఉండునా?; అనుటయున్= అని అనటమున్నూ; ఆ+మునివరుండు= ఆ ముని శ్రేష్ఠుడు.

తాత్పర్యం: అనగా విని నారదుడు సంతోషించి 'నీకేమి వరం కావాలో అడుగుము. ఇస్తాను' అన్నాడు. సృంజయుడిట్లా పలికాడు: 'దేవా! నీవు నాపట్ల దయచూపటం కంటె మరేం కావాలి? నీ అనుగ్రహానికి పాత్రులయిన వారికి సాధ్యంకాని వస్తువులు ఉంటాయా?' ఆ మాటలు విని నారదుడు ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **'మ్రుచ్చుల మూఢత్వము నం । జచ్చి నరకవాసమునకుఁ జనిన తనయు నేఁ**
దెచ్చెద మగుడఁగ వే నీ । కిచ్చెద వగ పుడుగు మింకనేనియు నధిపా!' 219

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; మ్రుచ్చుల= దొంగల; మూఢత్వమునన్= అవివేకంచేత; చచ్చి= చనిపోయి; నరకవాసమునకున్= పాపాత్ములను బాధించే లోకంలో నివసించటానికి; చనిన= పోయిన; తనయున్= కుమారుడిని; ఏన్= నేను; మగుడఁగన్= తిరిగి మరల; తెచ్చెదన్= తీసికొని వస్తాను; వే= తొందరగా; నీకున్= నీకు; ఇచ్చెదన్= ఇస్తాను; ఇంకన్+ఏమియున్= ఇకనైనా; వగపు= దుఃఖం; ఉడుగుము= చాలించుము లేదా మానుము.

తాత్పర్యం: 'ఓ రాజా! దొంగల అవివేకం చేత మరణించి నరకలోకంలో ఉండే నీ కుమారుడిని నేను ఇప్పుడే మళ్ళీ తెస్తాను. తొందరగా నీకు ఇస్తాను. ఇకనైనా నీవు దుఃఖాన్ని మానుము.'

విశేషం: కథా ప్రారంభంలో దొంగలను వెంగలులు అయినందువలననే వాళ్ళ చావు వాళ్ళే తెచ్చుకొన్నారు అన్నాడు. ప్రస్తుతం ఆ వెంగలి శబ్దానికి పర్యాయంగా 'మూఢత్వము' అని ప్రయోగించాడు. పురాకృత దుష్కృతం వలన 'నరకవాసమునకు' పోయి ఉంటాడని ఊహించవలసి ఉన్నది.

వ. **అని చెప్పిన.** 220

తాత్పర్యం: అని చెప్పగా.

క. **దేవముని యిమ్మెయిం దగు । దీవన యిచ్చుటయు నరుగుదెంచె సువర్ణ**
ష్ఠీవి కడు నద్భుతంబుగ; । నా విభుఁడుఁ బ్రమోద సంభృతాత్ముం డయ్యెన్. 221

ప్రతిపదార్థం: దేవముని= దేవర్షి అయిన నారదుడు; ఈ+మెయిన్= ఈ విధంగా; తగు= అనుకూలమైన; దీవన+ఇచ్చుటయున్= ఆశీర్వాదం చేయటమున్నూ; సువర్ణష్ఠీవి= సృంజయుడి కుమారుడైన సువర్ణష్ఠీవి; కడున్+అద్భుతంబుగన్= మిక్కిలి ఆశ్చర్యంగా; అరుగుదెంచెన్= వచ్చాడు; ఆ+విభుఁడున్= ఆ రాజున్నూ; ప్రమోద, సంభృత+ఆత్ముండు= సంతోషంచేత మిక్కిలిగా భరించబడ్డ మనస్సు కలవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: నారదముని ఆ విధంగా తగిన దీవెన ఈయగానే సువర్ణష్ఠీవి మిక్కిలి ఆశ్చర్యకరంగా అక్కడకు వచ్చాడు. ఆ సృంజయుడున్నూ సంతోషభరితస్వాంతను డయ్యాడు

విశేషం: ష్ఠీవనం అనగా ఉమ్మివేయటం, అంటే వెళ్ళగ్రక్కటం లేదా వెలువరచటం. సువర్ణాన్ని(బంగారాన్ని) వెళ్ళగ్రక్కేవాడు కాబట్టి సువర్ణష్ఠీవి అనేది అన్వర్థనామధేయం. చనిపోయిన వాళ్ళను మళ్ళీ రప్పించటం అద్భుతం. మానవలోకానికి దుర్లభంగా ఉండేవి మహాశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఆ ఆశ్చర్యమే ప్రకృష్టమైన మోదానికి కుదురు.

వ. **ఇవ్విధంబున నత్తపస్వి యిచ్చిన యక్కుమారునకు సృంజయుం డస్త్ర శిక్షగావించి, వివాహం బొనరించి, యతండు యాగంబులఁ ద్యాగంబుల భోగంబులం దనమనంబునకుఁ బ్రియంబు సేయుచు సంతానవంతుండై నెగడిన, నతం డత్యంత సంతోషంబునం బొదలె నిట్లు సువర్ణష్ఠీవి యశిక్షితా స్త్రుండును నకృత వివాహుండును నయాగకర్తయు నత్యాగవిదితుండును నభోగభాగియు నసంతానవంతుండును నగు సమయంబున సమయుట కారణంబుగా న న్నారదుండు గారుణ్యంబునం గ్రమ్మఱ వానిం గలిగించె; నది యట్లుండె; నవ్విశేషంబులన్నియు సంపన్నంబులయి శౌర్యంబున శత్రుధైర్యంబు దూలించి మేలిమి వడసి నాకలోక సౌఖ్యంబునం బొందిన వాసవపౌత్త్రునకు వగచుట వివేకంబు తెరువుగాదు; విను మీ లోకంబు దుఃఖబహుళం**

బగుటయుఁ దపోదానాద్యనుష్ఠానంబుల మానవులు సురలోక సుఖంబు సాధింపం జూచుట సుప్రసిద్ధంబు గాదె! నీ వయ్యర్జున నందనుఁ డెట్టి పుణ్యపరులుం బడయ నరిది యగు పదంబున నునికి దెలియుటకును బావనంబులైన పలువుర భూపతుల వృత్తాంతంబులు వినుటకును ఫలంబయిన పరిజ్ఞానంబున సమాధాన సుస్థిరుండవై యుండుము; పోయి వచ్చెద' నని పలికి, పారాశర్యుం డంతర్ధానంబు సేయుటయు, ధర్మసూనుం డుపశమితశోకుం డయ్యును విష్వచ్చుండు వచ్చిన వానితో నే మనువాఁడ నను తలంపు పుట్ట నూరకుండె' నని సంజయుండు సెప్పుటయు. 222

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఇట్లా; ఆ+తపస్వి+ఇచ్చిన= ఆ నారదముని తెచ్చి యిచ్చిన; ఆ+కుమారునకున్= ఆ సువర్ణష్ఠీవి అనే పుత్రుడికి; సృంజయుండు= సృంజయుడు; అస్త్రశిక్షన్+కావించి= బాణ ప్రయోగ విద్యాభ్యాసం చేయించి; వివాహంబు+ఒనరించి= పెండ్లి చేసి; అతండు= ఆ కుమారుడు; యాగంబులన్= యజ్ఞాలతో; త్యాగంబులన్= దానాలతో; భోగంబులన్= సుఖాలతో; తన మనంబునకున్= తన మనస్సుకు; ప్రియంబు+చేయుచున్= ప్రీతిని కలిగిస్తూ; సంతానవంతుండు+ఐ= సంతతి కలవాడై; నెగడినన్= ఒప్పగా; అతండు= అతడు; అత్యంత+సంతోషంబునన్= మిక్కిలి ఆనందంతో; పొదలెన్= వర్ధిల్లాడు; ఇట్లు= ఈ విధంగా; ఆ సువర్ణష్ఠీవి= ఆ సృంజయుడి కొడుకు సువర్ణష్ఠీవి; అశిక్షిత+అస్త్రుండునున్= శస్త్రవిద్య నేర్వనివాడును; అకృత వివాహుండును= చేయబడని వివాహం కలవాడున్నూ (అనగా పెండ్లి కానివాడున్నూ); అయాగకర్తయున్= యజ్ఞాలు చేయనివాడున్నూ; అత్యాగవిదితుండునున్= త్యాగం లేకుండుటం వలన తెలియబడనివాడున్నూ (అనగా త్యాగం లేనివాడున్నూ); అభోగభాగియున్= భోగాలు అనుభవించని వాడున్నూ; అసంతానవంతుండునున్= సంతానం లేనివాడున్నూ; అగు+సమయంబునన్= అయిన సందర్భంలో;సమయుట= మరణించటం; కారణంబుగాన్= హేతువుగా; ఆ+నారదుండు= ఆ నారదమహర్షి; కారుణ్యంబునన్= దయతో; వానిన్= ఆ సువర్ణష్ఠీవిని; క్రమ్మఱన్= మళ్ళీ; కలిగించెన్= సృష్టించాడు; అది+అట్లు+ఉండెన్= అది అట్లా ఉండనీ; ఆ+విశేషంబులు+అన్నియున్= పైన చెప్పిన ఆ వృత్తాంతాలు అన్నీ; సంపన్నంబులు+అయి= సమృద్ధంగా ఉన్నవై; శౌర్యంబునన్= శూరత్వంతో; శత్రు+ధైర్యంబున్+తూలించి= విరోధుల ధైర్యాన్ని తొలగించి; మేలిమిన్+పడసి= ఆధిక్యాన్ని పొంది; నాక, లోక, సౌఖ్యంబునున్= స్వర్గలోక సుఖాన్ని; పొందిన= ప్రాపించిన; వాసవపౌత్రునకున్= ఇంద్రుడి మనుమడికై; వగచుట= దుఃఖించటం; వివేకంబు, తెరువు, కాదు= తెలివి కలిగిన దారికాదు; వినుము= ఆకర్ణించుము; ఈ లోకంబు= ఈ జగత్తు; దుఃఖ+బహుళంబు+అగుటన్= బాధలూ, వ్యసనాలతోదట్టమైనది కావటంచేత; తపస్+దాన+ఆది+అనుష్ఠానంబులన్= తపస్సూ, దానమూ (త్యాగమూ), మొదలైన నడవడులతో (ఆచరించటం); మానవులు= నరులు; సుర, లోక, సుఖంబున్= దేవలోక సౌఖ్యాన్ని; సాధింపన్+చూచుట= సమకూర్చుకొనటానికి ఆలోచించటం; సుప్రసిద్ధంబు+కాదె!= మిక్కిలి ప్రసిద్ధం కదా!? నీవు= నీవు (ధర్మరాజువైన నీవు అని భావం); ఆ+అర్జున నందనుఁడు= ఆ అర్జునుడి కొడుకు; ఎట్టి= ఎటువంటి; పుణ్యపరులకున్= పుణ్యము (ధర్మము) నందు ఆసక్తి కలవారికిన్నీ; పడయన్= పొందటానికి; అరిది+అగు+పదంబునన్= దుర్లభమైన స్థానంలో; ఉనికి= ఉండటం; తెలియుటకును= తెలిసికొనటానికి; పావనంబులు+ఐన= పవిత్రాలైన; పలువురు, భూపతుల, వృత్తాంతంబులు= అనేకరాజుల కథలు; వినుటకును= వినటానికి; ఫలంబు+అయిన, పరిజ్ఞానంబునన్= ఫలితమైన (ప్రయోజనమైన) తెలివితో; సమాధాన, సు, స్థిరుండవు+ఐ+ఉండుము= చిత్తము యొక్క స్థైర్యంతో మిక్కిలి నిలకడ కలవాడవై ఉండుము; పోయి వచ్చెదన్= పోయివస్తాను; అని+పలికి= అని చెప్పి; పారాశర్యుండు= పరాశర మహర్షి పుత్రుడైన వ్యాసుడు; అంతర్ధానంబు+చేయుటయున్= అదృశ్యం కావటమున్నూ; ధర్మసూనుండు= ధర్మరాజు; ఉపశమిత, శోకుండు+అయ్యున్= అణచబడిన దుఃఖం కలవాడు అయినప్పటికీ; విష్వచ్చుండు= అర్జునుడు; వచ్చినన్= రాగా; వానితోన్= అతడితో; ఏమి+అనువాఁడన్= ఏమని చెప్పగలవాడను; అను+తలంపు= అనేచింత (ఊహ); పుట్టన్= కలుగగా; ఊరకుండెన్= మిన్నక ఉన్నాడు; అని= ఈ ప్రకారంగా; సంజయుండు= సూతుడు; చెప్పుటయున్= చెప్పగా.

తాత్పర్యం: ఈ విధంగా నారదుడు బ్రతికించి ఇచ్చిన కొడుకుకు బాణవిద్య నేర్పి, పెండ్లి చేశాడు. అతడు యాగాలూ, త్యాగాలు చేసి, భోగాల ననుభవించి తనకు సంతోషం కలిగిస్తూ సంతానవంతుడైనాడు. ఇట్లా సువర్ణష్ఠీవి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శస్త్రశిక్ష లేనివాడు, వివాహంకానివాడు, యాగాలు చేయనివాడు, త్యాగాల వలన కీర్తి కెక్కనివాడు భోగాల ననుభవించనివాడు, సంతానం లేనివాడు అయిన సమయంలో చనిపోవటం వలన ఆ నారదుడు అతడిని దయతో తిరిగి బ్రతికించాడు. అది అట్లుండగా; ఆ విశేషాలన్నీ గొప్పగా ఉండి, పరాక్రమంతో శత్రువులను చంపి, కీర్తిపొంది, స్వర్గలోక సౌఖ్యం పొందిన అభిమన్యుడిని గూర్చి దుఃఖించటం వివేకం కాదు. వినుము. ఈ లోకం దుఃఖమయం. తపోదానాదులతో మానవులు దేవలోకం చేరాలనుకొనటం ప్రసిద్ధం. అభిమన్యుడు అటువంటి పుణ్యాత్ములు పొందే అరుదైన లోకాన్ని పొంది ఉన్నాడని తెలపటానికే చక్రవర్తుల చరిత్రం చెప్పాను. దాని ఫలంగా కలిగే పరిజ్ఞానంతో నిమ్మళించిన మనస్సుకలవాడవై ఉండుము. పోయివస్తాను' అని వ్యాసుడు అంతర్ధానమయ్యాడు. ధర్మరాజు తన శోకాన్ని ఉపశమింపజేసికొన్నా, అర్జునుడు వస్తే ఏమని చెప్పాలి?' అనే చింతతో ఊరక ఉండిపోయాడు - అని సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పాడు.

విశేషం: 'నాకలోక సౌఖ్యంబునన్' అని ప్రయోగించినప్పుడు వెంటనే అభిమన్యుడిని 'ఆ వాసవ పౌత్రు' డని తెలపటం సాభిప్రాయం. వ్యాసుడు నిష్క్రమించటానికి ముందుగా 'సమాధానసుస్థిరుండవై ఉండుము' అని ఆదేశించటం ఎంతో అర్థవంతమైన ప్రయోగం.

తే. **'అతనితో ధృతరాష్ట్రుఁ డిట్లనియెఁ 'గ్రీడి। సంగరమున సంశప్తక సమితి నేమి**
సేసె? సుతువార్త యెవ్వరు సెప్పి? రాతఁ। డట్లు దెగుట యెఱింగి యెట్లయ్యెఁ జెపుము!' **223**

ప్రతిపదార్థం: అతనితోన్= సంజయుడితో; ధృతరాష్ట్రుఁడు; ఇట్లు; అనియెన్= అన్నాడు; క్రీడి= అర్జునుడు; సంగరమునన్= యుద్ధంలో; సంశప్తకసమితిన్= సంశప్తకుల సమూహాన్ని; ఏమి+చేసెన్?= ఏమి చేశాడు?; ఎవ్వరు= ఎవరు;సుతువార్తన్= అభిమన్యుడి మరణవృత్తాంతం; చెప్పిరి?= చెప్పారు?; ఆతఁడు= ఆ అభిమన్యుడు; అట్లు= ఆ విధంగా; తెగుట= మరణించటం; ఎఱింగి= తెలిసికొని; ఎట్లు+అయ్యెన్?= ఏ విధంగా అయ్యాడు?; చెపుము= చెప్పుమా!(వినిపించవలసింది).

తాత్పర్యం: సంజయుడితో ధృతరాష్ట్ర డీ విధంగా అన్నాడు: అర్జునుడు యుద్ధంలో సంశప్తకులను ఏమిచేశాడు? ఎవరు కుమారుడి మరణవార్త తెలిపారు? అభిమన్యుడు ఆ విధంగా మరణించటం తెలిసికొని అర్జునుడు ఏ విధంగా అయ్యాడు? చెప్పవలసింది.

విశేషం: సంశప్తక సమితి: ఆర్యావర్తానికి వాయవ్యభాగంలో ఉండే త్రిగర్త దేశానికి సుశర్మ అధిపతి. అతడి సోదరులే సత్యరథుడు, సత్యసేనుడు, సత్యకర్ముడు, మొదలైనవారు. వీరు దుర్యోధనుడి పక్షంలో చేరి అర్జునుడిని చంపాలని దృఢ ప్రతిజ్ఞ చేసి పోరాడి, చివరకు అర్జునుడి చేతిలోనే మరణించారు. అట్లా మరణించినవాళ్ళే సంశప్తక సమూహం.

క. **అనిన విని సూతసుతుఁ డి। ట్లనుఁ బేరడవులు దహించు ననలము చందం**
బున సంశప్తక సేనల। ననిమిషపతి సుతుఁడు దీవ్రుఁడై పొలివుచ్చెన్. **224**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; సూతసుతుఁడు= సంజయుడు; ఇట్లు; అనున్= అన్నాడు; పేరు+అడవులు+దహించు= (పెద్ద) గొప్ప అడవులను కాల్చే; అనలము+చందంబునన్= అగ్నివలె; సంశప్తక సేనలన్= సంశప్తకుల సైన్యాలను; అనిమిషపతి సుతుఁడు= దేవేంద్రుడి కొడుకు - అనగా అర్జునుడు; తీవ్రుఁడు+ఐ= పరాక్రమం కలవాడై; పొరిపుచ్చెన్= సంహరించాడు.

తాత్పర్యం: అనగా విని సంజయుడు ఇట్లా అన్నాడు: 'గొప్ప అడవులను కాల్చే కార్చిచ్చు వలె సంశప్తక సైన్యాలను అర్జునుడు పరాక్రమంతో విజృంభించి సంహరించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ. 'పేరడవులు దహించు ననలము చందంబు' అనే ఉపమానాన్ని తిక్కన సందర్భోచితంగా ప్రయోగించాడు. తీవ్రుడై అనగా మిక్కిలి వేడిమి కలవాడై అని అర్థం. పై ఉపమానానికి ఇది ఎంతో అనుగుణంగా ఉన్నది. పొరిపుచ్చు అను పదానికి సాధారణార్థం చంపటం. కానీ బాధించటం అనే అర్థాన్ని కూడా ఇచ్చుట గ్రహించవచ్చును. అర్జునుడిని 'అనిమిషపతి సుతుడు' అని అనటంలో కూడా రెప్పపాటులోపలనే శత్రువులను కూల్చివేశాడు అనే ధ్వని సూచితం.

అర్జునుఁడు శిబిరంబునకు వచ్చునెడ దుర్నిమిత్తంబులం గని కృష్ణునితోఁ జెప్పుట (సం. 7-50-1)

వ. అట్లు మర్దించి మగుడు నప్పుడు మాధవు నాలోకించి. 225

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; మర్దించి= సంహరించి; మగుడు+అప్పుడు= (శిబిరానికి) మరలివచ్చే సమయంలో; మాధవున్= శ్రీకృష్ణుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అట్లా చంపి తిరిగి వచ్చేటప్పుడు కృష్ణుడిని చూచి.

చ. 'కలయఁగ దుర్నిమిత్తములు గానఁగ నయ్యెఁ; మదీయ చిత్తముం
గలఁగెడు; మేను బ్రానుపడఁగాఁ దొడఁగెన్; గురుఁ డారయంగఁ గే
వలుఁడె? నృపాలుఁ డేదెసకు వచ్చెనొ?' యన్న నతండు రాజుఁ ద
మ్ములు సుఖు లొండుమై నశుభముం గల దిప్పు డెఱుంగ నయ్యెడున్.' 226

ప్రతిపదార్థం: కలయఁగన్= అంతటా; దుర్నిమిత్తములు= దుశ్శకునాలు; కానఁగన్+అయ్యెన్= కనిపిస్తున్నాయి; మదీయచిత్తమున్= నా మనస్సుకూడా; కలఁగెడున్= కలతచెందుతూ ఉన్నది; మేను= దేహం; బ్రానుపడఁగాన్+తొడఁగెన్= బ్రానువలె అయిపోవటం (నిశ్చేష్టత చెందటం)ప్రారంభించింది; ఆరయంగన్= ఆలోచించగా; గురుఁడు= ద్రోణుడు; కేవలుఁడు+ఎ!= సామాన్యుడా!; నృపాలుఁడు= ధర్మరాజు; ఏ+దెసకు+వచ్చెను+ఒ= ఎటువంటి దుర్గతి పాలైనాడో!; అన్నన్= అనగా; అతఁడు= శ్రీకృష్ణుడు; రాజున్= ధర్మరాజూ; తమ్ములున్= అతడి తమ్ముళ్ళునూ (భీమ, నకుల, సహదేవులున్నూ); సుఖులు= సుఖంగా ఉన్నారు; ఒండు+మైన్= మరియొకవైపున; అశుభమున్= అమంగళమున్నూ (కీడున్నూ); కలదు= ఉన్నది; ఇప్పుడు= ఇప్పుడే; ఎఱుంగన్+అయ్యెడున్= తెలియ నౌతుంది.

తాత్పర్యం: 'అంతటా దుశ్శకునాలే కన్పిస్తున్నాయి. నా మనస్సు కూడా కలత చెందుతూ ఉన్నది. శరీరం స్తంభించటం మొదలైంది. ఆలోచించగా ద్రోణుడు సామాన్యుడా! ధర్మరాజు ఎటువంటి దుర్గతికి వచ్చాడో!' అనగానే కృష్ణుడు 'రాజూ, ఆయన తమ్ములూ (ధర్మరాజూ భీమ, నకుల సహదేవులున్నూ) సుఖంగా ఉన్నారు. మరొకవైపున అమంగళం ఇప్పుడే తెలియబోతూ ఉన్నది.'

విశేషం: ఈ చంపకమాలా వృత్తం చివరిపాదం తుదివాక్యం త్రికాలవేది అయిన శ్రీకృష్ణుడి మాట. 'అశుభముం గలదు. ఇప్పు డెఱుంగ నయ్యెడున్' అను వాక్యంలో 'అశుభము' అనే పదానికి 'చావు' అనే అర్థం కూడా ఉన్నది. అది ఇప్పుడే తెలియబోతూ ఉన్నది అన్నాడు. అభిమన్యుడి మరణం శ్రీకృష్ణుడికి తెలుసు. సంశప్తకులతో పోరాడేటప్పుడు చెప్పటం అసంగతం. శిబిరానికి వస్తూ ఉన్నాడు కాబట్టి తాను చెప్పినా చెప్పకపోయినా విషయం తెలిసిపోతుంది. అర్జునుడు తనకు తానుగా దుర్నిమిత్తాలు అంటున్నాడు. అందువలన తాను కూడా సూచనగా అశుభం తెలియబోతూ ఉన్నది అని తెలిపాడు.

వ. అని పలికెఁ; దదనంతరంబ యద్దామోదర ధనంజయులు సంధ్యా సముచిత కరణీయంబు లాచరించి యరుగుదెంచి నిజ శిబిరంబు సొత్తెంచి; రది చిట్టిన చిత్రరూపంబులు గల కుడ్యంబునుం బోలె వివర్ణాకారులైన జనులవలనం బాడఱియున్నం, దత్ప్రకారం బనుసంధించి య న్నరుండు నారాయణున కిట్లనియె. 227

ప్రతిపదార్థం: అని పలికెన్= ఆ ప్రకారంగా చెప్పాడు; తద్+అనంతరంబు+అ= దాని తర్వాత; ఆ+దామోదర, ధనంజయులు= ఆ కృష్ణార్జునులు; సంధ్యా, సమయ, సముచిత+కరణీయంబులు= సాయం సమయానికి తగినపనులు; ఆచరించి= నిర్వర్తించి; అరుగుదెంచి= వచ్చి; నిజ శిబిరంబున్+చొత్తెంచిరి= తమ దండు విడిదిచేసిన చోటు ప్రవేశించారు; అది= ఆ శిబిరం; చిట్లిన+చిత్రరూపంబులు కల+కుడ్యంబునున్+పోలెన్= పగిలిన చిత్రలేఖనాలతోడి గోడలవలె; వివర్ణ+ఆకారులు+ఐన= వన్నె చెడిన రూపాలు కలవారైన; జనుల వలనన్= జనులవలన; పాడటి+ఉన్నన్= నశించి ఉండగా; తద్+ప్రకారంబు+అనుసంధించి= దాని రీతిని ఉద్దేశించి; ఆ+నరుండు= ఆ అర్జునుడు; నారాయణునకున్= కృష్ణుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: కృష్ణార్జునులు సంధ్యావందనం చేసి, 'కాంతిహీనమై, చింతాక్రాంతమై ఉన్న నిజశిబిరాన్ని' చేరారు. ఆ శిబిరం పగిలిన చిత్రలేఖనా లుండే గోడలవలె ఉన్నది. అక్కడ ఉండే జనాలు పాలిపోయిన మొగాలతో ఉన్నారు. ఆ ప్రకారాన్ని గమనించి అర్జును డిట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉపమ. చిట్లిన చిత్రలేఖనాలుండే గోడలతో శిబిరాన్ని పోల్చటం ఒక వినూత్న కల్పన. ఆ పోలికలో నిర్జీవుడైన అభిమన్యుడు ద్యోతకం. అర్జునుడిని నరుడు అని పేర్కొన్నప్పుడు శ్రీకృష్ణుడిని నారాయణుడని తెల్పటం అపూర్వమైన ఆ ఇరువురి పూర్వమైత్రిని సూచించటమే.

నరనారాయణులు: వీరిరువురూ మైత్రికి మారుపేరు. నరసింహావతారంలోని నరరూపం నరుడు. సింహరూపం నారాయణుడు. వీరు బదరికాశ్రమంలో తీవ్ర తపస్సు చేశారు. ప్రహ్లాదుడికీ ఈ ఇరువురికీ యుద్ధం ఎంతోకాలం జరిగింది. చివరకు విష్ణువుయొక్క అంశములే వీరిరువురని ప్రహ్లాదుడు గ్రహించాడు. సహస్ర కవచుడిని సంహరించటానికి కొన్నివేల సంవత్సరాలు ఇరువురూ ఒకరి తర్వాత ఒకరుగా తపస్సు చేసి ఆ రాక్షసుడి తొమ్మిది వందల తొంభై తొమ్మిది కవచాలు భేదించారు. మిగిలిన ఆ ఒక్క కవచంతోనే కర్ణుడు పుట్టాడు. అతడిని సంహరించటానికే కృష్ణార్జునులుగా పుట్టారు.

క. 'సైనికులు నన్నుఁ గనుఁగొని । యాననములు వాంచి తొలఁగి యరిగెద రది యే
మో నేఁడు వేణు వీణా । గానస్వనములును వీటఁ గలుగవు కృష్ణా! 228

ప్రతిపదార్థం: కృష్ణా!= కృష్ణా!; సైనికులు= సేనలు; నన్నున్+కనుఁగొని= నన్ను చూచి; ఆననములు+వాంచి= ముఖాలు వంచి; తొలఁగి+అరిగెదరు= తప్పుకొని పోతూ ఉన్నారు; నేఁడు= ఈనాడు; అది ఏమో= అది ఎందుకో; వేణు+వీణా+గాన స్వనములు= పిల్లన గ్రోవి, విపంచి అనే వాద్యాల సంగీత ధ్వనులు; వీటన్= శిబిరంలో; కలుగవు= లేవు.

తాత్పర్యం: 'కృష్ణా! ఈ సైనికులు నన్ను చూచి తలలు వంచుకొని, ప్రక్కలకు ఒదుగుకొని వెళ్ళిపోతూ ఉన్నారు. అది ఎందువలన? శిబిరాలలో పిల్లనగ్రోవి, వీణలకు సంబంధించిన సంగీత ధ్వనులు వినిపించటం లేదు.

క. ఈ మేలు ప్రజ కొనర్చిన । యా మహిమకు నెలవు గొంతి యగ్రతనయుఁ డో,
భీముఁ డొకొ, తమ్ముఁగుట్టులొ । కో, మఱి యెవ్వరొకొ! తలఁపుఁ గొలఁదికి మీఱెన్. 229

ప్రతిపదార్థం: ఈ మేలు= ఈ శుభము; ప్రజకున్+ఒనర్చిన= జనానికి కావించిన; ఆ మహిమకున్= అట్టి మహత్త్వానికి; నెలవు= స్థానం; గొంతి+అగ్రతనయుఁడో!= ధర్మరాజో!; భీముఁడొకొ!= భీముడో!; తమ్ముఁగుట్టులు+ఒకో!= నకుల సహదేవులో!; మఱి+ఎవ్వరొకొ!= ఇంకెవ్వరో!; తలఁపు+కొలఁదికిన్+మీఱెన్= ఊహకు మితి మీరుతూ ఉన్నది.

తాత్పర్యం: ఈ శుభాన్ని ప్రజలకు కలిగించిన ఆ మహత్త్వానికి స్థానం ధర్మరాజో, భీముడో, నకుల సహదేవులో మ రెవ్వరో, ఊహకు అందటం లేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఒకొ, ఒకో అనే ప్రయోగాలు ఒకటికి మూడుమారులు వరుసగా ఈ కందపద్యంలో అందంగా కూర్చబడ్డాయి. తర్వాత ఆటవెలదిలో కూడా ఒకో ఒక్కొ అనే సందేహార్థాన్ని తెలిపే పదాలు ప్రయోగించ బడ్డాయి. 'ఒకో' ప్రయోగంలో ఏదో తడబాటు, సందేహం ఊహించలేని అనర్థం చోటు చేసికొన్నట్లు ప్రతి పాఠకుడికీ స్ఫురిస్తుంది.

ఆ. అలరు మొగముతోడ నభిమన్యుఁ డేలొకో । యెదురు రాఁడు; నాకు నెట్టివార్త
చెవులు సోఁకు నొక్కొ! చేవెట్టి కలఁచిన । భంగిఁ ద్రిప్పికొనఁ దొడంగె మనము. 230

ప్రతిపదార్థం: అలరు+మొగముతోడన్= వికసించే ముఖంతో; అభిమన్యుఁడు= అభిమన్యుడు; ఏలొకో= ఎందుకో; ఎదురు రాఁడు= ఎదురుగా రాకున్నాడు; నాకున్= నాకు; చెవులన్= చెవులలో; ఎట్టివార్త= ఎటువంటి వృత్తాంతం (సమాచారం); చోఁకును+ఒక్కొ!= తగులునో (వినిపించునో)!; చే+పెట్టి కలఁచిన+భంగిన్= చేయిపెట్టి కలత కలిగించినట్లుగా; మనము= మనస్సు; త్రిప్పికొనన్+తొడంగెన్= క్షోభించటానికి మొదలైంది.

తాత్పర్యం: వికసించే ముఖంతో ముద్దుల కుమారుడు అభిమన్యుడు ఎందుకో ఎదురు రాకున్నాడు! ఈ చెవులకు ఎటువంటి వార్త వినబడుతుందో! చెయ్యిపెట్టి కలచివేసినట్లుగా మనస్సులో క్షోభ మొదలైంది.

విశేషం: అలం: ఉపమ. వికసించే ముఖంతో అభిమన్యుడు ఎదురుగా ఎందుకు రాకున్నాడో! - అనే సందేహం అర్జునుడికి కలిగింది. ఏ చెడ్డ వార్త వినవలసి వస్తుందో! - అనే అనుమానం కూడా కలుగుతూ ఉన్నది. ఏదో బయటకు చెప్పలేని ఒక మానసిక వైకల్యం ఏర్పడుతూ ఉన్నది. దీనినే తిక్కన చక్కని జాతీయంలో 'చేవెట్టి కఁలచినభంగి' 'త్రిప్పికొనఁ దొడంగె' అను ప్రయోగాలలో పేర్కొన్నాడు. 'అభిమన్యుడు - వార్త, భంగి' అను మూడు సంస్కృత పదాలు తప్ప తక్కిన ఆటవెలది పద్యం అంతా అచ్చతెనుగు నుడికారపు సొంపుతో 'అలరు'ట గమనార్హం.

క. పలుమాటల కిటు మఱుమా । టలు వలుకని కృష్ణుతో నడలు మది మొలవం
బలుకుచు ధర్మసుతుని విడి । దల కరిగెను మోము వెల్లఁదనమునఁ గదురన్. 231

ప్రతిపదార్థం: పలుమాటలకున్= పెక్కుమాటలకు; ఇటు= ఇట్లా; మఱుమాటలు+పలుకని= బదులు మాటలు మాటాడని; కృష్ణుతోన్= కృష్ణుడితో; మదిన్= మనస్సులో; అడలు+మొలవన్= దుఃఖం అంకురించగా; పలుకుచున్= మాటాడుతూ; మోము= మొగము; వెల్లఁదనమునన్= వివర్ణత్వంతో; కదురన్= అతిశయించగా; ధర్మసుతుని, విడిదలకున్= ధర్మరాజు శిబిరానికి; అరిగెన్= పోయాడు.

తాత్పర్యం: పెక్కుమాటలకు ఒక్కమాట కూడా బదులు పలుకని కృష్ణుడితో, మనస్సులో దుఃఖం చిగురించగా మాటాడుతూ, ముఖంలో వివర్ణత కలుగగా ధర్మరాజు ఉన్న శిబిరానికి పోయాడు.

విశేషం: ఇందలి పదబంధాలు ఎక్కడికక్కడ తునిగిపోయినట్లు అర్జునుడి వికలమైన మనస్సు ఎట్లా శకలాలు కానున్నదో ధ్వనింపజేస్తూ ఉన్నాయి. కందపద్యాన్ని రకరకాల గతులలో నడిపించే సర్వసమర్థుడైన తిక్కన ముందుగా కొన్ని లఘువులు తర్వాత ఒక గురువు మరల కొన్ని లఘువులు ఒక గురువూ వచ్చేటట్లు ఒక విచిత్రమైన లయగతిని ఇందులో పాటించాడు. అది సంశయగ్రస్తమైన మనస్సులోని సంతాపం అప్పుడప్పుడే చిగుళ్ళు తొడిగితే ఎట్లా ఉంటుందో రచనా శిల్పం ద్వారా అభివ్యక్తమైనది.

వ. ఇవ్విధంబున నరిగి, యన్నరపతి బంధు మిత్త్రులును మాన్యరాజన్యులుం దానును నొక్కయెడ నున్నం దత్ప్రదేశంబునకుం గేశవుండును దోడన చనంజని, వా రుమ్మలించి యునికియు వారలలోన సుభద్రాసూనుండు లేమియుం జూచి, సవ్యసాచి యడుగులు దొట్రువడ నక్కొలువులోనికిం బోయి కలయంగనుంగొని యెలుంగు రాల్పడ నిట్లనియె. 232

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఇట్లా; అరిగి= పోయి; ఆ+నరపతి= ఆ రాజు (అనగా ధర్మరాజు); బంధుమిత్రులును= బంధువులూ, మిత్రులూ; మాన్య+రాజన్యులున్= గారవించదగిన రాజ శ్రేష్ఠులూ; తానునున్= తానున్నూ; ఒక్క+ఎడన్= ఒకచోట; ఉన్నన్= ఉండగా; తద్+ప్రదేశంబునకున్= ఆ చోటుకు; కేశవుండునున్= శ్రీకృష్ణుడున్నూ; తోడన్+అ= తనతో కూడా; చనన్= పోగా; చని= పోయి; వారు= ధర్మరాజు, బంధుమిత్రులు, రాజన్యులు; ఉమ్మలించి= దుఃఖించి; ఉనికియున్= ఉండటమున్నూ; వారలలోనన్= ఆ అందరిలో; సుభద్రాసూనుండు= అభిమన్యుడు; లేమియున్= లేకుండటమున్నూ; చూచి= కనుఁగొని; సవ్యసాచి= అర్జునుడు; అడుగులు= పాదాలు; తొట్రుపడన్= తడబడగా; ఆ+కొలువులోనికిన్= ఆ రాజ సభలోకి; పోయి= అరిగి; కలయన్= అంతటా; కనుంగొని= చూచి; ఎలుంగు రాల్పడన్= గద్గదిక స్వరంతో (డగ్గుత్తికతో); ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా వెళ్ళి, ఆ ధర్మరాజు బంధుమిత్రులతో, రాజశ్రేష్ఠులతో కలిసి ఒకచోట ఉండగా, అక్కడికి శ్రీకృష్ణుడు వెంటరాగా వెళ్ళి, వారందరూ దుఃఖిస్తూ ఉండటం, వారిలో అభిమన్యుడు లేకపోవటం గమనించి,అర్జునుడు తడబడే అడుగులతో ఆ కొలువులోకి ప్రవేశించి అంతటా కలయజూచి గొంతు బొంగురుపోగా ఇట్లా అన్నాడు:

క. **'ఆననములు వెలవెల్లం । గా నడ లొదవినది మీకుఁ; గానఁ దడవ మీ**
లో నభిమన్యుఁడు లేఁడే । మో, నాకుం జెప్పుఁ; డేల యూరకయుండన్. **233**

ప్రతిపదార్థం: మీకున్= మీకు(అనగా ధర్మరాజాదులకు అని భావం); ఆననములు= ముఖాలు; వెల వెల్లన్+కాన్= (తెల తెల్లగా) వెల్లబోయేటట్లు; అడలు+ఒదవినది= దుఃఖం కలిగింది; కానన్= తెలియను; తడవన్= వెదుకగా; మీలోన్= మీలో; అభిమన్యుఁడు= అభిమన్యుడు; లేఁడు= లేకున్నాడు; ఏమో!= ఎందుకో!; నాకున్= నాకు; చెప్పుఁడు= చెప్పండి; ఊరక+ఉండన్+ఏల?= మిన్నక (మాటాడకుండా) ఉండటం ఎందుకు?

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! మీకు ముఖాలు వెల్లబాటు కలిగేటట్లు విన్నబాటు (దుఃఖం) కలిగింది. ఎందుకో తెలియదు. ఎంత వెదికినా మీలో అభిమన్యుడు మాత్రం కనిపించటం లేదు. నాకు చెప్పండి. ఊరక ఎందు కిట్లా మౌనంగా ఉన్నారు?

క. **ధనురాచార్యుఁడు దగఁ బ । న్నిన పద్మవ్యూహ మొరులు నేరరు చొరు మం**
చనుమానింప కతనిఁ జొరు । మనరుగదా! మీ యుపాయ మాఱడిఁ బోవన్. **234**

ప్రతిపదార్థం: ధనుస్+ఆచార్యుఁడు= ద్రోణుడు; తగన్= తగునట్లుగా; పన్నిన+పద్మవ్యూహము= ఏర్పరచిన (సిద్ధపరచిన) పద్మాకారం గల యుద్ధవ్యూహం; ఒరులు= ఇతరులు; నేరరు= చొరజాలరు; మీ ఉపాయము= మీయొక్క ఉపాయం; ఆఱడిన్+పోవన్= వ్యర్థంకాగా; అతనిన్= ఆ అభిమన్యుడిని; అనుమానింపక= సందేహించకుండా; చొరుము= ప్రవేశించుము; అనరుకదా!= అని మీరు అనలేదు కదా!

తాత్పర్యం: ద్రోణుడు ఏర్పరిచిన పద్మవ్యూహాన్ని ఇతరులు ప్రవేశించ లేరు. మీ ఉపాయం వ్యర్థంకాగా, అనుమానించకుండా ఆ అభిమన్యుడిని అందులో ప్రవేశించు మని మీరు అనలేదుకదా!

ఉ. **అమ్మొనసొచ్చు చొప్పు తెలియన్ వినె; నంతియకాని యిమ్ములం**
గ్రమ్మఱు భంగి వాఁడు వినఁగానఁడు దీని నెఱుంగ కున్కిఁ బా
పమ్మునఁ బోయి మీరు సొరఁ బంచిన నుక్కునఁ జొచ్చి యోధబృం
దమ్ములచేత మ్రగ్గఁడుగదా! కురువీరులు సుట్టుముట్టినన్. **235**

ప్రతిపదార్థం: ఆ+మొన+చొచ్చు+చొప్పు= ఆ వ్యూహాన్ని ప్రవేశించే విధం; తెలియన్= తెలియగా; వినెన్= విన్నాడు; అంతియ,కాని= అంతే కాని; ఇమ్ములన్= ఇంపుతో; క్రమ్మఱు+భంగిన్= అందుండి మరలివచ్చే విధాన్ని; వాఁడు= ఆ అభిమన్యుడు; వినన్+ కానఁడు=విని ఎరుగడు; దీనిన్= దీనిని; ఎఱుంగక+ఉన్కిన్= తెలియకపోవటం చేత; పాపమ్మునన్+పోయి= పాపకార్యానికి ఒడిగట్టి; మీరు= మీరందరు; చొరన్+పంచినన్= ప్రవేశించటానికి పంపగా; ఉక్కునన్= శౌర్యంతో; చొచ్చి= ప్రవేశించి; కురువీరులు= కౌరవవీరులు; చుట్టుముట్టినన్= చుట్టూ వచ్చి ముట్టడించగా; యోధ+బృందమ్ముల చేతన్= వీరుల సమూహంచేత; ప్రగ్గఁడు కదా!= చావడు కదా!

తాత్పర్యం: ఆ వ్యూహాన్ని ప్రవేశించే విధం మాత్రమే అతడికి ఎరుక. అంతేకాని అనుకూలంగా అందులోనుండి వెలుపలికి మరలిరావటం అతడు విని ఎరుగడు. దీనిని తెలియకపోవటం చేత పాపకార్యానికి ఒడిగట్టి మీరు అతడిని ప్రవేశించటానికి పంపగా, అతడు శౌర్యంతో ప్రవేశించి కురువీరులు చుట్టూచేరి ముట్టడించటంతో యుద్ధవీరుల సమూహంచేత మరణించలేదు కదా!

మ. హరిమేనల్లుఁడు, గొంతి కూర్చు మనుమం, డస్మత్తనూజుండు, సం
గరకేళీ నిపుణుండు, దివ్య శరశిక్షాశాలి యవ్వీరు నె
వ్వరొకో నేలకుఁ దెచ్చి? రొక్కరునిచే వాఁడేల చిక్కుం? బోరిం
బోరిఁ బెక్కండ్రురు విచ్చుచుం బొదువుచుం బోరాట గల్గెం జుమీ! 236

ప్రతిపదార్థం: హరిమేనల్లుఁడు= శ్రీకృష్ణుడికి మేనల్లుడూ; గొంతి, కూర్చు, మనుమండు= కుంతీదేవి ప్రేమించే మనుమడు; అస్మద్+తనూజుండు= నా కుమారుడూ; సంగర, కేళీ, నిపుణుండు= యుద్ధక్రీడలో విశారదుడూ; దివ్య, శర, శిక్షాశాలి= దివ్యములైన (గొప్పవైన)అస్త్రములయొక్క నేర్పుచేత ప్రకాశించేవాడూ(అయిన); ఆ+వీరున్= ఆ వీరుడిని; ఎవ్వరొకో= ఎవ్వరు; నేలకున్+తెచ్చిరి= పడగొట్టారో; ఒక్కరునిచేన్= ఒకడిచేత; వాఁడు= ఆ అభిమన్యుడు; ఏల చిక్కున్?= ఎట్లా లోబడతాడు(మరణిస్తాడు)?; పెక్కండ్రురు= అనేకులు; పొరిన్ పొరిన్= పలుమార్లు; విచ్చుచున్= తొలగుతూ; పొదువుచున్= క్రమ్ముతూ; పోరు+ఆట= రణక్రీడ (యుద్ధం చేయటం); కల్గెన్+చుమీ= కలిగి ఉంటుంది కాబోలు!

తాత్పర్యం: శ్రీ కృష్ణుడి మేనల్లుడూ, కుంతికి కూరిమి మనుమడూ, నా కుమారుడూ, యుద్ధక్రీడా చతురుడూ, దివ్యాస్త్రాల నేర్పుతో ప్రకాశించేవాడూ అయిన ఆ వీరుడిని ఎవరు నేల కూల్చారో? ఒక్కడి చేత వాడు ఎందుకు మరణిస్తాడు? (ఒక్కడికైతే వాడు లోబడడు). పలువురు మాటిమాటికి తొలగుతూ (కమ్ముకొంటూ) ఎదుర్కొంటూ యుద్ధం చేయటం జరిగి ఉంటుంది.

విశేషం: పద్యం యొక్క ఎత్తుగడ పరమగంభీరంగా ఉన్నది. అభిమన్యుడితో తమకుండే సంబంధాన్ని చెప్పేటప్పుడు మొట్టమొదట శ్రీకృష్ణుడిని, తర్వాత కుంతీదేవినీ, చివరగా తననూ అర్జునుడు ప్రస్తావించాడు. ముందుగా పెద్దలను చెప్పి, తర్వాత తనను గురించి చెప్పుకొనటం చక్కని సంప్రదాయం. ముందుగా మూడు విశేషణాలలో సంబంధ బాంధవ్యాలను తెలుపుతూ, చివరి రెండు విశేషణాలలో యుద్ధక్రీడా చాతుర్యాన్నీ, అస్త్ర విద్యా ప్రకాశత్వాన్నీ తిక్కన వివరించాడు. 'విచ్చుచుం బొదువుచుం బోరాట' సల్పినట్లుగా అభివర్ణించటం తిక్కనకు తెలిసిన యుద్ధ తంత్రాన్ని వెల్లడిస్తూ ఉన్నది.

క. గురులకు భక్తుఁ డుదారుఁడు, । గరుణ గలఁడు, శౌర్య ధైర్య గాంభీర్యధురం
ధరుఁడు, మొగమోడు నా సుర । వరపౌత్రుఁడు లేమి కోర్వవచ్చునె చెపుఁడా! 237

ప్రతిపదార్థం: గురులకున్= పెద్దలకు; భక్తుఁడు= సేవ చేసేవాడు; ఉదారుఁడు= గొప్పవాడు; కరుణగలఁడు= దయగలవాఁడు; శౌర్య, ధైర్య, గాంభీర్య, ధురంధరుఁడు= శూరత్వం, ధీరత్వం, క్రోధశోకాదులచేత వికారం పొందని స్వభావం అనే వాటియొక్క

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భారాన్ని భరించేవాడు; మొగమోడున్= మొగమోటమి కలవాడూ; ఆ+సురవర పౌత్రుండు, లేమికిన్= ఆ ఇంద్రుడి మనుమడు లేకుండటానికి; ఓర్వవచ్చును+ఎ?= సహించవచ్చునా?; చెపుఁడా!= చెప్పండి.

తాత్పర్యం: పెద్దల యెడ భక్తి గలవాడూ, గొప్పవాడూ, దయగలవాడూ, శౌర్యం, ధైర్యం, గాంభీర్యం అనే గుణాల భారాన్ని భరించేవాడూ, మొగమోటమి కలవాడూ, ఇంద్రుడి మనుమడూ లేకపోవటాన్ని సహించవచ్చునా! చెప్పండి.

క. **అన్నగుమోమును, నత్తెలి । గన్నులు, నవ్వెడఁద యురముఁ గన్నారంగాఁ**
గన్నను బ్రదుకుదుఁ; గానక । యున్నను బ్రాణంబు లెట్టు లుండఁగ నేర్చున్? **238**

ప్రతిపదార్థం: ఆ+నగుమోమునున్= ఆ నవ్వే ముఖాన్ని; ఆ+తెలికన్నులున్= ఆ తెల్లని కన్నులున్నూ; ఆ+వెడఁద+ఉరమున్= ఆ విశాలమైన వక్షస్థలమున్నూ; కన్నారంగాన్= కన్నులారా; కన్నను= చూడగలిగితే; బ్రదుకుదున్= జీవిస్తాను; కానక+ఉన్నన్= చూడకుంటే; ఎట్టులు= ఏ విధంగా; ప్రాణములు+ఉండఁగన్+నేర్చున్= ప్రాణాలు ఉండగలుగుతాయి (జీవించగలను అని భావం).

తాత్పర్యం: ఆ నవ్వుముఖాన్ని, ఆ తెల్లని కన్నులను, ఆ విశాలవక్షఃస్థలాన్నీ కళ్ళారా చూడగలిగితే జీవిస్తాను. చూడక పోతే ఎట్లా జీవించగలను?

విశేషం: అభిమన్యుడిలో అర్జునుడిని ఆకట్టుకొన్న అతిముఖ్య లక్షణాలు మూడు. అవి అతడి అందాన్నీ, క్షత్రియోచిత గాంభీర్యాన్నీ వెల్లడించేవి. ఏడుపుమొగంతో ఎదురువస్తే ఎప్పుడూ అపజయమే. కాని, నవ్వుమొగం ఆనందానికీ, అఖండ విజయానికీ సంకేతం. ముఖానికి మరీ సౌందర్య స్ఫూర్తిని కలిగించేవి కళ్ళు. అవి తెల్లని కళ్ళు అయితే ముఖకాంతి ఇనుమడిస్తుంది. దేదీప్యమానంగా వెలిగే ఆ తెల్లని కన్నుల నవ్వు మొగంతో ఎదురుగా అభిమన్యుడు రాలేదే? అని అర్జునుడి ఆవేదన. చిన్నకందంలో అభిమన్యుడి అందాన్ని తిక్కన చక్కగా ఆవిష్కరించాడు. వెడదయురము సుక్షత్రియ లక్షణం. అచ్చతెలుగు పదాలలో ఉండే మాధుర్యం తిక్కన కూర్పులో మిక్కిలి ఇనుమడించింది. ఈ పద్యం మొత్తంలో 'ప్రాణంబులు' అనే ఒక తత్సమం తప్ప తక్కిన పద్యమంతా సహజ సుందరమైన తెలుగు పలుకుబడితో ఎంతో శోభించింది.

సీ. **హంసతూలిక పాన్పునందుఁ బొందెడు మేను । కఠినంపు నేలతోఁ గదిసె నేఁడు;**
గొడుగుల నీడ పై నడరఁ జెన్నగు మోము। పొరిఁ బర్వు పెందూళి బ్రుంగె నేఁడు;
లలనలు లీలమైఁ గొలువ నుండెడు భోగి । వఱలుఁలలో నున్నవాఁడు నేఁడు;
నానాజనములకు నాథుఁడై శోభిల్లు । దొర యనాథత్వంబుఁ బొరసె నేఁడు;

ఆ. **వినయరతుఁడు, హృదయవిదుఁడు, సుభద్ర గా । రాబుపట్టి, మగలరాజు, మాన**
ధనుఁడు, దివిజరాజు మనుమఁడు, నా చెలి । కాఁడు, ముద్దులాఁడు లేఁడు నేఁడు. **239**

ప్రతిపదార్థం: హంసతూలిక+పాన్పునందున్= హంస తూలికా తల్పంపై; పొందెడుమేను= పరుండే శరీరం; నేఁడు= ఈనాడు; కఠినంపు+నేలతోన్+కదిసెన్= గరుకైన గట్టి నేలతో చేరింది; గొడుగులనీడ= గొడుగులయొక్క నీడ; పైన్+అడరన్= మీదపడగా (పైన వ్యాపించగా); చెన్ను+అగు, మోము= అందగించే ముఖం; నేఁడు= ఈనాడు; పొరిన్= మాటికి; పర్వు, పెను+ధూళిన్= వ్యాపించే ఎక్కువ దుమ్ముతో; బ్రుంగెన్= కమ్మ(ప్ప)బడింది; లలనలు= ఇంతులు(స్త్రీలు); లీలమైన్= విలాసంతో; కొలువన్= సేవించగా; ఉండెడు భోగి= ఉండే సుఖపురుషుడు; నేఁడు= ఈనాడు; వఱలుఁలలోన్+ఉన్నవాఁడు= నక్కల (మధ్య) నడుమ ఉన్నవాడు; నానాజనములకున్= సమస్త ప్రజలకు; నాథుఁడు+ఐ= ప్రభువై; శోభిల్లుదొర= ప్రకాశించే నాయకుడు; నేఁడు= ఈనాడు; అనాథత్వంబున్= అనదతనాన్ని (అనగా దిక్కులేనితనాన్ని); పొరసెన్= పొందాడు; వినయరతుఁడు= విశిష్టమైన నీతియందు ఆసక్తి కలవాడు; హృదయవిదుఁడు= మనస్సు తెలిసికొనేవాడు అనగా ఇంగితజ్ఞుడు; సుభద్రగారాబు పట్టి= సుభద్ర ముద్దులకొడుకు;

మగలరాజు= వీర శ్రేష్ఠుడు (పురుషోత్తముడు); మానధనుఁడు= అభిమానమే ధనంగా కలవాడు; దివిజరాజు మనుమఁడు= ఇంద్రుడి పౌత్రుడు; నా+చెలికాఁడు= నా మిత్రుడు; ముద్దులాఁడు= మనోజ్ఞుడు; నేఁడు లేఁడు= ఈనాడు లేడు.

తాత్పర్యం: హంసతూలికా తల్పంమీద పవ్వళించే శరీరం ఈనాడు కటికనేలలో కలిసింది. గొడుగుల నీడలో అందగించే ముఖం మాటిమాటికీ వ్యాపించే పెద్దదుమ్ముతో క్రమ్ముకొనబడింది. స్త్రీలు విలాసంతో సేవించగా ప్రకాశించే సుఖవంతుడు ఈనాడు నక్కల నడుమ పడి ఉన్నాడు. సమస్త ప్రజలకు ప్రభువై ఉండే దొర ఈనాడు దిక్కులేనితనాన్ని పొందాడు. మిక్కిలి వినయపరుడూ, ఇంగితజ్ఞుడూ, సుభద్ర ముద్దుల కొడుకూ, వీరశ్రేష్ఠుడూ, అభిమానధనుడూ, ఇంద్రుడి మనవడూ, నా మిత్రుడూ అయిన ఆ మనోజ్ఞుడు నేడు లేడు.

విశేషం: తిక్కన సీసపద్యపాదాలలో అభిమన్యుడి పూర్వస్థితికీ, ఇప్పటి స్థితికీ ఉండే తారతమ్యాన్ని తెలుపుతూ ఆటవెలదిలో అతడి అందచందాలు, అందరినీ అలరించే అతడి గుణగణాలు అభివర్ణించాడు. వందిమాగధులు మేలు కొలుపులతో మేలుకొనేవాడిని నక్కలు అరుపులతో మేల్కొలుపుతూ ఉన్నాయా అనే భావాన్ని తిక్కన వదలివేశాడు. తక్కిన విషయం మూలానికి సన్నిహితంగా ఉన్నా, ఎంతో స్వతంత్రంగా భాసిస్తూ, విస్పష్టతనూ విశదత్వాన్నీ సంతరించుకొన్నది. కుమారుడిని 'నా చెలికాడు' అనటం విశేషం. చక్కగా నీతి శాస్త్రాన్ని ఆకళించుకొన్న తిక్కన అభిమన్యుడి అప్పటి వయస్సును బట్టి 'చెలికాడు' అని ప్రయోగించటం ఔచిత్యవంతంగా ఉన్నది. మగలరాజు అనే ప్రయోగంలో మహాశూరులకే అతడధిపుడు అని ప్రకటిస్తూ, చివరిపాదంలోని శబ్దాలంకారం గమనార్హం. అది పైకి వినటానికి అందంగా ఉన్నా, అందులో అర్జునుడి మనఃక్షోభ పాఠకుడి మనస్సును కదలించి వేస్తుంది.

ఉ. **అక్కట! మందభాగ్యునకు నట్టి తనూభవరత్న మెవ్విధిన్**
దక్కు? విధాత నిర్దయుఁ; డొడంబడునే కడు మేలి వస్తువుల్
పెక్కుదినంబు లున్కి? యరిబృందము పిల్చినఁ బోటు బంటనై
యక్కడ కేల పోయితి? మహాగుణభూషణుఁ గోలుపోయితిన్.' **240**

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; మందభాగ్యునకున్= తక్కువ అదృష్టం కలవాడికి; అట్టి, తనూభవ, రత్నము= అటువంటి పుత్రశ్రేష్ఠం; ఏ+విధిన్= ఏ విధంగా; దక్కున్?= దక్కుతుంది?; విధాత= బ్రహ్మ; నిర్దయుఁడు= దయలేనివాడు; కడుమేలి వస్తువుల్= మిక్కిలి గొప్పవస్తువులు; పెక్కు+దినంబులు+ఉన్కి= చాలా దినాలు ఉండటం; ఒడంబడునే?= అనుకూలించేనా?; అరి, బృందము, పిల్చినన్= పగవారి గుంపు పోరుకు పిలువగా; పోటుబంటను+ఐ= శూరుడనై; అక్కడకున్= ఆ సంశప్తకులతో పోరాడే చోటుకు; ఏల?= ఎందుకు?; పోయితిన్= పోయాను; మహా, గుణ, భూషణున్= గొప్ప గుణాలు ఆభరణాలుగా ఉన్నవాడిని; కోలుపోయితిన్= పోగొట్టుకొన్నాను.

తాత్పర్యం: 'అయ్యో! నావంటి దౌర్భాగ్యుడికి అటువంటి పుత్రరత్నం ఎట్లా దక్కుతుంది? బ్రహ్మ దయలేనివాడు. మిక్కిలి గొప్ప వస్తువులను చాలా దినాలు ఉంచటానికి అతడు సమ్మతించడు. శత్రువులైన ఆ సంశప్తక సైన్యం పిలవగానే నే నక్కడికి ఎందుకు పోయాను? మహోదాత్త గుణాలే ఆభరణాలుగా శోభించే అభిమన్యుడిని పోగొట్టుకొన్నాను.'

వ. **అనుచుఁ జదికిలం బడి ఫల్గునుండు.** **241**

తాత్పర్యం: అంటూ నేలమీద కూలబడి అర్జునుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. హా! యను, ధర్మరాజ తనయా! యను, న న్నెడఁబాయ నీకుఁ జ
న్నే?' యనుఁ, దల్లి నేఁప జనునే! యనుఁ, గృష్ణుఁడు వీఁడె వచ్చె రా
వే! యను, నొంటి వోకఁ దగవే! యను, నేగతిఁ బోవువాఁడ నే
నో యభిమన్యుఁడా! యనుఁ, బ్రియోక్తుల నుత్తరఁ దేర్పవే! యనున్. 242

ప్రతిపదార్థం: హా!+అనున్= దుఃఖాన్ని తట్టుకోలేక హా! అని అంటాడు; ధర్మరాజ తనయా+అనున్= ధర్మరాజు కొడుకా! అంటాడు; నీకున్+నన్నున్+ఎడన్+పాయన్+చన్నే!= నీకు, నన్ను, వదలి వెళ్ళటం తగునా!; అనున్= అంటాడు; తల్లిన్+ఏఁపన్+చనునే!= (మీ) అమ్మను బాధించటం తగునా?; అనున్= అంటాడు; కృష్ణుఁడు= నీ మేనమామ కృష్ణుడు; వీఁడె, వచ్చెన్= ఇతడే వచ్చాడు; రావే!+అనున్= తొందరగా రా అంటాడు; ఒంటిపోక, తగవే= ఒంటరిగా పోవటం న్యాయమా?; అనున్= అంటాడు; ఓ+అభిమన్యుడా!; నేను+ఏగతిన్+పోవువాఁడన్= (కుమారా!) ఓ అభిమన్యూ! నేను ఏ విధంగా పోగలను; అనున్= అంటాడు; ప్రియ+ఉక్తులన్= ప్రీతిగల మాటలతో; ఉత్తరన్= ఉత్తరను; తేర్పవే!= తేరుకొనేటట్లు చేయవే!; అనున్= అంటాడు.

తాత్పర్యం: దుఃఖాన్ని భరించలేక అర్జునుడు హా! ధర్మరాజ కుమారా! నన్నెడబాయటం నీకు తగునా? తల్లిని బాధించటం ధర్మమా! ఇదిగో నీ మేనమామ కృష్ణుడు వచ్చాడు. తొందరగా రా! ఒంటిగా వెళ్ళిపోవటం యుక్తమా! ఓ అభిమన్యూ! నే నేమైపోతానో! ఉత్తరను మంచి మాటలతో ఊరడించుము అని అనేకవిధాలుగా విలపించాడు.

విశేషం: ఈ పద్యం ప్రారంభమే సంతాపార్థకం అయిన హాకారం. ప్రతిపాదం మొదట్లో యతిస్థానంలో సంబోధన అంతమయ్యేటట్లు దుఃఖాన్ని అభివ్యక్తం చేయటం ఈ రచనలోని విశిష్టత. తమలో పెద్దవాడు ధర్మరాజు. ఆయన వంశాన్ని నిలపవలసిన వాళ్ళలో అభిమన్యుడు ముఖ్యుడు. అందువలన ధర్మరాజ తనయా! అని అన్నట్లు తెలుపబడింది. మేనమామ కృష్ణుడు 'ఇడుగో! వచ్చాడు రావే' అనటం వలన అభిమన్యుడికీ, కృష్ణుడికీ మధ్య ఉండే సాన్నిహిత్యం, అన్యోన్య ప్రేమవాత్సల్యాలు వెల్లడింపబడ్డాయి. ఒంటిగా నీవు వెళ్ళావు. నేనెట్లా వెళ్ళేది? తల్లి నెందుకు బాధపెడతావు? నీ ఉత్తరను తేర్చుము అని అందరితో అభిమన్యుడికి ఉండే సంబంధ బాంధవ్యాన్ని చక్కగా తిక్కనామాత్యుడు ఈ ఉత్పలమాలావృత్తంలో వివరించాడు.

వ. అని మఱియు ననేక ప్రకారంబులం బలవించి యుధిష్ఠిరు నాననం బాలోకించి. 243

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; మఱియున్= ఇంకా; అనేక ప్రకారంబులన్= పెక్కు విధాలుగా; పలవించి= దుఃఖించి; యుధిష్ఠిరు+ఆననంబు= ధర్మరాజు ముఖం; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అంటూ పెక్కురీతులతో దుఃఖించి ధర్మరాజు ముఖాన్ని చూచి.

ఉ. 'పావని సేరి యుండఁ డొకో! పార్షతుఁ డచ్చట లేఁడె? యొండుమైఁ
బోవఁగఁ బంచితే ద్రుపదుఁ? బోరికి సాత్యకి రాక తక్కెనే?
భూవర! మత్స్యనాథుఁ డెట వోయెనొ! డెప్పరమైన నీకునుం
గావఁగ రాక తక్కెనొ! తెగం గత మేమి సుభద్ర పట్టికిన్? 244

ప్రతిపదార్థం: భూవర!= రాజా! (ధర్మజుడి సంబోధన); పావని= భీముడు; చేరి+ఉండఁడు+ఒకొ!= సమీపించి ఉండలేదా?; పార్షతుఁడు= పృషతుడి కొడుకు అనగా ద్రుపదుడు; అచ్చటన్= అక్కడ; లేఁడె?= లేడా?; ద్రుపదున్= ఆ పార్షతుని; ఒండుమైన్+పోవఁగన్= మరో చోటుకు పోవటానికై; పంచితే?= పంపావా?; సాత్యకి= సత్యకాత్మజుడు; పోరికిన్ రాక= యుద్ధానికి రాకుండా;తక్కెనే?= నిలిచిపోయాడా?; మత్స్యనాథుఁడు= విరాటరాజు; ఎట పోయెనొ?= ఎక్కడకు పోయాడో?; నీకునున్+డెప్పరమైనన్=

నీకున్నూ మిక్కుటం కాగా (అశక్యం - దుస్సహం కాగా); కావఁగన్+రాక= రక్షించటానికి (వీలు)కాక; తక్కెనో= తప్పిపోయిందా!; సుభద్రపట్టికిన్= అభిమన్యుడికి; తెగన్= చావటానికి; కత మేమి(కతము+ఏమి)= కారణం ఏమిటి?

తాత్పర్యం: ధర్మరాజా! భీముడు ఆ సమీపంలో లేడా? ద్రుపదుడు ఎక్క డున్నాడు? అతడిని మరోచోటికి పంపావా? సాత్యకి యుద్ధానికే రాలేదా? విరాటుడు ఎక్కడకు పోయాడు? అప్పుడు నీకూ అసాధ్యం కావటంతో కాపాడటానికి వీలు లేకపోయిందా? అభిమన్యుడు మరణించటానికి కారణం ఏమిటి?

విశేషం: తన తర్వాత తన అంతటివాడు భీముడు. ఇక పాండవసైన్యానికి అధిపతిగా ఉన్నవాడు ద్రుపదుడి కొడుకు. ఇట్లా ఈ పద్యంలో వారి వారి ప్రాధాన్యాన్ని బట్టి అర్జునుడు తమ సైన్యంలో ఉండే ప్రముఖులను అందరినీ అడిగాడు. అంతకుముందు వాక్యంలో యుధిష్ఠిరుడు అని ఉన్నది. యుద్ధంలో స్థిరంగా నిలిచే ధర్మరాజుకు అభిమన్యుడిని కాపాడటం అశక్యమైనదా? అని చివరగా ధర్మరాజును పేర్కొనటం జరిగింది. ధర్మరాజు తాను నిమిత్త మాత్రుడు. అవసరం వచ్చినప్పుడు ఎంతటిపనికైనా సమర్థుడు. మొదట్లోనే నీ వేమి చేస్తూ ఉండినావు అని అడగటం ఒక విధంగా నిందాపాత్రం అవుతుంది. ఇన్ని ఆలోచించి ఈ పద్యంలో యోధుల క్రమాన్ని చెప్పటం జరిగింది.

అర్జునుఁడు ధర్మరాజు నభిమన్యుండు సచ్చిన విధంబు నడుగుట (సం. 7-50-45)

క. పడుఁ గాక యేమి? పగఱం । గడిమి మెఱసి చంప నొంపఁ గనియెనె నృప! నీ
కొడు కిట యట సూడక యె । క్కుడు మగఁటిమి నుఱికి పేరు గొనియెనె పోరన్? 245

ప్రతిపదార్థం: నృప!= రాజా!; నీ కొడుకు= అభిమన్యుడు; పడున్‌కాక+ఏమి?= యుద్ధంలో చస్తే ఏమి?; కడిమి+మెఱసి= శౌర్యాన్ని అతిశయింపజేసి; పగఱన్= శత్రువులను; చంపన్+నొంపన్+కనియెనె= చంపటానికి, నొప్పించటానికి, శక్తుడయ్యాడా?; ఇట అట చూడక= అటూ ఇటూ దిక్కులు చూడకుండా అనగా పరాకుపడకుండా; ఎక్కుడు+మగఁటిమిన్= ఎక్కువ పరాక్రమంతో; ఉఱికి= దూకి, విజృంభించి; పోరన్= యుద్ధంలో; పేరు+కొనియెనె?= పేరు తెచ్చుకొన్నాడా? (శూరుడనిపించుకొన్నాడా?).

తాత్పర్యం: ' ఓ రాజా! నీ కొడుకు అభిమన్యుడు యుద్ధంలో మరణిస్తే మరణించాడు. అతడు శౌర్యంతో శత్రువులను చంపి బాధించ గలిగాడు కదా! భీతితో అటూ ఇటూ దిక్కులు చూడకుండా, పరాకు పడకుండా అధిక పరాక్రమంతో యుద్ధరంగంలోకి విజృంభించి దూకి పేరు తెచ్చుకొన్నాడా?

విశేషం: అభిమన్యుడి మరణానికి ఎంతో దుఃఖించిన అర్జునుడు, ఎట్లా మరణించాడు? అని అడుగుతూ 'పడుఁగాక యేమి' అని కొంత ఉపశమనాన్ని పొందినవాడివలె మాట్లాడాడు. వీరస్వర్గాన్ని అలంకరించిన అభిమన్యుడు శత్రువులను ఎట్లా చంపి నొంపి తన మగటిమిని ప్రదర్శించాడు? అందరూ అతడిని శూరుడు అని కీర్తించారా? అని అడిగాడు. అతని శరీరం నశించినా, అతడు ప్రదర్శించిన రణ నైపుణ్యమే పుణ్యాన్ని కలిగిస్తుందని ఇందులోని భావం.

వ. అని పలికి నిట్టూర్పు నిగిడించి చింతించి. 246

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలికి= మాటాడి; నిట్టూర్పు, నిగిడించి= దీర్ఘంగా నిశ్వసించి; చింతించి= ఆలోచించి.

తాత్పర్యం: అని మాటాడి దీర్ఘనిశ్వాసలు వదులుతూ చింతతో. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. పలువురు సుట్టుముట్టుకొని బాణకృపాణ ముఖాస్త్ర శస్త్ర పం
క్తులఁ గడు నొంపఁగాఁ దనకుఁ దోడ్పడు వారలు లేక నన్ మదిం
దలఁపఁడె? యత్తఱిన్ రిపువధంబున కెయ్యది తండ్రి! యేను గొం
దలమునఁ బొందకుండ నని తాఁ బలుమాఱును జీరకుండునే? 247

ప్రతిపదార్థం: పలువురు= అనేకులు; చుట్టుముట్టుకొని= చుట్టూ గుమిగూడి (పరివేష్టించి); బాణ, కృపాణ, ముఖ+అస్త్ర శస్త్ర పంక్తులన్= బాణాలు; ఖడ్గాలు (కత్తులు); మొదలైన అస్త్రాల యొక్క, ఆయుధాల యొక్క వరుసలచేత; కడునొంపగాన్= మిక్కిలి బాధించగా; తనకున్= తనకు; తోడ్పడువారలు+లేక= సహాయపడేవారు లేక; నన్= నన్ను; మదిన్= మనస్సులో; తలఁపఁడ?= తలచకుండా ఉంటాడా?; ఆ+తఱిన్= అప్పుడు; తండ్రి!= జనకా!; ఏను= నేను; కొందలమునన్+పొందకుండన్= కలత పొందకుండా; రిపు+వధంబునకున్= శత్రువులను చంపటానికి; ఎయ్దుము= వెంబడించుము; అని పలుమాఱునున్= అని అనేక పర్యాయాలు; చీరకుండునే?= పిలవకుండా ఉంటాడా?

తాత్పర్యం: అనేకులు చుట్టూ చేరి, బాణాలు, ఖడ్గాలు మొదలైన అస్త్రాలూ, ఆయుధాలూ ప్రయోగించగా తనకు సహాయపడేవారు లేక నన్ను మనస్సులో తలచుకొనకుండా ఉంటాడా? అప్పుడు 'తండ్రీ! నేను కలత పొందకుండా శత్రువులను చంపటానికి వెంబడించుము' అని ఎన్నోమార్లు పిలిచే ఉంటాడు.

క. అక్కట! తప్పఁ దలంచితి । నక్కొలఁదులవాఁడె కృష్ణు నల్లుఁడు? పోరన్
స్రుక్కునె! బాహాగర్వము । దక్కునె! నా కొడుకు మిన్ను దలపైఁ బడినన్. 248

ప్రతిపదార్థం: అక్కట!= అరెరే!; తప్పన్= పొరపాటుగా; తలంచితిన్= ఆలోచించాను; కృష్ణు+అల్లుఁడు= అభిమన్యుడు; ఆ+కొలఁదులవాఁడె?= అంత తక్కువవాడా? (పిరికివాడా?); పోరన్= యుద్ధంలో; స్రుక్కునె= భయపడుతాడా?; నా కొడుకు= నా కుమారుడు; మిన్ను, తలపైన్+పడినన్= ఆకాశం విరిగి తలమీదపడ్డా; బాహాగర్వమున్= భుజదర్పాన్ని; తక్కునె?= విడిచివేస్తాడా?

తాత్పర్యం: అరెరే! ఎంత తప్పుగా ఆలోచించాను. కృష్ణుడి అల్లుడు (అంత అల్పుడా!) అంత పిరికివాడా! యుద్ధంలో భయపడుతాడా? లేదు. నా కొడుకు మిన్ను విరిగి మీదపడ్డా భుజగర్వాన్ని వీడడు.

విశేషం: 'ఒంటరిగా పోరాడుతూ యుద్ధంలో స్రుక్కి ఎవ్వరూ సహాయపడక పోగా నన్ను తప్పక తలచుకొని ఉంటాడు, అనేక పర్యాయాలు పిలిచి ఉంటాడు' అని భావించిన అర్జునుడు వెంటనే 'ఎంత తక్కువగా ఆలోచించాను, అంచనావేసినాను' అన్నాడు. ఇక్కడ అభిమన్యుడిని గురించి చెప్తుతూ మొదట 'కృష్ణునల్లుడు' అని తర్వాత 'నా కొడుకు' అన్నాడు. సూక్ష్మాతిసూక్ష్మంగా పరిశీలిస్తే కాని ఇటువంటి ఔచిత్యాలు వెంటనే అవగతం కావు. తిక్కన ప్రతిపదాన్నీ, ఎక్కడ ఏది సమంజసమో గమనిస్తూ ఆచి తూచి ప్రయోగిస్తాడు. ఆ పద ప్రయోగంలోనే పాత్రల మనస్తత్త్వం, సన్నివేశ ప్రాముఖ్యం, రసపరిపోషణాది వివిధాంశాలు సమన్వయించ బడుతూ ఉంటాయి.

ఆ. పిన్న నగవుతోడఁ జెన్నెసలారు సౌ । భద్రుమొగము సూడఁ బడయకున్న
వాఁడ; నా మనంబు వ్రయ్యలై పోదు; దిది । ఱాతఁ జేసినది యొకో తలంప! 249

ప్రతిపదార్థం: పిన్న నగవుతోడన్= మందహాసంతో; చెన్ను+ఎసలారు= అందం అతిశయించే; సౌభద్రు మొగమున్= అభిమన్యుడి ముఖాన్ని; చూడన్+పడయకున్న+వాఁడన్= చూడలేక పోతూ ఉన్నాను; నా మనంబు= నా మనస్సు; వ్రయ్యలు+ఐ+పోదు= తుత్తునియలై పోవటం లేదు; తలంపన్= ఆలోచించగా; ఱాతన్= శిలతో(బండతో); చేసినది+ఒకో!= చేసిందా ఏమి!

తాత్పర్యం: మందహాసంతో అందగించే ఆ అభిమన్యుడి ముఖాన్ని చూడలేకపోతున్నాను. నా మనస్సు (హృదయం) ఎందుకు ముక్కలు ముక్కలై పోవటం లేదో! ఆలోచిస్తే ఇది (ఈ మనస్సు) శిలతో చేసిందా ఏమి? అనిపిస్తుంది.

విశేషం: మాటిమాటికి అర్జునుడికి అభిమన్యుడి నవ్వు మొగమే గుర్తుకు వస్తూ ఉన్నది. 'సౌభద్రుమొగము' అనటం వలన అతడిలో అతడి తల్లిపోలికలు ఎక్కువ ఉన్నట్లు అనిపిస్తూ ఉన్నది. 'కృష్ణునల్లుడు' అని అంతకుముందు పేర్కొనటం వలన మేనమామ పోలికలున్నట్లు విదితమౌతున్నది. తన గుండె బండ కాకపోతే ఎందుకు వ్రయ్యలైపోదు? అని విలపించటం ఈ పద్యంలోని విశేషం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పలువురు క్రూరత బాలునిఁ । జలము కొని వధించునపుడు శౌరిని నన్నుం
దలఁప రొకో మనముల వా । రలు దానికి నేమి నీఁగ రాదయ్యెడినో! 250

ప్రతిపదార్థం: వారలు= ఆ పగవారు; పలువురు= అనేకులు; క్రూరతన్= నిర్దయతో; బాలునిన్= కుమారుడిని; చలముకొని= మత్సరించి; వధించునప్పుడు= చంపేటప్పుడు; మనములన్= మనస్సులలో; శౌరిన్= శ్రీకృష్ణుడిని; నన్నున్= నన్ను; తలఁపరు+ఒకో!= తలచుకొనలేదా!; దానికిన్= అటువంటి పనికి (చేతకు); నీఁగరాదు+అయ్యెడినో+ఏమి= త్రిప్పికొట్టడం సాధ్యంకాదా ఏమి?

తాత్పర్యం: ఆ శత్రువులు అనేకులు ఆ విధంగా అభిమన్యుడిని క్రూరులై మత్సరించి సంహరించే సందర్భంలో మనస్సులో వారు శ్రీకృష్ణుడినీ, నన్నూ తలచుకొనలేదా! వారు చేసిన పనిని త్రిప్పికొట్టడం సాధ్యంకాదా ఏమి?

క. కటకట! పేరిన పెన్నె । త్తుట జొత్తిలియున్న మేనితోఁ గొడు కేచ
క్కటిఁ బడియున్నాఁడో? య । చ్చోటు సూపెడు వారు లేరె? చూచెద వానిన్. 251

ప్రతిపదార్థం: కటకట!= అక్కటా!; పేరిన పెను+నెత్తుటన్= గడ్డకట్టిన (గట్టిపడ్డ) అధికరక్తంచేత; జొత్తిలి+ఉన్నమేనితోన్= తడిసి ఉన్న శరీరంతో; కొడుకు= కుమారుడు; ఏ+చక్కటిన్= ఏ రీతిలో; పడి ఉన్నాడో= ఆ+చోటు= ఆ ప్రదేశం; చూపెడువారు లేరే?= చూపేవారు లేరా?; వానిన్+చూచెదన్= అతడిని చూస్తాను.

తాత్పర్యం: అక్కటా! పేరుకొన్న అధికరక్తంతో తడిసి ఉన్న శరీరంతో ఆ అభిమన్యుడు ఏ రీతి, ఎక్కడ పడి ఉన్నాడో? చూపేవారే లేరా? వాడిని చూస్తాను.

విశేషం: ఇక్కడ 'చక్కటి' అనే పదం దిక్కు, స్థలం, సమీపం, రీతి అనే వివిధార్థాలలోనూ ప్రస్తుత సందర్భానికి సరిపోతుంది.

సీ. పడియుండి వాఁ డిలఁ బొడిచిన చందురు । క్రియఁ దత్తలము వెలిఁగింప కున్నె!
యే మని నాతోడఁ బ్రేముడించు నొకో! సు । భద్ర పుత్త్రునిఁ జూడఁ బడయ కున్కి;
బగతుర నిర్జించి మొగము పోటుల నొచ్చి । పొడసూపరాఁడయ్యెఁ గొడుకు నాకు;
నడలునఁ దల్లడ పడియెడు ద్రౌపది । వంత మాన్పింప నెవ్వరికి వశమె?'

తే. యని యలంతమైఁ బలుమాట లాడుచుండి । తలఁచి మఱియును ధర్మనందనుని యాన
నంబు వీక్షించి నిర్జరనాథ తనయుఁ । డెలుఁగు గుత్తుకఁ దగులంగ నిట్టు లనియె. 252

ప్రతిపదార్థం: పడియుండి= రణరంగంలో పడిఉండి; వాఁడు= ఆ అభిమన్యుడు; ఇలన్+పొడిచిన+చందురు క్రియన్= భూమియందు ఉదయించిన చంద్రుడివలె; తద్+తలమున్= ఆ పడిఉండే స్థలాన్ని; వెలిగింపకున్నె!= ప్రకాశింపజేయకుంటాడా!; సుభద్ర; పుత్త్రునిన్= సుభద్రయొక్క కుమారుడిని; చూడన్+పడయన్+ఉన్కిన్= చూడలేకపోవటం చేత; నాతోడన్= నాతో; ఏమి+అని= ఏమని; ప్రేముడించునో= ప్రేమించునో; నాకున్= నాకు; కొడుకు= కుమారుడు; పగతురన్+నిర్జించి= శత్రువులను జయించి; మొగము పోటులన్= ముఖములోని పొడుపులతో; నొచ్చి= బాధపడి; పొడచూపరాఁడు+అయ్యెన్= కనిపించనివాడు అయ్యాడు; అడలునన్= దుఃఖంతో; తల్లడపడియెడు+ద్రౌపదిన్= చలించిపోయే ద్రౌపదిని; వంత+మాన్పింపఁగన్= దుఃఖాన్ని తీర్చగా; ఎవ్వరికిన్+వశమె?= ఎవరికైనా సాధ్యమా?; అని= ఆ ప్రకారంగా; అలంతమైన్= అలసటచేత; పలుమాటలు= చాలామాటలు; ఆడుచుండి= పలుకుతూ ఉండి; తలఁచి= తలచుకొని; మఱియున్= మరల; ధర్మనందనుని+ఆననంబున్= ధర్మరాజు ముఖాన్ని; వీక్షించి= చూచి; నిర్జరనాథ తనయుండు= అర్జునుడు; ఎలుఁగు= కంఠధ్వని; కుత్తుకన్+తగులంగన్= గొంతునుండి వెడలకుండగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

డగ్గ్తత్తిక పడగా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ రణరంగంలో పడిపోయిన అభిమన్యుడు భూమిలో పుట్టిన చంద్రుడివలె ఆ ప్రదేశాన్ని వెలిగించకుండా ఉంటాడా? కుమారుడిని చూడలేక పోవటం చేత సుభద్ర నన్ను ఏమని ప్రేమిస్తుంది? కొడుకు శత్రువులను జయించి మొగమునందలి దెబ్బలతో నొచ్చి కనిపించకుండా పోయాడనే దుఃఖంతో చలించే ద్రౌపదిని ఊరార్చటానికి ఎవరికి శక్యమౌతుంది? అని అలసటతో పెక్కుమాటలు మాటాడుతూ కుమారుడిని తలచుకొని మళ్ళీ ధర్మరాజును చూచి అర్జునుడు కంఠధ్వని గొంతునుండి సరిగ వెలువడని స్థితిలో ఇట్లా అన్నాడు:

వ. సంశప్తక సమితి తోడం దమకించి పోరి పోరి కౌరవసైనికుల సింహనాదంబుల వింటి; నప్పు డెలుంగెత్తి యుయుత్సుం డాడినమాటల నాకర్ణించితి. 253

ప్రతిపదార్థం: సంశప్తక సమితితోడన్= సంశప్తక సైన్య సమూహంతో; తమకించి= తొందరపడి; పోరి, పోరి= పోరాడి, పోరాడి; కౌరవసైనికుల సింహనాదంబులు= కౌరవుల సైన్యం చేసే సింహనాదాలు; వింటిని= విన్నాను; అప్పుడు= ఆ సందర్భంలో; యుయుత్సుండు= (ధృతరాష్ట్రుడికి వైశ్య స్త్రీయందు పుట్టి, ధృతరాష్ట్రుడి తర్వాత ఇంద్రప్రస్థానికి రాజైనవాడు) యుయుత్సుడు; ఎలుంగు+ఎత్తి= గొంతెత్తి; ఆడినమాటలన్+ఆకర్ణించితిన్= పలికినమాటలు విన్నాను.

తాత్పర్యం: సంశప్తక సమూహంతో వేగంగా విరివిగా పోరాడే సమయంలో కౌరవుల సైన్యం చేసిన సింహనాదాలు విన్నాను. అప్పుడు యుయుత్సుడు పలికిన మాటలు విన్నాను.

సీ. 'పెనఁగంగఁ జాలరు బీభత్సుతో మీరు; । బాలుని నొక్కరుఁ బలువు రిట్లు
సంపితి; రిది మీకు సంతోషకాలమే? । యేడ్తురు గా, కార్వ నేల చెపుఁడ!
హరికి నర్జునునకు నప్రియం బొనరించి । బ్రదుకంగ వర్చునే భవునకైన?
నది యట్టులుండె; నీ యధికపాపము ఫలం । బెట్లును జెఱుపక యేల తక్కు?'

ఆ. ననియె నివ్విధమున నరిసేన యోధుల । నతఁడు వలుక వీనులార వినియుఁ
దెలియనైతి; వాసుదేవుండు వినియెన । యని తలంచి దాని నంత గొనక. 254

ప్రతిపదార్థం: మీరు= మీరు(కౌరవయోధులు); బీభత్సుతోన్= అర్జునుడితో; పోరంగన్+చాలరు= యుద్ధం చేయలేరు; బాలునిన్= అభిమన్యుడిని; ఒక్కరున్= ఒక్కడిని; ఇట్లు= ఈ విధంగా; పల్వురు= అనేకులు; చంపితిరి= సంహరించారు;మీకున్= మీకు;ఇది= ఇది; సంతోషకాలంబె?= సంతోషించటానికి సమయమా!; ఏడ్తురుగాక= దుఃఖిస్తారుగాక! (రాబోయే ఆపదను తలచుకొని); ఆర్వన్+ఏల?= సింహనాదాలు చేయటం (గర్జించటం) ఎందుకు?; చెపుఁడ= చెప్పండి; హరికిన్= కృష్ణుడికీ; అర్జుననకున్= అర్జునుడికీ; అప్రియంబు+ఒనర్చి= అహితాన్ని కలిగించి; భవునకున్=ఐనన్= శివుడికైనా; బ్రదుకంగ వచ్చునె?= జీవించవచ్చునా?; అది= ఆ విషయం; అట్టు+ఉండెన్= అట్లా ఉండనీయండి;ఈ+అధిక పాపముఫలంబు= ఈ గొప్ప పాపం వలని ప్రయోజనం; ఎట్లును= ఏ విధం చేతనైనా; చెఱుపక+ఏల+తక్కున్?= నశించనీయకుండా ఎందుకు విడుస్తుంది?; అనియెన్= అన్నాడు; ఈ+విధమునన్= ఇట్లా; అరి, సేన, యోధులన్= శత్రుసైన్యం యొక్క యుద్ధవీరులను (ఉద్దేశించి); అతఁడు= ఆ యుయుత్సుడు;పలుకన్= మాటాడగా; వీనులార వినియున్= చెవులారా వినికూడా; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; వినియెన= విన్నాడులే అని; తలంచి= తలచి; దానిన్= దానిని (ఆ విషయాన్ని); అంత కొనక= అంతగా లక్ష్యపెట్టక; తెలియన్+ఐతిన్= గ్రహించలేకపోయాను.

తాత్పర్యం: 'మీరు అర్జునుడితో యుద్ధానికి చాలరు. ఒక్క బాలుడిని ఈ విధంగా మీరు పలువురు చంపారు. ఇది మీకు సంతోషసమయమా! త్వరలోనే ఏడవబోతారు. ఎందు కిట్లా గర్జిస్తారు? చెప్పండి. శ్రీకృష్ణార్జునులకు కీడు చేసి శివుడు కూడా జీవించలేడు. మీ పాపఫలం ఊరక పోదు. అది మిమ్మల్ని నాశనం చేసి తీరుతుంది' . ఇట్లు పలికే యుయుత్సుడి మాటలను చెవులారా విని కూడా శ్రీృష్ణుడు విన్నాడు కదా! అని నిర్లక్ష్యం చేసి ఆ విషయం ఏమిటో గ్రహించలేకపోయాను.

క. మనుజాధిప! తగు సమయం । బున నీ వెఱిఁగింపఁ గన్నఁ బొరివుచ్చనె వే
చనుదెంచి నీ సుతుం బొది । వినయెడఁ దత్క్రూర యోధవీరుల నెల్లన్.' 255

ప్రతిపదార్థం: మనుజాధిప!= రాజా! (ధర్మరాజా!); తగు సమయంబునన్= తగిన కాలంలో; నీవు+ఎఱిఁగింపన్+కన్నన్= నీవు తెలియజేసి ఉంటే; వేచనుదెంచి= నేను వెంటనేవచ్చి; నీ సుతున్= అభిమన్యుడిని; పొదివిన+ఎడన్= ఎదిరించినచోట; తద్+క్రూర యోధ వీరులన్+ఎల్లన్= ఆ క్రూరులైన యుద్ధవీరులను అందరినీ; పొరిపుచ్చనె?= చంపి ఉండనా?

తాత్పర్యం: ఓ ధర్మరాజా! తగిన సమయంలో నీవు నాకు తెలియజేసి ఉంటే, వెంటనే వచ్చి అభిమన్యుడిని ఆక్రమించిన ఆ చోటనే, ఆ క్రూరయుద్ధవీరులను అందరినీ అంతంచేసి ఉండేవాడిని.'

క. అని పలికి మఱియుఁ గొడుకుం । బనవుచు శోకమున మునుఁగు ఫల్గునునిఁ దగం
దనకరములఁ బొదువుచు ని । ట్లను హరి చిత్తంబులోన నడ లూనంగన్. 256

ప్రతిపదార్థం: అని+పలికి= అని మాటాడి; మఱియున్= ఇంకా; కొడుకున్+పనవుచున్= కుమారుడిని గురించి విలపిస్తూ; శోకమునన్+మునుఁగు, ఫల్గునునిన్= దుఃఖంలో నిమగ్నుడైన అర్జునుడిని; తగన్= ఒప్పునట్లు; తన కరములన్+పొదువుచున్= తన చేతులతో పట్టుకొంటూ; హరి= శ్రీకృష్ణుడు; చిత్తములోనన్= మనస్సులో; అడలు= చింత; ఊనంగన్= పొందగా; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఆ విధంగా మాటాడి, మళ్ళీ కొడుకును తలచి విలపిస్తూ దుఃఖంలో నిమగ్నుడైన అర్జునుడిని శ్రీకృష్ణుడు తన చేతులతో పట్టుకొంటూ మనస్సులో చింత కలుగగా ఈ విధంగా అన్నాడు:

చ. 'ఇటు దగునయ్య శూరులకు నెల్లను బోకడ యిట్ల కాదె! యే
మిటికి నలందురన్? మొనలు మేకొని యాయుధ జీవనంబు నూఁ
దుటయు నెఱుంగవే? రిపులఁ ద్రుంచి యశం బిల నించి పుత్త్రుఁ డె
క్కటి దివి చూఱకోల్ ప్రియము కా కిది యప్రియమే తలంపఁగన్? 257

ప్రతిపదార్థం: ఇటు+తగునయ్య= ఇట్టి వంత తగునా?; శూరులకున్+ఎల్లన్= వీరులకు అందరికీ; పోకడ= మరణం; ఇట్ల+కాదె!= ఇట్లే కదా!; ఏమిటికిన్+నలందురన్= దురపిల్లటం ఎందుకు?; మొనలు= సేనలు; మేకొని= పూని; ఆయుధజీవనంబున్= ఆయుధంచేత జీవించటం; ఊఁదుటయున్= పూనుకొనటమున్నూ; ఎఱుంగవె?= తెలియవా?; రిపులన్= శత్రువులను; త్రుంచి= సంహరించి; ఇలన్= భూమిలో; యశంబున్+నించి= కీర్తిని నింపి; పుత్త్రుఁడు= కుమారుడు; ఎక్కటిన్= ఒంటరిగా; దివి+చూఱకోల్= స్వర్గం చూరగొనటం; ఇది; ప్రియము+అ+కాక= హితమే కాక (మేలే అవుతుందిగాని); తలంపఁగన్= ఆలోచించగా; అప్రియమే?= అహితమా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఇట్లా విలపించటం తగునా? శూరులకు అందరికీ మరణం ఈ విధంగానే కదా! దుఃఖించటం ఎందుకు? యుద్ధానికి సేనలను సమీకరించి, ఆయుధమే జీవనంగా, ఎదిరించటమే వీరధర్మం. ఇది ఎఱుగవా? శత్రువులను సంహరించి, ఈ భూమిలో కీర్తిని నింపి నీ కుమారుడు ఒంటరిగా స్వర్గాన్ని చూరగొనటం హితమే కాని అహితం ఎట్లా అవుతుంది?

విశేషం: శ్రీకృష్ణోపదేశంలో వీరధర్మం వివరించబడింది. 'ఆయుధజీవనం' అనే ప్రయోగం వీరుడి కర్తవ్యాన్ని చక్కగా నిరూపిస్తూ ఉన్నది. వీరమరణాన్ని పొందిన వారికై విలపించటం తగదని - అభిమన్యుడు స్వర్గాన్ని చూరగొనటం హితమే కాని అహితం కాదని శ్రీకృష్ణుడు నిర్ధారించాడు.

ఆ. ఎఱుఁగవలయుదాని నెఱిఁగి కోవిదుఁ డగు । నట్టి నీకు వగవ నగునె పార్థ!
నీదు వంత సూచి నీ వార లందఱు । దీను లైరి; వీరిఁ దేర్పవలదె? 258

ప్రతిపదార్థం: పార్థ!= అర్జునా!; ఎఱుఁగవలయుదానిన్= తెలియవలసినదాన్ని; ఎఱిఁగి= తెలిసి; కోవిదుఁడు+అగు+అట్టి నీకున్= పండితుడవైనట్టి నీకు; వగవన్+అగునె?= చింతించతగునా?; నీ వారలు+అందఱున్= నీ జనులంతా; నీదు, వంత, చూచి= నీ దుఃఖాన్ని చూచి; దీనులు+ఐరి= దైన్యం వహించారు; వీరిన్= వీళ్ళను; తేర్పవలదె?= ఊరడించ వద్దా?

తాత్పర్యం: పార్థా! తెలియదగు పరమార్థాన్ని తెలిసి పండితుడవైన నీవు ఇట్లా విలపించటం తగదు. నీ వారందరూ నీ దుఃఖాన్ని చూచి దీనులయ్యారు. వాళ్ళను నీవు ఊరడించవద్దా?

విశేషం: ఏది ఎరుగవలయునో దానిని ఎరిగినవాడే కోవిదుడు. ఆఎరుక ఐహికబంధవ్యామోహాలకు అతీతం. అర్జునుడికి తానింతకు మునుపు చేసిన గీతోపదేశం వలన మోహం వినష్టమై స్మృతి కలిగింది. ప్రజ్ఞ కలిగిన పండితు డయ్యాడు. పండితులు విలపించరాదు. అందుకే 'కోవిదుఁడగునట్టి నీకు వగవ నగునె' అని శ్రీకృష్ణుడు సూచనా మాత్రంగా హెచ్చరించాడు. కోవిదుడైనవాని ధర్మం ఇతరుల దైన్యాన్ని తొలగించి తేర్చవలసి ఉన్నది. తన దుఃఖాన్ని చూచి ఇతరులు దుఃఖించేటట్లు కోవిదుడు వ్యవహరించ కూడదని ఇందులోని సారాంశం. ప్రాణాతిప్రాణంగా ప్రేమించే వ్యక్తులను కోల్పోయినప్పుడు కలిగే వంతకు అంతు లేదు. ఆ సందర్భంలో మనస్సు నెంతో చిక్కబట్టుకొన్నా, ప్రక్కనున్న ఆప్తుల విలాపాన్ని చూడగానే దుఃఖం కట్టలు తెగి ప్రవహిస్తుంది. అందుకే 'నీదు వంత సూచి నీ వారలందఱు దీనులైరి' అని కృష్ణుడు అర్జునుడిని హెచ్చరించటం ఎంతో సహజంగా ఉన్నది. 'నిన్ను చూచి విలపించే వారిని ఓదార్చవలసిన బాధ్యత నీది. నీవే ఈ విధంగా పూర్తిగా స్వాస్థ్యాన్ని తప్పి ప్రవర్తిస్తే తక్కిన బంధువుల పరిస్థితి ఏమౌతుంది?' అని శ్రీకృష్ణుడు అర్జునుడిని ఓదార్చాడు.

వ. వీరలం జూచి తగుమాట లాడు' మనిన నత్యంత శోకాక్రాంతస్వాంతుం డగుచు సుభద్రాకాంతుండు గద్గదకంఠంబుతోడం దోడంబుట్టువుల కిట్లనియె. 259

ప్రతిపదార్థం: వీరలన్= నీవారైన వీరినందరినీ; చూచి= కనుగొని; తగుమాటలు+ఆడుము= తగిన పలుకులు పలుకుము; అనినన్= అనగా; అత్యంత, శోక+ఆక్రాంత+స్వాంతుండు+అగుచున్= మిక్కిలి దుఃఖంచేత ఆక్రమించబడిన మనస్సు కలవాడౌతూ; సుభద్రాకాంతుండు= అర్జునుడు; గద్గదకంఠంబుతోడన్= డగ్గుత్తికతోడి స్వరంతో; తోడంబుట్టువులకున్= అన్నదమ్ములకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వీళ్ళను చూచి తగిన మాటలు మాట్లాడుము! అనగానే అర్జునుడు అధిక దుఃఖంపొంగి పొరలిన హృదయంతో, డగ్గుత్తికతో అన్నదమ్ములను చూచి ఇట్లా అన్నాడు.

చ. ‘మనసిజమూర్తి యైన యభిమన్యుని మాటలు వీనులార నే
వినవలతుం; దదీయమృతి వేడ్క నొనర్చిన వారు గ్రక్కునం
జని తగ వానిఁ గాంచి సుఖ సంగతిమై జరియించునట్లుగా
ననిచెద; నేఁటి పోరు దెలియంగల భంగియు మీరు సెప్పుఁడా!’ 260

ప్రతిపదార్థం: మనసిజమూర్తి= మన్మథుడివంటి ఆకారం కలవాడు; ఐన= అయినటువంటి; అభిమన్యునిమాటలు= అభిమన్యుడిని గురించిన పలుకులు; వీనులారన్= చెవులారా; నేన్= నేను; వినవలతున్= వినటానికి ఇష్టపడుతూ ఉన్నాను; తదీయమృతిన్= వాడి చావును; వేడ్కన్= సంతోషంతో (ఇష్టపడి); ఒనర్చినవారు= చేసినవాళ్ళు; గ్రక్కునన్+చని= వెంటనే పోయి (అనగా స్వర్గానికి పోయి); తగన్= తగునట్లు; వానిన్= ఆ అభిమన్యుడిని; కాంచి= చూచి; సుఖసంగతిమైన్= సుఖమైన పొందికతో; చరియించు+అట్లు+కాన్= తిరిగే విధంగా; అనిచెదన్= పంపుతాను; నేఁటిపోరున్= ఈనాడు జరిగిన యుద్ధ ప్రకారాన్ని; తెలియన్+కల+భంగియున్= తెలిసి ఉన్నంతవరకు; మీరు= మీరందరూ; చెప్పుఁడా!= చెప్పండి!

తాత్పర్యం: ‘మన్మథుడివంటి రూపం కలవాడైన ఆ అభిమన్యుడి మాటలు చెవులార వినాలని కోరుతున్నాను. వాడి చావును ఇష్టపడి చేసినవాళ్ళు వెంటనే స్వర్గానికిపోయి, ఆ అభిమన్యుడిని చూచి సుఖమైన పొందికతో తిరిగే విధంగా పంపుతాను. మీరు నేడు జరిగిన యుద్ధ ప్రకారాన్ని నాకు విశదంగా తెలపండి.’

విశేషం: ఈ పద్యంలో మూడురకాల భావాలు ఒక్కసారిగా అర్జునుడి మనస్సులో చోటు చేసుకొన్నట్లు చెప్పబడ్డాయి. అభిమన్యుడి మాటలు వినాలని ఆసక్తిగా ఉన్నది అని అన్నాడో లేదో వెంటనే వాడిని చంపిన వాళ్ళను కూడా వెంటనే వాడి దగ్గరకు పోయేటట్లు చేస్తాను అన్నాడు. అంతలోనే ఈనాటి యుద్ధప్రకారం మీకు తెలిసినంతవరకు చెప్పండి అంటున్నాడు. తాను దుఃఖాన్ని ఓర్చుకోలేక కసితో శత్రువులను చంపవచ్చును. అయితే వాళ్ళు చేరేది కూడా నా కొడుకు చేరిన చోటే. అక్కడ సుఖకరమైన చెలిమితో ఉంటారు అని అంటున్నాడు. ఎటువంటి వారైనాసరే యుద్ధంలో మరణిస్తే స్వర్గసౌఖ్యమే కదా అనే భావం భంగ్యంతరంగా చెప్పబడింది.

వ. అని మఱియును. 261

తాత్పర్యం: అని ఇంకా (ఇట్లా అన్నాడు).

చ. ‘అలవుఁ జలంబు శౌర్యమును నస్త్రమహత్త్వముఁ గల్గు నిందఱున్
గలుగఁగ నెట్లు సచ్చు బలఘస్మరుచే నయినం బ్రచండదో
ర్బల విభవాభిరాముఁడు సుభద్ర సుతుం? డిది యెన్ని భంగులం
దలఁచినఁ బోల; దేమిటికతంబున నా ఘనుఁ డిట్టు లయ్యెనో? 262

ప్రతిపదార్థం: అలవున్= బలమున్నూ; చలంబున్= మత్సరమున్నూ; శౌర్యమునున్= శూరత్వమున్నూ; అస్త్రమహత్త్వమున్= అస్త్రాలవలన గొప్పతనమున్నూ; కల్గు+ఇందఱున్+కలుగఁగన్= కలిగినట్టి మీరు అందరూ ఉండగా; బల+ఘస్మరుచేన్+ అయినన్= (బలుడనే రాక్షసుడికి నాశకుడైన) ఇంద్రుడిచేత అయినప్పటికీ; ప్రచండ+దోస్ బలవిభవ+అభిరాముఁడు= తీవ్రమైన భుజాల శక్తియొక్క ప్రాభవంచేత (ప్రకాశించే) ఒప్పువాడు; సుభద్రసుతుండు= అభిమన్యుడు; ఎట్లు చచ్చున్?= ఏ విధంగా మరణిస్తాడు?; ఎన్ని+భంగులన్+తలంచినన్= ఎన్ని విధాలుగా తలపోసినా; ఇది పోలదు= ఇది సరిపడదు; ఏమిటి కతంబునన్= ఏ కారణంచేత; ఆ ఘనుఁడు= అంత గొప్పవాడు; ఇట్టులు+అయ్యెనో!= ఈ విధంగా అయినాడో!

తాత్పర్యం: బలమూ, పట్టుదలా, శౌర్యమూ, వివిధాస్త్రాల గొప్పతనమూ కలిగిన మీరందరూ ఉండగా, ఇంద్రుడిచేతనైనా మరణించని ప్రచండ భుజబల ప్రాభవంతో మనోహరుడైన ఆ సుభద్ర కొడుకు ఏ విధంగా మరణిస్తాడు? ఎన్ని విధాల ఆలోచించినా సమాధానం కుదరటం లేదు. ఏ కారణంచేత అంతటి గొప్పవా డీ విధంగా అయినాడు?

విశేషం: తిక్కన వీరుల ప్రసిద్ధగుణాలు నాల్గింటితో పద్యాన్ని ఆరంభించి, అంతటి వీరులు అండగా నుండగా బలఘస్మరుడైన ఇంద్రుడి చేతనైన బ్రుంగని ప్రచండ దోర్బల విభవాభిరాముడైన అభిమన్యు డెట్లా మరణించాడనటంలో అర్జునుడు తర్కించిన విధానం చక్కగా చంపకమాలావృత్తంలో వివరించబడింది.

క. మిమ్మునుఁ బాంచాలురఁ గడు । నమ్మి చెడితి; వాని రక్షణమ్మునఁ బ్రౌఢ
త్వ మ్మిట్లు లేమి యెఱిఁగిన । నెమ్మెయిఁ గాచికొననేరనే యబ్బాలున్. 263

ప్రతిపదార్థం: మిమ్మునున్= ధర్మరాజాదులైన మిమ్మల్ని; పాంచాలురన్= ద్రుపదరాజుకు సంబంధించిన వాళ్ళను; నమ్మి= విశ్వసించి; చెడితిన్= నాశనమయ్యాను; వాని రక్షణమ్మునన్= ఆ అభిమన్యుడి సంరక్షణలో; ఇట్లు= ఈ విధంగా; ప్రౌఢత్వమ్ము= నేర్పరితనం; లేమి= మీలో లేకపోవటం; ఎఱిఁగినన్= తెలిసిఉంటే; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; ఆ+బాలున్= ఆ బాలుడిని; కాచికొననేరనే!= రక్షించుకొని ఉండలేనా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! మిమ్మల్ని, ద్రుపదుడికి సంబంధించిన వాళ్ళనీ నమ్మి చెడ్డాను. అభిమన్యుడిని రక్షించటంలో మీరు నేర్పరులు కారు అని తెలిసి ఉంటే, ఏ విధంగానైనా నేనే వాడిని రక్షించుకొని ఉండలేనా!

విశేషం: మీరు ఇంతవాళ్ళూ అంతవాళ్ళూ అనుకొని నమ్మినందుకు నాశనమైపోయాను. మనపక్షం వాళ్ళూ, మామ పక్షంవాళ్ళూ ఇంతమరీ పనికిమాలిన వాళ్ళని తెలిసిఉంటే నే నేవిధంగానైనా వాడిని కాపాడుకొని ఉంటాను అని ఇందలి భావం. ప్రౌఢత్వ మ్మిట్లు అనే ఆ పదాల విరుపులో ఒక విధమైన విసురుతోపాటు, వీళ్ళింత అసమర్థులా? అన్న అధిక్షేపమూ, ఇటు మీ నేర్పరితనం వీగి వ్యర్థమైపోయిందా? అన్న వెక్కసమూ ధ్వనిస్తూ ఉన్నాయి.

క. రథవితతి వఱపి మీ రవి । తథముగఁ గలియంగ మిమ్ముఁ దాఁకి కలఁచి యే
రథికులు సమయించిరి యరి । మథన భుజా విభవు నక్కుమారోత్తమునిన్?' 264

ప్రతిపదార్థం: మీరు= మీరు (ధర్మరాజాదులు); అవితథముగన్= నిజంగా (వ్యర్థం కాకుండా); రథవితతిన్+వఱపి= రథాలను పరుగెత్తేటట్లుచేసి; కలియంగన్= ఎదుర్కోగా; మిమ్మున్+తాఁకి= మిమ్మల్ని ఎదిరించి; కలఁచి= కలత కలిగించి; ఏ రథికులు= ఏ శూరులు; అరి, మథన, భుజా, విభవున్= శత్రువులను హతమార్చే భుజబల పరాక్రమం కలవాడిని; ఆ+కుమార+ఉత్తమున్= ఆ పుత్రరత్నాన్ని; సమయించిరి?= చంపారు?

తాత్పర్యం: మీరు నిజంగా రథాలను తోలి కమ్ముకోగా మిమ్మల్ని ఎదిరించి, కలత కలిగించి ఏ శూరులు ఆ భుజబల సంపన్నుడైన పుత్రరత్నాన్ని చంపారు?'

విశేషం: ప్రస్తుతం కందపద్యం ప్రాసస్థానంలో ఉన్న థకారం శత్రుఛీత్కారానికి (తన కుమారుడు) అభిమన్యుడు శత్రువులను మథించటంలో చూపే వైలక్షణ్యానికీ, కలత చెందిన మనస్సులోని క్రోధపూరిత కర్కశత్వానికీ సూచన. కుమార శ్రేష్ఠుడైన ఆ అభిమన్యుడు అసామాన్యుడు, 'అరిమథన భుజావిభవుడు'. అట్టి పరాక్రమవంతుడిని ఏ రథికులు చంపారు?

వ. అని యంతకంత కగ్గలించు నుమ్మలికంబునం గలంగి, యంత నిలువక. 265

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా పలికి; అంతకు+అంతకున్= ఎంతో రెట్టింపుగా; అగ్గలించు= అధికమయ్యే; ఉమ్మలికంబునన్= దుఃఖంతో; కలంగి= కలతచెంది; అంతన్= దానితో; నిలువక= ఆగక.

తాత్పర్యం: అని అంతకంతకూ అధికమయ్యే దుఃఖంతో కలతచెంది, అంతటితో ఆగక.

క. **'ఉక్కును నస్త్రబలము మీ । కెక్కడియది? సాలరైతి రిందఱు? నని న**
య్యొక్కరుఁ గావఁగ మీ రీ । తక్కువ కోర్చితిరి? మిమ్ముఁ ద క్కన నేలా? 266

ప్రతిపదార్థం: ఉక్కున్= బలమునూ; అస్త్రబలము= దివ్యాస్త్రములయొక్క శక్తి (సంపద); మీకున్= మీకు; ఎక్కడి+అది?= ఎక్కడుంది?; అనిన్= యుద్ధంలో; ఆ+ఒక్కరున్= ఆ ఒక్కబాలుడిని; కావఁగన్= కాపాడటానికి; చాలరు+ఐతిరి= శక్తులు కాలేకపోయారు; మీరు; ఈ+తక్కువకున్= ఇంత హీనత్వానికి (నిందకు అని భావం); ఓర్చితిరి= సహించారు; మిమ్మున్= మిమ్మల్ని; తక్కు+అనన్+ఏలా?= మరొకటి అనటం ఎందుకు?

తాత్పర్యం: దివ్యాస్త్రబలమూ, శారీరక బలమూ మీకు ఎక్కడుంది? యుద్ధంలో ఆ ఒక్క బాలుడిని కాపాడలేని అసమర్థు లయ్యారు. ఎంత హైన్యాన్ని సహించారు? ఇది నిందాకరం కాదా! మిమ్మల్ని మరొకటి అనటం ఎందుకు?

విశేషం: మిమ్మల్ని వేరే అనటం అనవసరం. ఇంత తక్కువతనానికి పాల్పడి అసమర్థులై ఒక బాలుడిని కాపాడలేకపోయారు. తక్కువతనానికి ఓర్చినారు. తక్కువ అననేలా? అని అర్జునుడు ఆవేదనను వ్యక్తం చేయడంలో సాధారణ విషయాన్నే కొంత విలక్షణంగా చెప్పటం జరిగింది. ఇట్టి తెలుగు పలుకుబడి వల్లనే మహాభారతకథ మన ఆంధ్రప్రాంతానికి చెందిందా? అనిపిస్తుంది. శరీరబలమూ - అస్త్రబలమూలేని ఇంత చవటలని తెలియకపోయెనే? అసంఖ్యాకంగా ఇందరుండి కూడా ఒక్క పిల్లవాడిని దక్కించుకొనలేకపోయారు. ఇంత హీనత్వానికి సహించారు. ద్విత్వకకార ప్రాసలో మిక్కిలి బలాన్ని నొక్కి చెప్పడమే కాకుండా అది ఒక్క బాలుడిని కాపాడటానికి సహకరించలేదే అన్న వెక్కసం నిందార్థంలో ప్రతిఫలించింది. తిక్కన పదప్రయోగ వైచిత్రిలో ఇట్టి వెన్నో!

క. **బలహీనులు సంగర భీ । తులు నగు మి మ్మెఱిఁగి యెఱిఁగి తొలఁగి తనూజుం**
దలఁపక యొంటి మెలఁగు వెం । గలి నగు నను దూఱుకొందుఁగా కే మందున్? 267

ప్రతిపదార్థం: బలహీనులు= శక్తిలేనివారు; సంగరభీతులు= యుద్ధానికి భయపడేవారు; అగు+మిమ్మున్= అయిన మిమ్మల్ని; ఎఱిఁగి+ఎఱిఁగి= తెలిసి తెలిసీ; తొలఁగి= వీడి; తనూజున్+తలఁపక= కుమారుడిని గురించి స్మరించకుండా; ఒంటిమెలఁగు+వెంగలిన్= ఒంటరిగా ఉండే మూఢుడిని; అగు+ననున్= అయిన నన్ను; దూఱుకొందున్+కాక= నిందించుకొంటాను కాని; ఏమి+అందున్= ఏమి అనగలను?

తాత్పర్యం: మీరు యుద్ధానికి భయపడేవారని, బలం లేనివాళ్ళనీ తెలిసి తెలిసీ, కుమారుడిని గూర్చి తలచకుండా ఒంటిగా ఉండిపోయిన మూఢుడిని అయిన నన్ను నేనే నిందించుకొంటాను. ఇంతకంటె ఏమనగలను?

విశేషం: చివరకు ఈ పద్యంలో మిమ్మల్ని అనడం ఎందుకు? మీరు ఎటువంటివారో తెలిసికూడా నేను ఆ సమయానికి కుమారుడికి దూరంగా ఉండి, వాడిని గురించి కొంచెం కూడా ఆలోచించకుండా ఒంటరి మూఢుడనయ్యాను. నన్ను నేను నిందించుకొనటం తప్ప మిమ్మల్ని అనటం కూడా తప్పే అంటున్నాడు. ఎదుటివాళ్లను తిట్టటం కంటే తన్ను తానే నిందించుకొనటంలో ఎంతో బలీయమైన అధిక్షేపం పరోక్షపద్ధతిలో అభివ్యక్తమౌతూ ఉంటుంది. 'ఒంటి మెలఁగు వెంగలి' అనే ప్రయోగంలో ప్రతిపదమూ సాభిప్రాయం. ఈ అచ్చతెలుగు ప్రయోగం తిక్కన అర్థగౌరవ స్ఫూర్తికి దృష్టాంతం. జాతీయమైన తెలుగు పలుకుబడిలో అవి అలతి అలతి పదములైనప్పటికి ఎంతో విశాలమైన అర్థం ఏ విధంగా అభివ్యక్తమౌతుందో పై మాటలు తెలుపుతూ ఉన్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **మానుసులు వోలె నున్నార; లేను లేని । తఱి మహాగుణశాలి నా తనయుఁ గాచి**
కొనఁ గడంగర? సింగారమునకుఁ గాక । మఱువులును గైదువులు మీకు మానమునకె?' **268**

ప్రతిపదార్థం: మానుసులు+పోలెన్+ఉన్నారలు= మానవుల ఆకారంలో ఉన్నారు; ఏను, లేని, తఱిన్= నేను లేని సమయంలో; మహాగుణశాలిన్= ఉత్తమ గుణాలతో ప్రకాశించేవాడిని; నా తనయున్= నా కొడుకును; కాచికొనన్+కడంగరు+అ= రక్షించటానికి ప్రయత్నించలేదు కదా!; సింగారమునకున్+కాక= అలంకారానికి కాకుండా; మఱువులున్= కవచాలు; కైదువులున్= ఖడ్గాలు; మీకున్= మీకు; మానమునకున్+ఎ?= అభిమానానికా?

తాత్పర్యం: మీరు మానవాకారాలతో ఉన్నారు అంతే. నేను లేని సమయంలో ఉత్తమగుణాలతో ప్రకాశించే నా కొడుకును రక్షించటానికి మీరు కొంతైనా ప్రయత్నించారా? మీకు ఈ కవచాలూ, ఖడ్గాలూ అలంకారానికే కాని అభిమానానికి కాదా?'

విశేషం: 'మానుసులు వోలె నున్నారు' అనే ప్రయోగంలో మానిసి శబ్దానికి కేవలం మనుష్యుడు అనే అర్థాన్నే కాక యోధుడు, భటుడు అనే అర్థాలనుకూడా గ్రహించవచ్చును. మఱువులు కైదువులు ధరించేవాళ్ళు యోధులు. ఇక్కడ యోధులు మాదిరి అవి ధరించినందువలన మానుసులుగా ఉన్నారే కాని నిజానికి మీకు మగతనం లేదు అని భావం. స్త్రీలు సింగారాన్ని ఇష్టపడతారు. మానిసి అనగా మనుష్య స్త్రీ, మీరూ ఆడంగుల మాదిరి ఆభరణప్రాయంగా ధరించేవారే కాని అభిమానం ఎక్కడపోయింది? అంటున్నాడు. పౌరుషాన్ని ప్రకటించలేని ఆయుధాలు వట్టి తొడవులే కాని ప్రయోజనం ఏమిటి అని భావం. మానుసులు అని ఆద్యక్షరాన్ని దీర్ఘంగా చెప్పటంలో ఎంతో వెక్కసం కాకుధ్వనిలో స్ఫురిస్తూ ఉన్నది. అభిమానం ఆవంతకూడా లేని మీరూ మనుషులేనా అనటం ఎత్తిపొడుపు. ఆవేదనతోడి అవహేళనకు ఇది పరకాష్ఠ.

వ. **అని భంగించి యూర్పులు సందడింప మొగంబు బిగువారం గ్రోధశోకంబులు మనంబునఁ బెనంగొనం గన్నీ రొలుక నూరకున్న, నెల్లవారు నతనికి మాఱుపలుకను దేఱిచూడను వెఱచియుండి; రప్పు డచ్యుతుం డొక్కరుండు ననునయాలాపంబులం దేర్చుచుండం బాండవాగ్రజుండు గుపితాఖండలనిభుండగు నా సవ్యసాచితో సాంత్వన స్వరంబున నిట్లనియె.** **269**

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; భంగించి= అవమానకరంగా మాట్లాడి; ఊర్పులు= నిట్టూర్పులు, దీర్ఘంగా నిశ్వాసాలు; సందడింపన్= అతిశయించగా; మొగంబు= ముఖం; బిగువారన్= (గర్వం) అభిమానంతో అతిశయించగా; క్రోధ+శోకంబులు= కోపమూ, దుఃఖమూ; మనంబునన్= మనస్సులో; పెనంగొనన్= ఆవరించగా; కన్నీరు+ఒలుకన్= బాష్పజలం స్రవింపగా (కారగా); ఊరక+ఉన్నన్= మౌనంతో ఉండగా; ఎల్లవారున్= అందరూ; అతనికిన్= అర్జునుడితో; మాఱుపలుకను= మారుమాటాడటానికి; తేఱిచూడను= బాగా పరికించటానికి; వెఱచి+ఉండిరి= భయపడి ఉన్నారు; అప్పుడు= ఆ సమయంలో; అచ్యుతుండు+ఒక్కరుండు= కృష్ణు డొక్కడు; అనునయ+ఆలాపంబులన్= ఊరడింపు మాటలతో; తేర్చుచుండన్= ఓదారుస్తూ ఉండగా (ప్రసన్నత కలిగిస్తూ ఉండగా); ఆ పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; కుపిత+ఆఖండలనిభుండు+అగు= కోపించిన ఇంద్రుడితో సమానమైన వాడైన; ఆ+సవ్యసాచితోన్= ఆ అర్జునుడితో; సాంత్వన స్వరంబునన్= ఊరడించే (ఓదార్చే) ఎలుగుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆవిధంగా అవమానకరంగా మాట్లాడి, నిట్టూర్పులు నిగిడించి, ముఖం బిరుసెక్కగా, కన్నీరు కారగా, కోపం దుఃఖం మనస్సులో పెనగొనగా అతడు ఊరకుండినప్పుడు, అందరూ అతడివైపు తేరిచూడటానికీ, అతడితో మారుపలకటానికీ భయపడ్డారు. అప్పుడు కృష్ణు డొక్కడే ఉపశమన వాక్యాలతో తేర్చుతూ ఉండగా, కోపించిన ఇంద్రుడివలె ఉన్న అర్జునుడితో ధర్మజుడు ఊరడించే స్వరంతో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఏడ్పూ, కోపమూ రెండూ ఒక్కమారుగా సంగమించినప్పుడు ముఖాన్ని బిగించటం కన్నీరుకార్చటం సహజం. అది ఎంతో గంభీరంగా చూచేవారికి కనిపిస్తుంది. ఆ సందర్భంలో ఎదుటివారు ఊరక చూస్తూ ఉండటం తప్ప ఒక్కమాటకూడా మాటాడలేరు. కోపతాపాలు పెనవేసికొన్న వ్యక్తితో సామాన్యులు ఎదురుగా మాటాడలేరు. అన్నింటికీ అతీతుడైన అసాధారణ వ్యక్తి మాత్రమే ఆ సందర్భంలో ఓర్పుతో ఓదార్పు చెప్పగలుగుతాడు.

ధర్మరా జర్జునుని కభిమన్యుండు సచ్చిన విధంబు సెప్పుట (సం. 7-51-1)

సీ. 'అనఘ! సంశప్తక హననంబునకు నీవు । సనిన నొడ్డన మేర్చికొని కడంగి
నడచి ద్రోణునిఁ దలఁపడితి మవ్వీరు మో । హర మేము సొరఁ జాలమైతి మనఁగ
నేల తద్బాణార్చు లేర్చిన నక్కడఁ । దేఱిచూడను లేక త్రిప్పికొంటి
మమ్మొన భేదింప నభిమన్యుఁ డోపుఁ బొ । మ్మనియెడు తలఁపు నా కపుడు పుట్టి,

ఆ. వానిఁ బిలిచి 'నీవు వాకిలిఁ బుచ్చు మం । దఱము మొగ్గరంబుఁ దఱియఁ జొచ్చె
దము వడిని భవత్పథంబున' ననుడు నం । భోధి సొచ్చు కరటి పోల్కిఁ జొచ్చి. 270

ప్రతిపదార్థం: అనఘ!= దోషరహితుడవైన ఓ అర్జునా!; నీవు; సంశప్తక, హననంబునకున్= సంశప్తకుల వధించటానికి; చనినన్= వెళ్ళగా; ఒడ్డనము+ఏర్చికొని= వ్యూహాన్ని పన్ని; కడంగి= పూని; నడచి= ముందుకు కదలి; ద్రోణునిన్= ద్రోణాచార్యుడిని; తలపడితిమి= తాకాము; ఆ+వీరు+మోహరమున్= ఆ వీరుడి వ్యూహాన్ని; ఏము= మేము; చొరన్+చాలము+ఐతిమి= ప్రవేశింపలేక పోయాము; అనంగన్+ఏల?= అనటం ఎందుకు?; తద్+బాణ+అర్చులు= అతడి బాణాల జ్వాలలు; ఏర్చినన్= కాల్చగా; అక్కడన్= ఆ వైపున; తేఱిచూడను లేక= తలెత్తి చూడటానికి సాధ్యం కాక; త్రిప్పికొంటిమి= వెనక్కు మరలాము; ఆ+మొనన్= ఆ సేనను; భేదింపన్= భేదించటానికి (చీల్చటానికి); అభిమన్యుఁడు+ఓపున్+పొమ్ము= అభిమన్యుడు సమర్థుడౌనుపో; అనియెడు తలఁపు= అనే ఉద్దేశం; అపుడు= ఆ సమయంలో; నాకున్= నాకు; పుట్టి= కలిగి; వానిన్+పిలిచి= ఆ అభిమన్యుడిని పిలిచి; నీవు; వాకిలిన్+పుచ్చుము= త్రోవను కలిగించుము; అందఱమున్= మేమంతా; మొగ్గరమున్= వ్యూహాన్ని; వడిన్= వేగంగా; భవత్=+పథంబునన్= నీ దారిలోనే; తఱియన్+చొచ్చెదము= సమీపించగా ప్రవేశిస్తాము; అనుడున్= అనిన పిదప; అంభోధిన్+చొచ్చు= సముద్రాన్ని ప్రవేశించే; కరటి+పోల్కిన్= ఏనుగు వలె; చొచ్చి= ప్రవేశించి.

తాత్పర్యం: 'దోష రహితుడవైన అర్జునా! నీవు సంశప్తకులను చంపటానికి అటు పోగా, వ్యూహాన్ని పన్ని పూని ముందుకు నడచి ద్రోణుడితో ఎదుర్కొన్నాము. అతడు పన్నిన వ్యూహాన్ని మేము ప్రవేశింపలేకపోయాం అని అనటం ఎందుకు? అతడి బాణజ్వాలలు మండించగా అక్కడ తలెత్తి చూడటానికి కూడా వీలుకాక వెనక్కు మరలాము. ఆ మొన భేదించటానికి అభిమన్యుడు సమర్థుడు అనే తలపు నాకు కలిగింది. అప్పుడు అభిమన్యుడిని పిలిచి 'నీవు త్రోవ కల్పిస్తే మేమందరమూ వేగంగా నీవు కల్పించిన దారిలోనే ప్రవేశిస్తాము' అనగానే అతడు సముద్రాన్ని ప్రవేశించే ఏనుగు విధంగా లోనికి చొచ్చాడు.

విశేషం: అలం: ఉపమ. ప్రస్తుత ఆటవెలదిలో అభిమన్యుడు మొగ్గరాన్ని ప్రవేశించే విషయం ప్రతిపాదితం. 'వాకిలిఁ బుచ్చుము' అనే ప్రయోగం ద్వారంలో దారి ఏర్పరచే అనే అర్థంలో ప్రయుక్తం. 'అంభోధి జొచ్చు కరటి'కి అభిమన్యుడు పోల్చబడ్డాడు. అరణ్యంతో రణరంగాన్ని పోల్చి ఉంటే అభిమన్యుడిని సింహంగా పేర్కొని ఉండవచ్చును. కానీ ఇక్కడ సముద్రంలో ప్రవేశించే ఏనుగుగా ఉపమింపబడ్డాడు. నీళ్ళలోకి ఎంతో ఆసక్తిగా ఏనుగు ప్రవేశిస్తుంది. అందులో ఆనందంగా క్రీడిస్తూ ఉంటుంది. ఏదైనా మొసలి పట్టుకుంటే దాని బలం ముందు దీని బలం హుళక్కి. అట్లని ఊరక ఉంటుం దని కాదు. ఎంతగా తన శక్తి సామర్థ్యాలు చూపినా,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అడ్డంకి ఏర్పడినప్పుడు ఏమీ చేయలేదు. చివరకు అంత పెద్ద ఏనుగు అక్కడ బందీగా చిక్కుకొని పోతుంది అనే భావం ఈ ఉపమానంలో సూచితం.

క. నీ యుపదేశముఁ దనచే । దోయి బలువుఁ దోడు గాఁగ ద్రోణుఁ గడచి వే
పోయి మొనఁ జొచ్చి సైన్యము । పాయ వడఁగఁ గలఁగఁ జెదరఁ బఱవఁగఁ జేసెన్. 271

ప్రతిపదార్థం: నీ+ఉపదేశమున్= నీవు నేర్పి ఉండటమున్నూ; తనచేదోయి బలువున్= తన రెండు భుజాల దృఢత్వమున్నూ; తోడుకాఁగన్= సహాయం కాగా; ద్రోణున్+కడచి= ద్రోణుడిని దాటి; వే+పోయి= వేగంగా పోయి; మొనన్+చొచ్చి= వ్యూహాన్ని దూరి; సైన్యము పాయవడఁగన్= వ్యూహం రెండుగా చీలినట్లుగా; కలఁగన్= కలత పొందేటట్లు; చెదరన్= చెదరిపోయేటట్లు; పఱవఁగన్= పారిపోయేటట్లు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: నీవు నేర్పిన విద్యా, తన రెండు భుజాలశక్తీ అండగా ఉండగా ద్రోణాచార్యులను దాటి, వేగంగా వ్యూహాన్ని చీల్చి కౌరవసైన్యం కలతతో చెదిరి పోయేటట్లు చేశాడు.

విశేషం: ఈ కందపద్యం చివరిపాదంలో ఒకటికి నాలుగు క్రియలను వరుసగా ప్రయోగిస్తూ అవి అన్నీ సర్వలఘువులుగా అభిమన్యుడి ఉరవడినీ, లాఘవాన్నీ ధ్వనింపజేసేటట్లు తిక్కన ప్రయోగించాడు. ఇందు 'పాయ'లోని ఆది దీర్ఘాక్షరం సైన్యాన్ని భేదించటాన్ని వ్యంజింపజేస్తూ ఉన్నది. ఏ విషయమునైనా అందంగా కందంలో నిబంధించగలిగే శిల్పకళలో తిక్కన సిద్ధహస్తుడు. ఈ కళానైపుణ్యం ఇందులో ఛాయామాత్రంగా ప్రదర్శించబడింది.

క. కని కుంభజముఖ్యులు వా । నిన పొదువఁగ నేముఁ జొచ్చి నిరతిశయ రయం
బున వానికిఁ దోడ్పడుటకుఁ । జనఁ జన మా కడ్డపడియె సైంధవుఁడు వడిన్. 272

ప్రతిపదార్థం: కుంభజముఖ్యులు= ద్రోణాచార్యాదులు; వానిన్+అ= ఆ అభిమన్యుడినే; పొదువఁగన్= కమ్ముకొనగా; కని= చూచి; ఏమున్= మేమున్నూ; చొచ్చి= ప్రవేశించి; నిరతిశయరయంబునన్= అధికవేగంతో; వానికిన్= ఆ అభిమన్యుడికి; తోడ్పడుటకున్+చనన్+చనన్= సహాయపడటానికి పోగా పోగా; వడిన్= వేగంగా; సైంధవుఁడు= జయద్రథుడు; మాకున్= మాకు అందరికీ; అడ్డపడియెన్= అడ్డుపడ్డాడు.

తాత్పర్యం: ద్రోణాదులు ఆ అభిమన్యుడినే చుట్టుముట్టి కమ్ముకొనగా చూచి, మేమున్నూ ప్రవేశించి, అధికవేగంతో అభిమన్యుడికి సహాయపడాలని అతిప్రయత్నంతో పోగా, మమ్మల్ని జయద్రథుడు అడ్డుకొన్నాడు.

విశేషం: 'చనన్ చనన్' అనే ద్విరుక్తి 'నిరతిశయ రయాన్ని సూచిస్తూ ఉన్నది. అభిమన్యుడిపై ఉండే వాత్సల్యాతిశయాన్నీ, అతడికి ఏమి ముప్పు జరుగుతుందో - తప్పించాలి అనే ఔచిత్యాన్నీ ఒకటికి రెండు మార్లు వెంట వెంటనే ఉపయోగించిన ఆ క్రియాపదాలు సూచిస్తున్నాయి. పాండవు లెంతగా వ్యూహాన్ని ప్రవేశించటానికి తొందరపడ్డారో దానిని మించిన మహావేగం సైంధవుడిలో చోటు చేసికొన్నది.

వ. అతండు రుద్ర వరానుభావంబునం జేసి యక్షుద్ర బలుం డగుటనే మతని మిగులం జాలక చిక్కితి; మా సౌభద్రుం జుట్టుముట్టి గురుకర్ణ కృతవర్మ కృపగురు పుత్త్రాది యోధవీరులు పెక్కండ్రు సిక్కు వఱుపం, జేవ సెడక వాఁడు బలంబు మెఱయఁ జలంబు నెఱయ నా రాధేయ ప్రముఖులం బఱపియు, బృహద్బల లక్ష్మణ ప్రభృతులగు రాజుల రాకుమారులఁ బలువురం జంపియు, సొంపారెం; బదంపడి పదాతియు గదాపాణియునై రథాంగపాణి యల్లుండు దూఁగాడుచుం బోరాడునెడ దుశ్శాసన తనయుండు దాఁకి వానిచే విరథుండై తానును గదగొని

పెలుచం దలఁపడియె; నత్తెఱంగున నైన గదారణంబున వారిరువురుం బరస్పర నిహతులై పడి; రివ్విధంబున నక్కుమారుండు దన తండ్రులకును మామలకును రూఢియగు రణక్రీడం గీర్తిపరిస్ఫూర్తియు నాకలోక సుఖంబునుం జేకొనియె' నని చెప్పుటయు. 273

ప్రతిపదార్థం: అతండు= ఆ సైంధవుడు; రుద్రవర+అనుభావంబునన్+చేసి= శివుడి వరంయొక్క ప్రభావంచేత; అక్షుద్రబలుండు+అగుటన్= మహాబలుడు కావటంవలన; ఏము= మేము; అతనిన్= ఆ సైంధవుడిని; మిగులన్+చాలక= మీరలేక; చిక్కితిమి= చిక్కుకొన్నాము; ఆ+సౌభద్రున్= ఆ అభిమన్యుడిని; చుట్టుముట్టి= కమ్ముకొని; గురు, కర్ణ, కృతవర్మ, కృప, గురుపుత్ర+ఆది, యోధవీరులు= ద్రోణాచార్యుడు, కర్ణుడు, కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ మొదలైన యుద్ధవీరులు; పెక్కండ్రు= అనేకులు; చిక్కు+పఱుపన్= ఇరుకునపెట్టగా; చేవ+చెడక= (సామర్థ్యం) ధైర్యం నశించక; వాఁడు= ఆ అభిమన్యుడు; బలంబు మెఱయన్= శక్తి ప్రకాశించేటట్లుగా; చలంబు నెఱయన్= మాత్సర్యం అతిశయించేటట్లు; ఆ+రాధేయ ప్రముఖులన్= ఆ కర్ణుడు మొదలైన ప్రసిద్ధులను; పఱపియున్= (అవమాన పరచియు) పరుగెత్తేటట్లు చేసియూ; బృహద్బల, లక్ష్మణ, ప్రభృతులు+అగు, రాజులన్= బృహద్బలుడు, లక్ష్మణకుమారుడు మొదలైన వాళ్ళు అగు రాజులను; రాజకుమారులన్= రాజకుమారులను; చంపియున్= సంహరించియున్నూ; సొంపారెన్= అందగించాడు; పదంపడి= పిమ్మట; పదాతియున్= కాలిబంటున్నూ; గదాపాణియున్+ఐ= గదను చేతిలో ధరించినవాడున్నూ అయి; రథాంగపాణి+అల్లుండు= చక్రాన్ని చేతిలో ధరించిన కృ(వి)ష్ణుని యొక్క మేనల్లుడు; తూఁగాడుచున్= ఊగుతూ; పోరాడు+ఎడన్= యుద్ధం చేసే సందర్భంలో; దుశ్శాసన తనయుండు= దుశ్శాసనుడి కొడుకు; తాఁకి= ఎదుర్కొని; వానిచేన్= ఆ అభిమన్యుడిచేత; విరథుండు+ఐ= రథంలేనివాడై; తానునున్= తానున్నూ (ఆ దుశ్శాసనుడి కొడుకున్నూ); గదన్+కొని= గదను తీసికొని; పెలుచన్= ఆగ్రహంతో; తలపడియెన్= ఎదిరించాడు; ఆ+తెఱంగునన్= ఆ విధంగా; ఐన= అయినటువంటి; గదారణంబునన్= గదాయుద్ధంలో; వారు+ఇరువురున్= ఆ ఇద్దరూ; పరస్పర నిహతులు+ఐ= ఒకరి నొకరు చంపుకొన్నవారై; పడిరి= నేలకూలారు; ఈ+విధంబునన్= ఇట్లా; ఆ+కుమారుండు= ఆ బాలుడు (కుమారుడు); తన తండ్రులకునున్= తన తండ్రులకూ; మామలకును= మామలకూ; రూఢి+అగు= ప్రసిద్ధమైనదైన; రణక్రీడన్= యుద్ధవిహారంలో; కీర్తి+పరిస్ఫూర్తియున్= యశస్సు యొక్క పరిపూర్ణతనూ; నాకలోకసుఖంబునున్= నాక (స్వర్గ) లోకసౌఖ్యాన్ని; చేకొనియెన్= పొందాడు; అని= ఆ ప్రకారంగా; చెప్పుటయున్= చెప్పగా.

తాత్పర్యం: సైంధవుడు రుద్రుడి వరబలంవలన అజేయుడు కావటంతో మేము అతడిని మించి ముందుకు పోలేక ఆగిపోయాము. గురు కర్ణ కృతవర్మ కృపాశ్వత్థామాది యోధులు పెక్కుమంది అభిమన్యుడిని చుట్టుముట్టి చిక్కులు పెట్టినా, వెనకాడక అతడు బలం, మాత్సర్యం ప్రకాశించగా కర్ణాది వీరులను పారద్రోలాడు. బృహద్బలుడు, లక్ష్మణుడు మొదలైన రాజులను, రాకుమారులను చాలామందిని చంపాడు. ఆ తరువాత పాదచారి అయి చేతితో గద తిప్పుతూ, తూగుతూ పోరాడే సమయంలో దుశ్శాసనుడి కొడుకు ఎదుర్కొన్నాడు. ఇరువురూ గదలతో యుద్ధం చేసి; ఒకరు నొకరు చంపుకొని నేలకూలారు. ఈ విధంగా అభిమన్యుడు తన తం(్రం)డులకూ, మామలకూ యుద్ధక్రీడలో కీర్తిని తెచ్చాడు. స్వర్గలోక సుఖాలు పొందాడు' అని చెప్పగా.

విశేషం: విషయాన్ని విపులంగా విడమరచి వివరించటానికి వచన రచన ఏ విధంగా అనుకూలిస్తుందో ప్రస్తుత యుద్ధవర్ణనలో ప్రకటితం. ఎవ్వరెవ్వరు ఏ రీతిలో ఎదుర్కొన్నారో వారిని అభిమన్యుడు ఏ రూపంలో రూపుమాపాడో వివరించటానికి ఈ వచనం ఉద్దేశించబడింది. తిక్కన కేవలం అర్థగౌరవ దృష్టితోనే రచన చేస్తాడు. శబ్దసౌందర్యాన్ని అంతగా పాటించడు - అని పలువురు భావిస్తారు. కానీ ఆ రెండింటినీ సమన్వయపరుస్తూ అనితరమైన గాంభీర్యాన్నీ సౌందర్యాన్నీ తన కూర్పు నేర్పులో ప్రదర్శించిన సందర్భాలు కొల్లలుగా ఉన్నాయి. 'రుద్రవరం - అక్షుద్రబలం - సౌభద్రుండు' పెక్కండ్రు చిక్కుపఱుప చేవ సెడక'. 'బలంబు మెఱయఁ జలంబు నెఱయ' వంటి ఎన్నో ఉదాహరణలు చూపవచ్చును. 'రథాంగపాణి అల్లుండు' అనటంలో అభిమన్యుడు పదాతియై చక్రాన్ని ధరించి చేసిన యుద్ధం సూచితం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తెల్లముగ సుతుపడుట విని । జల్లని డెందంబు సెదర, సంధులు ప్రిదులం,
దల్లడ మగ్గలమై మూ । ర్ఛిల్లె నరుఁడు బంధు లెల్లఁ జేష్టలు దక్కన్. 274

ప్రతిపదార్థం: సుతుపడుట= కుమారుడు మరణించటం; తెల్లముగన్= స్పష్టంగా; విని; డెందంబు= హృదయం; జల్లని+చెదరన్= జల్లుమని చెదరిపోగా; సంధులు+ప్రిదులన్= కీళ్ళు సడలిపోగా (ఊడిపోగా); తల్లడము= దుఃఖం; అగ్గలము+ఐ= అధికమై; బంధులు+ఎల్లన్= చుట్టాలు అందరూ; చేష్టలు+తక్కన్= చేతలు ఉడిగి ఉండగా; నరుఁడు= అర్జునుడు; మూర్ఛిల్లెన్= సొమ్మసిల్లాడు.

తాత్పర్యం: కుమారుడి మరణం స్పష్టంగా విని, గుండె జల్లుమని చెదరిపోగా, ఎక్కడి కీళ్ళక్కడ ఊడిపడేటట్లు అధిక దుఃఖంతో అర్జునుడు సొమ్మసిల్లి పడిపోయాడు. బంధువులందరూ నిశ్చేష్టు లయ్యారు.

విశేషం: ద్విరుక్తలకారపౌనఃపున్యం వలన గుండె ఝల్లుమనే తల్లడపాటు, విలవిలలాడుతూ సొమ్మసిల్లి పడిపోయే పరిస్థితి వ్యంజించబడ్డాయి.

వ. ఇట్లు పరవశుండైనఁ గృష్ణయుధిష్ఠిరులు గరతలంబుల నెత్త, నొక్కింతసేపునకు సేదదేఱి సైంధవుం దలంచి యతండు. 275

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; పరవశుండు+ఐనన్= ఒళ్ళు మరచినవాడు కాగా; కృష్ణయుధిష్ఠిరులు= కృష్ణుడున్నూ, ధర్మరాజున్నూ; కరతలంబులన్= తమ అరచేతులతో; ఎత్తి= పైకెత్తగా; ఒక్కంత సేపునకున్= కొంచెం సేపటికి; సేదదేఱి= సొమ్మదెలిసి; సైంధవున్+తలంచి= జయద్రథుడిని తలచుకొని; అతండు= అర్జునుడు.

తాత్పర్యం: ఈ విధంగా సొమ్మసిల్లగా కృష్ణుడూ, ధర్మరాజు కలిసి అతడిని తమ చేతులతో ఎత్తిపట్టారు. కొంతసేపటికి అతడు తేరుకొని సైంధవుడిని తలచి.

ఆ. అవుడు గఱచి యెఱ్ఱ నగు నాననంబుతో । బొమలు ముడిచి, చెమట పొడమ, మేను
కంప మొందఁ, గనలు గదిరిన కటికి న । వ్వెసక మెసఁగ నన్న కిట్టు లనియె. 276

ప్రతిపదార్థం: అవుడు+కఱచి= పెదవి కొఱికి; ఎఱ్ఱన+అగు+ఆననంబుతోన్= జేగురించిన ముఖంతో; బొమలు ముడిచి= కనుబొమలు ముకుళించి; చెమట పొడమన్= (శరీరంలో) చెమట పుట్టగా; మేను+కంపము+ఒందన్= ఒళ్ళు వణకిపోగా; కనలు, కదిరి, కటికి, నవ్వు= కోపం అతిశయించిన క్రూరమైన నవ్వు; ఎసక మెసఁగన్= ఒప్పుతూ ఉండగా; అన్నకున్= ధర్మరాజుకు; ఇట్టులు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: పెదవి కొరికి, జేగురించిన ముఖంతో కనుబొమలు ముడిచి, ఒళ్ళంతా చెమట పుట్టగా, వణికిపోతూ కోపం అతిశయించిన క్రూరమైన నవ్వు నవ్వి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: అర్జునుడు అంతకు మునుపే దుఃఖాతిశయంతో ఒళ్ళుమరచి సొమ్మసిల్లి పడిపోయాడు. తేరుకున్న తరువాత పట్టరాని కోపం సైంధవుడిపైన కలిగింది. ఎక్కువ కోపం వచ్చినప్పుడు శారీరకంగా ఎటువంటి మార్పులు వస్తాయో ఈ ఆటవెలది పద్యంలో తిక్కన చాలా చక్కగా వివరించాడు. ఆయన ఈ భారతంలో ఎన్నో నవ్వులను ప్రస్తావించి ఉన్నాడు. కోపం అతిశయించినప్పుడు కలిగే నవ్వును ఆయన ఇక్కడ కటికి నవ్వు అని తెలిపాడు. బొమముడిపాటు, చెమట కలగటం, శరీరం కంపించటం వంటి సాత్త్విక భావాలను ఆటవెలది పద్యంలో అర్థవంతంగా తిక్కన వివరించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. 'వినుఁడీ! నాదు ప్రతిజ్ఞ నీవు నిఖిలోర్వీనాథులున్; సింధురా
జు నవశ్యంబును నెల్లి సంపుదు భయస్థుండై నినుం జొచ్చినన్,
వనజాక్షున్ శరణంబు వేఁడినను, గర్వం బేది నన్నుం దగం
గనినం, బోరు దొఱంగి పోయిన నెఱుంగం గాని సత్యవ్రతా! 277

ప్రతిపదార్థం: సత్యవ్రతా!= సత్యాన్నే నిష్ఠగా ఆచరించేవాడా (ధర్మరాజా!); నీవున్= నీవున్నూ; నిఖిల+ఉర్వీనాథులున్= ఈ రాజులు అందరున్నూ; నాదు+ప్రతిజ్ఞన్= నా ప్రతినను; వినుఁడీ!= వినండి!; భయస్థుండై= భయంతో కూడినవాడై; నినున్+చొచ్చినన్= నీ శరణు చొచ్చినప్పటికీ; వనజాక్షున్= శ్రీకృష్ణుడిని; శరణంబున్+వేఁడినన్= రక్షణ కోరినప్పటికీ; గర్వంబు+ఏది= గర్వం తొలగి; నన్నున్= నన్ను; తగన్= తగునట్లు; కనినన్= చూచినప్పటికీ; పోరు+తొఱంగి+పోయినన్= యుద్ధం చేయకుండా తొలగి పోయినప్పటికీ; ఎఱుంగన్+కాని= తెలియనుగాని - చెప్పలేను కాని; ఎల్లి= రేపు; అవశ్యంబును= తప్పకుండా; సింధురాజున్= సైంధవుడిని; చంపుదున్= సంహరిస్తాను.

తాత్పర్యం: సత్యవ్రతుడవైన ఓ ధర్మరాజా! నీవూ, సమస్త రాజులూ నా ప్రతిజ్ఞ వినండి. ఆ సైంధవుడు నిన్ను శరణుజొచ్చినా, కృష్ణుడిని రక్షణ కోరినా, గర్వం విడిచి నన్నే వచ్చి ఆశ్రయించినా, యుద్ధం చేయకుండా కౌరవులను విడిచి మరెక్కడికైనా పారిపోతే చెప్పలేనుగాని, అట్లాకాని పక్షంలో రేపు తప్పకుండా అతడిని చంపి తీరుతాను.

విశేషం: అర్జునుడు తాను ప్రతిజ్ఞ చేస్తూ అన్నను సత్యవ్రతా! అని సంబోధించటం విచిత్రంగా ఉన్నది. అతడు సత్యవ్రతుడై ఉంటేనే తన ప్రతిజ్ఞను వినటానికి అర్హుడు. ముఖ్యంగా అన్నను ఉద్దేశించి 'వినండీ' అని చెప్తూ ఉన్న ప్రతిజ్ఞ. ఎవరి దగ్గరనో చేసినందువలన ఫలితం లేదు. సత్యవ్రతుల ముందు చేసిన ప్రతిజ్ఞే ప్రతిజ్ఞ. అదే సత్వరం ఫలించటానికి సమర్థం. తన ప్రతిజ్ఞకు సత్యవ్రతులు సాక్షిభూతులు. సత్యాన్ని నిర్వహించటంలో అనుజులు అన్నను అనుసరించాలి. కాబట్టి 'నీవు అనుసరించే సత్యవ్రతం యొక్క ఫలితం, నిన్ను అనుసరించే నాలో కూడా ప్రస్తుతం సిద్ధించి తీరుతుం'దన్న ప్రగాఢ విశ్వాసానికి ఈ సంబోధన ఎంతో సమర్థనీయంగా ఉన్నది. అన్న అజాత శత్రువు. ఆ సైంధవుడు వచ్చి శరణు కోరితే కాదనడు. అందువలన మొట్టమొదటగా 'నినుం జొచ్చినన్' అన్నాడు. అన్ని విషయాలలో నిరంతరం తమకు అండదండగా ఉండి కాపాడుతూ ఉన్న ఆ శ్రీకృష్ణుడు శరణాగత పరిరక్షకుడై సైంధవుడిని కాపాడటానికి ప్రయత్నించినా, చివరకు నన్నే వచ్చి ప్రసన్నుడవు కమ్ము అని ప్రార్థించినా వాడిని వదిలేది లేదు - అని అర్జునుడు ప్రతిజ్ఞ చేశాడు. ఈ చేసిన ప్రతిజ్ఞను బట్టి ఆ సైంధవుడు ఏ విధంగానూ తప్పించుకొనటానికి వీలులేదు అని స్పష్టమౌతూ ఉన్నది.

ఇందుకు మూలం: శ్లో॥ **"సత్యం వః ప్రతిజానామి । శ్వోఽస్మి హంతా జయద్రథమ్!**
నచేత్ వధభయాద్భీతో । ధార్తరాష్ట్రాన్ ప్రహాస్యతి॥
న చాస్మాన్ శరణం గచ్ఛేత్ । కృష్ణం వా పురుషోత్తమమ్।
భవన్తం వా మహారాజ శ్వోఽస్మి హంతా జయద్రథమ్॥ (ద్రోణ. 51.20-21)

క. బాలధ్వంసకు నా దు । శ్శీలుం గాచుటకు నన్నుఁ జెనకిన నస్త్ర
జ్వాలలఁ గౌరవ యోధులఁ । దూలించుచు వానిఁ గవియుదుం జటుల గతిన్. 278

ప్రతిపదార్థం: బాలధ్వంసకున్= బాలుడిని హతం చేసిన వాడిని; ఆ+దుశ్శీలున్= ఆ దుష్టస్వభావుడిని; కాచుటకున్= రక్షించటానికి; నన్నున్+చెనకినన్= నన్ను తాకితే; అస్త్రజ్వాలలన్= బాణాల మంటలచేత; కౌరవయోధులన్= కౌరవవీరులను; తూలించుచున్= పడగొడుతూ; చటుల గతిన్= తీవ్రవేగంతో; వానిన్+కవియుదున్= ఆ సైంధవుడిని ఎదుర్కొంటాను.

తాత్పర్యం: బాలుడిని సంహరించినవాడూ, పరమ దుష్టస్వభావుడూ అయిన అతడిని (ఆ సైంధవుడిని) కాపాడటానికి నన్ను ఎదిరిస్తే బాణజ్వాలలతో ఆ కౌరవవీరులను నేలకూలుస్తూ, తీవ్రంగా ఆ సైంధవుడిని మార్కొంటాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. **ఇట్లు సేయనైతి నేని గురుద్రోహి । గతికి, బ్రహ్మఘాతిగతికి, మద్య**
పానరతుని గతికి, మానార్హ జనపరి । వాదిగతికిఁ బోవువాఁడ నధిప! **279**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఇట్లు= ఈ విధంగా; చేయన్+ఐతిన్+ఏని= చేయలేకపోతే; గురు, ద్రోహిగతికిన్= గురుద్రోహం చేసినవాడి దుర్గతికి; బ్రహ్మ, ఘాతి, గతికిన్= బ్రహ్మహత్య చేసినవాడి దుర్గతికి; మద్య, పానరతుని, గతికిన్= సుర లేక కల్లుయొక్క త్రాగటంలో ఆసక్తి కలిగిన వాడి దుర్గతికి; మాన+అర్హ, జన, పరివాది+గతికిన్= గౌరవ యోగ్యులు (పాత్రులు) అయిన వారిని నిందించినవాడి దుర్గతికి; పోవువాఁడన్= పోయిన వాడినౌతాను.

తాత్పర్యం: రాజా! ఈ విధంగా చేయలేకపోతే, గురువుకు ద్రోహం చేసినవాడు పొందే ఆధోగతికి, బ్రహ్మహత్య చేసినవాడికి కలిగే దుర్గతికి, మద్యాన్ని త్రాగటంలో ఆసక్తి కలిగినవాడికి, గౌరవయోగ్యులను నిందించినవాడికి ప్రాప్తించే దుర్గతికి పోయిన వాడినౌతాను.

విశేషం: సైంధవుడిని రేపు సాయంకాలంలోపల సంహరించటం తథ్యం. ఎవరు వాడికి సాయం వచ్చినా తన ప్రతిజ్ఞ జరిగి తీరవలసిందే అని అంతకు ముందు నిర్ధారణ చేసిన అర్జునుడు ఆ ప్రతిజ్ఞను మరికొంత ఈ పద్యంలో తీవ్రతరం చేశాడు. గురుద్రోహం, బ్రహ్మహత్య, మద్యపానం, గౌరవపాత్రులను నిందించటం - అనే దుర్గుణాలు కలవాడు ఎటువంటి అధోగతి పాలౌతాడో, అటువంటి దుర్గతి పాలౌతాను అని చెప్పాడు. ఇందులో మద్యపానం ఎంత హీనమైనదో తెలుపబడింది. అదే విధంగా గౌరవానికి అర్హులైన వారిని నిందించేవాడు కూడా లోకం దృష్టిలో ఎంత పతితుడో, వాడు పొందే దుర్గతి ఎంత అపకీర్తికరమో తెలుపబడింది.

వ. **మఱియు నొక్క ప్రతిన యవధరింపుము.** **280**

తాత్పర్యం: ఇంకా ఒక ప్రతిజ్ఞ వినుము.

చ. **అనిమిష దైత్యకింపురుషు లాదిగ నెవ్వరు వచ్చి కాచినం**
దునుముదు నెల్లి సైంధవునిఁ దోయజమిత్త్రుఁడు గ్రుంకకుండుము
న్న నరవరేణ్య! యిత్తెఱఁగు నా కొనరింపఁగ రాక యున్న నే
ననలము సొచ్చువాఁడ నృపులందఱుఁ జూడఁగ గాండివంబుతోన్.' **281**

ప్రతిపదార్థం: నరవరేణ్య!= మానవశ్రేష్ఠా! (ధర్మరాజా!); అనిమిష= దేవతలు (రెప్పపాటులేనివాళ్ళు); దైత్య= రాక్షసులు (దితి కొడుకులు); కింపురుషులు= కొంచెం నరరూపం గల దివిజులు; ఆదిగా= మొదలుగా; ఎవ్వరు వచ్చి కాచినన్= ఎవరు వచ్చి రక్షించినా; తోయజమిత్త్రుఁడు= సూర్యుడు; క్రుంకకుండ మున్ను+అ= అస్తమించటానికి మునుపే; ఎల్లి= రేపు; సైంధవునిన్= జయద్రథుడిని; తునుముదున్= సంహరిస్తాను; ఇత్తెఱఁగు= ఇలా; నాకున్= నాకు; ఒనరింపఁగన్+రాక+ఉన్నన్= చేయడానికి కాకుండా ఉంటే; నృపులు+అందఱున్= రాజులంతా; చూడఁగన్= చూస్తూ ఉండగా; గాండివంబుతోన్= గాండీవం అనే వింటితో కూడా; నేను= నేను; అనలము+చొచ్చువాఁడన్= అగ్ని ప్రవేశం చేస్తాను.

తాత్పర్యం: ధర్మరాజా! దేవతలు, రాక్షసులు కింపురుషులు మొదలగువారు ఎవ్వరు వచ్చి కాపాడినా, రేపు సూర్యుడు అస్తమించే లోపల ఆ సైంధవుడిని సంహరిస్తాను. అట్లా చేయకపోతే రాజులంతా చూస్తూ ఉండగానే నేను గాండీవంతో కూడా అగ్నిలో దూకుతాను.

విశేషం: ఇంతకు ముందు చేసిన ప్రతిజ్ఞల్లో మొదటిది తనకూ కృష్ణుడికీ ధర్మరాజుకూ సంబంధించినది. ఎదిరించిన కౌరవసైన్యాన్ని మహావేగంతో సంహరిస్తాను అన్నాడు. అట్లా చేయలేకపోతే తన కెన్నో రకాల దుర్గతులు కలిగినట్లే అని తెలిపాడు. ప్రస్తుత ప్రతిజ్ఞ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేసే ముందు అన్నను సావధానుడవై విను మని హెచ్చరించాడు. 'అవధరింపుము' అని అదే పనిగా చెప్పటం వలన ఆ ప్రతిజ్ఞ యొక్క తీవ్రత వ్యక్తమవుతుంది. ఇంతకుముందు ప్రతిజ్ఞలో కూడా 'ఎల్లి' అని ఉన్నది. కాని 'ఎల్లి ఎంత లోపల' అనేది ఈ ప్రతిజ్ఞలో స్పష్టం చేశాడు. 'తోయజమిత్రుడు గ్రుంకకుండుమున్న' అని కాలనిర్దేశం. ఈ ప్రతిజ్ఞ మూడవ పాదం మొదటి అక్షరం దగ్గర ఆగింది. అటుపై నరవరేణ్యా! అని అన్నకు సంబోధన. ఏవార్థకంతో నిశ్చయంచేసిన ప్రతిజ్ఞ ప్రకారం అక్కడకు సైంధవుడి తల తెగినట్టే. అయితే మరో విషయం ఉన్నది.

ఒకవేళ ప్రతిజ్ఞ నెరవేర్చలేకపోతే, దాని ప్రాయశ్చిత్తం ప్రతిజ్ఞ కంటె మహాభయంకరంగా ఉంటుంది. మూడవ పాదం రెండవ అక్షరం నుండి, ప్రతిజ్ఞ నెరవేర్చకపోతే పరిణామం ఎంత దారుణంగా ఉంటుందో తెలుపబడింది. 'గాండీవముతో' నృపులందఱు చూస్తూండగ, అనలము సొచ్చువాడ అని చెప్పాడు. అన్ని పనులలోనూ తన విజయనామ సార్థక్యానికి సహకరించిన దివ్య సాధనం గాండీవం. గాండీవి అను పేరు అర్జునుడికి ఏర్పడింది గాండీవం వలననే. అంటే గాండీవం - తానూ వేరు వేరు కాదు. ప్రతిజ్ఞ నేరవేర్చకపోతే తనతోపాటు గాండీవం కూడా అగ్నిపాలు కావలసిందే అని నిష్కర్షగా చెప్తుతూ ఆ అస్త్రం యొక్క ఉత్కర్షను మరో విధంగా ఉట్టంకించాడు.

అగ్నిలోనే ఎందుకు గాండీవంతో గాండీవి ప్రవేశిస్తాను అంటున్నాడో - ఇది కొంత ఆలోచించవలసిన విషయం. ఆ గాండీవం తనకు ఏ విధంగా లభించిందో దానితో ముడిపడి ఉన్నది దాని అంతం కూడా. అదే ఇందులో ఉన్న రహస్యం.

గాండీవం దివ్యధనుస్సు. దానిని బ్రహ్మ, ప్రజాపతి, ఇంద్రుడు, వరుణుడు ఎన్నో వేల సంవత్సరాలు ధరించారు. చివరకు అది వరుణుడి దగ్గర నుండి అగ్ని గ్రహించాడు. ఖాండవ దహన సందర్భంలో అగ్నిని ఇంద్రుడు బాధించకుండా కాపాడటానికి అగ్ని అర్జునుడికి ఇచ్చాడు. దానిని మరే ఆయుధం తాకినా అది బూడిదైపోవలసిందే. అదే అర్జునుడికి అతి ముఖ్యమైన ఆయుధం. అగ్ని నుండి సంక్రమించిన ఆ దివ్యాస్త్రం తనతో కూడా మళ్ళీ ఆ అగ్నిలోనే ప్రవేశించటం జరగాలి అని అర్జునుడి ప్రతిజ్ఞలో ఉన్న అసలు రహస్యం.

వ. **అని పెలుచం బలికి, యప్పరమ కోదండంబు దెప్పించి, సజ్యంబు గావించి, గుణధ్వని నిగుడం జేయుటయుఁ, బద్మనాభుండు పాంచజన్యంబు పూరించె, దేవేంద్ర పుత్త్రుండు దేవదత్తం బొత్తె; నన్నాదంబులును దత్సైనిక సింహనాదంబులును దూర్యనినదంబులును నింగి వొంగం జెలంగె; నగ్గాండీవంబును నృత్తంబు సేసిన చందంబు నొందె; నస్త్రంబు గవదొనలు వెలువడి వెలింగె; నయ్యవసరంబునం గొండొక దెలివొంది పవననందనుఁ డప్పురందరనందను వదనంబు వీక్షించి.** **282**

ప్రతిపదార్థం: అని= ఆప్రకారంగా; పెలుచన్= గట్టిగా, అతిశయముగా; పలికి= ప్రతిజ్ఞచేసి; ఆ+పరమ, కోదండంబున్= ఆ ఉత్కృష్టమైన విల్లును; తెప్పించి= తెచ్చేటట్లు చేసి; సజ్యంబు కావించి= నారి ఎక్కుపెట్టి; గుణధ్వని= అల్లెత్రాటిమోత; నిగుడన్+చేయుటయున్= వ్యాపించేటట్లు చేయగా; పద్మనాభుండు= శ్రీకృష్ణుడు; పాంచజన్యంబున్+పూరించెన్= తన శంఖమైన పాంచజన్యాన్ని ఊదాడు; దేవేంద్ర పుత్త్రుండు= అర్జునుడు; దేవదత్తంబు+ఒత్తెన్= తన శంఖమైన దేవదత్తాన్ని ఊదాడు; ఆ+నాదంబులును= ఆ రెండు శంఖాల శబ్దాలున్నూ; తద్+సైనిక+సింహనాదంబులును= ఆ సేనలయొక్క గర్జనలవంటి అరుపులున్నూ; నింగి= ఆకాశం; పొంగన్+చెలంగెన్= అతిశయించేటట్లు (ఉబ్బేటట్లు) ఒప్పింది; ఆ+గాండీవంబు= ఆ గాండీవం అనే విల్లు; నృత్తంబు చేసిన+చందంబున్+ఒందెన్= నర్తించిన విధంగా అయింది; అస్త్రంబు= బాణం; కవదొనలు= అమ్ముల పొదుల జంటలు; వెలువడి= వెలుపలికి వచ్చి; వెలిగెన్= ప్రకాశించాయి; ఆ+అవసరంబునన్= ఆ సందర్భంలో; కొండొక= కొంత; తెలివొంది= సంతోషించి, వికాసాన్ని పొంది; పవననందనుండు= భీముడు; ఆ+పురందరనందను+వదనంబు= ఆ అర్జునుడి ముఖం; వీక్షించి= చూచి.

తాత్పర్యం: అని గట్టిగా పలికి, ఆ దివ్యకోదండాన్ని తెప్పించి నారి సారించి గుణధ్వని చేశాడు. శ్రీకృష్ణుడు పాంచజన్యం పూరించాడు. అర్జునుడు కూడా దేవదత్తాన్ని ఒత్తాడు. ఆ నాదాలూ, సైనికుల సింహనాదాలూ, వాద్యరవాలూ కలిసి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆకాశాన్ని అంటాయి. గాండీవం నృత్యం చేసినట్లయింది. అస్త్రాలూ, అమ్ములపొదులూ వెలువడి వెలిగాయి. ఆ సమయంలో కొంత తేరుకొన్న భీముడు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

క. 'అతి తీవ్రమైన నీదగు । ప్రతిన కుపోద్బలము గాఁగ బరఁగిన ధీరో
ద్ధతి పాంచజన్య రవమున । ధృతి తూలక యున్నె కురుపతికి నింద్రసుతా!' 283

ప్రతిపదార్థం: ఇంద్రసుతా!= అర్జునా!; అతి తీవ్రము+ఐన= మిక్కిలి తీక్ష్ణమైన; నీది+అగు ప్రతినకున్= నీ ప్రతిజ్ఞకు; ఉపోద్బలము+కాఁగన్= ప్రోత్సాహకంగా, ధైర్యం చెప్పినట్లుగా; పరఁగిన= ఒప్పిన; ధీర+ఉద్ధత= ధీరతతోడి ఉద్వృత్తికల (ధీరత మరియు ఆటోపంకల); పాంచజన్య, రవంబునన్= శ్రీకృష్ణుడి పాంచజన్యం అనే శంఖం యొక్క శబ్దంచేత; కురుపతికిన్= ఆ దుర్యోధనుడికి; ధృతి= ధైర్యం; తూలక+ఉన్నె?= చెడకుండా ఉంటుందా?

తాత్పర్యం: 'ఓ అర్జునా! మిక్కిలి తీవ్రమూ, కఠోరమూ అయిన నీ ప్రతిజ్ఞకు ప్రోత్సాహకంగా (ధైర్య గాంభీర్యాలూ, గర్వోద్దీపనలూ) ధీరతా, ఆటోపమూ కలిగిన శ్రీకృష్ణుడి పాంచజన్యం యొక్క మ్రోతతో ఆ దుర్యోధనుడి ధైర్యం నశించకుండా ఉంటుందా?'

విశేషం: ఇంతకు పూర్వం వచనంలో కూడా 'పవననందనుడు ఆ పురందర నందనుని వదనంబు' అని పేర్కొనబడింది. ఇచ్చట భీముడు అర్జునుడిని సంబోధిస్తూ ఇంద్రసుతా! అని పేర్కొన్నాడు. అర్జునుడి ప్రతిజ్ఞా వాక్యాలు, వెంటనే పాంచజన్య దేవదత్తాలను పూరించటం - ఆ ధ్వని దేవేంద్రాదులను అలరించింది. ప్రతిజ్ఞ ఫలించాలంటే ముందుగా దేవతలు తథాస్తు అని అనుగ్రహించాలి. అట్టి అనుగ్రహాన్ని ఇంద్రుడు అతడి కుమారుడికి కలిగిస్తాడు అని సూచన.

శ్రీకృష్ణుడు పూరించిన పాంచజన్య శబ్దం విజయుడి విజయానికి ఆమోదాన్ని తెలిపే ముందుసూచన. పాంచజన్య శబ్దం సాందీపని కుమారుడిని తెచ్చి ఇచ్చే సందర్భంలో యముడిని కూడా హడలెత్తించింది. ప్రభాసతీర్థంలో చనిపోయిన గురుపుత్రుడిని అక్కడ పంచజనుడు అనే రాక్షసుడు మ్రింగాడని భావించి వాడి శరీరాన్ని చీల్చగా అందులో ఉన్న శంఖమే పాంచజన్యమైంది. ఆ మహా గంభీర నినాదం దుర్యోధనుడి ధైర్యాన్ని తప్పక నశింపజేసి ఉంటుందని సారాంశం.

వ. అని యగ్గించె; నా సమయంబునం గోపంబు పెంపునను బూనికిపై భరంబునను భీమసేనుని సల్లాప సాహార్దంబునను దన డెందంబు శోకంబు డిందువడం గలయం గనుంగొని విజయుని వంది మాగధసందోహంబులు సంస్తుతించె; నట్టియెడ నిక్కడ. 284

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; అగ్గించెన్= పొగడాడు; ఆ సమయంబునన్= ఆ సందర్భంలో; కోపంబు+పెంపునను= క్రోధంయొక్క అతిశయంచేతను; పూనికిపైన్= ప్రయత్నంపై; భరంబునను= భారం చేతనూ (పూనికి+వైభవంబునను= ప్రయత్నంయొక్క విభవము చేతనూ); భీమసేనుని= భీముడి; సల్లాప సాహార్దంబునను= హితవచనాలతోడి మంచి మనస్సు చేతనూ; తన= తనయొక్క (అర్జునుడియొక్క); డెందంబు+శోకంబు= మనస్సులోని దుఃఖం; డిందువడన్= తగ్గగా (అణగగా); కలయన్= అంతటా (బాగుగా); కనుంగొని= చూచి; విజయునిన్= అర్జునుడిని; వందిమాగధ సందోహంబులున్= స్తుతి పాఠకుల మొత్తములున్నూ; సంస్తుతించెన్= పొగడాయి; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఇక్కడన్= ఈ మన కురుసైన్యంలో.

తాత్పర్యం: అని పొగడాడు; ఆ సమయంలో కోపతీవ్రతచేతను, ప్రయత్నాలు చేసే కార్యభారంచేతను, భీమసేనుడి హితవాక్యాల స్నేహభావంచేతను తన మనస్సు దుఃఖం తగ్గగా అంతటా కలయచూచిన అర్జునుడిని వందిమాగధగణాలు కీర్తించాయి. అదే సమయంలో మన కురుసైన్యంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. జననాథ! పాంచజన్య । ధ్వనిఁ గూడి చెలంగు దేవదత్తరవంబున్
విని, భీతి సంభ్రమంబుల । మన సైన్యము లెల్ల ఘూర్ణమానము లయ్యెన్. 285

ప్రతిపదార్థం: జననాథ!= ఓ రాజా (ధృతరాష్ట్రా!); పాంచజన్యధ్వనిన్+కూడి= శ్రీకృష్ణుడి శంఖమైన పాంచజన్యం యొక్క శబ్దంతో కూడుకొని; చెలంగు= ధ్వనించు; దేవదత్తరవంబున్= అర్జునుడి దేవదత్త శంఖ ధ్వనిని; విని; భీతి సంభ్రమంబులన్= భయంచేతనూ, తొట్రుపాటుచేతనూ; మన సైన్యములు+ఎల్లన్= మన సేనలు అన్నీ; ఘూర్ణమానములు+అయ్యెన్= తిరుగుడు పడినట్లుగా అయ్యాయి (మిక్కిలి భ్రమణం (కదలిక) చెందినవి అయ్యాయి).

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాంచజన్య శబ్దంతో కూడుకొన్న దేవదత్త శబ్దాన్ని విని, మన సైన్యాలు భయంతో, తొట్రుపాటుతో మిక్కిలి చలించి పోయాయి.

విశేషం: ప్రస్తుత కందపద్యంలో నరనారాయణు లిద్దరూ వారి వారి శంఖాలు పూరించిన విషయం తెలుపబడింది. ఇరువురూ ఏకాభిప్రాయానికి వచ్చినప్పుడు ఎంతటి దుస్తర కార్యమైనా అనాయాసంగా ఫలించి తీరుతుంది అని సూచన. ధ్వని విని భీతితో సైన్యాలు ఏ విధంగా కలత చెందినవో 'ఘూర్ణమాన' అనే ప్రయోగంలో పద్యాంతమున ప్రకటితం.

క. అప్పుడు వేగులవారలు । సెప్పిన నంతయు నెఱింగి సింధువిభుఁడు దన్
గప్పెడు నెవ్వగపెల్లున । నిప్పులఁ బడినట్లు గాలు నిలువఁగ లేమిన్. 286

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; వేగులవారలు= త్వరగా వార్తలు అందజేసే గూఢచారులు; చెప్పినన్= తెలుపగా; సింధువిభుఁడు= సైంధవుడు; అంతయున్+ఎఱింగి= విషయమంతా తెలిసికొని (అనగా అర్జునుడి ప్రతిజ్ఞను బాగుగా తెలిసికొని); తన్= తనను; కప్పెడు= ముంచివేసే; నెవ్వగపెల్లునన్= అధికమైన చింతతో; నిప్పులన్+పడినట్లు= అగ్నిలో పడినట్లు; కాలు+నిలువఁగన్+లేమిన్= కాలు నిలపటానికి కాకుండటం చేత.

తాత్పర్యం: వెంటనే వేగులవాళ్ళు చెప్పగా, అర్జునుడి ప్రతిజ్ఞను బాగుగా తెలిసికొని సైంధవుడు తనను అధికమైన విచారం (చింత) ఆవరించగా అగ్నిచేత తపించబడ్డట్లుగా కాలు నిలపటానికి సాధ్యంకాక.

విశేషం: 'నెవ్వగపెల్లు' అంటే అధికమైన విచారం యొక్క అతిశయం. అధికమైన విచారం ఆవరిస్తే మనస్సు క్షణం కుదురుగా ఉండలేదు. చితాగ్ని చచ్చిన శరీరాన్ని కాలిస్తే చింతాగ్ని క్షణక్షణోద్వేగంతో మనస్సును దహించి వేస్తుంది. చింతను అగ్నితో పోల్చటం పరిపాటి. 'నిప్పులలో పడ్డట్లుగా కాలు నిలవకపోవటం' అనే అచ్చ తెలుగు పలుకుబడి, సైంధవుడి అప్పటి మనః పరిస్థితిని కళ్ళకు కట్టినట్లుగా తెలుపుతూ ఉన్నది. చారుడు అనగా వేగువాడు, వేగరి. కాని, తిక్కన ఇచ్చట వేగులవారలు అనటంవలన అతి త్వరగా వార్తలను అందించేవాళ్ళు అని గ్రహించవలసి ఉన్నది. అన్యాయంచేసిన వ్యక్తి కొంత సుదూరంగా ఉండి, ప్రాణాపాయానికి గురి అవుతూ ఉన్నాడని తెలిసినప్పుడు, అత డేదో ఒక ఉపాయంతో బ్రతికి బయటపడటానికి గూఢచారులు వెంటనే వార్తను ఆ నిర్దిష్టవ్యక్తికి తెలపటం అనే పద్ధతి ఆనాటి యుద్ధ తంత్రంతో ఒక భాగంగా ఉన్నట్లు విదితం.

అర్జునుని ప్రతిజ్ఞ విని సైంధవుఁడు భయపడి దుర్యోధనునితోఁ జెప్పికొనుట (సం. 7-52-1)

క. చని యాప్తు లైన బల వ । న్మనుజేంద్రులు గొలువనున్న మానవనాథుం
గని యిట్లను సిగ్గు గడచి । తన యుల్లముఁ గలఁచి వెఱపు దల్లడవెట్టన్. 287

ప్రతిపదార్థం: చని= పోయి; ఆప్తులు+ఐన= ప్రాణ స్నేహితులైన; బలవత్+మనుజ+ఇంద్రులు= బలంకలిగిన రాజులు; కొలువన్= సేవిస్తూ ఉండగా; ఉన్న+మానవనాథున్= ఉండే రాజును అనగా దుర్యోధనుడిని; కని= చూచి; తన+ఉల్లమున్= తన మనస్సును;

కలఁచి= కలత కలిగించి; వెఱపు= భయం; తల్లడ+పెట్టన్= చలింపజేయగా (బాధపెట్టగా); సిగ్గుగడచి= సిగ్గు విడిచి; ఇట్లు= ఇట్లా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: చింతతో కాలు నిలువలేకపోటంచేత త్వరగా దుర్యోధనుడి దగ్గరకు పోయి, బలవంతులైన రాజులతో కొలువుదీరి ఉన్న అతడిని చూచి భయం తనను బాధపెట్టగా, సిగ్గు విడిచి ఇట్లా అన్నాడు.

ఉ. ఏ నొకరుండనే తనకు నెగ్గొనరించితి? నేల నాపయిం
బూనినవాఁడు ఫల్గునుఁడు? పోర వధింపగ నెట్టి పాడి? మీ
కీ నెఱిసంతసంబు వగ పేటికి నా కెట యేని పోయెదన్
వాని ప్రతిజ్ఞ కడ్డపడు వారె సురాసుర సిద్ధసాధ్యులున్. 288

ప్రతిపదార్థం: తనకున్= ఆ అర్జునుడికి; ఏను= నేను; ఒకరుండనే+ఎగ్గొనరించితిన్?= ఒక్కడినే కీడు చేశానా?; ఏల= ఎందువలన; ఫల్గునుఁడు= అర్జునుడు; పోరన్= యుద్ధంలో; వధింపఁగన్= చంపటానికి; నాపయిన్= నా మీద; పూనినవాఁడు= ప్రయత్నిస్తున్నాడు; ఎట్టిపాడి= ఎటువంటి ధర్మం (ఏమి న్యాయం); మీకున్= మీకు; ఈ నెఱి+సంతసంబు= ఈ సంతోషించటం; నాకున్= నాకు; వగపు+ఏటికి?= చింత ఎందుకు?; ఎటఏని+పోయెదన్= ఎక్కడికైనా వెళ్ళుతాను; వాని ప్రతిజ్ఞకున్= ఆ అర్జునుడి ప్రతినకు; సుర+అసుర, సిద్ధ, సాధ్యులున్= దేవతలు, రాక్షసులు, సిద్ధులు, సాధ్యులు కూడా; అడ్డపడువారె?= అడ్డుపడేవారేనా?

తాత్పర్యం: ఆ అర్జునుడికి నే నొక్కడినే కీడు చేశానా? ఎందుకు అతడు యుద్ధంలో నన్నే వధించటానికి ప్రయత్నిస్తున్నాడు? ఇది ఏమి ధర్మం? మీకు సంతోషించటం ఏమి న్యాయం? నాకు ఈ చింత ఎందుకు? ఎక్కడికైనా వెళ్ళిపోతాను. ఆ అర్జునుడి ప్రతిజ్ఞకు దేవదానవులు సిద్ధసాధ్యులు కూడా అడ్డుపడలేరు.

విశేషం: ఈ పద్యాలలో భయచకితుడైన సైంధవుడి మనస్థితి చాలా చక్కగా ఆవిష్కరించబడింది. నేనొక్కడినేనా అతడికి కీడు చేసింది, ఎందుకు మరి నన్నే చంపటానికి ప్రయత్నం? మీరందరూ సంతోషంగా ఉండటం నేను మాత్రం ఇట్లా చింతించటమా? ఇది ఏమి ధర్మం? అని తనకు రక్షణ దొరకదని సందేహపడ్డాడు. 'ఎక్కడికైనా పోయి దాగుకొంటాను. ఇంతకంటె ఏమి చేసేది?' అని భీతితో పరుగెత్తి వెళ్ళటానికి ఆలోచించాడు. అర్జునుడి ప్రతిజ్ఞ సామాన్యమైనది కాదు అని బాగా తెలిసిపోయింది. అందుకే అతడిని దేవతలు కూడా జయించలేరంటూ ఉన్నాడు. ప్రాణభీతి కలిగినప్పుడు ఒక వ్యక్తి ఎట్లా రకరకాలుగా ఆలోచించి ఎక్కడనో ఒక చోట తలదాచుకొనటానికి సంసిద్ధుడౌతాడో ఇందులో తెలుపబడింది. విడివిడి వాక్యాల కూర్పు భయభ్రాంత మనస్కతకు సూచన.

వ. అనుచుం గొలువు గనుంగొని. 289

తాత్పర్యం: అని అంటూ సభను అంతా చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. ద్రోణ కర్ణ శల్య దుర్యోధనులుఁ గృప । బాహ్లికులును జముఁడు పట్టికొన్న
వాని నైనఁ గావ వలఁతురు వలచిన । నొల్లకున్న నెట్టు లొకొ యెఱుంగ.' 290

ప్రతిపదార్థం: ద్రోణ, కర్ణ, శల్య, దుర్యోధనులున్= ద్రోణుడు, కర్ణుడు, శల్యుడు, దుర్యోధనులునూ; కృప+బాహ్లికులునున్= కృపుడూ, బాహ్లికుడున్నూ; జముఁడు, పట్టికొన్న వానిన్+ఐనన్= మృత్యువుకు చిక్కినవాడు అయినప్పటికీ; వలచినన్= కోరితే; కావన్+వలతురు= రక్షించటానికి ఇష్టపడతారు; ఒల్లకున్నన్= ఇష్టపడక పోతే; ఎట్టులు+ఒకొ!= ఎట్లో!; ఎఱుంగన్= తెలియను.

తాత్పర్యం: ద్రోణుడూ, కర్ణుడూ, శల్యుడూ, దుర్యోధనుడూ, కృపుడూ, బాహ్లికుడూ - వీరందరున్నూ అనుకొంటే మృత్యువుకు లోనైనవాడినైనా రక్షించటానికి సర్వసమర్థులు. కాని, అట్లా అనుకోకపోతే మరి ఏ మౌతుందో తెలిసికొనలేకుండా ఉన్నాను.'

విశేషం: సైంధవుడికి భయంతోపాటు సందేహంకూడా బాగా కమ్ముకొనేసింది. ద్రోణాదులు ఇష్టపడితే మృత్యువునుండైనా కాపాడగలిగే సమర్థులు. కాని, ఇష్టం లేకపోతే ఏ విధమో, అదే తెలియటంలేదు అంటున్నాడు. వలతురు అనే క్రియాపదం 'కామిస్తారు, కోరుతారు ఇష్టపడతారు' అనే అర్థాలలో వాడబడింది. వాళ్ళకు అక్కర అనుకుంటే ఎంతటి పనికైనా సంసిద్ధులే కానీ నా విషయం ఏ విధం? అని సంశయగ్రస్త మనస్తత్వంలో మరీ పిరికివాడై పలాయనం చిత్తగించటానికి సర్వసన్నద్ధంగా ఉన్నాడు.

వ. అని వెండియు. 291

తాత్పర్యం: అని మరియు.

క. 'పెదవులు దడుపుచుఁ గాళ్ళున్ । గుదివడ వడఁకుచు, మనంబు గొందలపడఁగా
నిది 'యేటి మాట లాడెదఁ? । దుదిఁ బార్థుఁడు గానకుండఁ దొలఁగఁగ వలయున్. 292

ప్రతిపదార్థం: పెదవులు+తడుపుచున్= పెదవులు ఎండిపోగా తడపుకొంటూ; కాళ్ళున్+గుదివడన్= కాళ్ళున్నూ కట్టువడగా; వడకుచున్= కంపిస్తూ; మనంబు= మనస్సు; కొందల పడన్= కలత చెందగా; ఇది+ఏటి, మాటలు+ఆడెదన్= ఇది ఎందుకు ఇట్లా మాటాడుతూ ఉన్నాను; తుదిన్= చివరకు; పార్థుడు కానకుండన్= అర్జునుడు చూడకుండా; తొలఁగనవలయున్= తొలగిపోవాలి.

తాత్పర్యం: పెదవులు ఎండిపోగా తడుపుకొంటూ, కాళ్ళు కట్టువడగా వణకుతూ, మనస్సు మరీ కలత చెందగా నే 'నెందుకిట్లా మాట్లాడుతూ ఉన్నాను? చివరకు పార్థుడికి కనిపించకుండా తొలగిపోవటమే శరణ్యం' అని అనుకొన్నాడు.

విశేషం: భయమూ, సందేహమూ, తనకు రక్షణ దొరకదనే స్థిరనిశ్చయం ఏర్పడ్డప్పుడు, ఆసన్నమవుతున్న చావును తప్పించుకొనటానికి సైంధవుడికి చివరకు ఒకే ఒక ఉపాయం తట్టింది. అదే అర్జునుడికి కనిపించకుండా ఎక్కడికైనా వెళ్ళి దాగుకొనటం. ఇక్కడ శారీరకంగా అతనిలో కలిగే మార్పులు నోరెండిపోవటం, కాళ్ళు క్రుంగిపోవటం. గుదివడన్= కాళ్ళు వెనుదీయటం; తగ్గటం, క్రుంగటం అనే అర్థాలున్నాయి. 'గుదివడన్' అనే పదానికి వణకటం అని ఉన్నది. రెండో అర్థాన్ని గ్రహిస్తే పునరుక్తి అవుతుంది. అందువలన క్రుంగు అనే అర్థాన్నే గ్రహించటం స్వారస్యం. గురివడు= కట్టుపడు - శబ్దరత్నాకరం.

వ. మీయందఱచేత ననుజ్ఞాతుండనకదా! పోయివచ్చెద' ననవుడు నిజకార్యధురంధరుండగు నక్కురుధరణీవరుం డతని కిట్లనియె. 293

ప్రతిపదార్థం: మీ+అందఱచేతన్= కొలువులో ఉండే ప్రముఖులైన మీ అందరిచేత; అనుజ్ఞాతుండను+అ+కదా!= అనుమతిని పొందినవాడినే కదా!; పోయివచ్చెదన్= పోయివస్తాను; అనవుడున్= అని అనిన వెంటనే; నిజ, కార్య, ధురంధరుండు+అగు= తన, పనియొక్క భారాన్ని భరించినవాడైన; ఆ+కురుధరణీవరుండు= ఆ దుర్యోధనుడు; అతనికిన్= ఆ సైంధవుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: మీ అందరిచేత అనుమతి పొందినట్లే కదా! పోయివస్తాను' - అని అనగా తన కార్యాన్ని సాధించటంలో నిపుణుడైన దుర్యోధనుడు అతడితో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. 'మును నీ వెన్నితి విక్రమాఢ్యు లని మమ్ముం గొందఱన్; ద్రౌణి పెం
పును, హార్దిక్యుబలంబు, సౌబలుని యేపుం జేవయున్, సోమద
త్తుని ధైర్యంబును శౌర్యమున్, శలు మహా దోర్దర్పముం గూడ నె
న్నిన నీ కెట్లగుఁ జూడు మిట్టి మగలు న్వేయేల ని న్నిత్తురే? 294

ప్రతిపదార్థం: నీవు; విక్రమ, బల+ఆఢ్యులు+అని= పరాక్రమమూ, శక్తి కలిగినవాళ్ళు అని; మమ్మున్+కొందఱన్= దుర్యోధనాదులైన మమ్మల్ని కొందరిని; ద్రౌణి పెంపును= అశ్వత్థామ ఔద్ధత్యాన్ని; హార్దిక్యు బలంబున్= కృతవర్మ శక్తినీ; సౌబలుని+ఏపున్= శకుని గర్వాన్ని; చేవయున్= బలాన్ని; సోమదత్తుని, ధైర్యంబును, శౌర్యమున్= సోమదత్తుడి ధీరతనూ శూరతనూ; శలు= శల్యుడి యొక్క; మహా+దోస్+దర్పమున్= గొప్ప బాహుగర్వాన్ని; కూడన్= కూడా (సయితం); మును= పూర్వం; ఎన్నితి(వి)= గణించావు; ఎన్నిన నీకున్= అట్లా గణించిన (లెక్కించిన) నీకు; ఎట్లు+అగున్+చూడుము= ఎట్లా అవుతుందో చూడుము; వేయి+ఏల?= పలుమాటలు ఎందుకు?; ఇట్టి+మగలున్= ఇటువంటి శూరులు; నిన్ను+ఇత్తురే?= నిన్ను అప్పజెప్పుతారా?

తాత్పర్యం: 'నీవు పూర్వం మమ్మల్ని కొందరిని గొప్ప బలపరాక్రమ సంపన్నులు అని గణించావు. అందులో అశ్వత్థామ ఉద్ధతినీ, కృతవర్మ బలాన్నీ, శకుని గర్వాన్నీ బలాన్నీ, సోమదత్తుడి ధీరతనూ శూరత్వాన్నీ, శలు బాహుబల గర్వాన్నీ లెక్కించావు. అట్లా నీవు లెక్కించిన ఆయా శూరుల వలన నీకు ఏమి జరుగుతుందో చూస్తూ ఉండుము. అంత గొప్ప వీరులు నిన్ను అర్జునుడికి అప్పగిస్తారా!

విశేషం: దుర్యోధను డిచ్చిన హామీ ఒక కొత్త తీరులో ఉన్నది. ఇంతకు ముందు నీవు ఒక్కొక్కరి శక్తిసామర్థ్యాలను తెలిపి ఉన్నావు. కదా! వారందరూ నీవు గణించిన బలపరాక్రమాలనూ, బాహుబలదర్పాలనూ, ఏ విధంగా ప్రకటిస్తారో చూస్తూ ఉండుము. నిన్ను విడిచి వాళ్ళెక్కడకు పోతారు? అని అన్నాడు. ఇది ఔద్ధత్యంలో భుజబలదర్పంతో గంభీరంగా చెప్పిన సందర్భం కాబట్టి తిక్కన ఇక్కడ మత్తేభ విక్రీడిత వృత్తాన్ని ప్రయోగించాడు.

క. నమ్ముము, వెఱవకు; మేనును । దమ్ములునుం గోట నీకుఁ దాత్పర్యముమై
నిమ్మెటి మగలు సూరెల । నెమ్మి నిలువ నింద్రుఁ డైన నీ కెదురగునే?' 295

ప్రతిపదార్థం: నమ్ముము= మమ్ములను విశ్వసించుము; వెఱవకుము= భయపడకుము; ఏనునున్= దుర్యోధనుడైన నేనూ; తమ్ములునున్= నా తమ్ముళ్ళునూ; నీకున్= నీకు; కోట= దుర్గం వంటి వాళ్ళు; ఈ+మేటిమగలు= ఈ గొప్ప శూరులు; తాత్పర్యముమైన్= తత్పరతతో నీ రక్షణలోనే ఆసక్తితో; నెమ్మిన్= ప్రీతితో; సూరెలన్= ప్రక్కభాగాలలో, పార్శ్వంగా; నిలువన్= ఉండగా; నీకున్= నీకు; ఇంద్రుఁడు+ఐనన్= దేవేంద్రుడైనా; ఎదురు+అగునే?= ఎదురౌతాడా?

తాత్పర్యం: మమ్మల్ని నమ్ముము. భయపడవద్దు. నేనూ నా తమ్ముళ్ళూ నీకు కోటవలె ఉంటాము. ఇక ఈ మన శూరులంతా ని న్నెంతో జాగ్రత్తగా, శ్రద్ధతో, ప్రీతిపూర్వకంగా ప్రక్కభాగాలలో నిలిచి సహకరిస్తారు. ఆ దేవేంద్రుడైనా నీకు ఎదురు రాలేడు.'

విశేషం: 'నిన్నిత్తురే' అని అంతకు ముందు చెప్పిన దుర్యోధనుడు ఈ పద్యంలో 'భయపడకు మమ్మల్ని నమ్ము' అని గట్టిగా హామీ ఇచ్చాడు. కోటవలె మేము ఉంటాం అని అన్నట్లుగానే దుర్యోధనుడు ఇతరులు ప్రవేశించటానికి, సైంధవుడిని కనిపట్టటానికి వీలుకాని విధంగా ద్రోణాచార్యుల చేత వ్యూహం ఏర్పాటు చేయించాడు. కోట అనే మాటను అక్షరాలా చెప్పినట్లుగానే ఆచరించాడు. మాట ఇస్తే తనను నమ్మిన వాళ్ళకు ప్రాణాల్ని కూడా ధారపోసే మనస్తత్వం దుర్యోధనుడిది. కోటవలె నిన్ను కాపాడితే ఆ అర్జునుడు కాదు వాళ్ళ బాబు కూడా ని న్నేమీ చేయలేడనటం ఎంతో సహజంగా ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని చుట్లనున్న రాజులం జూపిన నూఱడిల్లి, యంత నిలువక నీ కొడుకుం దోడ్కొని ద్రోణుని కడకుం జని జయద్రథుండు దనకు నర్జుననకు ధనుర్విద్యా విభవంబు నందలి వాసి యెట్టి? దని యడిగిన, నతండు 'నీకు నతనికి నాచార్యకంబు సమప్రకారంబ; యవ్వీరుండు వివిధ శ్రమంబుల యలజడి కోర్చి యలఘు ప్రయోగంబులు పెక్కులు సాధించుటం జేసి నీకంటె నధికుండై యుండు; నది యట్లుండె; నేను గలుగ నీ వా సవ్యసాచికి వెఱవ వలదు; మద్బాణంబుల మఱువున నున్న నిన్ను దేవతలకుం దేఱిచూడవచ్చునే? వివ్వచ్చునకుం బ్రవేశింపరాని బంధురవ్యూహంబు పన్నించెదఁ; గులధర్మంబు శిథిలంబు గాకుండ సమరంబు సేయు'మని చెప్పి వెండియు. 296

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; చుట్లన్+ఉన్న+రాజులన్= సమీప ప్రదేశాలలో లేదా నలు ప్రక్కల ఉండే రాజులను; చూపినన్= చూపించి నంతనే; ఊఱడిల్లి= ఉపశమించి (స్వస్థత-కుదురుపాటు చెంది); అంతన్= అంతటితో; నిలువక= ఆగక; నీ కొడుకున్= నీ కుమారుడైన దుర్యోధనుడిని; తోడ్కొని= తీసికొని; ద్రోణుని+కడకున్= ద్రోణాచార్యుల దగ్గరకు; చని= పోయి; జయద్రథుండు= సైంధవుడు; తనకున్+అర్జుననకున్= తనకూ, ఆ అర్జునుడికీ; ధనుః+విద్యా, విభవంబు+అందలి, వాసి= విలువిద్యయొక్క నేర్పులోని అంతరం (భేదం); ఎట్టిది+అని+అడిగినన్= ఎటువంటిది అని అడుగగా; అతండు= ఆ ద్రోణాచార్యుడు; నీకున్+అతనికిన్= నీకూ, అతనికీ; ఆచార్యకంబు= నేర్పటం అనగా ఉపాధ్యాయత్వం; సమప్రకారంబు+అ= సమానమే (సమానమైన పద్ధతి కలదియే); ఆ+వీరుండు= ఆ అర్జునుడు; వివిధ శ్రమంబుల+అలజడికిన్= పలు విధాల, పరిశ్రమల అలసటకు; ఓర్చి= సహించి; అలఘు ప్రయోగంబులు= గొప్పప్రయోగాలు; పెక్కులు= అనేకాలు; సాధించుటన్+చేసి= సాధించటం చేత; నీకంటెన్+అధికుండు+ఐ+ఉండున్= నీకంటె గొప్పవాడై ఉంటాడు (ఉన్నాడు); అది+అట్లు+ఉండెన్= దానిని అట్లా ఉండనీ; నేను కలుగన్= నేను ఉండగా; నీవు; ఆ+సవ్యసాచికిన్= ఆ అర్జునుడికి; వెఱవవలదు= భయపడవద్దు; మత్+బాణంబుల, మఱువునన్+ఉన్న, నిన్నున్= నా బాణాల మరుగులో ఉండే నిన్ను; దేవతలకున్= దేవతలకు కూడా; తేఱి చూడవచ్చున్+ఏ?= చూడటానికి వీలౌతుందా?; వివ్వచ్చునకున్= అర్జునుడికి; ప్రవేశింపరాని= చొచ్చుకొని రావటానికి వీలుకాని; బంధుర వ్యూహంబున్= గొప్ప వ్యూహాన్ని; పన్నించెదన్= ఏర్పాటు చేయిస్తాను; కులధర్మంబు= నీవర్ణ ధర్మం (క్షత్రియుడవుగా నీవు చేయాల్సిన కర్తవ్యం); శిథిలంబు+కాకుండన్= సడలిపోకుండా; నశించకుండా ఉండేటట్లు; సమరంబు+చేయుము= యుద్ధం చేయుము; అని= ఆ విధంగా; చెప్పి= తెలిపి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని తనచుట్టూ ఉన్న రాజులను చూపించాడు. సైంధవుడు ఊరడిల్లాడు. అయినా అంతటితో ఆగక దుర్యోధనుడిని వెంటబెట్టుకొని ద్రోణుడివద్దకు వెళ్ళి, తనకూ అర్జునుడికీ ధనుర్విద్యా వైభవంలో ఉన్న తేడాను తెలుపుమని ఆయనను కోరాడు. 'నీకూ, అర్జునుడికీ ఆచార్యకం ఒకటే, కాని, అర్జునుడు వివిధ పరిశ్రమలకు ఓర్చి గొప్ప గొప్ప ప్రయోగాలు అనేకం సాధించటం చేత నీకంటె అధికుడు' అని ద్రోణుడు చెప్పాడు. అంతేగాక 'నేనుండగా నీవు ఆ సవ్యసాచికి భయపడవద్దు. నా బాణాల రక్షణలో ఉన్న నిన్ను దేవతలకు కూడా తేరిచూడటానికి వీలుకాదు. అర్జునుడు ప్రవేశించటానికి వీలులేని గట్టి సేనా వ్యూహాన్ని పన్నుతాను. నీవు మాత్రం క్షత్రియధర్మం చెడకుండా యుద్ధం చేయుము' అని అన్నాడు ఇంకా.

క. శ్రుతు లభ్యసించి తతుల । క్రతువులు సేసితి కులంబు రక్షించితి వీ
వితరుల క్రియ మృత్యుభయా । న్వితుఁడవు గాఁ దగునె మేదినీవర! యింకన్. 297

ప్రతిపదార్థం: మేదినీవర!= రాజా! (సైంధవా! అని సంబోధన); ఈవు= నీవు; శ్రుతులు+అభ్యసించితి(వి)= వేదాలు వల్లె వేశావు; అతుల, క్రతువులు+చేసితి(వి)= సాటిలేని యజ్ఞాలు కావించావు; కులంబు, రక్షించితివి= వంశాన్ని కాపాడావు; ఇతరుల

క్రియన్= సర్వసామాన్యులైన తక్కినవాళ్ళవలె; మృత్యుభయ+అన్వితుఁడవు= చావువలన భీతి కలవాడవు; కాన్+తగునే?= కావడం న్యాయమా!

తాత్పర్యం: రాజా! సైంధవా! నీవు వేదాలు వల్లెవేశావు. సాటి లేని యజ్ఞాలు చేశావు. కులాన్ని కాపాడావు. సర్వసామాన్యు లైన ఇతరుల మాదిరి చావంటే భీతి కలవాడవు కావటం ధర్మమా?

విశేషం: అంతకు ముందు వచనంలో 'కులధర్మంబు శిథిలంబు కాకుండ సమరంబు సేయు'మని ద్రోణుడు తెలిపాడు. 'స్వధర్మే నిధనం శ్రేయః' అనే వాక్య సారాన్ని మరల తెలుపుతూ ఉన్నాడు. ఇక్కడ పేరు పెట్టి పిలవకుండా మేదినీవర! అని సంబోధించటం వలన నీ క్షత్రియత్వాన్ని నిలుపుమని హెచ్చరించినట్లయింది. 'కులంబు రక్షించితివి' అనే వాక్యం కూడా ఇప్పటి దాకా నీ వర్ణధర్మాన్ని కాపాడావు. ఇకపైన కూడా ఆ ధర్మాన్ని విడువవద్దు అన్నాడు. అజ్ఞానులైన పిరికివాళ్ళు చావంటే భయపడుతారు. కాని, నీవు అందరివలె కాదు. వేదాలు చదివావు. అంటే ఎంతో విజ్ఞానాన్ని ఆర్జించావు. పైగా సాటిలేనన్ని యజ్ఞాలు కూడా చేసి ఉన్నావు. ఇంత చదివీ, ఇన్ని చేసీ, ఇతరులవలె మృతికి వెరవటం తగదు అని అంటూ స్వధర్మాన్ని పాటించటమే కర్తవ్యం అని పదే పదే సైంధవుడికి ద్రోణుడు తెలిపాడు.

క. యాదవ కౌరవ పాండవు। లాదిగఁ గల యఖిలనృపులు నవ్యయ వృత్తిన్
మేదిని నిలుతురె క్రమమునఁ। బోదురు గా కెల్ల జనులుఁ బోవు తెరువునన్. 298

ప్రతిపదార్థం: యాదవ, కౌరవ, పాండవులు= యదువంశానికి సంబంధించిన వాళ్ళూ, కురువంశానికి చెందిన వాళ్ళూ, పాండురాజు కుమారులు; ఆదిగన్+కల= మొదలుగా ఉండే; అఖిల నృపులు= రాజులందరూ (సమస్త రాజులు); అవ్యయవృత్తిన్= నాశం లేని ప్రవర్తనతో; మేదినిన్= భూలోకంలో; నిలుతురు+ఎ?= స్థిరంగా ఉంటారా?; ఎల్లజనులు, పోవు, తెరువునన్= అందరూ పోయేదారిలో; క్రమమునన్= వరుసగా; పోదురు కాక= పోతారు కదా! (అనగా ఎటువంటివారికినీ ఈ భూమిపైన నిలకడ లేదు; యాదవాదులందరున్నూ సామాన్యులవలెనే క్రమంగా మరణిస్తారు అని భావం.)

తాత్పర్యం: యాదవులు, కౌరవులు, పాండుకుమారులూ మొదలుగా ఉండే సమస్త రాజులున్నూ వినాశంలేని ప్రవర్తనతో భూలోకంలోనే స్థిరంగా ఉంటారా? అందరూ పోయే దారిలోనే క్రమంగా వారందరూ పోతారు.

విశేషం: 'మృత్యువుకు భయపడటం క్షత్రియుడవైన నీకు తగదు' అని పూర్వపద్యంలో చెప్పి, ప్రస్తుత పద్యంలో ఎవ్వరూ శాశ్వతంగా ఈ లోకంలోనే ఉండిపోరు. కాలక్రమంగా అందరూ కాలధర్మాన్ని పొందేవాళ్ళే, మృత్యువు ఎవరికైనా అనివార్యం. దాన్ని గురించి చింతించటం అవివేకం. మన ధర్మాన్ని మనం తప్పక నిర్వర్తించి తీరాలి - అని లోకసహజమైన రీతిలో ద్రోణుడు సైంధవుడి మృత్యుభయాన్ని నివారించాడు. మృత్యువు ఎక్కడకు పోయినా, ఎప్పుడైనా తప్పకుండా సమయం ప్రకారం వచ్చి తీరుతుంది అని, ఎవరికైనా మృత్యువు ఖాయం అని నిర్ధారణ చేశాడు. ఇంతకు ముందు ఎవ్వరూ ఏర్పాటుచేయని విధంగా గొప్ప వ్యూహాన్ని నీ ప్రాణరక్షణకు సిద్ధం చేస్తాను. భయపడవద్దని పూర్తి హామీ ఇస్తూ కూడా మృత్యువును తప్పించుకొనలేము అనే శాశ్వత సత్యాన్ని చెప్పి ద్రోణుడు అతడిని ఊరటపరచాడు.

క. తపములు దానంబులుఁ జే। సి పడయు లోకంబు లెల్లఁ జేయలఁతులు భూ
మిపులకు సంగరవిద్యా। నిపుణతఁ దలఁ కుడిగి పోర నేర్చినఁ జాలున్.' 299

ప్రతిపదార్థం: సంగరవిద్యానిపుణతన్= యుద్ధవిద్యలోని నేర్పరితనం చేత; తలఁకు+ఉడిగి= బెదరు వదలిపెట్టి; పోరన్+నేర్చిన= పోరాడటానికి నేర్చితే; చాలున్= చాలును; భూమిపులకున్= రాజులకు; తపములున్= తపస్సులున్నూ; దానంబులున్= దానాలున్నూ; చేసి= కావించి; పడయు+లోకంబులు+ఎల్లన్= పొందే ఉత్తమ లోకాలు అన్నీ; చే+అలఁతులు= చేతికి అందుబాటులో ఉండేవే.

తాత్పర్యం: యుద్ధవిద్యలో నేర్పరితనంతో, బెదరు విడిచిపెట్టి పోరాడటానికి సర్వసమర్థులై సన్నద్ధంగా ఉండే రాజులకు తపస్సులూ, దానాలు చేసి పొందే ఉత్తమ లోకాలన్నీ (కరతలామలకాలే) చేతికి అందుబాటులో లోబడి ఉండేవే.'

విశేషం: ప్రస్తుత పద్యంలో మరణం తరువాత ఉత్తమ లోకప్రాప్తిని గురించి వివరించాడు. ద్రోణుడు ఒకవైపున ధైర్యం చెబుతూనే మరోవైపు పరలోకప్రాప్తిని గురించి వివరిస్తున్నాడు. ఇటువంటి మాటలు ఇంకా భయాన్ని రేకెత్తించవచ్చును అని మనకు అనిపిస్తుంది. అతడు కావాలని పనిగట్టుకొని ధర్మాలు వల్లించటంలేదు. అప్రయత్నంగా అతడి నుండి ఆ మాటలు వస్తూ ఉన్నాయి. మృత్యుభీతిని తప్పించాలంటే ఆ మృత్యువు యొక్క స్వాభావికమైన ధర్మాన్నీ, తదనంతర లోకప్రాప్తినీ తెలపటం సముచితం. అటువంటి ఉపదేశం అంతర్ముఖంగా ఒక బలిష్ఠమైన నిశ్చయాన్ని ప్రతిష్ఠింపజేస్తుంది. వీరోచితంగా పోరాడే శక్తిసామర్థ్యాలను కలిగిస్తుంది. ఈ పద్యంలో 'చేయలఁతులు' అనే అచ్చ తెలుగు పదబంధాన్ని తిక్కన ప్రయోగించాడు. చే+అలఁతులు అని దీని విభజన. ఇందులో అలఁతి అనే శబ్దానికి అల్పమూ, తేలిక, సూక్ష్మము, చిన్నది అనే అర్థాలున్నాయి. అంటే చేతిలో తేలిగ్గా ఇమిడి (లోబడి) పొగలిగే సూక్ష్మమైన లేక చిన్నదైన వస్తువు వంటిది అని గ్రహించవలసి ఉన్నది.

క. **అని యూఱడిల్లఁ బలికిన । విని యతఁడు గలంకు దేఱి, విభుఁడుం దానుం**
జని సంగ్రామోత్సాహం । బునఁ బొదలిరి తూర్యఘోషములు దివి ముట్టన్. **300**

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; ఊఱడిల్లన్+పలికినన్= ఉపశమనం కలిగేటట్లు మాటాడగా; అతఁడు= సైంధవుడు; కలంకు తేఱి= కలతనుంచి తేరుకొని అనగా కలత విడిచి; విభుఁడున్+తానున్= దుర్యోధనుడున్నూ, తానూ; చని= పోయి; తూర్యఘోషములు= వాద్యాల మ్రోతలు; దివిముట్టన్= ఆకాశాన్ని తాకగా; సంగ్రామ+ఉత్సాహంబునన్= యుద్ధాన్ని గూర్చిన ప్రయత్నంతో; పొదలిరి= ప్రకాశించారు (ఒప్పారారు).

తాత్పర్యం: ఆ విధంగా ద్రోణుడు సైంధవుడిని ఊరడించగా అతడు విని, కలత నుండి తేరుకొని, వాద్యాల మ్రోతలు మిన్నుముట్టుతూ ఉండగా యుద్ధప్రయత్నంతో దుర్యోధనుడూ తానూ మిక్కిలి ప్రకాశించారు.

విశేషం: ద్రోణుని ఊరడింపు మాటలు సైంధవుడిని కలత నుండి తేర్చడమే కాకుండా దుర్యోధన సైంధవులను ఇరువురునీ రణోత్సాహానికి పురికొల్పాయి. చింత తొలగి దాని స్థానే ఉత్సాహం కలిగినప్పుడు, ఆ ఉత్సాహాన్ని ద్విగుణీకృతం చేసే వాద్యాల చప్పుడు విన్నప్పుడు ఒక కొత్త శోభ, అంతకు ముందు లేని ఉబ్బు, ప్రవర్ధమానమైన గర్వమై పెరిగి ప్రకాశిస్తూ వ్యాపిస్తాయి. 'పొదలిరి' అనే క్రియా పదంలో ఆ ఇరువురూ ఎట్లా ఒప్పారినారో తెలుపబడింది.

వ. **సర్వసైన్యంబులును దైన్యంబు వాసి కయ్యంబుకడంక నుల్లసిల్ల సైనికోత్తముల సింహనాదంబులు సెలంగె; నిత్తెఱంగున భవత్తనయు శిబిరంబు సముద్యమ సుముఖం బయ్యె; నంత నక్కడ పాండవాగ్రజుండు పాంచాలమాత్స్య పాండ్య యాదవ కేకయాది రాజలోకంబు శోకంబు దగుమాటల మలుఁగం జేసి విడిదలకుం జన నియమించి, యనుజుల నచ్యుతునిం బెట్టికొనియున్న యెడ నగ్గోవిందుండు గాండీవి కిట్లనియె.** **301**

ప్రతిపదార్థం: సర్వసైన్యంబులును= అన్ని సేనలున్నూ; దైన్యంబు+పాసి= దీనత్వాన్ని విడిచి; కయ్యంబు+కడంకన్= యుద్ధంయొక్క ప్రయత్నంతో; ఉల్లసిల్లన్= సంతోషించగా; సైనిక+ఉత్తములు= సైనిక శ్రేష్ఠుల అనగా యోధవీరుల; సింహనాదంబులు+చెలంగెన్= గర్జనలవంటి అరుపులు ఒప్పాయి; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; భవత్+తనయు శిబిరంబు= నీ కుమారుడి సైన్యం విడిదిచేసిన చోటు; సముద్యమ, సుముఖంబు+అయ్యెన్= మిక్కిలి ప్రయత్నంతో ఎదురుముఖం (అభిముఖంగా) కలిగిందిగా అయింది;అంతన్=

పిమ్మట(ఆ సమయంలో); అక్కడన్= పాండవ శిబిరం ఉన్న చోట; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మజుడు; పాంచాల, మాత్స్య, పాండ్య, యాదవ, కేకయ+ఆది, రాజలోకంబు= ద్రుపదుడు, విరటుడు, పాండ్యరాజు, యాదవ ప్రముఖులు, కేకయదేశపు రాజు మొదలైన రాజుల సమూహంయొక్క; శోకంబున్= దుఃఖాన్ని; తగుమాటలన్= ఉచితాలైన మాటలతో; మలుఁగన్+చేసి= ఉపశమించేటట్లు కావించి; విడిదలకున్= వారి వారి శిబిరాలకు; చనన్= పోయేటట్లు; నియమించి= ఆజ్ఞాపించి; అనుజులన్= తమ్ముళ్ళను; అచ్యుతునిన్= శ్రీకృష్ణుడిని; పెట్టికొని+ఉన్న+ఎడన్= ఉంచుకొని ఉండే సందర్భంలో; ఆ+గోవిందుండు= ఆ కృష్ణుడు; గాండీవికిన్= అర్జునుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: సైన్యాలన్నీ దైన్యాన్ని వదలి యుద్ధోత్సాహంతో పొంగారగా, యుద్ధవీరులు సింహనాదాలు చేశారు. ఈ విధంగా దుర్యోధనుడి శిబిరం ఎదురుదాడికి సిద్ధమై ప్రకాశించింది. ఇక అక్కడ ధర్మరాజు పాంచాల, మాత్స్య, పాండ్య, యాదవ, కేకయాది రాజుల శోకాన్ని తగిన మాటలతో మాన్చి, వారిని విడిదులకు పంపాడు. తమ్ముళ్ళతో కృష్ణుడితో కూడి ఉన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

క. **'నాతోఁ దలపోయక రో । షాతురతం బ్రతినవట్టి తవనీనాథ**
వ్రాతంబు వినఁగ; నిట్టులు । చేతాఁకున దెప్పరంబు సేసితి కంటే! 302

ప్రతిపదార్థం: నాతోన్= నాతో కూడా; తలపోయక= ఆలోచించకుండా; రోష+ఆతురతన్= కోపం యొక్క వేగంతో; అవనీనాథ, వ్రాతంబు= రాజులయొక్క సమూహం; వినఁగన్= వినేటట్లుగా; ప్రతిన పట్టితి(వి)= ప్రతిజ్ఞ పట్టావు; ఇట్టులు= ఈ విధంగా; చేతాఁకునన్= సాహసంతో; డెప్పరంబు+చేసితి(వి)= అశక్యమైన దాన్నిగా చేశావు; కంటే!= చూశావా!

తాత్పర్యం: నాతో ఆలోచించకుండానే కోపవేగంతో రాజులందరూ వినేటట్లు ఇట్లా సాహసంతో అశక్యమైన ప్రతిజ్ఞ చేశావు; చూచావా!

విశేషం: 'అంత తీవ్ర ప్రతిజ్ఞ చేసేటప్పుడు ముందూ వెనకా ఆలోచించకుండా, కనీసం ఆప్తమిత్రుడనైన నాతో కూడా సంప్రదించకుండా, సమస్తరాజ సమూహ సమక్షంలో అందరూ వినేటట్లు ఇంతసాహసానికి ఒడిగట్టావు. ఇది నిజంగా అశక్యమైనది' అని కృష్ణుడు అన్నాడు. అఘటనఘటనా సమర్థుడైన కృష్ణుడికే అర్జునుడి ప్రతిజ్ఞ ఆశ్చర్యాన్ని కలిగించింది. డెప్పరము అనే పదాన్ని ఈ సందర్భంలో వివిధార్థాలు స్ఫురించేటట్లు తిక్కన ఎంతో అర్థవంతంగా ప్రయోగించాడు. 'డెప్పరము' అనే పదానికి, ఆపద, అశక్యం, అధికమైనది, ఆపద కలిగించేది, ఆశ్చర్యాన్ని కలిగించేది - అనే అర్థా లున్నాయి. ఆ అర్థాలన్నీ ఈ సందర్భంలో సరిపోతాయి. సాహసం అనే అర్థంలో చేతాఁకు అను అచ్చ తెనుగు పదం ఎంతో అర్థవంతంగా ఉన్నది. ఎంత బరువైన భావాన్నయినా అచ్చ తెనుగులో అతిసులభంగా అవలీలగా, ప్రస్ఫుటం చేయవచ్చునని ఇటువంటి పదాల కూర్పుల వలన విదితమౌతూ ఉన్నది. 'కామక్రోధోద్భవమైన వేగాన్ని అరికట్టిన వాడే యోగ్యుడు, సుఖి అయిన నరుడు' అని గీతోపదేశ సందర్భంలో తెలిపిన భావంయొక్క స్ఫురణ 'రోషాతుర' అనే ప్రయోగంలో అభివ్యక్తమైంది.

క. **అస్తమయమునకు మును రిపు । మస్తకముం దునుమవలయు; మన కిది సాలన్**
దుస్తరమును నగు; నస్త । వ్యస్తం బగునేని నాకు వగపు గదిరెడున్. 303

ప్రతిపదార్థం: అస్తమయమునకున్+మును= సాయంకాలానికి (అంటే ప్రొద్దు గ్రుంకకముందే) మునుపే; రిపు= శత్రువుయొక్క; మస్తకమున్= తలను; తునుమవలయున్= నరికివేయాలి; ఇది= ఈ పని; మనకున్= మనకు; చాలన్= మిక్కిలి; దుస్తరమునున్= అసాధ్యమే; అగున్= అవుతుంది; అస్తవ్యస్తము= వ్యత్యస్తం; అగున్+ఏని= అయితే; నాకున్= నాకు; వగపు+కదిరెడున్= చింత కలుగుతుంది.

తాత్పర్యం: పొద్దుగుంకే లోపల శత్రువు తల నరికివేయాలి. ఈ పని చాలా దుష్కరమే అవుతుంది. వ్యత్యస్తం అయిందా - నాకు చింత కలుగుతుంది.

విశేషం: సాయంకాలం లోపల తల నరికివేయాలి. ఇది అంత తేలికైన పనేమీ కాదు. చాలా దుష్కరమైనది. దీనికి వ్యతిరేకంగా జరిగితే మాత్రం నాకు మిగిలేది వగపే అని కృష్ణుడు అన్నాడు. ఇది చాలా పకడ్బందీగా ఒక పథకం ప్రకారం మహానిగూఢంగా ఎంతో చురుకుగా జరగవలసిన పని అని తెలుస్తూ ఉన్నది. ఏ కొంచెం పొరపొచ్చెం, తప్పిదమూ జరిగినా అది తనకు దుఃఖాన్నీ కీడునూ కలిగిస్తుందని, క్రీడిని బహుజాగరూకుడిగా ఉండవలసిందిగా కృష్ణుడు సూచిస్తూ ఉన్నాడు.

వ. మన వేగుల వారు వచ్చిరి; వారు సెప్పిన తెఱంగు వినుము: 'నీవు ప్రతిజ్ఞ సేసినప్పుడు మ్రోసిన చిందంబుల పెల్లునన్ బెదరి యవ్వీటివారు గవ్వడి కొడుకు చావునకుం గోపించి యిప్పుడ యెత్తి వచ్చు నని రథకరితురంగంబుల నాయితంబుసేయుచుండ, సైంధవుఁడు దనచారులచేత నీ యాడిన మాటలు విని, వెఱచఱచి కురురాజు గొలువున్న చోటికిఁ జని, సిగ్గఱి నిన్ను నగ్గించి, నీ ప్రతిన యెఱిఁగించి, యతం డలిగిన మీరు గావలే రని పలికి, తా నెందేనియుం బోయెద ననిన, నమ్మనుజపతి గురు కృతవర్మ కృప కర్ణ శల్యాశ్వత్థామ ప్రభృతులగు మేటి మగలం బేర్కొని 'వీరును నా తమ్ములును గలుగ నరునకు నిన్ను జుట్టనవ్రేలనుం జూపవచ్చునే' యని భయంబు వాపె; భారద్వాజుండును మహోత్సాహుండై దురవగాహ వ్యూహ విధానంబున జయద్రథుం జేరకుండ నిన్ను నిలువరించువాఁడయ్యె; అది యట్టిద; వా రొక్కొక్కరుండు గెలువరాని యట్టి జెట్టి జోదు; లందఱు నొక్కపనికిం దలకొని నిలిచిన గెలుచుట యశక్యంబు గాదె! ఇక్కార్యం బార్యు లగు నాప్తజనంబులం గూర్చికొని విచారింపవలయు' ననవుడు వివ్వచ్చుండు నవ్వుచు నిట్లనియె. 304

ప్రతిపదార్థం: మన, వేగులవారు= మన గూఢచారులు; వచ్చిరి= వచ్చారు; వారు= ఆ చారులు చెప్పిన; తెఱంగు= చెప్పిన విధం; వినుము; నీవు ప్రతిజ్ఞ చేసినప్పుడు= నీవు శపథం చేసిన సందర్భంలో; మ్రోసిన చిందంబుల పెల్లునన్= శబ్దించిన శంఖాల అతిశయంచేత; బెదరి= భయపడి; ఆ+వీటివారు= ఆ శిబిరంలోని వాళ్ళు; కవ్వడి= అర్జునుడు; కొడుకు చావునకున్= అభిమన్యుడి మరణానికి; కోపించి= కోపపడి; ఇప్పుడు+అ= ఈ క్షణమే; ఎత్తి వచ్చును+అని= దండెత్తి వస్తాడని; రథ, కరి, తురంగంబులన్= తేరులను, ఏనుగులను, గుఱ్ఱాలను; ఆయితంబు+చేయుచుండన్= సిద్ధం చేస్తూ ఉండగా; సైంధవుఁడు= జయద్రథుడు; తన చారులచేతన్= తన వేగులవాళ్ళ వలన; నీ, ఆడిన, మాటలు= నీవు పలికిన ప్రతిజ్ఞా వాక్యాలు; విని; వెఱచఱచి= భయపడి; కురురాజు= దుర్యోధనుడు; కొలువు+ఉన్న చోటికిన్= సభను తీర్చిన ప్రదేశానికి; చని= పోయి; సిగ్గు+అఱి= సిగ్గు విడిచి; నిన్నున్= నిన్ను; అగ్గించి= పొగడి; నీ ప్రతిన ఎఱిఁగించి= నీ శపథం తెలిపి; అతండు= అర్జునుడు; అలిగినన్= కోపించగా; మీరు కావలేరు= మీరు నన్ను కాపాడలేరు; అని పలికి= అని మాటాడి; తాను= ఆ సైంధవుడు; ఎందేనియున్+పోయెదన్+అనినన్= ఎక్కడికైనా వెళ్ళిపోతాను అని చెప్పగా; ఆ+మనుజపతి= ఆ దుర్యోధనుడు; గురు, కృతవర్మ, కృప, కర్ణ, శల్య+అశ్వత్థామ ప్రభృతులు+అగు= ద్రోణుడు, కృతవర్మ, కృపాచార్యులు, కర్ణుడు, శల్యుడు, అశ్వత్థామ మొదలైనవారగు; మేటిమగలన్= గొప్పశూరులను; పేర్కొని= పేర్లుపెట్టి ఉచ్చరించి; వీరును= ఈ పేర్కొన్న శూరులునూ; నా తమ్ములునున్= నా తమ్ముళ్ళునూ; కలుగన్= ఉండగా; నిన్నున్= నిన్ను; జుట్టనవ్రేలనున్= చూపుడు వ్రేలితో (తర్జనితో); చూపవచ్చునే?= చూపటానికి అవుతుందా?; అని; భయంబు+పాపెన్= అని భయాన్ని పోగొట్టాడు; భారద్వాజుండునున్= ద్రోణాచార్యుడున్నూ; మహా+ఉత్సాహుండు+ఐ= మిక్కిలి ఉత్సాహం (ప్రయత్నం) కలవాడై; దుర్+అవగాహ వ్యూహ విధానంబునన్= ప్రవేశించటానికి వీలుగాని మొగ్గరం యొక్క ఉపాయంచేత; జయద్రథున్= సైంధవుడిని; చేరకుండన్= సమీపించకుండా; నిన్నున్= నిన్ను; నిలువరించువాఁడు+అయ్యెన్= నిలుపు (ఆపు) లేదా ఎదుర్కొనేవాడు అయ్యాడు; అది+అట్టిది+అ= అది అటువంటిదే; వారు= ఆ కౌరవవీరులు; ఒక్కొక్కరుండు+అ= ఒక్కొక్కడున్నూ; గెలువరాని+అట్టి జెట్టిజోదులు= జయించటానికి వీలుకానటువంటి శూరులైన (శ్రేష్ఠులైన) యోధులు; అందఱున్= ఆ వీరులందరూ; ఒక్క పనికిన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒకే కార్యానికి; తలకొని= యత్నించి; నిలిచినన్= నిలబడితే; గెలుచుట= జయించటం; అశక్యంబు+కాదె!= అసాధ్యం అవుతుంది కదా!; ఈ+కార్యంబు= ఈపని; ఆర్యులు+అగు+ఆప్తజనంబులన్= పూజ్యులైన ప్రాణమిత్రులను; కూర్చికొని= ఒకటిగా సమావేశ పరచి; విచారింపన్ వలయున్= ఆలోచించాలి; అనవుడున్= అనిన అనంతరం; వివ్వచ్చుండు= అర్జునుడు; నవ్వుచున్= నవ్వుతూ; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: మన గూఢచారులు వచ్చారు, ఇట్లా చెప్పారు వినుము. 'నీవు ప్రతిజ్ఞ చేసినప్పుడు మ్రోగించిన శంఖనాదాల ఆర్భటికి బెదరిపోయి కౌరవపక్షంవారు, కొడుకు చావుకు కోపించి అర్జునుడు ఇప్పుడే యుద్ధానికి రావచ్చునని చతురంగబలాలను సిద్ధంచేయటం మొదలు పెట్టారు. సైంధవుడు తన గూఢచారుల వలన నీ ప్రతిజ్ఞ గురించి తెలిసికొని, భయపడి, దుర్యోధనుడు కొలువు తీర్చిన చోటికిపోయి, సిగ్గువదలి, నిన్ను కీర్తించి, నీ ప్రతిజ్ఞను తెలిపి, నీవు కోపిస్తే కాపాడగలిగినవారు వారిలో లేరని చెప్పి, తానెక్కడికైనా పారిపోతానని అన్నాడు. దుర్యోధనుడు, ద్రోణ, కృతవర్మ, కృప, కర్ణ, శల్యాశ్వత్థామాదులను పేర్కొని, వారూ, కౌరవ సోదరులూ ఉండగా అర్జునుడు అతడివైపు వేలెత్తి చూపలేడని భయం పోగొట్టాడు. ద్రోణాచార్యుడు కూడా ఉత్సాహాతిశయంతో అసాధ్యమైన వ్యూహాన్ని రచించి నీవు సైంధవుడిని సమీపించకుండ అడ్డగించటానికి సిద్ధమయ్యాడు. అది అట్లాగే జరుగుతుంది. కౌరవవీరులలో ఒక్కొక్కరు గెలువరాని జగజెట్టులు. వారందరూ కలిసి ఒక్కటిగా నిలిచి ఒకపని సాధించటానికి పూనుకొన్నప్పుడు వారిని గెలవటం అసాధ్యంకాదా? కాబట్టి ఆత్మీయులైన ఉత్తములతో ఆలోచించి మనకార్యాన్ని నిశ్చయించాలి' అనగానే అర్జునుడు నవ్వుతూ ఇట్లా అన్నాడు.

అర్జునుఁడు కృష్ణునితోఁ దన ప్రతిజ్ఞావిషయంబులైన వాక్యంబులు సెప్పుట (సం. 7-53-31)

క. వారి నెఱుంగుదు నేనును; । వారలు న న్నెఱుఁగుదురు; భవత్సాహాయ్య
స్ఫార బలోద్ధతి గలుగఁగ । వారే తప్పింపఁ జాలువా రీపూన్కిన్? 305

ప్రతిపదార్థం: నేనునున్= నేనున్నూ; వారిన్= ఆ కౌరవపక్షంలోని వాళ్ళను; ఎఱుంగుదున్= ఎరుగుదును; వారలున్= కౌరవపక్షం వాళ్ళున్నూ; నన్నున్= నన్ను; ఎఱుఁగుదురు= ఎరుగుదురు; భవత్+సాహాయ్య, స్ఫార, బల+ఉద్ధతి= నీయొక్క తోడ్పాటు అనే ఒప్పిదమైన బలగర్వం; కలుగఁగన్= ఉండగా; ఈ పూన్కిన్= ఈప్రయత్నాన్ని; తప్పింపన్+చాలువారు= భగ్నం కలిగించేవాళ్ళు; వారే?= వాళ్ళేనా?

తాత్పర్యం: నాకు వారు తెలుసు, వారికి నేను తెలుసు. నీ సహకారం అనే బలగర్వమే నాకు తోడుగా ఉంటే ఈ ప్రయత్నాన్ని తప్పించగలిగేవారు వారేనా? (ఈ ప్రయత్నాన్ని భంగపరచటానికి నీ సహాయం ఉన్నంతకాలమూ ఎవరివలనా వీలుకాదని భావం.)

విశేషం: శ్రీకృష్ణుడు అంతకుముందు 'అర్యులైన ఆప్తజనాన్ని సమకూర్చుకో - వారితో విచారించు' అన్నాడు. అర్జునుడికి శ్రీకృష్ణుడి కంటె ఆప్తుడైన వ్యక్తి ఎవ్వడున్నాడు? అతడే నిజంగా ఆర్యుడైన ఆప్త స్నేహితుడు. అసలు రహస్యం శ్రీకృష్ణుడి మాటలలోనే అర్థమయింది. అందుకే అర్జునుడు నవ్వుతూ నీయొక్క తోడ్పాటు అనే బలగర్వం నాకుంటే చాలు ఈ ప్రయత్నాన్ని మరెవ్వరు భంగపరిచే సమర్థులు కారు; ఎవ్వరూ అంతటి వాళ్ళు కౌరవపక్షంలో లేరు - అనే అర్జునుడి దృఢవిశ్వాసం ఇందులో పరోక్షంగా సూచితం.

వ. ఏను జయద్రథుం జంపుటకుం దమకించి తఱుమునప్పుడు నాకు నెవ్వరడ్డంబు సొచ్చి రేనియు. 306

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఏను= నేను; జయద్రథున్= సైంధవుడిని; చంపుటకున్= సంహరించటానికి; తమకించి= తొందరపడి; తఱుమునప్పుడు= వెంబడించి, పరుగెత్తించేటప్పుడు; నాకున్= నాకు; ఎవ్వరు+అడ్డంబు+చొచ్చిరి+ఏనియున్= ఎవ్వరైనా అడ్డం (నివారించటానికై) ప్రవేశిస్తే.

తాత్పర్యం: నేను జయద్రథుడిని చంపటానికి తొందరగా వెంబడించి వేటాడుతుంటే ఎవరు నాకు అడ్డం వచ్చినా.

మ. **పటు నారాచ పరంపరా ప్రసర దర్పం బేర్పడం బేర్చి త**
ద్భట సంఘంబును ఘోటక వ్రజము శుంభత్స్యందనౌఘంబు ను
ద్భట కుంభి ప్రకరంబునుం బొదివి విధ్వంసంబు గావించి నె
త్తుట జొత్తిల్లెడునట్లు సేయుదు సమిద్భూభాగ మత్యుగ్రతన్. **307**

ప్రతిపదార్థం: పటు+నారాచ= తీవ్రములైన బాణాల; పరంపరాప్రసర= వరుసల వ్యాపనం యొక్క; దర్పంబు= గర్వం; ఏర్పడన్= కలిగేటట్లు (స్పష్టపడేటట్లు); పేర్చి= విజృంభించి; తత్+భట, సంఘంబును= ఆ కౌరవులయొక్క భటుల మొత్తాన్ని; ఘోటక+వ్రజమున్= గుర్రాల మొత్తాన్ని; శుంభత్+స్యందన+ఓఘంబున్= శోభిస్తూ ఉండే రథాల మొత్తాన్ని; ఉద్భట, కుంభి, ప్రకరంబునున్= గొప్ప యేనుగుల సమూహాన్ని; పొదివి= ఆక్రమించి (క్రమ్మి); విధ్వంసంబు కావించి= హతం చేసి; సమిత్+భూభాగము= రణరంగం; అతి+ఉగ్రతన్= మిక్కిలి ఘోరంగా; నెత్తుటన్= రక్తంతో; జొత్తిల్లెడు అట్లు= తడిసేటట్లు; చేయుదున్= చేస్తాను.

తాత్పర్యం: తీవ్రబాణ పరంపరలను ప్రయోగించే గర్వం అతిశయించేటట్లు విజృంభించి, భటులు, గుర్రాలు, రథాలు, ఏనుగులు - వీటి మొత్తాలను చుట్టుముట్టి మట్టుపెట్టి రణరంగాన్ని నెత్తుటితో తడిపి వేస్తాను.

విశేషం: ప్రస్తుత పద్యం మత్తేభవిక్రీడితం, ఇందులో ఉద్భట కుంభి ప్రకరంబు యొక్క ప్రసక్తి కూడా సందర్భవశాత్తూ ప్రకటితమైంది. ప్రతిజ్ఞా వాక్య విషయాలు చెప్పే అర్జునుడి గర్వాతిశయాన్ని ఈ పద్యం వివరిస్తూ ఉన్నది. అర్జునుడు చెప్పే పద్ధతిలోని ఉద్ధతి మత్తేభ విక్రీడిత వృత్తగతిలో ప్రతిఫలించింది.

క. **కౌరవ సైన్యంబులఁ గల । వీరుల యస్త్రములు నాదు వివిధాస్త్రగతి**
క్రూర ప్రవాహముల కెదు । రే! రాజీవాక్ష! యాదరింపకు వారిన్. **308**

ప్రతిపదార్థం: రాజీవాక్ష!= కృష్ణా!; కౌరవ సైన్యంబులన్= కౌరవసేనలలో; కల= ఉన్నట్టి; వీరుల అస్త్రములు= వీరుల బాణాలు; నాదు= నాయొక్క; వివిధ+అస్త్ర, గతి, క్రూర, ప్రవాహములకున్= రకరకాల అస్త్రాల పోకడలచేత నొప్పించే ప్రవృత్తులకు; ఎదురు+ఏ!= సాటియే!; వారిన్= ఆ కౌరవులను; ఆదరింపకు= లక్ష్యపెట్టకుము.

తాత్పర్యం: ఓ కృష్ణా! ఆ కౌరవ వీరుల అస్త్రాలు, నా యొక్క రకరకాల అస్త్రాల పోకడలతో నొప్పించే ప్రవృత్తులకు ఎదురు నిల్వగలవా? వాళ్ళను లక్ష్యపెట్టవద్దు.

క. **వెఱఁగుపడి కుంభభవుఁడుం । బెఱరథికులుఁ జూచుచుండ బీరము లావున్**
మెఱయఁ జలము నెఱయఁగఁ దల । దఱిఁగెద సైంధవుని; నేల తలఁకెదు కృష్ణా! **309**

ప్రతిపదార్థం: కృష్ణా!= కృష్ణా!; కుంభసంభవుఁడున్= ద్రోణాచార్యుడూ; పెఱరథికులున్= ఇతర వీరులూ; వెఱఁగుపడి= నిశ్చేష్టులై; చూచుచున్+ఉండన్= చూస్తూ ఉండగా; బీరమున్= శౌర్యమూ; లావున్= బలమూ; మెఱయన్= ప్రకాశించేటట్లు; చలము= మాత్సర్యం; నెఱయఁగన్= నిండేటట్లుగా; సైంధవుని తలన్= సైంధవుడి శిరస్సును; తఱిఁగెదన్= నరికివేస్తాను; ఏల?= ఎందుకు; తలఁకెదు?= భయపడతావు?

తాత్పర్యం: ఓ కృష్ణా! ఆ ద్రోణాచార్యుడు, తక్కిన వీరులు భయచకితులై చూస్తూ ఉండగా నా శౌర్యమూ, బలమూ, ప్రకాశించేటట్లు, మాత్సర్యం నిండుకొనేటట్లు ఆ సైంధవుడి తలను నరికివేస్తాను. ఎందుకు నీవు భయపడతావు?

విశేషం: ఈ కందపద్యంలోని ప్రాసస్థానాలలోని శకటరేఫల పరుషోచ్చారణ వెక్కసమైన కసితో కరకరమని సైంధవుడి తలను నరికే తీరును సూచిస్తూ ఉన్నది. ఒక విధమైన లయ పద్ధతిలో వాని తల నరికి నాట్యం చేయిస్తాను అన్నట్లు పద్యగతి సాగింది. ప్రతిజ్ఞా నిర్వహణలో ఇది ఎట్లా జరుగుతుందో అన్న సంకోచం శ్రీకృష్ణుడిని కొంత చలింపజేస్తూనే ఉన్నది. ఆప్తజన సహకారం వలన తప్పక తన ప్రతిజ్ఞ నెరవేరుతుంది అని అర్జునుడి నమ్మకం. ఇతడు నన్నే నమ్మినాడు. దుస్తరమైన ఈ కార్యాన్ని ఎట్లా ఫలింపజేయాలి? అనే సందేహమూ, సంతాపమూ కృష్ణుడిని చలింపజేస్తున్నాయి. అది గమనించి అర్జునుడు 'తలఁకెదు కృష్ణా!' అంటున్నాడు.

క. కురుపతి బలముల యేలా, । చరాచరములైన భూతజాలము లెల్లం
దరతరమ యడ్డపడినం । దెరలిచి పడవైతు సింధుదేశాధీశున్. 310

ప్రతిపదార్థం: కురుపతి బలముల+ఏల?= దుర్యోధనుడి సేనలనే ఏల?; చర+అచర, భూతజాలములు+ఎల్లన్= జంగమ స్థావరాలైన జీవరాసులు అన్నీ; తరతరమ= పరంపరగా (వరుసపెట్టి) లేదా మిక్కిలిగా; అడ్డపడినన్= ఎదుర్కొన్నప్పటికీ; తెరలిచి= తొలగించి; సింధుదేశ+అధీశున్= సైంధవుడిని; పడవైతున్= చంపివేస్తాను.

తాత్పర్యం: ఒక్క కురుపతి సైన్యాలు ఏమిటి? సమస్త చరాచర ప్రాణికోటిమొత్తం వరుసపెట్టి ఎదుర్కొన్నా తొలగించి, సైంధవుడిని చంపిపడేస్తాను.

ఆ. గురుని యలవుఁ జలము వెరవును గలఁచి నీ । యాన, గాండివంబు నాన, దివ్య
శరము లాన, యెల్లి సైంధవు తల యెల్ల । భంగిఁ దునిమివైతుఁ బగఱు దలఁక. 311

ప్రతిపదార్థం: పగఱు= శత్రువులు; తలఁకన్= భీతి చెందగా; గురుని= ద్రోణాచార్యుడి; అలవున్= బలాన్ని; చలమున్= మాత్సర్యాన్ని; వెరవును= ఉపాయాన్ని; కలఁచి= కలత నొందించి; నీ+ఆన= నీమీద ఒట్టు; గాండీవంబు+ఆన= నా గాండీవ ధనుస్సుమీద ఒట్టు; దివ్యశరములు+ఆన= దివ్యాస్త్రాల మీద ఒట్టు; ఎల్లభంగిన్= అన్ని విధాల చేత; ఎల్లి= రేపు; సైంధవుని తలన్= సైంధవుడి శిరస్సును; తునిమివైతున్= ఖండిస్తాను.

తాత్పర్యం: పగవారు భీతిచెందేటట్లుగా ద్రోణుడి బలాన్నీ మాత్సర్యాన్నీ ఉపాయాన్నీ కలచివేసి నీమీద ఒట్టు, గాండివంపైన ఒట్టు, దివ్యాస్త్రాలపై ఒట్టు ఏ విధంగానైనా సరే రేపు ఆ సైంధవుడి తలను ఖండించివేస్తాను.

విశేషం: సైన్యాధ్యక్షుడు ద్రోణుడు శౌర్యాన్నీ, మాత్సర్యాన్నీ, చాతుర్యాన్నీ ఎంత ప్రదర్శించినా వాటి నన్నిటినీ లెక్కచేయకుండా అతడికి కలత కలిగించేటట్లు చేయటం రేపటి యుద్ధంలోని ప్రధాన కర్తవ్యం. అటుపైన మొదటగా శ్రీకృష్ణుడిమీద ఒట్టు పెట్టుకున్నాడు. తాను పూర్ణంగా నమ్ముకున్న వ్యక్తిపైన ఒట్టుపెట్టి, పిమ్మట తన కీర్తికీ, స్ఫూర్తికీ మూలమైన గాండీవంపైన, చివరకు దివ్య బాణాలపైన ఒట్టు పెట్టుకొనటం ఈ పద్యంలోని విశేషం.

చ. కనియెదు సైంధవుం గడచి క్రందుగ నాకు నెదుర్చు రాజులం
దునుమఁగ భూషణోత్కరముతోఁ బదహస్తశిరంబు లుర్విపైఁ
బెనఁగొని చారు భంగియును భీషణ రేఖయుఁ దాల్ప, నెత్తురున్
నెనడును గ్రోలి భూతములు నిక్కుచు నీల్గుచుఁ జొక్కుచుండఁగన్. 312

ప్రతిపదార్థం: సైంధవున్+కడచి= సైంధవుడిని దాటి (మీరి); క్రందుగన్= దట్టంగా; నాకున్+ఎదుర్చు రాజులన్= నన్ను ఎదిరించే రాజులను; తునుమఁగన్= చంపగా; భూషణ+ఉత్కరములతోన్= నగల మొత్తంతో; పద, హస్త, శిరంబులు= కాళ్ళూ, చేతులూ, తలలూ; ఉర్విపైన్= నేలపై; పెనఁగొని= ఒకదాని కొకటి పెనవేసికొని; చారుభంగియును= మనోహరమైన విధమూ; భీషణ రేఖయున్= భయంకరత్వమున్నూ; తాల్పన్= పొందగా; నెత్తురున్= రక్తమున్నూ; నెనడును= ఎముకలలోని (మూలుగు) గుజ్జు లేక కొవ్వున్నూ; క్రోలి= ఆస్వాదించి; భూతములు= పిశాచాలూ; నిక్కుచున్= ఉబ్బుతూ; నీల్గుచున్= నీల్గుతూ; చొక్కుచుండఁగన్= పారవశ్యాన్ని పొందుతూ ఉండగా; కనియెదు(వు)= చూడగలుగుతావు.

తాత్పర్యం: సైంధవుడిని దాటి న న్నెదిరించి వచ్చే రాజులను నేను చంపగా, వారి నగల మొత్తంతో కాళ్ళూ, చేతులూ, తలలూ పెనవేసికొని ఉండే మనోహరమూ, భయంకరమూ అయిన పద్ధతిలో నెత్తురు, ఎముకలలోని క్రొవ్వు త్రాగి నిక్కుతూ నీలుగుతూ పరవశత్వాన్ని పొందే పిశాచాల విన్యాసాలతో యుద్ధభూమిని చూడగలుగుతావు.

విశేషం: తిక్కన అక్కడక్కడా రణరంగం యొక్క బీభత్స దృశ్యాన్ని వర్ణిస్తూ కొన్ని కొన్ని సన్నివేశాలలో మనోహరత్వంలో భయంకరత్వమూ ఎట్లా మిళితమై ఉంటుందో తెలిపి ఉన్నాడు. ప్రస్తుత పద్యంలో కూడా అట్టి చారు భంగినీ, భీషణ రేఖనూ ప్రసక్తికి తెచ్చాడు. 'నిక్కుచు నీల్గుచు' వంటి రచనా విధానంలోని పస తిక్కననుండియే చేమకూరవంటి కవులు గ్రహించారని చెప్పవచ్చును.

క. **అవ్వలి సైనికు లడలఁగ । నవ్వుచు మనవార లార్వ నారాయణ! న**
న్నెవ్వరు మార్కొన లేమికి । నొవ్వం గురురాజు నేఁ దునుముదును ద్రోహిన్. **313**

ప్రతిపదార్థం: నారాయణా!= శ్రీకృష్ణా!; అవ్వలి సైనికులు= శత్రు సైనికులు (ఆవైపు సేనలు); అడలఁగన్= దుఃఖించగా; మనవారలు= మన సైనికులు; నవ్వుచున్= నవ్వుతూ; ఆర్వన్= గర్జించగా; కురురాజు= దుర్యోధనుడు; నన్నున్= నన్ను; ఎవ్వరున్= ఎవరుకానీ; మార్కొనలేమికిన్= ఎదుర్కొనలేకపోవటానికి; నొవ్వన్= బాధపడగా; నేన్= నేను; ద్రోహిన్= ద్రోహం కలవాడైన సైంధవుడిని; తునుముదును= సంహరిస్తాను.

తాత్పర్యం: శ్రీకృష్ణా! అవతలివైపు సేనలు దుఃఖించగా, మనవాళ్ళు నవ్వుతూ సింహనాదాలు చేయగా, ఆ కురురాజు నన్నెవ్వరూ ఎదిరించలేకపోవటానికి వెతచెందగా, ద్రోహి అయిన ఆ సైంధవుడిని నేను సంహరిస్తాను.

తే. **సాధనము గాండివం బటె! సమరకర్త । యర్జునుం డటె! సారథి యబ్జనాభుఁ**
డటె! మరల్పఁగ వచ్చునే యా రథంబు । హరునకైనను నెఱుఁగక యంటిగాక, **314**

ప్రతిపదార్థం: సాధనము= రణ పరికరమైన విల్లు; గాండివంబు+అటె!= గాండీవమంట!; సమరకర్త= యుద్ధం చేసేవాడు; అర్జునుండు+అటె!= అర్జునుడంట; సారథి= రథం తోలేవాడు; అబ్జనాభుఁడు+అటె!= శ్రీకృష్ణుడంట!; ఆ+రథంబున్= ఆ తేరును; హరునకున్+ఐనన్= శివుడికైనా; మరల్పఁగన్+వచ్చునే?= మళ్ళించటానికి సాధ్యమవుతుందా?; ఎఱుఁగక= తెలియక; అంటి+కాక= అంటివి.

తాత్పర్యం: యుద్ధ పరికరమా గాండీవం. యుద్ధం చేసేవాడా అర్జునుడు, అతడి రథాన్ని నడిపేవాడు సాక్షాత్తూ అబ్జనాభుడైన శ్రీకృష్ణుడు. ఆ రథాన్ని మళ్ళించటానికి శివుడికైనా సాధ్యమా! నీవు తెలియక అట్లా అన్నావు.

విశేషం: ఇందులో అర్జునుడి పరిపూర్ణ విశ్వాసం వ్యక్తమౌతూ ఉన్నది. గాండీవంపై ప్రగాఢమైన నమ్మకం. దానిని ధరించిన తనయందు పరిపూర్ణమైన ఆత్మవిశ్వాసం. తనకు తోడుగా ఉన్న శ్రీకృష్ణుడి యెడ భక్తి. ముక్కంటి కూడా ఎదిరించి వెనుదిరిగి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పోవలసిందే అని చెప్పటం ఈ పద్యంలోని విశేషం. అంతా చెప్పి చివరలో కృష్ణుడిలో 'ఎఱుఁగక యంటివిగాక' అని అనటం గట్టిగా తనలో నాటుకొన్న అచల బల విశ్వాసాన్ని వ్యక్తం చేయటమే.

క. పూనఁగ రాదే నాకె । ద్దానిం? బూనినను నీవు దలకొని తీర్చం
గా నునికి గలుగ నే నీ । చే నుండఁగ నిట్టు లేల చెప్పెదు చెపుమా! 315

ప్రతిపదార్థం: నాకున్= నాకు; ఏ+దానినిన్= దేనినైనా; పూనఁగన్+రాదే?= యత్నించరాదా?; నీవు= నీవు(కృష్ణుడు అని భావం); తలకొని= పూని; తీర్చంగాన్+ఉనికి= సరిపెట్టటానికి ఉండటం; కలుగన్= జరుగగా; ఏను= నేను; నీచేన్+ఉండఁగన్= నీ చేతిలో ఉండగా అనగా నీ అధీనంలో ఉండగా; ఇట్టులు= ఈ విధంగా; ఏల= ఎందుకు; చెప్పెదు?= చెబుతున్నావు? చెపుమా= తెలుపుము.

తాత్పర్యం: నీవు పూనుకొని అన్నీ తీర్చటానికి ఉండగా, నేను దేనికి ప్రయత్నించినా ప్రయత్నించవచ్చును గదా! నేను నీ అధీనంలో ఉండగా ఎందు కిట్లా అంటున్నావు చెప్పుము.

విశేషం: నేను దేనికీ ప్రయత్నించరాదా - అంటే దేనికైనా పూనుకొనవచ్చును గదా! ముఖ్యంగా నీవు నాకు అన్నీ సరిపెట్టటానికి సంసిద్ధంగా ఉన్నప్పుడు నేను దేనికైనా పూనుకొనవచ్చును. నేను నీ అధీనంలోనే ఉన్నప్పుడు ఎందుకిట్లా అంటున్నావో చెప్పుమని అర్జునుడు అనే మాటలలో శ్రీకృష్ణుడినే తాను అన్నిటికీ పరిపూర్ణంగా నమ్ముకొన్నానని, అంతా ఆయన చేతులలోనే ఉన్నది అని తెలుస్తూ ఉన్నది. 'నీచే నుండగా' అనే వాక్యం నేటికీ వ్యవహారంలో ఉన్నది. ఎంతో సజీవమైన, నిత్య వ్యవహార యోగ్యమైన భాషను తిక్కన ప్రయోగించా డనటానికి ఇటువంటి వెన్నో ప్రయోగాలు చూపవచ్చును. అట్లాగే 'తీర్పంగానునికి' అనే ప్రయోగం కూడా జాతీయమైన పలుకుబడితో భావపరిపుష్టి కలిగి ప్రజాబాహుళ్యం చేత నిత్యమూ వ్యవహరించబడుతూనే ఉన్నది.

క. ఈ ప్రతిన యెట్టి తెఱఁగున । నప్రతిహతవృత్తి నెగడునట్టి తెఱఁగు లో
క ప్రభువ! నీవ చేయ న । తిప్రకట పరాక్రమ ప్రదీప్తుఁడ నగుదున్. 316

ప్రతిపదార్థం: లోకప్రభువ!= లోకేశ్వరా! (కృష్ణా!); ఈ ప్రతిన= ఈ ప్రతిజ్ఞ; ఎట్టి+తెఱఁగునన్= ఏ విధంగా; అప్రతిహత+వృత్తిన్= విఘ్నం లేని ప్రవర్తనతో, అడ్డులేక మారుదెబ్బలేని ఉపాయంతో(నడవడికతో); నెగడున్= పూర్తి అవుతుందో; అట్టి తెఱఁగు= అటువంటి విధం; నీవు+అ+చేయన్= నీవే చేస్తూ ఉండగా; అతి, ప్రకట, పరాక్రమ, ప్రదీప్తుఁడన్= మిక్కిలి, ప్రసిద్ధమైన శౌర్యంచేత బాగుగా ప్రకాశించే (వెలుగొందే) వాడను; అగుదున్= అవుతాను.

తాత్పర్యం: లోకేశ్వరా! నేను చేసిన ఈ ప్రతిజ్ఞ ఏ విధంగా ప్రతిబంధకం లేని వర్తనతో పూర్తిగా నిర్వర్తించబడుతుందో అట్లా నీవే చేస్తూ ఉండగా, నేను ప్రసిద్ధంగా శౌర్యాన్ని ప్రదర్శించి ప్రకాశిస్తాను.

విశేషం: శ్రీకృష్ణుడు సాధారణ వ్యక్తి కాదు. ఆయన అన్ని లోకాలకు ప్రభువు. ఆయన ఆదేశాన్ని అనుసరించే అంతా ప్రవర్తిల్లుతూ ఉన్నది. అటువంటి మహాత్ముడు తనకు అండగా ఉండి సర్వమూ తానే నిర్వహిస్తున్నాడు. శ్రీకృష్ణుడి మాటలలో చెప్పాలంటే తాను కేవలం నిమిత్త మాత్రుడు. అంతా చేసేది ఆయనే. పైకి లోకం నేను ప్రతాపాన్ని ప్రకటించినట్లుగా భావిస్తూ ఉన్నది. నే నింతగా పరాక్రమంతో ప్రకాశించటానికి మూలమైన ఆలంబనం ఆ లోక ప్రభువు యొక్క అనుగ్రహపూర్ణమైన ఆలోకనమే. శ్రీకృష్ణుడే అంతా చేస్తూ ఉన్నాడనే భావానికి లోకప్రభువ! అనే సంబోధన సర్వవిధాలా సమర్థనీయంగా ఉన్నది.

క. మమ్ము నరయు భరమున నీ । విమ్మెయిఁ దలపోసి; తింక నిచ్చట నేలా
నెమ్మది నిద్రింపంగాఁ । బొమ్ము; ప్రభాతమున రథముఁ బూన్పఁగ వలయున్. 317

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మమ్మున్= మమ్మల్ని; అరయు,భరమునన్= రక్షించే భారంచేత; నీవు= నీవు(కృష్ణుడవు అని భావం); ఈ+మెయిన్= ఈ విధంగా; తలపోసితి(వి)= తలచావు; ఇంకన్= ఇంకా; ఇచ్చటన్= ఈ చోట; ఏలా?= ఎందుకు ఉండటం; నెమ్మదిన్= సుఖంగా, నిశ్చింతగా; నిద్రింపంగాన్= నిదురించటానికి; పొమ్ము= పోవలసింది; ప్రభాతమునన్= ఉదయానవే; రథమున్+పూన్పంగన్+వలయున్= రథాన్ని సిద్ధం చేయవలసి ఉన్నది (ఉదయాన్నే రథం ఏర్పాటు చేయవలసిన పని ఉన్నది కాబట్టి తొందరగా ఇప్పుడు నిద్రించటానికి పోవలసింది అని భావం).

తాత్పర్యం: మమ్మల్ని కాపాడే భారాన్ని వహించినందువల్ల నీవు ఈ విధంగా తలపోశావు. ఇంక ఇక్కడ ఉండటం ఎందుకు? నిశ్చింతగా నిద్రించటానికి పోవలసింది. రేపు ఉదయాన్నే తేరు సిద్ధం చేయవలసి ఉన్నది కదా!

విశేషం: 'అరయు భరము' అనే ప్రయోగం చాలా అర్థవంతమైనది. మమ్మల్ని రక్షించే బరువు బాధ్యతలున్న నీవు మా బాగోగులు తెలిసికొనాలని ఎప్పటి కప్పుడు విచారణ జరుపుతూ ఈ విధంగా తలపోశావు - అంతే కాని నీకు తెలియంది ఏమున్నది? మేము జాగరూకులమై ఉన్నామా? లేదా? అని పరిశీలించటానికి నీవు ఆ విధంగా ఏమీ తెలియనట్లుగా నటిస్తావు అని ఎంతో భావాన్ని ఆ ప్రయోగంలో కవి నిక్షిప్తం గావించాడు.

వ. అని యివ్విధంబున సల్లాపంబులు సేయుచు నరనారాయణు లత్యంత కుపితాంతఃకరణు లగుచుఁ బాములు రోఁజు పోల్కి నిట్టూర్పులు నిగిడించుచున్నం, బురందరాది బృందారకులు భయంబుగొని దీన నేమి పుట్టునో! యని చింతాక్రాంతు లైరి; వారిధులు సంక్షోభించె, సరిత్ప్రవాహంబులు ప్రతిగమన వ్యాకులంబు లయ్యెఁ, గాననశైల సహితంబుగా మహి సంచలించె, మఱియు మాతంగ తురంగ నరనికరంబుల నాశంబులు దెలుపునుత్పాతంబు లనేకంబులు దోఁచె, విశేషించి కౌరవస్కంధా వారంబున దారుణ వాయువులు విషమ గతులం జరించుటయు, నుల్కానిర్ఘాతంబులు నలుగడలం బడుటయుఁ, గరిహరి నికరంబులు బహుళంబులగు బాష్పజలంబులు విడుచుటయు మొదలుగాఁ బెక్కుదుర్నిమిత్తంబులు పుట్టినం బోటుమగ లగు భూపతులు లోనుగా నెల్లజనంబులుం బుల్లపడి యుండి' రనవుడు సంజయునకు ధృతరాష్ట్రుం డిట్లనియె. 318

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; ఈ+విధంబునన్= ఇట్లా; సల్లాపంబులు+చేయుచున్= సంభాషణలు సాగిస్తూ; నర, నారాయణులు= అర్జునుడూ, కృష్ణుడూ; అత్యంత కుపిత+అంతఃకరణులు+అగుచున్= మిక్కిలి కోపించిన మనస్సు కలవాళ్ళు అవుతూ; పాములు= సర్పాలు; రోఁజు పోల్కిన్= బుసకొట్టినట్లు; నిడు+ఊర్పులు= దీర్ఘనిశ్వాసాలు; నిగిడించుచున్నన్= వ్యాపింప జేస్తూ ఉండగా; పురందర+ఆది, బృందారకులు= దేవేంద్రుడు మొదలైన దేవతలు; భయంబుకొని= భీతిచెంది; దీనన్+ఏమి, పుట్టును +ఓ+అని= దీని వలన ఏమి కలుగుతుందో అని; చింతా+ఆక్రాంతులు+ఐరి= దిగులుతో ఆక్రమించబడినవారు అయ్యారు;వారిధులు =సముద్రాలు; సంక్షోభించెన్= కలతచెందాయి; సరిత్+ప్రవాహంబులు= నదుల వెల్లువలు; ప్రతిగమన= ఎదురుగా పయనించటంచేత; వ్యాకులంబులు+అయ్యెన్= కలత చెందినవి అయ్యాయి; మహి= భూమి; కానన, శైల, సహితంబుగాన్= అడవులు కొండలతో కూడుకొని; సంచలించెన్= మిక్కిలి కదలిపోయింది; మఱియున్= ఇంకా; మాతంగ, తురంగ, నర, నికరంబుల=ఏనుగులు, గుర్రాలు, మానవుల యొక్క మొత్తాల; నాశంబులు తెలుపు= నశించిపోవటాన్ని తెలిపే; ఉత్పాతంబులు+అనేకంబులు= అప శకునాలు పెక్కులు; తోఁచెన్= కన్పించాయి; విశేషించి= మిక్కిలి అనగా ప్రత్యేకించి; కౌరవస్కంధావారంబునన్= కౌరవులు విడిది చేసి వసించినచోట; దారుణ వాయువులు= భయంకరమైన గాలులు; విషమగతులన్= ప్రతికూలమైన (చలనములు) నడకలతో; చరించుటయున్= తిరగటమున్నూ; ఉల్కా నిర్ఘాతంబులు= ఉల్కలు, పిడుగులు; నలుగడలన్+పడుటయున్= నాలుగు వైపులా పడటమున్నూ; కరి, హరి, నికరంబులు= ఏనుగుల, గుర్రాల సమూహం; బహుళంబులు+అగు, బాష్పజలంబులు= అధికమైన కన్నీళ్ళు; విడుచుటయున్= కార్చుటయున్నూ; మొదలుగాన్+పెక్కు, దుర్నిమిత్తంబులు= మొదలైన (మున్నగు) అనేకములైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అపశకునాలు; పుట్టినన్= కలుగగా; పోటు, మగలు+అగు భూపతులు= యుద్ధవీరులైన రాజులు; లోనుగాన్= మొదలుగా; ఎల్ల+జనంబులున్= ప్రజలందరున్నూ; పుల్లపడి+ఉండిరి= స్తంభించి ఉండిపోయారు; అనవుడున్= అనిన వెంటనే; సంజయునకున్= సంజయుడికి; ధృతరాష్ట్రుండు; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని సంభాషణలు సాగిస్తూ కృష్ణార్జునులు మిక్కిలి కోపించిన హృదయాలతో బుసలుకొడుతున్న పాములవలె నిట్టూర్పులు విడుస్తుండగా ఇంద్రాది దేవతలు భయపడి, దానివలన ఎటువంటి తీవ్ర పరిణామాలు కలుగుతాయో అని విచారంలో మునిగారు. సముద్రాలు కల్లోల మయ్యాయి. నదులు అపసవ్యంగా ప్రవహించాయి, పర్వతారణ్యాలతో భూమి కంపించింది. చతురంగ బల నాశనాన్ని సూచించే అపశకునాలు తోచాయి. ప్రత్యేకంగా కౌరవుల సైన్య శిబిరాలలో పెనుగాలులు ఎడాపెడా వీచాయి, ఉల్కలూ, పిడుగులూ నాలుగువైపులా పడ్డాయి. ఏనుగులూ, గుర్రాలూ విరివిగా కన్నీరు కార్చాయి. ఇటువంటి అపశకునాలను గమనించి, వీరులైన రాజులు స్తంభించి ఉండిపోయారు. ఈ సంగతి విని ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు :

తే. **'అట్లు దమలోనఁ దగుమాట లాడి యాడి, । కోపరసవేగమునఁ గుంది కుంది, వగలఁ**
బొంది పొంది పురందరనందనుండు । నచ్యుతుండు నా రాత్రి యెట్లైరి చెపుమ!' 319

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; తమలోనన్= తమలో తాము; తగు మాటలు= యుక్తములైన సంభాషణలు; ఆడి+ఆడి= మిక్కిలిగా మాటాడి; కోపరస+వేగమునన్= కోపమనెడి రసముయొక్క అతిశయంతో; కుంది+కుంది= మిక్కిలిగా శోకించి; వగలన్= చింతలను; పొంది పొంది= అధికముగా అనుభవించి; పురందర నందనుండునున్= అర్జునుడున్నూ; అచ్యుతుండున్= శ్రీకృష్ణుడున్నూ; ఆ రాత్రి= ఆనాటి రాత్రి; ఎట్లు+ఐరి= ఏమయ్యారు; చెపుమ!= తెలుపుమా!

తాత్పర్యం: 'ఆ విధంగా తమలో తాము తగిన సంభాషణలు సాగిస్తూ, కోపాతిశయంతో మిక్కిలి శోకించి, చింతలను అధికంగా అనుభవించి ఆ అర్జునుడూ, కృష్ణుడూ ఆ రాత్రి ఏమయ్యారో చెప్పవలసింది.'

విశేషం: ఈ పద్యంలో అతిశయార్థంలో ఆడి యాడి, కుంది కుంది, పొంది పొంది అనే ప్రయోగాలను తిక్కన కూర్చాడు. ఇట్టి కూర్పు ఔత్సుక్యాన్ని కూడా తెలియజేస్తుంది. ధృతరాష్ట్రుడి ఉత్కంఠకు అనుగుణంగా ఇక్కడ ఇట్టి రచనా పద్ధతి పాటించబడింది.

శ్రీకృష్ణుండు పుత్రశోకాతురయైన సుభద్ర నూఱడించుట (సం. 7-54-11)

వ. **అని యడిగిన నా సూతసూనుం డంబికాసూనున కిట్లను: 'నమ్మురారి చిత్తం బారాధించి యర్జునుం డట మున్న యొక్కనాఁడు శిబిరంబునకు సుభద్రయుం బాంచాలియు నుత్తరయును వచ్చి యచ్చటన యునికిం జేసి యచ్చెలువల శోకానలంబు లుడుగునట్టి మాట లాడ నతనిం బ్రార్థించి పంచిన. 320**

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; అడిగినన్= అడుగగా; ఆ సూతసూనుండు= ఆ సంజయుడు; అంబికా సూనునకున్= ధృతరాష్ట్రుడికి; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు; ఆ+మురారి చిత్తంబు= ఆ శ్రీకృష్ణుడి మనస్సు; ఆరాధించి= సేవించి; అర్జునుండు= అర్జునుడు; అటమున్న= అంతకు మునుపే; ఒక్కనాఁడు= ఒక దినం; శిబిరంబునకున్= దండు విడిదిచేసి ఉన్నచోటుకు; సుభద్రయున్= సుభద్రయున్నూ; పాంచాలియున్= ద్రౌపదియున్నూ; ఉత్తరయునున్= ఉత్తరయున్నూ; వచ్చి= వచ్చి; అచ్చటన్+ఉనికిన్+చేసి= అక్కడ ఉండటం చేత; ఆ+చెలువల= ఆ స్త్రీల; శోక+అనలంబులు= దుఃఖాలనే నిప్పులు (దుఃఖాగ్నులు); ఉడుగునట్టి= చల్లారే; మాటలు+ఆడన్= మాటలు చెప్పటానికి; అతనిన్= ఆ శ్రీకృష్ణుడిని; ప్రార్థించి= వేడుకొని; పంచినన్= పంపగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని అడుగగా సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: 'ఆ శ్రీకృష్ణుడి మనస్సును ప్రసన్నం చేసికొని అర్జునుడు అంతకుముందే ఒకనాడు శిబిరానికి వచ్చి ఉన్న సుభద్ర, ద్రౌపది, ఉత్తరలను గుర్తుచేసుకొని, వారల మనస్సులలోని శోకాగ్నిని చల్లార్చుమని అతడిని వేడుకొని వారి వద్దకు పంపాడు.

తే. అమ్ముకుందుండు గ్రొత్తయై యడలు దనదు । డెంద మలఁపంగఁ జెలియలి మందిరమున
కరిగి పురపురఁ బొక్కెడు నా సుభద్రఁ । గాంచి యిట్లను నెంతయు గారవమున. 321

ప్రతిపదార్థం: ఆ+ముకుందుండు= ఆ శ్రీకృష్ణుడు (మోక్షాన్ని ఇచ్చేవాడు అని వ్యుత్పత్తి); క్రొత్త ఐ= వింత అయి; అడలు= దుఃఖించు; తనదు+డెందంబున్= తన హృదయం; అలఁపంగన్= అలతను కలిగించగా; చెలియలి మందిరంబునకున్= చెల్లెలు సుభద్ర ఇంటికి; అరిగి= పోయి; పురపురన్+పొక్కెడు= పురపురమని దుఃఖించే; ఆ సుభద్రన్= ఆ సుభద్రను; కాంచి= చూచి; ఎంతయున్= మిక్కిలి; గారవమునన్= ప్రీతితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు:

తాత్పర్యం: ఆ శ్రీకృష్ణుడు తనలో ఎన్నడూ కలుగని క్రొత్త రకమైన దుఃఖం మనస్సుకు అలత కలిగించగా, చెల్లెలు సుభద్ర మందిరానికి పోయి, పురపురమని వాపోయే ఆమెను చూచి ఎంతో ఆదరంగా ప్రీతితో ఇట్లా అన్నాడు:

విశేషం: అందరి దుఃఖాన్ని పోగొట్టి మోక్షాన్ని ప్రసాదించే ఆ శ్రీకృష్ణుడిలో కూడా ఏదో ఇంతకు మునుపు ఎన్నడూ లేని దుఃఖం ఎంతో క్రొత్తగా మనస్సును అలముకొన్నట్లు చెప్పటం ఇందలి విశేషం. గారాబు చెల్లెలు సుభద్రను ఎట్లా ఊరడించటమా అని ఒకవైపు, అల్లారు ముద్దుగా తమ చేతులలో పెరిగిన మేనల్లుడు అభిమన్యుడు పూర్తిగా ముద్దూ మురిపెమూ తీరకముందే పరలోకగతుడయ్యాడే అన్న ఆవేదన మరొకవైపు, కలచివేయగా ఏదో ఒక క్రొత్తరకమైన దుఃఖానికి గురైనట్లుగా తెలపటం ఎంతో వింతగా ఉన్నది. ఆ వింతనే తిక్కన 'క్రొత్తయై' అని ప్రయోగించాడు.

క. 'రాచూలికి నుచితం బగు । నాచారముగాదె రణమునం దరులఁ దెగం
జూచుచుఁ దిరుగని నడపున । నేచి యమరలోకమునకు నేఁగుట తరుణీ! 322

ప్రతిపదార్థం: తరుణీ!= స్త్రీ! (సుభద్రా! అని సంబోధన); రాచూలికిన్= రాజపుత్రుడికి; రణమునందున్= యుద్ధంలో; అరులన్+తెగన్+చూచుచున్= శత్రువులను చంపుతూ; తిరుగని నడపునన్= రణం నుండి మరలని విధంగా; ఏచి= విజృంభించి; అమరలోకమునకున్+ఏఁగుట= (వీర) స్వర్గానికి పోవటం; ఉచితంబు+అగు= తగినటువంటిదగు లేదా యుక్తమైనదగు ఆచారం; కాదె!= నడవడియే కదా!

తాత్పర్యం: 'సుభద్రా! యుద్ధంలో శత్రువులను చంపుతూ, వెనుతిరుగకుండా విజృంభించి పోరి స్వర్గలోకానికి పోవటం రాచపుట్టుక పుట్టినవానికి తగిన ఆచారమేకదా!

విశేషం: యుద్ధంలో వెనుదిరిగి రాకుండా పోరాడటం వీరధర్మం. అటువంటి వీరుడు రణరంగంలో మరణిస్తే వీరస్వర్గం. రాజకుమారులకు యుద్ధంలో శత్రువులను తెగనరకటం యోగ్యమైన నడవడి. ఏ విధంగా చూచినా అభిమన్యుడు దుఃఖించదగినవాడు కాడని శ్రీకృష్ణుడి అభిప్రాయం.

క. నీ కొడుకు తుచ్ఛమగు నీ । లోకంబు దొరంగి పుణ్యలోకమ్మునకుం
బోకకు ని ట్లధికం బగు । శోకముఁ బొందంగ నగునె సుదతీ! నీకున్? 323

ప్రతిపదార్థం: సుదతీ!= స్త్రీ (సుభద్రా అని సంబోధన) (మంచి దంతములు కలది అని వ్యుత్పత్తి); నీ కొడుకు= అభిమన్యుడు; తుచ్ఛము+అగు= నీచమైన; లోకంబు+తొరంగి= ఈ ప్రపంచాన్ని విడిచి; పుణ్యలోకమ్మునకున్+పోకకున్= స్వర్గలోకానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పోయినందుకు; నీకున్= నీకు; ఇట్లు= ఈ విధంగా; అధికంబు+అగు+శోకంబున్= మిక్కిలి దుఃఖాన్ని; పొందంగన్+అగునె?= పొందటం తగునా?

తాత్పర్యం: సుభద్రా! నీ కొడుకు అభిమన్యుడు ఈ నీచమైన ప్రపంచాన్ని విడిచి స్వర్గలోకాన్ని చేరాడు. అటువంటి పుణ్యపురుషుడి గురించి నీవు మిక్కిలి దుఃఖించటం తగునా?

విశేషం: కుమారుడి (అభిమన్యుడి) మరణానికి ఏ విధంగా ఆలోచించినా దుఃఖపడవలసిన పనే లేదు అంటున్నాడు. ఈ తుచ్ఛమైన లోకాన్ని వదలిపెట్టినందుకు, పైగా పుణ్యలోకప్రాప్తి కలిగినందుకు రెండు విధాలా సంతోషించవలసిన విషయమే కానీ అధికంగా శోకాన్ని పొందటం తగదని సహేతుకంగా శ్రీకృష్ణుడు సుభద్రను ఊరడించాడు.

ఆ. బ్రహ్మచర్యమునఁ దపంబున నుత్తమ। దానములను బడయఁ దలఁచునట్టి
గతులకంటె సౌఖ్యకారిణి యగు గతిఁ। బొందె నీసుతుండు గుంద నేల? 324

ప్రతిపదార్థం: నీ సుతుండు= నీ కొడుకు; బ్రహ్మచర్యమునన్= బ్రహ్మచర్యవ్రతం చేత; తపంబునన్= తపస్సుచేత; ఉత్తమదానములన్= శ్రేష్ఠములైన దానాలచేత; పడయన్+తలఁచు+అట్టి= పొందదలచే; గతులకంటెన్= సద్గతులకంటె; సౌఖ్యకారిణి+అగు+గతిన్= సుఖాన్ని కలిగించే ఉత్తమగతిని; పొందెన్= పొందాడు.

తాత్పర్యం: నీ కొడుకు బ్రహ్మచర్యవ్రతం చేతా, తపస్సుచేతా, శ్రేష్ఠములైన దానాల చేతా పొందాలి అనుకొనే సద్గతులకంటె ఎక్కువ సౌఖ్యాన్ని కలిగించే ఉత్తమోత్తమ గతిని పొందాడు.

ఉ. క్షత్రియకాంత పుత్రకుని గాంచుట వాఁ డతిలోకవీరుఁడై
ధాత్రిఁ బ్రసిద్ధి కెక్కుటకుఁ దా నది గాకయు వీరపత్ని నా
నీ త్రయి నెందునుం బ్రణుతి కెక్కిన నీవు తనూజుబీరమున్
శత్రువధోత్సవంబు విని సంతస మందక కుందఁ బాడియే! 325

ప్రతిపదార్థం: క్షత్రియకాంత= క్షత్రియవంశంలో పుట్టిన ఇంతి; పుత్రకునిన్+కాంచుట= కుమారుడిని కనటం; వాఁడు= ఆ కుమారుడు; అతిలోక వీరుఁడు+ఐ= లోకాతిశయుడైన శూరుడై; ధాత్రిన్= (భువి) పుడమిలో; ప్రసిద్ధికిన్+ఎక్కుటకున్= ప్రఖ్యాతిని పొందటానికి; అది కాకయున్= అంతే గాకుండా; తాన్= తాను; వీరపత్నినాన్= వీరుడి ఇల్లాలు అనగా; ఈత్రయిన్= ఈ మూడింటి చేతన్నూ (అనగా పుత్రుడిని కనటం, వాడు లోకాతిశయంగా వీరుడై ప్రసిద్ధిని కాంచటం, తాను వీరపత్ని కావటం అనే ఈ మూడింటి వలన); ఎందునున్= ఎప్పుడున్నూ; ప్రణుతికిన్+ఎక్కిన నీవు= పొగడ్త కాంచిన నీవు; తనూజుబీరమున్= కొడుకు శౌర్యాన్ని; శత్రు+వధ+ఉత్సవంబు= పగవాళ్ళను చంపిన ఆహ్లాదమున్నూ; విని; సంతసము+అందక= సంతోషపడకుండా; కుందన్+పాడియే?= దుఃఖించటం ధర్మమా?

తాత్పర్యం: క్షత్రియ వంశంలో పుట్టిన ఓ సుభద్రా! నీవు పుత్రుడిని కన్నావు. ఆ కన్న కుమారుడు లోకాతిశయ శౌర్యంతో ఎంతో ప్రసిద్ధి కెక్కాడు. అంతే కాకుండా నీవు వీరపత్నివి. ఈ విధంగా నీవు పైచెప్పిన మూడింటి చేత ఎల్లప్పుడూ పొగడ్త కెక్కావు. కుమారుడి శౌర్యాన్ని, శత్రువులను సంహరించిన సమరోత్సాహాన్ని గురించి విన్నావు. సంతోషించకుండా దుఃఖించటం ధర్మమా?

విశేషం: పుత్రుడిని కనటం కాదు ముఖ్యం. వాడు మహావీరుడై ప్రసిద్ధికెక్కాలి. పదిమందీ వాడిని కీర్తించాలి. వాడున్నూ తనధర్మాన్ని అందరూ ప్రశంసించేటట్లు నిర్వహించాలి. అట్లా నిర్వహించినప్పుడే ఆతడి తల్లిదండ్రులు సంతోషిస్తారు. అప్పుడే వాడు పుత్రుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నందనుడూ అనే మాటలకు సార్థక్యం కలిగించిన వాడౌతాడు. అట్టి బిడ్డను కన్నతల్లి వీరమాతగా కూడా ప్రసిద్ధికెక్కుతుంది. వీరపత్నియే కాకుండా వీరమాతగా కూడా పేరుకెక్కినప్పుడు చింతించవలసిన పనేలేదు - అని క్షత్రియ వంశంలో పుట్టి స్త్రీ తన జాత్యుచిత ధర్మాన్ని గౌరవిస్తూ ఎట్లా కీర్తికెక్కాలో సూచింపబడింది.

వ. అట్లుం గాక. 326

తాత్పర్యం: ఆ విధంగా కాకుండా.

క. కాలం బైనం బోవక । యీలోకమునందు నిలువ నెవ్వరి వశ? మి
ట్లేల యవివేకజనముల । పోలిక శోకానలమునఁ బొగులుచు నుండన్. 327

ప్రతిపదార్థం: కాలంబు+ఐనన్= కాలం ముగియగా, అంటే కాలం తీరిపోగానే; పోవక= మరణించకుండా; ఈ లోకమునందున్+నిల్వన్= ఈ మర్త్య (మానవ) లోకంలోనే నిలిచి ఉండటానికి (బ్రతికి ఉండటానికి); ఎవ్వరి వశము?= ఎవరికి శక్యం?; అవివేక జనంబుల+పోలికన్= తెలివి తక్కువ జనుల మాదిరి; శోక+అనలమునన్= దుఃఖాగ్నిచేత; పొగులుచున్= కుమిలిపోతూ; ఇట్లు= ఇట్లా; ఉండన్+ఏల?= ఉండటం ఎందుకు?

తాత్పర్యం: కాలం (ముగియ) తీరగానే మరణించకుండా ఈ మర్త్యలోకంలోనే శాశ్వతంగా నిలిచి ఉండటానికి ఎవరికీ వీలు (శక్యం)కాదు. తెలివి లేని వాళ్ళవలె దుఃఖాగ్ని చేత కుమిలిపోతూ ఇట్లా ఉండటం ఎందుకు?

విశేషం: 'కాలంబైనన్' అనే ప్రయోగానికి కాలం సంప్రాప్తిస్తే అనే అర్థం కూడా పొసగుతుంది. 'సంప్రాప్తే సన్నిహితే కాలే' అనే శంకరుల వాక్యం లోని భావమే పై ప్రయోగంలో స్పష్టం. 'ఐనన్' అనే క్రియాపదానికి 'జరిగితే, పరిణమిస్తే, ప్రాప్తిస్తే, సిద్ధిస్తే' అనే అర్థాలున్నాయి. కాబట్టి కాలం సమీపిస్తే లేదా కాలం ముగిస్తే అని రెండు రకాలుగా అర్థం సరిపోతుంది. 'అవివేక జనములు' అంటే తెలివిలేనివాళ్ళు, మూఢులు అని భావం. మంచి చెడ్డలను బాగా ఆలోచించి ఆత్మవిమర్శ చేసికొని ప్రశాంత జీవనాన్ని సాగించేవాడు వివేకి. దీనికి పూర్తిగా విపర్యయం విమోహి అనగా అవివేకి. వివేకి శాశ్వత సత్యాన్ని తెలిసికొని భ్రమప్రమాదాలు లేకుండా ప్రశాంతచిత్తుడై పరమానందాన్ని పొందగా, అవివేకి అజ్ఞానంతో ఐహికమే నిత్యమని భ్రమించి, వ్యామోహం చేత శోకనిమగ్నుడౌతాడు అని ఎంతో సందర్భానుసారంగా తిక్కన ఈ పదాన్ని ప్రయోగించాడు.

క. తగుమాట లాడి కోడలి । వగ పుడుపుము; నీవు ధైర్యవతి; వి ట్లడలం
దగునె? నినుఁ జూచి కాదే । మగుడుం జిత్తముల వగలు మా కందఱకున్. 328

ప్రతిపదార్థం: తగు+మాటలు+ఆడి= తగిన (యోగ్యమైన, సమయ సముచితమైన); ఊరడింపు పలుకులు పలికి; కోడలి వగపున్= ఉత్తర దుఃఖాన్ని; ఉడుపుము= పోగొట్టుము; నీవు= నీవు; ధైర్యవతివి= ధీరురాలవు; ఇట్లు+అడలన్+తగునె!= ఇట్లా, దుఃఖించటం తగునా!; నినున్+చూచి+కాదే= నిన్ను చూచియే కదా!; మాకున్+అందఱకున్= మా అందరికీ; చిత్తములన్= మనస్సులలో; వగలు= శోకాలు; మగుడున్= తొలగిపోతాయి.

తాత్పర్యం: సమయానికి అనుగుణంగా ఊరడింపు మాటలు చెప్పి, నీ కోడలు ఉత్తర దుఃఖాన్ని పోగొట్టుము. నీవు ధైర్యవతివై ఉండి ఇట్లా దుఃఖించటం తగునా? నీవు సంతోషంతో ఉండటం చూస్తేనే కదా మా అందరి మనస్సులలో దుఃఖం తొలగిపోతుంది.

విశేషం: 'తగు మాటలాడి' వంటి తిక్కన ప్రయోగాలను ఆయన తర్వాత వాగ్గేయకారులైన త్యాగరాజు వంటి ప్రముఖులు తమ కీర్తనలలో గ్రహించారు. సుఖంలో పొంగిపోకుండా దుఃఖంలో క్రుంగిపోకుండా స్థిరంగా ఉండగలిగే నిశ్చలత్వాన్నే ధైర్యం అంటారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అటువంటి ధైర్యం కలది అని సుభద్రను శ్రీకృష్ణుడు పేర్కొన్నాడు. అంత ధైర్యవతి అయి ఉండి కూడా ఆమె పుత్రమరణానికి తట్టుకోలేక బిట్టు వాపోయింది. అందుకు కృష్ణుడు నీవే ఇట్లా అయితే నిన్ను చూచి మేమందరం కూడా మరల భోరుమని విలపించవలసి వస్తుంది. కాబట్టి ధైర్యంగా ఉండి, అందరికీ ధైర్యం కలిగించాలని కోరాడు.

ఉ. **నీమగఁ డెల్లి సైంధవు ననిం దెగటార్చి శిరంబు దెచ్చినం**
గోమలి! నీదు పాదములకుం దగు పీఠము సేయు; మాతఁ డు
ద్దామ భుజాబలాఢ్యుఁ డది దప్పదు; వాని ప్రతిజ్ఞ దప్పినన్
భూమి వడంకదే! తరణి పొల్పు దలంకదె! వార్ధి యింకదే! **329**

ప్రతిపదార్థం: కోమలి!= ఓ సుభద్రా!; నీ మగఁడు= నీ భర్తఅయిన అర్జునుడు; ఎల్లి= రేపు; అనిన్= యుద్ధంలో; సైంధవున్= జయద్రథుడిని; అనిన్= యుద్ధంలో; తెగటార్చి= చంపి; శిరంబున్+తెచ్చినన్= తలను తీసికొనిరాగా (తేగా); నీదు పాదములకున్= నీ కాళ్ళకు; తగు పీఠము= తగిన పీట; చేయుము= కావించుము; ఆతఁడు= అర్జునుడు; ఉద్దామ, భుజా, బల+ఆఢ్యుఁడు= అధికమైన భుజముల యొక్క బలంచేత శ్రేష్ఠుడు; అది తప్పదు= ఆతడి ప్రయత్నం చెడదు; వాని ప్రతిజ్ఞ, తప్పినన్= అతడి ప్రతిజ్ఞ తప్పితే; భూమి వడంకదే!= భూకంపం కలుగదా!; తరణి పొల్పు= సూర్యుడి చందం; తలంకదె!= తొలగిపోదా; వార్ధి= సముద్రం; ఇంకదే!= ఎండిపోదా!

తాత్పర్యం: సుభద్రా! నీ భర్త రేపు యుద్ధంలో సైంధవుడిని చంపి, తలను తేగా నీ పాదాలకు తగిన పీఠంగా చేసికొనుము. ఆ అర్జునుడు అధికభుజబల శ్రేష్ఠుడు, అతడి ప్రయత్నం విఫలం కాదు. అతడి ప్రతిజ్ఞ విఫలమే అయితే భూమి కంపిస్తుంది. సూర్యుడు కాంతి తరిగిపోతాడు. సముద్రం ఒక్క నీటిచుక్క కూడా లేకుండా ఎండి పోతుంది.

విశేషం: ఈ పద్యంలో విఫలం కాని అర్జునుడి కఠోర ప్రతిజ్ఞ శ్రీకృష్ణుడి మాటలలో తెలుపబడింది. తెగిన సైంధవుడి తల సుభద్ర పాదాలమీద వచ్చి వాలుతుంది అంటున్నాడు. అర్జునుడు బాహుబలాఢ్యుడయితే ఆమె కోమలి. పైకి కోమలియే కాని ఎంతో ధైర్యవతి. ఆమె లక్షణాలే చాలా వరకు అభిమన్యుడిలో పరిపూర్ణంగా ప్రతిఫలించాయి. ప్రతిజ్ఞా ప్రయత్నాన్ని 'అది తప్పదు' అని చెప్పటం ఎంతో గంభీరంగా ఉన్నది. అట్లా చెప్పటంలోనే శిల్పకళా పారమ్యం యొక్క పొల్పు ఉన్నది.

క. **నా పలుకు నమ్ము; మర్జునుఁ । డా పాపాత్మకుని నెల్లి యనిఁ జంపి ముదం**
బాపాదించుం; గులమున । కీపెంపున కెలమి వొందుఁ డీవును నతఁడున్. **330**

ప్రతిపదార్థం: నా, పలుకు, నమ్ముము= నా మాట నమ్ముము; అర్జునుఁడు= నీ పెనిమిటి అర్జునుడు; ఆ పాపాత్మకునిన్= పాపచిత్తుడైన ఆ సైంధవుడిని; ఎల్లి= రేపు; అనిన్= యుద్ధంలో; చంపి= సంహరించి; కులమునకున్= రాజవంశానికి; ముదమున్+ఆపాదించున్= సంతోషాన్ని కలిగిస్తాడు; ఈ పెంపునకున్= ఈ గౌరవానికి; ఈవునున్= నీవున్నూ; అతఁడున్= అతడున్నూ (అర్జునుడున్నూ); ఎలమిన్+పొందుఁడు= సంతోషాన్ని పొందండి.

తాత్పర్యం: నా మాటలు నమ్ముము. అర్జునుడు ఆ పాపాత్ముడైన సైంధవుడిని రేపే చంపి సంతోషాన్ని కలిగిస్తాడు. ఈ రాజవంశం గౌరవానికి నీవూ, నీ భర్తా కారకులై పరమానందాన్ని పొందండి.'

విశేషం: పాపాత్ములను నిర్మూలించటం వలన ప్రతిజ్ఞ నిర్వహించబడటమే కాదు. అది ఆ వంశంయొక్క కీర్తిప్రతిష్ఠలను, గౌరవ మర్యాదలను కాపాడి అందరకూ ఆనందాన్ని కలిగిస్తుంది. అది వ్యక్తిగత ద్వేషంగా పైకి కనిపించినా, సంఘ శ్రేయస్సే దాని పరమలక్ష్యం. కృష్ణుడు చివరలో సైంధవుడిని చంపి, కులగౌరవాన్ని పెంచి, నీవూ, మీ శ్రీవారూ సంతోషాన్ని పొందండి అని తెలిపాడు.

వ. **అని యనేక ప్రకారంబులం బలికె; నప్పు డగ్గోవిందుం గనుంగొనుట నుత్కటం బయిన శోకంబున సుభద్ర యాకులతం బొంది.** **331**

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; అనేక ప్రకారంబులన్= ఎన్నో రీతులతో; పలికెన్= ఓదార్పు మాటలు చెప్పాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+గోవిందున్+కనుంగొనుటన్= ఆ కృష్ణుడిని చూడటం చేత; ఉత్కటంబు+అయిన, శోకంబునన్= మిక్కుటమైన దుఃఖంతో; సుభద్ర= సుభద్ర; వ్యాకులతన్+పొంది= మిక్కిలి కలత చెంది.

తాత్పర్యం: అంటూ ఎన్నో విధాలుగా ఓదార్పు మాటలు పలికాడు. శ్రీకృష్ణుడిని చూడటం చేత పొంగిన శోకంతో సుభద్ర కలతచెంది. (ఇట్లా అన్నది.)

ఉ.. 'అక్కట! పుత్త్ర! నిన్నుఁ గని నంతియ పుణ్యము కాని నాకు నీ
వెక్కుడు భక్తి సేసి నను నెప్పుడు నారయ నీకుమారకు
ల్మక్కువ నాకడం దిరుగ లాలన సేయుచునుండునట్టి యా
మిక్కిలి నోము లేద? యిట మీఁదికి నెవ్వరు దిక్కు సెప్పుమా! 332

ప్రతిపదార్థం: అక్కట! పుత్ర!= అయ్యో కుమారా!; నిన్నున్= నిన్ను; కనినంతియ పుణ్యము+అ+కాని= కడుపారా కన్న సుకృత విశేషమే కాని; ఈవు= నీవు; నాకున్= నాకు; ఎక్కుడు, భక్తి, చేసి= మిక్కిలి భక్తి కలిగి; ననున్= నన్ను; ఎప్పుడున్= సదా; ఆరయన్= విచారించగా; నీ కుమారకుల్= నీ కొడుకులు; మక్కువన్= కూర్మితో; నాకడన్+తిరుగన్= నా దగ్గర తిరుగుతూ ఉండగా; లాలన+చేయుచున్= బుజ్జగిస్తూ; ఉండునట్టి= ఉండగలిగే; ఆ మిక్కిలి, నోము, లేదు+అ?= ఆ గొప్ప నోము నోచుకోలేదా?; ఇటమీఁదికిన్= ఇకపైన; దిక్కు+ఎవ్వరు?= గతి ఎవ్వరు లేరా? శరణం ఎవ్వరు?; చెప్పుమా!= చెప్పుము.

తాత్పర్యం: అయ్యో! పుత్రా! నిన్ను కడుపారా కన్న పుణ్యమే కాని, నీవు నాకు ఎక్కువ భక్తి కలిగి నన్నెప్పుడూ ఆదరిస్తుండగా, నీ కొడుకులు నా దగ్గర ఇష్టంతో తిరుగుతూ ఉండగా, బుజ్జగించగలిగే ఆ నోము నేను నోచుకొనలేదా? ఇకపైన నా గతి ఏమిటి? నీవే చెప్పుము.

విశేషం: ఇందులో సుభద్ర ఆవేదన అభివ్యక్తం. 'అక్కట పుత్త్ర' అని సంతాపార్థకంతో ఉత్పలమాలావృత్తం ఆరంభమైనది. పుత్రుడు పుట్టటం గొప్ప పుణ్యమే. కాని, ఆ పుత్రుడి భక్తి ప్రపత్తుల వలన తల్లికి కలిగే ఆనందం ఎటువంటిదో ఈ పద్యంలో సూచించబడింది. 'పుత్రపౌత్రాభివృద్ధిరస్తు' అని పెద్దలు ఆశీర్వదిస్తూ ఉంటారు. కాని, అభిమన్యుడి కుమారులు తన చెంతకు వచ్చినప్పుడు వారిని లాలనతో పాలన చేసే భాగ్యం నాకు కరవైనదని సుభద్ర వాపోయింది. చివరగా 'ఇటుపైన తన కెవ్వరు దిక్కు' అని కుమారుడి మృతికి కుమారిల్లింది. దేనికైనా చేసికొని పుట్టాలి అంటారు పెద్దలు. అప్పుడు దిక్కులేని ఆ శోచనీయస్థితి చెప్పరానిది. తనకు భవిష్యత్తులో పౌత్రులతో ఆడిపాడి బ్రతికే అదృష్టం లేకపోయింది - అనే ఆవేదన ఎంతో చక్కగా ఈ పద్యంలో ఆవిష్కరించబడింది.

ఉ. బాలుఁడ వైన నీ వరిది బంటుతనంబునఁ బ్రౌఢవీర భూ
పాలురఁ గుంభజ ప్రభృతి బాహుబలాఢ్యులఁ గిట్టి నేలకుం
గోలకుఁ దెచ్చి యి ట్లగుటకున్ వెఱఁగందుచు వంతఁ బొందుచున్
లోలతఁ జూడ కున్నె జనలోకము నీదగు రూపురేఖయున్. 333

ప్రతిపదార్థం: బాలుఁడవు+ఐన, నీవు= చిన్నవాడవయినట్టి నీవు; అరిది+బంటుతనంబునన్= అరుదైన శౌర్యంతో; ప్రౌఢ, వీర, భూపాలురన్= నేర్పుగల శూరులైన రాజులను; కుంభజ, ప్రభృతి, బాహు, బల+ఆఢ్యులన్= ద్రోణుడు మున్నగు భుజశక్తిగల శ్రేష్ఠులను; కిట్టి= సమీపించి; నేలకున్+కోలకున్+తెచ్చి= భంగపరిచి; ఇట్లు= ఈ విధంగా; అగుటకున్= (వీరశయనం అలంకరించటానికి) కావటానికి; వెఱఁగందుచున్= ఆశ్చర్యపడుతూ; వంతన్+పొందుచున్= దుఃఖిస్తూ; నీది+అగు, రూపు రేఖయున్= నీదైన సౌందర్యం యొక్క అతిశయాన్ని; జనలోకము= జనసమూహం; లోలతన్= లోలత్వంతో; చూడకున్నె?= చూడకుండా ఉంటుందా?

తాత్పర్యం: చిన్నపిల్లవాడవైన నీవు ఆశ్చర్యకరమైన శౌర్యంతో భుజబలశ్రేష్ఠులైన ద్రోణాదులను సమీపించి బాణపరంపరలతో వాళ్ళను నేలపడవైచి, వీరశయనం అలంకరించినందుకు ఆశ్చర్యపడుతూ, దుఃఖపడుతూ, నీ సౌందర్యాతిశయాన్ని జనసమూహం ఆసక్తితో చూడకుండా ఉంటుందా?

విశేషం: అభిమన్యుడి పరాక్రమాతిశయాన్ని గుర్తు తెచ్చుకొన్న సుభద్ర, బాలుడయినప్పటికీ అతడు చూపిన ఆశ్చర్యకరమైన ప్రతాపం ద్రోణాది మహావీరులకే చెనకరానిది అయినది. కాని, చివరకు విధి వ్యథనే మిగిల్చిందని సుభద్ర పరితాపం. 'బాలుడవైన నీవని' ఉత్పలమాలావృత్తంలో అభిమన్యుడి సౌకుమార్యాన్ని స్ఫురణకు తెచ్చే రీతిలో సుభద్ర పలికిన మాటలను తిక్కన ఎంతో చక్కగా పొందుపరచాడు. ఇందులో 'నేలకుం గోలకుఁ దెచ్చి' అనే ప్రయోగం గమనార్హం.

తే. **మేను మృదుశయ్య సగము నా మేనిమీఁద । సగముగాఁ జేర్చుకొని ముద్దు మిగుల నిద్ర**
సేయునట్టి నీ విప్పుడు చెనఁటి నేలఁ । దనువు వొందుట కోర్చితే తండ్రి! చెపుమ! 334

ప్రతిపదార్థం: తండ్రి!= నాయనా అభిమన్యూ (ఆదరార్థకం); మేను= శరీరం; మృదుశయ్యన్= మెత్తని పడకపై; సగమున్= అర్ధాన్ని (సగం భాగాన్ని); నా మేనిమీఁదన్= నా శరీరంపైన; సగముగాన్+చేర్చుకొని= అర్ధభాగంగా చేర్చుకొని; ముద్దుమిగులన్= ముచ్చట మీరగా; నిద్ర+చేయు అట్టి= నిదురించే; నీవు; ఇప్పుడు= ఈ సమయంలో; చెనఁటినేలన్= కరకు నేలమీద; తనువు+పొందుటకున్= శరీరాన్ని పడవేయటం కొరకు; ఓర్చితి+ఏ= సహించినావా; చెపుమ!= చెప్పుము.

తాత్పర్యం: నాయనా! అభిమన్యూ! నీవు నీ శరీరం సగం మెత్తని పడకమీద, తక్కిన సగం నా శరీరం మీద చేర్చి ఎంతో ముచ్చటగా నిద్రపోయే వాడవు. ఇప్పుడు ఇచ్చట ఈ కటిక నేలమీద ఇట్లా శరీరాన్ని చేర్చటానికి ఏ విధంగా ఓర్చుకొన్నావు? చెప్పుము.

విశేషం: రణరంగంలో చనిపోయి, కటికి నేలమీద పడి ఉండే కుమారుడిని తలచి, చిన్నతనంలో తన ఒడిలో ఒడలు చేర్చి ఎంతో ముద్దుగా పవ్వళించి ఉండే దృశ్యాన్ని తలచుకొనింది సుభద్ర. మెత్తటి పడకమీద సగం, తన మేనిమీద సగం శరీరం చేర్చి ముద్దుగా నిద్రపోయే చిన్ననాటి సన్నివేశం గుర్తుకు వచ్చింది. వాత్సల్యానికి ఇది ఒక మచ్చు తునక. మృదుశయ్యకు చెనటి నేలకు పోలిక, చెనఁటి నేల అవటం విశేషం. అది కఠినమైన, శూన్యమైన, వ్యర్థమైన, దైవబలాన్ని కోల్పోయిన నేల. ఇట్లే చావుకూ నిద్రకూ పోలిక. నిద్ర ఒకవిధంగా చావుతో సమానమే. అందుకే చావుకు పెద్ద నిద్దురకు పర్యాయం అయింది. నిద్రలో ముఖకళ తరుగదు. అట్లే చెన్ను తరగని రీతిలో నిద్రించే వాడి మాదిరి అభిమన్యుడు పవళించి ఉన్నాడని ఇందులోని విశేషం.

క. **వంది జనంబులు మాగధ । బృందంబులు సంస్తుతింపఁ బెంపొందుదు మ్రో**
లం దిరిగెడు క్రవ్యాదుల । క్రందున నీవీను లిపుడు కటకటఁ బడవే? 335

ప్రతిపదార్థం: వంది జనంబులున్= స్తుతించి జీవించే బట్టుల మొత్తాలున్నూ; మాగధ బృందంబులున్= వంశవీర్యాదులను పొగడే మాగధుల మొత్తాలున్నూ; సంస్తుతింపన్= మిక్కిలి పొగడగా; పెంపొందుదు(వు)= అతిశయించే వాడవు (వర్ధిల్లేవాడవు); ఇపుడు= ఈ సమయంలో; మ్రోలన్+తిరిగెడు= ఎదుట సంచరించే; క్రవ్యాదుల= మాంసం తినే ప్రాణుల; క్రందునన్= మ్రోతచేత; నీ వీనులు= నీ చెవులు; కటకటన్+పడవే?= కష్టపడవా?

తాత్పర్యం: మేలు కొలుపులతో, స్తుతిపాఠాలతో, మాగధుల సమూహాలు నిన్ను స్తుతిస్తూ ఉండగా అప్పుడు ఎంతో వర్ధిల్లేవాడవు. ఇప్పుడు నీ ఎదుట తిరుగుతూ మాంసం తినే ప్రాణులు చేసే కటువైన చప్పుడుకు నీ చెవులు ఎంత కష్టపడ్డాయో!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: రాజవంశ్యులకు స్తుతిపాఠాలు పాడించుకొనటం సర్వసాధారణం. అది వారి పరంపరల్లో గౌరవ మర్యాదలతో కూడుకొన్న సంప్రదాయం. ఆచారంగా ఏర్పడి పోయిన స్తుతిపాఠాలలో ప్రత్యేకించి పొగడ్తలు ఉండకపోవచ్చును. అవి వాళ్ళకు మామూలు దినచర్య. అయినా ఆ వందిమాగధుల స్తుతులు వినటానికి ఎంతో ఇంపుగా ఉంటాయి. మనస్సుకు కొంతైనా ఇష్టాన్ని కలిగిస్తాయి కాని, శ్మశానంలో మాంసం తినటానికి వచ్చిన ప్రాణుల అరపులు ఎంత కర్ణకఠోరంగా ఉంటూ మనస్సుకు కష్టాన్ని కలిగిస్తాయో. ఈ రెండింటికీ ఉండే తారతమ్యాన్ని తిక్కన ఎంతో చక్కగా కందంలో వివరించారు. క్రవ్యం అంటే మాసం. దాన్ని తినేవాడు క్రవ్యాదుడు. క్రందు అనే శబ్దానికి దారుణమైన ధ్వని, ఏడ్పు, సందడి, అతిశయం అనే అర్థాలూ ఉన్నాయి. కటకటపడటం అంటే కోపించటం బాధపడటం కలత చెందటం. అర్థవత్పద ప్రయోగ నైపుణ్యం తిక్కన ఎరిగినంతగా మరెవ్వరికీ తెలియదనటం అతిశయోక్తి కాదు.

చ. **అనిలతనూజు లావు గలఁ డందురు, సాత్యకి శౌర్యశాలి నాఁ**
జను, ద్రుపదుండు సంగరవిశారద భావము పూనియుండు, మా
త్స్యుని బటు విక్రమాఢ్యుఁ డని చూతురు, పాండవు లింద ఱుండి యొ
క్కనికిఁ గడంగ లేర నినుఁ గావఁగ; నేమన నేర్తుఁ బుత్త్రకా! 336

ప్రతిపదార్థం: పుత్త్రకా!= కుమారా!; అనిలతనూజున్= భీమసేనుడిని; లావు+కలఁడు+అందురు= బలం కలవాడు అని అంటారు; సాత్యకి= సత్యకతనూజుడు; శౌర్యశాలి, నాన్+చనున్= శౌర్యంచేత ప్రకాశించేవాడు అనదగును; ద్రుపదుండు= ద్రుపద మహారాజు; సంగర, విశారద, భావము= యుద్ధంలో నేర్పరితనం; పూని ఉండున్= కలిగి ఉంటాడు; మాత్స్యునిన్= మత్స్యదేశపురాజైన విరటుడిని; పటు, విక్రమ+ఆఢ్యుఁడు+అని= మిక్కిలి పరాక్రమంచేత శ్రేష్ఠుడు అని; చూతురు= గణిస్తారు; పాండవులు+ఇందఱు+ఉండి= పాండవులు ఇంతమంది ఉండి కూడా; నినున్+కావఁగన్= నిన్ను కాపాడటానికి; ఒక్కనికిన్= ఒక్కడి కొరకు; కడంగ లేర!= ప్రయత్నించలేరా!; ఏమి+అనన్+నేర్తున్?= ఏమని చెప్పగలను?

తాత్పర్యం: కుమారా అభిమన్యూ! ఆ భీమసేనుడిని బలం కలవాడని అంటారు. సాత్యకిని మహాశూరు డనవచ్చును. ద్రుపదుడు యుద్ధంలో ఎంతో నేర్పరితనాన్ని కలిగి ఉంటాడు. విరాట మహారాజు అధిక పరాక్రమ శోభితుడు అని ఎన్నబడ్డాడు. ఇక ఇందరు పాండవు లుండి కూడా ఒక్క నిన్ను కాపాడటానికి ప్రయత్నమే చేయలేదా? ఏమని చెప్పేది?

విశేషం: భీముడి బలం, సాత్యకి శౌర్యం, ద్రుపదుడి యుద్ధనైపుణ్యం, విరాటుడి విక్రమం ఇవన్ని అంతగా ఉండి, పాండవు లెంత ప్రయత్నించినా ఒక బాలుడిని కాపాడుకొనలేకపోయారు అనే బాధ చంపకమాలావృత్తంలో ఎంతో గంభీరంగా ప్రతిపాదించబడింది. 'ఒక్కనికి' అనే ప్రయోగంలోని విరుపు చివుక్కుమనిపించి శత్రువుల చేతులలో చిక్కుకొని పోయిన అభిమన్యుడి దురవస్థను సూచిస్తున్నది.

సీ. **ఈలోక మెల్లఁ బాడిల్లును బోలెనై । యున్నది నీవు లేకునికిఁ జేసి;**
నీవు వేగమ గండు నెఱసి బంధులఁ బ్రీతిఁ । బొందఁ జేయుట గలవోలె నయ్యెఁ;
జిష్ణుని కొడుకవు కృష్ణునల్లుండ వీ । వరులచేఁ బడుట చోద్యంబు గాదె!
చెలువంపు మేనును జెన్ను మొగంబునై । యెప్పుడు పొడసూపె దింకఁ గుఱ్ఱ?

తే. **యకట! యుత్తర యొప్పెడు నది మనంబు । దీని కెంతయు మెత్తన; యేను నిన్ను**
వేఁడికొనియెద! వచ్చి యివ్వేలఁది వంత । దీపి దళుకొత్తుపలుకులఁ దేర్ప వన్న! 337

ప్రతిపదార్థం: కుఱ్ఱ!= బాలుడా!; నీవు, లేక+ఉనికిన్+చేసి= నీవు లేకుండటం చేత; ఈ లోకము+ఎల్లన్= ఈ ప్రపంచమంతా; పాడు+ఇల్లును+పోలెన్+ఐ+ఉన్నది= శూన్య గృహం మాదిరి అయి ఉన్నది; నీవు= నీవు(అభిమన్యుడు); వేగమ= తొందరగా; గండు నెఱపి= శౌర్యాన్ని ప్రకటించి (నింపి); బంధులన్= చుట్టాలను; ప్రీతిన్+పొందన్+చేయుట= సంతోషాన్ని కలుగజేయటం; కలవోలెన్+అయ్యెన్= స్వప్నంవలె అయిపోయింది; జిష్ణుని కొడుకవు= అర్జునుడి కుమారుడవు; కృష్ణు+అల్లుండవు= కృష్ణుడికి మేనల్లుడవు; ఈవు= నీవు; అరులచేన్+పడుట= శత్రువుల చేతిలో చావటం; చోద్యంబు కాదె!= వింతకాదా!; చెలువంపు మేనును= సుందరమైన శరీరమూ; చెన్ను మొగంబునున్= అందమైన ముఖమూ; ఐ= కలిగి; ఇంకన్= ఇంకా; ఎప్పుడు= ఎపుడు; పొడ చూపెదు= కనిపిస్తావు; అకట!= అయ్యో!; ఉత్తర= నీ భార్య ఉత్తర; ఒప్పెడునది= యోగ్యురాలు (సమ్మతిస్తుంది); దీనికిన్= ఈ ఉత్తరకు; ఎంతయున్= మిక్కిలి; మనంబు, మెత్తన= హృదయం మృదువు; ఏను= నేను; నిన్నున్= నిన్ను; వేఁడుకొనియెదన్= ప్రార్థిస్తాను; వచ్చి= (పోయిన నీవు మళ్ళీ ఒకసారి) వచ్చి; ఈ+వెలఁది, వంతన్= ఈ ఇంతి (నీ భార్య) దుఃఖాన్ని; తీపి+తళుకు+ఒత్తుపలుకులన్= మాధుర్యం అతిశయించే మాటలతో; తీర్పవు+అన్న!= ఊరడించవా!

తాత్పర్యం: అభిమన్యూ! నీవు లేకపోవటం చేత ఈ ప్రపంచమంతా పాడుపడ్డ ఇల్లువలె అయిపోయింది. నీవు నీ శౌర్యాన్ని నింపి చుట్టాలను సంతోషింప జేసినదంతా ఒక స్వప్నం మాదిరి అయిపోయింది. అర్జునుడి కుమారుడవూ, కృష్ణుడి మేనల్లుడవూ అయి ఉండీ నీవు శత్రువుల చేత చావటం ఎంతో వింతగా ఉన్నది. నీవు సుందర శరీరంతో అందమైన ముఖంతో ఇంకెప్పుడు కనిపిస్తావో! అయ్యో! నీ భార్య ఉత్తరను చూడుము. ఎంతో మెత్తని మనస్సు కల నీ ఇల్లాలి దుఃఖాన్ని నీ తీపి మాటలతో తీర్చటానికి ఒకసారి వచ్చి పో - అని నేను వేడుకొంటున్నాను. ఇట్లా వచ్చిపోతే ఆమె మనస్సు కూడా కొంత కుదురుపాటులో సమ్మతి పడుతుంది. ఆమె ఎంతో యోగ్యురాలు.

విశేషం: కోడలు కొరకైనా ఒకసారి వచ్చిపో - అని కొడుకును సుభద్ర వేడుకొనటం ఇందులోని విశేషం. ఎందుకు వచ్చిపో అని అర్థిస్తూ ఉందో దానికి కారణం కూడా చెప్పటం జరిగింది. 'మనంబు దీనికెంతయు మెత్తన' అని చెప్పటంలో కోడలి మనస్తత్వాన్ని అత్త ఎంతగా అర్థం చేసికొన్నదో విదితమౌతుంది. 'ఒప్పెడునది' అనే ప్రయోగం ఉత్తర యోగ్యురాలు అనే కాకుండా ఒక్కసారి నీవు వస్తే, మధురవాక్యాలతో ఊరడిస్తే ఆమె మనస్సు సమ్మతించి సమాధానపడుతుంది, అది ఎంతైనా సముచితంగా ఉంటుంది అని ఎన్నో విధాలుగా అర్థాన్ని చెప్పుకోవటానికి అనుకూలంగా కూర్పబడింది. జిష్ణుడి కొడుకవు అని తెల్పటంలో జయశీలుడైన అర్జునుడి కొడుకు వైన నీకు అపజయం ఎట్లా కలుగుతుంది? అట్లా జరగటం ఎంత వైపరీత్యం! అది నిజంగా ఎంత వింత? అని సాభిప్రాయంగా జిష్ణుశబ్దాన్ని తిక్కన ప్రయోగించాడు.

చ. **అలఘు తపంబులం, బ్రకట యాగములన్ మునిచోదిత వ్రతం**
బుల మహనీయదానములఁ బుణ్య చరిత్రములన్ మహాత్ము లెం
తలు రమణీయ విశ్రుత పదంబుల కేఁగుదు; రంతకంటె ను
జ్జ్వల మగు సద్గతిం బడయు వాసవపౌత్త్ర! పవిత్రవర్తనా!' **338**

ప్రతిపదార్థం: వాసవపౌత్త్ర!= ఇంద్రుడి మనవడివైన అభిమన్యూ!; పవిత్రవర్తనా!= పరిశుద్ధమైన (నిర్మలమైన) నడవడి కలవాడా!; అలఘు+తపంబులన్= గొప్ప తపస్సుల చేతనూ; ప్రకట యాగములన్= ప్రసిద్ధాలైన యాగాల చేతనూ; ముని,చోదిత, వ్రతంబులన్= మహర్షులు చెప్పిన నోముల చేతనూ; మహనీయదానములన్= గొప్పదానాల (ఈవుల) చేతనూ; పుణ్యాచరిత్రములన్= పవిత్రములైన నడవడుల చేతనూ; మహాత్ములు= మహనీయులు; ఎంతలు= ఎటువంటి; రమణీయ, విశ్రుత, పదంబులకున్= రమ్యమయి ప్రసిద్ధికెక్కిన సద్గతులకు; ఏఁగుదురు= పోవుదురో; అంతకంటెన్= వాటి అన్నింటికంటె; ఉజ్జ్వలము+అగు= శ్రేష్ఠమైనదైన; సద్గతిన్= ఉత్తమగతిని; పడయు= పొందుము.

తాత్పర్యం: ఇంద్రుడి మనుమడవైన ఓ అభిమన్యూ! పరిశుద్ధమైన నడవడి కలవాడా! గొప్ప గొప్ప తపస్సులచేత, ప్రసిద్ధ యాగాలచేత, మహర్షులు చెప్పిన నోములచేత, గొప్పదానాల చేత, పవిత్ర ప్రవర్తనల చేత మహాత్ములు ఎటువంటి రమ్యమైన, ప్రసిద్ధమైన ఉత్తమగతులు పొందారో, వాటికంటె ఉజ్జ్వలమైన (శ్రేష్ఠతమమైన) ఉత్తమ గతిని పొందుము.'

విశేషం: వాసవపౌత్ర! పవిత్రవర్తనా! అనే రెండు సంబోధనలు ప్రస్తుత పద్యంలో ప్రతిపాదించబడ్డ విషయానికి ఎంతో అనుగుణంగా ఔచిత్య స్ఫోరకంగా అతికాయి. సాభిప్రాయాలైన సంబోధనలను కూర్చటంలో తిక్కన అక్కడక్కడ చూపిన నేర్పు అప్రతిమానం. పరలోకగతుడైన అభిమన్యుడు ఇహలోకాన్ని వదలి వెళ్ళాడు. మళ్ళీ ఈ మహీతలానికి మనం ఎంత పిలిచి మొత్తుకొన్నా రాడు. ఇహంతో సంబంధం తెగిపోయింది. పరంతో సంబంధం కుదురుకొనింది. స్వర్గలోక సంబంధాన్ని పురస్కరించుకొని 'వాసవపౌత్ర' అని సంబోధించటం చాలా అర్థవంతంగా ఉన్నది.

అట్లాగే ఇందులో తపస్సులూ, యాగాలూ, వ్రతాలూ, దానాలు చెప్తుతూ 'పుణ్యచరిత్రములన్' అనే ఒక విశేషణాన్ని తిక్కన పేర్కొన్నాడు. పుణ్యచరిత్రము లనగా 'పవిత్ర వర్తనలు'. అందుకే సంబోధనలో తిక్కన 'పవిత్రవర్తనా' అని సుభద్రనోట పలికించాడు.

వ. **అని బహుప్రకారంబులం బలవించుచున్న సమయంబునం బాంచాలి యేతెంచి యిరుగేల నుత్తరా సుభద్రలం బొదివి, తానును వారును నడలూని పుడమిం బడి వివశతం బొంది వికలాక్రందనంబు సేయుచున్న నన్నారాయణుండును శోకసంతాపితాంతఃకరణుం డగుచు నుచితవచనంబుల నయ్యువిదల నెట్టకేలకు నూరార్చి, మగుడి పాండవులపాలికిం జనుదెంచె; నప్పుడు ధర్మతనయుం డమ్మాధవ ధనంజయులను భీమసేనునిం గవలను నితరపరిజనంబులను నిజనివాసంబులకుం బోవం బనిచి, తాను నభ్యంతర మందిరంబునకు నరిగె; గృష్ణుండును జిష్ణుతోన తదీయసదనంబునకుం జని, విమల జలంబులం గృతాచమనుం డయి యొక్క వివిక్త ప్రదేశంబునం దర్భశయ్య గావించి దాని నక్షతగంధపుష్పంబుల నలంకరించి యాయుధంబు లర్చించి, చుట్టు నిడి, కవ్వడి నందుండు మని నియోగించి 'నీవు నిశాసమయంబునం జేయు దేవపూజ యింతకు మున్న చేయ వని తలంపించిన నతండును బాదప్రక్షాళనంబు నుపస్పర్శనంబును నాచరించి, తాను నిత్యంబును నడపు త్ర్యంబక పూజనంబు తెఱంగున మాల్యానులేపన ధూప దీప నైవేద్యంబు జనార్దనునకు సమర్పించిన, నమ్మహాత్ముండు సంభావించి యాప్తులగు దౌవారికజనంబుల శస్త్రహస్తులై కొలిచి యుండునట్లుగా సంఘటించి, యా సవ్యసాచిం జూచి, నీవు సుఖనిద్ర సేయు; మేన నీకు శుభంబు గోరి యుండెదఁ; బోయి వచ్చెద' నని పలికి దారుకుండు దోడ నరుగ నాత్మగేహంబునకుం బోయి.** **339**

ప్రతిపదార్థం: అని= అట్లా పలికి; బహుప్రకారంబులన్= అనేక విధాలుగా; పలవించుచున్న= దుఃఖిస్తూ ఉన్న; సమయంబునన్= సందర్భంలో; పాంచాలి= ద్రౌపది; ఏతెంచి= వచ్చి; ఇరు కేలన్= రెండు చేతులతో; ఉత్తరా సుభద్రలన్= ఉత్తరను, సుభద్రను; పొదివి= చేరదీసికొని పట్టుకొని; తానును= ఆ పాంచాలియు; వారునున్= ఆ ఉత్తరాసుభద్రలున్నూ; అడలు+ఊని= దుఃఖించి; పుడమిన్+పడి= నేలపై పడి; వివశతన్+పొంది= మూర్ఛిల్లి; వికల+ఆక్రందనంబు= కలవరించే ఏడ్పుల అరపు; చేయుచున్నన్= కావిస్తూ ఉండగా; ఆ+నారాయణుండును= ఆ శ్రీకృష్ణుడును; శోక+సంతాపిత+అంతఃకరణుండు= దుఃఖంచేత మిక్కిలి తపించబడ్డ మనస్సు కలవాడు; అగుచున్= అవుతూ; ఉచితవచనంబులన్= తగిన మాటలతో; ఆ+ఉవిదలన్= ఆ స్త్రీలను; ఎట్టకేలకున్= చిట్టచివరకు; ఊరార్చి= ఊరడించి; మగుడి= మళ్ళీ; పాండవుల పాలికిన్= పాండవుల కడకు; చనుదెంచెన్= వచ్చాడు; అప్పుడు= ఆ సమయంలో; ధర్మతనయుండు= ధర్మరాజు; ఆ, మాధవ ధనంజయులనున్= ఆ కృష్ణార్జునులను; భీమసేనునిన్= భీముడిని; కవలనున్= అమడలైన నకుల సహదేవులను; ఇతర పరిజనంబులన్= తక్కిన పరివారాన్ని (బలగాన్ని); నిజనివాసంబులకున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తమ విడిది గృహాలకు; పోవన్+పనిచి= పోయేటట్లు (ఆజ్ఞాపించి) పంపి; తానును= తానున్నూ; అభ్యంతరమందిరంబునకున్= లోపలి గృహానికి; అరిగెన్= పోయాడు; కృష్ణుండును= కృష్ణుడున్నూ; జిష్ణుతోన్+అ= అర్జునుడితోనే; తదీయ, సదనంబునకున్+చని= అతడిఇంటికి పోయి; విమలజలంబులన్= నిర్మలమైన నీటితో; కృత+ఆచమనుండు+అయి= ఆచమనం చేసినవాడై; ఒక్క, వివిక్త ప్రదేశంబునన్= ఒక ఏకాంతస్థలంలో; దర్భశయ్య కావించి= దర్భలతో పడకచేసి; దానిన్, ఆ పడకను; అక్షత, గంధ, పుష్పంబులన్= సేసప్రాలు (పసుపుగాని కుంకుమగాని రాచిన బియ్యం) గంధమూ, పూలతో; అలంకరించి= సింగారించి (క్రైసేసి); ఆయుధంబులు+అర్చించి= శస్త్రాలను పూజించి; చుట్టున్+ఇడి= చుట్టూ ఉంచి; కవ్వడిన్= అర్జునుడిని; అందున్+ఉండుము= అక్కడే ఉండుము; అని, నియోగించి= అని ఆజ్ఞాపించి (కోరి); నీవు; నిశాసమయంబున్= రాత్రిపూట; చేయు+దేవపూజ= చేసే దైవసేవ; ఇంతకుమున్న= ఇంతకుముందే; చేయవని= నిర్వర్తించవని; తలంపించినన్= తలచేటట్లు చేయగా; అతండును+ఆ అర్జునుడున్నూ; పాదప్రక్షాళనంబున్= కాళ్ళు కడుగుకోవటం; ఉపస్పర్శనంబునున్= ఆచమనమున్నూ; ఆచరించి= చేసి; తాను= తాను; నిత్యంబును= ప్రతిదినమున్నూ; నడపు= నిర్వర్తించే; త్ర్యంబక పూజనంబు, తెఱంగునన్= శివపూజ వలె; మాల్య+అనులేపన, ధూప, దీప, నైవేద్యంబు= దండలూ, పూతలూ(గంధాదులు) (అగరుబత్తి) సాంబ్రాణి పొగలూ, దీపాలూ, నివేదింపదగిన వస్తువూ; జనార్దనునకున్= శ్రీకృష్ణుడికి; సమర్పించినన్= సమర్పించగా; ఆ+మహాత్ముండు= మహనీయుడైన ఆ కృష్ణుడు; సంభావించి= సమ్మానించి; ఆప్తులు+అగు= క్షేమం కోరేవాళ్ళయిన; దౌవారిక జనంబులన్= ద్వారపాలకులను; శస్త్రహస్తులు+ఐ= ఆయుధాలు చేత ధరించినవారై; కొలిచి+ఉండునట్లుగాన్= సేవించి ఉండేటట్లుగా; సంఘటించి= ఏర్పాటు చేసి; ఆ+సవ్యసాచిన్= ఆ అర్జునుడిని; చూచి= కనుగొని; నీవు; సుఖనిద్ర+చేయుము= సుఖంగా నిద్రించుము; ఏన= నేనే; నీకున్+శుభంబున్+కోరి+ఉండెదన్= నీకు మేలుకోరి ఉంటాను; పోయి+వచ్చెదన్= పోయి వస్తాను; అని+పలికి= అని చెప్పి; దారుకుండు= తన రథసారథి అయిన దారుకుడు; తోడన్= తనతోకూడా; అరుగన్= రాగా; ఆత్మ గేహంబునకున్= తనయొక్క ఇంటికి(శిబిరానికి); పోయి= చని.

తాత్పర్యం: అని పలురకాలుగా శోకిస్తున్న సమయంలో ద్రౌపది వచ్చి, రెండు చేతులతో ఉత్తరాసుభద్రలను కౌగిలించుకొని, తాను కూడా వారితో కలిసి నేలపైబడి మూర్ఛిల్లి గుండెలు పగిలేటట్లు రోదిస్తూ ఉండగా, శ్రీకృష్ణుడు కూడ శోకంతో తపించే మనస్సుతో చలించి కూడా తేరుకొని, తగిన మాటలతో ఆ వనితలను చిట్టచివరకు ఓదార్చి, తిరిగి పాండవుల వద్దకు వచ్చాడు. అప్పుడు ధర్మరాజు అందరినీ వారి వారి నివాసాలకు పంపి, తాను తన మందిరానికి వెళ్ళాడు. కృష్ణుడు అర్జునుడితో కలిసి అతడి మందిరానికి వెళ్ళి, మంచినీటితో ఆచమనం చేసి, ఒక ఏకాంత స్థలంలో దర్భశయ్య ఏర్పాటు చేసి, దానిని అక్షతలతో గంధ పుష్పాదులతో అలంకరించి, ఆయుధాలను పూజించి, చుట్టూ ఉంచి, అర్జునుడిని అక్కడ ఉండుమని ఆజ్ఞాపించి, 'నీవు రాత్రివేళ చేసే దైవపూజ ఇంతకుముందు చేయలే'దని హెచ్చరించి, చేసేటట్లు స్ఫూర్తిని కలిగించాడు. దానితో అర్జునుడు కూడా పాదాలు కడుగుకొని, ఆచమించి, తాను రోజూ చేసే త్ర్యంబకపూజను శ్రీకృష్ణుడికే షోడశోపచారాలతో చేశాడు. శ్రీకృష్ణుడు అర్జునుడిని సమ్మానించి, శస్త్రపాణులైన భటులను అతడికి రక్షగా నిలిపి, అర్జునుడిని సుఖనిద్ర పొమ్మని, అతడి శుభం కోరి తాను మసలేటట్లు చెప్పి, దారుకుడిని వెంటపెట్టుకొని తన నివాసానికి వెళ్ళాడు.

ఆ. సెజ్జయందు మేను సేర్చి యర్జునకార్య । చింతఁ బలుకకుండి కొంతవడికిఁ
బవ్వళించెఁ గురునృపాలక! జలశాయి । దారుకుండు గొలిచి యూరకుండ. 340

ప్రతిపదార్థం: కురునృపాలక!= కురురాజా!; ధృతరాష్ట్రా!; జలశాయి= శ్రీకృష్ణుడు; సెజ్జఅందున్= పక్కమీద; మేను= శరీరాన్ని; చేర్చి= ఉంచి-పరుండి; అర్జునకార్యచింతన్= అర్జునుడి పనిని గురించిన ఆలోచనతో; పలుకక+ఉండి= మాట్లాడకుండ ఊరకుండి; కొంతవడికిన్= కొంతసేపటికి; దారుకుండు= సారథి; కొలిచి= సేవిస్తూ; ఊరక+ఉండన్= మిన్నకుండా (నిశ్శబ్దంగా) వేచి ఉండగా; పవ్వళించెన్= పడుకొన్నాడు (నిద్రించాడు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శ్రీకృష్ణుడు పక్కమీద మేనువాల్చి అర్జునుడి ప్రతిజ్ఞను తీర్చేపనిని గురించి ఆలోచిస్తూ నిశ్శబ్దంగా ఉండి కొంతసేపటికి నిద్రపోయాడు. సారథి ఊరక ప్రక్కన నిలబడి ఆతడిని సేవిస్తూ ఉండిపోయాడు.

వ. ఆ సమయంబున నవ్వీటివా రెల్లను దమయుల్లంబుల నెవ్వగలు నివ్వటిల్లం గన్నుమూయక విన్ననయి యుండి. 341

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ సందర్భంలో; ఆ+వీటివారు+ఎల్లను= ఆ దండు (శిబిరం)లోని వాళ్ళంతా; తమ+ఉల్లంబులన్= తమ మనస్సులలో; నెవ్వగలు= అధిక విచారం; నివ్వటిల్లన్= కలుగగా (నిండుకోగా); కన్నుమూయక= నిద్రించకుండా; విన్ననయి+ఉండి= చిన్నబోయి ఉండి.

తాత్పర్యం: అప్పుడు ఆ శిబిరంలోని వారందరూ తమ మనస్సులలో పెద్ద దిగులు పెరగగా నిద్రపట్టక చిన్నబోయి ఉండి. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'అభిమన్యుఁ డీల్గిన నర్జునుఁ డధిక శో । కావేశ మొంది సాహసికవృత్తి
నతి దుర్ఘటం బైన ప్రతిన యిట్టులు పట్టు । నే? కౌరవులు దీని నెట్టు లైనఁ
దప్పింపఁ జూతురు; దర్పంబు వెరవును । గలవారు వారి కగ్గలము గలరు;
కడు దెప్పరం బైన కార్యంబు వాటిల్లె; । నెమ్మెయి నిది నిర్వహించువాఁడొ

ఆ. యకట! దినములోన నాసైంధవునిఁ జంప । నబ్బకున్న నతని కగ్ని సొరఁగ
వలయు; నాతఁ డనృతవాదిగాఁ; డికార్య । మెట్టు లగునొ! మనకు నేది గతియొ!' 342

ప్రతిపదార్థం: అభిమన్యుఁడు; ఈల్గినన్= మరణించగా; అర్జునుఁడు; అధిక, శోక+ఆవేశము+ఒంది= మిక్కిలి దుఃఖంతో ఒడలు మరచిన స్థితిని పొంది; సాహసికవృత్తిన్= తెగువ కలవాడి నడవడితో; అతి+దుర్ఘటంబు+ఐన= మిక్కిలి ఘటించటానికి వీలుకానిదైన; ప్రతిన= ప్రతిజ్ఞ; ఇట్టులు+పట్టునే?= ఈ విధంగా పూనునా?; దీనిన్= ఈ ప్రతిజ్ఞను; కౌరవులు= దుర్యోధనాదులు; ఎట్టులు+ఐనన్= ఏ విధంగానైనా; తప్పింపన్= తప్పిపోయేటట్లు(ప్రతికూలమయ్యేటట్లు); చూతురు= చూస్తారు (ఆలోచిస్తారు); వారికిన్= ఆ కౌరవులకు; దర్పంబు= గర్వం; వెరవును= ఉపాయమున్నూ; కలవారు= ఉన్నవారు; అగ్గలము కలరు= అధికంగా (మిక్కుటంగా) ఉన్నారు; కడు+దెప్పరంబు+ఐన= మిక్కిలి అశక్యమైన; కార్యంబు+వాటిల్లెన్= పని కలిగింది; ఇది= ఈ పని; ఏ+మెయిన్= ఏ విధంగా; నిర్వహించువాడొ!= నెరవేరుస్తాడో!; అకట!= అయ్యో!; ఆ సైంధవునిన్= ఆ సైంధవుడిని; దినములోనన్= ఒక్కదినం లోపల; చంపన్+అబ్బక+ఉన్నన్= చంపటం ఈడేరకపోతే; అతనికిన్= అర్జునుడికి; అగ్ని+చొరఁగన్+వలయున్= అగ్నిలో ప్రవేశించవలసి ఉన్నది; ఆతఁడు= అర్జునుడు; అనృతవాది+కాఁడు= అసత్యం పలికేవాడు కాడు; ఆ+కార్యము= ఆ ప్రతిజ్ఞా కార్యం; ఎట్టులు+అగునొ?= ఎట్లా ఔతుందో!; మనకున్= మనకు; ఏది గతియో!= ఏది ఉపాయమో! (మార్గమో!).

తాత్పర్యం: 'అభిమన్యుడు మరణించగానే అర్జునుడు దుఃఖంతో ఒళ్ళు మరచి, తెగువరి అయి సాధించటానికి వీలుకాని ప్రతిజ్ఞ చేశాడు. కౌరవులు ఈ ప్రతిజ్ఞను ఎట్లాగైనా వమ్ముచేయటానికి చూస్తారు. ఆ కౌరవులలో గర్వం, ఉపాయం ఉన్నవాళ్ళు మిక్కుటంగా ఉన్నారు. ఇది శక్యం కాని పని; ఏ విధంగా దీన్ని నెరవేర్చటమో. అయ్యో! ఆ సైంధవుడిని ఇంక ఒక్క దినంలో చంపలేకపోతే అర్జునుడు అగ్నిలో ప్రవేశించాలి. అతడు అసత్యవాది కాడు. ఈ పని ఎట్లా అవుతుందో? మన గతి ఏమిటో?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: జలశాయి అయిన కృష్ణుడు పవళించిన అనంతరం ఊరివారంతా అభిమన్యుడి మరణానికి కన్నుమూయలేదు. అభిమన్యుడి మరణానంతరం క్రమంగా జరుగబోయే అనర్థాలు ఏ విధంగా ఉంటాయో అని ఊరివారు భావించిన తీరు సీసపద్యంలో అభివర్ణితం. అభిమన్యుడి మృతికి తగినట్లుగ, అర్జునుడు చేసిన ప్రతిజ్ఞ సామాన్యమైనది కాదు. అర్జున ప్రతిజ్ఞ విని కౌరవులు ఊరకుండరు. ఏ విధంగానైనా ప్రతిజ్ఞకు ప్రతికూల కార్యక్రమాలు ఎంతో ప్రతిభావంతంగా చేపడుతారు. అర్జునుడు సైంధవుడిని చంపటానికి అవకాశం ఏర్పడకపోతే తానే అగ్నిలో ప్రవేశిస్తానని అంటున్నాడు. సత్య నిర్వహణలో అర్జునుడు అన్న ధర్మరాజు కన్నా తక్కువ వాడు కాడు. అనృతవాది కాని అర్జునుడి పరిస్థితి మరి ఎట్లో అని పౌరులు భావించిన విధానం గమనార్హం. పౌరుల అభిప్రాయాలను వెల్లడించటానికి అనువుగా ఇక్కడ తిక్కన సీసపద్యాన్ని ప్రవేశపెట్టటం ఆయన శిల్పదృష్టికి నిదర్శనం.

వ. అని వెండియు. 343

తాత్పర్యం: అని మఱియు.

క. 'మన చేసిన సుకృతంబుల । వినుతఫలము లెల్ల నెల్లి వివ్వచ్చుఁడు సిం
ధునరేంద్రుఁ జంపునట్లుగ । నొనరి యొదవవలయు' నని దృఢోక్తిఁ బలుకుచున్. 344

ప్రతిపదార్థం: వివ్వచ్చుఁడు= అర్జునుడు; సింధునరేంద్రున్= సైంధవుడిని; చంపు అట్లుగన్= సంహరించేటట్లుగా; మన, చేసిన, సుకృతంబుల= మనం పూర్వం చేసిన పుణ్యకార్యాల; వినుతఫలములు+ఎల్లన్= పొగడబడే ఫలితములు అన్నీ; ఎల్లి= రేపు; ఒనరి= అనుకూలించి; ఒదవ వలయున్+అని= సిద్ధించాలి అని; దృఢ+ఉక్తిన్= గట్టి మాటగా; పలుకుచున్= పలుకుతూ.

తాత్పర్యం: 'మనం పూర్వం చేసికొన్న పుణ్యకార్యాల ఫలమంతా రేపు అర్జునుడు సైంధవుడిని చంపేటట్లుగా అనుకూలించి సిద్ధించాలి' అని మిక్కిలి గట్టిగా చెప్పుతూ.

విశేషం: అర్జునుడు సైంధవుడిని సంహరించాలంటే మన పుణ్యకార్య ఫలాలన్నీ పండి అనుకూలించి రేపే సిద్ధించవలసి ఉన్నది. అర్జునుడి సుకృతం అటుంచి ముందు మన సుకృతాలు ఫలించాలి అని గట్టిగా అందరూ వక్కాణించారు. 'మనం బ్రతికి బయటపడాలంటే సైంధవుడు చచ్చితీరాలి' అని వారి అభిప్రాయం. పౌరులందరు తమ సుకృతాలు ఫలించటానికి సైంధవుడి వధ అవశ్యం జరిగి తీరవలసిందే అని భావించిన తీరును తిక్కన చక్కని కందంలో స్పష్టీకరించాడు.

ఆ. అగ్రపుస్తకంబు లర్చించి చూచుచుఁ । బరమ నియతిమై నుపశ్రుతులకుఁ
బోవుచును శుభంబు లావహించుటఁ గాంచి । చెలఁగి యొండొరులకుఁ జెప్పికొనుచు. 345

ప్రతిపదార్థం: అగ్రపుస్తకములు= అతి ముఖ్యములైన గ్రంథాలు; అర్చించి= పూజించి; చూచుచున్= చూస్తూ (ఆలోచిస్తూ); పరమ+నియతిమైన్= శ్రేష్ఠమైన నియమంతో; ఉపశ్రుతులకున్= శుభాశుభ సూచకాలైన ఇతరుల సంభాషణలను వినుటకు; పోవుచును= వెళ్ళుతూ; శుభంబులు= మేళ్ళు; ఆవహించుటన్= కలుగుటను; కాంచి= చూచి; చెలఁగి= సంతోషించి; ఒండొరులకున్= ఒకరికొకరు; చెప్పికొనుచున్= చెప్పికొంటూ.

తాత్పర్యం: శుభప్రదాలైన అతిముఖ్య గ్రంథాలను పూజించి చూస్తూ, ఎంతో నిష్ఠతో శుభాశుభ సూచకాలైన ఇతరుల సంభాషణలను వినటానికి వెళ్ళుతూ, శుభాలు కలగటం చూచి, సంతోషించి ఒకరి కొకరు చెప్పుకొంటూ. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: సంకట పరిస్థితులు ఏర్పడ్డప్పుడు సందేహ నివారణకో లేక సత్ఫల సంసిద్ధికో, శుభాశుభాలను నిర్దేశించే అతి ముఖ్య గ్రంథాలను పరిశీలించటం, వాటిని అర్చిస్తే శుభాలు కలుగుతాయి అని భావించటం ఒక సంప్రదాయంగా కనిపిస్తు ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భవిష్యత్తులో జరుగబోయే శుభాశుభాలకు సంబంధించి ముందుగానే కొన్ని సూచనలు గ్రహించటం అనేది కూడా పూర్వం మన పెద్దలు పాటించారు. వీటినే వాళ్ళు ఉపశ్రుతులు అన్నారు.

క. ‘గురునట్టివారు పదివే। వురు గాచిన నెల్లి సైంధవుని పగలిటిలోఁ
పొరిగొనునట్లుగ నరునకు। వరమిండీ వేల్పులార! వారని కరుణన్.’ 346

ప్రతిపదార్థం: వేల్పులార!= ఓ దేవతలారా!; వారని కరుణన్= ఉడుగని దయతో; గురు+అట్టివారు= ద్రోణాచార్యునంతటి వాళ్ళు; పదివేవురు= పదివేలమంది; కాచినన్= కాపాడినా; ఎల్లి= రేపు; పగలిటిలోన్= పగటిలోపలనే; సైంధవునిన్= సైంధవుడిని; పొరిగొనునట్లుగన్= చంపునట్లుగా; నరునకున్= అర్జునుడికి; వరము+ఇండీ= వరం ఈయండి.

తాత్పర్యం: ‘ఓ దేవతలారా! పదివేలమంది ద్రోణాచార్య నంతటివాళ్ళు వచ్చి కాపాడినప్పటికీ, రేపు పగటి పూటనే సైంధవుడిని చంపేటట్లు అపారకరుణతో అర్జునుడికి వరమీయండి.’

వ. అని ప్రార్థించుచు దైవంబుల కేటికోళ్ళు నిరూపించుచు మఱియు బహుప్రకారంబులం బలుకుచుండిరి; రాత్రి సాలం జనిన మేలుకని దామోదరుండు దారుకు నాలోకించి. 347

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; ప్రార్థించుచున్= ప్రార్థన చేస్తూ; దైవంబులకున్= దేవతలకు; ఏటికోళ్ళు= నమస్కారాలు; నిరూపించుచున్= ఆచరిస్తూ; మఱియున్= ఇంకా; బహుప్రకారంబులన్= అనేకవిధాలుగా; పలుకుచుండిరి= మాటాడుతూ ఉన్నారు; రాత్రి+చాలన్+చనినన్= రాత్రి చాలాకాలం గడిచిపోగా; దామోదరుండు= శ్రీకృష్ణుడు; మేలుకని= మేల్కాంచి; దారుకున్= రథసారథి అయిన దారుకుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అని ప్రార్థనలు చేస్తూ దేవతలకు మొక్కులు మొక్కుకొంటూ అనేకవిధాలుగా మాట్లాడుకొంటూ రాత్రి చాలాసేపు గడిపారు. అప్పుడు శ్రీకృష్ణుడు మేలుకొని దారుకుడిని చూచి (తరువాతి పద్యంతో అన్వయం).

శ్రీకృష్ణుఁడు దారుకుతో అర్జును ప్రతిజ్ఞా విషయంబులైన వాక్యంబులం గొన్ని సెప్పుట (సం. 7-56-27)

చ. ‘నరుఁ డిటు లాడునే నృపగణంబు వినంగ? జయింపవచ్చునే
గురుకురు సేనలం దరణి గ్రుంకక మున్న తలంపఁ జాల దు
స్తర మిది యాతఁ డీ ప్రతిన దప్పకయుండఁగ దీర్చునట్టుగాఁ
బొరయక యున్న దుర్దశలఁ బొందనె పాయని నిందఁ గుందనే! 348

ప్రతిపదార్థం: నృపగణంబు= రాజసమూహం; వినంగన్= వింటూ ఉండగా; ఇటులు= ఈ విధంగా; నరుఁడు= అర్జునుడు; ఆడునే!= (ప్రతిజ్ఞావాక్యాలు) మాటాడునే!; తరణి= సూర్యుడు; క్రుంకక+మున్నె= అస్తమించకముందే; గురు, కురు, సేనలన్= గొప్ప కౌరవ సైన్యాలను; జయింపవచ్చునే!= గెలువటానికి అవుతుందా!; తలంపన్+చాలన్= ఊహించలేకున్నాను; ఇది+దుస్తరము= ఇది కష్టం; ఆతఁడు= అర్జునుడు; ఈ+ప్రతిన= ఈ ప్రతిజ్ఞ; తప్పక+ఉండఁగన్= తప్పకుండా; తీర్చునట్లుగాన్= నెరవేర్చేటట్లుగా; పొరయక ఉన్నన్= కలిగించకుండా ఉంటే; దుర్దశలన్= దురదృష్టాలను; పొందనె?= పొందకుండా ఉంటానా?; పాయని, నిందన్= శాశ్వతమైన నిందతో; కుందనే!= బాధపడనా!

తాత్పర్యం: అందరు రాజులు వింటూ ఉండగా అర్జునుడు ఆ విధంగా ప్రతిజ్ఞ చేశాడు. సూర్యుడస్తమించక ముందే గొప్ప కౌరవసైన్యాలను జయించటానికి వీలవుతుందా? ఏమో! ఊహించలేకున్నాను. ఇది తరించరానిది. ఆ అర్జునుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ ప్రతిజ్ఞను తప్పకుండా నెరవేర్చేటట్లు చూడాలి. అలా నేను చేయకపోతే దుస్థితుల పాలుకానా? శాశ్వతమైన నింద పడనా?

విశేషం: తరింపచేసేవాడు తరణి. అతడు అస్తమించేలోపుగా అర్జునుడి ప్రతిజ్ఞ నెరవేరటం అంత సులువు కాదు. అది దుస్తరం. ఇక్కడ తిక్కన దుస్తరమనే ప్రయోగాన్ని ఛందోనుగుణంగా విరిచి చెప్పటంలో ఎంతో మహార్థస్ఫూర్తి వ్యంగ్య ప్రాయంగా సూచించబడింది. 'అర్జునుడి ప్రతిజ్ఞ నెరవేరకపోతే నింద అతడికి కాదు, నాకు కలుగుతుంది' అని దారుకుడితో శ్రీకృష్ణుడు వివరించిన విషయం చంపకమాలావృత్తంలో నిబంధించబడింది. 'నరుఁ డిటులాడునే' అని ఎత్తుగడ. 'పాయని నిందఁ గుందనే' అని చివరివాక్యం. ఈ రెండు వాక్యాలకు సమన్వయప్రాయంగా మధ్యవాక్యాలు కూర్పబడ్డాయి.

క. **కడుఁ గూర్తుఁ గవ్వడికి న । య్యొడలు గలుగ నేను బ్రతికియుండుదుఁ గా; కె**
క్కడి బ్రదుకు నాకు నాతం । డెడలిన; నప్పార్థుఁ గాతు నెల్ల విధములన్. **349**

ప్రతిపదార్థం: కవ్వడికిన్= అర్జునుడికి; కడున్= మిక్కిలి; కూర్తున్= ప్రియం కలిగిస్తాను; ఆ+ఒడలు+కలుగన్= ఆ అర్జునుడి శరీరం ఉంటేనే; ఏను= నేను; బ్రతికి+ఉండుదున్+కాక= జీవించి ఉండగలను; ఆతండు+ఎడలినన్= ఆ అర్జునుడు దూరమైతే; నాకున్= నాకు; ఎక్కడి బ్రదుకు= జీవనం ఎక్కడిది; ఎల్లన్+విధములన్= అన్ని విధాలా; ఆ+పార్థున్= ఆ అర్జునుడిని; కాతున్= కాపాడుతాను.

తాత్పర్యం: అర్జునుడు నాకు చాలా ఇష్టమైనవాడు. అతడి దేహం ఉంటేనే నేను జీవించి ఉండగలుగుతాను. అతడే దూరమైతే నాకు ఇం కెక్కడి బ్రతుకు? అన్నివిధాలా ఆ అర్జునుడిని రక్షిస్తాను.

విశేషం: నరనారాయణ మైత్రి ఏ విధంగా విడదీయరానిదో ఈ పద్యంలో కృష్ణార్జునపరంగా వివరించబడింది. ఒకరు లేకపోతే మరొకరు ఉండటం అసంభవం. బాహ్యంగా గానీ ఆంతరంగికంగా కానీ ఆ ఇరువురి అనుబంధం ఆ విధంగా విడదీయరానిది. ప్రతిజ్ఞ చేసింది అర్జునుడే కావచ్చును. కాని, దానిని నిర్వహించవలసిన బాధ్యత కృష్ణుడిమీదనే ఉన్నది. ఎట్లయినా అతడి ప్రతిజ్ఞ నెరవేరేటట్లు చూడాలి. ఈ సందర్భంలో ఆతడిని ఎదుర్కొనే అన్ని కష్టాలనుండి కాపాడాలి. అన్నివిధాలా అతడిని రక్షించగలిగినప్పుడే మా మైత్రికి సార్థకత అని కృష్ణుడు నిజమైన మైత్రిలో నీవూ-నేనూ అనే భేదం ఎట్లు ఉండదో వివరించాడు. ఎల్లప్పుడూ ఆతడూ నేనూ ఒకటిగా ఉంటూ ఉన్నాము. అతడికి కావలసినది అది ఏదైనా నేనే సమకూర్చుతున్నాను. ఒకే ప్రాణం రెండు శరీరాలు. అతడు ప్రాణాలు విడిస్తే నేను కూడా తప్పక మరణించి తీరవలసిందే'.

క. **నాలో సగ మర్జునుఁడే । నాలమునం దతని కగుట యరుదే! యెమ్మై**
వ్రాలెదనో? రిపు లెట్టులు । గూలెదరో? చూడు; నాకుఁ గురుబల మెదురే? **350**

ప్రతిపదార్థం: అర్జునుఁడు= ఆ నరుడు; నాలోన్+సగము= నాలో అర్ధభాగం; ఏను=నేను; ఆలము+అందున్= యుద్ధంలో;ఆతనికిన్+అగుట= ఆ అర్జునుడికి అనుకూలం కావటం; అరుదే!= ఆశ్చర్యమా!; ఎమ్మైన్= ఏ విధంగా; వ్రాలెదనో= మీరెదనో; రిపులు=శత్రువులు;ఎట్టులు+కూలెదరో?= ఏ విధంగా నశిస్తారో?; చూడు= పరికించుము; నాకున్= నాకు; కురుబలము= కౌరవసైన్యం; ఎదురే?=లెక్కా?

తాత్పర్యం: ఆ అర్జునుడు నాలో అర్ధభాగం. నేను అతడికి యుద్ధంలో అనుకూలంగా ఉండటం ఒక ఆశ్చర్యమా! ఎట్లా విజృంభిస్తానో,శత్రువులు ఏ విధంగా నేలగూలుతారో చూస్తూ ఉండుము. ఈ కురుసైన్యం నాకు ఒక లెక్కా?

విశేషం: 'అర్జునుడు తనలో సగం కాబట్టి, అతడి పక్షం నేనూ యుద్ధం చేయటంలో ఆశ్చర్యపడాల్సిం దేముంది? మిత్రుడంటే 'విపత్తి సౌఖ్య సదృశ క్రియుడు' కదా! ప్రస్తుతం ఆపదలో చిక్కుకొన్న అర్జునుడిని రక్షించటానికి నేనే శత్రువులను చీల్చి చెండాడుతాను.' అని కృష్ణుడు చెప్పిన ప్రతి వాక్యంలోనూ తనకూ అర్జునుడికీ అన్ని విషయాలలోనూ అభేదమే అన్న అభిప్రాయం అభివ్యక్తమైనది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **ఎల్లి సచరాచరములగు నెల్ల భూత। ములును నాదగు నేర్పును, బలముఁ, బాండు**
తనయులకు నేను గూర్చుటయును నెఱుంగ। వలయు దారుక! యేచెదఁ గలనిలోన. 351

ప్రతిపదార్థం: దారుక!= (రథసారథివైన) ఓ దారుకా!; నాది+అగు, నేర్పును= నాది అయిన చాకచక్యాన్ని; బలమున్= శక్తిని; పాండు తనయులకున్= పాండవులకు; ఏను= నేను; కూర్చుటయునున్= ప్రియం కలిగించటాన్నీ; ఎల్లి= రేపు; సచర+అచరములు+అగు+ఎల్ల, భూతములునున్= జంగమములు, స్థావరములును అయిన అన్ని ప్రాణులున్నూ; ఎఱుంగన్+వలయున్= తెలిసికొనటం సంభవిస్తుంది; కలనిలోనన్= యుద్ధంలో; ఏచెదన్= విజృంభిస్తాను.

తాత్పర్యం: దారుకా! నా నేర్పూ, శక్తీ, పాండవులకు నేను ప్రియం కలిగించటాన్ని, రేపు స్థావర జంగమాత్మకమైన ప్రాణికోటి తెలిసికొనటం సంభవిస్తుంది. యుద్ధంలో విజృంభిస్తాను.

విశేషం: 'యుద్ధంలో విజృంభించి తన నైపుణ్యాన్నీ, బలాన్నీ ప్రాణికోటి మొత్తం చూస్తూ ఉండగా రేపు ప్రకటిస్తాను' అని అర్జునుడికి బదులు తానే యుద్ధం చేసేటట్లు కృష్ణు డిందులో పేర్కొన్నాడు. అంతకు ముందు 'కవ్వడికిఁ గూర్తుఁ' నన్న కృష్ణుడు 'పాండు తనయులకు తాను కూర్చుట యెట్టిదో రేపు చూపుతాను' అంటున్నాడు. ఈ పద్యంలో కూర్చుట, కూర్తు అను ప్రయోగాల్ని తిక్కన అసాధారణమైన విశిష్టమైన అర్థంలో అక్కడక్కడా ప్రయోగించాడు. కూర్చుటలో ఎంతో విడదీయరాని అనుబంధాన్ని తిక్కన ప్రతిపాదించాడు. అర్థవంతాలైన అచ్చ తెలుగు పదాలు కూర్చటంలో ఆయనకు ఆయనయే సాటి. కృష్ణుడు తన సారథికి పాండవులతో తనకు గల ప్రగాఢ మైత్రిని కొంత విస్తరించి వివరించాడు.

క. **ఇనుఁ డస్తమింపకుండఁగ। మును సైంధవుఁ జంపువాఁడ; మునుకొని పరు లే**
చినఁ జిత్రవధ విహారం। బున నప్పుడు రౌద్రరసము పొడ వేర్పఱుతున్. 352

ప్రతిపదార్థం: ఇనుఁడు= సూర్యుడు; అస్తమింపక+ఉండఁగన్+మును= అస్తమించక ముందు; సైంధవున్= సైంధవుడిని; చంపువాఁడన్= సంహరించగలవాడను; మునుకొని= ముందుగా; పరులు= శత్రువులు; ఏచినన్= విజృంభిస్తే; అప్పుడు= ఆ సమయంలో; చిత్రవధ విహారంబునన్= ఆశ్చర్యంగా చంపటం యొక్క క్రీడా విహారంచేత; రౌద్రరసము+పొడవు= రౌద్రరసం యొక్క ఆకారం; ఏర్పఱుతున్= ఏర్పాటు చేస్తాను.

తాత్పర్యం: పొద్దు గుంకకముందే ఆ సైంధవుడిని సంహరిస్తాను. శత్రువులే ముందుగా విజృంభిస్తే వాళ్ళనందరినీ చిత్ర విచిత్ర పద్ధతులలో చంపుతూ క్రీడా విహారం సాగిస్తాను. రౌద్రరసంయొక్క ఆకారం ఎట్లా ఉంటుందో ఏర్పడేటట్లు చేస్తాను.

విశేషం: 'చిత్రవధ విహారము' తో 'రౌద్రరసము పొడవేర్పఱుతున్' అనే వాక్యంలో దయారస సముద్రుడైన కృష్ణుడు అర్జునుడి ప్రతిజ్ఞ నెరవేర్చటం కొరకు రౌద్రరసమే తా నవుతానని చెప్పటం విశేషం. పవిత్రమూ, అవ్యాజమూ అయిన స్నేహధర్మంలో వాడే వీడు కావటం సహజం. అర్జునుడు చేయవలసిన పని తానే చేస్తానని పదే పదే చెప్పటం వలన తన రథసారథిని యుద్ధానికి సంసిద్ధం కావాల్సిందని హెచ్చరించినట్లయింది.

ఉ. **సైంధవుఁ డొక్క డేల? యనిఁ జావకపోవఁగ నేర్తు రెట్లు గ**
ర్వాంధుఁడు కౌరవేశ్వరుఁడు నందఱు దమ్ములు, నెల్ల మిత్తులున్,
బంధులుఁ దోడు వచ్చిన నృపాలురుఁ బాండవకీర్తి సర్వది
క్సింధుర దంతకాండములఁ జెందఁగఁ జేయుట కేను బూనఁగన్. 353

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఏను= నేను; పాండవ కీర్తిన్= పాండు కుమారులయొక్క యశస్సును; సర్వ, దిక్+సింధుర, దంత, కాండములన్= అన్ని దిగ్గజాల యొక్క దంత సమూహాలను; చెందఁగన్+చేయుటకున్= పొందేటట్లు కావించటానికి; పూనఁగన్= ప్రయత్నించగా; సైంధవుఁడు+ఒక్కఁడు+ఏల?= సైంధవుడు ఒక్కడే ఏమి?; గర్వ+అంధుఁడు= దర్పంచేత కళ్ళు మూసికొని పోయినవాడు (అయిన); కౌరవ+ఈశ్వరుఁడున్= దుర్యోధనుడున్నూ; అందఱు తమ్ములున్= (అతడి అందరు సహోదరులున్నూ) తమ్ముళ్ళు అందరున్నూ; ఎల్లన్+మిత్రులున్= స్నేహితులు అందరున్నూ; బంధులున్= చుట్టాలున్నూ; తోడు వచ్చిన+నృపాలురున్= సహాయంగా వచ్చిన సామంతరాజులున్నూ; అనిన్= యుద్ధంలో; చావక+పోవఁగన్= మరణించకుండా; ఎట్లు నేర్తురు?= ఏ విధంగా ఉండగలరు?, సమర్థులవుతారు?

తాత్పర్యం: నేను పాండవుల కీర్తిని అన్ని దిక్కులలో వ్యాపింప చేయటానికి ప్రయత్నించగా, ఒక్క సైంధవుడు ఏమిటి? దర్పంచేత గ్రుడ్డివాడైన ఆ దుర్యోధనుడూ, అతడి తమ్ముళ్ళు అందరూ, మిత్రులందరూ, చుట్టాలు, సహాయంగా వచ్చిన రాజులూ యుద్ధంలో చావకుండా ఎట్లా ఉండగలరు?

విశేషం: 'పాండవుల కీర్తి అన్ని దిక్కులలో వ్యాపించేటట్లు చేస్తాను' అనే భావాన్ని అన్ని దిగ్గజాల దంత సమూహాలను చేరేటట్లు చేస్తాననటం ఒక క్రొత్తరూప కల్పన. ఏనుగుల దంతాలు తెల్లగా ఉంటాయి. అట్లాగే కీర్తికూడా తెల్లగా ఉంటుంది. ఆ సామ్యాన్ని పురస్కరించుకొని కీర్తిని ఆ దంతాలకు చెందేటట్లు చేస్తాననటం విశేషం. సహజంగానే ఏనుగుల దంతాలు తెల్లగా ఉండగా పాండవుల కీర్తిచేత ఆ తెలుపు కలిగేటట్లు చేస్తాను అంటున్నాడు. చెందటం అంటే - సిద్ధించటం, చేరటం, వసించటం, కూడుకొనటం, సమీపించటం అనే అర్థా లున్నాయి. అంటే అంతకుముందు ఉండేదాన్ని మరికొంత ప్రజ్వలింపజేయటం అని కూడా అర్థం పొసగుతుంది.

ఇక గర్వాంధుడు అని దుర్యోధనుడికి ప్రయోగించిన విశేషణం కూడా ఎంతో అర్థవంతంగా ఉన్నది. తండ్రి ధృతరాష్ట్రుడు పుట్టుగ్రుడ్డి అయితే ఆయనను మించిన గ్రుడ్డితనం వీడు తన గర్వంతో తెచ్చిపెట్టుకొన్నాడు. అహంకారమూ, మదమూ కళ్ళకు కప్పిన మొప్పె దుర్యోధనుడు. వాడి బటువు చూచికొనే సైంధవుడు యుద్ధరంగానికి వచ్చి ఉన్నాడు. కాబట్టి, సైంధవు డేమిటి వాడికి సహాయంగా వచ్చిన సమస్త యోధులను సంహరిస్తా నంటున్నాడు శ్రీకృష్ణుడు.

వ. **అది క్రమంబునం జూచెద; వెల్లి నీవు మనయరదంబు పన్ని శైబ్య సుగ్రీవ మేఘపుష్ప వలాహకంబులను గనకమణి మాలికాలంకృతంబులం జేసి పూన్చి, గరుడధ్వజంబు సంఘటించి, చక్ర గదా శార్ఙ్గ ప్రముఖాస్త్ర శస్త్రంబులు దగు తెఱంగున నునిచికొని మైమఱువు దొడిగిరమ్ము; పాంచజన్య రవం బాకర్ణించి నప్పడ వేగంబ యెయిది కొను' మనిన విని దారుకుండు.** **354**

ప్రతిపదార్థం: అది= శత్రువులను ఎదుర్కొనటం లేదా వాళ్ళను సంహరించటం; క్రమంబునన్+చూచెదవు= క్రమంగా నీవే చూస్తావు (అది అడుగుపెట్టినప్పుడు సామర్థ్యంతో పూనికతో నిర్వహించాల్సిన పని అని భావం); ఎల్లి= రేపు; నీవు; మన+అరదంబున్+పన్ని= మన రథాన్ని ఏర్పాటు చేసి (యుద్ధానికి సిద్ధం చేసి); శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకంబులనున్= శైబ్యమూ, సుగ్రీవమూ, మేఘపుష్పమూ, వలాహకమూ అనే గుర్రాలను (మేఘపుష్పాన్నే పుష్పకం అనికూడా వ్యవహరిస్తారు); కనక, మణి, మాలికా+అలంకృతంబులన్= బంగారు, మణుల దండలతో అలంకరించబడిన వాటినిగా; చేసి= ఒనర్చి; పూన్చి= రథాలకు కట్టి; గరుడధ్వజంబున్= గరుత్మంతుడి గుర్తున్న జెండాను; సంఘటించి= కూర్చి, అమర్చి; చక్ర, గదా, శార్ఙ్గ ప్రముఖ+అస్త్ర+శస్త్రంబులున్= సుదర్శనచక్రం, గద, విల్లు, బాణాలు, ఆయుధాలు; తగు తెఱంగునన్= తగినవిధంగా; ఉనిచికొని= ఉంచుకొని(ఉండునట్లు చేసికొని); మైమఱువున్= కవచాన్ని; తొడిగి= ధరించి; రమ్ము= రావలసింది; పాంచజన్యరవంబు= పాంచజన్యం అనే శంఖం యొక్క ధ్వని; ఆకర్ణించినప్పుడు+అ= విన్నప్పుడే; వేగంబ= త్వరగా; ఎయిదికొనుము= వెంబడించుము (రమ్ము); అనినన్= అని కృష్ణుడు చెప్పగా; విని; దారుకుండు= శ్రీకృష్ణుడి రథసారథియైన దారుకుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నా శత్రు సంహారాన్ని ఒక వరుసలో నీవే చూస్తావు. రేపు నీవు మన రథాన్ని సిద్ధం చేయుము. శైబ్య,సుగ్రీవ,మేఘపుష్ప, వలాహకాలనే గుర్రాలను బంగారుమణుల దండలతో అలంకరించి, గరుడధ్వజాన్ని నిలిపి, చక్రం, గద, శార్ఙ్గం మొదలైన అస్త్రశస్త్రాలను రథంలో పదిలంగా ఉంచుము. నీవు కవచాన్ని తొడుగు కొని రమ్ము.పాంచజన్యంపూరించగానే నీవు విజృంభించుము' అని అనగా, ఆ మాటలు విని దారుకుడు. (తరువాతి పద్యంతోఅన్వయం).

విశేషం: శ్రీకృష్ణుడు తాను అర్జునుడికి రథసారథి. తనకు రథసారథి దారుకుడు. యుద్ధానికి సర్వ సన్నద్ధుడై తానే యుద్ధాన్ని చేస్తానని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో రేపు ఉదయం బయలుదేరాలని చెప్పుతూ ఎట్లా సంసిద్ధం కావాలో దారుకుడికి శ్రీకృష్ణుడు వివరించాడు. మనం మన ఇంటిలోని పెంపుడు జంతువులకు ఎట్లా పేర్లు పెట్టుకొంటామో అట్లే నాలుగు గుర్రాల పేర్లు కూడా ఈ వచన భాగంలో తెలుపబడ్డాయి.

చ. **'అలఘువిచార! యట్ల తగు; నప్పని సేసెద; నంత సేయఁగా**
వలయునె? యెవ్వ రక్కడ నవార్యులు క్రీడికి సారథిత్వముం
దలకొని నీ వనూన శుభదం బగు వర్తన మాచరింప నీ
నిలుపును బార్థు చాలుటయు నేఁడుగదా భువనం బెఱింగెడున్. **355**

ప్రతిపదార్థం: అలఘు విచార!= గొప్ప ఆలోచన కలవాడా! (శ్రీకృష్ణా! అని సంబోధన); అట్లు+అ+తగున్= అట్లే, తప్పనిసరి అవుతుంది; ఆ+పని చేసెదన్= (మీరు చెప్పిన) ఆ కార్యం చేస్తాను; అంత= ఆ కొలది; చేయఁగాన్+వలయును+ఎ!= చేసి తీరవలసిందేనా!; నీవు; సారథిత్వమున్= సారథిగా ఉండటాన్ని; తలకొని= వహించి లేదా అవలంబించి; అనూన= గొప్ప; శుభదంబు+అగు= మేలు కలిగించేదైన; వర్తనమున్+ఆచరింపన్= (స్థితిని కలిగించగా) వృత్తి లేదా నడవడిని నిర్వహించగా; క్రీడికిన్= అర్జునుడికి; అక్కడన్= ఆ యుద్ధంలో; అవార్యులు= అడ్డగించ దగనివాళ్ళు; ఎవ్వరు= ఎవరు (ఉన్నారు); నీ+నిలుపునున్= నీ స్థైర్యం లేదా ప్రాపును; పార్థు+చాలుటయున్= అర్జునుడి సామర్థ్యమున్నూ; భువనంబు= లోకం; నేఁడు కదా!= ఈ దినం కదా!; ఎఱింగెడున్= తెలిసికొన గలుగుతుంది.

తాత్పర్యం: 'గొప్ప ఆలోచన కల ఓ శ్రీకృష్ణా! నీవు చెప్పినట్లే చేయదగును. నీవు ఆదేశించిన పని చేస్తాను. కాని, అంత చేయటం అవసరమా? అర్జునుడికి నీవు సారథిగా ఉండి గొప్ప శుభాన్ని గూర్చే స్థితిని కలిగిస్తే (శుభప్రదమైన వృత్తిని పాటిస్తే) ఇక అర్జునుడు అడ్డగించటానికి సాధ్యంకానివాళ్ళెవరున్నారక్కడ? నీ స్థైర్యాన్ని, ఆ అర్జునుడి సామర్థ్యాన్ని లోకం ఈ రోజు కదా తెలిసికొంటుంది'

విశేషం: 'అలఘువిచార!' అనే పద్యం ఎత్తుగడ గానీ, సాభిప్రాయమైన ఆ సంబోధన లోని అర్థవిశేషం గానీ ఎంతో గంభీరంగా, ఔచిత్య స్ఫోరకంగా, ఆ మొత్తం సన్నివేశాన్ని మనముందు ఉంచే విధంగా అభివ్యక్తమైనది. పార్థుడికి నీవు నిర్వహించే సారథ్యం. శుభప్రదమై సత్‌స్థితిని కలిగిస్తుంది. నీ ప్రాపు, అతడి సామర్థ్యం లోకానికి ఈ దినమే వెల్లడి అవుతాయి. అని దారుకుడు దృఢంగా తన నిశ్చయాన్ని తెలిపాడు. కాని, తాను సారథిగా ఉండి రథికుడు చెప్పేదాన్ని ఎట్లా కాదంటాడు? అందుకే 'అట్ల తగు అప్పని సేసెద' అని అన్నాడు. మళ్ళీ వెంటనే 'అంత సేయగా వలయునె' అని మనస్సులోని అసలు విషయాన్ని బయటపెట్టాడు.

వ. **అని సవినయంబుగాఁ బలికి దనుజమర్దను తమకంబు వారించె; నంతఁ 'బాంచజన్య రవాభిజ్ఞానంబు సవిశేషంబుగా నతనిచేత వినికొని తత్కాలంబున నాలంబులోనికి నరదంబు గొనివచ్చెద' ననియె; వెండియు వాసుదేవుండు సూతునితోడ సముచిత సల్లాపంబులు సేయుచుండె; నంత నట బీభత్సుండు ప్రతిజ్ఞోత్సాహంబు నిర్వహించు తెఱంగు దలంచుచు దామోదర కృత స్థండిల శయనంబున నుండి శోకనిద్రా వివశుండయ్యెఁ; నయ్యవసరంబునం గలలోనం గృష్ణుం డతనిపాలికిం బోయిన, నాతండు భక్తిం బ్రత్యుత్థానంబు సేసి తనయున్న సెజ్జ యిచ్చి, తొలంగి నిలుచుండ, నమ్మురారి యాసీనుండై యుండి యతని కిట్లనియె.356**

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; సవినయంబుగాన్= వినయంతో కూడుకొన్నట్లుగా; పలికి= మాటాడి; దనుజమర్దను+తమకంబున్= రాక్షసులను సంహరించేవాడైన శ్రీకృష్ణుడియొక్క తొందరపాటును; వారించెన్= నివారించాడు; అంతన్= అటుపిమ్మట; పాంచజన్య రవ+అభిజ్ఞానంబు= పాంచజన్య శబ్దంయొక్క ఎఱుకను (గుర్తును); సవిశేషంబుగాన్= విశేషసహితంగా; అతనిచేతన్= ఆ కృష్ణుడివలన; వినికొని= విని; తద్+కాలంబునన్= ఆ సమయంలో; అరదంబు= రథం; ఆలంబులోనికిన్= యుద్ధంలోకి; కొనివచ్చెదన్= తీసికొని వస్తాను; అనియెన్= అన్నాడు; వెండియున్= పిదప; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; సూతునితోడన్= రథసారథితో; సముచిత సల్లాపంబులు= తగిన సంభాషణలు; చేయుచుండెన్= చేస్తూ ఉన్నాడు; అంతన్= ఆ సమయంలో; అట= అక్కడ; బీభత్సుండు= అర్జునుడు; ప్రతిజ్ఞా+ఉత్సాహంబున్= శపథం యొక్క ప్రయత్నాన్ని; నిర్వహించు తెఱంగున్= దర్భశయ్యపైన (స్థండిలం అనగా, వ్రతాదులు పూనినవాళ్ళు పవళించటానికి దర్భాదుల చేత సంస్కరించబడ్డ భూమి); ఉండి; శోకనిద్రా వివశుండు+అయ్యెన్= దుఃఖంచేత నిద్రచేత; ఒళ్ళు మరచిన వాడు అయ్యాడు; ఆ+అవసరంబునన్= ఆ సందర్భంలో; కలలోనన్= స్వప్నంలో; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; అతనిపాలికిన్= అర్జునుడి దగ్గరకు; పోయినన్= పోగా; ఆతండు= ఆ అర్జునుడు; భక్తిన్= భక్తితో; ప్రత్యుత్థానంబున్+చేసి= లేచి నిలబడి; తన+ఉన్న సెజ్జన్= తాను ఉండే పడకను; ఇచ్చి; తొలంగి, నిలుచుండన్= (గౌరవాన్ని ప్రకటిస్తూ మర్యాదగా) కొంత దూరంలో నిలిచి ఉండగా; ఆ+మురారి= ఆ శ్రీకృష్ణుడు; ఆసీనుండు+ఐ= కూర్చున్నవాడై ఉండి; అతనికిన్= అర్జునుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు:

తాత్పర్యం: అని దారుకుడు విన్నవించి శ్రీకృష్ణుడి తొందరను తగ్గించాడు. పాంచజన్యం మ్రోగిన గుర్తును తెలిసికొని రణరంగంలోకి రథాన్ని తెస్తానని చెప్పాడు దారుకుడు. ఆ తరువాత అతడితో శ్రీకృష్ణుడు తగిన మాటలాడుతూ ఉండిపోయాడు. ఇక అక్కడ అర్జునుడు ప్రతిజ్ఞను నిర్వహించే విధాన్ని తలచుకొంటూ శ్రీకృష్ణుడు ఏర్పాటు చేసిన దర్భశయ్యమీద శోకంతో నిద్రలో మునిగిపోయాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు కలలో అతడిని సమీపించాడు. అతడు వినయంతో లేచి తన సెజ్జ మీద శ్రీకృష్ణుడిని కూర్చుండబెట్టి, సమీపంలో తాను నిలబడి ఉండగా శ్రీకృష్ణు డతడితో ఇట్లా అన్నాడు:

క. వగపున కెడ యీకుము; నె । వ్వగఁ గుందిన మానవుండు వైరులచేతన్
దెగుఁ గాని తనదు కార్యముఁ । దగ నొనరింపంగ లేఁడు; తగునే వగవన్?' 357

ప్రతిపదార్థం: వగపునకున్= దుఃఖానికి; ఎడ+ఈకుము= సందు ఈయవద్దు; నెవ్వగన్= మిక్కిలి దుఃఖంతో; కుందిన= కుమిలిన (బాధపడిన); మానవుండు= నరుడు; వైరులచేతన్= శత్రువులచేత; తెగున్+కాని= నశిస్తాడు కాని; తనదు కార్యమున్= తన పనిని; తగన్= తగునట్లు; ఒనరింపఁగన్+లేఁడు= చేయలేడు; వగవన్= దుఃఖించగా; తగునే?= న్యాయమా?(యుక్తమా?)

తాత్పర్యం: దుఃఖానికి అవకాశం ఇవ్వవద్దు. దుఃఖంతో బాధపడే నరుడు శత్రువుల చేత నశిస్తాడే కాని తన పనిని తాను తగు విధంగా చేయలేడు. దుఃఖించటం సబబా?

విశేషం: దుఃఖించటం వలన తన వినాశాన్ని తానే తెచ్చుకొన్న ట్లవుతుంది. కాబట్టి శోకించటం తగదు అని ఈ పద్యంలోని సారాంశం.

వ. అనిన విని యతం డతని కిట్లనియె. 358

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆకర్ణించి; అతండు= అర్జునుడు; అతనికిన్= శ్రీకృష్ణుడితో; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా విని అర్జునుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

క. 'వగ పింక నెన్నఁటికి దెగు? । మిగిలి ప్రతిన పూరగింప మేకొని చను నా
మగటిమియు లావు మాన్పుట । తగవే గురునకు నతండు దానికిఁ బూనన్. 359

ప్రతిపదార్థం: వగపు= దుఃఖం; ఇంకన్= ఇక; ఎన్నఁటికిన్= ఎప్పటికి; తెగున్?= నశిస్తుంది?; అతండు= ద్రోణాచార్యుడు; దానికిన్= నా ప్రతిజ్ఞకు భంగం కలిగించటానికి; పూనన్= ప్రయత్నించగా; మిగిలి= అతిశయించి; ప్రతిన= ప్రతిజ్ఞ; పూరగింపన్= నెరవేర్చటానికి; మేకొని=పూని; చను= పోయే; నామగటిమియున్= నా శౌర్యాన్నీ (పౌరుషాన్నీ); లావున్= బలాన్నీ; మాన్పుట= మానేటట్లు (విడిచేటట్లు) చేయటం; గురునకున్= ద్రోణాచార్యుడికి; తగవే?= తగినదేనా?

తాత్పర్యం: ఈ దుఃఖం ఇంకెప్పటికి నశిస్తుంది? ఆ ద్రోణుడు నా ప్రతిజ్ఞాభంగానికి ప్రయత్నించగా, నా ప్రతిజ్ఞను నెరవేర్చటానికి పూనుకొని యుద్ధరంగానికి పోయే నా శౌర్యాన్నీ, బలాన్నీ (విరమింపజేయడం) మానేటట్లు చేయటం ఆ ఆచార్యుడికి తగినదేనా?

క. ఇనతనయ సహిత మడ్డము । సనుదెంచు జనంబు పెల్లు సైంధవుఁడు బలం
బున కెల్ల వెనుక నునికియు । మనమునఁ దలపోయ వగపు మానునె నాకున్?' 360

ప్రతిపదార్థం: ఇనతనయ+సహితము= కర్ణుడితో కూడుకొన్నదై; అడ్డము+చనుదెంచు= అడ్డుగా వచ్చే; జనంబు+పెల్లు= జనంయొక్క గుంపు (అతిశయం లేదా ఆధిక్యం); సైంధవుఁడు= సింధుదేశపు రాజైన జయద్రథుడు; బలంబునకున్ ఎల్లన్= సైన్యానికి అంతటికీ; వెనుకన్+ఉనికియున్= వెనుకవైపు ఉండటమున్నూ; మనమునన్= మనస్సులో; తలపోయన్= ఆలోచించగా; నాకున్= నాకు; వగపు= దుఃఖం; మానునె?= ఆగుతుందా? (తగ్గుతుందా?)

తాత్పర్యం: కర్ణుడితో కూడా అడ్డగించటానికి వచ్చే ఆ సైన్యసమూహం యొక్క అతిశయమున్నూ, సైంధవుడు సైన్యానికంతటికీ వెనుక దాగి ఉండటమున్నూ ఆలోచించగా నాకు దుఃఖం ఆగుతుందా?'

విశేషం: 'జనంబు పెల్లు' అను ప్రయోగాలలో తత్సమమూ అచ్చ తెలుగు పదం చక్కగా కూర్చబడ్డాయి. కంద పద్యంలో ఆఱవగణం జగణం ఉండి తీరాలి. ఆ సందర్భంలో 'పెల్లు' పద్యగతికి ఒక విలక్షణ స్ఫూర్తిని కలిగించింది. సైంధవుడు దాగే విషయాన్ని 'బలంబున కెల్ల వెనుకనునికి' అని తిక్కన పేర్కొన్నాడు. ఈ ప్రయోగంలో కూడా బలంబు అను తత్సమం తర్వాత అన్నీ అచ్చతెనుగు పదాలే. ఇట్లే చివరిపాదం ఆది ప్రయోగం 'మనము' తప్ప మిగిలిన అచ్చతెనుంగు పదాలలో అనితరమైన అర్థస్ఫూర్తిని కన్నులకు కట్టేటట్లు వెల్లడించే ప్రత్యక్షీకరణ నాటకీయతను ప్రదర్శించాడు.

కృష్ణార్జునులు స్వప్నమందుఁ గైలాసమునకుఁ బోవుట (సం. 7-57-24)

వ. అనిన నచ్యుతుం 'డది యట్టిద! కాదె!' యని పలికి తదీయ హితార్థియై యుపాయంబువిచారించి, యుపస్పర్శనంబాచరించి,తూర్పు మొగంబై యుండి, యవ్విజయు వీక్షించి, శూలపాణికిం బరమ సాధనం బైన పాశుపతంబు నీకుంబ్రస్ఫుట పరిజ్ఞానం బయిన నీవు జయద్రథవధం బవశ్యంబును జేయుదు; వమ్మహాస్త్రంబు కలిమి సమంత్రక ముష్టిక స్థానక విజ్ఞానంబుగాఁ గ్రొత్త సేసికొనుట మేలు; తదర్థంబుగా నద్దేవుఁ జిత్తంబున నిలిపి సభక్తిక ధ్యానంబు సేయు' మనవుడుఁ గిరీటియుం గృతాచమనుండును భూసమాసీనుండును నై పరమేశ్వర స్మరణ తత్పరత్వంబున నుండి, కృష్ణుండును దానును గగనంబున కెగయుటయు, నతండు దన వలచేయి వట్టికొని చనుదేరం దా రిరువురు నుత్తరాభిముఖులై పోవుటయుం గాంచె; నవ్విధం బున వారలు చారణసిద్ధ గంధర్వ సేవితంబైన పథంబున వివిధ విశేషంబు లాలోకించుచుం బోయికైలాసంబుఁగని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యందు సరిత్సరోవర సుందరంబును బుష్పలతా భూషితంబును రమ్యతరు సంతాన కాంతంబును నయిన కుబేర విహారస్థానంబు సూచుచుం జనిచని, దాని కనతి దూరంబున మహనీయ మణిమయంబయి తేజరిల్లు మహామందిరంబు సొచ్చి, యచ్చటఁ బ్రమథగణ పరివృతుండును, బార్వతీ సహితుండును, బ్రద్యోతన సహస్ర ప్రభా విభాసమానుండును, దివ్యోత్తమ సేవ్య మానుండును, మహాముని ప్రస్తూయమానుండును, నప్పరోజన సంగీత మంగళమహిత పురోభాగుండును నై పేరోలగంబున నుండి శోభిల్లు శంకరు దర్శించి, సప్రణవోచ్చారణంబుగా దండ ప్రణామంబు లాచరించి యున్న నన్నరనారాయణుల దెసం బ్రసాదమందస్మిత సుందర విలోకనంబు లొలయ నయ్యిందుధరుండు మధురస్వనంబున నిట్లనియె. 361

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; అది+అట్టిద+కాదె!= అది అటువంటిదే కదా!; అని+పలికి= అని మాటాడి; తదీయ, హిత+అర్థి+ఐ= ఆతడి యొక్క మేలు కోరినవాడై; ఉపాయంబున్+విచారించి= ఉపాయాన్ని ఆలోచించి; ఉపస్పర్శనంబు+ఆచరించి= ఆచమనం చేసి; తూర్పుమొగంబు+ఐ+ఉండి= తూర్పువైపు మొగం కలవాడై ఉండి; ఆ+విజయున్= ఆ అర్జునుడిని; వీక్షించి= చూచి; శూలపాణికిన్= పరమేశ్వరుడికి; పరమసాధనంబు+ఐన+పాశుపతంబు= ఉత్కృష్ట (శ్రేష్ఠ)మైన పరికరమైన పాశుపతం; నీకున్= నీకు; ప్రస్ఫుట+పరిజ్ఞానంబు+అయినన్= వికసించే విశిష్టమైన ఎఱుక కలిగింది అయితే; నీవు; జయద్రథ+వధంబున్= సైంధవుడిని చంపటాన్ని; అవశ్యంబునున్= తప్పకుండా; చేయుదువు= చేస్తావు; ఆ+మహా+అస్త్రంబు కలిమి= ఆ గొప్ప అస్త్రం కలిగి ఉండటంచేత; సమంత్రక, ముష్టిక, స్థానక, విజ్ఞానంబుగాన్= మంత్ర పూర్వకంగా పిడికిలికి సంబంధించిన ప్రదేశంలో ఉండే విశేషజ్ఞానం కలిగిందిగా; క్రొత్త, చేసికొనుట= క్రొత్తగా సంపాదించటం; మేలు= శుభం; తద్+అర్థంబుగాన్= (దానికొఱకై) ఆ ప్రయోజనానికై; ఆ+దేవున్= ఆ శివుడిని; చిత్తంబునన్+నిలిపి= మనస్సులో నిలిపి; సభక్తిక ధ్యానంబు+చేయుము= భక్తిపూర్వకంగా ధ్యానాన్ని చేయాల్సింది; అనవుడున్= అనిన వెంటనే; కిరీటియున్= అర్జునుడున్నూ; కృత+ఆచమనుండు+అగుచున్= ఆచమనం చేసినవాడు ఔతూ; భూ+సమాసీనుండున్+ఐ= భూమిపై బాగా ఆసీనుడై; పరమేశ్వర స్మరణ తత్పరత్వంబునన్+ఉండి= శివుడిని స్మరించే ఆసక్తితో ఉండి; కృష్ణుండునున్+తానునున్= శ్రీకృష్ణుడున్నూ, తానున్నూ; గగనంబునకున్= ఆకాశానికి; ఎగయుటయున్= ఎగురుటయున్నూ; అతండు= కృష్ణుడు; తనవలచేయి, పట్టికొని, చనుదేరన్= తన కుడిచేయి పట్టుకొని రాగా; తారు= తాము; ఇరువురును= ఇద్దరున్నూ; ఉత్తర+అభిముఖులు+ఐ= పోవుటయున్= ఉత్తరం వైపుగా పోవటమున్నూ; కాంచెన్= చూచాడు; ఆ+విధంబునన్= ఆ రీతిగా; వారలు= ఆ కృష్ణార్జునులు; చారణ, సిద్ధ, గంధర్వ సేవితంబు+ఐన, పథంబునన్= చారణులు, సిద్ధులు, గంధర్వులచేత (సేవించ) పూజించబడే మార్గంలో; వివిధ విశేషంబులు+ఆలోకించుచున్= రకరకాల వింతలు చూస్తూ; పోయి; కైలాసంబున్+కని= కైలాసాన్ని చూచి; అందున్= ఆ కైలాసంలో; సరిత్+సరోవర+సుందరంబునున్= నదులు సరస్సులచేత అందమైనదియును; పుష్ప లతా భూషితంబునున్= పూలూ, తీగలచేత అలంకరించబడినదియున్నూ; రమ్య+తరు+సంతాన+కాంతంబునున్= అందమైన చెట్ల గుంపుచేత ప్రకాశించేదిన్నీ; అయిన, కుబేర, విహార, స్థానంబు= అయినటువంటి కుబేరుడు వేడుకగా తిరిగే వనప్రదేశం; చూచుచున్+చని+చని= చూస్తూ పోయి పోయి; దానికిన్= ఆ విహారస్థలానికి; అనతిదూరంబునన్= చాలా తక్కువ దూరంలో; మహనీయ, మణి, మయంబు+అయి= గొప్ప మణులు కలిగినదై; తేజరిల్లు= ప్రకాశించే; మహామందిరమ్ము= గొప్పనివాసం; చొచ్చి= ప్రవేశించి; అచ్చటన్= ఆ మందిరంలో; ప్రమథగణ పరివృతుండును= ప్రమథుల మొత్తంచేత పరివేష్టించ బడ్డవాడున్నూ; పార్వతీ సహితుండును= పార్వతితో కూడుకొన్న వాడున్నూ; ప్రద్యోతన, సహస్ర, ప్రభా, విభాసమానుండును= వేయిమంది సూర్యులయొక్క కాంతులచేత మిక్కిలి ప్రకాశించేవాడున్నూ; దివ్యోత్తమ సేవ్యమానుండునున్= శ్రేష్ఠులైన దివ్యులచేత పూజించబడే వాడున్నూ; మహాముని ప్రస్తూయమానుండును= గొప్ప ఋషులచేత కీర్తించబడేవాడున్నూ; అప్సరస్, జన, సంగీత, మంగళ, మహిత, పురోభాగుండును+ఐ= అప్సరస్ స్త్రీల సంగీతంచేత, కల్యాణకరమైన గొప్ప ముంగిలి ప్రదేశం కలవాడున్నూ అయి; పేరోలగంబునన్= పెద్ద కొలువులో; ఉండి; శోభిల్లు= ప్రకాశించే; శంకరున్= శివుడిని; దర్శించి= చూచి; సప్రణవ+ఉచ్చారణంబుగాన్= ఓంకార సహితమైన ఉచ్చారణ కలిగేటట్లుగా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దండ+ప్రణామంబులు+ఆచరించి+ఉన్నన్= కర్రవలె నేలపైబడి అష్టాంగాలు నేలకు తాకేటట్లుగా నమస్కారాలు చేసి ఉండగా; ఆ+నర+నారాయణుల దెసన్= ఆ నరుడూ, నారాయణుడూ - ఇరువురి వైపు; ప్రసాద మంద స్మిత సుందర విలోకనంబులు+ఒలయన్= ప్రసన్నమైన చిరునవ్వులతో, రమణీయములైన చూపులు ప్రసరించగా; ఆ+ఇందుధరుండు= చంద్రుడిని తలపై ధరించిన ఆ శివుడు; మధుర స్వరంబునన్= మాధుర్యం గల కంఠధ్వనితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని అర్జునుడు అనగా శ్రీకృష్ణుడు 'అది అంతే' అని పలికి, అతడికి మేలు చేయగోరి ఆచమించి తూర్పు మొగంగా కూర్చుండి అర్జునుడితో ఇట్లా అన్నాడు: 'ఈశ్వరుడికి శ్రేష్ఠమైన సాధనం పాశుపతం. దానిని నీవు సమగ్రజ్ఞాన స్ఫూర్తితో స్మరిస్తే సైంధవుడిని తప్పక చంపగలవు. ఆ మహాస్త్రాన్ని మంత్రసహితంగా నీ గుప్పిట నిలిచేటట్లు క్రొత్తగా సన్నిధానం చేసికొనటం మేలు. కాబట్టి, ఆ దేవదేవుడిని మనసులో స్మరించి భక్తితో ధ్యానం చేయుము' అనగా అర్జునుడు ఆచమించి నేలపైకూర్చుండి శివధ్యాన తత్పరుడయ్యాడు. ఆ ధ్యానంతో కృష్ణుడూ అర్జునుడూ ఆకాశానికి ఎగశారు. కృష్ణుడు అర్జునుడి కుడిచేయి పట్టుకొని ముందుకు తీసికొనిపోతూ ఉండగా; వారు చారణులు, సిద్ధులు మొదలైనవారు విహరించే మార్గంలో అనేక విశేషాలు చూస్తూ కైలాసానికి చేరుకొన్నారు. నదులతో, సరోవరాలతో, పూలలతలతో సుందరంగా శోభించే కుబేర విహారక్షేత్రాన్ని దర్శించి దూరంగా ఉన్న ఒక గొప్ప మణిమయ భవనంలో ప్రవేశించి, అందులో ప్రమథగణాలతోనూ, పార్వతీదేవితోనూ కూడుకొని వేయిసూర్యుల వెలుగుతో వెలుగొందే శివుడిని మహామునులు సేవిస్తున్న సమయంలో దర్శించారు. ఓంకారంతో దండప్రణామం చేశారు. పరమశివుడు ఆ నరనారాయణులను చిరునవ్వు చిందే ముఖంతో దయామయమైన చూపులతో చూచి, తియ్యని మాటలతో ఇట్లా అన్నాడు:

క. 'స్వాగతమే మీ యిద్దఱ । యాగమనంబునకు హేతు వగు కోర్కి యను
ద్వేగంబున నెఱిఁగింపుఁడు; । వేగమ యొడఁ గూర్తు నెల్ల విధముల దానిన్.' 362

ప్రతిపదార్థం: స్వాగతమే!= క్షేమమే కదా!; మీ+ఇద్దఱ= మీ ఇరువురి; ఆగమనంబునకున్= రాకకు; హేతువు+అగు కోర్కి= కారణమైన వాంఛ; అనుద్వేగంబునన్= ఉద్వేగం అనగా భీతి, కలతా లేకుండా; ఎఱిఁగింపుఁడు= తెల్పండి; ఎల్లవిధములన్= అన్నివిధాలా; దానిన్= ఆ మీ కోర్కెను; వేగము+అ= తత్ క్షణమే (తొందరగా); ఒడఁ గూర్తున్= తీరుస్తాను.

తాత్పర్యం: 'క్షేమమే కదా! మీ ఇద్దరి రాకకు కారణం ఏమిటో! ఉద్వేగం లేకుండా చెప్పండి. వెంటనే మీ కోర్కెను అన్ని విధాల తీరుస్తాను.'

విశేషం: తమ ఇంటికి వచ్చిన అతిథులను రాగానే క్షేమసమాచారాలు అడగటం ప్రథమధర్మం. వా రే ఉద్దేశంతో ఆశ్రయించారో అది తెలిసికొనటం ద్వితీయధర్మం. వెంటనే వారి కోర్కె తీర్చటం తృతీయధర్మం. ఇక్కడ 'అనుద్వేగకర' మైన తీరులో తెలుపండి. అనటం చాలా చక్కగా ఉన్నది. 'కలతా, తొట్రుపాటు, బాధ లేకుండా నిర్భయంగా అడగండి' అంటూ అభయమీయటం గమనార్హం. అనుద్వేగ కరమైన వాక్యం సాత్త్వికమైన వాచిక తపస్సును తెలుపుతుంది.

వ. అనినం బ్రీత చేతస్కులగుచు నుత్థితులై లలాటంబుల నంజలిపుటంబులు ఘటించి నిలిచి వాసుదేవార్జునులు తమ చిత్తంబులు భక్తిరసంబున జొత్తిల్లుచుండ. 363

ప్రతిపదార్థం: అనినన్= అని శంకరుడు పలుకగా; ప్రీత+చేతస్కులు+అగుచున్= ప్రీతి చెందిన మనస్సులు కలవారౌతూ; ఉత్థితులు+ఐ= పైకి లేచినవారై; లలాటంబులన్= నొసటి ప్రదేశాలలో; అంజలి పుటంబులు= దొప్పలవంటి దోసిళ్ళు (చేమోడ్పులు);

ఘటించి= కూర్చి; నిలిచి= ఎదుట నిలిచి; వాసుదేవ+అర్జునులు= శ్రీకృష్ణుడూ, అర్జునుడూ; తమ+చిత్తంబులు= తమ మనస్సులు; భక్తిరసంబునన్= భక్తి అనే రసంతో; జొత్తిల్లుచుండన్= రంజిల్లుచుండగా

తాత్పర్యం: అనగా సంతోషించి శ్రీకృష్ణార్జునులు లేచి నుదుట దొప్పలవంటి చేతులు మొగిడ్చి, తమ మనస్సులు భక్తిరసంతో రంజిల్లుతూ ఉండగా.

చ. 'రవి శశివహ్నిలోచన ! సుర ప్రతివీర విమర్దన క్రమా!
భువనమయాత్మకా! భుజగభూషణ! పోషితభక్త! సంయమి
స్తవన కథావధానపర! దర్పకదర్ప హరా! నిరస్త సం
భవమరణాది వైకృత! యపారగుణా! గుణ దోష వర్జితా! 364

ప్రతిపదార్థం: రవి, శశి, వహ్ని, లోచన!= సూర్యుడు, చంద్రుడు, అగ్ని కన్నులుగా కలవాడా!; సుర, ప్రతివీర, విమర్దన, క్రమా!= దేవతలకు (ప్రతివీరులైన) శత్రువులైన రాక్షసులను చంపుటలో సామర్థ్యం (బలిమి) కలవాడా!; భువన, మయ+ఆత్మకా!= సకలలోకాలు కలిగినట్టి వాడా! విశ్వమయమైన(స్వరూపం) ఆత్మకలవాడా!; భుజగభూషణ!= సర్పాలు ఆభరణాలుగా కలవాడా!; పోషితభక్త!= పోషించబడిన (రక్షించబడిన) భక్తులు కలవాడా!; సంయమి, స్తవన, కథా+అవధాన, పర= ఋషీశ్వరుల స్తోత్రాలు కథలు మనస్సున నిలుపుటలో ఆసక్తి కలవాడా!; దర్పక, దర్ప, హరా!= మన్మథుడి గర్వాన్ని హరించినవాడా!; నిరస్త, సంభవ, మరణ+ఆది, వైకృత!= తిరస్కరించబడిన పుట్టుక, చావు మొదలైన వికారాలు కలవాడా!; అపారగుణా!= హద్దులేని గుణాలు కలవాడా!; గుణదోష వర్జితా!= గుణాలను, దోషాలను వదలినవాడా!

తాత్పర్యం: సూర్య చంద్రాగ్నులు కన్నులైనవాడా! అమరుల శత్రువులైన అసురులను మర్దించే బలం కలవాడా! లోకములే తానైనవాడా! పాములు ఆభరణంగా కలవాడా! భక్తులను పోషించేవాడా! మహర్షుల స్తోత్రాలను, కథలను మనస్సునందు నిలుపుటలో ఆసక్తి కలవాడా! మన్మథుడి గర్వాన్ని హరించినవాడా! చావు, పుట్టుకలు మొదలైన వికారాలకు అతీతుడైనవాడా! హద్దులేని వాత్సల్యాది గుణాలు కలవాడా! త్రిగుణాలు దోషాలు వర్జించినవాడా!

విశేషం: ఇది శివస్తుతి పద్యం. ఆరంభంనుండి పద్యం చివరివరకు అన్నీ సంబోధనలే. శివుడి మూడునేత్రాల ప్రసక్తితో పద్యారంభం. చిట్టచివర తొమ్మిదవ సంబోధనలో అపారగుణ! అని వెంటనే పద్యాంతాన్ని గుణ దోషవర్జితా! అని గుణాతీతమైన తత్త్వంతో పరిసమాప్తం చేశాడు.

క. జగములు గలిగింపఁగ నవి । దగు వర్ధన మొంద నిలుపఁ దఱితో వానిం
దెగఁ జేయ నీవ నేర్పరి । వగుట శ్రుతులు సెప్పు నిర్మలాద్భుతమూర్తీ! 365

ప్రతిపదార్థం: నిర్మల+అద్భుత మూర్తీ!= పవిత్రమైన, ఆశ్చర్యకరమైన స్వరూపం కలవాడా! (ఓ పరమేశ్వరా! అని సంబోధన); జగములు= లోకాలు; కలిగింపఁగన్= సృష్టించగా; అవి= ఆ లోకాలు; తగు వర్ధనము+ఒందన్+నిలుపన్= (సరి అయిన) తగిన (ఉనికి) అభివృద్ధిని (స్థితి-నడవడి) పొందటానికై రక్షించగా; తఱితోన్= సమయానుకూలంగా, లేదా వెనువెంటనే; వానిన్= ఆ లోకాలను; తెగన్+చేయన్= నశింపచేయగా; ఈవు+అ= నీవే; నేర్పరివి= సమర్థుడవు; అగుటన్= కావటాన్ని; శ్రుతులు= వేదాలు; చెప్పున్= వక్కాణిస్తున్నాయి.

తాత్పర్యం: పవిత్రమైన, ఆశ్చర్యకరమైన స్వరూపం కలవాడా! లోకాలు సృష్టించటానికి, అవి తగిన (ఉనికి) స్థితిని పొంది రక్షించబడటానికి, కాలం గడువు తీరగా వెంటనే నశింపజేయటానికి నీవే సర్వసమర్థుడ వని వేదాలు నొక్కి వక్కాణిస్తున్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'తగు వర్ధన మొంద నిలుప' అనే ప్రయోగంలో 'నిలుపన్' అను క్రియాపద మొక్కటే చాలు. కానీ దానికి అనుబంధంగా పేర్కొన్న వాక్యంలో 'తగు వర్తనము' అనే పాఠాంతరము అనేకార్థాలలో ప్రయుక్తమైంది సరి అయిన నడవడి లేదా జీవనం కలిగేటట్లు,లేక యోగ్యమైన స్థితి, ఉనికి ఉండేటట్లు అనే అర్థాలు స్ఫురిస్తున్నాయి. అట్లే 'తతితో' అనే ప్రయోగం కూడా. అనేకార్థస్ఫూర్తి కలిగి ఉన్నది. నిర్మలాద్భుతమూర్తీ! అని సంబోధన శివుడి పరంగా అతడి స్వరూప స్వభావాలను సమన్వయిస్తూ కూర్చబడింది. శివుడు కాటిబూడిద, పుర్రె, పులితోలు, ప్రమథగణంతో శ్మశానవాటికా సంచారం కలిగి పైకి అమంగళకరంగా అపవిత్రంగా కనిపిస్తాడు. కాని, అతడు పరమ నిర్మలుడు. ఇట్టి వైరుద్ధ్యం వలన మనకు ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుంది ఆయన స్వరూపం - అని తిక్కన తన ప్రయోగంలో నిరూపించాడు.

క. ప్రకృతి యనఁ బురుషుఁ డనఁగా ।వికృతు లనం బరఁగుచున్న వీనికి నెల్లన్
సకలాత్మక! నీ విభవము । యకృత్రిమాధారభూతమై యుండు శివా! 366

ప్రతిపదార్థం: శివా!= మంగళకరమైనవాడా!; సకలాత్మక!= సమస్తమూ నీవై ఉండేవాడా!; ప్రకృతి+అనన్= పంచభూతాత్మకమై, సత్త్వాదిగుణ సామాన్యావస్థతో ఒప్పే స్వభావం అనగా; పురుషుఁడు+అనఁగాన్= సమస్త విశ్వానికి కారణభూతుడైన పురుషుడు అనేటట్లుగా; వికృతులు+అనన్= వికారాలు అనగా; పరఁగుచున్న= ఒప్పుతూ ఉండే; వీనికిన్+ఎల్లన్= వీటి అన్నింటికీ; నీ+విభవము= నీయొక్క గొప్పతనం, మహత్త్వం; అకృత్రిమ+ఆధారభూతము+ఐ+ఉండున్= సహజమైన (ఆదరువుకు) ఆలవాలానికి తగినదై ఉంటుంది.

తాత్పర్యం: మంగళకరమైనవాడా! ఓ శివా! అన్నీ నీవై ఉండేవాడా! ప్రకృతీ, పురుషుడూ మొదలైన వికారాలన్నింటికి నీ మహత్త్వమే సహజమైన ఆధారం.

విశేషం: అవ్యక్తమైన పరమాత్మ ప్రకృతిపురుష రూపంలో వ్యక్తం కావటమే వికృతి. విశ్వసృష్టికొరకు పరమాత్మ మాయను తన అధీనంలో ఉంచుకొని అనేక వికారాలను లీలామాత్రుడై ప్రదర్శిస్తూ ఉంటాడు. అతి సహజమైన ఆ స్వభావమే అన్నింటికీ ఆధారభూతమౌతూ ఉంటుంది. సర్వమూ తానే అయిన ఆ పరమశివుడు శుభానికీ, సుఖానికీ, మోక్షానికీ మూలం. కృత్రిమత్వం లేని సహజస్థితిలో పొందే ఆనందానికి అతడే గమ్యం. కృత్రిమత్వంలో స్వచ్ఛత ఉండదు. అది పై పై మెరుగులతో భ్రమప్రమాదాలు కలిగిస్తుంది. శివా! సకలాత్మకా! అనే రెండు సంబోధనలూ పరమేశ్వరుడి నిశ్చల, నిర్మల సహజగమ్య స్థితిని సూచిస్తూ, అన్నింటికీ అతీతమైన అతని విభవాన్ని ప్రతిపాదిస్తూ ఉన్నాయి.

క. అవ్యక్త మప్రమేయము । సువ్యక్త మనాది భక్తి సుగమ మగమ్యం
బవ్యయము త్రిలోచన! నీ । దివ్య మహిమ యాగమోపదేశము రుద్రా!' 367

ప్రతిపదార్థం: త్రిలోచన!= మూడు కన్నులు కలవాడా!; రుద్రా!= భయంకరుడవూ, మహనీయుడవూ అయిన ఓ పరమేశ్వరా!; నీ దివ్య+మహిమ= దివియందు పుట్టిన శ్రేష్ఠము, ఆశ్చర్యకరమైన నీ మాహాత్మ్యం; అవ్యక్తము= సృష్టికి బీజమై తెలియరాని మూల ప్రకృతి; అప్రమేయము= మితి చెప్పటానికి లేదా ఊహించటానికి అశక్యం; సువ్యక్తము= స్పష్టంగా తెలియబడేది; అనాది= ఆదిలేనిది అనగా నిత్యమైనది; భక్తిసుగమము= భక్తిచేత సులభమైనది; అగమ్యంబు= గమించటానికి లేదా పొందటానికి అశక్యమైనది; అవ్యయము= వ్యయం లేనిది (శుభమైనది); ఆగమ+ఉపదేశము= వేదాల హితవాక్యాలు కలిగినది.

తాత్పర్యం: త్రిలోచనా! రుద్రా! నీ దివ్య మహత్త్వం తెలియసాధ్యం కానిది. అపరిమితమైంది. సుస్పష్టమైంది. ఆదిలేనిది, భక్తిచేత సులభంగా పొందటానికి సులభమైనది, మరియు సాధ్యంకానిది, అక్షయమైంది, వేదాలచేత ఉపదేశింపబడింది.

విశేషం: పరమాత్మను ఇదమిత్థం అని నిర్వచించటం కష్టం. అందుకే అవ్యక్తం సువ్యక్తం సుగమం అగమ్యం అని ఉన్నట్లూ లేనట్లూ ద్వంద్వాత్మకంగా ప్రతిపాదించబడింది. అప్రమేయం, అనాది, అవ్యయం అనేవి మనబుద్ధిమేరకు అతీతమైన తత్త్వాన్ని ప్రకటిస్తున్నాయి. ఆ పరమాత్మను తెలిసికొనటానికి వేదమే ప్రమాణం అని తెలుపబడింది. రుద్రా! త్రిలోచన! అనే రెండు సంబోధనలు శివుడికి ప్రయోగించబడ్డాయి. ఇందులో రుద్రశబ్దం భయంకరత్వాన్నే గాక, గొప్పతనాన్ని కూడా తెలుపుతూ ఉన్నది. అన్నింటికి ప్రమాణమైన వేదమే రుద్రుడి మహనీయతను వివరించగలుగుతుంది.

వ. అని మఱియు ననేక ప్రకారంబుల నవాఙ్మానసగోచరుండగు నప్పరమేశ్వరుం బ్రస్తుతించి; రప్పు డచ్యుతుండు పార్థునిం బాశుపతం బర్థింపు మని కఱపిన, నతం డవ్వరంబు వేఁడుటకై విశ్వేశ్వరుం దప్పక చూచి తాను మున్ను ముకుందునందు సమర్పించిన నిశాసమయ పూజా ద్రవ్యంబు లగు మాల్యానులేపనంబు లద్దేవుని దివ్యదేహంబునం గాంచి యచ్చెరువంది, యమ్మురహర పురహరుల యేకత్వంబు మనంబునం గొనియాడి, 'దేవా! భవదీయ దివ్యాస్త్రంబు దయసేయు' మని విన్నవించుటయు భక్తవత్సలుం డగు శక్తినాథుండు గృష్ణు లిరువురను దరహాసంబుతో నవలోకించి. 368

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; మఱియున్= మరల; అనేక ప్రకారంబులన్= వివిధ విధాలుగా; అవాక్+మానస, గోచరుండు+అగు= మాటలకూ మనస్సుకూ అందని (గోచరం కాని) వాడైన; ఆ+పరమేశ్వరున్= ఆ మహేశ్వరుడిని; ప్రస్తుతించిరి= కొనియాడారు; అప్పుడు; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; పార్థునిన్= అర్జునుడిని; పాశుపతంబు= పశుపతికి సంబంధించిన దివ్యాస్త్రము; అర్థింపుము= వేడుము(కోరుము); అని, కఱపినన్= అని నేర్పగా (బోధించగా); అతండు= ఆ అర్జునుడు; ఆ+వరంబు= దేవతాదులచే పొందబడే ఆ కోరిక; వేఁడుటకై= అర్థించుటకై; విశ్వేశ్వరున్= విశ్వనాథుడైన ఆ శివుడిని; తప్పక= చలించకుండా - శ్రద్ధతో; చూచి= పరికించి; తాను; మున్ను= అంతకుమునుపు; ముకుందునందున్= శ్రీకృష్ణుడియందు; సమర్పించిన= పూజ్యభావంతో ఇచ్చిన; నిశాసమయ+పూజాద్రవ్యంబులు+అగు= రాత్రివేళ అర్చించే (పూతవస్తువులైన) మంచి వస్తువులైన; మాల్య= దండలు; అనులేపనంబులు= మైపూతలు అనగా చందనాదులు; ఆ+దేవుని= ఆ దేవుడైన శివుడి; దివ్యదేహంబునన్= దివ్యమైన శరీరంలో; కాంచి= చూచి; అచ్చెరువు+అంది= ఆశ్చర్యపడి; ఆ+మురహర, పురహరుల= ఆ హరి హరుల (మురాసురుడిని చంపినవాడు విష్ణువు, త్రిపురాసురులను సంహరించినవాడు ఈశ్వరుడు); ఏకత్వంబు= ఒక్కరే అనుభావం; మనంబునన్= మనస్సులో; కొనియాడి= ప్రశంసించుకొని; దేవా!= ప్రభూ!; భవదీయ, దివ్య+అస్త్రంబు= మీయొక్క ఆశ్చర్యకరమైన (దివ్యమైన) అస్త్రం; దయచేయుము= (కరుణించుము) ఇమ్ము; అని+విన్నవించుటయున్= అని మనవి చేయటమున్నూ; భక్తవత్సలుండు+అగు= భక్తులయందు వాత్సల్యం (దయ) కలవాడైన; శక్తినాథుండు= పార్వతీపతి; కృష్ణులు+ఇరువురనున్= కృష్ణార్జునులను; దరహాసంబుతోన్= చిరునవ్వుతో; అవలోకించి= చూచి.

తాత్పర్యం: అని పలురకాలుగా వాక్కులకూ, మనస్సుకూ గోచరించని ఆ పరమేశ్వరుడిని కీర్తించారు. అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుడిని - 'పాశుపతాన్ని కోరు' మని సూచించాడు. ఆ సూచనమేరకు అర్జునుడు ఏకాగ్రభావంతో దేవదేవుడిని చూచి, తాను పూర్వం శ్రీకృష్ణుడికి సమర్పించిన రాత్రిపూజాద్రవ్యాలు దండలు, గంధపు పూతలు మొదలైన వాటిని ఆ పరమేశ్వరుడి దేహంమీద గమనించి, ఆశ్చర్యపడి, ఆ హరిహరుల ఏకత్వాన్ని నుతించి 'దేవా! మీ దివ్యాస్త్రాన్ని దయచేయు' మని వేడుకొన్నాడు. భక్తవత్సలుడైన ఆ పరమశివుడు ఇరువురు కృష్ణులను చిరునవ్వుతో చూచి.

విశేషం: మూలంలో రాత్రి పూజా ప్రసక్తి ఉన్నది. కాని, ఆ మాల్యానులేపనాలు పరమేశ్వరుడి దివ్య దేహంలో చూచి ఆశ్చర్యపడి హరిహరు లిరువురూ ఒకరే అని భావించిన విషయం లేదు. దీనిని తిక్కన తాను నమ్మిన హరిహరనాథ తత్త్వాని కనుగుణంగా అనుసంధించాడు. కృష్ణు లిరువురు అనటంలో అర్జునుడూ, కృష్ణుడూ ఇద్దరూ ఒక్కటే అనే విషయాన్ని తిక్కన వెల్లడించాడు. హరిహరుల ఏకత్వంవలెనే కృష్ణార్జునుల ఏకత్వం కూడా అని సూచన. హరిహరుల ఏకత్వం రూపంలో కాగా, కృష్ణార్జునుల ఏకత్వం నామంలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **అమృతమయ మగు నుల్ల పద్మాకరమున । నాదు బాణాసనంబు బాణములు నున్న**
యవి; దృఢవ్రతులార! మీ రచటి కరిగి । వానిఁ దెం డిచ్చటికి' నని యాన తిచ్చె. **369**

ప్రతిపదార్థం: దృఢవ్రతులార!= గట్టిదైన పట్టుదల (దీక్ష) కలవారా!; అమృతమయము+అగు= అమృతంతో నిండినదైన; ఉల్లపద్మ+ఆకరమునన్= చెరువ నున్న తామర పూవులకు నిలయమైన సరోవరంలో; నాదు బాణాసనంబు= నా విల్లూ; బాణములున్= బాణాలూ; ఉన్న+అవి= ఉన్నాయి; మీరు; అచటికిన్= అక్కడికి; అరిగి= వెళ్ళి; వానిన్= వాటిని; ఇచ్చటికిన్= ఇక్కడికి; తెండు= తీసికొనిరండి; అని; ఆనతి+ఇచ్చెన్= ఆజ్ఞను ఇచ్చాడు.

తాత్పర్యం: 'ఓ వీరులారా! నా విల్లూ, బాణాలూ అమృతమయమైన పద్మాల సరస్సులో ఉన్నాయి. మీరు అక్కడికి పోయి వాటిని ఇక్కడికి తీసికొని రండి' అని ఆజ్ఞ ఇచ్చాడు.

విశేషం: ఉల్ల= అంత దూరమూ అంత దగ్గరా కాని; అల్ల= దూరస్థ; ఇల్ల= సమీపస్థ; ఉల్ల= దూరము దగ్గర కాని.

వ. **అ ట్లనుగ్రహించినం జిత్తానువర్తన తత్పరులగు తత్పరిసరవర్తులు కొందఱు దోడ్కొని పోవం బోయి పరమమునులగు నన్నర నారాయణులు త్రిణయన నిర్దిష్టంబైన యద్దివ్యసరస్సునందు.** **370**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; అనుగ్రహించినన్= కరుణించగా; చిత్త+అనువర్తన, తత్పరులు+అగు= మనస్సును అనుసరించి నడవటంలో ఆసక్తి కలవారైన; తద్+పరిసరవర్తులు= ఆ దగ్గరనే మెలగేవాళ్ళు; కొందఱు= కొంతమంది; తోడ్కొని పోవన్= తీసికొనిపోగా; పోయి= వారితో కూడా చని; పరమమునులు+అగు= శ్రేష్ఠులైన మహర్షులగు; ఆ+నర, నారాయణులు= కృష్ణార్జునులు (పూర్వం నరుడు, నారాయణుడు అనే పేర బదరికాశ్రమంలో కొన్ని వేల ఏండ్ల తపస్సు చేసినవాళ్ళు); త్రిణయన= ఈశ్వరుడిచేత; నిర్దిష్టంబు+ఐ= నిర్దేశించ బడినదైన(ఫలానా అని తెలుపబడినదైన); ఆ+దివ్య సరస్సునందున్= ఆ దివ్య సరోవరంలో (పద్మాకరంలో).

తాత్పర్యం: అని ఆ పశుపతి కరుణించగా ఆయన భావం తెలిసి మసలే కొందరు వారిని వెంటబెట్టుకొని తీసికొని పోగా శ్రీకృష్ణార్జునులు శివుడు చూపిన ఆ సరోవరంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **నాలుకలు గ్రోయుచు విష । జ్వాలలు నిగుడంగ నుగ్రసర్పద్వయ మా**
భీలాకృతి నుండఁగ బి । ట్టాలోకించి జనితాద్భుతాత్మకు లగుచున్. **371**

ప్రతిపదార్థం: ఉగ్ర, సర్ప, ద్వయము= భయంకరమైన, పాముల జంట; విషజ్వాలలు= విషపు మంటలు; నిగుడంగన్= వ్యాపింపజేయగా; నాలుకలు(జిహ్వలు); క్రోయుచున్= ఎగుడు దిగుడుగా (విషమంగా) చూస్తూ; ఆభీల+ఆకృతిన్= భయంకరమైన ఆకారంతో; ఉండఁగన్= ఉండగా; బిట్టు= తొందరగా; ఆలోకించి= చూచి; జనిత+అద్భుత+ఆత్మకులు+అగుచున్= ఆశ్చర్యం కలిగినవారు అవుతూ.

తాత్పర్యం: భయంకరమైన పాములజంట విషపుమంటలు వ్యాపించగా, నాలుకలను ఎగుడుదిగుడుగా చాస్తూ భయంకరాకారంతో వేగంగా వస్తుండగా; వాటిని మిక్కిలి ఆశ్చర్యంతో ఆ ఇరువురూ చూచి వెంటనే.

వ. **అవ్విధం బద్దివ్యాస్త్ర విలాసంబుగా నెఱింగి, పాదప్రక్షాళనోపస్పర్శనంబు లాచరించి యమ్మహోరగంబుల కుపస్థానంబు సేసి, వేదవిదులగు నమ్మహాత్ములు నియతాత్ములై శతరుద్రీయంబు జపించుచు నప్రమేయ ప్రభావుండగు భవునిం దమభావంబులలో నిలిపికొని యుండం దదీయానుభావంబునం జేసి యాదందశూకంబులు ముందటి చందంబు విడిచి విల్లును నమ్మునునై యున్నం జూచి యా సవ్యసాచియు శౌరియు సమ్మదంబునం బొదలి వానిం బుచ్చుకొని వచ్చి శంభు సన్నిధిం బెట్టుటయు.** **372**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ+విధంబు= ఆ ప్రకారం (ఆ తీరు); ఆ+దివ్య+అస్త్ర విలాసంబుగాన్= ఆ దివ్యమైన అస్త్రాల యొక్క క్రీడగా(లీలగా); ఎఱింగి= గ్రహించి; పాదప్రక్షాళన+ఉపస్పర్శనంబులు= కాళ్ళు కడుగుకొనటం, ఆచమనం చేయటాలు; ఆచరించి= చేసి(ఒనర్చి); ఆ+మహా+ఉరగంబులకున్= ఆ పెద్దపాములకు; ఉపస్థానంబు+చేసి= సేవచేసి (స్మరించి); వేదవిదులు+అగు= వేదాలు తెలిసినవాళ్ళయిన; ఆ+మహాత్ములు= ఆ మహనీయులు; నియత+ఆత్ములు+ఐ= నియమంతోడి మనస్సులు కలవారై; శతరుద్రీయంబు= యజుర్వేదంలోని 'నమక' మనే వేదభాగం; జపించుచున్= జపిస్తూ; అప్రమేయ+ప్రభావుండు= ఊహించటానికి శక్యంకాని మాహాత్మ్యం (ప్రకాశం) కలవాడు; అగు= ఐన; భవునిన్= పరమేశ్వరుడిని; తమ+భావంబులలోన్= తమ మనస్సులలో; నిలిపికొని+ఉండన్= స్థిరపరచుకొని ఉండగా; తదీయ+అనుభావంబునన్+చేసి= అతనియొక్క (ఆ పరమేశ్వరుడి యొక్క) మాహాత్మ్యం (ప్రభావం) చేత; ఆ+దందశూకంబులు= ఆ పాములు; ముందటి, చందంబు= పూర్వరూపం; విడిచి= వదలి; విల్లును= బాణాసనమూ; అమ్మునున్+ఐ= బాణమున్నూ అయి; ఉన్నన్+చూచి= ఉండగా కనుగొని; ఆ+సవ్యసాచియున్= ఆ అర్జునుడూ; శౌరియున్= శ్రీకృష్ణుడున్నూ; సమ్మదంబునన్= మిక్కిలి సంతోషంతో; పొదలి= ఒప్పి; వానిన్= ఆ వింటినీ, బాణాన్నీ; పుచ్చుకొని= గ్రహించి; వచ్చి= దూరంనుండి సమీపానికి చనుదెంచి (నడచి); శంభు+సన్నిధిన్= పరమేశ్వరుడి సమక్షంలో (ముందర); పెట్టుటయున్= దించటమున్నూ.

తాత్పర్యం: ఆ తీరు ఆ దివ్యాస్త్రాల లీలగా తెలిసికొని, వారిద్దరూ కాళ్ళు కడిగికొని, ఆచమించి నియమంతో శతరుద్రాన్ని (నమకాన్ని) జపిస్తూ మహానుభావుడైన శివుడిని తమ భావాలలో నిలిపికొని ఉండగా, పరమేశ్వరుడి మాహాత్మ్యం వలన ఆ పాములు ముందటి రూపాలు వదలి విల్లు, బాణంగా మారాయి. శ్రీకృష్ణార్జునులు వాటిని చూచి సంతోషించి, వాటిని తీసికొని వచ్చి శివుడి సమక్షంలో ఉంచగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **నీలలోహితవర్ణుండు బాలుఁ డొక్క। బ్రహ్మచారి మహాబల భవ్యమూర్తి**
హరుని పార్శ్వంబు నందుండి, యలిగి యా శ। రాసనము పుచ్చికొని శర మరి నమర్చి. **373**

ప్రతిపదార్థం: నీల లోహిత వర్ణుండు= నలుపుతో కూడిన ఎరుపు రంగు కలవాడు (నీలమూ, కుంకుమ పూవురంగూ కలిసిన దేహచ్ఛాయ కలవాడు); మహా,బల, భవ్య, మూర్తి= గొప్ప శక్తిచేత యోగ్యమైన స్వరూపం కలవాడు; బాలుఁడు= పసిపిల్లవాడూ (అయిన); ఒక్క బ్రహ్మచారి= బ్రహ్మచర్య వ్రతాన్ని అవలంబించే ఒక వటువు; హరుని పార్శ్వంబు+అందుండి= శివుడి ప్రక్క వైపు నుండి; అలిగి= కోపించి; ఆ+శరాసనము= ఆ విల్లు; పుచ్చికొని= తీసికొని; శరము= బాణం; అరిన్= వింటి అల్లెత్రాడు మధ్యలో; అమర్చి= పొందికగా ఏర్పరచి.

తాత్పర్యం: నలుపుతో కూడిన ఎరుపురంగు కలవాడూ, గొప్పబలంచేత యోగ్యమైన స్వరూపం కలవాడూ, పసిబాలుడూ అయిన బ్రహ్మచారి ఒకడు శివుడి ప్రక్కవైపు నుండి, కోపించి విల్లు తీసికొని, బాణాన్ని అల్లెత్రాటి మధ్యలో అనుసంధించి. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. **తెగవాపుటయుం దదీయ స్థానకంబును ముష్టి ప్రకారంబును నేకాగ్రదృష్టిం గనుంగొను గాండివికి మన్మథ మథనుండు మంత్రస్వరూపం బనుగ్రహించినం బరిగ్రహించి.** **374**

ప్రతిపదార్థం: తెగవాపుటయున్= అల్లెత్రాటిని లాగుటయు; తదీయ, స్థానకంబును= ఆ బ్రహ్మచారియొక్క నిలబడిన తీరున్నూ (ఏ స్థానంలో ఏది ఎట్లా పట్టుకొని ప్రయోగించాలో ఆ పద్ధతియున్నూ); ముష్టిప్రకారంబును= పిడికిలి యొక్క విధమున్నూ; ఏకాగ్రదృష్టిన్= ఒకే విషయంపై మనస్సు నిలిపి చూచే చూపున్నూ; కనుంగొను+గాండివికిన్= చూచే అర్జునుడికి; మన్మథమథనుండు= మన్మథుడిని ధ్వంసం చేసిన మహేశ్వరుడు; మంత్రస్వరూపంబున్= మంత్రం యొక్క స్వభావాన్ని (విధానాన్ని); అనుగ్రహించినన్= దయచేయగా; పరిగ్రహించి= ప్రీతితో పుచ్చుకొని.

తాత్పర్యం: అల్లెత్రాటిని లాగటం, ఆ బ్రహ్మచారి నిలబడిన తీరును, పిడికిలి పట్టినతీరును, ఏకాగ్రదృష్టితో చూచే అర్జునుడికి మహేశ్వరుడు మంత్రస్వరూపాన్ని అనుగ్రహించగా దానిని స్వీకరించి.

క. పురహరుఁ డనుమతి సేయఁగ । శరము శరాసనము దివ్యసరసిన యిడి య
న్నరుఁడు సనుదెంచి యాశం । కరు ముఖకమలంబు తెలివిఁ గాంచి ముదమునన్. 375

ప్రతిపదార్థం: పురహరుఁడు= శంకరుడు; అనుమతి సేయఁగన్= అనుమతించగా; శరము= బాణం; శరాసనము= విల్లు; దివ్య సరసిన్+అ= ఆ అమృతమయమైన సరోవరమునందే; ఇడి= ఉంచి; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; చనుదెంచి= వచ్చి; ఆ+శంకరు= ఆ పరమేశ్వరుడి యొక్క; ముఖ కమలంబు= తామరవంటి ముఖం యొక్క; తెలివిన్= ప్రసన్నత్వాన్ని; కాంచి= చూచి; ముదమునన్= సంతోషంతో.

తాత్పర్యం: శివుని, అనుజ్ఞ ప్రకారం బాణాన్నీ, విల్లునూ ఆ అమృతమయమైన ఆ సరోవరంలోనే ఉంచి, అర్జునుడు వెంటనే వచ్చాడు. అప్పుడు శంకరుడి ముఖంలో ఉన్న ప్రసన్నత్వాన్ని చూచి ఎంతో సంతోషంతో- (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: అర్జునుడు 'శంకరు ముఖ కమలంబు తెలివి గాంచి' నాడు. ఇందులో శంకర పదం సాభిప్రాయం. సంతోషాన్ని కలిగించేవాడు శంకరుడు. అందుకే అతడి ముఖపద్మం కూడా ఎంతో సంతోషంతో ఉండినది. ఇక్కడ 'తెలివి' అనే పదానికి సంతోషం అనే కాకుండా, ప్రసన్నత, ప్రకాశం, అంగీకారం, వివేకం, వికాసం అనే అర్థాలను కూడా అన్వయించుకొనవచ్చును. పద్యాంతంలోని 'ముదమునన్' అనే ప్రయోగం కూడా 'శంకర' పద సార్థక్యాన్ని చాటుతూ ఉన్నది.

వ. తనకు నరణ్యంబున నయ్యీశానుం డిచ్చిన వరంబును, దత్కాల సందర్శన ప్రకారంబునుం దలంపించిన నెఱింగి, యప్పశుపతి యతనిపైఁ గరణార్ద్రంబగు కటాక్షవీక్షణం బొలయ 'నది యట్ల కాక దానికి నన్యథాత్వంబు గలదే?' యనియె నప్పు డప్పాశుపతాస్త్రంబు బ్రస్ఫుటంబుగాఁ బడసినవాఁడై పార్థుండు పులక పటల పరికలిత దేహుం డగుచుం దన యుత్సాహం బప్రతిహతంబయ్యె నని మనంబున నిశ్చయించెఁ దదనంతరంబ. 376

ప్రతిపదార్థం: తనకున్= అర్జునుడైన తనకు; అరణ్యంబునన్= అరణ్యంలో (అరణ్యవాస సందర్భంలో); ఆ+ఈశానుండు= ఆ పరమేశ్వరుడు; ఇచ్చిన+వరంబును= ప్రసాదించిన వరాన్ని; తద్+కాల, సందర్శన ప్రకారంబునున్= ఆ సందర్భంలోని చూడటం యొక్క విధాన్ని; తలంపించినన్= జ్ఞప్తికి తేగా (పోలి ఉండగా); ఎఱింగి= తెలిసికొని(గ్రహించి); ఆ+పశుపతి= ఆ పరమేశ్వరుడు; అతనిపైన్= అర్జునుడిపై; కరుణా+ఆర్ద్రంబు+అగు= దయచేత చెమ్మగిల్లినదైన; కటాక్ష, వీక్షణంబు+ఒలయన్= కడగంటి చూపు ప్రసరింపగా (జాలువారగా); అట్లకాక= అట్లే అగుగాక; దానికిన్= ఆ వరానికి; అన్యథాత్వంబు= వేరొక విధంగా కావటం (వ్యతిరేకం); కలదే?= జరుగుతుందా?; అనియెన్= అన్నాడు; అప్పుడు= ఆ సందర్భంలో; ఆ+పాశుపత+అస్త్రంబున్= ప్రసిద్ధమైన పాశుపతాస్త్రాన్ని; ప్రస్ఫుటంబుగాన్= సుస్పష్టంగా (తేటతెల్లంగా); పడసినవాఁడు+ఐ= పొందినవాడై; పార్థుండు= అర్జునుడు; పులక, పటల, పరికలిత, దేహుండు+అగుచున్= పులకరింతల మొత్తంచేత కూడుకొన్న శరీరం కలవాడై; తన+ఉత్సాహంబు= తన కోరిక; అప్రతిహతంబు+అయ్యెన్= తిరస్కరించబడనిది అయింది; అని+మనంబునన్= అని మనస్సులో; నిశ్చయించెన్= స్థిరపరచుకొన్నాడు; తద్+అనంతరంబు+అ= దాని తర్వాత.

తాత్పర్యం: అరణ్యంలో శివుడు తన కిచ్చిన వరం, ఆ సమయంలో దర్శనమిచ్చిన విధం తోచగా, శివు డాతడిపై దయామయమైన చూపులు సారించి 'అది అంతే. దానికి మరొక విధంగా జరగటం కలగదు'- అని అన్నాడు. అప్పుడు అర్జునుడు పాశుపతాస్త్రాన్ని సుస్పష్టంగా పొంది, పులకరింతలతో పొంగిపోతూ, వారించరాని ఉత్సాహంతో మనసులో తన కోరిక నెరవేరినదని నిశ్చయించుకొన్నాడు. ఆ తరువాత.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'పులక పటల పరికలిత' అనే ప్రయోగం భారతావతారికలో హరిహరనాథుడు కనిపించి అనుకంపాతిశయంతో మంత్ర ద్రష్ట కావ్య స్రష్టఅయిన తిక్కయజ్వను పిలిచిన సందర్భంలో అతడికి ఆనంద పారవశ్యాన్ని తెలిపేటప్పుడు ప్రయుక్తమైనది.

తే. భవునిచే సాదరానుజ్ఞ వడసి శౌరి । ఫల్గునులు పలుమాఱుఁ దత్పదయుగంబు
ఫాలములు సోఁకఁ బ్రణమిల్లి బహులరోమ । హర్ష సంభృతగాత్రులై యరుగుదెంచి. 377

ప్రతిపదార్థం: శౌరి+ఫల్గునులు= శ్రీ కృష్ణార్జునులు; భవునిచేన్= ఈశ్వరుడిచేత; సాదర+అనుజ్ఞ= దయతో కూడుకొన్న అనుమతి; వడసి= పొంది; పలుమాఱున్= అనేక పర్యాయాలు; తద్+పదయుగంబు= ఆ శివుడి పాదములజంట; ఫాలములు= నొసళ్ళు; సోఁకన్= తగులగా; ప్రణమిల్లి= నమస్కరించి; బహుల రోమ హర్ష సంభృత గాత్రులు+ఐ= సంతోషం వలన దట్టమైన వెంట్రుకలతో (పులకరింతల వలన నిక్కపొడుచుకొన్న దట్టమైన వెంట్రుకలతో) చక్కగా భరించబడ్డ శరీరాలు కలవారై; అరుగుదెంచి= పోయి.

తాత్పర్యం: కృష్ణార్జును లిరువురు ఈశ్వరుడిచేత ఆదరపూర్వకమైన అనుమతి పొంది అనేక పర్యాయాలు ఆ పరమశివుడి అడుగులపై తమ నొసళ్ళు తాకేటట్లు నమస్కరించి, సంతోషంతో పులకరించిన శరీరాలు కలవారై పోయి.

విశేషం: ఈశ్వరానుజ్ఞ పొందిన కృష్ణార్జునులు పదే పదే శివుడి పాదాలపై తమ ఫాలభాగాలు నిలిపి, ప్రణామం చేశారు. ఆ సందర్భంలో వారిరువురు మహానంద భరిత పులకిత గాత్రులయ్యారు. ఇచ్చట తేటగీతి పద్యంలో 'వడసి, సోక, అరుగుదెంచి' అనే అచ్చతెలుగు క్రియాపదాలు ప్రయుక్తాలు. సాదరానుజ్ఞ, శౌరి ఫల్గునులు, తత్పదయుగంబు, ఫాలములు, అనే తత్సమపదాల మధ్య ఫల్గునులకు అనుగుణంగా పలుమారు ఫాలములకు వెంటనే సోక అనే అచ్చతెలుగు పదములు తేటగీతిలో ఒక సమతను సాధించటానికి ప్రయోగించాడు. చివరగా 'బహుల రోమహర్ష సంభృతగాత్రులై' అను సమాసంలో ఎంతో గాంభీర్యంతోడి భక్తి ప్రపత్తులు వెల్లడించబడ్డాయి.

వ. నిజ శిబిరంబు సొత్తెంచి; రివ్విధంబున నర్జునుండు గల గాంచెఁ; గృష్ణుండు దారుకుతోడం దగు మాటలాడుచుండఁ దెలతెల వేగె; నది యాధనంజయస్వప్నాంత సమయంబై సంఘటించె నని యిట్లు సంజయుండు సవ్యసాచి యంతర్వర్తనంబు తెఱంగు ధృతరాష్ట్రున కెఱింగించె ననుటయు. 378

ప్రతిపదార్థం: నిజ+శిబిరంబు= తన దండు విడిచినచోట; చొత్తెంచిరి= ప్రవేశించిరి; ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; అర్జునుండు+కలన్+కాంచెన్= అర్జునుడు కలకన్నాడు; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; దారుకునితోడన్= రథసారథి దారుకుడితో; తగు మాటలు+ఆడుచుండన్= తగిన పలుకులు పలుకుతుండగా; తెలతెల, వేగెన్= (తెలతెలమని) తెల్లగా తెలవారింది; అది= అట్లు తెల్లవారటం; ఆ+ధనంజయ, స్వప్న+అంత సమయంబు+ఐ= ఆ అర్జునుడి కలయొక్క చివరికాలమై; సంఘటించెన్= సంభవించినది; అని+ఇట్లు= అని ఈ విధంగా; సంజయుండు; సవ్యసాచి+అంత్వర్తనంబు+తెఱంగు= అర్జునుడి ఆంతరంగికమైన వర్తనముయొక్క తీరు; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రుడికి; ఎఱింగించెన్= తెలిపాడు; అనుటయున్= అని చెప్పుటయున్నూ.

తాత్పర్యం: వారు తమ శిబిరానికి వచ్చారు. ఆ తీరుగా అర్జునుడు కలకన్నాడు. కృష్ణుడు దారుకుడితో తగినమాటలు మాట్లాడుతూనే ఉన్నాడు. అంతలో తెల్లవారింది. అప్పుడే అర్జునుడి కల కూడా ముగిసింది.

క. 'మునినాథ! దేవకీసుతుఁ । డును సంక్రందనతనూజుఁడుం బూనిన యా
పని యెమ్మెయిఁ గడతేఱెనొ । వినవలతుం; దేటపఱుపవే పరిపాటిన్.' 379

ప్రతిపదార్థం: మునినాథ!= మునీశ్వరా!; దేవకీసుతుఁడును= దేవకీకుమారుడైన కృష్ణుడును; సంక్రందన తనూజుడును= ఇంద్రుడి కొడుకైన అర్జునుడును; పూనిన= ప్రయత్నించిన; ఆ+పని= ఆ కార్యం; ఏ+మెయిన్= ఏ విధంగా; కడతేఱెనొ= పూర్తి అయిందో; పరిపాటిన్= క్రమాన్ని అనుసరించి; వినవలతున్= వినటానికి ఇష్టపడుతూ ఉన్నాను; తేటపఱుపవే= స్పష్టం చేయవలసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వైశంపాయన మునీంద్రా! దేవకి కుమారుడైన కృష్ణుడూ, ఇంద్రుడి కొడుకైన అర్జునుడూ ప్రయత్నించిన కార్యం ఏ విధంగా పూర్తి అయిందో క్రమపద్ధతిలో వినాలని ఇష్టపడుతూ ఉన్నాను. దానిని స్పష్టం చేయవలసింది.'

విశేషం: ఈ పద్యాంశంలో ఉండే 'పరిపాటిన్' అనే ప్రయోగాన్ని పరిశీలించవలసి ఉంది. 'జరిగింది జరిగినట్లుగా, మొదటినుండి చివరిదాకా యావద్వృత్తాంతాన్ని సవిస్తరంగా క్రమం తప్పకుండా' అనే భావం ఆ పదంలో ఇమిడి ఉన్నది. విషయాన్ని సమగ్రంగా తెలిసికొనాలనే శ్రోతయొక్క ఉత్కంఠను కూడా ఆ పదం సూచిస్తుంది. సంప్రదాయ బద్ధంగా కార్యాన్ని నిర్వహించటంలో ఉండే శ్రద్ధాతాత్పర్యాలనూ కర్మప్రాధాన్య సిద్ధాంతాన్నీ ఆ ప్రయోగం వ్యక్తం చేస్తుంది.

వ. అని అడుగుటయు. 380

తాత్పర్యం: అని జనమేజయుడు అడుగుటయున్నూ - (మూడవ ఆశ్వాసంలోని వచనంతో అన్వయం).

ఆశ్వాసాంతము

చ. లలిత చతుర్దళాఢ్య కమల ప్రసవ ప్రసరత్సరస్వతీ
విలసన సౌరభోద్గమ నివిష్ట! మహామహిమాభిరామ! కే
వల సుఖితానుభూతిమయ వైభవ సార! జగజ్జనిస్థితి
ప్రళయ విధాన కేళి పరిపాటి వికస్వర! నిత్యభాస్వరా! 381

ప్రతిపదార్థం: లలిత, చతుః+దళ+ఆఢ్య కమలప్రసవ= అందమైన, నాలుగు రేకులచేత సంపన్నమైన (శ్రేష్ఠమైన) తామర పూవునుండి; ప్రసరత్+సరస్వతీ విలసన = జాలువారు పలుకుల లీల అనెడి; సౌరభ+ఉద్గమ; నివిష్ట!= సువాసనా ప్రసారమునందు ఉన్నవాడా!; మహా మహిమ+అభిరామ!= గొప్ప మాహాత్మ్యంచేత (ఐశ్వర్యం చేత); ఒప్పిదమైనవాడా!; కేవల సుఖితా-అనుభూతి మయ వైభవ సార!= స్వచ్ఛమైన (ఏకమైన) సౌఖ్యం యొక్క అనుభవమయమైన విభవంయొక్క సారం కలవాడా!; జగత్+జని, స్థితి, ప్రళయ, విధాన, కేళి, పరిపాటి, వికస్వర!= లోకం (విశ్వం) యొక్క పుట్టుక, నిలుపుదల గిట్టుట అనే విధంయొక్క క్రీడ (ఆట) యందలి అనుక్రమంచేత వికసించేవాడా!; నిత్యభాస్వరా!= ఎల్లప్పుడు ప్రకాశించేవాడా!

తాత్పర్యం: మనోజ్ఞములైన నాలుగు దళాలను కలిగియున్న తామరపూవునుండి జాలువారు వాగ్లీల అనే వాసనను వెలువరించటంలో ఏకాగ్రత కలవాడా! గొప్ప విభవంచేత ఒప్పిదమైన వాడా! కేవల సౌఖ్యానుభవంతో నిండుకొన్న ఐశ్వర్యం యొక్క సారం కలవాడా! లోకాలను సృష్టించటం, నిలపటం, విలీనం చేయటం అనే విధానాన్ని అనుక్రమంతో కూడుకొన్న ఒక క్రీడగా నిర్వహిస్తూ వికసించేవాడా! ఎల్లప్పుడు ప్రకాశించేవాడా!

విశేషం: నాలుగు రేకుల తామర వేదాలకు సూచన. వేదాలే సురభిళ నిశ్వాసంగా వెలుగొందే పరమాత్మా! అని మొదటి సంబోధనలోని సారాంశం. 'కేవల సుఖితానుభూతి' అనే విశేషణంలోని కేవల శబ్దం కైవల్య పదాన్ని బ్రహ్మానంద విభూతినీ సూచిస్తుంది. సృష్టిస్థితి సంహారాలు అనేవి పరమాత్మకు క్రీడలవంటివి. అయితే వాటిని ఒక క్రమాన్ని అనుసరించి నిర్వహించటం ఆయనకు పరిపాటి. అదే పరిపాటి శబ్దంలోని వైశిష్ట్యం. వికసించటం ప్రకాశించటం, సత్యం-శివం-సుందరం అనే మూడింటికీ ఆధారపీఠంగా ఉండటం ఆ పరమాత్మ లక్షణం. నాలుగుదళాల కమలం వంటి వాక్కులు అనే వాసనలు వెలువడినట్లు తిక్కన భావించిన తీరు అప్రతిమానం. సౌరభంలో సంస్కారాల సౌరు గుబాళింపజేస్తూ సౌరభోద్గమ నివిష్టుడుగా హరిహరనాథుడిని మన అందరి హృదయపీఠంలో కూర్చొనబెట్టటం అద్వైతాన్ని అభిమానించే ఆంధ్రుల అదృష్టం.

క. హృదయ సరసిరుహ మధుపా । స్వద విహృతి విశేష! నిహత పాపోన్మేషా!
వదన సముత్థిత వేదా! । మదవదసుర హరణ కరణ మంత్ర వినోదా! 382

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: హృదయ, సరసిరుహ, మధుప+ఆస్పద, విహృతి, విశేష!= పద్మంవంటి హృదయమనెడి మధురమైన స్థానవిశేషమునందు విహారంచేత అతిశయించినవాడా!; నిహత పాప+ఉన్మేషా!= కొట్టబడ్డ పాపాలయొక్క అభివృద్ధి కలవాడా!; వదన సముత్థిత వేదా!= ముఖంనుండి పుట్టిన వేదాలు కలవాడా!; మదవత్+అసుర హరణ కరణ మంత్ర వినోదా!= పొగరుగల రాక్షసులయొక్క సంహరించటం అనే కార్యాన్ని ఆలోచించటంలో ఆనందం కలవాడా!;

తాత్పర్యం: హృదయపద్మంలో మధురస్థానవిశేషంలో విహారక్రీడతో విలసిల్లేవాడా! సకల పాపాల పెరుగుదలను సమయించేవాడా! ముఖంనుండి పుట్టిన వేదాలు కలవాడా! పొగరు కలుగు రాక్షసులను సంహరించే కార్యాలోచనలో ఆనందం కలవాడా!

విశేషం: హృదయ కేంద్రం పరమాత్మ స్థానం. ఆ స్థానాన్ని సులువుగా తెలిసికొనటానికి పద్మంతో హృదయాన్ని పోల్చటం పరిపాటి. పద్మంయొక్క నడిమిభాగంలో సూక్ష్మాతిసూక్ష్మ స్థానంలో ఉండే మకరందాన్ని ఎంతో సున్నితంగా, మహాసుకుమారంగా అనాయాసంగా గ్రహించగలిగే నేర్పు ఓర్పు తుమ్మెదకు సహజసిద్ధంగా అలవడింది. సాధకుడు తుమ్మెదవలె బ్రహ్మానంద మకరందాన్ని ఆస్వాదించగలిగితే 'బ్రహ్మవి ద్బ్రహ్మైవ భవతి' అన్నట్లు ఆ పరబ్రహ్మమే తాను కాగలుగుతాడు. హృదయంలో విహార విశేషంతో వర్ధిల్లే హరిహరనాథుడిని తిక్కన మనీషి అద్వైతి అయి దర్శించాడు.

ఈ పద్యంలోని చివరిపాదం లయాత్మకమైన ఒక మంత్రంవలె సాగింది. శబ్దాలంకార సౌందర్యంతోపాటు అర్థగాంభీర్యాన్ని పుడికిపుచ్చుకొన్నది. అగ్నిబీజమైన రకారం లయవిన్యాసాన్ని ప్రదర్శించింది. మంత్రిగా తిక్కన తాను నెఱపిన మంత్ర వినోదాన్ని శత్రుసంహార సందర్భంలో హరిహరనాథుడికి కూడా అన్వయించి ఒక రకమైన అభేదాన్ని నెలకొల్పాడు. తిక్కన అర్థవత్ శాబ్దిక సౌందర్య సమన్వయ స్ఫూర్తికి ఇది ఒక చక్కని నిదర్శనం.

మాలిని.

ముని సముదయ హృద్యా! మూలవిద్యాzనవద్యా!
వినమదమృతవృష్టీ! విశ్వలోకైక దృష్టీ!
మనన సుగమమూర్తీ! మంత్రరూప ప్రకీర్తీ!
జనిమృతి భిషగాత్మా! శశ్వదాహ్లాదవర్త్మా ! 383

ప్రతిపదార్థం: ముని, సముదయ, హృద్యా!= మహర్షుల సమూహానికి, హృద్యమైనవాడా!; (ఇచ్చట హృద్యశబ్దానికి మనస్సులో పుట్టినవాడు అని కానీ హృదయానికి ఇంపైనవాడు అని కానీ అర్థం గ్రహించవచ్చును); మూలవిద్యా+అనవద్యా!= ప్రధానమైన విద్యచేత అనింద్యుడా!; వినమత్+అమృతవృష్టీ!= మిక్కిలి నమస్కరించేవారికి అమృతపు వర్షమైనవాడా! విశ్వలోక+ఏక దృష్టీ!= సమస్త జగత్తుకూ ఒకే లక్ష్యమైన వాడా!; లేదా అభిప్రాయం కలవాడా!; మనన, సుగమ, మూర్తీ= నిరంతర చింతన లేక ధ్యానం చేత (సులభంగా) సులువుగా పొందదగిన స్వరూపం కలవాడా!; మంత్రరూప ప్రకీర్తీ!= జపం మననంచే కాపాడే రహస్యాలగు ఓం నమోనారాయణాయ ఓం నమశ్శివాయ వంటి మంత్రముల రూపమైన మిక్కిలి కీర్తి కలవాడా!; జని, మృతి, భిషక్+ఆత్మా!= పుట్టుకచావు (అను రోగాలు) లకు వైద్యుడవైన వాడా!; శశ్వత్+ఆహ్లాద, వర్త్మా!= నిత్యమైన సంతోషానికి దారి అయినవాడా!

తాత్పర్యం: మునిజనుల మనస్సులలో పుట్టి అందే రమించి ఇంపు కలిగించేవాడా! మూలభూతమైన ఆధ్యాత్మ విద్యచేత చెప్పదగినవాడా! (మొదలి చదువుచేత దోసములు లేనివాడా!), వినమ్రులకు అమృతవర్షమైనవాడా! సమస్త జగత్తుకూ ఒకే దృష్టి (లక్ష్యం) యైనవాడా! చింతన లేక ధ్యానం చేత సులభమైనవాడా! మంత్రరూపమైన ప్రసిద్ధయశస్సు కలవాడా! జననమరణాలకు వైద్యుడవైన వాడా! శాశ్వతమైన ఆనందానికి మార్గమైనవాడా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: తిక్కన ఆశ్వాసాంతములలోని మూడు పద్యాలలో ఒక క్రమపద్ధతిని అనుసరించాడు. ప్రతి ఆశ్వాసాంతంలోనూ చివరి పద్యం మాలినీవృత్తం. మొదటి పద్యం చంపకమాల లేక ఉత్పలమాల. రెండవపద్యం కందం.

ప్రస్తుతం మాలినీ వృత్తంలోని ఒక్కొక్క పాదంలో రెండేసి అంత్యానుప్రాసలు గల సంబోధనలు కూర్చబడ్డాయి. మునులకు హృద్యుడైతే, వినమ్రులకు అమృతవృష్టి భగవంతుడు, పరమసులభుడని అభ్యాసపరులూ, గమ్య మెరిగిన అనుభవజ్ఞులూ సర్వ సమర్థ సద్గురువుల సందేశం. మంత్రరూప జపసాధనతో ప్రణామాంజలితో కొందరు పరమార్థాన్ని గుర్తిస్తే మననంతో, మౌనంతో, పలువురు జనన మరణ రహితమైన, శాశ్వతానంద ప్రదమైన సత్యాన్ని దర్శించారు. పద్ధతులు భిన్నమైనా అందరి లక్ష్యమూ విశ్వలోకైక దృష్టియే. 'వైద్యో నారాయణో హరిః' అన్నట్లు జనన మరణ సంసార పరిభ్రమణను శాశ్వతంగా అరికట్టి, పథ్యాన్ని నిర్దేశించేవాడు పరమాత్మ. అతడే భిషగాత్మ. మునిజనం హృద్యమూ అనవద్యమూ అయిన మూలవిద్యను గ్రహించి, వినమ్రులై అమృత దృష్టితో ద్రష్టలై, ధ్యానంతో పరమసులభుడైన పరమాత్మను దర్శించి, నిర్భరమైన దివ్యానుభూతితో మంత్ర రూపంలో ప్రకీర్తించి, జనన మరణా లనే రోగాలను మహాభిషగ్వర్యులై నిర్జించి, చివరకు శాశ్వతమైన బ్రహ్మానంద పదాన్ని ఎంతో సులువుగా పొందగలిగారు.

ఈ ఆశ్వాసాంతపద్యాల్లో తిక్కన ఆధ్యాత్మికానుభవం అక్షరాక్షరంలోనూ ప్రతిఫలించింది. వైదిక కర్మ నిష్ఠమగు వర్తనచేత-అనగా యజ్ఞయాగాది కర్మానుష్ఠానంచేత తిక్కన సోమయాజి అయ్యాడు. కాని, దానిని మించిన అద్వితీయానుభవాన్ని ఆయన హరిహరాద్వైత భావనతో సాధించగలిగాడు. కర్మనుండి జ్ఞానం, జ్ఞానం తర్వాత ధ్యానం - ఇట్లా ఒక మెట్టునుండి మరొక మెట్టు అధిరోహించి చివరకు సర్వసమన్వయాత్మకమైన అద్వైతశిఖరాన్ని చేరి బ్రహ్మానంద సామ్రాజ్య పదవీ పట్టాభిషిక్తుడయ్యాడు. ఆశ్వాసాంతంలోని ప్రతిపద్యమూ అందులోని పదపదమూ, ఆయన అద్వైతానంద విభూతికి పరమావధి.

గద్యము.

ఇది శ్రీ మదుభయ కవిమిత్త్ర, కొమ్మనామాత్య పుత్త్ర, బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీ మహాభారతంబున ద్రోణపర్వంబునందు ద్వితీయాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈ గ్రంథం; శ్రీమత్+ఉభయకవిమిత్త్ర= సంపద్యుక్తుడైన ఉభయకవిమిత్రుడు; కొమ్మనామాత్య పుత్త్ర= కొట్టరువు కొమ్మనామాత్యుడి కుమారుడు; బుధ+ఆరాధన, విరాజి= విద్వాంసులను సేవించటంచేత ప్రకాశించువాడు (అయిన) తిక్కన సోమయాజి+ప్రణీతంబు+అయిన= యజ్ఞం చేసినవాడైన తిక్కనచేత చేయబడినదైన; శ్రీ మహాభారతంబునన్= శ్రీ మహాభారతమునందు; ద్రోణపర్వంబునందున్= ద్రోణపర్వంలో; ద్వితీయ+ఆశ్వాసము= రెండవ ఆశ్వాసం.

తాత్పర్యం: ఈ మహాగ్రంథం ఉభయ కవిమిత్రుడు, కొమ్మనామాత్య పుత్రుడూ, విద్వాంసులను పూజించటంచేత మిక్కిలి ప్రకాశించేవాడూ అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శ్రీమహాభారతంలో ద్రోణపర్వంలోని రెండవ ఆశ్వాసం.

ద్రోణపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్రమహాభారతము

ద్రోణపర్వము - తృతీయాశ్వాసము

క. శ్రీ రమ్యతాద్రివరపు । త్రీరమణీయత్వ సుభగ దివ్యవిలాసో
దార! వనమాలికోరగ । హార పరిష్కార సార! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= లక్ష్మీదేవి యొక్క; రమ్యతా= సౌందర్యంచేతను; అద్రి వరపుత్రీ= పర్వతరాజైన హిమవంతుడి కొమార్తె అయిన పార్వతీదేవి యొక్క; రమణీయత్వ= సౌందర్యంచేతను; సుభగ= అందమైన; దివ్య విలాస= మహిమాన్వితాలైన లీలలచేత; ఉదార!= గొప్పవాడా!; వనమాలికా= తోమాల (వైజయంతి); ఉరగ హార= పాముదండ (వాసుకి) అనే; పరిష్కారసార!= శ్రేష్ఠమైన అలంకారాలను కలవాడా!; హరిహరనాథా!= హరిహరనాథుడా!

తాత్పర్యం: లక్ష్మీ పార్వతుల యొక్క సౌందర్యంచేత అందమైన విలాసాలు కలవాడా! వైజయంతిని, నాగహారాన్ని ఆభరణశ్రేష్ఠాలుగా ధరించినవాడా! ఓ హరిహరనాథా! (అవధరించుము).

విశేషం: అలం: యథాసంఖ్యం (క్రమాలంకారం). హరికి సతి లక్ష్మి, శివుడి భార్య పార్వతి; హరికి తోమాల, శివుడికి వాసుకి అలంకారాలు. ఇట్లా క్రమాన్వయం చెప్పుకోవాలి కాబట్టి క్రమాలంకారం - లేదా - యథాసంఖ్యం.

అర్జునుఁడు నిజస్వప్న వృత్తాంతంబు ధర్మరాజాదులతోఁ జెప్పుట (సం. 7-58-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు= వ్యాసమహర్షి శిష్యుడైన వైశంపాయనుడు; జనమేజయునకున్= పరీక్షిన్మహారాజు పుత్రుడైన జనమేజయుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: హరిహరనాథా! వ్యాస శిష్యుడైన వైశంపాయనుడు పరీక్షిన్మహారాజు పుత్రుడైన జనమేజయుడితో ఈ విధంగా అన్నాడు.

ఆ. పార్థుఁ డిట్లు ప్రతిన వట్టిన నది నిర్వ । హించు పనికిఁ గృష్ణుఁ డివ్విధమునఁ
బూని రాత్రి యన్ని పోకలఁబోవుట । విని విచిత్రవీర్యతనయుఁ డులికి. 3

ప్రతిపదార్థం: పార్థుఁడు+ఇట్లు ప్రతిన పట్టినన్= అర్జును డీవిధంగా ప్రతిజ్ఞ చేయగా (అనగా సైంధవుడిని హతమారుస్తానని); అది= ఆ ప్రతిజ్ఞను; నిర్వహించు పనికిన్= నెరవేర్చే కార్యానికి; కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; ఈ+విధమునన్= ఈ ప్రకారంగా; పూని= ప్రయత్నించి; రాత్రి= రాత్రివేళ; అన్ని పోకలన్+పోవుట= అన్నివిధాలైన నడకలు నడవటం (కైలాసాదులకు వెళ్ళటం మొదలైన పోకడలు); విని; విచిత్ర వీర్యతనయుఁడు= ధృతరాష్ట్రుడు; ఉలికి= బెదరి.

తాత్పర్యం: సైంధవుడిని హతమారుస్తానని అర్జునుడు ప్రతిజ్ఞ పూనాడు. అది నెరవేరటానికి రాత్రి శ్రీకృష్ణుడు మార్గాన్ని చూపాడు. ఆ విషయాన్ని విన్న ధృతరాష్ట్రుడు ఉలికిపడ్డాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **'ఇమ్మెయి వేగినఁ బాండవు । లెమ్మెయిఁ గార్యంబు నడపి? రెఱిఁగింపుము; చి**
త్తమ్ము కలంగెడు సంజయ! । నమ్మితి నగ్గురుఁడు గాచెనా మిమ్ము ననిన్?' 4

ప్రతిపదార్థం: సంజయ!= ఓ సంజయుడా!; ఈ+మెయిన్= ఈ విధంగా; వేగినన్= తెల్లవారగా; పాండవులు; కార్యంబున్= తాము చేయవలసిన పనిని; ఏ+మెయిన్= ఏ విధంగా; నడపిరి?= సాగించినారు?; ఎఱిఁగింపుము= నాకు తెలియజేయుము; చిత్తమ్ము= నా మనసు; కలంగెడున్= చీకాకు పడుతూ ఉన్నది; నమ్మితిన్= (గురుడిని) నమ్మినాను; అనిన్= యుద్ధంలో; మిమ్మున్= మీ అందరిని; ఆ+గురుఁడు= ఆ గురువైన ద్రోణాచార్యుడు; కాచెనా?= కాపాడెనా?

తాత్పర్యం: 'ఓ సంజయా! ఈ విధంగా తెల్లవారగా, పాండవులు తమ ప్రయత్నాలు ఏ విధంగా సాగించారో నాకు తెలుపుము. నా మనస్సు కలతగా ఉంది. నమ్మిన ఆ గురుడు ద్రోణుడు మిమ్ములను యుద్ధంలో కాపాడెనా?'

వ. **అని అడిగిన నమ్మహీశ్వరునకు సూతసూనుం డిట్లను; 'నట్లు ప్రభాతం బగుటయు.** 5

తాత్పర్యం: ఆ విధంగా ధృతరాష్ట్రుడు అడుగగా సంజయుడు ఇట్లా అన్నాడు: 'ఆ విధంగా తెల్లవారగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **వందిజన తుములముల యా । నందిత మాగధ సుగీత నాదంబుల ప్ర**
స్పందిత పాఠక రవముల । క్రందున ధర్మజుఁడు మేలుకనియె నరేంద్రా! 6

ప్రతిపదార్థం: నరేంద్రా!= ఓ రాజా! (ధృతరాష్ట్రా!); వందిజనతుములములు= వందిజనుల సందడులచేత; ఆనందిత= సంతోషపెట్టిన; మాగధ= పొగడ్తలతో జీవించే వారి; సుగీత= మంచిపాటల; నాదంబులన్= శబ్దాలతో; ప్రస్పందిత= మిక్కిలి కదలికగల; పాఠక రవములన్= స్తుతి పాఠకుల శబ్దాలయొక్క; క్రందునన్= సవ్వడితో; ధర్మజుఁడు= ధర్మరాజు; మేలుకనియెన్= నిదురమేలుకొన్నాడు.

తాత్పర్యం: ఓ రాజా! వందిమాగధులు పొగడ్తలతో స్తోత్రాలు చేస్తూ ఉండగా, తరచు వినిపించే వారి స్తుతి పాఠాల సవ్వడికి ధర్మరాజు నిదుర మేల్కొన్నాడు.

విశేషం: రాజాంతఃపురాలలో ప్రాచీనకాలంలో వందిమాగధులైన బట్టువారు పొగడ్తలతో పాటలు పాడి ప్రభువులను నిదుర మేల్కొల్పటం ఒక సంప్రదాయంగా ఉండేది.

వ. **ఇట్లు మేలు కని తగు తెఱంగున మజ్జనశాలకుంజని, మంత్రపూతంబులగు జలంబులు సముచిత పరిచారికా జనంబులు గనక కలధౌత కలశంబులఁ దేరఁ గృతస్నానుండయి, లఘుధౌతాంబర పరిధానంబును బరిమళ బహుళాంగ రాగానులేపనంబును సురభి కుసుమ మాలికాభరణధారణంబును నాచరించి, దేవార్చనంబు దీర్చి యగ్నికార్యంబు నిర్వర్తించి, కక్ష్యాంతరంబునకు వెడలి, విప్రనికరంబులకు ధేనుప్రకరంబులు గాంచన సంచయంబులు వస్త్రవిసరంబులు మణిభూషణ పుంజంబులుం జిత్తంబు రంజిల్ల నొసంగి తదాశీర్వాదంబులు గైకొనుచు నేనుంగు మొగసాల గడచి యాస్థాన మండపంబునకు వచ్చి.** 7

ప్రతిపదార్థం: ఇట్లు మేలుకని= ఈ విధంగా నిదురనుండి లేచి; తగు తెఱంగునన్= తగినవిధంగా; మజ్జనశాలకున్+చని= స్నాన గృహమునకు వెళ్ళి; మంత్రపూతంబులు+అగు జలంబులు= మంత్రాలచేత పవిత్రమైన నీటిని; సముచిత= తగిన; పరిచారికా జనంబులు= దాసీజనాలు; కనక= బంగారు; కలధౌత= వెండి; కలశంబులన్= పాత్రములతో; తేరన్= తీసికొనిరాగా; కృత+స్నానుండు+అయి= స్నానమాడి; లఘుధౌత+అంబర పరిధానంబును= తేలిక అయిన తెల్లని ధోవతిని; పరిమళ=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సువాసనలతో; బహుళ= విస్తారమైన; అంగరాగానులేపనంబును= మైపూతలు బాగా పూసికొనటం; సురభి= మంచివాసనలతో ఉన్న; కుసుమమాలికా= పూలమాలలయొక్క; ఆభరణ= (కిరీటాది) నగలయొక్క; ధారణంబును= ధరించటమున్నూ; ఆచరించి= చేసి; దేవ+అర్చనంబు+తీర్చి= దేవపూజచేసి; అగ్నికార్యంబు నిర్వర్తించి= ఔపాసనాదికాలను చేసి; కక్ష్యా+అంతరంబునకున్= లోపలికి; వెడలి= వెళ్ళి; విప్రనికరంబులకున్= బ్రాహ్మణసమూహాలకు; ధేనుప్రకరంబులు= ఆవుల మందలను; కాంచన సంచయంబులు= బంగారపు మొత్తములను; వస్త్రవిసరంబులు= గుడ్డల సమూహమును; మణిభూషణ పుంజంబులు= రత్నాలు పొదిగిన నగల సమూహాన్ని; చిత్తంబు= (వారి) మనసులు; రంజిల్లన్= సంతసించగా; ఒసంగి= ఇచ్చి; తదాశీర్వాదంబులు= ఆ విప్రుల దీవెనలను; కైకొనుచున్= తీసికొంటూ; ఏనుంగు మొగసాలన్= ఏనుగుల కొట్టమును; కడచి= దాటి; ఆస్థానమండపంబునకున్= సభామంటపానికి; వచ్చి= వచ్చి.

తాత్పర్యం: వందిమాగధుల స్తోత్రాలతో ధర్మరాజు నిద్రలేచి జలకాలాడు గదికి వెళ్ళాడు. ఆ స్నానశాలకు దాసీజనం సుగంధద్రవ్యాలతో నిండిన మంత్రజలాలను బంగారు వెండి గిండీలతో తీసికొని వచ్చారు. ఆ నీళ్ళతో ధర్మజుడు స్నానమాడి, పరిశుభ్రమైన వస్త్రాలను, సుగంధద్రవ్యాలను, పూలమాలలనూ ధరించి, దేవతార్చనలు చేసి, ఇంటిలోనికి వెళ్ళి, బ్రాహ్మణులకు ఆవులను, బంగారాన్ని, వస్త్రాలనూ దానం చేసి వారి ఆశీర్వాదాలను పొంది, ఏనుగు మొగసాలను దాటి సభాస్థలికి వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఆనాటి రాజభోగ విశేషాలను చాటుతున్న దీ వచనం.

తే. **ఉదయధరణీధరంబుపై నొప్పు దివస । నాథు నెనయుచు సింహాసనంబుమీఁదఁ**
బొలిచె లీలావతీ కరకలిత చామ । రములు వొలయంగ నుచిత జనములు గొలువ. **8**

ప్రతిపదార్థం: ఉదయ ధరణీ ధరంబుపైన్= తూర్పుకొండమీద; ఒప్పు= విలసిల్లే; దివసనాథు= సూర్యుని; ఎనయుచున్= సరిపోలుతూ; సింహాసనంబుమీఁదన్= సింహాసనంపైన; లీలావతీ= అందగత్తెల (దాసీజనాల); కరకలిత= చేతులతో ధరింపబడిన; చామరములు= వింజామరాలు; పొలయంగన్= ఒప్పారగా; ఉచిత జనములు= తగినవారు; కొలువన్= సేవించగా; పొలిచెన్= (ధర్మరాజు) ఒప్పి ఉండినాడు.

తాత్పర్యం: సేవకులు సేవిస్తుండగా, దాసీ జనం వింజామరాలు వీస్తుండగా, ఉదయపర్వతంమీద ప్రకాశించే సూర్యుడిని తలపిస్తూ ధర్మరాజు సింహాసనాసీనుడై ఉన్నాడు.

విశేషం: అలంకారం ఉపమ.

వ. **కొలువున్న సమయంబున దౌవారికుఁడు వచ్చి 'దామోదరుండు వచ్చె' నని యెఱింగించిన 'నవ్విభుండు వేగంబ తత్ప్రవేశంబు నడపు' మనిన వాఁ డట్లచేయ నమ్మహాత్ముండు ప్రీతి నేతెంచుటయు, నుచితాసన విన్యాసంబున నత్యాదర ముఖవికాసంబున నతనికి సత్కారంబు సేసి గారవించి తదాననం బాలోకించి యి ట్లనియె.** **9**

ప్రతిపదార్థం: కొలువు+ఉన్న సమయంబునన్= (ధర్మరాజు) కొలువుదీరి ఉన్నప్పుడు; దౌవారికుఁడు= ద్వారపాలకుడు (వాకిలి కావలి కాచేవాడు); వచ్చి; దామోదరుండు= శ్రీకృష్ణుడు; వచ్చెను+అని ఎఱింగించినన్= వచ్చి ఉన్నాడని తెలుపగా; ఆ+విభుండు= ధర్మరాజు; వేగంబు+అ, తత్+ప్రవేశంబు నడపుము+అనిన= వెంటనే అతడిని లోనికి ప్రవేశపెట్టుము అనగా; వాఁడు+అట్లచేయన్= వా డా విధంగా చేయగా; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడు; ప్రీతిన్+ఏతెంచుటయున్= ప్రేమతో రాగా; ఉచిత+ఆసన విన్యాసంబునన్= తగిన ఆసనాన్ని ఉంచి; అతి+ఆదర, ముఖవికాసంబునన్= మిక్కిలి ప్రీతితో కూడిన ముఖవికాసంతో; అతనికిన్= శ్రీకృష్ణుడికి; సత్కారంబు చేసి= మర్యాద చేసి; గారవించి= గౌరవించి; తద్+ఆననంబు+ఆలోకించి= అతడి ముఖాన్ని చూచి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మరాజు కొలువు దీరి ఉండగా ద్వారపాలకుడు వచ్చి 'శ్రీకృష్ణుడు వచ్చాడు' అని తెలిపాడు. వెంటనే ధర్మరాజు 'ఆయనను లోనికి ప్రవేశపెట్టు'మని పలుకగా అతడట్లాగే చేశాడు. అప్పుడు ఆ మహనీయుడు సంతోషంతో రాగా, ఆతడికి తగిన ఆసనమిచ్చి, గౌరవభావంతో సంతోషంగా సత్కారాలు చేశాడు.

క. 'జ్ఞానమ్ములు దెలివొందం। గా నత్యంతంబు సుఖముగా నింద్రియ సం
తానంబు ప్రసన్నముగా। నీ నిశ శుభవృత్తి గడపితే మధుమథనా!' 10

ప్రతిపదార్థం: మధుమథనా!= మధుసూదనా! (శ్రీకృష్ణా!); జ్ఞానమ్ములు= ప్రజ్ఞలు; తెలివొందంగాన్= వికసించగా; అత్యంతంబు= మిక్కిలి; సుఖముగాన్= సుఖంగా; ఇంద్రియ సంతానంబు= పంచేంద్రియాల సమూహం; ప్రసన్నముగాన్= నిర్మలంగా ఉండగా; ఈ నిశన్= ఈ రాత్రిని; శుభవృత్తిన్= మంగళకరమైన వర్తనంతో; కడపితే?= గడిపావా?

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! ప్రజ్ఞలు వికసించగా, ఇంద్రియసమూహం కలత చెందకుండగా ఈ రాత్రి ప్రశాంత మనస్సుతో సుఖంగా గడిపావా?

క. అనుటయు హరి ధర్మతనూ। జున కిట్లనుఁ 'బ్రీతి నిన్నుఁ జూడఁగనెపుడున్
జననుత! శోభనములు నా। కనూనముల కాదె? దీని నడుగఁగ నేలా?' 11

ప్రతిపదార్థం: అనుటయున్= ఆ విధంగా ధర్మరాజు ప్రశ్నించగా; హరి= శ్రీకృష్ణుడు; ధర్మతనూజునకున్+ఇట్లు+అనున్= ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు; జననుత!= ప్రజలచేత కీర్తింపబడేవాడా!; ఎపుడున్= అన్ని సమయాలలో; నిన్నున్= నిన్ను; ప్రీతిన్+చూడన్= ప్రేమతో చూడగా; నాకున్= నాకు; శోభనములు= (మంగళకరమైన) క్షేమాలు; అనూనముల కాదె!= తక్కువ కావుకదా! (అనగా-విస్తారంగా కలుగును కదా!); దీనిని= ఈ విషయాన్ని; అడుగఁగన్+ఏలా?= ప్రశ్నించటం ఎందుకు?

తాత్పర్యం: అని ధర్మరాజు పలుకగా శ్రీకృష్ణు డిట్లా అన్నాడు - 'ప్రజల మన్ననలందుకునే ఓ ధర్మరాజా! సంతోషంతో నిన్ను ఎప్పుడు చూచినా నాకు శుభపరంపరలు మిక్కుటంగా కలుగుతూ ఉంటాయికదా! ఇక ఈ అంశాన్ని గురించి ప్రత్యేకంగా అడగటం ఎందుకు?'

వ. అని పలికె నట్టియెడ భీమ నకుల సహదేవులును; సాత్యకి ద్రౌపదేయ ఘటోత్కచులును, బాంచాల మాత్స్య కేకయులును, మఱియుం దగువారుం జనుదెంచి సముచితంబుగాఁబ్రవేశించి యుధిష్ఠిరునకుం బొడసూపి, యతండు నియోగింప నుచితాసనంబుల నుండిరి; సాత్యకిం గృష్ణుండు నిజాసనంబున నునిచికొనియెం; దదనంతరంబ యెల్లవారలు వినుచుండ నన్నరపతి నారాయణున కిట్లనియె. 12

ప్రతిపదార్థం: అని పలికెన్= ఆ విధంగా పలికాడు; అట్టియెడన్= ఆ సమయాన; భీమ నకుల సహదేవులును= భీమసేనుడూ, నకుల సహదేవులూ; సాత్యకి ద్రౌపదేయ ఘటోత్కచులును= సాత్యకీ, ఉపపాండవులూ, ఘటోత్కచుడూ; పాంచాల మాత్స్యకేకయులును= పాంచాల మాత్స్య కేకయ దేశీయులూ; మఱియున్= ఇంకనూ; తగువారున్= తగినవారునూ; చనుదెంచి= వచ్చి; సముచితంబుగాన్= తగిన రీతిలో; ప్రవేశించి= లోనికి వచ్చి; యుధిష్ఠిరునకున్= ధర్మరాజునకు; పొడసూపి= కానుపించి; అతండు= ధర్మరాజు; నియోగింపన్= ఉత్తరువుచేయగా; ఉచిత+ఆసనంబులన్= (తమకు) తగిన పీఠాలలో; ఉండిరి= కూర్చున్నారు; సాత్యకిన్= సాత్యకిని; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; నిజ+ఆసనంబునన్= తాను కూర్చున్న స్థానంలో; ఉనిచికొనియెన్= కూర్చుండబెట్టుకొన్నాడు; తదనంతరంబు+అ= ఆ మీదట; ఎల్లవారలు= సభలోని వారంతా; వినుచుండన్= వింటూ ఉండగా; ఆ+నరపతి= ఆ రాజు(ధర్మరాజు); నారాయణునకున్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మజుని ప్రశ్నలకు శ్రీకృష్ణుడు ఆ విధంగా సమాధానం చెప్పాడు. ఆ సమయాన భీమ నకుల సహదేవులూ, సాత్యకి ద్రౌపదేయ ఘటోత్కచులూ, పాంచాల మత్స్య కేకయులూ, ఇంకా తగినవారూ ధర్మజుడి ఆజ్ఞ ప్రకారం తమ తమ స్థానాలలో కూర్చున్నారు. శ్రీకృష్ణుడు సాత్యకిని తన ఆసనంలో సరసన కూర్చొనబెట్టుకొన్నాడు. ఆ సమయాన అందరూ వింటుండగా శ్రీకృష్ణుడితో ధర్మరాజు ఈ విధంగా చెప్పాడు:

ఉ. **'పంకజనాభ! మాపడినపాటులు రాజ్యము గోలుపోకయుం**
గింకకు మూలమై కడఁగి గెల్పుకిరీటికి నీఁ దలంచి యీ
వంకకు వ్రాలి భక్తజనవత్సలతన్ రథచోదకుండ వై
తిం కిట మమ్ముఁగావు మని యేటికిఁ జెప్పఁగ మాటిమాటికిన్? **13**

ప్రతిపదార్థం: పంకజనాభ!= పద్మనాభుడా!; మాపడిన పాటులు= మేం పడిన కష్టాలు; రాజ్యము కోలుపోకయున్= రాజ్యాన్ని పోగొట్టుకొనటమూ; కింకకున్= నీ కోపానికి; మూలమై= ప్రధానకారణమై; కడఁగి= పూనుకొని; కిరీటికిన్= అర్జునుడికి; గెల్పు= జయాన్ని; ఈన్+తలంచి= ఇయ్యదలచి; ఈ వంకకున్= మా పక్కకు; వ్రాలి= చేరి; భక్తవత్సలతన్= భక్తుడిమీది దయతో; రథచోదకుండవు+ఐతి(వి)= సారథివి అయినావు; ఇంకన్= ఈ మీద; ఇటన్= ఇక్కడ; మమ్ము= మమ్మల్ని; కావుము+అని= కాపాడుమని; చెప్పఁగన్ మాటిమాటికిన్ ఏటికిన్?= మళ్ళీ మళ్ళీ చెప్పటం ఎందుకు?

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! రాజ్యాన్ని కోలుపోయి మేము పడ్డ కష్టాలన్నీ నీ కోపానికి మూలం కాగా, భక్తవత్సలతతో మా ప్రక్కకు వచ్చి, అర్జునుడికి సారథివైనావు. అటువంటప్పుడు మాటిమాటికీ మమ్మల్ని కాపాడుమని నీకు చెప్పవలెనా?

వ. **అర్జును ప్రతిన చిత్తంబున నిలుపుము; దుఃఖామర్ష మహార్ణవ మగ్నులమైన మమ్ముం దీరంబు సేరుపం దేపవు**
నీవ కాదె?' యనిన విని యచ్యుతుం డతని కి ట్లనియె. **14**

ప్రతిపదార్థం: అర్జును ప్రతిన= అర్జునుడి శపథాన్ని; చిత్తంబునన్= నీ మనసులో; నిలుపుము= నిల్పుకొనుము; దుఃఖ+అమర్ష, మహా+అర్ణవ, మగ్నులము+ఐన= దుఃఖకోపాలనే మహాసముద్రాలలో మునిగినవారమైన మమ్మున్= మా అందరిని; తీరంబు,చేరుపన్= గట్టెక్కించటానికి; తేపవు= తెప్పవు; నీవు+అ+కాదె!= నీవేకదా!; అనినన్+విని= అనగా విని; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడి ప్రతిజ్ఞను (సైంధవుని చంపుతానన్న ప్రతిజ్ఞను) నీమనస్సులో నిలుపుకొనుము. దుఃఖకోప మహాసముద్రంలో మునిగిన మా అందరినీ గట్టెక్కించే తెప్పవు నీవే కదా!' అన్న ధర్మరాజుతో శ్రీకృష్ణు డీవిధంగా అన్నాడు:

విశేషం: అలం: రూపకం.

మ. **విను నేఁ దర్జునుఁ డన్యసైన్యముల నుర్విం గూల్చుచుం బ్రేత భూ**
త నికాయంబులు మాంస భక్షణము రక్తస్వైర పానంబుఁ జే
సి నలిం గ్రాలఁగఁ గ్రీడసల్పు నిను మెచ్చించుం దుదిన్ సైంధవుం
డను వానిం దెగటార్చి పేర్చు రిపుధైర్యక్షేపణాటోపతన్. **15**

ప్రతిపదార్థం: విను= వినుము; నేఁడు= ఈదినం; అర్జునుఁడు= అర్జునుడు; అన్యసైన్యములన్= శత్రుసేనలను; ఉర్విన్= భూమిపై; కూల్చుచున్= చంపుతూ; ప్రేత భూత నికాయంబులు= దయ్యాల పిశాచాల గుంపులు; మాంసభక్షణము= మాంసాన్ని తినటం;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రక్తం= నెత్తురును; స్వైరపానంబున్+చేసి= స్వేచ్ఛగా త్రాగి; నలిన్= బాగుగా; క్రాలఁగన్= ఒప్పగా; క్రీడసల్పున్= ఆటలాడును; నినున్= నిన్ను; మెచ్చించున్= మెప్పించును; తుదిన్= ఆఖరున; సైంధవుండు+అను వానిన్= సైంధవుడనే పేరు కలవాడిని; తెగటార్చి= చంపి; రిపు= శత్రువుల; ధైర్య= ధైర్యమును; క్షేపణ= పోగొట్టేటి; ఆటోపతన్= విజృంభణంతో; పేర్చున్= చెలరేగుతాడు.

తాత్పర్యం: ఈ రోజు అర్జునుడు శత్రుసైన్యాలను చంపుతూ, భూతప్రేతాలు ఆ చనిపోయిన వారి మాంసాన్ని తింటూ, వారి నెత్తురును యథేచ్ఛగా త్రాగుతూ ఉండగా ఆఖరున సైంధవుడిని చంపి శత్రువుల ధైర్యాన్ని పోగొట్టి సంభ్రమంగా విజృంభిస్తాడు.

వ. క్రోధ శోక జ్వర విముక్తుండ వై శాంతిం బొందు ' మను నవసరంబున ధనంజయుండు వచ్చి ధర్మనందనునకు మ్రొక్కి నిలిచినం జూచి యతండు సంతసంబున సముత్థితుండై కౌఁగిలించుకొని దీవించి దరస్మిత రుచిరాననుండై. 16

ప్రతిపదార్థం: క్రోధ శోక జ్వర ముక్తుడవు+ఐ శాంతిన్+పొందుము= కోపదుఃఖా లనే జ్వరమును వదలి శాంతముతో ఉండుము; అను అవసరంబునన్= అనే సమయాన; ధనంజయుండు= అర్జునుడు; వచ్చి; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; మ్రొక్కి= నమస్కారం చేసి; నిలిచినన్= నిలువగా; చూచి; అతండు= ధర్మరాజు; సంతసంబునన్= సంతోషంతో; సముత్థితుండు+ఐ= లేచి; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; దీవించి= ఆశీర్వాదం చేసి; దరస్మిత రుచిర+ఆననుండు+ఐ= చిరునవ్వుతో ప్రకాశించే ముఖం కలవాడు అయి.

తాత్పర్యం: కోపం, దుఃఖం అనే జ్వరం నుండి విముక్తుడవై శాంతి పొంది ఉండుము' - అని అంటున్న సమయంలో అర్జునుడు వచ్చి ధర్మరాజుకు నమస్కరించి నిలువబడగా చూచి, అతడు ఆసనంనుండి సంతోషంతో లేచి అర్జునుడిని కౌగిలించుకొని ఆశీర్వదించి చిరునవ్వు నవ్వి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'గెలుపు ధ్రువము నీకును మెయిఁ । దలతలమనుచాయ దోఁచె; దైత్యాంతకుఁడుం
దెలివొంది యున్నవాఁ'డని । పలికిన నా విభునితోడఁ బార్థుఁడు నెమ్మిన్. 17

ప్రతిపదార్థం: గెలుపు ధ్రువము= నీకు విజయం నిశ్చయం; నీకున్= నీకు; మెయిన్= శరీరంలో; తలతలమనుచాయ= తళతళమని ప్రకాశించే కాంతి; తోఁచెన్= కానవస్తూ ఉన్నది; దైత్యాంతకుఁడున్= శ్రీకృష్ణుడు (దైత్య సంహారి); తెలివి+ఒంది ఉన్నవాఁడు= జాగరూకుడై ఉన్నాడు; అని పలికినన్= అని చెప్పగా; నెమ్మిన్= ప్రీతితో; ఆ విభుని తోడన్+పార్థుఁడు= ధర్మరాజుతో అర్జునుడు.

తాత్పర్యం: 'విజయం కలగటం తథ్యం. నీ శరీరంలో తళతళలాడే కాంతి కన్పిస్తున్నది. శ్రీకృష్ణుడు కూడా తెలివొంది ఉన్నాడు' - అని పలుకగా అర్జునుడు అతడితో ప్రీతితో - (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'దేవరకు నధికభద్రము; । యీ వసుదేవసుతు కరుణ నే నత్యాశ్చ
ర్యావహము గంటి; నది వినఁ । గావలయును బంధు మిత్ర గణ సహితముగన్'. 18

ప్రతిపదార్థం: దేవరకున్= ఏలినవారికి (అనగా మీకు); అధిక భద్రము+అ= మిక్కిలి క్షేమమే; ఈ వసుదేవసుతు= ఈ వాసుదేవుడి కుమారుడైన కృష్ణుడు కరుణన్= దయతో; ఏను= నేను; అతి+ఆశ్చర్యావహమున్= మిక్కిలి వింత అయిన విషయాన్ని; కంటిన్= చూచాను; అది= దానిని; బంధుమిత్రగణ సహితముగన్= బంధువులతో, స్నేహితులతో అందరితో కలిసి; వినఁగాన్ వలయున్=వినవలెను.

తాత్పర్యం: 'దేవరవారైన మీకు మిక్కిలి కుశలమే. ఈ వాసుదేవుడి దయతో నే నొక అద్భుతాన్ని చూచాను. బంధుమిత్రుల సమూహాలతో కలిసి ఆ విశేషాన్ని మీరు వినవలెను.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి స్వప్నంబున ఫాలలోచనువలనం బరమోత్కర్షంబు వడసిన తెఱం గేర్పడం జెప్పిన నతండును గొలువు వారును విస్మయ ప్రమోదంబులతో వృషభధ్వజు నుద్దేశించి నమస్కరించిరి; తదనంతరంబ యన్నరపతిచేత నన్నుజ్ఞాతులయి యా సకలయోధులుం బొంగి సంగర సన్నాహంబులు మెఱయ వెడలిరి; కృష్ణార్జున సాత్యకులు నతనికి నభివాదంబులు సేసి సహర్షంబుగా వెలువడి యర్జునావాసంబున కరిగి; రందుఁ గృష్ణుండు రథంబు వన్ని, జైత్రంబులగు మంత్రంబులు ప్రయోగించి యుజ్జ్వలంబు సేసిన నది బాలభానుండునుం బోలె దేజోమయంబై వెలుంగుచుండ సమర సన్నద్ధుండై ధనుర్బాణ పాణియై యర్జునుండు విప్రాశీర్వాదంబులతో నమ్మహనీయ స్యందనంబునకుం బ్రదక్షిణంబునుఁ బ్రణామంబునుం జేసి యారోహణం బాచరించి మేరు శిఖరంబునం బొలుచు భాస్కరుని భంగి శోభిల్లెఁ గృష్ణ సాత్యకులు నొగలను నతని పిఱుందను గూర్చున్న నా ఫల్గునుండు బుధశుక్ర సమేతుం డగు చంద్రు చందంబున నొప్పె; న ట్లొప్పివారు పుణ్యపాఠక రవంబులును వందిమాగధ ధ్వనులును వినుచుం జని రప్పుడు దమకు విజయప్రదంబులు గౌరవులకు విపరీతంబులు నైన గంధవాహాది నానానిమిత్తంబు లనుసంధించి యా సవ్యసాచి సాత్యకితో నిట్లనియె. 19

ప్రతిపదార్థం: అని పలికి= ముందర చెప్పినట్లుగా మాటాడి; స్వప్నంబునన్= కలలో; ఫాలలోచనువలనన్= ఈశ్వరుడి వలన; పరమోత్కర్షంబు పడసిన= శ్రేష్ఠమైన మేలుపొందిన; తెఱంగు+ఏర్పడన్+చెప్పినన్= పద్ధతిని స్పష్టంగా చెప్పగా; అతండును= ధర్మరాజును; కొలువువారును= సభలో ఉండేవారును; విస్మయ ప్రమోదంబులతోన్= సంతోషాశ్చర్యాలతో; వృషభధ్వజున్= ఈశ్వరుడిని; ఉద్దేశించి= తలచుకొని; నమస్కరించిరి= నమస్కారం చేశారు; తదనంతరంబు+అ= ఆ మీద; ఆ+నరపతిచేతన్= ఆ రాజువలన; అనుజ్ఞాతులై= ఉత్తర్వునంది; ఆ సకలయోధులు= ఆ సైనికులంతా; పొంగి= ఉబ్బి; సంగర సన్నాహంబులు= యుద్ధప్రయత్నాలు; మెఱయన్ వెడలిరి= బయల్పడగా వెళ్ళారు; కృష్ణ+అర్జున సాత్యకులు; అతనికిన్+అభివాదంబులు+చేసి= ధర్మజుడికి నమస్కారాలు చేసి; సహర్షంబుగాన్= సంతోషంతో; వెలువడి= బయటకు వెళ్ళి; అర్జున+ఆవాసంబునకున్= అర్జునుడి స్థావరానికి; అరిగిరి= వెళ్ళారు; అందున్= అక్కడ; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; రథంబు పన్ని= తేరును సిద్ధం చేసి; జైత్రంబులు+అగు= విజయాన్ని కల్గించే; మంత్రంబులు= మంత్రాలను; ప్రయోగించి= (ఆ రథంపైకి) నడిపించి; ఉజ్జ్వలంబు చేసినన్= వెలిగే విధంగా చేయగా; అది= ఆ తేరు; బాలభానుండునున్+పోలెన్= ఉదయ సూర్యుడి మాదిరిగా; వెలుంగుచుండన్= ప్రకాశిస్తూ ఉండగా; సమర సన్నద్ధుండు+ఐ= యుద్ధం చేయటానికి సిద్ధంగా; ధనుర్బాణపాణి+ఐ= విల్లమ్ములు చేతిలో కలవాడుగా; అర్జునుఁడు; విప్ర+ఆశీర్వాదంబులతోన్= బ్రాహ్మణుల ఆశీర్వచనాలతో; ఆ+మహనీయ స్యందనంబునకున్= ఆ మహత్తుకల తేరుకు; ప్రదక్షిణంబునున్= ప్రదక్షిణమూ; ప్రణామంబునున్= నమస్కారమూచేసి; ఆరోహణంబు+ఆచరించి= ఎక్కి; మేరు శిఖరంబునన్+పొలుచు= మేరుపర్వత శిఖరాన కనిపించే; భాస్కరుని భంగిన్= సూర్యుడివలె; శోభిల్లెన్= అందగించాడు; కృష్ణసాత్యకులు= కృష్ణుడు, సాత్యకియు; నొగలను= తేరు నొగలపై; అతని పిఱుందను= అతడికి వెనుకగా; కూర్చున్నన్= కూర్చొనగా; ఆ ఫల్గునుండు= ఫల్గునుడనే పేరున్న అర్జునుడు; బుధశుక్ర సమేతుండు+అగు= బుధ, శుక్ర గ్రహాలతో కూడి ఉన్న; చంద్రుచందంబునన్= చంద్రుడివలె; ఒప్పెన్= అమరి ఉన్నాడు; అట్లు+ఒప్పి; వారు= అర్జున కృష్ణ సాత్యకులు; పుణ్య= మంగళకరమైన; పాఠకరవంబులును= స్తుతిపాఠకులఘోషలను; వందిమాగధ ధ్వనులు= వందిమాగధుల గీతధ్వనులను; వినుచున్; చనిరి= వెళ్ళారు; అప్పుడు= ఆ సమయాన; తమకున్= తమకు (పాండవులకు); విజయప్రదంబులు= విజయాలను కలిగించేవి; కౌరవులకున్= దుర్యోధనాదులకు; విపరీతంబులు= వ్యతిరేకాలైనవి; గంధవాహ+అది= గాలులు మొదలైన; నానా నిమిత్తంబులు= అనేక శకునాలను; అనుసంధించి= కూర్చి; ఆ సవ్యసాచి= ఆ అర్జునుడు; సాత్యకితోన్+ఇట్లనియెన్= సాత్యకితో ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అర్జునుడు కలలో ఈశ్వరానుగ్రహాన్ని పొందిన విషయం చెప్పగా సభలోని వారంతా ఆశ్చర్యంతో సంతోషాన్ని తెల్పుతూ వృషభకేతనుడికి నమస్కరించారు. తరువాత రాజాజ్ఞతో సైనికులంతా సంతోషంతో యుద్ధ సన్నద్ధులైనారు. కృష్ణార్జున సాత్యకులు ధర్మరాజునకు నమస్కారం చేసి బయటకు వచ్చి అర్జునుడి శిబిరానికి వెళ్ళారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అక్కడ కృష్ణుడు యుద్ధానికి రథాన్ని సిద్ధంచేసి విజయానికి ఆధారాలైన మంత్రాలతో దానిని ప్రకాశింపజేయగా ఆ తేరు ఉదయ సూర్యుడి మాదిరి శాంతితో వెలుగుతూ ఉండింది. యుద్ధ సన్నద్ధుడైన అర్జునుడు బ్రాహ్మణాశీర్వాదాలను పొంది విల్లునూ, అమ్ములనూ ధరించి ఆ మహనీయమైన తేరుకు ప్రదక్షిణ నమస్కారం చేసి, తేరెక్కి, మేరు పర్వత శిఖరాన వెలిగే సూర్యుడిని తలపిస్తూ ప్రకాశించాడు. శ్రీకృష్ణుడు నొగలమీదా; సాత్యకీ, అర్జునుడూ వెనుకా కూర్చున్నారు. ఆ ఫల్గునుడు బుధ, శుక్ర గ్రహాలతో కలిసి అందంగా ప్రకాశించే చంద్రునివలె ఒప్పారుతూ, పాఠకుల మంగళ వచనాలనూ, వందిమాగధుల స్తోత్రాలనూ వింటూ వెళ్ళే సమయాన పాండవులకు అనుకూలంగానూ, కౌరవులకు వ్యతిరేకంగానూ గాలులు వీచటం మొదలైన నానావిధ శకునాలను సమన్వయించి అర్జునుడు సాత్యకితో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉపమ.

అర్జునుఁడు సాత్యకిని ధర్మరాజురక్షణంబునకు నియోగించుట (సం. 7-60-27)

క. **'మనకు నిమిత్తము లెంతయు । ననుకూలము లయ్యెఁ; గెలుతు; మాహవమున కేఁ**
జనియెదఁ బ్రతిజ్ఞ తీర్పఁగ; । ననఘా! ధర్మసుతు రక్ష కరుగుము నీవున్. 20

ప్రతిపదార్థం: అనఘా!= పాపము లేనివాడా!; మనకున్= మనకు; నిమిత్తములు= శకునాలు; ఎంతయున్+అనుకూలములు+అయ్యెన్= మిక్కిలి ఒద్దికగా ఉన్నాయి; గెలుతుము= జయిస్తాము; ఆహవమునకున్= యుద్ధానికి; ఏన్= నేను; చనియెదన్= వెళ్ళుతాను; ప్రతిజ్ఞన్+తీర్పఁగన్= శపథాన్ని నెరవేర్చటానికి; నీవున్= నీవు; ధర్మసుతు రక్షకున్= ధర్మరాజును కాపాడటానికి; అరుగుము= వెళ్ళుము.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! మనకు శకునాలు చాలా బాగున్నాయి. నేను నా శపథాన్ని నెరవేర్చటానికి వెళ్ళుతాను. నీవు ధర్మరాజును కాపాడేందుకు వెళ్ళుము.

క. **'విను! సింధురాజవధయును । మనుజాధిపరక్షణంబు మనకు సరియ కా**
వున నే నొకపని నీ వొక । పని మేకొని చేయు టరయఁ బాడియ కాదే! 21

ప్రతిపదార్థం: విను= వినుము; సింధురాజ వధయును= సైంధవుడిని చంపటం; మనుజాధిప రక్షణంబు= రాజైన ధర్మరాజును కాపాడటం; మనకున్ సరియ= మనకు సమానమే; కావునన్= అందువలన; నేను+ఒకపనిన్; నీవు+ఒకపనిన్= నేనొకపనిని, నీవొక పనినీ; మేకొని= పూనుకొని; చేయుట= చేయటం; అరయన్= చూడగా; పాడి+అ కాదే!= న్యాయం కదా!

తాత్పర్యం: మనకు సైంధవుడిని చంపటమూ, ధర్మరాజును కాపాడటమూ రెండూ సమానమే. కాబట్టి నే నొక పనీ, నీ వొక పనీ పూనుకొని చేయటం న్యాయం కదా!

ఆ. **ఏను నిలిచినట్ల కా నూఁఅడిల్లు నీ । వున్న న న్నరేశ్వరోత్తముండు;**
నిర్భరుండ వగుము నీవు నాదెస; నాకు । హరి గలండు; గలఁడె యచట నితఁడు? 22

ప్రతిపదార్థం: ఏను= నేను; నిలిచినట్లు+అ, కాన్= ప్రక్కనే నిలిచినట్లుగా; నీవు+ఉన్నన్= నీవు ప్రక్కన ఉంటే; ఆ+నరేశ్వరుండు= ఆ ధర్మరాజు; ఊఱడిల్లున్= ఊరట చెందుతాడు; నాదెసన్= నన్నుగూర్చి; నీవు= నీవు; నిర్భరుండవు+అగుము= భయం లేక ఉండుము; నాకున్ హరికలండు= నాకు శ్రీకృష్ణుడున్నాడు; అచటన్= ఆ దిక్కులో (అనగా ధర్మరాజు ఉన్నచోట); ఇతఁడు= ఈ శ్రీకృష్ణుడు; కలఁడె?= ఉన్నాడా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నీవు తన ప్రక్క ఉండగా నేను తోడున్నట్లుగా ధర్మరాజు ఊరట చెందుతాడు. నీవు ఆయన ప్రక్కన ఉండుము. నాకు దిక్కుగా శ్రీకృష్ణు డున్నాడు కాబట్టి భయం వద్దు. ఆయన చెంత శ్రీకృష్ణుడున్నాడా? లేదుకదా.

వ. **ఎల్లభంగుల రాజరక్షణార్థంబుగా నీకుఁ బోవలయును; బరాక్రమధుర్యుండగు నాచార్యుప్రతిన యెఱుంగవే!' యనుటయు, 'నట్ల కాక' యని యతండు ధర్మనందనుపాలికిం జనియె; నజ్జననాథుండు సమరోత్సాహ సముజ్జ్వలుం డయి వచ్చి నిజ సైన్యంబు నలంకరించి చిహ్నంబులు మెఱయ నెఱయం బొలిచి నిలిచె' ననిన విని సంజయునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె.** **23**

ప్రతిపదార్థం: ఎల్లభంగులన్= అన్ని విధాలుగా; రాజరక్షణ+అర్థంబుగాన్= రాజును కాపాడేందుకు (ధర్మరాజును కాపాడటానికి); నీకున్+పోవలయును= నీవు పోయి తీరవలెను; పరాక్రమధుర్యుండు+అగు= శత్రువులను జయించటంలో సామర్థ్యం కలవాడైన; ఆచార్యుప్రతిన= ద్రోణాచార్యులు చేసిన శపథం; ఎఱుంగవే?= తెలియదా?; అనుటయున్= అని(అర్జునుడు) అనగా; అట్లకాక+అని= అట్లే అని (అనగా సరే అని); అతండు= సాత్యకి; ధర్మనందనుపాలికిన్= ధర్మరాజు వద్దకు; చనియెన్= వెళ్ళాడు; ఆ+జననాథుండు= ఆ ధర్మరాజు; సమర+ఉత్సాహ సముజ్జ్వలుండు+అయి, వచ్చి= యుద్ధమందలి ఉత్సాహంతో ప్రకాశించినవాడై; వచ్చి; నిజసైన్యంబున్+అలంకరించి= తన సేనకు అలంకారంగా; చిహ్నంబులు+ (తమ తమ) గుర్తులు; మెఱయన్= ప్రకాశించగా; నెఱయన్+పొలిచి నిలిచెన్= వ్యాపించేటట్లుగా నిలిచాడు; అనినన్+విని= అని చెప్పగా విని; సంజయునకున్ ధృతరాష్ట్రుండు+ఇట్లు+అనియెన్= సంజయుడితో ధృతరాష్ట్రుడీ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఏ విధంగా చూచినా రాజును కాపాడేందుకు నీవు పోవలెను. ద్రోణాచార్యుడి శపథం నీకు తెలియును కదా!' అనగా, సరే అని సాత్యకి ధర్మరాజు వద్దకు వెళ్ళాడు. ఆ సమయంలో ధర్మరాజు సమరోత్సాహంతో వెలుగుతూ ఉన్నాడు' అని చెప్పగా విన్న ధృతరాష్ట్రుడు సంజయుడితో ఈ విధంగా చెప్పాడు.

సీ. **పుత్రశోకానలంబును గ్రోధవహ్నియు । మనమున ముప్పిరి గొనఁగ మృత్యు**
భంగి నేతెంచు బీభత్సునిఁ గౌరవుల్ । సెనకఁజాలర యేమి చేటు; మూఁడె
నో? పురిలో నొక్కయుమ్మడి నింటింట । నార్తనాదములు పెక్కయ్యెఁ; నెల్ల
రవముల మిగిలి సైంధవునింటి దిక్కున । నాక్రందనధ్వను లతిశయిల్లె;

తే. **నేను ద్రోణుండు భీష్ముండుఁ బూని చెప్ప । శౌరి మాటలు మీ రాజు సరకుగొనఁడ**
సంధి గానీక కర్ణుండు సౌబలుండు । దుస్ససేనుండు నందఱఁ ద్రుంచికొనిరి. **24**

ప్రతిపదార్థం: పుత్రశోక+అనలంబును= కొడుకు చనిపోవటం వలన కలిగిన దుఃఖమనే అగ్నీ; క్రోధవహ్నియున్= కోపమనే అగ్నీ; మనమునన్= హృదయంలో; ముప్పిరి గొనఁగన్= దట్టంగా వ్యాపించగా; మృత్యుభంగిన్= యముడివలె; ఏతెంచు= వచ్చే; బీభత్సు నిన్= అర్జునుడిని; కౌరవుల్= కౌరవులు; చెనకన్+చాలరు+అ= ఎదుర్కొనలేరు; ఏమి= ఎటువంటి (ఏ); చేటు= కీడు; మూఁడెనో= ముంచుకొని వచ్చిందో; పురిలోన్= నగరంలో; ఒక్క+ఉమ్మడిన్= ఒక్కసారిగా; ఇంటన్+ఇంటన్= ఇంటింటిలో; ఆర్తనాదములు= ఏడుపులు, పెడబొబ్బలు; పెక్కు+అయ్యెన్= మిక్కుటమయ్యాయి; ఎల్లరవములన్= అన్ని నాదాలను; మిగిలి= మించి; సైంధవు+ ఇంటి దిక్కునన్= సైంధవుడి ఇంటివైపు; ఆక్రందన ధ్వనులు= ఏడుపుల చప్పుళ్ళు; అతిశయిల్లెన్= ఎక్కువయ్యాయి; ఏనున్= నేను(ధృతరాష్ట్రుడూ); ద్రోణుండున్; భీష్ముండున్; పూని= పూనుకొని; చెప్పన్= చెప్పినప్పటికీ; శౌరిమాటలు= శ్రీకృష్ణుడి హితవులు; మీరాజు= మీకు ప్రభువైన దుర్యోధనుడు; సరకున్+కొనఁడు+అ= లెక్క చేయడు; కర్ణుండు; సౌబలుండు= శకుని; దుస్ససేనుండు= దుశ్శాసనుడు; సంధి కానీక= సంధి కాకుండా చేసి; అందఱన్= (తమవారిని) అందరినీ; త్రుంచికొనిరి= చంపుకొన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'కొడుకు చనిపోవటంవలన కలిగిన శోకాగ్నీ, సైంధవుడిపై పగసాధించాలన్న కోపాగ్నీ ముప్పేటగా ముసురుకొన్న యముడివలె అర్జునుడు రాగా కౌరవులు అతడిని ఎదుర్కొనలేరు. ఏమి కీడు జరిగిందో కాని నగరంలో ఒక్కసారిగా ఇంటింటా ఏడ్పులూ, పెడబొబ్బలూ పిక్కటిల్లాయి. ఆర్తనాదాలన్నింటికంటె సైంధవుడి ఇంట్లో ఏడ్పుల చప్పుళ్ళు మిక్కుటంగా వినబడుతున్నాయి. మీ రాజైన దుర్యోధనుడికి నేనూ, ద్రోణుడూ, భీష్ముడూ ఎంత ప్రయత్నించి చెప్పినా శ్రీకృష్ణుడి మాటలు లెక్కచేయడు. కర్ణుడు, శకుని, దుశ్శాసనుడు సంధి కానీయక అందరినీ చంపుకొన్నారు.

ఉ. ఎక్కటి పోరె; రుద్రునకు నేమిటఁ దక్కువ ఫల్గునుండు? వాఁ
డొక్కఁడ యయ్యెనే? జగము లొక్కట మ్రింగఁగఁజాలు; కేశవుం
డెక్కినవాఁడు వాని నొగ; లేల చలం? బని యెంత సెప్పినం
దక్కఁడు రాజ్యలోభము మదంబున నా కొడు; కేమి సేయుదున్? 25

ప్రతిపదార్థం: ఎక్కటి== ఒక్కడే; పోరెన్= యుద్ధం చేశాడు; రుద్రునకున్= ఈశ్వరుడికి; ఫల్గునుండు= అర్జునుడు; ఏమిటన్= ఎందులో; తక్కువ?= తగ్గినాడు? (అనగా ద్వంద్వ యుద్ధంలో శివుడితో తానొక్కడే అర్జునుడు పోట్లాడాడని భావం); వాఁడు= అర్జునుడు; ఒక్కడు+అ అయ్యెనే?= ఒకడే అయ్యాడా?; జగములు= లోకాలను; ఒక్కటన్= ఒకేమారు; మ్రింగఁగన్+చాలు= మ్రింగివేయగల; కేశవుండు= శ్రీకృష్ణుడు; వాని నొగలు= అర్జునుడి రథం యొక్క నొగలు; ఎక్కినవాఁడు= ఎక్కి ఉన్నాడు (సారథిగా ఉన్నాడు); ఏల చలంబు?= మాత్సర్యం ఎందుకు?; అని; ఎంత= ఎంతగా; చెప్పినన్= చెప్పినప్పటికీ; రాజ్యలోభము మదంబునన్= రాజ్యాన్ని అత్యాశతో పొందాలనే మదంవలన; నా కొడుకు= నా కుమారుడు; తక్కఁడు= వదలడు; ఏమి చేయుదున్?= ఏమి చేయగలను?

తాత్పర్యం: 'ఒక్కడే నిలిచి శివుడితో అర్జునుడు యుద్ధం చేశాడు. ఆతడిని ఏ విధంగా తక్కువగా అంచనా వేయగలం? ఆ అర్జును డొక్కడే లోకాలను హతమార్చగల శక్తి కలవాడు. అటువంటి వాడి తేరెక్కి సారథిగా శ్రీకృష్ణు డున్నాడు; వారిపై మనకు మాత్సర్యం ఎందుకు?' అని ఎంతగా చెప్పినా నా కుమారుడు రాజ్య లోభ మదంతో తన నిర్ణయాన్ని మానకుండా ఉన్నాడు. ఏమి చేయగలను?

వ. అది యట్లుండె. 26

తాత్పర్యం: దాని నట్లుండనిమ్ము.

తే. క్రీడి యమ్మెయి వచ్చినఁ గూడఁ బాఱి । యెడలు గలఁగఁగఁ గౌరవు లేమి సేసి?
రది యెఱుంగఁగఁ జెప్పవే యనఘ! నీతి । యయ్యె నేమి దా దుర్ణయ మయ్యె నేమి?' 27

ప్రతిపదార్థం: క్రీడి= అర్జునుడు; ఆ+మెయిన్= ఆ ప్రకారం; వచ్చినన్= రాగా; కూడన్= వెన్నంటి; పాఱి= పరుగెత్తి; ఎడలుకలఁగఁగన్= మనసులు కలతచెందగా; కౌరవులు+ఏమిచేసిరి?= కౌరవు లేమిచేశారు?; అది ఎఱుంగఁగన్ చెప్పవే= తెలిసేటట్లుగా చెప్పుము; అనఘ!= పుణ్యాత్ముడా!; నీతి అయ్యెనేమి?= ధర్మం అయినా; తాన్= అది; దుర్ణయము= దుర్నీతి అయినా కానిమ్ము(చెప్పుము).

తాత్పర్యం: అర్జును డా విధంగా వెన్నంటి తరుమగా పరుగెత్తిన కౌరవు లేమి చేశారు? అది ధర్మమైనా, అధర్మమైనా నాకు తెలియజెప్పుము'

వ. అనుటయు నా సూతనందనుం డంబికానందనున కి ట్లనియె. 28

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ సూతనందనుండు= సూతుడి కుమారుడైన సంజయుడు; అంబికానందనునకున్= ధృతరాష్ట్రుడితో (అంబిక కుమారుడు); ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా సంజయుడు ధృతరాష్ట్రుడితో ఈ విధంగా అన్నాడు.

సీ. 'అధిప! చెప్పెద నీకు నంతయు నివ్విలా । పము గతజల సేతు బంధనంబు;
మాయ జూదము మున్ను మాన్పవ, పదపడి । సంధి గావింపవ, సకల జనులు
నిను లుబ్ధుఁడు నధర్మనిరతుండు నని దూఱు । దురు; దూఱ కే లుండుదురు నరేంద్ర!
పాండుఁ డవ్విధమునఁ బాలించె రాజ్యంబు । పాండవు లెక్కుడు ప్రబ్బె యశము

తే. లాభమును భరతాన్వయోల్లాస మెసఁగఁ । దగ నొనర్చిరి వారలఁ దగునె వారి
తండ్రిపాలైన సిరి వాపఁ దనయు మీఁదఁ । బెట్టె దేల? నీ దుర్నీతి ముట్టవచ్చె. 29

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; నీకున్+అంతయున్+చెప్పెదన్= నీకు అన్ని విషయాలు చెపుతాను; ఈ+విలాపము= ఈ దుఃఖం; గతజలసేతు బంధనంబు= పోయిన నీటి ప్రవాహానికి వారధి కట్టినట్లు; మాయజూదము= మోసపు జూదమును; మున్ను= తొలుతనే; మాన్పవు+అ= ఆపినావు కావు; పదపడి= ఆ మీద; సంధి కావింపవు+అ= సంధి చేశావు కావు; సకలజనులు= సమస్త జనులూ; నినున్= నిన్ను; లుబ్ధుఁడు= లోభి; అధర్మనిరతుండు= అన్యాయమైన పనులు చేయటంలో ఆసక్తి కలవాడు; అని దూఱుదురు= అని దూషిస్తారు; నరేంద్ర!= ఓ రాజా!; దూఱక= తిట్టక; ఏల+ఉండుదురు?= ఎందుకుంటారు?; పాండుఁడు= పాండురాజు; ఆ+విధమునన్= ఆ ప్రకారంగా (అనగా ధర్మంగా); రాజ్యంబు= రాజ్యాన్ని; పాలించెన్= ఏలాడు; పాండవులు= పాండు కుమారులు; ఎక్కుడు= మిక్కిలి; ప్రబ్బె= వృద్ధిచెందె; యశము= కీర్తిని; లాభమును; భరతాన్వయ+ఉల్లాసము+ఎసఁగన్= భరతవంశానందం అతిశయించగా; తగన్= తగినట్లు; ఒనర్చిరి= చేశారు; వారలన్= పాండవులను; తండ్రిపాలు+ఐన సిరి= తండ్రి భాగపు సంపదను; పాపన్+తగునె?= తప్పింపవచ్చునా?; ఏల= ఎందుకు; తనయుమీఁదన్= కుమారుడి మీద; పెట్టెదు?= నెపం పెట్టుతున్నావు?; నీ దుర్నీతి= నీ మోసపునీతి; ముట్టన్వచ్చెన్= తాకవచ్చింది.

తాత్పర్యం: 'ఓ రాజా! నీకు అన్ని విషయాలు వివరిస్తాను. గత జల సేతుబంధనమైన ఈ ఏడుపెందుకు? తొలుతనే మోసపు జూదాన్ని మాన్పలేదు. ఆ తరువాత సంధీ కావించలేదు. లోకులంతా నిన్ను లోభివనీ, అన్యాయపరుడవనీ తిట్టకుండా ఎట్లా ఉంటారు? పాండురాజు రాజ్యాన్ని (ధర్మంగా) పాలించాడు. పాండుకుమారుల అభివృద్ధిని చూడలేక, వారి తండ్రిపాలు వారికి ఈయక తప్పించుకొనవచ్చునా? తప్పంతా నీ కుమారుడిపై తోస్తున్నావు. నీ కపటనీతితో నీ కుమారుడినే తప్పు పట్టుతున్నావు. నీ దుర్నీతి ఫలం అనుభవించే కాలం నీకు దాపురించింది.

ఉ. కౌరవు లేమి సేయుదురు? గాండివ ఘోషముఁ బాంచజన్య తీ
వ్రారవమున్ సహింప దివిజావలికిన్ వశమే? వియచ్చరుల్
పేరుకొనంగ నాదృఢకపిధ్వజమైన రథంబు తోడనుం
బోలిరి పోరు భంగి విను భూవర! శోకము దక్కి ధీరతన్.' 30

ప్రతిపదార్థం: భూవర!= ఓ రాజా! (ధృతరాష్ట్రా!); గాండివ ఘోషము= గాండీవముయొక్క శబ్దం (అనగా గాండీవం అల్లెత్రాటి టంకారము); పాంచజన్య= పాంచజన్యమనే పేరుకల శంఖంయొక్క; తీవ్రారవమున్= భయంకరమైన శబ్దమును (శంఖం ఊదినపుడు కలిగే శబ్దంయొక్క తీవ్రత); సహింపన్= ఓర్చుకొనటానికి; దివిజ+ఆవలికిన్= దేవతా సమూహానికి; వశమే?= సాధ్యమా?(అనగా

సాధ్యము కాదు కాబట్టి); కౌరవులు+ఏమి చేయుదురు?= కౌరవులేమి చేయగలరు?; (అయినా) వియత్+చరుల్= దేవతలు (ఆకాశంలో తిరిగేవారు); పేరుకొనంగన్= స్తుతిస్తూ ఉండగా; ఆ దృఢ= ఆ స్థిరమైన; కపిధ్వజము+ఐన= కపికేతనంగల; రథంబు తోడనున్= తేరితో (అనగా కపికేతనంతో దృఢంగా ఉన్న తేరితో); పోరిరి= యుద్ధం చేశారు; కౌరవులు= గాంధారీ సుతులు; ఏమి చేయుదురు?= ఇంతకంటె ఏమి చేయగలరు?; పోరుభంగిన్= యుద్ధం తీరును; శోకము దక్కి= దుఃఖాన్ని మానుకొని; వినుము= వినుము.

తాత్పర్యం: గాండీవ ఘోషమూ, పాంచజన్య రవమూ సహించటం దేవతా సమూహానికైనా సాధ్యమా? అయినా దేవతలు కీర్తిస్తుండగా కౌరవులు అర్జునునితో యుద్ధం చేశారు. ఓ రాజా! నీ దుఃఖాన్ని వదలి వారి యుద్ధగతిని నీవు వినుము.

వ. **అని పలికి యిట్లనియె: 'రేపకడ గురుండు సంగరోత్సాహదీప్తుం డయి వెడలి శంఖంబు పూరించి సైన్యంబులోనం గలయ మెలంగు నప్పుడు మనయోధు లాయుధంబు లంకించుచు నొండొరులతోడ బిరుదులు వలుకుచు నది యేమి యర్జునుండు దడసె, గోవిందుండు దఱిమికొన రాఁడు, భీమసేనుండు గడంగి పొడసూపం డనుచు సింహనాద శంఖరవ జ్యాఘోషంబులు సెలంగం బొంగుచున్న సమయంబున నా కుంభసంభవుండు సైంధవుం గనుంగొని 'నీవును భూరిశ్రవుండును గర్ణుండును శల్యుండును నశ్వత్థామయు వృషసేనుండును గృపాచార్యుండును గూడుకొనియుండుఁడు; మన బలంబులలో మేలేఱి పదునాలుగువే లేనుంగులను నఱువది వేలు రథంబులను, లక్ష గుఱ్ఱంబులును, బది లక్షలు పదాతులను గైకొనుండు; నా తీర్చు మోహరంబునకు యోజనత్రయ మాత్ర ప్రదేశంబునం బిఱిందిదెస బలసి నిలువుం డట్లైన నిన్ను దేవతలకుం దేఱి చూడరాదు పాండవు లెంతటి వా?' రనిన విని యతండు పెద్దయు నూఱడిల్లి యా రథికవరులు పరివేష్టింప నరిగె; భారద్వాజుండును ద్వాదశగవ్యూతి దీర్ఘంబును బంచగవ్యూతి విస్తృతంబును గా శకట వ్యూహంబు సమకట్టి దానికిఁ బశ్చిమార్ధంబున గర్భవ్యూహంబుగాఁ బద్మవ్యూహంబు వన్నించి తన్మధ్యంబు మొదలుకొని యోలిన సేనాముఖంబు దెసకుం జాలి నిగుడునట్లుగా సూచీవ్యూహంబుఁ గావించి, సూచీముఖంబునం గృతవర్మయు నటపిఱుందఁ గాంభోజరాజును మఱియు బిఱుసన నాప్తులైన శతసహస్ర యోధుల మున్నిడికొని కురురాజును మూలస్థానంబునఁ బూర్వోక్తప్రకారంబున నా జయద్రథుండును నిలుచునట్లుగా నొనర్చిన నమ్మహా వ్యూహంబు వేడుకం జూచి ఖేచరులు మెచ్చి; రట్టియెడ.** 31

ప్రతిపదార్థం: అని పలికి ఇట్లు+అనియెన్= అని ఈ విధంగా చెప్పాడు; ఆ రేపకడన్= ఆ ఉదయాన; గురుండు= ద్రోణాచార్యుడు; సంగర+ఉత్సాహ, దీప్తుండు+ఐ= యుద్ధం మీది ఆసక్తితో ప్రకాశిస్తూ; వెడలి= బయలుదేరి; శంఖంబు పూరించి= శంఖనాదం చేసి; సైన్యంబులోనం గలయ మెలంగునప్పుడు= సైన్యంలో తిరుగుతున్నప్పుడు; మన యోధులు= మన వీరులు; ఆయుధంబులు+ అంకించుచున్= ఆయుధాలను ఝళిపిస్తూ; ఒండొరులతోడన్; ఒకళ్ళొకళ్ళతో; బిరుదులు పలుకుచున్= పొగరు మాటలు మాట్లాడుతూ (తమ తమ సామర్థ్యాన్ని పొగడుకుంటూ); ఇది ఏమి అర్జునుండు తడసెన్?= ఏమిది అర్జునుడు ఆలస్యం చేశాడు?; గోవిందుండు= శ్రీకృష్ణుడు; తఱిమికొన రాఁడు= తరుముకొని రావటం లేదు; భీమసేనుండు కడంగి పొడసూపండు= భీముడు ప్రయత్నంతో కానరాడు; అనుచున్= అని చెప్తుతూ; సింహనాద శంఖరవ జ్యాఘోషంబులు= సింహనాదాలు, శంఖశబ్దాలు, వింటిమ్రోతలు; చెలంగన్= ధ్వనింపగా; పొంగుచున్న= చలరేగుతున్న; సమయంబునన్= వేళలో; ఆ కుంభసంభవుండు= ఆ ద్రోణుడు; సైంధవున్+కనుంగొని= సైంధవుడిని చూచి; నీవును; భూరిశ్రవుండును; కర్ణుండును; శల్యుండును; అశ్వత్థామయు; వృషసేనుండును; కృపాచార్యుండును; కూడుకొని ఉండుండు= కలిసి ఉండండి; మన బలంబులలోన్= మన సైన్యంలో; మేలేఱి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మేలైన వారిని ఎన్నుకొని; పదునాలుగువేలు ఏనుంగులను; అఱువది వేలు రథంబులను; లక్ష గుఱ్ఱంబులును; పదిలక్షలు పదాతులను= పదాతిదళాన్ని; కైకొనుండు= తీసికొనుడు; నాతీర్చు మోహరంబునకున్= నేను ఏర్పాటు చేసే మొగ్గరానికి; యోజనత్రయ మాత్ర ప్రదేశంబునన్= మూడు యోజనాల దూరంగా; పిఱిందిదెసన్= వెనుకభాగంలో; బలసి= చుట్టుకొని; నిలువుండు= నిలిచి ఉండండి; అట్లు+ఐన= ఆ మాదిరి ఉంటే; నిన్ను దేవతలకున్= నిన్ను దేవతలకు కూడా; తేఱి చూడరాదు= తలయెత్తి చూడశక్యం కాదు; పాండవులు+ఎంతటివారు?= పాండవులు ఏపాటివారు?; అనినన్ విని; అతఁడు= సైంధవుడు; పెద్దయున్ ఊఱడిల్లి= మిక్కిలి ఉపశమించి; ఆ రథికవరులు= తేరెక్కి యుద్ధం చేసే వీరులు; పరివేష్టింపన్= చుట్టూ రాగా; అరిగెన్= వెళ్ళాడు; భారద్వాజుండును= ద్రోణుడును; ద్వాదశగవ్యూతి దీర్ఘంబును= ఇరవైనాలుగు కోసుల పొడవును; పంచగవ్యూతి= పది కోసుల; విస్తృతంబును= విస్తారం కలది; కాన్= అయిన; శకటవ్యూహంబున్= బండి ఆకారంతో మొగ్గరాన్ని; సమకట్టి= సిద్ధంచేసి; దానికిన్+పశ్చిమార్ధంబునన్= దానికి పడమటి దిక్కులో సగాన; గర్భవ్యూహంబుగాన్= గర్భమున మొగ్గరంగా; పద్మవ్యూహంబున్= తామరవంటి మొగ్గరాన్ని; పన్నించి= ఏర్పాటుచేసి; తద్+మధ్యంబు మొదలుకొని= ఆ నడిమినుండి; ఓలిన= వరుసగా; సేనాముఖంబు దెసకున్= సేన మొగం దిక్కుకు; చాలి= పడిపోయి; నిగుడునట్లుగాన్= పొడవగునట్లుగా; సూచీ వ్యూహంబు కావించి= సూదిమాదిరి మొగ్గరం చేసి; సూచీముఖంబునన్= ఆ సూది మొదట; కృతవర్మయున్; అట పిఱుందన్= ఆ వెనుక; కాంభోజరాజును; మఱియున్= ఇంకా; పిఱుసన= వెనుక; ఆప్తులు+ఐన= కావలసిన వారైన; శతసహస్రయోధులన్= లక్షమంది సైనికుల; మున్ను+ఇడికొని= ముందుగా పెట్టుకొని; కురురాజును= సుయోధనుడిని; సూచీమూలస్థానంబునన్= సూది మొదటను; పూర్వ+ఉక్త ప్రకారంబునన్= ముందు చెప్పినట్లుగా; ఆ జయద్రథుండును= ఆ సైంధవుడును; నిలుచునట్లుగాన్= ఉండే విధంగా; ఒనర్చినన్= చేయగా; ఆ+మహావ్యూహంబు= ఆ పెద్ద మొగ్గరపు విధానంయొక్క; వేడుకన్= ఉత్సుకతతో; చూచి; ఖేచరులు= దేవతలు; మెచ్చిరి= మెచ్చుకొన్నారు.

తాత్పర్యం: అని పలికి ఇంకా ఇట్లా అన్నాడు. 'ఆ తెల్లవారే సమయంలో ద్రోణాచార్యుడు యుద్ధంచేసే ఉత్సాహంతో ఉప్పొంగి' ముందుకుసాగి శంఖాన్ని పూరించాడు. సైన్యంలో నలుమూలల తిరిగాడు. ఆ సమయంలో మనవీరులు తమ తమ బిరుదాలను పేర్కొంటూ, ఆయుధాలను ఝుళిపిస్తూ 'ఇది ఏమిటి? అర్జునుడు ఆలస్యం చేస్తున్నాడు?' అంటూ సింహనాదాలూ, వింటిత్రాటి మ్రోతలూ చేస్తూ పొంగిపోతున్నారు. ఆ సమయంలో ద్రోణాచార్యుడు సైంధవుడిని చూచి 'నీవూ, భూరిశ్రవసుడూ, కర్ణుడూ, శల్యుడూ, అశ్వత్థామా, వృషసేనుడూ, కృపాచార్యుడూ కలిసి ఉండండి. మన బలాలలో మేలైనవాటిని ఎన్నికచేసి, పదునాలుగువేల ఏనుగులను, అరవైవేల రథాలను, లక్షగుర్రాలను, పదిలక్షలమంది కాల్బలాలను సమీకరించండి. నేను రచించే యుద్ధవ్యూహానికి మూడామడల దూరంలో ఉన్న ప్రదేశంలో వెనుకభాగంగా మూగి నిలవండి. ఆ విధంగా ఉంటే నిన్ను దేవతలు కూడా సమీపించలేరు. ఇక పాండవులు ఎంతటివారు?' అన్నాడు. ఆ మాటలు విని సైంధవుడు ఎంతో ఊరడిల్లాడు. రథికవరులు చుట్టూ మూగి నడువగా నిర్దిష్టప్రాంతానికి వెళ్ళాడు. ఇక ద్రోణాచార్యుడు ఇరవైనాలుగు కోసుల పొడవూ, పది కోసుల విస్తారం ఉండే శకటవ్యూహాన్ని తీర్చాడు. దానికి పడమటి సగభాగంలో గర్భవ్యూహంగా పద్మవ్యూహాన్ని రచించాడు. దాని మధ్యభాగం మొదలుకొని సేనాముఖంవరకు వ్యాపించి ఉండే సూచీవ్యూహాన్ని అమర్చాడు. దాని ముఖంలో కృతవర్మనూ అతడి వెనుక కాంభోజరాజునూ, మరియు మరికొంత వెనుకభాగంలో నూరువేల వీరులను ముందుంచుకొని దుర్యోధనుడుండేటట్లు చేశాడు. సూచీవ్యూహంలోని కేంద్రస్థానంలో సైంధవుడిని (ఇదివరలో చెప్పినట్లు) నిలిపాడు. ఆ మహావ్యూహాన్ని దేవతలు ఉత్సాహంతో చూచి అబ్బురంగా మెచ్చుకొన్నారు. ఆ సమయంలో.

విశేషం: ద్రోణాచార్యుడు యుద్ధంలో అనేక విధాలైన వ్యూహాలను నిర్మించి సైంధవుడిని కాపాడటానికై ఏర్పాటు చేశాడు. యుద్ధగతిని నడపటంలో వ్యూహ నిర్మాణంలో ద్రోణుడి ప్రజ్ఞ మన కింది స్పష్టంగా తెలుస్తూ ఉన్నది.

ద్రోణుని నాల్గవనాటి యుద్ధము (సం.7-63-28)

క. 'మొనలోన నిలువ నొల్లక। తన చతురంగములతో నుదగ్రుం డై య
ర్జును నాఁగుదు నేనొకఁ డన'। యని దుర్మర్షణుఁడు సనియె నార్పులు నిగుడన్. 32

ప్రతిపదార్థం: మొనలోనన్= సైన్యంలో; నిలువన్= నిలుచుటకు; ఒల్లక= ఇష్టపడక; తన= తనదైన; చతురంగములతోన్= రథగజ తురగ పదాతులతో; ఉదగ్రుండు+ఐ= కోపంకలవాడై; ఏను+ఒకఁడన= నేనొక్కడనే; అర్జునున్= అర్జునుడిని; ఆఁగుదున్= ఆపు తాను; అని= అని చెపుతూ; దుర్మర్షణుఁడు= దుర్మర్షణు డనేవాడు; ఆర్పులు= అరుపులు; నిగుడన్= వ్యాపించగా; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: దుర్మర్షణుడనే వాడు (కౌరవులలో ఒకడు) యుద్ధంలోని మొగ్గరంలో నిలవటానికి ఇష్టపడక, తన చతురంగబలాలతో విజృంభించి వెళ్ళి, తా నొక్కడే అర్జునుడిని ఆపుతానని అరుపులు వ్యాప్తినందగా వెళ్ళాడు.

వ. చని యయ్యొడ్డనంబునకు వేయునే నూరువిండ్లపెట్టు దవ్వున ముందటం బన్నె; దుశ్శాసన వికర్ణులు సింధురాజ రక్షణ కార్యార్థులై నిజబలంబులతో నమ్మెయి నచ్చేరువకుం బోయి సన్నద్ధులైరి; ద్రోణాచార్యుం డభేద్యంబగు నా శకటవ్యూహంబు ముఖంబున నిలిచి ధవళ వస్త్రంబులు సితోష్ణీషంబును శ్వేతవర్మంబును నరుణాశ్వంబులును వేదికాధ్వజంబును వెలయ నుద్దండ కోదండుండై దండధరుకైవడిం బొలిచె; నట్లు కుంభ సంభవ సంరక్షితంబైన యా సైన్యంబు సాగర గిరి గహన సహితంబుగా మహి యెల్ల మ్రింగ నప్పళించున ట్లున్నం గనుంగొని కౌరవులును గురుపతియును బ్రముదిత హృదయులై; రా సమయంబున. 33

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; ఆ+ఒడ్డనంబునకున్= ఆ వ్యూహానికి; వేయు ఏనూఱు విండ్లపెట్టు దవ్వునన్= వేయి అయిదువందల విండ్ల దూరాన; ముందటన్= ముందర; పన్నెన్= యుద్ధానికి సిద్ధపడినాడు; దుశ్శాసన వికర్ణులు; సింధురాజు= సైంధవుని; రక్షణ కార్యార్థులు+ఐ= కాపాడే పనికై; నిజబలంబులతోన్= తమ సైన్యంతో; ఆ+మెయిన్= ఆ విధంగా; ఆ+చేరువకున్+పోయి=దగ్గరకు పోయి; సన్నద్ధులు+ఐరి= సిద్ధపడినారు; ద్రోణాచార్యుండు; అభేద్యంబు+అగు= చీల్చుటకు వీలుకాని; ఆ శకట వ్యూహ ముఖంబు నన్ నిలిచి= బండి ఆకారంతో ఉండే మొగ్గరం మొనలో నిలిచి; ధవళ వస్త్రంబులు= తెల్లని ధోవతులును; సిత+ ఉష్ణీషంబును= తెల్లని తలపాగా; శ్వేతవర్మంబును= తెల్లని కవచమును; అరుణ+అశ్వంబులును= ఎఱ్ఱని గుఱ్ఱాలును; వేదికా ధ్వజంబును= చదరమైన తిన్నెగుర్తుగా గల కేతనమును; వెలయన్= ఒప్పి ఉండగా; ఉద్దండ కోదండుండు+ఐ= పొడవగు విల్లు కలవాడై; దండ ధరుకైవడిన్= యముడి మాదిరి; పొలిచెన్= ప్రత్యక్షమాయెను; అట్లు; కుంభసంభవ సంరక్షితంబు+ఐన= ద్రోణుడిచే కాపాడబడిన; ఆ సైన్యంబు= ఆ కౌరవసేన; సాగర, గిరి, గహన, సహితంబుగాన్= సముద్రాలూ, కొండలూ, అడవులతోనూ;మహి ఎల్లన్= భూమినంతటినీ; మ్రింగన్= మింగుటకు; అప్పళించునట్లు+ఉన్నన్= ప్రయత్నిస్తూఉన్నట్లు ఉండగా; కనుంగొని= చూచి; కౌరవులును; కురుపతియును= దుర్యోధనుడునూ; ప్రముదిత హృదయులు+ఐరి= సంతోషించారు; ఆ సమయంబునన్= ఆ వేళలో.

తాత్పర్యం: దుర్మర్షణుడు ఆ వ్యూహానికి పదిహేను వందల విండ్ల దూరాన ముందుగా సిద్ధమై నిలువగా, దుశ్శాసన వికర్ణులు (సైంధవుడిని కాపాడే పనిలో) తమ సైన్యంతో ఆ సమీపానికి సిద్ధంగా వెళ్ళారు. ద్రోణాచార్యుడు శత్రువులకు చీల్చరాని శకట వ్యూహాన్ని ఏర్పాటు చేసి, తాను స్వచ్ఛమైన తెల్లని కవచంతో, తలపాగాతో, వస్త్రాలతో, ఎఱ్ఱని గుఱ్ఱాలతో, వేదికా ధ్వజంతో, భయంకరమైన విల్లమ్ములతో యముడిని తలపిస్తూ ఉన్నాడు. వారి సేన సముద్రాలతో, కొండలతో, అడవులతో నిండిన ప్రపంచాన్ని మ్రింగటానికి నోరుతెరచి సిద్ధంగా ఉన్నట్లు ఉండగా దుర్యోధనాదులు చూచిసంతోషించారు.

క. చూపులు మిఱుమిట్లు గొనఁగ। నేపారిన వానరేంద్రు నెసకంబున ను
ద్దీపిత మగుపడఁగ భయద। రూపంబునఁ గ్రాలఁగా నరుఁడు దోతెంచెన్. 34

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: చూపులు మిఱుమిట్లు కొనఁగన్= తన చూపులు నిప్పురవలవలె వెలుగగా; ఏపారిన= విజృంభించిన; వానరేంద్రు నెసకంబునన్= హనుమంతుడి విజృంభణంతో; ఉద్దీపితము= మిక్కిలి వెలుగొందేది; అగు పడఁగన్= అయిన ధ్వజం; భయదరూపంబునన్= చూచేవారికి భయాన్ని కలిగించే ఆకారంతో; గ్రాలన్= ప్రకాశించగా; నరుఁడు= అర్జునుడు; తోతెంచెన్= వచ్చెను.

తాత్పర్యం: కన్నులు మిరుమిట్లు గొలిపే చూపులతో అతిశయించిన కపిధ్వజంతో ఒప్పి, చూచేవారికి భయాన్ని కలిగిస్తూ అర్జునుడు వచ్చాడు.

సీ. **అమ్మహా వీరున కనతిదూరంబున । బిరుదు మూఁకల నడపించి ద్రుపద**
సూతియు నకులుని సుతుఁడు శతానీకుఁ । డును మొగ్గరం బమర్చిన మృదంగ
శంఖ భేరీ ధ్వాన సంగమ మేదుర । సింహనాదంబులు సెలఁగ నొప్పె
నప్పార్థుఁ డొ డ్డరయం బెట్టు కొలఁది న । బ్బలముముందటఁ దేరు నిలిపి యొత్తు

తే. **దేవదత్తంబు రవముతోఁ దీవ్ర పాంచ । జన్య నినదంబు భూరినిస్వనయుతముగ**
నిగుడు వానర రావంబు నింగి ముట్టె । నపుడు మన సేన బెగ్గల మగ్గలించె. **35**

ప్రతిపదార్థం: ఆ+మహావీరునకున్= ఆ గొప్పవీరుడైన అర్జునుడికి; అనతి దూరంబునన్= దగ్గర; బిరుదు మూకలన్= పేరున్న సైనికులను; నడపించి= నడచునట్లు చేసి; ద్రుపదసూతియున్= ద్రుపదుని కుమారుడును; నకులుని సుతుఁడున్= నకులుడి కుమారుడును; శతానీకుఁడును= శతానీకుడనే పేరుకలవాడును; మొగ్గరంబు+అమర్చినన్= సైనిక వ్యూహాన్ని ఏర్పరుపగా; మృదంగ, శంఖ, భేరీ ధ్వాన సంగమ= శంఖముల, నగారాల శబ్దాలతో కలసి; మేదుర= దట్టమైన; సింహనాదంబులు= సింహగర్జనలు; చెలఁగన్= ధ్వనించగా; ఒప్పెన్= తగి ఉండినది; ఆ+పార్థుఁడు= ఆ అర్జునుడు; ఒడ్డు+అరయన్ పెట్టుకొలఁదిన్= అంతయు వెదుకగా శక్తికొద్దీ; ఆ+బలము= ఆ సైన్యానికి; ముందటన్= ముందుగా; తేరు నిలిపి= తన రథాన్ని ఆపి; ఒత్తు దేవదత్తంబు రవముతోన్= తన శంఖం దేవదత్తాన్ని ఊదిన శబ్దంతో; తీవ్ర= తీవ్రమైన; పాంచజన్య నినదంబు= శ్రీకృష్ణుడి శంఖమైన పాంచజన్యముయొక్క; నిస్వనయుతముగన్= శబ్దంతో; నిగుడు= విజృంభించే; వానరరావంబు= కపిధ్వజం యొక్క పెనుశబ్దం; నింగిముట్టన్= ఆకాశాన్నంటగా; అపుడు= ఆ సమయాన; మనసేన= మనసైన్యం; బెగ్గలము= భయం; అగ్గలించెన్= ఎక్కువాయెను.

తాత్పర్యం: ఆ మహావీరు డర్జునునికి దగ్గరగా పేరుమోసిన సైనికులను నడపించి, ద్రుపదుడి కుమారుడు ధృష్టద్యుమ్నుడూ, నకులుడి కుమారుడు శతానీకుడూ వ్యూహాన్ని ఏర్పాటు చేయగా, శంఖ, నగారా శబ్దాలు ఎక్కువై సింహనాదాలు ఒప్పుతూ ఉండగా అర్జునుడు విజృంభించాడు. ఆ సైన్యానికి ముందు తన తేరును నిలిపి దేవదత్త శబ్దం, పాంచజన్య శబ్దంతో కలిసి ఉండిన శబ్దానికి కేతనంలో ఉన్న వానరుడు కావించిన శబ్దం ఆకాశాన్నంటింది. ఆ శబ్దానికి మన సైన్యం మిక్కిలి భయపడింది.

ఆ. **మొరపవాన పెల్లు గురిసె; నుల్కాతతి । డొల్లెఁ బడియె; పిడుగు లెల్లకడల**
నస్మదీయ బలమునందుఁ బదంపడి । యధిప! తూర్యనినద మతిశయిల్లె. **36**

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; మొరపవాన= గులకరాళ్ళ వాన; పెల్లు= ఎక్కువగా; కురిసెన్= కురిసింది; ఉల్కాతతి= (తోక) చుక్కల సమూహం; డొల్లెన్= రాలిపడ్డాయి; ఎల్లకడలన్= అన్ని దిక్కులలో; పిడుగులు= పిడుగులు; పడియెన్= పడ్డాయి; అస్మదీయ బలమునందున్= మన సైన్యంలో; తూర్యనినదము= తూర్య వాద్యాల శబ్దము (కొమ్ముబూరల శబ్దం); అతిశయిల్లెన్= ఎక్కువైనది.

తాత్పర్యం: ఓ రాజా! అపుడు గులకరాళ్ళవాన కురిసింది. అన్ని దిక్కులలో చుక్కలు రాలాయి, పిడుగులు పడ్డాయి. కొమ్ముబూరల శబ్దం మన సైన్యంలో ఎక్కువ అయినది.

వ. అయ్యవసరంబున నీ యోధులొండొరులం బిలిచికొని పురికొలిపికొనుచు సింహనాదంబులతోడం జెలంగి; రంత. 37

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; నీ యోధులు= నీ పక్షంలోని వీరులు; ఒండొరులన్+పిలిచికొని= ఒకరినొకరు పిలిచికొని; పురికొలిపికొనుచున్= ప్రేరేపించుకొంటూ; సింహనాదంబులతోడన్= యుద్ధగర్జనలతో; చెలంగిరి= విజృంభించారు; అంతన్= ఆ మీదట.

తాత్పర్యం: ఆ సమయంలో నీ సైన్యంలోని వీరులు ఒకరినొకరు పిలిచికొని ప్రేరేపించుకొంటూ సింహనాదాలతో విజృంభించారు. ఆ మీదట.

క. 'చెలియలికట్ట సముద్రము । నిలిపిన క్రియ నేన పార్థు నిలిపెద' ననుచుం
దలమిగిలి వెడలె మొనకును । బలువిడి దుర్మర్షణుండు పార్థివముఖ్యా! 38

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= ఓ రాజశ్రేష్ఠుడా!; సముద్రము= సంద్రాన్ని; చెలియలికట్ట నిలిపినక్రియన్= (దాని పొంగును) చెలియలికట్ట నిలిపినట్లుగా; నేను+అ= నేనే; పార్థున్= అర్జునుడిని; నిలిపెదన్= ఆపుతాను; అనుచున్= అని పల్కుతూ; మొనకును= (తన) సైన్యానికి; తలమిగిలి= ముందు మిగిలి; బలువిడి= అతిశయించి; దుర్మర్షణుండు; వెడలెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'సముద్రాన్ని చెలియలికట్ట అడ్డుకొన్నట్లుగా, అర్జునుడిని నేను అడ్డుకొంటాను' అని సైన్యంకంటె ముందుకు సాగి దుర్మర్షణుడు విజృంభించాడు.

క. కని విజయుఁ డలరి హరి కి । ట్లను 'నేనికగములతోడ నడరెడుఁ గడఁకన్
మును దుర్మర్షణుఁ డిదె యిం । దు నడపు; మరదంబు వీఁడు తొలుముద్ద యగున్.' 39

ప్రతిపదార్థం: కని= (దుర్మర్షణుడిని) చూచి; విజయుఁడు+అలరి= అర్జునుడు సంతోషించి; హరికిన్= కృష్ణుడితో; ఇట్లనున్= ఈ విధంగా అన్నాడు; ఏనికగములతోడన్= ఏనుగుల గుంపులతో; దుర్మర్షణుఁడు; కడఁకన్= పట్టుదలతో; ఇదె= ఇదిగో; అడరెడున్= విజృంభిస్తున్నాడు; అరదంబున్= మనతేరును; ఇందున్= ఇక్కడకు (వీని దగ్గరకు); నడపుము= తోలుము; వీఁడు= ఈ దుర్మర్షణుడు; తొలు ముద్దయగున్= (మనకు) తొలి కబళమవుతాడు (యుద్ధంలో); అని అర్జునుడు శ్రీకృష్ణుడితో అన్నాడు.

తాత్పర్యం: విజృంభించి వచ్చే దుర్మర్షణుడిని చూచి శ్రీకృష్ణుడితో అర్జునుడు 'మన రథాన్ని ఆ వైపునకు తోలుము. ఈ దుర్మర్షణుడు మనకు యుద్ధంలో తొలి కబళమవుతాడు' అని అన్నాడు.

ఆ. అనిన నట్ల చేసె నతఁ డా ధనంజయుఁ । డగ్గజేంద్రరాజి నస్త్రసమితిఁ
బొదివెఁ గారుమొగులు భూధరనికరంబు । బహులవృష్టిఁ గప్పుభంగిఁ దోఁప. 40

ప్రతిపదార్థం: అనినన్= అని అర్జును డనగా; అట్లు+అ చేసెన్= ఆ విధంగానే తేరును తోలాడు; ఆ ధనంజయుఁడు= ఆ అర్జునుడు; ఆ+గజేంద్రరాజిన్= ఆ ఏనుగుల గుంపును; అస్త్రసమితిన్= ఆయుధాల సమూహంతో; కారుమొగులు= కారుమేఘము (నల్లని మబ్బు); భూధరనికరంబు= కొండల గుంపును; బహుల= విస్తారమైన; వృష్టిన్= వానచేత; కప్పుభంగిన్= కమ్ముకొనే విధంగా; తోఁపన్= తోచేటట్లుగా; పొదివెన్= కమ్ముకొన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు కోరినట్లుగా తేరును శ్రీకృష్ణుడు తోలాడు. ఆ దుర్మర్షణుడి గజముల సమూహాన్ని తన అమ్ములతో అర్జునుడు - కార్మొయిలు పెద్దవానతో కొండలను కమ్ముకొన్నట్లుగా కమ్ముకొన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **ఒక్కఁ డని కడఁగి రథికులు । పెక్కండ్రు నిశాత విశిఖ భీమాకృతిఁ బే**
రుక్కునఁ బొదివిరి నరు నతఁ । డెక్కుడు మద మొలయఁ జేతి యేడ్తెఱ సూపెన్. **41**

ప్రతిపదార్థం: ఒక్కఁడు+అని= ఒకడే అని; పెక్కం(డ్రు= అనేకులు; రథికులు= రథస్థులైనవారు; కడఁగి= పూని; నిశాత= వాడి అయిన; విశిఖ= బాణముల; భీమాకృతిన్= భయంకరాకారంతో; పేరు+ఉక్కునన్= గొప్పశౌర్యంతో; నరున్= అర్జునుడిని; పొదివిరి= క్రమ్ముకొన్నారు; అతఁడు= ఆ అర్జునుడు; ఎక్కుడు మదము= మిక్కిలి గర్వం; ఒలయన్= ప్రకటంకాగా; చేతి= తన చేతి; ఏడ్తెఱ= శక్తిని; చూపెన్= చూపినాడు.

తాత్పర్యం: అర్జును డొక్కడే అని మన సైనికు లనేకులు వాడి బాణాలతో మిక్కిలి బలంతో అతనిని క్రమ్ముకొన్నారు. అర్జునుడు తన భుజబలాన్ని అతిశయంగా చూపించాడు.

వ. **అప్పుడు.** **42**

తాత్పర్యం: ఆ సమయంలో.

క. **పలు తలలు ముఖవికాసము । వొలియక పడియున్న సమర భూభాగము పె**
ల్లలరిన తామర కొలనిం । దలపించెన్ గగన చర వితతి పులకింపన్. **43**

ప్రతిపదార్థం: పలు తలలు= పెక్కు తలలు; ముఖవికాసము= ముఖాలకాంతి; పొలియక= చెడిపోక; పడి ఉన్నన్= (యుద్ధభూమిలో); పడి ఉండగా; సమర భూభాగము= యుద్ధభూమి; పెల్లు= ఎక్కువగా; అలరిన= వికసించిన; తామరకొలనిన్= తామర లున్న కోనేటిని; గగనచర వితతి= దేవతా సమూహం; పులకింపన్= సంతోషించగా; తలపించెన్= జ్ఞాపకానికి తెచ్చింది.

తాత్పర్యం: యుద్ధభూమిలో సైనికుల తలలు ముఖకాంతి చెడకుండా పడి ఉన్నాయి. ఆ భూమి చూచేటందుకు విచ్చుకొన్న తామరలుండే కోనేటిని తలపిస్తూ దేవతలను పులకింపజేసింది.

విశేషం: అలం: ఉపమ.

తే. **తొడవు లొప్పార నెత్తుట దోఁగి పెక్కు । గజము లొక్క యెడన పడి కరము వొలిచె**
జంట మెఱుఁగులతో నెఱసంజకెంపు । గదురఁ జెలువొందు మొగిళుల గమియుఁ బోలె. **44**

ప్రతిపదార్థం: తొడవులు= నగలు; ఒప్పారన్= అందంగా ఉండగా; నెత్తుటన్= నెత్తురులో; తోఁగి= పొర్లాడి; పెక్కు గజములు= ఏనుగుల గుంపు; ఒక్క ఎడన్+అ పడి= ఒక్కచోటనే పడి; జంట మెఱుఁగులతోన్= మెరుపుల జతతో; నెఱసంజ= నిండు సంధ్య; కెంపు= ఎఱ్ఱదనం; కదురన్= ఎక్కువగా; చెలువొందు= అందమయిన; మొగిళుల గమియున్= మేఘాల సమూహం; పోలెన్= వలె; కరము= మిక్కిలి; పొలిచెన్= ఒప్పారింది.

తాత్పర్యం: (యుద్ధరంగంలో) నెత్తుటిలో పొర్లాడు ఏనుగుల గుంపు ఒక్కచోటనే పడి ఉన్నది. (ఆ దృశ్యం) చూడటానికి మెరుపులతో కూడిన నిండు సంధ్యతో ఒప్పిన మేఘమాలవలె ఉన్నది.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు గనుపుకొట్టు కవ్వడికి నోహటింపక నీ సైనికులు పైపయిం గ్రమ్మి వివిధాస్త్రశస్త్రంబు లతనిపైఁ గురియ నతండు హస్తిహస్తంబుల నశ్వశరీరంబుల రథిక సారథి రథావయవంబులఁ బదాతి గాత్ర ఖండంబులం బ్రథన భూమిం గప్పె; నట్టియెడ మఱియును. 45

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కనుపుకొట్టు= ఖండిస్తూ ఉన్న; కవ్వడికిన్= అర్జునుడికి; ఓహటింపక= వెనుదీయక; నీ సైనికులు; పైపయిన్+క్రమ్మి= మీద మీద క్రమ్ముకొని; వివిధ+అస్త్రశస్త్రంబులు= అనేకములైన బాణాలను; అతనిపైన్= ఆ అర్జునుడిమీద; కురియన్= కురిపించగా (వానవలె); అతండు= అర్జునుడు; హస్తి= ఏనుగుల; హస్తంబులన్= తొండాలతో; అశ్వశరీరంబులన్= గుఱ్ఱాల శరీరాలతో; రథిక= సైనికుల; సారథి= సారథుల; రథ= రథముల; అవయవంబులన్= శరీరభాగాలతో; పదాతి= కాల్బలాల; గాత్ర= శరీరాల; ఖండంబులన్= ముక్కలతో; ప్రథన భూమిన్= యుద్ధరంగాన్ని; కప్పెన్= కప్పివేశాడు; మఱియును= ఇంకను.

తాత్పర్యం: తమ సైన్యాన్ని తుండెతుండెములుగా అర్జునుడు చీలుస్తూ ఉండగా వెనుదీయక మన సైనికులు అతడి మీద అనేక బాణాలను వర్షంవలె కురిపించారు. అపు డాతడు (మన) కాల్బలముల ఏనుగుల తొండాలను, గుఱ్ఱాలశరీరాలను, రథికులనూ సారథులను, రథభాగాలను, ముక్కలుముక్కలుగా చేసి, వాటితో యుద్ధభూమిని కప్పివేశాడు.

క. 'పార్థుఁడు వేఁడీ? పొదువుడు; । బార్థుఁడ యెట వోయె దింక? బార్థుఁడ! రావే;
పార్థుఁడ! యిక్కడ నెయ్యుము । పార్థునిఁ బట్టుఁ డను నులివు బహుళం బయ్యెన్. 46

ప్రతిపదార్థం: పార్థుఁడు వేఁడీ?= పార్థు డెక్కడ?; పొదువుఁడు= క్రమ్ముకొనండి; పార్థుఁడ!= అర్జునా!; ఎటు పోయెదు+ఇంకన్= ఇంక ఎక్కడకు పోతావు?; పార్థుడ! రావే= అర్జునా! రమ్ము; పార్థుఁడ!= అర్జునా!; ఇక్కడ= ఈ చోట; ఎయ్యుము= వెంబడించుము; పార్థునిన్ పట్టుఁడు= అర్జునుడిని పట్టుకొనండి; అను ఉలివు= అనే శబ్దం; బహుళంబు+అయ్యెన్= ఎక్కువయింది.

తాత్పర్యం: 'అర్జునుఁడెక్కడ? అర్జునా! ఇంక ఎక్కడకు పోతావు? అర్జునా! రా; అర్జునుడిని ఇక్కడ వెంబడించండి. అర్జునుడిని పట్టుకొనండి' అనే కలకలం ఎక్కువైనది.

వ. ఇవ్విధంబున సంకులసమరంబుగాఁ బెక్కు లట్ట లాడ నమ్మోహరంబు వోక పెనంగిన. 47

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ పైప్రకారంగా; సంకుల సమరంబుగాన్= దొమ్మిపోరు జరుగగా; పెక్కులు= అనేకములైన; అట్టలు+ఆడన్= తల తెగిన శరీరాలు ఆడుతూ ఉండగా; ఆ+మోహరంబు= ఆ సైన్యం; పోక= వెనుకకు తగ్గకుండా; పెనంగినన్= యుద్ధం చేయగా.

తాత్పర్యం: ఈ రీతిగా తీవ్రయుద్ధం జరిగింది. తలలు తెగిన మొండెములు ఆడాయి. ఐనా ఆ కౌరవసైన్యం వెనుదీయకుండా పోరాడగా.

సీ. అలిగిన గాండీవి యమ్ము లొక్కుమ్మడి । ముందటి దెసను బిఱిందివలన
వలపట దాపట సెలలు పె క్కవిసిన । తెఱఁగునఁ గవిసిన విఱుగు విల్లుఁ
దునియు ఖడ్గంబును దొరఁగు నెత్తురు మ్రొగ్గు । నేనుంగుఁ బడుకాలు మానిసియును
డొల్లుగుఱ్ఱంబును ద్రెళ్ళుతేఱును గూలు । రథికుండు నొఱగు సారథియు నైన

తే. మరలె దుర్మర్షణుఁడు దోన తెరలె సేన । యపుడు సమ్మెట కోలల నంకుశములఁ
జేఱుకోలల వ్రేటుల నీఱుతాఱు । యదలుపుల వాహనంబులు సెదరి పఱచె. 48

ప్రతిపదార్థం: అలిగిన= కోపగించిన; గాండీవి= అర్జునుడి; అమ్ములు= బాణాలు; ఒక్క+ఉమ్మడి= ఒక్కపెట్టున; ముందటి దెసను= ముందరను; పిఱిందివలన= వెనుకను; వలపటన్= కుడిప్రక్కను; దాపటన్= ఎడమప్రక్కను; సెలలు= బాణాలు; పెక్కు= దండిగా; అవిసిన= విరిసిన; తెఱఁగునన్= విధంగా; కవిసినన్= క్రమ్ముకొనగా; విఱుగు విల్లున్= ముక్కలయ్యే ధనుస్సులు; తునియు= విఱుగు; ఖడ్గంబును= కత్తియును; తొరగు నెత్తురు= ప్రవహించే నెత్తురు; మ్రొగ్గు= ఒరిగిపడే; ఏనుంగు= ఏనుగులు; పడు కాలుమానిసియును= క్రిందపడే కాల్బలమును; డొల్లు గుఱ్ఱంబును= దొర్లే గుర్రం; త్రెళ్ళు= పడిపోయిన; తేఱును= రథమును; కూలు రథికుండున్= పడిన వీరుడును; ఒఱగు సారథియున్= ప్రక్కకు ఒరిగిపడు సారథియూ; అయినన్= కాగా; దుర్మర్షణుడు మరలెన్= దుర్మర్షణుడు వెనుకకు మళ్ళాడు (వెన్నిచ్చాడు); తోన= వెంటనే; సేనతెరలెన్= సైన్యం తొలగింది; అపుడు= ఆ సమయాన; సమ్మెటకోలలన్= సమ్మెటవంటి అమ్ములతోను; అంకుశములన్= అంకుశాలతోనూ; చేఱు= దగ్గర అయిన; కోలల వ్రేటులన్= అమ్ముల దెబ్బలతో; ఈఱతాఱు= పరుషమైన; అదలుపులన్= బెదరింపులతో; వాహనంబులు= (సైనికుల) వాహనాలు; చెదరి= చెదరిపోయి; పఱచెన్= పరుగుతీశాయి.

తాత్పర్యం: కోపగించిన అర్జునుడి బాణాలు ఒక్కసారిగా ముందు వెనుకల, కుడియెడమల, చాలా ఎక్కువగా క్రమ్ముకొన్నవి. అందువలన మనవారి విండ్లు విరిగిపోయాయి. నెత్తుటి ప్రవాహంలో కత్తులు తునిగిపోయాయి, చతురంగ బలాలూ కూలిపోయాయి. వీరులు, సారథులు పడిపోగా దుర్మర్షణుడు వెన్నిచ్చి తొలగిపోగా, సమ్మెటపోటువంటి అంకుశాల పోట్లతోనూ, బాణాల దెబ్బలతోనూ, పరుషమైన అదలింపులతోను (మన) వాహనాలన్నీ చెల్లాచెదరయ్యాయి.

క. అనుటయు ధృతరాష్ట్రుండి । ట్లను సూతతనూజుతోడ 'నప్పుడు నరు మా
ర్కొన నెవ్వఁ డేనిఁ గలిగెనో? । చనిరో యందఱును ద్రోణు జంటకు భీతిన్?' 49

ప్రతిపదార్థం: అనుటయున్= (సంజయుడు) ఆ విధంగా చెప్పగా; సూత తనూజుతోడన్= సంజయుడితో; ధృతరాష్ట్రుఁడు+ఇట్లు+అనున్= ధృతరాష్ట్రుడీ విధంగా అన్నాడు; అపుడు= ఆ సమయాన; నరున్= అర్జునుడిని; మార్కొనన్= ఎదుర్కొనటానికి; ఎవ్వఁడేనిఁ గలిగెనో?= ఎవ్వడైనా ఉన్నాడా?; అందఱును= అంతమందీ; భీతిన్= భయంతో; ద్రోణు జంటకున్= ద్రోణుడి జతకు; చనిరో?= వెళ్ళినారా?

తాత్పర్యం: సంజయుడు చెప్పిన దానిని విని, ధృతరాష్ట్రుడు ఇట్లా అడిగాడు: 'అర్జునుడిని ఎదుర్కొనటానికి ఎవరైనా మిగిలారా లేక భయంతో అంతమందీ ద్రోణుడి జతకై ఆయన వద్దకు పరుగెత్తారా?

ఉ. నావుడు నాతఁడమ్మనుజనాథున కిట్లను 'నట్టిచోట దం
తావళరాజి మున్నుగ నుదాత్త గుణ స్వన ఘంటికా మహా
రావము లుల్లసిల్ల సమరప్రియుఁ బాండవసింహుఁ దాఁకి య
స్త్రావళిఁ గప్పె దీప్తముఖుఁడై యువరాజు మహాద్భుతంబుగన్. 50

ప్రతిపదార్థం: నావుడున్= అనగా; ఆతఁడు= సంజయుడు; మనుజనాథునకున్+ఇట్లనున్= ధృతరాష్ట్రుడితోడ ఈ విధంగా అన్నాడు; అట్టిచోటన్= ఆ సందర్భంలో; దంతావళరాజి= ఏనుగుల సమూహం; మున్నుగన్= తనకు ముందుగా రాగా; ఉదాత్త= గంభీరమైన; గుణస్వన= అల్లెత్రాటి శబ్దాలూ; ఘంటికామహారావములు= ఏనుగులపై వ్రేలాడవేసి ఉంచే గంటలనాదాలూ; ఉల్లసిల్లన్= ఎక్కువకాగా; యువరాజు= దుశ్శాసనుడు; దీప్తముఖుఁడు+ఐ= (కోపంతో) వెలిగేముఖంతో; సమరప్రియున్= యుద్ధంమీద ఆసక్తికలవాడైన; పాండవసింహున్= అర్జునుడిని; తాఁకి= ఎదుర్కొని; మహాద్భుతంబుగన్= మిక్కిలి ఆశ్చర్యకరంగా; అస్త్రావళిన్= బాణసమూహంతో; కప్పెన్= కప్పివేశాడు.

తాత్పర్యం: (ధృతరాష్ట్రు డా విధంగా అనగానే) సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: ఆ యుద్ధ భూమిలో తన ముందున్న ఏనుగుల సమూహాల ఘంటానినాదాలు, వీరుల ధనుష్టంకారాలు ముమ్మరంకాగా

యువరాజైన దుశ్శాసనుడు భయంకరంగా వెలిగిపోతూ, యుద్ధప్రియుడైన అర్జునుడిని మహోద్భుతంగా ఎదుర్కొన్నాడు.

వ. **ఇట్లు దుశ్శాసనుండు దలపడినం గ్రోధావేశంబునం బెలుచ నవ్వి కవ్వడి దేవదత్తం బొత్తి గాండీవ జ్యానినాదంబు రోదసీ కుహరంబున మేదురంబుగాఁ జిత్రంబులగు రథయాతాయాతంబులనుం బటుబాణ పాతంబులను నగ్గజంబులు వెగడుపడి పంక నిమగ్నంబులుం బోలె నిశ్చేష్టితంబులుగాఁ దదారోహకుల తలలు డొల్లుచప్పుళ్ళు మహావాత పతితంబు లగు తాళఫలంబుల రవంబు ననుకరింప మఱియును గరవాల గదాధనుస్సాయక సహితంబులగు బాహువులు బహువిధ మహానాగంబుల భంగి రణభూమి నభిరామ ఘోరంబుగా ననేక ప్రకార క్రూరశరంబులు దాఁకి తునియు రూపును రుధిరంబు దొరఁగు రూపును నొఱలు రూపును డ్రుళ్ళి కెడయురూపును దూఁగు రూపును బడి పొరలు రూపును నెత్తురు గ్రక్కు రూపును జిక్కురూపును రూపుసెడు రూపును నై కరి తురగ నర నికరంబులు వికలంబులుగా విజృంభించిన నతని సంరంభంబు సైరింపం జాలక సబలంబుగా నయ్యువరాజు వాఱిన వెనుకొని యప్పాండవ మధ్యముండు.** **51**

ప్రతిపదార్థం: ఇట్లు దుశ్శాసనుండు తలపడినన్= ఈ విధంగా (అనగా ముందు పద్యంలో చెప్పిన మాదిరి) దుశ్శాసనుడు ఎదుర్కొనగా; క్రోధ+ఆవేశంబునన్= కోపంతో కూడిన సంరంభంతో; పెలుచ నవ్వి= పెద్దగా నవ్వి; కవ్వడి= అర్జునుడు; దేవదత్తంబు+ఒత్తి= దేవదత్తమనే పేరున్న తన శంఖాన్ని పూరించి; గాండీవ జ్యా నినాదంబు= గాండీవంయొక్క అల్లెత్రాటి శబ్దం; రోదసీ కుహరంబునన్= గుహవంటిదైన భూమ్యాకాశ మధ్యభాగంలో; మేదురంబు కాన్= దట్టంకాగా; చిత్రంబులు+అగు= ఆశ్చర్యకరమైన; రథయాతాయాతంబులను= తేరుల పోకయును రాకయును; పటుబాణ పాతంబులను= తీవ్రమైన బాణములపాటును; ఆ+గజంబులు= ఆ ఏనుగులు; వెగడుపడి= భయపడి; పంకనిమగ్నంబులున్+పోలెన్= బురదలో కూరుకొనిపోయిన వాటి మాదిరిగా; నిశ్చేష్టితంబులు కాన్= చైతన్యరహితాలు కాగా; తదారోహకుల= ఆ ఏనుగుల మీద ఎక్కినవారి; తలలుడొల్లు చప్పుళ్ళు= దొర్లే తలలు చేసే చప్పుళ్ళు; మహావాత= పెనుగాలిచేత; పతితంబులగు తాళఫలంబుల= రాలిపడే తాటిపండ్ల; రవంబులన్= శబ్దాలను; అనుకరింపన్= అనుసరించగా; మఱియును= ఇంకను; కరవాల= కత్తులు; గదా= గదలు; ధనుస్సాయక= విల్లమ్ములతో; సహితంబులు+అగు= కూడుకొన్న; బాహువులు= చేతులు; బహువిధమహానాగంబుల భంగిన్= అనేక రకాలైన పెనుపాముల వలె; రణభూమి= యుద్ధరంగం; అభిరామ= అందానికి; ఘోరంబుగాన్= భయంకరంగా; అనేక ప్రకార= నానావిధాలైన; క్రూరశరంబులు= వాడిబాణాలు; తాఁకి= తగిలి; తునియు రూపును= తునిసిన ఆకారమును; రుధిరంబు= రక్తము; తొరఁగు= ప్రవహించు; రూపును= ఆకారమును; ఒఱలురూపును= రోదించే ఆకారమును; త్రుళ్ళి= ఎగిరిపడి; కెడయురూపును= చచ్చే ఆకారమును; తూగురూపును= నిద్రపోయినట్లు తూగే ఆకారమును; పడి పొరలురూపును= క్రిందపడి పొర్లాడే ఆకారమును; నెత్తురు గ్రక్కురూపును= నెత్తురు గ్రక్కే ఆకారమును; చిక్కురూపును= కృశించిన ఆకారమును; రూపుసెడు రూపును= ఆకారం చెడిన రూపును; కరి తురగ నర నికరంబులు= ఏనుగులు, గుర్రాలు, పదాతి సైన్యాల గుంపులు (చతురంగ బలా లని భావం); వికలంబులుగాన్= ముక్కలయ్యేటట్లు; విజృంభించినన్= అర్జునుడు చెలరేగగా; అతని సంరంభంబు= అర్జునుడి యుద్ధాతిశయ గర్వాన్ని; సైరింపన్+చాలక= ఓర్వలేక; సబలంబుగాన్= ససైన్యంబుగా; ఆ+యువరాజు= ఆ దుశ్శాసనుడు; పాఱినన్= పరుగెత్తగా; ఆ+పాండవమధ్యముండు= ఆ అర్జునుడు; వెనుకొని= తరిమి.

తాత్పర్యం: ఆ విధంగా దుశ్శాసనుడు ఎదుర్కొనగా మిక్కిలి కోపంతో అర్జునుడు నవ్వి, దేవదత్తాన్ని పూరించి గాండీవపు అల్లెత్రాటి టంకారం భూమ్యాకాశ మధ్యభాగంలో అలముకొనగా, దట్టంగా బాణాలు వేయగా, రథాలు అటు ఇటు పర్వెత్తగా, బాణాల తాకిడికి ఏనుగులు బురదలో మునిగినట్లు కదలలేక, వాటిమీద ఉన్న సైనికుల తలలు దొరలు చప్పుళ్ళు పెనుగాలికి క్రిందపడే తాటిపండ్లవలె ఉన్నాయి. అంతేకాక ఖడ్గాలతో, గదలతో, ధనుస్సులతో ఒప్పిన చేతులు పెనుపాములవలె ఉండి, రణభూమి భయంకరంగా ఉండింది. అనేక విధాలైన వాడి బాణాల తాకిడికి

తూనిగే రూపము, నెత్తురుకారే రూపము, రోదించే రూపము, ఎగిరిపడి చచ్చే రూపము, తూగిపడే రూపము, పడి పొర్లాడే రూపము, నెత్తురు క్రక్కేరూపము, కృశించే రూపము, ఆకారం చెడిన రూపము పొంది - ఏనుగుల, గుర్రాల, సైనికుల సమూహాలు ముక్కలయ్యేటట్లుగా అర్జునుడు విజృంభించగా. అతడి ధాటికి తట్టుకోలేక దుశ్శాసనుడు తన సైన్యంతో పరుగెత్తుతూ ఉంటే, అర్జునుడు వెంటబడి తరిమికొట్టాడు.

చ. 'నిలు నిలు మెందుఁ బోఁ గలవు? నీ విటు వాఱినఁ జావు దప్పునే?
యలవుఁ జలంబుఁ బోవిడిచి యా సభ నించుక శంక లేక నీ
పలికిన యన్నియున్ మఱచి భంగపుఁ జచ్చుట దెచ్చికొంటి పె
ద్దలు వగఁబొంద, నన్నకును దమ్ములకున్ దలవంపుగా నిసీ!' 52

ప్రతిపదార్థం: నిలుము, నిలుము+ఎందున్+పోన్+కలవు?= ఆగాగుము ఎక్కడకు పోయెదవు?; నీవు+ఇటు పాఱినన్= నీవు ఈ విధంగా పరుగెత్తితే; చావుతప్పునే= చావు తప్పిపోవునా?; అలవు= బలమును; చలంబు= పంతమును; పోవిడిచి= వదలి; ఆ సభన్= జూదమాడిన సభలో; ఇంచుక శంకలేక= ఒకింత అనుమానం లేకుండా; నీ పలికిన అన్నియున్= నీవు ప్రేలిన ప్రేలాపనలు (మాటలు) అన్నీ; మఱచి= మరచిపోయి; పెద్దలు వగపొందన్= ఇంటిలో పెద్దలు దుఃఖపడగా; అన్నకును తమ్ములకున్= నీ అన్నదమ్ములకు; తలవంపుగాన్= సిగ్గుచేటుగా; భంగపు+చచ్చుట= అవమానంతో కూడిన చావును; తెచ్చికొంటి(వి)= తెచ్చు కొన్నావు; ఇసీ= ఛీ!

తాత్పర్యం: 'ఓ దుశ్శాసనా! నిలు నిలు. ఎక్కడకు తప్పించుకొని పోయెదవు? నీవీ మాదిరి పరుగెత్తితే చావు తప్పుతుందా? బలమునూ, పట్టుదలనూ వదలి, సభలో జంకు లేకుండా మాటాడిన నీ మాటలను మరచి, పెద్దలు, దుఃఖించగా, అన్నకు, తమ్ములకు తలవంపు కలిగేటట్లుగా, అవమానంతో కూడిన చావు తెచ్చుకొన్నావు. ఛీ!

విశేషం: తిక్కనామాత్యుని నాటకీయ సంభాషణా చాతుర్యం ఈ పద్యంలో వ్యక్తమవుతూ ఉన్నది.

వ. అని పలుకుచు నీకొడుకు పెడతలయు వెన్నును బదితూపుల నేపారి యేసిన నతండు మరలియుం జూడక ద్రోణాచార్యుం జూచుచుం బాఱె; బీభత్సుండును సైంధవుని దెసకు మనసునిగుడ మనమొనపయి నడచి యగ్రభాగంబున నున్న యగ్గురుం గనుంగొని యనతి దూరంబున నిలిచి నమస్కరించి కృష్ణుం డనుమతి సేయ జేతులు మొగిచి యి ట్లనియె. 53

ప్రతిపదార్థం: అని పలుకుచున్= పై విధంగా హెచ్చరిస్తూ; నీ కొడుకు= నీ కుమారుడైన దుశ్శాసనుడి; పెడతలయు= తలవెనుక భాగాన; వెన్నును= వీపును; పదితూపులన్= పది వాడి బాణాలతో; ఏపారి= అతిశయించి; ఏసినన్= కొట్టగా; అతండు= ఆ దుశ్శాసనుడు; మరలియుంజూడక= తిరిగి చూడక; ద్రోణాచార్యున్ చూచుచున్= ద్రోణాచార్యులవారిని చూస్తూ; పాఱెన్= పరుగెత్తాడు (అనగా ఆనాటి సేనానాయకుడైన ద్రోణుడి దగ్గరకు సహాయానికై పరుగెత్తాడు); బీభత్సుండును= అర్జునుడునూ; సైంధవుని దెసకున్= సైంధవుడున్న దిక్కునకు (వానిమీదికి); మనసు నిగుడన్= మనసుపోగా; మనమొనపయి నడచి= మన సేనమీదకు వచ్చి; అగ్రభాగంబునన్+ఉన్న= మొన మొదటిలో ఉన్న; ఆ+గురున్+కనుంగొని= ఆ గురువైన ద్రోణాచార్యుడిని చూచి; అనతి దూరంబునన్ నిలిచి= దగ్గరగా నిలిచి; నమస్కరించి= దండంపెట్టి; కృష్ణుండు+అనుమతి చేయన్= శ్రీకృష్ణుడు ఉత్తరువీయగా; చేతులు మొగిచి= నమస్కారం చేసి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని అర్జునుడు హెచ్చరిస్తూ నీ కుమారుడైన దుశ్శాసనుడి తలవెనుకా వీపుమీదా పదిబాణాలతో కొట్టి, దుశ్శాసనుడు తిరిగి చూడకుండా గురువుగారైన ద్రోణాచార్యుడి చాటుకు పరుగెత్తేటట్లు చేశాడు. అర్జునుడు తన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనస్సు సైంధవుడున్న దిక్కుకు పోగా అటు పోవటానికి ప్రయత్నిస్తూ, కృష్ణానుమతితో ఆచార్యుడికి చేతులు జోడించి ఈ విధంగా అన్నాడు:

అర్జునుఁడు ద్రోణునిచే ననుజ్ఞాతుండై మొగ్గరంబు సొచ్చుట (సం.7-66-1)

ఉ. 'మేలుదలంపు శోభనము మేకొని చేయుము నాకుఁ బాండుభూ
పాలుని ధర్మనందనుని పంకజనాభుని యట్ల కావె! మ
త్పాలన వృత్తి కీవు నినుఁ బ్రార్థన సేసి భవత్ప్రసాద లీ
లాలసితుండ నై మొన దలంకఁగఁ జొచ్చెద భూసురోత్తమా!' 54

ప్రతిపదార్థం: భూసురోత్తమా!= బ్రాహ్మణశ్రేష్ఠుడా!; మేలుదలంపు= నా మేలును తలచుకొనుము; నాకున్= నాకు; శోభనము= మంచిని; మేకొని చేయుము= సమ్మతితో చేయుము; నాకు; పాండుభూపాలుని, ధర్మనందనుని, పంకజనాభుని అట్ల+అ కావె?= నాకు (మీరు) పాండురాజు; ధర్మరాజు, శ్రీకృష్ణు డెట్లో అట్లే కదా?; ఈవు= నీవు; మత్పాలనవృత్తిన్= నన్ను కాపాడటానికి; నినున్ ప్రార్థన చేసి= నిన్ను వేడుకొని; భవత్+ప్రసాద= నీ యనుగ్రహమనే; లీలా= విలాసంచేత; లసితుండను+ఐ= వెలుగుతూ; మొనన్= సేనావ్యూహమును; తలంకఁగన్= భయపడేటట్లుగా; చొచ్చెదన్= చొచ్చుకొని పోతాను.

తాత్పర్యం: 'ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! నన్ను కాపాడటంలో మీరు పాండురాజు, ధర్మరాజు, శ్రీకృష్ణుడు ఎట్లో, అట్లే కదా! నా మేలును మనసులో భావించి నన్ను కాపాడు మని ప్రార్థిస్తూ ఉన్నాను. నీ దయచేత ఈ సేనావ్యూహాన్ని భయపడేటట్లుగా చేసి మొగ్గరంలోకి ప్రవేశిస్తాను.'

క. 'నను నశ్వత్థామను నీ। వనఘా! సరికూర్మిఁ బెనిచి తట్లగుటను ద్రో
హిని సైంధవుఁ జంపఁగఁ బూ। నిన నా యుచిత ప్రతిజ్ఞ నెఱపుము కరుణన్.' 55

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్మా!; ననున్= నన్నూ; అశ్వత్థామను= అశ్వత్థామనున్నూ; సరికూర్మిన్+పెనిచితి= సమానమైన ప్రేమతో పెంచావు; అట్లు+అగుటన్= ఆ కారణం చేత; ద్రోహిని= ద్రోహం చేసిన; సైంధవున్= సైంధవుడిని; చంపఁగన్= చంపటానికి; పూనిన నా ఉచిత ప్రతిజ్ఞన్= ఆరంభించిన న్యాయమైన నా శపథాన్ని; కరుణన్= దయతో; నెఱపుము= నెరవేర్చుము.

తాత్పర్యం: 'పుణ్యాత్మా! నన్నూ అశ్వత్థామనూ సమానమైన ప్రేమతో పెంచావు. ద్రోహి అయిన సైంధవుడిని చంపటానికి నేను చేసిన ప్రతిజ్ఞ నెరవేరేటట్లు చేయుము.

తే. 'అనుడుఁ బిన్నన వ్వొలయఁగ నస్త్రగురుఁడు। నరునిపైఁ జూడ్కి నాటించి 'నన్ను గెలువ
కెట్లు సైంధవుఁ జేరె'దం చేసె రథ్య। ములును హరియును నతఁడు నమ్ముల మునుంగ. 56

ప్రతిపదార్థం: అనుడున్= ఆ విధంగా అర్జును డనగా; పిన్ననవ్వు= చిరునవ్వు; ఒలయఁగన్= కలుగగా; అస్త్రగురుఁడు= ధనురాచార్యుడు; నరునిపైన్+చూడ్కి నాటించి= అర్జునుడిని చూచి; నన్ను గెలువక= నన్ను జయింపకుండా; ఎట్లు= ఏ విధంగా; సైంధవున్+చేరెదు?= సైంధవుడి దగ్గరకు పోగలవు?; అంచున్= అని అంటూ; రథ్యములును= గుఱ్ఱాలు; హరియును= శ్రీకృష్ణుడును; అతఁడున్= అర్జునుడును; అమ్ములన్ మునుంగన్= బాణవర్షంలో మునిగిపోగా; ఏసెన్= వేశాడు.

తాత్పర్యం: అర్జునుడు సైంధవుడిని చంపటానికి ఆచార్యుడి అనుమతి కోరాడు. అందు కాయన చిరునవ్వుతో 'నన్ను గెలువకుండా సైంధవుడిని నీవు ఎట్లా సమీపిస్తావు?' అని చెపుతూ గుఱ్ఱాలనూ, శ్రీకృష్ణుడినీ, అర్జునుడినీ బాణవర్షంలో ముంచాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇ త్తెఱుంగున నేయుటయు నని సేయుటకై య మ్మహాత్మునకు విజ్ఞాపనంబు సేసి. 57

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఏయుటయున్= బాణాలను ప్రయోగించగా; అని= యుద్ధం; చేయుటకై= చేయటానికి; ఆ+మహాత్మునకున్= ఆ గొప్పవాడైన ద్రోణాచార్యుడికి; విజ్ఞాపనంబు+చేసి= మనవి చేసి.

తాత్పర్యం: పై విధంగా (ఆచార్యుడు) తమ్ము బాణవర్షంలో ముంచివేయగా; యుద్ధం చేయటానికి ఆయన అనుమతి కోసం అర్జునుడు ప్రార్థించాడు.

విశేషం: ధర్మయుద్ధం కనుక గురుడి ఆమోదంతో యుద్ధంచేద్దామని అర్జునుడు ఆయన అనుమతి కోరాడు.

క. అనుమతుఁడై విజయుం డా। తనిమీఁద నిశాత విశిఖ తతి వఱపి రయం
బున నవ నారాచము లే। సిన నడుమన నఱకె నతఁడు శీఘ్రత మెఱయన్. 58

ప్రతిపదార్థం: అనుమతుఁడై= అనుమతిని పొంది (ద్రోణాచార్యుని ఉత్తరువును పొంది); విజయుండు= అర్జునుడు; ఆతని మీఁదన్= ద్రోణుడిమీద; నిశాత విశిఖతతి= వాడి బాణాల సమూహం; వఱపి= వేసి; రయంబునన్= శీఘ్రంగా; నవనారాచములు= తొమ్మిది బాణాలను; ఏసినన్= వేయగా; అతఁడు= ఆ ద్రోణుడు; శీఘ్రత= వడి; మెఱయన్= బయలుపడగా; నడుమన= మధ్యలోనే; నఱకెన్= త్రుంచివేసెను.

తాత్పర్యం: ద్రోణుని అనుమతిపొంది అర్జును డాతడిని తొమ్మిది బాణాలతో కొట్టటానికి ప్రయత్నించాడు. ద్రోణుడు తన వడి ప్రకాశించగా ఆ బాణాలను నడుమనే త్రుంచివేసినాడు.

తే. నఱికి తోడన హరిమేను నరుని యొడలు। నేయ గురువిల్లు విఱుగంగ నేయఁ దలఁచె
న క్కిరీటి యాలోనన యతని మౌర్వి। వికలముగఁ జేసె నాధనుర్వేదవిదుఁడు. 59

ప్రతిపదార్థం: ఆ ధనుర్వేదవిదుఁడు= ధనుర్వేదంలో ప్రవీణుడైన ఆ ద్రోణాచార్యుడు; నఱికి= (అర్జునుడు వేసిన) బాణాలను నఱికి; హరిమేను= శ్రీకృష్ణుడి శరీరాన్ని; నరుని యొడలు= అర్జునుడి శరీరాన్ని; ఏయన్= కొట్టగా; ఆ+కిరీటి= అర్జునుడు; గురువిల్లున్= ఆచార్యుడి వింటిని; విఱుగంగన్= ముక్కలయ్యేటట్లుగా; ఏయన్+తలఁచెన్= బాణాలను ప్రయోగించగా తలచుకొన్నాడు; ఆలోనన= అంతలోనే; అతని మౌర్వి= ఆ అర్జునుడి అల్లెత్రాడును; వికలముగన్+చేసెన్= ముక్కలు చేశాడు.

తాత్పర్యం: ధనుర్విద్యావేత్త అయిన ద్రోణాచార్యుడు అర్జునుడి బాణాలను నరకి, శ్రీకృష్ణుడి మీద, అర్జునుడి మీద బాణాలు వేయగా, అర్జునుడు ఆచార్యుని ధనుస్సును విరువ దలచుకొన్నాడు, అంతలోనే ఆచార్యుడు అర్జునుడి అల్లెత్రాటిని నిరుపయోగంగా చేశాడు.

విశేషం: యుద్ధరంగంలో వీరుని మెలకువను వేగాన్నీ తెలియజేస్తూ ఉన్నది ఈ వర్ణన.

క. రహితగుణచాపుఁ డగు న। య్యహితాంతకుఁ బొదివె కేశవాశ్వ పతాకా
సహితంబుగ రుచిర స్మిత। మహితుఁ డగుచు న గ్గురుండు మార్గణ వితతిన్. 60

ప్రతిపదార్థం: రహితగుణచాపుఁడు+అగు= అల్లెత్రాడులేని విల్లు కలవాడైన; ఆ+అహితాంతకున్= శత్రువులను చంపే ఆ అర్జునుడిని; కేశవ= శ్రీకృష్ణుడితోనూ; అశ్వపతాకా సహితంబుగన్= గుర్రాలతోను, జెండాతోనూ; రుచిరస్మిత మహితుఁడు+అగుచున్= ఒప్పిదమయిన చిరునవ్వుతో నిండినవాడై; మార్గణవితతిన్= అమ్ముల సమూహంతో; ఆ+గురుఁడు= ఆ గురుడు; పొదివెన్=కప్పాడు.

తాత్పర్యం: తునిగిన వింటినారి కలవాడూ, శత్రుసంహారకుడూ అయిన అర్జునుడిని శ్రీకృష్ణసహితంగా గుర్రాలూ, పతాకమూ కప్పబడే విధంగా, ఒక చిరునవ్వుతో ద్రోణుడు తన బాణ సమూహంతో కప్పివేశాడు.

వ. **ఇవ్విధంబునం గుంభసంభవుండు విజృంభించిన వివ్వచ్చుం డలిగి సజ్యశరాసనుండై యాధనురాచార్యుం బటు బాణ విసరవేగంబున నతిక్రమించి కెలంకుల బలంబుల నాక్రమించిన.** **61**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; కుంభసంభవుండు= ద్రోణుడు; విజృంభించినన్= చెలరేగగా; వివ్వచ్చుండు= అర్జునుడు; అలిగి= కోపించి; సజ్యశర+ఆసనుండు+ఐ= అల్లెత్రాడు బిగించిన విల్లు కలవాడై; ఆ+ధనురాచార్యున్= ఆ ద్రోణుడిని; పటుబాణ విసరవేగంబునన్= బలమైన బాణాల సమూహం ప్రయోగించే వేగంతో; అతిక్రమించి= దాటి; కెలంకుల బలంబులన్= ప్రక్కన ఉన్న సేనలను; ఆక్రమించినన్= వశపరుచుకోగా.

తాత్పర్యం: ద్రోణాచార్యు డా విధంగా విజృంభించగా, అర్జునుడు తన విల్లుకు అల్లెత్రాడు బిగించి ఎక్కుపెట్టి అనేక బాణ సమూహాలతో ద్రోణాచార్యుడిని దాటి వేగంగా ప్రక్కన ఉన్న సైన్యాన్ని ఆక్రమించుకోగా. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **కులిశంబు తాఁకున కూలిన కులపర్వ । తంబుల కరణి మత్త ద్విపములు**
బలుగాలిఁ దూలిన జలధరపంక్తుల । చాడ్పున నుద్భట స్యందనములు
గీలుకాఁ డెడలింపఁ గెడసిన బొమ్మల । కైవడిఁ బడు తురంగవ్రజంబు
బెడిదంపు వఱ్ఱోడిఁ బడిన పేరడవి చం । దంబున బహుల పదాతి చయము

తే. **'వికటముగఁ ద్రెళ్ళె నలుగడ విచ్చె నొక్క। పెట్ట వెస డొల్లె నిలఁ జాపకట్టు పడియెఁ**
జండ గాండీవ నిర్ముక్త శాత వివిధ । కాండ దారుణ ప్రహతులఁ గౌరవేంద్ర!. **62**

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= కౌరవరాజా! (ధృతరాష్ట్రా!); కులిశంబు తాఁకునన్= వజ్రాయుధం దెబ్బకు; కూలిన= పడిపోయిన; కులపర్వతంబుల కరణిన్= సప్త కుల పర్వతాల మాదిరి; మత్తద్విపములున్= మదపుటేనుగులును; బలుగాలిన్= పెనుగాలికి; తూలిన= తూలిపడిన; జలధరపంక్తుల చాడ్పునన్= మేఘాలవరుసలవలె; ఉద్భటస్యందనములు= మిక్కుటమైన తేరులును; కీలుకాఁడు= సూత్రధారి; ఎడలింపఁగన్= వదలిపెట్టగా; ఎడసిన= తొలగిపోయిన; బొమ్మలకైవడిన్= బొమ్మల మాదిరి; పడు= పడిపోయే; తురంగవ్రజంబున్= గుర్రాల సమూహమును; బెడిదంపు= భయంకరమైన; వఱ్ఱోడిన్= ప్రవాహంలో; పడిన= పడిపోయిన; పేరడవి= పెద్ద అడవి; చందంబునన్= మాదిరి; బహులపదాతిచయమున్= విస్తారమైన కాలి బంటుల గుంపును; వికటముగన్= వికారంగా; త్రెళ్ళెన్= కూలింది; నలుగడన్= నలువైపులా; విచ్చెన్= విరిసిపోయింది; ఒక్కపెట్ట= ఒక్కమారుగా; వెసడొల్లెన్= శీఘ్రంగా దొర్లింది; ఇలన్= భూమి మీద; చాపకట్టుపడియెన్= చాపచుట్టవలె పడినది; చండ= భయమును కల్గించే; గాండీవ= గాండీవం నుండి; నిర్ముక్త= విడువబడిన; శాత= వాడి అయిన; వివిధకాండ= అనేకములయిన బాణముల; దారుణ= కఠినమైన; ప్రహతులన్= దెబ్బలవలన; పడియెన్= పడిపోయింది.

తాత్పర్యం: ఓ కౌరవరాజా! అర్జునుడి గాండీవం నుండి వెడలిన వాడి బాణాలు తాకుటచేత వజ్రాయుధం దెబ్బకు కూలే కొండల మాదిరి ఏనుగులు కూలినవి. పెనుగాలి తాకిడికి తూలిపోయే మేఘాల వలె తేరులు ఎగిరిపోయాయి. సూత్రధారి సళ్ళింపగా తునిసిపోయే బొమ్మలవలె గుర్రాలు పడ్డాయి. పదాతి సమూహం పెద్ద ప్రవాహంలో బడిన పెద్ద అడవి మాదిరి అయింది. ఈ సన్నివేశం చూడగా మొత్తం సైన్యం భూమిమీద చాపకట్టుగా పడినట్లయింది.

ఆ. **అడ్డుపడి గురుండు దొడ్డనారసము వ । క్షంబు దూఱ నేయ సవ్యసాచి**
యొల్లఁ బోయి తెలిసి పెల్లేసె న క్కుంభ । జన్మమీఁద నిశితసాయకములు. **63**

ప్రతిపదార్థం: గురుండు= ద్రోణుడు; అడ్డుపడి= అడ్డంగా వచ్చి (అర్జునుడి బాణాల నుండి సైన్యమును కాపాడటానికై); దొడ్డ= పెద్దదైన; నారసమున్= వాడి బాణాన్ని; వక్షంబు= గుండెలో; దూఱన్+ఏయన్= దూసికొనిపోయేటట్లు కొట్టగా; ఒల్లన్+పోయి= మూర్ఛపోయి; తెలిసి= మూర్ఛనుండి తేరుకొని; సవ్యసాచి= అర్జునుడు; ఆ+కుంభజన్మమీఁదన్= ఆ కుంభజన్ముడైన ద్రోణుడిమీద; నిశిత సాయకములు= వాడి బాణాలను; పెల్లు+ఏసెన్= ఎక్కువగా వేశాడు.

తాత్పర్యం: అర్జునుడికి ద్రోణుడు అడ్డుపడి, ఒక వాడి బాణంతో అర్జునుడి గుండె చీలేవిధంగా కొట్టాడు. ఆ దెబ్బకు అర్జునుడు మూర్ఛిల్లి, ఆపై తేరుకొని వాడి బాణాలను ద్రోణుడి మీద గుప్పించాడు.

వ. అతండును. 64

తాత్పర్యం: ఆ ద్రోణుడును.

క. హరి నైదువిశిఖముల న । న్నరు డెబ్బదిమూఁట గేతనము మూఁటను స
త్వరుఁ డై యేయుచు శితశర । పరంపరలు తద్రథంబుపైఁ బరఁగించెన్. 65

ప్రతిపదార్థం: హరిన్+ఐదు విశిఖములన్= శ్రీకృష్ణుడిని అయిదు వాడి బాణాలతోను; ఆ+నరున్= ఆ యర్జునుడిని; డెబ్బది మూఁటన్= డెబ్బైమూడు (బాణాల) తోను; కేతనమున్= ధ్వజమును; మూఁటను= మూడింటితోను; సత్వరుఁడు+ఐ= తొందరకాడై; ఏయుచున్= కొట్టుతూ; శితశరపరంపరలు= వాడి బాణాల వరుసలు; తద్రథంబుపైన్= ఆ అర్జునుడి తేరుమీద; పరఁగించెన్= వేశాడు.

తాత్పర్యం: ద్రోణుడు (సారథి అయిన) శ్రీకృష్ణుడి మీద అయిదింటినీ, అర్జునుడిమీద డెబ్బైమూడింటిని, తేరుటెక్కెంమీద మూడింటిని, అతి వేగంగా వేస్తూ వాడి బాణాల వరుసను అర్జునుడి తేరుమీద ప్రయోగించాడు.

క. కరములు నిగుడఁగ నొప్పెడు । తరణిఁ బొదువు వర్షదంబుదముక్రియ నట్లా
స్ఫురితాస్త్రుఁ బార్థు నత్యు । ద్ధుర బాణ సమగ్రుఁడైన ద్రోణుఁడు పొదివెన్. 66

ప్రతిపదార్థం: కరములు= కిరణాలు; నిగుడన్+ఒప్పెడు= వ్యాపించగా అందగించే; తరణిన్= సూర్యుడిని; పొదువు= క్రమ్ముకొనే; వర్షత్+అంబుదము క్రియన్= వర్షించే మేఘం మాదిరిగా; అట్లు= ఆ విధంగా; ఆ, స్ఫురిత+అస్త్రున్= ప్రకాశించే బాణాలు కలవాడైన ఆ; పార్థున్= అర్జునుడిని; అతి+ఉద్ధుర= మిక్కిలి భయంకరమైన; బాణసమగ్రుఁడు+ఐ= బాణాలతో నిండినవాడైన; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; పొదివెన్= క్రమ్ముకొన్నాడు.

తాత్పర్యం: కిరణాలతో అందంగా కన్పించే సూర్యుడిని వర్షించే మేఘం క్రమ్ముకొన్నట్లు, ప్రకాశించే బాణాలతో ఒప్పిన అర్జునుడిని మిగుల భయంకరమైన బాణాలతో కూడుకొని ఉన్న ద్రోణాచార్యుడు కమ్ముకొన్నాడు.

విశేషం: అలంకారం ఉపమ.

వ. పొదివిన యగ్గురు ప్రాపున భవదీయ సైనికులు గొందఱాకృష్ణులం జేరి పరాక్రమించుట గుండ్లు దేలి బెండ్లు మునింగిన ట్లయ్యెః నిబ్బంగి నక్కిరీటి కుమారుండయ్యును వృద్ధుండగు గలశ భవునిం గడవంజాలక చిక్కువడి యున్నం జూచి విచారించి యచ్యుతుం డతని కి ట్లనియె. 67

ప్రతిపదార్థం: పొదివిన= క్రమ్ముకొన్న; ఆ+గురు= ఆ ఆచార్యుడైన ద్రోణుడి; ప్రాపునన్= అండతో; భవదీయ సైనికులు= నీ సేన; కొందఱు= కొంతమంది; ఆ+కృష్ణులన్+చేరి= ఆ శ్రీకృష్ణార్జునులను చేరి; పరాక్రమించుట= సామర్థ్యం చూపటం; గుండ్లుదేలి బెండ్లు మునింగినట్లు= గుండ్రాళ్ళు తేలి బెండులు నీటిలో మునిగిపోయిన విధంగా; అయ్యెన్= అయింది; ఈ+భంగిన్= ఈ విధంగా; ఆ+కిరీటి= ఆ అర్జునుడు; కుమారుండు+అయ్యున్= వయసులో ఉన్నవాడయినప్పటికీ; వృద్ధుండు+అగు= ముసలి అయిన; కలశభవున్= ద్రోణుడిని; కడవన్+చాలక= అతిక్రమించలేక; చిక్కుపడి ఉన్నన్= కష్టపడి ఉండగా; చూచి; విచారించి= యోచించి; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; అతనికిన్= అర్జునుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు క్రమ్ముకోగా, ద్రోణుడి అండతో నీ సైనికులు కృష్ణార్జునులను ఎదుర్కొని పరాక్రమించటం బెండ్లు మునిగి గుండ్లు తేలాడినట్లుగా ఉన్నది. అపుడు యువకుడైనా అర్జునుడు ద్రోణాచార్యుడిని దాటి పోలేకపోయాడు. అపుడు శ్రీకృష్ణుడు అర్జునుడితో ఈ విధంగా అన్నాడు:

క. **'రిత్త దడవు గాకుండఁగ । నిత్తఱి నాచార్యుతోడి యీ సుడిగి వెసం**
జొత్తము శకటవ్యూహము । చిత్తంబున నొండు దలఁపు సేర్పకు మింకన్.' **68**

ప్రతిపదార్థం: రిత్త= వ్యర్థంగా; తడవు= ఆలస్యం; కాకుండఁగన్= కాకుండా; ఈ+తఱిన్= ఈ సమయంలో; ఆచార్యుతోడి= ఆచార్యుడి మీది; ఈసు+ఉడిగి= అసూయ వదలివేసి; వెసన్= వెంటనే; శకట వ్యూహమున్= శకట వ్యూహంలోనికి; చొత్తము= ప్రవేశింతాము; చిత్తంబునన్= నీ మనస్సులో; ఒండుదలఁపు= వేరే యోచనను; ఇంకన్ చేర్పకుము= ఇంక చేరనీయవద్దు.

తాత్పర్యం: 'అనవసరంగా ఆలస్యం కానీయకుండా ఇప్పు డాచార్యుడి మీది ఈసును వదలి, మనసులో వేరే యోచన లేకుండా ఈ శకటవ్యూహంలోనికి వెంటనే ప్రవేశించుదాము.

అర్జునుఁడు ద్రోణాచార్యుల నతిక్రమించి కురుసైన్యంబు సొచ్చుట (సం. 7-66-30)

చ. **అనవుడుఁ గ్రీడి 'నీదు హృదయంబున నెయ్యది దోఁచెఁ గృష్ణ! దా**
నిన తగఁ జేయువాఁడ' నని నెమ్మిగఁ బల్కినఁ బ్రీతిఁ గుంభజ
న్మునకుఁ బ్రదక్షిణంబుగ సముద్ధతి నాతఁడు దేరు వోవ ని
చ్చిన శరజాలముల్ వరఁగఁ జేయుచుఁ బార్థుఁడు వోవుచుండఁగన్. **69**

ప్రతిపదార్థం: అనవుడున్= అని శ్రీకృష్ణుడు చెప్పగా; క్రీడి= అర్జునుడు; కృష్ణ!; నీదు హృదయంబునన్= నీ మనస్సులో; ఏ+అది తోఁచెన్= ఏమి తోచిందో; దానిన= దానినే; తగన్+చేయువాఁడన్= తగునట్లు చేస్తాను; అని నెమ్మిగన్+పల్కినన్= అని ప్రీతిగా చెప్పగా; ఆతఁడు= కృష్ణుడు; ప్రీతిన్= ప్రేమతో; కుంభజన్మునకున్= ద్రోణుడికి; సముద్ధతిన్= గర్వంతో; ప్రదక్షిణంబుగన్= సవ్యంగా; తేరుపోవనిచ్చినన్= తేరును పోనీయగా; శరజాలములన్= బాణాల గుంపులను; పరఁగన్+చేయుచున్= వేస్తూ; పార్థుఁడు= అర్జునుడు; పోవుచున్+ఉండఁగన్= వెళ్ళుతుండగా.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి మాటలకు అర్జునుడు 'కృష్ణా! నీ మనసుకు తోచినట్లు చేయుము. దానికి తగినట్లు నేనూ చేస్తాను' అని ప్రీతిగా చెప్పాడు. అంత శ్రీకృష్ణుడు సగర్వంగా తేరును ద్రోణుడికి ప్రదక్షిణంగా పోనిచ్చాడు. అర్జునుడు బాణవర్షం కురిపించి పోతూఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. **కనుంగొని నవ్వుచు భారద్వాజుండు.** **70**

తాత్పర్యం: (అర్జునుడి పోకను) చూచి ద్రోణుడు నవ్వుతూ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'కలవే యెందును నిట్టివి? । బలసూదనతనయ! పగఱఁ బరిమార్పక వి
చ్చలవిడిఁ బ్రతిష్ఠితుఁ డవుగఁ । దలఁచెదు పోలు నొకొ!' యనుచుఁ దగిలెఁ బిఱుందన్. 71

ప్రతిపదార్థం: బలసూదనతనయ!= ఇంద్రుడి కుమారుడా! ఇట్టివి= ఇపుడు నీ చేష్టవంటివి; ఎందును గలవే?= ఎక్కడైనా ఉన్నాయా?; పగఱన్= శత్రువులను; పరిమార్పక= చంపక; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; ప్రతిష్ఠితుఁడవుగన్= నిలదొక్కుకున్నవాడవుగా, శాశ్వతుడవుగా; తలఁచెదు= తలచుకొంటున్నావు; పోలున్+ఒకొ!= ఇది తగునా!; అనుచున్; పిఱుందన్ తగిలెన్= వెంబడించాడు.

తాత్పర్యం: 'అర్జునా! ఇటువంటివి! ఎక్కడైనా ఉన్నాయా? శత్రువును చంపకుండా స్వేచ్ఛగా (నీవు) శాశ్వతుడవనుకొంటున్నావు.' "ఇది తగునా" అంటూ ద్రోణు డతనిని తరిమినాడు.

వ. ధనంజయుండును. 72

తాత్పర్యం: అర్జునుడును.

క. గురుఁ డవు గాక పగతుఁడవె? । దురమునఁ గుపితుఁడగు ని న్నెదుర్కొన నా కొ
క్కరునకు శక్యమె? యా । పురహరున కగుం గాక!' యనుచు నరుగుచు నుండెన్. 73

ప్రతిపదార్థం: గురుఁడవుకాక పగతుఁడవె?= (నాకు) గురుడివి కాక శత్రుడవా?; దురమునన్= యుద్ధంలో; కుపితుఁడు+అగు= కోపగించిన; నిన్నున్= నిన్ను; ఎదుర్కొనన్= ఎదుర్కొనటానికి; నాకున్+ఒక్కరునకున్ శక్యమె?= నా ఒక్కడికి సాధ్యమా?; ఆ పురహరునకున్= ఈశ్వరుడికి; అగున్+కాక= సాధ్యమగునుగాక!; అనుచున్= అంటూ; అరుగుచున్+ఉండెన్= వెళ్ళుతున్నాడు.

తాత్పర్యం: '(అర్జునుడు ద్రోణుడితో) నాకు గురుడవు కాక శత్రుడవా? యుద్ధంలో కోపగించిన నిన్నెదుర్కొనటానికి నాకు సాధ్యమా? అది శివుడికొక్కడికే సాధ్యం' అని వెళ్ళసాగాడు.

వ. ఇవ్విధంబున సైన్యంబు సొచ్చు నా సవ్యసాచి చక్రరక్షకులగు పాంచాల కుమారులు యుధామన్యుండును నుత్తమౌజుండును దోడన వచ్చి చొచ్చిః రప్పుడు కృతవర్మయుం గాంభోజుండును శ్రుతాయువుఁ దమతమ యున్న చోట్లన యుండి తలలెత్తి చూచి కపిధ్వజ వేదికా కేతనంబుల కతంబునఁ గవ్వడి వెనుకం గలశభవు రాకయుం గని యుత్సాహంబు మిగిలి తగులువడ నడ్డపడుటకు నప్పళించుచుండ నప్పుడప్పాండవ వీరునిం గేకయ ప్రభద్రక నారాయణ గోపాల ప్రభృతులు పొదివి రెవ్వ; రెట్లు పొదివినం బ్రతిజ్ఞాతత్పరుం డగు నన్నరుండు సామజంబు సరోవరంబు దఱియం జొచ్చు తెఱంగున నబ్బల ప్రకరంబు బడలువడం జేయుచుం బోవం బోవ. 74

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; సైన్యంబు చొచ్చు= సేనలోకి దూరు; ఆ సవ్యసాచి= ఆ అర్జునుడి; చక్రరక్షకులు +అగు= తేరును కాపాడేవారైన; పాంచాల కుమారులు= ద్రుపదుడి కుమారులు; యుధామన్యుండును, ఉత్తమౌజుండును=ఈపేర్లు కలవారు; తోడన్+అ వచ్చి= కూడా వచ్చి; చొచ్చిరి= (సేనలోనికి) చొరపడ్డారు; అప్పుడు= ఆ సమయాన; కృతవర్మయున్; కాంభోజుండునున్; శ్రుతాయువున్; తమ తమ ఉన్న చోట్లన ఉండి= తమ తమ స్థానాలలోనే ఉండి; తలలు+ఎత్తి చూచి= తలలు పైకెత్తి చూచి; కపిధ్వజ వేదికా కేతనంబుల కతంబునన్= కపిధ్వజమూ, వేదికా, జెండాలు కారణంగా; కవ్వడి వెనుకన్= అర్జునుడి వెనుక; కలశభవు రాకయున్+కని= ద్రోణుడు రావటమును చూచి; ఉత్సాహంబు మిగిలి= ప్రయత్నంతో అతిశయించి; తగులు వడన్+అడ్డపడుటకున్= వెంటపడి అడ్డుకొనటానికి; అప్పళించుచున్+ఉండన్= ఆరాటపడుతూ ఉండగా; అప్పుడు; ఆ+ పాండవ వీరుని= ఆ అర్జునుడిని; కేకయ, ప్రభద్రక, నారాయణ గోపాల ప్రభృతులు= ఈ మొదలైన వారు; పొదివిరి= కమ్ముకొన్నారు;ఎవ్వరు+ఎట్లు

పొదివినన్= ఎవ్వరే విధంగా కమ్ముకొన్నా; ప్రతిజ్ఞా తత్పరుండు+అగు= తన శపథంమీద పట్టుదల కలవాడైన; ఆ+నరుండు= ఆ అర్జునుడు; సామజంబు= ఏనుగు; సరోవరంబు దఱియన్+చొచ్చు తెఱంగునన్= తామరకొలనులో ప్రవేశించిన విధంగా; ఆ+బలప్రకరంబున్= ఆ సైన్య సమూహాన్ని; బడలువడన్+చేయుచున్= ఆయాస పడేటట్లుగా చేస్తూ; పోవన్+పోవన్= పోగా పోగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా సేనా సమూహంలో దూరిన అర్జునుడికి చక్రరక్షకులుగా పాంచాలరాజ కుమారులు యుధామన్యుడు, ఉత్తమౌజుడు కూడా వచ్చి చేరారు. అపుడు కృతవర్మ, కాంభోజుడు, శ్రుతాయువు మొదలైన వారు తలలెత్తి చూశారు. వారి వారి రథకేతనాలు గుర్తింపుగా ద్రోణార్జునులను గుర్తించి ఉత్సాహంతో అడ్డుకొనటానికి ఆరాటపడుతూ ఉండగా, కేకయ భద్రకాదులు అర్జునుడిని ఎదుర్కొన్నారు. అయినా, తన ప్రతిజ్ఞను నిలుపుకొనటానికి నిశ్చయించి అర్జునుడు తామరమడుగులో ప్రవేశించు ఏనుగు వలె ఆ సైన్యంలోకి చొచ్చుకొని వెళ్ళాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **కదిసి శరాసన గురుఁ డిరు । వది యేనుశరంబు లేయఁ బార్థుఁడు వానిం**
గుదియించి విశాలాస్య । ప్రదరము లడరింపఁ గుంభభవుఁ డెడఁ ద్రుంచెన్. 75

ప్రతిపదార్థం: కదిసి= దగ్గరకు చేరి; శరాసన గురుఁడు= ధనురాచార్యుడైన ద్రోణుడు; ఇరువది ఏను శరంబులు+ఏయన్= ఇరవై ఐదు బాణాలతో కొట్టగా; పార్థుఁడు= అర్జునుడు; వానిన్ కుదియించి= ఆ బాణాలను మరలించి; విశాలాస్య ప్రదరములు= పెద్దవైన మొగాలతో ఉన్న బాణాలను; అడరింపన్= వేయగా; కుంభసంభవుఁడు= ద్రోణుడు; ఎడన్= దూరాన; త్రుంచెన్= వాటిని ముక్కలు చేశాడు.

తాత్పర్యం: దగ్గరికి వచ్చి ద్రోణుడు ఇరువది అయిదు బాణాలతో కొట్టగా అర్జునుడు వాటిని త్రిప్పి కొట్టాడు. అర్జును డేసిన పెనుముఖాలు గల బాణాలను మధ్యలోనే ద్రోణుడు త్రుంచాడు.

క. **విజయుం డను శైలము గల । శజ ధారాధరము గప్పె శరవృష్టి మహా**
ద్విజు నతఁ డేయక కడున । క్కజముగ నయ్యంపసోన గ్రక్కున మాన్పెన్. 76

ప్రతిపదార్థం: విజయుండు+అను శైలమున్= అర్జునుడనే కొండను; కలశజ ధారాధరము= ద్రోణుడనే మేఘం; శరవృష్టిన్= అంపవానతో, జలవృష్టితో; కప్పెన్= క్రమ్మివేసింది; అతఁడు= ఆ అర్జునుడు; మహాద్విజున్= బ్రాహ్మణ శ్రేష్ఠుడిని (ద్రోణుడిని); ఏయక= కొట్టక (అనగా ఎదురేయక); కడున్+అక్కజముగన్= మిక్కిలి ఆశ్చర్యకరంగా; ఆ+అంపసోనన్= ఆ బాణవర్షాన్ని; గ్రక్కునన్= త్వరగా; మాన్పెన్= ఆపాడు.

తాత్పర్యం: అర్జునుడనే కొండను ద్రోణుడనే మేఘం బాణవర్షంతో కప్పింది. కాని ఆ మహాద్విజుడిని ఎదురు దెబ్బతీయకుండా ఆశ్చర్యంగా ఆ అంపవానను మాన్పాడు.

విశేషం: అలం: ఉపమ. రూపకం. శరవృష్టి - అనుచో శ్లేషము.

ఆ. **మఱియు నిరువదేను మార్గణంబుల నరు । డెబ్బదింటఁ గృష్ణు నుబ్బి యేసి**
గురుఁడు నారసములఁ గురియంగ నవి యాఁగ । నలవి గామి నతఁడు నతఁడు నొచ్చి. 77

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; ఇరువది+ఏను= ఇరవై అయిదు; మార్గణంబులన్= బాణములతో; నరున్= అర్జునుడిని; డెబ్బదింటన్= డెబ్బయితో; కృష్ణున్= శ్రీకృష్ణుడిని; ఉబ్బి ఏసి= విజృంభించి కొట్టి; గురుఁడు= ద్రోణుడు (ధనురాచార్యుడు);

నారసములన్= వాడి బాణాలను; కురియంగన్= (వానవలె) కురిపించగా; అవి= ఆ బాణాలు; ఆఁగన్= ఆపటానికి; అలవికామిన్= సాధ్యంకాకపోవటంచేత; అతఁడున్+అతఁడున్= కృష్ణార్జునులు; నొచ్చి= బాధపడి.

తాత్పర్యం: ధనురాచార్యుడు ఇరవై అయిదు బాణాలతో అర్జునుడిని, డెబ్బైతో శ్రీకృష్ణుడిని కొట్టటమేకాక వాడి బాణాల వాన కురిపించాడు, ఆ బాణవర్షం ఆపటానికి వీలు కాక ఆ ఇర్వురు బాధపడ్డారు.

వ. **అమ్మేటివిలుకాని వంచించి కృతవర్మని సైన్యంబు సొచ్చుటయు, నగ్గురుండు సేయునది లేక సేనాముఖ రక్షణంబునకుం జనియె; నప్పార్థుని మార్కొని కృతవర్మ పదియమ్ము లేసిన నక్కిరీటి యొక్కవాల మ్మురమ్మున నాటించి మఱియును నారాచత్రయంబున నొప్పించె; నా భోజపతి యన్నరనారాయణులం గనుంగొని నవ్వుచు నిరువదేసేసి తూపులం బరగించిన ధనంజయుం డతని ధనువుఁ దునిమి యేకవిశంతి విశిఖంబుల నొప్పించిన, నొండు కోదండంబు గొని హార్దిక్యుండు బాణ పంచక యుగంబు విప్వచ్చు వక్షంబున గ్రుచ్చె; నప్పు డా సవ్యసాచిం జూచి యితండు దవులు వడియె నిది గా దని తలంచి దామోదరుండు.** **78**

ప్రతిపదార్థం: ఆ+మేటి విలుకానిన్ వంచించి= ఆ పెద్దవిల్లు కలవాడైన (గొప్పవీరుడు) వాడిని మోసగించి; కృతవర్మని సైన్యంబు చొచ్చుటయున్= కృతవర్మ (నాయకుడుగా గల) సైన్యంలో ప్రవేశించుటయు; ఆ+గురుండు= ఆ ద్రోణుడు; చేయునది లేక= ఏమీ చేయలేక; సేనాముఖరక్షణంబునకున్+చనియెన్= సేన మొదలును కాపాడటానికి వెళ్ళాడు; ఆ+పార్థునిన్= ఆ అర్జునుడిని; మార్కొని= ఎదుర్కొని; కృతవర్మ పదిఅమ్ములు+ఏసినన్= కృతవర్మ పదిబాణాలేయగా; ఆ+కిరీటి= ఆ అర్జునుడు; ఒక్క+వాలమ్ము= ఒక వాడి అయిన బాణాన్ని; ఉరమ్మునన్= గుండెలో; నాటించి= గ్రుచ్చి; మఱియును= ఇంకా; నారాచత్రయంబునన్ నొప్పించెన్= మూడు వాడి అయిన బాణాలతో బాధించాడు; ఆ భోజపతి= భోజరాజయిన కృతవర్మ; ఆ+నరనారాయణులన్+కనుంగొని= ఆ అర్జున కృష్ణులను చూచి; ఇరువదే నేసి తూపులు= ఇరవై అయిదేసి బాణాలను; ఏపున్+పరఁగించినన్= శీఘ్రంగా వేయగా; ధనంజయుండు= అర్జునుడు; అతని ధనువున్= ఆతడి విల్లును; తునిమి= త్రుంచివేసి; ఏకవింశతి= ఇరవై ఒక్క; విశిఖంబులన్= బాణాలచేత; నొప్పించినన్= బాధించగా; ఒండు కోదండంబున్+కొని= వేరొక విల్లు తీసికొని; హార్దిక్యుండు= కృతవర్మ; బాణపంచకయుగంబున్= పది బాణాలను; విప్వచ్చు వక్షంబునన్ గ్రుచ్చెన్= అర్జునుడి గుండెలో గ్రుచ్చాడు; ఆ+వీరుండును= ఆ అర్జునుడు; తదీయ= హార్దిక్యుడి; స్తనాంతరంబునన్= చనులమధ్యగా; తొమ్మిది అంబకంబులు దూర్చెన్= తొమ్మిది బాణాలను గ్రుచ్చాడు; అప్పు డా సవ్యసాచిన్+చూచి= అపు డా అర్జునుడిని చూచి; ఇతండు= అర్జునుడు; తవులు పడియెన్= చిక్కు పడ్డాడు; ఇది కాదని తలంచి= ఈ పద్ధతి కాదని తలచుకొని; దామోదరుండు= శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: ఆ గొప్ప విలుకాడిని మోసగించి కృతవర్మ సైన్యంలోనికి చొరబడ్డాడు. అపుడు తాను చేయగలిగిన దేమీ లేదని ద్రోణుడు మొగ్గరం మొనకు వెళ్ళాడు. కృతవర్మ అర్జునుడిని ఎదుర్కొని పది బాణాలతో కొట్టగా అర్జునుడు ఒక పదునైన బాణాన్ని అతని ఎదలో నాటాడు. అంతేకాక మరో మూడు బాణాలతో కూడ నొప్పించాడు. కృతవర్మకృష్ణార్జునులను చూచి నవ్వుతు ఒక్కొక్కరి మీద ఇరువది బాణాలు వేయగా, అర్జునుడు అతని ధనుస్సును త్రుంచి, ఇరువది ఒక్క బాణాలతో, అతనిని నొప్పించాడు. తరువాత కృతవర్మ వేరొక ధనుస్సు తీసుకొని పదిబాణాలు అర్జునుని ఎదలో నాటుకొనేటట్లు కొట్టాడు. అప్పుడు కృష్ణుడు అర్జునుని చూచి, ఇతడు చిక్కున పడ్డాడు. ఇది పద్ధతి కాదు అని ఆలోచించి

క. **'తడవయ్యె నితఁడు మన కె । క్కడి బంధుం? డేల కృప దెగంబాఱుము' నా**
వుడుఁ గీలెడసిన జంత్రము । వడువునఁ బడ నేసె నతని వాసవి యధిపా! **79**

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా! (ధృతరాష్ట్రా!); తడవు+అయ్యెన్= ఆలస్యమైనది; ఇతఁడు= ఈ కృతవర్మ; మనకున్+ఎక్కడి బంధుండు?= ఎక్కడి బంధువయ్యా! (అనగా శత్రుపక్షంవాడు కనుక మనకు బంధువు కాడు); ఏల కృప?= ఎందుకు జాలి?;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తెగన్+పాఱుము= తెగవేయుము (చంపుము); నావుడున్= అని శ్రీకృష్ణు డనగా; కీలు+ఎడసిన జంత్రము వడువునన్= కీలు (సీల); తొలగించిన యంత్రం మాదిరి; అతనిన్= ఆ కృతవర్మను; వాసవి= అర్జునుడు; పడనేసెన్= క్రింద పడేటట్లు కొట్టాడు (అనగా చనిపోయేటట్లు).

తాత్పర్యం: శ్రీకృష్ణుడు 'ఆలస్యమౌతూ ఉన్నది. వీ డెక్కడి బంధువు? త్వరగా పడవేయు' మని అర్జునుడిని హెచ్చరించగా, వెంటనే అతడు ఆ కృతవర్మను నేలపై పడేటట్లు చేశాడు.

వ. ఇట్లు భోజపతిం గ్రూరనారాచంబుల మూర్ఛితుం జేసి. 80

తాత్పర్యం: ఆ విధంగా భోజరాజైన కృతవర్మను వాడిబాణాలతో మూర్ఛిల్లేటట్లుగా చేసి.

తే. కడచి కాంభోజ సైన్యంబు గలఁగఁ బెలుచఁ । జొచ్చు విన్వచ్చు వెనుకన చొరక యుండ
ముట్టి యాఁగె నా కృతవర్మ మూర్ఛదేఱి । వచ్చి రథ చక్ర రక్షకద్వయముఁ గడిమి. 81

ప్రతిపదార్థం: కడచి= అతిక్రమించి; కాంభోజ సైన్యంబు= కాంభోజ దేశపు సేన; కలఁగన్= కలతచెందగా; పెలుచన్+చొచ్చు= త్వరగా ప్రవేశించే; విన్వచ్చు వెనుకన= అర్జునుడి వెనుకనే; చొరక ఉండన్= ప్రవేశించకుండా; ముట్టి= తాకి; ఆ కృతవర్మ= ఆ కృతవర్మ; మూర్ఛతేఱి= మూర్ఛనుండి లేచి; వచ్చి= వచ్చి; రథ చక్రరక్షక ద్వయమున్= రథచక్రరక్షకుల నిద్దరినీ; కడిమిన్= ప్రయత్నంతో; ఆఁగెన్= ఆపాడు.

తాత్పర్యం: కాంభోజ సైన్యం కలతచెందేటట్లు ఆ సైన్యంలోకి అతివేగంగా ప్రవేశిస్తున్న అర్జునుడిని అనుసరించకుండా ఉండేటట్లు, అతని చక్రరక్షకు లిద్దరిని, మూర్ఛదేరిన కృతవర్మ అడ్డుకొని ఆపాడు.

వ. ఇవ్విధంబున నుత్తమౌజుని యుధామన్యుం బోనీక భోజపతి శరచతుష్టయంబును సాయకత్రయంబునుఁ దనువులం గీలించిన, నయ్యిరువురుం బదేసిబాణంబుల నతని నేసి, తత్కోదండంబు దుండంబులు సేసిన నతండు. 82

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారం; ఉత్తమౌజుని, యుధామన్యున్= (వీరిర్వురను) ఉత్తమౌజుని, యుధామన్యుని; పోనీక= (ముందుకు) పోనీయక; శరచతుష్టయంబును= నాల్గు బాణాలను; సాయకత్రయంబును= మూడు బాణాలను; తనువులన్ కీలించినన్= వారి శరీరాలలో నాటగా; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరునూ; పదేసి బాణంబులన్= పదిబాణాలతో (ఒక్కొక్కరునూ పదిబాణాలతో); అతనిన్+ఏసి= వాడిని కొట్టి; తద్+కోదండంబు= వాడి విల్లును; తుండంబులు చేసినన్= ముక్కలు చేయగా; అతండు= ఆ కృతవర్మ.

తాత్పర్యం: చక్రరక్షకులైన ఉత్తమౌజుడిని, యుధామన్యుడిని ముందుకుపోనీయకుండా, కృతవర్మ నాల్గు, మూడు బాణాలు వారి శరీరాలలో నాటగా, వారు ఒక్కొక్కరు పదేసి బాణాలతో కృతవర్మ విల్లును ముక్కలు చేశారు.

ఉ. వేఱొక విల్లు పుచ్చుకొని విండులు రెండును ద్రుంచి మేనులం
దూఱఁగ నేసె బెట్టిదపుఁ దూపుల వారును వాని యమ్ములన్
గీఱఁగ నొండు విండ్లు గొని కిన్క యెలర్పఁగ నేసె రెమ్మెయిం
దీఱద గండి గాంచి నరు తేలిపథంబునఁ బోవ వారికిన్. 83

ప్రతిపదార్థం: వేఱు+ఒకవిల్లున్= మరియొక వింటిని; పుచ్చుకొని= అందుకొని; విండులు రెంటిని= రెండు విండ్లను (అనగా ఆ ఇద్దరి విండ్లనూ); త్రుంచి= విరిచి; బెట్టిదపు= భయంకరమైన; తూపులన్= బాణాలతో; మేనులన్= శరీరాలందు;

దూఱఁగన్+ఏసెన్= దూరేటట్లుగా (శరీరంలో చొచ్చేటట్లుగా)కొట్టాడు; వారును= ఆ ఇరువురును; వాని అమ్ములన్= అతడి బాణాలను; గీఱఁగన్= చీల్చగా; ఒండు విండ్లుగొని= వేరు విండ్లను తీసికొని; కిన్క ఎలర్పఁగన్= కోపం ఎక్కువకాగా; ఏసిరి= కొట్టారు; వారికిన్= ఆ ఇద్దరికినీ; ఏ+మెయిన్= ఏ విధంగానూ (ఏ ఉపాయంతోనూ); నరుతేరి పథంబునన్= అర్జునుడి తేరు పోయే బాటలో; గండికాంచి= సందుచూచి; పోవన్= వెళ్ళుటకు; తీఱదు= కుదరలేదు.

తాత్పర్యం: కృతవర్మ వేరొక విల్లు తీసికొని వారి ఇద్దరి విండ్లనూ త్రుంచివేసి బాణాలతో వారిని నొప్పించాడు. వారు కూడా అతడి బాణాలను చీల్చారు. అయినా అర్జునుడి రథం వెళ్ళే మార్గంలో వారు పోలేకపోయారు.

అర్జునుఁడు శ్రుతాయుధ ప్రముఖ మహారథికులం జంపుట (సం.7-67-36)

వ. అట్లు చొచ్చు వివ్వచ్చుం జూచి శ్రుతాయుధుం డను రాజు రభసంబున నెదిర్చి మార్గణ త్రయంబున నేసి వాసుదేవునిపై సప్తతి ప్రదరంబులు నిగిడించి. 84

ప్రతిపదార్థం: అట్లు చొచ్చు వివ్వచ్చున్+చూచి= పై విధంగా దూసికొని చొచ్చే అర్జునుడిని చూచి; శ్రుతాయుధుండు+అను రాజు= శ్రుతాయుధుడనే పేరున్న రాజు; రభసంబునన్= వేగంగా; ఎదిర్చి= ఎదురుకొని; మార్గణత్రయంబునన్= మూడు అమ్ములతో; ఏసి= కొట్టి; వాసుదేవునిపైన్= శ్రీకృష్ణుడిమీద; సప్తతి= డెబ్బై; ప్రదరంబులు= బాణాలను; నిగిడించి= సంధించి.

తాత్పర్యం: ఆ విధంగా దూసికొని పోతూ ఉన్న అర్జునుడిని శ్రుతాయుధుడనే రాజు ఎదుర్కొన్నాడు. మూడు బాణాలు అర్జునుడిమీద, డెబ్బై బాణాలు శ్రీకృష్ణుడి మీద ప్రయోగించాడు.

తే. వెడఁదతూపునఁ గేతువు వ్రేయఁ గ్రీడి । నవతి విశిఖంబు లేయ నన్నరవరుండు
డెబ్బదేనమ్ము లడరింప నుబ్బి విల్లు । ద్రుంచి యుర మేడుశరముల నొంచె నరుఁడు. 85

ప్రతిపదార్థం: వెడఁద తూపునన్= విశాలమైన బాణంతో; కేతువు వ్రేయన్= జెండాను కొట్టగా; క్రీడి= అర్జునుడు; నవతి= తొంభై; విశిఖంబులు= బాణాలను; ఏయన్= వేయగా; ఆ+నరవరుండు= ఆ శ్రుతాయుధుడు; డెబ్బది+ఏనమ్ములు= డెబ్బై అయిదు బాణాలను; అడరింపన్= గుప్పించగా; ఉబ్బి= పెరిగి; విల్లుత్రుంచి= (వాడి) ధనుస్సును త్రుంచివేసి; ఉరము= (వాడి) గుండెను; ఏడు శరములన్= ఏడు బాణాలతో; నరుఁడు= అర్జునుడు; నొంచెన్= బాధించాడు.

తాత్పర్యం: శ్రుతాయుధుడు అర్జునుడి జెండాను పడగొట్టగా, అర్జునుడు తొంభై బాణాలను అతడిమీద వేశాడు. ఆ రాజు డెబ్బై అయిదు బాణాలను అర్జునుడిమీద వేయగా, అర్జునుడు విజృంభించి ఆతడి విల్లు త్రుంచి, ఏడు బాణాలతో అతడి గుండెను కొట్టి బాధించాడు.

క. కోపించి యాతఁడొండొక । చాపము గొని నవనిశాతసాయకములు బా
హోపరితలముల నురమున । నేపున నాటుటయుఁ బార్థు డెలన వ్వొలయన్. 86

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ శ్రుతాయుధుడు; కోపించి= కోపంతో; ఒండొక చాపముకొని= వేరొక విల్లును తీసికొని; నవ నిశాత సాయకములు= తొమ్మిది వాడిబాణాలు; బాహోపరితలములన్= చేతులకు పైభాగాన; ఉరమునన్= గుండియలో; ఏపునన్= గట్టిగా; నాటుటయున్= గ్రుచ్చుటయు; పార్థుఁడు= అర్జునుడు; ఎలనవ్వు+ఒలయన్= చిరునవ్వు కలుగగా.

తాత్పర్యం: శ్రుతాయుధుడు కోపంతో ఇంకొక విల్లు తీసికొని తొమ్మిది పదునైన బాణాలతో అర్జునుడి బాహువుల పైభాగాన గుండెలో దట్టంగా నాటేటట్లు వేశాడు. అపు డర్జునుడు చిరునవ్వుతో (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. **సారథిఁ గూల్చి యశ్వములఁ జంపి తదంగములందు సప్తతి**
క్రూరశిలీముఖంబు లతిఘోరముగాఁ దొరఁగింపఁ బ్రస్ఫుర
ద్భూరి గదాభిరాముఁ డయి దుర్దమ లీల రథంబు డిగ్గి యా
ధీర గుణోత్తరుం డతని తేరిదెసం గవిసెం రయంబునన్. 87

ప్రతిపదార్థం: (అర్జునుడు చిరునవ్వుతో); సారథిన్+కూల్చి= శ్రుతాయుధుడి తేరు తోలువాడిని చంపి; తద్+అంగములందున్= వాని శరీరం మీద; సప్తతి= డెబ్బై; క్రూరశిలీముఖంబులు= వాడిబాణాలను; అతి ఘోరముగాన్= మిక్కిలి భయంకరంగా; తొరఁగింపన్= ప్రవాహం మాదిరి వేయగా; ప్రస్ఫురత్= బాగా కనిపించే; భూరిగదా= పెద్ద గదతో; అభిరాముఁడు+అయి= (వర్ణింప తగిన విధంగా) అందగాడయి; దుర్దమలీలన్= అణచటానికి వీలుకాని చేష్టతో; రథంబు డిగ్గి= తేరు దిగి; ఆ ధీరగుణ+ఉత్తరుండు= ధీరగుణంతో శ్రేష్ఠుడయిన ఆ అర్జునుడు; రయంబునన్= వేగంగా; అతని తేరిదెసన్= అతడి తేరుండే దిక్కునకు; కవిసెన్= కమ్ముకొన్నాడు.

తాత్పర్యం: (అర్జునుడు) చిరునవ్వుతో శ్రుతాయుధుడి సారథిని చంపాడు. తేరి గుర్రాలను చంపాడు. డెబ్బై వాడిబాణాలతో అతడి శరీరాన్ని తూట్లు పొడిచాడు. అపు డాతడు భయంకరమైన గదను తీసికొని, తేరు దిగి, శీఘ్రంగా అర్జునుడి తేరుండే వైపు విజృంభించాడు.

వ. **ఆ రాజు వరుణ తనయుం డనియు, నగ్గద వరుణు వరంబున వచ్చిన దనియు, దాని నిచ్చునప్పుడు 'దీని ధరించినవాడు రిపుల కజేయుండగుఁ బోటెక్కించుకొనని వానిమీఁదం బ్రయోగించిన వానిన మరలి వధియించు' ననియు చెప్పె ననియును బెద్దలవలన విందుము.** 88

ప్రతిపదార్థం: ఆ రాజు= ఆ శ్రుతాయుధుడు వరుణ తనయుండు+అనియున్= వరుణుడి కుమారుడనీ; ఆ+గద; వరుణ వరంబునన్+వచ్చినది+అనియున్= వరుణుడి వరంచేత ఆ గద వచ్చిందనీ; వరుణుండు= వరుణుడు; అతనికిన్= ఆ శ్రుతాయుధునికి; దానిన్+ఇచ్చునప్పుడు= ఆ ఆయుధాన్ని ఇచ్చేటపుడు; దీనిన్ ధరించినవాఁడు= దీనిని చేతకలవాడు; రిపులకున్= శత్రువులకు; అజేయుండు+అగున్= జయింపరానివాడవుతాడు; పోటెక్కించుకొననివానిమీఁదన్= ఆయుధాన్ని ఎక్కుపెట్టనివాడిమీద; ప్రయోగించినన్= వేసిన; వానిన= వాడినే; మరలి వధియించున్+అని చెప్పెన్+అని= తిరిగిపోయి చంపునని చెప్పెనని; పెద్దలవలనన్ విందుము= పెద్దల మూలంగా విన్నాము.

తాత్పర్యం: ఆ యుద్ధం చేసే రాజు శ్రుతాయుధుడు వరుణుడి కుమారుడని, అతడి చేతిలోని గద వరుణుడి దయతో వచ్చిందని,'దానిని చేతబట్టిన వాడు శత్రువులకు జయింపశక్యంకాని వాడౌతాడని, యుద్ధ సన్నద్ధుడు కానివాడి మీద దాన్ని ప్రయోగిస్తే అది తిరిగి వచ్చి ప్రయోగించిన వాడినే హతమారుస్తుందని పెద్దలు చెప్పగా విన్నాము.

ఉ. **కాలము ప్రాప్తమైన మదిఁ గానఁడ! యన్నియమంబు మేదినీ**
పాలకుఁ డప్పు డట్లగుటఁ బంకజనాభుని వైచె నాతఁ డా
భీల గదం దదంసమునఁ బెట్టిన నూతన బుష్పమాలయుం
బోలి వెలింగెఁ గాని యది భూవర! నొంపద యించుకేనియున్. 89

ప్రతిపదార్థం: భూవర!= ఓ రాజా! (ఓ ధృతరాష్ట్రా! అని సంజయుడన్నాడు); కాలము= సమయం (చావు); ప్రాప్తము+ఐనన్= సిద్ధమైతే; మదిన్= మనసులో; ఆ+నియమంబున్= నియమాన్ని (అనగా తనగదకున్న నియమాన్ని); మేదినీపాలకుఁడు= రాజు (శ్రుతాయుధుడు); కానఁడు+అ= గుర్తించలేకపోయినాడు; అప్పుడు= ఆ సమయంలో; అట్లు+అగుటన్= అందువలన; ఆతఁడు= ఆ రాజు; ఆభీల= భయంకరమైన; గదన్= గదచేత; పంకజనాభునిన్= పద్మనాభుడైన శ్రీకృష్ణుడిని; వైచెన్= కొట్టాడు; అది= ఆ గద; తద్+అంసమునన్= అతడిభుజంమీద; పెట్టినన్ నూతన పుష్పమాలయున్ పోలి= కొత్తగా అలంకరించిన పూలమాలవలె; వెలింగెన్= వెలిగింది; కాని; ఇంచుకేనియున్= కొంచెమైనా; నొంపదు+అ= బాధించే బాధించదు.

తాత్పర్యం: కాలం దాపురిస్తే నియమాలు ఏవీ జ్ఞాపకానికిరావు; అందువలన ఆ శ్రుతాయుధుడు తన గదతో శ్రీకృష్ణుడిని కొట్టాడు. ఆ భయంకరమైన గద దెబ్బ ఆయన నేమీ చేయకుండా మెడలో క్రొత్తగా అలంకరించిన పూలమాలవలె వెలిగింది.

వ. ఇట్లు గోవిందునకుఁ గుసుమాభరణంబై పొలిచి యా క్షణంబ. 90

తాత్పర్యం: ఈ విధంగా శ్రీకృష్ణుడికి పూలమాలగా ఒప్పి వెంటనే.

ఆ. అశని కరణి వచ్చి యా శ్రుతాయుధునిపై । నమ్మహోజ్జ్వలాయుధమ్ము వడినఁ
బార్థు చేత మున్ను బాహులు దెగిపడ్డ । యతఁడు కొండ గూలినట్లు కూలె. 91

ప్రతిపదార్థం: అశనికరణి వచ్చి= వజ్రాయుధం మాదిరి వచ్చి; ఆ శ్రుతాయుధునిపైన్= ఆ శ్రుతాయుధుడి మీద; ఆ+మహా+ఉజ్జ్వల= ఆ మిక్కిలి ప్రకాశించే; ఆయుధమ్ము పడినన్= ఆయుధం పడగా; పార్థుచేతన్= అర్జునుడి వలన; మున్ను= అదివరకే; బాహులు దెగిపడ్డ అతఁడు= చేతులు తెగిపడి ఉన్న వాడు; కొండ కూలినట్లు= కొండకూలి క్రిందపడినట్లు; కూలెన్= కూలిపడిపోయాడు.

తాత్పర్యం: శ్రుతాయుధుడు విసిరిన గద, వజ్రాయుధం మాదిరి తిరిగి వచ్చి అతడి మీదనే పడింది. అంతకు ముందే అర్జునుడిచేత చేతులు తెగగొట్టబడి ఉన్న శ్రుతాయుధుడు కొండకూలిన విధంగా కూలిపడ్డాడు.

విశేషం: అలం: ఉపమ. ఇంద్రుడి వజ్రాయుధం కొండల రెక్కలను ఖండించేది. అప్పుడు కొండ నేల కూలేది, అయితే ఇక్కడ వజ్రాయుధంవంటి అతని ఆయుధంచేత అంతకుముందే బాహువులు తెగిపడిన శ్రుతాయుధుడు నేల కూలాడు.

వ. ఇట్లు వరుణతనయుఁడు పడిన గనుంగొని. 92

తాత్పర్యం: ఈ విధంగా వరుణకుమారుడు పడిపోగా చూచి.

క. అచ్చటి బలములు బ్రభువులు । నచ్చెరువును భయము మనములం దడరంగా
విచ్చిన నట చనియెడు వి । వ్వచ్చుని గాంభోజవిభుఁడు వడి మార్కొనియెన్. 93

ప్రతిపదార్థం: అచ్చటి బలములు= అక్కడి సైన్యాలు; ప్రభువులు= రాజులు; అచ్చెరువును భయము= ఆశ్చర్యమూ, భయమూ; మనములందున్= మనస్సులలో; అడరంగాన్= ఎక్కువకాగా; విచ్చినన్= చెదరిపోగా; అట చనియెడు= ఆ మార్గాన వెళ్ళుతున్న; వివ్వచ్చునిన్= అర్జునుడిని; కాంభోజవిభుఁడు= కాంభోజరాజు; వడిన్= శీఘ్రంగా; మార్కొనియెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: ఆ చోట ఉన్న సైన్యాలు, రాజులు ఆశ్చర్యమూ, భయమూ మనస్సులలో ఎక్కువై విచ్చిపోగా, అవు డాదిక్కున పోయే అర్జునుడిని కాంభోజరాజు ఎదుర్కొన్నాడు.

వ. ఇట్లు మార్కొనుటయు. 94

తాత్పర్యం: ఈ విధంగా ఎదుర్కొనగా.

సీ. అర్జునుం డతని నేడమ్ముల నేసినఁ । బదియేను శరములఁ బార్థుఁ గృష్ణు
విశిఖత్రయమున నవ్విభుఁ డేయ నాతని । విజయుఁ డస్త్రద్వయ విహతుఁ జేయ,
బాణముల్ మూఁటను బటుశక్తిఁ గ్రీడి నొ । ప్పించి కాంభోజుండు పేర్చి యార్చె;
నరుఁ డల్గి వెసఁ బదునాలుగు దూపుల । సూతాశ్వకోదండ కేతనములఁ

తే. **గూల్చి దొడ్డ నారసమున గుండెకాయ । వగుల బెట్టేయుటయు, నతిప్రబల పవన**
భూరి రయమునఁ గూలు మహీరుహంబు । తెఱఁగు దోఁప సుదక్షిణుఁ డొఅలి కెడసె. **95**

ప్రతిపదార్థం: అర్జునుండు+అతనిన్= అర్జును డా కాంభోజరాజును; ఏడు+అమ్ములన్+ఏసినన్= ఏడు బాణాలతో కొట్టగా; పదిఏను శరములన్= పదునైదు బాణాలతో; పార్థున్= అర్జునుడిని; విశిఖత్రయమునన్= మూడు బాణాలతో; కృష్ణున్= శ్రీకృష్ణుడిని; అ+విభుఁడు= ఆ కాంభోజరాజు; ఏయన్= కొట్టగా; ఆతనిన్= ఆ రాజును; విజయుఁడు= అర్జునుడు; అస్త్రద్వయవిహతున్+చేయన్= రెండు బాణాలతో పడగొట్టగా; పటుశక్తిన్= తీవ్రమైన బలంతో; కాంభోజుండు= కాంభోజరాజు; బాణముల్ మూఁటను= మూడు బాణాలతో; క్రీడిన్= అర్జునుడిని; నొప్పించి= బాధించి; పేర్చి ఆర్చెన్= విజృంభించి సింహనాదం చేశాడు; నరుఁడు= అర్జునుడు; అల్గి= కోపించి; వెసన్= వేగంతో; పదునాలుగు తూపులన్= పదునాలుగు బాణాలతో; సూత+అశ్వ కోదండ కేతనములన్= సారథిని, వింటినీ; తేరు గుఱ్ఱాలనూ, ధ్వజాన్నీ; కూల్చి= పడగొట్టి; దొడ్డనారసమునన్= పెద్ద ప్రాణాంతకమైన వాడి బాణంతో; గుండెకాయ పగులన్= గుండె పగులగా; బెట్టు+ఏయుటయున్= గట్టిగా కొట్టుటయు; అతి ప్రబల= మిక్కిలి శక్తిమంతమైన; పవన= గాలియొక్క; భూరిరయమునన్= పెనువేగంతో; కూలు= పడిపోయే; మహీరుహంబు తెఱఁగున్= చెట్టువలె; తోఁపన్= తోచగా; సుదక్షిణుఁడు= (కాంభోజుడు) సుదక్షిణుడు; ఒఅలి= దొర్లుతూ; కెడసెన్= పడిపోయాడు.

తాత్పర్యం: అర్జునుడు త న్నెదుర్కొన్న కాంభోజరాజును ఏడుబాణాలతో కొట్టాడు. బదులుగా ఆతడు పదిహేను బాణాలతో అర్జునుడినీ, మూటితో శ్రీకృష్ణుడినీ వేశాడు. అర్జునుడు రెండు బాణాలతో అతడిని పడగొట్టాడు. వెంటనే ఆ రాజు మూడు వాడిబాణాలతో అర్జునుడిని నొప్పించాడు. సింహనాదం కూడా చేశాడు. అంత అర్జునుడు కోపంతో పదునాలుగు బాణాలతో అతడి సారథిని, గుఱ్ఱాలనూ, వింటినీ, పతాకాన్నీ పడగొట్టాడు. తీవ్రమైన వాడిబాణంతో గుండె పగుల కొట్టాడు. ఆ పెనుదెబ్బ తాకిడికి పెనుగాలి వేగానికి నేలకూలే పెద్ద చెట్టువలె కాంభోజరాజు సుదక్షిణుడు దొర్లుతూ క్రింద పడ్డాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. **ఇట్లు కాంభోజపతి పడుటయు శూరసేన శిబి వసాతి ప్రముఖానేకదేశంబుల బలంబు లబ్బలమర్దననందనుం జుట్టుముట్టిన, నతండు దఱచు వాలంపగముల నాఱువేల రథంబుల రూపుమాపినం, గనుకనిం దెరలినం గని శ్రుతాయువు నయుతాయువును గాండీవి రెండు గెలంకుల సాయక సహస్రంబులు నిగిడించుచుం గవిసి; రప్పుడు శ్రుతాయువు చేతి తోమరంబున నొచ్చిన వివ్వచ్చుం బిడుగు వడిన వానిం గొఅవిఁ జూడిన తెఱంగున నయుతాయువు నాలోనన శూలంబు వైచి సోలంజేసిన విషాదంబున గరుడధ్వజుండు సొగయ నా కపిధ్వజుండు నిజధ్వజదండం బొక్కింత యూఁతగొనిన నక్కురు సైన్యంబుల సింహనాదంబులుం దూర్య నినదంబులుం జెలంగె; నంత శౌరి ప్రబోధింపం దేఱి ధనంజయుం డైంద్రాస్త్రంబు ప్రయోగించుటయు, నది వివిధాయుధాకారంబులం గవిసి నయ్యిరువుర హస్తమస్తక శకలంబులు ధరం దొరంగించి తదనుచరులం బంచశతరథిక వీరయోధుల వధియించి చూపఱకు విస్మయం బాపాదింప నిలింపపతిసుతుండు దఱిమికొని పోవు తఱి నయ్యిద్దఱ కొడుకులు నియుతాయువు దీర్ఘాయువును శోకవేగంబున నరవాయి గొనక పయింబడిన నుద్దవిడి గవ్వడి వారలం దండ్రులం గూడ ననిచి మహార్ణవంబు గలంచు మందరంబు చందంబున నీ బలంబులం దిరుగుడువడం జేయుచు నురవడించు సమయంబున.** **96**

ప్రతిపదార్థం: ఇట్లు కాంభోజపతి పడుటయున్= ఈ విధంగా కాంభోజరాజు చనిపోగా; శూరసేన; శిబి, వసాతి; ప్రముఖ= మొదలైన; అనేకదేశంబుల= నానాదేశాల; బలంబులు= సైన్యాలు; ఆ+బలమర్దన నందనున్+చుట్టుముట్టిన= ఆ అర్జునుడిని క్రమ్ముకొనగా; అతండు= ఆ అర్జునుడు; తఱచు= దట్టమైన; వాలు+అంపగములన్= వాడి అయిన బాణసమూహంతో; ఆఱువేల రథంబులన్; రూపుమాపినన్= నాశనంచేయగా; కనుకనిన్= సంభ్రమంతో (తొందరగా); తెరలినన్= తొలగిపోగా; కని= చూచి; శ్రుతాయువు, అయుతాయువును= ఈ పేర్లున్న వారిద్దరూ; సాయక సహస్రంబులు నిగుడించుచున్= వేల బాణాలను గుప్పిస్తూ; గాండీవి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అర్జునుడి; రెండు కెలంకులన్= రెండు ప్రక్కలనూ; కవిసిరి= కమ్ముకొన్నారు; అప్పుడు= ఆ సమయంలో; శ్రుతాయువు= శ్రుతాయువు; చేతి తోమరంబునన్= చేతిలో ఉన్న తోమరమనే ఆయుధంతో; నొచ్చిన= బాధితుడైన; విప్వచ్చున్= అర్జునుడిని; పిడుగు పడినవానిన్= పిడుగు నెత్తిన పడ్డవాడిని; కొఱవిన్+చూడిన తెఱంగునన్= కొరవితో కాల్చినట్లుగా; అయుతాయువు= అయుతాయువు; ఆలోనన= అంతలోనే; శూలంబు వైచి= శూలాన్ని వేసి; సోలన్+చేసిన= సొమ్మసిల్లచేయగా; విషాదంబునన్= దుఃఖంతో; గరుడధ్వజుండు= శ్రీకృష్ణుడు; సొగయన్= మూర్ఛిల్లగా; ఆ కపిధ్వజుండు= ఆ అర్జునుడు; నిజధ్వజదండంబు= తన జెండా కొయ్యను; ఒక్కింత ఊఁతగొనినన్= కొంత ఆధారంగా నిలువగా; ఆ+కురు సైన్యంబుల= ఆ కురుసేనలయొక్క; సింహనాదంబులు = సింహనాదాలు; తూర్యనినదంబులు చెలంగెన్= తూర్య శబ్దాలు ఒప్పాయి; అంతన్= అంతలో; శౌరి= కృష్ణుడు; ప్రబోధింపన్= మేల్కొలుపగా (అనగా ప్రేరేపించగా); తేఱి= తెప్పరిల్లి; ధనంజయుండు= అర్జునుడు; ఐంద్రాస్త్రంబు ప్రయోగించుటయున్= ఇంద్రదేవతాకమైన బాణాన్ని వేయగా; అది= ఆ అస్త్రం; వివిధ+ఆయుధ+ఆకారంబులన్+కవిసి= అనేకాయుధాల రూపాలలో(వచ్చి) క్రమ్ముకొని; ఆ+ఇరువురన్= ఆ శ్రుతాయువు, అయుతాయువులయొక్క; హస్త మస్తక శకలంబులు= చేతుల, శిరస్సుల, ముక్కలను; ధరన్+తొరంగించి= భూమిమీద దొర్లించి; తద్+అనుచరులన్= వారిని అనుసరించే వారిని; పంచశతరథిక వీరయోధులన్= అయిదు వందల రథవీరులను; వధియించి= చంపి; చూపఱకున్= చూచేవారికి; విస్మయంబు+ఆపాదింపన్= ఆశ్చర్యం కలిగించగా; నిలింపపతి సుతుండు= దేవరాజకుమారుడు (అర్జునుడు); తఱిమికొనిపోవుతఱిన్= తరిమికొనిపోయ్యేటప్పుడు; ఆ+ఇద్దఱుకొడుకులు= ఆ ఇద్దరి కుమారులు; నియుతాయువు దీర్ఘాయువు= అను పేర్లున్న వారు; శోకవేగంబునన్= దుఃఖంవలన కలిగిన తొందరలో; అరవాయిగొనక= సందేహించక; పయిబడినన్= తనమీద పడగా; ఉద్దవిడిన్= ఎక్కువగా; కవ్వడి= అర్జునుడు; వారలన్= ఆ ఇద్దరి నీ; తండ్రులన్+కూడన్= తండ్రులను చేరగా; అనిచి= పంపి (అనగా చంపి); మహార్ణవంబున్= పెనుసంద్రాన్ని; కలచు= కలియబెట్టే; మందరంబు చందంబునన్= మందరపర్వతం మాదిరి; నీ బలంబులన్= నీ సైన్యాన్ని (కురుసేనను); తిరుగుడువడన్= కలగునట్లు; చేయుచున్= చేస్తూ; ఉరవడించు సమయంబునన్= దూకే వేళలో.

తాత్పర్యం: కాంభోజరాజు పడిపోగా, శూరసేన, శిబి, వసాతి మొదలైనవారు అర్జునుడిని చుట్టుముట్టారు. ఆతడు తన అంపవానతో వారి ఆరువేల రథాలను హతమార్చాడు. దానిని చూచి శ్రుతాయువు, అయుతాయువు అర్జునుడికి రెండు ప్రక్కలా చేరి, వేల సంఖ్యలో బాణాలు వేసి అతడిని నొప్పించారు. శ్రుతాయువు ప్రయోగించిన తోమరంతో బాధితుడైన అర్జునుడిని, పిడుగునెత్తిన పడినవాడిని కొరివితో కాల్చినట్లు, అయుతాయువు శూలాన్ని విసిరి సొమ్మసిల్లచేశాడు. అది చూచి కృష్ణుడు కూడ సొమ్మసిల్లాడు. అర్జునుడు తన జెండా కొయ్యను ఊతగా గొనగా కురు సైన్యాల సింహనాదాలు, వాద్యధ్వనులు చెలరేగాయి, అప్పుడు శ్రీకృష్ణుడు ప్రబోధింపగా అర్జునుడు తెప్ప రిల్లుకొని ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు. అది వివిధాయుధ ఆకారాలతో విజృంభించి శ్రుతాయు అయుతాయువుల చేతులను తలలను ముక్కలు చేసి నేలమీద దొర్లించి, వారి అనుచరులను అయిదువందలమంది రథవీరులను వధించి, చూచేవారికి ఆశ్చర్యం కలిగిస్తూ ఉండగా, శ్రుతాయు అయుతాయువుల సుతులు నియతాయు దీర్ఘాయువులు శోకక్రోధాలతో అర్జునుడి మీదికి విజృంభించారు. అర్జునుడు వీరితండ్రుల దగ్గరికే వీళ్లను కూడ పంపాడు(చంపాడు). మహా సముద్రాన్ని కలచివేసే మందర పర్వతం వలె, నీ సైన్యాన్ని కలత నొందిస్తూ విజృంభించిన సమయంలో

విశేషం: అలం: ఉపమ.

ఆ. **కురునరేశ్వరుండు పురికొల్పఁ బ్రాచ్యక । ళింగ దాక్షిణాత్యు లంగబలము**
మ్లేచ్ఛతతియు బెరయ మెయికొని తాఁకిరి । గజఘటాసమృద్ధిఁ గారుకొనుచు. 97

ప్రతిపదార్థం: కురునర+ఈశ్వరుండు= దుర్యోధనుడు; పురికొల్పన్= ప్రేరేపించగా; ప్రాచ్య, కళింగ, దాక్షిణాత్యులు= తూర్పుదిక్కులోని కళింగులూ, దక్షిణ దిక్కులోని సైన్యాలూ; మ్లేచ్ఛతతియున్= ఆటవికుల సమూహమూ; బెరయన్= కూడగా; మెయికొని= విజృంభించి; గజఘటాసమృద్ధిన్= ఏనుగుల గుంపు ఎక్కువగా; కారుకొనుచున్= క్రమ్ముకొంటూ; తాఁకిరి=ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: దుర్యోధనుడు పురికొల్పగా తూర్పున ఉన్న కాళింగులూ, దక్షిణదిక్కులోని అంగబలాలూ, ఆటవికుల గుంపూ కలిసి విజృంభించి, ఏనుగుల సమూహంతో అర్జునుడిని కమ్ముకొన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్టియెడ గాండీవ ముక్త మార్గణవర్గంబు వేగంబున. 98

ప్రతిపదార్థం: అట్టి+ఎడ= ఆ సమయంలో; గాండీవ= గాండీవమునుండి; ముక్త=విడువబడిన;మార్గణ, వర్గంబు= బాణసమూహము యొక్క; వేగంబునన్= వేగము వలన

తాత్పర్యం: ఆ సమయంలో గాండీవం వదలిన బాణసమూహవేగముచేత. (తరువాతి పద్యంతో అన్వయం).

క. చేతులుఁ దొండములు శిరో। వ్రాతముఁ గుంభస్థలములు వడిఁ దొరఁగె ధరి
త్రీతలమున నంకుశ బహు। హేతి శకల సహితముగ మహీవరముఖ్యా! 99

ప్రతిపదార్థం: మహీవర ముఖ్యా!= ఓ రాజశ్రేష్ఠా!; చేతులున్= చేతులును; తొండములున్= తొండాలును; శిరోవ్రాతమున్= తలల మొత్తాలు; కుంభస్థలములున్= కుంభస్థలాలు; ధరిత్రీ తలమునన్= భూమి మీద; అంకుశ= అంకుశాలతో; బహుహేతి= అనేకములైన కత్తుల; శకల సహితముగన్= ముక్కలతో కూడా; వడిన్+తొరఁగెన్= శీఘ్రంగా దొర్లాయి.

తాత్పర్యం: ఓ రాజా! చేతులూ, తొండాలూ, తలల సమూహాలు, కుంభస్థలాలూ అంకుశాలతో, కత్తుల ముక్కలతో సహా భూమిమీద దొర్లాయి.

తే. ఇవ్విధంబున నుఱుమాడ నీడఁ బోక। యవనపారద శక బర్బరాదు లైన
మ్లేచ్ఛబలములు ధైర్యంబు మిక్కుటముగఁ। బొదివి పోరెను గ్రీడి యద్భుతము నొంద. 100

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; నుఱుమాడన్= చంపగా; ఈడఁబోక= వెనుకంజ వేయకుండా; యవనపారద శక బర్బర+ఆదులు+ఐన= ఈ మున్నగు జాతులవారు; మ్లేచ్ఛబలములు= ఆటవికుల సైన్యాలు; ధైర్యంబు మిక్కుటముగన్= ధైర్యం ఎక్కువ కాగా; క్రీడి= అర్జునుడు; అద్భుతమున్+ఒందన్= ఆశ్చర్యపడగా; పొదివి= క్రమ్ముకొని; పోరెను= యుద్ధం చేశాయి.

తాత్పర్యం: యవనులు, పారదులు, శకులు మొదలైన ఆటవికుల సేనలు ఒక్కటిగా చేరి, అర్జునుడు తమవారిని చంపుతున్నా వెనుకంజ వేయకుండా, అత డాశ్చర్యపడేటట్లు యుద్ధం చేశాయి.

క. తుంగమడువుఁ జొచ్చిన మా। తంగమునకు మిగిలి యడవి దరికొను కార్చి
చ్చుం గడచి యబ్బలంబుల। భంగించె నతండు ఘోర బహు విధ గతులన్. 101

ప్రతిపదార్థం: అతండు= అర్జునుడు; తుంగమడువున్+చొచ్చిన= తుంగతోనిండి ఉండే మడుగులో దూకిన; మాతంగమునకున్ మిగిలి= మదపుటేనుగును అతిశయించి; అడవిన్= అడవిని; దరికొను= కాల్చే; కార్చిచ్చున్= దావాగ్నిని; కడచి= మీరి; ఆ+బలంబులన్= ఆ సైన్యాలను; ఘోర బహువిధ గతులన్= భయంకరమైన అనేక విధాలుగా; భంగించెన్= భంగపరచాడు.

తాత్పర్యం: తుంగతో నిండిన మడుగులోకి దూకిన మదపుటేనుగు చేష్టను మించేటట్లుగా, అడవిని కాల్చే దావాగ్నిని అతిశయించేటట్లుగా అర్జునుడు ఆ సైన్యాన్ని భంగపరచాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు నారాయణ మారుత ప్రేరితంబగు నరజ్వలనంబు శరజ్వాలాజాలంబున భవత్సేనాకాననంబు రూపుమాపె; నప్పుడు. 102

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నారాయణ మారుత ప్రేరితంబు+అగు= నారాయణుడనే వాయువు చేత ప్రేరేపించబడిన; నరజ్వలనంబు= అర్జునుడనే అగ్ని; శరజ్వాలాజాలంబునన్= తన బాణా లనే అగ్నిజ్వాలా సమూహంతో; భవత్+సేనా కాననంబున్= నీ సేన అనే అడవిని; రూపుమాపెన్= హతమార్చింది; అప్పుడు= ఆ సమయంలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నారాయణుడనే గాలిచేత ప్రేరేపించబడిన అర్జును డనే అగ్ని తన బాణాలనే జ్వాలలతో నీ సైన్యమనే అడవిని కాల్చి రూపుమాపింది. ఆ సమయంలో.

విశేషం: అలం: రూపకం.

తే. **అర్జునుం డను పర్జన్యు నస్త్ర వృష్టిఁ । బల్లమును మిఱ్ఱునని యేఱుపఱుపరాక**
యుండ నెత్తురు వెల్లు లొండొండ పెరిఁగె । నుబ్బి భూతబేతాళంబు లోలలాడ. 103

ప్రతిపదార్థం: అర్జునుండు+అను వర్జన్యు= అర్జునుడనే మేఘంయొక్క; అస్త్రవృష్టిన్= బాణవర్షంతో; పల్లమును మిఱ్ఱును+అని= ఇది పల్లం, ఇది మిట్ట అని; ఏఱుపఱుప రాకన్= వేరుచేయలేక; ఉండన్= ఉండగా; నెత్తురు వెల్లులు= నెత్తురు వెల్లువలు; (వానిలో); భూతబేతాళంబులు= భూతప్రేతాలు; ఉబ్బి= చెలరేగి; ఓలలాడన్= ఈదులాడగా; ఒండొండ పెరిగెన్= క్రమంగా పెరిగింది.

తాత్పర్యం: అర్జునుడనే మేఘం కురిసిన బాణవర్షంచేత మిట్టపల్లాలను వేరుచేయలేని స్థితి ఏర్పడింది. (ఆ బాణాల తాకిడికి) నెత్తురు వెల్లువలై పారింది. లోతైన నెత్తురుటేరులలో భూతబేతాళాలు ఓలలాడాయి.

విశేషం: అలం: రూపకం.

వ. **ఇమ్మెయి నద్భుత విక్రమంబున నతిక్రమించి కడంగు కవ్వడి నంబష్ఠపతి యగు శ్రుతాయువు మార్కొని నొగ నొగం దాఁక నరదంబు వఱపుటయు.** 104

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ ప్రకారం; అద్భుత విక్రమంబునన్= ఆశ్చర్యాన్ని కలిగించే శౌర్యంతో; అతిక్రమించి= దాటి; కడంగు కవ్వడిన్= ఉద్యమించే అర్జునుడిని; అంబష్ఠపతి అగు శ్రుతాయువు= అంబష్ఠ దేశరాజయిన శ్రుతాయువు; మార్కొని= ఎదుర్కొని; నొగనొగన్ తాఁకన్= (తనతేరు) కాడి కాడిని (అర్జునుడి తేరుకాడిని) తాకేటట్లుగా; అరదంబు వఱపుటయున్= తేరును తోలటమూ.

తాత్పర్యం: ఆశ్చర్యాన్ని కలిగించే శౌర్యంతో అర్జునుడు ముందుకు పోగా అంబష్ఠదేశరాజు శ్రుతాయువు ఎదుర్కొని (తనతేరు) నొగ (క్రీడితేరు) నొగను తాకేటట్లు తన తేరును తోలగా.

చ. **అతని శరాసనంబును హయంబులుఁ ద్రుంచిన నాశ్రుతాయు వు**
ద్యతగద నొప్పఁ బట్టి దనుజాంతకు వ్రేసె నరుండు దద్గదా
హతి యొనరించె నొండుగద నాతఁడు వెండియు విక్రమించినన్
శతమఖసూతి యాతని భుజంబులుఁ గంఠముఁ ద్రుంచె వ్రేల్మిడిన్. 105

ప్రతిపదార్థం: అతని శరాసనంబును= ఆ శ్రుతాయువు విల్లును; హయంబులన్= గుర్రాలను; త్రుంచినన్= చంపగా; ఆ శ్రుతాయువు; ఉద్యతగదన్= పైకెత్తిన గదను; ఒప్పన్+పట్టి= బాగా పట్టుకొని; దనుజాంతకున్ వ్రేసెన్= శ్రీకృష్ణుడిని కొట్టాడు; నరుండు= అర్జునుడు; తద్+గదా హతి ఒనరించెన్= అతడి గదను త్రుంచాడు; ఆతఁడు= ఆ శ్రుతాయువు; వెండియున్= మరలా; విక్రమించినన్= విజృంభించగా; శతమఖసూతి= (నూరు యజ్ఞాలు చేసిన ఇంద్రుడి కుమారుడైన) అర్జునుడు; వ్రేల్మిడిన్= చిటికెవేసే కాలంలో; ఆతని= ఆ శ్రుతాయువుయొక్క; భుజంబులున్= చేతులు; కంఠమున్= గొంతును; త్రుంచెన్= త్రుంచివేశాడు.

తాత్పర్యం: ఆ శ్రుతాయువు వింటినీ గుర్రాలనూ అర్జునుడు చంపాడు. అంత శ్రుతాయువు గదతో శ్రీకృష్ణుడిని కొట్టాడు. ఆ గదను అర్జునుడు త్రుంచాడు. ఆ శ్రుతాయువు మళ్ళీ విజృంభించాడు. అర్జునుడు (చిటికె) వేసే లోపల అతడి చేతులనూ, గొంతునూ త్రుంచివేశాడు.

వ. ఇత్తెఱంగున ద్రోణాచార్యుం గడచి కృతవర్మని బెట్టుపఱిచి, శ్రుతాయుధునిం గూల్చి, కాంభోజపతిం బడవైచి శ్రుతాయుఃప్రభృతుల నులిపి తఱిమి భవదీయ సైన్యంబు సొచ్చి బహువిధ యోధ ప్రాణంబుల బాణనాళంబులం బీల్చి కొనుచుం బెలుచ నడరు ఫల్గునుం గనుంగొని నీ కొడుకు దేరు దోలుకొని యొంటిమై నక్కుంభసంభవు కడకుం జని కటకటంబడుచు నతని కిట్లనియె. 106

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ద్రోణాచార్యున్+కడచి= ద్రోణాచార్యుడిని దాటి; కృతవర్మని; బెట్టుపఱిచి= గట్టిగా పడవేసి; శ్రుతాయుధునిన్+కూల్చి= శ్రుతాయుధుడిని చంపి; కాంభోజపతిన్+పడవైచి= కాంభోజరాజును పడగొట్టి; శ్రుతాయుః ప్రభృతులను= శ్రుతాయువు మొదలైన వారిని; నులిపి తఱిమి= చెదరగొట్టి; భవదీయ సైన్యంబున్= నీ సేనలోకి; చొచ్చి= దూరి; బహువిధయోధ ప్రాణంబులన్= చాలామంది వీరుల ప్రాణాలను; బాణనాళంబునన్= బాణనాళాలతో; పీల్చికొనుచున్= పీల్చివేస్తూ; పెలుచన్+అడరు= దండిగా విజృంభించే; ఫల్గునున్+కనుంగొని= అర్జునుడిని చూచి; నీ కొడుకు= (దుర్యోధనుడు) నీ కుమారుడు; తేరుతోలుకొని= తన తేరును తోలుకొంటూ; ఒంటిమైన్= ఒకడే; ఆ+కుంభసంభవు కడకున్= ఆ ద్రోణాచార్యుడి దగ్గరకు; చని= వెళ్ళి; కటకటంబడుచున్= కష్టపడుతూ; అతనికిన్= ద్రోణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అర్జునుడు ద్రోణాచార్యుడిని దాటుకొని కృతవర్మను తీవ్రంగా బాధించాడు. శ్రుతాయువును చంపాడు. కాంభోజపతిని పడగొట్టాడు. శ్రుతాయువు మొదలైన వారిని నలియగొట్టాడు, తరిమాడు. నీ సేనలోకి దూరి తన బాణాలతో చాలా మంది ప్రాణాలను పీల్చివేసి విజృంభిస్తూ ఉంటే, అర్జునుడిని చూచిన నీ కొడుకు తన తేరును తోలుకొంటూ ద్రోణుడి దగ్గరకుపోయి మనస్సునొచ్చుకొని ఇట్లా అన్నాడు.

దుర్యోధనుఁడు ద్రోణుని దూఱనాడుట (సం. 7-69-1)

చ. 'నిను నవలీల దాఁటి ప్రజ నేలకుఁ గోలకుఁ దెచ్చుచున్న య
ర్జునుఁ దలయెత్తి యైన నటు సూడవు పాండవపక్షపాతి నీ
మన మటు గాన నెప్పుడును మాదెసఁ గప్ప యెలుంగుఁ బాము వై
యునికి యెఱుంగ వచ్చె; నటు లూఱట గా వర మిచ్చినాఁడవో? 107

ప్రతిపదార్థం: నినున్= నిన్ను; అవలీలన్= సులభంగా; దాఁటి= తప్పుకొని; ప్రజన్ నేలకున్ కోలకున్+తెచ్చుచున్న= సైనికులను కిందామీద చేస్తున్న; అర్జునున్= అర్జునుడిని; తలఎత్తి ఐనన్+అటుచూడవు= ఆ ప్రక్కకు తలయెత్తికూడా చూడకున్నావు; నీ మనము= నీ మనస్సు; పాండవ పక్షపాతి= పాండవులమీద పక్షపాతం కలిగింది; అటుగానన్= నీ మనస్సట్లా ఉన్నది కాబట్టి; ఎప్పుడును= అన్ని సమయాలలో; మాదెసన్= మా మీద; కప్పఎలుంగుపామవై= కప్పగొంతుతో అరిచే పాముగా; ఉనికి= ఉండటం; ఎఱుంగవచ్చెన్= తెలియవచ్చింది; అటులు= ఆ విధంగా; ఊఱటగాన్= సహాయంగా (అంటే పాండవులకు సాయంగా); వరము+ఇచ్చినాఁడవో?= వరమిచ్చావా?

తాత్పర్యం: నిన్ను సులభంగా దాటి సైన్యాన్ని తల్లక్రిందులు చేస్తూ ఉన్న అర్జునుడి దిక్కు నీవు తలఎత్తి అయినా చూడటంలేదు. నీ మనసెప్పుడూ పాండవ పక్షపాతియే. మా వైపు కప్పగొంతుతో అరిచే పాము వలె ఉండే నీ తత్త్వం తెలిసింది. ఆ దిక్కున ఉండేవారికి ఊరటగా నీవు వరమిచ్చినట్లుగా ఉన్నదే!

విశేషం: దుర్యోధనుడు - విజృంభించి తన సైన్యాన్ని నాశనంచేస్తూ ఉన్న అర్జునుడిని ఎదుర్కొనకుండా ద్రోణాచార్యుడుపాండవపక్ష పాతిగా ఉన్నాడని ఆయనను దెప్పుడు మాటలతో ఎత్తిపొడుస్తున్నాడు. కాబట్టే కప్పగొంతుతో ఉండే పామని ఆయనను అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. నిను నమ్మి యొండువలనికిఁ । జనక జయద్రథుఁడు నిలిచె సైన్యములో నా
తనిఁ జంపెడు తేనియపూ । సినకత్తివి గాక మానిసివె? యూహింపన్. 108

ప్రతిపదార్థం: నినున్ నమ్మి= నిన్ను నమ్ముకొని; జయద్రథుఁడు= సైంధవుడు; ఒండువలనికిన్= ఇంకొకచోటికి; చనక= వెళ్ళకుండా; నిలిచెన్= నిలిచాడు; సైన్యములోన్= మన సైన్యంలో; ఆతనిన్= ఆ సైంధవుడిని; చంపెడు= చంపునటువంటి; తేనియ పూసిన కత్తివి గాక= తేనెపూసిన కత్తి మాదిరి వాడవు కాకుండా; (నీవు) మానిసివె?= మనుష్యుడవా?

తాత్పర్యం: సైంధవుడు నిన్ను నమ్మాడు. ఇంకో చోటికి పోకుండా నిలిచాడు. నీవు తేనెపూసిన కత్తిలాగా అతడిని చంపే మనసుతో ఉన్నావు. ఊహిస్తే నీవు మనిషివేనా?' (అని తోస్తూ ఉన్నది)

విశేషం: తన పక్షంలో ఉంటూ ద్రోణుడు తేనెపూసిన కత్తి మాదిరి ఉన్నాడని తిరస్కరిస్తూ మాటాడినాడు దుర్యోధనుడు.

వ. అని పలికి కార్యదాహంబునం జేసి తన రాజసం బడంచుకొని యతండు. 109

ప్రతిపదార్థం: అని పలికి= అని అంటూ; కార్యదాహంబునన్+చేసి= పనియందలి ఆశతో; తన= తనయొక్క; రాజసంబు= రజోగుణం వలన ఏర్పడే అహంకారమును; అడంచుకొని= అణచుకొని; అతండు= ఆ దుర్యోధనుడు

తాత్పర్యం: అని మాట్లాడి, పనిమీద ఆశతో తన కుండే అహంకారాన్ని అణగించుకొన్నాడు దుర్యోధనుడు.

తే. సైంధవున కడ్డమున్న రాజవ్రజంబు । పార్థు రాకకు వెలువెలఁ బాఱఁ జొచ్చె!
నార్తిఁ బలుకు నా మాటల కలుగ కకట! । చావకుండంగ నాతనిఁ గావవయ్య! 110

ప్రతిప్రదార్థం: సైంధవునకున్= సైంధవుడికి; అడ్డము+ఉన్న= (కాపుగా) అడ్డముండే; రాజవ్రజంబు= రాజుల సమూహం; పార్థురాకకున్= అర్జునుడు వచ్చే విధానానికి; వెలువెలన్+పాఱజొచ్చెన్= తెల్లపోతున్నారు; ఆర్తిన్= బాధతో; పలుకు= చెప్పే; నా మాటలకున్= నా పలుకులకు; అలుఁగకు= కోపపడకు; అకట!= అయ్యో!; చావక+ఉండన్= చావకుండా ఉండేటట్లు; ఆతనిన్= సైంధవుని; కావవయ్య!= రక్షించుమయ్యా!

తాత్పర్యం: సైంధవుడికి రక్షగా ఉండే రాజులు, అర్జునుడు చొచ్చుకువచ్చే తీరుకు వెలవెలపోతున్నారు. బాధతో మాట్లాడే నా మాటలకు అలుగవద్దు. సైంధవుడు చావకుండా ఉండేటట్లు అతడిని కాపాడు.

వ. అనిన విని యాచార్యుం డతని కి ట్లనియె. 111

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; విని= విని; ఆచార్యుండు= ద్రోణుడు; అతనికిన్= ఆ దుర్యోధనుడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ మాటలకు ద్రోణాచార్యు డీ విధంగా అన్నాడు.

క. 'నీ మాటకు మా యశ్వ । త్థామ వచనములకు నేఁ బదరుదునె? విను మా
దామోదరు మతి ముంగలి । గా మారుతవేగ ఘోటకస్ఫురణ మెయిన్. 112

ప్రతిపదార్థం: నీ మాటకున్= నీ పలుకుకూ; మా అశ్వత్థామ వచనములకున్= మా అశ్వత్థామ మాటలకూ (దుర్యోధనుడినీ అశ్వత్థామనూ ద్రోణుడు పుత్రవాత్సల్యంతో చూచాడు); నేన్= నేను; పదరుదునె?= కోపిస్తానా?; వినుము; ఆ దామోదరుమతి= ఆ శ్రీకృష్ణుడి తలపుకంటె; ముంగలిగాన్= ముందుగా; మారుతవేగ= గాలియొక్క వేగంకల; ఘోటక= గుర్రాలయొక్క; స్ఫురణ మెయిన్= స్ఫూర్తితో.

తాత్పర్యం: (ఓ సుయోధనా!) నీ మాటకూ అశ్వత్థామ మాటకూ నేను కోపిస్తానా? నా మాటవినుము. ఆ కృష్ణుడి తలపు ముందుపోగా వాయువేగంకల గుర్రాల యొక్క స్ఫూర్తితో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. చనునప్పు డతని యమ్ములు । వెనుకఁ బ్రజం దాఁకుచుండు విఫ్వచ్చుని నేఁ
జననీక యాఁగువాఁడనె? । కనికని యిటు లేల పలుకఁ గౌరవనాథా! 113

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: చనునప్పుడు= పోయేటప్పుడు (వేగంతో); అతని అమ్ములు= ఆ అర్జునుడి బాణాలు; వెనుక ప్రజం= వెనుక ఉండే సైన్యాన్ని; తాకుచుండు= తాకుతూ ఉంటాయి (అటువంటప్పుడు); విప్వచ్చుని= బీభత్సుడిని (అర్జునుడిని); నే జననీక= నేను ముందుకు పోనియ్యకుండా; ఆగువాఁడనె?= ఆపేవాడినా? కనికని= చూస్తూ చూస్తూ; కౌరవనాథా!= కురురాజా!; ఇటులు+పలుకన్+ఏల?= ఈ విధంగా ఎందుకు మాట్లాడుతావు?

తాత్పర్యం: (అర్జునుడు ఆ విధంగా) పోయేటప్పుడు, ఆతడి బాణాలు వెనుక ఉండే సైన్యాన్ని తాకుతూ ఉంటాయి. అటువంటి సమయంలో బీభత్సుడిని ముందుకు పోనీకుండా నే నాపగలనా? దుర్యోధనా! చూస్తూ చూస్తూ నీవు ఈ విధంగా మాట్లాడటం ఎందుకు?

విశేషం: ఇందులో అర్జునుడి రథవేగంయొక్క అతిశయం వర్ణించబడింది. బాణాలకంటె ముందుగా రథం పోతున్నదని భావం.

వ. **అది యట్లుండె; నొకహితంబు సెప్పెద నాకర్ణింపుము; సేనాముఖంబు విడిచి యే నర్జును వెనుకం బోయినం బాండవ బలంబు లురులం దోఁ తెంచు మనయొడ్డు గలంగిన సైంధవుం గాచు టరిది; యట్లుంగాక రాజమధ్యంబున ధర్మరాజుం బట్టెద' నని యాడిన 'నాకు నప్పని యేమఱందగునే యతనిన వేచి నిలిచెద; విశేషించి వృద్ధ నగుటంజేసి శీఘ్రయానం బశక్యంబయి యుండు; గాండీవియు నీవును దుల్యవయో వర్తనులరు; శంక లేక వానితో విరోధంబు గొన్నవాఁడవు తగు సహాయులం గూర్చికొని యడ్డపడుము; చయ్యనం జను' మని పలికిన నతండు.** **114**

ప్రతిపదార్థం: అది అట్లుండెన్= అది అట్లుండనీ; ఒక్క హితంబు చెప్పెదన్= ఒక మంచి మాట చెప్పుతున్నాను; ఆకర్ణింపుము= వినుము; సేనాముఖంబు విడిచి= సేన మొదలు వదిలి; ఏన్= నేను; అర్జును వెనుకన్+పోయినన్= అర్జునుడి వెనుక పోతే; పాండవ బలంబులు= పాండవ సైన్యాలు; ఉరులన్+తోఁతెంచున్= ఉర్లపడుతూ వస్తాయి; మన ఒడ్డు కలంగినన్= మన వ్యూహం చెదరిపోతే; సైంధవున్+కాచుట+అరిది= సైంధవుడిని కాపాడటం సాధ్యం కాదు; అట్లున్+కాక= ఆ విధంగా కాకుండా; రాజమధ్యంబునన్= రాజుల మధ్యలో; ధర్మరాజున్+పట్టెదను+అని= ధర్మరాజును బందీ చేస్తానని; ఆడిన నాకున్= ప్రతిజ్ఞ చేసిన నాకు; ఆ+పని ఏమఱన్+తగునే?= ఆ పనిని మరిచిపోవచ్చునా?; అతనిన= అతడినే (ఆ ధర్మరాజునే); వేచి నిలిచెదన్= కాచుకొని ఉంటాను; విశేషించి= మీదు మిక్కిలి; వృద్ధను+అగుటన్+చేసి= ముసలివాడను కావటంవలన; శీఘ్రయానంబు= వేగంగా నడపటం; అశక్యంబు+అయి ఉండున్= అసాధ్యంగా ఉన్నది; గాండీవియున్= అర్జునుడూ; నీవును= నీవునూ (దుర్యోధనుడూ); తుల్యవయోవర్తునులరు= సమానమైన వయస్సు, నడవడీ కలవారు; శంక లేక= అనుమానించకుండా; వానితోన్= అర్జునుడితో; విరోధంబు కొన్నవాఁడవు= పగ తెచ్చుకొన్నవాడవు; తగు సహాయులన్ కూర్చికొని= తగిన సహాయకులను ఏర్పాటు చేసికొని, అడ్డుపడుము= (అర్జునుని) అడ్డుకొనుము; చయ్యనన్ చనుము= వెంటనే వెళ్ళుము; అని పలికినన్= అని మాట్లాడగా; అతండు= ఆ దుర్యోధనుడు.

తాత్పర్యం: 'దానిని అట్లా ఉండనీ. ఒక మేలి మాట చెప్పుతాను విను. సేన మొదట అర్జునుడి వెనుకపోతే పాండవ సైన్యం విజృంభించి వస్తుంది. మనసైన్యం కలకబారితే సైంధవుడిని కాపాడటం సాధ్యంకాదు. అంతేకాక రాజసభామధ్యంలో ధర్మరాజును బంధిస్తానని చెప్పాను. ఆ పని మరువ తగునా? పైగా, నేనా ముసలివాడిని; త్వరగా నడవలేనివాడిని. అర్జునుడూ నీవూ సమానమైన వయసులో ఉన్నవారు, సందేహించక అతడితో వైరం తెచ్చుకొన్నావు. తగినవారి సహాయంతో అతడి దారికి అడ్డుపడుము. త్వరగా పొమ్ము.' అని ద్రోణుడు చెప్పగా విని దుర్యోధనుడు.

చ. **'నినుఁ గృతవర్మ గెల్చి యవనీపవర ప్రకరంబు నోర్చి పే**
ర్చిన నరు నేన కాదు సురసేనయు నింద్రుఁడు నైనఁ దాఁక నే
ర్చునె? యది కార్యతంత్రముగఁ జూచిత యేని భవన్నియోగమున్
గొనకొని చేసెదన్ యశము గోల్పడకుండఁగఁ జూడు మెమ్మెయిన్'. **115**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నినున్= నిన్ను; కృతవర్మన్ గెల్చి= కృతవర్మనూ గెల్చి; అవనీప వర ప్రకరంబున్= రాజశ్రేష్ఠుల సమూహాన్ని; ఓర్చి= ఓడించి; పేర్చిన= విజృంభించిన; నరున్= అర్జునుడిని; నేను+అ కాదు= నేనే కాదు; సురసేనయున్= దేవసేనా; ఇంద్రుఁడునైనన్= ఇంద్రుడు అయినా; తాఁక నేర్చునే?= ఎదురుకొనగలరా?; అది= ఆ విధంగా ఎదుర్కొనటం; కార్యతంత్రముగన్= పనిగా; చూచిత ఏని= చూచినట్లైతే; భవత్+నియోగమున్= నీ ఉత్తర్వును; గొనగొని= ప్రయత్నంతో; చేసెదన్= చేస్తాను; ఏ+మెయిన్= ఎట్టయినా; యశము= కీర్తిని; కోల్పడకుండన్= పోగొట్టుకొనకుండా; చూడుము.

తాత్పర్యం: 'నిన్ను కృతవర్మనూ గెలిచి, ప్రముఖులైన రాజులనందరినీ ఓడించి విజృంభిస్తూ ఉండే అర్జునుడిని నేనే కాదు - దేవతా సైన్యంతో ఇంద్రుడు కూడా ఎదుర్కొనలేడు. అర్జునుడిని ఎదుర్కొనటమే కార్యోపాయంగా నీవు భావించినట్లయితే నీ ఆజ్ఞ ప్రకారం తప్పకుండా అట్లే చేస్తాను. కాని, ఏ విధంగానైన కీర్తి కోల్పోకుండా చూడు.

వ. **అనుటయు నగ్గురుం డక్కురుపతిఁ గనుంగొని 'నీవు నిక్కంబ పలికితి; కిరీటి యట్టివాఁడ; నేఁడొక్క యద్భుతంబు సూపెద; నిక్కవచధారణంబుచేత రక్షితుండవై యతనిం దలపడుము; కృష్ణుండును సమస్తజనంబులు వెఱఁగుపడం దదీయ శరంబులు నీ తనువుఁ దాఁకకుండ గల యవి' యని చెప్పి యొక్క పసిండికత్తళంబునం దా శక్తి యావహించి యిచ్చినం బుచ్చుకొని, ప్రీతుం డగుచు నియతాత్ముండై దానిం దొడుగునప్పు డాచార్యుం 'డిది దొల్లి దేవ సంరక్షణార్థంబుగా నజుండు దేవేంద్రున కిచ్చె; నది యతం డంగిరసునకు, నంగిరసుండు బృహస్పతికి, బృహస్పతి యగ్నివైశ్యునకు, నగ్నివైశ్యుండు నాకును దీని నొసంగి' రని యెఱింగించి, సమంత్రకంబుగాఁ దొడిగి నానావిధ వాక్యంబుల దీవన లిచ్చి పొమ్మని యనుజ్ఞ సేసిన నమ్మహీపతి యుబ్బి యరదంబు సత్వరంబు సేసి యనేక రథకరితురగ నరనికరంబులు దన్నుం బరివేష్టింప వివిధ తూర్యనాదంబులు నింగిముట్ట వివ్వచ్చు వెనుకొనియె; నట్టియెడ నిక్కడ.** **116**

ప్రతిపదార్థం: అనుటయున్= (దుర్యోధనుడు) అని అనగా (అనగా తమ పేరు పోకుండా చూడుమని ప్రార్థించగా); ఆ+గురుండు= గురువైన ద్రోణాచార్యుడు; ఆ+కురుపతిన్= ఆ దుర్యోధనుడిని; కనుంగొని= చూచి; నీవు నిక్కంబు+అ పలికితివి= నీవు నిజం చెప్పావు; కిరీటి అట్టివాఁడు+అ= అర్జునుడు అంతటివాడే; నేఁడు= ఈ రోజు; ఒక్క అద్భుతంబు చూపెదన్= ఒక వింత చూపిస్తాను; ఈ కవచ ధారణంబుచేతన్= ఈ కవచాన్ని వేసికొనటంచేత; రక్షితుండవు+ఐ= కాపాడబడినవాడవై; అతనిన్+తలపడుము= ఆ అర్జునుడిని ఎదుర్కొనుము; కృష్ణుండును సమస్తజనంబులున్= కృష్ణుడును తక్కిన జనులందరూ; వెఱఁగు పడన్= ఆశ్చర్యపడగా; తదీయ శరంబులు= ఆ అర్జునుడు వేసే బాణాలు; నీ తనువున్= నీ శరీరాన్ని; తాఁకకుండన్+కల అవి= తాకకుండా ఉంటాయి; అని చెప్పి= ఆ మాదిరి చెప్పి; ఒక్క పసిండి కత్తళంబునందున్= ఒక బంగారు కవచంలో; ఆ శక్తి= ఆ శక్తిని (అనగా అర్జునుడిని బాణాలు తగులని శక్తిని); ఆవహించి= నిలిపి; ఇచ్చినన్= ఇయ్యగా; పుచ్చుకొని= తీసికొని; ప్రీతుండు+అగుచు= సంతోషంతో; నియత+ఆత్ముండు+ఐ= నియమంతో; దానిన్+తొడుగుచున్నప్పుడు= దానిని తొడుగుకొనేటప్పుడు; ఆచార్యుండు= ద్రోణుడు; తొల్లి= వెనుక; దేవసంరక్షణార్థంబుగాన్= దేవతలను కాపాడేటందుకై; అజుండు= బ్రహ్మ; ఇది= ఈ కవచం; దేవ+ఇంద్రునకున్+ఇచ్చె= ఇంద్రుడికిచ్చాడు; అతండు+అంగిరసునకున్= ఆయన ఆంగిరసుడికి; అంగిరసుండు బృహస్పతికిన్= ఆంగిరసుడు దేవతల గురువైన బృహస్పతికి; బృహస్పతి యగ్నివైశ్యునకున్= దేవగురువు అగ్నివైశ్యునకు; అగ్నివైశ్యుండు నాకును= అగ్నివైశ్యుండు నాకు (ద్రోణునకు); ఒసంగిరి= ఇచ్చారు; అని= అని చెప్పి; ఎఱింగించి= తెలిపి; సమంత్రకంబుగాన్= మంత్ర సహితంగా; తొడిగి= కప్పి; నానావిధవాక్యంబులన్= అనేక రకాలైన మాటలతో; దీవనలు+ఇచ్చి= ఆశీర్వచనాలు చెప్పి; పొమ్మని= వెళ్ళమని; అనుజ్ఞ చేసినన్= ఉత్తర్వు ఈయగా; ఆ+మహీపతి= ఆ దుర్యోధనుడు; ఉబ్బి= సంతోషించి; అరదంబు సత్వరంబు చేసి= తేరును సిద్ధంచేసి; అనేక రథకరితురగ నరనికరంబులు= నానా చతురంగబలాలు; తన్నున్+పరివేష్టింపన్= తనను అనుసరించగా; వివిధ తూర్యనాదంబులు= అనేక రకాలయిన తూర్య శబ్దాలు; నింగి ముట్టన్= ఆకాశాన్ని అంటగా; వివ్వచ్చున్= అర్జునుడిని; వెనుకొనియెన్= వెన్నంటాడు; అట్టి ఎడన్= ఆ సమయంలో; ఇక్కడన్= ఈ ప్రక్క.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అనగా, ఆ గురుడైన ద్రోణుడు ఆ సుయోధనుడితో 'నీవు నిజమే చెప్పావు. అర్జును డటువంటివాడే ఈ రోజు ఒక ఆశ్చర్యం చూపిస్తాను. ఈ కవచాన్ని ధరించి దానిచేత కాపాడబడుతూ అతడిని ఎదుర్కొనవలసింది. శ్రీకృష్ణుడు, మిగిలిన జనులందరూ ఆశ్చర్యపడగా అతడి బాణాలు నీ శరీరానికి తగలవు' అని చెపుతూ ఒక బంగారు కవచాన్ని మంత్రశక్తితో నింపి ఇచ్చాడు. దానికి ఆతడు సంతోషించి దానిని తొడుగుకొనేటప్పుడు - 'దీనిని వెనుక దేవతలను కాపాడేందుకు బ్రహ్మ ఇంద్రుడికి ఇచ్చాడు. ఆతడు అంగిరసుడికి ఇచ్చాడు. అంగిరసుడు బృహస్పతికి, బృహస్పతి అగ్నివైశ్యుడికీ, అగ్నివైశ్యుడు నాకూ ఇచ్చాడు' అని తెలిపి, మంత్రపూర్వకంగా కవచాన్ని, అనేక వాక్యాలతో ఆశీర్వదించి పొమ్మని ఉత్తర్వు చేశాడు. దానికి ఆ రాజు (దుర్యోధనుడు) సంతోషించి, శీఘ్రంగా తేరును సిద్ధంచేసి నానావిధాలైన చతురంగ బలాలు త న్ననుసరింపగా అనేక తూర్యనాదాలతో ఆకాశాన్నంటే శబ్దంతో బీభత్సుడి వెనుకవైపునుండి దాడిచేసినపుడు; ఇక్కడ.

చ. **సరభసవృత్తిఁ బాండుసుతసైన్యము లొక్కట నేచినం గడుం**
దిర మయి నీ బలంబులు నుదీర్ణత సూపిన జాహ్నవీ సము
ద్ధుర యమునాభిఘట్టనముతో నెనవచ్చె నరేంద్ర! యప్డు సం
గర మతిఘోరమయ్యెఁ నొకకాలము నట్టివి సూడ మెయ్యెడన్. 117

ప్రతిపదార్థం: నరేంద్ర!= ఓ రాజా!; సరభసవృత్తిన్= త్వరత్వరగా; పాండుసుత సైన్యములు= పాండవుల సైన్యాలు; ఒక్కటన్= ఒక్కుమ్మడిగా; ఏచినన్= విజృంభించగా; కడున్+తిరమయి= మిక్కిలి స్థిరంగా; నీ బలంబులు= నీ సైన్యాలు; ఉదీర్ణత చూపినన్= తీవ్రపరాక్రమం చూపగా; జాహ్నవీ= గంగానదితో; సముద్ధుర= వేగవతి అయిన; యమునాభిఘట్టనముతోన్= యమునానది తాకిన విధంలో; ఎనవచ్చెన్= సరివచ్చింది; అప్డు= ఆ సమయంలో; సంగరము= యుద్ధం; అతి ఘోరము+అయ్యెన్= మిక్కిలి భయంకరంగా అయింది; ఒక కాలమున్= ఏ కాలంలోనూ; అట్టివి= అటువంటివి; ఏ+ఎడన్= ఎక్కడా; చూడము= చూడలేదు.

తాత్పర్యం: తొందరగా పాండవసైన్యాలు ఒక్కుమ్మడిగా విజృంభించాయి. అయితే నీ సైన్యాలు స్థిరంగా నిలిచాయి. ఆ గొప్పగా నిలవడం గంగా యమునా సంగమం మాదిరి తోచింది. ఓ రాజా! ఆ యుద్ధం వంటి యుద్ధాన్ని, ఏ కాలానా, ఎక్కడా చూడ లేదు.

వ. **అ య్యవసరంబున.** 118

తాత్పర్యం: ఆ సమయంలో.

ఆ. **నడుమ భానుఁ దాల్చు నభముఁ గనుంగొని । దాని మిగులు బుద్ధి ధరణి భాను**
యుగము దాల్చె ననఁగ నొప్పిరి తీవ్రతే । జమున గురుఁడు ద్రుపదసంభవుండు. 119

ప్రతిపదార్థం: నడుమన్= మధ్యలో; భానున్+తాల్చు= సూర్యుడిని ధరించే; నభమున్+కనుంగొని= ఆకాశాన్ని చూచి; దానిన్+మిగులు బుద్ధిన్= ఆ ఆకాశాన్ని అతిశయించే తలపుతో; ధరణి= భూదేవి; భాను యుగమున్= ఇద్దరు సూర్యులను; తాల్చెన్= మోస్తున్నదో; అనఁగన్= అని అన్నట్లు; తీవ్రతేజమునన్= తీక్ష్ణకాంతితో; గురుఁడు= ద్రోణుడు; ద్రుపద సంభవుండు= ద్రుపదుడి కొడుకు (ధృష్టద్యుమ్నుడు); ఒప్పిరి= ప్రకాశించారు.

తాత్పర్యం: నడిమిభాగాన ఆకాశం మోసే సూర్యుడిని చూచి, దానిని అతిశయించేటట్లు భూదేవి ఇద్దరు సూర్యులను మోస్తున్నదా అన్నట్లు ద్రోణ ధృష్టద్యుమ్నులు వెలిగారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉత్ర్పేక్ష. ఆకాశం ఒక సూర్యుడినే మోస్తుంది. భూదేవి ఇద్దరు సూర్య సమ తేజస్సు కలవారిని మోస్తూ ఉన్నట్లున్నది అని భావము.

వ. ఇట్లు ద్రోణ ధృష్టద్యుమ్నులు మెఱసి పోరి; రప్పు డప్పాంచాలవరుండు గురుని శరవర్షంబులు వారించుచు మిగిలి మన వాహినిపై నడరి నేల నెత్తుటం దోఁచిన, నతని కోల్తలకుం గాక యొదిఁగి యచ్చటి ప్రజ మూఁడు గుంపు లయ్యెఁ; నప్పుడు ద్రోణుండు గినిసినం బాంచాల కేకయ ప్రముఖ బలంబులు గలంగం బడిన మగుడనస్మత్సైన్యంబులు పురికొనుటయు ధర్మసూనుండు సోదరాదియోధ వీర సహితంబుగా నురవడించినం, గని, వికర్ణ వివింశతి చిత్రసేనులు భీమసేనుని, బాహ్లికుండు ద్రౌపదేయులను, దుశ్శాసనుండు సాత్యకిని, శకుని నకుల సహదేవులను, సోమదత్తుండు శిఖండిని, నలంబుసుండు ఘటోత్కచునిం, దలపడిరి; శల్యుండు సింధురాజుకడ నుండియు నగ్గలిక నమ్మొగ్గరంబు మొగంబునకుం జనుచు మరలుచునికింజేసి తత్కాల సన్నిహితుం డయిన యుధిష్ఠిరుం దాఁకె; నివ్విధంబునం దార్కొనిన యద్దొరలు నానా ప్రకార దారుణ విచిత్ర సంగరంబులు సేసి పల్లవితాశోకపుష్పిత కింశుక వనంబులం బోలి పొలిచి; రా సమయంబున దుస్ససేనుండు శైనేయుని మూర్ఛితుం జేసిన నాలోనన తెలిసి యతండు ప్రచండ భంగిం బెనంగెఁ; గవల యమ్ముల కోహటించి గాంధారరాజు ద్రోణు దెసకుం బాఱె; నట్టియెడ. 120

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ద్రోణ ధృష్టద్యుమ్నులు= ద్రోణుడు, ధృష్టద్యుమ్నుడును; మెఱసి పోరిరి= విజృంభించి యుద్ధం చేశారు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+పాంచాలవరుండు= ఆ పాంచాలశ్రేష్ఠుడు (ధృష్టద్యుమ్నుడు); గురుని= ద్రోణుడియొక్క; శరవర్షంబులు= అంప వానలు; వారించుచున్= అడ్డుకొంటూ; మిగిలి= అతిశయించి; మనవాహినిపైన్= మనసేన మీదకు; అడరి= విజృంభిస్తూ; నేల నెత్తుటన్+తోఁచినన్= భూమి నెత్తురులో కన్పించగా; అతని కోల్తలకున్+కాక= వానికి ఎదురు నిల్చి యుద్ధం చేయలేక; ఒదిఁగి= అణగి; అచ్చటి ప్రజ= అక్కడి సేన; మూఁడు గుంపులు+అయ్యెన్= మూడు భాగాలుగా అయింది; అప్పుడు, ద్రోణుండు కినిసినన్= ఆ సమయంలో ద్రోణుడు కోపించగా; పాంచాల కేకయ ప్రముఖ బలంబులు= పాంచాల దేశ, కేకయ దేశ ముఖ్యసేనలు; కలంగన్+పడిన= చీకాకు పడగా; మగుడన్= మరలా; అస్మద్+సైన్యంబులు= మన సైన్యాలు; పురికొనుటయున్= విజృంభించగా; ధర్మసూనుండు= ధర్మరాజు; సోదరాదియోధ వీర సహితంబుగాన్= సోదరులు మొదలైన యుద్ధవీరులతో; ఉరవడించినన్= వేగంగా రాగా; కని= చూచి; వికర్ణ వివింశతి చిత్రసేనులు= ఈ పేర్లు కలవారు; భీమసేనునిన్= భీముడిని; బాహ్లికుండు= బాహ్లికుడు; ద్రౌపదేయులను= ద్రౌపది కుమారులయిన ఉపపాండవులను; దుశ్శాసనుండు= దుశ్శాసనుడు; సాత్యకిని= సాత్యకినీ; శకుని నకుల సహదేవులను= శకుని నకులుడినీ, సహదేవుడినీ; సోమదత్తుండు శిఖండిని= సోమదత్తుడు శిఖండినీ; అలంబుసుండు ఘటోత్కచునిన్= అలంబుసుడనే రాక్షసుడు ఘటోత్కచుడినీ; తలపడిరి= ఎదుర్కొన్నారు; శల్యుండు సింధురాజు కడన్+ఉండియున్= శల్యుడు సైంధవుడి దగ్గర ఉన్నప్పటికినీ; అగ్గలికన్= శౌర్యంతో; ఆ+మొగ్గరంబు+ మొగంబునకున్= ఆ వ్యూహం మొదటికి; చనుచున్= పోతూ; మరలుచునికిన్+చేసి= తిరిగి వస్తూ ఉన్నందున; తత్కాల= ఆ సమయంలో; సన్నిహితుండు+అయిన= దగ్గరగా ఉన్న; యుధిష్ఠిరున్+తాఁకెన్= ధర్మరాజును ఎదుర్కొన్నాడు; ఈ+విధంబునన్= ఈ మాదిరిగా; తార్కొనిన= ఎదుర్కొన్న; ఆ+దొరలు= ఆ రాజులు; నానా ప్రకార= అనేక విధాలుగా; దారుణ= భయంకరమైన; విచిత్ర సంగరంబులు= చూచేవారికి ఆశ్చర్యకరమైన యుద్ధాలు; చేసి; పల్లవిత= చిగురించిన; అశోక= అశోకములు; పుష్పిత= పూచిన; కింశుక వనంబులన్+పోలి= మోదుగు తోటలవలె; పొలిచిరి= ఒప్పినారు; ఆ సమయంబునన్= ఆ సమయంలో; దుస్ససేనుండు= దుశ్శాసనుడు; శైనేయునిన్= సాత్యకిని; మూర్ఛితున్+చేసినన్= మూర్ఛిల్లచేయగా; ఆలోనన్= అంతలోనే; తెలిసి= ఒడలు తెలిసి; అతండు = సాత్యకి; ప్రచండ భంగిన్= భయంకరంగా; పెనంగెన్= పోరాడాడు; కవల అమ్ములకున్= నకుల సహదేవుల బాణాలకు; ఓహటించి= వెనుకంజవేసి; గాంధారరాజు= శల్యుడు; ద్రోణుదెసకున్= ద్రోణుడున్న దిక్కుకు; పాఱెన్= పరుగెత్తాడు; అట్టి ఎడన్=ఆ సమయంలో.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడూ ద్రోణుడూ విజృంభించి యుద్ధం చేస్తూ ఉండగా, ధృష్టద్యుమ్నుడి బాణవర్షానికి భూమి నెత్తురుమయం కాగా, అతడితో ఎదురు నిల్చి యుద్ధంచేయలేక ఒదిగిపోయిన మన సేన మూడు భాగాలయింది. అంత ద్రోణుడు కోపంతో విజృంభించగా పాంచాల కేకయ సైన్యాలు చీకాకు పడ్డాయి. మరలా మన సైన్యాలు పుంజుకున్నాయి. అంతలో సోదరులతో కూడి ఉండే ధర్మరాజు ఎదురెత్తి వచ్చాడు. వాళ్ళను చూచి వికర్ణ వివింశతి చిత్రసేనులు భీముడినీ, బాహ్లీకుడు ఉపపాండవులనూ, దుశ్శాసనుడు సాత్యకినీ, శకుని నకుల సహదేవులనూ, సోమదత్తుడు శిఖండినీ, అలంబుసుడు ఘటోత్కచుడినీ ఎదుర్కొన్నారు. శల్యుడు సైంధవుడి ప్రక్కనే ఉన్ననూ, ఆ సైన్యం ముందుకూ వెనుకకూ వస్తూ పోతూ, దగ్గరగా కనుపించిన ధర్మరాజును ఎదుర్కొన్నాడు. ఈ విధంగా ఆ దొరలు భయంకరంగా చిత్ర విచిత్రమయిన విధంగా యుద్ధం చేస్తూ, చూచేవారికి వింతగా చిగిర్చిన అశోకాలూ, పూచిన మోదుగులవలె కనపడ్డారు. అప్పుడు దుశ్శాసనుడు సాత్యకిని మూర్ఛిల్ల చేశాడు. అంతలోనే సాత్యకి లేచి భయంకరంగా యుద్ధం చేశాడు. నకుల సహదేవుల బాణాల దెబ్బకు శకుని భయపడి ద్రోణుడున్న దిక్కుకు పరుగెత్తాడు.

విశేషం: అలం: ఉపమ. ఆ యుద్ధ విశేషాన్ని కూడా తిక్కన కవి సాహిత్యస్ఫూర్తిని కలిగిస్తూ ఆలంకారికంగా వర్ణించాడు.

క. మనమూఁక యొదిఁగి గుంపులు । గొని యెప్పటి యట్ల యగుడు గురుఁ డతిరభసం
బున ధృష్టద్యుమ్నుని భీ । ముని ధర్మజుఁ బొదివి యుగ్రముగ నేసె నృపా! 121

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా! (ధృతరాష్ట్రా!); మన మూఁక= మన సైన్యం; ఒదిఁగి= అణగి; గుంపులుగొని= గుంపులుకట్టి; ఎప్పటి అట్ల అగుడున్= ఎప్పటి మాదిరి కాగా (అనగా వెనుకటి వచనంలో వర్ణించిన మాదిరి యుద్ధం కాగా); గురుఁడు= ద్రోణుడు; అతిరభసంబునన్= మిక్కిలి వేగంగా; ధృష్టద్యుమ్నుని, భీముని; ధర్మజున్= ధర్మరాజునూ; పొదివి= క్రమ్ముకొని; ఉగ్రముగన్= భయంకరంగా; ఏసెన్= కొట్టాడు (బాణవర్షమును కురిపించాడు).

తాత్పర్యం: ఓ రాజా! మన సైన్యం ఒదిగి గుంపులుగా అయింది. ద్రోణుడు చాల వేగంగా ధృష్టద్యుమ్న, భీమ, ధర్మరాజులను క్రమ్ముకొని భయంకరంగా బాణాలు వేశాడు.

వ. అయ్యవసరంబున. 122

తాత్పర్యం: ఆ సమయంలో.

క. ఉభయ బలంబులుఁ బురికొని । యిభ తురగ స్యందనంబు లిలఁ బ్రోవులుగా
సభయాశ్చర్యాత్మకులై । నభశ్చరులు వొగడ నీసునం బోరాడెన్. 123

ప్రతిపదార్థం: ఉభయ బలంబులున్= ఇరువాగు సేనలు; పురికొని= విజృంభించి; ఇభ= ఏనుగులు; తురఁగ= గుర్రాలు; స్యందనంబులు= తేరులు; ఇలన్= భూమిమీద; ప్రోవులుగాన్= కుప్పలుగా కాగా; నభశ్చరులు= ఆకాశంలో తిరిగే దేవతలు మొదలగువారు; సభయ+ఆశ్చర్య+ఆత్మకులు+ఐ= భయాశ్చార్యాలతో కూడినవారై; పొగడన్= కీర్తించగా; పోరాడెన్= యుద్ధంచేశాయి.

తాత్పర్యం: ఇరుపక్షాల సేనలూ కమ్ముకొని (చతురంగ బలాలైన) ఏనుగులూ, గుర్రాలూ, తేరులూ, భూమిమీద కుప్పలుగా కూలేటట్లు పోరాడారు. ఆకాశంలో తిరిగే దేవతలు మొదలైనవారు ఈ స్థితిని ఆశ్చర్యంతో, భయంతోనూ చూస్తూ పొగడారు.

ధృష్టద్యుమ్న ద్రోణాచార్యుల యుద్ధము (సం. 7-72-22)

వ. అట్టి సంకుల సమరంబున సుస్థిరోత్సాహుండై నిజవ్యూహం బభేద్యంబగునట్లుగా శుంభదవష్టంభంబునం బేర్చి కుంభసంభవుండు ధృష్టద్యుమ్ను మిగిలి పాండవసైన్యంబు దైన్యంబు నొందించుచున్న నప్పాంచాల కులప్రదీపకుండు కోపోద్దీపితుం డయి పారావతవర్ణంబులగు తన రథ్యంబుల నగ్గురు నరుణాశ్వంబులం బెరయ నరదంబు వఱపించి పలకయు వాలునుంగొని సాహసికత్వంబున నతని తేరికడ నొగఁద్రొక్కి యెక్కి కాఁడిపయిం జిత్రగతులు మెఱసి తఱచై తొరఁగు తదీయ శరంబులు నిజ శరీరంబుఁ జోఁకనీకుండెడు నాలోఁ జేయార్పు రాకుండియుఁ దమకంబునం గృపాణంబు విసరినం దద్రథ తురంగంబుల యంగంబులు వెడవెడ దాఁకు కొలఁది నయ్యాచార్యుండు రయంబున. 124

ప్రతిపదార్థం: అట్టి= ఆ విధమైన; సంకుల సమరంబునన్= దట్టమయిన యుద్ధంలో; సుస్థిర+ఉత్సాహుండు+ఐ= దృఢమయిన ఉత్సాహంకలవాడయి; నిజవ్యూహంబు= తన మొగ్గరం; అభేద్యంబుగాన్= చీల్చరానిదిగా; శుంభత్+అవష్టంభంబునన్+పేర్చి= ప్రకాశించే అహంకారంతో విజృంభించి; కుంభసంభవుండు= ద్రోణుడు; ధృష్టద్యుమ్నున్+మిగిలి= ధృష్టద్యుమ్నుడిని దాటి; పాండవసైన్యంబును= పాండవసేనను; దైన్యంబున్+ఒందించుచున్నన్= దురవస్థ పొందిస్తూ ఉంటే; ఆ+పాంచాల కుల ప్రదీపకుండు= ఆ పాంచాల రాజవంశాన్ని ప్రకాశింపచేసేవాడు(ధృష్టద్యుమ్నుడు); కోపోద్దీపితుండు+అయి= కోపంతో వెలుగుతూ; పారావత వర్ణంబులు+అగు= పావురాల రంగుగల; తన రథ్యంబులన్= తన గుర్రాలను; ఆ+గురు= ఆ గురుని (ద్రోణుని); అరుణాశ్వంబులన్= ఎర్రని గుర్రాలను; బెరయన్= చేరగా; అరదంబు= తేరును; వఱపించి= తోలి; పలకయు వాలునున్+కొని= డాలూ కత్తీ తీసికొని; సాహసికత్వంబునన్= తెంపరితనంతో; అతని తేరికడన్= ద్రోణుడి తేరువద్ద; నొగన్+త్రొక్కి ఎక్కి= నొగను తొక్కి పైకి ఎక్కి; కాఁడిపయిన్= నొగ కాడిమీద; చిత్రగతులు= చిత్రగతులతో; మెఱసి= రేగి; తఱచై= ఎక్కువగా; తొరఁగు= పడుతూ ఉండే; తదీయ= ఆ ద్రోణుడి; శరంబులు= బాణాలు; నిజశరీరంబున్= తన ఒంటిమీద; చోఁకనీకుండెడున్ ఆలోన్= తగులనీకుండునంతలో; చేయార్పు= చేయి తీయటానికి; రాకుండియున్= రాకుండినప్పటికి; తమకంబునన్= పట్టుదలతో; కృపాణంబు విసరినన్= కత్తి విసరగా; తద్రథ= ఆ ద్రోణుడి తేరి; తురంగంబుల= గుర్రాల యొక్క అంగంబులు= దేహాలను; వెడ వెడన్= కొంత కొంత; తాఁకు కొలఁది= తగులగా; ఆ+ఆచార్యుండు= ఆ ద్రోణాచార్యుడు; రయంబునన్= వేగంగా.

తాత్పర్యం: ఆ సంకుల యుద్ధంలో సుస్థిరంగా ఉన్న ఉత్సాహంతో, తన యుద్ధ వ్యూహం చీల్చరానిదన్న అహంకారంతో విజృంభించి ద్రోణుడు, ధృష్టద్యుమ్నుడిని దాటి, పాండవ సైన్యాన్ని దురవస్థపాలు చేస్తూ ఉండగా, పాంచాలకుల దీపకుడైన ధృష్టద్యుమ్నుడు కోపంతో మండిపోతూ, పావురాల రంగున్న తన తేరి గుర్రాలను ఆ గురుడి ఎర్రని గుర్రాలను, తాకేటట్లు తన తేరిని తోలి, డాలూ, కత్తీ తీసికొని సాహసంతో ఆయన తేరు దగ్గర నొగమీద కాలుపెట్టి యెక్కి కాడి మీద కాలు మోపుకొని అనేక విధాల విజృంభించి, విస్తారంగా పడే ద్రోణుడి బాణాలను తన ఒంటిని తాకనీయకుండా, అంతలోనే చేయితీయటానికి వీలుపడకున్నా పట్టుదలగా కత్తిని పట్టి విసరగా, అది ద్రోణుని తేరి గుర్రాల ఒడలిని తాకగా ఆ ఆచార్యుడు వేగంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అలుఁగు చెక్కలుగాఁ జేసి హరుల సూతుఁ। దునిమి సిడమును బలకయు ద్రుంచి వైచి
మేను లక్షించి కులిశంబుఁ బోని దొడ్డ। నారసం బేయ సాత్యకి నడుమ నఱికె. 125

ప్రతిపదార్థం: అలుఁగున్= కత్తిని; చెక్కలుగాన్+చేసి= ముక్కలుగా చేసి; హరులన్= గుర్రాలను; సూతున్= సారథిని; తునిమి= చంపి; సిడమును పలకయున్= ధ్వజాన్ని, డాలును; త్రుంచివైచి= ముక్కలు చేసి; మేనున్= శరీరాన్ని; లక్షించి= గురిచూచి;

కులిశంబుబోని= వజ్రాయుధంవంటి; దొడ్డ= పెద్ద; నారసంబు+ఏయన్= వాడి బాణాన్ని వేయగా; సాత్యకి నడుమ నఱకెన్= సాత్యకి (దానిని) మధ్యలోనే నరకివేశాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడి కత్తిని ముక్కలు చేసి, గుర్రాలను, సారథినీ చంపి, పతాకాన్నీ, డాలునూ ముక్కలు చేసి, వజ్రాయుధం వంటి వాడి నారసంతో వేయగా దానిని సాత్యకి మధ్యలోనే నరకివేశాడు.

వ. **ఇట్లు శినిపుంగవుండు సింగంబు వొదివిన కురంగంబుఁ గాచు చందంబున ధృష్టద్యుమ్ను రక్షించి తొలంగంగొనిపోయె' ననిన విని యాంబికేయుండు సంజయున కి ట్లనియె.** **126**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; శినిపుంగవుండు= సాత్యకి; సింగంబు పొదివిన= సింహం కమ్ముకున్న; కురంగంబున్= జింకను; కాచుచందంబునన్= కాపాడే విధంగా; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; రక్షించి= కాపాడి; తొలంగన్+కొనిపోయెన్= తప్పించి తీసికొనిపోయాడు; అనినన్= అని చెప్పగా; విని; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్+ఇట్లు+అనియెన్= సంజయునితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా సాత్యకి, సింహం కమ్ముకొనిన జింకను కాపాడే విధంగా ధృష్టద్యుమ్నుడిని రక్షించి, తప్పించి తీసికొనిపోయాడని సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **'పులివాతి కండ గొనుగతి - నలవున బాంచాల తనయు నయ్యెడరునకుం**
దొలఁగించిన సాత్యకిపై । నలుక వొడమకుండు నెట్టు లాచార్యునకున్?' **127**

ప్రతిపదార్థం: పులివాతి కండన్= పులినోటి దగ్గరి మాంసపు ముక్కను; కొనుగతిన్= తీసుకొనిపోయే విధంగా; అలవునన్= బలంతో; పాంచాలతనయున్= పాంచాలరాజు కొడుకైన ధృష్టద్యుమ్నుడిని; ఆ+ఎడరునకున్= ఆ ప్రమాదానికి; తొలగించిన= తప్పించిన; సాత్యకిపైన్= సాత్యకిమీద; ఆచార్యునకున్= ద్రోణాచార్యుడికి; ఎట్టులు= ఏ విధంగా; అలుక= కోపం; ఎట్టులు= ఏ విధంగా; పొడమక+ఉండున్= కలుగకుండా ఉంటుంది?

తాత్పర్యం: 'ద్రోణాచార్యుడు ధృష్టద్యుమ్నుడిని హతమార్చేటందుకు సిద్ధం కాగా సాత్యకి తప్పించాడు. అది పులి నోటి దగ్గరి కడి అయిన మాంసపు ముక్కను హరించినట్లయింది. ఆ సందర్భంలో పులికి ఎంత కోపం వస్తుందో ఆ విధంగానే ద్రోణుడికి సాత్యకిమీద కోపం రాకుండా ఉంటుందా?

విశేషం: అలం: ఉపమ.

వ. **అనుటయు నమ్మానవపతికి సూతసూనుం డిట్లను 'నట్లు సేసినం గినిసి గురుండు ఱెక్కలు గల పెనుబాము కైవడి సాత్యకిపైఁ గవియుటయు, నతండు నిజసారథి నాలోకించి 'యివ్విప్రుండు ధర్మతనయ భయంకరుం డితని మార్కొనవలయు'నని పలికి తేరు సమ్ముఖంబు సేయించె; నిత్తెఱంగున.** **128**

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+మానవపతికిన్= ఆ రాజుకు (ధృతరాష్ట్రునితో); సూతసూనుండు= సంజయుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; అట్లు చేసినన్= ఆ విధంగా చేయగా (సాత్యకి ధృష్టద్యుమ్నుడిని తప్పించగా); గురుండు= ద్రోణుడు; ఱెక్కలుకల= రెక్కలలో ఉన్న; పెనుబాము కైవడిన్= పెద్దపాము మాదిరిగా; సాత్యకిపైన్+కవియుటయున్= సాత్యకి మీదకు దూకుటయు; అతండు= ఆ సాత్యకి; నిజసారథిన్+ఆలోకించి= తన సారథిని చూచి; ఆ+విప్రుండు= ఆ బాపడు; ధర్మతనయ భయంకరుండు= ధర్మరాజుకు భయంకలిగించేవాడు; ఇతనిన్ మార్కొనవలయును= ఇతడిని ఎదుర్కొనవలెను; అని పలికి= అని చెప్పి; తేరు సమ్ముఖంబు చేయించెన్= తేరును ఎదురుగా పోనిచ్చాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా.

తాత్పర్యం: ఆ విధంగా అనిన ధృతరాష్ట్రుడితో సంజయుడు ఈ విధంగా అన్నాడు; 'ఆ విధంగా సాత్యకి చేయగా కోపగించుకొన్న గురుడు ద్రోణాచార్యుడు రెక్కలున్న పెద్దపాము మాదిరిగా సాత్యకిమీదకి దూకాడు. అందుకు ఆతడు తన సారథితో 'ఈ బ్రాహ్మణుడు ధర్మరాజునకు భయంకరుడు; ఇతడిని ఎదుర్కొనటానికి మన తేరును అతడి ఎదుటికి పోనిమ్మ'ని అన్నాడు. ఈ విధంగా - (తరువాతి పద్యంతో అన్వయం).

క. తలపడి చాపరుచులు మెఱుఁ। గుల గములుగ గుణనితాంత ఘోషంబులు గ
ర్జలుగా నారథికోత్తమ। జలదయుగము మెఱసి సాంద్ర శర వర్షములన్. 129

ప్రతిపదార్థం: తలపడి= ఎదుర్కొని; చాపరుచులు= విండ్ల కాంతులు; మెఱుఁగులగములుగన్= మెఱుపుల సమూహాలుగా; గుణ= అల్లెత్రాటి; నితాంత ఘోషంబులు= ఎడతెగని శబ్దాలు; గర్జలుగాన్= మేఘాల గర్జనలుగా; ఆ రథిక+ఉత్తమ జలదయుగము= సైనిక శ్రేష్ఠులనే ఆ మేఘాల జంట; మెఱసి= పెరిగి (విజృంభించి); సాంద్ర= దట్టమైన; శరవర్షములన్= బాణాల వానతో.

తాత్పర్యం: ద్రోణ సాత్యకులు ఎదుర్కొన్నారు. వారి ధనుస్సుల కాంతులు మెఱుపుల సమూహాలుగా, అల్లెత్రాటి టంకారధ్వనులు మేఘాల గర్జనలుగా ఆ రథికోత్తములు అనే మేఘాల జంటవిజృంభించి, దట్టమైన బాణవర్షాలతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: రూపకం.

వ. అంతకంతకుం గదిసి భల్లంబుల నేట్లాడం దొడంగిన. 130

ప్రతిపదార్థం: అంతకున్+అంతకున్ కదిసి= క్రమక్రమంగా సమీపించి; భల్లంబులన్= బల్లేలతో; ఏట్లాడన్+తొడంగినన్= పోట్లాట మొదలుపెట్టగా.

తాత్పర్యం: అంతకంతకు కమ్ముకొని బల్లేలతో పోట్లాడగా.

చ. గొడుగులు గేతనంబులును గూలెఁ దనూద్గత రక్తధార లొ
ల్కెడు గజదానతోయముల లీల వహించె బలద్వయంబు న
ప్పుడు వెఱఁగందె నచ్చెరువుఁ బొందె వియచ్చరకోటి యిట్లు పో
రెడు నెడ ద్రోణువిల్లు వెస రెండుగ సాత్యకి ద్రుంచెఁ ద్రుంచినన్. 131

ప్రతిపదార్థం: గొడుగులు= గొడుగులును; కేతనంబులును= జెండాలును; కూలెన్= కూలిపోయాయి; తను+ఉద్గత= శరీరం నుండి వెడలిన; రక్తధారలు= నెత్తుటి ధారలు; ఒల్కెడు= జారుతూ ఉన్న; గజదానతోయముల లీలన్= ఏనుగుల మదజలాల విధమును; వహించెన్= పొందాయి; బలద్వయంబు= రెండు ప్రక్కల సేనలు; అప్పుడు= ఆ సమయాన; వెఱఁగు+అందెన్= భయపడినవి; వియత్+చరకోటి= ఆకాశంలో తిరిగే దేవతలు మొదలైనవారు; అచ్చెరువున్+పొందెన్= ఆశ్చర్యపడ్డారు; ఇట్లు పోరెడు+ఎడన్= ఈ మాదిరి యుద్ధం చేసేటప్పుడు; సాత్యకి= సాత్యకి; ద్రోణువిల్లు= ద్రోణుడి వింటిని; వెసన్= శీఘ్రంగా; రెండుగన్= రెండుగా (అనగా రెండు ముక్కలుగా); త్రుంచెన్= త్రుంచాడు; త్రుంచినన్= త్రుంచగా.

తాత్పర్యం: (ఆ యుద్ధంలో) గొడుగులూ జెండాలూ కూలిపోయాయి. (సైనికుల) శరీరాల నుండి వెలువడే నెత్తురు ఏనుగుల మదజలం మాదిరి పడింది. ఇరుసైన్యాలూ అపుడు భయపడ్డాయి. దేవతలు ఆశ్చర్యపడ్డారు. ఆ సమయంలో సాత్యకి ద్రోణుడి విల్లు రెండుగా విరిచాడు. అట్లా విరువగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ. విలువిద్యలో సాత్యకికి గల మెలకువలు దేవతలను కూడా ఆశ్చర్యపరచాయి.

క. గురుఁ డొండొకవిల్లెత్తిన । సరభసముగ నదియుఁ దునిమె సాత్యకి; మఱియుం
త్వరితముగ నెక్కువెట్టఁగ । శరాసనము లెన్నియేనిఁ జక్కడిచె వడిన్. 132

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యుడు; ఒండు+ఒకవిల్లు= ఇంకొక విల్లును; ఎత్తినన్= ఎత్తుకోగా; సరభసముగన్= వేగంగా; అదియున్= దానిని కూడా; సాత్యకి= సాత్యకి; తునిమెన్= త్రుంచివేశాడు; మఱియున్= ఇంకా; త్వరితముగన్= తొందరగా; శర+అసనము= బాణములకు ఆసనమైన (పీఠమైన) విల్లు; ఎక్కుపెట్టఁగన్= ఎక్కుపెట్టగానే; ఎన్ని ఏనిన్= ఎన్నిటిని అయినా; వడిన్= వెంటనే; చక్కడిచెన్= నాశనం చేశాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు ఇంకో వింటిని ఎక్కుపెట్టేటప్పటికి సాత్యకి దానిని త్రుంచివేశాడు. ఆయన త్వరత్వరగా ఎత్తుకొని ఎక్కుపెట్టిన విండ్లనన్నింటిని త్వరత్వరగా విరిచివేశాడు.

వ. అట్టి యెడ నాచార్యుం డాత్మగతంబున. 133

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆచార్యుండు= ద్రోణుడు; ఆత్మగతంబునన్= మనస్సులో

తాత్పర్యం: ఆ సమయంలో ద్రోణుడు తన మనసులో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'రామునందును గార్తవీర్యక్షితీశు । నందు నరునందు భీష్మునియందుఁ దక్కఁ
గలుగునే యెందు నీ యస్త్రబలము? వీని । యాశు విక్రమ మద్భుతంబయ్యెఁ జూడ'. 134

ప్రతిపదార్థం: రామునందున్= పరశురాముడి లో; కార్తవీర్యక్షితి+ఈశునందున్= కార్తవీర్యార్జునుడనే రాజులోనూ; నరునందున్= అర్జునుడి లో; భీష్ముని అందును= (కౌరవులకూ పాండవులకూ తాతగారైన) భీష్ముని లో; తక్కన్= కాకుండా; ఎందున్= ఎక్కడైనా; ఈ+అస్త్రబలము= ఈ ధనుర్విద్యాశక్తి; కలుగునే?= ఉంటుందా?; వీని= ఈ సాత్యకి యొక్క; ఆశువిక్రమము= వేగమగు శౌర్యం; చూడన్= చూడగా; అద్భుతంబు+అయ్యెన్= ఆశ్చర్యంగా ఉన్నది.

తాత్పర్యం: 'పరశురాముడిలోనూ, (వేయి చేతులు గల) కార్తవీర్యుడిలోనూ, అర్జునుడిలోనూ, కురుపితామహుడైన భీష్ముడిలోనూ తప్ప ఇటువంటి ధనుర్విద్యాబలమూ, వేగంగా విజృంభించటమూ మరెక్కడా కానరాదు. చూస్తూ ఉంటే చాలా అద్భుతంగా ఉన్నది'.

వ. అని యగ్గించెఁ; జారణసిద్ధ సాధ్యులు సంకీర్తనంబులు సేసిరి; వెండియు నొండు కోదండంబు గొని యగ్గురుండు దొరంగించిన శరంబులు శైనేయుండు దుత్తుమురు సేసిన. 135

ప్రతిపదార్థం: అని అగ్గించెన్= అని పొగిడాడు; చారణ సిద్ధ సాధ్యులు= ఆకాశంలో తిరిగే చారణులు, సిద్ధులు, సాధ్యులు; సంకీర్తనంబులు; చేసిరి= పొగడారు; వెండియున్= మరల; ఒండుకోదండంబుకొని= ఇంకొక విల్లును తీసికొని; ఆ+గురుండు= ఆ ద్రోణుడు; తొరంగించిన శరంబులు= వేసిన బాణాలు; శైనేయుండు= సాత్యకి; తుత్తుమురు చేసినన్= పొడిగా చేయగా.

తాత్పర్యం: ఆ విధంగా సాత్యకిని పొగిడాడు. ఆకాశంలో తిరిగే సిద్ధచారణ సాధ్యులూ కీర్తించారు. ఆ సమయాన ద్రోణుడు ఇంకొక విల్లును తీసికొని బాణాలు వేయగా, వాటిని సాత్యకి పొడిపొడి చేయగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఏ వీరునకైనను నిది । భావారూఢంబు గానిపనియే?' యనుచున్
మీ వారెల్లను బెలుచం । గైవారము సేసి రతనిఁ గౌరవనాథా! 136

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ఓ ధృతరాష్ట్రా!; ఏ వీరునకున్+ఐననున్= ఎటువంటి వీరుడికైనా; ఇది= ఈ విక్రమం; భావారూఢంబు కాని= మనసుకు ఎక్కని; పనియే?= చేష్టయా?; అనుచున్= అంటూ; మీవారు+ఎల్లరును= మీ సైన్యమంతా; అతనిన్= సాత్యకిని; పెలుచన్= త్వరగా; కైవారము చేసిరి= పొగిడారు.

తాత్పర్యం: 'ఏ వీరుడికైనా ఈతడి శౌర్యం మనసుకెక్కదా?' అని మీవారంతా (సాత్యకిని) పొగిడారు. (అని సంజయుడు ధృతరాష్ట్రుడితో అన్నాడు.)

వ. **అప్పలుకులు సహింపక.** **137**

తాత్పర్యం: ఆ మాటలకు ఓర్వలేక.

శా. **ఆగ్నేయాస్త్రము ద్రోణుఁ డేసిన సముద్యజ్జ్వాలికామాలికో**
ద్విగ్నం బయ్యె నభంబు, వారుణ శరావిర్భావముం జేసెఁ గ్రో
ధాగ్ని స్ఫూర్తి వెలుంగ నాశినివరుం డబ్బాణముల్ ద్రాస ని
ర్మగ్నవ్యోమ చరంబు లై తొడరి పోరంజొచ్చె నొండొంటితోన్. **138**

ప్రతిపదార్థం: ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; ఆగ్నేయ+అస్త్రమున్= ఆగ్నేయాస్త్రాన్ని; ఏసినన్= వేయగానే; నభంబు= ఆకాశం; సముద్యత్= పైకెగసే; జ్వాలికామాలికా= అగ్నిజ్వాలల మాలలచేత; ఉద్విగ్నంబు= భయపడినది; అయ్యెన్= అయింది; ఆ శినివరుండు= ఆ శిని వంశంలో మొనగాడైన సాత్యకి; క్రోధ+అగ్ని స్ఫూర్తి= కోపమనే నిప్పు తోచేటట్లు; వెలుంగన్= ప్రకాశించగా; వారుణ శర+ఆవిర్భావమున్+చేసెన్= వారుణాస్త్రాన్ని పుట్టించాడు; ఆ+బాణముల్= ఆ బాణాలు; త్రాస= భయంలో; నిర్మగ్న= మునిగిన; వ్యోమచరంబులు+ఐ= ఆకాశంలో తిరిగేవారు కలవై; తొడరి= ఎదిరిస్తూ; ఒండు+ఒంటితోన్= ఒకదానితో మరొకటి (ఆగ్నేయ వారుణాస్త్రాలు); పోరన్+చొచ్చెన్= యుద్ధం చేస్తూ ఉన్నాయి.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు ఆగ్నేయాస్త్రాన్ని వేయగా ఆకాశం అగ్నిజ్వాలల మాలలతో మండుతూ భయపడింది. దానికి సాత్యకి కోపంతో రగులుతూ వారుణాస్త్రాన్ని సృష్టించి వేశాడు. ఆ రెండు అస్త్రాలు ఆకాశచారులకు భయాన్ని కలిగిస్తూ ఎదుర్కొని ఒకదానితో మరొకటి యుద్ధం చేయసాగాయి.

క. **ఘోరంబు గాఁగ హాహా । కారము లెసఁగంగ బలయుగంబును డయ్యం**
బోరి పెడఁబాసి శాంతము । లై రెండును నిలిచె నమ్మహాస్త్రము లధిపా! **139**

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా! (ధృతరాష్ట్ర మహారాజా!); ఘోరంబుగాఁగన్= భయంకరంగా; హాహాకారములు+ఎసఁగంగన్=హాహా అనే శబ్దాలు ఎక్కువ కాగా; బలయుగంబును= ఇరువాగుల సైన్యమూ; డయ్యన్= అలసిపోగా; ఆ+మహాస్త్రములు= ఆ దివ్యాస్త్రములు; పోరి= యుద్ధం చేసి; పెడన్+పాసి= ఎడమై; శాంతములు+ఐ= శాంతించినవై; రెండును= రెండూ; నిలిచెన్= ఆగాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఆ రెండు దివ్యాస్త్రాలూ భయంకరంగా తలపడటంచేత సేనలలో హాహాకారాలు పుట్టాయి. రెండువైపులా ఉన్న సేనలూ అలసిపోయేటట్లు అవి యుద్ధం చేసి, క్రమంగా విడివడి, శాంతించి నిలిచాయి (ఆగాయి).

వ. **ఆ సమయంబున ధర్మజ భీమ నకుల సహదేవులు శైనేయునకు బాసటయై తఱిమిన ధృష్టద్యుమ్న ప్రముఖ రథిక వరులుం దలకడచి భారద్వాజుం దాఁకుటయు, దుశ్శాసను మున్నిడికొని మన దిక్కు రాజకుమార వర్గంబు వారలతోఁ దలపడిన నుభయ బలంబులుం బురికొని యోహరిసాహరిం బెనఁగుచుండె; నప్పు డక్కడ.** **140**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ వేళలో; ధర్మజ భీమ నకుల సహదేవులు= ఈ నలుగురూ; శైనేయునకున్= సాత్యకికి; బాసట+ఐ= తోడుగా (సహాయంగా); తఱిమినన్= (శత్రువులను) తరుమగా; ధృష్టద్యుమ్న ప్రముఖ= ధృష్టద్యుమ్నుడూ మొదలైన; రథిక వరులు= సైన్యంలోని మొనగాళ్ళు; తల కడచి= అతిక్రమించి (ముందు మిగిలి); భారద్వాజున్+తాఁకుటయున్= ద్రోణుడిని ఎదుర్కొనగా; మనదిక్కు రాజకుమార వర్గంబు= మన ప్రక్కన ఉండే రాజకుమారులు; దుశ్శాసనున్+మున్నిడికొని= దుశ్శాసనుడిని ముందుంచుకొని; వారలతోన్= పాండవులతో; తలపడినన్= యుద్ధానికి దిగగా; ఉభయ బలంబులున్= రెండు ప్రక్కల సైనికులునూ; పురికొని= క్రమ్ముకొని; ఓహరి సాహరిన్= తండోపతండాలుగా (గుంపులు గుంపులుగా); పెనఁగుచుండెన్= యుద్ధం చేస్తూ ఉన్నారు; అప్పుడు+అక్కడన్= అప్పుడు ఆ యుద్ధరంగంలో.

తాత్పర్యం: ధర్మజ భీమ నకుల సహదేవులు సాత్యకికి సహాయంగా శత్రువులను తరిమారు. ధృష్టద్యుమ్నుడు మొదలైన సేనానులు ద్రోణాచార్యుడిని ఎదుర్కొన్నారు. దుశ్శాసనుడిని ముందుంచుకొని మన రాజకుమారులు పాండవులను ఎదుర్కొని గుంపులు గుంపులుగా యుద్ధం చేయసాగారు.

క. నరుఁడు దనతేరు వోయెడు । తెరువున కైనంతసేనఁ దీవ్రాస్త్రములన్
ధరఁగూల్పఁగ నయ్యెడ న । య్యరదముఁ గృష్ణుండు నడపు టద్భుత మయ్యెన్. 141

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; తన తేరు= తన రథం; పోయెడు= వెళ్ళుతున్న; తెరువునకున్= దారికి (బాటకు); ఐనంత సేనన్= సాధ్యమైనంత సేనను; తీవ్ర+అస్త్రములన్= భయంకరమయిన బాణాలతో; ధరన్+కూల్పఁగన్= చంపగా; ఆ+ఎడన్= ఆ సమయంలో; ఆ+అరదమున్= ఆ తేరును (అర్జునుడున్న తేరును); కృష్ణుండు= కృష్ణుడు; నడపుట= తోలుట; అద్భుతము+అయ్యెన్= ఆశ్చర్యమైంది.

తాత్పర్యం: అర్జునుడు వాడి బాణాలతో తన తేరు వెళ్ళేబాట వరకు కావలసిన సైన్యాన్ని చంపాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు ఆ తేరును తోలిన విధం ఆశ్చర్యంగా ఉన్నది.

వ. ఇ ట్విధంబున రౌద్రరసంబు దళుకొత్త దర్పంబున సైంధవుం డున్న దిక్కునకుం బోవం బోవ. 142

తాత్పర్యం: ఈ మాదిరిగా రౌద్రరసం మెరయగా గర్వంతో సైంధవుడుండే దిక్కునకు పోగా పోగా.

విందానువిందు లర్జునుచేత మృతిఁబొందుట (సం. 7-74-17)

క. విందానువిందు లేక । స్యందనగతు లై కడంగి సైన్యంబులు దా
రుం దెప్పదెరల నా సం । క్రందననందనుని మీఁదఁ గవిసిరి గడిమిన్. 143

ప్రతిపదార్థం: విందానువిందులు= విందుడు, అనువిందుడు అనే పేరు కలవారు; ఏకస్యందనగతులు+ఐ= ఒకే తేరులో పోతూ; కడంగి= ప్రయత్నించి; సైన్యంబులు= సేనలు; తారును= తాము; తెప్పదెరలన్= చాలా వేగంగా; ఆ సంక్రందననందనుమీఁదన్= ఆ అర్జునుడి మీద; కడిమిన్= పరాక్రమంతో; కవిసిరి= కమ్ముకొన్నారు.

తాత్పర్యం: విందానువిందులు ఒకే తేరులో పోతూ, సైన్యాలతో కూడి ఆ అర్జునుడి మీదకు సాహసంతో సాగి, ఆతడి చుట్టూ కమ్ముకొన్నారు.

వ. ఇ ట్లవంతీశ్వరు లురవడించి. 144

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా అవంతిరాజులు చాలా వేగంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. హరులపయిన్ మురారిపయి నాతని మేనను బాణ వర్షముల్
గురిసి; రతండు వారి నతిఘోరశరంబుల నొంప ధీరతం
దెరలక వారుఁ దద్రథముఁ దేల్చిరి తూపుల వెల్లి; నల్గి య
య్యిరువుర విండులుం దునిమి యేపున మూఁకల పె ల్లడంచుచున్. 145

ప్రతిపదార్థం: హరులపయిన్= గుర్రాలమీద; మురారి పయిన్= శ్రీకృష్ణుడిమీదను; ఆతని మేనను= అర్జునుడి ఒంటిమీదను; బాణవర్షముల్ కురిసిరి= అమ్ములవానను కురిపించారు; అతండు= ఆ అర్జునుడు; వారిన్= విందానువిందులను; అతిఘోర శరంబులన్= మిక్కిలి వాడి బాణాలతో; నొంపన్= బాధించగా; ధీరతన్= ధైర్యంతో; తెరలక= తొలగిపోకుండా; వారు = అవంతి రాజులు(విందుడు, అనువిందుడు) తద్+రథమున్= వాని తేరును; తూపుల వెల్లిన్= బాణాల వెల్లువలో; తేల్చిరి= తేలకొట్టారు; అల్గి= కోపించి; ఆ+ఇరువుర విండులున్= ఆ విందానువిందుల విండ్లను; తునిమి= విరిచి; ఏపునన్= విజృంభించి; మూఁకల= సైన్యాల; పెల్లు= అతిశయాన్ని; అడంచుచున్= అణస్తూ.

తాత్పర్యం: విందానువిందులు అర్జునుడి గుర్రాలమీదా, శ్రీకృష్ణుడిమీదా, ఆతడి శరీరం మీదా బాణాల వాన కురిపించారు. అర్జునుడు విందానువిందులను వాడిబాణాలతో చాలా బాధించాడు. వారునూ ధైర్యం సడల కుండా బాణప్రవాహంలో తేల్చారు. అర్జునుడు వారి విండ్లనూవిరిచాడు. విజృంభించి వారి సైన్యాల గర్వాన్ని అణగించాడు.

క. తోడన కడువేగంబునఁ । గ్రీడి తురంగముల సూతుఁ గేతనమును దు
న్మాడుచు విందుని దల యిల । పై డొల్లగ నేసెఁ దీవ్రభల్లప్రహతిన్. 146

ప్రతిపదార్థం: తోడన= వెంటనే; కడువేగంబునన్= చాలా తొందరగా; క్రీడి= అర్జునుడు; తురంగములన్= గుర్రాలను; సూతున్= సారథిని; కేతనమున్= పతాకాన్ని; తున్మాడుచున్= త్రుంచివేస్తూ; విందుని తల= విందుడనే వాడి తలను; ఇలపైన్ డొల్లగన్= భూమిమీద దొర్లగా; తీవ్ర= వాడి అయిన; భల్లప్రహతిన్= బల్లెపు పోటుతో; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: అర్జునుడు వెంటనే చాలా వేగంగా (విందుడి) తేరు గుర్రాలను, సూతుడిని, పతాకాన్నీ త్రుంచివేస్తూ, వాడి అయిన బల్లెపుపోటుతో విందుడి తల భూమిమీద దొర్లేటట్లు కొట్టాడు.

వ. ఇట్లు దలఁ దునుముటయు బలుగాలిం గూలు తరువు పోలికం బడిన యగ్రజు నాలోకించి యనువిందుం డలుకయు నుమ్మలికంబు నుల్లంబునం బెనంగొన గదఁ గొని సంరంభంబున. 147

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తలన్+తునుముటయున్= తలను త్రుంచగా; బలుగాలిన్= పెనుగాలికి; కూలు= పడిపోయే; తరువు పోలికన్= చెట్టుమాదిరిగా; పడిన= పడిపోయిన (అనగా చనిపోయిన); అగ్రజున్+ఆలోకించి= అన్నను చూచి; అనువిందుండు= అనువిందుడనే వాడు; అలుకయున్= కోపమును; ఉమ్మలికంబున్= దుఃఖమును; ఉల్లంబునన్= మనసులో; పెనంగొనన్= పెనగొనగా; గదన్+కొని= గదను తీసికొని; సరంభంబునన్= తొందరగా.

తాత్పర్యం: విందుడి తలను అర్జునుడు త్రుంచగా పెనుగాలికి పడిపోయే చెట్టు వలె ఆతడు పడిపోయాడు; అట్లా పడిన అన్నను చూచి అనువిందుడు కోపంతోనూ, దుఃఖంతోనూ గదను తీసికొని త్వరత్వరగా (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

చ. అరదము డిగ్గి తీవ్రగమనాతిశయంబునఁ గిట్టి బాహువి
స్ఫురణ దలిర్ప దానవనిషూదను ఫాలము వ్రేసి యార్వ ను
ద్ధుర రభసం బెలర్ప గదద్రుంచి పదంబులు బాహుశాఖలున్
శిరమును ద్రెంచి వాని బలిసేసె ధనంజయుఁ డాజిభూమికిన్. 148

ప్రతిపదార్థం: ; అరదము డిగ్గి= తేరు దిగి; తీవ్రగమన+అతిశయంబునన్= చాలా వేగంగా; కిట్టి= సమీపించి; బాహు విస్ఫురణ తలిర్పన్= భుజముల బలం వికసించగా; దానవనిషూదను= రాక్షస శత్రువైన శ్రీకృష్ణుడి; ఫాలము వ్రేసి= మొగము మీద కొట్టి; ఆర్వన్= అట్టహాసంచేయగా; ధనంజయుడు= అర్జునుడు; ఉద్ధుర రభసంబు ఎలర్పగన్= గొప్ప వేగం అతిశయించగా; గదద్రుంచి= (అనువిందుని) గదను ముక్కలుగా చేసి; పదంబులు= కాళ్ళు; బాహుశాఖలున్= కొమ్మలవంటి చేతులను; శిరమును= తలను; త్రెంచి= తుంచివేసి; ఆజిభూమికిన్= యుద్ధరంగానికి; వానిన్= అనువిందుని; బలి చేసెన్= బలి చేశాడు.

తాత్పర్యం: అనువిందుడు రథం దిగి అధికవేగంతో సమీపించి భుజబలం ప్రకాశించగా రాక్షస శత్రువైన శ్రీకృష్ణుడి నుదురుపై కొట్టి అర్వగా, అర్జునుడు వాడి గదవిరుగగొట్టి కాళ్ళూ, చేతులూ, శిరస్సూ ఖండించి యుద్ధభూమికి బలి యిచ్చాడు.

ఆ. దొరలు పడిన సేన దూలక యవ్వీరుఁ। జుట్టుముట్టుటయును బెట్టు గవియు
కాఱుచిచ్చు దఱచుఁ గానల నీఱుగఁ। జేయు పగిదిఁదోఁపఁ జేసె నతఁడు. 149

ప్రతిపదార్థం: దొరలు పడినన్= తమ రాజులు చనిపోగా; సేన తూలక= సైన్యం తూలిపోకుండా; ఆ వీరున్= ఆ వీరుడిని (అర్జునుడిని) చుట్టుముట్టుటయును= చుట్టుక్రమ్ముకోగా; బెట్టు= దట్టంగా; కవియు= కమ్ముకొనే; కాఱుచిచ్చు= దావాగ్ని; కానలన్= అడవులను; నీఱుగన్= బూడిదగా; చేయు పగిదిన్= చేసేటట్లుగా; అతఁడు= ఆ అర్జునుడు; తోఁపన్+చేసెన్= తోచునట్లుగా చేశాడు.

తాత్పర్యం: (విందానువిందులు) తమ దొరలు పడినా సేనలు తొలగిపోకుండా ఆ వీరుడిని చుట్టుముట్టాయి. అప్పుడు దట్టంగా చుట్టుముట్టిన కార్చిచ్చు అరణ్యాలను కాల్చి బూడిదచేసే విధం తోచేటట్లు ఆ సైన్యాలను అర్జునుడు హతమార్చాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇవ్విధంబున. 150

తాత్పర్యం: ఈ ప్రకారంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. అచ్చోటు గదలి వివ్వచ్చుండు సనఁజన। నతని మైవాడును హయ చయంబు
డప్పియు నతనికి నప్పుడు సైంధవుఁ। డున్నెడ దూరమై యుండుటయును
గని సంతసము నొంది కౌరవయోధులు। సింహనాదంబులు సేసి తఱుమ
నా రథికోత్తముం డచ్యుతుఁ జూచి ర। థ్యమ్ముల మేనుల నలుఁగు లుండ

తే. నురవడింపవు వీరల సరకు గొనక। వీని నిప్పుడ యల్లులు విడిచి తడవు
మనుడు నతఁ డిది పోలున యనుడుఁ దేరు। డిగ్గి సారించెఁ గ్రీడి గాండివ గుణంబు. 151

ప్రతిపదార్థం: వివ్వచ్చుండు= అర్జునుడు; ఆ+చోటుకదలి= ఆ చోటును విడచి; చనన్ చనన్= వెళ్ళగా; అతనిమైవాడును= ఆ అర్జునుడి శరీరం వాడిపోవుట (అలసిపోవుట); హయచయంబు= గుఱ్ఱాల సమూహానికి; డప్పియున్= దాహము; అతనికిన్=

అర్జునుడికి; అప్పుడు= ఆ సమయాన; సైంధవుఁడున్+ఎడన్+దూరమై ఉండుటయును= సైంధవుడు దూరంగా ఉండటమున్ను; కని= చూచి; కౌరవ యోధులు= కౌరవసేనానులు; సంతసమున్+ఒంది= సంతోషపడి; సింహనాదంబులు= సింహనాదాలు (గర్జనలు); చేసి; తఱుమన్= తరుమగా; ఆ రథిక+ఉత్తముఁడు= ఆ రథికులలో మొనగాడు (అర్జునుడు); అచ్యుతున్+చూచి= శ్రీకృష్ణుడిని చూచి; రథ్యమ్ముల= తేరు గుర్రాల; మేనులన్= ఒంటిమీద; అలుఁగులు= బాణాల మొనలు; ఉండన్= తగులుకొని ఉండగా; ఉరవడింపవు= వేగంగా పోవు; వీరలన్= ఈ కౌరవులను; సరకు గొనక= లెక్కచేయకుండా; వీనిని= ఈ గుర్రాలను; ఇప్పుడు= వెంటనే; అఱ్ఱులు= మెడలు; విడిచి= విడిపించి (తీసి); తడవుము= తాకుము (మెడమీది పట్టీలను తీసి పశువులను దువ్వటం వానిని ప్రోత్సాహకంగా తడవుట సంప్రదాయం); అనుడున్= అనగా; ఆతఁడు= శ్రీకృష్ణుడు; ఇది పోలున= ఇది తగినదే; అనుడున్= అనగా; తేరు డిగ్గి= తేరిమీదనుండి దిగి; గాండివగుణంబున్= గాండీవం యొక్క అల్లెత్రాటిని; క్రీడి= అర్జునుడు; సారించెన్= చక్కచేశాడు.

తాత్పర్యం: (అర్జునుడు అనువిందుని చంపిన తరువాత) ఆ చోటు దాటి వెళ్ళగా వెళ్ళగా శరీరం అలసిపోయింది. గుర్రాలు దప్పికతో అలసినవి. సైంధవుడూ దూరంగా ఉన్నాడు. కనుక కౌరవ సైన్యాలు సంతోషంతో సింహనాదం చేస్తూ ఆతడిని తరుమవచ్చాయి. శ్రీకృష్ణుడిని చూచి అర్జునుడు; గుర్రాల ఒంటిమీద బాణాలు గ్రుచ్చుకొని ఉన్నాయి. అందువల్ల అవి వేగంగా పోలేవు కాబట్టి 'వాళ్ళను లెక్కచేయకుండా గుర్రాలను తోలి మెడలు మీది పట్టీలను తీసి వాటి శరీరాలను తడవుము' అనుచుండగా కృష్ణుడు అట్లే చేశాడు. అర్జునుడు తేరు దిగి గాండీవాన్ని సారించాడు. (శత్రువుల గుండియలు గుభేలు మనేటట్లు).

చ. **ఎడఁగని యబ్బలంబు గడు నేడ్తెఱఁ గిట్టి మహాస్త్రశస్త్రము**
ల్గడువడిఁ గుప్పఁగూరఁగఁ జలంబున బైఁదొరఁగింప నేచి క
వ్వడి వివిధోజ్జ్వలాస్త్రముల వాని వెసన్ మగిడించి తాఁకు పె
ల్లడరఁగఁ జేసె మింటికల యంతయుఁ జిట్టలు గట్టుమంటలన్. **152**

ప్రతిపదార్థం: ఎడఁగని= తెరపిచూచి; ఆ+బలంబు= ఆ శత్రుసైన్యం; కడున్= మిక్కిలి; ఏడ్తెఱన్= పరాక్రమంతో; కిట్టి= సమీపించి; మహాస్త్రశస్త్రముల్= శక్తిగల గొప్ప బాణాలు; కడువడిన్= మిక్కిలి తొందరగా; కుప్పఁగూరఁగన్= కుప్పపడేటట్లు; చలంబునన్= పట్టుదలతో; పైఁదొరఁగింపన్= మీద పడేటట్లు వేయగా; కవ్వడి= అర్జునుడు; ఏచి= పెరిగి; వివిధ= నానా విధాలుగా; ఉజ్జ్వల= వెలిగే; అస్త్రములన్= బాణాలతో; వానిన్= ఆ బాణాలను; వెసన్= వెంటనే; మగిడించి= త్రిప్పి; మింటి కలయంతయున్= ఆకసం అంతా; చిట్టలు గట్టుమంటలన్= (చూచేవారికి) అబ్బురమయ్యే మంటలతో; తాకు= తాకిడిని(యుద్ధాన్ని); పెల్లు+అడర చేసెన్= మిక్కిలి ఎక్కువయ్యేటట్లు చేశాడు.

తాత్పర్యం: ఆ ఎడము చూచి శత్రుసైన్యం విజృంభించి పెనుబాణాలు కుప్పలు కుప్పలుగా పట్టుదలతో ప్రయోగించాయి. ఆ బాణాలను తీవ్రబాణాలతో మరలించి ఆకాశమంతా ఆశ్చర్యం గొలిపే మంటలు వ్యాపించే విధంగా అర్జునుడు యుద్ధాన్ని ముమ్మరం చేశాడు.

వ. **ఇ త్తెఱంగున.** **153**

తాత్పర్యం: ఈ విధంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **లావును వెరవును మెఱయఁగ । నీవీరులు పాండుపుత్రునిం బొదివినచో**
నావీరుని యక్కజ మగు । లావు వెరవుఁ గరతలామలకమై తోఁచెన్. **154**

ప్రతిపదార్థం: లావును= బలమున్ను; వెరవును= ఉపాయమున్ను; మెఱయఁగన్= ప్రకాశంకాగా; నీ వీరులు= నీ వైపు ఉన్న వీరులు (కౌరవుల పక్షాన ఉన్నవీరులు); పాండు పుత్రునిన్= అర్జునుడిని; పొదివినచోన్= క్రమ్ముకొన్నప్పుడు; ఆ వీరుని=ఆ వీరుడి

(అర్జునుడి); అక్కజము+అగు= ఆశ్చర్యం కలిగించేదైన; లావు= బలం; వెరవున్= ఉపాయమున్నూ; కరతల+ఆమలకము+ఐ= అరచేతిలో ఉసిరికపండై; తోఁచెన్= కనిపించింది.

తాత్పర్యం: బలమూ, ఉపాయమూ ప్రకాశించగా నీ వీరులు అర్జునుడిని చుట్టుముట్టగా, ఆశ్చర్యకరమైన అతడి బలము, ఉపాయమూ అరచేతిలో ఉసిరికపండువలె సులభంగా కనిపించింది.

వ. అట్టి యెడఁ జతురంగంబులు. 155

తాత్పర్యం: ఆ సమయంలో రథగజతురగ పదాతి బలాలు.

క. నొచ్చినఁ జచ్చినఁ దెరలిన । విచ్చిన నయ్యెడరు సూచి విసువక పైపైఁ
జొచ్చినఁ గడుఁ గ్రిక్కిఱిసిన । నచ్చట మన సేనలోన నార్పులు వెడలెన్. 156

ప్రతిపదార్థం: నొచ్చినన్= నొప్పి కలుగగా; చచ్చినన్= చనిపోగా; తెరలినన్= కలగిపోగా (చికాకు); విచ్చినన్= విడిపోగా; ఆ+ఎడరు= ఆ ఆపదను; చూచి; విసువక= విసిగిపోకుండా; పైపైన్+చొచ్చినన్= మీదమీదకు పోగా; కడున్+క్రిక్కిఱిసినన్= మిక్కిలి ఒత్తిడికాగా; అచ్చటన్= ఆ యుద్ధసమయంలో; మనసేనలోనన్= మన సైన్యంలో; ఆర్పులు= అరుపులు; వెడలెన్= బయలుదేరినవి.

తాత్పర్యం: చతురంగబలాలు బాధపడినా, చచ్చిపడినా, కలతచెందినా, విడిపోయినా ఆ ఆపదలను చూచి కూడా విసుగుచెందక మీదిమీదికి రాగా, మిక్కిలి ఒత్తిడికి గురికావటం చేత అక్కడ మనసేనలలో అరుపులు చెలరేగాయి.

వ. ఆ ఫల్గునుండు పాదచారియై యునికిం దేఁకువ సెడియును గెలుపున కాస పడియును నిట్లు గ్రమ్మిన కౌరవ సైన్యంబు పొంగిన సముద్రంబు పోలిక యగుటకుం దగిన తరంగంబుల చందంబున నిగుడు శర పరంపరల వలనను, ఘోషంబు చాడ్పునం జెలంగు తూర్య నాదంబుల వలనను వివిధ సత్త్వంబుల విధంబున నుల్లసిల్లు మాతంగ తురంగ సుభట స్యందన సందోహంబుల వలనను జలియింపక చెలియలికట్టయుం బోలె నవి నిలువరించి యవ్విక్రమ కుతూహలి విజృంభించిన. 157

ప్రతిపదార్థం: ఆ ఫల్గునుండు= ఆ అర్జునుడు; (ఉత్తరఫల్గునీ నక్షత్రంలో పుట్టినవాడు); పాదచారి ఐ= నడుస్తున్నవాడై; ఉనికిన్= ఉండటంతో; తేఁకువ+చెడియును= ధైర్యం లేకపోయినను; గెలుపునకున్= జయమునకు; ఆసపడియును= ఆసపడి; ఇట్లు క్రమ్మిన= ఈ విధంగా కమ్ముకున్న (ముందు చెప్పినట్లుగా); కౌరవసైన్యంబు= కౌరవసేన; పొంగిన సముద్రంబు పోలికన్= ఉప్పొంగిన సముద్రం వలె; అగుటకున్= అవుటకు; తగిన= సరిపోయిన; తరంగంబుల చందంబునన్= అలలమాదిరిగా; నిగుడు= పెరుగు; శర పరంపర వలనను= బాణాల వరుసలవలనను; ఘోషంబు చాడ్పునన్= సముద్ర ఘోషమువలె; చెలఁగు= ధ్వనించు; తూర్యనాదంబుల వలనను= వాద్యశబ్దాల వలనను; వివిధ సత్త్వంబుల వధంబునన్= వివిధ ప్రాణులను చంపుటచేత; ఉల్లసిల్లు= సంతోషించే; మాతంగ= ఏనుగుల; తురంగ= గుర్రాల; సుభట= మంచి సైనికుల; స్యందన= తేరుల; సందోహంబుల వలనను= గుంపులవలనను; చలియింపక= చీకాకు పడకుండా; చెలియలికట్టయున్+పోలెన్= చెలియలికట్ట మాదిరిగా; (దాటి సముద్ర ముప్పొంగదు); నిలువరించి= ఆపి; ఆ+విక్రమ కుతూహలి= శౌర్యమునం దాసక్తికలవాడైన ఆ అర్జునుడు; విజృంభించినన్= విజృంభించగా.

తాత్పర్యం: అర్జునుడు తేరు దిగి నడుస్తూ ఉండటంతో ధైర్యం లేకున్నా మనసైనికులు జయం మీది ఆశతో క్రమ్మికొన్నారు. అలలవలె వ్యాపించే బాణాలతో, సాగర ఘోషవలె చెలరేగే వాద్య ధ్వనులతో, వివిధ జలచరాలతో విలసిల్లే గజ తురగ భట రథ సమూహాలతో కూడి సముద్రంవలె ఉన్న ఆ కౌరవ సైన్యానికి జంకక చెలియలికట్టవలె దాని పొంగును ఆపి, అర్జునుడు విజృంభించాడు.

విశేషం: అలం: ఉపమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **పటుభల్ల నికరంబు పరఁగినఁ బఱియలై। యఱవఱ లయ్యెడు నరదములును**
నానార్ధచంద్ర బాణ వ్రాత మడరినఁ। దునియ లై మేదినిఁ దొరఁగు కరులు
శాతనారాచ పుంజంబులు నిగిడినఁ। గుదురులై కూలెడు ఘోటకములు
వివిధాస్త్ర తతులు పర్వినఁ గండలై వండఁ। దఱిగినట్లుండు పదాతి చయము

తే. **నగుచు బీభత్స రౌద్ర మహాద్భుతములు। మూర్తిమంతంబులుగ మన మొనలు రక్త**
మాంస మేదోస్థి మస్తిష్కమయతఁ జూడ। ఘోర రూపంబులై పరిక్షోభ మొందె. **158**

ప్రతిపదార్థం: పటు= తీవ్రమయిన; భల్ల నికరంబు= బల్లెముల సమూహము; పరఁగినన్= వ్యాపించగా; పఱియలు+ఐ= ముక్కలై; అఱవఱలు+అయ్యెడు= చిన్నచిన్న ముక్కలుగా అవుతూఉన్న; అరదములును= తేరులును; నానా= అనేకములైన; అర్ధచంద్రబాణవ్రాతము= అర్ధచంద్రాకారంలో ఉన్న అనేక బాణాల సమూహము; అడరినన్= విజృంభించగా; తునియలు+ఐ= ముక్కలై; మేదినిన్= భూమిమీద; తొరఁగు= పడిపోయే; కరులున్= ఏనుగులును; శాత= వాడి అయిన; నారాచ పుంజంబులు= ఇనుప బాణాల సమూహము; నిగిడినన్= వ్యాపించగా; కుదురులు+ఐ= చుట్టకుదురుల మాదిరి; కూలెడు= పడిపోయే; ఘోటకములున్= గుర్రాలును; వివిధ+అస్త్రతతులు= నానా విధాలైన బాణాల సమూహాలు; పర్విన‌న్= వ్యాపించగా; కండలు+ఐ= కండలుగా; వండన్= వంటకు తగినట్లు; తఱిగినట్లు ఉండు= తరిగిన విధంగా ఉండే; పదాతి చయమున్= కాల్బలాల సమూహమును; అగుచున్= ఔతూ; బీభత్స రౌద్రమహా+అద్భుతములు= బీభత్సం, రౌద్రం, అద్భుతరసాలు; మూర్తిమంతంబులుగన్= ఆకారాలు చెందినట్లుగా; మనమొనలు= మన సైన్యాలు; రక్త+మాంస+మేదః+అస్థి+మస్తిష్క+మయతన్= నెత్తురు, మాంసం, మెదడు, ఎముకలు, పుర్రెలు, నిండి ఉండటంచేత; చూడన్= చూడటానికి; ఘోర రూపంబులు+ఐ= భయంకరమయిన ఆకారాలు కలిగినవై; పరిక్షోభము+ఒందెన్= చీకాకు పడ్డాయి.

తాత్పర్యం: అర్జునుడు బల్లేలతో కొట్టగా తేరులు ముక్కలయ్యాయి. అర్ధచంద్రాకార బాణాల దెబ్బలకు ఏనుగులు ముక్కలుగా పడ్డాయి. ఇనుప బాణాల దెబ్బలకు గుర్రాలు చుట్టకుదురులుగా పడ్డాయి. వివిధ బాణాలతాకిడికి పదాతిసైన్యం వంటకు తరిగే కండలుగా అయ్యాయి. ఈ స్థితి చూచేవారికి బీభత్స రౌద్ర అద్భుత రసాలను మూర్తీభవించినట్లు; (మనసైన్యాలు) నెత్తురు, మాంసము, మెదడు, ఎముకలు, పుర్రెల గుంపుతో నిండి భయంకరాకారంతో మిక్కిలి కలత పొందాయి.

వ. **ఇవ్విధంబునఁ గురుసేనం గనుపుకొట్టి నవ్వుచున్న కవ్వడిం గనుంగొని కమలనాభుండు.** **159**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; కురుసేనన్= కౌరవసైన్యాన్ని; కనుపుకొట్టి= ముక్కలు చేసి; నవ్వుచు+ఉన్న; కవ్వడిన్= అర్జునుని; కనుంగొని= చూచి; కమలనాభుండు= పద్మమును నాభిగాగలవాడు-(విష్ణు స్వరూపుడైన కృష్ణుడు)

తాత్పర్యం: ఈ ప్రకారంగా కౌరవసైన్యాన్ని ముక్కలుగా చేసి నవ్వుతూన్న అర్జునుడిని చూచి శ్రీకృష్ణుడు (తరువాతి పద్యంతో అన్వయం).

క. **పెఱికితి నలుఁగులు మేనులు। నెఱిఁ బడ నెల్లెడలఁ గలయ నివిరితి హరు లి**
త్తఱి నీళులు ద్రావక తె। ప్పిఱ వెట్లొకొ? శత్రు సైన్య భీకర మూర్తీ! **160**

ప్రతిపదార్థం: శత్రు సైన్య భీకరమూర్తీ!= విరోధి సైన్యానికి భయం కలిగించేవాడా! (అని అర్జునుడిని సంబోధించాడు కృష్ణుడు); అలుఁగులు+పెఱికితిన్= బాణముల ముక్కలను పైకి తీశాను (గుర్రాలకు గ్రుచ్చుకొన్న బాణాల ముక్కలను); మేనులు= శరీరాలు; నెఱిఁబడన్= చక్కబడగా; ఎల్లెడలన్ కలయన్= అంతటా; నివిరితిన్= నిమిరాను; చక్కనొత్తినాను; హరులు= గుర్రాలు; ఈ+తఱిన్ = ఈ సమయంలో; నీళులు ద్రావక= నీళ్ళు తాగకుండా; తెప్పిఱవు= తెప్పిరిల్లవు; ఎట్లొకొ?= ఏమి చేయాలో?

తాత్పర్యం: శత్రుసైన్యానికి భయం కలిగించే అర్జునా! ఈ గుర్రాల ఒడళ్ళమీద గ్రుచ్చుకొన్న బాణాల ముక్కలను పెరికివేశాను. ఒడలంతా నిమిరాను. కాని, నీళ్ళు త్రాగితే కాని ఇవి తెప్పిరిల్లవు. ఏమి చేయాలో?

క. వెన్నుమునుఁగఁ దివియఁగలే । కున్నను ద్రావఁదగు నీళు లొదవిన హయముల్
నిన్ను గెలిపించు' ననవుడుఁ । గన్నుల నగి యర్జునుండు గల విదె యనుచున్. 161

ప్రతిపదార్థం: వెన్నుమునుఁగన్= వీపు తడిసేటట్లుగా మునిగి; తివియఁగన్= బయటికి రాగా; లేక+ఉన్నను= లేకపోయినా; త్రావన్+తగు నీళులు+ఒదవినన్= త్రాగటానికి తగినన్ని నీళ్ళు కలిగితే; హయముల్= (ఈ) గుర్రాలు; నిన్ను గెలిపించున్= నిన్ను గెలిపింపజేయగలవు; అనవుడున్= అనగా; అర్జునుండు= అర్జునుడు; కన్నులన్+నగి= నవ్వును కళ్ళలోనే చూపించి; ఇవె= ఇవిగో; కలవు= ఉన్నాయి (ఇవిగో నీళ్ళున్నాయి); అనుచున్= అని అంటూ.

తాత్పర్యం: ఈ గుర్రాలకు వెన్ను తడిసి వెలికి వచ్చేటంతమాత్రం లేకపోయినా, (దప్పిక తీరడానికి) త్రాగేటందుకు తగిన నీళ్ళుంటే చాలును, అవి నీకు జయాన్ని కలిగిస్తాయి' అని కృష్ణుడు అనగా, తాను కన్నులతోనే నవ్వుతూ 'ఇవిగో నీళ్ళు అని అర్జునుడు అంటూ. (తరువాతి పద్యంతో అన్వయం).

అర్జునుఁడు దివ్యాస్త్రముల ధరఁ బగిల్చి కొల నుత్పాదించుట (సం. 7-74-32)

మ. ధర దివ్యాస్త్ర హతిం బగిల్చి కొల నుత్పాదించి వే దానికి
న్శర జాలంబుల నిల్లుగట్ట మన సైన్యంబుల్ వెఱంబొందె, న
చ్చెరు వందెన్ సురసంఘముల్; హరి నుతించెం బొంగి యప్పార్థు; భూ
వర! మున్నిట్టివి సూడరున్ వినరు నెవ్వారుం ద్రిలోకంబులన్. 162

ప్రతిపదార్థం: భూవర!= ఓ రాజా! (ధృతరాష్ట్రా!); ధరన్= భూమిని; దివ్యాస్త్రహతిన్= దివ్యబాణాల దెబ్బతో; పగిల్చి= చీల్చి; కొలనున్= కోనేటిని; ఉత్పాదించి= పుట్టించి; వే= వెంటనే; దానికిన్= ఆ కొలనికి; శరజాలంబులన్= బాణాల సమూహాలతో; ఇల్లుకట్టన్= ఇంటిని కట్టగా; మన సైన్యంబుల్= మన సేనలు; వెఱన్+పొందెన్= భయపడ్డాయి; సురసంఘముల్= దేవసమూహాలు; అచ్చెరువు+అందెన్= ఆశ్చర్యపడ్డాయి; హరి= శ్రీకృష్ణుడు; పొంగి= సంతోషంతో; ఆ+పార్థున్= ఆ అర్జునుడిని; నుతించెన్= పొగడాడు; మున్ను= ఇదివరకు; ఇట్టివి= ఇటువంటివి; త్రిలోకంబులన్= ముల్లోకాలలో; ఏ+వారున్= ఎవరుకూడా; చూడరున్ వినరున్= చూడలేదు, వినలేదు.

తాత్పర్యం: అర్జునుడు దివ్యాస్త్రాలతో భూమిని చీల్చి, కోనేటిని ఏర్పరచి, వెంటనే బాణాలతో దానికి ఇంటినికూడ కట్టాడు. దానిని చూచి మన సైన్యాలు భయపడ్డాయి. దేవ సమూహాలు ఆశ్చర్యపడ్డాయి. సంతోషంతో శ్రీకృష్ణు డర్జునుడిని ప్రశంసించాడు. ఓ రాజా! ఇటువంటి వింతను ఇంతవరకు ముల్లోకాలలో ఎవరూ చూడలేదు, వినలేదు.

తే. హర్షమందస్మితము తోడ నమ్మురారి । యపుడ హయముల మెయివెట్టునట్లు సేసి
తఱిమి నీళులు ద్రావించి తడవి మగుడఁ । దెచ్చె మన యోధు లెల్లను బిచ్చలింప. 163

ప్రతిపదార్థం: ఆ+మురారి= ఆ శ్రీకృష్ణుడు; హర్ష మందస్మితముల తోడన్= సంతోషంతో కూడిన చిరునవ్వుతో; అపుడు+అ= ఆ సమయాన; హయములన్= గుర్రాలను; తఱిమి= తోలి; మెయి+పెట్టు+అట్లు,చేసి= కొలనిలో శరీరాలు పెట్టేటట్లు చేసి అనగా అవి కొలనిలోనికి దిగేటట్లు చేసి; నీళులు త్రావించి= నీళ్ళు త్రాగించి; తడవి= వాటి ఒడళ్ళను నిమిరి; మగుడన్= మళ్ళీ; మన యోధులు= మన సైనికులు; ఎల్లను= అందరూ; పిచ్చలింపన్= భయపడగా; తెచ్చెన్= తీసికొని వచ్చాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు సంతోషంతోనూ, చిరునవ్వుతోనూ ఆ గుర్రాలను కొలనిలోనికి తోలి నీళ్ళు త్రాగించి, వాటి శరీరాలను నిమిరి, మన సైనికులు అందరూ భయపడుతుండగా మళ్ళీ తోలుకొని వచ్చాడు.

వ. ఇట్లు సేదదీర్చి. 164

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సేద+తీర్చి= అలసటను పోగొట్టి

తాత్పర్యం: ఈ విధంగా గుర్రాల అలుపును పోగొట్టి.

క. మును దివ్యాస్త్ర బలంబున । జనియించిన నీరితోన సంభూతం బై
యొనరిన ఖాణము మేపెం । దనివు సనం దురగములకు దర్ప మెలర్పన్. 165

ప్రతిపదార్థం: మును= అదివరకే; దివ్య+అస్త్ర బలంబునన్= దివ్యాస్త్రాల శక్తితో; జనియించిన= పుట్టిన; నీరితోనన్= నీళ్ళతో; సంభూతంబు+ఐ= పుట్టి; ఒనరిన= కలిగిన; ఖాణము= గుర్రాల దాణాను; తనివు చనన్= తృప్తిగా; తురగములకున్= గుర్రాలకు; దర్పము+ఎలర్పన్= గర్వం ప్రకాశించగా; మేపెన్= మేపించాడు (అనగా మేతగా పెట్టాడు).

తాత్పర్యం: దివ్యమైన అస్త్రాల ప్రభావంతో పుట్టిన నీళ్ళతోపాటు అంతకుముందే కలిగిన గుర్రపు దాణాను గుర్రాలచేత సగర్వంగా తృప్తితీరా తినిపించాడు.

వ. మేపి కట్టాయితం బయి మనమూఁకల నడుమం బడంతుల పిండులోనం గ్రాలెడు విలాసియుం బోలె విల సిల్లుచు నమ్మహనీయ రథ్యంబులం బూన్చినఁ బాండవమధ్యముం డా రథం బల్లన యెక్కె; నా తడవున దుర్యో ధనుం డనతి దూర వర్తి యై వారలం గని వేగంబున వచ్చుచుండె; వార లక్కడ చూడ; రయ్యవసరంబుననచ్చటి భూవల్లభులెల్ల వెల్లనైన మొగంబులతోడ వెఱఁగంది డెందంబులు గుందుచుండం దమలో ని ట్లనిరి. 166

ప్రతిపదార్థం: మేపి= గుర్రాలకు దాణాలుమేపి; కట్టాయితంబు+అయి= బాగా సిద్ధమయి; మనమూఁకల నడుమన్= మన సేనల మధ్య; పడంతుల పిండులోనన్= స్త్రీల గుంపులో; క్రాలెడు= వెలిగేటటువంటి; విలాసియున్+పోలెన్= విలాసవంతుడివలె; విలసిల్లుచున్= వెలుగుతూ (ప్రకాశిస్తూ); ఆ+మహనీయ= ఆ గొప్పశక్తిగల; రథ్యంబులన్+పూన్చినన్= గుర్రాలను సన్నద్ధం చేయగా; పాండవ మధ్యముండు= అర్జునుడు; ఆ రథంబు= ఆ తేరును; అల్లనన్= మెల్లగా; ఎక్కెన్= ఎక్కినాడు; ఆ తడవునన్= ఆ సమయాన; దుర్యోధనుండు; అనతిదూరవర్తి ఐ= దగ్గరగా నడుస్తూ; వారలన్+కాంచి= ఆ సైన్యాన్ని చూచి; వేగంబునన్= వేగంగా వచ్చుచుండెన్= వస్తూ ఉన్నాడు; వారలు= ఆ కృష్ణార్జునులు; అక్కడ చూడరు= ఆ దిక్కు చూడలేదు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; అచ్చటి భూవల్లభులు+ఎల్లన్= అక్కడ ఉండే రాజులందరూ; వెల్లనైన మొగంబులతోడన్= వెలవెలబోయిన మొగాలతో (భయపడిన మొగాలతో); వెఱఁగు+అంది= భయపడి; డెందంబులు= మనస్సులు; కుందుచుండన్= కుములుతూ ఉండగా; తమలోన్+ఇట్లు+అనిరి= తమలో తాము (ఒకరితో ఒకరు) ఇట్లా అనుకొన్నారు.

తాత్పర్యం: ఆ విధంగా గుర్రాలను మేపి, శ్రీకృష్ణుడు మన సేనమధ్యలో ఆడువారి నడుమ ఉన్న రసికుడివలె ప్రకాశిస్తూ, మహనీయ శక్తి కలిగిన గుర్రాలను పూన్చిరథాన్ని సిద్ధం చేయగా, ఆ తేరు మీదికి అర్జునుడు మెల్లగా ఎక్కాడు. ఆ సమయంలో దుర్యోధనుడు దూరంనుండి వారిని చూచి వేగంగా వారిని సమీపించాడు. వారు ఆ దిక్కు చూడలేదు. అక్కడి రాజులు భయంతో పాలిపోయిన మొగాలతో కుములుతూ తమలో తాము ఈ విధంగా మాట్లాడుకొన్నారు.

చ. **చతురంగంబులు నొక్కపెట్ట వివిధాస్త్ర జ్వాలలం గప్పఁగా**
నతివేగంబున ਮ్రింగెఁ గ్రోలె ఘనమాయన్ రూ పడంగించె నా
నితఁ డన్నింటిని రిత్త పుచ్చుచు మదం బేపార నిమ్మై రణ
క్షితియుం బీనుఁగు పెంటఁ జేసెఁ జెనయం జిట్టాడఁగా శక్యమే! 167

ప్రతిపదార్థం: చతురంగంబులున్= రథ గజ తురగ పదాతులును; ఒక్కపెట్టన్= ఒకమారే; వివిధ+అస్త్రజ్వాలలన్= అనేక విధాలయిన బాణాల మంటలతో; కప్పఁగాన్= కప్పివేయగా; అతివేగంబునన్= మిక్కిలివేగంగా; మ్రింగెన్= మింగివేశాడు; క్రోలెన్= త్రాగాడు; ఘనమాయన్= పెద్దమాయతో; రూపు+అడంగించెన్= నాశనం చేశాయి; నాన్= అనగా; ఇతఁడు= ఈ అర్జునుడు; అన్నింటిని= పైన చెప్పినవానిని అంతనూ; రిత్తపుచ్చుచున్= అబద్ధం చేస్తూ; మదంబు+ఏపారన్= గర్వం ఎక్కువ కాగా; ఈ+మెయిన్= ఈ విధంగా; రణక్షితియున్= యుద్ధభూమిని కూడా; పీనుఁగుపెంటన్+చేసెన్= పీనుగుల కుప్పగా చేశాడు (ఇతడిని); చెనయన్= ఎదిరించగా; చిట్టాడఁగాన్= సంచరించగా; శక్యమే= సాధ్యమా!

తాత్పర్యం: 'చతురంగ బలాలు ఒక్కసారిగా అనేకమైన అస్త్రాలను అతివేగంగా ప్రయోగించగా, మాయాబలంతో శత్రుసైన్యాన్ని కప్పి, మ్రింగి, త్రాగి, రూపులేకుండా చేశాడా అన్నట్లు అర్జునుడు వాటన్నింటిని నిరుపయోగంగా చేస్తూ, గర్వాతిశయంతో వింతగా ఈ రణరంగాన్నంతా పీనుగుల కుప్పలుగా మార్చాడు. ఇటువంటి అర్జునుడిని సమీపించటం, ఎదురించటం సాధ్యమా?

సీ. **కురుసేన పైఁబడ్డ సరకు సేయక మంచు । విరియించు భానుని వెరవు మెఱసి,**
యిది నడుగల నని యించుక గొంకక । తన ఘోటకంబులఁ దడవఁ బనిచి
కొల నక్కజంబుగ నలుఁగుల మొన ఘటి । యించి యమ్ముల దానికిల్లు గట్టి
సారథి లీల నశ్వముల కార్యము దీర్చు । నంతకు నవ్వుచు నవుల నిలిచి,

ఆ. **గారవమునఁ దాను గానివాఁడును బోలె । నరద మెక్కె నింక నడ్డపడఁగ**
నలవియే పురారి కైనను? వీనిచేఁ । జచ్చువాఁడు గాక సైంధవుండు. 168

ప్రతిపదార్థం: కురుసేన= కౌరవసైన్యాలు; పైన్+పడ్డన్= మీదపడగా; సరకు చేయక= లెక్క పెట్టకుండా; మంచు= మంచును; విరియించు= విప్పజేయు; భానుని= సూర్యుడి; వెఱవు= పద్ధతిని (ఉపాయాన్ని); మెఱసి= ప్రకాశించి; ఇది= ఈ ఉండే చోటు; నడు కలను= యుద్ధరంగానికి నడుమ అని (యుద్ధ మధ్యంలో); ఇంచుక గొంకక= కొంచెమైనా జంకకుండా; తన ఘోటకంబులన్= తన గుర్రాలను; తడవన్+పనిచి= చేతులతో నిమురజేసి; అక్కజంబుగన్= ఆశ్చర్యంగా; అలుఁగుల మొనన్= బాణాల కొనలతో; కొలను= కోనేటిని; ఘటియించి= తయారుచేసి; అమ్ములన్= బాణాలతో; దానికిన్= ఆ కోనేటికి; ఇల్లుగట్టి= ఇంటినికట్టి; సారథి= బండి తోలువాడు (శ్రీకృష్ణుడు); లీలన్= ఆటగా; అశ్వములు= గుర్రాల; కార్యము తీర్చునంతకున్= పని పూర్తిచేసే దాకా; నవ్వుచున్= చిరునవ్వుతో; అవ్వల నిలిచి= దూరంగా నిలిచి; గారవమునన్= మర్యాదతో(దర్పంతో); తాను కాని వాఁడును పోలెన్= తాను సంబంధములేని వాడి మాదిరి; అరదము+ఎక్కెన్= తేరుమీదకు ఎక్కాడు; ఇంక అడ్డ పడఁగన్= అతడికి ఇంక అడ్డం పోవటానికి; పురారికైనను= ఈశ్వరుడికైనను; అలవియే?= సాధ్యమా?; సైంధవుండు= సైంధవుడు; వీనిచేన్= ఈ అర్జునుడిచేత; చచ్చువాఁడుగాక= చనిపోయేవాడు కాకుండా (తప్పుకోగలడా); (అని సైనికులు అనుకొన్నారు).

తాత్పర్యం: కౌరవసేనలు మీదపడినా లెక్కపెట్టకుండా మంచును విరియజేసే సూర్యుడివలె ప్రకాశించి, తా నుండేది యుద్ధరంగ మధ్యంలో అని సందేహించకుండా తన గుర్రాలను కృష్ణుడిచేత నిమిరించాడు. చూచేవారికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆశ్చర్యకరంగా బాణాలను వేసి కోనేరును పుట్టించి దానికి ఇల్లు కూడ కట్టాడు. తన రథసారథి విలాసంగా ఆ గుఱ్ఱాల పని పూర్తి చేసేటంతవరకూ చిరునవ్వుతో దూరంగా నిలిచి చూస్తూ ఉండి, ఆ మీద దర్పంతో అంతదాకా జరిగిన పనులకూ తనకూ సంబంధం లేనట్లుగా తేరెక్కాడు. ఇటువంటి అర్జునుడిని అడ్డుకొనటానికి ఈశ్వరుడికి కూడా సాధ్యంకాదు. అర్జునుడి చేతిలో చావకుండా సైంధవుడు తప్పించుకొనలేడు (అని సైనికులు అనుకొంటూ ఉన్నారు).

వ. **అనుచు నీ యోధ వీరులందఱును బెండు వడి యుండిరి గాని యందు నొకండేనియు మార్కొనువాఁడు లేఁడయ్యె నట్లు గోపాల దేవుండును గ్రీడియు బాల క్రీడ విధంబుగా విహరించి యనాయాస గమన విలాసంబు మెఱయం జని చని ప్రొద్దువాలుట గనుంగొని పాంచజన్య దేవదత్తంబు లొత్తి, రయంబు గైకొని యరిగి; రా చక్కటిం గొందఱు నరపతు లొండొరులం బురికొల్పికొని యడ్డపడి తవులు వెట్టి బెట్టు పెనంగి సముద్రంబు సొచ్చిన యేఱులుం బోలె నడంగి; రట్లు సైన్యంబు గడచి బలితంపు వల వ్రచ్చికొని వెలువడిన మహా మత్స్యంబులును రాహు ముఖంబు వెడలిన చంద్రార్కులుం బోలెఁ బొలిచి యట వోవుచుండ నయ్యెడ సైనికులు సింధురాజు పని సాలించి తొలఁగి; రిత్తెఱంగున దుస్తరంబు లగు బహుళ బలంబుల నిస్తరించి యయ్యిరువురుం దలలెత్తి చూచి తమలో నిట్లనిరి.** **169**

ప్రతిపదార్థం: అనుచున్= అనుకొంటూ (సైంధవుడి చావు తప్పదంటూ); నీ యోధ వీరులు+అందఱును= నీ సైన్యంలోని మొనగాండ్లందరూ; బెండుపడి ఉండిరి కాని= బలహీనపడి ఉన్నారు కాని; అందున్= వారిలో; ఒకండేనియున్= ఒకడైనా; మార్కొను వాఁడు= ఎదిరించేవాడు; లేఁడు+అయ్యెన్= లేకున్నాడు; అట్లు= ఆ విధంగా; (వెనుకటి పద్యంలో వివరించిన విధంగా); గోపాలదేవుండును క్రీడియున్= శ్రీకృష్ణార్జునులు; బాలక్రీడ విధంబుగా= పసి పిల్లల ఆటమాదిరిగా; విహరించి= తిరిగి; అనాయాసగమన విలాసంబు= సుఖంగా నడిచే చేష్ట; మెఱయన్= ప్రకాశించగా; చని చని= పోయి పోయి; ప్రొద్దువాలుట= సూర్యుడస్తమించే సమయాన్ని; కనుంగొని= గుర్తించి; పాంచజన్య దేవదత్తములు= పాంచజన్యము, దేవదత్తమూ అనే పేరుగల తమ శంఖాలను; ఒత్తి= ఊది; రయంబుగైకొని= వేగంగా; అరిగిరి= వెళ్ళారు; ఆ చక్కటిన్= ఆ ప్రక్క; కొందఱు నరపతులు= కొంతమంది రాజులు; ఒండొరులన్= ఒకరినొకరు; పురికొల్పుకొని= హెచ్చరించుకొని; అడ్డపడి= ఆ ఇద్దరికీ అడ్డంగా వచ్చి; తవులు పెట్టి= వెంటపడి; బెట్టుపెనంగి= గట్టిగా పెనగులాడి (యుద్ధంచేసి); సముద్రంబు చొచ్చిన ఏఱులన్ పోలెన్= సముద్రంలో కలిసిన నదుల మాదిరిగా; అడంగిరి= అణగిపోయినారు (తమ ఆకారాలు లేకుండా పోయారు); అట్లు= ఆ విధంగా; సైన్యంబు గడచి= సైన్యాన్ని దాటి; బలితంపు వలన్= పెద్ద వలను; వ్రచ్చికొని= చీల్చుకొని; వెలువడిన= బయటపడిన; మత్స్యంబులును= చేపలును; రాహుముఖంబు వెడలిన= రాహుగ్రహము నోటినుండి బయటపడిన; చంద్ర+అర్కులున్ పోలెన్= చంద్ర సూర్యుల మాదిరిగా; పొలిచి= ఒప్పి ఉండి; అట పోవుచుండన్= ఆ దిక్కులో వెళ్ళుతూ ఉండగా; అయ్యెడన్= అక్కడ(యుద్ధరంగంలో); సింధురాజు పనిచాలించి= సైంధవుడి సేవ చాలించి; సైనికులు; తొలఁగిరి= దూరంగా పోయారు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; దుస్తరంబు+అగు=దాటడానికి వీలులేని; బహుళ బలంబులు= ఎక్కువ అయిన సైన్యాలను; నిస్తరించి= దాటిపోయి; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరూ; తలలు+ఎత్తి= తలలు మీదికి ఎత్తి; చూచి; తమలోన్= తమలో తాము (కృష్ణార్జునులు); ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: ఆ విధంగా నీ సైనికులంతా బలహీనులయి ఉండిపోయారు. ఒక్కడు కూడా ధైర్యంతో ఎదుర్కొనేవాడు లేకుండాపోయాడు. (వెనుక వర్ణించినట్లు) కృష్ణార్జునులు పిల్లల ఆటగా తిరిగి అనాయాసంగా సాగే నడకల హొయలు మెరయగా ప్రొద్దువాలుట గమనించి, తమ శంఖాలు పాంచజన్య దేవదత్తాలను ఒత్తి, వేగంగా వెళ్ళారు. ఆ ప్రక్కలోని రాజులు ఒకళ్ళొకళ్ళు హెచ్చరికలతో అడ్డుపడి పెనగులాడి సముద్రంలో కలిసిపోయే ఏరుల వలె అణగిపోయారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ విధంగా సైన్యాన్ని దాటుకొని పెను వలను త్రెంచుకొని వచ్చే పెద్ద చేపల మాదిరిగాను, రాహువు నోటినుండి వెలువడిన చంద్రసూర్యుల మాదిరిగాను ఆ దిక్కులో వారు పోతూ ఉండగా, సైనికులంతా సింధురాజు సేవ మానుకొని తొలగి పోయారు. ఈదటానికి అనువుగాని సముద్రం వంటి ఆ సైన్యాన్ని దాటి, తల లెత్తి వారిద్దరు (కృష్ణార్జునులు) తమలో తాము ఇట్లా మాట్లాడుకొన్నారు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. వీఁడె సైంధవుండు! వీని చుట్లను గృప । శల్య గురుతనూజ సౌమదత్తి
కర్ణ కర్ణ సుతులు గావలి యున్నారు; । పోటు మగలు గాన పూఁచి పట్టి. 170

ప్రతిపదార్థం: వీఁడె సైంధవుండు= ఇతడే సైంధవుడు; వీని చుట్లను= వీడికి అన్నివైపుల; కృప శల్య గురుతనూజ సౌమదత్తి శల్య కర్ణ కర్ణ సుతులు= కృపుడు, శల్యుడు, అశ్వత్థామ, బాహ్లికుడు, కర్ణుడు, వృషసేనుడు (మొదలైనవారు); పోటు మగలు= పేరు మోసిన వీరులు; కానన్= అయినందుచేత; పూఁచిపట్టి= ప్రయత్నంతో; కావలి ఉన్నారు= కాపుదలగా ఉన్నారు.

తాత్పర్యం: (కృష్ణార్జునులు తమలో తాము) ఈ ఎదురుగా ఉన్నవాడే సైంధవుడు. పేరుకెక్కిన పెద్ద యోధులు కనుక కృపుడు, శల్యుడు, అశ్వత్థామ, బాహ్లికుడు, కర్ణుడు, వృషసేనుడు, సైంధవుడికి అన్నివైపుల గట్టి కాపలా ఉన్నారు.'

వ. అని పలికి వారలలో నా జయద్రథుం దప్పక చూచి వెండియు. 171

తాత్పర్యం: అని చెప్పి వాళ్ళలో సైంధవుడిని బాగా చూచి మరల ఇట్లా అన్నారు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'వీ రేమి గాచెదరు? తా । నే రూపున బ్రదుకు? వీర లేల? సురలు జం
భారియుఁ గాచినఁ దన్నును । బారిసమరి కాక నింగిఁ బడనిచ్చెదమే?' 172

ప్రతిపదార్థం: వీరు+ఏమి కాచెదరు?= ఈ సైనికులు ఏ విధంగా సైంధవుడిని కాపాడగలరు?; తాను+ఏరూపున బ్రదుకున్?= వీ డేవిధంగా బ్రతుకుతాడు?; వీరలు+ఏల?= వీరే కాదు; సురలు= దేవతలు; జంభారియున్= ఇంద్రుడును; కాచినన్= కాపాడినా; బారి సమరి= చంపి; కాక= కాకుండా; నింగిన్= ఆకాశాన్ని; పడనిచ్చెదమే?= పడనిస్తామా?

తాత్పర్యం: 'ఈ వీరులు సైంధవుడిని ఏమి కాపాడగలరు? ఇక అతడు ఎట్లా బతుకుతాడు? ఈ వీరులే కాదు - దేవతలూ దేవేంద్రుడూ కూడా కలిసి కాపాడటానికి ప్రయత్నం చేసినా అతడిని చంపికాని పొద్దుక్రుంక నీయం.

క. అను పలుకులు నీ యోధులుఁ । దనయులు వినుచుండ ఘోరతరదుర్గము లె
ల్లను గడచి లాభదేశము । సనఁ జొచ్చిన వణిజులట్ల సమ్మదలీలన్. 173

ప్రతిపదార్థం: అను పలుకులు= అని (కృష్ణార్జునులు) మాటాడే మాటలు; నీ యోధులున్, తనయులున్= నీ సైనికులూ, కుమారులూ; వినుచుండన్= వింటూ ఉండగా; ఘోరతర= భయంకరమైన; దుర్గములు+ఎల్లను= కోటలన్నింటినీ; కడచి= దాటి; లాభదేశమున్= అదృష్టమును కలిగించే దేశంలోకి; చనన్+చొచ్చిన= ప్రవేశించిన; వణిజులు+అట్లు+అ= వ్యాపారుల మాదిరి; సమ్మదలీలన్= సంతోషంతో.

తాత్పర్యం: ఆ మాటలు నీ కుమారులు, సైనికులూ వింటూ ఉండగా భయంకరమైన కోటలను దాటి లాభసాటి అయిన దేశంలో అడుగుపెట్టిన వ్యాపారుల వలె (కృష్ణార్జునులు) సంతోషంతో.

వ. ఒప్పిన యప్పురుష సత్తములం గనుంగొని యారథిక జనంబులు విస్మయంబునం దమలో ని ట్లనిరి. 174

ప్రతిపదార్థం: ఒప్పిన= ప్రకాశించిన; ఆ+పురుష సత్తములన్= ఆ పురుషశ్రేష్ఠులను; కనుంగొని=చూచి; ఆ,రథికజనంబులు=రథంమీది నుండి యుద్ధంచేసే ఆ వీరులు; విస్మయంబునన్= ఆశ్చర్యముతో; తమలోన్= తమలో తాము; ఇట్లు+అనిరి= ఈ విధంగా అనుకొన్నారు.

తాత్పర్యం: ఆ విధంగా ప్రకాశించే ఆ పురుషశ్రేష్ఠులను చూచి, ఆ రథికులు ఆశ్చర్యపడి తమలో తాము ఈ విధంగా అనుకొన్నారు.

తే. పెక్కు నదు లీఁది వెడలుట, పేర్చు దావ । శిఖలు గడచుట, దారుణాశీవిషముల
బారి దప్పుట గాదె! కుంభజముఖోగ్ర శూరయోధుల మిగిలి వచ్చుటఁ దలంప. 175

ప్రతిపదార్థం: కుంభజముఖ= ద్రోణుడు మొదలయిన; ఉగ్ర= తీవ్రమయిన; శూరయోధులన్= శూరులయిన వీరులను; మిగిలి వచ్చుట= దాటుకొని రావటం; తలంపన్= భావించగా; పెక్కునదులు= అనేకములయిన నదులను; ఈఁది వెడలుట= ఈది గట్టెక్కటమును; పేర్చు= ఎక్కువైన; దావశిఖలు= దావాగ్ని మంటలను; కడచుట= దాటటం; దారుణ= భయంకరమయిన; ఆశీవిషముల= పాముల; బారి తప్పుట= దెబ్బ తప్పించుకొనటం; కాదె!= కాదా!.

తాత్పర్యం: ద్రోణుడు మొదలైన క్రూరవీరశూరులను దాటి యుద్ధంలో ముందుకు రావటం - ఆలోచించి చూస్తే, అనేక నదులను ఈది ఒడ్డుకెక్కటం, కమ్ముకొని విజృంభించిన దావాగ్నిజ్వాలలను దాటటం, భయంకర సర్పాల బారిన పడకుండా తప్పించుకోవటం కాదా!

విశేషం: అలం: నిదర్శన.

వ. అనుచు నాకృష్ణుల నుపలక్షించి. 176

ప్రతిపదార్థం: అనుచున్= అని అనుకొంటూ; ఆ, కృష్ణులన్= ఆ కృష్ణార్జునులను, ఉపలక్షించి= చూచి

తాత్పర్యం: అని పలుకుతూ ఆ కృష్ణార్జునులను చూచి.

క. 'గురుముఖ బహురథిక శరో । త్కరములచే నైన క్రొత్త గంట్లను సుమనో

భరిత నవకర్ణికార । స్ఫురితాచలయుగము భంగిఁ బొలిచిరి చూడన్.' 177

ప్రతిపదార్థం: గురుముఖ= గురువైన ద్రోణుడు మొదలయిన; బహురథిక= అనేకులయిన వీరుల; శర+ఉత్కరములచేన్= బాణ సమూహాల వలన; ఐన= అయినటువంటి; క్రొత్తగంట్లను= కొత్త గాయాలను; సుమనోభరిత= పూలతో కూడిన; నవ= క్రొత్త; కర్ణికార= కొండగోగులతో; స్ఫురిత= అందగించిన; అచల యుగము= కొండలజంట; భంగిన్= మాదిరిగా; చూడన్= చూడటానికి; పొలిచిరి= ఒప్పారారు.

తాత్పర్యం: 'ద్రోణాదులయిన చాలామంది రథిక వీరులు బాణాలతో కొట్టటం వల్ల కలిగిన క్రొత్త గాయాలతో అప్పుడే పూచిన క్రొత్త కొండగోగుపూలతో ఒప్పారే రెండు కొండల వలె కృష్ణార్జునులు చూడ ముచ్చటగ అగుపించారు.

విశేషం: అలం: ఉపమ.

క. అని యగ్గించుచు సింధువి । భునిదెస విగతాశు లైరి భూవల్లభ! య
వ్వనజాక్షు లెఱ్ఱసెర లొ । ప్ప నతని వీక్షించి యార్చి బరవస మలరన్. 178

ప్రతిపదార్థం: భూవల్లభ!= ఓ రాజా! (ఓ ధృతరాష్ట్రా!); అని అగ్గించుచున్= ఆ విధంగా కీర్తిస్తూ; సింధువిభుని దెసన్= సైంధవుడిని గూర్చి; విగత+ఆశులు+ఐరి= ఆస వదలుకొన్నారు; (సైంధవుడిని కాపాడలేమను నమ్మకంతో ఉండిపోయారు); ఆ+వనజ+అక్షులు= ఆ తామరస నేత్రులు (కృష్ణార్జునులు); ఎఱ్ఱసెరలు+ఒప్పన్= కోపంవలన ఏర్పడే కంటి ఎర్రజీరలు అమరగా; అతనిన్= ఆ సైంధవుడిని; వీక్షించి= చూచి; బరవసము+అలరన్= ధైర్యం అతిశయించగా; ఆర్చి= పెద్దగా అరచి (సింహనాదం చేసి).

తాత్పర్యం: ఓ రాజా! ఆ విధంగా ప్రశంసిస్తూ సైంధవుడిమీద మన సైనికులు ఆశ వదలుకొన్నారు. కృష్ణార్జునులు కోపంతో కన్నులలో ఎర్రజీరలు ఒప్పారగా సైంధవుడిని చూచి, గర్వంతో పెనుబొబ్బపెట్టి సింహనాదం చేసి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్రమహాభారతము

ద్రోణపర్వము - చతుర్థాశ్వాసము

క. శ్రీమత్త్వాయుష్మత్త్వ సు । ధీమత్త్వ ప్రద కటాక్ష దీపిత భక్త
స్తోమారామవసంతా! । వ్యామోహ ప్రశమకరణ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీమత్త్వ= సంపదను కలిగి ఉండటం; ఆయుష్మత్త్వ= ఆయుస్సును కలిగి ఉండటం; సుధీమత్త్వ= శ్రేష్ఠమైన, విజ్ఞానమును కలిగి ఉండటం; ప్రద= ఇచ్చునటువంటి; కటాక్ష= కడకంటిచూపుతో; దీపిత= ప్రకాశింపజేయబడిన (వెలిగేటట్లు చేసిన); భక్తస్తోమ= భక్త సమూహమనే; ఆరామ= ఉద్యానవనానికి; వసంతా!= వసంత ఋతువువంటివాడా! (అనగా భక్తులనే ఉద్యానవనం చిగిర్చి వెలగటానికి వసంత ఋతువు వంటి వాడు హరిహరనాథుడని భావం); వ్యామోహ= మూఢత్వమును (అజ్ఞానమును); ప్రశమకరణ!= పోగొట్టేవాడా!; హరిహరనాథా!= హరిహరనాథస్వామీ!

తాత్పర్యం: ఐశ్వర్యాన్ని, ఆయుష్యాన్ని, విజ్ఞానాన్ని అనుగ్రహించే కడగంటి చూపుతో ప్రకాశింపచేయబడిన భక్త సమూహము అనే ఉద్యానవనానికి వసంతుని వంటివాడా! అజ్ఞానాన్ని అణగించేవాడా! ఓ హరిహరనాథా!

విశేషం: అలం: రూపకం. హరిహరులను ఇర్వురనూ ఒకే విధంగా ఒకే గుణవిశేషంతో వర్ణించాడు తిక్కన.

సాత్యకి మొగ్గరంబు సొరందొడంగుట (సం. 7-89-38)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కి ట్లనియె. 2

తాత్పర్యం: వైశంపాయనముని జనమేజయుడితో ఈ విధంగా అన్నాడు:

తే. 'ధర్మపుత్త్రుండు వనుప సాత్యకి గడంగి । తన బలము దెస నడచుట వినిన యాంబి
కేయుఁ డర్జునుఁ గలియ శైనేయుఁ బోవ । విడిచిరే మనవా?' రని యడుగుటయును. 3

ప్రతిపదార్థం: ధర్మపుత్త్రుండు పనుపన్= ధర్మరాజు పంపగా; సాత్యకి కడంగి= సాత్యకి పూనుకొని; తన బలము దెసన్= తన సైన్య మున్న దిక్కుకు; నడచుట= పోవటం; వినిన= విన్నట్టి; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; అర్జునున్= అర్జునుడిని; కలయన్= కలియటానికి; శైనేయున్= సాత్యకిని; పోవన్= పోవుటకు; మనవారు= మనసైన్యాలు; విడిచిరే?= వదలినారా?; అని అడుగుటయును= అని అడుగగా.

తాత్పర్యం: 'ధర్మరాజు పంపగా సాత్యకి పూనికతో కౌరవబలాలవైపు పోవటం విని ధృతరాష్ట్రుడు 'సాత్యకి ఆ విధంగా అర్జునుడిని కలియటానికి పోతూ ఉంటే మనవారు అతడిని ఎదుర్కొనకుండా, పోనిచ్చారా?' అని అడుగగా.

వ. సంజయుం డతని కిట్లను; 'నట్లు మఱందిం బనిచి యుధిష్ఠిరుం డాచార్యుల నవలోకించి యాశిని వరుపిఱుందన తఱిమె; నప్పుడు ధృష్టద్యుమ్నుం డవష్టంభంబున నెలుంగెత్తి పురికొల్పి పాండవసైనికులు గవిసిన మనవారును మార్కొనిరి; తదనంతరంబ. 4

ప్రతిపదార్థం: సంజయుండు; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనున్= ఈ ప్రకారంగా అన్నాడు; అట్లు= ఆ విధంగా; మఱందిన్+పనిచి= మేనమరదిని ఆజ్ఞాపించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఆచార్యువలను= ద్రోణుని దిక్కు; అవలోకించి= చూచి; ఆ శినివరు= ఆ శినివంశంలో ఉత్తముడైనవాని (సాత్యకి); పిఱుందన్= వెంటనే; తఱిమెన్= తరిమాడు; అప్పుడు= ఆ సమయంలో; ధృష్టద్యుమ్నుండు= పాండవసేనాని అయిన ధృష్టద్యుమ్నుడు (ద్రుపదుడి కుమారుడు); అవష్టంభంబునన్= గర్వంతో; ఎలుంగు+ఎత్తి= గొంతెత్తి; పురికొల్పన్= ప్రేరేపించగా; పాండవ సైనికులు= పాండవ బలాలు; కవిసినన్= క్రమ్ముకొనగా; మనవారును= మనసైన్యాలు కూడా; మార్కొనిరి= ఎదుర్కొన్నారు; తదనంతరంబు+అ= ఆ మీదట.

తాత్పర్యం: ధర్మరాజు మేనమరది అయిన సాత్యకిని ఆ విధంగా ఆజ్ఞాపించి, ద్రోణుడున్న దిక్కు చూచి, అతడిని వెంటనే తరిమాడు. ఆ సమయంలో ధృష్టద్యుమ్నుడు గర్వంతో గొంతెత్తి ప్రేరేపించగా పాండవ సైనికులు మనవారిని క్రమ్ముకొన్నారు. మన సైనికులు కూడ ఎదుర్కొన్నారు. ఆ మీద (తరువాతి పద్యంతో అన్వయం).

క. **తలలను గరముల వక్ష। స్థ్సలముల జఘనములఁ దొడలఁ జరణంబుల న**
య్యిలఁ గప్పెడు సాత్యకి కో। ల్తల కోర్వక నీ బలము గలంగంబడియెన్. 5

ప్రతిపదార్థం: ఆ+ఇలన్= ఆ యుద్ధరంగంలో; తలలను= తలలను; కరములన్= చేతులను; వక్షస్థ్సలములన్= రొమ్ములను; జఘనములన్= నడుములను; తొడలన్= తొడలను; చరణంబులన్= పాదాలను; కప్పెడు= కప్పివేసే; సాత్యకి= సాత్యకియొక్క; కోల్తలకున్= ఎదురు యుద్ధానికి; ఓర్వక= ఆగలేక; నీ బలము= నీ సైన్యం; కలంగంబడియెన్= చికాకు పడింది.

తాత్పర్యం: ఆ యుద్ధరంగంలో ఎదురు నిలిచిన సాత్యకి యుద్ధపద్ధతి నీ సైన్యం తలలను, చేతులను, గుండెలను, నడుములను, తొడలను, పాదాలను నరికి నేలనంతటను పరువగా అతడి-దాడికి తాళలేక నీ సైన్యం చీకాకుపడింది.

క. **విచ్చిన మూఁకల కడ్డము। సొచ్చిన నేడ్వురు నృపాల శూరోత్తములం**
బుచ్చె జముం గొలువఁగ వి। వ్వచ్చుమఱఁది పెఱ నృపాల వర్గము దెరలన్. 6

ప్రతిపదార్థం: విచ్చినమూఁకలకున్= చెదరిన సైన్యానికి; అడ్డము చొచ్చినన్= అడ్డంగా దూరిన (సహాయంగా సాత్యకి సైనికుల మధ్య అడ్డంగా దూరిన); ఏడ్వురు= ఏడుగురు; నృపాలశూర+ఉత్తములన్= రాజవీర శ్రేష్ఠులను; వివ్వచ్చుమఱఁది= అర్జునుడి మేనమరది (సాత్యకి); పెఱనృపాల వర్గము= మిగిలిన రాజసమూహం; తెరలన్= (భయంతో) తొలగిపోగా; జమున్+కొలువంగన్= యముడిని సేవించటానికి; పుచ్చెన్= పంపాడు (అనగా చంపాడని భావం).

తాత్పర్యం: చెదరిపోయిన సైన్యాలకు సాయంచేయటానికి (నిలపటానికి) అడ్డంగా వచ్చిన రాజవీర శ్రేష్ఠులను ఏడుగురుని, యుద్ధరంగంలోని తక్కిన రాజులు బెదరి, చెదరిపోగా, సాత్యకి యముడికి సేవ చేయటానికై వారిని పంపాడు.

విశేషం: అలం: పర్యాయోక్తం. చంపెను అనటానికి 'పుచ్చె జముం గొలువఁగ' అని భంగ్యంతరంచే చెప్పటంచేత అలంకారం పర్యాయోక్తము.

సీ. **ఆ సమయంబున నతని మార్కొని కుంభ। భవుఁ డేడు తూపులు వఱపె మేన**
నతఁ డస్త్రసప్తకహతుఁ జేసె; నాతని। నగ్గురుఁ డాఱింట నశ్వములను
సూతు నాతని నొంచె; నాత డయ్యాచార్యు। నేపుమైఁ బదియును నేడు నాలు
నెనిమిదియును బదునెనిమిదియును శాత। శరముల నొప్పించి తురగచయము

ఆ. **నాల్గు సాయకముల నడికించి సారథి। నొక్క మార్గణమున ను బ్బడంచి**
యార్చుటయును ద్రోణుఁ డలిగి । వాలమ్ములఁ బొదివెఁ దద్రథంబు మద మెలర్ప. 7

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= సాత్యకి ఆ విధంగా యుద్ధం చేసేటప్పుడు; కుంభ భవుఁడు= ద్రోణాచార్యుడు; అతనిన్= ఆ సాత్యకిని; మార్కొని= ఎదుర్కొని; ఏడుతూపులు= ఏడు బాణాలు; మేనన్= అతడి శరీరంలో; పఱపెన్= నాటాడు; అతండు= ఆ సాత్యకి; అస్త్రసప్తక= ఏడు బాణాలతో; హతున్+చేసెన్= (ఆచార్యుడిని) దెబ్బతినేటట్లు చేశాడు; ఆ+గురుఁడు= ఆ ద్రోణాచార్యుడు; ఆతనిని= సాత్యకిని; ఆఱింటన్= ఆరింటితోను; అశ్వములను= గుర్రాలను; సూతున్= సారథిని; ఆతనిన్= ఆ సాత్యకిని; నొంచెన్= బాధించాడు; ఆతఁడు= ఆ సాత్యకి; ఏపుమైన్= విజృంభణంతో; ఆ+ఆచార్యున్= ఆ ద్రోణాచార్యుడిని (గురువును); పదియును= పదింటితోను; ఏడు= ఏడింటితోను; ఆఱు= ఆఱింటితోను; ఎనిమిదియును= ఎనిమిదింటితోను; పదునెనిమిదియును= పదునెనిమిదింటితోను; శాత= వాడియైన; శరములన్= బాణాలతో; నొప్పించి= బాధించి; తురగచయమున్= గుర్రములను; నాల్గు సాయకములన్= నాల్గు బాణాలతో; అడికించి= భయపెట్టి; సారథిని= సూతుని; ఒక్క మార్గణమునన్= ఒక వాడి అమ్ముతో; ఉబ్బు+అడంచి= గర్వాన్ని నాశంచేసి; ఆర్చుటయును= సింహనాదం చేయటంతో; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; అలిగి= కోపించి; మదము= గర్వము; ఎలర్పన్= ఎక్కువ కాగా; తద్రథంబున్= ఆ సాత్యకియొక్క తేరును; వాలమ్ములన్= వాడి అయిన బాణాలతో పొదివెన్= క్రమ్ముకొన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా యుద్ధం జరిగేటప్పుడు ద్రోణుడు సాత్యకిని ఏడు బాణాలతో కొట్టాడు. అందుకు బదులుగా సాత్యకి కూడా ఏడు బాణాలతో ద్రోణుని కొట్టాడు. అపుడు ద్రోణుడు వరుసగా సాత్యకి మీద ఆరు బాణాలు వేసి అతడిని, సూతుడిని, గుర్రాలను దెబ్బతీశాడు. అందు కా సాత్యకి విజృంభించి ఆచార్యుడిని పది, ఏడు, ఆరు, ఎనిమిది, పద్దెనిమిది సంఖ్యలు గల వాడి బాణాలతో బాధించాడు. గుర్రాలను నాల్గు బాణాలతో భయపెట్టి, సూతుడిని ఒక తూపుతో హతమార్చి సింహనాదం చేశాడు. ద్రోణుడి కంతట కోపం ఎక్కువ కాగా వాడి అయిన బాణాలతో సాత్యకి తేరును క్రమ్ముకొన్నాడు.

వ. ఇట్లు బాణజాలంబు గుప్పి గురుండు సాత్యకి నుపలక్షించి. 8

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; బాణజాలంబు= బాణముల యొక్క సమూహము; గుప్పి= ప్రయోగించి; గురుండు= ద్రోణుడు; సాత్యకిన్= సాత్యకిని; ఉపలక్షించి= చూచి

తాత్పర్యం: ఈ విధంగా బాణాల సమూహాన్ని గుప్పిస్తూ ద్రోణుడు సాత్యకిని చూచి.

క. 'నా చేతి బలువు గని నీ । యాచార్యుం డోడి తొలఁగి యరిగెను నీవే
త్రోచి యట వోవు వాఁడవు । సూచెదుగా కెట్లు నిన్ను స్రుక్కించెదనో! 9

ప్రతిపదార్థం: నా చేతి బలువు= నా భుజశక్తిని; కని= చూచి; నీ ఆచార్యుండు= నీ గురువైన అర్జునుడు; ఓడి= ఓడిపోయి; తొలఁగి= తప్పుకొని; అరిగెను= వెళ్ళాడు; నీవే త్రోచి= నీవే చొచ్చుకొని; అటపోవువాఁడవు= ఆ విధంగా పోతావు; నిన్నున్= నిన్ను; ఎట్లు= ఏ విధంగా; స్రుక్కించెదనో= బలహీనుని చేస్తానో; చూచెదుగాక!= చూస్తావు కదా!.

తాత్పర్యం: నా చేతి బలాన్ని చూచి నీ గురుడు (అర్జునుడు) ఓడి పారిపోయాడు. నీవు కూడ త్వరగా అట్లే పోతావు. ని న్నేవిధంగా బలహీనుని చేస్తానో చూడు'.

క. అనవుడు 'ధర్మాత్మజు పను । పున నే గాండీవికడకుఁ బోయెద; న న్నిం
తన నేటికిఁ? దడవయ్యెడు । ననుగ్రహము సేయు; మర్హ మది పెద్దలకున్.' 10

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; ధర్మరాజు పనుపునన్= ధర్మరాజు ఆజ్ఞతో; ఏన్= నేను; గాండీవికడకున్= అర్జునుడి దగ్గరకు; పోయెదన్= వెళ్ళుతాను; నన్నున్= నన్ను; ఇంత+అనన్= ఇన్నిమాట లనగా; (వెనుకటి పద్యంలో ద్రోణుడాడిన వ్యంగ్యమైన మాటలు); ఏటికిన్?= ఎందుకు?; తడవు+అయ్యెడున్= ఆలస్యమవుతూ ఉన్నది; అనుగ్రహము చేయుము= దయ చూపుము; పెద్దలకున్= పెద్దవారికి; అది అర్హము= అది తగి ఉంటుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మరాజు ఆజ్ఞచేయుగా ‘ నే నర్జునుడి దగ్గరకు పోతూ ఉన్నాను. ఇన్ని మాటలతో నన్నెందుకు బాధిస్తావు? ఆలస్యమవుతూ ఉన్నది. నామీద దయ చూపుము. పెద్దవారి కది ధర్మం’.

క. అని పలికి తొలఁగిపోవుట । మనమున నూహించి దైత్యమర్దనుతమ్ముం
డను సూతుతోడ ‘ద్రోణుఁడు । మనలం బోనీక పెనఁగు మాత్సర్యమునన్. 11

ప్రతిపదార్థం: అని పలికి= అని మాటలాడి; తొలఁగిపోవుట= తప్పించుకొనిపోవటాన్ని; మనమునన్= తన మనసులో; ఊహించి= తలచికొని; దైత్యమర్దను తమ్ముండును= సాత్యకియు; (దితి కుమారులయిన రాక్షసులను చంపిన వాడికి - శ్రీకృష్ణుడికి తమ్ముడని); సూతుతోడన్= తన సారథితో; అనున్= ఇట్లా అన్నాడు; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; మనలన్= మనలను; పోనీక= తప్పుకొని పోనీయకుండా; మాత్సర్యమునన్= మచ్చరంతో (పట్టుదలతో); పెనఁగున్= పోరాడుతాడు.

తాత్పర్యం: సాత్యకి ద్రోణుడితో ఆ మాటలు మాట్లాడి (అర్జునుడిలాగానే) (ద్రోణుణ్ణి) తొలగి పోవడం మంచిదని మనసులో ఊహించి తన సారథితో ఈ విధంగా అన్నాడు. ద్రోణుడు మాత్సర్యంతో మనలను ముందుకు పోనీకుండా యుద్ధం చేస్తాడు.

వ. తడసినఁ గర్జంబు దప్పు; నితనికి నోసరించి పోవలయు; విను మిదియె బాహ్లికబలం; బదే యంగసైన్యం; బల్లదె దాక్షిణాత్యసేన; వీనియం దొక్కసందున వెడలు ద’, మని గడంగి యడ్డపడిన నొప్పించి చిక్కువఱిచి పోద మనిన నట్ల కాక యని యద్దారుకానుజుండు ద్రోణునకుం దొలంగించి తేరు దోలందీవ్రబాణంబులు గురియుచు నగ్గురుండు వెనుతవుల నయ్యాదవ సింహుండు సింహవిక్రమంబున నంగచమూచ్ఛేదనంబు సేసి చను నెడఁ గృతవర్మ యాతనిఁ దాఁకి. 12

ప్రతిపదార్థం: తడసినన్= ఆలస్యం చేస్తే; కర్జంబు= పని; తప్పున్= చెడిపోతుంది; ఇతనికిన్= ఈ ద్రోణుడికి; ఓసరించి= తప్పుకొని; పోవలయున్= వెళ్ళవలసి ఉన్నది; ఇదియె బాహ్లిక బలంబు= ఇదిగో బాహ్లికుడి సేన; అదే అంగసైన్యంబు= అదుగో అంగదేశపు సేన; అల్లదె= ఆ దూరంగా కనుపించేదే; దాక్షిణాత్యసేన= దక్షిణ దిక్కునుండి వచ్చినవారి సైన్యం; వీని అందున్= ఈ సేనలో; ఒక్క సందునన్= ఒక సందులో (మధ్యలో దూరి అని భావం); వెడలుదము= వెళ్ళుదాము; అనినన్= అనగా; కడంగి= పూనుకొని; అడ్డపడినన్= అడ్డంరాగా; నొప్పించి= బాధించి; చిక్కుపఱిచి= చికాకుపెట్టి; పోదము+అనినన్= వెళ్ళుదా మనగా; అట్లు+అ కాక+అని= అట్లే అని; ఆ+దారుకానుజుండు= ఆ దారుకుడి తమ్ముడు; ద్రోణునకున్ తొలంగించి= ద్రోణుడిని తప్పించి; తేరు తోలన్= తేరును తోలగా; ఆ+గురుండు= ఆ ద్రోణుడు; తీవ్రబాణంబులన్+కురియుచున్= వాడి బాణాలను వర్షంవలె కురిపిస్తూ; వెనుతవులన్= వెన్నంటగా; ఆ+యాదవ సింహుండు= సింహమువంటి ఆ యాదవుడు; సింహ విక్రమంబునన్= సింహము శౌర్యం వంటి శౌర్యంతో; అంగచమూ= అంగసైన్యాన్ని; ఛేదనంబు చేసి= చంపి; చనుఎడన్= పోయేటప్పుడు; కృతవర్మ; ఆతనిన్+తాఁకి= ఆతడిని తలకొని.

తాత్పర్యం: ఆలస్యం అయితే పని చెడిపోతుంది. ఇతడిని తప్పించుకొని పోవలసియుంది. ఈ బాహ్లిక, అంగ, దాక్షిణాత్య సేనలలో సందుచేసికొని వెళ్ళుదాము. ఎవరైనా అడ్డుపడితే నొప్పించి చీకాకు పరిచి వెళ్ళుదాము’. అనగా అట్లే అని దారుకుడి తమ్ముడైన సారథి ద్రోణుని తప్పించి తేరును తోలాడు. గురుడు తీవ్ర బాణాలు కురిపిస్తూ వెంటబడగా, ఆ యాదవసింహం సాత్యకి సింహ పరాక్రమంతో అంగసైన్యాన్ని చీల్చుకొని వెళ్ళుతూ ఉండగా, కృతవర్మ అతడిని ఎదుర్కొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆ అమ్ము లతని మేనం । దూఱంగా నేసె నాల్గు తురగాంగములన్
గీఱించినఁ గని ద్రోణుం । డూఱడి ధర్మజుని దెసకు నున్ముఖుఁ డయ్యెన్. 13

ప్రతిపదార్థం: ఆఱు+అమ్ములు= ఆరు బాణాలను; అతని మేనన్= ఆ సాత్యకి శరీరంలో; తూఱంగాన్= చొచ్చుకొని పోయేటట్లు; ఏసి= కొట్టి; నాల్గు= నాల్గుబాణాలతో; తురగ+అంగములన్= గుర్రాల శరీరాలను; గీఱించినన్= చీల్చివేయగా; కని= చూచి; ద్రోణుండు; ఊఱడి= ఊరటతో; ధర్మజుని దెసకున్= ధర్మరాజు దిక్కుకు; ఉన్ముఖుఁడు+అయ్యెన్= ముందుకు సాగాడు.

తాత్పర్యం: ఆరు బాణాలను సాత్యకి శరీరంలోకి దూరేటట్లువేసి, నాలుగింటితో గుర్రాల శరీరాలను చీల్చాడు. దానిని (కృతవర్మ యుద్ధగతిని) చూచి ద్రోణుడు ఊరటతో ధర్మజు డున్న వైపునకు పోవటానికి ఉద్యుక్తుడయ్యాడు.

వ. అక్కడ మొగమయ్యు నిక్కడ నేమఱక యుండె; నప్పుడు. 14

ప్రతిపదార్థం: అక్కడన్= ధర్మరాజు ఉన్నచోట; మొగము+అయ్యున్= మొగము ఉన్నా; ఇక్కడన్= ఈ యుద్ధం జరిగే చోట; ఏమఱక= ఏమరుపాటు లేకుండా; ఉండెన్; అప్పుడు.

తాత్పర్యం: ఆ దిక్కునకు మొగమున్నా (ధర్మజుడి దిక్కునకు మొగమయినా) ఇక్కడ ఈ యుద్ధం జరిగే స్థితికి ఏమరుపాటులేకుండా ఉన్నాడు. అప్పుడు (తరువాతి పద్యంతో అన్వయం).

క. కృతవర్మయొడల సాత్యకి । శితసాయకములు పదాఱు సెరివినఁ గోపో
ద్ధతి మెఱయఁగఁ బలుదూపుల । నతఁ డాతని నుచ్చిపోవునట్లుగ నేసెన్. 15

ప్రతిపదార్థం: కృతవర్మ ఒడలన్= కృతవర్మ ఒంటిమీద; సాత్యకి; శితసాయకములు= వాడిబాణాలు; పదాఱు చెరివినన్= పదునారింటితో గ్రుచ్చగా; కోప+ఉద్ధతి= కోపంవలని దర్పం; మెఱయఁగన్= ప్రకాశించగా; పలుతూపులన్= అనేక బాణాలతో; అతఁడు= కృతవర్మ; ఆతనిన్= సాత్యకిని; ఉచ్చిపోవునట్లుగన్= గ్రుచ్చిదూసికొని పోయేటట్లుగా; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: వాడి అయిన పదహారు బాణాలను కృతవర్మ శరీరంలో గ్రుచ్చాడు. కోపంతో కృతవర్మ అనేక బాణాలు సాత్యకి ఒంటిలో దూసుకొని పోయేటట్లు కొట్టాడు.

వ. వెండియు. 16

ప్రతిపదార్థం: వెండియున్= మరలా

తాత్పర్యం: ఇంకను. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. విలు దునుమాడి వక్షమున వే పదియమ్ములు నాఁట నాతఁ డు
జ్జ్వలఘనశక్తి వైచి కృతవర్మని బాహువు నొంచి ధైర్య ని
శ్చలమతి నొండు విల్లు గొని సారథిఁ జంపిన సూతకృత్యమున్
వలనుగఁ బూని యా రథికవర్యుఁడు నిల్చె నితాంతధీరతన్. 17

ప్రతిపదార్థం: విలు తునుమాడి= వింటిని త్రుంచివేసి; వే= వెంటనే; పది అమ్ములన్= పది బాణాలను; వక్షమునన్= గుండెలో; నాఁటన్= గ్రుచ్చగా; ఆతఁడు= సాత్యకి; ఉజ్జ్వల ఘనశక్తి వైచి= మండుతున్న పెద్ద శక్త్యాయుధాన్ని వేసి; కృతవర్మని= కృతవర్మయొక్క; బాహువు నొంచి= భుజమును నొప్పించి; ధైర్యనిశ్చలమతిన్= ధైర్యంతో నిశ్చలమైన మనస్సుతో; ఒండు విల్లు కొని= వేరొకవిల్లును తీసికొని; సారథిన్+చంపినన్= సారథిని చంపగా; ఆ రథిక వర్యుఁడు= ఆ వీరశ్రేష్ఠుడు; సూతకృత్యమున్= సారథి పనిని; నితాంతధీరతన్= మిక్కిలి ధైర్యంతోను; వలనుగన్+పూని= ఉపాయంతోనూ పూనుకొని; నిల్చెన్= నిలిచాడు.

తాత్పర్యం: కృతవర్మ సాత్యకి విల్లును త్రుంచి, పది వాడి బాణాలను అతడి గుండెలో గ్రుచ్చాడు. అప్పుడు పెద్ద శక్తితో సాత్యకి కృతవర్మ అతడి భుజాన్ని నొప్పించి ధైర్యనిశ్చలమతితో ఇంకొక విల్లు తీసుకొని సారథిని చంపాడు. అయినా అతడు ధైర్యంతో ఉపాయంగా సారథ్యం చేపట్టి యుద్ధరంగంలో నిలిచాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. నిలిచియు సాత్యకి దెసం దఱుమక భీమసేన పురస్సరంబైన బలంబున కడ్డపడ నరిగె; నవ్విధంబున నతని బెట్టు వఱిచి యా శైనేయుం డచటు గడచి చనియె' ననిన విని ధృతరాష్ట్రుండు సంజయున కి ట్లనియె. 18

ప్రతిపదార్థం: నిలిచియున్= ఆగియు; సాత్యకిదెసన్= సాత్యకి వైపు; తఱుమక= తరుమకుండా; భీమసేన పురస్సరంబు+ఐన= భీముడు నాయకుడుగా ఉన్న; బలంబునకున్= సైన్యానికి; అడ్డపడన్= అడ్డం పోవటానికి; అరిగెన్= వెళ్ళాడు; ఆ+విధంబునన్= ఆ ప్రకారంగా (వెనుక వివరించిన విధంగా); అతనిన్= ఆ కృతవర్మను; బెట్టుపఱిచి= ఎక్కువగా కష్టపెట్టి; ఆ శైనేయుండు= ఆ సాత్యకి; అచటు గడచి= ఆ చోటు దాటి; చనియెన్= వెళ్ళాడు; అనినన్ విని= అని చెప్పగా విని; ధృతరాష్ట్రుండు; సంజయునికిన్+ఇట్లు+అనియెన్= సంజయుడితో ముందు చెప్పబోయే విధంగా అన్నాడు.

తాత్పర్యం: కృతవర్మ ధైర్యంగా నిలిచికూడా సాత్యకి ఉన్న దిక్కుకు వెళ్ళకుండా, భీముడు నాయకుడుగా ఉండే సైన్యానికి అడ్డుపడటానికె వెళ్ళాడు. సాత్యకి కూడా ఆ కృతవర్మను మిక్కిలి కష్టపెట్టి, ఆ చోటు వీడి వెళ్ళాడన్నది విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

చ. గురు కృతవర్మ ముఖ్యు లతిఘోరపరాక్రమ శీలు; రట్టి నా
దొరలను సైన్యసాగరము దోర్బల సంపద గాసి సేసె న
న్నరుఁ డది గాక క్రమ్మఱ వినం గడు విస్మయ మి ట్లజయ్యుఁ డై
వెరవున లావునం బరిభవించుచు సాత్యకి యేపు సూపెనే? 19

ప్రతిపదార్థం: గురు= ద్రోణుడు; కృతవర్మముఖ్యులు= కృతవర్మ మొదలైన వారు; అతిఘోర పరాక్రమశీలురు= మిక్కిలి భయంకరంగా శత్రువులను ఆక్రమించుకొనేవారు (జయించేవారు); అట్టి= అటువంటి; నా దొరలను= నా నాయకులను; సైన్యసాగరమున్= సేనా సముద్రాన్ని; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; దోర్బల సంపదన్= భుజశక్తితో (భుజబల మనే సంపదతో); గాసి+చేసెన్= కష్టపెట్టాడు; అదిగాక= అంతమాత్రమే కాకుండా; సాత్యకి; ఇట్లు+అజయ్యుఁడు+ఐ= ఈ విధంగా అజేయుడుగా; వెరవునన్= ఉపాయంతో; లావునన్= బలంతో; పరిభవించుచున్= అవమానిస్తూ; ఏపు చూపెనే?= తన గొప్పతనాన్ని చూపినాడా? (అని); వినన్= వినగా (ఈ విషయాలు); కడు విస్మయము= మిక్కిలి ఆశ్చర్యకరం.

తాత్పర్యం: ద్రోణుడు, కృతవర్మ మొదలయిన మొనగాండ్రు మహాభయంకరమైన పరాక్రమం కలవారు. అటువంటి నా సేనానులనూ, సేనాసముద్రాన్నీ తన భుజబలంతో అర్జునుడు కష్టపెట్టాడు. అంతేకాదు. అజేయుడుగా ఉపాయం తోనూ బలంతోనూ మన సైన్యాన్ని అవమానిస్తూ తన గొప్పతనాన్ని చూపుతున్నాడా? ఇది వినటానికి వింతగా ఉన్నది.

మ. హరియుం బార్థుఁడు నట్లు నేర్పు గల బాహాశక్తిమైఁ జొచ్చుచో
దొరలున్ సేనలు బెల్లుఁ గూలుటకు నా దుర్యోధనుం డెంత యా
తురతం బొందెనో? దంతి ఘోటక పదాతుల్ సాత్యకిస్ఫార దో
స్స్ఫురణన్ మ్రగ్గుట కెట్లు దాను ననుజుల్ శోకించెనో యక్కటా!' 20

ప్రతిపదార్థం: హరియున్= కృష్ణుడును; పార్థుఁడున్= అర్జునుడును; అట్లు= ఆ విధంగా; నేర్పు కల= నేర్పున్న; బాహాశక్తి మైన్= భుజబలంతో; చొచ్చుచోన్= దూరేటపుడు (సైన్యాలు చొరబారేటప్పుడు); దొరలున్= రాజులును (నాయకులును); సేనలున్= సైన్యాలూ; పెల్లు కూలుటకున్= ఎక్కువగా నశించటానికి; ఆ దుర్యోధనుండు; ఎంత ఆతురతన్= ఎంత ఆరాటాన్ని; పొందెనో?= అందినాడో?; దంతి= ఏనుగులు; ఘోటక= గుర్రాలు; పదాతుల్= కాల్బలం; సాత్యకి= సాత్యకియొక్క; స్ఫార= విస్తారమైన; దోఃస్ఫురణన్= భుజశక్తితో; మ్రగ్గుటకున్= నాశనం కావటానికి; తాను= దుర్యోధనుడు; అనుజుల్= తోబుట్టువులు (సోదరులు); అక్కటా!= అయ్యో!; ఎట్లు= ఏ విధంగా; శోకించెనో!= దుఃఖపడ్డాడో!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శ్రీకృష్ణార్జునులు నేర్పు, భుజబలం చూపుతూ సైన్యంలోకి చొచ్చుకొని పోయినందుకూ, పెక్కుమంది సైనికులు నశించినందుకూ దుర్యోధను డెంతగా ఆరాటపడ్డాడో? సాత్యకి భుజశక్తికి నశించిన ఏనుగులనూ, గుఱ్ఱాలనూ కాల్బలమునూ చూచి తన తమ్ములతో కలిసి తా నెంతగా దుఃఖించాడో!'.

వ. అనవుడు సూతసూనుం డమ్మానవపతి కి ట్లనియె. 21

ప్రతిపదార్థం: అనవుడు= అని అనగా; సూతసూనుండు= సూతునికొడుకైన సంజయుడు; ఆ+మానవపతికిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజునకు; ఇట్లు+అనియెన్= ఇట్లన్నాడు

తాత్పర్యం: అనగా సంజయుడు ఆ రాజుతో (ధృతరాష్ట్రుడితో) ఈ విధంగా అన్నాడు.

క. 'నీ యవినయంబు పెంపున । నీ యాపద సంభవించె; నింక వగచినం
బాయునె? యితరుల క్రియ శో । కా యత్తుఁడ వగుట నీకు నర్హమె యధిపా! 22

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా!; నీ అవినయంబు పెంపునన్= నీ అడకువ లేమి కారణంగా; ఈ ఆపద= ఈ కష్టం; సంభవించెన్= కలిగింది; ఇంక వగచినన్= ఇంక ఏడ్చినప్పటికినీ; పాయునె?= పోవునా? (ఈ దుఃఖం పోదు అని); ఇతరుల క్రియన్= ఇతరుల మాదిరిగా (సామాన్యుల వలె); శోక+ఆయత్తుఁడవు+అగుట= దుఃఖవశుడవవటం; నీకున్ అర్హమె?= నీకు తగునా? (అనగా తగదు).

తాత్పర్యం: ఓ రాజా! నీ అవినయం కారణంగా ఈ ప్రమాదం కలిగింది. ఇపుడు దుఃఖించిన ప్రయోజన మేమి? సామాన్యులవలె దుఃఖించటం తగునా? (ఓ రాజా! చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకొన్నట్లుంటుంది నీ ఈ చేష్ట - అని సంజయుడు ధృతరాష్ట్రుడితో అన్నాడు.)

వ. సుస్థిరుండ వై సమర ప్రకారంబు వినుము; 'సాత్యకి యత్తెఱంగునం జని కాంభోజసేనం జొచ్చిన నందలి మేటి మగలు దలపడి; రట్టియెడం గుంభసంభవుండు. 23

ప్రతిపదార్థం: సుస్థిరుండవు+ఐ= స్థిరంగా ఉన్నవాడవై; సమరప్రకారంబు= యుద్ధ విధానం; వినుము; సాత్యకి ఆ+తెఱంగునన్= సాత్యకి ఆ విధంగా; చని= వెళ్ళి; కాంభోజసేనన్= కాంభోజదేశపు సేనలోనికి; చొచ్చినన్= ప్రవేశించగా; అందలి= ఆ సేనలోని; మేటి మగలు= గొప్పవీరులు; తలపడిరి= ఎదుర్కొన్నారు; అట్టి ఎడన్= ఆ సమయంలో; కుంభసంభవుండు= ద్రోణుడు.

తాత్పర్యం: దృఢచిత్తంతో యుద్ధ విధానాన్ని వినుము. సాత్యకి ఆ విధంగా కాంభోజసేనలో ప్రవేశించగా వారిలోని గొప్పవీరులు సాత్యకిని ఎదుర్కొన్నారు. అటువంటప్పుడు ద్రోణుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కని కృతవర్మకు సారథి । నొనర్చి తన కృత్యమునకు నునిచి కడఁగి యా
శినివరు వెనుకొన ధర్మసు । తుని దొర లయ్యస్త్రగురునిఁ దొడర నడరినన్. 24

ప్రతిపదార్థం: (కుంభసంభవుండు= ద్రోణుడు); కని= చూచి; కృతవర్మకున్= కృతవర్మకు; సారథిన్+ఒనర్చి= సూతుడిని ఏర్పాటుచేసి; తన కృత్యమునకున్+ఉనిచి= (వాడిని) తాను చేస్తున్న పనికి నియమించి; కడఁగి= యత్నించి; ఆ శినివరున్= ఆ శినివంశ శ్రేష్ఠుడిని (సాత్యకిని); వెనుకొనన్= వెన్నంటగా; ధర్మసుతుదొరలు= ధర్మరాజు పక్షాన ఉన్న రాజులు; ఆ+అస్త్రగురునిన్= ఆ ధనురాచార్యుడిని; తొడరన్= ఎదుర్కొనటానికి; అడరినన్= విజృంభించగా.

తాత్పర్యం: (ద్రోణాచార్యుడు) చూచి కృతవర్మకు సారథిని ఏర్పాటుచేసి తానుచేస్తున్న పనిని-యుద్ధాన్ని-అతనికి అప్పగించి, సాత్యకిని తాను వెంటాడగా, ధర్మరాజు పక్షంలోని సేనా నాయకులు ద్రోణాచార్యుని ఎదుర్కొనటానికి విజృంభించగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **వారిఁ గృతవర్మ మార్కొని । దారుణ శర శిఖల నేర్చి తల్లడపఱుపం**
గా రయము గుంది నిలిచిరి । వా రొండొరుఁ జూచుచును వివర్ణాకృతులై. 25

ప్రతిపదార్థం: కృతవర్మ; వారిన్ మార్కొని= వారిని ఎదుర్కొని; దారుణ శరశిఖలన్= భయంకరమైన బాణాగ్ని జ్వాలలతో; ఏర్చి= కాల్చి; తల్లడ పఱుపన్= తల్లడిల్లజేయగా; వారు= ఆ సైనికులు(పాండవ పక్షంవారు); ఒండొరున్ చూచుచున్= ఒకరినొకరు చూస్తూ; వివర్ణ+ఆకృతులు+ఐ= తెల్లబడిన ముఖం కలవారయి; రయము= వేగం; కుంది= తగ్గి; నిలిచిరి= నిలిచారు.

తాత్పర్యం: కృతవర్మ వారిని ఎదుర్కొని, భయంకరమైన బాణాగ్ని జ్వాలలతో కాల్చి తల్లడిల్లజేయగా, ఆ సేనా నాయకులు వెలవెల పోయిన ముఖాలతో ఒకరినొకరు చూస్తూ, తమ వేగం మందగిల్లగా నిలిచారు.

వ. **ఇట్లు హార్దిక్యుబలు విడి కోహటించిన రథికులం బురికొలిపికొని వృకోదరుండు సోదరపుత్త్రమిత్త్ర సహితంబుగా నతనిపై గవిసె; నట్టి సమయంబున నయ్యనిలజుండును ధృష్టద్యుమ్నుండును శరత్రయంబులను, ధర్మనందన ద్రుపదులు బాణపంచకంబులను, హైడింబుం డేడమ్ములను, మత్స్యపతి పదియేనింటను, సహదేవుం డిరువదేనింటను, శిఖండి యిరువదింటను, ద్రౌపదేయులు డెబ్బది తూపులను, నకులుండు సాయక శతంబునను నొక్కుమ్మడి నమ్మేటివిలుకానిం బొదివిన నతండు.** 26

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; హార్దిక్యుబలువిడికిన్= హార్దిక్యుని పద్ధతికి (యుద్ధపద్ధతికి); ఓహటించిన= వెనుకంజ వేసిన; రథికులన్= రథవీరులను; పురికొలిపికొని= ప్రేరేపించుకొంటూ; వృకోదరుండు= భీమసేనుడు; సోదర పుత్త్ర మిత్త్ర సహితంబుగాన్= తోబుట్టువులతో, కుమారులతో, స్నేహితులతోకూడా; అతనిపైన్= ఆ హార్దిక్యుని మీదకు; కవిసెన్= క్రమ్ముకొన్నాడు; అట్టి సమయంబునన్= ఆ వేళలో; ఆ+అనిలజుండును= ఆ భీమసేనుడును; ధృష్టద్యుమ్నుండును= ధృష్టద్యుమ్నుడుకూడా; శరత్రయంబునన్= మూడు బాణాలతోను; ధర్మనందన ద్రుపదులు= ధర్మరాజు, ద్రుపదుడును; బాణపంచకంబులను= ఐదు బాణాలతోను; హైడింబుండు= హిడింబ కుమారుడైన ఘటోత్కచుడు; ఏడు అమ్ములను= ఏడు బాణాలను; మత్స్యపతి= విరాటరాజు; పది ఏనింటను= పదునైదు బాణాలతోను; సహదేవుండు; ఇరువది+ఏనింటను= ఇర్వై అయిదు బాణాలతోను; శిఖండి; ఇరువదింటను= ఇరువది తోను; ద్రౌపదేయులు= ఉపపాండవులు; డెబ్బదితూపులను= డెబ్భై బాణాలతోను, నకులుండు; సాయకశతంబునను= నూరు బాణాలతోను; ఒక్కుమ్మడిన్= ఒక్కటిగా; ఆ+మేటి విలుకానిన్= ఆ గొప్ప విలుకాడిని; పొదివినన్= క్రమ్ముకోగా; అతండు= ఆ హార్దిక్యుడు.

తాత్పర్యం: ఈ విధంగా కృతవర్మ యుద్ధపద్ధతికి వెనుకంజ వేసిన సేనాపతులను పురికొల్పుతూ సోదర పుత్రమిత్ర సహితంగా భీముడు అతడి మీదకు దూకాడు. ఆ సమయంలో భీమ ధృష్టద్యుమ్నులు మూడు బాణాలతోను, ధర్మనందన ద్రుపదులు ఐదు బాణాలతోను, ఘటోత్కచుడు ఏడింటితోను, విరాటరాజు పదునైదింటితోను, సహదేవుడు ఇరువది ఐదుతోను, శిఖండి ఇరువదితోను, ఉపపాండవులు డెబ్బై బాణాలతోనూ, నకులుడు నూరు బాణాలతోనూ ఒక్కసారిగా ఆ గొప్ప విలుకాడిని కృతవర్మను క్రమ్ముకొన్నారు. అందుకాతడు(తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **ఐదైదు శరముల నందఱ స్రుక్కించి, । భీముని నేడింట బెట్టు వఱచి**
ధనువుఁ గేతనమును దునిమి డెబ్బది తూపు । లతిరయంబున నుర మాడ నేయ
సోలిన యమ్మరుత్సుతుఁ జూచి యందఱు । నా కృతవర్మపై నడరి; రంతఁ
దెలిసి వృకోదరుం డలఘు దారుణసము । జ్జ్వలశక్తి నాతని వైవ నతఁడు

తే. **ముత్తునియఁ జేయ దొడ్డ విల్లెత్తి యతని । యొడలు నెత్తురు వఱ్ఱు సేయుటయు నాస**
మీరనందనుఁ దక్కటి వారి నొంచె । మూఁడు మూఁడ మ్ము లేసి యవ్వాఁడిమగఁడు. 27

ప్రతిపదార్థం: అందఱన్= ఎదిరి వీరు లందరిని; ఐదు+ఐదు శరములన్= అయిదయిదు బాణాలతో; స్రుక్కించి= మూర్ఛిల్లచేసి; భీమునిన్= భీమసేనుడిని; ఏడింటన్= ఏడు బాణాలతో; బెట్టువఱచి= ఎక్కువగా బాధపెట్టి; ధనువున్= వింటిని; కేతనమును= పతాకాన్ని; తునిమి= త్రుంచి వేసి; డెబ్బది తూపులన్= డెబ్బై బాణాలతో; అతిరయంబునన్= మిక్కిలి తొందరగా; ఉరము+ఆడన్= గుండియలో గ్రుచ్చుకొనేటట్లు; ఏయన్= కొట్టగా; సోలిన= సొమ్మసిల్లిన; ఆ+మరుత్సుతున్= ఆ వాయుతనయుడైన భీముడిని; చూచి; అందఱున్= (పాండవ) సైనికులందరునూ; ఆ కృతవర్మపైన్= ఆ కృతవర్మమీదకు; అడరిరి= (బాణాలు వేస్తూ) అతిశయించారు; అంతన్+తెలిసి= అంతలోనే ఒళ్ళు తెలిసి; వృకోదరుండు= భీమసేనుడు; అలఘు= పెద్దదైన; దారుణ= భయంకరమైన సముజ్జ్వలశక్తిన్= మిక్కిలి వెలుగుతూ ఉన్న శక్త్యాయుధాన్ని; అతనిన్= ఆ కృతవర్మను వైవన్= కొట్టగా; అతఁడు= ఆ కృతవర్మ; దొడ్డవిల్లు+ఎత్తి= పెద్దబాణాన్ని తీసికొని; ముత్తునియన్+చేయన్= (ఆ శక్తిని) మూడు ముక్కలు చేయగా; అతని+ఒడలు= ఆ కృతవర్మ ఒంటిని; నెత్తురు వఱ్ఱు= నెత్తుటి ప్రవాహం; చేయుటయు= చేయగా; ఆ+వాఁడిమగఁడు= ఆ వీరుడైన సైనికుడు (కృతవర్మ); మూఁడు మూఁడు+అమ్ములు+ఏసి= మూడు మూడు బాణాలతో కొట్టి; సమీర+నందనున్= వాయుకుమారుడైన భీముడిని; తక్కటి వారిన్= మిగిలిన వారలను; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: కృతవర్మ తన్నెదిరించిన వీరులందరిని బాధించి అయిదయిదు బాణాలతో పాండవ సైన్యాన్ని బాధించాడు. ఏడింటితో భీముడిని పెద్ద దెబ్బ కొట్టాడు. వింటినీ పతాకాన్నీ త్రుంచివేసి, డెబ్బది బాణాలతో గుండెమీద కొట్టగా భీముడు సొమ్మసిల్లాడు. అపు డా సైనికులంతా కృతవర్మపైకి వెళ్ళారు. అంతలో భీముడు మూర్ఛనుండి తేరుకొన్నాడు. ఒక భయంకరమైన శక్తిని అతడిపై వేయగా దానిని కృతవర్మ మూడు ముక్కలు చేశాడు. అంత భీముడు ఒక పెద్ద విల్లు తీసికొని కృతవర్మ శరీరాన్ని నెత్తురు వఱ్ఱోడునట్లుగా చేశాడు. దానికి బదులుగా ఆతడు భీముడినీ, మిగిలినవారినీ మూడేసి బాణాలతో కొట్టాడు.

తే. **అందఱును జుట్టుముట్టి తీవ్రాస్త్రజాల । కములఁ గృతవర్మ నొంప, శిఖండి గదిసి**
యాక్రమించిన విలు ద్రుంచె నాతఁ డప్పు । డతని చాపంబు దునిమె నుగ్రాసి వైచి. **28**

ప్రతిపదార్థం: అందఱును= భీమసేనాదు లంతా; చుట్టుముట్టి= చుట్టూ క్రమ్ముకొని; తీవ్ర+అస్త్రజాలకములన్= భయంకరమైన బాణాలతో; కృతవర్మన్= కృతవర్మను; నొంపన్= నొప్పించగా; శిఖండి; కదిసి= అతిక్రమించి; ఆక్రమించినన్= క్రమ్ముకోగా; విలుత్రుంచెన్= అతడి వింటిని త్రుంచివేసినాడు; ఆతఁడు= కృతవర్మ; అప్పుడు= అపుడు; ఉగ్ర+అసిన్= భయంకరమైన కత్తితో; వైచి= కొట్టి(వేసి); అతని చాపంబున్= ఆ శిఖండి వింటిని; తునిమెన్= ముక్కలు చేశాడు.

తాత్పర్యం: కృతవర్మను భీమసేనాదులు చుట్టుముట్టి తీవ్రాస్త్రాలతో బాధించారు. శిఖండి క్రమ్ముకోగా అతడి విల్లును కృతవర్మ త్రుంచాడు. వెంటనే పెద్దకత్తి విసరి కృతవర్మ శిఖండి ధనువును ముక్కలు చేశాడు.

క. **ఆలోనన భోజపతిన్ । వాలమ్ముల బొదివి రెల్లవారలు దానం**
దూల కతఁడు బలువిలు గొని । క్రాలుచు నా భీమముఖ్య రథికుల నొంచెన్. **29**

ప్రతిపదార్థం: ఆలోనన= అంతలోనే; ఎల్లవారును= అందరును (అనగా పాండవపక్షంలోని వీరులంతా); వాలు+అమ్ములన్= వాడి అగు బాణాలతో; భోజపతిన్= భోజరాజును; పొదివిరి= కమ్ముకొన్నారు; దానన్= అందుకు; అతఁడు= భోజరాజయిన కృతవర్మ; తూలక= తూలిపోకుండా; బలువిలుకొని= బలమైన విల్లును తీసికొని; క్రాలుచున్= ప్రకాశిస్తూ; ఆ భీమముఖ్యరథికులన్= ఆ భీమసేనుడు మొదలైన రథికవీరులను; నొంచెన్= బాధించాడు.

తాత్పర్యం: అంతలోనే (శీఘ్రంగా) పాండవ సైనికులు మొత్తంగా వాడిబాణాలతో భోజరాజును క్రమ్ముకొన్నారు. అంతమాత్రానికి జంకకుండా ఆతడు కూడా పెద్ద విల్లును చేపట్టి వెలుగుతూ భీమాది రథికులనందరను నొప్పించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అప్పుడు. 30

తాత్పర్యం: ఆ సమయంలో.

ఉ. ఒండొక చాప మెత్తికొని యుగ్రత శాంతనవాంతకుండు వే
దండము వోలెఁ గిట్టిన నుదగ్రత సింహనఖోపమ స్ఫుర
త్కాండములం దదంగము రథంబుపయిం బడ నేసె భోజనా
థుం డది యాజికిం దొలఁగఁ దోలె రయంబున సూతుఁ డార్తుఁ డై. 31

ప్రతిపదార్థం: శాంతనవ+అంతకుండు= శిఖండి (భీష్ముడి చావుకు కారణమైనవాడు); ఒండొక చాపము= ఇంకొక విల్లును; ఎత్తికొని= తీసికొని; ఉగ్రతన్= భయంకరంగా; కిట్టినన్= సమీపించగా; ఉదగ్రతన్= భయంకరమైన; సింహనఖ= సింగపు గోళ్ళతో; ఉపమ= సాటియయిన స్ఫురత్+కాండములన్= ప్రకాశించుచున్న బాణాలతో; తదంగమున్= ఆ శిఖండి శరీరాన్ని; భోజనాథుండు= భోజరాజయిన కృతవర్మ; రథంబుపయిన్= తేరిమీద పడేటట్లుగా వేశాడు (కొట్టాడు); అది= దానిని; సూతుఁడు= సారథి; ఆర్తుఁడు+ఐ= భయంతో; ఆజికిన్= యుద్ధరంగానికి; తొలఁగన్+తోలెన్= తొలగిపోయేటట్లుగా తోలాడు.

తాత్పర్యం: శిఖండి ఇంకొక విల్లుతో మదపుటేనుగువలె భయంకరంగా ఎదుర్కొన్నాడు. కృతవర్మ సింహపు గోళ్ళవలె వాడి అయి భయంకరమైన బాణాలతో కొట్టి ఆ శిఖండి శరీరం తేరుమీద పడేటట్లు చేశాడు. ఆ స్థితికి సారథి భయపడి శిఖండిని యుద్ధభూమినుండి తొలగించి దూరంగా తీసికొనిపోయాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు శిఖండి గండడంగిపోయినం గని మత్స్యచేదికేకయాది సైన్యంబులు బరవసంబు సేసి యురవడించిన నా కృతవర్మ మర్మభేదనస్ఫార నారాచ పరంపరా ప్రవాహంబున వానినెల్లం గలంచె; తత్కలకలం బాలించి సాత్యకి య ట్లబ్బలంబులు వికలంబు లగుట యాలోకించి, విజయునకుం దోడ్పడం బదంపడి పోఁదగు; రాజు వలనారయవలయు నని యూహించి తనకు నడ్డపడిన భరద్వాజుని తోడి సమరంబు సాలించి మరలి యరదంబు దోలుకొని యరుగుదెంచి కృతవర్మునిం దాఁకి యేసిన, నతండును బొగలేని మంటచందంబున నుద్దీపించి సాయకజ్వాలలు నిగిడించిన నవి మగిడించి యా శైనేయుండు. 32

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; శిఖండి; గండు+అడంగిపోయిన్+కని= మగటిమి నశించిపోగా చూచి (బలం ఉడిగిపోగా);మత్స్య, చేది, కేకయ+ఆది సైన్యంబులు= మత్స్యదేశంయొక్క, చేదిదేశంయొక్క, కేకయదేశంయొక్క సైన్యాలు; బరవసంబు చేసి= ధైర్యం చేసి; ఉరవడించినన్= దూకగా; ఆ కృతవర్మ; మర్మభేదన= ప్రాణాలను తీసే (చీల్చే); స్ఫార= వాడి అయిన; నారాచపరంపరా= నారసముల వరుసతో; ప్రవాహంబునన్= సమూహంతో (నది ఉరవడివలె పడుతూ ఉండే బాణాల గుంపుతో); వానిన్+ఎల్లన్= ఆ బాణాలన్నిటినీ; కలంచెన్= చికాకు పరచాడు; తద్+కలకలంబు= ఆ శబ్దాన్ని; ఆలించి= విని; సాత్యకి; అట్లు= ఆ విధంగా; ఆ+బలంబులు= ఆ సేనలు; వికలంబులు+అగుట= చెదరిపోవటం; ఆలోకించి= చూచి; విజయునకున్+తోడ్పడన్= అర్జునుడికి సహాయపడటానికి; పదంపడి= మరల; పోన్+తగున్= పోవచ్చును; రాజు= ధర్మరాజు; వలను= దిక్కును (అనగాఅతడి వైపు); ఆరయవలయును= చూడవలెను; అని ఊహించి= అని తలపోసి; తనకున్+అడ్డుపడిన= తన దారికడ్డంవచ్చిన; భరద్వాజునితోడి= ద్రోణుడితో; సమరంబు చాలించి= యుద్ధం ఆపి; మరలి= తిరిగి; అరదంబు తోలుకొని= తేరును తోలుకొని; అరుగు దెంచి= వచ్చి; కృతవర్మునిన్+తాఁకి= కృతవర్మను ఎదుర్కొని; ఏసినన్= కొట్టగా; అతండును= ఆ కృతవర్మకూడ; పొగ లేని మంట చందంబునన్= పొగలేని మంట మాదిరిగా (సాధారణంగా పొగలేనిదే మంటరాదు); ఉద్దీపించి= విజృంభించి; సాయకజ్వాలలు=

బాణాగ్ని మంటలను; నిగిడించినన్= ఎగయించగా; అవి= ఆ మంటలను; ఆ శైనేయుండు మగిడించి= ఆ సాత్యకి బాణాగ్ని జ్వాలలను త్రిప్పికొట్టి.

తాత్పర్యం: శిఖండి శక్తి అడగిపోగా చూచిన కృతవర్మ, మత్స్య చేది కేకయాది సైన్యాలు ప్రవాహవేగంతో రాగా మర్మభేదం కావించే బాణాలతో ఆ సైన్యాన్ని కలచాడు. ఆ కలకలం విన్న సాత్యకి, ఆ సైన్యాలు చీకాకు పడటంచూచి, 'అర్జునుడికి సహాయంగా తరువాత పోవచ్చును, ముందురాజైన ధర్మజుడి దిక్కు చూడవలసి ఉన్నది' -అని ద్రోణుడు అడ్డం వచ్చినప్పటికినీ అతడితో యుద్ధం చేయకుండా, తన తేరును తోలుకొనిపోయి, కృతవర్మని తాకి కొట్టాడు. అందు కాతడు పొగలేని మంటవలె విజృంభించాడు. ఆ సాత్యకి కృతవర్మడి బాణాగ్ని జ్వాలలను త్రిప్పికొట్టి

విశేషం: అలం: ఉపమ.

శా. **భల్లం బొక్కట విల్లు ద్రుంచి రయ మొప్పన్ నాల్గిటన్ వాజులం**
ద్రెళ్ళన్ బెట్టుగ నేసి సూతుతల సందీప్తైక బాణాహతిన్
డొల్లం జేసి యదల్చి, యి ట్లతని యాటోపంబు మాన్పించి యు
త్ఫుల్లాస్యుండయి పోవ నడ్డపడినం ద్రుంచెం ద్రిగర్తావళిన్. **33**

ప్రతిపదార్థం: (సాత్యకి) భల్లంబు+ఒక్కటన్= ఒక్క బల్లెంతో; విల్లుత్రుంచి= కృతవర్మ వింటిని త్రుంచివేసి; రయము+ఒప్పన్= వేగం ఒప్పగా; నాల్గిటన్= నాల్గు బాణాలతో; వాజులన్= తేరిగుర్రాలను; త్రెళ్ళన్= తునిసిపడేటట్లు; బెట్టుగన్= గట్టిగా; ఏసి= కొట్టి; సూతుతలన్= సారథి తలను; సందీప్త= మండుతున్న; ఏక బాణ+ఆహతిన్= ఒక బాణం దెబ్బతో; డొల్లన్+చేసి= దొర్లిపోయేటట్లుగా చేసి (పడగొట్టి); ఇట్లు= ఈ విధంగా; అదల్చి= బెదరించి; అతని= కృతవర్మయొక్క; ఆటోపంబు= గర్వాన్ని; మాన్పించి= ఆపి వేసి; ఉత్ఫుల్ల= వికసించిన; ఆస్యుండు+అయి= మొగం కలవాడయి; పోవన్= పోగా; అడ్డపడినన్= దారికడ్డం రాగా; త్రిగర్త+ఆవళిన్= త్రిగర్త దేశపు సైన్యాన్ని; త్రుంచెన్= నరికివేసెను.

తాత్పర్యం: ఒక బల్లెంతో కృతవర్మ వింటిని (సాత్యకి) త్రుంచాడు. నాల్గు బాణాలతో తేరిగుర్రాలను కూల్చాడు. ఒక మండే బాణంతో సారథితలను దొర్లునట్లు చేశాడు. ఈ విధంగా కృతవర్మ గర్వాన్ని మాన్పించాడు. వికసించిన ముఖంతో పోబోయే అతడి దారికి అడ్డం రాగా, త్రిగర్తదేశసైన్యాన్ని కూడ సాత్యకి హతమార్చాడు.

వ. **ఇట్లు కృతవర్మ విరథుం డైన రయంబునం బురికొని యురవడించిన పాండవ సైన్యంబులం గని కుంభసంభవుం డా శినివరు విక్రమ విహారంబున కడ్డపడం గడంగక యా సైన్యంబుల సంరంభంబు దన విజృంభణంబున వారించి నిలిచె; నిత్తెఱంగునం ద్రిగర్తసేనఁ జిక్కువఱిచి తఱిమి చను నయ్యాదవరత్నంబు ప్రయత్నంబునకు భంగంబు సేయ నుత్తుంగ మాతంగంబును గొలిపి జలసంధుండు మదాంధుం డయి మార్కొనుటయు.** **34**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కృతవర్మ విరథుండయినన్= కృతవర్మ తేరులేనివాడు కాగా (రథం విరిగినవాడుగా); రయంబునన్= వేగంగా; పురికొని= క్రమ్ముకొని; ఉరవడించిన= వేగిరపడిన; పాండవసైన్యంబులన్+కని= పాండవసేనను చూచి; కుంభవసంభవుండు= ద్రోణాచార్యుడు; ఆ శినివరు= ఆ శినివంశములో ఉత్తముడైన వాని (సాత్యకిని); విక్రమ= శౌర్యమనే; విహారంబునకున్= ఆటకు; అడ్డపడన్= అడ్డం పోవటానికి; కడంగక= పూనుకోకుండా; ఆ సైన్యంబుల= ఆ సైన్యాల; సంరంభంబున్= ఆటోపమును; తన విజృంభణంబునన్= తన అతిశయంతో; వారించి= అడ్డుకొని; నిలిచెన్= నిలచాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; త్రిగర్తసేనన్= త్రిగర్తదేశ సైన్యమును; చిక్కువఱిచి= చీకాకుచేసి; తఱిమి= తఱిమివేసి; చను= పోతూ ఉన్న; ఆ+యాదవ

రత్నంబు= ఆ యాదవ వంశములో శ్రేష్ఠుడైన (సాత్యకి); ప్రయత్నంబునకు= చేసేపనికి; భంగము చేయన్= అవమానం చేయటానికి; ఉత్తుంగ మాతంగంబును= పెద్ద ఏనుగు నొకదానికి; కొలిపి= ఉసికొల్పి; జలసంధుండు= జలసంధుడనే రాజు; మదాంధుండయి= పొగరుతో కన్నులు కనబడకుండా; మార్కొనుటయున్= ఎదుర్కొనగా.

తాత్పర్యం: కృతవర్మ విరథుడు కాగా, పాండవ సైన్యాలు వేగంగా దూకుడుతో క్రమ్ముకోవటాన్ని ద్రోణుడు చూచి, శినివంశంలో ఉత్తముడయిన సాత్యకి వీరవిహారానికి అడ్డంపోకుండా, పాండవసైన్యాల ఆటోపాన్ని తన అతిశయంతో అడ్డుకొని నిలచాడు. త్రిగర్తదేశ సైన్యాన్ని భంగపరచి తరిమివేసి పోతూ ఉండే ఆ మేటి యాదవుడైన సాత్యకి చేసే పనికి భంగం కలిగించటానికి, జలసంధుడనే రాజు పొగరుబోతుతనంతో ఒక మదపుటేనుగును అతడి మీదకు ఉసికొల్పి ఎదుర్కొనగా.

జలసంధుం డను రాజు సాత్యకితో యుద్ధంబు సేసి చచ్చుట (సం. 7-91-24)

క. ప్రదర ప్రవాహమునన । మ్మదవద్ద్విరదంబు పటుగమన ముడిపి ముదం
బొదవిన సాత్యకి విలు బె । ట్టు దునిమె న మ్మగధనాథుఁడు మహోగ్రుం డై. 35

ప్రతిపదార్థం: ప్రదర ప్రవాహమునన్= బాణాల వెల్లువలో; ఆ+మదవత్+ద్విరదంబు= ఆ మదపుటేనుగుయొక్క; పటుగమనము= తీవ్రమైన వేగాన్ని; ఉడిపి= ఆపి; ముదంబు+ఒదవిన= సంతోషపడిన; సాత్యకి విలు= సాత్యకివింటిని; ఆ+మగధనాథుఁడు= ఆ మగధదేశపు రాజు; మహా+ఉగ్రుండు+ఐ= మిక్కిలి భయంకరుడై; బెట్టు= మిక్కిలి; తునిమెన్= త్రుంచాడు.

తాత్పర్యం: మాగధుడైన జలసంధుడు ఉసికొల్పిన మదపుటేనుగు వేగాన్ని తన బాణాల వరదతో సాత్యకి ఆపాడు. ఆ జలసంధుడు మహాకోపంతో సాత్యకివింటిని త్రుంచివేశాడు.

తే. తునిమి నవ్వుచు నేఁబది తూపు లురము । నందు నాఁటిన శైనేయుఁ డలిగి బెట్టి
దంపు విలుగొని యాతని ధనువు నఱకి । యుఱక యఱువది యమ్ములు వఱపె మేన. 36

ప్రతిపదార్థం: తునిమి= త్రుంచి (జలసంధుడు సాత్యకి విల్లును తునిమి); నవ్వుచున్= నవ్వుతూ; ఏఁబది తూపులు= ఏబది బాణాలు; ఉరమునందున్= గుండెమీద; నాటినన్= గ్రుచ్చగా; శైనేయుఁడు= సాత్యకి; అలిగి= కోపించి; బెట్టిదంపు విల్లు కొని= పెద్ద విల్లు తీసికొని; ఆతని ధనువు నఱకి= వింటిని తెగనరికి; ఉఱక= గురి చూచి; అఱువది అమ్ములు= అరవై బాణాలు; మేనన్= అతడి ఒడలిమీద; పఱపెన్= వేశాడు.

తాత్పర్యం: జలసంధుడు సాత్యకి విల్లును త్రుంచివేసి, యాభైబాణాలను అతడి గుండెమీద నాటాడు. దానికి కోపించి సాత్యకి, పెద్ద విల్లుతో అతడి వింటిని నరకివేసి, అరువది బాణాలతో గురిచూచి అతడి ఒడలిమీద కొట్టాడు.

వ. దానికిం జలింపక జలసంధుండు. 37

ప్రతిపదార్థం: దానికిం= అందులకు; చలింపక= జంకక; జలసంధుండు= జలసంధుడనేవాడు.

తాత్పర్యం: అందుకు జలసంధుడు భయపడక.

చ. పటుగతి నా శినిప్రవరు బాహువుఁ దోమర కీలితంబు సే
యుటయును గాక త్రుంచె ధను వుగ్రకృపాణము వైచి యాతఁ డు
త్కట మగు నల్క నొండువిలు గైకొని వాని నికృత్తహస్తునిం
ద్రుటిత శిరస్కునిం బ్రదరధూత మదావళుఁ జేసి యార్చినన్. 38

ప్రతిపదార్థం: (ఆ జలసంధుడు) పటుగతిన్= తీవ్రమైన పద్ధతితో; ఆ శినిప్రవరు= ఆ సాత్యకియొక్క; బాహువున్= భుజమును; తోమర కీలితంబు= తోమరమనే ఆయుధపు దెబ్బ తగిలేటట్లు; చేయుటయును= చేయుటమే; కాక= కాక; ధనువు= విల్లును; ఉగ్రకృపాణము= భయంకరమైన కత్తిని; వైచి= వేసి; త్రుంచెన్= త్రుంచాడు; ఆతఁడు= ఆ సాత్యకి; ఉత్కటము+అగు అల్కన్= ఎక్కువ కోపంతో; ఒండు విలు= ఇంకో వింటిని; కైకొని= తీసికొని; వానిన్= ఆ జలసంధుడిని; నికృత్తహస్తునిన్= నరకబడిన చేయికలవాడుగాను; త్రుటిత శిరస్కునిన్= త్రుంచబడిన తలకల వాడినిగాను; ప్రదరధూతమదావళున్= బాణం దెబ్బతో ఎగురగొట్టబడిన మదపుటేనుగు కలవాడినిగాను; చేసి; ఆర్చినన్= సింహనాదం చేయగా.

తాత్పర్యం: జలసంధుడు సాత్యకి బాహువును తోమరంతో కొట్టటమే కాకుండా, పెద్ద కత్తితో ఆతడి విల్లును కూడా త్రుంచాడు. దానికి కోపించిన సాత్యకి ఇంకొక విల్లు తీసుకొని, అతడి చేతిని నరికాడు. తలను త్రుంచాడు. బాణం దెబ్బతో మదపుటేనుగును ఎగురకొట్టి సింహనాదం చేశాడు.

క. **పెలుకుఱి యచ్చటి మూఁకలు । గలఁగిన గని తన ముఖంబు కయ్యంబునకున్**
బలియురఁ గృతవర్మాదుల । నిలిపి గురుఁడు వచ్చి యా శినిప్రభుఁ దాఁకెన్. **39**

ప్రతిపదార్థం: అచ్చటి మూఁకలు= అక్కడ ఉన్న సైనికులు; పెలుకుఱి= భయంతో వణుకుతూ; కలఁగినన్= చికాకు పడగా; కని= చూచి; తన ముఖంబు= తాను ఎదురుగా చేస్తున్న; కయ్యంబునకున్= యుద్ధానికి; బలియురన్= బలవంతులయిన; కృతవర్మ+ఆదులన్= కృతవర్మ మొదలయిన వారిని; నిలిపి= నిలిపి ఉంచి; గురుఁడు= ద్రోణుడు; వచ్చి= వచ్చి; ఆ శినిప్రభున్= ఆ శిని వంశపు రాజును (సాత్యకిని); తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: తన సైన్యం భయంతో వణుకుతూ చికాకుపడగా, ఆచార్యుడైన ద్రోణుడు చూచి, బలవంతులైన కృతవర్మాదులను తాను చేస్తున్న యుద్ధాన్ని చేయటానికి నిలిపి, తాను ఆ శినివంశరాజు (సాత్యకి)ని ఎదుర్కొన్నాడు.

వ. **ఇవ్విధంబునం గడంగిన కుంభసంభవుం జూచి యతని ప్రాపున దుర్మర్షణ దుస్సహ వికర్ణ దుర్ముఖ దుశ్శాసన చిత్రసేన ప్రముఖు లగు కురు కుమారు లొక్కపెట్ట కవిసి మిక్కుటం బగు తూర్యరవంబులతోఁ బెక్కమ్ముల సాత్యకిం బొదువ నత్తుములంబులకు దుర్యోధనుం డేతెంచి తమ్ములం గలిసినం గనుంగొని గురుండు వార లతని కోపుదు రను బుద్ధిఁ బాండవసేనాముఖంబునకుం జనుదెంచిన నయ్యచ్యుతానుజుం డారథికు లందఱ కన్నిరూపు లయి వారల శరాసారంబులు నివారించుచు నొకని నొకని ననేక బాణజాలంబుల నొప్పించుచుండ నక్కౌరవేశ్వరుం డుద్దామగతిని గవిసి వాలమ్ము లాతని తనువునం జొనిపిన నతండు.40**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; కడంగిన= పూనిన; కుంభసంభవున్+చూచి= ద్రోణాచార్యుడిని చూచి; అతని ప్రాపునన్= అతడి అండతో; దుర్మర్షణ దుస్సహ వికర్ణ దుర్ముఖ దుశ్శాసన చిత్రసేన ప్రముఖులు+అగు కురుకుమారులు= దుర్మర్షణుడు, దుస్సహుడు, వికర్ణుడు, దుర్ముఖుడు, దుశ్శాసనుడు, చిత్రసేనుడు మొదలైన ముఖ్యులైన కురుకుమారులు; ఒక్కపెట్టన్= ఒక్కమారుగా; కవిసి= క్రమ్ముకొని; మిక్కుటంబు+అగు= ఎక్కువైన; తూర్యరవంబులతోన్= కొమ్ము శబ్దాలతోను; పెక్కు+అమ్ములన్= చాల బాణాలతో; సాత్యకిన్ పొదువన్= సాత్యకిని క్రమ్ముకొనగా; ఆ+తుములమునకున్= ఆ సంకుల యుద్ధానికి; దుర్యోధనుండు= దుర్యోధనుడు; ఏతెంచి= వచ్చి; తమ్ములన్ కలిసినన్= తన తమ్ముళ్ళను చేరుకొనగా; కనుంగొని= చూచి; గురుండు= ద్రోణుడు; వారలు= ఆ కౌరవ కుమారులు; అతనికిన్= ఆ సాత్యకికి; పాండవ సేనాముఖంబునకున్= పాండవుల సేనల మొగకు; చనుదెంచినన్= రాగా; ఆ+అచ్యుత+అనుజుండు= ఆ కృష్ణుడి తమ్ముడు; ఆ రథికులు+అందఱకున్= ఆ కౌరవ

సేనానుల కందరికీ; అన్ని రూపులు+అయి= అన్నివిధాలైన ఆకారాలతో; వారల= ఆ కౌరవుల; శరాసారంబులన్= బాణవర్షాన్ని; నివారించుచున్= ఆపుచు; వారిన్= ఆ కౌరవులను; ఒకనిన్+ఒకనిన్= ఒకొక్కకళ్ళను; అనేకబాణజాలంబులన్= మిక్కిలి బాణాల గుంపుతో; నొప్పించుచుండన్= బాధిస్తూ ఉండగా; ఆ+కౌరవ+ఈశ్వరుండు= ఆ దుర్యోధనుడు; ఉద్దామగతిని= భయంకరమైన విధంగా; కవిసి= కమ్ముకొని; వాలమ్ములు= వంకరైన బాణాలను; ఆతని తనువున్+చొనిపినన్= ఆ సాత్యకి శరీరంలో గ్రుచ్చగా; అతండు= ఆ సాత్యకి.

తాత్పర్యం: ఈ విధంగా సాత్యకిని ఎదుర్కొన్న ద్రోణుని చూచిన కౌరవులు, అతడి అండతో దుర్మర్షణ, దుస్సహ, వికర్ణ, దుర్ముఖ, దుశ్శాసన, చిత్రసేనాదులయిన కురుకుమారులు తూర్యనాదాలతో, అనేక బాణాలతో సాత్యకిని క్రమ్ముకొనగా, ఆ సంకులసమరానికి దుర్యోధనుడు వచ్చి తన తమ్ములతో కలుసుకొన్నాడు. దానిని చూచిన ద్రోణుడు వారందరూ సాత్యకిని ఆపగలరు - అన్న బుద్ధితో పాండవసేన మొగకు మరల తాను వచ్చాడు. ఆ సమయంలో సాత్యకి ఆ కౌరవసేనానుల కందరికీ అనేక రకాలుగా కానవస్తూ, బాణాలతో వారిని బాధిస్తూ ఉండగా, దుర్యోధనుడు భయంకరమైన విధంగా క్రమ్ముకొన్నప్పుడు సాత్యకి (తరువాతి పద్యంతో అన్వయం).

క. **నగుచు విలు దునిమి తీవ్రా । శుగముల నొంచుటయు నీదు సుతు లెల్లను నా**
మృగపతివిక్రముపైఁ దఱ । చుగ నిగిడించిరి ప్రదీప్త సునిశిత శరముల్. **41**

ప్రతిపదార్థం: నగుచున్= ఆ సాత్యకి నవ్వుతూ; విలు తునిమి= ఆ దుర్యోధనుడి వింటిని త్రుంచివేసి; తీవ్ర+ఆశుగములన్= వాడి అయిన బాణాలతో; నొంచుటయున్= బాధించగా; నీదు సుతులు+ఎల్లన్= నీ కొడుకు లంతా; ఆ మృగపతి విక్రముపైన్= ఆ సింహపరాక్రముడిమీద; ప్రదీప్త= మండుతున్న; సునిశిత= వాడి అయిన; శరముల్= బాణాలను; తఱచుగన్= వరుసగా; నిగిడించిరి= ప్రయోగించారు.

తాత్పర్యం: సాత్యకి నవ్వుతూ దుర్యోధనుడి విల్లు త్రుంచివేసి, వాడి అయిన బాణాలతో అతడిని నొప్పించాడు. నీ కుమారులందరూ సింహవిక్రముడైన సాత్యకిమీద మండే వాడిబాణాలను ప్రయోగించారు.

క. **చిక్కు వడక సాత్యకి యొ । క్కొక్కరు నయిదయిదు దృఢ మహోగ్రాస్త్రములన్**
స్రుక్కించి యెనిమిదిటఁ బే । రుక్కున నక్కురునృపాలు నొడలం గ్రుచ్చెన్. **42**

ప్రతిపదార్థం: సాత్యకి చిక్కుపడక= సాత్యకి కష్టపడకుండా; ఒక్కొక్కరు= కౌరవకుమారులు ఒక రొకరు; అయిదు+అయిదు= ఐదు ఐదుగా; దృఢ, మహా+ఉగ్ర+అస్త్రములన్= చేవగల భయంకరమైన బాణాలతో; స్రుక్కించి= బాధపెట్టి; పేరు+ఉక్కునన్= పెద్దబలంతో; ఎనిమిదిటన్= ఎనిమిది బాణాలతో; ఆ+కురునృపాలు= ఆ సుయోధనుడి; ఒడలన్ గ్రుచ్చెన్= ఒంటిమీద గుచ్చాడు.

తాత్పర్యం: సాత్యకి సంకటపడకుండ ఆ కౌరవులను ఒక్కొక్కరిని భయంకరమైన ఐదుబాణాలతో బాధించి, దుర్యోధనుడి ఒంటిమీద ఎనిమిది బాణాలను పెనుబలంతో గ్రుచ్చాడు.

ఉ. **అంతటఁ బోక రత్నమయ మైన భుజంగ పతాక గూల్చి య**
త్యంత రయంబుమై ధనువు నశ్వచయంబును సూతుమేను నిం
తింతలు వ్రయ్యలై పడఁగ నేసిన బెగ్గిలి తేరు డిగ్గి భూ
కాంతుఁడు వాఱె సేన కలఁగంబడి మ్రోయ నతండు నవ్వఁగన్. **43**

ప్రతిపదార్థం: అంతటన్+పోక= ఆ మాత్రంతోనే ఆగకుండా (దుర్యోధనుడి శరీరాన్ని బాణాలతో గ్రుచ్చటంతోనే); రత్నమయము+ఐన= రత్నాలు తాపిన; భుజంగ పతాకన్= సర్పకేతనాన్ని; కూల్చి= పడగొట్టి; అత్యంతరయంబుమైన్= మిక్కిలి వేగంగా; ధనువున్= వింటిని; అశ్వచయంబును= గుర్రాలను; సూతుమేనున్= సారథి శరీరాన్ని; ఇంత+ఇంతలు= చిన్న చిన్న; వ్రయ్యలు+ఐ= ముక్కలుగా; పడఁగన్= క్రిందపడగా; ఏసినన్= కొట్టగా; బెగ్గిలి= భయపడి; భూకాంతుఁడు= రాజు (దుర్యోధనుడు); సేన= తన సైనికులు; కలఁగన్+పడి= చీకాకుపడి; మ్రోయన్= అరవగా; అతండు= ఆ సాత్యకి; నవ్వఁగన్= నవ్వుతూ ఉండగా; తేరు డిగ్గి= తేరు దిగి; పాఱెన్= పరుగెత్తిపోయాడు.

తాత్పర్యం: అంతటితో ఆగకుండ సాత్యకి రత్నాలు తాపిన భుజంగ పతాకాన్ని పడగొట్టి, వేగంగా వింటిని, గుర్రాలను, సారథి శరీరాన్ని చిన్నచిన్న ముక్కలుగా చీల్చి పడగొట్టగా, సుయోధనుడు భయపడి, తేరు దిగి తన సైన్యాలు కలకలంతో శబ్దంచేస్తూ ఉండగా, సాత్యకి నవ్వుతూ ఉండగా, - పరుగెత్తిపోయాడు.

వ. **ఇట్లు పాఱి చిత్రసేను నరదం బెక్కె నక్కోలాహలం బాలించి కృతవర్మ తనరథంబు రయంబున నద్దెసకుం బఱపం బనిచి యురవడి నరుగుదెంచినం గని శినిపుంగవుండును నిజస్యందనంబు సమ్ముఖంబు సేయించెఁ; నయ్యిరువురుం గొఱవి గొఱవిం దాఁకిన తెఱంగునం దలపడి యొండొరులపైఁ బ్రచండ బాణంబులు పరఁగించుచుం బోరునెడ జనార్దనానుజుండు హార్దిక్యు నతిక్రమించి.** 44

ప్రతిపదార్థం: (సుయోధనుడు) ఇట్లు పాఱి= ఈ ప్రకారం పరుగెత్తి; చిత్రసేను అరదంబు+ఎక్కెన్= చిత్రసేనుడి తేరుమీదికి ఎక్కాడు; ఆ+కోలాహలంబు ఆలించి= ఆ కలకలాన్ని విని; కృతవర్మ; తన రథంబున్= తన తేరును; రయంబునన్= వేగంగా; ఆ+దెసకున్= ఆ దిక్కుకు; పఱపన్= తోలగా; పనిచి= చేసి; ఉరవడిన్= వేగంగా; అరుగుదెంచినన్= రాగా; కని= చూచి; శినిపుంగవుండును= శిని వంశంలో శ్రేష్ఠుడును (సాత్యకి); నిజస్యందనంబును= తన తేరును; సమ్ముఖంబు చేయించెన్= కృతవర్మ తేరుకు ఎదురుగా పోనిచ్చాడు; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరు (సాత్యకి, కృతవర్మలు); కొఱవి కొఱవిన్ తాఁకిన తెఱంగునన్= మంటలతో నున్న కొరవి ఒకదాని నొకటి తాకినట్లుగా; తలపడి= ఎదుర్కొని; ఒండొరులపైన్= ఒకరిపై నొకరు; ప్రచండ బాణంబులు= తీవ్రమైన బాణాలను; పరఁగించుచున్+పోరు+ఎడన్= వేస్తూ యుద్ధం చేసేటప్పుడు; జనార్దన+అనుజుండు= జనార్దనుడి తోబుట్టు వైన సాత్యకి; హార్దిక్యున్= కృతవర్మను; అతిక్రమించి= మిగిలి.

తాత్పర్యం: ఈ విధంగా సుయోధనుడు పరుగెత్తి చిత్రసేనుడి తేరుమీదికి ఎక్కాడు. ఆ కలకలాన్ని విన్న కృతవర్మ తన తేరును ఆ దిక్కుకు తరుముకొని వచ్చాడు. ఆ ఉరవడిని చూచి, సాత్యకి తన తేరును కృతవర్మ తేరుకు ఎదురుగా పోనిచ్చాడు. ఆ ఇద్దరూ కొరవి - కొరవి తాకినట్లుగా తలపడి, ఒకరిమీద ఒకరు భయంకరమైన బాణాలను వేసుకొంటూ యుద్ధం చేసేటప్పుడు, సాత్యకి కృతవర్మను మించి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **హయములను సూతు నొంచి శరాసనంబుఁ । ద్రుంచి మెఱుఁగులు వెరిఁగిన దొడ్డనార**
సంబు మే నుచ్చిపో నేయఁ జచ్చినట్ల । మూర్ఛ వోయి మోఁకాళులు మోవఁబడియె. 45

ప్రతిపదార్థం: హయములను= గుర్రాలను; సూతున్= సారథిని; నొంచి= బాధించి; శరాసనంబును= వింటిని; త్రుంచి= ముక్కలు చేసి; మెఱుఁగులు= కాంతులు; పెరిఁగిన= ఎక్కువైన; దొడ్డ నారసంబు= పెద్ద వాడి అయిన బాణాన్ని; మేను+ఉచ్చిపోన్= శరీరాన్ని దూసుకొని పోగా; ఏయన్= కొట్టగా; చచ్చినట్లు+అ మూర్ఛపోయి= చచ్చినట్లు మూర్ఛపోయి; మోఁకాళులు మోవన్+పడియెన్= మోకాళ్ళు తన్ను మోయగా పడిపోయాడు(అనగా కుదించుకు పడిపోయాడు).

తాత్పర్యం: సాత్యకి కృతవర్మ గుఱ్ఱాలను చంపి, సారథిని బాధపెట్టి, వింటిని ముక్కలుచేసి, తళతళలాడే వాడి అయిన పెద్దబాణం అతడి శరీరాన్ని చీల్చుకొని పోయేటట్లు కొట్టగా అతడు చచ్చినట్లు మూర్ఛపోయి తన మోకాళ్ళమీద కుదియ పడ్డాడు.

వ. ఇత్తెఱంగునం దేరిపయిఁ గూలిన కృతవర్మం దెగియెన కాఁ దలంచి ధనంజయుం గలయం దమకించి సాత్యకి యక్కడఁ బోవ నా భోజపతి దెప్పిఱి సన్నద్ధుండై మరలి చని యెప్పటి నెలవున నిలిచి యనిలతనయ ప్రముఖుల కడ్డపడినం జూచి యాచార్యుం డచ్చోటి కతనిం జాలించి శౌర్యధుర్యుం డగు నా శినివరుం డట సనుట సైరింపం జాలక రయంబున. 46

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; తేరిపయిన్= తేరుమీద; కూలిన= పడిన; కృతవర్మన్= కృతవర్మను; తెగియెన కాన్+తలంచి= చనిపోయినాడనే తలచుకొని; ధనంజయున్= అర్జునుడిని; కలయన్= చేరగా; తమకించి= తొందరపడి; సాత్యకి అక్కడ పోవన్= సాత్యకి ఆ చోటకు పోగా; ఆ భోజపతి= ఆ భోజరాజైన కృతవర్మ; తెప్పిఱి= తేరుకొని; సన్నద్ధుండు+ఐ= సిద్ధంగా; మరలి చని= తిరిగి పోతూ; ఎప్పటి నెలవునన్= ఎప్పటిచోటున; నిలిచి= నిలబడి; అనిల తనయ ప్రముఖులకున్= భీమాది ముఖ్యమైన వారికి; అడ్డపడినన్= అడ్డంపోగా; చూచి; ఆచార్యుండు= ద్రోణుడు; ఆ+చోటికిన్= ఆ యుద్ధభూమికి; అతనిన్ చాలించి= అతడిని ఆపి; శౌర్యధుర్యుండు= వీరవరుడు; అగు= అయిన; ఆ శినివరుండు= ఆ సాత్యకి; అట చనుట= ఆ దిక్కునకు పోవటం; సైరింపన్+చాలక= ఓర్వలేక; రయంబునన్= వేగంగా.

తాత్పర్యం: ఈ విధంగా తేరుమీద పడిపోయిన కృతవర్మను చనిపోయాడని భావించిన సాత్యకి, అర్జునుడిని చూడటానికి తొందరపడుతూ పోగా, కృతవర్మ తెప్పరిల్లి లేచి ఎప్పటి మాదిరిగా భీమాదులకు అడ్డుపడగా చూచి, ద్రోణాచార్యుడు ఆ చోటి కతడిని నిలిపి, వీరవరుడైన సాత్యకి ధనంజయుడి దిక్కునకు పోవటం ఓర్వలేక మిక్కిలివేగంతో (తరువాతి పద్యంతో అన్వయం).

క. మగుడఁ జనియాఁ గి నిశితము । లగు నారాచములు మూఁట నతని నుదుట బె
ట్టుగ నాటినఁ ద్రిశిఖరయుత । నగము క్రియం బొలిచె నతఁడు నరవరముఖ్యా! 47

ప్రతిపదార్థం: నరవరముఖ్యా!= ఓ రాజశ్రేష్ఠుడా! (ఓ ధృతరాష్ట్రా!); మగుడన్+చని= తిరిగి వెళ్ళి; ఆగి= ఆపి; నిశితములు+అగు= వాడి అయిన; నారాచములు= తీవ్రమైన బాణాలు; మూఁటన్= మూడింటిని; అతని నుదుటన్= అతడి నెన్నుదురులో; బెట్టుగన్= దట్టంగా; నాఁటినన్= గ్రుచ్చగా; అతఁడు= ఆ సాత్యకి; త్రిశిఖర యుత నగము క్రియన్= మూడు కొండ కొమ్ములతో ఉన్న కొండవలె (త్రికూటాచలంవలె); పొలిచెన్= ఒప్పినాడు.

తాత్పర్యం: ఓ రాజా! ద్రోణాచార్యుడు సాత్యకిని ఆపి, వాడి అయిన మూడు బాణాలను అతడి నెన్నుదుటిలో నాటాడు. అప్పుడు సాత్యకి శిఖరాలు మూడింటితో కూడుకొన్న కొండవలె ఒప్పాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఆ రథికవరుండును గురునిపైఁ గ్రూర నారాచంబులు నిగుడించె; నిట్లు దొడంగి యయ్యిరువురు నొండొరు శరజాలంబులు వారించుచుఁ దురంగంబుల యంగంబుల రుధిరంబులు పూరించుచు సారథుల నొప్పించుచు మేనుల వాలమ్ముల గుప్పించుచు నసదృశంబు లగు కరలాఘవంబులు సదృశంబులుగా బోరునప్పుడు. 48

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ రథికవరుండు= ఆ రథికశ్రేష్ఠుడు (సాత్యకి); గురునిపైన్= ద్రోణాచార్యుడి మీద; క్రూరనారాచంబులు= వాడి అయిన బాణాలను; నిగుడించెన్= పరచాడు (వేశాడు); ఇట్లు= ఈ విధంగా; తొడంగి= పూనుకొని; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరును (ద్రోణసాత్యకులు); ఒండొరు శరజాలంబులు= ఒకరొకరి బాణాల గుంపును; వారించుచున్= అడ్డుకొంటూ; తురంగంబుల= గుఱ్ఱాల; అంగంబులన్= శరీరాలమీద; రుధిరంబులు= నెత్తురులు; పూరించుచున్= నింపుతూ; సారథుల నొప్పించుచున్= సారథులను బాధిస్తూ; మేనులన్= ఒడళ్ళమీద; వాలు+అమ్ములన్= వాడి బాణాలను; గుప్పించుచున్= కురిపిస్తూ; అసదృశంబులు+అగు= సాటిలేని; కరలాఘవంబులు= చేతివాటాలు; సదృశంబులుగాన్= సమానంగా; పోరునప్పుడు; యుద్ధం చేసేటప్పుడు.

తాత్పర్యం: ఆ సాత్యకి కూడ ద్రోణుడిమీద వాడిబాణాలను ప్రయోగించాడు. ఆ ఇద్దరూ పూనుకొని ఒకళ్ళొకళ్ళ బాణాలను తప్పుకొంటూ, గుఱ్ఱాల మేనులు నెత్తురుతో నింపుతూ, సారథులను బాధిస్తూ ఒడళ్ళమీద వంకర అయిన వాడి బాణాలు కురిపిస్తూ సాటిలేని చేతివాటాలతో సమానంగా యుద్ధం చేస్తూ ఉన్నప్పుడు.

మ. **ధనురాచార్యుఁడు కేశవానుజు ధనుర్దండంబు ద్రుంచెన్; గదం**
గొని వైచెన్ వడి నాతఁ డగ్గురుఁ డెడం గ్రూరంపు భల్లంబునం
దునుమం గ్రక్కున నొండు విల్లు గొని యాదోర్దర్పదుర్దాంతు మై
ఘనబాణంబుల నొంచె నించె నతఁ డాకాశంబు గర్జాధ్వనిన్. **49**

ప్రతిపదార్థం: ధనుః+ఆచార్యుఁడు= ద్రోణాచార్యుడు; కేశవ+అనుజు ధనుర్దండంబున్= కృష్ణుడి తమ్ముడైన సాత్యకి యొక్క వింటి దబ్బను; త్రుంచెన్= త్రుంచివేశాడు; ఆతఁడు= సాత్యకి; గదన్+కొని= గదను తీసికొని; వడిన్= త్వరగా; వైచెన్= కొట్టాడు; ఆ+గురుఁడు= ఆ ద్రోణాచార్యుడు; ఎడన్= సందుచూచి; క్రూరంపు= తీవ్రమయిన; భల్లంబునన్= బల్లెంతో; తునుమన్= త్రుంచగా (ఆ గదను త్రుంచగా); గ్రక్కునన్= వేగంగా; ఒండు విల్లు కొని= ఇంకొక వింటిని తీసికొని; ఆ దోర్దర్ప= ఆ భుజబల గర్వమునందు; దుర్దాంతు= అణచటానికి వీలుకాని బలంకలవాడియొక్క; మైన్= ఒంటిని; ఘనబాణంబులన్= గొప్ప బాణాలతో; అతఁడు= ఆ సాత్యకి; నొంచెన్= బాధించాడు; గర్జాధ్వనిన్= సింహగర్జనంతో; ఆకాశంబు నించెన్= ఆకాశాన్ని పూరించాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు సాత్యకి వింటి దబ్బను విరిచాడు. వెంటనే సాత్యకి గదతీసి, ఆచార్యుడిమీద వేశాడు. ఆయన అదనుచూచి వాడి బల్లెంతో ఆ గదను ముక్కలు చేశాడు. సాత్యకి వెంటనే మరొక విల్లు ఎత్తి, భుజ బలగర్వంలో అణచటానికి సాధ్యంకాని ఆచార్యుడి మేనిమీద గొప్ప బాణాలు గ్రుచ్చి, బాధించి, ఆకాశమంతా ప్రతిధ్వనించేటట్లు సింహగర్జన చేశాడు.

ఆ. **అలిగి గురుఁడు శక్తి నడరింప నది విధి । ప్రేరణమునఁ జేసి తేరు దాఁకెఁ**
గాని యతనిఁ దాఁకఁ గానద యతఁడు త । ద్బాహుశాఖ నొంచెఁ బటుశరమున. **50**

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణుడు; అలిగి= కోపించి; శక్తిన్+అడరింపన్= శక్తి అనే ఆయుధాన్ని (సాత్యకిమీదకు) వేయగా; అది= ఆ శక్తి; విధిప్రేరణమునన్+చేసి= దైవవిలాసంతో; తేరుతాఁకెన్+కాని= తేరు తాకింది కాని; అతనిన్+తాఁకన్+కానదు+అ= సాత్యకిని తాకలేకపోయింది; అతఁడు= ఆ సాత్యకి; తద్బాహుశాఖన్= అతడి శాఖ వంటి చేతులను; పటుశరమునన్= తీవ్రబాణంతో; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు కోపంతో సాత్యకిమీద శక్త్యాయుధాన్ని వేశాడు. అది దైవవిధి కారణంగా సాత్యకిని తాకకుండా అతడి తేరును తాకింది. సాత్యకి తీవ్రమైన బాణంతో ద్రోణుడి భుజాన్ని నొప్పించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. నొంచినం గోపించి. **51**

తాత్పర్యం: నొప్పించగా కోపించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. చాపాచార్యుఁడు సాత్యకి । చాపము దునుమాడి సూతు సమ్మూర్ఛితుఁ గా
నేపారియేయ రథ్య । వ్యాపారము దాన నడపి యతఁ డని సేసెన్. **52**

ప్రతిపదార్థం: చాపాచార్యుఁడు= ధనురాచార్యుడు; సాత్యకి చాపమున్= సాత్యకి వింటిని; తునుమాడి= త్రుంచి (ముక్కలు చేసి); సూతున్= సారథిని; సమ్మూర్ఛితున్+కాన్= మూర్ఛపోయిన వానినిగా; ఏపారి ఏయన్= మిగిలి కొట్టగా; అతఁడు= ఆ సాత్యకి; రథ్యవ్యాపారము= సారథి రథికుల పనిని; తాను+అ నడపి= తానే చేసి; అని చేసెన్= యుద్ధం చేశాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు సాత్యకి విల్లును త్రుంచాడు. సూతుడిని మూర్ఛపోగొట్టాడు. కాని, సాత్యకి తానే సారథిగాను, రథికుడుగాను రెండు పనులను చేస్తూ యుద్ధం చేశాడు.

వ. ఆలోన నతని రథచోదకుండు తెలిసిన నెలమిం బొంది. **53**

ప్రతిపదార్థం: ఆలోనన్= ఆ లోగా; అతని రథచోదకుండు= సాత్యకి సారథి; తెలిసినన్= తేరుకొనగా; ఎలమిన్= పొంది; సంతసించి.

తాత్పర్యం: అంతలోనే తన సారథికి స్పృహ రాగా సంతసించి.

క. బలువిడి బహుభంగుల ను । జ్జ్వల శరములఁ బోరి పోరి శైనేయుఁడు బె
ట్టిలఁ బడ సారథి నేసినఁ । దొలఁగంగాఁ బఱచె ద్రోణుతురగములు వెసన్. **54**

ప్రతిపదార్థం: శైనేయుఁడు= సాత్యకి; బలువిడిన్= శీఘ్రముగా; బహుభంగులన్= అనేకరకాలుగా; ఉజ్జ్వల= ప్రకాశించే; శరములన్= బాణాలతో; పోరి పోరి= యుద్ధంచేసి చేసి; సారథిన్= (ద్రోణుడి) సారథిని; ఇలన్= భూమిమీద; పడన్= పడగా; బెట్టు= గట్టిగా; ఏసినన్= కొట్టగా; ద్రోణుతురగములు= ద్రోణుడి గుర్రాలు; వెసన్= త్వరగా; తొలఁగంగాన్= తొలగి పోగా (యుద్ధంనుండి తప్పుకొని పోవునట్లు); పఱచెన్= పరుగెత్తినవి.

తాత్పర్యం: సాత్యకి అనేక విధాలుగా, శీఘ్రంగా, వెలిగే బాణాలతో యుద్ధం చేసి, తీవ్రంగా సారథిని నేల పడగొట్టగా ద్రోణుడి గుర్రాలు యుద్ధరంగం నుండి తొలగి ఆవలికి పరుగెత్తాయి.

ఆ. అచటి రాజలోక మగ్గురు నరదంబు । సనిన దిక్కు సనుచు సంభ్రమమున
నాఁగి కొనుఁడు పట్టుఁ డలుపుఁ డేయుఁ డ । శ్వముల ననఁగఁ దెరలె సైన్యసమితి. **55**

ప్రతిపదార్థం: అచటి రాజలోకము= అక్కడి రాజసమూహం; ఆ+గురునరదంబు= ఆ గురుడి తేరు; చనిన దిక్కు= పోయినదిక్కుకు; చనుచున్= పోతూ; సంభ్రమమునన్= తొందరతో; ఆఁగికొనుఁడు= ఆపండి; పట్టుఁడు= పట్టుకొనండి; అదలుపుఁడు= బెదిరించండి; అశ్వములన్+ఏయుఁడు= గుర్రాలను కొట్టండి; అనఁగన్= అనగా; సైన్యసమితి= సైన్యసమూహం; తెరలెన్= పరుగెత్తింది.

తాత్పర్యం: (సాత్యకి విజృంభణానికి) అక్కడి రాజులు ద్రోణుడి తేరు పోయిన దిక్కుకు త్వర త్వరగా వెళ్ళుతూ (ఆయనను) ఆపండి, పట్టుకొనండి, బెదిరించండి, గుర్రాలను పడగొట్టండి - అనగా సైన్యసమూహం పరుగెత్తింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇ వ్విధంబున నిజరథంబు విఫల మనోరథం బై పోయిన నదియ పోకగాఁ బోయి సన్నద్ధుం డై సముద్ధతం బైన పాంచాల బలంబుచేతం గలంగు తనమూఁకలం బురికొలిపికొని కుంభసంభవుం డవష్టంభ విజృంభణంబున సేనాముఖంబునం బొలిచి నిలిచె; నిత్తెఱంగున ద్రోణ కృతవర్మ దుర్యోధనాదులగు జెట్టి జోదుల బెట్టు పఱచి చిఱునవ్వొలయ సాత్యకి సారథితో ని ట్లనియె. 56

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; నిజరథంబు= తన తేరు; విఫల మనోరథంబు+ఐపోయినన్= ఫలించని కోరిక గలదై; అదియ పోకగాన్ పోయి= అదే పోకగా పోయి; సన్నద్ధుండు+ఐ= యుద్ధానికి తయారయి; సముద్ధతంబైన= గర్వంతో ఉన్న; పాంచాల బలంబులచేతన్= పాంచాల దేశపు సైన్యం వలన; కలంగు= చీకాకుపడే; తనమూఁకలన్= తన సైన్యాలను; పురికొలిపికొని= హెచ్చరిస్తూ (ప్రేరేపిస్తూ); కుంభసంభవుండు= ద్రోణాచార్యుడు; అవష్టంభ= గర్వంయొక్క; విజృంభణంబునన్= అతిశయంతో; సేనాముఖంబునన్ పొలిచి= సేనమొగంలో కానవచ్చి; నిలిచెన్= నిలిచాడు; ఈ+తెఱంగునన్= ఈ ప్రకారంగా; ద్రోణ= ద్రోణుడు; కృతవర్మ దుర్యోధన+ఆదులు= కృతవర్మ, దుర్యోధనుడు మొదలగువారు; అగు జెట్టిజోదులన్= శ్రేష్ఠులయిన మేటి వీరులను; బెట్టు పఱచి= మిక్కిలి బాధించి, తరిమి; చిఱునవ్వు+ఒలయన్= చిరునవ్వు కలుగగా; సాత్యకి; సారథితోన్; ఇట్లు+అనియెన్= తన సూతుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా తన తేరు వ్యర్థమై - పోయినదే పోకగా పరుగెత్తి పోగా యుద్ధానికి సిద్ధమైన పాంచాలసేనచేత చికాకు పడుతూ ఉన్న తన సైన్యాన్ని ప్రేరేపించి ద్రోణాచార్యుడు గర్వంతో సేన మొదట నిలిచాడు. సాత్యకి, ద్రోణ కృతవర్మ దుర్యోధనాదులయిన వీరులను తరిమికొట్టి, చిరునవ్వు నవ్వుతూ తన సారథితో ఈ విధంగా అన్నాడు.

క. 'ఇక్కడఁ గృష్ణుల తేజము, । నక్కడఁ బవమాననందనాది జనుల పే
రుక్కును గెలిపించె మనలఁ; । జిక్కక వెడలితిమి శత్రుసేనలచేతన్. 57

ప్రతిపదార్థం: ఇక్కడ= ఈ చోట; కృష్ణుల తేజము= కృష్ణార్జునుల శౌర్యం; అక్కడన్= ఆ చోట; పవమాన నందన+ఆది జనుల పేరు+ఉక్కు.ను= భీమసేనుడు మొదలయిన మనుష్యుల గొప్పశక్తి; మనలన్ గెలిపించెన్= మనలను గెలిపించినది; శత్రుసేనలచేతన్= శత్రుసేనల చేతికి; చిక్కక= చిక్కుకోకుండా; వెడలితిమి= బయటపడ్డాము.

తాత్పర్యం: 'శ్రీకృష్ణార్జునుల శౌర్యం ఇక్కడా, భీమాది జనుల పెనుబలం అక్కడా మనలను గెలిపించింది. శత్రుసేనల చేతికి దొరకకుండా తప్పించుకొని బయటపడ్డాము.'

వ. అని పలికి యర్జునుం డున్న దిక్కునకు రథంబు రయంబునం బఱపం బంచిన వాఁడును నట్ల చేయ విమలాశ్వవేగంబునం జారు భీషణం బగు నత్తేరు నీ వారికి దుర్నిరీక్ష్యంబై నభంబున భానురథంబు సనుచందంబున. 58

ప్రతిపదార్థం: అని పలికి= అని మాట్లాడి; అర్జునుండు+ఉన్న, దిక్కునకున్= అర్జునుడు ఉన్నవైపు; రథంబు= రథాన్ని; రయంబునన్= వేగంగా; పఱపన్= పోనిమ్మని; పంచినన్= ఆజ్ఞాపించగా; వాఁడును= సారథికూడా; అట్లు+అ+చేయన్= ఆ విధంగానే చేయగా; విమల+అశ్వవేగంబునన్= తెల్లనిగుర్రాలవేగంతో; చారు భీషణంబు+అగు= అందంగానూ, భయంకరంగానూఉన్న; ఆ+తేరు= ఆ రథం; నీ వారికిన్= నీ పక్షంవారికి (కౌరవవీరులకు); దుర్నిరీక్ష్యంబు+ఐ= చూడటానికి శక్యం కానిదై; నభంబునన్= ఆకాశంలో; భానురథంబు= సూర్యరథం; చను= వెళ్ళే; చందంబునన్= విధంగా.

తాత్పర్యం: అని చెప్పి, (సాత్యకి) అర్జునుడి వైపు తన తేరును శీఘ్రంగా తోలుమని సారథికి ఉత్తర్వు చేశాడు. వాడు (సారథి) సుందరం, భయంకరం అయిన, ఆ తేరును తోలాడు. కౌరవసేనకు ఆ రథం తెల్లని అశ్వాల వేగంతో ఆకాశంలో సూర్యరథంవలె చూడటానికి శక్యం కానిదై తోచింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సుదర్శనుం డనురాజు సాత్యకితో యుద్ధంబు సేసి చచ్చుట (సం. 7-94-6)

క. అరుగఁగ సుదర్శనుం డను। ధరణీపతి యడ్డపడియె దర్ప మలర న
య్యిరువురుఁ బెనంగుటయు న। చ్చెరువుం గావించె నచటి సేనల కెల్లన్. 59

ప్రతిపదార్థం: అరుగఁగన్= (సాత్యకి ఆ విధంగా) వెళ్ళగా; సుదర్శనుండు+అను ధరణీపతి= సుదర్శను డనే రాజు; అడ్డపడియెన్= అడ్డుపడ్డాడు; ఆ+ఇరువురున్=ఆ ఇద్దరూ (సుదర్శన సాత్యకులు); దర్పము+అలరన్= గర్వం వికసించగా; పెనంగుటయును= పోట్లాడగా; అచటి సేనలకున్+ఎల్లన్= అక్కడ ఉన్న సేనలకంతా (ఇరువాగులవారికి); అచ్చెరువు కావించెన్= ఆశ్చర్యాన్ని కలిగించింది.

తాత్పర్యం: (సాత్యకి వెళ్ళుతూ ఉండగా) సుదర్శను డనేరాజు అతడికి అడ్డుపడ్డాడు. ఆ ఇద్దరూ గర్వాతిశయంతో చేసిన పెనగులాట రెండు ప్రక్కల సైన్యాలకూ ఆశ్చర్యం కలిగించింది.

వ. అట్టి యెడ నమ్మహీనాథుండు. 60

తాత్పర్యం: ఆ సమయంలో ఆ సుదర్శను డనే రాజు.

క. పలు తునియలు సేయుచుఁ దూ। పుల దనదెసఁ జేరనీక పోర శినివరుం
డలిగి తురగముల సారథి। నిలఁగూల్చి తదుత్తమాంగ మేడ్తెఱ నఱకెన్. 61

ప్రతిపదార్థం: పలు తునియలు చేయుచున్= అనేక రకాలుగా ముక్కలు చేస్తూ; తూపులు= బాణాలు; తనదెసన్= తన దిక్కుకు; చేరన్+ఈక= చేరనీయకుండా; పోరన్= యుద్ధం చేయగా; శినివరుండు= సాత్యకి; అలిగి= కోపించి; తురగములన్= గుర్రాలను; సారథిన్= సూతుడిని; ఇలన్= భూమిమీద; కూల్చి= పడగొట్టి; తద్+ఉత్తమ+అంగమున్= అతడి తలను; ఏడ్తెఱన్ నఱకెన్= పరాక్రమంతో త్రుంచాడు.

తాత్పర్యం: సాత్యకి వేసే బాణాలను తనదగ్గరికి రానీయకుండా ముక్కలు ముక్కలు చేస్తూ యుద్ధం చేసే సరికి, సాత్యకి కోపించి, అతడి గుర్రాలనూ, సారథినీ పడగొట్టి భయంకరంగా అతడి తలను త్రుంచాడు.

వ. నఱకి నిజసారథిం జూచి. 62

తాత్పర్యం: (సుదర్శనుడి) తలను నరికివేసి, తన సారథిని చూచి.

క. 'గురుఁ డను జలనిధిఁ గడచితి;। నొరులు దలంపంగ నాకు నులిగాలువ లీ
నరపతుల సరకు గొన నీ। వరదము సననిమ్ము నేఁటి యని కలయకుమీ! ॥ 63

ప్రతిపదార్థం: గురుఁడు+అను జలనిధిన్= గురువనే సముద్రాన్ని; కడచితిన్= దాటాను; ఒరులు= ఇతరులు; నాకున్; తలంపంగన్= ఆలోచింపగా; నులిగాలువలు= పిల్లకాలువలు; ఈ నరపతులన్= ఈ రాజులను; సరకుగొనన్= లెక్కపెట్టను; నీవు; అరదము చననిమ్ము= తేరును పోనిమ్ము; నేఁటి అనికిన్= ఈ దినం యుద్ధానికి; అలయకుమీ!= అలసిపోవద్దు!

తాత్పర్యం: గురువైన ద్రోణు డనే సముద్రాన్ని దాటిన నేను, పిల్లకాలువల వంటి ఈ ఇతర రాజులను లెక్కచేయను. నీవు తేరును తోలుము. ఈనాటి యుద్ధానికి కలతపడవద్దు.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనవుడు వాఁడు నగుచు 'నీ విక్రమంబునకు నా వెరవు సంగడంబు గాదె! సంగరంబున నేమి సేయుదు? నెవ్వని పైఁ దేరు నడపుదు?' ననిన విని శినివరుండు వివ్వచ్చుచేతం జచ్చిన కరితురగ నరనికాయంబుల తిట్టలు సూపి 'యజ్జాడం దేరు వఱపు; మదె గాండీవగుణ చండనాదంబు వీతెంచుచున్న యది; నేఁడు పాండవ మధ్యముం డిచ్చిన ధనుర్విద్యా విలాసంబు మెఱయను బాండుసూనుల కేను జేయు భక్తి స్నేహంబులు నెఱపను వలయు; నా కడంక గని కురువిభుం డిరువురు ఫల్గునులను బుద్ధికలంగు నట్లు సేసెద' నని పలుకు నవసరంబున నద్దెసం గాంభోజ యవన సైన్యంబు లతని కడ్డపడం గడంగిన నవ్వీరుండు గుణంబు సారించి యబ్బలంబువలనికి దేరు వఱపించి. 64

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; వాఁడు= సాత్యకి యొక్క సారథి; నగుచున్= నవ్వుతూ; నీ విక్రమంబునకున్= నీ శౌర్యానికి; నా వెరవు= నా నేర్పరితనం; సంగడంబుకాదె!= తోడు కదా! (సాత్యకి శౌర్యానికి సారథి బండితోలు నేర్పరితనం చక్కని స్నేహితుడి వంటిదని భావం); సంగరంబునన్= యుద్ధంలో; ఏమి చేయుదున్?= నేనేమి చేయవలెను?; ఎవ్వనిపైన్ తేరునడపుదును?= ఎవడిమీదకు తేరును తోలవలయును?; అనినన్ విని= అనిన సారథి మాటలు విని; శినివరుండు= సాత్యకి; వివ్వచ్చుచేతన్+చచ్చిన= అర్జునుడిచేత చనిపోయిన; కరి, తురగ, నరనికాయంబుల= ఏనుగుల, గుర్రాల, మానవుల గుంపుల; తిట్టలు= రాశిని (కళేబరాల గుట్టలని భావం); చూపి; ఆ+జాడన్= ఆ దిక్కునకు; తేరు పఱపుము= తేరును తోలుము; అదె= అదిగో; గాండీవగుణ= గాండీవము అల్లెత్రాటి; చండనాదంబు= భయంకరమైన శబ్దం; వీతెంచుచున్న అది= వినవస్తూ ఉన్నది; నేఁడు= ఈ దినం; పాండవ మధ్యముండు= అర్జునుడు; ఇచ్చిన= నేర్పిన; ధనుర్విద్యా విలాసంబు మెఱయను= విలువిద్య యొక్క వైశిష్ట్యం ప్రకాశించ టానికి; పాండుసూనులకున్= పాండుపుత్రులకు; ఏను= నేను; చేయు భక్తి స్నేహంబులు= చేసే భక్తి స్నేహమూ; నెఱపను వలయున్ = ప్రదర్శించవలసి ఉన్నది; నా కడంకన్+కని= నా పూనికను చూచి; కురువిభుండు= దుర్యోధనుడు; ఇరువురు ఫల్గునులు= ఇద్దరు ఫల్గునులు (ఇద్దరు అర్జునులు); అను బుద్ధి కలంగునట్లు= అనే తలంపుతో చీకాకు పడేటట్లు, చేసెదన్= చేస్తాను; అని= అంటూ; పలుకు అవసరంబునన్= మాటాడే సమయంలో; అద్దెసన్= ఆ వైపున; కాంభోజ యవన సైన్యంబులు= కాంభోజ యవన సైన్యాలు; అతనికిన్= ఆ సాత్యకికి; అడ్డపడన్+కడంగినన్= అడ్డం రావటానికి ప్రయత్నించగా; ఆ+వీరుండు= ఆ వీరుడు; గుణంబు సారించి= అల్లెత్రాటిని సిద్ధంగా లాగి; ఆ+బలంబు వలనికిన్= ఆ సైనికులు ఉన్న ప్రక్కకు; తేరు పఱపించి= తన రథాన్నితోలించి.

తాత్పర్యం: సాత్యకి మాటలకు ఆతడి సారథి నవ్వుతూ 'నీ శౌర్యానికి నా నేర్పరితనం నెచ్చెలికదా! యుద్ధంలో తేరును ఏ దిక్కుకు ఎవరిమీదకు తోలేది?' అని అడిగాడు. అందుకు సాత్యకి అర్జునుడిచే హతమైన ఏనుగులు, గుర్రాలు, సైనికుల కుప్పలున్న దిక్కు చూపి, ఆ దిక్కు తేరు నడపుమన్నాడు. అదిగో భయంకరమైన 'గాండీవజ్యాధ్వని వినిపిస్తూ ఉన్నది. అర్జునుడు నేర్పిన ధనుర్విద్యా విలాసాన్ని మెరిపించటానికి, పాండుకుమారుల మీద నా కున్న భక్తి విశేషాలు చాటటానికీ, నా ప్రయత్నాన్ని చూచి దుర్యోధనుడు యుద్ధరంగంలో ఇర్వురు అర్జును లున్నారే అని కలతచెందటానికి తగినట్లు చేస్తాను.' అని అంటూ ఉండే సమయంలో, కాంభోజ యవన సైన్యాలు అతడి కడ్డురాగా; ఆ వీరుడు తన అల్లె త్రాటిని సారించాడు. ఆ సైనికుల దిక్కుకు తేరుతోలించాడు.

**క. నానాస్త్రంబులు ముందఱ । వే నిగుడన్ బడలువడిన వీరభటులపై
నేనుంగుల గుఱ్ఱంబుల । పీనుంగుల మీఁద దేరు పెలుచం బఱపెన్. 65**

ప్రతిపదార్థం: నానాస్త్రంబులు= అనేక రకాలైన బాణాలు; ముందఱన్= ముందుగా (తమ ముందు); వే నిగుడన్= వేగంగా గ్రుచ్చుకోగా; బడలుపడిన= అలసిపోయిన; వీరభటులపైన్= వీరులయిన సేనలమీద; ఏనుంగుల= ఏనుగుల; గుర్రంబుల= గుర్రాలయొక్క; పీనుంగులమీఁదన్= పీనుగులమీదుగా; తేరు= రథాన్ని; పెలుచన్= త్వరగా; పఱపెన్= తోలాడు.

తాత్పర్యం:అంతకు మునుపే అనేకాస్త్రాలు తమ మీద వేగంగా గ్రుచ్చుకోగా అలసిపోయిన వీర సైనికుల మీదుగా, ఏనుగుల, గుర్రాల, పీనుగుల మీదుగా త్వరగా తన తేరును తోలించాడు.

వ. ఇవ్విధంబున వెండియుం గిరాతశకబర్బర పారద యవన ప్రముఖ మ్లేచ్ఛసేనల రూపడంచి నీ మూఁకలు గలఁగం దఱిసి చిత్ర వర్మంబు మైచాయగా నారాచంబులు నఖంబులును విల్లు బలుమొగంబును నై బెబ్బులి వోలెం బోవం బోవ దుర్యోధన దుశ్శాసన చిత్రసేన వివింశతి శకుని దుస్సహ దుర్ధర్షణ క్రథప్రభృతి రథికనికరంబు రభసంబునం బోకు పోకు మను నెలుంగులతోఁ బిఱిందిదెసం దఱిమినం దత్కలకలంబు విని యతండు సూతు నాలోకించి. 66

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; వెండియున్= ఇంకను; కిరాత, శక, బర్బర, పారద, యవన, ప్రముఖ= కిరాత, శక, బర్బర, పారద, యవనులు మొదలగు; మ్లేచ్ఛసేనల= మ్లేచ్ఛసైనికుల; రూపు+అడంచి= నాశంచేసి; నీ మూఁకలు= నీ సేనలు; కలఁగన్= చికాకుపడగా; తఱిసి= దగ్గరకుపోయి; చిత్రవర్మంబు= రంగులున్న కవచం; మైచాయగాన్= శరీరపురంగు కాగా; నారాచంబులు= వాడిబాణాలు; నఖంబులును= గోళ్ళును; విల్లు బలుమొగంబునున్+ఐ= విల్లు బలమైన ముఖం గలదై; బెబ్బులిపోలెన్= పెద్దపులి మాదిరిగా; పోవన్+పోవన్= పోగా పోగా; దుర్యోధన, దుశ్శాసన, చిత్రసేన, వివింశతి, శకుని, దుస్సహ, దుర్ధర్షణ, క్రథ, ప్రభృతి= ఈ మొదలయిన; రథిక నికరంబు= సేనానుల సమూహం; రభసంబునన్= ఆర్భాటంతో; పోకుము పోకుము= పోవద్దు పోవద్దు; అను= అనేటటువంటి; ఎలుంగులతోన్= గొంతెత్తి పిలిచే శబ్దాలతో; పిఱింది దెసన్= వెనుకవైపులో; తఱిమినన్= తరుమగా; తత్కలకలంబు విని= ఆ కల్లోలాన్ని విని; అతండు= సాత్యకి; సూతున్+ఆలోకించి= సూతుడిని చూచి.

తాత్పర్యం: కిరాతులు, శకులు, బర్బరులు, పారదులు, యవనులు, - మొదలయిన ఆటవిక సైనికులను నాశనం చేసి, నీ సైనికులను చీకాకుపరచి, కవచం రంగులు ఒంటిరంగులుగా, బాణాలు గోళ్ళుగా, విల్లు బలమైన ముఖంగా పెద్దపులిమాదిరి పోగా, పోగా, దుర్యోధన దుశ్శాసన చిత్రసేన వివింశతి శకుని దుస్సహ దుర్ధర్షణ క్రథులు మొదలైన వీరుల సమూహాలు పోకు పోకుమని అదలిస్తూ వెన్నంటి ఆర్భాటంగా తరుముకొని రాగా, ఆ కలకలాన్ని విని తన సారథిని చూచి.

విశేషం: అలం: ఉపమ.

క. 'మందగతిఁ జనుము నావెను । కం దగిలెడు సైన్యజలధి గ్రక్కున శోషిం
పం దీవ్రశరార్చుల నం । దంద వడిం బఱపి నగుచు నరుగుద' మనినన్. 67

ప్రతిపదార్థం: (సారథిని చూచి); మందగతిన్= నెమ్మదిగా; చనుము= వెళ్ళుము; నా వెనుకన్= నా వెనుకప్రక్క; తగిలెడు= తాకేటటువంటి; సైన్యజలధిన్= సేనాసముద్రాన్ని; గ్రక్కునన్+శోషింపన్= వేగమే ఎండిపోయేటట్లు; తీవ్రశర+అర్చులన్= వాడి అయిన బాణాగ్నులను; అందంద= అక్కడక్కడ; వడిన్+పఱపి= శీఘ్రంగా; నగుచున్= నవ్వుతూ; అరుగుదము+అనినన్= వెళ్ళుదాము అనగా.

తాత్పర్యం: 'నెమ్మదిగా పొమ్ము. నా వెనుక తాకే సేనా సముద్రాన్ని శీఘ్రంగా ఎండిపోయేటట్లు వాడి అయిన బాణాలనే అగ్నులను అక్కడక్కడ వ్యాపింపజేసి నవ్వుతూ మనం వెళ్ళుదాము' అనగా.

విశేషం: అలం: రూపకం.

క. అతఁ డట్ల చేయ నబ్బల । మతిరయమున నెయిది పొదువ నరిగి కరిచతు
శ్శతియు హయత్రిశతియు వసు । మతిఁ గూల్చెను శినివరుండు మద మెలరారన్. 68

ప్రతిపదార్థం: అతఁడు= ఆ సారథి; అట్లు+అ చేయన్= ఆ ప్రకారమే చేయగా ఆ+బలము= ఆ కౌరవసైన్యం; అతిరయమునన్= మిక్కిలివేగంగా; ఎయిది= వెంబడించి; పొదువన్= క్రమ్ముకోగా; శినివరుండు= సాత్యకి; మదము+ఎలరారన్= దర్పం అతిశయించగా; అరిగి= వెళ్ళి; కరిచతుశ్శతియున్= నాలుగు వందల ఏనుగులను; హయత్రిశతియున్= మూడువందల గుర్రాలను; వసుమతిన్= భూమిమీద; కూల్చెన్= పడగొట్టాడు.

తాత్పర్యం: సాత్యకి చెప్పిన విధంగానే సారథి తేరు తోలగా, శీఘ్రంగా కురుసేన వేగంగా వెంబడించి క్రమ్ముకోగా - సాత్యకి దర్పాతిశయంతో నడిచి నన్నూరు ఏనుగులను, మున్నూరు గుర్రాలను హతమార్చాడు.

వ. అంత నిలువక చలంబున నా సేన శైనేయుపై బెట్టు గిట్టె; నట్టియెడ. 69

ప్రతిపదార్థం: అంతన్= అంతటితో; నిలువక= ఆగక; చలంబునన్= మత్సరంతో; ఆ సేన; శైనేయుపైన్= సాత్యకి మీద; బెట్టు= తీవ్రంగా; కిట్టెన్= తాకెను; అట్టి+ఎడన్= ఆ సమయంలో

తాత్పర్యం: అంతమాత్రంతో నిలువకుండా మత్సరంతో ఆ సేన సాత్యకిమీద తీవ్రంగా దాడిచేసింది; అప్పుడు.

క. నర తురగ ద్విరద రథో । త్కరములలో నతని శరము దాఁకనిరూపుం
బరికించియుఁ గానం ద । త్త్వరితత్వంబునకు వేఱ వర్ణన యేలా? 70

ప్రతిపదార్థం: నర తురగ ద్విరద రథ+ఉత్కరములలోన్= చతురంగ బలాలలో (రథగజ తురగ పదాతులలో); అతని శరము= సాత్యకియొక్క బాణం; తాఁకని రూపున్= తగులని ఆకారాన్ని; పరికించియున్= పరిశీలించి చూచికూడా; కానన్= కానలేనైతిని; తత్+త్వరితత్వంబునకున్= ఆ సాత్యకియొక్క వేగానికి (బాణప్రయోగ లాఘవశక్తికి); వేఱ= వేరే; వర్ణన+ఏలా?= వర్ణించటమెందుకు?

తాత్పర్యం: (కౌరవుల) చతురంగ బలాలలో సాత్యకి బాణం తగులని శరీరం వెదకి చూచినా కానరాదు. కాబట్టి ఆతడి అస్త్రప్రయోగ లాఘవశక్తిని వేరే వర్ణించటమెందుకు?

క. 'నరుబాహాస్ఫురణమునకు । సరి యగు నెక్కు డగుఁ గాని సాత్యకి భుజ వి
స్ఫురణం బల్పము గా' దని । సురనికురుంబంబు పొగడుచుం జూచె నృపా! 71

ప్రతిపదార్థం: నృపా!= ఓ ధృతరాష్ట్ర చక్రవర్తీ!; నరుబాహాస్ఫురణమునకున్= అర్జునుడి భుజశక్తి వ్యక్తీకరణానికి; సరి అగున్+ఎక్కుడగున్కాని= సమానమో లేక ఎక్కువో అవుతుంది కాని; సాత్యకి భుజవిస్ఫురణంబు+అల్పముకాదు= సాత్యకి భుజశక్తి తక్కువైనది కాదు; అని= అంటూ; సురనికురుంబంబు= దేవతాసమూహం; పొగడుచున్= కీర్తిస్తూ; చూచెన్= చూచింది.

తాత్పర్యం: ఓ రాజా! 'సాత్యకి భుజబలం తక్కువైంది కాదు. అర్జునుడి భుజశక్తికి సమానమో లేక ఒక్కింత ఎక్కువో అవుతుంది' అని దేవతాసమూహం పొగడుతూ చూచింది.

మ. కురుముఖ్యుండును దోడి సైనికులుఁ బెక్కుల్ దూపు లొక్కుమ్మడిం
గురియం బిన్నటి నవ్వుతో నతఁడు తత్కోదండ సూతాశ్వకే
తురథంబుల్ వికలత్వముం బొరయఁగా దోర్దర్పదుర్దాంతుఁ డై
వెరవుం జేవయు లావునుం దెలిపె నుర్వీనాథ! యా సేనకున్. 72

ప్రతిపదార్థం: ఉర్వీనాథ!= ఓ రాజా!; కురుముఖ్యుండును= దుర్యోధనుడును; తోడి సైనికులు= కూడి ఉన్న సేనయు; పెక్కుల్ తూపులు= పెక్కుబాణాలు; ఒక్కుమ్మడిన్ కురియన్= ఒక్కసారి (వానవలె) కురియగా; అతఁడు= సాత్యకి; పిన్నటి నవ్వుతోన్= చిరునవ్వుతో; తద్+ఆ కౌరవుల; కోదండ= విండ్లు; సూత= సారథులు; అశ్వ= గుర్రాలు; కేతు= జెండాలు; రథంబుల్= తేరులు;

వికలత్వమున్+పొరయఁగాన్= ముక్కలు కాగా; దోర్దర్ప= భుజబలంచేత; దుర్దాంతుఁడు+ఐ= జయించటానికి సాధ్యంకానివాడయి; ఆ సేనకున్= ఆ కురుసేనకు; వెరవున్= ఉపాయాన్ని; చేవయున్= శక్తిని; లావును= బలాన్ని; తెలిపెన్= తెలియజేశాడు.

తాత్పర్యం: ఓ రాజా! దుర్యోధనుడు, అతడి వెంట నున్న సైనికులు ఒక్కుమ్మడిగా పెక్కుబాణాలు కురిపించారు. సాత్యకి చిరునవ్వుతో వారి విండ్లను, సారథులను, గుఱ్ఱాలను, పతాకలను, తేరులను, ముక్కలుచేసి, అజేయుడై తన భుజబలాన్ని, ఉపాయాన్ని, శక్తిని ఆ సేనకు తెలియజేశాడు.

వ. అప్పుడు. 73

తాత్పర్యం: ఆ సమయంలో.

క. కదిసి నరేంద్రుఁడు సూతుని । మదమును దురగముల యుబ్బు మానిచి నిశిత
ప్రదరముల నతని యంగము । పొదివె శకుని దోడుపడఁగ భుజబల మలరన్. 74

ప్రతిపదార్థం: నరేంద్రుఁడు= సుయోధనుడు; కదిసి= చేరి; సూతుని మదమును= సారథి దర్పాన్ని; తురగముల ఉబ్బున్= గుఱ్ఱాల ఉత్సాహాన్ని; మానిచి= మాన్పివేసి; నిశిత ప్రదరములన్= వాడి అయిన బాణాలతో; భుజబలము+అలరన్= భుజశక్తి వికసించగా; శకుని తోడుపడఁగన్= శకుని సహాయంకాగా; అతని అంగమున్ పొదివెన్= అతడి శరీరమును క్రమ్ముకొన్నాడు.

తాత్పర్యం: శకుని తనకు సహాయపడగా తన భుజబలం అతిశయించగా దుర్యోధనుడు సాత్యకిని సమీపించి, అతని సారథి గర్వాన్ని, గుఱ్ఱాల ఉత్సాహాన్ని తగ్గించి వాడి బాణాలతో అతడి శరీరాన్ని కప్పివేశాడు.

వ. పొదివిన నొదవిన కోపంబు నాటోపంబున. 75

ప్రతిపదార్థం: పొదివినన్= కప్పివేయగా; ఒదవిన= కలిగిన; కోపంబు+ఆటోపంబునన్= కోపము యొక్క వేగిరపాటుతో

తాత్పర్యం: అట్లు కప్పివేయగా కలిగిన కోపం యొక్క వేగంతో.

మ. ధరణీనాథ! మురాంతకానుజుఁడు గాంధారేశు చాపంబునుం
గురువంశాగ్రణి సూతుకంఠము నతిక్రూరాస్త్రపాతంబునం
గరమాశ్చర్యము గాఁగఁ ద్రుంచినఁ దురంగస్తోమ మా మేదినీ
శ్వరు తే రచ్చటు వాయ నీడ్చికొని పెల్చంబాఱె దుర్వారమై. 76

ప్రతిపదార్థం: ధరణీనాథ!= ఓ రాజా! (ధృతరాష్ట్రా!); మురాంతక+అనుజుఁడు= సాత్యకి; గాంధార+ఈశు చాపంబునున్= శకుని వింటిని; కురువంశ+అగ్రణి సూతుకంఠమున్= దుర్యోధనుడి సారథికుత్తుకను; అతి క్రూర+అస్త్రపాతంబునన్= మిక్కిలి తీవ్రమయిన బాణాలను కురిపించటంచేత (వాడి బాణాలను వర్షపాతంవలె వేశాడని భావం); కరము= మిక్కిలి; ఆశ్చర్యముకాఁగన్= మిక్కిలి వింత గొల్పేటట్లు; త్రుంచినన్= నరకగా; తురంగ స్తోమము= గుఱ్ఱాల సమూహం (తేరు గుఱ్ఱాలు); ఆ మేదినీశ్వరుతేరున్= ఆ రాజుతేరును (దుర్యోధనుడి తేరును); అచ్చటు పాయన్= ఆ చోటును పాసిపోవటానికి; ఈడ్చికొని= లాగికొని; దుర్వారము+ఐ= అడ్డుకొనరానట్లుగా; పాఱెన్= పరుగెత్తింది.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర చక్రవర్తీ! సాత్యకి, శకుని విల్లునూ, దుర్యోధనుడి సారథి కుత్తుకనూ మిక్కిలి భయంకరమైన బాణాలతో, చూచేవారు ఆశ్చర్యపడేటట్లుగా త్రుంచివేశాడు. దుర్యోధనుడి తేరి గుఱ్ఱాలు అతని తేరును అడ్డుకొనటానికి వీలులేని విధంగా అక్కడి నుండి లాగి కొని వెళ్ళాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇత్తెఱంగునం బాఱిన. 77

తాత్పర్యం: ఈ విధంగా పరుగెత్తగా.

క. తమ్ములు దొరలును నేపఱి । యమ్మనుజాధిపునిపజ్జ కరుగుటయును సై
న్యమ్ము వెఱచఱచి విచ్చిన । నెమ్మదిఁ దన యరుగు దెస శినిప్రభుఁ డరిగెన్. 78

ప్రతిపదార్థం: తమ్ములున్= తన తమ్ములును; దొరలును= నాయకులును; ఏపు+అఱి= శక్తి ఉడిగి; ఆ+మనుజ+అధిపుని పజ్జకున్= ఆ రాజు ప్రక్కకు; అరుగుటయును= వెళ్ళగా; సైన్యమ్ము= సేన; వెఱచఱచి= భయపడి; విచ్చినన్= విడి పోగా; శిని ప్రభుఁడు= సాత్యకి; తన అరుగుదెసన్= తాను వెళ్ళే దిక్కుకు; నెమ్మదిన్= నెమ్మదిగా; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: (దుర్యోధనుడి) తమ్ములు, సేనానులు బలం ఉడిగి దుర్యోధనుని కౌరవసైన్యం భయపడి ప్రక్కకు వెళ్ళగా చెల్లాచెదరైపోగా, సాత్యకి తాను వెళ్ళుతున్న వైపు వెళ్ళాడు.

వ. అనిన విని యాంబికేయుండు సంజయున కి ట్లనియె. 79

ప్రతిపదార్థం: ఆంబికేయుండు= అంబికయొక్క కుమారుడు, ధృతరాష్ట్రుడు

తాత్పర్యం: అనగా సంజయుడితో ధృతరాష్ట్రుడు ఈ విధంగా అన్నాడు:

క. 'పులికిఁ బసులు పాఱిన క్రియ । నలవుఁ జలము సిగ్గు విడిచి య ట్లొక్కని కో
ల్లల కోర్వక విఱిగిన పు । త్రుల నే మని విందు నేను రోయక యింకన్?' 80

ప్రతిపదార్థం: పులికిన్ పసులు పాఱిన క్రియన్= పులిని చూచి పశువులు పర్వెత్తినట్లుగా; అలవున్= బలమును; చలమున్= పట్టుదలను; సిగ్గున్= సిగ్గును; విడిచి= వదలివేసి; అట్లు= ఆ మాదిరిగా; ఒక్కని= ఒకనియొక్క; కోల్లలకున్= ఎదురు దాడికి; ఓర్వలేక= ఓపలేక; విఱిగిన= ఓడిపోయిన; పుత్రులను= కొడుకులను (గురించి); ఇంకన్= ఇకమీదట; ఏను= నేను; రోయక= అసహ్యించుకోకుండా; ఏమని విందున్?= ఏమి గొప్పగా వినగలను?

తాత్పర్యం: 'ఒక్కడి బాణాలకు ఆ విధంగా పులిని చూచి పరుగెత్తే పశువులమాదిరి సిగ్గూ, బిడియమూ, పట్టుదలా, బలమూ వదలి పరుగెత్తిన కురు కుమారుల ఓటమికి అసహ్యపడకుండా ఇంకా ఏమని వినగలను?

క. అనుడు నతఁ డవ్విభుని కి । ట్లను 'నీవును నగ్రసుతుఁడు నవినయములు సే
సినఁ బాటిల్లిన యాపద । వినకుండఁగ వశమె? మీఁదు విను తెలియంగన్. 81

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; అతఁడు= ఆ సంజయుడు; ఆ విభునికిన్= ఆ ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; నీవును+అగ్రసుతుఁడును= నీవూ, నీ పెద్దకొడుకూ (దుర్యోధనుడును); అవినయములు= నీతిమాలిన పనులు; చేసినన్= చేయగా; పాటిల్లిన= కలిగిన, ఆపద= కష్టాన్ని; వినకుండఁగన్ వశమె?= వినకపోవటానికి సాధ్యమా?; తెలియంగన్= స్పష్టంగా (తెలిసేటట్లుగా); మీఁదు విను= ఆ పై కథను వినుము.

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'నీవూ నీ పెద్దకొడుకూ చేసిన అవినీతివలన కలిగిన ప్రమాదాలను వినకుంటే ఎలా? ఆ మీద జరిగిన కథను వినుము.

విశేషం: ఈ పద్యంలో సంజయుడు ఈ కలుగుతూ ఉన్న ప్రమాదాలను ధృతరాష్ట్ర దుర్యోధనుల అవినీతి ఫలితాలుగా తెలియజెప్పాడు.

వ. **అట్లు గాసి యై కోపించి నీ కొడుకు పురికొల్ప నంబష్ఠ టేంకణ పారద ప్రముఖ దేశంబుల బలంబులు దుశ్శాసన పురస్సరంబుగా రయంబునం జని సాత్యకిం జుట్టుముట్టిన నా జెట్టిమగండు నిజభుజ విక్రమాటోపంబునకుం బాటవంబు దలకొల్పిన.** **82**

ప్రతిపదార్థం: అట్లు గాసి ఐ= ఆ విధంగా కష్టపడి; కోపించి= కోపం చేసికొని; నీకొడుకు= నీ కొడుకైన దుర్యోధనుడు; పురికొల్పన్= ప్రేరేపించగా; అంబష్ఠ, టేంకణ, పారద ప్రముఖ= ఈ పేర్లుగల; దేశంబుల బలంబులు= దేశాల సైన్యాలు; దుశ్శాసన పురస్సరంబుగాన్= దుశ్శాసనుడిని ముందుపెట్టుకొని; రయంబునన్+చని= శీఘ్రంగా వెళ్ళి; చుట్టుముట్టినన్= చుట్టూ క్రమ్ముకోగా; ఆ జెట్టిమగండు= వీరశ్రేష్ఠుడు; నిజభుజ విక్రమ+ఆటోపంబునకున్= తన భుజబల విజృంభణానికి; పాటవంబు తలకొల్పినన్= నైపుణ్యం పూనిక కలిగించగా.

తాత్పర్యం: నీ సైనికులు, కుమారులు ఓడిపోగా, కోపంతో నీ కొడుకు దుర్యోధనుడు పురికొల్పగా, అంబష్ఠ, టేంకణ, పారద మొదలైన దేశాల సైన్యాలు దుశ్శాసనుడిని ముందుంచుకొని వేగంగా సాత్యకిని చుట్టుముట్టగా, సాత్యకి, తన భుజబల విజృంభణానికి నైపుణ్యాన్ని కల్పించి పోరు సాగించాడు.

మ. **విఱిగెం బెక్కు రథంబు; లొక్క మొగి నుర్విం గూలె శుండాలముల్;**
దఱచై రాలె దురంగమావయవ సంతానంబు; లింతింత లై
కుఱుకుల్ గట్టె భటాంగకంబులు రణక్షోణిం బ్రవాహంబు లై
పఱచెన్ నెత్తురు భూతకోటి విహరింపం బ్రస్తుతింపన్ సురల్. **83**

ప్రతిపదార్థం: విఱిగెన్+పెక్కురథంబులు= పెక్కుతేర్లు విరిగినవి; ఒక్క మొగిన్= ఒక్కవరుసగా; శుండాలముల్= ఏనుగులు; ఉర్విన్+కూలెన్= భూమిమీద పడ్డాయి (అనగా చనిపోయాయి); తురంగము+అవయవ, సంతానంబులు= గుర్రాల శరీరపు భాగాలు; తఱచై= విస్తారంగా; రాలెన్= రాలిపోయాయి (అనగా పడిపోయాయి); భట+అంగకంబులు= సైనికులయొక్క శరీరాలు; ఇంతింతలు+ఐ= చిన్న చిన్న ముక్కలుగా; కుఱుకుల్+కట్టెన్= రాశులు కట్టాయి (కుప్పలుగా అయినవి); రణక్షోణిన్= యుద్ధభూమిలో; భూతకోటి= పిశాచాల సమూహం; విహరింపన్= తిరగగా; సురల్ ప్రస్తుతింపన్= దేవతలు కీర్తించగా; నెత్తురు= రక్తము; ప్రవాహంబులు+ఐ+పఱచెన్= ప్రవాహంగా పారింది.

తాత్పర్యం: సాత్యకి భుజాటోపానికి అనేక రథాలు విరిగిపోయాయి, ఏనుగులు ఒక వరుసగా భూమిమీద కూలాయి; గుర్రాల శరీరాలు చిన్న ముక్కలై విస్తారంగా నేలరాలాయి, భటుల శరీరాలు యుద్ధరంగంలో రాసిపోసినట్లయ్యాయి, నెత్తురు ప్రవహిస్తూ ఉండగా, పిశాచసమూహం విహరించగా, దేవతలు కీర్తించగా (సాత్యకి యుద్ధం సాగింది).

దుశ్శాసనుఁడు సాత్యకితో యుద్ధంబు సేసి పాఱిపోవుట (సం. 7-97-29)

క. **రోషమున దుస్ససేనుఁడు । పాషాణప్రథన నిపుణ పార్వతికతతిన్**
భీషణముగఁ గవియింప జి । గీషం బొదువుటయుఁ జూడ్కిఁ గెంపారంగన్. **84**

ప్రతిపదార్థం: దుస్ససేనుఁడు= దుశ్శాసనుడు; రోషమునన్= రోషంతో; పాషాణ ప్రథన నిపుణ= రాళ్ళ యుద్ధంలో నేర్పరులైన; పార్వతిక తతిన్= కొండజాతివారిని; భీషణముగన్= భయంకరంగా; కవియింపన్= ఆక్రమింపచేయగా; జిగీషన్= జయేచ్ఛతో; పొదువుటయున్= క్రమ్ముకొనుటయు; చూడ్కి= తన చూపు; కెంపారంగన్= ఎర్రబడగా (అనగా కోపం కలుగగా).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దుశ్శాసనుడు కోపంతో రాళ్ళ యుద్ధంలో నేర్పరులైన కొండజాతివారిని భయంకరంగా ప్రేరేపించాడు. జయాశతో వారు క్రమ్ముకోగా సాత్యకి చూపు ఎఱ్ఱబడగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. శినివరుఁ డాఱా లెల్లను । దునియలుగా నేయ మగిడి తొరఁగుచు నవి వై
చినవారిన నొప్పింపఁగ । గనుకని నమ్మూఁక విచ్చెఁ గౌరవనాథా! 85

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ఓ కురురాజా!; శినివరుఁడు= సాత్యకి; ఆ ఱాలు+ఎల్లను= ఆ రాళ్ళన్నిటిని; తునియలుగాన్+ఏయన్= ముక్కలు చేయగా; మగిడి= మరల; తొరఁగుచున్= ద్రాలుచూ; అవి= ఆ రాళ్ళు; వైచిన వారిన్+అ= వేసినవారినే; నొప్పింపఁగన్= బాధించగా; కనుకని= సంభ్రమంతో (తొట్రుపాటుతో); ఆ+మూఁక= ఆ సైన్యం; విచ్చెన్= విరిసిపోయింది.

తాత్పర్యం: ఓ రాజా! సాత్యకి ఆ రాళ్ళ నన్నింటిని ముక్కలు చేయగా, అవి తిరిగి రాళ్ళు వేసిన వారిపైకి వెళ్ళి బాధించగా, ఆ సైన్యం భయంతో విచ్చిపోయింది.

తే. విచ్చుటయు నంటఁదాఁకి యవ్వీరుఁ డంప । వెల్లిఁ దేల్చిన వెగడంది పెల్లగిల్లి
యధిప! దుశ్శాసనుఁడు మొదలైన యోధ । గణము లెల్లను ద్రోణుని కడకుఁ బఱచె. 86

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; విచ్చుటయున్= విడిపోవుటయు; అంటన్+తాఁకి= తాకునట్లుగా దగ్గరై; ఆ+వీరుఁడు= ఆ సాత్యకి; అంపవెల్లిన్= బాణప్రవాహంలో; తేల్చినన్= తేల్చగా; వెగడు+అంది= భయపడి; పెల్లగిల్లి= లేచి; దుశ్శాసనుడు మొదలైన యోధగణములు+ఎల్లను= దుశ్శాసనుడు మొదలైన యుద్ధవీరులసమూహాలన్నీ; ద్రోణుని కడకున్= ద్రోణుడి దగ్గరకు; పఱచెన్= పరుగెత్తెను.

తాత్పర్యం: ఓ రాజా! వీరుడయిన ఆ సాత్యకి విచ్చిపోయిన సైన్యాన్ని అంటదాకి బాణప్రవాహంలో తేల్చగా భయపడి లేచి దుశ్శాసనుడు మొదలైన వీరులసమూహాలన్నీ ద్రోణుడి దగ్గరకు పరుగెత్తటం జరిగింది.

వ. ఇవ్విధంబునఁ దన చేరువకుం జనిన యా దుశ్శాసనునిం గనుంగొని మున్ను శైనేయు చన్నదెసం బుట్టిన యక్కోలాహలం బాకర్ణించుచున్న యగ్గురుం డి ట్లనియె. 87

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; తన చేరువకున్= తన దగ్గరకు; చనిన= పోయిన; ఆ దుశ్శాసనునిన్+కనుంగొని= ఆ దుశ్శాసనుడిని చూచి; మున్ను= ఇదివరకు; శైనేయు చన్నదెసన్= సాత్యకి వెళ్ళిన దిక్కులో; పుట్టిన= కలిగిన; ఆ+కోలాహలంబు= ఆ కలకలాన్ని; ఆకర్ణించుచున్న= వింటూ ఉన్న; ఆ+గురుండు= ఆ ద్రోణుడు; ఇట్లు+అనియెన్= ఈ ప్రకారంగా అన్నాడు.

తాత్పర్యం: తన దగ్గరకు చేరిన దుశ్శాసనుడిని చూచి, అంతకుముందే సాత్యకి పోయిన దిక్కులో కలిగిన కలకలాన్ని వింటూ ఉన్న ద్రోణుడు ఇట్లా అన్నాడు:

క. 'ఏమి యువరాజ విభునకు । సేమమె? సైంధవుని నేమి సేసె నరుఁడు? నీ
వేమిటి కి ట్లీరథిక । స్తోమముతో విఱిగి? తెందుఁ జొచ్చెద వింకన్? 88

ప్రతిపదార్థం: ఏమి= ఏమి; యువరాజ విభునకు సేమమె?= యువరాజైన దుర్యోధనుడు క్షేమంగా ఉన్నాడా?; నరుఁడు= అర్జునుడు; సైంధవునిన్= సైంధవుడిని; ఏమి చేసెన్?= ఏమి చేశాడు?; నీవు= నీవు (దుశ్శాసనా! నీవు); ఏమిటికిన్= ఏ కారణంగా; ఇట్లు= ఈ విధంగా; రథికస్తోమముతోన్= సేనానుల వరుసతో; విఱిగితి= ఓడిపోయావు?; ఇంకన్ ఎందున్ చొచ్చెదవు?= ఇంక ఎక్కడికి పోతావు?

తాత్పర్యం: 'ఏమయింది? యువరాజైన దుర్యోధనుడు క్షేమమా? అర్జునుడు సైంధవుడిని ఏమి చేశాడు? నీవు ఈ విధంగా ఈ వీరుల సమూహంతో కూడ ఎందుకు ఓడిపోయావు? ఇం కెక్కడికి పోతావు?

క. అడుకులు ది న్నట్లగునే? । కడుపునఁ గుట్టెత్తినపుడు గడుఁ బఱచితి నాఁ
డొడ లెఱుఁగక పాండుసుతుల । నుడిగి మడుగ వలసె; నిప్పు డొక సాత్యకిచేన్. 89

ప్రతిపదార్థం: కడుపునన్= కడుపులో; కుట్టు+ఎత్తినపుడు= నొప్పి కలిగినప్పుడు; అడుకులు= అటుకులు; తిన్నట్లు+అగునే?= తిన్నవిధంగా ఔతుందా?; నాఁడు= వెనుక; ఒడలు+ఎఱుఁగక= ఒళ్ళు తెలియక; పాండుసుతులన్= పాండు కుమారులను; కడున్= మిక్కిలి; పఱచితి= కష్టపెట్టావు; ఇపుడు= ఈ సమయంలో; ఒక సాత్యకిచేన్= ఒక సాత్యకి వలన; ఉడిగి= కష్టపెట్టబడి; మడుగ వలసెన్= అణగిపోవలసి వచ్చింది.

తాత్పర్యం: కడుపు కుట్టైనపుడు అటుకులు తిన్నట్లుగా వెనుక పాండవులను కష్టపెట్టావు. ఇపుడు ఒక్క సాత్యకి చేత కష్టపెట్టబడి అణిగిపోవలసి వచ్చింది.

విశేషం: అలం: నిదర్శన.

వ. భీమార్జునుల బారినుండి యేమి గాఁ గలవాఁ డ?' వని పలికి యలుక వొడమిన నంత నిలువక. 90

ప్రతిపదార్థం: భీమా+అర్జునుల, బారినుండి= భీమార్జునుల వలన కలిగే ప్రమాదం నుండి; ఏమి,కాన్+కలవాఁడవు= ఏ మౌతావు?; అని; పలికి; అలుక+పొడమినన్= కోపం కలుగగా; అంత= అంతటితో; నిలువక= ఆగక

తాత్పర్యం: భీమార్జునులచేత చిక్కి ఏ మౌతావో అని, కోపంతో ద్రోణుడు అంతతో ఆగక

చ. 'మఱచితె యా సభన్ భువనమాన్య గుణోత్తర యాజ్ఞసేని నీ
పఱచిన పాటుఁ? బాండవులఁ బల్కిన పల్కులు? నాఁటి క్రొవ్వు నే
డ్తెఱయును నెందుఁ బోయె? రణధీరుల వారల నల్గఁ జేసి సి
గ్గఱి తుది; నిట్టు లైతి; తగు నక్కట! తియ్యన గావె ప్రాణముల్? 91

ప్రతిపదార్థం: ఆ సభన్= ఆ సభలో (జూదమాడిన సభలో); భువనమాన్య గుణోత్తర= లోకంలో గౌరవించదగిన గుణవిశేషములు కలిగిన ఆమెను; యాజ్ఞసేనిన్= ద్రౌపదిని; నీ పఱచినపాటు= నీవు కష్టపెట్టిన విధము; ఆ సభన్= ఆ సభలో; పాండవులన్= పాండవులను; పల్కిన పలుకులు?= ఆడినమాటలు?; మఱచితె?= మరిచావా?; నాఁటి క్రొవ్వు= అప్పటి పొగరుయొక్క; ఏడ్తెఱయును= ఆ గొప్పతనం; ఎందున్+పోయెన్?= ఇప్పు డెక్కడికి పోయింది?; రణధీరులన్= యుద్ధవీరులను; వారలన్= పాండవులను; అల్గన్+చేసి= కోపింప చేసి; సిగ్గు+అఱి= సిగ్గువీడి; తుదిన్= చివరకు; ఇట్టులు+ఐతి= ఈ విధంగా అయ్యావు (ఈ భంగపాటు పడ్డావు); తగున్= తగి ఉన్నది; అక్కటా!= అయ్యో!; ప్రాణముల్= ప్రాణాలు; తియ్యన కావె!= తీపి కదా!

తాత్పర్యం: ఆ సభలో లోకమాన్య గుణోత్తర అయిన ద్రౌపదిని అవమానపరచిన విషయం, పాండవులను పలికిన మాటలు మరిచావా? అప్పటి కొవ్వు, దర్పం ఇప్పు డెక్కడికిపోయాయి? యుద్ధవీరులైన వారికి కోపం కలిగించి, సిగ్గువీడి తుదకు ఇట్లయ్యావు. అయ్యో! పాపం! ప్రాణాలు తీపే కదా!

ఆ. బ్రతుకఁ దలఁచితేని బాండునందనులకు । నింక నైనఁ బుడమి యిచ్చునట్లు
గాఁగ నన్నతోడఁ గార్యంబుఁ జెప్పు మ । వ్వెడఁగు భీష్ము బుద్ధి వినక చెడియె! 92

ప్రతిపదార్థం: బ్రతుకన్+తలఁచితేని= బ్రతికి ఉండటానికి ఇష్టముంటే; పాండునందనులకున్= పాండుకుమారులకు; ఇంకన్+ఐనన్= ఇప్పటికైనా; పుడమి ఇచ్చునట్లుగాఁగన్= రాజ్యం ఇచ్చేటట్లుగా; అన్నతోడన్= నీ అన్న అయిన సుయోధనుడితో, కార్యంబున్ చెప్పుము= చేయవలసిన పనిని చెప్పుము; ఆ+వెడఁగు= ఆ వెర్రివాడు (దుర్యోధనుడు); భీష్ముబుద్ధిన్= భీష్ముడి సలహాను; వినక= వినకుండా; చెడియెన్= చెడిపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: బ్రతుకుమీద ఆశ ఉంటే ఇప్పటికైనా పాండుకుమారులకు రాజ్యాన్ని ఇచ్చేటట్లుగా, చేయవలసిన పనిని మీ అన్నతో చెప్పుము. ఆ అవివేకి భీష్ముడి మాట వినక చెడిపోయాడు.

వ. ఇట్లు సేయఁజాల వైతేని. 93

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; చేయన్+చాలవు+ఐతి+ఏని= చేయలేని వాడవైతే

తాత్పర్యం: ఈ విధంగా చేయలేకపోతే.

క. ఎటు వోవ వచ్చు? నిను ముం । దట నిడుకొని పోరనున్న తగు రాజుల నె
క్కటఁ దోలెడి సాత్యకి నీ । వట దఱుముదు గాక! యొదుఁగ నగునే నీకున్?' 94

ప్రతిపదార్థం: ఎటు పోవవచ్చున్?= ఎక్కడికి పోదగును?; నినున్ ముందటన్ ఇడుకొని= నిన్ను ముందుగా పెట్టుకొని; పోరన్= యుద్ధం చేయగా; ఉన్న= ఉన్నటువంటి; తగురాజులన్= తగిన దొరలను; సాత్యకి; ఎక్కట= ఒక్కడుగా; తోలెడి= తరుముతున్నాడు; నీవున్= నీవు కూడా; అట తఱుముదు గాక= ఆ దిక్కులో తరిమి వేయుదువు గాక; నీకున్= నీకు; ఒదుఁగ నగునే?= అణగిపోవచ్చునా?

తాత్పర్యం: నిన్ను ముందు పెట్టుకొని యుద్ధానికై ఉన్న రాజులను సాత్యకి ఒకడే తరుముతూ ఉన్నాడు. నీవు కూడ అక్కడ శత్రువులను తరుము. అట్లా తరుమక అణగి పోవచ్చునా?'

క. అనుటయు నతండు వినియును । వినని చెవులు సేసి మగుడ విక్రమమునకున్
గొనకొని యేమియుఁ బలుకక । చనియె శిని ప్రవరుపజ్జ సమరంబునకున్. 95

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; అతండు= ఆ దుశ్శాసనుడు; వినియును= విన్నప్పటికినీ; వినని చెవులు చేసి= చెవిలో వినబడనట్లుగా నటించి; మగుడన్= మరల; విక్రమమునకున్= విజృంభించటానికి; గొనకొని= పూనుకొని; ఏమియున్ పలుకక= బదులేమీ చెప్పక; శినిప్రవరు పజ్జన్= సాత్యకి దిక్కుకు; సమరంబునకున్= యుద్ధానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ద్రోణుడి మాటలు విని, విననట్లుగా దుశ్శాసనుడు ఏమీ బదులు చెప్పక సాత్యకి వైపు యుద్ధానికై మరల శౌర్యంతో పూనుకొని వెళ్ళాడు.

వ. తదనంతరంబ యాచార్యుం డవార్యదోర్వీర్యంబు మెఱయం దఱిమి మెఱుంగు వాలమ్ముల వేఁడిమి సూపిన. 96

ప్రతిపదార్థం: తత్+అనంతరంబ= ఆ తరువాత; ఆచార్యుండు= ద్రోణుడు; అవార్య= అడ్డుకొనసాధ్యంకాని; దోః+వీర్యంబు= భుజ పరాక్రమము; మెరయన్= ప్రకాశించగా; తఱిమి= శత్రుసైన్యాన్ని తరుమగొట్టి; మెఱుంగు,వాలు+అమ్ములు= మెరుస్తున్నవాడి బాణాల యొక్క; వేఁడిమి= వేడిని; చూపినన్= చూపగా

తాత్పర్యం: ఆ తరువాత ద్రోణాచార్యుడు అడ్డుకొనటానికి వీలు లేని భుజబలం ప్రకాశించగా శత్రుసైన్యాలను తరుముతూ - మెరిసే వాడిబాణాల వేడి చూపించగా.

శా. పాండుక్ష్మావరసూను సైన్యములు దర్పం బేదుడున్ వీరకే
తుం డుగ్రంబునఁ దాఁకి యగ్గురుని సూతున్ నొంచి యేనమ్ము లు
ద్దండుం డై తను వాడ నేయుటయు నాతం డల్గి దీప్తోజ్జ్వల
చ్ఛండాస్త్రంబునఁ గూల్చె నా ద్రుపదసంజాతున్ మహోదగ్రతన్. 97

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పాండుక్ష్మావరసూను సైన్యములు= పాండురాజు కుమారుని సేనలు; దర్పంబు+ఏదుడున్= గర్వం నశించగా; వీర కేతుండు= వీరకేతుడనేవాడు; ఉగ్రంబునన్= కోపంతో; తాఁకి= తలపడి; ని+గురుని= ఆ ద్రోణుడిని; సూతున్= సారథిని; నొంచి= నొప్పించి; ఏను+అమ్ములు= ఐదు బాణాలు; ఉద్దండుండు+ఐ= అతిశయించినవాడై; తను వాడన్+ఏయుటయున్= ఒంటిమీద నాటగా కొట్టటంతో; ఆతఁడు= ద్రోణుడు; అల్గి= కోపించి; దీప్త+ఉజ్జ్వలత్+చండ+అస్త్రంబునన్= ప్రకాశిస్తూ ఉండే తీవ్రమయిన బాణంతో; మహా+ఉదగ్రతన్= మిక్కిలి భయంకరంగా; ఆ ద్రుపద సంజాతునిన్= ఆ ద్రుపదుడి కుమారుడిని (వీరకేతుని); కూల్చెన్= చంపాడు.

తాత్పర్యం: (ద్రోణుడి బాణాల తాకిడికి) శ్రేష్ఠుడైన పాండు రాజు కుమారుని సైన్యాలు గర్వాన్ని కోల్పోవగా, వీరకేతుడు ఆచార్యుడి సారథిని వాడి బాణాలతో నొప్పించాడు. ఆ ద్రుపదపుత్రుడిని ఆచార్యుడు ప్రకాశించే తీవ్రమైన వాడి బాణంతో కూల్చాడు.

వ. **ఇట్లు వీరకేతుండు పడినం గినిసి యతని యన్నలుందమ్ములు నగు చిత్రకేతుండును సుధన్వుండును జిత్రవర్మయు జిత్రరథుండును ద్రోణురథంబు బాణమయంబు సేసిన నతండు.** **98**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వీరకేతుండు పడినన్= వీరకేతుడు చనిపోగా; కినిసి= కోపించి; అతని అన్నలున్ తమ్ములున్= వాని అన్నదమ్ములు; అగు= అయిన; చిత్రకేతుండును, సుధన్వుండును, చిత్రవర్మయు, చిత్రరథుండును= ఈ పేరులు కలవారు; ద్రోణురథంబు= ద్రోణుడి తేరును; బాణమయంబు చేసి= బాణాలతో ముంచివేయగా; అతండు= ఆ ద్రోణుడు.

తాత్పర్యం: వీరకేతుడు పడిపోగా ఆతడి సోదరులు చిత్రకేతుడు, సుధన్వుడు, చిత్రవర్మ, చిత్రరథుడు అనేవారు ద్రోణాచార్యుడి తేరును బాణాలతో ముంచారు. దాని కాతడు (తరువాతి పద్యంతో అన్వయం).

క. **వారల రథ్యంబులఁ ద । త్సారథులం బొడ వడంచి ధరఁ దొరఁగించెన్**
వారిశిరంబులు పువ్వు ల । వారణమెయి డుల్చు గంధవహుఁడుం బోలెన్. **99**

ప్రతిపదార్థం: (ఆ ద్రోణుడు) వారల రథ్యంబులన్= చిత్రకేతు మొదలగు వారి గుర్రములను; తద్+సారథులన్= వారి సారథులను; పొడవు+అడంచి= నాశంచేసి; ధరన్= భూమిమీద; వారి శిరంబులు= ఆ నలుగురి తలలు; పువ్వులన్= పూలను; అవారణ మెయిన్= అడ్డులేక; డుల్చు= రాల్చు; గంధవహుఁడున్+పోలెన్= వాయుదేవుడి వలె; తొరఁగించెన్= పడేటట్లు చేశాడు.

తాత్పర్యం: ఆ ద్రోణుడు, చిత్రకేతుడు మొదలయిన నల్గురు సోదరులగుర్రాలను, సారథులను చంపి, అడ్డులేకుండా వాయుదేవుడు పూలను రాల్చినట్లు వారి తలలను భూమిమీద పడేటట్లుచేశాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. **అప్పు డాలోకించి ధృష్టద్యుమ్నుండు గెంజాయ రంజిల్లు కన్నులం గన్నీ రొలుకం గవిసి కుంభసంభవు నురంబునం గ్రూర నారాచంబులు సొనిపిన మనమూఁకలు హాహాకారంబుఁ లెసంగ నతండు మూర్ఛిల్లిన న ప్పాంచాలవరుండు.** **100**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఆలోకించి= చూచి; ధృష్టద్యుమ్నుండు; కెంజాయ రంజిల్లు కన్నులన్= ఎఱ్ఱని రంగుతో కూడిన కన్నులతో (కోపంతో); కవిసి= మీదకు దూకి; కుంభసంభవున్= ద్రోణుడిని; ఉరంబునన్= రొమ్ముపై; క్రూర= భయంకరమైన; నారాచంబులు= వాడిబాణాలు; చొనిపినన్= చొప్పించగా; మనమూఁకలు= మన సైన్యాలు; హాహాకారంబులు= దుఃఖసూచకమైన హాహా అను శబ్దాలు; ఎసంగన్= అతిశయించగా; అతండు= ద్రోణుడు; మూర్ఛిల్లినన్= మూర్ఛపోగా; ఆ+పాంచాలవరుండు= ఆ పాంచాల దేశీయులలో మొనగాడు (ధృష్టద్యుమ్నుడు).

తాత్పర్యం: అప్పుడు ధృష్టద్యుమ్నుడు ఆ సన్నివేశాన్ని చూచి, ఎఱ్ఱబారిన కన్నులనుండి కన్నీరు కారుస్తూ. కుపితుడై ద్రోణాచార్యుడిని ఎదుర్కొని, అతడి వక్షంమీద క్రూరమైన బాణాలను నాటాడు. ఆ దెబ్బకు ఆచార్యుడు మూర్ఛిల్లాడు. మన సేనలు హాహాకారాలు చేశాయి. అప్పుడు ధృష్టద్యుమ్నుడు (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **పలకయును వాలునుం గొని యలఘుజవము । మెఱయ నేలకు లంఘించి మెఱుఁగు మెఱచి**
నట్లు సని తల గోయుట కప్పళించి । యెగిరె నగ్గురు తేరిపై నేపు మెఱయ. 101

ప్రతిపదార్థం: పలకయును= డాలును; వాలునున్+కొని= కత్తిని తీసికొని; అలఘు జవము= గొప్పవేగం; మెఱయన్= ప్రకాశించగా; నేలకున్= భూమిపైకి; లంఘించి= దూకి; మెఱుఁగు= మెఱుపు; మెఱచినట్లు= వెలిగేటట్లుగా; చని= వెళ్ళి; తలకోయుటకున్= (ద్రోణుడి) తల నరకుటకు; అప్పళించి= ప్రయత్నించి; ఆ+గురుతేరిపైన్= ఆ గురుడి తేరుమీదకు (ద్రోణుడి తేరు మీదకు); ఏపు మెఱయన్= దర్పం ప్రకాశించగా; ఎగిరెన్= ఎగశాడు.

తాత్పర్యం: (ధృష్టద్యుమ్నుడు) కత్తిని, డాలును తీసికొని సాటిలేని శక్తితో ప్రకాశిస్తూ భూమిపైకి దూకి, మెరుపు మెరసినట్లు (క్షణంలో) వెళ్ళి, ద్రోణుడి తల నరికే ప్రయత్నంతో దర్పంతో అతడి తేరుమీదకు ఎగిరాడు.

వ. **అంతటం దెలిసి యాచార్యుండు ధైర్యధురంధరుండై యెదురు గదియంబడినప్పటికి సాధనంబు లగు జేనకొలంది తూపుల నతని నొప్పించినం గడుఁదురులు గఱచిన వెగడు పడునట్లు మొగతిరిగి యా ద్రుపదనందనుండు నిజస్యందనంబునకు వచ్చి విల్లు గొని పెల్లేసిన.** 102

ప్రతిపదార్థం: అంతటన్+తెలిసి= ఆ మీద ఒళ్ళు తెలిసి (మూర్ఛనుండి తేరుకొని); ఆచార్యుండు= ద్రోణాచార్యుడు; ధైర్యధురంధరుండు+ఐ= ధైర్యభారమును వహించినవాడై; ఎదురు కదియన్+పడిన+అప్పటికిన్= ఎదుర్కొన్న ఆ సమయానికి; సాధనంబులు+అగు= సాధనము లయిన; జేనకొలందితూపులన్= జేనెడు పరిమాణం గల బాణాలతో; అతనిన్+నొప్పించినన్= ఆ ధృష్టద్యుమ్నుడిని బాధించగా; కడుఁదురులు= కందిరీగలు; కఱచినన్= కుట్టగా; వెగడుపడునట్లు= తల్లడిల్లేటట్లు; మొగ తిరిగి= వెను తిరిగి; ఆ ద్రుపదనందనుండు= ఆ ధృష్టద్యుమ్నుడు; నిజస్యందనంబునకున్= తన తేరికి; వచ్చి; విల్లు కొని= వింటిని తీసికొని; పెల్లు+ఏసినన్= ఎక్కువగా బాణాలు వేయగా.

తాత్పర్యం: మూర్ఛనుండి తేరుకొని, ద్రోణుడు ధైర్యంతో ఎదుర్కొనినప్పుడు అప్పటికి చేతి కందిన సాధనాలయిన జానెడు పొడవు బాణాలతో ధృష్టద్యుమ్నుడిని బాధించగా, కందిరీగలు కరిచినట్లుగా బాధపడి వెనుతిరిగి, తన తేరిమీదకు వచ్చి విల్లందుకొని విస్తారంగా బాణాలు వేయగా.

విశేషం: అలం: ఉపమ.

క. **గురుఁ డతని సూతుఁ దునుముడుఁ । దురగములు రథంబు ననికి దొలఁగఁ దిగువ నా**
ధరణీసురోత్తముఁడు బం । ధుర పాండవ సైన్య సమితిఁ దోలెం బెలుచన్. 103

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణుడు; అతని సూతున్= ఆ ధృష్టద్యుమ్నుడి సారథిని; తునుముడున్= త్రుంచగా (చంపగా); తురగములు= గుర్రాలు; రథంబున్= తేరును; అనికిన్= యుద్ధానికి; తొలఁగన్= తొలగిపోయేటట్లు; తిగువన్= లాగగా; ఆ ధరణీ సుర+ఉత్తముఁడు= ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడు; బంధుర= దట్టమైన; పాండవ= పాండవులయొక్క; సైన్యసమితిన్= సేనాసమూహాన్ని; పెలుచన్= కోపంతో; తోలెన్= తరిమాడు (పశువులను తోలిన విధంగా తరిమాడు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి సారథిని చంపాడు. గుర్రాలు తేరును యుద్ధరంగం నుండి తొలగిపోయేటట్లు లాగాయి. అప్పుడు ఆ భూసురశ్రేష్ఠుడు దట్టమైన పాండవ సేనాసమూహాన్ని కోపంతో త్వరగా తరిమివేశాడు.

క. కలశజుని తెంపుఁ బెంపును । బలిమియునుం జూచి యపుడు పాండునృప తనూ
జుల దెస సైనికు లెవ్వరు । నలపు మెఱసి కడఁగఁ జాల రైరి నరేంద్రా! 104

ప్రతిపదార్థం: నరేంద్రా!= ఓ రాజా!; కలశజుని= ద్రోణుడి; తెంపున్= సాహసాన్నీ; పెంపును= గొప్పతనాన్నీ; బలిమియునున్+చూచి= బలమునూ చూచి; అపుడు= ఆ సమయాన; పాండునృప తనూజుల దెస= పాండురాజు కుమారుల దిక్కు; సైనికులు+ఎవ్వరున్= ఏ సైనికులూ కూడా; అలవు మెఱసి= బలం ప్రకాశింపజేసి; కడఁగన్+చాలరైరి= పూనుకొనలేకపోయారు.

తాత్పర్యం: ద్రోణుడి తెంపును, సాహసాన్నీ, బలాన్నీ చూచిన పాండవ సైనికులెవ్వరూ సాహసంతో ద్రోణుడి దిక్కుకు వెళ్ళలేకపోయారు.

వ. అట్టి యెడ. 105

తాత్పర్యం: అటువంటి సమయంలో.

ఆ. అవ్విధమునఁ బల్కి యాచార్యుఁ డట పుచ్చ । నరిగి దుస్ససేనుఁ డాశిని ప్ర
వీరుఁ దాఁకుటయును గౌరవపతి త్రిగ । ర్తుని బలంబుఁ బనిచెఁ దోడువడఁగ. 106

ప్రతిపదార్థం: ఆ+విధమునన్= ఆ ప్రకారంగా; పల్కి= మాటాడి; ఆచార్యుఁడు+అటపుచ్చన్= ద్రోణాచార్యుడు అటు పంపగా; దుస్ససేనుఁడు= దుశ్శాసనుడు; అరిగి= వెళ్ళి, ఆ శిని ప్రవరున్= ఆ శినివంశవీరుడిని(సాత్యకిని); తాఁకుటయును= ఎదుర్కొనటమూ; కౌరవపతి= దుర్యోధనుడు; తోడుపడఁగన్= సహాయపడగా; (దుశ్శాసనుడికి సహాయంకాగా); త్రిగర్తుని బలంబున్= త్రిగర్త దేశసైన్యాన్ని; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: (సంజయుడు ధృతరాష్ట్రుడితో) ఆ విధంగా చెప్పి, ఇంకా ఇట్లా చెప్పాడు. ద్రోణాచార్యుడు దుశ్శాసనుడిని సాత్యకిపైకి పంపాడు. ఆ దుశ్శాసనుడికి సాయంగా దుర్యోధనుడు త్రిగర్తదేశ సేనను పంపాడు.

వ. ఆ సంశప్తకులలో దండిమగలు మూఁడువేల రథంబులవారు బెట్టు గిట్టిన నా వృష్ణివీరుండు పంచశత ముఖ్య రథికులం బంచత్వంబు నొందించి, పెఱచతురంగ బలంబుల నెత్తుట జొత్తిల్లం జేసిన, నా త్రిగర్త సైన్యంబు దైన్యంబు నొంది ద్రోణు దెసకుం బఱచినం బోవక యువరాజు శైనేయుతోడ నానానిశిత శరంబుల దురంబు సేయ నతండు. 107

ప్రతిపదార్థం: ఆ సంశప్తకులలో= ఆ సంశప్తక తెగవారిలో; దండిమగలు= మేటి మొనగాండ్రు; మూఁడువేల రథంబులవారు= మూడువేల సంఖ్యగల రథికులు; బెట్టుగిట్టినన్= విజృంభించి సమీపించగా; ఆ వృష్ణివీరుండు= ఆ యాదవవీరుడు (సాత్యకి); పంచశత ముఖ్యరథికులన్= అయిదువందల మంది ముఖ్య రథికులను; పంచత్వంబున్+ఒందించి= చంపి; పెఱ= ఇతర; చతురంగ బలంబులన్= చతురంగ బలాలను (రథ గజ తురగ పదాతులను); నెత్తుటన్= నెత్తురులో; జొత్తిల్లన్= మునుగగా; చేసినన్= చేయగా; ఆ త్రిగర్త సైన్యంబు= ఆ త్రిగర్త దేశపు సేనలు; దైన్యంబున్+ఒంది= డిల్లపడి (దీనత్వమును పొంది); ద్రోణుదెసకున్= ద్రోణుడున్న దిక్కునకు; పఱచినన్= తరుమగా; పోవక= పోకుండా; యువరాజు= దుశ్శాసనుడు; శైనేయుతోడన్= సాత్యకితో; నానానిశిత శరంబులన్= అనేకము లయిన వాడిబాణాలతో; దురంబు చేయన్= యుద్ధం చేయగా; అతండు= ఆ సాత్యకి.

తాత్పర్యం: సంశప్తకులలో త్రిగర్త దేశీయులైన మేటి మొనగాండ్రు రథికులు మూడువేలమంది విజృంభించి మీదికి రాగా, ఆ వృష్ణివీరుడయిన సాత్యకి అయిదు వందలమందిని హతమార్చాడు. మిగిలిన చతురంగ బలాలను నెత్తుట ముంచాడు. దానితో ఆ త్రిగర్త సైన్యం దీనత్వాన్ని పొంది ద్రోణుడి దెసకు పరుగెత్తిపోయింది. అయినా తాను పోకుండా దుశ్శాసనుడు, సాత్యకితో నానా విధాలయిన వాడి బాణాలతో యుద్ధం చేశాడు. దానికి సాత్యకి. (తరువాతి పద్యంతో అన్వయం).

దుశ్శాసనుఁడు సాత్యకితో యుద్ధంబు సేసి యోడుట (సం. 7-99-28)

క. ధనువు దునిమి నవ్విన, నీ । తనయుఁడు పటు శక్తి వైచెఁ దలఁకక యది ప
ల్తునియలుగఁ జేసె సాత్యకి; । విను మాతం డతని నొందు విలు గొని నొంచెన్. 108

ప్రతిపదార్థం: ధనువు తునిమి= వింటిని త్రుంచివేసి; నవ్వినన్= నవ్వగా; నీ తనయుఁడు= నీ కొడుకు; తలఁకక= జంకకుండా; పటుశక్తి వైచెన్= తీవ్రమయిన శక్త్యాయుధాన్ని వేశాడు; అది= ఆ శక్తిని; సాత్యకి; పల్+తునియలుగన్+చేసెన్= అనేకములయిన ముక్కలుగా చేశాడు; వినుము= (ఆ మీద) వినుము; అతండు= ఆ దుశ్శాసనుడు; అతనిన్= ఆ సాత్యకిని; ఒండు విలు కొని= వేరొక వింటిని తీసికొని; నొంచెన్= బాధపెట్టాడు.

తాత్పర్యం: సాత్యకి దుశ్శాసనుడి విల్లును త్రుంచి నవ్వాడు. నీ కొడుకు వెనుకాడక, తీవ్రమయిన శక్తిని వేశాడు. దాని నాతడు పెక్కు ముక్కలు చేశాడు. అందు కాతడు వేరొక విల్లును తీసికొని సాత్యకిని బాధించాడు.

ఆ. అలిగి కృష్ణుతమ్ముఁ డతని చాపంబును । సూతుఁ దురగములను గేతనంబుఁ
దునిమి సొగయ నేసియును భీమసేను ప్ర । తిజ్ఞ దలఁచి చంపఁ దెగక చనియె. 109

ప్రతిపదార్థం: కృష్ణు తమ్ముఁడు= సాత్యకి; అలిగి= కోపించి; అతని చాపంబును= దుశ్శాసనుడి వింటిని; సూతున్= సారథిని; కేతనంబున్= ధ్వజమును (జెండాను); తునిమి= ఖండించి; సొగయన్ ఏసియును= మూర్ఛిల్లునట్లు కొట్టినప్పటికిని; భీమసేను ప్రతిజ్ఞ= భీముడి శపథాన్ని; తలఁచి= తలచుకొని; చంపన్+తెగక= చంపే సాహసం చేయక; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి తమ్ముడైన సాత్యకి కోపించి దుశ్శాసనుడి విల్లునూ, సారథినీ, ధ్వజాన్నీ పడగొట్టి మూర్ఛపోయేటట్లు చేశాడు. కాని, భీముడి శపథాన్ని తలచుకొని అతడిని చంపటానికి తెగించక వెళ్ళిపోయాడు.

విశేషం: పాండవ కౌరవుల జూదానికి తరువాత సభాపర్వంలో దుశ్శాసనుడు ద్రౌపదిని చాలా నీచంగా అవమానించాడు. ఆ సమయంలో భీమసేనుడు రణరంగంలో దుశ్శాసనుడి గుండెను చీల్చి అందరి ఎదుట అతడి రక్తాన్ని ఆస్వాదిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. అది సాత్యకి తలపునకు రావటంచేత దుశ్శాసనుడిని చంపక వదలి పెట్టాడు.

వ. అట ధర్మజ భీమ నకుల సహదేవులు సాత్యకి సేనఁ దఱియం జొచ్చుట యెఱింగి సైన్యంబులం బురికొల్పికొని ధృష్టద్యుమ్నాది యోధుల ము న్నిడికొని తఱిమిన మనవారును మార్కొని పెనంగి రా శైనేయుండును నీ సేన బడలువడం జేయుచు మున్నీటం బెనుఁ జోఁట దఱిసి పోవు తెఱంగునం బోవుచుండె; నంత నక్కడఁ గవ్వడియును యుగాంత కాలరుద్రుని కైవడి రౌద్రరసమయమూర్తియై తన మునుము మొనల బారి సమరుచుండె; మోహరంబు మొగంబున గురుండును గౌంతేయ బలంబులం బొరిగొనుచుండె; నివ్విధంబున నమ్ముప్పురచేతను బ్రజాక్షయం బగుచుండం గురుపతి భరద్వాజు నాజి యరసిపోవవచ్చి యచ్చటం బాండవ

సైనికుల సంరంభంబుఁ జూచి యేచి యొక్కరుండును దలకడచి యమ్మొన వనజ వనంబు సొచ్చు వారణంబును బోలెఁ దఱియం జొచ్చి భీమసేనుం బదిబాణంబులను, నకుల సహదేవ ద్రుపద విరాట ద్రౌపదేయుల సాయక త్రయంబులను, గేకయు లేవురను శరద్వయంబులను ధృష్టద్యుమ్నుని నిరువదింటను శిఖండిని మూఁటను ధర్మనందనుని నైదు దూపులను నేసి మఱియు ననేక తురగ ద్విరద రథనికరంబులం బటు ప్రదర శతంబుల నొప్పించె; నప్పుడు. 110

ప్రతిపదార్థం: అటన్= ఆచోట (పాండవుల వైపు); ధర్మజ భీమ నకుల సహదేవులు= ఈ నలుగురును; సాత్యకి; సేనన్= సేనను; తఱియన్+చొచ్చుట= సమీపించి ప్రవేశించటాన్ని; ఎఱింగి= తెలిసి; సైన్యంబులన్= సేనలను; పురికొల్పికొని= ప్రేరేపించుకొని; ధృష్టద్యుమ్న+ఆది యోధులన్= ధృష్టద్యుమ్నుడు మొదలయిన వీరులను; మున్ను+ఇడికొని= ముందుంచుకొని; తఱిమినన్= తరుమగా; మనవారును= మన (కౌరవుల) సైన్యం; మార్కొని= ఎదుర్కొని; పెనగిరి= యుద్ధంచేశారు; ఆ శైనేయుండును= ఆ సాత్యకియు; నీ సేనన్= నీ సైన్యాన్ని; బడలు వడన్+చేయుచున్= అలసిపోజేస్తూ; మున్నీటన్= సముద్రంలో; పెనుజోఁగు= పెద్ద సొరచేప; తఱిసి= దగ్గరకు పోయి; పోవు తెఱంగునన్= పోయే విధంగా; పోవుచుండెన్= పోతూ ఉన్నాడు; అంతన్= ఆ మీద; అక్కడన్= ఆ యుద్ధరంగంలో; కవ్వడియున్= అర్జునుడును; యుగాంత కాలరుద్రుని కైవడిన్= ప్రళయకాలంలోని కాలరుద్రుడి వలె; రౌద్రరసమయ మూర్తి ఐ= రౌద్రరసం మూర్తీభవించిన విధంగా; తన మునుము= తన ముందున్న; మొనలన్= సైన్యాలను; బారి సమరుచుండెన్= నాశము చేయుచుండెను; మోహరంబు మొగంబునన్= సేన మొదట; గురుండును= ద్రోణుండును; కౌంతేయబలంబులన్= పాండవసేనలను; పొరిగొనుచుండెన్= హతం చేస్తూ ఉన్నాడు; ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; ఆ+మువ్వురచేతను= ఆ ముగ్గురివలన (సాత్యకి, ద్రోణ, అర్జునులచేత); ప్రజాక్షయంబు= జననాశం; అగుచుండన్= అగుచుండగా; కురుపతి= దుర్యోధనుడు; భరద్వాజునాజి= ద్రోణుడి యుద్ధమును; అరసి పోవచ్చి= చూచిపోవుటకు వచ్చి; అచ్చుటన్+పాండవ సైనికుల సంరంభంబున్+చూచి= ఆ చోట పాండవ సేనయొక్క ఆర్భాటాన్ని చూచి; ఏచి= విజృంభించి; ఒక్కరుండును= ఒక్కడే; తలకడచి= ముందుదాటి; ఆ+మొనన్= ఆ సేనలో; వనజవనంబు చొచ్చు= తామరకొలనిలో ప్రవేశించే; వారణంబునున్ పోలెన్= ఏనుగువలె; తఱియన్+చొచ్చి= దగ్గరకు పోయి; భీమసేనున్+పదిబాణంబులను= భీముడిని పదిబాణాలతోను; నకుల సహదేవ ద్రుపద విరాట ద్రౌపదేయుల సాయక త్రయంబులను= నకులుడిని, సహదేవుడిని, ద్రుపదుడిని, విరాటుడిని, ఉపపాండవులను మూడేసి బాణాలతోను; కేకయులు+ఏవురను= కేకయ దేశీయు లయిదుగురను; శరద్వయంబులను= రెండు బాణాలతోను; ధృష్టద్యుమ్నుని ఇరువదింటను= ధృష్టద్యుమ్నుడిని ఇరువది బాణాలతోను; శిఖండిని మూఁటను= శిఖండిని మూడు బాణాలతోను; ధర్మనందనుని ఐదు తూపులను= ధర్మరాజును అయిదు బాణాలతోను; ఏసి= కొట్టి; మఱియున్= ఇంకనూ; తురగ ద్విరద రథనికరంబులన్= గుర్రాలను, ఏనుగులను, తేరులను; పటు= తీవ్రమయిన; ప్రదరశతంబులన్= నూర్లకొలది బాణాలతో; నొప్పించెన్= బాధించాడు; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: పాండవుల దిక్కు ధర్మజ భీమ నకుల సహదేవులు నలుగురూ సాత్యకి సేనను సమీపించటానికి సేనలను పురికొల్పుతూ ధృష్టద్యుమ్నాదులను ముందిడుకొని తరిమారు. అపుడు మనసేనకూ వారికీ తీవ్రమయిన యుద్ధం సాగింది. సాత్యకి కౌరవసేన అలసిపోయేటట్లుచేస్తూ సముద్రంలో దూరే సొరచేపవలె ఆ సైన్యంలోకి దూరిపోతూ ఉన్నాడు. అర్జును డారంగంలో ప్రళయకాల రుద్రుడివలె, మూర్తీభవించిన రౌద్రరసం మాదిరిగా తన ముందున్న మనసేనను నాశంచేస్తూ ఉన్నాడు. సేన మొదటద్రోణుడు కూడా పాండవ సైన్యాన్ని హతమారుస్తూ ఉన్నాడు. ఈ ప్రకారంగా సాత్యకి, అర్జున, ద్రోణులచేత జననాశం అవుతూ ఉన్నది. ద్రోణుడి యుద్ధాన్ని చూచి పోవచ్చిన దుర్యోధనుడు పాండవుల ఆర్భాటాన్ని చూచి, ఏకాకిగా ఆ సైన్యం తలకడచి తామర కొలనిలో దూకే ఏనుగు మాదిరిగా ఎదిరి సైన్యంలోకి వెళ్ళి, భీముడిని పదిబాణాలతోను, నకుల సహదేవ ద్రుపద విరాట ఉపపాండవులను మూడేసి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బాణాలతోను, అయిదుగురు కేకయులను రెండేసి బాణాలతోను, శిఖండిని మూటితోను, ధృష్టద్యుమ్నుడిని ఇరువది బాణాలతోను, శిఖండిని మూడు బాణాలతోను, ధర్మజుడిని అయిదు తూపులతోను కొట్టి, గుర్రాలను, ఏనుగులను, తేరులను వందలకొలది తీవ్రమయిన బాణాలతో బాధించాడు. అపుడు.

విశేషం: అలం: ఉపమ.

తే. **అతని చాపంబుఁ గుంతీసుతాగ్రజుండు । నఱకఁ బెఱవారు వొదివిన నుఱక వారి**
నెల్ల గుంభజుఁ డమ్ములవెల్లిఁ దేల్చి । యురవడించి యా సైన్యంబు నుబ్బడంచె. **111**

ప్రతిపదార్థం: అతని చాపంబున్= ఆ దుర్యోధనుడి వింటిని; కుంతీ సుత+అగ్రజుండు నఱకన్= కుంతి కుమారులలో పెద్దవాడయిన ధర్మరాజు నరుకగా; పెఱవారు= ఇతరులు; పొదివినన్= క్రమ్ముకోగా; ఉఱక= లెక్కపెట్టక; వారిన్+ఎల్లన్= వారందరినీ; కుంభజుఁడు= ద్రోణుడు; అమ్ముల వెల్లిన్= బాణాల వెల్లువలో; తేల్చి= తేలజేసి; ఉరవడించి= వేగిరపాటుతో; ఆ సైన్యంబు= ఆ సేనయొక్క; ఉబ్బు+అడంచెన్= గర్వాన్ని అణచాడు.

తాత్పర్యం: దుర్యోధనుడి విల్లును ధర్మరాజు నరికాడు. మిగిలినవారు అతడిని క్రమ్ముకొన్నారు. అందరను ద్రోణుడు బాణాలవెల్లువలో ముంచెత్తాడు. ఎదిరి సైన్యపు దర్పాన్ని అణచాడు.

వ. **కౌరవపతియు మగిడి యా సైంధవు కడకుం జనియె; దదనంతరంబ కేకయ మహీనాథుండు మార్కొని.** **112**

తాత్పర్యం: దుర్యోధనుడు మరల వెనుదిరిగి సైంధవుడి వద్దకు వెళ్ళాడు. తరువాత కేకయరాజు కౌరవసేనను ఎదుర్కొని.

క. **గురుఁ డెన్ని శరము లేసిన । వెరవున నన్నింటి నన్నివిశిఖంబులఁ దా**
మరలిచి బ్రహ్మాస్త్ర పరి । స్ఫురణము సూపిన దదస్త్రమునన యడంచెన్. **113**

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణుడు; ఎన్ని శరములు+ఏసినన్= ఎన్ని బాణాలు ప్రయోగించినప్పటికిని; వెరవునన్= ఉపాయంతో; అన్నింటిన్= అన్ని బాణాలను; అన్ని విశిఖంబులన్= అన్ని బాణాలతో; తాన్+మరలిచి= తాను త్రిప్పికొట్టి; బ్రహ్మాస్త్ర పరిస్ఫురణము చూపినన్= బ్రహ్మాస్త్రపు శక్తిని చూపగా; తద్+అస్త్రముననన= ఆ బాణముతోనే; అడంచెన్= నశింపజేశాడు.

తాత్పర్యం: ద్రోణుడు వేసిన బాణాలన్నింటిని కేకయరాజు అన్ని విధాలుగా తిప్పికొట్టి, అతడు ప్రయోగించిన బ్రహ్మాస్త్ర శక్తిని తన బ్రహ్మాస్త్రంతో అణచాడు.

క. **మఱియు నతని మెయి బాణము । లఱువది గిఱిగొలుప నా బృహత్ క్షత్రుం డే**
డ్తెఱ సూతు నొంప నాతం । డఱిముఱి నారాచతతుల నవ్విభుఁ బొదివెన్. **114**

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; అతని మెయిన్= అతడి శరీరంలో; బాణములు= ములుకులు; అఱువది గిఱిగొలుపన్= అరవై చుట్టుకొనేటట్లు చేయగా; ఆ బృహత్ క్షత్రుండు= ఆ బృహత్క్షత్రుడు; ఏడ్తెఱన్= విజృంభణంతో; సూతున్+నొంపన్= సూతుడిని బాధించగా; ఆతండు= ఆచార్యుడు; అఱిముఱిన్= సంభ్రమంతో; నారాచతతులన్= బాణాల సమూహాలతో; ఆ+విభున్= బృహత్క్షత్రుడిని; పొదివెన్= క్రమ్ముకొన్నాడు.

తాత్పర్యం: ఆచార్యుడు అరువది బాణాలను బృహత్ క్షత్రుడిని చుట్టుకొనేటట్లు వేశాడు. అతడు విజృంభించి ద్రోణుడి సారథిని నొప్పజేశాడు. దానికి ద్రోణుడు సంభ్రమంతో ఆ బృహత్ క్షత్రుడిని బాణ సమూహంతో క్రమ్ముకొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **చిక్కువడఁ జేసి చనుమఱ యొక్క దొడ్డ । నారసమ్మున బిట్టేయ నరవరుండు**
ద్రెళ్ళె; శిశుపాల తనయుండు ధృష్టకేతుఁ । డమ్మహావీరుపై వీఁక నడరి యపుడు. **115**

ప్రతిపదార్థం: చిక్కుపడన్+చేసి= అతడిని చిక్కుపడేటట్లుగా చేసి; చనుమఱన్= చన్నుభాగాన; ఒక్కదొడ్డ నారసమ్మునన్= ఒక్క బాణంతో; బిట్టు+ఏయన్= గట్టిగా కొట్టగా; నరవరుండు= గొప్పవాడైన బృహత్క్షత్రుడు; త్రెళ్ళెన్= చనిపోయాడు; శిశుపాలతనయుండు= శిశుపాలుడి కుమారుడైన; ధృష్టకేతుఁడు= ధృష్టకేతుడు అనేవాడు; ఆ+మహావీరుపైన్= ఆ గొప్పవీరుడైన ద్రోణుడిమీద; వీఁకన్= సాహసంతో; అడరి= విజృంభించి; అపుడు= ఆ సమయాన.

తాత్పర్యం: అతడిని చిక్కులలో పడవేసి, రొమ్ముమీద పెద్దవాడి బాణంతో తీవ్రంగా కొట్టగా ఆ రాజశ్రేష్ఠుడు మరణించాడు. అప్పుడు శిశుపాలుడి కొడుకు ధృష్టకేతుడు ఆ మహావీరుడైన ద్రోణుడి మీదికి సాహసంతో దూకాడు.

క. **పెనుమంట నుఱుకు శలభం । బును బోలెం గవిసి, కోలుపులిఁ గోలన్ వ్రే**
సిన మాడ్కి నేసె నఱువది । సునిశిత బాణముల నశ్వసూత యుతముగన్. **116**

ప్రతిపదార్థం: పెనుమంటన్= పెద్దమంటలో; ఉఱుకు= దూకే; శలభంబునుపోలెన్= మిడుతవలె; కలిసి= పరుగెత్తుకొని వచ్చి; కోలుపులిన్= పెద్దపులిని; కోలన్= కర్రతో; వ్రేసిన మాడ్కి= కొట్టినట్లు; అరువది సునిశిత బాణములన్= అరవై వాడి బాణాలతో; అశ్వ, సూత, యుతముగన్= గుర్రాలతోను, సారథితోను కూడినట్లుగా; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: (ధృష్టకేతుడు) పెద్దమంటలో దూకే మిడతవలె పరుగెత్తి, పెద్దపులిని కర్రతో కొట్టినట్లు అరవై వాడి బాణాలతో గుర్రాలను సారథితోకూడ కలిపి కొట్టాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. **బాణఘట్టనఁ గటకటఁ బడి గురుండు । విల్లు ద్రుంచిన నొండొకవింట నొంచె;**
నాతఁ డక్కుంభసంభవుఁ డతని విరథుఁ । జేసి యా విలు దునిమినఁ జేవ సెడక. **117**

ప్రతిపదార్థం: గురుండు= ద్రోణుడు; బాణఘట్టనన్= బాణాలను ఘట్టించుట చేత; కటకటన్+పడి= బాధపడి; విల్లున్+త్రుంచినన్= వింటిని త్రుంచగా; ఆతఁడు= ధృష్టకేతుడు; ఒండు+ఒక వింటన్= మరొక విల్లుతో; నొంచెన్= బాధించాడు; ఆ+కుంభసంభవుఁడు= ఆ ద్రోణుడు; అతనిన్= ఆ ధృష్టకేతువును; విరథున్+చేసి= రథం లేనివాడిగా చేసి; ఆ విలు= ఆ వింటిని; తునిమినన్= త్రుంచగా; చేవ చెడక= బలం తగ్గక.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు బాణాలు ఘట్టించి ధృష్టకేతువు విల్లును త్రుంచాడు. అతడు వేరొక విల్లుతో ఆచార్యుడిని బాధించాడు. ఆ ద్రోణుడు అతడిని విరథుడిని చేసి, విల్లును త్రుంచివేసినా ధైర్యం నశించకుండా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **గద వైచిన నది ద్రోణుని । ప్రదరంబుల నడఁగఁ దోమరము శక్తియు బె**
ట్టిదముగ నతఁ డడరించిన । మదమున నయ్యోధవరుఁడు మడియించె నెడన్. **118**

ప్రతిపదార్థం: గద వైచినన్= గదతో కొట్టగా; అది= ఆ గద; ద్రోణుని ప్రదరంబులన్= ద్రోణుడి యొక్క వాడిబాణాలతో; అడఁగన్= నశించగా; తోమరమున్ శక్తియున్= తోమరం; శక్తి అనే ఆయుధాలతో; బెట్టిదముగన్= తీవ్రంగా; అతఁడు అడరించినన్= అతడు ప్రయోగించగా; మదమునన్= అహంకారంతో; ఆ+యోధవరుఁడు= ఆ సైనిక శ్రేష్ఠుడు; ఎడన్= మధ్యలోనే; మడియించెన్= నాశనం చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అతడు గదను విసరగా, అది ద్రోణుడి వాడిబాణాలతో నశించింది. తరువాత తోమర, శక్తి ఆయుధాలతో తీవ్రంగా అతడు అదరించగా ద్రోణాచార్యుడు వాటిని నడుమనే నాశనం చేశాడు.

వ. ఇట్లు విగత సాధనుం జేసి. 119

తాత్పర్యం: ఈ ప్రకారంగా పోయిన సాధనాలు కలవాడినిగా చేసి.

క.. ఆలోనన మెఱుఁగారెడు। వాలిక నారసము చేదివరు హృదయమునం
గీలించినఁ బొడ వెగయుచు। నేలం బడి తన్నికొని చనియె జము కడకున్. 120

ప్రతిపదార్థం: ఆలోననన్+అ= ఆ లోగానే; మెఱుఁగారెడు= వాడి అయిన; వాలిక నారసము= వంకరైన తీవ్రబాణాన్ని; చేదివరు హృదయమునన్= చేదిరాజైన ధృష్టకేతుడి గుండెలో; కీలించినన్= తగిలించగా; పొడ వెగయుచున్= ఆకారం ఎగిసిపడుతూ; నేలన్+పడి= భూమిమీద పడి; తన్నికొని= గిజగిజలాడి; జముకడకున్= యముడి వద్దకు; చనియెన్= వెళ్ళాడు. (అనగా చనిపోయాడు).

తాత్పర్యం: అంతలోనే వాడి బాణం చేదిరాజైన ధృష్టకేతుడి గుండెలో నాటగా, ఆతడు ఎగిరి నేలపైబడి, గిజగిజ తన్నుకొని యముడి దగ్గరకు వెళ్ళాడు.

క. కని యాతని కొడు కడలుం। గనలుం బిరికొనఁగఁ దన్నుఁ గవిసినఁ బొదివెన్
ధనురాచార్యుఁడు శీఘ్రం। బున బెబ్బులికొదమ లేడిఁ బొదివిన మాడ్కిన్. 121

ప్రతిపదార్థం: కని= చూచి; ఆతని కొడుకు= ఆ ధృష్టకేతుడి కుమారుడు; అడలున్+కనలున్= భయం, కోపం; పిరికొనఁగన్= పెనవేసికొనగా; తన్నున్= తనను (ద్రోణుడిని); కవిసినన్= క్రమ్ముకొనగా; ధనురాచార్యుఁడు= ద్రోణాచార్యుడు; శీఘ్రంబునన్= వేగంగా; బెబ్బులి కొదమ= పెద్దపులి పిల్ల; లేడిన్= జింకను; పొదివిన మాడ్కిన్= క్రమ్ముకొన్న విధంగా; పొదివెన్= క్రమ్ముకొన్నాడు.

తాత్పర్యం: ధృష్టకేతుడి కొడుకు కోపభయాలు పెనవేసుకోగా ద్రోణుడిని క్రమ్ముకొన్నాడు. దానికి ద్రోణాచార్యుడు పెద్దపులిపిల్ల జింకను క్రమ్ముకొన్నట్లుగా చాలా వేగంగా అతడిని క్రమ్ముకొన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. పొదివి యవలీల నాతని బొలియఁ జేయ। సమదగతి మాఱుకొని జరాసంధ తనయుఁ
డస్త్రగురు నొంచుటయు నతం డల్గి యతని। గూల్చెఁ దత్సైనికులు గనుంగొనుచు నుండ. 122

ప్రతిపదార్థం: పొదివి= క్రమ్ముకొని; అవలీలన్= అనాయాసంగా; ఆతనిన్= ధృష్టకేతుడి కుమారుని; పొలియన్+చేయన్= చంపగా; జరాసంధ తనయుఁడు= జరాసంధుడి కుమారుడు; సమదగతిన్= ఆటోపంతో; మాఱుకొని= ఎదుర్కొని; అస్త్రగురున్= ధనురాచార్యుడిని (ద్రోణుని); నొంచుటయున్= నొవ్వజేయుటయు; అతఁడు+అల్గి= ధనురాచార్యుడు కోపించి; తత్సైనికులు కనుంగొనుచున్+ఉండన్= వాడి సేనలు చూచుచుండగనే; అతనిన్ కూల్చెన్= అతడిని చంపాడు.

తాత్పర్యం: ద్రోణుడు ధృష్టకేతుడి కుమారుడిని అనాయాసంగా చంపాడు. దానికి జరాసంధుడి కొడుకు ఆటోపంతో ఆచార్యుని ఎదుర్కొని నొవ్వజేశాడు. అందుకు ధనురాచార్యుడు కోపించి, అతడి సేనల ఎదుటనే అతడిని హతమార్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్టియెడ వడముడి ధృష్టద్యుమ్నుండు విన నవ్విప్రవరుం డప్రతిహత దపస్సిద్ధుండు గా కేమి చూపులన దహించు నట్ల తూపులవేఁడిమిం బగఱ రూపడంచుచున్నవాఁ డనిన నా ద్రుపదనందనుం డతని మార్కొనం గడంగునెడ నాతనిం దలకడచి. 123

ప్రతిపదార్థం: అట్టి ఎడన్= అటువంటి సమయంలో; ధృష్టద్యుమ్నుండు వినన్= ధృష్టద్యుమ్నుడు వినేటట్లుగా; వడముడి= భీమసేనుడు; ఆ+విప్రవరుండు= ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడు (ద్రోణుడు); అప్రతిహత= ఎదురులేని; తపః+సిద్ధుండు గాక+ఏమి= తపస్సిద్ధి కలవాడా ఏమి?; చూపులను= చూచినంత మాత్రాన; దహించు అట్లు= కాల్చేటట్లుగా; తూపుల వేఁడిమిన్= బాణాగ్నిచేత; పగఱ= శత్రువుల; రూపు+అడంచుచున్నవాఁడు= నాశం చేస్తున్నాడు; అనినన్= అనగా; ఆ ద్రుపదనందనుండు= ఆ ధృష్టద్యుమ్నుడు; అతనిన్ మార్కొనన్ కడంగుఎడన్= అతడిని ఎదుర్కొన ప్రయత్నిస్తూ ఉండగా; ఆతనిన్= ఆచార్యుడిని; తల కడచి= అతిక్రమించి.

తాత్పర్యం: ఆ సమయాన భీముడు ధృష్టద్యుమ్నుడు వినేటట్లుగా 'ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు (ద్రోణుడు) ఎదురులేని తపశ్శక్తి కలవాడా ఏమి? చూచినంత మాత్రాన కాల్చివేసేటట్లుగా, బాణాగ్నితో శత్రునాశం చేస్తున్నాడు' అనగానే ఆతడు ఆచార్యుడిని ఎదుర్కొనటానికి ప్రయత్నిస్తూ అతిక్రమించి.

ఆ. క్షత్రవర్మ గురుని చాపంబు ద్రుంచిన। వేఱ యొక్క దొడ్డ విల్లు రయము
మెఱయఁ గొని యతండు మెఱుఁగులు గిఱికొను। నారసమున వాని నామ మడఁచె. 124

ప్రతిపదార్థం: క్షత్రవర్మ= క్షత్రవర్మ అనేవాడు; గురుని చాపంబు త్రుంచినన్= ద్రోణాచార్యుడి విల్లు త్రుంచగా; అతండు= ఆచార్యుడు; వేఱ ఒక్క దొడ్డవిల్లు= ఇంకొక పెద్దవిల్లు; రయము మెఱయన్= వేగం ప్రకాశించగా; కొని= తీసికొని; మెఱుఁగులు= మిణుగురులు(మంటలు); గిఱికొను= చుట్టుకొను; నారసమునన్= వాడి బాణముతో; వాని= ఆ క్షత్రవర్మయొక్క; నామము+అడఁచెన్= చంపాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడి విల్లును క్షత్రవర్మ త్రుంచాడు. దాని కాచార్యుడు వేరొక విల్లును తీసికొని నిప్పులు చెరిగే బాణాలతో అతడిని చంపాడు.

ఉ. అప్పుడు చేకితానుఁడు శతాశుగముల్ గురుమేనఁ గ్రుచ్చి తే
రొప్పుఱ సూతు నొంచి తురగోద్ధతి మాన్స నతండు గన్నులన్
నిప్పులు రాలఁ దద్భుజము నిష్ఠుర బాణహతంబు సేసి వే
కప్పె శరాళి సూతుఁడు దెగన్ హరు లోటఱి గ్రేళ్ళు వాఱఁగన్. 125

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; చేకితానుఁడు= చేకితాను డనే యాదవరాజు; గురుమేనన్= గురుడగు ద్రోణుడి శరీరంలో; శత+ఆశుగముల్ గ్రుచ్చి= నూరు వాడి బాణాలను గ్రుచ్చి; తేరు; ఒప్పు+అఱన్= అందం నశించగా (నాశంచేసి); సూతున్+నొంచి= సారథిని బాధించి; తురగ+ఉద్ధతిన్= గుర్రాల ఏపును; మాన్పన్= మాన్పించగా; అతండు= ఆ ద్రోణుడు; కన్నులన్ నిప్పులు రాలన్= కన్నులనుండి నిప్పులు రాలగా (కోపంతో); తద్= ఆ చేకితానుడి; భుజము= చేతిని; నిష్ఠురబాణహతంబు చేసి= తీవ్రమయిన బాణంతో పడగొట్టి; సూతుఁడు తెగన్= సారథి చావగా; హరులు= గుర్రాలు; ఓటఱి= నిస్సత్త్వంగా; క్రేళ్ళు పాఱఁగన్= ఎగిరిపడగా; శరాళిన్ కప్పెన్= బాణ సమూహంతో కప్పాడు.

తాత్పర్యం: చేకితాను డనే యాదవరాజు ద్రోణుడి శరీరంలోకి వాడి బాణాలను గ్రుచ్చి, తేరును నాశంచేసి, సారథిని నొప్పించి గుర్రాల వేగాన్ని తగ్గించాడు. అందు కాచార్యుడు తీవ్రమయిన బాణాలతో చేకితానుడి భుజాన్ని పడగొట్టాడు. అతడి సూతుడు హతుడయ్యేటట్లు, గుర్రాలు ఎగిరిపడేటట్లు బాణాలతో కప్పివేశాడు.

వ. ఇట్లు చేకితానుం డోటమి కోర్చి యమ్మెయిన తొలంగె; నిత్తెఱంగున. 126

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; చేకితానుండు= చేకితానుడను యాదవరాజు; ఓటమికిన్+ఓర్చి= ఓడిపోవుటను సహించి; ఆ+మెయిన= ఆ విధంగా; తొలంగెన్= యుద్ధభూమి నుండి తొలగిపోయాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా

తాత్పర్యం: ఈ విధంగా చేకితాను డోడిపోయి వెంటనే యుద్ధం నుండి తొలగిపోయాడు. ఈ ప్రకారంగా.

క. **పెక్కండ్రు దొరలు దన పే । రుక్కున రూపఱఁగ ద్రోణుఁ డుద్ధతిఁ దోడ్తో**
నెక్కఁగ నితఁడు కుమారుం । డొక్కొ! యనఁగ ముదుకఁడయ్యు నుగ్రత మెఱసెన్. **127**

ప్రతిపదార్థం: పెక్కం(డు దొరలు= చాలా మంది రాజులు; తన పేరు+ఉక్కునన్= తన దొడ్డ బలంతో; రూపఱఁగన్= నశించి పోగా; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; ఉద్ధతిన్= గర్వంతో; తోడ్తోన్+ఎక్కఁగన్= వెంటనే విజృంభించగా; ఇతఁడు= ఈ ద్రోణుడు; ముదుకఁడు+అయ్యున్= ముసలివాడైననూ; కుమారుండు+ఒక్కొ!= పసివాడో!; అనఁగన్= అనుకొనగా; ఉగ్రతన్ మెఱసెన్= కోపంతో వెలిగాడు.

తాత్పర్యం: తన బలంతో చాలామంది రాజులు నశించగా ద్రోణుడు దర్పంతో విజృంభించాడు. ముదుసలి అయినా కోపంతో ఆయన వెలిగిన తీరు ద్రోణుడు పసివాడో అన్నట్లు ఉండినది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. **ఆ సమయంబునం బాంచాలపతి 'యీ బ్రాహ్మణుండు వృషభంబులుం బోని భూపాలుర నెల్లరను సృగాలంబుల కాహారంబు సేయుచున్నవాఁడు; వారింపవలదే' యని కడంగి మొనలం బురికొలిపికొనుచు నక్కజం బగు కయ్యంబు సేయుచుండం బాండవాగ్రజుం డాత్మగతంబున.** **128**

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ వేళలో; పాంచాలపతి= పాంచాలదేశానికి రాజయిన ద్రుపదుడు; ఈ బ్రాహ్మణుండు= ఈ బ్రాహ్మణుడైన ద్రోణుడు; వృషభంబులున్+పోని= ఎద్దులవంటి (ఆబోతులవంటి); భూపాలురన్+ఎల్లరను= రాజులనందరిని; సృగాలంబులకున్= నక్కలకు; ఆహారంబు చేయుచున్నవాఁడు= ఆహారంగా చేస్తున్నాడు (అనగా చంపుతున్నాడు); వారింపవలదే?= అడ్డుకొనవద్దా? (అనగా అడ్డుకొనవలయును); అని కడంగి= అని ప్రయత్నించి; మొనలన్+పురి కొలిపికొనుచున్= సేనలను ప్రేరేపించుకొనుచు; అక్కజంబు+అగు= ఆశ్చర్యాన్ని కలిగించే; కయ్యంబు చేయుచుండన్= యుద్ధంచేస్తూ ఉండగా; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; ఆత్మగతంబునన్= తనలో.

తాత్పర్యం: ఆ సమయంలో పాంచాల దేశరాజు ద్రుపదుడు (ద్రోణుడి యుద్ధగతిని వర్ణిస్తూ) 'ఈ బ్రాహ్మణుడు ఆబోతులవంటి రాజులనందరినీ నక్కలవాత వేస్తున్నాడు. దానిని అడ్డుకొనవద్దా' అని ప్రయత్నంతో తన సేనలను ప్రేరేపిస్తూ, ఆశ్చర్యకరంగా యుద్ధంచేస్తూ ఉండగా, పాండవాగ్రజు డయిన ధర్మరాజు తనలో (ఇట్లా అనుకొన్నాడు).

విశేషం: అలం: ఉపమ.

ధర్మరాజు భీముని నర్జునునకుఁ దోడ్పడఁ బుచ్చుట (సం.7-102-4)

ఉ. **అర్జునుఁ డొంటి వోయె నని యక్కడఁ బుచ్చితి బాహుసారవి**
స్ఫూర్జితు సాత్యకిం బెలుచఁ బోవుటయుం గనుఁగొంటి నిద్దఱున్
దుర్జయ శత్రుసైన్యముల దొండడి నేమయి రొక్కొ! విక్రమా
వర్జిత వైరిభీముఁడును వారికిఁ దోడుగ నేఁగు టెట్లొకో? **129**

ప్రతిపదార్థం: అర్జునుఁడు+ఒంటి పోయెనని= అర్జునుడు ఒక్కడే వెళ్ళాడని; అక్కడన్= ఆ చోటికి; బాహుసారవిస్ఫూర్జితున్= భుజశక్తిచే ప్రకాశించేవాడిని; సాత్యకిన్= సాత్యకిని; పుచ్చితిన్= పంపాను; పెలుచన్+పోవుటయున్= (అతడు) శీఘ్రంగా

పోవటమును; కనుఁగొంటిన్= చూచాను; ఇద్దఱున్= అర్జున సాత్యకు లిద్దరూ; దుర్జయ= గెలువరాని; శత్రుసైన్యముల= విరోధిమూకల; దొండడిన్= సమ్మర్దంలో; ఏమయిరి ఒక్కొ!= ఏమయ్యారో? (అని ధర్మరాజు సందేహిస్తున్నాడు. అర్జున సాత్యకులు మహావీరులయినా తన సంబంధం వారిని గూర్చి ఆందోళనను ఆయనకు కల్గించింది); విక్రమ= శౌర్యంతో; ఆవర్జితవైరి= ఆకర్షింపబడిన శత్రువులు గల; భీముఁడును= భీమసేనుడు కూడా; వారికిన్= అర్జున సాత్యకులకు; తోడుగన్= సహాయంగా; ఏఁగుట= పోవటం; ఎట్లొకో?= ఎట్లా ఉంటుందో?

తాత్పర్యం: 'అర్జును డొక్కడే వెళ్ళాడని తోడుగా సాత్యకిని పంపాను. ఆతడు వేగంగా పోవటమూ చూచాను. ఆ ఇద్దరునూ దుర్జయులైన విరోధి కలమూకల సమ్మర్దంలో ఏ మయ్యారో? తన భుజబలంతో విరోధుల నాకర్షించు భీముడిని కూడా వారికి తోడుగా పంపితే ఎట్లా ఉంటుందో?

క. **తమ్మునిఁ దలంచి కృష్ణుని । తమ్ముఁ బనిచె; నాతనిం బదంపడి తన చి**
త్తమ్మునఁ దలఁపఁడ ధర్మజుఁ । డెమ్మెయి వాఁ డొక్కొ నారె? యీ యున్నజనుల్. **130**

ప్రతిపదార్థం: తమ్మునిన్+తలంచి= తన తమ్ముడైన అర్జునుడిని తలచుకొని; కృష్ణు తమ్మున్ పనిచెన్= కృష్ణుడి తమ్ముడైన సాత్యకిని పంపాడు (అర్జునుడికి సాయంగా); ఆతనిన్= ఆ సాత్యకిని; పదంపడి= ఆ మీదట; తన చిత్తమునన్ తలఁపఁడు+అ= తన మనసులో తలచుకోనే లేదు సుమా!; ఈ ఉన్న జనుల్= ఈ చుట్టూ ఉన్నవారు; ధర్మజుఁడు+ఎమ్మెయివాఁడొక్కొ!= ధర్మరాజెటువంటివాడో!; నారె?= అనరా?

తాత్పర్యం: తన తమ్ముడైన అర్జునుడికి సాయంగా కృష్ణుడి తమ్ముడైన సాత్యకిని పంపాడు. కాని, ఆ మీదట ఆ సాత్యకి ఏమయ్యాడో అనే తలంపు కూడా ఈ ధర్మరాజుకు లేకపోయెనే అని జను లనుకొంటారు కదా!

విశేషం: ధర్మరాజు తన సోదరుడి మేలును మాత్రం కోరి సాత్యకిని తోడు పంపాడు. కాని, సాత్యకి క్షేమాన్ని మాత్రం ఈ ధర్మరాజు తలచుకొనలేదు. ఈతడు విశ్వాసహీను డని జనులు భావిస్తా రేమో అన్న తలంపుతో సాత్యకికి తోడుగా భీమసేనుడిని పంపటం భావ్యమేమో! అని ధర్మరాజు తలచుకొన్నాడు. అనగా లోకాపవాదం తనకు రాకుండవలెనంటే సాత్యకి క్షేమంకూడా తన బాధ్యతే అన్న తలంపు ధర్మజున కున్నది అని అర్థం.

తే. **పెక్కుచోటుల నెఱిఁగిన యుక్కులావుఁ । గలుగు నీతనిఁ బనుచుట కలుక నేల?**
యితఁడు గలయ నయ్యిరువుర కెలమి వచ్చుఁ । బనుతు నే నటు శోకంబు వాయవలయు. **131**

ప్రతిపదార్థం: పెక్కుచోటులన్= అనేక స్థలాలలో; ఎఱిఁగిన= తెలిసిన; ఉక్కులావు= ధైర్యం, బలం; కలుగు= ఉన్నట్టి; ఈతనిన్= ఈ భీముడిని; పనుచుటకున్= పంపుటకు; అలుకన్+ఏల?= జంకటం ఎందుకు?; ఇతఁడు కలయన్= ఈ భీముడు చేరగా; ఆ+ఇరువురకున్= ఆ అర్జునసాత్యకులకు; ఎలమి= సంతోషం; వచ్చున్= కలుగుతుంది; ఏన్+అటు శోకంబు పాయవలయున్= నే నావిధమయిన దుఃఖమును (చింతను) వదలవలయును.

తాత్పర్యం: అనేక స్థలాలలో భీముడి బలం, ధైర్యం తెలిసిన నేను అర్జునసాత్యకులకు తోడుగా ఇతడిని పంపితే ఆ ఇద్దరికీ సంతోషం కలుగుతుంది. చింత మాని ఇతడిని అటు పంపుతాను'.

వ. **అని బహువిధంబుల విచారించి నిశ్చయించి.** **132**

ప్రతిపదార్థం: అని; బహు, విధంబులన్= అనేక విధాల; విచారించి= ఆలోచించి; నిశ్చయించి= నిర్ణయించి

తాత్పర్యం: అని నానావిధాలుగా యోజించి నిశ్చయం చేసికొని.

ఆ. **భీముఁ జేర నరిగి 'బీభత్సు నీ తమ్ము' । నని యెలుంగు గళమునందుఁ దగుల**
నశ్రు లొలుక మాట యట సెప్పలేఁ డతఁ । డార్తి సూచి యిట్టు లనియె నతఁడు. **133**

ప్రతిపదార్థం: భీమున్ చేరన్+అరిగి= భీముడి యొద్దకు వెళ్ళి; బీభత్సు నీ తమ్ముఁన్+అని= బీభత్సు డయిన నీ తమ్ముడు అని; ఎలుంగు= స్వరం; గళమునందున్= గొంతులోనే; తగులన్= తగుల్కొనగా (గొంతు లోనేఆగిపోగా); అశ్రులు+ఒలుకన్= కన్నీళ్ళు జారగా; మాట= పలుకు; అట చెప్పలే డతఁడు= ఆ ధర్మరాజు అక్కడ చెప్పలేకున్నాడు; అతఁడు= భీముడు; ఆర్తి= (ధర్మజుడి) దుఃఖాన్ని; చూచి; ఇట్లు+అనియెన్= ఈ ప్రకారంగా అన్నాడు.

తాత్పర్యం: (ధర్మరాజు) భీముడి దగ్గరికి వెళ్ళి 'బీభత్సు డయిన నీ తమ్ముడు' అని, ఆపైన మాట పెగిలిరాక కన్నీళ్ళతో నిలిచాడు. ఆతడి ఆర్తిని చూచి భీమసేను డిట్లా మాటాడినాడు.

విశేషం: తిక్కన తన రచనలో ఏ ఘట్టమునం దయినా నాటకీయమైన చతురిమను చూపగలడనుట ఈ ఆటవెలదిలో మనం గుర్తించవచ్చును. ధర్మరాజు అర్జునుడికి సాయంగా యుద్ధరంగానికి వెళ్ళుమని భీముడిని కోరటం తన ఉద్దేశం. దానిని వాచ్యంగా కాకుండా తన చేష్టలతో వ్యక్తీకరించాడు. తగు విధంగా భీముడి సమాధానం కూడా ఉంటుంది. అందుకే 'మాట అట సెప్పలేఁడు' అనీ 'అతఁ డార్తి సూచి యిట్టు లనియె' ననీ వర్ణించాడు.

క. **'ఏము గలంగిన యప్పుడు । నీ మహిమయ మమ్ముఁ దేర్చు నీకును గలఁగన్**
భూమీశ! తగునె యివ్విధ । మేమిటఁ బాటిల్లెఁ, బనుపు మేపని కైనన్'. 134

ప్రతిపదార్థం: భూమీశ!= ఓ రాజా! (ధర్మజా!); ఏము కలంగిన అప్పుడు= మేము చీకాకు చెందిన సమయంలో; నీ మహిమయ= నీ గొప్పదనమే; మమ్మున్+తేర్చున్= మా అందరను దరిచేరుస్తున్నది; నీకును కలఁగన్= నీవు చీకాకు పడగా; తగునె?= తగునా? (న్యాయమా); ఈ+విధము= ఇప్పటి నీ ఆర్తి; ఏమిటన్= ఏ కారణంగా; పాటిల్లెన్?= కలిగింది?; ఏపనికి+ఐనన్= ఎటువంటి పనికైనా; పనుపుము= ఉత్తర్వు చేయుము.

తాత్పర్యం: 'ఓ రాజా! మేము చీకాకు పడిన సమయంలో నీ మహిమ కారణంగా మా చీకాకుల నుండి తేరుకొంటున్నాము. నీవు చీకాకు పడవచ్చునా? ఇప్పటి నీ ఆర్తికి కారణ మేమిటి? ఏ పనికైనా నన్ను పంపుము.'

చ. **అనవుడు నాతఁ డిట్లనియె ' నక్కడ నప్పుడు బాంచజన్య ని**
స్వనము వినంగ నైన నట సాత్యకిఁ బుచ్చితి; నేమి పుట్టెనో!
యను వెత నిప్పు డద్దెస భయంబు దిగంబడ నీవు వోయి పా
ర్థునిఁ గని సింహనాదమున రోదసి నింపుము మాకు నింపుగన్. 135

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా (భీము డట్లనగా); ఆతఁడు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అక్కడన్= ఆ చోట (ఆ యుద్ధరంగంలో); అప్పుడు; పాంచజన్యనిస్వనము= పాంచజన్యమనే శంఖనాదం; వినంగన్+ఐనన్= వినరాగా; అటన్= ఆ చోట; ఏమిపుట్టెనో?= ఏమైనదో?; అనువెతన్= అన్నభయంతో; సాత్యకిన్+పుచ్చితిన్= సాత్యకిని పంపాను; ఇపుడు= ఈ సమయంలో; ఆ+దెసన్= ఆ దిక్కులో; భయంబు దిగంబడన్= భయం తొలగగా; నీవు పోయి= నీవు వెళ్ళి; పార్థునిన్= అర్జునుడిని; కని= చూచి; రోదసిన్= భూమ్యాకాశముల మధ్య భాగం; మాకున్+ఇంపుగన్= మాకు ప్రీతిగా; సింహనాదమునన్= సింహగర్జనంతో; నింపుము= నిండచేయుము.

తాత్పర్యం: అని భీము డనగా ధర్మరాజు అతడితో ఇట్లా అన్నాడు: 'ఆ వైపు రణరంగంలో పాంచజన్య శబ్దం మాత్రమే వినవచ్చింది. అక్కడ ఏమాయెనో? అని సాత్యకిని పంపాను. కాని ఆ దిక్కున జరిగేదానికై నాకు కలిగిన భయాన్ని పోగొట్టటానికై నీవక్కడకు పోయి అర్జునుడిని చూచి (సంతోష చిహ్నంగా) ఆకాశమంతా నిండేటట్లు సింహనాదం చేసి నాకు సంతోషాన్ని కలిగించుము.

క. నీతమ్ముఁగుఱ్ఱ రూపసి, । నీతి విదుఁడు, సకల సుగుణ నిధి, మద్భక్తుం
డాతని కెడరగునో యను । చేతోగతి పల్లటిల్లఁ జేయదె తాల్మిన్? 136

ప్రతిపదార్థం: నీ తమ్ముఁగుఱ్ఱ= పసివాడైన నీ తమ్ముడు; రూపసి= అందగాడు; నీతివిదుఁడు= నీతిని తెలిసినవాడు; సకల సుగుణనిధి= అన్ని మంచి గుణములపుట్ట; మద్భక్తుండు= నా యెడ భక్తికలవాడు; ఆతనికిన్= అతనికి; ఎడరు+అగునో= ప్రమాదమగునో; అను చేతోగతి= అనే మనసుపోక; తాల్మిన్= ఓరిమిని; పల్లటిల్లన్= చలించేటట్టు; చేయదె?= చేయదా?

తాత్పర్యం: పసివాడు నీ తమ్ముడు అందగాడు, నీతి పద్ధతి తెలిసినవాడు, మంచిగుణా లున్నవాడు, మీదు మిక్కిలి నాకు భక్తుడు. అటువంటి వాడికి కీడు కలుగుతుందేమో అనే మనోభావం నా ఓర్మిని చలింపజేయదా?'

ఆ. అనిన భీముఁ డిట్టు లనియెఁ 'దద్రథము ర । థ్యముల సారథిని శరాసనంబు
నెఱుఁగు దతని కొలఁది యెఱిఁగిన యదియ నీ । కేల వగవ? నిపుడ యేను బోదు. 137

ప్రతిపదార్థం: అనినన్= ధర్మజు డట్లనగా; భీముఁడు+ఇట్టులు+అనియెన్= భీముడీ విధంగా అన్నాడు; తద్రథమున్= అతడి తేరును; రథ్యములన్= గుఱ్ఱాలను; సారథిని= తేరు తోలేవానిని; శరాసనంబును= వింటిని; ఎఱుఁగుదు(వు)= తెలిసినవాడవు; అతని కొలఁది ఎఱిఁగిన అదియ నీకున్= అతడి బలం నీకు తెలిసిందే; నీకున్+ఏల వగవన్?= నీవు దుఃఖపడ నేల?; ఏను= నేను; ఇపుడు+అ= ఇపుడే; పోదున్= పోతాను.

తాత్పర్యం: భీముడు ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు: 'అతడి తేరును, గుఱ్ఱాలను, సారథిని, వింటినీ, బలాన్నీ తెలిసిన నీకు దుఃఖ మెందుకు? నే నిపుడే వెళ్ళుతున్నాను.

వ. దేవరయాజ్ఞఁ దల నిడికొని చని యా కృష్ణుల కృష్ణానుజునిం గలసి యిక్కడ కెఱుక సేయుదు' నని పలికి పాంచాల నందనుం గనుంగొని 'కుంభసంభవు బలిమియు నతని ప్రతిజ్ఞ తెఱంగును నెఱుంగుదు; వేమఱకుండుము; నాకుం బోక కర్జంబు గాదు; గాకున్న నేలినవాని యానతి నడపవలయు' ననవుడు నతండు. 138

ప్రతిపదార్థం: దేవర ఆజ్ఞ= రాజుగారి ఉత్తర్వు; తలన్+ఇడికొని= మోసికొని (శిరోధార్యంగా); చని= వెళ్ళి; ఆ కృష్ణులన్= ఆ శ్రీకృష్ణార్జునులను; కృష్ణానుజునిన్= సాత్యకిని; కలసి= కలసికొని; ఇక్కడకున్+ఎఱుక చేయుదును=ఇక్కడికి తెలియచేస్తాను; అని పలికి= అని చెప్పి; పాంచాల నందనున్+కనుంగొని= ధృష్టద్యుమ్నుడిని చూచి; కుంభసంభవు బలిమియున్= ద్రోణుడి బలాన్నీ; అతని ప్రతిజ్ఞ తెఱంగునున్= ఆతడి మాట (శపథం తీరును); ఎఱుంగుదువు= తెలిసినవాడవు (అతడి ప్రతిజ్ఞ ధర్మజుడిని బందీచేయటం); ఏమఱక+ఉండుము= మరువకుండా ఉండుము; నాకున్+పోక కర్జంబుకాదు= నేను వెళ్ళవలసిన పని కాదు; కాకున్నన్= కాకుంటే; ఏలినవాని ఆనతిన్= రాజాజ్ఞను; నడపవలయును= నెరవేర్చవలయును; అనవుడున్= అనగా; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు.

తాత్పర్యం: రాజాజ్ఞను శిరసావహించి వెళ్ళి కృష్ణార్జునులను, సాత్యకిని కలసికొని అక్కడి విషయాలు తెలియజేస్తాను' అని, ధృష్టద్యుమ్నుడితో 'ద్రోణుడి ప్రతిజ్ఞను, బలాన్ని తెలిసినవాడవు. జాగ్రత్తగా ఉండుము. నేను పోవటం తగిన పనికాదు. కాని, రాజాజ్ఞ దాటరానిది. దానిని చేసి తీరవలయును' అనగా ఆతడు (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'వినుము భవత్సేనాపతి । తనువునఁ బ్రాణములు గలుగ ధర్మజు దెసకుం
జనుదెంచువాఁడె ద్రోణుం? । డనుమానము దక్కి యరుగు మర్జును కడకున్.' 139

ప్రతిపదార్థం: వినుము= ఓ భీమసేనా! వినుము; భవత్+సేనాపతి తనువునన్= మీ సేనానాయకుడి ఒంటిలో; ప్రాణములు కలుగన్= ప్రాణా లుండగా; ద్రోణుండు= ద్రోణుడు; ధర్మజు దెసకున్ చనుదెంచువాఁడె?= ధర్మజుడి దిక్కుకు రాగలడా? (అనగా రాలేడని); అనుమానము తక్కి= సందేహం వదలి; అర్జును కడకున్= అర్జునుడి దగ్గరకు; అరుగుము= వెళ్ళుము.

తాత్పర్యం: 'ఓ భీమసేనా! ఇదిగో వినుము. నీ సేనాని మేనిలో ప్రాణాలుండగా ద్రోణుడు ధర్మరాజు దిక్కుకు రాగలడా? సందేహించకుండా అర్జునుడి యొద్దకు వెళ్ళుము' అని అన్నాడు.

వ. అనిన ధృష్టద్యుమ్ను పలుకుల కూఱడిల్లి యనిలతనయుం డన్నచరణంబులకుం బ్రణతుండై యాలింగనంబును నాశీర్వాదంబునుం బడసి యున్న యప్పుడు శౌరి శంఖ విరావంబు వీతెంచిన న వ్విభుం డవ్వీరున కి ట్లనియె. 140

ప్రతిపదార్థం: అనిన ధృష్టద్యుమ్ను పలుకులకు= ఆ విధంగా చెప్పిన ధృష్టద్యుమ్నుడి మాటలకు; ఊఱడిల్లి= ఓదార్పునంది; అనిల తనయుండు= భీమసేనుడు; అన్న చరణంబులకున్= ధర్మజుడి పాదాలకు; ప్రణతుండు+ఐ= నమస్కారం చేసి; ఆలింగనంబును= కౌగిలియు; ఆశీర్వాదంబునున్ పడసి= ఆశీస్సులను పొంది; ఉన్న అప్పుడు= ఉండే సమయాన; శౌరి= శ్రీకృష్ణుడి; శంఖవిరావంబు= శంఖధ్వని; వీతెంచినన్= వినరాగా; ఆ+విభుండు= ఆ ధర్మరాజు; ఆ+వీరునకున్+ఇట్లు+అనియెన్= ఆ వీరుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనుమానం వదలి అర్జునుడి యొద్దకు వెళ్ళు'మని ధృష్టద్యుమ్నుడు పలుకగా ఊరడిల్లి, భీమసేనుడు తన అన్నగారి పాదాలకు నమస్కరించాడు. ఆయన కౌగిలించుకొని ఆశీస్సు లందించాడు. అపుడు కృష్ణుడి శంఖధ్వని వినరాగా ఆ రాజు ఆ వీరుడితో ఇట్లా అన్నాడు:

క. 'విను పాంచజన్య పటు ని । స్వన మదె యిది మఱఁది యెడరు సైరింపక కృ
ష్ణుని రణము సేయు రభసం । బని తలఁచెద నెయ్యు మెయ్యు మధిక రయమునన్.' 141

ప్రతిపదార్థం: పాంచజన్య పటునిస్వనము= పాంచజన్య శంఖంయొక్క పెనురవం; అదె వినుము= అదుగో వినుము; ఇది= ఈ శబ్దం; మఱఁది ఎడరు= తన మేన మరది అర్జునుడి భంగపాటును; సైరింపన్= ఓర్వలేక; కృష్ణుని రణము చేయు= కృష్ణుడు యుద్ధం చేసే; రభసంబు+అని= వేగమని; తలఁచెదన్= తలచుకొంటున్నాను; అధిక రయమునన్= మిక్కిలి తొందరగా; ఎయ్యుము ఎయ్యుము= (వారిని) వెంబడించుము.

తాత్పర్యం: 'పాంచజన్య శంఖారావం వినవస్తూ ఉన్నది. అదిగో! వినుము. తన మేనమరది అయిన అర్జునుడి భంగపాటున కోర్వక శ్రీకృష్ణుడు చేసే రభస మది' అని తలుస్తున్నాను. చాలా తొందరగా వారిని వెంబడించి వెళ్ళుము' (అని ధర్మజుడు భీముడితో అన్నాడు).

వ. అనవుడు సవిశేష కల్పితంబగు రథంబు రవంబును దూర్య నినదంబును దనసింహనాదంబునుం జెలంగ విశోకుని సారథ్య సామర్థ్యంబున రథ్యంబులు నెఱయ మెఱయం గదలి గొనయంబు సారించి కురుబలంబు నవలోకించుచు నడరు నవ్వడముడిం దలపడి నీ కొడుకులు దుశ్శల చిత్రసేనకుండభేది వివింశతి దుర్ముఖ దుస్సహులును వికర్ణ శలవిందానువింద సుముఖ దీర్ఘబాహు సుదర్శన బృందారకులును సుహస్త సుషేణ దీర్ఘలోచనాభయ రౌద్రకర్మ సువర్మ దుర్విమోచనులును వివిధ విశిఖంబులు వరఁగించుటయు, లేళ్ళగమిం జూచి పొంగు సింగంబు చందంబునం జెలంగి యా శరంబులు వారించుచు వారిం గదిసి బృందారకుం దెగఁ జూచి యభయ రౌద్రకర్మ దుర్విమోచనులను ముష్వుర మూఁడు వెడంద దూపులం దునిమిన. 142

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనవుడున్= అని ధర్మరాజు చెప్పగా; సవిశేష కల్పితంబు+అగు రథంబు రవంబును= అన్ని విశేషాలతో సిద్ధం చేసిన తేరు సవ్వడిని (అనగా అన్ని హంగుల యుద్ధ పరికరాలతో సన్నద్ధమయిన తేరు నడకలో విన్పించే శబ్దమును); తూర్యనినదంబును= తూర్యనాదాలును; తన సింహనాదంబును= తాను కావించే సింహనాదమును; చెలంగన్= ధ్వనించగా; విశోకుని సారథ్య సామర్థ్యంబు నన్= విశోకుడనే సూతుడి శక్తితో; రథ్యంబులు= గుర్రాలు; నెఱయన్= గొప్పగా వ్యాపించగా (అనగా గొప్పగా పరుగులు వారగా); మెఱయన్= ప్రకాశించగా; కదలి= నడచి (యుద్ధానికి బయలుదేరి); గొనయంబుసారించి= అల్లెత్రాటిని లాగి (వింటినారిని లాగి శబ్దంచేసి); కురుబలంబున్= కౌరవసేనను; అవలోకించుచున్= చూస్తూ; అడరు= విజృంభించే; ఆ+వడముడిన్+తలపడి= ఆ భీమసేనుడిని ఎదుర్కొని; నీ కొడుకులు= నీ కుమారులయిన; దుశ్శల, చిత్రసేన, కుండభేది, వివింశతి, దుర్ముఖ, దుస్సహులును, వికర్ణ, శల, వింద+అనువింద, సుముఖ, దీర్ఘబాహు సుదర్శన బృందారకులును, సుహస్త, సుషేణ, దీర్ఘలోచన+అభయ, రౌద్రకర్మ, సుశర్మ, దుర్విమోచనులును= ఈ పేర్లు కల నీ కొడుకులు; వివిధ విశిఖంబులు= అనేకరకాలయిన బాణాలను; పరఁగించుటయున్= వేయుటయు; లేళ్ళగమిన్+చూచి పొంగు= జింకలగుంపును చూచి ఉప్పొంగే (చెలరేగే); సింగంబు చందంబునన్= సింహంవలె; చెలంగి= ఒప్పి; ఆ శరంబులు= కౌరవులు ప్రయోగించిన బాణాలను; వారించుచున్= ఆపుచు; వారిన్+కదిసి= కౌరవులను దాటి; బృందారకున్+తెగన్+చూచి= బృందారకు డనే వాడిని చంపి; అభయ, రౌద్రకర్మ, దుర్విమోచనులను ముబ్బురన్= ఈ ముగ్గురిని; మూఁడు= మూడు; వెడంద తూపులన్= వాడి అయిన విశాలమయిన బాణాలతో; తునిమినన్= చంపగా.

తాత్పర్యం: ధర్మరాజు చెప్పగా భీమసేనుడు, సర్వాంగసన్నద్ధమైన రథంతో, విశోకుడనే సారథి సారథ్యంలో, రథనాద తూర్యనాద సింహనాదాలతో ఒప్పుతూ వింటినారిటంకార శబ్దంతో యుద్ధానికి వెళ్ళాడు. కౌరవసైన్యాన్ని చూస్తూ పేట్రేగిన భీమసేనుడిని, నీ కొడుకులైన దుశ్శల, చిత్రసేన, కుండభేది, వివింశతి, దుర్ముఖ, దుస్సహ, వికర్ణ, శల, వింద, అనువింద, సుముఖ, దీర్ఘబాహు, సుదర్శన, బృందారక, సుహస్త, సుషేణ, దీర్ఘలోచన, అభయ, రౌద్రకర్మ, సుశర్మ, దుర్విమోచను లనేవారు అనేకవిధాలైన వాడి బాణాలను వేశారు. అందు కాతడు లేళ్ళ గుంపును చూచి ఉప్పొంగే సింహం మాదిరి, కౌరవులు వేసిన బాణాలను ఆపుకొంటూ వారిని దాటి, బృందారకుడిని చంపి, అభయ రౌద్రకర్మ దుర్విమోచనులనే ముగ్గురిని మూడు బాణాలతో హతమార్చగా.

విశేషం: అలంకారం ఉపమ.

క. **చలమునఁ బోవక పెనఁగిన । నల వేర్పడ నతఁడు విందు ననువింద సుశ**
ర్మల జంపి, సుదర్శను బె । ట్టిలపైఁబడి యపుడు సావ నేసె నరేంద్రా! **143**

ప్రతిపదార్థం: నరేంద్రా!= ఓ రాజా! (ధృతరాష్ట్రా!); చలమునన్= మత్సరంతో; పోవక= వెళ్ళిపోక (తప్పుకొని పోకుండా); పెనఁగినన్= పోట్లాడగా; అలవు= బలం; ఏర్పడన్= స్పష్టం కాగా; అతఁడు= ఆ భీమసేనుడు; విందున్= విందుడినీ; అనువింద సుశర్మలన్= అనువిందుడినీ, సుశర్మనూ; చంపి= చంపివేసి; సుదర్శనున్= సుదర్శనుడిని; బెట్టు+ఇలపైన్+పడి= భయంకరంగా భూమిమీద పడి; చావన్= చని పోగా; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: ఓ రాజా ధృతరాష్ట్రా! (నీ కొడుకులు) వెనుకకు తిరిగిపోకుండా మత్సరంతో యుద్ధం చేయగా, భీముడు తన బలం స్పష్టపడేటట్లు విందుడినీ అనువింద సుశర్ములనే వారినీ చంపి, సుదర్శనుడు భూమిమీద పడి చచ్చేటట్లుగా కొట్టాడు.

క. **పెఱవారు వెఱచి నలుగడఁ । బఱచిన వాయుసుతుఁ డార్చి పఱపె రథం బా**
తెఱపిన యరుగుట గని గురుఁ । డుఱక యతనిఁ దాఁకఁ గప్పె నుగ్రాస్త్రములన్. **144**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పెఱవారు= ఇతరులు (శత్రువులు); వెఱచి= భయపడి; నలుగడన్+పఱచినన్= నాలుగు దిక్కులకు పరుగెత్తగా (పారిపోగా); వాయుసుతుఁడు= భీమసేనుడు; ఆర్చి= సింహనాదం చేసి; రథంబున్= తన తేరును; పఱపెన్= తోలాడు; ఆ తెఱపిన= ఆ బాటనే; అరుగుటన్+కని= వెళ్ళటం చూచి (భీముడట్లే పోవటం చూచి); గురుఁడు= ద్రోణుడు; ఉఱక= లెక్కపెట్టక; ఉగ్రాస్త్రములన్= భయంకరమైన బాణాలతో; అతనిన్+తాఁకన్= వానిని తాకగా; కప్పెన్= కప్పివేశాడు.

తాత్పర్యం: ఇతరులు భయపడి నాలుగుదిక్కులకూ పరుగెత్తేటట్లుగా చేసి, భీముడు సింహనాదం చేస్తూ, తన తేరు నా దిక్కుకు తోలించాడు. దానిని చూచిన ద్రోణుడు భీముని లెక్కపెట్టక, భయంకరమైన బాణాలతో అతడిని కప్పివేశాడు.

వ. ఇట్లు నిలువరించి, నిటలంబున నారాచంబు నాటించి, యక్కుంభసంభవుండు దనమనంబున 'వీఁడు విజ్వచ్చునట్లు నన్ననుసరింపఁ గలవాఁ'డని తలంచి యప్పవనతనయు నుద్దేశించి. 145

ప్రతిపదార్థం: ఇట్లు నిలువరించి= ఈ విధంగా నిలిపి; నిటలంబునన్= నెన్నుదుట; నారాచంబున్= వాడి బాణాన్ని; నాటించి= నాటుకొనేటట్లు చేసి; ఆ+కుంభసంభవుండు= ఆ ద్రోణుడు; తనమనంబునన్= తన మనస్సులో; వీఁడు= ఈ భీమసేనుడు; విజ్వచ్చున్+అట్లు= అర్జునుడి మాదిరిగనే; నన్ను+అనుసరింపన్+కలవాఁడు= న న్ననుసరించి వచ్చేవాడు; అని తలంచి= అని ఊహించి; ఆ+పవనతనయునుద్దేశించి= ఆ భీముడిని గూర్చి.

తాత్పర్యం: ఆ విధంగా నిలిపి, నెన్నుదుట వాడిబాణాన్ని నాటి, ఆ ద్రోణుడు మనసులో 'ఆ అర్జునుడు నన్ననుసరించి వెళ్ళినట్లుగానే ఇతడు కూడా అనుసరిస్తా' డని తలచుకొని (భీముడితో) ఇట్లా అన్నాడు:

క. 'నను గెలిచి కాక నీ కి। మ్మొన సొరఁగా నెట్లు వచ్చు? మును నీ తమ్ముం
డనుమతుఁడై కాదే చొరఁ। గనియె' ననుడు నతఁడు గన్నుఁగవ గెంపారన్. 146

ప్రతిపదార్థం: నను గెలిచి కాక= నన్ను జయించకుండా (అనగా అస్త్రగురుడ నగు నన్ను గెలువక); నీకున్= నీకు (భీమసేనుడికి); ఈ+మొనన్= ఈ వ్యూహంలోకి; చొరఁగాన్= ప్రవేశించగా; ఎట్లు వచ్చున్?= ఏ విధంగా సాధ్యమవుతుంది? మును= వెనుక; నీ తమ్ముండు= నీ తమ్ముడైన అర్జునుడు; అనుమతుఁడు+ఐ కాదే= నా ఉత్తర్వు నంది కదా!; చొరన్+కనియెన్= లోనికి వెళ్ళ గలిగాడు; అనుడున్= అనగా; అతఁడు= భీముడు; కన్నుఁగవ= కన్నులు రెండును; కెంపారన్= ఎర్రబడగా (అనగా కోపం కలుగగా).

తాత్పర్యం: 'ఓ భీమసేనా! తొలుత నన్ను గెలిస్తే గాని ఈ సేనలోకి ప్రవేశించటం సాధ్యం కాదు. ఇదివరకు నా అనుమతితోనే నీ తమ్ముడు కూడా సేనలోకి చొచ్చుకొని వచ్చాడు' అనగా, భీముడు కోపంతో తన కన్నులు రెండూ ఎర్రబడగా (ఇట్లా అన్నాడు). (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'నరుఁ డొక రథికుని యనుమతిఁ। జొరఁ దలఁచునె? మనుజ సేన సురబల మైనం
దెరలిచికొని విచ్చలవిడి। నరుగుం దనవలయు నెడకు; నది యట్లుండెన్. 147

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; ఒక రథికుని అనుమతిన్= ఒకానొక రథికుడి ఉత్తర్వుతో; చొరన్+తలఁచునె?= లోనికి వెళ్ళగోరునా?; మనుజసేన= మానవసైన్యం; సురబలము= దేవసేన; ఐనన్= అయినప్పటికినీ; తెరలిచికొని= చీల్చికొని; విచ్చలవిడిన్= తనకు తోచినట్లు; తనవలయు+ఎడకున్= తాను వెళ్ళదలచుకొన్న చోటికి; అరుగున్= వెళ్ళుతాడు; అది అట్లు+ ఉండెన్= దాని నట్లా ఉండనిమ్ము.

తాత్పర్యం: 'ఒక రథికుడి అనుమతితో అర్జునుడు తాను వెళ్ళదలచుకొన్నచోటికి వెళ్ళుతాడా? మానవసేన అయినా, దేవతాసైన్యమైనా, తాను పోవలసిన చోటుకి చీల్చుకొని వెళ్ళ గలడు. అది అట్లా ఉండనిమ్ము. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. ప్రియములు వల్కి ని న్ననుసరింపఁగఁ బార్థుఁడు గాఁడు సుమ్ము! దు
ర్జయ భుజశక్తి నిర్మథిత శత్రుఁడు భీముఁడు గాని; నీవు దం
డ్రియు గురుడుం బ్రియుండు నని ప్రీతి యొనర్తుఁ బూని వైరికిన్
జయ మొనరింతు గాక! యని సైఁతునె దర్పము సూపకుందునే?' 148

ప్రతిపదార్థం: ప్రియములు పల్కి= తీయని మాట లాడి; నిన్నున్+అనుసరింపఁగన్= నిన్ననుసరించటానికి (నీ వెంట నడిచే దానికి); పార్థుఁడు గాఁడు సుమ్మ!= అర్జునుడు కాడు సుమా!; దుర్జయ= జయింపరాని; భుజశక్తి= భుజబలంతో; నిర్మథితశత్రుఁడు= మర్దింపబడిన శత్రువులు కలవాడు; భీముఁడు= భీముడు; కాని= కాకుంటే; నీవు; తండ్రియున్, గురుఁడున్, ప్రియుండున్+అని= తండ్రివంటివాడవు, గురుడవు, ప్రియమైనవాడవు అని; ప్రీతి+ఒనర్చెదన్= (మీకు)సంతోషం కలిగిస్తాను; పూని వైరికిన్= ప్రయత్నంతో విరోధికి; జయము+ఒనరింతు+కాక!+అని= జయం కలిగించడానికి; సైఁతునె= సహిస్తానా? దర్పము= గర్వము; చూపక+ఉందునే= చూపకుండా ఉంటానా?

తాత్పర్యం: తియ్యని మాటలతో ని న్ననుసరించటానికి నే నర్జునుడను గాను. భుజబలంతో శత్రువులను మథించిన వాడను - భీముడను. నీవు నాకు తండ్రి వంటివాడవని, గురుడివని, ఇష్టమైనవాడివని నీకు సంతోషాన్ని కలిగిస్తాను. అంతేకాని శత్రువుకు ప్రయత్నించి నీవు జయంకలిగించడాన్ని మాత్రం నేను సహించను. నా గర్వం చూపకుండా ఉంటానా?

వ. అని పలికి. 149

తాత్పర్యం: అని మాట్లాడి.

మ. గద సారించి చెలంగి వైచిన భుజాగర్వంబు సాలించి య
మ్ముదుకం డుర్వికి దాఁటి పోయె; నది రశ్ముల్ మింటఁ బర్వంగ బె
ట్టిదమై మ్రోయుచు వచ్చి బల్పిడుగు మాడ్కిం దాఁకుడున్ గుఱ్ఱముల్
సదిసెన్, సారథి మ్రగ్గె, దేరు వొలిసెన్ సైన్యంబు భీతిల్లఁగన్. 150

ప్రతిపదార్థం: గద సారించి= గదను ఊపి; చెలంగి వైచినన్= ఉత్సాహంతో వేయగా; భుజాగర్వంబు= భుజబలం; చాలించి= వదలి; ఆ+ముదుకండు= ఆ ముసలివాడు; ఉర్వికిన్= భూమికి; దాఁటిపోయెన్= దాటుకొనిపోయాడు; అది= ఆగద; రశ్మల్= కాంతులు; మింటన్+పర్వంగన్= ఆకాశంలో వ్యాపించగా; బెట్టిదము+ఐ= తీవ్రమై; మ్రోయుచు వచ్చి= శబ్దం చేస్తూ వచ్చి; బల్పిడుగు మాడ్కిన్= పెను పిడుగు మాదిరిగా; తాఁకుడున్= తగులగా; సైన్యంబు భీతిల్లగన్= (మన) సైన్యం భయపడగా; గుఱ్ఱముల్ చదిసెన్= గుర్రాలు నలిగిపోయాయి; సారథి= సూతుడు; మ్రగ్గెన్= చచ్చాడు, తేరు పొలిసెన్= రథం నాశమయింది.

తాత్పర్యం: (భీమసేనుడు) గదను చాచి వేయగా భుజబలం చాలించి ఆ వృద్ధుడు (ద్రోణుడు) రథం మీద నుండి భూమి మీదికి ఉరికి తొలగి వెళ్ళాడు. ఆ గద ఆకాశం దాకా కాంతులను వ్యాపింపచేస్తూ, పెద్దశబ్దంచేస్తూ, పెద్ద పిడుగువలె తాకేటప్పటికి మన సైన్యం భయపడేటట్లుగా గుర్రాలు, సారథి చనిపోగా, తేరు నుగ్గునుగ్గయింది.

వ. అప్పు డమ్మేటిమగండు. 151

ప్రతిపదార్థం: అప్పుడు; ఆ+మేటిమగండు= ఆ గొప్పవీరుడు

తాత్పర్యం: అపు డా గొప్ప మొనగాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **మన మూఁక దటిసి యుద్ధతిఁ । జనఁ జన నీనందనులు వెసం దాఁకియు ను**
బ్బిన యతని వీఁక కోర్వక । కనుకని సిగ్గు సెడి పాఱఁగా గురుఁ డంతన్. 152

ప్రతిపదార్థం: మన మూఁక దటిసి= మన సేన దగ్గరకు వచ్చి; ఉద్ధతిన్ చనన్+చనన్= దర్పంతో పోగా పోగా; నీ నందనులు= నీ కుమారు లయిన కౌరవులు; వెసన్+తాఁకియున్= తొందరగా ఎదుర్కొని నప్పటికినీ; ఉబ్బిన= పెరిగిన; అతని వీఁకకున్= ఆతడి ఉత్సాహానికి; ఓర్వక= సహించలేక; కనుకని= సంభ్రమంతో; సిగ్గు చెడి= సిగ్గు వదలి; పాఱఁగాన్= పారిపోగా; అంతన్= ఆ మీదట; గురుండు= ద్రోణుడు.

తాత్పర్యం: మన సేనను ఎదుర్కొని దర్పంతో పోగా పోగా, నీ కొడుకులు త్వరగా అతడిని ప్రతిఘటించి, అతడి పరాక్రమానికి ఆగలేక, భయంతో సిగ్గు వదలి పరుగెత్తారు. అంతట గురుడు.

క. **ఒండొక తే రెక్కి సము । ద్దండతఁ జని భీమసేనుఁ దాఁకి శరము లొం**
డొండ నిగిడించి నొంచిన । గం డడఁగక యతఁడు గనలు గదిరిన మదితోన్. 153

ప్రతిపదార్థం: (ద్రోణుడు) ఒండొక తేరు+ఎక్కి= మరియొక తేరుమీది కెక్కి; సముద్దండతన్= గొప్పగా; చని= వెళ్ళి; భీమసేనున్ తాఁకి= భీముడిని ఎదుర్కొని; శరములు= బాణాలు; ఒండొండన్= ఒకదానితో ఒకటిగా (వరుసగా); నిగిడించి= వేసి; నొంచినన్= బాధించగా; గండు= పొగరు, గర్వం; అడఁగక= తగ్గక; అతఁడు= భీముడు; కనలు= కోపం; కదిరిన= నిండిన; మదితోన్=మనసుతో.

తాత్పర్యం: ద్రోణుడు ఇంకొక తేరెక్కి, గొప్పగా వెళ్ళి భీముడితో తలపడి వరుసగా బాణాలు వేసి బాధించాడు. బలగర్వం తగ్గకుండా మిక్కిలి కోపం నిండిన మనసుతో భీముడు(తరువాతి పద్యంతో అన్వయం).

చ. **అరదము డిగ్గి యప్పటు శరావళి కోర్చి మొగంబు వాంచి స**
త్వరుఁ డయి వాన పైఁ గురియ వంచిన మస్తక మొప్పఁ బోవు సుం
దర వృషభంబు లీలఁ జని దర్ప మెలర్పఁగ నొక్కచే నొగల్
వెరవునఁ బట్టి తేరు ప్రజ విస్మయ మందఁగ వీచి వైచినన్. 154

ప్రతిపదార్థం: (భీమసేనుడు) అరదము డిగ్గి= తన తేరును దిగి; ఆ+పటు శర+ఆవళికిన్+ఓర్చి= ఆ ద్రోణుడిచే వేయబడిన తీవ్రబాణపంక్తిని ఓర్చుకొంటూ; మొగంబు వాంచి= తన మొగమును వంచుకొని (బాణాలు తగులకుండా); సత్వరుఁడు+అయి= వేగం కలవా డయి; వాన పైన్ కురియన్ వంచిన మస్తకము= వాన మీద కురుస్తున్నా వంచిన తలను; ఒప్పన్+పోవు= తగిన విధంగా నడిచే; సుందరవృషభంబు లీలన్= అందమైన ఆబోతు వలె; చని= వెళ్ళి; దర్పము+ఎలర్పఁగన్= గర్వం ఒప్పగా; ఒక్కచేన్= ఒక చేతితో; నొగల్= తేరి నొగలను; వెరవునన్+పట్టి= ఉపాయంతో పట్టుకొని; తేరున్= తేరును (ద్రోణుడి తేరును); ప్రజ= చూచే జనం; విస్మయము+అందఁగన్= ఆశ్చర్యపడగా; వీచి వైచినన్= విసరివేయగా.

తాత్పర్యం: తన రథం మీది నుండి ఎగిరి క్రిందికి దూకి, ద్రోణుడు ప్రయోగించే తీవ్రబాణ సమూహాన్ని ఓర్చుకొంటూ, ముఖం వంచుకొని, మిక్కిలి వేగంగా - మీద వర్షం కురుస్తుంటే తలనువంచి పరుగెత్తే అందమైన ఆబోతు వలె వెళ్ళి, గర్వం అతిశయించగా, ఒక్కచేతితో ద్రోణుడి తేరి నొగలను పట్టి ఎత్తి, అందరు చూచి ఆశ్చర్యపడేటట్లు ఆ రథాన్ని విసిరివేయగా (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

భీముఁడు ద్రోణాది రథికుల నతిక్రమించి యర్జునుఁ జేరఁబోవుట (సం. 7-102-88)

ఆ. **నుగ్గునూచ మైన నగ్గురుఁ డొండొక । యరద మెక్కి యల్ల నరిగె సేన**
మొగమునకు రయంబు మిగుల విశోకుఁడు । దేర భీముఁ డెక్కెఁ దేరు ప్రీతి. 155

ప్రతిపదార్థం: నుగ్గునూచము+ఐనన్= (రథం విసరివేయగా) పొడిపొడికాగా; ఆ+గురుఁడు= ఆ ద్రోణుడు; ఒండొక అరదము+ఎక్కి= వేరొక తేరు నెక్కి; అల్లన్+అరిగెన్= నెమ్మదిగా వెళ్ళాడు; సేన మొగమునకున్= సేన మొదటికి; విశోకుఁడు= భీముడి సారథి అయిన విశోకుడు; రయంబు మిగులన్= మిక్కిలి వేగంతో; తేరన్= తీసికొని రాగా; భీముఁడు= భీమసేనుడు; ప్రీతిన్= ప్రేమతో; తేరున్= రథాన్ని; ఎక్కెన్= ఎక్కాడు.

తాత్పర్యం: ఆ విధంగా వేయటంవలన తేరు ముక్కలు ముక్కలయింది. అంత గురుడు వేరొక తేరెక్కి సేనాముఖానికి మెల్లగా వెళ్ళాడు. తన సారథి విశోకుడు మిక్కిలి వేగంగా రథం తీసికొనిపోగా, ప్రీతితో భీమసేనుడు ఆ తేరుఎక్కాడు.

వ. ఇవ్విధంబున ధనురాచార్యు బెట్టు వఱచి బిట్టు సను నా జెట్టిబిరుదున కెదుర్పం జాలక భోజబలంబును గాంభోజానీకంబును యవనాది మ్లేచ్ఛ సైన్యంబులునుం బసులు పులికిం బాఱు తెఱంగునం గలంగి పఱచె;న న ట్లప్రతిహతగతిం బోయి సాత్యకి సమరోల్లాసంబు గనుంగొనుచు నట కడచి యవ్వడముడి దివ్యరథంబు మెఱయఁ గౌరవ్యయోధులతోడం బెనంగు సవ్యసాచిం జూచి సింహనాదంబు సేసిన, నతనిం గనుంగొని ప్రియంబున నయ్యర్జునుండును హరియును గర్జారవంబుల గగనంబు నినిచి; రమ్మహారవంబు లాకర్ణించి యుధిష్ఠిరుండు భీము సంజ్ఞాపనంబునకు సంతుష్టాంతరంగుండై తన లోనన యతని నగ్గించి యన్నర నారాయణుల యెలుంగులు వినం గనుటకుం బొంగుచు, నప్పార్థుండు దన ప్రతిజ్ఞ నెఱపి వచ్చి తన్నుం గౌఁగిలించికొనుటం గోరుచుం, గౌరవపతి యిమ్మెయిం దమ్ములు బంధులుం దెగంబొలియుట దెలిసి యయినను దీరునకుం జొచ్చి యున్నవారినైనం గాచి కొనునొకో! యని యూహించుచుఁ గయ్యంబు సేయుచుండె' ననిన విని ధృతరాష్ట్రుండు సంజయున కి ట్లనియె. 156

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; ధనురాచార్యున్= ద్రోణాచార్యుడిని; బెట్టు పఱచి= మిక్కిలి బాధించి; బిట్టు చను= త్వరగా వెళ్ళుతున్న; ఆ జెట్టి బిరుదునకున్= ఆ మహావీరునకు; ఎదుర్పన్+చాలక= ఎదుర్కొనలేక; భోజబలంబును= భోజదేశ సైన్యమును; కాంభోజ+అనీకంబును= కాంభోజసైన్యమును; యవనాది మ్లేచ్ఛ సైన్యంబులును= యవనులు మొదలైన మ్లేచ్ఛ సేనలును; పసులు= పశువులు; పులికిన్+పాఱు తెఱంగునన్= పులిని చూచి పరుగెత్తే విధంగా; కలంగి= బెదరి; పఱచెన్= పరుగెత్తాయి; అట్లు= ఆ విధంగా; అప్రతిహతగతిన్+పోయి= ఎదురు లేని విధంగా వెళ్ళి (తనను అడ్డుకొనేవాడు లేడన్నట్లుగా వెళ్ళి); సాత్యకి సమర+ఉల్లాసంబు కనుంగొనుచున్= సాత్యకియొక్క యుద్ధోత్సాహాన్ని చూస్తూ; అట కడచి= ఆ చోటు దాటి; ఆ+వడముడి= ఆ భీమసేనుడు; దివ్యరథంబు మెఱయన్= దేవతా రథం ప్రకాశించగా; కౌరవ్యయోధులతోడన్= కౌరవులలోని మొనగాండ్రతో; పెనంగు= యుద్ధం చేసే; సవ్యసాచిన్+చూచి= అర్జునుడిని చూచి; సింహనాదంబు చేసినన్= సింహగర్జనం చేయగా; అతనిన్+కనుంగొని= ఆ భీముడిని చూచి; ప్రియంబునన్= ప్రేమతో; ఆ+అర్జునుండును హరియును= ఆ అర్జునుడూ, కృష్ణుడూ; గర్జారవంబులన్= గర్జాధ్వనులతో; గగనంబు నినిచిరి= ఆకాశం నింపారు; ఆ+మహారవంబులు= ఆ పెను శబ్దాలను; ఆకర్ణించి= విని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; భీము సంజ్ఞాపనంబునకున్= భీముని యొక్క సైగకు; సంతుష్ట+అంతరంగుండు+ఐ= సంతోషంతో కూడిన మనస్సుతో; తనలోనన= తన మనస్సులోనే; అతనిన్+అగ్గించి= ఆ భీముడిని పొగడి; ఆ నరనారాయణుల= ఆ అర్జునుడి కృష్ణుడి; ఎలుంగులు= కంఠధ్వనులు; వినన్= వినటానికి; కనుటకున్= చూడటానికీ; పొంగుచున్= సంతోషిస్తూ; ఆ+పార్థుండు= ఆ అర్జునుడు; తన ప్రతిజ్ఞ నెఱపి వచ్చి= తన శపథాన్ని సాగించి వచ్చి (మాట నిలుపుకొని వచ్చి); తన్నున్+కౌఁగిలించుకొనుటన్+కోరుచున్= తనను కౌగిలించుకొనుటకై ఆశపడుతూ; కౌరవపతి= దుర్యోధనుడు; ఈ+మెయిన్= ఈ ప్రకారంగా; తమ్ములు బంధులు= తన తమ్ములు, బంధువులును; తెగన్+పొలియుట= చనిపోవటం; తెలిసి= తెలిసినవాడై; అయినను= ఉన్నా; తీరునకున్+చొచ్చి= సంధికి వచ్చి; ఉన్న వారిన్+ఐనను= మిగిలి ఉన్నవారి నైనను; కాచికొనునొకో!= రక్షించుకొన కలుగునో! అని= అని అలా; ఊహించుచున్= తలచుకొంటూ; కయ్యంబు= యుద్ధాన్ని; చేయుచున్+ఉండెన్+అనినన్= చేస్తూ ఉండినాడనగా; విని= విన్నవాడై; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్= సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: భీముడు ఈ విధంగా ద్రోణుడిని మిక్కిలి బాధించి వెళ్ళుతుండగా మహావీరుడైన భీముడిని ఎదుర్కొనలేక భోజకాంభోజ యవనాది సేనలు పులిని చూచి పారిపోయే పశువుల మాదిరిగా భయపడి పరుగెత్తాయి. తనను అడ్డుకొనే నాథుడే లేకపోగా సాత్యకి యొక్క యుద్ధోత్సాహాన్ని చూస్తూ ఆ చోటు దాటి, తన దివ్య రథం మెరుస్తుండగా కౌరవులలోని మొనగాండ్రతో యుద్ధం చేస్తూ ఉన్న అర్జునుడిని చూచి సింహనాదం చేయగా భీముని చూచి ప్రీతితో కృష్ణార్జునులు తమ సింహనాదాలతో ఆకాశాన్ని నింపారు. ఆ పెను సవ్వడులు విన్న ధర్మరాజు భీముడు చేసిన సంజ్ఞకు సంతోషించి, మనస్సులో అతనిని పొగడి, కృష్ణార్జునుల గొంతులు వినటానికీ, చూడటానికీ పొంగిపోతూ, అర్జునుడు తన ప్రతిజ్ఞను నిలుపుకొని వచ్చి, తనను కౌగిలించుకోవాలనికోరుతూ, యుద్ధంలో తన సోదరులూ, బంధువులూ ఈ రీతిగా చచ్చిపోవటం చూచి అయినా, సంధికి వచ్చి, మిగిలి ఉన్నవారినైనా దుర్యోధనుడు రక్షించుకోగలడా?' అని అనుకొంటూ ఉన్నాడని విన్న ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అంటూ ఉన్నాడు.

ఆ. **ఇట్లు సింహనాద మిచ్చిన భీముని । మార్కొనంగ మగఁడు మన బలమునఁ**
గలిగెనే మదాత్మజులఁ గాల్పఁ బుట్టిన । చిచ్చు వాఁడు; వానిఁ జెనయు టరిది. **157**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారం; సింహనాదము+ఇచ్చిన= సింహగర్జన చేసిన; భీముని= భీమసేనుడిని; మార్కొనఁగన్= ఎదుర్కొనగలిగిన; మగఁడు= మొనగాడు; మన బలమునన్= మన సేనలో; కలిగెనే?= ఉన్నాడా?; మత్+ఆత్మజులన్= నా కుమారులను; కాల్పన్+పుట్టిన= కాల్చటానికై పుట్టిన (అనగా చంపటానికై పుట్టిన); చిచ్చు వాఁడు= అగ్గి అయిన వాడు; వానిన్= భీమసేనుడిని (అటువంటి వాడిని); చెనయుట= ఎదుర్కొనటం; అరిది!= ఆశ్చర్యమే సుమా!

తాత్పర్యం: అ ట్లా సింహగర్జనం చేసిన భీముడిని ఎదుర్కొన గల మొనగాడు మన బలంలో ఉన్నాడా? అతడు నా కొడుకును కాల్చటానికే పుట్టిన అగ్గివంటి వాడు. అతడిని ఎదుర్కొనటం అసాధ్యం.'

చ. **అనవుడు నాతఁ డిట్టు లను నమ్మనుజేంద్రు 'కప్డు కర్ణుఁ డ**
య్యనిలతనూజు మార్కొని రయంబున వింశతి సాయకంబు లే
సిన, నతఁడేడు తొమ్మిదులు చెచ్చెర నేసి సిడం బొకంట నే
పునఁ గుదియించె నా రథికపుంగవు లట్లు దొడంగి యుద్ధతిన్. **158**

ప్రతిపదార్థం: అనవుడు= అనగా; ఆతఁడు= ఆ సంజయుడు; ఆ+మనుజ+ఇంద్రునకున్= ఆ రాజేంద్రుడితో; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నాడు; అప్డు= ఆ సమయాన; కర్ణుఁడు= రాధేయుడు; ఆ+అనిలతనూజున్= ఆ భీమసేనుడిని; మార్కొని= ఎదుర్కొని; రయంబునన్= తొందరగా; వింశతి సాయకంబులు+ఏసినన్= ఇరువది బాణాలను వేయగా; అతఁడు= ఆ భీముడు; ఏడు తొమ్మిదులు= అరువది మూడు(బాణాలను); చెచ్చెరన్+ఏసి= వేగంగా వేసి; సిడంబు= కేతనమును; ఒకంటన్= ఒక బాణంతో; ఏపునన్= గర్వంతో; కుదియించెన్= కుదియచేశాడు (క్రుంగదీశాడు); ఆ+రథికపుంగవులు= ఆ రథిక శ్రేష్ఠులు; అట్లు= ఆ ప్రకారంగా; తొడంగి= పూనుకొని; ఉద్ధతిన్= దర్పంతో.

తాత్పర్యం: అనగా విని సంజయుడు ఇట్లా చెప్పాడు. 'ఆ సమయంలో కర్ణుడు భీముడిని ఎదుర్కొని వేగంగా ఇరవై బాణాలను అతడిపై వేయగా, ఆ భీముడు కూడా అరవైమూడు బాణాలను వేగంగా వేసి, ఒక బాణంతో కర్ణుడి రథకేతనాన్ని గర్వంతో విరుగగొట్టాడు. ఆ విధంగా ఆ రథిక శ్రేష్ఠులిద్దరూ తలపడి, దర్పంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. **పెనంగు నెడ భీమసేనుండు.** **159**

తాత్పర్యం: పెనగులాడేటప్పుడు భీమసేనుడు.

క. సూతసుతు విల్లు ద్రుంచిన । నాతఁడు బలు వింట నొంచె నతని వెస మరు
త్సూతి యదియుఁ ద్రుంచుచు ద । త్సూతునిఁ దురగములఁ ద్రుంచె దుర్దమలీలన్. 160

ప్రతిపదార్థం: సూతసుతు విల్లు త్రుంచినన్= కర్ణుడి వింటిని త్రుంచివేయగా; ఆతఁడు= ఆ కర్ణుడు; బలువింటన్= పెద్దవిల్లుతో; అతనిన్= ఆ భీమసేనుడిని; నొంచెన్= బాధించాడు; వెసన్= వేగంగా; మరుత్సూతి= వాయుపుత్రుడయిన భీముడు; అదియున్= ఆ బాణాగ్ని; త్రుంచుచున్= ముక్కలు చేస్తూ; తత్సూతునిన్= అతడి సారథిని; తురగములన్= గుర్రాలను; దుర్దమలీలన్= అణచవీలుకాని విలాసంతో; త్రుంచెన్= చంపాడు.

తాత్పర్యం: కర్ణుడి విల్లును త్రుంచాడు. అంత కర్ణుడు వేరొక విల్లుతో భీముడిని బాధించాడు. దానిని కూడా త్రుంచివేస్తూ అణచటానికి వీలుకాని విలాసంతో భీముడు ఆ కర్ణుడి సారథినీ, గుర్రాలనూ చంపి వేశాడు.

ఆ. విరథుఁడై యతండు వృషసేను రథ మెక్కఁ । బాఱుటయును, గలఁగఁ బాఱె సేన;
లట్టియెడ నృపాలుఁ డాచార్యు పాలికిఁ । జనియె తేరు దోలికొని రయమున. 161

ప్రతిపదార్థం: విరథుఁడు+ఐ= తేరులేనివాడై; అతండు= ఆ కర్ణుడు; వృషసేను రథము+ఎక్కన్= వృషసేనుడి తేరు మీదికి ఎక్కగా; పాఱుటయును= పరుగెత్తగా; సేన= (మన) సేన; కలఁగన్+పాఱెన్= చిందరవందరగా పరుగెత్తింది; అట్టి ఎడన్= ఆ సమయంలో; నృపాలుఁడు= దుర్యోధనుడు; రయమునన్= వేగంగా; ఆచార్యుపాలికిన్= ద్రోణాచార్యుడి దగ్గరకు; తేరు తోలికొని= రథం తోలుకొంటూ; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: (కర్ణుడు) అతడు తేరులేనివాడై పరుగెత్తి వృషసేనుడి తేరుమీద ఎక్కాడు. దానిని చూచిన సేన కలత చెందింది. అప్పుడు దుర్యోధనుడు గురువయిన ద్రోణుడి వద్దకు తన తేరు తోలుకొని వెళ్ళాడు.

దుర్యోధనుఁడు ద్రోణుని దూఱనాడుట (సం.7-105-1)

వ. చని యడచిపాటు గదుర నతనితో ని ట్లనియె. 162

తాత్పర్యం: (ఆ విధంగా) వెళ్ళి, తొందరపాటుతో ద్రోణాచార్యుడితో ఇట్లా అన్నాడు:

క. 'నరుఁడును సాత్యకియు వృకో । దరుఁడును మనసేనఁ గలఁచెదరు; సైంధవుఁ జే
రిరి; నీకుఁ దగునె నరునిం । జొరనిచ్చితయేని వారిఁ జొరనీ ననఘా! 163

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! నరుఁడును= అర్జునుడును; సాత్యకియున్= సాత్యకియును; వృకోదరుఁడును= భీముడును; మనసేనన్+కలఁచెదరు= మన సేనను చీకాకు పరుస్తారు; (వారు); సైంధవున్+చేరిరి= సైంధవుడికి దగ్గరయ్యారు; నరునిన్+చొరనిచ్చితయేని= అర్జునుడిని ప్రవేశింపనిచ్చినప్పటికీ; వారిన్+చొరనీన్= సాత్యకి, భీములను చొరనివ్వటానికి; నీకున్+తగునె?= నీకు న్యాయమా?

తాత్పర్యం: అర్జునుడు, సాత్యకి, భీముడు మన సేనలను చీకాకు పరచి సైంధవుడి దగ్గరకు చేరారు. అర్జునుడిని చొరనిచ్చినా, సాత్యకినీ, భీముడినీ చొరనీయటం నీకు తగునా?

క. సమరంబున నీ వోడుట । సముద్ర మింకుట; జయించె సాత్యకి గురుఁ గ
య్యమున నని యెసఁగు జనవా । దమ మేలుగఁ దలఁచి తొక్కొ! ధనురాచార్యా! 164

ప్రతిపదార్థం: ధనురాచార్యా!= ధనుర్విద్యా గురువా!; సమరంబునన్= యుద్ధంలో; నీవు+ఓడుట= నీవు ఓడిపోవటం; సముద్రము+ఇంకుట= సముద్రం ఇంకిపోవటం వంటిది (అనగా సముద్రంలో నీరు ఇంకిపోవటం ఎంత వింతయో యుద్ధంలో ధనురాచార్యుడయిన ద్రోణుడు ఓడిపోవటం అట్టిదే); సాత్యకి= ఆశైనేయుడు; గురున్= గురువయిన మిమ్ము; కయ్యమునన్= యుద్ధంలో; జయించెన్= జయించాడు; అని ఎసఁగు= అని వ్యాపించే; జననాదము+అ= నలుగురిమాటయే; మేలుగన్= శ్రేష్ఠంగా; తలఁచితి+ఒక్కొ?= తలచుకొన్నావా?

తాత్పర్యం: ధనురాచార్యా! యుద్ధంలో నీవు ఓడిపోవటం సముద్రం ఇంకిపోవటం వంటిది. ఇక సాత్యకి ధనురాచార్యుడవయిన నిన్ను గెలిచా డని లోకులు అనుకొనటమే మేలుగా తలచుకొన్నావా?

విశేషం: అలం: నిదర్శన.

క. **ఈ భంగి నీ వడంగుట । మా భాగ్యము గాక యింక మాటలు వల దీ**
క్షోభం బెట్టు లుడుగుఁ జెపు । మా! భవదీయ బలశౌర్యమతులకుఁ దగఁగాన్.' **165**

ప్రతిపదార్థం: ఈ భంగిన్= ఈ విధంగా; నీవు+అడంగుట= నీ వణగిపోవటం; మా భాగ్యముకాక= మా అదృష్టం కాక; ఇంకన్ మాటలు వలదు= ఇంక మాట్లాడ నక్కరలేదు; ఈ క్షోభంబు+ఎట్టులు+ఉడుగున్= ఈ ఆరాట మెట్లా పోతుందో; భవదీయబల శౌర్యమతులకున్= నీ బలానికి, పరాక్రమానికీ, బుద్ధికి తగఁగాన్= తగినట్లుగా; చెపుమా!= చెప్పవలయును సుమా!

తాత్పర్యం: ఈ మాదిరిగా నీ వణగిపోవటం మా అదృష్టం (మా దౌర్భాగ్యం) కాక వేరేముంది? ఊరకే మాటలెందుకు? మా ఈ క్షోభ తీరే విధ మేమిటి? నీ బలానికీ, బుద్ధికీ, శక్తికీ తగిన విధంగా చెప్పవలసింది.'

చ. **అనవుడు నాతఁ డిట్టు లను 'నక్కడ నిక్కడ నొక్క రూపునన్**
మన మొనకైన యీ యెడరు మాన్పఁగ నోపిన యంత మాన్చెద;
న్వినుము! విశిష్ట కార్య మవనీవర! సైంధవుఁ గాచికోల య
ర్జునునకు నీకునుం గలిగె జూదము నేఁ డధికంపుటొడ్డుగన్. **166**

ప్రతిపదార్థం: అవనీవర!= రాజశ్రేష్ఠా!; అనవుడున్= ఆ విధంగా చెప్పగా; ఆతఁడు+ఇట్టులు+అనున్= ఆ ద్రోణు డీవిధంగా అన్నాడు; అక్కడన్+ఇక్కడన్= ఆ చోట ఈచోట (దుర్యోధనుడి తమ్ములు మొదలయిన వారున్నచోట, తానున్న ఈ చోట); ఒక్కరూపునన్= ఒకే విధంగా; మనమొనకైన ఈ ఎడరు= మన సేనకు కలిగిన ఈ భంగపాటు; మాన్పఁగన్= పోగొట్టటానికి; ఓపినఅంత మాన్చెదన్= చేతనైనంతగా పోగొట్టుతాను; వినుము= (నా ప్రతిజ్ఞ) వినుము; విశిష్టకార్యము= విశేషమైన పని; సైంధవున్+కాచికోల= సైంధవుడిని కాపాడుకొనటమే; నేఁడు= ఈ దినం; అర్జుననకున్= అర్జునుడికీ; నీకునున్= నీకునూ; అధికంపుటొడ్డుగన్= విశేషమైన పందెంతో; జూదము= పాచికల ఆట; కలిగెన్= ఏర్పడింది.

తాత్పర్యం: దుర్యోధను డావిధంగా వ్యంగ్యంగా దెప్పగా విని, అందుకు బదులుగా ద్రోణుడు ఇట్లా అన్నాడు: 'ఓ దుర్యోధనా! యుద్ధరంగంలో అక్కడా, ఇక్కడా (అనగా నీ తమ్ములకూ, నాకూ) మన సేన పొందిన భంగపాటును పోగొట్టటానికి నా శక్తితో ప్రయత్నిస్తాను. ఇప్పటి మన ప్రత్యేక కర్తవ్యం - సైంధవుడిని కాపాడుకొనటమే. ఈ దినం జరిగే యుద్ధం నీకూ అర్జునుడికీ జరిగే పాచికలాటవంటిది. దాని పందెం చాలా భారీగా ఉంటుంది.

క. **మును శకుని బుద్ధిమై గెలి । చిన యది యస్థిరపు గెలుపు; సెడకీ జూదం**
బున వెడలఁ బాటు సూవే । మన వెరవును లావు కలిమి మనుజాధీశా! **167**

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= ఓ రాజా! (దుర్యోధనా!); మును= ఇదివరలో; శకుని బుద్ధిమైన్= శకుని తెలివితో; గెలిచిన అది= జయించటం (సభాపర్వంలో గెలిచింది); అస్థిరపు గెలుపు= (నిలవని గెలుపు) నిలుకడ లేని జయం; చెడక= నశించిపోక; ఈ జూదంబునన్= ఈ నాటి జూదంలో; వెడలన్+పాటు= బైట పడటం (అనగా జయించటం); మన వెరవును= మన ఉపాయమూ; లావును= బలమూ; సూవే!= సుమా!

తాత్పర్యం: ఓ రాజా! ఇదివరలో శకుని తెలివితేటలతో పొందిన గెలుపు శాశ్వతమైన గెలుపు కాదు. ఈ దినం స్థిరంగా మనం ఈనాటి జూదంలో గట్టెక్కటమే మన ఉపాయమూ, బలమూ సుమా!

వ. **కావున నీవు సమరోత్సాహుండ వై సాహాయ్యంబునకు నద్దెస నున్న కర్ణాదులం గొని కవ్వడి మొదలగు నమ్ముప్వురకుం జాలి సింధురాజ రక్షణంబు నిర్వహింపు; మేను సేనాముఖంబున నిలిచి తక్కినయందఱి నిలువరించుట మేలు; నీతో వచ్చుట కర్జంబు గాదు పొ' మ్మనుటయు నతండు మరలి తన్నుందాన పురికొలిపికొనుచు నట సనియె; నప్పుడు యుధామన్యుండు నుత్తమౌజుండును మున్ను కృతవర్మచేత నివారితులై నరునితోడ నఱుమం జనక కెలని కుఱికి మనమొనఁ దెరల్చికొని బయలికి వెడలి కపిధ్వజ గాండీవ గుణరావంబుల కతన నతని యున్న యెడ యుపలక్షించి తిరిగి వచ్చి బలుపున మన బలంబు వాయఁ బాపికొని చొచ్చి విప్వచ్చుం జేరవచ్చుచున్నం గని యక్కురువిభుండు వారల వారింపం గడంగిన. 168**

ప్రతిపదార్థం: కావునన్= కనుక; నీవు సమర+ఉత్సాహుండవు+ఐ= నీవు యుద్ధంలో ఆశ కలవాడవై; సాహాయ్యంబునకున్= నీకు సాయానికై; ఆ+దెసన్+ఉన్న= ఆ వైపు ఉన్న; కర్ణాదులన్+కొని= కర్ణుడు మొదలైనవారిని పిలుచుకొని; ఆ+ముప్వురకున్+చాలి= ఆ మూగురికి తగినట్లుగా (అనగా భీమార్జున సాత్యకులకు తగినట్లుగా); సింధురాజ రక్షణంబు= సైంధవుడిని కాపాడటం; నిర్వహింపుము= నెరవేర్చుము; ఏను సేనాముఖంబునన్+నిలిచి= నేను సేన మొగలో ఉండి; తక్కిన అందఱి నిలువరించుట మేలు= మిగిలిన వారినంతా ఆపటం మేలు; నీతోన్ వచ్చుట= నీతో కలిసి రావటం; పనికాదు= కార్యంకాదు; పొమ్ము= నీవు వెళ్ళుము; అనుటయున్= అనగా; అతండు= ఆ దుర్యోధనుడు; మరలి= తిరిగి; తన్నున్+తాన= తనను తాను; పురికొలిపికొనుచున్= ప్రేరేపించుకొంటూ; అట చనియెన్= ఆ దిక్కుగా వెళ్ళాడు; అప్పుడు= ఆ సమయంలో; యుధామన్యుండును, ఉత్తమౌజుండును; మున్ను= ఇదివరకు; కృతవర్మచేత నివారితులై= కృతవర్మచేత అడ్డుకొనబడినవారై; నరునితోడన్+అఱుమన్ చనక= అర్జునుడితో కలిసిఆక్రమించుకోవటానికి పోకుండా; కెలనికిన్= ప్రక్కకు; ఉఱికి= దూకి; మన మొనన్+తెరల్చికొని= మనసేనను దాటుకొని; బయలికిన్ వెడలి= బయటకు వెళ్ళి; కపిధ్వజ= కపికేతనము వలననూ; గాండీవగుణ రావంబుల కతనన్= గాండివపు నారి ధ్వనివలననూ; అతని ఉన్న ఎడ= ఆతడుండే చోటును; ఉపలక్షించి= చూచి; తిరిగి వచ్చి= మరలివచ్చి; బలుపునన్= శక్తితో; మనబలంబు= మనసేన; పాయన్= పాయునట్లు; పాపికొనిచొచ్చి= తొలగించుకొని ప్రవేశించి; విప్వచ్చున్+చేరవచ్చుచున్నన్= అర్జునుడిని చేరబోవటాన్ని; కని= చూచి; ఆ+కురువిభుండు= ఆ కౌరవరాజు దుర్యోధనుడు; వారలన్= ఆ ముగ్గురు సైనికవరులను; వారింపన్+కడంగినన్= అడ్డుకోవటానికి పూనుకొనగా.

తాత్పర్యం: నీవు యుద్ధోత్సాహంతో, సహాయంగా కర్ణాదులను తీసికొని సైంధవుడికి కాపుగా నిలిచి, అర్జునుడు మొదలయిన ఆ ముగ్గురినీ ఎదుర్కొనుము, నేను సేన మొగాన నిలిచి తక్కిన వారి నందరినీ ఆపుతాను (నిలువరిస్తాను.) అది సరి అయిన పని. నేను నీతో రావటం తగిన పనికాదు'. అని పొమ్మనగానే, దుర్యోధనుడు తనను తానే పురికొల్పుకొంటూ అక్కడికి వెళ్ళాడు. ఆ సమయాన యుధామన్యుడూ, ఉత్తమౌజుడూ అదివరకు కృతవర్మచేత అడ్డుకొనబడి అర్జునుడితో కలిసి ముందుకు దూకలేక, ప్రక్కకు తప్పుకొని, మన సేనను దాటుకొని బయటకు వెళ్ళారు. అపుడు వినవచ్చిన గాండీవరావం కపికేతనం గలగల మూలాన అర్జునుడి ఉనికి తెలిసికొని, తిరిగి వచ్చి బలంతో మన సైన్యాన్ని పాయతరిమి, అర్జునుడిని చేరపోయారు. అపుడు దుర్యోధనుడు వారిని చూచి, అడ్డుకొన ప్రయత్నించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఆ యిరువురతో నజ్జన । నాయకునకు నయ్యె దారుణం బగు రణ మం
దాయత నృపచాపము రో । షాయత్తత నుత్తమౌజుఁ డార్చుచుఁ దునిమెన్. 169

ప్రతిపదార్థం: ఆ ఇరువురతోన్= ఆ యుధామన్యు ఉత్తమౌజులతో; ఆ+జననాయకునకున్= ఆ రాజునకు (దుర్యోధనుడికి); దారుణంబు+అగు= భయంకరమైన; రణము+అయ్యెన్= యుద్ధమైనది; అందున్= ఆ యుద్ధంలో; ఆయత నృపచాపము= పొడవైన రాజు వింటిని; రోష+ఆయత్తతన్= రోషానికి వశుడౌటచే; ఉత్తమౌజుఁడు= ఉత్తమౌజుడు; ఆర్చుచున్= అరుస్తూ; తునిమెన్= త్రుంచివేశాడు.

తాత్పర్యం: రాజైన దుర్యోధనుడికి యుధామన్యు ఉత్తమౌజులతో దారుణమైన యుద్ధం జరిగింది. పెద్దదయిన ఆ రాజు వింటిని ఆ యుద్ధంలో యుధామన్యుడు సింహనాదం చేస్తూ త్రుంచివేశాడు.

తే. తునిమి తోడన యుర మాడ సునిశితాస్త్ర । చయము నిగుడింప రా జొండు చాప మెత్తి
యతని హయముల సారథి నవనిఁ గూల్చె; । నాతఁ డరిగె యుధామన్యు నరదమునకు. 170

ప్రతిపదార్థం: తునిమి= త్రుంచి (ఉత్తమౌజుడు సింహనాదం చేస్తూ దుర్యోధనుడి వింటిని త్రుంచగా); తోడన= వెంటనే; ఉరమాడన్= గుండెలో తాకేటట్లుగా; సునిశిత+అస్త్రచయము నిగుడింపన్= వాడి అయిన బాణాలు వేయగా; రాజు= దుర్యోధనుడు; ఒండు చాపము+ఎత్తి= వేరొక విల్లును తీసికొని; అతని హయములన్= ఆ ఉత్తమౌజుడి గుర్రాలను; సారథిన్= సూతుడిని; అవనిన్+కూల్చెన్= భూమిమీద పడవేశాడు (అనగా చంపాడు); ఆతఁడు= ఉత్తమౌజుడు; యుధామన్యు నరదమునకున్= యుధామన్యుడి తేరు మీదకు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఉత్తమౌజుడు దుర్యోధనుడి విల్లు త్రుంచి, వాడిబాణాలతో అతడి గుండెలో కొట్టాడు. అంత దుర్యోధనుడు ఇంకొక విల్లు నందుకొని వాడి గుర్రాలనూ, సారథినీ చంపాడు. అపుడు అతడు యుధామన్యుడి తేరుమీదికి వెళ్ళాడు.

క. అరిగి తురగముల సూతుం । బొరిగొన విరథుఁడయి నృపతి పొలివోవక యు
ద్ధుర గతిఁగద గొని చని త । త్తురగంబుల సారథిని జిదుర్పలు సేసెన్. 171

ప్రతిపదార్థం: అరిగి= (యుధామన్యుడి తేరు మీదకు) వెళ్ళి; తురగములన్ సూతున్ పొరిగొనన్= గుర్రాలను, సారథిని చంపగా; నృపతి పొలివోవక= రాజు చచ్చుపడకుండా; ఉద్ధురగతిన్= నిలుకడగా; గదకొని= గదతీసికొని; చని= వెళ్ళి; తత్తురగంబులన్= అతడి గుర్రాలను; సారథిని= సూతునీ; చిదుర్పలు= ముక్కలుగా; చేసెన్.

తాత్పర్యం: ఉత్తమౌజుడు (యుధామన్యుడి తేరుమీదకు వెళ్ళి) దుర్యోధనుడి తేరి గుర్రాలనూ సారథినీ చంపగా, అతడు చచ్చుపడకుండా విజృంభించి గదతో అతడి గుర్రాలనూ సారథినీ ముక్కలుముక్కలుగా చేశాడు.

తే. రథము డిగ్గి తొలంగి రా రథికు ల మ్మ । హీశుఁడేతెంచి యెక్కె మద్రేశు తేరు;
వారు నీ యోధు లిరువుర బారిసమరి । యా రథము లెక్కి యర్జునుఁ జేరఁ జనిరి.' 172

ప్రతిపదార్థం: రథము డిగ్గి తొలంగిరి+ఆరథికులు= ఆ సేనానులు ఉత్తమౌజుడూ, యుధామన్యుడూ తేరు నుండి దిగి తొలగిపోయారు; ఆ+మహీశుఁడు= ఆ రాజయిన దుర్యోధనుడు; మద్రేశు తేరున్= మద్రభూపతియొక్క తేరుమీదకు; ఎక్కెన్= ఎక్కాడు; వారు= యుధామన్యు ఉత్తమౌజులు; నీ యోధులు+ఇరువురన్= నీ సైనికులయిన యిద్దరిని; బారిసమరి= హింసించి; ఆ రథములు+ఎక్కి= వారి తేరులెక్కి; అర్జునున్+చేరన్+చనిరి= అర్జునుడి వద్దకు వెళ్ళారు.

తాత్పర్యం: యుధామన్యూత్తమౌజులు తేరునుండి దిగితొలగిపోయారు. దుర్యోధనుడు శల్యుడి తేరు ఎక్కాడు. దుర్యోధనుడినీ, శల్యుడినీ చావబాది, వారిద్దరూ ఆ తేరెక్కి అర్జునుడి వద్దకు చేరుకొన్నారు.'

వ. అనుటయు నాంబికేయుండు సంజయున కిట్లను 'మనవా రెల్లం గర్ణుండు గౌంతేయుం గెలుచు నని యాస పడుదు రా ధర్మతనయుం డాతని యాటోపంబు దలంచి రేలెల్లను గన్ను మూయండు. 173

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్+ఇట్లు+అనున్= సంజయుడితో ఈ విధంగా అన్నాడు; మనవారు+ఎల్లన్= మనవారంతా; కర్ణుండు= కర్ణుడు; కౌంతేయున్= కుంతికుమారుడయిన అర్జునుడిని; గెలుచున్+అని= జయిస్తాడని; ఆసపడుదురు= ఆశతో ఉంటారు; ఆ ధర్మతనయుండు= ఆ ధర్మరాజు; ఆతని ఆటోపంబు తలంచి= ఆ కర్ణుడి ఉరవడిని తలచుకొని; రేలు+ఎల్లను= రాత్రులంతా; కన్నుమూయండు= నిద్రపోడు.

తాత్పర్యం: (యుధామన్యూత్తమౌజులు దుర్యోధన శల్యులను అతిక్రమించి అర్జునుడిని చేరబోయారని) అనగా, ధృతరాష్ట్రుడు సంజయుడితో 'మనవారంతా కర్ణుడు అర్జునుడిని గెలుస్తా డని ఆశతో ఉంటారు. వాడి బలాన్ని తలచుకొని ధర్మరాజు రాత్రులలో నిద్రపోకుండా ఉన్నాడు.

ఆ. అట్టి జెట్టి యనిలుపట్టి చే విరథుఁడై । పోయి పోయినట్లు పోయెఁ గాని;
మరలి కయ్యమునకుఁ జొరఁ డెట్టు? లాతని । తెఱఁగు సెప్పు నాకుఁ దేటపడఁగ. 174

ప్రతిపదార్థం: అట్టి జెట్టి= అటువంటి వీరుడు; అనిలుపట్టిచేన్= భీముడి చేత; విరథుఁడు+ఐ= రథాన్ని పోగొట్టుకొని; పోయి పోయినట్లు పోయెన్+కాని= తిరిగి చూడకుండా పోయినట్లుగా పోయాడు కానీ; మరలి కయ్యమునకున్= మళ్ళీ యుద్ధానికి; చొరఁడు+ఎట్టులు?= రాడేమి?; ఆతని తెఱఁగు= ఆ కర్ణుడి పద్ధతి; నాకు తేటపడఁగన్= నాకు అర్థమయ్యేటట్లు; చెప్పు= చెప్పుము.

తాత్పర్యం: అటువంటి మొనగా డయిన వీరుడు కర్ణుడు, భీముని వలన తేరులేనివాడై పోయినవాడట్లేపోయాడు. మళ్ళీ యుద్ధానికి రాలేదు. ఆ విధ మెట్లా అయిందో నాకు స్పష్టంగా చెప్పవలసింది.

చ. 'అనవుడు నాతఁ డిట్టు లను నన్నరనాథున "కట్లు సూతనం
దనుఁ బొరివుచ్చి భీముఁడు మదంబున నర్జును దిక్కు వోవఁ గాఁ
గని యతఁ డాయితం బయి తగం దనపే రెలుఁగెత్తి పిల్చె; నా
ధ్వని విని యావృకోదరుఁ డుదగ్రగతిన్ మరలెన్ మహీశ్వరా! 175

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆతడు= ఆ సంజయుడు; ఆ+నరనాథునకున్= ఆ రాజయిన ధృతరాష్ట్రుడితో; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; మహీశ్వరా!= ఓ రాజా!; అట్లు= ఆ ప్రకారంగా; సూతనందనున్= కర్ణుడిని; పొరివుచ్చి= యుద్ధంలో తరిమి; భీముఁడు= భీమసేనుడు; మదంబునన్= గర్వంతో; అర్జును దిక్కు+పోవఁగాన్= అర్జును డుండే చోటికి పోగా; కని= చూచి; అతఁడు= ఆ కర్ణుడు; ఆయితంబు+అయి= సిద్ధమయి; తగన్= తగినట్లుగా; తనపేరు= తన పేరును (ఓ భీమా! అని); ఎలుఁగెత్తి= గొంతెత్తి; పిల్చెన్= పిలిచాడు; ఆ ధ్వని విని= ఆ పిలుపు విని; వృకోదరుఁడు= భీముడు; ఉదగ్ర గతిన్= భయంకరంగా; మరలెన్= తిరిగాడు (కర్ణుడు తనను పేరు పెట్టి పిలిచేటప్పటికి భీముడు కోపాటోపంతో తిరిగాడు).

తాత్పర్యం: భీమసేనుడు కర్ణుడిని పొరిపుచ్చి, అర్జునుడి వద్దకు పోగా చూచికర్ణుడు మరలా సన్నద్ధుడై భీముడిని పేరుపెట్టి పిలిచాడు. ఆ పిలుపునకు తీవ్రమయిన కోపంతో భీముడు తిరిగాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్లు దార్కొని అర్కప్రతాపు లగు నయ్యిరువురు నొండొరువుల శరంబులు దూలించుచు దురంగంబుల యంగంబులం దూపులఁ గీలించుచు సారథుల బెట్టు వఱచుచుఁ జాపంబులు విఱుచుచు మైమఱువు లఱువుళ్ళు సేయుచు మేనులు నెత్తుట జొత్తిల్లఁ జేయుచు నొండొరులకు వేఁడిమి సూపి యేవునం బెనంగు నెడ నయ్యనిలతనయుండు. 176

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; తార్కొని= చేరువయి; అర్క ప్రతాపులు+అగు= సూర్యుడితో సమానమయిన శౌర్యం కలవారయిన; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరూ (కర్ణ భీములు); ఒండొరువుల శరంబులు తూలించుచున్= ఒకరొకరి బాణాలను తొలగిస్తూ; తురంగంబుల= గుర్రాల; అంగంబులన్= శరీర భాగాలను; తూపులన్= బాణాలతో; కీలించుచున్= నాటుతూ; సారథులన్= సూతులను; బెట్టు పఱచుచున్= మిక్కిలి చీకాకు పరుస్తూ; చాపంబులు విఱుచుచున్= విండ్లను విరుస్తూ; మైమఱువులు= కవచాలను; అఱువుళ్ళు చేయుచున్= శిథిలపరుస్తూ; మేనులు= ఒళ్ళు; నెత్తుటన్ జొత్తిల్లన్ చేయుచున్= నెత్తురులో మునుగజేస్తూ; ఒండొరులకున్= ఒకరొకరికి; వేఁడిమి= దర్పమును; చూపి= చూపుతూ; ఏపునన్= గొప్పగా; పెనంగు ఎడన్= పోట్లాడేటప్పుడు; ఆ+అనిల తనయుండు= ఆ వాయుదేవుడి వరాన బుట్టిన భీముడు.

తాత్పర్యం: ఆ విధంగా దగ్గరయి, సూర్యతేజంతో వా రిద్దరు ఒకరిపై నొకరు బాణాలు గుప్పిస్తూ గుర్రాల శరీరాంగాలను బాణాలతో గ్రుచ్చుతూ, సారథులను చీకాకుపరుస్తూ, విండ్లను విరుస్తూ, కవచాలను చూర్ణం చేస్తూ, శరీరాలను నెత్తురులో మునుగచేస్తూ ఒకరు మరియొకరిమీద గొప్పతనాన్ని చూపి యుద్ధం చేసేటప్పుడు ఆ భీమసేనుడు (తరువాతి పద్యంతో అన్వయం).

క. విలు దురుము సేసి గుఱ్ఱం । బుల సూతునిఁ బిలుకుమార్చి భుజగనిభ శరం
బులఁ జేడ్పఱిచిన సిగ్గఱి । కలఁగి పఱచి యొండు రథముఁ గర్ణుం డెక్కెన్.' 177

ప్రతిపదార్థం: (భీమసేనుడు) విలుతురుము చేసి= వింటిని ముక్కలుగా చేసి; గుఱ్ఱంబులన్, సూతునిన్= గుర్రాలను, సారథినీ; పిలుకుమార్చి= చంపివేసి; భుజగనిభ శరంబులన్= పాములవంటి బాణాలతో; చేడ్పఱిచినన్= బాధించగా; సిగ్గఱి= సిగ్గువదలి; కలఁగి పఱచి= చీకాకుతో తొలఁగిపోయి; కర్ణుఁడు= కర్ణుడు; ఒండు రథమున్= ఇంకొక తేరుమీదికి; ఎక్కెన్= ఎక్కాడు.

తాత్పర్యం: భీమసేనుడు కర్ణుడి విల్లు త్రుంచాడు. గుర్రాలను సారథినీ చంపాడు. పాములవంటి తీవ్రమైన బాణాలతో బాధించాడు. అందుకు సిగ్గువదలి, చీకాకుపడి, ప్రక్కకు పోయి ఇంకొక తేరుమీదికి కర్ణుడు ఎక్కాడు.'

క. అనిన విని ధృతరాష్ట్రుం డి । ట్లను 'నమ్మినబంటు పిఱికియై యిటు పఱవం
గని మందబుద్ధి దుర్యో । ధనుఁ డేమని తలఁచెనొక్కొ! తన చిత్తమునన్. 178

ప్రతిపదార్థం: అనినన్= సంజయు డీ విధంగా చెప్పగా; విని= విని; ధృతరాష్ట్రుఁడు+ఇట్లు+అనున్= ధృతరాష్ట్రు డీ విధంగా అన్నాడు; నమ్మినబంటు= తాను మిక్కిలిగా నమ్మిన సైనికుడు (సేవకుడు); పిఱికి ఐ= పిరికివాడుగా; ఇటు పఱవన్= ఈ విధంగా ఓడి పరుగెత్తగా; కని= చూచి; మందబుద్ధి= బుద్ధిలేని; దుర్యోధనుఁడు= దుర్యోధనుడు; తన చిత్తమునన్= తన మనస్సులో; ఏ మని తలఁచెనొక్కొ!= ఏ మని తలచుకొన్నాడో?;

తాత్పర్యం: సంజయుడు కర్ణుడి అవస్థను చెప్పగా ధృతరాష్ట్రుడు 'తన నమ్మిన బంటు ఈ విధంగా పిరికివాడుగా పరుగెత్తటం చూచి బుద్ధిహీనుడయిన దుర్యోధను డేమనుకొన్నాడో?

విశేషం: ఈ పద్యంలో పుత్రపక్షపాతి అయిన ధృతరాష్ట్రుడు దుర్యోధనుడిని బుద్ధిహీనుడిగా పేర్కొనటం వింత.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అది యట్లుండె; నా కర్ణుని బింకంబు పిదప నెట్లయ్యె?' ననవుడు సంజయుం డతని కిట్లనియె. 179

తాత్పర్యం: అది అట్లా ఉండనీ, ఆ కర్ణుని డాంబికం ఆ తర్వాత ఏమయినది?' అనగా సంజయు డాతడితో ఈ విధంగా అన్నాడు:

తే. ఆననంబునఁ గ్రోధమహానలంబు । భీషణముగ రాధేయుండు భీము దెసకు
మరలి యురవడిఁ గవియ నయ్యిరువురకు మ । హాద్భుతం బగు సంగ్రామ మయ్యె నధిప! 180

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; ఆననంబునన్= ముఖంలో; క్రోధమహా+అనలంబు= కోప మనే పెనుమంట; భీషణముగన్= భయంకరంగా; రాధేయుండు= కర్ణుడు; భీము దెసకున్= భీముడి దిక్కుగా; మరలి= తిరిగి; ఉరవడిన్= వేగంగా; కవియన్= క్రమ్ముకోగా; ఆ+ఇరువురకునున్= ఆ ఇద్దరికినీ; మహాద్భుతంబు+అగు= మిక్కిలి అచ్చెరు వయిన; సంగ్రామము+అయ్యెన్= యుద్ధమైనది.

తాత్పర్యం: పెనుమంటవలె కోపం ముఖంలో భయంకరంగా కానరాగా కర్ణుడు భీముడి దిక్కుగా తిరిగి వేగంగా క్రమ్ముకొనగా - ఆ ఇద్దరికీ ఆశ్చర్యకర మయిన పెద్ద యుద్ధం జరిగింది.

క. బలు దేగల కైవడి బె । బ్బులుల పగిది మత్తకరుల పోలిక దర్పో
జ్జ్వల సింహంబుల చాడ్పున । నలవుఁ జలము మెఱయఁ బెనఁగి రా రథికవరుల్. 181

ప్రతిపదార్థం: బలు దేగల కైవడిన్= బలమైన డేగల మాదిరిగా; బెబ్బులుల పగిదిన్= పెద్దపులుల మాదిరిగను; మత్తకరుల పోలికన్= మదపుటేనుగుల మాదిరిగను; దర్పోజ్జ్వల= గర్వం ఎక్కువయిన; సింహంబుల చాడ్పునన్= సింహముల మాదిరిగను; అలవు= బలము; చలము= పట్టుదల; మెఱయన్= వెలుగగా; ఆ రథికవరుల్= ఆ రథిక శ్రేష్ఠులు; పెనఁగిరి= పోట్లాడారు.

తాత్పర్యం: ఆ వీరులిద్దరును బలమైన డేగలు, పెద్దపులులు, మదపుటేనుగులు, గర్వంతో ప్రకాశించే సింహాలూ, పోట్లాడినట్లుగా ఉపాయమూ మత్సరమూ అతిశయించగా పోట్లాడారు.

విశేషం: అలం: మాలోపమ.

క. పెనఁగునెడం గర్ణుని ది । క్కునఁ జతురంగములు బెట్టు గోల్తల నా భీ
మునిమీఁదఁ గవిసి మంత్రిం । చిన యట్టులు గూలె నతని చేతి బలువునన్. 182

ప్రతిపదార్థం: పెనఁగునెడన్= యుద్ధం చేసేటప్పుడు; కర్ణుని దిక్కునన్= కర్ణుడి వైపున ఉన్న; చతురంగములు= నాల్గు విధాలయిన బలాలు (రథ, గజ, తురగ, పదాతులు); బెట్టు= పెద్దగా, కోల్తలన్= యుద్ధసన్నాహంతో; ఆ భీమునిమీఁదన్= ఆ భీముడిపైకి; కవిసి= దూకి; మంత్రించిన అట్టులు= మంత్రించిన విధంగా (మంత్రముగ్ధ లయినట్లు); అతనిచేతి బలువునన్= ఆ భీముడిచేతి బలంతో; కూలెన్= పడిపోయాయి.

తాత్పర్యం: యుద్ధం చేసేటప్పుడు కర్ణుడి వైపున ఉండే చతురంగ బలాలు ఆ భీముడిమీద విజృంభించి, మంత్రించిన విధంగా అతడి చేతిబలానికి కూలిపోయాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. అనవుడు నాంబికేయుండు. 183

తాత్పర్యం: అనగా ధృతరాష్ట్రుడు.

క. 'తొడరెడు కొలఁదియె వానికి? । వడముడి భుజవిక్రమంబు వారల మన మె
ప్పుడు వినమొ? కర్ణు వినమో? । యడిబీరపుఁ దులువ గెలుచు నటె పాండవులన్? 184

ప్రతిపదార్థం: వానికిన్= ఆ కర్ణుడికి; తొడరెడు కొలఁదియె?= ఎదిరించే సాటివాడా?; వడముడి భుజ విక్రమంబు= భీమసేనుడి భుజబలం; వారలన్= పాండవులను గూర్చి; మనము+ఎప్పుడు వినమొ?= మనము ఎప్పుడూ వినలేదా?; కర్ణుని వినమో?= కర్ణుడిని గూర్చి వినమా? (వినలేదా?); అడి బీరపు తులువ= వ్యర్థమయిన తుంటరివాడు; పాండవులన్ గెలుచున్+అటె?= పాండవులను గెలువగలడా?

తాత్పర్యం: ఆ కర్ణుడికి (పాండవులను) ఎదిరించటం సాధ్యమా? భీముడి భుజబలమును గూర్చి, పాండవులను గూర్చి మన మెపుడూ వినలేదా? తుంటరిగా వ్యర్థంగా మాటాడే కర్ణుడినిగూర్చి మనం వినలేదా? ఇతడు పాండవులను గెలువగలడా?

విశేషం: దుందుడుకుతనంతో మాటాడే కర్ణుడి మాటలూ చేష్టలూ మనకు తెలియును. పాండవుల శక్తీ మనకు తెలియును. పనికి రాని మాటలు తప్ప మరేమీ చేతకాని కర్ణుడు పాండవులను గెలవగలడా? అని ధృతరాష్ట్రుడు తన మనస్సులోని భావాన్ని వెళ్ళగ్రక్కాడు.

ఉ. **సూతసుతుండు పాండునృపసూనులఁ బోర జయించు నంచు గ**
ర్వాతిశయంబునన్ మనమదాంధుఁడు కృష్ణుఁ దృణీకరించి సం
ప్రీతిగ సంధి సేయఁడ యపేతకళంకులు వారు; వారి కే
లా తగ వేది దైవము దలంచు రణంబునఁ జేటు? సంజయా! **185**

ప్రతిపదార్థం: సంజయా!= ఓ సంజయుడా!; సూత సుతుఁడు= కర్ణుడు; పాండు నృపసూనులన్= పాండురాజు కుమారులను; పోరన్+జయించుచున్+అంచున= యుద్ధంలో గెలుస్తా డంటూ; గర్వాతిశయంబునన్= మిక్కిలి పొగరుబోతుతనంతో; మన మద+అంధుఁడు= మత్తుతో కళ్ళుతెలియని గ్రుడ్డిగా ఉండే మనవాడు (దుర్యోధనుడు); కృష్ణున్= శ్రీకృష్ణుడిని; తృణీకరించి= లెక్కించకుండా; సంప్రీతిగన్= ప్రీతి గలుగునట్లుగా; సంధి చేయఁడు+అ= సంధి చేసికొనలేదు; అపేత కళంకులు వారు= ఆ పాండవులు పాపాలు లేనివారు (తొలగిన పాపాలు కలవారు); వారికిన్= అటువంటి వారికి; దైవము= దేవుడు; తగవు+ఏది= న్యాయాన్ని పోగొట్టి; రణంబునన్= యుద్ధంలో; ఏలా?= ఎట్లా?; చేటు+తలంచున్?= కీడు తలుస్తాడు? (అనగా తలవడు).

తాత్పర్యం: ఓ సంజయా! కర్ణుడు పాండవులను యుద్ధంలో జయిస్తా డని అహంకారంతో, మదంతో గ్రుడ్డిగా మనవాడు శ్రీకృష్ణుడిని తృణీకరించి సంతోషంగా వారితో సంధికి ఒప్పుకొనలేదు. నిర్దోషు లయిన వారికి దైవం కూడా వ్యతిరేకి కాడు. యుద్ధంలో వారికెట్లా చేటు తలపెడతాడు?

వ. **తానును దమ్ములుం జెడుదు; రింతియ కాక యొండు గలదే? యది యట్లుండె; భండనంబు తెఱంగు సెప్పు' మనిన నమ్మనుజపతికి నా సూతసంభవుం డి ట్లనియె.** **186**

ప్రతిపదార్థం: తానును (దుర్యోధనుడు); తమ్ములున్= దుర్యోధనుని తమ్ములూ; చెడుదురు= నాశనమౌతారు; ఇంతియ,కాక= ఇదికాక; ఒండు= మరొకటి; కలదే; ఉన్నదా? అది, అట్టుండెన్= అది అట్లా ఉండనిమ్ము; భడనంబు= యుద్ధంయొక్క; తెఱంగు= విధము; చెప్పుము; అనినన్; ఆ+మనుజపతికిన్= ఆ ధృతరాష్ట్రమహారాజుకు; ఆ సూతసంభవుండు= సూతవంశములో జన్మించినవాడు-సంజయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడూ, అతడి తమ్ముళ్ళూ నాశనమౌతారు - అంతకంటే ఇంకేముంది?' యుద్ధగతిని చెప్పుము. అనగా ధృతరాష్ట్రుడితో సంజయు డిట్లా అన్నాడు:

చ. **సమసిన సేనఁ జూచి రభసంబునఁ గర్ణుఁడు భీముఁ గిట్టి ద**
ర్పము సిగురొత్త ముప్పది శరంబుల నొంచినఁ గెంపు సొంపు వ
క్రమునకు నొప్పు సేయఁగ నతండు వెసన్ విలు ద్రుంచి సూతు ప్రా
ణముఁ గొనినం జలం బెదఁ బెనంగొన వాహన చోదకుండు నై! **187**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సమసిన సేనన్+చూచి= నాశమైన సైన్యాన్ని చూచి; రభసంబునన్= తొందరగా; కర్ణుఁడు= కర్ణుడు; భీమున్+కిట్టి= భీముడిని ఎదుర్కొని; దర్పము చిగురొత్తన్= గర్వం మొలవగా; వక్త్రమునకున్= తన మొగానికి; కెంపుసొంపు= కోపం మూలాన ఎఱ్ఱబడిన అందం; ఒప్పుచేయఁగన్= తగి ఉండగా; అతండు= ఆ భీముడు; వెసన్= శీఘ్రంగా; విలుద్రుంచి= (కర్ణుడి) విల్లు ద్రుంచి; సూతుప్రాణమున్+కొనినన్= (కర్ణుడి) సారథిని చంపగా; చలంబు= పట్టుదల; ఎదన్= హృదయంలో; పెనంగొనన్= పెనవేసికొనగా; వాహనచోదకుండున్+ఐ= సారథిగా కూడనయి (కర్ణుడు సారథి చనిపోవటంతో తానే రథాన్ని తోలుకొంటూ యుద్ధం చేయవలసి వచ్చింది).

తాత్పర్యం: తన సేన నాశంకాగా చూచిన కర్ణుడు తొందరగా భీముడితో తలపడ్డాడు. తన గర్వం చిగురించగా ముప్పై బాణాలతో భీముడిని నొప్పించాడు. ఆ కారణంగా అతడి మొగం ఎఱ్ఱబడింది. భీముడు కర్ణుడి సారథిని చంపి, విల్లును విరిచాడు. కర్ణుడు తానే రథాన్ని తోలుకొంటూ యుద్ధం చేయవలసి వచ్చింది.

వ. కర్ణుండు శక్తి వైచిన. 188

తాత్పర్యం: కర్ణుడు శక్తి అనే ఆయుధాన్ని వేయగా.

క. ఎనిమిది తునియలుగా నది । దునిమి, మరున్నందనుండు తొమ్మిది శరముల్
తను వాడ నేయ బలువిలు । గొని యన్నియుఁ గర్ణుఁ డేసె గ్రూరాస్త్రంబుల్. 189

ప్రతిపదార్థం: మరుత్+నందనుండు= భీముడు; అది= ఆ శక్తిని; ఎనిమిది తునియలుగాన్= ఎనిమిది ముక్కలుగా; తునిమి= ముక్కలు చేసి; తొమ్మిది శరముల్= తొమ్మిది బాణాలను; తనువు+ఆడన్= ఒంటిలో నాటుకొనగా; బలువిలు కొని= పెద్ద విల్లును తీసికొని; అన్నియు క్రూర+అస్త్రంబుల్= భీముడు వేసినన్ని తీవ్రబాణాలనూ; ఏసెన్= వేశాడు (కొట్టాడు).

తాత్పర్యం: కర్ణుడు వేసిన శక్త్యాయుధాన్ని భీముడు ఎనిమిది ముక్కలుగా త్రుంచి, కర్ణుడి ఒంటిలో నాటుకొనేటట్లు తొమ్మిది అమ్ములను వేశాడు. కర్ణుడు పెద్దవింటిని తీసికొని వాడి అయినవీ, అన్నే లెక్క గలవీ అయిన బాణాలతో భీముడిని కొట్టాడు.

క. వాని నెడ నఱికి యప్పవ । మాన తనూభవుండు నిశిత మార్గణములు పై
పై నిగిడింపఁగ రాధా । సూనుండును సాయకముల సోనలు గురిసెన్. 190

ప్రతిపదార్థం: ఆ+పవమాన తనూభవుండు= వాయుదేవుడి కుమారు డయిన ఆ భీముడు; వానిన్= ఆ కర్ణుడి బాణాలను; ఎడన్ నఱికి= మధ్యలోనే నరికివేసి; నిశితమార్గణములు= వాడి బాణాలను; పైపై నిగిడింపఁగన్= మీద మీద వేయగా; రాధాసుతుండును= రాధయొక్క కొడుకైన కర్ణుడు కూడ; సాయకముల సోనలు= బాణాల వర్షాలు; కురిసెన్= కురిపించాడు.

తాత్పర్యం: ఆ కర్ణుడి అస్త్రాలను నడుమనే తెగనరికి, భీమసేనుడు వాడిబాణాలను మీద మీద వేయగా, రాధా కుమారు డైన కర్ణుడు బాణ వర్షాలు కురిపించాడు.

క. చెలఁగు పటు సింహనాదం । బులు అంకెలు గాఁగ వారు పొలిచిరి వృషభం
బుల క్రియ నొండొరులకు మా । ర్మలయుచుఁ దాఁకుచు నుదాత్తరభసోజ్జ్వలు లై. 191

ప్రతిపదార్థం: చెలఁగు= శబ్దం చేసే; పటు సింహనాదంబులు= దట్టమయిన సింహనాదాలు; బలు అంకెలుగాఁగన్= పెద్ద ఎద్దుల రంకెల మాదిరి కాగా; వారు= కర్ణ భీములు; వృషభంబుల క్రియన్= ఆబోతుల మాదిరిగా; ఒండొరులకున్= ఒకళ్ళొకళ్ళకు; మార్మలయుచున్= ఎదురు ఉద్యమిస్తూ; తాఁకుచున్= ఎదురు తాకుతూ; ఉదాత్త రభసోజ్జ్వలు లై= గంభీరమయిన ఉద్రేకంతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రకాశిస్తూ; పొలిచిరి= ఒప్పారారు.

తాత్పర్యం: భయాన్ని గొల్పే సింహనాదాలు రంకెలుగా, కర్ణభీములు ఆబోతులవలె ఒకరినొకరు ఎదుర్కొంటూ గంభీరమయిన వేగంతో కూడిన ఉత్సాహంతో ప్రకాశించారు.

విశేషం: అలం: ఉపమ.

ఉ. **అత్తఱిఁ గర్ణువిల్లును హయంబులు నుగ్గుగఁజేసి నెత్తుటన్**
జొత్తిల మేన బాణములు సొన్పి మరుత్సుతుఁ డార్చె నార్చినం
జిత్తము తల్లడిల్లఁ గురుసింహుఁడు దుర్జయుఁ బన్ప నాతఁ డ
త్యుత్తమ సాహస ప్రకటితోద్ధతి నాజగజెట్టిఁ దాఁకినన్. **192**

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= ఆ సమయంలో (కర్ణభీములు పోట్లాడేటప్పుడు); కర్ణువిల్లును= కర్ణుడి ధనుస్సును; హయంబులు= గుఱ్ఱాలను; నుగ్గుగన్+చేసి= పొడిగా చేసి; నెత్తుటన్= నెత్తురులో; జొత్తిలన్= ఎఱ్ఱబారగా; మేనన్= ఒంటిలో; బాణములు చొన్పి= బాణాలను దోపి; మరుత్సుతుఁడు= భీముడు; ఆర్చెన్= సింహనాదం చేశాడు; ఆర్చినన్= అట్లా సింహనాదం చేయగా; చిత్తము తల్లడిల్లన్= మనస్సు కలవరపడగా; కురుసింహుఁడు= దుర్యోధనుడు; దుర్జయున్+పన్పన్= దుర్జయుడిని పంపగా; ఆతఁడు= ఆ దుర్జయుడు; అత్యుత్తమ= మిక్కిలి శ్రేష్ఠమయిన; సాహస ప్రకటిత= ధైర్యంచేత వ్యక్తం చేయబడిన; ఉద్ధతిన్= గర్వంతో; ఆ జగజెట్టిన్+తాఁకినన్= ఆ మేటి వీరు డయిన భీముడిని ఎదుర్కొనగా.

తాత్పర్యం: కర్ణ భీములు పోట్లాడేటప్పుడు భీముడు కర్ణుడి విల్లునూ, గుఱ్ఱాలనూ చూర్ణంగా చేసి, నెత్తుటితో ఎఱ్ఱబడేటట్లు అతడి ఒంటినిండా బాణాలను గ్రుచ్చి ఒక్క పెద్ద అరుపు (సింహనాదం) అరిచాడు. ఆ శబ్దానికి మనస్సు తల్లడిల్లి, దుర్యోధనుడు దుర్జయుడిని పంపాడు. వాడు గొప్ప సాహసంతో ఆ జగజెట్టి అయిన భీముడితో తలపడ్డాడు.

తే. **బలము లచ్చెరువంద న ట్లలవు మెఱయ । నీ సుతుఁ డనిలసుతుఁ దాఁకి నిశితసాయ**
కముల నొప్పించి రథతురంగముల నొంచి । సూతు నో నేయఁ గ్రోధ విస్ఫూర్తి నతఁడు. **193**

ప్రతిపదార్థం: బలములు= సేనలు; అచ్చెరువు+అందన్= అబ్బురపడగా; అట్లు= ఆ విధంగా; అలవు మెఱయన్= బలం అతిశయించగా; నీ సుతుఁడు= నీ కొడుకు (దుర్జయుడు); అనిలసుతున్= భీముడిని; తాఁకి= ఎదుర్కొని; నిశిత సాయకములన్= వాడి బాణాలతో; నొప్పించి= బాధించి; రథతురంగముల నొంచి= తేరునూ గుఱ్ఱాలనూ బాధించి; సూతున్= సారథిని; నోనేయన్= నొచ్చునట్లు కొట్టగా; అతఁడు= ఆ భీముడు; క్రోధవిస్ఫూర్తిన్= కోపం బయల్పడగా.

తాత్పర్యం: సేనలు ఆశ్చర్యపడేటట్లు ఉపాయంతో దుర్జయుడు భీమసేనుడిని ఎదుర్కొన్నాడు. వాడి బాణాలతో నొప్పించాడు, గుఱ్ఱాలను బాధించాడు. సూతుడిని నొవ్వజేశాడు. అప్పుడు భీముడు క్రోధం ప్రకటమయ్యేటట్లు గా(తరువాతి పద్యంతో అన్వయం).

క. **తురగముల తలలు సూతుని । శిరము నతని మస్తకంబు శితశరషట్క**
స్ఫురణమున ధరణిమీఁదం । దొరఁగించెం గర్ణుఁ డేడ్పుతోఁ గనుఁగొనఁగన్. **194**

ప్రతిపదార్థం: తురగముల తలలు= (దుర్జయుడి) గుఱ్ఱాల తలలు; సూతుని శిరమున్= సారథి తలనూ; అతనిమస్తకంబు= దుర్జయుని తలయును; శిత,శర,షట్క= ఆరువాడి బాణాల; స్ఫురణమునన్= తోచటంతో (తాకుటతో); కర్ణుఁడు= కర్ణుడు; ఏడ్పుతో కనుఁగొనఁగన్= ఏడుస్తూ చూస్తుండగా; ధరణిమీఁదన్= భూమిమీద; తొరఁగించెన్= దొర్లునట్లు చేశాడు (పడగొట్టాడు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కర్ణుడు ఏడుస్తూ చూస్తుండగా భీమసేనుడు ఆరు వాడి బాణాలతో దుర్జయుడి గుఱ్ఱాల తలలను, సారథి తలను, దుర్జయుడి తలను భూమిమీద దొర్లేటట్లుగా కొట్టాడు.

వ. **ఆలోనన సూతసూనుండు రథంబు సన్నద్ధంబు సేసికొనినవాఁడగుట నప్పాండవతనయుం దలపడియె; నమ్మేటిమేగలు కోపంబులు నాటోపంబులు చలంబులు శౌర్యంబులు మెఱయు తెఱంగునం బెనంగి; రట్టి యెడ.** **195**

ప్రతిపదార్థం: ఆలోనన= అంతలోనే; సూతసూనుండు= కర్ణుడు; రథంబున్= తేరును; సన్నద్ధంబు= సిద్ధం; చేసికొనినవాఁడు+అగుటన్= చేసికొన్నవాడయినందున; ఆ+పాండు తనయున్= ఆ భీమసేనుడిని; తలపడియెన్= ఎదుర్కొన్నాడు; ఆ+మేటిమగలు= ఆ గొప్ప వీరులు; కోపంబులు= కోపాలూ; ఆటోపంబులు= గర్వాలూ; బలంబులు= శక్తులూ; చలంబులు= మాత్సర్యాలూ; మెఱయు= ప్రకాశించు; తెఱంగునన్= విధంగా; పెనఁగిరి= పోట్లాడారు; అట్టియెడన్= అటువంటి సమయంలో.

తాత్పర్యం: కర్ణుడంతలోనే తేరును సిద్ధం చేసికొని, భీముడిని ఎదుర్కొన్నాడు. ఆ గొప్పవీరులిద్దరు కోపాలూ,ఆటోపాలూ, పట్టుదలలూ, శౌర్యధైర్యాలూ ప్రకాశించేటట్లు పోరాడారు. ఆ సందర్భంలో.

మ. **ఖరనారాచము భీము వక్షమున నా కర్ణుండు బాహాబలా**
భరణుం డై నిగిడింప నుచ్చి చని భూభాగంబు నాఁటంగ నా
తురతం బొంద కతండు నిష్ఠుర గదం ద్రుంచెం దురంగంబులన్,
ధరణిం గూల్చె ధనుర్విలాస మలరం దత్సూతునిం గేతువున్. **196**

ప్రతిపదార్థం: ఖరనారాచము= వాడి బాణం; భీము వక్షమునన్= భీముడి గుండెలో; ఆ కర్ణుండు= ఆ కర్ణుడు; బాహాబల+ఆభరణుండు+ఐ= భుజబలమే అలంకారంగా; నిగిడింపన్= ఏయగా; ఉచ్చి చని= గ్రుచ్చుకొనిపోయి (దూసుకొనిపోయి); భూభాగంబు నాఁటంగన్= భూమిలో నాటు కోగా; అతండు= ఆ భీముడు; ఆతురతన్+పొందక= భయపడక; నిష్ఠుర గదన్= కఠినమైన గదతో; తురంగంబులన్= గుఱ్ఱాలను; త్రుంచెన్= చంపాడు; ధనుర్విలాసము+అలరన్= విలువిద్య అందగించగా; తద్= ఆ కర్ణుడి; సూతునిన్= సారథిని; కేతువున్= పతాకాన్ని; ధరణిన్+కూల్చెన్= భూమిమీద పడగొట్టాడు.

తాత్పర్యం: కర్ణుడు భుజబలం రాణించగా ఒక క్రూర బాణాన్ని భీముడి వక్షంలో సంధించాడు. ఆ బాణం అతడి గుండెలో దూసుకొని పోయి నేలమీద పడింది. అయినా అతడు కలత చెందకుండా, గట్టి గదతో కర్ణుడి తేరు గుఱ్ఱాలను బాదాడు. బాణ విద్యా చాతుర్యంతో సారథిని, కేతువును నేలమీద పడగొట్టాడు.

మ. **విరథుం డయ్యును రాధనందనుఁడు దోర్వీర్యం బవార్యంబుగా**
శరజాలంబుల భీముఁ గప్పుట మహాశ్చర్యంబు గావించె భూ
వరుఁ డంతం దన తమ్ము నా రథికుఁ గావం బంచె నా దుర్ముఖుం
డు రయం బారఁగఁ దాఁకె భీమునకు నాటోపంబు దీపింపఁగన్. **197**

ప్రతిపదార్థం: విరథుండు+అయ్యును= రథం లేనివాడైనప్పటికినీ; రాధనందనుఁడు= కర్ణుడు; దోర్వీర్యంబు= భుజబలం; అవార్యంబుగాన్= ఎదుర్కొనలేనిదిగా (అడ్డులేనట్లు); శరజాలంబులన్= బాణాల గుంపుతో; భీమున్+కప్పుట= భీముడిని కప్పివేయుటం; మహాశ్చర్యంబు కావించెన్= (చూచేవారికి) చాలా వింత గొల్పింది; భూవరుఁడు= రాజు దుర్యోధనుడు; అంతన్= ఆ సమయంలో; ఆ రథికున్+కావన్= ఆ వీరు డయిన కర్ణుడిని కాపాడటానికి; తన తమ్మున్+పంచెన్= తన తమ్ముడిని పంపాడు; ఆ దుర్ముఖుండు= ఆ దుర్ముఖుడు; రయంబు+ఆరఁగన్= వేగంగా; భీమునకున్= భీమసేనుడికి; ఆటోపంబు= దర్పం

(తనయొక్క); దీపింపఁగన్= వెలుగగా (తెలియగా); తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: తేరు విరిగిన వాడయినను కర్ణుడు, తన అమ్ముల గుంపుతో, సాటిలేని భుజబలంతో భీముడిని కప్పివేయటం, చూచేవారికి వింత గొల్పింది. ఆ సమయంలో దుర్యోధనుడు కర్ణుడికి బాసటగా తన తమ్ముడయిన దుర్ముఖుడిని పంపాడు. ఆ దుర్ముఖు డతివేగంగా తన దర్పం ప్రకాశించేటట్లు భీముడిని ఎదుర్కొన్నాడు.

క. **అయ్యంగరాజుతోడం । గయ్యము సేయుచును దుర్ముఖు ప్రాణంబుల్**
సయ్యన తొమ్మిది యమ్ములఁ । గ్రుయ్యక డయ్యక యతండు గొనియె నరేంద్రా! **198**

ప్రతిపదార్థం: నరేంద్రా!= ఓ రాజా!; ఆ+అంగరాజుతోడన్= ఆ కర్ణుడితో; కయ్యము చేయుచును= యుద్ధం చేస్తూనే; అతండు= ఆ భీమసేనుడు; చయ్యనన్= వేగంగా; తొమ్మిది అమ్ములన్= తొమ్మిది బాణాలతో, క్రుయ్యక డయ్యక= వెనుదీయక అలసిపోకుండా; దుర్ముఖ ప్రాణంబుల్= దుర్ముఖుడి ప్రాణాలను; కొనియెన్= తీసికొన్నాడు (చంపాడు).

తాత్పర్యం: ఓ రాజా! భీమసేనుడు కర్ణుడితో యుద్ధం చేస్తూనే వేగంగా తొమ్మిది బాణాలను తీసికొని వెనుదీయకుండా అలసిపోకుండా ఆ దుర్ముఖుడిని హతమార్చాడు.

వ. **ఇట్లు భవదాత్మజుండు పడుటయు.** **199**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; భవత్+ఆత్మజుండు= మీ యొక్క కుమారుడు; పడుటయు= పడిపోగా

తాత్పర్యం: ఈ విధంగా నీ కుమారుడు చనిపోగా.

ఉ. **ఆతనిఁ జూచి కన్నుఁగవ నశ్రులు గ్రమ్మఁగ సూతసూతి శో**
కాతురుఁడై తదీయ రథ మల్లన యెక్కఁగ భీమసేనుఁ డు
ద్ద్యోతితహేమ భూషిత చతుర్దశ మార్గణ విద్ధుఁ జేయుడు
న్నాతశరంబు లన్ని వెస నాఁటె నతండును దద్భుజంబులన్. **200**

ప్రతిపదార్థం: ఆతనిన్+చూచి= ఆ దుర్ముఖుడిని చూచి; సూతసూతి= కర్ణుడు; కన్నుఁగవన్ అశ్రులు క్రమ్మఁగన్= రెండు కన్నులను కన్నీళ్ళు క్రమ్ముకోగా; శోకాతురుఁడు+ఐ= దుఃఖంతో బాధపడ్డవాడై; తదీయ రథమున్= అతని తేరును; అల్లన ఎక్కఁగన్= మెల్లగా ఎక్కగా; భీమసేనుఁడు= భీముడు; ఉద్ద్యోతిత= మండుతూ ఉన్న (ప్రకాశించే); హేమ భూషిత= బంగారుతో అలంకరింపబడిన; చతుర్దశ మార్గణ= పదునాలుగు బాణాలతో; విద్ధున్+చేయుడున్= బాధించగా; అన్ని= అదే సంఖ్య గల (ఆ లెక్కతోనే పదునాలుగు); శాతశరంబులన్= వాడి బాణాలను; అతండును= ఆ కర్ణుడు కూడా; తద్భుజంబులన్= అతడి భుజాలలో (భీముడి భుజాలలో); వెసన్+నాఁటెన్= వెంటనే నాటుకొనేటట్లు చేశాడు (అనగా త్వరగా నాటాడు).

తాత్పర్యం: దుర్ముఖుడి గతిని చూచి కర్ణుడు, కన్నీరు కారుస్తూ, దుఃఖంతో కూడిన బాధతో మెల్లగా తన తేరెక్కాడు. అప్పుడు భీముడు బంగారంతో అలంకరింపబడిన పదునాల్గు బాణాలతో కర్ణుడిని బాధించాడు. అంత కర్ణుడు కూడా అదే సంఖ్యగల బాణాలను భీముడి భుజాలలో నాటాడు.

వ. **దానం గనలి అనిలతనయుండు.** **201**

ప్రతిపదార్థం: దానన్= దానివలను; కనవి= కోపించి; అనిలతనయుండు= వాయుపుత్రుడైన భీముడు

తాత్పర్యం: అందువలన భీముడు కోపించి,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. వాఁడి నారసములు మూఁడు కర్ణుని ఱొమ్ము। గాఁడ నేయ నాన గడచి నొవ్వ
భయము గదురఁ జేయ రయమున నరదంబు। దోలికొని యతండు దొలఁగఁ బాఱె. 202

ప్రతిపదార్థం: (భీముడు) వాఁడి= వాడి అయిన; నారసములు= ప్రాణాలు తీసే పదునైన బాణాలను; మూఁడు= మూటితో; కర్ణుని ఱొమ్మున్= కర్ణుడి గుండెను; కాఁడన్+ఏయన్= లోతుగా గ్రుచ్చుకొనేటట్లుగా; ఏయన్= కొట్టగా; ఆన గడచి= సిగ్గును మించి; నొవ్వ= నొప్పి; భయము కదురన్+చేయన్= భయమును కలిగించగా; రయమునన్= వేగంగా; అరదంబున్= తేరును; తోలికొని; అతండు= ఆ కర్ణుడు; తొలఁగన్+పాఱెన్= తొలగిపోయాడు.

తాత్పర్యం: ప్రాణాలు తీసే వాడి బాణాలు మూటితో కర్ణుడి గుండెలో గ్రుచ్చుకొనేటట్లు కొట్టాడు. ఆ దెబ్బకు కర్ణుడు నిట్టూర్పుతో భయం కలుగగా తేరును తోలుకొని అక్కడ నుండి తొలగిపోయాడు.'

వ. అనిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 203

తాత్పర్యం: (ఆ విధంగా సంజయుడు చెప్పగా) విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

క. విను పౌరుషము నిరర్థక;। మనుమానము లేదు దైవ మధికంబు; మరు
త్తనయునిచే నారాధా। తనయుం డి ట్లగుట నెవ్విధంబునఁ దలఁపన్. 204

ప్రతిపదార్థం: విను= వినుము; మరుత్+తనయునిచేన్= వాయుపుత్రుడైన భీమునిచేత; ఆ రాధాతనయుండు= ఆ కర్ణుడు; ఇట్లు+అగుట= ఈ విధంగా కావటం (ఓడి పరుగెత్తటం); ఏ+విధంబునన్= ఏ ప్రకారం; తలఁపన్= తలచినప్పటికిని; పౌరుషము= పురుషశక్తి; నిరర్థకము= వ్యర్థం; దైవము+అధికంబు= దైవశక్తి ఎక్కువయినది; అనుమానము లేదు= సందేహం లేదు.

తాత్పర్యం: ఓ సంజయా! దైవశక్తి ముందు మానవశక్తి నిరర్థకం. ఇందులో సందేహం లేదు. వాయునందను డైన భీముడిచేత రాధాతనయు డైన కర్ణుడు ఈ విధంగా పరాజితుడు కావటం తలచుకొంటే (అంతే ననిపిస్తూ ఉన్నది).

విశేషం: లోకంలో మానవు డెంతటివాడైనా, అతడి బలం, దైవబలం ముందు వ్యర్థమని కర్ణుడు భీముడిచేత పరాజితుడు కావటం తెలుపుతూ ఉన్నది - అని ధృతరాష్ట్రుడు చెపుతూ ఉన్నాడు.

క. అట్టన నేల? మహాబలు। పట్టికి సుర ఖచర దనుజ పన్నగులు మా
ర్వెట్ట రనినఁ గర్ణాదుల। కెట్టు నిలువవచ్చు వాని యెదురం దిరమై! 205

ప్రతిపదార్థం: అట్టు+అనన్+ఏల?= అట్లా అనటం ఎందుకు? (ముందన్నట్లు దైవమానుష బలాలను గూర్చి); మహాబలు పట్టికిన్= భీముడికి (వాయుదేవుడికి మహాబలుడనే పేరున్నది); సుర, ఖచర, దనుజ, పన్నగులు= దేవతలు, గంధర్వులు, రాక్షసులు, నాగులు; మార్వెట్టరు= ఎదిరించలేరు; అనినన్= అనగా; కర్ణ+ఆదులకున్= కర్ణుడు మొదలయినవారికి; వాని యెదురన్= ఆ భీముడి కెదురుగా; తిరమై= స్థిరంగా (గట్టిగా); ఎట్టు= ఏ విధంగా; నిలువవచ్చున్?= నిలువగలరు?

తాత్పర్యం: దైవమానవ శక్తులను గూర్చి ఎందుకు? దేవతలు, గంధర్వులు, రాక్షసులు, నాగులూ భీముడిని ఎదిరించలేరంటే కర్ణాదులు అతడి కెదురుగా స్థిరంగా ఎట్లా నిలువగలరు?

క. పాండవుల గెలుచు నాజి ని। తం డని యగ్గించు సూతతనయుని మత్పు
త్రుం; డతఁడు భీము నేపున। గం దడఁగినఁ జూచి మనసు గందక యున్నే? 206

ప్రతిపదార్థం: పాండవులన్= పాండవులను; ఆజిని= యుద్ధంలో; ఇతండు= ఈ కర్ణుడు; గెలుచున్= జయిస్తాడు; అని= అంటూ; సూత తనయుని= కర్ణుడిని; మత్+పుత్రుడు= నా కుమారుడు దుర్యోధనుడు; అగ్గించున్= పొగడుతుంటాడు; అతండు= ఆ కర్ణుడు; భీము ఏపునన్= భీముడి శక్తికి; గండు+అడఁగినన్= బలం అణగిపోగా; చూచి; మనసు= మనస్సు; కందక= తాపం లేకుండా; ఉన్నే?= ఉంటుందా? (అని సంజయుడితో ధృతరాష్ట్రుడు అన్నాడు).

తాత్పర్యం: 'కర్ణుడు పాండవులను యుద్ధంలో జయిస్తాడు' అని అంటూ కర్ణుడిని దుర్యోధనుడు పొగడుతుంటాడు, భీముడి శక్తికి కర్ణుడి బలం అణగిపోగా చూచి మనసుకు కష్టం కలుగకుండా ఉంటుందా?

క. **వినఁడె జరాసంధాదులఁ। దునుముట; మన దుర్జయుండు దుర్ముఖుఁడును భీ**
మునితోడఁ బెనఁగువా రే। మని కర్ణునిఁ గావఁ బనిచె నబ్బాలకులన్? 207

ప్రతిపదార్థం: జరాసంధ+ఆదులన్= జరాసంధుడు మొదలైన వారిని; తునుముట= చంపటం (భీముడు వారిని ఇదివరకే చంపి ఉండటాన్ని); వినఁడె?= వినలేదా?; మన దుర్జయుండు దుర్ముఖుఁడును= మన దుర్జయ దుర్ముఖులు; భీమునితోడన్= భీముడితో; పెనఁగువారు= యుద్ధం చేసేవారు; ఆ+బాలకులన్= ఆ పసివాండ్రను; కర్ణునిన్+కావన్= కర్ణుడిని కాపాడటానికి; ఏమని= ఏమనుకొని; పనిచెన్?= పంపాడు?

తాత్పర్యం: జరాసంధాదులను భీముడు చంపిన సంగతి వినలేదా? ఆ భీముడితో యుద్ధానికి దుర్జయ దుర్ముఖులా? కర్ణుడిని కాపాడటానికి ఆ పసివారిని ఏమని పంపాడు?

విశేషం: భీముడు జరాసంధాదులను ఇదివరకే చంపి ఉన్నాడు. అంతటి బలశాలితో పెనగులాటకు పసివారు దుర్జయ దుర్ముఖులు తగినవారేనా? వారిని కర్ణుడికి అండగా దుర్యోధనుడు పంపటమా? దీనిని చూస్తే దుర్యోధనుడి తెలివిలేనితనం తెలుస్తూ ఉన్నది- అని ధృతరాష్ట్రుడు సంజయుడితో అన్నాడు. దీనివలన శక్తికి మించిన బరువు నెత్తిన పెట్టి నట్లయింది.

క. **పవనజుఁ డొక్కఁడె పెఱపాం। డవులను సాత్యకియు హరియు డాఁ తురె యుగ్రా**
హవమునఁ బ్రాణములావున। నవిజయ్యులు వారిఁ దొడర నగునే తనకున్?' 208

ప్రతిపదార్థం: పవనజుఁడు+ఒక్కఁడె= భీము డొక్కడే (అనగా ఒకడే చాలును); ఉగ్ర+ఆహవమునన్= భయంకరమయిన యుద్ధంలో; పెఱ పాండవులను= మిగిలిన పాండవులను; సాత్యకియున్ హరియున్= సాత్యకి, శ్రీకృష్ణులు; డాఁతురె?= దాచుకొందురా?; ప్రాణము లావునన్= ప్రాణశక్తితో; అవిజయ్యులు= గెలువరానివారు; వారిన్= ఆ ఇద్దరినీ; తనకున్= దుర్యోధనుడికి; తొడరన్+అగునే?= ఎదుర్కొన సాధ్యమా?

తాత్పర్యం: భీము డొకడే కాదు - మిగిలిన పాండవులూ, శ్రీకృష్ణ సాత్యకులూ భయంకర యుద్ధంలో ఒడలు దాచుకొంటారా? బలంలో వారందరూ అజేయులు. దుర్యోధనుడు వారి నెదుర్కొనగలడా?'

చ. **అని పలుమాట లాడుటయు నమ్మనుజేంద్రునితోడ నాతఁ డి**
ట్లను 'విష మెత్తి క్రోలి యది యంగము నారట పెట్ట నన్యులం
గినిసిన యట్ల మీఁదు పరికింపక యమ్మెయి నీవు పాండునం
దనులకుఁ జెట్టవై, హృదయతాపము వచ్చినఁ బల్కె దొండులన్. 209

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; పలుమాటలు+ఆడుటయున్= నానావిధాలుగా మాట్లాడటం (విని); ఆ+మనుజ+ఇంద్రుని తోడన్= ఆ ధృతరాష్ట్రుడితో; ఆతఁడు= ఆ సంజయుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; విషము ఎత్తి క్రోలి= విషాన్ని

చేతితో ఎత్తుకొని త్రాగి; అది= ఆ విషం; అంగమున్= శరీరాన్ని; ఆరటపెట్టన్= బాధపెట్టగా; అన్యులన్= ఇంకొక్కరిని; కినిసిన అట్లు= కోపించిన విధంగా; మీఁదు పరికింపక= ముందుచూపు లేకుండా; నీవు; ఆ+మెయిన్= ఆ విధంగా; పాండునందనులకున్= పాండవులకు, చెట్టవు+ఐ= శత్రుడవై; హృదయతాపము= నీ మనసుకు కష్టం; వచ్చినన్= రాగా; ఒండులన్= ఇతరులను; పల్కెదు= మాటలంటున్నావు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు పై విధంగా ఎన్నో మాట లనగా విని సంజయుడు ఆతడితో ఇట్లా అన్నాడు: 'విషాన్ని స్వయంగా చేత నెత్తికొని త్రాగి, అది శరీరాన్ని ఆరాటపెట్టగా ఇతరుల మీద కోపగించుకొన్నట్లు, ముందు యోచన లేకుండా ఆ ప్రకారంగా నీవు పాండవులకు వైరివై, నీ మనసుకు బాధ కలిగితే వేరొక్కరిని మాట లంటున్నావు.'

విశేషం: అలం: ఉపమ. ఈ పద్యంలో ఒక మంచి లౌకిక న్యాయం సంజయుడిద్వారా కవి చెప్పించాడు. అది స్వయంగా విషాన్ని త్రాగినందువలన కడుపులో మంటపుడితే ఆ తపనకు లోకంలో ఎవరినో ఎందు కాడిపోసు కొనటం? ముందు వెనుకలు చూడకుండా పాండవులను కష్టపెట్టి, అది ఎదురు దెబ్బ తగిలితే ఆ దెబ్బ మూలాన కలిగే బాధను తట్టుకొనలేక ఎదుటివారిని దూషించటం వంటిది ఈ నీ యారాట మని సంజయుడు ధృతరాష్ట్రుడితో అనటం అతడి మనస్తత్వం ఎటువంటిదో తెలుపుతూ ఉన్నది.

వ. ఊరక బవరంబు తెఱంగు వినుము; నీ తనయులు దుర్మర్షణుండును, దుర్మదుండును, దుస్సహుండును, విజయుండును, విచిత్రుండును గర్ణునోటమి సయిరింపం జాలక వడముడిం దొడరి తూపు లడరించినం జూచి యా సూతసూనుండు దాను నతనిపయిం గవిసి యేసిన దద్విశిఖంబుల వారించుచు మారుత నందనుండు. 210

ప్రతిపదార్థం: ఊరక= మాటాడకుండా; బవరంబు తెఱంగున్= యుద్ధగతిని; వినుము; నీ తనయులు= నీ కుమారులు; దుర్మర్షణుండు, దుర్మదుండును, దుస్సహుండును, విజయుండును, విచిత్రుండును= ఈ పేర్లవారు; కర్ణుని ఓటమి= కర్ణు డోడిపోవటం; సయిరింపన్+చాలక= ఓర్వలేక; వడముడిన్+తొడరి= భీముడిని ఎదుర్కొని; తూపులు+అడరించినన్= బాణాలు వేయగా; చూచి= చూచినవాడైన; ఆ సూతసూనుండు= ఆ సూతుడి కుమారుడయిన కర్ణుడు; తాను= తానుకూడా; అతనిపయిన్= ఆ భీముడిమీద; కవిసి ఏసినన్= క్రమ్ముకొని వేయగా; తద్విశిఖంబులన్ వారించుచున్= ఆ వాడి బాణాలను తొలగించుకొంటూ; మారుతనందనుండు= భీమసేనుడు.

తాత్పర్యం: ఊరక మాటాడకుండా యుద్ధం తీరును వినుము' అని సంజయుడు ధృతరాష్ట్రుడితో అన్నాడు. 'నీ కొడుకులు దుర్మర్షణ, దుర్మద, దుస్సహ, విజయ, విచిత్రులు కర్ణు డోడటాన్ని సైపచాలక ఉమ్మడిగా భీముడిమీద తలపడి బాణాలు వేస్తూ ఉండగా, కర్ణుడు కూడా అతడిని క్రమ్ముకొని బాణాలు వేస్తే భీముడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. ఏచి కురుకుమారు లేవురఁ దురగ సా । రథులతోడఁ గూడ రయము మెఱయ
వసుధఁ గూల్చె మెఱుఁగు వాలారు తూపు లా । ఱాఱు నిగుడఁజేసి యద్భుతముగ. 211

ప్రతిపదార్థం: ఏచి= విజృంభించి; కురుకుమారులు+ఏవురన్= కౌరవ కుమారు లైదుగురిని; తురగ సారథులతోడన్= తేరి గుర్రాలతోనూ, సూతులతోనూ; కూడ= కలిపి; రయము మెఱయన్= వేగం (అతిశయించగా) ప్రకాశించగా; మెఱుఁగు= వెలిగే; వాలారు= వాడి అయిన; తూపులు= ములుకులు; ఆఱు+ఆఱు= ముప్పది ఆరు; నిగుడన్+చేసి= నిగుడింపజేసి (కొట్టి); అద్భుతముగన్= ఆశ్చర్యకరంగా; వసుధన్+కూల్చెన్= భూమిమీద పడేటట్లు కొట్టాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: భీమసేనుడు విజృంభించి కురుకుమారు లైదుగురిని తేరి గుర్రాలతోనూ, సారథులతోను కలిపి మెరిసే వాడిబాణాలు ముప్పది ఆరింటితో వేగంగా కొట్టి, ఆశ్చర్యం కలిగేటట్లు భూమిమీద పడేటట్లు చేశాడు (అనగా చంపాడు).

క. అనిఁ బడిన రాచకొడుకులఁ । గని కర్ణుం 'డేటి బ్రదుకుగా బ్రదికెద నే
నని యింక నెన్నఁటికి లా । వని భీముని నొంపవలదె?' యని తెం పెసఁగన్. 212

ప్రతిపదార్థం: అనిన్+పడిన= యుద్ధంలో పడిపోయిన (చనిపోయిన); రాచకొడుకులన్+కని= రాజకుమారులను చూచి; కర్ణుండు= కర్ణుడు; ఏటి బ్రదుకుగాన్ బ్రదికెదన్+ఏను+అని= ఏమి బ్రతుకుగా నేను బ్రతుకుతున్నాను (నా దేటి బ్రదుకని); ఇంకన్+ఎన్నఁటికి లావు?= బలం ఇప్పుడు కాకపోతే మరి ఎప్పటికి?; అనిన్= యుద్ధంలో; భీమునిన్+నొంపవలదె?= భీముడిని బాధింపవద్దా?; అని= అనుకొంటూ; తెంపు+ఎసఁగన్= సాహసంతో.

తాత్పర్యం: యుద్ధంలో పడిపోయిన రాజకుమారులను చూచి కర్ణుడు 'నా బ్రదుకేమి బ్రదుకు? నాకు బలం ఇప్పుడు కాకపోతే ఎప్పటికి? యుద్ధంలో భీముడిని బాధించవద్దా?' అనుకుంటూ సాహసంతో (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. కదిసి డెబ్బదేను కాండంబు లాతని । మేనఁ బఱపి యుబ్బు మిగిలి నవ్వ
నతఁడు నూటయేను శితవిశిఖంబుల । నతని నేసి చాపయష్టిఁ ద్రుంచె. 213

ప్రతిపదార్థం: కదిసి= సమీపించి; డెబ్బది+ఏను కాండంబులు= డెబ్బది అయిదు బాణాలను; ఆతని మేనన్= ఆ భీముడి ఒంటిపై; పఱపి= వేసి; ఉబ్బు మిగిలి= గర్వ మెక్కువ కాగా; నవ్వన్= నవ్వగా; అతఁడు= ఆ భీముడు; నూటయేను= నూటయిదు; శితవిశిఖంబులన్= వాడి బాణాలతో; అతనిన్+ఏసి= ఆ కర్ణుడిని కొట్టి; చాపయష్టిన్= వింటి దబ్బను; త్రుంచెన్= విరిచాడు.

తాత్పర్యం: భీముడిని సమీపించి డెబ్బది అయిదు బాణాలను అతడి శరీరంమీద పరచి, గర్వంతో నవ్వి నిలిచాడు. భీముడు కర్ణుడి శరీరంలోకి నూటయిదు వాడి బాణాలను వేసి, అతడి వింటిదబ్బను త్రుంచాడు.

మ. రయమారన్ బలువిల్లు పుచ్చుకొని యా రాధాసుతుం డేయ దు
ర్జయుఁ డమ్మారుతి పొంగి సూతుని వెసం జానేసి విల్ ద్రుంచుచున్
హయ సందోహముఁ గూల్చి హాస్యమునకున్ హాసంబు సేయన్ గద
న్భయదాకారత వైచె నాతఁ డది భగ్నం బయ్యె నా భీముచేన్. 214

ప్రతిపదార్థం: ఆ రాధాసుతుండు= రాధా కుమారు డయిన కర్ణుడు; రయమారన్= త్వరగా; బలువిల్లు= పెద్ద ధనుస్సును; పుచ్చుకొని= తీసికొని; ఏయన్= కొట్టగా; దుర్జయుఁడు= గెలువరానివాడయిన; ఆ+మారుతి= ఆ భీముడు; పొంగి= విజృంభించి, సూతునిన్= కర్ణుడి సారథిని; వెసన్= వెంటనే; చాన్+ఏసి= చావగొట్టి; విల్ త్రుంచుచున్= వింటిని ముక్కలు చేస్తూ; హయసందోహమున్+కూల్చి= తేరు గుర్రాలను చంపి; హాస్యమునకున్= ఎగతాళికి; హాసంబు చేయన్= నవ్వగా; ఆతఁడు= ఆ కర్ణుడు; గదన్= గదను; భయదాకారతన్= భయంకరంగా; వైచెన్= వేసెను; ఆ భీముచేన్= ఆ భీముడివలన; అది భగ్నంబు+అయ్యెన్= ఆ గద ముక్కలయింది.

తాత్పర్యం: రాధాకుమారు డయిన కర్ణుడు వేగంగా పెద్ద విల్లును తీసికొని, దుర్జయు డయిన భీమసేనుడిని కొట్టాడు. ఆ భీముడు రేగి, కర్ణుడి సారథిని చావగొట్టి, అతడి విల్లును ముక్కలు చేస్తూ గుర్రాలను చంపాడు. ఎగతాళిగా నవ్వాడు. కర్ణుడు భయంకరంగా గదను విసిరాడు. దానిని భీముడు తునాతునకలు చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు గద ద్రుంచి పైపై నేయు పావని బరవసంబునకుం దెరలక యొండు కోదండంబు గొని కర్ణుం డతని తనుత్రాణంబు దునియలు సేసి పెల్లేసిన నతండును దదీయ కంకటంబును భుజంబును భేదించె; నిప్పరుసునఁ బాదచారియై పెనఁగు నయ్యోధవరుం జూచి భూవరుండు సత్వరుండై పనుపం జిత్ర విచిత్ర చిత్రాక్షచారు చిత్రులును చిత్రధ్వజ చిత్రాయుధ చిత్రకర్ములును శరాసారంబులు బరఁగించుచు ధర్మపుత్రానుజుం దాఁకిన నతండు మహావాత పతిత భూరుహ ప్రతతిభంగి దోఁప నక్కుమార సప్తకంబును, రథసప్తకంబును, రథసప్తి సారథి సహితంబుగాఁ బొడవడంగం జేసె; నా సందునఁ గల్పితస్యందనుండై యాసూతనందనుం డప్పాండు నందనునిపై నురవడించిన. 215

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; గదన్+త్రుంచి= గదను ముక్కలుచేసి; పైపైన్+ఏయు= మీద మీద వేస్తున్న; పావని= పవన తనయుడైన భీముడి; బరవసంబునకున్+తెరలక= ధైర్యానికి చలింపక; ఒండు కోదండంబు కొని= వేరొక వింటిని తీసికొని; కర్ణుండు; అతని= భీముడి; తను త్రాణంబులు= శరీరాన్ని కాపాడుతూ ఉన్న కవచాలను; తునియలు చేసి= ముక్కలుగా చేసి; పెల్లు+ఏసినన్= మిక్కిలిగా కొట్టగా; అతండును= ఆ భీముడు కూడా; తదీయ= ఆ కర్ణుడి; కంకటంబును= కవచాన్ని; భుజంబును భేదించెన్= జబ్బను చీల్చాడు; ఈ+పరుసునన్= ఈ విధంగా; పాదచారియై= నడుస్తూ; పెనఁగు= యుద్ధం చేసే; ఆ+యోధవరున్+చూచి= ఆ వీర శిఖామణిని చూచి; భూవరుండు= రాజయిన దుర్యోధనుడు; సత్వరుండు+ఐ= తొందరతో; పనుపన్= పంపగా; చిత్ర విచిత్ర చిత్రాక్ష చారుచిత్రులును= ఈ పేర్లు గలవారు; చిత్రధ్వజ చిత్రాయుధ చిత్రకర్ములును= ఈ పేర్లున్నవారు; శరాసారంబులు= బాణవర్షాలు; పరఁగింపుచున్= వేస్తూ; ధర్మపుత్ర+అనుజున్+తాఁకినన్= ధర్మరాజు తమ్ముడిని ఎదుర్కొనగా; అతండు= ఆ భీముడు; మహావాత= పెనుగాలివలన; పతిత= పడిపోయిన; భూరుహప్రతతి భంగి తోఁపన్= చెట్ల వరుస మాదిరి తోచగా; ఆ+కుమారసప్తకంబును= ఆ ఏడుగురు కుమారులను; రథసప్తకంబును= ఏడు రథాలనూ; రథసప్తి సారథి సహితంబుగాన్= గుర్రాలను తేరులను సారథులను కూడా; పొడవు+అడంగన్+చేసెన్= ఆకారం నశింపగా చేశాడు (చంపాడు); ఆ సందునన్= ఆ వ్యవధిలో; కల్పిత స్యందనుండు+ఐ= రథాన్ని ఏర్పరచుకొనిన వాడై; ఆ సూతనందనుండు= ఆ సూతుడి కుమారుడు (కర్ణుడు); ఆ+పాండునందనునిపైన్= ఆ పాండు రాజకుమారుడిమీద; ఉరవడించినన్= దూకగా.

తాత్పర్యం: ఈ విధంగా గదను ముక్కలు చేసి మీద వేస్తూ దూకుతూ ఉన్న భీముడి ఉద్వేగానికి కలగిపోకుండా, వేరొక విల్లు తీసికొని, భీముడి కవచాన్ని ముక్కలు చేసి ఎక్కువగా కొట్టగా, ఆ భీముడు కర్ణుడి కవచాన్ని, జబ్బను చీల్చాడు. పాదచారి అయిన కర్ణుడు పెనగటం చూచిన దుర్యోధనుడు తన సోదరులను ఏడుగురను - చిత్ర, విచిత్ర, చిత్రాక్ష, చారుచిత్ర, చిత్రధ్వజ, చిత్రాయుధ, చిత్రకర్ములను భీముడి మీదికి పంపాడు. వారు ధర్మరాజు తమ్ముడిని ఎదుర్కొన్నారు. వారందరిని పెనుగాలికి పడిపోయే చెట్ల మాదిరిగా భీముడు పడగొట్టాడు. వారి రథాలనూ, గుర్రాలనూ సారథులనూ పడగొట్టాడు. ఆ వ్యవధానంలో మరొకరథాన్ని అమర్చుకొని కర్ణుడు భీముడి మీదకు దూకాడు.

విశేషం: అలంకారం ఉపమ.

**క. అటిమటి నిరువుర శరములు। తఱుచుగ నొండొరుల బెట్టు దాఁకిన నయ్యు
ద్దఱు నెత్తుటఁ దోఁగి కడున్। వఱలిరి కల్పాంత నవదివాకరుల క్రియన్. 216**

ప్రతిపదార్థం: అటిమటిన్= సంభ్రమంతో (తొట్రుపాటుతో); ఇరువుర శరములు= ఇద్దరి బాణాలు; తఱుచుగన్= దట్టంగా; ఒండొరులన్= ఒకరినొకరిని; బెట్టుతాఁకినన్= తీవ్రంగా తాకగా (ఎదుర్కొనగా); ఆ+ఇద్దఱు= ఆ కర్ణభీములు ఇర్వురును; నెత్తుటన్+తోఁగి= నెత్తురులో మునిగి; కడున్= మిక్కిలిగా; కల్పాంత= ప్రళయకాలంలోని; నవ= క్రొత్త; దివాకరుల క్రియన్= సూర్యుల మాదిరి; వఱలిరి= ఒప్పారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఇద్దరి బాణాలు తత్ర్వరగా, అధికంగా, తీవ్రంగా ఒకరివి మరొకరిని తాకగా, ఇద్దరు నెత్తుట తడిసి ప్రళయకాలపు క్రొత్త సూర్యులవలె ప్రకాశించారు.

విశేషం: అలంకారం ఉపమ.

క. **అరదములు చిత్ర గతులం । జరియింపఁగ ధైర్యములును శౌర్యంబులు ను**
ద్ధుర బాహా వీర్యంబులు । సరి యై మెఱయంగ నధిక సంరంభములన్. **217**

ప్రతిపదార్థం: అరదములు= తేరులు; చిత్రగతులన్+చరియింపఁగన్= ఆశ్చర్యకరంగా అనేక విధాలుగా తిరుగాడగా; ధైర్యములు= (ఇద్దరి) ధైర్యాలును; శౌర్యంబులును= పరాక్రమాలును; ఉద్ధుర= దట్టమైన; బాహావీర్యంబులు= భుజబలాలును; సరి+ఐ= సమానంగా (అనగా కర్ణ భీముల వీరములు సమానంగా); మెఱయంగన్= ప్రకాశించగా (బయల్పడగా); అధిక= ఎక్కువైన; సంరంభములన్= ఆటోపాలతో.

తాత్పర్యం: వారి రథాలు ఆశ్చర్యకరంగా అనేక విధాలుగా తిరుగగా, ధైర్యశౌర్య బహువీర్యాలు సమానంగా ప్రకాశించగా, అధికమైన ఆటోపంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. **ఒండొరు మీఁద సాయకము లొక్క మొగిం బరఁగింతు రేపు మై**
నొండొరు బాణముల్ నఱకి యుర్విపయిన్ నెఱయింతు రుగ్రులై
యొండొరు మేనులన్ శరము లుచ్చిచనన్ నిగిడింతు; రిట్టు లు
ద్దండతఁ బోరి రాఱని మదంబుల నొండొరు మీఱు నాసలన్. **218**

ప్రతిపదార్థం: సాయకములు= అమ్ములను; ఒండొరు మీఁదన్= ఒకరిమీద నొకరు; ఒక్కమొగిన్+పరగింతురు= ఒక్క ఉదుటున వేస్తారు; ఏపుమైన్= బలంగా; ఒండొరు బాణముల్ నఱకి= ఒకరి బాణాలను ఇంకొకరు నరికివేసి; ఉర్విపయిన్= భూమిమీద; నెఱయింతురు= వ్యాపింప చేస్తారు; ఉగ్రులు+ఐ= కోపం గలవారయి; ఒండొరు మేనులన్= ఒకరి ఒంటిమీద ఇంకొకరు; శరములు= బాణాలు; ఉచ్చి చనన్= దూసికొని పోయేటట్లు; నిగుడింతురు= వేస్తారు; ఇట్టులు= ఈ ప్రకారంగా; ఆఱని మదంబులన్= చల్లారని దర్పాలతో (నశించని మదంతో); ఒండొరు మీఱు= ఒకరిని మరొకరు మించాలనే; ఆసలన్= కోరికలతో; ఉద్దండతన్= భయంకరంగా; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: ఒకరిమీద మరొకరు ఒక్క ఊపున బాణాలు వేస్తూ, ఒకరి బాణాలను ఇంకొకరు నరికివేస్తూ, భూమినిండా పడేటట్లు చేస్తూ, భయంకరువై, ఒకరి శరీరంలో మరొకరు బాణాలు దూసుకుపోనిస్తూ, తగ్గని మదంతో ఒకరినొకరు మించాలనే కోరికతో తీవ్రంగా యుద్ధం చేశారు.

క. **మరుదాత్మజుఁ డేచిన న । న్నరుఁడు హరియు సంతసంబునం బొదలుదు రు**
ద్ధురతం గర్ణుఁడు మిగిలినఁ । గర ముబ్బు విభుండు దమ్ము గమియుం దానున్. **219**

ప్రతిపదార్థం: మరుత్+ఆత్మజుఁడు= వాయుపుత్రు డయిన భీముడు; ఏచినన్= విజృంభించగా; ఆ+నరుఁడు హరియున్= ఆ అర్జునుడును, కృష్ణుడును; సంతసంబునన్= సంతోషంతో; పొదలుదురు= ఒప్పుతారు; ఉద్ధురతన్= గర్వంతో; కర్ణుఁడు మిగిలినన్= కర్ణుడు అతిశయించగా; విభుండు= రాజయిన దుర్యోధనుడు; తమ్ముగమియున్= తమ్ముల సమూహమును; తానున్= తానును; కరము+ఉబ్బున్= మిక్కిలి సంతోషిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వాయుపుత్రు డయిన భీముడు (కర్ణుడిని) విజృంభిస్తే కృష్ణార్జునులును, దర్పంతో కర్ణుడు అతిశయిస్తే దుర్యోధనుడు, అతడి తమ్ములు చాలా సంతోషించారు.

తే. సూతనందనునకు నెడ సొచ్చి చొచ్చి । సమదుఁ డగు భీమసేనుచేఁ జచ్చి చచ్చి
బలము లఱుగ నా కర్ణుండు దొలఁగిపోవఁ । జూచుఁ దెగిపోఁడు పడిన నీ సుతులఁ జూచి. 220

ప్రతిపదార్థం: సూతనందనునకున్= కర్ణుడికి; ఎడచొచ్చి చొచ్చి= మధ్యలో వెళ్ళి వెళ్ళి; సమదుఁడు+అగు= మదంతో కూడిన; భీమసేనుచేన్= భీముడి చేతిలో; చచ్చి చచ్చి= చనిపోయి; బలములు= సేనలు; అఱుగన్= క్షయించగా; ఆ కర్ణుండు తొలఁగిపోవన్= ఆ కర్ణుడు తప్పుకొనిపోగా; చూచున్= చూస్తాడు; పడిన నీ సుతులన్+చూచి= చనిపోయిన నీ కుమారులను చూచి; తెగిపోఁడు= వెళ్ళిపోడు.

తాత్పర్యం: కర్ణుడికి కొంతదూరంగా వెళ్ళి, భీముడి చేత సేనలు చచ్చిపోగా, కర్ణుడు తొలగిపోవచూస్తాడు. కాని, యుద్ధంలో కూలిన నీ కుమారులను చూచి తాను తప్పుకోడు.

వ. శోకంబునం గోపంబునం గర్ణు విక్రమాటోపంబు దీపించిన. 221

తాత్పర్యం: దుఃఖంతో, కోపంతో కర్ణుడి శౌర్యం, ఆటోపం ప్రకాశించగా.

క. గొడుగునను వింటి కొమ్ముల । సిడమున నరదంబునందు సెల లవిసి కడున్
వడి నిగిడెడు చాడ్పున న । వ్వడముడి దెస నమ్ము లడరె వసుధాధీశా! 222

ప్రతిపదార్థం: వసుధాధీశా!= ఓ ధృతరాష్ట్ర చక్రవర్తీ!; గొడుగునను= (తేరు కున్న) గొడుగుతోను; వింటి కొమ్ములన్= వింటి దబ్బ కొమ్ములతోను; సిడమునన్= ధ్వజంతోను; సెల లవిసి= బాణాలు వేసి; కడున్= మిక్కిలి; వడి నిగిడెడు చాడ్పునన్= వేగంగా పడే విధంగా; ఆ+వడముడి దెసన్= ఆ భీముడి దిక్కుగా; అమ్ములు+అడరెన్= బాణములతిశయించాయి.

తాత్పర్యం: ఓ రాజా! భీముని గొడుగు మీద, వింటికొమ్ముల మీద, ధ్వజం మీద తేరి మీద మిక్కిలి వేగంగా పడేటట్లు కర్ణుని బాణాలు విజృంభించాయి.

క. దానికి మనమున నించుక । యైనను దలఁకక సమీరణాత్మజుఁ డవి పై
రానీక నిలిపి యతనిం । దా నిరువది నారసములఁ దలరఁగఁజేసెన్. 223

ప్రతిపదార్థం: దానికిన్= ఆ యుద్ధగతికి; సమీరణ+ఆత్మజుఁడు= వాయుపుత్రు డయిన భీముడు; ఇంచుకైనను= ఎంతమాత్రము (కొంచెమైనను); తలఁకక= జంకకుండా; అవి= ఆ బాణాలు; పైరానీక నిలిపి= మీరకుండా నిలిపి; అతనిన్= ఆ కర్ణుడిని; తాను= తాను (భీముడు); ఇరువది నారసములన్= ఇర్వై బాణాలతో; తలరఁగన్+చేసెన్= చలింపజేశాడు.

తాత్పర్యం: అందుకు భీముడు కాసంత అయినా జంకకుండా, ఆ బాణాలను పైకి రానీయకుండా, కర్ణుడు చలించేటట్టు ఇరువది బాణాలతో కొట్టాడు.

వ. అప్పుడు. 224

తాత్పర్యం: ఆ సమయంలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మనవారు వారి వారలు । ననిలతనయు విక్రమంబు నగ్గింప సుయో
ధనుఁడు దనయొద్ది యోధుల । ననుజులనుం గర్ణుఁ గావుఁ డని పనుచుటయున్. 225

ప్రతిపదార్థం: మనవారున్= మనసేనలోని వాళ్ళను (కౌరవులు); వారి వారలున్= పాండవులవైపు ఉన్నవారును; అనిల తనయు విక్రమంబున్= భీముడి శౌర్యాన్ని; అగ్గింపన్= పొగడగా; సుయోధనుఁడు= దుర్యోధనుడు; తన ఒద్ది= తన దగ్గరనున్న; యోధులన్= వీరులను; అనుజులన్= తోబుట్టువులను; కర్ణున్+కావుఁడు= కర్ణుడిని కాపాడండి; అని= అంటూ; పనుచుటయున్= పంపటమును.

తాత్పర్యం: మన సేనలూ, పాండవ పక్షంవారూ భీముడి పరాక్రమాన్ని పొగడుతూ ఉండగా, దుర్యోధనుడు తన దగ్గర ఉన్న వీరులనూ, తమ్ములనూ 'కర్ణుడిని కాపాడండి' అని పంపగా.

భీమసేనుచేత శత్రుంజయాది కురుకుమారులు చచ్చుట (సం. 7-112-30)

వ. అప్పుడు శత్రుంజయుండును శత్రుసహుండును సుదేహుండును మదనుండును ద్రుముండును జిత్రబాహుండును వికర్ణుండును గర్ణ రక్షణ పరులై కడిమివెలయఁ దలకడచి యొక్కట భీమసేనుం దాఁకి ధరాధరంబు నంబుధారలం గప్పు జలధరంబుల చందంబున నతని నతినిబిడ పరంపరలఁ బొదవినం బెరిఁగిన దర్పంబునం బొదలి యతండు దృఢైకముష్టి నిర్ముక్తమార్గణ సప్తకంబున వారిం బిలుకుమార్చి యార్చిన, నా సింహనాదంబు విని ధర్మతనయుం డది విజయాగ్రజుండు నిజవిజయం బెఱింగించునట్లుగా నెఱింగి మనంబునం బొంగి ద్రోణుదెసకుఁ దఱిమి కయ్యంబు సేసె; నట్లు పలువురు దమ్ములు వొలిసిన దుర్యోధనుండు దనమనంబున జూదంబునప్పుడు విదురుండు సెప్పినట్ల యగుచున్నదని విషాదంబునొంది యా సభ నమ్మెయిఁ బాండవులఁ బఱచిన పాపఫలం బనుభవించె' ననవుడు వైచిత్రవీర్యుండు. 226

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయాన; శత్రుంజయుండును, శత్రుసహుండును, సుదేహుండును, మదనుండును, ద్రుముండును, చిత్రబాహుండును, వికర్ణుండును= ఈ పేర్లుగల దుర్యోధనుడి తమ్ములు; కర్ణ రక్షణపరులు+ఐ= కర్ణుడిని కాపాడటంలో ఆసక్తికలవారయి; కడిమి వెలయన్= పరాక్రమం ప్రకాశించగా; తల కడచి= ముందుకు దూకి; ఒక్కటన్= ఒక్కమారుగా; భీమసేనున్+తాఁకి= భీముడిని ఎదుర్కొని; ధరాధరంబున్= కొండను; అంబుధారలన్= వానతో; కప్పు= కప్పివేసే; జలధరంబుల చందంబునన్= మేఘాల మాదిరిగా; అతనిని= ఆ భీముడిని; అతినిబిడశరంబులన్= మిక్కిలి దట్టమయిన బాణాలతో; పొదవినన్= క్రమ్ముకోగా; పెరిఁగిన దర్పంబునన్= ఎక్కువయిన గర్వంతో; పొదలి= ఒప్పి; అతండు= ఆ భీముడు; దృఢ+ఏకముష్టి= గట్టిగా పట్టుకొన్న పిడికిలినుండి; నిర్ముక్త= వదలబడిన; మార్గణసప్తకంబునన్= ఏడు బాణాలతో; వారిన్+పిలుకుమార్చి= ఆ శత్రుంజయాదులను చంపి; ఆర్చినన్= సింహనాదం చేయగా; ఆ సింహనాదంబు= ఆ సింహనాదం; విని= విన్నవాడై; ధర్మతనయుండు= ధర్మరాజు; అది= ఆ అరచుట; విజయ+అగ్రజుండు= భీముడు; నిజవిజయంబు+ ఎఱింగించునట్లుగాన్= తన జయాన్ని తెల్పుతున్నట్లుగా; ఎఱింగి= తెలిసికొని; మనంబునన్= మనసులో; పొంగి= సంతోషించి; ద్రోణుదెసకున్= ద్రోణు డున్న వైపునకు; తఱిమి= (తన తేరును) తోలి; కయ్యంబు చేసెన్= యుద్ధం చేశాడు; అట్లు పలువురు= ఆ విధంగా చాలామంది; తమ్ములు= తన సోదరులు; పొలిసినన్= చనిపోగా; దుర్యోధనుండు తనమనంబునన్= తన మనస్సులో దుర్యోధనుడు; విదురుండు= విదురుడు; జూదంబు+అప్పుడు= (కౌరవపాండవులు) జూదం ఆడినప్పుడు; చెప్పిన+అట్లు+అ= చెప్పినట్లుగానే; అగుచున్+ఉన్నది+అని= జరుగుతూ ఉన్నదని; విషాదంబున్+ఒంది= విచారపడి; ఆ సభన్= ఆ కురుసభలో; ఆ+మెయిన్= ఆ విధంగా; పాండవులన్= పాండవులను; పఱచిన= అవమానించిన; పాపఫలంబు= పాపానికి ఫలం; అనుభవించెన్= అనుభవించాడు; అనవుడున్= అనగా విని; వైచిత్రవీర్యుండు= ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: శత్రుంజయుడు మొదలయిన వారు కర్ణుడిని కాపాడవలె ననే ఆసక్తితో ఒక్కుమ్మడిగా పరాక్రమం ఉట్టిపడే విధంగా ముందుకు వెళ్ళి, వర్షంతో మేఘమాల కొండను కప్పివేసే విధంగా భీముడిని చుట్టుముట్టి, బాణవర్షంతో కప్పివేశారు.

అందువలన పెరిగిన కోపంతో భీముడు పిడికిలి బిగించి గట్టిగా ఏడు బాణాలు వదలి, శత్రుంజయాది సోదరులను ఏడుగురిని చంపి సింహనాదం చేశాడు. ఆ సింహనాదం విన్న ధర్మరాజు ఆ శబ్దం భీముడు తన విజయాన్ని తెలుపటంగా గుర్తించి, మనసులో పొంగి, ద్రోణు డున్న వైపునకు చొచ్చుకొనిపోయి యుద్ధం చేశాడు. ఆ విధంగా తన తమ్ములు చాలామంది చనిపోగా దుర్యోధనుడు తన మనస్సులో. 'అలనాడు జూదమాడేటప్పుడు విదురుడు చెప్పినట్లే ఇప్పుడు జరుగుతున్న'దని దుఃఖించి, ఆ సభలో ఆ విధంగా పాండవులను అవమానించిన పాపఫలం ఈ విధంగా పొందాడు' - అని సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు.

క. **'గతవృత్తములకు వగవం । గత మేమి? యతండు వెట్టి; కార్యము నా దు**
ర్మతిఁ దప్పె; నోర్చి కొడుకుల । కత వినియెదఁ జెప్పు చెప్పఁగలయది యెల్లన్.' **227**

ప్రతిపదార్థం: గత వృత్తములకున్= జరిగిపోయిన కథలకు (వెనుకటి గాథలకు); వగవన్+కతము+ఏమి?= ఏడ్చుటకు కారణ మేముంది?; అతండు= ఆ దుర్యోధనుడు; వెట్టి= పిచ్చివాడు; కార్యము= చేయవలసిన పనిని; నా+దుర్మతిన్ తప్పెన్= నా చెడుబుద్ధి వలన తప్పిపోయింది; ఓర్చి= ఓర్చుకొని(ఓర్పుతో); కొడుకుల కత వినియెదన్= నా కుమారుల కథ నంతా వింటాను; చెప్పఁగల అది ఎల్లన్= చెప్పవలసిన దంతా; చెప్పు= చెప్పుము.

తాత్పర్యం: 'జరిగిపోయిన చరిత్రను తలచుకొని దుఃఖించటం దేనికి? దుర్యోధనుడు వెర్రివాడు. నా చెడ్డబుద్ధి వలననే తాను చేయతగిన పని తప్పిపోయింది. ఓర్మితో నా కొడుకుల కథనంతా వింటాను. నీవు చెప్పవలసిన దంతా చెప్పుము.'

విశేషం: ఈ పద్యంలో విధి బలవత్తరమనే సత్యమును ధృతరాష్ట్రుడు గుర్తించిన విషయం వ్యక్తమవుతూ ఉన్నది.

వ. **అనిన నతనికి సంజయుం డిట్లను 'న ట్లనిలజుఁ డార్చినం బేర్చి కర్ణుఁ డతనిపయిం గవిసి ఘోర సంగ్రామంబు సేయుచుండ నీ సేన భీమసేనుఁ జుట్టుముట్టిన నతండు బెట్టిదంబులగు భల్ల ప్రముఖ బాణంబులఁ గేతు ఛత్ర చామరంబులు సూతరథరథ్య రథికావయవంబులు దురంగమాతంగ సుభటాంగంబులుఁ దునియలై దొరఁగి పెరుఁగు నెత్తురుటేఱుల వెంబడిం బాఱంజేయుటయుఁ బతితశేషం బగు నబ్బలం బిరుగెలంకులం దొలంగి యంపవెట్టునేల కవుల సని చూచుచుండె; వెండియు రాధేయుండు రయంబున నతనిం దాఁకి పోరె; నట్టి యెడ నమ్మారుతనందనుండు.** **228**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; సంజయుఁడు+ఇట్లనున్= సంజయు డీ విధంగా అన్నాడు; అట్లు= ఆ ప్రకారంగా; అనిలజుఁడు= భీమసేనుడు; ఆర్చినన్= సింహనాదం చేయగా; పేర్చి= విజృంభించి; కర్ణుఁడు+అతని పయిన్+కవిసి= కర్ణుడు అతడి మీదకు దూకి; ఘోర సంగ్రామంబు= భయంకరమైన యుద్ధం; చేయుచుండన్= చేస్తూ ఉండగా; నీ సేన= నీ సైన్యం; భీమసేను చుట్టుముట్టినన్= భీముడిని క్రమ్ముకోగా; అతండు= ఆ భీముడు; బెట్టిదంబులు+అగు= బలమయిన; భల్లప్రముఖ= బల్లెములు మొదలుగా; బాణంబులన్= అమ్ములను; కేతుచ్ఛత్ర చామరంబులు= ధ్వజం, గొడుగు, చామరాలు; సూత రథ రథ్య రథికావయవంబులు= సారథులు, తేరులు, గుర్రాలు, సైనికుల అవయవాలు; తురంగ మాతంగ సుభటాంగంబులు= గుర్రాలు, ఏనుగులు, మంచి సైనికుల అవయవాలు; తునియలు+ఐ= ముక్కలుగా; తొరఁగి= దొరలి; పెరుఁగు= ఎక్కువయిన; నెత్తుఱుటేరుల వెంబడిన్= నెత్తురు ప్రవాహాల ననుసరించి; పాఱన్+చేయుటయున్= పరుగెత్తేటట్లుగా చేయగా; పతితశేషంబు+అగు= పడిపోగా మిగిలిన; ఆ+బలంబు= ఆ సేన; ఇరు, కెలంకులన్+తొలంగి= రెండుప్రక్కలకు తప్పుకొంటూ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంపపెట్టు= బాణాల తాకిడి; నేలకున్= భూమికి; అవుల చని= అవతలికి పోయి; చూచుచుండెన్= చూస్తూ ఉండిపోయింది; వెండియున్= మరలా; రాధేయుండు= కర్ణుడు; రయంబునన్= శీఘ్రంగా; అతనిన్+తాఁకి= ఆ భీముడిని ఎదుర్కొని; పోరెన్= యుద్ధం చేశాడు; అట్టి ఎడన్= ఆ సమయంలో; ఆ+మారుత నందనుండు= ఆ భీమసేనుడు.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అనగా సంజయుడు ఈ విధంగా చెప్పాడు: 'భీముడి సింహనాదానికి కర్ణుడు విజృంభించి, అతడి మీదకు దూకి భయంకరమయిన యుద్ధం చేస్తూ ఉండగా, నీ సేన భీమసేనుని చుట్టు ముట్టింది. భీమసేనుడు బలమైన బల్లెములు మొదలైన వాడి బాణాలతో తేరుల కున్న పతాకలనూ సారథులనూ గుఱ్ఱాలనూ సుశిక్షితులయిన సైనికులనూ తునియలుగా చేసి, నెత్తుటి నదుల్లో కొట్టుకుపోయేటట్లు చేయగా, పడిపోగా మిగిలిన సేన ఇరువైపులకు తప్పుకొని బాణాలు పడేప్రదేశానికి దూరంగా వెళ్ళి చూస్తూ నిలబడింది. మళ్లీ కర్ణుడు వేగంగా భీముని ఎదుర్కొన్నాడు అపుడు భీముడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆభీలతఁ గర్ణుని క । ర్ణాభరణము చుక్కపడిన యట్లు పడఁగ సం
శోభిత శరమున నేసి మ । హాభల్ల మురస్ స్థలమ్ము నాడఁగ నేసెన్. 229

ప్రతిపదార్థం: ఆభీలతన్= భయంకరంగా; కర్ణుని= కర్ణుడియొక్క; కర్ణాభరణము= చెవికుండలం; చుక్కపడినఅట్లు= నక్షత్రం రాలినట్లుగా; పడఁగన్= పడిపోయేటట్లు; సంశోభిత శరమునన్+ఏసి= బాగా వెలిగే బాణంతో కొట్టి; మహాభల్లము= పెను బల్లెమును; ఉరస్ స్థలమ్మున్= గుండెలో; నాడఁగనేసెన్= నాటుకొనేటట్లు చేశాడు.

తాత్పర్యం: కర్ణుడి చెవికుండలం చుక్క రాలిపడినట్లుగా పడేటట్లు బాగా వెలిగే బాణంతో భీముడు భయంకరంగా కొట్టి, ఒక పెద్ద బల్లెమును అతడి గుండెలో నాటుకొనేటట్లు వేశాడు.

క. ఆలోనన యారథికుని । ఫాలస్థలి నోలి నెనయఁ బది నారసముల్
గీలించిన నవి యచ్చట । నీలోత్పలమాల వోలె నెఱయం బొలిచెన్. 230

ప్రతిపదార్థం: ఆలోనన= అంతలోనే; ఆ రథికుని= ఆ కర్ణుడి; ఫాలస్థలిన్= నెన్నుదుటిలో; ఓలిన్= వరుసగా; ఎనయన్= పొందగా (ఒప్పి ఉండగా); పది నారసముల్= పది వాడి బాణాలను; కీలించినన్= నాటించగా; అవి= ఆ బాణాలు; అచ్చటన్= ఆ ముఖాన, గుండెలోను; నీలోత్పల మాలవోలెన్= నల్లకలువ దండవలె; పొలిచెన్= ఒప్పారాయి.

తాత్పర్యం: అంతలోనే ఆ కర్ణుడి నెన్నుదుట వరుసగా పది వాడిబాణాలను వేయగా అవి అతడి ముఖాన నల్ల కలువ దండవలె రాణించాయి.

విశేషం: అలం: ఉపమ.

తే. అలిగి బాణశతంబున నాతఁ డతని । నొంచె; నవ్వీరు చాపంబు ద్రుంచె నతఁడు
పఱపె బలువింటఁ గర్ణుండు పటు శరములఁ । బట్టపవలింటి సూర్యుని ప్రభలు వొలయ. 231

ప్రతిపదార్థం: అలిగి= కోపించి; బాణశతంబునన్= నూరు బాణాలతో; ఆతఁడు= ఆ కర్ణుడు; అతనిన్= ఆ భీముడిని; నొంచెన్= నొప్పించాడు; అతఁడు= ఆ భీముడు; ఆ+వీరుచాపంబున్= ఆ కర్ణుడి వింటిని; త్రుంచెన్= తునియచేశాడు; కర్ణుండు; బలువింటన్= పెద్ద విల్లుతో; పట్టపవలింటి= మిట్టమధ్యాహ్నమందలి; సూర్యుని ప్రభలు= సూర్యకాంతులు; పొలయన్= వ్యాపించగా; పటు= తీవ్రమైన; శరములన్= బాణములను; పఱపెన్= వేసెను.

తాత్పర్యం: కోపంతో కర్ణుడు నూరు బాణాలువేసి భీముడిని నొప్పించాడు. భీముడు కర్ణుడి విల్లు త్రుంచాడు. కర్ణుడు పెద్ద విల్లుతో పట్టపగలింటి సూర్యుడి కాంతి వ్యాపించినట్లు అనేక తీవ్ర బాణాలు భీముడిమీద వేశాడు.

వ. ఇట్లేయు నా సూతనందను విల్లు విదుర్పు దోఁపక గుడుసువడుటఁ జక్రాకృతిం బొలుచు ననలశిఖల చెలువు దాల్చె; నట్టి రయంబునకు భయంబు గొనక భీముండు నిగిడించు హేమ లిప్తనారాచధారలు గగన లక్ష్మి కనకాభరణంబుల చెన్ను చేకొనియె; నప్పుడు కోపంబు రూపంబు గైకొన్న కైవడి నుదీర్ణుండై యక్కర్ణుండు. 232

ప్రతిపదార్థం: ఇట్లు+ఏయు= ఈ విధంగా బాణాలు వేస్తున్న; ఆ సూతనందను= ఆ కర్ణుడి; విల్లు= ధనుస్సు; విదుర్పు= బాణాలు వదలటం; తోఁపక= అగుపించక; గుడుసు+పడుటన్= గుండ్రంగా అగుటచే; చక్ర+ఆకృతిన్+పొలుచు= చక్రాకారంలో ఉన్న; అనలశిఖల= అగ్ని జ్వాలల; చెలువు= సొగసు; తాల్చెన్= పొందెను; అట్టి రయంబునకున్= అటువంటి వేగానికి; భయంబు కొనక= భయపడక; భీముండు నిగిడించు= భీముడు వేసే; హేమలిప్త= బంగారు పూత గల; నారాచధారలు= తీవ్రమయిన బాణాల వాదరలు; గగనలక్ష్మి= ఆకాశలక్ష్మియొక్క కనక+ఆభరణంబుల చెన్నున్= బంగారు నగల అందాన్ని; చేకొనియెన్= పొందెను; అప్పుడు; కోపంబు= కోపం; రూపంబు గైకొన్న కైవడిన్= ఆకారం పొందిన విధంగా, ఉదీర్ణుండు+ఐ= అతిశయించినవాడై

తాత్పర్యం: ఒకదాని వెంటఒకటిగా, అతివేగంగా బాణాలు వదలే కర్ణుడి వింటి యొక్క బాణాల విదిలింపు అగుపించక, అది అట్లె గుండ్రంగా వంగి ఉండటం వల్ల, చక్రాకారంలో ప్రవేశించే అగ్నిజ్వాలల సొంపుపొందింది. కర్ణుడు బాణాలు వేసే వేగానికి భయపడకా భీముడు ప్రయోగించే బంగారు పూతబాణాలు, ఆకాశలక్ష్మికి బంగారు ఆభరణాలు అందాన్ని పొందాయి. అప్పుడు కోపమేరూపెత్తినట్లు కర్ణుడు విజృంభించి(తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలంకారం: ఉపమ, ఉత్ప్రేక్ష.

చ. పవనజు చాపమున్ హరుల పగ్గములుం దునుమాడి కాఁడితో
నవి పెనఁగాడఁగా వెడఁదయమ్మునఁ గేతువు గూల్చి సూతు మే
నవియగ నేసినం బఱచె నాతఁడు ఫల్గును చక్రరక్షు తే
రి వెనుకకుగ్రశక్తి యడరించెఁ జలింపక భీముఁ డత్తఱిన్. 233

ప్రతిపదార్థం: పవనజు చాపమున్= భీముడి వింటిని; హరుల పగ్గములున్+తునుమాడి= గుర్రాల పగ్గాలను త్రెంచివేసి; అవి= ఆ గుర్రాలు; కాఁడితోన్= నొగలతో; పెనఁగాడఁగాన్= పెనగులాడగా; వెడద అమ్మునన్= విశాలమైన బాణంతో; కేతువు కూల్చి= తేరి పతాకాన్ని పడగొట్టి; సూతుమేను= సారథి ఒడలు; అవియఁగన్= బద్దలయ్యేటట్లు (దెబ్బతినగా); ఏసినన్= కొట్టగా; ఆతఁడు= ఆ సారథి; ఫల్గును= అర్జునుడి; చక్రరక్షు తేరి వెనుకకున్= చక్రరక్షకుడగు భీముడి తేరి వెనుక ప్రక్కకు; పఱచెన్= పర్వెత్తాడు; ఆతఁడు= భీముడు; ఉగ్రశక్తి= భయంకరమైన శక్త్యాయుధాన్ని; అడరించెన్= వేశాడు; ఆ+తఱిన్= ఆ సమయాన; భీముఁడు; చలింపక= జంకకుండా.

తాత్పర్యం: కర్ణుడు భీముడి విల్లును త్రుంచాడు, గుర్రాల పగ్గాలను త్రెంచాడు. ఆ గుర్రాలు కాడితో పెనగులాడగా పెద్ద బాణంతో పతాకాన్ని పడగొట్టాడు. సూతుడి శరీరం చీలేటట్లు కొట్టగా అతడు అర్జునుడికి చక్రరక్షకుడి తేరు వెనుకకు పరుగెత్తాడు. ఆ సమయంలో భీముడు బెదరకుండా భయంకరమైన శక్త్యాయుధాన్ని ప్రయోగించాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **అది సూతనందనుఁడు దొ। మ్మిది శరములఁ దునుముటయు సమీరసుతుఁడు బె**
ట్టిదముగ వాలుఁ బలకయు। న్మదమునఁ గొన నతఁడు పలక నఱికె; నఱికినన్. 234

ప్రతిపదార్థం: అది= ఆ శక్తిని; సూతనందనుఁడు= కర్ణుడు; తొమ్మిది శరములన్= తొమ్మిది బాణాలతో; తునుముటయున్= త్రుంచుటయు; సమీరసుతుఁడు= వాయునందనుడైన భీముడు; బెట్టిదముగన్= గట్టిగా; వాలున్= కత్తియు; పలకయున్= పలకను; మదమునన్+కొనన్= గర్వంతో తీసికొనగా; అతఁడు= ఆ కర్ణుడు; పలక నఱికెన్= పలకను నరికాడు; నఱికినన్= ఆ విధంగా నరకగా.

తాత్పర్యం: ఆ శక్తిని తొమ్మిది బాణాలతో కర్ణుడు త్రుంచాడు, అపుడు భీముడు బలమయిన కత్తిని, పలకను దర్పంతో తీసికొన్నాడు. కర్ణుడు ఆ పలకను నరికాడు. అట్లా నరకగా (తరువాతి పద్యంతో అన్వయం).

మ. **కరవాలంబున వైచి యా రథికువిల్ ఖండింప నొండొక్క ని**
ష్ఠుర చాపం బతఁ డెత్తునంతకు జవాటోపంబుఁ గోపంబు మ
చ్చరముం దేటపడన్ వియచ్చరులు మెచ్చన్ భీముఁ డా సూతసూ
తి రథం బల్లల నాడ దానిపయికిం దెం పొప్ప లంఘించినన్. 235

ప్రతిపదార్థం: కరవాలంబునన్ వైచి= కత్తితో కొట్టి; ఆ రథికువిల్ ఖండింపన్= ఆ వీరుడి (కర్ణుడి) వింటిని ముక్కలు చేయగా; అతఁడు= ఆ కర్ణుడు; ఒండొక్క= ఇంకొక; నిష్ఠుర చాపంబున్= కఠినమైన వింటిని; ఎత్తునంతకున్= చేతికి తీసికొనేటంతలో; జవాటోపంబున్= వేగంయొక్క విజృంభణము; కోపంబు= కోపము; మచ్చరమున్= ద్వేషము; తేటపడన్= బయల్పడగా; వియచ్చరులు= దేవతలు; మెచ్చన్= మెచ్చుకొనగా; భీముఁడు= భీమసేనుడు; ఆ సూతసూతి= ఆ కర్ణుడి; రథంబు+అల్లలన్+ఆడన్= తేరు అల్లాడగా (తేరు ఊగిపోగా); దాని పయికిన్= ఆ తేరు మీదకు; తెంపు+ఒప్పన్= సాహసంతో; లంఘించినన్= దూకగా.

తాత్పర్యం: భీముడు కత్తిని విసరి కర్ణుడి వింటిని విరిచాడు. కర్ణుడు వేరొక విల్లును ఎత్తుకొనేటంతలో నేర్పూ, దర్పమూ, ద్వేషమూ తేటపడేటట్లు, దేవతలు మెచ్చుకోగా, విధంగా కర్ణ డుండే రథం అల్లలనాడేటట్లు, సాహసంతో భీము డా తేరిమీదికి దూకాడు.

వ. **అతండు కేతనంబునకుం గుదురుగాఁ బెనుపొనరం గావించిన పీఠంబు నడుగున నొదిఁగినం దేరిపయి నతనిం గానక భీమసేనుండు నలుదిక్కులుం బరికించి యతని పాఱుటయు లేకున్న నయ్యరదంబు క్రిందఁ దూఱెనను తలంపున నతనిం బట్టికొనువాఁడై డిగ్గనుఱుకుటయుం, దోడన తోఁచి రాధేయుండు రథచిత్రగతులు మెఱయ రయంబారఁ బెక్కు నారాచంబు లొక్కమొగిం దనువునఁ జొనుపుచు నేచిన నయ్యనిలతనయుండు సాధన వైకల్యంబున వెడంగు పడియును వెన్నీక మున్ను విప్వచ్చుచేతం జచ్చిన సామజంబుల హయంబులఁ బుచ్చికొని డాచేత నొడ్డుకొనుచు వలచేత వైచుచుఁ బెనంగె; నవియును వివిధ విశిఖంబులఁ దునియలు సేయుచు నెఱకులు నో నేయుచుఁ గర్ణుండు గదిసి తఱుమఁ దదీయ స్యందనంబునకు దుర్గమం బగు నని యతం దర్జునాస్త్ర పతితంబు లైన చతురంగంబుల తిట్టల యోలంబు సొచ్చిన.** 236

ప్రతిపదార్థం: అతండు= ఆ కర్ణుడు; తన కేతనంబునకున్= తన ధ్వజానికి; కుదురుగాన్= క్రింద చుట్టు కుదురుగా (పీఠంగా); పెనుపు+ఒనరన్+కావించిన= గొప్పగా చేసిన; పీఠంబు అడుగునన్= పీటక్రింద; ఒదిఁగినన్= దాగుకొనగా; తేరిపయిన్= తేరిమీద; అతనిన్+కానక= అతడిని చూడక; భీమసేనుండు; నలుదిక్కులు పరికించి= నాలుగు దిక్కులా చూచి; అతని పాఱుటయు లేకున్నన్= వాడు పరుగెత్తుటకూడా లేకపోగా; ఆ+అరదంబు క్రిందన్= ఆ తేరు క్రిందుగా; తూఱెన్+అను తలంపునన్= దూరి ఉండవచ్చుననే భావంతో; అతనిన్+పట్టుకొనువాడై= కర్ణుడిని పట్టుకొనవలెనని; డిగ్గన్+ఉఱుకుటయున్= క్రిందికి దూకగా; తోడన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తోఁచి= వెంటనే కనబడి; రాధేయుండు= కర్ణుడు; పెక్కు నారాచంబులు= అనేకములైన వాడిబాణాలను; ఒక్క మొగిన్= ఒక్క వరుసగా; తనువునన్ చొనుపుచున్= ఒంటిమీద వేస్తూ; ఏచినన్= విజృంభించగా; ఆ+అనిల తనయుండు= ఆ భీమసేనుడు; సాధన వైకల్యంబునన్= ప్రయత్నం విచ్ఛేద మయినందున; వెడంగు పడియును= భయపడి కూడా; వెన్ను+ఈక= వీపు చూపకుండా (పారిపోక); మున్ను= అంతకుముందు; వివ్వచ్చుచేతన్+చచ్చిన= అర్జునుడిచేత చచ్చిన; సామజంబుల= ఏనుగులను; హయంబులన్+పుచ్చికొని= గుర్రాలను తీసికొని; డాచేతన్= ఎడమచేతితో; ఒడ్డుకొనుచున్= అడ్డం పెట్టుకొంటూ; వలచేత వైచుచు= కుడిచేతితో కొట్టుతూ; పెనంగెన్= యుద్ధం చేశాడు; అవియును= ఆ ఏనుగులు, గుర్రాలూ; వివిధ విశిఖంబులన్ తునియలు చేయుచున్= అనేక రకాలయిన బాణాలతో ముక్కలు చేస్తూ; నెఱఁకులు= మర్మములను; నోన్+ఏయుచున్= నొవ్వచేస్తూ; కర్ణుండు కదిసి తఱుమన్= కర్ణుడు క్రమ్ముకొని తరుమగా; తదీయస్యందనంబునకున్= అతడి తేరుకు; దుర్గమంబు+అగునని= పోలేక (ముందుకు) పోవునని; అతండు= ఆ భీముడు; అర్జున+అస్త్ర పతితంబులు+అయిన= అర్జునుడి బాణాలకు పడిన (నేలరాలిన); చతురంగంబుల తిట్టలన్= చతురంగ బలాల గుట్టలలో; ఒలంబు సొచ్చినన్= మరుగు చొచ్చి పోగా.

తాత్పర్యం: కర్ణుడు, తన ధ్వజానికి క్రింద కుదురుగా చేసిన పీఠం క్రింద దాగుకొన్నాడు. భీము డాతడిని వెదకుతూ తేరు మీద కన్పించకపోగా, నాలుగు దిక్కులా చూచి, అతడు పారిపోవటంకూడ కనబడకపోయేసరికి, తేరు క్రింద దూరుకొన్నాడని తలంచి తానూ క్రిందకు పోయి పట్టుకొనవలె భీముడు రథం మీద నుండి క్రిందికి దూకాడు వెంటనే కర్ణుడు పీఠం క్రింది నుండి బయటికి వచ్చి, తన రథం చిత్రగతుల మేరయగా, వేగంగా అనేక బాణాలను భీముని శరీరంలో గ్రుచ్చుకొనేటట్లు వేశాడు. అందుకు భీముడు తన ప్రయత్నం భంగమయినందుకు భయపడినప్పటికినీ వెనుకాడకుండా, అంతకుముందు అర్జునుడిచేత చంపబడిన యుద్ధరంగంలోని గుర్రాలను, ఏనుగులను ఎడమచేతితో తనకు అడ్డం పెట్టుకొంటూ, కుడిచేత కర్ణుడి మీద విసురుతూ యుద్ధం చేశాడు. కర్ణుడు వివిధ బాణాలతో ముక్కలు చేస్తూ, మర్మస్థానాలను నొప్పిస్తూ భీముని తరుమగా, భీముడు తన రథం మీదికి వెళ్ళటం సాధ్యం కానిపని అని తలచి, అర్జునుని బాణాలచేత చచ్చిపడి ఉన్న చతురంగబలాల గుట్టల చాటున దాగుకొన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. మొనలతోడను దనతోడ మున్ను పెనఁగి । శ్రమము నొందియు న ట్లరదమున కరిగి
వెండియును బోరి కడు డస్సి బెండు వడిన । యన్నిరాయుధుఁ జూచి సూతాత్మజుండు. 237

ప్రతిపదార్థం: మొనలతోడను= సైన్యాలతోను; తన తోడన్= తనతోను (కర్ణుడితో); మున్ను పెనఁగి= ఇదివరకే యుద్ధం చేసి; శ్రమమున్+ఒందియున్= అలసిపోయికూడా; అట్లు+అరదమునకు+అరిగి= ఆ ప్రకారంగా తేరి క్రిందకు పోయి; వెండియును= మరల; పోరి= యుద్ధం చేసి; కడు డస్సి= మిక్కిలి అలసిపోయి; బెండుపడిన= (తేలిక అయిన) బలాన్ని కోలుపోయిన; ఆ+నిరాయుధున్+చూచి= ఆ ఆయుధాలు లేని వాడిని చూచి (అస్త్ర శస్త్రములు లేనివాడిని); సూత+ఆత్మజుండు= కర్ణుడు.

తాత్పర్యం: సేనలతోనూ, తనతోనూ యుద్ధం చేసి అలసిపోయి, ఆ విధంగా తేరుక్రిందికి దిగి, తనతో యుద్ధం చేసి మిక్కిలి అలసి బలహీనుడయిన ఆ ఆయుధహీనుడిని చూచి కర్ణుడు.

క. మనమునఁ గుంతీవాక్యం । బును నొలసిన నేయు టుడిగి పోయి కదిసి న
వ్వున మోమొప్ప నతని కి । ట్లను వింటం గడుపు లీల నల్లఁ బొడుచుచున్. 238

ప్రతిపదార్థం: మనమునన్= తన మనస్సులో (కర్ణుడి మనస్సులో); కుంతీవాక్యంబును= కుంతి మాటలను (ఉద్యోగ పర్వంలో కుంతి కర్ణుడి జన్మాదికాలను చెప్పినప్పటిమాటలను, ఆ సందర్భంలో ఒక్క అర్జునుడిని దక్క తక్కిన పాండవులలో ఎవ్వరినీ చంపనని ఇచ్చిన మాటను); ఒలసినన్= తలపునకు రాగా; ఏయుట+ఉడిగి= బాణాలు వేయటం మాని; పోయి= భీముడి దగ్గరకు పోయి; కదిసి= తాకి; నవ్వున మోము+ఒప్పన్= నవ్వుతో తన మొగముండగా; వింటన్= విల్లుతో; లీలన్= విలాసంగా; అల్లన్+పొడుచుచున్= నెమ్మదిగా గ్రుచ్చుతూ; అతనికిన్= ఆ భీముడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కుంతి కిచ్చిన మాటలు గుర్తు రాగా, కర్ణుడు బాణాలు వేయటం ఆపి, భీముడికి దగ్గరగావెళ్ళి, నవ్వుమొగంతో తన విల్లును వాని కడుపుమీద అలవోకగా పొడుస్తూ (ఎగతాళిగా) ఇట్లా అంటున్నాడు:

కర్ణుండు భీమసేను నవమానించి నీచోక్తులు పలుకుట (సం. 7-114-69)

ఆ. 'తిండిపోత! నీకు భండనం బేటికి? । గడవఁ జేరి మనసు కాంక్ష దీఱ
నోపుకొలఁది మ్రింగి యూరక నీ వింటి । కడన యుండు మింక నడిచి పడక.' 239

ప్రతిపదార్థం: తిండిపోత!= తిండిమీదనే ఆశ కలవాడా! నీకు భండనంబు+ఏటికిన్= నీకు యుద్ధమెందుకు?; మనసు కాంక్షతీఱన్= మనసులోని ఆశ తీరేటట్లుగా; కడవన్+చేరి= అన్నంవండిన కుండను సమీపించి; ఓపుకొలఁది= శక్తి ఉన్నంతదాకా; మ్రింగి= తిని; నీవు+ఇంటి కడన= నీవు ఇంటివద్దనే; ఊరక ఉండుము= ఊరకుండుము (అనగా నోరు మూసికొని ఉండుము); ఇంకన్= ఇక మీదట; అడిచిపడకు= త్రుళ్ళిపడకుము.

తాత్పర్యం: 'ఓరీ తిండిపోత! నీకు తిండితిప్ప యుద్ధ మెందుకు? నీ మనసులో ఆశతీరేటట్లుగా భోజనపాత్ర వద్దకు చేరి, చాలినంతతిండిని మ్రింగి, ఇంటివద్దనే ఊరక కూర్చొనుము. త్రుళ్ళింత వద్దు.'

వ. అని మఱియును. 240

తాత్పర్యం: అని, ఇంకను.

క. వనమున ఫలమూలంబులు । దిని ముని వై యుండుగాక ధీరోద్ధతిమై
నని సేయ నీకు వచ్చునె? । చను మచటికి నుడిఁగి మడఁగి శాంతుఁడపోలెన్. 241

ప్రతిపదార్థం: వనమునన్= అడవిలో; ఫలమూలంబులు= పండ్లు, దుంపలు; తిని; మునివై ఉందు(వు)కాక!= ఋషివై ఉంటావుకాని; ధీరోద్ధతిమైన్= ధైర్యంతోనూ, దర్పంతోనూ; అని చేయన్= యుద్ధం చేయటానికి; నీకు వచ్చునె?= నీ చేత నవుతుందా?; అచటికిన్= ఆ వనాలకు; ఉడిఁగి= యుద్ధంమాని; మడిఁగి= అడగి; శాంతుఁడ పోలెన్= శాంతమూర్తివలె; చనుము= వెళ్ళుము.

తాత్పర్యం: అడవిలో పండ్లనూ కందమూలాలనూ తింటూ మునివృత్తితో ఉందువుగాక! దర్పంతో విజృంభించి యుద్ధం చేయటం నీ వల్ల అవుతుందా? యుద్ధంమాని, తగ్గి శాంతమూర్తివలె ఆ వనాలకు వెళ్ళుము.

వ. అట్లు నీ యొడ లుండ దేని. 242

తాత్పర్యం: ఆ విధంగా నీ ఒడ లుండకుంటే.

క. చేయలఁతిం గని సమరము । సేయుము; నను బోఁటి తోడఁ జెనయకు; నరనా
రాయణులు వారె యచటికిఁ । బోయెదవేఁ బోయి బ్రదుకుపొంక ముడుగుమీ!' 243

ప్రతిపదార్థం: చే+అలఁతిన్+కని= నీ చేయియొక్క ఒడుపును గుర్తించి; సమరము చేయుము= యుద్ధం చేయుము; ననుబోఁటి తోడన్= నావంటి వాడితో; చెనయకు= ఎదిరించవద్దు; నరనారాయణులు వారె= అదిగో నరనారాయణులు వారున్నారు; అచటకిన్+పోయెదవేన్= అక్కడికి పోతే; పోయి బ్రదుకు= అటుపోయి బ్రదికిపో; పొంకము+ఉడుగుమీ!= గర్వము వదులు సూమా; వదలుమా!

తాత్పర్యం: నీ చేతి సత్తా తెలిసికొని యుద్ధం చేయుము. నా బోటివాడితో తలపడవద్దు. అరుగో నరనారాయణులు వారే! అక్కడకు పోతే పోయి బ్రదుకు. గర్వము వదలుకొమ్ము.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ పద్యంలో కర్ణుడు తనకున్న అక్కసునంతా వెళ్ళబోసికొన్నాడు. భీముడు తనతో కయ్యానికి తగిన చేవ లేనివాడని, కృష్ణార్జునుల నీడలో బ్రదికిపోవటం మంచి దనీ, ధ్వనివిశేషంతో మాట్లాడాడు.

క. అని పలికె నట్టియెడఁ గృ। ష్ణుని పనుపున నర్జునుండు సునిశిత నారా
చనితాంతపాతముల నా। తనిఁ బిఱుసనఁ జేసి భీము దైన్యము వాఁపెన్. 244

ప్రతిపదార్థం: అని పలికెన్= అని మాట్లాడాడు (కర్ణు డా విధంగా ఎగతాళిగా మాట్లాడాడు); అట్టి ఎడన్= ఆ సమయాన; కృష్ణుపనుపునన్= కృష్ణుడి ఉత్తరువుతో; అర్జునుఁడు= అర్జునుడు; సునిశిత= మిక్కిలి వాడి అయిన; నారాచ= నారసముల (వాడిబాణాల); నితాంతపాతములన్= ఎడతెగని ధారతో (వర్షధారవలె బాణాలను కురిపించటంతో); ఆతనిన్+పిఱుసనన్= అతడు వెనుకకు వెళ్ళేటట్లుగా; చేసి; భీముదైన్యము+పాపెన్= భీముడి దుఃఖాన్ని తొలగించాడు.

తాత్పర్యం: ఆ విధంగా కర్ణుడు మాట్లాడి భీముడిని దీనునిచేయగా, కృష్ణుడి ఉత్తర్వుతో అర్జునుడు ఎడతెగని వాడి బాణాల వానతో ఆతడు వెనుతిరిగిపోయేటట్లు చేసి, భీముడి దుఃఖాన్ని పోగొట్టాడు.

క. మండెడు బలునారసముల। వెండియు నా రజ్జులాని వివ్వచ్చుం డు
ద్దండత నేసిన యెడ నవి। ఖండించెను గురుసుతుండు గర్వం బలరన్. 245

ప్రతిపదార్థం: మండెడు= మండుతూ ఉండే; బలు నారసములన్= పెను బాణాలతో; వెండియున్= మరల; ఆ రజ్జులానిన్= వ్యర్థమైన మాటలు మాట్లాడేవాడిని (పనికిరాని మాటలాడే వాడిని); వివ్వచ్చుండు= అర్జునుడు; ఉద్దండతన్= ఎక్కువగా; ఏసిన ఎడన్= (బాణాలు వేసి) కొట్టగా; గురుసుతుండు= అశ్వత్థామ; గర్వంబు+అలరన్= పొగరు వికసించగా; అవి= ఆ బాణాలను; ఖండించెను= త్రుంచివేశాడు.

తాత్పర్యం: అర్జునుడు మండుతూ ఉండే బలమైన బాణాలతో పనికిమాలిన మాటలు మాట్లాడే కర్ణుడిని మళ్ళీ కొట్టగా వాటి నన్నిటినీ గురుపుత్రు డయిన అశ్వత్థామ గర్వంతో త్రుంచివేశాడు.

వ. అప్పు డశ్వత్థామ యఱువది నాల్గు నారసంబుల నొప్పించిన నన్నరుండు నిలు నిలు మని యదలించినం దెరలి యతండు కరులగమిఁ జొచ్చె; నాలోనన యమ్మారుతి సారథి యగు విశోకుండు తేరాయితంబు సేసి తెచ్చిన నెక్కి యాతండు విన్నని మొగంబుతోడఁ గవ్వడి కడకుఁ జనియె; నప్పుడు సాత్యకియు నద్దిక్కునకు సగర్వగమనంబునం బోయె' ననిన విని వైచిత్రవీర్యుండు సంజయునితో ని ట్లనియె. 246

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయాన; అశ్వత్థామ; అఱువదినాల్గు నారసంబులన్= అరవై నాలుగు వాడిబాణాలతో; నొప్పించినన్= బాధించగా; ఆ+నరుండు= ఆ అర్జునుడు; నిలుము+నిలుము+అని అదలించినన్= ఆగాగుమని అదరించగా; తెరలి= తొలగి; అతండు= అశ్వత్థామ; కరులగమిన్= ఏనుగుల గుంపులో; చొచ్చెన్= దూరాడు; ఆలోనన= అంతలోనే; ఆ+మారుతి సారథి అగు= ఆ భీముడి తేరు తోలేవాడైన; విశోకుండు= విశోకుడనే పేరున్నవాడు; తేరు+ఆయితంబు చేసి= తేరును సిద్ధం చేసి; తెచ్చినన్= తీసికొని రాగా; ఎక్కి; ఆతండు= భీముడు; విన్నని మొగంబు తోడన్= చిన్నబోయిన మొగంతో; కవ్వడికడకున్+చనియెన్= అర్జునుడి ఒద్దకు వెళ్ళాడు; అప్పుడు సాత్యకియున్= ఆ సమయంలో సాత్యకికూడా; ఆ+దిక్కునకున్= ఆ అర్జును డున్న వైపునకు; సగర్వ= గర్వంతో కూడుకొన్న; గమనంబునన్= నడకతో; పోయెన్+అని= పోయాడని; విని; వైచిత్రవీర్యుండు= ధృతరాష్ట్రుడు; సంజయునితోన్= సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అపు డశ్వత్థామ అరవైనాలుగు బాణాలు వేసి నొప్పించాడు. దానికి అర్జునుడు ఆగుమాగుమని అతడిని హెచ్చరించాడు. అతడు తొలగిపోయి ఏనుగుల గుంపులో దూరాడు. ఈలోగా భీముడి సారథి విశోకుడనేవాడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇంకొక తేరును సిద్ధం చేసి తెచ్చాడు. భీము డా తేరెక్కి ఖిన్నుడుగా అర్జునుడి యొద్దకు చేరాడు. ఆ సమయాన సాత్యకి అర్జును డుండే చోటికి సగర్వంగా నడుస్తూ వెళ్ళాడు. అని చెప్పగా విన్న ధృతరాష్ట్రుడు సంజయుడితో ఈ విధంగా అన్నాడు:

క. 'బలియురతోఁ బగ గొనినం । గలుగునె మే లెల్లభంగిఁ గౌంతేయులకుం
గల పా లీఁ దగుఁ దోడ్తోఁ । గలిమియు గీర్తియును బొలియఁగా విన వశమే? 247

ప్రతిపదార్థం: బలియురతోన్= బలవంతులతో; పగ కొనినన్= వైరం తెచ్చుకొంటే; కలుగునె మేలు?= క్షేమం కలుగుతుందా?; ఎల్లభంగిన్= అన్ని విధాలుగా; కౌంతేయులకున్+కలపాలు= పాండవుల కున్న భాగాన్ని; తోడ్తోన్= వెంటనే; ఈన్+తగున్= ఇవ్వటం మంచిది; కలిమియున్= సంపదయును; కీర్తియును= మంచిపేరును; పొలియగాన్= నశించగా; వినన్ వశమే?= వినగలమా?

తాత్పర్యం: బలవంతులతో వైరం వలన క్షేమం కలుగుతుందా? ఏ విధంగా చూచినా పాండవుల పాలు వెంటనే ఇచ్చివేయటం మంచిది. (లేకుంటే) సంపదా, కీర్తి చెడిపోవటాన్ని వినగలమా?

క. విను మడుగులపైఁ బడి యై । నను, నెంగిలి గుడిచి యైన నరులకుఁ బగ బోఁ
గొని యరుల కినుకడఁచి బ్రదు । కనవలయు నిహమ్ముఁ బరముఁ గలుగునె చెడినన్? 248

ప్రతిపదార్థం: వినుము= (ఓ సంజయా!) వినుము; అడుగులపైన్+పడి ఐనను= కాళ్ళమీద పడి అయినా; ఎంగిలి కుడిచి ఐనన్= ఎంగిలి తిని ఐనా; నరులకున్= మానవులకు; పగ= వైరం; పోఁగొని= పోగొట్టుకొని; అరుల కినుక= శత్రువుల కోపాన్ని; అడఁచి= పోగొట్టి; బ్రదుకన వలయున్= బ్రదుకవలయును; చెడినన్= చెడిపోతే (నాశమైతే); ఇహమ్మున్+పరమున్= ఇహపరాలు (అనగా బ్రదికి ఉన్నపుడు కానీ చనిపోయిన తరువాత కానీ సుఖం); కలుగునె?= కలుగుతుందా?

తాత్పర్యం: సంజయా! వినుము. శత్రువుల పాదాల మీద పడిగాని, వాళ్ళ ఎంగిలి తినిగాని, వాళ్ళ కోపాన్నిపోగొట్టి, పగను వదలి బ్రతకటం మానవులకు మంచిది. నాశనమైపోతే ఇహపరాలు (ఇహలోకపరలోక సుఖాలు) ఉంటాయా?

క. తా నెఱుఁగఁ డొరులు సెప్పిన । నైనను విననేరఁ డట్టి యతిబాలిశు నిం
కే నే మందుఁ? గొడుకు దు । ర్మాని గనునె బ్రదుకు పోకరాకలు దెలియన్. 249

ప్రతిపదార్థం: తాను+ఎఱుఁగఁడు= తనకు తెలియదు; ఒరులు= ఇతరులు; చెప్పిన నైనను= చెప్పినప్పటికినీ; విన నేరఁడు= వినటానికి ఇష్టపడడు; అట్టి= అటువంటి; అతిబాలిశున్= పెద్ద మూర్ఖుడిని; ఏమని+అందున్?= ఏ మనగలను?; కొడుకు= కుమారుడు; దుర్మాని= దురభిమానం కలవాడు; బ్రదుకు పోక రాకలు= ప్రాణం పోవటం, రావటం; కనునె?= గుర్తించునా?

తాత్పర్యం: మిక్కిలి మూర్ఖుడయిన నా కొడుకు దురభిమాని. తనకు తెలియదు ఇంకొకరు చెపితే వినడు. బ్రదుకు రాకపోకలు తెలియని ఆ మూర్ఖుడు అయిన కొడుకును నే నే మనగలను?

విశేషం: దుర్యోధనుడి మౌర్ఖ్యం వలన ధృతరాష్ట్రుడు పొందిన ఆరాటానికి ఈ పద్యం ఒక దృష్టాంతం మాత్రమే.

వ. అది యట్లుండె. 250

తాత్పర్యం: దాని నట్లా ఉండనిమ్ము.

ఆ. గురునిఁ గడచి నరుఁడు కురుసేన సొచ్చిన । యపుడ తెగియెఁ గార్య; మదియుఁ గాక
కలసి రట్టి బల్లిదులు భీమసాత్యకు । లకట! సైంధవుండు హతుఁడ కాఁడె! 251

ప్రతిపదార్థం: గురునిన్= ద్రోణుడిని; కడచి= దాటి; నరుఁడు= అర్జునుడు; కురుసేన చొచ్చిన అపుడు+అ= కౌరవసేనలోకి దూసికొని వచ్చినపుడే; కార్యము= పని (మనపని); తెగియెన్= తీరింది; అదియున్+కాక= అంతే కాకుండా; అట్టి బల్లిదులు= నరుని వంటి బలవంతులు; భీమసాత్యకులు= భీముడు సాత్యకికూడా; కలసిరి= చేరుకొన్నారు; అకట!= అయ్యో!; సైంధవుండు హతుఁడు+అ కాడె!= సైంధవుడు చచ్చినట్టే!

తాత్పర్యం: గురువైన ద్రోణాచార్యుడిని అర్జునుడు దాటి, కౌరవసేనలోనికి దూసుకొని వచ్చినపుడే మనపని అయిపోయింది. అతడికి తోడుగా అంతటి బలశాలులు భీముడూ, సాత్యకీ చేరుకొన్నారు. అయ్యో! ఇక సైంధవుడు చచ్చిపోకుండా ఉండగలడా?

వ. సమర విశేషంబు తెఱంగెఱింగింపు' మనిన నమ్మహీపతి కతం డిట్లను 'నట్లు శైనేయుండు గౌంతేయులఁ గూడం బోవ నలంబుసుం డనురాజు బలంబు మెఱయ నతని మార్కొనిన నయ్యిరువురకుఁ బరస్పర బాణభంజనంబును వర్మ విదారణంబును మర్మభేదనంబును ధనుర్దళనంబును భూచర ఖేచర విస్మయ కరంబును నగు సంగరం బయ్యె; నొక్కింత సేపునకు నాశినిపుంగవుండు. 252

ప్రతిపదార్థం: సమర విశేషంబు= యుద్ధవిశేషాల; తెఱంగు= పద్ధతి; ఎఱింగింపుము+అనినన్= తెలుపు మనగా; ఆ+మహీపతికిన్= ఆ ధృతరాష్ట్ర రాజునకు; అతండు= ఆ సంజయుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; అట్లు= ఆ విధంగా; శైనేయుండు= సాత్యకి; కౌంతేయులన్= కుంతి కుమారులను (భీమార్జునులను); కూడన్+పోవన్= చేరబోగా; అలంబుసుండు+అను రాజు= అలంబుసు డనే పేరు గల రాజు; బలంబు మెఱయన్= తనబలం తెలియగా; అతనిన్ మార్కొనినన్= ఆ సాత్యకిని ఎదుర్కొనగా; ఆ+ఇరువురకున్= సాత్యకి, అలంబుసులకు; పరస్పర= ఒకరితో ఒకరి; బాణ భంజనంబును= బాణాలను విరుచుకొనటమును; వర్మవిదారణంబును= కవచాలను చీల్చుకొనటమును; మర్మ భేదనంబును= మర్మస్థలాలను భేదించటం; ధనుర్దళనంబును= విల్లు త్రుంచుకొనటమును; భూచర= భూమిమీద తిరుగువారికి; ఖేచర= ఆకాశంలో తిరిగేవారికి; విస్మయకరంబును= ఆశ్చర్యాన్ని కలిగించేదిగాను; అగు= అయిన; సంగరంబు+అయ్యెన్= యుద్ధమయింది; ఒక్కింత సేపునకున్= కొంతకాలానికి; ఆ శినిపుంగవుండు= ఆ సాత్యకి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు యుద్ధ విశేషాలు వివరించుము'. అనగా సంజయుడు ఆ రాజుతో 'ఆ విధంగా సాత్యకి కుంతి కుమారులను చేరబోయేటప్పటికి అలంబుసు డనే రాజు తన శక్తితో వారి నెదుర్కొన్నాడు. అపుడా ఇద్దరునూ ఒకరి బాణాలను మరొకరు విరిచారు. కవచాలను చీల్చుకొన్నారు. ఆయువు పట్లను నొప్పించుకొన్నారు. విండ్లను విరుచుకొన్నారు. ఆ యుద్ధం భూమ్యాకాశ మార్గాలలో తిరిగేవారికి ఆశ్చర్యాన్ని కల్గించింది. తరువాత కొంత సేపటికి సాత్యకి.

క. తురగములఁ జంపి సారథి। శిరము దునిమి కుండలములఁ జెలువారెడు న
న్నరపతి తల యిలఁ బడ ను। ద్ధుర భంగి వెడంద వాతితూపుల నేసెన్. 253

ప్రతిపదార్థం: తురగములన్+చంపి= గుర్రాలను చంపి; సారథి శిరము తునిమి= సారథి తలను త్రుంచి; కుండలములన్+చెలువారెడు= చెవికున్న కుండలాలతో అందంగా ఉన్న; ఆ+నరపతి తల= ఆ అలంబుసుని తలను; ఇలన్+పడన్= భూమిమీద పడగా; ఉద్దురభంగిన్= భయంకరంగా; వెడంద= విశాలమైన; వాతితూపులన్= ముఖాలు గల బాణాలతో; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: అలంబుసుడి గుర్రాలను చంపి, సారథిని తలతునిమి, చెవి కుండలాలతో అందంగా ఉన్నవాడి తల భూమిమీద పడేటట్లు పెద్దమొనగల బాణాలతో కొట్టాడు.

క. **ఏసి యెలమి నరుగఁగ దు। శ్శాసనుఁడు మొగంబుగా వెసన్ నీ కొడుకుల్**
డాసిన నవ్వీరుఁ డనా। యాసంబున దుస్ససేను హయములఁ జంపెన్. 254

ప్రతిపదార్థం: (సాత్యకి అలంబుసుని తల నేల బడవేశాడు) ఏసి ఎలమి నరుగఁగన్= కొట్టి సంతోషంతో వెళ్ళగా; నీ కొడుకుల్= నీ కుమారులు; దుశ్శాసనుఁడు; మొగంబుగాన్= ముందుగా (అనగా నాయకుడుగా); వెసన్= త్వరగా; డాసినన్= చేరగా (సాత్యకి దగ్గరకు); ఆ+వీరుఁడు= ఆ వీరుడు (సాత్యకి); అనాయాసంబునన్= శ్రమ లేకుండా; దుస్ససేను= దుశ్శాసనుడి; హయములన్= గుఱ్ఱాలను; చంపెన్= చంపాడు.

తాత్పర్యం: సాత్యకి అలంబుసుడి తల నేలబడ వేసి ఆనందంగా వెళ్ళుతుండగా, నీ కొడుకులు దుశ్శాసనుడిని నాయకుడుగా ముందుంచుకొని, వేగంగా సాత్యకిని సమీపించగా, ఆ వీరుడు అనాయాసంగా దుశ్శాసనుడి గుఱ్ఱాలను చంపాడు.

వ. **చంపి, యతని రథంబునకుఁ గవియుడుఁ ద్రిగర్తు లనేకు లడ్డంబు సొచ్చిన నతండు సేయం గలవారిం బంచశత రథికులం బంచత్వంబు నొందించి బలంబుల బడలువడం జేయఁ బెఱవారు విఱిగిన నాసత్యకసుతుండును మెఱసి చన శూరసేన సైనికులు దొడరుటయు, దోర్విలాసంబు నెఱపి పఱపి కళింగులు గవిసినన్ గం డడంచి కడచి గాండీవిం గనుంగొని జలాశయంబు వెలువడి సింధురంబు సుస్థలంబు సేరిన ట్లాశ్వాసించుచున్న నచ్యుతుం డయ్యోధవరు నాలోకించి నరు నుద్దేశించి.** 255

ప్రతిపదార్థం: (సాత్యకి దుశ్శాసనుడి గుఱ్ఱాలను చంపాడు) చంపి అతని రథంబునకున్ కవియుడున్= చంపిన తరువాత దుశ్శాసనుడి తేరుమీదకు పరుగెత్తగా; త్రిగర్తులు= త్రిగర్త దేశస్థులు; అనేకులు= చాలామంది; అడ్డంబు చొచ్చినన్= అడ్డం రాగా; అతండు= ఆ సాత్యకి; చేయన్+కలవారిన్= యుద్ధం చేయగల చేవ ఉన్నవారిని; పంచశతరథికులన్= ఏబదిమంది వీరులను; పంచత్వంబున్+ఒందించి= చంపి; బలంబులన్= సేనలను; బడలువడన్+చేయన్= అలసిపోయేటట్లు చేయగా; పెఱవారు= తక్కిన వారు; విఱిగనన్= చెదరిపోగా; ఆ సత్యకసుతుండును= ఆ సాత్యకి; మెఱసి చనన్= మెరుపు వలె వెలిగి వెళ్ళగా; శూరసేన సైనికులు= శూరసేన దేశపు సేనలు; తొడరుటయున్= ఎదుర్కొనగా; దోర్విలాసంబు నెఱపి= భుజశక్తిని చూపి; పఱపి= వ్యాపింపజేసి; కడచి= దాటి; గాండీవిన్+కనుంగొని= అర్జునుడిని కనుగొని; జలాశయంబున్= కొలనునుండి; వెలువడి= బయటకు వచ్చి; సింధురంబు= మదపుటేనుగు; సుస్థలంబున్= మంచిచోటికి (ప్రమాదం లేనిచోటికి); చేరినట్లు= చేరినట్లుగా; ఆశ్వాసించుచున్న= ఊర్పులు వదలుతూ ఉండగా; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; ఆ+యోధవరున్= ఆ వీరశిఖామణిని; ఆలోకించి= చూచి; నరున్+ఉద్దేశించి= అర్జునుడిని ఉద్దేశించి.

తాత్పర్యం: దుశ్శాసనుడి గుఱ్ఱాలను చంపి, అతడి తేరుమీదకు సాత్యకి పరుగెత్తేటప్పుడు త్రిగర్త సేనలు అడ్డుపడితే వారిలోని వీరులను ఏబదిమందిని హతమార్చి, సేనలు అలసేటట్లు చేయగా, మిగిలినవారు చెదరిపోగా, సాత్యకి మెరుపువలె మెరసి వెళ్ళాడు. అపుడు శూరసేన దేశసైనికులు భుజబలంతో అతడిని ఎదుర్కొనగా సాత్యకి వారిని పారిపోయేటట్లుచేశాడు. కళింగులు క్రమ్ముకొనగా వారి బలాన్ని నాశంచేసి, ముందుకు సాగి అర్జునుని చూచి కొలనునుండి బయటకు వచ్చి ఏనుగు ప్రమాదం లేనిచోటికి చేరిన విధంగా నిట్టూరుస్తూ ఉన్న సాత్యకిని చూచి, కృష్ణు డర్జునుడితో (ఇట్లన్నాడు).

మ. **కృతవర్మాదులఁ జెప్ప నేల? గురు నక్షీణ ప్రభావంబు ము**
న్నితఁ డెబ్బంగి నడంచె నొక్కొ! యొకరుం డి ట్లేపుమై రాకకుం
గత మాధర్మజుపంపు నీ దెస సమగ్ర స్నేహముం జూపెఁ జూ
చితె? నీ శిష్యుని సాత్యకిం బటుభుజాశ్రీ గర్వనిర్వాహకున్. 256

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కృతవర్మ+ఆదులన్+చెప్పన్+ఏల?= కృతవర్మ మొదలైన వారిని గూర్చి చెప్పుట ఎందుకు?; గురు= ద్రోణుడి; అక్షీణప్రభావంబు= తరగని శక్తి; మున్ను= ఇదివరకు; ఇతడు+ఎబ్బంగిన్= ఏ ప్రకారంగా; అడంచెన్+ఒక్కొ!= అణగార్చినాడో!; ఒకరుండు= ఒకడు; ఇట్లు+ఏపుమైన్= ఈ విధంగా గర్వంతో; రాకకున్= వచ్చుటకు; కతము= కారణం; ఆ ధర్మజుపంపు= ధర్మరాజు ఆజ్ఞ; నీ దెస సమగ్ర స్నేహమున్ చూపెన్= నీ దిక్కున నిండైన స్నేహాన్ని చూపాడు; నీ శిష్యుని= నీ శిష్యుడి; పటుభుజాశ్రీ= దృఢమైన భుజ బలం సంపద వలని; గర్వనిర్వాహకున్= దర్పంతో ఉండే వాడిని; చూచితె?= చూచావా?

తాత్పర్యం: నీ శిష్యుడిని భుజబలగర్వ నిర్వహకుడైన సాత్యకిని చూచావా! కృతవర్మాదులనుసరే ముందుగా ద్రోణాచార్యుని తరుగని శక్తిని ఏవిధంగా అణగించాడో! ఒక్కడే గర్వంతో ఇక్కడికి రావటానికి కారణం ఆ ధర్మరాజు ఆజ్ఞే. నీ పట్లనిండైన స్నేహాన్ని చూపాడు.

వ. **మన కింత ప్రియం బగునే!' యనిన నయ్యింద్రనందనుం డిట్లను 'నితని రాక నా కప్రియంబై తోఁచె నెట్లంటేని ధర్మరాజ రక్షణంబున కితనిం జాలించి వచ్చితి; మీ రథికుం డచ్చట లేమి నతం డే మగునో యెఱుంగ; మా భూపతియును భరద్వాజుబారి నున్నవాఁడు సైంధవుండును నేలకు వ్రాలండు; ప్రొద్దునుం బెద్దయు వ్రాలె నది యట్లుండె; బలసారోదారులైన గురు కృతవర్మాదులను ననేక యోధవీరులతోడం బోరి రథ్యసారథి సహితంబుగా నిప్పురుషార్థపరుండు దప్పిం బడి తెప్పిఱంగానని యాలోనన కయ్యంబున డయ్యనివాఁడును సహాయ సంపన్నుండును నగు భూరిశ్రవుం డదె తలపడఁ గడంగెడు నక్కురు సింహుండు శక్తి చాతుర్య శౌర్యధైర్యాస్త్ర వీర్య సమగ్రుండును గావున నిద్ది సాత్యకికి చాల డెప్పరం బైన తెఱంగు వాటిల్లె; బాండవాగ్రజుం డీయన నిక్కడ కేల పుత్తెంచె? గురుం డామిషంబునకు వేచు డేగచందంబునఁ దనకు వేచుట దలంపవలవదే?' యనుచున్న సమయంబున నాసోమదత్త సూనుండు శైనేయున కడ్డంబు వచ్చి నిలు నిలు మని యదల్చి వెండియు.** **257**

ప్రతిపదార్థం: (శ్రీకృష్ణుడు అర్జునుడితో) మనకున్+ఇంత ప్రియంబు అగునే?= మన కింత ఇష్టమయినది జరిగిందికదా? (అనగా ఆ చేసిన పని చాలా ప్రీతికరం); అనినన్= అనగా; ఆ+ఇంద్రనందనుండు= ఆ అర్జునుడు; ఇట్లు+అనున్= ఈ ప్రకారంగా అన్నాడు; ఇతని రాక= ఈ సాత్యకి ఇక్కడకురావటం; నాకు+అప్రియంబై తోఁచెన్= నాకిష్టం కానిదిగా తోస్తున్నది; ఎట్లు+అంటి(వి)+ఏని= ఏమనగా; ధర్మరాజరక్షణంబునకున్= ధర్మరాజును కాపాడేటందుకు; ఇతనిన్+చాలించి వచ్చితిమి= ఇతడిని నిలిపి వచ్చాము; ఈ రథికుండు+అచ్చట లేమిని= ఈ వీరు డక్కడ లేకుండట వలన; అతండు= ఆ ధర్మరాజు; ఏమగునో ఎఱుంగము= ఏమవుతాడో మనకు తెలియదు; ఆ భూపతియును= ఆ రాజుకూడా; భరద్వాజు బారిన్+ఉన్నవాఁడు= ద్రోణాచార్యుడి వలన కలిగే ఉపద్రవంలో ఉన్నాడు; సైంధవుండును నేలకు వ్రాలండు= సైంధవుడు కూడా నేలబడలేదు (చావలేదు); ప్రొద్దునున్+పెద్దయున్ వ్రాలె= సూర్యాస్తమయం కాబోతున్నది; అది అట్లుండెన్= దాని నట్లుండనీ; బలసార= దట్టమయిన బలంతో; ఉదారులు+ఐన= గొప్పవారయిన; గురుకృతవర్మాదులగు ననేకులు= ద్రోణుడు, కృతవర్మ మొదలయినవారు చాలామంది; యోధవీరులతోడన్= యుద్ధవీరులతో; పోరి= యుద్ధం చేసి; రథ్యసారథి సహితంబుగాన్= రథిక సారథులతో; ఇప్పురుషార్థపరుండు= నాలుగు పురుషార్థములను ఆశతో కోరేవాడు; తప్పింపన్+పడి= తప్పించబడి (ప్రమాదం నుండి తప్పించబడి); తెప్పిఱన్+కాని= తప్పించుకొన్నదానిని చూడని; ఆలోనన= అంతలోనే యుద్ధంలో; డయ్యనివాఁడును= అలసిపోనివాడును; సహాయ సంపన్నుండును= సహాయ శక్తి కలాడును; అగు= అయిన; భూరిశ్రవుండు= భూరిశ్రవు డనేవాడు; శక్తి= బలం; చాతుర్య= నేర్పు; శౌర్యధైర్య= వీరుడి ధైర్యంతో; అస్త్రవీర్య సమగ్రుండును= ధైర్యంలో నిండైనవాడును (అనగా శక్తి చాతుర్య శౌర్య ధైర్యాలతో); కావునన్= అయినందున; ఇద్ది= ఈ రావటం; సాత్యకికిన్ చాల డెప్పఱుంబు+ఐన తెఱంగు= సాత్యకికి మిక్కిలి కష్టాన్ని కల్గించే పద్ధతి; పాటిల్లెన్= కలిగింది; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; ఈయనన్= ఈ సాత్యకిని; ఇక్కడ కేల పుత్తెంచె?= ఈ చోటి కెందుకు పంపాడో; గురుండు= ద్రోణుడు; ఆమిషంబునకున్= మాంసపుముద్దకు; వేచు= ఎదురుచూచే; డేగ చందంబునన్= డేగవలె; తనకున్= తనకొర్కై; వేచుట= కాచుకొని ఉండటం; తలంచవలదే?=

తలచుకోవద్దా?; అనుచున్న సమయంబునన్= అనుకొనేవేళలో; ఆ సోమదత్తసూనుండు= ఆ సోమదత్తుడి కొడుకు (భూరిశ్రవుడు); శైనేయునకున్= సాత్యకికి; అడ్డంబు వచ్చి= అడ్డువచ్చి; నిలు నిలుము= ఆగాగుము; అని; అదల్చి= బెదరించి;

తాత్పర్యం: మన కెంత ఆనందంగా ఉన్నది!' అనిన శ్రీకృష్ణుడితో అర్జునుడు 'సాత్యకి ఈ రావటం నా కానందంగా లేదు' అన్నాడు. 'ఎందుకంటే ధర్మరాజును కాపాడేటందుకు ఈ రథికుడిని నిలిపి వచ్చాము. ఇతడు లేకుండటం మూలాన ఆయన ఏమవుతాడో? తెలియదు. ఆయన ద్రోణాచార్యుడి ప్రమాదకర దృష్టిలో ఉన్నాను సైంధవుడా - ఇంకా చావ లేదు. ప్రొద్దు వ్రాలిపోతూ ఉన్నది. అది అట్లా ఉండగా - మహాబలవంతుడైన ద్రోణ, కృతవర్మాదు లనేకులతో పోట్లాడి ఈ పురుషార్థపరుడు గుర్రాలతో సారథితో అలసి, దాహానికి లోనయ్యాడు.తరుకొనేలోగానే అంతదాక యుద్ధంలో అలుపెరుగనివాడు, సహాయం కలవాడు అయిన భూరిశ్రవుడు అదిగో యుద్ధానికి సిద్ధమయి వస్తున్నాడు. ఆ కురుసింహుడు బలమూ, నేర్పూ, వీరత్వం, ధైర్యం కల అస్త్రబలంతో ఉండేవాడు. అందువలన అతని రాక సాత్యకికి చాలా కష్టం కలిగిస్తుంది. ధర్మరాజు ఇపు డీయన నెందు కిక్కడకు పంపాడో? ఆచార్యుడు మాంసానికై ఎదురుచూచే డేగ మాదిరిగా తనకై కాచుకోవటం ఆయన తలచుకోవద్దా?' అని అంటూ ఉన్న సమయంలో ఆ సోమదత్త కుమారుడు సాత్యకికి అడ్డం వచ్చి నిలు నిలుమని అదలించి.

విశేషం: అలం: ఉపమ.

భూరిశ్రవుండు సాత్యకితో యుద్ధంబు సేసి మడియుట (సం.7-117-1)

సీ. **'తేఁకువ లేక పుత్తెంచిన యప్పాండ । వజ్యేష్ఠునకుఁ దలవంపుఁ గాఁగ**
వచ్చుచో మార్కొని చచ్చినవారల । బంధులోకమునకుఁ బ్రమదఁ మెసఁగ
నంతంతఁ జనుదేరఁ నాదటఁ గనుఁగొను । శౌరికిఁ బ్రాణంబు జల్లనంగఁ
బెనఁగించి గెలిపింతు నని యాస సేయు కి । రీటికి నాలావు దేటపడఁగ

తే. **నాయుధంబులఁ దునిమి రథ్యములఁ గూల్చి । సూతుఁ దెగటార్చి తనువున శోణితంబు**
వఱపి పఱుపుదు నిలిచిన నుఱకపట్టి । వ్రచ్చి పడవైతు నెందుఁ బోవచ్చు నీకు?' **258**

ప్రతిపదార్థం: తేఁకువ లేక పుత్తెంచిన= ధైర్యంలేక పంపిన; ఆ+పాండవజ్యేష్ఠునకున్= ఆ పాండురాజు కొడుకులలో పెద్దవాడికి (ధర్మరాజుకు); తలవంపుకాఁగన్= అవమానం కలిగేవిధంగా; వచ్చుచోన్= అక్కడనుండి వచ్చేటప్పుడు; చచ్చిన వారలన్= చనిపోయిన వారిని; బంధులోకమునకున్= బంధువుల సమూహానికి; ప్రమదము+ఎసఁగన్= సంతోషం కలగగా; అంతంతన్+చనుదేరన్= నెమ్మదిగా రాగా; ఆదటన్+కనుఁగొను శౌరికిన్= ప్రేమతో చూచే కృష్ణుడికి; ప్రాణంబు జల్లు+అనంగన్= ప్రాణం చెదరగా; పెనఁగించి= పోట్లాడించి; గెలిపింతును+అని= గెలిపిస్తానని; ఆసచేయు= ఆశపడే; కిరీటికిన్= అర్జునుడికి; నా లావు= నాబలం; తేటపడఁగన్= బాగా తెలియగా; ఆయుధంబులన్+తునిమి= ఆయుధాలను త్రుంచి; రథ్యములన్+కూల్చి= గుర్రాలను చంపి; సూతున్+తెగటార్చి= సారథిని చంపి; తనువునన్= ఒంట్లో; శోణితంబు వఱపి= నెత్తురు వ్యాపింపజేసి; పఱుపుదున్= పరుగెత్తిస్తాను; నిలిచినన్= ఒకవేళ ఎదిరించి నిలిచినట్లయితే; ఉఱక పట్టి= ఊరకే పట్టుకొని (సునాయాసంగా పట్టుకొని); వ్రచ్చి= చీల్చి; పడవైతున్= పడవేస్తాను; ఎందున్+పోవచ్చు నీకున్?= నీకు ఎక్కడకు పోవటానికి సాధ్యం?' (అని భూరిశ్రవుడు సాత్యకితో అన్నాడు).

తాత్పర్యం: 'ధైర్యంలేక నిన్ను పంపిన ధర్మరాజుకు కవమానం కలిగేటట్లు, వచ్చేటప్పుడు నిన్ను దారిలో ఎదుర్కొని, చచ్చినవారి బంధువులకు ఆనందం కలిగేటట్లు, నెమ్మది నెమ్మదిగా రావటం గమనించి ప్రేమతో చూచే కృష్ణుడికి గుండె గతుక్కుమనేటట్లు, యుద్ధం చేసి గెలిపిస్తానని ఆశపడే కిరీటికి నా బలం తెలిసేటట్లు

- ఆయుధాలను ముక్కలు చేసి, గుర్రాలను చంపి, ఒంటి నిండా నెత్తురు వ్యాపింపజేసి నిన్ను పారిపోయేటట్లు చేస్తాను; ఒకవేళ నీవు నిలిస్తే ఊరకే పట్టుకొని సునాయాసంగా చీల్చిపారవేస్తాను. నీ వింక ఎక్కడికిపోగలవు?'

క. అనిన విని నవ్వి 'నాతోఁ । నని సేఁతకుఁ దెంపు సేసి యడరెడు రథికుం
గనుట యది నాకుఁ బండువు; । వినవే మీ కెల్ల వేరువి త్తని నన్నున్?' 259

ప్రతిపదార్థం: అనినన్= అనగా (భూరిశ్రవు డావిధంగా అనగా); విని నవ్వి= విని నవ్వినవాడై; నాతోన్= నాతో (సాత్యకితో); అని చేఁతకున్= యుద్ధం చేయటానికి; తెంపుచేసి= సాహసించి; అడరెడు= త్రుళ్ళిపడే; రథికున్+కనుట= వీరుడిని చూడటం; అది= ఆ చూడటం; నాకున్+పండువు= నాకు పండుగ; నన్నున్= నన్నుగూర్చి (సాత్యకినిగూర్చి); మీకు+ఎల్లన్= మీ అందరికీ (కౌరవపక్షం వారికి); వేరువిత్తు+అని= నాశకుడ నని; వినవే?= వినలేదా?

తాత్పర్యం: అని భూరిశ్రవుడు అనగా, సాత్యకి నవ్వి 'నాతో యుద్ధం చేయటానికి సాహసంతో త్రుళ్ళిపడే వీరుడిని చూడటం నాకు పండుగ. మీ అందరికీ నేను నాశకుడనని వినలేదా?'

వ. అని పలికి సాత్యకి మఱియును. 260

తాత్పర్యం: అని మాట్లాడి సాత్యకి ఇంకనూ (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'ఎదుర నుండ వెఱచి మద మఱి దవ్వుగా । వచ్చి యొదిఁగి తేల? పెచ్చు వెఱిఁగి
ప్రేలె; దిపుడ పట్టి నాలుక గోసెద; । మాను మాను రిత్తమాట లేల?' 261

ప్రతిపదార్థం: ఎదురన్+ఉండన్ వెఱచి= ఎదురుగా నిలవటానికి భయపడి; మదము+అఱి= దర్పం నశించి; దవ్వుగాన్ వచ్చి= దూరంగా వచ్చి; ఒదిఁగితి(వి)+ఏల?= ఒదిగిపోయా వెందుకు? (భయంతో గునిసినట్లు); ఏలపెచ్చుపెఱిగి ప్రేలెదు?= ఎందుకు ఊరకే పెచ్చుపెరిగి ప్రేలుతున్నావు? (వదరుతున్నావు?); ఇపుడ పట్టి= ని న్నిపుడే పట్టుకొని; నాలుక కోసెదన్= నాలుకను కోసివేస్తాను; మాను మాను= మానుకో మానుకో; రిత్తమాటలు+ఏల?= ఒట్టి మాట లెందుకు? (వ్యర్థమైన ప్రేలు డెందుకు?)

తాత్పర్యం: '(ఓ భూరిశ్రవా!) ఎదురుగా నిలువటానికి భయపడి, దర్పాన్ని కోల్పోయి దూరంగా వచ్చి ముడుచుకు పోతున్నావెందుకు? ఊరకే పేట్రేగి ప్రేలుతున్నావు. ని న్నిపుడే పట్టుకొని నాలుక కోసివేస్తాను. పనికిరాని మాట లెందుకు? వెంటనే మానుకొమ్ము.

వ. అనియె న ట్లియ్యిరువురు నొండొరులఁ బరుసంబులు పలుకుచుఁ దలపడి పలుదెఱంగుల మెఱంగుటమ్ము లొండొరులపై నిగిడించుచు నొకళ్ళొకళ్ళ మార్గణంబులు మగిడించుచు వర్మంబులు వ్రయ్య నేయుచుఁ దనువులు నెత్తుట జొత్తిల్లం జేయుచుఁ దమ్ము సేన లేనికపోరు సూచునట్లు సూడం బోరి పోరి పరస్పర తురంగ విదారణంబును మిథస్సూత మారణంబును నన్యోన్యధ్వజపాతనంబును నితరేతరధనుశ్ఛేదనంబును జేసి యాసునం గరవాలంబులుఁ బలకలుం గొని పాదచారు లై చేరి వివిధ చిత్రగతులం బెనంగి పాసి యించుకసేపు దప్పిక తీర్చికొని క్రమ్మఱఁ గదిసి పలకలు పఱియలు గావించి యలుఁగుల నొడ్డనంబుల నంగవంచనంబులను వ్రేటుపోటుల సవదరింపకుండం గాచికొను నోజ మెఱయుచుండి విన్నాణంబుతగులున మేనులు బెరసిన మల్లయుద్ధప్రకారం బగు పెనంకువకుఁ జొచ్చి; రప్పుడా భూరిశ్రవుండు మేలుచే యయి పోరుట గనుంగొని కృష్ణుండు జిష్ణున కి ట్లనియె. 262

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అట్లు= ఆ విధంగా; ఆ+ఇరువురున్= ఆ భూరిశ్రవ స్సాత్యకులు; ఒండొరులన్= ఒకరి నొకరు; పరుసంబులు పలుకుచున్= దురుసుమాటలు మాటాడుతూ; తలపడి= ఎదుర్కొని; పలు తెఱంగులన్= అనేక విధాలుగా; మెఱుంగు+అమ్ములు= మండే బాణాలను; ఒండొరులపైన్ నిగిడించుచున్= ఒకరిమీద ఒకరు వేస్తూ; ఒకళ్ళొకళ్ళ మార్గణంబులు= ఒకరు ఇంకొకరి అమ్ములను; మగిడించుచున్= వెనుకకు త్రిప్పుతూ; వర్మంబులు= కవచాలు; వ్రయ్యలు చేయుచున్= చీల్చుతూ; తనువులు= శరీరాలు; నెత్తుట జొత్తిల్లన్+జేయుచున్= నెత్తురులో మునుగజేస్తూ; తమ్మున్= తమ ఇరువురినీ; సేనలు= సైనికులు; ఏనికపోరు= ఏనుగులతో పోట్లాట; చూచునట్లు= చూచేవిధంగా; చూడన్= చూడగా; పోరి, పోరి= పోట్లాడి పోట్లాడి; పరస్పర తురంగ విదారణంబును= ఒకరొకరి గుర్రాలను చంపటం; మిథస్సూత మార్గణంబును= ఒకళ్ళొకళ్ళ సారథులను చంపటం; అన్యోన్య ధ్వజపాతనంబును= ఒకరు ఇంకొకరి కేతనాలను పడగొట్టటం; ఇతర+ఇతర ధనుః+ఛేదనంబును= ఒకరు మరియొకరి విండ్లను త్రుంచివేయటం; చేసి= చేసి; ఈసునన్+కరవాలంబులు= అసూయతో కత్తులు; పలకలున్+కొని= డాళ్ళు తీసికొని; పాదచారులు+ఐ చేరి= నడచి దగ్గరకు వెళ్ళి; వివిధ చిత్రగతులన్+పెనంగి= అనేక విధాలగు గతులతో పోట్లాడి; పాసి= ప్రక్కకు తొలగి; ఇంచుకసేపు= కొంతకాలం; దప్పిక దీర్చుకొని= ఆయాసం వలన కలిగిన దాహాన్ని పోగొట్టుకొని; క్రమ్మఱన్+కదిసి= మరల ఎదుర్కొని; పలకలు పఱియలు కావించి= డాళ్ళను ముక్కలు చేసి; అలుఁగులన్+ఒడ్డనంబులన్= కత్తుల వ్యూహాలతో; అంగవంచనంబులును= ఒకరి నొకరు మోసగించటం; వ్రేటుపోటులన్= దెబ్బల తాకిడిని; సవదరింపకుండన్= తాల్చకుండా; కాచికొను ఓజన్= కాపాడుకొనే నేర్పు; మెఱయుచుండి= ప్రకాశిస్తూ ఉండి; విన్నాణంబు తగులునన్= నేర్పుతో; మేనులు బెరసిన= ఒడళ్ళు దాచుకోగా; మల్లయుద్ధ ప్రకారంబు+అగు= ముష్టియుద్ధ విధానంతో; పెనంకువకున్= యుద్ధానికి; చొచ్చిరి= మొదలు పెట్టారు; అప్పుడు= ఆ సమయాన; ఆ భూరిశ్రవుండు= ఆ భూరిశ్రవుడు; మేలు చేయి అయి= పై చేయి అయి; పోరుట= యుద్ధం చేయటం; కనుంగొని= గుర్తించి; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; జిష్ణునకున్= అర్జునుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా భూరిశ్రవుడూ సాత్యకీ ఒకరి నొకరు తీవ్రంగా దూషించుకొంటూ ఢీకొని, అనేక విధాలుగా మెరిసే బాణాలను వేసుకొంటూ, ఒకరు వేసిన బాణాలను ఇంకొకరు త్రిప్పికొట్టుతూ, కవచాలను చీలుస్తూ, శరీరాలు నెత్తుట మునిగేటట్లుగా చేస్తూ, సైనికులు తమ ఇద్దరినీ ఏనుగుల పోట్లాట చూచినట్లు చూడగా పోట్లాడి పోట్లాడి, ఒకరి గుర్రాలను వేరొకరు చంపుతూ, ఒకరి సారథిని మరొకరు హతమారుస్తూ, ఒకరి కేతనాన్ని మరొకరు పడగొట్టుతూ ఒకరి అమ్ములను మరొకరు విరుస్తూ, అసూయతో కత్తీ డాలూ తీసుకొని, పాదచారులుగా అనేక రకాలుగా పోట్లాడారు. కొంత దూరానికి వెళ్ళి దాహాన్ని తీర్చుకొని మళ్ళీ చేరి, డాళ్ళను తునకలు చేసి కత్తులను త్రిప్పుతూ ఉపాయంగా శరీరాలు తప్పించుకొంటూ, వ్రేటుపోటుల తాకిడి తగులకుండా బలం మెరయగా నేర్పుతో ఒళ్ళు రాచుకోగా మల్లయుద్ధంలో పెనగులాటకు పూనుకొన్నారు. ఆ సమయంలో భూరిశ్రవుడు పై చేయిగా యుద్ధం చేయటం చూచిన శ్రీకృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు:

చ. **పెనుమొనతోడ మున్ పెనఁగి పెద్దయు డయ్యుటఁ జేసి సోమద**
త్తునిసుతుచేతఁ జిక్కి కడుదుర్దశఁ బొందె శినిప్రవీరుఁ డీ
తనిఁ దగుఁ గావ నీకయి కదా యిట రాక! మృగేంద్రు బారిఁ జొ
చ్చిన కరివోలె నయ్యెః వెసఁ జేకొని కావుము పాండవోత్తమా! **263**

ప్రతిపదార్థం: పాండవోత్తమా!= పాండవశ్రేష్ఠ అర్జునా!; శినిప్రవీరుఁడు= సాత్యకి; పెను మొనతోడన్= పెద్దసేనతో; మున్ పెనఁగి= ముందు పోట్లాడి; పెద్దయున్= మిక్కిలి; డయ్యుటన్+చేసి= అలసిపోయినందున; సోమదత్తుని సుతుచేతన్+చిక్కి= భూరిశ్రవుడికి; దొరికి; కడు దుర్దశన్+పొందెన్= మిక్కిలి దీనావస్థను చెందాడు; ఈతనిన్= ఇతడిని; కావన్+తగున్= కాపాడదగి ఉన్నది; ఇటు రాక= ఈ దిక్కుకు రావటం; నీకయికదా!= నీ కొరకు కదా!; మృగేంద్రుబారిన్= సింహానికి; చొచ్చిన= ప్రవేశించిన; కరివోలెన్+అయ్యెన్= ఏనుగు మాదిరిగా అయింది; వెసన్= త్వరగా; చేకొని= కైకొని; కావుము= కాపాడుము. (సాత్యకిని కాపాడుము).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఓ పాండవోత్తమా! ఇదివరకే పెద్ద సేనతో పోట్లాడి మిక్కిలి అలసిపోయినందున (సాత్యకి) సోమదత్తుడి కొడుకయిన భూరిశ్రవుడి చేతికి చిక్కి, చాలా దీనమయిన స్థితిలో ఉన్నాడు. శినివంశంలో శ్రేష్ఠుడయిన ఇతడిని కాపాడవలసి ఉన్నది. నీ కొరకే వచ్చి సింహం బారిన పడ్డ ఏనుగు మాదిరి అయినాడు, త్వరగా ఆ సాత్యకిని కాపాడుము.' (అని శ్రీకృష్ణుడు అర్జునుడిని కోరాడు).

విశేషం: అలంకారం ఉపమ.

క. **అనునెడ భూరిశ్రవసుం । డనూనబల మొప్ప దానవాంతకు ననుజ**
న్మునిఁ బట్టి పుడమిపై వై । చినఁ గ్రిందై యోపినంత సేయుచునుండెన్. **264**

ప్రతిపదార్థం: అను+ఎడన్= శ్రీకృష్ణు డట్లా అనేటప్పటికి; భూరిశ్రవసుండు= భూరిశ్రవసుడు; అనూన బలము+ఒప్పన్= మిక్కిలి బలం అమరగా; దానవ+అంతకు అనుజన్మునిన్= శ్రీకృష్ణుడి తోబుట్టును (సాత్యకిని); పట్టి= పట్టుకొని; పుడమిపైన్‌వైచినన్= భూమిమీద వేయగా; క్రిందై= తాను క్రింద ఉండి (తగ్గిపోయి); ఓపిన అంత= శక్తి కొలది; చేయుచు+ఉండెన్= పోట్లాడుతూ ఉన్నాడు.

తాత్పర్యం: అని శ్రీకృష్ణు డర్జునుడితో సాత్యకిని కాపాడవలసి ఉన్నదని అంటూ ఉండగానే సాటిలేని బలంతో భూరిశ్రవసుడు శ్రీకృష్ణుడి తోబుట్టువైన సాత్యకిని పట్టుకొని భూమిమీద వేయగా, క్రిందయిన సాత్యకి తన యోపినకొలది శక్తివంచన లేక పోట్లాడుతూ ఉన్నాడు.

వ. **అమ్మురహరుండు మఱియుం దఱిమి ధనంజయుతో 'నీకుం దోడ్పడ వచ్చి నీ శిష్యుండొరులచేత దురవస్థం బొంద నూరకునికి యుచితంబగునే?' యనిన నతం డిట్లనియె.** **265**

ప్రతిపదార్థం: ఆ+మురహరుండు= ఆ మురుని చంపినవాడు (శ్రీకృష్ణుడు); మఱియున్= ఇంకను; తఱిమి= తొందరపెట్టి; ధనంజయుతోన్= అర్జునుడితో; నీకున్+తోడ్పడవచ్చి= నీకు సహాయంగా వచ్చి; నీ శిష్యుండు= నీ శిష్యుడు; ఒరులచేతన్= ఇంకొకరిచేత; దురవస్థంబు+ఒందన్= కష్టపడుతుండగా; ఊరకునికి= ఊరకుండటం; ఉచితంబు+అగునే?= న్యాయమా?; అనినన్+అతండు+ఇట్లు+అనియెన్= అనగా అర్జునుడు శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఆ శ్రీకృష్ణు డర్జునుడిని ఇంకా తొందరపెట్టె 'నీకు సహాయంగా వచ్చిన నీ శిష్యుడు ఇతరులచేత కష్టపడుతూ ఉండగా ఊరకొనుట న్యాయమా?' అని అనగా అతనితో అర్జును డిట్లా అన్నాడు.

తే. **ఒండు దెసఁ జక్కఁ జూడరాకుండునట్లు । గాఁగ రథములు పయి పయిఁ గ్రమ్మె వార**
లెక్క టెక్కటి పోరెద రిపుడు నాకు । నేయఁగాఁ దగ; దీరెండు నిటుల నుండ. **266**

ప్రతిపదార్థం: ఒండు దెసన్= ఇంకొక దిక్కు; చక్కన్+చూడన్= బాగా చూడటానికి; రాక+ఉండునట్లు= సాధ్యం కానట్లుగా; కాఁగన్= కాగా; రథములు= తేరులు; పయిపయిన్ క్రమ్మెన్= మీద మీద చుట్టుకొన్నాయి; వారలు= ఆ సాత్యకి భూరిశ్రవులు; ఎక్కటెక్కటి పోరెదరు= ఒక్కొక్కరే యుద్ధం చేస్తున్నారు; ఇపుడు నాకున్= ఈ సమయంలో; ఈ రెండు= ఈ తేరులు క్రమ్ముకొని ఉండగాను; వీరెక్కటి యుద్ధం చేస్తుండగాను; ఇటులు+ఉండన్= ఈ విధంగా ఉండగా; ఏయఁగాన్ తగదు= కొట్టటం సరికాదు. (న్యాయం కాదు)

తాత్పర్యం: 'ఇంకొక దిక్కుకు చక్కగా చూడ సాధ్యం కానట్లుగా తేరులు మీద మీద క్రమ్ముకొన్నాయి. అంతేకాదు వాళ్ళిద్దరూ (సాత్యకి భూరిశ్రవసులు) ఎక్కటి యుద్ధం చేస్తున్నారు. ఈ సమయంలో నేను బాణంతో కొట్టటం న్యాయం కాదు. ఈ రెండూ ఇట్లా ఉన్నా'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఆనాటి యుద్ధాలలో ఎక్కటి యుద్ధంలో వీరులుండగా మరొక్కరు దూరి అందులో ఒకనిని కొట్టటం యుద్ధనీతి కాదు.

వ. నెచ్చెలి చావునుం జూడం జాల; నీ రథికులను వారించెద; నయ్యోధవరునిం గాచెద' ననియె; నప్పుడు సాత్యకి చాల డస్సిన సౌమదత్తి యతిక్రమించి యెగసి పడవైచి వాని వలచేయు నురంబును నిరుగాలం ద్రొక్కి యెక్కుడు మదంబున మణికంకణ కిరణ స్ఫురణ సుందరంబగు కరంబు మెఱయం గృపాణం బెత్తి గళంబు దునియ వేయువాఁడై పూఁచిన నా భుజం బింద్రధ్వజంబునుం బోలెఁ బొలిచి నీ సైనికుల చూడ్కులకు వేడ్కలు సేయ వాసుదేవుండు వేగిరపడి యేయు మేయు మని పలికిన బార్థుం డక్కౌరవోత్తముం జిత్తంబున నగ్గించుచు వెడందవాతియమ్ము గ్రక్కునం దొడిగి గాఢాకర్షణంబును దీవ్రతేజంబును రయంబునుం బరఁగంజేసి యేసినం దునిసిపడి యబ్బాహువు మహాభుజంగంబు చందంబున శోభిల్లె; నిచ్చటి సేననెల్ల దురపిల్లె నా భూరిశ్రవుండు దన్ను నఫలితప్రయత్నునిం జేసినవాఁడు గాండీవి యగు టెఱింగి యాఱని కోపంబున గర్హించు మనంబుతో నతని దిక్కు సూచి తగునెలుంగున ని ట్లనియె. 267

ప్రతిపదార్థం: నెచ్చెలి చావును చూడన్+చాలన్= మిత్రుడి చావును చూడలేను; ఈ రథికులను= ఈ రథ వీరులను; వారించెదన్= అడ్డగిస్తాను; ఆ+యోధవరునిన్+కాచెదన్= ఆ వీరశ్రేష్ఠుడిని కాపాడుతాను; అనియెన్= అన్నాడు; అప్పుడు= ఆ సమయాన; సాత్యకి చాల డస్సినన్= సాత్యకి చాలా అలసిపోగా; సౌమదత్తి= భూరిశ్రవసుడు; అతిక్రమించి ఎగసి= మీరి, పై కెగసి; పడవైచి= క్రిందకు త్రోసి; వాని వలచేయున్= సాత్యకి కుడిచేతిని; ఉరంబును= ఎదను (గుండెను); ఇరుగాలన్+త్రొక్కి= తన రెండు కాళ్ళతో త్రొక్కి; ఎక్కుడు మదంబునన్= మిక్కిలి గర్వంతో; మణికంకణ కిరణ స్ఫురణసుందరంబు+అగు= మణులు పొదిగిన కడియాల కాంతి తళ తళలాడే అందమయిన; కరంబు= చేయి; మెఱయన్= ప్రకాశించగా; కృపాణంబు+ఎత్తి= కత్తి ఎత్తి; గళంబు తునియ వేయువాఁడు+ఐ= (సాత్యకి) కంఠం తునిగేటట్లు వేసేవాడుగా; పూఁచినన్= పూనగా; ఆ భుజంబు= ఆ భూరిశ్రవుడి చేయి; ఇంద్రధ్వజంబునున్+పోలెన్ పొలిచి= ఇంద్రుడి టెక్కెం మాదిరిగా ఒప్పి; నీ సైనికుల చూడ్కులకున్= నీ సేన చూపులకు; వేడ్కలు+చేయన్= సంతోషాన్ని కల్గించగా; వాసుదేవుండు= కృష్ణుడు; వేగిరపడి ఏయుము+ఏయుము+అని పలికినన్= తొందరపడి కొట్టు కొట్టు అని చెప్పగా; పార్థుండు= అర్జునుడు; ఆకౌరవ+ఉత్తమున్= ఆ కౌరవశ్రేష్ఠుడిని; చిత్తమునన్+అగ్గించుచున్= మనస్సులో పొగడుతూ; వెడందవాతి అమ్ము= విశాలమైన వాడి అయిన బాణాన్ని; గ్రక్కునన్+తొడగి= వెంటనే సంధించి; గాఢ+ఆకర్షణంబును= దట్టంగా లాగగల శక్తికలదియు; తీవ్రతేజంబును= మిక్కిలి శక్తికలదియు; రయంబును= వేగమును; పరగన్+చేసి= ప్రవర్తిల్లగా (వ్యాపించగా) చేసి; ఏసినన్= కొట్టగా; తునిసిపడి= తెగిపడి; ఆ+బాహువు= ఆ చేయి (కత్తి నెత్తిన భూరిశ్రవసుని చేయి); మహాభుజంగంబు చందంబునన్= పెనుబాము మాదిరిగా; శోభిల్లెన్= ప్రకాశించింది; ఇచ్చటి సేనలు+ఎల్లన్= ఇక్కడి సైన్యమంతా; దురపిల్లెన్= దుఃఖపడింది; ఆ భూరిశ్రవుండు; తన్ను= తనను; అఫలిత ప్రయత్నున్ చేసినవాఁడు= సిద్ధించని ప్రయత్నమున్నవాడినిగా చేసినవాడు; గాండీవి= అర్జునుడు; అగుట+ఎఱింగి= కావటం తెలిసికొని; ఆఱని కోపంబునన్= చల్లారని కోపంతో; గర్హించు= అసహ్యించే; మనంబుతోన్= మనస్సుతో; అతని దిక్కు చూచి= అతడి ప్రక్కచూచి; తగు ఎలుంగునన్= తగిన గొంతుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'మిత్రుడి చావు చూడలేను. ఆ వీరులను అడ్డుకొంటాను ఈ వీరుడిని కాపాడుతాను' అని అన్నాడు. ఆ సమయంలో చాలా అలసిన సాత్యకిని భూరిశ్రవుడు మిగిలి, పైకెత్తి క్రింద పడవేసి తన రెండు కాళ్ళతో అతడి గుండెను, కుడిచేతిని త్రొక్కిపట్టి, గర్వంతో చేతికంకణాలలోని మణులు కాంతి తళతళలాడే అందమయిన చేతితో, మెరిసే కత్తి నెత్తి, సాత్యకి కంఠాన్ని నరికి వేయటానికి పూనుకొన్నాడు. ఆ భూరిశ్రవుడి చేయి, చూచేవారికి ఇంద్రధ్వజంవలె ఒప్పింది. అపుడు నీ సేనలకు సంతోషం కలిగింది. దానిని చూచి కృష్ణుడు వేగంగా వేయుమని అర్జునుని త్వరపెట్టాడు. అపుడు అర్జును డా కౌరవశ్రేష్ఠుడిని మనసులో మెచ్చుకొని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశాలమూ వాడికలదీ అయిన బాణాన్ని వెంటనే వింట సంధించి, బాగా లాగి - మిక్కిలి వేగం, వాడి వెలుగూ వ్యాపించగా కొట్టాడు. కత్తి నెత్తిన భూరిశ్రవుడి చేయి తెగిపోయి, పెనుబాము మాదిరిగా ప్రకాశించింది. నీ సేనలు దుఃఖించాయి. తన ప్రయత్నాన్ని సిద్ధించకుండా చేసినవాడు అర్జునుడని తెలిసికొని, ఆరని కోపంతో, అసహ్యించుకొనే మనసుతో ఆ దిక్కు చూచి తగిన గొంతుతో భూరిశ్రవు డీ విధంగా అన్నాడు:

ఉ. 'నీ దెసఁ జూడ నొండొకరినిం దగ మార్కొని పోరుచుండఁ బెం
పేది వినీచకర్మమున కియ్యకొనం దగునే? భవాదృశుం
డీదురుపాయ మగ్గురుఁడొ యింద్రుఁడొ రుద్రుడొ నీకుఁ జెప్పె దా
మోదరుఁ డింతపాపమున కోర్వఁగఁ జేయునె నిన్ను నర్జునా!' 268

ప్రతిపదార్థం: అర్జునా!= ఓ అర్జునా!; నీదెసన్+చూడన్= నీ దిక్కుగా నేను చూడలేదు; ఒండు+ఒకరినిన్+తగ మార్కొని= మరొక్కడిని తగినట్లు ఎదుర్కొని; పోరుచుండన్= యుద్ధం చేస్తూ ఉండగా; పెంపు+ఏది= పెద్దరికం నశించి; వినీచకర్మమునకున్= మిక్కిలి నీచమయిన పనికి; భవాదృశుండు= నీవంటివాడు; ఇయ్యకొనన్+తగునే?= అంగీకరించవచ్చునా?; ఈ దురుపాయము= ఈ మోసపు ఉపాయం; ఆ+గురుఁడొ= ఆ గురువగు ద్రోణాచార్యుడా?; ఇంద్రుఁడొ= ఇంద్రుడా!; రుద్రుఁడొ!= పాశుపతాస్త్రాన్ని నీకు ఒసగిన ఈశ్వరుడా?; నీకున్+చెప్పెన్?= నీకు చెప్పాడు?; దామోదరుఁడు= శ్రీకృష్ణుడు; నిన్నున్= నిన్ను; ఇంత పాపమునకున్= ఇటువంటి పాపపు పనికి; ఓర్వఁగన్+చేయునె?= సహింపజేస్తాడా?

తాత్పర్యం: 'ఓ అర్జునా! నేను నీ దిక్కు చూడలేదు. ఇంకొకరితో ఎదుర్కొని పోరాడుతూ ఉండగా మర్యాద లేక ఇట్టి నీచమయిన పనికి పూనుకొంటావా? ఈ నీచోపాయాన్ని నీకు అస్త్రవిద్యాగురువైన ద్రోణుడా, నీ పుట్టుకకు ఆధారమైన ఇంద్రుడా, నీకు పాశుపతాస్త్రాన్ని ఇచ్చిన రుద్రుడా ఎవరు చెప్పారయ్యా! దామోదరు డింత పాపాని కొడికట్టేటట్లు చేస్తాడా?'

విశేషం: అస్త్రవిద్యలో ధర్మతత్త్వాన్ని బోధించిన ద్రోణుడి శిష్యుడవు, దేవరాజయిన ఇంద్రుడి వరాన పుట్టిన వాడవు, పరమేశ్వరుడి దయావిశేషంతో (మహాతపశ్శక్తితో) పాశుపతాస్త్రాన్ని సాధించిన నీవు శ్రీకృష్ణుడి ప్రేరణతో ఇట్టి నీచమయిన పనిచేస్తావా?' ఇదేమి న్యాయమని భూరిశ్రవుడు అర్జునుడిని ప్రశ్నించాడు.

వ. అనిన విని అబ్బాహ్లికపౌత్రు నాలోకించి. 269

తాత్పర్యం: అనగా విని ఆ బాహ్లికుడి మనుమడిని చూచి.

చ. 'నృపతులు సొచ్చి పోరునెడ నెయ్యురు బంధులుఁ దోడుపాటు నీ
చపుఁ బనియే? నినుం బగఱు సంపఁగఁ గావఁగ లేని మీ బలా
ధిపతుల దూఱు సాత్యకి యతిశ్రమ మొందిన చోటఁ దాఁకి క
ష్టపఱిచి చంపె దీ; వతఁడు సచ్చునె యూఱడి యేను గల్గఁగన్? 270

ప్రతిపదార్థం: నృపతులు= రాజులు; చొచ్చి= ప్రవేశించి; పోరు ఎడన్= యుద్ధం చేసేటప్పుడు; నెయ్యురు= మిత్రులు; బంధులు= బంధువులు; తోడుపాటు= తోడ్పడటం (సాయపడటం); నీచము+పనియే?= నీచ మయిన పనియా?; నినున్= నిన్ను; పగఱు= పగవాండ్రు (శత్రువులు); చంపఁగన్= చంపివేయగా; కావఁగన్ లేని= కాపాడలేని; మీ బల+అధిపతులన్= మీ సేనా నాయకులను; దూఱు(ము)= తిట్టుము; సాత్యకి అతిశ్రమము+అందినచోటన్+తాఁకి= సాత్యకి మిక్కిలి అలసిన సమయాన ఎదుర్కొని; కష్టపఱిచి= బాధపెట్టి; ఈవు చంపెద(వు)= నీవు చంపబోతున్నావు; అతఁడు= ఆ సాత్యకి; చచ్చునె?= చనిపోతాడా?; ఏనున్+కల్గఁగన్=

నే నుండగా; ఆఱడి= నిందయా?

తాత్పర్యం: రాజులు యుద్ధం చేసేటప్పుడు మిత్రులు, బంధువులు తోడ్పాటుగా రావటం నీచకార్యమా? నిన్ను శత్రువులు చంపుతూ ఉండగా కాపాడలేని మీ దండునాయకులను దూషించుము. చాల శ్రమనందిన సాత్యకిని అవమానించి చంపటానికి పూనినావు. నే నుండగా అతడు చనిపోతాడా? నిందపడతాడా?

వ. మీ రందఱు నట్టకాదే? యధర్మపరులయి యభిమన్యు ననుచితంపు జంపు చంపితి' రని నిరుత్తరుం జేసి, యప్పుడు దన్ను నీ కొడుకులం గొందఱు రాజులును నిందించిన నత్తెఱంగునన పలికి వారల పలుకుల నుడిపి, యా సౌమదత్తి నుపలక్షించి శోకించి, యతనికుందు మాన్పం దలంచి. 271

ప్రతిపదార్థం: మీరందరును= (కౌరవ పక్షమువారు) మీరంతా; అట్టు+అ కాదే!= ఆ విధంగానే కదా! (అన్యాయంగా); అధర్మపరులు+అయి= ధర్మం లేని వారుగా; అభిమన్యున్= అభిమన్యుడిని; అనుచితంపు= ఉచితం కాని; చంపుచంపితిరి= చావు కలిగేటట్లుగా చంపారు; అని= అని చెప్పి; నిరుత్తరున్+చేసి= బదులు చెప్పలేనట్లు చేసి; అప్పుడు= ఆ సమయంలో; తన్నున్= అర్జునుడిని; నీకొడుకులు కొందఱు రాజులును= నీ కుమారులు; మరికొందరు రాజులును; నిందించినన్= తిట్టగా; ఆ+తెఱంగునన పలికి= అదే విధంగా మాటాడి; ఆ సౌమదత్తిన్= ఆ సోమదత్త కుమారు డయిన భూరిశ్రవుడిని; ఉపలక్షించి= చూచి; శోకించి= దుఃఖపడి; అతని కుందు మాన్పన్+తలంచి= అతడి బాధను పోగొట్ట నెంచి.

తాత్పర్యం: అభిమన్యుడిని మీరంతా అధర్మంతో చంపారుకదా!' అని మాటాడకుండా చేశాడు. అపు డర్జునుడిని, నీ కొడుకులూ, మరికొంతమంది రాజులూ నిందించగా, అదే విధంగా అర్జునుడు వారి నోరులు మూయించాడు. భూరిశ్రవుడి యెడ అనుకంపతో అతడి నుద్దేశించి అతడి మనసులోని బాధను పోగొట్టనెంచి.

తే. 'క్షత్ర ధర్మంబు కీడునఁ గటకటా మ । హాత్మ! నీయట్టి వాని కి ట్లధిక పీడ
సేయ వలసె; నా ప్రతిన చర్చింపు; మెల్ల । పనులకును మూల మా సుయోధనుఁడ సూవె! 272

ప్రతిపదార్థం: మహాత్మ!= ఓ మహనీయుడా!; క్షత్రధర్మంబు కీడునన్= క్షత్రియధర్మం వలని పాపంచేత; కటకటా!= అయ్యయ్యో!; నీ అట్టివానికిన్= నీ వంటివానికి; అధికపీడ చేయవలసెన్= మిక్కిలి కష్టాన్ని కలిగించ వలసి వచ్చింది; నా ప్రతిన= నా శపథాన్ని; చర్చింపుము= యోచింపుము; ఎల్ల+పనులకున్= అన్ని పనులకును (కౌరవపాండవులకు సాగిన, సాగుతున్న స్పర్థలకు); మూలము= మొదలు (ఆధారం); ఆ సుయోధనుఁడు+అ చూవె!= ఆ దుర్యోధనుడే సుమా!

తాత్పర్యం: 'ఓ మహాత్మా! క్షత్రియ ధర్మం కారణంగా నీ వంటి వాడిని ఇట్లా బాధింపవలసి వచ్చింది. నా శపథాన్ని గూర్చి యోచింపుము. ఈ అన్నిపనులకు (మంచి చెడ్డలకు) ఆ సుయోధనుడే కారణం.

వ. అన్నరపతి నరకంబునం బడం గలవాఁడు; నీవు సద్గతిం బొందు' మనవుడు నతండు శైనేయు విడిచి యపసవ్యకరంబున శరంబులు వఱుచుకొని ప్రాయోపవేశనమతి నుండి ప్రాణాయామ పరాయణుండై యోగయుక్తుండయ్యె; నంత నొడలి కుత్సాహంబు వచ్చి లేచి సాత్యకి గరవాలం బమర్చికొని మాధవధనం జయభీమాశ్వత్థామ కృపకర్ణులు వలదు వలదని యెలుంగెత్తి వారింప క్రోధోన్మాదంబున శిరశ్ఛేదనంబు సేసిన భూరిశ్రవుండు సిద్ధచారణ గణాభినందితుం డగుచుఁ బుణ్యలోకంబున కరిగె; నా శినివరుండు దన్ను వారించిన వారల నుద్దేశించి యభిమన్యు వధప్రకారం బుపన్యసించె; నప్పుడు మన సైనికు లిట్టు దగునే యనువారును, గోపం బేమి సేయింప? దనువారును నతని చేతఁబడినవాఁ డుడుగునే? యనువారును

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గోపం బేమి సేయింప? దనువారును నతని చేతఁబడినవాఁ డుడుడునే? యనువారును నై రనిన

విని ధృతరాష్ట్రుండు సంజయున కి ట్లనియె. 273

ప్రతిపదార్థం: ఆ+నరపతి= ఆ రాజు (దుర్యోధనుడు); నరకంబున్+పడన్+కలవాఁడు= నరకానికి పోతాడు (కష్టాలకు లోనవుతాడు); నీవు సద్గతిన్+పొందుము= నీవు పుణ్యలోకాలకు పొమ్ము; అనవుడున్= అనగా; అతండు= ఆ భూరిశ్రవుడు; శైనేయున్ విడిచి= సాత్యకిని వదలి; అపసవ్య కరంబునన్= ఎడమచేతితో; శరంబులు= బాణాలు; పఱుచుకొని= క్రింద పరుచుకొని; ప్రాయోపవేశన మతిన్+ఉండి= ప్రాయోపవేశ బుద్ధితో; ప్రాణాయామ పరాయణుండు+ఐ= ఊపిరిని తన ఇష్టప్రకారం నిలపటానికి సిద్ధపడినవాడై; యోగయుక్తుండు+అయ్యెన్= ధ్యానంతో కూర్చున్నాడు; అంతన్= ఆ మీదట; ఒడలికిన్= ఒంటికి; ఉత్సాహంబు లేచి వచ్చి= శక్తి కలిగి; సాత్యకి; కరవాలంబు+అమర్చికొని= కత్తిని చేతబట్టుకొని; మాధవ ధనంజయ భీమ+అశ్వత్థామ కృపకర్ణులు= వీరందరూ; వలదు వలదు= వద్దు వద్దు; అని= అంటూ; ఎలుంగు+ఎత్తి వారింపన్= గొంతెత్తి అడ్డుకోగా; క్రోధ+ఉన్మాదంబునన్= కోపం వలన కలిగిన మత్తుతో; శిరస్+ఛేదనంబు చేసినన్= (భూరిశ్రవుడి) తలను కత్తిరించగా; భూరిశ్రవుండు; సిద్ధచారణ గణ+అభినందితుండు+ అగుచున్= సిద్ధచారణ గణాలతో కీర్తింపబడుతూ; పుణ్యలోకంబునకున్+అరిగెన్= సద్గతికి పోయాడు; ఆ శినివరుండు= ఆ శినివంశశ్రేష్ఠుడు (సాత్యకి); తన్ను వారించిన వారలన్+ఉద్దేశించి= తన్నడ్డుకొన్నవారిని ఉద్దేశించి (చూచి); అభిమన్యువధ ప్రకారంబు= అభిమన్యుడిని చంపిన విధానాన్ని; ఉపన్యసించెన్= వివరించాడు; అప్పుడు= ఆ సమయంలో; మన సైనికులు; ఇట్లు తగునే? అనువారున్= ఈ విధంగా చేయవచ్చునా? అనేవారును; కోపంబు+ఏమి చేయింపదు?+అనువారును= కోపం ఏ పనిని చేయించదు? అనేవారును (కుపితులకు ధర్మాధర్మ వివక్ష ఉండదు); అతనిచేతన్= సాత్యకి చేతిలో; పడిన; వాడు= సాతకి; ఉడుగునే= ఊరకుంటాడా?; అనువారును= అనేవారును; ఐరి= అయ్యారు; అనినన్ విని= అని చెప్పగా విని; ధృతరాష్ట్రుండు సంజయునకున్+ఇట్లు+అనియెన్= ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: రాజైన ఆ దుర్యోధనుడు నరకానికి పోతాడు నీవు స్వర్గానికి పోతావు.' అంటూ అర్జునుడు అనగా, ఆ భూరిశ్రవుడు సాత్యకిని వదలి ఎడమచేతితో బాణాలను క్రిందపరుచుకొని ప్రాయోపవేశ బుద్ధితో సమాధిలోకి వెళ్ళాడు. అపుడు సాత్యకి ఉత్సాహంతో కత్తిని చేతబట్టి శ్రీకృష్ణార్జునులును, భీమ, అశ్వత్థామ కర్ణులును వలదని గొంతెత్తి వారించినా, కోపంతో ఒడలు తెలియక భూరిశ్రవుడి తలను నరికివేశాడు. సిద్ధచారణ గణాలు కీర్తిస్తూ ఉండగా అతడు సద్గతికి పోయాడు. తనను అడ్డుకొన్నవారందరికి సాత్యకి అభిమన్యుడిని (కౌరవులు) చంపిన పద్ధతిని గూర్చి వివరించాడు. ఆ సమయాన మనసేనలోని వారు 'ఈ విధంగా చేయవచ్చునా?' అనీ, 'కోపం ఎంతటి పనినైనా చేయించగల'దనీ, 'సాత్యకి చేతపడితే అతడు చంపకుండా మానుకుంటాడా, అని అన్నారని చెప్పిన సంజయుడి మాటలకు ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు:

క. **'గురు కృతవర్మాది రథిక । వరులకు నవిజయ్యుఁ డైనవాఁడు శినివరుం**
డరయఁగ మహాద్భుతం బ । క్కురువరుచే నాతఁ డిట్లగుట సూతసుతా!' 274

ప్రతిపదార్థం: సూతసుతా!= సారథి కుమారుడా (సంజయా!); గురుకృతవర్మ+ఆది రథిక వరులకున్= ద్రోణుడు, కృతవర్మ మొదలయిన వీరవరులకు; అవిజయ్యుఁడు+ఐనవాఁడు= జయించ వీలుకానివాడు; శినివరుండు= శినివంశ శ్రేష్ఠుడు (సాత్యకి); అరయఁగన్= పరిశీలింపగా; ఆ+కురువరుచేన్= ఆ కురువంశం వాడయిన భూరిశ్రవుడి మూలాన; ఆతఁడు; ఇట్లు+అగుట= ఈ విధంగా కావటం (అవమానానికి లోనుకావటం); మహా+అద్భుతంబు= చాలా అబ్బురంగా ఉన్నది.

తాత్పర్యం: 'ఓ సంజయా! ద్రోణుడు, కృతవర్మ మొదలయిన వీరవరులకు సైతం జయించటానికి వీలుకానివాడు సాత్యకి. ఈ కురువంశంవాడయిన భూరిశ్రవుడి అవమానానికి అతడు గురికావటం చాలా వింతగా ఉన్నది' (అని ధృతరాష్ట్రుడు సంజయుడితో అన్నాడు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంజయుఁడు ధృతరాష్ట్రునకు సాత్యకి పరాభవ కారణంబు చెప్పుట (సం. 7-119-1)

వ. అనవుడు నతఁ డమ్మహీపతి కిట్లను 'దీనికిం గారణంబు గల దాకర్ణింపుము; సోమవంశవరుం డగు యయాతి నందనుం డయిన యదుని కులంబున జనియించిన దేవమీఢునకుఁ బుట్టిన శూరుని కొడుకు వసుదేవుండు రూపగుణంబులఁ బ్రసిద్ధుండై పెరుఁగుచుండ దేవకుం డను భూవల్లభుండు దన పుత్త్రికి దేవకీదేవికి స్వయంవర మహోత్సవం బాచరించిన నవ్వసుదేవునకై యయ్యాదవాన్వయజాతుం డగు శిని యవ్వనితఁ బరాక్రమంబునఁ దేరఁ గూడిన రాజలోకంబుఁ దొడరి పోరంజాలక నిలిచిన సోమదత్తుం డొక్కరుండును బోక పెనంగె; నయ్యిరువురు నొండొరులచేత విరథులై కృపాణంబులు గొని ధరణికి లంఘించి పోరునెడ నయ్యదువీరుం డాక్రమించి బాహ్లికతనయుం గొప్పువట్టి యొఱగం దిగిచి యనుకంప పెంపునం జంప నొల్లక తన్ని విడిచినం బోయి సిగ్గు పెంపునఁ దలయెత్తి తిరుగనేరక వనంబున కరిగి హరు నుద్దేశించి పెద్దకాలంబు దపంబు సేసిన నప్పరమేశ్వరుండు ప్రత్యక్షంబై వరంబు వేడుమనినఁ దత్కాలంబునకు శినియును దదీయసుతుండును గడచనుటం జేసి శినిమనుమని ననిం బడవైచి తన్నం జాలు తనయు నీవలయు నని యడిగిన నద్దేవుం' డట్ల యగుం గాక! 'యని యానతిచ్చి యంతర్హితుం డయ్యెఁ దద్వరప్రభావంబున భూరిశ్రవుండు సాత్యకి నిట్లు సేసె నని చెప్పిన నాంబికేయుండు గయ్యం బటమీఁద నెట్లు సెల్లె? ననుటయు సంజయుం డి ట్లనియె. 275

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; అతఁడు= ఆ సంజయుడు; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు (ధృతరాష్ట్రుడితో); ఇట్లు+అనున్= ఈ ప్రకారంగా అన్నాడు; దీనికిన్+కారణంబు కలదు= దీనికి నిమిత్తమున్నది (సాత్యకిని భూరిశ్రవుడు అవమానించటానికి); సోమవంశవరుండు+అగు= చంద్రవంశంలో శ్రేష్ఠుడయిన; యయాతినందనుండు+అయిన= యయాతి కొడు కయినటువంటి; యదుని కులంబునన్= యదుడి వంశంలో; జనియించిన= పుట్టిన; దేవమీఢునకున్ బుట్టిన= దేవమీఢుడనే వాడికి పుట్టిన; శూరునికొడుకు వసుదేవుఁడు= శూరు డనే వాడికొడుకు వసుదేవుడు; రూపగుణంబులన్ ప్రసిద్ధుండు+ఐ= గుణంలో, ఆకారంలో పేరు పొందినవాడయి; పెరుఁగుచుండన్= పెరుగుతూ ఉండగా; దేవకుండు+అను భూవల్లభుండు= దేవకు డనేరాజు; తన పుత్రికిన్= తన కూతురికి; దేవకీదేవికిన్= దేవకీదేవి అనే ఆమెకు; స్వయంవర మహోత్సవంబు+ఆచరించినన్= స్వయంవరాన్ని చాటగా; ఆ+వసుదేవునకై= ఆ వసుదేవుడి కొరకై; ఆ+యాదవ+అన్వయ జాతుండు+అగు= ఆ యాదవకులంలో పుట్టిన వాడయిన; శిని= శిని అనేవాడు; ఆ+వనితన్+పరాక్రమంబునన్+తేరన్= ఆ స్త్రీని శౌర్యంతో తీసికొని రాగా (ఇతరులను జయించి); కూడిన రాజ లోకంబు= అక్కడ చేరిన రాజులందరూ; తొడరి= ఎదిరించి; పోరన్+చాలక= యుద్ధం చేయలేక; నిలిచినన్= నిలిచిపోగా; సోమదత్తుఁడు+ఒక్కరుండునున్= సోమదత్తు డొక్కడే; పోక పెనంగెన్= వెన్నిచ్చిపోకుండా యుద్ధం చేశాడు; ఆ+ఇరువురు= ఆ శిని, సోమదత్తులు; ఒండొరులచేతన్= ఒకరితో ఒకరు; విరథులు+ఐ= తేర్లు పోగొట్టుకొన్నవారయి; కృపాణంబులు కొని= కత్తులు తీసికొని; ధరణికిన్ లంఘించి= భూమిమీదకు దూకి; పోరు ఎడన్= యుద్ధం చేసేటప్పుడు; ఆ+యదువీరుండు= ఆ యాదవవీరుడు(శిని); ఆక్రమించి= క్రమ్ముకొని; బాహ్లికతనయున్= బాహ్లికుడికొడుకును (సోమదత్తుని); కొప్పు+పట్టి ఒఱగన్+తిగిచి= జుట్టుపట్టి క్రిందకు లాగి; అనుకంప పెంపునన్= దయాధిక్యంతో; చంపన్+ఒల్లక= చంపటానికి ఇష్టపడక; తన్ని విడిచినన్= కొట్టి వదలగా; పోయి= వెళ్ళి; సిగ్గు పెంపునన్= ఎక్కువైన సిగ్గుతో(అవమానంతో); తలయెత్తి తిరుగ నేరక= తల పైకెత్తి తిరుగ లేక; వనంబునకున్+అరిగి= అడవికి వెళ్ళి; హరున్+ఉద్దేశించి= ఈశ్వరుడిని గూర్చి; పెద్దకాలంబు= చాలాకాలం; తపంబు చేసినన్= తపస్సు చేయగా; ఆ+పరమేశ్వరుండు ప్రత్యక్షంబు+ఐ= ఆ పరమశివుడు ఎదుట నిలిచి; వరంబు వేడుము+అనినన్= కోరికను కోరుకొనుమనగా; తత్కాలంబునకున్= ఆవేళకు; శినియును, తదీయ సుతుండును= శినీ, వాడి కొడుకుకూడా; కడ చనుటన్+చేసి= చనిపోవటంచేత; శినిమనుమని= శిని మనుమడిని; అనిన్+పడవైచి= యుద్ధంలో క్రింద తోసి; తన్నన్+చాలు= తన్నగల్గిన;

తనయున్= కొడుకును; ఈ వలయున్+అని= ఈయవలయు నని; అడిగినన్= అడుగగా; ఆ+దేవుఁడు+అట్లు+అ+అగు+కాక!= ఆ విధంగానే అవుగాక!; అని ఆనతి+ఇచ్చి= అని ఆజ్ఞచేసి; అంతర్హితుండు+అయ్యెన్= మాయమయినాడు; తద్వర ప్రభావంబునన్= ఆ వరముయొక్క శక్తిచేత; భూరిశ్రవుండు సాత్యకిన్+ఇట్లు చేసెన్= భూరిశ్రవుడు సాత్యకిని ఈ విధంగా చేశాడు; అని చెప్పినన్= అని చెప్పగా; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; కయ్యంబు+అటమీఁదన్= యుద్ధం తరువాత; ఎట్లుచెల్లెన్?= ఏ విధంగా సాగింది?; అనుటయున్= అనగా; సంజయుండు+ఇట్లు అనియెన్= సంజయు డీవిధంగా అన్నాడు:

తాత్పర్యం: చంద్రవంశంలో గొప్పవా డయిన యయాతి కుమారుడూ యదువంశంవాడూ దేవమీఢునికి పుట్టిన శూరునికొడుకు వసుదేవుడు అందచందాలలో పేరుపొందుతూ, పెరుగుతూ వచ్చాడు. దేవకు డనే రాజు తన కూతురు దేవకీదేవికి స్వయంవరం చాటాడు. ఆ వసుదేవుడికిగాను యాదవకులంలో పుట్టిన శిని బలపరాక్రమాలతో ఆమెను తీసికొని వచ్చాడు. స్వయంవరానికి వచ్చిన రాజులలో ఎవరూ, అతడిని ఎదిరించి పోరాడలేకపోగా, సోమదత్తు డొక్కడు మాత్రం వెన్నిచ్చి పోకుండా యుద్ధం చేశాడు. శిని, సోమదత్తులు ఒకరితేరును ఇంకొకరు విరిచారు. తేరులు లేనివారై భూమిమీదకు దూకి యుద్ధం చేశారు. ఆ యాదవరాజు, వీరుడూ అయిన శిని బాహ్లికుడి కుమారు డయిన సోమదత్తుని జుట్టు పట్టి లాగి, క్రింద త్రోసి, తన్ని, అవమానించి దయతలచి చంపకుండా వదలిపెట్టాడు. అవమాన భారంతో తల ఎత్తుకొనలేక అడవులు పట్టిపోయి పరమేశ్వరుడిని ఉద్దేశించి సోమదత్తుడు తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమయి వరం కోరుకొమ్మన్నాడు. ఆ వేళకు శినీ, అతడి కొడుకూ కూడా కాలగతిలో కలసిపోయారు కాబట్టి, అతడి మనుమడిని యుద్ధంలో తన్నగలిగే వాడిని, తనకు కొడుకుగా ప్రసాదించుమని కోరాడు. ఆయన సరే అన్నాడు. ఆ తర్వాత శివుడు అంతర్హితు డయ్యాడు. ఆ వరశక్తి వలన భూరిశ్రవుడు సాత్యకిని ఈ విధంగా అవమానించగలిగాడు.' అని సంజయుడు చెప్పాడు. 'ఆ తరువాత యుద్ధం ఎట్లా సాగిం?' దని ధృతరాష్ట్రుడు అడుగగా సంజయుడు దాని ప్రకారం చెపుతూ ఉన్నాడు.

ఆ. **సొమదత్తి యిట్లు సచ్చినఁ దదనంత । రంబు రథము సింధురాజు దెసకు**
నరుఁడు నడపఁ బంచె నారాయణు నపుడు । గురుసుతాది రథికవరులు నృపుఁడు. **276**

ప్రతిపదార్థం: సౌమదత్తి= సోమదత్తుడి కుమారు డయిన భూరిశ్రవుడు; ఇట్లు చచ్చినన్= ఈ విధంగా చనిపోగా; తద్+అనంతరంబు= ఆ మీదట; నరుఁడు= అర్జునుడు; రథము= తన తేరును; సింధురాజుదెసకున్= సైంధవు డున్న దిక్కునకు; నారాయణున్= శ్రీకృష్ణుడిని; నడపన్= తోలుటకు; పంచెన్= ఉత్తర్వు చేశాడు; అపుడు= ఆ సమయంలో; గురుసుత+ఆది= అశ్వత్థామ మొదలగు; రథికవరులు= వీరులలో మొనగాండ్రు; నృపుఁడు= రాజయిన దుర్యోధనుడును.

తాత్పర్యం: భూరిశ్రవు డీ విధంగా చనిపోగా, తనతేరును సైంధవు డున్న దిక్కునకు తోలు మని అర్జునుడు శ్రీకృష్ణునకు ముదల ఇచ్చాడు. అపు డశ్వత్థామ మొదలయిన మొనగాండ్రును, రాజయిన దుర్యోధనుడును. (తరువాతి గద్యంతో అన్వయం).

వ. **బరవసంబు సేసి యడ్డపడి; రట్టి యెడ కర్ణ సాత్యకులకుఁ గయ్యంబయ్యె; నత్తెఱంగు వివరించెద వినుము; కృష్ణుండు త్రికాలవేది యగుటఁ దన తమ్మునికి భూరిశ్రవుని వలనం బుట్టు నెడరు తెఱం గెఱింగి తొలునాఁటి రాత్రి నిజసారథి యగు దారుకునితోడఁ బార్థుని ప్రతిన నెరపం బూని పలుకు నెపంబున మన యరదం బాయితంబు సేసికొని యెల్లి గయ్యంబునకుం గొని రమ్మని చెప్పెనప్ప డెట్టి యడియాలంబులతోఁ బాంచన్యంబుం బూరింపం గలవాఁడై పలికె నా చందంబున నంతకు మున్న యాసూతునకు నేతేరవలయు**

తడవు గనుంగొని శంఖంబు పూరించిన వాఁడును శైల్యసుగ్రీవ మేఘ పుష్పవలాహకంబు లను వాహంబుల వేగంబు నెఱయ మెఱయం బొలుచు గరుడకేతనంబు గ్రాలఁ దేరు తత్కాలంబున కొదవ నాలంబులోనికిఁ దెచ్చిన నయ్యచ్యుతుండు మెచ్చుచు నాశైనేయున కిచ్చినం జూచి కౌంతేయుం డచ్చెరువందిన నతనికి నవ్విధంబు గొంత సూచించె; నిట్లు సాత్యకి సన్నద్ధుం డై. 277

ప్రతిపదార్థం: బరవసంబుచేసి= ధైర్యంచేసి; అడ్డపడిరి= అడ్డుకొన్నారు; అట్టి ఎడన్= ఆ సమయంలో; కర్ణ సాత్యకులకున్ కయ్యంబు+అయ్యెన్= కర్ణుడికీ సాత్యకికీ పోట్లాట జరిగింది; ఆ+తెఱంగు= ఆ పద్ధతి; వివరించెదన్= తెలియచెపుతాను; వినుము; కృష్ణుండు; త్రికాలవేది= మూడు కాలాలూ తెలిసినవాడు; అగుటన్= అయినందున; తన తమ్మునకున్= తనకు తమ్ము డయిన సాత్యకికి; భూరిశ్రవుని వలనన్= భూరిశ్రవుడి మూలాన; పుట్టు= కలుగు; ఎడరు తెఱంగు= ఆపదయొక్క విధం; ఎఱింగి= తెలిసి; తొలునాఁటి రాత్రి= అంతకు ముందు రాత్రి; నిజ సారథి+అగు= తన సారథి అయిన; దారుకునితోడన్= దారుకుడితో; పార్థుని ప్రతిన= అర్జునుడి శపథాన్ని; నెరపన్+పూని= నెగ్గజేయ నిశ్చయించుకొని; పలుకు నెపంబునన్= మంతనమాడే మిషతో; మన+అరదంబు+ఆయితంబు చేసికొని= మన తేరును సిద్ధం చేసికొని; ఎల్లి= రేపు (మరునాడు); కయ్యంబునకున్+కొని రమ్ము= యుద్ధానికి తీసికొని రావలసింది; అని చెప్పెన్= అని చెప్పాడు; అప్పుడు= ఆమాట చెప్పిన సమయంలో; ఎట్టి అడియాలంబులతోన్= ఎటువంటి గురుతులతో; పాంచజన్యంబున్= తన శంఖమును; పూరింపన్+కలవాడై= అటువంటి శబ్దం చేసేవాడుగా; పలికెన్= చెప్పాడు; ఆ చందంబునన్= ఆ విధంగా; అంతకు మున్న= అంతకంటే ముందుగానే; ఆ సూతునకున్= ఆ సారథికి; ఏతేరవలయు= రావలసిన; తడవు కనుంగొని= సమయం గుర్తుంచుకొని; శంఖంబు పూరించినన్= శంఖాన్ని ఊదగా; వాఁడును= దారుకుడును; శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకంబులను= శైబ్య సుగ్రీవ మేఘపుష్ప వలాహకా లని పిలువబడే; వాహంబులన్= గుర్రాలను; వేగంబు నెఱయమెఱయన్ పొలుచు= వేగం తెలియగా ప్రకాశించే; గరుడ కేతనంబు= గరుడ ధ్వజం; క్రాలన్= ప్రకాశించగా; తేరు= తేరు; తత్కాలంబునకున్= ఆ సమయానికి; ఒదవన్= కలుగగా; ఆలంబులోనికిన్+తెచ్చినన్= యుద్ధంలోనికి తీసికొనిరాగా; ఆ+అచ్యుతుండు= ఆ శ్రీకృష్ణుడు; మెచ్చుచున్= మెచ్చుకొంటూ; ఆ శైనేయునకున్+ఇచ్చినన్= ఆ సాత్యకికి ఈయగా; చూచి= చూచినవాడై; కౌంతేయుడు+అచ్చెరువు+అందినన్= కుంతి కొడుకయిన అర్జునుడు ఆశ్చర్యపడగా; అతనికిన్= ఆ అర్జునుడికి; ఆ+విధంబు= ఆ పద్ధతిని (ఉపాయాన్ని); కొంత సూచించెన్= కొంచెం తెలియజేశాడు; ఇట్లు= ఈ ప్రకారం; సాత్యకి సన్నద్ధుండు+ఐ= సాత్యకి సిద్ధమయి.

తాత్పర్యం: ధైర్యంతో (భూరిశ్రవుడు చనిపోగా అర్జునుడి తేరు సైంధవుడి దిక్కునకు శ్రీకృష్ణుడు తోలగా) అశ్వత్థామ మొదలయిన వీరులు అర్జునుడికి అడ్డం వచ్చారు. అప్పుడు కర్ణ సాత్యకులు పోరుట జరిగింది. దానిని వివరిస్తాను వినుము. (అని సంజయు డన్నాడు). త్రికాలవేది అయిన శ్రీకృష్ణుడు తన తమ్ము డయిన సాత్యకికి భూరిశ్రవుడి మూలాన కలిగే ఆపదను తెలిసికొని ముందురోజు రాత్రి తన సారథి అయిన దారుకుడితో పార్థుడి ప్రతిజ్ఞను నెగ్గించటానికి నిశ్చయించి మాట్లాడే నెపంతో 'మన తేరును సిద్ధంచేసికొని రేపు యుద్ధరంగానికి తీసికొని రావలసింది' అని చెప్పాడు. ఆ సమయంలో ఏ గురుతుతో పాంచజన్యాన్ని పూరిస్తా నని చెప్పాడో ఆ విధంగా అంతకంటే ముందుగానే ఆ సారథికి తేరు తేవలసిన సమయాన్ని గుర్తుంచుకొని శంఖాన్ని ఊదాడు. అపుడు దారుకుడు శైబ్య సుగ్రీవ మేఘపుష్ప వలాహకాలనే గుర్రాలను వేగం మెరయగా గరుడకేతనంతో ఆ సమయానికి ఆ తేరును సరిగా యుద్ధరంగంలోకి తీసికొని రాగా, ఆ శ్రీకృష్ణుడు అతడిని మెచ్చుకొని, సాత్యకికి ఆ తేరు నిచ్చాడు. దాని కర్జునుడు అబ్బురపడ్డాడు. శ్రీకృష్ణు డా ఉపాయాన్ని కొంచెం తెలియజేశాడు. ఈ విధంగా సాత్యకి యుద్ధానికి సిద్ధమయ్యాడు (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **ఏచి నరునకు సాహాయ్య మాచరించు । కౌతుకంబున నేతేరఁ గర్ణుఁ డతని**
నధిక సంరంభమునఁ దాఁకె నక్కిరీటి । కని జనార్దనుతోఁడ ని ట్లనియె నగుచు. **278**

ప్రతిపదార్థం: ఏచి= విజృంభించి; నరునకున్= అర్జునుడికి; సాహాయ్యము+ఆచరించు= సహాయము చేసే; కౌతుకంబునన్= ఉత్సాహంతో; ఏతేరన్= రాగా; కర్ణుఁడు= కర్ణుడు; అతనిన్= ఆ సాత్యకిని; అధిక సంరంభమునన్= మిక్కిలి ఆటోపంతో; తాఁకెన్= ఎదుర్కొన్నాడు; ఆ+కిరీటి= ఆ అర్జునుడు; కని= చూచి; జనార్దనుతోడన్= శ్రీకృష్ణుడితో; నగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడికి సాయం చేయాలనే ఆసతో సాత్యకి విజృంభించి రాగా, కర్ణుడు చాలా ఆటోపంతో అతడిని ఎదుర్కొన్నాడు. ఆ స్థితిని చూచి నవ్వుతూ అర్జునుడు శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు.

క. **'భూరిశ్రవుండు సచ్చుట । సైరింపక సూతసుతుఁడు సాత్యకితోడం**
బోరం దొడంగె; మనము వి । చారింపక యెయ్యవలయు సరిగొనకుండన్.' **279**

ప్రతిపదార్థం: భూరిశ్రవుండు చచ్చుట= భూరిశ్రవుడు చనిపోవటం; సైరింపక= ఓర్వలేక; సూతసుతుఁడు= కర్ణుడు; సాత్యకితోడన్= సాత్యకితో; పోరన్+తొడంగెన్= యుద్ధానికి పూనుకొన్నాడు; మనము= మనం; విచారింపక= సందేహించకుండా; సరిగొనకుండన్= చంపకుండా; ఎయ్యవలయున్= వెంబడించవలెను.

తాత్పర్యం: 'భూరిశ్రవుడు చావటాన్ని సహించక కర్ణుడు సాత్యకితో యుద్ధానికి పూనుకొన్నాడు. అతడు చావకుండా మనం నిస్సందేహంగా అతడిని వెంబడించాలి.

ఆ. **అనుఁడు నతఁడు సాలు నతనికి నా చక్ర । రక్షకులు గడంగి రయము మెఱయఁ**
గదిసి తోడుపడిరి కావున నక్కడి । చింతవలవ దని మురాంతకుండు. **280**

ప్రతిపదార్థం: అనుఁడున్= అర్జునుడు అట్లా అనగా; ముర+అంతకుండు= శ్రీకృష్ణుడు; అతనికిన్= ఆ కర్ణుడికి; అతఁడు= సాత్యకి; చాలున్= పోరుతో సరిపోతాడు - సరి ఉజ్జీ అని భావం; ఆ చక్రరక్షకులు= ఆ సాత్యకి రథచక్రాలను రక్షించే వీరులు (అంగరక్షకుల వంటివారు); కడంగి= పూనుకొని; రయము మెఱయన్= వేగం ప్రకాశించేటట్లు; కదిసి= సమీపించి, కూడి; తోడుపడిరి= సహాయపడ్డారు; కావునన్= కాబట్టి; అక్కడి చింత= ఆ వైపు దిగులు (సాత్యకికి కీడు కలుగుతుందనే బెంగ); వలవదు+అని= వద్దని.

తాత్పర్యం: అర్జునుడి మాటలు విని శ్రీకృష్ణు డిట్లా అన్నాడు. 'ఆ కర్ణుడికి సాత్యకి అన్నింట సరితూగుతాడు. అంతేకాక, అతడి చక్రరక్షకులు అప్రమత్తంగా పూనికతో వేగంగా అతడిని సమీపించి తోడుపడ్డారు. కాబట్టి ఆ వైపు దిగులు నీవు పెట్టుకొనవద్దు.'

వ. **తేరును సైంధవుని దెసకుం దరిమె; నప్పుడు శైనేయరాధేయుల పో రెల్లవారును వెఱఁగుపడి చూచుచుండి; రత్తెఱంగు సంగరంబు సురాసుర గంధర్వుల యందునుం గలుగదు; వినుము; మట్లు పోరి యన్నారాయణానుజుండు.** **281**

ప్రతిపదార్థం: తేరును సైంధవుని దెసకున్+తరిమెన్= సైంధవు డున్న దిక్కుకు తోలాడు; అప్పుడు శైనేయరాధేయుల పోరు= ఆ సమయంలో సాత్యకి కర్ణుల యుద్ధం; ఎల్లవారును= అందరూ; వెఱఁగుపడి= ఆశ్చర్యపడి; చూచుచున్+ఉండిరి= చూస్తూ ఉన్నారు; ఆ+తెఱంగు సంగరంబు= ఆ విధమయిన యుద్ధం; సుర+అసుర గంధర్వుల యందును= దేవతలూ, రాక్షసులూ, గంధర్వులలో కూడా; కలుగదు= ఉండదు; వినుము= వినవలసింది; అట్లు పోరి= ఆ విధంగా యుద్ధం చేసి; ఆ+నారాయణ+అనుజుండు= ఆ నారాయణుడి తమ్ముడు (సాత్యకి).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: (శ్రీకృష్ణుడు) తేరును సైంధవు డున్న ప్రక్కకు తోలాడు. ఆ సమయంలో కర్ణ సాత్యకుల యుద్ధం అందరూ ఆశ్చర్యంతో చూడసాగారు. ఆ విధమయిన యుద్ధం దేవతలలోగాని, రాక్షసులలోగాని జరుగలేదు. ఆ విధంగా యుద్ధంచేసి ఆ నారాయణుడి తమ్ముడు.

కర్ణుఁడు సాత్యకితో యుద్ధంబు సేసి యోడిపోవుట (సం. 7-120)

చ. **నిరుపమశక్తిఁ గర్ణుమెయి నెత్తురు వఱ్ఱుగఁ జేసి సూతునిం**
దురగములన్ సిడంబు వెసఁద్రుంచి రథంబును నాతపత్రముం
దర మిడి నుగ్గు సేసె వసుధావర! తమ్ములు రాజుఁ జూడ న
ప్పరుషత సూచి చేయఁగల పార్థివు లాతనిఁ జుట్టుముట్టినన్. **282**

ప్రతిపదార్థం: వసుధావర!= ఓ రాజా!; నిరుపమ శక్తిన్= సాటిలేని బలంతో; కర్ణుమెయిన్= కర్ణుడి శరీరాన్ని; నెత్తురు వఱ్ఱుగన్‌చేసి= రక్తం ప్రవాహంగా చేసి; సూతునిన్= సారథిని; తురగములన్= గుఱ్ఱాలను; సిడంబు= కేతనమును; వెసన్+త్రుంచి= శీఘ్రంగా ముక్కలు చేసి; రథంబును= తేరును; ఆతపత్రమున్= గొడుగును; తరమిడి= వరుసగా; నుగ్గు చేసెన్= పొడి చేశాడు; తమ్ములు= దుర్యోధనుడి తమ్ములును; రాజు= దుర్యోధనుడును; చూడన్= చూస్తుండగా; ఆ+పరుషతన్= ఆ కాఠిన్యాన్ని; చూచి= చూచి; చేయన్+కల పార్థివులు= చేవ గల (శక్తి ఉన్న) రాజులు; ఆతనిన్= అతడిని; చుట్టుముట్టినన్= చుట్టు క్రమ్ముకొనగా.

తాత్పర్యం: ఓ రాజా! సాటిలేని బలంతో కర్ణుడి ఒళ్ళంతా నెత్తురుమయంగా చేసి, అతడి సారథినీ, గుఱ్ఱాలనూ, కేతనాన్నీ త్వరగా త్రుంచివేసి - తేరునూ, గొడుగునూ వరుసగా, తమ్ములతో గూడా దుర్యోధనుడు చూడగా పొడిచేశాడు. ఆ వీరత్వాన్ని చూచి, శక్తిగల రాజులు సాత్యకిని చుట్టుముట్టగా.

క. **శరవేగము రథగమన । స్ఫురణ విచిత్రతయు మెఱయఁ బోరి యతం డ**
య్యరదములగములు సుడివడఁ । దెరల మరలఁ బఱవఁజేసె దీపించె నృపా! **283**

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; (కురురాజులు తన్ను చుట్టుకొనగా సాత్యకి) శరవేగము= బాణాలు వేయటంలో తొందర; రథ గమన స్ఫురణ= తేరుల వేగంగా పోయే ప్రకాశం; విచిత్రతయున్= చమత్కారం; మెఱయన్= ప్రకాశించగా; పోరి= యుద్ధంచేసి; అతండు= ఆ సాత్యకి; ఆ+అరదముల గములు= ఆ తేరులగుంపులు; సుడివడన్= కలతచెందగా; తెరలన్= తొలగిపోయేటట్లు; మరలన్= తిరిగి; పఱవన్+చేసెన్= పరుగెత్తేటట్లుగా చేశాడు.

తాత్పర్యం: ఓ రాజా! తనను చుట్టుకొన్న కురురాజుల మీద బాణాలు వేయటంలో వేగం, తేరులు వెళ్ళే వేగం తీరూ, చిత్రవిచిత్రమైన గతులూ ప్రకాశిస్తూ యుద్ధంచేసి, ఆ సాత్యకి ఆ తేరుల గుంపును సుళ్ళు తిరిగి కలతపడేటట్లూ దూరంగా పోయేటట్లూ తిరిగి పరుగులెత్తేటట్లూ చేశాడు.

క. **అనుటయు ధృతరాష్ట్రుఁడు గృ । ష్ణుని రథమును రథ్యములను సూతుఁడు నగుటన్**
శినివరునకు నుత్సాహం । బనూన మయి చూవె యంత యధికుం డయ్యెన్. **284**

ప్రతిపదార్థం: అనుటయున్= సంజయు డావిధంగా చెప్పగా; ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్ర చక్రవర్తి; కృష్ణుని= శ్రీకృష్ణుడి; రథమును= తేరునూ; రథ్యములును= గుఱ్ఱాలూ; సూతుఁడున్= సారథీ; అగుటన్= అయినందువలన; శినివరునకున్= సాత్యకికి; ఉత్సాహంబు+అనూనము+అయి= సంతోషం ఎక్కువయి; అంత అధికుండు+అయ్యెన్= అంత గొప్పవా డయ్యాడు (బలం కలవాడయ్యాడు; చూవె!= సుమా!

తాత్పర్యం: సంజయుడితో ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు: 'శ్రీకృష్ణుడి తేరూ, గుర్రాలూ, సూతుడూ అయినందువలన సాత్యకి ఉత్సాహంతో పాటు సాటిలేని బలంతో కూడి మేటి వీరుడయ్యాడు.'

వ. అనిన విని సంజయుం డతని కిట్లను నట్టియెడ మున్ను దారకుండు దేరు దెచ్చుసంరంభంబు సూచి యది కృష్ణుని పనుపని యెఱుంగని వాఁడగుటఁ గయ్యంబు గజిబిజిగాఁ దలంచుచు వాని పిన్నతమ్ముండు మేలిమి రథంబునం దగు తురంగంబులం బూన్చికొని వివిధాయుధంబు లమర్చికొని కేతనోద్ద్యోతితంబు సేసి యా రథంబు వచ్చిన జాడ నేతెంచి సన్నిహితుం డగుటయు, సాత్యకి సముచితంబుగా నయ్యరదం బెక్కి విక్రమాటోపంబు సూపుచుండ రథాంగధరుని సారథి రథసహితంబుగా నతనికడకుఁ జనియె; నీ కొడుకులు కర్ణుం గల్పితరథోదీర్ణుం గావించి రనవుడు నాంబికేయుం 'డట్లు కిరీటిం గలిసి భీముం డేమి సేసె' నని యడిగిన. 285

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విని; సంజయుండు+అతనికిన్+ఇట్లు+అనున్= ధృతరాష్ట్రుడితో ఈ విధంగా అన్నాడు; అట్టి ఎడన్= ఆ సమయంలో; మున్ను= ముందుగా; దారకుండు= దారకు డనే వాడు (ఆ కృష్ణుడి సారథి); తేరుతెచ్చు సంరంభంబు చూచి= తేరును తీసికొనివచ్చే తొందరను చూచి; అది= ఆ తేరు తీసికొని రావటం; కృష్ణుని పనుపు= శ్రీకృష్ణుడి ఉత్తర్వు; అని ఎఱుంగని వాఁడు+అగుటన్= అని తెలియని వాడయినందున; వాని, పిన్నతమ్ముడు= అతడి చిన్న తమ్ముడు. కయ్యంబు= యుద్ధము; గజిబిజికాన్; తలంచుచు; మేలిమి= ఉత్తమమైన రథంబునన్= రథమునందు; తగు తురంగంబులన్+పూన్చికొని= తగిన గుర్రాలను సిద్ధం చేసికొని; వివిధ+ఆయుధంబులు+అమర్చికొని= నానా విధాలయిన ఆయుధాలను ఏర్పాటు చేసికొని; కేతన+ఉద్యోతితంబు చేసి= జెండాను ఎగురవేసి; ఆ రథంబు వచ్చిన జాడన్+ఏతెంచి= ఆ తేరు వచ్చిన బాటనే వచ్చి; సన్నిహితుండు+అగుటయున్= దగ్గరగా వచ్చుటయు; సాత్యకి సముచితంబుగాన్= సాత్యకి తగినట్లుగా; ఆ+అరదంబు+ఎక్కి= ఆ తేరు నెక్కి; విక్రమ+ఆటోపంబు చూపుచుండన్= శౌర్యంయొక్క దర్పాన్ని చూపిస్తూ ఉండగా; రథాంగధరుని= శ్రీకృష్ణుడి యొక్క(చక్రధారియొక్క); సారథి= సూతుడు; రథసహితంబుగాన్= తేరుతోకూడా; అతని కడకున్+చనియెన్= సాతకి దగ్గరకు వెళ్ళాడు; నీ కొడుకులు= నీకుమారులు; కర్ణున్+కల్పిత రథ+ఉదీర్ణున్+కావించిరి= ఏర్పాటు చేసిన తేరుమీద కెక్కించారు; అనవుడున్= అనగా; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; అట్లు కిరీటిన్+కలిసి= ఆ విధంగా అర్జునుడిని కలసికొని; భీముం డేమి చేసెను?= భీము డేమి చేశాడు?; అని అడిగినన్= అని అడుగగా.

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రుడితో ఈ విధంగా అన్నాడు: 'ఆ సమయంలో ముందుగా దారకుడు త్వర త్వరగా రథం తీసుకురావటాన్ని సాత్యకి చూచాడు. కాని, అది శ్రీకృష్ణుని ఆదేశం మేరకు తన సైన్యాం వస్తున్నదని తెలియక, అతని చిన్న తమ్ముడు తగిన గుర్రాలు కట్టి, జెండాను కూర్చి, వివిధ ఆయుదాలు అమర్చి సిద్ధం చేసి తెచ్చిన ఉత్తమ రథాన్ని అధిరోహించి తన పరాక్రమాన్ని చూపుతూ ఉండగా అపుడు శ్రీకృష్ణుడి తేరును తోలుకొని సారథి అతడి దగ్గరకు వెళ్ళాడు. నీ కొడుకులు కర్ణుడికి తగిన తేరును సిద్ధం చేసి దానిమీద కెక్కించారు.' అనగానే ధృతరాష్ట్రుడు 'అర్జునుడిని చేరి భీము డేమి చేశాడు?' అని అడుగగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ఆతనికి సంజయుం డిట్టు లనియె; 'గర్ణు । చేత నవమానింతుం డయి చిన్నఁ బోయి
పార్థుపాలికి నరిగియుఁ బలుకకుండెఁ । గినుక నెరియు మనంబుతో మనుజనాథ! 286

ప్రతిపదార్థం: మనుజనాథ!= ఓ రాజా!; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడితో; సంజయుడు+ఇట్టులు+అనియెన్= సంజయుడితో ఈ విధంగా అన్నాడు; కర్ణుచేతన్+అవమానితుండు+అయి= కర్ణుడిచేత అవమానపడి; చిన్నఁబోయి= సిగ్గుపడి; పార్థుపాలికిన్= అర్జునుడి దగ్గరకు; అరిగియున్= వెళ్ళికూడా; కినుకన్= కోపంతో; ఎరియు= మండుతున్న; మనంబుతోన్= మనసుతో; పలుకకుండెన్= మాట్లాడకుండా ఉండిపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధృతరాష్ట్రుడితో సంజయు డిట్లా అన్నాడు: 'కర్ణుడిచేత ఆ విధంగా అవమానించబడి (భీముడు) సిగ్గుతో అర్జునుడి యొద్దకు చేరికూడా కోపంతో మండే మనసుతో ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాడు.

వ. పదంపడి త న్నా సూతపుత్రుండు పలికిన పలుకు లా ఫల్గునుతోఁ నుగ్గడించి 'వానిం దొడరి, యే నెల్లభంగులం బరిమార్తు' ననిన నాతం 'డవి నా చెవి సోఁక నాడుట నన్నుఁ బలుకుట గాక నీకుం బని యేమి నీ వటుండు' మని పలికి రాధేయు రథంబున కభిముఖుం డై. 287

ప్రతిపదార్థం: పదంపడి= ఆ మీద; తన్నున్= తనను (భీముడిని); ఆ సూతపుత్రుండు= ఆ కర్ణుడు; పలికిన పలుకులు= మాటాడిన మాటలు(అవమానకరమైన మాటలు); ఆ ఫల్గునుతోన్= ఆ అర్జునుడితో; ఉగ్గడించి= చెప్పి; వానిన్+తొడరి= ఆ కర్ణుడిని ఎదుర్కొని; ఏ నెల్లభంగులన్= నేనన్ని విధాలా; పరిమార్తున్= చంపుతాను; అనినన్= అనగా; ఆతండు= ఆ అర్జునుడు; అవి= ఆ మాటలు; నా చెవి సోఁకన్+ఆడుట= నా చెవికి వినబడేట్లుగా చెప్పటం; నన్నున్+పలుకుట గాక= నన్నే అనటంకాక; నీకున్+పని ఏల?= నీ కెందుకు (ఆ మాటలు నన్నే అన్నవి వాటికి బదులు నే నిస్తాను. నీకెందుకు? - అని అంటున్నాడు); నీవు+అటు+ఉండుము= నీవట్లా ఉండుము (నీవు మాటాడవద్దు); అని పలికి= అని చెప్పి; రాధేయు రథంబునకున్= కర్ణుడి తేరునకు; అభిముఖుండు+ఐ= ఎదురుగా నిలిచి.

తాత్పర్యం: తరువాత భీముడు అర్జునుడితో కర్ణుడు తన్నాడిన మాటలన్నీ చెప్పి, అతడినెదుర్కొని అన్నివిధాల హతమారుస్తా నన్నాడు. అందు కర్జునుడు 'ఆ మాటలు నా చెవిని వేయటం వలన అవి నన్ను అన్నట్లే. నీకెందుకు? అతడికి బదులు నే నిస్తాను. నీ వూరకుండుము' అని కర్ణుడి తేరున కెదురుగా పోయి (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'ఏమిర కర్ణ! భీము నటులేటికిఁ దిట్టి; తతండు దోల సి
గ్గేమియు లేక పాఱునెడ నెవ్వరు దిట్టిరి నిన్ను గెల్పు సం
గ్రామములోనఁ దప్పిదము గల్గిన యంతన యింతగర్వ మే
లా? ముసు ని న్నెఱుంగమె? చలంబున సాత్యకి యిప్డు గెల్వఁడే? 288

ప్రతిపదార్థం: ఏమిర కర్ణ!= ఏరా కర్ణా!?; భీమున్+అటులు+ఏటికిన్ తిట్టితి(వి)= భీముడిని ఆ విధంగా (అవమానకరంగా) ఎందుకు తిట్టావు?; అతండు= ఆ భీముడు; తోలన్= తరుమగా; సిగ్గు+ఏమియు లేక= ఎంతమాత్రం సిగ్గు లేక; పాఱున్+ఎడన్= పరుగెత్తిన సమయంలో; నిన్నున్+ఎవ్వరు తిట్టిరి?= నిన్నెవరు తిట్టారు?(అవమానించారు?); సంగ్రామములోనన్= యుద్ధంలో; గెల్పు= జయం; తప్పిదము కల్గినన్= తప్పిపోతే; అంతన్+అ= అంతలోనే; ఇంత గర్వము+ఏలా?= ఇంత గర్వమెందుకు?; మును= ఇంతకుముందు; నిన్నున్+ఎఱుంగమె?= నీ సంగతి తెలియనిదా?; చలంబునన్= పట్టుదలతో; ఇప్డు= ఈసమయాన; సాత్యకి= సాత్యకి (నిన్ను); గెల్వఁడే?= జయించలేదా?

తాత్పర్యం: 'ఏరా కర్ణా! భీముడిని ఆ విధంగా ఎందుకు తిట్టావు? అతడు తరిమినపుడు సిగ్గు లేక పరుగెత్తావే! అపుడు ని న్నెవరయినా తిట్టారా? యుద్ధంలో ఓటమి తప్పా? ఇంత గర్వ మెందుకురా! ఇంతకు ముందు నీ గురించి తెలియదా? ఇపుడు సాత్యకి నిన్ను గెలువలేదా?

క. గెలుపును నోటమియును ననిఁ। గలుగవె? యెడపెట్టి యెట్టిఘనులకు నిమ్మెఁ
బలుకుదురే తగువారిం। దులువా! నీకులము గుణముఁ దోఁచెం బ్రజకున్. 289

ప్రతిపదార్థం: తులువా!= తుంటరీ!; అనిన్= యుద్ధంలో; గెలుపును ఓటమియును= జయాపజయాలు; కలుగవె?= కలుగవా?; ఎడ పెట్టి= తొలగించి; ఎట్టి ఘనులకున్= ఎంత గొప్పవారైనా; తగువారిన్= సాటివారిని; ఈ+మెయిన్= ఈ విధంగా; పలుకుదురే?= మాటాడుదురా?; నీ కులము= నీ వంశమూ; గుణమున్= గుణమూ; ప్రజకున్+తోఁచెన్= జనులకు కూడా తెలుసు.

తాత్పర్యం: యుద్ధంలో ఎంత గొప్పవారికైనా గెలుపోటములు కలుగవా? ఈ వాస్తవాన్ని మరచి ఈ విధంగా సాటివారిని మాట్లాడతారా? ఓ తుంటరీ! నీ కులము, గుణం సామాన్య ప్రజలకు కూడా తెలిసివచ్చిందిరా!

వ. ఇంత వట్టును వెలారింతు నీ మాటలు మఱవకుండు; మిదియునుం గాక నాయసన్నిధిన ధర్మంబున నభిమన్యుని విల్లు దునిమితివి; దానికి నీవు గనుంగొనుచుండ ధర్మప్రకారంబున వృషసేనుని తల దునుము దు; మఱియు నీతోడంగూడ నప్పు డప్పాపం బాచరించిన వారిని నిన్ను నెట్లు సేసెదనో యటుచూడు' మని పలికితఱిమిన మనసైన్యంబు లఱిముఱినతనిపైఁగవిసినఁదత్సమరవిహారంబు దారుణంబయ్యె; మిహిరుండును మందరశ్మి యగుచు వచ్చె; నా సమయంబున సుయోధనుండు రాధేయున కి ట్లనియె. 290

ప్రతిపదార్థం: ఇంతవట్టును= ఇంతమాత్రం; వెలారింతును= చెపుతాను; ఈ మాటలు= ఈ పలుకులు; మఱవక+ఉండుము= మరచిపోవద్దు; ఇదియునున్+కాక= ఇది మాత్రమే కాదు; నా+అసన్నిధిని= నేను దగ్గర లేనపుడు; అధర్మంబునన్= ధర్మానికి వ్యతిరేకంగా; అభిమన్యుని విల్లు తునిమితివి= అభిమన్యుడి విల్లు త్రుంచావు; దానికిన్= ఆ పనికై; నీవు కనుంగొనుచుండన్= నీవు చూస్తూ ఉండగా; ధర్మప్రకారంబునన్= ధర్మమార్గంలో (అనగా మోసమునగాక); వృషసేను తల తునుముదున్= వృషసేనుడి తలను త్రుంచుతాను; మఱియున్ నీతోడన్కూడన్= ఇంకా నీతో కలసి; అప్పుడు= ఆ సమయాన; ఆ+పాపంబు+ఆచరించిన వారిని= ఆ దోషం చేసిన వారినీ; నిన్నున్= నిన్ను కూడా; ఎట్లు చేసెదనో= ఏ విధంగా చేస్తానో; అటు చూడుము అని పలికి= ఆ విధంగా చూడుమని చెప్పి; తఱిమినన్= తరుమగా; మనసైన్యంబులు= మనసేనలు; అఱిముఱిన్= తొందరగా; అతనిపైన్= అతడిమీద; కవిసినన్= క్రమ్ముకోగా; తద్+సమరవిహారంబు= ఆ యుద్ధగతి; దారుణ ప్రకారంబు+అయ్యెన్= భయంకరమైనది; మిహిరుండును= సూర్యుడుకూడా; మందరశ్మి అగుచున్ వచ్చెన్= కాంతిహీనుడుగా అయ్యాడు; ఆ సమయంబునన్= ఆ వేళలో; సుయోధనుండు= దుర్యోధనుడు; రాధేయునకున్+ఇట్లు+అనియెన్= కర్ణుడితో ఇట్లాఅన్నాడు:

తాత్పర్యం: నే నంతమాత్రం చెపుతాను. ఈ మాటలు మరచిపోవద్దు. ఇంతే కాదు - నేను లేనపుడు అధర్మంగా, న్యాయానికి వ్యతిరేకంగా అభిమన్యుడి విల్లు త్రుంచావు. దానికై నీవు చూస్తూ ఉండగానే ధర్మపద్ధతిలో వృషసేనుడి తలను త్రుంచుతాను. ఇంకా నీతో కలసి ఆ అన్యాయం చేసిన వారి నేవిధంగా చేస్తానో చూడుము' అంటూ తరుమగా, మనసేనలు తొందరగా అతడిని క్రమ్ముకోగా ఆ యుద్ధగతి చాలా భయంకరంగా మారింది. సూర్యుడు కూడా కాంతిహీను డయ్యాడు. అపుడు దుర్యోధనుడు కర్ణుడితో ఈ విధంగా అన్నాడు:

విశేషం: అర్జునుడు కర్ణుడితో నేను లేనప్పుడు నా బిడ్డ డయిన అభిమన్యుడిని నీవూ, మరికొందరూ అధర్మంగా చంపారు. నీవు, వారూ చూస్తూ ఉండగా ధర్మపద్ధతితో నీ కొడుకయిన వృషసేనుడిని నేను తల త్రుంచుతాను. దానికి నీ వేమి చేయగలవు?'అని హెచ్చరించాడు.

సీ. 'శైనేయుఁడును భీమసేనుండు నిరుదెస । రా నర్జునుఁడు సింధురాజు దెసకు
నేడ్తెఱఁ దఱిమెడు నింక నొక్కించుక । ప్రొద్దాఁగి పెనఁగినఁ బ్రొద్దు దాను
నస్తమించెడును నీయట్టి జోదునకు శ । ల్యుండును గురునందనుండుఁ గృపుఁడు
దుశ్శాసనుఁడు నేను దోడ్పడ నతనికిఁ । జేయార్పవచ్చునె? చేటుకాల

ఆ. మైనఁ బ్రతిన వట్టె నంతియ తనతోడి । వార సోదరులును వీరు సనిన
నేల యెల్ల మనము యేలుద మిత్తఱి । నలవుఁ జలముఁ జూపవలయు నీవు.' 291

ప్రతిపదార్థం: శైనేయుఁడును= సాత్యకీ; భీమసేనుండును= భీముడూ; ఇరుదెస రాన్= రెండు ప్రక్కల రాగా (చక్రరక్షకులవలె రాగా); అర్జునుఁడు= అర్జునుడు; సింధురాజుదెసకున్= సైంధవుడి దిక్కునకు; ఏడ్తెఱన్+తఱిమెడు= విజృంభణంతో తరుముతున్నాడు; ఇంకన్

ఒక్కించుక ప్రొద్దు= ఇంక కొంతసేపు; ఆఁగి పెనఁగినన్= నిలిపి యుద్ధంచేస్తే; ప్రొద్దు తాను= సూర్యుడు తానుకూడా; అస్తమించెడును= అస్తమిస్తాడు; నీ అట్టి జోదునకున్= నీవంటి వీరుడికి; శల్యుండును, గురునందనుండు, కృపుఁడు, దుశ్శాసనుఁడు, నేను తోడ్పడన్= శల్యుడు, అశ్వత్థామ, కృపాచార్యుడు, దుశ్శాసనుడూ, నేనూ తోడు కాగా; చేయార్పవచ్చునె?= చేయి కదల్చ సాధ్యమా?; చేటుకాలమైనన్ ప్రతిన పట్టెన్= (తనకు) చెడిపోయే కాలం కాగా శపథం చేశాడు; అంతియ= అంతమాత్రమే; తనతోడి వార సోదరులును= తన బంధువులు, సోదరులు; వీరు+చనినన్= వీరంతా పోగా; నేల ఎల్లన్= రాజ్యమంతటినీ; మనము+అ ఏలుదము= మనమే పాలిద్దాం; ఈ+తఱిన్= ఈ సమయంలో; అలవున్= బలమూ; చలమున్= పట్టుదలా; నీవు చూపవలయున్= నీవు చూపించవలెను.

తాత్పర్యం: 'సాత్యకీ, భీమసేనుడూ రెండు ప్రక్కల రాగా అర్జునుడు సైంధవు డున్న దిక్కునకు విజృంభణంతో సేనను తరుముతున్నాడు. ఇంక కొంత సేపు అతడిని ఆపగలమేని సూర్యు డస్తమిస్తాడు. నీవంటి వీరుడికి శల్యుడూ, అశ్వత్థామా, కృపాచార్యుడూ, దుశ్శాసనుడూ, నేనూ తోడుకాగా అతడికి చేయి కదిలించటం సాధ్యమా! పోగాలం వచ్చి వా డటువంటి ప్రతిజ్ఞ చేశాడు. వీడితోకూడా వాడి సోదరులు కూడ పోయే వారే. వీరి అనంతరం రాజ్యమంతా మనమే ఏలుదాం. ఈ సమయంలో నీవు ఉపాయమూ, పట్టుదలా చూపించవలయును' (అని దుర్యోధనుడు కర్ణుడితో అన్నాడు).

వ. అనిన సూతనందనుం డమ్మానవపతి నాలోకించి. 292

తాత్పర్యం: అనగా కర్ణు డారాజును (దుర్యోధనుడిని) చూచి.

చ. 'అనిలతనూజు బాణముల నంగము లెల్లను జాల నొచ్చె నై
నను నను మీఱ వచ్చునె? రణంబునఁ గ్రీడికి మేదినీశు మ
న్నన గల మేటిబంటు ప్రధనంబున నింతలు సేయ కున్న నొ
ప్పునె? యనిఁ బేర్చువాఁ డ నట భూవర! దైవము నేర్చు' నావుడున్. 293

ప్రతిపదార్థం: భూవర!= ఓ రాజా! (దుర్యోధనా!); అనిల తనూజు బాణములన్= భీముడి బాణాలతో; అంగములు+ఎల్లను= అవయవాలన్నీ; చాల నొచ్చెన్= మిక్కిలి బాధ చెందినవి; ఐనను= అయినప్పటికినీ; క్రీడికిన్= అర్జునుడికి; రణంబునన్= యుద్ధంలో; ననున్ మీఱవచ్చునె?= నన్నతిశయింపవచ్చునా?; (నన్నుమీరవచ్చునా); మేదినీశు= రాజుయొక్క; మన్నన కల మేటిబంటు= ఆదరంగల గొప్ప వీరుడు; ప్రధనంబునన్= యుద్ధంలో; ఇంతలు చేయకున్నన్= ఈ మాత్రం చేయనట్లయితే; అటన్= అక్కడ; ఒప్పునె?= తగునా?; అనిన్= యుద్ధంలో; పేర్చువాఁడన్= విజృంభించేవాడిని; దైవము+అ నేర్చు= దేవుడికే తెలియును; నావుడున్= అనగా.

తాత్పర్యం: ' భీముడి బాణాల తాకిడికి నా ఒడలంతా నొచ్చి ఉన్నది. అంతమాత్రాన అర్జునుడు యుద్ధంలో నన్ను మీరగలడా? రాజుగారి ఆదరమున్న మేటిబంటును. ఈ మాత్రం కూడా యుద్ధం నేను చేయకుండటం ధర్మమా? యుద్ధంలో విజృంభిస్తాను. ఆ మీద దైవ మున్నాడు.' అని కర్ణుడు తన రాజభక్తిని చాటుకొన్నాడు. అతడి మాటలు విని (తరువాతి గద్యంతో అన్వయం).

వ. ఆతండు ప్రీతుం డయ్యె; నయ్యవసరంబున భీమ సాత్యకి సహాయుం డగు నా సవ్యసాచి గాడ్పు తోడు గల యగ్నిదేవుండునుం బోలె దేజరిల్లె; భల్లాది బాణంబులు నీ బలంబులపై నిగిడింపఁ జతురంగంబుల యవయవంబులుఁ జామర ఛత్రకేతుక శకలంబులుఁ గోదండ గదాదండాది హేతిఖండంబులుఁ గీడ్వెరసి పాఱు నెత్తురుటేఱులుఁ దెట్టువలు గట్టె; నట్టియెడ దుర్యోధన కర్ణవృషసేన శల్య కృపాశ్వత్థామలు గడంగి తమతోడన తఱుము జయద్రథుం బిఱిందికిఁ ద్రోచికొని ప్రొద్దులావునం జేవయెక్కి యక్కిరీటిం దాఁకి

తీవ్రశరంబులు పరఁగించిన నవి యతం డొక్కొక్కటిం బెక్కుతునియలు సేయం దఱిమి యందఱు నొక్కుమ్మడి యొక్కొక్కరుండు పె క్కమ్ము లమ్మధుసూదన ధనంజయ తనువులం బఱపిన నన్నరుం డుఱక యొక్కొక్కరినిం బెక్కు నారాచంబుల స్రుక్కించి. 294

ప్రతిపదార్థం: ఆతండు= ఆ దుర్యోధనుడు; ప్రీతుండు+అయ్యెన్= సంతోషించాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; భీమ సాత్యకి సహాయుండు+అగు= భీమసాత్యకుల తోడు కలవా డయిన; ఆ సవ్యసాచి= ఆ అర్జునుడు; గాడ్పుతోడు కల= గాలి సహాయంగా ఉన్న; అగ్నిదేవుండునున్+పోలెన్= అగ్నిదేవుడి మాదిరిగా; తేజరిల్లెన్= వెలిగాడు; భల్లాది బాణంబులు= బల్లెములు మొదలయిన బాణాలను; నీ బలంబులపైన్ నిగిడింపన్= నీ సేనలమీద వేయగా; చతురంగంబుల= నాలుగు విధాలయిన (రథ, గజ, తురగ, పదాతుల) సైన్యముల; అవయవంబులు= శరీరంలోని భాగాలు; చామర+ఛత్ర, కేతు, శకలంబులు= (రాచరికమును చాటే) వింజామరాలు, గొడుగులు, పతాకాలు - వీటి ముక్కలు; కోదండ= విండ్లు; గదా= గదలు; దండ+ఆది= కర్రలు మొదలైన; హేతి= ఆయుధాల యొక్క; ఖండంబులు= ముక్కలు; కీడ్పొరసి= చెడిపోయి; పాఱు= ప్రవహిస్తున్న; నెత్తురు+ఏఱులన్= రక్త ప్రవాహాలలో; తెట్టువలుకట్టెన్= గుంపులుగా గుట్టలయినవి; అట్టి ఎడన్= ఆ సమయంలో; దుర్యోధన కర్ణ వృషసేన శల్య కృప+అశ్వత్థామలు= వీరందరునూ;కడంగి= పూనుకొని; తమతోడన తఱుము= తమతో కలిసి తరుముతూ ఉన్న; జయద్రథున్+పిఱిందికిన్ త్రోచికొని= సైంధవుడిని తమవెనుకకు త్రోసికొని; ప్రొద్దులావునన్= ప్రొద్దు అధికం అయినందు వలన; చేవ ఎక్కి= ధైర్యం ఎక్కువై; ఆ+కిరీటిన్+తాఁకి= ఆ అర్జునుడిని ఎదుర్కొని; తీవ్రశరంబులు= వాడి బాణాలు వేయగా; అవి= ఆ బాణాలను; అతండు= అర్జునుడు; ఒక్కొక్కటిం= ఒక్కొక్కదానిని; పెక్కుతునియలు చేయన్= అనేకములైన ముక్కలు చేయగా; తఱిమి= తరుముకొని; అందఱున్= ఆ వీరులందరును; ఒక్కుమ్మడి= ఒక గుంపుగా; ఒక్కొక్కరుండు= ఒక డొక్కడే; పెక్కు+అమ్ములు= అనేక బాణాలను; ఆ+మధుసూదన, ధనంజయ తనువులన్= ఆ శ్రీకృష్ణార్జునుల శరీరాలలో;పఱపినన్= వ్యాపింపజేయగా (చొప్పించగా); ఆ+నరుండు= ఆ అర్జునుడు; ఉఱక= లెక్కించక; ఒక్కొక్కరిని= ఒకరొకరిని; పెక్కు నారాచంబులన్= అనేకము లయిన వాడి బాణాలతో; స్రుక్కించి= మూర్ఛిల్లజేసి.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు సంతోషించాడు. భీముడు, సాత్యకి తోడు రాగా అర్జునుడు, గాలి తోడైన అగ్నిదేవుడి మాదిరిగా వెలుగుతూ, బల్లెములు, బాణాలూ నీ సేనమీద గుప్పించగా,చతురంగ అవయవాలు చామరమునూ గొడుగునూ పతాకాలనూ ముక్కలు, విండ్లూ గదలూ మొదలైన ఆయుధాలు ముక్కలు సొగసు బాసి నెత్తురుటేరుల ప్రవాహంలో కుప్పలు గట్టి తేలాడయి. దుర్యోధనుడు కర్ణవృషసేన శల్య కృపాశ్వత్థామలు పూనికతో తమతోకూడా శత్రు సైన్యాల తరుముకొని వచ్చే సైంధవుడిని వెనుకకు నెట్టి, ప్రొద్దు ఎక్కువ కావటం వల్ల ధైర్యం ఎక్కువై ఆ అర్జునుడిని ఎదుర్కొని వాడి బాణాలు వేశారు. వాటిని ఆత డొక్కొక్క దానిని ముక్కలు చేశాడు. అందరూ గుంపుగా ఒకేమారు విడిగా ఒక్కొక్కడు అనేక బాణాలు ఆ కృష్ణార్జునుల శరీరాలలో గ్రుచ్చుకొనేటట్లువేశారు. ఆ అర్జునుడు లెక్కసేయక, ఒక్కొక్కరిని పెక్కు వాడి బాణాలతో మూర్ఛిల్లజేశాడు.

కర్ణార్జునుల ద్వంద్వ యుద్ధము (సం.7-120)

క. సింధుపతిదెసకు మదవ । త్సింధురగతిఁ గవియఁ జూచి ధీరోద్ధతిఁ గో
పాంధమతి నడ్డపడియె వ । సుంధర గ్రక్కదల సూతసూనుం డధిపా! 295

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా!; సింధుపతి దెసకున్= సింధుదేశపు రాజుదిక్కుకు (సైంధవుడి దిక్కుకు); మదవత్+సింధురగతిన్= మదపుటేనుగు మాదిరిగా; కవియన్+చూచి= క్రమ్ముకొన చూచి; ధీరోద్ధతిన్= ధైర్యాతిశయంతో; కోప+అంధమతిన్= కోపం వలన గ్రుడ్డిదైన మనస్సుతో; వసుంధర= భూమి; గ్రక్కదలన్= అదరగా; సూతసూనుండు= కర్ణుడు; అడ్డపడియెన్= అడ్డంగా వచ్చాడు.

తాత్పర్యం: ఓ రాజా! (ధృతరాష్ట్రా!) సైంధవు డున్న దిక్కునకు మదపుటేనుగువలె అర్జునుడు దూకగా చూచి, దర్పాతిశయంతో, కోపం పెల్లుబుకగా గ్రుడ్డిదైనమనస్సుతో భూమి అదరగా కర్ణ డడ్డుపడ్డాడు.

వ. అప్పుడు. 296

తాత్పర్యం: ఆ సమయంలో.

ఆ. పదియు నేను నిశిత బాణంబు లర్జునుఁ। డనిలనందనుండు శినివరుండు
మూఁడు మూఁడు మెఱుఁగు వాఁడి తూపులు మేను। గాఁడ నేయ నొచ్చి కర్ణుఁ డలిగి. 297

ప్రతిపదార్థం: పదియునేను= పదునైదు; నిశిత బాణంబులు= వాడిబాణాలు; అర్జునుఁడు= అర్జునుడును; అనిలనందనుండు= భీముడు; శినివరుండు= సాత్యకి; మూఁడు మూఁడు= మూడేసి; మెఱుఁగు వాఁడితూపులన్= మెరిసే వాడిబాణాలను; మేను కాఁడన్= ఒంటిలో నాటుకొనేటట్లు; ఏయన్= కొట్టగా; నొచ్చి= బాధపడి; కర్ణుఁడు+అలిగి= కర్ణుడు కోపించి.

తాత్పర్యం: పదిహేను వాడి బాణాలు అర్జునుడును, భీమ సాత్యకులు మూడేసి వాడి బాణాలు ఒంటిలో గ్రుచ్చుకొనేటట్లు వేయగా, కర్ణుడు కోపించి.

క. అఱువది యఱువదియమ్ముల। నెఱఁకులు నోనాడ నేసి నిలిపి తన రయం
బెఱిఁగించె ముప్పురకు న। త్తెఱఁ గద్భుతరసమువెల్లిఁ దేల్చె జనములన్. 298

ప్రతిపదార్థం: అఱువది+అఱువది అమ్ములన్= అరవై అరవైగా బాణాలతో; నెఱఁకులు నోనాడన్= మర్మాలు నొవ్వగా; ఏసి= కొట్టి; నిలిపి= ఆపి; ముప్పురకున్= అర్జున, భీమ, సాత్యకులు ముగ్గురికి; తన రయంబు= తనవేగమును(బాణాలు వేయుటలోని వేగమును); ఎఱిఁగించెన్= తెలిపాడు; ఆ+తెఱఁగు= ఆ పద్ధతి; జనములన్= చూచే జనాలను; అద్భుతరసము= ఆశ్చర్య రసం; వెల్లిన్+తేల్చెన్= వెల్లువలో తేల్చింది.

తాత్పర్యం: (కర్ణుడు) అరువది అరువది బాణాలతో ఆయువు పట్లునొచ్చేటట్లుకొట్టి, తన వేగాన్ని తెలియజేశాడు. అది చూచేవారి నంతా అద్భుతరస ప్రవాహంలో ముంచింది.

ఆ. నరుఁడు నూఱు తీవ్రశరముల నయ్యోధ। వరుని తనువు రక్తవారిఁ దోఁప
నాతఁ డట్టి నూఱు లై దడరించె న। వ్వేగమునకు రోష వివశుఁ డగుచు. 299

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; నూఱు తీవ్రశరములన్= నూఱు వాడి బాణాలతో; ఆ+యోధవరుని తనువు= ఆ వీరవరుని ఒడలు;రక్తవారిన్+తోఁపన్= నెత్తుటిలో కానరాగా; ఆతఁడు= ఆ కర్ణుడు; అట్టి నూఱులు= ఆ విధమైన నూరులు; ఐదు+అడరించెన్= అయిదింటిని వేశాడు (అనగా అయిదు నూరు బాణాలను వేశాడు); ఆ+వేగమునకున్= ఆ తీవ్రతకు; రోషవివశుఁడు+అగుచున్= కోపంతో పరవశుడౌతూ.

తాత్పర్యం: అర్జునుడు నూరు వాడి బాణాలతో కొట్టి, ఆ వీరశ్రేష్టుడి శరీరాన్ని నెత్తుటితో తడిసి కనుపించేటట్లుగా చేశాడు. ఆ కర్ణుడు అటువంటివి అయిదు నూర్ల బాణాలను వేశాడు. ఆ వేగానికి అర్జునుడు కోపంతో వివశుడవుతూ.

క. ఆ విజయుఁడు గర్ణుని విలు। వావిరిఁ దునుమాడి విపుల వక్షము నవ బా
ణావిద్ధము సేసి యతని। జీవము గొనునట్టి ఘన విశిఖ మేసె వడిన్. 300

ప్రతిపదార్థం: ఆ విజయుఁడు= ఆ అర్జునుడు; కర్ణుని విలు= కర్ణుడి వింటిని; వావిరి= వెంటనే; తునుమాడి= త్రుంచివేసి; విపుల వక్షము= వెడద అయిన గుండెను; నవబాణ= తొమ్మిది బాణాలతో; ఆవిద్ధము చేసి= తొలిచి; అతని= ఆ కర్ణుడి; జీవము కొనునట్టి= ప్రాణం తీసేటటువంటి; ఘనవిశిఖము= గొప్ప బాణాన్ని; వడిన్= త్వరగా; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: ఆ అర్జునుడు వేగంగా కర్ణుడి విల్లు త్రుంచివేశాడు. తొమ్మిది బాణాలతో విశాలమయిన అతడి గుండెను తొలిచాడు. ఆతడి ప్రాణాలను తోడే వాడిబాణంతో కొట్టాడు.

వ. అది యర్ధచంద్రసాయకంబున నశ్వత్థామ త్రుంచె; నంతం గాంచన భాసితంబగు శరాసనంబు గొని రాధేయుండు రయంబునఁ దీవ్రశరంబులు పరఁగింప నర్జునుఁడు 'నిలునిలు కర్ణ! యర్జును నెఱుంగవే?' యనుచు ననేక చండకాండంబులం గప్పినఁ గర్ణుండు 'నిలునిలు మర్జున! కర్ణు నెఱుంగవే?' యనుచు నతని బహుపటు ప్రదరంబులం బొదివె; న ట్లయ్యిరువురు నొండొరుల కదృశ్యమూర్తులై సురల గ్గింపం బోరుచుండం గౌరవపతి తన వారి నెలుంగెత్తి కర్ణునకుఁ దోడ్పడుం డని పనిచె; నక్కొలందికిం గిరీటి కోపాటోపంబున. 301

ప్రతిపదార్థం: అది= ఆ బాణమును; అర్ధచంద్ర సాయకంబునన్= అర్ధచంద్రాకారంలో ఉన్న బాణంతో; అశ్వత్థామ త్రుంచెన్= అశ్వత్థామ త్రుంచివేశాడు; అంతన్= ఆ మీదట; కాంచన భాసితంబు+అగు= బంగారు వన్నె గల; శరాసనంబుకొని= విల్లును తీసికొని; రాధేయుండు= కర్ణుడు; రయంబునన్= వేగంగా; తీవ్రశరంబులు పరఁగింపన్= వాడి బాణాలు వేయగా; అర్జునుండు= అర్జునుడు; నిలు నిలు కర్ణ!= ఆగు మాగుము కర్ణ!; అర్జునున్+ఎఱుంగవే?= అర్జునుడిని తెలియవా?; అనుచున్= అంటూ; అనేక చండ కాండంబులన్ కప్పినన్= మిక్కిలి తీవ్రమైన బాణాలతో కప్పగా; కర్ణుండు= కర్ణుడు; నిలు నిలుము+అర్జున!= ఓ అర్జునా! ఆగుమాగుము; కర్ణున్+ఎఱుంగవే?= కర్ణుడిని తెలియవా?; అనుచున్= అంటూ; అతనిన్= ఆ అర్జునుడిని; పటు= తీవ్రమైన; ప్రదరంబులన్= బాణాలతో; పొదివెన్= కప్పాడు; అట్లు+ఆ+ఇరువురున్= ఆ విధంగా ఆ ఇద్దరూ; ఒండొరులకున్= ఒకరికొకరు; అదృశ్యమూర్తులు+ఐ= కానరాకుండా; సురలు+అగ్గింపన్= దేవతలు కీర్తించగా; పోరుచుండన్= యుద్ధం చేస్తుండగా; కౌరవపతి= దుర్యోధనుడు; తనవారిన్= తన సైనికులను; ఎలుంగు+ఎత్తి= పెద్ద గొంతుతో; కర్ణునకున్+తోడ్పడుండు+అని పనిచెన్= సహాయపడండని పంపాడు; ఆ+కొలందికిన్= ఆ పరిమితికి; కిరీటి= అర్జునుడు; కోప+ఆటోపంబునన్= కోపంతోడి విజృంభణంతో.

తాత్పర్యం: ఆ (అర్జునుడి) బాణాన్ని అశ్వత్థామ అర్ధచంద్రాకారం గల బాణంతో త్రుంచాడు. ఆ మీద బంగారురంగు విల్లు తీసికొని కర్ణుడు వేగంగా వాడి బాణాలను వేయగా, అర్జునుడు 'కర్ణా! ఆగాగు' మంటూ 'అర్జును నెరుంగవా?' అని తీవ్రబాణాలు వేసి కప్పాడు. దానికి కర్ణుడు 'అర్జునా! నిలునిలు'మంటూ, 'కర్ణుడిని గూర్చి నీకు తెలియదా?' అంటూ తీవ్రమయిన బాణాలతో అర్జునుడిని కప్పాడు. ఒకరి కొకరు అగుపడకుండా ఆ ఇద్దరూ చేసే యుద్ధం దేవతలు పొగడే విధంగా సాగింది. అపుడు దుర్యోధనుడు తన సైనికులను ఎలుగెత్తి పిలుస్తూ కర్ణుడికి తోడ్పడవలసిందిగా పంపాడు. ఆ పనికి అర్జునుడు కోపాటోపంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. తురగవ్రాతముఁ గూల్చి, సూతు తనువుం దున్మాడి, విద్వేషి భీ
కర నారాచపరంపరానిహతి నంగం బార్తి నొందింప నా
తురుఁ డై కర్ణుఁడు దర్పహీనుఁ డగుడున్ ద్రోణాత్మజుం డెయ్ది యా
త్మరథస్థుండుగఁ జేసి యేసె విజయున్ మద్రేశుఁడుం దోడ్పడన్. 302

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: (అర్జునుడు కోపాటోపంతో) తురగవ్రాతమున్+కూల్చి= (కర్ణుడి) గుర్రాలను పడగొట్టి; సూతు తనువున్+తున్మాడి= సారథి శరీరాన్ని త్రుంచి; విద్వేషిన్= శత్రువును (కర్ణుడిని); భీకర= భయంకరమైన; నారాచపరంపరా నిహతిన్= వాడి బాణాల మొత్తంతో కొట్టటంచేత; అంగంబు= ఒడలిని; ఆర్తిన్+ఒందింపన్= బాధపెట్టగా; ఆతురుఁడు+ఐ కర్ణుఁడు= బాధపడినవాడై కర్ణుడు; దర్పహీనుఁడు+అగుడున్= గర్వాన్ని పోగొట్టుకొన్నవాడు కాగా; ద్రోణ+ఆత్మజుండు= అశ్వత్థామ; ఎయ్డి= సహాయపడి (ఆదుకొని); ఆత్మరథస్థుండుగన్+చేసి= తన రథంమీద ఉండేటట్లుగా చేసి; మద్ర+ఈశుఁడున్ తోడ్పడన్= శల్యుడు కూడా తోడ్పడగా; విజయున్= అర్జునుడిని; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: కర్ణుడి గుర్రాలను పడగొట్టి, సారథిని చంపి, భయంకరమైన బాణాలతో మోది, శరీరాన్ని బాధపెట్టగా గర్వహీనుడై కర్ణుడు బాధపడ్డాడు. అపు డశ్వత్థామ ఆదుకొని, తన రథం మీదకి ఎక్కించుకొని, శల్యుడు సహాయపడగా అర్జునుడిని బాణాలతో కొట్టాడు.

తే. కృపుఁడు వృషసేనుఁడును వారికెడన కూడి । పార్థు తనువునఁ దూపులు పఱపి; రట్లు
పొదువు నలువుర పిఱుఁదను బొంచి సింధు । వరుఁడు నిగిడించె నమ్ములు నరుని మీఁద. 303

ప్రతిపదార్థం: కృపుఁడు= కృపాచార్యుడు; వృషసేనుఁడును= వృషసేనుడు (కర్ణుడి కొడుకు); వారి కెడన కూడి= వారి ప్రక్కనే (శల్యాశ్వత్థామల ప్రక్కనే) చేరి; పార్థు తనువునన్= అర్జునుడి ఒంటిమీద; తూపులు= బాణాలను; పఱపిరి= ప్రయోగించారు (గుప్పించారు); అట్లు= ఆ విధంగా; పొదువు= క్రమ్ముకొన్న; నలువుర పిఱుఁదను= నలుగురి వెనుక; పొంచి= దాగి; సింధువరుఁడు= సైంధవుడు; నరునిమీఁదన్= అర్జునుడి మీద; అమ్ములు నిగిడించెన్= బాణాలు వేశాడు.

తాత్పర్యం: కృపాచార్యుడు, వృషసేనుడు శల్యాశ్వత్థామల ప్రక్కకు చేరి, అర్జునుడి శరీరం మీద బాణాలు వేశారు. వారి నల్వుర వెనుక దాగికొని సైంధవుడు కూడ అర్జునుడి మీద బాణాలు వేశాడు.

క. గురుతనయ ప్రముఖ రథిక । వరుల భుజావిక్రమంబు వారించుచు ని
ర్భరరోషమునం బార్థుఁడు । శరంబు లతిముతి నిగిడ్చె సైంధవుమీఁదన్. 304

ప్రతిపదార్థం: గురుతనయ ప్రముఖ= అశ్వత్థామ మొదలగు మొనగాండ్రైన; రథికవరుల= సైనిక శ్రేష్ఠుల; భుజావిక్రమంబు= భుజబలాన్ని; వారించుచున్= అడ్డుకొంటూ; నిర్భరరోషమునన్= ఎక్కువయిన కోపంతో; పార్థుండు= అర్జునుడు; శరంబులన్= బాణాలను; అతిముతి= విస్తారంగా; సైంధవుమీఁదన్= సైంధవుడిపైన; నిగిడ్చెన్= వేశాడు.

తాత్పర్యం: అశ్వత్థామాది రథికశ్రేష్ఠుల భుజవిక్రమమును అడ్డుకొంటూ ఎక్కువ కోపంతో అర్జునుడు సైంధవుడి మీద బాణాలను వేశాడు.

వ. ఆ సమయంబున సుయోధనుండు సేనలకుం జేయి వీచిన నొక్కుమ్మడిం గవ్వడిఁ గదిసి వివిధ హేతివ్రాతంబులు మేన నించి నొంచిన గలంక లేక కడంగి. 305

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ వేళలో; సుయోధనుండు= దుర్యోధనుడు; సేనలకున్= తన సైనికులకు; చేయి వీచినన్= చేయి ఊపగా (సైగ చేయగా); ఒక్క+ఉమ్మడిన్= ఒక్క గుంపుగా; కవ్వడి కదిసి= అర్జునుడిని తాకి; వివిధ హేతివ్రాతంబులు= నానా విధ ఆయుధ సమూహాలు; మేన నించి= అతడి శరీరం నిండా నింపి; నొంచినన్= నొప్పించగా; కలంక లేక కడంగి= చీకాకు పడకుండా పూనుకొని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అర్జునుడు సైంధవుడి మీద బాణాలు వేసిన సమయంలో దుర్యోధనుడు తన సేవలకు చేయి ఊపగా వా రొక్క గుంపుగా అర్జునుడిని క్రమ్ముకొని, అనేక విధాలైన ఆయుధాలతో అతడి ఒడలిని నొప్పించారు. అయినా అర్జునుడు చీకాకు పడకుండా ప్రయత్నంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

శా. **గాండీవంబు గుణంబు ఘోరరవ మాకాశంబునం బర్వ వే**
దండస్యందన ఘోటకంబులు మహాస్త్ర క్రూరపాతంబుల
న్ఖండీభూతములున్ విదారితములు న్భగ్నంబులుం గా సము
ద్దండుం డై యడరం గలంగి పఱచెన్ తత్సైన్యసంతానముల్. **306**

ప్రతిపదార్థం: గాండీవంబు గుణంబు= గాండీవంయొక్క అల్లెత్రాటి; ఘోరరవము= భయాన్ని కలిగించే శబ్దం; ఆకాశంబునన్+పర్వన్= ఆకాశమంతా వ్యాపించగా; వేదండస్యందన= ఏనుగులూ, రథాలూ; ఘోటకంబులు= గుర్రాలూ; మహా+అస్త్ర= గొప్ప అస్త్రముల; క్రూరపాతంబులన్= భయంకరంగా మీదపడటం వలన; తత్సైన్యసంతానముల్= ఆ సేనల సమూహాలు; ఖండీభూతములున్= ముక్కలుగా నయినవీ; విదారితములున్= ఖండితములయినవీ; భగ్నంబులున్+కాన్= విరిగినవీకాగా; సముద్దండుండు+ఐ= మించినవాడై; అడరన్= విజృంభించగా; కలంగి= సంక్షోభం పొంది; పఱచెన్= పరుగెత్తాయి.

తాత్పర్యం: గాండీవానికుండే అల్లెత్రాటి టంకార శబ్దం ఆకాశం అంతా వ్యాపించగా, ఏనుగులు రథాలు గుర్రాలు భయంకరమయిన బాణాలతాకిడికి ముక్కలుగా చీల్చబడినవీ, భగ్నమయినవీ కాగా, అర్జునుడి విజృంభణకు ఆ సేనల సమూహాలు సంక్షోభంచెంది పారిపోయాయి.

వ. **ఇట్లు ప్రచండమూర్తియై మధ్యందిన మార్తాండుండునుం బోలె వెలింగి విష్వచ్ఛుండు వియ్యచ్చరుల కచ్చెరువందించె; వెండియు దొరలందఱు నొక్కటఁ దఱుమ నతం డదల్చి యమ్ముల వెల్లిం దేల్చి తెరల్చి దీప్తబాణపాత పూర్వకంబుగా జయద్రథునకుం గవిసిన నమ్మహారథుండు.** **307**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ప్రచండమూర్తి ఐ= భయాన్ని కలిగించే ఆకారం కలవాడై; మధ్యందిన= మట్టమధ్యాహ్నంలోని; మార్తాండుండునున్+పోలెన్= సూర్యుడి మాదిరిగా; వెలింగి= ప్రకాశించి; విష్వచ్ఛుండు= అర్జునుడు; వియత్+చరులకున్= ఆకాశంలో తిరిగేవారికి (దేవతలకు); అచ్చెరువు+అందించెన్= ఆశ్చర్యాన్ని కలిగించాడు; వెండియున్= ఇంకను; దొరలందఱును= సేనానులందరూ; ఒక్కటన్= ఒక్కటిగా; తఱుమన్= మూకుమ్మడిగా తరుమగా; అతండు= ఆ అర్జునుడు; అదల్చి= అదరగొట్టి; అమ్ములవెల్లిన్+తేల్చి= బాణప్రవాహంలో తేలజేసి; తెరల్చి= తొలగించి; దీప్త=వెలుగుతూ ఉన్న (వేడిగల); బాణపాతపూర్వకంబుగాన్= బాణాలను వేస్తూ; జయద్రథునకున్= సైంధవుడిమీదకు; కవిసినన్= దూకగా; ఆ+మహారథుండు= ఆ గొప్ప రథికుడయిన సైంధవుడు.

తాత్పర్యం: ఈ విధంగా భయంకరమూర్తి అయి, మట్టమధ్యాహ్నపు సూర్యుడివలె మండుతూ అర్జునుడు ఆకాశచారులను ఆశ్చర్యపరచాడు. ఆ సేనానులందరూ మూకుమ్మడిగా తరుముకొని రాగా, వారి నదల్చి బాణాలవెల్లువలో తేల్చి తరిమి, మండే బాణాలతో సైంధవుడి మీదకు దూకాడు. ఆ మహారథుడైన సైంధవుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **పావక హయకేతన గాం। డీవములం బార్థుమ్రైఁ గడింది వడిన్ సై**
న్యావళియు దేవతలు నా। నా విధములఁ బొగడ నాఁటె నారాచంబుల్. **308**

ప్రతిపదార్థం: (సైంధవుడు) పోవక= పరుగెత్తిపోకుండా; హయ= గుర్రాలను; కేతన= జెండాను; గాండీవములన్= (అర్జునుడి విల్లయిన) గాండీవాన్ని; పార్థుమైన్= అర్జునుడి ఒంటిమీద; కడింది వడిన్= మిక్కిలి వేగంగా; సైన్యావళియున్= సేనా సమూహమూ; దేవతలు= దేవతలూ; నానావిధములన్+పొగడన్= అనేక రకాలుగా కీర్తించగా; నారాచంబుల్= వాడి బాణాలను; నాఁటెన్= నాటాడు.

తాత్పర్యం: (సైంధవుడు) పరుగెత్తిపోకుండా గుర్రాల మీద, జెండా మీద, గాండీవం మీద అర్జునుడి శరీరం మీద, సేనలమీద దేవతలంతా అనేక విధాల పొగడగా వాడి బాణాలు నాటాడు.

క. **విజయుం డతని వరాహ । ధ్వజమును సారథిశిరంబు నొక్కట న**
క్కజముగఁ బడవేసిన నీ । ప్రజ తామరపాకు నీటి భంగిం దలఁకెన్. **309**

ప్రతిపదార్థం: విజయుండు= అర్జునుడు; అతని= ఆ సైంధవుడి; వరాహధ్వజమును= వరాహం (పంది) గుర్తుగా గల కేతనాన్ని; సారథిశిరంబు= సూతుడి తలను; అక్కజముగన్= ఆశ్చర్యంగా; ఒక్కటన్= ఒక్కటిగా; పడవేసినన్= పడగొట్టగా; నీ ప్రజ= నీ జనం; తామరపాకు నీటి భంగినన్= తామరాకుమీది నీరు మాదిరి; తలఁకెన్= కదలాడింది. (ఊఁగి).

తాత్పర్యం: అర్జును డా సైంధవుడి వరాహ కేతనాన్ని, సూతుడి తలను ఒకేసారి ఆశ్చర్యంగా నేల పడగొట్టాడు. అది చూచిన నీ సేన తామరాకుమీది నీరు మాదిరిగా భయంతో వణకిపోయింది.

విశేషం: అలంకారం ఉపమ.

క. **ప్రాణములు గలుగు నంతకుఁ । ద్రాణపరాయణత నీదు రథికోత్తము ల**
క్షీణజవమునఁ బ్రసారిత । బాణు లగుచు నతని కడ్డపడిరి నరేంద్రా! **310**

ప్రతిపదార్థం: నరేంద్రా!= ఓ రాజా! (ధృతరాష్ట్రా!); ప్రాణములు కలుగునంతకున్= ప్రాణాలు ఉన్నంత దాకా; త్రాణపరాయణతన్= కాపాడే ఆశతో; నీదు రథికోత్తములు= నీ సైనికోత్తములు; అక్షీణ జవమునన్= తగ్గని వేగంతో; ప్రసారిత= వేయబడిన; బాణులు+అగుచున్= బాణాలు కలవారుగా; అగుచున్= అవుతూ; అతనికిన్= ఆ సైంధవుడికి; అడ్డపడిరి= అడ్డం పడ్డారు (ఆదుకొన్నారు).

తాత్పర్యం: ఓ రాజా! నీ సేనానులు ప్రాణాలున్నంతదాకా తరుగని శక్తితో అతడిని కాపాడే పట్టుదలతో బాణాలు ప్రయోగిస్తూ అడ్డుపడ్డారు.

వ. **ఇవ్విధంబునఁ గృపాశ్వత్థామ శల్య వృషసేనులు దెంపు సేసి సైంధవున కడ్డం బైనం జూచి యా సవ్యసాచి యతనిఁ దెగఁ జూడ నెడ గానక యవుడు గఱచుచుఁ బ్రొద్దుదిక్కు గనుంగొనినఁ గేశవుం డిట్లనియె.311**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= పైన చెప్పిన విధంగా; కృప+అశ్వత్థామ శల్య వృషసేనులు= ఈ పేర్లు కలవారు; తెంపు చేసి= సాహసం చేసి; సైంధవునకున్+అడ్డంబు+ఐనన్= సైంధవుడికి అడ్డమై రాగా; చూచి= చూచినవాడై; ఆ సవ్యసాచి= ఆ అర్జునుడు; అతనిన్+తెగన్+చూడన్= ఆ సైంధవుడిని చంపటానికి; ఎడ కానక= అవకాశం తెలియక; అవుడు కఱచుచున్= తన పెదవిని పంటితో నొక్కుతూ (కోపంతో చేసే పని); ప్రొద్దుదిక్కు= సూర్యుడి వైపు; కనుంగొనినన్= చూడగా; కేశవుండు+ఇట్లు+అనియెన్= కృష్ణుడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా కృపాశ్వత్థామ శల్య వృషసేనులు సాహసంతో సైంధవుడి కాపాడటానికి అడ్డంగా (అర్జునుడి దెబ్బ తగులకుండా) నిలబడగా, ఆ అర్జునుడు సైంధవుడిని చంపేదారి తోచక, కోపంతో పెదవి నొక్కుకుంటూ సూర్యుడి దిక్కు చూడగా, కృష్ణుడు ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. ‘చక్కఁ జలము పెనఁగఁ జన దింక నినుఁడు ప । శ్చిమధరాధరంబు సేరఁ బోయె;
దీని కొక యుపాయ మేను గల్పించెదఁ । దానఁజేసికాని దాయ వడఁడు. 312

ప్రతిపదార్థం: చక్కన్= సరిగా (న్యాయంగా); చలము= మత్సరంతో (పట్టుదలతో); పెనఁగన్= పోట్లాడగా; ఇంకన్= ఇకమీద; చనదు= పనికారాదు; ఇనుఁడు= సూర్యుడు; పశ్చిమధరాధరంబు= పడమటికొండను; చేరన్+పోయెన్= చేరబోతున్నాడు; దీనికిన్= ఈ పనికి (అనగా ఈ పెనుగులాటకు); ఒక ఉపాయము= ఒక మార్గాన్ని; ఏను కల్పించెదన్= నేను ఏర్పరుస్తాను; దానన్+చేసి కాని= దానితోకాని (ఆ ఉపాయంవలన కాని); దాయ= విరోధి; పడఁడు= పడిపోడు (చనిపోడు).

తాత్పర్యం: ‘ సూటిగ పట్టుదలతో పెనగులాట ఇకమీద పనికిరాదు. సూర్యుడు పడమటి కొండను చేరబోతున్నాడు. దీనికి ఒక ఉపాయాన్ని నేను చూపిస్తాను. దానితోగాని శత్రువు పడిపోడు.

విశేషం: సూర్యు డస్తాద్రికి చేరుతున్నాడు. అదే జరిగితే అర్జునుడి ప్రతిజ్ఞ భంగమవుతుంది. కనుక సరి అయిన మార్గంలో గాక, నేను చెప్పే ఉపాయంతో శత్రువును పడగొట్టాలని శ్రీకృష్ణుడు అర్జునుడితో అన్నాడు. ఇది ఒక యుద్ధ తంత్రం.

వ. అది యెయ్యది యంటేని. 313

తాత్పర్యం: ఆ ఉపాయ మేమంటే.

క. ఇనమండలంబు మఱువడ । నొనరించెదఁ దమము పాండవోత్తమ! యది గ్రుం
కిన చంద మైన సైంధవుఁ । డును గౌరవ యోధులుం గడుం బ్రమదమునన్. 314

ప్రతిపదార్థం: పాండవ+ఉత్తమ!= పాండవులలో శ్రేష్ఠుడా! (ఓ అర్జునా!); ఇనమండలంబున్= సూర్యమండలాన్ని; మఱువడన్= మరుగుపడేటట్లు (కనపడకుండా); తమము= చీకటి; ఒనరించెదన్= చేస్తాను; అది క్రుంకిన చందము+ఐనన్= (ఆ చీకటి) సూర్యుడు అస్తమించిన విధం కాగా; సైంధవుఁడును= సైంధవుడునూ; కౌరవయోధులున్= కురు సేనావీరులునూ; కడున్ ప్రమదమునన్= మిక్కిలి సంతోషంతో.

తాత్పర్యం: ఓ పాండవోత్తమా! సూర్యమండలాన్ని మరుగుపడేటట్లుగా చీకటిని కలిగిస్తాను. అది సూర్యుడు అస్తమించిన విధం కాగా సైంధవుడూ మిగిలిన కౌరవవీరులూ చాలా సంతోషంతో.

వ. ప్రతిజ్ఞా భంగ మయ్యె నని కయ్యంబుకడంక దక్కి విచ్చలవిడి నొండొరుల మెచ్చుచుఁ బొంగి చెలంగుదు; రప్పుడు నీవూన్కి దీర్చికొ’మ్మని పలికినం బరాక్రమంబు సవ్యాజం బయ్యె నని మనోవ్యథంజెందు సవ్యసాచిం గనుంగొనుచు నమ్మాధవుండు మాయాతిమిరంబునఁ దిమిరవైరిం గప్పిన. 315

ప్రతిపదార్థం: ప్రతిజ్ఞా భంగంబు+అయ్యెన్+అని= శపథం విఫల మైనదని; కయ్యంబు కడంకన్= యుద్ధ ప్రయత్నాన్ని; తక్కి= మానుకొని; విచ్చలవిడిన్= యథేచ్ఛగా (ఇష్టం వచ్చినట్లుగా -హద్దు లేకుండా); ఒండొరులన్ మెచ్చుచున్= ఒకరినొకరు మెచ్చుకొంటూ (తమ ప్రయత్నం వలన అర్జునుడి ప్రతిజ్ఞ భంగమైనదని); పొంగి= సంతోషించి; చెలంగుదురు= తిరుగుతారు; అప్పుడు= ఆ సమయాన; నీ పూన్కి= నీ ప్రతిన; తీర్చుకొమ్ము= నెరవేర్చుకొమ్ము; అని= అంటూ; పలికినన్= చెప్పగా; పరాక్రమంబు= శత్రువును జయించటం; సవ్యాజంబు= నెపంతో కూడినది; అయ్యెన్+అని= అయిన దని; మనోవ్యథన్+చెందు= మనసులో బాధపడుతూ ఉన్న; సవ్యసాచిన్+కనుంగొనుచున్= అర్జునుడిని చూస్తూ; ఆ+మాధవుండు= ఆ కృష్ణుడు; మాయాతిమిరంబునన్= మోసపు చీకటితో; తిమిరవైరిన్= సూర్యుడిని (చీకటికి విరోధి); కప్పినన్= కప్పివేయగా.

తాత్పర్యం: ప్రతిన భంగమైనదని యుద్ధ ప్రయత్నం మాని, కౌరవవీరులు తమలోతాము ఒకరినొకరు మెచ్చుకొంటూ సంతోషంతో తిరుగుతారు. అపుడు నీ ప్రతిన తీర్చికొమ్ము' అని చెప్పగా శత్రువును జయించటానికి ఒక్క మిష కావలసి వచ్చిందని (ఉపాయం కావలసి వచ్చిందని) చీకాకుపడే అర్జునుడిని చూస్తూ, శ్రీకృష్ణుడు మాయ చీకటిని కలిగించి సూర్యుడిని కప్పివేయగా.

క. అది రవి గ్రుంకుటగాఁ గొని । మద మెసకంబెసఁగ నార్చి మన సైన్యంబుల్
వొదలెఁ దల యెత్తి హర్షా । స్పదమతి సింధుపతి యపుడు పడమర సూచెన్. 316

ప్రతిపదార్థం: అది= ఆ చీకటి; రవి= సూర్యుడు; క్రుంకుట కాన్= అస్తమించటంగా; కొని= తలచికొని; మన సైన్యంబుల్= మన సేనలు; మదము= గర్వం; ఎసకం బెసఁగన్= ఎక్కువ కాగా; ఆర్చి= సింహనాదం చేసి; పొదలెన్= తిరిగినవి; సింధుపతి= సైంధవుడు; హర్ష+ఆస్పదమతిన్= ఆనందంతో కూడిన మనసుతో; తల ఎత్తి= తన తల పైకెత్తి; పడమర చూచెన్= పడమటి దిక్కుకు చూచాడు. (అంటే సూర్యాస్తమయంతో తనకున్న ప్రమాదం తప్పిందని).

తాత్పర్యం: అది సూర్యాస్తమయంగా భావించి మన సేనలు గర్వాతిశయంతో సింహనాదాలు చేశాయి. ఆనందంతో నిండిన మనస్సుతో సైంధవుడు తల ఎత్తి, పడమటి దిక్కుకు చూచాడు.

వ. తదవసరంబున. 317

తాత్పర్యం: ఆ సమయంలో.

ఆ. 'ఎలమిఁ దేరిమీఁద నిలుచుండి పడమ ర । ట్లెత్తి చూచుచున్న యిద్దురాత్ము
మస్తకంబు దునుము మసలక' యని యర్జు । నునకుఁ జూపె సైంధవుని మురారి. 318

ప్రతిపదార్థం: ఎలమిన్= సంతోషంతో; తేరిమీఁదన్= రథంమీద; నిలుచుండి= నిలిచి; పడమర= పడమటి దిక్కుకు; అట్టు+ఎత్తి చూచుచున్+ఉన్న= మెడ ఎత్తి చూస్తూ ఉన్న; ఈ+దురాత్ము= ఈ దుర్మార్గుడి యొక్క; మస్తకంబున్= తలను; మసలక= ఆలస్యం చేయక; తునుము= త్రుంచుము; అని= అంటూ; అర్జుననకున్= అర్జునుడికి; మురారి= శ్రీకృష్ణుడు; సైంధవునిన్+చూపెన్= సైంధవుడిని చూపించాడు.

తాత్పర్యం: 'సంతోషంతో తేరిమీద నిలుచుని పడమటి దిక్కుకు మెడ ఎత్తి చూచే ఈ దుర్మార్గుడి తలను వెంటనే త్రుంచివేయుము' అంటూ శ్రీకృష్ణుడు అర్జునుడికి సైంధవుడిని చూపించాడు.

అర్జునుఁడు సైంధవుని తల దునుముట (సం. 7-121-31)

క. అతఁడు గని గంధమాల్యా । ర్చిత మై దొన మెఱయుచున్న శితశర ముగ్రో
ద్ధతి నేయ డేగ పులుఁగును । గతిఁ గొనుక్రియ నది హరించె గ్రక్కన శిరమున్. 319

ప్రతిపదార్థం: అతఁడు= ఆ అర్జునుడు; కని= చూచి; గంధమాల్య+అర్చితమై= గంధమాల్యాలతో పూజించబడినదై; దొనన్= అమ్ముల పొదిలో; మెఱయుచున్న= ప్రకాశిస్తూ ఉన్న; శితశరము= వాడి అయిన బాణాన్ని; ఉగ్ర+ఉద్ధతిన్= తీవ్రమైన కోపంతో; ఏయన్= వేయగా (కొట్టగా); డేగ= సాళువం; పులుగును= పిట్టను; గతిన్= వెళ్ళేటప్పుడు; కొనుక్రియన్= తీసికొనిపోయేటట్లు (తన్నుకొనిపోయేటట్లుగా); గ్రక్కునన్= వేగంగా; అది= ఆ బాణం; శిరమున్= తలను; హరించెన్= గ్రహించింది.

తాత్పర్యం: అర్జునుడు చూచి, గంధపుష్పాలతో పూజించినట్టి అమ్ముల పొదిలో మెరుస్తూ ఉన్న వాడిబాణాన్ని కోపాటోపంతో సంధించి వేయగా, డేగ పిట్టను పోతూ పోతూ తన్నుకొనిపోయేటట్లు వేగంగా అతడి తలను ఆ బాణం హరించింది.

విశేషం: అలం: ఉపమ.

వ. **అప్పుడు సత్వరుండై.** **320**

తాత్పర్యం: ఆ సమయంలో తొందర కలవాడై.

ఆ. **శౌరి 'పార్థ! పార్థ! సైంధవు తల యిలఁ । బడిన నొప్పు; దది నభంబునంద**
నిలువఁజేయు; మేను నీ కెఱింగించెద । నత్తెఱంగు దెలియ' ననిన నతఁడు. **321**

ప్రతిపదార్థం: శౌరి= శ్రీకృష్ణుడు; పార్థ! పార్థ!= అర్జునా! అర్జునా!; సైంధవుతల= సైంధవుడి తల; ఇలన్+పడన్+ఒప్పదు= భూమిమీద పడదగదు; అది= ఆ తల; నభంబునందున్+అ= ఆకాశంలోనే; నిలువన్+చేయుము= నిలిచేటట్లుగా చేయుము; ఏను= నేను; ఆ+తెఱంగు= ప్రకారం; తెలియన్= స్పష్టంగా; నీకున్+ఎఱింగించెదన్= నీకు తెలుపుతాను; అనినన్= అనగా; అతడు= ఆ అర్జునుడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు 'ఓ అర్జునా! అర్జునా! సైంధవుడి తల నేల మీద పడకూడదు. దానిని ఆకాశంలో నిలిచేటట్లు చేయుము. దానికి కారణం నేను చెపుతాను.' అనగా అర్జునుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **పటు శరముల మీఁదికి డా । పటికిన్ వలపటికి నపర భాగమునకు ముం**
దటికిఁ జదల నడపె సము । త్కటరయమున శిరమున్ గందుక క్రీడ గతిన్. **322**

ప్రతిపదార్థం: పటు శరములన్= తీవ్రమైన బాణాలతో; శిరమున్= (సైంధవుడి) తలను; కందుక క్రీడ గతిన్= బంతి ఆటవలె; మీఁదికిన్= పైకి; డాపటికిన్= ఎడమకు; వలపటికిన్= కుడికీ; అపర భాగమునకున్= వెనుకకూ, ముందటికిన్= ముందరికీ; చదలన్= ఆకాశంలో; నడపెన్= తిప్పాడు.

తాత్పర్యం: గట్టి బాణాలతో మీదకు, కుడియెడమలకు, ముందు వెనుకలకు ఆకాశంలో మిక్కిలి వేగంగా (సైంధవుడి) తలను బంతి ఆటవలె నడపాడు.

విశేషం: అలంకారం ఉపమ.

వ. **అట్టియెడ.** **323**

తాత్పర్యం: అటువంటి సమయాన.

క. **మాయపుఁ జీఁకటి విరియుడుఁ । దోయజమిత్త్రుండు మగుడఁ దోఁచెఁ బ్రజకుఁ గో**
పాయత్తు లై బలంబులఁ । జేయంగలవారు గడఁగి శితబాణములన్. **324**

ప్రతిపదార్థం: మాయము+చీఁకటి= అబద్ధపు చీకటి; విరియుడున్= విచ్చిపోగా; తోయజమిత్త్రుండు= పద్మమిత్త్రుడైన సూర్యుడు; ప్రజకున్= జనులకు; మగుడన్+తోఁచెన్= మళ్ళీ కానుపించాడు; బలంబులన్= సేనలలో; చేయన్+కలవారు= శక్తి ఉన్నవారు; కోపాయత్తులు+ఐ= కోపంతో సిద్ధపడినవారై; శిత బాణములన్= వాడి బాణాలతో; కడఁగి= పూనుకొని.

తాత్పర్యం: మాయచీకటి విచ్చిపోగా సూర్యుడు మళ్ళీ కానవచ్చాడు. కోపంతో నిండిన మనస్సులతో సేనలలో శక్తికలవారు వాడిబాణాలతో విజృంభించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **నరుఁ బొదివి; రతఁడు వారల । యురవడి వివిధాస్త్రతతుల నుడుపుచు నింగిం**
దిరుగ మును నడపుచుండెడు । శిరమును నేమరక యుండెఁ జిత్రస్ఫురణన్. **325**

ప్రతిపదార్థం: నరున్= అర్జునుడిని; పొదివిరి= క్రమ్ముకొన్నారు; అతఁడు= నరుడు; వారల= ఆ వీరుల; ఉరవడిన్= వేగాన్ని (దూకుడును); వివిధ+అస్త్రతతులన్= అనేక విధాల బాణాల సమూహాలతో; ఉడుపుచున్= నిలుపుతూ; నింగిన్= ఆకాశంలో; తిరుగన్= తిరుగగా; మును= ఇదివరకు; నడపుచున్+ఉండెడు= నడుపుతూ ఉన్న; శిరమును= తలను; చిత్రస్ఫురణన్= ఆశ్చర్యం కలిగేటట్లు; ఏమరక ఉండెన్= మరచిపోకుండా ఉన్నాడు.

తాత్పర్యం: అర్జునుడిని చుట్టు ముట్టారు. వారి దూకుడును నానావిధాలయిన బాణాలతో వారిస్తూ, ఆకాశంలో ఇదివరకే తిరుగుతూ ఉన్న (సైంధవుడి) తలను ఏమరుపాటు చెందకుండా ఆశ్చర్యంగా త్రిప్పుతూ ఉన్నాడు.

వ. **ఇ ట్లత్యాశ్చర్యకరణ పరిణత బాహువీర్యుం డై విక్రమవిహారంబు సలుపుచుండి.** **326**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అతి+ఆశ్చర్యకరణ= మిక్కిలి ఆశ్చర్యాన్ని కలిగించే; పరిణత= పరిపూర్ణతను పొందిన; బహు వీర్యుండు+ఐ= బహుబలము కలవాడై; విక్రమ, విహారంబు= పరాక్రమముతో కూడిన విహారము; సలుపుచు+ఉండి= చేయుచు ఉండి.

తాత్పర్యం: ఈ విధంగా ఆశ్చర్యాన్ని కలిగించే పరిణతమైన భుజబలంతో వీరవిహారం చేస్తూ ఉండి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. **'దనుజవైరి! యెంతదడ వింక నిలుపంగ । వలయు సింధురాజు తల నభమున?**
నెచట వైచువాఁడ? నేమిటి కివ్విధ । మాచరింప వలసె? ననిన నతఁడు. **327**

ప్రతిపదార్థం: దనుజవైరి!= రాక్షసులకు శత్రువైన వాడా! (శ్రీకృష్ణా!); సింధురాజు తల= సైంధవుడి తలను; నభమునన్= ఆకసంలో; ఎంత తడవు= ఎంతకాలం; నిలుపంగ వలయున్?= నిలుప వలెను?; ఇంకన్= ఇంకా; ఎచటన్ వైచువాఁడన్?= ఎక్కడ వేయుదును?; ఈ+విధము= ఈ ప్రకారంగా; ఏమిటికి= ఎందుకోసం; ఆచరింపవలసెన్?= చేయవలసి వచ్చింది?; అనినన్= అని అడుగగా; అతఁడు= శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: 'కృష్ణా! ఎంతకాలం ఈ సైంధవుడి తలను ఆకాశంలో నిలుపవలెను? ఎక్కడ వేయవలెను? ఎందుకు ఈ విధంగా చేయవలసి వచ్చింది?' అనగా, దానికి అతడు.

వ. **'వినుము. వృద్ధక్షత్త్రుం డను సింధుదేశాధీశుండు సంతానకర తపోవిశేషంబున నీ జయద్రథుం బడసె; నితండు కుమారుండై వర్తిల్లు సమయంబున నొక్కనాఁ డశరీరవాణి 'వీఁడు సంగ్రామంబున నేమఱి తల దునుమంబడు' నని యాదేశించిన నతం డెల్లవారును విన 'వీని మస్తకంబు మహిం బడ నెవ్వఁడేసె వాని శిరంబు శకలశతం బయ్యెడు' మని తన తపంబు బలిమిం బలికి, యతనిఁ బట్టంబు గట్టి వనంబునకు నియతుండై యరిగె; నట్లుగావున.** **328**

ప్రతిపదార్థం: వినుము= అర్జునా! వినుము; వృద్ధక్షత్త్రుండు+అను= వృద్ధక్షత్రుడనే పేరుకల; సింధుదేశ+అధీశుండు= సింధుదేశపురాజు; సంతానకర= పిల్లలను కలిగించే; తపోవిశేషంబునన్= గొప్ప తపస్సుతో; ఈ జయద్రథున్+పడసెన్= జయద్రథుడనే వీడిని పొందాడు; ఇతండు= ఈ జయద్రథుడు; కుమారుండు+ఐ= వయస్సు వచ్చిన కొడుకుగా; వర్తిల్లు సమయంబునన్= తిరుగాడేటప్పుడు; ఒక్కనాఁడు= ఒకానొక రోజున; అశరీరవాణి= ఆకాశవాణి; వీఁడు= ఈ జయద్రథుడు;

సంగ్రామంబునన్= యుద్ధంలో; ఏమఱి= ఏమరుపాటున ఉండగా; తల; తునుమన్+పడున్= త్రుంచబడుతాడు; అని ఆదేశించినన్= అని ఉత్తర్వు చేయగా; అతండు= ఆ సింధురాజు; ఎల్లవారును వినన్= అక్కడున్న వారంతా వినగా; వీని మస్తకంబు= ఈ (కుమారుడి) తలను (సైంధవుడి తలను); మహిన్+పడన్= భూమిమీద పడగా; ఎవ్వఁడు+ఏసెన్= ఎవడు కొడతాడో; వాని శిరంబు= అతడి తల; శకలశతంబు+అయ్యెడున్+అని= నూరు ముక్కలవుగాక అని; తన తపంబు బలిమిన్= తన తపోబలంతో; పలికి= చెప్పి; అతనిన్= ఆ సైంధవుడిని; పట్టంబు కట్టి= పట్టాభిషేకం చేసి; వనంబునకున్= అడవికి; నియతుండు+ఐ అరిగెన్= నియమంతో వెళ్ళాడు; కావునన్= అందుచేత.

తాత్పర్యం: 'అర్జునా! వినుము. వృద్ధక్షత్రుడనే సింధుదేశపు రాజు పిల్లలకొరకై చేసిన గొప్ప తపస్సువలన జయద్రథుడు అనే పేరుగల కుమారుడు పుట్టాడు. వయసులో వీడు తిరుగుతూ ఉన్నప్పుడు ఒకానొక దినం ఆకాశవాణి 'ఈ జయద్రథుడు ఏమరుపాటులో ఉండగా యుద్ధంలో ఇతడి తల త్రెంచబడుతుం'దని ఆదేశించింది. అప్పుడు అక్కడ వారంతా వినేటట్లు 'ఇతడి తలను ఎవడు భూమిమీదకు పడకొడతాడో వాడి తల నూరువ్రక్కలవుతుంది' అని తన తపశ్శక్తితో వృద్ధక్షత్రుడు అన్నాడు. ఆ కారణంగా.

క. ఈ తల పుడమిం బడనీ । కాతనితొడమీఁద వైచునది; యాపని వి
ఖ్యాతం బగు పాశుపతము । చేతన యగుఁగాక! యొంటఁ జెల్లునె మనకున్? 329

ప్రతిపదార్థం: ఈ తల= ఈ సైంధవుడి తలను; పుడమిన్+పడనీక= భూమిమీద పడకుండా; ఆతని తొడమీఁద వైచునది= ఆ వృద్ధక్షత్రుడి తొడమీద (ఒడిలో) వేయవలసింది; ఆ పని= ఆ వేసే పని; విఖ్యాతంబు+అగు= ప్రశస్తమైన; పాశుపతము చేతన= పాశుపతాస్త్రం వలననే; అగున్+కాక= అవుతుంది; మనకున్= మనకు; ఒంటన్= వేరొకదానితో; చెల్లునె?= సాగుతుందా?(అనగాసాగదని).

తాత్పర్యం: ఈ సైంధవుడి తలను భూమిమీద పడనీయకుండా ఆ వృద్ధక్షత్రుడి తొడపై పడేటట్లు చేయుము. ఆ పని పాశుపతాస్త్రం వలననే అవుతుంది. దానిశక్తి అట్టిది. వేరొక దానివలన కాదు.

వ. ఆ వృద్ధక్షత్త్రుండు శమంతపంచక సమీపంబున నుండు; నీ వమ్మహనీయాస్త్రంబు నాశ్రయింపు' మనవుడు నర్జునుం డట్లకాక యని భక్తియుక్తంబుగా నియతమతిం దత్ప్రయోగం బాచరించిన నద్దివ్యసాధనంబు సాయక పరంపరాకారాంబయి యా శిరం బట గొని చని తదాశ్రమ ద్వారంబు సొచ్చునప్పు డజ్జనపతి జపయుక్తుండై యుండ నమ్మహాస్త్రంబు మాహాత్మ్యంబున నమ్మస్తకం బతని తొడమీఁదఁ బడిన నతండు తదీయ స్పర్శంబున నెఱింగి దిగ్గన లేచుచుం ద్రోచిన నది భూతలపతితం బగుటయు. 330

ప్రతిపదార్థం: ఆ వృద్ధక్షత్త్రుండు= ఆ వృద్ధక్షత్రుడనే వాడు; శమంతక పంచక సమీపంబునన్= శమంత పంచకమనే కొలకుల దగ్గర; ఉండున్= ఉంటాడు; నీవు; ఆ+మహనీయాస్త్రంబున్= ఆ మహాస్త్రాన్ని; ఆశ్రయింపుము= సాయం కోరుము; అనవుడున్= అనగా; అర్జునుండు; అట్లు+అ కాక!= అంతే అగుగాక!; అని= అంటూ; భక్తియుక్తంబుగాన్= భక్తితో కూడా; నియతమతిన్= నియమంతో కూడిన మనస్సుతో; తత్ప్రయోగంబు+ఆచరించినన్= ఆ అస్త్రాన్ని వేయగా; ఆ+దివ్యసాధనంబు= ఆ దైవశక్తికల ఆయుధం; సాయక పరంపరా+ఆకారంబు+అయి= బాణాల వరుస రూపం అయి; ఆ శిరంబు+అటగొని చని= ఆ తలను అక్కడికి తీసికొనిపోయి; తద్+ఆశ్రమద్వారంబు= ఆ వృద్ధక్షత్రుడు ఉన్న ఆశ్రమం వాకిలిలోనికి; చొచ్చునప్పుడు= వెళ్ళేటప్పుడు; ఆ+జనపతి= ఆ రాజు (వృద్ధక్షత్రుడు); జపయుక్తుండు+ఐ ఉండన్= జపం చేసికొంటూ ఉండగా (ధ్యానంలో ఉండగా); ఆ+మహా+అస్త్రంబు= ఆ దివ్యాస్త్రం యొక్క; మాహాత్మ్యంబునన్= శక్తితో; ఆ+మస్తకము= ఆ తల (సైంధవుడి తల); అతని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తొడమీఁదన్+పడినన్= అతడి తొడపై పడగా; అతండు= ఆ వృద్ధక్షత్రుడు; తదీయ= దానియొక్క; స్పర్శంబునన్= తాకుటవలన; ఎఱింగి= తెలిసి; దిగ్గన లేచుచున్= త్వరగా (తొట్రుపాటుతో) లేస్తూ; త్రోచినన్= త్రోయగా; అది= ఆ తల; భూతల పతితంబు+అగుటయున్= భూమి మీద పడగా.

తాత్పర్యం: ఆ వృద్ధక్షత్రుడు శమంత పంచకమనే చోట ఉంటాడు. ఈ మహత్త్వం కల పాశుపతాస్త్రాన్ని సహాయం కోరుకొనుము.' అనగా అర్జునుడు అట్లే యని మిక్కిలి భక్తితో నియమంగా దానిని (పాశుపతాన్ని) వేయగా, ఆ దివ్యబాణం బాణాల వరుసగా మారి, ఆ తలను మోసికొనిపోయి వృద్ధక్షత్రుని ఆశ్రమద్వారాన్ని ప్రవేశించేటప్పుడు జపంలో ఉన్న ఆ రాజు తొడమీద ఆ తల అస్త్రమాహాత్మ్యంతో పడింది. ఆ రాజు దాని తాకిడికి దిగ్గనలేస్తూ దాన్ని తోశాడు. అది క్రిందపడి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **పగిలి యాతని తల నూఱు పఱియలయ్యెఁ । శౌరి విజయుని నగ్గించె; సకల భూత**
ములు మహాద్భుతరసమున మునిఁగె; నపుడు । సంహరించె నయ్యస్త్ర మా సవ్యసాచి. **331**

ప్రతిపదార్థం: పగిలి= చీలి; ఆతని తల= ఆ వృద్ధక్షత్రుడి తల; నూఱు పఱియలు+అయ్యెన్= నూరు ముక్కలయింది; శౌరి= కృష్ణుడు; విజయునిన్= అర్జునుడి; అగ్గించెన్= పొగడాడు; సకలభూతములు= అన్ని ప్రాణులూ; మహా+అద్భుత రసమునన్= గొప్ప అద్భుతరసంలో; మునిఁగెన్= మునిగాయి (అనగా ఆశ్చర్యాన్ని పొందాయి); అపుడు= ఆ సమయంలో; ఆ సవ్యసాచి= ఆ అర్జునుడు; ఆ+అస్త్రము= ఆ అస్త్రాన్ని; సంహరించెన్= ఉపసంహరించాడు.

తాత్పర్యం: ఆ వృద్ధక్షత్రుడి తల నూరు ముక్కలుగా చీలింది. కృష్ణుడు అర్జునుడిని పొగిడాడు. ప్రాణు లంతా ఆశ్చర్యంలో మునిగారు. అర్జునుడు ఆ అస్త్రాన్ని ఉపసంహరించాడు.

క. **ఇవ్విధమున సైంధవు తలఁ । గవ్వడి యట నడపుశక్తి గనుఁగొని సేనల్**
నివ్వెఱఁగందె; మనంబుల । క్రొవ్వడఁగెను దొరల కెల్లఁ గురువంశనిధీ! **332**

ప్రతిపదార్థం: కురువంశనిధీ!= కురువంశమునకంతకూ నిధియైనవాడా! (ఓరాజా!); ఈ+విధమునన్= ఈ ప్రకారంగా; సైంధవు తల= సైంధవుడి తలను; కవ్వడి= అర్జునుడు; అట నడపు శక్తిన్+కనుఁగొని= అక్కడ నడిపించే శక్తిని చూచి; సేనల్= మన సేనలు; నివ్వెఱఁగు+అందెన్= ఆశ్చర్యపోయాయి; దొరలకున్+ఎల్లన్= మనరాజులకందరికీ; మనంబులన్= మనసులలో; క్రొవ్వు+అడఁగెను= గర్వము అణగింది.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! ఆ విధంగా అర్జునుడు సైంధవుడి తలను నడిపించిన విధానాన్ని చూచి సేనలు భయపడ్డాయి. రాజులందరికీ పొగరణిగింది.

సీ. **సైంధవు ఘోరకబంధంబు దల యిలఁ । బడునంతకును దేరిపైన నిలిచి**
మఱి కూలుటయు విస్మయము గావించెఁ జూ । పఱ కట్లు పార్థుండు ప్రతిన నెఱపె;
నీ తనూభవులు గన్నీళ్ళు దొరఁగ న । త్యంత శోకముఁ బొంది; రచ్యుతుండు
నన్నరుండును బరమానంద కందళి । తాత్ములై; రత్తఱి ననిలసుతుఁడు

ఆ. **నలిఁ జెలంగి సింహనాదంబు సేసిన । విని యుధిష్ఠిరుండు విజయు పూన్కి**
నెఱయు టెఱిఁగి హర్షనిర్భరాకృతి యయ్యె । నుల్లసిల్లి రతని యోధు లెల్ల. **333**

ప్రతిపదార్థం: సైంధవు= సైంధవుడి; ఘోర కబంధంబు= భయంకరమైన మొండెం; తల= అతడి తల; ఇలన్+పడునంతకును= భూమిమీద పడేదాకా; తేరి పైన్+అ నిలిచి= తేరుమీదనే నిలిచి ఉండి; మఱి కూలుటయు= ఆ మీద పడటం; చూపఱకున్= చూచేవారికి; విస్మయము కావించెన్= ఆశ్చర్యాన్ని కలిగించింది; అట్లు= ఆ ప్రకారం; పార్థుండు= అర్జునుడు; ప్రతిన నెఱపెన్= తన ప్రతిజ్ఞను తీర్చుకొన్నాడు; నీ తనూభవులు= నీ కుమారులు; కన్నీళ్ళు తొరఁగన్= కన్నీళ్ళు కారగా; అత్యంత శోకమున్+పొందిరి= మిక్కిలి దుఃఖపడ్డారు; అచ్యుతుండున్= శ్రీకృష్ణుడును; ఆ+నరుండును= ఆ అర్జునుడును; పరమానంద= మిక్కిలి సంతోషంతో; కందళిత+ఆత్ములు+ఐరి= వికసించిన మనస్సుకలవారయ్యారు; ఆ+తఱిన్= ఆ సమయాన; అనిలసుతుఁడు= భీమసేనుడు; నలిన్+చెలంగి= ఎక్కువగా విజృంభించి; సింహనాదంబు చేసినన్= సింహగర్జనం చేయగా; విని= విన్నవాడై; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; విజయుపూన్కి= అర్జునుడి ప్రతిజ్ఞ; నెఱయుట+ఎఱిఁగి= నెరవేరుట తెలిసి; హర్షనిర్భర= సంతోషంతో నిండిన; ఆకృతి+అయ్యెన్= ఆకారం కలవా డయ్యాడు; అతనియోధులు+ఎల్లన్= అతడి సైనికులంతా; ఉల్లసిల్లిరి= సంతోషించారు.

తాత్పర్యం: సైంధవుడి తల భూమిమీద పడేదాకా భయంకరమైన అతడి మొండెం తేరిమీదనే నిలిచి ఉండి ఆ మీదట పడిపోవటం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ విధంగా అర్జునుడు తన ప్రతిజ్ఞ నెరవేర్చుకొన్నాడు. నీ కొడుకులు కన్నీళ్ళు దొర్లగా చాలా దుఃఖించారు. కృష్ణార్జునులు సంతోషం నిండిన మనసు కలవారయ్యారు. అపుడు భీమసేనుడు చాలా విజృంభించి సింహనాదం చేశాడు. దానిని విన్న ధర్మరాజు సంతోషంతో నిండిన ఆకారం కలవా డయ్యాడు. ఆతడి సైనికులంతా సంతోషించారు.

వ. **అచ్చట నార్పులుఁ దూర్యనినదంబులుఁ జెలంగెఁ; దద్బలంబులుఁ బరమప్రమోదంబునుం బొందె నని సంజయుండు సైంధవవధ ప్రకారంబు ధృతరాష్ట్రున కెఱింగించె నని చెప్పినఁ జిత్తంబు గౌతుకాయత్తంబగుచుండ నటమీఁది వృత్తాంతం బెఱింగింపు మనుటయు.** **334**

ప్రతిపదార్థం: అచ్చటన్= ఆ చోట; ఆర్పులు= అరచుటలు; తూర్య నినదంబులు= తూర్య శబ్దాలు (కొమ్ముబూర ఊదినట్లు ఊదే శబ్దం); చెలంగెన్= చెలరేగాయి; తద్బలంబులు= ఆ సేనలు; పరమ ప్రమోదంబునున్+పొందెన్= మిక్కిలి సంతోషాన్ని పొందాయి; అని= అంటూ; సంజయుండు= సంజయుడు; సైంధవవధ ప్రకారంబు= సైంధవుడిని చంపిన తీరును; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రుడికి; ఎఱింగించెన్= తెలిపాడు; అని చెప్పినన్= అని చెప్పగా; చిత్తంబు= మనసు; కౌతుక+ఆయత్తంబు= ఆసక్తితో సిద్ధమయినది; అగుచుండన్= అవుతూ ఉండగా; అటమీఁది= ఆ మీదటి; వృత్తాంతంబు= ఆపై విషయాన్ని; ఎఱింగింపుము+అనుటయున్= తెలియచేయుమనగా.

తాత్పర్యం: ఆ సేనలో అరుపులూ, తూర్యశబ్దాలూ చెలరేగాయి. ఆ సేనలు చాలా సంతోషించాయి - అని సంజయుడు సైంధవవధ విధానాన్ని ధృతరాష్ట్రుడికి చెప్పాడు. అని చెప్పగా ఆ మీద కథను తెలుపుమని ఆసక్తితో ఉన్న మనసుతో అడిగాడు ధృతరాష్ట్రుడు.

ఆశ్వాసాంతము

ఉ. **బిందు చిదాత్మనాదమయ పీఠ! చతుష్కల! సద్విహార! ని**
ష్యంది సుధాకృతీ! పరమ సౌఖ్య విధాయక! చిత్స్వరూప! ని
ష్పంద నిరంజనాస్ఖలిత శాశ్వత నిర్మల వైభవా! మహా
నంద రసైకతాత్మ లయనక్రమ! నిష్కల! బోధపుష్కలా! **335**

ప్రతిపదార్థం: బిందు చిత్+ఆత్మనాదమయ పీఠ!= బిందువు చైతన్య స్వరూపమయిన ఆత్మ నాదం అనే ఈ శక్తులు స్థానంగా కలవాడా! (ప్రణవ స్వరూపము ప్రజ్ఞాస్వరూపము, ఆత్మస్వరూపము అయిన శబ్దమే స్థానముగా కలవాడా. జ్ఞానశక్తీ, ఇచ్ఛాశక్తీ, క్రియా శక్తులనే మూటినీ కలవాడని భావం); చతుష్కల!= నాలుగు కళావిశేషాలతో ఒప్పినవాడా! (ఆ నాలుగు కళలకే ప్రకాశ, అనంత, జ్యోతిష్మతీ, ఆయతనములని పేర్లున్నవి. సద్విహార!= మంచివారిలో తిరుగువాడా! (సత్పురుషులనగా ఋష్యాదులు); నిష్యంది= స్రవించే (జారుచున్న); సుధాకృతీ!= అమృతస్వరూపుడా! (మహాయోగుల సమాధ్యవస్థలో పొందే అనిర్వచీయానందానికే "నిష్యందిసుధ" అని యోగతత్త్వ విశేషాలు తెలిసినవారు చెబుతుంటారు); పరమసౌఖ్య= శ్రేష్ఠమైన సంతోషాన్ని; విధాయక!= నిర్ణయించేవాడా!; చిత్స్వరూప!= జ్ఞానమే ఆకారమైనవాడా!; నిష్పంది= కదలనటువంటి; నిరంజన= ఆసక్తిలేని; అస్ఖలిత= స్థిరమైన, జారిపోని; శాశ్వత= ఎల్లప్పుడూ ఉండే; నిర్మల= స్వచ్ఛమైన; వైభవా!= సంపదకలవాడా!; మహానందరస= నిండైన సంతోషమనే రసము యొక్క; ఏకతాత్మ!= ఏకత్వమునందు; ఆత్మలయనక్రమ= ఆత్మలీనం గావించుట అనే తీరు కలవాడా! నిష్కల!= భాగాలు లేని అఖండమూర్తీ!; బోధపుష్కలా= విజ్ఞాన ఘనమూర్తీ!

తాత్పర్యం: స్వామీ! నీవు 'బిందుచిదాత్మమయ'మైన ముక్కాలి పీటమీద అధివసించి ప్రపంచ వ్యాపారమును గావించెదవు. ప్రకాశాది నాలుగు కళలూ నీకున్నవి. ప్రపంచమంతా నీవు స్వచ్ఛమైన రూపంతో తిరుగుతున్నావు. యోగీశ్వరుల యోగనిష్ఠలో స్రవించే అమృతధారవు నీవు. అందువలన నీవు సర్వశ్రేష్ఠమయిన మోక్షమును కలిగిస్తున్నావు. చేతనాచేతనమూ. నాశరహితం, దేనియందునూ ఆసక్తం కానిదీ, అదృష్టమైనదీ అయిన ఈశ్వర భావ ప్రకాశం నీది. ప్రపంచంలోని మహానందమనే ఏకైకరసమునందు ఆత్మను లీనం గావించువాడవు.

క. **ఆస్తిక చేతస్సహితా! । కౌస్తుభరత్నాస్థిమాలికా శబలిత వ**

క్షస్థల! సుమహిత నిగమ । ప్రస్తవనీయ ప్రకార! పరమోదారా! **336**

ప్రతిపదార్థం: ఆస్తిక= ఆస్తికులయిన వారి (దైవ విశ్వాసమున్నవారి); చేతస్సహితా!= మనస్సులతో కూడి ఉన్న వాడా!; కౌస్తుభరత్న= కౌస్తుభమనే రత్నంతోనూ; అస్థిమాలికా= ఎముకల హారంతోనూ; శబలిత వక్షస్థల= చిత్రమయిన వర్ణంతో ఉన్న ఎదురురొమ్ము కలవాడా; సుమహిత= చాలా గొప్పవైన; నిగమ= వేదాలలో; ప్రస్తవనీయ ప్రకార!= కొనియాడదగిన విధము కలవాడా!; పరమోదారా!= మిక్కిలి దయాగుణము కలవాడా!.

తాత్పర్యం: ఆస్తికుల మనస్సులతో కూడుకొన్నవాడా! కౌస్తుభరత్నంతోను (విష్ణుని పరంగా) ఎముకల మాలికతోను (శివుని పరంగా) చిత్రమైన వర్ణంకల వృక్షస్థలము కలవాడా! చాల గొప్పవైన వేదాలలో స్తుతింపబడిన విధము కలవాడా! మిక్కిలి దయాగుణం కలవాడా!

మాలిని:

శ్రుతి ఫలరస భావస్తుత్యమూర్తీ! నతార్తి
ప్రతిహనననితాంత ప్రౌఢహేలా! వినోదా
యితభువన వితానాహీన నిర్వాహ! మోహ
వ్యతికర తిమిర ప్రధ్వంసనా దీపరూపా! **337**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: శ్రుతిఫల= వేదములనే ఫలములయొక్క; రసభావ= రసత్వంతో; స్తుత్యమూర్తీ!= స్తుతింపదగిన ఆకారం కలిగినవాడా! (పరబ్రహ్మ శ్రుతిరస భావమూర్తి అనీ - ఆ రసఫలమే ఈ పరతత్త్వంగా మూర్తిత్వమును పొందినదనీ భావం. పరబ్రహ్మతత్త్వము= వేదరస స్వరూపం); నతార్తి= నతుల (భక్తుల) కష్టాలను; ప్రతిహనన= నశింపజేయటంలో; నితాంత= మిక్కిలి; ప్రౌఢహేలా!= నేర్పరియైనవాడా! (అనగా కష్టాలతో సర్వార్పణంగా నమస్కారంచేసి నీవే దిక్కనిన వారికష్టాలను తొలగించుటలో మిక్కిలి నేర్పరి అయినావాడా - అని); వినోదాయిత= వినోదంగా ఒప్పిన; భువన= ప్రపంచముల; వితాన= సంబంధమైన; అహీన నిర్వాహ!= ఉత్తమముగా పరిపాలనము సేయువాడా! (అనగా ప్రపంచ సృష్టిస్థితి లయాలను నిరుపమానంగా పాలించేవాడా - అని భావం); మోహవ్యతికర= అజ్ఞాన సంబంధమైన; తిమిర= చీకటిని; ప్రధ్వంసనా= నశింపజేయటంలో; దీపరూపా!= దీపాకారం కలవాడా! (వెలుగయిన వాడా).

తాత్పర్యం: శ్రుతులయిన వేదాలచేత తెలియజేయబడే రసభావం నీ స్వరూపం. భక్తుల బాధలను తొలగించటం నీ కొక ఆట. చతుర్దశభువనాలలో లోటులేమీ లేకుండా పరిపాలన చేస్తూ ఉంటావు. భక్తుల మనసులలోని అజ్ఞానాంధకారమును తొలగించే, అంతటను ప్రకాశించే దీపముయొక్క ఆకారం కలవాడా! మోహాంధకారాన్ని తొలగించే ప్రదీపస్వరూపా!

గద్యము:

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీమహా భారతంబున ద్రోణపర్వంబునందుఁ జతుర్థాశ్వాసము.

తాత్పర్యం: ఈ మహాభారతం సంస్కృతాంధ్ర భాషా కవీశ్వరులకు స్నేహితుడూ (సూర్యుడివంటి వాడూ), కొమ్మనామాత్యుడి కుమారుడూ, పండితుల పూజలచేత ప్రకాశిస్తున్నవాడూ అయిన తిక్కన సోమయాజిచేత రచితమయిన శ్రీమహాభారతంలోని ద్రోణపర్వంలో నాలుగవ ఆశ్వాసం.

ద్రోణపర్వంలోని చతుర్థాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ద్రోణపర్వము - పంచమాశ్వాసము

క. శ్రీధామ లసదపాంగ । వ్యాధూత ప్రణత దురితవర్గ! నిరోహ
ద్బోధాత్మక దేహా! జగ । దాధార విహార నిపుణ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= సంపదలకు; ధామ= నిలయమై; లసత్= ప్రకాశిస్తున్న; అపాంగ= కడకంటి చూపులచేతనే; వ్యాధూత= ఎగురగొట్టబడిన; ప్రణత= (తనకు) నమస్కరిస్తూ ఉన్న భక్తులయొక్క; దురితవర్గ!= పాపాల సమూహం కలవాడా!; నిరోహత్= మొలకెత్తుతున్న; బోధాత్మక= జ్ఞానరూపమైన; దేహా!= శరీరంకలవాడా!; జగత్= ప్రపంచానికి; ఆధార= ఆశ్రయమైన; విహార= విలాసక్రీడయందు; నిపుణ!= సమర్థుడవైనవాడా!; హరిహరనాథా!= శివకేశవాత్మకుడవైన ఓ ఆదిదేవా! (అవధరింపుము= సావధానంగా వినండి).

తాత్పర్యం: నిన్నాశ్రయించిన భక్తుల పాపాలను, అనగా పాపఫలాలైన దుఃఖాలను కడగంటి చూపులచేతనే పోగొట్టి వారికి సంపదల ననుగ్రహించి నిర్మూలిస్తావు. మోక్షాన్ని కోరే భక్తుల హృదయాలలో జ్ఞానరూపంతో ఆవిర్భవించి, వారికి మోక్షలక్ష్మిని ప్రసాదిస్తావు. ఈ ప్రపంచమంతా నీ లీలావిలాసమే. ఈనాడు నాకు హరిహరరూపంతో సాక్షాత్కరించిన ఓ పరమేశ్వరా! (నే చెప్పబోయే కథను సావధానంగా వినుము.)

కృష్ణార్జునులు సల్లాపంబు లొనరించుచు ధర్మజుకడ కరుగుచుండుట (సం. 7 - 122 - 1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నట్లద్భుతోదారంబగు నరనారాయణుల విక్రమ విహారంబు విని వెఱఁగంది యాంబికేయుండు సంజయు దిక్కు మొగంబై. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= జనమేజయ మహారాజునకు(తో); ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు; అట్లు= ఆ విధంగా; అద్భుత= ఆశ్చర్యాన్ని కలిగించే; ఉదారంబు+అగు= గొప్పదైన అనగా గొప్ప ప్రయోజనాన్ని సాధించిన (సైంధవవధ సామాన్య విషయం కాదు. సైంధవుడి తల భూమిపై పడకుండా అతడి తండ్రి తొడమీద పాశుపతాస్త్రం ద్వారా పడవేయించటం ఆశ్చర్యకరం కాదా! మరియు పార్థుని ప్రాణాలకే ముప్పుగా పరిణమించిన సైంధవవధరూప ప్రతిజ్ఞ నెరవేర్చటం గొప్ప ప్రయోజనాన్ని సాధించిందే అయింది); నరనారాయణుల= నర నారాయణులనబడే బదరికాశ్రమవాసులగు ఋషులు; వారి అంశచేత జన్మించిన వారలు ఈ అర్జునుడు, కృష్ణుడున్న - వీరిద్దరియొక్క; విక్రమ విహారంబు= పరాక్రమంతో కూడిన విహారాన్ని గూర్చి; విని; వెఱఁగు= నిశ్చేష్టత్వాన్ని; అంది= పొంది; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు (ఆంబికాయాః అపత్యం పుమాన్ ఆంబికేయః - అంబిక అనే ఆమె కుమారుడు ధృతరాష్ట్రుడు, కావున ఆంబికేయుడు); సంజయు దిక్కు మొగంబు+ఐ= సంజయుడివైపు అభిముఖుడై.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వైశంపాయన ఋషి జనమేజయమహారాజుతో అనంతర కథను ఈ విధంగా చెప్పాడు: ధృతరాష్ట్రుడు అర్జునుడి, శ్రీకృష్ణుడి పరాక్రమ ప్రదర్శనలను గురించి విన్నాడు. చేష్టలు సన్నగిల్లి, భయభ్రాంతుడయ్యాడు. ఆ తరువాత జరిగిన కథను వినగోరి సంజయుడిని చూచి ధృతరాష్ట్రుడు ఇట్లా ప్రశ్నించాడు.

క. 'ఇవ్విధమున సైంధవుఁ డా । కవ్వడిచేఁ బడిన పిదపఁ గౌరవు లెట్లై
రవ్వార్త సెప్పు' మనవుడు । నవ్విభునకు నాతఁ డిట్టు లనియె నరేంద్రా! 3

ప్రతిపదార్థం: నరేంద్రా!= జనమేజయమహారాజా!; ఈ+విధమునన్= ఈ ప్రకారంగా; సైంధవుఁడు= సింధుదేశపు రాజయిన జయద్రథుడు; ఆ+కవ్వడిచేన్= ఆ సవ్యసాచిచేత (అనగా అర్జునుడిచేత); పడిన పిదపన్= సంహరించబడిన తరువాత; కౌరవులు= దుర్యోధనుడు మొదలైన మావారు; ఎట్లు= ఏ విధంగా (అనగా ఎట్టి ప్రవృత్తి కలవారు); ఐరి= అయినారో; ఆ+వార్త= ఆ విషయాన్ని; చెప్పుము= వినిపించుము; అనవుడున్= అనగా; ఆ+విభునకున్= ఆ ధృతరాష్ట్రుడికి; ఆతఁడు= ఆ సంజయుడు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'ఓ సంజయా! సైంధవుడు పార్థుడిచేత సంహరించబడిన తరువాత మా వారైన దుర్యోధనాదులు- ఏం చేశారో ఆ విషయాన్ని చెప్పు' మని అడుగగా - జనమేజయ మహారాజా! సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా చెప్పటానికి ప్రారంభించాడు. (ఇది వైశంపాయనుడి వాక్యం).

వ. అట్లు పాండవ బలంబులు పొంగి కడంగి కుంభసంభవుమీఁదం గవిసి కయ్యంబు సేసె; నా సమయంబున నిక్కడ. 4

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; పాండవ బలంబులు= పాండవుల సైన్యాలు; పొంగి= ఉత్సాహంతో విజృంభించి; కడంగి= ప్రయత్నపూర్వకంగా; కుంభసంభవుమీఁదన్= ద్రోణాచార్యుడిపై; కవిసి= తలపడి; కయ్యంబు= యుద్ధం; చేసెన్= చేశాయి; ఆ సమయంబునన్= అదే సమయంలో; ఇక్కడన్= ఇచ్చట (కౌరవసైన్యంలో).

తాత్పర్యం: సైంధవవధతో పాండవుల సైన్యాలు ఉత్సాహంతో పెల్లుబికి, ద్రోణాచార్యులపై తలపడి యుద్ధం చేయ ప్రారంభించాయి. ఆ సమయంలోనే ఇక్కడ కౌరవసైన్యంలో.

చ. కృపుఁడును ద్రౌణియుం గడఁగి క్రీడిపయిన్ శర వర్షముల్ మహో
గ్రపు రభసంబునం గురియఁగా నవి మాన్చి యతండు వారలం
గుపితుఁడు గాకయున్ విశిఖ కోటుల నల్లన కప్పు పెల్లునం
గృపుని శరీర మొయ్య నొఱగెన్ రుధిరచ్యుతి మూర్ఛ వచ్చినన్. 5

ప్రతిపదార్థం: కృపుఁడును= కృపాచార్యుడూ; ద్రౌణియున్= అశ్వత్థామా(అనగా వీరిద్దరూ); కడఁగి= ప్రయత్నపూర్వకంగా; క్రీడిపయిన్= అర్జునుడిపై; శరవర్షముల్= బాణాలవర్షాలు; మహోగ్రపు రభసంబునన్= మిక్కిలి భయంకరమైన వేగంతో; కురియఁగాన్= కురిపించగా; అవి= ఆ బాణాలను; మాన్చి= శమింపచేసి; అతండు= ఆ అర్జునుడు; వారలన్= ఆ కృపాచార్య, అశ్వత్థామలను; కుపితుఁడు= కోపం కలవాడు; కాకయున్= కాకుండానే (అనగా వారిపై కోపపడక); విశిఖకోటులన్= బాణాల సమూహాలచేత; అల్లన= మెల్లగా (అనగా తీక్ష్ణంగా గాయపరచకుండే విధంగా); కప్పుపెల్లునన్= కప్పివేయటంలోని అతిశయంతో; కృపుని శరీరము = కృపాచార్యుడి దేహం; రుధిరచ్యుతిన్= రక్తంకారటంచేత; మూర్ఛ= తెలివితప్పుట; వచ్చినన్= రాగా; ఒయ్యన్= మెల్లగా; ఒఱగెన్= వాలింది. (అనగా తెలివి కోల్పోయి రథంమీద వాలిపోయాడని భావం).

తాత్పర్యం: కృపాచార్యుడు, అశ్వత్థామ అర్జునుడిమీద బాణవర్షం కురిపించారు. అర్జునుడు ఆ బాణాలను ఖండించాడే కాని వారిపై కోపం చూపించలేదు. కాని, మెల్లగా బాణవర్షం కురిపించాడు. వలసినంత వేగంగా బాణాలు వేయనప్పటికీ కృపాచార్యుడి శరీరంనుండి ఆ మాత్రం బాణాల తాకిడిచేతనే నెత్తురు ధారగా కారిపోవటం చేత అతడు మూర్ఛపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు కృపాచార్యుండు రథంబుమీఁదం బడినఁ దత్సారథి దేరు దొలంగం దోలుకొని పోయె; నశ్వత్థామయు నోహటించి తొలంగెఁ; దక్కటి రథికులు పైఁబెట్టంజాలక యంతంత నిలిచి;రట్లు శారద్వతుండు దనయమ్ముల మూర్ఛిల్లుట సూచి సవ్యసాచి వగచెఁ; నప్పు డన్నరునిఁ గౌఁగిలించుకొని నారాయణుం డి ట్లనియె: 6

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కృపాచార్యుండు= అశ్వత్థామ మేనమామ అయిన కృపాచార్యుడు; రథంబుమీఁదన్= రథంపై; పడినన్= వాలిపోగా; తద్+సారథి= ఆ కృపుడియొక్క సారథి; తేరు= రథాన్ని; తొలంగన్= (యుద్ధభూమినుండి) తొలగిపోయే విధంగా; తోలుకొని పోయెన్= తోలుకొనిపోయాడు; అశ్వత్థామయున్= అశ్వత్థామకూడ; ఓహటించి= వెనుకాడి; తొలంగెన్= తొలగిపోయాడు (అర్జునుడిని ఎదిరించలేక వెనుదిరిగి పోయాడని భావం); తక్కటి రథికులు= మిగిలిన రథికులు; పైన్+పెట్టన్+చాలక= ఎదిరించలేక; అంతన్+అంతన్= కొంతదూరాన; నిలిచిరి= ఉండిపోయారు; అట్లు= ఆ విధంగా; శారద్వతుండు= కృపాచార్యుడు; తన+అమ్ములన్= తనయొక్క (అర్జునుడి యొక్క) బాణాలతో; మూర్ఛిల్లుట= తెలివితప్పి పడిపోవటం; చూచి= కనిపెట్టి; సవ్యసాచి= అర్జునుడు; వగచెన్= దుఃఖించాడు; అప్పుడు= ఆ సమయాన(అర్జునుడి దుఃఖావస్థను మాన్పటానికి); ఆ+నరునిన్= ఆ అర్జునుడిని; నారాయణుండు= కృష్ణుడు; కౌఁగిలించుకొని= అక్కున చేర్చుకొని; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఈ విధంగా కృపాచార్యుడు రథంమీద మూర్ఛిల్లటం చూచి, సారథి రథాన్ని రణభూమినుండి తొలగించి తోలుకొనిపోయాడు. అశ్వత్థామ కూడా అర్జునుడిని ఎదిరించలేక వెనుదిరిగాడు. మిగిలిన రథికవీరులు అంతంత దూరంలో చూస్తూ నిలుచుండిపోయారు. అర్జునుడు తన బాణాలకు కృపాచార్యుడు మూర్ఛిల్లటంతో దుఃఖావస్థకు లోనయ్యాడు. అది కనిపెట్టి ఓదార్చటానికై కృష్ణుడు అర్జునుడిని ఆలింగనం చేసికొని ప్రశంసిస్తూ ఇట్లా పలికాడు:

విశేషం: కృపాచార్యుడి మూర్ఛ చూచి అర్జునుడు విలపించిన ప్రకారం సంస్కృతభారతంలో ద్రోణపర్వం 47వ అధ్యాయం 13వ శ్లోకంనుండి 23వ శ్లోకం వరకు విపులంగా వర్ణించబడింది. ఈ విషయం అంతా "అప్పుడు" అనే మాటతో సంగ్రహించటం జరిగింది. ఆ సమయాన అర్జునుడిపై తలపడదలచిన కర్ణుడిని సాత్యకి అడ్డుకోవటం, కర్ణసాత్యకుల యుద్ధం, కర్ణ పరాజయం, అర్జునుడు కర్ణుడిని గద్దించటం, కర్ణపుత్రుడైన వృషసేనుడిని వధించటానికి అర్జునుడి ప్రతిజ్ఞ - ఇత్యాద్యంశాలు వర్ణించిన పిమ్మట కృష్ణుడు అర్జునుడిని ప్రశంసించటం కలదు. (సంస్కృతభారతం గోరఖపూర్ ప్రతి ననుసరించి అనువాదంలో ఈ మార్పు గోచరిస్తున్నది.)

క. 'కురుబలముఁ దొడరి గెలువఁగ । సుర గణముల కైన నరిది శూరోత్తమ! నీ
వురవడి గెలిచితి భాగ్య । స్ఫురణంబును బాహు బలముఁ బొగడం దగదే? 7

ప్రతిపదార్థం: శూరోత్తమ!= శూరులలో శ్రేష్ఠుడవగు ఓ అర్జునా!; కురుబలమున్= కౌరవసైన్యాన్ని; తొడరి= ఎదిరించి; గెలువఁగన్= గెలవటానికి; సురగణములకున్+ఐన= దేవతల సమూహాలకైనా కూడా; అరిది= అశక్యం (అనగా శక్యంకాదు); నీవు+ఉరవడిన్= నీవు అతివేగంగా (అనగా అనాయాసంగా); గెలిచితి(వి)= ఓడించావు (కావున నీయొక్క); భాగ్యస్ఫురణంబును= అదృష్టస్ఫూర్తి మరియు; బాహుబలమున్= భుజబలం (అనగా పరాక్రమం); పొగడన్= ప్రశంసించటానికి; తగదే?= తగింది కాదా! (నీ అదృష్టానికీ, పరాక్రమానికీ నిన్ను ప్రశంసిస్తున్నా నని భావం.)

తాత్పర్యం: ఈ కౌరవసైన్యాన్ని గెలవటం ఆ దేవతలందరు ఏకమై వచ్చినా సాధ్యం కాదు. అట్టి సైన్యాన్ని సునాయాసంగా గెలిచావు. ఈ గెలుపునకు నీ అదృష్టమే కాదు, నీ పరాక్రమం కూడా కారణమే. అందువల్ల నీ అదృష్టాన్ని, పరాక్రమాన్ని ప్రశంసించనక్కరలేదా!.

క. ఆ వృద్ధక్షత్తు తపము । వావిరి నోర్వంగ నీకు వచ్చినటుల దు
ర్భావుఁ డగు కర్ణు నోర్వం । గా వచ్చినఁ గాదె నాకుఁ గడుఁ బ్రీతి యగున్!' 8

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ వృద్ధక్షత్త్రు తపము వాని రిన్= సైంధవుడి తండ్రి అయిన ఆ వృద్ధక్షత్ర మహారాజు తపస్సుయొక్క ఉత్కర్షను; ఓర్వంగన్= జయించటానికి; నీకున్= అర్జునుడవైన నీకు (ముక్కంటినే గెలిచి పాశుపతాస్త్రాన్ని సంపాదించినవాడవైన నీకని అర్థాంతర సంక్రమిత వాచ్యధ్వని); వచ్చిన+అటులు= వచ్చిన విధంగా; ఓర్వంగన్+వచ్చినటులు= జయించజాలిన విధంగా అని అన్వయక్రమం; దుర్భావుఁడు+అగు= ఊహించరానివాడైన (అనగా ఊహకందని పరాక్రమము గలవాడని భావము); కర్ణుని= రాధేయుడిని; ఓర్వంగాన్ వచ్చినన్= ఓడించజాలిన (నాడే); నాకున్= నీ శ్రేయము కోరే నాకు (కృష్ణునకు); కడున్= మిక్కిలి; ప్రీతి= సంతోషము; అగున్+కాదె!= కలుగును కదా!

తాత్పర్యం: వృద్ధక్షత్రుడు సైంధవుని తండ్రి, తన కుమారుని తల నేల గూల్చినవాని తల తుత్తునియలగుటకు తన తపస్సును ధారపోసినాడు. అతడి తపోమహిమ అట్టిది. దానిని గూడ పాశుపతాస్త్ర ప్రభావంచేత జయించావు. అర్జునా! నీవు ఇక జయించవలసినవాడు కర్ణుడు. ఇంద్రుడిచ్చిన శక్త్యాయుధంతో ఊహ కందకుండా నిలిచాడు. అతడిని కూడ నీవు జయించిననాడు నా కెంతో సంతోషం కలుగుతుంది. నీ శ్రేయస్సును కోరేవాడను కదా!

విశేషం: ఇవి శ్రీకృష్ణుడు అర్జునుడితో అనిన మాటలు. 'నీకు' అనగా పాశుపతాస్త్రాన్ని సాధించిన నీకు అని 'నాకు' అనగా సర్వవిధాల నీ శ్రేయాన్ని కోరే నాకు అని అర్థాంతర సంక్రమిత వాచ్యధ్వని. ఇంతేగాక ఆ వృద్ధక్షత్రు అనే సమాసంలోని 'ఆ' అను మాట పూర్వపరామర్శకమై వృద్ధక్షత్రుడు పుత్రప్రాప్తికై చేసిన తపస్సు మొదలైన విషయాలను జ్ఞప్తికి తెస్తుంది. ఈ పద్యంలోని పదాల అర్థవిశేషం గమనిస్తే తప్ప పద్యాభిప్రాయం స్పష్టంకాదు.

చ. అనవుడు నాతఁ డిట్లను 'మహాత్మ! భవత్కరుణం బ్రతిజ్ఞ యే
ను నెఱపఁ గంటిఁ బాండవమనోరథసిద్ధి భవద్దయా సమృ
ద్ధి నగుట వింతయే? భవ దధీనులకున్ విజయంబు బ్రాఁతె? నీ
పను పొనరించు వార; మట భారము నీయది గాదె యెప్పడున్!' 9

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆతఁడు= అర్జునుడు; ఇట్లు= ఈ విధంగా; అనున్= పలుకుతున్నాడు; ఓ మహాత్మ!= ఓ మహానుభావా!(కృష్ణా!); భవత్+కరుణన్= (భవత్ శబ్దము పూజ్యార్థం)= పూజ్యుడవగు నీయొక్క దయచేత; ప్రతిజ్ఞ= సైంధవ వధ రూపమైన ప్రతిన; ఏను= నేను; నెఱపన్+కంటిన్= నిర్వహించజాలితిని; పాండవ మనోరథసిద్ధి= పాండవులయొక్క అభీష్టముల యొక్క సిద్ధి (అనగా పాండవులమగు మా కోరికలు నెరవేరటం); భవత్+దయా+సమృద్ధిన్= నీ దయాతిశయం చేత; అగుట= కలుగుట; వింత+ఏ?= ఆశ్చర్యమా?; భవత్+అధీనులకున్= నీ అధీనులైన వారలకు (నిన్ను ఆశ్రయించిన వారలకని భావం); విజయంబు= కార్యసాఫల్యం; బ్రాఁతి+ఎ?= దుర్లభమా? (తప్పక లభిస్తుందని తాత్పర్యం); నీ పనుపు= నీ ఆనతిని; ఒనరించువారము= పాటించేవారం; అట= ఆ తరువాత; భారము= కార్యం నిర్వహించే భారం; ఎప్పుడున్= ఎట్టి సందర్భంలోనైనా; నీ అది= నీది; కాదె?= కాదా? (నీదే అనిభావం.)

తాత్పర్యం: కృష్ణుడి పలుకులు విని అర్జునుడు ఈ విధంగా అన్నాడు. 'ఓ మహానుభావా! కృష్ణా! నేను ఈ ప్రతిజ్ఞ నిర్విఘ్నంగా నెరవేర్చానంటే అదంతా నీ దయయే. కేవలం నాదే కాదు. మా పాండవులందరి కోరిక లీడేరటం నీ పరిపూర్ణ దయా ఫలితమే. దీనిలో వింత లేదు. నిన్నాశ్రయించినవారికి కార్యసిద్ధి దుర్లభం కాదు. మేము నీవు చెప్పినట్లు చేయువారం. ఆపైన భారం ఏ విషయంలోనైనా నీదే కదా!'

తే. అనుడు నుద్గత మందస్మితాస్యుఁ డగుచు । దనుజమర్దనుఁ డతనితో 'ధర్మతనయుఁ
గానఁ బోవంగ వలయు భాస్కరుఁడు గ్రుంకు । చున్నవాఁ' డని పలికిన నన్నరుండు. 10

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనుడున్= అనగానే; ఉద్గత= పొడసూపిన; మందస్మిత= చిరునవ్వు గల; ఆస్యుఁడు= ముఖం కలవాడు; అగుచున్= ఔతూ; దనుజమర్దనుఁడు= రాక్షససంహారి అయిన కృష్ణుడు; అతనితోన్= ఆ అర్జునుడితో; ధర్మతనయున్= ధర్మనందనుడైన ధర్మరాజును; కానన్= చూడటానికి; పోవంగవలయున్= పోవలయును; భాస్కరుఁడు= సూర్యుడు; క్రుంకుచున్నవాఁడు= అస్తమిస్తున్నాడు; అని= ఇట్లు; పలికినన్= పలుకగా; ఆ+నరుండు= ఆ అర్జునుడు.

తాత్పర్యం: అర్జునుడి మాటలు విని కృష్ణుడు చిరునవ్వుతో ఇట్లా అన్నాడు: 'ఓ పార్థా! ధర్మరాజును మనం చూడపోవలె. సూర్యాస్తమయం ఔతూ ఉన్నది.' ఈ పలుకులు విని అర్జునుడు (తరువాతి గద్యంతో అన్వయం).

వ. 'అట్లు కాక' యనుటయుఁ గదిలి, భీమసేనుండును సాత్యకియును యుధామన్యుండును నుత్తమౌజుండును సముచితసల్లాపంబులు సేయుచుఁ దో నేతేర సాంద్ర శోణిత పూర సేకంబున ఘోరంబైన సంగ్రామ తలంబునం జని చని శౌరి సవ్యసాచి నాలోకించి. 11

ప్రతిపదార్థం: అట్లు= అట్లే; కాక= కానీ; అనుటయున్= అనగానే; కదిలి= బయలుదేరి; భీమసేనుండును= భీముడు; సాత్యకియును= సాత్యకి; యుధామన్యుండును= యుధామన్యుడు; ఉత్తమౌజుండును= ఉత్తమౌజుడు; సముచిత సల్లాపంబులు+చేయుచున్= సందర్భోచితాలైన మాటలు మాట్లాడుకొంటూ; తోన్+ఏతేరన్= వెంట వస్తూ ఉండగా; సాంద్రశోణితపూర సేకంబునన్= దట్టమైన రక్తప్రవాహపు జల్లుతో; ఘోరంబు+ఐన= భయంకరంగా ఉన్న; సంగ్రామ తలంబునన్= రణరంగస్థలాన; చని చని= వెళ్ళి వెళ్ళి (కొంతదూరంవెళ్ళి అని భావం); శౌరి= కృష్ణుడు; సవ్యసాచిన్= అర్జునుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: 'సూర్యాస్తమయం కావస్తూ ఉన్నది. ధర్మరాజును చూడటానికి వెళ్ళుదాము' అనే కృష్ణుడి మాటకు పార్థుడు 'సరే' అన్నాడు. అప్పుడు భీముడు, సాత్యకి, యుధామన్యుడు, ఉత్తమౌజుడు యథోచితంగా సంభాషిస్తూ వెంట నడిచారు. వారు నడిచే రణభూమి అంతా రక్తప్రవాహం గడ్డకట్టి భయంకరంగా ఉన్నది. ఆ రణభూమిని చూచి కృష్ణుడు అర్జునుడితో ఈ విధంగా పలికాడు:

విశేషం: యుధామన్యుడు, ఉత్తమౌజుడు - వీరిద్దరు పాంచాలురు. అర్జునుడికి చక్ర రక్షకులు. సాత్యకి అర్జునుడికి పృష్ఠ రక్షకుడు. భీష్మపర్వంలో ఈ విషయం ప్రస్తావించబడింది. ఈ శ్లోకం చూడండి. శ్లో ॥ పృష్ఠగోయోర్జునస్యాసి యుయుధానో మహారథః । చక్రరక్షే చ పాంచాల్యే యుధామ న్యూత్తమౌజసౌ॥ (యుయుధాన= సాత్యకి).

చ. 'కరులు రథంబు లశ్వములు కాలుబలంబు చమూపతుల్ మహీ
శ్వరు లఖిలాస్త్ర శస్త్రములు చామరముల్ గొడుగుల్ సిడంబు లా
భరణము లిత్తెఱంగునను బార్థ! కడుం జెలువొందెఁ జూడ సం
గరమహి చిత్ర వస్త్రమునఁ గప్పిన చందముఁ దోఁపఁ జేయుచున్. 12

ప్రతిపదార్థం: పార్థ!= ఓ అర్జునా!; కరులు= ఏనుగులు; రథంబులు= రథాలు; అశ్వములు= గుర్రాలు; కాలుబలంబు= సైనికులు; చమూపతుల్= సైన్యాధ్యక్షులు; మహీశ్వరులు= రాజులు; అఖిల+అస్త్రశస్త్రములు= అస్త్రాలు, శస్త్రాలు అన్నీ కూడా; చామరముల్= వింజామరాలు; గొడుగుల్= ఛత్రాలు; సిడంబులు= ధ్వజాలు; ఆభరణములు= కిరీట కేయూరాది ఆభరణాలు (వీటన్నింటిని); ఈ+తెఱంగునను= ఈ విధంగా; చూడన్= చూస్తూ ఉంటే (గజ రథాశ్వాదులు రణరంగాన పడిఉన్న తీరు చూస్తూఉంటే అని భావం); సంగరమహి= రణభూమి; చిత్ర వస్త్రమునన్= రంగురంగుల వస్త్రంతో; కప్పిన చందమున్= కప్పిన విధానాన్ని; తోఁపన్+ చేయుచున్= స్ఫురింపజేస్తూ; కడున్= మిక్కిలి; చెలువు+ఒందెన్= ప్రకాశిస్తూ ఉన్నది.

తాత్పర్యం: 'అర్జునా! ఈ రణభూమి చూచావా? రణాన తెగిపడిన చతుర్విధ సైన్యం, సేనాపతులు, రాజులు వారి ధ్వజ రథాదులు, ఆభరణాలు, శస్త్రాలు ఈ భూమిని కప్పివైచినవి. వీటిని చూస్తుంటే ఎంతో అందంగా రంగురంగుల వస్త్రంతో రణభూమిని కప్పినట్లుగా భాసిస్తూ ఉన్నది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. రణభూమిని చిత్ర వస్త్రాలంకృతంగా ఊహించి చెప్పటంచేత ఇది ఉత్ప్రేక్షాలంకారం.ఈ అలంకారం అర్జునుడి వీరవిహారాన్ని పరాక్రమాతిశయాన్ని సూచిస్తుంది. అర్జునుడి పరాక్రమాతిశయాన్ని ప్రస్తుతించటానికి కృష్ణ డీవిధంగా రణభూమిని వర్ణించాడు. దీనిని అలంకారకృత వస్తుధ్వని అంటారు. మరియొక విశేషం: ఈ పద్యం మూడవపాదంలో 'అఖిలాస్త్ర విత్తములు' అనే పాఠం 'అఖిలాస్త్ర శస్త్రములు' అనే దానికి బదులుగా కానవస్తున్నది. దానికి అర్థం అస్త్రాలన్నింటిని బాగా తెలిసినవారు అని. ఈ మహాసేనాపతులు అట్టివారని అన్వయం. అంతేగాక పద్యంలోని మరోపాదం సంస్కృతమూలానికి చాలా దగ్గరగా ఉన్నది. అదేమంటే "ఆభరణము లిత్తెఱంగునను బార్థ! కడుం జెలువొందె జూడు సంగరమహి" దీని అర్థం: ఆభరణములు+ఉన్న+ఈ తెఱఁగు= ఆభరణాలు పడియున్న వైనం (కర్త) రణభూమిని చిత్ర వస్త్రాలంకృతగా ఉన్నట్లు తోపింపజేస్తూ మిక్కిలి ప్రకాశిస్తూ ఉన్నది చూశావా? - అని అర్జునుడితో కృష్ణుడు పలికిన వాక్యం మూలంలో ఉన్న "మహీతలం నరవర పశ్య దుర్దృశమ్" అనే ఘట్టానికి తగినట్లుగా ఉన్నది.

వ. భవదీయ బాహావిహారంబు నుదారత్వం బిట్లుండునే?' యని యగ్గించుచు నరిగి సమయోచితం బగుటయును ప్రతియోధులు జీచ్చవడియునికిం జేసియు సమరంబు సాలించి తమరాక కెదురు చూచుచుం గూడికొని యున్నయుధిష్ఠిరాదుల సమీపంబగుటయుం బాంచజన్యంబు పూరించినం బాండవాగ్రజుండు. 13

ప్రతిపదార్థం: (ఓ అర్జునా!) భవదీయ బాహావిహారంబు+ఉదారత్వంబు= నీ బాహువుల వీరవిహారంయొక్క గొప్పతనం; ఇట్లు= ఈ విధంగా; ఉండునే?= ఉంటుందా? (ఈనాటి నీ వీరవిహారం మిక్కిలి ఆశ్చర్యకరంగా ఉన్నది. ఇంతకుముందెన్నడూ చూడలేదని భావం); అని= అంటూ; అగ్గించుచున్= ప్రశంసిస్తూ; అరిగి= వెళ్ళి; సమయ+ఉచితంబు= సమయానికి తగింది; అగుటయును=కాగా; ప్రతియోధులు= శత్రువీరులు; జీచ్చవడి= చేష్టలు కోల్పోయి; ఉనికిన్+చేసియున్= ఉండటంచేతకూడ; సమరంబు= యుద్ధం; చాలించి= ఆపివేసి; తమరాకకున్= తాము రావటానికి; ఎదురుచూచుచున్= ఎదురుచూస్తూ; కూడికొని+ఉన్న= గుమిగూడి ఉన్నటువంటి; యుధిష్ఠిర+ఆదుల= ధర్మరాజు మొదలయినవారికి; సమీపంబు+అగుటయున్= దగ్గర కావటంవలన; పాంచజన్యంబు= పాంచజన్యం అనే తన (కృష్ణ) శంఖాన్ని; పూరించినన్= (కృష్ణుడు) పూరించిన వెంటనే; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు.

తాత్పర్యం: 'ఓ అర్జునా! ఈ నాటి నీ బాహువుల వీరవిహారంయొక్క గొప్పతనం ఎంతో ఆశ్చర్యకరంగా ఉందే' అని కృష్ణుడు అర్జునుడిని ప్రశంసిస్తూ, ఇద్దరూ రణభూమిని చూస్తూ ముందుకు నడిచారు. ఇక ప్రొద్దుపోవటాన్ని, శత్రువీరులు అలసి నిశ్చేష్టులై ఉండటాన్ని చూచి యుద్ధం ఆపుచేయించారు. తమరాకకై ఎదురుచూస్తూ గుమికూడి యున్న ధర్మరాజాదులు కానవస్తూ ఉండగా, కృష్ణుడు తన పాంచజన్యాన్ని విజయసూచకంగా పూరించాడు. అది విని ధర్మరాజు

విశేషం: 'బాహావిహారంబు' అనే దానికి బదులు 'బాహా వీర్యవిలాసంబు' అనే పాఠం తగినట్టుగా ఉన్నది.

సైంధవుని సంహరించి కృష్ణార్జునులు వచ్చి ధర్మజునకు నమస్కరించుట (సం. 7-124-1)

తే. రథము డిగ్గి హర్షాశ్రులు గ్రమ్ముదేర । నెదురు కొనుటయు సంభ్రమ మెసక మెసఁగఁ
బార్థుఁడును గేశవుండును బాదచారు । లై రయంబునఁ జని మ్రొక్కి రవ్విభునకు. 14

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: రథము= రథాన్ని; డిగ్గి= దిగి; హర్ష+అశ్రులు; ఆనందబాష్పాలు; క్రమ్ముదేరన్= కమ్ముకొంటూ ఉండగా; ఎదురు కొనుటయున్= ఎదుర్కొనగా; పార్థుడును= అర్జునుడూ; కేశవుండును= కృష్ణుడూ; సంభ్రమము= తొందరపాటు; ఎసకము+ఎసఁగన్= అతిశయిస్తూ ఉండగా; పాదచారులు+ఐ= కాలినడకన వస్తూ; రయంబునన్= వేగంగా; చని= వెళ్ళి; ఆ+విభునకున్= ఆ ధర్మరాజునకు; మ్రొక్కిరి= నమస్కారం చేశారు.

తాత్పర్యం: (ధర్మరాజు) రథం దిగి ఆనందబాష్పాలు కన్నులవెంట రాలగా కృష్ణార్జునులను ఎదుర్కొంటూ ఉంటే వారిద్దరూ తొందర తొందరగా రథం దిగి పాదచారులై వచ్చి ఆ ధర్మరాజుకు ప్రణామం చేశారు.

విశేషం: ధర్మరాజు రథం దిగటం కృష్ణుడిపై ఆదరాన్ని సూచించగా కృష్ణార్జునుల సంభ్రమాతిశయం ధర్మరాజుపై వారికిగల ఆదరభావాన్ని సూచిస్తుంది. ధర్మరాజు ఆనందాశ్రువులు, కృష్ణుడియందుగల భక్తిని, అర్జునుడిపై గల వాత్సల్యాన్ని స్ఫురింపజేస్తాయి. ఇది భావధ్వని. దీనితో ఈ పాత్రల మనస్తత్త్వం చక్కగా నిరూపితమయింది.

వ. ఇట్లు ప్రణమిల్లిన. 15

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ప్రణమిల్లినన్= నమస్కరించగా.

తాత్పర్యం: ఈ విధంగా కృష్ణార్జునులు ధర్మరాజునకు నమస్కారం చేయగా.

క. నరపతి యానందాశ్రులు । గరసరసిరుహముల నొత్తి కను దనియఁగ న
య్యిరువురఁ జూచుచు మేనులు । గరుపాఱఁగ గ్రుచ్చి యొక్క కౌఁగిటఁ జేర్చెన్. 16

ప్రతిపదార్థం: నరపతి= ధర్మరాజు; ఆనంద+అశ్రులు= ఆనందబాష్పాలను; కర సరసిరుహములన్= కమలాలవంటి చేతులతో; ఒత్తి= తుడుచుకొని; కను= కన్నులు; తనియఁగన్= తృప్తినిపొందే విధంగా; ఆ+ఇరువురన్= ఆ ఇద్దరిని (కృష్ణార్జునులను); చూచుచున్= చూస్తూ; మేనులు= వారివారి శరీరాలు; గరుపాఱఁగన్= గగుర్పొడిచే విధంగా; గ్రుచ్చి= ఆనించి; ఒక్కకౌఁగిటన్= ఒకే కౌగిలిలో; చేర్చెన్= చేర్చాడు. (ఇద్దరిని విడివిడిగా గాక ఒకేసారి కౌగిలించుకొన్నాడని భావం).

తాత్పర్యం: ధర్మరాజు ఆనందాతిశయంతో కన్నులలో నిండిన కన్నీటిని తుడిచికొంటూ, కన్నులార వారిద్దరిని చూస్తూ ఒకేసారి వారిద్దరిని గాఢంగా కౌగిలించుకొన్నాడు. ఆ కౌగిలిచేత వారిద్దరి శరీరాలు పులకితమైనాయి.

విశేషం: 'అలం: పరికరం. 'ఒక్క కౌఁగిట' అనే పదంలో 'ఒక్క' అనే విశేషణం సాభిప్రాయం కాబట్టి ఇది పరికరాలంకారం. ఈ అలంకారం చేత ధర్మరాజు ఆ ఇద్దరిని సమానంగా ఆదరించాడనే భావం ధ్వనిస్తూ ఉన్నది.

వ. ఇ వ్విధంబున నాలింగనంబు సేసి యర్జునునితో ని ట్లనియె. 17

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఇట్లా; ఆలింగనంబు+చేసి= కౌగిలించుకొని; అర్జునునితోన్= పార్థుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వారిద్దరిని గాఢంగా ఆలింగనం చేసికొన్న తరువాత ధర్మరాజు అర్జునుడిని చూచి ఇట్లా అన్నాడు:

క. 'చే నెత్తురు గాకుండం । గా నా సైంధవునిఁ జంపి క్రమ్మఱ మీరల్
రా నోచితి నా భాగ్యం । బేన పొగడు నట్టిదయ్యె నీతని కరుణన్.' 18

ప్రతిపదార్థం: చేః= చేయి; నెత్తురు+కాకుండన్+కాన్= రక్తంతో తడియకుండానే; ఆ సైంధవునిన్= (మన అభిమన్యువధకు మూలకారణంగా నిలిచిన) ఆ జయద్రథుడిని; చంపి= సంహరించి; మీరల్= మీరిద్దరు (కృష్ణార్జునులు); క్రమ్మఱన్= తిరిగి; రాన్= రావటానికి; నోచితిన్= పుణ్యం చేసికొన్నాను; నా భాగ్యంబు= నా అదృష్టం; ఈతని కరుణన్= ఈ కృష్ణుడి అనుగ్రహం వలన; ఏను+అ= నేనే; పొగడునట్టిది+అయ్యెన్= ప్రశంసించుకొనవలసినంతటిదయింది.

తాత్పర్యం: 'చేతికి నెత్తురంటకుండా మీరిద్దరూ సైంధవుడిని సంహరించి నన్ను చేరుట నా పుణ్యం. నా అదృష్టాన్ని మెచ్చుకోవాలి. ఎవరో కాదు నేనే. ఇదంతా ఈ మహానుభావుడి అనుగ్రహం వలననే సిద్ధించింది.'

క. అని వాసుదేవుఁ జూపిన । విని యాతఁడు 'నీదు కోపవేగంబున దు
ర్జనుఁ డా జయద్రథుఁడు వొలి । సిన నెవ్వరి కెట్లు సేయఁ జెల్లదె?' యనినన్. 19

ప్రతిపదార్థం: అని= పలికి; వాసుదేవున్= కృష్ణుడిని; చూపినన్= (చేత నిర్దేశిస్తూ) చూపగా; విని= (కృష్ణుడు) విని; ఆతఁడు= కృష్ణుడు; దుర్జనుఁడు= దుష్టుడయిన; ఆ జయద్రథుఁడు= ఆ సైంధవుడు; నీదుకోపవేగంబునన్= నీ (ధర్మరాజు) క్రోధాని కున్న తీవ్రతతో; పొలిసినన్= మరణించగా; ఎవ్వరికిన్= ఎవరికైనా; ఎట్లు= ఏ విధంగానైనా; చేయన్= చేయుటకు; చెల్లదు+ఎ?= తగియుండదా?; అనినన్= అనగా (కృష్ణుడు ధర్మరాజుతో ఈ విధంగా పలుకగా).

తాత్పర్యం: అని పలుకుతూ కృష్ణుడిని చూపాడు ధర్మరాజు. అంటే ధర్మరాజు అభిప్రాయంలో కృష్ణుడే విజయానికి కారణమన్నమాట. ఈ అభిప్రాయాన్ని గమనించి కృష్ణుడు ధర్మరాజుతో 'సైంధవవధతో చేకూరిన ఈ విజయానికి కారణం ఆ కౌరవులు మీకు కలిగించిన కోపమే. మీబోటి సత్పురుషుల కోపావేశం ఎంత పనైనా చేయిస్తుంది. అటువంటప్పుడు ఆ అర్జునుడే కాదు మరెవ్వరైనా కేవలం జయద్రథుడిని వధించుటే కాదు. అంతకంటె దుస్సాధ్యమైన ఏ కార్యమైనా సులభంగా చేయగలుగుతారు. దీనిలో ఆశ్చర్య మేమి?' అని పలుకగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఇక్కడ వాసుదేవ పదం కృష్ణ పర్యాయంగా ప్రయోగించుటవలన ధర్మరాజు తన మనస్సులో కృష్ణుడిని భావించిన తీరు వ్యక్తమవుతున్నది. కృష్ణుడిని వసుదేవ పుత్రుడిగానే మాత్రం ధర్మరాజు అనుకొనటం లేదు. అతడిని భగవంతుడిగా భావించాడు. వాసుదేవ పదం భగవత్పర్యాయం. విష్ణు సహస్రనామంలో ఈ వాసుదేవపదం ఉన్నది. శంకరాచార్యులు ఈ పదాన్ని తన విష్ణు సహస్రనామ భాష్యంలో ఇట్లా నిర్వచించారు. 'వాసయతి జగదాచ్ఛాదయతి మాయయేతి వాసుః స ఏవ దేవ ఇతి వాసుదేవః శ్లో॥ ఛాదయామి జగత్ విశ్వం భూత్వా సూర్య ఇవాంశుభిః' (మహా - భా - శాంతి - 141/41) ఇతి భగవద్వచనాత్॥" (విష్ణు సహస్ర. భాష్యం 709 వ నామం). అనగా తన మాయచేత ఈ సమస్త ప్రపంచాన్ని ఆచ్ఛాదించేవాడు కాబట్టి 'వాసు' అని అంటారు. అట్టి దేవుడు కాబట్టి వాసుదేవుడైనాడు అని ఆ భాష్యం సారాంశం. 'బహూనాం జన్మనామంతే' అనే గీతా శ్లోకం (7/19)లోని 'వాసుదేవః' అనే పదానికి భగవద్గీతా వ్యాఖ్యాతలు కూడా భగవత్పరంగా ఇదే అర్థం వ్రాశారు. అంతేగాక భగవంతుడు తాను సర్వప్రపంచాన్ని వ్యాపించి ఉండటంచేత, సర్వభూతాలకు (ప్రాణులకు) తాను నివాసభూతుడు కావటంచేతను వాసుదేవుడైనాడని యజుర్వేద సంధ్యావందనంలోని ఈ శ్లోకం చెప్తుతున్నది.

శ్లో॥ వాసనాత్ వాసుదేవస్య వాసితం తే జగత్త్రయమ్ ।
సర్వభూత నివాసోఽసి వాసుదేవ నమోఽస్తుతే" ॥

కాబట్టి ఇక్కడి వాసుదేవ పదం ఎంతో అర్థవంతం.

వ. అ మ్మహీపతి య మ్మహాత్ము నుద్దేశించి. 20

ప్రతిపదార్థం: ఆ+మహీపతి= ఆ ధర్మరాజు; ఆ+మహాత్మున్= మహాత్ముడైన ఆ శ్రీకృష్ణుడిని; ఉద్దేశించి= గురించి.

తాత్పర్యం: ఆ ధర్మరాజు మహానుభావుడైన ఆ శ్రీకృష్ణుడిని సంబోధిస్తూ (ఇట్లా పలికాడు). (తరువాతి పద్యంతో అన్వయం).

క. దేవాసురసంఘంబులు । నీ వలిగిన రూ పడంగు నీ కూరిమి సౌ
ఖ్యావహ మఖిల జగములకు । దేవ! భవద్భక్తు లరులఁ దీర్చుట యరుదే! 21

ప్రతిపదార్థం: దేవ!= ఓ దేవా!; (కృష్ణ భగవానుడా!); నీవు+అలిగినన్= నీవే కోపించినట్లైతే; దేవ+అసుర సంఘంబులు= దేవతల సమూహాలు, రాక్షసుల సమూహాలు; రూపు+అడంగున్= నశిస్తాయి; నీ కూరిమి= నీ ప్రేమ; అఖిల జగములకున్= సమస్త లోకాలకు; సౌఖ్య+ఆవహము= సుఖాన్ని కలుగజేసేది; భవద్భక్తులు= నీయందు భక్తి కలిగి ఉన్నవారు; అరులన్= శత్రువులను; తీర్చుట= నశింపచేయటం; అరుదు+ఏ!= ఆశ్చర్యమా!

తాత్పర్యం: ఆదిదేవుడవైన శ్రీకృష్ణా! నీవు కోపిస్తే, ఈ దేవతలు, రాక్షసులు నశిస్తా రనగా ఈ మానవుల లెక్క ఏమి? నీవు దయదలిస్తే ఈ సమస్త లోకాలలోని వారందరూ సుఖిస్తారు. కాబట్టి నిన్ను సర్వాత్మనా భజించే భక్తులు శత్రువులను జయించటంలో ఆశ్చర్య మేముంది? (మా శత్రు నిర్మూలనం, అంటే ఈ జయప్రదవధ నీ అనుగ్రహంతోనే కలిగిందని శ్రీకృష్ణుడితో ధర్మరాజు పలికిన ఈ మాటలలో తేటపడుతుంది.)

విశేషం: ఇక్కడ 'దేవ' అనే పదంతో కృష్ణుడిని సంబోధించటం శ్రీకృష్ణుడి ఆదిదేవత్వాన్ని సూచిస్తుంది - అప్పుడే దేవాసుర వినాశాది రూప పద్యార్థం సుసంభావిత మౌతుంది.

వ. అని మఱియు ననేక ప్రకారంబులం బ్రస్తుతించి, భీష్మాదు లతని కతన మడియుట యుగ్గడించి 'నీవు కోపించినట్లు వర్తించుటఁ గౌరవులు సెడిర కాఁ దలంచెద' ననుటయు నచ్యుతుం డా భూపాలు నాలోకించి 'ధర్మోత్కృష్టుండవగు నీకు నరిష్టం బాచరించిన వారికిఁ జెడకుండ వచ్చునే?' యనునెడ ననిలసుతుండును సాత్యకియును దనువులఁ గ్రొత్తగంట్లు గొమరార నద్ధరణీపతి చరణంబులకుఁ బ్రణతులైన, నతం డెత్తి కౌఁగిలించుకొని వారలు కుంభసంభవ కృతవర్మాదుల సంరంభంబు మర్దించుట పేర్కొని యభినందించె; యుధామన్యుండును నుత్తమౌజుండును దగిన తెఱంగున నంగాంచిన వారి నుచిత వచనంబుల సంభావించెఁ; దదీయ సైన్యం బెల్లను బ్రమోద భరితంబై కయ్యంబునకుం గాలు ద్రవ్వుచుండె; నా సమయంబున శోక విస్మయ వివశుం డగుచు దుర్యోధనుం డంతర్గతంబున. 22

ప్రతిపదార్థం: అని= పలికి; మఱియున్= ఇంకా; అనేక ప్రకారంబులన్= అనేక విధాలుగా; ప్రస్తుతించి= పొగడి; భీష్మ+ఆదులు= భీష్ముడు మొదలైనవారు; అతని కతనన్= ఆ శ్రీకృష్ణుడి కారణంగానే (ఆ శ్రీకృష్ణుడి అనుగ్రహంతోనే అని భావం); మడియుట= నశించిపోవటాన్ని; ఉగ్గడించి= కీర్తించి; నీవు= శ్రీకృష్ణుడు; కోపించినట్లు= కోపపడేటట్లు; వర్తించుటన్= ప్రవర్తిస్తూ ఉండటంచేత; కౌరవులు= దుర్యోధనుడు మొదలైన కౌరవులు; చెడిరి కాన్= చెడిపోయినట్లు; తలంచెదన్= తలుస్తాను; అనుటయున్= అనగానే; అచ్యుతుండు= కృష్ణుడు; ఆ భూపాలున్= ఆ రాజును అనగా ధర్మరాజును; ఆలోకించి= చూచి; ధర్మ+ఉత్కృష్టుండవు+అగు= ధర్మంచేత శ్రేష్ఠుడవయినట్టి; నీకున్= ధర్మరాజునకు; అరిష్టంబు= కీడు; ఆచరించిన వారికిన్= చేసినవారికి; చెడక+ఉండన్+వచ్చునే?= చెడిపోకుండా ఉండటానికి సాధ్యమవుతుందా? (అట్టివారు చెడిపోతారని భావం); అను+ఎడన్= అంటూ ఉండే సమయాన; అనిల సుతుండును= వాయునందనుడు (భీముడు); సాత్యకియును= సాత్యకికూడా; తనువులన్= శరీరాలపై; క్రొత్తగంట్లు= (యుద్ధంలో)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అప్పుడే ఏర్పడిన గాయాలు; కొమరు+ఆరన్= ప్రకాశిస్తూ ఉండగా; ఆ+ధరణీ పతి చరణంబులకున్= ఆ ధర్మరాజు పాదాలకు; ప్రణతులు+ఐనన్= నమస్కారం చేసినవారు కాగా; అతండు= ఆ ధర్మరాజు; ఎత్తి= (వారిద్దరిని పైకి) లేవనెత్తి; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; వారలు= ఆ భీమసేన సాత్యకులు; కుంభసంభవ, కృతవర్మ+ఆదుల సంరంభంబు= ద్రోణాచార్యులు కృతవర్మ మొదలైనవారి యుద్ధవేగాన్ని; మర్దించుట= అణగద్రొక్కటాన్ని; పేర్కొని= ప్రస్తావించి (వారిద్దరి యుద్ధనైపుణ్యాన్ని కొనియాడి అని భావం); అభినందించెన్= అభినందించాడు (వారిద్దరి వీరత్వానికి తన సంతోషాన్ని ధర్మరాజు తెలిపాడని భావం); యుధామన్యుండును= యుధామన్యుడనేవాడు; ఉత్తమౌజుండును= ఉత్తమౌజుడనే అతడు (వీరిద్దరు); తగిన తెఱంగునన్=తగిన విధంగా; కాంచినన్= (తనను) సమీపించటం తోడనే - అనగా వినయంతో అంజలిబద్ధులై ధర్మరాజును సమీపించిన వెంటనే; ఉచిత వచనంబులన్= సముచిత సల్లాపాలతో; సంభావించెన్= గౌరవించాడు; తదీయ సైన్యంబు+ఎల్లను= ఆ ధర్మరాజు సైన్యమంతా; ప్రమోద భరితంబు+ఐ= సంతోషంతో నిండినదై; కయ్యంబునకున్= యుద్ధానికి; కాలుద్రవ్వుచున్+ఉండెన్= సన్నద్ధమౌతూ ఉన్నది; ఆ సమయంబునన్= అదే సమయాన; శోకవిస్మయ వివశుండు+అగుచున్= దుఃఖం ఆశ్చర్యం - ఈ రెంటికి లోనవుతూ; దుర్యోధనుండు= సుయోధనుడు (దుర్యోధనుడికి తన సైన్య పరాజయంచేత దుఃఖం, సైంధవుడిని వధించిన తీరు చూస్తూ ఉంటే విస్మయం కల్గిందని భావం); అంతర్గతంబునన్= స్వగతంగా.

తాత్పర్యం: అని పలికిన తరువాత మళ్ళీ కూడా శ్రీకృష్ణుడిని ధర్మరాజు అనేక విధాలుగా స్తుతించాడు. అతడు పురాణ పురుషుడనే విషయాన్ని స్పష్టపరిచాడు. భీష్మాదులను జయించుట కృష్ణుడి అనుగ్రహం లేకుండా సాధ్య మయ్యేది కాదన్నాడు. 'కౌరవుల అధర్మాచరణం నీకు కోపహేతువయింది. ఆ నీ కోపమే కౌరవుల నాశనానికి దారి తీసింది' అని ధర్మరాజు కృష్ణుడితో తాను భావించిన తీరు చెప్పిన వెంటనే కృష్ణుడు, 'అదేదీ కాదు నీబోటి ధర్మనిష్ఠునికి అరిష్టం తలపెట్టినవారికి చెడిపోవటం ఎట్లాగూ తప్పదు.' అని అంటూ ఉండగానే, యుద్ధంలో తమ శరీరం మీద ఏర్పడిన కొత్త గాయాలు ప్రకాశిస్తూ ఉండగా భీముడు, సాత్యకి వచ్చి ధర్మరాజుకు పాదాభివందనం చేశారు. వారిద్దరినీ లేవనెత్తి ధర్మరాజు ఆలింగనం చేసికొని, ద్రోణ కృతవర్మల విజృంభణాన్ని వారు అణచివేయడాన్ని ప్రస్తావించి అభినందించాడు. ఇంతలో యుధామన్యుడు, ఉత్తమౌజుడు అనేవారు వినయంగా ధర్మరాజును దర్శించగా, వారిని కూడా సముచితవచనాలతో గౌరవించాడు. శత్రువిజయంచేత ధర్మరాజుసైన్యంలో ఆనందోత్సాహాలు పెరిగి, మళ్ళీ యుద్ధానికి ఆ సైన్యం కాలు ద్రవ్వసాగింది. అదే సమయాన దుర్యోధనుడు దుఃఖానికి, ఆశ్చర్యానికి తీవ్రంగాలోనై, తన మనస్సులో (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: దుర్యోధనుని ఆశ్చర్యం సైంధవవధకు, దుఃఖం తనపక్షపరాజయానికి 'అని మఱియు అనేక ప్రకారంబులం బ్రస్తుతించి భీష్మాదు లతని కతన మడియుట యుగ్గడించి' అనే ఈ వచనంలో కృష్ణుని స్తుతించిన అనేక ప్రకారా లేవి అంటే - సంస్కృత మూలంలో "బాల్యాత్ప్రభృతి శ్రీకృష్ణ కర్మాణి శ్రుతవానహమ్" (ద్రోణ- 149 అధ్యా. 13వ శ్లో. నుండి 35వ శ్లోకం వరకు) అనే శ్లోకం మొదలుకొని 20 శ్లోకాల భావం 'అనేక ప్రకారంబులం బ్రస్తుతించి' అనే వాక్యంతో సంగ్రహించబడింది. కృష్ణుని పురాణ పురుషత్వాన్ని సూచించే ఎన్నో అంశాలు ఈ శ్లోకాలలో ఇమిడి ఉన్నాయి. వాటిని సూచించటానికి ఈ ఒక్కమాట వచనంలో పొదగబడింది. ఆ అంశాలను వివరించటం ప్రకృతం విస్తృతికి దారి తీస్తుంది. పూర్తిగా విడుచుటకు మనసొప్పక తిక్కన కవిబ్రహ్మ, 'మూలాన్ని చూడవచ్చు కదా ఎవరికైనా విశేష జిజ్ఞాస ఉంటే' అనే అభిప్రాయంతో ఈ మాత్రం సూచనప్రాయంగా చెప్పినట్లు భావించాలి. అదే కవిబ్రహ్మ ప్రత్యేకత.

ఉ. **'ద్రోణుఁడు గర్ణుఁడుం గృపుఁడు ద్రోణసుతుండును నేల వాని గీ**
ర్వాణులకైననుం జెనయవచ్చునె? యెవ్వరు నాజిఁ గౌరవ
త్రాణ పరాయణత్వమున దర్పము సూపఁగ లేమి దెల్ల మ
క్షీణ పరాక్రముం డయిన క్రీడికి నిక్కపుటల్క వచ్చినన్.' **23**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అక్షీణ పరాక్రముండు+అయిన= తరుగు అనేది లేని పరాక్రమం గల; క్రీడికిన్= అర్జునుడికి; నిక్కపుటల్క (నిక్కము+అల్క)= నిజమైన కోపం (ప్రణయకోపాదులు పైకి కోపాలైనా అవి నిజానికి కోపాలు కావు కదా! కావున శత్రువులపై చూపేదే నిజమైన కోపం); వచ్చినన్= వచ్చినట్లయితే; ద్రోణుఁడు= ద్రోణాచార్యులు; కర్ణుఁడున్= కర్ణుడు (తన ప్రాణ స్నేహితుడు); కృపుఁడు= కృపాచార్యులు; ద్రోణసుతుండునున్= ద్రోణాచార్య పుత్రుడు అశ్వత్థామ; ఏల?= ఎందుకు? (వీరందరిమాట ఎందుకు? అని భావం); గీర్వాణులకున్+ఐననున్= దేవతలకైనా కూడా; ఆజిన్= యుద్ధంలో; వానిన్= ఆ అర్జునుడిని; చెనయన్‌వచ్చునే?= ఎదిరించ సాధ్యం అవుతుందా? (కాదని భావం); ఎవ్వరున్= ఈ ద్రోణాదులలో ఎవ్వరైనా; ఆజిన్= యుద్ధంలో (ఈ పదం వెనక వాక్యంలో కూడా అన్వయించింది); కౌరవ త్రాణపరాయణత్వమునన్= కౌరవులమైన మా రక్షణ అందలి తత్పరత్వంచేత (తృతీయార్థే సప్తమీ); దర్పము= భుజదర్పాన్ని; చూపఁగలేమి= చూపలేకపోవటం; తెల్లము= స్పష్టం.

తాత్పర్యం: 'అర్జునుడి పరాక్రమానికి క్షీణత్వమనేదే లేదు. అట్టి అర్జునుడికే నిజంగా కోపం వచ్చిననాడు ఈ ద్రోణకర్ణకృపాశ్వత్థామలేకాదు, ఆ దేవతలైనా అతడి ముందు యుద్ధంలో నిలువలేరు. ఈ ద్రోణ కర్ణాదులకు 'కౌరవులమైన మమ్ము రక్షించాలి' అనే తత్పరత ఉంటే ఉండుగాక! కాని, వారు యుద్ధంలో అర్జునుడి కెదురుగా నిలిచి తమ భుజబలాన్ని చూప శక్తిలేనివారని నేడు స్పష్టమయింది.'

వ. అనుచు నుత్సాహ రహితంబైన చిత్తం బుత్తలపడఁ గుంభసంభవు పాలికిం బోయి, పరుల జయంబును, దమవారు సమయుటయు నుగ్గడించి మఱియును. 24

ప్రతిపదార్థం: అనుచున్= అనుకొంటూ (మనస్సులో ఇట్లా భావిస్తూ); ఉత్సాహ రహితంబు+ఐన= ఉత్సాహం లేనట్టి; చిత్తంబు= మనస్సు; ఉత్తలపడన్= తత్తరపాటు చెందుతూ ఉండగా; కుంభసంభవు పాలికిన్= ద్రోణాచార్యుల సమీపానికి; పోయి= వెళ్ళి; పరుల జయంబును= శత్రువులకు కలిగిన విజయాన్ని; తమవారు= తమ యోధులు, బంధువులు మొదలైనవారు; సమయుటన్= నశించటాన్ని; ఉగ్గడించి= చెప్పి; మఱియును= మళ్ళీ కూడా.

తాత్పర్యం: అని దుర్యోధనుడు తనలో తాను తర్కించుకొంటూ ఉత్సాహాన్ని కోల్పోయిన మనస్సు తత్తరపాటు చెందుతుండగా, ద్రోణాచార్యుల సమీపానికి వెళ్ళి 'శత్రువుల విజయాన్ని, తమవారి మరణాన్ని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు: (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. 'బల్లిదుఁ డగు భీష్ముఁ బడవైచి సోదర । వర్గంబుఁ దాను ననర్గళముగఁ
గ్రాలెడు నేచి శిఖండి యింతకు మున్న । పొలిసె నేడక్షౌహిణులు, గిరీటి
చేత సైంధవుపాటు సెప్ప జిట్టలు నాకుఁ । బూని మేలెంచి కాంభోజవిభుఁడు
జలసంధుఁడును సుదర్శనుఁడును లోను గాఁ । గలుగు భూపతులు పెక్కండ్రు నేఁడు

తే. గలనఁ గూలిరి; వీరి లోకంబ యైన । నొండెఁ బాంచాల బలమును బాండవులను
దండినై తెగఁ జూచిన నొండెఁ గాక । యెట్లు వాయు నా కిందఱ ఋణము? సెపుమ! 25

ప్రతిపదార్థం: శిఖండి= ద్రుపదమహారాజు కుమారుడు శిఖండి; బల్లిదుఁడు+అగు= అతి బలశాలిఅయిన; భీష్మున్= భీష్ముడిని; పడన్‌వైచి= పడిపోయే విధంగా చేసి; సోదరవర్గంబున్= ధృష్టద్యుమ్నుడు మొదలైన సోదరుల సమూహాన్నీ; తాను= శిఖండి; అనర్గళముగన్= అడ్డులేకుండా; ఏచి= అతిశయించి; మిక్కిలి; క్రాలెడున్= ప్రకాశిస్తూ ఉన్నాడు; ఇంతకున్‌మున్ను+అ= ఇంతకంటే

ముందే; ఏడు+అక్షౌహిణులు= ఏడు అక్షౌహిణుల సైన్యం; పొలిసెన్= నశించింది; కిరీటిచేతన్= అర్జునుడిచేత; సైంధవుపాటు= జయద్రథుడి మరణం; చెప్పన్= చెప్పటానికీ; చిట్టలు= ఆశ్చర్యం (ఆశ్చర్యం కలిగించే విధంగా ఉన్నది); నాకున్= నా కోసం; పూని= పనిగట్టుకొని; ఏతెంచి= వచ్చి; కాంభోజ విభుఁడు= కాంభోజదేశపురాజు; జలసంధుఁడును= జలసంధుడు; సుదర్శనుఁడును= సుదర్శనుడు; లోనుగాన్+కలుగు= మొదలుగా సమర్థులైన; భూపతులు= రాజులు; పెక్కం(డ్రు= చాలామంది; నేఁడు= ఈనాడు; కలనన్= యుద్ధంలో; కూలిరి= పడిపోయారు; వీరిలోకంబు+అ+ఐనన్= ఈ వీరులు పొందిన లోకమైనా; ఒండెన్= ఒకటే; పాంచాల బలమును= పాంచాల సైన్యాన్ని; పాండవులను= ధర్మరాజాదులను; దండిని+ఐ= బలశాలినై; తెగన్+చూచినన్= సంహరించినా; ఒండెన్= ఒకటే (ఈ రెంటిలో ఏదైనా తనకు సమానమే కాని ఈ రెండు తప్ప మరో పక్షం తనకు అభిమతం కాదని దుర్యోధనుడి భావం); కాక= కాదంటే (ఈ రెంటిలో ఏదో ఒకటి చేయనిపక్షంలో); నాకున్= దుర్యోధనునకు; ఇందఱ ఋణము= (తనకై ప్రాణాలు ధారవోసిన) ఇందరి (రాజుల) బాకీ; ఎట్లు= ఏ విధంగా; పాయున్?= తీరుతుంది?; చెపుమ!= చెప్పండి!; (మరో విధంగా తాను ఋణవినిర్ముక్తుణ్ణి కాలేనని దుర్యోధనుడి భావం.)

తాత్పర్యం: 'బలిష్ఠుడైన భీష్ముడిని పడగొట్టి శిఖండి, తన సోదరవర్గం అడ్డులేకుండా వెలిగిపోతున్నారు. మన ఏడక్షౌహిణుల సైన్యం ఇంతకుముందే నశించింది. అర్జునుడి చేత జరిగిన సైంధవపతనాన్ని చెప్పటానికే ఆశ్చర్య కరంగా ఉంది. నాకై ప్రాణాలు లెక్కచేయక యుద్ధానికి వచ్చిన కాంభోజరాజు, జలసంధుడు, సుదర్శనుడు మొదలైన రాజులు పెక్కుమంది ఈ రోజు యుద్ధంలో మరణించారు. ఇక నాకు ఆ రాజులమాదిరి వీరస్వర్గాన్ని అలం కరించటమో లేదా పాంచాలసైన్యాన్ని, ధర్మరాజాదులను బలశాలినై తెగనరకడమో తప్ప, నాకై ప్రాణాలర్పించిన ఇందరు వీరుల ఋణం ఏ విధంగా తీరుతుందో చెప్పు.

విశేషం: భీష్ముడిని జయించినవాడు అర్జునుడే అయినా నిమిత్తం మాత్రం శిఖండే - కాశీరాజు కూతురు అంబ భీష్ముడిపై వైరంతో తపస్సుచేసి రెండో జన్మలో ద్రుపదరాజునకు, శిఖండి అయి, స్త్రీగా జన్మించి, తరువాత పురుషత్వం పొందింది. నైష్ఠిక బ్రహ్మచారి కావటంచేత భీష్ముడు స్త్రీలతో యుద్ధం చేయడు. శిఖండి పురుషత్వం పొందిన స్త్రీగానే భీష్ముని భావన. ఈ అదను చూచికొని శిఖండిని ముందరపెట్టుకొని అర్జునుడు భీష్ముడితో యుద్ధం చేశాడు. భీష్ముడు శిఖండిని చూడకుండా ఉండటానికై వెనుదిరిగి అర్జునుడితో యుద్ధం చేశాడు. (శిఖండి జన్మవృత్తాంతం ఉద్యోగపర్వంలోని అంబోపాఖ్యానంలో ఉన్నది చూడండి). కాబట్టి దుర్యోధనుడు 'శిఖండి భీష్ముని పడవైచి' నట్లు చెప్పటంలో అసందర్భమేమీ లేదు.

క. నరుఁ డనుఁగుబంటు గావునఁ । బొరిగొనఁ జొర వీవు; సూతపుత్రుఁ డొకఁడ మా
ర్తుర మార్కొనియెడు; నతనికి । వెరవును గఱతలును లేవు వీరుం డగుటన్. 26

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; అనుఁగుబంటు= ప్రియశిష్యుడు; కావునన్= కాబట్టి; ఈవు= నీవు; పొరిగొనన్+చొరవు= చంపటానికి తలపెట్టటం లేదు; సూతపుత్రుఁడు= కర్ణుడు; ఒకఁడు+అ= ఒకడే; మార్తురన్= శత్రువులను; మార్కొనియెడున్= ఎదుర్కొంటాడు; వీరుండు+అగుటన్= (అతడు) పరాక్రమశాలి కాబట్టి; అతనికిన్= కర్ణుడికి; వెరవును= ఉపాయం (సులభంగా కార్యం సాధించే ఆలోచనాశక్తి); కఱతలును= దుశ్చేష్టలుకూడా. (పైకి ఒకటి లోన ఒకటి అనే విధంగా కుటిల ప్రవృత్తులు); లేవు.

తాత్పర్యం: ఆచార్యా! అర్జునుడేమో తమకు ప్రియశిష్యుడు; అందుకే అతడిని సంహరించ బూనుకొనటం లేదు. ఇక మిగిలినవారిలో కర్ణుడొకడే నిష్కపటవర్తనుడు, మహావీరుడు. అతడొక్కడు మాత్రం శత్రుజయానికై పాటుపడతాడు. కాని, కార్యం సాధించే సులభోపాయం మాత్రం అతడికి తొందరగా తట్టదు. (ఉపాయశాలులైన మీరేమో నా విషయంలో కపటంగా ప్రవర్తిస్తున్నారని భావం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: కర్ణుడికి ఉపాయం, దుశ్చేష్టలు లేవని చెప్పటంచేత ఈ రెండూ తమకున్నాయని ద్రోణుడిని గూర్చిన ఎత్తిపొడుపు ధ్వనిస్తూ ఉన్నది.

వ. అతఁడునుం బోరి పోరి చేడ్పడి సైంధవుం గోలుపోయె' ననవుడుఁ గటగటంబడి యాచార్యుం డతని కిట్లనియె. 27

ప్రతిపదార్థం: అతఁడునున్= ఆ కర్ణుడు; పోరి పోరి= యుద్ధంచేసి చేసి; చేడ్పడి= నశించి (అశక్తుడై); సైంధవున్= జయద్రథుడిని; కోలుపోయెన్= పోగొట్టుకొన్నాడు (సాధ్యమైనంతవరకు పోరాడినా సైంధవుడిని రక్షించుకొనలేకపోయాడని); అనవుడున్= అనగానే; కటకటన్+పడి= బాధపడి; ఆచార్యుండు= ద్రోణాచార్యుడు; అతనికిన్= ఆ దుర్యోధనుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ కర్ణుడు సైంధవుడిని రక్షించుకొనటానికి ఎంతగానో యుద్ధం చేశాడు. కాని, సాధ్యం కాక సైంధవుడిని వదలుకొన్నాడు.' ఈ మాట వినగానే ద్రోణాచార్యుడు ఎంతో బాధపడి, దుర్యోధనుడిని చూచి ఇట్లా అన్నాడు:

విశేషం: 'పోరి పోరి' అనే ద్విరుక్తిచేత కర్ణుడి ప్రయత్నాతిశయం వ్యక్తమగుటయే కాకుండా ద్రోణాచార్యులు అంత శ్రద్ధగా పోరాడి సైంధవుడిని రక్షించలేదనే దుర్యోధనుడి అభిప్రాయం కూడా ధ్వనిస్తున్నది.

చ. 'నను మది దూఁటు వోవు వచనంబుల నేటికి నిట్లు నొంప? న
ర్జునుని జయింపరామి పలుచోటులఁ జెప్పనె? దేవకోటికై
నను నవిజయ్యుఁ భీష్ముఁ బ్రధనంబున నాతఁడు సంపఁ గౌరవుల్
మన రని తోఁచె నాకు; నభిమానముఁ గాచుటకై పెనంగెదన్. 28

ప్రతిపదార్థం: ననున్= నన్ను; మది= మనస్సు; తూఁటు+పోవు= చిల్లులు పడే; వచనంబులన్= మాటలతో; ఇట్లు= ఇట్లా; నొంపన్= నొప్పించటం; ఏటికిన్?= ఎందుకు?; అర్జునుని జయింపరామి= అర్జునుడిని జయించలేకపోవటం అనే విషయం; పలు చోటులన్= అనేక సందర్భాలలో; చెప్పనె?= చెప్పలేదా?; దేవకోటికిన్+ఐనను= దేవతల సమూహానికైనా కానీ; అవిజయ్యున్= జయింపశక్యంకాని; భీష్మున్= భీష్ముడిని; ప్రధనంబునన్= యుద్ధంలో; ఆతఁడు= ఆ అర్జునుడు; చంపన్= సంహరించగా; కౌరవుల్= కౌరవులు (మీరు); మనరు+అని= జీవించరని; నాకున్= నాకు (ద్రోణాచార్యులకు); తోఁచెన్= తోచింది (అయినా); అభిమానమున్= ఆత్మగౌరవం; కాచుటకై= రక్షించుకొనటానికి; పెనంగెదన్= యుద్ధం చేస్తూ ఉన్నాను.

తాత్పర్యం: 'దుర్యోధనా! నన్నిట్లా మనస్సు చిల్లులుపడే మాటలతో ఎందుకు వేధిస్తావు? నేనింతకు ముందే ఎన్నో సందర్భాలలో అర్జునుడిని జయించటం కష్టం - అనే విషయం చెప్పనే చెప్పాను. దేవతలంతా ఒక్కటైనా జయింప సాధ్యంకాని ఆ భీష్ముడినే యుద్ధంలో జయించాడు అర్జునుడు. అప్పుడే 'కౌరవులు ఇక జీవించరని నాకు తోచింది. అయినా నేను యుద్ధం చేస్తున్నానంటే విజయం సాధిస్తానని కాదు - నా ఆత్మగౌరవం కాపాడుకొనటానికే.

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. 'దేవకోటికైనను నవిజయ్యు' అనే భీష్ముడి విశేషణంలో అట్టి భీష్ముడినే జయించిన సవ్యసాచికి ఎదురై నిలిచేవాడు మన సైన్యంలో లేనే లేడని ద్రోణాచార్యుల అభిప్రాయమైనట్లు వ్యక్తమవుతూ ఉన్నది.

ఆ. శకునిచేతి యడ్డసాళ్ళులు నేఁడు గాం। డీవ ముక్త బహు పటిష్ఠ బాణ
మూర్తిఁ గవిసి నీకు నార్తి యొనర్పంగ। నాఁకగొనఁగ నెట్టు లగు కుమార! 29

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కుమార!= వత్సా దుర్యోధనా!; శకునిచేతి+అడ్డసాళ్ళులు= శకునిచేతి పాచికలు; నేఁడు= ఈనాడు; గాండీవ= గాండీవమనే అర్జునుడి ధనుస్సునుండి, ముక్త= విడువబడిన; బహు పటిష్ఠ= మిక్కిలి సామర్థ్యం గల; బాణ= బాణాల; మూర్తిన్= ఆకారాన్ని; కవిసి= పొంది; నీకున్= దుర్యోధనుడికి; ఆర్తి+ఒనర్పఁగన్= బాధ కలిగిస్తూ ఉంటే; ఆఁక+కొనఁగన్= ఆపటానికి; ఎట్టులు= ఎట్లా; అగున్?= సాధ్యం అవుతుంది?

తాత్పర్యం: వత్సా దుర్యోధనా! ఆనాడు శకునిచేతి పాచికలే ఈనాడు అర్జునుడి గాండీవంనుండి వెలువడే బలమైన బాణరూపాన్ని ధరించి నిన్ను బాధిస్తూ ఉన్నాయి. వాటిని ఆపటం ఎవరికి సాధ్యమౌతుంది?

విశేషం: అలం: రూపకం.

క. **భూరమణ! విదురుఁ డమ్మెయి । వారింపఁగ నతుల పుణ్యవతిఁ గృష్ణను మీ**
వా రెల్లఁ జూడఁ బఱచిన । క్రూరపుఁ బాపంబు ఫలము గుడువక యున్నే? **30**

ప్రతిపదార్థం: భూరమణ!= రాజా దుర్యోధనా!; విదురుఁడు= మీ పినతండ్రి విదురుడు; ఆ+మెయిన్= ఆ విధంగా; వారింపఁగన్= నివారించినా కూడా; అతులపుణ్యవతిన్= సాటిలేని పుణ్యాత్మురాలయిన; కృష్ణన్= ద్రౌపదిని; మీవారు+ఎల్లన్= మీ వారందరు; చూడన్= చూస్తూ ఉండగా; పఱచిన క్రూరపు+పాపంబు= అవమానించిన ఆ క్రూరమైన పాపఫలం; ఫలము+కుడువక+ఉన్నే?= అనుభవించక తప్పుతుందా?

తాత్పర్యం: ఓ రాజా! విదురుడు ఆ విధంగా వద్దని చెపుతూఉన్నా, పుణ్యాత్మురాలైన ద్రౌపదిని, మీ వారందరు చూస్తూ ఉండగా అవమానించిన ఘోరమైన పాపఫలం అనుభవించక తప్పుతుందా?

క. **ఆ సభ నీవును మీ దు । శ్శాసనుఁడును గర్ణుఁడును బ్రశస్త చరిత్రో**
ద్భాసితు లగు పాండవులకుఁ । జేసిన కీ డెల్లభంగిఁ జెఱుపదె? మిమ్మున్.? **31**

ప్రతిపదార్థం: ఆ సభన్= ఆ సభలో; నీవును= దుర్యోధనుడు; మీ దుశ్శాసనుఁడును= మీ (సోదరుడు) దుశ్శాసనుడు; కర్ణుఁడును= కర్ణుడు కూడా; ప్రశస్తచరిత్ర+ఉద్భాసితులు+అగు= ప్రశంసాపాత్రమైన నడవడితో ప్రకాశించేటటువంటి; పాండవులకున్= పాండురాజు కుమారులైన ధర్మరాజాదులకు; చేసిన= ఆచరించిన; కీడు= అపకారం; ఎల్లభంగిన్= సర్వవిధాల; మిమ్మున్= మీ అందరిని; చెఱుపదె?= నశింపజేయదా? (నశింపజేయక తప్పదు).

తాత్పర్యం: ఆ సభలో నీవు, నీ అనుజుడు దుశ్శాసనుడు, నీ ఆప్తమిత్రుడు కర్ణుడు ప్రశంసాపాత్రమైన నడవడితో ప్రకాశించే ఆ పాండవులకు చేసిన అపకారం ఊరకపోదు. అన్నివిధాల అది మిమ్మల్ని నశింపచేస్తుంది.

విశేషం: 'ప్రశస్త చరిత్రోద్భాసితులు' అనే పదం పాండవుల పవిత్రతను వ్యక్తీకరిస్తూ, అదే కౌరవుల పాలిట వినాశహేతువనే భావాన్ని దృఢపరుస్తూ ఉన్నది. 'ఇక మేం ఎంత చేసినా అది బూడిదలో పోసిన పన్నీరే' అనే ద్రోణాభిప్రాయాన్ని వ్యక్తీకరించటం జరిగింది.

ఉ. **అన్ని విధంబులం బఱిచి యైనను నక్కటికంబు లేక వా**
రి న్నెఱి మాలి కానలఁ జరింపఁగఁ బంచినఁ బోయి వచ్చి య
య్యన్నయుఁ దమ్ములుం దమకు నయ్యు సగం బిల వేఁడి కాన కి
ట్లున్నను, వారి మార్కొనుట కోర్చితి నేనొక బ్రాహ్మణుండనే? **32**

ప్రతిపదార్థం: అన్ని విధంబులన్= సర్వవిధాల; పఱిచి+ఐనను= భంగపాటు కలిగించికూడా; అక్కటికంబు= కనికరం అనేది; లేక= లేకుండగా; వారిన్= ఆ పాండవులను; నెఱిమాలి= నీతి తప్పి; కానలన్= అడవులలో; చరింపఁగన్= నివసించటానికి; పంచినన్= పంపినా కూడా; పోయివచ్చి= వెళ్ళి వచ్చి; ఆ+అన్నయున్= ఆ జ్యేష్ఠభ్రాత ధర్మరాజు; తమ్ములున్= సోదరులైన భీమాదులు; తమకున్= తమవంతుగా వచ్చే; అయ్య సగంబు+ఇలన్= తండ్రి సగభాగం భూమిని; వేఁడి= (ఇమ్మని) ప్రార్థించి; కానక=పొందక; ఇట్లు+ఉన్ననున్= ఈ విధంగా ఉన్నప్పటికి కూడా (చేసేది లేక పూనుకొన్నది ధర్మయుద్ధమే అయినా); వారిన్= అట్టి పాండవులను; మార్కొనుటకున్= ఎదిరించటానికి; ఓర్చితిన్= సహించాను; నేను ఒక= ఇట్టి అన్యాయాన్ని సహించే నేను కూడా; బ్రాహ్మణుం డన్+ఏ?= బ్రాహ్మణజాతికి చెందినవాడనేనా? (నా బ్రాహ్మణత్వం వ్యర్థం).

తాత్పర్యం: దుర్యోధనా! మీరెన్నో విధాల పాండవుల నవమానపరచారు. అయినా వారు సహించారు. దయ అనేది లేక వనవాసానికి పంపారు. ఆ వనవాస అజ్ఞాతవాసాదులను కూడా చేసి వచ్చి, తమ తండ్రి సగభాగం రాజ్యం ఇమ్మని అర్థించి, దానిని పొందలేక, న్యాయంగా రావలసిన రాజ్యానికై మార్గాంతరం లేక యుద్ధానికి పూనుకొన్నారు. నీవేమో అన్యాయంగా వారితో యుద్ధానికి తలపడ్డావు. అయినా వారితో యుద్ధం చేయటానికి నే నొప్పుకొని నీ అధర్మవర్తనాన్ని సహించానంటే నేను బ్రాహ్మణుడనేనా? నా బ్రాహ్మణత్వం ఎందుకు?

విశేషం: తాను బ్రాహ్మణుడై ఉండి నే నొక బ్రాహ్మణుండనే?' అని చెప్పటంచేత ఇది అర్థాంతర సంక్రమిత వాచ్యధ్వని అయింది. జాతిని బట్టి మాత్రం బ్రాహ్మణుడు కాడు, బ్రాహ్మణవిధి నిర్వర్తించినవాడే బ్రాహ్మణుడు. తాను అధర్మవర్తనాన్ని ఆమోదించటంచేత తన బ్రాహ్మణ్యం నశించిందనే ద్రోణాచార్య భావన ఇక్కడ ధ్వనిస్తూ ఉన్నది.

క. నీవును నచ్చటఁ బన్నిన । నీ వారును సైంధవుని ననిం బడకుండం
గావఁగ జాలిరె? యేనును । నీ వాఁడన కానె? యేల నిందింపంగన్.?' 33

ప్రతిపదార్థం: నీవును= నీవయినా (దుర్యోధనుడు); అచ్చటన్= ఆ రణరంగాన; పన్నిన నీ వారును= యుద్ధానికి తలపడిన నీవారు అనగా కర్ణాదులయినా; సైంధవునిన్= జయద్రథుడిని; అనిన్= యుద్ధంలో; పడకుండన్= పడిపోకుండా; కావంగన్+చాలిరి+ఎ?= కాపాడుకొన్నారా? (కాపాడుకోలేదు కదా!); ఏనును= నేనుకూడా; నీవాఁడను+అ= నీ పక్షం వహించినవాడినే; కాను+ఎ?= కాదా? (అటువంటప్పుడు నన్నుమాత్రం); నిందింపంగన్ ఏల?= నిందించటమెందుకు?

తాత్పర్యం: సైంధవుడిని రక్షించాలని నీవూ, నీవారైన కర్ణాదులు పూనుకొని ఉండికూడా అతడిని రక్షించలేకపోయారు కదా! వారందరు నీ వారనేకదా నీవు నిందించటం లేదు! నేను మాత్రం నీవాడను కానా? నన్నుమాత్రం ఎందుకు నిందిస్తున్నావు?'

విశేషం: 'కావగఁ జాలర' అని పాఠాంతరం. రక్షించటానికి సామర్థ్యం లేనివారా? అని దాని అర్థం. సమర్థులై ఉండికూడా రక్షించ లేకపోయా రంటే అది అసాధ్యం అనే విషయం వెల్లడిస్తుంది. ఆ సైంధవ రక్షణ నాకు కూడా అసాధ్యమే అయినప్పుడు నన్ను మాత్రం నిందించటం దేనికి? అని తాత్పర్యం. 'కావఁగఁ జాలర' - అనే దానికి రక్షించటానికి సమర్థులు కానే కాదని కూడా అర్థం చెప్పవచ్చును.

వ. అని వీడనాడి వెండియు. 34

ప్రతిపదార్థం: అని= ఇట్లా చెప్పి; వీడనాడి= పోవటానికి అనుమతించి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ఇట్లా చెప్పి దుర్యోధనుడిని పోవటానికి అనుమతించాడు. (కాని దుర్యోధనుడి ఉత్సాహం నశింపచేయుటం తగదనే భావంతో) మళ్ళీ (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పాంచాలురుఁ బాండవులు ను । దంచిత గర్వమున ననికిఁ దఱిమి యొడలు మం
డించుచు నుండఁగ ని ట్లుడి । కించెద వొకవలన నీవుఁ గీడుపలుకులన్'. 35

ప్రతిపదార్థం: పాంచాలురు= ధృష్టద్యుమ్నుడు మొదలైన పాంచాలదేశపు రాజులు; పాండవులున్= అర్జునుడు మొదలైనపాండవులు; ఉదంచిత గర్వమునన్= గొప్ప గర్వంతో; అనికిన్= యుద్ధానికి; తఱిమి= తలపడి; ఒడలు= శరీరం; మండించుచున్+ ఉండఁగన్= దహింపజేస్తూ ఉంటే; ఈవు= నీవేమో; ఒక వలనన్= ఒకవైపున; కీడుపలుకులన్= చెడు మాటలతో; ఇట్లు= ఈ విధంగా; ఉడికించెదవు= బాధిస్తూ ఉన్నావు. (ఇది నీకు తగిన పనేనా?)

తాత్పర్యం: ఓ వైపు యుద్ధానికి తలపడి పాంచాలురు, పాండవులు నా శరీరాన్ని ఉడికింపజేస్తూ ఉంటే రెండోవైపు నీవు నన్ను నిందావాక్యాలతో వేధిస్తూ ఉన్నావు. ఇది నీకు తగిన పనేనా?'

ద్రోణుఁడు పాంచాలురఁ జంపక కవచంబు విడవ నని ప్రతిజ్ఞ సేయుట (సం.7-126-32)

వ. అని పగతుర యుత్సాహం బుపన్యసించి. 36

ప్రతిపదార్థం: అని= ఇట్లా పలికి; పగతుర+ఉత్సాహంబు= శత్రువుల యుద్ధోత్సాహాన్ని; ఉపన్యసించి= విశదీకరించి.

తాత్పర్యం: అని, శత్రువులు విజయ గర్వంతో చూపే యుద్ధోత్సాహాన్ని విప్పి చెప్పి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: శత్రువుల యుద్ధోత్సాహోపన్యాసం వలన ప్రకృతంలో యుద్ధం ముంచుకొనివస్తుంది కాబట్టి దానికై అందరు సిద్ధం కావలెగాని స్వపక్షవ్యక్తి దూషణ తగదనే భావం సూచితమైనది.

క. 'పలుకులఁ బని లే దీ రే । తలపెట్టక పోరువా రుదగ్రత నేనుం
జలము మెఱయఁ బాంచాలురఁ । బొలియింపక కత్తళంబు పుచ్చ నరేంద్రా! 37

ప్రతిపదార్థం: ఓ నరేంద్రా!= ఓ రాజా! (దుర్యోధనా!); ఈరు+ఏ= మీరే; తలపెట్టక= తలపోయకుండా (జరిగిన విషయాలేవీ మనస్సులో పెట్టుకొనకుండా); ఉదగ్రతన్= భయంకరంగా; పోరువారు= యుద్ధంచేస్తారు; పలుకులన్= మాటలతో; పని లేదు= అవసరంలేదు (చెప్పవలసిన పనిలేదు); నేనున్= నేను కూడా; చలము= పట్టుదల; మెఱయన్= ప్రకాశించే విధంగా (అభినివేశంతో); పాంచాలురన్= శిఖండి మొదలగువారిని; పొలియింపక= సంహరించకుండా; కత్తళంబు= కవచాన్ని; పుచ్చన్= విడువను.

తాత్పర్యం: 'ఓ రాజా! ఇప్పుడు జరిగినదానిని గూర్చి విచారించకుండా శత్రుభయంకరంగా యుద్ధానికి తలపడటానికి మీరు సిద్ధంగా ఉండండి. నేను కూడా పాంచాలురను - అనగా శిఖండి మొదలైనవారిని సంహరించే వరకు ఈ కవచాన్ని విడువను.

క. కావున మన సైన్యంబులు । సేవ సెడక సంగరంబు సేయునటులుగా
నీ వుత్సహించి నిజ బా । హా విభవము సూపు శక్తి కనురూపముగన్.' 38

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; మన సైన్యంబులు= మన సేనలు; చేవ= ధైర్యం; చెడక= చెడకుండా; సంగరంబు= యుద్ధం, చేయునటులుగాన్= చేసే విధంగా; నీవు+ఉత్సహించి= నీవు ఉత్సాహాన్ని కనబరచి; శక్తికిన్= సామర్థ్యానికి; అనురూపముగన్= తగినట్టుగా; నిజ బాహా విభవము= నీ బాహుబలవైభవాన్ని; చూపు(ము)= ప్రదర్శించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కాబట్టి మన సైన్యానికి, ధైర్యంతో యుద్ధం చేసే ఉత్సాహం కలగజేయటానికి నీవు ఉత్సాహంగా నీ భుజబలాన్ని ప్రదర్శించుము.'

వ. అని తెంపు సేసి. 39

ప్రతిపదార్థం: అని= ఇట్లా పలికి; తెంపు+చేసి= సాహసించి (యుద్ధానికి సన్నద్ధుడై).

తాత్పర్యం: అని దుర్యోధనుడికి చెప్పవలసింది చెప్పి, ద్రోణుడు తాను సాహసించి - అనగా యుద్ధానికి సిద్ధమై (దుర్యోధనుడితో మళ్ళీ ఇట్లా అన్నాడు).

క. 'భూసురభక్తియు వృద్ధో । పాసనముం గలిగి ధర్మపథవర్తన ని
త్యాసక్తుఁడ వగు మనఘా! । నా సుతు బోధింపు వగపునకుఁ జొరకుండన్.' 40

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పుణ్యాత్మా!; వగపునకున్= దుఃఖానికి; చొరకుండన్= లోనుగాకుండా ఉండేటట్లు; నా సుతున్= నా కుమారుడైన అశ్వత్థామకు; బోధింపు(ము)= (నా మాటగా) తెలుపుము (ఏమని అనగా); భూసురభక్తియున్= బ్రాహ్మణుల యెడల భక్తిభావం; వృద్ధ+ఉపాసనము= తపోజ్ఞాన విద్యాదులచేత పెద్దలైనవారిని సేవించటం; కలిగి= కలవాడవై; ధర్మపథవర్తన నిత్యాసక్తుఁడవు= ధర్మమార్గ ప్రవృత్తిలోనే ఎల్లప్పుడు ఆసక్తిగలవాడవు; అగుము= కమ్ము అని.

తాత్పర్యం: అనఘా! బ్రహ్మణులందు భక్తి భావం కలిగి, పెద్దలను సేవిస్తూ, ధర్మమార్గాన నడచుకోవటంలో ఎడతెగని ఆసక్తి కలిగి ఉండుము, అని నా కుమారుడు అశ్వత్థామ దుఃఖానికి లోనుకాకుండా బోధించు.

విశేషం: నాయనా దుర్యోధనా! నా కుమారుడికి నా ఉపదేశాన్నందించి పుణ్యం కట్టుకో. నేనేమో యుద్ధానికి వెళ్ళుతున్నాను. మళ్ళీ తిరిగి వస్తానో లేదో, ఒకవేళ జరుగకూడనిదేదైనా జరిగితే నా కుమారుడు ఆ దుఃఖానికి తట్టుకోలేడు. ఆ దుఃఖాన్ని అతిక్రమించటానికి నా సందేశాన్ని వినిపించు - అని అశ్వత్థామను ఉద్దేశించి చెప్పిన సందేశమే అయినా, ఇది పరోక్షంగా దుర్యోధనునికి కూడ వర్తించే అవకాశం ఉంది. 'వగుమనఘా' అనే పై పాఠం కూడా ఉన్నది. కానీ ఇది దుర్యోధనుడికి కూడ ఉపదేశిస్తున్నట్లు తోస్తుంది. కాని ఇది అశ్వత్థామకు పంపిన ఉపదేశమే. ఈ సంస్కృతమూలం చూడండి. శ్లో॥ రాజన్ బ్రూయాః సుతం మే త్వ మశ్వత్థామాన మాహవే । నసోమకాః ప్రమోక్తవ్యా జీవితం పరిరక్షతా॥ యచ్చ పిత్రాZను శిష్టోZసి తద్ వచః పరిపాలయ॥ ఆనృశంస్యే దమే సత్యే చార్జవే చ స్థిరో భవ । ధర్మార్థ కామకుశలో ధర్మార్థావ ప్యపీడయన్ ॥ ధర్మప్రధాన కార్యాణి కుర్యాశ్చేతి పునఃపునః చక్షుర్మనోభ్యాం సంతోష్యా విప్రాః పూజ్యాశ్చ శక్తితః । న చైషాం విప్రియం కార్యం తే హి వహ్ని శిఖోపమాః ॥ (ద్రోణ. 151/35-38 గీతా ప్రెస్ ప్రతి) అని.

వ. 'నా చేతఁ దెగని పాంచాలురు గలిగిరేనియు వారిం బోనీక పొదివి తెగఁ జూచునది' యని చెప్పుము.' 41

ప్రతిపదార్థం: నాచేతన్= ద్రోణుడిచేత; తెగని పాంచాలురు= సంహరించబడకుండా ఉన్న పాంచాలరాజులు (ధృష్టద్యుమ్నాదులు); కలిగిరి+ఏనియున్= (మిగిలి) ఉన్నట్టయితే; వారిన్= ఆ పాంచాలరాజులను; పోనీక= విడిచిపెట్టక; పొదివి= చుట్టుముట్టి; తెగన్+ చూచునది= నిహతులయ్యేటట్లు చూడాలి; అని= ఇట్లా; చెప్పుము= నా మాటగా చెప్పుము.

తాత్పర్యం: 'ఒకవేళ నా చేత చావకుండా మిగిలిపోయిన పాంచాలరాజు లెవరైనా ఉంటే వారిని విడిచిపెట్టక చుట్టుముట్టి, ఏ విధంగానైనా సంహరించాలి' అని నా మాటగా చెప్పుము.'

క. అని పలికి గాఢ నిశ్చయ । మున వదనం బెలమిఁ బొంద మును కలఁగిన నీ
మొన లెల్ల నొక్క మొగముగ నొనరిచితలకొలిపె భూసురోత్తముఁ డనికిన్. 42

ప్రతిపదార్థం: భూసుర+ఉత్తముఁడు= ఆ బ్రాహ్మణోత్తముడైన ద్రోణుడు; అని= ఇట్లా; పలికి= చెప్పి; గాఢనిశ్చయమునన్= దృఢమైన నిశ్చయంతో; వదనము= ముఖం; ఎలమిన్= వికాసాన్ని; పొందన్= పొందుతూ ఉండగా; మును= అంతకుముందు; కలఁగిన= కలత చెందిన; నీ మొనలు+ఎల్లన్= నీ సైన్యాలనన్నింటిని (ఇది సంజయుడు ధృతరాష్ట్రుడిని సంబోధిస్తూ పల్కిన మాట); ఒక్క మొగముగన్= ఏకముఖంగా; ఒనరిచి= చేసి; అనికిన్= యుద్ధానికి; తలకొలిపెన్= సిద్ధం చేశాడు.

తాత్పర్యం: ద్రోణు డిట్లా పలికి, గట్టి పట్టుదల ముఖాన దీపిస్తూ ఉండగా సైన్యాన్నంతా సమీకరించి, యుద్ధానికి పురికొల్పాడు.

వ. అ ట్లాచార్యుండు పురికొల్పినం గౌరవపతి సమర సముత్సాహ రహితం బగు మనంబుతో సూతనందనుఁ జేర నరిగి యి ట్లనియె. 43

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; ఆచార్యుండు= ద్రోణాచార్యుడు; పురికొల్పినన్= ప్రేరేపించిన వెంటనే; కౌరవపతి= దుర్యోధనుడు; సమర సముత్సాహ రహితంబు+అగు= యుద్ధోత్సాహం లేనట్టి; మనంబుతోన్= మనస్సుతో; సూతనందనున్= కర్ణుడిని; చేరన్+అరిగి= సమీపించి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ విధంగా ద్రోణాచార్యుడు ప్రేరేపించగా, దుర్యోధనుడు యుద్ధోత్సాహమనేది లేక చిన్నవోయిన మనస్సుతో కర్ణుడి దగ్గరకి వెళ్ళి ఇట్లా అన్నాడు:

క. 'అరుల కభేద్యం బగు న । ప్పరుసున బలుమోహరంబు పన్నించి తుదిం
జొర విడిచెఁ గాని గురుఁ డ । న్నరు నాఁగఁడ; యతఁడు గీడు నాకుం జూడన్? 44

ప్రతిపదార్థం: గురుఁడు= ఆ ద్రోణాచార్యుడు; అరులకున్= శత్రువులకు; అభేద్యంబు+అగు+అ+పరుసునన్= భేదింపరానట్టి విధంగా; బలువు+మోహరంబు= బలమైన వ్యూహాన్ని; పన్నించి= నిర్మింపజేసి; తుదిన్= చివరకు; చొరన్= ప్రవేశించటానికి; విడిచెన్+కాని= అర్జునుడిని వదలిపెట్టాడే తప్ప; గురుఁడు= ద్రోణాచార్యుడు; ఆ+నరున్= ఆ అర్జునుడిని; ఆగఁడు+అ= ఆపలేక పోయాడు; నాకున్+చూడన్= నేను ఆలోచించగా; అతఁడు= గురుడైన ద్రోణుడే; కీడు= నాకు హానికరుడు.

తాత్పర్యం: సైంధవ రక్షణకై శత్రువులకు చొరరాని బలమైన చక్రవ్యూహాన్నేమో పన్నాడు. కాని చివరకు శత్రుప్రవేశాన్ని ఉపేక్షించాడు. అర్జునుడిని ఆపలేదు. ఆలోచించగా గురుడే మనకు హానికరుడు.

క. ఒకఁ డట్లు సొచ్చి, భూప । ప్రకరంబులఁ గూల్చి, సింధురాజుఁ దునిమె నె
ట్లొకొ? యతని కడిమి కుంభజు । నికి వారింపంగ రామి నిక్కమె? యరయన్. 45

ప్రతిపదార్థం: ఒకఁడు+అట్లు= (అర్జునుడు) ఒక్కడు ఆ విధంగా; చొచ్చి= (వ్యూహాన్ని ఛేదించుకొని) ప్రవేశించి; భూపప్రకరంబులన్= (సైంధవ రక్షణకై నిలిచిన) రాజుల సమూహాన్ని; కూల్చి= సంహరించి; సింధురాజున్= సైంధవుడిని; తునిమెన్= వధించాడు; ఎట్లు+ఒకొ?= (ఇది) ఎట్లు సంభవం?; అతని కడిమి= ఆ అర్జునుడి పరాక్రమం; కుంభజునికిన్= ద్రోణాచార్యులకు; వారింపంగరామి = నివారించటానికి శక్యం కాకుండా ఉండటం; అరయన్= ఆలోచిస్తే; నిక్కమె?= నిజమా? (నిజంకాదని భావం).

తాత్పర్యం: అర్జునుడు ఒక్కడే ఆ విధంగా దుర్భేద్యమైన వ్యూహంలో ప్రవేశించి, రక్షణకై నిలిచిన రాజులందరినీ సంహరించి, సైంధవుడిని వధించటం ఎట్లా సంభవం? ఆలోచిస్తే ఆ అర్జునుడి వీరవిహారాన్ని ద్రోణాచార్యులు ఆపలేకపోయాడనటం నిజమా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ పద్యం నాలుగవ చరణం చివర 'నిక్కం బరయన్' అనే పాదానికి కూడా నిక్కంబు+ఎట్లొకో? అని అన్వయించి అర్థం చెప్పాలి. ఇది దూరాన్వయ దోషం. కాబట్టి దీనికంటె 'నిక్కమె యరయన్' అనే పాఠమే బాగుంది. మూలానికి అనుగుణమైన అర్థం ఇదే. ద్రోణుడికి పార్థుడిని ఆపే శక్తి ఉండికూడా ఆ పని చేయలేదనేదే దుర్యోధనుడి భావం.

క. తన మాట నమ్మి సైంధవు । మొనకుం దెచ్చితిమి గాక! ము న్నెఱిఁగిన నా
తని నింటఁ బెట్టి వత్తుము; । మన సేనయు నివ్విధమున మడియక యుండున్. 46

ప్రతిపదార్థం: తనమాట= ద్రోణుడి మాట; నమ్మి= విశ్వసించి; సైంధవున్= జయద్రథుడిని; మొనకున్= వ్యూహానికి; తెచ్చితిమి కాక= తీసికొని వచ్చామే కాని; మున్ను+ఎఱిఁగినన్= ముందే తెలిసి ఉంటే; ఆతనిన్= ఆ సింధురాజును; ఇంటన్= ఇంటిలోనే; పెట్టి వత్తుము= ఉంచి వచ్చేవారం; మనసేనయున్= మన సైన్యంకూడా; ఈ+విధమునన్= ఈ విధంగా; మడియక= నశించకుండా; ఉండున్= ఉండేది.

తాత్పర్యం: సైంధవుడిని రక్షిస్తాననే ద్రోణుడి మాట నమ్మి, అతడిని రణరంగానికి తెచ్చాం కానీ, లేకుంటే ఇంట్లోనే ఉంచి వచ్చేవారం. మన సైన్యం కూడ ఈ విధంగా నశించకుండా ఉండేది.

విశేషం: 'ఆతని మాట' అని ఆనక 'తన మాట' అని చెప్పటంచేత ఆచార్యుడు తా నిచ్చిన మాట తానే నిలబెట్టుకొనలేదనే దుర్యోధనుడి అభిప్రాయం ధ్వనిస్తూ ఉన్నది.

క. మన మెంత సెట్టలమొ ఫ । ల్గునుపై నాతనికి నంత గూర్మి గలిగె? నే
మనఁ గల? దింక నతనిఁ గొని । యని సేయుద మనుట కార్య మగునే మనకున్?' 47

ప్రతిపదార్థం: మనము= నీవు, నేను, మన వారు; ఎంత= ఎంతటి; చెట్టలమొ= ద్రోహబుద్ధి గలవారమో; ఫల్గునుపైన్= అర్జునుడిపై; ఆతనికిన్= ఆ ద్రోణాచార్యులకు; అంత= అంతటి; కూర్మి= ప్రేమ; కలిగెన్?= కలిగింది? (ఇంతకంటె); అనన్= అనటానికి; ఏమి కలదు?= ఏమున్నది?; ఇంకన్= ఇకముందు; అతనిన్= ఆ ద్రోణాచార్యులను; కొని= ఆశ్రయించి; అని= యుద్ధాన్ని; చేయుదము= చేద్దాము; అనుట= అనటం; మనకున్= కౌరవులకు; కార్యము+అగునే?= ప్రయోజనకారియేనా?

తాత్పర్యం: ఆ ద్రోణుడికి మనమెంత కానివారమై పోయామో! అంతగా అర్జునుడిపై అభిమానం పెరుగుతూ ఉన్నది. ఈ విషయంలో ఇంతకంటె చెప్పేది ఏమీ లేదు. అటువంటప్పుడు ఆ ఆచార్యుడినే ఆశ్రయించి పాండవులతో యుద్ధం చేద్దామని అనుకోవటం మనకు ప్రయోజనకారి అవుతుందా?

చ. అన విని కర్ణుఁ డిట్లనియె 'నగ్గురు దూఱఁగ నేల? యాతఁ డో
పినటుల పోరుఁ గాక; నరుబీరము లావును నెక్కుడైన వా
ని నుడుప వచ్చునే విధియ నేర్చు విషం బిడి యిల్లు గాల్చి కా
ననమున కేఁగఁ జేసి యొక నాశముఁ గంటిమె గొంతిసంతతిన్? 48

ప్రతిపదార్థం: అనన్= ఇట్లా పలుకగా; విని= విన్న తరువాత; కర్ణుఁడు= (దుర్యోధనుడి ప్రాణస్నేహితుడు) కర్ణుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు; ఆ+గురున్= ఆ ద్రోణాచార్యులను; దూఱఁగన్+ఏల?= నిందించటమెందుకు?; ఆతఁడు= ఆ ద్రోణుడు; ఓపినటులు+అ= యథాశక్తిగానే; పోరున్+కాక= యుద్ధం చేస్తే చేయవచ్చును (అయినా); నరుబీరము= అర్జునుడి పరాక్రమం; లావును= సామర్థ్యం (ఈ రెండూ); ఎక్కుడు+ఐనన్= అధికమైనప్పుడు; వానిన్= ఆ బలశౌర్యాలను; ఉడుపన్‌వచ్చును+ఏ? = తొలిగింప శక్యమా?; విధి+అ= దైవమే; నేర్చు= (ఆ పనిచేయటానికి) సమర్థమవుతుంది-పాండవులను హతమార్చటం ఎవరివలనా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కాదు ఆ దైవానికే తప్పు (ఎట్లాగంటే); విషంబు+ఇడి= విషాన్నిచ్చి (భీముడికి విషం పెట్టిన విషయం ఈ సందర్భంలో అనుసంధించాలి); ఇల్లు+కాల్చి= లక్కమేడను దహించి; కాననమునకున్= అడవికి (ద్యూతంతో జయించి); ఏఁగన్+చేసి= పోయేటట్లు చేసి; కుంతిసంతతిన్= కుంతి సంతానానికి (పాండవులకు); ఒక నాశము= ఒక విధమయిన నాశాన్నయినా; కంటిమి+ఎ?= కనుగొన్నామా?

తాత్పర్యం: ఆ దుర్యోధనుడి మాటలు విని, కర్ణుడు ఇట్లా అన్నాడు: 'ఆ ఆచార్యుడిని ఎందుకు దూషిస్తావు?అతడు శక్తికొలది యుద్ధం చేస్తూనే ఉన్నాడు. అంత చేసినా ఒకవేళ అర్జునుడి బలపరాక్రమాలు ఎక్కువైతే, వాటిని తగ్గించటం అతడికి సాధ్యమా? ఆ పనిచేయటానికి దైవానికే సాధ్యమౌతుంది. ఇంతెందుకు? మనం పాండవుల వినాశానికి ఎంతో ప్రయత్నించాం, భీముడికి విషమిచ్చాం, పాండవులందరిని లక్క ఇంటిలో దహింపజూచాం, ద్యూతంలో ఓడిపోయారనే మిషతో వనవాసానికి పంపాం. అయినా వారికి ఒక కొంచెమైనా చేటు సంభవించిందా? (కాబట్టి పాండవులను నశింపజేయటం దైవం తలిస్తే తప్ప మన కెవరికీ సాధ్యం కాదనటం స్పష్టం - అటువంటప్పుడు ఆచార్యులను నిందించటమెందుకు? దైవమే ప్రధానం.)

క. కావున మన సైంధవునిన్ । దైవము తెగటార్చె నంతఁ దలరి మనమునం
జేవ సెడ నేల? పోరం । గా విధి పంచినటు లయ్యెఁ; గడఁగన వలయున్.' 49

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; మన సైంధవునిన్= మన జయద్రథుడిని; దైవము+అ= అదృష్టమే; తెగటార్చెన్= హతమార్చింది; అంతన్= అంతగా; తలరి= బాధపడి; మనమునన్= మనస్సులో; చేవ= ధైర్యం; చెడన్+ఏల?= కోల్పోవటమెందుకు?; పోరంగాన్= (శక్తివంచన లేకుండా) యుద్ధం చేస్తూనే ఉండగా; విధి= దైవం; పంచిన+అటులు+అయ్యెన్= ఆజ్ఞాపించిన విధంగా అయింది; కడ= పరిణామం; కనవలయున్= చూడాలి. (మనం చేయవలసిన ప్రయత్నం చేస్తూనే ఉన్నాం కాని, మనమనుకొన్నది ఇంతవరకు అయిందా? దైవం ఏది తలుస్తుందో ఇప్పుడు ఆ పరిణామం చూడాలి).

తాత్పర్యం: కాబట్టి, మన సైంధవుడిని సంహరించింది దైవమే. అంతగా బాధపడి ధైర్యం చెడగొట్టుకొనవద్దు. మనం పోరు సాగించాలన్నదే దైవాజ్ఞ. చివరకు ఏమౌతుందో చూద్దాం. '

క. అనునెడఁ బాండవ సేనలు । మొనసి కదియ నడచె; నీదు మొనలుం దగ మా
ర్కొనియె; నిటు లుభయ బలములు । ననిమిషులకు వేడ్క వుట్టునట్లుగఁ దాఁకెన్. 50

ప్రతిపదార్థం: అను+ఎడన్= అని అనేటప్పుడు; పాండవ సేనలు; పాండవుల సైన్యాలు; మొనసి= వ్యూహంగా ఏర్పడి; కదియన్= ఎదుర్కొనటానికి; నడచెన్= కదిలాయి; నీదు మొనలున్= నీ సైన్యాలు కూడా; తగన్= సముచితంగా; మార్కొనియెన్= ఎదుర్కొన్నవి; ఇటులు= ఇట్లా; ఉభయ బలములు= ఉభయ సైన్యాలు; అనిమిషులకున్= దేవతలకు; వేడ్క= కుతూహలం; పుట్టునట్లు= కలిగే విధంగా; తాఁకెన్= ఢీకొన్నవి.

తాత్పర్యం: కర్ణుడిట్లా అంటూ ఉండగానే, పాండవుల సైన్యాలు యుద్ధానికి సంసిద్ధమై మీ సైన్యాన్ని ఎదుర్కొనటానికి కదిలాయి. మీ సైన్యాలు కూడా వెంటనే వాటితో ఢీకొన్నాయి. ఆ దృశ్యం దేవతలకు కూడా కుతూహలం కలిగించే విధంగా ఉన్నది.

క. తురగము తురగముఁ గరి కరి । నరుఁడు నరుఁడు దేరు తేరు నలిఁ దాఁకిన య
ప్పరుసఁదన మేమి సెప్పదుఁ? । పొరి మిడుఁగుఱు లెగసి కైదువుల పొడి రాలెన్. 51

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తురగము= అశ్వం; తురగమున్= అశ్వాన్ని; కరి= ఏనుగు; కరిన్= ఏనుగును; నరుఁడు= మనుష్యుడు (కాలినడకనే యుద్ధం చేసే సిపాయి); నరుఁడు= సిపాయిని; తేరు= రథం; తేరు= రథాన్ని; నలిన్= ఉత్సాహంతో; తాఁకిన= ఢీకొన్న; ఆ+పరుసఁదనము= ఆ కాఠిన్యం; ఏమి+చెప్పుదున్?= ఏమని చెప్పాలి?; పొరి= అధికంగా; మిడుఁగుఱులు= నిప్పురవ్వలు; ఎగసి= పైకి వెళ్ళి (ఆకాశాన్నంటి); కైదువులపొడి= ఆయుధాల తుమురు; రాలెన్= క్రిందపడింది.

తాత్పర్యం: ఉభయపక్ష చతురంగ సైన్యాలు ఒకదానితో మరొకటి ఢీకొంటూ ఉంటే ఆ ఆయుధాల తాకిడికి. నిప్పురవ్వలు ఆకాశాన్నంటాయి. ఆయుధాల నుగ్గునుగ్గైనపొడి కింద రాలింది.

వ. అట్టియెడ నీ కొడుకు సైంధవుని చావునకు దుఃఖితుం డగుటఁ బ్రాణంబుల దెస నిరపేక్షుం డయి కడంగినం గని ద్రోణ కృపకర్ణులు వారింపం ద్రోచి తలకడచి దర్ప ప్రచండగతిం బాండవ సైన్యంబు సొచ్చి నిశిత వివిధ విశిఖ పరంపరలు పరఁగించినఁ, జతురంగంబుల యంగంబులు ధరం దొరఁగి చిక్కుపడి మదకల మాతంగంబు గలంచిన కమలాకరంబు చందంబయ్యె; నప్పు డందుఁ జేయంగల బలుమగ లెల్ల నొక్కమొగిం గవిసి నమ్మహీపతిం బొదివిన నతండు భీమసేనుఁ బదిబాణంబులను నకుల సహదేవ ద్రుపద విరాటద్రౌపదేయుల మూఁడు మూఁడు మార్గణంబులను, శిఖండిని నూటను, ధృష్టద్యుమ్ను డెబ్బదింటను, ధర్మపుత్ర సాత్యకుల నైదైదమ్ములను, ఘటోత్కచు నఱువది నాలుగింటను నొప్పించి కేకయ చేది ప్రముఖ యోధవరుల ననేక సాయకంబుల బెట్టు పఱిచి సింహనాదంబు సేసిన. 52

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; నీ కొడుకు= నీ పుత్రుడు దుర్యోధనుడు; సైంధవుని చావునకున్= జయద్రథుడి మరణానికి; దుఃఖితుండు+అగుటన్= దుఃఖం కలిగి ఉండటంవలన; ప్రాణంబులదెసన్= ప్రాణాలపై; నిరపేక్షుండు+అయి= అపేక్షలేనివాడై; కడంగినన్+కని= యుద్ధం చేయటానికి ఉద్యమిస్తూ ఉంటే చూచి; ద్రోణకృప కర్ణులు= ద్రోణుడు, కృపుడు,కర్ణుడు ఈ ముగ్గురు; వారింపన్= ఇంత సాహసం పనికిరాదని వారిస్తూ ఉంటే; త్రోచి= (అడ్డం వచ్చినవారిని) ప్రక్కకు తొలగజేసి; తలకడచి= దాటిపోయి; దర్పప్రచండగతిన్= గర్వంయొక్క తీవ్రస్థాయితో (పరాకాష్ఠను చేరిన దర్పంతోనని భావం); పాండవ సైన్యంబు+చొచ్చి= పాండవుల సైన్యాన్ని ప్రవేశించి; నిశిత వివిధ విశిఖ పరంపరలు= తీక్ష్ణములైన అనేక బాణాల వరుసలను; పరఁగించినన్= వ్యాపింపజేస్తూ ఉంటే; చతురంగ బలంబుల+అంగంబులు= చతురంగ సైన్యంయొక్క శరీరావయవాలైన శిరస్సు, మొండెం, బాహువులు మొదలైనవి; ధరన్= భూమిపై; తొరఁగి= పడిపోయి; చిక్కుపడి= ఒకదానితో ఒకటి కలిసిపోయి; మదకల మాతంగంబు= మదించిన ఏనుగు (మదం కలయతి గచ్ఛతీతి మదకలః, 'కల గతే సంఖ్యానేచ' చురాదిః); కలంచిన కమలాకరంబు చందంబు= అవలోడించిన సరస్సు విధంగా; అయ్యెన్= అయింది; అప్పుడు= ఆ సమయాన; అందున్= అక్కడ; చేయన్+కల= సమర్థులైనట్టి; బలు(పు)+మగలు+ఎల్లన్= బలిష్ఠులైన వీరులందరు; ఒక్కమొగిన్= ఒకే పర్యాయం; కవిసి= ఎదిరించి; ఆ+మహీపతిన్= ఆ దుర్యోధనుడిని; పొదివినన్= చుట్టుముట్టిన వెంటనే; అతండు= ఆ దుర్యోధనుడు; భీమసేనున్= భీముడిని; పదిబాణంబులన్= పది బాణాలతో; నకుల సహదేవ ద్రుపద విరాట ద్రౌపదేయులన్= నకులుడిని, సహదేవుడిని, ద్రుపదరాజును, విరాటరాజును ద్రౌపది కుమారులను (ఉపపాండవులైన ప్రతివింధ్యాదులను); మూఁడు మూఁడు మార్గణంబులను= మూడేసి బాణాలతో; శిఖండిని= శిఖండిని (భీష్మవధకు నిమిత్తమైన ద్రుపదరాజు కుమారుడిని); నూటను= నూరు బాణాలతో; ధృష్టద్యుమ్నున్= పాండవుల సేనాపతి అయిన ధృష్టద్యుమ్నుడిని; డెబ్బదింటను= డెబ్బైబాణాలతో; ధర్మపుత్ర సాత్యకులన్= ధర్మరాజును మరియు సాత్యకిని; ఐదు+ఐదు+అమ్ములను= ఐదేసి బాణాలతో; ఘటోత్కచున్= ఘటోత్కచుడనే రాక్షసుడిని (భీముడి వలన హిడింబ అను రాక్షసస్త్రీయందు పుట్టినవాడిని); అఱువది నాలుగింటను= అరువది నాలుగు బాణాలతో; నొప్పించి= బాధించి; కేకయ చేది ప్రముఖ యోధవరులన్= కేకయ చేది దేశాలకు చెందిన ముఖ్యులైన వీర శ్రేష్ఠులను; అనేక సాయకంబులన్= లెక్కలేనన్ని బాణాలతో; బెట్టు= మిక్కిలి; పఱిచి= పడగొట్టి; సింహనాదంబు= సింహనాదాన్ని; చేసినన్= చేయగానే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ సమయంలో నీ కొడుకు దుర్యోధనుడు సైంధవవధవలన కలిగిన దుఃఖంచేత ప్రాణాలకు తెగించి యుద్ధానికి పూనుకొన్నాడు. ద్రోణ, కృప, కర్ణులు ఎంత వారించినా వినలేదు. పాండవ సైన్యంలో ప్రవేశించి ఘోరంగా యుద్ధం చేశాడు. చతురంగ బలాలు అతడి ధాటికి నేలకూలాయి. ఆ సమయాన ఆ రణరంగం మదగజం కల్లోలపరిచిన కమలాకరం మాదిరి భాసించింది. ఆ దుర్యోధనుడి యుద్ధావేశం చూచి, పాండవసైన్యంలో సమర్థులైన వీరులందరు ఒకేసారి దుర్యోధనుడిపై తలపడ్డారు. అప్పుడు దుర్యోధనుడు వారినందరిని ఎదిరించాడు. భీముడిని పది బాణాలతో, నకులాదులను మూడేసి బాణాలతో, శిఖండిని నూరు బాణాలతో, ధృష్టద్యుమ్నుడిని డెబ్బైబాణాలతో, ధర్మరాజును సాత్యకిని ఐదేసి బాణాలతో, ఘటోత్కచుడిని అరువది నాలుగు బాణాలతో, కేకయ చేది దేశాల వీరశ్రేష్ఠులను లెక్కలేనన్ని బాణాలతో కొట్టి పడవేసి, తన విజయసూచకంగా సింహనాదాన్ని చేశాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ. దుర్యోధనుడి ధాటికి నేలకూలిన చతురంగ సైన్యం యొక్క శరీరావయవాలతో చెల్లాచెదరై ఉన్న రణరంగాన్ని మదగజం కలచిన కాసారంతో పోల్చటం చేత ఇది ఉపమాలంకారం - ఈ అలంకారం దుర్యోధనుడు అవలీలగా ఇంతగా పరాక్రమించాడనే భావాన్ని ధ్వనిస్తూ ఉన్నది. దీనిని అలంకారకృత వస్తుధ్వని అని అంటారు.

క. **ఆ ధర్మనందనుఁడు స । క్రోధాత్ముం డగుచు నేసెఁ గోదండము ను**
గ్గై ధరఁ దొరఁగఁగఁ; నాతఁ డ । బోధంబునఁ దేరి మీఁదఁ బొలుపఱి వ్రాలెన్. **53**

ప్రతిపదార్థం: ఆ ధర్మనందనుఁడు= ఆ ధర్మరాజు; సక్రోధ+ఆత్ముఁడు+అగుచున్= కోపంతో కూడిన మనస్సు కలవాడై; కోదండము (దుర్యోధనుడి) ధనుస్సు; నుగ్గు+ఐ= తునియలై; ధరన్= భూమిపై; తొరఁగఁగన్= పడిపోయే విధంగా; ఏసెన్= (బాణాలతో) కొట్టాడు (దుర్యోధనుడిని అని శేషం); అతఁడు= (అట్లా ధర్మరాజుచేత నిహతుడైన) ఆ దుర్యోధనుడు; అబోధంబునన్= (తెలివితప్పి అని భావం); తేరిమీఁదన్= రథంపైన; పొలుపు+అఱి= ఒప్పు చెడి; వ్రాలెన్= వాలిపోయాడు.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడి విజృంభణం చూచి ధర్మరాజుకు కోపం పెరిగి దుర్యోధనుడితో తలపడి, అతడి ధనుస్సు తుత్తునియలై నేలమీదపడేటట్లు, అతడు స్పృహ కోల్పోయి రథంమీదే వాలిపోయేటట్లు బాణాలు వేశాడు.

తే. **ఇట్లు మూర్ఛిల్లుటయుఁ గౌరవేశ్వరుండు । సచ్చె ననియెడు నెలుఁగులు శంఖ కాహ**
ళారవంబులు సెలఁగఁ బ్రియంబు నొందె । వారి బలములు, ద్రోణుఁ డేపారి కదిసె. **54**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మూర్ఛిల్లుటయున్= (దుర్యోధనుడు) మూర్ఛపొందిన వెంటనే; కౌరవ+ఈశ్వరుఁడు= కురురాజైన దుర్యోధనుడు; చచ్చెన్+అనియెడు= మరణించాడనే; ఎలుఁగులు= కంఠాలు (కంఠధ్వనులు); శంఖ కాహళ+ఆరవంబులు= శంఖాలు, తూటుకొమ్ములు అనే వాటి ధ్వనులు; చెలఁగన్= చెలరేగుతూ ఉంటే; వారి బలములు= ఆ పాండవుల సైన్యాలు; ప్రియంబున్+ఒందెన్= సంతోషాన్ని పొందాయి (సంతోషించాయి); (అప్పుడు) ద్రోణుఁడు= ద్రోణాచార్యులు; ఏపారి= విజృంభించి; కదిసెన్= ఎదుర్కొన్నాడు; (ఆ పాండవసైన్యాల నెదుర్కొన్నాడని భావం. 'వారి బలములు' అనే పదం దేహళీ దత్త దీపన్యాయంగా పూర్వోత్తర వాక్యాల్లో అన్వయిస్తుంది.)

తాత్పర్యం: దుర్యోధనుడు తెలివితప్పి ఈ విధంగా పడిపోవటం చూచి కురురాజు మరణించా డనే అరుపులు, శంఖకాహళధ్వనులు చెలరేగగా పాండవసైన్యం చెప్పలేనంత సంతోషాన్ని పొందింది. ఇది చూచి, ద్రోణుడు విజృంభించి ఆ పాండవసైన్యంతో తలపడ్డాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అంత. 55

ప్రతిపదార్థం: అంతన్= తరువాత

తాత్పర్యం: ఈ ఆర్భాటం చెలరేగిన తరువాత

క. తెలివొంది 'యుధిష్ఠిర! నిలు । నిలు మని రభసమునఁ దాఁకు నీ సుతుఁ గని యా
బల మేచిన నీ బలముం । బెలుచ నిగుడ నపుడు రణము భీషణ మయ్యెన్. 56

ప్రతిపదార్థం: తెలివి+ఒంది= తేరుకొని; యుధిష్ఠిర!= ఓ ధర్మరాజా!; నిలునిలుము+అని= ఆగాగు అని (అంటూ); రభసమునన్= వేగంగా; తాఁకు= ఎదిరిస్తూ ఉన్న; నీ సుతున్= నీ కుమారుడిని (దుర్యోధనుడిని); కని= చూచి; ఆబలము+ఏచినన్= ఆ పాండవ సైన్యం చెలరేగుతూ ఉండేటప్పుడు; నీబలమున్= నీ సైన్యం కూడా; పెలుచన్= వెంటనే; నిగుడన్= విజృంభించగా; అపుడు= ఆ సమయాన; రణము= యుద్ధం; భీషణము= భయంకరం; అయ్యెన్= అయింది. (భయంకరంగా సాగిందని భావం).

తాత్పర్యం: మూర్ఛనుండి తేరుకొని 'యుధిష్ఠిరా! నిలు నిలు' మని వేగంగా అతడి నెదుర్కొనే నీ కొడుకును చూచి పాండవసైన్యం విజృంభించగా, వెనువెంటనే నీ సైన్యం కూడా విజృంభించింది. ఆ సమయాన ఆ యుద్ధం భయంకరం అయింది.

వ. అనిన విని ధృతరాష్ట్రుం డట్టియెడ 'నాచార్యుం డెవ్విధంబున నరివధంబు సేసె? నిందలి యందలి చేయంగల సైనికోత్తము లెత్తెఱంగునం బెనంగిరి? చెప్పు' మనవుడు సంజయుం డిట్లను న ట్లుభయబలంబులుఁ బురికొని పోరుచు నుద్దండ రయంబు మెఱసి యుధిష్ఠిర ప్రముఖ పాండవులును, శైనేయాది యాదవులును, ద్రుపద ప్రభృతి పాంచాలురును, విరాట పురస్సరమాత్స్యులును, గుమార వర్గంబును మఱియు ననేక దండనాయకులును సాయకాసారంబు పరఁగించుచు భారద్వాజుపై నడరిన; నతం డత్యుదీర్ణుండయి కర్ణుండు మొదలుగాఁ గల బలుమగ లిరుగెలంకుల సంరంభంబునం దఱుమ విజృంభించె; నయ్యవసరంబున నెగసిన ధరణీపరాగంబు జనంబుల చూడ్కులు నిగుడనీక యుండె; నాలోనన శుండాల సుభట ఘోటకంబుల యంగంబులం గ్రమ్ముదెంచు రుధిరం బది యడంచిన నమ్మొనల కడంక రెట్టించె; నప్పుడు కౌరవుల దిక్కున ఘూక సృగాల రవంబులు సెలంగ వా రది సరకుసేయక సమరోన్మత్తులై నెత్తురు టేఱులు వాఱఁ గేలి సలిపి; రా సమయంబునఁ గేకయ రథికులును ధృష్టద్యుమ్న తనయులును లోనగువారిం బెక్కండ్ర నక్కుంభసంభవుండు నుఱిపియు మఱియు బలువురఁ బఱపియుఁ గడిమి నెఱపం బ్రతాపశీలుం డగు శిబి సాహసరసికుండై. 57

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= సావధానంగా విని; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆచార్యుండు= ద్రోణాచార్యుడు; ఏ+విధంబునన్= ఏ విధంగా; అరివధంబు= శత్రువధ; చేసెన్?= చేశాడు?; ఇందలి+అందలి= ఈ వైపు (స్వపక్షంలో), ఆ వైపు (పరపక్షంలో) ఉన్న; చేయన్+కల= సమర్థులైనట్టి; సైనిక+ఉత్తములు= సైనిక శ్రేష్ఠులు; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; పెనంగిరి?= యుద్ధం చేశారు?; చెప్పుము+అనవుడున్= (సంజయా)! చెప్పుము అని అనగా; సంజయుండు; ఇట్లు= ఈ (చెప్పబోయే) విధంగా; అను(న్)= పలుకుతాడు; అట్లు= ఆ విధంగా; ఉభయ బలంబులున్= రెండుపక్షాల సైన్యాలు కూడా; పురికొని= అతిశయించి (ఒకదానికంటె మరొకటి అతిశయించాలి అనే కోరికతో నని భావం); పోరుచున్+ఉండన్= యుద్ధం చేస్తూ ఉండగా; ఉద్దండరయంబు= గొప్పవేగం; మెఱసి= ప్రకాశించి; యుధిష్ఠిర ప్రముఖ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాండవులును= ధర్మరాజు మొదలైన పాండవులు; శైనేయ+ఆది యాదవులును= సాత్యకి మొదలైన యాదవవీరులు; ద్రుపద ప్రభృతి పాంచాలురును= ద్రుపదరాజు మొదలైన పాంచాలదేశ వీరులు; విరాట పురస్సర మాత్స్యులును= విరాటరాజు మొదలైన మత్స్యదేశ యోధులు; కుమారవర్గంబును= ప్రతివింధ్యుడు మొదలైన పాండవ కుమారుల సమూహం; మఱియున్= అంతేగాక; అనేక దండనాయకులును= అనేకులైన సేనానాయకులు కూడా; సాయక+ఆసారంబు= బాణాలవర్షం; పరఁగించుచున్= కలుగజేస్తూ; భారద్వాజుపైన్= ద్రోణాచార్యుడిపై; అడరినన్= చెలరేగుతూ ఉంటే; అతండు= ఆ ద్రోణుడు; అతి+ఉదీర్ణుండు+అయి= మిక్కిలి ఉద్రేకం కలవాడై; కర్ణుడు మొదలుగాన్+కల= కర్ణుడు మొదలైన; బలు(వు) మగలు= బలిష్ఠులైన వీరులు; ఇరు+కెలంకులన్= రెండువైపులందు; సంరంభంబునన్= వేగంగా; తఱుమన్= ఎదిరించగా; విజృంభించెన్= చెలరేగాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; ఎగసిన= పైకి లేచిన; ధరణీపరాగంబు= భూమిధూళి; జనంబుల చూడ్కులు= జనుల చూపులను; నిగుడన్+ఈక= ఆననీయక; ఉండెన్= ఉన్నది (జనులచూపులు ప్రసరించలేకుండా ఉండేటంత దట్టంగా ధూళి వ్యాపించిందని భావం); ఆలోననన్= అంతలోనే; శుండాల-సుభట-ఘోటకంబుల+అంగంబులన్= ఏనుగుల, యోధుల అశ్వాల శరీరాలనుండి; క్రమ్మ+తెంచు= వ్యాపించునట్టి; రుధిరంబు= నెత్తురు; అది= దాన్ని (ఆ ధూళిని); అడంచినన్= అణగద్రొక్కిన వెంటనే; ఆ మొనలకడంక= ఆ సైన్యాల ఔద్ధత్యం; రెట్టించెన్= రెండింతలైంది; అప్పుడు= ఆ సమయంలో; కౌరవుల దిక్కునన్= కౌరవుల దిశాభాగంలో(కౌరవులవైపున); ఘూక సృగాల రవంబులు= గుడ్లగూబల ధ్వనులు, నక్కల ధ్వనులు; చెలంగన్= వ్యాపిస్తూ ఉండగా; వారు= ఆ కౌరవవీరులు; అది= ఆ ధ్వనిని; సరకు+చేయక= లెక్కచేయకుండా; (అపశకునం అని కూడా విచారించకుండా అని భావం.); సమర+ఉన్మత్తులై= యుద్ధోన్మాదం కలవారై; నెత్తురు+ఏఱులు= రక్తం వరదలు; పాఱన్= పారే విధంగా; కేలి(ళి)= యుద్ధక్రీడ; సలిపిరి= చేశారు, (అవలీలగా యుద్ధం చేశారని భావం.); ఆ సమయంబునన్= కేకయదేశానికి చెందిన రథికులు (రథంపై ఉండి యుద్ధం చేసేవారు రథికులు); ధృష్టద్యుమ్న తనయులును= ధృష్టద్యుమ్నుడి కుమారులు; లోనగువారిన్= మొదలైన వారిని; పెక్కండ్రన్= అనేకులను; ఆ+కుంభసంభవుఁడు= ఆ ద్రోణాచార్యుడు; నుఱిపియున్= చూర్ణంచేసి; మఱియున్= అంతేగాక; పలువురన్= అనేకులను; పఱపియున్= పలాయనం చేయించి; కడిమి= పరాక్రమాన్ని; నెఱపన్= విస్తరింపజేస్తూ ఉండే సమయంలో; ప్రతాపశీలుండు+అగు= పరాక్రమించే స్వభావం గలిగిఉన్న; శిబి= శిబి అనే వీరుడు; సాహస రసికుండు+అయి= సాహసం చేయటానికి మక్కువగలవాడై.

తాత్పర్యం: అని సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు. సంజయా! ఆ సమయంలో ద్రోణాచార్యుడు ఎట్లా శత్రువధ చేశాడు? ఇరుపక్షాల్లో ఉన్న మేటి మొనగాళ్ళు ఏ విధంగా యుద్ధం చేశారు? చెప్పుమని అడుగగా, సంజయుడు ఈ విధంగా అన్నాడు. ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఉభయసైన్యాలు భయంకరంగా పోరాడుతూ ఉండే సమయంలోనే ధర్మరాజు మొదలైన పాండవులు, సాత్యకి మొదలైన యాదవవీరులు, ద్రుపదుడు మొదలైన పాంచాలవీరులు, విరాటరాజు మొదలైన మత్స్యదేశం యోధులు, ఉపపాండవులు, అంతేగాక మరెందరో దండనాయకులు ద్రోణాచార్యుడిపై బాణవర్షం కురిపిస్తూ యుద్ధం చేస్తూ ఉండగా, ద్రోణాచార్యుడు మహోద్రేకంతో కర్ణుడు మొదలైన మన యోధాగ్రేసరులు ఇరువైపులా శత్రుసైన్యాలను ఎదిరించగా విజృంభించాడు. ఆ యుద్ధ సంరంభంలో ఎగసిన ధూళి ఆకాశాన్ని కప్పింది. అది ఎవ్వరికీ చూడరానంత దట్టంగా దెసల వ్యాపించింది. అంతలోనే ఆ యుద్ధంలో హతమైన చతురంగబలాల శరీరాలనుండి రక్తం ప్రవాహంగా పారింది. దానితో ఆ ధూళి అంతా అణగింది. మళ్ళీ ఉభయసైన్యాలు అంతకు రెండింతలుగా విజృంభించి తలపడ్డాయి. అప్పుడు, కౌరవులవైపు గుడ్లగూబల కూతలు, నక్కల అరుపులు వ్యాపించగా, అది అపశకునమని లెక్కచేయకుండానే మీ సైన్యంలోని యోధులు నెత్తురు వరదగా ప్రవహించే విధంగా పోరాడారు. ద్రోణాచార్యుడు పాండవపక్షీయులైన కేకయ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వీరులను మరియు ధృష్టద్యుమ్నుడి పుత్రులను మరెందరినో మహావీరులను హతమార్చాడు. కొందరిని పరుగులు తీయించాడు. ఇంత గొప్పగా ద్రోణుడు యుద్ధం చేస్తూ ఉంటే అప్పుడు శిబి అనే ప్రతాపశాలి సాహసానికి పూనుకొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **ఉరవడిఁ దాఁకుటయును బది । శరము లతని మేనఁగ్రుచ్చె సాయకగురుఁ డ**
చ్చెరువగు మగఁటిమి; నతఁడు । ద్ధురుఁడై తత్సూతు శిరము ద్రుంచెం బెలుచన్ **58**

ప్రతిపదార్థం: ఉరవడిన్= అతి వేగంతో; తాఁకుటయును= ఎదిరిస్తూ ఉండగా; పదిశరములు= పదిబాణాలు; అతని మేనన్= ఆ శిబి శరీరంలో; సాయక గురుఁడు= బాణవిద్యాగురువైన ద్రోణాచార్యులు; అచ్చెరువు+అగు= ఆశ్చర్యకరమైన; మగఁటిమిన్= పరాక్రమంతో; క్రుచ్చెన్= నాటుకపోయేటట్లు వేశాడు; అతఁడు= ఆ శిబి; ఉద్ధురుఁడు+ఐ= (ఆ బాణాఘాతాలకు) చలించనివాడై; పెలుచన్= క్రోధంతో; తద్+సూతు శిరము= ఆ ద్రోణాచార్యుడి సారథి తలను; త్రుంచెన్= తెగగొట్టాడు.

తాత్పర్యం: అతి వేగంగా వచ్చి ద్రోణాచార్యుడిని ఎదుర్కొనగా (శిబి), తత్క్షణమే ద్రోణాచార్యుడు పదిబాణాలు ఆశ్చర్యకరమైన పరాక్రమంతో అతడి శరీరంలో నాటుకుపోయే విధంగా కొట్టాడు. శిబి కూడ చలించకుండ కోపంతో ద్రోణుడి సారథి శిరస్సు తెగనరికాడు.

తే. **త్రుంచి తోడన ముప్పదితూపు లతని । యొడల నాటుడు హయముల మెడలు సూతు**
గళము నజ్జనపతి కుత్తుకయును దునిమె । ఘోర భల్ల షట్కమ్మునఁ గుంభభవుఁడు. **59**

ప్రతిపదార్థం: త్రుంచి= (సారథి శిరాన్ని) తెగన్+ఏసి; తోడన్+అ= వెంటనే; ముప్పది తూపులు= ముప్పది బాణాలను; అతని+ఒడలన్= ఆ ద్రోణుడి శరీరంలో; నాటుడున్= గ్రుచ్చుకొనేటట్లు వేయగానే; కుంభభవుఁడు= కుంభసంభవుడు (ద్రోణుడు); ఘోర భల్లషట్కమునన్= భయంకరములైన భల్లములు అనే బాణాలు ఆరింటితో; హయముల మెడలు= అశ్వాల కంఠాలను (అశ్వాలు నాలుగు కాబట్టి నాలుగు బాణాలతో); సూతుగళమున్= సారథి కంఠాన్ని (ఒక బాణంతో); ఆ+జనపతి కుత్తుకయును= ఆ శిబిరాజు కంఠాన్ని మరియొక బాణంతో (మొత్తం ఆరుబాణాలతో); తునిమె(న్)= తెగగొట్టాడు.

తాత్పర్యం: ద్రోణుడి సారథి తల నరికిన వెనువెంటనే, ముప్పది బాణాలు ద్రోణుడి శరీరంలో గ్రుచ్చుకొనేటట్లు కొట్టాడు. ద్రోణాచార్యుడు ఆరు భయంకరాలైన భల్లా లనే బాణాలతో గుర్రాల మెడలను, సారథి కంఠాన్ని, ఆ శిబి గళాన్ని తెగవేశాడు.

వ. **అప్పుడు.** **60**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ద్రోణుడిట్లా ఆ శిబిని సంహరించిన సమయంలో.

తే. **భానుమంతునిఁ జంపిన పగ మనమునఁ । బెట్టికొని యుండి యాతని పట్టి భీమ**
సేనుపై వడిఁ గాళింగ సేనతోడఁ । గవిసి నారాచధారలఁ గప్పి యొప్పె. **61**

ప్రతిపదార్థం: భానుమంతునిన్= తన తండ్రియైన భానుమంతుడిని; చంపిన పగ= చంపినటువంటి వైరాన్ని; మనమునన్= మనస్సులో; పెట్టికొని+ఉండి= పెట్టుకొన్నవాడై; ఆతని పట్టి= ఆ భానుమంతుడి కుమారుడు; భీమసేనుపైన్= భీముడిపై; వడిన్=

వేగంగా; కాళింగ సేనతోడన్= కళింగదేశపు సైన్యంతో; కవిసి= చుట్టుముట్టి; నారాచ ధారలన్= బాణాల పరంపరలతో; కప్పి= కప్పివేసి; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: తన తండ్రి అయిన భానుమంతుడిని భీముడు చంపాడన్న పగతో, అతడి కుమారుడు కళింగసైన్యంతో భీమసేనుడిని చుట్టుముట్టి, అతడిపై బాణవర్షం కురిపించాడు.

క. **కినిసి బకమర్దనుఁడు వెసఁ । దన యరదము వాని తేరు దాఁకఁ బఱపి, యా**
తని మీఁద నుఱికి క్రుమ్మెం । గనుకని నెంపపొడి సెదరఁ గాలం గేలన్. **62**

ప్రతిపదార్థం: కినిసి= కోపించి; బకమర్దనుఁడు= బకాసురుని చంపిన భీముడు; వెసన్= వేగంగా; తన+అరదము= తన రథాన్ని; వాని తేరుదాఁకన్= ఆతని రథాన్ని తాకేటట్లు; పఱపి= తోలి; ఆతనిమీఁదన్= అతనిపైకి; ఉఱికి= దుమికి; కనుకనిన్= సంభ్రమంతో; ఎంపపొడి= ఎముకల నుగ్గు; చెదరన్= చెదరిపడేటట్లు; కాలన్= కాలితో; కేలన్= చేతితో; క్రుమ్మెన్= పొడిచాడు.

తాత్పర్యం: భీముడు కోపించి తన రథాన్ని వాడి రథాన్ని తాకేటట్లు తీసికొని వెళ్ళి, వాడి రథంపై పడి, వాడి ఎముకలన్నీ నుగ్గునుగ్గయి చెదరిపడేటట్లు కాలితో, చేతితో క్రుమ్మాడు.

విశేషం: బకుడనే రాక్షసుడిని సంహరించటంచేత భీముడికి బకమర్దనుడనే పేరు కలిగింది. బకుని మర్దించినవాడు బకమర్దనుడు- (మర్దించు= సంహరించు) భీముడు బకాసురుడిని సంహరించి ఏకచ్ఛత్రపురవాసులను రక్షించిన కథ మహాభారతం ఆదిపర్వంలో ఉన్నది. అంతటి రాక్షసుడినే జయించిన భీముడికి ఈ రాజకుమారుడు ఒక లెక్కా? అనే అర్థం స్ఫురిస్తూ ఉన్నది.

భీమసేనుఁడు దుర్మద దుష్కర్ణులం జంపుట (సం.7-130-22)

వ. **అమ్మహోగ్ర సముద్ధతిం జూచి పాంచాల సైనికులు సింహనాదంబులు సేసిన సహింపక సూతసుతుండును తత్సోదరులును నవ్వీరుం బొదివిన, నతం డద్భుతంబుగా ధ్రువు నరదంబు మీఁదికి లంఘించి వానిఁ బిడికిటి పోటునఁ జావం బొడిచి, జయరాతునిపైఁ గవిసి యాతని నతని సూతునిఁ గాళ్ళు లిరుగేలం బట్టి బె ట్టిలపై వ్రేసి గతాసులం జేసిన నలిగి కర్ణుండు శక్తివైవ మలంగి వెరవున నొడిసికొని దానిన యవ్వడముడి యతనిపై వైచినం గని గాంధార మహీవల్లభుండు భల్లంబున నడుమన నఱకె; నంతఁ గురుకుమారు లమ్మారుతిం జుట్టుముట్టి విశిఖంబులు నిగిడించినఁ గోపించి దుర్మదుని తేరి కురవడించి తురంగంబులం బొరివుచ్చి సారథిం జదిపిన నాతండు దుష్కర్ణు స్యందనం బెక్కె; నయ్యిరువురు నప్పాండుతనయు తనువున మెఱుంగుటమ్ములు గిరిగొలుపం గిట్టి యా రథంబు గూల నవలీలం దన్ని, దుర్యోధన ద్రౌణి కృప కృతవర్మ కర్ణ శల్య బాహ్లికులు సూచుచుండ నక్కుమారుల నిద్దఱం గాల నొక్కనిం గేల నొక్కనింగా సమయించె; నివ్విధంబునం జిత్రవధ విహారంబున విజృంభించు నా భీమసేనుం జూచి, రుద్రుండు రభసోద్రేకంబునం బాండవేయులకుఁ డోడ్పడం జనుదెంచెంగాక! మానవు లిట్టివారునుం గలరే! యనుచు నీ వారెల్లను వెఱచఱిచి యుద్ధకౌ క్క తెరువునం బోకపఱచి రక్కుమార కంఠీరవుం డుక్కునం దమసేన దిక్కుసూచి యెట్లు విరిదామరలం దెగడుకన్నులం గౌంతేయాగ్రజు నుపలక్షించి కేలుమొగిచి ఫాలంబునం జేర్చునప్పుడు తన్మూర్తి నతండును నకుల సహదేవ ద్రుపద విరాటులును దేఱి చూడ శంకించి మాఱు మొగంబులతో నగ్గించి రా సమయంబున.** **63**

ప్రతిపదార్థం: ఆ+మహా+ఉగ్ర+సముద్ధతిన్= ఆ గొప్ప భయంకరమైన విజృంభణాన్ని; చూచి= ప్రత్యక్షంగా చూచి; పాంచాల సైనికులు= పాంచాలదేశపు సైనికులు; సింహనాదంబులు= సింహనాదాలను; చేసినన్= చేయగా; సహింపక= తట్టుకోలేక; సూత సుతుండును= సూతపుత్రుడూ (కర్ణుడూ); తద్+సోదరులును= ఆ మృతవీరుడి సోదరులూ; ఆ+వీరున్= వీరుడైన ఆ భీమ సేనుడిని; పొదివినన్= ఎదిరించగా; అతండు= ఆ భీముడు; అద్భుతంబుగాన్= ఆశ్చర్యం కలిగే విధంగా; ధ్రువు+అరదంబు మీఁదికిన్=ధ్రువుడనే వాడి రథంపైకి; లంఘించి= దుమికి; వానిన్= ఆ ధ్రువుడిని; పిడికిటి పోటునన్= పిడికిలితో పొడిచి కొట్టటంతో; చావన్= మరణించే విధంగా; పొడిచి= పొడిచి; జయరాతునిపైన్= జయరాతుడనే వానిపైకి; కవిసి= ఉరికి; ఆతనిన్= అతడిని; ఆతని సూతునిన్= ఆ జయరాతుడి సారథిని; కాళ్ళులు= పాదాలను; ఇరు+కేలన్= రెండు చేతులతో; పట్టి= పట్టుకొని; బెట్టు= అత్యంతమూ; ఇలపైన్= భూమిమీద; వ్రేసి= పడవేసి; గత+అసులన్= మృతులనుగా; చేసినన్= చేయగా; అలిగి= కోపించి - క్రోధంతో అని భావం; కర్ణుఁడు= కర్ణుడు; శక్తిన్= శక్తి అనే ఆయుధాన్ని; వైవన్= వేయగా; ఆ+వడముడి= ఆ భీముడు; మలంగి= ప్రక్కకు లాగి; వెరవునన్= ఉపాయంతో; ఒడిసికొని= పట్టుకొని; దానిన్+అ= ఆ శక్తి అనే ఆయుధాన్నే; అతనిపైన్= అతడిమీదనే; వైచినన్= వేయగా; కని= చూచి; గాంధార మహీవల్లభుండు= గాంధారదేశం రాజు (శకుని); భల్లంబునన్= భల్లం అనే బాణంతో; నడుమన్+అ= నడిమధ్యలోనే; నఱకెన్= నఱికి వేశాడు; అంతన్= ఆ సమయంలో; కురుకుమారులు= కౌరవులు; ఆ+మారుతిన్= ఆ వాయునందనుడిని(భీముడిని); చుట్టుముట్టి= క్రమ్ముకొని; విశిఖంబులు= బాణాలను; నిగిడించినన్= వెలువరించగా; కోపించి= క్రోధం గలవాడై; దుర్మదుని తేరికిన్= దుర్మదుడి రథంపైకి; ఉరవడించి= చెలరేగి; తురంగంబులన్= అశ్వాలను; పొరి పుచ్చి= సంహరించి; సారథిన్= సారథిని; చదిపినన్= చంపివేయగా; ఆతండు= ఆ దుర్మదుడు; దుష్కర్ణు స్యందనంబు= దుష్కర్ణుని రథాన్ని; ఎక్కెన్= ఎక్కాడు; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరుకూడా; ఆ+పాండు తనయు తనువునన్= ఆ భీముడి శరీరంలో; మెఱుంగు +అమ్ములు= (పదనుతో) మెరుస్తూ ఉన్న బాణాలను; గిరిగొలుపన్= నాటగా; కిట్టి= సమీపించి; ఆ+రథంబు= ఆ రథము; కూలన్= కూలిపోగా; అవలీలన్= అనాయాసంగా; తన్ని= కాలితో తన్ని (ఆ రథాన్ని పక్కకు నెట్టి అని భావం); దుర్యోధన= దుర్యోధనుడు; ద్రౌణి= ద్రోణపుత్రుడు (అశ్వత్థామ); కృప= కృపాచార్యులు; కృతవర్మ= కృతవర్మ; కర్ణ= కర్ణుడు; శల్య= శల్యుడు; బాహ్లికులు= బాహ్లికుడు అను వారలు; చూచుచుండన్= చూస్తూ ఉండగా; ఆ+కుమారులన్+ఇద్దఱన్= ఆ ఇద్దరు కురు కుమారులను (దుర్మద దుష్కర్ణులను); కాలన్= పాదంతో; ఒక్కనిన్= ఒక్కడిని; కేలన్= చేతితో; ఒక్కనిన్+కాన్= ఒక్కడిని అనే విధంగా; సమయించెన్= చంపి వేశాడు; ఈ విధంబునన్= ఈ విధంగా; చిత్రవధ విహారంబునన్= ఆశ్చర్యం గొలిపే విధంగా చేసిన శత్రు వధల విహారంతో; విజృంభించు+ఆ+భీమసేనున్= చెలరేగుతున్న ఆ భీముడిని; చూచి= చూచినవారై; నీ వారు+ఎల్లను= (ఓ ధృతరాష్ట్ర మహారాజా!) నీ సైన్యంలోని వారందరు; పాండవేయులకున్= పాండవులకు; తోడ్పడన్= సహాయం చేయటానికి; రుద్రుండు= ప్రళయకాల శివుడు; రభస+ఉద్రేకంబునన్= వేగాతిశయంతో; చనుదెంచెన్= వచ్చాడు; కాక!= కాకున్నచో!; మానవులు= మనుష్యులు; ఇట్టివారునున్= ఇంతటివారు కూడా (ఇంతటి పరాక్రమశాలులు అని భావం); కలరు+ఏ!= ఉన్నారా!; అనుచున్= అనుకుంటూ; వెఱ చఱచి= భయపడి ('వెఱచి పఱచిరి' అని పాఠాంతరం, భయపడి పారిపోయారు అని అర్థం.); ఇద్దఱు= ఇరువురూ; ఒక్క తెరువునన్= ఒకే మార్గంలో; పోకపఱచిరి= పోకుండా పరుగెత్తిపోయారు; ఆ+కుమార కంఠీరవుండు= ఆ కుమారసింహము (భీముడు); ఉక్కునన్= దర్పంతో; తమ సేనదిక్కు= తమ సైన్యం వైపు; చూచి; ఎఱ్ఱవిరి+ తామరలన్= ఎఱ్ఱని వన్నెగల వికసించిన కమలాలను; తెగడు= నిందించేటటువంటి (అనగా అట్టి కమలాలకంటె గొప్పగానున్న అని భావం); కన్నులన్= కన్నులతో; కౌంతేయ+అగ్రజున్= పాండవుల అన్న అగు ధర్మరాజును; ఉపలక్షించి= చూచి; కేలు మొగిచి= చేతులు జోడించి; ఫాలంబునన్= నుదుట; చేర్చు+అప్పుడు= చేర్చే సమయంలో;తద్+మూర్తిన్= ఆ భీముడి ఆకారాన్ని (భయంకరాకారాన్ని); ఆతండును= ఆ ధర్మరాజు; నకుల సహదేవ ద్రుపద విరాటులును= నకుల సహదేవులు, ద్రుపద విరాట రాజులును; తేఱిచూడన్= స్పష్టంగా చూడటానికి; శంకించి= జంకి; మాఱుమొగంబులతోన్= వెనుదిరిగిన ముఖాలతో; అగ్గించిరి= పొగడారు; ఆ సమయంబునన్= అప్పుడు.

తాత్పర్యం: భయంకరంగా సాగిన ఆ శత్రుసంహార విజృంభణాన్ని పాంచాల సైనికులు చూచి, సింహనాదాలు చేశారు. అది సహించక కర్ణుడు, కళింగరాజ కుమారుని సోదరులు ధ్రువ జయరాతులు భీముడితో తలపడ్డారు. భీముడు ధ్రువుడి రథంపైకి దుమికి, అతడిని పిడికిటిపోటుతో సంహరించాడు. మరియు జయరాతుడి మీద తలపడి అతడిని, అతడి సారథిని - ఇద్దరిని, చేతులతో వాళ్ళ కాళ్ళుపట్టి పైకెత్తి, భూమిపై గట్టిగా కొట్టి చంపాడు. అప్పుడు మిక్కిలి కోపంతో కర్ణుడు శక్త్యాయుధాన్ని భీముడిపై ప్రయోగించాడు. వస్తున్న ఆ శక్తిని భీముడు ఉపాయంతో పట్టుకొని తిరిగి దానిని ఆ కర్ణుడిపై ప్రయోగించాడు. అది చూచి, శకుని మధ్యలో ఆ శక్త్యాయుధాన్ని భల్లంతో ఖండించాడు. ఆ సమయంలో కౌరవకుమారులు దుర్మద దుష్కర్ణులు ఆ భీమసేనుడిని చుట్టుముట్టి, బాణాలు గుప్పించారు. దానికి భీముడు కోపించి, దుర్మదుడి రథంపైకి లంఘించి అశ్వాలను, సారథిని తెగటార్చాడు. అప్పుడు దుర్మదుడు తన రథం విడిచి దుష్కర్ణుని రథంపైకి ఎక్కాడు. వారిరువురు కూడా కలిసి భీముడిపై బాణవర్షం కురిపించారు. భీముడు వారి రథాన్ని తన్నివేసి, ఆ దుర్మదదుష్కర్ణుల నిద్దరినీ కాలితో ఒక్కడిని, చేతితో మరొక్కడిని సంహరించివేశాడు. ఇదంతా, దుర్యోధనుడు, అశ్వత్థామ, కృపాచార్యులు, కృతవర్మ, కర్ణుడు, శల్యుడు, బాహ్లికుడు వీరందరూ చూస్తూనే ఉన్నారు. ఈ విధంగా ఆశ్చర్యకరంగా శత్రువధచేసి చెలరేగుతున్న భీముడిని చూచి మీ కురుసైనికులు - ప్రళయకాలరుద్రుడు పాండవ సహాయార్థం కౌరవసైన్యంలో వీరవిహారం చేస్తున్నాడే తప్ప ఇతడు భీముడా? కాదు - మానవులలో ఇట్టివారుంటారా? అని నీ వారంతా భయపడ్డారు. ఆ వీరులిద్దరినీ ఒక విధంగా తెగటార్చి భీముడు గొప్ప దర్పంతో వెనుదిరిగి తమ సైన్యాన్ని చూచాడు. అప్పుడు అతడి కన్నులు వికసించిన ఎఱ్ఱకమలాలవలె ఉన్నాయి. అన్న ధర్మరాజును చూచి, అంజలి ఘటించాడు. అప్పటి ఆ భీముడి ఆకారం చాలా భయంకరంగా ఉన్నది. దానిని ధర్మరాజు, నకుల సహదేవులు, ద్రుపద విరాటులు ఎవ్వరూ కూడా తేరి చూడలేకపోయారు. ముఖాలు చాటు చేసికొన్నారు. భీముడిని ప్రస్తుతించారు. ఆ సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. కురుసైన్యం భీముడిని పాండవ సహాయార్థం వచ్చిన ప్రళయ రుద్రుడిగా భావించింది. ఇది ఉత్ప్రేక్షాలంకారం. దీనివలన భీముడి పరాక్రమాతిశయం, శత్రుసంహార సౌలభ్యం వ్యక్తమౌతాయి. ఇక్కడ - 'నీవారెల్లరు వెఱచఱచి' అనే పాఠంకంటె 'వెఱచి పఱచిరి' అనే పాఠం మూలానుగుణంగా ఉన్నది - సంస్కృతమూలం ఇట్లా ఉన్నది. **శ్లో॥ 'రుద్రోzయం భీమరూపేణ ధార్తరాష్ట్రేషు యుధ్యతి । ఏవ ముక్త్వా పలాయంతే సర్వే భారత! పార్థివాః'** (ద్రోణ - 55-42) **మరియు 'వెఱ చఱచి (యుద్ధతొక్క తెరువునం బోక పఱచి) రక్కుమార కంఠీరవుండు...'** ఈ పాఠం అనన్వితంగా ఉన్నది. కావున సవరించి అర్థం వ్రాయవలసి వచ్చింది. కొన్ని ప్రతులలో కుండలీకరణంలో ఇచ్చి ఉన్న వాక్యం లేదు. అన్వయం సరిపోయింది. **'వెఱచి పఱచిరిద్దరిద్దఱ నొక్క తెరువునం బోక పఱచి యక్కుమార...'** - అనే విధంగా అన్వయానుగుణంగా, ఆ వాక్యం మార్చి అర్థం వ్రాయవలసి వచ్చింది - గమనించాలి.

క. **కడువడి గురుఁ డనిలజుపై । నడరిన రాధాతనూభవాదులు దోడై**
కడఁగుటయుఁ గనుంగొని నీ । కొడుకుగమియుఁ గదిసె నుదిత కోపస్ఫురణన్. **64**

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యులు; కడు= మిక్కిలి; వడిన్= వేగంతో; అనిలజుపైన్= భీముడిపై; అడరినన్= విజృంభించగా; రాధాతనూభవ+ఆదులు= రాధేయుడు (కర్ణుడు); మొదలైనవారు; తోడు+ఐ= సహాయంగా వచ్చినవారై; కడఁగుటయున్= తల పడుతూ ఉంటే; కనుంగొని= చూచి; నీ కొడుకు+గమియున్= నీ కుమారుల సమూహం కూడా; ఉదిత= కలిగిన; కోపస్ఫురణన్= కోపస్ఫూర్తితో; కదిసెన్= ఎదుర్కొన్నది.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు మిక్కిలి వేగంగా భీముడిపై చెలరేగాడు. కర్ణాదులు అతడికి తోడైనారు. ఇది చూచి, నీ కుమారులు (కౌరవులు) కూడా మిక్కిలి కోపంతో కలిసి ఎదుర్కొన్నారు.

తే. **వారిఁ దలపడి పోరిరి దారుణముగ। ధర్మసుతుఁడును గవలు నుద్దండవృత్తిఁ**
దఱుమ ద్రుపద విరాట సాత్యకులు మఱియుఁ । జేయఁ గలయట్టి మేదినీ నాయకులును. 65

ప్రతిపదార్థం: వారిన్= ఆ కర్ణాదులను; తలపడి= ఎదిరించి; ధర్మసుతుఁడును= ధర్మరాజు; కవలును= నకుల సహదేవులు కూడా; దారుణముగన్= భయంకరంగా; పోరిరి= యుద్ధం చేశారు, మఱియున్= అంతేగాక; ద్రుపద విరాట సాత్యకులు= ద్రుపదరాజు, విరాటరాజు, సాత్యకి - ఈ ముగ్గురు; చేయన్+కల+అట్టి= సమర్థులైన; మేదినీ నాయకులును= రాజులు కూడా; ఉద్దండ వృత్తిన్= భయంకర ప్రవృత్తిని (అనగా శత్రువుల పొగరునని భావం); తఱుమ(న్)= తరిమివేయటానికి (అణచటానికి) ('వారిఁ దలపడి పోరిరి' అని అన్వయం).

తాత్పర్యం: భీముడిపై తలపడిన కర్ణాదులను, నీ కుమారులను కూడా ఎదిరించి, వారి పొగరు అణచటానికి ధర్మరాజు, నకులసహదేవులు, ద్రుపద విరాట సాత్యకులు - అంతేగాక పాండవ సైన్యంలో కడు సమర్థులైన రాజులందరు కూడా కలిసి యుద్ధం చేశారు.

వ. **అయ్యవసరంబున సోమదత్తుండు దనకు సాత్యకి సన్నిహితుఁ డగుటయు నతనితో నిట్లనుఁ 'బ్రాయోపవిష్టుండగు భూరిశ్రవుం జంపి తది బోయ చందంబు గాక రాజ ధర్మం బగునే? యీ రేయి నీవు నాచేత బ్రదికి పోవు వాఁడవే?' యని పలికి సింహనాదంబు సేసి శంఖంబు పూరించిన నా శైనేయుఁడు, 'భూరిశ్రవుండు సచ్చుట యొప్పదేని ని న్నొప్పెడునట్లు సంపెద; నిటు రమ్ము శలుని చావొప్పు నొప్పదని యుగ్గడింప వది యేమి? నీకెట్లయినం గాని కా' దని భంగించె; నిత్తెఱంగున నొండొరుల నో నాడి యేటులాడం దొడంగి; రప్పుడు నీ కొడుకు ఘోటక స్యందన సందోహ సమేతంబుగా నక్కౌరవునకుం దోడ్పడియె; శకునియుఁ దన బలంబునుం దానును నాతనిం గూడుకొనియె; నవ్విధంబునం బలువు రొక్కనిపైఁ గవిసినం గని ధృష్టద్యుమ్నుండు భూరి సైన్య సమేతుండై వారల నెదుర్కొనం బోరు ఘోరం బయ్యె; నట్టియెడ.** 66

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయాన; సోమదత్తుండు= సోమదత్తుడు (భూరిశ్రవుడి తండ్రి); తనకున్= (సోమదత్తుడికి); సాత్యకి= సాత్యకి; సన్నిహితుండు+అగుటయున్= (యుద్ధం చేయటానికి); సమీపానికి రావటంతో; ఆతనితోన్= ఆ సాత్యకితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= పలికాడు; ప్రాయోపవిష్టుండు+అగు= ప్రాయోపవేశం చేసిన; భూరిశ్రవున్= భూరిశ్రవుడనే తన కుమారుడిని; చంపితి= సంహరించావు; అది= అట్లు అస్త్రసన్న్యాసం చేసిన వానిని చంపుట; బోయచందంబు+కాక= దారిదోపిడీ చేసే బోయవాడి తీరు (అవుతుందే) తప్ప; రాజ ధర్మంబు+అగునే?= రాజులకు తగిన ధర్మం అవుతుందా?; ఈ రేయి= ఈ రాత్రి; నీవు (సాత్యకి); నా చేతన్= (సోమదత్తుడిచేత); బ్రదికి పోవువాఁడవు+ఏ?= (సంహరించబడక); బ్రతికిపోతావా?; అని= ఇట్లా; పలికి= చెప్పి; సింహనాదంబు+చేసి= సింహనాదాన్ని చేసి; శంఖంబు= శంఖాన్ని; పూరించినన్= పూరించగా; ఆ శైనేయుఁడు= శిని అనే వాడి మనుమడు, ఆ సాత్యకి; భూరిశ్రవుండు+చచ్చుట= భూరిశ్రవుడు మరణించటం; ఒప్పదు+ఏనిన్= తగింది కాకుంటే; నిన్ను (సోమదత్తుడు నిన్ను); ఒప్పెడు+అట్లు= తగిన విధంగా; చంపెదన్= సంహరిస్తాను; ఇటు రమ్ము= ఈ వైపురా; శలుని చావు= శలుడు అనే నీ రెండవకుమారుడి (భూరిశ్రవుడి తమ్ముడి) సంహారం; ఒప్పును= తగుతుంది; ఒప్పదు= తగదు; అని (ఇట్లు తగుతుందని కాని తగదని కాని అని భావం); ఉగ్గడింపవు= చెప్పవు; అది+ఏమి?= ఆ తటస్థభావం ఎందుకు?; నీకున్= (సోమదత్తుడికి); ఎట్లు+అయినన్+కాని= ఎట్లానన్నా కాని, (ఆ విషయం నీ అభిప్రాయంలో ఎట్లాగైనా ఉండనీ); కాదు+అని= (నిజానికి అది అధర్మం) కాదు అని; భంగించెన్= ఖండించాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఒండొరులతోన్= ఒకరినొకరు;

నోన్+ఆడి= నొచ్చునట్లు నిందించుకొని; ఏటులాడన్+తొడంగిరి= యుద్ధం చేయబూనారు; అప్పుడు= ఆ సమయాన; నీ కొడుకు= నీ (ధృతరాష్ట్రుడి) కుమారుడు దుర్యోధనుడు; ఘోటక స్యందన సందోహ సమేతంబుగాన్= అశ్వరథ సమూహంతో కూడి (అట్టి ఆశ్విక రథిక సమూహంతో కూడి వచ్చి అని భావం); ఆ+కౌరవునకున్= ఆ కురువంశీయుడైన సోమదత్తుడికి; తోడ్పడియెన్= సహాయం చేశాడు; శకునియున్= శకుని కూడా; తన బలంబునున్= తన సైన్యం మరియు; తానునున్= తానుకూడా; ఆతనిన్= అతడిని; కూడుకొనియెన్= కలిశాడు (సహాయం చేయటానికి యుద్ధానికి వచ్చాడని భావం); ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; పలువురు= అనేకులు; ఒక్కనిపైన్= ఏకాకి అయిన సాత్యకిపై; కవిసినన్= తలపడగా; కని= చూచి; ధృష్టద్యుమ్నుండు= పాండవ సైన్యాధిపతి అయిన ధృష్టద్యుమ్నుడు; భూరి సైన్య సమేతుండు+ఐ= గొప్ప సైన్యం వెంట తీసికొన్నవాడై; వారలన్= ఆ దుర్యోధనాదులను; ఎదుర్కొనన్= ఎదిరించగా; పోరు= యుద్ధం; ఘోరంబు+అయ్యెన్= భయంకరమయింది - (భయంకరంగా సాగింది అని భావం); అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో సాత్యకి తనకు దగ్గరగారాగా, సోమదత్తుడు చూచి ఇట్లా అన్నాడు: 'నా తనయుడు భూరిశ్రవుడు (బాహుదండం ఛిన్నం కాగా) ప్రాయోపవేశం చేసి సమాధిలో ఉండగా అతడి తల నరికావు. నీవు చేసింది కిరాతకుడి పనే కాని, అది రాజధర్మమా? కాబట్టి ఈ రాత్రికి నీవు నా చేతిలో చావవలసిందే. బ్రతికి పోలేవు' అని పలికి, సింహనాదాన్ని చేసి శంఖం పూరించాడు. అప్పుడు సాత్యకి, భూరిశ్రవుడిని సంహరించటం తగినపని కాకుంటే, నిన్ను తగినట్లే చంపుతాను ఇటురా, అయితే నీ రెండవ కుమారుడు శలుడిని సంహరించటం ఒప్పుతుందా? ఒప్పదా? దానిని గూర్చి చెప్పవేమి? నీవెట్లనుకుంటున్నావో కాని అదిమాత్రం అధర్మం కా' దని ఖండించాడు. ఈ విధంగా ఒకరినొకరు దూషించుకొంటూ యుద్ధానికి తలపడ్డారు. ఆ సమయంలో దుర్యోధనుడు ఆశ్విక రథిక బలాలతో వచ్చి, ఆ సోమదత్తుడికి తోడ్పడ్డాడు. శకుని కూడా తన సైన్యాన్ని వెంట తీసికొని సహాయం చేయటానికి సోమదత్తుడిని కలిశాడు. ఈ విధంగా పెక్కుమంది కౌరవవీరులు ఒక్కడుగా నున్న సాత్యకితో తలపడటం చూచి, ధృష్టద్యుమ్నుడు గొప్ప సైన్యంతో వచ్చి వారిని ఎదుర్కొన్నాడు. యుద్ధం భయంకరమైంది- ఆ సమయాన (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **సోమదత్తుఁడు తొమ్మిది సునిశితాస్త్ర । ముల శినిప్రభు నేసిన నలిగి యతఁడు**
నతని నన్నియమ్ములన మూర్ఛితునిఁ జేయ । రథము దొలఁగంగఁ దోలె సారథి గలంగి. 67

ప్రతిపదార్థం: సోమదత్తుఁడు; తొమ్మిది; సునిశిత+అస్త్రములన్= వాడి బాణాలతో; శినిప్రభువున్= సాత్యకిని; ఏసినన్= కొట్టగా; అలిగి= కోపించి; అతఁడు= ఆ సాత్యకి; అన్ని+అమ్ములను+అ= అంతే సంఖ్యగల (అనగా తొమ్మిది) బాణాలతో; మూర్ఛితునిన్+చేయన్= మూర్ఛపొందినవాడినిగా చేయగా; సారథి= ఆ సోమదత్తుడి రథసారథి; కలంగి= కలతచెంది; రథము= ఆ రథాన్ని; తొలఁగంగన్= రణభూమినుండి తొలగి వెళ్ళిపోయేటట్లు; తోలెన్= తోలుకొనిపోయాడు.

తాత్పర్యం: సోమదత్తుడు సాత్యకిని తొమ్మిది బాణాలతో కొట్టగా, ఆ సాత్యకి కూడా సోమదత్తుడిని మళ్ళీ తొమ్మిదే బాణాలతో కొట్టి మూర్ఛ పొందించాడు. అది చూచి, సారథి కలత చెంది, రణభూమినుండి రథాన్ని దూరంగా తోలుకొనిపోయాడు.

మ. **కని ద్రోణాత్మజుఁ డేచి సాత్యకి భుజాగర్వంబు మాన్పింతుఁ బో**
మ్మని పోఁ బో నడుమన్ ఘటోత్కచుఁడు ఘోరాకార దైత్య వ్రజం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బును దానుం బటుభంగిఁ దాఁకుటయు నీపుత్రుండుఁ గర్ణుండుఁ ద
క్కిన వారున్ వెఱ వానితోడి యనికిం గ్రేడించి రుర్వీశ్వరా! 68

ప్రతిపదార్థం: ఉర్వీశ్వరా!= ఓ రాజా!; కని= చూచి; ద్రోణ+ఆత్మజుఁడు= అశ్వత్థామ; ఏచి= విజృంభించి; సాత్యకి భుజాగర్వంబు= సాత్యకియొక్క భుజదర్పాన్ని; మాన్పింతున్= మాన్పించివేస్తాను; పొమ్ము+అని= పో అని (నిశ్చయంగా అని భావం); పోన్+పోన్= వెళ్తూ వెళ్తూ ఉంటే; నడుమన్= మార్గమధ్యంలోనే; ఘటోత్కచుఁడు= ఘటోత్కచుడనే రాక్షసుడు - (భీముడి వలన హిడింబ అనే రాక్షసస్త్రీయందు జనించినవాడు); ఘోర+ఆకార దైత్య వ్రజంబును= భయంకరాకారం గల రాక్షసుల సమూహం; తానున్= తాను (ఘటోత్కచుడు) కూడా; పటుభంగిన్= సమర్థంగా; తాఁకుటయున్= ఎదుర్కొనగా; నీ పుత్రుండు= నీ కుమారుడు దుర్యోధనుడు; కర్ణుండు; తక్కినవారున్= మిగిలినవారు (ఇతరులు); వెఱన్= భయంతో; వానితోడి అనికిన్= ఆ ఘటోత్కచుడితో యుద్ధం చేయటానికి; క్రేడించిరి= తొలగిపోయారు.

తాత్పర్యం: సోమదత్తుడు మూర్ఛపోవటం చూచి అశ్వత్థామ, సాత్యకి భుజదర్పాన్ని అణచివేస్తానని పో బోవగా, మార్గమధ్యంలోనే ఘటోత్కచుడు ఎంతో భయంకరమైన రాక్షససైన్యంతో అతడిని ఎదుర్కొన్నాడు. దుర్యోధనుడు, కర్ణుడు, ఇతర యోధులు ఆ ఘటోత్కచుడితో యుద్ధం చేయటానికి భయపడి తప్పుకొన్నారు.

విశేషం: 'క్రీడించిరి' అనే ఉస్మానియా పాఠం అర్థానుగుణంగా లేదు. 'కేడించిరి' అనే పాఠమే ప్రకృతానికి సరిపోయేవిధంగా ఉన్నది. క్రేడించిరి అని కూడా కొన్ని ప్రతులలో ఉన్నది - ఈ రెండును సమానార్థకాలే - సంస్కృతమూలం -

"శ్లో॥ తనయా స్తవ కర్ణశ్చ వ్యథితాః ప్రాద్రవన్ దిశః" (156/71).

వ. అట్లు సంధ్యాసమయ సంవర్ధిత బలుండగు నప్పూర్వగీర్వాణుని కోల్తల కోర్వక మేటి మగలెల్లం దొలంగిన. 69

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; సంధ్యాసమయ సంవర్ధిత బలుండు+అగు= సంధ్య సమయంలో వృద్ధిపొందిన బలం గలవాడైన; ఆ+పూర్వగీర్వాణుని= ఆ రాక్షసుడి (ఘటోత్కచుడి); కోల్తలకున్= ఆ ఘటోత్కచుడి యుద్ధసన్నాహమునకు; ఓర్వక= ఓపికలేక - తట్టుకోలేక అని భావం; మేటి మగలు+ఎల్లన్= గొప్ప వీరులందరూ; తొలంగిన(న్)= తొలగిపోగా.

తాత్పర్యం: ఆ విధంగా సంధ్యాసమయంలో పెరిగిపోయే బలం కలవాడైన ఆ ఘటోత్కచుడి యుద్ధసన్నాహాన్ని సహించలేక, గొప్ప గొప్ప వీరులు కూడా ప్రక్కకు తొలగిపోగా (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: గీర్వాణులు అంటే దేవతలు. దేవతలకు వాక్కు బాణాలుగా పనిచేస్తాయి. కాబట్టి మొదట దేవతలుగా ఉండటంచేత రాక్షసులు పూర్వదేవ పూర్వగీర్వాణ పదాలచేత వ్యవహరించబడినారు. కాబట్టి ఘటోత్కచు డిచ్చట పూర్వగీర్వాణ పద వాచ్యుడయ్యాడు.

క. గురుసుతుఁ డొక్కరుఁడును సు । స్థిరుఁ డై తద్బాణనిహతిఁ దెరలక యతి ని
ష్ఠుర నారాచంబులు పది । యురమున నాటింప దానవోత్తముఁ డలుకన్. 70

ప్రతిపదార్థం: గురు సుతుఁడు+ఒక్కరుఁడును= అశ్వత్థామ ఒక్కడే; సుస్థిరుఁడు+ఐ= నిలుకడ కలవాడై; తద్బాణ నిహతిన్= ఆ ఘటోత్కచుడి బాణాలదెబ్బకు; తెరలక= చలింపక; అతి నిష్ఠురనారాచంబులు పది= పది కఠినాలైన బాణాలను; ఉరమునన్= రొమ్మున; నాటింపన్= నాటేటట్లు చేయటం తోడనే; అలుకన్= కోపంతో; దానవ+ఉత్తముఁడు= ఆ రాక్షసశ్రేష్ఠుడు ఘటోత్కచుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఒక్క అశ్వత్థామ మాత్రం ఆ ఘటోత్కచుడి బాణాలదెబ్బకు ఏమాత్రం కలత చెందకుండా, మిక్కిలి తీక్ష్ణములైన పదిబాణాలు అతడి వక్షఃస్థలంలో గ్రుచ్చుకొనేటట్లు కొట్టాడు. ఆ బాణాఘాతంతో ఘటోత్కచుడు కోపం చెంది (తరువాతి పద్యంతో అన్వయం).

క. **వడిఁ జక్రంబున వైచిన । నడుమన గురునందనుండు నఱికెం; బుణ్యం**
బెడలిన నరు సంకల్పము । వడువున నది వమ్ముగాఁగ వసుధాధీశా! **71**

ప్రతిపదార్థం: వడిన్= వేగంగా; చక్రంబునన్= చక్రంతో; వైచినన్= వేయగా; నడుమన్+అ= నడిమి త్రోవలోనే; గురునందనుండు= గురుపుత్రుడు అశ్వత్థామ; నఱికెన్= నరికివేశాడు; వసుధా+అధీశా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా! (అది ఎట్లా అంటే); పుణ్యంబు= ఈ జన్మలో సుఖఫలాన్నిచ్చే పూర్వజన్మార్జిత కర్మవిశేషం; ఎడలిన= నశించినటువంటి; నరు సంకల్పము వడువునన్= మనుష్యుడి సంకల్పం విధంగా; (మనుష్యుడు కార్యం నెరవేరటానికి సంకల్పిస్తాడు. ఆ సంకల్పం నెరవేరాలంటే దైవానుకూల్యం కావాలి. దైవమనగా పూర్వజన్మలో అతడు చేసిన మంచి చెడు పనులే - మంచి పనులే పుణ్యం, చెడు పనులే పాపం. కాబట్టి పుణ్యం నశిస్తే సుఖానుకూల కార్యసిద్ధికై చేసే సంకల్పం వ్యర్థమౌతుంది. ఆ విధంగా అని భావం.); అది= ఆ చక్రాయుధం; వమ్ము= వ్యర్థం; కాఁగన్= అయ్యేటట్లు; నఱికెన్= ఖండించాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఘటోత్కచుడు వెంటనే చక్రాయుధాన్ని ప్రయోగించాడు. పుణ్యం క్షీణించిన మానవుడి సంకల్పం వ్యర్థమైన విధంగా అశ్వత్థామ మధ్యలోనే ఆ చక్రాయుధం వ్యర్థమయ్యేటట్లు దాన్ని నరికివేశాడు.

విశేషం: అలం: ఉపమ. దైవబలం లేని మనుష్యుడి సంకల్పం వ్యర్థమయిన విధంగా ఆ చక్రాయుధం వ్యర్థమైంది అని చెప్పటం చేత ఇది ఉపమాలంకారం. దీనివలన ఏ పని చేయటానికి సంకల్పించినా పురుష ప్రయత్నంతోపాటు దైవబలం కూడా కావాలి అనే అర్థం ధ్వనిస్తూ ఉన్నది. 'వసుధాధీశా!' అని ధృతరాష్ట్రుడిని సంబోధిస్తూ చెప్పటాన్ని బట్టి 'నీ కుమారులూ నీవూ ఎంతటి దైవబలం గలవారో విచారించుకో!' అనే అర్థం ధ్వనిస్తూ ఉన్నది.

అంజనపర్వుం డశ్వత్థామతో యుద్ధంబు సేసి చచ్చుట (సం.7-131-44)

వ. **అప్పుడద్దనుజుని తనయుం డంజనపర్వుం డశ్వత్థామం దలపడి బలుతూపులం బొదివిన బెదరక యతం డ య్యసుర వీరుని విల్లుద్రుంచి విరథుం జేయుటయు, వాఁడు కరవాలంబు గొనినం, దునిమె గద వైచిన దుమురు సేసె, నింగి కెగసి మ్రోఁగుచుం బాషాణ వర్షంబు గురియ నదియును వారించి యమ్మాయావి మేన మేఘంబున గిఱికొను తరణి కిరణంబులంగ్రేణిసేయు పటు బాణంబుల నిగిడించె; మగిడి యొండు రథంబున నరుదెంచినఁ దల ద్రెంచె; నిట్లు గురుపుత్రుండు వానిం బరిమార్చి పేర్చి పాండవ బలంబులఁ బరిమార్పం దొడంగినం గని కడంగి హిడింబా నందనుండు 'నిలు నిలు నా బారిం బడి యెందుఁ బోవచ్చు?' ననవుడు నా రథికుం డతని నవలోకించి.** **72**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఆ+దనుజుని తనయుండు= ఆ ఘటోత్కచుడి కుమారుడైన; అంజనపర్వుండు= అంజనపర్వుడనే రాక్షసుడు; అశ్వత్థామన్= అశ్వత్థామతో; తలపడి= యుద్ధానికి పూనుకొని; పలు తూపులన్= అనేక బాణాలను; పొదివినన్= గ్రుచ్చుకొనజేయగా; బెదరక= భయపడక; అతండు= ఆ అశ్వత్థామ; ఆ+అసురవీరుని విల్లు= ఆ రాక్షసవీరుడి అనగా అంజనపర్వుడి ధనుస్సును; త్రుంచి= తెగగొట్టి; విరథున్= రథం లేనివాడినిగా; చేయుటయున్= చేయటం తోడనే; వాఁడు= ఆ అంజనపర్వుడు; కరవాలంబు= ఖడ్గాన్ని; కొనినన్= గ్రహించగానే; తునిమెన్= తునకలుగా చేశాడు; గద= గదను;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వైచినన్= వేసిన వెంటనే; తుమురు+చేసెన్= తుత్తునియలుగా చేశాడు; నింగికిన్= ఆకాశానికి; ఎగసి= ఎగిరిపోయి; మ్రోఁగుచున్= అరుస్తూ; పాషాణవర్షంబు= రాళ్ళవర్షం; కురియన్= కురిపిస్తూ ఉంటే; అదియును= దాన్ని కూడా; వారించి; ఆ+మాయావిమేనన్= మాయావి అయిన ఆ అంజనపర్వుడి శరీరంలో; మేఘంబునన్= మబ్బులో; గిటికొను= వ్యాపించిన; తరణికిరణంబులన్= సూర్యకిరణాలను; క్రేణిచేయు= పరిహసిస్తూ ఉన్న (అట్టి సూర్యకిరణాలను మించిన అని భావం); పటుబాణంబులన్= సమర్థమైన అనగా తీక్ష్ణమైన బాణాలను; నిగిడించెన్= నాటజేశాడు; మగిడి= మళ్ళీ; ఒండురథంబునన్= మరియొక రథంపై; అరుదెంచినన్= రాగానే; తలన్= శిరమును; త్రెంచెన్= తెగగొట్టాడు; ఇట్లు= ఈ విధంగా; గురుపుత్రుండు= ద్రోణుడి కుమారుడు అశ్వత్థామ; వానిన్= ఆ అంజనపర్వుడనే రాక్షసుడిని; పరిమార్చి= సంహరించి; పేర్చి= విజృంభించి; పాండవ బలంబులన్= పాండవుల సైన్యాలను; పరిమార్పన్= సంహరించటానికి; తొడంగినన్= పూనుకొంటూ ఉంటే; కని= చూచి; కడంగి= తలపడి; హిడింబానందనుండు= హిడింబ అనే రాక్షసి భీముని భార్య; వారి కుమారుడు ఘటోత్కచుడు; నిలు నిలు= ఆగు ఆగిపొమ్ము; నాబారిన్= నా గురిలో; పడి= పడ్డావు కాబట్టి (క్త్వాప్రత్యయం హేత్వర్థకం); ఎందున్= ఎక్కడికి; పోవచ్చును?= పోగలవు? (ఎక్కడికి కూడా పారిపోవటం నీ శక్యంకాదని భావం.); అనవుడున్= అనగానే; ఆ రథికుండు= రథం అధిష్ఠించి యుద్ధం చేస్తూ ఉన్న ఆ అశ్వత్థామ; అతనిన్= ఆ అంజనపర్వుడిని; అవలోకించి= చూచి.

తాత్పర్యం: ఆ సమయంలో ఆ ఘటోత్కచుడి కుమారుడు అంజనపర్వుడు అశ్వత్థామను ఎదుర్కొన్నాడు.ఎన్నో బాణాలతో నొప్పించాడు. దానికి ఆ అశ్వత్థామ బెదరిపోలేదు. మీదు మిక్కిలి ఆ రాక్షసవీరుడి ధనువును విరగగొట్టాడు. రథాన్ని కూడా కూలద్రోశాడు. అప్పుడు ఆ అంజనపర్వుడు ఖడ్గాన్ని పుచ్చుకోగా ఆ ఖడ్గాన్ని కూడా తునకలు చేశాడు. వాడు గద వేయగా దానిని కూడా తుత్తుమురు చేశాడు. ఇక ఆ రాక్షసుడు ఆకాశాని కెగిరి రాళ్ళవర్షం కురిపించగా, దానిని కూడా అశ్వత్థామ నివారించి, మాయాబలంతో విజృంభిస్తూ ఉన్న ఆ రాక్షసుడి శరీరంలో మేఘాన్ని కప్పిన సూర్యకిరణాలను మించిన తీక్ష్ణమైన బాణాలను నాటాడు. ఆ అంజనపర్వుడు మరియొక రథంపై కూర్చుని, మళ్ళీ యుద్ధానికి వచ్చాడు. రావటం తోడనే అశ్వత్థామ వాడి తల నరికాడు. ఈ విధంగా విజృంభించి ఆ రాక్షసుడిని వధించి, పాండవసైన్యాన్ని సంహరింప పూనుకొన్నాడు. అదిచూచి, ఘటోత్కచుడు 'అశ్వత్థామా! పారిపోక నిలువు; నీవు నా బారినుండి తప్పించుకొనలేవు; ఎక్కడికీ పోలేవు' అని అంటూ తనను ఎదిరించిన ఘటోత్కచుడిని అశ్వత్థామ చూచి (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అంజనపర్వుడి శరీరంలో గ్రుచ్చిన బాణాలు మబ్బులో ప్రసరించిన సూర్యకిరణాలను పరిహసించాయి అని చెప్పటంచేత ఇది ఆర్థీ ఉపమ. సూర్యకిరణాలు ప్రసరించిన నల్లనిమేఘం ఎఱ్ఱబారినట్లు ఆ రాక్షసుడి నల్లనిశరీరం కూడా బాణాలు గ్రుచ్చుకొనటంతో రక్తం స్రవించి ఎఱ్ఱబారి ఉండటం వలన ఉపమ. దీనితో అంజనపర్వుడి శరీరం తూట్లుపడేటట్లు అశ్వత్థామ యుద్ధం చేశాడని, దానితో అంజనపర్వుడు తాళలేకపోయాడని, అశ్వత్థామ ప్రతాపాతిశయం వ్యక్తమవుతూ ఉన్నది.

ఆ. 'వలదు రన్న! పిన్నవాఁడవు తండ్రి నే। నకట! నిన్నుఁ జూచి యలుగ రాదు;
పెనఁగు మొరులతోడ' ననవుడుఁ బుత్ర శో। కాభితప్తుఁ డైన యతఁడు గనలి. 73

ప్రతిపదార్థం: వలదుర+అన్న!= వద్దురా నాయనా! (నీవు నాతో యుద్ధం చేయటం తగదని భావం); (ఎందుకంటే) పిన్నవాఁడవు= (నీవు) చిన్నవాడవు; ఏన్= నేను; తండ్రిని= జనకస్థానీయుడను; అకట!= అయ్యో!; నిన్నున్= భీమసేన కుమారుడవగు నిన్ను; చూచి= నాతో యుద్ధానికి తలపడుతూ ఉంటే కూడా చూచి; అలుగరాదు= నేను కోపించకూడదు - (కావున నేను యుద్ధం ఎట్లా చేస్తాను? చేయను అని భావం); ఒరులతోడన్= వేరే మరెవ్వరితోనైనా; పెనఁగుము= యుద్ధం చేయుము (నాతో మాత్రం

వద్దని భావం); అనవుడున్= అనగానే; పుత్రశోక+అభితప్తుఁడు+ఐన= పుత్రుడు (అంజనపర్వుడు) మరణించుటచేత కలిగిన శోకంతో తాపం పొందిన; అతఁడు= ఆ ఘటోత్కచుడు; కనలి= మండిపడి.

తాత్పర్యం: 'నీవేమో చిన్నవాడవురా నాయనా! ఘటోత్కచా! నేను తండ్రివంటివాడిని; నీపై కోపం చూపించకూడదు. నాతో కాదు మరెవరితోనైనా నీవు యుద్ధం చేయి' అని అనటంతోడనే పుత్రశోకంతో కుమిలిపోతున్న ఘటోత్కచుడు, కోపించి ఇట్లా అన్నాడు: (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఎక్కడి తండ్రివి? నీవే । నక్కౌంతేయులకుఁ గొడుకనై పగతుర పే
రుక్కు సహింతునె? తనయుం । గ్రక్కించెద నిపుడ పట్టి కండలు దిందున్.' 74

ప్రతిపదార్థం: నీవు= నీవు (అశ్వత్థామ); ఎక్కడి తండ్రివి?= ఎక్కడి నుండి వచ్చిపడిన (నా) తండ్రివి?; ఏన్= నేను; ఆ+కౌంతేయులకున్= ఆ ధర్మరాజాదులకు; కొడుకను+ఐ= కుమారుడనై ఉండి; పగతుర+పేరు+ఉక్కు= శత్రువుల ప్రతాపాతిశయాన్ని; సహింతునె?= సహిస్తానా?; ఇపుడు+అ= ఇప్పుడే; పట్టి= పట్టుకొని; తనయున్= నా కుమారుడిని; క్రక్కించెదన్= కక్కునట్లు చేస్తాను (మరియు); కండలు= మాంసపు ముక్కలను అనగా నీ (అశ్వత్థామ) శరీరాన్ని ముక్కలుచేసి (ఆ మాంసపు ముక్కలనని భావం); తిందున్= తింటాను.

తాత్పర్యం: 'అశ్వత్థామా! నీవు నాకు ఎక్కడినుండి ఊడిపడిన తండ్రివి?' నేను పాండవులకు కొడుకునై ఉండి శత్రువుల ప్రతాపాన్ని సహిస్తానా! ఇప్పుడే నిన్ను పట్టి నీవు దిగమ్రింగిన నా కొడుకును క్రక్కిస్తాను నీ కండలు తింటాను.

క. అని పలికి యిరుసులంతలు । సునిశిత బాణమ్ము లేయుచుం దఱిమిన ద్రో
ణుని కొడుకు వాని నన్నిటిఁ । దునుమ నసుర మాయఁ బెఱిగి దుర్దాంతగతిన్. 75

ప్రతిపదార్థం: అని= ఇట్లా; పలికి= చెప్పి; ఇరుసులంతలు= ఇరుసులంత ఉన్న; సునిశిత బాణమ్ములు= తీక్ష్ణములైన బాణాలను; ఏయుచున్= వేస్తూ; తఱిమినన్= వేగిరపడుతూ ఉన్నప్పటికీ; ద్రోణుని కొడుకు= అశ్వత్థామ; వానిన్+అన్నిటిన్= ఆ బాణాల నన్నింటిని; తునుమన్= తుమురు చేసిన వెంటనే; అసుర= ఆ ఘటోత్కచుడు; మాయన్= మాయతో; దుర్దాంతగతిన్= ఆపరాని పోకడతో; పెఱిగి= పెరిగిపోయి.

తాత్పర్యం: అని పలికి ఇరుసులను పోలిన వాడిబాణాలు ప్రయోగిస్తూ తరుమగా, అశ్వత్థామ వానినన్నింటిని ఖండించాడు. అప్పుడు ఘటోత్కచుడు మాయాశక్తిచే అణచరాని విధంగా పెరిగి - (తరువాతి పద్యంతో అన్వయం).

క. గిరియై పఱతేర నశని । శరమును, మేఘత్వమొంది సాయక వృష్టిం
గురిసినఁ బవనాస్త్రంబును । బరువడి నిగిడించి గురుని పట్టి దెరల్చెన్. 76

ప్రతిపదార్థం: గురుని-పట్టి= అశ్వత్థామ; గిరి+ఐ-పఱతేరన్= (ఘటోత్కచుడు) కొండ అయి రాగా; అశని-శరమును= వజ్రబాణాన్నీ; మేఘత్వము+ఒంది= మేఘరూపంపొంది; సాయక-వృష్టిన్= బాణవర్షాన్ని; కురిసినన్= కురియగా; పవన+అస్త్రంబును= వాయవ్యాస్త్రాన్నీ; పరువడిన్= క్రమముగా; నిగిడించి= ప్రయోగించి; తెరల్చెన్= తొలగించెను.

తాత్పర్యం: పర్వతరూపాన్ని ధరించి పరుగెత్తి వస్తూ ఉంటే వజ్రాస్త్రాన్ని ప్రయోగించి, మరల మేఘంగా మారి బాణవర్షాన్ని కురిపిస్తూ ఉంటే వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించి అశ్వత్థామ అతడిని తొలగించాడు.

విశేషం: ఈ పద్యంలో అస్త్రయుద్ధం వర్ణింపబడింది. పర్వతానికి వజ్రం విరుగుడు; మేఘానికి గాలి విరుగుడు. కావున పర్వతమై

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వస్తూ ఉంటే వజ్రాస్త్రాన్ని (ఇంద్రాస్త్రాన్ని), మేఘంగా మారినప్పుడు వాయురూపమైన వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించినట్టు వర్ణించబడింది.

సీ. **హైడింబుఁ డల్గి యుగ్రాకృతిఁ గవిసిన । దనుజ గణంబు మాతంగ తురగ**
రథ నివహంబుతో రారాజు మొన లెల్ల । నొక్కెత్తుగాఁ బ్రేల్చి యురవడింప
న న్నరనాథుండు విన్నఁబోయిన గురు । తనయుండు 'నీకు నీ యనికి నేమి
పని? నీవు సంభ్రమింపకుము; దానవుల న । క్కడి మానవులను వ్రేల్మిడి నడంతు'

ఆ. **ననిన సంతసిల్లి యతఁడు సౌబలుఁ జూచి । వీరె ద్రౌణిబాణదారితాంగు**
లైరి పాండుసుతులు; దేరిగములతోడ । సత్వరముగ నరిగి జయము గొనుము'. **77**

ప్రతిపదార్థం: హైడింబుఁడు= హిడింబాకుమారుడు ఘటోత్కచుడు; అల్గి= కోపించి; ఉగ్ర+ఆకృతిన్= భయంకరమైన ఆకారంతో; కవిసినన్= ఎదుర్కొనగా; దనుజగణంబు= రాక్షసుల సమూహం; రారాజు మొనలు+ఎల్లన్= దుర్యోధనుడి సైన్యాన్నంతటిని; మాతంగ, తురగ రథ నివహంబుతోన్= గజాలు, అశ్వాలు, రథాలు అనగా రథికులు; అనేవాని సమూహంతోపాటు; ఒక్క+ఎత్తు+కాన్= ఒకే ఎత్తుగడతో అనగా ఒకేసారి; ప్రేల్చి= దగ్ధం చేసి; ఉరవడింపన్= విజృంభిస్తూ ఉంటే; ఆ+నరనాథుండు= ఆ దుర్యోధన నృపతి; విన్నన్+పోయినన్= ఖిన్నుడు కాగా; (చూచి ఆ దుర్యోధనుడితో) గురుతనయుండు= ద్రోణాచార్య పుత్రుడు అశ్వత్థామ; నీకున్= (దుర్యోధనుడికి); ఈ+అనికిన్= ఈ యుద్ధానికి; ఏమిపని= పని ఏమి; నీవు= నీవు (దుర్యోధనుడు); సంభ్ర మింపకుము= తొందరపడకుము; దానవులను= ఆ రాక్షసులను; అక్కడి మానవులను= అక్కడ ఉన్న (శత్రుపక్షంలోనున్న) మనుష్యులను; వ్రేల్మిడిన్= త్రుటిలో; అడంతున్= అణచివేస్తాను; అనినన్= అని పలుకగా; సంతసిల్లి= సంతోషపడి; అతఁడు= ఆ దుర్యోధనుడు; సౌబలున్= శకునిని; చూచి= చూచి (పలికాడని భావం); వీరు+ఎ= ఈ కనపడే; పాండు సుతులు= పాండవులు; ద్రౌణి బాణ+దారిత+అంగులు+ఐరి= అశ్వత్థామ బాణాలచేత చీల్చివేయబడిన శరీరాలు గల వారయినారు; తేరిగములతోడన్= రథ(రథిక) సమూహాలతో సహా; సత్వరముగన్= తొందరగా; అరిగి= వెళ్ళి; జయము= విజయాన్ని; కొనుము= గ్రహించుము (పొందుము అని భావం) - ఇచ్చట 'తేరిగములతోడ' అనే పదం దేహళీదత్త దీపన్యాయంగా అన్వయిస్తుంది - పాండవుల రథికవర్గంతో సహా అశ్వత్థామ బాణాలకు గురయినారని నీవు (శకుని) రథికవర్గం వెంట నిడుకొని జయాన్ని పొందుమని కూడా అర్థం పర్యవసిస్తుంది.

తాత్పర్యం: ఘటోత్కచుడు మహాకోపంతో భయంకరాకారం తాల్చి అశ్వత్థామ నెదుర్కొన్నాడు. అతడి సైన్యంలోని రాక్షసవీరులందరూ విజృంభించారు. దుర్యోధనుడి చతురంగబలాన్ని ఒకేసారి దగ్ధం చేశారు. దానిచేత దుర్యోధనుడు ఖిన్నుడై యుద్ధానికి పూనుకొంటూ ఉంటే అశ్వత్థామ వారించి 'రారాజా! నీవెందుకయ్యా యుద్ధానికి? నేనొక్క క్షణంలో ఆ రాక్షసవీరుల్నే గాక పాండవ సైన్యాన్నంతటినీ అణచివేస్తాను' అని అంటూ ఉంటే దుర్యోధనుడు సంతోషపడ్డాడు. శకునితో ఇట్లా అన్నాడు. 'ఇదిగో ఈ పాండవులూ వారి సైన్యం మన అశ్వత్థామ బాణాల ధాటికి శరీరాలు చిల్లులుపడి అణగిపోయినట్టే; ఇక నీవు రథికవర్గంతో వేగంగా వెళ్ళి జయాన్ని స్వీకరించుము.'

వ. **అని యవ్వలను సూపి కృప కృతవర్మ కర్ణ వృషసేనులను దుశ్శాసన ప్రముఖులైన కొందఱు దమ్ములను నిరూపించి 'వీరును నీవును గూడుకొని కవియుం'డని పనిచిన నతండును బింకంబుతోడం బోయె; నశ్వత్థామ భీమనందనుల సంగ్రామంబు భీమంబయ్యె; నట్టి యెడ నా ఘటోత్కచుండు.** **78**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని= ఇట్లా పలికి; ఆ+వలను= ఆ వైపు; చూపి= చేతితో చూపి; కృప కృతవర్మ కర్ణ వృషసేనులను= కృపుడు, కృతవర్మ, కర్ణుడు, వృషసేనుడు అనేవారిని; దుశ్శాసన ప్రముఖులు+ఐన= దుశ్శాసనుడు మొదలైన; కొందఱు+తమ్ములను= కొంతమంది సోదరులను; నిరూపించి= చూపి; వీరును= ఈ చూపినవారలు; నీవును= నీవుకూడా; కూడుకొని= కలిసి (వెళ్ళి); కవియుండు+అని= తలపడండి అని; పనిచినన్= పంపగా; అతండును= ఆ శకునియు; బింకంబుతోడన్= గర్వంతో; పోయెన్= వెళ్ళాడు; అశ్వత్థామ, భీమనందనుల సంగ్రామంబు= అశ్వత్థామ ఘటోత్కచుల యుద్ధం; భీమంబు+అయ్యెన్= భయంకరమై కొనసాగింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ ఘటోత్కచుండు= ఆ ఘటోత్కచుడు.

తాత్పర్యం: అని ఆ వైపు చూపి, 'ఈ కృప కర్ణాది యోధులు దుశ్శాసనుడు మొదలైన నా తమ్ములు నీ వెంట వస్తారు. వీరితో కూడా నీవు యుద్ధానికి వెళ్ళుము' అని తనను పంపుతూ ఉంటే, శకుని గర్వంతో యుద్ధానికి వెళ్ళాడు. ఇక అశ్వత్థామ ఘటోత్కచుల యుద్ధం భయంకరం అయింది. ఆ సమయంలో ఘటోత్కచుడు (తరువాతి పద్యంతో అన్వయం).

మ. **పటుబాణాహతి ద్రోణి యంగము చలింపం జేసి తచ్చాప ము**
త్కట వేగంబునఁ ద్రుంచినం గినిసి యాతం డొండు వి ల్లెత్తి యు
ద్భట బాహాబల శౌర్యముల్ నెఱపె నా దైత్యుండు సైన్యంబు నొ
చ్చుటయుం జచ్చుటయున్ మహీపతికి మెచ్చుం బ్రీతియుం జేయఁగన్. **79**

ప్రతిపదార్థం: పటుబాణ+ఆహతిన్= సమర్థమైన - అనగా తీక్ష్ణమైన బాణాల తాకిడితో; ద్రౌణి+అంగము= అశ్వత్థామ శరీరం; చలింపన్+చేసి= కదలించివేసి; అనగా నొప్పించి; తద్+చాపము= ఆ అశ్వత్థామ ధనుస్సును; ఉత్కట వేగంబునన్= గొప్పవేగంతో; త్రుంచినన్= తెగగొట్టగా (శరీరాన్ని నొప్పించడమేమి ధనువును త్రుంచడమేమి - రెండూ ఒకేసారి జరిగినవని తెలుపటానికి 'ఉత్కట వేగంబునన్' అనే మాట వాడటం జరిగింది); కినిసి= కోపపడి; ఆతండు= ఆ అశ్వత్థామ; ఒండువిల్లు+ఎత్తి= మరొక ధనువును తీసికొని; ఉద్భట బాహాబల శౌర్యముల్= మిక్కిలి బాహు బలపరాక్రమాలను; నెఱపెన్= ప్రదర్శించాడు; (ఎంతటి గొప్ప బాహుబలం పరాక్రమం ప్రదర్శించాడంటే - దానితో); ఆ దైత్యుండు= ఆ ఘటోత్కచుడు; నొచ్చుటయున్= పరితాపాన్ని పొందటం; సైన్యంబు= ఆ రాక్షససైన్యం; చచ్చుట+యున్= మృతి చెందటం (అనే ఈ రెండూ); (ఇచ్చట యథాసంఖ్యాలంకారంచేత క్రమాన్వయం); మహీపతికిన్= దుర్యోధనుడికి; మెచ్చున్= మెప్పును; ప్రీతి+యున్= సంతోషాన్నీ; చేయఁగన్= కలిగించగా; (బాహుబల శౌర్యముల్ నెఱపె' అనే తరువాతి వాక్యంతో అన్వయం).

తాత్పర్యం: తీక్ష్ణ బాణాల తాకిడితో అశ్వత్థామ శరీరాన్ని కంపింపచేసి, ఆతడి ధనుస్సును అతివేగంగా త్రుంచగా, ఆ అశ్వత్థామ రెండోవిల్లు తీసుకొని ఆ ఘటోత్కచుడిని నొప్పించడంచేత, అతని సేనను చంపడంచేత దుర్యోధనుడికి మెప్పును, సంతోషాన్ని కలిగించగా,

విశేషం: అలం: యథాసంఖ్యం. 'నాదైత్యుండు సైన్యంబు నొచ్చుటయుం జచ్చుటయు' అనేచోట క్రమాన్వయం వలన యథా సంఖ్యాలంకారం.

వ. **ఇట్లసురబలంబు నశ్వత్థామ సించి చెండాడం బాండవ బలంబులు దర్పం బేది మార్వెట్ట లేక చూచుచుండ నుద్దండ పరాక్రముం డగు నా ఘటోత్కచుండు దర్పంబున నెక్కటెక్కటి తలపడి పరిఘుంబున వైచినం బట్టుకొని యతండు దానిన యద్దానవునిపై వైచుటయు, వాఁడు దొలంగ నుఱికి ద్రుపద నందన స్యందనంబునకుం బోయె; నయ్యుగ్ర సాధనం బతని తురంగ సారథి రథంబుల రూ పడంచిన.** **80**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అసురబలంబున్= రాక్షససైన్యాన్ని; అశ్వత్థామ= అశ్వత్థామ; చించి= చీల్చి; చెండాడన్=

ఖండిస్తూ ఉండగా; పాండవ బలంబులు= పాండవ సేనలు; దర్పంబు= దర్పం; ఏది= ఉడిగి; మార్పెట్టలేక= ఎదిరించలేక; చూచుచున్+ఉండన్= చూస్తూ ఉండగా; ఉద్దండ పరాక్రముండు+అగు= భయంకరమైన పరాక్రమం కలవాడైన; ఆ+ఘటోత్కచుండు= ఆ ఘటోత్కచుడు; దర్పంబునన్= గర్వంతో; ఎక్కటి+ఎక్కటి= ఒకరితో నొకరు; తలపడి= ఢీకొని; పరిఘంబునన్= పరిఘము అనే ఆయుధ విశేషంతో; వైచినన్= కొట్టగా; పట్టుకొని= (ఎదురువస్తూ ఉన్న ఆ పరిఘాయుధాన్ని) చేత తీసికొని; అతండు= ఆ అశ్వత్థామ; దానిన్+అ= ఆ పరిఘాయుధాన్ని; ఆ+దానవునిపైన్= ఆ ఘటోత్కచుడిపై; వైచుటయున్= ప్రయోగించటం తోడనే; వాఁడు= ఆ ఘటోత్కచుడు; తొలంగన్= పక్కకు పోయేవిధంగా; ఉటికి= లంఘించి; ద్రుపదనందన స్యందనంబునకున్= ద్రుపదుడి కుమారుడైన ధృష్టద్యుమ్నుడి రథంపైకి; పోయెన్= వెళ్ళాడు; ఆ+ఉగ్రసాధనంబు= ఆ భయంకరమైన ఆయుధం; అతని తురంగ సారథి రథంబులన్= ఆ ఘటోత్కచుడి గుర్రాలను, సారథిని, రథాన్ని; రూపు+అడంచినన్= నశింపజేయగానే.

తాత్పర్యం: ఈ విధంగా ఆ ఘటోత్కచుడి సైన్యాన్ని అశ్వత్థామ చీల్చి చెండాడుతూ ఉంటే, పాండవుల సైన్యాలు గర్వముడిగి, ఎదుర్కొనలేక చూస్తూ ఉండిపోయాయి. భయంకర పరాక్రమం కలిగిన ఆ ఘటోత్కచుడు గర్వంతో అశ్వత్థామ నెదుర్కొని అతడిపై పరిఘాయుధాన్ని ప్రయోగించాడు. అశ్వత్థామ ఎదురుగా వస్తూ ఉన్న ఆ ఆయుధాన్ని గ్రహించి, తిరిగి దానినే ఆ ఘటోత్కచుడిపై విసిరాడు. ఘటోత్కచుడు తప్పుకొని లంఘించి ధృష్టద్యుమ్నుడి రథంపై చేరాడు. ఆ పరిఘాయుధం ఘటోత్కచుడి అశ్వ రథ సారథులను నుగ్గు నుగ్గు చేసింది. ఆ సమయాన (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇనుపముండ్లు చుట్టూ ఉన్న ఇనుపరోకలి విధంగా ఉండే ఆయుధవిశేషాన్ని పరిఘమని అంటారు. (ఇనుపముండ్ల రోకలి).

ఆ. **ఒక్క తేరిమీఁద నుండి ధృష్టద్యుమ్న । భీమసేన సుతులు పెనఁగి రస్త్ర**
గురుతనూజు వీఁకఁ దెరలక యంత ను । ద్దామసేనతోడ భీముఁ డడరె. 81

ప్రతిపదార్థం: ఒక్కతేరి మీఁదన్+ఉండి= ఒకే రథంపై ఉన్నవారై; ధృష్టద్యుమ్న భీమసేన సుతులు= ధృష్టద్యుమ్నుడి కొడుకు, భీముడి కుమారుడు ఘటోత్కచుడు (ఈ ఇద్దరు); వీఁకన్= ఉత్సాహం; తెరలక= తగ్గక; అస్త్ర గురు తనూజున్= అస్త్ర విద్యా గురువైన ద్రోణుడి పుత్రుడిని - అశ్వత్థామను; పెనఁగిరి= ఎదుర్కొన్నారు; అంతన్= అంతలోనే; భీముఁడు= భీమసేనుడును; ఉద్దామ సేనతోడన్= గొప్ప సైన్యంతో; అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్న ఘటోత్కచులిద్దరూ ఒకే రథంపై ఉంటూనే అమితోత్సాహంతో అశ్వత్థామను ఎదుర్కొన్నారు. అంతలోనే గొప్ప సైన్యం తీసికొని భీముడు కూడా యుద్ధం చేయటానికి వారికి సహాయంగా అశ్వత్థామను ఎదుర్కొన్నాడు.

వ. **అప్పు డశ్వత్థామ నవ్వుచు నమ్ముప్పురం గ్రొవ్వఱ నేసి భాసమాన మార్గణంబులు నిగిడించిన.** 82

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; అశ్వత్థామ; నవ్వుచున్= మందహాసం చేస్తూ; ఆ+ముప్పురన్= ఆ ముగ్గురిని; క్రొవ్వు+అఱన్= మదమడగేటట్లు; ఏసి= కొట్టి; భాసమాన మార్గణంబులు= ప్రకాశిస్తూ ఉన్న బాణాలను; నిగిడించినన్= ప్రయోగించగానే.

తాత్పర్యం: అప్పుడు అశ్వత్థామ నవ్వుతూ ఆ ధృష్టద్యుమ్న ఘటోత్కచ భీములను ముగ్గురినీ మదం ఉడిగేటట్లు మెరిసే బాణాలతో కొట్టాడు. సైన్యంమీద అంతటా బాణాలు నింపాడు. దానితో (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. భటగాత్రంబుల ఘోటకాంగముల శుంభత్కుంభి కాయంబులం
జటుల స్యందన ఖండ సంచయములన్ సంగ్రామరంగంబు గ
ప్పుట చూడన్ వెఱఁగయ్యె నబ్బలములుం బోకేచి క్రమ్మంగ నె
త్తుటఁ దేల్చెం బొరిమార్చె నాతఁ డడరం ద్రుంచెన్ మథించెం గడున్. 83

ప్రతిపదార్థం: భటగాత్రంబులన్= సైనికుల శరీరాలతో; ఘోటక+అంగములన్= గుర్రాల శరీరాలతో; శుంభత్+కుంభి+కాయంబులన్= ప్రకాశిస్తూ ఉన్న ఏనుగుల శరీరాలతో; చటుల స్యందన ఖండ సంచయములన్= మనోహరాలైన రథాల తునుకల సమూహాలతో; సంగ్రామ రంగంబు= రణరంగం; కప్పుట= కప్పివేయటం; చూడన్= చూస్తూ ఉంటే; వెఱఁగు+అయ్యెన్= అద్భుతమయింది; ఆ+బలములున్= ఆ రాక్షససైన్యాలు కూడా; పోక= పారిపోక; ఏచి= విజృంభించి; క్రమ్మంగన్= ఎదుర్కొనగా; ఆతఁడు= ఆ అశ్వత్థామ; నెత్తుటన్= రక్తంలో; తేల్చెన్= తేలేటట్లు చేశాడు; పొరిమార్చెన్= సంహరించాడు; అడరన్= క్షోభించే విధంగా; త్రుంచెన్= ఖండించాడు; కడున్= మిక్కిలి; మథించెన్= నుగ్గునుగ్గు చేశాడు.

తాత్పర్యం: సైనికుల శరీరాలతో, ఏనుగుల శరీరాలతో, రథాల ముక్కల సమూహాలతో యుద్ధరంగం నిండిపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. మిగిలిన సైన్యాలు పారిపోక విజృంభిస్తూ ఉంటే ఆ అశ్వత్థామ వాటిని కూడా రక్తంలో ముంచెత్తాడు. కొంత సైన్యాన్ని సంహరించాడు. కొంత సైన్యం కాళ్ళు చేతులు నరికాడు. మరికొంత సైన్యాన్ని నుగ్గు నుగ్గు చేశాడు.

వ. ఇట్లేకాక్షౌహిణీ బలక్షయం బాపాదించి యాతపత్ర శత పత్రంబును జామరమరాళంబును గేశ శైవాలంబును నాయుధమీనంబును మాంసమేదో మస్తిష్క పంకంబును; రక్త జలోద్రిక్తంబును నగు నదీప్రవాహంబు నుత్పాదించె; నప్పుడు దర్పంబున సురథుండును శత్రుంజయుండును బలానీకుండును బృషధ్రుండును జయానీకుండును జయుఁడును జంద్రసేనుండును జండ రయంబునఁ గదిసి బాణంబులు వరఁగించిన, నప్పాంచాల కుమారుల నమానుష విక్రమంబున సమయించినం గోపించి, కుంతిభోజ తనూజు లొక్కపెట్ట పదుమువ్వు రతనిం బొదివినఁ బదుమూఁడు మేటి తూపులం గీటడంచి కెరలి జము చందంబున గర్జిల్లి ఘటోత్కచుం గాలదండంబుఁ బోని కోలం దేరిపైఁ ద్రెళ్ళి మూర్ఛిల్ల నేసిన నోసరిల నయ్యరదంబు దోడన ధృష్టద్యుమ్నుండు గొనిపోవుటయుఁ, బొంగి సింగంబు చాడ్పున గర్జిల్లిన నిర్జరు లగ్గురునందను నగ్గించి; రంతయుం గనుంగొని. 84

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఏక+అక్షౌహిణీ బలక్షయంబు= ఒక అక్షౌహిణీ సైన్యనాశనాన్ని; ఆపాదించి= చేసి; ఆతపత్ర శతపత్రంబును= శ్వేతచ్ఛత్రాలే కమలాలుగా గలిగినట్టి; చామర మరాళంబును= చామరాలే హంసలుగా కలిగినటువంటి; కేశశైవాలంబును= వెంట్రుకలే నాచుగా గలదైన; ఆయుధమీనంబును= ఆయుధాలే చేపలుగా గలిగి ఉన్నటువంటి; మాంసమేదో మస్తిష్క పంకంబును= మాంసం క్రొవ్వు మెదడు ఇవి బురదగా గలిగినటువంటి; రక్తజల+ఉద్రిక్తంబును= నెత్తురు అనే నీరు అతిశయించి ఉన్నటువంటిదయి (రక్తజలంచే ఉద్రిక్తము - తృతీయా తత్పురుష సమాసం); అగు= అయినట్టి; నదీ ప్రవాహంబు= నదీ ప్రవాహాన్ని; ఉత్పాదించెన్= పుట్టించాడు; అప్పుడు= ఆ సమయంలో; దర్పంబునన్= గర్వంతో; సురథుండును= సురథుడు; శత్రుంజయుండును= శత్రుంజయుడు; బలానీకుండును= బలానీకుడు; పృషధ్రుండును= పృషధ్రుడు; జయానీకుండును= జయానీకుడు; జయుఁడును= జయుడు; చంద్రసేనుండు= చంద్రసేనుడు (అనే వీరందరు); చండ రయంబునన్= భయంకరమైన వేగంతో; కదిసి= ఎదిరించి; బాణంబులు= బాణాలను; పరఁగించినన్= వ్యాపింపజేయగా; ఆ+పాంచాల కుమారులన్= ఆ పాంచాల రాజుగు ద్రుపదుడి కుమారులైన సురథాదులను; అమానుష విక్రమంబునన్= మనుష్యులకు సాధ్యంకాని పరాక్రమంతో;

సమయించినన్= సంహరించగా; కోపించి= కోపం కలిగి; కుంతిభోజ తనూజులు= కుంతిభోజుడి కుమారులు; ఒక్కపెట్టు+అ= ఒకేసారి; పదుమువ్వురు= పదమూడుమంది; అతనిన్= ఆ అశ్వత్థామను; పొదివినన్= ముట్టడించగా; పదమూఁడు మేటి తూపులన్= పదుమూడు దృఢములైన బాణాలతో; గీటడంచి= సంహరించి; కెరలి= చెలరేగి; జముచందంబునన్= యమునివలె; గర్జించి= సింహగర్జన చేసి; ఘటోత్కచున్= ఘటోత్కచుడిని; కాలదండంబున్+పోని= కాలదండాన్ని పోలియున్నట్టి; కోలన్= బాణంతో; తేరిపైన్= రథంపై; త్రెళ్ళి= పడిపోయి; మూర్ఛిల్లన్+ఏసినన్= మూర్ఛపొందేటట్లు కొట్టగానే; ఒసరిలన్= పడిపోగా; తోడన్+అ= వెంటనే; ధృష్టద్యుమ్నుండు; ఆ+అరదంబు= ఆ రథాన్ని; కొనిపోవుటయున్= తీసికొనిపోయిన వెంటనే; పొంగి= పొంగిపోయి; సింగంబు చాడ్పునన్= సింహంవలె; గర్జిల్లినన్= గర్జిస్తూ ఉంటే; నిర్జరులు= దేవతలు; ఆ+గురునందనున్= ఆ అశ్వత్థామను; అగ్గించిరి= ప్రస్తుతించారు; అంతయున్= ఈ విషయాన్నంతా; కనుంగొని= చూచి.

తాత్పర్యం: ఈ విధంగా (అశ్వత్థామ) ఒక అక్షౌహిణీ సైన్యాన్ని సంహరించాడు. దానితో బయలు వెడలిన రక్తమంతా నదివలె ప్రవహించింది. ఆ నదిలో శ్వేతచ్ఛత్రాలు కమలాలవలె, చామరాలు హంసలవలె, వెంట్రుకలు నాచువలె, శస్త్రాలు చేపలవలె, మాంసం క్రొవ్వు, మెదడు బురదవలె, రక్తమంతా జలంవలె భాసించాయి. అంతలోనే ద్రుపదుడి కుమారులు సురథుడు, శత్రుంజయుడు, బలానీకుడు, పృషధ్రుడు, జయానీకుడు, జయుడు, చంద్రసేనుడు అనేవారు గర్వంతో భయంకరమైన వేగంతో అశ్వత్థామను ఎదుర్కొని బాణాలు ప్రయోగించారు. అశ్వత్థామ మానవులెవ్వరికి సాధ్యంకాని పరాక్రమంతో ఎదుర్కొని వీరినందరినీ సంహరించాడు. ఇది చూచి కుంతిభోజుడి కుమారులు కోపించి, ఒకేసారి పదుమూడుమంది అశ్వత్థామ నెదుర్కొన్నారు. అశ్వత్థామ వారిని పదముగ్గురినీ పదమూడు బాణాలతోనే సంహరించాడు. ఇక యమధర్మరాజువలె విజృంభిస్తూ గర్జించి, ఘటోత్కచుడిపై మృత్యుదండంవంటి బాణాన్ని ప్రయోగించాడు. ఆ దెబ్బతో ఘటోత్కచుడు రథంపై పడిపోయి మూర్ఛపొందాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు ఆ రథాన్ని రణరంగంనుండి తీసికొని వెళ్ళాడు. వెంటనే అశ్వత్థామ సింహంవలె గర్జించగా, అతడి పరాక్రమాన్ని దేవతలంతా ప్రస్తుతించారు. ఇదంతా గమనించి (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: రూపకం. రక్తప్రవాహాన్ని నదీప్రవాహంగా రూపించటం వలన ఇది రూపకాలంకారం - నదిలో ఉండవలసిన కమలాలు, హంసలు, నాచు, బురద, నీరు, ఇక్కడ కూడా ఉన్నట్లు ఆతపత్రాలే కమలాలని చామరాలే హంసలని - ఈ విధంగా అన్నింటిని రూపించి చూపటం జరిగింది - కాబట్టి దీనిని సావయవ రూపకాలంకారం అంటారు. ఈ అలంకారంచేత అశ్వత్థామ పరాక్రమం అలోకసామాన్యం అనే విషయం ధ్వనిస్తూ ఉన్నది.

ఆ. పాండవాగ్రజుండు పవనాత్మజునిఁ గూడి । తఱిమి సాత్యకియును దాను గవిసె;
నంత మూర్ఛ దేఱి హైడింబుఁ డొక్కతే । రనువుగాఁగఁ జేసికొని కడంగె. 85

ప్రతిపదార్థం: పాండవ+అగ్రజుండు= పాండవ జ్యేష్ఠుడు ధర్మరాజు; పవన+ఆత్మజునిన్= వాయునందనుడైన భీముడిని; కూడి= కూడుకొని-వెంట తీసికొని అని భావం; తఱిమి= వేగంగా; సాత్యకియును= సాత్యకి; తాను= తాను (ధర్మరాజు); కవిసెన్= తలపడ్డాడు; అంతన్= అంతలోనే; హైడింబుఁడు= హిడింబానందనుడైన ఘటోత్కచుడు; మూర్ఛ తేఱి= మూర్ఛనుండి తేరుకొని; ఒక్కతేరు= ఒక రథాన్ని; అనువుకాఁగన్= అనుకూలంగా ఉండేవిధంగా; చేసికొని= సిద్ధం చేసికొని; కడంగెన్= యుద్ధానికి ఉద్యమించాడు.

తాత్పర్యం: ధర్మరాజు వెంటనే భీముడితో కలిసి సాత్యకి, తాను అశ్వత్థామ నెదుర్కొన్నారు. అంతలోనే ఘటోత్కచుడు మూర్ఛనుండి తేరుకొన్నాడు. అనువైన రథాన్ని సిద్ధం చేసికొని యుద్ధానికి ఉపక్రమించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'గవిసె నంత' అనే పాఠమే నిర్దుష్టం - 'గవిసి రంత' అనే ఈ పాఠం దుష్టం. అందుకు సూత్రప్రమాణం - ఆత్మార్థం బభిహితంబగుచో దల్లింగ సంఖ్యాభిధాయి వచనంబు ధాతు విశేషణంబులకగు" బాల. క్రియ - 120

వ. తోడన ధృష్టద్యుమ్నుండును బరవసంబు సేసినం దత్సైన్యంబు లొక్క మొగిన మొనయుటయును మనమూఁకలును సోమదత్త బాహ్లిక పురస్సరంబుగా నురవడించిన సందడి కయ్యంబయ్యెఁ; నందు సంజ చీఁకటి చూపునకుఁ జొరవయీకున్నను సైనిక నికర వివిధాభరణ మణి కిరణ కలాపంబులుఁ జర్మవర్మాతపత్ర కేతుకీలిత రత్నరశ్మిజాలంబులు నాలోకనంబు నాపాదించెఁ; నట్లిరువాఁగును గలయ బెరసి పోరునప్పుడు. 86

ప్రతిపదార్థం: తోడన= వెంటనే; ధృష్టద్యుమ్నుండును= ధృష్టద్యుమ్నుడు (పాండవ సైన్యాధిపతి); బరవసంబు= ధైర్యం; చేసినన్= చేయగా; తద్+సైన్యంబులు= ఆ పాండవుల సేనలు; ఒక్కమొగిన్+అ= ఏకముఖంగా; మొనయుట+యును= వ్యూహంగా ఏర్పడిన తరువాత; మన మూఁకలును= మన సేనలుకూడా; సోమదత్త బాహ్లిక పురస్సరంబుగాన్= సోమదత్తుడిని, బాహ్లికుడిని, ముందుంచుకొని; ఉరవడించినన్= విజృంభిస్తూ ఉండగా; సందడి కయ్యంబు= సంకుల సమరం; అయ్యెన్= ఏర్పడ్డది; అందున్= ఆ జనసమ్మర్దంలో; సంజచీఁకటి= సంధ్యా సమయంలోని అంధకారం; చూపునకున్= దృష్టికి; చొరవ= ప్రవేశం; ఈక+ఉన్నను= ఇవ్వకపోయినా కూడా; సైనిక నికర= సైనికుల సమూహాలయొక్క; వివిధ+ఆభరణ= పలు రకాలైన ఆభరణాలయొక్క; మణికిరణ కలాపంబులున్= మణులకాంతుల సమూహాలు; చర్మ= డాలు; వర్మ= కవచాలు; ఆతపత్ర= గొడుగులు; కేతు= ధ్వజములు అనే వానిఅందు; కీలిత= పొదుగబడి ఉన్న; రత్న= రత్నాలయొక్క; రశ్మిజాలంబులు= కాంతిపుంజాలు; ఆలోకనంబు= వెలుతురును; ఆపాదించెన్= పుట్టించినది; అట్లు= ఆ విధంగా; ఇరువాఁగును= రెండు సైన్యాలు; కలయన్= కలిసిపోయిన విధంగా; బెరసి= కూడి; పోరునప్పుడు= యుద్ధం చేసే సమయంలో.

తాత్పర్యం: వెంటనే ధృష్టద్యుమ్నుడు పరాక్రమించగా ఆ పాండవుల సైన్యాలు తత్క్షణం వ్యూహంగా ఏర్పడ్డాయి. మన సైన్యాలుకూడా సోమదత్త, బాహ్లికులను ముందుంచుకొని విజృంభించాయి. దానితో సంకులసమరం ఏర్పడింది. అప్పుడు ఆ సంధ్యా సమయంలోని చీకట్లో చూపానకుండా పోయింది. అయినా సైనికులు ధరించిన ఆభరణాలలోని మణులకాంతులు, డాలులు, కవచాలు, ఛత్రాలు, ధ్వజాలు అనే వాటిలో పొదగబడిన రత్నాల కాంతులు వెలుతురును పుట్టించాయి. అట్లు ఆ రెండుసైన్యాలు కలిసిపోయిన విధంగా మిక్కిలి యుద్ధంచేసే సమయాన (తరువాతి పద్యంతో అన్వయం).

భీమసేనునిచేత బాహ్లికుఁడు పచ్చుట (సం. 7-132-8)

క. శినివరుఁడు సోమదత్తుఁడుఁ । బెనఁగఁగఁ దోడ్పడియె వచ్చి భీముఁడు గడఁకం
దన మఱఁదికి నక్కౌరవుఁ । డెనయే? యని బిరుదులాడి యేడ్తెఱ నొంచెన్. 87

ప్రతిపదార్థం: శినివరుఁడు= శినివంశ శ్రేష్ఠుడు సాత్యకి; సోమదత్తుఁడున్; పెనఁగఁగన్= యుద్ధం చేయగా (ఒకరితో ఒకరు యుద్ధం చేస్తూ ఉంటే); భీముఁడు= భీమసేనుడు; కడఁకన్= ప్రయత్నపూర్వకంగా (కల్పించుకొని అని భావం); వచ్చి= సమీపించి; తోడ్పడియెన్= సహాయపడ్డాడు; తన మఱఁదికిన్= తన మరది అయిన సాత్యకికి; ఆ+కౌరవుఁడు= ఆ కురువంశీయుడు- సోమదత్తుడు; ఎన+ఏ?= సాటియా?; అని= ఈ విధంగా; బిరుదులు+ఆడి= పౌరుషవాక్యాలు పలికి; ఏడ్తెఱన్= పరాక్రమంతో; నొంచెన్= బాధించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సాత్యకి, సోమదత్తుడు - వీరిద్దరు పరస్పరం యుద్ధం చేస్తుండగా, భీముడు వచ్చి, ఈ సోమదత్తుడు మా సాత్యకికి సాటియా? అని పౌరుషవాక్యములు పలికి సోమదత్తుడిని తన పరాక్రమంతో బాధించాడు.

వ. అట్టియెడ. 88

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

క. అనలశిఖవోని నారస । మున సాత్యకి యేయు నెడను ముద్గరమున భీ
ముని కొడుకు వైచె రెంటం । దనువున నొ వ్వడరి సోమదత్తుఁడు సోలన్. 89

ప్రతిపదార్థం: సాత్యకి; అనిల శిఖ+పోని= అగ్నిజ్వాలవంటి; నారసమునన్= బాణంతో; ఏయు+ఎడను= కొట్టే సమయంలో; భీముని కొడుకు= భీమసేనుడి కుమారుడు - ఘటోత్కచుడు; ముద్గరమునన్= ఇనుపరోకలివలె ఉన్న ఆయుధవిశేషంతో (పరిఘాయుధంతో); వైచెన్= కొట్టాడు; రెంటన్= ఆ రెండింటితో; తనువునన్= శరీరమందు; నొవ్వు= నొప్పి; అడరి= అతిశయించి; సోమదత్తుఁడు= సోమదత్తుడు; సోలన్= మూర్ఛపోగా.

తాత్పర్యం: సోమదత్తుడిని సాత్యకి అగ్నిజ్వాలవంటి బాణంతో కొట్టే సమయంలోనే, ఘటోత్కచుడు ఇనుపరోకలి విధంగా ఉండే ముద్గరాయుధంతో కొట్టాడు. ఈ రెండు దెబ్బలకు సోమదత్తుడు శరీరంలో నొప్పి మిక్కుటమై సొమ్మసిల్లాడు. ఆ సమయంలో.

చ. తనయుఁడు మూర్ఛవోయిన నుదగ్రత బాహ్లికుఁ డచ్యుతానుజ
న్మినిఁ దలపడ్డ నాతనికి మించి వృకోదరుఁ డన్నరేంద్రు నే
సిన నతఁ డుగ్రశక్తి వయిచెన్ మెయి నాటుడు సోలి యంతలో
నన తెలివొంది ముద్గరమునం బవనాత్మజుఁ డేచి వైచినన్. 90

ప్రతిపదార్థం: తనయుఁడు= తన కుమారుడు సోమదత్తుడు; మూర్ఛ+పోయినన్= మూర్ఛపోగానే; ఉదగ్రతన్= రౌద్రభావంతో - క్రోధంతోనని భావం; బాహ్లికుఁడు; అచ్యుత+అనుజన్మినిన్= శ్రీకృష్ణుడి తమ్ముడైన సాత్యకిని; తలపడ్డన్= ఎదుర్కొనగా; వృకోదరుఁడు= భీముడు; ఆతనికిన్= ఆ బాహ్లికుడికంటె; మించి= అతిశయించి; ఆ+నరేంద్రున్= ఆ బాహ్లికుడనే కురువంశీయ రాజును; ఏసినన్= కొట్టగా (బాణాలతో అని భావం); అతఁడు= ఆ బాహ్లికుడు; ఉగ్రశక్తి= భయంకరమైన శక్తి అనే ఆయుధాన్ని; వయిచెన్= ప్రయోగించాడు; (ఆ శక్త్యాయుధం) మెయి నాటుడున్= శరీరంలో గ్రుచ్చుకోగానే; సోలి= మూర్ఛపోయి; అంతలోనన= అంతలోనే; తెలివి+ఒంది= (మూర్ఛదేరి) తెలివొంది; ముద్గరమునన్= ముద్గరాయుధంతో; పవన+ఆత్మజుఁడు= వాయునందనుడు భీముడు; ఏచి= విజృంభించి; వైచినన్= కొట్టగా.

తాత్పర్యం: తన కుమారుడు సోమదత్తుడు మూర్ఛపోగా, అతడి తండ్రి బాహ్లికుడు సాత్యకితో తలపడ్డాడు. అప్పుడు భీముడు బాహ్లికుడిని అతడికంటె అధికంగా బాణాలతో కొట్టాడు. వెంటనే బాహ్లికుడు భీముడిపై భయంకరమైన శక్త్యాయుధాన్ని ప్రయోగించాడు. దానితో భీముడు ఒక్క త్రుటికాలం మూర్ఛపోయి, వెంటనే తెలివొంది ముద్గరాయుధంతో ఆ బాహ్లికుడిని కొట్టాడు - దానితో (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తల వ్రయ్యలైన నిష్ఠుర । కులిశహతిం బగిలి కూలు కులపర్వతముం
దలఁపించుచుఁ గురువృద్ధుం డిలఁ । గూలెం బ్రతిబలంబు లే పారంగన్. 91

ప్రతిపదార్థం: తల= ఆ బాహ్లికుని శిరం; వ్రయ్యలు+ఐనన్= బద్దలు కాగా; నిష్ఠుర కులిశహతిన్= కఠినమైన వజ్రాయుధపు దెబ్బతో; పగిలి= పగిలిపోయి; కూలు= కూలిపోయినటువంటి; కులపర్వతమున్= కులపర్వతాన్ని; తలఁపించుచున్= తలంపునకు తెస్తూ; కురువృద్ధుండు= కురువంశంలో వయోవృద్ధుడైన ఆ బాహ్లికుడు; ప్రతిబలంబులు= శత్రుసైన్యాలు; ఏపారంగన్= విజృంభించగా; ఇలన్= భూమిపై; కూలెన్= కూలిపోయాడు.

తాత్పర్యం: కురువృద్ధుడైన బాహ్లికుడు తలపగిలి, కఠినమైన వజ్రాయుధపు దెబ్బతో పగిలిపోయి నేలగూలిన కులపర్వతంవలె కూలిపోయాడు. దానితో పాండవసేనలో ఉత్సాహంతో కూడిన విజృంభణం పెరిగింది.

విశేషం: అలం: ఉపమ.

వ. అయ్యవసరంబున దశరథసుత సన్నిభం బగు భవత్కుమార దశకం బా కిమ్మీర వైరిం బొదువుటయు దశ నిశిత బాణంబులం బ్రాణంబులు గొనియెఁ గర్ణానుజుండగు వృకరథుండు గడంగి వచ్చినం బొరివుచ్చె సౌబల సోదరులు పన్నిరువురు బరవసంబు సేసినం బడనేసె నిట్లు పటు పరాక్రమంబునం బేర్చిన భీమసేనుమీఁద శూరసేన వసాతి మాళవ త్రిగర్త బాహ్లిక ప్రముఖంబు లగు దేశంబుల బలంబులు బలువిడిం గవిసినం గని కౌంతేయాగ్రజుండు సైన్య సంతాన సమేతంబుగా నురవడించి భుజాటోపంబు సూపిన నవి మడిసియు జడిసియుఁ జిక్కువడియు నుక్కు మడిఁగియు వెఱంగుపడి చూచుచుండ నాచార్యుని దుర్యోధనుండు పురికొల్పిన నతం డుత్సాహదీప్తుండై యా ధర్మతనయుఁ దాఁకి వాయవ్య యామ్య వారుణాగ్నేయ త్వాష్ట్ర సావిత్రంబు లగు సాయకంబులు వరుస నేయ నయ్యై యస్త్రంబుల నవ్విభుండు ప్రత్యస్త్రంబుల వారించిన నతం డైంద్రాస్త్రంబున నిజ ప్రతిజ్ఞ నెఱపం జూచిన నదియు నట్ల యడంగుటయుం గోపించి సకల భూత భయంకరంబగు బ్రహ్మాస్త్రంబు ప్రయోగించిన నమ్మహీపతియు నమ్మహనీయాస్త్రంబునన సమయించె నంత ధృష్టద్యుమ్నుం డతని కడ్డపడిన నా రథికుతోడి యనికిం గ్రేడించి కుంభసంభవుండు. 92

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; దశరథ సుత సన్నిభంబు+అగు= శ్రీరాముడి పోలిన; భవత్కుమార దశకంబు= నీ పుత్రులు పదిమంది (దశకము= దశసంఖ్యాక సమూహం - కుమారాణాం దశకం - అని షష్ఠీతత్పురుషసమాసం); ఆ కిమ్మీర వైరిన్= ఆ భీమసేనుడిని; పొదువుటయున్= ఎదిరించిన వెంటనే; దశ నిశితబాణంబులన్= పది తీక్ష్ణబాణాలతో; ప్రాణంబులు= ప్రాణాలను; కొనియెన్= గ్రహించాడు (అనగా సంహరించాడు); కర్ణ+అనుజుండు+అగు= కర్ణుని తమ్ముడైన; వృకరథుండు= వృకరథుడు; కడంగి= సాహసించి; వచ్చినన్= (యుద్ధానికి) వచ్చిన వెంటనే; పొరివుచ్చెన్= సంహరించాడు; సౌబల సోదరులు= శకుని తోబుట్టువులు; పన్నిరువురు= పండ్రెండుగురు; బరవసంబు+చేసినన్= ధైర్యం చేయగా; పడన్+ఏసెన్= పడగొట్టెను (అనగా సంహరించాడు); ఇట్లు= ఈ విధంగా; పటుపరాక్రమంబునన్= సమర్థమైన పరాక్రమంతో; పేర్చిన= చెలరేగుతూ ఉన్న; భీమసేను మీఁదన్= భీముడిపై; శూరసేన వసాతి మాళవ త్రిగర్త బాహ్లిక ప్రముఖంబులు+అగు= శూరసేనం, వసాతి, మాళవం, త్రిగర్తం, బాహ్లికం అనేవి ప్రధానంగా ఉన్న; దేశంబుల బలంబులు= దేశాల సైన్యాలు; బలువిడిన్= పరాక్రమంతో; కవిసినన్= తలపడగా; కని= చూచి; కౌంతేయ+అగ్రజుండు= పాండవుల అన్న ధర్మరాజు; సైన్య సంతాన సమేతంబుగాన్= సైన్యాల పరంపరతో కూడి; ఉరవడించి= వేగిరపడి వచ్చి; భుజ+ఆటోపంబు= భుజముల బలాతిశయాన్ని; చూపినన్= చూపగా; అవి= ఆ సైన్యాలు; మడిసియున్= చచ్చియు; జడిసియున్= బెదరిపోయి; చిక్కువడియున్= సంకటాలలో చిక్కి; ఉక్కుమడిఁగియున్= గర్వం అణగి; వెఱంగుపడి= ఆశ్చర్యపోయి; చూచుచుండన్= చూస్తూ ఉంటే; ఆచార్యుని= ద్రోణాచార్యులను; దుర్యోధనుండు; పురికొల్పినన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రేరేపించగా; అతండు= ఆ ద్రోణాచార్యుడు; ఉత్సాహదీప్తుండు+ఐ= ఉత్సాహంతో ప్రకాశిస్తూ ఉన్నవాడై; ఆ ధర్మతనయున్= ఆ ధర్మరాజును; తాఁకి= ఎదుర్కొని; వాయవ్య యామ్య వారుణ+ఆగ్నేయ త్వాష్ట్ర సావిత్రంబులు+అగు= వాయువు యముడు వరుణుడు అగ్ని త్వష్ట సూర్యుడు దేవతలుగా గలిగిన; సాయకంబులు= బాణాలు అనగా దివ్యాస్త్రాలు; వరుసన్= క్రమంగా; ఏయన్= ప్రయోగించగా; అయ్యై అస్త్రంబులన్= (ఆ+ఆ+అస్త్రంబులన్) ఆయా అస్త్రాలను; ఆ+విభుండు= ఆ ధర్మరాజు; ప్రత్యస్త్రంబులన్= మారుబాణాలతో; వారించినన్= నివారిస్తూ ఉండగా; అతండు= ఆ ద్రోణాచార్యుడు; ఇంద్ర+అస్త్రంబునన్= ఇంద్రదేవతాకమైన దివ్యాస్త్రంతో; నిజ ప్రతిజ్ఞ= తన ప్రతిజ్ఞను; నెఱపన్+చూచినన్= నెరవేర్చటానికి చూడగా; అదియున్= ఆ ఇంద్రాస్త్రం కూడా; అట్లు+అ= ఆ విధంగానే; అడంగుటయున్= నశించగా (ధర్మరాజు దానిని గూడా ప్రత్యస్త్రంచేత నివారించుట చేత); కోపించి= మండిపడి; సకల భూత భయంకరంబు+అగు= సకల ప్రాణులకు భయాన్ని కొలిపే; బ్రహ్మ+అస్త్రంబు= బ్రహ్మ దేవతాకమైన దివ్యాస్త్రాన్ని; ప్రయోగించినన్= ప్రయోగించగా; ఆ+మహీపతియున్= ఆ ధర్మరాజు కూడా; ఆ+మహనీయ+అస్త్రంబునన్+అ= ఆ పూజ్యమైన బ్రహ్మాస్త్రంతోనే (బ్రహ్మాస్త్రానికి బ్రహ్మాస్త్రమే విరుగుడు దానికి మరే అస్త్రం విరుగుడు - కాదు కావున ప్రత్యస్త్రంగా ప్రయోగించాడు); సమయించెన్= ఖండించాడు; అంతన్= అటు తరువాత; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; అతనికిన్= ఆ ద్రోణాచార్యులకు; అడ్డుపడినన్= అడ్డుపడుతూ ఉంటే; ఆ రథికుతోడి+అనికిన్= ఆ ధృష్టద్యుమ్నుడితో యుద్ధానికి; క్రేడించి= అలక్ష్యం చేసి; కుంభసంభవుఁడు= ద్రోణుడు.

తాత్పర్యం: ఆ సమయాన శ్రీరాముడివంటి నీ కుమారులు పదిమంది ఆ భీముడిని ఎదిరించారు. వెంటనే భీముడు వారిని పది వాడిబాణాలతో సంహరించాడు. అంతలో కర్ణుడి తమ్ముడు వృకరథుడు సాహసించి రాగా, అతడిని కూడా సంహరించాడు. శకుని తోబుట్టువులు పండ్రెండుగురు తలపడుతూ ఉండగా వారిని కూడా పడవేశాడు. ఈ విధంగా భీముడు అవక్రపరాక్రమంతో విజృంభిస్తూ ఉంటే, శూరసేన వసాతి మాళవ త్రిగర్త బాహ్లిక దేశాల సైన్యాలు వెనువెంటనే అతడిని ఎదిరించాయి. ఇది చూచాడు ధర్మరాజు. వెంటనే గొప్ప సైన్యంతో చేరవచ్చి తలపడ్డాడు. ఆ ధాటికి శత్రుసైన్యాలు ఆగలేకపోయాయి. సైన్యం కొంత నశించింది. కొంత ఖండితమై భయభ్రాంతమైంది. మరికొంత చిక్కులో పడి దుఃఖాక్రాంతమైంది, కొంత సైన్యం గర్వముడిగి ఆశ్చర్యంగా చూస్తూ ఉంది. ఈ పరిస్థితిని గమనించి, దుర్యోధనుడు వెళ్ళి ద్రోణాచార్యుడిని యుద్ధానికి ప్రేరేపించాడు. అతడు అమితోత్సాహంతో ఆ ధర్మరాజును దివ్యాస్త్రాలతో ఎదుర్కొన్నాడు. ధర్మరాజు ఆ దివ్యాస్త్రాలను ప్రత్యస్త్రాలు ప్రయోగించి శమింపజేశాడు. ఇది కాదని దుర్యోధనుడి కిచ్చిన మాట నెరవేర్చటానికి ద్రోణుడు ధర్మరాజుపై ఇంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు. అది కూడ విఫలం కాగానే సకల ప్రాణిలోక భయంకరమైన బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. దానిని ధర్మరాజు తిరిగి బ్రహ్మాస్త్రంతోనే నివారించాడు. అంతలో ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని అడ్డుకొన్నాడు. ధృష్టద్యుమ్నుడిని అలక్ష్యంచేసి ద్రోణుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. ద్రుపదుని సేనపై నడరి తోలినఁ జూచి వృకోదరుండు దే
వపతిసుతుండుఁ దాఁకి యనివారణ నగ్గురు నొంప నేచి యు
గ్రపువడి మాత్స్యకేకయ ముఖం బగు పాండవ సైన్య మొక్క పె
ట్ట పరఁగి నీ బలంబుల కడంక యడంచి మదించి పేర్చినన్. 93

ప్రతిపదార్థం: ద్రుపదుని సేనపైన్= ద్రుపదరాజు సైన్యంమీద; అడరి= విజృంభించి; తోలినన్= పారిపోయేటట్లు చేయగా; చూచి= గమనించి (శ్లో॥ తే హన్యమానా ద్రోణేన పాంచాలాః ప్రాద్రవన్ భయాత్ । పశ్యతో భీమసేనస్య పార్థస్య చ మహాత్మనః' (ద్రోణ. 157/44) అని సంస్కృత మూలం.); వృకోదరుండు= భీముడు; దేవపతి సుతుండున్= ఇంద్రసుతుడు అర్జునుడు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ ఇద్దరు; తాఁకి= (ద్రోణుడిని) ఎదుర్కొని; అనివారణన్= ఆటంకం లేకుండా (వెంటనే అని భావం); ఆ+గురున్= ఆ ద్రోణాచార్యుడిని; నొంపన్= (బాణాలతో) నొప్పిస్తూ ఉంటే; ఏచి= విజృంభించి; ఉగ్రపువడిన్= భయంకరమైన వేగంతో; మాత్స్యకేకయ ముఖంబు+అగు= మత్స్య కేకయదేశాల సైన్యం ముఖభాగంలోగల; పాండవసైన్యము= పాండవులసేన; ఒక్కపెట్టు+అ= ఒకేసారి; పరఁగి= చుట్టుముట్టి; నీ బలంబుల కడంక= నీ సైన్యాల గర్వాన్ని; అడంచి= అణచి; మదించి= గర్వించి; పేర్చినన్= విజృంభించగా.

తాత్పర్యం: ద్రుపదుడి సైన్యంపై విజృంభించి దానిని పారద్రోలాడు. దీనిని గమనిస్తూ వెంటనే భీమార్జునులు ద్రోణాచార్యుల నెదుర్కొని నిరాటంకంగా బాణాలతో నొప్పిస్తుంటే, అదే సమయంలో నీ సైన్యాన్ని, పాండవ సేనలు - ప్రధానంగా మత్స్య కేకయాది సైన్యాలు వేగంగా చుట్టుముట్టాయి. నీ సైన్యాల గర్వముడిగించి మదాతిరేకంతో ఇంకా విజృంభిస్తూనే ఉండగా (తరువాతి వచనంతో అన్వయం).

వ. కనుంగొని కౌరవేశ్వరుండు కర్ణుని కిట్లనియె. 94

ప్రతిపదార్థం: కనుంగొని= చూచి; కౌరవ+ఈశ్వరుండు= కౌరవరాజు దుర్యోధనుడు; కర్ణునికిన్= కర్ణుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అది చూచి దుర్యోధనుడు కర్ణుడితో ఇట్లా అన్నాడు:

క. 'పాండవ పాంచాలాదులు । గండు మిగిలి బెట్టు దఱుమఁ గౌరవబల మొం
డొండ కలంగెడు నీ దగు । దండితనము సూపి కావఁ దగు తఱి వచ్చెన్.' 95

ప్రతిపదార్థం: పాండవ పాంచాలాదులు= పాండవ పాంచాల ప్రభృతి యోధులు; గండు= పౌరుషం; మిగిలి= అతిశయించి; బెట్టు= మిక్కిలి; తఱుమన్= తరుముతూ ఉంటే; కౌరవబలము= కౌరవసైన్యం; ఒండు+ఒండు+అ= క్రమక్రమంగా; కలంగెడున్= కలత జెందుతూ ఉన్నది (కావున); నీది+అగు= నీదైన; దండితనము= గొప్పతనాన్ని; చూపి= ప్రదర్శించి; కావన్+తగు; తఱి= కాపాడటానికి తగిన సమయం; వచ్చెన్= వచ్చింది.

తాత్పర్యం: 'పాండవ పాంచాల ప్రముఖ యోధులు మహాపౌరుషంతో మన సైన్యాన్ని తరుముతూ ఉంటే క్రమక్రమంగా సైన్యానికి ధైర్యం దెబ్బతినిపోతూ ఉన్నది. కాబట్టి నీవు విక్రమించి, ఈ మన సైన్యాన్ని కాపాడవలసిన సమయం ఆసన్నమైనది.

వ. అనవుడు. 96

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే.

తాత్పర్యం: దుర్యోధనుడు కర్ణుడితో ఇట్లా అనిన వెంటనే.

శా. 'చంపం జాలుదు నే నొకండన భుజాశక్తిన్ నరున్ వెండి మ
ర్దింపం జుల్కన భీమముఖ్యుల భవత్తేజంబు రాజ్యంబుఁ బా
లింపం బూనిన యేను గల్గఁగ రిపుల్ జృంభింతురే? చూడు నా
తెంపుం బెంపును' నంచుఁ గర్ణుఁడు మహోదీర్ణాకృతిం బొల్చినన్. 97

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నేను+ఒకండన్+అ= నేనొక్కడనే; భుజాశక్తిన్= (నా) భుజబలంతో; నరున్= అర్జునుడిని; చంపన్+చాలుదున్= చంప జాలుతాను; వెండి= మరియు; భీమ ముఖ్యులన్= భీముడు మొదలైనవారిని; మర్దింపన్= నుగ్గునుగ్గు చేయటం; చుల్కన= తేలిక; భవత్+తేజంబు= నీ పౌరుషాన్ని; రాజ్యంబున్= రాజ్యాన్ని; పాలింపన్+పూనిన= పరిపాలించటానికి తలపెట్టిన; ఏను= నేను; కల్గఁగన్= ఉండగా; రిపుల్= శత్రువులు; జృంభింతురే?= విజృంభిస్తారా? (విజృంభించలేరని భావం); నా తెంపున్= నా సాహసాన్ని; పెంపును= పరాక్రమాతిశయాన్ని; చూడు= (ఇక) చూడు; అంచున్= అంటూ; కర్ణుఁడు= కర్ణుడు; మహా(మహత్)+ఉదీర్ణ+ ఆకృతిన్= గొప్ప గర్వంతో కూడిన ఆకారంతో; పొల్చినన్= ప్రకాశించగా.

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! భుజబలంతో అర్జునుని నేనొక్కడినే చంపగలను. తరువాత భీముడు మొదలైన వారిని మర్దించటం తేలికైన పని. నీ క్షాత్రతేజస్సు రాజ్యాన్ని పరిపాలించటానికి పూనుకొంటే, నేనుండగా ఈ శత్రువులు విజృంభిస్తారా? నా సాహసాన్ని, పరాక్రమాతిశయాన్ని చూడు, అంటూ కర్ణుడు గొప్ప గర్వాన్ని ప్రదర్శిస్తూ, ప్రకాశిస్తూ ఉంటే (తరువాతి పద్యంతో అన్వయం).

కృపాచార్యుండు గర్ణు నుపాలంభించుట (సం. 7-133-12)

వ. కనుంగొని గృపాచార్యుం డలంతి నవ్వుతో నతని కి ట్లనియె. 98

ప్రతిపదార్థం: కనుంగొని= చూచి; కృపాచార్యుండు= కృపాచార్యుడు; అలంతి నవ్వుతోన్= మందహాసంతో; అతనికిన్= ఆ కర్ణుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: కృపాచార్యుడు, చిరునవ్వునవ్వి కర్ణుడితో ఇట్లా పలికాడు:

చ. 'అగు నగు! మేలు మేలు! మనుజాధిపుఁడున్ మహి యేలు మాటల
న్మగఁటిమి యిమ్మెయిన్ నెఱపినం జెడుఁ బాండుతనూజ కోటియుం
దగు మును ఘోషయాత్రను బదంపడి గోగ్రహణంబునందుఁ బే
రు గొనిన నీకు ని ట్లనుట క్రొవ్వులు దక్కుము; సాలు నిన్నియున్. 99

ప్రతిపదార్థం: అగును+అగున్!= అవునవును!; మేలు మేలు!= మంచిది మంచిది! (పరిహాస గర్భిత వచనమిది); మనుజ+అధిపుఁడున్= దుర్యోధనుడు; మహి= ఈ భూమిని; ఏలు మాటలన్= పాలిస్తాడనే మాటలతో మాత్రం; మగఁటిమి= పౌరుషాన్ని; ఈ+మెయిన్= ఈ విధంగా; నెఱపినన్= చూపుతూ ఉంటే; పాండు తనూజకోటియున్= పాండవుల సమూహం; చెడున్!= నశిస్తుంది! (నశించక ఉంటుందా? అని ఎత్తిపొడుపు. నశించదని భావం.); మును= పూర్వం; ఘోషయాత్రను= ఘోషయాత్రా సమయంలో; పదంపడి= అటు తరువాత; గోగ్రహణంబునందున్= ఉత్తర గోగ్రహణ సమయంలో; పేరు+కొనిన నీకున్= పేరు(కీర్తి) తెచ్చుకొన్న నీకు; ఇట్లు= ఈ విధంగా; అనుట= అనటం; తగున్!= యుక్తమే (ఇదికూడా ఎత్తిపొడుపు మాటయే - కర్ణుడు ఘోషయాత్రలో పారి పోయాడు - ఉత్తర గోగ్రహణంలో అర్జునుడిచే జయించబడ్డాడు); క్రొవ్వులు= గర్వోక్తులు; తక్కుము= తగ్గించుకొనుము; ఇన్ని యున్= ఈ మాత్రం మాటలు; చాలున్= సరిపోతాయి.

తాత్పర్యం: అవునౌను! మేలు మేలు! దుర్యోధనుడు భూమండలాన్ని పరిపాలిస్తాడనే ఈ పౌరుషవాక్యాలు పలికి నంత మాత్రాన పాండవులు నశిస్తారా? ఇదివరకు ఘోషయాత్రలో, ఉత్తర గోగ్రహణంలో కూడా పేరు తెచ్చుకొన్న నీవు ఇట్లా మాట్లాడుట తగునా! ఈ పొగరుబోతుమాటలు కట్టిపెట్టుము. ఇంతవరకు మాట్లాడింది చాలు.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: కర్ణుడికి పాండవులను గెలిచేటంత సామర్థ్యం లేదు. ఇతడి మాటలు బూటకాలే. నమ్మదగినవి కావు - అని కృపుడు దుర్యోధనుడితో చెప్పక చెప్పినట్లయింది. ఈ కృపాచార్యుడి అభిప్రాయం ఇక్కడ ధ్వనిస్తూ ఉన్నది.

వ. అని వెండియు. 100

ప్రతిపదార్థం: అని= ఇట్లా పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: ఈ విధంగా కర్ణుడిని ఎత్తిపొడిచి మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. నిన్నును బాండుతనూజుల । నెన్నండును బోరఁ జూచి యెఱుఁగని వారిం
గన్నట్లు పలుక నేటికి । నిన్ని సెనటి రజ్జు లనికి నివి దోడ్పడునే? 101

ప్రతిపదార్థం: ఎన్నండును= ఏనాడుకూడా; నిన్నును= నిన్ను(కర్ణుడిని); పోరన్= యుద్ధంలో; చూచి+ఎఱుఁగని వారిన్= చూచినట్లే తెలియనివారిని; పాండుతనూజులన్= పాండవులను; కన్న+అట్లు= చూచినవిధంగా; పలుకన్= పలుకటానికి; ఇన్ని+చెనఁటి రజ్జులు= ఇన్ని కుత్సితాలైన వ్యర్థప్రలాపాలు; ఏటికిన్?= ఎందుకు?; అనికిన్= యుద్ధానికి; ఇవి= ఈ వ్యర్థప్రలాపాలు; తోడ్పడును+ఏ?= తోడ్పడుతాయా? (తోడ్పడవని భావం).

తాత్పర్యం: ఎన్నడూ నిన్నూ, పాండవులనూ యుద్ధంలో చూచి ఎరుగని వారిని చూచి మాట్లాడినట్లు మాట్లాడటం ఎందుకు? నీవు పలికిన ఇన్ని వ్యర్థప్రలాపాలూ యుద్ధానికి తోడ్పడేవేనా?

క. క్రీడికి మును మన మందఱు । నోడు టెఱుఁగు; దన్నలును ఘటోత్కచుఁడు దగం
దోడు పడ బంధునృపతులుఁ । గూడి నడవ మనకు గెలుపు గొన నెట్టు లగున్?' 102

ప్రతిపదార్థం: మును= పూర్వం; మనము+అందఱును= మనమందరం; క్రీడికిన్= అర్జునునకు; ఓడుట= ఓడిపోవటం; ఎఱుఁగుదు= తెలిసినవాడవు (మనం జయించుట ఇంతవరకు జరుగలేదని భావం); (ఇప్పుడు ఆ అర్జునునకు); అన్నలును= ధర్మజ భీములు; ఘటోత్కచుఁడున్= ఘటోత్కచుడు; తగన్= తగినవిధంగా; తోడుపడన్= సహాయం చేస్తూ ఉండగా; బంధు నృపతులున్= బంధువులైన రాజులు కూడా; కూడి నడవన్= కూడుకొని తోడై నడువగా; మనకున్= నీకు నాకు మాత్రం కాదు మనందరికీ; గెలుపు+కొనన్= (వారితోపోరి యుద్ధంలో) గెలుపు సాధించటానికి; ఎట్టులు= ఏ విధంగా; అగున్?= సాధ్యమవుతుంది? (సాధ్యంకాదని భావం).

తాత్పర్యం: మనమందరం ఇదివరకు యుద్ధంలో అర్జునుడికి ఓడిపోవటం నీకు తెలుసు. ఇప్పుడు అర్జునుడొక్కడు కాడు, అతడికి ధర్మరాజు, భీముడు, ఘటోత్కచుడు, అంతేగాక బంధువులైన ఇతర రాజులు తోడుగా ఉండగా అతడిని గెలవటం ఎట్లా సాధ్యం అవుతుంది?'

చ. అనవుడుఁ గర్ణుఁ డిట్టు లను 'నాడిన యంతయుఁ జేయఁ జాలు బం
టున కెటు లన్న నేమగుఁ? గడుం బెలుచన్ మును మ్రోసికాదె వృ
ష్టి నిగుడఁజేయు నంబుదము సెల్లదు నీ పలు కింతవట్టు సైఁ
పన తగు నింక నేమనినఁ బాఱుఁడ! నాలుక గోయుదుం జుమీ!' 103

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; కర్ణుఁడు= కర్ణుడు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అంటాడు; ఆడిన+అంతయున్= చెప్పినదంతా కూడా; చేయన్+చాలు= చేయటానికి సమర్థుడైన; బంటునకున్= వీరునకు; ఎటులు+అన్నన్= ఎట్లా అన్నాకూడా;

ఏమి+అగున్= ఏమవుతుంది? (ఏమీ కాదని భావం) (ఎట్లాగూ చేస్తాడు కాబట్టి చేతకు ముందుకాని, చేసిన తరువాత కాని చెప్పటం ఒకటే - కావున నేను ముందుగా చెప్పటం తప్పుకాదు ఎట్లా+అంటే?); కడున్= మిక్కిలి; పెలుచన్= బిగ్గరగా; మును= మొదట; మ్రోసికాదె!= గర్జన చేసిన తరువాతనే కదా!; అంబుదము= వర్షకాల మేఘం; వృష్టి(న్)= వానను (ఇక్కడ దృష్టి అనే ఉస్మానియా ప్రతిపాఠం కంటే 'వృష్టి' అనే ఈ బాలసరస్వతీ బుక్ డిపో మద్రాసు ప్రతి ప్రకృతానుకూలంగా ఉన్నది. కాబట్టి ఆ పాఠాన్నే గ్రహించటం జరిగింది. శ్లో॥'శూరాగర్జంతి సతతం ప్రావృషీవ బలాహకాః' అని మూల సంస్కృతం (158/25); నిగుడన్+చేయున్= వ్యాపింపచేస్తుంది (కావున); నీ పలుకు= నీ మాట (నీవు నన్ను ఆక్షేపించిన తీరు అని భావం); చెల్లదు= తగింది కాదు; ఇంతవట్టు= ఈ మాత్రం; సైఁపనన్= సహించటమే (ఇప్పటివరకు నీ వాడిన మాటలు సహించటం అని భావం); తగున్= తగుతుంది; ఇంకన్= మళ్ళీ; ఏమి+అనినన్= ఏమైనా మాట్లాడితే; పాఱుఁడ!= ఓ బ్రాహ్మణుడా! (ఇంతవరకు బ్రాహ్మణుడనే గౌరవంతో క్షమించానని భావం); నాలుకన్= నాలుక (జిహ్వను); కోయుదున్+చుమీ!= కోస్తాను సుమా! (ఇకముందు ఇటువంటి మాటలు రాకుండా జాగ్రత్త! అనే కర్ణుడి హెచ్చరిక ధ్వనిస్తూ ఉన్నది).

తాత్పర్యం: అని అనగానే కర్ణుడు 'చెప్పినదంతా చేసే సామర్థ్యమున్న వీరుడికి ఎట్లా చెప్పినా చెల్లుతుంది. వర్షాకాలంలోని మేఘం మొదట గర్జించేకదా తరువాత వర్షిస్తుంది. నీవన్నమాట చెల్లదు. ఓ బ్రాహ్మణుడా! నీవేదో అన్నావు పోనీ, ఇంతవరకు బ్రాహ్మణుడవనే గౌరవంతో సహించాను. ఇంక మరేదైనా మాట్లాడావంటే నీ నాలుకను కోసేస్తాను జాగ్రత్త!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'ఆడిన యంతయుఁ జేయఁ జాలు బంటున కెటు లన్న నేనుగున్' అనే 'సామాన్య' వీరవృత్తాంతాన్ని మేఘరూప 'విశేష' వృత్తాంతంతో సమర్థించటం జరిగింది. కావున అర్థాంతరన్యాసాలంకారం. విశేషంతో సామాన్యాన్ని సమర్థించే ఈ అర్థాంతరన్యాసాలంకారంలో 'విశేషం' వైధర్మ్యంలో ఉన్నది. సామాన్య వీరవృత్తాంతంచేత ప్రస్తుత కర్ణవృత్తాంతం ప్రతీయమానమగుటచే కర్ణుడు చేతకు ముందు తాను చేస్తా' నని చెప్పటంలో తప్పులేదనే విషయాన్ని మేఘవృత్తాంతంతో సమర్థించుకొనటం కొరకే సామాన్య వీరవృత్తాంతాన్ని ప్రస్తావించాడని తాత్పర్యం.

వ. అని పలికి మఱియును. 104

ప్రతిపదార్థం: అని= ఇట్లా; పలికి= చెప్పి; మఱియును= మరల.

తాత్పర్యం: ఇట్లా తాను బీరాలు పలుకటం సమర్థించుకొని మరల. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'నరు నద్దెసఁ గలవారిని । గురుబల ముబ్బు సెడఁ బొగడి కొఱ కొఱ గాఁగన్
గురుని గురుతనయు మద్రే । శ్వరు నను నేమిటికిఁ గాని వారిం జేయన్.' 105

ప్రతిపదార్థం: నరున్= అర్జునుడిని; ఆ+దెసన్+కలవారిని= ఆవైపున్నవారిని (పాండవపక్షంలోనివారిని); కురుబలము+ఉబ్బు= కౌరవసైన్యంలోని ఉత్సాహం; చెడన్= నశించేటట్లు; పొగడి= పొగడి; కొఱకొఱ= కోపము; కాఁగన్= పుట్టగా; గురునిన్= ద్రోణుడిని; గురుతనయున్= అశ్వత్థామను; మద్రేశ్వరున్= శల్యుడిని; ననున్= (కర్ణుడిని); కానివారిన్= అసమర్థులనుగా; చేయన్+ఏమిటికిన్= చేయుటమెందుకు?

తాత్పర్యం: అర్జునుడిని, అర్జునుడి పక్షంలో ఉన్నవారిని పొగడి, కౌరవసైన్యంయొక్క ఉత్సాహాన్ని చెరిచి, కోపం కలిగేటట్లుగా, ఆచార్యుడిని, ఆచార్యపుత్రుడు అశ్వత్థామను, శల్యుడిని, నన్ను అసమర్థులను చేస్తున్నావు. ఎందుకు?'

క. అని మామఁ బలుకు పలుకులు । విని యశ్వత్థామ క్రోధవివశుం డయి గ్ర
క్కున వాలు వెఱికికొని క । ర్ణుని దెసకుం గవియ భూవరుం డెడ సొచ్చెన్. 106

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; మామన్= మామ అయిన కృపాచార్యుడి నుద్దేశించి; పలుకు పలుకులు= పలికే మాటలు; విని= విన్నవాడై; అశ్వత్థామ= కృపుడి సోదరి కుమారుడు; క్రోధ వివశుండు+అయి= కోపంతో తనను తాను నిగ్రహించుకొనలేని వాడయి; గ్రక్కునన్= శీఘ్రంగా; వాలు= ఖడ్గాన్ని; పెఱికికొని= దూసికొని; కర్ణుని దెసకున్= కర్ణుడి వైపునకు; కవియన్= ఉరుకగా; భూవరుఁడు= దుర్యోధనుడు; ఎడ+చొచ్చెన్= అడ్డగించాడు.

తాత్పర్యం: ఇట్లా తన మామయైన కృపాచార్యులతో కర్ణుడు మాట్లాడటం విని, అశ్వత్థామ కోపం పట్టలేక వెంటనే కత్తి దూసి కర్ణుడిపైకి ఉరుకుతూ ఉంటే, దుర్యోధనుడు అతడిని అడ్డగించాడు.

ఆ. నృపతితోడఁ గూడి కృపుఁడును నెడ సొచ్చె । వార లతనిఁ బట్టి 'వలదు రోష
ముడుగ వలయు' ననిన నుగ్రత నాతఁడు । పెనఁగఁ గర్ణుఁ డిట్టు లనియెఁ గనలి. 107

ప్రతిపదార్థం: నృపతి తోడన్+కూడి= దుర్యోధనుడితో కూడుకొని; కృపుఁడునున్= కృపాచార్యుడు కూడా; ఎడ+చొచ్చెన్= అడ్డువచ్చాడు; వారలు= ఆ దుర్యోధన కృపులు; ఆతనిన్= ఆ అశ్వత్థామను; పట్టి= (పోకుండా) పట్టుకొని; రోషము= కోపం; ఉడుగవలయున్= మానాలి; అనినన్= అని అంటూ ఉంటే; ఆతఁడు= ఆ అశ్వత్థామ; ఉగ్రతన్= క్రోధంతో; పెనఁగన్= (తప్పుకొని పోవటానికి) పెనగులాడుతూ ఉండగా; కర్ణుఁడు; కనలి= మండిపడి; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడితోపాటు కృపాచార్యుడు కూడా వచ్చి అడ్డుపడి కోపం పనికిరాదని కోపాన్ని విడువుమని చెప్పినా అశ్వత్థామ వినకుండా, కోపోద్రిక్తుడై పెనగులాడుతుంటే, కర్ణుడు కోపంతో ఇట్లా అన్నాడు.

క. 'విడు విడు మీతం డిమ్మెయి । నడిచిపడఁగ నేల పట్టె దవనీశ్వర! నీ
వుడిపెడు తెఱఁగున నా బిరు । దుడుగునె నా చేయిదాఁకి యుడిగిన భంగిన్?' 108

ప్రతిపదార్థం: అవనీశ్వర!= ఓ రాజా! (దుర్యోధనా!); విడు విడుము= (ఆ అశ్వత్థామను) విడిచివేయండి; ఆతండు= ఆ అశ్వత్థామ; ఈ+మెయిన్= ఈ విధంగా; అడిచి పడఁగన్= మిడిసిపడుతూ ఉంటే; ఏల పట్టెదు?= ఎందుకు పట్టుతావు?; ఆ బిరుదు= ఆ శూరుడు; నా చేయి= నా చేతిదెబ్బ; తాఁకి= తగిలి; ఉడిగిన భంగిన్= నశించే విధంగా; నీవు= దుర్యోధనుడు; ఉడిపెడి తెఱఁగునన్= మాన్పే పద్ధతితో; ఉడుగునె?= నశిస్తాడా? (నశించడని భావం).

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! ఆ అశ్వత్థామ అంతగా మిడిసిపడుతూ ఉంటే ఆపటమెందుకు? వదలుము! వదలుము! నా చేతిదెబ్బ తగిలి ఆగినట్లుగ నీవు ఆపే పద్ధతిలో ఈ వీరుడు ఆగుతాడా?

క. అనుడుఁ గృపాచార్యుం డి । జ్జన పతికిం గాఁగ నేను సైరించిన నే
మని పలికితేని నీకుం । జనియెం; బొ మ్మింక వలదు సంభ్రమ మనియెన్. 109

ప్రతిపదార్థం: అనుడున్= ఇట్లా పలుకగానే; కృపాచార్యుండు= అశ్వత్థామ మేనమామ; ఈ+జనపతికిన్+కాఁగన్= ఈ రాజుకు కాబట్టి (ఈ దుర్యోధనుడి ప్రయోజనార్థమై); ఏను= నేను; సైరించినన్= సహిస్తూ ఉంటే; ఏమి+అని= ఏ మాట (ఏదో అని భావం. ఏ మాట మాట్లాడినా దాని మంచి చెడులలో వివక్ష లేదనే అర్థాన్ని 'అని' ఏమి అనే పదంతో చేరి సూచిస్తూ ఉండటం లోకవ్యవహారం); పలికితి(వి)+ఏనిన్= మాట్లాడినా కూడా; నీకున్= (కర్ణుడికి); చనియెన్= చెల్లింది; పొమ్ము= నిశ్చయం; ఇంక= ఇక; సంభ్రమము= సంక్షోభం; వలదు= వద్దు; అనియెన్= అని పలికాడు.

తాత్పర్యం: అనిన వెంటనే కర్ణుడితో కృపాచార్యుడు 'ఈ రాజును చూచి నిన్ను క్షమించాను కాబట్టి నీ వేమి మాట్లాడినా చెల్లింది. ఇంక అలజడి వద్దు, పొమ్ము!' అని అన్నాడు.

వ. అప్పు డక్కురుపతి గురుపుత్త్రు నుద్దేశించి. 110

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయాన; ఆ+కురుపతి= ఆ కురురాజు దుర్యోధనుడు; గురుపుత్రున్= ఆచార్యపుత్రుడైన అశ్వత్థామను; ఉద్దేశించి= గురించి.

తాత్పర్యం: ఆ సందర్భంలో ఆచార్య కుమారుడయిన అశ్వత్థామతో దుర్యోధనుడు (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'గురుఁడును నీవును మద్రే। శ్వరుఁడును గర్ణుండు గృపుఁడు సౌబలుఁడు ననున్
ధర యేలింపఁగ నున్నా। రరు; మీకుం దగునె సంగరములోఁ గలఁగన్. 111

ప్రతిపదార్థం: గురుఁడును= ఆచార్యుడు (ద్రోణుడు); నీవును= (అశ్వత్థామ); మద్రేశ్వరుఁడును= మద్రదేశాధిపతి(శల్యుడు); కర్ణుండున్= కర్ణుడు; కృపుఁడు= కృపాచార్యుడు; సౌబలుఁడు= శకుని; (మీరందరు) ననున్= నన్ను; ధర= భూమి; ఏలింపఁగన్+ ఉన్నారరు= పాలింపజేయుటానికున్నారు; సంగరములోన్= యుద్ధంలో; కలఁగన్= కలవరపడటానికి; మీకున్= మీకందరికీ; తగునె? = తగుతుందా?

తాత్పర్యం: 'ఓ అశ్వత్థామా! ఆచార్యుడు మీ తండ్రి, ఆచార్యపుత్రుడవు నీవు, శల్యుడు, కర్ణుడు, కృపాచార్యుడు, మా మామ శకుని, మీరందరూ నాతో ఈ భూమండలాన్ని పరిపాలింపజేయటానికే ఉన్నారు. మీరు కలహించుకొని యుద్ధంలో సంక్షోభం సృష్టించటం మీకు తగుతుందా?

క. క్షమియింపు' మనుడు నతఁ డురు। శమ మొందినఁ గర్ణుఁడుం బ్రశాంతుం డై వి
క్రమకేలి సలుపఁ బ్రతిసై। న్యము దెస మొగమయ్యెఁ బటుగుణధ్వని సెలఁగన్. 112

ప్రతిపదార్థం: క్షమియింపుము= క్షమించుము; అనుడున్= అనగానే; అతఁడు= ఆ అశ్వత్థామ; ఉరుశమము= శాంతిని; ఒందినన్= పొందగా (శాంతించగానే అని భావం); కర్ణుఁడున్= కర్ణుడు కూడా; ప్రశాంతుండు+ఐ= శాంతించినవాడై; విక్రమకేలి+చలుపన్= పరాక్రమ క్రీడ చేయటానికి (అవలీలగా పరాక్రమించటానికి అని భావం); పటుగుణధ్వని= బిగువైన అల్లెత్రాటి టంకారధ్వని; చెలఁగన్= చెలరేగుతూ ఉండగా; ప్రతిసైన్యముదెస మొగము+అయ్యెన్= శత్రుసైన్యాభిముఖుడయ్యాడు.

తాత్పర్యం: కర్ణుడిని క్షమించండి' అని అనగానే దుర్యోధనుడి మాట ప్రకారం అశ్వత్థామ శాంతించాడు. కర్ణుడు కూడా శాంతించి, ఇక ధనుష్టంకారం చేస్తూ యుద్ధం చేయటానికి శత్రుసైన్యాభిముఖుడయ్యాడు.

విశేషం: ఉస్మానియా ప్రతి ఆదరించిన 'ఉరుశమ' అనే పాఠమే అనుగుణంగా ఉండటంచేత అదే గ్రహించబడింది.

వ. ఇట్లు గడంగినం బ్రత్యర్థి పార్థివు లయ్యోధవరు నాలోకించి 'పాండవులకుఁ బాటిల్లిన యనర్థంబుల కెల్లను మూలంబు వీఁడ కాఁడె!, వీనిం బొదువుఁడు, పోనీకుఁడు, పడవైవుం' డనుచు దలపడిన నా సూతసూనుఁడు నిజనామాంకితంబులగు నారాచంబుల నన్నరపతులఁ గరుల నరులఁ దురంగంబుల నరదంబుల రూపుమాపి యేపునఁ దదీయాంగంబులు రుధిరంబున మునుంగునట్లు సేసినం జూచి సవ్యసాచి సాయకజాలంబులు

నిగిడించుచుం గవిసిన నతండు మూఁడు మార్గణంబులు దన తనువునఁ జొనుపుటయుం గినిసి యక్కిరీటి ముప్పది శరంబుల నొప్పించి భుజ శిఖరంబున బలు నారసంబులు నాఁటించినం జేతి విల్లు వడియెం; బడుటకుఁ దలంకక యక్కర్ణుం డాక్షణంబ విల్లు పుచ్చుకొని వివ్వచ్చుండు వెడంగుపడునట్టి వేగంబున వివిధ విశిఖంబులు నిగిడించిన. 113

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కడంగినన్= తలపడుతూ ఉండగా; ప్రత్యర్థి పార్థివులు= శత్రురాజులు; ఆ+యోధవరులన్= ఆ వీరశ్రేష్ఠులను; ఆలోకించి= చూచి; పాండవులకున్= మన ధర్మరాజాది పాండవులకు; పాటిల్లిన= కలిగినటువంటి; అనర్థంబుల కున్+ఎల్లను= అనర్థాలన్నింటికి; మూలంబు= కారణం; వీఁడు+అ= వీడే (ఈ కర్ణుడే); కాడు+ఎ?= కాడా?; వీనిన్= ఈ కర్ణుడిని; పొదువుఁడు= క్రమ్మండి; పోనీకుఁడు= తప్పించుకొనిపోకుండా చూడండి; పడవైవుండు= (కొట్టి క్రింద) పడవేయండి; అనుచున్= అంటూ; తలపడినన్= యుద్ధానికి సిద్ధపడగా; ఆ సూత సూనుఁడు= ఆ సూతపుత్రుడు కర్ణుడు; నిజనామ+అంకితంబులు+అగు= తన పేరు ముద్రించబడి ఉన్నటువంటి; నారాచంబులన్= బాణాలతో; ఆ+నరపతులన్= ఆ శత్రురాజులను; కరులన్= ఏనుగు లను; నరులన్= సైనికులను; తురంగంబులన్= గుర్రాలను; అరదంబులన్= రథాలను; రూపుమాపి= నశింపజేసి; ఏపునన్= అధికంగా; తదీయ+అంగంబులు= ఆ చతురంగబలాల శరీరాలు; రుధిరంబునన్= రక్తంలో; మునుంగునట్లు= మునిగిపోయేటట్లు; చేసినన్= చేయగా; చూచి= గమనించి; సవ్యసాచి= అర్జునుడు; సాయకజాలంబులు= బాణాలసమూహాలు; నిగిడించుచున్= ప్రయోగిస్తూ; కవిసినన్= ఎదుర్కొనగా; అతండు= ఆ కర్ణుడు; మూఁడు మార్గణంబులు= మూడు బాణాలను; తన తనువునన్= తన శరీరంలో; చొనుపుటయున్= గ్రుచ్చుకొనేటట్లు వేయగా; కినిసి= కోపించి; ఆ+కిరీటి= ఆ అర్జునుడు; ముప్పది శరంబులన్= ముప్పై బాణాలతో; నొప్పించి= నొప్పి కలిగేటట్లు కొట్టి; భుజ శిఖరంబునన్= భుజ శిరస్సుపై; బలు నారసంబులు= దృఢములైన బాణాలు; నాటించినన్= గ్రుచ్చుకొనేటట్లు చేయగా; చేతివిల్లు= చేతిలో ఉన్న ధనుస్సు; పడియెన్= క్రిందపడ్డది; పడుటకున్= పడినందుకు; తలంకక= బాధపడక; ఆ+కర్ణుండు; ఆ క్షణంబు+అ= వెంటనే; విల్లు= ధనుస్సును; పుచ్చుకొని= తీసికొని; వివ్వచ్చుండు= బీభత్సుడు - అర్జునుడు (కూడా); వెడంగు పడునట్టి= ఆశ్చర్యపడేటటువంటి; వేగంబునన్= వేగంతో; వివిధ విశిఖంబులు = పలురకాలైన బాణాలు; నిగిడించినన్= వ్యాపింపజేస్తూ ఉండగా.

తాత్పర్యం: ఇట్లా కర్ణుడు యుద్ధోన్ముఖుడై వస్తూ ఉండగా శత్రురాజులు అతడిని చూచి (అనగా పాండవపక్షీయులైన వారు). 'మన పాండవులకు ఇన్ని అనర్థాలు కలిగాయంటే అన్నింటికీ వీడే కారణం. ఇంకా చూస్తారేమి? వీనిని ఆక్రమించండి. పారిపోనీకండి, పడగొట్టండి' అని పలుకుతూ కర్ణుడితో యుద్ధానికి తలపడ్డారు. కర్ణుడు ఆ శత్రురాజులను, చతురంగబలాలను తనపేరు చెక్కబడిన బాణాలతో గాయపరిచి నెత్తుటితో వారి శరీరాలు మునిగేటట్లు చేశాడు. అది చూచిన సవ్యసాచి అనేక బాణాలు ప్రయోగిస్తూ కర్ణుడిని ఎదుర్కొన్నాడు. కర్ణుడు అర్జునుడిని మూడుబాణాలతో కొట్టగా అర్జునుడు కర్ణుడిని ముప్పైబాణాలతో నొప్పించటమే గాక అతడి భుజం కొసన బలువైన బాణాలు నాటాడు. దానితో ఆ కర్ణుడి చేతివిల్లు క్రిందికి జారిపడింది. అందుకు కర్ణుడు కలత చెందక వెంటనే వేరొకవిల్లు పుచ్చుకొని అర్జునుడికి ఆశ్చర్యం కలిగేవిధంగా వివిధ బాణాలను ప్రయోగించగా (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: బీభత్సుడు అనే పదానికి తెలుగులో వివ్వచ్చుడు అనే పదం (వికృతి) - యుద్ధరంగాన్ని శత్రుసైన్య రక్తమాంసాదులచేత బీభత్సంగా చేసేవాడు కాబట్టి అర్జునుడికి ఆ పేరు. అట్టి అర్జునుడే కర్ణుడి బాణవేగం చూచి ఆశ్చర్యపడ్డాడంటే ఇక కర్ణుడి ఇప్పటి యుద్ధం తీరు అనన్యాదృశం అనే భావం వ్యక్తమవుతూ ఉన్నది. కాబట్టి 'వివ్వచ్చుడు' అనే పదం ఇక్కడ సార్థకం. ఇది పదద్యోత వస్తుధ్వని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. కడక న్నెఱ్ఱనిచెల్వుఁ దాల్ప నతఁ డుగ్రస్ఫూర్తి విల్ ద్రుంచి యె
క్కుడు వేగంబున సూతుమస్తకముతోఁ గూడం దురంగాంగముల్
గడికండంబులు సేసి యా రథికుమైఁ గాఁడంగఁ బెక్కమ్ము లే
యుడు నొవ్వారినఁ బాఱి యెక్కెఁ గృపుతే రుర్వీశ! నిర్లజ్జుఁ డై. 114

ప్రతిపదార్థం: ఉర్వీశ!= ఓ ధృతరాష్ట్ర మహారాజా! కడకన్ను= కనుకొలుకు; ఎఱ్ఱని చెల్వున్= ఎరుపువన్నె అందాన్ని; తాల్పన్= పొందగా; అతఁడు= ఆ అర్జునుడు; ఉగ్రస్ఫూర్తిన్= భయంకరమైన స్ఫురణతో, అనగా చూచేవారికి భయం గొలిపే ఆకారంతో; విల్= విల్లును; త్రుంచి= తెగగొట్టి; ఎక్కుడు వేగంబునన్= మిక్కిలి వేగంతో; సూతుమస్తకముతోన్+కూడన్= సారథి శిరస్సుతోపాటు; తురంగ+అంగముల్= అశ్వాల శరీరాలను; కడికండంబులు+చేసి= ముక్కలు ముక్కలుగా చేసి; ఆ రథికుమైన్= ఆ రథికుడి అనగా కర్ణుడి శరీరాన; కాఁడంగన్= నాటుకొనే విధంగా; పెక్కు+అమ్ములు= వివిధ బాణాలను; ఏయుడున్= వేయగానే; నొవ్వు+ఆరినన్= నొప్పి నిండగా - నొప్పి మిక్కిలి కలుగగా అని భావం; పాఱి= పారిపోయి; (కర్ణుడు) నిర్లజ్జుఁడు+ఐ= సిగ్గులేని వాడై; కృపుతేరు= కృపాచార్యుడి రథాన్ని; ఎక్కెన్= ఎక్కాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుడి కనుకొలకు అతి క్రోధంతో ఎఱ్ఱబారగా, భయంకరమైన తేజస్సుతో మిక్కిలి వేగంగా కర్ణుడి ధనుస్సును త్రుంచివేశాడు. సారథి శిరస్సుతోపాటు గుఱ్ఱాల శరీరాలను తుత్తునియలుగా చేసి, ఆ కర్ణుడి శరీరాన్ని బాణాలతో నింపివేశాడు. కర్ణుడు ఆ బాణఘాతాల నొప్పికి ఆగలేక పారిపోయి, సిగ్గు విడిచి కృపుడి రథంపైకి ఎక్కినాడు. (తాను కృపాచార్యులను ఇంతకుముందు అనరాని మాటలన్నాడు. ఆలాంటి కృపాచార్యుడి రథంపైకి ఎక్కుతున్నాననే సిగ్గుకూడా కర్ణుడికి అప్పుడు లేకుండా పోయింది.)

వ. ఇవ్విధంబున రాధేయుం డోడి పాఱిన నీడంబోవు మన సైనికులం గనుంగొని కురువిభుండు. 115

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; రాధేయుండు= కర్ణుడు; ఓడి= పరాజయాన్ని పొంది; పాఱినన్= పారిపోగా; ఈడంబోవు= వెనుదిరిగిపోతున్న; మన సైనికులన్= మన సైనికులను; కనుంగొని= చూచి; కురువిభుండు= దుర్యోధనుడు.

తాత్పర్యం: ఇట్లా కర్ణుడు పరాభూతుడై పారిపోగానే మన సైనికులు కూడా వెనుదిరిగిపోవటాన్ని గమనించి దుర్యోధనుడు (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'నిలువుఁడు; వెఱపేటికి నేఁ । గలుగఁగ? గాండీవిఁ దక్కుఁ గల పాండవులన్
గెలిచెద నిదె చూడుఁడు నా । యలవుఁ జలము' ననుచు నడచె నన్నరుమీఁదన్. 116

ప్రతిపదార్థం: నిలువుఁడు= (పారిపోక) నిలవండి; నేన్= నేను; కలుగఁగన్= ఉండగా; వెఱపు= భయం; ఏటికిన్?= ఎందుకు?; గాండీవిన్= గాండీవ ధనుర్ధారి అయిన అర్జునుడిని; తక్కున్+కల= మిగిలిన; పాండవులన్= పాండవులను; గెలిచెదన్= గెలుస్తాను; ఇదె= ఇదిగో; నా+అలవున్= నా సామర్థ్యాన్ని; చలమున్= పట్టుదలను; చూడుఁడు= చూడండి; అనుచున్= అని అంటూ; ఆ+నరుమీఁదన్= ఆ అర్జునుడిపైకి; నడచెన్= (యుద్ధానికి) వెళ్ళాడు.

తాత్పర్యం: 'ఓ సైనికులారా! పారిపోకండి. నిలువండి. నేనున్నాను కదా! భయమెందుకు? ఆ అర్జునుడినీ, తక్కిన పాండవులనూ గెలుస్తాను. ఇదిగో! నా శక్తి, నా పట్టుదల చూతురుగాని' అని పలుకుతూ ఆ అర్జునుడిపైకి యుద్ధానికి వెళ్ళాడు.

వ. అప్పుడు కృపాచార్యుం డాచార్యనందనున కి ట్లనియె. 117

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కృపాచార్యుండు= కృపాచార్యుడు; ఆచార్యనందనునకున్= అశ్వత్థామతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు యుద్ధానికి వెళ్ళటం గమనించిన కృపాచార్యుడు అశ్వత్థామను చూచి ఇట్లా అన్నాడు:

చ. 'శలభము వహ్నిమీఁదఁ జను చందము గాదె! నృపాలుఁ డర్జునుం
దలపడఁ బోక; యాతని శితప్రదరంబుల బారి కగ్గ మై
యెలసినఁ గావఁగా వశమె? యీతని నీవును నేను నుండి మొ
క్కలమునఁ బోవనీఁ; దగదు గ్రమ్మన నెయ్యుడు నిల్పు మవ్విభున్.' 118

ప్రతిపదార్థం: నృపాలుఁడు= దుర్యోధనుడు; అర్జునున్= అర్జునుడిని; తలపడన్+పోక= ఎదుర్కొనటానికి వెళ్ళటం; శలభము= మిడుత; వహ్నిమీఁదన్= అగ్నిపైకి; చనుచందము= వెళ్ళేవిధం; కాదె?= కాదా? (అవుతుందని భావం) శలభం (మిడుత) దీపపు శిఖను చూచి పండుగా భ్రమించి దానిని పట్టుకొనటానికి వెళ్ళి ఆ అగ్నిలో పడి చస్తుంది. కాబట్టి దుర్యోధనుడు అర్జునుడిని జయిస్తానని వెళ్ళటం శలభం మంటపైకి వెళ్ళటం వంటిదే అవుతుందని భావం; ఆతని శితప్రదరంబుల బారిన్= ఆ యర్జునుడి తీక్ష్ణములైన బాణాల గురికి; అగ్గము+ఐ= అధీనమై; ఎలసినన్= (అర్జునుడికి) వశమైన ఎడల; ఈతనిన్= ఈ దుర్యోధనుడిని; నీవును= (అశ్వత్థామ); నేనున్= (కృపాచార్యుడు); ఉండి= ఉండి కూడా; (ఆ దుర్యోధనుడికి రక్షణగా నిలిచి కూడా అని భావం); కావఁగాన్= కాపాడటానికి; వశమె?= వశమవుతుందా? కాదని భావం. (కాబట్టి) నీవును, నేనును ఉండి కూడా; ఈతని; మొక్కలమునన్= పౌరుషానికి; పోవన్+ఈన్+తగదు= పోనీయటం యుక్తంకాదు; క్రమ్మనన్= శీఘ్రంగా; ఎయ్యుడు= వెంబడించుము; ఆ+విభున్= ఆ దుర్యోధనుడిని; నిల్పుము= ఆపుము.

తాత్పర్యం: దుర్యోధనుడు అర్జునుడితో తలపడటానికి వెళ్ళటమంటే మిడుత నిప్పుమీదికి వెళ్ళటంవంటిదే కదా! నీవు, నేను ఉన్నా దుర్యోధనుడు అర్జునుడి వాడిబాణాల బారినపడి చిక్కుకొంటే, ఇతడిని కాపాడటం సాధ్యమా? ఇతడిని పౌరుషంతో వెళ్ళనీయటం తగదు. వెంటనే అతడిని వెంబడించి ఆపుము.

విశేషం: ఈతని 'నీవును నేను నుండి' అనే వాక్యం దేహలీదత్త దీపన్యాయంగా వెనకవాక్యంలో ముందువాక్యంలో కూడా అన్వయిస్తుంది. కాబట్టి నీవు నేను ఉండి కూడా ఈతడిని కావగా వశమె? అని, నీవూ నేనూ ఉండగా ఈతడిని స్వయంగా యుద్ధానికి వెళ్ళనివ్వటం యుక్తం కాదు అని అభిప్రాయం ఏర్పడుతుంది.

క. అనుటయు గురునందనుఁ డ । మ్మనుజాధిపు నెయిది 'యేను మాన్పెద బీ
భత్సుని కడఁక; యేమి మూఁడినఁ । జనియెదు తల కడచి సాహసక్రియ?' ననుడున్. 119

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; గురునందనుఁడు= అశ్వత్థామ; ఆ+మనుజాధిపున్= ఆ రాజును (దుర్యోధనుడి); ఎయిది= వెంబడించి; (దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు); ఏను= నేను; బీభత్సుని కడఁక= అర్జునుడి విజృంభణాన్ని; మాన్పెదన్= అరికడతాను; ఏమి= ఏ అనర్థం; మూఁడినన్= వాటిల్లగా; తలకడచి= అతిక్రమించి; సాహసక్రియన్= సాహసకార్యానికి; చనియెదు?= వెళ్ళుతావు?; అనుడున్= అనగానే.

తాత్పర్యం: ఈ విధంగా కృపాచార్యుడు పలుకగానే అశ్వత్థామ దుర్యోధనుడిని అడ్డగించి ఇట్లా అన్నాడు: 'నేను ఆ అర్జునుడి విజృంభణాన్ని అణచివేస్తాను. ఏ కీడు కలిగిందని నీవు అతిక్రమించి సాహసంతో వెళ్ళుతున్నావు అని అనగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'గురుఁడు పాండవులకుఁ గూర్చు; నీవును దానిని। నెఱిఁగి బవరమున నుపేక్ష సేయు;
దిది మదీయ భాగ్యహీనత గాక నీ। వేచితేని నెవ్వ రెదురు సెపుమ! 120

ప్రతిపదార్థం: గురుఁడు= ఆచార్యుడు (ద్రోణుడు); పాండవులకున్= ధర్మరాజాదులకు; కూర్చున్= ప్రియాన్ని చేస్తాడు; నీవును= నీవుకూడా; దానిన్= ఆ విషయాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; బవరమునన్= యుద్ధంలో; ఉపేక్ష= అశ్రద్ధ; చేయుదు(వు)= చేస్తావు; ఇది= నీవట్లా చేయటం; మదీయ భాగ్యహీనత= నా దురదృష్టం; కాక= అలాకాకుండా (ఉపేక్ష చేయక అని భావం); నీవు+ ఏచితి(వి)+ఏనిన్= నీవు విజృంభిస్తే; ఎవ్వరు+ఎదురు?= ఎవ్వరు ఎదురుగా నిలుస్తారు? (నిన్ను ఎదిరించి పోరాడే వీరు లెవ్వరూ లేరని భావం); చెపుమ!= చెప్పుమా!

తాత్పర్యం: ద్రోణాచార్యులకు పాండవులంటే ఇష్టం. అది తెలిసి నీవు కూడ యుద్ధంలో అశ్రద్ధ చూపుతావు. అట్లా నీవు ఉపేక్షించటం నా దురదృష్టం. ఒకవేళ నీవు ఉపేక్ష చేయక శ్రద్ధగా శక్తినంతా ధారపోసి యుద్ధంలో విజృంభిస్తే, నీ కెదురుగా యుద్ధంచేసే వీరులెవరైనా ఉన్నారా? నీవే చెప్పుము.

క. పలువురు బంధులు నాకై। పొలిసిరి; మీరింకఁ బాండుపుత్రుల దెస రా
వలవదు; పాంచాలాదుల। వలన నిలిచి గెలువుఁ డేను వారలఁ దీర్తున్.' 121

ప్రతిపదార్థం: పలువురు= అనేకులైన; బంధులు= బంధువులు; నాకై= నాకొరకు; పొలిసిరి= మరణించారు; ఇంకన్= మరి; మీరు= నీవు, మీవారు; పాండుపుత్రుల దెస(న్)= పాండవులవైపునకు; రావలవదు= రావద్దు; పాంచాల+ఆదులవలనన్= ద్రుపదరాజు మొదలైనవారు ఉన్నదిక్కుగా; నిలిచి= ఉండి; గెలువుఁడు= గెలువండి; ఏను= నేను; వారలన్= ఆ పాండవులను; తీర్తున్= నశింపజేస్తాను.

తాత్పర్యం: ఎంతోమంది బంధువులు నాకొరకు పోరాడి నశించారు. మీరికమీద పాండవులవైపునకు రావద్దు. ద్రుపదరాజు మొదలగు వారితో యుద్ధంచేసి గెలువండి. నేను పాండవులతో యుద్ధం చేస్తాను. వారినిసంహరిస్తాను.'

వ. అనిన విని యశ్వత్థామ భూమీశ్వరున కిట్లనియె: 122

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని; అశ్వత్థామ= అశ్వత్థామ; భూమీశ్వరునకున్= రాజునకు (దుర్యోధనుడితో); ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు అట్లా పలుకగా విని, అశ్వత్థామ అతనితో ఈ విధంగా అన్నాడు:

క. గురునకు నాకును బాండవు। లరయఁగఁ గూరిమికిఁ బాత్ర మగుదుర యైనన్
దురమునఁ జుట్టఱికంబను। గరు సిడికొను టేల కలుగుఁ? గౌరవనాథా! 123

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ఓ కురురాజా దుర్యోధనా!; గురునకున్= ద్రోణాచార్యులకు; నాకును= (అశ్వత్థామకు); అరయఁగన్= విచారిస్తే; పాండవులు= ధర్మరాజాదులు; కూరిమికిన్= ప్రేమకు; పాత్రము+అగుదురు+అ= తగినవారే; ఐనన్= అయినాకూడా; దురమునన్= యుద్ధంలో; చుట్టఱికంబు+అను= బంధుత్వమనే; గరుసు= మర్యాద; ఇడికొనుట= ఇచ్చికొనటం; ఏల= ఎట్లు; కలుగున్?= కలుగుతుంది?

తాత్పర్యం: ఓ దుర్యోధనా! ద్రోణాచార్యుడికీ, నాకూ పాండవులు ఇష్టులే. అయినా యుద్ధంలో బంధుత్వాలు లెక్కకేల వస్తాయి?

ఉ. పెక్కు రణంబులం గనియుఁ బెద్దయు నమ్మువు నన్ను మద్గురుం

దక్కినవారు మేము విను దాఁపము ప్రాణము లోపినట్లు పే
రుక్కునఁ బోర దైవగతి యున్నటు లుండెడుఁ గాక; పాండవుల్
మిక్కిలివారు నీ తలఁపు। మే గెలువన్ వశమే మహీశ్వరా! 124

ప్రతిపదార్థం: ఓ మహీశ్వరా!= ఓ రాజా!; పెక్కురణంబులన్= అనేక యుద్ధాలను; కనియున్= చూచికూడా; పెద్దయున్= పెద్దగా; నన్నున్ (అశ్వత్థామను); మద్గురున్= నా తండ్రి ద్రోణాచార్యులను; నమ్మవు= నమ్మటం లేదు; తక్కినవారున్= మిగిలినవారును; మేమున్= మేమును; ప్రాణములు= ప్రాణాలు; దాఁపము= దాచుకొనేవారం కాము; విను= వినుము; ఓపినట్లు= చేతనయినంతవరకు; పేరు+ఉక్కునన్= మిక్కిలి పౌరుషంతో; పోరన్= యుద్ధంచేయగా; దైవగతి= దైవం పోకడ; ఉన్నటులు= ఉండే తీరుగా; ఉండెడున్+కాక= ఉండనీ (దైవం తలచినట్లే జరిగేదేదో జరుగనీ, మా ప్రయత్నలోపం మాత్రం లేదని భావం); (ఎందుకనగా) పాండవుల్= పాండవులు; మిక్కిలివారు= అధికులు; నీ తలఁపు= నీ అభిప్రాయం; మే= ప్రకారం; గెలువన్ వశమే?= గెలుపు సాధ్యమవుతుందా? (సాధ్యం కాదని భావం)

తాత్పర్యం: 'ఓ రాజా! ఎన్నో యుద్ధాలలో నన్ను, మా తండ్రిని ద్రోణాచార్యులను విక్రమిస్తూ ఉంటే చూచి కూడా నీవు అంతగా నమ్మటం లేదు. మేముకాని, ఇతరులుకాని ప్రాణాలు దాచుకొని యుద్ధం చేసేవారం కాము. శ్రద్ధగా విను. మాకు సాధ్యమయినంతవరకు మహాపౌరుషంతో యుద్ధం చేస్తాం. ఆపై దైవం ఏం తలిస్తే అట్లా జరుగుతుంది. పాండవులు మిక్కిలి బలపరాక్రమశాలులు. నీ అభిప్రాయం ప్రకారం వారిని మేము జయించటం సాధ్యమను కొంటున్నావా?

వ. మా కిరువురకుం దోడు కృప కర్ణ కృతవర్మ మద్రపతులు గల రెట్లును బాండవ సైన్యంబు సమయింతు; మూఱడు' మని వెండియు. 125

ప్రతిపదార్థం: మాకున్+ఇరువురకున్= మా ఇద్దరికి; తోడు= సహాయంగా; కృప-కర్ణ-కృతవర్మ-మద్రపతులు= కృపాచార్యులు, కర్ణుడు, కృతవర్మ, శల్యుడు, కలరు= ఉన్నారు; ఎట్లును= ఏ విధంగానైనా; పాండవ సైన్యంబు= పాండవుల సైన్యాన్ని; సమయింతుము= నశింపజేస్తాము; ఊఱడుము= ఊరడిల్లండి; అని= ఇలా పలికి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: మా ఇద్దరికి తోడుగా కృపాచార్యులు, కర్ణుడు, కృతవర్మ, మద్రదేశాధిపతి శల్యుడు ఉన్నారు. పాండవ సైన్యాన్ని ఎలాగయినా నశింపజేస్తాము. మీరు శాంతించండి' అని పలికి మళ్ళీ (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'మమ్ము కాదు నీ వెవ్వరి నమ్మ; వెట్లు। నమ్మకున్నను నే మగు? నరవరేణ్య!
ప్రతిబలంబుల లోనికిఁ బసుల నడుమ। సొచ్చు పులివోలెఁ జొచ్చెదఁ జూడు నన్ను. 126

ప్రతిపదార్థం: నరవరేణ్య!= ఓ దుర్యోధనా!; నీవు; మమ్ము+అ కాదు= మా ముగ్గురినే కాదు; ఎట్లు= ఏ విధంగానైనా; ఎవ్వరిన్= ఎవ్వరిని కూడా; నమ్మవు= విశ్వసించవు; నమ్మక+ఉన్నను= నమ్మకపోయినప్పటికీ; ఏమి+అగున్?= ఏమవుతుంది? (నీవు విశ్వసించినా విశ్వసించకున్నా మా కర్తవ్యంలో ఏ మార్పు లేదని భావం); ప్రతిబలంబులలోనికిన్= శత్రుసైన్యాల లోపలికి; పసుల నడుమ+చొచ్చుపులి వలెన్= పశువుల మధ్యన చొచ్చే పెద్దపులి వలె; చొచ్చెదన్= ప్రవేశిస్తాను; నన్నున్ (అశ్వత్థామను); చూడు!= చూడుమా! (శత్రుసైన్యంలోనికి నేనెలా ప్రవేశించి విక్రమిస్తానో చూడుమని భావం).

తాత్పర్యం: ఓ రాజా! నీవు మమ్మేకాదు. ఎవ్వరినీ కూడా ఎట్లాగూ నమ్మవు. అయినా నీ నమ్మికతో మా కేమి

పని? ఇదిగో నే నిప్పుడు శత్రుసైన్యంలోనికి పశువులమంద నడుమ పులి ప్రవేశించినట్లు చొచ్చుకొనిపోయి విక్రమిస్తాను చూడుము.

విశేషం: అలం: ఉపమ. 'పసుల నడుమ సొచ్చు పులివోలె' అనే చోట ఉపమాలంకారం - దీనితో క్షణంలో శత్రుసైన్యసంహారం చేయటం ధ్వనిస్తూ ఉన్నది.

వ. నీచెప్పిన పాంచాలురం బఱపెదఁ, దక్కిన బలంబులం గలంచెదం; గౌంతేయులు దార్కొనినను మార్కొని నిలువరించెద' నని పలికి తలకడచి నడచె; నప్పుడు గడంగిన కవ్వడికి మించి పాంచాల కేకయ ప్రభృతిసేన లొక్కపెట్ట కవియుటయు, నా జెట్టి బిరుదు వివిధ విశిఖ పరంపరలు పరగించినన్ బడలు వడియును బలుదెసలం బాఱియు నబ్బలంబులు వికలంబు లైనఁ బదుండ్రు రాజులు నిలు నిలు మనుచుఁ బరవసంబు సేసిన, వారల జముని వశంబు సేసి యేచిన యయ్యాచార్యసుతుం జూచి రోషావిష్టుండై ధృష్టద్యుమ్నుండు దాఁకి 'నీవు గొందఱ నిర్జించితి నని దుర్జయత్వం బెక్కించుకొనకు; మేను జుమ్మ వచ్చినవాఁడ'ననుటయు నతండు 'నిన్నకాదె వెదకెద మద్బాణంబులకుఁ బ్రాణంబు లిత్తుగా' కనవుడు నప్పాంచాల వరుండతని నుపలక్షించి. 127

ప్రతిపదార్థం: నీ చెప్పిన పాంచాలురన్= నీవు నిర్దేశించినట్టి పాంచాలవీరులను; పఱపెదన్= పారిపోయేటట్లు చేస్తాను; తక్కిన బలంబులన్= మిగిలిన సైన్యాలను; కలంచెదన్= నొప్పిస్తాను; కౌంతేయులు= పాండవులు; తార్కొనినను= సమీపించినప్పటికీ; మార్కొని= ఎదిరించి; నిలువరించెదన్= కదలకుండా చేస్తాను; అని= ఈ విధంగా; పలికి= చెప్పి; తలకడచి= అతిక్రమించి; నడచెన్= వెళ్ళాడు (దుర్యోధనుడిని దాటవేసి వెళ్ళాడు యుద్ధానికని భావం); అప్పుడు= ఆ సమయాన; కడంగిన కవ్వడికిన్= తలపడుతూ ఉన్న అర్జునుడిని; మించి= అతిక్రమించి (అర్జునుడి కంటే ముందుగా అని భావం); పాంచాల కేకయ ప్రభృతి సేనలు= పాంచాల కేకయ మొదలగు దేశాల సైన్యాలు; ఒక్కపెట్టు+అ= ఒకేసారి; కవియుటయున్= ఎదుర్కొనగా; ఆ జెట్టి బిరుదు= ఆ శ్రేష్ఠవీరుడు (అశ్వత్థామ); వివిధ విశిఖ పరంపరలు= పలువిధాలైన బాణాల వరుసలను; పరఁగించినన్= వ్యాపింప జేయగా; బడలు పడియును= అలసట జెంది; పలుదెసలన్= నాలుగుదిక్కులా; పాఱియున్= పారిపోయి; ఆ+బలంబులు= ఆ సైన్యాలు; వికలంబులు+ఐనన్= చెల్లాచెదరు కాగా; పదుండ్రు రాజులు= పదుగురు (శత్రు) రాజులు; నిలుము+నిలుము+అనుచున్= ఆగు ఆగు అంటూ; బరవసంబు+చేసినన్= ధైర్యం చేయగా, ఎదిరించగా అని భావం; వారలన్= ఆ శత్రురాజులను; జముని వశంబు+చేసి= యముడి (మృత్యు) వశం చేసి - అనగా సంహరించి; ఏచిన+ఆ+ఆచార్యసుతున్= విజృంభిస్తున్న ఆ ద్రోణాచార్యుడి కుమారుడిని (అశ్వత్థామను); చూచి; రోష+ఆవిష్టుఁడు+ఐ= క్రోధావేశం గలవాడై; ధృష్టద్యుమ్నుండు= పాండవ సైన్యాధిపతి అయిన ధృష్టద్యుమ్నుడు; తాఁకి= ఎదుర్కొని; నీవు= ఓ అశ్వత్థామా! నీవు; కొందఱిన్= ఏ కొందరినో; నిర్జించితిన్+అని= జయించానని; దుర్జయత్వంబు= (శత్రువులకు) జయింప శక్యంకాని వాడననే భావాన్ని; ఎక్కించుకొనకుము= ఆరోపించుకొనకుము; ఏను+ చుమ్ము= నేను సుమీ!; వచ్చినవాఁడను= (నిన్ను ఎదుర్కొనటానికి) వచ్చిన వ్యక్తిని; అనుటయున్= అనగానే; అతండు= ఆ అశ్వత్థామ; నిన్నున్+అ= నిన్నే; వెదకెదన్= వెదుకుచున్నాను; కాదు+ఎ!= కాదా!; మత్+బాణంబులకున్= నా బాణాలకు; ప్రాణంబు= (నీ) ప్రాణాన్ని; ఇత్తు+కాక= ఇత్తువుగానీ; అనవుడున్= అనగానే; ఆ+పాంచాల వరుండు= ఆ ధృష్టద్యుమ్నుడు; అతనిన్= ఆ అశ్వత్థామను; ఉపలక్షించి= చూచి.

తాత్పర్యం: నీవు చెప్పినట్లు పాంచాలవీరులైన ధృష్టద్యుమ్నాదులను పారద్రోలుతాను. మిగిలిన సైన్యాలను కలచివేస్తాను. ఒకవేళ పాండవులే ఎదురైనా ఎదిరించి కదలకుండా చేస్తాను' అని దుర్యోధనుడితో అశ్వత్థామ పలికి, దుర్యోధనుడిని దాటవేసి యుద్ధానికి వెళ్ళాడు. ఆ సమయంలో అర్జునుడు తలపడటానికి ఉపక్రమించగా, అతడిని దాటి, పాంచాల కేకయ సైన్యాలు మరి ఇతర సైన్యాలు ఒకేసారి అశ్వత్థామను చుట్టుముట్టాయి. ఆ మహావీరుడైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అశ్వత్థామ ఆ సైన్యంపై బాణవర్షం కురిపించాడు. దానితో కొంత సైన్యం అలసి సొమ్మసిల్లింది. మరికొంత సైన్యం పారిపోయింది. మిగిలిన సైన్యం చెదరిపోయింది. అది చూచి కొంతమంది శత్రురాజులు 'నిలు నిలు' మని అంటూ ధైర్యం చేసి అశ్వత్థామను ఎదుర్కొన్నారు. వెంటనే అశ్వత్థామ వారినందరినీ యముడివశం చేసి విజృంభించగా, అతడిని చూచి ధృష్టద్యుమ్నుడు. వెంటనే క్రోధావేశంతో అశ్వత్థామతో తలపడి 'అశ్వత్థామా! నీవు ఏ కొందరినో జయించి దుర్జయుడినని అనుకోవద్దు. నీతో యుద్ధం చేయటానికి వచ్చింది నేను సుమా! అని అనగా, అందుకు అశ్వత్థామ 'నిన్నే కదా నేను వెదకుతున్నది. ఇక దొరికావు. నా బాణాలకు నీ ప్రాణాలను ఇత్తువులే!' అని ధృష్టద్యుమ్నుడితో అన్నాడు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు ఆ అశ్వత్థామను చూచి (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'ఏను జుమ్ము వచ్చిన వాఁడన్' ఈ ధృష్టద్యుమ్నుడి వాక్యంలోని 'ఏను' అనే పదం మీ తండ్రి వధకై పుట్టిన ధృష్టద్యుమ్నుడను అనే అర్థం ధ్వనిస్తూ ఉన్నది. ఇది అర్థాంతర సంక్రమిత వాక్యధ్వని. దీనితో 'మీ తండ్రినే సంహరించే శక్తి గల నాకు నీవొక లెక్కా?' అనే అర్థం ధ్వనించటంచేత ఇది వ్యంగ్యార్థంచేత భాసించే అర్థశక్తిమూల ధ్వని.

క. 'మీ తండ్రికి నే మృత్యువ । నై తోఁచినవాఁడ నగుట యట్లుండె; నినుం
జూత మట సనక డగ్గఱు । మా తలఁకక; వలదు రిత్తమాటలు మనకున్. 128

ప్రతిపదార్థం: మీ తండ్రికిన్= మీ తండ్రి ద్రోణాచార్యులకు; నేన్= నేను; మృత్యువను+ఐ= మృత్యుదేవతనై; తోఁచినవాఁడను= ఆవిర్భవించినవాడను; అగుటన్= కావటం; అట్లు+ఉండెన్= అట్లా ఉండనీ; నినున్= నిన్ను; చూతము= చూస్తాం; అట+చనక= అటుగా వెళ్ళక; తలఁకక= భయపడక అనగా ధైర్యంగా; డగ్గఱుమా= దగ్గరికి రా; మనకున్= మన ఇద్దరికి; రిత్తమాటలు= వ్యర్థ ప్రలాపాలు; వలదు= వద్దు.

తాత్పర్యం: 'మీ తండ్రి ద్రోణాచార్యులకు నేను మృత్యువుగా అవతరించాను - అది అట్లా ఉండనీ; నీ పరాక్రమ మెంతటిదో చూస్తాము. తొలగిపోక ఇటురమ్ము! మనమధ్య వ్యర్థప్రలాపాలతో పనిలేదు.

వ. అనియె నట్లయ్యిరువురును నొండొరులం బరుసంబులు పలుకుచుం బలు దెఱంగుల మెఱుంగుటమ్ముల నే ట్లాడి; రట్టియెడ. 129

ప్రతిపదార్థం: అనియెన్= అని అన్నాడు (ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామతో అన్నాడని భావం); ఇట్లు= ఈ విధంగా; ఆ+ఇరువురును= ఆ ఇద్దరు; ఒండొరులన్= పరస్పరంగా; పరుసంబులు= కఠినమైన మాటలు; పలుకుచున్= మాట్లాడుకొంటూ; పలు తెఱంగుల= అనేక విధాలైన; మెఱుంగు+అమ్ములన్= తళతళ మెరుస్తూ ఉన్న అనగా తీక్ష్ణములైన బాణాలతో; ఏట్లాడిరి= యుద్ధం చేశారు; అట్టి+ఎడన్= అప్పుడు.

తాత్పర్యం: అని ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామతో అన్నాడు: ఆ విధంగా వారిద్దరూ పరస్పరం పరుషాలు పలుకుతూ పలురకాలైన వాడిబాణాలతో యుద్ధం చేశారు. ఆ సమయంలో.

మ. ధనువుం గేతువుఁ ద్రుంచి, సారథిని రథ్యవ్రాతముం గూల్చి, యే
పునఁ బాంచాల తనూజు వెల్గొడుగు సొంపున్ వమ్ము గావించి, యా
తని పార్శ్వంబుల యోధవీరశతముం దన్మాన్యులన్ ముప్పురం
దునిమెన్ ద్రోణసుతుండు రాజు వొగడన్ దోర్వర్గ దుర్వారుఁ డై. 130

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సారథిని= రథసారథిని; రథ్యవ్రాతమున్= రథానికున్న గుఱ్ఱాల సమూహాన్ని (నాలుగు గుఱ్ఱాలను); కూల్చి= కూలజేసి; ఏపునన్= విజృంభణంతో అనగా విజృంభిస్తూ; పాంచాల తనూజు= పాంచాలరాజు కుమారుడైన ధృష్టద్యుమ్నుడియొక్క; వెల్+గొడుగు= శ్వేతచ్ఛత్రంయొక్క; సొంపున్= అందాన్ని; వమ్ముకావించి= వ్యర్థం చేసి - అనగా శ్వేతచ్ఛత్రాన్ని భగ్నంచేసి; ఆతని పార్శ్వంబులన్= ఆ ధృష్టద్యుమ్నుడి ఇరుపార్శ్వాలను అనగా పార్శ్వ రక్షకులను; యోధవీరశతమున్= నూరుగురు వీరయోధులను; తద్+మాన్యులన్= ఆ సేనలో శ్రేష్ఠులైన; ముప్వురన్= ముగ్గురు యోధులను; రాజు= దుర్యోధనుడు; పొగడన్= పొగడేటట్లు; దోర్గర్వదుర్వారుఁడు+ఐ= బాహుబలగర్వంచేత (శత్రువులకు) నివారింపశక్యం కానివాడై; తునిమెన్= సంహరించాడు.

తాత్పర్యం: అశ్వత్థామ ధృష్టద్యుమ్నుడి విల్లును, ధ్వజాన్ని తెగగొట్టాడు. సారథిని, రథానికున్న అశ్వాలను కూల గొట్టాడు. ఇంకా విజృంభించి అతడి శ్వేతచ్ఛత్రాన్ని ఖండించాడు. అంతేగాక అతడి పార్శ్వరక్షకులుగా, అతడికై యుద్ధం చేస్తూ ఉన్న నూరుమంది యోధులనేగాక ఆ సైన్యంలో ముఖ్యులైన ముగ్గురు యోధులను బాహుబల గర్వంతో నివారింప సాధ్యంకానివాడై దుర్యోధనుడు పొగడగా విక్రమించాడు.

వ. ఇవ్విధంబున వైరివధం బాపాదించి సింహనాదంబు సేసిన యశ్వత్థామ కట్టెదుర నిలువలేక పాండవ పాంచాల సైనికులు సెల్లాచెద రైనం గని ధర్మజ సమీరసూనులు ససైన్యంబుగా నతనిం బొదివినం గురుపతియును గురుసమేతుం డయి సేనలతోడ నడరినన్ బలుకయ్యంబయ్యె; నప్పుడు విజయుండును మన ప్రజమీఁదఁ గవిసె; నా సమయంబున నంబష్ఠ శిబివంగాది దేశంబుల బలంబులు భీమసేనుచేత మ్రగ్గె; నా సమయంబున మగధ మద్ర వంగాంబష్ఠాది దేశంబుల బలంబుల సవ్యసాచి సమయించినం గని కినిసి ద్రోణుండు వాయవ్య బాణంబునఁ గౌంతేయుల మొనలఁ జొక్కాకుల చందంబునం దూలం జేసిన.131

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; వైరివధంబు= శత్రుసంహారాన్ని; ఆపాదించి= చేసి; సింహనాదంబు= సింహ నాదాన్ని; చేసిన+అశ్వత్థామ కట్టెదురన్= చేసినటువంటి అశ్వత్థామ ముందర; నిలువలేక= నిలువటానికి సామర్థ్యం లేక;పాండవ పాంచాల సైనికులు= పాండవుల సైన్యాలు, పాంచాల సైన్యాలు కూడా; చెల్లాచెదరు+ఐనన్= మిక్కిలి చెదరిపోగా; కని= చూచి; ధర్మజ సమీరసూనులు= ధర్మతనయ వాయునందనులు (ధర్మరాజు భీముడు - ఈ ఇద్దరు); ససైన్యంబుగాన్= సైన్యంతో సహా (వచ్చి); అతనిన్= ఆ అశ్వత్థామను; పొదివినన్= ఎదిరించగా; కురుపతియును= కురురాజు దుర్యోధనుడు కూడా; గురు సమేతుండు+అయి= ద్రోణాచార్యసహితుడై; సేనలతోడన్= సైన్యంతో (వచ్చి); అడరినన్= విజృంభించగా; బలుకయ్యంబు+అయ్యెన్= గొప్ప యుద్ధం జరిగింది; అప్పుడు= ఆ సమయంలో; విజయుండును= అర్జునుడు కూడా; మన ప్రజమీఁదన్= మన సేనాజనంపై; కవిసెన్= లంఘించాడు; ఆ సమయంబునన్= అదే సమయంలో; మగధ, మద్ర, వంగ, అంబష్ఠ ఆది - దేశంబుల బలంబులు= మగధదేశం, మద్రదేశం, వంగదేశం, అంబష్ఠదేశం మొదలైన దేశాలనుండి వచ్చిన సైన్యాలు; సవ్యసాచి= అర్జునుడు; సమయించినన్= సంహరించగా; కని= చూచి; కినిసి= కోపించి; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; వాయవ్య బాణంబునన్= వాయువు - దేవతగా గలిగిన బాణంతో - అనగా వాయవ్యాస్త్రంతో; కౌంతేయుల మొనలన్= పాండవుల సైన్యాలను; చొక్కాకుల చందంబునన్= ఎండుటాకులవలె; తూలన్+చేసినన్= చెదరిపోయే విధంగా చేయగా.

తాత్పర్యం: ఈ విధంగా శత్రుసంహారం చేసి సింహనాదం చేసిన అశ్వత్థామను ఎదిరించి యుద్ధం చేయలేక పాండవ పాంచాల సైనికులు చెల్లాచెదరైపోయారు. అది చూచి ధర్మరాజు భీముడు సేనాసహితంగా వచ్చి అతడిని ఎదుర్కొన్నారు. ఇది గమనించిన దుర్యోధనుడు ద్రోణాచార్యులను వెంట నిడుకొని గొప్ప సైన్యంతో వచ్చి వారిపై విజృంభించాడు. యుద్ధం ఘోరంగా జరిగింది. అప్పుడు అర్జునుడు కూడా మన సైన్యంమీద విజృంభించాడు. అంతలోనే అంబష్ఠ శిబి వంగాది దేశాల సైన్యాలు భీమునిచేత చచ్చాయి. అప్పుడే అర్జునుడు మగధ మద్ర వంగదేశాల సైన్యాలతో పాటు ఇతర దేశాల సైన్యాలను కూడ సంహరించాడు. అది చూచి ద్రోణుడు కోపించి వాయవ్యాస్త్రాన్ని పాండవసైన్యంపై సంధించి సైన్యాన్ని ఎండుటాకుల వలె పడగొట్టగా (తరువాతి పద్యంతో అన్వయం).

సోమదత్తుఁడు సాత్యకితో యుద్ధంబు సేసి చచ్చుట (సం.7-136-12)

క. **'అలిగి నరుఁడు భీముఁడు నిరు। గెలఁకుల నయ్యస్త్రగురునిఁ గిట్టి శరౌఘం**
బులఁ దేల్చిన మగుడ ననికిఁ। దలకొని వడి నురవడించెఁ దత్సైన్యంబుల్. **132**

ప్రతిపదార్థం: నరుఁడున్= అర్జునుడూ; భీముఁడున్= భీమసేనుడూ; అలిగి= కోపించి; ఇరు+కెలఁకులన్= రెండువైపుల; ఆ+ అస్త్రగురునిన్= అస్త్రవిద్యాగురుడైన ఆ ద్రోణాచార్యుడిని; కిట్టి= చేరి; శర+ఓఘంబులన్= బాణాల ప్రవాహాలతో; తేల్చినన్= తేల్చగా; మగుడన్= మళ్ళీ; తత్సైన్యంబుల్= ఆ పాండవసైన్యాల; అనికిన్= యుద్ధానికి; తలకొని= సిద్ధపడి; వడిన్= వేగంగా; ఉరవడించెన్= విజృంభించాయి.

తాత్పర్యం: అర్జునుడూ, భీముడూ కోపించి ఆ ద్రోణాచార్యుడికి రెండువైపుల చేరి, అతడిని బాణాల ప్రవాహంలో ముంచెత్తారు. ఆ పాండవసైన్యాలు మళ్ళీ యుద్ధానికి తలపడి, వేగంగా విజృంభించాయి.

తే. **అధిపతియు నస్త్రగురుఁడు బేరగ్గలికలఁ। దఱుమఁ జతురంగములుఁ బేర్చి యుఱక వారి**
మొనలతోఁ దాఁకి గాండీవ ముక్త విశిఖ। శిఖల వేఁడిమి కోటఱి చెదరి పఱచె. **133**

ప్రతిపదార్థం: అధిపతియున్= కురురాజు దుర్యోధనుడును; అస్త్రగురుఁడున్= ద్రోణాచార్యుడును; పేరు+అగ్గలికలన్= గొప్ప ఉత్సాహాలతో; తఱుమన్= తరుముతూ ఉండగా; చతురంగములున్= చతురంగ సైన్యాలు; పేర్చి= విజృంభించి; ఉఱక= లక్ష్య పెట్టక; వారిన్= వారిని; మొనలతోన్= సేనలతో; తాఁకి= ఢీకొని; గాండీవ= గాండీవమనే అర్జునుడి వింటినుండి; ముక్త= విడువ బడిన; విశిఖ= బాణాలయొక్క; శిఖల వేఁడిమికిన్= జ్వాలల వేడికి; ఓటఱి= బలహీనమై; చెదరి పఱచెన్= చెదరిపోయి పరుగెత్తాయి (పాండవుల సేనలపై పడిన కౌరవసేనలు అర్జునుడి బాణజ్వాలలకు తట్టుకొనలేక చెల్లాచెదరై పరుగులు తీశాయని భావం).

తాత్పర్యం: కురురాజు దుర్యోధనుడూ, కుమారుల అస్త్రవిద్యా గురువు ద్రోణుడూ పెద్ద ఉత్సాహంతో (పాండవుల సైన్యాలను) తరుముతూ ఉంటే మీ చతురంగబలాలు కూడా పాండవసేనపై విజృంభించాయి. ఆ సమయంలో అర్జునుడు తన గాండీవ ధనువునుండి విడిచిన బాణజ్వాలలవేడికి బలహీనపడి మీ సైన్యాలు చెల్లాచెదరైపారిపోయాయి.

వ. **అట్టియెడ సోమదత్తుండు సమరోల్లాసంబునం బాండవ సైనికుల 'నిలు నిలు' మని యదల్చుచు నిల్చినం గనుంగొని సాత్యకి యతనితోడం దలపడినం దత్సంగ్రామంబు భీమం బయ్యె నందు.** **134**

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయాన; సోమదత్తుండు= భూరిశ్రవసుడి తండ్రి సోమదత్తుడు; సమర+ఉల్లాసంబునన్=

యుద్ధోత్సాహంతో; పాండవ సైనికులన్= పాండవుల సైనికులను; నిలుము+నిలుము+అని= ఆగండి ఆగండి అని; అదల్చుచున్= బెదరిస్తూ; నిల్చినన్= నిలువగా; కనుంగొని= చూచి; సాత్యకి; అతనితోడన్= ఆ సోమదత్తుడితో; తలపడినన్= ఢీకొనగా; తద్+సంగ్రామంబు= ఆ యుద్ధం; భీమంబు+అయ్యెన్= భయంకరంగా సాగింది; అందున్= ఆ యుద్ధంలో.

తాత్పర్యం: ఆ సమయంలో సోమదత్తుడు యుద్ధోత్సాహంతో పాండవ సైనికులను ఎదుర్కొని నిలునిలుమని అదలిస్తూ నిలబడగా, సాత్యకి చూచి, అతడితో యుద్ధానికి తలపడ్డాడు. ఆ యుద్ధం భయంకరమైంది. ఆ యుద్ధంలో.

సీ. **సాత్యకి వి ల్లర్ధచంద్ర బాణంబున । నఱికి యా బాహ్లిక నందనుండు**
ముప్పదేనమ్ముల నొప్పింప, నత డొండు । విలు గొని యాతని నలుఁగుటమ్ము
లైదింట నేసి మహారజత, ధ్వజం । బిలఁ గూల్చి ధనువు; సెక్కలుగఁ జేసెఁ
జిఱునవ్వుతో నాతఁ డుఱక వేఱొక వింట । నేట్లాడఁగా భీముఁ డేసె నపుడు

తే. **దాఁకి మీ తండ్రిపై ఘటోత్కచుఁడు వైచెఁ । బరిఘమును; నది దునిమె నక్కురువరేణ్యుఁ;**
డపుడు హయ సారథులఁ జంపి యతని యుసురు । గొనియె బలు నారసమున నా శినివరుండు.135

ప్రతిపదార్థం: ఆ బాహ్లిక నందనుండు= ఆ సోమదత్తుడు; సాత్యకి విల్లు= సాత్యకి ధనువును; అర్ధచంద్ర బాణంబునన్= అర్ధచంద్రాకార బాణంతో; నఱికి= తెగగొట్టి; ముప్పదేను+అమ్ములన్= ముప్పదిఅయిదు బాణాలతో; నొప్పింపన్= నొప్పి పుట్టిస్తూ ఉండగా; అతండు= ఆ సాత్యకి; ఒండువిల్లు= రెండో ధనుస్సును; కొని= తీసికొని; ఆతనిన్= ఆ సోమదత్తుడిని; అలుఁగు+అమ్ములు+ఐదింటన్= అయిదు తీక్ష్ణములైన బాణాలతో; ఏసి= కొట్టి; మహారజతధ్వజంబు= బంగారు ధ్వజాన్ని; ఇలన్= భూమి మీద; కూల్చి= కూలగొట్టి; ధనువు= విల్లును; చెక్కలుగన్= ముక్కలుగా; చేసెన్= చేశాడు; చిఱునవ్వుతోన్= మందహాసంతో; అతఁడు= ఆ సోమదత్తుడు; ఉఱక= లక్ష్యపెట్టక; వేఱు+ఒకవింటన్= మరియొక ధనువుతో; ఏట్లాడఁగాన్= యుద్ధం చేస్తూ ఉంటే; అపుడు= అదే సమయంలో; భీముఁడు= భీమసేనుడు; తాఁకి= ఢీకొని; మీ తండ్రిపైన్= మీకు తండ్రి వరుసయైన సోమదత్తుడిపై; ఏసెన్(బాణాలు) వేశాడు - అనగా కొట్టాడు; మరియున్ ఘటోత్కచుఁడు= ఘటోత్కచుడు కూడా; పరిఘమును= పరిఘమనే ఆయుధాన్ని (ముండ్ల గుదియను); వైచెన్= వేశాడు; ఆ+కురువరేణ్యుఁడు= ఆ సోమదత్తుడు; అది= ఆ పరిఘాయుధాన్ని; తునిమెన్= తుత్తునియలు చేశాడు; అపుడు= ఆ సమయంలో; ఆ శినివరుండు= ఆ సాత్యకి; హయసారథులన్= (ఆ సోమదత్తుడి) రథాశ్వాలను రథసారథిని కూడా; చంపి= సంహరించి; అతని+ఉసురున్= ఆ సోమదత్తుడి ప్రాణాన్ని; బలునారసమునన్= బలువైన బాణంతో; కొనియెన్= గ్రహించాడు (సంహరించాడని భావం).

తాత్పర్యం: ఆ సోమదత్తుడు అర్ధచంద్రాకార బాణంతో సాత్యకి వింటిని నరికి, ముప్పయి అయిదు బాణాలతో అతడిని నొప్పించాడు. సాత్యకి మరొక వింటిని తీసికొని, అయిదు వాడిబాణాలు సోమదత్తుడిమీదవేసి, గొప్పదైన అతడి వెండిటెక్కాన్ని నేలగూల్చాడు. విల్లు ముక్కలు చేశాడు. సోమదత్తుడు చిరునవ్వుతో, ధైర్యంగా వేరొక వింటిని చేపట్టి బాణాలను ప్రయోగించాడు. అప్పుడు భీముడు సోమదత్తుడిని ఎదుర్కొన్నాడు. ఘటోత్కచుడు పరిఘను వేశాడు. దానిని సోమదత్తుడు భగ్నం చేశాడు. అంతలో సాత్యకి బలమైన బాణంతో సోమదత్తుడి గుర్రాలను, సారథిని చంపి, అతడి ప్రాణాలను తీశాడు.

విశేషం: 'అపుడు తాఁకి మీ తండ్రిపై' అనే వాక్యం దేహళీ దీప న్యాయంగా వెనుకముందులకు అన్వయిస్తుంది. 'అపుడు తాఁకి మీ తండ్రిపై భీముడు ఏసెన్' అని, 'అపుడు తాఁకి మీ తండ్రిపై ఘటోత్కచుడు పరిఘమును వైచెన్' అని కూడా వాక్యార్థం ఏర్పడుతుంది. ఈ వాక్యార్థం ఏర్పడటానికే 'మరియు' అనే మాటతో వాక్యయోజనం చేసి వ్యాఖ్యానించటం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **మారుతి యిమ్మెయి నక్కురు । వీరునిఁ జంపించి మోము వికసిల్లఁగఁ దాఁ**
బోరెడు నెప్పటి మునుము మ । హీరమణుల మీఁదఁ దఱిమె నిభపురనాథా! 136

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= ఓ హస్తినపుర ప్రభువా! - ధృతరాష్ట్రా!; మారుతి= వాయునందనుడు భీముడు; ఈ+మెయిన్= ఈ విధంగా; ఆ+కురువీరునిన్= ఆ కౌరవవంశవీరుడైన సోమదత్తుడిని; చంపించి= సంహరింపజేసి; మోము= ముఖం; వికసిల్లఁగన్= వికాసాన్ని అనగా సంతోషాన్ని పొందగా; తాన్= తాను; పోరెడు= యుద్ధం చేస్తూ ఉన్న; ఎప్పటి మునుము= ఇంతకు ముందటి వరుసలో నున్నటువంటి; మహీరమణుల మీఁదన్= రాజులపైకి; తఱిమెన్= పరుగుతీశాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీముడు ఈ విధంగా ఆ సోమదత్తుడిని సాత్యకిచేత చంపించి, తానెంతో సంతోషించి, తాను అంతకుముందు యుద్ధం చేస్తూ ఉన్న రాజులపైకి పరుగుతీశాడు.

ఉ. **చచ్చిన సోమదత్తుఁ గని సాత్యకిపై మనవారు గ్రమ్మినం**
జెచ్చెర ధర్మజుం డతనిఁ జేకొని వారలఁ దూలఁ దోలుడున్
వచ్చి గురుండు విల్ నఱకి వైచి సిడంబును డొల్లఁ జేసి మే
నుచ్చి చనంగ నేయ నతఁ డుద్భట రోష మహోగ్ర మూర్తి యై. 137

ప్రతిపదార్థం: చచ్చిన సోమదత్తున్= మరణించిన సోమదత్తుడిని; కని= చూచి; సాత్యకిపైన్= సోమదత్తుడిని సంహరించిన ఆ సాత్యకిపై; మనవారు= మన కౌరవ పక్షీయులైన యోధులు; క్రమ్మినన్= చుట్టుముట్టగా; చెచ్చెఱన్= వేగంగా; ధర్మజుండు= ధర్మరాజు; అతనిన్= ఆ సాత్యకిని; చేకొని= ఆదుకొని; వారలన్= ఆ కౌరవయోధులను; తూలన్= తొలగిపోయేటట్లు; తోలుడున్= తోలగా; గురుండు= ద్రోణాచార్యుడు; వచ్చి= సమీపించి; విల్= ఆ ధర్మరాజు విల్లు; నఱకివైచి= విరగగొట్టి; సిడంబును= ధ్వజాన్ని; డొల్లన్+చేసి= పడగొట్టి; మేన్= శరీరాన్ని; ఉచ్చి చనంగన్= క్రుచ్చుకొని బయట వెడలేటట్లుగా; ఏయన్= బాణాన్ని ప్రయోగించగా; అతఁడు= ఆ ధర్మరాజు; ఉద్భటరోష మహోగ్రమూర్తి ఐ= పెద్ద కోపంతో భయంకరమైన ఆకారం గలవాడై.

తాత్పర్యం: సోమదత్తుడు మరణించటం చూచి, మనవారు సాత్యకిమీద దండెత్తగా, అది గమనించిన ధర్మరాజు వెంటనే సాత్యకిని ఆదుకొని, మన యోధులను తొలగచేశాడు. అంతలోనే ద్రోణుడు వచ్చి ధర్మరాజు విల్లు నరికి ధ్వజాన్ని పడగొట్టి అతని శరీరం తూట్లు పడేవిధంగా బాణాలు ప్రయోగించాడు. దానితో ధర్మరాజు మహాకోపంతో భయంకరరూపం తాల్చి,

క. **వేఱొక విలు గొని యెమ్ముల । గీఱ మెఱుఁగు నారసముల గిఱికొలిపిన నో**
టాఱి మెయిం గ్రొన్నెత్తురు । పాఱ నతఁడు దేరిమీఁదఁ బడి మూర్ఛిల్లెన్. 138

ప్రతిపదార్థం: వేఱు+ఒక= మరియొక; విలు= ధనుస్సును; కొని= తీసికొని; ఎమ్ములన్= ఎముకలను; గీఱన్= ఒరసి నొప్పి పుట్టేవిధంగా; మెఱుఁగు నారసములు= తీక్ష్ణములైన బాణాలను; గిఱికొలిపినన్= నాటగా; ఓటారి= బలాన్ని కోల్పోయి; మెయిన్= శరీరమందు; క్రొన్నెత్తురు= క్రొత్త నెత్తురు; పాఱన్= ప్రవహించగా; అతఁడు= ఆ ద్రోణాచార్యులు; తేరిమీఁదన్= రథంమీద; పడి= పడిపోయి; మూర్ఛిల్లెన్= మూర్ఛపోయాడు.

తాత్పర్యం: ఇంకొక ధనుస్సు తీసుకొని ఎముకలకు గుచ్చుకొనే విధంగా ద్రోణుడి శరీరంలో వాడిబాణాలు నాటాడు. దానితో బలం కోల్పోయి ద్రోణుడు శరీరంమీద క్రొత్త నెత్తురు ప్రవహించగా, ఆ రథంమీదనే తూలిపడి మూర్ఛపోయాడు.

వ. కొండొక సేపునకు సేద దీఱి యక్కుంభసంభవుండు విజృంభించి వాయుదైవత్యం బగు శరం బేయుటయు నా భూవిభుండు దద్దేవతాకంబగు సాయకంబున శమియింపం జేసి పెల్లేసినం గని కృష్ణుం డతని కి ట్లనియె. 139

ప్రతిపదార్థం: కొండొక సేపునకున్= కొంతసేపటికి; సేద+తీఱి= తెప్పరిల్లి; ఆ+కుంభసంభవుండు= ఆ ద్రోణాచార్యుడు; విజృంభించి= చెలరేగి; వాయుదైవత్యంబు+అగు= వాయువు దేవతగా గలిగిన; శరంబు= బాణాన్ని; ఏయుటయున్= ప్రయోగించగానే; ఆ భూవిభుండు= ఆ ధర్మరాజు; తద్+దేవతాకంబు+అగు= ఆ వాయుదేవతాకమైన; సాయకంబునన్= బాణం అనగా అస్త్రంతో; శమియింపన్+చేసి= శాంతింపజేసి; పెల్లు+ఏసినన్= ఎక్కువగా (బాణాలతో) కొట్టగా; కని= చూచి; కృష్ణుండు; అతనికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: కొంతసేపటికి ద్రోణాచార్యుడు మూర్ఛనుండి తేరుకొని మళ్ళీ చెలరేగాడు. పాండవసేనపై వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. అది చూచి ధర్మరాజు తానుకూడా వాయవ్యాస్త్రాన్నే ప్రత్యస్త్రంగా ప్రయోగించి, దానిని శమింపజేశాడు. అంతేగాక ఎన్నో బాణాలు అతడిపై గుప్పించాడు. అది చూచి కృష్ణుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

క. 'నినుఁ బట్టఁ గుంభజుండు ప్ర । తిన సేయు టెఱుంగు; దతనిఁ దేఁకువ సెడి మా
ర్కొనఁ దగదు; నీకు భీముం । డని సేయు మొగమునఁ బొదువు మక్కురుసేనన్. 140

ప్రతిపదార్థం: (ఓ ధర్మరాజా!) నినున్= నిన్ను; పట్టన్= పట్టివేయటానికి (బంధించటానికి అని భావం); కుంభజుండు= ద్రోణుడు; ప్రతిన+చేయుట= ప్రతిజ్ఞ చేయటం; ఎఱుగుదు(వు)= తెలిసినవాడవు (కావున); అతనిన్= ఆ ద్రోణుడిని; తేఁకువ= భయం; చెడి= నశించి; మార్కొనన్= ఎదిరించటానికి; నీకున్ తగదు (కాబట్టి); భీముండు; అని= యుద్ధం; చేయు మొగమునన్= చేసే వైపున; ఆ+కురుసేనన్= ఆ కౌరవసైన్యాన్ని; పొదువుము= ఎదిరించుము.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ద్రోణుడు నిన్ను పట్టుకొంటానని ప్రతిజ్ఞ చేయటం నీకు తెలుసు. అటువంటప్పుడు భయం వీడి నీ వతడితో యుద్ధానికి తలపడటం తగదు కాబట్టి, భీముడు యుద్ధం చేసే వైపునకు వెళ్ళి కౌరవసైన్యాన్ని ఎదిరించుము.

తే. ఇతని వధియించుటకు జనియించె నెవ్వఁ । డతఁడ యీతని తోడఁ బోరాడుఁ గాక!'
యనుడు నొక్కింత యూహించి యాన్నృపాలుఁ । డరిగె; ద్రోణుండు ద్రుపద సైన్యమున కడరె. 141

ప్రతిపదార్థం: ఎవ్వఁడు= ఏ ధృష్టద్యుమ్నుడయితే; ఇతనిన్= ఈ ద్రోణుడిని; వధియించుటకున్= వధించటానికి; జనియించెన్= పుట్టాడో; ఆతఁడు+ఆ= ఆతడే; ఈతనితోడన్= ఈ ద్రోణుడితో; పోరాడున్+కాక= యుద్ధం చేయనీ (నీవు మాత్రం ఆ ద్రోణుడితో పోరాడవద్దు అని అవధారణార్థక 'అ' కారంచేత ధ్వనిస్తూ ఉన్నది); అనుడున్= అనగానే; ఒక్కింత= ఒక్కక్షణం; ఊహించి= ఆలోచించి; ఆ నృపాలుఁడు= ఆ ధర్మరాజు; అరిగెన్= (ఆ వైపునకు) వెళ్ళాడు; (ఇక) ద్రోణుండు= ద్రోణాచార్యుడు; ద్రుపదు సైన్యమునకున్= పాంచాల సైన్యానికై; అడరెన్= విజృంభించాడు. (పాంచాల సైన్యంతో యుద్ధం చేయటానికి తలపడ్డా డని భావం.)

తాత్పర్యం: ఈ ద్రోణుడిని సంహరించటానికి ఏ ధృష్టద్యుమ్నుడయితే పుట్టాడో అతడే ఇతడితో పోరు సలుపుతాడు. నీవు వద్దు' అని కృష్ణుడు పలుకగానే ధర్మరాజు ఒక క్షణం విచారించి, భీముడు యుద్ధం చేసే వైపు వెళ్ళాడు. ఇక ద్రోణుడు కూడా పాంచాల సైన్యంతో యుద్ధానికి పూనుకొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్లు సని యుధిష్ఠిరుండు దన తమ్మునకుఁ బెను బ్రాపయ్యె; నయ్యనిలసుతుండును సాత్యకియు ధృష్టద్యుమ్నుండును బరవసంబు సేసినఁ గృప కర్ణ కలశభవులు గడఁగి; రయ్యుభయ సైనికోత్తములు సంరంభంబునం బేర్చిన సైన్యద్వయంబును రయంబునం గలయన్ బెరసినం బెందూళి యెగసి తఱితోఁ గవియుదెంచు దమంబునకుం దోడుపడి చూడ్కులు నిగుడనీకున్నను దమకంబునం దమ తమ పేళ్ళు బిరుదులు నుగ్గడించుచు నగ్గలిక సొంపునను సన్నల నుద్దేశంబుల నద్దెస నిద్దెస వీరులు వోరుచుండ నంధకారం బతిసాంద్రంబై చిక్కుపఱిచె; నట్టియెడ బిట్టడరి పాండవు లుద్దండ బాహాసంపదలు సూపిన నేపఱి కౌరవబలంబులు గలఁగి చీకాకు పడి చీఁకటి కతంబునం గూడుకొనంగానక పలుదెసలఁ దొలంగి పొలుపఱిన నయ్యాచార్యుండు ధైర్యంబు మెఱయ దుర్యోధనుం గూర్చుకొని యుద్దామ సామర్థ్యంబున సకల చతురంగంబులం బూఁచున ట్లొనర్చి యొక్క మోహరంబుగా నమర్చి, యం దగ్రభాగంబునం దాను నిలిచి యిరు గెలంకుల నశ్వత్థామ సౌబలుల నునిచి నడుకొన శల్యు నిలిపి యన్నరేంద్రుండు వెన్నుదన్ని నిలుచునట్లు సేసె ననుటయు; ధృతరాష్ట్రుండు సంజయునితో నిత్తెఱంగునం బన్ని బహుల తిమిరంబున సమరం బెట్లు సేసి రని యడిగిన నతం డతని కిట్లను - నా సమయంబున నక్కురు భూపాలుఁడు దమ కాలుబలంబుల నెల్ల నాయుధంబులు పెట్టి దివియలు పట్ట నియోగించిన. 142

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; చని= వెళ్ళి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; తన తమ్మునకున్= తన సోదరుడైన భీమసేనునకు; పెనుప్రాపు+అయ్యెన్= పెద్ద అండ అయ్యాడు; ఆ+అనిలసుతుండును= ఆ వాయునందనుడు - భీముడు; సాత్యకియున్= సాత్యకీ; ధృష్టద్యుమ్నుండును= ధృష్టద్యుమ్నుడూ; బరవసంబు+చేసినన్= ధైర్యం చూపగా; కృప కర్ణ కలశభవులు= కృపుడు, కర్ణుడు, ద్రోణుడు; కడంగిరి= (యుద్ధం చేయటానికి) పూనుకొన్నారు; ఆ+ఉభయ సైనికోత్తములు= ఆ ఇరువైపులలోని యోధ శ్రేష్ఠులు; సంరంభంబునన్= తొందరగా; పేర్చిన సైన్యద్వయంబును= మోహరించిన రెండు సేనలు; రయంబునన్= వేగంగా; కలయన్= అంతటను; బెరసినన్= వ్యాపించగా; పెందూళి= పెద్ద దుమ్ము; ఎగసి= పైకి లేచి; (ఏం చేసిందంటే); తఱితోన్= అదనుతో- ఆ సమయాన; కవియుదెంచు= అలముకొన్న; తమంబునకున్= చీకటికి; తోడుపడి= సహాయపడి; చూడ్కులు= చూపులను; నిగుడనీకున్నను= ప్రసరింపజేయకుండా ఉన్నప్పటికీ (చీకటికి ధూళి తోడై కంటిచూపును ఆనకుండా చేసినప్పటికి కూడా అని భావం); తమకంబునన్= ఉత్సాహంతో; తమ తమ పేళ్ళు= తమ తమ నామధేయాలను; బిరుదులను= శౌర్య చిహ్నంగా వచ్చిన మారుపేర్లను; ఉగ్గడించునన్= పేర్కొంటూ; అగ్గలిక సొంపునను= ఉత్సాహాధిక్యంతో (యుద్ధం చేయాలనే ఉత్సాహం మిక్కుటంగా ఉన్నది కాబట్టి అని భావం); సన్నలన్= సంజ్ఞలతో; ఉద్దేశంబులన్= ఊహలతో; ఆ+దెసన్= ఆ వైపున; ఈ+దెసన్= ఈ వైపునను; వీరులు= యోధులు; పోరుచుండన్= యుద్ధం చేస్తూ ఉండగా; అంధకారంబు= చీకటి; అతిసాంద్రంబు+ఐ= మిక్కిలి దట్టమై; చిక్కు+పఱిచెన్= చిక్కు కలుగజేసింది (ఆ దట్టమైన అంధకారం స్వ పర భేదాన్ని గుర్తించకుండా చేసి చిక్కుపెట్టిందని భావం); అట్టి+ఎడన్= ఆ సమయంలో; బిట్టు= మిక్కిలి; అడరి= విజృంభించి; పాండవులు= ధర్మరాజాదులు; ఉద్దండ బాహాసంపదలు= గొప్ప భుజబల శోభలను - అనగా గొప్ప భుజ పరాక్రమాన్ని; చూపినన్= చూపగా; ఏపు+అఱి= ఆధిక్యం తగ్గి; కౌరవబలంబులు= కౌరవసేనలు; కలఁగి= కలతజెంది; చీకాకుపడి= చెదరిపోయి; చీఁకటి కతంబునన్= చీకటి కారణాన; కూడుకొనన్+కానక= ఒకచోట గుమిగూడలేక; పలుదెసలన్= పలు దిక్కులకు; తొలంగి= తొలగిపోయి (అనగా పారిపోయి); పొలుపు= ఒప్పు; అఱినన్= నశించిపోగా; ఆ+ఆచార్యుండు= ఆ ద్రోణాచార్యుడు; ధైర్యంబు= ధీరభావం; మెఱయన్= ప్రకాశిస్తూ ఉండగా; దుర్యోధనున్= కురురాజు దుర్యోధనుడిని; కూర్చుకొని= వెంట పెట్టుకొని; ఉద్దామ సామర్థ్యంబునన్= గొప్ప సామర్థ్యంతో; సకల చతురంగంబులన్= సమస్తమైన చతురంగసైన్యాన్ని; పూఁచునట్లు+ఒనర్చి= (యుద్ధానికి) పూనుకొనే విధంగా చేసి; ఒక్క మోహరంబుగాన్= ఒక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యూహంగా; అమర్చి= ఏర్పరచి; అందున్= ఆ వ్యూహంలో; అగ్రభాగంబునన్= ముందటిభాగంలో; తాను= ద్రోణుడు తనకు తాను; నిలిచి= ఉండి; ఇరు+కెలంకులన్= రెండువైపుల అనగా రెండు ప్రక్కలలో; అశ్వత్థామ సౌబలులన్= అశ్వత్థామను, శకునిని; ఉనిచి= ఉంచి; నడుకొనన్= నడిమి ప్రదేశాన; శల్యున్= శల్యుడిని; నిలిపి= ఉంచి; ఆ+నర+ఇంద్రుండు= ఆ దుర్యోధనుడు; వెన్నుదన్ని= వెంబడించి; నిలుచునట్లు= నిలిచేవిధంగా - సైన్యాన్ని అనుసరిస్తూ అన్ని కోణాలనుండి రక్షిస్తూ ఉండే విధంగా అని భావం; చేసెన్= చేశాడు; అనుటయున్= అని చెప్పగానే; ధృతరాష్ట్రుండు; సంజయునితోన్= ఈ భారతకథను చెపుతున్న సంజయుడితో (ఇట్లా అడిగాడు); ఈ+తెఱంగునన్= ఈ విధంగా; పన్ని= (సైన్యాన్ని) మోహరించి; బహులతిమిరంబునన్= చిమ్మచీకటిలో; సమరంబు= యుద్ధం; ఎట్లు= ఏ విధంగా; చేసిరి?= చేశారు?; అని= ఈ విధంగా; అడిగినన్= అడుగగా; అతండు= సంజయుడు; అతనికిన్= ధృతరాష్ట్రుడితో; ఇట్లు; అనున్= అన్నాడు; ఆ సమయంబునన్= చీకటి అలుముకొన్న ఆ సమయాన; ఆ+కురుభూపాలుఁడు= ఆ కురురాజు దుర్యోధనుడు; తమ కాలుబలంబులన్+ఎల్లన్= తమ పదాతిదళాన్నంతా; ఆయుధంబులు= ఆయుధాలను; పెట్టి= క్రిందపెట్టి - విడిచి అని భావం; దివియలు= దివిటీలను; పట్టన్= పట్టుకొనటానికి; నియోగించినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఈ విధంగా ఆ ధర్మరాజు వెళ్ళి తన తమ్ముడు భీముడికి పెద్దఅండగా నిలిచాడు. ఇక ఆ భీముడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు - ఈ ముగ్గురు ఎదుర్కొంటూ ఉంటే కృపుడు, కర్ణుడు, ద్రోణుడు వారితో యుద్ధానికి తలపడ్డారు. ఆ ఇరుపక్షాల యోధముఖ్యులు వెంటనే సైన్యాన్ని సమాయత్తం చేశారు. రెండుపక్షాల సైన్యాలు కలియబడ్డాయి. దానితో పెద్ద ధూళి చెలరేగి ఆ సమయాన అలముకొన్న చీకటికి తోడుకాగా సైనికులకు చూపు అగపడకున్నా, యుద్ధోత్సాహంతో తమ తమ పేర్లు బిరుదులు పేర్కొంటూ సంజ్ఞలతో ఊహలతో గుర్తించి ఇరువైపుల యుద్ధం చేస్తుండగా చీకటి దట్టమై చిక్కుపరచింది. అప్పుడు పాండవులు మిక్కిలి విజృంభించి బాహుబల సంపదలు చూపగా, వారి ధాటికి తట్టుకొనలేక మీ సైన్యం ఆ గాఢాంధకారంలో ఎటూకానక సామర్థ్యం నశించి చెదరిపోయింది. మళ్ళీ ఏకం కాలేకపోయింది. అప్పుడు ద్రోణాచార్యుడు ధైర్యంగా దుర్యోధనుడిని వెంట తీసికొని, మన సైన్యానికి ధైర్యం కలుగజేసి, ఒక వ్యూహంగా సేనను మలచాడు. ద్రోణుడు ఆ వ్యూహానికి మొదటిభాగాన తానే స్వయంగా నిలిచి, ఇరుపార్శ్వాలలో అశ్వత్థామను, శకునిని నిలిపాడు. శల్యుడిని మధ్యభాగాన ఉంచాడు. దుర్యోధనుని సేనకు వెన్నుదన్నుగా నిలిపాడు. ఇట్లా సంజయుడు చెప్తుతూ ఉండగా ధృతరాష్ట్రుడు - 'ఓ సంజయా! చీకట్లు అంతగా వ్యాపించి చూపులు ఆనలేదుకదా! మరి యుద్ధం ఎట్లా చేశారు?' అని అడుగగా, సంజయుడు 'ఆ సమయంలో దుర్యోధనుడు పదాతిదళాలను ఆయుధాలను విడిచి దివిటీలు పట్టుకొమ్మని ఆదేశించాడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. మున్నాపని మానుసులం । గ్రన్నన పతి సంఘటింపఁగాఁ బనిచిన సం
పన్నంబుగ నొడఁగూర్చిన । నున్నత కరదీప నికర ముజ్జ్వలితముగన్. 143

ప్రతిపదార్థం: మున్ను= మొదట; ఆ పనిన్= ఆ కార్యాన్ని; క్రన్నన్+అ= తొందరగానే; సంఘటింపఁగాన్= చేసేటట్లు; మానుసులన్= మనుష్యులను; పతి= రాజు (దుర్యోధనుడు); పనిచినన్= ఆజ్ఞాపించగానే; సంపన్నంబుగన్= సిద్ధంగా; ఒడన్+కూర్చినన్= చేసినవెంటనే; ఉన్నత కర దీప నికరము= ఎత్తైన దివిటీల సమూహాన్ని; ఉజ్జ్వలితముగన్= ప్రజ్వలితంగా.

తాత్పర్యం: 'మొదట ఆ పని చేయాలి' అని దుర్యోధనుడు మనుష్యులను నియోగించాడు. వారు ఆ దివిటీల పనిని తొందరగా సిద్ధం చేశారు. అప్పుడు (పదాతివర్గాలు) ఎత్తైన ఆ దివిటీల సమూహాన్ని ప్రకాశవంతంగావెలిగేటట్లు.

వ. చేసికొని యప్పదాతి వర్గంబులు దివియలు దెచ్చిన నద్ధరణివరుండు రథంబున నైదును, గరికి మూఁడును, దురంగంబున నొండును నియతంబుగాఁ బట్టించి మఱియు వానికెలంకులను గేతనంబులకును దగం బట్టునట్లు సేసి, వెండియు మోహరంబు ముందటను బార్శ్వంబులను బిఱుందను బ్రభలు నిగుడం బొడవుగా నెత్తిపట్టం బనిచిన, నవ్వెలుంగు నింగికి నేలకుం జాలి పొలిచె; నట్టియెడ మణి భూషణంబులను రత్నకేతనంబులను వివిధాయుధంబులను బ్రతిప్రభలు ప్రజ్వరిల్ల శోభిల్లి నీ సైన్యం బొప్పె; నప్పుడు పాండవ బలంబునను రథంబునకుం బదియును గరికేడును దురంగంబునకు రెండునుగాఁ దత్ప్రకారంబునం గర దీపికాలోకం బాలోకనీయం బయ్యె; నయ్యవసరంబున నయ్యస్త్రగురుఁడు మధ్యందినమార్తాండు పగిదిం బ్రదీప్తమూర్తియై వెలుంగ నమ్మనుజపతి యనుజన్ములతో ని ట్లనియె. 144

ప్రతిపదార్థం: చేసికొని= (దివిటీలను ప్రజ్వలితంగా) ఒనర్చి; ఆ+పదాతివర్గంబులు= ఆ కాలుబలముల సమూహాలు; దివియలు= దివిటీలను; తెచ్చినన్= తేగా; ఆ+ధరణివరుండు= ఆ రాజు దుర్యోధనుడు; రథంబునకున్= రథానికి; ఐదును= అయిదు దివిటీలను; కరికిన్= గజానికి; మూఁడును= మూడు దివిటీలను; తురంగంబునకున్= గుర్రానికి; ఒండును= ఒక దివిటీని; నియతంబుగాన్= విధిగా; పట్టించి= పట్టేవిధంగా చేసి; మఱియున్= మరియు, అంతేగాక; వానికెలంకులను= ఆ రథాదుల పార్శ్వభాగాలలో; కేతనంబులకును= ధ్వజాలకు కూడా; తగన్= తగినవిధంగా; పట్టునట్లు+చేసి= పట్టించి; వెండియున్= మఱియు; మోహరంబు ముందటను= వ్యూహానికి ముందుభాగాన; పార్శ్వంబులన్= ప్రక్కలకు; పిఱుందను= వెనుకభాగానకూడా; ప్రభలు= కాంతులు; నిగుడన్= వ్యాపించగా; పొడవుగాన్= ఎత్తుగా; ఎత్తిపట్టన్= లేవనెత్తి పట్టుకొనేందుకు; పనిచినన్= నియోగించగా; ఆ+వెలుంగు= ఆ వెలుగు; నింగికిన్= ఆకాశానికి; నేలకున్= భూమికి; చాలి= సరిపడి; పొలిచెన్= ఒప్పింది; అట్టి+ఎడన్= ఆ సమయాన; మణిభూషణంబులను= మణిమయభూషణాలతో; రత్నకేతనంబులను= రత్నఖచిత ధ్వజాలతో; వివిధ+ ఆయుధంబులను= అనేకాలైన ఖడ్గాద్యాయుధాలతో; ప్రతిప్రభలు= ప్రతిఫలించిన కాంతులు; ప్రజ్వరిల్లన్= వెలుగొందగా; శోభిల్లి= ప్రకాశించి; నీ సైన్యంబు= నీ సేన; ఒప్పెన్= ఒప్పింది; అప్పుడు= అదే సమయంలో; పాండవ బలంబునను= పాండవుల సైన్యంలోకూడా; రథంబునకున్= రథానికి; పదియును= పది దివిటీలు; కరికిన్= ఏనుగుకు; ఏడును= ఏడు దివిటీలు; తురంగంబునకున్= అశ్వానికి; రెండును= రెండు దివిటీలు; కాన్= ఉండేటట్టు; తద్+ప్రకారంబునన్= ఆ విధంగా; కర దీపికా= చేదివిటీలయొక్క; ఆలోకంబు= వెలుగు; ఆలోకనీయంబు+అయ్యెన్= చూడదగినదయింది; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; ఆ+అస్త్రగురుఁడు= ఆ అస్త్రవిద్యాగురువు అనగా ద్రోణుడు; మధ్యందిన మార్తాండు పగిదిన్= మట్టమధ్యాహ్న సూర్యుడివలె; ప్రదీప్తమూర్తి ఐ= వెలుగొందుతున్న ఆకారం కలవాడై; వెలుంగన్= ఒప్పుతూ ఉండగా; ఆ+మనుజపతి= ఆ రాజు అనగా దుర్యోధనుడు; అనుజన్ములతోన్= (తన) తమ్ములతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: చేసుకొని పదాతిదళాలు దివిటీలు తేగానే, దుర్యోధనుడు రథానికి అయిదుదివిటీల చొప్పున, ఏనుగుకు మూడు చొప్పున, అశ్వానికి ఒకటి చొప్పున ఆ దివిటీలను విధిగా పట్టించాడు. మరియు వాటికి రెండు వైపుల ధ్వజాలకు దివిటీలు ఏర్పరచాడు. వ్యూహానికి ముందుభాగంలో, ఇరువైపుల, వెనుకభాగంలో కాంతులు విరజిమ్మే విధంగా పొడవుగా దివిటీలను ఎత్తిపట్టించగా, ఆ కాంతులు ఆకాశాన భూమిపైన వలసినంతగా ప్రసరించాయి. అంతేగాక ఆ దివిటీల కాంతులు మణిభూషణాలు రత్నధ్వజాలు ఆయుధాలు - వీటి అన్నింటిలో ప్రతిఫలించి ద్విగుణీకృతంగా భాసిల్లాయి. ఇక పాండవసైన్యంలో కూడా రథానికి పది, గజానికి ఏడు, అశ్వానికి రెండు చొప్పున దివిటీలను పట్టించారు. ఆ సైన్యంకూడా దివిటీలప్రకాశంతో మిక్కుటంగా చూడ ముచ్చటగొల్పింది. ఆ సమయంలో ఆ ద్రోణాచార్యుడు మట్టమధ్యాహ్న సూర్యుడివలె వెలుగొందాడు. అది చూచి దుర్యోధనుడు తన తమ్ములతో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉపమ. ద్రోణుడిని మధ్యందిన మార్తాండునితో పోల్చటం చేత ఉపమాలంకారం. మధ్యందినమున్నంతవరకే ఆ సూర్యుడు వెలుగొంది తరువాత తన ప్రకాశాన్ని కోల్పోతాడు కాబట్టి ఈ ద్రోణుడిట్లా వెలుగొందటం తాత్కాలికమే - శాశ్వతంకాదు అనే అనిష్టార్థాన్ని సూచిస్తూ ఉన్నది.

తే. **'శల్య కృతవర్మ ముఖ యోధ సమితిఁ గూర్చి । కొని మహోద్యోగమున మీరు కుంభజన్ము**
చెంత కా ద్రుపదాత్మజుఁ జేరకుండ । నాఁగు' దొరు లెల్లవారల నతఁడు గెలుచు.' **145**

ప్రతిపదార్థం: మీరు= సోదరులారా! మీరు; శల్య కృతవర్మ ముఖయోధ సమితిన్= శల్యుడు, కృతవర్మ మొదలైన యోధులవర్గాన్ని; కూర్చికొని= కూడగట్టుకొని; మహా+ఉద్యోగమునన్= గొప్ప ప్రయత్నంతో (ఏం చేయాలంటే); కుంభజన్ముచెంతకున్= ద్రోణాచార్యుడి సమీపానికి; చేరకుండన్= రాకుండా; ఆ ద్రుపదాత్మజున్= ఆ ద్రుపదుడి తనయుడగు ధృష్టద్యుమ్నుడిని; ఆఁగుఁడు= ఆపండి; అతఁడు= ఆ ద్రోణాచార్యుడు; ఒరులు+ఎల్లవారలన్= ఇతరులనందరినీ; గెలుచున్= గెలుస్తాడు.

తాత్పర్యం: 'ఓ సోదరులారా! మీరు శల్యుడు, కృతవర్మ మొదలైన యోధులసమూహాన్ని కూడగట్టుకొని, తీవ్రప్రయత్నంతో ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుడిని సమీపించకుండా ఆపండి. ద్రోణుడు మిగిలినవారినందరినీ గెలుస్తాడు.'

విశేషం: ద్రుపదుడు తన వైరాన్ని తీర్చుకొనటానికి తపస్సుచేసి, ద్రోణవధకై పొందినవాడు ధృష్టద్యుమ్నుడు. కాబట్టి 'అతడు ద్రోణుడిని సమీపించకుండా ఆపండి' అని అనటంలోని ఆంతర్యాన్ని 'ద్రుపదాత్మజున్' అనేపదం ధ్వనిస్తూ ఉన్నది. అతడు తప్ప పాండవసేనలో మరే వీరుడూ ద్రోణుడిని జయించేవాడు లేడనే అర్థం కూడా ఆ ధ్వనిచే స్ఫురిస్తూ ఉన్నది. ఈ అర్థమంతా మూలంలో వాచ్యంగా ఉన్నది.

పాండవ కౌరవ వీరుల ద్వంద్వ యుద్ధము (సం.7-139-22)

వ. **పదంపడి యా ధృష్టద్యుమ్నుం బరిమార్చు, కిరీటిం గర్ణుండును, భీమసేనుని నేనును గెలుతు' మని పలికి బలంబులకుఁ జేయివీచి కడంగిన, నెదిరి సేనయు నురవడింప నెన్నండును జూడవినంబడని యట్టి బవరంబయ్యెఁ; బాండవాగ్రజుండుఁ దన దొరల ద్రోణుమీఁదం గవియుం డని పనిచి, తానును దఱిమిన, నమ్మనుజపతిం గృతవర్మయు, సాత్యకిని భూరియు, సహదేవు రాధేయుండును , వాయుసూను సుయోధనుండును, నకులుని శకునియు, శిఖండిఁ గృపాచార్యుండును, బ్రతివింధ్యుని దుశ్శాసనుండును, ఘటోత్కచుని గురుపుత్త్రుండును, బాంచాల విభుని వృషసేనుండును, మత్స్యరాజును మద్రేశ్వరుండును, శతానీకునిఁ జిత్రసేనుండును, నర్జునుని యలంబుసుండునుం దలపడి; రిట్లు గురుని నొంపను రక్షింపను బూని మఱియు ననేకు లనేకులఁ దార్కొనిరి; సోమక సైన్యంబు సమయించు నక్కుంభసంభవుని ధృష్టద్యుమ్నుండు మార్కొనియె; నట్టియెడ.** **146**

ప్రతిపదార్థం: పదంపడి= తరువాత; ఆ ధృష్టద్యుమ్నున్= ఆ ధృష్టద్యుమ్నుడిని; పరిమార్చు= సంహరించే; కిరీటిన్= అర్జునుడిని; కర్ణుండును= కర్ణుడూ; భీమసేనునిన్= భీముడిని; నేనును= నేను అనగా దుర్యోధనుడు; గెలుతుము= గెలుస్తాం; అని= ఇట్లా; పలికి= చెప్పి; బలంబులకున్= సైన్యాలకు; చేయివీచి= చేయి కదలించి అనగా సంజ్ఞచేసి; కడంగినన్= యుద్ధానికి పూనుకొన్న వెంటనే; ఎదిరిసేనయున్= శత్రుసైన్యం కూడా; ఉరవడింపన్= విజృంభించగా; ఎన్నండును= ఏనాడు కూడా; చూడ వినంబడని+అట్టి= చూడనట్టి విననట్టి; బవరంబు= యుద్ధం; అయ్యెన్= అయింది; పాండవ+అగ్రజుండు= పాండవుల అన్న ధర్మరాజు; తన దొరలన్= తనకు సహాయంగా వచ్చిన రాజులను; ద్రోణుమీఁదన్= ద్రోణుడిపై; కవియుండు+అని= ఉద్యమించండి

అని; పనిచి= పంపి; తానును, ధర్మరాజు కూడా; తటిమినన్= (ద్రోణుడిపైకి) పరుగిడగా; ఆ+మనుజపతిన్= ఆ ధర్మరాజును; కృతవర్మయున్= కృతవర్మా; సాత్యకి; భూరియున్= భూరి అనే కురువంశరాజు; సహదేవున్= సహదేవుడిని; రాధేయుండును= కర్ణుడు; వాయుసూనున్= భీముడిని; సుయోధనుండును= దుర్యోధనుడు; నకులునిన్= నకులుడిని; శకునియున్= శకుని; శిఖండిన్= శిఖండిని; కృపాచార్యుండును= కృపాచార్యుడూ; ప్రతివింధ్యునిన్= ప్రతివింధ్యుడిని; దుశ్శాసనుండును= దుశ్శాసనుడు; ఘటోత్కచునిన్= ఘటోత్కచుడిని; గురుపుత్రుండును= ద్రోణపుత్రుడు అశ్వత్థామ; పాంచాల విభునిన్= పాంచాలరాజు ద్రుపదుడిని; వృషసేనుండును= వృషసేనుడు; అర్జుననిన్= అర్జునుడిని; అలంబుసుండును= అలంబుసుడు అనే రాక్షసుడు; తలపడిరి= ఢీకొన్నారు; (ద్రోణుడిపైకి వెళ్ళకుండా నిరోధించారని భావం); ఇట్లు= ఈ విధంగా; గురునిన్= ద్రోణుడిని; నొంపను= బాధించటానికి; రక్షింపను= రక్షించటానికి; పూని= ఉద్యమించి; మఱియున్= ఇంకా; అనేకులు= పలువురు; అనేకులన్= పలువురిని; తార్కొనిరి= ఢీకొన్నారు- పాండవ పక్షీయులు ద్రోణుడిపైకి పరుగుతీస్తూ ఉంటే, కౌరవపక్షీయులు వారిని వెళ్ళకుండా నిరోధించారు; సోమకసైన్యంబు= సోమకసైన్యాన్ని; సమయించు+ఆ+కుంభసంభవునిన్= సంహరించే ఆ ద్రోణాచార్యులను; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; మార్కొనియెన్= ఎదుర్కొన్నాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: తరువాత ధృష్టద్యుమ్నుడిని చంపుతాడు. అర్జునుడిని కర్ణుడు జయిస్తాడు. భీముడిని నేను గెలుస్తాను.' అని పలికి సైన్యాలకు చేతితో కదలిపొండని సంజ్ఞ చేశాడు దుర్యోధనుడు. తాను కూడా పోరాడటానికి కదిలాడు. శత్రుసైన్యం కూడా విజృంభించింది. ఇక ఆ యుద్ధంతీరు ఎన్నడూ కూడా ఇంతకుముందు చూడలేదు, వినలేదు. అప్పుడు ధర్మరాజు తనవారిని ద్రోణుడిమీదికి యుద్ధానికి పంపాడు. అంతేకాక తాను కూడా ద్రోణుడిపైకి పోరాడటానికి వెళ్ళుతూ ఉంటే కృతవర్మ ఎదుర్కొన్నాడు. ఇట్లే సాత్యకిని భూరి అనే అతడు, సహదేవుడిని కర్ణుడు, భీముడిని దుర్యోధనుడు, నకులుడిని శకుని, శిఖండిని కృపాచార్యుడు, ప్రతివింధ్యుడిని దుశ్శాసనుడు, ఘటోత్కచుడిని అశ్వత్థామ, ద్రుపదరాజును వృషసేనుడు, విరాటరాజును శల్యుడు, శతానీకుడిని చిత్రసేనుడు, అర్జునుడిని అలంబుసుడనే రాక్షసుడు అడ్డగించి ద్రోణుడిపైకి వెళ్ళకుండా నిలిపి యుద్ధం చేశారు. పాండవపక్షీయులేమో ద్రోణుడిని ఢీకొనటానికి వెళ్ళుతూ ఉంటే కౌరవపక్షీయులు ద్రోణుడిని రక్షించటానికి, పాండవపక్షీయులను అటు వెళ్ళకుండా ఆపి వారితో యుద్ధానికి తలపడ్డారు. ఆ సందర్భంలో ఎందరో ఎందరితోనో యుద్ధానికి తలపడ్డారు. పేర్లు లెక్కించి చెప్పటం సాధ్యంకాదు. ద్రోణుడు సోమకసైన్యంతో పోరాడుతూ దానిని హతమార్చాడు. అట్టి సమయంలో ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని ఎదుర్కొన్నాడు. ఆ సమయాన. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'గురుని నొంపను రక్షింపను' అనే చోట యథాసంఖ్యాలంకారం. 'ధర్మరాజాదులు గురుని నొంపను బూని తలపడిరి- కృతవర్మాదులు గురుని రక్షింపను బూని తలపడిరి' అనేవిధంగా అన్వయం. 'మఱియు ననేకులు అనేకులతో తార్కొనుటకు' కూడా కారణం ఇదియే.

సీ. **పాండవాగ్రజుని చాపము ద్రుంచెఁ గృతవర్మ; । యతఁ డొండు విలు గొని యతని నొంచె;**
ధనువును దునిమి హస్తం బుచ్చిపో శక్తి । యడరింప వేఱ శరాసనంబు
గొని హయ సూతులఁ గోదండంబును బొడి । సేసి హార్దిక్యుండు సెలఁగి యేసె
నరనాయకుఁడు గృపాణముగొన్న నఱకెఁ । దోమరముఁ బూనిన రూపుమాపి మఱువుఁ

తే. **బఱియలుగఁ జేసి తనువునఁ బఱపె నార । సంబు; లిట్లమ్మహాబలు చటుల విక్ర**
మంబు దుస్సహ మగుడు నమ్మానవేంద్రుఁ । డనికిఁ దొలఁగిన గురుబల మలరె నధిప! 147

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; కృతవర్మ; పాండవ+అగ్రజుని చాపము= ధర్మరాజు విల్లు; త్రుంచెన్= తెగవేశాడు; అతఁడు= ఆ ధర్మరాజు; ఒండువిలు= ఇంకో విల్లు; కొని= తీసికొని; అతనిన్= ఆ కృతవర్మను; నొంచెన్= నొప్పించాడు - అనగా యుద్ధం చేశాడు; ధనువును= ఆ కృతవర్మ ధనుస్సును; తునిమి= తునుకలు చేసి; హస్తంబు= చేతిని; ఉచ్చిపోన్= చీల్చుకొనిపోయే విధంగా; శక్తి= శక్త్యాయుధాన్ని; అడరింపన్= ప్రయోగించగా; వేఱు+అ= వేరే; శరాసనంబు= ధనుస్సును; కొని= తీసికొని; హయసూతులన్= అశ్వాలను, రథసారథిని కూడా; కోదండంబును= ధనువును; పొడి+చేసి= చూర్ణంచేసి - ధర్మరాజు రథమునకున్న అశ్వాలను అతడి సారథిని సంహరించి అతడి ధనుస్సును కూడా తెగగొట్టి అని భావం; హార్దిక్యుండు= కృతవర్మ; చెలఁగి= చెలరేగి; ఏసెన్= బాణాలను ప్రయోగించాడు; నరనాయకుఁడు= ధర్మరాజు; కృపాణము= ఖడ్గాన్ని; కొన్నన్= గ్రహించగానే; నఱకెన్= ఖండించాడు; తోమరమున్= తోమరాన్ని; పూనినన్= పట్టుకోగానే; రూపుమాపి= ధ్వంసంచేసి; మఱువున్= కవచాన్ని; పఱియలుగన్+చేసి= ఛిన్నంచేసి; తనువునన్= శరీరంపై; నారసంబులు= బాణాలను; పఱపెన్= వ్యాపింపచేశాడు - అనగా శరీరమంతటా బాణాలతో కొట్టాడని భావం; ఇట్లు= ఈ విధంగా; ఆ+మహాబలు చటుల విక్రమంబు= గొప్ప బలంగల ఆ కృతవర్మ అందమైన పరాక్రమం; దుస్సహము+అగుడున్= సహించరానిది కాగా; ఆ+మానవ+ఇంద్రుండు= ఆ ధర్మరాజు; అనికిన్= యుద్ధానికి - యుద్ధంనుండి అని భావం; తొలఁగినన్= తొలగిపోగా; కురుబలము= (మీ) కౌరవసైన్యం; అలరెన్= సంతోషించింది.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! కృతవర్మ ధర్మరాజు విల్లు తెగగొట్టాడు. వెంటనే అతడు మరో విల్లు గ్రహించి, ఆ కృతవర్మను బాణాలతో నొప్పించాడు, అతడి వింటిని ముక్కలు చేసి శక్త్యాయుధాన్ని అతడిపై ప్రయోగించాడు. అది అతడిచేతిని చీల్చుకొనిపోయింది. అయినా ఆ కృతవర్మ వేరొక ధనుస్సును తీసికొని ధర్మరాజు రథానికున్న గుర్రాలను, సారథిని సంహరించాడు. మరియు అతడి ధనువును కూడా నుగ్గునుగ్గ చేశాడు. ధర్మరాజు ఖడ్గాన్ని గ్రహించాడు. దాన్నికూడ నరికివేశాడు. వెంటనే తోమరాన్ని ధర్మరాజు తీసికొనగా దానిని కూడ నశింపజేశాడు. అంతేకాక ధర్మరాజు కవచాన్ని తూట్లుపడే విధంగా చేసి, ఆ ధర్మరాజు శరీరంలో ఎన్నో బాణాలు నాటాడు. ఇక ధర్మరాజు ఆ కృతవర్మ యుద్ధాన్ని సహించలేకపోయాడు. వెంటనే యుద్ధభూమినుండి తొలగిపోయాడు. అది చూచి మీ కౌరవసేనలో సంతోషం ఉప్పొంగింది.

క. భూరియు శినివరుఁడు శరా । సారము లొండొరులమీఁద సరిఁ బఱపి వడిం
బోరునెడ భల్లమున నా । కౌరవు విలు ద్రుంచె సత్యకసుతుం డధిపా! 148

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; భూరియున్= భూరి అనే కురువీరుడు; (మరియు) శినివరుఁడు= సాత్యకి; శర+ఆసారములు= బాణధారలు; ఒండొరులమీఁదన్= ఒకరు మరియొకరిపైన పరస్పరం; సరిన్= సమంగా; పఱపి= వ్యాపింపజేసి; వడిన్= వేగంగా; పోరునెడన్= యుద్ధం చేసే సమయంలో; భల్లమునన్= భల్లమనే బాణంతో; ఆ కౌరవువిలున్= ఆ కురువంశీయుడగు భూరియొక్క విల్లును; సత్యకసుతుండు= సాత్యకి; త్రుంచెన్= తెగగొట్టాడు.

తాత్పర్యం: భూరి, సాత్యకి ఈ ఇరువురు ఒకరిపై మరియొకరు సమానంగా బాణవర్షాన్ని కురిపిస్తూ వేగంగా యుద్ధం చేస్తూ ఉండగా ఓ ధృతరాష్ట్ర మహారాజా! మీ కురువంశీయుడైన భూరియొక్క విల్లును సాత్యకి ఒక భల్లంతో విరుగగొట్టాడు.

ఆ. త్రుంచి మేను గాఁడఁ దూపులు నిగిడింప । నాతఁ డొండు వింట నతని నొంచి
ధనువు దునుమఁ గోప మినుమడి యై శక్తిఁ । ద్రెళ్ళ వైచె శినివరేణ్యుఁ డతని. 149

ప్రతిపదార్థం: త్రుంచి= ఆ భూరివిల్లును తెగవేసి; మేను= శరీరాన్ని; కాఁడన్= క్రుచ్చుకొనే విధంగా; తూపులు= బాణాలను;

నిగిడింపన్= ప్రయోగించగా; ఆతఁడు= ఆ భూరి; ఒండువింటన్= మరియొక విల్లుతో; అతనిన్= ఆ సాత్యకిని; నొంచి= నొప్పించి; ధనువు= విల్లును; తునుమన్= త్రుంచగా; కోపము= కోపం; ఇనుమడి ఐ= రెట్టింపై; శినివరేణ్యుఁడు= సాత్యకి; అతనిన్= ఆ భూరిని; త్రెళ్ళన్= పడిపోయేటట్లు అనగా - మరణించేవిధంగా; శక్తిన్= శక్తి అనే ఆయుధంతో; వైచెన్= కొట్టాడు.

తాత్పర్యం: ఆభూరి (యొక్క) ధనుస్సును త్రుంచి, శరీరంపైబాణాలు నాటాడు. వెంటనే ఆ భూరి మరియొక ధనుస్సును తీసికొని ఆ సాత్యకిని బాణాలతో నొప్పించి, అతడి ధనుస్సును ముక్కలు చేశాడు. దానితో సాత్యకికి కోపం రెండింతలైనది. శక్త్యాయుధాన్ని భూరిపై ప్రయోగించాడు. దానితో భూరి మరణించాడు.

వ. ఇట్లు సాత్యకి చేతం జచ్చిన భూరిం జూచి భారద్వాజపుత్రుం డతని పయిం గవియుటయు ఘటోత్కచుండు 'నిలునిలు' మని యెలుంగు సూపి దొడ్డ తూపు లడరించిన నతం డవి మగిడించి పెల్లేసిన నేదు వెఱిగిన ట్లయ్యసురవరుండు దశవిశిఖంబులు రయంబున నురంబునఁగ్రుచ్చిన మూర్ఛవచ్చి యమ్మేటిజోదు కేతుదండం బవలంబించి. 150

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సాత్యకిచేతన్= సాత్యకిచేత; చచ్చినభూరిన్= మరణించిన భూరి అనే రాజును; చూచి; భారద్వాజపుత్రుండు= ద్రోణపుత్రుడు అశ్వత్థామ; అతనిపయిన్= ఆ సాత్యకిపై; కవియుటయున్= తలపడగానే; ఘటోత్కచుండు= ఘటోత్కచుడు; నిలు నిలుము+అని= ఆగాగు అని; ఎలుంగు+చూపి= కంఠధ్వని చేసి (పెద్దగా అరచి అని భావం); దొడ్డతూపులు= దృఢమైన బాణాలను; అడరించినన్= ప్రయోగించగా; అతండు= ఆ అశ్వత్థామ; అవి= ఆ బాణాలను; మగిడించి= త్రిప్పికొట్టి; పెల్లు= అధికంగా; ఏసినన్= బాణాలతో కొట్టగా; ఏదు= ముండ్లపంది; పెఱిగినట్లు= చెలరేగినవిధంగా; ఆ+అసురవరుండు= ఆ ఘటోత్కచుడు; దశవిశిఖంబులు= పదిబాణాలను; రయంబునన్= వేగంగా; ఉరంబునన్= వక్షఃస్థలంలో; క్రుచ్చినన్= క్రుచ్చుకొనేటట్లు కొట్టగా; మూర్ఛవచ్చి= మూర్ఛవస్తున్నట్లయి తెలివి కోల్పోతున్నట్లు తోచి; ఆ+మేటిజోదు= ఆ యోధశ్రేష్ఠుడు అశ్వత్థామ; కేతుదండంబు= ధ్వజస్తంభాన్ని; అవలంబించి= పట్టుకొని;

తాత్పర్యం: ఇట్లా సాత్యకిచేత మరణించిన భూరిని చూచి అశ్వత్థామ, సాత్యకి నెదుర్కొనటానికి ఉద్యమించగా, ఘటోత్కచుడు అశ్వత్థామను 'నిలు నిలు' మని పెద్దగా అరుస్తూ అడ్డుకొని అతడిపై దృఢమైన బాణాలను ప్రయోగించాడు. వెంటనే అశ్వత్థామ ఆ బాణాలను త్రిప్పికొట్టటమే కాక, ఆ ఘటోత్కచుడిని దృఢమైన బాణాలతో నొప్పించాడు. అప్పుడు ఘటోత్కచుడు ముండ్లపంది విజృంభించినట్లు చెలరేగిపోయి, పదిబాణాలతో ఆ అశ్వత్థామను వక్షఃస్థలంలో వేగంగా కొట్టాడు. దానితో అశ్వత్థామకు మూర్ఛవచ్చినట్లయి ఆ రథంమీదనే ధ్వజస్తంభాన్ని ఆనుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆలోనన తెలిసి మెఱుఁగు । వాలిక నారసము దైత్యువక్షమున వెసం
గీలించిన నరదముపై । సోలిపడుడుఁ దేరు దొలఁగ సూతుఁడు దోలెన్. 151

ప్రతిపదార్థం: ఆలోననన్+అ= అంతలోనే; తెలిసి= తెలివి పొంది - మూర్ఛదేరి అని భావం; మెఱుఁగు= తళతళ మెరుస్తూ ఉన్న; వాలిక= దీర్ఘమైన; నారసము= బాణాన్ని; దైత్యువక్షమునన్= ఆ ఘటోత్కచుడి రొమ్ములో; కీలించినన్= క్రుచ్చుకొనేటట్లు వేయగా; అరదముపైన్= రథంపై; సోలి= మూర్ఛపోయి; పడుడున్= పడిపోయిన వెంటనే; సూతుఁడు= ఆ ఘటోత్కచుడి సారథి; తేరు= రథాన్ని; తొలఁగన్= రణరంగంనుండి తొలగిపోయే విధంగా; తోలెన్= తోలాడు. (ఇట్లు అశ్వత్థామ తాకిడికి తట్టుకోలేక మూర్ఛిల్లిన ఘటోత్కచుడిని రథచోదకుడు రణరంగానికి దూరంగా తీసికొని వెళ్ళాడని భావం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అంతలోనే తెలివి పొంది, ఆ ఘటోత్కచుడి వక్షంలో దృఢమైన, తీక్ష్ణమైన బాణంతో కొట్టాడు. వెంటనే ఆ ఘటోత్కచుడు ఆ దెబ్బకు ఆగలేక సొమ్మసిల్లి, రథంపై ఒరిగాడు. అది గమనించి, సారథి ఆ రథాన్ని ప్రక్కకు తీసికొని వెళ్ళాడు.

క. భీముఁడుఁ గురుపతియు శర । స్తోమము లొండొరులమీఁదఁ దొరఁగించుచు ను
ద్దామాంభోద పిహిత రవి । సోముల చందమున నొప్పుచుం బోరునెడన్. 152

ప్రతిపదార్థం: భీముఁడు= భీమసేనుడు; కురుపతియున్= దుర్యోధనుడు; శరస్తోమములు= బాణాల సమూహాలను; ఒండొరుల మీఁదన్= ఒకరు మరియొకరిపై; తొరఁగించుచున్= వర్షించుకుంటూ (ఉండేటప్పుడు); ఉద్దామ= గొప్ప; అంభోద= మేఘాలచేత; పిహిత= కప్పబడిన; రవిసోముల= సూర్యచంద్రుల; చందమునన్= విధాన; ఒప్పుచున్= ప్రకాశిస్తూ; పోరు+ఎడన్= యుద్ధం చేసేటప్పుడు.

తాత్పర్యం: భీమ దుర్యోధనులు ఒకరినొకరు బాణసమూహంతో కప్పుకొంటూ, పెద్ద మేఘాలు కప్పివేసి సూర్యచంద్రులవలె ప్రకాశిస్తూ యుద్ధం చేసే సమయంలో.

విశేషం: అలం: ఉపమ. 'రవి సోముల చందమున' అనేటప్పుడు ఉపమాలంకారం. దానిచేత భీమ దుర్యోధనులు పరస్పరం కనబడనంత దట్టంగా బాణాలు ప్రయోగిస్తూ యుద్ధం చేశారనే విషయం ప్రకృతంలో ధ్వనిస్తూ ఉన్నది. ఇది అలంకారకృత వస్తుధ్వని.

చ. ధనువు సిడంబుఁ ద్రుంచి సముదగ్రత భీముఁడు మేను నొంప న
మ్మనుజవిభుండు వేఱొక సమగ్రబలం బగు చాప మెత్తి యా
యనమెయిఁ గాఁడ విల్ విఱుగునట్లుగ నేసిన నొండువింట న
య్యనిలజుఁ డేడు నారసము లా నృపు గాత్రమునందుఁ గ్రుచ్చుచున్. 153

ప్రతిపదార్థం: భీముఁడు= భీమసేనుడు; ధనువున్= ఆ దుర్యోధనుడి ధనుస్సును; సిడంబున్= ధ్వజాన్ని; త్రుంచి= తెగవేసి; సముదగ్రతన్= ఔద్ధత్యంతో అనగా గర్వంతో; మేనున్= దుర్యోధనుడి శరీరాన్ని; నొంపన్= నొప్పించగా; ఆ+మనుజ విభుండు= ఆ దుర్యోధనుడు; వేఱొక సమగ్ర బలంబు+అగు= మరియొక బలిష్ఠమైన; చాపము= విల్లు; ఎత్తి= తీసికొని; ఆయనమెయిన్= ఆ భీముడి శరీరంలో; కాఁడన్= గ్రుచ్చుకొనే విధంగా; విల్= ధనుస్సు; విఱుగునట్లుగన్= విరిగిపోయే విధంగానూ; ఏసినన్= బాణాలతో కొట్టగా; ఒండు వింటన్= మరో ధనుస్సుతో; ఆ+అనిలజుఁడు= ఆ వాయునందనుడు, భీముడు; ఏడు నారసములు= ఏడుబాణాలను; ఆ నృపగాత్రమునందున్= ఆ రాజు అనగా దుర్యోధనుడి శరీరంలో; క్రుచ్చుచున్= నాటుకపోయేటట్లు చేస్తూ.

తాత్పర్యం: భీముడు, దుర్యోధనుడి ధనుస్సును, ధ్వజాన్ని ముక్కలు చేసి, గర్వం ప్రదర్శిస్తూ అతడి శరీరాన్ని, బాణాలతో నొప్పింపగా, దుర్యోధనుడు వేరే ధనుస్సును - మహాదృఢమైన దానిని గ్రహించి భీముడి శరీరం నొప్పి పుట్టే విధంగా, అతడి ధనుస్సు విరిగేవిధంగా చేయగా, అప్పుడు భీముడు మరొకవిల్లు గ్రహించి ఏడుబాణాలతో దుర్యోధనుడిని కొట్టి శరీరాన్ని గాయపరిచాడు.

చ. విలు దునుమాడి వెండియును విండులు నా ల్గతఁ డెత్త నెత్త ను
త్తలముగఁ ద్రుంచి వైచె గదఁ దత్తురగంబుల సూతుఁ జంప న
గ్గలమగు భీతి రాజు దొలఁగన్ వెస దాఁటుడుఁ గాన కాతఁడుం
బొలిసెనకాఁ దలంచి మదిఁ బొంగి వృకోదరుఁ డార్చె; నార్చినన్. 154

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: విలు= ధనుస్సును; తునుమాడి= తునుకలు చేసి; వెండియున్= మళ్ళీ; అతఁడు= ఆ దుర్యోధనుడు; నాల్గు విండులు= నాలుగు ధనువులను; ఎత్తన్+ఎత్తన్= ఎత్తుతూ పోతూ ఉండగా; ఉత్తలముగన్= వేగంగా; త్రుంచివైచెన్= త్రుంచివేశాడు; గదన్= గదతో; తద్+తురగంబులన్= అతడి అశ్వాలను; సూతున్= సారథిని; చంపన్= సంహరించగా; అగ్గలము+అగు= అధికమైన; భీతిన్= భయంతో; రాజు= దుర్యోధనుడు; తొలఁగన్= తొలగిపోగా; వెసన్= తొందరగా; దాఁటుఁడున్= దాటినంతనే; కానక= గుర్తించక; ఆతఁడున్= ఆ దుర్యోధనుడును; పొలసెను+అ+కాన్= మరణించియే ఉండవచ్చును అని; తలంచి= అనుకొని; మదిన్= మనస్సులో; పొంగి= ఎంతో సంతోషించి; వృకోదరుఁడు= భీముడు (తోడేలు పొట్టవంటి పొట్ట గలవాడు కాబట్టి భీముడికి ఆ పేరు); ఆర్చెన్= సింహనాదం చేశాడు; ఆర్చినన్= ఆర్వగా.

తాత్పర్యం: విల్లును ముక్కలు చేసి, అతడు మళ్ళీ విల్లెత్తాడో లేదో మళ్ళీ తునుకలు చేశాడు. ఇట్లా నాలుగు విల్లులను ఖండించాడు. అంతేకాక గదతో ఆ దుర్యోధనుడి రథానికున్న అశ్వాలను, సారథిని సంహరించాడు. అప్పుడు దుర్యోధనుడు విపరీతభయంతో యుద్ధంమాని, వేగంగా అక్కడినుండి అగపడకుండా వెళ్ళగా అతడు మరణించాడనే భావించి భీముడు సింహనాదం చేశాడు. ఆ సింహనాదానికి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఉస్మానియా ప్రతిలో 'జావ' అనే పాఠానికి చూపిన 'జంప' అనే పాఠాంతరం ప్రకృతానుగుణమగుటచేత గ్రహించటం జరిగింది.

వ. మన మూఁకలు నట్లకాఁ దలంచి హాహాకారంబులతో నాకులతం బొందె; నందలి జనంబులు ప్రమదంబునం జెలంగి రక్కౌరవేంద్రుండు వేఱొక్క తేరెక్కి తోఁచినం గని యెల్లవారును డిందుపడిరి ; కర్ణ సహదేవులు సముదీర్ణ విక్రమంబు వెలయం బెనంగునప్పుడు. 155

ప్రతిపదార్థం: మన మూఁకలు= మన సైన్యాలు; అట్లు+అ= అట్లాగే; కాన్+అయినట్టుగా+తలంచి= అనుకొని, అనగా దుర్యోధనుడు మరణించాడనే భావించి; హాహాకారంబులతోన్= హా హా (అయ్యో! అయ్యో!) అనే ఆర్తధ్వనులతో, అనగా దుఃఖాతిశయంతో 'హా హా' అని అరుస్తూ; ఆకులతన్= వ్యాకులభావాన్ని; పొందెన్= పొందాయి; అందలి జనంబులు= ఆ పాండవ పక్షంలో ఉండే జనులు; ప్రమదంబునన్= సంతోషంతో; చెలంగిరి= నినాదం చేశారు; (అంతలోనే) ఆ+కౌరవేంద్రుండు= ఆ దుర్యోధనుడు; వేఱొక్క తేరు= మరియొక రథాన్ని; ఎక్కి= అధిరోహించి; తోఁచినన్= దర్శనమీయగానే; ఎల్లవారును= అందరూ (ఇరువైపుల వారందరూ - అని భావం); డిందుపడిరి= ఉపశమించారు (చెలరేగటాలు మానారు!); కర్ణసహదేవులు= కర్ణుడును, సహదేవుడును; సముదీర్ణ విక్రమంబు= గొప్ప పరాక్రమం; వెలయన్= ప్రకాశించగా; పెనంగునప్పుడు= యుద్ధం చేసే సమయంలో.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! మన సైన్యాలు కూడా దుర్యోధనుడు మరణించాడనే భావించి హాహాకారాలు చేస్తూ కలతనొందాయి. పాండవసైన్యాలు సంతోషంతో సింహనాదాలు చేశాయి. ఇంతలో దుర్యోధనుడు వేరొకరథంపై కూర్చొని దర్శనమివ్వటంతో అందరు సద్దుమణిగారు. కర్ణ సహదేవులు గొప్ప పరాక్రమంతో యుద్ధం చేస్తుండగా

క. అమ్మాద్రీసుతుఁ డేపునఁ । దొమ్మిది వాలమ్ము లొడలఁ దూర్చిన నతిరో
షమ్మునఁ గర్ణుండు దదం । గమ్ములు నొప్పించెఁ దీవ్రకాండ శతమునన్. 156

ప్రతిపదార్థం: ఆ+మాద్రీసుతుఁడు= ఆ సహదేవుడు; ఏపునన్= విజృంభణతో; తొమ్మిది వాలు+అమ్ములు= తొమ్మిది తీక్ష్ణములైన బాణాలను; ఒడలన్= కర్ణుడి శరీరాన; తూర్చినన్= క్రుచ్చుకొనేటట్లు కొట్టగా; కర్ణుండు; అతి రోషమ్మునన్= మిక్కిలి కోపంతో; తీవ్ర కాండశతమునన్= వాడి అయిన నూరుబాణాలతో; తద్+అంగంబులు= ఆ సహదేవుడి శరీరావయవాలను; నొప్పించెన్= నొప్పించాడు - నొప్పి పుట్టేవిధంగా కొట్టాడని భావం.

తాత్పర్యం: ఆ సహదేవుడు విజృంభించి కర్ణుడిని తొమ్మిది తీక్ష్ణములైన బాణాలతో కొట్టి, శరీరాన్ని గాయపరచగా, కర్ణుడు మహాకోపంతో అతని అవయవాలను వంద వాడిబాణాలతో నొప్పించాడు.

వ. ఇట్లు సహదేవుం బొదివి రాధేయుండు. 157

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సహదేవున్= సహదేవుడిని; పొదివి= మర్దించి అనగా నుగ్గునుగ్గు చేసి; రాధేయుండు= కర్ణుడు.

తాత్పర్యం: కర్ణు డీ విధంగా సహదేవుడిని ఆక్రమించి.

చ. రయమున విల్లు ద్రుంచిన పరాక్రమ మొండొక వింటఁ జేయఁగా
హయముల సూతుఁ జంపుటయు నాతఁడు ఖడ్గము ఖేటకంబు ని
ర్భయముగఁ బుచ్చుకొన్న బహు బాణములం దునుమాడె నన్యదు
ర్జయ మగు లావునం గడువెసన్ గద వైవ నడంచె నవ్వుచున్. 158

ప్రతిపదార్థం: రయమునన్= వేగంగా; విల్లున్= విల్లును; త్రుంచినన్= విరుగగొట్టగా; ఒండు+ఒకవింటన్= మరియొక ధనుస్సుతో; పరాక్రమము= విక్రమించటం; చేయఁగాన్= చేస్తూ ఉంటే; హయములన్= అశ్వాలను; సూతున్= సారథిని; చంపుటయున్= సంహరించగానే; అతఁడు= ఆ సహదేవుడు; ఖడ్గమున్= కత్తిని; ఖేటకంబున్= డాలును; నిర్భయముగన్= భయం అనేది లేక; పుచ్చుకొన్నన్= తీసికొనగానే; బహుబాణములన్= అనేక బాణాలతో; తునుమాడెన్= తునకలు చేశాడు; అన్యదుర్జయము+అగు= ఇతరులకు జయింపరాని; లావునన్= (బాహు) బలంతో; కడు వెసన్= మిక్కిలి వేగంతో; గదన్= గదను; వైవన్= వేయగా; నవ్వుచున్= నవ్వుతూ; అడంచెన్= అణచివేశాడు - మధ్యలోనే ఆ గదను కర్ణుడు ఖండించాడు.

తాత్పర్యం: (కర్ణుడు) వెనువెంటనే సహదేవుడి ధనువును ముక్కలు చేశాడు. ఆ సహదేవుడు వేరొక విల్లు తీసికొని విక్రమించాడు. అంతలోనే కర్ణుడు సహదేవుడి రథానికున్న అశ్వాలను, సారథిని సంహరించాడు. వెంటనే సహదేవుడు కత్తి డాలు తీసికొని, నిర్భయంగా పోరాటాని కుపక్రమించగానే, కర్ణుడు అనేక బాణాలతో వాటిని ముక్కలు చేశాడు. అప్పుడు సహదేవుడు అన్యులు అసాధ్యంకాని బాహుబలంతో మిక్కిలి వేగంగా కర్ణుడి పైకి గదను విసరగా, కర్ణు డా గదను నవ్వుతూ కిందపడేటట్లు చేశాడు.

వ. దానం బెండువడక యప్పాండు నందనుండు. 159

ప్రతిపదార్థం: దానన్= దానిచేత; బెండు+పడక= బలహీనం కాక, నిరుత్సాహపడక; ఆ+పాండునందనుండు= ఆ సహదేవుడు.

తాత్పర్యం: సహదేవుడు అందుకు నిరుత్సాహపడక

కర్ణుఁడు సహదేవుని వింటికోపునం బొడుచుచు నవమానించుట (సం. 7-141-12)

ఆ. శక్తివైవ నిశితచక్రంబు నిగిడింప । వరుస నదియు నిదియు వ్రయ్యలయ్యు
దునియ లయ్యు నేలఁ దొరఁగంగఁ జేసి పె । ల్లేసి, తెరలుటయును నెయ్దె నతఁడు. 160

ప్రతిపదార్థం: (సహదేవుడు) శక్తిన్= శక్త్యాయుధాన్ని; వైవన్= వేయగా; నిశితచక్రంబు= పదునైన తన రథచక్రాన్ని; వరుసన్= క్రమంగా; నిగిడింపన్= ప్రయోగించగా; అతఁడు= ఆ కర్ణుడు; పెల్లు= మిక్కిలి; ఏసి= బాణాలతో కొట్టి; అదియున్= ఆ

శక్తి; ఇదియున్= ఈ చక్రం; వ్రయ్యలు+అయ్యున్= ముక్కలై కూడా; తునియలు+అయ్యున్= తునకలై (అదియు వ్రయ్యలయ్యు ఇదియు తునియలయ్యు అని వరుసగా అన్వయం;) నేలన్= భూమిపై; తొరఁగంగన్= పడిపోయేటట్లు; చేసి= చేసి; తెరలుటయునున్= తొలగిపోతూ ఉండగా, రణాన్ని వీడిపోతూ ఉండగా; అతఁడు= కర్ణుడు; ఎయ్దెన్= వెంబడించాడు.

తాత్పర్యం: (ఆ సహదేవుడు) కర్ణుడిపైకి శక్త్యాయుధాన్ని, తరువాత రథచక్రాన్ని ప్రయోగించాడు. ఆ రెండూ కర్ణుడి బాణాలకు తునకలుగా మారి నేలగూలాయి. ఇంకా కూడా కర్ణుడు సహదేవుడిని బాణాలతో కొట్టాడు. నిరాయుధుడైన సహదేవుడు ఆ కర్ణుడిధాటికి ఆగలేక రణంనుండి నిష్క్రమిస్తూ ఉంటే కర్ణుడు అతడిని వెంబడించాడు.

విశేషం: పెల్లేసినవాడు, ఎయ్దినవాడు= వెంబడించినవాడు కర్ణుడు; తెరలినవాడు సహదేవుడు. అదేవిధంగా అన్వయించి అర్థాన్ని గ్రహించాలి. కొంచెం అర్థభ్రాంతి అయ్యే అవకాశం ఉండుటచేత ఈ విధంగా వివరించవలసి వచ్చింది. సహదేవుడు ప్రయోగించింది రథచక్రం కాని చక్రాయుధం కాదు. దానికి సంస్కృతమూలం శ్లో॥ "శక్తిం చిక్షేప కర్ణాయ తా మప్యస్యాచ్ఛిన చ్ఛరైః। ససంభ్రమం తత స్తూర్ణ మవప్లుత్య రథోత్తమాత్। సహదేవో మహారాజ! దృష్ట్వా కర్ణం వ్యవస్థితమ్। రథచక్రం ప్రగృహ్యాజౌ ముమోచాధిరథిం ప్రతి." (ద్రోణ. 167/10,11) చివరకు ఏ ఆయుధమూ లేక రణమునుండి వైదొలగాడు సహదేవుడు - ఆ సంస్కృత మూలశ్లోకం ఇంతకుముందే ఉదాహరించబడింది.

వ. ఇత్తెఱంగునఁ గర్ణుండు గదిసి నిశ్చేష్టితుండగు సహదేవు నాలోకించి, కుంతి మాటలు దలంచి, యొండు సేయ నొల్లక యల్లన వింటికోపునం గడుపు వొడిచి నవ్వుచు 'నెక్కుడైన పగఱ నుక్కునం దలపడకు; మల్ల వాఁడె నరుండు గురుసేనతోడ బిరుదై పెనంగెడు; నతని కడకుం బొ' మ్మని పలికి పోయె; నక్కుమారుండును నట్లు గర్ణునేటులను మాటలను గడునొచ్చి తన బ్రదుకునకు రోయుచుం బోయి వేఱొక్క రథం బెక్కె; మత్స్య మద్రేశ్వరులు జంభవాసవుల చందంబున సమరంబు సేయు సమయంబున నా శల్యుండు. 161

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; కర్ణుండు; కదిసి= సమీపించి; నిశ్చేష్టితుండు+అగు= చేష్టలు దక్కి ఉన్నటువంటి; సహదేవున్= సహదేవుడిని; ఆలోకించి= చూచి; కుంతి మాటలు= కుంతి మాటలను; తలంచి= తలచుకొని; ఒండు= అన్యం; చేయన్= చేయటానికి; ఒల్లక= ఇష్టపడక; వింటికోపునన్= వింటికొనతో; కడుపున్= ఉదరభాగాన్ని; పొడిచి= పొడిచివేసి; నవ్వుచున్= మందహాసం చేస్తూ (ఇట్లా అన్నాడు); ఎక్కుడు+ఐన= అధికులైన; పగఱన్= శత్రువులను; ఉక్కునన్= పొగరుతో; తలపడకు= ఎదిరించకుము; అల్ల= అదిగో; వాఁడె= ఆ కనబడేవాడే; నరుండు= అర్జునుడు; కురుసేనతోడన్= కౌరవసైన్యంతో; బిరుదు+ఐ= మేటి అయి; పెనంగెడున్= యుద్ధం చేస్తున్నాడు; అతనికడకున్= అతడివద్దకు; పొమ్ము= వెళ్ళుము; అని= ఇట్లా; పలికి= చెప్పి; పోయెన్= కర్ణుడు వెళ్ళిపోయాడు; ఆ+కుమారుండునున్= ఆ సహదేవుడు; అట్లు= ఆ విధంగా; కర్ణుని+ఏటులను= కర్ణుడి బాణాల దెబ్బలతోను; మాటలను= (ఎత్తిపొడుపు) మాటలతోను; కడున్= మిక్కిలి; నొచ్చి= బాధపడి; తన బ్రదుకునకున్= తాను జీవించియుండటానికి; రోయుచున్= అసహ్యించుకొంటూ; పోయి= (అక్కడినుండి) వెళ్ళి; వేఱు+ఒక్క రథంబు= మరో రథాన్ని; ఎక్కెన్= అధిరోహించాడు; మత్స్యమద్రేశ్వరులు= విరాటరాజు, శల్యుడు (వీరిద్దరు); జంభవాసవుల చందంబునన్= జంభాసురుడు, ఇంద్రుడూ, జంభవాసవులు - వారిద్దరి విధాన; సమరంబు= యుద్ధాన్ని; చేయు సమయంబునన్= చేసే సమయంలో; ఆ శల్యుండు= ఆ శల్యుడు.

తాత్పర్యం: ఇట్లా కర్ణుడు సహదేవుడిని సమీపించి, చేష్టలు దక్కి చూస్తూ ఉన్న సహదేవుడిని చూడగానే కుంతి తనతో అన్నమాటలు (అనగా - అర్జునుడిని ఒక్కడినే తప్ప మరెవ్వరిని రణంలో, అవకాశం ఎదురై వచ్చినా వధించకుండా ఉంటాననే తన మాటలు) జ్ఞాపకం వచ్చాయి. కాబట్టి సహదేవుడిని సంహరించటానికి మనస్సు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాక, కేవలం వింటికొనతో అతడి ఉదరభాగాన్ని పొడుస్తూ నవ్వుతూ 'తనకంటె అధికుడైన శత్రువుతో పొగరుతో తలపడటం అవివేకం. ఇట్లా ఎప్పుడూ చేయకుము. అదుగో మీ అర్జునుడు కురుసైన్యంతో పోరాడుతూ ఉన్నాడు అతడిదగ్గరికి వెళ్ళుము' అని చెప్పి, కర్ణుడు అక్కడినుండి వెళ్ళిపోయాడు. సహదేవుడు ఆ కర్ణుడి బాణఘాతాల తోను ఈ సూటిపోటి మాటలతోను మనస్సులో చాలా బాధపడి తన బ్రతుకునకు తానే అసహ్యపడుతూ వెంటనే వేరొక రథం ఎక్కి అక్కడినుండి వెళ్ళిపోయాడు. విరాట శల్యులు జంభాసుర దేవేంద్రులవలె యుద్ధం చేసే సమయంలో ఆ శల్యుడు (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: కుంతి కర్ణుడి దగ్గరకు వెళ్ళి 'నీవు నా కుమారుడవు. కన్యగా ఉన్నప్పుడు సూర్యునివలన కలిగినవాడవు. పాండవులకు జ్యేష్ఠభ్రాతవు. కౌరవపక్షాన్నివీడి పాండవపక్షం చేరి రాజ్యాన్ని నీవే అనుభవించుము' అని అర్థించింది. అందుకు కర్ణుడు అది తనకు ధర్మం కాదని లోక సమ్మతమూ కాదని కుంతి అభ్యర్థనను తిరస్కరిస్తూనే ఇట్లా అన్నాడు: **శ్లో॥ న చతేఽయం సమారంభో మయి మోఘో భవిష్యతి । వధ్యాన్ విషహ్యాన్ సంగ్రామే న హనిష్యామి తే సుతాన్ । యుధిష్ఠిరంచ భీమంచ యమౌ చైవార్జునాదృతే॥'** (ఉద్యోగ 146/20,21) నీవిట్లా రావటం వృథా కాదు. అర్జునుడు తప్ప మరెవ్వరైనా నీ కొడుకులు - యుధిష్ఠిరాదులు యుద్ధంలో తటస్థించి సంహరించే అవకాశం వచ్చినా సంహరించను' అని - ఇది కర్ణుడు కుంతి కిచ్చిన మాట. ఆ మాట నిలబెట్టుకొనటానికే సహదేవుడిని సంహరించక కర్ణుడు విడిచిపెట్టాడు.

క. హరులను సూతునిఁ జంపిన । విరటుఁడు పొలివోక వివిధ విశిఖచయంబుల్
గురియ శతానీకుఁడు శ । ల్యురథం బస్త్రములఁ బొదివె నుద్ధతభంగిన్. 162

ప్రతిపదార్థం: (శల్యుడు) హరులను= (ఆ విరాటరాజుయొక్క) అశ్వాలను; సారథిని= సారథిని; చంపినన్= సంహరించగా; విరటుఁడు= విరాటరాజు; పొలివోక= నిరుత్సాహపడక; వివిధ విశిఖ చయంబుల్= అనేకములైన బాణాల సమూహాలను; కురియన్= కురిపించగా; (అప్పుడే చేరి) శతానీకుఁడు= విరాటుడి తమ్ముడు శతానీకుడనేవాడు; శల్యురథంబు= శల్యుడి రథాన్ని; ఉద్ధతభంగిన్= గర్వించిన విధాన; గర్వంతో చెలరేగి; అస్త్రంబులన్= బాణాలతో; పొదివెన్= కప్పివేశాడు.

తాత్పర్యం: విరాటుడి అశ్వాలను, సారథిని చంపాడు. అప్పుడు విరాటుడు నిరుత్సాహపడక ఆ శల్యుడిపై బాణవర్షం కురిపించాడు. అంతలోనే విరాటుడి తమ్ముడు శతానీకుడు విజృంభించి శల్యుడి రథాన్ని బాణాలతో కప్పివేశాడు.

వ. ఇట్లు మత్స్యానుజుండు దాఁకిన. 163

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; మత్స్య+అనుజుండు= మత్స్యదేశపురాజైన విరాటుడి తమ్ముడు శతానీకుడు; తాఁకినన్= (శల్యుడిని) ఎదుర్కొనగా.

తాత్పర్యం: ఈ విధంగా విరాటుడి తమ్ముడు శతానీకుడు (తనను) ఎదుర్కొనగా.

తే. అతనిఁ గూల్చె మద్రేశుఁ డయ్యరద మెక్కి । విరటుఁ డడలును గినుకయుఁ బిరిగొనంగ
ముట్టె నాతని; నాతండు మూర్ఛవోవ । నేయ సారథి దొలఁగంగ నెగచె రథము. 164

ప్రతిపదార్థం: మద్రేశుఁడు= శల్యుడు; ఆతనిన్= ఆ శతానీకుడిని; కూల్చెన్= పడగొట్టాడు - సంహరించాడని భావం; విరటుఁడు= విరాటరాజు; ఆ+అరదము= ఆ శతానీకుడి రథాన్ని; ఎక్కి= అధిరోహించి; అడలును= భయం; కినుకయును= కోపం;పిరిగొనంగన్=

ఆవహింపగా; ఆతనిన్= ఆ శల్యుడిని; ముట్టెన్= ఎదుర్కొన్నాడు; ఆతండు= ఆ శల్యుడు; ఆతనిన్= ఆ విరాటుడిని; మూర్ఛ= మూర్ఛ; పోవన్= పోయేవిధంగా; ఏయన్= కొట్టగా; సారథి= ఆ విరాటుడి సారథి; రథమున్= రథాన్ని; తొలఁగంగన్= రణరంగంనుండి తొలగిపోయే విధంగా; ఎగచెన్= తరిమాడు.

తాత్పర్యం: శల్యుడు శతానీకుడిని సంహరించాడు. విరాటుడు తన తమ్ముడి రథం ఎక్కి భయం, కోపం-తన మనస్సునావహింపగా, ఆ శల్యుడిని ఎదిరించాడు. కాని, ఆ శల్యుడు విరాటుడిని మూర్ఛపోయేటట్లు బాణాలతో కొట్టగా, వెంటనే అతడి సారథి ఆ రథాన్ని రణరంగంనుండి తొలగించి తీసికొని వెళ్ళాడు.

విశేషం: 'ఆతనిన్' అనే పదం దేహళీదత్త దీపన్యాయంచేత అన్వయించి రెండర్థాలు. 'ముట్టెనాతని' అని, 'ఆతని నాతఁడు మూర్ఛపోవ' అని శల్యవిరాటులను చెప్పుతుంది.

వ. **ఇవ్విధంబున విరటుండు వికలుఁ డగుటయు నా చక్కటి సైన్యంబులు శల్యునురవడికిం గాక తెరలినం దఱిమి ధనంజయుండు నిలువరించిన బలాఢ్యుం డగు నలంబుసుం డతని మేన మార్గణంబులు గ్రుచ్చి పేర్చిన నప్పాండవ మధ్యముండు.** **165**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; విరటుండు= విరాటరాజు; వికలుండు+అగుటయున్= విఫలం కాగా; ఆ చక్కటి సైన్యంబులు= ఆ వైపు సైన్యాలు; శల్యు+ఉరవడికిన్= శల్యుడి ధాటికి; కాక= తాళలేక; తెరలినన్= (ప్రక్కకు) తొలగగా; తఱిమి= పరుగుతీసి (వచ్చి); ధనంజయుండు= అర్జునుడు; నిలువరించినన్= నిలిచిపోయేటట్లు చేయగా; బల+ఆఢ్యుండు= బల సంపన్నుడైన; అలంబుసుండు= ఆలంబుసుడనే రాక్షసుడు; అతని మేనన్= ఆ అర్జునుడి శరీరాన; మార్గణంబులు= బాణాలు; గ్రుచ్చి= నాటి; పేర్చినన్= విజృంభిస్తూ ఉంటే; ఆ+పాండవమధ్యముండు= ఆ అర్జునుడు.

తాత్పర్యం: ఈ రీతిగా విరాటరాజు విఫలుడు కాగా, ఆ వైపు సైన్యాలు శల్యుడిధాటికి తట్టుకొనలేక తొలగిపోగా, అర్జునుడు పరుగుపరుగున వచ్చి, వాటిని ఆదుకొని నిలువరించాడు. అలంబుసుడనే బలాఢ్యుడైన రాక్షసుడు అర్జునుని శరీరంమీద బాణాలను గ్రుచ్చి రెచ్చిపోగా, అర్జునుడు.

ఉ. **చాపముఁ గేతువుం దునిమి, సారథి నశ్వములన్ వధింప ను**
త్కోపవికారుఁడై యసుర క్రూర కృపాణము గొన్న నేసె ను
గ్గై పృథివీస్థలిం దొరఁగున ట్లలయించి చతుశ్శిలీముఖా
టోపము సూప నాతఁడు గడున్ వెసఁ బాఱె భయార్తమూర్తి యై. **166**

ప్రతిపదార్థం: (ఆ పాండవమధ్యముడు) చాపమున్= ధనుస్సును; కేతువున్= ధ్వజాన్ని; తునిమి= ఖండించి; సారథిన్= సూతుడిని; అశ్వములన్= గుఱ్ఱాలను; వధింపన్= వధించగా; ఉత్కోపవికారుఁడు+ఐ= గొప్ప కోపవికారం కలవాడై; అసుర= ఆ అలంబుసుడు అనే రాక్షసుడు (విరథుడై); క్రూరకృపాణము= భయంకరమైన ఖడ్గాన్ని; కొన్నన్= తీసికొనగా - అనగా ప్రయోగించటానికి పైకి ఎత్తగానే; నుగ్గు+ఐ= నుసి నుసి అయి; పృథివీస్థలిన్= భూమిపై; తొరఁగునట్లు= పడేవిధంగా; ఏసెన్= బాణాలతో కొట్టాడు; ఇట్లు+అలయించి= ఇట్లా అలసట పుట్టేటట్లు చేసి; చతుః+శిలీముఖ+ఆటోపము= నాలుగు బాణాలతో ఆడంబరం; చూపన్= చూపినవెంటనే; (రథాశ్వ సారథులను, ధనురాద్యాయుధాలను లేకుండా చేసి యుద్ధంలో అలుపు పుట్టించి మరీ నాలుగుబాణాలు ప్రయోగించి శరీరాన్ని నొప్పించగా); ఆతఁడు= ఆలంబుసుడు; కడున్= మిక్కిలి; వెసన్= శీఘ్రంగా; భయార్తమూర్తి+ఐ= భయంతో ఆర్తిని చెందిన ఆకారం గలవాడై; పాఱెన్= పారిపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అలంబుసుడి చాపాన్ని, ధ్వజాన్ని, సారథిని, అశ్వాలను నేలకూల్చాడు. దానితో మిక్కిలి కోపంతో ఆ అలంబుసుడు భయంకర ఖడ్గాన్ని ఎత్తిన వెంటనే దానిని కూడా తుత్తునియలు చేశాడు. ఇట్లా యుద్ధంలో ఆ అలంబుసుడిని అలసేటట్లు చేసి, నాలుగు దృఢములైన బాణాలతో కొట్టగా, ఆ రాక్షసుడు భయకంపితుడై యుద్ధరంగంనుండి వేగంగా పారిపోయాడు.

విశేషం: 'చతుశ్మతిన్ సమాటోపము' అని ఉస్మానియా ప్రతి ఆదరించి చూపిన పాఠం మూలానుగుణంగా లేదు. పాఠాంతరంగా చూపిన పాఠమే మూలానికి విధేయంగా ఉండటంచేత అదే గ్రహించి వ్యాఖ్యానించటం జరిగింది. సంస్కృతమూలంలో ఇట్లా ఉన్నది. శ్లో॥నవభిశ్చ శితైర్బాణై ర్ధ్వజం చిచ్ఛేద భారత । సారథిం చ త్రిభిర్బాణై స్త్రిభిరేవ త్రివేణుకమ్ । ధను రేకేన చిచ్ఛేద చతుర్భిశ్చతురో హయాన్ । పునః సజ్యం కృతం చాపం తదప్యస్య ద్విధాzచ్ఛినత్ । విరథస్యోద్యతం ఖడ్గం శరేణాస్య ద్విధాzకరోత్ । అథైనం నిశితైర్బాణై శ్చతుర్భిర్భరతర్షభ! పార్థోzవిధ్యద్రాక్షసేన్ద్రం సవిద్ధః ప్రాద్రవద్రథాత్' (ద్రోణ. 167/44-47) అని.

సీ. నకులనందనుఁడు నీనందనుతోఁ బోరు । నెడ నా శతానీకుఁ డేచి యతని
కంకట మంగంబు గ్రక్కునఁ బాసిపోఁ । బడ వేసి విల్లును సిడముఁ ద్రుంపఁ,
దలఁకక యొండు కోదండంబు గొని నీదు । పుత్త్రుండు నొంప నా చిత్రసేను
శరముల కోర్చి తత్తురగంబులను సూతుఁ । ధరఁ గూల్చె వెస భవత్పౌ త్త్రుఁ డపుడు.

తే. గలఁక లేక యతండు శీఘ్రమున నిరువ । దేను దూపుల నొంచిన నెసక మెసఁగఁ
గినుక నాతఁ డా ధనువును దునుమ నక్కు । మారుఁ డేఁగె హార్దిక్యుని తేరిపైకి. 167

ప్రతిపదార్థం: నకుల నందనుండు= నకులుడి కుమారుడు శతానీకుడు; నీ నందనుతోన్= నీ కుమారుడైన చిత్రసేనుడితో; పోరునెడన్= యుద్ధం చేసే సమయంలో; శతానీకుఁడు; ఏచి= విజృంభించి; అతని కంకటము= ఆ చిత్రసేనుని కవచం; అంగంబు= శరీరాన్ని; పాసి= విడిచి; పోఁబడన్= పోయి పడే విధంగా; ఏసి= బాణాలు వేసి; విల్లును= ధనుస్సును; సిడమున్= ధ్వజాన్ని; త్రుంపన్= ఖండించగా; తలఁకక= చలించక; ఒండు= మరియొక; కోదండంబు= ధనుస్సును; కొని= తీసికొని; నీదుపుత్త్రుండు= నీ కుమారుడు చిత్రసేనుడు; నొంపన్= బాణాలతో నొప్పి కలుగజేయగా; ఆ చిత్రసేను శరములన్= ఆ చిత్రసేనుడి బాణాలను; ఓర్చి= సహించి; అపుడు= ఆ సమయంలో; భవత్+పౌత్త్రుండు= మనుమడు అయిన ఆ శతానీకుడు; తద్+తురంగంబులను= అతని అశ్వాలను; సూతున్= సారథిని; ధరన్= భూమిపై; వెసన్= శీఘ్రంగా; కూల్చెన్= పడగొట్టాడు - అనగా సంహరించాడు; అతండు= ఆ చిత్రసేనుడు; కలఁక లేక= జంకు లేక; శీఘ్రముగన్= వేగంగా; ఇరువదేను తూపులన్= ఇరువది అయిదు బాణాలతో; నొంచినన్= నొప్పి పుట్టించగా; ఆతఁడు= ఆ శతానీకుడు; కినుకన్= కోపంతో; ఎసకము= విజృంభణం; ఎసఁగన్= అతిశయించగా; ఆ ధనువును= ఆ విల్లును; తునుమన్= విరుగగొట్టగా; ఆ+కుమారుఁడు= ఆ చిత్రసేనుడు; హార్దిక్యుని తేరిపైకిన్= హార్దిక్యుడి రథంపైకి; ఏఁగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: నకులుడి కుమారుడు శతానీకుడు నీ కుమారుడైన చిత్రసేనుడితో యుద్ధం ప్రారంభించగానే శతానీకుడు చిత్రసేనుడి కవచాన్ని బాణాలతో ఛిన్నంచేసి, తొలగిపోయి క్రిందపడేటట్లు చేశాడు. ధనువును, ధ్వజాన్ని నరికివేశాడు. వెంటనే చిత్రసేనుడు మరో విల్లును చేపట్టి ఆ శతానీకుడి శరీరాన్ని నొప్పి పుట్టేటట్లు గట్టిగా కొట్టాడు. అయినా శతానీకుడు ఆ బాధకు తట్టుకొని వెంటనే చిత్రసేనుడి అశ్వాలను సారథిని కూల్చివేశాడు. వెంటనే చిత్రసేనుడు శతానీకుడిని ఇరువది అయిదు బాణాలను శరీరంలో గ్రుచ్చుకొని నొప్పి పుట్టేటట్లు ప్రయోగించాడు. అప్పుడు శతానీకుడు మిక్కిలి కోపంతో విజృంభించి, చిత్రసేనుడి విల్లును ముక్కలు చేశాడు. దానితో చిత్రసేనుడు నిరాయుధుడై రథాశ్వ సారథులను, కవచాన్ని కూడా కోల్పోయి హార్దిక్యుడి రథంమీదికి పారిపోయి ఎక్కాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **ద్రుపదుఁడు వృషసేనుండును। నుపమానాతీత ఘోర యుద్ధంబున బా**
ణ పరీత శోణిత ప్లుత। వ పురుజ్జ్వలులైరి కౌరవక్షితినాథా! **168**

ప్రతిపదార్థం: కౌరవ క్షితినాథా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ద్రుపదుఁడు= ద్రుపదరాజు; వృషసేనుండును= కర్ణుడి కుమారుడు వృషసేనుడు; ఉపమాన+అతీత ఘోర యుద్ధంబునన్= సాటిలేని భయంకరమైన యుద్ధంలో; బాణ= బాణాలతో; పరీత= వ్యాప్తమైన; శోణిత= నెత్తురుతో; ప్లుత= తడిసిన; వపుః= శరీరాలతో; ఉజ్జ్వలులు= ప్రకాశిస్తున్నవారు; ఐరి= అయ్యారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ద్రుపదరాజు, కర్ణుడి కుమారుడు వృషసేనుడు యుద్ధానికి తలపడ్డారు. ఆ యుద్ధం సాటిలేని విధంగా భయంకరంగా సాగింది. ఇద్దరి శరీరాలూ బాణాలతో చీల్చబడి రక్తధారలతో నిండిపోయాయి.

వ. **అట్టియెడ నాకర్ణపట్టి చేయి బెట్టిదంబయి వచ్చినం బాంచాల బలంబు నిజపతికిం దలకడచి యతనింబొదివి యా సైనికోత్తము నంపసోన కోటఱి పఱచినం బ్రదీప్తుండై యతండు మెఱసె; దుశ్శాసనుండు ధర్మనందన నందనుండును బోరునెడ నప్పాండుపౌత్రుం డతని ఫాలంబున వాలిక నారసంబులు మూఁడు నాటించినం ద్రిశిఖరయుత శైలంబులీల నయ్యువరా జొప్పి యవ్వీరుం గ్రూర శరంబులం గప్పి కేతు సారథి రథంబులం దిల ప్రమాణ శకలంబులు సేసిన.** **169**

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ కర్ణపట్టి చేయి= ఆ వృషసేనుడి హస్తమే - హస్తలాఘవమే; బెట్టిదంబు+అయి= భయంకరమై; వచ్చినన్= రాగా; పాంచాలబలంబు= ద్రుపదుడి సైన్యం; నిజపతికిన్= తమరాజుకు (విరాటుడికి); తలకడచి= (దాటవేసి) ముందుకుపోయి; అతనిన్= ఆ వృషసేనుడిని; పొదివి= ఎదిరించి; ఆ సైనికోత్తముని+అంపసోనకున్= ఆ వీరశ్రేష్ఠుడైన వృషసేనుడి బాణవర్షానికి; ఓటఱి= ఓడిపోయి; పఱచినన్= పారిపోగా; ప్రదీప్తుండు+ఐ= వెలుగొందుతూ ఉండి; అతండు= ఆ వృషసేనుడు; మెఱసెన్= రాణించాడు (ఇక్కడినుండి దుశ్శాసన ప్రతివింధ్యుల యుద్ధవర్ణన); దుశ్శాసనుండు= దుర్యోధనుడి తమ్ముడు దుశ్శాసనుడు; ధర్మనందన నందనుండును= ధర్మరాజు కొడుకు ప్రతివింధ్యుడు; పోరునెడన్= యుద్ధంచేసే స్థలంలో; ఆ+పాండుపౌత్రుండు= ఆ పాండురాజు మనుమడు ప్రతివింధ్యుడు; అతని ఫాలంబునన్= ఆ దుశ్శాసనుడి నుదుట; వాలిక నారసంబులు మూఁడు= తీక్ష్ణములైన మూడు బాణాలను; నాటించినన్= గుచ్చుకొనేటట్లు కొట్టగా (అప్పుడు); త్రిశిఖరయుత శైలంబు లీలన్= మూడు శిఖరాలతో కూడిఉన్న పర్వతంవలె; ఆ+యువరాజు= యువరాజైన ఆ దుశ్శాసనుడు; ఒప్పి= రాణించి; ఆ+వీరున్= ఆ వీరుడిని అనగా ప్రతివింధ్యుడిని; క్రూరశరంబులన్= భయంకరములైన బాణాలతో; కప్పి= కప్పివేసి; కేతు, సారథి రథంబులన్= ధ్వజాన్ని, సారథిని, రథాన్ని (మూడింటిని); తిలప్రమాణ శకలంబులు= నువ్వులగింజలంత ముక్కలుగా; చేసినన్= చేయగా.

తాత్పర్యం: ఆ సమయంలో వృషసేనుడిదే పై చేయి అయింది. ద్రుపదసైన్యాలు తమ రాజు తగ్గిపోవటాన్ని చూచి, అతడికి ముందుగా నిలిచి, వృషసేనుడిని ఎదిరించి పోరాడాయి. కాని, వృషసేనుడి బాణవర్షాన్ని తట్టుకొనలేక పారిపోయాయి. ఇట్లా ద్రుపదుడి పరాజయంతో వృషసేనుడొక వెలుగు వెలిగాడు. ఇక దుశ్శాసనుడు ప్రతివింధ్యుడిని ఎదిరించి పోరే స్థలంలో - ప్రతివింధ్యుడు దుశ్శాసనుడి నుదుట మూడు తీక్ష్ణములైన బాణాలతో కొట్టగా, అవి దుశ్శాసనుడి నుదుట గ్రుచ్చుకొన్నాయి. వాటితో ఆ దుశ్శాసనుడు మూడు శిఖరాలతో కూడిన పర్వతంవలె శోభిల్లాడు. వెంటనే విజృంభించి దుశ్శాసనుడు ఆ ప్రతివింధ్యుడిపై బాణాలు గుప్పించి అతడి ధ్వజాన్ని, సారథిని, రథాన్ని, నువ్వులగింజలంత తుత్తునియలు చేయగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: నిదర్శన. నుదుట మూడుబాణాలు నాటింది దుశ్శాసనుడు. అట్లా నాటగా ప్రకాశించినవాడు ప్రతివింధ్యు డని సంస్కృతమూలం. ఆ మూల సంస్కృత శ్లోకాలివి - శ్లో॥ ప్రతివింధ్యంతు సమరే కుర్వాణం కర్మ దుష్కరమ్ । దుశ్శాసన స్త్రిభిర్బాణైర్లలాటే సమవిధ్యత । సోతి విద్ధో బలవతా తవపుత్రేణ ధన్వినా । విరరాజ మహాబాహుః సశృంగ ఇవ పర్వతః ॥' (ద్రోణ-168/ 36, 37) ఇక్కడ 'త్రిశిఖరయుత శైలంబులీలన్' ఉపమాలంకారం. నాటిన బాణాలు అట్లా గ్రుచ్చుకొనిపోయి నిలిచిన వనగా ఆ వీరుడి బాణప్రయోగంలోని బాహుబలాతిశయం వ్యక్తమవుతున్నది. ఇది ఈ నిదర్శనాలంకారంచేత ఏర్పడిన వస్తుధ్వని.

క. వింధ్యాద్రి వోలె నాప్రతి । వింధ్యుఁ డచలితోగ్రమూర్తి వెలయ నిలిచి ద
ర్పాంధ్యమతి నడరి దీప్తా । వంధ్యాస్త్రము లక్కుమారవరుపైఁ బఱపెన్. 170

ప్రతిపదార్థం: వింధ్య+అద్రి+పోలెన్= వింధ్యపర్వతంవలె; ఆ ప్రతివింధ్యుఁడు - ఆ ధర్మరాజు కుమారుడు; అచలిత+ఉగ్రమూర్తి= చలించని భయంకరమైన ఆకారం; వెలయన్= ప్రకాశించగా; నిలిచి= విరథుడై భూమిపై నిలిచియే; దర్ప+అంధ్యమతిన్= దర్పంతో అంధత్వమేర్పడిన బుద్ధితో - మిక్కిలి దర్పంతోనని భావం (దర్పాత్ ఆంధ్యం దర్పాంధ్యం - దర్పాంధ్యయుతా మతిః; మధ్యమ పద లోప కర్మధారయ సమాసం); అడరి= చెలరేగి; దీప్త+అవంధ్య+అస్త్రములు= దీప్తములైన - అనగా పదను తళుకును చూపుతున్న, వ్యర్థములు కాని, బాణాలతో; ఆ+కుమారవరుపైన్= ఆ దుశ్శాసనుడిపై; పఱపెన్= వ్యాపింపజేశాడు.

తాత్పర్యం: ప్రతివింధ్యుడు వింధ్యపర్వతంవలె చలించక భయంకరాకారంతో నిలిచి, గర్వం అతిశయించగా చెలరేగి, వాడి అయిన బాణాలను ఆ దుశ్శాసనుడిపై కురిపించాడు.

విశేషం: 'వింధ్యాద్రివోలె' అనునప్పుడు ఉపమాలంకారం. దీనిచేత - మేఘం ఎంత వర్షధారలు కురిపించినా వింధ్యాద్రి కేమీ కానట్లు దుశ్శాసనుడి బాణవర్షంతో ప్రతివింధ్యుడు ఏమీ కాక నిలుకడగా నిలిచాడని అతడి ధైర్యాతిశయం ధ్వనిస్తూ ఉన్నది.

ఆ. అలిగి వెడఁదవాతియమ్మున నాతని । ధనువుఁ దునియ నేసి తనువునందు
నిశిత విశిఖచయము నిగిడించె నీ కొడు;। కంతఁ దత్సహోదరాళి గదిసి. 171

ప్రతిపదార్థం: అలిగి= కోపించి; నీ కొడుకు= దుశ్శాసనుడు; వెడఁద వాయి+అమ్మునన్= వెడల్పయిన మూతి గల బాణంతో (ఔపవిభక్తికం); అతని ధనువున్= ఆ ప్రతివింధ్యుడి విల్లును; తునియన్= తునకలయ్యేటట్లు; ఏసి= కొట్టి; తనువునందున్= శరీరంపై; నిశిత విశిఖచయము= వాడిఅయిన బాణాలసమూహాన్ని; నిగిడించెన్= చొప్పించాడు; అంతన్= అంతలోనే; తద్+ సహోదర+ఆళి= అతడి సోదరులసమూహం కూడా; కదిసి= చేరుకొని.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అప్పుడు నీ కొడుకు దుశ్శాసనుడు మిక్కిలి కోపంతో ఆ ప్రతివింధ్యుడి వింటిని, వెడల్పైన మూతిగల బాణంతో నరికి, అతడి శరీరంలో తీక్ష్ణములైన బాణాలసమూహాన్ని చొప్పించాడు. అంతలోనే ఆ ప్రతివింధ్యుడి సోదరవర్గం కూడా అతడికి తోడుగా యుద్ధం చేయటానికి చేరింది. అట్లా చేరుకొని.

వ. కయ్యంబు సేయ నందు భీమసేననందనుం డగు శ్రుతసోము నరదం బయ్యుధిష్ఠిర తనయుం డెక్కి యొక్క సముద్దండం బగు కోదండంబు పుచ్చికొని భండనంబు సేసె; మనవారు నయ్యువరాజున కడ్డంబు సొచ్చి పెనంగిరి; నకులుండును శకునియు సమాన విక్రమంబుల సమరంబు సేయునెడ నా సౌబలుండు.172

ప్రతిపదార్థం: కయ్యంబు+చేయన్= యుద్ధం చేయగా; అందున్= ఆ యుద్ధంలో; భీమనందనుండు+అగు శ్రుతసోముని+అరదంబు= భీముడి కుమారుడైన శ్రుతసోముడి రథాన్ని; ఆ+యుధిష్ఠిర తనయుండు= ఆ ధర్మరాజు కుమారుడైన ప్రతివింధ్యుడు; ఎక్కి= ఆరోహించి; ఒక్క సముద్దండంబు+అగు= ఓ భయంకరమైన; కోదండంబు= ధనుస్సును; పుచ్చికొని= తీసికొని; భండనంబు=

యుద్ధం; చేసెన్= చేశాడు; మనవారు= (ఓ ధృతరాష్ట్ర మహారాజా!) మనపక్షంవారు; ఆ+యువరాజునకున్= ఆ దుశ్శాసనుడికి; అడ్డంబు+చొచ్చి= అడ్డంగా నిలిచి; పెనంగిరి= యుద్ధం చేశారు (ఇక నకుల శకునుల యుద్ధవర్ణన); నకులుండు= నకులుడు; శకునియున్= శకుని; సమాన విక్రమంబులన్= సమానమైన పరాక్రమాలతో; సమరంబు= యుద్ధం; చేయు+ఎడన్= చేసే సమయంలో (ఎట్లా యుద్ధం జరిగిందంటే); ఆ సౌబలుండు= ఆ శకుని.

తాత్పర్యం: యుద్ధం చేయగా, భీముడి కుమారుడైన శ్రుతసోముడి రథాన్ని యుధిష్ఠిరుడి కుమారుడు ఆరోహించి, ఓ భయంకరమైన, దృఢమైన విల్లును తీసికొని యుద్ధం చేశాడు. అప్పుడు మనవారు కూడా దుశ్శాసనుడికి తోడుగా వచ్చి యుద్ధం చేశారు. నకులుడు, శకుని సమానస్థాయిలో పరాక్రమిస్తూ ఉండగా ఆ శకుని. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **ఒక బలు తూ పురంబు గొని యుచ్చి చనం గర మల్గి యేయుడున్**
నకులుఁడు మూర్ఛ వోవుటయు నాదము రోదసి నిండ నార్చె; నం
తకుఁ దెలివొంది చాపముఁ బతాకయుఁ ద్రుంచి యతండు నీమఱం
దికి నరసా వొనర్చె ఘన తీవ్ర సముజ్జ్వల మార్గణంబులన్. **173**

ప్రతిపదార్థం: ఒక= ఒక; బలు= బలిష్ఠమైన; తూపు= బాణాన్ని; కొని= తీసికొని; ఉరంబు= వక్షాన్ని; ఉచ్చి= చీల్చి; చనన్= పోయేవిధంగా; కరము= మిక్కిలి; అల్గి= కోపించి; ఏయుడున్= ప్రయోగించగానే; నకులుఁడు= నకులుడు; మూర్ఛ+పోవుటయును= అచేతనత్వాన్ని పొందగానే; నాదము= ధ్వని; రోదసిన్= ఆకాశంలో; నిండన్= నిండిపోయే విధంగా; ఆర్చెన్= సింహనాదాన్ని చేశాడు; అంతకున్= అంతలోనే; తెలివి+ఒంది= తెలివిని పొంది (మూర్ఛనుండి తేరుకొని అని భావం); చాపమున్= ధనుస్సును; పతాకయున్= ధ్వజాన్ని; త్రుంచి= తెగగొట్టి; అతండు= ఆ నకులుడు; నీ మఱందికిన్= (ఓ ధృతరాష్ట్ర మహారాజా!) నీ భార్య తోబుట్టువైన శకునికి; ఘన= గట్టి; తీవ్ర= తీక్ష్ణములైన; సముజ్జ్వల= ప్రకాశిస్తూ ఉన్న; మార్గణంబులన్= బాణాలతో (ధ్వజాన్ని ధనువును ఖండించి); అర+చావు= సగం చావును; ఒనర్చెన్= కలుగజేశాడు (జీవన్మృతుడిని చేశాడని భావం - బ్రతికినా చచ్చినవాడితో సమానంగా ఉండేవాడు జీవన్మృతుడు).

తాత్పర్యం: ఓ బలిష్ఠమైన బాణాన్ని తీసి, ఆకర్ణాంతం లాగి, కోపంతో అతడి వక్షస్స్థలం చీల్చిపోయే విధంగా కొట్టగానే ఆ నకులుడు మూర్ఛపోగా శకుని ఆకాశం అంతా నిండేవిధంగా సింహనాదం చేశాడు. నకులుడు వెంటనే తేరుకొని దృఢమైన వాడిబాణాలతో ఆ శకుని విల్లును, ధ్వజాన్ని తుత్తునియలుగా చేసి, ముష్టిపై తొడలపై కొట్టి, గాయపరచి, సగం చచ్చినవాడినిగా చేశాడు.

విశేషం: ఇక్కడ అరసావు అనే మాటలో సంస్కృత మూలార్థం ధ్వనిస్తూ ఉన్నది. సంస్కృతమూలం ఇట్లా ఉన్నది.

శ్లో॥ అథాస్య సశరం చాపం ముష్టిదేశేఽచ్ఛినత్ తదా
ధ్వజం చ త్వరితం ఛిత్వా రథాద్ భూమౌ వపాతయత్
విశిఖేన చ తీక్ష్ణేన పీతేన నిశితేన చ
ఊరూ నిర్భిద్య చైకేన నకులః పాండునందనః
శ్యేనం సపక్షం వ్యాధేన పాతయామాస తం తదా
సోఽతివిద్ధో మహారాజ రథోపస్థ ఉపావిశత్
ధ్వజయష్టిం పరిక్లిశ్య కాముకః కామినీం యథా
తం విసంజ్ఞం నిపతితం దృష్ట్వా శ్యాలం తవానఘ!
అపో వాహ రథేనాశు సారథి ర్ధ్వజినీ ముఖాత్. (ద్రోణ. 169/14-19)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిక్కన ఈ అర్థాన్నంతా 'అరసావు' అనే మాటతో సంక్షిప్తీకరించాడు. అందుకే 'పడుటయు' అనే పదానికి మూలానుగుణంగా 'మూర్ఛపడిపోగానే' అని వివరించటం జరిగింది. శకుని పరాజితుడై జీవన్మృతుడు అయ్యాడు.

వ. ఇట్లు గాంధారపతి పడుటయుఁ దత్సారథి దేరు దొలంగఁ దోలుకొని పోయెఁ; గృపాచార్యుతోడ రణక్రీడఁ జలుపుచుండ శిఖండి కోదండంబు బిసకాండంబుగా ఖండించి యతండు శక్తి వైవ నదియును దునిమిన ఘనంబగు ధనువు గొని తోరంపు నారసంబున నతనిం దేరిపై సొగయ నేసి, యగ్గౌతముండు గోపంబునఁ జంపఁ దలంపెత్తి వెండియు నేయ నిగుడునంతకు నద్దెస యోధులు పలువు రొక్కట నుక్కున నురవడించిన మన దిక్కు సైనికులు శారద్వతుం గడచి కడిమి నెఱయఁ బోరిరి; మఱియు ననేక ద్వంద్వ యుద్ధంబులు సెల్లుచుండ సంకులసమరం బయ్యె; నయ్యవసరంబున. 174

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; గాంధారపతి= గాంధారదేశపురాజు (శకుని); పడుటయున్= మూర్ఛపడి పోగానే; తద్+సారథి= అతడి సారథి; తేరు= రథాన్ని; తొలంగన్= (రణరంగం నుండి) తొలగిపోయే విధంగా; తోలుకొనిపోయెన్= తోలుకొనిపోయాడు (ఇది నకుల శకునుల యుద్ధ వర్ణన; ఇక కృప - శిఖండుల యుద్ధవర్ణన ప్రారంభం); శిఖండి= ద్రుపదపుత్రుడు శిఖండి; కృపాచార్యుతోడన్= కృపాచార్యుడితో; రణక్రీడన్= యుద్ధక్రీడను; చలుపుచు+ఉండన్= చేస్తూ ఉండే సమయులో; (ఆ శిఖండి); కోదండంబు= (ఆ కృపాచార్యుడి) ధనుస్సును; బిసకాండంబు+కాన్= తామరతూడు కాగా - తామరతూడువలె (అనాయాసంగా అని భావం); ఖండించి= భగ్నం చేసి; అతండు= ఆ కృపాచార్యుడు; శక్తిన్= శక్తిని; వైవన్= వేయగా; అదియును= ఆ శక్తినికూడ; తునిమినన్= త్రుంచగా; ఘనంబు+అగు= దృఢమైన; ధనువు= ధనుస్సును; కొని= తీసికొని; తోరంపు నారసంబునన్= దృఢమైన బాణంతో; ఆతనిన్= ఆ శిఖండిని; సొగయన్= మూర్ఛిల్లే విధంగా; ఏసి= కొట్టి; ఆ+గౌతముండు= ఆ కృపాచార్యుడు; కోపంబునన్= కోపంతో; చంపన్= చంపటానికి; తలంపు+ఎత్తి= కోరిక పొడమి; వెండియున్= మరల; ఏయన్= బాణం వేయటానికి; నిగుడు+అంతకున్= ఉద్యమించే లోపల; ఆ+దెస యోధులు+పలువురు= ఆ వైపు వీరులు అనేకులు; ఒక్కటన్= ఒకేసారి; ఉక్కునన్= గర్వంతో; ఉరవడించినన్= విజృంభించగా; మన దిక్కు సైనికులు= మనవైపు వీరులు; శారద్వతున్= ఆ కృపాచార్యుడిని; గడచి= దాటిపోయి; కడిమి= శౌర్యం; నెఱయన్= అతిశయించగా; పోరిరి= యుద్ధం చేశారు; మఱియున్= ఇంకా కూడ; అనేక ద్వంద్వయుద్ధంబులు= అనేకాలైన ద్వంద్వయుద్ధాలు; చెల్లుచుండన్= జరుగుతుండగా; సంకుల సమరంబు= తుములమైన యుద్ధం; అయ్యెన్= అయింది; ఆ+అవసరంబునన్= ఆ సమయాన.

తాత్పర్యం: ఇట్లా శకుని మూర్ఛపోగానే అతడి సారథి ఆ రథాన్ని రణరంగంనుండి మరల్చాడు. (ఈ నకుల శకునుల యుద్ధం శకుని పరాజయంతో ముగిసింది.) శిఖండి కృపాచార్యుడి విల్లును తామరతూడు మాదిరి విరుగగొట్టాడు. ఆ కృపాచార్యుడు శక్తిని వేయగా, దాన్ని కూడా దృఢమైన బాణంతో ఖండించాడు. అప్పుడు కృపాచార్యుడు దృఢమైన విల్లును తీసికొని పెద్దబాణంతో శిఖండి రథంపై సొమ్మసిల్లిపడేటట్లుకొట్టాడు. అప్పుడు కృపుడు ఆ శిఖండిని కోపంతో చంపబూని, దృఢమైన బాణాన్ని ఎక్కుపెట్టి ప్రయోగించటానికి పూనుకోగా, అంతలోనే ఆ వైపున్న వీరులు ఒక్కపెట్టున కృపాచార్యుడిపై విజృంభించారు. అది చూచి మన వీరసైనికులు కృపుడిని దాటవేసి ముందుకు వచ్చి, ఆ వైపు సైనికులతో వీరోచితంగా యుద్ధం చేశారు. అనేక ద్వంద్వయుద్ధాలతో అది ముమ్మరయుద్ధంగా మారింది. ఆ సమయాన.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **ఏచి ధృష్టద్యుమ్నుఁ డాచార్యు నురమున । వెస నాఁటె నైదునారసము; లాతఁ**
డాతని నిరువదేనమ్ముల నొంచి విల్ । దునిమిన నొండువిల్ గొని యతండు
మంటలు గ్రమ్మెడు మహితాస్త్ర మేయుడుఁ । గాలంబు గా కిది కలశజునకు
ననుచు నీవారు భయం బంద నేకాద । శాస్త్రంబు లొక ముష్టి నలవరించి

తే. **యేసి కర్ణుండు దునియలు సేసె నడుమ; । నంతఁ గురురాజు యువరాజు నడర గురుసు**
తుండు శకునియు శల్యుండుఁ దోడుపడిరి । వార లేడ్వుర తాఁకు నవ్వీరుఁ డోర్చె. 175

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్నుఁడు; ఏచి= విజృంభించి; ఆచార్య+ఉరమునన్= ద్రోణాచార్యుల వక్షస్స్థలాన; వెసన్= వేగంగా; ఐదు నారసములు= అయిదు బాణాలను; నాఁటెన్= నాటాడు (గ్రుచ్చుకొనిపోయేటట్లు గట్టిగా కొట్టాడని భావం); అతఁడు=ఆ ద్రోణాచార్యుడు; ఆతనిన్= ఆ ధృష్టద్యుమ్నుడిని; ఇరువది+ఏను+అమ్ములన్= ఇరువది అయిదు బాణాలతో; నొంచి= నొప్పి పుట్టించి (కొట్టి అని భావం); విల్= ధనుస్సును; తునిమినన్= ఖండించగా; ఒండు విల్= మరొక ధనువును; కొని= తీసికొని; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; మంటలు= అగ్నిజ్వాలలు; క్రమ్మెడు= వ్యాపింపజేస్తూ ఉన్న; మహిత+అస్త్రము= మాన్యమైన అనగా దివ్యమైన బాణాన్ని; ఏయుడున్= ప్రయోగించగానే; ఇది= ఈ దివ్యబాణం; కలశజునకున్= ద్రోణాచార్యుడికి; కాలంబు= మృత్యువు; కాక= తప్ప (మరేమి?); అనుచున్= అంటూ; నీవారు; భయంబు= భీతిని; అందన్= పొందగా; కర్ణుండు= కర్ణుడు; ఏకాదశ+అస్త్రంబులు= పదకొండుబాణాలను; ఒక ముష్టిన్= ఒక పిడికిటిలో; అలవరించి= పట్టుకొని; ఏసి= ప్రయోగించి; నడుమన్= మార్గమధ్యంలోనే; తునియలు+చేసెన్= తునకలు చేశాడు; అంతన్= అంతలోనే; కురురాజు= దుర్యోధనుడు; యువ రాజును= దుశ్శాసనుడు కూడా; అడరన్= పూనుకొనగా; శకునియున్= శకుని; శల్యుండును= శల్యుడు; తోడుపడిరి= తోడుగా వచ్చారు; వారలు+ఏడ్వుర తాఁకు= ఆ ఏడుగురు యోధుల తాకిడిని; ఆ+వీరుఁడు= ఆ ధృష్టద్యుమ్నుడు; ఓర్చెన్= తట్టుకొన్నాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు విజృంభించి, ద్రోణాచార్యుడిని వెంటనే అయిదు బాణాలతో వక్షస్స్థలంలో కొట్టాడు. ఆ ద్రోణుడు ఇరువది అయిదు బాణాలతో ధృష్టద్యుమ్నుడిని కొట్టి, అతడి విల్లుకూడ విరుగగొట్టగా, వెంటనే ధృష్టద్యుమ్నుడు వేరొక విల్లు తీసికొని మంటలు గ్రక్కే దివ్యబాణాన్ని ప్రయోగించాడు. అది చూచి ఈ బాణం ద్రోణుడికి మృత్యువుగాకేమి? - అని మీపక్షంవారు అనుకొంటూ భయకంపితులయ్యారు. వెంటనే కర్ణుడు పదకొండుబాణాలు ఏకంగా వేసి మార్గమధ్యంలోనే ఆ దివ్యబాణాన్ని తునియలు చేశాడు. అంతలోనే దుర్యోధనుడు, దుశ్శాసనుడు వచ్చి చేరారు. వారి వెంట శకుని శల్యుడు కూడా తోడు వచ్చారు. ఇట్లా ఏడుగురు కురువీరులు ఎదుర్కొన్నా ధృష్టద్యుమ్నుడు వారి తాకిడికి తట్టుకొన్నాడు.

క. **ద్రుమసేనుఁ డడరి పటు బా । ణము లుద్ధతిఁ బఱపె సూతనందనుపైఁ గో**
పము గదిరి యతఁడు వాని శి । రము గుండలదీప్త మై ధరం బడ నేసెన్. 176

ప్రతిపదార్థం: (అంతలో) ద్రుమసేనుఁడు= ద్రుమసేనుడనేవాడు; అడరి= చెలరేగి; పటుబాణములు= సమర్థములైన బాణాలను; ఉద్ధతిన్= గర్వంతో; సూతనందనుపైన్= కర్ణుడిపై; పఱపెన్= ప్రయోగించాడు; అతఁడు= ఆ కర్ణుడు; కోపము= క్రోధం; కదిరి= అతిశయించి; వాని శిరము= ఆ ద్రుమసేనుడి తల; కుండల దీప్తము+ఐ= చెవికమ్మలతో ప్రకాశిస్తున్నదై; ధరన్= భూమిపై; పడన్= పడిపోయేవిధంగా; ఏసెన్= బాణాలతో కొట్టాడు.

తాత్పర్యం: అంతలో ద్రుమసేనుడు కర్ణుడిని ఎదిరించాడు. పెద్ద గర్వంతో అతడిపై దృఢమైన బాణాలు వర్షించాడు. దానితో కర్ణుడికి కోపం పెరిగి, ఆ ద్రుమసేనుడి తల కుండలాల ప్రకాశంతో భూమిపై పడేవిధంగా బాణాలతో కొట్టాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు ద్రుమసేనుండు సచ్చినం బేర్చిన కోపంబునఁ గర్ణుకోదండంబు దునిమి ధృష్టద్యుమ్నుండు నతిమిన, నొండు బలు వింటం బెనంగు నతనిం గూడుకొని కురురాజు మొదలగు నేగురు రథికులు పెలుచ నేసి; రా సమయంబున సాత్యకి సమదగతిం గవిసి 'నిలు నిలు' మని యదల్చి రాధేయుం దలపడియె; న య్యిరువుర యుక్కును నొక్కరూపున నక్కజం బై యుండె; నట్టియెడ వృషసేనుండు వచ్చి శైనేయు నేయుటయు, నతండు వాలమ్ములు నిగిడించి వానిం దేరిపయిం ద్రెళ్ళ మూర్ఛిల్లం జేసినం బుత్రశోక పీడితుం డగు సూతపుత్రుం డచ్యుతానుజు నానాస్త్ర పీడితుం గావించె; నంతకుం దెలిసి తనయుండును దోడుపడియె; నట్లడరు నయ్యిద్దఱ నా శినివరుండు గినుక యెక్కిన యేడ్తెఱం జిక్కువఱిచె; నప్పుడు గాండీవ గుణ దేవదత్త మహారావంబును హాహా కారంబును వీతెంచిన నయ్యంగరాజు రారాజున కిట్లనియె. 177

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ద్రుమసేనుండు= ద్రుమసేనుడు; చచ్చినన్= మరణించగా; పేర్చిన కోపంబునన్= అతిశయించిన క్రోధంతో; కర్ణుకోదండంబు= కర్ణుడి ధనుస్సును; తునిమి= తునియలుచేసి; ధృష్టద్యుమ్నుండు; నఱిమినన్= పొడిచేయగా; ఒండు బలువింటన్= రెండో దృఢమైన విల్లుతో; పెనంగు+అతనిన్= యుద్ధం చేస్తూ ఉన్న ఆ కర్ణుడిని; కూడుకొని= చేరి; కురురాజు మొదలగు+ఏగురు రథికులు= దుర్యోధనుడు మొదలైన అయిదుగురు రథికులు; పెలుచన్= దృఢంగా; ఏసిరి= బాణాలతో కొట్టారు; ఆ సమయంబునన్= ఆ సమయంలో; సాత్యకి; సమదగతిన్= గర్వవిజృంభణయుక్తంగా - అనగా గర్వాతిరేకంతో; కవిసి= (వారినందరిని) ఎదిరించి; నిలుము+నిలుము+అని= ఆగు ఆగు అని; అదల్చి= గద్దించి; రాధేయున్= కర్ణుడిని; తలపడియెన్= ఎదుర్కొన్నాడు; ఆ+ఇరువుర+ఉక్కును= ఆ సాత్యకి కర్ణులిద్దరి పరాక్రమం కూడ; ఒక్క రూపునన్= ఏకరూపంలో - అనగా ఒకే విధంగా; అక్కజంబు+ఐ= ఆశ్చర్యాన్ని కొలుపుతున్నదై; ఉండెన్= ఉన్నది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; వృషసేనుండు= కర్ణుడి కుమారుడైన వృషసేనుడు; వచ్చి= అక్కడికి చేరి; శైనేయున్= శినికి పౌత్రుడైన సాత్యకిని; ఏయుటయున్= బాణాలతో కొట్టగానే; అతండు= ఆ సాత్యకి; వాలు+అమ్ములు= తీక్ష్ణములైన బాణాలను; నిగిడించి= ప్రయోగించి; వానిన్= ఆ వృషసేనుడిని; తేరిపయిన్= రథంపైన; త్రెళ్ళి= కూలి; మూర్ఛిల్లన్= మూర్ఛపోయే విధంగా; చేసినన్= చేయగానే; పుత్రశోక పీడితుండు+అగు= పుత్రుడు మరణించాడనే భావనతో కలిగిన దుఃఖంతో బాధపడిన; సూతపుత్రుండు= కర్ణుడు; అచ్యుత+అనుజున్= కృష్ణుడి తమ్ముడైన సాత్యకిని; నానా+అస్త్రపీడితున్= పలు బాణాలతో బాధపొందినవాడినిగా; కావించెన్= చేశాడు; అంతకున్= అంతలోనే; తెలిసి= మూర్ఛతేరుకొని; తనయుండును= అతడి కుమారుడు వృషసేనుడు కూడ; తోడుపడియెన్= తోడ్పడ్డాడు; అట్లు= ఆ విధంగా; అడరు+ఆ+ఇద్దఱన్= చెలరేగుతూ ఉన్న ఆ తండ్రి కొడుకులిరువురిని; ఆ శినివరుండు= ఆ శినివంశశ్రేష్ఠుడు సాత్యకి; కినుక+ఎక్కిన+ఏడ్తెఱన్= కోపం పెల్లుబికిన పరాక్రమంతో; చిక్కుపఱిచెన్= కష్టపెట్టాడు; అప్పుడు= ఆ సమయంలో; గాండీవగుణ దేవదత్త మహారావంబును= అర్జునుడి గాండీవ ధనుష్టంకారధ్వని, దేవదత్తమనే శంఖనాదం; హాహాకారంబును= సైనికుల ఆర్తనాదం కూడ; వీతెంచినన్= వినబడగా; ఆ+అంగరాజు= ఆ కర్ణుడు; రారాజునకున్= దుర్యోధనుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఈ విధంగా ద్రుమసేనుడు మరణించగా, ధృష్టద్యుముడు అతిశయించినకోపంతో కర్ణుడి విల్లును తుత్తునియలు చేసి, కసితో పొడి చేశాడు. అప్పుడు కర్ణుడు మరియొక బలిష్ఠమైన విల్లును తీసికొని యుద్ధంచేస్తూ ఉండగా, దుర్యోధనుడు మొదలైన అయిదుగురు మహావీరులు కర్ణుడికి తోడై, దృష్టద్యుమ్నుడిని బాణాలతోకొట్టారు. అప్పుడు సాత్యకి గర్వంతో విజృంభించి 'నిలునిలు' మని కర్ణుడివైపు పరుగు తీసి, కర్ణుడినిఎదుర్కొన్నాడు. ఆ సాత్యకి కర్ణుల యుద్ధం సమానస్థాయిలో ఉండి, ఆశ్చర్యం కలుగజేసింది. ఆ సమయంలో కర్ణుడికొడుకు వృషసేనుడు వచ్చి, సాత్యకిని బాణాలతో కొట్టగా, సాత్యకి దృఢమైన బాణాలతో కొట్టి ఆ వృషసేనుడు రథంపైమూర్ఛ ల్లేటట్లుచేశాడు. కర్ణుడు తన కొడుకు మరణించాడని భ్రమించి పుత్రదుఃఖంతో సాత్యకిని పెక్కుబాణాలతోబాధించాడు.

అంతలోనే కర్ణపుత్రుడు వృషసేనుడు మూర్ఛనుండి తేరుకొని తన తండ్రికి తోడ్పడ్డాడు. చెలరేగిన ఆ తండ్రి కొడుకు లిద్దరిపై సాత్యకి మిక్కిలి కోపంతో బాణాలు నింపాడు. ఇంతలోనే అర్జునుని గాండీవ ధనుష్టంకారధ్వని, దేవదత్తాన్ని పూరించిన ధ్వని, సైనికుల హాహాకారం వినిపించగా కర్ణుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

కర్ణ దుర్యోధనులు దురాలోచన సేసి సాత్యకిం దలపడుట (సం. 7-145-55)

క. **'అదె పార్థుఁడు దన మునుమున। కొదవిన సేనలఁ గలంచునులి వడఁ డితనిం**
గదియఁగ రాకుండఁగ ముసు। పొదువుదమే సాత్యకిం బ్రభూత బలముతోన్? 178

ప్రతిపదార్థం: పార్థుఁడు= అర్జునుడు; అదె= అదిగో (అక్కడ ఉన్నాడని చేతితో చూపటం); అతఁడు= ఆ అర్జునుడు; తన మునుమునకున్= తన ముందువరుసకు; ఒదవిన సేనలన్= కలిగిన సైన్యాలను; కలంచునులివు= కలతబెట్టేశబ్దం; ఇతనిన్= ఈ సాత్యకిని; కదియఁగన్= సమీపించటానికి; రాకుండఁగన్= రాకపోయే విధంగా; మును= ముందుగా; ప్రభూత బలముతోన్= గొప్ప సైన్యంతో; సాత్యకిన్= సాత్యకిని; పొదువుదమే?= చుట్టుముట్టుదామా!

తాత్పర్యం: 'అదిగో అర్జునుడు ఆ వైపున ఉన్న సైనికవీరులతో యుద్ధంచేసే సందడిలో ఉన్నాడు. అతడు సాత్యకిని ఆదుకొనటానికి చేరకముందే, మనం గొప్ప సైన్యంతో సాత్యకిని ముట్టడించుదాము.

వ. **అట్లయిన వీఁ డభిమన్యుపోయిన పోకం బోవు; నది నీకు విజయంబునకుఁ గారణం బగు; వీనిం బలువురు ముట్టుట యెఱింగెనేని వివ్వచ్చుండు వచ్చు నతం డెఱుంగకుండ నక్కడ నిలువరించి పోరం జాలు బల్లిదుల నట పుచ్చవలయు' ననుటయు, నమ్మనుజవిభుం 'డిది లెస్సకర్జం' బని గాంధారపతిం గనుంగొని 'నీవు పదివేలేనుంగులు నన్ని యరదంబులుం గొని దుశ్శాసన సుబాహు దుష్ప్రధర్షణ దుర్విషహులు దోడుగాఁ గ్రీడిపై నడచి కయ్యంబు సేయు; మద్దిక్కునం దక్కిన పాండవులు నున్నవా; రయ్యన్నదమ్ములం బొదివి గెలువు' మనిన నతం డమ్మెయికిం జనియెఁ దదనంతరంబ.** 179

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; అయినన్= అయితే; వీఁడు= ఈ సాత్యకి; అభిమన్యుపోయిన పోకన్= అభిమన్యుడు చచ్చిన (విధమైన) చావును; పోవును= చస్తాడు; అది= ఆ సాత్యకి మరణం; నీకున్= ఓ దుర్యోధనా! నీకు; విజయంబునకున్= విజయానికి; కారణంబు= కారణం; అగున్= అవుతుంది; వీనిన్= ఈ సాత్యకిని; పలువురు= అనేకులు (వీరులు); చుట్టుముట్టుట= ముట్టడించటం; ఎఱింగెనేనిన్= ఒకవేళ తెలిసికొన్నాడా!; వివ్వచ్చుండు= అర్జునుడు; వచ్చును= (సాత్యకిని రక్షించటానికి) వస్తాడు (కాబట్టి); అతండు= ఆ అర్జునుడు; ఎఱుంగకుండన్= తెలిసికొనకుండా; అక్కడన్= ఆ వైపున; నిలువరించి= నిలిపివేసి; పోరన్+ చాలు= యుద్ధం చేయుటానికి సమర్థులైన; బల్లిదులన్= బలిష్ఠులైన వీరులను; అట= అటువైపు; పుచ్చవలయున్= పంపాలి; అనుటయున్= అనగానే; ఆ+మనుజ విభుండు= ఆ దుర్యోధనుడు; ఇది= ఈ నీవు చెప్పినది; లెస్స కర్జంబు= మంచిపని; అని= పలికి; గాంధార పతిన్= శకునిని; కనుంగొని= చూచి; నీవు= ఓ శకుని మామా! - నీవు; పదివేలు+ఏనుంగులు= పదివేల గజాలను; అన్ని= అదే లెక్కగా పదివేలు; అరదంబులున్= రథాలను; కొని= వెంట తీసికొని; దుశ్శాసన సుబాహు దుష్ప్రధర్షణ దుర్విషహులు= దుశ్శాసనుడు, సుబాహువు, దుష్ప్రధర్షణుడు, దుర్విషహుడు అనేవారు; తోడుగాన్= సహాయులు కాగా; క్రీడిపైన్= అర్జునుడిపై; నడచి= దండెత్తి; కయ్యంబు= యుద్ధం; చేయుము= సాగించుము; ఆ+దిక్కునన్= ఆ వైపున; తక్కిన పాండవులున్= అర్జునుడే కాక మిగిలిన పాండవులు కూడ; ఉన్నవారు= ఉన్నారు; ఆ+అన్న+తమ్ములన్= ఆ అన్నదమ్ములనందరిని; పొదివి= ఆక్రమించి; గెలువుము= జయించుము; అనినన్= అనగానే; అతండు= ఆ శకుని; ఆ+మెయికిన్= ఆ వైపునకు; చనియెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= అటు తరువాత.

తాత్పర్యం: అట్లా చేస్తేనే ఈ సాత్యకి అభిమన్యుడు చచ్చిన విధంగా చస్తాడు; అది నీ గెలుపునకు కూడా కారణ మవుతుంది. ఒకవేళ మనమందరం ఈ సాత్యకిని ముట్టడించామని తెలిస్తే, తప్పక అర్జునుడు ఇతడిని ఆదుకొనటానికి వస్తాడు, కాబట్టి ఈ విషయం అతడికి తెలియకుండా అర్జునుడిని అక్కడే కదలనివ్వకుండా నిలిపి యుద్ధం చేయగల బలిష్ఠులైన మన వీరులను కొందరిని పంపాలి' అని కర్ణుడు సలహా ఇవ్వగా విని దుర్యోధనుడు 'ఇది చాలా మంచిపని' అని వెంటనే శకునిని చూచి, నీవు పదివేల ఏనుగులను, పదివేల రథాలను తీసికొని-దుశ్శాసనుడు, సుబాహువు, దుష్ప్రధర్షణుడు, దుర్విషహుడు అనే నా తమ్ములు తోడుగా గొని ఆ అర్జునుడిని ఎదుర్కొని యుద్ధం చేయుము అక్కడనే మిగిలిన భీమాది పాండవులు ఉన్నారు. ఆ అన్నదమ్ములనందరిని గెలిచి విజయం సాధించుము' అని ఆ వైపే తక్కిన పాండవులు కూడ ఉన్నారు. ఆ అన్నదమ్ములను ఎదుర్కొని గెలువుము. అని అనగా, అతడు ఆ వైపు వెళ్ళాడు. తరువాత

క. చేయఁగల రథికులును రా । ధేయుఁడు బలయుతము గాఁగఁ దెప్పదెరల శై
నేయుపయిఁ గవిసి బహువిధ । సాయకములు గురిసి రథిక సంరంభమునన్. 180

ప్రతిపదార్థం: చేయన్+కల= సమర్థులైన; రథికులును= వీరులు; రాధేయుఁడు= కర్ణుడు; బలయుతము= సైన్యంతో కూడినవారు; కాఁగన్= క్రాయి; తెప్పదెరలన్= అతివేగంగా; శైనేయుపయిన్= సాత్యకిపై; కవిసి= కలయబడి; బహువిధసాయకములు= అనేక విధాలైన బాణాలను; అధిక సంరంభమునన్= మిక్కిలి వేగంగా; కురిసిరి= కురిపించారు.

తాత్పర్యం: సమర్థులైనవీరులు, కర్ణుడు సైన్యంతో కూడి ఆ సాత్యకిపై కలియబడ్డారు. విజృంభించి అనేకవిధాలైన బాణాలను అతడిమీద కురిపించారు.

వ. అతండును గోపాటోపంబున. 181

ప్రతిపదార్థం: అతండును= ఆ సాత్యకి కూడా; కోప+ఆటోపంబునన్= కోపాడంబరంతో (మిక్కిలి కోపంతో అని భావం).

తాత్పర్యం: ఆ సాత్యకి కూడా మిక్కిలి కోపంతో (తరువాతి పద్యంతో అన్వయం).

క. కరుల కరంబులు హయముల । శిరములు రథసంచయంబు చెక్కలును సమి
ద్ధరఁ గప్పి క్రమ్మఱఁగ నె । త్తురు టేఱులు వఱపి దానిఁ దొలఁగం ద్రోచెన్. 182

ప్రతిపదార్థం: కరుల కరంబులు= ఏనుగుల తొండాలను; హయముల శిరములు= గుర్రాల తలలను; రథసంచయంబు చెక్కలును= రథాల సమూహాల ముక్కలను; సమిత్+ధరన్= యుద్ధభూమియందు; కప్పి= కప్పివేసి; క్రమ్మఱఁగన్= మళ్ళీ; నెత్తురు+ఏఱులు= రక్తపునదులు; వఱపి= ప్రవహింపజేసి; దానిన్= ఆ ఏనుగు తొండము మొదలగు వాటిని; తొలఁగన్= తొలగిపోయేవిధంగా; ద్రోచెన్= తోసివేశాడు.

తాత్పర్యం: ఏనుగులతొండాలతో గుర్రాలతలలతో రథాల చెక్కలముక్కలతో యుద్ధభూమినంతా మొదట కప్పి, వెంటనే నెత్తురునదులను ప్రవహింపజేసి, ఆ ఏనుగులతొండాలు మొదలగు వాటినన్నిటిని తొలగింపజేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇట్లా యుద్ధవర్ణన చేయటంచేత సాత్యకి యుద్ధనైపుణి, హస్తలాఘవం వ్యక్తమవుతూ ఉన్నాయి.

క. **శినివరు నద్భుత విక్రము । మున కోర్వక కలఁగఁబడిన మొనఁ గనుఁగొని నీ**
తనయుఁడు తనయరదము నా । తని యరదముమీఁద నత్యుదగ్రతఁ బఱపెన్. **183**

ప్రతిపదార్థం: శినివరు+అద్భుత విక్రమమునకున్= సాత్యకియొక్క ఆశ్చర్యకరమైన ఆ పరాక్రమానికి; ఓర్వక= తట్టుకోలేక; కలఁగన్+పడిన నీ మొనన్= కలతజెందిన నీ సైన్యాన్ని; కనుఁగొని= చూచి; నీ తనయుఁడు= ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ కుమారుడు దుర్యోధనుడు; తన+అరదమున్= తన రథాన్ని; ఆతని+ఆరదము మీఁదన్= ఆ సాత్యకి రథంపైకి; అతి+ఉదగ్రతన్= అతి కోపంతో; పఱపెన్= పంపాడు (సాత్యకిపై యుద్ధానికి వెళ్ళాడని భావం).

తాత్పర్యం: ఆ సాత్యకి అద్భుత పరాక్రమానికి ఓర్వలేక కలతచెందిన సైన్యాన్ని చూచి, నీ తనయుడు ఆ సాత్యకి ధాటికి కౌరవసైన్యం తట్టుకోలేకపోయింది. దుర్యోధనుడు, వెంటనే తన రథాన్ని సాత్యకి రథంవైపు మిక్కిలి కోపంతో నడిపించాడు.

వ. **అయ్యిరువురు నక్కజం బగు కయ్యంబు సేయునెడ నా శైనేయుండు.** **184**

ప్రతిపదార్థం: ఆ+ఇరువురున్= ఆ సాత్యకి దుర్యోధనులు ఇద్దరూ కూడా; అక్కజంబు+అగు= ఆశ్చర్యకరమైన; కయ్యంబు= యుద్ధం; చేయు ఎడన్= చేసే సమయంలో; ఆ శైనేయుండు= ఆ శినివంశజుడైన సాత్యకి.

తాత్పర్యం: ఆ ఇద్దరూ ఆశ్చర్యం గొలిపే యుద్ధం చేస్తూ ఉండగా, సాత్యకి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **తురగముల సూతుఁ జంపినఁ । గురుపతి పొలివోక యతని గురుసున నేయం**
గరమలిగి ధనువు దునుముడుఁ । బరవస మఱి యొరుని తేరుపైకిం బోయెన్. **185**

ప్రతిపదార్థం: తురగములన్= గుర్రాలనూ; సూతున్= సారథినీ; చంపినన్= చంపగా; కురుపతి= కురురాజు దుర్యోధనుడు; పొలివోక= నిరుత్సాహపడక; అతనిన్= ఆ సాత్యకిని; గురుసునన్= జీవస్థానంలో; ఏయన్= కొట్టగా; కరము= మిక్కిలి; అలిగి= కోపించి; ధనువున్= విల్లును; తునుముడున్= తునకలు చేయగా; బరవసము= ధైర్యం; అఱి= నశించి; ఒరుని= మరి ఒకరి అనగా కృతవర్మయొక్క; తేరుపైకిన్= రథంపైకి; పోయెన్= పోయెను.

తాత్పర్యం: అశ్వాలను, సారథిని చంపగా, దుర్యోధనుడు నిరుత్సాహపడక, ఆ సాత్యకిని, ఆయువుపట్టులో కొట్టగా, సాత్యకి మిక్కిలికోపించి దుర్యోధనుడి విల్లును తెగగొట్టాడు. అప్పుడు దుర్యోధనుడు ధైర్యాన్ని కోల్పోయి మరొకరి రథం ఎక్కివెళ్ళాడు.

వ. **ఇ వ్విధంబున.** **186**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా.

తాత్పర్యం: దుర్యోధనుడు ఈ రీతిగా సాత్యకితో పరాజయం పొందగా.

తే. **పతి గలంగ శైనేయుఁ డ బ్బలము బాణ । నిహతిఁ దూలించె; నక్కడ నీ మఱంది**
యడరి యర్జునుతో విస్మయావహముగ । నాహవము సేసెఁ దగు సహాయంబు కలిమి. **187**

ప్రతిపదార్థం: పతి= ప్రభువైన దుర్యోధనుడు; కలంగన్= కలత చెందగా; శైనేయుఁడు= సాత్యకి; ఆ+బలమున్= ఆ కౌరవసైన్యాన్ని; బాణనిహతిన్= శరాఘాతంతో; తూలించెన్= తొలగిపోయేటట్లు చేశాడు; ఆ+కడన్= ఆ వైపు; నీమఱంది= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; నీ భార్య గాంధారి సోదరుడు శకుని; అదరి= విజృంభించి; తగుసహాయంబు= వలసినంత సహాయం; కలిమిన్= ఉండటంచేత; విస్మయ+ఆవహముగన్= ఆశ్చర్యం కలిగే విధంగా; అర్జునుతోన్= అర్జునుడితో; ఆహవము= యుద్ధం; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు కలత చెందగా, సాత్యకి కౌరవసైన్యాన్ని బాణాలతో చెదరగొట్టాడు. నాథుడు లేని ఆ కౌరవసైన్యం సాత్యకి ధాటికి ఆగలేక పారిపోయింది. అక్కడ నీ మరది శకుని, తగినంత సహాయం కలిగి ఉండటంచేత అర్జునుడితో యుద్ధం ఆశ్చర్యం కలిగేటట్లు సాగించాడు.

చ. **అతని సుతుం డులూకుఁడు నుదగ్రతఁ గృష్ణునిమేనఁ బార్థుపై**
శితశరకోటి నించి విలసిల్లఁగ సౌబలుసూతుఁ జంపి యు
ద్ధతిఁ దురగంబులం దునిమి తద్ఘన చాపముఁ ద్రుంచె న న్నరుం
డతఁడు తనూజు తేరి పయి కాత్మ చలింపఁగఁ బోయి వెండియున్. **188**

ప్రతిపదార్థం: అతని సుతుండు= ఆ శకుని కుమారుడు; ఉలూకుఁడున్= ఉలూకుడనే వాడు కూడా; ఉదగ్రతన్= గొప్పగా; కృష్ణుని మేనన్= శ్రీకృష్ణుడి శరీరంపై; పార్థుపైన్= అర్జునుడిపైన; శితశరకోటిన్= వాడి అయిన బాణాల సమూహాన్ని; నించి= నింపి; విలసిల్లఁగన్= ఉల్లాసం చూపుతూ ఉండగా; ఆ+నరుండు= ఆ అర్జునుడు; సౌబలుసూతున్= శకుని సారథిని; చంపి= సంహరించి; ఉద్ధతిన్= గర్వంతో; తురగంబులన్= గుర్రాలను; తునిమి= ఖండించి; తద్+ఘనచాపము= దృఢమైన ఆ శకుని విల్లును; త్రుంచెన్= తెగగొట్టాడు (అప్పుడు); అతఁడు= ఆ శకుని; తనూజు తేరిపయికిన్= తన కొడుకైన ఉలూకుడి రథంపైకి; ఆత్మ= ధైర్యం; చలింపఁగన్= చలించిపోతూ ఉండగా; పోయి= వెళ్ళి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ఆ శకుని కుమారుడు ఉలూకుడు కూడా తోడుగా వచ్చి, కృష్ణుడిమీద అర్జునుడిమీద గొప్పగా వాడి బాణాల సమూహాన్ని నింపి ప్రకాశించగా, అంతలోనే అర్జునుడు శకుని సారథిని, గుర్రాలను, విల్లును ఖండించి వేశాడు. శకుని ధైర్యం కోల్పోయి వెంటనే తన కుమారుడి రథంపైకి వెళ్ళాడు. వెళ్ళి మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **వాఁడుఁ దోడ్పడఁ గడఁగి వివ్వచ్చు నేసె; । నతఁడు వారలు నేడ్పడునట్లు గాఁగ**
గడఁక గల యోధవీరులు బడలు వడఁగ । బలము సెడి పాఱఁ దనవింటి బలుపు సూపె. **189**

ప్రతిపదార్థం: వాఁడు= అతడు అనగా తన కుమారుడు ఉలూకుడు; తోడ్పడన్= సహాయపడగా; కడఁగి= పూని; వివ్వచ్చున్= అర్జునుడిని; ఏసెన్= బాణాలతో కొట్టాడు; అతఁడు= ఆ అర్జునుడు; వారలు= ఆ తండ్రి కొడుకులు శకుని, ఉలూకులు; చేడ్పడునట్లు+కాఁగన్= బాధపడేవిధంగా (మరియు); కడఁక+కల యోధవీరులు= పూనికగల వీరయోధులు; బడలు+పడఁగన్= అలసట చెందేటట్లు; బలము+చెడి= శక్తి శిథిలమయి; పాఱన్= పారిపోయే విధంగా; తన వింటి బలుపు= తన గాండీవ ధనువు యొక్క బలాన్ని; చూపెన్= చూపాడు.

తాత్పర్యం: కొడుకు ఉలూకుడు తనకు తోడ్పడగా శకుని పూనిక వహించి అర్జునుని బాణాలతో కొట్టాడు. ఆ అర్జునుడు తండ్రి కొడుకులిద్దరు బాధనొందేటట్లు, వారికి తోడైనవచ్చిన ఇతర వీరులు అలసిపోయేటట్లు, వారి సైన్యం బలహీనమై పరుగెత్తేటట్లు తన గాండీవ బలం ఎటువంటిదో తెలిసే విధంగా బాణాలు కురిపించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు వివ్వచ్చుండు పేర్చిన యా సమయంబున ధృష్టద్యుమ్నుండు. 190

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వివ్వచ్చుండు= అర్జునుడు; పేర్చిన+ఆ సమయంబునన్= విజయగర్వంతో ఉబ్బిపోయే ఆ సమయంలోనే; ధృష్టద్యుమ్నుండు.

తాత్పర్యం: ఈ విధంగా అర్జునుడు విజృంభించగా ఆ సమయంలోనే, అక్కడ ధృష్టద్యుమ్నుడు.

క. తతిమి గురు వింటి గొనయం। బతిముతిఁ దునియంగ నేయ నతఁ డాతని నే
డ్తెఱ నొండు వింట నేసిన। నుఱక తునిమె నాతఁ డ మ్మహోగ్రశరంబుల్. 191

ప్రతిపదార్థం: తతిమి= ఎదుర్కొని; గురువింటి గొనయంబు= ద్రోణాచార్యుడి ధనువు నారిని; అతిముతిన్= వెంటనే; తునియంగన్= తునకలయ్యేటట్లు; ఏయన్= కొట్టగా; ఆతఁడు= ఆ ద్రోణాచార్యుడు; ఆతనిన్= ఆ ధృష్టద్యుమ్నుడిని గూర్చి; ఏడ్తెఱన్= వేగంతో; ఒండువింటన్= రెండవ ధనుస్సుతో; ఏసినన్= బాణాలు ప్రయోగించగానే; ఆ+మహా+ఉగ్రశరంబుల్= ఆ గొప్ప భయంకరములైన బాణాలను; ఉఱక= అవలీలగా; ఆతఁడు= ధృష్టద్యుమ్నుడు; తునిమెన్= తునకలు చేశాడు.

తాత్పర్యం: (ఆ వైపు ధృష్టద్యుమ్నుడు) ద్రోణాచార్యుడిని ఎదుర్కొని, అతడి వింటినారిని వెంటనే తెగగొట్టగా, ద్రోణాచార్యుడు మరొక విల్లు గ్రహించి ధృష్టద్యుమ్నుడిపై వేగంగా భయంకరమైన బాణాలు ప్రయోగిస్తూ ఉంటే - వాటిని అవలీలగా ధృష్టద్యుమ్నుడు తునకలు చేశాడు.

వ. వెండియు నాచార్యుం డేయు సాయకంబులు ద్రుంచుచు నంగంబులు నొంచుచు మిగిలి మార్గణజాలంబుల సైన్యంబు దైన్యంబు నొందించె; నట్లు సాత్యకి సవ్యసాచి ధృష్టద్యుమ్నులచేతం గలయం గలంగి కౌరవానీకంబు గాందిశీకం బగుటయుఁ, బాంచజన్య దేవదత్తాది శంఖరవంబులు సెలంగం బాండవ బలంబులు గూడికొని వెన్నడిం గవిసినం గని భీషణరోషాతిరేక విధేయుం డయి రాధేయుండు. 192

ప్రతిపదార్థం: వెండియున్= మళ్ళీ; ఆచార్యుండు+ఏయు= ద్రోణాచార్యుడు ప్రయోగిస్తూ ఉన్న; సాయకంబులు= బాణాలను; త్రుంచుచున్= ఖండిస్తూ; అంగంబులు= శరీరావయవాలను; నొంచుచున్= నొప్పిస్తూ; మిగిలి= అతిశయించి; మార్గణజాలంబులన్= బాణాల సమూహాలతో; సైన్యంబు= ఆ శత్రుసైన్యాన్ని; దైన్యంబున్= దీనత్వాన్ని; ఒందించెన్= పొందింపజేశాడు; అట్లు= ఆ విధంగా; సాత్యకి, సవ్యసాచి, ధృష్టద్యుమ్నుల చేతన్= సాత్యకి, అర్జునుడు, ధృష్టద్యుమ్నుడు అనే ముగ్గురు పాండవపక్ష వీరులచేత; కలయన్= అంతటను; కలంగి= కలతచెంది; కౌరవ+అనీకంబు= కౌరవుల సైన్యం; కాందిశీకంబు+అగుటయున్= భయంతో పారిపోయిన వెంటనే; పాంచజన్య దేవదత్త+ఆది శంఖరవంబులు= పాంచజన్యమనే శ్రీకృష్ణుడి శంఖం, దేవదత్తమనే అర్జునుడి శంఖం మొదలుగాగల (ఇతర వీరుల) శంఖాల ధ్వనులు; చెలంగన్= ధ్వనిస్తూ ఉండగా; పాండవ బలంబులు= పాండవుల సైన్యాలు; కూడికొని= ఏకమై; వెన్నడిన్ కవిసినన్= వెన్నంటి తరుముతూ ఉంటే; కని= చూచి; భీషణ రోష+అతిరేక విధేయుండు+అయి= భయంకరమైన కోపాతిశయానికి వశుడై; రాధేయుండు= కర్ణుడు.

తాత్పర్యం: మళ్ళీ ద్రోణాచార్యుడు వేసిన బాణాలనన్నింటినీ ఖండించి, ద్రోణాచార్యుడి శరీరావయవాలను బాణాలతో మిక్కిలి నొప్పిస్తూ, మరీ విజృంభించి కౌరవసైన్యానికి దిక్కుతోచని స్థితి కల్పించాడు. ఆ విధంగా సాత్యకి, అర్జునుడు, ధృష్టద్యుమ్నుడు - వీరు ముగ్గురిచేత కౌరవసైన్యం కలతచెంది పారిపోయింది. అపుడు కృష్ణుడు పాంచజన్యాన్ని, అర్జునుడు దేవదత్తాన్ని, ధృష్టద్యుమ్నాదులు తమ తమ శంఖాలను పూరించగా, పాండవసైన్యం ఉత్సాహంతో ఏకమై కౌరవసైన్యాన్ని వెంటాడి తరుముతూ ఉండగా, అది చూచి కర్ణుడు మిక్కిలి భయంకరమైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కోపావేశంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. తలలుం జేతులుఁ గాళ్ళులుం దనువులున్ ధాత్రీస్థలిం బెక్కు తి
ట్టలు గావించి రథప్రతానములు ఘోటశ్రేణులున్ వారణా
వలులుం జేడ్పడఁ బైపయిం దఱిమి దుర్వారైక దర్పోద్ధతిం
జలముం జేవయుఁ జూపె నుద్భటభుజా సంరంభ రౌద్రంబుగన్. 193

ప్రతిపదార్థం: తలలున్= శిరస్సులను; చేతులున్= హస్తాలను; కాళ్ళులున్= పాదాలను; తనువులున్= శరీరాలను; ధాత్రీస్థలిన్= రణభూమియందు; పెక్కుతిట్టలు= మిక్కుటమైన కుప్పలు; కావించి= చేసి; రథప్రతానములు= రథాల సమూహాలను; ఘోటశ్రేణులున్= అశ్వాల సమూహాలను; వారణ+ఆవలులున్= గజాల సమూహాలను; చేడ్పడన్= బాధపడే విధంగా; పైపయిన్= ముందు ముందుకు; తఱిమి= ఉరికించి పారిపోయే విధంగా వెంబడించి; దుర్వార+ఏక దర్ప+ఉద్ధతిన్= నివారించరాకుండా ఉన్న గర్వం యొక్క ఔద్ధత్యంతో - మిక్కిలి గర్వంతో; ఉద్భట= గొప్ప; భుజాసంరంభ= భుజముల ఆటోపంచేత; రౌద్రంబుగన్= భయం కలిగించే విధంగా; చలమున్= పౌరుషాన్ని; చేవయున్= సామర్థ్యాన్ని; చూపెన్= చూపాడు.

తాత్పర్యం: (మిక్కిలి కోపంతో ఆ కర్ణుడు) శత్రువుల తలలను, చేతులను, కాళ్ళను శరీరాలను కుప్పలు కుప్పలుగా రణరంగాన అంతటా పడేటట్లు చేసి, రథాలు, గుర్రాలు, ఏనుగులు బాధతో రణరంగం నుండి పారిపోయే విధంగా తరిమి అడ్డుకొనసాధ్యంకాని తన గర్వాధిక్యాన్ని, మాత్సర్యాన్ని, శక్తిని-భయంకరమైన గొప్ప భుజబల విజృంభణంతో చూపించాడు.

వ. ఇ వ్విధంబున విజృంభించి నొంచినం బఱిపఱియై పఱచు న వ్వాహినుల వెనుకొను నా సూతనందనుం జూచి తలంకి ధర్మతనయుం డర్జునునితో నిట్లనియె. 194

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; విజృంభించి= రేగిపోయి; నొంచినన్= నొప్పింపగా; పఱి పఱి ఐ= చెల్లాచెదరై; పఱచు+ఆ+వాహినులన్= పరుగెత్తుతున్న ఆ సైన్యాలను; వెనుకొను+ఆ+సూతనందనున్= వెంబడిస్తూ ఉన్న ఆ కర్ణుడిని; చూచి; తలంకి= చలించిపోయి; ధర్మతనయుండు= ధర్మరాజు; అర్జునునితోన్= అర్జునుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఈ రీతిగా రెచ్చిపోయి, బాణాలతో నొప్పిస్తూ ఉండగా, తట్టుకొనలేక చెల్లాచెదరై పారిపోయే పాండవుల సైన్యాలను వెంటాడే కర్ణుని చూచి కలతచెంది ధర్మరాజు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

క. నడురేయి తీవ్రభానుఁడు। పుడమి వెలసె నను తలంపు పుట్టించుచు ను
గ్గడు వగు తేజంబున వెలిఁ। గెడుఁ గర్ణుఁడు బాణరుచులు గిఱికొన దెసలన్. 195

ప్రతిపదార్థం: నడురేయి= నడిమి రాత్రి; తీవ్రభానుఁడు= చండకిరణుడు - అనగా సూర్యుడు; పుడమిన్= భూమిపై; వెలసెన్+అను తలంపు= ఉదయించాడా అనే ఊహను; పుట్టించుచున్= కలిగిస్తూ; ఉగ్గడువు+అగు= అధికమైన; తేజంబునన్= తేజస్సుతో; బాణరుచులు= బాణాల కాంతులు; దెసలన్= దిక్కులయందు; గిఱికొనన్= వ్యాపించగా; కర్ణుఁడు= కర్ణుడు; వెలిఁగెడున్= ప్రకాశిస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: ఆ కర్ణుడి బాణాల కాంతులు దిక్కులన్నింట వ్యాపించి ప్రకాశిస్తూ ఉండగా - కర్ణుడు నడిరాత్రిలో సూర్యుడు ఉదయించాడని అనిపించేటట్లు వెలిగాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఇక్కడ కర్ణుడియందు నడిరాత్రి ఉదయించిన సూర్యుడితో తాదాత్మ్యం ఊహించటంచేత ఉత్ప్రేక్షాలంకారమే కాని ఉపమకాదు. సూర్యుడు అర్ధరాత్రంలో ఉదయించినట్లు ఊహించుటచేత ఉపమాంశం కవి కల్పితమేకాని స్వతస్సిద్ధం కాదు కదా!

ఆ. 'ఇట్లు దఱిమెనేని యిప్పుడ యీతఁ డీ । ద్దిక్కు వారినెల్ల నొక్కయెత్తు
గాఁగఁ బిలుకుమార్చుఁ గావున నెమ్మెయి । నైనఁ బ్రతివిధాన మాచరింపు'. 196

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; తఱిమెనేని= వెంబడిస్తూ ఉన్నట్టయితే; ఇప్పుడు+అ= ఈ సమయంలోనే (ఇంకా ఆలస్యం లేకుండా); ఈతఁడు= ఈ కర్ణుడు; ఈ+దిక్కువారిని+ఎల్లన్= ఈ మనవైపున ఉన్నవారినందరిని; ఒక్క+ఎత్తు+గాన్= ఒకే పర్యాయం; పిలుకుమార్చున్= సంహరిస్తాడు; కావునన్= కాబట్టి; ఏ+మెయిన్+ఐనన్= ఏ విధంగానైనా; ప్రతివిధానము= ప్రతిక్రియను; ఆచరింపు(ము)= చేయుము.

తాత్పర్యం: ఈ కర్ణుడు ఇట్లాగే తరుముతూ పోతూ ఉండగా, మనం ఉపేక్ష చేశామంటే ఈ సైన్యాన్నంతా ఒకేసారి ఇప్పుడే సంహరించి వేస్తాడు. కాబట్టి ఏ విధంగానైనా దీనిని అడ్డుకొనే విధంగా ప్రయత్నించుము'.

వ. అనిన విని యతం డచ్యుతు నాలోకించి 'రాధేయు రభసంబున కిమ్మోహారం బోహటించిన భూపతి భీతుండయ్యె భారద్వాజుండును బైకొని యొక్క వలన మొనలం దెరల్చెడి నే నదల్చి యిక్కర్ణు నుక్కడంచి యక్కుంభసంభవు సంరంభంబు వారించెదఁ దేరు నడపు' మనుటయు నద్దనుజమర్దనుం డతని కిట్లనియె. 197

ప్రతిపదార్థం: అనినన్= (ఇట్లా ధర్మరాజు) పలుకగా; విని; అతండు= ఆ అర్జునుడు; అచ్యుతున్= కృష్ణుడిని; ఆలోకించి= చూచి; రాధేయు రభసంబునకున్= కర్ణుడి వేగానికి; ఈ+మోహరంబు= సైన్యం; ఓహటించినన్= వెనుదీయగా; భూపతి= ధర్మరాజు; భీతుండు+అయ్యెన్= భయపడిపోయాడు; భారద్వాజుండును= ద్రోణాచార్యుడు కూడా; పైకొని= విజృంభించి; ఒక్కవలనన్= ఒక వైపున; మొనలన్= మన సైన్యాలను; తెరల్చెడిన్= తొలగిపోయేటట్లు చేస్తున్నాడు (పారద్రోలుతున్నాడని భావం); (కావున ఏన్= నేను; అదల్చి= అదలించి; ఈ+కర్ణు+ఉక్కు= ఈ కర్ణుడి పొగరును; అడంచి= అణచివేసి; ఆ+కుంభసంభవు సంరంభంబు= ఆ ద్రోణాచార్యుడి వేగాన్ని; వారించెదన్= నివారిస్తాను; తేరు= రథాన్ని; నడపుము= కర్ణుడివైపు నడిపించుము; అనుటయున్= అనగానే; ఆ+దనుజ మర్దనుండు= ఆ కృష్ణుడు (దైత్యులను సంహరించినవాడు కాబట్టి కృష్ణుడికి ఆ పేరు); అతనికిన్= ఆ అర్జునుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అని ధర్మరాజు అనగానే, అర్జునుడు కృష్ణుడిని చూచి 'మన సైన్యం కర్ణుడి వేగాన్ని తట్టుకొనలేక పారిపోతూ ఉండగా ధర్మరాజు భీతిల్లిపోయాడు. ఒకవైపు ద్రోణాచార్యుడు కూడా విజృంభిస్తూ సైన్యాన్ని పారద్రోలుతూ ఉన్నాడు. కాబట్టి ముందుగా ఈ కర్ణుడి పొగరు అణుస్తాను. తరువాత ద్రోణాచార్యుల యుద్ధవేగాన్ని నివారిస్తాను. కాబట్టి కర్ణుడివైపు రథాన్ని నడిపించుము' అని అనగా, కృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

క. 'వినుము నిశాసమయంబున । దనుజులకుం బేర్చు బాహుదర్పము శౌర్యం
బును; గావున హైడింబుం । డనిఁ గర్ణుని నోర్చుఁ; బనుత మతని నతనికిన్' 198

ప్రతిపదార్థం: వినుము= ఓ అర్జునా! వినుము; నిశా సమయంబునన్= రాత్రి సమయాన; దనుజులకున్= రాక్షసులకు; బాహు దర్పము= భుజగర్వం; శౌర్యంబును= పరాక్రమం (ఈరెండూ); పేర్చున్= అతిశయిస్తాయి; కావునన్= కాబట్టి; హైడింబుండు=

హిడింబా కుమారుడు ఘటోత్కచుడు; అనిన్= యుద్ధంలో; కర్ణునిన్= కర్ణుడిని; ఓర్చున్= ఓడిస్తాడు (అందుకే); అతనిన్= ఆ ఘటోత్కచుడిని; అతనికిన్= ఆ కర్ణుడిపైకి; పనుతము= పంపుదాము.

తాత్పర్యం: 'ఓ అర్జునా! రాక్షసులకు రాత్రి సమయంలో బాహుబలం పరాక్రమం అతిశయిస్తాయి; కాబట్టి మన హిడింబాసుతుడు ఘటోత్కచుడే ఈ సమయంలో కర్ణుడిని యుద్ధంలో ఓడిస్తాడు. కాబట్టి ఆ కర్ణుడిపైకి ఘటోత్కచుడినే పంపుదాము.

వ అని వెండియు. 199

తాత్పర్యం: ఇట్లా పలికి మళ్ళీ (అర్జునుడితో కృష్ణుడు ఇట్లా అన్నాడు).

క. 'మన మంతకు వేఱొక ది । క్కున నడతము; భీమసుతునకును మాయలుఁ బెం
పొనరిన దివ్యాస్త్రంబులు । ననేకములు గలవు; వలవ దనుమానింపన్. 200

ప్రతిపదార్థం: మనము= మనం; అంతకున్= అంతవరకు; వేఱు+ఒక దిక్కునన్= వేరే వైపునకు; నడతము= నడుద్దాము - వేరే వైపునకు యుద్ధం చేయటానికి వెళ్ళుదామని భావం; భీమసుతునకును= భీముడి కుమారుడైన ఘటోత్కచుడికి; మాయలున్= రాక్షస మాయలు; పెంపు+ఒనరిన= అతిశయించిన; దివ్య+అస్త్రంబులు= దివ్యములైన అస్త్రాలు; అనేకములు= అనేకాలు; కలవు= ఉన్నవి (కాబట్టి); అనుమానింపన్= సంశయించటం; వలవదు= వద్దు.

తాత్పర్యం: 'అంతవరకు మనము వేరేవైపున యుద్ధానికి నడుద్దాము. ఘటోత్కచుడికి ఎన్నో మాయలు తెలుసు; దివ్యాస్త్రాలు కూడా ఎన్నో అతడి వద్ద ఉన్నవి. కాబట్టి అనుమానించ అక్కరలేదు.

వ. అని చెప్పి ఘటోత్కచుం బిలిచిన నతండు సన్నాహ సంరంభమూర్తి స్ఫూర్తి మెఱయం జనుదెంచి 'పనియేమి?' యనుటయు. 201

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; చెప్పి= పలికి; ఘటోత్కచున్= ఘటోత్కచుడిని; పిలిచినన్= పిలువగానే; అతండు= ఆ ఘటోత్కచుడు; సన్నాహ సంరంభమూర్తి స్ఫూర్తి= యుద్ధయత్నోద్రేకానికి తగిన ఆకార స్ఫురణ (యుద్ధ సన్నద్ధుడై ఉనికి అని భావం); మెఱయన్= మెరుస్తూ ఉండగా; చనుదెంచి= వచ్చి; పని= చేయవలసిన కార్యం; ఏమి?= ఎట్టిది?; అనుటయున్= అనగానే.

తాత్పర్యం: అని పలికి, ఘటోత్కచుడిని పిలువగా, ఆ ఘటోత్కచుడు యుద్ధానికి సన్నద్ధమైన ఆకారస్ఫురణ ప్రకాశించగా వచ్చి 'నే నేం చేయాలి?' అని అడుగగా

ఉ. 'పాండవ సైన్యముల్ సెదరి పాఱెడుఁ గర్ణునిచేత నొచ్చి, యు
ద్దండత నీదు శౌర్యమును దర్పము నేర్పడ నిల్వరింపు; మీ
తం డని రాత్రి నీకుఁ గడుఁ దక్కువ; తండ్రులకున్ జయంబు పు
త్త్రుం డొసఁగంగఁ గాన్పు మహి రూఢికి నెక్కదె? గెల్వు మీతనిన్.' 202

ప్రతిపదార్థం: (ఓ ఘటోత్కచా!) కర్ణుని చేతన్= కర్ణుడిచేత - కర్ణుడి బాణాల ధాటికి; నొచ్చి= బాధ కలిగి; పాండవ సైన్యముల్= (మన) పాండవ సైన్యాలు; చెదరి= చెదరిపోయి; పాఱెడున్= పారిపోతూ ఉన్నాయి; ఉద్దండతన్= (శత్రువులకు) భయంకొల్పే విధంగా; నీదు శౌర్యమును= నీ వీరత్వం; దర్పమును= భుజదర్పం కూడా; ఏర్పడన్= ప్రకటితమయ్యే విధంగా; నిల్వరింపుము=

నిలిచే విధంగా చేయుము (కర్ణుడిని ఎదుర్కొని మన సైన్యాలు పారిపోకుండా చూడుము అని భావం); ఈతండు= ఈ కర్ణుడు; అనిన్= యుద్ధంలో; రాత్రి= రాత్రి సమయాన; నీకున్= నీకంటె; కడున్= మిక్కిలి; తక్కువ= హీనబలుడే (రాక్షసులకు రాత్రి సమయంలో బలమెక్కువ కాబట్టి రాక్షసుడవైన నీముందు కర్ణుడు ఈ రాత్రి సమయాన యుద్ధంలో నిలువలేడని భావం); పుత్రుండు= కుమారుడు; తండ్రులకున్= జనకులకు; జయంబు= యుద్ధ విజయాన్ని; ఒసఁగంగ కాన్పు= ఇవ్వగా చూడగలగడం; మహిన్= భూమిపై; రూఢికిన్= ప్రసిద్ధికి; ఎక్కడె?= ఎక్కడా? (అట్టి పుత్రుడు ఈ లోకంలో కీర్తి పొందుతాడు కదా అని భావం) (కాబట్టి); ఈతనిన్= ఈ కర్ణుడిని; గెల్వుము= జయించుము - కర్ణుడిని జయించి తండ్రులకు విజయం కలుగజేసి మంచి పుత్రుడనే కీర్తి గడించుము అని భావం.

తాత్పర్యం: 'ఓ ఘటోత్కచా! కర్ణుడి బాణాఘాతాలకు ఆగలేక మన పాండవసైన్యాలు పారిపోతూ ఉన్నాయి. నీ భుజదర్పాన్ని, పరాక్రమాన్ని చూపి కర్ణుడిని ఎదుర్కొని, మన సైన్యం పారిపోకుండా ఆపుము. ఈ కర్ణుడు రాత్రి యుద్ధంలో నీ ముందు నిల్వలేడు. పుత్రుడు తండ్రులకు విజయం చేకూర్చగలగటం లోకప్రసిద్ధమేకదా. కాబట్టి కర్ణుడిని జయించుము.

విశేషం: 'నీకు' అని నొక్కి చెప్పటంలో రాత్రియందు విజృంభించే నిశాచరుడవైన నీ ముందు ఎవ్వరూ ఈ రాత్రి యుద్ధంలో ఆగలేరు అనే అర్థం ధ్వనిస్తూ ఉన్నది. మరియు 'తండ్రులకున్ జయంబు పుత్రుండొసఁగంగఁ గాన్పు మహిరూఢికి నెక్కడె?' అనే సామాన్యార్థంచేత సమర్థనీయమైన 'ఓ ఘటోత్కచా! పుత్రుడవైన నీవు కర్ణుడిని జయించి తండ్రులకు విజయం చేకూర్చి కీర్తి గడించుమా' అనే ప్రకృత విశేషార్థం ధ్వనింపజేయుటచేత ఇది అర్థాంతరన్యాసాలంకారం.

అలంబుసుండు ఘటోత్కచునిచేతఁ జచ్చుట (సం. 7-149-15)

వ. అనియె; ధనంజయుండును దదనురూపంబులైన యాలాపంబుల ననుమతి సేసినం గడంగి ఘటోత్కచుండు గర్ణుదెసకుం గవిసె; నట్టియెడ జటాసురసుతుం డగు నలంబుసుం డేతెంచి కురుపతిం గాంచి 'నాకుఁ బాండవుల దెసం బూర్వవైరంబు గలదు; నీకును బ్రియంబుగా వారిని, వారి వారిని వధియించెద' నని పలికి యతండు ప్రీతుండై యభినందింప, నా సూతనందనుం గలిసి తలకడచి హిడింబానందనుం దాఁకిన దారుణ రణం బయ్యె; నయ్యిరువురును వివిధ విశిఖ స్ఫురణంబుల నొండొరులఁ దెరల్పం జాలక రథికు లగుట యుడిగి మాయలకుం జొచ్చి మహోరగ గరుడాకారంబులను, వారణ కంఠీరవ రూపంబులను, రవిసైంహికేయాకృతులను, మేఘమారుతమూర్తులను మఱియు బహు విధ వికారాకారంబులను జూపుచుం బోరి యేపునం గదిసి బాహాబాహిం బెనంగునపుడు మేనులు బెరసిన నా భీమనందనుండు. 203

ప్రతిపదార్థం: అనియెన్= (అని కృష్ణుడు ఘటోత్కచుడితో) అన్నాడు; ధనంజయుండును= అర్జునుడు కూడా; తద్+ అనురూపంబులు+ఐన+ఆలాపంబులన్= ఆ కృష్ణుడి మాటలకు అనుగుణాలైన పలుకులతో; అనుమతి+చేసినన్= అనుజ్ఞ ఇవ్వగానే; కడంగి= యుద్ధోద్యుక్తుడయి; ఘటోత్కచుండు= భీముడి కుమారుడు ఘటోత్కచుడనే వాడు; కర్ణుదెసకున్= కర్ణుడివైపునకు; కవిసెన్= పరుగుతీశాడు; అట్టియెడన్= ఆ సమయంలో; జటాసురసుతుండు+అగు= జటాసురుడి కుమారుడైన; అలంబుసుండు= అలంబుసుడనే రాక్షసుడు; ఏతెంచి= వచ్చి; కురుపతిన్= దుర్యోధనుడిని; కాంచి= చూచి; నాకున్= నాకు; పాండవుల దెసన్= పాండవులవైపు; పూర్వవైరంబు= ఇంతకు ముందు నుండి వైరం; కలదు= ఉన్నది; నీకును= ఓ దుర్యోధన మహారాజా! నీకు కూడా; ప్రియంబు+కాన్= ఇష్టమయ్యే విధంగా; వారిని= ఆ పాండవులను; వారి వారినిన్= ఆ పాండవుల పక్షీయులను; వధియించెదన్= వధిస్తాను; అని= ఇట్లా; పలికి= చెప్పి; అతండు= ఆ దుర్యోధనుడు; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; అభినందింపన్= అభినందించగా; ఆ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సూతనందనున్= ఆ సూతపుత్రుడైన కర్ణుడిని; కలసి= కలసికొని; తలకడచి= అతిక్రమించి; హిడింబానందనున్= హిడింబ కొడుకైన ఘటోత్కచుడనే రాక్షసుడిని; తాఁకినన్= ఎదుర్కొనగా; దారుణ రణంబు= (వారిద్దరికి) భయంకరమైన యుద్ధం; అయ్యెన్= సాగింది; ఆ+ఇరువురును= ఆ ఇద్దరు - అనగా అలంబుస ఘటోత్కచులు కూడా; వివిధ విశిఖ స్ఫురణంబులన్= అనేక విధాలైన బాణాల స్ఫురణతో (అనగా తీక్ష్ణములైన బాణాలతో అని భావం); ఒండొరులన్= ఒకరి నొకరు; తెరల్పన్+చాలక= ఉడిగింపలేక; రథికులు+అగుట= రథంపై నుండి యుద్ధం చేయటం; ఉడిగి= మానివేసి; మాయలకున్= సహజమైన రాక్షసమాయ లకు; చొచ్చి= ప్రవేశించి - రాక్షసమాయలు ప్రయోగించి యుద్ధం చేయటానికి ఉపక్రమించి; మహా+ఉరగ గరుడ+ఆకారంబులను= పెద్ద సర్పం మరియు గరుత్మంతుడి ఆకారాలను (ఒకడు పెద్ద సర్పంగా మారగా మరొకడు ఆ సర్పానికి శత్రువైన గరుత్మంతుడి ఆకారాన్ని ధరించి పోరాడా డని భావం); (ఇట్లే) వారణ కంఠీరవ రూపంబులను= గజ సింహ శరీరాలను; రవిసైంహికేయ+ఆకృతులను= సూర్యుడు మరియు రాహువు రూపాలను; మేఘ మారుతమూర్తులను= మేఘస్వరూపాన్ని, దానికి విరుగుడుగా వాయురూపాన్ని; మఱియున్= ఇంతేగాక; బహువిధ వికార+ఆకారంబులను= ఇంకా ఎన్నో విధాలైన వికృతములైన ఆకారాలను; చూపుచున్= చూపిస్తూ; పోరి= యుద్ధం చేసి; ఏపునన్= విజృంభణంతో; కదిసి= ఎదుర్కొని; బాహాబాహిన్= బాహాబాహి యుద్ధంతో (బాహాసు బాహాసు గృహీత్వా ఇదం యుద్ధం ప్రవృత్తం ఇతి బాహా బాహి - అని విగ్రహవాక్యం బాహుయుద్ధం ఇది. ఏ ఆయుధం లేక ఇద్దరు బాహువులతోనే పోరాడటం) (ఈ విధంగా); పోరి= పోరాడి; మేనులు= వారిద్దరి శరీరాలు; బెరసినన్= కూడగా; ఆ భీమనందనుండు= ఆ ఘటోత్కచుడు.

తాత్పర్యం: అని అనగా అప్పుడు అర్జునుడు కూడా కృష్ణుడు చెప్పిన దానికి తగినట్లుగా చెప్పి, ఘటోత్కచుడిని కర్ణుడితో యుద్ధం చేయటానికి అనుమతించగా, వెంటనే ఘటోత్కచుడు కర్ణుడు ఉన్న వైపునకు వెళ్ళాడు. ఆ సమయంలో జటాసురుడి కుమారుడు అలంబుసుడు అనే రాక్షసవీరుడు దుర్యోధనుడిని కలిసి, 'నాకు పాండవులపై ఇదివరకే పగ ఉన్నది. కాబట్టి నీకు సంతోషం కలిగేటట్లు ఆ పాండవులను, వారికి సంబంధించిన వారిని సంహరిస్తా' నని పలుకగా, దుర్యోధనుడు ఆ అలంబుసుడిని సంతోషంతో అభినందించాడు. వెంటనే ఆ అలంబుసుడు కర్ణుడి వైపు వెళ్ళి అతడిని దాటవేసి, ఘటోత్కచుడిని ఎదుర్కొనగా యుద్ధం భయంకరమైంది. వారిద్దరూ వివిధ బాణాలతో ఒకరినొకరు అణగించలేక రథాలుదిగి, మాయలకు పూనుకొని మహాసర్పగరుడపక్షిరూపాలను, గజసింహరూపాలను, సూర్యరాహురూపాలను, మేఘవాయురూపాలను, ఇంకా అనేకానేక వికృతరూపాలను చూపుతూ పోరాడి, ఒకరితో ఒకరు కలియబడి బాహాబాహియుద్ధం చేసేటప్పుడు, వారి శరీరాలు ఒకదానితో మరొకటి చేరగా- ఘటోత్కచుడు.

క. **పట్టి బలువుగ జటాసురు। పట్టిం బడవైచి, యురము పాదమునఁ గడున్**
బిట్టుగఁ ద్రొక్కి, యతని తల। యట్టకుఁ బాయంగఁ జేసి యార్చెం బెలుచన్. **204**

ప్రతిపదార్థం: (ఘటోత్కచుడు) జటాసురు పట్టిన్= జటాసురుడి కొడుకైన ఆ అలంబుసుడిని; బలువుగన్= బలంగా; పట్టి= పట్టుకొని; పడవైచి= (క్రింద) పడవేసి; ఉరము= వక్షఃస్థలాన్ని; పాదమునన్= పాదంతో; కడున్= మిక్కిలి; బిట్టుగన్= శీఘ్రంగా; త్రొక్కి= అదిమి; అతనితల= అతడి శిరస్సు; అట్టకున్= మొండెమునకు; పాయఁగన్= ఎడబాసే విధంగా; చేసి; పెలుచన్= గట్టిగా; ఆర్చెన్= సింహనాదం చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: (ఆ ఇద్దరి శరీరాలు పెనవేసికొనగానే ఘటోత్కచుడు) ఆ అలంబుసుడిని పట్టుకొని, క్రిందపడవైచి, అతని రొమ్మును పాదంతో త్రొక్కి, అతడి తలను శరీరంనుండి వేరుచేసి వెంటనే బిగ్గరగా సింహనాదం చేశాడు.

ఆ. **ఆర్చి నెత్తు రుట్ట నమ్మస్తకము వట్టి । కొని యతం డుదాత్త ఘోర భంగి**
బ్రమరివాఱి కురునృపాలకు నరదంబు । నందు వైచి యిట్టు లనియె నధిప! 205

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఆర్చి= సింహనాదం చేసి; నెత్తురు= రక్తం; ఉట్టన్= కారగా; ఆ+మస్తకము= ఆ తలను; పట్టి= పట్టుకొని; అతండు= ఆ ఘటోత్కచుడు; ఉదాత్త ఘోరభంగిన్= గొప్ప భయంగొలిపే విధంగా; బ్రమరివాఱి= చుట్టూ తిరిగి (దుర్యోధనుని రథం ఎక్కడ ఉన్నదో చూడటానికని భావం); కురునృపాలకు+అరదంబునందున్= కురురాజైన దుర్యోధనుడి రథం మీద; వైచి= వేసి; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: సింహనాదం చేసి, ఆ ఘటోత్కచుడు ఆ అలంబుసుడి తలను నెత్తురు కారుతూ ఉండగా పట్టుకొని చూపరులకు భయంకొల్పే విధంగా చుట్టూ తిరిగి, దుర్యోధనుడి రథం లోకి ఈ తలను విసరివేశాడు. ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ కుమారుడైన దుర్యోధనుడితో ఘటోత్కచుడు ఇట్లా అన్నాడు.

క. **'కొను మిదె నీ మిత్రుని తల; । విను మిట్టుల మాఱులేని విక్రమమునఁ గ**
ర్ణునిఁ ద్రుంచెద; వరుసం బోరి । గొనియెద నిను; భీమసేను కొడుక నెఱుఁగవే?' 206

ప్రతిపదార్థం: ఇదె= ఇదిగో; నీ మిత్రుని తల= (ఓ దుర్యోధనా!) నీ మిత్రుడైన అలంబుసుని తలకాయ; కొనుము= తీసికొనుము; వినుము= శ్రద్ధగా వినుము; ఇట్టులు+అ= ఇట్లే; మాఱులేని విక్రమమునన్= సాటిలేని పరాక్రమంతో; కర్ణునిన్= నీ మిత్రుడైన కర్ణుడిని కూడా; త్రుంచెదన్= సంహరిస్తాను; వరుసన్= క్రమంగా; నినున్= నిన్ను; పొరిగొనియెదన్= సంహరిస్తాను; భీమసేను కొడుకన్= భీముడి కుమారుడను (నేను); ఎఱుఁగవే?= తెలియలేవా?

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! ఇదిగో నీ స్నేహితుడైన అలంబుసుని తల తీసికొనుము. ఇదే విధంగా సాటిలేని పరాక్రమంతో కర్ణుడిని కూడా చంపివేస్తాను. వరుసగా నీ వంతు వచ్చినప్పుడు నిన్ను కూడా సంహరిస్తాను. నేనెవడనో తెలియదా? భీముడి కుమారుడిని.'

విశేషం: భీమసేన తనయుడనే విషయం అందరికీ తెలిసిందే అయినా మళ్ళీ తనకు తానే భీమసేన తనయుడనని చెప్పుకొనటంలోని తాత్పర్యం ఏమిటి? 'నిన్ను తొడలు విరుగగొట్టుతానని ప్రతిజ్ఞ చేశాడు మా తండ్రి భీమసేనుడు. అతడి ప్రతిజ్ఞకు బద్ధుడనై నిన్నిప్పుడే సంహరించేవాడను కాని, వదిలాను.' - ఈ అర్థం 'వరుసన్' అనే పద సహాయంతో ప్రధానంగా వ్యక్తమవుతూ ఉన్నది. ఇది అర్థాంతర సంక్రమిత వాచ్యధ్వని.

వ. **అని పలికి యసురవరుం డరుణం బగు తన యరదం బెక్కి గృధ్రకేతనంబు గ్రాల నీలోన్నతం బయిన తన రూపంబున కనురూపం బైన దంష్ట్రాయుగళంబును బింగళోద్బద్ధ జటాకేశ కలాపంబును భీషణంబులుగాఁ గనక భూషణంబుల కతంబునఁ దటిల్లతా వికటంబగు నంబుదంబు కైవడిఁ గర్ణుపయిం గవిసి ఘనశరంబు లేయ నతండును జండభంగి నెదుర్కొని నిశితనారాచంబులఁ గప్పెఁ; నిప్పురుసునం దలపడి యమ్మనుజ దనుజులు మహాద్భుతకరం బగు సంగరంబు సేయునెడ వివిధాయుధ వ్యాపార ఘోర విచేష్టిత విగళిత రక్తసిక్తంబు లగు నంగంబుల యచలత్వంబున గైరిక గిరిద్వయంబు చందంబున నొప్పి;ర ట్లెక్కువ తక్కువలు**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లేక పోరిపోరి రాధేయుం డొక్క దివ్యాస్త్రంబు ప్రయోగించిన నది భైమసేని ప్రత్యస్త్రంబున నడంచి, మాయాసైన్యం బడరించిన నమ్మాయా సైన్యంబు సాయక శూల ముద్గరాది హేతి వ్రాతంబులును బలల వర్షంబులునుం గురియం గురువాహిని గలంగి పాఱిన, నా సూతసూనుం డొక్కరుండును నవష్టంభ విజృంభణంబు మెఱయ నిలిచి మహనీయాస్త్రబలంబున నమ్మాయ మాయించుటయు హైడింబుండు చక్రంబు వైచినం జక్కడిచె, గద నిగిడించిన మగిడించె, గగనంబున కరిగి తరుపాషాణ పటలంబులు పరఁగించినం దునిమి ధరం దొరఁగించె, మఱియు రథికత్వంబునం గడంగిన నయ్యోధవరుండు తురగ సారథి సహితంబుగా రథంబు శకలంబులు సేసి యతని తను వేదు వెఱిగిన తెఱంగుగా మెఱుంగుటమ్ములు గిఱిగొల్పినం గెరలి య న్నిశాచరనాథుండు. **207**

ప్రతిపదార్థం: అని= ఇట్లా; పలికి= చెప్పి; అసురవరుండు= రాక్షస శ్రేష్ఠుడగు ఆ ఘటోత్కచుడు; అరుణంబు+అగు= ఎర్రనైన; తన+అరదంబు= తన రథాన్ని; ఎక్కి= ఆరోహించి; గృధ్రకేతనంబు= గద్ద అనే పక్షి గురుతుగా కలిగిన ధ్వజం; క్రాలన్= ఒప్పగా; నీల+ఉన్నతంబు+అయిన= నల్లగాను, పొడవుగాను ఉన్నట్టి; తన రూపంబునకున్= తన ఆకారానికి; అనురూపంబు+ఐన= తగి ఉన్నటువంటి; దంష్ట్రా యుగళంబును= కోరలజంట; పింగళ+ఉద్బుద్ధ జటాకేశ కలాపంబును= ఎరువు, పసుపు కలసిన వన్నె కలిగి, పైకి లేచి యున్నటువంటి జడలు కట్టుకపోయిన వెంట్రుకల సమూహం కూడా (ఈ రెండూ అని భావం); భీషణంబులు+కాన్= భయంకరములై ఉండగా; కనక భూషణంబుల కతంబునన్= బంగారు ఆభరణాల కారణాన; తటిత్+లతా వికటంబు+అగు=మెరుపు తీగతో అందమై ఉన్న; అంబుదంబు కైవడిన్= మేఘంవలె; కర్ణుపయిన్= కర్ణుడిపైకి; కవిసి= పరుగెత్తి; ఘనశరంబులు+ఏయన్= దృఢములైన బాణాలను వేయగా; అతండును= ఆ కర్ణుడు కూడా; చండభంగిన్= భయంకొల్పే విధంగా; ఎదుర్కొని= ఎదిరించి; నిశితనారాచంబులన్= తీక్ష్ణములైన బాణాలతో; కప్పెన్= కప్పివేశాడు; ఈ+పరుసునన్= ఈ విధంగా; తలపడి= యుద్ధానికి దిగి; ఆ+మనుజదనుజులు= ఆ మనుష్య రాక్షసులైన కర్ణుడు, ఘటోత్కచుడు; మహా+అద్భుతకరంబు+అగు= మిక్కిలి ఆశ్చర్యం కలిగించేటటువంటి; సంగరంబు= యుద్ధం; చేయునెడన్= చేసే సమయంలో; వివిధ+ఆయుధ వ్యాపార ఘోర విచేష్టిత విగళిత రక్తసిక్తంబులు+అగు= అనేకములైన ఆయుధాలు (ఒకరిపై ఒకరు) ప్రయోగించుట అనే భయంకరమైన చేష్టచే విడివడిన నెత్తురుచేత తడిసినటువంటి; అంగంబుల+అచలత్వంబునన్= శరీరాల పర్వతాకారంతో (అచలః, పర్వతః, తస్య భావః అచలత్వం, పర్వతత్వం పర్వతధర్మః పర్వతాకారత్వేన తాదృశౌన్నత్య రూపేణ ప్రకృతే పరిణమతి); గైరిక గిరిద్వయంబు చందంబునన్= ఎర్రజాజు కొండల జంట వలె; ఒప్పిరి= ప్రకాశించారు; అట్లు= ఆ విధంగా; ఎక్కువ తక్కువలు లేక= ఆధిక్య న్యూనత్వాలు లేకుండా; పోరిపోరి= యుద్ధం చేసి చేసి; రాధేయుండు= కర్ణుడు; ఒక్క దివ్యాస్త్రంబు= ఓ దివ్యాస్త్రాన్ని; ప్రయోగించినన్= సంధించి ఘటోత్కచుడిపై వేయగా; అది= దానిని; భైమసేని= భీమసేనుడి కుమారుడగు ఘటోత్కచుడు; ప్రత్యస్త్రంబునన్= ఆ దివ్యాస్త్రానికి విరుగుడుగా ఉండే మరో దివ్యాస్త్రంతో; అడంచి= నివారించి; మాయాసైన్యంబు= మాయతో సృష్టించిన సైన్యాన్ని; అడరించినన్= వ్యాపింప చేయగా; ఆ+మాయాసైన్యంబు= ఆ మాయతో ఏర్పడిన సేనను; సాయక శూల ముద్గర+ఆది హేతి వ్రాతంబులును= బాణాలు, శూలాలు ముండ్లరోకళ్ళు మొదలైన ఆయుధ సమూహాలను; పలల వర్షంబులను= మాంస వర్షాలను; కురియన్= కురిపించగా; కురువాహిని= కౌరవసైన్యం; కలంగి= వ్యథచెంది; పాఱినన్= పారిపోగా; ఆ సూతసూనుండు+ఒక్కరుండునున్= ఆ కర్ణుడుఒక్కడే; అవష్టంభ విజృంభణంబు= గర్వాతిశయం; మెఱయన్= ప్రకాశించగా; నిలిచి= తొలగిపోక నిలిచి; మహనీయ+ అస్త్రబలంబునన్= గొప్పవైన అస్త్రాల బలంతో; ఆ+మాయన్= ఆ రాక్షస మాయను; మాయించుటయున్= నివారించిన వెంటనే; హైడింబుండు=హిడింబా తనయుడగు ఘటోత్కచుడు; చక్రంబు= చక్రాయుధాన్ని; వైచినన్= వేయగా; చక్కడిచెన్= ఖండించాడు; గద= గదను; నిగిడించి నన్= ప్రయోగించగా; మగిడించెన్= తిప్పికొట్టాడు; గగనంబునకున్= ఆకాశానికి; అరిగి= వెళ్ళి; తరుపాషాణ పటలంబులు=చెట్లు, బండల సమూహాలను; పరఁగించినన్= వ్యాపింపజేయగా; తునిమి= తునకలు చేసి; ధరన్= భూమిపై; తొరఁగించెన్ = పడగొట్టాడు; మఱియున్= ఇంకా; రథికత్వంబునన్= రథారోహకభావంతో; కడంగినన్= యుద్ధం చేయబూనగా (రథంపై ఆరోహించి

విల్లమ్ములతో యుద్ధానికి ఉపక్రమించగా అని భావం); ఆ+యోధవరుండు= ఆ యోధులలో శ్రేష్ఠుడైన కర్ణుడు; తురగ సారథి సహితంబుగాన్= అశ్వాలతో, సారథితో కూడుకొని ఉన్న; రథంబు= రథాన్ని; శకలంబులు+చేసి= ముక్కలు చేసి; అతని తనువు= ఆ ఘటోత్కచుడి శరీరం; ఏదు= ముండ్లపంది; పెఱిగిన తెఱంగు+కాన్= విజృంభించిన విధం ఏర్పడేటట్లు (క్రియా విశేషణంగా 'గిఱిగొల్పినన్' అనేదానితో అన్వయిస్తుంది) (ముండ్లపంది యుద్ధానికి విజృంభిస్తుందా అనే భావం కలిగే విధంగా అని తాత్పర్యం); మెఱుంగు+అమ్ములు= తళతళలాడే బాణాలను; గిఱిగొల్పినన్= గ్రుచ్చుకొనే విధంగా నాటగా; కెరలి= చెలరేగి; ఆ+నిశాచర నాథుండు= ఆ రాక్షసుల రాజు ఘటోత్కచుడు.

తాత్పర్యం: అని చెప్పి, వెంటనే ఆ ఘటోత్కచుడు ఎఱ్ఱని తన గ్రద్దచిహ్నంగల జెండా ఒప్పగా, నల్లని ఎత్తైన తన రథంపై కూర్చొని రూపానికి తగినట్లు కోరలజంట, ఎరుపుపసుపు కలిసిన వన్నె కలిగి, పైకి నిక్కి జడలుగట్టిన వెండ్రుకల సమూహము భయంకరాలై ఉండగా; బంగారునగలు శరీరంమీద ప్రకాశిస్తూ ఉన్నకారణంగా మెరుపులతో కూడిన మేఘంవలె కర్ణుడి మీదికి పరుగెత్తి దృఢమైన బాణాలతో కొట్టాడు. కర్ణుడు కూడా ప్రచండంగా అతడిని ఎదుర్కొని, వాడి అయిన బాణాలు అతడిపై కురిపించాడు. ఈ విధంగా మనుష్యుడైన కర్ణుడు, రాక్షసుడైన ఘటోత్కచుడు మిక్కిలి ఆశ్చర్యకరమైన యుద్ధం చేయగా, ఒకరిపై మరొకరు ప్రయోగించిన వివిధాయుధాల వల్ల రక్తం కారుతున్న శరీరాలతో గైరికాదిధాతువులతో ఎఱ్ఱగా ఉన్న రెండు కొండలవలె ప్రకాశించారు. ఆ ఇద్దరూ ఒకరు తక్కువ, ఒకరు ఎక్కువ కాకుండా సమానస్థాయిలో పోరాడారు. కర్ణుడు ఒక దివ్యాస్త్రాన్ని ప్రయోగించగా, ఘటోత్కచుడు దానికి విరుగుడుగా ప్రత్యస్త్రాన్ని ప్రయోగించి దాన్ని అణచివేశాడు. మాయాసైన్యాన్ని సృష్టించాడు. ఆ మాయాసైన్యం శత్రుసైన్యంపై బాణాలను, శూలాలను, ముండ్ల రోకళ్ళను- ఇంకా ఎన్నో విధాలైన ఆయుధాలను మాంసఖండాలను కురిపిస్తూ ఉండగా కౌరవసైన్యం తట్టుకోలేక పారిపోసాగింది. అయినా ఆ కర్ణుడు ఒక్కడే నిలిచి తన దర్పం చాటుతూ దివ్యాస్త్రాల బలంతో ఆ మాయాసైన్యాన్ని రూపుమాపాడు. వెంటనే ఘటోత్కచుడు చక్రాయుధాన్ని ప్రయోగించాడు. కర్ణుడు దానిని ఖండించివేశాడు. ఘటోత్కచుడు గద విసిరాడు. దానిని కూడా కర్ణుడు తుత్తునియలు చేశాడు. ఇక ఘటోత్కచుడు తాను ఆకాశానికి చేరి చెట్లవర్షం, రాళ్ళవర్షం కురిపిస్తూ ఉంటే వెంటనే కర్ణుడు ఆ చెట్లను, రాళ్ళను తునుకలుగాచేసి భూమిపై పడేటట్లు చేశాడు. ఇక ఘటోత్కచుడు రథంపై ప్రత్యక్షమై యుద్ధానికి ఉపక్రమించగా కర్ణుడు ఆ ఘటోత్కచుడి గుఱ్ఱాలను, సారథిని ఖండించి, రథాన్ని తునుకలు చేశాడు. అంతేకాక, ఆ ఘటోత్కచుడి శరీరం నిండా బాణాలు నాటాడు. ఆ సమయంలో ఘటోత్కచుడు ముండ్లపంది యుద్ధానికి విజృంభిస్తూ ఉన్నదా- అన్నట్లు భాసించాడు. అప్పుడు ఆ ఘటోత్కచుడు చెలరేగి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

"తటిల్లతా వికటంబగు" అనే పాఠంకంటే-సంశోధిత ముద్రణలో పాఠాంతరంగా చూపబడిన తటిల్లత రాజిత" అనే పదమే ఉచితంగా ఉంటుంది.

సీ. **మాయాముఖంబున మార్గణజాలంబు । ద్రావఁ గర్ణుం డది వ్రయ్య నేసి**
చెలఁగినఁ గడుఁబెక్కుశిరములతోడి మ । హాకృతి గైకొని నదియుఁ దునుమఁ
జచ్చె వీఁ డని మన సైన్యంబు లుబ్బంగఁ । బడియుండి వివిధ రూపములు దాల్చి
భంగించె నవియును ద్రుంగఁగ నేసిన । శైలమై తద్వజ్ర సాయకమున

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. సమసి రథికుఁడై తన చుట్టుఁ జాతురంగ। మైన బల మేచి తఱుమంగ నడరి దీప్త
భూరి శరముల నాసూతపుత్త్రు నొంచి। యెక్కుడై త్రుంచె నతని వి ల్లక్కజముగ. 208

ప్రతిపదార్థం: మాయా ముఖంబునన్= మాయతో (ఏర్పడిన) నోటితో; మార్గణజాలంబు= (కర్ణుడు వేసిన) బాణాల సమూహాలను; త్రావన్= త్రాగివేయగా; కర్ణుండు= కర్ణుడు; అది= ఆ మాయా కల్పిత ముఖాన్ని; వ్రయ్యన్= పగిలిపోయేటట్లు; ఏసి= బాణాలు వేసి; చెలఁగినన్= అర్వగా (ఆ ఘటోత్కచుడు); కడున్= మిక్కిలి; పెక్కుశిరములతోఁడి; మహా+ఆకృతిన్= అనేకములైన తలలతో కూడిన పెద్ద ఆకారాన్ని; కైకొనన్= గ్రహించగా; (కర్ణుడు) అదియున్= ఆ శిరోబహుళమైన ఆకారాన్ని కూడా; తునుమన్= ఖండించగా; వీఁడు= ఈ ఘటోత్కచుడు; చచ్చెన్= మరణించాడు; అని= అని (అనుకొని); మన సైన్యంబులు= ఓ ధృతరాష్ట్ర మహారాజా! మన కౌరవసేనలు; ఉబ్బంగన్= ఉబ్బిపోయేటట్లు; పడియుండి= పడిపోయి; (వెంటనే ఆ ఘటోత్కచుడు) వివిధ రూపములు= పలు విధాలైన ఆకారాలను; తాల్చి= ధరించి; భంగించెన్= (కర్ణుడు వేసిన బాణాలను) భగ్నం చేశాడు (అప్పుడు కర్ణుడు); అవియును= ఆ వివిధాకృతులను కూడా; త్రుంగఁగన్= తునుకలయ్యే విధంగా; ఏసినన్= కొట్టగా (ఆ ఘటోత్కచుడు); శైలము+ఐ= పర్వతమై (పర్వతరూపం ధరించినవాడై అని భావం); తద్+వజ్రసాయకమునన్= ఆ కర్ణుడి వజ్రరూప దివ్యాస్త్రంచేత; సమసి= (ఆ పర్వతరూపం) నశించి; రథికుడు+ఐ= రథారోహణం చేసినవాడై (ఆ ఘటోత్కచుడు); తన చుట్టున్= తనకు నాలుగువైపులా; చాతురంగము+ఐన బలము= చతురంగ సైన్యం; ఏచి= విజృంభించి; తఱుమంగన్= (ఆ కౌరవసైన్యాన్ని) తరుముతూ ఉండగా; అడరి= చెలరేగి; దీప్తభూరిశరములన్= తళతళ మెరుస్తూ ఉన్న అనేకములైన బాణాలతో; ఆ సూతపుత్రున్= ఆ కర్ణుడిని; నొంచి= నొప్పించి; ఎక్కుడై= (ఆ కర్ణుడి కంటె యుద్ధంలో) ఆధిక్యం కలవాడై; అతని విల్లు= ఆ కర్ణుడి ధనుస్సును; అక్కజముగన్= ఆశ్చర్యం కలిగే విధంగా; త్రుంచెన్= ముక్కలు చేశాడు.

తాత్పర్యం: మాయతో పెద్ద నోరు సృష్టించి, దానితో ఆ కర్ణుడు వేసిన బాణాలనన్నింటినీ మ్రింగివేయగా, కర్ణుడు ఆ ఘటోత్కచుడి మాయా కల్పిత ముఖాన్ని దివ్యాస్త్రాలతో మటుమాయం చేసి రెచ్చిపోతూ ఉండగా వెంటనే ఘటోత్కచుడు అనేక ముఖాలు గల పెద్ద ఆకారాన్ని ధరించాడు. కర్ణుడు దానిని కూడా నశింపజేయగా, ఘటోత్కచుడు ఈ దెబ్బతో చచ్చిపోయే ఉంటాడని మనసైన్యం ఉప్పొంగిపోయింది. కాని వెంటనే ఘటోత్కచుడు ఒక్కటేమిటి - అనేక రూపాలతో దిక్కులన్నీ వ్యాపించి కర్ణుడు వేసిన బాణాలను భగ్నం చేశాడు. అప్పుడు కర్ణుడు తన దివ్యాస్త్రబలంతో ఆ ఘటోత్కచుడి ఆ పెక్కు రూపాలను నశింపజేశాడు. ఘటోత్కచుడు వెంటనే పర్వతమై నిలిచాడు. కర్ణుడు వజ్రరూపమైన ఇంద్రాస్త్రాన్ని అనుసంధించి ఆ పర్వతరూపాన్ని ఖండించాడు. ఇక ఘటోత్కచుడు తన చుట్టూ చతురంగ బలంతో కూడుకొని రథం అధిరోహించి యుద్ధానికి దిగాడు. రెచ్చిపోయి, కర్ణుడిపై బాణాలు కురిపించి నొప్పించాడు. అంతేకాక కర్ణుడి విల్లును తునుకలు చేశాడు. ఆ ఘటోత్కచుడు కర్ణుడి కంటె అధికుడై విక్రమించాడు అని అందరూ ఆశ్చర్యపోయారు.

వ. ఆ సమయంబున బకుని తోడంబుట్టు వగు నలాయుధుం డను నసురేంద్రుండు వడముడి వలనివైరంబు పెద్ద కాలం బేనియు మనం బెరియింపం దటి వేచికొని యుండి యన్నిశాసంగ్రామంబునకు ససైన్యంబుగాఁ జనుదెంచి దుర్యోధనుం గని త న్నెఱింగించుకొని యతనితో నిట్లనియె. 209

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అదే సమయంలో; బకుని తోడంబుట్టువు+అగు= బకాసురుడి సోదరుడైన; అలాయుధుండు +అను= అలాయుధుడు అనే (పేరుగల); అసుర+ఇంద్రుండు= రాక్షసశ్రేష్ఠుడు; వడిముడివలని వైరంబు= భీమసేనుడి వలన ఏర్పడిన శత్రుత్వం (భీముడు ఏకచక్రపురంలో తన సోదరుడు బకాసురుడిని చంపినవైరం); పెద్దకాలంబు+ఏనియున్=చాలా కాలంగా; మనంబు= మనస్సును; ఎరియింపన్= కాలుస్తూ ఉండగా; తటి= (తగిన) సమయం; వేచికొని ఉండి=ఎదురుచూచుకొంటూ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉండి; ఆ+నిశాసంగ్రామంబునకున్= ఆ రాత్రి యుద్ధానికి; ససైన్యంబుగాన్= సైన్యంతో కూడి ఉండేటట్లు (సైన్యంతో కూడా అని భావం) (క్రియా విశేషణం); చనుదెంచి= వచ్చి; దుర్యోధనున్= దుర్యోధనుడిని; కని= చూచి; తన్నున్= తనను; ఎఱింగించుకొని= తెలియజేసికొని; అతనితోన్= ఆ దుర్యోధనుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అదే సమయాన బకాసురుడి సోదరుడు అలాయుధుడు అనే రాక్షసుడు రాత్రియుద్ధం చేసి భీముడిపై పూర్వవైరాన్ని సాధించుకొనటానికి సైన్యసమేతంగా దుర్యోధనుడిని చేరాడు. (భీముడు ఏకచక్రపురంలో బ్రాహ్మణ కుటుంబాన్ని, ఆ ఊరి ప్రజలను కష్టాలనుండి కాపాడటానికి బకుడనే రాక్షసుడిని సంహరించాడు. అదీ అలాయుధుడికి భీముడిపైనున్న పూర్వవైరం. ఇంతకాలం ఆ రాక్షసుడి మనస్సును కాల్చివేస్తున్నది ఆ వైరం. తగిన సమయానికి నిరీక్షిస్తున్నాడు. ఆ పగ తీర్చుకొనటానికి ఈ రాత్రియుద్ధం తగిన సమయంగా భావించాడు.) అలాయుధుడు దుర్యోధనుడిని సమీపించి, తా నెవడో ఎందుకు వచ్చాడో పరిచయం చేసికొని మరీ ఇట్లా అన్నాడు.

విశేషం: పరిచయ ఘట్టం మూలంలో విస్తృతంగా ఉన్నది. తిక్కన 'త న్నెఱింగించుకొని' అనే మాటతో దానినంతా సంగ్రహించాడు.

అలాయుధాసురుండు ఘటోత్కచునితో యుద్ధంబు సేసి చచ్చుట (సం. 7-151-1)

క. **'భీమునిఁ దత్సోదరులను । భూమీశ్వర! యిపుడ పట్టి పొరివుచ్చెద; ను**
ద్దామత మ్రింగెదఁ గృష్ణుని । తో మిత్రగణంబుతో సుతులతోఁ గూడన్. 210

ప్రతిపదార్థం: భూమీశ్వర!= ఓ దుర్యోధన మహారాజా!; భీమునిన్= భీమసేనుడిని; తద్+సోదరులను= అతడి తోబుట్టువులైన ధర్మరాజాదులను; పట్టి= పట్టుకొని; ఇపుడు+అ= ఇప్పుడే; పొరివుచ్చెదన్= సంహరిస్తాను (సంహరించి, వారినందరిని); కృష్ణునితోన్= వారు నమ్ముకొన్న కృష్ణుడితో; మిత్రగణంబుతోన్= (వారి) స్నేహితుల సమూహంతో; సుతులతోన్= వారి పుత్రులతో; కూడన్= సహితంగా; ఉద్దామతన్= భయం కలిగించే విధంగా; మ్రింగెదన్= మ్రింగివేస్తాను.

తాత్పర్యం: 'ఓ దుర్యోధన మహారాజా! భీముడిని, అతని అన్నదమ్ములను, ఆ పాండవులకు అండగా ఉన్న కృష్ణుడిని, ఆ పాండవుల స్నేహితులనూ, కుమారులనూ ఇప్పుడే చంపి మ్రింగివేస్తాను.

వ. **నీకును నీ వారికిం గయ్యంపు టలజడి గాకుండునట్లుగా నరిసేన సమయించెద' ననియె; నప్పుడు ద్రోణద్రౌణి కృప కృతవర్మ మద్రపతి ప్రముఖ యోధవీరులు వెఱఁగుపడి చూచుచుండం బేర్చి హైడింబుండు గవిసినం గర్ణుదెస నఖిలజనంబులును నిరాశులైరి; సుయోధనుం డలాయుధు నాలోకించి. 211**

ప్రతిపదార్థం: నీకును= ఓ దుర్యోధనా! నీకును; నీవారికిన్= నీకు సంబంధించిన వారలకు; కయ్యము+అలజడి= యుద్ధం వల్లనైన కలత; కాక+ఉండునట్లు+కాన్= లేకుండా ఉండే విధంగా; అరిసేనన్= శత్రుసైన్యాన్ని; సమయించెదన్= సంహరిస్తాను; అనియెన్= (అని) పలికాడు; అప్పుడు= ఆ సమయంలోనే; ద్రోణ= ద్రోణుడు; ద్రౌణి= ద్రోణపుత్రుడు - అశ్వత్థామ; కృప= కృపుడు; కృతవర్మ= కృతవర్మ; మద్రపతి= శల్యుడు (మద్రదేశాధిపతి కావున ఈతడికి ఆ పేరు); ప్రముఖ= మొదలుగా గల; యోధవీరులు= యుద్ధం చేసే వీరులు; వెఱఁగుపడి= ఆశ్చర్యపడి; చూచుచుండన్= చూస్తూ ఉండగా; పేర్చి= విజృంభించి; హైడింబుండు= ఘటోత్కచుడు; కవిసినన్= పైబడుతూ ఉండగా; కర్ణుదెసన్= కర్ణుడిపై; అఖిల జనంబులును= జనులందరు; నిరాశులు+ఐరి= ఆశలేనివారయ్యారు- అనగా జీవితాశయం వదలుకొన్నారు; సుయోధనుండు= దుర్యోధనుడు; అలాయుధున్= ఆ బకాసురుడి సోదరుడైన అలాయుధుడనే రాక్షసుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: నీకూ, నీ పక్షాన ఉన్నవారికీ ఇక యుద్ధక్లేశం లేకుండా చేస్తాను. ఈ శత్రుసైన్యాన్నంతా వధిస్తాను' అన్నాడు. ఇక అక్కడ ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ, శల్యుడు మొదలైన మహాయోధులు ఆశ్చర్యపడిచూస్తూఉండగా, ఘటోత్కచుడు కర్ణుడి మీద విజృంభించటాన్ని చూచి జనులందరూ కర్ణుడిపై ఆశ వదలుకొన్నారు. అప్పుడు దుర్యోధనుడు అలాయుధుని చూచి

తే. **'భీమతనయుండు మాయపుఁ బెనఁకువలను । గర్ణు నొప్పించుచున్నాఁడు; గడఁగి వానిఁ**
దాఁకి గెలువు నీ' వనవుడు దైత్యవిభుఁ డు । దగ్రగతిఁ జని తాఁకె నా దైత్యవిభుని. **212**

ప్రతిపదార్థం: (ఓ అలాయుధా!) భీమతనయుండు= భీముడి కొడుకు ఘటోత్కచుడు; మాయము+పెనఁకువలను= రాక్షసమాయలతో కూడిన యుద్ధాలతో; కర్ణున్= కర్ణుడిని; నొప్పించుచున్నాఁడు= బాధిస్తున్నాడు (కాబట్టి); నీవు= (సమర్థుడవైన) నీవు; కడఁగి= విజృంభించి; తాఁకి= ఎదుర్కొని; వానిన్= ఆ ఘటోత్కచుడిని; గెలువు(ము)= జయించుము; అనవుడున్= అనగానే; దైత్యవిభుఁడు= ఆ అలాయుధుడు; ఉదగ్రగతిన్= భయంకరమైన పోకడతో; చని= వెళ్ళి; ఆ దైత్యవిభునిన్= ఆ ఘటోత్కచుడిని; తాఁకెన్= ఢీకొన్నాడు.

తాత్పర్యం: 'ఓ అలాయుధా! ఘటోత్కచుడు తన మాయాయుద్ధాలతో కర్ణుడిని బాధిస్తూ ఉన్నాడు. నీవు అతడని ఎదుర్కొని గెలువుము అని దుర్యోధనుడు అనగానే అలాయుధుడు రోషభీషణంగా వెళ్ళి, ఘటోత్కచుడిని ఢీకొన్నాడు.

విశేషం: ఘటోత్కచు డనక భీమతనయుడని చెప్పటం అలాయుధుడికి భీముడి యెడ గల పూర్వవైరానుసంధాన సూచనార్థం. దీనిచేత 'ఓ అలాయుధా! నీ వా ఘటోత్కచుడిని చంపి ఆ భీముడిపై గల వైరాన్ని కొంతవరకైనా తీర్చుకొనుము' - అనే అర్థం ధ్వనిస్తూ ఉన్నది. 'మాయపుఁ బెనఁకువలను' అను పదంచేత 'ఆ ఘటోత్కచుడి ఉక్కడంచటానికి మాయా యుద్ధతంత్రాన్ని తెలిసిన నీవే సమర్థుడ'వని కూడా దుర్యోధనుడి అభిప్రాయ రూపమైన అర్థం వ్యక్తమవుతూ ఉన్నది.

క. **అరదము మొదలైన సకల । పరికరములు రూపునేపుఁ బ్రాయంబును న**
య్యిరువురు దనుజాధిపులకు । సరియై యొప్పారెఁ జూడ జగతీనాథా! **213**

ప్రతిపదార్థం: జగతీనాథా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అరదము మొదలు+ఐన= రథం మొదలుగా గల; సకల పరికరములున్= సాధానాలన్నీ (మరియు); రూపు= రూపం; ఏపున్= విజృంభణం; ప్రాయంబునున్= వయస్సు కూడా; ఆ+ఇరువురు దనుజ+అధిపులకున్= ఆ ఇద్దరు రాక్షస శ్రేష్ఠులకు; చూడన్= కనుకొనగా; సరియై= సమానమై; ఒప్పారెన్= భాసించాయి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఘటోత్కచుడు, అలాయుధుడు - అనే ఆ ఇద్దరు రాక్షసవీరులు రథం మొదలైన యుద్ధసాధనాలలో, రూపంలో, విజృంభించి పోరు సల్పటంలో, వయస్సులో - ఒకటేమి? అన్నింటిలో కూడా సమానులై భాసించారు.

వ. **ఇట్లేపు మెఱయ నిరువురుం దలపడి పోరు వారలం జూచి సూతసూనుండు మరుత్సూనుపయిం గవిసిన నతండు దన సుతుం డలాయుధుచేత నొచ్చునో యను తలంపునఁ గర్ణునిఁ గ్రేడించి యమ్మేటి రక్కసునిమీఁద నాటోపంబున నడరుటయుఁ, దదనుచరులగు నిశాచరు లనేకు లొక్కమొగి నతనిం బొదివిన కినుక నమ్ములగములు వఱపి యవ్వీరుండు వారిం బఱపిన.** **214**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఏపు= విజృంభణం; మెఱయన్= ప్రకాశించగా; ఇరువురున్= ఇద్దరుకూడా; తలపడి= కలియబడి; పోరువారలన్= యుద్ధంచేసే ఆ ఘటోత్కచుడు అలాయుధుడు అనే రాక్షసవీరులను; చూచి; సూతసూనుండు= కర్ణుడు; మరుత్+సూనుపయిన్= వాయునందనుడయిన భీముడిపై; కవిసినన్= దాడిచేయగా; అతండు= ఆ భీముడు; తన సుతుండు= తన కుమారుడగు ఘటోత్కచుడు; అలాయుధుచేతన్= తాను సంహరించిన బకాసురుడి సోదరుడైన అలాయుధుడి చేత; నొచ్చునో = చనిపోవునేమో; అను తలంపునన్= అనే ఊహతో; కర్ణునిన్= కర్ణుడిని; క్రేడించి= లెక్కచేయక దాటి; ఆ+మేటి రక్కసుమీఁదన్= ఆ అలాయుధుడనే రాక్షసశ్రేష్ఠుడిపై; ఆటోపంబునన్= యుద్ధాడంబరంతో; అడరుటయున్= చెలరేగగానే; తద్+అనుచరులు+అగు= ఆ అలాయుధుడి సహచరులైన; నిశాచరులు+అనేకులు= రాక్షసులు పలువురు; ఒక్క మొగిన్= ఒకేసారి; అతనిన్= ఆ భీముడిని; పొదివినన్= ఎదుర్కొనగా; ఒదవిన కినుకన్= పుట్టిన కోపంతో; అమ్ములగములు= బాణాల సమూహాలను; పఱపి= ప్రయోగించి; ఆ+వీరుండు= వీరుడైన ఆ భీమసేనుడు; వారిన్= ఆ సహచర రాక్షసులను; పఱపినన్= పారద్రోలగా.

తాత్పర్యం: ఈ విధంగా ఆ ఘటోత్కచుడు, అలాయుధుడు - ఇద్దరూ ఒకరితో ఒకరు యుద్ధానికి తలపడి విజృంభించి పోరుతూ ఉంటే చూచి, కర్ణుడు భీముడిపై యుద్ధంచేయటానికి ఉరికాడు. కాని ఆ భీముడు తన కుమారుడు ఘటోత్కచుడు అలాయుధుడి చేతిలో చిక్కి మరణిస్తాడో ఏమో - అనే అనిష్టశంకతో కర్ణుడిని లెక్క చేయక దాటవేసి, ఆ అలాయుధుడిపైకి విజృంభించి పరుగుతీస్తూ ఉండగా, ఆ అలాయుధుడి అనుచరుడైన రాక్షసవీరులు ఒకేసారి భీముడిపైకి దూసికొని వచ్చారు. వారినందరిని భీముడు బాణాలు గుప్పించి పారద్రోలగా

తే. **పోక నిలిచి యమ్మారుతపుత్త్రుఁ డేయు । సాయకంబులఁ గొన్నింటిఁ జంచదస్త్ర**
కుంఠితంబులఁ గావించి కొన్ని యురము । నందు డిందంగ మెఱసె న య్యసురవరుఁడు. 215

ప్రతిపదార్థం: ఆ+అసురవరుఁడు= ఆ అలాయుధుడు; పోక= తానొక్కడు మాత్రం తొలగిపోక; నిలిచి= ఆ భీముడికి ఎదురు నిలిచి; ఆ+మారుత పుత్త్రుఁడు= ఆ వాయునందనుడు భీముడు; ఏయు= వేసే; సాయకంబులన్= బాణాలలో; కొన్నింటిన్= కొన్ని బాణాలను; చంచత్+అస్త్రకుంఠితంబులన్= తళతళ మెరుస్తూ ఉన్న బాణాలతో మొక్కవోయినవాటినిగా; కావించి= చేసి; కొన్ని= మరికొన్ని బాణాలు; ఉరమునందున్= వక్షఃస్థలమందు; డిందంగన్= క్రుచ్చుకొనిపోయి ఉండగా; మెఱసెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: అలాయుధుడు తన సైన్యం తొలగి పారిపోయినా తా నొక్కడు మాత్రం తొలగిపోక, భీముడికి ఎదురుగా నిలిచి, ఆ భీముడు వేసిన బాణాలను కొన్నింటిని తన బాణాలతో ఖండించాడు. అయినా కొన్ని బాణాలు మాత్రం కొట్టువడక వచ్చి అతడి వక్షస్స్థలం చీల్చగా భాసించాడు.

క. **భీముఁడు గద వైచిన ను । ద్దామ గదాప్రహతి నది యతండు సదిపి యు**
గ్రామేయ వివిధ విశిఖ । స్తోమంబుల నతని నొంచె దుర్జయలీలన్. 216

ప్రతిపదార్థం: భీముఁడు= భీమసేనుడు; గద= గదను; వైచినన్= వేయగా; అది= దానిని; ఉద్దామగదా ప్రహతిన్= భయంకరమైన గదయొక్క దెబ్బతో; అతండు= ఆ అలాయుధుడు; చదిపి= నశింపజేసి; ఉగ్ర= భయంకరములైన; అమేయ= లెక్కలేనన్ని; వివిధ= అనేక విధాలైన; విశిఖ= బాణాలయొక్క; స్తోమంబులన్= సమూహాలతో; దుర్జయ లీలన్= జయించరాని విధంగా; అతనిన్= ఆ భీముడిని; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: భీముడు గద ప్రయోగించగా ఆ అలాయుధుడు తాను భయకరమైన గదనే ప్రయోగించి ఆ గదను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యర్థం చేసి, భయంకరాలైన బాణాలు లెక్కలేనన్నింటిని ఆ భీముడిపై వేసి, బాధించాడు.

వ. నిజ బలంబులం బురికొల్పిన నవి పాంచాల సైన్యంబుల బడలు వఱిచె; నప్పుడు శౌరి సవ్యసాచిం జూచి 'రాత్రి యుద్ధంబున రాక్షసులు వేర్చిరి; వీరి మరల్ప నకుల సహదేవ సాత్యకి ప్రభృతుల నియోగింపుము; కర్ణుదెసకు శిఖండి ధృష్టద్యుమ్న ప్రముఖులం బనుపుము; గురుని ప్రాపున నురవడించు నరపతుల నీవు నిలువరింపు' మనునెడ నలాయుధుం డనిలతనయు ధనువు దునిమి యతండు వేఱొక్కవిల్లెత్తికొను సందున సారథి రథ్యంబుల సోలనేసినం బొలివోవక యబ్బలుమగండు గదాహస్తుండయి గొదకొన వాఁడును గదగొని మార్కొని ఘోరంబు గాఁ బోర గదలు దుము రగుటయు రథావయవంబులుఁ గరిదంతంబులు లోనుగా దొరకొన్నవియ సాధనంబులుగా నొండొరుల నొప్పింపం దొడంగిన. 217

ప్రతిపదార్థం: నిజ బలంబులన్= తన సైన్యాలను; పురికొల్పినన్= ప్రేరేపించగా; అవి= ఆ సైన్యాలు; పాంచాల సైన్యంబులన్= పాంచాలదేశపు సేనలను; బడలు+పఱిచెన్= అలయింపజేశాయి; అప్పుడు= ఆ సమయంలో; శౌరి= కృష్ణుడు; సవ్యసాచిన్= అర్జునుడిని; చూచి= చూచి (ఇట్లా అన్నాడు); రాత్రి యుద్ధంబునన్= రాత్రి యుద్ధంలో; రాక్షసులు= ఆ రాక్షసవీరులు; పేర్చిరి= అతిశయించారు; వీరిన్= ఈ రాక్షసులను; మరల్పన్= తొలగించటానికి; నకుల సహదేవ సాత్యకి ప్రభృతులన్= నకులుడు, సహదేవుడు, సాత్యకి మొదలైన వీరులను; నియోగింపుము= పంపుము; కర్ణుదెసకున్= కర్ణుడివైపునకు; శిఖండి ధృష్టద్యుమ్న ప్రముఖులన్= శిఖండి, ధృష్టద్యుమ్నుడు మొదలైనవారిని; పనుపుము= పంపుము; గురుని ప్రాపునన్= ద్రోణాచార్యుడి రక్షణలో; ఉరవడించు నరపతులన్= ఎదుర్కొంటూ ఉన్న రాజులను; నీవు= ఓ అర్జునా! నీవు; నిలువరింపుము= నిలిపివేయుము; అను+ఎడన్= అనే సమయంలో; (అక్కడ) అలాయుధుండు= బక సోదరుడు-అలాయుధాసురుడు; అనిల తనయు ధనువున్= వాయునందనుడైన భీమసేనుడి ధనుస్సును; తునిమి= ఖండించి; అతండు= ఆ భీముడు; వేఱు+ఒక్క+విల్లు= మరియొక ధనువును; ఎత్తికొను సందునన్= తీసికొనే అవకాశంలో; సారథి రథ్యంబులన్= అతని సారథిని, అశ్వాలను; సోలన్= మూర్ఛపోయి రథం నుండి తొలగిపోయే విధంగా; ఏసినన్= కొట్టగా; పొలి+పోవక= భంగపడక; ఆ+బలుమగండు= ఆ బలశాలియైన వీరుడు భీముడు; గదా హస్తుండు+అయి= గద చేతిలో తీసికొన్నవాడయి; గొదకొనన్= విజృంభించగా; వాఁడును= ఆ అలాయుధుడు కూడ; గద= గదను; కొని= తీసికొని; మార్కొని= ఢీకొని; ఘోరంబు+కాన్= భయంకరంగా; పోరన్= యుద్ధం చేయగా; గదలు= ఆ ఇద్దరి గదలు; తుమురు+అగుటయున్= చూర్ణమయిన వెంటనే; రథ+అవయవంబులున్= రథాల చక్రాలు, నొగళ్ళు, కాడులు మొదలైనవి; కరి దంతంబులు= ఏనుగుల దంతాలు; లోనుగాన్= మొదలుగా; దొరకొన్నవి+అ= లభించినవియే; సాధనంబులుకాన్= సాధనాలు కాగా (దొరికినవి దొరికినట్లే రథాల చక్రాలు నొగళ్ళు, కాణీలు, ఏనుగుల దంతాలు మొదలైన వాటిని ఆయుధాలుగా ఉపయోగించి అని భావం); ఒండొరులన్= పరస్పరం; నొప్పింపన్+తొడంగినన్= బాధించటానికి పూనుకొనగా.

తాత్పర్యం: అంతేకాక, తన సైన్యాలను ఆ అలాయుధుడు శత్రుసైన్యంపై ప్రేరేపించాడు. ఆ సైన్యాలు పాంచాల సైన్యాలతో పోరాడి ఆ సైన్యాలను అలసిపోయేటట్లు చేశాయి. ఇది గమనించి కృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు: 'అర్జునా! రాత్రి యుద్ధంలో రాక్షసులు అతిశయించారు. కాబట్టి ఈ రాక్షస వీరులను మరల్చటానికి నకుల సహదేవులు సాత్యకి మొదలైన వారిని పంపించుము. ఇక కర్ణుడిపైకి శిఖండి, ధృష్టద్యుమ్నుడు మొదలైన వారిని పంపుము. నీవేమో ద్రోణుడి రక్షణ నిమిత్తం పోరాడుతూ ఉన్న రాజులను ఆపుము.' అని అర్జునుడితో కృష్ణుడు చెప్పుతూ ఉండే సమయంలో, అక్కడ అలాయుధుడు భీముడి ధనుస్సును ముక్కలు చేశాడు. భీముడు మరో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధనుస్సును తీసికొనే లోపలనే భీముడి సారథిని, గుర్రాలను సంహరించివేశాడు. భీముడు క్రుంగిపోక గద తీసికొని ఆ అలాయుధుడిపైకి ఉరుకగా; ఆ అలాయుధుడు కూడా గద తీసికొని భీముడి నెదుర్కొన్నాడు. యుద్ధం ఘోరంగా సాగింది. వారిద్దరి గదలు తుమురైపోయాయి. ఇక ఆ ఇద్దరూ రథచక్రాలు, రథాల నొగళ్ళు, ఏనుగుల దంతాలు మొదలుగా రణరంగాన ఏ సాధనం దొరికితే దానితో ఒకరినొకరు నొప్పించటానికి పూనుకొనగా (తరువాతి పద్యంతో అన్వయం).

క. కని హరి 'గర్ణునితోడం । బెనఁగు ఘటోత్కచునిఁ బిలిచి భీముఁడు వల; ది
ద్దనుజుని మర్దింపుము నీ' । వన నాతం డతని విడిచి యతనికిఁ గవిసెన్. 218

ప్రతిపదార్థం: కని= ఈ విషయం గమనించి (యుద్ధంలో భీము డలసినట్లు గమనించి అని భావం); హరి= కృష్ణుడు; కర్ణుని తోడన్= కర్ణుడితో; పెనఁగు= యుద్ధం చేసేటటువంటి; ఘటోత్కచునిన్= ఘటోత్కచుడిని; పిలిచి= దగ్గరికి పిలిచి (అతడితో ఇట్లా అన్నాడు); (ఓ ఘటోత్కచా!); భీముఁడు= మీ తండ్రి భీమసేనుడు; వలదు= ఆ అలాయుధుడితో యుద్ధం చేయవద్దు; నీవు= నీవే; ఈ+దనుజునిన్= ఈ అలాయుధుడనే రాక్షసుడిని; మర్దింపుము= పిండి పిండి చేసి సంహరించుము; అనన్= అని చెప్పిన వెంటనే; ఆతండు= ఆ ఘటోత్కచుడు; ఆతనిన్= ఆ కర్ణుడిని; విడిచి= వదలివేసి; అతనికిన్= ఆ అలాయుధుడితో; కవిసెన్= తలపడ్డాడు.

తాత్పర్యం: అది చూచి శ్రీకృష్ణుడు కర్ణుడితో యుద్ధం చేస్తున్న ఘటోత్కచుడిని పిలిచి, 'ఓ ఘటోత్కచా! అలాయుధుడితో నీవే పోరాడి అతడిని చంపు. భీముడు చేసిన యుద్ధం చాలు. ఇక వద్దు' అని చెప్పిన వెంటనే కర్ణుడిని వదలివేసి, ఘటోత్కచుడు అలాయుధుడితో తలపడ్డాడు.

క. నకులాదులు నా దైత్య । ప్రకరంబుఁ దెరల్చి రేఁచి రాధేయుఁడు నే
లకుఁ గోలకుఁ దెచ్చెను సో । మకుల శిఖండ్యాది రథిక మర్దనుఁ డగుచున్. 219

ప్రతిపదార్థం: నకుల+ఆదులున్= నకులుడు మొదలైనవారు; ఆ దైత్యప్రకరంబున్= ఆ రాక్షససమూహాన్ని; తెరల్చిరి= పారి పోయేటట్లు చేశారు; (ఇక) రాధేయుఁడు= కర్ణుడు; ఏఁచి= విజృంభించి; శిఖండి+ఆది రథిక మర్దనుఁడు+అగుచున్= శిఖండి మొదలైన రథికులను నుగ్గు చేస్తూ (మరియు); సోమకులన్= సోమకవీరులను (పాంచాల దేశవీరులను); నేలకున్ కోలకున్+తెచ్చెను= బాణాలకు గురిచేశాడు- అనగా బాణాలతో కొట్టాడు.

తాత్పర్యం: నకులుడు మొదలైన వారు రాక్షసవర్గంపై పడి తరిమివేశారు. కర్ణుడు విజృంభించి, సోమకుడు శిఖండి మొదలైన రథికులను బాధించాడు, పాంచాల వీరులలో కొందరిని నేలగూల్చాడు. మరి కొందరిని బాణాల ధాటికి ఆగలేకుండా చేశాడు.

వ. ఆ విక్రమంబు వీక్షించి సన్నద్ధుం డయి సమీరనందనుం డా సూతనందనుం దలపడినం దోడ్పడి నకులాదులు నానాస్త్రంబులు గురిసిరి; కిరీటి పాంచాలురం గూర్చికొని కుంభసంభవ సైన్యంబుఁ బొదివి సమయించుచుండె; నలాయుధుండు ఘటోత్కచునిం బరిఘ పాతంబున సోలంజేసిన, నాలోనన తెలిసి యతండు. 220

ప్రతిపదార్థం: ఆ విక్రమంబున్= ఆ కర్ణుడి పరాక్రమాన్ని; వీక్షించి= చూచి; సన్నద్ధుండు+అయి= యుద్ధానికి ఉద్యమించినవాడయి; సమీరనందనుండు= వాయుపుత్రుడు భీముడు; ఆ సూతనందనున్= ఆ కర్ణుడిని; తలపడినన్= ఎదుర్కొనగా; తోడ్పడి=

సహాయంగా వచ్చి; నకుల+ఆదులు= నకులుడు మొదలైనవారు; నానా+అస్త్రంబులు= అనేకాలైన అస్త్రాలను; కురిసిరి= కురిపించారు; కిరీటి= అర్జునుడు; పాంచాలురన్= ఆ పాంచాలవీరులను; కూర్చికొని= వెంటపెట్టుకొని; కుంభసంభవ సైన్యంబున్= ద్రోణాచార్యుడి సైన్యాన్ని; పొదివి= ఎదుర్కొని; సమయించుచున్+ఉండెన్= సంహరిస్తు ఉన్నాడు; అలాయుధుండు= అలాయుధుడు; ఘటోత్కచునిన్= ఘటోత్కచుడిని; పరిఘ పాతనంబునన్= పరిఘాయుధం (ముండ్లగదతో పడవేయటంతో) దెబ్బతో; సోలన్+చేసినన్= మూర్ఛపోయే విధంగా చేయగా; ఆలోనన్+అ= అంతలోనే; తెలిసి= తెలివిని పొంది; అతండు= ఆ ఘటోత్కచుడు.

తాత్పర్యం: ఆ కర్ణుడి విజృంభణాన్ని చూచి భీముడు యుద్ధానికి సిద్ధమయి కర్ణుడిని డీకొన్నాడు. నకులుడు మొదలైనవారు ఆ భీముడికి తోడుగా వెళ్ళి బాణాలు కురిపించారు. అక్కడ అర్జునుడు పాంచాలవీరులతో కూడి ద్రోణుడిసైన్యాన్ని ఎదుర్కొని సంహరిస్తూ ఉన్నాడు. మరోవైపు అలాయుధుడు ఘటోత్కచుడిపై పరిఘాన్ని విసిరాడు. దానితో ఘటోత్కచుడు మూర్ఛిల్లి, వెనువెంటనే మేల్కొని - (తరువాతి పద్యంతో అన్వయం).

క. గద(ద్రిప్పి బెట్టు వైచిన । నది రథ్యంబులను సూతునరదము సిడముం
జిదురుపలు సేయ నతఁ డం । బుదమై గర్జిల్లె నభము బూరటిలంగన్. 221

ప్రతిపదార్థం: గదన్= గదను; త్రిప్పి= చుట్టూ తిప్పి; బెట్టు= గట్టిగా; వైచినన్= వేయగా; అది= ఆ గద; రథ్యంబులను= అశ్వాలను; సూతున్= సారథిని; అరదమున్= రథాన్ని; సిడమున్= ధ్వజాన్ని; చిదురుపలు+చేయన్= తుమురు చేయగా; అతఁడు= ఆ అలాయుధుడు; అంబుదము+ఐ= మేఘంగా మారి; నభము= ఆకాశం; బూరటిలంగన్= నిండుగా; గర్జిల్లెన్= గర్జించాడు.

తాత్పర్యం: గద గిరగిరా తిప్పి, గట్టిగా ఆ అలాయుధుడిపై విసరగా అది అతడి సారథిని, అశ్వాలను, రథాన్ని, ధ్వజాన్ని చూర్ణం చేయగా, వాడు మేఘంగా మారి ఆకాశం పిక్కటిల్లే విధంగా గర్జించాడు.

వ. ఇట్లు మాయ గైకొని నెత్తురు సోనతోఁ బిడుగులు వడంజేయ, వాయు తనయ తనయుండును దివి కెగసి తనమాయ నమ్మాయ మాయించినఁ, గ్రమ్మఱ బకభ్రాత భూచారి యయినఁ, దోడన హైడింబుండును డిగ్గిన నయ్యిరువురకుం దరువుల పాషాణంబుల భీషణం బగు రణంబు వాలి సుగ్రీవ సమరసమంబై చెల్లె; మగుడ వివిధాయుధంబుల నా యోధు లాయోధనంబు సేసి; రట్టియెడఁ గరవాలంబు గొని మదంబునఁ గవిసినచో ఘటోత్కచుం డలాయుధుం దలవట్టి బలువిడి నిలంబడ దిగిచి మెడ దెగవ్రేసి యార్చినం బేర్చిన పాండవ బలంబులఁ దూర్యనినదంబులు సింహనాదంబులుం జెలంగె; నప్పుడు. 222

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మాయ+కైకొని= రాక్షసమాయ గ్రహించి అనగా ప్రయోగించి; నెత్తురు సోనతోన్= రక్తవర్షంతోపాటు; పిడుగులు= పిడుగులు; పడన్+చేయన్= పడేటట్లు చేయగా; వాయుతనయ తనయుండును= వాయుదేవుడి కుమారుడి (వాయుతనయుడు అనగా భీముడు అతనితనయుడు (కుమారుడు) ఘటోత్కచుడు; దివికిన్= ఆకాశానికి; ఎగసి= ఎగిరివెళ్ళి; తన మాయన్= తన రాక్షస మాయతో; ఆ+మాయన్= ఆ అలాయుధుడి (రాక్షస) మాయను; మాయించినన్= మాయం చేయగా - అనగా నశింపజేయగా; క్రమ్మఱన్= మరల (అవ్యయం); బక భ్రాత= బకాసురుడి సోదరుడైన ఆ అలాయుధుడు; భూచారి+అయినన్= భూమిపై సంచరించే వాడు కాగా - అనగా ఆకాశం వీడి భూమియందుండి యుద్ధం చేయటానికి క్రిందికి దిగగా; హైడింబుండును= ఘటోత్కచుడు కూడ; డిగ్గినన్= (ఆకాశం నుండి భూమికి) దిగగా; ఆ+ఇరువురకున్= ఇద్దరికి; తరువులన్= చెట్లతో; పాషాణంబులన్= రాళ్ళతో; భీషణంబు+అగు= భయంకరమైన; రణంబు= యుద్ధం; వాలి సుగ్రీవసమర

సమంబు+ఐ= వాలి సుగ్రీవుల పోరాటంతో సమానమై; చెల్లెన్= సాగింది; మగుడన్= మళ్ళీ; వివిధ+ఆయుధంబులన్= అనేక విధాలైన ఆయుధాలతో; ఆ యోధులు= ఆ ఇద్దరు రాక్షసవీరులు; ఆయోధనంబు+చేసిరి= యుద్ధం చేశారు; అట్టి ఎడన్= ఆ సమయంలో; కరవాలంబు= ఖడ్గాన్ని; కొని= తీసికొని; మదంబునన్= గర్వంతో; కవిసినచోన్= ఎదుర్కొనేటప్పుడు (అలాయుధుడు తన రాక్షసమాయ నశించగా కత్తి చేతబట్టి ఘటోత్కచుడితో తలపడటానికి రాగా ఆ సమయాన); ఘటోత్కచుండు= ఘటోత్కచుడు; అలాయుధున్= అలాయుధుడిని; తల+పట్టి= తల పట్టుకొని; బలువిడిన్= పరాక్రమంతో; ఇలన్= భూమిపై; తిగిచి= లాగి; మెడన్= కంఠాన్ని; తెగవ్రేసి= తెగగొట్టి; ఆర్చినన్= సింహనాదం చేయగా; పేర్చిన పాండవ బలంబులన్= ఉప్పొంగిన పాండవుల సైన్యాలలో; తూర్యనినదంబులు= యుద్ధవాద్యాల ధ్వనులు; సింహనాదంబులున్= సింహనాదాలు; చెలఁగెన్= ధ్వనించాయి; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా అలాయుధుడు మాయామేఘంగా మారి, నెత్తురుతోపాటు పిడుగులు పడేటట్లుచేయగా, వర్షించాడు. వెంటనే ఘటోత్కచుడు కూడా ఆకాశానికెగిరి తానుకూడా రాక్షసమాయను ప్రయోగించి, ఆ అలాయుధుడి మాయను మటుమాయం చేశాడు. అప్పుడు అలాయుధుడు భూమిపైకి దిగి యుద్ధానికి ప్రత్యక్షం కాగానే ఘటోత్కచుడు కూడా వెంటనే భూమికి దిగివచ్చి, అతడితో యుద్ధానికి తలపడ్డాడు. ఆ యుద్ధం చెట్లతో రాళ్ళతో పూర్వపు వాలిసుగ్రీవుల యుద్ధం వలె భయంకరంగా సాగింది. మళ్ళీ వారిద్దరూ వివిధాయుధాలతో యుద్ధం సాగించారు. ఆ సమయంలో అలాయుధుడు ఖడ్గాన్ని గ్రహించి ఘటోత్కచుడి మీదికిరాగా, ఘటోత్కచుడు అతడి శిరస్సును పట్టుకొని క్రింద పడవేసి, కంఠాన్ని నరికివేశాడు. విజయగర్వంతో సింహనాదం చేశాడు. అది చూచి ఉప్పొంగిన పాండవసైన్యాల్లో వాద్యాలధ్వనులు సింహనాదాలు చెలరేగాయి. అప్పుడు.

క. పటుగతిఁ జని కురుపతిముం । దట వైచెం జేత నున్న తల రౌద్రం బు
ద్భటముగ ఘటోత్కచుం డు । త్కట శోకము వొంది రతఁడుఁ దత్సైనికులున్. 223

ప్రతిపదార్థం: ఘటోత్కచుండు= ఘటోత్కచుడు; రౌద్రంబు= క్రోధం; ఉద్భటము+కన్= అధికం కాగా; పటుగతిన్= శక్తిగల నడకతో - అనగా వేగంగా; చని= వెళ్ళి; చేతన్+ఉన్న తలన్= చేతిలో ఉన్న తలను; కురుపతి ముందటన్= కురురాజైన దుర్యోధనుడి ఎదుట; వైచెన్= పడవేశాడు; అతఁడు= ఆ దుర్యోధనుడు; తద్+సైనికులున్= ఆ దుర్యోధనుడి సేనలో ఉన్న వీరులు కూడ; ఉత్కటశోకము= గొప్ప దుఃఖాన్ని; పొందిరి= పొందారు.

తాత్పర్యం: ఘటోత్కచుడు క్రోధాతిశయంతో దుర్యోధనుడివైపు వేగంగా వెళ్ళి, తన చేతిలోనున్న అలాయుధుడి తలను ఆ దుర్యోధనుడి ముందర పడవేశాడు. అది చూచి దుర్యోధనుడు, అతని సైనికవీరులు కూడా మిక్కిలి దుఃఖాన్ని పొందారు.

క. మును బకుననుజుని వలనం । దనతమ్ములుఁ దాను బ్రదుకఁ దలఁచి యతఁడు స
చ్చిన విభుఁడు భీమసేను ప్ర । తిన పారం బెయ్యు నని మదిం దలఁచె నృపా! 224

ప్రతిపదార్థం: నృపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; విభుఁడు= దుర్యోధనుడు; బకు అనుజునివలనన్= బకాసురుడి తమ్ముడైన అలాయుధుడి వలన; తన తమ్ములున్= తన తమ్ములైన దుశ్శాసనాదులు; తానున్= తాను; బ్రదుకన్= జీవించటానికి (తుమున్నర్థకం); మును= మొదట; తలఁచెన్= అనుకొన్నాడు (కాని); అతఁడు= ఆ అలాయుధుడు; చచ్చినన్= మరణించగానే; భీమసేను ప్రతిన= భీముడి ప్రతిజ్ఞ అనగా 'తాను దుర్యోధనాదులను సంహరిస్తా' నని భీముడు చేసిన ప్రతిజ్ఞ; పారంబు= కడను; ఎయ్యున్+అని= చేరుతుందని; మదిన్= మనస్సులో; తలఁచెన్= భావించాడు (భీముడి ప్రతిజ్ఞ నెరవేరుతుందనీ, ఇక తమకు జీవితాశ లేదనీ దుర్యోధనుడనుకొన్నాడు.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఇంతకుముందు బకాసురుడి తమ్ముడు అలాయుధుడి వలన తానూ, తన తమ్ములు నిశ్చింతగా బ్రదుకవచ్చు నని అనుకొన్న దుర్యోధనుడు-వాడు చావగానే ఇక భీముడు చేసిన ప్రతిజ్ఞ నెరవేరుతుందని తన మనస్సులో భావించాడు.

వ. **అట్టియెడఁ గర్ణుండు కౌంతేయ సైన్య సంతానంబు నానాస్త్ర ఘట్టనంబుల విఘటితంబు సేయుచున్న నవ్వాయునందననందనుండు నిజస్యందనం బెక్కి యుక్కు మెఱయం దలపడియె; నయ్యిద్దఱుం బెద్దసేపు శరపరంపరల సరి యై సంగరంబు సేసిరి; పదంపడి రాధేయుండు రథ్యంబులం జంపిన రథ సమేతంబుగా నా ఘటోత్కచుం డదృశ్యుండైన నీ సైనికులు దల్లడిల్లి 'యెక్కడ వచ్చి యెవ్వరి నేమి సేయునో' యనుచు మేనులు వడంక నలుగడలుం గనుంగొనుచుండిరి; హైడింబుండును మహాంబుదంబు చందంబునఁ జదలం దోఁచి మెఱుముచు నుఱుముచు బాణ కృపాణ ముసల ముద్గర కుంత క్షురికాది హేతివ్రాతంబులుం బరుషోపల పటలంబులుం దొరఁగింపం దోడి దానవులు మొగిళ్ళయి యొక్క మొగి నట్లు చేయ నా సూతసుతునకుం బ్రతివిధాన మాచరింప నలవిగామిఁ గౌరవ బలంబున రథంబులు గజంబులుఁ దురగంబులుఁ ద్రెళ్ళను గూలను దొల్లను దొడంగె; నొండు గడకుం గడంగు తలంపులు దక్కి తలలుఁ గప్పికొని యుండి యోధులు భగ్నాపరభాగులై పడంజొచ్చి; రప్పు డిద్దెస వా రెల్ల నాఖండల ప్రముఖ బృందారకులు పాండునందనులకుం దోడ్పడి యిట్లు సేసెద రను వగ వెగడంది కలంగంబడి; రయ్యవసరంబున.225**

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; కర్ణుండు; కౌంతేయ సైన్య సంతానంబు= పాండవుల సేనాసమూహాన్ని; నానా+అస్త్రఘట్టనంబులన్= అనేకములైన అస్త్రాల ప్రయోగాలతో; విఘటితంబు= విచ్ఛిన్నం; చేయుచున్నన్= చేస్తూ ఉండగా; ఆ+వాయునందన నందనుండు= ఆ వాయునందనుడైన భీముడి నందనుడు ఘటోత్కచుడు; నిజస్యందనంబు= తన రథాన్ని; ఎక్కి; ఉక్కు= ప్రతాపం; మెఱయన్= మెరుస్తూ ఉండగా; తలపడియెన్= (కర్ణుడిని) ఎదుర్కొన్నాడు; ఆ+ఇద్దఱున్= ఆ కర్ణ ఘటోత్కచులిద్దరు; పెద్దసేపు= చాలాసేపు; శరపరంపరలన్= బాణాల వరుసలయందు; సరియై= సమానులై (వరుసబాణాలు ప్రయోగించటంలో యుద్ధమందు సమానులై); సంగరంబు= యుద్ధం; చేసిరి= చేశారు; పదంపడి= పిమ్మట; రాధేయుండు= కర్ణుడు; రథ్యంబులన్= గుఱ్ఱాలను; చంపినన్= చంపగా; రథసమేతంబుగాన్= రథంతో కూడ; ఆ ఘటోత్కచుండు= ఆ ఘటోత్కచుడు; అదృశ్యంబు+ఐనన్= మాయం కాగా; నీ సైనికులు= ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ (కౌరవ) సైనికులు; తల్లడిల్లి= భయపడి; ఎక్కడన్= ఏవైపు; వచ్చి= ప్రత్యక్షమై వచ్చి; ఎవ్వరిన్= ఏ వ్యక్తిని; ఏమి+చేయునో= ఏం చేస్తాడో; అనుచున్= అంటూ; మేనులు= శరీరాలు; వడంకన్= వణకగా; నలు+కడలున్= నాలుగు దిక్కుల; కనుంగొనుచుండిరి= చూస్తూ ఉన్నారు; హైడింబుండును= హిడింబానందనుడు ఘటోత్కచుడును; మహా+అంబుదంబు చందంబునన్= గొప్ప మేఘం వలె; చదలన్= ఆకాశంలో; తోఁచి= కనిపించి; మెఱుముచున్= మెరుస్తూ; ఉఱుముచున్= గర్జిస్తూ; బాణ కృపాణ ముసల ముద్గర కుంత క్షురికా+ఆది హేతివ్రాతంబులున్= బాణాలు, ఖడ్గాలు, రోకళ్ళు, ముద్గరాలు (ముండ్లవంటి రోకళ్ళు); ఈటెలు, చురకత్తులు మొదలైన ఆయుధాల సమూహాలును; పరుష+ఉపల పటలంబులున్= కఠినములైన రాళ్ళ రాసులను; తొరఁగింపన్= దొర్లిస్తూ ఉంటే (ఆకాశాన్నుండి క్రుమ్మరిస్తూ ఉంటే); తోడిదానవులు= వెంటనున్న రాక్షసులు కూడ; మొగిళ్ళు+అయి= మేఘాలుగా మారి; ఒక్కమొగిన్= ఒక్క పెట్టున; అట్లు చేయన్= అదేవిధంగా చేస్తూ ఉండగా (ఆయుధవర్షాలను కురిపిస్తూ ఉండగా); ఆ సూతసుతునకున్= ఆ కర్ణుడికి; ప్రతివిధానము= దానికి విరుగుడు; ఆచరింపన్= చేయటానికి; అలవి+కామిన్= సాధ్యం కాకపోవటంచేత; కౌరవ బలంబునన్= కౌరవ సైన్యంలో; రథంబులు= రథాలు; త్రెళ్ళను+తొడంగెన్= కూలటం ప్రారంభించాయి; గజంబులు= ఏనుగులు; కూలను తొడంగెన్= క్రిందపడ ప్రారంభించాయి; తురంగంబులు= గుఱ్ఱాలు; దొల్లను+తొడంగెన్=

క్రిందపడటం ప్రారంభించాయి (ఇక్కడ తొడంగెన్ అను క్రియ మూడు తుమర్థ క్రియలతో అన్వయిస్తూ ఉన్నది); యోధులు= సైనికవీరులు; ఒండు+కడకున్= రెండోవైపునకు; కడంగు తలంపులు= తిరిగి వెళ్ళిపోయే కోరికలను; తక్కి= విడిచి; తలలు= తలలు; కప్పి కొని+ఉండి= ఆచ్ఛాదించుకొని; యోధులు= సైనికవీరులు; భగ్న+అపరభాగులు+ఐ= విరిగిన వెన్నుభాగాలు కలవారై; పడన్+చొచ్చిరి= క్రింద పడుతూ ఉన్నారు; అప్పుడు= ఆ సమయంలో; ఈ+దెసవారు+ఎల్లన్= ఈ కౌరవులవైపు వారందరు; ఆఖండల ప్రముఖ బృందారకులు= ఇంద్రుడు మొదలైన దేవతలు; పాండునందనులకున్= పాండవులకు; తోడ్పడి= సహాయపడి; ఇట్లు= ఈ విధంగా; చేసెదరు= చేస్తారు; అను= అనే; వగన్= చింతతో; వెగడు+అంది= భయపడి; కలంగన్+పడిరి= కలత చెందారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో కర్ణుడు, పాండవులసైన్యాన్ని వివిధములైన అస్త్రాలు ప్రయోగించి, విచ్ఛిన్నం చేస్తూఉండగా, ఘటోత్కచుడు తన రథంపై కూర్చొని ప్రతాపాతిశయంతో కర్ణుడితో యుద్ధానికి తలపడ్డాడు. ఆ ఇద్దరూ చాలాసేపు ఎక్కువ తక్కువలు లేక సమానంగా బాణాల పరంపరలను కురిపిస్తూ యుద్ధం చేశారు. తరువాత కర్ణుడు ఘటోత్కచుడి రథాశ్వాలను సంహరించాడు. వెంటనే ఘటోత్కచుడు తన రథంతో సహా కనపడకుండా మాయమయ్యాడు. అప్పుడు కౌరవసైనికులు 'ఎక్కడ ప్రత్యక్షమై ఎవ్వరిని ఏం చేస్తాడో?' అని భయపడి వణకిపోతూ నలుదిక్కులనూ బెదురుచూపులతో చూస్తూ ఉన్నారు. ఆ ఘటోత్కచుడు ఆకాశాన పెద్ద మేఘంగా సాక్షాత్కరించి, ఉరుముతూ మెరుస్తూ బాణాలు, ఖడ్గాలు, రోకళ్ళు, ఈటెలు, చురకత్తులు, ముళ్ళగుదియలు - ఇంకా ఎన్నో ఆయుధాలను, మరియు రాళ్ళను కురిపిస్తూ ఉంటే, ఇక ఆ ఘటోత్కచుడికి తోడుగా వచ్చిన రాక్షసులు కూడ మేఘాలుగా మారి, వారుకూడ అట్లేచేయగా కర్ణుడు ఆ ఘోరకర్మను ఆపలేకపోయాడు. కౌరవసైన్యంలో రథాలు చూర్ణమయ్యాయి. గజాలు క్రుంగిపోయాయి. అశ్వాలు గాయపడ్డాయి. ఇక సైనికులు తలలు పగిలి వెన్నుభాగం విరిగిపోయి పడిపోతూ ఉన్నారు. ఇది చూచి, కౌరవసైనికులు 'ఇది సామాన్య యుద్ధంకాదు. పాండవులకు సహాయం చేయటానికి ఇంద్రాది దేవతలు వచ్చి ఈ యుద్ధం చేస్తున్నారు. లేకుంటే ఇంత భయానక పరిస్థితి కొనసాగుతుందా?' - అని భావించి, భయపడిపోయి, ఆత్మరక్షణకై పరుగుతీశారు. ఆ సమయంలో.

శా. **ధీరత్వం బొకఁడుం సహాయముగ రాధేయుండు దివ్యాస్త్ర సం**
చారోల్లాసము సూపెఁ జూపుటయు రక్షస్సంచయానేక మా
యా రూపావళి భాస్కరాంశుల నదృశ్యాకారమై పోవు నీ
హారంబుం దలఁపించుచున్ విరిసె నే నాశ్చర్యముం బొందితిన్. **226**

ప్రతిపదార్థం: ధీరత్వంబు+ఒకఁడున్= ధైర్యమొక్కటే; సహాయము+కన్= సహాయం కాగా; రాధేయుండు= కర్ణుడు; దివ్య+అస్త్ర సంచార+ఉల్లాసము= దివ్యాస్త్రాలను ప్రయోగించటంలో ఉత్సాహాన్ని; చూపెన్= చూపాడు; చూపుటయున్= చూపిన వెంటనే; రక్షస్సంచయ+అనేక మాయా రూపావళి= ఆ రాక్షసుల గుంపుయొక్క మాయికమైన రూపాల సమూహం; భాస్కర+అంశులన్= సూర్యుడి కిరణాలతో; అదృశ్య+ఆకారము+ఐపోవు= కానరాని ఆకారం గలదై పోయేటటువంటి; నీహారంబున్= మంచును; తలఁపించుచున్= స్మరణకు తెస్తూ; విరిసెన్= విచ్చుకపోయింది అనగా విడిపోయింది (మాయాజాలం నశించిపోయిందని భావం);

ఏన్= ఓ ధృతరాష్ట్ర మహారాజా! నేను (సంజయుడు); ఆశ్చర్యమున్= ఆశ్చర్యాన్ని; పొందితిన్= పొందాను.

తాత్పర్యం: కర్ణుడు ధైర్యమాత్ర సహాయుడై ఉత్సాహంతో దివ్యాస్త్రాలు ప్రయోగించగానే ఆ రాక్షస సమూహం యొక్క మాయారూపజాలం, సూర్యకిరణాలకు అదృశ్యమైపోయే మంచువలె వీడిపోయింది. అది చూచి - ఓ ధృతరాష్ట్ర మహారాజా! నేను ఆశ్చర్యపడ్డాను.

చ. మగుడఁగ దానవప్రవరు మాయ సమంచిత దివ్యబాణ శ
క్తి గుదియఁ జేసి తొంటితన తీవ్రత గైకొని నీదుసైన్యముల్
బెగడువడన్ మదించి యతి భీమ సముద్ధతి నింక నెమ్మెయిం
దెగఁ డను భీతి యోధులమదిన్ జనియింపఁగ నాక్రమించినన్. 227

ప్రతిపదార్థం: మగుడఁగన్= మళ్ళీ; దానవ ప్రవరు మాయ= రాక్షసశ్రేష్ఠుడైన ఘటోత్కచుడి మాయ; సమంచిత దివ్య బాణ శక్తిన్= (అందరిచేత) పూజించబడే దివ్యాస్త్రశక్తిని; కుదియన్+చేసి= అణచివేసి; తొంటి తన తీవ్రతన్= మొదట్లో ఉన్న తన వేగాన్ని; కైకొని= గ్రహించి; నీదు సైన్యముల్= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; నీ సైన్యాలు; బెగడు+పడన్= భయపడే విధంగా; మదించి= గర్వించి; అతిభీమసముద్ధతిన్= మిక్కిలి భయంకరమైన విజృంభణంతో; ఇంకన్= మరి; ఏ+మెయిన్= ఏ విధంగా కూడ; తెగఁడు+అను= (ఘటోత్కచుడు) మరణించడు అనే; భీతి= భయం; యోధుల మదిన్= యుద్ధం చేసే సైనికవీరుల మనస్సులో; జనియింపఁగన్= పుట్టే విధంగా; ఆక్రమించఁగన్= ఆవరిస్తూ ఉండగా.

తాత్పర్యం: మళ్ళీ ఆ ఘటోత్కచుడి మాయ, కర్ణుడి దివ్యాస్త్రశక్తిని అణచివేసి ఇదివరకటి తీవ్రతను పొంది నీ సైన్యాలు భయపడేవిధంగా 'ఇక ఈ ఘటోత్కచుడు ఏ విధంగా కూడా మరణించటం జరగని పని' అని మనస్సులో అనిపించేవిధంగా అంతటా ఆవరిస్తూ ఉండగా.

వ. వార లందఱు సూతనందనుం జూచి యాతండు గలంగమికి నచ్చెరువందుచు నగ్గించి యతని నుద్దేశించి, 'యన్నిశాచరుం డిందఱ సమయింపకుండం గాచికొనుము; నీవును బ్రదుకు; మాఖండలుండు గవచకుండలంబులు గొనునప్పుడు నీకు నొసంగిన మహాశక్తి యింక నెన్నఁటికి? భీమార్జునులు ని న్నేమి సేసెద? రిప్పుడు బ్రదికిన మఱి చూచికొంద; మప్పరమ సాధనంబు వీనిమీఁదం బ్రయోగింపు' మనునెడ నారక్కసుం డామేటి మగని గీటడంచువాఁడై యాటోపంబునం గదిసి తదీయ రథ్యంబులఁ బటు గదా పాతంబునం బొలియించె; న ట్లవ్వీరుండు విరథుం డగుటయుం దఱిమి యద్దనుజుండు గదాంతర పాతాభితాడితుం జేసిన నోసరిలి యతం డాసైనికుల యాలాపంబుల నాలించి తనకుఁ జావు దప్పించుకొన నది దప్ప నొండుపాయంబు లేమిం జేసి. 228

ప్రతిపదార్థం: వారలు+అందఱు= ఆ సైన్యంలోని వీరులందరు; సూతనందనున్+చూచి= కర్ణుడిని చూచి; ఆతండు= ఆ కర్ణుడు; కలంగమికిన్= కలత చెందకపోవటానికి; అచ్చెరువు= ఆశ్చర్యం; అందుచున్= పొందుతూ; అగ్గించి= పొగడి; అతనిన్= ఆ కర్ణుడిని; ఉద్దేశించి= గురించి (ఇట్లా అన్నారు - ఓ కర్ణా!); ఈ+నిశాచరుండు= ఈ ఘటోత్కచుడనే రాక్షసుడు; ఇందఱన్= ఇంతమందిని; సమయింపక+ఉండన్= చంపకుండా ఉండే విధంగా; కాచికొనుము= రక్షించుకొమ్ము; నీవును= ఓ కర్ణా!

- నీవు కూడా; బ్రదుకుము= జీవించుము (రాబోయే మృత్యువు నుండి నిన్ను నీవు రక్షించుకొమ్ము) (దానికి ఉపాయం ఏముంది?); ఆఖండలుండు= ఇంద్రుడు (బ్రాహ్మణరూపంలో యాచకుడై వచ్చి నిన్ను యాచించి); కవచ కుండలంబులు= పుట్టుకతో వచ్చిన నీ కవచాన్ని చెవుల కుండలాలను; కొను అప్పుడు= నీ నుండి తీసికొన్నప్పుడు; నీకున్= నీకు (ఆ కవచకుండలాలకు బదులుగా); ఒసంగిన మహాశక్తి= ఇచ్చినట్టి గొప్ప శక్తి అనే ఆయుధం; ఇంకన్= మరి; ఎన్నఁటికిన్?= ఎప్పటికి?; (ఆ శక్తిని మరేదో తగిన సమయానికని దాచిపెట్టావు కాని ఇక సమయ నిరీక్షణం తగదు - ఇంతకంటె తగిన సమయం మరేది? (ఎందుకంటే?); భీమ+అర్జునులు= భీముడు, అర్జునుడు ఈ ఇద్దరు; నిన్నున్+ఏమి+చేసెదరు?= నిన్నేం చేయగలరు?; ఇప్పుడు= ఈ భయంకరమైన ఆపద ముంచుక వచ్చే సమయంలో; బ్రదికినన్= చావు తప్పించుకొని జీవించి ఉన్నట్లయితే; మరి= తరువాత; చూచికొందము= (ఆ భీమార్జునుల విషయం) చూద్దాము (కావున); ఆ+పరమసాధనంబు= ఆ శ్రేష్ఠమైన ఆయుధాన్ని; వీనిమీఁదన్= ఈ ఘటోత్కచుడిపై; ప్రయోగింపుము= ప్రయోగించి వేయుము; అను+ఎడన్= అని అంటూ ఉండే సమయంలో; ఆ రక్కసుండు= ఆ రాక్షసుడు (ఘటోత్కచుడు); ఆ మేటిమగనిన్= ఆ శ్రేష్ఠవీరుడైన కర్ణుడిని; గీటడంచువాఁడై= సంహరించేవాడై; ఆటోపంబునన్= ఆడంబరంతో; కదిసి= సమీపించి; తదీయ రథ్యంబులన్= ఆ కర్ణుడి రథాశ్వాలను; పటుగదాపాతంబునన్= దృఢమైన గదను పడవేయటంచేత; పొలియించెన్= సంహరించాడు; అట్లు= ఆ విధంగా; ఆ+వీరుండు= ఆ పరాక్రమశాలి అయిన కర్ణుడు; విరథుండు= రథంలేనివాడు; అగుటయున్= అయిన వెంటనే; తటిమి= వేగిరపడి అనగా వేగంగా; గదాంతర పాత+అభితాడితున్= మరియొక గద ప్రయోగించటం చేత కొట్టబడిన వాడినిగా; చేసినన్= చేయగా; ఓసరిలి= పక్కకు తొలగిపోయి; అతండు= ఆ కర్ణుడు; ఆ సైనికుల+ఆలాపంబులన్= ఆ సైనికవీరుల సంభాషణలను; ఆలించి= విని; తనకున్= తనకు; చావున్= మరణాన్ని; తప్పించుకొనన్= తప్పించుకొనటానికి; అది= ఆ ఇంద్రుడిచ్చిన శక్తిని ప్రయోగించటం; తప్పన్= తప్పితే; ఒండు+ఉపాయంబు= వేరేమార్గం; లేమిన్+చేసి= లేకపోవటం వలన.

తాత్పర్యం: సైనికవీరులందరు కర్ణుడు ఏ మాత్రం కలత చెందకుండా ఉండటం చూచి ఆశ్చర్యపడుతూ అతడిని పొగిడి, 'ఈ రాక్షసుడు అందరిని సంహరించకుండా కాపాడుము. నిన్ను నీవు కాపాడుకొనుము. ఇంద్రుడు కవచకుండలాలు నీ నుండి తీసికొనేటప్పుడు నీ కిచ్చిన మహాశక్తి వినియోగం ఇంకెప్పటికి? భీమార్జునులు నిన్నేమిచేయగలరు? ఇప్పుడు మనం బ్రతికితే, తరువాతి సంగతి ఆలోచించుకొందాము. ఆ మహాయుధాన్ని వీడిమీద ప్రయోగింపుము' అని అంటూ ఉన్న సమయంలో ఆ రాక్షసుడు మేటివీరుడైన కర్ణుని సంహరించాలని, గర్వాతిశయంతో సమీపించి, అతడి రథాశ్వాలను, బలమైన గదనువేసి చంపాడు. ఆ విధంగా విరథుడైన కర్ణుడిని తరిమి వెంటనే వేరొక గదతో కొట్టగా, కర్ణుడు ప్రక్కకు తొలగి, ఆ సైనికుల మాటలు విని, తాను చావు తప్పించుకొనటానికి అంతకంటె వేరు మార్గంలేనందువల్ల.

కర్ణుఁ డింద్రదత్తం బైన శక్తిచేత ఘటోత్కచునిం జంపుట (సం. 7-154-5)

ఉ. వైరివినాశనక్రియకు వాసవుఁ డిచ్చిన డాఁచియున్న యా
ఘోరపుశక్తి నాలుకలు గ్రోయ మెఱుంగులు ప్రజ్వరిల్ల ఘుం
టారవ మభ్రవీథి నిగుడం దగఁ గేల నమర్చి పేర్చి య
వ్వైరికిఁ బూఁచినం దలఁకి వాఁడు మహోన్నతఘూర్ణితాకృతిన్. 229

ప్రతిపదార్థం: వైరి వినాశన క్రియకున్= శత్రువులను నశింపజేసే పనికి; వాసవుఁడు= ఇంద్రుడు; ఇచ్చిన= ఇచ్చినటువంటిదగు (మరియు); డాఁచిఉన్న= దాచి ఉంచినది (తనకు ప్రధాన శత్రువు అర్జునుడు కావున అతడిపై ప్రయోగించటానికి ఇంతవరకు ఎవరిపై ప్రయోగించకుండా రక్షించబడుతూ వచ్చిందని భావం); ఆ= అట్టి (ప్రయోగించిన వెంటనే వైఫల్యమనేది లేకుండా తప్పక శత్రుసంహారం చేసేదని తాత్పర్యం); ఘోరపుశక్తి= భయంకరమైన శక్తి ఆకారంలో ఉండే ఆయుధాన్ని - 'కేలనమర్చి' అనే మూడవపాదంలోని పదంతో అన్వయం; నాలుకలు= ఆ శక్తి నోళ్ళలోని నాలుకలు, క్రోయన్= చాస్తూ ఉండగా; మెఱుంగులు= తళతళకాంతులు; ప్రజ్వరిల్లన్= దీపించగా; (మరియు) ఘంటారావము= ఆ శక్తి నడుమునకు కట్టుకొన్న గంటల చప్పుడు; అభ్రవీథిన్= ఆకాశమార్గంలో; నిగుడన్= వ్యాపించగా; తగన్= తగినట్లుగా; కేలన్= చేతిలో; అమర్చి= ధరించి; పేర్చి= అతిశయించి; ఆ+వైరికిన్= ఆ ఘటోత్కచుడి పైకి; పూఁచినన్= పూనుకొనగా; తలఁకి= భయపడి; వాఁడు= ఆ ఘటోత్కచుడు; మహా+ఉన్నత ఘూర్ణిత+ఆకృతిన్= మిక్కిలి ఎత్తుగా పెరిగి ఉండి తిరుగుడు పడిన ఉన్న శరీరంతో.

తాత్పర్యం: శత్రువును నశింపచేయటానికి-ఇంద్రుడిచ్చినది, తాను దాచిఉంచినది అయిన ఆ మహాభయంకర శక్త్యాయుధం నాలుకలుకోస్తూ ఉండగా, కాంతులు ప్రజ్వరిల్లుతూ ఉండగా, ఘంటల మ్రోత ఆకాశం నిండగా చేతపట్టి, విజృంభించి, ఆ ఘటోత్కచుడి మీద ప్రయోగించటానికి పూనుకోగా, అతడు భయపడి మిక్కిలిగా తిరుగుడుపడుతున్న ఆకారంతో (తరువాతి పద్యంతో అన్వయము)

తే. **తెరలి పాఱఁగఁ దలఁచుచో దృష్టితోడఁ। గూడికొను ముష్టి మృత్యువు తోడఁబుట్టు**
వనఁగఁ జాలు నద్దివ్యసాధనము వైచె। గగన తలమున భూతసంఘములు మ్రోయ. **230**

ప్రతిపదార్థం: తెరలి= తొలగిపోయి; పాఱఁగన్= పారిపోవటానికి; తలఁచుచోన్= తలపెట్టుకొన్నట్లయితే; దృష్టితోడన్= చూపుతో; కూడికొను= కూడుకొని ఉన్నట్టి; ముష్టి= కుత్తుక నలిపే పిడికిలితో సమానమైనది (కావుననే); మృత్యువు తోడఁ బుట్టువు+అనఁగన్= మృత్యుదేవతకు సోదరి అనటానికి; చాలు+ఆ+దివ్యసాధనమున్= తగియున్నటువంటి ఆ (ఇంద్రుడిచ్చిన శక్తి అనే) దివ్యమైన ఆయుధాన్ని; గగనతలమునన్= ఆకాశభాగాన; భూతసంఘములు= విద్యాధరాది దేవయోని విశేషముల సమూహాలు; మ్రోయన్= హర్షధ్వానాలు చేస్తూ ఉండగా; వైచెన్= ప్రయోగించాడు (లేదా ఆకాశమందలి ప్రాణివర్గం ఆర్తనాదాలు చేయగా ప్రయోగించాడు అని కూడా అర్థం చెప్పవచ్చును కాని సంస్కృతమూలంలో శ్లో॥ సురాస్త్రత విసిస్మియుః' (సం. ద్రోణ. 175/99) అని ఉండుటను బట్టి దేవతలు యుద్ధ ప్రేక్షకులై వచ్చారనటం స్పష్టమగుటచేత 'భూత' శబ్దానికి దేవయోని విశేషమనే అర్థమే సరి అయినది.)

తాత్పర్యం: తప్పించుకొని పారిపోవాలని అనుకోగా చూపు ఉన్న నిండైన మృత్యువుయొక్క తోబుట్టువు అని అనదగిన ఆ దివ్యాయుధాన్ని, ఆకాశంలో దేవతాసమూహాలు హర్షధ్వానాలు చేస్తూ ఉండగా ప్రయోగించాడు.

విశేషం: 'శక్తి'ని 'దృష్టితోడఁ గూడికొను ముష్టి' అనే అభేదారోపం చేసి చెప్పటంచేత రూపకాలంకారం. 'మృత్యువు తోడఁ బుట్టు వనఁగఁజాలు' అని చెప్పటం మృత్యువు వంటిది అని చెప్పటం కొరకే - సోదరి శబ్దం సదృశార్థముననే పరిణమిస్తుంది. కాబట్టి ఇది 'ఆర్థీ - ఉపమాలంకారం - ఈ రెండు అలంకారములచేత 'ఇక ఈ ఆయుధానికి తిరుగు లేదు. ఘటోత్కచుడి వధ తప్పదు' అనే వస్తువు ధ్వనిస్తూ ఉన్నది. దీనిని అలంకారకృత వస్తుధ్వని అంటారు.

వ. **ఇ ఱ్విధంబున రాధేయుండు మహోగ్రంబుగా వైచిన.** **231**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; రాధేయుండు= కర్ణుడు; మహా+ఉగ్రంబుగాన్= మిక్కిలి భయంకరంగా; వైచినన్= (ఘటోత్కచుడిపై) వేయగా.

తాత్పర్యం: ఈ విధంగా కర్ణుడు మహాభయంకరంగా ప్రయోగించగా (తరువాతి పద్యంతో అన్వయం).

క. మును మాయ మ్రింగి దనుజేం । ద్రుని యురము పగిల్చి కొనుచు దుర్ధరగతి వీఁ
పున వెడలి శక్తి యెగసెను । వినువీథికి నుడుగణంబు వెలుకం బాఱన్. 232

ప్రతిపదార్థం: శక్తి= ఆ ఇంద్రదత్తశక్తి; మును= మొదట; మాయన్= రాక్షసమాయను; మ్రింగి= మ్రింగివేసి అనగా నశింపజేసి; దనుజ+ఇంద్రుని+ఉరము= ఆ రాక్షసశ్రేష్ఠుడైన ఘటోత్కచుడి వక్షాన్ని; పగిల్చి కొనుచున్= చీల్చుకుంటూ; దుర్ధరగతిన్= భరింపరాని పోకడతో; వీఁపునన్= వీపునుండి; వెడలి= వెలుపలికి వచ్చి; ఉడుగణంబు= నక్షత్రపుంజం; వెలుకన్+పాఱన్= వెలవెలపోయే విధంగా (అంత అధికమైన కాంతిలో అని భావం); వినువీథికిన్= ఆకాశానికి; ఎగసెను= ఎగసిపోయింది.

తాత్పర్యం: ఆ శక్తి ముందుగా ఘటోత్కచుడి మాయను మ్రింగి, అతడి వక్షస్స్థలాన్ని భేదించి, వెన్నుభాగంనుండి వెలువడి, నక్షత్రాలు వెలవెలపోయేటట్లు ఆకాశంలోకి ఎగసిపోయింది.

వ. అప్పుడు. 233

తాత్పర్యం: ఆ సమయంలో.

క. సోలుచు బోరగిలంబడి । నాలుక వెడలంగఁ బెట్టి నడుము గఱచుచున్
లాలలు గ్రమ్మఁగ రక్షః । పాలుఁడు వికృతాస్యుఁ డగుచుఁ బ్రాణము విడిచెన్. 234

ప్రతిపదార్థం: రక్షఃపాలుఁడు= ఆ ఘటోత్కచుడు; సోలుచున్= సొమ్మసిల్లుతూ; బోరగిలన్+పడి= వెనుకభాగం మీదికి ఉండే విధంగా పడిపోయి (బోర్లపడి); నాలుక; వెడలంగన్= నోటి లోపలిభాగం నుండి వెడలి వచ్చి ఉన్న విధంగా (నోరు చాచుకొని); పెట్టి= పెట్టుకొని; లాలలు= చొల్లులు; నడుము= (ఆ ఘటోత్కచుడి) నడుమును; కఱచుచున్= అంటుకొంటూ; క్రమ్మంగన్= వ్యాపించగా; వికృత+ఆస్యుఁడు+అగుచున్= వికారంతో కూడిన ముఖం కలవాడై ఉంటూ; ప్రాణము= ప్రాణాన్ని; విడిచెన్= విడిచాడు.

తాత్పర్యం: ఆ ఘటోత్కచుడు తెలివితప్పి, సోలుతూ భూమిపై బోర్లపడి, నోటినుండి నాలుక బయటికి సాగి, నడుము అంటుకొనేటట్లు చొల్లుకారుస్తూ, ఉండగా వికృతమైన ముఖంతో మరణించాడు.

వ. ఇట్లు ఘటోత్కచుండు పడిన మన సైన్యంబున శంఖభేరీ స్వన సహితంబులగు సింహనాదంబులు సెలంగెఁ; నీ పుత్రుండు బంధుమిత్ర సమేతంబుగాఁ బ్రమోదంబు నొంది సూతనందనుం గౌఁగిలించి తనయరదం బెక్కించికొని యుల్లసిల్లెఁ; ననిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 235

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఘటోత్కచుండు; పడినన్= పడిపోగా (మరణించగా); మనసైన్యంబునన్= ఓ ధృతరాష్ట్ర మహారాజా! మన సేనలో; శంఖభేరీ స్వన సహితంబులు+అగు= శంఖాల ధ్వనులతో భేరీల ధ్వనులతో కూడి ఉన్న; సింహనాదంబులు= వీరుల సింహనాదాలు; చెలంగెన్= వ్యాపించినవి; నీ పుత్రుండు= నీ కుమారుడు దుర్యోధనుడు; బంధుమిత్ర సమేతంబుగాన్= బంధుమిత్రుల సహితంగా; ప్రమోదంబున్= సంతోషాన్ని; ఒంది= పొంది; సూతనందనున్= కర్ణుడిని;

కౌఁగిలించి= ఆలింగనం చేసికొని; అరదంబు= తన రథాన్ని; ఎక్కించికొని; ఉల్లసిల్లెన్= ఉల్లాసాన్ని పొందాడు; అనినన్= అనగా; విని= వినినవాడై; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్= సంజయుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ విధంగా ఘటోత్కచుడు మరణించగా మనసైన్యంలో శంఖభేరీ ధ్వనులు, సింహనాదాలు చెలరేగాయి. నీ కుమారుడు దుర్యోధనుడు బంధుమిత్రులతో కలిసి ఎంతో ఆనందించి కర్ణుని కౌగిలించుకొని తన రథంపై అతడిని ఎక్కించుకొని ఉల్లాసాన్ని పొందాడు అని చెప్పగా, ధృతరాష్ట్రుడు. వెంటనే సంజయుడితో మళ్ళీ ఇట్లా అన్నాడు:

క. **బలు మాయా బల బాహా । బలములు గలవాఁడు భీముపట్టి వడిన న**
గ్గలమగు శోకముఁ గోపము ।నలఁచుం బాండవుల నెట్టు లైరొకో వారల్? 236

ప్రతిపదార్థం: బలు మాయాబల బాహాబలములు కలవాఁడు= గొప్ప రాక్షస మాయాబలం మరియు బాహుబలం కలిగి ఉన్న వాడైన; భీముపట్టి= భీముడి కుమారుడు ఘటోత్కచుడు; పడినన్= పడిపోగా అనగా మరణించగా; అగ్గలము+అగు= అధికమైన; శోకమున్= దుఃఖం; కోపమున్= మరియు కోపం; పాండవులన్= పాండుపుత్రులైన ధర్మరాజాదులను; అలఁచున్= బాధిస్తూ ఉండవచ్చును; (కావున) వారల్= ఆ పాండవులు; ఎట్టులు= ఏ విధంగా; ఐరి+ఒకొ?= అయినారో? (ఒకొ - ప్రశ్నార్థకం)

తాత్పర్యం: ఓ సంజయా! గొప్ప మాయాబల, బాహుబలాలు గల ఘటోత్కచుడు మరణించగానే పాండవులకు మిక్కుటమైన దుఃఖంతో పాటు కోపం కూడా కలిగి ఉండాలి - మరి వా రే విధంగా ఏ స్థితి కలిగి ఉన్నారో? వివరంగా చెప్పుము.

వ. **అని యడిగిన నమ్మహీపతికి నతం డిట్లను నట్లు మృతుం డైన హిడింబాసుతుం జూచి కౌంతేయు లత్యంత దీనమానసులై కన్నీరు గడలుకొన నడలునఁ గుందిరి; గోవిందుండు ప్రమోదంబు నొంది సింహనాదంబు సేసి శంఖంబు పూరించి పగ్గంబులు నొగల ముడిచి మందమారుతాందోళితంబగు మందారంబు చందంబు దోఁప నర్తించుచు నరదంబు నడిమి కరిగి కిరీటిం గౌఁగిలించికొని వీఁ పప్పళించి వెండియు నార్చిన నాతం డ య్యుపేంద్రు నుపలక్షించి. 237**

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; అడిగినన్= అడగగానే; ఆ+మహాపతికిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజుతో; అతండు= ఆ సంజయుడు; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; అట్లు= ఆ విధంగా- అనగా కర్ణుడు ప్రయోగించిన ఆ ఇంద్రదత్త శక్తితో; మృతుండు+ఐన= మరణించిన; హిడింబాసుతున్= హిడింబ అనే రాక్షస స్త్రీయందు భీముడి వలన కలిగిన ఘటోత్కచుడిని; చూచి= చూచి (తమ కన్నుల యెదుటనే జరిగిన ఆ భయంకర దృశ్యాన్ని చూచి); కౌంతేయులు= ధర్మరాజాదులు, అత్యంత దీనమానసులు+ఐ= మిక్కిలి దైన్యంతో నిండిన మనస్సు గలవారై; కన్నీరు= కంటి నుండి వచ్చే నీరు; కడలుకొనన్= అతిశయించగా; అడలునన్= దుఃఖంతో; కుందిరి= క్రుంగిపోయారు; గోవిందుండు= కృష్ణుడు; ప్రమోదంబున్= సంతోషాన్ని; ఒంది= పొంది; సింహనాదంబు= సింహనాదాన్ని; చేసి; శంఖంబు= తన పాంచజన్యమనే శంఖాన్ని; పూరించి= ఊది (శంఖనాదం చేసి); పగ్గంబులున్= తాను సారథ్యం చేస్తున్న అర్జునుడి రథానికున్న గుర్రాల పగ్గాలను; నొగలన్= నొగలయందు; ముడిచి= కట్టివేసి (అశ్వాలు రథాన్ని గుంజుకొనిపోకుండా తాను బిగించి పట్టుకొనిన ఆ పగ్గాలను నొగలకు బంధించి); మందమారుత+

ఆందోళితంబు+అగు= పిల్లగాలిచేత కదిలించబడిన; మందారంబు చందంబు= మందారమనే వృక్షవిశేషం తీరు (విధం); తోఁపన్= తోచేవిధంగా; నర్తించుచున్= నృత్యం చేస్తూ (కృష్ణుడు నృత్యం చేస్తూ ఉంటే నందనవనంలోని మందార వృక్షం మందమారుతానికి మెల్లగా ఊగినప్పుడెట్లా ఉంటుందో అట్లా చూపరులకు కనిపించిందని భావం); అరదంబు నడిమికిన్= రథం మధ్యభాగానికి; అరిగి= వెళ్ళి (అర్జునుడిని సమీపించి); కిరీటిన్= అర్జునుడిని (నివాత కవచ కాలకేయాది భయంకర రాక్షసవర్గాన్ని జయించి తనకు సహాయం చేయటానికి వెళ్ళుతున్న సమయంలో ఇంద్రుడిచ్చిన కిరీటం చాలా ప్రశస్తమైనది. ఆ కిరీటం కలిగి ఉండటంచేత అర్జునుడికి కిరీటి అనే పేరు రూఢమైంది. ఈ కథ వనపర్వంలో వస్తుంది - 168వ అధ్యాయం శ్లో. 74 సంస్కృతమూలం); కౌఁగిలించికొని= ఆలింగనం చేసికొని; వీఁపు= వీపును; అప్పళించి= చరచి; వెండియున్= మళ్ళీ; ఆర్చినన్= సింహనాదం చేయగా; అతండు= ఆ అర్జునుడు; ఆ+ఉపేంద్రున్= ఆ కృష్ణుడిని; ఉపలక్షించి= చూచి.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అడుగగానే సంజయు డతడితో ఇట్లా అన్నాడు: 'ఓ రాజా! ఆ విధంగా కర్ణుడిచేత హతుడైన ఘటోత్కచునిచూచి, పాండవులు మిక్కిలి దైన్యంతో కన్నీరు మున్నీరుగా దుఃఖించారు. కాని, కృష్ణుడు సంతోషంతో సింహనాదం చేసి, పాంచజన్యాన్ని పూరించి తన చేతిలోని పగ్గాలను రథం నొగలుకు కట్టివేసి మందమారుతానికి అల్లిన ఊగే మందారవృక్షంవలె నృత్యంచేస్తూ రథం నడిమి భాగంలో ఉన్న అర్జునుడిని చేరి, ఆలింగనం చేసికొన్నాడు. వెన్ను చరిచాడు. మళ్ళీ సింహనాదం చేశాడు. అప్పుడు అర్జునుడు కృష్ణుడిని చూచి.

ఉ. **'చచ్చె ఘటోత్కచుండు మన సైన్యము లెల్లఁ గలంగి నల్గడన్**
విచ్చుటఁ జూచి మేము వగ నెక్కొన వందెద మిప్పు డెమ్మెయిన్
వచ్చెఁ బ్రమోద? మెట్లు గరువంపుఁ జరిత్రము దక్కి లాఘవం
బచ్చుపడం జెలంగెదు? మహాపురుషా! యిది యేమి సెప్పవే.' **238**

ప్రతిపదార్థం: ఓ మహాపురుషా!= ఓ పురుషోత్తమా! కృష్ణా!; ఘటోత్కచుండు= ఘటోత్కచుడు; చచ్చెన్= చనిపోయాడు; (దానికి) మన సైన్యములు+ఎల్లన్= మన సైన్యాలన్నీ; కలంగి= కలత చెంది; నల్గడన్= నాలుగువైపులకు; విచ్చుటన్= విచ్చిపోవటాన్ని (చెల్లాచెదరై పారిపోవటాన్ని); చూచి; మేము= మేము; వగ= చింత; అతిశయించగా; వందెదము= క్రుంగిపోతున్నాము; ఇప్పుడు= ఈ సమయంలో; ఏ+మెయిన్= ఏ విధంగా; ప్రమోదము= (నీకు) సంతోషం; వచ్చెన్?= వచ్చింది?; గరువము+చరిత్రము= గౌరవంతో కూడిన నడవడిని; తక్కి= విడిచి; లాఘవంబు= చులకనభావం; అచ్చుపడంగన్= స్పష్టమయ్యే విధంగా ఎందుకని; చెలంగెదు= ప్రవర్తిస్తూ ఉన్నావు; ఇది+ఏమి= ఇదేమిటి? - ఈ నీ ప్రవర్తనకు కారణ మేమి? అని భావం; చెప్పవే!= చెప్పుమా!

తాత్పర్యం: కృష్ణా! మన ఘటోత్కచుడు మరణించాడు. దానికి కలతచెంది మన సైన్యాలన్నీ నాలుగుదిక్కులకు చెల్లాచెదరైపోవటాన్ని చూచి, దిక్కుతోచక మేమందరం దుఃఖంలో కూరుకొనిపోతూ ఉంటే, నీవు సంతోషంతో గంతులు వేస్తున్నావు. ఇంత సంతోషం నీకు ఏ విధంగా కలిగింది? గౌరవాస్పదమైన ప్రవర్తన వదలి తక్కువతనం వ్యక్తమయ్యేవిధంగా ప్రవర్తిస్తున్నావు. మహాపురుషా! ఇదేమిటి?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కృష్ణుండు ఘటోత్కచుండు వడఁ దాను సంతసించుటకు నిమిత్తం బర్జునునితోఁ జెప్పుట (సం.7-155-11)

వ. అనుటయు నయ్యచ్యుతుం డతని కిట్లను 'నింద్రుండు గుండలంబులు కొనుచుండి కర్ణుని కిచ్చిన శక్తి యతనికడ నున్నంత కాలంబును నిన్ను బ్రతికించుట దుష్కరం బని తలంచుచుండుదు; నేఁడు హిడింబానందనుమీఁద నది వోయినం బ్రమోదంబు నొందితి; నా సూతనందనుం డది సేత నుండెనేనిఁ జక్ర గాండీవ ధరులమై మన మిరువురముం గవిసితి మేనియు జయించు; నతండు దేవ సన్నిభుండు; దివిజపతి వేఁడినఁ గవచకుండలంబులు వికృత్తంబులు సేసి యిచ్చుట వైకర్తనుండనం బరఁగె; నీకై మీతండ్రి యిట్లు సేయఁడయ్యెనేని వాని కెదు రెవ్వరు? కవచకుండల విహీనుండై మానవ సామాన్యంబు నొందుటను శక్రదత్త సాధనంబు లేమిం జేసియు నింక నీకు గెలువవచ్చు; నిట్ల యేకలవ్య శిశుపాల జరాసంధాదుల నీక కా నొక్కొక్క తెఱంగునం బిలుకు మార్చితి; నిత్తఱి వార లున్నఁ గౌరవపతి వారలం దెచ్చుకొను; నమ్మువ్వురుఁ గూడిన నెవ్వరికి నోర్వరాకుండు; ఘటోత్కచుండును గిమ్మీర బక హిడింబులతోడి వాఁడ; ధర్మద్వేషంబును రోషంబును గలిమిం జేసి యొక్కప్పు డొప్పమి వచ్చుం గావున నద్దానవుల యట్ల వీని పొలిసి పోకయు నా కభిమతంబు; వీఁడు రావణునట్టి వాఁ డగుట నిపుడు సావకుండెనేనిఁ బదంపడి నాకుం జంప వలయు; నిది సంతోషకాలంబు గాని శోక సమయంబు గాదు; మన మొనలు గలంగెఁ గురుబలంబు పై కొనియెడు నీవుఁ దెలిసి యుత్సాహంబు వాటింపు, మనియెనని చెప్పిన విని ధృతరాష్ట్రుండు సంజయు దిక్కు మొగంబై. 239

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; అర్జును డట్లా ప్రశ్నించగానే అని భావం; ఆ+అచ్యుతుండు= ఆ శ్రీకృష్ణుడు; అతనికిన్= ఆ అర్జునుడితో; ఇట్లు= ఇట్లా; అనున్= అన్నాడు; ఇంద్రుండు= ఇంద్రుడు; కుండలంబులు= (కర్ణుడి సహజ కవచ) కుండలాలను (కుండల పదం కవచానికి ఉపలక్షకం); కొనుచున్+ఉండి= (కపట బ్రాహ్మణుడై వచ్చి యాచించి) గ్రహిస్తూ ఉన్నవాడై (కర్ణుడి కోరిక ప్రకారం వాటికి బదులుగా); కర్ణునికిన్= కర్ణుడికి; ఇచ్చిన శక్తి= ఇచ్చిన 'శక్తి' అనే ఆయుధం; అతనికడన్= ఆ కర్ణుడి దగ్గర; ఉన్నంతకాలంబును= ఉన్నంతకాలమూ; నిన్నున్= ఓ అర్జునా! నిన్ను; బ్రదికించుట= (ఆ కర్ణుడి బారినుండి రక్షించుకొని) జీవితునిగా చేసికొనటం; దుష్కరంబు+అని= సాధ్యం కాదని; తలంచుచుండుదున్= (నేను) అనుకొంటూ ఉంటాను; నేఁడు= ఈ రోజు; హిడింబానందను మీఁదన్= హిడింబ అనే రాక్షసజాతి స్త్రీకి కుమారుడైన ఘటోత్కచుడి మీదకు; అది= ఆ శక్తి అనే ఆయుధం; పోయినన్= (కర్ణుడి నుండి) విడిపోగానే; ప్రమోదంబున్= సంతోషాన్ని; ఒందితిన్= పొందాను; ఆ సూతనందనుండు= ఆ కర్ణుడు; అది= ఆ శక్తి అనే ఆయుధం; చేతన్+ఉండెనేనిన్= (తన) చేతిలో ఉన్నట్లయితే; చక్రగాండీవధరులము+ఐ= సుదర్శన చక్రాన్ని, గాండీవ ధనువును ధరించినవారమై; మనము+ఇరువురమున్= మన మిద్దరం కూడా; కవిసితిమి+ఏనియున్= ఎదుర్కొన్నప్పటికీ; జయించున్= (ఏకకాలంలో) జయిస్తాడు (ఎందుకంటే); అతండు= ఆ కర్ణుడు; దేవసన్నిభుండు= ఇంద్రాది దేవతలతో సమానమైనవాడు; దివిజపతి= దేవేంద్రుడు; వేఁడినన్= యాచించగా; కవచ కుండలంబులు= (తనకు పుట్టుకతో వచ్చిన) కవచాన్ని, కుండలాలను; వికృత్తంబులు+చేసి= (శరీరంలో పాతుకుపోయిన వాటిని) కత్తితో కత్తిరించి వేసి; ఇచ్చుటన్= ఇవ్వటం వలన; వైకర్తనుండు+అనన్= వైకర్తనుడు అని అనే విధంగా (లోకులు వైకర్తనుడు అనే పేరుతో పిలిచే విధంగా); పరఁగెన్= ప్రసిద్ధి చెందాడు; నీకై= ఓ అర్జునా! నీ కొరకు; మీ తండ్రి= మీ జనకుడైన ఇంద్రుడు (అర్జునుడు కుంతికి ఇంద్ర వరప్రసాద జనితుడు కావున తండ్రి పదంచేత ఇంద్రుడికి అర్జునుడియెడ గల బాంధవ్యం సూచించబడింది); ఇట్లు= ఈ విధంగా చేయఁడు+అయ్యెను+ఏని= చేయకుండా ఉన్నట్లయితే; వానికిన్= ఆ కర్ణుడికి; ఎదురు= ఎదురుగా నిలిచి యుద్ధం చేసేవాడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎవ్వరు?= ఎవ్వడు? (అనగా ఎవ్వడైనా ఉన్నాడా? అని కాకుస్వరం - ఎవ్వడూ లేడని భావం); కవచకుండల విహీనుండు+ఐ= కవచ కుండలాలతో విరహితుడై, అనగా కవచం కుండలాలు లేనివాడై; మానవ సామాన్యంబు= మానవమాత్ర భావాన్ని; ఒందుటను= పొందటం వలన (దివ్యత్వాన్ని సూచించే సహజ కవచకుండలాలు పోవటం వలన, సాధారణ మానవుడై ఉన్నందువలన); శక్రదత్త సాధనంబు= ఇంద్రుడిచే ఇవ్వబడిన శక్తి అనే ఆయుధం; లేమిన్+చేసియున్= లేకపోవటం వలన కూడ; ఇంకన్= ఇక; నీకున్= ఓ అర్జునా! నీకు; గెలువవచ్చున్= జయించటానికి సాధ్యమవుతాడు; ఇట్లు+అ= ఈ విధంగానే; ఏకలవ్య, శిశుపాల, జరాసంధ+ఆదులన్= ఏకలవ్యుడు, శిశుపాలుడు, జరాసంధుడు మొదలైన వారలను; నీకున్+అ= నీకై; కాన్= అగు విధంగా (నీ కొరకే అని భావం); ఒక్క+ఒక్క+తెఱంగునన్= ఒక్కొక్క విధంగా - ఒక్కొక్కరిని ఒక్కొక్క విధంగా (ఇట్లా విభిన్న రీతులలో) అని భావం; పిలుకుమార్చితిన్= సంహరించివేశాను; ఈ+తఱిన్= ఈ సమయంలో; వారలు= ఆ ఏకలవ్యాదులు; ఉన్నన్= జీవించి ఉన్నట్లయితే; కౌరవపతి= దుర్యోధనుడు; వారలన్= ఆ ఏకలవ్య శిశుపాల జరాసంధాదులను; తెచ్చుకొనున్= సహాయంగా తెచ్చుకొంటాడు; ఆ+ముప్వురున్= ఆ ఏకలవ్యుడు, శిశుపాలుడు, జరాసంధుడు అనే ముగ్గురు కూడ; కూడినన్= కలసి ఏకమై ఉన్నప్పుడు; ఎవ్వరికిన్= ఏ వీరుడికి కూడ; ఓర్వరాక+ఉండున్= ఓడించరాకుండా ఉంటుంది (ఆ ముగ్గురేకమైనచో వారిని జయించటం ఎవ్వరికి కూడా సాధ్యం కాదు) (మరియు); ఘటోత్కచుండును= భీమనందనుండైన ఘటోత్కచుడు కూడ; కిమ్మీర బక హిడింబుల తోడివాఁడు+అ= కిమ్మీరుడు, బకుడు, హిడింబుడు అనే రాక్షసులకు సరివచ్చువాడే; ధర్మద్వేషంబును= వేదోక్తమయిన ధర్మకార్యాలయందు వైరం; రోషంబును= క్రోధం కూడా (ఘటోత్కచుడు రాక్షస జాతీయుడవటంచేత విష్ణువునందు రాక్షసజాతి వధ జన్యమగు క్రోధముండటం సహజమని భావం); కలిమిన్+చేసి= ఉండటం వలన; ఒక్కప్పుడు= ఏదో ఒక సందర్భంలో; ఒప్పమి= తగి ఉండకపోవటం; వచ్చున్= సంభవిస్తుంది; కావునన్= కాబట్టి; ఆ+దానవుల+అట్లు+అ= ఆ కిమ్మీరాది రాక్షసులవలెనే; వీని పొలిసి పోకయున్= ఈ ఘటోత్కచుడి మరణం కూడ; నాకున్= ఓ అర్జునా! నాకు (కృష్ణుడికి); అభిమతంబు= ఇష్టం; వీఁడు= ఈ ఘటోత్కచుడు; రావణు+అట్టివాఁడు+అగుటన్= రావణాసురుడితో సమానమైన వాడు కావటం చేత; ఇపుడు= ఇప్పుడు; చావకుండెనేనిన్= మరణించకుండా ఉన్నట్లయితే; పదంపడి= తరువాత; నాకున్= నాకు అనగా ధర్మవిరోధులను హతమార్చి ధర్మసంస్థాపన చేయవలసిన నాకు; చంపవలయున్= సంహరించవలసి ఉంటుంది (కాబట్టి); ఇది= ఈ ఘటోత్కచుడు మరణించిన సమయం; సంతోషకాలంబు+కాని= సంతోషానికి తగిన సమయమేకాని; శోకసమయంబుకాదు= దుఃఖానికి తగిన సమయం కాదు (కావున దుఃఖాన్ని మాని నీవు కర్తవ్యోన్ముఖుడవు కావాలి); మన మొనలు= మన సైన్యాలు; కలంగెన్= కలత చెందాయి; కురుబలంబు= కౌరవసైన్యం; పైకొనియెడున్= మీరిపోతూ ఉన్నది; నీవు= ఓ అర్జునా! నీవు; తెలిసి= యథార్థజ్ఞానం కలవాడవయి; దైన్యశోకాలకు దూరుడవై); ఉత్సాహంబు= యుద్ధోత్సాహాన్ని; పాటింపుము= అవలంబించుము; అనియెన్= అని అన్నాడు; అని= ఇట్లా; చెప్పినన్= చెప్పగా; విని= విన్నవాడయి; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు; సంజయు దిక్కుమొగంబు+ఐ= సంజయుడికి అభిముఖుడై.

తాత్పర్యం: అని అర్జునుడు అడుగగానే, కృష్ణుడిట్లా అన్నాడు: 'ఓ అర్జునా! ఇంద్రుడు కర్ణుడినుండి కవచ కుండలాలను తీసికొని వాటికి బదులుగా ఇచ్చిన ఆ శక్తి అనే ఆయుధం కర్ణుడి దగ్గర ఉన్నంతకాలం, నిన్ను బ్రతికించుకొనటం అసాధ్యం అని భావించేవాడిని. ఈ రోజు శక్తి ఘటోత్కచుడిపై ప్రయోగించటంతో కర్ణుడికి అది లేకుండా పోవటం నాకు చాలా సంతోషంగా ఉన్నది. ఒకవేళ ఆ శక్తి కర్ణుడి దగ్గరే ఉన్నట్లయితే నేను సుదర్శన చక్రాన్ని, నీవు గాండీవధనుస్సును ధరించి ఏకమై ఎదిరించినా ఆ కర్ణుడు మనయిద్దరిని కూడా జయిస్తాడు. కర్ణుడంటే సామాన్యుడా? దేవతలతో సమానమైనవాడు. ఇంద్రుడు బ్రాహ్మణుడై వచ్చి యాచించగా పుట్టుకతో వచ్చిన కవచకుండలాలను తన చర్మం నుండి కోసి ఇవ్వటం చేత, వైకర్తనుడనే పేరు వచ్చింది. మీ తండ్రి ఇంద్రుడు నీ కొరకు ఆ కర్ణుడినుండి సహజ కవచకుండలాలను వేరు చేయకపోయినట్లయితే ఆ కర్ణుడికి ఎదురుగా నిలువగల వారెవ్వరు? ఇక కవచకుండలాలు పోవటంతో సాధారణ మానవుడైనాడు. దివ్యమైన శక్తి అనే ఆయుధం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కూడా ఇప్పుడు లేదు కాబట్టి నీ కిక సులభంగా గెలువటానికి వీలవుతుంది. ఇట్లాగే ఓ అర్జునా! నీ కొరకే ఏకలవ్యుడు, శిశుపాలుడు, జరాసంధుడు మొదలైన వారిని ఒక్కొక్కడిని ఒక్కొక్క విధంగా హతమార్చాను. ఒకవేళ వారందరూ ఈ సమయంలో జీవించి ఉన్నట్లయితే దుర్యోధనుడు వారినందరిని సహాయంగా తెచ్చుకొనేవాడు. ఆ ఏకలవ్యాదులు ముగ్గురూ కూడి యుద్ధం చేస్తే వారిని ఎవ్వరూ ఎదిరించలేరు. ఈ ఘటోత్కచుడు కిమ్మీర బక హిడింబాసురుల వంటివాడే. ధర్మద్వేషం, క్రోధం కలిగిఉన్నవాడు. కాబట్టి ఎప్పుడో ఒకప్పుడు ఇతడి ప్రవర్తన నాకు సమ్మతం కాకపోవచ్చును. కాబట్టి ఆ కిమ్మీరాదులవలె ఈ ఘటోత్కచుడు కూడా మరణించటం నాకు ఇష్టమే. ఈ ఘటోత్కచుడు రావణాసురుడి వంటివాడు కావటంచేత, ఒకవేళ ఈ సమయంలో మరణించకుండా ఉంటే, తరువాత నేనే స్వయంగా సంహరించవలసి వస్తుంది. అందువల్ల నా కిది సంతోష సమయం కాని దుఃఖసమయం కాదు. మన సైన్యాలు కలతచెందాయి. కౌరవసైన్యం ఉత్సాహంతో అతిశయిస్తూ ఉన్నది. కావున నీవు యథార్థాన్ని తెలుసుకొని ఉత్సాహాన్ని పొందుము అని అర్జునుడికి సమాధానం చెప్పాడు. అని సంజయుడు చెప్పగానే ధృతరాష్ట్రుడు సంజయుడివైపు తిరిగి (ఇట్లా అన్నాడు).

చ. **'ఒకనిని జంపి యిట్లు సను నుజ్జ్వల శక్తి నెఱింగి కర్ణుఁ డే**
టికి నరుమీఁద దాని నిగిడింపక యిన్ని దినంబు లప్రయో
జకముగఁ జేసెఁ గయ్యము? భుజాబలశాలి నరుండు వడ్డఁ బో
రికి మఱి యుత్సహింపఁ గలరే పెఱవారలు; సూతనందనా! **240**

ప్రతిపదార్థం: సూతనందనా!= ఓ సంజయా!; ఒకనిని= ఒక వ్యక్తిని; ఇట్లు= ఈ విధంగా; చంపి= సంహరించి; చను= వెళ్ళునట్టి; ఉజ్జ్వలశక్తిన్= దేదీప్యమైన శక్తి అనే ఆయుధాన్ని; ఎఱింగి= తెలిసి; కర్ణుఁడు= కర్ణుడు; ఏటికిన్= ఏ కారణంచేత; నరుమీఁదన్= అర్జునుడిపై; దానిన్= ఆ శక్త్యాయుధాన్ని; నిగిడింపక= ప్రయోగించక; ఇన్ని దినంబులు= ఇన్ని రోజులు; కయ్యము= యుద్ధాన్ని; అప్రయోజకముగన్= ప్రయోజనరహితంగా; చేసెన్?= చేశాడు?; భుజాబలశాలి= బాహుబలశోభితుడైన; నరుండు= అర్జునుడు; పడ్డన్= పడిపోతే; పెఱవారలు= ఇతరులు అనగా శత్రుపక్షీయులు; మఱి= మళ్ళీ; పోరికిన్= యుద్ధానికి; ఉత్సహింపన్+కలరే?= ఉత్సాహం చూప జాలుతారా? (అర్జునుడే పడిపోతే ఇక శత్రువులు యుద్ధానికే పూనుకొనక ఉండేవారని భావం).

తాత్పర్యం: 'ఓ సంజయా! కర్ణు డిన్ని దినాలు నిష్ప్రయోజనంగా యుద్ధం చేశా డేమి? ఒక మహాయోధుడిని మాత్రమే సంహరించి ఇంద్రుడి వద్దకు వెళ్ళిపోతుంది - ఆ అమోఘమైన తన శక్త్యాయుధం అనే విషయం తనకు తెలుసుకదా! అటువంటప్పుడు ఆ ఆయుధాన్ని అర్జునుడిపై ప్రయోగించక ఆలస్యం చేయటానికి కారణ మేమి? ఈ శక్త్యాయుధంతో అర్జునుడినే సంహరించినట్లయితే ఇక పాండవులు యుద్ధానికి మళ్ళీ పూనుకొనేవారా? వారిలో యుద్ధోత్సాహమే లేకుండా పోయి మనకు జయం సులభంగా అబ్బేది కదా!

క. **పిలిచికొని యైనఁ బార్థుం । బొలియింపఁడ శక్తి; నతఁడు పోరికి నెవ్వా**
రలు రమ్మన్నను వ్రతమయి । తలకొని చనుఁ; గర్ణుఁ డేల తప్పం జేసెన్?' **241**

ప్రతిపదార్థం: పిలిచికొని+ఐనన్= (యుద్ధానికి) ఆహ్వానించి అయినా కూడా; పార్థున్= అర్జునుడిని; శక్తిన్= శక్త్యాయుధంతో; పొలియింపఁడు+అ?= సంహరింపలేడా? (సంహరింపవచ్చుగదా అని భావం) - (ఎందుకనగా?); అతఁడు= ఆ అర్జునుడు; పోరికిన్= యుద్ధానికి; ఏ+వారలు= ఎవరయినా; రమ్ము+అన్నను= రమ్మన్నప్పటికీ, యుద్ధానికి ఆహ్వానించినట్లయితే; వ్రతము+అయి= నిష్ఠతో; తలకొని= ప్రయత్నపూర్వకంగా; చనున్= వెళ్ళుతాడు; కర్ణుఁడు= కర్ణుడు; ఏల= ఎందుకు; తప్పన్ (ఈ అవకాశం) తప్పిపోయేటట్లు; చేసెన్= చేశాడు?

తాత్పర్యం: యుద్ధానికి ఎవరు ఆహ్వానించినా వెళ్ళటం వ్రతంగా తలచివెళ్ళేవాడు కదా అర్జునుడు. కాబట్టి అతడిని యుద్ధానికి ఆహ్వానించిఅయినా శక్తిచేత చంపకూడదా? కర్ణుడు ఎందుచేత ఇందుకు భిన్నంగా చేశాడు?

వ. అని వెండియు. **242**

ప్రతిపదార్థం: అని= ఇట్లా పలికి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని మరల (ఇట్లా అన్నాడు).

తే. 'నా తనూజులు దుర్బుద్ధు లీ తెఱంగు । నీవుఁ దలఁపవ; యాశక్తి నీరజాక్షుఁ
డొడిచికొనియెనె మొఱకుచే నున్న తియ్య । పండు వెస నాఁచికొనిన నేర్పరియుఁ బోలె' **243**

ప్రతిపదార్థం: నా తనూజులు= (ఓ సంజయా!) నా కుమారులు దుర్యోధనాదులు; దుర్బుద్ధులు= దుష్టమైన బుద్ధి గలవారలు; (దుష్టచింతనే తప్ప కార్యానుకూలమైన ఆలోచన లేనివారని భావం); ఈ తెఱంగు= ఈ విధం (కర్ణుడిద్వారా ఆ శక్త్యాయుధాన్ని అర్జునుడిపై ప్రయోగింపజేయటం అనే విషయాన్ని); నీవున్= ఓ సంజయా! నీవైనా; తలపవు+అ= జ్ఞాపకం చేయలేకపోయావా; ఆ శక్తి= ఆ శక్త్యాయుధాన్ని; నీరజాక్షుఁడు= కృష్ణుడు; మొఱకుచేన్+ఉన్న= మూర్ఖుడి చేతిలో ఉన్న; తియ్యపండు= మధురమైన ఫలాన్ని; వెసన్= తొందరగా; ఆఁచికొనిన= అపహరించుకొని పోయినట్టి; నేర్పరియున్+పోలెన్= తెలివిగల వాడివలె; ఒడిచికొనియెను+ఎ!= అపహరించుకొనిపోయాడు కదా!

తాత్పర్యం: 'ఓ సంజయా! నా కుమారులు దుర్యోధనాదులకు దుష్టచింతనే తప్ప దూరాలోచన లేదు. పోనీ నీవైనా ఈ శక్త్యాయుధాన్ని గూర్చి జ్ఞాపకం చేయలేకపోయావా? ఆ శ్రీకృష్ణుడు ఆ మహాశక్త్యాయుధాన్ని మూర్ఖుడిచేతిలో ఉన్న తీయని పండును తెలివిగలవాడు అపహరించుకొనిపోయినట్లు అపహరించుకొని పోయాడు. దీని కంతటికి కారణ మేమి?'

వ. అనిన న మ్మహీపతికి సంజయుం డి ట్లనియె. **244**

ప్రతిపదార్థం: అనినన్= ఇట్లా ప్రశ్నించగానే; ఆ+మహీపతికిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజుతో; సంజయుండు= సంజయుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడిట్లా అనగా, సంజయుడతడితో ఇట్లా సమాధానం చెప్పాడు.

తే. రాత్రు లీపని కర్ణుతో రాజు ననుజ । సమితియును నేనుఁ దగఁ జెప్పుదుము నరేంద్ర!
యతఁడు లెస్సగ విని 'యెల్లి య క్కిరీటి । సచ్చుఁ బటుశక్తి' నని బాస యిచ్చు మాకు. **245**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నరేంద్ర!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; రాజున్= దుర్యోధనరాజు; అనుజసమితియును= దుశ్శాసనాది సోదరవర్గమూ; నేనున్= నేను కూడా; కర్ణునితోన్= కర్ణుడితో; ఈ పని= ఈ కార్యాన్ని గూర్చి; రాత్రులు= రాత్రి సమయాలలో; తగన్= తగిన విధంగా; చెప్పుదుము= చెప్పుతూ ఉంటాము; అతఁడు= ఆ కర్ణుడు; లెస్సగన్= బాగుగా; విని= వినినవాడై; ఎల్లి= రేపు; ఆ+కిరీటి= ఆ అర్జునుడు; పటు శక్తిన్= సమర్థమైన శక్త్యాయుధంచేత; చచ్చున్= మరణిస్తాడు; అని= అని చెప్పి; మాకున్= మా అందరికీ; బాస= మాట (ప్రతిజ్ఞ); ఇచ్చున్= ఇస్తాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ కుమారుడు దుర్యోధనరాజు, దుశ్శాసనాదులు, నేను ప్రతిరోజూ రాత్రి సమయంలో కర్ణుడితో ఈ విషయం చెపుతూనే ఉన్నాము. ఆ కర్ణుడు కూడా 'ఇదుగో - రేపు తప్పక ఈ శక్త్యాయుధంతో అర్జునుడు వధింపబడుతాడు ఇది నిజం' - అని మాకు మాట కూడా ఇస్తూ ఉంటాడు.

వ. ఏము వెండియు నా కర్ణునితో నిట్లందుము- 'వివ్వచ్చుండు సచ్చినం దక్కటి పాండవులం దొక్కనిఁ బద్మనాభుండు పట్టంబు గట్టుం; గావున ననర్థ మూలం బగు నమ్మాధవుండు దెగిన జగతీ రాజ్యంబు మనకుఁ దక్కు; నింద్ర దత్తం బయిన శక్తి నతని సమయించుట గార్యంబు.' 246

ప్రతిపదార్థం: ఏము= మేము; వెండియున్= మళ్ళీ కూడ; ఆ కర్ణుతోన్= ఆ రాధేయుడితో; ఇట్లు= ఈ విధంగా; అందుము= అంటూ ఉంటాము; వివ్వచ్చుండు= అర్జునుడు; చచ్చినన్= మరణిస్తే; తక్కటి పాండవులందున్= మిగిలిన పాండవులలో; ఒక్కనిన్= ఏ ఒక్కడినైనా; పద్మనాభుండు= కృష్ణుడు; పట్టంబు కట్టున్= రాజ్య పట్టాభిషిక్తుడిని చేస్తాడు; కావునన్= కాబట్టి; అనర్థమూలంబు+అగు= అనర్థానికి కారణభూతుడైన; ఆ+మాధవుండు= ఆ కృష్ణుడు; తెగినన్= హతుడైతే; జగతీరాజ్యంబు= ఈ సార్వభౌమాధికారము; మనకున్= మనకే; దక్కున్= దక్కుతుంది; ఇంద్రదత్తంబు+అయిన శక్తిన్= ఇంద్రుడిచే ఇవ్వబడిన శక్త్యాయుధంతో; అతనిన్= ఆ కృష్ణుడిని, సమయించుట= సంహరించటం; కార్యంబు= చేయదగిన పని.

తాత్పర్యం: మేమందరం కూడా కర్ణుడితో మరల ఇట్లా అంటూ ఉంటాము. 'ఓ కర్ణా! ఒకవేళ అర్జునుడు చస్తే ఆ కృష్ణుడు ఈ భూమండలాధిపత్యాన్ని మరొక పాండుసుతుడికి పట్టం కట్టుతాడు. అన్ని అనర్థాలకూ మూలం ఆ కృష్ణుడే కాబట్టి ఆ కృష్ణుడిపైననే ఈ శక్త్యాయుధాన్ని ప్రయోగించుము. అతడు పోతే మన కిక ఏ ఆటంకం లేకుండా ఈ భూమండలమంతా దక్కుతుంది. కాబట్టి ఇంద్రుడిచ్చిన శక్త్యాయుధంతో కృష్ణుడినే సంహరించటం తగినపని.

క. అని చెప్పిన య మ్మాటలు । విని 'యెల్ల విధముల కృష్ణవిజయులలో నొ
క్కనిఁ బొరిపుచ్చెదఁ జూడుం' । డనుచుఁ జనున్ సూతసుతుఁ డహంకారముతోన్. 247

ప్రతిపదార్థం: అని= ఇట్లా; చెప్పిన= చెప్పినటువంటి; ఆ+మాటలు= ఆ మాటలను; సూతసుతుఁడు= సూతపుత్రుడైన కర్ణుడు; విని= విన్నవాడై; ఎల్లవిధములన్= సర్వవిధాలుగా - అనగా నిశ్చయంగా; కృష్ణ విజయులలోన్= కృష్ణార్జునులలో; ఒక్కనిన్= ఒక్కడిని; పొరిపుచ్చెదన్= సంహరిస్తాను; చూడుఁడు= చూడండి; అనుచున్= అంటూ; అహంకారముతోన్= గర్వంతో; చనున్= వెళ్తాడు.

తాత్పర్యం: అని చెప్పిన మా మాటలు విని, 'నిశ్చయంగా కృష్ణార్జునులలో నొక్కడిని నేను శక్త్యాయుధంతో సంహరించివేస్తాను. చూడండి' అంటూ అహంకారం కనబరుస్తూ వెళ్ళిపోతాడు.

తే. వినుము వేగిన సంగ్రామమునకుఁ బోయి । నప్పు డ కృర్ణునకు మాకు నందఱకును
దోఁప దా బుద్ధి వెండియుఁ దోఁచు మగిడి । వచ్చి శిబిరంబు సొరఁగ దైవంబు కతన. 248

ప్రతిపదార్థం: వినుము= (ఓ ధృతరాష్ట్ర మహారాజా!) వినండి; వేగినన్= తెల్లవారగానే; సంగ్రామమునకున్= యుద్ధానికి; పోయినప్పుడు= వెళ్ళిన సమయంలో; ఆ కర్ణునకున్= ఆ కర్ణుడికి; మాకున్+అందఱకును= మా అందరికీ కూడ; ఆ బుద్ధి= శక్త్యాయుధ ప్రయోగ విషయక బుద్ధి; తోఁపదు= స్ఫురించదు; వెండియున్= మళ్ళీ; మగిడి= తిరిగి; వచ్చి= యుద్ధం నుండి వచ్చి; శిబిరంబు= గుడారాన్ని; చొరఁగన్= ప్రవేశించిన వెంటనే; దైవంబుకతనన్= దైవయోగం వలన; తోఁచున్= స్ఫురణకు వచ్చును.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! దైవయోగం వలన, తెల్లవారగానే యుద్ధానికి వెళ్ళేటప్పుడు ఆ కర్ణుడికి గాని, మాకు గాని శక్త్యాయుధం ప్రయోగించి కృష్ణార్జునులలో ఎవరినైనా తుదముట్టించాలి అనే విషయం జ్ఞాపకముండేది కాదు. మళ్ళీ యుద్ధం ముగిసి మన గుడారాలకు రాగానే ఆ విషయం జ్ఞాపకం వచ్చేది -

వ. **దైవం బన వేఱొకండు గలదె? కృష్ణుండ; యది యెట్లనిన - నట్లర్జును బోధించునప్పుడు సాత్యకి శౌరితో 'నా సూతసుతుం డీ శక్తి యిన్ని దినంబులు ధనంజయుమీఁదఁ బ్రయోగింపమికిఁ గారణం బేమి? యని యడిగిన నతండు.** **249**

ప్రతిపదార్థం: దైవంబు+అనన్= దైవం అంటే; వేఱు+ఒకండు= మరొకటి; కలదె?= ఉన్నదా?; అది= ఆ దైవం; కృష్ణుండు+అ= కృష్ణుడే; ఎట్లు+అనినన్= ఎట్లా అంటే; అట్లు= ఆ విధంగా; అర్జునున్= అర్జునుడికి; బోధించునప్పుడు= ఘటోత్కచవధ జన్యహర్ష నిమిత్తాదులను చెప్పే సందర్భంలో; సాత్యకి; శౌరితోన్= కృష్ణుడితో; ఆ సూతసుతుండు= ఆ సూతపుత్రుడు కర్ణుడు; ఈ శక్తి= ఈ ఇంద్రదత్తమైన శక్త్యాయుధాన్ని; ఇన్ని దినంబులు= ఇన్ని రోజులు; ధనంజయు మీఁదన్= అర్జునుడిపై; ప్రయోగింపమికిన్= ప్రయోగించకపోవటానికి; కారణంబు= హేతువు; ఏమి+అని= ఏమిటని; అడిగినన్= అడుగగానే; అతండు= ఆ కృష్ణుడు.

తాత్పర్యం: దైవమంటే వేరొకటి లేదు - కృష్ణుడే ఆ దైవం. ఇది స్పష్టం. ఎట్లా అంటే ఘటోత్కచుడు శక్త్యాయుధంచేత హతుడైనప్పుడు కృష్ణుడు నాట్యం చేస్తూ హర్షించాడు. దానికి కారణం ఏమిటని ప్రశ్నించాడు పార్థుడు. ఆ కారణాన్ని అర్జునుడికి వివరించే సందర్భంలో సాత్యకి కృష్ణుడితో 'ఈ శక్త్యాయుధాన్ని ఇన్ని రోజుల నుండి అర్జునుడిపై కర్ణుడు ప్రయోగించకుండా ఉండటానికి కారణమేమి?' అని అడుగగా కృష్ణుడు (ఇట్లా బదులు పలికాడు).

తే. **'వాని వా రెల్ల నీపని వాని కెపుడుఁ । గఱపుదురు; వాఁడుఁ బూన్కిమైఁ గడఁగి వచ్చుఁ;**
దాఁకుదల నేను వారలందఱును మఱచు । నట్లు సేయుదు నరునకునై కుమార!' **250**

ప్రతిపదార్థం: కుమార!= ఓ సాత్యకీ!; వానివారు+ఎల్లన్= ఆ కర్ణ పక్షీయులందరు; ఈ పని= ఈ శక్త్యాయుధాన్ని ప్రయోగించే పనిని; వానికిన్= ఆ కర్ణుడికి; ఎపుడున్= ఎల్లప్పుడు; కఱపుదురు= మాటిమాటికి చెప్తుతూ ఉంటారు; వాఁడున్= ఆ కర్ణుడు కూడ; పూన్కిమైన్= పూనికతో - పట్టుదలతో; కడఁగి= సంసిద్ధుడై; వచ్చున్= వస్తాడు (కాని); నేను= (కృష్ణుడు); నరునకున్+ఐ= అర్జునుడి నిమిత్తం; వారలు+అందఱును= వారందరు కూడ; తాఁకుదలన్= యుద్ధం ప్రారంభించే సమయంలో; మఱచునట్లు= (ఆ విషయం) మరచిపోయేటట్లు; చేయుదున్= చేస్తాను.

తాత్పర్యం: 'ఓ సాత్యకీ! ఆ కర్ణుడికి శక్త్యాయుధంతో అర్జునుడిని హతమార్చాలనే విషయం ఆ కర్ణుడివైపు వారందరు (దుర్యోధనాదులందరూ) ఎప్పుడూ బోధిస్తూనే ఉంటారు. ఆ కర్ణుడు కూడా గట్టి పట్టుదలతో సిద్ధమయ్యే యుద్ధానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వస్తాడు. కాని, యుద్ధం సమయంలో నేనే అర్జునుడి క్షేమం కోరి వాడు, అతడి వారందరూ కూడా ఆ విషయం మరచే విధంగా చేస్తూ ఉంటాను.'

వ. అని పలికి ధృష్టద్యుమ్నాదులం బేర్కొని యాతనిం గలిపికొని సాత్యకి నుద్దేశించి. 251

ప్రతిపదార్థం: అని= ఇట్లా; పలికి= చెప్పి; ధృష్టద్యుమ్న+ఆదులన్= ధృష్టద్యుమ్నుడు మొదలైన వారిని; పేర్కొని= పేర్లుపెట్టి చూపించి; ఆతనిన్= ఆ సాత్యకిని; కలిపికొని= కూడగట్టుకొని; సాత్యకిన్= సాత్యకిని; ఉద్దేశించి= సంబోధించి.

తాత్పర్యం: అని చెప్పి ధృష్టద్యుమ్నుడు మొదలగువారిని పేరుపేరున పేర్కొని, సాత్యకిని కూడా చేర్చి, సాత్యకితో (ఇట్లా అన్నాడు).

క. 'మీరును బ్రాణములు ద్రిలో । కీ రాజ్యము నాదు బుద్ధికిం బార్థుక్రియం
గూరిమికిం బాత్రంబులె । యీా రేయి గదా! సుఖించి యే నిద్రింతున్. 252

ప్రతిపదార్థం: (ఓ సాత్యకీ!) మీరును= ధృష్టద్యుమ్నుడు మొదలైన మీరందరు; ప్రాణములు= నా ప్రాణాలు; త్రిలోకీ రాజ్యము= ఈ ముల్లోకాల రాజ్యమైనా; నాదు బుద్ధికిన్= నా బుద్ధికి (నా అభిప్రాయం ప్రకారం); పార్థుక్రియన్= అర్జునుడివలె; కూరిమికిన్= ప్రేమకు; పాత్రంబులు+ఎ?= అర్హములు ఔతాయా? (కావని భావం. ఈ లోకంలో నాకు మరేది పార్థుడి కంటె ప్రేమపాత్రం కాదని భావం) మహాభారతం సంస్కృతమూలంలో ఇట్లా ఉన్నది.

శ్లో॥ న పితా న చ మే మాతా న యూయం భ్రాతరస్తథా! న చ ప్రాణా స్తథా రక్ష్యా యథా బీభత్సురాహవే॥ త్రైలోక్య రాజ్యాద్ యత్ కించిద్ భవే దన్యత్ సుదుర్లభమ్ । నేచ్ఛేయం సాత్వతాహం తద్ వినా పార్థం ధనంజయమ్ ॥ (సం. భార. ద్రోణ. 182 అధ్యా 43, 44 శ్లో.) కాబట్టి; ఈ రేయి+కదా= ఈ రాత్రే కాదా; సుఖించి= సుఖంగా; ఏన్= నేను; నిద్రింతున్!= నిద్రిస్తాను!

తాత్పర్యం: 'ఓ సాత్యకీ! మీరేకాని నా ప్రాణాలేకాని ఈ మూడు లోకాల రాజ్యమే కాని పార్థునివలె నా ప్రేమకు పాత్రుడా? ఈనాడు అర్జునుడిని రక్షించుకొన్నాను. ఈ రాత్రే గదా సుఖంగా నిద్రిస్తాను.'

వ. అని చెప్పె నట్లు గావున మనకుఁ బశ్చాత్తాపంబు వలవ దనుటయు ధృతరాష్ట్రుండు 'మీరు దైవోపహతుల; రమ్మహాశక్తి దృణీభూతుం డగు ఘటోత్కచునకుఁగా వమ్మయ్యె; నింక మీవా రెవ్వరు నెప్పరుసున బ్రదికెదరు? చేయునది లేఁ; దటమీఁది వృత్తాంతంబు సెప్పు' మనవుడు నజ్జనపతికి సంజయుం డిట్లనియె. 253

ప్రతిపదార్థం: అని= ఇట్లా; చెప్పెన్= చెప్పాడు; అట్లు+కావునన్= అట్లా కాబట్టి; మనకున్= ఓ ధృతరాష్ట్ర మహారాజా! మనకందరికి; పశ్చాత్తాపంబు= పశ్చాత్తాపం; వలవదు= కూడదు; అనుటయున్= ఇట్లా పలుకగానే; ధృతరాష్ట్రుండు; మీరు= మీరందరు; దైవ+ఉపహతులరు= దైవంచేత కొట్టబడినవారలు (దురదృష్టవంతులని భావం); ఆ+మహాశక్తి= అట్టి గొప్ప ఇంద్రదత్తమైన శక్త్యాయుధం; తృణీభూతుండు+అగు= గడ్డిపోచ అయిన ఘటోత్కచునకుఁగాన్= ఘటోత్కచుడికయి; వమ్ము+అయ్యెన్= వ్యర్థమయింది; ఇంకన్= మరియు; మీవారు+ఎవ్వరున్= ఓ సంజయా! మీవా రెవ్వరైనా (తనవారైన దుర్యోధనాదులని భావం), సంజయుడు దుర్యోధనాదులను తన వారినిగా అభిమానిస్తున్నాడనే భావంతో 'మీవారు' అనే ధృతరాష్ట్రుడి ప్రయోగంలోని స్వారస్యం; ఏ+పరుసునన్= ఏ విధంగా; బ్రదికెదరు?= బ్రదుకుతారు?; చేయునది= చేయవలసింది (ఏదికూడ); లేదు= లేనేలేదు (చేయవలసిన ప్రతీకారం ఏది కూడా లేదు); అటమీఁది వృత్తాంతంబు= అటు పిమ్మట జరిగిన వృత్తాంతం; చెప్పుము= వినిపించుము; అనవుడున్= అనగానే; ఆ+జనపతికిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజుతో; సంజయుండు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు. (చెప్పసాగాడు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని చెప్పాడు. కాబట్టి మనం పశ్చాత్తాపపడవలసిన పని లేదు - అనగానే ధృతరాష్ట్ర మహారాజు 'సంజయా! మీరు దురదృష్టవంతులు; అంత గొప్ప శక్త్యాయుధం - ఓ గడ్డిపోచలాంటి ఆ ఘటోత్కచుడి కొరకు - అతడిపై ప్రయోగించటంతో వ్యర్థమయిపోయింది. ఇంక మీ (మన) వా రెట్లు బ్రతుకుతారో? అయినా చేయగలిగిందిలేదు. తరువాత జరిగిన వృత్తాంతం ఏమిటో చెప్పుము' అని అడుగగానే సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా చెప్పసాగాడు.

తే. **భీమనందను చావునఁ బ్రేముడించి । ధర్మతనయుండు బాష్పాంబుధార లడర**
మేను డిల్లంబుగాఁ దేరిమీఁద వివశుఁ । డగుచుఁ జదికిలఁ బడుటయు నచ్యుతుండు. **254**

ప్రతిపదార్థం: ధర్మతనయుండు= ధర్మరాజు; భీమనందను చావునన్= భీమసేనుని కుమారుడైన ఘటోత్కచుని మృతివలన; ప్రేముడించి= శోకించి; బాష్పాంబుధారలు= కన్నీటి ధారలు; అడరన్= అతిశయించగా; మేను= శరీరం; డిల్లంబుగాన్= సత్త్వహీనము కాగా (క్రుంగిపోగా); తేరిమీఁదన్= రథంపై; వివశుఁడు+అగుచున్= పరాధీనుడవుతూ; చతికిలన్+పడుటయున్= కూలబడగా; అచ్యుతుండు= కృష్ణుడు.

తాత్పర్యం: ధర్మరాజు, ఘటోత్కచుడి మరణంతో మిక్కిలి దుఃఖాక్రాంతుడై కన్నీటి ధారలు పొరలిపోగా, శరీరంలో సత్త్వం నశించి, వివశత్వంతో రథంమీదనే కూలబడి పోగా - అప్పుడు కృష్ణుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. **రయంబునం జని కరంబులం బొదివి యాతని నాలోకించి.** **255**

ప్రతిపదార్థం: రయంబునన్= వేగంగా; చని= వెళ్ళి; కరంబులన్= చేతులతో; పొదివి= పట్టుకొని; అతనిన్= ఆ ధర్మరాజును; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: త్వరత్వరగావెళ్ళి అతడిని చేతులతో పట్టుకొని అతడితో (ఇట్లా అన్నాడు).

క. **'ప్రకృతిజనునట్టు లిమ్మెయి । వికృతిం బొందంగఁ దగునె? విను! మిట్లయినం**
జకితం బగు నీ సైన్యము । సకలము; లె, మ్ముత్సహింపు సమరంబునకున్. **256**

ప్రతిపదార్థం: (ఓ ధర్మరాజా!) ప్రకృతి జనునట్టులు= ప్రాకృత జనుడు అనగా మూర్ఖుడు - అతడి వలె; ఈ+మెయిన్= ఈ విధంగా; వికృతిన్= వికారాన్ని అనగా దుఃఖాన్ని; (హర్షశోకాదులను వికారాలంటారు); పొందంగన్+తగునె?= పొందటం తగుతుందా?; వినుము= సావధానంగా వినండి; ఇట్లు+అయినన్= ఈ విధంగా అయితే (నీవే ఇట్లా దుఃఖిస్తే); నీ సైన్యము సకలము= నీ సైన్యమంతా; చకితంబు+అగు= భయభ్రాంతం అవుతుంది (కావున); లెమ్ము= ధైర్యంతో లే; సమరంబునకున్= యుద్ధానికి; ఉత్సహింపు(ము)= ఉత్సాహం చూపుము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! నీవే ఇట్లా అజ్ఞానివలె దుఃఖానికి లోనయితే, ఇక నీ సైన్యమంతా భయభ్రాంతమయిపోతుంది. కాబట్టి ధైర్యంతో యుద్ధానికి ఉత్సాహం చూపుము.'

వ. **నీవు వహించు గురుభారంబు దలంపక యింత యలంత నొందిన జయంబు సేకుఱునే?' యనిన నతండు కన్నీరు కరతలంబున నొత్తికొని మెత్తని మాటల ఘటోత్కచుని గుణముల గణుతించి కామ్యకవనంబునను గంధమాదన యాత్రను దమకుఁ జేసిన సాహాయ్యం బుగ్గడించె; 'వాఁడు నాకు భక్తుం; డేనును సహదేవుకంటెను వానికిం గూర్తు; నట్టి; పట్టి లేకున్న నాకు శోకంబు గాకుండునే?'యని, తత్ప్రతివీరునిదెసకు నెలసిన**

యంతరంగంబు రోషాక్రాంతం బగుటయు 'నిక్కుమారు నిట్లు సేసిన యీ దుర్జాతుండ కాఁడె? మున్ను నభిమన్యువిల్లు నఱికి చిక్కుపఱిచి యబ్బాలునిం బలువురచేతఁ జంపించె; నప్పుడు దవ్వుల నున్న సైంధవుని సవ్యసాచి సమయించె; నది దానికి మాఱుగా; దీరెండు క్రూరకర్మంబులకుఁ గర్ణునిఁ గడికండలు సేయక శాంతిం బొంద నేర్తునే?' యని బిగువుటెలుంగునం బలికి దిగ్గన లేచి 'యా ద్రోహికి నిన్నయు నేఁడును దోడ్పడిన ద్రోణుం దెగటార్పవలయు; నప్పనికిఁ బావని వోవు; నే సూతసూనుం డున్నెడకుం బోయెద' నని శంఖం బొత్తి చాపంబు పుచ్చికొని రథంబు నడప సూతు నియమించి చనుచుండె; నప్పు డచ్యుతుండు దమతేరిపైకి వచ్చి వివ్వచ్చు వీక్షించి. 257

ప్రతిపదార్థం: నీవు= (ఓ ధర్మరాజా!); నీవు; వహించు= మోయునట్టి; గురుభారంబు= గొప్పభారాన్ని గూర్చి; తలంపక= విచారించక; ఇంత+అలంతన్= ఇంతటి శోకాన్ని, ఒందినన్= పొందినట్లయితే; జయము= యుద్ధంలో జయం; చేకుఱునె?= లభిస్తుందా?; అనినన్= అనగా; అతండు= ఆ ధర్మరాజు; కన్నీరు= కన్నీళ్ళను; కరతలంబునన్= అరచేతితో; ఒత్తికొని= తుడుచుకొని; మెత్తని మాటలన్= తియ్యని పలుకులతో; ఘటోత్కచు గుణంబులు= ఘటోత్కచుడి గుణాలను; గణుతించి= కొనియాడి; కామ్యకవనంబునన్= కామ్యకం అనే పేరుగల వనంలో; గంధమాదన యాత్రను= గంధమాదన పర్వతానికి వెళ్ళేటప్పుడు కూడ; తమకున్= పాండవులమైన తమకు; చేసిన= చేసినట్టి; సాహాయ్యంబు= ఉపకారాన్ని; ఉగ్గడించెన్= పేర్కొన్నాడు; వాఁడు= ఆ ఘటోత్కచుడు; నాకున్ భక్తుండు= నాయందు గౌరవపూర్వకమైన ప్రేమ కలవాడు; ఏనును= నేను కూడ; సహదేవుకంటెను= నా చిన్న తమ్ముడు సహదేవుడి కంటె కూడ (అధికంగా); వానికిన్= ఆ ఘటోత్కచుడి విషయంలో; కూర్తున్= పాటుపడతాను; అట్టి పట్టి= అటువంటి కుమారుడు; లేకున్నన్= లేకుండా పోగా; నాకు; శోకంబు= దుఃఖం; కాక+ఉండునే?= కలుగకపోతుందా?; అని= ఇట్లా పలికి; తత్ప్రతివీరుని దెసకున్= ఆ ఘటోత్కచుడిని సంహరించిన ప్రతివీరుడు కర్ణుడు - అతడివైపు; ఎలసిన= మళ్ళినటువంటి; అంతరంగంబు= మనస్సు; రోష+ఆక్రాంతంబు+అగుటయున్= కోపంతో ఆక్రమించినది కాగానే; ఈ+కుమారున్= ఈ ఘటోత్కచుడిని; ఇట్లు= ఈ విధంగా; చేసిన= చేసినటువంటి (అనగా సంహరించిన); ఈ దుర్జాతుండు+అ కాదె= ఈ దుష్టుడు కర్ణుడే కదా!; మున్ను= పూర్వం; అభిమన్యుని విల్లు= అభిమన్యుడి ధనువును; నఱికి= ఖండించి; చిక్కుపఱిచి= కష్టాల పాలు చేసి; ఆ+బాలునిన్= ఆ అభిమన్యుడిని; పలువురచేతన్= అనేకులచేత; చంపించెన్= సంహరింపజేశాడు; అప్పుడు= ఆ సమయంలో; దవ్వులన్+ఉన్న= దూరంలో ఉన్నటువంటి; సైంధవునిన్= సైంధవుడిని; సవ్యసాచి= అర్జునుడు; సమయించెన్= సంహరించాడు (సైంధవుడు అభిమన్యువధ సమయంలో దూరంగానే ఉండిపోవటంచేత ప్రత్యక్షంగా కారణంకాదు - ముఖ్యకారణం మాత్రం కర్ణుడే. ద్రోణాచార్యుడు కూడా.) చూడండి. సంస్కృతమూలము - శ్లో॥ యత్ర వధ్యో భవేద్ ద్రోణః సూతపుత్రశ్చ సానుగః । తత్రా వధీ న్మహా బాహుః సైంధవం దూరవాసినమ్ ॥ (ద్రోణ. 183 / 49); అది= ఆ సైంధవ వధ; దానికిన్= ఆ అభిమన్యుడి వధకు; మాఱు= ప్రతీకారం; కాదు= కాదు; ఈ రెండు క్రూరకర్మంబులకున్= అభిమన్యు వధ, ఘటోత్కచ వధ - అనే ఈ రెండు నిర్దయ కృత్యాలకు; కర్ణునిన్= కర్ణుడిని; కడికండలు= తునుకలుతునుకలుగా; చేయక= చేయకుండా; శాంతిని= కోపోపశాంతిని; పొందనేర్తునే?= పొందజాలుతానా?; అని= ఇట్లా; బిగువు+ఎలుంగునన్= పెద్ద కంఠంతో- బిగ్గరగా; పలికి; దిగ్గనన్= తటాలున; లేచి= నిలిచి; ఆ ద్రోహికిన్= ద్రోహం చేసిన ఆ కర్ణుడికి; నిన్నయున్= వెనుకటి రోజు; నేఁడును= ఈ రోజు కూడ; తోడ్పడిన ద్రోణున్= సహాయం చేసిన, ద్రోణాచార్యుడిని; తెగటార్ప వలయున్= సంహరించవలె; ఆ+పనికిన్= ఆ కార్యానికి; పావని= పవననందనుడు - భీముడు; పోవున్= పోతాడు; నేన్= నేను; సూతసూనుండు= కర్ణుడు; ఉన్న+ఎడకున్= ఉన్నటువంటి దిక్కునకు; పోయెదన్= పోతాను; అని= అని చెప్పి; శంఖంబు= శంఖాన్ని; ఒత్తి= పూరించి; చాపంబు= ధనుస్సును; పుచ్చికొని= తీసికొని; రథంబు= రథాన్ని; నడపన్= తోలటానికి; సూతున్= సారథిని; నియమించి= ఆజ్ఞాపించి; చనుచుండెన్= వెళ్ళుతూ ఉన్నాడు; అప్పుడు= ఆ సమయంలో; అచ్యుతుండు= కృష్ణుడు; తమ తేరిపైకిన్= తమ రథంపైకి; వచ్చి= వచ్చినవాడై; వివ్వచ్చున్= అర్జునుడిని వీక్షించి= చూచి.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీవు ఎంతపెద్ద భారం వహిస్తున్నావో ఆలోచించుకోకుండా, ఇంత దుఃఖానికి విజయ మెట్లా చేకూరుతుంది?' అనే కృష్ణుడి పలుకులను విని, ధర్మరాజు కన్నీళ్ళను చేతితో తుడుచుకొని, మెల్లగా ఘటోత్కచుడి గుణగణాలను ప్రశంసించి, కామ్యకవనంలో, గంధమాదన పర్వతానికి వెళ్ళే సందర్భంలోను - అతడు చేసిన సాయాన్ని చెప్పాడు. వాడు నాకు భక్తుడు. నేను కూడా అతడిని సహదేవుడి కంటె ఎక్కువగా ప్రేమిస్తాను. అట్టి కుమారుడు లేకుంటే నాకు శోకం లేకుండా ఉంటుందా?' అని అంటూ ఉండగా ఆ ధర్మరాజు మనస్సు ఆ ఘటోత్కచుడిని సంహారం చేసిన కర్ణుడివైపు మరలి కోపంతో ఈ దుర్మార్గుడే కదా - 'ఇంతకుముందు కూడా అభిమన్యుడి విల్లు ఖండించి, పలువురి చేత సంహరింపజేశాడు. దానికి ప్రతీకారంగా మన అర్జునుడు దూరంగా ఉన్న సైంధవుడిని సంహరించాడు. అది దానికి తగిన ప్రతీకారంకాదు. ఈనాడు ఘటోత్కచుడిని, ఆనాడు అభిమన్యుడిని సంహరించి రెండు క్రూరకర్మలకు కారకుడైన ఈ కర్ణుడిని ముక్కలుముక్కలు చేయకపోతే నాకు మనశ్శాంతి ఎట్లా చేకూరుతుంది?' అని బిగ్గరగా అరిచి, తటాలున లేచి, 'ఈ ద్రోహి కర్ణుడికి నిన్న నేడు సహాయం చేసినవాడు ద్రోణుడు. అతడిని సంహరించటానికి భీముడు వెళ్తాడు. నేను కర్ణుడివైపు వెళ్తాను' అని చెప్పి, శంఖనాదం చేసి, విల్లును తీసికొని రథాన్ని నడుపుమని సారథిని ఆదేశించి కర్ణుడివైపు యుద్ధానికి వెళ్ళుతూఉండగా, అప్పుడు కృష్ణుడు తన రథంపైకి వచ్చి అర్జునుడిని చూచి (ఇట్లా అన్నాడు).

విశేషం: ధర్మరాజు స్మరించిన, ఘటోత్కచుడు చేసిన మహోపకారాలు సంస్కృతమూలంలో ఇట్లా పేర్కొనబడినవి.

శ్లో॥ **అస్మాకం హి వనస్థానాం హైడింబేన మహాత్మనా ।**
బాలేనాపి సతా తేన కృతం సాహ్యం జనార్దన ।
అస్త్రహేతోర్గతం జ్ఞాత్వా పాండవం శ్వేతవాహనమ్।
అసౌ కృష్ణ! మహేష్వాసః కామ్యకే మాముపస్థితః ।
ఉషితశ్చ సహాస్మాభిర్యావన్నాసీద్ ధనంజయః ॥
గంధమాదన యాత్రాయాం దుర్గేభ్యశ్చ స్మ తారితాః ।
పాంచాలీ చ పరిశ్రాంతా పృష్ఠేనోఢా మహాత్మనా ॥
ఆరంభా చ్చైవ యుద్ధానాం యదేష కృతవాన్ ప్రభో!
మదర్థే దుష్కరం కర్మ కృతం తేన మహాహవే ॥

(ద్రోణ - 183/28-32) అంటే కామ్యకవనంలో ఉండేటప్పుడు అర్జునుడు అస్త్రప్రాప్తికై వెళ్ళిన సమయాన ఈ ఘటోత్కచుడు వచ్చి వారికి తోడుగా ఉండటం, గంధమాదన పర్వతానికి వెళ్ళేటప్పుడు ద్రౌపదిని తన పృష్ఠంపై ఎక్కించుకొని తీసికొని వెళ్ళటం - కేవలం ద్రౌపదినేకాదు తన అనుచర వర్గంతో వారినందరిని కూడా దుర్గమ ప్రాంతాలకు మోసికొని వెళ్ళటం - వారికై ఆరంభం నుండి యుద్ధం చేయటం - ఇవన్నీ తిక్కన రచనలో సంక్షేపించబడ్డాయి.

క. **'తనచేతన సూతసుతుం। దునుముదుఁ గా కనుచు నలుకతోడ రయమునం**
జనియెడు ధర్మసుతుం డీ। తని నూరక చూచుచునికి దగునే మనకున్?' 258

ప్రతిపదార్థం: ధర్మసుతుండు= ధర్మరాజు; తన చేతన్+అ= తన చేతనే - స్వయంగానే; సూతసుతున్= కర్ణుడిని; తునుముదు+కాక= సంహరిస్తాను సుమా!; అనుచున్= అంటూ; అలుక తోడన్= కోపంతో; రయమునన్= వేగంతో; చనియెడున్= వెళ్ళుతూ ఉన్నాడు (కావున); మనకున్= (ఓ అర్జునా!) మనకు; ఈతనిన్= ఈ ధర్మరాజును; ఊరక= ఉదాసీనంగా; చూచుచునికిన్= చూస్తూ ఉండటం; తగునే?= తగుతుందా?

తాత్పర్యం: ధర్మరాజు స్వయంగా కర్ణుడిని సంహరిస్తానని కోపంతో వేగంగా వెళ్ళుతూ ఉన్నాడు. ఈతడిని అనుసరించక ఊరకే చూస్తూ ఉండటం మనకు తగిన పనేనా?'

ఆ. అని రథంబు పెలుచఁ జన నిచ్చె; నట్లు క్రో । ధాంధవృత్తి నరుగు నవ్విభునకు
సమ్ముఖంబు గాఁగ సత్యవతీసుతుఁ । డరుగుదెంచి కరుణ నాదరించి. 259

ప్రతిపదార్థం: అని= ఇట్లా పలికి; రథంబు= రథాన్ని; పెలుచన్= వేగంగా; చనన్+ఇచ్చెన్= పోనిచ్చాడు; అట్లు= ఆ విధంగా; క్రోధ+అంధ వృత్తిన్= క్రోధంతో ముందుచూపులేని ప్రవృత్తితో; అరుగు+ఆ+విభునకున్= వెళ్ళుతూ ఉన్న ఆ ధర్మరాజునకు; సమ్ముఖంబు+కాఁగన్= ఎదురుగా; సత్యవతీ సుతుఁడు= వ్యాసమహర్షి; కరుణన్= దయతో; అరుగుదెంచి= వచ్చి; ఆదరించి= సంభావించి.

తాత్పర్యం: అని రథాన్ని వేగంగా ధర్మరాజురథాన్ని అనుసరిస్తూ పోనిచ్చాడు. ఆ విధంగా క్రోధంచేత ముందుచూపులేక ఆవేశంతో వెళ్ళుతున్న ఆ ధర్మరాజునకు ఎదురుగా వ్యాసమహర్షి వచ్చి, అతడిని ఆదరించి. (తరువాతి గద్యంతో అన్వయం).

వ. అతండు ప్రణతుం డైన దీవించి యి ట్లనియె. 260

ప్రతిపదార్థం: అతండు= ఆ ధర్మరాజు; ప్రణతుండు+ఐనన్= నమస్కరించగా; దీవించి= ఆశీర్వదించి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ధర్మరాజు నమస్కారం చేయగా ఆశీర్వదించి, వ్యాసమహర్షి అతడితో ఇట్లా అన్నాడు:

సీ. 'అనిమిషనాథుఁ డిచ్చిన శక్తి యర్జును । సమయింపఁ గర్ణుండు సంగ్రహించె;
నది యున్న దాన నయ్యాపద వాటిల్లె । నేని నయ్యలఁత సహింప వశమె?
యీ ఘటోత్కచునకు నింతియ కాలమ్మై । యీ నెపంబునఁ దెగటాఱెఁ జూవె!
యిట్లు మే లిది దైవ మిచ్చిన దురిత ని । స్తారంబు నీ; కింత దలఁచి నీవు

ఆ. సంభ్రమంబు దక్కి సైన్యంబు దోడ్పడ । మనుజపతులఁ దమ్ములను సుహృజ్జ
నములఁ గూర్చికొని రణంబు సేయుము కురు । ప్రతతి తోడ నీదు బలము మెఱయ. 261

ప్రతిపదార్థం: (ఓ ధర్మరాజా!) అనిమిషనాథుఁడు= దేవేంద్రుడు; ఇచ్చిన శక్తి= ఇచ్చినట్టి శక్తి అనే ఆయుధాన్ని; అర్జునున్= అర్జునుడిని; సమయింపన్= సంహరించటానికయి; కర్ణుండు; సంగ్రహించెన్= సంపాదించి పెట్టుకొన్నాడు; అది= ఆ శక్త్యాయుధం; ఉన్నన్= ఆ కర్ణుడి దగ్గరనే ఉన్నట్లయితే; దానన్= ఆ శక్త్యాయుధంతో; ఆ+ఆపద= ఆ కర్ణుడు తలపెట్టిన అర్జున సంహార రూపమైన ఆపద; పాటిల్లెన్+ఏనిన్= సంభవించినట్లయితే; ఆ+అలఁత= ఆ శోకం; సహింప వశమే?= (నీకు) ఓర్చుకొన వీలవుతుందా? (కాబట్టి ఈ ఘటోత్కచుడి మృతికి నీవు అంతగా చింతించవలసిన పనిలేదని భావం) - ఎందుకనగా?; ఈ

ఘటోత్కచునకున్= ఘటోత్కచుడికి; ఇంతియ= ఈ మాత్రమే; కాలము+ఐ= జీవితావధియై; ఆ నెపంబునన్= ఆ శక్త్యాయుధం అనే కారణంతో; తెగటాఱెన్+చూవె!= మరణించాడు సుమా!; ఇట్లు= ఈ విధంగా; ఇది= ఈ ఘటోత్కచ మృతి; మేలు= హితమైనది (మరియు); నీకున్= (ఓ ధర్మరాజా!) నీకు; దైవము= అదృష్టం; ఇచ్చిన= ఇచ్చినటువంటి; దురితనిస్తారంబు= పాపమూలక కష్టాలను నివర్తింపజేసినట్టిది (కాబట్టి); నీవు= నీవు; ఇంత= ఇదంతా; తలఁచి= మనస్సులో భావించి; సంభ్రమంబు= ఆవేగాన్ని; తక్కి= విడిచి; సైన్యంబు= సేన; తోడ్పడన్= తోడుకాగా; మనుజపతులన్= రాజులను; తమ్ములను= భీమాది సోదరులను; సుహృద్+జనములన్= మిత్రవర్గాన్ని; కూర్చుకొని= సమాయత్తం చేసికొని; కురుప్రతతితోడన్= కురు (సైన్య) సమూహంతో; నీదు బలము= నీ బలం; మెఱయన్= ప్రకాశించే విధంగా; రణంబు= యుద్ధాన్ని; చేయుము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఆ కర్ణుడు అర్జున వధార్థమే ఆ దేవేంద్రు డిచ్చిన శక్త్యాయుధాన్ని సంగ్రహించి ఉంచాడు. (అనగా దాచి ఉంచాడు). ఆ శక్తి అట్లాగే కర్ణుడి చెంత ఉండి, ఒకవేళ అది అర్జునుడిపై ప్రయోగించబడితే ఆ సంభవించే ఆపదకు నీవు తట్టుకొని ఉండేవాడివా? ఈ ఘటోత్కచుడికి కాలం చెల్లి ఆ శక్త్యాయుధం కారణంగా మృతి చెందాడు. ఒక విధంగా ఇది మేలే. దైవం నీకు పెద్ద దుఃఖం రాకుండా కాపాడింది. ఈ విషయాన్ని గమనించి, నీ వింక కోపావేశం వదలుకొమ్ము. సైన్యం సహాయపడగా, ఈ రాజులను, నీ సోదరులను, మిత్రవర్గాన్ని, కలుపుకొని ఉత్సాహం, ధైర్యం అతిశయించే విధంగా ఈ కౌరవసైన్యంతో యుద్ధం కొనసాగించుము.

క. కలఁక యుడిపి చిత్తము ని । ర్మల ధర్మోదాత్తముగ నమర్చి నెగడు; మె
వ్వలనఁ గలుగు ధర్మం బ । వ్వలనికి జయ మంగళము లవశ్యముఁ గలుగున్.' 262

ప్రతిపదార్థం: కలఁక= శోకాన్ని; ఉడిపి= విడిచి; చిత్తము= మనస్సును; నిర్మల= పవిత్రమైన; ధర్మ= ధర్మంచేత; ఉదాత్తముగన్= గొప్పదానినిగా; అమర్చి= చేసి; నెగడుము= అభివృద్ధిని పొందుము; ఏ+వలనన్= ఏ పక్షాన; ధర్మంబు= ధర్మం; కలుగున్= ఉంటుందో; ఆ+వలనికిన్= ఆ వైపునకు; జయమంగళములు= జయం, శుభం అనేవి; అవశ్యమున్= తప్పక; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఇక శోకాన్ని త్యజించి, నీ మనస్సును గొప్పగా ధర్మంవైపు స్థిరంగా నిలుపుము; అభివృద్ధిని పొందుము. ధర్మం ఏ వైపున ఉంటే ఆ వైపుననే జయం, శుభం తప్పక కలుగుతాయి.

వ. అని హితోపదేశంబు సేసి. 263

ప్రతిపదార్థం: అని= ఇట్లా; హిత+ఉపదేశంబు+చేసి= మేలైన మంచి మాటల నుపదేశించి.

తాత్పర్యం: అని, హితాన్ని ఉపదేశించి.

క. 'విను మేనగు దివసంబున । నినుఁ బొందు ననూనమేదినీ రాజ్యశ్రీ
యనుమాన మేమియును లే' । దని గ్రక్కున నమ్మునీంద్రుఁ డరిగె నరేంద్రా!' 264

ప్రతిపదార్థం: నరేంద్రా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; వినుము= (ఓ ధర్మరాజా!) వినుము; ఏను+అగు దివసంబునన్= (నేటికి) అయిదవ రోజున; అనూన మేదినీ రాజ్యశ్రీ= (ఈ) పరిపూర్ణమైన పృథ్వీరాజ్యసంపద; నినున్= నిన్ను; పొందున్= పొందుతుంది; అనుమానము+ఏమియును= ఏ విధమైన సంశయం; లేదు= లేదు; అని= అని చెప్పి; ఆ+ముని+ఇంద్రుఁడు= వ్యాసముని శ్రేష్ఠుడు; గ్రక్కునన్= తొందరగా; అరిగెన్= వెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! సావధానంగా వినుము. నేటికి అయిదవ రోజున ఈ అఖండ భూమండల రాజ్యలక్ష్మి నిన్ను పొందుతుంది. దీనిలో ఏ మాత్రం సంశయం లేదు'. అని చెప్పి - ఓ ధృతరాష్ట్ర మహారాజా! వ్యాసమునీంద్రుడు వెంటనే వెళ్ళిపోయాడు.

వ. ఇ ట్లమ్మహాముని సనుటయు, సావధానుండై పాండవాగ్రజుండు ధృష్టద్యుమ్నుం గనుంగొని 'గురుని పురోభాగంబునఁ గౌరవసేన భీమసేనుండు దాఁకి తెరల్చుచున్నవాఁడు; నీ వక్కుంభసంభవు సంరంభంబు మాన్పుము; తద్వినాశం బాచరించుటకయి యనలంబున జనియించిన వాఁడవు; శిఖండి ప్రముఖ పాంచాల కుమారులం గొని యరవాయి గొనక యడరు' మని పలికి కెలంకుల నున్న నకుల సహదేవ ద్రుపద విరాట ద్రౌపదేయ శైనేయ కేకయుల నాలోకించి 'మీరును ఫల్గున పురస్సరంబుగా ద్రోణవధంబునకుం గడంగుఁ' డనుటయు. 265

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఆ+మహాముని= ఆ వ్యాసమహాముని; చనుటయున్= వెళ్ళిపోగానే; సావధానుండు+ఐ= మనోధైర్యం కలవాడై; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; కనుంగొని= చూచి; గురుని పురోభాగంబునన్= ద్రోణాచార్యుడి ముందట; కౌరవసేన= కౌరవుల సైన్యాన్ని; భీమసేనుండు= భీముడు; తాఁకి= ఎదుర్కొని; తెరల్చుచున్న వాఁడు= తొలగజేస్తూ ఉన్నాడు; నీవు= ఓ ధృష్టద్యుమ్నా! నీవు; ఆ+కుంభసంభవు సంరంభంబు= ఆ ద్రోణుడి వేగాన్ని; మాన్పుము= నశింపజేయుము; తద్వినాశంబు= ఆ ద్రోణుడి నాశాన్ని; ఆచరించుటకయి= చేయటం కొరకే; అనలంబునన్= అగ్నిహోత్రమునందుండి; జనియించినవాఁడవు= పుట్టావు (కదా!) (కాబట్టి); శిఖండి ప్రముఖ పాంచాల కుమారులన్= శిఖండి మొదలైన పాంచాల రాజకుమారులను; కొని= వెంట తీసికొని; అరవాయి+కొనక= సంశయించక - జయిస్తాననే గట్టి ధైర్యంతో; అడరుము= విజృంభించుము; అని= అని; పలికి= చెప్పి; కెలంకులన్= పార్శ్వభాగాలయందు; ఉన్న= ఉన్నట్టి; నకుల సహదేవ ద్రుపద విరాట ద్రౌపదేయ శైనేయ కేకయులన్= నకుల సహదేవులను; విరాట ద్రుపద రాజులను, ద్రౌపది కుమారులైన ఉపపాండవులను, శిని మనుమడైన సాత్యకిని, కేకయ దేశపు రాజులను; ఆలోకించి= చూచి; మీరు= ఓ నకుల సహదేవాది వీరులారా! మీరందరు కూడ; ఫల్గున పురస్సరంబుగాన్= అర్జునుడిని ముందుంచుకొని; ద్రోణవధంబునకున్= ద్రోణాచార్య వధకు; కడంగుఁడు= ఉద్యమించండి; అనుటయున్= అనగానే.

తాత్పర్యం: ఈ విధంగా ఆ వ్యాసమహాముని వెళ్ళిన పిమ్మట ధర్మరాజు మనస్సు ఏకాగ్రం చేసికొని ధృష్టద్యుమ్నుడిని చూచి, ద్రోణుడికి ముందుభాగంలో భీముడు కౌరవసైన్యాన్ని ఎదుర్కొని పారద్రోలుతున్నాడు. ఇక నీవు ఆ ద్రోణుడిని ఎదిరించి. అతడి ధాటిని మాన్పుము. ద్రోణుని చంపటానికే అగ్నికుండంనుండి పుట్టావు. కాబట్టి మీ పాంచాలరాజు కుమారులను శిఖండి మొదలైన వారిని వెంట తీసికొని, సంశయించక విజృంభించుము అని చెప్పి తన ప్రక్కలలో ఉన్న నకుల సహదేవ ద్రుపద విరాట ఉపపాండవ సాత్యకీ కేకయులను చూచి, మీరు అర్జునుని ముందుంచుకొని ద్రోణవధకై ప్రయత్నించండి-అని అనగానే

విశేషం: ద్రోణద్రుపదులు బాల్యమిత్రులు. సహాధ్యాయులు, ద్రోణుడు తన పుత్రుడు అశ్వత్థామ శైశవ దశలో ఉండగా అతడి పాలకై పాడి ఆవును యాచించటానికి ద్రుపదుడి ఆస్థానానికి వెళ్ళి, అతడిచేత అవమానితుడయ్యాడు. అది మనస్సులో పెట్టుకొని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాండవులను గురుదక్షిణగా ద్రుపదుడిని బంధించి తెమ్మన్నాడు ద్రోణుడు. పాండవులు - ముఖ్యంగా అర్జునుడు - ద్రుపదుడిని జయించి బంధించి తెచ్చి ద్రోణుడికి అర్పించారు. ఆ అవమానాన్ని ద్రుపదుడు సహించలేక ద్రోణ వధార్థమై పుత్రప్రాప్తికి ప్రయత్నించి సఫలుడయ్యాడు - చూడండి. ఈ ధృష్టద్యుమ్నుని పుట్టుకను గూర్చి మహాభారతం సంస్కృతమూలంలో.

శ్లో॥ ఉత్తస్థౌ పావకాత్ తస్మాత్ కుమారో దేవ సన్నిభః
జ్వాలావర్ణో ఘోరరూపః కిరీటీ వర్మచోత్తమమ్
బిభ్రత్ సఖడ్గః సశరో ధనుష్మాన్ వినదన్ ముహుః
భయావహో రాజపుత్రః పాంచాలానాం యశస్కరః
రాజ్ఞః శోకాపహోజాత ఏష ద్రోణవధాయ వై
ఇ త్యువాచ మహాద్భుత మదృశ్యం ఖేచరం తదా । (ఆది- 166/39-43)

కవచ కిరీటాదులతో భూషితుడై ఖడ్గాన్ని, ధనుర్బాణాదులను ధరించిన కుమారుడు ద్రోణ వధార్థం హోమకుండం నుండి పుట్టినట్లుగా ఈ వర్ణన చెపుతున్నది. గొప్ప తేజశ్శాలి కాబట్టి ఇతడికి ధృష్టద్యుమ్నుడనే నామకరణం సార్థకమైనది చూడండి.

శ్లో॥ ధృష్టత్వా దత్యమర్షిత్వాద్ ద్యుమ్నాద్యుత్సం భవాదపి
ధృష్టద్యుమ్నః కుమారోऽయం ద్రుపదస్య భవత్వితి (ఆది-166/53)

అందుకే ధర్మరాజు ద్రోణవధార్థం ధృష్టద్యుమ్నుడిని ప్రేరేపించాడు.

క. **వారలు దమ తమ బలములుఁ । దారును గవియుటయు నత్యుదగ్రత గురుఁ డ**
వ్వీరానీకము మార్కొని । పోరికిఁ దన సైన్య సమితిఁ బురికొల్పి తగన్. 266

ప్రతిపదార్థం: వారలు= ఆ నకుల సహదేవ ద్రుపద విరాటాదులు; తమ తమ బలములున్= తమ తమ సైన్యాలు; తారును= తాము కూడ; కవియుటయున్= (కౌరవ సైన్యాలను) ఎదుర్కొనగానే; గురుఁడు= ద్రోణుడు; ఆ+వీర+అనీకమున్= ఆ వీరుల సైన్యాన్ని; మార్కొని= ఎదిరించి; పోరికిన్= యుద్ధం చేయటానికి; తన సైన్య సమితిన్= తన సేనాసమూహాన్ని; తగన్= తగిన విధంగా; పురికొల్పి= ప్రేరేపించి.

తాత్పర్యం: ఆ నకుల సహదేవ విరాట ద్రుపదాదులు అందరూ వారి వారి సైన్యాలతో కలిసి కౌరవసైన్యాన్ని ఎదుర్కొన్నారు. ద్రోణు డది చూచి ఆ పాండవ వీరసైన్యాన్ని ఎదిరించి యుద్ధం చేయటానికి తన సైన్యాన్ని పురికొల్పి (తరువాతి వచనంతో అన్వయం).

వ. **బరవసంబు వాటించెఁ; గురువిభుండును గోల్తల సేసె; నప్పు డిరుదెఱంగుల వాహినులును దగ యెత్తి తూలం జొచ్చె; నీ సైనికులు డప్పియు నిదురయుం గదిరి మేను లలయం గొందలంపడి రెల్లవారికి నా త్రియామ సహస్రయామ యయితోఁచె; నట్లైనను నిజధర్మంబు ప్రతిపాలింప నడరి పెనంగుచుండిరి; నిద్రా పరవశత్వంబున దివియల వారును హీనప్రయత్నులైనం దమంబు గవియం దొడంగె; నట్టియెడం గునికి కునికి యాయుధంబులు వడ విడుచు వారును వాహనంబులు వోయినట్ల పోవం దెరలువారును జొక్కునం దమవారిం దామ యెదిరి పొడుచువారును, మఱియు ననేక ప్రకారంబులగు వికల సంచారంబుల గాసి యగువారును నగుటయుం గని గాండీవి యిరువాఁగు నుద్దేశించి యెలుంగెత్తి.** 267

ప్రతిపదార్థం: బరవసంబు= ధైర్యాన్ని; పాటించెన్= పొందాడు; కురువిభుండును= కురురాజు దుర్యోధనుడు కూడ; కోల్తల= యుద్ధసన్నాహాన్ని; చేసెన్= చేశాడు; అప్పుడు= ఆ సమయంలో; ఇరు తెఱంగుల వాహినులును= రెండువైపుల సైన్యాలుకూడ; దీగ+ఎత్తి= దప్పి కలిగి; తూలన్+చొచ్చెన్= తూలిపోజొచ్చినవి; నీ సైనికులు= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; నీ సైనికులు; డప్పియున్= దప్పి; నిదురయున్= నిద్ర; కదిరి= అతిశయించి; మేనులు= శరీరాలు; అలయన్= అలసిపోగా; కొందలం పడిరి= కలత చెందారు; ఎల్లవారికిన్= అందరికి; ఆ త్రియామ= ఆ రాత్రి (ఆ మూడు జాముల రాతిరి); సహస్రయామ+అయి= వేయి జాముల రాత్రిఅయి; తోఁచెన్= తోచింది; అట్లు+ఐనను= అట్లా అయినప్పటికిని; నిజధర్మంబు= తమ ధర్మాన్ని; ప్రతిపాలింపన్= నిర్వహించటానికి; అడరి= పూనుకొని; పెనంగుచుండిరి= యుద్ధం చేస్తూ ఉన్నారు-కాని; నిద్రాపరవశత్వంబునన్= నిద్రాపారవశ్యంచేత; దివియలవారును= దివిటీలు పట్టుకొన్నవారు; హీనప్రయత్నులు+ఐనన్= క్షీణించిన ప్రయత్నం కలవారు కాగా (చమురుతో దీపాన్ని శ్రద్ధగా వెల్గించే ప్రయత్నం మందం కాగా); తమంబు= చీకటి; కవియన్= ఆవరించటానికి; తొడంగెన్= ఆరంభించింది; అట్టి+ఎడన్= ఆ సందర్భంలో; కునికి కునికి= కునికిపాటు అధికం కాగా; ఆయుధంబులు= తమ తమ చేతిలోని ఖడ్గాద్యాయుధాలను; విడుచు వారును= జారవిడిచేవారు (కొందరు); వాహనంబులు= తాము కూర్చున్న గజాశ్వాది వాహనాలు; పోయినట్లు పోవన్= (చోదకుని ప్రేరణ లేకపోవుటచేత) తమంతట తామే స్వేచ్ఛగా ముందుకు సాగగా; తెరలు వారును= (యుద్ధం నుండి) తొలగిపోయేవారు (కొందరు); చొక్కునన్= మోహంతో; తమవారిన్= స్వపక్షీయులనే; తాము+అ= తామే; ఎదిరి= ఎదిరించి; పొడుచువారును= సంహరించేవారు (మరికొందరు); మఱియున్= ఇంకా; అనేక ప్రకారంబులు+అగు= పలు విధాలైన; వికల సంచారంబులన్= వ్యర్థములైన నడవడులతో; గాసి అగువారును= బాధపడేవారు; అగుటయున్= కావటాన్ని; కని= చూచి; గాండీవి= అర్జునుడు; ఇరువాగున్= రెండు సైన్యాలను; ఉద్దేశించి= కూర్చి (సంబోధించి); ఎలుంగు+ఎత్తి= కంఠస్వరాన్ని పెంచి.

తాత్పర్యం: పూనికవహించాడు. (ద్రోణుడు); దుర్యోధనుడు కూడా సమర సన్నాహాన్ని చేశాడు. ఆ సమయంలో రెండు పక్షాల సైన్యాలు కూడా అలసటతో తూలిపోవ నారంభించాయి. ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ సైనికులందరు దప్పితోను నిదురతోను శరీరాలు పట్టుకోల్పోయి, మిక్కిలి తాపానికి గురిఅయ్యారు. ఇంక ఈ రాత్రి ఎట్లా గడుస్తుందా అనే భావం ఏర్పడింది. అందరికి ఆ మూడుజాములరాత్రి వెయ్యిజాములరాత్రిగా తోచింది. (అంటే క్షణమొక యుగంగా భాసించింది,) అయినా వారు తమ కర్తవ్యంగా భావించి యుద్ధం చేయసాగారు. కాని, నిద్రాపరవశత్వం వల్ల దివిటీలు పట్టుకొన్నవారు తమ ప్రయత్నం సరిగా చేయలేకపోవటంచేత చీకటి వ్యాపించసాగింది. కొందరు నిద్రకు తట్టుకోలేక కునికిపాట్లతో తమ తమ ఆయుధాలనే జారవిడుచుకొన్నారు. కొందరు తమ ప్రమేయం లేకుండా తమ వాహనాలు ఎటువైపు తీసికొని వెళ్ళుతుంటే అట్లాగే పోయి రణరంగాన్నుండి వైదొలగిపోయారు. మరి కొందరేమో నిద్రాపారవశ్యంతో తమ వారెవరో శత్రువులెవరో గుర్తించక, తమ వారినే పొడిచి సంహరిస్తున్నారు. ఇట్లా రెండు సైన్యాలలో కూడా వికృతపు పోకడలతో సైనికులు బాధపడుతూఉండటం అర్జునుడు చూచి, వెంటనే రెండు సైన్యాల వారి నుద్దేశించి గొంతెత్తి ఇట్లా అన్నాడు:

క. 'అడరెడు నిద్రాభరమునఁ । గడు డస్సితి రెల్లవారుఁ; గలనను జాడ్యం
బెడలఁగఁ జొక్కు మడుఁపుఁ; డి । ప్పుడ చంద్రుఁడు వొడుచు; వెండి పోరుట యొప్పున్.' 268

ప్రతిపదార్థం: అడరెడు= చెలరేగుతున్న; నిద్రాభరమునన్= నిద్రాతిశయంతో; ఎల్లవారును= ఇరుపక్షాల సైనికులందరు కూడా; కలనను= యుద్ధమందు; కడున్= మిక్కిలి; డస్సితిరి= అలసిపోయారు; కలనను= యుద్ధంలో; జాడ్యంబు= మాంద్యం (కలననుఅనే పదం దేహళీదత్తదీపన్యాయంగా అన్వయిస్తుంది); ఎడలఁగన్= తొలగిపోయే విధంగా; చొక్కు= నిద్రాపారవశ్యాన్ని; మడుఁపుఁడు=

తీర్చుకొనండి; ఇప్పుడు+ఆ= ఇంక కొద్దిసేపటికే; చంద్రుఁడు= చందమామ; పొడుచున్= ఉదయిస్తాడు; వెండి= మళ్ళీ (ఆ వెన్నెలలో); పోరుట= యుద్ధం చేయుటం; ఒప్పున్= తగుతుంది.

తాత్పర్యం: 'ఓ సైనికులారా! మీరు (అంటే రెండువైపులనున్న సైనికులందరు కూడా) నిద్రముంపును తట్టుకోలేక మిక్కిలి అలసిపోయి ఉన్నారు. యుద్ధంలో మాంద్యం సంభవించింది. ఈ మాంద్యం పోయి చురుకుగా యుద్ధం సాగాలంటే మీరందరు కొంచెం సేపు నిద్రించి నిద్రాపారవశ్యాన్ని తొలగ చేసికొనండి. ఇక కొద్దిసేపట్లో చంద్రోదయం ఔతుంది. అప్పుడు మళ్ళీ ఆ వెన్నెలలో యుద్ధం చేయటం బాగుంటుంది.'

వ. అనిన విని మన వారలందఱు నట్ల మే లని కర్ణ దుశ్శాసనుల యనుమతి వడసి విశ్రమించిరి; పాండవ సైన్యంబును విశ్రామంబు నొందె; గగనంబున దేవగణంబు ధనంజయు ధర్మజ్ఞత్వంబు ప్రస్తుతించె; నయ్యవసరంబున. 269

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= విన్నవారై; మనవారలందఱున్= మన సైనికులందరు కూడ; అట్లు+అ= ఆ విధంగానే; మేలు+అని= మంచిది అని; కర్ణదుశ్శాసనుల అనుమతిన్= కర్ణుడు, దుశ్శాసనుడు - వీరిద్దరి అనుమతిని; పడసి= పొంది; విశ్రమించిరి= విశ్రాంతి తీసికొన్నారు; పాండవ సైన్యంబును= పాండవుల సేన కూడా; విశ్రామంబున్= విశ్రాంతిని; ఒందెన్= పొందింది; గగనంబునన్= ఆకాశంలో; దేవగణంబు= దేవతల సమూహం; ధనంజయ ధర్మజ్ఞత్వంబు= అర్జునుడి ధర్మజ్ఞానాన్ని; ప్రస్తుతించెన్= పొగడింది; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అట్లా అర్జునుడు పలుకగానే మన సైనికులందరూ 'అట్లా చేయటమే బాగుంటుంది' అని చెప్పి, కర్ణ దుశ్శాసనుల అనుమతిని కూడా తీసికొని, విశ్రమించారు. పాండవసైన్యం కూడా విశ్రమించింది. ఆకాశంలో దేవతలందరూ అర్జునుడి ధర్మజ్ఞత్వాన్ని ప్రశంసించారు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'కరుణ గలవు; మమ్ము గారవంబున సుఖా । న్వితులఁ జేసి తనఘ! నీకు సురలు
వరము లెపుడు నిచ్చువారు గావుత; మనో । రథముఁ బొందు మమరరాజతనయ!' 270

ప్రతిపదార్థం: ఓ అమరరాజతనయ!= ఓ ఇంద్రతనయా అర్జునా!; కరుణ గలవు= దయగలవాడవు (కావుననే); మమ్మున్= ఈ సైనికులమైన మమ్ము; గారవంబునన్= ప్రేమతో; సుఖ+అన్వితులన్= సుఖంతో కూడినవారినిగా; చేసితి(వి)= చేశావు; అనఘ!= పుణ్యాత్మా! (అఘము= పాపము, అది లేనివాడు అనఘుడు); నీకున్= (అర్జునుడికి); సురలు= దేవతలు; వరములు= అభీష్టవరాలను; ఎపుడున్= ఎల్లప్పుడు; ఇచ్చువారు కావుతన్= ఇస్తారుగాక; మనోరథము= కోరిక; పొందుము= పొందుతావు.

తాత్పర్యం: 'ఓ పుణ్యపురుషా! ఇంద్రతనయా! అర్జునా! నీవు నిజంగా దయామయుడవు. మాపట్ల దయ దలచి ప్రేమతో మాకు సుఖం కలుగజేశావు. కాబట్టి నీకు దేవతలు వరాలు ఇత్తురుగాక! నీ కోరిక ఈడేరుగాక!

క. అని యక్కౌరవ సైన్యము । జనములు సంప్రీతి సవ్యసాచికిఁ బలు దీ
వన లిచ్చుచు నాతనిఁ గీ । ర్తన సేయుచు నిద్ర వొందె ధరణీనాథా! 271

ప్రతిపదార్థం: ధరణీనాథా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అని= అని పలికి; ఆ+కౌరవసైన్యము జనములు= ఆ కౌరవసైన్యంలోని జనులు; సంప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; సవ్యసాచికిన్= అర్జునుడికి; పలుదీవెనలు= అనేకములైన ఆశీస్సులు; ఇచ్చుచున్= ఇస్తూ; ఆతనిన్= ఆ అర్జునుడిని; కీర్తన+చేయుచున్= కీర్తిస్తూ అనగా పొగడుతూ; నిద్ర= నిద్రను; పొందెన్= పొందింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! మీ కౌరవసైన్యంలోని వారందరు ఇట్లా అర్జునుడికి మిక్కిలి ప్రేమపూర్వకంగా ఎన్నో ఆశీస్సు లిచ్చి, అతడిని పొగడుతూ నిద్రించారు.

వ. ఆ సమయంబున నుభయ బలంబులయందును. 272

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ సమయంలో; ఉభయ బలంబుల అందును= ఇరువైపులవారి సైన్యాలలో కూడ.

తాత్పర్యం: ఆ నిద్రించే సమయంలో రెండు సైన్యాలలో కూడా (తరువాతి పద్యంతో అన్వయం).

క. తరుణుల కుచములపై రతి । పరవశులై యొఱగు పతుల పగిది సమర సం
భరిత శ్రమమున నిద్రిం । చిరి కరికుంభములఁ జెంది చెన్నుగ జోదుల్. 273

ప్రతిపదార్థం: జోదుల్= యోధులు; సమర సంభరిత శ్రమమునన్= యుద్ధంతో నిండిన అలసటతో; కరికుంభములన్= ఏనుగుల కుంభస్థలాలను; చెంది= పొంది; తరుణుల కుచములపైన్= వయసులో ఉన్న భార్యల వక్షోజాలపై; రతిపరవశులు+ఐ= సురతశ్రాంతులై; ఒఱగు పతుల పగిదిన్= విశ్రమించిన భర్తలవలె; చెన్నుగన్= అందంగా; (శృంగార భావనచే ఆ దృశ్యం అందంగా ఉందని భావం); నిద్రించిరి= నిద్రపోయారు.

తాత్పర్యం: యుద్ధంలో ఎంతో అలసట చెందిన యోధులు గజకుంభాలపై రతిశ్రాంతులైన భర్తలు వయసులో ఉన్న తమ భార్యల వక్షోజాలపై ఒరిగి విశ్రాంతి తీసికొంటున్నట్లు ఎంతో అందంగా నిద్రించారు.

విశేషం: అలం: ఇది బింబ ప్రతిబింబ భావంతో కూడిన ఉపమాలంకారం - తరుణుల కుచాలతో కరి కుంభాలకు గల సాదృశ్యం, మరియు రతిశ్రాంతి సమరశ్రాంతుల సాదృశ్యం యోధులకు భర్తలతో చెప్పిన పోలికలో ఉపకరించే సాధర్మ్యంగా ఏర్పడుతుంది. బింబ ప్రతిబింబ భావలక్షణం కువలయానందంలో - వస్తుతః భిన్నయోరపి పరస్పర సాదృశ్యా దభిన్నయోః ఉపమానోపమేయ ధర్మయోః పృథగుపాదానంబింబప్రతిబింబభావః' అని.

క. తురగంబులపై నాశ్వికు, । లరదంబులమీఁద రథికు లప్పుడు నిద్రం
బొరసిరి; కొందఱు భూస్థలి । నిరవుగ సుఖనిద్ర సేసి; రి ట్లున్నంతన్. 274

ప్రతిపదార్థం: ఆశ్వికులు= గుర్రాలపైనెక్కి యుద్ధం చేసే సైనికులు; తురగంబులపైన్= గుర్రాలపై (మరియు); రథికులు= రథాలమీద నిలిచి యుద్ధం చేసేవారు; అరదంబుల మీఁదన్= రథాలపైన; అప్పుడు= ఆ సమయంలో; నిద్రన్= నిద్రను; పొరసిరి= పొందారు; కొందఱు= మరికొందరు అనగా పదాతులు; భూస్థలిన్= భూతలంపై; ఇరవుగన్= పొందికగా; సుఖనిద్రన్= సుఖాన్ని కలిగించే నిద్రను; చేసిరి= చేశారు; ఇట్లు= ఈ విధంగా; ఉన్నంతన్= ఉండే సమయంలో.

తాత్పర్యం: ఇంకా ఆ సమయంలో ఆశ్వారోహకులు అశ్వాలపై, రథికులు రథాలపై, పదాతి దళాలు నేలపై - సుఖంగా నిద్రించారు. అట్లు వారు సుఖనిద్రలో ఉండే సమయంలో.

సీ. నలువ చెందొవల తేకులకు నన్నువు వెట్టఁ । గోరి కావించిన గుళిక యనఁగ;
నఖిల ద్విజ శ్రేష్ఠమగు చకోర చయంబు । తపము సముల్లసత్ఫల మనంగఁ ;
జిగురుజొంపము నునుజిగి యొప్ప నుదయాద్రిఁ । బొలుపారు నవకల్ప భూజ మనఁగఁ;
బూర్వ పయోరాశి పొంతఁ గెంజాయ చె । న్నొదవిన పవడంపుఁ బొద యనంగ

తే. **నరుణ రుచి తన మండల మతిశయిల్లఁ । బొడిచి, దివిఁ బ్రాఁకి, దీధితు లడరఁ జేసి,**
యంతకంతకు నెక్కుచు సంతమసముఁ । గాలుకొననీక చంద్రుఁడు గ్రాలె నధిప! 275

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; నలువ= బ్రహ్మదేవుడు; చెందొవల జేకులకున్= ఎర్రకలువల రేకులకు; అన్నువు= మెరుగు; పెట్టన్+కోరి= పెట్టదలచి; కావించిన= సిద్ధం చేసిన; గుళిక+అనఁగన్= గోళి (మందు గోళి) యా అనే విధంగా; అఖిల ద్విజశ్రేష్ఠము+అగు= పక్షులన్నింటిలో ప్రశస్తిని పొందిన, (బ్రాహ్మణులందరిలో ప్రశస్తిని గాంచిన అనే అర్థం కూడా ధ్వనిస్తూ ఉన్నది); చకోర చయంబు తపము= చకోర పక్షుల తపస్సుయొక్క; సముల్లసత్+ఫలము= ప్రకాశిస్తున్న ఫలమా; అనంగన్= అనే విధంగా; చిగురు జొంపము నునుజిగి= చిగురుటాకుల గుంపుల అందమైన కాంతి; ఒప్పన్= ప్రకాశించగా; ఉదయ+అద్రిన్= ఉదయాచలంపై (తూర్పుకొండపై); పొలుపారు= ప్రకాశించు; నవకల్పభూజము+అనఁగన్= అభినవ కల్పవృక్షమా అనే విధంగా; పూర్వ పయోరాశి పొంతన్= తూర్పు సముద్రం సమీపంలో; కెంజాయ చెన్ను= ఎర్రని కాంతుల సౌందర్యం; ఒదవిన= కలిగిన; పవడము+పొద= పగడాల పొదరిల్లా; అనంగన్= అనేవిధంగా; తన మండలము= తన బింబం; అరుణరుచిన్= ఎరుపు కాంతితో; అతిశయిల్లన్= అతిశయించగా; పొడిచి= ఉదయించి; దివిన్= ఆకాశంపైకి; ప్రాఁకి= పాకి; దీధితులు= కిరణాలు; అడరన్+చేసి= వ్యాపింపజేసి; అంతకున్+అంతకున్= క్రమక్రమంగా; ఎక్కుచున్= ఎగబ్రాకుతూ; సంతమసమున్= దట్టపు చీకటిని; కాలుకొననీక= కాలుపెట్టనీయక (వ్యాపించకుండా చేస్తూ); చంద్రుఁడు= చంద్రుడు; క్రాలెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! బ్రహ్మదేవుడు ఎర్రకలువరేకులకు మెరుగుపెట్టాలని సిద్ధంచేసిన గుళికా అని అనిపించేవిధంగా, పక్షులన్నింటిలో శ్రేష్ఠాలైన చకోరపక్షుల తపస్సుయొక్క ప్రకాశిస్తున్న ఫలమా అన్నట్లుగ, చిగురుటాకుల గుంపు యొక్క నునుపైన కాంతి ప్రకాశించగా ఉదయాద్రి మీద వెలిగే, కాంతి కల్పవృక్షమా అన్నట్లుగ, తూర్పు సముద్రం చెంత ఎర్రని కాంతి సౌందర్యం కలిగిన పగడాల పొదరిల్లా అన్నట్లుగ-తన బింబం అరుణకాంతితో అతిశయిల్లగా ఉదయించి, ఆకాశంపైకి ప్రాకి, కాంతులు వ్యాపింపచేసి, క్రమక్రమంగా ఎగప్రాకుతూ, చీకటిని కాలుమోపనీయక చంద్రుడు ప్రకాశించాడు. పగడాల పొదయా? - అన్నట్లు ప్రకాశించింది.

విశేషం: ఈ చంద్రోదయ వర్ణనం తిక్కన సోమయాజి కవితా శిల్పానికి గీటురాయి - ఈ వర్ణన ఇట్లా సంస్కృత మూలంలో కానరాదు. 'నలువ - కావించిన గుళిక యనఁగ' అన్నది కవియూహ కాబట్టి ఇది ఉత్ప్రేక్షాలంకారం, బ్రహ్మదేవుడు ఎర్రకలువల రేకులకు మెరుగులు దిద్దటానికి సృజించిన రసాయనపు గుళికగా చంద్రుడిని (చంద్రబింబాన్ని) కవి ఊహించాడు. ఎందుకు? చంద్రుడుదయించగానే ఎర్రకలువల కాంతి మరింత ఎక్కువగా ప్రకాశించింది. కాబట్టి ఇక్కడ - 'అనఁగ' అనేది ఉత్ప్రేక్షావాచకం-విశేషమేమంటే, ఉత్ప్రేక్షా వాచకమున్నంత మాత్రాన ఉత్ప్రేక్షాలంకారం కాదు. దానికి తోడుగా ఆ ఉపమానం కూడా కవి కల్పితమై ఉండాలి. అప్పుడే ఉత్ప్రేక్షాలంకార మవుతుంది. ఈ సీస పాదాలు మొదటి మూడింటిలో ఉత్ప్రేక్షాలంకారం, నాల్గవపాదంలో మాత్రం ఉత్ప్రేక్షాలంకారం కాదు - అది ఉపమాలంకారమే. పూర్వ సముద్రతీరాన పవడాల పొద ఉండటం లోక ప్రసిద్ధమే కాని కవి కల్పితం కాదు కదా! కాబట్టి ఇచ్చట మూడు ఉత్ప్రేక్షలు, ఒక ఉపమాలంకారం - ఆలంకారికులు ఈ విషయాన్ని ఇట్లా చెప్పారు.

శ్లో॥ **'యదాऽయ ముపమానాంశః, అసిద్ధః కవి కల్పితః ।**
తదోత్ప్రేక్షైవ యేనేవశబ్దః సంభావనాపరః ॥' (వివరాలకు 'చిత్రమీమాంస' ఉపకరిస్తుంది).

వ. **ఇట్లు ప్రౌఢుండై కామినీ గండ పాండు చ్ఛవిం దొట్టి కుముదంబులకు జగన్నేత్రంబులకు నానందం బాపాదించుచుఁ జంద్రుండు మహేంద్రప్రముఖ దిఙ్ముఖంబు లలంకరింపఁ గౌరవ పాండవ బలంబులు మేలుకని యాలంబునకుఁ దొడఁగె; నప్పుడు కురురాజు గురుని కడకుం జని యతని యస్త్రవీర్య శౌర్యంబు లగ్గించి 'యిట్టివాడవు నీకు**

సరిగాని వారిం బాండవులఁ బెద్దసేసికొని శిష్యత్వంబు పాటించి పోటునకుం జొరక తిరుగుట నా భాగ్యంబు చందంబు గాక! నే నేమి సేయవచ్చు?' ననవుడు నతండు గనలి 'యర్జునుండు శిష్యుం డని మన్నించియ కాదె ఖాండవం బాఖండలుండు గోలుపోయె; ఘోషయాత్రఁ జిత్రసేనాది గంధర్వులు నిన్ను విడిచి వలియం బాఱిరి నివాత కవచ కాలకేయాదులు పొలిసి? రివి యేల? వలవని దురుక్తు లనుటయు నమ్మనుజపతి గోపించి సంరంభంబుగా నక్కుంభసంభవుతో 'నీవు సవ్యసాచికిఁ జాలవేనిం జాలవ కాక! నిలువుము కొంత సైన్యంబు గొని నీయోపినవారితోడం బెనంగు; మేనును దుశ్శాసన శకుని కర్ణులు నా కవ్వడిఁ గూల్చెద' మనిన నవ్వి యవ్వీరుం 'డట్ల చేయుం; డిది గర్జం; బత్తెఱంగునన గెలుతురు గాని పొం' డని పలికి, వెండియు. 276

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ప్రౌఢుండు+ఐ= వృద్ధిని పొందినవాడై; కామినీ గండపాండుచ్ఛవిన్= యువతుల చెక్కిళ్ళ తెల్లని కాంతిని; తొట్టి= వహించి; కుముదంబులకున్= కలువలకు; జగత్+నేత్రంబులకున్= లోకం కన్నులకు; ఆనందంబు= సంతోషాన్ని; ఆపాదించుచున్= కలిగిస్తూ; చంద్రుండు; మహేంద్ర ప్రముఖ దిక్+ముఖంబులన్= ఇంద్రాది దేవతల దిక్కుల - అనగా తూర్పు మొదలగు ఎనిమిది దిశల, వాటి అగ్రభాగాలను; అలంకరింపన్= అలంకరింపజేస్తూ (తన వెన్నెలలతో దిక్కులన్నీ ప్రకాశింపజేస్తూ); కౌరవ పాండవ బలంబులు= కౌరవ పాండవ సైన్యాలు; మేలుకని= నిద్రనుండి మేల్కొని; ఆలంబునకున్= యుద్ధానికి; తొడఁగెన్= పూనుకొన్నాయి; అప్పుడు= ఆ సమయంలో; కురురాజు= దుర్యోధనుడు; గురునికడకున్= ద్రోణాచార్యుడి సమీపానికి; చని= వెళ్ళి; అతని+అస్త్రవీర్యశౌర్యంబులు= ఆ ద్రోణాచార్యుడి దివ్యాస్త్రముల శక్తిని, మరియు అతడి పరాక్రమాన్ని; అగ్గించి= పొగడి; అట్టివాఁడవు= అంతటి గొప్పవాడవు; నీకు సరిగాని వారిన్= నీకు సాటిరాని వారైన; పాండవులన్= ధర్మరాజాదులను; పెద్ద+చేసికొని= గొప్పగా చేసికొని (నిజానికి నీకంటె వారు గొప్పవారు కారని భావం); శిష్యత్వంబు= శిష్యభావాన్ని; పాటించి= పురస్కరించుకొని; పోటునకున్= యుద్ధానికి; చొరక= చొచ్చుకొని పోకుండా; తిరుగుట= తిరగటం (పైపైకి యుద్ధం చేస్తున్నట్లు ఆడంబరం కనపరచటమే తప్ప నిజానికి ఇది యుద్ధం కాదని భావం); నా భాగ్యంబు చందంబు+కాక= నా అదృష్టం తీరు తప్ప (మరేదీ కాదు. కాబట్టి దైవాన్ని ఎదిరించి); నేను+ఏమి+చేయవచ్చును?= నేనేమి చేయజాలుతాను? (ఏమీ చేయలేనని భావం); అనవుడున్= (ఇట్లా) అనగానే; అతండు= ఆ ద్రోణాచార్యుడు; కనలి= మండిపడి (ఇట్లా అన్నాడు); అర్జునుండు= అర్జునుడు; శిష్యుండు+అని= నా శిష్యుడని; మన్నించి+అ+కాదె= తలపోసియే కాదా; ఖాండవంబు= ఖాండవవనాన్ని; ఆఖండలుండు= ఇంద్రుడు; కోలుపోయెన్?= పోగొట్టుకొన్నాడు?; ఘోషయాత్రన్= ఘోషయాత్రలో; చిత్రసేన+ఆది గంధర్వులు= చిత్రసేనుడు మొదలైన గంధర్వులు; నిన్నున్= ఓ దుర్యోధనా! నిన్ను; విడిచి= బంధవిముక్తుడిని చేసి విడిచిపెట్టి; వలియన్= అలసట కలిగే విధంగా (వేగంగా అని భావం); పాఱిరి= పారిపోయారు; నివాత కవచ కాలకేయ+ఆదులు= నివాతకవచులు, కాలకేయులు మొదలైన రాక్షసులు; పొలిసిరి= నశించారు; ఇవి= ఈ; వలవని దురుక్తులు= తగని దుర్భాషలు; ఏల?= ఎందుకు?; అనుటయున్= అనగానే; ఆ+మనుజపతి= ఆ దుర్యోధనుడు; కోపించి= కోపపడి; సంరంభంబుగాన్= ఉద్రేకంగా; ఆ+కుంభసంభవుతోన్= ఆ ద్రోణాచార్యుడితో (ఇట్లా అన్నాడు); నీవు= ఓ ద్రోణాచార్యా! నీవు; సవ్యసాచికిన్= ఆ అర్జునుడికి; చాలవేనిన్+చాలవ కాక!= దీటయిన వాడవు కాకపోతే కాకపోదువు గాక; నిలువుము= నిలిచిపొమ్ము (అర్జునుడిని ఎదిరించకుండా ఉండిపో) (మరేం చేయాలంటే); కొంత సైన్యంబు= (నీకు అవసరమైన) కొంత సైన్యాన్ని; కొని= తీసికొని; నీ+ఓపిన వారితోడన్= నీ శక్తికి తగినవారితో; పెనంగుము= యుద్ధం చేయుము; ఏనును= నేనూ; దుశ్శాసన శకుని కర్ణులును= దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు (మేమందరం కలిసి); ఆ కవ్వడిన్= ఆ అర్జునుడిని; కూల్చెదము= సంహరిస్తాము; అనినన్= అని అనగా; నవ్వి; ఆ+వీరుండు= వీరుడైన ఆ ద్రోణాచార్యుడు; అట్లు= ఆ విధంగా; చేయుండు= చేయండి; ఇది= ఈ మీ ప్రయత్నం; కర్జంబు= ప్రకృతంలో చేయటానికి తగింది; ఆ+తెఱంగునన్+అ= ఆ విధంగానే; గెలుతురు గాని= గెలుస్తారు కావచ్చు; పొండు= వెళ్ళండి; అని పలికి= అని చెప్పి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ఈ విధంగా క్రమక్రమంగా వృద్ధిని పొందుతూ చంద్రుడు విరహిణీ స్త్రీల చెక్కిళ్ళ తెల్లని కాంతుల సోయగాన్ని పొందాడు. కలువలను వికసింపజేస్తూ వాటి కానందం చేకూర్చాడు. అంతవరకు చీకటిలో మ్రగ్గిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లోకుల కన్నులకు ఆహ్లాదాన్ని కలిగిస్తూ దిక్కులన్నింటిలో వెన్నెలలు విరజిమ్మాడు. అప్పుడు కౌరవ పాండవ సైన్యాలు నిద్రనుండి మేల్కొన్నాయి. యుద్ధానికి దిగాయి. అప్పుడు దుర్యోధనుడు ద్రోణాచార్యుడిని సమీపించాడు. అతడి అస్త్రవిద్యా కౌశలాన్ని, పరాక్రమాన్ని ప్రస్తుతించి ఇట్లా అన్నాడు: 'ఓ ఆచార్యా! ఇంతటి గొప్పవాడవు నీవు. నీకు ఈ పాండవులు దేనిలోను సరిరారు. అయినా వారిని శిష్యులుగా భావించి గొప్పగా చిత్రిస్తూ వారితో యుద్ధానికి తగిన విధంగా తలపడకపోతున్నావంటే అది నా దురదృష్టం. దైవాన్ని నిందించటమే తప్ప ఇంతకంటే నే నేమి చేయగలను?' దుర్యోధను డిట్లా పలికిన వెంటనే ద్రోణాచార్యుడు కోపంతో ఇట్లా అన్నాడు: 'ఆనాడు ఇంద్రుడు తన ఖాండవవనాన్ని అగ్నిహోత్రుడి బారినుండి రక్షించుకోలేక వదులుకొన్నాడంటే - అగ్నిహోత్రుడికి రక్షణగా నిలిచిన అర్జునుడు నా శిష్యుడని మన్నించేనా? ఘోషయాత్రలో చిత్రసేనాది గంధర్వులు నిన్ను బందీగా పట్టుకొని కూడా విడిచి పారిపోయారంటే అదికూడా అర్జునుడు నా శిష్యుడని భావించేనా? ఇంద్రాదులకే దుర్జయులైన నివాత కవచ కాలకేయాది రాక్షసులను జయించింది అర్జునుడు నా శిష్యుడనేనా? ఇదంతా తెలిసి ఉండీ కూడా నీవు లేనిపోని దుర్భాషలాడటం ఎందుకు?' అని ద్రోణాచార్యుడు గద్దించగానే ఆ దుర్యోధనుడు కోపావేశంతో అతడితో ఇట్లా అన్నాడు: 'ఓ ద్రోణాచార్యా! ఇట్లా అర్జునుడి గొప్పలు చెప్పే నీవు ఆ అర్జునుడికి దీటుగా నిలిచి పోరాడ జాలకపోతే పోనీ, అతడితో యుద్ధానికి దిగక ఉండిపొమ్ము, నీకు ఇష్టమైన వారితోనే యుద్ధం చేయటానికి కొంత సైన్యం తీసుకొని వెళ్ళుము. ఆ అర్జునుడితో యుద్ధం చేసి, ఓడించి, సంహరించటానికి నేను, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు ఉండనే ఉన్నాము' ఇట్లా దుర్యోధనుడు పలుకగా విని ద్రోణాచార్యుడు నవ్వి దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు: 'ఓ దుర్యోధనా! మీరందరూ అట్లా చేయండి. ప్రస్తుతం ఇదే మీ కర్తవ్యం. ఒకవేళ అట్లా చేస్తే అర్జునుడిని గెలువవచ్చునేమో? పొండి' అని పలికి మళ్ళీ - (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 1. ఈ చంద్రోదయ వర్ణనం సంస్కృత మూలానుసారియై ఉన్నది. సంస్కృత మూలంలో ఈ చంద్రవర్ణనాపరమైన శ్లోకం ఎన్నో అలంకారశాస్త్ర గ్రంథాలలో ఉదాహృతమై ప్రసిద్ధి చెందింది. ఆ శ్లోకం ఇది -

శ్లో॥ "తతః కుముదనాథేన కామినీగండ పాండునా
నేత్రానందేన చంద్రేణ మాహేంద్రీ దిగలంకృతా" (ద్రోణ. 185 - 46)

కువలయానందకర్త అప్పయ్య దీక్షితులు ఈ శ్లోకాన్ని రూపకాలంకారోదాహరణంగా ఉదాహరించాడు.

2. ఇంకో విశేషం - అర్జునుడి పరాక్రమ ప్రశస్తిని చాటి చెప్పే మూడు సంఘటన లిక్కడ ఉదాహరించబడ్డాయి. ఒకటి ఖాండవదహన వృత్తాంతం. ఇది శ్రీ మదాంధ్ర మహాభారతం ఆదిపర్వంలోని అష్టమాశ్వాసంలో ఉన్నది. ఇక రెండవది ఘోషయాత్రా వృత్తాంతం - ఇది శ్రీమదాంధ్ర మహాభారతం అరణ్యపర్వంలోని పంచమాశ్వాసంలో ఉన్నది. మూడవది నివాతకవచులనే మూడు కోట్ల రాక్షసులను జయించిన కథ ఆంధ్రమహాభారతం అరణ్యపర్వం చతుర్థాశ్వాసంలోనిది. ఆయా ఆశ్వాసాల నుండే ఈ కథల వివరాలు తెలుసుకొనవచ్చు.

క. 'కుడిచితి, కట్టితి, పెట్టితి, । పుడమి సమస్తంబు నఖిల భోగంబుల నె
క్కుడు పేర్మి ననుభవించితి; । తొడరుము వెఱ పుడిగి పార్థుతోడఁ గుమారా! 277

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఓ కుమారా!= ఓ దుర్యోధనా!; కుడిచితి= వివిధరుచ్యభోజ్య పదార్థాలను భుజించావు; కట్టితి= సువర్ణవస్త్రాలను ధరించావు; పెట్టితి= నీవు మాత్రమేకాక నీవారందరికీ కుడువ కట్టబెట్టావు; పుడమి సమస్తంబు= ఈ భూమినంతా; అఖిల భోగంబులన్= సమస్త రాజభోగాలతో; ఎక్కుడు పేర్మిన్= మిక్కిలి గొప్పతనంతో; అనుభవించితి= అనుభవించావు. (ఇక నీకు ఇది అనుభవించకపోయితినే అనే ఏ చింతా లేదు కాబట్టి); వెఱపు= మరణభయాన్ని; ఉడిగి= విడిచి; పార్థుతోడన్= అర్జునుడితో; తొడరుము= యుద్ధానికి పూనుకొమ్ము.

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! నీవీ భూమండలాన్ని సమస్త రాజభోగాలతో గొప్పగా అనుభవించావు. వివిధ రుచ్య భోజ్య పదార్థాలను, సువర్ణ వస్త్రాదులను నీవు మాత్రమే కాక నీవారందరిని అనుభవింపజేశావు. ఇంతకంటె కావలసిందేముంది? - ఇక నీవు నిశ్చింతగా అర్జునుడితో యుద్ధానికి వెళ్ళుము. అర్జునుడి చేతిలో మరణిస్తానేమో అనే భయం నీ కక్కరలేదు. వెళ్ళుము'.

విశేషం: **శ్లో॥ దత్తం భుక్తమధీతం చ ప్రాప్తమైశ్వర్య మీప్సితం**
కృతకృత్యోऽ నృణశ్చాసి మాభై ర్యుధ్యస్వ పాండవమ్॥ (ద్రోణ - 185/36)

ఈ సంస్కృత మూలశ్లోకానికి తెలుగు సేత ఇది - 'అధీతం' అనే పదానికి తెలుగు సేత లేదు. అధ్యయనమంటే వేదశాస్త్రాద్యధ్యయనమే అవుతుంది కాని ధనుర్వేదాదుల అభ్యాసం అధ్యయనమనిపించుకోదు. ఆ పదం ఆ అర్థమందే రూఢమైంది. దుర్యోధనుడు వేదాదుల నభ్యసించినా అది అతనియందు చరితార్థం కాలేదు. సద్ధర్మాచరణమే అధ్యయన ఫలం. అది పరద్రోహచింతన శీలుడైన దుర్యోధనుని యందు మృగ్యమే. కాబట్టి ఆ పదాన్ని పరిహరించటంలో తిక్కన ఎంతో ఔచిత్యం పాటించాడనిపిస్తుంది.

వ. **అని యప్పాంచాలు బలంబు దిక్కు పేరుక్కున నడచెఁ; గౌరవపతియును బాండవుల వలనికి నురవడించె; నిట్లు వేకువ జామున సంగ్రామంబు సెల్లఁ బదంపడి తూ ర్పెఱ్ఱ నగుచు వచ్చె; నప్పు డచ్యుతుం డర్జును నాలోకించి 'రెండు మైల గండు మిగిలి వచ్చి పోరెదు నిమ్మూఁకల నన్నిటిని డాపట నిడి తఱుమవలయు' నని యతం డొడంబడ నమ్మెయి నరదంబు నడపె; భీముండును బరవసంపు మాటల బీభత్సునిం బురికొలిపె; నివ్విధంబునఁ గడంగిన గాండీవిం బొదివి దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులు పెల్లేసిన 'నయ్యోధవరుం డందఱ కన్నిరూపులై యేట్లాడ నిరువాఁగును బెరసి తలలు వట్టికొని పోట్లాడెఁ; దదనంతరంబ. 278**

ప్రతిపదార్థం: అని= అని పలికి; ఆ+పాంచాలు బలంబు దిక్కు= పాంచాల రాజుల సైన్యంవైపు; పేరు+ఉక్కునన్= గొప్ప వేగంతో; నడచెన్= వెళ్ళాడు; కౌరవపతియును= దుర్యోధనుడు కూడ; పాండవుల వలనికిన్= పాండవుల వైపునకు; ఉరవడించెన్= వెళ్ళటానికి వేగిరపడ్డాడు; ఇట్లు= ఈ విధంగా; వేకువజామున(న్)= తెల్లవారుజామున; సంగ్రామంబు= యుద్ధం; చెల్లన్= నడుస్తూ ఉండగా; పదంపడి= క్రమక్రమంగా; తూర్పు= తూర్పుదిక్కు; ఎఱ్ఱనగుచు వచ్చెన్= ఎర్రబారజొచ్చింది; అప్పుడు= ఆ సమయంలో; అర్జునున్= అర్జునుడిని; ఆలోకించి= చూచి; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు (ఇట్లా అన్నాడు); రెండు మైలన్= రెండు వైపుల; గండు= పౌరుషం; మిగిలి= అతిశయించి (పరాక్రమాతిశయంతో); వచ్చి; పోరెదు= యుద్ధం చేస్తున్న; ఈ+మూఁకలన్+అన్నింటిని= ఈ సైన్యాలనన్నింటిని; డాపటన్= ఎడమవైపు; ఇడి= ఉంచి; తఱుమవలయున్= పరుగులు తీయించాలి; అని= ఇట్లా పలికి; అతండు=ఆ అర్జునుడు; ఒడంబడన్= సమ్మతించగా; ఆ+మెయిన్= ఆ విధంగా; అరదంబు= రథాన్ని; నడపెన్= తోలించాడు; భీముండును= భీమసేనుడును; బరవసంపు మాటలన్= అభినివేశాన్ని కలిగించే మాటలతో; బీభత్సునిన్= అర్జునుడిని; పురికొలిపెన్= ఉత్సాహ పరిచాడు; ఈ+విధంబునన్= ఈ విధంగా; కడంగిన గాండీవిన్= యుద్ధానికి ఉద్యమించిన అర్జునుడిని; పొదివి= చుట్టుముట్టి; దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులు= దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు అనే నల్వురు యోధులు; పెల్లు=మిక్కిలి;ఏసినన్=

బాణాలు వేయగా - యుద్ధం చేయగా అని భావం; ఆ+యోధవరుండు= యోధులలో శ్రేష్ఠుడైన ఆ అర్జునుడు; అందఱకున్= ఆ యోధులందరికీ; అన్నిరూపులై= (వారెందరో) అన్ని రూపాలు గలవాడై - అనగా అట్లా భాసిస్తూ (ఆయా యోధులు తమతోనే యుద్ధం చేస్తున్నట్లుగా తోస్తూ అని భావం); ఏట్లాడన్= యుద్ధం చేయగా; ఇరువాఁగును= రెండువైపుల సైన్యాలు; బెరసి= కలిసిపోయి; తలలు+పట్టికొని= ఒకరితలనొకరు పట్టుకొని; పోట్లాడెన్= యుద్ధం చేశాయి; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: అని పలికి పాంచాలవీరుల సైన్యాలవైపు యుద్ధం చేయటానికి వెళ్ళాడు (ద్రోణాచార్యుడు.) ఇక దుర్యోధనుడు పాండవులున్న వైపునకు యుద్ధానికి పరుగుతీశాడు. ఇట్లా తెల్లవారుజామున యుద్ధం సాగుతూ ఉన్నది. క్రమక్రమంగా తూర్పుదిక్కు ఎఱ్ఱబారసాగింది. అప్పుడు కృష్ణుడు అర్జునుడిని చూచి ఇట్లా అన్నాడు. 'ఈ కౌరవ సైన్యాలు రెండు వైపులనుండీ వస్తున్నాయి. పౌరుషంతో యుద్ధం కూడా బాగా చేస్తున్నాయి. ఈ సైన్యాలనన్నింటిని ఎడమవైపుగా ఉంచి తరిమివేయాలి.' అర్జునుడు అట్లే అన్నాడు. కృష్ణుడు రథం ఆ వైపునకు నడుపుతూ ఉన్నాడు. అప్పుడు భీముడు పౌరుషాన్ని రేకెత్తించే మాటలు పలుకుతూ అర్జునుడిని మరింత ఉత్తేజపరిచాడు. అంతలోనే దుర్యోధనాది దుష్టచతుష్టయం అర్జునుడిని ఎదుర్కొని బాణాలు కురిపించారు. వారిని చూడగా అర్జునుడికి కోపం రెండింతలై వారికందరికీ అన్ని రూపాలతో యుద్ధం చేస్తున్నట్లు భాసించాడు. రెండు వైపుల సైన్యాలు కలియబడి ఒకరితలనొకరు పట్టుకొని కేశాకేశి బాహాబాహి అన్నట్లుగా యుద్ధం చేశాయి. తరువాత

విశేషం: కేశాకేశి యుద్ధం సాగిందని చెప్పటంచేత అర్జునుడి ధాటికి తమ తమ రథగజాశ్వవాహనాలు భగ్నంకాగా, ధూళి రేగి సైన్యమంతా అంధకారం అలుముకొని తమవా రెవరో ఇతరు లెవరో తెలియక ఎదురైన వారితో కేశాకేశి యుద్ధానికి దిగారనే మూలార్థం ఇక్కడ సంగ్రహించబడింది. సంస్కృత మూలం ఇట్లా ఉన్నది.

శ్లో॥ అథ దుర్యోధనః కర్ణః శకునిశ్చాపి సౌబలః ॥
అభ్యవర్షచ్ఛరవ్రాతైః కున్తీపుత్రం ధనంజయమ్ ॥
తేషా మస్త్రాణి సర్వేషా ముత్తమాస్త్రవిదాం వరః ॥
కదర్థీకృత్య రాజేంద్ర! శరవర్షైరవాకిరత్ ।
అస్త్రై రస్త్రాణి సంవార్య లఘుహస్తో జితేంద్రియః ॥
సర్వా నవిధ్యన్నిశితై ర్దశభిర్దశభిః శరైః ।
ఉద్ధూతా రజసో వృష్టిః శరవృష్టి స్తథైవ చ ॥
తమశ్చ ఘోరం శబ్దశ్చ తదా సమనుభవ న్మహాన్ ।
న ద్యౌ ర్న భూమి ర్న దిశః ప్రాజ్ఞాయంత తథా గతే ॥
సైన్యేన, రజసా మూఢం సర్వమంధ మివా భవత్ ।
నైవ తే న వయం రాజన్ ప్రాజ్ఞాసిష్మ పరస్పరమ్ ।
ఉద్దేశేనహి తేన స్మ సమయుధ్యన్త పార్థివాః ।
విరథా రథినో రాజన్ సమాసాద్య పరస్పరమ్ ॥
కేశేషు సమసజ్జన్త కవచేషు భుజేషు చ ।
హతాశ్వా హతసూతాశ్చ నిశ్చేష్టా రథినో హతాః ॥ (ద్రోణ. 186-14-21 శ్లో)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మొనలో నిలువక యుత్తర । మునకై చని యేకతంబు మొనసిన గురునిం
గని పాండవ సైన్యము పులిఁ । గనిన హరిణకులము నట్లు కంపము నొందెన్. 279

ప్రతిపదార్థం: మొనలోన్= సైన్యంలో; నిలువక= ఉండక; ఉత్తరమునకై= ఉత్తర దిక్కునకు; చని= వెళ్ళి; ఏకతంబు= ఒంటరిగా; మొనసిన గురునిన్= యుద్ధానికి పూనుకొన్న ద్రోణాచార్యుడిని; కని= చూచి; పాండవ సైన్యము= పాండవుల సైన్యం; పులిన్= పెద్దపులిని; కనిన హరిణ కులము అట్లు= చూచిన లేళ్ళ సమూహం వలె; కంపము= వణకును; ఒందెన్= పొందింది (భయంతో వణకిపోయింది.)

తాత్పర్యం: సైన్యం అగ్రభాగాన నిలువకుండా ద్రోణాచార్యుడు ఉత్తరభాగానికి వెళ్ళి, ఒంటరిగా పోరు సల్పటానికి పూనుకోగా పాండవసైన్యం పులిని చూచి లేళ్ళసమూహం భయపడినట్లు భయపడి వణకిపోయింది.

విశేషం: అలం: ఉపమ. ఈ ఉపమానం ద్రోణాచార్యులముందు నిలిచి పోరు సల్పే ధైర్యంకల వాడెవ్వడు కూడా లేడనే అర్థాన్ని సూచిస్తుంది.

వ. ఇత్తెఱంగున నెఱి గలిగి యద్దెసవారిం బిలిచిన నా సైనికు లచ్చెరువడువారును, గోపించువారును, గడంకలు దెచ్చుకొను వారును, నివ్వెఱఁగందు వారునునయి; రందు విరాట ద్రుపదులును ద్రుపదు మనుమలలోన ముప్వురును గేకయపతులును సబలంబుగా బలువిడిం గవిసి యక్కుంభసంభవుం జుట్టుముట్టిన, నతండు. 280

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; నెఱి= పరాక్రమం; కలిగి= ఉండి; ఆ+దెసవారిన్= ఆ వైపున ఉన్నవారిని; పిలిచినన్= యుద్ధానికి ఆహ్వానించగా; ఆ సైనికులు= ఆ సైన్యంలోని వారు (కొందరు); అచ్చెరువడువారును (అయిరి)= ఆశ్చర్యపడేవారు; కోపించువారును (అయిరి)= కోపంగల వారయినారు (మరికొందరు); కడంకలు= ఉత్సాహాలు; తెచ్చుకొనువారును (అయిరి)= తెచ్చుకొన్నవారు (అనగా లేని ఉత్సాహాన్ని చూపుతూ తెగించారు); (మరికొందరు) నివ్వెఱఁగు= నిశ్చేష్టతను (కాళ్ళు, చేతులు ఆడని స్థితిని); అందువారును= పొందేవారు; అయిరి= అయ్యారు; (అయిరి అనే ఈ పదం అచ్చెరువడువారును మొదలగు పదాలన్నింటితో అన్వయిస్తుంది). (కాబట్టి అన్నింటితో ఈ పదాన్ని జోడించి అర్థం వ్రాయబడింది. ఇట్లా పదాన్ని ఆవృత్తి చేయటాన్ని అనుషంగం అంటారు); అందున్= ఆ సైన్యంలో విరాట ద్రుపదులును=విరాటరాజు, ద్రుపదమహారాజు; ద్రుపదు మనుమలలోనన్= ద్రుపదుడి మనుమలలో; ముప్వురును= ముగ్గురు మనుమలు మాత్రం; కేకయపతులును= కేకయ దేశపు రాజులు (వీరందరు); సబలంబుగాన్= తమ తమ సైన్యాలతో కూడా; బలువిడిన్= వేగంగా; కవిసి= ఎదుర్కొని; ఆ+కుంభసంభవున్= ఆ ద్రోణాచార్యుడిని; చుట్టుముట్టినన్= చుట్టుముట్టగా; అతండు= ఆ ద్రోణాచార్యుడు.

తాత్పర్యం: ఈ విధంగా పరాక్రమశాలి అయిన ద్రోణాచార్యుడు ఆ శత్రుపక్షీయులను యుద్ధానికి ఆహ్వానిస్తూ ఉంటే ఆ సైనికులు కొందరు ఆశ్చర్యపోయారు. మరి కొందరు యోధులు అతడిపై కోపంతో మండిపడ్డారు. మరికొందరు లేని ఉత్సాహాన్ని తెచ్చుకొని యుద్ధానికి సన్నద్ధమయ్యారు. మరికొందరు కాళ్ళూ చేతులు ఆడక, అట్లే చూస్తూ ఉండిపోయారు. ఇట్టి పరిస్థితిలో విరాట ద్రుపద రాజులు ఇద్దరు, ద్రుపదుడి మనుమలు ముగ్గురు మరియు కేకయరాజులు వీరందరూ సైన్యాలతో కలిసి వేగంగా వెళ్ళి ద్రోణాచార్యులను చుట్టుముట్టారు. అప్పుడు ఆ ద్రోణాచార్యుడు (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. ప్రజ నెల్లం దునుమాడి యుగ్రముఖుఁ డై పాంచాల పౌత్రత్రయం
బు జముం జేరఁగఁ బుచ్చి, కేకయుల కేపుం జేవయుం జూపి యం
బుజముల్ గోసినకైవడిం దలలు సంఫుల్లాస్య భల్లంబు ల
క్కజ మై యుండ నిగిడ్చి త్రుంచెఁ బటుదోర్గర్వం బఖర్వంబుగన్. 281

ప్రతిపదార్థం: ప్రజన్+ఎల్లన్= సమస్త సైనిక జనాన్ని; తునుమాడి= సంహరించి; ఉగ్రముఖుఁడు+ఐ= భయంకరమైన ముఖం గలవాడై (క్రోధోద్దీప్తిచేత ఆ ద్రోణాచార్యుడి ముఖం శత్రువులకు భయం కొల్పుతూ ఉన్నదని భావం); పాంచాల పౌత్రత్రయంబు= పాంచాలరాజైన ద్రుపదుడి ముగ్గురు మనుమలను - త్రయ మనగా మూడింటి సముదాయం (పౌత్రాణాంత్రయం ష.త.స.); జమున్= మృత్యుస్వరూపుడైన యమధర్మరాజును; చేరఁగన్= చేరేవిధంగా; పుచ్చి= పంపి (సంహరించి); కేకయులకున్= కేకయ రాజులకు; ఏపున్= ఆధిక్యాన్ని; చేవయున్= సామర్థ్యాన్ని; చూపి= దర్శింపజేసి; సంఫుల్ల+ఆస్య భల్లంబులు= మిక్కిలి వికసించిన వెడల్పైన ముఖం అనగా అగ్రభాగం (ములికి) గలిగి ఉన్న భల్లము లనే బాణాలు; అక్కజము+ఐ+ఉండన్= ఆశ్చర్యాన్ని కలిగించేవై ఉండే విధంగా; నిగిడ్చి= చొప్పించి; తలలు= ఆ కేకయరాజుల తలలను; అంబుజముల్= కమలాలను; కోసిన కైవడిన్=కోసినవిధంగా; పటుదోర్గర్వంబు= సమర్థములైన బాహువులయొక్క గర్వం; అఖర్వంబుగన్= అనల్పమై ఉండే విధంగా; త్రుంచెన్= త్రెంచి వేశాడు; (తీక్ష్ణములైన భల్లాలనే పేరుగల బాణాలతో కేకయరాజుల తలలను ఖండించి తన బాహుబలాన్ని చాటుకొన్నాడనిభావం).

తాత్పర్యం: సైన్యంలోని వార లందరినీ సంహరించి, మరియు క్రోధావేశంతో భయంకరమైన ముఖం కలవాడై, ద్రుపదుడి మనుమలను ముగ్గురిని హతమార్చాడు. తరువాత కేకయరాజులకు తన శక్తి ఎట్టిదో చూపించాడు. ఆ కేకయరాజుల తలలను భల్లబాణాలతో కమలాలను కోసినంత సులువుగా తెగగొట్టివేశాడు. శత్రువులకు తన బాహుబలంయొక్క గొప్పతనమేమిటో తెలిసిపోయేటట్లు చేశాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. వెండియు. 282

తాత్పర్యం: ఇంకా.

విరాట ద్రుపదులు ద్రోణునిచేతఁ జచ్చుట (సం. 7-161-34)

శా. చంచద్బాణ పరంపరా ప్రహతులన్ సైన్యంబుఁ గ్రూరోద్ధతిం
జించెం; జించిన నింక నెన్నఁటికి నిస్సీ భూరిబాహాబలం
బంచుం గూడి కడంగి నొంపఁ గుపితుండై మత్స్యభూవల్లభుం
బాంచాల క్షితినాథునిం దునిమె దర్పస్ఫూర్తి శోభిల్లఁగన్. 283

ప్రతిపదార్థం: చంచత్= కదలుతున్న; బాణ= బాణాలయొక్క; పరంపరా= వరుసలచేతనైన; ప్రహతులన్= దెబ్బలచేత; సైన్యంబు= (తమ తమ) సైన్యాన్ని; క్రూర+ఉద్ధతిన్= భయంకరమైన ఔద్ధత్యంతో; చించెన్= చీల్చివేశాడు; చించినన్= చీల్చి చెండాడగా (చూచి విరాటద్రుపదులు); భూరిబాహాబలంబు= ఈ మా గొప్ప బాహుబలం; ఇస్సీ= వ్యర్థం; ఇంకన్= మళ్ళీ; ఎన్నఁటికిన్= ఏనాటికి; అంచున్= అంటూ; కూడి= ఆ ఇద్దరు కలిసి; కడంగి= పూనుకొని; నొంపన్= బాణాల వర్షంతో నొప్పించగా; కుపితుండు+ఐ= కోపం గలవాడై (ఆ ద్రోణాచార్యుడు); మత్స్యభూవల్లభున్= మత్స్య దేశపురాజైన విరాటుడిని; పాంచాలక్షితినాథున్= పాంచాలదేశపురాజైన ద్రుపదుడిని (వీరిద్దరిని); దర్పస్ఫూర్తి= బాహుబలదర్పంయొక్క స్ఫురణం; శోభిల్లఁగన్= శోభిస్తూ ఉండే విధంగా; తునిమెన్= సంహరించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: (ఆ ద్రోణాచార్యుడు) శత్రులకు భయం కలిగించే ఔద్ధత్యంతో వాడి అయిన బాణాల పరంపరలు వర్షించి, ఆ సైన్యాన్ని చీల్చి చెండాడాడు. విరాట ద్రుపదులు 'ఇప్పుడు గాక మరెప్పుడు మా బాహుబలాల ఉపయోగం?' అని మనస్సులో భావించి, మిక్కిలి క్రోధోత్సాహాలతో ద్రోణుడిని ఎదుర్కొని అతడిపై బాణవర్షాన్ని కురిపించగా, దానితో ద్రోణాచార్యుడు మిక్కిలి కోపించి, వెంటనే తన బాహుబల గర్వం ప్రకాశించే విధంగా విక్రమించి విరాట ద్రుపదులను నేలగూల్చాడు.

వ. **ఇవ్విధంబున విరాటద్రుపదులు పడినం జూచి ధృష్టద్యుమ్నుండు 'ద్రోణుం జంప నయితినేనిం గులాచార ధర్మంబులకుఁ దప్పినవాఁడ నగుదు' నని పలువురు విన బాస యిచ్చి పాంచాల సేనా సమన్వితుండై యతని పయిం గవిసినం గురుపతి గర్ణాదులుం దానును నడ్డపడి పెనంగెఁ; పెనంగినం దవులం బడిన యా ద్రుపదనందనుం గనుంగొని యనిలతనయుం డదల్చి 'నన్నుఁ జూడు' మనుచు నడరిన నప్పార్షతుండును గూడికొనిన నక్కౌరవేశ్వరుండును బరవసంబు సేయుటయు, నుభయ బలంబులుం బురికొని తలపడిన సంకుల సమరం బయ్యెఁ; నంత.** **284**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; విరాట ద్రుపదులు= విరాటరాజు, ద్రుపదరాజు (వీరిద్దరు); పడినన్= పడిపోగా (సంహరింపబడగా); చూచి= గమనించి; ధృష్టద్యుమ్నుండు= ద్రుపదుడి కుమారుడు ధృష్టద్యుమ్నుడు; ద్రోణున్= ద్రోణాచార్యుడిని; చంప నయితి నేనిన్= చంపక పోయినట్లయితే; కుల+ఆచార ధర్మంబులకున్= వంశపరంపరగా వచ్చిన కులాచారాలకు, ధర్మాలకు కూడ; తప్పినవాఁడను+అగుదును= అతిక్రమణ చేసిన వాడిని అవుతాను; అని= ఈ విధంగా; పలువురు= అనేకులు; వినన్= వింటూ ఉండగా; బాస+ఇచ్చి= మాట ఇచ్చి (ప్రతిజ్ఞచేసి); పాంచాలసేనా సమన్వితుండు+ఐ= పాంచాల సైన్యంతో కూడుకొన్నవాడై; అతని పయిన్= ఆ ద్రోణాచార్యుడిపైకి; కవిసినన్= ఉరుకగా; కురుపతి= దుర్యోధనుడు; కర్ణ+ఆదులున్= కర్ణుడు మొదలైన వారు; తానును= తాను (ఆ దుర్యోధనుడు స్వయంగా); అడ్డపడి= (అటువైపు వెళ్ళకుండా) అడ్డంవచ్చి; పెనంగెన్= పోరాడారు; పెనంగినన్= (వారు అడ్డగించి తనపై) పోరాటం సాగించగా; తవులన్+పడిన= వారినే తగుల్కొని ఉన్న (అనగా తదేక దీక్షతో వారితోనే యుద్ధానికి దిగుతున్న); ఆ ద్రుపదనందనున్= ఆ ధృష్టద్యుమ్నుడిని; కనుంగొని= చూచి; అనిల తనయుండు= వాయుపుత్రుడైన భీముడు; అదల్చి= గద్దించి; నన్నున్= నన్ను (భీముడిని); చూడుము+అనుచున్= చూడుము అంటూ; అడరినన్= ద్రోణాచార్యుల వైపు (భీముడు) విజృంభిస్తూ ఉండగా; ఆ+పార్షతుండును= ఆ ధృష్టద్యుమ్నుడు కూడ; కూడికొనినన్= (భీముడితో) కలియగా; ఆ+కౌరవ+ఈశ్వరుండును= ఆ దుర్యోధనుడు కూడ; బరవసంబు= (తన సైన్యానికి) ఉత్సాహం; చేయుటయున్= కలుగజేయగా; ఉభయ బలంబులున్= ఇరువైపులలోని సైన్యాలు; పురికొని= విజృంభించి; తలపడినన్= యుద్ధానికి తలపడగా; సంకుల సమరంబు= ఒకదానిలో నొకటి చొచ్చుకపోయి సాగిన అనగా భయంకరమైన యుద్ధం - సామూహిక యుద్ధం; అయ్యెన్= అయ్యింది; అంతన్= ఆ సమయాన.

తాత్పర్యం: ఈవిధంగా విరాటరాజూ, తన తండ్రి ద్రుపదరాజూ హతులై పడిపోవటాన్ని చూచి ధృష్టద్యుమ్నుడు, 'ఇదిగో నేను ద్రోణుడిని సంహరించకపోతే మా కులక్రమాగతములైన ఆచారాలను, ధర్మాలను అతిక్రమించినవాడనే ఔతాను' అని అక్కడి వారందరూ వినేటట్లు ప్రతిన బూని, పాంచాల సైన్యాన్ని వెంట తీసికొని, ద్రోణుడిపైకి యుద్ధానికి వెళ్ళాడు. అది గమనించి దుర్యోధనుడు - కర్ణుడు మొదలైన వారితో వెళ్ళి అడ్డగించి ధృష్టద్యుమ్నుడితో యుద్ధం సాగించాడు. ధృష్టద్యుమ్నుడు ముందుకు సాగక, వారితో యుద్ధం సాగిస్తూ ఉండగా, భీమసేనుడు చూచి ధృష్టద్యుమ్నుడిని గద్దించి, తనను అనుసరించు మని చెప్పి, ద్రోణుడి వైపు విజృంభిస్తూ ఉండగా, ఆ ధృష్టద్యుమ్నుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కూడా భీముడితో కలిసి విజృంభించాడు. ఇక దుర్యోధనుడు తన సైన్యాన్ని పురికొల్పాడు. అప్పుడు ఆ రెండు సైన్యాలు ఒకదానితో మరొకటి చొచ్చుకొని పోయి, యుద్ధం చేయసాగాయి. యుద్ధం భయంకరంగా నడిచింది. ఆ సమయంలో.

విశేషం: భీముడు ధృష్టద్యుమ్నుడిని గద్దించిన తీరు మూలంలో ఇట్లా ఉన్నది.

శ్లో॥ ద్రుపదస్య కులే జాతః సర్వాస్త్రే ష్వస్త్ర విత్తమ ।
కః క్షత్రియో మన్యమానః ప్రేక్షేతారిమవస్థితమ్ ॥
పితృపుత్ర వధం ప్రాప్య పుమాన్ కః పరిపాలయేత్ ।
విశేషతస్తు శపథం శపిత్వా రాజసంసది ॥
ఏష వైశ్వానర ఇవ సమిద్ధః స్వేన తేజసత్ ॥
శరచాపేంధనో ద్రోణః క్షత్రం దహతి తేజసా ॥
పురాకరోతి నిశ్శేషాం పాండవానా మనీకినీమ్ ।
స్థితాః పశ్యత మే కర్మ ద్రోణమేవ వ్రజామ్యహమ్ ॥ (ద్రోణ - 186/51-55)

(పురాకరోతి= సద్యః కరిష్యతీత్యర్థః -యావత్పురానిపాతయో ర్లట్ - ఇతి లట్ పురాకరోతి' అనగా తొందరగా చేయగలడు అని అర్థం - ఇది విశేషార్థ యోగం

(ధృష్టద్యుమ్నుడిని భీముడు గద్దించట మేమి? అనే సందేహ నివృత్తికై ఈ అంశ మిక్కడ ప్రస్తావించబడింది.)

క. **విరియించి తామరలలో । నరుణాంశులు సొచ్చి సుభగ మగు సౌందర్య**
స్ఫురణము నొందఁగఁ దోఁచెం । దరణి యుదయ శిఖరిమీఁద ధరణీనాథా! 285

ప్రతిపదార్థం: ఓ ధరణీనాథా! ఓ ధృతరాష్ట్ర మహారాజా!; తరణి= సూర్యుడు; విరియించి= వికసింపజేసి; తామరలలోన్= కమలాలలో; అరుణ+అంశులు= ఎర్రని కిరణాలు; చొచ్చి= ప్రవేశించి; సుభగమగు= భాగ్యవంతమైన; సౌందర్య స్ఫురణము= సౌందర్యశోభను; అందఁగన్= పొందేవిధంగా; ఉదయ శిఖరిమీఁదన్= తూర్పుకొండమీద; తోఁచెన్= ఉదయించాడు.

తాత్పర్యం: ఓ రాజా! పద్మాలలో ఎర్రని కిరణాలు ప్రవేశించి అవి అందంగా ప్రకాశించేటట్లు వికసింపచేసి, సూర్యుడు తూర్పుకొండమీద ఉదయించాడు.

వ. **అప్పుడు రెండు దెఱంగుల జనంబులుం గాలోచిత కృత్యంబులు సలిపి క్రమ్మఱఁ గయ్యంబు సేయం దొడంగిరి; ప్రొద్దెక్కిన నెండ తాఁకును రేయింటి యలజడియు నప్పటి యాఁకలియు నొడళ్ళు డిల్లపడం జేసినను మొగంబులు వెడంగు పఱపినను బొలివోని పౌరుషంబుల నియ్యిరువాఁగునుం గడంగి కలయన్ బెరసి పెనంగు నా రభసంబునం బెల్లెసఁగు ధూళికతంబునం బోయిన రాత్రి మగుడ వచ్చె నను బుద్ధి యెల్లవారికిం బుట్టె; నట్టియెడ ద్రోణ ధనంజయులు మిసిమింతులుగాక సేనలం జీకాకు పడనీక పొదివి పోరించిరి; బెట్టిదంబు లగు వివిధాస్త్ర శస్త్ర పాతంబులం గరి తురగ పదాతి వ్రాతంబుల శరీరంబులం దొరంగు రుధిరం బారేఱువు నడంచిన కొలఁది నిలువక బహుల ప్రవాహంబుల నుత్పాదించె; నార్పులు బొబ్బలుం బోట్ల నొఱలు చప్పుళ్ళను జిందంబుల మ్రోఁతయు బెరసి పరఁగి నలుదిక్కులుం బిక్కటిల్లె; నా సమయంబున. 286**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో అనగా సూర్యోదయం కాగానే; రెండు తెఱంగుల జనంబులున్= రెండువైపులనున్న జనులు; కాల+ఉచిత కృత్యంబులు= ఆ కాలానికి తగిన దంతధావనాది క్రియలను; సలిపి= చేసి; క్రమ్మఱన్= మళ్ళీ; కయ్యంబు= యుద్ధం; చేయన్+తొడంగిరి= చేయబూనారు; ప్రొద్దు+ఎక్కినన్= పొద్దెక్కుతూ ఉంటే; ఎండతాఁకును= ఎండదెబ్బ; రేయింట+అలజడియును= రాత్రి (నిద్రలేకపోవటం చేత కలిగిన) అలసట; అప్పటి+ఆఁకలియున్= అప్పుడు కలిగిన ఆకలి (ఇవన్నీ కలిసి); ఒడళ్ళు= శరీరాలను; డిల్లపడన్+చేసినను= బలహీనపరచినప్పటికి; మొగంబులు= ముఖాలను; వెడంగు పఱపినను= వికృతం చేసినప్పటికి కూడ; పొలివోని పౌరుషంబులన్= తరిగిపోని పరాక్రమాలతో; ఆ+ఇరువాఁగునున్= ఆ రెండు సైన్యాలు కూడ; కడంగి= యుద్ధానికి పూనుకొని; కలయన్= రెండు ఒకటిగా కలిసిపోయే విధంగా; బెరసి పెనంగు+ఆ రభసంబునన్= మిక్కిలి పోరాడే ఆ వేగంతో; పెల్లు+ఎసఁగు ధూళికతంబునన్= అధికంగా వ్యాపించిన దుమ్ము కారణాన; పోయినరాత్రి= గతించిన రాత్రి; మగుడన్= మళ్ళీ; వచ్చెను+అను బుద్ధి= వచ్చింది అనే తలంపు; ఎల్లవారికిన్= అందరికీ; పుట్టెన్= కలిగింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ద్రోణ ధనంజయులు= ద్రోణాచార్యులు, అర్జునుడు (వీరిద్దరు); మిసిమింతులు+కాక= అలసిపోయిన వారు కాకుండా (అలసిపోక ఉత్సాహాన్ని చూపిస్తూ); సేనలన్= తమ తమ సైన్యాలను; చీకాకు పడనీక= చెదరి పోనీయక; పొదివి= ఉంచి; పోరించిరి= యుద్ధం చేయించారు; బెట్టిదంబులు+అగు= భయంకరంగా ఉన్నట్టి; వివిధ+అస్త్ర శస్త్ర పాతంబులన్= పలు విధాలైన అస్త్రశస్త్రాల పైపాటులతో; కరి= ఏనుగులయొక్క; తురగ= గుఱ్ఱాలయొక్క; పదాతి= కాలుబలంయొక్క; వ్రాతంబుల= (ఈ మూడింటి) సమూహాలయొక్క; శరీరంబులన్= శరీరాలనుండి; తొరంగు రుధిరంబు= ప్రవహిస్తూ ఉన్న రక్తం; ఆ రేణువును= ఆ ధూళిని; అడంచిన కొలఁది= అణచి వేసేటంత మేరకు; నిలువక= ఆగిపోక (ఇంకా); బహుల ప్రవాహంబులన్= అనేక (రక్త) ప్రవాహాలను; ఉత్పాదించెన్= పుట్టించింది (ఏ ధూళి అయితే సర్వత్ర వ్యాపించి రాత్రి భ్రాంతిని కలుగజేసిందో అంతటి ధూళిని కూడా కరితురగ పదాతి దళాల క్షతగాత్రాల నుండి పడిన రక్తం మటుమాయం చేసి, అంతటితో ఆగిపోక ఇంకా ఎన్నో రక్తప్రవాహాలను పుట్టించిందని భావం); ఆర్పులు= సింహనాదాలు; బొబ్బలున్= పెద్ద పెద్ద కేకలు (ఆర్తనాదాలు); పోట్లన్= ముష్ట్యా ఘాతాల వలన; ఒఱలు= కలిగిన; చప్పుళ్ళును= ధ్వనులు; చిందంబుల మ్రోఁతయున్= శంఖనాదాలు; బెరసి= కలసిపోయి; పరఁగి= వ్యాపించి; నలుదిక్కులున్= నాల్గు దిక్కులు; పిక్కటిల్లెన్= నిండాయి; ఆ సమయంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సూర్యోదయ కాలంలో రెండు వైపుల ఉన్న వారందరు కాలోచితకృత్యాలను నిర్వర్తించుకొని మళ్ళీ యుద్ధానికి పూనుకొన్నారు. పొద్దెక్కింది. ఎండ దెబ్బ, మరియు రాత్రి నిద్రలేకపోవటం. ఆకలి సమయం - ఇవన్నీ కలిసి వాళ్ళ శరీరాలను క్రుంగదీశాయి. మొగాలు వికృతంగా తోచాయి. అయినా యుద్ధం ఎడతెగకుండా, పౌరుషం కనపరుస్తూ చేస్తూనే ఉన్నారు. ఆ యుద్ధవేగం వలన పెద్ద ధూళి చెలరేగింది. పోయిన రాత్రి తిరిగి వచ్చిందా అనే భ్రాంతి కలిగింది ఆ సైనికులందరికీ. ఆ సమయంలో ద్రోణాచార్యులు, అర్జునుడు అలసిపోకుండ తమ తమ సైన్యాలు చెదరిపోకుండా కట్టుదిట్టం చేసి యుద్ధం సాగేటట్లు చేశారు. భయంకరాలైన వివిధశస్త్రాస్త్రాలు మీద పడడంవల్ల గజ అశ్వ పదాతిదళాల శరీరాలనుండి ప్రవహించే నెత్తురు ఆ ధూళిని అణగించేకొలది నిలువక' ఇంకా ఆ నెత్తురు ఎన్నో పాయలుగా ప్రవహిస్తూనే ఉన్నది. సింహనాదాలు, పెద్ద కేకలు (ఆర్తనాదాలు) పిడికిళ్ళు, గుద్దుల చప్పుళ్ళు, శంఖనాదాలు- వీటన్నింటితో దిక్కులన్నీ పిక్కటిల్లాయి. ఆ సమయంలో.

తే. **పతియు యువరాజుఁ గవలను బార్థుఁ గురుఁడు। భీముఁ గర్ణుఁడుఁ దాఁకి రుద్దామ లీల**
వారి రథ బహుగతులు దుర్వార విశిఖ। విసరణంబులు నద్భుత విధము లయ్యె. **287**

ప్రతిపదార్థం: పతియున్= రాజైన దుర్యోధనుడు; యువరాజున్= యువరాజైన దుశ్శాసనుడు (వీరిద్దరు); కవలను= నకుల సహదేవులను; గురుఁడు= విద్యాగురువైన ద్రోణాచార్యుడు; పార్థున్= అర్జునుడిని; కర్ణుఁడు= కర్ణుడు; భీమున్= భీముడిని; ఉద్దామలీలన్= భయమును కలిగించే విధంగా; తాఁకిరి= ఎదుర్కొన్నారు; వారి రథ బహుగతులు= వారి రథాల పలు పోకడలు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుర్వార= నివారింపరాని; విశిఖ= బాణాలయొక్క; విసరణంబులు= ప్రయోగాలు; అద్భుత విధములు= అచ్చెరువు గొలిపే విధానాలు కలిగినవై; అయ్యెన్= అయినవి.

తాత్పర్యం: దుర్యోధనుడు నకులుడిని ఎదిరించగా, దుశ్శాసనుడు సహదేవుడిని ఎదిరించి పోరాడాడు. ఇక ద్రోణాచార్యుడు అర్జునుడితో పోరు సలిపాడు. కర్ణుడు భీముడితో యుద్ధం చేశాడు. వీరందరి యుద్ధం భయంకరంగా సాగింది. వారిరథాల పోకడలు వారి బాణప్రయోగాలు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించాయి.

క. **నకులుఁడు నృపతియు నొక్కం । డొకనిం జుట్టుకొని వచ్చు నొప్పును బలుపుం**
బ్రకటీకృత శౌర్యమ్మును । సకలజనముఁ బ్రస్తుతించె జగతీనాథా! **288**

ప్రతిపదార్థం: జగతీనాథా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; నకులుఁడు= మాద్రి కుమారుడు నకులుడు; నృపతియున్= రాజైన దుర్యోధనుడు; ఒక్కండు+ఒకనిన్= ఒకరు మరియొకరిని; చుట్టుకొని వచ్చు+ఒప్పును= చుట్టుముట్టి యుద్ధంచేసే తీరును; బలుపున్= బలాన్ని; ప్రకటీకృత శౌర్యమ్మును= ప్రదర్శించబడిన పరాక్రమాన్ని (యుద్ధంలో చూపిన పరాక్రమాన్ని); సకల జనము= సమస్త జనం; ప్రస్తుతించెన్= ప్రశంసించింది.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నకులుడు, దుర్యోధనుడు - వీరిద్దరూ యుద్ధంలో ఒకరికొకరు చుట్టుముట్టి వచ్చే తీరు, బలము, ప్రదర్శించబడిన పరాక్రమం-వీటిని సమస్త జనుల ప్రశంసించారు.

క. **విను సహదేవుఁడు దుశ్శా । సనుసూతునిఁ దునుమ, నతఁడు సారథికృత్యం**
బును జలుపుచు నేయుచుఁ గవి । సిన నాతఁడు నొంపఁ బఱచెఁ జెడి తురగంబుల్. **289**

ప్రతిపదార్థం: విను= ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఇంకా వినుము; సహదేవుఁడు= మాద్రి రెండవ పుత్రుడు (యమళుడు) సహదేవుడు; దుశ్శాసను సూతునిన్= దుశ్శాసనుడి యొక్క సారథిని; తునుమన్= సంహరించగా; అతఁడు= ఆ దుశ్శాసనుడే; సారథి కృత్యంబును= సారథి చేయవలసిన పని రథాన్ని నడపటం - దానిని కూడ; చలుపుచున్= చేస్తూ; ఏయుచున్= యుద్ధాన్ని చేస్తూ; కవిసినన్= (సహదేవుడిని) ఎదిరించగా; ఆతఁడు= ఆ సహదేవుడు; నొంపన్= (బాణాలతో) బాధించగా; చెడి= ఆ బాధకు తాళలేక శక్తి కోల్పోయి; తురగంబుల్= గుర్రాలు; పఱచెన్= పరుగులు తీశాయి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సహదేవుడు దుశ్శాసనుడి సారథిని సంహరించగా, వెంటనే దుశ్శాసనుడు తానే రథం నడుపుకొంటూ, బాణాలు ప్రయోగిస్తూ విజృంభించగా, సహదేవుడు గుర్రాలను నొప్పింపగా, అవి బాధకు తట్టుకోలేక పరుగులు తీశాయి.

విశేషం: సంస్కృత మూలంలో ఈ దుశ్శాసనుడు సారథి లేక యుద్ధం చేసేటప్పటి స్థితి మనోహరంగా చిత్రించబడింది. (సం. మహా.ద్రోణ. 188/7-8 గోరఖ్‌పూర్ ప్రతి).

ఉ. **భీముఁడుఁ గర్ణుఁడుం గదిసి భీమసముద్ధతి నేటులాడి రు**
ద్దామ గదానిపాతన విధంబులు నప్పుడు గల్గె నయ్యెడన్
భీముని వాజులన్ రయము పెంపునఁ గర్ణుఁడు గూల్చె మార్గణ
స్తోమమునం గురుప్రతతి చూడ్కులకుం బ్రమదం బొనర్చుచున్. **290**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భీముఁడును= భీముడు; కర్ణుఁడును= కర్ణుడు; కదిసి= (ఒకరి నొకరు) ఢీకొని; భీమసముద్ధతిన్= భయంకరమైన దర్పంతో; ఏటులాడిరి= యుద్ధంచేశారు; అప్పుడు= ఆ సమయంలో; ఉద్దామ గదానిపాతన విధంబులు= భయంకర గదాయుద్ధంలోని దెబ్బల విధానాలు; కల్గెన్= కలిగినవి; (కర్ణభీములిద్దరు మొదట ధనుర్యుద్ధం చేసి, తరువాత కొంతసేపు గదాయుద్ధానికి పూనుకొన్నారని మూల సంస్కృతంలో ఉన్నది); ఆ+ఎడన్= ఆ సమయంలో; కర్ణుఁడు; భీముని వాజులన్= భీముడి అశ్వాలను; రయము పెంపునన్= వేగాధిక్యంతో; మార్గణస్తోమమునన్= (ప్రయోగించిన) బాణాల సమూహంతో; కురు ప్రతతి చూడ్కులకున్= కురువీరుల చూపులకు; ప్రమదంబు= సంతోషాన్ని; ఒనర్చుచున్= కలుగజేస్తూ; కూల్చెన్= సంహరించాడు.

తాత్పర్యం: భీముడు, కర్ణుడు ఢీకొని భయంకరంగా యుద్ధం చేశారు. తరువాత వారిద్దరికి గదాయుద్ధం సాగింది. వారొకరిపై మరియొకరు గదలు ప్రయోగించే తీరు భయంకరమై తోచింది. అప్పుడు కర్ణుడు వేగంగా బాణాల వర్షం కురిపించి, కురువీరులందరికి హర్షాన్ని కలిగిస్తూ భీముడి రథాలను నేలగూల్చాడు.

ద్రోణార్జునుల ద్వంద్వ యుద్ధము (సం. 7-163-20)

వ. **పవననందనుండు నకులస్యందనం బెక్కె; గురుండును గిరీటియు వివిధ బాణాసారంబుల నంబరంబు గప్పుచు సమరవిహారంబు సలిపి; రట్టియెడ.** 291

ప్రతిపదార్థం: పవన నందనుండు= వాయుపుత్రుడు భీముడు; నకుల స్యందనంబు= (కర్ణుడిచే, తన అశ్వాలు సంహరించబడి రథం లేకపోవటంచేత) నకులుడి రథాన్ని; ఎక్కెన్= ఆరోహించాడు; గురుండును= ద్రోణాచార్యుడు; కిరీటియున్= అర్జునుడు (వీరిద్దరు); వివిధ బాణ+ఆసారంబులన్= అనేక విధాలైన బాణాల ధారల వర్షాలతో; అంబరంబు= ఆకాశాన్ని; కప్పుచున్= కప్పివేస్తూ; సమర విహారంబు= యుద్ధవిహారాన్ని; సలిపిరి= చేశారు; అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: కర్ణుడు తన అశ్వాలను నేలగూల్చిన వెంటనే భీముడు తన రథాన్ని విడిచి, సహదేవుడి రథంపైకి వెళ్ళాడు. ద్రోణార్జునులు బాణవర్షాలతో ఆకాశాన్నే కప్పివేస్తూ యుద్ధం చేశారు. అప్పుడు (తరువాతి పద్యంతో అన్వయం).

క. **గురుఁ డేయ నరుఁడు త్రుంపఁగ । నరుఁ డేయఁగ గురుఁడు త్రుంప నానావిశిఖ**
స్ఫురణ పరిహరణముల క । చ్చెరు వందుచు నుండి రుభయసేనల జనముల్. 292

ప్రతిపదార్థం: గురుఁడు= ఆచార్యుడు ద్రోణుడు; ఏయన్= బాణాలు వేయగా; నరుఁడు= అర్జునుడు (ఆ బాణాలను); త్రుంపఁగన్= ఖండించి వేయగా; నరుఁడు= అర్జునుడు; ఏయన్= బాణాలు వేయగా; గురుఁడు= ఆచార్యుడు (వాటిని); త్రుంపఁగన్= ఖండించగా; నానా విశిఖ స్ఫురణ పరిహరణములకున్= అనేకములైన బాణాల స్ఫురణ పరిహరించటానికి - ఒకరు ప్రయోగించగా మరియొకరు పరిహరించుట అని భావం; ఉభయసేనల జనముల్= రెండు సైన్యాలలోని జనులు; అచ్చెరువు= ఆశ్చర్యాన్ని; అందుచున్+ఉండిరి= పొందుతూ ఉన్నారు.

తాత్పర్యం: ద్రోణార్జునుల యుద్ధం ఉభయ సైన్యాలు ఆశ్చర్యపడే విధంగా సాగింది. ఆచార్యుడు ప్రయోగించిన బాణాలను శిష్యుడు అర్జునుడు ఖండించాడు. అర్జునుడు ప్రయోగించిన బాణాలను ద్రోణుడు ఖండించి వేశాడు. వివిధ బాణాలు మెరుస్తున్నట్లె మెరిసి, మరుక్షణంలో కనిపించకుండాపోవటానికి జనులందరు ఆశ్చర్యపోయారు.

విశేషం: 'నానా విశిఖ స్ఫురణ పరిహరణము' శబ్దప్రయోగం ఆశ్చర్యస్ఫోరకం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **దొరఁకొని దివ్యబాణములు ద్రోణుఁడు బల్విడి నైంద్ర మాదిగా**
నరుపయి నేయ నాతఁడు మనంబునఁ గొంకక తత్తదస్త్రము
ల్వెరవున నేసి యేసి యఫలీకరణం బొనరించి పేర్చుఁ ద
ద్వర శరజాలమున్ గురునివారితమై యడఁగుం బొరిం బొరిన్. **293**

ప్రతిపదార్థం: ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; ఐంద్రము+ఆదిగాన్= ఇంద్రదేవతాకమైన అస్త్రాన్ని 'ఐంద్రము' అని అంటారు- ఆ దివ్యాస్త్రం మొదలుగా గల; దివ్యబాణములు= దివ్యాస్త్రాలను; దొరఁకొని= యత్నించి - ప్రయత్నపూర్వకంగా; బల్విడిన్= వేగంగా; నరుపయిన్= అర్జునుడిపై; ఏయన్= ప్రయోగించగా; ఆతఁడు= ఆ అర్జునుడు; మనంబునన్= మనస్సులో; కొంకక= సంకోచపడక; తత్తద్+అస్త్రముల్= ఆయా దివ్యాస్త్రాలను; వెరవునన్= నేర్పుతో; ఏసి+ఏసి= శీఘ్రంగా ప్రయోగించి (ద్విరుక్తి శీఘ్రతా సూచనార్థం); అఫలీకరణంబు+ఒనరించి= వైఫల్యాన్ని కలుగజేసి (ఆ దివ్యాస్త్రాలను ప్రత్యస్త్రాలతో నివారించి); పేర్చున్= విజృంభిస్తాడు; తద్వర శరజాలమున్= ఆ అర్జునుడి దివ్యాస్త్ర సమూహం కూడ; గురు నివారితము+ఐ= ద్రోణాచార్యుడిచే నివారించబడినదై; పొరింబొరిన్= మాటిమాటికీ; అడఁగున్= అణగిపోతుంది.

తాత్పర్యం: ద్రోణుడు ఇంద్రదేవతాకమైన ఐంద్రాస్త్రం మొదలైన దివ్యాస్త్రాలను అర్జునుడిపై ప్రయోగించగా, అర్జునుడు జంకక, వెంటనే ఆ దివ్యాస్త్రాలకు ప్రత్యస్త్రాలను ప్రయోగించి వ్యర్థచేసి విజృంభించసాగాడు. అట్లాగే అర్జునుడు ప్రయోగించే దివ్యాస్త్రాలను ద్రోణుడు వెనువెంటనే ప్రత్యస్త్రాలతో నివారించాడు.

విశేషం: ఆయా దేవతా మంత్రసిద్ధితో సిద్ధించి ఎప్పు డవసరమై ఉంటే అప్పుడు ఆ దేవతామంత్రం జపించి ప్రయోగిస్తే చాలు తమ తమ సామర్థ్యం చూపేవి ఈ దివ్యాస్త్రాలు - వాయవ్యాస్త్రం, ఆగ్నేయాస్త్రం, వారుణాస్త్రం, బ్రహ్మాస్త్రం, పాశుపతాస్త్రం, ఐంద్రాస్త్రం మొదలైనవి - ప్రత్యస్త్రాలంటే? - ఆగ్నేయాస్త్రం అగ్నిని వర్షించేది, దానికి వారుణాస్త్రం - జలాన్ని వర్షించేది ప్రత్యస్త్రం. ఇట్లెన్నో దివ్యాస్త్రాలు రామాయణ భారతాలలో వర్ణించబడ్డాయి.

వ. **ఇట్లు సదృశంబులగు శస్త్ర బల బాహు వీర్యశౌర్యంబు లసదృశంబుగాఁ బోరు నగ్గురు శిష్యుల నుపలక్షించి సుర ఖచర విద్యాధరులు దమలోన.** **294**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; సదృశంబులు+అగు= సమానమై ఉన్నట్టి; శస్త్రబల బాహువీర్య శౌర్యంబు= శస్త్రబలం అనగా దివ్యశస్త్రాస్త్ర బలం, బాహువీర్యమనగా బాహుబలం, శౌర్యమనగా పరాక్రమం - ఈ మూడు గుణాలును; అసదృశంబుగాన్= సాటిలేని విధంగా; పోరు+ఆ+గురుశిష్యులన్= యుద్ధం చేసే ఆ గురుశిష్యులైన ద్రోణార్జునులను; ఉపలక్షించి= చూచి; సుర ఖచర విద్యాధరులు= దేవతలు ఆకాశసంచారులైన ఋషులు, సిద్ధులు మొదలైనవారు మరియు విద్యాధరులు; తమలోనన్= తమ మనస్సులలో.

తాత్పర్యం: ఈ విధంగా గురుశిష్యులైన ద్రోణార్జునులు సమానదివ్యశస్త్రాస్త్రబలంతో, బాహుబలంతో, పరాక్రమంతో ప్రదర్శించారు. సాటిలేని విధంగా పోరే ఆ గురుశిష్యులను చూచి దేవతలు, ఆకాశ సంచారులైన విద్యాధరులు చూచి,

విశేషం: సుర ఖచర విద్యాధరులు అనే సమాస పదంలోని ఖచర పదం మహార్థం కలది. ఖచరులు అనగా ఆకాశాన సంచరించే స్వభావం గల ఋషులు సిద్ధులు, మొదలైనవారు. ఈ అర్థమే మూలానుగుణమయినది చూడండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్లో॥ తతోऽంతరిక్షే దేవాశ్చ గంధర్వాశ్చ సహస్రశ ।
ఋషయః సిద్ధ సంఘాశ్చ వ్యతిష్ఠంత దిదృక్షయా ॥
తదప్సరోభిరాకీర్ణం యక్షగంధర్వ సంకులమ్ ।
శ్రీమదాకాశ మభవద్ భూయో మేఘాకులం యథా ॥

(ద్రోణ. 188/34 మరియు విద్యాధర పదం గంధర్వాదుల కుపలక్షకం).

క. 'హరుఁడు వినోదార్థముగా । నిరుమే నయి రణ మొనర్చె; నింతియ కా కి
ప్పరుసున నక్కజ మగు సం । గర మొనరింపంగ నొరులఁ గంటిమె యెందున్?' 295

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు; వినోద+అర్థముగాన్= విలాసానికై; ఇరుమేను+అయి= ద్రోణార్జునులు అనే రెండు శరీరాలు కలవాడయి (ఈ ద్రోణార్జునులు అనే వీరిద్దరూ శివుని రెండు రూపాలే అని భావం); రణము= యుద్ధాన్ని; ఒనర్చెన్= చేశాడు; ఇంతియ= ఇంతే; కాక= కాకపోతే; ఈ+పరుసునన్= ఈ విధంగా; అక్కజము+అగు= ఆశ్చర్యకరమైన; సంగరము= యుద్ధాన్ని; ఒనరింపంగన్= చేస్తూ ఉండగా; ఒరులన్= ఇతరులను; ఎందున్= ఎక్కడనైనా; కంటిమే?= చూశామా? (చూడలేదని భావం, - ఇంతటి గొప్ప యుద్ధం ఆ శివుడు తప్ప మరెవ్వడు చేయలేడు - కావున ఆ శివుడే ఈ ద్రోణార్జునుల శరీరాలు ధరించి యుద్ధం చేస్తున్నాడని భావం.)

తాత్పర్యం: 'శివుడు వినోదార్థం రెండు శరీరాలు ధరించి యుద్ధం చేస్తున్నాడు. అంతేకాని, ఈ విధంగా ఆశ్చర్యకరమైన యుద్ధం ఇతరులు చేయగా ఎక్కడైన చూచామా?

విశేషం: ఇంత అద్భుతంగా యుద్ధం చేసే వీరిద్దరు ద్రోణార్జునులు కారు. రెండు వేరు వేరు శరీరాలతో ఉన్న శివుడే అనే అపహ్నవాలంకారం ఇక్కడ వ్యంగ్యంగా భాసిస్తుంది. దీనిచేత వారు చేసిన యుద్ధం గొప్పతనం వివరించినట్లయింది.

వ. అనుచుండి రప్పుడు. 296

ప్రతిపదార్థం: అనుచుండిరి= (సురఖచర విద్యాధరులు) తమలోన అనుకొన్నారు; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: (సుర ఖచరవిద్యాధరులు ఆ యుద్ధం చూచి తమలో) అని అనుకొన్నారు. ఆ సమయంలో.

మ. క్షితియుం బర్వత కోటియున్ వడఁకె నగ్నిచ్ఛాయ లయ్యెన్ దిశ
ల్చతురంభోనిధులుం గలంగె భయలోలం బయ్యె దేవవ్రజం
బతి సంక్షోభము నొందె నొక్క మొగి సైన్యద్వంద్వమున్ ద్రోణుఁ డు
ద్ధతి బ్రహ్మాస్త్రము మౌర్వితో నియతమంత్రస్ఫూర్తి సంధించినన్. 297

ప్రతిపదార్థం: ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; నియత మంత్రస్ఫూర్తిన్= నియమబద్ధమైన మంత్రస్ఫురణంతో (ఆ బ్రహ్మ దేవతా మంత్రాన్ని మనస్సులో భావించి); బ్రహ్మాస్త్రము= బ్రహ్మాస్త్రాన్ని; మౌర్వితోన్= అల్లెత్రాటితో; ఉద్ధతిన్= ఔద్ధత్యంతో-దర్పంగా; సంధించినన్= సంధించగా; క్షితియున్= భూమి; పర్వతకోటియున్= పర్వతాల సమూహం; వడఁకెన్= కంపించిపోయాయి; దిశల్= దిక్కులు; అగ్నిచ్ఛాయలు+అయ్యెన్= అగ్గివంటి ఎర్రని కాంతి గలవి అయ్యాయి; చతురంభోనిధులున్= నాలుగు సముద్రాలు; కలంగెన్= సంక్షోభం చెందాయి; దేవవ్రజంబు= దేవతల సమూహం; భయలోలంబు= భయకంపితం; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: ద్రోణాచార్యులు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగింప దలచి - నియమపూర్వకంగా మంత్రాన్ని స్మరించి ఆ దివ్యాస్త్రాన్ని మౌర్వితో సంధించటానికి పూనుకొన్న వెంటనే - భూమి, పర్వతాలు వణకిపోయాయి, దిక్కులన్నీ మంటలు చెలరేగాయా అన్నట్లు ఎఱ్ఱబారాయి. నాలుగు సముద్రాలూ సంక్షోభించిపోయాయి. దేవతలందరు భయకంపితులయ్యారు. రెండుపక్షాల సైన్యంలోని వారందరు ఒక్క పెట్టున సంక్షోభాన్ని పొందారు.

వ. ఇట్లు సువిహిత సంధానుండై యతం డమ్మహాస్త్రంబుఁ బ్రయోగించిన. 298

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సువిహిత సంధానుండు+ఐ= శాస్త్రోక్త ప్రకారంగా చేయబడిన అస్త్రమంత్రానుసంధానం కలవాడై; అతండు= ఆ ద్రోణాచార్యులు; ఆ+మహాస్త్రంబున్= ఆ గొప్ప దివ్యాస్త్రాన్ని; ప్రయోగించినన్= ప్రయోగించిన వెంటనే.

తాత్పర్యం: ఈ విధంగా శాస్త్రోక్త ప్రకారంగా మంత్రానుసంధానం చేసి, ఆ బ్రహ్మాస్త్రాన్ని ద్రోణాచార్యులు ప్రయోగించగా (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అంతరంగంబునం దొక యింత యేని। యలుకు లేక తనర్చి బ్రహ్మాస్త్రమునన
వేడుకకు మరలించిన విధము దోఁప। నద్భుతంబుగ వారించె నర్జునుండు. 299

ప్రతిపదార్థం: అర్జునుండు= అర్జునుడు; అంతరంగంబునందున్= మనస్సులో; ఒకింత ఏని= ఒకింతైనా; అలుకు= భయం; లేక= లేకనే; తనర్చి= ఒప్పి; బ్రహ్మాస్త్రమునన= బ్రహ్మాస్త్రం చేతనే; వేడుకకున్= వినోదానికి; మరలించిన విధము= వెనుకకు పంపిన విధానం - వినోదం కలిగించటానికి నివారించినట్లు; తోఁపన్= స్ఫురించే విధంగా; అద్భుతంబుగన్= ఆశ్చర్యం కలిగే విధంగా; వారించెన్= (ఆ బ్రహ్మాస్త్రాన్ని) నివారించాడు - బ్రహ్మాస్త్రానికి బ్రహ్మాస్త్రమే ప్రత్యస్త్రం - కాబట్టి బ్రహ్మాస్త్రంతోనే దానిని నివారించా డని భావం.

తాత్పర్యం: అర్జునుడు మనస్సులో ఏ మాత్రము జంకూ లేకుండా ఆ బ్రహ్మాస్త్రాన్ని నివారించటానికి ప్రత్యస్త్రంగా బ్రహ్మాస్త్రాన్నే విలాసంగా ప్రయోగించి మరలిస్తున్నాడని అనిపించేటట్లు అద్భుతంగా నివారించాడు.

వ. ఇత్తెఱంగున గెలుపోటమియు లేక యయ్యిరువురుఁ బోరుటయు, నత్తఱిం గెరలిన సందడి కయ్యంబు కతంబున మాని యగ్గురు పార్థులు పాంచాల కౌరవ బలంబులపైఁ దఱిమి; రా సంకుల సమరంబున దుశ్శాసనుండు ధృష్టద్యుమ్నుం దాఁకి యోర్వలేక తొలంగె; నతండు ద్రోణుమీఁదం గవిసినఁ గవలును దోడ్పడం గృతవర్మ యడ్డపడి పెనంగె; సుయోధనుండును సాత్యకియుఁ దార్కొని తమ శైశవ క్రీడలు దలంచి యుగ్గడించి 'రాజధర్మం బిట్టిద కాక' యని తలంచి పోరం జొచ్చి; రట్టి యెడ నా శినివరుండు భూవరువిల్లు ద్రుంచి మేను నొంచిన నోహటించి యోసరించి దప్పిదీర్చికొని మగుడ నమ్మాధవానుజుం దలపడి యెప్పటియట్లు కలంగం జొచ్చినం జూచి రాధేయుఁ డయ్యోధవరుదెసకు నడరినం గని వడముడి యతని మార్కొని తూపులు నిగిడించిన నవి నిలువరించి నవ్వుచు నాతం డవ్వీరు సారథి సొగయను శరాసనంబు దునియలై తొరఁగను జేసిన నా బల్లిదుండు బలుగద ద్రిప్పి బిట్టు వైచిన సూతుండును రథంబును బొడియైననుం దెరలక సూతసుతుండు శరవ్రాతంబు నిగిడించె; నప్పు డనేక చతురంగంబు లెడసొచ్చె; ధర్మతనయుండు మాత్స్యాది బలంబులం బురికొల్పుకొని కుంభసంభవు దిక్కున కురవడించె; నంత మధ్యాహ్నం బగుచు; వచ్చె నా సమయంబున నకుల సహదేవ సమీరనందను లర్జును నుద్దేశించి యెలుం గెత్తి. 300

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; గెలుపు= జయం; ఓటమియున్= పరాజయం; లేక= లేకుండ; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరు (ద్రోణార్జునులు); పోరుటయున్= యుద్ధం చేయటాన్ని; ఆ+తఱిన్= ఆ సమయంలో; కెరలిన= చెలరేగినటువంటి; సందడి కయ్యంబు కతంబునన్= సంకుల యుద్ధం కారణాన; మాని= విరమించుకొని; ఆ+గురుపార్థులు= ఆ ద్రోణాచార్యార్జునులు; పాంచాల కౌరవబలంబులపైన్= పాంచాల సైన్యంపై, కౌరవ సైన్యంపై; తఱిమిరి= విజృంభించారు (ద్రోణుడు పాంచాలసైన్యంపై; అర్జునుడు కౌరవసైన్యంపై, విజృంభించారని క్రమంగా అన్వయం; ఆ సంకుల సమరంబునన్= ఆ సంకుల యుద్ధంలో; దుశ్శాసనుడు; ధృష్టద్యుమ్నున్= ద్రుపద రాజకుమారుడైన ధృష్టద్యుమ్నుడిని; తాఁకి= ఎదిరించి; ఓర్వలేక= ఆ ధృష్టద్యుమ్నుడి ధాటి సహించలేక; తొలంగెన్= (ధృష్టద్యుమ్నుడితో యుద్ధం చేయలేక) వెనుదిరిగి పోయాడు (అప్పుడు); అతండు= ఆ ధృష్ట ద్యుమ్నుడు; ద్రోణుమీఁదన్= ద్రోణాచార్యుడిపైకి; కవిసినన్= కలియబడగా; కవలును= నకుల సహదేవులు (ఆ ధృష్టద్యుమ్నుడికి); తోడ్పడన్= పృష్ఠరక్షకులై సహాయంచేస్తూ ఉండగా; కృతవర్మ= దుర్యోధన పక్షీయుడైన కృతవర్మ అనే యదువీరుడు; అడ్డపడి= ద్రోణుడికి అడ్డంగా నిలిచి; పెనంగెన్= (ధృష్టద్యుమ్నుడితో) యుద్ధం చేశాడు; సుయోధనుండును= దుర్యోధనుడు; సాత్యకియున్= సాత్యకి (వీరిద్దరు పరస్పరంగా); మార్కొని= యుద్ధానికి తలపడి; తమ శైశవక్రీడలు= తమ బాల్యక్రీడలను; తలంచి= తలచుకొని; ఉగ్గడించి= (ఒకరితో నొకరు) చెప్పుకొని; రాజధర్మంబు= క్షత్రియుల ధర్మం; ఇట్టిది+అ+కాక= ఇటువంటిదే కదా (బంధుత్వాదులను విచారించదని); అని= ఇట్లా; తలంచి= అనుకొని; పోరన్+చొచ్చిరి= యుద్ధం చేయనారంభించారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ శినివరుండు= ఆ సాత్యకి (శిని అనే వాడు సాత్యకి తాత, శిని వంశశ్రేష్ఠుడు కాబట్టి సాత్యకికా పేరు); భూవరువిల్లు= భూపతి అయిన దుర్యోధనుడి ధనువును; త్రుంచి= విరగగొట్టి; మేను= శరీరాన్ని; నొంచినన్= (బాణాఘాతాలతో నొప్పి కలిగించగా); ఓహటించి= వెనుకకుతగ్గి; ఓసరించి= యుద్ధంనుండి తొలగిపోయి; డప్పి= అలసట; తీర్చికొని= పోగొట్టుకొని; కొంచెం విశ్రాంతి తీసికొని అని భావం; మగుడన్= మళ్ళీ; ఆ+మాధవ+అనుజున్= ఆ సాత్యకిని (మాధవు డనగా కృష్ణుడు. అతని సోదరుడు, కాన సాత్యకి మాధవానుజుడు); తలపడి= ఎదుర్కొని; ఎప్పటి అట్లు+అ= ఎప్పటి విధంగా (ఇంతకుముందు యుద్ధం చేసిన విధంగానే); పెనంగన్+చొచ్చినన్= యుద్ధం చేయబూనుతూ ఉండగా; చూచి= కనుగొని; రాధేయుఁడు= రాధాపుత్రుడు కర్ణుడు; ఆ+యోధవరుదెసకున్= యోధశ్రేష్ఠుడైన ఆ సాత్యకి వైపునకు; అడరినన్= విజృంభించగా; కని= చూచి; వడముడి= భీముడు (వడ అనగా తాపము, ముడి అనగా చోటు - శత్రుతాపస్థానము - స్థానభూతుడు అనునది వ్యుత్పత్త్యర్థం - భీముడనే అర్థంలో ప్రసిద్ధి); అతనిన్= ఆ కర్ణుడిని; మార్కొని= ఎదిరించి; తూపులు= బాణాలను; నిగిడించినన్= ప్రయోగించగా; అవి= ఆ బాణాలను; నిలువరించి= తొలగింపజేసికొని; నవ్వుచున్= మందహాసం చేస్తూ (ఇవి నాకొక లెక్కా- అని అనుటే ఆ మందహాసంలోని తాత్పర్యం); అతఁడు= ఆ కర్ణుడు; ఆ+వీరు సారథి= ఆ భీముడి సారథి; సొగయను= మూర్ఛపోయే విధంగా; (మరియు) శరాసనంబు= (ఆ భీముని) ధనుస్సు; తునియలు+ఐ= తునకలై; తొరఁగను= పడిపోయే విధంగా; చేసినన్= చేసిన వెంటనే; ఆ బల్లిదుండు= బలిష్ఠుడైన ఆ భీముడు; బలుగద= దృఢమైన గదను; త్రిప్పి= త్రిప్పి; దృఢంగా (గట్టిగా); వైచినన్= ప్రయోగించగా; సూతుండును= ఆ కర్ణుడి రథసారథి; రథంబును= రథం; పొడి ఐనను= చూర్ణం అయినా కూడా; తెరలక= యుద్ధం నుండి తొలగిపోక; సూతసుతుండు= సూతపుత్రుడు - కర్ణుడు; శరవ్రాతంబు= బాణాల సమూహాన్ని; నిగిడించెన్= వ్యాపింపజేశాడు; అపుడు= ఆ సమయంలో; అనేక చతురంగంబులు= పెక్కులు చతురంగ సైన్యాలు; ఎడసొచ్చెన్= అడ్డంవచ్చాయి; ధర్మతనయుండు= ధర్మరాజు; మాత్స్యాది బలంబులన్= మత్స్య పాంచాలాది సైన్యాలను; పురికొల్పుకొని= ప్రేరేపించుకొని; కుంభసంభవు దిక్కునకున్= ద్రోణాచార్యులవైపు; ఉరవడించెన్= విజృంభించాడు; అంతన్= ఆ సమయానికి; మధ్యాహ్నంబు+అగుచు వచ్చెన్= రెండు జాముల పొద్దు అవుతూ వచ్చింది; ఆ సమయంబునన్= అట్టి సమయాన; నకుల సహదేవ సమీరనందనులు= నకులుడు, సహదేవుడు, వాయుపుత్రుడు అనగా భీముడు - ఈ ముగ్గురు; అర్జునున్+ఉద్దేశించి= అర్జునుడిని గురించి (అర్జునుడితో); ఎలుంగు+ఎత్తి= కంఠస్వరం హెచ్చించి.

తాత్పర్యం: ఈ విధంగా జయాపజయాలు అనేవి లేకుండానే ఆ ఇద్దరూ యుద్ధం చేస్తుండగా, అంతలో చెలరేగిన సంకుల యుద్ధం కారణంగా ద్రోణార్జునులు తమ యుద్ధాన్ని మానివేసి, ద్రోణుడు పాంచాల సైన్యం వైపు, అర్జునుడు కౌరవ సైన్యంవైపు యుద్ధానికి దిగారు. ఆ సంకుల సమరంలో దుశ్శాసనుడు ధృష్టద్యుమ్నుడితో పోరాడి,

అతడి ధాటికి తట్టుకొనలేక దుశ్శాసనుడు ఆ యుద్ధంనుండి తొలగిపోయాడు. ఇక ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని ఎదిరించటానికి వెళ్ళగా, నకుల సహదేవులు అతడికి సాయపడగా కృతవర్మ అడ్డుపడి యుద్ధం చేశాడు. దుర్యోధనుడు, సాత్యకి - వీరిద్దరూ యుద్ధానికి తలపడి - తమ తమ శైశవ క్రీడా విశేషాలను జ్ఞప్తికి తెచ్చుకొని చెప్పుకొంటూ, ఇట్లా 'రాజధర్మం ఇట్టిది కదా? అని అనుకొంటూ యుద్ధం చేశారు. అప్పుడు సాత్యకి దుర్యోధనుడి విల్లును తెగగొట్టి శరీరాన్ని గాయపరచగా వెనుకకుతగ్గి తొలగిపోయి, అలసట తీర్చుకొని మళ్ళీ వచ్చి సాత్యకితో ఇంతకు ముందువలె యుద్ధం చేస్తూ ఉండగా, అది చూచి కర్ణుడు. దుర్యోధనుడికి సహాయంగా సాత్యకిపై యుద్ధానికి వెళ్ళాడు. అది చూచి భీముడు కర్ణుడిని ఎదుర్కొని, అతడిపై బాణాలు కురిపించగా, కర్ణుడూ వాటినన్నింటినీ అవలీలగా నిరోధించి, నవ్వుతూ భీముడి సారథిని మూర్ఛ నొందించాడు. విల్లు విరగగొట్టాడు. వెంటనే భీముడు గద గైకొని గిరగిర త్రిప్పివేయగా కర్ణుడి సారథి రథం ముక్కలు అయినా కర్ణుడు యుద్ధంనుండి తొలగక బాణాలు కురిపిస్తూనే ఉన్నాడు. ఇంతలో చతురంగ సైన్యాలు అడ్డువచ్చాయి. ధర్మరాజు మత్స్యదేశం పాంచాలదేశం సైన్యాలను సమాయత్తం చేసికొని ద్రోణుడి పైకి దండెత్తాడు. అంతలో మధ్యాహ్నమైనది. ఆ సమయంలో నకుల సహదేవులు, భీముడు దూరంగా ఉన్న అర్జునుడిని సంబోధిస్తూ గొంతెత్తిబిగ్గరగా (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'కోలు మసఁగి గురుండు పాంచాలసేన। నేలకును గోలకును దెచ్చె; నీవు గడఁగి
కౌరవులఁ బాయ పఱపు; మేకతమ యైన। నతనిఁ బరిమార్చుఁ బైకొని యబ్బలంబు.' 301

ప్రతిపదార్థం: గురుండు= ద్రోణాచార్యుడు; కోలు= మిక్కిలి; మసఁగి= చెలరేగి; పాంచాలసేన= పాంచాల సైన్యాన్ని; నేలకును గోలకును తెచ్చెన్= నేల పాల్జేశాడు (సంహరించాడని భావం); గోలకును తెచ్చెన్= హాహాకారధ్వని పాలు చేశాడు (బాణాలతో మిక్కిలి బాధించి పారద్రోలాడు); (కాబట్టి) నీవు= ఓ అర్జునా! నీవు; కడఁగి= విజృంభించి; కౌరవులన్= ద్రోణ రక్షకులై ఉన్న ఆ కౌరవ వీరులను; పాయపఱపుము= తొలగిపోయే విధంగా ఆచరించుము (ఈ విధంగా అందరిని ఎడబాసి); ఏకతము+అ= ఒంటరిగా (క్రియావిశేషణమిది); ఐన+అతనిన్= ఉన్న ఆ ద్రోణాచార్యుడిని; ఆ+బలంబు= ఆ పాంచాలసైన్యం; పైకొని= ఆక్రమించి; పరిమార్చున్= సంహరిస్తుంది.

తాత్పర్యం: 'ఓ అర్జునా! ద్రోణాచార్యుడు పాంచాల సైన్యంపై చెలరేగిపోయాడు. సైన్యాన్ని నేల గూలుస్తూ హాహాకారం పుట్టించాడు. కాబట్టి ఆ ద్రోణుడికి రక్షకులైఉన్న కౌరవవీరులపై విజృంభించి పారద్రోలుము. అప్పుడు ఒంటరి అయి నిలిచిన ద్రోణాచార్యుడిని ఆ పాంచాల సైన్యమే ఆక్రమించి సంహరించివేస్తుంది.

విశేషం: దీనికి సంస్కృత మూలం ఇది.

శ్లో॥ యమౌ చ భీమసేనశ్చ ప్రాక్రోశం స్తే ధనంజయమ్ ।
అభిద్రవార్జున! క్షిప్రం కురూన్ ద్రోణాదపానుద ।
తత ఏనం హనిష్యంతి పాంచాలా హతరక్షిణమ్ ॥ (ద్రోణ. 189/63-64)

2. నేలకున్ గోలకున్ తెచ్చె - అనేటప్పుడు తెచ్చె అనే పదం రెండింటితో అన్వయిస్తుంది. ఇట్లా పదావృతి చేయటాన్ని అనుషంగం అంటారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనుచు నయ్యాచార్యుపైఁ గవిసి; రిట్లు పెక్కు బలంబులు గ్రమ్మినఁ బటు ప్రదరజాలంబులు పఱపి పొడిసేయు నమ్మహాత్ము నాలోకించి ధర్మతనయ భీమసేన మాద్రీతనయులు గూడికొని తమలోన. 302

ప్రతిపదార్థం: అనుచున్= ఇట్లా అంటూనే; ఆ+ఆచార్యుపైన్= ఆ ద్రోణాచార్యుడిపై; కవిసిరి= కలియబడ్డారు; ఇట్లు= ఈ విధంగా; పెక్కుబలంబులు= అనేక సైన్యాలు; క్రమ్మినన్= ఆవరించగా; పటు ప్రదర జాలంబులు= శక్తిమంతములైన బాణాల సమూహాలను; పఱపి= వ్యాపింపజేసి; పొడి+చేయు+ఆ+మహాత్మున్= నుగ్గునుగ్గ చేస్తూ ఉన్న - అనగా ఖండిస్తూ ఉన్న - ఆ మహాత్ముడిని అనగా ద్రోణాచార్యుడిని; ఆలోకించి= చూచి; ధర్మతనయ, భీమసేన, మాద్రీతనయులు= ధర్మరాజు, భీముడు, మాద్రి కుమారులు కవలు నకుల సహదేవులు; కూడికొని= కలిసి; తమలోనన్= తమలో.

తాత్పర్యం: ఇట్లా అర్జునుడితో ఉచ్చైస్స్వరంతో అంటూనే ద్రోణాచార్యుడిపైకి దూసుకుపోయారు. ఇట్లా ఎన్నో సైన్యాలు చుట్టుముట్టగా ద్రోణాచార్యుడు వాటినన్నింటిని వాడిఅయిన బాణజాలంతో నుగ్గునుగ్గ చేస్తూనే ఉన్నాడు. ఇది గమనించి, ధర్మరాజు, భీముడు, నకుల సహదేవులు తమలో ఇట్లా తలపోసారు.

మ. 'కరులం గూల్చుచుఁ, దేరులన్ నఱకుచున్, గర్జిల్లి ఘోటమ్ములన్
నరులన్ నెత్తుటఁ దేల్చుచున్, దొరల నానారూపఖండంబు లై
తొరఁగం జేయుచుఁ గుంభజుండు విలసద్దోర్దండ చండాకృతిం
దెరలం బైఁజనుదెంచు నేపు మనలం దీర్పంగ నోపుం దుదిన్. 303

ప్రతిపదార్థం: కరులన్= ఏనుగులను; కూల్చుచున్= కూలదోస్తూ; తేరులన్= రథాలను; నఱకుచున్= నరకివేస్తూ; గర్జిల్లి= సింహనాదం చేసి; ఘోటమ్ములన్= అశ్వాలను (మరియు); నరులన్= సైనికులను; నెత్తుటన్= నెత్తురులో; తేల్చుచున్= తేలుస్తూ; దొరలన్= ప్రభువులను; నానా రూప ఖండంబులు+ఐ= అనేక రూపాలుగల అనగా తల, మొండెము, కాళ్ళు చేతులు అనే రూపాలతోనున్న తునకలై; తొరఁగన్= పడిపోయే విధంగా; చేయుచున్= చేస్తూ; కుంభజుండు= ద్రోణాచార్యుడు; విలసత్+దోర్దండచండ+ఆకృతిన్= ప్రకాశిస్తూ ఉన్న బాహుదండములు గలిగినటువంటి భయంకరమైన ఆకారంతో; తెరలన్= కలగే విధంగా (ఇది క్రియావిశేషణం); పైన్= (మన) పైకి చనుదెంచు+ఏపు= వస్తూ ఉండే విజృంభణం; తుదిన్= చివరకు; మనలన్= మనలనందరిని; తీర్పంగన్+ఓపున్= సంహరించ సమర్థమవుతుంది.

తాత్పర్యం: 'ఆ ద్రోణాచార్యుడు గజాలను నేల గూలుస్తూ రథాలను భగ్నం చేస్తూ అశ్వాలను పదాతి దళాలను నెత్తురులో ముంచి తేలుస్తూ మన వీరుల నెందరినో ముక్కలుచేసి వారి తలలు, బాహువులు మొదలైన అవయవాలు అక్కడక్కడ చెదరి పడేటట్లు చేస్తూ. బాహుబలం మెరిసిపోగా భయంకరమైన ఆకారంతో మన పైకే వస్తూ ఉన్న విజృంభణం చూస్తూ ఉంటే తుదకు మనలను కూడా సంహరించే సామర్థ్యం గలదిగా ఉన్నది.

వ. ఎవ్వరికేని నిలువరింప నలవి గాదు; నరుండును ధర్మపరుండై యూరకున్నవాఁడు; దెగువకుం జొరం' డనుచు దలంకిరి; వారి తెఱంగు గనుంగొని కమలనాభుండు దమతేరు వారల కడకుం గొనిపోయి కిరీటితో నిట్లనియె. 304

ప్రతిపదార్థం: (ఆ, పైఁ జనుదెంచు నేపు) ఎవ్వరికిన్+ఏని= ఎవ్వరికి కూడ; నిలువరింపన్+అలవి+కాదు= ఆపటానికి శక్యంకాదు; నరుండును= అర్జునుడును; ధర్మపరుండు+ఐ= ధర్మాసక్తుడై (గురువధ ధర్మంకాదనిభావించి); ఊరక+ఉన్నవాఁడు= ఊరకున్నాడు- ద్రోణుడిని వధించే ప్రయత్నం చేయటం లేదని భావం; తెగువకున్= ఆ సాహసానికి; చొరండు= పూనుకొనడు;అనుచున్=

ఇట్లా (తమలో తాము) అనుకొంటూ; తలంకిరి= చింతించారు; వారి తెఱంగున్= ఆ ధర్మరాజాదుల తీరు; కనుంగొని= గమనించి; కమలనాభుండు= కృష్ణుడు; తమ తేరు= తమ రథాన్ని; వారల కడకున్= ఆ ధర్మరాజాదుల సమీపానికి; కొనిపోయి= తీసికొనిపోయి; కిరీటితోన్= అర్జునుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఎవ్వరికి కూడా ఆప వీలుకాదు. ఇక అర్జును డందామా? గురువధ ధర్మం కాదని ఆ సాహసానికి పూనుకోక ఊరుకొన్నాడు.' ఇట్లా ధర్మరాజాదులు చింతిస్తూ ఉంటే, అది గమనించిన కృష్ణుడు, వెంటనే తమ రథాన్ని వారున్న వైపునకు తోలుకొని వెళ్ళాడు. వారు వినేటట్లు అర్జునుడితో ఇట్లా అన్నాడు:

చ. **'అని మొన దేవ దానవుల కైనను గెల్వ నశక్య మిమ్మహా**
త్ముని; నొకమందు సెప్పెద; సుతున్ హతుఁ డయ్యె ననంగ విన్న యం
తన యితఁ డాయుధంబు దిగఁ ద్రావి యచేష్టతఁ బొందు; నప్పు డీ
తనిఁ బరిమార్పవచ్చు; నిది తప్ప నుపాయము గల్గ దెమ్మెయిన్.' **305**

ప్రతిపదార్థం: అని మొనన్= రణాగ్రమందు (ఉన్న) - యుద్ధం చేస్తూ ఉన్న; ఈ+మహాత్మునిన్= మహానుభావుడైన ఈ ద్రోణాచార్యుడిని; దేవ దానవులకున్+ఐనను= దేవతలకైనా, రాక్షసులకైనా కూడా; గెల్వన్= జయించటానికి; అశక్యము= శక్యం కాదు (అయినా కూడ అతనిని గెలువటానికి); ఒక మందు= ఒక ఉపాయం; చెప్పెదన్= చెప్పుతాను (అదేమంటే?); సుతున్= తన కుమారుడైన అశ్వత్థామను గూర్చి; (సుతుండు అని పాఠాంతరంలో స్పష్టత ఉన్నది); హతుఁడు+అయ్యెన్= సంహరించబడ్డాడు; అనంగన్= అని అంటూ ఉండేటప్పుడు; విన్న+అంతన్+అ= వినిన వెంటనే; ఇతఁడు= ఈ ద్రోణాచార్యుడు; ఆయుధంబు= తన చేతిలో ఉన్న ఆయుధాన్ని; దిగఁద్రావి= విడిచిపెట్టి; అచేష్టతన్= నిశ్చేష్టత్వాన్ని; పొందున్= పొందుతాడు; అప్పుడు= ఆ సమయంలో; ఈతనిన్= ఈ ద్రోణాచార్యుడిని; పరిమార్పవచ్చున్= సంహరించ వీలవుతుంది; ఇది తప్పన్= ఇదిగాక; ఏ+మెయిన్= ఏ విధంగానూ; ఉపాయము= (వేరే) ఉపాయం; కల్గదు= లేదు.

తాత్పర్యం: ఈ ద్రోణాచార్యుడిని యుద్ధంలో గెలువటం దేవతలకు కాని దానవులకు కాని అసాధ్యం. అయినా ఇతడిని జయించటానికి ఒక ఉపాయం చెపుతాను. తన కుమారుడు అశ్వత్థామ సంహరించబడ్డాడని వింటే చాలు, ఆయుధాన్ని విడిచి యుద్ధాన్ని మానివేస్తాడు. ఆ సమయంలో ఇతడిని సంహరించవచ్చును. ఇదితప్ప ఇతడిని సంహరించటానికి మరో మార్గం లేదు.'

వ. **'కావున నశ్వత్థామ సచ్చె నని యొక్కరుం డతనికిఁ జెప్పుటయ కర్జం' బనిన విని యచ్చటియందఱు 'నిదియ మే' లని; రర్జునుండు దాని కొడంబడక యుండెఁ; బాండవాగ్రజుండు విషాదంబుతో విచారించెఁ; దదనంతరంబ.** **306**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అశ్వత్థామ= ద్రోణాచార్యుడి కుమారుడు, అశ్వత్థామ; చచ్చెన్= మృతి చెందాడు; అని= ఈ విధంగా; ఒక్కరుండు= ఒక వ్యక్తి; అతనికిన్= ఆ ద్రోణాచార్యుడికి; చెప్పుట+అ= చెప్పటమే; కర్జంబు= కర్తవ్యం; అనినన్= అని చెప్పగా; విని= సావధానంగా విని; అచ్చటి+అందఱున్= అక్కడ ఉన్న వారందరుకూడ; ఇది+అ= ఇదే; మేలు+అనిరి= హితమైనదని అన్నారు (కాని); అర్జునుండు= అర్జునుడు (ద్రోణాచార్యులకు ప్రియశిష్యుడు కాబట్టి); దానికిన్= ఆ చెప్పిన దానికి; ఒడంబడక= ఒప్పుకొనకుండా; ఉండెన్= ఉన్నాడు; పాండవ+అగ్రజుండు= పాండవుల జ్యేష్ఠభ్రాత ధర్మరాజు; విషాదంబుతోన్= దుఃఖంతో; విచారించెన్= శస్త్ర త్యాగం చేసినవాడిని సంహరించటం ధర్మాతిక్రమణం కాదా అని ఆలోచించాడు; తద్+అనంతరంబు+అ= తరువాత.

తాత్పర్యం: 'కాబట్టి అశ్వత్థామ మృతి చెందా డని ఎవడో ఒక డతనికి చెప్పటమే ప్రస్తుత కర్తవ్యం' అని కృష్ణుడు చెప్పగానే విన్నవారందరు 'ఇట్లా చేయటమే మంచి' దన్నారు. కాని, అర్జునుడు మాత్రం దాని కొప్పుకొనలేదు. ధర్మరాజు దుఃఖంతో ఆలోచించసాగాడు. ఆ తరువాత.

క. భీమునిచే నని నశ్వ। త్థామ యనం బరఁగు భద్రదంతి వడిన ను
ద్దామగతి నన్నెపమ్ముగ। నామారుత పుత్త్రుఁ డేగి యగ్గురుతోడన్......... 307

ప్రతిపదార్థం: భీమునిచేన్= భీమసేనుడి చేత; అనిన్= యుద్ధంలో; అశ్వత్థామ+అనన్= అశ్వత్థామ అని పిలువబడి; పరఁగు= ప్రసిద్ధిని చెందిన అనగా అశ్వత్థామ అనే పేరుతో ప్రసిద్ధి చెందిన; భద్రదంతి= భద్రగజం; పడినన్= పడిపోగా - అనగా సంహరించబడగా; ఆ మారుత పుత్త్రుఁడు= ఆ వాయునందనుడు భీముడు; ఉద్దామ గతిన్= గొప్ప అనగా వేగవంతమైన; నడకతో; ఏగి= వెళ్ళి; ఆ+నెపమ్ముగన్= అశ్వత్థామ గజసంహారం అనే మిషతో; ఆ+గురుతోడన్= ఆ ద్రోణాచార్యుడితో.

తాత్పర్యం: భీముడి చేతిలో అశ్వత్థామ అనే ఏనుగు మృతి చెందింది. ఆ నెపంతో భీముడు అతివేగంగా వెళ్ళి ద్రోణాచార్యుడితో (తరువాతి పద్యంతో అన్వయం).

వ. 'అశ్వత్థామ సచ్చె' నని చెప్పుటయుఁ' జిత్తంబు జల్లని చెదర బెదరియు నతండు దన కొడుకు నస్త్రవీర్యాది గుణంబులు గణుతించి యప్పలుకులు పెడచెవులం బెట్టి కలఁక లేక ధృష్టద్యుమ్నుపైఁ గవిసి పెల్లేసి, యతని కడ్డపడిన పాంచాల రథికుల నిరువది వేవుర వధియించి, మాత్స్యబలంబున కుటికి యేనూఱు రథంబులఁ బదివేలు మాతంగంబుల నన్నియ తురంగంబులం బొరిగొని, తేజరిల్లి రాజుల గములకు నాదిగొనునప్పుడు విశ్వామిత్ర జమదగ్ని భరద్వాజ గౌతమ కశ్యప వశిష్ఠాత్రిప్రభృతి మునివర ప్రకరం బాతని పాలి కేతెంచి- 'భారద్వాజా! నీవు బ్రాహ్మణుండవు, వేదవేదాంగవిదుండవు; నీకు సంగ్రామంబు సేయ ధర్మంబగునే? యింతకు మున్ను చేసితేనియుం జేసితి గాని, కాలంబు పూర్ణం బయ్యెఁ గాన నింక సమరంబు నుడుగుట మేలు; మా మాటలు వట్టి యాయుధంబులు వెట్టి శాంతిఁ బొందు' మని చెప్పి యంతర్ధానంబు సేసిన న వ్విప్రవరుండు వారల పలుకు లూహించి భీమసేను వచనంబులం దలంచి యగ్రభాగంబునకు వచ్చి యున్న ధృష్టద్యుమ్నుం గనుంగొని వికల చిత్తుండును శోకాయత్తుండును నగుచు నిజపుత్త్రుండు సచ్చుట బ్రదుకుట, యజాత శత్రు వలన నున్నరూపు దెలియువాఁడై యతని నడిగె; నయ్యవసరంబున వాసుదేవుం డవ్వసుమతీపతి కిట్లనియె. 308

ప్రతిపదార్థం: అశ్వత్థామ+చచ్చెను+అని= అశ్వత్థామ మృతిచెందాడని; చెప్పుటయున్= చెప్పగానే; చిత్తంబు= మనస్సు; జల్లు+అని= జల్లు అనే శబ్దం చేసి; చెదరన్= చలించి పోగా; బెదరియున్= భయపడిపోయి; అతండు= ఆ ద్రోణాచార్యులు; తన కొడుకు +అస్త్రవీర్య+ఆది గుణంబులు= తన కుమారుడైన అశ్వత్థామకు గల దివ్యాస్త్ర సామర్థ్యం మొదలైన గుణాలను; గణుతించి= భావించి; ఆ+పలుకులు= ఆ భీమసేనుడి మాటలు; పెడచెవులన్+పెట్టి= విన్నా లెక్కచేయక; కలఁక= అయ్యో! నా కొడుకుపోయాడే అనే బాధ; లేక= లేకుండా; ధృష్టద్యుమ్నుపైన్= ధృష్టద్యుమ్నుడిపైకి; కవిసి= లంఘించి; పెల్లు= మిక్కుటంగా; ఏసి= బాణాలు ప్రయోగించి; అతనికిన్= ఆ ధృష్టద్యుమ్నుడికి; అడ్డపడిన= అడ్డం వచ్చిన-ద్రోణాచార్యుడి బారినుండి కాపాడవచ్చిన; పాంచాలరథి కులన్+ఇరువది నేవురన్= ఇరువదివేల పాంచాలదేశపు రథికులను; వధియించి= వధించి; మాత్స్యబలంబునకున్=మత్స్య దేశపు సైన్యానికి; ఉటికి= పరుగెత్తి; ఏనూఱు రథంబులన్= అయిదు వందల రథాలను; పదివేలు మాతంగంబులన్= పదివేలఏనుగు లను; అన్ని+అ తురంగంబులన్= అన్నే గుర్రాలను-పదివేల గుర్రాలనని భావం; పొరిగొని= వధించి; తేజరిల్లి= పౌరుషదీప్తితోవెలిగిపోతూ;

రాజుల గములకున్= రాజుల సమూహాలకు; ఆదిగొను+అప్పుడు= కన్ను వేసే సమయంలో; విశ్వామిత్ర జమదగ్ని భరద్వాజ గౌతమ కశ్యప వసిష్ఠ+అత్రి ప్రభృతి మునివర ప్రకరంబు= విశ్వామిత్రుడు, జమదగ్ని, భరద్వాజుడు, గౌతముడు, కశ్యపుడు, వసిష్ఠుడు, అత్రి ఈ సప్తఋషులు మొదలుగా గల ఋషిశ్రేష్ఠుల సమూహం; ఆతని పాలికిన్= ఆ ద్రోణాచార్యుల సమీపానికి; ఏతెంచి= వచ్చి; భారద్వాజా!= భరద్వాజ కుమారుడైన ఓ ద్రోణా!; నీవు బ్రాహ్మణుండవు= నీవు బ్రాహ్మణుడివి; వేదవేదాంగ విదుండవు= ఋగ్వేదాది చతుర్వేదాలను మరియు శిక్షాది వేదాంగాలను ఆరింటిని తెలిసిన వాడివి; సంగ్రామంబు= యుద్ధం; చేయన్= చేస్తే; నీకు ధర్మంబు+అగునే?= నీకు ధర్మమవుతుందా? (కాదని భావం); ఇంతకున్ మున్ను= ఇంతకంటె పూర్వం; చేసితి(వి)+ఏని+యున్, చేసితి(వి)+కాని= చేస్తే చేశావుగాక-చేసినదాని గురించి మాకిప్పుడు పట్టింపు లేదు; కాలంబు= నీ జీవితకాలం; పూర్ణంబు+అయ్యెన్+కానన్= నిండింది కాబట్టి; ఇంకన్= ఇక; సమరంబున్+ఉడుగుట= యుద్ధం చాలించటం; మేలు= ఉచితం; మా మాటలు+పట్టి= మా యొక్క మాటలను గ్రహించి; ఆయుధంబులు+పెట్టి= శస్త్రాలు క్రిందపెట్టి - శస్త్రత్యాగంచేసి; శాంతిన్= శమాన్ని; పొందుము అని; చెప్పి= బోధించి; అంతర్ధానంబు+చేసినన్= మాయమయిన తరువాత; ఆ+విప్రవరుండు= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు అనగా ద్రోణుడు; వారల పలుకులు= ఆ ఋషుల మాటలను; ఊహించి= ఆలోచించుకొని - ఆ మాటల తాత్పర్యం గ్రహించి; భీమసేను వచనంబులు= భీముడి మాటలను (అశ్వత్థామ హతుడయ్యాడనే మాటలను); తలంచి= తలచుకొని; అగ్రభాగంబునకున్= ముందు వైపునకు; వచ్చి ఉన్న= వచ్చినటువంటి; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; కనుంగొని= చూచి; వికల చిత్తుండును= వ్యాకులమైన మనస్సు కలవాడుగాను; శోక+ఆయత్తుండును+అగుచున్= దుఃఖానికి లోనైనవాడుగాను ఉంటూ; అజాతశత్రువలనన్= ధర్మరాజువలన; ఉన్నరూపు= ఉన్నటువంటి పరిస్థితిని - నిజాన్ని; తెలియువాఁడు+ఐ= తెలిసికొనేవాడై; నిజపుత్రుండు= తన కుమారుడు; చచ్చుట= చావటం; బ్రదుకుట= బ్రతికి ఉండటం; అతనిన్= ఆ ధర్మరాజును; అడిగెన్= అడిగాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; వాసుదేవుండు= కృష్ణుడు; ఆ+వసుమతీపతికిన్= ఆ ధర్మరాజుతో (వసుమతికి భూమికి పతి ప్రభువు= రాజు); ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: 'అశ్వత్థామ మృతుడైనాడు' అని చెప్పాడు. వెంటనే ద్రోణాచార్యుడు చిత్తం జల్లుమనగా భయపడినా, తన కొడుకు పరాక్రమాన్ని దివ్యాస్త్ర సామర్థ్యాన్ని తలపోసి, భీముడి మాటలు లెక్కపెట్టక మనస్సులో ఏ సంకోచం లేక ధృష్టద్యుమ్నుడిపై దాడి చేశాడు. బాణాల వర్షం కురిపించాడు. అడ్డం వచ్చిన పాంచాల రథిక వీరులను ఇరువది వేల మందిని వధించి. వెనువెంటనే మత్స్యదేశపు సైనికుల మీదికి వెళ్ళి, అయిదు వందల రథాలను, పదివేల ఏనుగులను, పదివేల గుఱ్ఱాలను సంహరించి. అమిత పరాక్రమంతో వెలుగుతూ రాజుల సమూహాల మీద కన్నువేసిన సమయంలో కశ్యపాది సప్తఋషులను ముందుంచుకొని ఎందరో ఋషిప్రవరులు ద్రోణాచార్యులకు ప్రత్యక్షమై 'ఓ ద్రోణా! నీవు భరద్వాజముని కుమారుడవైన బ్రాహ్మణుడివి. వేదవేదాంగాలు తెలిసినవాడివి. అటువంటి నీ విట్లా యుద్ధం చేయటం ధర్మమా? ఇక ఇంతవరకు యుద్ధం చేస్తే చేశావు నీ జీవితకాలం చెల్లిపోయింది. అందువల్ల నీవు యుద్ధం చాలించటం మంచిది. చేతనున్న ఆ శస్త్రాన్ని ఇక విడిచి పెట్టుము; శాంతించుము' అని చెప్పి, వారు మాయమయ్యారు. ద్రోణాచార్యుడు ఆ మునులు చెప్పిన మాటలు ఆలోచించుకొని, భీముడు చెప్పిన మాటలను గుర్తుచేసికొని, ఎదుట పొంచి ఉన్న ధృష్టద్యుమ్నుడిని చూచి మనస్సు వికలమై, దుఃఖంతో-తన కుమారుడు మరణించాడో లేక బ్రతికి ఉన్నాడో అజాతశత్రువు ధర్మరాజు వలన సత్యం తెలుసుకోవలెనని అతడిని అడిగాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: 1. కశ్యపాదులు సప్తఋషులు - అందుకే ఆ ఏడుగురి నామనిర్దేశం చేయబడింది. దానికి ప్రమాణం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్లో॥ **కశ్యపోఽత్రిర్భరద్వాజః విశ్వామిత్రోఽథ గౌతమః!**
జమదగ్ని ర్వసిష్ఠశ్చ సాధ్వీ చైవాప్యరుంధతీ ॥

ఈ సప్త ఋషులతోపాటు మహాపతివ్రత వసిష్ఠపత్ని అరుంధతి కూడ పూజనీయురాలని ఆమె కూడా ఇక్కడ స్మరించబడింది.

2. ద్రోణుడిని చూచి ఆ ఋషులు వేదవేదాంగవిదుడ వని అన్నారు. వేదాలు నాలుగు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం అనేవి - ఈ వేదాలకు అంగాలు ఆరు.

శ్లో॥ **శిక్షా వ్యాకరణం ఛందో నిరుక్తి ర్జ్యోతిషం తథా ।**
కల్పశ్చేతి షడంగాని వేదస్యాహుర్మనీషిణః ॥ ఇవి వేదాంగాలు.

3. ద్రోణాచార్యుడి మనస్సు వికలమై క్షోభించటానికి కారణాలు రెండు. ఒకటి కొడుకు మరణవార్త; రెండు ధృష్టద్యుమ్నుడు తన ఎదుట యుద్ధానికి నిలువటం. ధృష్టద్యుమ్నుడు ద్రోణుడి మరణానికే ఆవిర్భవించినవాడు. ద్రుపదుడు ద్రోణుడికి బాల్యమిత్రుడు. ద్రోణుడు పరశురాముడివలన అస్త్రవిద్య పొంది, బాల్యమిత్రుడని ద్రుపదుడి దగ్గరకి వెళ్ళాడు. ద్రుపదుడు బాల్య స్నేహాన్ని మరచి దరిద్రుడన్న భావంతో ద్రోణుడిని అవమానించాడు. దానికి ప్రతీకారంగా ద్రోణుడు పార్థుడి ద్వారా గురుదక్షిణ రూపంలో ద్రుపదుడిని జయించి బంధించి తెప్పించుకొన్నాడు. తగిన గుణపాఠం చెప్పి అర్ధరాజ్యం మాత్రం ఇచ్చి అతడిని విడిచివేశాడు. కాని, ద్రుపదుడు ఆ ద్రోణుడిపై ప్రతీకార జ్వాలతో యజ్ఞం చేసి, ద్రోణుడి మరణానికై ధృష్టద్యుమ్నుడిని పుత్రుడిగా పొందాడు. ధృష్టద్యుమ్నుడి పుట్టుకలోని విశేషం ఏమిటంటే - అతడు అగ్నికుండం నుండి కవచ కిరీటాదులు ధరించి, ఆయుధపాణి అయి సద్యోయౌవనం కలిగి ఆవిర్భావం చెందాడు. ద్రౌపది కూడా అప్పుడే సద్యోయౌవన అయి ఆవిర్భవించింది. (చూ. ఆంధ్ర మహాభారతం, ఆదిపర్వం, సప్తమాశ్వాసం 17-20 పద్యాలు).

తే. **'అడరి యీ దివసము నపరాహ్ణమునను । ద్రోణుఁ డని సేసిన ట్లైనఁ ద్రుంగిపోక**
యుండ నేర్తురే యిక్కడి యోధు లెవ్వ । రైన? విను నుతి గాదు సత్యమ్ము సుమ్ము! **309**

ప్రతిపదార్థం: ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; అడరి= చెలరేగి; ఈ దివసమున్+అపరాహ్ణమునను= ఈ దినం అపరాహ్ణసమయంలో (సూర్యుడుదయించినప్పటి నుండి అస్తమించే వరకు ఎంత సమయం ఔతుందో దానిలో అయిదింట నాలుగో భాగం అపరాహ్ణం, మధ్యాహ్నం తరువాతిది అపరాహ్ణం); అని= యుద్ధం; చేసినట్లు+ఐనన్= చేసినట్లయితే; ఇక్కడి యోధులు+ఎవరు+ఐనన్= ఈ మన సైన్యంలో ఉన్న ఎంతటి గొప్పయోధులైనా; త్రుంగిపోక= తెగిపోక; ఉండనేర్తురే!= ఉండజాలుతారా! (యుద్ధంలో ద్రోణుడి కంటబడి బ్రతికి బయటపడే వారెవరు కూడ ఉండరని భావం); విను= సావధానంగా వినుము ధర్మరాజా!; నుతి కాదు= (ఇది) ప్రశంస కాదు - ప్రశంసార్థం చెప్పే అతిశయోక్తి కాదని భావం; సత్యమ్ము సుమ్ము= సత్యం సుమా! ఉన్న యథార్థ విషయాన్నే చెప్పాను - మరేదో కాదని భావం.

తాత్పర్యం: ద్రోణుడు విజృంభించి ఈరోజు అపరాహ్ణం దాకా యుద్ధం చేస్తే ఈ పక్షంలోని యోధులెవరైనా మరణించకుండా మిగిలి ఉండగలరా? ఇది నిజం. ప్రశంస ఏమాత్రం కాదు. (ఇక ఆలోచించు)

విశేషం: 'అపరాహ్ణం అంటే, అహ్నః అపరః దివసం యొక్క అపరభాగ మని వ్యుత్పత్త్యర్థం.' ఈ పదం రూఢం కాబట్టి అపరాహ్ణ కాలం అనే అర్థంలోనే ప్రయోగించబడుతుంది. ఒక్కదినానికి అయిదు కాలాలు. అవి. 1. ప్రాతఃకాలం, 2. సంగమకాలం, 3. మధ్యాహ్నకాలం, 4. అపరాహ్ణకాలం, 5. సాయంకాలం అనేవి - దినం అంటే సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు గల కాలం. ఆ కాలంలోని అయిదు భాగాలలో నాలుగవ భాగం అపరాహ్ణం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మము నీతని కొప్పింపక । సముచితముగఁ గాచికొను; మసత్యవచన దో
షము లేదు ప్రాణరక్షణ । సమయంబున; నతని కొడుకు సచ్చెన యనుమీ!' 310

ప్రతిపదార్థం: మమున్= మమ్ములను; ఈతనికిన్= ఈ ద్రోణుడికి; ఒప్పింపక= అప్పజెప్పక; సముచితముగన్= తగిన విధంగా; కాచికొనుము= రక్షించుకొమ్ము; ప్రాణరక్షణ సమయమునన్= ప్రాణాల రక్షణ సందర్భంలో (ప్రాణాలను రక్షించుకొనే నిమిత్తం అని భావం); అసత్యవచన దోషము= అసత్యం పలుకుట వలన కలిగే దోషం; లేదు= ఉండదు (కాబట్టి); అతని కొడుకు= ఆ ద్రోణుడి కుమారుడు అశ్వత్థామ; చచ్చెను+అ= చావనే చచ్చాడు ('అ' అవధారణార్థకం) (నిశ్చయంగా మృతి చెందాడు); అనుము+ఈ!= అని చెప్పుమా! ('ఈ' సంప్రార్థనార్థకం).

తాత్పర్యం: మమ్మందరిని ఈ ద్రోణుడికి అప్పజెప్పకుండా తగువిధంగా కాపాడుకొనుము. ప్రాణాలను కాపాడుకొనే సమయంలో అసత్యాన్ని పలుకుటలో ఏ దోషం లేదు. 'అశ్వత్థామ హతు డయినాడు' అని ద్రోణుడితో చెప్పవయ్యా!'

వ. అని పనిచె; నట్టియెడ నయ్యుధిష్ఠిరుతో భీమసేనుం 'డే నప్పుడు కృష్ణుండు సెప్ప నయ్యోధవరు వధియించు నుపాయంబు విని యదియ మనంబున నుండి మాళవేంద్రుండగు నింద్రవర్మవారణం బశ్వత్థామ యనుపేరిటిది నాచేతఁ జచ్చెఁ;నది నెపంబుగ నతనికి నశ్వత్థామ సచ్చె నని చెప్పితిఁ జెప్పిన నొక్కింత విచారించి యమ్మాట దెస ననాదరంబు సేసె; నీకు విజయంబు గోరి హితం బుపదేశించు నీ గోవిందుని వాక్యం బుల్లంఘింపక నీవు నట్ల చెప్పుము; నీ వచనమ్ము నమ్మి యతండు గయ్యంబు సేయఁ జేయాడక చెడు' నని యొత్తి చెప్పుటయు. 311

ప్రతిపదార్థం: అని= ఇట్లా పలికి; పనిచెన్= ప్రేరేపించాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ+యుధిష్ఠిరుతోన్= ఆ ధర్మరాజుతో; భీమసేనుడు; ఏను= నేను; అప్పుడు= ఆ సమయంలో; కృష్ణుండు= కృష్ణుడు; చెప్పన్= చెప్పగా; ఆ+యోధవరున్= ఆ యోధులలో మేటి అయిన ద్రోణాచార్యుడిని; వధియించు+ఉపాయంబు= చంపే ఉపాయం; విని= విన్నవాడనై; అది+అ= అదే; మనంబునన్= మనస్సులో; ఉండన్= ఉండగా (మనస్సులో ఎప్పుడూ అదే మెదలుతూ ఉండగా) (అశ్వత్థామా హతః అని చెప్పటానికి నే నొక ఎత్తు వేశాను అదేమిటంటే); మాళవ+ఇంద్రుండు+అగు+ఇంద్రవర్మ వారణంబు= మాళవ దేశాధీశుడైన ఇంద్రవర్మగజం; అశ్వత్థామ పేరిటిది= అశ్వత్థామ అనే పేరు గలది; నాచేతన్= నాచేత; చచ్చెన్= చచ్చింది; అది= ఆ అశ్వత్థామ నామక గజసంహారం; నెపంబు+కన్= మిషగా; అతనికిన్= ఆ ద్రోణాచార్యుడికి; అశ్వత్థామ+చచ్చెన్= అశ్వత్థామ హతుడయ్యాడు; అని చెప్పితిన్= అని చెప్పాను; చెప్పినన్= చెప్పగానే; ఒక్కింత= కొంచెంసేపు; విచారించి= ఆలోచించి; ఆ+మాటదెసన్= ఆ పలుకువైపు; అనాదరంబు= నిర్లక్ష్యం; చేసెన్= చేశాడు; నీకున్= ఓ ధర్మరాజా! నీకు; విజయంబు+కోరి= విజయాన్ని ఆకాంక్షించి; హితంబు= మేలు; ఉపదేశించు+ఈ గోవిందుని వాక్యంబు= ఉపదేశించే ఈ కృష్ణుని మాట; ఉల్లంఘింపక= దాటక; నీవును= నీవు కూడ; అట్లు+అ= ఆ విధంగానే; చెప్పుము; నీ వచనమ్ము= నీ మాటను; నమ్మి= విశ్వసించి; అతండు= ఆ ద్రోణాచార్యుడు; కయ్యంబు= యుద్ధం; చేయన్= చేయటానికి; చేయి+ఆడక= చేయి కదలక; చెడున్= నశిస్తాడు; అని= అనే విధంగా; ఒత్తి= గట్టిగా; చెప్పుటయున్= చెప్పగానే.

తాత్పర్యం: అని పలికి, ఆ పనికి ప్రేరేపించాడు. ఆ సమయంలో ధర్మరాజుతో భీము డన్నాడు - 'కృష్ణుడు ద్రోణవధకై చెప్పిన ఉపాయం అప్పుడు విన్నాను; వినినప్పటి నుండి అది నా మనసులో మెదలుతూ ఉన్నది. నా చేతచచ్చిన అశ్వత్థామ అనే గజం మాళవరాజు ఇంద్రవర్మది జ్ఞాపకం వచ్చింది. అది నెపంగా ద్రోణుడితో అశ్వత్థామ మరణించాడని చెప్పాను. కాని, ఆ ద్రోణాచార్యుడు నా మాటపై కొంత విచారించి నిర్లక్ష్యం చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నీకు విజయంకోరి హితంచెప్పే ఈ కృష్ణుడి మాటను దాటకుండా ఆ విధంగా చెప్పుము. నీ మాట నమ్మి ద్రోణుడు యుద్ధం చేయటానికి చేయిఆడక నశిస్తాడు అని గట్టిగా చెప్పగా (తరువాతి పద్యంతో అన్వయం).

ధర్మజుఁడు ద్రోణునితో నశ్వత్థామ సచ్చె నని యేనుఁగు నెపంబునఁ జెప్పుట (సం. 7-164-105)

క. మది నయ్యిరువుర మాటలు । బదిలంబుగఁ బట్టికొనుటఁ, బట్టియు నెట్లుం
దుది నది యట్టుల కాఁగల । యదియై యుండుటను, దాని కత డొడఁబడియెన్. 312

ప్రతిపదార్థం: ఆ+ఇరువురమాటలున్= ఆ ఇద్దరు అనగా కృష్ణభీములు చెప్పిన మాటలు కూడ; మదిన్= మనస్సును; పదిలంబుగన్= దృఢంగా; పట్టికొనుటన్+పట్టియున్= పట్టుకొనటం వలన; ఎట్లున్= ఎట్లాగైనా; తుదిన్= చివరకు; అట్లు= అదే విధంగా; కాఁగల అది+ఐ+ఉండుటను= అవుతుంది కాబట్టి; దానికిన్= వారు చెప్పినదానికి; అతఁడు= ఆ ధర్మరాజు; ఒడఁబడియెన్= అంగీకరించాడు.

తాత్పర్యం: ఆ కృష్ణుడు, భీముడు ఇద్దరు చెప్పిన మాటలు ధర్మరాజు మనస్సును గట్టిగా పట్టుకోవటంవల్ల, చివరకు అది అట్లా జరుగవలసి ఉన్నందువల్ల ఆ విధంగా చెప్పటానికి అంగీకరించాడు.

వ. ఇట్లు సమ్మతించి. 313

తాత్పర్యం: ఈ విధంగా అంగీకరించి.

క. అనృత భయము నాజిజయము । గొనియెడు తమకంబు పెంపు గుదియింపఁగఁ బాం
డునరేంద్రు నగ్రతనయుం । డనుమానము వాయఁ బెట్టి యస్త్రగురునితోన్. 314

ప్రతిపదార్థం: అనృత భయమున్= అసత్య భయమును; ఆజిజయమున్+కొనియెడు, తమకంబు పెంపు= యుద్ధ విజయాన్ని పొందే ఆసక్తియొక్క ఆధిక్యం - అనగా మిక్కుటమైన ఆసక్తి; కుదియింపఁగన్= క్రుంగింపగా; పాండు నరేంద్రుని+అగ్రతనయుండు= పాండురాజు జ్యేష్ఠపుత్రుడు ధర్మరాజు; అనుమానము= సందేహాన్ని; పాయన్+పెట్టి= తొలగించుకొని; అస్త్రగురునితోన్= అస్త్ర విద్యాగురువైన ద్రోణాచార్యుడితో.

తాత్పర్యం: అసత్యభయాన్ని యుద్ధంలో విజయం సాధించాలి అనే బలమైన ఆకాంక్ష అణగించగా, ఏ సందేహం లేక ధర్మరాజు ద్రోణాచార్యుడితో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. వలయు కొలఁది నెలుంగెత్తి వర్ణ సమితి । యచ్చుపడఁగ 'నశ్వత్థామ సచ్చె' ననియె
నని పదంపడి యల్లన యతని చెవికి । వినఁగ రాకుండఁ 'గుంజర' మనియె నధిప! 315

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; వలయు కొలఁదిన్= కావలసినంత - అనగా తానెంత బిగ్గరగా చెప్పవలయునో అంత బిగ్గరగా; ఎలుంగు= కంఠస్వరాన్ని; ఎత్తి= హెచ్చించి; వర్ణ సమితి= అక్షరాల సముదాయం; అచ్చు పడఁగన్= స్పష్టంగాతెలిసే విధంగా; అశ్వత్థామ+చచ్చెన్= అశ్వత్థామ మరణించాడు; అనియెన్= (అని) అన్నాడు; అని= ఇట్లా పలికి; పదంపడి= వెంటనే; అల్లన= మెల్లగా; అతని చెవికిన్= ఆ ద్రోణాచార్యుల చెవులకు; వినఁగన్+రాకుండన్= వినరాకుండా ఉండే విధంగా కుంజరము=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏనుగు; అనియెన్= (అని) అన్నాడు - హతమయింది; అశ్వత్థామ (కాని అది) గజం అని అన్నాడు (గజము అని మెల్లగా పలికి ద్రోణునకు వినరాకుండా చేశాడు)

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! బిగ్గరగా, కంఠస్వరాన్ని హెచ్చించి ఉచ్చారణ స్పష్టంగా ఉండే విధంగా 'అశ్వత్థామ చచ్చెను' అని వెంటనే ఏనుగు అనే మాట ద్రోణాచార్యుడికి వినబడకుండ మెల్లగా అన్నాడు.

విశేషం: అశ్వత్థామ అనే గజం హతమయింది నిజమే - కాని, ద్రోణుడి ప్రశ్నకు అది ఉత్తరం కాదు. హతమయింది అశ్వత్థామ అని బిగ్గరగా చెప్పి 'ఏనుగు' అనే మాట మెల్లగా అనటంచేత ద్రోణాచార్యులకు వినరాక నిజంగా అశ్వత్థామ తన కుమారుడే మరణించాడని భావించాడు. ఈ సత్యం కపటంతో కూడింది. కాబట్టి సత్య మనిపించుకోదు 'సత్యం నతత్ యచ్ఛల మభ్యుపేతమ్' అని ధర్మ సూక్ష్మత్వాన్ని వివరించారు పెద్దలు. కావున ధర్మరాజు పలికింది అనృతమే అయింది.

వ. ఇ వ్విధంబునం బలుకుటయు. 316

తాత్పర్యం: ఈ విధంగా పలుకగానే.

క. నేలకు నల్లెఁడు పొడువునఁ । గ్రాలుచు మును మెఱయు గురుని రథచక్రము ల
క్కాలంబున సమరజయ । శ్రీ లోపము దెలియ నంటసిలఁబడియె నృపా! 317

ప్రతిపదార్థం: నృపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; నేలకున్= భూమికి; నల్లెఁడు పొడువునన్= నాలుగువేళ్ళ ఎత్తున; క్రాలుచున్= నడుస్తూ; మును= పూర్వం; మెఱయు= ప్రకాశించే; గురుని రథ చక్రములు= ద్రోణాచార్యుడి రథానికున్న చక్రాలు; ఆ+కాలంబునన్= ఆ సమయాన; సమరజయశ్రీ లోపము= యుద్ధంలో జయలక్ష్మి లోపం; తెలియన్= తెలిసే విధంగా; అంటసిలన్= (నేలకు) తాకే విధంగా; పడియెన్= పడింది.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఇంతకుముందు భూమికి నాలుగువేళ్ళ ఎత్తున నడుస్తూ తిరిగే ద్రోణుని రథచక్రాలు, ఆ సమయంలో ద్రోణుడికి యుద్ధవిజయం లోపిస్తుందని తెలియజేసే విధంగా నేలను తాకాయి.

విశేషం: భూభాగానికి నాలుగువేళ్ళపైన తిరిగే రథం ఎవరిది అనే సంశయం కలుగుతూ ఉన్నది. ఆ రథం ద్రోణాచార్యుడిదని తిక్కన ఈ పద్యంలో చెప్పాడు. ఇక సంస్కృత మూలం ఇట్లా ఉన్నది.

శ్లో॥ అవ్యక్త మబ్రవీత్ రాజన్ హతః కుంజర ఇత్యుత ।
తస్యపూర్వం రథః పృథ్వ్యాః చతురంగుళ ముచ్ఛ్రితః ।
బభూవైవం చ తేనోక్తే తస్య వాహాః స్పృశన్ మహీమ్'

అనగా అతడు పలుకగానే అతని అశ్వములు భూమిని అంటినవి. ఈ శ్లోకానికిగల పూర్వ సందర్భాన్ని బట్టి 'తస్య వాహాః' అనే పదాలకు ధర్మరాజు గుర్రాలు అనే అర్థమే ఔతున్నది. ఈ శ్లోకం తరువాతి శ్లోకం ఇది

శ్లో॥ యుధిష్ఠిరాత్తు తద్వాక్యం శ్రుత్వా ద్రోణో మహారథః ।
పుత్రవ్యసన సంతప్తో నిరాశో జీవితేఽభవత్ (ద్రోణ - 190/56-57)

ఈ శ్లోకార్థం విచారించినా కూడా వెనుకటి శ్లోకంలోని తస్యవాహాః (అతడి అశ్వములు) అనే దానికి ద్రోణుడి అశ్వాలు అనే అర్థం కుదురటంలేదు. ఇంత వరకు ఎన్నడూ అసత్యమాడని వాడు ధర్మరాజు- అందుకే అతడి రథం భూమికి నాలుగువేళ్ళ

ఎత్తున నడుస్తూ ఉండేది. ఇప్పుడు అసత్యమాడాడు కదా! వెంటనే ఆ రథం నేలపై పడిపోయింది. పూర్వాపర సందర్భాలు ధర్మరాజు రథమనే భావాన్నే కలిగిస్తూ ఉన్నవి. తిక్కన మాత్రం ద్రోణుడి రథాన్నే అట్లా చిత్రీకరించాడు.

మూల శ్లోకాలనుబట్టి చూచినా ఆ గుర్రాలు ద్రోణుడి వనే భావించారు కొందరు. ఆ వార్తను వినటానికి పూర్వం ద్రోణుడి అశ్వాలను సారథి అతివేగంగా నడిపించాడు. అందుచేత అవి భూమికి నాలుగంగుళాలు ఎత్తున దుమికేవి. ఇప్పుడు దుర్వార్త చెవినిబడగానే ద్రోణుడు క్రుంగిపోవటంవలన, సారథి ఆ గుర్రాల పట్టు సడలించటం వలన, అవి నేలకు ఆని నిలిచాయి అని భావించాలి. అంతేకాని ధర్మరాజు అసత్యమాడటానికీ, గుర్రాలు క్రింద ఆనటానికి సంబంధం ఏమిటి? అందుచేత ఇక్కడ తిక్కన భావమే సమంజసమని తోస్తుంది. 320 పద్యం వల్ల ద్రోణుడి పరిస్థితి అర్థమవుతుంది.

వ. అప్పుడు. 318

తాత్పర్యం: ఆ సమయంలో.

క. తనుఁ బాండుతనయులకు ద్రో । హునిగా నక్కుంభజన్ముఁ డూహించుచు న
మ్మునులట్లు సెప్పి; రటుగా । వునఁ గా కేమి యిది దగవవుం బొమ్మనుచున్. 319

ప్రతిపదార్థం: తనున్= తనను; పాండు తనయులకున్= పాండు పుత్రులైన ధర్మరాజాదులకు; ద్రోహునిగాన్= ద్రోహం చేసిన వాడినిగా; ఆ+కుంభజన్ముఁడు= ఆ ద్రోణాచార్యుడు; ఊహించుచున్= ఊహిస్తూ; ఆ+మునులు= ఆ కశ్యపాది ఋషులు; అట్లు= ఆ విధంగా; చెప్పిరి= చెప్పారు; అటు= ఆ విధంగా; కావునన్= అగుతుంది కాబట్టి; కాక+ఏమి?= కానీ ఏమి? ('ఏమి' ప్రశ్నార్థకం); ఇది= ఈ చేసే యుద్ధం; తగవు= ధర్మమే (న్యాయమే); అవున్= అవుతుంది; పొమ్ము= నిశ్చయం; అనుచున్= అంటూ.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు తాను పాండవులకు ద్రోహం చేస్తున్న వాడినని అనుకొంటూ, ఆ మునులు ఆ విధంగా చెప్పారు. అట్లా జరిగితే జరుగనీ ఏం? అయినా నేను ఇట్లా యుద్ధం చేయటం న్యాయం, అని తలపోస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం).

శా. ధృష్టద్యుమ్మునిఁ జూచుచున్ రణసముద్రేకంబు బాహాబలా
వష్టంభంబును శౌర్యనిర్వహణ గర్వస్ఫూర్తియుం దొంటియు
త్కృష్టత్వంబును దక్కి స్రుక్కి వగ బుద్ధిం బీఁకువీఁకాడఁగాఁ
జేష్టాహీనతఁ బొంది యగ్గురుఁడు సంక్షిప్తాంగుఁ డై యున్నెడన్. 320

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్నునిన్= ధృష్టద్యుమ్నుడిని; చూచుచున్= చూస్తూ; రణసముద్రేకంబు= యుద్ధ విజృంభణం; బాహాబల+అవష్టంభంబును= భుజ బలగర్వం; శౌర్య నిర్వహణ= శూరత్వం ప్రకటించటంలో; గర్వస్ఫూర్తియున్= దర్పస్ఫురణ; తొంటి ఉత్కృష్టత్వంబును= మొదటి గొప్పతనం; తక్కి= తగ్గిపోయి - అనగా క్షీణించి (ఆ కారణాన); స్రుక్కి= మూర్ఛచెంది; వగ= పుత్రమరణజన్యమైన దుఃఖం; బుద్ధిన్= మతిని; పీఁకువీఁకాడఁగాన్= మిక్కిలి వికలం జేయగా; చేష్టాహీనతన్+పొంది= చేష్టారహితత్వాన్ని పొంది - చేష్టలుడిగి; ఆ+గురుఁడు= ఆ ద్రోణుడు; సంక్షిప్త+అంగుఁడై= ముడుచుకోబడిన కర చరణాద్యవయవాలు కలవాడై; ఉన్న+ఎడన్= ఉన్న సమయంలో.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడిని చూస్తూ, యుద్ధోద్రేకాన్ని, బాహుబలగర్వాన్ని , శౌర్యాన్ని ప్రకటించటంలో దర్పాన్ని, ఇదివరకటి అతిశయాన్ని కోల్పోయి, బలహీనపడి, దుఃఖం మనస్సును మిక్కిలి కలతనొందించగా చేష్టలుడిగి, ముడుచుకొనిపోయిన అవయవాలు కలవాడై ఉండగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అతని వధంబునకై పాంచాలవిభుని వేలిమిం బుట్టినవాఁ డగుట నప్పార్షతుండు దత్సమయజనితోత్సాహ రోష విశేషాయత్తచిత్తుం డగుచు నమ్మహీసురుమీఁదం గవిసి యేసిన ననికి నొల్లని యుల్లంబునఁ బరుని యుల్లాసంబు సహింపలేని తేజంబును బురికొని యతండు వోరం దొడంగిన దివ్యాస్త్రంబులు ప్రతిభాసింపక యుండె; నట్లయినను మనసుబలిమి కలిమిం బ్రకృతి బాణంబుల నాతని బాణబాణాసన రథ రథ్య సూత కేతనంబులు వొడిసేసె; నాధృష్టద్యుమ్నుండు గద గొనినం దునియలు గావించెఁ; బలకయు వాలునుం గొని వచ్చి యవ్వీరుండు సారథి తురంగంబుల యంగంబుల వ్రయ్యనేయఁ దత్కరవాల ఖేటపాటనంబు సేసి తనువునం జండకాండంబులు నించె; నట్లు నించి నొంచినం గని శినివరుండు గృపకర్ణ కృతవర్మల తోడం బెనంగు చుండియుఁ గ్రూరనారాచ దశకం బయ్యాచార్యుమేన నిగిడించె; నంత నత్యంతరయంబునం జనుదెంచి యనిలనందనుండు ద్రుపదనందనుఁ గుంభసంభవు బారికిం దప్పించుకొని పోయినం బొమ్మని పలికి, దెందం బెప్పటి చందం బగుటయు నిశ్చలభావం బొందె; నివ్విధంబున నాలుగు దివసంబులు నొక్కరాత్రియు నేనగు దివసంబులో నిరువది గడియలు నిరువది యొక్కవే యట్టలాడ భండనంబు సేసి పాండవ బలంబులు నుఱుమాడి పేరడవి గొని కాల్చి పొనుంగుపడిన కార్చిచ్చుకైవడిం గుదిసి యమ్మహాత్ముండు. **321**

ప్రతిపదార్థం: అతని వధంబునకై= ఆ ద్రోణాచార్యుల వధ కొరకు; పాంచాల విభుని వేలిమిన్= ద్రుపదరాజు (చేసిన)హోమకుండము నందుండి; పుట్టినవాఁడు+అగుటన్= పుట్టి ఉన్నవాడు అగుటచేత; ఆ+పార్షతుండు= ఆ ధృష్టద్యుమ్నుడు; తత్సమయ జనిత+ ఉత్సాహ రోష విశేష+ఆయత్తచిత్తుండు+అగుచున్= ఆ సమయంలో పుట్టిన ఉత్సాహక్రోధాలకు మిక్కిలి అధీనమై మనస్సు కలవాడై; ఆ+మహీసురవరుమీఁదన్= ఆ ద్రోణాచార్యుడిపైకి; కవిసి= ఉరికి; ఏసినన్= బాణాలు వేయగా; అనికిన్= యుద్ధానికి; ఒల్లని+ ఉల్లంబునన్= ఇష్టపడని మనస్సుతో; పరుని+ఉల్లాసంబును= శత్రువు మిడిసిపాటును; సహింపలేని తేజంబును= ఓర్వజాలని ప్రతాపం; పురికొని+అతండు= చెలరేగి ఆ ద్రోణాచార్యుడు; పోరన్+తొడంగినన్= యుద్ధానికి పూనుకొనగా; దివ్య+అస్త్రంబులు= ఇంద్రాస్త్రం మొదలైన అస్త్రములు; ప్రతిభాసింపక+ఉండెన్= స్ఫురించకుండా అయినవి; అట్లు+ అయినను= అట్లా అయినప్పటికి; మనసు బలిమి కలిమిన్= మనోబలంతో - యుద్ధం చేయటానికే మనస్సు బలాత్కరించటంవలన; ప్రకృతి బాణంబులన్= సహజములైన బాణాలతో; అతని= ఆ ధృష్టద్యుమ్నుడి; బాణ= (ప్రయోగించిన) బాణాలను; బాణాసన= ధనుస్సును; రథ= రథాన్ని; రథ్య= అశ్వాలను; సూత= సారథిని; కేతనంబులు= ధ్వజాన్ని (ద్వంద్వ సమాసం కాబట్టి బహువచనం, ద్వితీయార్థమున ప్రథమావిభక్తి); పొడి+చేసెన్= నుగ్గునుగ్గు చేశాడు - ఖండించాడని భావం; ఆ ధృష్టద్యుమ్నుండు= అన్నీ కోల్పోయిన ఆ ధృష్ట ద్యుమ్నుడు; గద= గదను; కొనినన్= తీసికొన్న వెంటనే; తునియలు= తునకలుగా; కావించెన్= చేశాడు (రథం, సూతుడు, అశ్వాలు; ధనుర్బాణాలు నశించి ఏవీ కూడా) యుద్ధానికి లేకపోవటం వలన; పలకయున్= డాలు; వాలునున్= ఖడ్గాన్ని; కొని= తీసికొని; వచ్చి= వచ్చి; ఆ+వీరుండు= ఆ ధృష్టద్యుమ్నుడు; సారథి తురంగంబుల+అంగంబులన్= సారథియొక్క మరియు అశ్వాలయొక్క శరీరాలను; వ్రయ్యన్+ఏయన్= తుత్తునుకలయ్యేటట్లు కొట్టగా; తద్= అతడియొక్క; కరవాల= ఖడ్గంయొక్క; ఖేట= డాలుయొక్క; పాటనంబు= ఖండనం; చేసి= చేసి; తనువునన్= శరీరంపై; చండకాండంబులు= భయంకరమైన బాణాలను; నించెన్= నింపాడు; అట్లు= ఆ విధంగా; నించి= నింపి; నొంచినన్= నొప్పింపగా; కని= చూచి; శినివరుండు= సాత్యకి; కృప, కర్ణ, కృతవర్మల తోడన్= కృపాచార్యుడు, కర్ణుడు, కృతవర్మ అనే వారితో; పోరుచుండియున్= యుద్ధం చేస్తూ ఉండి కూడా; క్రూర నారాచ దశకంబు= భయంకరమైన బాణాల దశకాన్ని అనగా - బాణాలను పదింటిని; ఆ+ఆచార్యుమేనన్= ఆ ద్రోణాచార్యుడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శరీరంపై; నిగిడించెన్= వ్యాపింపజేశాడు (పది బాణాలతో కొట్టాడు); అంతన్= ఆ సమయాన; అత్యంత రయంబునన్= మిక్కిలి వేగంగా; చనుదెంచి= వచ్చి; అనిల నందనుండు= భీముడు; ద్రుపదనందనున్= ధృష్టద్యుమ్నుడిని; కుంభసంభవు బారికిన్= ద్రోణాచార్యుల గురికి, అనగా ద్రోణాచార్యుడికి లక్ష్యం కావటాన్ని; తప్పించుకొని= తప్పించివేసి; పోయి నన్= తీసికొని పోగా (ద్రోణాచార్యుడి ఎదుటనున్న ధృష్టద్యుమ్నుడిని ప్రక్కకు తొలగించుకొని పోతూ ఉండగా); పోయినన్+పొమ్ము+అని పలికి= (ద్రోణుడు) పోతేపో అని పలికి; డెందంబు= మనస్సు; ఎప్పటి చందంబు= ఎప్పటి విధంగా; అగుటయున్= కాగానే; నిశ్చలభావంబు= నిశ్చలత్వాన్ని; ఒందెన్= పొందాడు (యుద్ధానికై తనను పురికొల్పిన ధృష్టద్యుమ్నుడు యుద్ధం విడిచి భీముడి ద్వారా తొలగి పోయాడు. ఇక నా అంతట నాకు యుద్ధంతో పనిఏమి? అని తలంచి పూర్వ విధంగా తన మనస్సు ప్రశాంతమై ఉండగా యోగ నిష్ఠపూన తలచి కదలక మెదలక ఉన్నాడని భావం); ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; నాలుగు దివసంబులు= నాలుగు దినాలు; ఒక్క రాత్రియున్= ఒక రాత్రి; ఏను+అగు దివసంబులోన్= అయిదవరోజున; ఇరువది గడియలు= ఇరవై గడియలు (సూర్యోదయం నుండి 20 గడియలు దివసం గతించేటంత వరకు) (గడియ అనగా రెండున్నర గంటలు కాబట్టి సుమారు మధ్యాహ్నం రెండు గంటల సమయం వరకు అని భావం); ఇరువది యొక్కవేలు+అట్టలు= ఇరువయ్యొక్కవేల మొండాలు; ఆడన్= నృత్యం చేసేటట్లు; భండనంబు+చేసి= యుద్ధం చేసి (ఈ యుద్ధంలో ఇప్పుడు 21వేల మంది తలలు తెగగొట్టాడని భావం); పాండవ బలంబులన్= పాండవుల సైన్యాలను; నుఱుమాడి= సంహరించి; పేరడవిన్= మహారణ్యాన్ని; కొని= చేపట్టి; కాల్చి= దహించి; పొనుంగు పడిన కార్చిచ్చుకైవడిన్= చల్లారిన దావాగ్నివలె; కుదిసి= ఉపశమించి; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు ద్రోణాచార్యుడు.

తాత్పర్యం: అతని వధకై ద్రుపదుని హోమకుండం నుండి పుట్టినవాడు కావటం చేత ఆ సమయంలో కలిగిన ఉత్సాహరోషాలకు విశేషంగా స్వాధీనమైన మనస్సు కలవాడై, ఆ ద్రోణుడిమీదికి విజృంభించి బాణాలు వేయగా, యుద్ధం చేయటానికి ఇష్టంలేని ద్రోణుడి మనస్సులో, శత్రువుయొక్క ఉత్సాహాన్ని సహించలేని పరాక్రమం క్రమ్ముకొని యుద్ధానికి పూనుకోగా, ఆయనకు దివ్యాస్త్రాలు స్ఫురించలేదు. అయినా మనోబలంతో సహజ బాణాలతోనే ధృష్టద్యుమ్నుడి బాణాలను, ధనుస్సును, రథాన్ని, రథాశ్వాలను, సారథిని, రథకేతనాన్ని నుగునుగ్గు చేశాడు. ధృష్టద్యుమ్నుడు గదతీసుకోగా, దానిని ముక్కలు చేశాడు. తరువాత ధృష్టద్యుమ్నుడు డాలును ఖడ్గాన్ని తీసుకొని ద్రోణుని రథసారథి శరీరాన్ని, గుర్రాల శరీరాలను ముక్కలయ్యేటట్లు కొట్టగా గురుడు అతని ఖడ్గాన్ని, డాలును ఖండించి, అతని శరీరంనిండా భయంకరాలైన బాణాలు నింపాడు. ఆ విధంగా నింపి ధృష్టద్యుమ్నుడిని నొప్పింపగా, సాత్యకి చూచి, తాను కృప, కర్ణ, కృతవర్మలతో యుద్ధం చేస్తూ ఉన్నా, పది వాడిబాణాలు ద్రోణుడి శరీరంలో నాటాడు. అప్పుడు భీమసేనుడు మహావేగంగా వచ్చి; ధృష్టద్యుమ్నుడు ద్రోణుడి బారిన పడకుండా తప్పించి తీసుకొనిపోగా, ద్రోణుడు పొమ్మని పలికి, మనస్సు పూర్వస్థితికి రాగా ప్రశాంతతను పొందాడు. ఈ విధంగా నాలుగురోజులు, ఒక రాత్రి, అయిదవరోజులో ఇరువది గడియలు - ఇరువదియొక్క వేల మొండెములు నేలపడి ఆడగా యుద్ధంచేసి, పాండవ బలాలను సంహరించి, మహారణ్యాన్ని దహించి కాంతివిహీనమైన కార్చిచ్చువలె తగ్గి ఆ మహానుభావుడు ద్రోణుడు(తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ; 'కార్చిచ్చు కైవడిన్' అన్నచోట ఉపమాలంకారం.

సీ. సంగరంబునఁ దన్వి సని శాంతిఁ బొందిన । చిత్తంబుతోఁ దమసేన దిక్కు
గనుఁగొని పెలుచ నోకర్ణ! యోకృప! యో సు । యోధన! పోర న న్నొత్తి యెపుడుఁ
జెప్పుదు; రేను నాచే నయినంతయుఁ । జేసితి; నింక నిశ్చింతవృత్తి
సుగతికిఁ జనఁ గోరి తగ నుజ్జగించెద । బాణాసనంబును బాణములను;

తే. దెలివి గలిగి మనుం' డని పలికి శరశ । రాసనము లూడ్చి తేరిపై ననఘమూర్తి
యొప్పఁ గూర్చుండి సంభృత యోగనిష్ఠ । నొంది తేజోమయాత్ముఁ డై యుండె నధిప! 322

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; సంగరంబునన్= యుద్ధంలో; తన్వి= తృప్తిని; చని= పొంది; శాంతిన్= శమాన్ని; పొందిన చిత్తంబుతోన్= పొందిన మనస్సుతో; తమ సేన దిక్కు= తమ సైన్యంవైపు; కనుఁగొని= చూచి; పెలుచన్= బిగ్గరగా; ఓ కర్ణ!= ఓయి కర్ణా!; ఓ కృప!= ఓ కృపా!; ఓ సుయోధన!= ఓయి దుర్యోధనా! (వినండి); పోరన్= యుద్ధం చేయటానికి; నన్నున్= నన్ను; ఒత్తి= గట్టిగా; ఎపుడున్= ఎల్లప్పుడు; చెప్పుదురు= చెప్పుతారు (కదా!); ఏను= నేను; నాచేన్+అయిన+అంతయున్= నా చేతనయినంత; చేసితిన్= చేశాను; ఇంక= ఇక; నిశ్చింతవృత్తిన్= చింతలేని ఉనికితో అనగా ఏ చింతా లేక; సుగతికిన్=ఉత్తమ గతికి; చనన్= పోవటానికి; కోరి= కాంక్షించి; తగన్= తగిన విధంగా; బాణాసనంబును= ధనువును; బాణములను= బాణాలను; ఉజ్జగించెదన్= త్యజిస్తూ ఉన్నాను (ఇక మీరు); తెలివి+కలిగి= బుద్ధి గలిగి; మనుండు+అని= జీవించండి అని; పలికి= చెప్పి; శర శరాసనములు= బాణాలను ధనువును; ఊడ్చి= జారవిడిచి; తేరిపైన్= రథంమీద; అనఘమూర్తి= పాపరహితమైన (తన) స్వరూపం; ఒప్పన్= ప్రకాశింపగా; కూర్చుండి= కూర్చున్నవాడయి; సంభృత యోగనిష్ఠన్= సంపూర్ణమైన యోగనిష్ఠను- (సమాధిని); ఒంది= పొంది; తేజోమయ+ఆత్ముఁడు+ఐ= తేజస్సుతో నిండిన (తేజఃప్రచురమైన) స్వరూపం కలవాడై; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! యుద్ధంలో తృప్తిని, చిత్తంలో ఏ విధమైన చింతలేక శాంతిని పొంది తమ సైన్యం వైపు చూస్తూ బిగ్గరగా కర్ణాదులను పిలుస్తూ ఇట్లా అన్నాడు: 'ఓ కర్ణ, కృప, దుర్యోధనులారా! మీ రెప్పుడూ నన్ను ఎత్తిపొడుస్తూ యుద్ధానికి పురికొల్పేవారు - ఇదిగో, నా చేతనయినంత యుద్ధం చేశాను. ఇక ఈ ధనుర్బాణాలు నా కక్కరలేదు. నేను ఇక నిశ్చింతగా ప్రాణాలు త్యజించి పుణ్యలోకాలకు వెళ్ళాలని ధనుస్సును, బాణాలను వదలి వేస్తున్నాను. ఇక మీరు బుద్ధి కలిగి, జీవితం సాగించండి' అని పలుకుతూనే తన ధనుర్బాణాలను రథంపై జారవిడిచాడు. ఇక తాను రథంపై కూర్చుండి యోగసమాధిలో మునిగిపోయాడు. ఓ ధృతరాష్ట్ర మహారాజా! అప్పుడు ఆ ద్రోణాచార్యుల శరీరం తేజోరూపంతో వెలిగింది.

వ. అట్టియెడ ధృష్టద్యుమ్నుండు గృపాణపాణియుఁ బాదచారియునై భారద్వాజు దెసకుం గవియుటయు, నుభయ సైన్యంబుల హాహాకారంబు లెసఁగె; నంతం దనువు విడిచి యప్పుణ్యపురుషుండు ప్రకట జ్యోతీరూపంబున నెగసి పరమస్థానంబునకుం జనియెఁ; దత్తేజోమూర్తి యేను గంటిఁ, గృష్ణార్జున ధర్మనందన కృపాచార్యులునుం గనిరి; దక్కటి మానవులు గానరు; సురలు సూచి సంతసంబునం బొదలి; ర ట్లడరిన యాద్రుపద నందనుండు. 323

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; ధృష్టద్యుమ్నుండు; కృపాణపాణిఐ= ఖడ్గం చేతియందు కలవాడై; పాదచారియును+ఐ= (ఏ వాహనంపై కాక కేవలం) పాదాలతోనే నడుస్తూ ఉన్నవాడై; భారద్వాజు దెసకున్= ద్రోణాచార్యుల వైపునకు;

కవియుటయున్= చేరగానే; ఉభయ సైన్యంబులన్= ఇరుపక్షాల సైన్యాలలో; హాహాకారంబులు= హాహాకారాలు (హాహా అనే ఆర్తనాదాలు); ఎసగెన్= వ్యాపించాయి; అంతన్= అంతలోనే; తనువు= శరీరం; విడిచి= విడిచివేసి; ఆ+పుణ్యపురుషుండు= పవిత్రుడైన ఆ వ్యక్తి (ద్రోణాచార్యుడు); ప్రకట జ్యోతిస్+రూపంబునన్= స్పష్టమైన - అనగా మిక్కిలి ప్రకాశిస్తూ ఉన్న జ్యోతిస్సు రూపంతో; ఎగసి= ఎగిరిపోయి; పరమస్థానంబునకున్= మిక్కిలి ఉత్కృష్టమైన స్థానానికి, అనగా బ్రహ్మలోకానికి; చనియెన్= వెళ్ళాడు; తద్+తేజోమూర్తిన్= ఆ తేజస్స్వరూపాన్ని; ఏను= ఓ ధృతరాష్ట్ర మహారాజా! నేను (సంజయుడు); కంటిన్= చూచాను; కృష్ణ+అర్జున ధర్మనందన, కృపాచార్యులునున్= కృష్ణుడు, అర్జునుడు, ధర్మరాజు, కృపాచార్యులు (వీరందరు); కనిరి= చూచారు; తక్కటి మానవులు= మిగిలిన వీరులు; కానరు= చూడలేదు; సురలు= దేవతలు; చూచి= (ఆ తేజోదృశ్యాన్ని)దర్శించి; సంతసంబునన్= సంతోషంతో; పొదలిరి= ఉబ్బిపోయారు; అట్లు= ఆ విధంగా; అడరిన+ఆ ద్రుపదనందనుండు= విజృంభించిన ఆ ధృష్టద్యుమ్నుడు (ఆ ద్రోణాచార్యుడు న్యస్తశస్త్రుండై ఉండటమే తన కనువైన సమయంగా భావించి సంహరించటానికి సిద్ధపడిన వాడు ఆ ధృష్టద్యుమ్నుడు అని భావం).

తాత్పర్యం: అప్పుడు ధృష్టద్యుమ్నుడు. ఖడ్గం చేబూని కాలినడకతో ద్రోణాచార్యుని సమీపించగానే, దానిని చూచి ఉభయ పక్షాల సైనికులందరూ హాహాకారాలు చేశారు. అంతలోనే ద్రోణాచార్యుడు యోగాన్ని ఆశ్రయించి శరీర త్యాగం చేసి జ్యోతిస్స్వరూపంతో ఆకాశానికి ఎగసి పరమస్థానానికి అనగా బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు. అత డట్లా జ్యోతిస్సు రూపంలో వెలుగుతూ ఉత్తమ లోకానికి వెళ్ళటం - కేవలం నేను (సంజయుడు), కృష్ణుడు, అర్జునుడు, ధర్మరాజు, కృపాచార్యుడు - అనే అయిదుగురం మాత్రమే చూచాము. తక్కినవారు చూడలేదు. అని సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్పాడు. దేవతలు అదిచూచి సంతోషంతో ఉబ్బిపోయారు. ఆ విధంగా విజృంభించిన ధృష్టద్యుమ్నుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ధృష్టద్యుమ్నుండు మృతుండైన ద్రోణుని కంఠంబు దునుముట (సం. 7-165-47)

చ. అరదముపైకి దాఁటి కుపితాత్మత ద్రోణుశవంబు కేశముల్
గరమున బె ట్టమర్చికొని ఖడ్గహతిన్ మెడ ద్రుంచివైచె స
త్వరముగ మాను మాను మను వాక్యముతో నరుఁడేగఁ, దప్పు సు
మ్మర యని ధర్మజుండు దివి ముట్టు నెలుంగున బి ట్టదల్పఁగన్. 324

ప్రతిపదార్థం: అరదముపైకిన్= రథంపైకి; దాఁటి= లంఘించి; కుపిత+ఆత్మతన్= క్రోధంతో నిండిన ఆకారంతో; ద్రోణు శవంబు కేశముల్= ద్రోణాచార్యుడి కళేబరం యొక్క వెంట్రుకలను (ఆ ద్రోణుడి శరీరం నిర్జీవమై ఉన్న సంగతి ధృష్టద్యుమ్నుడికి తెలియదు - తెలియక ద్రోణుడిని వధిస్తున్నా ననే మోహంలో పడ్డాడు ధృష్టద్యుమ్నుడు - ఈ విషయం మూలంలో **శ్లో॥ బ్రహ్మ లోక గతే ద్రోణే ధృష్టద్యుమ్నే చ మోహితే!** అని చెప్పబడింది); కరమునన్= చేతిలో; బెట్టు+అమర్చికొని= గట్టిగా పట్టుకొని; ఖడ్గహతిన్= కత్తివ్రేటుతో; మెడన్= కంఠాన్ని (నరికి వేయటానికి ఉద్యుక్తుడవుతూ ఉండగా); మాను మానుము= (నాయనా ధృష్టద్యుమ్నా!); మానివేయుము; అనువాక్యముతోన్= అని పలుకుతూ; నరుఁడు= అర్జునుడు; ఏఁగన్= వెళ్ళగా; (మరియు); తప్పు సుమ్మర!+అని= అరే (ధృష్టద్యుమ్నా!) తప్పు సుమా! అని; ధర్మజుండు= ధర్మరాజు; దివిముట్టు+ఎలుంగునన్= ఆకాశాన్నంటే కంఠస్వరంతో; బిట్టు= గట్టిగా; అదల్పఁగన్= గద్దిస్తూ ఉండగా; (దీనిని కూడా పట్టించుకోక); సత్వరముగన్= తొందరగా; త్రుంచివైచెన్= తెగనరికి వేశాడు.

తాత్పర్యం: కోపాతిశయంతో రథంపైకి లంఘించి. ద్రోణుడి కళేబరంయొక్క తలవెంట్రుకలను చేతితో పట్టుకొని, (ఆ ద్రోణుడి శరీరం నిర్జీవం అనే విషయం అతడికి తెలియదు) తల నరికివేయటానికి కత్తి ఎత్తుతూ ఉండగా అర్జునుడు పరుగుతీస్తూ 'ఆ పని కూడదు - మానివేయుము' అని అంటూనే ఉన్నా, ధర్మరాజు 'అది తప్పు కూడదు అని ఆకాశాన్నంటే కంఠస్వరంతో గట్టిగా గద్దిస్తూఉన్నా ధృష్టద్యుమ్నుడు వెంటనే ఆ ద్రోణుడి తలను తెగనరికి వేశాడు.

వ. ఇత్తెఱంగునం దునిమి యతం డయ్యట్టయుం దలయును ధరణీతల గతంబు సేసె; నిట్లు శతవృద్ధుం డగు నయ్యస్త్ర గురుండు నీ దుర్మంత్రంబునఁ ద్రుంగిపోయినం బొంగి పాండవానీకంబు పైకొని తఱిమిన మన మొనలు వెఱచఱచి కనుకనిం బఱచెం; బఱచిన మనంబు గలంగి యప్పుడు నీ కొడుకు లేట మొగంబులు వడు దొరలతోడం గూడఁ దిరుగ నట్టియెడ దుర్యోధన దుశ్శాసన కృప కర్ణ కృతవర్మ మద్రేశ్వరుల మాతంగంబులం దురంగంబుల ముందఱ పెట్టికొని 'కటకటా!' యనుచు 'నింత పుట్టునే?' యనుచు 'నింక నేమి గల;' దనుచు 'నెట్లు సేయంగల వార?' మనుచు 'నేది దుది?' యనుచు మరలి మరలి చూచుచుం జనుచుండఁ దక్కిన యలంతి మానుసు లెల్లను దలచీర వాటించు తలంపు లేక యొండొరుల నిలు నిలు మని పలుకుచుం గాలు నిలువక పలుదిక్కులకుం బాఱి రత్తఱి నశ్వత్థామ మున్నొక్కకెలనం గయ్యంబు సేయుచుండి నీసేన య ట్లగుటఁ గనుంగొని యక్కురుపతి కడకుం జని యతని కి ట్లనియె. **325**

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; తునిమి= ఖండించి; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; ఆ+అట్టయున్= మొండెం; తలయును= తలను; ధరణీతలగతంబు= భూతలాన్ని పొందినదిగా; చేసెన్= చేశాడు; తలను ఖండించి (మొండెం, తల ఈ రెండూ భూమిపై పడగొట్టాడు; ఇట్లు= ఈ విధంగా; శతవృద్ధుండు+అగు= నూరేండ్లు సమీపిస్తున్న ముదుసలిఅయిన (ద్రోణాచార్యుడు 85 సంవత్సరాల వాడని మూలంలో ఉన్నది. **శ్లో॥ ఆకర్ణ పలితః శ్యామో వయసాశీతి పంచకః త్వత్కృతే 'వ్యచరత్ సంఖ్యే స తు షోడశవర్షవత్ ॥ ద్రోణ 192/64)'** అతివృద్ధుండు అనే పాఠాంతరం మూలవిధేయంగా ఉన్నది); ఆ+అస్త్రగురుండు= అస్త్రవిద్యాగురువైన ఆ ద్రోణాచార్యుడు; నీ దుర్మంత్రంబునన్= ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ దుష్టమైన ఆలోచన వలన; త్రుంగిపోయినన్= రాలిపోగా; పొంగి= ఉప్పొంగి; పాండవ+అనీకంబు= పాండవుల సైన్యం; పైకొని= పైబడి; తఱిమినన్= తరుమగా; మన మొనలు= మన (కౌరవ) సైన్యాలు; వెఱచఱచి= భయపడి; కనుకనిన్= సంభ్రమంతో; పఱచెన్= పారిపోయారు; పఱచినన్= పారిపోగానే; మనంబు= మనస్సు; కలంగి= కలతచెంది; అప్పుడు= ఆ సమయాన; నీ కొడుకులు= నీ కుమారులు అనగా కౌరవులు; లేట మొగంబులు+పడు= పెడమొగం పెట్టుకొని, పరాఙ్ముఖులై పారిపోతున్న; దొరల తోడన్+కూడన్= రాజులతోపాటు; తిరుగన్= వెనుతిరుగుతూ ఉంటే (ద్రోణ మరణంతో కౌరవవీరులందరు నిరుత్సాహంతో పారిపోయారని (సంస్కృత మూలం ద్రోణ - 193వ అధ్యాయంలో విపులంగా ఉన్నది); అట్టి+ఎడన్= ఆ సమయంలో; దుర్యోధన, దుశ్శాసన, కృప, కర్ణ, కృతవర్మ, మద్రేశ్వరులు= దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కృపాచార్యులు, కర్ణుడు, శకుని - వీరందరు; మాతంగంబులన్= ఏనుగులను; తురంగంబులన్= అశ్వాలను; ముందఱ+పెట్టుకొని= ముందుంచుకొని; కటకటా!+అనుచున్= అకటా! అని అంటూ; ఇంత పుట్టునే+అనుచున్= ఇంత జరుగుతుందా? అని అనుకుంటూ; ఇంకన్+ఏమి+కలదు?+అనుచున్= (ఇంత జరిగినాక) ఇంక ఏమి ఉంటుంది? - అని అంటూ; ఎట్లు+చేయన్+కలవారము?+అనుచున్= ఎట్లా చేస్తాం? అని అంటూ; ఏది తుది?+అనుచున్= ఇక దీనికి చివర ఏది? అని అంటూ; మరలి+మరలి+మాటి మాటికి వెనుకకు తిరిగి; చూచుచున్= చూస్తూ; చనుచున్+ఉండన్= వెళ్ళుతూ ఉండగా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తక్కిన+అలంతి మానుసులు+ఎల్లన్= మిగిలిన కొద్దిపాటి మనుష్యులందరు; తలచీర+పాటించు తలంపులేక= తలపాగ చుట్టుకొనటానికి ఇచ్చ లేక (తలపాగ విడిపోయినా సరిచేసుకొనటానికి తీరికలేక); ఒండొరులన్= పరస్పరం (ఒకరు మరొకరితో); నిలునిలుము+అని= ఆగుము ఆగుము అని; పలుకుచున్= అంటూ; కాలు నిలువక= పాదం ఆనక (నిలబడే ఓపిక లేక); పలు దిక్కులకున్= నానా దిశలకు; పాఱిరి= (భయంతో) పారిపోయారు; ఆ+తఱిన్= ఆ సమయంలో; అశ్వత్థామ= ద్రోణాచార్యుడి కుమారుడు అశ్వత్థామ; మున్ను= ముందు; ఒక్కకెలనన్= ఒకవైపు; కయ్యంబు= యుద్ధం; చేయుచున్+ఉండి= చేస్తూ ఉండి; నీ సేన= ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ సైన్యం; అట్లు+అగుటన్= ఆ విధంగా కావటాన్ని - అట్లా భయభ్రాంతమై పారిపోవటాన్ని; ఆ+కురుపతి కడకున్+చని= ఆ కురురాజు - అనగా దుర్యోధనుడి దగ్గరకు వెళ్ళి; అతనికిన్= అతడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఈ విధంగా తలనరికి ఆ తల, ఆ మొండెం రెంటిని భూమిమీదికి విసరివేశాడు. ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ యొక్క చెడు ఆలోచన ఫలితంగా, అందరికీ అస్త్రవిద్యను నేర్పిన ఆ గురువు నూరేండ్ల పండుముసలి తెగిపడిపోగా, పాండవుల సైన్యాలు సంతోషంతో ఉప్పొంగిపోయాయి, మన సైన్యాలపై విజృంభించాయి. దానికి మన సైన్యాలు భయపడి, దిక్కుతోచక పరుగెత్తాయి. ఆ విధంగా పరుగెత్తగా. నీ కొడుకులు కలతచెందిన మనస్సుతో పెడమొగం పెట్టుకొని పారిపోతున్న రాజులతో పాటు వెనుదిరిగి వెళ్ళుతూ ఉండగా మన దుర్యోధన, దుశ్శాసన, కృప, కర్ణ, కృతవర్మ, శల్యుల గజాశ్వాది సైన్యాలను ముందర పెట్టుకొని, 'అయ్యో! మన కింకా ఏం మిగిలింది?' ఇట్లా జరుగుతుం దని అనుకొనలేదు' 'ఇక మనం ఏదైనా చేస్తామన్నా ఏం చేయజాలుతాము?' 'దీనికి ఏమైనా పరిష్కారముందా?' - అని అనుకొంటూ వెనుకకు తిరిగి తిరిగి చూస్తూ వెళ్ళుతూ ఉండగా, తక్కిన సామాన్య సైనికులందరూ 'ఒరేయి ఆగరా నేను వస్తున్నా'నని ముందర పోయే వారిని పిలుస్తూ, తలపాగా కూడ సవరించుకోకుండ పలుదిక్కులకు పరుగెత్తారు. ఆ సమయంలో అశ్వత్థామ ఒక వైపు యుద్ధం చేస్తూ ఉన్నాడు. ఇట్లా కురుసైన్యాలు పారిపోవటం గమనించాడు. కురురాజు దుర్యోధనుడి దగ్గరికి వెళ్ళి ఇట్లా అన్నాడు.

తే. **'బలము లిది యేమి నలుగడఁ బాఱఁ జొచ్చె? । కర్ణ కృప ముఖ్యు లేటికిఁ గలఁగి లేట**
మొగము వడి? రేల నీవును మున్నువోలె । నిలువరింపంగఁ దగియెడు నిలుపు లేవ?' **326**

ప్రతిపదార్థం: బలములు= సైన్యాలు; నలుగడన్= నాలుగువైపులకు; పాఱన్+చొచ్చెన్= పారిపోవటానికి ప్రయత్నించాయి; ఇది+ఏమి?= ఇదేమి?-ఎందుకు?; కర్ణ కృప ముఖ్యులు= కర్ణుడు కృపాచార్యుడు మొదలైనవారు; ఏటికిన్= ఎందుకు?;కలఁగి= కలతజెంది; లేటమొగము+పడిరి?= పరాఙ్ముఖులైనారు?; నీవును= ఓ దుర్యోధనా! నీవుకూడ; మున్ను+పోలెన్= మునుపటివలె; నిలువరింపగన్+తగియెడు= ఆపజాలినట్టి; నిలుపు= స్థైర్యం; లేవు+అ= లేనివాడవా?; ఏల?= ఎందుకని? (ఎందుకు నిలుపటం లేదు?).

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! మన సైన్యాలు నాలుగు వైపులకు ఎందుకు పారిపోతున్నాయి. కర్ణుడు, కృపాచార్యుడు మొదలైన ప్రముఖులు ఎందుకు కలతచెంది బాధతో పరాఙ్ముఖులై వెనుదిరుగుతున్నారు. నీవు కూడా మునుపటివలె లే వేమి? వీరందరిని ఆపగలిగే ఆ మునుపటి శక్తి నీలో కొరవడిందా? ఎందుకు? చెప్పుము.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని యడిగిన నతం డతనిమొగంబు సూచి యాచార్యు తెగుట సెప్పంబోయి డగ్గుత్తికపడి యూరకుండె; శారద్వతుండు వెలువెలం బాఱుచు నెట్టకేలకు నెలుంగు దెచ్చికొని. 327

ప్రతిపదార్థం: అని= ఇట్లా; అడిగినన్= అడుగుతూ ఉండగా; అతండు= ఆ దుర్యోధనుడు; అతని మొగంబు= ఆ అశ్వత్థామ ముఖం; చూచి; ఆచార్యు తెగుట+చెప్పన్+పోయి= ద్రోణాచార్యుడి వధను గూర్చి చెప్పటానికి పూనుకొని; డగ్గుత్తిక+పడి= చెప్పటానికి నోరురాక, కంఠం గద్గదస్వరాన్ని పొందగా; ఊరక+ఉండెన్= మౌనంగా ఉండిపోయాడు; శారద్వతుండు= కృపాచార్యులు; వెలువెలన్+పాఱుచున్= వెలవెలబోతూ - తన ముఖం కళావిహీనం అయిపోతూ ఉండగా; ఎట్టకున్+ఏలకున్= ఎంతో కష్టంగా, ఎలుంగు+తెచ్చికొని= కంఠధ్వనిని సవరించుకొని. (ఇట్లా అన్నాడు)

తాత్పర్యం: అని అడుగగా దుర్యోధనుడు, అశ్వత్థామ ముఖం చూస్తూ ద్రోణుడి వధ విషయం చెప్పబోయి తండ్రి కంఠం గాద్గదికమై నోటమాట రాక మౌనంగా ఉండిపోయాడు. కృపాచార్యుడు వెలవెలబారిన ముఖంతో ఎట్లాగో కంఠస్వరాన్ని కుదుటపరచుకొని

సీ. 'పాంచాల పాండవ ప్రముఖ సైన్యంబుల । ద్రోణుండు బలువిడిఁ ద్రుంచుటయును,
నుక్కఱి పాండవు లొక్కచోటికి వచ్చి । నిలువరింపఁగ, లేక తలఁకుటయును,
వాయుతనూజుఁ 'డశ్వత్థామ సచ్చెఁ జు' । మ్మని కుంభజునితోడ నాడుటయును,
నమ్మాట గొనక ధర్మాత్మజు నవ్వార్త । యాచార్యుఁ డేర్పడ నడుగుటయును
తే. భీముచేత నశ్వత్థామనామ గజము । మున్న చచ్చుట కతమున న న్నరాధి
పతియు నది నెపముగ నట్ల పలుకఁ, జాల । నడలి యతఁ డాయుధంబులు విడుచుటయును. 328

ప్రతిపదార్థం: ద్రోణుండు= ద్రోణాచార్యుడు; పాంచాల పాండవ ప్రముఖ సైన్యంబులన్= పాంచాలసైన్యాలు, పాండవసైన్యాలు- ఈ మొదలైన సైన్యాలను; బలువిడిన్= వేగంగా; త్రుంచుటయును= ఖండించివేయటం; పాండవులు= పాండవవీరులు; ఉక్కు+అఱి= పొగరు తగ్గి; ఒక్క చోటికిన్= (అందరు) ఒకే చోటికి అనగా ద్రోణాచార్యుడు యుద్ధం చేసే చోటికి; వచ్చి= ఏకమై వచ్చి కూడ; నిలువరింపఁగన్+లేక= అడ్డుకొనలేక; తలఁకుటయును= తొలగిపోవటం; వాయు తనూజుఁడు= వాయునందనుడైన భీముడు; అశ్వత్థామ+చచ్చెన్+చుమ్ము+అని= అశ్వత్థామ మరణించాడు సుమా అని; కుంభజుని తోడన్= ద్రోణాచార్యుడితో; ఆడుటయును= చెప్పటం; ఆ+మాట= ఆ భీముడి మాటను; కొనక= నమ్మక; ధర్మాత్మజున్= ధర్మరాజును; ఆ+వార్త= ఆ అశ్వత్థామ మరణవార్త; ఆచార్యుఁడు= ద్రోణాచార్యులు; ఏర్పడన్= తేటతెల్లం కావటానికి; అడుగుటయును= అడుగటం (అశ్వత్థామ మరణవార్త భీముడు చెప్పిన మాత్రాన నమ్మక దానిని గూర్చి నిజం తెలియటానికి ఆచార్యుడు ధర్మరాజును అడిగాడని భావం); భీము చేతన్= భీమసేనుడి చేత; అశ్వత్థామ నామగజము= అశ్వత్థామ అనే పేరుగల ఏనుగు; మున్ను= అంతకుముందే; చచ్చుట కతమునన్= మరణించటం కారణాన (భీముడు, అశ్వత్థామ అనే గజాన్ని అంతకుముందు సంహరించాడు కాబట్టి); ఆ+నరాధిపతియున్= ఆ ధర్మరాజుకూడ; అది నెపము+కన్= ఆ అశ్వత్థామ అనే గజం మరణించటం మిష కాగా; అట్లు+అ= ఆ విధంగానే అనగా ఔను అశ్వత్థామ మరణించెనని; పలుకన్= చెప్పగానే; చాలన్= మిక్కిలి; అడలి= (ఆ దుఃఖాన్ని తట్టుకొనలేక) చలించిపోయి; ఆయుధంబులు= శస్త్రాలను; విడుచుటయును= విసర్జన చేయటం.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు పాంచాల పాండవ ప్రముఖ సైన్యాలను త్రుటిలో పెద్ద మొత్తంలో అంతమొందించాడు. అది చూచి పాండవ వీరుల పొగరు అణిగిపోగా వారందరు విడివిడిగా కాక ఏకమై ద్రోణుడితో పోరుకు దిగికూడా ఆ ద్రోణుడి ధాటిని అడ్డుకొనలేక తొలగిపోయారు. అప్పుడు భీముడు 'అశ్వత్థామ చచ్చెన్' అని ద్రోణుడితో అన్నాడు. ఆ భీముడి మాటను నమ్మక ద్రోణాచార్యుడు ధర్మరాజుతో 'అశ్వత్థామ చచ్చెనా?' అని ప్రశ్నించాడు. భీముడు అంతకుముందు అశ్వత్థామ అనే పేరుగల ఏనుగును సంహరించాడు కాబట్టి ధర్మరాజు ఆ మిషతో అశ్వత్థామ చావటం యథార్థమని ద్రోణాచార్యుడికి తోచే విధంగా సమాధానం చెప్పాడు. దీనితో కొడుకు మరణవార్త నిజమని నమ్మి ద్రోణాచార్యుడు ఆ దుఃఖానికి తట్టుకొనలేక ఆయుధాలు వదలివేశాడు.

వ. అప్పుడు. 329

తాత్పర్యం: ఆ సమయంలో.

క. గురుఁ డమలయోగనిష్ఠం। దిరమై యుండంగ వచ్చి, ధృష్టద్యుమ్నుం
డరదముమీఁది కెగసి త। చ్ఛిరోజములు పట్టికొని యసిం దునుముటయున్. 330

ప్రతిపదార్థం: గురుఁడు= ఆచార్యుడు - ద్రోణుడు; అమల యోగనిష్ఠన్= నిర్మలమైన యోగనిష్ఠలో; తిరము+ఇ= స్థిరుడై; ఉండంగన్= ఉంటూ ఉండగా; వచ్చి= సమీపానికి వచ్చి; ధృష్టద్యుమ్నుండు; అరదము మీఁదికిన్= ఆచార్యుల రథంపైకి; ఎగసి= కుప్పించి; తద్+శిరోజములు= ఆ ద్రోణాచార్యుడి వెంట్రుకలు; పట్టికొని= చేత తీసికొని; అసిన్= కత్తితో; తునుముటయున్= నరికివేయటం.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు నిర్మలమైన యోగనిష్ఠలో స్థిరంగా ఉండగా, ధృష్టద్యుమ్నుడు రథం మీదికి ఎగిరి వచ్చి, ద్రోణాచార్యుడి తల వెంట్రుకలను చేతితో పట్టుకొని, కత్తితో తలను నరికివేశాడు.

వ. చెప్పి యప్పుడు ధర్మనందన ధనంజయులు వారింప నతం డుడుగక యట్లు సేసె ననియు నెఱింగించి, యిట్లు భారద్వాజుండు పడిన బలంబులు విఱిగె; నేమును నిరుత్సాహుల మయితి; మేనుంగు పేరి నెపంబుగా నట్టి మాట పుట్టుట కృష్ణకృతం బయిన కపటోపాయంబుగానోపు; నని యంతయు నేర్పడం బలికె ననుటయు ధృతరాష్ట్రుండు సంజయుదిక్కు మొగంబై. 331

ప్రతిపదార్థం: చెప్పి= (ద్రోణవధ జరిగిన తీరును) తెలియజేసి (మళ్ళీ ఇట్లా అన్నాడు); అప్పుడు= ఆ సమయంలో; ధర్మనందన ధనంజయులు= ధర్మరాజు అర్జునుడు; వారింపన్= కూడదని నివారిస్తూ ఉండగానే; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; ఉడుగక= ఆగక; అట్లు= ఆ విధంగా - అనగా ద్రోణ శిరఃఖండనం; చేసెన్= చేశాడు; అనియున్= అని కూడా; ఎఱింగించి= తెలిపి; ఇట్లు= ఈ విధంగా; భారద్వాజుండు= ద్రోణాచార్యులు; పడినన్= పడిపోగా - అనగా మరణించగా; బలంబులు= (మన) సైన్యాలు; విఱిగెన్= చెదరిపోయాయి; ఏమును= మేముకూడ; నిరుత్సాహులము= ఉత్సాహం లేనివారం; అయితిమి= అయ్యాము; ఏనుంగు పేరి నెపంబుగాన్= అశ్వత్థామ అనే గజం పేరు మిష కాగా; అట్టిమాట= ఆ మాట - అనగా 'అశ్వత్థామ సచ్చె' అనే మాట;పుట్టుట=

పుట్టటం; కృష్ణకృతంబు+అయిన= కృష్ణుడిచే చేయబడిన; కపట+ఉపాయంబు= కపటంతో కూడిన ఎత్తుగడ; కాన్+ఓపున్= కావచ్చు; అని= ఇట్లా; అంతయున్= సర్వం; ఏర్పడన్= విశదమయ్యేటట్లు; పలికెన్= పలికాడు; అనుటయున్= అనగానే, అనగా సంజయుడు చెప్పగానే; ధృతరాష్ట్రుండు; సంజయు దిక్కుమొగంబు+ఐ= సంజయుడి వైపు తిరిగి - సంజయుడికి అభిముఖుడై.

తాత్పర్యం: అప్పుడా ధర్మరాజు, అర్జునుడు వద్దనిచెప్పినా, అతడు వినక ఆ విధంగా చేశాడు. అట్లా ద్రోణాచార్యులు కూలిపోగానే సైన్యాలు భయభ్రాంతములై నలువైపుల చెదరిపోయాయి. మేము కూడా ఉత్సాహం లేక ఇట్లా అయిపోయాము. అశ్వత్థామ అనే ఏనుగు చావటం మిషగా 'అశ్వత్థామ చచ్చెను' అనే పుకారు పుట్టించటం కృష్ణుని కుతంత్రం కావచ్చును. అని అంతా స్పష్టంగా చెప్పాడు-అని సంజయుడు చెప్పగా ధృతరాష్ట్ర మహారాజు సంజయుడివైపు తిరిగి (ఇట్లా ప్రశ్నించాడు).

మ. **'వరదివ్యాస్త్రవిదుండు బాహుఘనుఁ డశ్వత్థామ శ్రీరాముతో**
సరిసేయం దగువాఁడు దండ్రితల పాంచాలాత్మజుం డట్లు ని
ష్ఠురుఁ డై పట్టె ననంగఁ ద్రుంచె నన వించున్ వారితోఁ గూడ నా
తురుఁ డై పోయెనొ? పోక నిల్చియలుకన్ దోర్దర్పముం జూపెనో? 332

ప్రతిపదార్థం: అశ్వత్థామ= అశ్వత్థామ; వరదివ్య+అస్త్రవిదుండు= శ్రేష్ఠములైన దివ్యాస్త్రాలు తెలిసినవాడు; బాహుఘనుఁడు= బాహుబలంలో గట్టివాడు (కాబట్టి); శ్రీరాముతో సరి+చేయన్+తగువాఁడు= ఆ శ్రీరామచంద్రుడితో పోల్చదగినవాడు (అట్టి అశ్వత్థామ); తండ్రి తల= (తన) తండ్రి ద్రోణాచార్యుడి తలను; పాంచాల+ఆత్మజుండు= ద్రుపదుడి కుమారుడు ధృష్టద్యుమ్నుడు; అట్లు= ఆ విధంగా; నిష్ఠురుఁడు+ఐ= కఠినుడై - అనగా కర్కశ స్వభావం కలవాడై; పట్టెన్+అనంగన్= (తల వెంట్రుకలను) పట్టాడు అనగా; (మరియు) త్రుంచెన్+అనన్= (తల) నరికివేశాడు అని అంటూ ఉంటే; వించున్= వింటూ; వారితోన్+కూడన్= ఆ దుర్యోధనాదులతో కూడా; ఆతురుఁడు+ఐ= సంతాపం కలవాడై; పోయెనొ?= పోయాడో?; పోక= దుఃఖపరవశుడై పోక; నిల్చి= స్థిరుడై ఉండి; అలుకన్= క్రోధంతో; దోర్దర్పమున్= భుజగర్వాన్ని; చూపెనో?= చూపాడా?

తాత్పర్యం: 'సంజయా! అశ్వత్థామ దివ్యాస్త్రాలన్నీ తెలిసినవాడు, గొప్పబాహుబలం కలవాడు. శ్రీరాముడితో సరిపోల్చదగినవాడు. అట్టి అశ్వత్థామ, ఆ ధృష్టద్యుమ్నుడు తన తండ్రి తలవెంట్రుకలు పట్టి అంత నిర్దయగా గుంజాడంటే, అంతేకాక ఆ తండ్రి తలను ఖడ్గంతో నరికివేశాడంటే వింటూ ఆ దుర్యోధనాదులతోపాటు దుఃఖిస్తూ ఊరకే ఉన్నాడా? లేదా క్రోధోద్రిక్తుడై విజృంభించి శత్రువులపై భుజబలదర్పాన్ని ఏమైనా చూపాడా? చెప్పుము.

క. **తను నాధృష్టద్యుమ్నుం । దునుముటకై కోరి కనియె ద్రోణుఁడు పరమా**
స్త్ర నిరూఢి పరశురాముఁ డ । తని కిచ్చిన యంతవట్టు దన కతఁ డిచ్చెన్. 333

ప్రతిపదార్థం: ద్రోణుఁడు= తండ్రి ద్రోణాచార్యుడు; తనున్= తనను అనగా అశ్వత్థామను; ఆ ధృష్టద్యుమ్నున్= తన తండ్రి మరణానికి అవతరించిన ఆ ద్రుపద పుత్రుడిని ధృష్టద్యుమ్నుడిని; తునుముటకై= సంహరించటానికి; కోరి= ఇష్టపడి - ప్రత్యేకించి; కనియెన్= కన్నాడు (మరియు); అతనికిన్= ఆ ద్రోణాచార్యుడికి; పరశురాముఁడు= అతడి గురువగు పరశురాముడు; ఇచ్చిన+అంత+పట్టు= ఇచ్చినదంతా - నేర్పినదంతా అని భావం; అస్త్రనిరూఢిన్= అస్త్రాలను (ప్రయోగోపసంహారాలతో) నిర్వహించే

సామర్థ్యాన్ని; అతఁడు= ఆ(తన తండ్రి) ద్రోణాచార్యుడు; తనకున్= తనకు అనగా అశ్వత్థామకు; ఇచ్చెన్= ఇచ్చాడు - నేర్పాడు అని భావం.

తాత్పర్యం: ద్రోణుడు అశ్వత్థామను ధృష్టద్యుమ్నుడి వధ నిమిత్తం కని, తాను తన గురువు పరశురాముడి దగ్గర నేర్చుకొనిన అస్త్రవిద్యనంతా అతడికి నూరిపోశాడు.

వ. అట్టి జనకు నా ద్రుపదనందనుం డట్లు సేసిన నక్కొడు కెట్లు సేసెనో వినవలతుం జెప్పు మనవుడు నమ్మహీపతి కతఁ డి ట్లనియె. 334

ప్రతిపదార్థం: అట్టి జనకున్= అటువంటి తండ్రిని; ఆ ద్రుపదనందనుండు= ఆ ధృష్టద్యుమ్నుడు; అట్లు= ఆ విధంగా - అనగా కేశాకర్షణం చేసి తల నరకటం; చేసినన్= చేయగా; ఆ+కొడుకు= ఆ ద్రోణపుత్రుడు అశ్వత్థామ; ఎట్లు= ఏ విధంగా; చేసెనో= చేశాడో; వినన్= వినటానికి; వలతున్= కోరుతున్నాను; చెప్పుము; అనవుడున్= అనగానే; ఆ+మహీపతికిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజుతో; అతఁడు= ఆ సంజయుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అటువంటి తన తండ్రి ద్రోణాచార్యుడి తలను ధృష్టద్యుమ్నుడు ఆ విధంగా నరికి వేశాడని తెలిసిన ఆ ద్రోణాచార్యుల కుమారుడు అశ్వత్థామ ఏం చేశాడో వినవలెనని ఉన్నది చెప్పుము. అని అనగానే సంజయుడు ఆ ధృతరాష్ట్ర మహారాజుతో ఇట్లా అన్నాడు:

తే. కృపుని పలుకులు విని దట్టకెంపు గదురు । గన్నుఁగవ నశ్రుజలములు గ్రమ్ముదేరఁ
బాణితలమున నొత్తి యా ద్రోణతనయుఁ । డిట్టు లనుఁ దగఁ గౌరవాధీశుతోడ. 335

ప్రతిపదార్థం: కృపుని పలుకులు= కృపాచార్యుడి మాటలు; విని; దట్టకెంపు గదురు+కన్ను+కవన్= మిక్కిలి ఎరుపువన్నె అతిశయించిన కన్నుల జంటలో; అశ్రుజలములు= కన్నీళ్ళు; క్రమ్ముదేరన్= పైకి ఉబికి రాగా; పాణితలమునన్= అరచేతితో; ఒత్తి= ఒత్తుకొని; ఆ ద్రోణతనయుఁడు= ఆ ద్రోణాచార్యుడి కుమారుడు అశ్వత్థామ; కౌరవ+అధీశుతోడన్= కౌరవరాజు దుర్యోధనుడితో; తగన్= తగినవిధంగా; ఇట్టులు= ఇట్లా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: కృపాచార్యుడి మాటలు వినగానే ఎరుపెక్కిన అశ్వత్థామ రెండు కన్నులలో కన్నీళ్ళు గిర్రున తిరిగాయి. అయినా దుఃఖాన్ని ఆపుకొని, కన్నీళ్ళను చేతితో తుడుచుకొని, దుర్యోధనుడితో సమయోచితంగా ఇట్లా అన్నాడు.

ఉ. 'చావులు లేవె యెందు? ననిఁ జచ్చుట యొప్పదె? యిట్లు లోకసం
భావితు న మ్మహాత్ముఁ దల వట్టె నొకండను వాఁడి మాట య
మ్మై వడి దాఁకి చిత్తమున కార్తి యొనర్ప సహింపరాదు గా
కే విన నున్కి వాఁ డెఱుఁగఁడే? నను నిమ్మెయి భంగపెట్టునే? 336

ప్రతిపదార్థం: (ఓ దుర్యోధనా!) చావులు= మరణాలు; ఎందున్= ఎక్కడైనా; లేవు+ఎ?= ఉండవా? (మరణాలు తప్పవని భావం); అనిన్= యుద్ధంలో; చచ్చుట= మరణించటం; ఒప్పదు+ఎ?= శోభించదా? (యుద్ధంలో మరణం కీర్తికరమే కాబట్టి వీరులకు తగి ఉండుటచేత ఒప్పుతుందని భావం). (కాని ఈ మా తండ్రి మరణం నాకు దుఃఖహేతువు కావటానికి కారణ మేమంటే?); అట్లు= ఆ విధంగా; లోకసంభావితున్= లోకులచేత పూజించబడినట్టి; ఆ+మహాత్మున్= ఆ మహానుభావుడైన మా తండ్రిని; ఒకండు= ఒకడు; (పేరు తలచుకొనటం కూడ పాపహేతువు కాబట్టి పేరు ఇక్కడ ఉదాహరింపబడలేదు 'కథాపి ఖలు పాపా

నామలమశ్రేయసే యతః' - ఆర్యోక్తి); తల పట్టెన్= తలవెంట్రుకలు పట్టుకొన్నాడు; అను వాఁడిమాట= అనే తీవ్రమైన పలుకు; అమ్ము+ఐ= బాణమై; వడిన్= వేగంగా; తాఁకి= తగిలి; చిత్తమునకున్= మనస్సునకు; ఆర్తి= బాధ; ఒనర్పన్= కలుగజేయగా; సహింపరాదు+కాక= ఓర్వరాకుండా ఉంటే ఉండుగాక; ఏన్= నేను; వినన్+ఉన్కి= వినగలుగుటను; వాఁడు= ఆ వ్యక్తి (ఆ ధృష్టద్యుమ్నుడు); ఎఱుఁగడే?= తెలియకుండా ఉన్నాడా?; ననున్= నన్ను; ఈ+మెయిన్= ఈ విధంగా; భంగపెట్టునే= భంగపరుస్తాడా? - అవమానిస్తాడా!

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! ఎక్కడా మరణాలులేవా? యుద్ధంలో మరణించటం తగదా? (ఇవి సహజాలే) ఈ విధంగా లోకపూజ్యుడైన ఆ మహాత్ముడిని తలపట్టి ఈడ్చాడనే క్రూరమైన మాట వాడిబాణమై వేగంగా మనస్సును తాకి బాధకలిగిస్తే సహించటం సాధ్యం కాదు సరే, నేను వింటానని వాడికి తెలియదా? నన్ను ఈ విధంగా అవమానిస్తాడా?

క. నా దివ్యాస్త్రంబులు బా । హాదర్పము నింకఁ గాల్పనా? గురుఁ డాజిం
దా దిక్కుమాలి పగతుని । చే దైన్యముఁ బొందె నటె! యిసీ! యే మందున్? 337

ప్రతిపదార్థం: నా దివ్య+అస్త్రంబులు= నా యొక్క దివ్యములైన బ్రాహ్మము మొదలైన అస్త్రాలు; బాహాదర్పము= భుజగర్వం; ఇంకన్= ఇక; కాల్పనా?= దహించి వేయటానికా? - నిష్ప్రయోజన మి దంతా (ఎందుకంటే); గురుఁడు= మా+తండ్రి; ఆజిన్= యుద్ధంలో; తాన్= తాను; దిక్కుమాలి= రక్షణ కోల్పోయి; పగతునిచేన్= శత్రువుచేత; దైన్యమున్= దీనదశను; పొందెన్+అట+ఎ?= పొందాడు కదా!; ఇసీ= ఎంత రోత?; ఏమి+అందున్?= (దీనిని గూర్చి) ఏమనాలి? (ఇది ఎంత అవమానకర విషయమో! అనటానికి మాటలులేవు.)

తాత్పర్యం: నా దివ్యాస్త్రాలు, భుజగర్వం ఇంకెందుకు? కాల్చి వేయటానికా? మా తండ్రి ఏ దిక్కులేక యుద్ధంలో శత్రువు చేతిలో దీనంగా మృతిచెందాడా! ఛీ! ఇంకేమి అనగలను?

క. దీనికి మూలము ధర్మజుఁ । డా నిక్కము గల్గు రాజు నని దండితుఁగా
నే నెట్లు సేసి పుత్తునొ । కో! నా చిత్తము కలంకయును నెవ్వగయున్. 338

ప్రతిపదార్థం: దీనికిన్= దీనికంతటికి; మూలము= కారణభూతుడు; ధర్మజుఁడు= ధర్మరాజు - ఇదంతా ధర్మరాజువలననే జరిగింది; ఆ నిక్కము= ఆ సత్యం - అనగా కపటపూర్వక సత్యం; కల్గు= కలిగిఉన్న; రాజున్= రాజును అనగా ఆ ధర్మరాజును; అనిన్= యుద్ధంలో; దండితున్ కాన్= దండించబడేవాడినిగా; ఎట్లు= ఏ విధంగా; చేసి= చేసి; ఏన్= నేను; నా చిత్తము కలంకయును= నా మనస్సులోని క్షోభాన్ని; నెఱ+వగయున్= గొప్ప బాధను; పుత్తును+ఒకో!= పోగొట్టుకుంటానో!. (నా మనస్సులోని సంక్షోభం ఈ దుఃఖం పోవాలంటే ధర్మరాజును దండించక తప్పదు - అ దెట్లా?).

తాత్పర్యం: ఓ దుర్యోధనా! దీని కంతటికీ కారణం ఆ ధర్మరాజే. ఆ కపట సత్యాన్ని కలిగి ఉన్న రాజును యుద్ధంలో ఏ విధంగా దండించి నా మానసిక సంక్షోభాన్ని, దుఃఖాన్ని తొలగించుకొంటానో!

ఆ. పుత్త్రుఁ గనుట యెల్ల శత్రునిచేఁ దల । వట్టి తాను దునుమఁబడుట కయ్యె
నస్త్రగురున; కింక నన నేమి గలదు? నా । యుచ్చుబాస కౌరవేంద్ర! వినుము. 339

ప్రతిపదార్థం: అస్త్రగురునకున్= అస్త్రవిద్యాగురువైన ద్రోణాచార్యుడికి; పుత్రున్+కనుట+ఎల్లన్= కొడుకును (నన్ను) కనటం అంతా; శత్రునిచేన్= శత్రువు చేత; తాను= తండ్రి అయిన తాను; తల+పట్టి తునుమఁబడుటకున్= తలను పట్టుకొని సంహరింపబడటానికి; అయ్యెన్= అయింది; అనన్= చెప్పటానికి; ఇంకన్= ఇంతకంటె ఎక్కువ; ఏమి+కలదు?= ఏమున్నది? (ఏమీలేదని భావం); ఓ కౌరవేంద్ర!= ఓ కురురాజా దుర్యోధనా!; నా+ఇచ్చు బాస= నేనిస్తూ ఉన్న మాట - నా ప్రతిజ్ఞ వినుము.

తాత్పర్యం: అస్త్రగురుడైన మా తండ్రి ద్రోణాచార్యులు పుత్రుడనైన నన్ను కన్నది శత్రువుచేత తలపట్టి ఈడ్వబడి తాను ఏ దిక్కూలేక నరికివేయబడి మరణించటానికే అన్నట్లయింది. ఇక చెప్పటానికి ఏమున్నది దుర్యోధనా!? నేను చేసే ప్రతిజ్ఞ వినుము.

మ. **హరియుం బాండవులున్ మదీయ పటు బాహాశక్తి దివ్యాస్త్ర ని**
ర్భర సంతాప పరీతులై యొదుఁగ ఘోరస్ఫార సంక్రీడఁ ద
త్తురగస్యందన వారణప్రకరముల్ ద్రుంగన్ విజృంభించెద
న్సుర సంఘంబులు వచ్చి యడ్డుపడిన న్దుర్వారదర్పోద్ధతిన్. **340**

ప్రతిపదార్థం: హరియున్= కృష్ణుడును; పాండవులున్= ధర్మరాజు మొదలైన పాండవులును; మదీయ= నాదైన; పటు= సమర్థమైన; బాహాశక్తి= భుజబలంచేత (మరియు); దివ్య+అస్త్ర= దేవతాసంబంధులైన మంత్రబాణాలచేత; నిర్భరసంతాప= (కలిగిన) అధికమైన బాధతో; పరీతులు+ఐ= కూడిన వారలై; ఒదుఁగన్= తొలగిపోయే విధంగా(మరియు); తద్+తురగ స్యందన వారణ ప్రకరముల్= ఆ పాండవుల అశ్వరథగజాల సమూహాలు; ఘోరస్ఫార సంక్రీడన్= భయంకరము, అధికము అయిన యుద్ధక్రీడ చేత - అనగా విలాసంగా ఏ క్లేశం లేక చేసే యుద్ధం చేత; త్రుంగన్= ఖండించబడే విధంగా; (ఒకవేళ) సురసంఘంబులు= దేవతల సమూహాలు; వచ్చి= పాండవ పక్షం వచ్చి; అడ్డుపడినన్= అడ్డంగా నిలిచినా కూడా; దుర్వార దర్ప+ఉద్ధతిన్= నివారించ శక్యంకాని భుజ బలగర్వం చేతనైన; ఉద్ధతిన్= మిడిసిపాటుతో; విజృంభించెదన్= విజృంభిస్తాను.

తాత్పర్యం: నా ఈ బాహుబల పరాక్రమాలతో దివ్యాస్త్ర ప్రయోగంతో తల్లడిల్లి, మిక్కిలి బాధతో ఆ శ్రీకృష్ణుడు, పాండవులు రణరంగంలో తట్టుకోలేక తొలగిపోయేటట్లు చేస్తాను. అసంఖ్యాకములైన బాణజాలం వర్షిస్తూ అశ్వరథగజాల సమూహాలు నేలకొరిగేటట్లు చేస్తాను. దేవతల సంఘాలు పాండవ పక్షపాతులై అడ్డువచ్చినా నా దుర్వారమైన భుజబలం ఔద్ధత్యం ప్రదర్శిస్తూ విజృంభిస్తాను.

క. **తనుఁ దాన చెప్పికొను టొ । ప్పని పని యగు; నైనఁ దండ్రి పరిభవమునకుం**
గనలు గదిరి యి ట్లంటిని; । విను మే నే మనిన నేమి వృథ వో దధిపా!' **341**

ప్రతిపదార్థం: అధిపా! వినుము= ఓ దుర్యోధనా వినుము; తనున్= తన గూర్చి; తాను+అ= తానే (స్వయంగా); చెప్పుకొనుట= ప్రశంసించుకొనటం; ఒప్పని పని= తగనిపని; అగును= అవుతుంది (ఆత్మస్తుతి పనికిరాదని భావం); ఐనన్= అయినప్పటికి; తండ్రి పరిభవమునకున్= తండ్రికి జరిగిన అవమానానికి; (నాలోని) కనలు= కోపం; కదిరి= అతిశయించి; ఇట్లు= ఈ విధంగా; అంటిని= అన్నాను (మా తండ్రి ద్రోణాచార్యులకు ఆ పాండవులు చేసిన అవమానంతో నాలో పెల్లుబికిన దుఃఖాతిశయం నాతో ఇట్లా పలికించింది కాని నేను స్వయంగా ఆత్మస్తుతికి పూనుకొనలేదు); ఏను= నేను; ఏమి+అనినన్= ఏమి అన్నప్పటికీ; ఏమి=

ఏమి కూడ; వృథ+పోదు= వ్యర్థంగాపోదు - అది అయ్యే తీరుతుందని భావం (దీనితో ఏమన్నానో అది చేసి చూపిస్తానని దుర్యోధనుడితో అశ్వత్థామ చెప్పినట్లయింది).

తాత్పర్యం: తన్ను గురించి తాను చెప్పుకోవటం తగని పని. తండ్రికి జరిగిన అవమానానికి కోపం అతిశయించి ఈ విధంగా అన్నాను. ఓ దుర్యోధనా! వినుము. నేనేమన్నా అది వృథాగా పోదు. (అయితీరుతుంది).'

అశ్వత్థామ పూన్కివలనఁ గౌరవయోధులు మరల నరికిఁ గడంగుట (సం. 7-166-43)

వ. **అని పలికి మఱియు నిట్లను 'మా తండ్రి నారాయణు నారాధించి యొక్క మహాస్త్రంబు వడసె; నది నాకు నిచ్చె; న ద్దివ్యసాధనంబు వధ్యు లవధ్యులను విభాగంబు లేక విరోధి విధ్వంసనంబు సేయుఁ; దత్ప్రయోగంబున జయంబు సేకొనియెదం జూడు!' మనుటయు నమ్మహీపతియు ననుజులు సేనాపతులును శంఖంబులు పూరించి సింహనాదంబులు సేసి మరలిన, భేరీమృదంగాది తూర్యధ్వనులు నింగి ముట్టఁ దురంగ రింఖా రథనేమి గజపద ఘట్టనంబుల నిల గ్రక్కదల మన సైన్యంబులు మరలి యురవడించె; ననిన విని ధృతరాష్ట్రుండు.** **342**

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికి= చెప్పి; మఱియున్= మళ్ళీ; ఇట్లు= ఇట్లా; అనున్= అన్నాడు; మా తండ్రి= మా తండ్రి అయిన ద్రోణాచార్యుడు; నారాయణున్= నారాయణ భగవానుడిని; ఆరాధించి= ఆరాధన చేసి; ఒక్క మహాస్త్రంబు= ఒకానొక దివ్యాస్త్రాన్ని; పడసెన్= పొందాడు; అది= ఆ దివ్యాస్త్రాన్ని; నాకున్+ఇచ్చెన్= నాకిచ్చాడు; ఆ+దివ్యసాధనంబు= ఆ దివ్యాస్త్రం; వధ్యులు+అవధ్యులు+అను విభాగంబు= (వీరు) వధించ తగినవారు (వీరు) వధించతగని వారు అనే భేదం; లేక= లేకుండానే; విరోధి విధ్వంసనంబు= శత్రునాశం; చేయున్= చేస్తుంది; తత్ప్రయోగంబునన్= ఆ దివ్యాస్త్ర ప్రయోగంతో; జయంబు= విజయాన్ని; చేకొనియెదన్= చేపట్టుతాను; చూడుము= ఓ దుర్యోధనా! చూడు; అనుటయున్= ఇట్లా అనగానే; ఆ+మహీపతియున్= ఆ రాజు- దుర్యోధనుడు; అనుజులున్= తమ్ములు దుశ్శాసనాదులు; సేనాపతులును= సైన్యాధిపతులు కూడా; శంఖంబులు= శంఖాలను; పూరించి= పూరణచేసి (శంఖధ్వనులు చేసి); సింహనాదంబులు+చేసి= సింహనాదాలను చేసి; మరలినన్= పాండవ సైన్యంవైపు మరలగానే - మళ్ళీ యుద్ధం చేయటానికి సమాయత్తం కాగానే; భేరీ మృదంగ+ఆది తూర్యధ్వనులు= భేరీలు మృదంగాలు మొదలైన వాద్యాల ధ్వనులు; నింగిముట్టన్= ఆకాశాన్ని అంటగా; తురంగ రింఖా రథనేమి గజ పద ఘట్టనంబులన్= అశ్వాల డెక్కలు, రథచక్రాల కమ్ములు, ఏనుగుల పాదాలు అనే వాటియొక్క తాకిడులచేత; ఇల= భూమి; గ్రక్కదలన్= మిక్కిలిగా కదలుతుండగా; మన సైన్యంబులు= ఓ ధృతరాష్ట్ర మహారాజా! మన (కురు) సైన్యాలు; మరలి= తిరిగి; ఉరవడించెన్= సమాయత్తమయినవి; అనినన్= అనగానే; విని= విని; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు.

తాత్పర్యం: అని పలికి, ఇంకా ఇట్లా అన్నాడు. 'మా తండ్రి నారాయణుడిని ఉపాసించి అతడి వలన ఒకానొక దివ్యాస్త్రాన్ని పొందాడు. అదే నారాయణాస్త్రం. దానిని అతడు నాకు ఇచ్చాడు. ఆ దివ్యాస్త్రం వీరు చంపదగినవారు, వీరు చంపదగనివారు అనే భేదం లేక శత్రునిర్మూలనం చేసివేస్తుంది. దానిని ప్రయోగించి విజయాన్ని సాధిస్తా చూడుము - చూస్తావు కదా!' అని అశ్వత్థామ తన దగ్గరనున్న దివ్యాస్త్ర ప్రభావాన్ని వర్ణించి చెప్పగానే దుర్యోధనుడు, దుశ్శాసనాదులు, సేనాధిపతులు అందరూ యుద్ధసన్నద్ధులై శంఖాలను పూరించారు. సింహనాదాలు చేశారు. భేరీ మృదంగాది వివిధ రణరంగ వాద్యాలు మ్రోగాయి. అన్నింటి ధ్వనులు ఆకాశాన్నంటాయి. చతురంగబలాలు ముందుకు నడిచాయి. అశ్వాల డెక్కలతో, రథచక్రాల కమ్ములతో, ఏనుగుల పాదాలతో ఒరపిడి పొంది, ఆ

భూమి అంతా కదలుచున్నట్లనిపించింది. ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఇట్లా మన సైన్యాలు శత్రుసైన్యాలపై మళ్ళీ విజృంభించాయి - అని చెప్పగానే విని ధృతరాష్ట్ర మహారాజు (సంజయుడితో ఇట్లా అన్నాడు).

ఆ. 'అట్లు గడఁగు కౌరవానీకములఁ గని । పాండుపుత్రు లేమి భంగివార
లై? రెఱుంగఁ జెప్పు' మనవుడు నమ్మహీ । శ్వరున కిట్టు లనియె సంజయుండు. 343

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; కడఁగు= ఉద్యమిస్తున్న; కౌరవ+అనీకములన్= కౌరవ సైన్యాలను; కని= చూచి; పాండుపుత్రులు= పాండురాజు కుమారులు ధర్మరాజాదులు; ఏమి భంగివారలు= ఎటువంటి విధానం కలవారు; ఐరి?= అయినారు?; ఎఱుంగన్= తెలిసే విధంగా; చెప్పుము= చెప్పుము; అనవుడున్= అనగానే; సంజయుండు; ఆ+మహీపతికిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజుతో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'ఓ సంజయా! ఆ విధంగా మన సైన్యాలు యుద్ధానికి సమాయత్తమై వస్తూ ఉండగా పాండవులు ఏ విధానాన్ని అనుసరించారు? అంతా స్పష్టంగా చెప్పుము'- అని ధృతరాష్ట్ర మహారాజు ప్రశ్నించగానే సంజయుడు అతడితో ఇట్లా అన్నాడు:

వ. ఇత్తెఱంగునం గురుబలంబులు పురికొనం గౌంతేయులుం గూడుకొని సైన్యంబు సుసంగతంబు సేసికొని సంగరక్రీడ కమరి; రప్పుడు గ్రీడి నాలోకించి ధర్మతనయుండు. 344

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; కురుబలంబులు= కురుసైన్యాలు; పురికొనన్= ఉద్యమిస్తూ ఉంటే; కౌంతేయులు= కుంతీపుత్రులు ధర్మరాజాదులు కూడ; కూడుకొని= ఒకచోట కలిసి; సైన్యంబు= తమ సైన్యాన్ని; సుసంగతంబు= సముచితంగా అనగా యుద్ధసన్నద్ధంగా; చేసికొని= ఏర్పరచుకొని; సంగరక్రీడకున్= పోరాటానికి అనగా యుద్ధానికి; అమరిరి= సన్నద్ధమయ్యారు; అప్పుడు= ఆ సమయాన; క్రీడిన్= అర్జునుడిని; ఆలోకించి= చూచి; ధర్మతనయుండు= ధర్మరాజు. (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ఈ విధంగా కురుసైన్యాలు పెల్లుబికిన ఉత్సాహంతో యుద్ధానికి కదలివస్తూ ఉండగా చూచి, ధర్మరాజాదులు కూడా అందరూ ఏకమై తమ సైన్యాన్ని కూడా యుద్ధానికి పురికొల్పారు. తాము కూడ యుద్ధానికి సిద్ధమయ్యారు. ఆ సమయంలో ధర్మరాజు అర్జునుడితో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'గురుఁడు పడిన నవ్విధమునఁ । బరమభయాకులతఁ బొంది పఱచియు నట వే
తిరిగి కురుబలము పోరికిఁ । గర ముద్ధతి నగ్గలింపఁ గత మెయ్యదియో? 345

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యుడు; పడినన్= పడిపోగా; ఆ+విధమునన్= ఆ విధంగా; పరమ భయ+ఆకులతన్= మిక్కిలి భయంచేత వ్యాకులత్వాన్ని; పొంది= చెంది; అట= ఆ వైపు; పఱచియున్= పరుగులు తీసికూడ; వేః= వేగంగా; తిరిగి= మలగి; కురుబలము= కురుసైన్యం; పోరికిన్= యుద్ధానికి; కరము= మిక్కిలి; ఉద్ధతిన్= దర్పంతో; అగ్గలింపన్= ఉత్సహించటానికి; కతము= కారణం; ఎయ్యది+ఓ?= ఏమిటో?

తాత్పర్యం: 'ఆచార్యుడు ద్రోణుడు పడిపోగానే ఆ కురుసైన్యాలు మిక్కిలి భయంతో చెల్లాచెదరై పారిపోయాయి కదా! మరి ఇప్పుడు కొండంత ఉత్సాహంతో తిరిగి యుద్ధానికి పూనుకొని ఇటు వస్తున్నవి. కారణం ఏమిటో?

క. ఇలయును నింగియు నద్రువం । జెలఁగె మహారవము వారి సేనలఁ గురుచా
వలుక నొనర్చిన నక్కడ । బలరిపుఁ డేతెంచి తోడు పడి నడచె నొకో!' 346

ప్రతిపదార్థం: ఇలయును= భూమియు; నింగియున్= ఆకాశం; అద్రువన్= అదలిపోయే విధంగా; మహారవము= పెద్ద ధ్వని; వారిసేనలన్= ఆ కౌరవుల సైన్యంలో; చెలఁగెన్= పెల్లుబికింది; గురుచావు= ద్రోణాచార్యుడి మృతి; అలుకన్= కోపాన్ని; ఒనర్చినన్=కలుగజేయగా; బలరిపుఁడు= ఇంద్రుడు; అక్కడన్= ఆ వైపు; ఏతెంచి= వచ్చి; తోడుపడి= సహాయపడి; నడచెనొకో!= నడుస్తున్నాడా ఏమి?

తాత్పర్యం: ఆ కౌరవసైన్యంలో భూమి ఆకాశం బ్రద్దలయ్యేటట్లు గొప్ప ధ్వని పుట్టిం దేమి? ఒకవేళ ద్రోణాచార్యుల మృతివలన మనపై కోపం పుట్టి ఆ ఇంద్రుడు వీరి సహాయార్థం వచ్చి ఈ సైన్యాని కుత్సాహం కలుగటానికి వెంట నడుస్తున్నాడా? ఏమి ఇది?'

వ. అనిన విని యమ్మనుజపతికి నతం డి ట్లనియె. 347

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; విని= విని; ఆ+మనుజ పతికిన్= ఆ ధర్మరాజుతో; అతండు= ఆ అర్జునుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని అడుగగా, ధర్మరాజుతో అర్జునుడు ఇట్లా అన్నాడు:

ఆ. 'న్యస్తశస్త్రుఁ డైన యాచార్యుఁ జంపిన । నెవ్వరొక్కొ? వారి కివ్విధంబు
బలిమి గలుగఁ జేసి రలుకమై ననుచు సం । దియము పడగ నేల? తెలియ వినుము. 348

ప్రతిపదార్థం: న్యస్తశస్త్రుఁడు+ఐన= త్యజించబడిన శస్త్రంగల; ఆచార్యున్= ఆ ద్రోణాచార్యుడిని; చంపినన్= సంహరించగా; అలుకమైన్= కోపంతో; ఎవ్వరు= ఏ వ్యక్తులు; వారికిన్= ఆ కౌరవులకు; ఈ+విధంబు= ఇటువంటి; బలిమి= బలం; కలుగన్+చేసిరి ఒకో!= కలిగేటట్లు చేశారో!; అనుచున్= అంటూ; సందియము= అనుమానం; పడఁగన్+ఏల?= పడవలసిన పనిఏమి?; తెలియన్= తెలిసేటట్లు; వినుము= వినుము.

తాత్పర్యం: 'అస్త్రత్యాగం చేసిన ఆచార్యుడిని చంపారనే కోపంతో ఈ కౌరవసైన్యానికి ఇంత ధైర్యం నూరిపోసి మా పైకి పురికొల్పిన వా రెవ్వరో అని - ఓ ధర్మరాజా! సందేహపడవలదు. నేను చెప్పుతాను వినుము.

చ. జనకు నధర్మవృత్తి మెయిఁ జంపుటకై తలవట్టె నొక్కరుం
డన విని రిత్తవోవునె మహాద్భుత శౌర్యము నస్త్రవీర్యమున్
మనము జగంబుఁ గన్న యతిమానుషవిక్రమశాలి; వీని నె
వ్వని కెదురంగ రా దనఁగ వ్రాలిన ద్రోణసుతుండు భూవరా! 349

ప్రతిపదార్థం: భూవరా!= ఓ ధర్మరాజా!; జనకున్= తన తండ్రి అయిన ద్రోణాచార్యులను; అధర్మవృత్తిమెయిన్= అధర్మ ప్రవర్తనతో; చంపుటకై= సంహరించటానికి; తల= తలను; పట్టెన్= పట్టాడు; ఒక్కరుండు+అనన్= ఓ వ్యక్తి (ధృష్టద్యుమ్నుడు) అనగా; విని= విని; రిత్త+పోవునే?= క్రియాశూన్యుడై ఉంటాడా? (సుతుడు అశ్వత్థామ, ఊరకుంటాడా?); ఆ ద్రోణసుతుండు= అశ్వత్థామ (ఎటువంటి వాడంటే); మహా+అద్భుత శౌర్యము= గొప్ప ఆశ్చర్యాన్ని కలుగజేసే ప్రతాపం; అస్త్రవీర్యమున్= దివ్యాస్త్ర శక్తి; మనము= మనం (కేవలం మనమే కాదు); జగంబున్= ఈ లోకం కూడ; కన్న= చూచిన (వాడు) (ఆ అశ్వత్థామ ప్రతాపం దివ్యాస్త్రశక్తి ఎంతటి ఆశ్చర్యాన్ని కలుగజేసేదో మనమే కాదు లోకమంతా ప్రత్యక్షంగా చూచింది అనగా అందరికీ తెలుసు); అతి మానుష విక్రమశాలి= మనుష్యుల కెవ్వరికీ సాధ్యంకాని పరాక్రమంతో శోభించేవాడు; (మరియు ప్రస్తుతం అతడు) వీనిన్= ఈ అశ్వత్థామను; ఎవ్వనికిన్= ఏ వీరుడికి కూడ; ఎదురంగన్+రాదు= ఎదుర్కొనటానికి సాధ్యంకాదు; అనఁగన్= అనే విధంగా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్రాలిన= విజృంభించిన (వాడు); అటువంటి ద్రోణసుతుడు (అశ్వత్థామ) రిత్త+పోవునే? అని అన్వయం - (దూరాన్వయ దోషంచేత ఇట్లా అర్థం వ్రాయవలసి వచ్చింది).

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆ ద్రోణాచార్యుడి కుమారుడు అశ్వత్థామ తన తండ్రిని అధర్మంగా ఒకడు సంహరించటానికి అతడి తల పట్టుకున్నాడని విన్నాడు. అట్లా తన తండ్రికి జరిగిన అవమానానికి ఊరుకుంటాడా? అతడు సామాన్యవ్యక్తి కాడే! ఎంతో దివ్యాస్త్రసంపద, అద్భుతమైన బాహుబలం, అతిమానుషమైన పరాక్రమం అతడికున్నాయి. అది మనకుగాని ఈ లోకానికి గాని తెలియనిది కాదు. తననెవ్వరు ఎదిరించి నిలువలేరనే విధంగా విజృంభించాడు. అంతే. (దీనికంతటికి అతడే కారణం).

తే. **జన్మవేళన యాతఁ డుచ్చైశ్శ్రవంబు । భంగి హేషించెఁ బృథివి గంపంబు నొందఁ;**
నప్పు డతని కశ్వత్థామ యని యొసర్చెఁ । బేరు జనములు విన నశరీరవాణి. **350**

ప్రతిపదార్థం: జన్మవేళన్+అ= పుట్టుక సమయంలోనే; ఆతఁడు= ఆ ద్రోణాచార్యుడి కుమారుడు; పృథివి= భూమి; కంపంబున్= కంపాన్ని; ఒందన్= పొందే విధంగా; ఉచ్చైశ్శ్రవంబు భంగిన్= ఉచ్చైశ్శ్రవం అనే దేవేంద్రుడి గుర్రం మాదిరి; హేషించెన్= సకిలించాడు; అశ్వంవలె పెద్దగా అరిచాడని భావం; అప్పుడు= ఆ సమయంలో; అశరీరవాణి= ఆకాశవాణి; జనములు= జనులు; వినన్= వినేటట్లు; అతనికిన్= ఆ ద్రోణపుత్రుడికి; అశ్వత్థామ+అని= అశ్వత్థామ అనే; పేరు; ఒనర్చెన్= కలుగజేసింది.

తాత్పర్యం: అశ్వత్థామ తాను పుట్టగానే ఇంద్రుడి అశ్వం ఉచ్చైశ్శ్రవం వలె పెద్ద సకిలింత చేశాడట. దానితో భూమి కంపించిపోయింది - అది చూచి ఆకాశం నుండి అశరీరవాణి 'ఈ శిశువు అశ్వత్థామ అనే పేరుతో ప్రసిద్ధి చెందుతాడు' అని చెప్పింది. ఆ అద్భుతం అక్కడ ఉన్న జనులందరూ విన్నారు.

వ. **అతఁడు సూవె కౌరవసైన్యంబు నిప్పటి సంరంభంబునకుం గారణం' బని చెప్పి వెండియు.** **351**

ప్రతిపదార్థం: అతఁడు+చూవె= ఆ అశ్వత్థామయే ('చూవె' నిశ్చయార్థకము); కౌరవ సైన్యంబు+ఇప్పటి సంరంభంబునకున్= కౌరవసైన్యంలో ఇప్పుడు కలిగిన ఆటోపానికి; కారణంబు= కారణం; అని చెప్పి= ఇట్లా చెప్పి; వెండియున్= ఇంకా (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ఈ కౌరవసైన్యం ఇట్లా ఆటోపంతో యుద్ధానికి ఉద్యమిస్తున్నదంటే దానికి కారణం ఈ అశ్వత్థామయే' అని అర్జునుడు ధర్మరాజుతో చెప్పి, మరల (ఇట్లా అన్నాడు).

ఆ. **'అనఘ! నిన్ను శిష్యుఁడును ధార్మికుండు స । త్యవ్రతుండు నని మహాదరమున**
నడిగె; నీవు ధర్మహానికి నోర్చిన । గురుఁడు నిశ్చయించెఁ గొడుకు చావు. **352**

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పుణ్యాత్మా!; నిన్నున్= నిన్ను; శిష్యుఁడును= శిష్యుడవు; ధార్మికుండున్= ధర్మం తప్పనివాడవు; సత్యవ్రతుండును= సత్యనిష్ఠగల వాడవు; ('ను' అంతాగమము ప్రాయికం); అని మహా+ఆదరమునన్= అనే గొప్ప ఆదరభావంతో; అడిగెన్= అడిగాడు; అశ్వత్థామ మరణాన్ని గూర్చి ప్రశ్నించాడని భావం; నీవు= ఓ ధర్మరాజా! నీవు; ధర్మహానికిన్= ధర్మపరిత్యాగానికి; ఓర్చినన్= సిద్ధపడిన వెంటనే; గురుఁడు= మన అస్త్రవిద్య గురువు ద్రోణాచార్యుడు; కొడుకు చావు= తన కొడుకు అశ్వత్థామ మరణాన్ని; నిశ్చయించెన్= ధ్రువపరచుకొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఇంతవరకు పాపమంటే తెలియని ఓ ధర్మరాజా! ('ఇప్పుడే పాపానికి ఒడిగట్టా'వని ధ్వని) ద్రోణాచార్యుడు-నీవు సత్యవంతుడవు. ధర్మాత్ముడవు. మీదు మిక్కిలి తనకు శిష్యుడవు అని ఎంతో ఆదరభావంతో కొడుకు మరణాన్ని గూర్చి నిన్ను అడిగాను. నీవు ధర్మహానికి పూనుకోగా గురుడు తన పుత్రుడు అశ్వత్థామ మరణించినట్లుగా ధ్రువీకరించుకొన్నాడు.

క. ఛలము గొని యిట్లు వడయఁగ । వలయునె రాజ్యంబు? దీన వచ్చిన కలిమిం
గలుగునె పెంపుం బేరును? వెలి యైతిమి లోకమునకు వేయును నేలా? 353

ప్రతిపదార్థం: ఛలము+కొని= కపటాన్ని ఆశ్రయించి; ఇట్లు= ఈ విధంగా; రాజ్యంబు= రాజ్యాన్ని; పడయఁగన్+వలయునె?= పొందవలెనా? (రాజ్యప్రాప్తికి వేరే మార్గం లేదా? అని భావం); దీనన్= దీనివలన; వచ్చిన కలిమిన్= పొందిన (రాజ్య) సంపదతో; పెంపున్= అభివృద్ధి; పేరును= కీర్తి; కలుగునె?= కలుగుతాయా? (కలుగదని భావం); వేయునున్+ఏలా?= వేయి (మాటలు) ఎందుకు? (ఎన్ని చెప్పినా ఏమి ప్రయోజనం?) (మనకు చేకూరిన లాభం ఏమంటే?); లోకమునకున్= లోకానికి; వెలి+ఐతిమి= వెలి అయినాము అనగా దూరమయినాము' (గౌరవం కోల్పోయాము).

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఇట్లా కపట వృత్తితో రాజ్యం పొందటం తగునా? అట్లా పొందిన రాజ్యం పేరు తెస్తుందా? ఆ సంపద అభివృద్ధిని సాధిస్తుందా? ఇంకా ఏం చెప్పి ఏమి ప్రయోజనం? లోకం దృష్టిలో మనం వెలియై గౌరవాన్ని కోల్పోయామన్న మాట నిజం.

వ. అదియునుం గాక. 354

తాత్పర్యం: అంతేకాక. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. వల దిట్లే లని యేను బేరెలుఁగునన్ వారించుచున్ బాఱఁగాఁ
దల యిట్లేటికిఁ బట్టి త్రెవ్వ నడిచెన్? ధర్మప్రణాశం బెదం
దలఁపం డాగ్రహవృత్తిఁ బార్షతుఁడు; దద్దైన్యంబునం గ్రోధవి
హ్వలుఁ డై యీతనిపై వడిం బడక యశ్వత్థామ సైరించునే? 355

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఏల?= ఎందుకు?; వలదు= వద్దు; అని= అని; ఏను= (అర్జునుడు); పేరు+ఎలుఁగునన్= పెద్ద కంఠధ్వనితో; వారించుచున్= నివారిస్తూ; పాఱఁగాన్= పరుగుతీస్తూ ఉండగానే; పార్షతుఁడు= ధృష్టద్యుమ్నుడు; ఇట్లు=ఈ విధంగా; తలపట్టి త్రెవ్వన్= తల పట్టుకొని నరకటానికి; ఏటికిన్= ఎందుకు; నడిచెన్?= నడిచాడు?; కేశగ్రహణం చేసి సంహరించటంలో అతడి ఉద్దేశం ఏమిటో తెలియటం లేదని భావం; (ఇట్లా చేయటం వలన)? - ధర్మప్రణాశంబు= (కలిగే) ధర్మహానిని; పార్షతుఁడు= ధృష్టద్యుమ్నుడు; అగ్రహవృత్తిన్= కోపస్వభావంతో; ఎదన్= మనస్సులో; తలంపఁడు= భావించకుండా ఉన్నాడు; తద్+దైన్యంబునన్= ఆ చింతచేతనైన దైన్యంచేత; క్రోధవిహ్వలుఁడు+ఐ= కోపానికి వివశుడై; అశ్వత్థామ= గురుపుత్రుండు-అశ్వత్థామ; వడిన్= వేగంగా; ఈతనిపైన్= ఈ ధృష్టద్యుమ్నుడిపై; పడక= విజృంభించకుండా; సైరించునే?= సహిస్తాడా?

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఇట్లా పనికిరాదు, చేయటం వద్దు అని పెద్ద కంఠస్వరంతో నేను అడ్డుకొంటూ అతడివైపు పరుగెత్తుతూనే ఉన్నాను. అయినా లెక్కచేయక ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుడి కేశగ్రహణం చేసి, శిరస్సును ఖండించటానికి ఎందుకు పూనుకొన్నాడు? ఆ కోపంలో ధర్మహాని జరుగుతుందని కూడా విచారించలేదు. అట్లా అధర్మంగా తన తండ్రి తల నరకివేయటం వల్ల కలిగిన దీనత్వంతో క్రోధం పెల్లుబికి ప్రతీకారంగా ధృష్టద్యుమ్నుడిపై దాడి చేయకుండా ఊరుకొంటాడా?

క. మన సేవల నొక్కెత్తునఁ । గొనఁ దలఁచి కడంగి వచ్చు గురుపుత్రుని మా
ర్కొన ధృష్టద్యుమ్నునిఁ గా । వను శక్యమె నీకు? నిచటివారికి? నధిపా!' 356

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా!; మన సేవలన్= మన సైన్యాలను; ఒక్క+ఎత్తునన్= ఒకేసారిగా; కొనన్+తలఁచి= పట్టుకొనటానికి సంకల్పించి; కడంగి= విజృంభించి; నన్ను గురు పుత్రునిన్= వస్తూ ఉన్న గురుపుత్రుడిని - అశ్వత్థామను; మార్కొనన్= ఎదుర్కొనటానికి మరియు; ధృష్టద్యుమ్నుని; కావను= రక్షించటానికి; నీకున్; ఇచ్చటివారికిన్= ఇక్కడివారికి!; శక్యమె?= సాధ్యమవుతుందా? (ఎవరికి కూడా సాధ్యం కాదని భావం).

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఒక్కపెట్టుగా మన సైన్యాన్ని వమ్ము చేయతలపెట్టి విజృంభించి వస్తున్నాడు. అశ్వత్థామను ఎదుర్కొనటం, ధృష్టద్యుమ్నుడిని అతడి' బారినుండి కాపాడటం నీకుగాని, ఇక్కడున్నవారికిగాని సాధ్య మవుతుందా?'

వ. అనినం గోపించి యనిలనందనుం డా సంక్రందననందనున కి ట్లనియె. 357

ప్రతిపదార్థం: అనినన్= ఇట్లా అనగానే; కోపించి= కోపపడి; అనిల నందనుండు= వాయుసుతుడు - భీముడు; ఆ సంక్రందన నందనునకున్= ఇంద్రుడి కుమారుడు - అర్జునుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు ఇట్లా ధర్మరాజుతో అనగా భీముడికి కోపంవచ్చి, ఆ అర్జునుడితో ఇట్లా అన్నాడు:

చ. 'అడవుల నుండు తాపసుల యట్టులు పల్కెదు రాజనీతి యి
ట్టొడఁబడి చేయ వచ్చి వధ కొల్లమి యొప్పునె? ధర్మనిష్ఠ యె
క్కడఁ గల దాసభన్ ద్రుపదకన్యక పాటున కిట్టి వెన్నియుం
గడుకొని చేసినన్ మనలఁ గల్మష మొందఁగ నేర దర్జునా! 358

ప్రతిపదార్థం: అర్జునా!= ఓ పార్థా!; అడవులన్= అరణ్యాలలో; ఉండు తాపసుల+అట్టులు= నివసించే మునులవలె; పల్కెదు= పలుకుతావు; రాజనీతి; ఇట్లు+ఒడఁబడి= ఈ విధంగా అనుమతించి; చేయవచ్చి= చేయతగిన; వధకున్= గురువధకు, రాజనీతి (యుద్ధంలో బంధుత్వాదుల విచారించక వధ చేయటాన్ని అనుమతించింది కావున గురువధ చేయటం సముచితమే); ఒల్లమి= సమ్మతించకపోవటం; ఒప్పునె?= తగునా? (తగదని భావం) - ఇక కపటంగా వధించటమంటావా?; ధర్మనిష్ఠ= ధర్మరతి; ఎక్కడన్+కలదు?= ఎక్కడ ఉంది? (మనయందు మాత్రమే ధర్మనిష్ఠ ఉండవలెనా? ఆ కౌరవులయందు ఉండనక్కరలేదా? అని భావం); ఆ సభన్= కపటద్యూతాన్ని నిర్వహించిన ఆ కౌరవసభలో; ద్రుపద కన్యక పాటునకున్= ద్రౌపది పడిన కష్టానికి (వస్త్రాపహరణాది క్లేశానికి); ఇట్టి= ఇటువంటివి; ఎన్నియున్= ఎన్నైనా; కడుకొని= పూనుకొని; చేసినన్= చేసినా కూడా; మనలన్= మనకు; కల్మషము= పాపం; ఒందఁగ నేరదు= పొందజాలదు.

తాత్పర్యం: 'ఓ అర్జునా! నీవు అరణ్యాలలో ఉండి తపస్సు చేసికొనే మునులు పల్కినట్లు పల్కుతున్నావు. ద్రోణవధ గురువధ అని భావించి నీవు ఒప్పుకొనటం లేదు. గురువు, శిష్యుడు, పుత్రుడు అనే సంబంధ పరిగణన యుద్ధంలో లేదని రాజనీతి చెప్తున్నది. ఇక కపటంగా వధించటం అధర్మమనియా నీ భావన? ధర్మంగానే ఉన్నదా కౌరవుల ప్రవర్తన? ఆనాడు సభలో ద్రౌపది పడినభంగపాటుకు ఇటువంటివి ఎన్ని చేసినా మనకు పాపమంటదు.

తే. అరులు మనమీఁద నురవడి నరుగుదేర । నేము సిడిముడిపడుచుండ నిట్టు లనుట
యొప్ప 'దురిసినపుండుల నుప్పు' వెట్టె । దరయ; దీనికి నిన్ను నే మందు పార్థ! 359

ప్రతిపదార్థం: పార్థ!= ఓ అర్జునా!; అరులు= శత్రువులు; మనమీఁదన్= మనపైకి; ఉరవడిన్= మిక్కిలి వేగంగా; అరుగుదేరన్= వస్తూ ఉండగా; ఏము= మేము; చిడిముడి పడుచున్+ఉండన్= వేగిరపడుతూ ఉండే సమయంలో; ఇట్టులు+అనుట= ఈ విధంగా- అనగా నిరుత్సాహం కలిగే విధంగా మాటలాడటం; ఒప్పదు= తగదు (నీవు ఏం చేస్తున్నావంటే); ఉరిసిన పుండులన్= పక్వమైపగిలిన పుండ్లమీద; ఉప్పు= ఉప్పు; పెట్టెదు= ఉంచుతూ ఉన్నావు (పుండుపగిలి బాధపడుతూ ఉంటే దాని మీద ఉప్పు చల్లి మరీ బాధపెట్టినట్లుగా నీ పలుకులు - ఓ అర్జునా! మాకెంతో బాధాకరంగా ఉన్నాయి); అరయన్= చూడగా; దీనికిన్= ఈ నీ మాటల తీరునకు; నిన్నున్= నిన్ను; ఏమి+అందున్= ఏమనేది?

తాత్పర్యం: ఓ అర్జునా! శత్రువులు మనమీదికి మిక్కిలి వేగంతో వచ్చిపడుతూఉంటే, వాళ్ళను తిప్పికొట్టటానికి మేము సంభ్రమంతో సమాయత్తమౌతూఉంటే, ఈ సమయంలో నిరుత్సాహపరచే నీ మాటల ధోరణి చూస్తూ ఉంటే పక్వమై పగిలిన పుండ్లమీద ఉప్పు చల్లినట్లున్నది. ఇట్లా మాట్లాడటం నీకు తగదు. ఇంతకంటె నిన్ను నే నేమనగలను?

క. కురువీరు లెఱుఁగుదురు ననుఁ; । గురువీరుల తెఱఁగు నేనుఁ గొంత యెఱుఁగుదున్;
శరపరిఘప్రహరణములఁ । బొరిగొనియెదఁ గాక వారిఁ బో నిచ్చెదనే? 360

ప్రతిపదార్థం: కురువీరులు= కౌరవవీరులు; ననున్= నన్ను; ఎఱుఁగుదురు= తెలిసి ఉన్నారు; కురువీరుల తెఱఁగు= కౌరవవీరుల పద్ధతిని; నేనున్= నేనూ (భీముడు); కొంత= కొంతభాగం; ఎఱుఁగుదున్= తెలిసికొని ఉన్నాను (కాబట్టి) శరపరిఘప్రహరణములన్= బాణాలు, పరిఘలు (ముండ్ల రోకళ్ళు) అనే వాటియొక్క దెబ్బలచేత; వారిన్= ఆ దుర్యోధనాదులను; పొరిగొనియెదన్+కాక= సంహరించివేస్తానే తప్ప; పోనిచ్చెదనే?= (ఊరకే) పోనిస్తానా?

తాత్పర్యం: ఓ అర్జునా! నే నంటే ఏమో కురువీరులకు తెలుసు. నాకు కూడా ఆ కురువీరుల బలపరాక్రమాలు కొంతతెలుసు. ఇక చూడు - వారినందరినీ నా బాణాలు, పరిఘలు ప్రయోగించి, దృఢప్రహరణాలతో సంహరిస్తానుగాని, ఊరకే పోనిస్తానా?'

వ. అని పలికె; నప్పుడు ధృష్టద్యుమ్నుండు బీభత్సున కిట్లనియె. 361

ప్రతిపదార్థం: అని= ఇట్లా; పలికెన్= పలికాడు; అప్పుడు= ఆ సమయంలో; ధృష్టద్యుమ్నుఁడు; బీభత్సునకున్= అర్జునుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా భీముడు అర్జునుడితో పలికిన వెంటనే ధృష్టద్యుమ్నుడు కూడా అర్జునుడిని చూచి ఇట్లా అన్నాడు:

చ. 'వెరవును లావు లేని ప్రజ వేయు విధంబుల దివ్యబాణ వి
స్ఫురణము సూపి చూపి పొరిపుచ్చె మహోగ్రత ధార్మికుండె య
గ్గురుఁ? డది గాక యే నతనిఁ గూల్పన పుట్టినవాఁడ; నింతవ
ట్టరయక నన్ను నిట్లు సెడనాడుట పాడియె నీకు వాసవీ! 362

ప్రతిపదార్థం: వాసవీ!= ఓ అర్జునా!; వెరవును= ఉపాయం; లావు= అస్త్రబలం; లేని ప్రజన్= లేనటువంటి సైనికజనాన్ని; వేయువిధంబులన్= కొట్టేపద్ధతులలో; దివ్యబాణ విస్ఫురణము= దివ్యాస్త్రాల మెరపును; చూపి చూపి= అనేకసార్లు ప్రయోగించి; మహా+ఉగ్రతన్= మిక్కిలి నిర్దయభావంతో; పొరిపుచ్చెన్= నశింపజేశాడు; ఆ+గురుఁడు= అట్టి మీ విద్యాగురుడు ద్రోణుడు; ధార్మికుండె?= ధర్మనిష్ఠగలవాడేనా?; అది+కాక= అంతేకాక; ఏను= నేను; అతనిన్= ఆ ద్రోణుడిని; కూల్పన్+అ= కూల్చ

వేయటానికే; పుట్టిన వాఁడన్= పుట్టాను; ఇంత వట్టు= ఈ మాత్రం సందర్భం; అరయక= తెలుసుకోక; నన్నున్= నన్ను; ఇట్లు= ఈ విధంగా; చెడన్+ఆడుట= నిందించటం; నీకున్= నీకు; పాడియె?= న్యాయమా? నీకు ధర్మంకాదని భావం.

తాత్పర్యం: 'ఓ అర్జునా! ఉపాయము, బలములేని సామాన్యసైనిక జనాన్ని తన దివ్యాస్త్ర ప్రకాశాన్నంతా చూపి చూపి దారుణంగా చంపాడు. ఆ గురుడు ధార్మికుడా? అంతేకాదు నేను ఆ ద్రోణుడి వధకై పుట్టాను. ఇదంతా తెలిసికొనకుండా నీ విట్లా నన్ను నిందిస్తున్నావు. ఇది నీకు ధర్మమేనా? చెప్పు(ము).

క. **పితృసఖుఁ డగు భగదత్తునిఁ । బితామహుం డైన వృద్ధు భీష్ముని నీ వు**
ద్ధతిఁ జంపుట పుణ్యంబే? । ప్రతివీరునిఁ జంపు టేల, పాపం బయ్యెన్? 363

ప్రతిపదార్థం: పితృసఖుఁడు+అగు= తండ్రికి మిత్రుడైన; భగదత్తునిన్= భగదత్తుడిని; పితామహుండు+ఐన= తాత అయిన; వృద్ధున్= (మరియు) ముదుసలి అయిన; భీష్మున్= భీష్ముడిని; నీవు= ఓ అర్జునా! నీవు; ఉద్ధతిన్= మిడిసిపాటుతో (వినయంలేక); చంపుట= సంహరించటం; పుణ్యంబే?= పుణ్యమేనా?; ప్రతివీరునిన్= ఎదిరించి పోరాడే వీరుడిని; చంపుట= సంహరించటం ఏల= ఏ విధంగా; పాపంబు= పాపం; అయ్యెన్?= అయింది?

తాత్పర్యం: ఓ అర్జునా! నీవు నీ తండ్రికి మిత్రుడైన భగదత్తుడిని సంహరించావు. వృద్ధుడైన పితామహుడు భీష్ముడిని పడగొట్టావు. వీరిద్దరిని నీవు ఉద్ధతితో చంపటం పుణ్యమా? ఎదిరించిన శత్రువీరుడిని నేను చంపటం పాపం ఎట్లా అయింది?

క. **భూనాథుఁడు బొంకఁడు; విను । మేనును ధర్మంబు దప్ప; నిది యేటికి మి**
థ్యానింద? శిష్యవంచకుఁ । డైన గురుఁడు సచ్చె; గెలువు మరిసైన్యంబున్.' 364

ప్రతిపదార్థం: వినుము= ఓ అర్జునా! నేను చెప్పేది వినుము; భూనాథుఁడు= ధర్మరాజు; బొంకఁడు= అసత్యం పలుకలేదు; ఏనును= నేను కూడ; ధర్మంబు= ధర్మాన్ని; తప్పను= తప్పలేదు; ఇది= ఈ; మిథ్యానింద= అబద్ధమైన నింద; ఏటికి?= ఎందుకు?; శిష్యవంచకుఁడు+ఐన= శిష్యులను మోసపుచ్చేవాడైన; గురుఁడు= ద్రోణాచార్యుడు; చచ్చెన్= మరణించాడు. (ఇక శత్రు విజయానికి బాట సులభమయింది. కావున); అరిసైన్యంబున్= శత్రుసైన్యాన్ని; గెలువుము= జయించుము.

తాత్పర్యం: ఓ అర్జునా! ధర్మరాజు అబద్ధమాడలేదు. నేను కూడా ధర్మం తప్పలేదు. ఇంక ఎందుకు నన్ను నీవు వ్యర్థంగా నిందిస్తావు? శిష్యులను మోసం చేసిన ఆ గురువు ద్రోణుడు చచ్చాడు. ఇక ఈ శత్రుసైన్యాలను జయించుము.

ఆ. **అనియె ననుడు సంజయున కాంబికేయుఁ డి । ట్లను మునీంద్ర జాతుఁ డైన ద్రోణు**
నట్లు చేసి యద్దురాత్ముఁ డమ్మెయిఁ బల్క । వినుచు నచటివారు గనల రెట్లు? 365

ప్రతిపదార్థం: అనియెన్= (అని ధృష్టద్యుమ్నుడు అర్జునుడితో) అన్నాడు; అనుడున్= అని (ఈ విధంగా సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్పగానే); ఆంబికేయుఁడు= (అంబిక కుమారుడు) ధృతరాష్ట్ర మహారాజు; సంజయునకున్= సంజయుడితో; ఇట్లు= ఇట్లా; అనున్= అంటాడు (అదిగాదని భావం); ఆ+దురాత్ముఁడు= ఆ దుష్టుడు - ధృష్టద్యుమ్నుడు; మునీంద్ర జాతుఁడైనన్= మునిశ్రేష్ఠుడైన భరద్వాజుడి వలన జన్మనెత్తిన; ద్రోణున్= ద్రోణాచార్యుడిని; అట్లు+చేసి= ఆ విధంగా చేసి, అనగా వధించి;

ఆ+మెయిన్= ఆ విధంగా; అనగా తాను చేసిన ద్రోణవధ ధర్మమే అని; పల్కన్= పలుకగా; వినుచున్= వింటూ; అచటివారు= అక్కడున్నవారు; ఎట్లు= ఏ విధంగా; కనలరు?= మండిపడకుండా ఉంటారు?

తాత్పర్యం: అని ధృష్టద్యుమ్నుడు అర్జునుడితో అన్నాడు అని అనగా ధృతరాష్ట్ర మహారాజు సంజయుడితో ఇట్లా అన్నాడు. భరద్వాజ మహామునికి జన్మించిన ద్రోణుని ఆ విధంగా చంపి, ఆ దుర్మార్గుడు ధృష్టద్యుమ్నుడు ఆ విధంగా మాట్లాడగా; విన్నవారు దానికి మండిపడకుండా ఉండగలరా? తరువాత ఏం జరిగిందో చెప్పుము.

ద్రోణు పరిభవంబునకుఁ గోపించి సాత్యకి ధృష్టద్యుమ్ను నాక్షేపించుట (సం.7-169-8)

సీ. అనుటయు నా సూత తనయుఁ డవ్విభునకు । నిట్లను నతని రూక్షేక్షణముల
నరుఁ డుపలక్షించి తొరఁగు కన్నీరితో । నిట్టూర్పు నిగిడించి ' యట్టిరోఁత
మాట లేటికి?' నన మాఱు పల్కక హరి । ధర్మపుత్రాదులు దలలు వంప
నలిగి సాత్యకి ద్రుపదాత్మజుఁ గనుఁగొని । 'నీ జిహ్వ దునియదు నీ శిరంబు
తే. వగులు; దమ్మెయి గురునకుఁ బరిభవంబు । సేసి యిమ్మెయిఁ బలుకంగఁ జేయునదియుఁ
గలదె? యీరాజు సన్నిధిఁ గాన బ్రదికి; । తింకఁ బలికిన నోరు ప్రేయింతుఁ జుమ్ము! 366

ప్రతిపదార్థం: అనుటయున్= ధృతరాష్ట్రుడిట్లా అనగా; ఆ సూతతనయుఁడు= ఆ సంజయుడు; ఆ+విభునకున్= ఆ రాజుతో; (ధృతరాష్ట్రుడితో); ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; నరుఁడు= అర్జునుడు; రూక్ష+ఈక్షణములన్= తీక్ష్ణములైన చూపులతో; అతనిన్= ఆ ధృష్టద్యుమ్నుడిని; ఉపలక్షించి= చూచి; తొరఁగు కన్నీరితోన్= స్రవిస్తూ ఉన్న కన్నీటితో; నిట్టూర్పు= నిశ్వాసం; నిగిడించి= పెద్ద పెట్టున తీసి; ఇట్టి రోఁత మాటలు= ఈ విధములైన ఏహ్యాభావం కలిగించే పలుకులు; ఏటికిన్?= ఎందుకు?; అనన్= అనగా (ధృష్టద్యుమ్నుడితో అంటూ ఉంటే); హరి ధర్మపుత్ర+ఆదులు= కృష్ణుడు, ధర్మరాజు మొదలైనవారు; మాఱు+పల్కక= మారుమాటాడక; తలలు= శిరములు; వంపన్= వంచుకోగా (అప్పుడు); సాత్యకి; అలిగి= కోపించి; ద్రుపద+ఆత్మజున్= ధృష్టద్యుమ్నుడిని; కనుఁగొని= చూచి (ఇట్లా అన్నాడు); నీ జిహ్వ= ఓ ధృష్టద్యుమ్నా! నీ నాలుక; తునియదు= చీలిపోకుండా ఉన్నది; నీ శిరంబు= నీ తల; పగులదు= బద్దలు కాకుండా ఉన్నది (నీవు చేసిన పనికి, ఈ మాటలకు నీ నాలుక తెగగొట్టటం, తలబద్దలు కొట్టటం చేయవలసిందే, కాని అట్లు చేయలేదు); ఆ+మెయిన్= ఆ విధంగా; గురునకున్= ద్రోణాచార్యుడికి; పరిభవంబు= అవమానం; చేసి; ఈ+మెయిన్= ఈ విధంగా; పలుకంగన్= పలుకగా; చేయునది= చేసేది; కలదె?= ఉన్నదా? (చేయగలిగింది ఏమీ లేదు); ఈ రాజు సన్నిధిన్= ఈ ధర్మరాజుయొక్క సమక్షమునందు; కానన్= కాబట్టి; బ్రదికితి= బ్రతికిపోయావు; ఇంకన్= ఇంకా కూడ; పలికినన్= పలికావంటే; నోరు= నోరును; ప్రేయింతు సుమ్ము= చీల్చివేస్తాను సుమా!

తాత్పర్యం: అని ధృతరాష్ట్ర మహారాజు అడుగగానే సంజయుడు చెప్ప నారంభించాడు. ఓ ధృతరాష్ట్ర మహారాజా!, అట్లా అంటూ ఉన్న ఆ ధృష్టద్యుమ్నుడిని కొర కొర చూస్తూ అర్జునుడు పెల్లుబికిన కన్నీటితో నిట్టూర్పు విడిచి ఇట్టి రోత పుట్టించే మాటలు ఇక చాలు.' అని అనగానే కృష్ణుడు, ధర్మరాజు మొదలైనవారు మారు పలుకలేదు. సిగ్గుతో తలలు కూడా వంచుకున్నారు. అప్పుడు సాత్యకి కోపంతో ధృష్టద్యుమ్నుడిని చూచి ఇట్లా అన్నాడు: 'ధృష్టద్యుమ్నా! ఆ విధంగా ద్రోణాచార్యుడిని అవమానించావు. దానిని సమర్థించుకొంటూ ఇట్లా పలుకుతున్నావు. అయినా నీ నాలుక చీలిపోకుండా, నీ తల పగిలిపోకుండా ఉన్నది అంటే ఇది ధర్మరాజు సన్నిధి కాబట్టి చేసేది లేక దక్కిపోయావు - లేకుంటేనా? నీ నాలుక ఎప్పుడో చీల్చివేసి, నీ తల బ్రద్దలు కొట్టి ఉండేవాడిని జాగ్రత్త. నీ వింకేమైనా హద్దుదాటి మాట్లాడావంటే నాలుక చీలుస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తన మాఁటే యని గంగా । తనయు శిఖండియు వధించెఁ; దత్కార్యం బా
తనికిఁ బ్రియ మైనఁ బనిచెం । దన మనుమనిఁ బనుపుసేఁత దగదె నరునకున్? 367

ప్రతిపదార్థం: తన మాటు+ఏ+అని= తన వంతే అని; గంగా తనయున్= గంగాపుత్రుడిని భీష్ముడిని; శిఖండియున్= శిఖండి కూడా (నీ సోదరుడే); వధించెన్= సంహరించాడు; తత్కార్యంబు= ఆ పని (అనగా శిఖండికి తన మనుమడు అర్జునుడు తోడు ఉండి వధించటం); ఆతనికిన్= ఆ భీష్ముడికి; ప్రియము+ఐనన్= ఇష్టమైనందువలన; తన మనుమనిన్= తన తమ్ముడు విచిత్రవీర్యుడికి మనుమడు (అనగా తనకు కూడ వరసకు మనుమడైన అర్జునుడిని); పనిచెన్= (ధర్మరాజు శిఖండికి తోడుగా) పంపాడు; పనుపు+చేఁత= ఆ ధర్మరాజు ఆదేశాన్ని నిర్వహించటం; నరునకున్= అర్జునుడికి; తగదు+ఎ?= తగింది కాదా? (రాజాజ్ఞ పరిపాలనం అందరికి కూడ అవశ్యకర్తవ్యమే కదా!).

తాత్పర్యం: తాను భీష్ముడి వధార్థమే జన్మించానని చెప్తూ భీష్మవధకై ఉద్యమించి సంహరించాడు భీష్ముడిని శిఖండి. అర్జునుడు అతడికి తోడుగా వెళ్ళాడు. అది కూడా తనకు తానుగా కాదు. అది ధర్మరాజు ఆజ్ఞ. ధర్మరాజు ఆజ్ఞాపించింది కూడా భీష్ముడి అనుమతి ప్రకారంగానే. తన మరణానికి నిమిత్తం కేవలం శిఖండియే అయినా, అర్జునుడు కూడా తోడు ఉండాలి అని భీష్ముడి ఆకాంక్ష. అందుకే అర్జునుడిని ధర్మరాజు పంపాడు. కాబట్టి ధర్మరాజు ఆజ్ఞ నెరవేర్చాడు అర్జునుడు. ఏం కూడదా?

విశేషం: సంస్కృత మూలంలో సాత్యకి ఇట్లా అన్నట్లు లేదు. తిక్కన స్వయంగా ఈ విషయం సాత్యకిచే పలికించాడు. భీష్ముడు శిఖండికి తోడుగా అర్జునుడిని పంపుమన్నట్లు భీష్మపర్వంలో ఉన్నది. ధర్మరాజు భీష్ముడిని తన నెట్లు జయించాలో ఉపాయం చెప్పుమన్నాడు. ఆ సందర్భంలో భీష్ముడు పలికిన పలుకులు. (మూల సంస్కృతంలో శ్లోకాలు) ఇవి:

శ్లో॥ అర్జునః సమరే శూరః పురస్కృత్య శిఖండినమ్ ।
మా మేవ విశిఖై స్తే క్ష్ణైరభిద్రవతు దంశితః ॥
అమంగల్యధ్వజే తస్మిన్ స్త్రీ పూర్వే చ విశేషతః ।
న ప్రహర్తు మభీప్సామి గృహీతేషుః కథంచన ॥
తదంతరం సమాసాద్య పాండవో మాం ధనంజయః ।
శరైర్ఘాతయతు క్షిప్రం సమంతాద్ భరతర్షభ! (భీష్మ - 107/82-84)

వ. ఆ శిఖండియు నీవు నుద్భవించి పాంచాల కులంబుఁ గీర్తికిం బుణ్యలోకంబునకుం బాపితి' రనిన ధృష్టద్యుమ్నుండు నవ్వుచు నతని నవలోకించి. 368

ప్రతిపదార్థం: ఆ శిఖండియున్= ఆ నీ సోదరుడు శిఖండి; నీవును= ఓ ధృష్టద్యుమ్నా! నీవు (మీరిద్దరు); ఉద్భవించి= పుట్టి; పాంచాలకులంబు= పాంచాల వంశాన్ని; కీర్తికిన్= ప్రతిష్ఠకు; పుణ్యలోకంబునకున్= ఉత్తమ లోకానికి; పాపితిరి= దూరం చేశారు; అనినన్= ఇట్లా సాత్యకి అనగానే; ధృష్టద్యుమ్నుండు; నవ్వుచున్= నవ్వుతూ; అతనిన్= ఆ సాత్యకిని; అవలోకించి= చూచి.

తాత్పర్యం: నీవు, శిఖండి పుట్టి పాంచాలవంశాన్ని, కీర్తిని, పుణ్యలోకాలకు దూరం చేశారు.' ఇట్లా సాత్యకి పలికిన మాటలు విని ధృష్టద్యుమ్నుడు నవ్వుతూ సాత్యకిని చూచి (ఇట్లా అన్నాడు).

క. సైరించిన నెఱుఁగవు నీ । చారిత్రము దలఁప నన్య శరకృత్తకరున్
భూరిశ్రవుఁ జంపి తదియు । వీర వ్యవహారమే వివేక విహీనా! 369

ప్రతిపదార్థం: వివేకవిహీనా!= వివేకం లేనివాడా ఓ సాత్యకీ!; నీ చారిత్రము= నీ నడవడి; సైరించినన్= సహిస్తూ ఉంటే; ఎఱుఁగవు= తెలిసికొనకుండా ఉన్నావు; తలఁపన్= ఆలోచించగా; అన్యశరకృత్తకరున్= ఇతరుల (అర్జునుడి) బాణాలచేత తెగగొట్టబడిన చేతులుగల వాడై ఉన్నటువంటి; భూరిశ్రవున్= భూరిశ్రవుడిని; చంపితి= చంపావు; అదియు= అది కూడ; వీరవ్యవహారము+ఏ?= వీరుల వ్యవహారమేనా? అనగా వీరులు నడిచే పద్ధతేనా? (ఇదే నీ అవివేకానికి గుర్తు అని తెలుపటానికి వివేకహీనా! అని సంబోధనం సార్థకం - తన తప్పులు తెలుసుకొనలేక ఇతరులను దూషించటం వ్యర్థమని తాత్పర్యం).

తాత్పర్యం: ఓ తెలివిలేని మూర్ఖుడా సాత్యకీ! సహిస్తూఉన్నాంకదా అని నీ చరిత్ర నీవు తెలుసుకొనకుండా ఉన్నావు. భూరిశ్రవుడి చేతులను ఎవరో ఇతరులు ఖండించిన తరువాత, ఆ చేతులు లేనివాడిని నీవు సంహరించావు. ఇది వీరధర్మమేనా?

తే. **అతఁడు నీ ఱొమ్ముఁద్రొక్కిన యపు డొకండు । జేయఁ జాలవ యగ్గురు సాయకములఁ**
బాండవానీకములు విచ్చి పాఱ నెన్ని । యెడల మార్కొంటి వాతని నెఱుఁగ వెట్లు? **370**

ప్రతిపదార్థం: అతఁడు= ఆ భూరిశ్రవుడు; నీ ఱొమ్ము= నీ వక్షస్స్థలాన్ని; త్రొక్కిన+అపుడు= క్రింద పడవేసి కాలితో తన్నినప్పుడు; ఒకండున్= ఒకటి కూడా; చేయన్+చాలవు+అ= చేయలేకపోయావు (ఏమీకూడా); ఔనా? - భూరిశ్రవుడు నిన్ను క్రింద పడవేసి కాలితో తొక్కి ఖడ్గంతో నీ శిరస్సును నరకిపోతూ ఉంటే నీవేం చేశావు? అప్పుడు అతడి ఖడ్గసహితమైన బాహువును నరకివేసి నిన్ను రక్షించింది అర్జునుడే కదా!; ఆ+గురుసాయకములన్= ఆ ద్రోణాచార్యుల బాణాలతో; పాండవ+అనీకములు= పాండవ సేనలు; విచ్చి= వీడిపోయి; పాఱన్= పారిపోతూ ఉండగా; ఎన్ని+ఎడలన్= ఎన్ని సందర్భాలలో అనగా ఎన్నిసార్లు; ఆతనిన్= ఆ ద్రోణాచార్యుడిని; మార్కొంటివి?= ఎదిరించావు?; ఎట్లు= ఏ విధంగా; ఆతనిన్+ఎఱుఁగవు?= ఆ ద్రోణాచార్యుడిని గూర్చి తెలియకుండా ఉన్నావు? (ద్రోణుడి ధాటికి ఆగలేక మన పాండవుల సైన్యాలు పారిపోతూ ఉంటే ఎప్పుడైనా ద్రోణుడిని ఎదిరించి పాండవ సైన్యాలను కాపాడావా? ఆ ద్రోణుడు ఎంతటి అజేయుడో నీకు తెలియదా?); 'ఆతని' అనే పదానికి దేహళీదత్తదీపన్యాయంగా అన్వయం.

తాత్పర్యం: ఆ భూరిశ్రవుడు నిన్ను క్రిందపడవేసి, ఛాతిలో తన్ని, తన ఖడ్గంతో నీ తల ఖండించ పూనుకొనేటప్పుడు నీ వేం చేయగలిగావో చెప్పుము. నీవప్పుడు విక్రమించలేదు. నిన్నెవరో ఆ సమయంలో రక్షించవలసి వచ్చింది. మరి ఆ భూరిశ్రవుడు తన చేయి తెగి మరణోన్ముఖుడై ప్రాయోపవేశం చేసిన తరువాతనే అతడిని సంహరించావు. అదీగాక ఆ ద్రోణాచార్యుడు ఎన్నిసార్లు మన సైన్యాలను పారద్రోలలేదు? అప్పు డేమైనా ఆ ద్రోణుడిని అడ్డుకొన్నావా? కాబట్టి ఆ ద్రోణుడిని గూర్చి నీకు తెలియదా? నీవు భూరిశ్రవుడిని అట్టి స్థితిలోనే సంహరించినప్పుడు లేని దోషం నేను అట్టి స్థితిలోనే ఉన్న ద్రోణుడిని వధించేటప్పుడు ఉన్నదా? అంత గొప్ప అజేయుడైన ద్రోణాచార్యుడిని వధిస్తే సంతోషించవలసింది పోయి నన్ను తప్పుపడుతావా? ఇదేమి న్యాయం?

విశేషం: భూరిశ్రవుడు సాత్యకిని విరథుడిగా, విశస్త్రుడిగా చేసి - ఛాతిలో తన్ని ఖడ్గంతో నరకపోతూ ఉంటే అర్జునుడు ఆ భూరిశ్రవుడి బాహువును ఖండించి, సాత్యకిని కాపాడాడు. ఆ భూరిశ్రవుడు తన బాహువు ఖండితం కాగా ప్రాయోపవేశం చేశాడు. అట్టి స్థితిలో ఉన్న భూరిశ్రవుడిని సాత్యకి తల తెగగొట్టి సంహరించివేశాడు. సంస్కృతమూలం.

శ్లో॥ ఉత్థితః స తు శైనేయో విముక్తః సౌమదత్తినా।
ఖడ్గమాదాయ చిచ్ఛిత్సుః శిరస్తస్య మహాత్మనః ॥
ప్రాయోపవిష్టాయ రణే పార్థేన ఛిన్నబాహవే ।
సాత్యకిః కౌరవేయాయ ఖడ్గే నాపాహర చ్ఛిరః ॥ (ద్రోణ 143 / 49; 54).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వలవని ప్రేలరి మాటల। నలిగింపకు నన్ను నేమి యాడిన నింకం
దల ద్రెవ్వ నేయుదుం గురు। బల మదె పురణించె బడలు పఱుతము రమ్మా!' 371

ప్రతిపదార్థం: నన్నున్= ఓ సాత్యకీ! నన్ను; వలవని ప్రేలరి మాటలన్= కూడని వ్యర్థ ప్రలాపాలతో; అలిగింపకు= కోపింప చేయవద్దు; ఇంకన్= మరీ; ఏమి+ఆడినన్= ఏమైనా మాట్లాడావంటే; తల+ద్రెవ్వన్= తల తెగిపోయేటట్లు; ఏయుదున్= కొడ్తాను (ఖడ్గంతో తల నరికివేస్తానని భావం) (ఇక ఈ విషయం ఇంతటితో చాలు ప్రస్తుత విషయానికి వస్తే); అది+ఎ= అదుగో; కురుబలము= కౌరవసైన్యం; పురణించెన్= విజృంభిస్తూ ఉన్నది (మనమిద్దరం ఏకమై); బడలు పఱుతము= అలయిద్దాం అనగా అలసిపోయి యుద్ధం చేయలేక పారిపోయేటట్లు చేద్దాం; రమ్ము+ఆ= రా; సాత్యకీ! నీవు నేను కలిసి యుద్ధం చేద్దాం రా (ఏక కార్యార్థులమైన మనకు వైరం కూడదని భావం).

తాత్పర్యం: ఓ సాత్యకీ! కూడని వ్యర్థప్రలాపాలతో నాకు కోపం తెప్పించవద్దు. ఇంకా ఏమైనా ప్రేలావంటే నీ తల తెగవేస్తాను అదుగో కౌరవసైన్యం విజృంభిస్తూ ఉన్నది. కలిసి పోరాడి, ఆ సైన్యాన్ని పారద్రోలుదాం రా!

వ. అని పలికిన శినివరుండు రోషారుణితలోచనుండై కోదండంబు రథంబున నిడి గద పుచ్చికొని 'మాటల నలిగెదేని వ్రేటున శిక్షించెద' ననుచు ధరణికి లంఘించి కవిసినం గని, కేశవుండు పనుపం బవనతనయుండు రథంబు డిగ్గి రయంబునం జని పట్టి యాఱడుగుల కొలఁది నిలువరించె; నట్టియెడ సహదేవుం డా శైనేయు నుద్దేశించి 'మిమ్మును బాంచాలురం గడచిన బంధువులు మాకును మిమ్మును మిగిలిన బాంధవు లా పాంచాలురకును వారల కంటె మాకంటె - నెక్కుడు సుహృజ్జనులు మీకును లేకునికి దెల్లం; బిట్టి మీలో మీ రెరవు పడం దగునే? యలుక దక్కు' మనునెడ నాధృష్టద్యుమ్నుండు వడముడితో 'నతనిం బట్టక విడువుము; నాచేతంగాని నీచేత నిలువండు; నేనొక్కచేతి భూరిశ్రవుండనే? యేల? యడిచిపడియెడు?' ననవుడు నాభీమసేను బాహువుల లోనం దిరుగుడు పడుచు నురగంబు చందంబున సాత్యకి రోఁజుచున్నం గృష్ణ యుధిష్ఠిరు లయ్యిరువురం బ్రయత్నంబున వారించిరి; తదనంతరంబ. 372

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికినన్= ధృష్టద్యుమ్నుడు పలుకగానే; శినివరుండు= సాత్యకి; రోష+అరుణిత లోచనుండు +ఐ= కోపంతో ఎర్రబారిన కన్నులు గలవాడై; కోదండంబు= ధనుస్సును; రథంబునన్= రథంపై; ఇడి= ఉంచి;గద= గదను; పుచ్చికొని= తీసికొని; మాటలన్= మాటలతో; అలిగెదు+ఏనిన్= కోపించినట్లయితే; వ్రేటునన్= ఈ గద దెబ్బతో; శిక్షించెదన్= శిక్షిస్తాను; అనుచున్= అంటూ; ధరణికిన్= భూమికి; లంఘించి= దూకి; కవిసినన్= మీదికి రాగా; కని= చూచి; కేశవుండు= కృష్ణుడు; పనుపన్= పంపించగా; పవనతనయుండు= భీముడు; రథంబు= రథం; డిగ్గి= దిగి; రయంబునన్= వేగంతో (వేగంగా); చని= వెళ్ళి; ఆఱు+అడుగుల కొలఁది= ఆరు అడుగుల వ్యవధిలో-ఆరు అడుగులు వేయగానే అని భావం (నిగ్రహీత పదే షష్ఠే అని సంస్కృత మూలం); నిలువరించెన్= పోకుండా నిలిపాడు; అట్టిఎడన్= ఆ సమయంలో; సహదేవుండు; ఆ శైనేయున్+ ఉద్దేశించి= ఆ సాత్యకితో (ఇట్లా అన్నాడు); మిమ్మును= మిమ్ములను అనగా యాదవులను; పాంచాలురన్= ధృష్టద్యుమ్నుడి వంశీయులైన పాంచాల రాజులను; కడచిన బంధువులు= అతిశయించిన బంధువులు; మాకున్= అనగా పాండవులకు; మిమ్మును= మిమ్ములను; (యాదవులను) మిగిలిన= మించిన; బాంధవులు+ఆ పాంచాలురకును; వారలకంటె= ఆ పాంచాలురకంటె; మాకం టెన్= పాండవులకంటె; ఎక్కుడు= ఎక్కువైన; సుహృత్+జనంబులు= స్నేహితులు; మీకును= మీ యాదవులకును లేక+ ఉనికి+ తెల్లంబు= లేకుండా ఉండటం స్పష్టం; ఇట్టి మీలో మీరు= ఇటువంటి మీలోమీరు; ఎరవు పడన్+ తగునే?= కలహించవచ్చునా?; అలుక= కోపం; తక్కుము= మానివేయుము; అను+ఎడన్= అని అంటూ ఉన్నప్పుడు; ఆ ధృష్ట ద్యుమ్నుండు= ఆ ధృష్టద్యుమ్నుడు; వడముడితోన్= భీముడితో (ఇట్లా అన్నాడు); అతనిన్= ఆ సాత్యకిని; పట్టక= పట్టుకొనక

అనగా ఆపక; విడువుము= విడిచిపెట్టుము; నాచేతన్+కాని= నా చేతనే తప్ప; నీచేతన్= ఓ భీమసేనా! నీచేత; నిలువండు=ఆగిపోడు -ఎందుకంటే? నేను= నేను; ఒక్కచేతి; భూరిశ్రవుండనే?=ఒకే ఒక చెయ్యిగల భూరిశ్రవుడనా?; ఏల= ఎందుకని; అడిచి పడియె డున్= మిడిసిపడుతున్నాడు (ఆ సాత్యకి మిడిసిపాటు చెల్లేందుకు నేనేమి భూరిశ్రవుడను కాదు - ఎందుకు ఆ మిడిసిపాటు? భూరిశ్రవుడేమో ఓ చేయు ఖండితము కాగా ఒంటిచేతితో యుద్ధం చేయలేక మాని ప్రాయోపవేశం చేసి కూర్చున్నాడు - అప్పుడతడి శిరస్సు ఈతడు ఖండించాడు. అది కూడా పౌరుషమేనా?); అనవుడున్= అనగానే; ఆ భీమసేను బాహువులలోనన్= ఆ భీముడి బాహువులలోపల అనగా భీముడి బాహుబంధంలో; తిరుగుడు పడుచున్= పరిభ్రమణం చేస్తూ; ఉరగంబు చందంబునన్= సర్పంవలె; సాత్యకి= ఆ సాత్యకి; రోఁజుచున్నన్= బుసకొట్టుతూ ఉంటే; కృష్ణయుధిష్ఠిరులు= కృష్ణుడు, ధర్మరాజు; ఆ+ఇరువురన్= ఆ ఇద్దరిని అనగా సాత్యకి ధృష్టద్యుమ్నులను; ప్రయత్నంబునన్= మిక్కిలి యత్నంతో - అతికష్టంగా; వారించిరి= నివారించారు; తదనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: అని ధృష్టద్యుమ్నుడు అనగా, సాత్యకి కన్నులెర్రబారాయి, ధనుస్సు రథంమీద పడవేసి గద గైకొన్నాడు. 'ఓ ధృష్టద్యుమ్నా! మాట్లాడితే నీకు కోపం వస్తుంది కదా! మాట లెందుకు? చేతలతోనే నిన్ను శిక్షిస్తాను. కాచుకొమ్ము.' అని భూమిపైకి రథం నుండి దూకి ధృష్టద్యుమ్నుడి పైకి పరుగుతీస్తూ ఉన్నాడు. అది చూచి కృష్ణుడు, అతడిని ఆపటానికి భీముడిని పంపాడు. భీముడు రథంనుండి దిగి పరుగెత్తి ఆరు అడుగుల దూరంలో అతడిని ఆపాడు. ఆ సమయంలో సహదేవుడు వచ్చి సాత్యకితో మిమ్ములను, పాంచాలురను మించిన బంధువులు మాకు, మమ్ములను మించిన బంధువులు ఆ పాంచాలురకు, వారలకంటె, మాకంటె ఎక్కువైన మిత్రులు మీకు లేరు. అటువంటప్పుడు మీలోమీరు కలహించుకోవచ్చునా? కోపం మానుము. అని అంటూ ఉంటే భీముడితో ధృష్టద్యుమ్నుడు నీవు అతడిని ఆపవద్దు - అతడు నా చేతగాని, నీ చేతగాని ఆగడు. నేనేమీ ఒంటిచేతి భూరిశ్రవుడినా? కాదు. మిడిసిపడుతున్నాడు. అని అంటూ ఉంటే సాత్యకి భీముడి బాహుబంధంలో పడి తప్పించుకొనలేక పామువలె బుసకొడుతూ ఉంటే, అది చూచి కృష్ణుడూ, ధర్మరాజూ వెళ్ళి అతి ప్రయత్నం మీద ఆ సాత్యకి, ధృష్టద్యుమ్నులను యుద్ధంనుండి ఆపారు. ఆ తరువాత.

క. భేరీ మృదంగ శంఖ మ। హారవములు సెలఁగఁ బాండవానీకంబుం
గౌరవ సైన్యముఁ దాఁకెను। వారిధు లొండొంటిఁ దాఁకు వడు వమరంగన్. 373

ప్రతిపదార్థం: భేరీ మృదంగ శంఖ మహారవములు= నగారాలు, మద్దెలలు, శంఖాలు అనే వాటియొక్క పెద్దధ్వనులు; చెలఁగన్= (దశదిశలు) ధ్వనించగా; పాండవ+అనీకంబున్= పాండవుల సైన్యం; కౌరవ సైన్యమున్= కౌరవుల సైన్యం; ఒండొంటిన్= ఒకటి మరొకదానిని; వారిధులు= (రెండు) సముద్రాలు; ఒండొంటిన్= ఒకటి మరియొకదానిని; తాఁకు వడువు= తాకే విధం (ఢీకొన్న విధం); అమరంగన్= ఒప్పుతూ ఉండేటట్లు; తాఁకెన్= ఢీకొన్నాయి.

తాత్పర్యం: భేరీమృదంగ శంఖ ధ్వనులు చెలరేగగా, పాండవకౌరవసైన్యాలు రెండు సముద్రాలు ఒకదానితో నొకటి ఢీకొంటున్నాయా? అన్నట్లు ఎదుర్కొన్నాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. రెండు సముద్రాలు పరస్పరంగా ఢీకొనటం కవి యూహ. కాబట్టి ఇది ఉత్ప్రేక్షాలంకారం. దీనివలన ఆ సైన్యాలు రెండూ కనుచూపు మేరలో అంతు తెలియనంత విస్తరించి ఉన్నాయనటం వ్యంగ్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మును ద్రోణునిఁ బొలియించితి। మని పాండవబలము బలియు నశ్వత్థామం
గొని కురుసేనయు నత్తఱి। ననూనగర్వమున నుద్భటాటోపమునన్. 374

ప్రతిపదార్థం: పాండవబలము= పాండవుల సైన్యం; మును= ఇంతకు ముందు; ద్రోణునిన్= ద్రోణాచార్యుడిని; పొలియించితిమి+అని= వధించాము అనే; అనూన గర్వమునన్= మిక్కిలి గర్వంతో; (పెనంగన్+తొడంగెన్ - అనే ముందరి వచనంలోని పదాలతో అన్వయం); ఆ+తఱిన్= ఆ సమయంలోనే; కురుసేనయున్= కౌరవుల సైన్యం కూడా; బలియున్= బలిష్ఠుడైన; అశ్వత్థామన్= ద్రోణాచార్యుడి కుమారుడు అశ్వత్థామను; కొని= నాయకుడిగా తీసికొని; ఉద్భట+ఆటోపమునన్= మిక్కిలి ఆడంబరంతో (గొప్పగా దర్పాన్ని ప్రదర్శిస్తూ).

తాత్పర్యం: ఇంతకుముందు ద్రోణాచార్యుడిని వధించామనే గర్వంతో పాండవసైన్యమూ, అజేయుడైన అశ్వత్థామ మాకు అండగా దొరికాడనే ఉత్సాహంతో కౌరవసైన్యమూ సాటిలేని గర్వంతో, అత్యధిక విజృంభణంతో (తరువాతి గద్యంతో అన్వయం).

విశేషం: అలం: పరిసంఖ్య. 'పాండవ బలము అనూన గర్వమున' 'కురుసేనయు ఉద్భటాటోపమున' అని క్రమంగా అన్వయం. కాబట్టి ఇది పరిసంఖ్యాలంకారం (క్రమాలంకారం). రెండు పదాల తాత్పర్యం ఒక్కటే కాబట్టి పునరుక్తి దోషం కలుగకుండా ఇట్లా క్రమాన్వయంతో వ్యాఖ్యానించటం రమణీయంగా ఉంటుంది.

వ. పెనంగందొడంగె; నప్పుడు ద్రౌణి దుర్యోధనుం గనుంగొని. 375

ప్రతిపదార్థం: పెనంగన్= యుద్ధం చేయటానికి; తొడంగెన్= ఆరంభించాయి; అప్పుడు= ఆ సమయంలో; ద్రౌణి= ద్రోణపుత్రుడు అశ్వత్థామ; దుర్యోధనున్= దుర్యోధనుడిని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: యుద్ధం చేయటానికి ఉపక్రమించాయి. ఆ సమయంలో అశ్వత్థామ దుర్యోధనుడిని చూచి.

క. 'అనృతంబు పలికి బ్రదికెద। మని చూచిన రాజు మూఁక లన్నియు నెట్లై
యనిఁ బడియెడునో యెమ్మెయిఁ। గనుకనిఁ బఱచెడునో చూడు కన్నారంగన్.' 376

ప్రతిపదార్థం: అనృతంబు= అసత్యం; పలికి= చెప్పి; బ్రదికెదము+అని= బ్రతికిపోతాము అని; చూచిన రాజు మూఁకలు+అన్నియున్= చూస్తూ ఉన్న ఆ ధర్మరాజు సైన్యాలన్నీ కూడా; ఎట్లు+ఐ= ఏ విధంగా అయిపోయి; అనిన్= యుద్ధంలో; పడియెడున్+ఓ= పడిపోతాయో?(మరియు); ఏ+మెయిన్= ఏ విధంగా; కనుకనిన్= సంభ్రమంతో; పఱచెడున్+ఓ= పారిపోతాయో!; కన్ను+ఆరంగన్= కన్నులనిండా; చూడు= చూడుము.

తాత్పర్యం: అబద్ధమాడి బ్రతికిపోదామనుకొన్న ధర్మరాజు సైన్యాలన్నీ బ్రతికిపోతాయని అనుకొన్నాడు. కాని, యుద్ధంలో ఏ విధంగా పడిపోతాయో, ఏ విధంగా భయపడి పరుగెత్తిపోతాయో కన్నార చూడుము.

వ. అని పలికి నియతుం డయి నారాయణాస్త్రంబు ప్రయోగించిన. 377

ప్రతిపదార్థం: అని= ఇట్లా; పలికి= చెప్పి; నియతుండు+అయి= నియమం కలవాడై (ఆ నారాయణాస్త్ర మంత్రాన్ని జపించటానికి మనస్సును ఏకాగ్రం); నారాయణ+అస్త్రంబు= నారాయణం అనే దివ్యాస్త్రాన్ని; ప్రయోగించినన్= శత్రుసైన్యంమీద ప్రయోగించిన వెంటనే.

తాత్పర్యం: అని మనస్సును ఏకాగ్రం చేసి, నారాయణాస్త్రాన్ని స్మరించి, శత్రుసైన్యంమీద ప్రయోగించగా (తరువాతి పద్యంతో అన్వయం).

మ. ధరణీచక్రము దిర్దిరం దిరిగె మార్తాండుండు గుంఠీభవ
త్కిరణుం డయ్యె, దిశావితానము వడంకెన్, మి న్నదిర్చెన్, మహీ
ధర సంతానము లోలి గ్రక్కదలె, నుద్భ్రాంతంబులై యంబుధు
ల్పొరలెం గట్టులమీఁదఁ బిట్ట పిడుగుల్మ్రోసెన్ మహోదగ్రతన్. 378

ప్రతిపదార్థం: ధరణీ చక్రము= భూమండలం; దిర్దిరం= దిర్‌దిర్ అనే మోతతో; తిరిగెన్= తిరిగింది; మార్తాండుండు= సూర్యుడు; కుంఠీభవత్+కిరణుండు= మొక్కబోయిన అనగా కళావిహీనమయిన కిరణాలు గలవాడు; అయ్యెన్= అయ్యాడు; దిశావితానము= దిక్కుల సమూహం; వడంకెన్= కంపించింది; మిన్ను= ఆకాశం; అదిర్చెన్= చలించింది; మహీధర సంతానములు= పర్వత సమూహాలు; ఓలిన్= వరుసగా; గ్రక్క+అదలెన్= చలించిపోయాయి; ఉద్భ్రాంతంబులై= మిక్కిలి పరిభ్రమిస్తూ ఉన్నవై; అంబుధుల్= సముద్రాలు; గట్టులమీఁదన్= చెలియలికట్టలపై; పొరలెన్= పొంగి పొరలిపోయాయి; పిడుగుల్+పిడుగుల్ - పిట్ట పిడుగుల్= మిక్కిలి పిడుగులు; మహా+ఉదగ్రతన్= మిక్కిలి భయంకరంగా; మ్రోసెన్= మ్రోగాయి,

తాత్పర్యం: భూమండలమంతా గిరగిర తిరిగింది. సూర్యకిరణాలలో కాంతి తరిగిపోయింది. దిక్కులు వణకాయి, ఆకాశం అదిరింది, పర్వత సమూహాలు వరుసగా కంపించాయి. సముద్రాలు చెలియలికట్టలపై పొర్లిపొరాయి, భయంకరంగా పెక్కుపిడుగులు ధ్వనించాయి.

వ. ఇట్లు భీకర ప్రాదుర్భావంబైన యద్దివ్యసాధనంబు మండలార్ధ చంద్ర భల్లనారాచక్షుర ప్రముఖంబులు ననల మయంబులు నగు ననేక దేదీప్యమాన మార్గణమూర్తులు గైకొని కౌంతేయ సైన్య సంతానం బంతయు నొకపాయగాఁ గవిసినం గని తెంపుపెంపునం దత్సైనిక నికరంబులు వివిధ విశిఖంబులఁ బరపుచు, నయ్యయి ముఖంబుల మగిడించుచు, బలువునం గడంగినం బొంగుచు నింగిని నేలను నడుమను నాభీలజ్వాలాచ్ఛటా జటిలంబుగాఁ బైపయి నడరి యమ్మహాస్త్రంబు చతురంగంబులం ద్రుంగించుచు నెదు రెంతెంత పెనంగె నంతంతియ పేర్చి యేర్చుచుం బఱవం దొడంగిన, నమ్మొనలు పఱవం దొడంగె; నప్పుడు నరుం డూరకునికి సూచి నారాయణుండు నతండును వినుచుండ ధర్మసూనుండు సాత్యకి ధృష్టద్యుమ్నుల నాలోకించి యి ట్లనియె. 379

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; భీకర ప్రాదుర్భావంబు+అయిన= భయంకరంగా ఆవిర్భవించిన; ఆ+దివ్యసాధనంబు= ఆ దివ్యమైన నారాయణాస్త్రం; మండల+అర్ధచంద్ర భల్ల నారాచ క్షుర ప్రముఖంబులును= మండలాగ్రం అనగా ఖడ్గం మరియు అర్ధచంద్రం, భల్లం, నారాచం, క్షురము అనునవి బాణాలలోని విశేషాలు; అవి మొదలైనట్టి; అనలమయంబులును+అగు= అగ్నిమయాలు అనగా అగ్నిజ్వాలలను కుమ్మరించుచున్న; అనేక దేదీప్యమాన మార్గణ మూర్తులు= పలు విధాలైనట్టి, మిక్కిలి ప్రకాశిస్తూ ఉన్న బాణాల స్వరూపాలను; కైకొని= గ్రహించి; కౌంతేయ సైన్యసంతానంబు+అంతయున్= పాండవుల సైన్యాన్నంతా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక్కపాయగన్= ఒకే వరుసగా; కవిసినన్= ఎదుర్కొనగా; కని= చూచి; తెంపు పెంపునన్= సాహసాధిక్యంతో - మిక్కిలి తెగింపుతో; తద్+సైనిక నికరంబులు= ఆ పాండవుల సైనికుల సమూహాలు; వివిధ విశిఖంబులన్= అనేక విధాలైన బాణాలను; పరపుచున్= ప్రయోగిస్తూ; ఆ+ఆ+ముఖంబులన్= ఆయా ఉపాయాలతో; మగిడించుచున్= మరలిస్తూ; బలువునన్= బలంగా; కడంగినన్= ఎదుర్కొంటూ ఉండగా; పొంగుచున్= వృద్ధి పొందుతూ; ఆ+మహాస్త్రంబు= ఆ నారాయణాస్త్రం; నింగిని= ఆకాశంపై; నేలను= భూమిపై; నడుమనున్= నడిమి ప్రదేశంలో; ఆభీల జ్వాలాచ్ఛటా జటిలంబుగాన్= భయంకరములైన జ్వాలల సెగలతో దట్టమయ్యే విధంగా; పైపయిన్= పైపైకి; అడరి= వ్యాపించి; చతురంగబలంబులన్= చతురంగ సైన్యాలను; త్రుంగించుచున్= నశింపజేస్తూ; ఎదురు= (తనకు) అభిముఖంగా; ఎంత+ఎంత= ఏ మేరకు; పెనంగెన్= యుద్ధం చేసిందో; అంత+అంతియ= అంతంతమాత్రమే; పేర్చి= విజృంభించి; ఏర్చుచున్= దహిస్తూ; పఱపన్+తొడంగినన్= పరుగెత్తుతూ ఉండగా; ఆ+మొనలు= ఆ సైన్యాలు; పఱపన్+తొడంగెన్= పరుగు తీశాయి; అప్పుడు= ఆ సమయంలో; నరుండు= అర్జునుడు; ఊరక+ఉనికి= ఊరకే ఉండటం (ఏ విధమైన ప్రతీకారచర్య లేక చూస్తూ ఉండిపోవటం); నారాయణుండును= కృష్ణుడూ; అతండును= ఆ అర్జునుడూ; వినుచున్+ఉండన్= వింటూ ఉండగా; ధర్మసూనుండు= ధర్మరాజు; సాత్యకి ధృష్టద్యుమ్నులన్= సాత్యకిని, ధృష్టద్యుమ్నుడిని; ఆలోకించి= చూచి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అతి భయంకరంగా ఆవిర్భవించిన ఆ నారాయణాస్త్రం - ప్రముఖాలు, అగ్నిమయాలు అయిన అర్ధచంద్రాలు, భల్లాలు, నారాచాలు, క్షురాలు అనే దేదీప్యమానమైన బాణరూపాలు దాల్చి ఆ పాండవుల సైన్యాన్నంతా ఒక్క పెట్టుగా చుట్టుముట్టాయి. ఇక చేసేది లేక పాండవుల సైనికులు తెగించి, ఎన్నో బాణాలు కురిపించి, ఆ దివ్యాస్త్రం నుండి వెలువడిన బాణాలను మరలించారు. ఇంకా వివిధోపాయాలతో గట్టిగా పోరాడుతూ ఉండగా, ఆ దివ్యాస్త్రం పొంగిపోతూ భయంకరమైన అగ్నిజ్వాలలను భూమి, ఆకాశం, భూమ్యాకాశాల నడిమి ప్రదేశం, అంతటా ఆవరింపజేసి, ఆ చతురంగబలాలను నశింపజేసింది. ఆ పాండవుల సైన్యం ఎంతెంతగ ఆ దివ్యాస్త్రంపై విజృంభించిందో అంతంతగ విజృంభించి సైన్యాన్ని దహిస్తూ పరుగెత్తి వస్తూఉంటే, ఆ సేనలు పరుగెత్త సాగాయి. అప్పుడు అర్జునుడు ఊరకుండటం చూచి, అతడు, శ్రీకృష్ణుడు వినేటట్లుగా ధర్మరాజు సాత్యకిని, ధృష్టద్యుమ్నుని చూచి ఇట్లా అన్నాడు.

సీ. **'ఆ సభఁ బాంచాలి గాసి సేయఁగ నుపే । క్షకుఁ డయి చూచెఁ; బెక్కండ్రఁ గూర్చి**
కొని బాలు నభిమన్యుఁ గూల్చెఁ; నించుక వడి । యాఁగిన నర్జునుఁ డగ్నిఁ జొచ్చు
నను వగ మనల నాతనికిఁ దోడ్పడఁ బోవ । నీ కాఁగె నమ్మెయి; నిట్టి ధర్మ
పరుఁ డైన కలశసంభవుతోడ సరివచ్చు । టుచితంబె? యీవచ్చు నుజ్జ్వలాగ్ని
తె. **వలని కరిగెద; మీరు మీ వాహినులును । బాఱి పొం డెక్కడేని; నప్పార్థుకోర్కి**
యంత సఫలత బొందెడు; నచ్యుతుండు । నెట్లు దనకు రుచించెఁ దా నట్లు సేయు.' **380**

ప్రతిపదార్థం: (ఆ ద్రోణు డెట్టి ధర్మాత్ముడంటే) ఆ సభన్= ఆ కురుసభలో; పాంచాలిన్= ద్రౌపదిని; గాసి+చేయఁగన్= బాధపెట్టుతూ ఉండగా; ఉపేక్షకుఁడు+అయి= ఉపేక్షించినవాడయి అనగా పట్టించుకొనకుండా ఉండి; చూచెన్= చూచాడు -

అధర్మంగా పాంచాల రాజపుత్రిని అవమానపరుస్తూ ఉంటే కౌరవులను ఒక్కమాట అయినా అనక ఊరకే చూస్తూ ఉన్నాడు ఈ ద్రోణాచార్యుడు; పెక్కంద్రన్= పలువురు వీరులను; కూర్చికొని= వెంట తీసికొని; బాలున్+అభిమన్యున్= చిన్నవాడయిన అభిమన్యుడిని; కూల్చెన్= సంహరించాడు (మరియు); ఇంచుకవడి= కొద్దిసేపు; ఆఁగినన్= ఆగిపోతే - కొంచెంసేపు ఆలస్యంగా వెళ్ళినట్టయితే; అర్జునుఁడు= అర్జునుడు; అగ్నిన్= అగ్నిలో; చొచ్చున్= ప్రవేశిస్తాడు; అను= అనే; వగన్= చింతతో (ఉన్నటువంటి); మనలన్= మనలను; ఆతనికిన్= ఆ అర్జునుడికి; తోడ్పడన్= సహాయం చేయటానికి; పోవనీక= పోనివ్వకుండా; ఆ+మెయిన్= ఆ విధంగా; ఆఁగెన్= ఆపాడు; ఇట్టి ధర్మపరుఁడు+ఐన= ఇంతటి ధర్మాసక్తుడైన (కాకువు) అనగా ద్రోణులవారు కౌరవుల సభలో ద్రౌపదిని అవమానపరుస్తూ ఉంటే పల్లెత్తుమాట అయినా అనకపోవటం ధర్మమేనా? ఒక చిన్న వయసువాడిని, అసహాయుడిని - అభిమన్యుడిని పదుగురు వీరులను కలుపుకొని సంహరించటం ధర్మమేనా? అంతేగాక సూర్యాస్తమయం లోపల జయద్రథుడిని వధిస్తాను లేకుంటే అగ్నిప్రవేశం చేస్తానని కదా అర్జునుడి ప్రతిజ్ఞ - అప్పుడు మనం ఎట్లాగైనా, అర్జునుడు అగ్నిప్రవేశం చేయకుండా కాపాడుకొనవలెనుఅని అతడికి సహాయంగా వెళుతుంటే వెళ్ళనీయక సేనాముఖంలో ఆపింది ఎవరు? ఈ ద్రోణులవారు కాదా? ఇదేనా ద్రోణులవారి ధర్మనిష్ఠ? ఇదేనా పాండవ పక్షపాతం? అని భావం; కలశసంభవుతోడన్= ఆ ద్రోణులవారితో; సరివచ్చుట= సాటివచ్చుట; ఉచితంబు+ఎ?= తగుతుందా?; ఈ వచ్చు+ఉజ్జ్వల+అగ్ని వలనికిన్= ఈ అస్త్రంనుండి వచ్చే మండుతున్న అగ్ని దగ్గరికి; అరిగెదన్= వెళ్ళుతాను; మీరు= ఓ సాత్యకి ధృష్టద్యుమ్నులారా! మీరు; మీ వాహినులును= మీ సైన్యాలు; ఎక్కడేని= ఎక్కడికైనా; పాఱిపొండు= పారిపొండి (దీనితో); ఆ+పార్థుకోర్కి+అంతన్= ఆ అర్జునుడి కోరిక పూర్తిగా; సఫలతన్= సాఫల్యాన్ని; పొందెడున్= పొందుతుంది; అచ్యుతుండును= కృష్ణుడు కూడా; ఎట్లు= ఏ విధంగా; తనకున్= (అతడికి); రుచించెన్= ఇష్టమవుతుందో; తాను= అతడు; అట్లు= ఆ విధంగా; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: ఆ ద్రోణులవారు ఎంతటి ధర్మాత్ముడంటే కౌరవులు ఆ సభలో ద్రౌపదిని అవమానపరుస్తూ ఉంటే ఉపేక్ష చేశాడే కాని ఎంతమాత్రం పట్టించుకొనలేదు. పలువురు వీరులను కూడగట్టుకొని చిన్నవాడైన అభిమన్యుడిని సంహరింపజేశాడు. ఇంక కొంచెంసేపు ఆగితే అర్జునుడు ఎక్కడ ప్రతిజ్ఞాభంగం అయి అగ్నిప్రవేశం చేస్తాడో అనే దుఃఖంతో అతడికి సహాయానికి వెళ్ళుతూ ఉంటే మనలను ఆ విధంగా అడ్డుకొన్నాడు. ఈయన ధర్మనిష్ఠ అట్టిది. ఆ ధర్మనిష్ఠ మనకు అక్కరలేదు. మనం అట్టి ధర్మాత్ముడితో సాటి రావటం చెల్లుతుందా? అది సరే - నేనిప్పుడు ఆ అస్త్రాగ్ని జ్వాలలవైపు వెళ్ళుతున్నాను. ఓ సాత్యకీ! ఓ ధృష్టద్యుమ్నా! ఇక మీరు మీ మీ సైన్యాలతో పారిపొండి. ఆ అర్జునుడి కోరిక సఫలమౌతుంది! ఆ కృష్ణుడు ఏం చేస్తాడో ఇక అతడి ఇష్టం.

వ. అనిన విని జనార్దనుండు సత్వరుండై పెద్ద యెలుంగున నెల్లవారును విన 'సైనికులారా! సామజ హయ రథంబులు డిగ్గి యాయుధంబులు వెట్టి నిలువుండు; భూమిగతులగు నిరాయుధుల నిమ్మహాస్త్రం బేమియుం జేయ; దది యెట్లనిన నిట్లగుట దీనికిఁ బ్రతివిధానంబుగా దీని నొసంగిన మహాత్ముండు విధియించె' ననుటయు సకల జనంబులు నమ్మాట కియ్యకొని యట్లు సేయం జూచిన సమయంబున సమీరనందనుండు.

381

ప్రతిపదార్థం: అనినన్= (అని ధర్మరాజు) అనగా; విని; జనార్దనుండు= కృష్ణుడు; సత్వరుండు+ఐ= తొందరతో కూడినవాడై; పెద్ద+ఎలుంగునన్= బిగ్గరగా; ఎల్లవారును= అందరుకూడా; వినన్= వినే విధంగా; సైనికులారా!= ఓ సైనిక వీరులారా!; సామజ హయ రథంబులు= మీమీ వాహనాలయిన ఏనుగులు, గుర్రాలు, రథాలు; డిగ్గి= దిగి; ఆయుధంబులు= మీమీ ఆయుధాలను; పెట్టి= క్రిందపెట్టి; నిలువుండు= ఊరకే ఉండండి; భూమిగతులు+అగు+నిరాయుధులన్= ఏ ఆయుధం లేక భూమిపై (ఊరకే) ఉన్నవారిని; ఈ+మహాస్త్రంబు= ఈ గొప్ప దివ్యాస్త్రం; ఏమియున్= ఏమీ; చేయదు= చేయదు; అది+ఎట్లు+అనినన్= అదెట్లా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంటే; దీనిన్= ఈ దివ్యాస్త్రాన్ని; ఒసంగిన= ఇచ్చినటువంటి; మహాత్ముండు= మహానుభావుడు; దీనికిన్= ఈ అస్త్రానికి; ప్రతివిధానంబుగాన్= ప్రతిక్రియగా - అనగా ఈ అస్త్రానికి ఉపసంహారం చేయటానికి వేరే అస్త్రమనేది లేదు, ఆ అస్త్రాన్ని శరణైనా వేడాలి లేదా పారిపోవాలి ఇదే ఆ అస్త్రానికి ప్రతిక్రియ; ఇట్లు+అగుట= ఇట్లు జరగటం అనే దానిని; విధియించెన్= ఏర్పరచాడు; అనుటయున్= అని అనగానే, సకల జనంబులు= సైనిక జనులందరు; ఆ+మాటకున్= ఆ కృష్ణుడు పలికిన పలుకునకు; ఇయ్యకొని= ఒప్పుకొని; అట్లు= ఆ విధంగానే, అనగా ఆయుధాలు విడిచి ఊరకే ఉండటం; చేయన్+చూచిన సమయంబునన్= చేయటానికి పూనుకొనే సమయాన; సమీరనందనుండు= వాయునందనుడు భీముడు.

తాత్పర్యం: అట్లా ధర్మరాజు అనగా విని, కృష్ణుడు వెంటనే బిగ్గరగా సైనికులందరితో ఇట్లా అన్నాడు: 'ఓ సైనికులారా! మీరందరు తొందరగా మీమీ వాహనాలైన గజాశ్వ రథాల నుండి దిగి, మీ ఆయుధాలను క్రిందపెట్టి ఊరకే నేలపై నిలవండి. ఆ దివ్యాస్త్రం నేలమీద ఉన్నవారిని, ఆయుధాలు ధరించని వారిని ఏమీ చేయదు. ఎందుకంటే - ఈ అస్త్రాన్ని అనుగ్రహించిన మహానుభావుడు ఈ అస్త్రానికి విరుగుడుగా దీనిని చెప్పాడు. అని శ్రీకృష్ణుడు చెప్పిన మాటకు సైనికులందరు ఒప్పుకొని, అట్లాగే చేయటానికి పూనుకొనే సమయంలో భీముడు (అడ్డువచ్చి ఇట్లా అన్నాడు).

చ. **' డిగకుఁడు వాహనంబులు గడింది మగంటిమి గోలుపోవ మీ**
రు గడఁక దక్కి పెట్టకుఁడు రూపఱ నాయధముల్ మహాస్త్ర శ
క్తి గెలుతు గోత్రభిత్కులిశ తీవ్రశరంబుల వైభవంబు భూ
రి గద విహార భంగియు నరిప్రకరంబులు పిచ్చలింపఁగన్.' **382**

ప్రతిపదార్థం: (ఓ సైనిక వీరులారా!) వాహనంబులు= మీమీ వాహనాలను; డిగకుఁడు= దిగకండి (మరియు); మీరు; కడింది మగంటిమి= అధికమైన పౌరుషాన్ని; కోలుపోవన్= పోగొట్టుకొనే విధంగా; కడఁక= యుద్ధప్రయత్నం; తక్కి= మాని; రూపఱన్= ఉన్నరూపు నశించే విధంగా, అనగా వీర ధర్మం మంటగలియగా; ఆయుధముల్= మీమీ ఆయుధాలను; పెట్టకుఁడు= కింద పెట్టకండి; గోత్రభిత్ వైభవంబు= ఇంద్రుడియొక్కవైభవము; కులిశ= వజ్రాయుధంవలె; తీవ్ర= వాడిఅయిన; శరంబుల= బాణాలయొక్క; వైభవంబు= సామర్థ్యాన్ని (మరియు); భూరిగద విహార భంగియున్= నా బలిష్ఠమైన గద (యొక్క) విహార విధానాన్ని అనగా విహరించే పద్ధతిని (షష్ఠీ తత్పురుషం సాధ్యసమాసం); అరిప్రకరంబులు= శత్రువుల సమూహాలు కూడా; పిచ్చలింపఁగన్= ప్రశంసించే విధంగా; మహాస్త్రశక్తిన్= ఆ దివ్యాస్త్ర సామర్థ్యాన్ని; గెలుతున్= జయిస్తాను.

తాత్పర్యం: 'ఓ సైనికవీరులారా! మీరు మీ పౌరుషాధిక్యాన్ని కోల్పోయేటట్లుగా మీమీ వాహనాలను దిగకండి; మీరు యుద్ధం మాని ఆయుధాలు క్రింద పెట్టకండి; ఇంద్రుడి వజ్రాయుధం వంటి నా వాడిబాణాల వైభవాన్ని, నా బలిష్టమైన గదా విహార విధాన్ని శత్రు సమూహాలు ప్రశంసించేటట్లుగ ఆ దివ్యాస్త్ర సామర్థ్యాన్ని అణచివేస్తాను.

వ. **అని బరవసంబు సేసి, శంఖం బొత్తి, మల్లచఱిచి, సింహనాదంబు సెలంగ నశ్వత్థామకు మార్కొనుటయు; నవ్వీరుం డదల్పుతో నన్నారాయణాస్త్రంబు నిగుడం జేసిన.** **383**

ప్రతిపదార్థం: అని= ఇట్లా చెప్పి; బరవసంబు+చేసి= ధైర్యంచేసి, సాహసించి; శంఖంబు= శంఖాన్ని; ఒత్తి= పూరించి; మల్లచఱిచి= భుజాస్ఫాలనం చేసి; సింహనాదంబు+చెలంగన్= సింహనాదం చెలరేగగా; అశ్వత్థామకున్= ఆ దివ్యాస్త్రాన్ని ప్రయోగించిన అశ్వత్థామను; మార్కొనుటయున్= ఎదిరించగానే; ఆ+వీరుండు= ఆ వీరుడు అశ్వత్థామ; అదల్పుతోన్= అదలించటంతో (అదలించి); ఆ+నారాయణ+అస్త్రంబు= ఆ నారాయణాస్త్రాన్ని; నిగుడన్+చేసినన్= ఆ భీముడిపై ప్రసరింపజేయగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని సాహసించి శంఖాన్ని పూరించి, భుజం చరచి, సింహనాదంచేసి అశ్వత్థామను ఎదుర్కోగా, అప్పుడు అశ్వత్థామ తన దివ్యాస్త్రాన్ని భీముడివైపు మళ్ళించాడు.

క. అనలశిఖాసదృశము లగు । నసేక బాణములు భీమునరదము వొదువం
గని యమ్మొన యోధులు వా । హనములు డిగ్గి వెట్టి రాయుధము లిలన్. 384

ప్రతిపదార్థం: అనల శిఖా సదృశములు+అగు= అగ్ని జ్వాలలతో సమానములైన; అనేక బాణములు= వివిధ బాణాలు; భీము+అరదము= భీముడి రథాన్ని; పొదువన్= చుట్టుముట్టగా; కని= చూచి; ఆ+మొన యోధులు= ఆ పాండవ సైన్యంలోని వీరులు; వెసన్= వేగంగా(తొందరగా); వాహనములు= తమ తమ వాహనాలు - గజాశ్వ రథాదులను; డిగ్గి= దిగి; ఇలన్= భూమిపై; ఆయుధములు= ఆయుధాలను; పెట్టిరి= పెట్టారు.

తాత్పర్యం: అగ్నిజ్వాలలవలె మండుతున్న అనేక బాణాలు భీముడి రథాన్ని చుట్టుముట్టగా అది చూచి, తొందరగా సైనిక వీరులందరు తమ తమ వాహనాలు దిగి ఆయుధాలను కింద పడవేశారు.

విశేషం: అలం: ఉపమ. 'అనలశిఖా సదృశములు' అనేచోట ఉపమాలంకారం. ఆ వచ్చేవి బాణాలుగా కాక మండుచున్న అగ్నిజ్వాలలై కాల్చి వేస్తాయని ధ్వని.

వ. పదాతి దళంబులుం గైదువులు వెట్టి; రప్పు డద్దివ్యసాధనం బెవ్వరికి బాధకంబు గాక యా భీమసేను దెసకు మొగం బగుటయు. 385

ప్రతిపదార్థం: పదాతి దళంబులున్= కాలినడకన యుద్ధం చేసే సైనికులు కూడ; కైదువులు= ఆయుధాలను; పెట్టిరి= క్రింద పెట్టారు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+దివ్యసాధనంబు= ఆ దివ్యాస్త్రం; ఎవ్వరికిన్= ఎవ్వరికి కూడ; బాధకంబు= బాధ కలిగించేది; కాక= కాకుండా (ఉండి); ఆ భీమసేను దెసకున్= ఆ భీముడివైపునకు; మొగంబు+అగుటయున్= అభిముఖం కావటాన్ని - భీముడి వైపు తిరిగి వెళ్ళటాన్ని.

తాత్పర్యం: కాలినడకన యుద్ధం చేసే సైనికులందరు కూడా ఆయుధాలను క్రింద పెట్టారు. ఆ సమయాన ఇక ఆ దివ్యాస్త్రం ఎవ్వరిని బాధించక భీముడివైపు వెళ్ళుతూ ఉండగా.

క. నరుఁడు గని సత్వరంబుగ । వరుణాస్త్రం బేయుటయును వావిరి నది త
త్పరుషత మానెడునట్లుగఁ । బరఁగిన గురుసుతుఁడు పెద్ద ప్రబలం జేసెన్. 386

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; కని= చూచి; సత్వరంబుగన్= వెంటనే; వరుణాస్త్రంబు= వర్షాన్ని కురిపించే స్వభావంగల వరుణ దేవతాకమైన అస్త్రాన్ని - వారుణాస్త్రాన్ని (పర్జన్యాస్త్రం అనికూడ దీనినే అంటారు); ఏయుటయును= ప్రయోగించగానే; అది= ఆ దివ్యాస్త్రం; వావిరిన్= క్రమంగా; తత్పరుషతన్= ఆ నారాయణాస్త్రం వలన కలిగిన అగ్నిజ్వాలల కాఠిన్యాన్ని; మానెడునట్లుగన్= తగ్గిపోయే విధంగా; పరఁగినన్= ప్రవర్తించగా; (అప్పుడు) గురుసుతుండు= ద్రోణపుత్రుడు - అశ్వత్థామ; పెద్దప్రబలన్= (తన దివ్యాస్త్రాన్ని) మిక్కిలి ప్రబలిపోయేటట్లు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: అర్జునుడు చూచి, వెంటనే వారుణాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ అస్త్రం ప్రయోగించగానే ఆ నారాయణాస్త్రం వలన కలిగిన మంటలు కొద్ది కొద్దిగా తగ్గ నారంభించాయి. దానిని కనిపెట్టాడు అశ్వత్థామ - వెంటనే ఆ నారాయణాస్త్ర బలాన్ని మరింత ఎక్కువ శక్తిమంతంగా చేశాడు.

నారాయణాస్త్రపీడితుం డగు భీముఁ గృష్ణార్జునులు రథంబు డిగ్గఁ జేయుట (సం. 7-171-12)

వ. ఇవ్విధంబున నశ్వత్థామ యమ్మహాస్త్రంబు దీపింపం జేసిన నది పేర్చి కార్చిచ్చు పోదువు చందంబున సమీరనందనుం జుట్టుముట్టె; నట్లు సమర విముఖులై యేమియుం గాకున్న ధర్మనందనాదులను బలిమి వదలని చలంబున ననలంబు చేతం బొదువంబడిన వృకోదరునిం గని కృష్ణార్జునులు దేరు డిగ్గి రిత్తచేతులం బాఱి వారుణాస్త్రంబు కతంబునం బెద్ద గాలక యున్న యాభీముని రథంబు డిగ్గఁ ద్రోవ, డిగక బిగిసిన నచ్యుతుం డతని కిట్లనియె. 387

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; అశ్వత్థామ= ద్రోణుడి కుమారుడు అశ్వత్థామ; ఆ+మహాస్త్రంబు= ఆ దివ్యాస్త్రాన్ని; దీపింపన్= ఉద్దీప్తి కలిగేటట్లు; చేసినన్= చేయగా; అది= ఆ నారాయణాస్త్రం; పేర్చి= పెరిగిపోయి; కార్చిచ్చు= దావాగ్ని; పొదువు చందంబునన్= క్రమ్మే విధంగా; సమీరనందనున్= భీముడిని (సమీరమనగా వాయువు - వాయుదేవుడి కుమారుడు కాన సమీరనందనుడు భీముడు); చుట్టుముట్టెన్= చుట్టూ ఆవరించింది; అట్లు= ఆ విధంగా; సమర విముఖులు+ఐ= యుద్ధానికి పెడమొగం పెట్టినవారై - యుద్ధం చేయక ఊరకే ఉన్నవారై (ఉండుటచేత); ఏమియున్= ఏమీ కూడ; కాక+ఉన్న= కాకుండా ఉన్నటువంటి; ధర్మనందనాదులను= ధర్మరాజు మొదలైనవారిని; కని= చూచి అని అన్వయం - మరియు; బలిమి= పరాక్రమాన్ని; వదలని చలంబునన్= విడువని పట్టుదలవలన; అనలంబు చేతన్= అగ్నిచేత పొదువబడిన; వృకోదరునిన్= ఆవరింపబడినటువంటి భీముడిని; కని= చూచి (యుద్ధం మానివేసి ఊరకే ఉన్న ధర్మరాజాదులను ఈ నారాయణాస్త్రం ఏమీ చేయలేదు. యుద్ధం చేయటానికి మొండిపట్టుపడుతున్న ఈ భీముడిని ఆవరించింది కదా అనే విషయాన్ని గమనించి; కృష్ణ+అర్జునులు= కృష్ణుడు, అర్జునుడు; తేరు= రథాన్ని; డిగ్గి= దిగి; రిత్తచేతులన్= వట్టి చేతులతో అనగా ఆయుధాలు లేని చేతులతో; పాఱి= పరుగెత్తి; వారుణ+అస్త్రంబు కతంబునన్= అర్జునుడు ప్రయోగించిన ఆ పర్జన్యాస్త్రం కారణాన; పెద్ద= ఎక్కువగా; కాలక+ఉన్న+ఆ భీమునిన్= కాలకుండా ఉన్నట్టి ఆ భీమసేనుడిని; రథంబు= రథంనుండి; డిగ్గన్= దిగిపోయే విధంగా; త్రోవన్= త్రోసివేయగా; డిగక= దిగిపోక; బిగిసినన్= పట్టుపట్టి ఉండగా; అతనికిన్= ఆ భీముడితో; అచ్యుతుండు= కృష్ణుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అశ్వత్థామ ఆ దివ్యాస్త్రాన్ని మరీ ఉద్ధృతం చేసిన వెంటనే అది విజృంభించి దావాగ్నివలె భీముడి చుట్టూ వ్యాపించింది. యుద్ధం మాని తమకు ఏమీ కాక నిలిచి ఉన్న ధర్మరాజాదులను, ఎంత చెప్పినా పట్టుదలతో యుద్ధం మానక ఆ దివ్యాస్త్ర జ్వాలలచే చుట్టబడియున్న భీమసేనుని కృష్ణార్జునులు గమనించి, రథం దిగి, చేతిలోని ఆయుధాలు పడవేసి, వట్టిచేతులతోనే పరుగెత్తి, వారుణాస్త్ర కారణంగా అంతవరకు ఎక్కువ కాలకుండా ఉన్న భీమసేనుని రథంపై నుండి క్రిందపడేటట్లు త్రోయగా, భీముడు పట్టువదలక రథాన్ని దిగకపోగా, కృష్ణుడు భీముడితో ఇట్లా అన్నాడు:

తే. 'ఇమ్మహాస్త్రంబుఁ గడిమి మైఁ గ్రమ్మఱింప। నెవ్వరికి రామిఁ జేసి కా కేము శక్య
మైన నూరక యుండుదు మయ్య? వలవ। దుడుగు నాబుద్ధి విని డిగ నుఱుకు తేరు.' 388

ప్రతిపదార్థం: ఈ+మహాస్త్రంబున్= ఈ దివ్యాస్త్రాన్ని; కడిమిమైన్= పరాక్రమంతో; ఎవ్వరికిన్= ఎవరికి కూడా; క్రమ్మఱింపన్= మరలించటానికి - అనగా ఉపశమింపజేయటానికి; రామిన్+చేసి= సాధ్యం కాకపోవటం వలన ('చేసి' హేత్వర్థకం); కాక= తప్ప; ఏము= మేము; శక్యమైనన్= మరలింప సాధ్యమే అయితే; ఊరక= వట్టిగా అనగా ఏ ప్రయత్నం లేక; ఉండుదుము+అయ్య?= ఉంటామా నాయనా?; వలవదు= వద్దు; ఉడుగు= మానివేయి; నా బుద్ధిన్= నా బోధను - నేను చెప్పినమాటను; విని= పెడచెవిని పెట్టక విని; తేరు= రథాన్ని; డిగన్= దిగిపోయే విధంగా; ఉఱుకు= పరుగెత్తుము.

తాత్పర్యం: 'ఓ భీమసేనా! ఈ దివ్యాస్త్రాన్ని ఉపసంహరింపజేయటం ఎవ్వరికీ సాధ్యం కాదు కాబట్టి మే మిట్లా ఊరకే ఉన్నాము. ఒకవేళ సాధ్యమే అయితే ఇట్లా చేస్తూ ఊరకుంటామా నాయనా! ఇక్కడికి చాలు, ఇక వద్దు. యుద్ధం చేయటం మానివేయుము. నే చెప్పే మాట వినుము. రథం నుండి త్వరగా దిగనురుకుము'.

వ. అనుచు నతని నిరాయుధుం జేసి యర్జునుండు తోడ్పడ నరదంబు డిగ్గఁ ద్రోచె; నిత్తెఱంగునఁ బాండవ సైన్యంబంతయు దైన్యంబు నొందుటయు, నారాయణాస్త్రంబు ప్రశాంతిం బొందెఁ దదనంతరంబ. 389

ప్రతిపదార్థం: అనుచున్= అని కృష్ణుడు అంటూనే; అతనిన్= ఆ భీముడిని; నిరాయుధున్= ఏ ఆయుధాలు (చేతుల్లో) లేనివాడినిగా; చేసి; అర్జునుండు; తోడ్పడన్= తోడుకాగా; అరదంబు= రథంనుండి; డిగ్గన్= దిగిపోయే విధంగా; త్రోచెన్= త్రోసివేశాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; పాండవ సైన్యంబు+అంతయున్= పాండవుల సైన్యం అంతా కూడా; దైన్యంబున్= దీనదశను- అభిమానాన్ని చంపుకొనే స్థితిని; ఒందుటయున్= పొందగానే; నారాయణ+అస్త్రంబు= ఆ నారాయణాస్త్రం; ప్రశాంతిన్= శాంతిని; పొందెన్= పొందింది - శాంతించింది; తదనంతరంబు+అ= అటు తరువాత.

తాత్పర్యం: అని అంటూ కృష్ణుడు, భీముడి చేతిలోని ఆయుధాలను లాగివేసి, అర్జునుడూ, తానూ ఇద్దరూ కలిసి ఆ భీముడిని రథం నుండి క్రిందికి తోశారు. ఈ విధంగా పాండవసైన్యం దీనత్వాన్ని పొందగానే నారాయణాస్త్ర ప్రశాంతతను పొందింది. ఆ తరువాత - (తరువాతి పద్యంతో అన్వయం).

క. హరి పనుప వారి బలములు । పురికొని వాహన వితానములు శస్త్రాస్త్రో
ద్ధుర భంగి నొప్ప నడరెం । గురుసేనలమీఁదఁ దూర్యఘోషము సెలఁగన్. 390

ప్రతిపదార్థం: హరి= కృష్ణుడు; పనుపన్= ఆదేశించగా; వారి బలములు= ఆ పాండవుల సైన్యాలు; పురికొని= ఉత్సాహాన్ని పొంది; వాహన వితానములు= గజాశ్వాది వాహనాల సమూహాలు; శస్త్ర+అస్త్ర+ఉద్ధుర భంగిన్= శస్త్రాస్త్రములతో నిండుగాఉన్న రీతితో; ఒప్పన్= ఒప్పుతూ ఉండగా మరియు; తూర్యఘోషము= వాద్యముల ధ్వని; చెలఁగన్= ధ్వనిస్తూ ఉండగా; కురుసేనలమీఁదన్= కౌరవసైన్యాలపైకి; అడరెన్= విజృంభించింది.

తాత్పర్యం: (ఆ దివ్యాస్త్రం శాంతించగానే) కృష్ణుడు సైన్యాలను సమాయత్తం కమ్మని ఆదేశించగా పాండవసైన్యాలు వాహన సమూహాలతో శస్త్రాస్త్రాలతో వాద్యధ్వనులు చెలరేగగా కౌరవసైన్యాలపైకి విజృంభించాయి.

వ. ఆ సంరంభంబు సూచి సుయోధనుం డశ్వత్థామతో 'నింకను నమ్మహాస్త్రంబు ప్రయోగింపు' మనుటయు, నతం డది పునఃప్రయోగంబున కర్హంబు గా; దట్లయినం బ్రయోగించిన వారిని వధియించు; నిట్లగుట గురునకు వరదాన కాలంబునం గేశవుం డానతిచ్చెఁ; జావోటములు రెండును నొక్కరూపు కావున నమ్మహనీయాస్త్రంబు పగతుర నోడించి యంతటి తోడఁ దెగియెఁ; గృష్ణుఁ డీ యుపాయంబున నప్పరమ సాధనంబు గడపి పుచ్చె; మన మేమి సేయుద?' మనుచు నిట్టూర్పు నిగిడించె; ననవుడు నాంబికేయుండు సంజయున కి ట్లనియె. 391

ప్రతిపదార్థం: ఆ సంరంభంబు= ఆ పాండవసేనల యుద్ధాటోపాన్ని; చూచి= కనిపెట్టి; సుయోధనుండు; అశ్వత్థామతోన్= అశ్వత్థామతో (ఇంకా ఇట్లా అన్నాడు); ఇంకను= మళ్ళీకూడ; ఆ+మహాస్త్రంబు= ఆ దివ్యాస్త్రాన్ని; ప్రయోగింపుము+అనుటయున్= ప్రయోగించుము అని అనగానే; అతండు= ఆ అశ్వత్థామ (ఇట్లా అన్నాడు); అది= ఆ దివ్యాస్త్రం; పునఃప్రయోగంబునకున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మళ్ళీ ప్రయోగించటానికి; అర్హంబు= తగింది; కాదు; అట్లు+అయినన్= అట్లా అయినప్పటికి కూడా - ఆ నియమాన్ని కాదంటే; ప్రయోగించిన వారిని= ఆ ప్రయోగించిన వ్యక్తిని (వారిని అనే బహువచనం అనిర్దిష్ట పురుష వ్యావహారమునందు వచ్చినది - ప్రౌఢ- శబ్ద 57); వధియించున్= సంహరిస్తుంది; ఇట్లు+అగుటన్= ఇట్లా కావటంచేత; గురునకున్= మా తండ్రి ద్రోణాచార్యులకు; కేశవుండు= ఆ నారాయణ భగవానుడు; వరదానకాలంబునన్= వరం ఇచ్చే సమయంలోనే - ఈ దివ్యాస్త్రాన్ని ప్రదానం చేసినప్పుడే; ఆనతి+ఇచ్చెన్= సెలవిచ్చాడు; చావు+ఓటములు= మరణం, పరాజయం; రెండునున్= ఈ రెండు కూడా; ఒక్కరూపు+అ= ఒకే విధమైనవి; కావునన్= కాబట్టి; ఆ+మహనీయ+అస్త్రంబు= ఆ పూజనీయమైన నారాయణాస్త్రం; పగతురన్= శత్రువులను; ఓడించి= పరాజితులను చేసి (జయించి); అంతటి తోడన్= ఆ శత్రుపరాజయం మాత్రంతోనే; తెగియెన్= విభిన్నమయింది - ఆగిపోయిందని భావం; కృష్ణుండు; ఈ+ఉపాయంబునన్= ఈ ఆయుధత్యాగం అనే ఉపాయం చేత; ఆ+పరమసాధనంబు= ఆ శ్రేష్ఠమైన అస్త్రాన్ని; కడపి పుచ్చెన్= పంపించి వేశాడు; మనము= మనం; ఏమి; చేయుదము?= చేయగలం?; అనుచున్= అని అంటూ; నిట్టూర్పు= నిశ్వాసాన్ని; నిగిడించెన్= వెలువరించాడు అనగా నిట్టూర్చాడు. (తన నారాయణాస్త్రం దుర్యోధనుడికి విజయం సాధించలేకపోయిందని తన దుఃఖాతిశయాన్ని వ్యక్తం చేశాడని భావం); అనవుడున్= అనగానే; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుండు; సంజయునకున్= సంజయుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అట్లా పాండవుల సైన్యాలు తమపైకి సమరోత్సాహంతో ఆడంబరంగా రావటం చూచి దుర్యోధనుడు, 'అశ్వత్థామా! మళ్ళీ ఒకసారి ఆ దివ్యాస్త్రాన్ని ప్రయోగించు' మని అర్థించాడు. అందుకు అశ్వత్థామ 'దుర్యోధనా! అది మళ్ళీ ప్రయోగించటానికి వీలులేనిది. ఒకవేళ మళ్ళీ ప్రయోగించామంటే ప్రయోగించినవారినే ఆ దివ్యాస్త్రం వధిస్తుంది. ఈ విధంగా జరుగుతుంది అని - ఈ అస్త్రాన్ని ప్రదానం చేసే సమయంలోనే ఆ నారాయణ భగవానుడు మా తండ్రి ద్రోణులవారికి చెప్పాడు. ఓడిపోవటం అంటే మరణంతో సమానమే కదా! అందుకే ఆ దివ్యాస్త్రం శత్రువుల ఓటమితోనే విరమించింది. ఇదంతా జరగటానికి కారణం ఆ కృష్ణుడు. ఆ కృష్ణుడికి, ఈ దివ్యాస్త్రానికి బలికాకుండా ఎట్లా తప్పించుకొనాలో తెలుసు. అందుకే తమ వారందరూ ఆయుధాలు క్రింద పెట్టే ఉపాయం పన్నాడు. దానితో ఈ దివ్యాస్త్రం వారిని దహించివేయక అదృశ్యమయింది. ఇంక మనం ఏమి చేయగలము? అని పెద్దగా నిట్టూర్చాడు- అని అనగా ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

క. 'నారాయణాస్త్ర మిమ్మెయి । వైరి చమూసంచయంబు వధియింపక పో
రారాజును ద్రౌణియుఁ దా । రే రూపున సంచరించి? రెఱిఁగింపు తగన్.' 392

ప్రతిపదార్థం: (ఓ సంజయా!) నారాయణ+అస్త్రము= నారాయణాస్త్రం; ఈ+మెయిన్= ఈ విధంగా; వైరిచమూ సంచయంబు= శత్రువుల సైన్య సమూహాన్ని; వధియింపకపో= వధించకుండా ఉండుగాక (సరే అదిపోనీ); రారాజును= దుర్యోధనుడు; ద్రౌణియున్= అశ్వత్థామ; తారు= తాము - ఆ ఇద్దరు తమలో తాము; ఏరూపునన్= ఏ విధంగా; సంచరించిరి?= నడుచుకొన్నారు?; తగన్= తగినట్లు; ఎఱిఁగింపు= తెలియజెప్పుము.

తాత్పర్యం: 'ఆ నారాయణాస్త్రం శత్రుసైన్యాలను వధించకుండానే పోయింది. సరే పోతే పోనీ. ఇక దుర్యోధనుడు, అశ్వత్థామ ఆపైన ఏం చేశారో చెప్పుము సంజయా!'

వ. అని యడిగిన నమ్మనుజపతికి సూతసూనుం డి ట్లనియె. 393

ప్రతిపదార్థం: అని= ఇట్లా; అడిగినన్= అడుగగా; ఆ+మనుజపతికిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజుతో; సూతసూనుండు= సంజయుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని అడుగగా ధృతరాష్ట్రునకు సంజయుడు ఇట్లా చెప్ప నారంభించాడు.

క. ఆ మనుజపతికి నశ్వ । త్థామ యటులు సెప్పుటయు, నతం 'డన్యాస్త్ర
స్తోమంబునఁ బాండవసే । నామర్దన మాచరింపు' నావుడు గడిమిన్. 394

ప్రతిపదార్థం: ఆ మనుజపతికిన్= ఆ రాజుతో అనగా ఆ దుర్యోధనుడితో; అశ్వత్థామ; అటులు= ఆ విధంగా; చెప్పుటయున్= చెప్పగానే; అతండు= ఆ దుర్యోధనుడు; అన్య+అస్త్రస్తోమంబునన్= ఇతరములైన దివ్యాస్త్రసమూహాలతో; పాండవ సైన్యాల వధను; ఆచరింపుము= చేయుము; నావుడు= అనగా; కడిమిన్= పౌరుషంతో.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అశ్వత్థామ అట్లా అనగానే దుర్యోధనుడు, ఇతర దివ్యాస్త్ర సమూహంతో పాండవసైన్యాన్ని మట్టుపెట్టుము' అని అనగానే మహా పౌరుషంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ద్రౌణి గౌంతేయసేనపై బాణవితతిఁ । బరఁగఁ జేయుచు నాచార్యమరణ మంత
రంగ సంతాప మొనరింప నక్కజముగఁ । దఱిమి పాంచాలతనయునిఁ దాఁకె నధిప! 395

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ద్రౌణి= అశ్వత్థామ; కౌంతేయు సేనపైన్= పాండవుల సైన్యం మీద; బాణవితతిన్= బాణాల సమూహాన్ని; పరఁగన్+చేయుచున్= వ్యాపింపజేస్తూ; ఆచార్య మరణము= ద్రోణాచార్యుడి మృతి; అంతరంగ సంతాపము= మానసిక సంక్షోభాన్ని; ఒనరింపన్= కలుగజేయగా; (కడిమిన్= పౌరుషంతో; ద్రోణాచార్యుడి వధవృత్తాంతం మనసులో మెదలుతూ ఉంటే దుఃఖంతోపాటు పౌరుషం పెరిగిందని భావం); 'కడిమిన్' - వెనుకటి పద్యంలోనిదీ పదం ఇక్కడ అన్వయిస్తుంది); అక్కజముగన్= ఆశ్చర్యం కలిగే విధంగా; తఱిమి= (పాండవసైన్యాన్ని); పారద్రోలి; పాంచాల తనయునిన్= ద్రుపదరాజు కుమారుడైన ధృష్టద్యుమ్నుడిని; తాఁకెన్= ఎదిరించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అశ్వత్థామ పాండవసేనపై బాణసమూహాన్ని విపరీతంగా వేస్తూ, మనస్సులో తండ్రి ద్రోణాచార్యుడి మరణం దుఃఖం కలిగిస్తూ ఉండగా, ఆశ్చర్యకరంగా పాండవ సైన్యాలను తరిమి వెంటనే ధృష్టద్యుమ్నుడిని ఎదుర్కొన్నాడు.

తే. తాఁకి యిరువదే నమ్ము లుదగ్రవృత్తి । నతని తనువునఁ బఱపి రయంబు మెఱయ
మఱియు నిరువదిమూఁ డుగ్ర మార్గణముల । నిగుడఁ జేసిన నాతండు వెగడు పడక. 396

ప్రతిపదార్థం: తాఁకి= ఎదుర్కొని; ఇరువదేను+అమ్ములు= ఇరువది అయిదు బాణాలు; ఉదగ్రవృత్తిన్= ఉద్ధతమైన ప్రవృత్తితో- మిక్కిలి గర్వంతో; అతని తనువునన్= ఆ ధృష్టద్యుమ్నుడి శరీరాన; పఱపి= వ్యాపింపజేసి; రయంబు= వేగం; మెఱయన్= మెరిసిపోగా; మఱియున్= మళ్ళీ; ఇరువది మూఁడు+ఉగ్రమార్గణములు= ఇరువది మూడు భయంకర బాణాలు; నిగుడన్+చేసినన్= నాటుకొనేటట్లు చేయగా; ఆతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; వెగడు పడక= తల్లడిల్లక.

తాత్పర్యం: ఎదుర్కొనిన వెంటనే ఇరువది అయిదు బాణాలు అతడి శరీరంలో గ్రుచ్చుకొనేటట్లు కొట్టి, ఆగక, ఎంతో వేగంగా మళ్ళీ ఇరువది మూడు భయంకరములైన బాణాలు వేసి నొప్పించాడు. అట్లా అశ్వత్థామ బాణాలతో కొట్టినా కూడా తడబడక ఆ ధృష్టద్యుమ్నుడు.

వ. నిశిత నారాచంబుల నొప్పించినం గోపించి. 397

ప్రతిపదార్థం: నిశిత నారాచంబులన్= వాడి అయిన బాణాలతో; నొప్పించినన్= బాధ కలుగజేయగా; కోపించి= క్రోధం కలిగి.

తాత్పర్యం: అశ్వత్థామను తీక్ష్ణములైన బాణాలతో నొప్పించగా, అశ్వత్థామ క్రోధావిష్టుడై. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. **గురుపుత్రుండు గడంగి సూతు హరులం గోదండముం గేతువున్**
ధరణిం గూల్చినఁ జూచి సాత్యకి మదౌద్ధత్యంబునం దాఁకుడున్
శర మొక్కంటన మూర్ఛ వుచ్చి వెస ధృష్టద్యుమ్ను ఫాలంబు ని
ష్ఠుర నారాచహతంబు సేయుటయు వాఁడుంౘ దేరిపై సోలినన్. **398**

ప్రతిపదార్థం: గురుపుత్రుండు= అశ్వత్థామ; కడంగి= విజృంభించి; సూతున్= సారథిని; హరులన్= అశ్వాలను; కోదండమున్= ధనుస్సును; కేతువున్= ధ్వజాన్ని; ధరణిన్= భూమిపై; కూల్చినన్= కూల్చివేయగా; చూచి= కనిపెట్టి; సాత్యకి; మద+ఔద్ధత్యంబునన్= మదముయొక్క ఆధిక్యంతో; తాఁకుడున్= ఎదుర్కొంటూ ఉండగా; శరము+ఒక్కంటన= ఒకే ఒక బాణంతో; మూర్ఛ పుచ్చి= మూర్ఛ పొందించి - తెలివి తప్పునట్లు కొట్టి; వెసన్= వేగంగా; ధృష్టద్యుమ్ను ఫాలంబు= ధృష్టద్యుమ్నుడి నుదుటి భాగాన్ని; నిష్ఠుర నారాచహతంబు+చేయుటయున్= క్రూరములయిన బాణాలతో నిహతం చేయగానే అనగా కొట్టగానే; వాఁడున్= ఆ ధృష్టద్యుమ్నుడు కూడా; తేరిపైన్= రథంపై; సోలినన్= మూర్ఛపోగా.

తాత్పర్యం: అశ్వత్థామ విజృంభించి, ధృష్టద్యుమ్నుడి సారథిని, గుర్రాలను, విల్లును, ధ్వజాన్ని భూమిపై కూల్చగా సాత్యకి చూచి, మదాతిరేకంతో ఎదిరించగా అశ్వత్థామ ఒకే ఒక బాణంతో సాత్యకిని మూర్ఛపడగొట్టాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడి ఫాలభాగాన తీక్ష్ణమైన బాణంతో కొట్టాడు. ఆ బాణాఘాతంతో ధృష్టద్యుమ్నుడుకూడ రథంమీద మూర్ఛిల్లాడు. అప్పుడు.

వ. **కనుంగొని రోషవిషాదంబులు మనంబునం బెనంగొనఁ గిరీటియు భీమసేనుండునుం గవిసినన్ బాసటయై శిశుపాలపౌత్రుం డగు యువరాజును మాళవుండగు సుదర్శనుండును బౌరవుం డగు వృద్ధక్షత్రుండును గూడుకొని యయ్యేవురు నయిదయిదు సాయకంబు లేయ నక్కుంభసంభవ సంభవుండు వానిం బంచవింశతి కాండంబుల ఖండించె; నిట్లు దొడంగి యందఱకు నన్నిరూపులై యేపునం బోరుచుండి ప్రచండ భల్లత్రయంబున భుజంబులు శిరంబునుం దునిమి సుదర్శనుఁ గృతాంత దర్శనంబున కనిచి, పౌరవు తేరునుం దలయును నఱికి విశిఖశిఖలం జేదికుమారు వ్రుందించి, మదంబున సింహనాదంబు సేసి, శంఖం బొత్తినం జిత్తంబులు గలంగి పాంచాలురుం బాండవ బలంబులు జలం బెడలి పాఱినం బోక నిలిచి భీమార్జును లమ్మొన మరల్చి; రప్పుడు పాకశాసనతనయుం డతని నిలునిలు మని యదల్చి సంరంభవిజృంభితుండై.** **399**

ప్రతిపదార్థం: కనుంగొని= చూచి; రోషవిషాదంబులు= కోపం, దుఃఖం ఈ రెండు; మనంబునన్= మనస్సులో; పెనంగొనన్= ఒండొంటితో కలియగా; కిరీటియున్= అర్జునుడును; భీమసేనుండును= భీముడును; కవిసినన్=(అశ్వత్థామను)ఎదుర్కొనగా; బాసట ఐ= సహాయమై; శిశుపాల పౌత్రుండు+అగు= శిశుపాలుడి మనుమ డైన; యువరాజును= యువరాజు; మాళవుండు+అగు= మాళవదేశీయుడైన; సుదర్శనుండును= సుదర్శనుడు; పౌరవుండు+అగు= పురువంశీయుడైన; వృద్ధక్షత్రుండును= వృద్ధక్షత్రుడు (వీరందరు); కూడుకొని= కలిసి; ఆ+ఏవురును= ఆ అయిదుగురు; అయిదు+అయిదు+సాయకంబులు= అయిదేసి బాణాలను; ఏయన్=వేయగా; ఆ+కుంభసంభవ సంభవుండు= ఆ ద్రోణపుత్రుడు అశ్వత్థామ; వానిన్= ఆ బాణాలను; పంచవింశతికాండంబులన్= ఇరువది అయిదు బాణాలతో; ఖండించెన్= తునకలు చేశాడు; ఇట్లు= ఈ విధంగా; తొడంగి= పూనుకొని; అందఱకున్=వారందరికి; అన్ని రూపులు+ఐ= అన్ని విధాలై; ఏపునన్= ఆధిక్యంతో అనగా మిక్కుటంగా; పోరుచుండి= యుద్ధం చేస్తూ ఉన్నవాడయి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సుదర్శనున్= మాళవుడైన సుదర్శనుడిని; ప్రచండ భల్లత్రయంబునన్= భయంకరములైన భల్లములనే బాణాలతో; భుజంబులు= చేతులను; శిరంబును= తలను; తునిమి= తెగగొట్టి; కృతాంత దర్శనంబునకున్= యమధర్మరాజును చూడటానికి; అనిచి= పంపి (సంహరించి); పౌరవు తేరునున్= పురువంశీయుడైన వృద్ధక్షత్రుని రథాన్ని; తలయును= శిరాన్ని; నఱికి= ఖండించివేసి; విశిఖ= బాణములయొక్క; శిఖలన్= కొసలతో; చేది కుమారు= చేది దేశీయుడైన యువరాజును; ప్రమందించి= సంహరించి; మదంబునన్= గర్వంతో; సింహనాదంబు= సింహనాదాన్ని; చేసి; శంఖంబు= శంఖాన్ని; ఒత్తినన్= పూరించగా - శంఖనాదం కూడా చేస్తూ ఉండగా; చిత్తంబులు= (పాండవ వీరుల) మనస్సులు; కలంగి= కలత చెంది; పాంచాలురున్= పాంచాల దేశీయులైన సైనికులు; పాండవ బలంబులున్= పాండవుల సైన్యాలు (ఈ రెండూ కూడా); చలంబు= పట్టుదల; ఎడలి= సడలిపోయి; పాఱినన్= పారిపోతూ ఉండగా పోక= పోకుండా; నిలిచి= ఉండి; భీమ+అర్జునులు= భీముడు, అర్జునుడు ఈ ఇద్దరూ; ఆ+మొనన్= ఆ సైన్యాన్ని; మరల్చిరి= మరలించారు; అప్పుడు= ఆ సమయంలో; పాకశాసన తనయుండు= (పాకుడనే రాక్షసుడిని శాసించినవాడు పాకశాసనుడు అనగా ఇంద్రుడు, అతని తనయుడు అర్జునుడు); ఆతనిన్= ఆ అశ్వత్థామను; నిలుము+నిలుము+అని= ఆగుము ఆగుము అని; అదల్చి= గద్దించి; సంరంభ విజృంభితుండు+ఐ= వేగిరపాటుతో విజృంభించినవాడై.

తాత్పర్యం: అట్లా ధృష్టద్యుమ్నుడు మూర్ఛపోవటాన్ని చూచి భీమార్జునులు. అశ్వత్థామను ఎదుర్కొనగా వారికి తోడుగా శిశుపాలుడి మనుమడు చేదిదేశం యువరాజు, మాళవదేశీయుడు సుదర్శనుడు, పురువంశీయుడు వృద్ధక్షత్రుడు - వీరు ముగ్గురూ వారిని అనుసరించి వెళ్ళారు. ఈ అయిదుగురు వీరులు అశ్వత్థామ పైకి అయిదేసి బాణాలు ప్రయోగించారు. ఆ బాణాలను అశ్వత్థామ తాను ఇరవై అయిదు బాణాలతో నడుమనే నరికివేశాడు. నరికివేయటమే కాదు, ఆ అశ్వత్థామ వారందరిలో ప్రతి వ్యక్తికీ తనతోనే అశ్వత్థామ యుద్ధం చేస్తున్నాడని భ్రాంతి కలిగే విధంగా అంతటి వేగిరపాటుతో, అన్ని రూపులు కలవాడా - అన్నట్లు కనిపించాడు. భయంకరాలైన మూడు భల్లాలతో మొదట సుదర్శనుడి చేతులు, తల నరికి సంహరించాడు. వెంటనే వృద్ధక్షత్రుడి రథాన్ని తలను ఖండించి తరువాత చేది యువరాజును బాణాలతో వధించి, గర్వంతో సింహనాదం చేసి శంఖాన్ని పూరించాడు. దానితో పాంచాల సైన్యాలు, పాండవుల సైన్యాలు పౌరుషతేజం నశించి పారిపోవటం ప్రారంభించాయి. అప్పుడు భీమార్జునులు అడ్డుకొని పారిపోకుండా ఆ సైన్యాలను మరలించారు. వెంటనే అర్జునుడు - అశ్వత్థామను నిలుము నిలుము' అని గద్దించి, విజృంభించి (ఇట్లా అన్నాడు).

క. **'గురుసుత! నీదుభుజావి ၊ స్ఫురణము దివ్యాస్త్ర వీర్యమును గురుధరణీ**
వరుదెస కూర్మియుఁ జూపితి ၊ దెరలకుమీ' యనుడు నతఁడు దీప్తాకృతి యై. **400**

ప్రతిపదార్థం: గురుసుత!= ఓ గురుపుత్రా! అశ్వత్థామా!; నీదు భుజా విస్ఫురణము= నీ భుజబల విస్ఫూర్తిని; దివ్య+అస్త్ర వీర్యమున్= దివ్యాస్త్రాల శక్తిని; కురుధరణీవరుదెస కూర్మియున్= కురురాజు దుర్యోధనుడిపై గల భక్తిని (ప్రేమను) రాజభక్తిని అని భావం; చూపితి(వి)= చూపావు (సరే కాని ఇంకెటు పోతున్నావు చూడు); తెరలకుమీ= తొలగిపోవద్దు; అనుడున్= ఇట్లా అర్జునుడు అనగానే; అతఁడు= ఆ అశ్వత్థామ; దీప్తాకృతి ఐ= క్రోధంతో ఎర్రబడిన ఆకారం కలవాడై.

తాత్పర్యం: 'ఓ గురుపుత్రా! అశ్వత్థామా! నీ బాహుబలమెంతటిదో, నీ దివ్యాస్త్రశక్తి ఎట్టిదో, నీ రాజభక్తి ఎట్లాంటిదో చూపావు. తొలగిపోవద్దు' అనగానే అశ్వత్థామ క్రోధాగ్నితో మండిపోతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. నియతిం బావక బాణ మేయుడు మహాగ్నిజ్వాలికా మాలిక
ల్హయ సందోహ రథవ్రజ ద్విరద మాలా సద్భట శ్రేణికా
క్షయముం జేయుచు సర్వభూత భయదాకారంబునం బేర్చి య
త్యయకాల జ్వలనోద్ధతిం గవిసి యేకాక్షౌహిణిం ద్రుంపఁగన్. 401

ప్రతిపదార్థం: నియతిన్= నియమంతో; పావక బాణము= ఆగ్నేయాస్త్రాన్ని; ఏయుడున్= వేసిన వెంటనే; మహా+అగ్ని జ్వాలికా మాలికల్= పెద్ద అగ్నిజ్వాలల సమూహాలు; హయసందోహ= అశ్వాల సమూహాలు; రథవ్రజ= రథాల సమూహాలు; ద్విరదమాలా= ఏనుగుల గుంపులు; సత్+భటశ్రేణికా= సమర్థులైన పదాతుల పటాలాలు - అనే ఈ అన్నింటియొక్క; క్షయమున్= నాశాన్ని; చేయుచున్= చేస్తూ; సర్వభూత భయద+ఆకారంబునన్= సర్వప్రాణులకు భయాన్ని కలిగించే ఆకారంతో; పేర్చి= పెరిగి; అత్యయకాల జ్వలన+ఉద్ధతిన్= ప్రళయకాలమందలి అగ్నివంటి దర్పంతో; కదిసి= ఎదిరించి; ఏక+అక్షౌహిణిన్= ఒక అక్షౌహిణి సైన్యాన్ని; త్రుంపఁగన్= నశింపచేయగా.

తాత్పర్యం: వెంటనే మంత్రించి, ఆగ్నేయాస్త్రాన్ని సంధించి, పాండవుల సైన్యంమీద ప్రయోగించగా, ఆ దివ్యాస్త్రం నుండి పెద్దగా అగ్నిజ్వాలలు వరుసలుగా బయలుదేరి అశ్వ, రథ, గజ, పదాతి సమూహాలను నాశనం చేస్తూ, సర్వప్రాణులకు భయాన్ని కలిగించే రూపంగా పెరిగి, ఇది ప్రళయకాలాగ్నివలె విజృంభించి పాండవుల సైన్యంలో ఒక అక్షౌహిణీ సైన్యాన్ని నశింపజేయగా - (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 1. సందోహ - వ్రజ - మాలా - శ్రేణికా అనే ఈ నాలుగు పదాలు ఒకే అర్థంలో వరుసగా ప్రయోగింపబడ్డాయి. అర్థం ఒకటే అయినప్పుడు శబ్ద భేదం ఉంటేనే చమత్కారం ఉంటుంది. అదే అర్థాన్ని ఒకే పద్యంలో మాటిమాటికి చెప్పవలసి వచ్చినప్పుడు వాడిన ఆ పదాన్నే వాడటం కవికి గల శబ్దదారిద్ర్యాన్ని సూచిస్తుంది. కాబట్టి అర్థభేదం లేకపోతే శబ్దభేదమన్నా ఉండి తీరాలి. కవిత్వంలోని ఈ మెలకువను తిక్కన ఇక్కడ ప్రతిబింబింపజేశాడు.

2. అత్యయకాల జ్వలనోద్ధతిన్ అనేచోట ఉపమాలంకారం - ఈ అలంకారంచేత ఆ దివ్యాస్త్రాగ్ని జ్వాలలు ఈ ఒక్క అక్షౌహిణినే కాదు క్షణంలో పాండవసైన్యమంతా క్రమంగా చుట్టుముట్టి దహించి వేయగలవు అనే అర్థం. ఇచ్చట వ్యంగ్యం. ఇదీ తిక్కన కవితా శిల్పం.

క. కురుసేన యుబ్బి యార్చుచు । హరియు నరుఁడు మడియుదురు శరానల శిఖలన్
సరి గలరే త్రిభువనముల । గురుసుతునకు ననఁగఁ దూర్యఘోషము లెసఁగెన్. 402

ప్రతిపదార్థం: కురుసేన= కౌరవసైన్యం; ఉబ్బి= పొంగిపోయి; ఆర్చుచున్= సింహనాదం చేస్తూ; హరియున్= కృష్ణుడు; నరుఁడున్= అర్జునుడు; శర+అనల శిఖలన్= బాణాగ్ని జ్వాలలతో అనగా ఆ ఆగ్నేయాస్త్రంయొక్క అగ్గిమంటలలో; మడియుదురు= నశిస్తారు; త్రిభువనములన్= మూడు లోకాలలో; గురుసుతునకున్= గురుపుత్రుడైన అశ్వత్థామకు; సరి+కలరే?= సాటివచ్చువారు ఉన్నారా?- లేరు; అనఁగన్= అంటూ ఉందా అనునట్లు; తూర్య ఘోషములు= వాద్యధ్వనులు; ఎసఁగెన్= అతిశయించాయి.

తాత్పర్యం: కౌరవసైన్యం పొంగిపోయి సింహనాదం చేస్తూ, 'శ్రీకృష్ణుడూ, అర్జునుడూ ఆగ్నేయాస్త్రపు మంటలలో చనిపోతారు. మూడు లోకాలలో అశ్వత్థామకు దీటైనవారు ఉన్నారా?' అని అన్నట్లుగా వాద్యధ్వనులు మిక్కుటంగా మ్రోగాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

తే. **ఎల్ల దివ్య బాణంబులుఁ బొల్ల వోవఁ। జేయునట్లుగ బ్రహ్మ సృజించినట్టి**
కీర్తనీయమహాస్త్రంబు గ్రీడి మంత్ర। నిష్ఠ యొప్పఁ బ్రయోగించె నృపవరేణ్య! 403

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఎల్ల దివ్యబాణంబులున్= దివ్యాస్త్రాలన్నీ; పొల్లవోవన్= వ్యర్థమయ్యేటట్లుగా; చేయునట్లుగన్= చేసే విధంగా; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; సృజించినట్టి= నిర్మించినట్టి; కీర్తనీయ మహా+అస్త్రంబు= పొగడదగిన దివ్యాస్త్రాన్ని; క్రీడి= అర్జునుడు; మంత్ర= మంత్ర జపముయొక్క ఏకాగ్రత; ఒప్పన్= ఒప్పేటట్లు; ప్రయోగించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! దివ్యాస్త్రాలన్నీ వమ్మయిపోయేటట్లుగా బ్రహ్మ సృష్టించిన ప్రశస్తమయిన బ్రహ్మాస్త్రాన్ని అర్జునుడు మంత్రనిష్ఠతో ప్రయోగించాడు.

వ. **ఆ బ్రహ్మాస్త్రంబుచేత నద్భుతంబగు నశ్వత్థామ యాగ్నేయాస్త్రంబు సంక్షీణంబగుటయుఁ, గైటభాంతకుండును గిరీటియుం బాంచజన్య దేవదత్తంబులు పూరించినఁ, బాండవసైన్యంబున సింహనాద శంఖ భేరీ మహారావంబులు సెలంగెఁ; గౌరవసేన లేటమొగంబు వడియె; నప్పు డగ్గురునందనుండు. 404**

ప్రతిపదార్థం: ఆ బ్రహ్మ+అస్త్రంబుచేతన్= అర్జునుడు ప్రయోగించిన ఆ బ్రహ్మాస్త్రంచేత; అద్భుతంబు+అగు= ఆశ్చర్యం కలిగించే; అశ్వత్థామ+ఆగ్నేయాస్త్రంబు= అశ్వత్థామ ప్రయోగించిన ఆగ్నేయాస్త్రం; సంక్షీణంబు+అగుటయున్= క్షీణించిపోగానే; కైటభ+అంతకుండును= కైటభుడనే రాక్షసుడిని సంహరించినవాడు - అనగా కృష్ణుడు; కిరీటియున్= అర్జునుడు కూడా; పాంచజన్య దేవదత్తంబులు= పాంచజన్యం దేవదత్తం అనే రెండు శంఖాలను; పూరించినన్= పూరించగా (ఊదగా) (కృష్ణుడు పాంచజన్య శంఖాన్ని అర్జునుడు దేవదత్త శంఖాన్ని పూరించగా, అని క్రమంగా అన్వయం - శంఖనాదం చేయగా అని భావం); పాండవసైన్యంబునన్= పాండవుల సైన్యంలో; సింహనాద శంఖ భేరీ మహారావంబలు= సింహనాదాలు అనగా సింహంవలె (వీరులు) గర్జించటం మరియు శంఖాల భేరీల గొప్ప ధ్వనులు; చెలంగెన్= మ్రోగాయి; కౌరవసేన= కౌరవుల సైన్యం; లేట మొగంబు వడియెన్= పెడమొగం పట్టింది - పారిపోయింది; అప్పుడు= ఆ సమయంలో; ఆ+గురునందనుండు= ఆ అశ్వత్థామ.

తాత్పర్యం: ఆ బ్రహ్మాస్త్రం చేత అశ్వత్థామ ప్రయోగించిన ఆగ్నేయాస్త్రం క్షీణించిపోగా, విజయోత్సాహంతో కృష్ణుడు పాంచజన్య శంఖాన్ని, అర్జునుడు దేవదత్త శంఖాన్ని పూరించారు. పాండవసైన్యంలో సింహనాద శంఖ భేరీనినాదాలు చెలరేగాయి. కౌరవసైన్యం తిరుగుముఖం పట్టింది. అప్పుడు అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. **'తెల్లమయ్యె నాకు దివ్యాస్త్రబలము లే। కునికి సిగ్గుమాలి యనికి నింకఁ**
గడఁగ నేల? దీని నుడిగెదఁ గా' కని। యుల్లమునఁ దలంచి విల్లు వైచి. 405

ప్రతిపదార్థం: దివ్య+అస్త్రబలము= దివ్యాస్త్రముల బలం; నాకున్= నాకు; లేక+ఉనికి= లేకపోవటం; తెల్లము+అయ్యెన్= స్పష్టమయింది; ఇంకన్= మరియు; కడఁగన్= పరాక్రమించగ; ఏల?= ఎందుకు? (ఇంకా యుద్ధం చేసి ఏం ప్రయోజనం); దీనిన్= ఈ పరాక్రమించటాన్ని; ఉడిగెదన్+కాక= విడిచివేస్తాను; అని= ఈ విధంగా; ఉల్లమునన్= మనస్సులో; తలంచి= అనుకొని; విల్లు= ధనుస్సును; వైచి= పడవేసి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'దివ్యాస్త్రాల బలం ఇక నాకు లేదనే విషయం స్పష్టమయింది. సిగ్గులేక ఇంకెందుకు యుద్ధం చేయటం? మానివేస్తాను' అని మనస్సులో భావించి తన చేతిలోని ధనుస్సును క్రింద పడవేసి. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అరదంబు డిగ్గి తొలంగి పోవం బోవ. 406

ప్రతిపదార్థం: అరదంబు= రథాన్ని; డిగ్గి= దిగి; తొలంగిపోవన్+పోవన్= రణరంగంనుండి తొలగిపోతూ పోతూ ఉండగా -

తాత్పర్యం: రథం నుండి దుమికి, రణరంగం విడిచి వెళ్ళిపోతూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. జిగి దొలఁకాడఁగ నేలకు । మొగి లేలొకొ డిగ్గె ననఁగ ముందటఁ దోఁచెన్
విగత దురితత్త్వభాసుం । డగు వేదవ్యాసుఁ డ మ్మహాపురుషునకున్. 407

ప్రతిపదార్థం: జిగి= కాంతి; తొలఁకాడఁగన్= అతిశయించగా; మొగిలు= మేఘం; ఏల+ఒకో= ఎందుకో; నేలకున్= భూమిపైకి; డిగ్గెన్= దిగింది; అనఁగన్= అనే విధంగా; విగత దురితత్త్వభాసుండు+అగు= పాపరహితమైన స్వభావంతో ప్రకాశిస్తూ ఉన్న; వేదవ్యాసుఁడు= వేదాలను విభజించిన కృష్ణద్వైపాయన మహాముని; ఆ+మహాపురుషునకున్= ఆ మహావ్యక్తియైన అశ్వత్థామకు; ముందటన్= ముందరి భాగంలో (ఎదుట); తోఁచెన్= ప్రత్యక్షమయ్యాడు.

తాత్పర్యం: వెళ్ళుతూ ఉన్న ఆ అశ్వత్థామ ఎదుట నల్లని కాంతిని దశదిశలకు విరజిమ్ముతూ ఆకాశంనుండి ఏ కారణం చేతనో భూమికి దిగివచ్చిన మేఘమా? - అన్నట్లున్న పుణ్యమూర్తి వ్యాసమహర్షి ఎదురుగా సాక్షాత్కరించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఉపమానం కవి కల్పితం కాబట్టి ఉపమాలంకారం కాదు. మేఘం ప్రసిద్ధమే అయినా ఆకాశం నుండి భూమికి దిగివచ్చిన మేఘం కవి కల్పనమే. తాపోపశమనం చేసి సేదతీర్చటమే మేఘలక్షణం కాబట్టి అశ్వత్థామలోని పరితాపాన్ని పోగొట్టటానికి వ్యాసుడు వచ్చా డనటం ఈ ఉత్ప్రేక్షాలంకార తాత్పర్యం.

అశ్వత్థామకు వ్యాసుఁడు గృష్ణార్జునుల మహిమ సెప్పుట (సం. 7-172-43)

వ. తోఁచిన వినయసంభ్రమంబులతోడ వినతుండై గద్గదకంఠుం డగుచు 'మునీంద్రా! మదీయం బగు నాగ్నేయాస్త్రంబు వృథ యయ్యెఁ; నిది యేమి మాయయొ యెఱుంగ; సురాసుర గంధర్వాది జాతులకును దుస్సహంబయిన యద్దివ్య సాధనంబు మనుష్యు లగు కృష్ణార్జునుల దహింపఁ జాల దయ్యె' ననవుడు నా తపోధనవర్యుండు 'వినుము! నీ సంశయంబు వాపెద' నని యతని కి ట్లనియె. 408

ప్రతిపదార్థం: తోఁచినన్= సాక్షాత్కరించగానే; వినయ సంభ్రమములతోడన్= వినయంతోనూ, వేగిరపాటుతోనూ; వినతుండు+ఐ= నమస్కరించినవాడై; గద్గదకంఠుండు+అగుచున్= గద్గదస్వరంతో కూడిన కంఠం కలవాడవుతూ - డగ్గుత్తికతో అని భావం (ఇట్లా అన్నాడు); మునీంద్రా!= ఓ వ్యాస మహామునీ; మదీయంబు+అగు= నాది - అనగా నేను ప్రయోగించిన; ఆగ్నేయ+అస్త్రంబు= ఆగ్నేయం అనే దివ్యాస్త్రం; వృథ+అయ్యెన్= వ్యర్థం అయిపోయింది; ఇది= ఈ దివ్యాస్త్రం ఇట్లా వ్యర్థం కావటం; ఏమి మాయయొ?= ఏ అదృశ్య శక్తియో; ఎఱుంగన్= తెలియను; సుర+అసుర గంధర్వ+ఆది జాతులకును= దేవతలు, రాక్షసులు, గంధర్వులు మొదలైన జాతివారలకు కూడా; దుస్సహంబు+అయిన= సహింపశక్యం కాని; ఈ+దివ్యసాధనంబు= ఈ దివ్యాస్త్రం; మనుష్యులు+అగు= మనుష్యజాతిలో పుట్టినటువంటి; కృష్ణ+అర్జునులన్= కృష్ణుడిని, అర్జునుడిని; దహింపన్+చాలదు+అయ్యెన్= కాల్చలేకుండా పోయింది; అనవుడున్= అనగానే; ఆ తపోధనవర్యుండు= తపోధనులు అనగా తపస్సు ధనంగా గల మునులు - వారిలో శ్రేష్ఠుడైన వ్యాసుడు; వినుము= ఓ అశ్వత్థామా! విను; నీ సంశయంబు= నీ అనుమానాన్ని; పాపెదన్= పోగొట్టుతాను; అని= అని పలికి;

అతనికిన్= ఆ అశ్వత్థామతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అట్లా వ్యాసభగవానుడు ప్రత్యక్షంకాగానే నమస్కరించి, గద్గద స్వరంతో ఇట్లా అన్నాడు: 'ఓ మునీంద్రా! నా ఆగ్నేయాస్త్రం వ్యర్థం అయింది. ఇదేమి మాయ? ఈ దివ్యాస్త్రం దేవదానవ గంధర్వాది దివ్యజాతుల వారికి కూడా సహింపరాని ఈ దివ్యాస్త్ర మానవమాత్రులైన కృష్ణార్జునులను దహించలేకపోయింది. అని అనగా, ఆ వ్యాసమహర్షి 'అశ్వత్థామా! నీకు కలిగిన సంశయాన్ని పోగొట్టుతాను. వినుము.' అని

ఆ. **'ఆదిదేవుఁ డైన య య్విష్ణుఁ డఖిలలో । కాభిరక్షణార్థమై జనించి**
మహిత తపము సేసె మైనాకశైలంబు । నందుఁ బెద్దకాల మభవుగుఱిచి. 409

ప్రతిపదార్థం: ఆదిదేవుఁడు+ఐన= దేవాదిదేవుడైన; ఆ+విష్ణుఁడు= ఆ విష్ణు భగవానుడు; అఖిలలోక+అభిరక్షణ+అర్థము+ఐ= లోకాలన్నింటి (యొక్క) రక్షణకై; జనించి= ఆవిర్భవించి; పెద్దకాలము= చాలాకాలం వరకు; మైనాకశైలంబునందున్= మైనాకం అనే పర్వతమందు; అభవున్= శివుడిని; గుఱించి= గురించి; మహిత తపము= పూజితమైన తపస్సును అనగా గొప్ప తపస్సును; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ఆదిదేవుడైన ఆ విష్ణు భగవానుడు ఈ లోకాలన్నింటినీ రక్షించటానికి (నారాయణ ఋషిగా) జన్మించి, మైనాకపర్వతం మీద మహాదేవుడిని గూర్చి చాలకాలం గొప్పగా తపమాచరించాడు.

సీ. **పవనాశనుఁడు నూర్ధ్వబాహుండు నగుచు న । న్నారాయణుం డతిఘోరనిష్ఠఁ**
జలుపు నాతపమున సంతుష్టుఁ డై బాల । శశిరేఖ నొప్పారు జడముడియును
శూలపినాకాది సుమహితాయుధముల । వెలిఁగెడు చేతులు విలసదురగ
యజ్ఞోపవీత సమంచిత వక్షంబు । శోభిల్లఁగాఁ బొడసూపె శంభుఁ
తే. **డపుడు పద్మాక్షుఁ డవ్విరూపాక్షునకు ధ । రాతలము జానుపాణి శిరంబు లొంద**
మ్రొక్కి నిలుచుండి నుదుటిపై మోడ్పుఁ గేలు । భక్తిఁ గదియించి యిట్లని ప్రస్తుతించె. 410

ప్రతిపదార్థం: పవన+అశనుండు= వాయువును మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ ఉన్నవాడై; ఊర్ధ్వబాహుండును= పైకెత్తిన చేతులు గలవాడూ; అగుచున్= ఔతూ; ఆ+నారాయణుండు= ఆ నారాయణ ఋషి; అతిఘోరనిష్ఠన్= మిక్కిలి భయంకరమైన నిష్ఠతో; చలుపు+ఆ తపమునన్= చేసేటటువంటి ఆ తపస్సుతో; సంతుష్టుఁడు+ఐ= సంతోషించిన వాడై; బాలశశిరేఖన్= బాలచంద్రుడి రేఖతో (రేఖామాత్రంగా ఉన్న బాలచంద్రుడితో); ఒప్పారు= ప్రకాశిస్తూ ఉన్న; జడముడియును= జటాబంధం; శూలపినాక+ఆది సుమహిత+ఆయుధములన్= శూలం (త్రిశూలం), పినాకం అనే ధనువు మొదలైన; మిక్కిలి పూజించబడే ఆయుధాలతో; వెలిఁగెడు చేతులు= ప్రకాశించే హస్తాలు; విలసత్= ప్రకాశించే; ఉరగ= సర్పాలు అనే; యజ్ఞోపవీత= యజ్ఞోపవీతాలచేత; సమంచిత= పూజితమైన అనగా ఒప్పుచూ ఉన్నట్టి; వక్షంబు= వక్షస్స్థలం; శోభిల్లఁగాన్= శోభిస్తూ ఉండగా; శంభుండు= పరమశివుడు; పొడసూపెన్= సాక్షాత్కరించాడు; అపుడు= ఆ సమయంలో; పద్మాక్షుఁడు= ఆ నారాయణుడు; ఆ+విరూపాక్షునకున్= ఆ శివుడికి; జానుపాణి శిరంబులు= మోకాళ్ళు, చేతులు, శిరం అనేవి అన్నీ కూడా; ధరాతలము= భూతలాన్ని; ఒందన్= పొందేటట్లు; మ్రొక్కి= నమస్కరించి (సాష్టాంగదండ ప్రణామం చేసి); నిలుచుండి= లేచి నిలువబడి; నుదుటిపైన్; మోడ్పుఁగేలు= అంజలిని; కదియించి= ఘటించి; భక్తిన్= భక్తితో; ఇట్లు+అని= ఈ విధంగా; ప్రస్తుతించెన్= స్తోత్రం చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వాయుభక్షణం మాత్రం చేసి ఊర్ధ్వబాహువై నిలుచుండి ఆ నారాయణుడు అతి భయంకరమైన నిష్ఠతో చేసిన ఆ తపస్సుకు సంతోషించి శివుడు జటాజూటాన చంద్రరేఖ, చేతులలో త్రిశూలం పినాక ధనువు మొదలైన ఆయుధాలు, వక్షస్స్థలాన పాములనే యజ్ఞోపవీతాలు ప్రకాశిస్తూ ఉండగా ఆ నారాయణునికి ప్రత్యక్షమైనాడు. అప్పుడు ఆ నారాయణ ఋషి విరూపాక్షునికి దండవత్ప్రణామం (సాష్టాంగప్రణామం) చేసి, లేచి నిలబడి, ఫాలభాగాన అంజలి ఘటించి ఇట్లా స్తోత్రం చేశాడు.

విశేషం: ఈ సీసంలోని మూడవ చరణంలో 'మహదాయుధము' అనే పాదం యూనివర్శిటీ ప్రతి ఆదరించిన పాఠం. పాఠాంతరంగా చూపిన పాఠం 'మహితాయుధముల' అనేది. ఈ పాఠమే నిర్దుష్టంగా ఉంది. కాబట్టి 'మహితాయుధము' అనే పాఠాన్నే ఇచ్చి వ్యాఖ్యానించటమైనది. మహచ్ఛబ్దంతో కర్మధారయం కాబట్టి 'మహాయుధము' అని ఉంటుంది. కాని 'మహదాయుధముల' అని ఉండకూడదు. తిక్కన చేసిన ప్రయోగం 'మహితాయుధముల' అనే సాధుపద ప్రయోగమే అనటం స్పష్టం. (చూ. ఆన్మహతః సమానాధికరణ జాతీయయోః' (పా.సూ.6.3.46 సిద్ధాంత కౌముది - సమాస ప్రకరణం) శ్రీమాన్ ఉత్పల వేంకట రంగాచార్యులవారి లఘుటీకతో సహా ముద్రించిన బాలసరస్వతీ బుక్‌డిపో వారి ప్రతిలో కూడా 'మహదాయుధముల' అనే పాఠం ఆదరించటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

క. **'స్థావరములు జంగమములు । నీవలనం గలిగెఁ; దద్వినిర్మలరక్షా**
ప్రావీణ్యము దగఁ బ్రభువుల । కేవారలకైన నీవ యిత్తు మహేశా! 411

ప్రతిపదార్థం: మహేశా!= ఓ పరమేశ్వరా!; స్థావరములు= స్థిరంగా కదలకమెదలక అక్కడనే ఉండే పర్వతాలు, చెట్లు మొదలైనవి; జంగమములు= నడిచే స్వభావం గల పశుపక్ష్యాది జీవరాశి అంతయు; నీవలనన్= నీ నుండే; కలిగెన్= పుట్టింది; తత్+వినిర్మల రక్షా ప్రావీణ్యము= ఆ సృష్టియొక్క మిక్కిలి స్వచ్ఛమైన రక్షణ సామర్థ్యాన్ని; ప్రభువులకు+ఏవారలకు+ఐనన్= సమర్థులైన పరిపాలకులకు ఎవరికైనా కూడా; తగన్= తగినట్లు; నీవు+అ= నీవే; ఇత్తు(వు)= ఇస్తావు.

తాత్పర్యం: 'ఓ పరమేశ్వరా! చరాచరాత్మకమైన ఈ జగత్తంతా నీ వలననే పుట్టింది. ఈ జగత్తును రక్షించే నిర్మలమైన రక్షణ సామర్థ్యాన్ని ప్రభువులకు ఎవరికైనా నీవే ఇస్తావు.

విశేషం: అలం: పరికరాంకురం. ఈశుడు అనగా నియామకుడు - జగత్తు యొక్క సృష్టి స్థితి వ్యవహారాలను సక్రమంగా నడిపేవాడు కాబట్టి శివుడికి; మహా+ఈశుఁడు= మహేశుడు (నియామకులందరికి పెద్ద) అనే పేరు సార్థకం. సాభిప్రాయంగా ఇక్కడ వాడబడింది కాబట్టి ఇది పరికరాంకురాలంకారం. 'సాభిప్రాయే విశేష్యేతు భవేత్ పరికరాంకురః' అని కువలయానందంలో ఈ అలంకార లక్షణం.

క. **సురలాదిగఁ గల జీవులు । పురుషార్థ చతుష్టయంబుఁ బొంది సుఖిత్వ**
స్ఫురణము నొందుట నీదగు । కరుణాతిశయంబు వడసి కాదె కపర్దీ! 412

ప్రతిపదార్థం: కపర్దీ!= ఓ శివా! (శివ జటాజూటానికి కపర్ద మని పేరు. అది గలవాడు కపర్ది - శివుడు - సంబుద్ధి); సురలు= దేవతలు; ఆదిగన్+కల జీవులు= మొదలుగాగల ప్రాణులు; పురుషార్థ చతుష్టయంబు= ధర్మార్థ కామమోక్షములు - అనే పురుషార్థాల చతుష్టయం (నాలుగింటి సముదాయం) అనగా నాలుగు పురుషార్థాలను; పొంది= సంపాదించి; సుఖిత్వస్ఫురణన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సుఖస్ఫూర్తిని (సుఖినః భావః సుఖిత్వం, సుఖిత్వం చ సుఖమేవ) సుఖానుభవాన్ని; ఒందుట= పొందటం; నీదగు= నీదైన (నీయొక్క); కరుణాతిశయంబు= దయాతిశయం (మిక్కిలి దయఅని భావం); పడసి= పొంది; కాదె!= కాదా? (ఔనని భావం); (నీ దయవలననే సకల ప్రాణులు పురుషార్థాల వలన కలిగే సుఖాన్ని అనుభవిస్తున్నారని భావం).

తాత్పర్యం: ఓ కపర్దధారీ - పరమశివా! దేవతలు మొదలు సకలజీవులు పురుషార్థాలను సాధించి సుఖంగా జీవిస్తున్నారంటే అదంతా నీ దయవలననే కదా.

విశేషం: 'ధర్మం, అర్థం, కామం, మోక్షం' అనేవి నాలుగు పురుషార్థాలు. ధర్మాన్ని ధర్మబద్ధాలైన అర్థకామాలను ప్రతి వ్యక్తి సాధించాలి అదే జీవిత ప్రయోజనం - ఇట్లా ధర్మబద్ధ జీవనంతో మోక్షానికి పాటుపడాలి. మోక్షంతోనే జన్మరాహిత్యం, శాశ్వతానందం కల్గుతుంది. ఇదంతా ఆ భగవంతుడి దయ ఉంటేనే సాధ్యం. ఇందుకు ఈ కఠోపనిషద్వాక్యం ప్రమాణం 'యమేవైష వృణుతే తేన లభ్యః తస్యైష ఆత్మా నిపుణలతే తనూంస్వాం॥' (కఠ 2/23).

క. **వేదములు ధర్మవాచక । వాదంబులు దద్విలాసవంతం బగు ధా**
త్రీదేవోత్కరము భవ । త్ప్రాదుర్భావములు గావె? బాలేందుధరా! **413**

ప్రతిపదార్థం: బాల+ఇందుధరా!= ఓ పరమశివా!; (బాలుడు అనగా కళామాత్రావశిష్టుడైన; ఇందు అనగా చంద్రుడిని తలపై ధరించినవాడు అని వ్యు.); ధర్మవాచకవాదంబులు= ధర్మప్రబోధక వాక్యాలై ఉన్న; వేదములు= ఋగ్వేదం మొదలైన నాలుగు వేదాలు; తద్విలాస వంతంబు+అగు= ఆ వేదాల స్ఫురణం కలిగిఉన్న - అనగా వేదాధ్యయన సంపన్నమైన; ధాత్రీదేవ+ఉత్కరము= బ్రాహ్మణుల సమూహం; భవత్+ప్రాదుర్భావములు= మీనుండి పుట్టుక కలవి; కావె?= కావా? (ఔనని భావం - ఈ విషయంలో ఎట్టి సంశయానికి అవకాశం లేదని కాక్వర్థం. లోకకల్యాణార్థం అనంతవిజ్ఞానరాశిని వేదాన్ని ఇచ్చి తత్ప్రచుర ప్రచారాన్ని కలుగజేసినవాడవు నీవే నని భావం).

తాత్పర్యం: ధర్మప్రబోధకాలైనవి వేదాలు. వాటిని నిరంతరం ధారణ చేసి, పఠన ప్రవచనాదుల ద్వారా వ్యాప్తి చేస్తున్న వేదమూర్తులైన బ్రాహ్మణుల సమూహాలు - హే భగవన్! మీనుండే ఆవిర్భవించాయి కదా!

విశేషం: 'యస్య నిశ్శ్వసితం వేదాః' అనే శ్రుతి వాక్యం వేదాలు ఆ భగవంతుడి నుండే ఆవిర్భవించాయనుటకు ప్రమాణం. వేదాలలో ముఖ్యములైన రెండు అంశాలున్నవి. ఒకటి విధి. రెండు అర్థవాదం. 'నీ విలా చేయుము' అని శాసించే భాగం విధి. ఇట్లా చేస్తే నీ కిన్ని లాభా లున్నాయి లేకుంటే అనర్థం - అని ప్రరోచనార్థం చెప్పే అంశం అర్థవాదం. అర్థవాదానికి విధిలో తాత్పర్యం. కావున విధి వాక్యమే ప్రధానం. 'ధర్మవాచకవాదంబులు అనే సమాసంలోని వాద పదానికి వాక్యం అనే అర్థం' 'వేదవాదరతాః' అని గీతా శ్లోకపదాన్ని వ్యాఖ్యానిస్తూ 'వాద' పదానికి 'వాక్యం' అనే అర్థాన్నే చెప్పారు. 'ఉచ్యంత ఇతి వాదాః వాక్యాని' (శంకరనాందీ గీతావ్యాఖ్య 2142) - వాదపదాన్ని అర్థవాదపరంగా వ్యాఖ్యానిస్తే 'అప్రధానాలైన అర్థవాద రూపాలు వేదాలు' - అనే అర్థభ్రాంతి ఏర్పడుతుంది. అందుకే విధివాక్యపరంగా భావించాలి.

క. **నినుఁ దనుఁగా నతినిర్మల । మనస్సమాధిప్రకర్షమగ్నత వలనం**
గనుఁగొని తద్రూప భజన । మొనరించు మహాత్ముఁ డమృత మొందుఁ బశుపతీ!' **414**

ప్రతిపదార్థం: పశుపతీ!= సర్వజగత్తునకు అధీశుడ వైన ఓ శివా!; నినున్= నిన్ను; తనున్+కాన్= తననుగా; అతినిర్మల= మిక్కిలి పవిత్రమైన; మనస్= చిత్తంయొక్క; సమాధి ప్రకర్ష= ఏకాగ్రతాతిశయం లోని; మగ్నత వలనన్= లీనత్వం వలన - అనగా చిత్తాన్ని ఇతర విషయాలవైపు పోనీయక ఏకాగ్రం చేయటం వలన; కనుఁగొని= తెలిసికొని; తద్+రూపభజనము= తత్పదార్థమై అపరబ్రహ్మ స్వరూపాన్ని సేవించటం; ఒనరించు= చేయునట్టి; మహాత్ముండు= మహానుభావుడు; అమృతము= మోక్షాన్ని; ఒందున్=పొందుతాడు (ఏ బ్రహ్మ పదార్థాన్ని తనయందు అనుసంధానం చేసి పుణ్యపురుషులు ముక్తులగుతున్నారో అట్టి పరబ్రహ్మం నీవే).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ పశుపతీ! అతి నిర్మలమైన ప్రగాఢ మనస్సమాధిలో, నిన్ను తననుగ దర్శించి, ఆ రూపాన్ని భజించేమహాత్ముడు, మోక్షాన్ని పొందుతాడు.

విశేషం: పశుపతీ!= పశువులనగా ద్విపాత్తులు చతుష్పాత్తులు మొదలగు ప్రాణిజాతం. దానికి పతి కాబట్టి పశుపతి శివుడు లేదా బ్రహ్మాది స్థావరాంతము అందరూ కూడా పశువులే వారి పతి అని కూడా అర్థం. రుద్రాధ్యాయి భాష్యంలో 'పశూనాం స్వభూతానాం ద్విపదాం చతుష్పదాం చ పతయే । ... బ్రహ్మాద్యాః స్థావరాంతాశ్చ పశవః పరికీర్తితాః । తేషాం పతిత్వా ద్విశ్వేశో భవః పశుపతిః స్మృతః ॥ ఇతి చ పురాణే' ఇది 'పశూనాం పతయే నమః' అనే రుద్రాధ్యాయ మంత్రానికి భట్టభాస్కర భాష్యం. ఈ జగత్తునకు సృష్టి స్థితి లయలు దేనియొక్క విలాసాలో, ఏదైతే ఈ జగత్తునంతా అంతర్లీనమై వ్యాపించి ఉన్నదో (తత్సృష్ట్వాతదేవాను ప్రావిశత్)- అట్టి పరతత్వం తప్ప మరేదీ రెండవది లేదనే అద్వైత భావన. ఈ పద్యంలో వ్యక్తీకరించబడింది. (నేహ నా నాస్తి కించన) - ఇది తిక్కన వేదాంత నిష్ఠకు పరాకాష్ఠ.

వ. **అని మఱియు ననేక భంగులం బ్రస్తుతించి 'దేవా! నిన్ను భక్తి భజియించు నాకు ననన్య సులభ ప్రభావం బొసంగు'మని యభ్యర్థించుటయు, దేవముఖ్యుం డగు విష్ణుదేవుం బ్రసన్నదృష్టినాలోకించి యప్పరమేశ్వరుండు 'నీవు నరసుర గంధర్వ కిన్నర గరుడోరగాది భూతంబుల నవలీల గెలిచి పరమ తేజో విరాజమానుండవై వర్తింపుము; నీకు నస్త్రంబుల శస్త్రంబుల నగ్ని - జలంబుల నశనినార్ద్రంబునను శుష్కంబునను స్థావరంబునను జంగమంబునను జావు నొప్పులు లేకుండం గలయవి దొడరిన నన్నైన జయింపు' మని వరం బిచ్చెం గావున నన్నారాయణుం డవిజయ్యుండై నెగడె; నతనియందు జనియించిన నరుండును నట్టివాఁడై కూడి సంచరించు నరసఖుం డగు నద్దేవుండు నిజమాయా విశేషంబులం జగన్మోహనుండై విహరించు నమ్మహాత్ము లిరువురును దానవుల వధియించుటకును ధర్మసంస్థాపనంబు సేయుటకు నై వలసిన యప్పుడెల్లను జననాది కృత్యంబులు గైకొని వినోదింతురు; వారలు గదా యీ కృష్ణార్జును లని చెప్పి కృష్ణద్వైపాయనుండు వెండియు నిట్లనియె.** **415**

ప్రతిపదార్థం: అని= అని (నుతించి); మరియున్= ఇంకను; అనేక భంగులన్= పలువిధాలుగా; ప్రస్తుతించి= స్తోత్రం చేసి;దేవా!= ఓ మహాదేవా!; నిన్నున్= నిన్ను; భక్తిన్= భక్తితో; భజియించు నాకున్= సేవించే నాకు; అనన్య సులభ ప్రభావంబు= ఇతరులచేత పొంద వీలులేని సామర్థ్యాన్ని; ఒసంగుము= ఇమ్ము; అని+అభ్యర్థించుటయున్= అని ప్రార్థించగానే; దేవముఖ్యుండు+అగు= దేవతలలో ప్రముఖుడైన; విష్ణుదేవున్= ఆ నారాయణ భగవానుడిని; ప్రసన్న దృష్టిన్= ప్రసన్నమైన చూపుతో; ఆలోకించి= చూచి-చూపులో సంతోషాన్ని వ్యక్తపరుస్తూ; ఆ+పరమేశ్వరుండు= ఆ మహాదేవుడు - శివుడు; నీవు= ఓ విష్ణూ! నీవు; నర సుర గంధర్వ కిన్నర గరుడ+ఉరగ+ఆది భూతంబులన్= మనుష్యులు, దేవతలు, గంధర్వులు, కిన్నరులు, గరుడులు, సర్పములు మొదలైన ప్రాణులను; అవలీలన్= అనాయాసంగా; గెలిచి= జయించి; పరమ తేజో విరాజమానుండవు+ఐ= మిక్కిలి తేజంతో ప్రకాశిస్తూ ఉన్నవాడవై; వర్తింపుము= ప్రవర్తించుము; నీకున్= (మరియు) నీకు; అస్త్రంబులన్= ఆగ్నేయాది దివ్యాస్త్రాల వలన; శస్త్రంబులన్= ఖడ్గాద్యాయుధాల వలన; అగ్నిజలంబులన్= అగ్నివలన, నీరువలన; అశనిన్= వజ్రాయుధం వలన లేదా పిడుగు వలన; ఆర్ద్రంబునను= తడియున్న వస్తువు వలన అనగా నురుగు మొదలగు వాటివలనను; శుష్కంబునను= ఎండి ఉన్న వస్తువువలన; స్థావరంబునను= నడక లేకుండా స్థిరంగా ఉండే స్వభావంగల చెట్లు, గుట్టలు మొదలైన వాటివలన; జంగమంబునను= నడిచే స్వభావంగల పశుపక్ష్యాదుల వలనను; చావు నొప్పులు= మరణం కాని శారీరక బాధ కాని; లేకుండన్+కలయవి= లేకుండా ఉంటవి; తొడరినన్= ఎదిరిస్తే; నన్నున్+ఐనన్= నన్నయినను; జయింపుము= జయిస్తావు; అని= ఇట్లా; వరంబు= వరాన్ని; ఇచ్చెన్= ఇచ్చాడు; కావునన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కాబట్టి; ఆ+నారాయణుండు= ఆ నారాయణ భగవానుడు; అవిజయ్యుండు+ఐ= జయింపశక్యం కానివాడై; నెగడెన్= అతిశయించాడు; అతని+అందున్+అ= ఆ నారాయణుడి యందే; జనియించిన నరుండును= పుట్టిన నరుడుకూడా; అట్టివాఁడు+ఐ=ఆ నారాయణుడియంతటి వాడై; కూడి= కలిసి; సంచరించున్= తిరుగుతాడు; నరసఖుండు+అగు= నరుడికి మిత్రుడైన;ఆ+దేవుండు=ఆ నారాయణుడు; నిజమాయా విశేషంబులన్= స్వీయములైన మాయావిశేషాలచేత - అనగా తనయొక్క పలు విధాలైన మాయలచేత; జగత్+మోహనుండు+ఐ= జగత్తును మోహింపజేస్తున్నవాడై; విహరించును= విహరిస్తాడు; ఆ+మహాత్ములు+ ఇరువురును= ఆ మహానుభావులిద్దరు కూడా; దానవులన్= రాక్షసులను; వధియించుటకును= సంహరించటానికి; ధర్మసంస్థాపనంబు+చేయుటకును+ఐ= ధర్మస్థాపనం చేయటానికే ఉండి; వలసిన+అప్పుడు+ఎల్లను= అవసరమైన సమయా లన్నింటిలో; జనన+ఆది కృత్యంబులు= పుట్టుట మొదలైన విధులను; కైకొని= చేపట్టి; వినోదింతురు= క్రీడిస్తూ ఉంటారు; వారలు= ఆ నారాయణుడు, నరుడు అనే వారే; కృష్ణ+అర్జునులు= ఈ కృష్ణుడు అర్జునుడు అనే వారే; కదా= కాదా! - ఔను (వారే వీరు ఇది నిశ్చయం); అని= ఇట్లా; చెప్పి= అశ్వత్థామతో చెప్పి; కృష్ణద్వైపాయనుండు= వ్యాసమహాముని; వెండియున్= మళ్ళీ; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా స్తోత్రం చేయటమేకాక మరెన్నో విధాలుగా స్తోత్రం చేసి 'ఓ మహాదేవా! ని న్నిట్లా భక్తితో భజించే, నాకు ఇతరులకు పొంద సాధ్యంకాని ప్రభావాన్ని దయచేయండి' అని కోరగానే, ఆ మహాదేవుడు శివుడు, దేవతలలో ముఖ్యుడైన ఆ విష్ణుదేవుని అనుగ్రహదృష్టితో చూచి, 'నీవు నరులను, సురలను, గంధర్వులను, కిన్నరులను, గరుడులను, నాగులను - వారు వీరు అనే భేదం లేక అందరినీ అనాయాసంగా గెలిచి అమితమైన, తేజస్సుతో ప్రకాశింపుము దానితో నీకు ఏ భయం ఉండదు. నీకు దేనివలన కూడా మరణం కాని శారీరక బాధ కాని కలుగదు. స్థావర జంగమాత్మకమైన ఈ ప్రపంచంలో ఏ వస్తువూ నిన్ను నొప్పించజాలదు. శస్త్రాలు, అస్త్రాలు నిన్నేం చేయజాలవు. పంచ మహాభూతాల వలననైనా నీకు ఎట్టి భయం కలుగదు. ఏవీ కూడా నిన్ను ఏమీ చేయజాలవు. తడి వస్తువులు, ఎండిన పొడి వస్తువులు- ఏవైనా కానీ నిన్నేమీ చేయజాలవు. ఎదిరిస్తే నన్ను కూడా జయించివేస్తావు.' అని ఆ శివుడు వరాన్నిఇచ్చాడు. కాబట్టి ఎవ్వరికీ జయింపశక్యం కానివాడై సర్వోత్కృష్టుడై నారాయణుడు విలసిల్లాడు. ఆ నారాయణుడి నుండి పుట్టినవాడు కావటం చేత కూడ అట్టివాడై ఆయనతో కూడి ఈ నరుడు సంచరిస్తూ ఉంటాడు. నరసఖుడైన ఆ నారాయణుడు తన లీలలచేత లోకులను మైమరపిస్తూ ఉంటాడు. మహానుభావులిద్దరు దానవ సంహారంచేసి, ధర్మసంస్థాపనం చేయటానికి అవసరం కలిగినప్పుడు ఆ యా అవతారాలను ఎత్తుతుంటారు. ఓ అశ్వత్థామా! ఈ కృష్ణార్జునులు ఎవరో కాదు. ఆ నారాయణనరులే వీరు.' అని వివరించి వ్యాసమహర్షి అశ్వత్థామతో ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: నరనారాయణులు అనే వీరిద్దరు భగవదంశతో పుట్టిన గొప్ప తపస్సంపన్నులైన ఋషులు. నారాయణుడు ధర్ముడి కుమారుడు అనే విషయం మూలంలో ఇట్లా ఉన్నది.

> **శ్లో॥యోసౌ నారాయణో నామ పూర్వేషా మపి పూర్వజః ।**
> **అజాయత చ కార్యార్థం పుత్రో ధర్మస్య విశ్వకృత్ ॥'**

ఆ నారాయణుడే తన తపోబలంచేత పుట్టించినవాడు నరుడు. ఈ విషయం మూల సంస్కృతంలో ఉన్నది.

> **శ్లో॥ తస్యైవ తపసాజాతం నరం నామ మహామునిమ్ ॥** (ద్రోణ 201/57,86)

శ్రీ మద్భాగవతంలో కూడా ఈ నరనారాయణులు ఇద్దరూ భగవదంశతో ధర్ముడికి దక్షప్రజాపతి కూతురు 'మూర్తి' అనే భార్యయందు అవతరించిట్లు చెప్పబడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్లో॥ధర్మస్య దక్షదుహిత ర్యజనిష్ట మూర్త్యాం నారాయణో నర ఇతి స్వతపః ప్రభావః (శ్రీమద్భా. 2/716)

ఈ విషయం విష్ణ్వవతారాల పరిగణనా సందర్భంలో చెప్పబడింది. నారాయణ మహాముని విష్ణువు అవతారంగా పేర్కొనబడినవాడు కావుననే తిక్కన ఆ నారాయణ ఋషి పర్యాయంగా విష్ణువాచక పదాలు 'పద్మాక్షుడు' మొదలైనవి వాడటం జరిగిందని తెలియాలి.

క. ' నీవుఁ దపస్తేజో వి । ద్యావిభవ సమగ్రమూర్తి వగు దైవమ; నీ
కే వినిపించెదఁ దెలియం । గా విను వారలకు నీకుఁ గలయంతరముల్.416

ప్రతిపదార్థం: నీవున్= నీవు కూడ; తపస్తేజోవిద్యావిభవసమగ్ర మూర్తివి+అగు= తపస్సు, తేజస్సు, విద్యలు - అనునట్టి ఈ అన్నింటి యొక్క వైభవంతో సంపూర్ణమైన స్వరూపం గలిగిన; దైవము+అ= దైవ స్వరూపుడవే (అయినా ఓ అశ్వత్థామా!) వారలకున్= ఆ నరనారాయణులకు; నీకున్= నీకు; కల+అంతరముల్= ఉన్నట్టి తారతమ్యాలు; తెలియంగాన్= తెలిసే విధంగా; ఏన్= నేను; నీకున్= నీకు; వినిపించెదన్= వినిపిస్తాను; విను= వినుము.

తాత్పర్యం: 'ఓ అశ్వత్థామా! నీవు కూడా దైవస్వరూపుడవే అనగా దైవాంశ సంభూతుడవే. ఎందుకంటే నీలో తపస్సు, తేజస్సు విద్యలు - ఇవన్నీ సమగ్రంగా ఉన్నవి. అయినప్పటికీ ఆ నరనారాయణులకు నీకు ఉన్న తేడాను వివరిస్తాను వినుము.

తే. శుభ్ర మగు నుర్విమృత్తిక సురుచిరంపుఁ । బ్రతిమఁ గావించికొని యందుఁ బరము నావ
హించి పూజావిశేషంబు లెల్లఁ జేసి । నీవు దొలుమేనఁ గొలిచితి నిష్ఠతోడ. 417

ప్రతిపదార్థం: ఓ అశ్వత్థామా! నీవు= నీవు; తొలుమేనన్= పూర్వజన్మలో; శుభ్రము+అగు= పవిత్రమైన; ఉర్విన్= భూమిలో; మృత్తికన్= మట్టితో; సురుచిరంపు ప్రతిమన్= అందమైన మూర్తిని; కావించికొని= చేసికొని; అందున్= ఆ ప్రతిమయందు; పరమున్= పరతత్త్వమైన ఆ భగవత్స్వరూపాన్ని; ఆవహించి= ఆవాహనం చేసికొని (ప్రాణప్రతిష్ఠ చేసి); పూజావిశేషంబులు+ఎల్లన్= పూజా ప్రకారాలను అన్నింటిని- అనేక విధాలైన పూజలను (లఘున్యాసమహాన్యాస రుద్రాభిషేకములు, లఘురుద్ర మహారుద్ర అతిరుద్రాదులు శివపూజలోని విశేషములు అనేకాలు); అనుష్ఠించి= చేసి; నిష్ఠతోన్= ఏకాగ్రతతో; కొలిచితి(వి)= సేవించావు.

తాత్పర్యం: ఓ అశ్వత్థామా! పూర్వజన్మలో నీవు శుభ్రమైన మన్నుతో అందమైన శివుని ప్రతిమను చేసి, ఆ ప్రతిమకు ప్రాణప్రతిష్ఠ చేసి, భగవంతుని ఆవాహించి అన్ని పూజలు నిష్ఠతో చేశావు.

క. వారలు లింగాధిష్ఠా । నా రూఢుంగా నొనర్చి యర్చించిరి భ
వ్యారాధన పరులై మును । గౌరీపతి నతులనియమ కల్పన వెలయన్. 418

ప్రతిపదార్థం: వారలు= ఆ కృష్ణార్జునులు; మును= పూర్వం అనగా నారాయణ నరులుగా ఉన్నప్పుడు; గౌరీపతిన్= శివుడిని; లింగ+అధిష్ఠాన+ఆరూఢున్+కాన్= లింగం అనే ఆధారస్థానాన్ని అధిష్ఠించినవాడినిగా; ఒనర్చి= చేసి - లింగరూపంలో ప్రతిష్ఠించి; భవ్య+ఆరాధనపరులు+ఐ= శుభమైన ఆరాధనయందు ఆసక్తులై; అతుల నియమ కల్పన= నిరుపమాన నియమాచరణం; వెలయన్= ప్రకాశించగా; అర్చించిరి= పూజించారు.

తాత్పర్యం: ఆ కృష్ణార్జునులు పూర్వం నారాయణనరరూపులై ఉన్నప్పుడు కఠోర నియమాలు పాటించి, ఆ పరమేశ్వరుడిని లింగంగా ప్రతిష్ఠించి భవ్యంగా ఆరాధించారు.

వ. ఎత్తెఱంగునం జేసినను పరమేశ్వరారాధనంబు సర్వార్థసాధనం బగు; నందును లింగంబునందుఁ బూజించుట

యర్చయం దారాధించుటకంటె ననేక గుణంబు లెక్కుడు గావున లింగార్చన పరులగు వారల నర్చారాధకుండవగు నీకు నెట్లు జయింప వచ్చు? మీమీ పూర్వజన్మంబుల యర్చనంబుల ఫలంబులు దారతమ్యంబులతో ననుభవింప వలవదే?' యని తెలియం బలుకుటయు, నశ్వత్థామ పులకితాంగుండును సమాహితాంతరంగుండునునై రుద్రునిం దలంచి నమస్కరించి గేశవుం గొనియాడి పరాశర నందనున కభివందనంబు సేసిన, నమ్మహాముని యంతర్ధానంబు సేయఁ దానును మరలివచ్చి నిజ రథారూఢుండై యరుణగభస్తి యస్తగిరి సమీపంబున కరుగుటఁ గనుంగొనుచుఁ గురుపతి పాలికిం జని యతనికిం గాలోచితం బెఱింగించినవాడై బలంబులఁ దివియ నియమించె; నట్లు తిరిగి దీనంబు లగు నాననంబులతోడం గౌరవులు విడిదలకుం బోయిరి; పాండవులు బహుతూర్య నినదంబులు సింహనాదంబులుం జెలంగం బొంగారిన సముద్రంబు చందంబున నుల్లసిల్లు సైన్యంబు మగిడించుకొని నిశ్చింతంబు లగు నంతఃకరణంబులతోఁ గృష్ణోపలాలితు లగుచు నిజశిబిరంబులకుం జనిరి; తదనంతరంబ ధనంజయుండు. 419

ప్రతిపదార్థం: ఏ+తెఱంగునన్= ఏ విధంగా; చేసినను= చేసినప్పటికీ; పరమేశ్వర+ఆరాధనంబు= శివారాధన; సర్వ+అర్థసాధనంబు = సకల ప్రయోజనాలను సాధించేది; అగున్= ఔతుంది; అందును= దానిలో కూడా; లింగంబునందున్= లింగాధిష్ఠానమందు; పూజించుట= ఆరాధించటం; అర్చయందున్= ప్రతిమారూప అధిష్ఠానమందు; ఆరాధించుట కంటెన్= అర్చించటం కంటె కూడ; అనేక గుణంబు= పలురెట్లు (ఎన్నో రెట్లు గుణములు); ఎక్కుడు= ఎక్కువ; కావునన్= కాబట్టి; లింగ+అర్చనపరులు+అగువారలన్= లింగాధిష్ఠానంలో పూజించటంచేత శ్రేష్ఠులైన ఆ కృష్ణార్జునులను; అర్చా+ఆరాధకుండవు+అగు= ప్రతిమాధిష్ఠానంలో ఆరాధించిన వాడవైన; నీకున్= నీకు; ఎట్లు= ఏ విధంగా; జయింపవచ్చున్= జయించటం సాధ్యమవుతుంది?; మీమీ పూర్వజన్మంబుల+అర్చనంబుల ఫలంబులు= మీమీ పూర్వజన్మలలోని పూజల ఫలాలను; తారతమ్యంబులతోన్= తర తమ భావాలతో (హెచ్చుతగ్గులతో యథోచితంగా); అనుభవింప వలవదే?= అనుభవించవద్దా? (అనుభవించవలసిందే; అని= ఇట్లు; తెలియన్= తెలిసే విధంగా; పలుకుటయున్= చెప్పగానే; అశ్వత్థామ; పులకిత+అంగుండును= పులకాంకురములు ఉదయించిన శరీరంగల వాడయి(మరియు); సమాహిత+అంతరంగుండును= నిశ్చలమైన మనస్సుగలవాడు; ఐ= అయి; రుద్రునిన్= శివుడిని; తలంచి= స్మరించి; నమస్కరించి= మ్రొక్కి; కేశవున్= ఆ నారాయణాంశతో జనించిన కృష్ణుడిని; కొనియాడి= ప్రశంసించి; పరాశర నందనునకున్=పరాశర మహాముని కుమారుడైన వ్యాసభగవానుడికి; అభివందనంబు= నమస్కారం; చేసినన్= చేయగా; ఆ+మహాముని= ఆ వ్యాసమహర్షి; అంతర్ధానంబు+చేయన్= తిరోధానం చేయగా, కనుమరుగు కాగా, మాయమైపోగా; తానును= ఆ అశ్వత్థామ తానుకూడ; మరలి వచ్చి= తిరిగి వచ్చి; నిజరథ+ఆరూఢుండు+ఐ= తన రథాన్ని ఎక్కినవాడై; అరుణగభస్తి= సూర్యుడు (అరుణ= ఎర్రని, గభస్తులు= కిరణాలు కలవాడు; అరుణగభస్తి= సూర్యుడు); అస్తగిరి సమీపంబునకున్= అస్తాద్రి సమీపానికి; అరుగుటన్= వెళ్ళుటను (సూర్యాస్తమయాన్ని); కనుంగొనుచున్= గమనిస్తూ; కురుపతి పాలికిన్= దుర్యోధనుడి సమీపానికి; చని= వెళ్ళి; అతనికిన్= ఆ దుర్యోధనుడికి; కాల+ఉచితంబు= సమయానికి తగిన విషయాన్ని; ఎఱింగించినవాఁడై= తెలియజేసినవాడై; బలంబులన్= సైన్యాలను; తివియన్= ఉపసంహరించటానికి (యుద్ధం ఆపటానికి); నియమించెన్= నియోగించాడు; అట్లు= ఆ విధంగా; తిరిగి= మగిడి; దీనంబులు+అగు+ఆననంబుల తోడన్= దైన్యంతో నిండిన ముఖాలతో; కౌరవులు= కౌరవవీరులు; విడిదలకున్= విడిది చేసిన నివాసాలకు; పోయిరి= వెళ్ళారు; పాండవులు= పాండవ యోధులు; బహుతూర్య నినదంబులు= అనేక వాద్యాల ధ్వనులు; సింహనాదంబులు= వీరుల సింహనాదాలు; చెలంగన్= చెలరేగగా; పొంగారిన సముద్రంబు చందంబునన్= ఉప్పొంగిన సముద్రం వలె; ఉల్లసిల్లు సైన్యంబు= ప్రకాశించే సైన్యాన్ని; మగిడించికొని= మరల్చుకొని; నిశ్చింతంబులు+అగు+అంతఃకరణంబులతోన్= చింతలేని మనస్సులతో; కృష్ణ+ఉపలాలితులు+అగుచున్= కృష్ణుడిచేత అభినందించబడుతూ; నిజశిబిరంబులకున్= తమ శిబిరాలకు; చనిరి= వెళ్ళారు; తద్+అనంతరంబు+ఆ= అటు తరువాతనే; ధనంజయుండు= అర్జునుడు.

తాత్పర్యం: ఏ విధంగా శివారాధన చేసినా మనోరథాలు అన్నీ నెరవేరుతాయి. అయినా అందులో లింగాకారంలో ఉన్న

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శివుడిని పూజించటం, ప్రతిమాకారంలో ఉన్న శివుడిని పూజించటం కంటె ఎన్నో రెట్లు అధికం. ఆ కృష్ణార్జునులు లింగాకారంలో ఉన్న శివుడిని ఆరాధించారు. నీవేమో ప్రతిమలో శివుడిని పూజించావు. అందుకే వారిని జయించటం నీ కెట్లా సాధ్యమవుతుంది? మీరు మీరు పూర్వజన్మలో చేసిన పూజా ఫలాలను తారతమ్యాలతో అనుభవించక తప్పదు.' కదా-అని తెలియజెప్పగా, అశ్వత్థామ పులకించి, ప్రశాంతతపొందిన మనస్సుతో ఆ పరమేశ్వర రూపాన్ని మనస్సులో ధ్యానించి, నమస్కరించాడు. కృష్ణుడిని ప్రస్తుతించాడు. వ్యాసుడికి పాదాభివందనం చేశాడు. అప్పుడు వ్యాసుడు అంతర్ధానం చెందగా. అశ్వత్థామ వెంటనే మళ్ళీ వచ్చి, రథాన్ని అధిరోహించాడు. అప్పుడే సూర్యాస్తమయం అవుతూ ఉండటం గమనించి దుర్యోధనుడి సమీపానికి వెళ్ళాడు. 'సూర్యాస్తమయం కావస్తూ ఉన్నది. ఇక యుద్ధం విరమింపజేసి సైన్యాన్ని మరలిస్తాను' అని తత్కాలోచితంగా చెప్పాడు. సైన్యం యుద్ధరంగంనుండి మరలింది. ఆ కౌరవవీరులు ముఖాలు దీనంగా పెట్టి తమ తమ విడిదులకు తరలి వెళ్ళారు. పాండవులు, విజయభేరులు మ్రోగిస్తూ సింహనాదాలు చేస్తూ ఉప్పొంగుతున్న సముద్రంవలె ఉన్న సైన్యాన్ని మరలించుకొని, ఏ చింతా లేక సంతోషంతో నిండిన మనస్సులతో శ్రీకృష్ణుని అభినందనలు అందుకొంటూ తమ శిబిరాలకు వెళ్ళారు. (తరువాతి పద్యంతో అన్వయం).

వేదవ్యాసమునీంద్రుఁ డర్జునునకుఁ బరమేశ్వరు మహిమ సెప్పుట (సం. 7-173-2)

మ. మహనీయాకృతి సంయమిప్రవరు ధర్మస్ఫూర్తి సంకీర్తనీ
యు హుతాగ్ని ప్రతిమానతేజుఁ గరుణాయుక్తుం బ్రతీపాన్వయో
ద్వహు నాశ్చర్యకర ప్రబోధనిధి వేదవ్యాసుఁ బుణ్యున్ జయా
వహుఁ డై వచ్చినవాని నాగమసుఖావాసాననాంభోరుహున్. 420

ప్రతిపదార్థం: మహనీయ+ఆకృతిన్= గొప్పతేజస్సుతో కూడిన ఆకారంకలిగిన; వానిని, సంయమి, ప్రవరున్= మునులలో శ్రేష్ఠుడైన టువంటి వానిని, ధర్మస్ఫూర్తి సంకీర్తనీయున్= ధర్మదేవతయొక్క సాక్షాత్కారమని కీర్తించదగినవానిని - ధర్మదేవతయే మూర్తీభవించి సాక్షాత్కరించిందా అనే విధంగా ఉన్నట్టివానిని; హుత+అగ్ని ప్రతిమానతేజున్= హోమాగ్నితో (హోమకుండంలోని అగ్నితో) సమానమైన తేజస్సు కలిగి ఉన్నవానిని; కరుణాయుక్తున్= దయతో కూడుకొని ఉన్నట్టివానిని; ప్రతీప+అన్వయ+ఉద్వహున్= ప్రతీపుడనే మహారాజు వంశాన్ని, ఉద్ధరించినవానిని; ఆశ్చర్యకర ప్రబోధనిధిన్= ఆశ్చర్యాన్ని గొలిపే విజ్ఞానానికి నిధి అయినటువంటివానిని; పుణ్యున్= పవిత్రుడైనట్టివానిని; జయ+ఆవహుఁడు+ఐ వచ్చినవానిన్= విజయాన్ని చేకూర్చువాడై వచ్చినవాడు; ఆగమ+సుఖావాస+ఆనన+అంభోరుహున్= వేదాలకు సుఖనివాసమైన ముఖ కమలం కలవాడై యున్నట్టివానిని; వేదవ్యాసున్= వేదవ్యాసుని.

తాత్పర్యం: (అర్జునుడు) మహనీయమైన ఆకారం కలవాడు, మునులలో శ్రేష్ఠుడు, ధర్మతేజస్సు చేత కీర్తించదగినవాడు, హెూమాగ్నితో సమానమైన కాంతికలవాడు, దయాగుణంతో కూడుకొన్నవాడు, ప్రతీప మహారాజు వంశాన్నిఉద్ధరించిన వాడు, ఆశ్చర్యాన్ని గొలిపే విజ్ఞానానికి నిధి అయినటువంటివాడు, వేదాలకు సుఖ నివాసమైన ముఖ పద్మం కలవాడు, విజయాన్ని కలిగించటానికై వచ్చినవాడు అయిన వేదవ్యాస మహర్షిని (తరువాతి వచనంతో అన్వయం)

విశేషం: కురువంశీయుడైన ప్రతీపుడనే రాజు మిక్కిలి ధర్మాత్ముడు, తపశ్శాలి. అతడు గంగాతీరమందు తపస్సు చేస్తూ ఉండగా

అతడి గుణగణాలకు మురిసిపోతూ గంగాదేవి వచ్చి అతడి కుడితొడపై కూర్చుండి తనను వివాహమాడుమని కోరింది. ప్రతీపుడు ధర్మాతిక్రమణం చేయలేక అందులకంగీకరించలేదు. కాని, 'తనయులకు, కూతుళ్ళకు కూర్చొనటానికి తగిన నా కుడితొడపై అధిష్ఠించావు కాబట్టి నిన్ను కోడలుగా చేసుకుంటా'నని మాట ఇచ్చాడు. ఆ ప్రతీపకుమారుడు శంతనుడు గంగను పెండ్లాడి, తండ్రి మాట నిలబెట్టాడు. ఆ గంగాపుత్రుడే భీష్ముడు. భీష్ముడు ఆజన్మబ్రహ్మచారి - శంతనుడి రెండవ భార్య సత్యవతి. ఆమె పుత్రులు విచిత్రవీర్య చిత్రాంగద క్షేత్రముల యందు దేవరన్యాయంతో వ్యాసుడు సంతానోత్పత్తి చేసి ప్రతీపుని(కురు) వంశాన్ని నిలబెట్టాడు. ఇట్లా ఉన్నది కాబట్టే ప్రతీపాన్వయోద్వహుడైనాడు వ్యాసుడు. 'ప్రతీప్తాన్వయోద్వహున్' అనే పాఠం ఉస్మానియా ప్రతి ఆదరించింది. ఇది అంత అర్థవంతంగా లేదు. పాఠాంతరంగా చూపిన 'ప్రతీపాన్యయోద్వహున్' అనే పాఠమే సముచితంగా ఉన్నది. కాబట్టి దానినే స్వీకరించి వ్యాఖ్యానించటం జరిగింది. (ప్రతీపుని కథ సం. భార. ఆదిపర్వం - 97, 98 అధ్యాయాలు మరియు తెలుగు భారతంలో- ఆది - చతుర్థాశ్వాసం 135వ పద్యం నుండి)

వ. అంతంతం గనుంగొని యత్యంతవినయ సంభ్రమంబులతో దండప్రణామంబు సేసి యాసనార్ఘ్యపాద్యాది పూజనంబుల నారాధించి సమీపభూమిం గూర్చుండి కృతాంజలి యై సుప్రసన్నంబగు నమ్మహాముని వదనంబు వీక్షించి. 421

ప్రతిపదార్థం: అంతంతన్= కొంచెం దూరంలో; కనుంగొని= చూచి; అత్యంత వినయ సంభ్రమంబులతోన్= మిక్కిలి వినయంతో, వేగిరపాటుతో; దండప్రణామంబు+చేసి= దండవత్ ప్రణామం అనగా సాష్టాంగ నమస్కారం చేసి; ఆసన+అర్ఘ్యపాద్య+ఆది పూజనంబులన్= ఆసనం, అర్ఘ్యం, పాద్యం మొదలైన పూజా విధులతో; ఆరాధించి= పూజించి; సమీపభూమిన్= దగ్గరి ప్రదేశంలో; కూర్చుండి= కూర్చొని; కృత+అంజలి ఐ= చేయబడిన అంజలి బంధం కలవాడై (చేతులు జోడించి); సుప్రసన్నంబు+అగు= మిక్కిలి ప్రసన్నంగా ఉన్న చిరునవ్వుతో కూడిన; ఆ+మునివదనంబు= ఆ కృష్ణద్వైపాయనముని ముఖాన్ని; వీక్షించి= చూచి.

తాత్పర్యం: కొంతదూరంలో చూచి వేగిరపాటుతో లేచి ఎదురేగి వినయంతో సాష్టాంగనమస్కారం చేసి తోడ్కొని వచ్చి సమీపస్థలంలో కూర్చుండబెట్టి, అర్ఘ్య పాద్యాది పూజలతో ఆరాధించి, దగ్గరగా వచ్చి నేలమీదకూర్చొని, మందహాసం చిందే అతడి వదనారవిందాన్ని చూస్తూ, చేతులు జోడించి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ' అవధరింపు మహాత్మ! కయ్యమున నేను । శాత్రవుల నేయఁ బూనుచో సరభసముగ
నడరి ముందట నొకరుఁడు పుడమి నడుగు । లిడక పావకనిభమూర్తి యెసక మెసఁగ. 422

ప్రతిపదార్థం: మహాత్మ!= ఓ మహానుభావా! వ్యాసమహామునీ!; అవధరింపు= సావధానంగా వినండి; కయ్యమునన్= యుద్ధంలో; నేను= నేను; శాత్రవులన్= శత్రువులను; ఏయన్+పూనుచోన్= కొట్టటానికి పూనుకొంటూ ఉండగా; సరభసముగన్= త్వరితంగా; అడరి= విజృంభించి; ముందటన్= నా ముందర; ఒకరుఁడు= ఒకడు (ఒక మహాపురుషుడు అని భావం); పుడమిన్+అడుగులు+ఇడక= భూమిపై పాదాలు మోపక; పావక నిభమూర్తి= అగ్నితో సమానమైన ఆకృతి; ఎసక మెసఁగన్= ప్రకాశించగా.

తాత్పర్యం: మహాత్మా! నేను చెప్పే విషయం సావధానంగా వినండి. నేను యుద్ధంలో శత్రువులను కొట్టటానికి పూనుకొంటూ ఉండగా, నా ముందర భూమిపై కాళ్ళంటకుండా త్వరత్వరగా విజృంభించి నడుస్తూ, అగ్నివలె జ్వలిస్తూ ఉన్న ఆకారంతో ఒక మహాపురుషుడు (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. కిరణము లుల్లసిల్లఁ దన కేల నుదగ్రపుశూల ముండఁగాఁ
బొరిఁబొరి నందు ఘోరముగఁ బుట్టినశూల పరంపరల్ గరం
బరుదుగ వారి నెల్లఁ దెగటార్పఁగ నే వెనుకన్ శరంబులం
గురియుచుఁ జంపినాఁడ నని కొందు జయంబు సముద్భటంబుగన్. 423

ప్రతిపదార్థం: కిరణములు= తళుకులు; ఉల్లసిల్లన్= ప్రకాశిస్తూ ఉండగా; తనకేలన్= తన చేతిలో; ఉదగ్రపు శూలము= భయంకరమైన శూలం; ఉండఁగాన్= ఉండగా; అందున్= ఆ శూలమందుండి; ఘోరముగన్= భయంకరంగా; పొరిన్+పొరిన్= మాటిమాటికీ; పుట్టిన శూలపరంపరల్= పుట్టుతూ ఉన్న శూలాల వరుసలు; కరంబు= మిక్కిలి; అరుదుగన్= ఆశ్చర్యం కలిగించే విధంగా; వారిన్+ఎల్లన్= ఆ శత్రువులందరిని; తెగటార్పఁగన్= సంహరించగా; ఏన్= నేను; వెనుకన్= అటు తరువాత; శరంబులన్= బాణాలను; కురియుచున్= కురిపిస్తూ; చంపినాఁడన్+అని= సంహరించినవాడిని (నేనే) అని; జయంబు= విజయాన్ని; సముద్భటంబుగన్= గొప్పగా; కొందున్= గైకొంటూ ఉన్నాను (నిజానికి సంహరించిందతడే, కీర్తి మాత్రం నాకు అని భావం).

తాత్పర్యం: తన చేతులలో తళుకులీనే భయంకరమైన శూలం పట్టుకొన్నాడు. ఆ శూలం నుండి మరెన్నో భయంకరాలైన శూలాలు మాటిమాటికీ పుట్టుతూ, శత్రువులందరినీ సంహరిస్తూ ఉంటే నాకెంతో ఆశ్చర్యం కలిగింది. అతడు నా ముందు సంహరిస్తూ పోతూ ఉంటే నేను వెనుకనుండి శత్రువులపై బాణాలు కుమ్మరిస్తూ పోతూ సంహరించింది నేనే అని అనుకొంటూ ఉన్నానే తప్ప, నిజానికి సంహరించింది నేను కాదు - అతడే. కాని సంహరించాననే కీర్తి, శత్రువిజయం గొప్పగా నాకు దక్కింది.

క. అప్పురుషుఁ డెవ్వఁడో యని । యెప్పుడు మదిఁ దలఁతు; నతని నేర్పడ నాకుం
జెప్పవలయు' నని యడిగిన । నప్పార్థున కిట్టులనియె నమ్ముని ప్రీతిన్. 424

ప్రతిపదార్థం: ఆ+పురుషుఁడు= ఆ మహాపురుషుడు; ఎవ్వఁడో?= ఎవడు కావచ్చు?; అని= ఇట్లు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; మదిన్= మనస్సులో; తలఁతున్= అనుకొంటూ ఉన్నాను; అతనిన్= ఆ మహాపురుషుడిని గూర్చి; ఏర్పడన్= స్పష్టంగా తెలిసే విధంగా; నాకున్= ఓ వ్యాసమహామునీ! నాకు; చెప్పవలయున్= చెప్పాలి; అని= అని ఈ విధంగా; అడిగినన్= ప్రశ్నించగా; ఆ+పార్థునకున్= ఆ అర్జునుడితో; ఆ+ముని= ఆ వ్యాసముని; ప్రీతిన్= సంతోషంతో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ దివ్యపురుషుడు ఎవరా? అని ఎప్పుడు మనస్సులో అనుకొంటూ ఉంటాను. అత డెవడో నాకు మీరు స్పష్టంగా చెప్పాలి' అని అర్జునుడు అడుగగా, ఆ వ్యాసమహర్షి సంతోషంతో ఇట్లా అన్నాడు.

వ. నీయడిగిన యతండు. 425

తాత్పర్యం: నీవు అడిగిన ఆ మహాపురుషుడు.

ఉ. ఆదికి నాది, లోకముల కన్నిటికిం బ్రభుఁ డవ్యయుండు, వే
దాది పవిత్ర వాచక సహస్ర పరిస్ఫుట వాచ్యరూపుఁ, డం
హోదళన ప్రకారక శుభోదయ కారక దివ్యనాముఁ, డం
బాదయితుండు దృఙ్మహిత ఫాలుఁడు లోలుఁడు భక్తి యుక్తికిన్. 426

ప్రతిపదార్థం: (ఓ అర్జునా! అతడు) ఆదికిన్= ఈ సృష్ట్యాదికి; ఆది= మూలం - తానే సృష్ట్యాదిఅయి తన కాది అంటూ లేని వాడు; లోకములకు+అన్నిటికిన్= సమస్త లోకాలకు; ప్రభుఁడు= అధిపతి; అవ్యయుండు= అంతరించటం అనేది లేనివాడు; వేద+ ఆది= వేదాలు మొదలుగా గల; పవిత్రవాచక సహస్ర= పవిత్రములైన శబ్దసహస్రాలకు, అనగా వేదాలు ఉపనిషత్తులు మొదలైన వేలకొలది శబ్దరాశులకు; పరిస్ఫుట వాచ్యరూపుఁడు= స్పష్టమైన వాచ్యార్థస్వరూపుడైనవాడు (వేదాలు ఉపనిషత్తులు మొదలైనవి ఈతడి తత్త్వాన్నే ప్రస్ఫుటంగా బోధిస్తూ ఉన్నవని భావం); అంహోదళన ప్రకారక= పాపఖండన రూపమైన; శుభోదయ= మంగళకరమైన అభివృద్ధిని; కారకన్= చేయునట్టి; దివ్యనాముఁడు= దివ్యమైన నామధేయం కలవాడు - అనగా ఇతడి దివ్యనామం స్మరణం చేసినంత మాత్రాన పాపాలు నశించి శుభాలు చేకూరుతవి; అంబాదయితుండు= పార్వతీదేవికి భర్త; దృక్+మహితఫాలుఁడు= తృతీయ నేత్రంచేత పూజితమైన (ఒప్పుతున్న) లలాటభాగం కలవాడు; భక్తియుక్తికిన్= భక్తియోగానికి; లోలుఁడు= ఆసక్తి చూపేవాడు (నిష్కపట భక్తిచే వశుడవుతాడు).

తాత్పర్యం: అతడు ఈ సృష్టి కంతటికి మూలమైనవాడే కాని తనకు ఆది అనేది లేనివాడు (అనాది). ఈ లోకాలనన్నింటిని పరిపాలించే ప్రభువు. తనకు అంతం అనేది లేనివాడు, వేదాలు ఉపనిషత్తులు మొదలైన అనంత శబ్దరాశి ప్రబోధించే తత్త్వస్వరూపుడు. పాపాలు హరించి, శుభాలు కూర్చే దివ్యమైన నామం కలవాడు, పార్వతీపతి. మూడవకంటితో ప్రకాశించే లలాటం కలవాడు. భక్తికి వశమయ్యేవాడు.

విశేషం: లోకముల కన్నిటికిన్ - లోకాలు పద్నాలుగు. ఊర్ధ్వలోకాలు ఏడు. అవి 1.భూర్లోకం, 2.భువర్లోకం, 3.సువర్లోకం (స్వర్గం) 4.తపోలోకం, 5.మహర్లోకం, 6.జనలోకం, 7.సత్యలోకం ఇవి. ఇక అధోలోకాలు: అతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతల, పాతాళలోకాలు ఏడు. మొత్తం పదునాలుగు. ఇవే చతుర్దశ భువనాలు అని తెలియాలి. పురాణాలలో ఈ లోకాల వర్ణన కానవస్తుంది.

క. యోగీంద్రచిత్తకమలా । భోగ మధుప విభుఁడు, ప్రకృతిపురుషాత్ముఁడు, ని
ర్భోగ స్వరూపుఁ డవ్య । క్తా గోచరుఁ డధికసులభుఁ డమలాత్ములకున్. 427

ప్రతిపదార్థం: యోగి+ఇంద్రు= యోగీశ్వరుల యొక్క; చిత్త కమల=మనస్సుఅనే కమలంయొక్క; ఆభోగ= పరిపూర్ణ-అనగా విశాలమైన చిత్తకమలానికి; మధుప విభుఁడు= మేటి తుమ్మెదఅయినవాడు (ఎట్లాగయితే తుమ్మెద కమలంలో మకరంద లోలుపమై స్థిరంగా ఉంటుందో అట్లే ఈతడు యోగీశ్వరుల మనస్సులలో భక్తికి వివశుడై స్థిరంగా ఉంటాడని భావం. ఇది రూపకాలంకారం); ప్రకృతి పురుష+ఆత్ముఁడు= ప్రకృతి పురుషులే స్వరూపంగా కలవాడు ("శ్లో॥ ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి"అనేగీతా శ్లోకభాష్యంలో శంకర భగవత్పాదులు 'ప్రకృతిం పురుషం చైవ ఈశ్వరస్య ప్రకృతీ తౌ ప్రకృతి పురుషౌ' - అని ప్రకృతి పురుషులు అనాదులై భగవత్స్వరూపంగా ఉన్నారని చెప్పి ఉన్నారు); నిర్భోగ స్వరూపుడు= విషయోపభోగరహితమైన స్వరూపం కలవాడు- అనగా ఆత్మారాముడు; అవ్యక్త+అగోచరుండు= అవ్యక్తం అనగా సత్యజ్ఞానానంద స్వరూపమైన నిరాకార పరబ్రహ్మం - తద్రూపుడై ఉండటంచేత అగోచరుడు అనగా చక్షురాది ఇంద్రియాలకు మనస్సునకు కూడా అందనివాడు. ఇందుకు -"యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ" అనే శ్రుతివాక్యం ప్రమాణం. అంతటి దుర్బోధమైన స్వరూపం కలవాడైనా భక్తానుగ్రహార్థం వివిధ రూపాలతో అవతరించి); అమల+ఆత్ములకున్= నిర్మలమైన మనస్సుగల భక్తులకు; అధిక సులభుఁడు= మిక్కిలి అనాయాసంగా లభించేవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: బాహ్యదృష్టికి అగుపించనివాడు. నిర్మలమైన చిత్తం కలవారికి చాల సులువుగా లభించేవాడు.

ఉ. నీలగళుండు, శంకరుఁడు, నిత్యుఁడు, సత్యసురూపుఁ, డుజ్జ్వల
త్కాల మహానల ప్రశమక ప్రచురామృతవృష్టి విస్ఫుర
ద్బాలమృగాంక శేఖరుఁడు, దైత్యకుల ప్రవిదారణ క్రియా
లోల పరశ్వథుండు, సకలుం డమలుండు, ప్రియుండు శాంతికిన్.' 428

ప్రతిపదార్థం: నీలగళుండు= నల్లనైన అనగా నల్లగా మారిన కంఠం గలవాడు - దేవాసురుల అమృతమథన సమయంలో పుట్టిన కాలకూట విషాన్ని దేవాసురులు వేడగా లోకకల్యాణార్థమై మింగటంచేత కంఠం నల్లగా మారి నీలకంఠుడని ప్రసిద్ధి చెందినవాడు. దీనిచే భక్తపారవశ్యం వ్యక్తమవుతూ ఉన్నది; శంకరుఁడు= శుభాన్ని కలుగజేసేవాడు - అరిష్టాలను నివారించి మంగళాన్ని చేసేవాడు- దీనిచేత మృత్యువునే దూరీకరించి దీర్ఘాయుష్యాన్ని మార్కండేయుడికి అనుగ్రహించిన వృత్తాంతం వ్యక్తీకరించబడింది; నిత్యుఁడు= నిత్యస్వరూపుడు - మూడు లోకాలలోనూ చెక్కుచెదరక ఒకే విధంగా ఉండే స్వరూపం కలవాడు; సత్యసురూపుఁడు= సత్యమైన స్వరూపం కలవాడు - అనగా మూడు లోకాలలో అబాధితమైన తన అస్తిత్వం కలవాడు. 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' అనే శ్రుతి వాక్యం ప్రకారం సత్యమే తన రూపైన వాడని భావం; ఉజ్జ్వలత్= మండుతున్న; కాలమహానల= గొప్ప ప్రళయ కాలాగ్నిని; ప్రశమక= చల్లార్చేటటువంటి; ప్రచుర+అమృతవృష్టి= గొప్ప అమృతవర్షం కలిగి; విస్ఫురత్= ప్రకాశించే; బాలమృగ+అంక= బాలచంద్రుడు; శేఖరుఁడు= శిరోభూషణంగా కలిగినవాడు (భీకరంగా ప్రళయాగ్ని చెలరేగి జగత్తును కాల్చివేస్తూ ఉంటే తాను శిరోభూషణంగా ధరించిన బాలచంద్రుడిద్వారా అమృతవృష్టి కురిపించి ఆ ప్రళయాగ్నిని చల్లార్చి జగత్కల్యాణం చేసినవాడని భావం); దైత్యకుల= రాక్షసుల సమూహాన్ని; ప్రవిదారణ క్రియా= చీల్చి ఖండించివేయటంలో; లోల= ఆసక్తమైన; పరశ్వథుండు= గండ్రగొడ్డలి కలవాడు; సకలుండు= ఏ విధమైన పాపం అంటనివాడు - నిర్మలుడు; శాంతికిన్= శాంతిభావానికి; ప్రియుండు= మిక్కిలి ఇష్టమైనవాడు; (ఓ అర్జునా! నీ ముందు శూలధారి అయి వెళ్ళుతూ శత్రుసంహారం చేసినవాడు ఇట్టివాడు - అనగా అతడు ఆ పరమేశ్వరుడు పార్వతీపతి శివుడు).

తాత్పర్యం: నల్లని కంఠం కలవాడు, శుభాన్ని కలిగించేవాడు, శాశ్వతంగా ఉండేవాడు, సత్యమైన స్వరూపం కలవాడు, మండుతున్న ప్రళయకాల మహాగ్నిని చల్లార్చే అమృతవర్షమైనవాడు, ప్రకాశించే బాలచంద్రుని శిరోభూషణంగా కలవాడు, రాక్షససమూహాన్ని ఖండించే పనిలో ఆసక్తిగల గండ్రగొడ్డలి కలవాడు, అంతా తానైనవాడు, పవిత్రమైన వాడు, శాంతి అంటే ఎంతో ఇష్టపడేవాడు.

వ. అని ప్రశంసించి కవ్వడి గనినవాఁడు రుద్రుం డగుటఁ దేటపఱిచి దక్షమఖ మథన త్రిపుర మర్దనాదులగు నద్దేవుని దివ్యలీల లుపన్యసించి మహాదేవ పశుపతి శివప్రముఖంబు లగు తదీయ భవ్యనామంబులకుం బ్రవృత్తి నిమిత్తంబులగు నర్థంబులు దెలియ నిర్వచనంబు సేసి; 'యట్టి పరమేశ్వరుండు నీకు వరదుండయి సన్నిధిసేసె నతనిం గని పెన్నిధిఁ గన్న పేదవోలెం గృతార్థుండ వై; తయ్యంధకాసురభంజను కతంబున గడింది పగ రడంగుదు; రయ్యాదిమ ధనుర్ధరుం డివ్విధంబున; వైరివధం బాపాదింప నీకు గెలుపు గొనుట సుకరం

బయ్యె; నీ తపంబు పెంపునం దొల్లి సన్నిహితుండై నీకుం బ్రియంబుగా దివ్యాస్త్రంబు లొసంగె; నంతటం దనివి సనక యత్తెఱంగున భక్తపరాధీనత్వంబు ప్రకటించె; నీవు పుణ్యాత్ముండ వప్పరమాత్ము నాత్మ నిలిపి నమస్కరింపు; మాసర్వలోక శరణ్యు శరణంబు సొరు మక్కరుణాకరుండు శరణాగతులకు నాయు రారోగ్యైశ్వర్యాది సకలాభిమతంబులు నిత్యంబులుగాఁ బ్రసాదించు' నని నిర్దేశించిన నయ్యర్జునుండు దండ ప్రణామ పూర్వకంబుగా భక్తి రసాయత్తంబగు చిత్తంబునం జంద్రధరు నెలకొలిపి సాంద్రానందం బనుభవించి సాత్యవతేయు చరణంబుల కెఱంగిన, నమ్మునీంద్రుం డయ్యింద్ర నందను నభినందించి 'సుఖివి గ' మ్మని దీవించి విజయం చేసె నని యిట్లు సంజయుండు ధృతరాష్ట్రున కెఱింగించె నని జనమేజయునకు వైశంపాయనుండు సెప్పుటయు. **429**

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; ప్రశంసించి= వర్ణించి చెప్పి; కవ్వడి+కనినవాఁడు= అర్జునుడు చూసినవాడు; రుద్రుండు+అగుటన్+ తేటపఱిచి= సాక్షాత్తూ పరమేశ్వరుడే అయి ఉండటాన్ని స్పష్టంగా తెలియజెప్పి; దక్షమఖమథన త్రిపుర మర్దనాదులు+అగు+ఆ+దేవుని దివ్యలీలలు= దక్షప్రజాపతి యజ్ఞాన్ని, తన భార్య సతీదేవి అవమానాన్ని పురస్కరించుకొని ధ్వంసం చేయటం, త్రిపురాసుర సంహారం మొదలైన ఆ మహాదేవుడి దివ్యలీలను; ఉపన్యసించి= వివరంగా చెప్పి; మహాదేవ పశుపతి శివ ప్రముఖంబులు+అగు= మహాదేవుడు, పశుపతి, శివుడు మొదలైన; తదీయ దివ్యనామంబులకున్= ఆ పరమేశ్వరుడి దివ్యములైన పేర్లకు; ప్రవృత్తి నిమిత్తంబులు+అగు+అర్థంబులు= ప్రవృత్తికి నిమిత్త భూతములైన అర్థాలను (ఆ పేర్లతో పిలవటానికిగల హేతువేమిటో, దానికి గల కథలెట్టివో వాటిని-అని భావం); తెలియన్= తెలిసే విధంగా; నిర్వచనంబు+చేసి= వివరించి చెప్పి; అట్టి పరమేశ్వరుండు= అటువంటి పరమశివుడు; నీకున్= ఓ అర్జునా! నీకు; వరదుండు+అయి= కోరిన వరాన్ని ఇచ్చినవాడై; సన్నిధి+చేసెన్= సమీపానికి వచ్చాడు; అతనిన్= ఆ పరమేశ్వరుడిని; కని= చూచి; పెన్నిధిన్= పెద్ద ధనరాశిని; కన్న= పొందిన; పేద+పోలెన్= దరిద్రుడివలె; కృత+అర్థుండవు= చేయబడిన అనగా నెరవేరిన ప్రయోజనం కలవాడవు; ఐతి(వి)= అయినావు; ఆ+అంధకాసురభంజను కతంబునన్= (అంధకుడనే రాక్షసుడిని సంహరించటం వలన శివునకు అంధకాసుర భంజనుడనే పేరు కలిగినది) అట్టి శివుడి కారణాన; కడింది పగఱు= ప్రబల శత్రువులు; అడంగుదురు= నశిస్తారు; ఆ+ఆదిమ ధనుర్ధరుండు= ఆ ప్రప్రథమ ధనుర్ధారి అయిన శివుడు; ఈ+విధంబునన్= ఈ విధంగా; వైరివధంబు= శత్రువధను; ఆపాదింపన్= చేయగా; నీకున్= ఓ అర్జునా నీకు; గెలుపు+కొనుట= విజయం పొందుట; సుకరంబు+అయ్యెన్= సులభమయింది; నీ తపంబు పెంపునన్= నీవు (ఇంతకు ముందు) చేసిన తపస్సు పెరుగుదలచే; తొల్లి= ముందు (పూర్వం); నీకున్= నీకు; సన్నిహితుండు+ఐ= ప్రత్యక్షమై; ప్రియంబుగాన్= ఇష్టమయ్యే విధంగా; దివ్య+అస్త్రంబులు= దివ్యములైన అస్త్రాలను - ఆగ్నేయ వారుణాదులను; ఒసంగెన్= ఇచ్చాడు; అంతటన్= అంతటితో; తనివి+చనక= తృప్తి తీరక; ఈ+తెఱంగున్= ఈ విధంగా; భక్తపరాధీనత్వంబు= (తనయొక్క) భక్తవివశత్వాన్ని; ప్రకటించెన్= ప్రకటించాడు; నీవు పుణ్యాత్ముండవు= ఓ అర్జునా! నీవు పుణ్యమూర్తివి; ఆ+పరమాత్మున్= ఆ పరమేశ్వరుడిని; ఆత్మన్= మనస్సులో; నిలిపి= నిలుపుకొని; నమస్కరింపుము; ఆ సర్వలోక శరణ్యున్= సమస్త లోకాలకు రక్షణ నిచ్చే సామర్థ్యంగల ఆ పరమశివుడిని; శరణంబు+చొరుము= శరణాగతి పొందుము; ఆ+కరుణాకరుండు= ఆ దయానిధి; శరణాగతులకున్= శరణు కోరి వచ్చిన వారికి; ఆయుః+ఆరోగ్య+ఐశ్వర్య+ఆది సకల+అభిమతంబులు= ఆయుష్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం - ఈ మొదలగు సమస్తములైన కోరికలు; నిత్యంబులుగాన్= నిత్యములై ఉండేటట్లు; ప్రసాదించున్+ అని= అనుగ్రహిస్తాడు అని; నిర్దేశించినన్= చెప్పగా; ఆ+అర్జునుండు; దండప్రణామ పూర్వకంబుగాన్= సాష్టాంగ నమస్కార పురస్సరంగా; భక్తి రస+ఆయత్తంబు+అగు= భక్తి రసానికి అధీనమైన; చిత్తంబునన్= మనస్సులో; చంద్రధరున్= శివుడిని; నెలకొల్పి= నిలుపుకొని; సాంద్ర+ఆనందంబు= గొప్ప ఆనందాన్ని; అనుభవించి= పొంది; సాత్యవతేయు చరణంబులకున్= వ్యాస మహాముని పాదాలకు; ఎఱంగినన్= మ్రొక్కగా; ఆ+ముని+ఇంద్రుండు= ఆ మహాముని; ఆ+ఇంద్రనందనున్= ఆ అర్జునుడిని; అభినందించి= మెచ్చుకొని; సుఖివి కమ్ము+అని= సుఖం కలవాడవుఅగుమని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దీవించి= ఆశీర్వదించి; విజయం చేసెన్+అని= వెళ్ళిపోయాడు అని ఈ విధంగా; సంజయుండు; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్ర మహారాజునకు; ఎఱింగించెన్= తెలిపాడు; అని= అని ఈ విధంగా; జనమేజయునకున్= జనమేజయ మహారాజుకు; వైశంపాయనుండు= వైశంపాయన మహాముని; చెప్పుటయున్= చెప్పగానే.

తాత్పర్యం: వ్యాసు డిట్లా అతడి గుణగణాలను ప్రస్తుతించి, అర్జునుడు చూచినవాడు సాక్షాత్తు రుద్రుడని తెలియ చెప్పి, దక్షయజ్ఞ ధ్వంసం, త్రిపురాసురమర్దనం మొదలైన ఆయన దివ్యలీలలను వివరించి, మహాదేవుడు, పశుపతి, శివుడు మొదలైన ఆయన శుభనామాలు కలగటానికిగల కారణాలను వివరించి. 'అర్జునా! ఆ పరమేశ్వరుడే నీ అభీష్టాన్ని నెరవేర్చటానికి నీ ముందుకు విచ్చేశాడు. పెన్నిధిని కన్న పేదవలె నీవు ధన్యుడవయ్యావు. ఆ అంధకాసుర భంజనుని కారణంగా ప్రబల శత్రువులు నశిస్తారు. ఆ ప్రప్రథమ ధనుర్ధారి అయిన శివుడు ఈ విధంగా శత్రువధచేయగా నీవు గెలుపు పొందుట సులభం అయింది. నీవు చేసిన గొప్ప తపస్సు వల్ల ఇదివరలో నీకు ప్రత్యక్షమై దివ్యాస్త్రాలను నీకు సంతోషం కలిగేటట్లుగా ఇచ్చారు. అంతటితో తృప్తినొందక ఇప్పుడు ఈ విధంగా శత్రువుల ప్రాణాలు హరించి తన భక్త పరాధీనతను ప్రకటించాడు. నీవు పుణ్యాత్ముడవు. ఆ పరమాత్ముని మనస్సులో నిలుపుకొని నమస్కరింపుము. ఆ సర్వలోకరక్షకుని శరణువేడుము. ఆ కరుణామయుడు తన్ను శరణు కోరి వచ్చినవారికి ఆయురారోగ్య ఐశ్వర్యాది అభీష్టాలనన్నింటిని శాశ్వతంగా ఉండేటట్లు అనుగ్రహిస్తాడు- అనిచెప్పగా, ఆ అర్జునుడు దండప్రణామ పూర్వకంబుగా భక్తిరసంతో నిండిన తన మనస్సులో ఆ చంద్రశేఖరుని నిలుపుకొని గొప్ప ఆనందాన్ని అనుభవించి, వ్యాసుని పాదాలకు ప్రణమిల్లగా, ఆ మునీంద్రుడు అర్జునుని అభినందించి, సుఖివి కమ్మని దీవించి, వెళ్ళిపోయాడు. అని సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్పాడని వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజుతో చెప్పాడు. చెప్పగానే.

విశేషం: 1. దక్షయజ్ఞ ధ్వంసకథ సంగ్రహంగా: దక్షుడనే ప్రజాపతి కూతురు సతీదేవి - శివుడిభార్య, ఒకానొక సభలో శివుడు లేచి నమస్కరించలే దని దక్షుడు శివుడిపై ద్వేషం పెంచుకొన్నాడు. అది కారణంగా దక్షుడు తాను యజ్ఞం తలపెట్టి, అందులో శివుడికి భాగం కల్పించలేదు. ఆహ్వానం కూడా పంపలేదు. సతీదేవి తన తండ్రి యజ్ఞం చేస్తున్నాడని తెలిసి, శివుడు ఎంత చెప్పినా వినక తానొకతే యజ్ఞాని కని వెళ్ళింది. అక్కడ తనను ఎవరు కూడా తుదకు దక్షుడి భయంచేత తల్లి కూడా పలుకరించలేదు. యజ్ఞంలో కూడా తన భర్త శివుడికి భాగం లేకపోవటం చూచి ఈ అవమానాన్ని భరించలేక యోగాగ్నిచేత సతీదేవి తన దేహాన్ని ఆహుతి చేసికొన్నది. ఇది తెలిసిన శివుడు వీరభద్రుడిని ఉత్పాదించి, అతడి ద్వారా దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేశాడు. తుదకు దేవతల ప్రార్థనచేత దక్షుడిని అనుగ్రహించాడు. అతడి తెగిన తలకు బదులుగా మేక తలను అతడి మొండానికి తగిలించి దక్షుడిని పునరుజ్జీవింపజేసి యజ్ఞాన్ని పూర్తి చేయించాడు. ఈ కథ శ్రీమద్భాగవతం చతుర్థ స్కంధంలో రెండు నుండి ఆరవ అధ్యాయం వరకు ఉన్నది.

2. రెండవది త్రిపురాసుర సంహార కథ. లోక కంటకుడైన త్రిపురాసురులను సంహరించటానికి ఎంతో ఆడంబరాన్ని ప్రదర్శించాడు మహాదేవుడు. పృథివిని రథంగా, బ్రహ్మను సారథిగా, మేరుపర్వతాన్ని ధనువుగా, చంద్రసూర్యులను రథచక్రాలుగా, విష్ణువును బాణంగా చేసికొని ఆ త్రిపురాసురులను సంహరించి తన మహాదేవత్వాన్ని నిరూపించుకొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మునివర! ద్రోణుని వృత్తము। విని సంతుష్టుండ నైతి వినువేడుక నా
మనమునఁ దోడ్తో నొదవెడు;। వినిపింపు దగంగ మీఁదివృత్తాంతంబున్. 430

ప్రతిపదార్థం: మునివర!= ఓ వైశంపాయన మునీంద్రా!; ద్రోణుని వృత్తము= ద్రోణాచార్యులకు సంబంధించిన కథ; విని= మీరు చెప్పగా విని; సంతుష్టుండను+ఐతిన్= సంతోషించాను; మీఁది వృత్తాంతంబున్= అటుపై జరిగిన కథను; విను వేడుక= వినాలనే కుతూహలం; మనమునన్= మనస్సులో; తోడ్తోన్= వెనువెంటనే; ఒదవెడున్= కలుగుతూ ఉన్నది; తగంగన్= తగిన విధంగా; వినిపింపు(ము)= వినిపించుము.

తాత్పర్యం: ఓ వైశంపాయన మహామునీ! ద్రోణాచార్యుడి వృత్తాంతం విని చాల సంతోషించాను. ఇంకా అటుపైన ఏం జరిగిందో వినాలని కుతూహలం కలుగుతూ ఉన్నది. కాబట్టి మీది కథ వినిపించండి.

వ. అని యడుగుటయు. 431

తాత్పర్యం: ఇట్లా అడుగగానే. (తరువాతి కర్ణపర్వంలోని గద్యంతో అన్వయం).

ఆశ్వాసాంతము

చ. అమర కిరీట కోటి కలితారుణ రత్నమరీచి వీచికా
సముదయ ఖేలనోల్లసన చారు పదాంబుజ కాంతిపూర! దు
ర్దమ దను సూను సంచయ విదారణచిత్త విహార! బోధనా
గమ హితనాద నిర్వహణ కౌతుక విశ్రుత! రక్షితాశ్రితా! 432

ప్రతిపదార్థం: అమరకిరీట కోటి= దేవతల కిరీటాల అంచులయందు; కలిత= పొదుగబడిన; అరుణరత్న= ఎర్రని రత్నాలయొక్క; మరీచివీచికా సముదయ= కాంతులు అనెడి తరంగాల సమూహం యొక్క; ఖేలన+ఉల్లసన= క్రీడావిలాసంచేత; చారు= అందమైన; పదాంబుజ కాంతిపూర!= పాదపద్మాల యొక్క కాంతి అనెడి ప్రవాహం కలవాడా! (ఆ హరిహరనాథ భగవానుడి పాదాలపై పడి దేవతలు నమస్కారం చేస్తూ ఉండగా ఆ దేవతల తలలపై ఉన్న కిరీటాల ఎర్రని రత్నాల కాంతులు స్వామివారి పాదాల నఖాల తెల్లని కాంతుల ప్రవాహంలో కలసి అందమైన దృశ్యాన్ని కలిగించాయని భావం); దుర్దమ=(ఇతరులకు) అణగద్రొక్క శక్యంగాని; దనుసూను= దానవులయొక్క; సంచయ= సమూహం యొక్క; విదారణ= సంహరించుటయందు; చిత్తవిహార!= మనస్సు యొక్క విహారం అనగా తలంపు కలవాడా! (ధర్మవిధ్వంసకులైన రాక్షసుల ఆగడాలు రూపుమాపి ధర్మసముద్ధరణ చేయటానికై ఆ దుష్టరాక్షసులను సంహరించే తలంపు కలవాడు హరిహరనాథుడు). ఇందుకు భగవానుడి గీతావాక్యం ప్రమాణం-

శ్లో॥ "యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం ॥
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ "

బోధన+ఆగమ హితనాద= ధర్మప్రబోధకములైన వేదాల హితకరములైన ధ్వనులయొక్క; నిర్వహణ= నిర్వహించుట అనగా కొనసాగించటం లోని; కౌతుక= కుతూహలంచేత; విశ్రుత!= ప్రసిద్ధి గలవాడా! (వేదవిహిత ధర్మమే మానవులందరికి శ్రేయోమార్గం చూపి మేలు కలుగ చేసేది కాబట్టి వేద ధర్మ ప్రతిష్ఠాపనయందు ఆసక్తికలవాడై ధర్మసంస్థాపకుడనే కీర్తి గడించిన వాడని భావం); రక్షిత+ఆశ్రితా!= రక్షించబడిన ఆశ్రితులు అనగా శరణాగతులు కలవాడా! తనను శరణుజొచ్చిన వారిని వారు, వీరు అనక ఎట్టివారినైనా రక్షించే తీరుతాడు భగవంతుడు. శ్రీమద్భగవద్గీతలో ఇట్లా ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్లో॥ మాం హి పార్థ! వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః ।
స్త్రియో వైశ్యాస్తథా శూద్రా స్తేఽపి -యాంతి పరాం గతిమ్ ॥ (9/32) శ్రీ మద్రామాయణంలోకూడా
శ్లో॥ సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ॥ (వాల్మీకిరామాయణం 6/18/33) అని భావం.

తాత్పర్యం: తిక్కన తన కృతిపతి అయిన హరిహరనాథ భగవానుడిని సంబోధిస్తూ ఇట్లా వర్ణించాడు. (దేవతలు నీ పాదాల మీదపడి మొక్కుతూఉంటే) ఆ దేవతల కిరీటాల చివర పొదుగబడిన రత్నకాంతుల సమూహం యొక్క కదలికల విలాసంతో అందమైన పాదపద్మ కాంతి ప్రవాహం కలవాడా! అణచసాధ్యంకాని రాక్షస సమూహాన్ని అంతం చేయటంలో విహరించే మనస్సుకలవాడా! ధర్మప్రబోధకాలైన వేదాల లోకహిత నాదాన్ని కాపాడటంలో గొప్ప ఆసక్తి కలవాడా! ఆశ్రితులను రక్షించేవాడా!

విశేషం: అలం: రూపకం. 'అమరకిరీట . . . కాంతి పూర' అనే సంబుద్ధి, విశేషణంలో 'మరీచి వీచికా' 'కాంతిపూర' అనే రెండు పదాంశలలోను రూపకముండటంచేత ఇది సావయవ రూపకాలంకారం. దీనితో దేవతలందరు కిరీటాలతో శోభిల్లే తమ శిరస్సులు పాదాలపై పెట్టి నమస్కారం చేశారని చెప్పినట్లయింది.

క. జనవినుత! బాదరాయణ । మునీంద్ర వాగమృతనిధి సముద్భూతాహ్లా
దన కీర్తి సుధాకిరణా! । వినతాఖిలభద్రకరణ! విశ్రుత చరణా! 433

ప్రతిపదార్థం: జనవినుత= భక్తజనులచే స్తోత్రం చేయబడినవాడా!; బాదరాయణ= బదరీవనమే నివాసంగా కలవాడు బాదరాయణుడు అనగా కృష్ణద్వైపాయన వ్యాసమునీంద్రుడు - అతడియొక్క; వాక్+అమృతనిధి= వాక్కులు అనెడి సముద్రం నుండి- అనగా క్షీరసాగరం నుండి (అమృత పదానికి పర్యాయం); దేవాసురులు మథించింది క్షీరసాగరమే కాని సుధాసముద్రం కాదు. శ్రీమద్భాగవతంలోని ఈ శ్లోకం చూడండి. **శ్లో॥ యథా భగవతా బ్రహ్మన్ మథితః క్షీరసాగరః ॥** (శ్రీమద్భాగవతం 8/5/11) సముద్భూత= పుట్టిన; ఆహ్లాదన= (లోకులను) ఆనందపరచినట్టి; కీర్తిసుధాకిరణా!= కీర్తి అనెడి చంద్రుడు గలవాడా! (అమృతమయమైన కిరణాలుగల వాడు కావటంచేత సుధాకిరణుడు అనగా చంద్రుడు. చంద్రుడు క్షీర సముద్రం నుండి పుట్టి లోకాల నెట్లా ఆనందింపజేస్తాడో- అట్లే భగవంతుడి కీర్తి, వ్యాస విరచితములైన పురాణాదుల వలన అవగతమై లోకాల నానందపరుస్తుందని భావం); వినత= నమస్కరించిన వారలకు - అనగా వినమ్రులై శరణు వేడిన వారలకు; అఖిల భద్రకరణ విశ్రుత= సమస్త శుభాలను చేకూర్చటంలో ఖ్యాతిగన్న; చరణా!= పాదాలు గలవాడా!

తాత్పర్యం: జనులచేత స్తుతింపబడేవాడా! వ్యాసమహాముని వాక్కుఅనే అమృతసాగరం నుండి పుట్టి ఆహ్లాదాన్ని కలిగించే కీర్తిచంద్రా! ప్రణమిల్లిన వారికి సర్వశుభాలు చేకూర్చటంలో ఖ్యాతిగన్న పాదాలు కలవాడా!

విశేషం: అలం: రూపకం. 'వ్యాసవాగమృతనిధి' అనేటప్పుడు 'కీర్తి సుధాకిరణా' అనేప్పుడు కూడా రూపకమనే అలంకారం. ఈ రూపకాలు పరస్పర సాపేక్షములై ఉండుటచే ఇది పరంపరిత రూపకం అని అనరాదు. కీర్తికి చంద్రుడితో అభేదం చెప్పటంలో కవిసమయ ప్రసిద్ధ సాదృశ్యం ఉండనే ఉన్నది. కాబట్టి కీర్తికి చంద్రాభేదసిద్ధిలో మొదటి రూపకం అంతగా అపేక్షితం కాదు. కాబట్టి సావయవ రూపకమే ఇది. రసగంగాధరంలో ఈ విషయం ఇట్లా వివరించబడింది. 'యద్యపి సావయవేప్యారోప ఆ రూపాంతరస్యోపాయః, తథాపి తత్రారూపాతిరిక్తేన కవిసమయ సిద్ధ సాదృశ్యే నాప్యారోపాంతరసిద్ధిః సంభవతి' (రస. ద్వితీయ రూపకాలంకారం). దీనితో వ్యాసముని

ప్రణీత వాఙ్మయాన్ని అమృత సముద్రంగా రూపించటంచేత ఆ వాఙ్మయం అనంతం అగాధం అనీ, క్షీరసాగరాన్ని మథిస్తే అమృతకిరణాదులు వెలువడి దేవతలను అజరామరులను చేసి ఆనందింపజేసినట్లు ఈ వాఙ్మయాన్ని మథిస్తే వెలువడిన భగవద్యోగమనెడి అమృత కిరణుడి వలన అమృతాన్ని అనగా శాశ్వతానంద రూప మోక్షాన్ని పొందుతారనే అర్థం స్ఫురిస్తూ ఏకాంత భక్తి సాధనం అనే పరమార్థం ధ్వనింపజేస్తూ ఉన్నది.

మాలిని.

అమృతమయ విలాసా! యాగభాస్వద్విలాసా!
విమల హృదయరమ్యా! వీతరాగాది గమ్యా!
కమలభవ నమస్యా! గౌరవాధిక్య శస్యా!
శమదమ పరివర్తీ! శాశ్వతానందమూర్తీ! 434

ప్రతిపదార్థం: అమృతమయ విలాసా!= అమృతమయాలైన విలాసాలు కలవాడా! (భక్తజనోద్ధరణాది భగవద్విలాసాలు అమృతత్వాన్ని ప్రసాదించే వని భావం); యాగభాస్వద్విలాసా!= యాగాలతో ప్రకాశిస్తున్న వినోదం కలవాడా! (యజ్ఞయాగాది యాగశబ్దం ఉపలక్షకం. వివిధ యజ్ఞయాగాది ధర్మ్యసత్క్రియలచేత వినోదించేవాడని భావం); విమలహృదయ రమ్యా!= నిర్మలాంతఃకరణంలో రమించటానికి అనగా విలసిల్లటానికి యోగ్యుడా! (హృదయం సత్యాహింసా దయాది సద్గుణాలచేత పవిత్రమైనప్పుడే భగవత్సాక్షాత్కారం కలుగుతుందని భావం); వీతరాగాదిగమ్యా!= వీతరాగులు అనగా ముముక్షువులు (సాంసార వాసనలేని సర్వసంగపరిత్యాగులు) వారికి పొందదగినవాడా! (పరబ్రహ్మ స్వరూపుడని భావం); కమలభవ నమస్యా!= (కమలభవుడనగా విష్ణునాభికమలంనుండి జన్మించిన చతుర్ముఖబ్రహ్మ) ఆ బ్రహ్మదేవుడిచేత నమస్కరించదగినవాడా! (బ్రహ్మదేవుడు సృష్ట్యాదిలో మధుకైటభులు అనే రాక్షసులచేత పీడించబడి విష్ణుభగవానుడిని తలంచి స్తుతించాడు. విష్ణువు వారిని సంహరించాడు. ఈ మధుకైటభసంహార కథ ఇక్కడ అనుసంధించుకొనాలి); గౌరవ+ఆధిక్యశస్యా!= పూజ్యభావమందలి ఆధిక్యంచేత ప్రశంసించదగినవాడా! (పూజార్హులైన దేవతలందరిలో సర్వోత్తముడని భావం); శమదమ పరివర్తీ!= సహనం, ఇంద్రియ నిగ్రహం - ఈ రెంటిని శమదమాలని అంటారు. ఈ పదాన్ని ఉపలక్షకంగా గ్రహించటంచేత 'శమదమ' అనగా శమదమాది షడ్గుణ సంపత్తి అని అర్థం; ఆ షడ్గుణ సంపదయందే అనగా ఆ షడ్గుణసంపద ఉన్న చోటనే ఉండేవాడా! (శమాది షడ్గుణాలుగల వారికి అధీనుడా!); శాశ్వత+ఆనందమూర్తీ!= నిత్యానంద స్వరూపుడా!

తాత్పర్యం: అమృతమయాలైన విలాసం కలవాడా! యాగాలచేత ప్రకాశించే విలాసం కలవాడా! నిర్మలహృదయం చేత రమ్యమైనవాడా! సర్వసంగపరిత్యాగులు చివరకు పొందదగినవాడా! బ్రహ్మదేవుడు నమస్కరింపదగినవాడా! గౌరవాధిక్యంచేత స్తుతించదగినవాడా! శమదమాదులందు సంచరించేవాడా! నిత్యానందస్వరూపా!

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బయిన శ్రీమదాంధ్ర మహాభారతంబున ద్రోణపర్వంబునందు సర్వంబును బంచమాశ్వాసము.

తాత్పర్యం: ఇది మంగళకరమైన 'ఉభయ కవిమిత్ర' బిరుదాన్ని పొందినవాడు, కొమ్మనామాత్యుడి పుత్రుడు, పండితులను ఆరాధించుటచేత (లేదా పండితులచేత ఆరాధించబడటం చేత) ప్రకాశించేవాడు - అయిన తిక్కన సోమయాజి రచించిన శుభప్రదమైన ఆంధ్రమహాభారతంలోని ద్రోణపర్వం ముగిసే అయిదవ అశ్వాసం.

ద్రోణపర్వంలోని అయిదవ అశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్రమహాభారతంలోని ద్రోణపర్వం ముగిసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ద్రోణ పర్వము

గద్య పద్య ప్రథమ పాద సూచి

పద్యము	పుట
అ	
అంగద నాథు మ్రింగిన	06
అంగిరసుం డమరపతికి	387
అంత	559
అంతంతం గనుంగొని	738
అంతం పతంగుండు	133
అంతకంతకుం గదిసి	365
అంతకు భీమసేనుఁడు	60
అంతకు మున్ ఘటోత్కచు	409
అంతకు మును భగదత్తుని	114
అంతటం దెలిసి యాచార్యుండు	455
అంతటఁ బోక రత్నమయ	438
అంత నపరాహ్ణంబయ్యె;	64
అంత నపరాహ్ణంబయ్యె	188
అంత నిలువక	402
అంత నిలువక చలంబున	447
అంతరంగంబునం దొక	678
అందఱకు నన్నిరూపులై	102
అందఱును జుట్టుముట్టి	433
అందఱు నొక్క మొగంబై	392
అందు వలపట సింధు	43
అంబష్ఠ విదేహ పాండ్రాది	17
అకట! యజాతశత్రుఁ డను	36
అక్కట! తప్పఁ దలంచితి	255
అక్కట! పుత్త్ర నిన్నుఁగని	292
అక్కట! మందభాగ్యునకు	252
అక్కట! రావలవదు	421
అక్కడ మొగమయ్యు నిక్కడ	429
అక్కుమారుండును	227
అగణిత దుఃఖాత్మక	221
అగునగు! మేలుమేలు!	581
అగ్రపుస్తకంబు లర్చించి	299
అచటి రాజలోక మగ్గురు	442
అచటు వాసి రయంబున	218
అచ్చట నార్పులుఁ	534
అచ్చట సైన్యమంతయు	177
అచ్చటి బలములు ప్రభువులు	351
అచ్చోటు గదలి విచ్చచుండు	370
అట ధర్మజ భీమ నకుల	457
అట్టన నేల మహాబలు	486
అట్టి జనకు నా ద్రుపద	699
అట్టి జెట్టి యనిలు	478
అట్టియెడ నాచార్యుం డసమాన	49
అట్టి యెడ	05
అట్టి యెడ	18
అట్టి యెడ	58
అట్టి యెడ	61
అట్టి యెడ	127
అట్టి యెడ	193
అట్టి యెడ	196
అట్టి యెడ	411
అట్టి యెడ	456
అట్టి యెడ	530
అట్టి యెడ	577
అట్టి యెడఁ గర్ణుండు	639
అట్టి యెడఁ గేకయ	69
అట్టి యెడఁ జతురంగంబులు	372
అట్టి యెడ గాండీవముక్త	354
అట్టి యెడ దేవదత్తము	392
అట్టి యెడ ధృష్టద్యుమ్నుండు	693
అట్టి యెడ నమ్మహీనాథుండు	444
అట్టి యెడ నాకర్ణపట్టి	612
అట్టి యెడ నాచార్యుం డాత్మ	366
అట్టి యెడ నీ కొడుకు	557
అట్టి యెడ వడముడి	462
అట్టి యెడ సుబాహుండు	82
అట్టి యెడ సోమదత్తుండు	594
అట్టి సంకుల సమరంబున	363
అట్టి సమయంబున	94
అట్లు కాక యనుటయుఁ	541

అట్లనుగ్రహించిన 310
అట్లయిన వీఁ డభిమన్యు 618
అట్లాచార్యుండు పురికొల్పినం 554
అట్లుంగాక 290
అట్లు కురురాజు నొచ్చిన 108
అట్లు గడంగి 152
అట్లు గడఁగు కౌరవానీకములఁ 703
అట్లు గసిమసంగి కిరీటి 89
అట్లు గాసియై కోపించి 450
అట్లు చొచ్చు వివ్వచ్చుం 349
అట్లు దమలోనఁ 287
అట్లు దార్కొని అర్క ప్రతాపు 479
అట్లు నీ యొడలుండ దేని 499
అట్లు పాండవ బలంబులు 538
అట్లు బెట్టేసిన వాసవి 156
అట్లు భీషణమగు నర్జు 390
అట్లు మర్దించి మగుడు 246
అట్లు విచ్చియుం గూడుకొని 395
అట్లు సంధ్యాసమయ 567
అట్లు సని యుధిష్ఠిరుండు 598
అట్లు సేనాధిపత్యంబు 35
అడరి నరేంద్ర కోటి 155
అడరి యా దివసము 685
అడరెడు నిద్రాభరమునఁ 661
అడవుల దవశిఖి 26
అడవుల నుండు తాపసుల 707
అడుకులు దిన్నట్లగునే? 452
అడ్డుపడి గురుండు 342
అతండందఱ కన్నిరూపులై 128
అతండు కేతనంబునకుం 497
అతండును 343
అతండును గోపాటోపంబున 619
అతండు ప్రణతుండైన 657
అతండు మాయావి యగుట 124
అతండు రుద్రవరాను 265
అతఁడు సూవె కౌరవ 705
అతఁడందఱ మార్గణములు 153
అతఁడందఱ విశిఖమ్ములు 183
అతఁ డట్ల చేయ నబ్బలమతి 446
అతఁడతని తోడ 226
అతఁడు గని గంధమాల్యార్చిత 529
అతఁడు నీ ఱొమ్ము ద్రొక్కిన 712
అతఁడునుం బోరి పోరి 549
అతఁడు మాయాబలోద్ధతి 407
అతఁడొకటియైన నే నే గతి 415
అతనిఁ గూల్చె మద్రేశుఁ 609
అతని కడ నుండి యమ్మహీ 211
అతని చాపంబుఁగుంతీ 459
అతనితో ధృతరాష్ట్ర 245
అతని దిక్కును జూడక 187
అతని పడుట గనుంగొని 112
అతని వధంబునకై పాంచాల 690
అతని శరాసనంబును 355
అతని సుతుం డులూకుడు 621
అతి కోలాహల వికల 95
అతి తీవ్రమైన నీదగు 271
అతిలోక పరాక్రమనిధి 28
అత్తఱిఁ గర్ణువిల్లును 483
అదలిచి లక్ష్మణుండు 181
అది అర్ధచంద్రసాయక 524
అది క్రమంబునం జూచెద; 303
అది యగునైనను 417
అది యట్లుండె 328
అది యట్లుండె 501
అది యట్లుండె; నా కర్ణుని 480
అది యట్లుండె నొక్కహితంబు 358
అది యట్లుండె మహితాత్మ 225
అదియునుంగాక 706
అది యెట్లంటేని 114
అది యెయ్యది యంటేని 528
అది రవి గ్రుంకుటగాఁ 529
అది సూతనందనుఁడు 497
అదె పట్టువడియె 70
అదె పార్థుఁడు దన మునుమున 618
అద్దేవు నుద్దేశించి 218
అధిక తపంబున నగ్ని 237
అధిప! చెప్పెద నీకు 329
అధిపతియు నస్త్రగురుఁడు 594
అధిప! నీయోధులయందు 21
అధిప! సర్వాస్త్రఘాతియై 388
అనఘ! నిన్ను శిష్యుఁడును 705
అనఘవిచార! నీవరయు 214
అనఘ! సంశప్తక హననంబు 264
అనఘ! సరిత్సుతుండు 07
అనఘుని ధర్మనందనుని 163
అనల శిఖవోని నారసమున 577
అనలశిఖా సదృశములగు 720
అన విని కర్ణుఁడిట్లనియె 555
అన విని ధృతరాష్ట్రుండిట్లను 118
అన విని మేను వెంచి 67
అన విని యాంబికేయుఁడు 156
అన విని సూతసూనుఁడు 170
అన విన సూతసూనుఁడు 190
అనవుడు 135
అనవుడు 580
అనవుడుఁ గర్ణుఁ డిట్టులను 582

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనవుడుఁ గ్రీడి నీదు	344	అని చెప్పెనట్లు గావున	653	అనిన విని యతం డతని	305
అనవుడు ధర్మాత్మజు	427	అని తెంపుసేసి	553	అనిన విని యబ్బాహ్లిక	510
అనవుడు నతం డట్లకాక	422	అని దూఱినం గృష్ణుఁడు	122	అనిన విని యతండు ముకుందు	88
అనవుడు నతఁ డమ్మహీపతి	513	అనినం గోపించి	707	అనిన విని యతండు కర్ణ	36
అనవుడు నమ్మనుజపతికి	08	అనినం బ్రీత చేతస్కులగుచు	308	అనిన విని యత్తపోధనుండు	242
అనవుడు నల్లనవ్వి	147	అనిన గాంగేయుండు	16	అనిన విని యభిమన్యుం	145
అనవుడు నాంబికేయుం	114	అనిన ధృష్టద్యుమ్ను పలుకుల	467	అనిన విని యమ్మనుజపతి	224
అనవుడు నాంబికేయుండు	480	అనిన చ్యుతుండది	306	అనిన విని యమ్మనుజపతికి	704
అనవుడు నాతఁ డిట్టులను	107	అనిన నట్లకాకయని	115	అనిన విని యమ్మహాత్ముండు	212
అనవుడు నాతఁ డిట్టులను	473	అనిన నట్లచేసె	334	అనిన విని యశ్వత్థామ	589
అనవుడు నాతఁ డిట్టులను	475	అనిన నతండిట్లను	19	అనిన విని యాంబికేయుండు	26
అనవుడు నాతఁ డిట్లనియె	465	అనిన నతనికి సంజయుం	494	అనిన విని యాంబికేయుండు	449
అనవుడు నాతఁ డిట్టులను	478	అనిన నమ్మనుజవల్లభునకు	181	అనిన విని యాచార్యుం	357
అనవుడు నాతఁ డిట్లను	540	అనిన నమ్మహీపతికి	650	అనిన విని వారలందఱు	161
అనవుడు నా సూతనందనుం	410	అనిన నొడఁ బడి	78	అనిన విని సంజయుం	518
అనవుడు భీముఁ డిట్టులను	144	అనిన వెలుకఁ బాఱి	160	అనిన విని సాత్యకి	416
అనవుడు వాఁడు నగుచు	445	అనిన భీముఁడిట్టులనియెఁ	466	అనిన విని సుశర్మ	73
అనవుడు శినిపుంగవుం	419	అనిన విని కర్ణుం డతని	103	అనిన విని సూతసుతుఁ	03
అనవుడు సంజయుం	169	అనిన విని కుటిలంబగు		అనిన విని సూతసుతుఁ	245
అనవుడు సవిశేష కల్పితం	467	అనిన విని కెంపు	405	అనిన విని సూతసూను	170
అనవుడు సూతసూనుం	431	అనిన విని గురుండ	135	అనిన వెలుకఁ బాఱి	160
అనిఁబడిన రాచకొడుకుల	489	అనిన విని జనార్దనుండు	718	అనిన సంజయుఁడిట్లను	35
అని అడిగిన నా సూత	287	అనిన విని ధర్మనందనుం	144	అనిన సాత్యవతేయు	208
అని అడిగిన నమ్మహీశ్వరునకు	320	అనిన విని ధర్మసూనుఁడు	146	అనిన సూతనందనుం	521
అని అడుగుటయు	316	అనిన విని ధృతరాష్ట్రుం డిట్లను	479	అని నారదుండు	241
అని కోరుటయు	36	అనిన విని ధృతరాష్ట్రుం డట్టి	559	అని పగతుర యుత్సాహం	552
అని కౌరవులును దక్కటి	07	అనిన విని ధృతరాష్ట్రుండు	486	అని పనవి వనట	31
అని చుట్లనున్న రాజుల	276	అనిన విని నవ్వి నాతో	506	అని పనిచె నట్టియెడ	686
అని చెప్పి ఘటోత్కచుం	625	అనిన విని మనవారలందఱు	662	అని పలికి	470
అని చెప్పిన	243	అనిన విని మునీశ్వరుం	207	అని పలికి కార్యదాహంబున	357
అని చెప్పిన యమ్మాటలు	651	అనిన విని మృత్యుదేవత	216	అని పలికి గాఢ నిశ్చయమున	553
అనిచెప్పి సంజయుఁడు	113	అనిన విని యతండచ్యుతు	624	అని పలికి తన సారథిం	12

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అని పలికి తొలఁగిపోవుట 428
అని పలికి ధృష్టద్యుమ్నాదులం 653
అని పలికినం బ్రీత చేతస్కుండై 24
అని పలికిన విని యుధిష్ఠిరుండు 41
అని పలికిన శినివరుండు 713
అని పలికి నిట్టూర్పు నిగిడించి 254
అని పలికి నియతుండయి 716
అని పలికి పతికి 188
అని పలికి పారావత 80
అని పలికి పార్థుం 384
అని పలికి బరవసంబు 201
అని పలికి మఱియుఁ 258
అని పలికి మఱియును 583
అని పలికి మఱియు నిట్లను 702
అని పలికి యర్జునుం డున్న 443
అని పలికి యసురవరుం 628
అని పలికి యార్చి 162
అని పలికి యిట్లనియె; 330
అని పలికి యిరుసులంతలు 570
అని పలికి వాని యాలాపంబు 148
అని పలికి వారలలో 378
అని పలికి వాలుటమ్ములు 125
అని పలికి సాత్యకి 506
అని పలికి స్వప్నంబున 325
అని పలికెఁ దదనంతరంబ 246
అని పలికె నట్టియెడ 322
అని పలికె నట్టియెడఁ 500
అని పలికె నప్పుడు 707
అని పలుకుచు నీకొడుకు 339
అని పలుకు నంతకుం 104
అని పలుమాటలాడి 29
అని పలుమాటలాడుటయు 487
అని పాంచాలవరుండగు 78
అని పెక్కు భంగులం జెప్పిన 382
అని పెక్కుమాటలాడిన 16
అని పెలుచం బలికి 270
అని ప్రశంసించి కవ్వడి 741
అని ప్రార్థించుచు దైవంబుల 300
అని బరవసంబు సేసిన 83
అని బరవసంబు సేసి, శంఖం 719
అని బహుప్రకారంబులం 296
అని బహువిధంబుల 464
అని భంగించి యూర్పులు 263
అని మఱియు ననేక 206
అని మఱియు ననేక 253
అని మఱియు ననేక 311
అని మఱియు ననేక 545
అని మఱియు ననేక భంగుల 733
అని మఱియును 81
అని మఱియును 260
అని మఱియును 499
అని మామఁ బలుకు పలుకులు 584
అనిమిషదైత్య కింపురుష 269
అనిమిష నదీతనూజుఁడు 02
అనిమిషనాథుఁడిచ్చిన 657
అనిమిషాసుర యుద్ధమున 235
అని మొన దేవదానవుల 682
అని యంత కంత కగ్గలించుచు 261
అని యక్కౌరవ సైన్యము 662
అని యగ్గించుచు సింధు 379
అని యగ్గించెఁ జారణ 366
అని యగ్గించె; నాసమయం 271
అని యడలూని పొగిలి 27
అని యడిగిన జనమేజయు 02
అని యడిగిన నతం 696
అని యడిగిన నమ్మనుజ 723
అని యడిగిన నమ్మహీ 645
అని యడిగిన నా సూత 287
అని యడుగుటయు 743
అని యతని జత్రుదేశంబున 163
అని యనేకప్రకారంబులం 291
అని యప్పాంచాల బలంబు 667
అని యవ్వలను సూపి 571
అని యిట్లు దన్ను నిందించు 386
అని యివ్విధంబున సల్లాపం 286
అని యుబ్బుచుండి; రివ్విధం 44
అని యూఱడిల్లఁ బలికిన 278
అనియె; ధనంజయుండును 626
అనియె నట్లియ్యిరువురు 506
అనియె నట్లయ్యిరువురు 592
అనియె ననుడు సంజయున 709
అని రథంబు పెలుచఁ 657
అని రాధేయుఁడు పాండు 44
అనిలతనూజు బాణముల 521
అనిలతనూజు లావు 294
అనిలసుతుండు సాత్యకి 173
అనిలాస్త్రంబు ప్రయోగించిన 88
అని వాసుదేవుఁ జూపిన 544
అని వితర్కించి విప్పచ్చుండు 115
అని వీడనాడి వెండియు 551
అని వెండియు 22
అని వెండియు 274
అని వెండియు 299
అని వెండియు 582
అని వెండియు 625
అని వెండియు 650

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అని వెచ్చనూర్చి యూరకుండి 34
అని వెస నాదివ్య శరం 388
అని వేఁడికొనిన నయ్యందఱం 23
అని సంశాపంబులు పలికి 75
అని సవినయంబుగా 304
అని సొంపు వినియు 60
అని హితోపదేశంబు సేసి 658
అనుచుం జేరనడచి 81
అనుచుండి రప్పుడు 677
అనుచుఁ గ్రూరంబులగు 385
అనుచుం గొలువు 273
అనుచుఁ జదికిలంబడి 252
అనుచుఁ దనయరదం 151
అనుచు నచట నున్న 22
అనుచు నతని నిరాయుధుం 722
అనుచు నయ్యాచార్యుపైఁ 681
అనుచు నాకృష్ణుల 379
అనుచు నీ యోధవీరులందఱు 377
అనుచు నుత్సాహ రహితంబైన 547
అనుచు మురారిఁ జూచుట 117
అనుచు వినతుండగుటయు 223
అనుచు సంభ్రమాకుల 70
అనుటయు నర్జునుం 40
అనుటయుం గురురాజు 21
అనుటయు గురునందనుఁ 588
అనుటయు ధృతరాష్ట్రుం 337
అనుటయు ధృతరాష్ట్రుఁడు 517
అనుటయు నగ్గురుం 359
అనుటయు నతండు 453
అనుటయు నమ్మానవపతికి 141
అనుటయు నమ్మానవపతికి 364
అనుటయు నమ్ముని ప్రవరు 224
అనుటయు నయ్యచ్యుతుం 647
అనుటయు నయ్యుధిష్ఠిరుండు 77
అనుటయు నాంబికేయుండు 478
అనుటయు నా సూతనందనుం 329
అనుటయు నా సూత 710
అనుటయుఁ బారాశర్యుండు 209
అనుటయు సంజయుఁ 159
అనుటయు సంజయుం 397
అనుటయు హరి ధర్మతనూ 322
అనుడుఁ గృపాచార్యుం 584
అనుడు నతఁ డవ్విభునికి 449
అనుడు నతఁడు నవ్వుచు 79
అనుఁడు నతఁడు సాలు 516
అనుడు నమ్మేదినీశు 397
అనుడు నుద్గత మందస్మితా 540
అనుడు బాలిశులైన 38
అనుడుఁ బిన్ననవ్వొలయఁగ 340
అనునెడఁ బాండవసేనలు 556
అనునెడ భూరిశ్రవసుం 508
అను నెలుంగులు నింగిముట్ట 128
అనుపమ హితవిద్యా 138
అను పలుకులు నీ యోధులు 378
అనుమతుఁడై విజయుం 341
అనృతంబు పలికి బ్రదికెద 715
అనృత భయము నాజి 687
అన్నగుమోమును, నత్తెలి 251
అన్నరపతి నరకంబునం 511
అన్ని విధంబులం బఱచి 550
అన్య చాపహస్తుఁడై 97
అపుడు నీ యగ్రనందనుఁ 19
అప్పలుకులు సహింపక 367
అప్పు డక్కురుపతి 585
అప్పుడద్దనుజుని తనయుం 568
అప్పుడమ్మేటి మగండు 470
అప్పు డశ్వత్థామ నవ్వుచు 573
అప్పు డశ్వత్థామ యఱువది 500
అప్పు డాలోకించి 110
అప్పు డాలోకించి ధృష్టద్యుమ్నుం 454
అప్పుడు 45
అప్పుడు 49
అప్పుడు 156
అప్పుడు 335
అప్పుడు 434
అప్పుడు 448
అప్పుడు 492
అప్పుడు 523
అప్పుడు 561
అప్పుడు 644
అప్పుడు 689
అప్పుడు 697
అప్పుడు కృపాచార్యుం 587
అప్పుడు చేకితానుఁడు 462
అప్పుడు దన్నుం దాన 10
అప్పుడు ధృష్టద్యుమ్నుఁడు 52
అప్పుడు పాండవయోధు 68
అప్పుడు భీష్ములేమి 05
అప్పుడు రెండు దెఱంగుల 672
అప్పుడు వినియును 410
అప్పుడు వేగులవారలు 272
అప్పుడు శత్రుంజయుండును 493
అప్పుడు శౌరి పార్థునకు 121
అప్పుడు సంశప్తకులు 127
అప్పుడు సత్వరుండై 530
అప్పురుషుఁ డెవ్వఁడో యని 739

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అబ్బాలుండు 198
అభవుఁ డిట్టు లనియె 213
అభిమన్యుండును భండనంబున 223
అభిమన్యుఁడీల్గిన నర్జునుఁ 298
అభిముఖ సంవృత్తములగు 174
అమర కిరీట కోటి 744
అమరనదీతనూజు 03
అమృతమయమగు నుల్ల 312
అమృతమయ విలాసా! యాగ 745
అమ్మనుజవిభుల బహుల 179
అమ్మహావీరున కనతి 333
అమ్మహీపతి య మ్మహాత్ము 545
అమ్మహోగ్ర సముద్ధతిం 562
అమ్మహోత్పాతములకు 45
అమ్మాద్రీసుతుఁ డేపున 606
అమ్ముకుందుండు గ్రొత్తయై 288
అమ్మురహరుండు మఱియుం 508
అమ్మెయి సూతుఁడీల్గుటయు 60
అమ్మేటి విలుకాని వంచించి 347
అమ్మొనసొచ్చు చొప్పు 249
అయ్యంగరాజు తోడం గయ్యము 485
అయ్యవసరంబున 55
అయ్యవసరంబున విరాటుండును 59
అయ్యవసరంబున 62
అయ్యవసరంబున నా సైన్యంబుల 70
అయ్యవసరంబున నీ యోధు 334
అయ్యవసరంబున 360
అయ్యవసరంబున 362
అయ్యవసరంబున సింధురాజ 390
అయ్యవసరంబున సోమదత్తుండు 565
అయ్యవసరంబున దశరథ 578
అయ్యిరువురు నక్కజం బగు 620
అయ్యెడ ఖేచరులకు 397
అరదంబు డిగ్గి తొలంగి 729
అరదంబులు మొదలగు 87
అరదము డిగ్గి తీవ్రగమనా 370
అరదము డిగ్గి యప్పుటు 471
అరదము పైకి దాఁటి 693
అరదము మొదలైన 633
అరదములు చిత్రగతులం 491
అరయఁగ బంధు కోటులకు 17
అరిగి తురగముల 477
అరుగఁగ సుదర్శనుండును 444
అరుణాశ్వములు రుచిర 18
అరుల కభేద్యం బగు 554
అరులు మనమీఁద నురవడి 707
అర్జునుండతని నేడమ్ముల 351
అర్జునుండును పర్జన్య 355
అర్జునుఁ జంపుదు మతని 74
అర్జునుఁడొంటి వోయెనని 463
అర్జును ప్రతిన చిత్తంబున 323
అర్థి విశ్వావసుం డాదిగాఁ 233
అఱి ముఱిఁ ద్రెళ్ళఁ దేరులు 389
అఱిముఱి నిరువుర 490
అఱిముఱి నొండొరు వ్రేసిన 62
అఱిముఱి వ్రేసినఁ బలకం 58
అఱువది యఱువదియమ్ముల 523
అలఘు తపంబులం 295
అలఘుబలుఁడు శైనేయుఁడు 415
అలఘువిచారా! యట్ల 304
అలరు మొగముతోడ 248
అలవి యెఱుంగ కిమ్మెయి 40
అలవుఁ జలంబు శౌర్యమును 260
అలిగి కృష్ణుతమ్ముఁ డతని 457
అలిగి గురుండు ధర్మజు 399
అలిగి గురుఁడు శక్తి 441
అలిగి దశార్ణ భూరమణుఁ 110
అలిగిన గాండీవి యమ్ము 336
అలిగి నరుఁడు భీముఁడు 594
అలిగి బాణశతంబున 495
అలిగి యవుడు గఱచి 389
అలిగి వెడఁదవాతియమ్మున 613
అలుఁగు చెక్కలుగాఁ జేసి 363
అలుఁగు టమ్ముల దాఁకిన 119
అలుకొందు మనముతోఁ 110
అవధరింపు మహాత్మ! 738
అవధానాయత్తంబగు 229
అవుడు గఱచి యెత్తినగు 267
అవ్యక్త మప్రమేయము 310
అవ్వలి సైనికులడలఁగ 284
అవ్విధం బద్దివ్యాస్త్ర 310
అవ్విధమునఁ బల్కి 456
అవ్విధంబున గృపాశ్వత్థామ 527
అశని కరణి వచ్చి 351
అశ్వత్థామ సచ్చెనని 683
అశ్వసుభట తతుల 93
అస్తమయమునకు మును 279
అస్త్రశస్త్రంబుల నధికుండు 27

ఆ

ఆగ్నేయాస్త్రము ద్రోణుఁడేసిన 367
ఆ చక్రం బ ట్లయిన 406
ఆచార్యపుత్రు నస్త్రప్రభావం 388
ఆతండు ప్రీతుండయ్యె 521
ఆతఁడట్లు చేయ నరవాయి 116
ఆతఁడు వాఱినం దెరలు 125

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆతనిఁ జూచి కన్నుఁగవ 485
ఆతనికి సంజయుం 518
ఆతని వెనుకొన నాచార్యు 98
ఆదికి నాది లోకముల 739
ఆదిదేవుఁడైన యవ్విష్ణు 730
ఆ ధర్మనందనుఁడు 558
ఆ ధర్మసూనుఁ గయ్యంబునఁ 37
ఆననంబునఁ గ్రోధ 480
ఆననములు వెలవెల్లం 249
ఆ నరుఁ డెప్పుడు మము 73
ఆ నరు నేనొకండన 16
ఆ నినదంబు సాంద్రముగ 81
ఆపద ముట్టిన యెడ 380
ఆ పాపాత్ములు తమలోనం 228
ఆ పార్థుఁడు గోపానల 86
ఆ ఫల్గునుండు పాదచారియై 372
ఆ బ్రహ్మాస్త్రంబుచేత 728
ఆభీలతఁ గర్ణుని 495
ఆ మనుజపతికి నశ్వత్థామ 724
ఆ మోము నా భుజంబులు 413
ఆ యిరువురతో నజ్జన నాయకు 477
ఆయువును బుణ్యమును 241
ఆ రథము కెలన నుజ్జ్వల 42
ఆ రథికవరుండును 440
ఆ రథికు లొక్కమొగి 395
ఆ రాజు వరుణ తనయుం 350
ఆర్చి నెత్తురుట్ట నమ్ముస్తకము 628
ఆఱమ్ము లతని మేనం 428
ఆలోనన మెఱుఁగారెడు 461
ఆలోచన యా రథికుని 495
ఆ లోన 191
ఆలోన నతని రథచోదకుండు 442
ఆలోనన తెలిసి మెఱుఁగు 604
ఆలోనన భోజపతిన్ 433
ఆలోనన సూతసూనుండు 484
ఆలోన సైంధవుండు 57
ఆ విక్రమంబు వీక్షించి 636
ఆ విజయుఁడు గర్ణుని విలు 523
ఆ వృద్ధక్షత్త్రు తపము 539
ఆ వృద్ధ క్షత్త్రుండు శమంత 532
ఆ వెలుఁగు గనువెలుంగు 34
ఆ శిఖండియు నీవు 711
ఆ సంకుల సమరంబున 397
ఆ సంరంభంబు సూచి 722
ఆ సంశప్తకులలో దండిమగలు 456
ఆ సభఁ బాంచాలి గాసిసేయఁగ 717
ఆ సభ నీవును మీ దుశ్శాసను 550
ఆ సమయంబునం గడఁగి 194
ఆ సమయంబునం జేడ్పడి 176
ఆ సమయంబునం బాంచాల 463
ఆ సమయంబున 108
ఆ సమయంబున 153
ఆ సమయంబున 199
ఆ సమయంబున ధర్మజ 367
ఆ సమయంబున నతని 426
ఆ సమయంబున నవ్వీటి 298
ఆ సమయంబున నశ్వత్థామ 393
ఆ సమయంబున నుభయ 663
ఆ సమయంబున బకుని 631
ఆ సమయంబున సుయోధనుం 525
ఆసీనుండై యాతండు 32
ఆస్తిక చేతస్సహితా! కౌస్తుభ 535

ఇ

ఇంతకు మున్న నీజనకుఁ 187
ఇంతి నీ కధర్మమేల యయ్యెడు? 219
ఇంత వట్టును వెలారింతు 520
ఇక్కడఁ గృష్ణుల తేజము 443
ఇక్కడ భారద్వాజుండు 136
ఇటు దగునయ్య శూరులకు 258
ఇట్లు లొండొంటిఁ గదియంగ 45
ఇట్లదరి వివిధాస్త్ర 63
ఇట్లత్యాశ్చర్యకరణ 531
ఇట్లనన్య భేద్యం బగు 149
ఇట్లభిమన్యుఁడు మడిసె 179
ఇట్లమ్మహాముని సనుటయు 659
ఇట్లర్జునపుత్త్రుండు 178
ఇట్లసురబలంబు 572
ఇట్లవంతీశ్వరు లురవడించి 368
ఇట్లింద్రపౌత్త్రుండు గోసలేంద్రునిం 185
ఇట్లు కాంభోజపతి వడుట 352
ఇట్లు కృతవర్మ విరథుండైన 435
ఇట్లు కృపాచార్యుండు 539
ఇట్లు గడంగినం బ్రత్యర్థి 585
ఇట్లు గదద్రుంచి పైపై 490
ఇట్లు గనుపుకొట్టు 336
ఇట్లు గాంధారపతి పడుట 615
ఇట్లు గెలిచి వచ్చియు 211
ఇట్లు గోవిందునకుఁ గుసుమా 351
ఇట్లు ఘటోత్కచుండు వడిన 645
ఇట్లు చతుర్దశ సహస్ర 115
ఇట్లు చేకితానుం 462
ఇట్లు దంతిని భగదత్తునిం 123
ఇట్లు దటిమెనేని యిప్పుడ 624
ఇట్లు దలఁ దునుముటయు 369
ఇట్లు దలపడి శల్యసమీర 61
ఇట్లు దాఁకియతనిపై 131
ఇట్లు దుశ్శాసనుండు దలపడి 338
ఇట్లు దెలివొంది యొండొరులం 82
ఇట్లు దొడంగి యయ్యిరువురు 406

ఇట్లు ద్రుమసేనుండు సచ్చినం 617
ఇట్లు ద్రోణధృష్టద్యుమ్నులు 361
ఇట్లు ద్రోణుండు బరవసంబు 412
ఇట్లు ధర్మజుని యొద్దవాసి 78
ఇట్లుద్ధతుండై యగ్గురుండు 67
ఇట్లు నారాయణమారుత 354
ఇట్లు నిలువరించి నిటలంబున 469
ఇట్లు పరవశుండైనఁ 267
ఇట్లు పాండవ బలంబులు 105
ఇట్లు పాండవాగ్రజుండు 401
ఇట్లు పురంబు వెడలి 09
ఇట్లు పూర్వవైరంబు దలంచి 186
ఇట్లు పెక్కంద్రొక్కపెట్ట 394
ఇట్లు పెద్దయుంబ్రొద్దు 62
ఇట్లు ప్రచండమూర్తియై 526
ఇట్లు ప్రణమిల్లిన 543
ఇట్లు ప్రళయ సమయ 167
ఇట్లు ప్రౌఢుండై కామినీ 664
ఇట్లు బాణజాలంబు 427
ఇట్లు భయభ్రాంతులైన 83
ఇట్లు భవదాత్మజుండు 485
ఇట్లు భీకర ప్రాదుర్భావంబైన 716
ఇట్లు భీమసేనునేపు 113
ఇట్లు భోజపతిం గ్రూర 348
ఇట్లు మండల ప్రచార 85
ఇట్లు మనస్సైన్యంబు 109
ఇట్లు మత్స్యానుజుండు దాఁకిన 609
ఇట్లు మాయగైకొని 637
ఇట్లు మార్కొనుటయును 351
ఇట్లు మూఁకలంగలంచి 166
ఇట్లు మూర్ఛిల్లిన దుశ్శాసను 164
ఇట్లు మూర్ఛిల్లుటయు 558
ఇట్లు మేలుకని తగు తెఱంగు 320
ఇట్లు వరుణతనయుఁడు 351
ఇట్లు వాఁటి చిత్రసేను 439
ఇట్లు విగతసాధనుం జేసి 461
ఇట్లు వికలసాధనుం డై 173
ఇట్లు విరథుండయి 407
ఇట్లు విరథుండును 389
ఇట్లు వివ్వచ్చుండు పేర్చిన 622
ఇట్లు వీరకేతుఁడు వడినం 454
ఇట్లు వృషసేను నరదంబు 175
ఇట్లు శిఖండి గండడంగి 434
ఇట్లు శినిపుంగవుండు 364
ఇట్లు శిబిరంబునను 39
ఇట్లు శిబిరంబున నుండి 03
ఇట్లు శౌర్యసారసంపాదిత 200
ఇట్లు సదృశంబులగు 676
ఇట్లు సన్నద్ధులై వెడలి 05
ఇట్లు సమ్మతించి 687
ఇట్లు సహదేవుం బొదివి 607
ఇట్లు సాత్యకి చేతం జచ్చిన 604
ఇట్లు సింహనాద మిచ్చిన 473
ఇట్లు సువిహిత సంధానుండై 678
ఇట్లు సేదదీర్చి 375
ఇట్లు సేయఁ జాలనైతేని 453
ఇట్లు సేయ నైతినేని 269
ఇట్లు సౌభద్రుఁ జెనయం 151
ఇట్లు హార్దిక్యు బలువిడి 432
ఇట్లేకాక్షౌహిణీ బలక్షయం 574
ఇట్లేపు మెఱయ నిరువురుం 633
ఇట్లేయు నా సూతనందను 496
ఇతఁడున్నయంతసేపును 78
ఇతఁడు వడిన ప్రజ విచ్చును; 382
ఇతనికి నితండ యితనికి 61
ఇతని వధియించుటకు 597
ఇత్తెఱంగున 196
ఇత్తెఱంగున 371
ఇత్తెఱంగున 390
ఇత్తెఱంగునం గురుబలంబు 703
ఇత్తెఱంగునం జేయి 88
ఇత్తెఱంగునం దునిమి 101
ఇత్తెఱంగునం దునిమి 694
ఇత్తెఱంగునం దెరలుచుం 396
ఇత్తెఱంగునం దేరిపయిఁ 440
ఇత్తెఱంగునం బాఱిన 449
ఇత్తెఱంగునఁ గర్ణుండు 608
ఇత్తెఱంగున గెలుపోటమి 678
ఇత్తెఱంగున ద్రోణాచార్యుం 356
ఇత్తెఱంగున నెఱి గలిగి 669
ఇత్తెఱంగున నేయుటయు 341
ఇత్తెఱంగున సింధురాజు 174
ఇది శ్రీమదుభయకవిమిత్ర 138
ఇది శ్రీమదుభయకవిమిత్ర 318
ఇది శ్రీమదుభయకవిమిత్ర 424
ఇది శ్రీమదుభయకవిమిత్ర 536
ఇది శ్రీమదుభయకవిమిత్ర 746
ఇదె యొక పిన్నవాఁ డడరి 146
ఇన తనయ సహిత 306
ఇన మండలంబు మఱువడ 528
ఇనుఁ డస్తమింపకుండఁగ 302
ఇనుఁ గబళించు రాహుక్రియ 162
ఇబ్బంగి నుభయసైనికులును 91
ఇమ్మహాస్త్రంబుఁ గడిమమైఁ 721
ఇమ్మెయిఁ గృతార్థంబైన 85
ఇమ్మెయిఁదమ్మునిం దునుము 166
ఇమ్మెయి నద్భుతవిక్రమంబున 355
ఇమ్మెయి బాలుఁడొక్కరుఁడ 180
ఇమ్మెయి వేగనఁ బాండవు 320
ఇరువది యేవురు పాంచాలురు 411
ఇరువది యేవురు పరిణత 238

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇరువాఁగును దార్కొని 91
ఇరువే యుద్భట రథముల 83
ఇలయును నింగియు నద్రువం 703
ఇవ్విధంబున 370
ఇవ్విధంబున 620
ఇవ్విధంబునం గడంగిన 437
ఇవ్విధంబునం గుంభ 342
ఇవ్విధంబునఁ గృపాశ్వత్థామ 527
ఇవ్విధంబునం దొడంగి 47
ఇవ్విధంబునం బలుకుటయు 688
ఇవ్విధంబునం బాండవాగ్రజుం 100
ఇవ్విధంబునఁ గదిసి 195
ఇవ్విధంబునఁ గురుసేనం 373
ఇవ్విధంబునఁ దన చేరువకుం 451
ఇవ్విధంబున ధనురాచార్యు 472
ఇవ్విధంబున నడ్డపడి 172
ఇవ్విధంబున నత్తపస్వి 243
ఇవ్విధంబున నయ్యోధ 153
ఇవ్విధంబున నరిగి 248
ఇవ్విధంబున నశ్మకుండు 154
ఇవ్విధంబున నశ్వత్థామ 721
ఇవ్విధంబున నసమ సమర 90
ఇవ్విధంబున నాలింగనంబు 543
ఇవ్విధంబున నిజరథంబు 443
ఇవ్విధంబున నుత్తమౌజుని 348
ఇవ్విధంబున నుఱుమాడ 354
ఇవ్విధంబున మన దిక్కునఁ 405
ఇవ్విధంబున రాధేయుండు 644
ఇవ్విధంబున రాధేయుం 587
ఇవ్విధంబున రౌద్రరసంబు 368
ఇవ్విధంబున విజృంభించి 86
ఇవ్విధంబున విజృంభించి 623
ఇవ్విధంబున విరటుండు 610
ఇవ్విధంబున విరాటద్రుపదులు 671
ఇవ్విధంబున వెండియుం 446
ఇవ్విధంబున వైరివధం 593
ఇవ్విధంబున సంకులసమరంబు 336
ఇవ్విధంబున సైన్యంబులు 167
ఇవ్విధంబున సైన్యంబు 345
ఇవ్విధమున సైంధవుఁడా 538
ఇవ్విధమున సైంధవుతలఁ 533

ఈ

ఈతఁడు మీకు నాపదల 381
ఈ తల పుడమిం బడనీ 532
ఈ ప్రతిన యెట్టి తెఱఁగున 285
ఈ భంగి నీవడంగుట 475
ఈ మేలు ప్రజ కొనర్చిన 247
ఈ యధర్మంబునకు వెఱతు; 217
ఈ యితిహాసం బాయువు 223
ఈ యొడ్డు భేదింప నేమెవ్వరము 143
ఈలోక మెల్లఁ బాడిల్లును 294
ఈసును రోసముఁ గల దు 203
ఈ సేనల భేదించి భుజా 420

ఉ

ఉక్కును నస్త్రబలము 262
ఉదయధరణీధరంబుపై 321
ఉన్న సమయంబున లజ్జా 72
ఉభయ బలంబులుఁ బురికొని 132
ఉభయ బలంబులుఁ బురికొని 362
ఉరగాంగన నలిఁ బట్టెడు 59
ఉరవడిఁ దాఁకుటయును 561
ఉఱక యురంబు బాహువులు 182
ఉఱుముచు నెల్లెడం 30

ఊ

ఊరక బరవంబు తెఱంగు 488

ఎ

ఎక్కటి పోరె; రుద్రునకు 328
ఎక్కటెక్కటి పెనఁగిన 59
ఎక్కడి తండ్రివి? నీవే 570
ఎచట నున్న వాఁడవే? 88
ఎటుపోవ వచ్చు? నిను 453
ఎడఁగని యబ్బలంబు 371
ఎడఁగని వాలు బల్లెమున 192
ఎత్తెఱంగునం జేసినను 735
ఎదుర నుండ వెఱచి 506
ఎనిమిది తునియలుగా 482
ఎప్పాట నెవ్వరికి విధి 208
ఎఱిఁగినఁ జేరఁడు; చేరుట 381
ఎఱుగవలయుదాని నెఱిఁగి 259
ఎలమిఁ జెలంగు కృష్ణుల 383
ఎలమిఁ దేరిమీఁద నిలుచుండి 529
ఎల్ల దివ్య బాణంబులుఁ 728
ఎల్లభంగుల రాజరక్షణార్థంబు 327
ఎల్లభంగుల రాజరక్షణార్థంబు 417
ఎల్లి సచరాచరములగు 302
ఎవ్వఁడు దెరలెనొ? తిరుగక 30
ఎవ్వరికేని నిలువరింప 681
ఎవ్వరి నెట్లు సేసెదనొ 135

ఏ

ఏచి కురుకుమారు లేవుర 488
ఏచి ధృష్టద్యుమ్నుఁ డాచార్యు 616
ఏచిన రథికవరులు 52
ఏచి నరునకు సాహాయ్య 516
ఏడుదీవుల యందుఁ 231
ఏను జయద్రథుం జంపుటకుం 281
ఏను నిలిచినట్ల కా నూఱడిల్లు 326
ఏను నిలిచినట్ల కా నూఱడిల్లు 417

ఏ నొకరుండనే తనకు 273
ఏ మనుసంధించిన పనికి 219
ఏమి యువరాజ విభునకు 451
ఏమిర కర్ణ! భీము నటు 519
ఏము గలంగిన యప్పుడు 465
ఏము వెండియు నా కర్ణుని 651
ఏ వీరునకైనను నిది 366
ఏసిన నతండు రయంబున 193
ఏసి యెలమి నరుగఁగ 503

ఐ

ఐదైదు శరముల నందఱ 432

ఒ

ఒండు దెసఁ జక్కఁ జూడ 508
ఒండొక చాప మెత్తికొని 434
ఒండొక తేరెక్కి సముద్దండత 471
ఒండొక విలుగొని ధర్మ 399
ఒండొరు మీఁది కోపమున 195
ఒండొరు మీఁద సాయ 491
ఒకఁ డట్లు సొచ్చి, భూపప్రకరం 554
ఒకనిని జంపి యిట్లు 649
ఒక బలు తూ పురంబు 614
ఒక్కఁడ చన్నవాఁడు 412
ఒక్కఁడని కడఁగి రథికులు 335
ఒక్క తేరిమీఁద నుండి 573
ఒక్కొక్క చోట 93
ఒడలను బ్రాణముల్ గలుగ 84
ఒప్పిన యప్పురుష సత్తములం 378
ఒరుల దిక్కు సనక 383

ఓ

ఓడితిమె మేము రణమున 127
ఓర్వక పెక్కండ్రురుర్వీశు 236

క

కంకటము దూటి యంగంబు 155
కటకట పేరిన పెన్నెత్తుట 256
కడంగి రంతఁ గురుపతి 380
కడక న్నెఱ్ఱనిచెల్వుఁ దాల్చ 587
కడచి కాంభోజసైన్యంబు 348
కడుఁ గూర్తుఁ గవ్వడికి 301
కడుపు(వ)వ్రచ్చి యొడలు 228
కడువడి గురుఁ డనిలజుపై 564
కడువడి నీ వరుగఁగ 418
కడువడి వీరధన్వుఁడు 401
కదిసి డెబ్బదేను కాండంబు 489
కదిసి నరేంద్రుఁడు సూతుని 448
కదిసిన లక్ష్మణునిం 182
కదిసి శరాసన గురుఁ డిరువది 346
కని కుంభజముఖ్యులు 265
కని కృతవర్మకు సారథి 431
కని ద్రుపదాన్వయోత్తముఁ 95
కని ద్రోణాత్మజుఁ డేచి 566
కని యాతని కొడుకు 461
కనియెదు సైంధవుం గడచి 283
కని విజయుఁ డలరి 334
కని హరి గర్జునితోడం 636
కనుంగొని గృపాచార్యుం 581
కనుంగొని కౌరవేశ్వరుండు 580
కనుంగొని నవ్వుచు 344
కనుంగొని రోషవిషాదంబులు 725
కనుఁగొని గురుఁడవ్విభు 400
కనుఁగొని ఫల్గునుండు 121
కనువెలుఁగు నీవు గానీ 22
కన్నీ రొలుకఁగ వగచిన 10
కన్నుఁగవఁ గెంపు గదురంగఁ 69
కమలాసమని యింద్రియముల 215
కయ్యంబు సేయ నందు 613
కరములు నిగుడఁగ 343
కరవాలంబున వైచి 497
కరి కళేబరములు 197
కరిగాత్రంబుల ఘోటకాంగ 64
కరి ఘటలు దురగముల 91
కరితురగ రథపదాతులు 87
కరిపతి జిఱ్ఱనం దిరిగి 111
కరియూథనాథుఁ బొదువం 94
కరుణ గలవు; మమ్ము 662
కరులం గూల్చుచుఁ, దేరులన్ 681
కరుల కరంబులు 619
కరులు రథంబులశ్వములు 541
కర్ణ కర్ణ వచ్చి కావు 06
కర్ణ నందనుఁ డిట్లత్యుద్దీర్ణ 64
కర్ణుండు శక్తి వైచిన 482
కలఁక యుడిపి చిత్తము 658
కలఁగిన సేనలఁ గాచెద 10
కలయఁగ దుర్నిమిత్తములు 246
కలవే యెందును నిట్టివి? 345
కలశజుని తెంపుఁ బెంపును 456
కవచధారణ మను ఘన 189
కవలుం దానుమ నేచి 63
కవిసిన నమ్మహాభుజుఁడు 130
కాంచనాలంకార కాంతంబులై 231
కాదేని గాండివజ్యా నాదము 11
కాలంబైనం బోవక 290
కాలము ప్రాప్తమైన మదిఁ 350
కాలువలై పాఱు కీలాల 133
కావున 23
కావున నతం డంతకు 08

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కావున నశ్వత్థామ సచ్చెనని 682
కావున నీవు సమరోత్సాహుండవై 476
కావున నొక్కరు నిరూపింపు 20
కావున మన సైంధవునిన్ 556
కావున మన సైన్యంబులు 552
కావున వారల గెలుచు 34
కినిసి బకమర్దనుఁడు 562
కినిసి వెసన్ సత్యజితుని 97
కినుకమై నిగిడిన 109
కిరణము లుల్లసిల్లఁ 738
కుడిచితి, కట్టితి, పెట్టితి, 666
కుడువను గట్టను బూయను 204
కురునరేశ్వరుండు పురికొల్పఁ 353
కురుపతి ధర్మనందను 126
కురుపతి బలముల 283
కురుబలముఁ దొడరి 539
కురుబలము సొచ్చి నీదగు 415
కురుముఖ్యుండును దోడి 447
కురువీరు లెఱుఁగుదురు 708
కురుసేన పైఁబడ్డ 376
కురుసేన యుబ్బి యార్చుచు 727
కులిశంబు తాఁకున కూలిన 342
కూలురూపుఁ దన్నికొనియెడు 89
కూల్చుచు గజముల నెత్తుటఁ 48
కృతవర్మయుఁ గృపుఁడు 183
కృతవర్మయెడల సాత్యకి 429
కృతవర్మాదులఁ జెప్పనేల? 503
కృతవర్ముఁడు మద్రమహీపతి 63
కృపుఁడును ద్రౌణియుం 538
కృపుఁడు వృషసేనుఁడును 525
కృపుఁడు గురుసుతుండుఁ 152
కృపుని పలుకులు విని 699
కేతువుఁ గూల్చి, రథ్యములఁ 402
కొండొకసేపునకు సేద దీఱి 597
కొడుకుఁ బొడగాన కర్ణును 203
కొడుకు వధించి రన్న 205
కొనుమిదె నీ మిత్రుని తల; 628
కొమ్ములఁ గ్రుమ్మియుఁ 92
కొఱవిద్రిప్పిన తెఱంగు 159
కొలువున్న సమయంబున 321
కోపంబు గదిరి ప్రాగ్జ్యోతిష 120
కోపాటోప మహోగ్రమూర్తి 395
కోపించి యాతఁడొండొక 349
కోలు మసఁగి గురుండు 680
కౌరవపతియు మగిడి 459
కౌరవయోధవరు లొక్కపెట్ట 71
కౌరవసేనా ముఖంబున 25
కౌరవ సైన్యంబులఁ గల 282
కౌరవులం గాచుచు రణ 11
కౌరవులేమి సేయుదురు? 329
క్రీడికి మును మనమందఱు 582
క్రీడి యమ్మెయి వచ్చిన 328
క్రీడి యాఁకొనియున్న కేసరి 80
క్రోధ శోకజ్వర విముక్తుండవై 324
క్షత్రదేవుండు లక్ష్మణుతోడ 55
క్షత్రధర్మంబు కీడునఁ 511
క్షత్రవర్మ గురుని చాపంబు 462
క్షత్రికాంత పుత్రకుని 289
క్షమియింపు మనుడు 585
క్షతియుం బర్వతకోటియున్ 677
క్షేమధూర్తి బృహత్క్షత్తు 401
క్షోణీవల్లభ! వినుమేఁ 40

ఖ

ఖండముల్లై పడం ధనువు 97
ఖరనారాచము భీమువక్షమున 484

గ

గగన మధ్యంబునకు వచ్చి 50
గజముఁ గొలిపి యాదిక్కున 110
గతవృత్తములకు వగవం 494
గదగొని యశ్వత్థామం 193
గదఁద్రిప్పి బెట్టు వైచిన 637
గద లన్యోన్య సమాగతిన్ 61
గద వైచిన నది ద్రోణుని 460
గద సారించి చెలంగి 470
గద సారించుచు జయమునఁ 23
గాండీవంబు గుణంబు 526
గాండీవి చందమయి 85
గిరియై పఱతేర నశని 570
గురుఁ డతని సూతుఁ 455
గురుఁడను జలనిధిఁ 444
గురుఁడను తీవ్రమారుతము 90
గురుఁ డమల యోగనిష్ఠం 697
గురుఁ డలిగి పెలుచ నడరిన 51
గురుఁడవుగాక పగతుఁడవె? 345
గురుఁ డశ్వంబులఁ గూల్చెను 191
గురుఁడును నీవును మద్రేశ్వరు 585
గురుఁడు పాండవులకుఁ గూర్చి 589
గురుఁడు వడిన నవ్విధమునఁ 703
గురుఁడు వడిన యపుడ 30
గురుఁడు సత్యజిత్తు కోదండ 95
గురుఁ డెన్ని శరములేసిన 459
గురుఁ డేయ నరుఁడు 675
గురుఁడొండొక విల్లెత్తిన 366
గురుఁ డొడ్డగఁ దమకంబునఁ 126
గురు కృతవర్మ ముఖ్యులతి 430
గురు కృతవర్మాది రథిక 512
గురుఁడును భీష్ముఁడుం గలనఁ 34

గురుతనయ ప్రముఖ 525
గురు దృఢసేనుఁడు దాఁకిన 101
గురునకు నాకును బాండవు 589
గురునట్టివారు పదివేవురు 300
గురునిఁ గడచి నరుఁడు 501
గురుని ప్రతిన వింటె? 39
గురుని బలశౌర్యములు 77
గురుని యలవుఁ జలము 283
గురుని యుపేక్షఁ జేసి 161
గురుని వధించుటయు 40
గురుపుత్ర కర్ణమద్రేశ్వర 413
గురుపుత్రుండు గడంగి 725
గురుముఖ బహురథిక 379
గురుమెయిఁ దొంబది సునిశిత 398
గురులకు భక్తుఁ డుదారుఁడు 250
గురు శారద్వత ముఖ్యయోధ 202
గురుసుత! నీదుభుజా 726
గురుసుతుఁ డొక్కరుఁడును 567
గెలుపు ధ్రువము నీకును 324
గెలుపును నోటమియును 519
గొడుగునను వింటికొమ్ముల 492
గొడుగులుఁ గేతనంబులును 365
గోమునఁ బెరిఁగినవాఁడు 380

ఘ

ఘనతర కోపవేగమున 96
ఘోరంబు గాఁగ హాహాకారము 367

చ

చంచత్తుంగ తురంగ సత్వర 50
చంచద్బాణ పరంపరా 670
చండగతి వీరరథికులఁ 188
చంపం జాలుదు నేనొకండన 580
చంపి యతని రథంబునకు 503
చంపి విక్రమంబు సొంపారఁ 111
చక్కఁ జలము పెనఁగఁ 528
చచ్చిన నీలునిఁ గనుఁగొని 127
చచ్చిన వసాతిఁ గనుఁగొని 176
చచ్చిన సోమదత్తుఁ గని 596
చచ్చె ఘటోత్కచుండు మన 646
చతురంగంబులు నొక్కపెట్ట 376
చని యడచి పాటు గదుర 474
చని యయ్యొడ్డనంబునకు 332
చని యాప్తులైన బలవన్మను 272
చనుఁ డడ్డం బాచార్యున 125
చనునప్పు డతని యమ్ములు 357
చరాచరంబు లన్నియు 215
చలమునఁ బోవక పెనఁగిన 468
చలమేది కౌరవ సైన్యముల్ 66
చాపము కేతువుం దునిమి 185
చాపముఁ గేతువుం దునిమి 610
చాపాచార్యుఁడు సాత్యకి 442
చావులు లేవె యెందు? ననిఁ 699
చిక్కువడఁ జేసి చనుమఱ 460
చిక్కు వడక సాత్యకి 438
చిచ్చునకుఁ దోడు గరువలి 130
చిత్తము వొక్కెడుం బురుష 140
చూడం బిన్నవాఁడు గాని 189
చూపులు మిఱుమిట్లుగొనఁగ 332
చెప్పి యప్పుడు ధర్మనందన 697
చెలఁగు పటు సింహనాదం 482
చెలియలికట్ట సముద్రము 334
చెవులు బీటలు వాఱంగఁ 392
చేతులుఁ దొండములు 354
చే నెత్తురు గాకుండం 543
చేయఁగల రథికులును 619
చేయలఁతిం గని సమరము 499
చేరి యుండుట ననువైన 124
చేసికొని యప్పుడాతి 600

ఛ

ఛలము గొనియిట్లు వడయఁగ 706

జ

జగము లన్నియును దేజంబున 196
జగములు గలిగింపఁగ 309
జనకు నధర్మవృత్తి 704
జననమాదిగఁ బాకశాసను 234
జననాథ! పాంచజన్య ధ్వని 272
జననాథ! యిట్లు శోకంబున 229
జనపాలక! సృంజయుఁ డను 226
జనవినుత! బాదరాయణ 745
జన్మవేళన యాతఁ డుచ్చైశ్శ్ర 705
జిగి దొలఁకాడఁగ నేలకు 729
జ్ఞానమ్ములు దెలివొందం 322

డ

డిగకుఁడు వాహనంబులు 719

త

తక్కటి రథికుల నెల్లను 70
తగఁ బర్జన్యుని సొంపునన్ 16
తగ మన సైన్యమున్ 44
తగు మాటలాడి కోడలి వగ 290
తగు సంతసింపఁ గుజనుల 81
తడవయ్యె నితఁడు మన 347
తడసినఁ గర్జంబు దప్పు; 428
తదనంతరంబున 07
తదనంతరంబ ద్రోణుం 47
తదనంతరంబ యాచార్యుం 453
తదవసరంబ 51

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తదవసరంబున 96
తదనంతరంబున 109
తదవసరంబున యుధిష్ఠిరుండు 529
తనకు నరణ్యంబున 314
తన కొడుకుల గెలుపు 31
తనచేతన సూతసుతుం 656
తనదైన ప్రతిన నెఱపుట 392
తనమాట నమ్మి సైంధవు 555
తన మాటే యని గంగాతనయు 711
తనయుఁడు మూర్ఛవోయిన 577
తనయునిమీఁది కూరిమి 170
తన విద్య కలిమి వినతా 191
తన వెనుక దెసకు పాఱిన 131
తన సారథిఁ గనుంగొని 147
తనుఁ దాన చెప్పికొను టొప్పని 701
తనుఁ బాండు తనయులకు 689
తను నత్యుద్ధతిఁ బిల్చి 130
తను నా ధృష్టద్యుమ్నుం 698
తను నిమ్మెయిఁ దలచిన 08
తపములు దానంబులుఁ జేసి 277
తమకించుచుందుము నీకు 74
తముఁ బిలుచుచు నివ్విధమున 383
తమ్మునిఁ దలంచి కృష్ణుని 464
తమ్ములు దొరలును నేపతి 449
తమ్ములు నన్నులుం జెలులుఁ 159
తరుణుల కుచములపై 663
తఱిమి గురు వింటి గొనయం 622
తఱిమి ఘటోత్కచుండు 405
తఱిమి సహదేవుఁడా త్రిగర్త 402
తఱిమి సుశర్మదమ్ములును 76
తఱుచుగాఁ దెగిపడ్డ 49
తలపడి చాపరుచులు 365
తల మిగిలి వచ్చు బాహ్లికు 128
తలలను గరముల 426
తలలుం జేతులుఁ గాళ్లులుం 623
తల వ్రయ్యలైన నిష్ఠుర 578
తాఁకినఁ బొగడం దగియెడు 67
తాఁకి యిరువదే నమ్ము లుదగ్ర 724
తానును దమ్ములుం జెడుదు; 481
తా నెఱుఁగఁ డొరులు సెప్పిన 501
తిండిపోతా! నీకు భండనం 499
తునిమి తోడన యురమాడ 477
తుంగ మడువుఁ జొచ్చిన 354
తునిమి తోన యతనిఁ 394
తునిమి నవ్వుచు నేఁబది 436
తురంగంబులపై నాశ్వికు 663
తురగము తురగముఁ గరి కరి 556
తురగమున నరుని వ్రేయుచుఁ 92
తురగములఁ జంపి సారథి 502
తురగముల తలలు 483
తురగముల సూతుఁ జంపినఁ 620
తురగవ్రాతముఁ గూల్చి 524
తురగవ్రాతము నొంచి 53
తెగవాపుటయుం దదీయ 313
తెరలిన సైంధవుఁ గని 58
తెరలి పాఱఁగఁ దలచుచో 643
తెఱపిగొని నీవు సొచ్చినఁ 144
తెలివొంది యుధిష్ఠిర 559
తెల్లమయ్యె నాకు దివ్యాస్త్ర 728
తెల్లముగ సుతుపడుట విని 267
తేఁకువ లేక పుత్తెంచిన 505
తేరుల యొప్పు వ్రోడుపడఁ 91
తేరును సైంధవుని దెసకు 516
తొడరెడు కొలఁదియె వానికి? 481
తొడవు లొప్పార నెత్తుట 335
తొమ్మిది తొమ్మిది వాలిక 388
తోఁచిన వినయసంభ్రమంబుల 729
తోడంబుట్టువునకుం 65
తోడన కడువేగంబున 369
తోడన ధృష్టద్యుమ్నుండును 576
త్రుంచి తోడన ముప్పదితూపు 561
త్రుంచి మేను గాఁడఁ దూపులు 603
త్వరితముగఁ జనుము సఖుఁడు 413

ద

దండిమగలైన వృషసేనుండు 391
దనుజవైరి! యెంతదడ నింక 531
దమమును సత్యముం దపము 09
దర్ప దుస్సహతేజు రాధా 44
దవ్వని చూడకు; మార్తుర 420
దానం గనలి అనిలతనయుండు 485
దానం బెండువడక 607
దానవజయ మింద్రుని కెద్దాని 108
దానికిం జలింపక 436
దానికి మనమున నించుక 492
దీనికి మూలము ధర్మజుఁ 700
దురమున బంధుమిత్రులకుఁ 413
దుష్ట మనస్కుండగు 26
దేవముని యిమ్మెయిం దగు 243
దేవరకు నధిక భద్రము; 324
దేవరయాజ్ఞఁ దలనిడి 466
దేవవ్రతుండు దేవ భావంబునం 04
దేవా! వైశంపాయనుండు 01
దేవా! వైశంపాయనుండు 140
దేవా! వైశంపాయనుండు 319
దేవా! వైశంపాయనుండు 425
దేవా! వైశంపాయనుండు 537
దేవాసుర సంఘంబులు 545
దైవంబన వేఱొకండు గలదె? 652

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దొరఁకొని దివ్యబాణములు 676
దొరలు వడిన సేన దూలక 370
ద్రుపద విరాట కేకయులు 418
ద్రుపదుఁడు వృషసేనుండును 612
ద్రుపదుని సేనపై నడరి 579
ద్రుమసేనుఁ డడరి పటు 616
ద్రోణ కర్ణ శల్య దుర్యోధనులుఁ 273
ద్రోణ కృప ద్రౌణి కృతవర్మ 157
ద్రోణుండు కోపించి 400
ద్రోణుండు పది బాణములు 53
ద్రోణుఁడు గర్ణుఁడుం గృపుఁడు 546
ద్రోణుని శరములు నిలుపుచు 52
ద్రౌణి గౌంతేయసేనపై 724
ద్రౌపది వడ్డ బన్నము 382
ద్వైతవనంబునందు గుణ 414

ధ

ధనంజయ ధృష్టద్యుమ్నుల 50
ధనంజయుం డతని కిట్లనియె 77
ధనంజయుండును 345
ధనురాచార్యుఁడు కేశవానుజ 441
ధనురాచార్యుఁడు దగఁబన్నిన 249
ధనువుం గేతువుఁ ద్రుంచి 593
ధనువు దునిమి నవ్విన 457
ధనువు సిడంబుఁ ద్రుంచి 605
ధరణీచక్రము దిర్దిరం 716
ధరణీనాథ! మురాంతకాను 448
ధరణీభాగము గ్రక్కునం 70
ధర దివ్యాస్త్రహతిం బగిల్చి 374
ధర్మజ భీమ పార్థులును 11
ధర్మతనయు రథ్యంబుల 400
ధర్మపుత్త్రుండు వనుప 425
ధవళాశ్వంబులుఁ బూని 41
ధీరత్వం బొకఁడుం సహాయముగ 640
ధృష్టద్యుమ్న సాత్యకి సేనా 102
ధృష్టద్యుమ్నునిఁ జూచుచున్ 689

న

నకుల నందనుఁడు నీనందను 611
నకులాదులు నా దైత్య ప్రకరం 636
నకులుఁడు నృపతియు 674
నకులునిఁ దాఁకి వికర్ణుం 403
నకులుని నైదు సాయకముల 68
నడచి నదీనందనుఁ డున్న 13
నగుచు విలు దునిమి 438
నడిఁకెడువాడు గాఁడు 31
నడుమ భానుఁ దాల్చు 360
నడురేయి తీవ్రభానుఁడు 623
నను గెలిచి కాక నీ కిమ్మైన 469
నను నశ్వత్థామను నీవనఘా! 340
నను భీష్ముని పిదప బలం 35
నను మది దూఁటు వోవు 549
నను విను కీచకాంతక! 145
నమ్ముము, వెఱవకు, మేనును 275
నరతనయ ప్రముఖ 112
నర తురగ ద్విరద రథోత్కర 447
నరపతి యలరఁగ రథకరి 18
నరపతి యానందాశ్రులు 543
నరవర మున్న చెప్పితి 72
నరసుతున కగ్గమయ్యెం 151
నరుఁ డగ్గలికం దఱుముచు 51
నరుఁ డనుఁగుబంటు గావునఁ 548
నరుఁ డిటులాడునే నృపగణంబు 300
నరుఁడు గని సత్వరంబుగ 720
నరుఁడు దనతేరు వోయెడు 368
నరుఁడును రాధేయుఁడు 45
నరుఁడును సాత్యకియు 474
నరుఁడు నూఱు తీవ్రశరముల 523
నరుఁడు లేని చోట ననుఁగని 73
నరుఁడెడ సొచ్చెనేని 38
నరుఁ డొక రథికుని యనుమతిఁ 469
నరుఁ బొదివి; రతఁడు వారల 531
నరు నద్దెసఁ గలవారిని 583
నరుని విక్రమంబు 135
నరు బాహాస్ఫురణమునకు 447
నరు లమరు లగుదు, 221
నఱకి నిజసారథిం జూచి 444
నఱికి తోడన హరిమేను 341
నలి భగదత్తుఁడు గదువుల 113
నలుమడి నీకు నమ్మనుజ 240
నలువ చెందొవల తేకులకు 663
నాకుంగా లోకంబులం 214
నా చేతఁ దెగని పాంచాలురు 553
నా చేతి బలుపు గని 427
నా తనూజులు దుర్బుద్ధులీ 650
నా తెఱంగు వినుండు 10
నాతోఁ దలపోయక 279
నా దివ్యాస్త్రంబులు బాహా 700
నానాస్త్రంబుల నాతఁడు 86
నానాస్త్రంబులు ముందఱ 445
నా పలుకు నమ్ము; మర్జునుఁ 291
నాయున్న చోట నెపుడు 39
నారాయణాస్త్ర మిమ్మెయి 723
నాలుకలు గ్రోయుచు విష 310
నాలో సగ మర్జునుఁడే 301
నావింటి బలువుఁ జేతుల 387
నావుడుఁ గర్ణుతోడ 20
నావుడు నాతఁడమ్మనుజ 337

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నావుడు నాతఁ డా ధరణి	118
నిజబలంబులం బురికొల్పిన	635
నిజశిబిరంబు సొత్తెంచి;	315
నినుఁ గృతవర్మ గెల్చి	358
నినుఁ దనుఁ గా నతి నిర్మల	732
నినుఁ బట్టఁ గుంభజుండు	597
నినుఁ బ్రజాసంహారమునకు	217
నిను నమ్మి యొండు వలనికి	357
నిను నవలీల దాఁటి	356
నిన్నును బాండుతనూజుల	582
నియతిం బావక బాణ	727
నిరుపమ గుణరాశీ! నిర్గుణత్వ	423
నిరుపమశక్తిఁ గర్ణుమెయి	517
నిర్మలచిత్త భృంగరమణీయ	422
నిలిచిన రూపు డొల్లి	92
నిలిచియు సాత్యకి దెసం	430
నిలు నిలు కర్ణ! యో కృపుఁడ	167
నిలు నిలు మెందుఁబోగలవు?	339
నిలువుఁడు; వెఱపేటికి	587
నిశిత నారాచంబుల	724
నిషాదులు గళింగులు	184
నీకుఁ జూడ ముష్టి నెలవు	385
నీకును నీవారికిం గయ్యంపు	632
నీకు వగవఁ బనిలేదు;	222
నీ కొడుకు తుచ్ఛమగు	288
నీ కోరికి యప్రతిహతమే	213
నీ చెప్పిన పాంచాలురం	591
నీ తమ్ముఁగుఱ్ఱ రూపసి	466
నీదు నిశ్చయం బెట్టిది?	37
నీ దెసఁ జూడ నొండొకరినిం	510
నీమగఁడెల్లి సైంధవు ననిం	291
నీ మాటకు మా యశ్వత్థామ	357
నీయడిగిన యతండు	739
నీ యవినయంబు పెంపున	431
నీ యుపదేశముఁ దనచే	265
నీలగళుండు, శంకరుఁడు,	740
నీలలోహిత వర్ణుండు	311
నీలుఁడను రాజు గురుసుతు	127
నీ వలన సనాథంబై	19
నీవుఁ దపస్తేజో విద్యావిభవ	735
నీవును నచ్చటఁ బన్నిన	551
నీవు వహించు గురుభారంబు	654
నీవు సృజియించి తటె	216
నీ సైనికు లెంతయు సంతోసిల్లు	199
నుగ్గునూచమైన నగ్గురుఁ	471
నృపతితోడఁ గూడి కృపుఁడును	584
నృపతులు సొచ్చి పోరునెడ	510
నెచ్చెలి చావునుం జూడం	509
నెత్తుటఁ దోఁగినేల యెఱనింగి	197
నెత్తుట జొత్తిల్లి నెఱసిన	192
నెఱి దప్పంబడి పెల్లుగ	199
నేఁడీ బ్రాహ్మణు చేతం	79
నేలకు నల్లెఁడు పొడువున	688
నొంచినం గోపించి	442
నొంచినఁ గెంపు సొంపునఁ	175
నొచ్చినఁ జచ్చినఁ దెరలిన	372
న్యస్త శస్త్రుఁడైన యాచార్యుఁ	704
ప	
పంకజనాభ! మా పడిన	323
పగతు రకంపనుపై నెత్తి	210
పగిలి యాతని తల	533
పటుగతిఁ జని కురుపతి	638
పటుగతి నా శినిప్రవరు	436
పటు నారాచ పరంపరా	282
పటు బాణాహతి ద్రౌణి	572
పటు భల్ల నికరంబు	373
పటు శరముల మీఁదికి	530
పట్టి బలువుగ జటాసురు	627
పడియుండి వాఁడిలఁ బొడిచిన	256
పడుఁ గాక యేమి? పగఱం	254
పతి గలంగ శైనేయుఁ డబ్బుల	620
పతియు యువరాజుఁ గవలను	673
పతిరహితాత్మ యైన సతి	06
పదంపడి తన్నా సూతపుత్రుండు	519
పదంపడి యా ధృష్టద్యుమ్నుం	601
పదముల రథవాహంబుల	112
పదాతి జనంబులుం గైదువులు	720
పదియు నేను నిశిత బాణంబు	523
పనిచి కృత పడిన	02
పరమకరుణ నైన	414
పరసేన భేదింపఁ బనిచితి	207
పరిధాన ప్రావరణీ కరణా	423
పలకయును వాలునుం గొని	455
పలుకక యున్న యద్దరణి	241
పలుకులఁ బనిలే దీ	552
పలుకులు వింటిరే ధనువు	160
పలు తలలు ముఖవికాసము	335
పలు తునియలు సేయుచుఁ	444
పలు మాటల కిటు మఱు	248
పలువురు క్రూరత బాలుని	256
పలువురు బంధులు నాకై	589
పలువురు రాజులం దునిమె	208
పలువురు సుట్టు ముట్టుకొని	254
పవనజుఁ డొక్కఁడె పెఱ	487
పవనజు చాపమున్ హరుల	496
పవనతనూజుఁ గంటె?	103
పవననందనుండు నకుల	675

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పవనాశనుఁడు నూర్ధ్వబాహుండు 730
పాంచాల పాండవ ప్రముఖ 696
పాంచాల యాదవ పాండ్య 170
పాంచాలురు పాండవులు 552
పాండవ పాంచాలాదులు 580
పాండవసైన్యముల్ సెదరి 625
పాండవాగ్రజుండు పవనాత్మజు 575
పాండవాగ్రజుని చాపము 602
పాండవుల గెలుచు నాజి 486
పాండుక్ష్మావరసూను సైన్యములు 453
పాముఁ బొదివి వడఁ దిగిచిన 29
పాయవడు రథచయంబులు 48
పార్థుఁ డిట్లు 319
పార్థుఁడువేఁడీ? పొదువుండు 336
పాఱెడు మనసేన పఱఁగెడు 118
పావనంబులయిన పలుకులు 14
పావని సేరియుండఁ డొకొ! 253
పిడుగుల యట్ల తాఁకి 386
పితృ సఖుఁడగు భగదత్తునిఁ 709
పిన్న నగవుతోడఁ జెన్నెసలారు 255
పిలిచికొని యైనఁ బార్థుం 649
పిలిచినఁ బోవకుండు టిది 77
పిలిచిన మరలమి దగ 117
పిలువుఁడు దడయక కర్ణుని 07
పుత్రశోకానలంబును గ్రోధ 327
పుత్త్రశోకాపహంబును 242
పుత్రుఁ గనుట యెల్ల శత్రునిచేఁ 701
పుత్రుఁ దలఁచి తలఁచి 211
పురహరుఁ డనుమతి సేయఁగ 314
పులికిఁ బసులు వాఱిన క్రియ 449
పులివాతికడఁ గొను 364
పులుఁగుఁ ద్రాటఁ గట్టి 410
పూనఁగ రాదే నా కెద్దానిం 285
పూర్వవంశ్యులఁ గావఁ బూని 233
పెక్కంద్రు గూడి యిమ్మెయి 199
పెక్కంద్రు దొరలు దన 463
పెక్కుచోటుల నెఱిఁగిన 464
పెక్కు నదు లీఁది వెడలుట, 379
పెక్కు రణంబులం గనియుఁ 590
పెదవులు దడుపుచుఁ గాళ్లన్ 274
పెనంగం దొడంగె; నప్పుడు 715
పెనంగి; రందుఁ గొందఱు 87
పెనంగు నెడ భీమసేనుండు 473
పెనఁగంగఁ జాలరు బీభత్సుతో 257
పెనఁగు నెడం గర్ణుని దిక్కున 480
పెనుగాలిఁ బెఱుగు కార్చి 68
పెనుగాలిని వెసఁ గూలిన 102
పెనుపారన్ వరమిచ్చి తట్లు 134
పెనుమంట నుఱుకు శలభం 460
పెనుమొనతోడ మున్ పెనఁగి 507
పెర యోఁగలగతిఁ గవియుచుఁ 87
పెఱవారు వెఱచి నలుగడఁ 468
పెఱికితి నలుఁగులు మేనులు 373
పెలుకుఱి యచ్చటి మూఁకలు 437
పేర్చిన మూఁకఁ గూడ 14
పొదివిన నొదవిన కోపంబు 448
పొదివిన యగ్గురు ప్రాపున 343
పొదివి యవలీల నాతని 461
పొదువుచు విచ్చుచు బలువిడి 48
పొదువుటయుం గనుఁగవఁ 51
పోక నిలిచి యమ్మారుత 634
పోనీఁడు పొదువుఁ గుంతీ 401
పోరెడు నప్పుడు లావును 62
పోవక హయకేతన గాండీవ 526
పౌరవుం డభిమన్యు బలువిడి 56
ప్రకట బలాఢ్యు లొక్కటఁ 152
ప్రకృతి జనునట్టు లిమ్మెయి 654
ప్రకృతి యనఁ బురుషుఁ 310
ప్రజ నెల్లం దునుమాడి 670
ప్రతిజ్ఞా భంగమయ్యెనని 528
ప్రథమ గిరిమీఁదఁ దోఁతెంచు 29
ప్రదర ప్రవాహమునన 436
ప్రస్ఫురద్వానరపతియును 396
ప్రాణములు గలుగు నంతకుఁ 527
ప్రాయము కల్మి నొక్కటన 21
ప్రియములు వల్కి నిన్నను 470

బ

బరవసంబు వాటించెఁ 660
బరవసంబు సేసి యడ్డపడి 514
బలమును దాను మత్స్యనర 56
బలములఁ గావఁగఁ జనుటయు 115
బలము లచ్చెరువంద 483
బలము లిది యేమి నలుగడఁ 695
బలము విఱిగి రెండు పాయలై 125
బలహీనులు సంగర భీతులు 262
బలియురతోఁ బగగొనినం 501
బలు డేగల కైవడి 480
బలు మాయాబల బాహా 645
బలువిడిఁ గరి గవియుఁడు 119
బలువిడి బహుభంగుల 442
బల్లిదుఁ డగు భీష్ముఁ బడవైచి 547
బహుహేతి ప్రకరంబులన్ 406
బాణఘట్టనఁ గటకటఁ బడి 460
బాలధ్వంసకు నా దుశ్శీలుం 268
బాలుఁడవు నీవు; కుంభజ 147
బాలుఁడవైన నీ వరిది 292
బాలుఁడు సుకుమారుఁడు 203
బాలుఁడొంటి యిట్లు పలువుర 169

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బాసటయై వృకోదరుఁడు 131
బిందు చిదాత్మనాదమయ 534
బిరుదు జితశ్రమంబు 114
బ్రతుకఁ దలఁచితేని 452
బ్రహ్మచర్యమునఁ దపంబున 289
బ్రహ్మవిద్వేషంబు పరికించి 240

భ

భట గాత్రంబుల ఘోట 574
భయ మేటికి వినుఁడు 384
భరితాశాంతర పాంచజన్య 15
భల్లం బొక్కట విల్లుద్రుంచి 435
భల్లముల మూఁట గొడుగును 173
భవదీయ బాహావిహారంబు 542
భవదీయ రక్ష యిమ్మెయి 419
భవునిచే సాదారానుజ్ఞ వడసి 315
భవ్యంబైన బలాధిపత్యము 24
భానుమంతనిఁ జంపిన పగ 561
భీమతనయుండు మాయవుఁ 633
భీమనందను చావునఁ బ్రేమ 654
భీమనాదుండు భీముఁ డుద్దాము 221
భీమసేన పురస్సరులై 411
భీమార్జునుల బారింబడి 452
భీముఁ జేర నరిగి 464
భీముఁడుఁ గర్ణుఁడుం గదిసి 674
భీముఁడుఁ గురుపతియు 605
భీముఁడు గదవైచిన 634
భీముఁ డుదగ్రతం గవియఁ 111
భీముఁడు నట్టివాఁడె యరిభీషణ 103
భీమునిఁ దత్సోదరులను 632
భీమునిచే నని నశ్వత్థామ 683
భూనాథుఁడు బొంకఁడు; విను 709
భూరమణ! విదురుఁ డమ్మెయి 550
భూరిచక్రంబు వెస 406
భూరియు శినివరుఁడు 603
భూరిశ్రవుండు సచ్చుట 516
భూసురభక్తియు వృద్ధో 553
భేరీ మృదంగ శంఖ మహా 714

మ

మండెడు బలునారసముల 500
మందగతిఁ జనుము నా వెనుకం 446
మందస్మిత సుందర వదనేందు 391
మగధపతి సూనుఁడైన 186
మగిడి యట నిరూపించి 117
మగుడఁగ దానవప్రవరు 641
మగుడఁ జనియాఁగి నిశిత 440
మణిగణోజ్జ్వలమైన మన 12
మది నయ్యిరువుర మాటలు 687
మన కింత ప్రియం బగునే! 504
మన కిది సమయము నుండీ 129
మనకు నిమిత్తము లెంతయు 326
మనకు నిమిత్తము లెంతయు 416
మనకును నితనికి సైంధవు 381
మన చేసిన సుకృతంబుల 299
మన తొమ్మిది సిడముల 397
మనబల మార్చినం గినిసి 54
మన బలము గదియు 46
మన మంతకు వేఱొక దిక్కున 625
మనమునఁ గుంతీవాక్యంబును 498
మనమునఁ గొంకక యెదురుగఁ 383
మనమున ఖేదము మోదము 158
మన మూఁక దఱిసి యుద్ధతిఁ 471
మన మూఁక యొదిఁగి గుంపులు 362
మన మూఁకలు నట్లకాఁ దలంచి 606
మన మెంత సెట్టలమొ 555
మనవారును రణ కౌతుక 43
మనవారు వారి వారలు 493
మన వేగుల వారు వచ్చిరి 280
మనసిజ మూర్తియైన 260
మన సేనల నొక్కెత్తునఁ 707
మన సేన పెలుచఁ 153
మనుజాధిప తగుసమయం 258
మము నీతని కొప్పింపక 686
మమ్ము కాదు నీ నెవ్వరి 590
మమ్ము నరయు భరమున 285
మరుదాత్మజుఁ డేచిన నన్నరు 491
మఱచితె యా సభన్ భువన 452
మఱియు నతని మెయి 459
మఱియు నమ్మహీశ్వరుండు 23
మఱియు నిరువది మెఱుంగు 394
మఱియు నిరువదేను 346
మఱియును శరశతకము 410
మఱియు నొక్క ప్రతిన 269
మఱియు వృకోదరాది సోదరుల 42
మహనీయాకృతి సంయమి 737
మహితలావణ్యమును 198
మా కిరువురకుం దోడు 590
మానుసులు వోలె నున్నార; 263
మాయవుఁ జీఁకటి విరియుఁడుఁ 530
మాయలు జూదము తోడన 124
మాయా ముఖంబున మార్గణ 630
మారుతి యిమ్మెయి నక్కురు 596
మార్బలంబులు సొచ్చి, మాతంగ 200
మిడుక మిడుక ని త్రెఱంగున 183
మిమ్మును బాంచాలురఁ గడు 261
మిట్టుఁ బల్లంబునై మెలఁగంగఁ 239
మీ తండ్రికి నే మృత్యువ 592

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మీ యందఱచేత ననుజ్ఞాతుం 274
మీ రందఱు నట్లకాదే 511
మీరును బ్రాణములు 653
మీరెల్లఁ జూచుచుండఁగఁ 10
మునిజనవల్లభ యివ్విధము 02
మునినాథ! దేవకీసుతుఁ 315
మునినాథ! నీవు సెప్పఁగ 222
మునినాయక! మృత్యువు 212
మునివర! ద్రోణుని వృత్తము 743
ముని సముదయ హృద్యా! 317
మును దివ్యాస్త్ర బలంబున 375
మును ద్రోణునిఁ బొలియించితి 715
మును నీవెన్నితి విక్రమాఢ్యు 275
మును ప్రసిద్ధిఁ బొంది చనిన 224
మును బకుననుజుని వలనం 638
మును మాయ మ్రింగి 644
మును శకుని బుద్ధిమైగెలిచిన 475
మును సంకటపడి మూఁకలు 390
మున్నాపని మానుసులం గ్రన్నన 599
మున్నెన్నఁడు నవ్విధ మేఁ గన్నది 385
మృత్యుదేవిముం బరమేష్ఠికిం 218
మెయిమెయిం బెనంగి మెచ్చించి 15
మెఱుఁగులు గర్జితంబులును 93
మెఱుఁగు మెఱచినట్లు 149
మెఱుమ ధనుర్దండము 99
మేను మృదుశయ్య సగము 293
మేపి కట్టాయితం బయి 375
మేరు వొఱుగుట యినుఁడిల 28
మేలుదలంపు శోభనము 340
మొగమునఁ గయ్యపు వేడుక 19
మొనలతోడను దనతోడ 498
మొనలోన నిలువ నొల్లక 332
మొనలో నిలువక యుత్తరమున 669
మొరపవాన పెల్లు గురిసె; 333
మ్రుచ్చుల మూఢత్వమునం 243

య

యదువంశంబున లోక 33
యాదవ కౌరవ పాండవులాదిగ 277
యోగీంద్ర చిత్త కమలా భోగ 740
యౌవనంబునఁ దపమాచరింపఁ 232

ర

రథకరి తురగోత్థ పృథివీ 46
రథము డిగ్గి తొలంగి 477
రథము డిగ్గి హర్షాశ్రులు 542
రథమును నశ్వమ్ముల 398
రథ వితతి వఱపి 261
రథ్యంబుల దగ యుడుపను 420
రభసంబునఁ బ్రాగ్జ్యోతిష 113
రభసోదగ్రతఁ బూన్చి 121
రయంబునం జని కరంబులం 654
రయమారన్ బలువిల్లు 489
రయమున విల్లుద్రుంచిన 607
రవి శశివహ్నిలోచన! 309
రహితగుణచాపుఁ డగు 341
రాచూలికి నుచితంబగు 288
రాత్రు లీపని కర్ణుతో 650
రాధేయుఁ జూచి రారాజు 164
రామునందును గార్తవీర్యక్షితీశు 366
రారాజుఁ గృపుఁడును 154
రిత్త దడవు గాకుండఁగ 344
రుక్మరథుం డను వాఁడు 178
రుక్మరథుఁడు వడిన 178
రేపకడ యుభయ బలములు 72
రోషమున దుస్సేనుఁడు 450

ల

లక్ష భార్యల నుపలాలించి 236
లలిత చతుర్థళాఢ్య కమల 316
లావును వెరవును మెఱయఁగ 371

వ

వంగాధీశ్వరుఁ డేనుఁగుం 108
వంది జనంబులు మాగధ 293
వంది జనతుములముల 320
వగపింక నెన్నఁటికి దెగు? 306
వగపున కెడ యీకుము; 305
వచ్చితి రాధేయుఁడఁ; గను 13
నడిఁ జక్రంబున వైచిన 568
వడి రాధేయుని నాతని 394
వనగజ మంబుజాకర 196
వననిధి నడు నీటఁ గలము 09
వనమున ఫలమూలంబులు 499
వరదివ్యాస్త్రవిదుండు 698
వర మిచ్చెదేనిఁ గోరెద 36
వల దిట్లేలని యేను 706
వలదు రన్న పిన్నవాఁడవు 569
వలయు కొలఁది నెలుంగెత్తి 687
వలవని ప్రేలరి మాటల 713
వాఁడి నారసములు మూఁడు 486
వాఁడుఁ దోడ్పడఁ గడఁగి 621
వానితోడిద లోకమై యేను 204
వాని నెడ నతికి యప్పవమాన 482
వాని వారెల్ల నీ పని వాని 652
వారలందఱు సూతనందనుం 641
వారలఁ బొదువ నడరు 391
వారల రథ్యంబులఁ దత్సారథు 454
వారలు దమ తమ బలములుఁ 660
వారలు లింగాదిష్టా నారూఢుం 735

వారిఁ గృతవర్మ మార్కొని 432
వారి కేతనములు వడిఁ ద్రుంచి 83
వారి తలఁపు వొసఁగ నేరదు 41
వారి నెఱుంగుదు నేనును 281
వారిఁ దలపడి పోరిరి 565
వారెవ్వ రెవ్వ రంటేని 391
వాలమ్ములు పది మేనం 65
వాలిక దొడ్డనారసము 123
వాలును బలకయుఁ గొని 191
వాసవు నంత వానికిని 205
విందాను విందు లేక స్యందన 368
విందులఁ గనిన ట్లాతఁడు 411
వింధ్యాద్రి వోలెనా ప్రతివింధ్యు 613
వింశతి శరముల నేసి 54
వికట విస్ఫురదసి చర్మ 57
విచ్చిన మూఁకల కడ్డము 426
విచ్చుటయు నంటఁ దాఁకి 451
విజయుం డతని వరాహ 527
విజయుండను శైలము 346
విడు విడు మాతం డిమ్మెయి 584
వినఁడె జరాసంధాదులఁ 487
విని సంశప్తకు లేము దక్క 136
వినుఁడీ నాదు ప్రతిజ్ఞ నీవు 268
విను నేఁ డర్జునుఁ డన్య 323
విను పాంచజన్య పటునిస్వన 467
విను పౌరుషము నిరర్థక మను 486
విను మడుగులపైఁ బడియైనను 501
విను మప్పుడు నిజశక్తుల 51
విను మాఁటది వోలెం దన 387
విను మా ధృష్టద్యుమ్నుం 418
వినుము కిరీటి! దివ్యశర 384
వినుము తదీయ యోధులును 104
వినుము నరేంద్ర! పాండవులు 169
వినుము నిశాసమయంబున 624
వినుము భవత్సేనాపతి 466
వినుము వృద్ధక్షత్త్రుండను 531
వినుము వేగిన సంగ్రామమునకుఁ 651
విను మేనగు దివసంబున 658
విను సహదేవుఁడు దుశ్శాసను 674
విను! సింధురాజవధమును 326
విను! సింధురాజవధమును 416
విపినంబు నడఁచు దవశిఖి 211
విమలాంబుదములు పూనిన 84
విరథుం డయ్యును రాధ 484
విరథుఁడై యతండు వృషసేను 474
విరియించి తామరలలో 672
విఱిగినచో నిలువక 58
విఱిగెం బెక్కు రథంబు; లొక్క 450
విలసిల్లుచు నుండఁగ 227
విలు దునుమాడి వక్షమున 429
విలు దునుమాడి వెండియును 605
విలు దురుము సేసి గుఱ్ఱంబుల 479
విల్లు పట్టెడు వారెల్ల 28
వీఁక మెయిఁ గ్రీడి కొడుకుం 150
వీఁడె సైంధవుండు! వీనిచుట్లను 378
వీరలం జూచి తగుమాట 259
వీరాస్థి శర్కరాఘన 100
వీరిచట నివ్విధంబునఁ 107
వీరేమి గాచెదరు? తా నే 378
వృకుఁడను పాంచాలకుమారకుఁ 96
వెండియు 429
వెండియు 670
వెండియు నాచార్యుండేయు 622
వెడఁద తూపునఁ గేతువు 349
వెన్నుమునుఁగఁ దివియఁగలే 374
వెరవును లావునుం గలిగి 209
వెరవును లావు లేని ప్రజ 707
వెరవే; సంపదఁ గోరి 382
వెఱఁగు పడి కుంభభవుఁడుం 282
వెఱవకుఁ డిట మరలుఁడు 83
వెస మారుతియు నలంబుసుఁడు 404
వెస రాధేయుని తొలఁగిన 166
వేగంబ వేఱొక్క విలుగొని 393
వేడుకమైఁ దలపడి పోరాడిరి 56
వేదములం దదంగములు 23
వేదములు ధర్మవాచక 732
వేదశిరోమణి చరణా 137
వేఱొక విలు గొని 596
వేఱొక విల్లు పుచ్చుకొని 348
వైరం బాత్మల నిండి యుండ 419
వైరి వినాశన క్రియకు 643
వ్యాఘ్రదత్తుండు సాత్యకి 403
వ్యాస ప్రసాద మహిమం 02

శ

శకుని కృతవర్మ కృప కర్ణ 193
శకుని కృతవర్మ శల బాహ్లిక 191
శకునిచేతి యడ్డసాళ్లలు 549
శక్తి యాచార్యు శక్తిని 399
శక్తివైవ నిశితచక్రంబు 607
శర గురుఁ డెచటికిఁ దఱిమిన 126
శరజాల మహావాతస్ఫురణంబున 107
శరజిహ్వాభీకరుఁడగు 14
శరభసింహవ్యాఘ్రసత్త్వ 238
శరముతోడ నొక్క కరము 178
శరము లొకఁ డొకఁడు 82
శరవేగము రథగమన 517
శలభము వహ్నిమీఁదఁ 588
శల్య కృతవర్మ ముఖ యోధ 601

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శల్యుండును ద్రౌపదీపుత్రుల 403
శినివరుఁ డాఱాలెల్లను 451
శినివరుఁడు సోమదత్తుఁడుఁ 576
శినివరు నద్భుత విక్రమ 620
శిరము లురంబులు గరములు 89
శుభ్రమగు నుర్విమృత్తిక 735
శైనేయుఁడును భీమసేనుండు 520
శోకంబునం గోపంబునం 492
శౌరి పార్థ! పార్థ! సైంధవుతల 530
శౌరి మెయిని భగదత్తుఁడు 120
శౌర్యధుర్యుఁడగు వసాతి 175
శ్రీకర భక్తాంభోధి సుధాకర 139
శ్రీధామ లసదపాంగ 537
శ్రీమత్త్వాయుష్మత్త్వ సుధీ 425
శ్రీరమ్యతాద్రివర పుత్రీ 319
శ్రీసంశ్రయ మంగళ గౌరీ 01
శ్రుతి ఫలరస భావస్తుత్య 535
శ్రుతు లభ్యసించి తతుల 276

స

సంగరంబునఁ దన్వి సని 692
సంగర క్రీడ సలుపు 48
సంజయుం డతని కిట్లను; 425
సంతానార్థియయి సంతతంబును 226
సంరంభ విజృంభితుండై 192
సంవర్తుఁడను మహాసంయమి 229
సంశప్తక సమితితోడ 257
సంశప్తకులు మఱియును 87
సత్యజిత్తు మేన సాయక 97
సన్మార్గమున రాజ్యసంపద 230
సమరంబున నీ వోడుట 474
సమర విశేషంబు తెఱం 502
సమరోద్యోగము వీటికిం 04
సమసిన సేనఁజూచి 481
సరభసవృత్తిఁ బాండుసుత 360
సర్వసేనాధిపత్యంబు 23
సర్వసైన్యంబులును దైన్యంబు 278
సహదేవుండును గదఁగొని 53
సహదేవుండును మగిడి 402
సాత్యకి విల్లర్ధచంద్ర బాణంబున 595
సాత్యవతేయవాఙ్మయ 137
సాధనము గాండివం బటె 284
సారథి గూల్చి యశ్వములఁ 350
సారథి తురంగముల 111
సాహంకారుం డగు గురు 98
సింధురము మహోద్రేక 29
సింధుదేశోద్భవ స్థిర 171
సింధుపతిదెసకు 522
సుభద్రాతనయుం డతని 194
సురలాదిగఁ గల జీవులు 731
సురలును సిద్ధులు విద్యాధరులు 156
సుస్థిరుండవై సమరప్రకారం 431
సూతనందనునకు నెడసొచ్చి 492
సూతసుతుండు పాండునృప 481
సూతసుతు విల్లు ద్రుంచిన 474
సెజ్జ యందు మేను సేర్చి 297
సేనాపతిత్వమునకుం బూని 20
సేనాపతి యగు ద్రుపద 55
సేనాసముదయ వర్తకుఁగా 23
సైంధవుఁ డొక్కఁ డేలయనిఁ 302
సైంధవు ఘోరకబంధంబు 533
సైంధవున కడ్డమున్న 357
సైనికులు నన్నుఁ గనుఁగొని 247
సైరించిన నెఱుఁగవు 711
సొమ్మవోయి పడిన సుదతు 32
సోమదత్తుఁడు తొమ్మిది 566
సోలుచు బోరగిలంబడి 644
సౌమదత్తి యిట్లు సచ్చినఁ 514
స్థావరములు జంగమములు 731
స్వాగత మే మీయిద్దఱ 308

హ

హంసగౌరములగుహయములు 104
హంసతూలిక పాన్పునందు 251
హయములఁ జంపి, సూతు 157
హయములను సూతు నొంచి 439
హయముల మీఁద సూతుపయి 165
హరి గురుఁడు నీకుఁ గ్రీడియు 415
హరి నేమియు నన నేరక 119
హరి నైదు విశిఖముల 343
హరి మేనల్లుఁడు, గొంతి కూర్చు 250
హరి యాత్మ యర్జునున కా హరి 34
హరియుం బాండవులున్ 701
హరియుం బార్థుఁడు నట్లు 430
హరి యొకఁడు నీవొకండవు 414
హరి పనుప వారిబలములు 722
హరిసుత సూతి మావుల, 403
హరుఁడు వినోదార్థముగా 677
హరులను సూతునిఁ జంపిన 609
హరులవయిన్ మురారిపయి 369
హర్ష మందస్మితము తోడ 374
హా యను, ధర్మరాజ తనయా! 253
హృదయ సరసిరుహ 316
హైడింబుఁ డల్గి యుగ్రాకృతిఁ 571

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవచధారణంబున దుర్యోధనుం డర్జునుతోఁ దలపడుట (సం. 7-76-37)

వ. కడంగి రంతఁ గురుపతి గూడవచ్చి కుంభసంభవకృతంబగు కవచంబు కతంబున భయంబు దక్కి బలంబునకుం దలకడఁచి తన రథంబు జయద్రథుం డున్న దిక్కున కడ్డంబుగాఁ జొచ్చిన నతని సూరెల నున్న వీర లోకంబు ముదంబున సింహనాదంబులు సేయ శంఖ భేరీస్వనంబులు సెలంగం దమ తేరికిం గట్టెదురై నిలిచినం గని కృష్ణుండు గ్రీడి కి ట్లనియె. 179

ప్రతిపదార్థం: కడంగిరి= ప్రయత్నించారు; అంతన్= ఆ మీద; కురుపతి= దుర్యోధనుడు; కూడవచ్చి= దగ్గరగా వచ్చి; కుంభసంభవ కృతంబు+అగు= ద్రోణాచార్యుడిచేత చేయబడిన; కవచంబు కతంబునన్= కవచం కారణంగా; భయంబు తక్కి= భయంవదలి; బలంబునకున్ తలకడచి= సేనను దాటి; తన రథంబు= తా నెక్కిన తేరు; జయద్రథుండు ఉన్నదిక్కునకున్= సైంధవుడు ఉన్న దిక్కుకు; అడ్డంబుగాన్+చొచ్చినన్= అడ్డంగా దూరగా; సూరెలన్= ప్రక్కలో; ఉన్న వీరలోకంబు= ఉండే వీర సమూహం; ముదంబున్= సంతోషంతో; సింహనాదంబులు చేయన్= సింహనాదాలు చేయగా; శంఖ భేరీ స్వనంబులు= శంఖాల, నగారాల శబ్దాలు; చెలంగన్= ధ్వనింపగా; తమ తేరికిన్= తామున్న తేరుకు; కడు+ఎదురు+ఐ నిలిచినన్= కంటికి ఎదురుగా ఉండగా; కని= చూచి; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; క్రీడికిన్+ఇట్లు+అనియెన్= అర్జునుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: (కృష్ణార్జునులు) విజృంభించగా, అటుపిమ్మట దుర్యోధనుడు ద్రోణు డిచ్చిన కవచం కారణంగా భయంవదలి తన సైన్యాన్ని దాటి ముందుకు వచ్చి, సైంధవు డున్న దెసకు అడ్డంగా తన రథాన్ని పోనిచ్చాడు. అప్పుడు అతడికి ఇరువైపులా ఉన్న వీరులు సంతోషంతో సింహనాదాలు చేశారు. శంఖ భేరీ ధ్వనులు చెలరేగాయి. ఆ విధంగా తమ రథానికి ఎట్టఎదుటగా నిలిచిన సుయోధనుడిని చూచి, నారాయణుడు నరుడితో ఇట్లా అన్నాడు.

క. 'ఆపద ముట్టిన యెడ ని । ట్లేపారఁగ వలదె! రథికుఁ డీతఁడు శశ్వ
త్కోపోద్దీప్తుఁడు మాదెసఁ । జాప కళావేది దర్పసంపన్నుండున్. 180

ప్రతిపదార్థం: ఆపద ముట్టిన ఎడన్= కష్టాలు వచ్చినప్పుడు; రథికుఁడు= సైనికుడు; ఇట్లు+ఏపారఁగన్+వలదె!= ఈ విధంగా అతిశయించ వద్దా!; ఈతఁడు= ఈ దుర్యోధనుడు; మాదెసన్= మా మీద; శశ్వత్‌కోప= నిలుకడ గల కోపంతో; ఉద్దీప్తుఁడు= మండుతూ ఉన్నాడు (ఇతడు); చాప కళావేది= ధనుర్విద్యా రహస్యాలు తెలిసినవాడు; దర్ప సంపన్నుండున్= గర్వితుడు కూడా.

తాత్పర్యం: 'కష్టాలు వచ్చినప్పుడే సైనికుడు ఇట్లా ధైర్యాన్ని చాటాలి; ధనుర్విద్యా విశారదుడు అయిన దుర్యోధనుడు నిరంతర కోపంతో మా మీద మండిపడుతూ ఉన్నాడు.

క. గోమునఁ బెరిఁగిన వాఁడు మ । హా మానోదగ్రచిత్తుఁ డ ట్లగుటను సం
గ్రామంబున కలుకం డు । ద్దామ భుజావీర్య దుర్మద స్ఫురితుండున్. 181

ప్రతిపదార్థం: గోమునన్+పెరిఁగిన వాఁడు= సుకుమారంగా పెరిగినవాడు; మహామాన= ఎక్కువ అభిమానంతో; ఉదగ్రచిత్తుఁడు= భయంకరమయిన మనస్సున్నవాడు; అట్లు+అగుటను= అందుచేత; సంగ్రామంబునకున్= యుద్ధానికి; అలుకండు= జంకడు; ఉద్దామ= అధికమైన; భుజావీర్య= భుజబలంతో; దుర్మద స్ఫురితుండున్= దురహంకారంతో ఉన్నవాడు కూడా.

తాత్పర్యం: దుర్యోధనుడు సుకుమారంగా పెరిగాడు. మిక్కిలి అభిమానంతో భయంకరమయిన మనస్సుకలవాడు అయినందున యుద్ధానికి వెరవడు. తన భుజబలంతో దురహంకారంతో ఉండేవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **మనకును నితనికి సైంధవుఁ । డను నొడ్డున నయ్యె జూద మధికౌద్ధత్యం**
బున గెలువుము చిరకాలము । మనమున రారాజు నలుక మ్రందింపు తగన్. 182

ప్రతిపదార్థం: మనకునున్= మనకు (కృష్ణార్జునులకు); ఇతనికిన్= ఈ దుర్యోధనుడికి; సైంధవుఁడు+అను ఒడ్డునన్= సైంధవుడనే పందెంతో (సైంధవుడు పణంగా); జూదము+అయ్యెన్= జూదం సిద్ధమైనది; అధిక+ఔద్ధత్యమునన్= మిక్కిలి దర్పంతో; గెలువుము= జయించుము; చిరకాలము= చాలాకాలంగా; మనమునన్= మనస్సులో ఉండే; రారాజు+అలుకన్= దుర్యోధనుడి దురాగ్రహాన్ని; తగన్= తగినట్లుగా; మ్రందింపుము= నశింపజేయుము.

తాత్పర్యం: ఈ దుర్యోధనునకూ మనకూ సైంధవుడనే పందెంతో (యుద్ధమనే) జూదం సిద్ధమైనది. ఉద్ధతితో ఈ జూదాన్ని గెలువుము. బహుకాలంగా దుర్యోధనుడికి మనమీద ఉన్న క్రోధాన్ని ఈనాడు నిర్మూలించుము.

విశేషం: అలం: రూపకం.

క. **ఈతఁడు మీకు నాపదల కెల్లను మూలము; ధర్మపుత్త్రు దు**
ర్ద్యూతమునం బరాభవము నొందఁగ జేసిన పాపనిశ్చయుం
డా తరుణీలలామమున కమ్మెయి భంగ మొనర్చె వీఁడు నీ
చేతులలా వెఱుంగఁడు విశిష్టశుభం బిది నీకు ఫల్గునా! 183

ప్రతిపదార్థం: ఫల్గునా!= అర్జునా!; ఈతఁడు= ఈ దుర్యోధనుడు; మీకు నాపదలకున్+ఎల్లను మూలము= మీ కష్టాలకు అంతా కారణం; ధర్మపుత్రున్= ధర్మరాజును; దుర్ద్యూతమునన్= చెడ్డ జూదంలో (మోసపు జూదంలో); పరాభవమున్= అవమానాన్ని; ఒందఁగన్+చేసిన= కలిగించిన; పాప నిశ్చయుండు= చెడు తలపు కలవాడు; ఆ తరుణీలలామమునకున్= ఆడవారిలో ఉత్తమురాలైన ఆమెకు (ద్రౌపదికి); ఆ+మెయిన్= ఆ విధంగా (కట్టుగుడ్డను ఒలుచునట్లుగా); భంగము+ఒనర్చెన్= అవమానమును కలిగించాడు; వీఁడు= ఈ దుర్యోధనుడు; నీ చేతులలావు+ఎఱుంగఁడు= నీ భుజబలం తెలిసినవాడు కాడు; ఇది= ఈ యుద్ధం; నీకున్ విశిష్ట శుభంబు+అగున్= విశేషమైన మంచిని కలిగిస్తుంది.

తాత్పర్యం: అర్జునా! మీ కష్టాలకు మూలకారణం ఈ దుర్యోధనుడే. మోసపు జూదంలో ధర్మరాజును అవమానించిన పాడుబుద్ధికలవాడు. ద్రౌపదిని కట్టుగుడ్డలు ఒలిపించి అవమానించాడు. నీ చేతి బలాన్ని తెలిసినవాడు కాడు. ఈ యుద్ధంలో నీకు శుభం కలుగుతుంది.

క. **ఎఱిఁగినఁ జేరఁడు; చేరుట । యెఱుకువమై మనకు దైవ మిచ్చిన సిరి యి**
ట్లఱిమిన యాలో గ్రక్కున । నఱకు; మితఁడు దెగిన మన మనఃపీడ దెగున్. 184

ప్రతిపదార్థం: ఎఱిఁగినన్= తెలిస్తే (నీచేతి బలం తెలిస్తే); చేరఁడు= దగ్గరకు రాడు; చేరుట= సమీపించటం; ఎఱుకువమైన్= తెలిసి; మనకున్= మనకు; దైవమిచ్చిన సిరి= దేవుడు ఇచ్చిన సంపద (అదృష్టం); ఇట్లు+అఱిమినన్= ఈ విధంగా ఆక్రమిస్తే; ఆలోన్= అంతలోనే; గ్రక్కునన్= శీఘ్రంగా; నఱకుము= నరికివేయుము; ఇతఁడు తెగినన్= ఈతడు చనిపోతే; మన= మనయొక్క; మనఃపీడ= మనసులోని చింత; తెగున్= తెగిపోతుంది (తొలగిపోతుంది).

తాత్పర్యం: నీచేతిబలం తెలిసి ఉంటే (మన) దగ్గరకు రాడు. దగ్గరకు రావటం మనకు దైవ మిచ్చిన అదృష్టం. దానితో అతడిని ఆక్రమించుము; వెంటనే అతడిని నరికివేయుము. వీడు పోతే మనకు గుండెలోని దిగులు తీరుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. **వెరవే! సంపదఁ గోరి గాండివ గుణావిర్భూత బాణాలి కి**
ట్లెరయై వచ్చుట యి మ్మహీపతి కితం డేలొక్కొ యత్యంత ని
ష్ఠుర శౌర్యోన్నతి నిన్నుఁ దాఁకఁ దలఁపం జోద్యంబుఁ వీఁ డగ్గ మై
దొరకో లర్జున! నీకుఁ దొంటి సుకృతస్తోమంబు కల్మిం జుమీ! **185**

ప్రతిపదార్థం: అర్జున!= అర్జునా!; సంపదన్+కోరి= ఐశ్వర్యాన్ని ఆశించి; గాండివ గుణ+ఆవిర్భూత= గాండీవమనే వింటి అల్లెత్రాటి నుండి పుట్టిన; బాణ+ఆలికిన్= బాణాల సమూహానికి; ఇట్లు= ఈ విధంగా; ఎర ఐ= ఆహారమై; వచ్చుట= రావటం; ఈ+మహీపతికిన్= ఈ రాజునకు; వెరవే!= తగునా!; ఇతండు= ఈ దుర్యోధనుడు; ఏల+ఒక్కొ!= ఎందుకనో; అత్యంత నిష్ఠుర= మిక్కిలి కఠినమైన; శౌర్య+ఉన్నతిన్= వీర్యాధిక్యంతో; నిన్నున్= నిన్ను; తాఁకన్+తలఁపన్= ఎదుర్కొనటానికి ప్రయత్నించటం; చోద్యంబు= ఆశ్చర్యం; వీఁడు= ఇతడు; అగ్గము+ఐ= వశమై; దొరకోలు= చిక్కటం; నీకున్ తొంటి సుకృతస్తోమంబు= నీ పూర్వజన్మ పుణ్య సముదాయం సుమా.

తాత్పర్యం: ఓ అర్జునా! సంపదను ఆశించి గాండీవపు అల్లెత్రాటి నుండి వెడలిన బాణాలకు ఆహారంగా ఈ రాజుకు తగునా? ఇంత శౌర్యంతో ఇతడు నిన్ను ఎదుర్కొనాలని అనుకోవటం ఆశ్చర్యంగా ఉన్నది. ఇతడు మిక్కిలి ప్రయత్నంతో ఇట్లా చేయటం నీ పూర్వజన్మ పుణ్యాల ఫలమే సుమా!

క. **ఇతఁడు వడినఁ బ్రజ విచ్చును; । ధృతి సైంధవుఁ డటిమెనేనిఁ దెగు నాతం డు**
ద్ధతి విడిచి పాఱిపోయినఁ । బ్రతిన కదియ చాలుఁ; గడఁగు పటుశౌర్య నిధీ!' **186**

ప్రతిపదార్థం: పటుశౌర్యనిధీ!= తీవ్ర పరాక్రమానికి నిధి అయినవాడా!; ఇతఁడు= ఈ దుర్యోధనుడు; వడినన్= చనిపోతే; ప్రజ= సైన్యం; విచ్చును= విరిసిపోతుంది; ధృతిన్= ధైర్యంతో; సైంధవుఁడు= సైంధవుడు; అటిమెన్+ఏనిన్= ఆక్రమణం చేయటానికి ప్రయత్నిస్తే; తెగున్= చస్తాడు; ఆతండు= ఆ సైంధవుడు; ఉద్ధతి విడిచి= గర్వాన్ని వదలి; పాఱిపోయినన్= పరుగెత్తిపోతే; ప్రతినకున్= శపథానికి; అది+అ చాలున్= అంతేచాలును; కడఁగు= పూనుకొనుము.

తాత్పర్యం: ఈ దుర్యోధనుడు పడిపోతే సైన్యం వికావికలౌతుంది. సైంధవుడు ధైర్యంతో పరాక్రమించటానికి వచ్చాడా- చస్తాడు. వాడు గర్వాన్ని వదలి పారిపోతే (మన) శపథానికి అదే చాలును. మిక్కిలి శౌర్యం కలవాడా! పూనుకొనుము.'

వ. **అని పెక్కుభంగులం జెప్పిన విని వివ్వచ్చుం డచ్యుతు నాలోకించి.** **187**

ప్రతిపదార్థం: అని; పెక్కు, భంగులన్= అనేక విధాలుగా; చెప్పినన్= చెప్పగా; విని; వివ్వచ్చుండు= అర్జునుడు; అచ్యుతున్= శ్రీకృష్ణుని; ఆలోకించి= చూచి

తాత్పర్యం: అని అనేక విధాలుగా (కృష్ణుడు) చెప్పగా విన్న అర్జునుడు, కృష్ణుడి వంక చూచి.

ఉ. **'ద్రౌపది వడ్డ బన్నము లుదగ్రత మేదినిఁ బెద్దకాల మి**
చ్ఛా పరతంత్రుఁడై తన వశంబుగఁ జేసిన వీని గర్వముం
గోపము పెంపదే? మనము గుందఁగఁ జేయదె? యింత సెప్ప నే
లా? పొరిగొందు నీతనిఁ జలంబు బలంబును నీవు మెచ్చఁగన్. **188**

ప్రతిపదార్థం: ద్రౌపది; పడ్డ బన్నములు= పడిన కష్టాలు; ఉదగ్రతన్= భయంకరంగా; మేదినిన్= లోకంలో; పెద్దకాలము= చాలా కాలం; ఇచ్ఛాపరతంత్రుఁడై= తన ఇష్టానికి వచ్చినట్లు; తన వశంబుగన్+చేసిన= తను చెప్పిన విధంగా ఉండేటట్లు చేసినటువంటి; వీని గర్వమున్= ఈతడి అహంకారం; కోపము పెంపదే?= నా కోపాన్ని పెంచదా?; మనము కుందఁగన్+చేయదె?= మనస్సును బాధపెట్టదా?; ఇంత చెప్పన్+ఏలా?= ఇంతగా చెప్పటం ఎందుకు?; చలంబున్= (వీడిపై నాకున్న) మాత్సర్యాన్ని; బలంబును=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(నా) బలాన్ని; నీవు మెచ్చఁగన్= నీవు మెచ్చుకొనే విధంగా; పొరిగొందున్= చంపుతాను.

తాత్పర్యం: 'ద్రౌపది పడిన కష్టాలూ, భయంకరంగా లోకంలో చాలా కాలం ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వీడి గర్వం ఇతడి మీద నాకు కోపాన్ని పెంచదా? మనస్సును బాధపెట్టదా? ఇంతెందుకు - నీవు మెచ్చుకొనే విధంగా నా మచ్చరము, బలము ప్రకాశింప వీడిని చంపుతాను.

ఆ. **ఒరుల దిక్కు సనక యరదంబు నీతని । యున్న యెడకు నడపు' మన్న నతఁడు**
నట్ల చేయఁ, దనకు నభిముఖులై వచ్చు । వారిఁ జూచి మనుజవల్లభుండు. **189**

ప్రతిపదార్థం: ఒరుల దిక్కు చనక= ఇతరుల వంకకు పోకుండా; అరదంబున్= తేరును; ఈతని ఉన్న ఎడకున్= వీడున్న దిక్కునకు; నడపుము+అన్నన్= తోలుమనగా; అతఁడు= కృష్ణుడు; అట్లు+అ+చేయన్= ఆ విధంగా చేయగా (తేరును దుర్యోధనుడి వైపు తోలగా); తనకున్+అభిముఖులై వచ్చు= తనకు ఎదురుగా వస్తున్న; వారిన్+చూచి= వాళ్ళను చూచి; మనుజవల్లభుండు= రాజు (దుర్యోధనుడు).

తాత్పర్యం: 'తేరును ఇతరుల వైపునకు తోలక, ఇతడు ఉన్న దిక్కునకు తోలుము' అనగా, కృష్ణుడు అట్లాగే చేయగా, తనకు ఎదురుగా వచ్చే వారిని చూచి దుర్యోధనుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **మనమునఁ గొంకక యెదురుగఁ । జనియె నిజోద్ధతికి మెచ్చి జనపాలకు లె**
ల్లనుఁ బిచ్చలింప సేనా । నినదం బెసఁగంగ ఘోర నిష్ఠుర వృత్తిన్. **190**

ప్రతిపదార్థం: నిజ+ఉద్ధతికిన్= తన దర్పానికి; మెచ్చి= మెచ్చుకొని; జనపాలకులు+ఎల్లనున్= రాజులందరు; పిచ్చలింపన్= భయపడగా; సేనా నినదంబు= సైనికుల శబ్దం; ఎసఁగంగన్= ఎక్కువ కాగా; ఘోర నిష్ఠుర వృత్తిన్= భయంకరంగాను, కఠినంగాను; మనమునన్= మనస్సులో; కొంకక= సందేహించక; ఎదురుగన్ చనియెన్= ఎదురుగా వెళ్ళాడు.

తాత్పర్యం: తన దర్పాన్ని మెచ్చుకొని రాజులందరూ భయపడగా, సేనలు చేసే శబ్దం ఎక్కువ కాగా, భయంకరం, కఠినం అయిన నడవడితో మనస్సులో సందేహించకుండా ఎదురుగా వెళ్ళాడు.

క. **తముఁ బిలుచుచు నివ్విధమున । సమదాటోపగతి నడరు జనపతిఁ గని చి**
త్తము లలర నార్చి నిజ శం । ఖము లొత్తిరి శార్ఙ్గధరుఁడు గాండివధరుఁడున్. **191**

ప్రతిపదార్థం: తమున్+పిలుచుచున్= తమను పిలుస్తూ; ఈ+విధమునన్= ఈ ప్రకారంగా; సమదాటోపగతిన్= గర్వంతో కూడిన ఆటోపంతో; అడరు= విజృంభించే; జనపతిన్+కని= దుర్యోధనుడిని చూచి; చిత్తములు= మనస్సులు; అలరన్= సంతోషించగా; ఆర్చి= బొబ్బరించి; శార్ఙ్గధరుఁడున్= శ్రీకృష్ణుడూ; గాండివధరుఁడున్= అర్జునుడును; శంఖములు+ఒత్తిరి= తమ శంఖాలను ఊదారు.

తాత్పర్యం: గర్వంతో అదిరిపడుతూ తమను పిలుస్తున్న దుర్యోధనుడిని చూచి, మనస్సులు వికసించగా కృష్ణార్జునులు బొబ్బరించి తమ శంఖాలను పూరించారు.

చ. **ఎలమిఁ జెలంగు కృష్ణుల యహీనసముద్ధతిఁ జూచి శోక వి**
హ్వలు లయి మానవేంద్రు దెస నాసలు మాని మృగంబు భ్రాంతి ను
జ్జ్వలదనలంబులో నుఱుకు చందముగాఁ గొని నీదు యోధ వీ
రు లకట! చచ్చెఁజచ్చె నని మ్రోయఁగ నాతఁడు వారి కి ట్లనున్. **192**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఎలమిన్= వికాసంతో; చెలంగు= శంఖములు పూరించి ధ్వని చేసిన; కృష్ణుల= కృష్ణార్జునుల; అహీనసముద్ధతిన్= తగ్గిపోని ఆవేశాన్ని; చూచి= చూచినవారై; శోక విహ్వలులు+అయి= దుఃఖంతోను, భయంతోను స్వాధీనం తప్పినవారై; నీదు యోధవీరులు= నీ సైన్యంలోని వీరులు; మానవ+ఇంద్రుదెసన్= రాజుమీది (దుర్యోధనుడిమీది); ఆసలు మాని= ఆశలు వదులుకొని (అనగా వాని ప్రాణాలమీది ఆశలు మానుకొని); మృగంబు= లేడి; భ్రాంతిన్= భ్రమతో; ఉజ్జ్వలత్= బాగా మండుతూ ఉన్న; అనలంబులోన్= అగ్గిలో; ఉఱుకు చందము కాన్= దూకే విధం; కొని= భావించి; అకట!= అయ్యో!; చచ్చెన్+చచ్చెన్= చచ్చాడు చచ్చాడు; అని= అంటూ; మ్రోయఁగన్= అరవగా; ఆతఁడు= ఆ రాజు (దుర్యోధనుడు); వారికిన్= ఆ సైనికులకు; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటున్నాడు.

తాత్పర్యం: ఉత్సాహ వికాసాలతో తగ్గిపోని కృష్ణార్జునుల ఆవేశాన్ని మన సైనిక వీరులు చూచారు. దుఃఖంతోనూ భయాకులతతోనూ వారు రాజు మీద ఆశ వదలుకొన్నారు. దుర్యోధనుడిని మండే మంటలో దూకే జింక మాదిరిగా భావించి, 'అయ్యో చచ్చాడు. చచ్చాడు' అని దుఃఖాక్రాంతులయ్యారు. అప్పుడు ఆ రాజు ఆ వీరులతో ఈ విధంగా అన్నాడు.

క. **'భయ మేటికి వినుఁడు ధనం। జయునిం గేశవుని నాదు శరకీలాసం**
చయమున నేర్చెదఁ బేర్చెద। నయనానందంబు మీ కొనర్చెదఁ గడిమిన్'. **193**

ప్రతిపదార్థం: భయము+ఏటికిన్?= భయము ఎందుకు?; వినుఁడు= నా మాట వినండి; ధనంజయునిన్ కేశవునిన్= అర్జునుడినీ, కృష్ణుడినీ; నాదు= నా యొక్క; శర కీలా సంచయమునన్= బాణాగ్ని జ్వాలలతో; ఏర్చెదన్= కాల్చివేస్తాను; పేర్చెదన్= విజృంభిస్తాను; మీకున్= మీకు; నయన+ఆనందంబున్= కనువిందును, తృప్తిని; కడిమిన్+ఒనర్చెదన్= ఎక్కువగా కలిగిస్తాను.

తాత్పర్యం: మీ కందరికీ భయం ఎందుకు? కృష్ణార్జునులను నా బాణాగ్ని జ్వాలలతో కాల్చివేస్తాను. పరాక్రమంతో విజృంభిస్తాను. మీ అందరికీ కనువిందు చేస్తాను'.

వ. **అని పలికి పార్థుం గనుంగొని యవష్టంభంబున.** **194**

ప్రతిపదార్థం: అని, పలికి; పార్థున్= అర్జునుని; కనుంగొని= చూచి; అవష్టంభంబునన్= అహంకారంతో

తాత్పర్యం: అని పలికి, దుర్యోధనుడు అర్జునుడిని చూచి అహంకారంతో.

దుర్యోధనుఁ డర్జునుం దలపడి యధిక్షేపించుట (సం. 7-77-35)

చ. **'వినుము కిరీటి! దివ్యశరవేదివి! నాఁ జను; దేను లేనిచో**
టను మును సెల్లె నీకు; నిచటం జన నిత్తునె? యిప్డు నీ బలం
బును హరినేర్పుఁ జూచుటకుఁ బోరికి వచ్చితి; నీవు పాండురా
జునకు జనించితేనిఁ దెగి చూపుము శౌర్యము నస్త్రవీర్యమున్'. **195**

ప్రతిపదార్థం: కిరీటి! వినుము= అర్జునా! విను; దివ్యశరవేదివి నాన్= దైవశక్తిగల అస్త్రరహస్యాలు తెలిసినవాడవు అని; చనుదు= చెల్లుబడి ఔతున్నావు; ఏను లేనిచోటను= నేను లేని చోట; నీకున్ మునుచెల్లె= ఇదివరకు నీకు ఆ పేరు చెల్లిపోయింది; ఇప్డు= ఈ సమయంలో; ఇచటన్ చననిత్తునె?= ఇక్కడ చెల్లనిస్తానా?; ఇప్డు= ఈ సమయంలో; నీ బలంబును= నీ శక్తిని; హరినేర్పును= కృష్ణుడి నేర్పరితనాన్ని; చూచుటకున్= చూడటానికై; పోరికిన్ వచ్చితిన్= యుద్ధానికి వచ్చాను; నీవు; పాండురాజునకున్ జనించితి(వి)+ఏనిన్= పాండురాజునకు పుట్టి ఉన్నట్లయితే (పాండురాజునకు కొడుకువైతే); తెగి= సాహసంతో; శౌర్యమున్+అస్త్రవీర్యమున్= వీరత్వాన్నీ, బాణాల శక్తినీ; చూపుము= ప్రదర్శించుము.

తాత్పర్యం: 'ఓ అర్జునా! నీవు దైవశక్తిగల బాణ రహస్యాలను తెలిసినవాడవనే పేరుతో లోకంలో చెల్లుబడి

అయినావు. నేను లేనిచోట నీకు ఆ పేరు చెల్లింది. ఇక్కడ నిన్ను కదలనీయను. నీ బలాన్ని, కృష్ణుని నేర్పరితనాన్ని చూడటానికై యుద్ధానికి వచ్చాను. నీవు పాండురాజు కొడుకువైతే సాహసంతో నీ శక్తిని, బాణప్రయోగ బలాన్ని చూపించుము.

వ. అనుచుఁ గ్రూరంబులగు మూఁడు నారాచంబుల నన్నరు నేసి, శర చతుష్టయంబున హయంబులు నొప్పించి, పది బాణంబులు పద్మనాభునురంబునం గ్రుచ్చి, మునిగోల యొక్కకోలం దునిమినం గినిసి క్రీడి యాతనిపైఁ జతుర్దశ నిశిత ప్రదరంబులు వరగించిన, నవి యమ్మహీపతి మైమఱువు దాఁకి మిట్టి పడుటయుం జూచి తొమ్మిది తూపులతోడం బంచాశుగంబులు నిగిడించిన, నవియు నిష్ఫలంబు లగుటయు, నిరువదెనిమిది బాణంబు లడరించె; నవ్వాలమ్ములు నమ్మెయిన వమ్మైన విషాదంబున వాసుదేవుండు వాసవి కి ట్లనియె. 196

ప్రతిపదార్థం: అనుచున్= అని చెపుతూ; క్రూరంబులు+అగు= కఠినమైన; మూఁడు నారాచంబులన్= మూడు వాడి అయిన బాణాలతో; ఆ+నరున్=ఏసి= ఆ అర్జునుడిని కొట్టి; శరచతుష్టయంబునన్= నాలుగు బాణాలతో; హయంబులు నొప్పించి= గుర్రాలను బాధించి; పది బాణంబులు= పది బాణాలు; పద్మనాభు ఉరంబునన్ గ్రుచ్చి= శ్రీకృష్ణుడి ఎదలో గ్రుచ్చి; మునిగోలన్= గుర్రాలను అదలించే మునిగోలను; ఒక్క కోలన్+తునిమినన్= ఒక్క బాణంతో త్రుంచగా; కినిసి= కోపించి; క్రీడి= అర్జునుడు; ఆతనిపైన్= ఆ దుర్యోధనుడి మీద; చతుర్దశ నిశిత ప్రదరంబులు= పదునాలుగు వాడి బాణాలను; పరఁగించినన్= వేయగా; అవి= ఆ బాణాలు; ఆ+మహీపతి= ఆ దుర్యోధనుడి; మైమఱువు= కవచాన్ని; తాఁకి= తగిలి; మిట్టిపడుటయు= ఎగిరి పడుట; చూచి; తొమ్మిది తూపుల తోడన్= తొమ్మిది బాణాలతో; పంచ+ఆశుగంబులు= ఐదు బాణాలను; నిగిడించినన్= వేయగా; అవియున్= ఆ బాణాలు కూడా; నిష్ఫలంబులు+అగుటయున్= వ్యర్థంకాగా; ఇరువది+ఎనిమిది బాణములు= ఇరవై ఎనిమిది బాణాలను; అడరించెన్= ప్రయోగించాడు; ఆ+వాలమ్ములు= ఆ బాణాలు; ఆ+మెయినన్= అట్లాగే; వమ్ము+ఐనన్= పనికి రాకపోగా; విషాదంబునన్= దుఃఖంతో; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; వాసవికిన్+ఇట్లు+అనియెన్= అర్జునుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా మాట్లాడుతూ దుర్యోధనుడు మూడు బాణాలతో అర్జునుడిని, నాలుగు బాణాలతో గుర్రాలను, పది బాణాలతో శ్రీకృష్ణుడి గుండెను నొప్పించి, మునిగోలను ఒక బాణంతో త్రుంచాడు. అర్జునుడు కోపంతో అతడి మీద వాడి అయిన పదునాలుగు బాణాలు వేశాడు. అవి అతని కవచాన్ని తాకి ఎగిరి పడ్డాయి. అది చూచి తరువాత తొమ్మిది బాణాలు, అయిదు బాణాలు ప్రయోగించాడు అవి కూడ వ్యర్థమయ్యాయి. తరువాత ఎనిమిది బాణాలతో కొట్టాడు. అవీ వ్యర్థమయ్యాయి. అపుడు శ్రీకృష్ణుడు దుఃఖంతో అర్జునుడితో ఇట్లా అన్నాడు.

క. 'మున్నెన్నఁడు నివ్విధ మేఁ । గన్నది గా; దమ్ము లెడలె గాండీవములా
వు న్నీ భుజముల శక్తియు । మిన్నక పోఁ జిత్ర మిది యమిత్రధ్వంసీ! 197

ప్రతిపదార్థం: అమిత్రధ్వంసీ!= శత్రువులను నాశనము చేసేవాడా!; మున్ను+ఎన్నఁడున్= ఇదివరకు ఎప్పుడూ; ఈ+విధము= ఈ పద్ధతి; ఏన్ కన్నది కాదు= నేను చూచినది కాదు; గాండీవము లావున్= గాండీవము యొక్క శక్తి; నీ భుజముల శక్తియున్= నీ చేతి లావును; మిన్నకపోన్= ఊరకపోయేటట్లు; అమ్ములు= బాణాలు; ఎడలెన్= విచ్ఛిన్నమైన; చిత్రం= ఆశ్చర్యం; ఇది= ఇటువంటిది.

తాత్పర్యం: శత్రువులను హతమార్చేవాడా! ఇదివరకు ఎప్పుడూ నేను ఇట్టి స్థితిని చూడలేదు. గాండీవబలం, నీ భుజబలం వ్యర్థమయ్యేటట్లు నీ బాణాలు విచ్ఛిన్నమయ్యాయి. ఆశ్చర్యంగా ఉన్నది.

ఆ. నీకుఁ జూడ ముష్టి నెలవు నాకర్షణ । గాఢతయును బాణగతియుఁ దొంటి
యట్లొ? యొండుభంగియై తోఁచెనో? నాకు । నున్నరూపు సెప్పవన్న పార్థ! 198

ప్రతిపదార్థం: పార్థ!= అర్జునా!; నీకున్ చూడన్= నిన్ను చూడగా; ముష్టినెలవున్= పిడికిలిపట్టు (వింటిని); ఆకర్షణ గాఢతయును=అల్లె త్రాటిని లాగు శక్తీ; బాణగతియున్= బాణపు పోకడా; తొంటి అట్లొ?= వెనుకటి వలెనే ఉన్నదా?; ఒండు భంగి ఐ తోచెనో?= వేరే విధంగా కనిపిస్తున్నదా?; నాకున్ ఉన్న రూపుల్= నాతో ఉన్న విషయాన్ని; చెప్పవన్న!= చెప్పుమా!

తాత్పర్యం: అర్జునా! నీ పిడికిటిపట్టు, వింటిని లాగే శక్తి, బాణాలు వేసే పద్ధతి వెనుకటి వలెనే ఉన్నవా? లేక వేరే విధంగా ఉన్నవా? యథార్థాన్ని నాకు చెప్పుము.

చ. **పిడుగుల యట్లు తాఁకి రిపుబృందములం దెగటార్చు నాజి నె**
ప్పుడు భవదీయ దివ్యశరపుంజము లొక్కట నిప్పు పొల్లు వో
యెడు నిది; నీవు నిమ్మతివిహీనపు జంతువు నేమి సేట్లకుం
జెడుటకు నొక్కొ విస్మయము సెందెడు డెంద మలంతఁ బొందెడున్' **199**

ప్రతిపదార్థం: ఆజిన్= యుద్ధంలో; ఎప్పుడున్= ఎల్లప్పుడును; భవదీయ దివ్యశర పుంజములు= నీయొక్క దేవతాశక్తిగల బాణసమూహాలు; పిడుగుల అట్లు తాఁకి= పిడుగుల మాదిరిగా తాకి; రిపుబృందములన్= శత్రు సమూహాలను; తెగటార్చున్= నాశం చేస్తాయి; ఒక్కటన్= ఒక్కసారిగా; ఇప్డు= ఈ సమయంలో; పొల్లుపోయెడున్= వ్యర్థమైపోతూ ఉన్నవి; ఇది= ఈ విధానం; నీవున్= నీవును; ఈ+మతివిహీనపు జంతువున్= ఈ బుద్ధిలేని జంతువునగు నేను (శ్రీకృష్ణుడను); ఏమి; చేట్లకున్ చెడుటకున్+ఒక్కొ= ఆపదలకు గురియై నశించటానికో!; డెందము= నా మనస్సు; విస్మయము చెందెడున్= ఆశ్చర్యపడుతూ ఉన్నది; అలంత పొందెడున్= కష్టపడుతూ ఉన్నది.

తాత్పర్యం: నీ బాణాల గుంపులు యుద్ధరంగంలో పిడుగుల దెబ్బలవలె తాకి శత్రుసైన్యాన్ని ఎప్పుడూ హతమార్చేవి. ఒక్కసారిగా ఇప్పుడు అవి పొల్లుపోవటానికి కారణం ఏమి? నీవూ, ఈ మతిలేని జంతువునైన నేనూ ఏ యాపదలు పొంది చెడటానికో! నాకు ఆశ్చర్యం, బాధ కలుగుతున్నవి.'

వ. **అని యిట్లు దన్ను నిందించుకొనుచు గోవిందుం డడిగినఁ బురందర నందనుం డతని కిట్లనియె 'నిది యొక్క కవచ ధారణంబు; మున్ను ద్రోణుఁ డొక్కరుండ యెఱుంగు; బదంపడి నాకు నెఱింగించె; నిప్పుడు సుయోధనుండును నెఱుంగు తెఱంగు గావించెం గావలయు; నిమ్మెయి మైమఱువు త్రిలోకంబుల కభేద్యం బగుటయు, నీవు నెఱుంగుదు; వెఱింగియు న న్నడుగ నేల? భువనత్రయంబునందును వస్తుప్రకారంబులు నీయెఱుంగనియవియుం గలవే? యది యట్లుండె; నితండు దీని నగ్గురుకరుణం బడసినవాఁడై. 200**

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ విధంగా; తన్ను నిందించుకొనుచున్= తనను దూషించుకొంటూ; గోవిందుండు= శ్రీకృష్ణుడు; అడిగినన్= అడుగగా; పురందరనందనుండు= అర్జునుడు (ఇంద్రుడి వరాన పుట్టినవాడు); అతనికిన్= కృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా (ముందు చెప్పే విధంగా) అన్నాడు; ఇది ఒక్క కవచధారణంబు= ఇది యొక కవచాన్ని ధరించటం; మున్ను= ఇదివరకు; ద్రోణుండు+ఒక్కరుండు+అ= ద్రోణుడొక్కడే; ఎఱుంగున్= తెలిసినవాడు; పదంపడి= ఆ మీద; నాకున్+ఎఱింగించెన్= నాకు తెలిపాడు; ఇపుడు= ఈ సమయంలో; సుయోధనుండును= దుర్యోధనుడు కూడా; ఎఱుంగు తెఱంగు= తెలిసిన విధం; కావించెన్+కావలయున్= చేసియుండవలెను; ఈ+మెయిన్= ఈ విధమైన; మైమఱువు= కవచం; త్రిలోకంబులకున్= ముల్లోకాలకు; అభేద్యంబు+అగుటయున్= చీల్చుటకు సాధ్యంకాకపోవటం; నీవున్+ఎఱుంగుదు(వు)= నీకును తెలియును; ఎఱింగియున్= తెలిసికూడ; నన్నున్+అడుగన్+ఏల?= నన్ను అడిగేదెందుకు?; భువనత్రయంబునందును= ముల్లోకాలలోనూ; వస్తుప్రకారంబులు= వస్తు స్థితులు; నీ ఎఱుంగనియవియున్+కలవే?= నీకు తెలియనివి ఉన్నవా?; అది అట్లు+ఉండెన్= దాన్ని

అట్లా ఉండనీ; ఇతండు= ఈ దుర్యోధనుడు; దీనిన్= ఈ కవచాన్ని; ఆ+గురు కరుణన్= ఆ గురుడి దయతో; పడసిన వాఁడై= పొందిన వాడయి (ఉన్నాడు).

తాత్పర్యం: తనను కించపరచుకొంటూ గోవిందుడు అడుగగా అర్జునుడు అతడితో ఇట్లా అన్నాడు: 'ఇది ఒక కవచాన్ని తొడుగుకొనటంవలన ఇట్లా జరిగి ఉంటుంది. ఈ కవచధారణ ఇది వరలో ద్రోణుడికే తెలుసు. ఆ మీద నాకు తెలిపాడు. ఇపుడు సుయోధనుడికీ తెలిపినట్లున్నాడు. ఈ కవచం ముల్లోకాలకూ అభేద్యమని నీకూ తెలుసును. తెలిసికూడా న న్నడగటమెందుకు? ముల్లోకాలలోని వస్తుగుణాలన్నీ నీకు తెలియవా? అది అట్లా ఉండనిమ్ము. గురుడి దయచేత ఈ కవచాన్ని పొంది.

క. వినుమాఁటది వోలెం దన । తనువున కడ్డంబు గాఁగఁ దగిలిచికొన్నాఁ
డనఘ! యిటు లైన నెట్లగు । నని యెఱుఁగఁడు; దీనివిధము లన్నియుఁ దెలియన్. 201

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముఁడా! (కృష్ణా!); వినుము= నా మాట వినండి; ఆఁటదిపోలెన్= నాట్యం చేసే స్త్రీ మాదిరి; తన తనువునకున్= తన శరీరానికి; అడ్డంబు కాఁగన్= అడ్డంగా (రక్షణగా); తగిలిచికొన్నాఁడు= తగిలించుకొన్నాడు; ఇటులు+ఐనన్= ఈ విధంగా అయితే; దీని విధము లన్నియున్ తెలియన్= ఈ కవచానికి ఉన్న రహస్యాలన్నిటిని తెలిసికొనటం; ఎట్లు+అగున్+అని= ఏ విధంగానని; ఎఱుఁగఁడు= తెలియడు.

తాత్పర్యం: ఓ మహాత్మా! ఆటకత్తె అడ్డం తగిలించుకొన్నట్లుగా అతడు తన శరీరానికి కవచాన్ని వేసికొన్నాడు. అంతే కాని, దాని రహస్యాలు, ఏవీ ఆతడికి తెలియవు.

క. నా వింటి బలువుఁ జేతుల । లావును జూడు మిదె నీ తలం కుడుగఁగ నే
నీ విభునిఁ గవచరక్షితుఁ । డై విలసిల్లంగనీ క యలఁచెదఁ గృష్ణా! 202

ప్రతిపదార్థం: కృష్ణా!= శ్రీకృష్ణా!; నా వింటి బలువున్= నా విల్లుకు వున్న బలాన్ని; చేతుల లావును= భుజ బలాన్ని; చూడుము= గుర్తించుము; ఇదె= ఇదిగో; నీ తలంకు= నీ భయం; ఉడుగఁగన్= పోయేటట్లు; ఏన్= నేను; ఈ విభునిన్= ఈ రాజును; కవచ రక్షితుఁడు+ఐ= కవచంచేత కాపాడబడిన వాడై; విలసిల్లంగన్+ఈక= ఒప్పనీయక; అలఁచెదన్= బాధపెట్టుతాను.

తాత్పర్యం: కృష్ణా! నా వింటి శక్తిని, చేతుల బలాన్ని చూడుము. నీ భయాన్ని పోగొట్టుతాను; కవచం ఉన్నా కాపాడుకొనలేకుండా చేసి అతడిని బాధిస్తాను.

వ. అంగిరసుం డమరపతికి నొక్క మహాస్త్రం బిచ్చె; దాని నతండు నా కొసంగె నది నిఖిల కవచ నిర్భేదన శీలంబై యుండు; దాన నిమ్మెయిమఱు వఱువుళ్ళు సేసెద.' 203

ప్రతిపదార్థం: అంగిరసుండు; అమరపతికిన్= దేవేంద్రుడికి; ఒక్క= ఒక; మహా+అస్త్రంబు= గొప్పదైన మంత్రసహిత బాణాన్ని; ఇచ్చెన్= ఇచ్చాడు; అతండు= దేవేంద్రుడు; దానిన్= ఆ మహాస్త్రాన్ని; నాకున్= నాకు (అర్జునుడికి); ఒసంగెన్= ఇచ్చాడు; అది= ఆ మహాస్త్రం; నిఖిల, కవచ, నిర్భేదన, శీలంబు+ఐ= అన్ని కవచాలను పగులగొట్టగల స్వభావం కలది అయి; ఉండున్= ఉంటుంది; దానన్= దానిచేత; ఈ+మెయిమఱువు= ఈ (దుర్యోధనుడి) కవచం; అఱువుళ్ళు+చేసెదన్= ముక్కలు చేస్తాను.

తాత్పర్యం: అంగిరసుడు ఇంద్రుడికి ఒక మహాస్త్రాన్నిచ్చాడు. ఆయన దానిని నా కిచ్చాడు. ఆ అస్త్రం అన్ని కవచాలను చీల్చేశక్తి కలది. దానితో ఈ కవచాన్ని చీల్చివేస్తాను.'

క. అని వెస నాదివ్యశరం । బనూన మంత్ర ప్రకాశ మగునట్టులుగా
గొనయమునఁ జేర్చి తిగిచినఁ । గని యశ్వత్థామ బాహుగర్వం బలరన్. 204

ప్రతిపదార్థం: అని= అని చెపుతూ; వెసన్= శీఘ్రంగా; ఆ దివ్యశరంబున్= ఆ దైవశక్తిగల బాణాన్ని; అనూన= తక్కువకాని; మంత్ర ప్రకాశము+అగునట్టులుగాన్= మంత్రంతో వెలిగేటట్లుగా; గొనయమునన్= వింటిలో; చేర్చి= (కలిపి) జోడించి; తిగిచినన్= లాగగా; కని= చూచి; అశ్వత్థామ= ద్రోణాచార్యుడి కుమారుడైన అశ్వత్థామ; బాహుగర్వంబు+అలరన్= భుజబలం అతిశయించగా.

తాత్పర్యం: అంటూ శీఘ్రంగా గొప్ప మంత్రంతో ఆ దివ్యబాణాన్ని వెలిగేటట్లుగా వింటిలో అమర్చి, అల్లెత్రాడు లాగి ప్రయోగించగా అశ్వత్థామ చూచి, తన భుజబలం ప్రకాశించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అధిప! సర్వాస్త్రఘాతి యై యతిశయిల్లు । నస్త్రమునఁ జిత్రముగఁ దెగయంద తునిమె
నమ్మహాస్త్రంబు న ట్లది వమ్ముగాఁగ । నెఱిఁగి వెఱఁగంది హరి కతఁ డిట్టు లనియె. 205

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!(ధృతరాష్ట్రా!); సర్వ+అస్త్రఘాతి+ఐ= అన్ని బాణాలను పడగొట్టినదై; అతిశయిల్లు= విజృంభించే (పెరిగే); అస్త్రమునన్= బాణంతో; చిత్రముగన్= ఆశ్చర్యంగా; తెగ+అంద= ఎక్కు పెట్టుటయందే; ఆ+మహా+అస్త్రంబున్= ఆ పెద్దబాణాన్ని; తునిమెన్= త్రుంచివేశాడు; అట్లు= ఆ విధంగా; అది= ఆ అస్త్రం; వమ్ము కాఁగన్= పనికిరాకపోగా; ఎఱిఁగి= తెలిసికొని; వెఱఁగంది= ఆశ్చర్యపడి; అతఁడు= అర్జునుడు; హరికిన్= కృష్ణుడితో; ఇట్టులు+అనియెన్= ఈ ప్రకారంగా అన్నాడు.

తాత్పర్యం: అన్ని అస్త్రాలను నాశనం చేసి అతియించే ఒక మహాస్త్రాన్ని ప్రయోగించగా, ఆశ్చర్యకరంగా అది అర్జునుని మహాస్త్రాన్ని త్రుంచింది. ఆ విధంగా తన అస్త్రం వ్యర్థం కాగా, అర్జునుడు ఆశ్చర్యపడి కృష్ణునితో ఈ విధంగా అన్నాడు.

వ. 'ఆచార్య పుత్త్రు నస్త్ర ప్రభావంబున నవ్విశిఖంబు వినిహతంబయ్యెఁ బునఃప్రయోగంబు సేసిన నది యొప్పమి సేయు నని వింటి; నా వింటి బలిమిన సాధించెదం జూడు' మను నవసరంబున నయ్యిరువురను దుర్యోధనుండు. 206

ప్రతిపదార్థం: ఆచార్యపుత్రు+అస్త్రప్రభావంబునన్= అశ్వత్థామయొక్క అస్త్రమహిమచేత; ఆ+విశిఖంబు= ఆబాణం; వినిహతంబు +అయ్యెన్= మొక్కపోయింది; పునఃప్రయోగంబు+చేసినన్= మరల ప్రయోగిస్తే; అది= ఆ మహాస్త్రం; ఒప్పమి= కీడు; చేయున్+ అని= చేస్తుందని; వింటిన్= విన్నాను (కాబట్టి); నా వింటి బలిమిన= నా వింటి బలంతోనే; సాధించెదన్= సాధిస్తాను; చూడుము= చూస్తూ ఉండుము; అను+అవసరంబునన్= అనే సమయంలో; దుర్యోధనుడు; ఆ+ఇరువురను= ఆ ఇద్దరినీ (కృష్ణార్జునులను).

తాత్పర్యం: 'ద్రోణాచార్యుడి కుమారుడైన అశ్వత్థామ ప్రయోగించిన బాణశక్తివలన నా బాణం మొక్కవోయింది. మరల దాన్ని ప్రయోగిస్తే అది కీడు కలిగిస్తుందని విన్నాను. నా వింటి బలంతోనే సాధిస్తాను చూడుము.' అనే సమయంలో ఆ ఇరువురుని దుర్యోధనుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తొమ్మిది తొమ్మిది వాలిక । యమ్ముల మున్నేసి పటుశరాసారము పైఁ
గ్రమ్మించిన మనదెసఁ దూ । ర్యమ్ములునుం గీర్తనములు నార్పులుఁ జెలఁగెన్. 207

ప్రతిపదార్థం: తొమ్మిది తొమ్మిది= తొమ్మిదేసి తొమ్మిదేసి; వాలిక అమ్ములన్= వాలమ్ములతో; మున్ను+ఏసి= ముందుగా కొట్టి; పటుశరాసారము= దట్టమైన బాణవర్షం; పైన్+క్రమ్మించినన్= మీద కురిపించగా; మనదెసన్= మన వైపున; తూర్యమ్ములునున్= తూర్యనాదాలు (తుత్తురుమను శబ్దం వచ్చే విధంగా చేయటం); కీర్తనములు= పాటలు (ఉత్సాహంతో పాడేపాటలు); ఆర్పులు= సింహనాదాలు; చెలఁగెన్= ధ్వనించాయి.

తాత్పర్యం: తొమ్మిదేసి తొమ్మిదేసి వాలమ్ములను ముందుగా కొట్టి, ఆపైన దట్టమైన బాణవర్షం కురిపించగా మన దిక్కున తూర్యశబ్దాలూ, పాటలూ, సింహనాదాలూ చెలరేగాయి.

ఆ. **అలిగి యవుడు గఱచి యన్నరుఁ డా నృపు। తురగములను సూతుఁ దునిమి వైచి**
రథము నఱికి యధిక రయమునఁ దఱచుగ। నాటెఁ గరతలముల నారసములు. **208**

ప్రతిపదార్థం: అలిగి= కోపించి; ఆ నరుఁడు= ఆ అర్జునుడు; అవుడు గఱచి= క్రింది పెదవిని పంటితో నొక్కి (కోపాన్ని చూపి); ఆ నృపు తురగములను= ఆ దుర్యోధనుడి గుర్రాలను; సూతున్= సారథిని; తునిమివైచి= చంపి; రథము నఱికి= తేరును ముక్కలు చేసి; అధిక రయమునన్= చాలా వేగంగా; కరతలమునన్= చేతులతో; నారసములు= వాడియైన బాణములను; తఱచుగన్= దట్టముగా; నాటెన్= గ్రుచ్చాడు.

తాత్పర్యం: ఆ సమయంలో అర్జునుడు కోపంతో పెదవి నొక్కుకుంటూ ఆ దుర్యోధనుడి గుర్రాలను, సారథిని చంపి, తేరును ముక్కలు చేసి చాలా తొందరగా అతని అరచేతులలో వాడి బాణాలను నాటాడు.

వ. **ఇట్లు విరథుండును వికల హస్తుండును నై విషణ్ణుం డగు నన్నరనాథుండు వెడం గగుటం గటకటంబడి యాకంకటంబు నిష్ఫలం బను బుద్ధిం బుచ్చి వైచి యొండొక కవచంబు దొడిగె; నయ్యెడరు గనుంగొని శీఘ్రంబునం దత్సైనికోత్తములు చతురంగ బహు బలంబులతోఁ గవిసి, కవ్వడిం జుట్టి ముట్టి యలుఁగుల సోనలు గురిసిన నతండు సంరంభ విజృంభితుం డగుటయు.** **209**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; విరథుండును= తేరు లేనివాడూ; వికల హస్తుండును+ఐ= గాయపడిన చేతులు కలవాడూ అయి; విషణ్ణుండు+అగు= దుఃఖానికి గురి అయిన; ఆ నరనాథుండు= ఆ రాజు (దుర్యోధనుడు); వెడంగు+అగుటన్= వివేకాన్ని కోల్పోయిన వాడై; కటకటన్+పడి= కష్టపడి; ఆ కంకటంబు= ఆ కవచం; నిష్ఫలంబు= పనికిరానిది; అను బుద్ధిన్= అనే తలపుతో; పుచ్చివైచి= తొలగించి; ఒండు+ఒక కవచంబున్= ఇంకొక కవచాన్ని; తొడిగెను= తొడుగుకొన్నాడు; ఆ+ఎడరు= ఆ భంగపాటును; కనుంగొని= చూచి; శీఘ్రంబునన్= వేగంగా; తద్+సైనిక+ఉత్తములు= వాని సేనానులు; చతురంగ బహు బలంబులతోన్= అధిక సంఖ్యలోగల రథ గజ తురగ పదాతి సైన్యాలతో; కవిసి= కమ్ముకొని; కవ్వడిన్= అర్జునుడిని; చుట్టిముట్టి= చుట్టుకొని తాకి; అలుఁగుల సోనలు కురిసినన్= బాణాల వానను కురిపించగా; అతండు= ఆ అర్జునుడు; సంరంభ విజృంభితుండు+అగుచున్= ఆటోపంతో చెలరేగినవాడై.

తాత్పర్యం: ఈ విధంగా తేరు లేక, చేతులు గాయపడి, దుఃఖంతో ఆ దుర్యోధనుడు వివేకాన్ని కోల్పోయి చింతించి ఆ కవచం పనికిరాదనే బుద్ధితో తీసివేసి, ఇంకో కవచాన్ని తొడుగుకొన్నాడు. అతడి సైనికోత్తములు దుర్యోధనుడికి కలిగిన ఆపదను చూచి అనేక చతురంగ బలాలతో దూకి అర్జునుడిని క్రమ్ముకొని బాణాలవాన కురిపించగా అతడు పేట్రేగిపోయాడు.

చ. **అఱిముఱిఁ ద్రెళ్ళెఁ దేరులు, గజావళి గూలెఁ, దురంగమాంగము**
ల్గిఱికొనియెన్ మహిన్ భటులు లెక్కకు మిక్కిలి సేన పాడుగా
నఱు మయి రప్ప కృష్ణుఁడు నినాదము భూగగనాంతరంబునం
దఱచుగ నొత్తె నిర్మథిత దానవ సైన్యముఁ బాంచజన్యమున్. **210**

ప్రతిపదార్థం: అఱిముఱిన్= సంభ్రమంతో; తేరులు త్రెళ్ళెన్= రథాలు పడిపోయాయి; గజ+ఆవళి= ఏనుగుల గుంపు; కూలెన్= కూలిపోయింది; తురంగమ= గుర్రాల; అంగముల్+గిఱికొనియెన్= శరీరంలోని భాగాలు చుట్టుకొన్నవి; మహిన్= భూమిమీద;

భటులు= సైనికులు; లెక్కకు మిక్కిలి సేన= లెక్క పెట్టడానికి ఎక్కువైన సేన; పాడుగాన్= నాశంకాగా; అఱుము+అయిరి= ఆక్రమించుకొన్నారు; అప్డు= ఆ సమయంలో; కృష్ణుడు= శ్రీకృష్ణుడు; భూగగన+అంతరంబునన్= భూమ్యాకాశాల మధ్యలో; తఱచుగన్= దట్టంగా; నిర్మథిత దానవ సైన్యమున్= నాశం చేయబడిన దానవ సైన్యం కల; పాంచజన్యమున్= పాంచ జన్యమనే (తన) శంఖాన్ని; ఒత్తెన్= ఊదాడు.

తాత్పర్యం: కలతబడి తేరులు పడిపోయాయి; ఏనుగుల గుంపులు కూలిపోయాయి; గుర్రాల శరీరాంగాలు వికలమయ్యాయి; భూమిమీద సైనికులు లెక్కపెట్టలేనంతగా కూలిపోయారు. ఆ సమయంలో కృష్ణుడు - రాక్షసైన్యాన్ని నాశం చేసిన పాంచజన్యాన్ని భూమ్యాకాశాల మధ్య ప్రతిధ్వనించేటట్లుగా ఊదాడు.

తే. అట్లు భీషణమగు నర్జునాక్రమంబు । ఘోరమైన మురారి శంఖారవంబు
నధిక భయసంభ్రమంబుల నావహింప । నధిప! నలుగడఁ బఱచె సైన్యంబు గలఁగి. 211

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; అట్లు= ఆ విధంగా; భీషణము+అగు= భయంకరమైన; అర్జున+ఆక్రమంబు= అర్జునుడి కమ్ముకోటం; ఘోరము+ఐ= భయాన్ని కలిగించే; మురారి= శ్రీకృష్ణుడి; శంఖారవంబు= శంఖం చేసిన శబ్దం; అధిక= ఎక్కువైన; భయసంభ్రమంబులన్= భయాన్ని, తొట్రుపాటును; ఆవహింపన్= కలిగించగా; సైన్యంబు= (మన) సైన్యం; కలఁగి= చీకాకుపడి; నలుగడన్= నాలుగు దిక్కులకు; పఱచెన్= పరుగెత్తింది.

తాత్పర్యం: ఓ రాజా! అర్జునుడు ఆ విధంగా భయంకరంగా ఆక్రమించుకొనటమూ, మహాభయంకరమైన శ్రీకృష్ణుడి శంఖనాదమూ-భయమునూ, తొట్రుపాటునూ కలిగించగా మన సైన్యం కకావికలై నాలుగు దిక్కులకూ పరుగెత్తింది.

వ. ఇ త్తెఱంగున. 212

తాత్పర్యం: ఈ విధంగా.

క. మును సంకటపడి మూఁకలు । గనుకని విచ్చుటయుఁ బిదప గాండివి మెఱసెం
బొనుఁగుపడి యుండి తగుగా । డ్పున మండు మహానలంబు పోల్కి మహీశా! 213

ప్రతిపదార్థం: మహీశా!= ఓ రాజా! (ధృతరాష్ట్రా!); మును= ముందు (అనగా ఇదివరలో); మూఁకలు= సైన్యాలు; సంకటపడి= బాధపడి; కనుకనిన్= సంభ్రమంతో; విచ్చుటయున్= విరిసిపోగా; పిదపన్= వెనుకనే; గాండివి= అర్జునుడు; పొనుఁగుపడి ఉండి= వెలుగు తగ్గి ఉండి (నిస్తేజంగా ఉండి); తగుగాడ్పునన్= తగిన గాలితో (వాలుగాలితో); మండు= మండే; మహా+అనలంబుపోల్కి= దావాగ్ని మాదిరిగా; మెఱసెన్= వెలిగాడు.

తాత్పర్యం: ఓ రాజా! మన సైన్యాలు బాధతోనూ తొట్రుపాటుతోనూ చెల్లాచెదరైపోగా, వెంటనే నిస్తేజంగా ఉండి అనుకూలమైన గాలి తగులగానే మండే దావాగ్ని మాదిరి అర్జునుడు కాంతితో ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. అయ్యవసరంబున సింధురాజ రక్షకంబైన బలంబు సంక్షోభ సహితంబగు నుత్సాహంబునం బొదలి శంఖభేరీ పణవాది క్వణన మేదుర సింహనాదభరిత రోదసీ కుహరంబయ్యె; నచ్చిడిముడి పడుట యవలోకించి. 214

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; సింధురాజ రక్షకంబు+ఐన= సైంధవుడిని కాపాడుతూ ఉన్న; బలంబు= సైన్యం; సంక్షోభ సహితంబు+అగు= కలతతో కూడిన; ఉత్సాహంబునన్= సంతోషంతో; పొదలి= ఒప్పి; శంఖ, భేరీ, పణవ+ఆది= శంఖం, నగారా, పణవం మొదలైనవి కావించే; క్వణన= మ్రోతతో; మేదుర= దట్టమైన; సింహనాదభరిత= సింహనాదాలతో నిండిన; రోదసీకుహరంబు+అయ్యెన్= గుహవంటి ఆకసము అయినది; ఆ చిడిముడిపడుటన్= ఆ తొట్రుపాటును; అవలోకించి= చూచి.

తాత్పర్యం: ఆ సమయంలో సైంధవుడిని రక్షిస్తున్న సైన్యం తొట్రుపాటుతో కూడుకొన్న ఉత్సాహంతో పొంగి శంఖాలు, భేరులూ, పణవాలు వంటి వాద్యాల నాదాలతో, సింహనాదాలతో ఆకాశ గుహ నిండిపోగా అర్జునుడు వారి ఆర్భాటాన్ని గమనించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. మందస్మిత సుందర వద। నేందు లగుచు హరియు నరుఁడు నేడ్తెఱఁ బ్రియముల్
డెందములం బొంద భవ। న్నందనుపై నురవడించినం గని కడఁకన్. 215

ప్రతిపదార్థం: మందస్మిత= చిరునవ్వుతో; సుందర వదన+ఇందులు+అగుచున్= అందమైన చంద్రుడి వంటి ముఖాలు కలవారయి; హరియున్ నరుఁడున్= కృష్ణార్జునులు; ఏడ్తెఱన్= ఎక్కువగా; ప్రియముల్= సంతోషాలు; డెందములన్= మనస్సులలో; పొందన్= పొందగా; భవత్+నందనుపైన్= నీ కుమారుని మీద (అనగా దుర్యోధనుడిమీద); ఉరవడించినన్= దూకగా; కని= చూచి; కడఁకన్= పట్టుదలతో.

తాత్పర్యం: చిరునవ్వులతో అందమైన చంద్రుడివంటి మొగాలతో కృష్ణార్జునులు మిక్కిలి సంతోషించే మనస్సులతో నీ కుమారుడి మీద దూకగా, అది చూచి పట్టుదలతో. (తరువాతి పద్యంతో అన్వయం).

వృషసేనుండు లోనగు నెనమండ్రు రథికు లొక్కపెట్ట యర్జునుపైఁ గవియుట (సం. 7-79-1)

క. వారలఁ బొదువ నడరు బలు। తేరుల మొత్తముల మిగిలి దీప్తపటు రథో
దారు లగుచు నెనమండ్రురు। వీరులు దఱిమిరి నితాంతవేగోజ్జ్వలు లై. 216

ప్రతిపదార్థం: వారలన్+పొదువన్= ఆ వీరులను ఆక్రమించటానికి; అడరు= విజృంభించే; బలుతేరుల మొత్తములన్= దృఢమైన తేరుల సమూహాలతో; మిగిలి= అతిశయించి; దీప్త= వెలిగే; పటురథ+ఉదారులు= దృఢమైన తేరులచే గొప్పవారు; అగుచున్; ఎనమండ్రురు వీరులు= ఎనిమిదిమంది బలయుతులైన వీరులు; నితాంత= తుదిలేని; వేగ+ఉజ్జ్వలులు+ఐ= వేగంతో ప్రకాశిస్తూ; దఱిమిరి= తరిమారు.

తాత్పర్యం: ఆ వీరులను ఆక్రమించటానికి బలమైన తేరులతో ప్రకాశిస్తూ ఎనిమిది మంది వీరులు అంతులేని వేగంతో వెలుగుతూ కృష్ణార్జునులను తరిమారు.

వ. వా రెవ్వ రెవ్వ రంటేని. 217

తాత్పర్యం: వారందరూ ఎవ్వరని అడుగుతావేమో వినుము. (అని సంజయుడు ధృతరాష్ట్రుడితో అన్నాడు).

క. దండిమగ లైన వృషసే। నుండు శలుండు సైంధవుఁడునుం గృపుఁడును గ
ర్ణుండును గురునందనుఁడు శ। ల్యుండును భూరిశ్రవుండు నుర్వీనాథా! 218

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= ఓ రాజా! (ఓ ధృతరాష్ట్రా!); దండిమగలు+ఐన= మేటి వీరులైన; వృషసేనుండు, శలుడు, సైంధవుఁడును, కృపుడును, కర్ణుండును, గురునందనుడును, శల్యుండును భూరిశ్రవుఁడును= వృషసేనుడు, శలుడు, సైంధవుడు, కృపాచార్యుడు, కర్ణుడు, అశ్వత్థామ, శల్యుడు, భూరిశ్రవుడు మొదలగువారు.

తాత్పర్యం: వృషసేనుడు, శలుడు, సైంధవుడు, కృపుడు, కర్ణుడు, అశ్వత్థామ, శల్యుడు, భూరిశ్రవుడు మొదలైన మేటివిలుకాండ్రు వారు. (అనగా అర్జునుడిని క్రమ్ముకొన్న వీరులు వీరని సంజయుడు వివరిస్తున్నాడు.)

వ. అందఱు నొక్క మొగంబై. 219

తాత్పర్యం: అందరు ఒక్కటిగా కూడి.

క. తనదైన ప్రతిన నెఱపుట । కును ముఖ్యోపాయ మది యగుట నట్లు సుయో
ధనుఁ బరిమార్పఁ గడఁగు ఫ । ల్గునుఁ దలపడి రాత్మశంఖ ఘోషంబులతోన్. 220

ప్రతిపదార్థం: తనది+ఐన ప్రతినన్= తన శపథాన్ని (అర్జునుడు సైంధవుడిని హతమారుస్తానని ప్రతిజ్ఞ చేశాడు); నెఱపుటకును= సాధించటానికి; ముఖ్య+ఉపాయము= ముఖ్యమయిన ఉపాయం (మార్గం); అది అగుటన్= అదే కావటం (సైంధవవధకు అది ప్రధానమైన బాట (ఉపాయం); అట్లు= ఆ విధంగా; సుయోధనున్= దుర్యోధనుడిని; పరిమార్పన్+కడఁగు= చంపటానికి పూనుకొన్న; ఫల్గునున్= అర్జునుడిని; ఆత్మశంఖ ఘోషంబులతోన్= తమ తమ శంఖనాదాలతో; తలపడిరి= ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: (అర్జునుడు తన శపథం నెరవేర్చుకొనటానికి ప్రధానమైన ఉపాయం - దుర్యోధనుడిని పరిమార్చటం. అందుకు ప్రయత్నించే అర్జునుడిని తమ తమ శంఖనాదాలతో వృషసేనాదులు ఆతడిని ఎదుర్కొన్నారు.

క. అట్టియెడ దేవదత్తము । బిట్టొత్తె నరుండు పెక్కు పిడుగుల మ్రోఁతన్
బెట్టు వఱచు తన్నినదము । పుట్టించెను దిగులు నీదు పుత్రకు మేనన్. 221

ప్రతిపదార్థం: అట్టి ఎడన్= అటువంటి సమయంలో; నరుండు= అర్జునుడు; దేవదత్తమున్= దేవదత్తమనే తన శంఖాన్ని; బిట్టు+ఒత్తెన్= గట్టిగా ఊదాడు; (మ్రోత) పెక్కుపిడుగుల మ్రోఁతన్= అనేకమయిన పిడుగుల శబ్దంతో; బెట్టు+పఱచు= అతిశయించే; తద్+నినదము= ఆ శంఖ శబ్దం; నీదు పుత్రకు మేనన్= నీ కుమారుడి శరీరంలో; దిగులు= భయాన్ని; పుట్టించెన్= కలిగించింది.

తాత్పర్యం: ఆ సమయాన అర్జునుడు దేవదత్తాన్ని గట్టిగా ఊదాడు. ఆ శబ్దం పెక్కు పిడుగులు రాలే శబ్దంతో నీ కుమారుడికి దిగులు పుట్టించింది. (అని సంజయుడు ధృతరాష్ట్రుడితో అర్జునుడి శక్తిని వివరిస్తున్నాడు.)

తే. చెవులు బీఁటలు వాఱంగఁ జెలఁగు నమ్మ । హారవమ్మున కులుకక యతనిమీఁద
విభుఁడుఁ గర్ణాదులును శరవృష్టి గురిసి । రదరి సైంధవు దిక్కున కడ్డపడుచు. 222

ప్రతిపదార్థం: చెవులు బీఁటలు పాఱంగన్= చెవులు చిల్లులు పడగా; చెలఁగు= ధ్వనిస్తూ ఉన్న; ఆ+మహారవమ్మునకున్= ఆ పెను చప్పుడుకు; ఉలుకక= భయపడక; అతని మీఁదన్= ఆ అర్జునుడిమీద; విభుఁడున్= దుర్యోధనుడును; కర్ణ+ఆదులును= కర్ణుడు మొదలైనవారును; సైంధవుని దిక్కునకున్= సైంధవుడు ఉండే దిక్కునకు; అడ్డపడుచున్= అడ్డమౌతూ; అదరి= పూని; శరవృష్టిన్= అంపవానను; కురిసిరి= కురిపించారు.

తాత్పర్యం: (అర్జునుడి శంఖనాదం) తమ చెవులు చిల్లులు పడగా ఆ పెను శబ్దానికి భయపడకుండా దుర్యోధనుడు, కర్ణుడు మొదలైనవారు సైంధవుడున్న వైపు వెళ్ళుతున్న అర్జునుడిపై బాణవర్షం కురిపించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఆ సమయంబున నశ్వత్థామ యుబ్బి దెబ్బదిమూఁడు మార్గణంబుల మురవైరిని భల్లత్రయంబునఁ బార్థునినైదు శరంబులఁ దురంగమంబులం గేతువు నేసిన నవ్వాసవి యతని నూటయాఱింటను గర్ణునిఁ బదింటను వృషసేనుని మూఁటను నొప్పించి యొక్క కత్తివాతియమ్మున శల్యు చాపంబు ముష్టికిం ద్రుంచిన. 223

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ వేళలో; అశ్వత్థామ; ఉబ్బి= రేగి; డెబ్బది మూఁడు మార్గణంబులన్= డెబ్బైమూడు బాణాలతో; మురవైరిని= శ్రీకృష్ణుడిని; భల్లత్రయంబునన్= మూడు బల్లేలతో; పార్థునిన్= అర్జునుడిని; ఐదు శరంబులన్= అయిదు బాణాలతో; తురంగమంబులన్ కేతువును= గుర్రాలను, పతాకాన్ని; ఏసినన్= పడగొట్టగా; ఆ+వాసవి= ఆ అర్జునుడు; అతనిన్= అశ్వత్థామను; నూట ఆఱింటను= నూట ఆరు బాణాలతోను; కర్ణునిన్= కర్ణుడిని; పదింటను= పదింటితోను; వృషసేనునిన్= వృషసేనుడనే వాడిని; మూఁటను= మూడింటితోను; నొప్పించి= బాధపెట్టి; ఒక్క కత్తివాతి అమ్మునన్= ఒక కత్తివంటి వాడికల బాణంతో; శల్యుచాపంబున్= శల్యుడి విల్లును; ముష్టికిన్+త్రుంచినన్= పిడికిలి వద్దకు త్రుంచివేయగా.

తాత్పర్యం: ఆ సమయంలో అశ్వత్థామ చెల రేగి, డెబ్బైమూడు బాణాలతో శ్రీకృష్ణుడినీ, మూడింటితో అర్జునుడినీ అయిదింటితో గుర్రాలనూ కేతువునూ పడగొట్టగా - ఆ అర్జునుడు అశ్వత్థామను నూట ఆరు బాణాలతోనూ, కర్ణుడిని పదింటితోనూ, వృషసేనుడిని మూడింటితోనూ బాధించాడు. ఒక కత్తి వంటి వాడిగల బాణంతో, శల్యుడి ధనుస్సును పిడికిలి వద్దకు విరువగా. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. వేగంబ వేఱొక్క విలు గొని మద్రేశుఁ। డతనిపైఁ దొమ్మిది యమ్ము లేయ
ముప్పది రెంటను మూఁట నేనింటను। బదియింట నఱువది బాణములను
గర్ణ భూరిశ్రవః కర్ణనందన కృప। గురుపుత్రు లేసి రన్నరుని మఱియు
నాతనిమీఁద దివ్యాస్త్రంబు లైదు గో। విందు మై సప్తతి విశిఖములును

తే. ద్రౌణి నిగిడించె నట్టిసందడి జయద్ర। థుండు వారల మఱువున నుండి పఱపె
సరభసముగఁ ద్రిసప్తతి సాయకంబు। లమ్మహాబాహు దెసఁ గౌరవాధినాథ! 224

ప్రతిపదార్థం: కౌరవ+అధినాథ!= కౌరవులకు ప్రభువైన ధృతరాష్ట్రా!; మద్రేశుఁడు= శల్యుడు; వేగంబు+అ= తొందరగా; వేఱొక్కవిలుగొని= ఇంకో వింటిని తీసికొని; అతనిపైన్= ఆ అర్జునుడిమీద; తొమ్మిది అమ్ములు+ఏయన్= తొమ్మిది బాణాలతో కొట్టగా; ముప్పదిరెంటను= ముప్పైరెంటితోను; మూఁటన్= మూటితోనూ; ఏనింటన్= ఐదింటితోను; అఱువది బాణములను= అరవై బాణాలతోను; కర్ణభూరిశ్రవః కర్ణనందన కృప గురుపుత్రులు= కర్ణుడు, భూరిశ్రవుడు, వృషసేనుడు, కృపాచార్యులు, అశ్వత్థామా; ఆ+నరునిన్+ఏసిరి= ఆ అర్జునుడిని కొట్టారు; మఱియున్= ఇంకను; ఆతని మీఁదన్= అర్జునుడిమీద; దివ్య+అస్త్రంబులు+ఐదు= దివ్యమైన బాణాలనైదింటిని; గోవిందుమైన్= శ్రీకృష్ణుడి శరీరంమీద; సప్తతి= డెబ్బై; విశిఖములను= వాడి బాణాలను; ద్రౌణి= అశ్వత్థామ; నిగిడించెన్= వేశాడు; అట్టి సందడిన్= ఆ సంకుల సమరంలో; జయద్రథుండు= సైంధవుడు; వారల మఱువునన్= పై చెప్పిన కర్ణాదుల చాటున; ఉండి= నిలచి; సరభసముగాన్= వేగంగా; త్రిసప్తతి సాయకంబులు= డెబ్బదిమూడు బాణాలు; ఆ+మహాబాహుదెసన్= ఆ గొప్ప భుజబలం కలవాడి దిక్కుగా; పఱపెన్= వేశాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర చక్రవర్తీ! శల్యుడు శీఘ్రంగా ఇంకొక విల్లు తీసికొని తొమ్మిది బాణాలతో కొట్టాడు. కర్ణుడు ముప్పయి రెండుతో, భూరిశ్రవుడు మూటితోను, వృషసేనుడు ఐదింటితో, కృపాచార్యులు పదింటితో, అశ్వత్థామ అరువది బాణాలతో అర్జునుని కొట్టారు. అశ్వత్థామ, ఇంకా ఆతడి మీద దివ్యాస్త్రాలైదు, గోవిందుడి మీద డెబ్బై వాడి బాణాలను ప్రయోగించాడు. అటువంటి సందట్లో సైంధవుడు వారిచాటున నిలచి మిక్కిలి తొందరగా ఆ మహావీరుడిపైన డెబ్బదిమూడు బాణాలను వేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు పెక్కం డ్రొక్కపెట్ట పె ల్లేసినం గినుక నూనిన నవ్వు రౌద్రరసంబు నలంకరింప. 225

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పెక్కండ్రు= పెక్కురు; ఒక్కపెట్టన్= ఒక్కసారిగా; పెల్లు+ఏసినన్= మిక్కిలిగా బాణాలు ప్రయోగించగా; కినుకన్+ఊనిన నవ్వు= కోపం తెచ్చుకొని నవ్విన నవ్వు; రౌద్రరసంబున్= కోపతీవ్రతను తెలిపే భావాన్ని; అలంకరింపన్= అందగించగా.

తాత్పర్యం: ఈ విధంగా అందరు ఒక్క పెట్టున బాణాలు ప్రయోగించగా కోపంతో కూడిన నవ్వు (అర్జునుడి ముఖంలో) రౌద్రరసాన్ని అందగించేటట్లు చేయగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వడి రాధేయుని నాతని । కొడుకునుఁ బండ్రెంట మూఁటఁ గుదియించుచుఁ గ
వ్వడి యొక బలుతూపున నె । క్కుడు రయమునఁ దునిమె శల్యు కోదండంబున్. 226

ప్రతిపదార్థం: వడిన్= శీఘ్రంగా; రాధేయునిన్= కర్ణుడిని; ఆతని కొడుకును= ఆతడి కుమారుడైన వృషసేనుడిని; పండ్రెంటన్ మూఁటన్= పండ్రెండుతోను, మూడింటితోను; కుదియించుచున్= అణగిస్తూ; కవ్వడి= అర్జునుడు; ఒక బలుతూపునన్= ఒక తీవ్రమైన బాణంతో; ఎక్కుడు రయమునన్= మిక్కిలి వేగంతో; శల్యుకోదండంబున్= శల్యుడి వింటిని; తునిమెన్= త్రుంచివేశాడు.

తాత్పర్యం: (అర్జునుడు) శీఘ్రంగా కర్ణుడిని, అతడి కొడుకును వరుసగా పండ్రెండు, మూడు బాణాలతో అణగిస్తూ, ఒక్క వాడి బాణంతో శల్యుడి వింటిని శీఘ్రంగా త్రుంచివేశాడు.

ఆ. తునిమి తోన యతనిఁ దొమ్మిది యమ్ముల । స్రుక్కఁ జేసి మూఁట సోమదత్త
తనయు నెనిమిదింట ద్రౌణిని నిరువదే । నింటఁ గృపుని నొంచి నిలువరించె. 227

ప్రతిపదార్థం: (శల్యుకోదండంబున్= శల్యుడి వింటిని); తునిమి= త్రుంచివేసి; తోన= వెంటనే; అతనిన్= ఆ శల్యుడిని; తొమ్మిది అమ్ములన్= తొమ్మిది బాణాలతో; స్రుక్కన్+చేసి= అణగించి; మూఁటన్= మూడు బాణాలతో; సోమదత్త తనయున్= సోమదత్తుడి కుమారుడిని; ఎనిమిదింటన్= ఎనిమిది బాణాలతో; ద్రౌణినిన్= అశ్వత్థామను; ఇరువది+ఏనింటన్= ఇరవై ఐదుబాణాలతో; కృపునిన్= కృపాచార్యుడిని; నొంచి= బాధపెట్టి; నిలువరించెన్= ఆపాడు.

తాత్పర్యం: శల్యుడి వింటిని త్రుంచి, వెంటనే తొమ్మిది బాణాలతో అతనిని అణగించి, మూటితో సోమదత్తుడి కుమారుడిని, ఎనిమిదింటితో అశ్వత్థామను, ఇరవై ఐదింటితో కృపాచార్యుడిని, బాధించి అడ్డుకొన్నాడు.

వ. మఱియు నిరువది మెఱుంగు వాలమ్ము లశ్వత్థామ యంగంబునం గ్రుచ్చె; నిట్లందఱతోడను గ్రందు కయ్యంబు సేయు సమయంబున నొక్కొక్కమఱి వారి పిఱుంద నోర వాఱం దోఁచు జయద్రథు నేయం దీఱకున్నం దమకంబున నెడనెడ నఱిముఱిం దద్రథంబు దెసకు నతఁడు వాఱ విడిచిన విశిఖంబులు నూఱు గల వప్పుడు భూరిశ్రవుండు వాసుదేవుని చేతిమునికోల నొకకోలం దునిమి కదిసి క్రీడి మేనం బ్రిసప్తతి శరంబులు వరఁగించెం దక్కటివారును నొక్క మొగిం గ్రూరనారాచంబులు గుప్పించి నొప్పించిన. 228

ప్రతిపదార్థం: మఱియును= ఇంకను; ఇరువది మెఱుంగువాలమ్ములు= వెలుగుతూ ఉండే ఇరవై వాడి బాణాలు; అశ్వత్థామ అంగంబునన్ గ్రుచ్చెన్= అశ్వత్థామ శరీరంలో గ్రుచ్చాడు; ఇట్లు= ఈ విధంగా; అందఱతోడను= అందరితోను; క్రందుకయ్యంబు= దట్టమైన యుద్ధం; చేయు సమయంబునన్= చేసే వేళలో; ఒక్కొక్కమఱి= ఒక్కొక్కమారు; వారి పిఱుందన్= వారి వెనుకను; ఓరవాఱన్= ప్రక్కగా; తోఁచు= కన్పించే; జయద్రథున్= సైంధవుడిని; ఏయన్+తీఱకున్నన్= కొట్టటం వీలుచిక్కకపోగా; తమకంబునన్= త్వరతో; ఎడనెడన్= మధ్యమధ్యలో; అఱిముఱిన్= సంభ్రమంతో; తద్రథంబుదెసకున్= అతడి తేరు దిక్కుకు;

అతఁడు= అర్జునుడు; పాఱవిడిచిన= పడునట్లుగా వదలిన; విశిఖంబులు= వాణిబాణాలు; నూఱు కలవు= ఒక వంద ఉన్నాయి; అప్పుడు= ఆ సమయంలో; భూరిశ్రవుండు= భూరిశ్రవుడు; వాసుదేవుని= శ్రీకృష్ణుడి; చేతిమునికోలన్= చేతిలో ఉన్న ములుకర్రతో; ఒక కోలన్= ఒక బాణంతో; తునిమి= త్రుంచివేసి; కదిసి= దగ్గరకు చేరి; క్రీడిమేనన్= అర్జునుడి శరీరం మీద; త్రిసప్తతి= డెబ్బది మూడు బాణాలను; పరఁగించెన్= ప్రయోగించాడు; తక్కటివారును= మిగిలినవారు కూడా; ఒక్క మొగిన్= ఒక వరుసగా; క్రూర= భయంకరమైన; నారాచంబులన్= వాడి బాణాలను; గుప్పించి= కురిపించి; నొప్పించినన్= బాధించగా.

తాత్పర్యం: ఇంకా ఇరువది మెరుగు బాణాలతో అశ్వత్థామ శరీరాన్ని గుచ్చి, అందరితోనూ దట్టమైన యుద్ధం చేసేటప్పుడు, ఒక్కొక్కసారి వారికి వెనుక ప్రక్క ఓరగా కనబడే సైంధవుడిని దెబ్బకొట్టడానికి వీలు చిక్కకున్నా, తొందరగా అప్పుడప్పుడు సైంధవుడి మీద నూరు బాణాలను వేశాడు. అప్పుడు భూరిశ్రవుడు శ్రీకృష్ణుడిచేతి మునికోలను ఒక్క బాణంతో త్రుంచి, సమీపించి అర్జునుడి శరీరంమీద డెబ్బదిమూడు బాణాలను వేశాడు. తక్కినవారు కూడా ఒక్కసారిగా తీవ్రమైన బాణాలను గుప్పించి బాధించారు.

శా. **కోపాటోపమహోగ్రమూర్తి యగుచుం గోదండ టంకార లీ**
లా పూర్ణంబుగ భూనభోంతర మతం డయ్యోధులన్ బాణ జా
లా పాతంబునఁ దూలనేసి చటుల వ్యాపార ఘోరానిలా
క్షేపక్షోభిత వారివాహచయభంగిం జూపె నేపారఁగన్. **229**

ప్రతిపదార్థం: కోప+ఆటోప మహా+ఉగ్రమూర్తి అగుచున్= కోపం యొక్క అతిశయంతో భయంకరాకారం కలవాడౌతూ; కోదండ టంకార= వింటి అల్లెత్రాటి శబ్దం; లీలాపూర్ణంబుగన్= క్రీడవోలె నిండుగా; భూనభోంతరము= భూమ్యాకాశాల మధ్యలో; అతండు= ఆ అర్జునుడు; ఆ+యోధులన్= ఆ కౌరవసేనానులను; బాణజాల+ఆపాతంబునన్= బాణాల గుంపుతో కొట్టటం వలన; తూలన్+ఏసి= ఎగిరిపోయేటట్లుగా కొట్టి; చటుల= తీవ్రమైన; వ్యాపార= వీచుటగల; ఘోర= భయంకరమైన; అనిల= గాలియొక్క; ఆక్షేప= త్రోపుతో; క్షోభిత= చీకాకుపెట్టబడిన; వారివాహచయభంగిన్= మేఘాల గుంపు మాదిరి; ఏపారఁగన్= విజృంభించగా; చూపెన్= చూపాడు.

తాత్పర్యం: అర్జునుడు కోపాటోపంతో భయంకరమైన ఆకారం కలవాడుకాగా అల్లెత్రాటి టంకారశబ్దం భూమ్యాకాశాలు నిండగా, ఆ కౌరవవీరులను బాణాల తాకిడితో ఎగురగొట్టి, దట్టమైన పెనుగాలికి సంక్షోభంతో విచ్చిపోయే మేఘాల మాదిరి అయ్యేటట్లుగా తన శక్తిని చూపాడు.

వ. **అట్లు విచ్చియుం గూడికొని మూఁకలం గూర్చికొని యొండొరులం బురికొల్పికొని.** **230**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; విచ్చియున్= విడివడిపోయికూడా; కూడికొని= ఒక్కటై; మూఁకలన్= సేనలను; కూర్చికొని= కలిపికొని; ఒండు+ఒరులన్= ఒకరినొకరు; పురికొల్పికొని= ప్రోత్సహించుకొని.

తాత్పర్యం: ఆ ప్రకారంగా విచ్చిపోయి మరల సైన్యాలను కలుపుకొని ఒకరినొకరు ప్రేరేపించుకొంటూ.

క. **ఆ రథికు లొక్క మొగి న । వ్వీరునిపైఁ గవియుటయును విస్ఫురితశరా**
సార మతఁడు నిగిడించిన । వారి బలము లెల్ల రక్తవారిం దేలెన్. **231**

ప్రతిపదార్థం: ఆ రథికులు= ఆ సైనికులు; ఒక్కమొగిన్= ఒక్క మొత్తంగా; ఆ+వీరునిపైన్= ఆ సేనానిపైన; కవియుటయును= కమ్ముకొనగా; అతఁడు= ఆ అర్జునుడు; విస్ఫురిత= మిక్కిలి; ప్రకాశించే; శరాసారము= బాణవర్షాన్ని; నిగిడించినన్= వ్యాపింపజేయగా; వారి బలము లెల్లన్= కౌరవ సైన్యాలన్నీ; రక్తవారిన్= నెత్తుటిలో; తేలెన్= తేలాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ సైనికులంతా ఒక్క మొత్తంగా అర్జునుడిపై బడి కమ్ముకొనగా ఆతడు బాణవర్షాన్ని కురిపించి, వారి సైన్యాలను నెత్తుటేటిలో తేలించాడు.

వ. ఇత్తెఱంగునం దెరలుచుం బొదువుచు భవదీయ సైనికలోకంబు వోక పెనంగె' ననిన విని 'యప్పు డేమేమి యడియాలంబులతో నెవ్వ రెవ్వరి సిడంబులు మెఱసి యుండె?' నని యాంబికేయుం డడిగిన సంజయుం డి ట్లనియె. 232

ప్రతిపదార్థం: ఇత్తెఱంగునన్= ఈ విధంగా; తెరలుచున్= తొలగుచూ; పొదువుచున్= కమ్ముకొంటూ; భవదీయ సైనికలోకంబు= నీ సైన్య సమూహం; పోక పెనంగెన్= వెన్నీయకుండా పోట్లాడింది; అనినన్= అని చెప్పగా; విని= విన్నవాడై; అప్పుడు= ఆ సమయంలో; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; ఏమేమి అడియాలంబులతోన్= ఏఏ గుర్తులతో; ఎవ్వరి+ఎవ్వరి సిడంబులు= ఎవరెవరి కేతనాలు; మెఱసి ఉండెన్?= ప్రకాశిస్తూ ఉండినవి?; అని అడిగినన్= అని అడుగగా; సంజయుడు ఇట్లు+అనియెన్= సంజయుడు ఈ ప్రకారంగా చెప్పాడు.

తాత్పర్యం: పై విధంగా తొలగుతూ, కమ్ముకొంటూ నీ సైన్యాలు వెన్నీయక పోట్లాడాయి.' అనగా విని ధృతరాష్ట్రుడు 'ఆ సమయంలో ఏఏ గుర్తులతో ఎవరెవరి కేతనాలు ప్రకాశిస్తూ ఉన్నాయి?' అని అడుగగా సంజయుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

సీ. ప్రస్ఫురద్వానరపతియును సింహలాం । గూలంబు నుజ్జ్వల గోవృషంబు
వారణ కక్ష్యయు భూరి మయూరంబు । సీతయుఁ గాంచన సింధురంబు
రత్నయూపంబును రజతవరాహంబు । నుద్దీప్యమాన మహోరగంబుఁ
గేతనంబుల నొప్పుఁ గ్రీడికి నాచార్య । సుతునకుఁ గృపునకు సూతజునకు

తే. నతని నందనునకును మద్రావనీశ్వ । రునకు శలునకు భూరిశ్రవునకు సైంధ
వునకు రారాజునకు నిట్లు దనరి మెఱయుఁ । బది సిడంబులు నభమునఁ బ్రభలు నిగుడ. 233

ప్రతిపదార్థం: నభమునన్= ఆకాశంలో; ప్రభలు నిగుడన్= వెలుగులు ఎక్కువ కాగా; క్రీడికిన్= అర్జునుడికి; ప్రస్ఫురత్= ప్రకాశించుచున్న; వానరపతియును= కపిరాజును (హనుమంతుడును); ఆచార్య సుతునకున్= అశ్వత్థామకు; సింహలాంగూలంబున్= సింహము తోకయు; కృపునకున్= కృపాచార్యునకు; ఉజ్జ్వల= బాగా తేజస్సుతో ఉన్న; గోవృషంబును= ఎద్దును; సూతజునకున్= కర్ణుడికి; వారణకక్ష్యయున్= ఏనుగు నడుమున కట్టు పట్టెయును; అతని నందనునకున్= అతని కొడుకైన వృషసేనుడికి; భూరి మయూరంబున్= పెద్ద నెమలియు; మద్ర+అవనీశ్వరునకున్= శల్యుడికి; సీతయున్= నాగేటిచాలు; శలునకున్= శలుడికి; కాంచన= బంగారు; సింధురంబున్= ఏనుగును; భూరిశ్రవునకున్= భూరిశ్రవుడికి; రత్నయూపంబును= రత్నపు పాలకొయ్యయును; సైంధవునకున్= సైంధవుడికి; రజత వరాహంబు= వెండిరంగు పంది; రారాజునకున్= దుర్యోధనునికి; ఉద్దీప్యమాన మహా+ఉరగంబున్= వెలుగుతున్న పెనుబామును; కేతనంబులన్= కేతనాలలో; ఒప్పన్= ఒప్పగా; పదిసిడంబులు= పది కేతనాలు; మెఱయున్= మెరుస్తున్నవి.

తాత్పర్యం: (ఈ పద్యంలో నానారకాలైన పది కేతనాలు ఆయా వీరుల చిహ్నాలుగా వర్ణించబడ్డాయి.) అర్జునుడికి కపికేతనం, అశ్వత్థామకు సింహపు తోక, కృపుడికి వృషభం, కర్ణుడికి మొలనూలు కల ఏనుగు నడుము కట్టె, వృషసేనుడికి పెద్ద నెమలి, శల్యుడికి నాగేటిచాలు, శలుడికి బంగారు రంగు గల ఏనుగు, భూరిశ్రవుడికి రత్నాలు పొదిగిన యూపస్తంభం, సైంధవుడికి రజత వరాహం, దుర్యోధనుడికి భయంకరమైన పెనుబాము, రథకేతనాలుగా ప్రకాశిస్తూ ఉంటే ఆకసమంతా మెరిసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **మన తొమ్మిది సిడముల కం। టెను నుజ్జ్వల మగుచు నొక్కటియ పెక్కై యెం**
దును దాన తోచు నయ్యు। ర్జును సిడము మహోగ్రతం గురుక్షితినాథా!' 234

ప్రతిపదార్థం: కురుక్షితినాథా!= కురుదేశానికి చక్రవర్తి అయిన ఓ ధృతరాష్ట్రా!; మన తొమ్మిది సిడముల కంటెను= మనవారి తొమ్మిది కేతనాల కంటె; ఉజ్జ్వలము+అగుచున్= కాంతిమంతమై; ఒక్కటియ పెక్కై= ఒకటే అనేకంగా; ఎందునున్= ఏ దిక్కున చూచినా; ఆ+అర్జున సిడము= ఆ అర్జునుడి ధ్వజము; తాన= తానే; మహోగ్రతన్ తోఁచున్= మిక్కిలి భయంకరంగా కానవస్తుంది.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర చక్రవర్తీ! మన తొమ్మిది మంది కేతనాల కంటెను అర్జునుడి కేతనం ప్రకాశవంతమై భయంకరంగా అది ఒక్కటే అనేకాలుగా అంతటా కానవస్తూ ఉన్నది'.

తే. **అనుడు నమ్మేదినీశుఁ డి ట్లనియె 'నట్లు। క్రీడి విస్మయావహ రణక్రీడ సలుప**
గురుని దర్పంబుచే నాఁక గొనిన ధర్మ। సూను సైన్యంబు లెట్లయ్యె? సూతతనయ!' 235

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; ఆ+మేదినీ+ఈశుఁడు= ఆ చక్రవర్తి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; సూతతనయ!= ఓ సంజయా!; అట్లు= ఆ ప్రకారంగా; క్రీడి= అర్జునుడు; విస్మయ+ఆవహ= ఆశ్చర్యాన్ని కలిగించే; రణక్రీడన్= యుద్ధాన్ని; సలుపన్= చేయగా; గురుని= ద్రోణుడి; దర్పంబుచేన్= గర్వంవలన; ఆఁకగొనిన= అడ్డుకొనబడిన; ధర్మసూను సైన్యంబులు= ధర్మరాజు సేనలు; ఎట్లు+అయ్యెన్= ఏమైనవి?

తాత్పర్యం: సంజయుడు అట్లా చెప్పగా ధృతరాష్ట్రుడు ఇట్లా అడిగాడు: 'సంజయా! ఆశ్చర్యాన్ని కలిగించే విధంగా అర్జునుడు యుద్ధాన్ని చేసినప్పుడు, ద్రోణుడు దర్పంతో అడ్డుకొన్న ధర్మరాజు సైన్యాలు ఏమయ్యాయి?'

వ. **అనుటయు సంజయుం డతని కి ట్లనియె. 236**

తాత్పర్యం: అనగా సంజయుడు ఈ విధంగా అన్నాడు.

క. **అయ్యెడ ఖేచరులకు వెఱ। గయ్యెడు చందమున నట్టియవసరమున బ**
ల్కయ్యము గురుని బలముతో। నయ్యె యుధిష్ఠిర బలోచ్చయంబున కధిపా! 237

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! (ధృతరాష్ట్రా!); ఆ+ఎడన్= ఆ సమయంలో; ఖేచరులకున్= ఆకాశంలో తిరిగే వారికి (దేవతలు మొదలైనవారికి); వెఱఁగు+అయ్యెడు చందమునన్= భయం కలిగే విధంగా; అట్టి అవసరమునన్= అటువంటి వేళలో; గురుని బలముతోన్= ద్రోణుడి సైన్యంతో; ఆ+యుధిష్ఠిర బల+ఉచ్చయంబునకున్= ఆ ధర్మజుడి సైనిక సమూహానికి; బల్+కయ్యము+అయ్యెన్= పెనుయుద్ధమైనది.

తాత్పర్యం: ఆ సమయంలో దేవతలకు భయం కలిగించే విధంగా ద్రోణుడి సైన్యాలకూ ధర్మరాజు సైన్యాలకూ మహా యుద్ధ మయింది.

వ. **ఆ సంకుల సమరంబున బృహత్క్షత్త్రుని క్షేమధూర్తియు ధృష్టకేతుని వీరధన్వుండును నకులుని వికర్ణుండును సహదేవుని దుర్ముఖుండును సాత్యకిని వ్యాఘ్రదత్తుండును దలపడిరి; శల్యుఁడు సేనాముఖంబునకు వచ్చుచుం బోవుచున్న వాఁడగుట నుచితంబు మెయి నచ్చటి యనికిఁ జొచ్చి ద్రౌపదేయులం దాఁకె; భీమసేనుని యలంబుసుండును ధర్మనందను నాచార్యుండును మార్కొని; రప్పు డయ్యుధిష్ఠిరుండు. 238**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ సంకుల సమరంబునన్= ఆ దట్టమయిన యుద్ధంలో; బృహత్క్షత్త్రునిన్= బృహత్ క్షత్త్రుడు అనే వాడిని; క్షేమధూర్తియున్= క్షేమధూర్తి అనే వాడును; ధృష్టకేతునిన్= ధృష్టకేతుడు అనేవాడిని; వీరధన్వుండును= వీరధన్వుడనేవాడును; నకులునిన్= నకులుడిని; వికర్ణుండును= వికర్ణుడును; సహదేవుని; దుర్ముఖుండును= దుర్ముఖుడనేవాడును; సాత్యకిని; వ్యాఘ్ర దత్తుండును= వ్యాఘ్రదత్తుడనే వాడును; తలపడిరి= ఎదుర్కొన్నారు; శల్యుండు= శల్యుడు; సేనాముఖంబునకున్= మొగ్గరం ముందుకు; వచ్చుచున్ పోవుచున్న వాఁడు+అగుటన్= వస్తూ పోతూ ఉన్నవాడయినందున; ఉచితంబు మెయిన్= తగిన విధంగా; అచ్చటి+అనికిన్= అక్కడ జరిగే యుద్ధానికి; చొచ్చి= ప్రవేశించి; ద్రౌపదేయులన్= ఉపపాండవులను (ద్రౌపది కుమారులను); తాఁకెన్= ఎదుర్కొన్నాడు; భీమసేనుని= భీముడిని; అలంబుసుండును= అలంబుసుడనేవాడును; ధర్మనందనునిన్= ధర్మరాజును; ఆచార్యుండును= ద్రోణుడును; మార్కొనిరి= ఎదుర్కొన్నారు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు.

తాత్పర్యం: ఆ దట్టమయిన యుద్ధంలోబృహత్క్షత్త్రుడిని క్షేమధూర్తీ, ధృష్టకేతుడిని వీరధన్వుడూ, నకులుడిని వికర్ణుడూ, సహదేవుడిని దుర్ముఖుడూ; సాత్యకిని వ్యాఘ్రదత్తుడూ ఎదుర్కొన్నారు. శల్యుడు సేన తలకడకు వస్తూ పోతూ ఉండటం మూలాన తగు విధంగా ఆ యుద్ధానికి పూనుకొని, ఉపపాండవులను తాకాడు. అలంబుసుడనే వాడు భీమసేనుడినీ, ద్రోణాచార్యుడు ధర్మరాజునూ ఎదుర్కొన్న సమయంలో ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

ధర్మరాజు ద్రోణునితో యుద్ధము సేసి యోడిపోవుట (సం. 7-81-18)

క. **గురుమెయిఁ దొంబది సునిశిత । శరముల నినుచుటయు, నతఁడు సక్రోధుం డై**
యిరువదియేనిట నాతని । యురస్థ్సలము నొంచి పొదివె నుగ్రాస్త్రములన్. **239**

ప్రతిపదార్థం: గురుమెయిన్= ద్రోణుడి శరీరంపైన; తొంబది సునిశిత శరములన్= తొంభై వాడి బాణాలను; నినుచుటయున్= నింపగా; అతఁడు= గురుడు (ద్రోణాచార్యుడు); సక్రోధుండు+ఐ= కోపంతో; ఇరువది ఏనిటన్= ఇరువది అయిదింటితో; ఆతని= ఆ ధర్మజుడి; ఉరఃస్థలము= గుండెను; ఉగ్ర+అస్త్రములన్= భయంకరమైన బాణాలతో; నొంచి= బాధించి; పొదివెన్= కమ్ముకొన్నాడు.

తాత్పర్యం: (ధర్మజుడు) గురుడి శరీరం మీద తొంభై వాడి బాణాలను గ్రుచ్చగా, ద్రోణుడు కోపంతో అతడి గుండెను ఇరవై ఐదు బాణాలతో నొప్పించి, భయంకరమైన అస్త్రాలతో కమ్ముకొన్నాడు.

క. **రథమును నశ్వమ్ముల సా । రథిఁ దన్నునుఁ గప్పుశరపరంపర లెల్లన్**
వృథ సేసెం గరలఘుతా । ప్రథితుం డగు ధర్మసుతుఁడు బాణౌఘములన్. **240**

ప్రతిపదార్థం: ధర్మసుతుఁడు= ధర్మరాజు; రథమును= తన తేరును; అశ్వమ్ములన్= గుర్రాలను; సారథిన్= సూతుడిని; తన్నును; కప్పు= కమ్ముకొన్న; శరపరంపరలు+ఎల్లన్= బాణాల గుంపునంతటినీ; కరలఘుతా ప్రథితుండు+అగు= చేతి లాఘవంతో ప్రఖ్యాతుడైన; ధర్మసుతుఁడు= ధర్మరాజు; బాణ+ఓఘములన్= బాణాల సమూహాలతో; వృథ చేసెన్= వ్యర్థము చేశాడు.

తాత్పర్యం: ద్రోణుడి బాణాలు ధర్మజుడి తేరును, సారథిని, గుర్రాలను క్రమ్ముకొన్నాయి. అప్పుడు ధర్మరాజు తన చేతి మెలకువతో ఆ ప్రయత్నాన్ని వమ్ముచేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. అలిగి గురుండు ధర్మజుశరాసన మేడ్తెఱఁ ద్రుంచి పెక్కు ల
మ్ముల సతురంగ సూతముగ ముంచె రథం బది యెల్లఁ జూచి సే
న లతఁడు పేర్చె నిమ్మనుజనాథుఁడు సచ్చునొ? యోడి పాఱునో?
బలిమిఁ దొలంగి పట్టువడి పాడఱిపోవునొ? యంచు నున్నెడన్. 241

ప్రతిపదార్థం: గురుండు= ద్రోణాచార్యుడు; అలిగి= కోపించి; ధర్మజు శరాసనము= ధర్మరాజు వింటిని; ఏడ్తెఱన్= పరాక్రమంతో; త్రుంచి= తుంచి (ముక్కలు చేసి); పెక్కులు+అమ్ములన్= చాలా బాణాలతో; సతురంగ సూతముగన్= గుర్రాలతోను, సారథితోను; రథంబున్= తేరును; ముంచెన్= ముంచి వేశాడు; అది ఎల్లన్= ఆ విధానమంతా (ద్రోణుడి బాణ ప్రయోగ విశేషాలను చూచి చూచి); సేనలు= సైనికులు; అతఁడు పేర్చెన్= ఆ ద్రోణాచార్యుడు అతిశయించాడు; ఈ+మనుజనాథుఁడు= ఈ ధర్మరాజు; చచ్చునొ?= చనిపోవునో?; ఓడి= ఓటమి జెంది; పాఱునో?= పరుగెత్తిపోవునో?; బలిమిన్= బలవంతంగా; తొలంగి= ఆపదతో; పట్టువడి= చిక్కిపోయి; పాడఱి= పాడుబడిపోయి (అనగా నశించి); పోవునొ?= పోవునేమో?; అంచున్+ఉన్న+ఎడన్= అని అనుకొంటూ ఉండగా.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు కోపించి, ధర్మరాజు వింటిని త్రుంచి, పరాక్రమంతో చాలా బాణాలను వేసి గుర్రాలతోను, సూతుడితోను తేరును ముంచాడు. దానినంతా చూచి సేనలు 'ఆచార్యుడు పేట్రేగిపోయాడు. ఈ రాజు (ధర్మరాజు) చస్తాడో, ఓడిపోయి పరుగెత్తుతాడో, బలవంతంగా ఆపదలో చిక్కిపోయి పాడైపోతాడో (అనగా నశించిపోతాడో)' అంటూ ఉన్న సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఒండొక విలు గొని ధర్మ సు । తుం డా నిబిడాస్త్ర సంతతులు రయము మెయిన్
ఖండించి తీవ్ర రశ్ముల । మండెడు ఘనశక్తి వైచె మార్తురు దలఁకన్. 242

ప్రతిపదార్థం: ధర్మసుతుఁడు= ధర్మరాజు; ఒండొక విలు కొని= ఇంకొక వింటిని తీసికొని; ఆ నిబిడ+అస్త్ర సంతతులు= ఆ దట్టమయిన బాణాల గుంపును; రయము మెయిన్= వేగంగా; ఖండించి= త్రుంచివేసి; తీవ్ర రశ్ములన్= భయంకరమైన వెలుగులతో; మండెడు= మండుతూ ఉన్న; ఘనశక్తిన్= గొప్పశక్తి అనే అస్త్రాన్ని; మార్తురు= విరోధులు; తలఁకన్= భయపడే విధంగా; వైచెన్= వేశాడు.

తాత్పర్యం: ఇంకొక వింటితో ధర్మరాజు ఆచార్యుడు వేసిన తీవ్రబాణాల గుంపును శీఘ్రంగా త్రుంచివేసి, వాడి అయిన జ్వాలలతో మండే పెనుశక్తిని, శత్రువులు భయపడేటట్లు ఆయన మీద ప్రయోగించాడు.

సీ. శక్తి యాచార్యు శక్తిని మాయించుఁ బొ । మ్మని చూపఱెల్లను నబ్బు లెత్తి;
రక్కుంభసంభవుఁ డపుడు బ్రహ్మాస్త్ర ప్ర । యోగంబు సేసిన నుగ్రభంగి
నయ్యస్త్ర మాశక్తి నద్భుతంబుగ నేలఁ । గలిపి యుధిష్ఠిరు వలను నిగుడ
నమ్మహీవిభుఁడు బ్రహ్మాస్త్రంబునన యది । యడఁగునట్లుగఁ జేసి, యతని మేన

తే. నైదు దూపులు నాఁటి శరాసనంబుఁ । దునుమ గద గొని వైచె నుద్ధురత నతఁడు
పతియు గదవైవ దత్సన్నిపాత జాత । చటులపావక జ్వాలలు చదల నిగుడ. 243

ప్రతిపదార్థం: శక్తి= ధర్మరాజు వేసిన శక్త్యాయుధం; ఆచార్యుని శక్తినిన్= ద్రోణాచార్యుడు ప్రయోగించిన శక్త్యాయుధాన్ని; మాయించున్ పొమ్ము+అని= తప్పక నాశం చేస్తుంది అని; చూపఱు+ఎల్లను= చూచేవారంతా; అబ్బులు+ఎత్తిరి= మెడలు పైకెత్తారు; బ్రహ్మాస్త్ర

ప్రయోగంబు చేసినన్= బ్రహ్మాస్త్రాన్ని వేయగా; ఉగ్రభంగిన్= భయంకరమైన విధంగా; ఆ+అస్త్రము= ఆ బ్రహ్మాస్త్రం; ఆ శక్తిన్= ధర్మరాజు ప్రయోగించిన శక్తిని; అద్భుతంబుగన్= అబ్బురంగా; నేల కలిపి= నేలపై పడవేసి; యుధిష్ఠిరు వలను= ధర్మరాజు దిక్కునకు; నిగుడన్= పోగా; ఆ+మహీవిభుఁడు= ఆ ధర్మరాజు; బ్రహ్మాస్త్రంబునన్= బ్రహ్మాస్త్రంతోనే; అది అడఁగునట్లుగన్+చేసి= ద్రోణుడి బాణం నశించేటట్లుగా చేసినవాడై; అతని మేనన్= ఆ ద్రోణుని శరీరముపైన; ఐదు తూపులు= ఐదు బాణాలు; నాటి= గ్రుచ్చి; శరాసనంబున్= విల్లును; తునుమన్= త్రుంచి వేయగా; అతఁడు= ఆచార్యుడు; ఉద్ధురతన్= దర్పంతో; గద కొనివైచెన్= గదను తీసికొని కొట్టాడు; పతియున్= ధర్మరాజు కూడా; గద వైవన్= గదతో కొట్టగా; తద్= ఆ గదల యొక్క; సన్నిపాత= కలసుకోవటం (వలన); జాత= పుట్టిన; చటుల= తీవ్రమైన; పావకజ్వాలలు= అగ్నిజ్వాలలు; చదలన్= ఆకాశంలో; నిగుడన్= వ్యాపించగా.

తాత్పర్యం: ధర్మజుడి శక్తి ద్రోణుడి శక్తిని తప్పక నాశం చేస్తుంది అని మెడలు పైకెత్తి అందరూ చూడగా, ఆ ద్రోణుడు బ్రహ్మాస్త్రాన్ని వేసేసరికి అది భయంకరమైన పద్ధతిలో ఆ శక్తిని నేల కూల్చి, యుధిష్ఠిరుడి దిక్కుకు పోతుండగా, ఆ యుధిష్ఠిరుడు బ్రహ్మాస్త్రంతోనే అది నశించి పోయేటట్లు చేసి, ఆచార్యుడి ఒడలిపై ఐదు వాడి తూపులను నాటించి, ఆయన విల్లును త్రుంచి వేశాడు. ఆచార్యుడు గదతో కొట్టాడు. ధర్మరాజు కూడా తన గదను వేయగా ఆ రెండు గదల తాకిడి వలన కలిగిన తీవ్రమైన అగ్నిజ్వాలలు ఆకాశం దాకా వ్యాపించాయి.

వ. ద్రోణుండు కోపించి. 244

తాత్పర్యం: ద్రోణాచార్యుడు కోపపడి.

తే. ధర్మతనయు రథ్యంబుల ధరణిఁ గూల్చి । ధనువుఁ గేతువుఁ దునుమాడి తనువు నొంప
నాతఁ డరదంబు డిగ్గి నిరాయుధుండు । నూర్ధ్వబాహుండు నై యూరకుండె నధిప! 245

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; ధర్మతనయు రథ్యంబులన్= ధర్మరాజు తేరు గుర్రాలను; ధరణిన్+కూల్చి= భూమి మీదికి పడగొట్టి; ధనువున్= వింటిని; కేతువున్= పతాకాన్ని; తునుమాడి= త్రుంచివేసి; తనువున్= ఒడలిని; నొంపన్= బాధించగా; ఆతఁడు= ధర్మరాజు; అరదంబు డిగ్గి= తేరు దిగి; నిరాయుధుండు= ఆయుధాలు లేనివాడు; ఊర్ధ్వబాహుండును+ఐ= చేతులు పైకెత్తినవాడై (అనగా అసహాయతను ప్రకటించి); ఊరకుండెన్= ఊరకున్నాడు.

తాత్పర్యం: ఓ రాజా! ద్రోణుడు ధర్మరాజు తేరు గుర్రాలను పడగొట్టి - వింటిని, పతాకాన్ని త్రుంచివేసి, అతడి శరీరాన్ని బాధించాడు. ధర్మజుడు తేరు దిగి నిరాయుధుడుగా చేతులు పెకెత్తి ఊరకున్నాడు.

క. కనుఁగొని గురుఁ డవ్విభు నే । యను బొడువను చేతులాడ కట పార్శ్వములం
దనచూడ్కిఁ బడిన హయరథ । మనుజ ద్విప సముదయముల మడియించె వెసన్. 246

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యుడు; కనుఁగొని= చూచి (ధర్మరాజు అవస్థను చూచి); ఆ+విభున్= ఆ రాజును(ధర్మజుని); ఏయను= కొట్టటానికి; పొడువను= పోటుదెబ్బ వేయటానికి; చేతులు+ఆడక= చేతులు రాక; అట= అక్కడ; పార్శ్వములన్= ప్రక్కలలో; తన చూడ్కిపడిన= తన చూపునకు తగిలిన; హయరథ మనుజ ద్విపసముదయములన్= గుర్రాల, తేరుల, మనుష్యుల, ఏనుగుల గుంపులను (చతురంగ బలాలను); వెసన్= శీఘ్రంగా; మడియించెన్= నాశనం చేశాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు చూచి ధర్మరాజును కొట్టటానికి, పొడవటానికి చేతులు రాక, ప్రక్కలో తన కంటబడిన చతురంగ బలాలను శీఘ్రంగా చంపాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **పోనీఁడు పొదువుఁ గుంతీ। సూనుని గురుఁ డనుచు నుండ జూపఱగము ల**
మ్మానవపతి యతిరయమున। దా నెక్కెం బాఱి పిన్నతమ్ముని రథమున్. 247

ప్రతిపదార్థం: కుంతిసూనునిన్= ధర్మరాజును; గురుఁడు= ద్రోణుడు; పోనీఁడు= తప్పించుకొని పోనీయడు; పొదువున్= క్రమ్ముకొనును; అనుచున్= అని అంటూ; చూపఱగములు అనుచున్+ఉండన్= చూచేవారు అంటూ ఉండగా; ఆ+మానవపతి= ఆ ధర్మరాజు; అతిరయమునన్= చాల తొందరగా; పాఱి= పరుగెత్తుకొనిపోయి; పిన్న తమ్ముని రథమున్= చిన్న తమ్ముడైన సహదేవుడి తేరుపైకి; తాన్+ఎక్కెన్= తాను ఎక్కాడు.

తాత్పర్యం: అక్కడ చూస్తున్న వారంతా గురుడు ధర్మరాజును పోనీయక పట్టుకొంటాడు - అంటూ ఉండగా ఆ ధర్మరాజు చాలా తొందరగా పరుగెత్తుకొని పోయి చిన తమ్ముడైన సహదేవుడి తేరుపైకి ఎక్కాడు.

వ. **ఇట్లు పాండవాగ్రజుండు సహదేవుని రథం బెక్కి తొలంగం దోలుకొని పోయె; నట్టియెడ.** 248

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు సహదేవుని తేరుమీదికి ఎక్కి ప్రక్కకు పోగా (తేరును తోలుకొని పోయాడు) అప్పుడు.

తే. **క్షేమధూర్తి బృహత్ క్షత్రు శిత శిరముల। నొంచి విలు ద్రుంప నొండు ధనువు రయంబు**
వఱలఁ గొని హయసారథి ధ్వజయుతముగ। నతని మస్తక మిలఁ గూల్చి యార్చె నతఁడు. 249

ప్రతిపదార్థం: క్షేమధూర్తి= క్షేమధూర్తి అనేవాడు; బృహత్ క్షత్రున్= బృహత్ క్షత్రుడిని; శితశరములన్= వాడి బాణాలతో; నొంచి= నొప్పించి; విలు త్రుంపన్= వింటిని త్రుంచివేయగా; అతఁడు= బృహత్క్షత్రుడు; ఒండు ధనువున్= ఇంకొక వింటిని; రయంబు వఱలన్= వేగం ఒప్పగా; కొని= తీసికొని; హయసారథి ధ్వజయుతముగన్= గుర్రాలు, సూతుడు, కేతనములతో; అతని మస్తకము= ఆ క్షేమధూర్తి యొక్క తల; ఇలన్ కూల్చి= భూమిపై పడవేసి అనగా చంపి; ఆర్చెన్= బొబ్బపెట్టాడు (అనగా సింహనాదం చేశాడు).

తాత్పర్యం: క్షేమధూర్తి అనేవాడు బృహత్క్షత్రుడిని వాడి బాణాలతో నొప్పించి వింటిని త్రుంచివేశాడు. ఆతడు వేగంగా ఇంకొక వింటిని తీసికొని, క్షేమధూర్తియొక్క గుర్రాలను, సారథిని, కేతనంతో కూడా అతడి తలను భూమిమీద పడగొట్టి సింహనాదం చేశాడు.

చ. **కడువడి వీరధన్వుఁడు త్రిగర్తులు పొంగఁగ ధృష్టకేతు విల్**
నడిమికిఁ ద్రుంచినన్ మొగమునం దళుకొత్తెడు కెంపు సొంపుతోఁ
జిడిముడిపాటు లేక యతి శీఘ్రమునన్ ఘనశక్తి నాతఁ డె
క్కుడు మద మొప్ప నాన్నృపతిఁ గూలఁగ వైచె సురల్ నుతింపఁగన్. 250

ప్రతిపదార్థం: వీరధన్వుఁడు= కౌరవపక్షపాతి అయిన వీరధన్వుడు అనేవాడు - త్రిగర్త దేశాధీశుడు; త్రిగర్తులు పొంగఁగన్= త్రిగర్తులు సంతోషించగా; ధృష్టకేతువిల్= ధృష్టకేతుడి వింటిని (పాండవ పక్షం వాడిని); నడిమికిన్+త్రుంచినన్= మధ్యకు విరవగా; మొగమునన్= వాడి ముఖంలో; తళుకొత్తెడు= ప్రకాశించే; కెంపుసొంపుతోన్= ఎర్రని అందంతో; చిడిముడిపాటు= తొట్రుపాటు; లేక= కానరాక; అతిశీఘ్రమునన్= మిక్కిలి వేగంగా; ఘనశక్తిన్= గొప్ప శక్త్యాయుధంతో; ఆతఁడు= ధృష్టకేతుడు; ఎక్కుడు మదము+ఒప్పన్= మిక్కిలి గర్వం ప్రకాశించగా; ఆ నృపతిన్= వీరధన్వుడిని; సురలు నుతింపన్= దేవతలు కీర్తించగా; కూలఁగవైచెన్= పడగొట్టాడు (చంపివేశాడు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: త్రిగర్త దేశాలవారు ఉప్పొంగగా వీరధన్వుడు శీఘ్రంగా ధృష్టకేతుడి వింటిని నడిమికి రెండుగా త్రుంచాడు. అది అతడి మొగానికి కెంపుసొంపుల తళుకులను కూర్చింది. తొట్రుపాటు లేక శీఘ్రంగా పెద్దశక్త్యాయుధంతో వాడి గర్వ మణగేటట్లుగా పడగొట్టాడు. అందుకు దేవతలు కీర్తించారు.

వ. సహదేవుండును మగిడివచ్చి దుర్ముఖునిం దలపడి దోర్విలాసంబు మెఱయం బోరి పోరి. 251

ప్రతిపదార్థం: సహదేవుండును; మగిడివచ్చి= మరల వచ్చి; దుర్ముఖునిన్; తలపడి= ఎదుర్కొని; దోస్+విలాసంబు= భుజముల విలాసము - భుజ పరాక్రమమం; మెఱయన్= ప్రకాశించగా; పోరిపోరి= యుద్ధం చేసి చేసి;

తాత్పర్యం: సహదేవుడును తిరిగి వచ్చి (ద్రోణుడి దెబ్బలకు అలసిన ధర్మజుడిని దూరంగా తీసికొనిపోయి తిరిగివచ్చి) దుర్ముఖుడిని ఎదుర్కొని భుజబలం ప్రకాశించగా యుద్ధం చేసి చేసి.

ఉ. కేతువుఁ గూల్చి, రథ్యములఁ గీటడఁగించి, శరాసనంబుతో
సూతుని కంఠముం దునిమి, స్రుక్కఁగ నంగము బాణపంచక
స్యూతము నేయ నీదు తనయుం డరిగెన్ నిరమిత్రుతేరిపై
కాతత సంభ్రముం డయి రయంబున బాండవ సైన్య ముబ్బఁగన్. 252

ప్రతిపదార్థం: కేతువున్ కూల్చి= పతాకాన్ని పడగొట్టి; రథ్యముల= గుర్రాలను; కీటు+అడఁగించి= చంపి; శరాసనంబుతోన్= వింటితో; సూతున్= సారథియొక్క; కంఠమున్+తునిమి= గొంతు కత్తిరించి; అంగము స్రుక్కఁగన్= ఒడలు బాధపడగా; బాణపంచక స్యూతమున్= ఐదు బాణాలతో కుట్టబడినట్లుగా; ఏయన్= కొట్టగా; నీదు తనయుండు= నీ కుమారుడు; నిరమిత్రు తేరిపైన్= త్రిగర్త రాజకుమారుడైన నిరమిత్రుడనే వాడి తేరిమీదికి; ఆతత సంభ్రముండు+అయి= ఎక్కువైన తొందరతో కూడినవాడై; రయంబునన్= వేగంగా; పాండవసైన్యము+ఉబ్బఁగన్= పాండురాజు సైన్యం సంతోషించగా; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: నీ కుమారుడైన దుర్ముఖి కేతువును పడగొట్టి, రథపు గుర్రాలను చంపి, వింటిబద్దతో సారథి గొంతును త్రుంచి, శరీరం బాధపడగా ఐదు బాణాలను గుదికూర్చి కుట్టినట్లు వేశాడు. అప్పుడు దుర్ముఖి త్రిగర్తరాజు కుమారుడైన నిరమిత్రుడి తేరిమీదికి వెళ్ళాడు. అది పాండవ సైన్యానికి సంతోషం కలిగించింది.

వ. అంత నిలువక. 253

తాత్పర్యం: అంతటితో ఆగకుండా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. తఱిమి సహదేవుఁ డా త్రిగర్త క్షితీశ । తనయుఁ డగు నిరమిత్రునిఁ దునిమి యొప్పె
ఖరుని తలఁ ద్రెవ్వనేసి రాఘవుఁడు మెఱయు । తెఱఁగు దోఁప నీసేనకు వెఱపు గదుర. 254

ప్రతిపదార్థం: ఖరుని తలన్= ఖరాసురుడి తలను; త్రెవ్వన్+ఏసి= తెగి కిందపడేటట్లుగా కొట్టి; రాఘవుఁడు= శ్రీరామచంద్రుడు; మెఱయు తెఱఁగు= ప్రకాశించే విధానం; తోఁపన్= తెలిసేటట్లుగా; నీ సేనకున్= నీ సైన్యానికి; వెఱపు కదురన్= భయం కలుగగా; సహదేవుఁడు; ఆ త్రిగర్త క్షితీశ తనయుఁడు= ఆ త్రిగర్త దేశపు రాజకుమారుడు; అగు= అయినటువంటి; నిరమిత్రునిన్= నిరమిత్రుడనే వాడిని; తఱిమి= తరుముకొని పోయి; తునిమి= చంపి; ఒప్పెన్= రాణించాడు.

తాత్పర్యం: సహదేవుడు నిరమిత్రుడిని తరిమి చంపటం, శ్రీరామచంద్రుడు ఖరాసురుడి తల త్రుంచి ప్రకాశించినట్లుగా ఉన్నది. ఆ దృశ్యం నీ సైన్యానికి భయాన్ని కలిగించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. నకులునిఁ దాఁకి వికర్ణుం । డొకపరి యైనను బెనంగ నోపక తిరిగెన్
సకల బలముఁ జూడఁగ ఱా । తికిఁ బైకొని యడరి తగరు దెరలిన మాడ్కిన్. 255

ప్రతిపదార్థం: వికర్ణుండు= కౌరవులలో చిన్నవాడు; నకులునిన్ తాఁకి= నకులుడిని ఎదుర్కొని; ఒకపరి ఐనను= ఒక్కమారైనను; పెనంగన్+ఓపక= యుద్ధం చేయలేక; సకల బలమున్ చూడఁగన్= సైన్యమంతా చూస్తుండగా; ఱాతికిన్= పెద్దరాయిపైకి; పైకొని= ఎదుర్కొని పోయి; అడరి= విజృంభించి; తగరు= పొట్టేలు; తెరలిన మాడ్కిన్= తిరిగి పోయినట్లు; తిరిగెన్= వెన్నిచ్చిపోయాడు.

తాత్పర్యం: వికర్ణుడు నకులుని ఎదుర్కొని ఒక్కసారి కూడ యుద్ధం చేయలేక, పెద్ద రాతిని ఎదుర్కొని వెను తిరిగిన పొట్టేలువలె తన సైన్యమంతా చూస్తుండగా తిరిగిపోయాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. వ్యాఘ్రదత్తుండు సాత్యకి నస్త్రవృష్టి । ముంచె ముంచిన నతఁడు కోపించి సూతుఁ
జదిపి హయములఁ బొరి గొని చటులవృత్తి । జంపె నమ్మగధ క్షితీశ్వరుకుమారు. 256

ప్రతిపదార్థం: వ్యాఘ్రదత్తుండు= వ్యాఘ్రదత్తుడనేవాడు; సాత్యకిన్= సాత్యకిని; అస్త్రవృష్టిన్= అంపవానలో; ముంచెన్= ముంచాడు; ముంచినన్= ముంచగా; అతఁడు= ఆ సాత్యకి; కోపించి; సూతున్= సారథిని; చదిపి= చంపి; హయములన్= గుర్రాలను; పొరిగొని= చంపి; చటులవృత్తిన్= తీవ్రంగా; ఆ+మగధ క్షితీశ్వరు కుమారున్= ఆ మగధరాజు కుమారుడిని; చంపెన్= చంపాడు.

తాత్పర్యం: వ్యాఘ్రదత్తుడు సాత్యకిని అంపవానలో ముంచాడు. అట్లా ముంచగా ఆతడు కోపించి, అతడి సారథిని, గుర్రాలను సంకుల సమరంలో సంహరించి అతడినీ చంపాడు.

వ. శలుండును ద్రౌపదీపుత్రుల నేవుర నైదైదు బాణంబుల నేసి; మఱియును మార్గణ నికరంబులు నిగిడింపం జలింపక
వా రా సొమదత్తి నొక్కుమ్మడిం జుట్టుముట్టిన నతం డందఱ కన్నిరూపులై యేపునం బెనంగుచుండ 257

ప్రతిపదార్థం: శలుండును, ద్రౌపదీ పుత్రులన్= ఉపపాండవులను; ఏవురన్= ఐదుగురిని; ఐదైదు బాణంబులన్= అయిదేసి బాణాలతో; ఏసి= కొట్టి; మఱియును= ఇంకను; మార్గణ నికరంబులు= బాణాల గుంపును; నిగిడింపన్= వేయగా; వారు= ఆ ఉపపాండవులు; చలింపక= జంకకుండా; ఆ సొమదత్తిన్= సోమదత్తుడి కుమారుడైన ఆ శల్యుడిని; ఒక్క+ఉమ్మడిన్= ఒక్కసారిగా; చుట్టుముట్టినన్= చుట్టుముట్టగా; అతండు= ఆ సొమదత్తి; అందఱకున్= ఉపపాండవులందరికి; అన్ని రూపులై= అన్ని ఆకారాలతో; ఏపునన్= దట్టంగా; పెనంగుచుండన్= పోట్లాడుతుండగా.

తాత్పర్యం: శల్యుడు ఉపపాండవులు ఐదుగురిని ఒక్కొక్కరిని అయిదేసి బాణాలతో కొట్టి, ఇంకా బాణాల సమూహాన్ని సంధించగా ఆ ఉపపాండవులు చలించకుండా సొమదత్తిని ఒక్కసారిగా కమ్ముకొనగా, అతడువారి కందరికీ అన్ని ఆకారాలతో కనబడుతూ గొప్పగా యుద్ధం చేశాడు.

చ. హరిసుతసూతి మావుల, బకాంతక సూనుఁడు చాపమున్, యుధి
ష్ఠిర తనయుండు గేతువు గడింది మగంటిమిఁ ద్రుంప సూతునిం
బొరిగొనియెన్ వెసన్ నకులపుత్రకుఁ; డిమ్మెయి జిక్కువడ్డఁ జె
చ్చెర సహదేవ నందనుఁడు సేసె శిరంబును మేను వేఱుగన్. 258

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: హరిసుతసూతి= ఉపపాండవులలో అర్జునుడి కుమారుడు; మావులన్= గుర్రాలను; బకాంతక సూనుఁడు= భీముడి కుమారుడు; చాపమున్= విల్లును; యుధిష్ఠిర తనయుండు= ధర్మరాజు కుమారుడు; కేతువున్= ధ్వజమును; కడింది మగంటిమిన్= గొప్ప శౌర్యంతో; త్రుంపన్= త్రుంచివేయగా; వెసన్= వెంటనే; నకుల పుత్రకుఁడు= నకులుడి కుమారుడు; సూతునిన్= సారథిని; పొరిగొనియెన్= చంపాడు; ఈ+మెయిన్= ఈ విధంగా; చిక్కువడ్డన్= చిక్కులో పడగా; సహదేవనందనుఁడు= సహదేవుడి కుమారుడు; చెచ్చెరన్= శీఘ్రంగా; శిరంబును మేనున్= తలనూ, శరీరాన్ని; వేఱుగన్ చేసెన్= వేరయ్యేటట్లుగా చేశాడు.

తాత్పర్యం: ఉపపాండవులు శలుడిని చట్టుముట్టారు. వారిలో అర్జునుడి కుమారుడు గుర్రాలను, భీముడి కుమారుడు వింటిని, ధర్మరాజు కుమారుడు ధ్వజాన్ని - గొప్ప దర్పంతో త్రుంచగా, నకులుడి కుమారుడు చాలా వేగంగా సూతుడిని చంపివేశాడు. వాడు (సౌమదత్తి) చిక్కుపడగా సహదేవుడి కుమారుడు శీఘ్రంగా అతడి తలనూ శరీరాన్ని వేరు చేశాడు.

సీ. **వెస మారుతియు నలంబుసుఁడును బోరుచో। నద్దానవేంద్రుని యంప బలువు**
చేత నతండు మూర్ఛిల్లి యాలోనన। తెలిసి కాటుకకొండ పొలుపు గెలుచు
నాతని మేను పెల్లలరిన మోదువు। తెఱఁగుగాఁ జేసిన నుఱక వాఁడు
మాయా విలాసోగ్ర కాయంబు గైకొని। యఖిల దిక్కులఁ దోఁచి నిఖిలబలము

తే. **నుఱిపి నెత్తురు టేఱులు వఱపి 'భీమ। సేన! మా యన్న బకుని నా లేనిచోట**
నట్లు సేసితి గాక, నీ యలవుఁ జలము। నింక మెఱయంగ వచ్చునె యేను గలుగ?'. 259

ప్రతిపదార్థం: వెసన్= శీఘ్రంగా; మారుతియున్= భీముడును; అలంబుసుఁడున్= అలంబుసుడున్నూ; పోరుచోన్= యుద్ధం చేసేటప్పుడు; ఆ+దానవ+ఇంద్రుని= ఆ రాక్షసరాజు యొక్క; అంపబలువుచేతన్= బాణాల బలానికి; అతఁడు= భీముడు; మూర్ఛిల్లి= మూర్ఛపోయి; ఆలోనన= అంతలోనే; తెలిసి= తెలివి దెచ్చుకొని; కాటుక కొండ= నల్లని కాటుక వంటి కొండయొక్క; పొలుపున్= సొగసును; గెలుపు= జయించే; ఆతని మేనున్= ఆ అలంబుసుడి శరీరాన్ని; పెల్లు= గొప్పగా; అలరిన= చిగిర్చిన; మోదువు తెఱఁగుగాన్ చేసినన్= మోదుగు చెట్టు మాదిరిగా చేయగా (అనగా ఒంటినిండా గాట్లు అయ్యేటట్లుగా చేసి నెత్తురు చిందుతూ ఉంటే నల్లని శరీరంమీద ఆ నెత్తుటి గుర్తు పూచిన మోదుగు చెట్టు మాదిరిగా ఉన్నది); ఉఱక= లెక్కబెట్టక; వాఁడు= ఆ అలంబుసుడు; మాయావిలాస= మోసపు ఆటతో; ఉగ్రకాయంబు గైకొని= భయంకరమైన శరీరాన్ని పొంది; అఖిల దిక్కులన్+తోఁచి= అన్ని దిక్కులలోను కానబడి; నిఖిల బలము= సైన్యాన్నంతటినీ; ఉఱిపి= నాశనం చేసి; నెత్తురు ఏఱులు పఱపి= నెత్తురు నదులు ప్రవహింపజేసి; భీమసేనా!= ఓ భీమా!; నా లేని చోటన్= నేను లేని చోట; మా అన్న= నా కన్నగారు అయిన బకాసురుని; అట్లు+చేసితి గాక= ఆ విధంగా చేశావు గాక (అట్లా చంపావు గాక); నీ అలవున్ చలమున్= నీ బలం, పట్టుదల; ఏను+కలుగన్= నే నుండగా; ఇంకన్ మెఱయంగ వచ్చునె?= ఇంకా ప్రకాశింపగలదా?

తాత్పర్యం: ఆ సమయంలో భీముడు అలంబుసుడు యుద్ధం చేస్తుండగా ఆ రాక్షసరాజు బాణాలబలంవలన భీముడు మూర్ఛపోయి, అంతలోనే ఒడలు తెలిసి, కాటుకకొండ అందాన్ని జయించే నల్లని ఒడలు ఉండే ఆ రాక్షసుడి శరీరంమీద బాణాలు ప్రయోగించి, అది బాగా పూచిన మోదుగుచెట్టు మాదిరి కానవచ్చేటట్లు చేశాడు (నెత్తురు చిందేటట్లుగా దెబ్బలు కొట్టాడు). వాడు కూడా అది లెక్కపెట్టకుండా మోసపు క్రీడగా భయంకరమైన శరీరాన్ని పొంది, అన్ని దిక్కులలోను కనబడి సమస్త సైన్యాన్ని నులిపివేసి నెత్తురు ఏరులు ప్రవహింపచేసి, పరవుతూ 'ఓ భీమసేనా! మా అన్న బకాసురుడిని నేను లేనప్పుడు అట్లా చంపావు. ఇప్పుడు నే నున్నాను. నీ బలం, పట్టుదల ఇంక ప్రకాశించలేవు'.

తే. **అనిన విని కెంపు గనుఁగవ నడరఁ గినిసి । యుజ్జ్వల త్వష్ట్ర బాణప్రయోగమునఁ బ్ర**
భంజనాత్మజుఁ డమ్మాయ వాయఁజేసి । తఱిమి యేసి యారక్కసుఁ బఱపె నధిప! 260

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! - ధృతరాష్ట్రా!; అనినన్ విని= అలంబుసుడు అనగా విని; కనుఁగవన్= కనుదోయిలో; కెంపు= కోపం వలన కలిగే ఎర్రదనం; అడరన్= అతిశయించగా; కినిసి= కోపించి; ఉజ్జ్వల= బాగా మండే; త్వష్ట్ర బాణప్రయోగమునన్= బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించటంతో; ప్రభంజన+ఆత్మజుఁడు= వాయుదేవుడి కుమారుడైన భీముడు; ఆ+మాయన్= ఆ మోసాన్ని; పాయన్+చేసి= తొలగించి; ఆ రక్కసున్= ఆ రాక్షసుడిని; తఱిమి ఏసి= తరిమికొట్టి; పఱపెన్= పడవేశాడు.

తాత్పర్యం: ఓ రాజా! అలంబుసుడి మాటలు విని, కోపంతో ఎర్రబడ్డ కళ్ళతో భీమసేనుడు మండే బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి ఆ రాక్షసుడిని తరిమికొట్టాడు.

వ. **ఇవ్విధంబున మనదిక్కునఁ జేయంగల దొరల చావును, నోటమియుం జూచి మూఁకలు గలంగినం గుంభసంభవుండు రోషసంరక్త లోచనుం డై తలకడచి సాత్యకి ప్రముఖ పాండవపక్షవీరులఁ గ్రూరనారాచ నిచయంబుల నిలువరించి నెఱయం బొలిచి నిలిచి మెఱయుటయును. 261**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; మన దిక్కునన్= మన పక్షాన; చేయన్+కల దొరల= చేయనున్న వీరుల; చావును ఓటమియు= చనిపోవటం, ఓడిపోవటం; చూచి; మూఁకలు= సైన్యాలు; కలంగినన్= కలత చెందగా; కుంభసంభవుండు= ద్రోణుడు; రోషసంరక్త లోచనుండు+ఐ= కోపం వలన ఎర్రబారిన కనులతో; తలకడచి= ముందుకు సాగి; సాత్యకి ప్రముఖ పాండవ పక్షవీరులన్= సాత్యకి మొదలైన పాండవుల దిక్కులోనున్న మొనగాండ్రయిన వీరులను; క్రూరనారాచనిచయంబులన్= క్రూరమైన వాడి బాణాల సమూహంతో; నిలువరించి= ఆపి; నెఱయన్= వ్యాపింపజేస్తూ; పొలిచి నిలిచి= ప్రకాశించి నిలబడి; మెఱయుటయును= విజృంభించటమున్నూ.

తాత్పర్యం: (ఓరాజా!) ఈ విధంగా మన పక్షాన ఉన్న చేవగల రాజుల చావును, ఓటమినీ చూచి సైన్యాలు చెదరిపోగా ద్రోణుడు గమనించి, కోపంతో ఎర్రబడ్డ కనులు కలవాడై ముందుకుసాగి, సాత్యకి మొదలైన వీరులపై దాడిచేసి, వాడి బాణాల సమూహంతో వారిని నిలిపి విజృంభించాడు.

చ. **తఱిమి ఘటోత్కచుండు బలదర్పము లేర్పడ ద్రోణుమీఁద నే**
డ్తెఱ నడతేరఁ గాంచి చనుదెంచి యలంబుసుఁ డమ్మహాసురుం
గుఱియుఁగఁ జేసి శాతశరకోటికి నడ్డము సొచ్చు సాత్యకిం
బిఱిఁదికిఁ ద్రోఁచి యద్దనుజు భీమతనూజుఁడు నొంచె నమ్ములన్. 262

ప్రతిపదార్థం: ఘటోత్కచుండు= భీముడి కొడుకైన ఘటోత్కచుడు; తఱిమి= తరుముకొని వచ్చి; బలదర్పములు+ఏర్పడన్= బలం, అహంకారం స్పష్టం కాగా; ద్రోణుమీఁదన్= ద్రోణాచార్యుడి మీద; ఏడ్తెఱన్= పరాక్రమంతో; నడతేరన్= నడచి రాగా; కాంచి= చూచి; అలంబుసుఁడు= అలంబుసుడు అనే రాక్షసుడు; చనుదెంచి= వచ్చి; ఆ+మహా+అసురున్= ఆ గొప్పరాక్షసుడిని; గుఱియుఁగన్ చేసెన్= బాణాలకు లక్ష్యమయ్యేటట్లుగా చేశాడు (అనగా కొట్టాడు); అడ్డము చొచ్చు= అడ్డంగా వచ్చే (ఘటోత్కచుడికి దెబ్బ తగలకుండా అడ్డంగా వచ్చే); సాత్యకిన్= సాత్యకిని; భీమ తనూజుఁడు= భీముడి కుమారుడైన ఘటోత్కచుడు; పిఱిఁదికిన్+త్రోఁచి= వెనక్కు త్రోసి; ఆ+దనుజున్= ఆ అలంబుసుడిని; అమ్ములన్= బాణాలతో; నొంచెన్= బాధించాడు.

తాత్పర్యం: తన బలదర్పాలు స్పష్టం కాగా ఘటోత్కచుడు ద్రోణుని మీదికి రావటం చూచి అలంబుసుడు ఘటోత్కచుడిని వాడి బాణాలకు గురి అయ్యేటట్లుగా చేశాడు. దానిని అడ్డుకోవటానికి వచ్చే సాత్యకిని వెనుకకు త్రోసి, ఘటోత్కచుడు ఆ రాక్షసుడిని బాణాలతో నొప్పించాడు.

అలంబుసుండు ఘటోత్కచునితో యుద్ధము సేసి చచ్చుట (సం. 7-84-1)

తే. భూరి చక్రంబు వెస నలంబుసుఁడు వైవఁ। బెలుచ గద వైచి పొడి సేసె భీమసుతుఁడు
కడుఁదురులు గవిసి కఱచు కరణి యయ్యె। మూఁక నత్తునియలు వెసఁ దాఁకు నపుడు. 263

ప్రతిపదార్థం: అలంబుసుఁడు= అలంబుసుడు; వెసన్= శీఘ్రంగా; భూరి= పెద్దదయిన; చక్రంబు వైవన్= పెద్ద చక్రంవంటి ఆయుధాన్ని వేయగా; భీమసుతుఁడు= భీముడి సుతుడైన ఘటోత్కచుడు; పెలుచన్= అనాయాసంగా; గద వైచి= గదను వేసి; పొడిచేసెన్= ఆ చక్రాయుధాన్ని చూర్ణం చేశాడు; ఆ+తునియలు= ఆ చక్రాయుధపు ముక్కలు; మూఁకన్= సైన్యాన్ని; వెసన్= శీఘ్రంగా; తాఁకునపుడు= తగిలేటప్పుడు; కడుఁదురులు= కందిరీగలు; కవిసి= క్రమ్ముకొని; కఱచు కరణి= కరిచేవిధం; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: అలంబుసుడు ఒక పెద్ద చక్రాయుధాన్ని వేయగా, ఘటోత్కచుడు దానిని పెద్ద గదతో పొడి చేశాడు. ఆ తునిగిన చక్రాయుధపు పొడి సైన్యాన్ని శీఘ్రంగా తాకేటప్పుడు కందిరీగలు క్రమ్ముకొని కుట్టినట్లు అయింది.

విశేషం: అలం: ఉపమ.

క. ఆ చక్రం బ ట్లయిన ని। శాచరపతి వివిధ శక్తిజాలము వఱపం
జూచి ఘటోత్కచుఁ డది వ। మ్మై చెడ నర్ధేందుశరచయం బడరించెన్. 264

ప్రతిపదార్థం: ఆ చక్రంబు+అట్లయినన్= ఆ చక్రం ఆ విధంగా కాగా (పొడి కాగా); నిశాచరపతి= రాక్షసరాజైన అలంబుసుడు; వివిధ శక్తిజాలమున్= అనేక రకాలయిన బలం కల మాయలను; వఱపన్= వేయగా; చూచి; ఘటోత్కచుఁడు= ఘటోత్కచుడు; అది= ఆ మాయాజలం; వమ్ము+ఐ చెడన్= వృథా అయిపోగా; అర్ధ+ఇందు శరచయంబు= అర్ధచంద్రాకారంగల బాణాల గుంపును; అడరించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: ప్రయోగించిన చక్రం వ్యర్థమై పోగా అలంబుసుడు పలురకాలయిన మాయలను ప్రయోగించాడు. ఆ మాయలు వృథా అయిపోయేటట్లు ఘటోత్కచుడు అర్ధచంద్రబాణాల సమూహాన్ని ప్రయోగించాడు.

వ. ఇట్లు దొడంగి యయ్యిరువురు దానవేశ్వరులును. 265

తాత్పర్యం: ఆ ఇద్దరు రాక్షసరాజులు ఆ విధంగా పూనుకొని.

మ. బహుహేతి ప్రకరంబులన్ బహువిధోపాయంబులన్ విస్ఫుర
ద్బహు మాయాకృత రూపజాలముల శుంభద్వీర సంరూఢిమై
మహి యల్లాడఁగఁ బోరఁ బాండుతనయుల్ మాత్సర్యధుర్యాత్ము లై
సహితోద్యోగత నయ్యలంబుసు శరచ్ఛన్నాంగునిం జేసినన్. 266

ప్రతిపదార్థం: బహుహేతి ప్రకరంబులన్= అనేక రకాలైన ఆయుధాలతో; బహువిధ+ఉపాయంబులన్= ఎన్నో మాయలతో; విస్ఫురత్= స్పష్టమైన; బహు మాయాకృత రూప జాలములన్= పెను మాయలతో కూడిన మాయ వేషాలతో; శుంభత్+వీర సంరూఢిమైన్= భయంకరమైన వీర లక్షణంతో; మహి+అల్లాడఁగన్= భూమి వణకగా; పోరన్= యుద్ధంలో; పాండు తనయులు=

ఉపపాండవులు; మాత్సర్య ధుర్యాత్ములై= అసూయతో నిండుకొన్న మనస్సు కలవారై; సహిత ఉద్యోగతన్= కూడిన ప్రయత్నంతో; ఆ+అలంబుసున్= ఆ అలంబుసుడిని; శరచ్ఛన్న+అంగునిన్+చేసినన్= బాణాలతో కప్పబడిన శరీరం కలవాడినిగా చేయగా.

తాత్పర్యం: పెక్కురకాలయిన ఆయుధాలతో, నానావిధ ఉపాయాలతో, ఎన్నో మాయాజాలాలతో భూమి అల్లాడగా అమిత దర్పంతో ఆ యిద్దరు యుద్ధం చేయగా, ఉపపాండవులు ప్రతీకారం నిండుకొన్న మనసులతో, అలంబుసుడి, శరీరాన్ని బాణాలతో కప్పివేయగా.

సీ. **అతఁడు మాయాబలోద్ధతి నా శరావలి । మొఱఁగి దావానల ముక్త మైన**
కరి విధంబున మ్రోఁగి యిరువదేనమ్ముల । ననిలజు, ధర్మనందను మూఁట,
సహదేవు ద్రౌపదీ సంభవులను హిడిం । బాసుతు నైదైదు బాణములను,
నకులు దెబ్బది మూఁటఁ, బ్రకట విక్రమ మొప్ప । నేసి యార్చిన, నల్గి యింతవట్టు

తే. **రథికవరులును గిట్టి మార్గణ చయంబు । లొక్కమొగిఁ దొరఁగింప వాఁ డుఱక యేటు**
లాడఁ గదిసి ఘటోత్కచుఁ డతని సూతుఁ । ద్రుంచి యరదంబు రూ పడఁగించె నధిప! 267

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! - (ధృతరాష్ట్రా!); అతఁడు= ఆ అలంబుసుడు; మాయాబల+ఉద్ధతిన్= మాయాబలం యొక్క దర్పంతో; ఆ శర+ఆవలిన్= ఆ బాణాల వరుసను; మొఱఁగి= మోసంచేసి; దావానల= కార్చిచ్చు నుండి; ముక్తము+ఐన= వదలబడిన కరివిధంబునన్= ఏనుగు మాదిరి; మ్రోఁగి= శబ్దం చేసి (ఘీంకారం చేసి); ఇరువది+ఏనమ్ములన్= ఇరవై అయిదు బాణాలతో; అనిలజున్= భీముడిని; ధర్మనందనునిన్= ధర్మరాజును; మూఁటన్= మూడింటితోను; సహదేవున్= సహదేవుడిని; ద్రౌపదీ సంభవులను= ఉపపాండవులను; హిడింబాసుతున్= ఘటోత్కచుడిని; ఐదైదుబాణములను= అయిదైదు బాణాలతోను; నకులున్= నకులుడిని; డెబ్బదిమూఁటన్= డెబ్బయిమూడు బాణాలతో; ప్రకటవిక్రమము+ఒప్పన్= శౌర్యం తెలియగా; ఏసి= కొట్టి; ఆర్చినన్= అరువగా (సింహనాదం చేయగా); అల్గి= కోపించి; ఇంతవట్టు= ఇంతమాత్రం; రథికవరులును= సేనానులును; కిట్టి= సమీపించి; మార్గణ చయంబులు= అంపసమూహాన్ని; ఒక్క మొగిన్= ఒకే వరుసగా (మొత్తంగా); తొరఁగింపన్= ఏయగా; వాఁడు= ఆ అలంబుసుడు; ఉఱక= లక్ష్యపెట్టక; ఏటులు+ఆడన్= కొట్టగా; కదిసి= దగ్గరగా చేరి; ఘటోత్కచుఁడు= ఘటోత్కచుడు; అతని సూతున్+త్రుంచి= ఆ అలంబసుడి సారథిని చంపి; అరదంబున్= తేరును; రూపు+అడఁగించెన్= నాశనం చేశాడు.

తాత్పర్యం: అలంబుసుడు తన మాయాజాలంతో ఆ బాణాలను తప్పించుకొని, కార్చిచ్చు నుండి వెలువడిన ఏనుగు మాదిరిగా, ఘీంకరిస్తూ, భీముడిని ఇరవై అయిదు బాణాలతోను, ధర్మరాజును మూడు బాణాలతోను, ఉపపాండవులనూ, సహదేవుడినీ, ఘటోత్కచుడినీ ఇరువది అయిదు బాణాలతోను, నకులుని డెబ్బది మూడు బాణాలతోను తన దర్పం తెలిసేటట్లుగా కొట్టి సింహనాదం చేశాడు. దీనికి కోపించి సేనానులు వాడిని ఎదుర్కొని ఒక్క వరుసన బాణాలు వేయగా, వాడు వారిని లక్ష్యపెట్టక కొట్టుతుండగా, ఘటోత్కచుడు అతడికి దగ్గరగా చేరి సారథినీ, గుర్రాలనూ, తేరునూ నాశనం చేశాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. **ఇట్లు విరథుం డయి యలంబుసుం డిలకు లంఘించి మాయ గైకొని సాయకాసారంబు ఘోరంబుగాఁ గురిసిన నమ్మారుతి సుతుండును దేరు డిగ్గి యగ్గలం బగు మాయాకృతమార్గణ జాలంబున నది దూలించి గదవైచిన, నక్కిమ్మీరానుజుండు పీడితుండై ఖడ్గంబు గొని గగనతలంబున కెగయుటయు, హిడింబ కొడుకును గృపాణపాణి యై తోడన యెగసె; నయ్యిరువురును సుడిగాడ్పునం దొడరి తిరుగుడు మొగిళ్ళ చాడ్పున నొప్పి యెరకుఁ బెనంగు డేగల చందంబునఁ జిత్రగతులం బోరి పోరి భూతలగతులై యుబ్బునం**

దలపడిన బెబ్బులుల కరణి నొండొరుల మేనులు నెత్తుట జొత్తిల్లం జేసి పాసి యొకళ్ళొకళ్ళ కంఠంబులు లక్ష్యంబుగాఁ గరవాలంబులు వైవ, నవి యొండొకటం దాఁకి మండుచు మహిం బడిన, మల్లయుద్ధ సన్నద్ధులై కిట్టుచుంబట్టుచు, బాయుచు వ్రేయుచు నొడుచుచుం బొడుచుచు మఱియు ననేక ప్రకారంబుల వీరత్వంబును విశారదత్వంబును సేనలకు వెఱఁగు పుట్టింపం బోరాడి; రట్టియెడ బకావరజుండు డస్సినం బవమాన పౌత్త్రుండు పడవైచి, తాను మీఁదై జానుకూర్పర ముష్టి ఘాతంబులు నిర్ఘాత పాతంబులుం బోలెఁ బ్రయోగించి నొప్పించి యతని తొడలు నెమ్ములు నొక్కుమ్మడిం బొడి పొడి సేసి నుఱిపిడికిం జొచ్చిన ప్రబల హాలికుని లీల నేలం బెట్టి కాలం జమరి చంపి పొంపిరివోవు మగంటిమిం బేర్చి యార్చినం బాండవ బలంబుల సింహనాదంబులుఁ దూర్యనినదంబులున్ జెలంగె నప్పుడా ఘటోత్కచుండు ధర్మనందనున కభివందనంబు సేసిన, నతండు సంతుష్టాంతరంగుండై యాలింగనంబును మూర్ధాఘ్రాణంబును జేసి యగ్గించె' ననిన విని యాంబికేయుండుసంజయున కిట్లనియె. 268

ప్రతిపదార్థం: ఇట్లు విరథుండు+అయి= ఈ విధంగా తేరు లేని వాడై; అలంబుసుఁడు= అలంబుసుడనే వాడు; ఇలకున్ లంఘించి= భూమిమీదకు దూకి; మాయగైకొని= మోసమైన వేషాన్ని పొంది (ఇంద్రజాలికుడి మాదిరి); సాయకా సారంబున్= బాణాల జడివానను; కురిసినన్= కురిపించగా; ఆ+మారుతి సుతుండును= ఆ భీమసేనుడి కుమారుడైన ఘటోత్కచుడును; తేరు డిగ్గి= తన తేరు నుండి దిగి; అగ్గలంబు+అగు= ఎక్కువైన; మాయాకృత= మోసంచేత చేయబడిన; మార్గణజాలంబునన్= బాణ సమూహంతో; అది= ఆ అలంబుసుడి మాయను; దూలించి= ఎగురగొట్టి; గదవైచినన్= గదతో కొట్టగా; ఆ+కిమ్మీర+అనుజుండు= ఆ కిమ్మీరుడి తమ్ముడు; పీడితుండు+ఐ= బాధపెట్టబడి; ఖడ్గంబు కొని= కత్తి తీసికొని; గగనతలంబునకున్= ఆకాశానికి; ఎగయుటయున్= ఎగురుటయు; హిడింబకొడుకును= హిడింబ కుమారుడైన ఘటోత్కచుడును; కృపాణపాణి ఐ= కత్తి చేతగలవాడై; తోడన= వెంటనే; ఎగసెన్= పైకి ఎగిరాడు; ఆ+ఇరువురును= ఆ ఇద్దరును; సుడిగాడ్పునన్= సుడిగాలిలో; తొడరి= ఎదుర్కొని; తిరుగుడు పడు= సుళ్ళు తిరిగే; మొగిళ్ళ చాడ్పునన్= మేఘాల మాదిరిగా; ఒప్పి= తగి; ఎరకున్= ఆహారానికై; పెనంగు= పోట్లాడే; డేగల చందంబునన్= డేగల మాదిరి; చిత్రగతులన్= అనేక విధాలైన కదలికలతో; పోరిపోరి= పోట్లాడి, పోట్లాడి; భూతలగతులు+ఐ= భూమి మీదకు దూకి; ఉబ్బునన్= ఉత్సాహంతో; తలపడిన= ఎదుర్కొన్న; బెబ్బులుల కరణిన్= పెద్ద పులుల మాదిరి; ఒండొరుల మేనులు= ఒక్కొక్కరి శరీరాలు; నెత్తుటన్= నెత్తురులో; జొత్తిల్లన్= ఎర్రబడగా; చేసి= చేసి; పాసి= తప్పుకొని; ఒకళ్ళొకళ్ళ కంఠంబులు= ఒకడు మరియొకడి కుత్తుకను; లక్ష్యంబుగాన్= లక్ష్యంగా; కరవాలంబులు వైవన్= కత్తులు విసరగా; అవి= ఆ కత్తులు; ఒండొకటిన్+తాఁకి= ఒకదానిని ఇంకొకటి తాకి; మండుచున్= మంటమండుతూ; మహిన్+పడినన్= భూమిమీద పడగా; మల్లయుద్ధ సన్నద్ధులు+ఐ= మల్లయుద్ధానికి సిద్ధపడి; కిట్టుచున్= దగ్గరకు చేరుతూ; పట్టుచున్= ఒకరినొకరు పట్టుకొనుచు; పాయుచున్= దూరంగా పోతూ; వ్రేయుచున్= కొట్టుతూ; ఒడుచుచున్= ఓడిస్తూ; పొడుచుచున్= పోటు పొడుస్తూ; మఱియు అనేక ప్రకారంబులన్= ఇంకా అనేక విధాలుగా; వీరత్వంబును= శౌర్యాన్ని; విశారదత్వంబును= నేర్పరితనాన్ని; సేనలకున్= ఇరువాగు సైన్యానికి; వెఱఁగు= ఆశ్చర్యం; పుట్టింపన్= కలిగించగా; పోరాడిరి= యుద్ధం చేశారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; బక+అవరజుండు= బకుడి కంటె చిన్నవాడు (బకుడి తమ్ముడు); డస్సినన్= అలసిపోగా; పవమాన పౌత్రుండు= వాయుదేవుడి మనుమడు (అనగా ఘటోత్కచుడు); పడవైచి= క్రిందకు త్రోసి; తాను మీఁదై= తాను పైన కూర్చుండి; జాను= మోకాలి; కూర్పర= మోచేతి; ముష్టి= పిడికిలి యొక్క; ఘాతంబులు= పోట్లు; నిర్ఘాతపాతంబులున్ పోలెన్= పిడుగుపాట్లవలె; ప్రయోగించి= చేసి; నొప్పించి= బాధపెట్టి; అతని= ఆ అలంబసుడి; తొడలు= తొడలును; ఎమ్ములున్= ఎముకలును; ఒక్క+ఉమ్మడిన్= ఒక్కసారిగా; పొడి పొడిచేసి= నుగ్గు నుగ్గుగా చేసి; ఉఱిపిడికిన్= పంట ఊర్పిడికి; చొచ్చినన్= చొరబడిన; ప్రబల హాలికుని లీలన్= పెద్దరైతు వలె; నేలన్+పెట్టి= నేలమీదపెట్టి; కాలన్ చమరి= కాలితో రాచి; చంపి= చంపివేసి; పొంపిరిపోవు= అతిశయించిన; మగంటిమిన్= మగతనంతో (శౌర్యంతో); పేర్చి ఆర్చినన్= విజృంభించి సింహనాదం చేయగా; పాండవ బలంబుల= పాండవసైన్యం యొక్క; సింహనాదంబులున్= సింహనాదాలును (పెనుబొబ్బలు); తూర్యనినదంబులున్= వాద్యాల ఘోషలు; చెలంగెన్= ధ్వనించినవి; అప్పుడు+ఆ ఘటోత్కచుండు= అప్పుడు

ఆ ఘటోత్కచుడు; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; అభివందనంబు చేసినన్= నమస్కారం చేయుగా; అతండు= ఆ ధర్మరాజు; సంతుష్ట+అంతరంగుండు+ఐ= సంతోషంతో నిండిన మనస్సు కలవాడై; ఆలింగనంబును= కౌగిలింతయు; మూర్ధ+ఆఘ్రాణంబును= శిరస్సును ముద్దుగొనుటయు (పిల్లలను దగ్గరికి చేరదీసి తల్లిదండ్రులు వారి శిరస్సులను ముద్దు పెట్టుకొనటం ఒక అలవాటు); చేసి; అగ్గించెను= కీర్తించాడు; అనినన్= అని చెప్పగా; విని= విన్నవాడై; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్= సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా రథం లేని అలంబుసుడు నేలమీదకు దూకి బాణాల జడివాన కురిపించగా ఘటోత్కచుడు కూడ తేరు దిగి పెనుమాయతో అధిక బాణ సమూహంతో అలంబుసుడి మాయను ఎగురగొట్టి గదతో కొట్టాడు. అందు కా కిమ్మీరుడి తమ్ముడు బాధపడి, కత్తి చేతబట్టి ఆకాశాని కెగిరాడు. ఘటోత్కచుడు కూడా వెంటనే కత్తితో పైకెగశాడు. ఆ ఇద్దరూ సుడిగాలి తాకిడికి తిరుగుడు పడే మేఘాల మాదిరి, ఆహారానికై పోట్లాడే డేగల మాదిరి, అనేక విధాలుగా పోట్లాడి, పోట్లాడి భూమి మీదకు దిగి, దర్పంతో ఎదుర్కొన్న పెద్ద పులుల మాదిరి ఒకళ్ళొకళ్ళ శరీరాలు నెత్తుటిలో ఎర్రబడగా కలియబడి, తప్పుకొని, ఒకరి కుత్తుక మరియొకరు లక్ష్యంగా చేసుకొని, కత్తులు విసరుకోగా, అవి ఒకదానినొకటి తాకి మండుతూ భూమిమీద పడ్డాయి. అప్పుడు వారు మల్లయుద్ధానికి సిద్ధమై దగ్గరకు చేరుతూ ఒకరినొకరు పట్టుకొంటూ, తప్పుకొంటూ, పొడుస్తూ - తమ శౌర్యం, నేర్పరితనం ఇరువైపుల సేనకు ఆశ్చర్యం కలిగించగా పోట్లాడారు. ఆ సమయంలో బకాసురుడి తమ్ముడు (అలంబుసుడు) అలసిపోగా, వాయుదేవుడి మనుమడు (ఘటోత్కచుడు) అలంబుసుడిని కిందకుత్రోసి తాను మీద కూర్చుని పిడుగు పాట్లవలె మోకాలితోను, మోచేతితోను, పిడికిలితోను పోట్లు పొడిచి, బాధపెట్టి, వాడి తొడలు ఎముకలు ఒక్కసారిగా చూర్ణం చేసి పంట నూర్పిడికి ప్రయత్నించిన పెద్ద వ్యావసాయకుడి మాదిరి నేలపై బెట్టి, కాలితో రాచి చంపి ఎక్కువైన మగతనంతో సింహనాదం చేశాడు. దానితో పాండవ సైన్యంలో సింహనాదాలు, వాద్యశబ్దాలు చెలరేగాయి. ఆ సమయంలో ఘటోత్కచుడు ధర్మరాజునకు నమస్కారం చేయగా, ఆయన సంతుష్టమనస్కుడై కౌగిలించుకొని, నెన్నుదురును ముద్దుపెట్టుకొన్నాడు, పొగిడాడు.' అని చెప్పిన మాటలకు ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉపములు.

ఉ. 'అంతకు మున్ ఘటోత్కచున కడ్డము సాత్యకి సొచ్చె నంటి వాఁ
డంతకసన్నిభుండు గురుఁ డద్భుత విక్రముఁ డద్దెసన్ సము
ద్దాంతతఁ బేర్చి వార లటు దార్కొని మిన్నక పోవ నేర్తురే?
కొంతయినన్ రణంబు గలుగుం; గలభంగి యెఱుంగఁ జెప్పుమా!' 269

ప్రతిపదార్థం: అంతకు మున్= అంతకు ముందే; ఘటోత్కచునకున్= ఘటోత్కచుడికి; అడ్డము= అడ్డంగా (సహాయంగా); సాత్యకి చొచ్చెన్+అంటివి= సాత్యకి చొరబడ్డా డన్నావు; వాఁడు= ఆ సాత్యకి; అంతక సన్నిభుండు= యముడితో సమానమైనవాడు; గురుఁడు= ద్రోణాచార్యుడు; అద్భుత విక్రముఁడు= ఆశ్చర్యాన్ని గొలిపే శౌర్యం కలవాడు; ఆ+దెసన్= ఆ దిక్కులో; సముద్దాంతతన్= సాటిలేని గొప్పతనంతో; పేర్చి= విజృంభించి; వారలు= ఆ ఇద్దరు; అటు= ఆ విధంగా; తార్కొని= ఎదుర్కొని; మిన్నక పోవ నేర్తురే?= ఊరకే పోతారా?; కొంతయినన్= కొంచెమైనా; రణంబు= యుద్ధం; కలుగున్= జరిగి ఉంటుంది; కలభంగిన్= ఉన్న విధాన్ని; ఎఱుంగన్ చెప్పుమా!= తెలియజెప్పుమా!

తాత్పర్యం: 'అంతకు ముందుగానే ఘటోత్కచుడిని ఆదుకోటానికి సాత్యకి అడ్డం వచ్చా డన్నావు. సాత్యకియముడితో సమానుడు. గురువైన ద్రోణాచార్యుడు మహావిక్రముడు. అటువంటప్పుడు వారిద్దరు ఎదుర్కొంటే ఊరకే ఉండరు కదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కొంతయినా యుద్ధం సాగి ఉంటుంది. అది ఎట్లా జరిగిందో ఉన్న దున్నట్లుగా తెలియజేయుము' అని ధృతరాష్ట్రుడు సంజయుడిని అడిగాడు.

వ. అనవుడు నా సూతనందనుం డతని కిట్లను 'సాత్యకి దఱిమి మన మొన నుఱుము సేయం దొడంగిన ద్రోణుండు మార్కొని యిరువదేను కుప్పెకోలల నతని చేత నేటులు వడి మూఁడు నారసంబుల నతని నొప్పించె; నయ్యాదవ వీరుండు పంచాశద్బాణంబుల నొంచిన ధనుర్గురుండు దొమ్మిది యమ్ములెమ్ములం గీలించి. 270

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆ సూతనందనుండు= ఆ సంజయుడు; అతనికిన్= ఆ ధృతరాష్ట్రునితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; సాత్యకి; తఱిమి= తరిమి వేస్తూ; మన మొనన్= మన సైన్యాన్ని; నుఱుముచేయన్+తొడంగినన్= పొడి చేయటానికి మొదలు పెట్టగా; ద్రోణుండు; మార్కొని= ఎదుర్కొని; ఇరువది+ఏను= ఇర్వై అయిదు; కుప్పెకోలలన్= విశేషపు బాణాలతో; అతని చేతన్= ఆ సాత్యకివలన; ఏటులుపడి= దెబ్బలు తిని; మూఁడు నారసంబులన్= మూడు వాడి బాణాలతో; అతనిన్= ఆ సాత్యకిని; నొప్పించెన్= బాధపెట్టాడు; ఆ+యాదవ వీరుండు= ఆ యాదవ సేనాని; పంచాశద్బాణంబులన్= ఏబది బాణాలతో; నొంచినన్= నొప్పించగా; ధనుర్గురుండు= ధనురాచార్యుడు (ద్రోణుడు); తొమ్మిది అమ్ములన్= తొమ్మిది బాణాలను; ఎమ్ములన్= ఎముకలకు; కీలించి= తగిలించి (అనగా కొట్టి).

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: 'సాత్యకి మనసేనను తరిమి చూర్ణం చేయటం మొదలుపెట్టగా, ద్రోణాచార్యుడు అతడిని ఎదుర్కొని, అతనిచేత ఇరువది అయిదు ప్రత్యేక బాణాల దెబ్బలు తిని, ఆ బాణాలకు ప్రతిగా మూడు వాడి బాణాలతో అతడిని తిరిగి కొట్టాడు. అందుకు సాత్యకి యాభై బాణాలతో ద్రోణుని నొప్పించాడు. అప్పుడు ద్రోణుడు తొమ్మిది బాణాలతో కొట్టి.

క. మఱియును శరశతకము మెయిఁ । గిఱికొలిపిన వృష్ణి వరుఁడు గినియఁగ లే కే
పఱి యున్నఁ జూచి యార్చుచు । మెఱసిరి నీ తనయు లుబ్బు మిగిలి నరేంద్రా! 271

ప్రతిపదార్థం: నరేంద్రా!= ఓ రాజా!; మఱియును= ఇంకను; శరశతకము= నూరుబాణాలను; మెయిన్= ఒడలిమీద; గిఱికొలిపినన్= చుట్టూ చుట్టుకొనేటట్లు చేయగా; వృష్ణివరుఁడు= సాత్యకి; కినియఁగన్ లేక= కోపించ లేక; ఏపు+అఱి+ఉన్నన్= విజృంభించలేక ఉండగా; చూచి ఆర్చుచున్= చూచి సింహనాదం చేస్తూ; నీ తనయులు= నీ కుమారులు; ఉబ్బు మిగిలి= గర్వం ఎక్కువై; మెఱసిరి= ప్రకాశించారు.

తాత్పర్యం: ఓ రాజా! ఇంకా సాత్యకి శరీరంమీద నూరు బాణాలను ప్రయోగించాడు. ఏమీ చేయలేక, కోపాన్ని చూపలేక, శక్తిలేక ఉన్న సాత్యకిని చూచిన నీ కుమారులు పెనుబొబ్బలు పెట్టుతూ ఉత్సాహంతో ప్రకాశించారు.

వ. అప్పుడు వినియును గనియును ధర్మతనయుండు ధృష్టద్యుమ్నాది యోధవరుల నాలోకించి. 272

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ధర్మతనయుండు= ధర్మరాజు; వినియును= సాత్యకి స్థితిని గురించి విని; కనియును= కళ్ళారాచూచి; ధృష్టద్యుమ్న+ఆది= ధృష్టద్యుమ్నుడు మొదలైన; యోధవరులన్= వీరశ్రేష్ఠులను; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఆ సమయంలో విని, చూచి ధర్మరాజు ధృష్టద్యుమ్నుడు మొదలైన సైనిక శ్రేష్ఠులను చూచి.

ఆ. 'పులుఁగు ద్రాటఁ గట్టి యలయించి యాడెడు । బాలునట్ల పోలె బాణగురుఁడు
గడఁగి కృష్ణుననుజుఁ గారించుచున్న వాఁ । డతనిఁ బొదువుఁ; డితని కడ్డపడుఁడు. 273

ప్రతిపదార్థం: పులుఁగున్= పిట్టను; త్రాటన్+కట్టి= త్రాటితో కట్టి; అలయించి= బాధించి; ఆడెడు= ఆటలాడు; బాలున్ అట్లపోలెన్= పసివాడి మాదిరి; బాణగురుఁడు= ధనురాచార్యుడు (ద్రోణుడు); కడఁగి= పూనుకొని; కృష్ణు+అనుజునిన్= సాత్యకిని (కృష్ణుడి తమ్ముడిని); కారించుచున్+ఉన్నవాఁడు= కష్టపెడుతున్నాడు; అతనిన్ పొదువుఁడు= ఆ ద్రోణాచార్యుడిని క్రమ్ముకొనుడు; ఇతనికిన్= సాత్యకికి; అడ్డపడుఁడు= అడ్డంపడండి.

తాత్పర్యం: 'ఒక పసిబాలుడు పిట్టకు త్రాడుకట్టి బాధించి ఆట్లాడేటట్లుగా ద్రోణుడు సాత్యకిని కష్టపెడుతూ ఆడుతూ ఉన్నాడు. అతడిని క్రమ్ముకొనండి; ఇతడికి అడ్డుపడండి.

విశేషం: అలం: ఉపమ.

వ. **భీమసేన పురస్సరులై కవియుం' డనుచుం దానును దఱుముటయు, నా సైనికోత్తములు సాత్యకిం గడచి యాచార్యుం గదిసిన.** **274**

ప్రతిపదార్థం: భీమసేన పురఃసరులు+ఐ= భీముడిని ముందుంచుకొన్నవారై; కవియుండు= క్రమ్ముకొనండి; అనుచున్= అంటూ; తానును= తానుకూడా; తఱుముటయున్= ముందుకు పొండని ప్రోత్సహించగా; ఆ సైనిక+ఉత్తములు= ఆ సైనికవీరులు; సాత్యకిన్+కడచి= సాత్యకిని దాటి; ఆచార్యున్= ద్రోణుడిని; కదిసినన్= సమీపించగా.

తాత్పర్యం: భీమసేనుడిని ముందుంచుకొని క్రమ్ముకొనండి' అంటూ తానుకూడా తరుముటచేత ఆ సైనికశ్రేష్ఠులు సాత్యకిని దాటి ఆచార్యుడిని ఎదుర్కొనగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **విందులఁ గనిన ట్లాతఁడు । మందస్మితుఁడై యెదిర్చి మార్గణజాల**
స్పందితులఁ జేసె వారల । నందఱ; కవ్విధము రోమహర్షణ మయ్యెన్. **275**

ప్రతిపదార్థం: ఆతఁడు= ద్రోణాచార్యుడు; విందులన్= అతిథులను; కనినట్లు= చూచినట్లుగా; మందస్మితుఁడు+ఐ= చిరునగవుతో; ఎదిర్చి= ఎదిరించి; మార్గణజాల= బాణాలగుంపుతో; స్పందితులన్= కదలునట్లుగా; వారలన్ చేసెన్= వారందరినీ చేశాడు; ఆ+విధము= ఆ పద్ధతి; అందఱకున్= అక్కడున్న వారందరికీ; రోమహర్షణము అయ్యెన్= శరీరం పులకరించి నట్లయింది.

తాత్పర్యం: భీమసేనాదులు తనపైకి ఎత్తి రాగా, ద్రోణుడు చిరునవ్వుతో ఎదుర్కొని అతిథులను చూచినట్లుగా సంతోషించి, వారందరు స్పందించునట్లు బాణాలను ప్రయోగించాడు. ఆ పద్ధతి వారందరికి పులకరింతను కలిగించింది.

వ. **అట్టి యెడ.** **276**

తాత్పర్యం: ఆ సమయంలో.

క. **ఇరువది యేవురు పాంచా । లురు, నూర్వురు కేకయులును లూనాంగకు లై**
ధరఁ దొరఁగిరి పెఱమొత్తము । కరినికరము రొంపిఁ బడిన గతి నుండె నృపా! **277**

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; ఇరువది ఏవురు పాంచాలురు= పాంచాల దేశస్థులు ఇరవై ఐదుమంది; కేకయులు నూర్వురును= కేకయ దేశం వారు నూరుమంది; లూన+అంగకులై= తునిసిన శరీరాలు కలవారుగా (ముక్కలైన శరీరాలతో); ధరన్= భూమిమీద; తొరఁగిరి= పడ్డారు; పెఱ మొత్తము= శత్రువులు అందరు; కరినికరము= ఏనుగుల గుంపు; రొంపిన్= బురదలో; పడిన గతిన్ ఉండెన్= పడినట్లుగా ఉన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ రాజా! (ధృతరాష్ట్రా!) పాంచాలురు ఇరువది ఐదుమంది, కేకయులు నూర్గురు, శరీరాలు తునిగి భూమిమీద పడ్డారు. మిగిలిన వారు ఏనుగుల గుంపు బురదలో పడినట్లుగా అయినారు.

విశేషం: అలం: ఉపమ.

వ. **ఇట్లు ద్రోణుండు బరవసంబు సేసినం బాండవయోధులు పైఁ బెట్టంజాలక సొలసియున్న సమయంబునం బాంచజన్య ధ్వని విని యుధిష్ఠిరుం డక్కడ నాలించి గాండీవ ఘోషణంబు గర్ణగోచరంబు గామికి మనంబు గలంగ నెలుంగు గుత్తుకం దగుల సాత్యకితో ని ట్లనియె.** 278

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; బరవసంబు చేసినన్= పూనికతో యుద్ధం చేయగా; పాండవయోధులు= పాండవ వీరులు; పైన్+పెట్టన్+చాలక= ముందుకు పోలేక; సొలసి ఉన్న= మూర్ఛపోయి ఉన్న; సమయంబునన్= వేళలో; పాంచజన్య ధ్వని విని= పాంచజన్యం అనే శంఖం యొక్క మ్రోత విని (కృష్ణుడి శంఖధ్వని); యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అక్కడ= ఆ సమయంలో; ఆలించి= విన్నవాడై; గాండీవ గుణ ఘోషణంబు= గాండీవ మనే వింటియొక్క అల్లెత్రాటి శబ్దం; కర్ణగోచరంబు కామికిన్= చెవికి వినరాకపోగా; మనంబు కలంగన్= మనసు చీకాకుపడగా; ఎలుంగు= గొంతు; కుత్తుకన్ తగులన్= బొంగురు పోగా; సాత్యకితోన్+ఇట్లు+అనియెన్= సాత్యకితో ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఈ విధంగా ద్రోణాచార్యుడు పూనికతో యుద్ధం చేయగా పాండవ వీరులు ముందడుగు పెట్టలేక మూర్ఛపోయి ఉన్న సమయంలో పాంచజన్యంయొక్క మ్రోత వినిపించింది. ధర్మరాజు ఆ శంఖరావం విన్నప్పటికినీ, గాండీవటంకారం అతడి చెవిని పడకపోయేసరికి మనస్సు కలతచెంది దుఃఖంతో గొంతు బొంగురుపోగా సాత్యకితో ఇట్లా అన్నాడు:

ధర్మరాజు సాత్యకి నర్జునునకుఁ దోడ్పడఁ బొమ్మని ప్రార్థించుట (సం.7-85-41)

ఉ. **'ఒక్కఁడ చన్నవాఁడు విజయుండు మహీరజ మెక్కు డయ్యె న**
ద్దిక్కునఁ బాంచజన్యము యుదీర్ణత మ్రోయఁ దొడంగె నక్కటా!
చిక్కెనొ కౌరవాధములచే నతఁ డయ్యెడ నీవ యొక్కఁడుం
దక్క నొరుండు దీర్పఁగ నుదగ్రుఁడు బంధుఁడు లేమి వేఁడెదన్. 279

ప్రతిపదార్థం: ఒక్కఁడు+అ చన్నవాఁడు విజయుండు= అర్జునుడు ఒక్కడే వెళ్ళాడు; మహీరజము+ఎక్కుడు+అయ్యెన్= భూమి మీద దుమ్ము ఎక్కువగా కానవస్తున్నది (యుద్ధం ముమ్మరంగా సాగుతున్న దనే దానికి నిదర్శనం); ఆ+దిక్కునన్= ఆ ప్రక్క; పాంచజన్యము+అ= కృష్ణుడి పాంచజన్యమే; ఉదీర్ణతన్= ఎక్కువగా; మ్రోయన్+తొడంగెన్= మ్రోగుతూ ఉన్నది; అతఁడు= ఆ అర్జునుడు; అక్కటా!= అయ్యో!; కౌరవ+అధములచేన్ చిక్కెనొ!= నీచులైన కౌరవుల చేతికి దొరికాడో ఏమో!; ఆ ఎడన్= అట్టి సమయంలో; నీవు+అ ఒక్కండున్ తక్కన్= నీవు ఒక్కడవే తప్ప; ఒరుండు= వేరొకడు; తీర్పఁగన్= ఈ కష్టాన్ని తొలగించటానికి; ఉదగ్రుఁడు= భయంకరుడు, గొప్పవాడు; బంధుఁడు= బంధువు; లేమిన్= లేకపోవుటచేత; వేఁడెదన్= వేడుకొంటున్నాను.

తాత్పర్యం: 'అర్జునుడు ఒక్కడే వెళ్ళాడు. ఆ దిక్కులో దుమ్ము ఎక్కువగా రేగుతూ ఉన్నది. పాంచజన్య శబ్దమే ఎక్కువగా వినవస్తూ ఉన్నది. ఈ సందర్భంలో - అయ్యో! వాడు నీచులైన కౌరవుల చేతిలో చిక్కుకున్నాడో ఏమో! ఇప్పుడు నీ వొక్కడివే ధైర్యశాలివి, బంధువురి, నీవు తప్ప ఈ ప్రమాదాన్ని తప్పించగలవాడు వేరొకడు లేకుండుట వలన నిన్ను వేడుకొంటూ ఉన్నాను'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. త్వరితముగఁ జనుము సఖుఁడు । న్గురుఁడుఁ గదా! నీకు నర్జునుం; డుపకృతి త
త్పరులై నెగడెడు నుత్తమ । పురుషులు వేచు తఱి వచ్చె భుజవీర్యనిధీ! 280

ప్రతిపదార్థం: భుజవీర్యనిధీ!= భుజబలానికి గనివంటివాడా! - భుజబలం గలవాడా!; త్వరితముగన్ చనుము= శీఘ్రంగా వెళ్ళుము; అర్జునుండు; నీకున్; సఖుఁడున్= స్నేహితుడును; గురుఁడున్= గురువును; కదా!; ఉపకృతి తత్పరులు+ఐ= సహాయం చేసే మనస్సుతో; నెగడెడున్= నడచుకొనే; ఉత్తమ పురుషులు= ఉత్తములైన పురుషులు; వేచు తఱి= ఎదురుచూచే కాలం; వచ్చెన్= వచ్చింది.

తాత్పర్యం: భుజబలవీరుడా! అర్జునుడు నీకు స్నేహితుడు, గురువు కదా! ఉపకారపరులైన ఉత్తమ పురుషులు ఎదురు చూచే సమయం వచ్చింది. తొందరగా వెళ్ళుము. (త్వరగా వెళ్ళి అర్జునుడికి సహాయం చేయుము).

చ. దురమున బంధుమిత్రులకుఁ దోడ్పడు తెంపును ధాత్రి యెల్ల భూ
సురులకు నర్థి నిచ్చుటయు సూరిజనుల్ సుకృతంబు లెన్నుచో
సరియుఁగఁ జేసి చెప్పుదురు శాశ్వతకీర్తియు నిన్ను నొందు నా
హరి నను నా సుహృజ్జనుల నందఱఁ గాంచుటఁ గ్రీడిఁ గావవే! 281

ప్రతిపదార్థం: దురమునన్= యుద్ధంలో; బంధుమిత్రులకున్= బంధువులకు, స్నేహితులకు; తోడ్పడు= సహాయం చేసే; తెంపును= సాహసం; ధాత్రిఎల్లన్= భూమినంతటిని; భూసురులకున్= బ్రాహ్మణులకు; అర్థిన్= ప్రీతితో; ఇచ్చుటయున్= దానం చేయటం; సూరిజనుల్= పండితులు; సుకృతంబుల్= పుణ్యాలను; ఎన్నుచోన్= లెక్కపెట్టేటప్పుడు; సరియుఁగన్+చేసి= సమానంగా చేసి; చెప్పుదురు= చెప్పుతారు; ఆ హరి= ఆ శ్రీకృష్ణుడు; ననున్= నన్ను; నా సుహృద్+జనులన్= నా స్నేహితులను; అందఱన్= అందరిని; కాంచుటన్= కాపాడటంచేత; క్రీడిన్= అర్జునుడిని; కావవే!= కాపాడుమా!; నిన్నున్= నిన్ను; శాశ్వతకీర్తియున్= స్థిరమైన కీర్తి; ఒందున్= పొందుతుంది.

తాత్పర్యం: ఓ సాత్యకీ! యుద్ధంలో బంధువులకు, మిత్రులకు సహాయం చేసే సాహసం, భూమి నంతటిని బ్రాహ్మణుల కివ్వటంతో సమానమని పుణ్యాలను లెక్కపెట్టేటప్పుడు పండితులు చెపుతూ ఉంటారు. శ్రీకృష్ణుడు నన్ను, నా స్నేహితులను అందరిని కాపాడేటట్లుగా నీవు అర్జునుడిని కాపాడుము. నీకు శాశ్వత కీర్తి కలుగుతుంది.

క. గురుపుత్ర కర్ణ మద్రే । శ్వర కృప భూరిశ్రవసులు శత్రుజన భయం
కరులు జయద్రథునకు నై । నరుఁ బొదివిన నతఁడు నొచ్చె నాకుం జూడన్. 282

ప్రతిపదార్థం: గురుపుత్ర= అశ్వత్థామ; కర్ణ= కర్ణుడు; మద్రేశ్వర= శల్యుడు; కృప= కృపుడు; భూరిశ్రవసులు= భూరిశ్రవుడు మొదలుగా గల; శత్రుజన భయంకరులు= విరోధులకు భయాన్ని కలిగించేవారు; జయద్రథునకునై= సైంధవుని కొరకు; నరున్ పొదివినన్= అర్జునుడిని క్రమ్ముకొనగా; నాకున్+చూడన్= నాకు చూడగా; అతఁడు నొచ్చెన్= అర్జునుడు బాధపడ్డాడు (అని తోస్తూ ఉన్నది.)

తాత్పర్యం: అశ్వత్థామ, కర్ణుడు, శల్యుడు, కృపుడు, భూరిశ్రవుడు మొదలైనవారు అరిజన భయంకరులు. సైంధవుడి కొరకు అర్జునుడిని కమ్ముకొన్నట్లుగా తోస్తూ ఉన్నది. అందువలన, అర్జునుడు బాధపడ్డాడని నా కనిపిస్తూ ఉన్నది.

క. ఆ మోము నా భుజంబులు । నా మేనుం గలదె? కేశవానుజ! యెచ్చో
నే మగలకు నమ్మూర్తికి । నేమి దలంచు నొకో! దైవ మెయ్యది దుదియో! 283

ప్రతిపదార్థం: కేశవ+అనుజ!= ఓ సాత్యకీ!; ఆ మోము= ఆ మొగం; ఆ భుజంబులు= ఆ చేతులు; ఆ మేనున్= ఆ శరీరం; ఎచ్చోన్= ఎక్కడనైనా; ఏ మగలకున్= ఏ వీరులకైనా; కలదె?= ఉన్నదా? (అనగా అర్జునుడి శరీరాకృతి ఎక్కడైనా ఎవరికైనా లేదని భావం); ఆ+మూర్తికిన్= ఆ మనిషికి (అటువంటి లోకోత్తరమైన వాడికి); దైవము= విధి; ఏమి తలంచున్+ఒకొ!= ఏమి చేయబోతున్నదో; ఏ+అది= ఏది; తుదియో?= అంతమో?

తాత్పర్యం: ఆ మొగమూ, భుజాలూ, శరీర సౌందర్యమూ - ఎక్కడనైనా, ఏ మానవుడికైనా ఉన్నాయా? ఓ సాత్యకీ! ఆ వీరమూర్తికి విధి వ్రాత ఎట్లుందో? దీనికి తుది ఏమో!

విశేషం: ధర్మరాజు అర్జునుడిని తలచుకొని పొందే పరిదేవనమూ, ఆత్మీయానుబంధమూ ఈ పద్యంలో వర్ణితమైనది.

ఉ. **ద్వైతవనంబునందు గుణధన్యుఁడు గాండివి నాకుఁజెప్పె 'ని**
ర్ధూత విరోధి సత్యకసుతుండు సహాయుఁడుగా జయింతుఁ బ్ర
ఖ్యాతిగ ధార్తరాష్ట్రబలమంతయు నే' నని దానికిం దగం
బ్రీతి యొనర్పవే నరవరేణ్య! రయంబునఁ బోయి వానికిన్. **284**

ప్రతిపదార్థం: నాకున్= నాకు(ధర్మరాజునకు); గుణధన్యుఁడు= సుగుణాలరాశి; గాండివి= అర్జునుడు; ద్వైతవనంబు అందున్= ద్వైతవనంలో; నిర్ధూతవిరోధి= ఎగురగొట్టబడిన శత్రువులుకల; సత్యకసుతుండు= సాత్యకి; సహాయుఁడుగాన్= తోడుగా; ప్రఖ్యాతిగన్= ప్రసిద్ధంగా; ధార్తరాష్ట్ర బలము+అంతయున్= కౌరవసేన అంతటినీ; అనిన్= యుద్ధంలో; ఏను= నేను; జయింతున్= జయిస్తాను (అని); నాకున్ చెప్పెన్= నాకు చెప్పాడు; దానికిన్= ఆ మాటకు; తగన్= తగునట్లుగా; రయంబుగన్= శీఘ్రంగా; పోయి= వెళ్ళి; నరవరేణ్య!= మానవశ్రేష్ఠా!; వానికిన్= ఆ అర్జునుడికి; ప్రీతి ఒనర్పవే!= సంతోషాన్ని కల్గించుమా!

తాత్పర్యం: ద్వైతవనంలో మేమున్నప్పుడు 'శత్రువులను అదలించి కొట్టే సాత్యకి తోడుగా కౌరవ బలాన్ని నేను యుద్ధంలో జయిస్తాను' అని అర్జునుడు నాకు చెప్పాడు. కనుక - ఓ నరవరేణ్యా! త్వరగా వెళ్ళి, అర్జునుడి మాటకు తగినట్లుగా అతడికి సంతోషమును కలిగించుము.

క. **హరి యొకఁడు నీ వొకండవు । పరమాప్తులు కలిమి నరుఁడు భారపుఁ బనికిం**
జొర నలుకఁడు నీ కూరిమి । పొరపొచ్చెము గాక యుండఁ బోవఁగవలదే ! **285**

ప్రతిపదార్థం: హరి ఒకఁడు= శ్రీకృష్ణు డొకడును; నీవు+ఒకండవున్= నీ వొక్కడవును; పరమాప్తులు= నిజమైన ఆప్తులు; కలిమిన్= ఉండటంచేత; నరుఁడు= అర్జునుడు; భారపు+పనికిన్= కష్టమైన పనికి కూడ; చొరన్= దూరటానికి (చొచ్చుటకు); అలుకఁడు= జంకడు; నీ కూరిమి= నీ స్నేహం; పొరపొచ్చెముకాక ఉండన్= వృథా కాకుండా; పోవఁగ వలదే?= పోవద్దా (అనగా సహాయంగా పోవలె కదా!).

తాత్పర్యం: శ్రీకృష్ణుడొకడూ, నీ వొకడవూ అర్జునుడికి చాల కావలసినవారు; మీ అండ ఉండటం చేతనే ఎటువంటి కష్టపు పనికైనా అర్జునుడు పూనుకొంటాడు. కనుక మీ స్నేహం వృథా కాకుండా నీ విపుడు పోవద్దా?

ఆ. **పరమకరుణ నైన బంధుభావంబున । నైన భుజబలంబు నతిశయమున**
నైన నెల్లభంగి నర్జును రక్షింపఁ । బోవఁ దగు మహానుభావ! నీకు. **286**

ప్రతిపదార్థం: మహానుభావ!= ఓ గొప్పవాడా!; పరమ కరుణన్+ఐనన్= మిక్కిలి దయతోనైనా; బంధుభావంబునన్+ఐనన్= బాంధవ్యం కారణంగా నైనా; భుజబలంబు= భుజశక్తి; అతిశయమునన్+ఐనన్= ఎక్కువైనందువలననైనా; ఎల్లభంగిన్= అన్ని విధాలుగా; అర్జునున్= అర్జునుడిని; రక్షింపన్+పోవన్= కాపాడటానికి పోవటం; నీకున్+తగున్= నీకు తగి ఉన్నది.

తాత్పర్యం: ఓ మహానుభావా! (అని సాత్యకిని ధర్మజుడు సంబోధిస్తున్నాడు). మిక్కిలి దయతోనైనా, బాంధవ్యం కారణంగా నైనా, భుజబలం గొప్పతనం తోనైనా - అన్ని విధాలుగా అర్జునుడిని కాపాడటానికి నీవు పోవటం న్యాయం.

క. అతఁ డొకటి యైన నే నే । గతిఁ బోదుం జెపుమ! యెల్లకార్యంబులలో
నతనికిఁ దోడ్పడఁ బోవుట । యతి ముఖ్యము దానిఁ జేయు మనఘ విచారా! 287

ప్రతిపదార్థం: అతఁడు+ఒకటి ఐనన్= ఆ అర్జునుడు ఏమైనా అయినట్లయితే (అర్జునుడికి ప్రమాదం జరిగినట్లయితే); ఏను= నేను; ఏ గతిన్+పోదున్?= ఏ దిక్కునకు పోగలను?; (నా గతి ఏమౌతుంది?); చెపుమా!= చెప్పవలసింది!; ఎల్ల కార్యంబులలోన్= అన్ని పనులలో; అతనికిన్= ఆ అర్జునుడికి; తోడ్పడన్+పోవుట= సహాయానికి పోవటం; అతిముఖ్యము= చాలా అవసరం; అనఘ విచారా!= పాపరహితమైన ఆలోచన చేసేవాడా!; దానిన్+చేయుము= ఆ పనిని చేయుము; (అనగా అర్జునుడిని కాపాడటానికి పొమ్ము);

తాత్పర్యం: అర్జునుడికి ఏదేని ప్రమాదం జరిగినట్లయితే నా గతి ఏమౌతుంది? నే నెక్కడికి పోగలను? అన్ని పనులలో అతడికి సహాయంగా వెళ్లటం చాల ముఖ్యం నీవు మంచినే ఆలోచించేవాడవు. కనుక ఆ పని చేయుము.

క. అలఘుబలుఁడు శైనేయుఁడు । గలుగఁగఁ బాండవుల గెలువఁగా వచ్చునె? వా
రల కతఁడు గోట యంద్రు; రి । పులు దానికిఁ దగఁగ నెఱపు భుజగర్వంబున్. 288

ప్రతిపదార్థం: అలఘు బలుఁడు= తక్కువకాని బలం కలవాడు; శైనేయుఁడు= సాత్యకి; కలుగఁగన్= ఉండగా (తోడుండగా); పాండవులన్= పాండవులను; గెలువఁగాన్ వచ్చునె?= జయింపసాధ్యమా?; వారలకున్= ఆ పాండవులకు; అతఁడు= ఆ సాత్యకి; కోట= కోట అని; రిపులు= శత్రువులు; అంద్రు= అంటారు; దానికిన్= ఆ మాటకు; తగఁగన్= తగినట్లుగా; భుజగర్వంబున్= భుజదర్పాన్ని; నెఱపుము= ప్రదర్శించుము.

తాత్పర్యం: సాటిలేని బలంకల సాత్యకి కోటవలె పాండవులకు ఉండగా వారిని జయించటం సాధ్యమా? - అని శత్రువులంటూ ఉంటారు. దానికి తగినట్లుగా భుజదర్పాన్ని చూపించుము.

క. హరి గురుఁడు నీకుఁ గ్రీడియు । గురుఁ డిరువుర యెడరు దీర్పఁ గోరి గురులకున్
గురుఁడ నగు నేనె చేసెదఁ । బరమ ప్రార్థనము; దీనిఁ బాటింపు తగన్. 289

ప్రతిపదార్థం: నీకున్ హరి గురుఁడు= నీకు కృష్ణుడు గురువు; నీకు క్రీడియున్ గురుఁడు= అర్జునుడు కూడా గురువే; ఇరువుర ఎడరు= ఆ ఇద్దరి ఇబ్బందిని; తీర్పన్+కోరి= తీర్చుమని కోరి; గురులకున్= గురువులకు; గురుఁడన్+అగు= గురువు నైన; ఏన్= నేనే; పరమ ప్రార్థనము చేసెదన్= ఎక్కువగా ప్రార్థిస్తున్నాను; దీనిన్= ఈ ప్రార్థనను; తగన్ పాటింపుము= తప్పక చేయుము.

తాత్పర్యం: కృష్ణార్జునులు ఇరువురూ నీకు గురువులే. వారి ఇబ్బందిని తొలగించుమని ఆ గురువులకు గురువునైన నేను నిన్ను అర్థిస్తూ ఉన్నాను. నా ప్రార్థనను తప్పక పాటింపుము.

క. కురుబలము సొచ్చి, నీదగు । శరముల దర్పంబు సూపి, చయ్యనఁ జని య
న్నరుఁ గైకొని నా యుల్లము । పరితాపముఁ దీర్పవే! నృపాలురు మెచ్చన్. 290

ప్రతిపదార్థం: కురుబలము చొచ్చి= కురుసైన్యంలోకి చొచ్చుకొనిపోయి; నీది+అగు= నీయొక్క; శరముల దర్పంబు= బాణాల శక్తిని; చూపి= చూపించి; చయ్యనన్= శీఘ్రంగా; చని= వెళ్ళి; ఆ+నరున్+కైకొని= ఆ అర్జునుడిని కాపాడి; నా ఉల్లము= నా మనస్సులోని; పరితాపమున్= బాధను; నృపాలురు= రాజులు; మెచ్చన్= మెచ్చుకోగా; తీర్పవే!= తీర్చుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కౌరవ సైన్యంలోకి చొచ్చుకొనిపోయి నీ బాణాలశక్తిని చూపి, రాజులు మెచ్చుకోగా శీఘ్రంగా వెళ్ళి అర్జునుడిని ఆదుకొని నా మనస్సులోని బాధను తొలగించుము.'

వ. అనిన విని సాత్యకి ధర్మనందనున కిట్లను 'నీ వచనంబు లుచితంబు; లేను నప్పార్థునకును రణంబునం బ్రాణంబులు దాఁప; విశేషించి నీ వింత ప్రార్థించి పనుప నూరకుండుదునే? యతండు సైంధవ వధార్థంబుగా నట సనుచుండి కృష్ణుఁడు వినుచుండ నాతోఁ జెప్పిన తెఱంగు విన్నవించెద నవధరింపుము. 291

ప్రతిపదార్థం: అనినన్ విని= ధర్మరాజు చెప్పగా విని; సాత్యకి; ధర్మనందనునకున్= ధర్మరాజుతో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; నీ వచనంబులు= నీ మాటలు; ఉచితంబులు= న్యాయంగా ఉన్నవి; ఏను= నేను; ఆ+పార్థునకున్= ఆ అర్జునుడికి; రణంబునన్= యుద్ధంలో; ప్రాణంబులు= నా ప్రాణాలను; దాఁపన్= దాచుకొనను; విశేషించి= మీదు మిక్కిలి; నీవు+ఇంత+ప్రార్థించి పనుపన్= నీ వింతగా వేడుకొని పంపినపుడు; ఊరక+ఉండుదునే?= ఊరకుంటానా?; అతండు= ఆ అర్జునుడు; సైంధవ వధ+అర్థంబుగాన్= సైంధవుడిని చంపుటకై; అట చనుచున్+ఉండి= ఆ దిక్కుకు పోతూ ఉండి; కృష్ణుఁడు వినుచుండన్= శ్రీకృష్ణుడు వింటూ ఉండగా; నాతోన్ చెప్పిన తెఱంగు= నాతో చెప్పిన పద్ధతి; విన్నవించెదన్= మనవి చేస్తాను; అవధరింపుము= వినుము.

తాత్పర్యం: ఆ విధంగా ధర్మరాజు చెప్పగా, సాత్యకి ఆతడితో ఇట్లా అన్నాడు: 'నీ పలుకులు న్యాయంగా ఉన్నాయి. అర్జునుడి కొరకై చేసే యుద్ధంలో నా ప్రాణాలను దాచుకోను. మీదు మిక్కిలి నీ వింతగా ప్రార్థించి పంపినప్పుడు ఊరకుంటానా? సైంధవుడిని చంపుటకై వెళ్ళుతూ, కృష్ణుడు వింటూ ఉండగా, అర్జునుడు నాతో చెప్పిన విషయం మనవి చేస్తాను వినుము.

**క. 'మనకు నిమిత్తము లెంతయు । ననుకూలము లయ్యెఁ; గెలుతు మాహవమున నేఁ
జనియెదఁ బ్రతిజ్ఞఁ దీర్పఁగ; । ననఘా! ధర్మసుతు రక్ష కరుగుము నీవున్. 292**

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా!; మనకున్ నిమిత్తములు= మనకు శకునాలు; ఎంతయున్+అనుకూలములు+అయ్యెన్= ఎంతో అనుకూలంగా ఉన్నాయి; ఆహవమునన్= యుద్ధంలో; గెలుతుము= జయిస్తాము; ప్రతిజ్ఞన్+తీర్పఁగన్= మాట నిలుపుకోగా; ఏన్+చనియెదన్= నేను వెళ్ళుతాను; ఈవున్= నీవు కూడ; ధర్మసుతు రక్షకున్= ధర్మరాజును కాపాడటానికి; అరుగుము= వెళ్ళుము.

తాత్పర్యం: ' ఓ పుణ్యాత్మా! శకునాలు మన కనుకూలంగా ఉన్నాయి. యుద్ధంలో గెలుస్తాము. ప్రతిజ్ఞ తీర్చటానికి నేను వెళ్ళుతాను (సైంధవ వధ ప్రతిజ్ఞ). నీవు ధర్మరాజును కాపాడటానికి వెళ్ళుము. (అంటూ సాత్యకికి చెప్పాడు.)

**క. విను! సింధురాజు వధ మును । మనుజాధిప రక్షణంబు మనకు సరియ కా
వున నే నొక పని నీ వొక । పని మేకొని చేయు టరయఁ బాడియ గాదే? 293**

ప్రతిపదార్థం: విను= ఓ సాత్యకీ! వినుము; సింధురాజు వధమును= సైంధవుడిని చంపటం; మనకున్= మనకు; మనుజాధిప రక్షణంబు= రాజును కాపాడుకొనటం (అనగా ధర్మరాజును కాపాడుకొనటం); సరియ= సమానం; కావునన్+ఏను+ఒకపని నీవు+ఒకపని= నేనొకపనిని; నీవొక పనిని (సైంధవవధ, ధర్మరాజు రక్షణం అనే పనులను); మేకొని చేయుట= పూనుకొని చేయటం; పాడియ కాదే?= ధర్మం కాదా?

తాత్పర్యం: ఓ సాత్యకీ! వినుము, సైంధవుడిని చంపటం, ధర్మరాజును కాపాడటం మనకు సమానమే. కాబట్టి నే నొక పనిని, నీ వొక పనిని పూనుకొని చేయటం ధర్మం కదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. ఏను నిలిచినట్ల కా నూఱడిల్లు నీ । వున్న నన్నరేశ్వరోత్తముండు;
నిర్భరుండ వగుము నీవు నా దెస; నాకు । హరి గలండు; గలఁడె యచట నితఁడు. 294

ప్రతిపదార్థం: ఈవు+ఉన్నన్= నీవున్నట్లయితే; అన్నర+ఈశ్వర+ఉత్తముండు= ఆ రాజశ్రేష్ఠుడు (ధర్మరాజు); ఏను నిలిచినట్లుకాన్= నేను తన ప్రక్క ఉన్నట్లు; ఊఱడిల్లున్= ఓదార్పు పొందుతాడు; నీవు నిర్భరుండవు+అగుము= నీవు భయం లేక ఉండుము; నా దెసన్= నావైపున; హరి కలండు= కృష్ణు డున్నాడు; అచటన్= ధర్మరాజు ఉన్నచోట; ఇతఁడున్= కృష్ణుడు కలఁడే= ఉన్నాడా? (లేడని భావం).

తాత్పర్యం: నీవు ప్రక్కన ఉంటే ధర్మరాజు ప్రక్కలో నేనున్నట్లుగానే ధైర్యాన్ని పొందుతాడు. నా ప్రక్కన శ్రీకృష్ణుడు న్నాడు. ధర్మజుడి ప్రక్క అత డిపుడు లేడు. కనుక నీ వచటికి వెళ్ళుట న్యాయం. నిర్భయంగా నీవు ఉండుము.

వ. ఎల్లభంగుల రాజ రక్షణార్థంబుగా నీకుం బోవవలయుఁ బరాక్రమ ధుర్యుండగు నాచార్యుప్రతిన యెఱుంగవె?' యని చెప్పిన నట్ల కాక యని ని న్నతనిచే నిక్షేపంబుగా గైకొని యేను నీకడకుం జనుదెంచితి; గురుండు ప్రతిన నెఱపునేని విజయుండు జయద్రథుం జంపుట యప్రయోజనంబు కాదే? యది యట్లుండ నిమ్ము; నీ చిత్తమ్మున వలవని వెఱపు గట్టుకొని యెదవు; కృష్ణసారథికం బగు జిష్ణురథం బప్రతిహత మనోరథం బగుట యెఱుంగవలవదే?' యనుటయు నమ్మహీపతి యతని కి ట్లనియె. 295

ప్రతిపదార్థం: ఎల్లభంగులన్= అన్ని విధాలుగా; రాజరక్షణ+అర్థంబుగాన్= రాజును కాపాడటానికై; నీకున్+పోవలయున్= నీవు పోయి తీరాలి; పరాక్రమధుర్యుండు+అగు= శత్రువులను ఆక్రమించుకొనే శక్తికలవాడైన (ఆ నేర్పరితనం కలవాడు); ఆచార్య ప్రతిన= ద్రోణుడి శపథం; ఎఱుంగవె?= తెలియవా?; అని చెప్పినన్= అని చెప్పగా; అట్లకాక అని= సరేనని, నిన్నున్= నిన్ను; అతనిచేన్= అతడి నుండి; నిక్షేపంబుగాన్= నిధిగా; కైకొని= తీసికొని; ఏను= నేను; నీ కడకున్ చనుదెంచితిన్= నీ దగ్గరకు వచ్చాను; గురుండు= ద్రోణాచార్యుడు; ప్రతిన నెఱపున్+ఏనిన్= ప్రతిజ్ఞను నిలిపినట్లయితే (అనగా ధర్మరాజును బంధించినట్లయితే); విజయుండు= అర్జునుడు; జయద్రథున్+చంపుట= సైంధవుడిని చంపటం; అప్రయోజనంబు కాదే?= వ్యర్థం కాదా!; అది అట్లుండన్+ఇమ్ము= దానినట్లా ఉండనీ; నీ చిత్తమ్మునన్= నీ మనస్సులో; వలవని వెఱపు= అనవసరమైన భయం; కట్టుకొనియెదవు= పెట్టుకుంటూ ఉన్నావు; కృష్ణ సారథికంబు+అగు= శ్రీకృష్ణుడిని సారథిగా గల; జిష్ణురథము= అర్జునుడి తేరు; అప్రతిహత మనోరథంబు= ఎదురులేని కోరిక తీర్చేది (అనగా దానిని ఎవ్వరూ కొట్టలేరు); అగుటన్= కావటంచేత; ఎఱుంగవలవదే?= తెలియవద్దా?; అనుటయున్= అని చెప్పగా; ఆ+మహీపతి= ఆ ధర్మజుడు; అతనికిన్= సాత్యకితో; ఇట్లనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'అన్ని విధాలుగా రాజును కాపాడటానికి నీవు తప్పక పోవలయును. శత్రువులను ఆక్రమించుకొనటంలో నేర్పరి అయిన గురువుగారి శపథం నీకు తెలియదా?' అని చెప్పినందువల్ల, సరే అని, నిన్ను అతడు నా చేతికిచ్చిన నిధిగా భావించి నీ దగ్గరకు వచ్చాను. ఆచార్యుడు గనుక తన ప్రతిజ్ఞను నిలుపుకొంటే, అర్జునుడు సైంధవుడిని చంపటం వ్యర్థం. కనుక, అనవసరంగా భయం మనసులో పెట్టుకోవద్దు. కృష్ణుడు సారథిగా ఉండే అర్జునుని రథం, ఎదురులేని మనోరథం అని తెలియదా?' అని అనగా ఆ ధర్మరాజు అతనితో ఇట్లా అన్నాడు:

క. 'అది యగు నైనను ననుఁ బెం । పొదవఁగఁ గాచికొని యిచట నుండుట కంటెన్
మది నధికం బై తోఁచిన । యది నీ వర్జునుని పాలి కరుగుట నాకున్. 296

ప్రతిపదార్థం: అది+అగున్= నీవు చెప్పింది నిజమే; ఐనను= అయినప్పటికీ; పెంపు+ఒదవఁగన్= గొప్పతనం కలుగగా; కాచికొని= కావలి కాచుకొని; ఇచటన్ ఉండుట కంటెన్= ఇక్కడ ఉండటం కంటె; నీవు= ఓ సాత్యకీ!; అర్జునుని పాలికిన్= అర్జునుడి దగ్గరకు; అరుగుట= వెళ్ళటం; మదిన్= మనస్సులో; నాకున్= నాకు; అధికంబై తోఁచిన అది= ఎక్కువగా తోచింది.

తాత్పర్యం: అది అట్లే అయినప్పటికిని, గొప్పగా ఇక్కడ కాచుకొని ఉండటం కంటె అర్జునుడి వద్దకు నీవు వెళ్ళటం ఎక్కువ అవసరం అని తోచింది.

తే. **కడువడి నీ వరుగఁగ వడ । ముడియును నీ వెనుక శీఘ్రముగ నెయిదుం గ**
వ్వడి కుశలి యైన విజయం । బొడఁగూడును మనకు; దీని కొడఁబడు మనఘా! 297

ప్రతిపదార్థం: నీవు కడువడిన్ అరుగన్= నీవు చాల త్వరగా వెళ్ళగా; వడముడియును= భీమసేనుడు కూడా; నీ వెనుకన్= నీ వెంటనే; శీఘ్రమునన్= త్వరగా; ఎయిదున్= వెంబడించి వస్తాడు; కవ్వడి= అర్జునుడు; కుశలి+ఐనన్= క్షేమంతో ఉంటే; మనకున్= మనకు; విజయంబు= జయం; ఒడఁగూడును= కలుగుతుంది; అనఘా!= ఓ పుణ్యాత్మా!; దీనికిన్= ఇప్పటి నా మనవికి; ఒడఁబడుము= అంగీకరించుము.

తాత్పర్యం: ఓ పుణ్యాత్మా! త్వరగా నీవు వెళ్ళితే, వెంటనే భీమసేనుడు కూడా నిన్ను అనుసరిస్తాడు. అర్జునుడు క్షేమంగా ఉంటే మనకు విజయం కలుగుతుంది - కనుక నేను చెప్పినట్లు చేయటానికి ఒప్పుకొనుము.

చ. **ద్రుపద విరాట కేకయులు దోర్బలధుర్యులు, ద్రౌపదేయు లు**
గ్రపు బిరుదుల్, ఘటోత్కచుఁ డరాతి విదారిఁ శిఖండి ధైర్యసా
ర పరుషమూర్తి, సంగర ధురంధరు లిద్దెసఁ దక్కుఁ గల్గు వా
రపరిమితుల్; గొనండు ద్రుపదాత్మజుఁ డగ్గురుఁ బోరఁ జీరికిన్. 298

ప్రతిపదార్థం: ద్రుపద, విరాట, కేకయులు= ద్రుపద విరాట కేకయ దేశాల వారు; దోర్బలధుర్యులు= భుజబల శక్తి కలవారు; ద్రౌపదేయులు= ఉపపాండవులు; ఉగ్రపుబిరుదుల్= భయంకరమైన పేరుగలవారు (గొప్ప పేరు గలవారు); ఘటోత్కచుఁడు; అరాతి విదారి= శత్రువులను తునాతునుకలు చేసేవాడు; శిఖండి; ధైర్యసార పరుషమూర్తి= ధైర్యసారమే నిష్ఠురమూర్తిగా ఉన్నవాడు; సంగర ధురంధరుల్= యుద్ధభారాన్ని వహించినవారు; ఈ+దెసన్= ఈ దిక్కున; తక్కన్ గల్గువారు= మిగిలినవారు; అపరిమితుల్= సాటిలేనివారు; ద్రుపదాత్మజుఁడు= ధృష్టద్యుమ్నుడు; ఆ+గురున్= ఆ ద్రోణాచార్యుడిని; పోరన్= యుద్ధంలో; చీరికిన్= లెక్కకు; కొనండు= తీసికొనడు (లెక్కించడు కనుక నీవు వెళ్ళవచ్చునని ధర్మజుడి భావం).

తాత్పర్యం: ద్రుపద విరాట కేకయ రాజులు, ఉపపాండవులు, ఘటోత్కచుడు, శిఖండి తక్కిన పాండవ పక్షములోని వారు భుజబలంతో, గొప్పపేరుతో, శత్రువులను అణగార్చుతూ ధైర్యసాహసాలతో ఒప్పినవారు - సాటిలేని బలం కలవారు ఈ వైపున్నారు. ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని లెక్కచేయడు.

క. **విను మా ధృష్టద్యుమ్నుం । డనలంబునఁ గుంభభవ వధార్థముగాఁ బు**
ట్టినవాఁడు గాఁడె? నా దెస । ననుమానం బేల? యోర్చు నాతం డతనిన్.' 299

ప్రతిపదార్థం: వినుము= నామాట వినుము; ఆ ధృష్టద్యుమ్నుండు= ద్రుపదుడి కుమారుడైన ఆ ధృష్టద్యుమ్నుడు; కుంభసంభవ వధ+అర్థముగాన్= ద్రోణుడిని చంపుట కొరకై; అనలంబునన్= అగ్నిలో; పుట్టినవాఁడు కాఁడె?= పుట్టినవాడు కదా?; నా దెసన్=నా విషయమై; అనుమానంబు+ఏల?= సందేహమెందుకు?; ఆతండు= ధృష్టద్యుమ్నుడు; అతనిని= ద్రోణాచార్యుడిని; ఓర్చున్=ఓడిస్తాడు.

తాత్పర్యం: 'ఓ సాత్యకీ! వినుము. ద్రోణుడిని చంపటానికై ధృష్టద్యుమ్నుడు అగ్నిగుండంలో పుట్టాడు కదా! నా విషయమై (అనగా నా క్షేమాన్ని గూర్చి) నీకు సందేహ మెందుకు? ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని ఓడిస్తాడు.'

వ. అనవుడు శినిపుంగవుం డొక్కింత చింతించి, పార్థుపజ్జం బోవుట బంటుతనంబున కూనంబుగా; దితండునుం బెద్దయుుం దటిమి పలికెడుఁ; బోదున కాక! యని మనంబున నిశ్చయించి, యధిపతి యాననం బాలోకించి. 300

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; శినిపుంగవుండు= శినివంశంలో ఉత్తము డయిన సాత్యకి; ఒక్కింత= కొంతసేపు; చింతించి= ఆలోచించి; పార్థుపజ్జన్+పోవుట= అర్జునుడి వైపు వెళ్ళటం; బంటుతనంబునకున్= వీరత్వానికి; ఊనంబు కాదు= తక్కువ కాదు; ఇతండును= ఈ ధర్మరాజుకూడ; పెద్దయున్= మిక్కిలి; తటిమి= తొందరపెట్టి; పలికెడున్= మాటలాడుతున్నాడు; పోదున కాక= వెళ్ళెదనుగాక!; అని మనంబునన్ నిశ్చయించి= అని మనస్సులో నిశ్చయించుకొని; అధిపతి ఆననంబు= ధర్మరాజు ముఖాన్ని; ఆలకించి= చూచి.

తాత్పర్యం: అనగా సాత్యకి కొంతసేపు యోచించి, అర్జునుడి దగ్గరకు పోవటం తన వీరత్వానికి తక్కువ కాదనీ, ఈ ధర్మరాజు మిక్కిలి తొందరపెట్టుతున్నాడు కనుక వెళ్ళుతాననీ మనస్సులో నిశ్చయించుకొని ఆ ధర్మరాజు ముఖం చూచి.

సాత్యకి ధర్మరాజు వేఁడిన చొప్పున నర్జును కడకుఁ బోవ సమ్మతించుట (సం. 7-86-1)

క. భవదీయ రక్ష యిమ్మెయి । సువిహిత మగునేని మేలు; సొచ్చెద భేరీ
రవ బృంహిత హేషాభై । రవ కౌరవ సేన గలఁగి క్రందుకొనంగన్. 301

ప్రతిపదార్థం: భవదీయ రక్ష= నీయొక్క అండ (ధర్మరాజునకున్న సహాయం); ఈ+మెయిన్= ఈ విధంగా; సువిహితము+అగునేని= బాగా ఉన్నట్లయితే; మేలు= మంచిది; భేరీరవ= నగారా చప్పుళ్ళతోడి; బృంహిత= ఏనుగుల యొక్క ఘీంకారమును; హేషా= గుఱ్ఱాల సకిలింతలు; భైరవ= భయంకరమైన శబ్దాలతోను; కౌరవసేన= కురుసేన; కలఁగి= చీకాకుపడి; క్రందుకొనంగన్= అతిశయించగా; చొచ్చెదన్= ప్రవేశిస్తాను.

తాత్పర్యం: నీ కున్న అండ ఈ విధంగా చక్కగా ఉన్నట్లయితే మంచిది. నగారాల మ్రోతతో, ఏనుగుల ఘీంకారంతో, గుఱ్ఱాల సకిలింతలతో భయంకరమైన కౌరవ సేన చీకాకు పడటం అధికమయ్యేటట్లుగా నేను వెళ్ళుతాను.

శా. వైరం బాత్మల నిండి యుుండ భుజగర్వంబుల్ దలిర్పంగ దు
ర్వారోత్సాహులు వీరె కొందఱు నృపుల్ రారాజు కార్యంబు వి
స్తారోదగ్రము సేయఁ బూని విలసత్సంరంభు లై పన్నియు
న్నా రీదట్టపుమూఁక లెట్టు లగునో నాకోల్తలం జూడుమీ! 302

ప్రతిపదార్థం: వైరంబు= శత్రుత్వం; ఆత్మలన్+నిండి ఉండన్= మనస్సులో నిండుకొని ఉండగా; భుజగర్వంబుల్= భుజదర్పం; తలిర్పంగన్= చిగురించగా; దుర్వార= అడ్డుకొనటానికి సాధ్యంకాని; ఉత్సాహులు= ఆసక్తి ఉన్నవారు; వీరె= వీరే; కొందఱు నృపుల్= కొందరు రాజులు; రారాజు కార్యంబున్= దుర్యోధనుడి పనిని; విస్తార= ఎక్కువగా; ఉదగ్రము= భయంకరంగా; చేయన్+పూని= చేయుటకు పూనుకొని; విలసత్+సంరంభులు+ఐ= ప్రకాశంతోడి తొందరలో; పన్ని ఉన్నారు= యుద్ధానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సిద్ధమై ఉన్నారు; ఈ దట్టపు మూఁకలు= ఈ ముమ్మరమైన సైన్యం; నా కోల్తలన్= నేను ఎదుట నిలిచి యుద్ధం చేయటంతో; ఎట్టులు+అగునో చూడుమీ!= ఏమౌతుందో చూడుమా!

తాత్పర్యం: మనస్సు నిండా శత్రుత్వంతో, భుజగర్వం ఒప్పి ఉండగా, అడ్డులేని ఉత్సాహంతో ఈ కొందరు రాజులు దుర్యోధనుడికొరకు విస్తారంగా, భయంకరంగా యుద్ధ ప్రయత్నంలో ఉన్నారు. దట్టమైన ఈ సైన్యం నేను ఎదుట నిలిచి యుద్ధం చేస్తే ఏమౌతుందో చూడుము.

క. **ఈ సేనల భేదించి భు । జా సంపద వెలయఁ బార్థసాహాయ్యం బేఁ**
జేసెద నీపం పనియెడు । భాసుర దీపమున కన్యబలతమ మెదురే? 303

ప్రతిపదార్థం: ఈ సేనల భేదించి= ఈ సైన్యాన్ని చీల్చి; భుజాసంపద= భుజబల విభవం; వెలయన్= ప్రకాశించగా; పార్థసాహాయ్యంబు= అర్జునుడికి సహాయం; ఏన్+చేసెదన్= నేను చేసెదను; నీ పంపు= నీ ఉత్తరువు; అనియెడు= అనేటువంటి; భాసుర దీపమునకున్= వెలిగే దీపానికి; అన్యబలతమము= ఇతరుల బలమనే చీకటి; ఎదురే?= ఎదురా?

తాత్పర్యం: ఈ సేనలను చీల్చి, భుజబలం ప్రకాశించగా అర్జునుడికి సహాయం చేస్తాను. నీ ఆజ్ఞఅనే దీపం ముందు శత్రు బలమనే చీకటి ఎదురు నిలుస్తుందా?

విశేషం: అలం: రూపకం.

క. **దవ్వని చూడకు; మార్తుర । క్రొ వ్వడఁచెద; సింధువిభునిఁ గూల్పఁగడఁగు నా**
వివ్వచ్చు మెచ్చు తెఱఁగున । నవ్వుచుఁ గవిసెద మరుద్గణంబులు వొగడన్. 304

ప్రతిపదార్థం: దవ్వు+అని చూడకు= దూరమని చూడవద్దు; మార్తుర= శత్రువులయొక్క; క్రొవ్వు= క్రొవ్వును; అడఁచెదన్= అడగారిస్తాను; సింధువిభుని= సైంధవుడిని; కూల్పన్= చంపటానికి కడఁగు= ప్రయత్నించే; ఆ వివ్వచ్చు= అర్జునుడు; మెచ్చుతెఱఁగునన్= మెచ్చుకొనే విధంగా; మరుత్+గణంబులు= దేవతా సమూహాలు; పొగడన్= కీర్తించగా; నవ్వుచున్= నవ్వుకొంటూ; కవిసెదన్= క్రమ్ముకొంటాను.

తాత్పర్యం: (ఇక్కడకు) దూరమని చూడవద్దు. విరోధుల పొగరు అణుస్తాను. సైంధవుడిని చంపటానికి ప్రయత్నించే అర్జునుడు మెచ్చుకొనే విధంగా, దేవతలందరు పొగడగా నవ్వుతూ శత్రువులను క్రమ్ముకొంటాను.

వ. **రథ్యంబుల దగ యుడుపను సారథి దప్పియుం దీర్పను రథంబు సవిశేష సన్నాహంబు సేయను వలయు' ననినం బ్రీతి నొంది యప్పాండవాగ్రజుండు పనుపం దద్ జ్ఞులైన పరిచారకు లత్తురంగంబుల నీరికిం దిగిచి ఖాణం బెత్తి తడవి దారుకానుజుం డగు నా సూతు నుపయుక్తాహారుం జేయుటయు, వాఁడును విశిష్టాయుధ సమేతంబుగా నయ్యరదంబు సుకల్పితంబు సేసి సింహధ్వజంబు గ్రాలం దెచ్చె; నంతకు మున్న సాత్యకియుఁ గృతస్నానుండై యాప్యాయన మధుపానంబున నెలమిం బొంది యమ్మహీపతి పాదంబులకుం బ్రణతుం డైనం గౌఁగిలించుకొని యతండు దీవించినం బెండ్లికి పోవులీలం దేరెక్కి యెక్కిడిన విల్లును మెచ్చువచ్చునమ్ములును దొడలపైఁ బెట్టికొని కదలి చను సమయంబున భీమసేనుండును నగ్రజునకుం బ్రణామంబు సేసి తన తోడన రాఁ గదలినం గని యా శినిపుంగవుం డతని కి ట్లనియె.** 305

ప్రతిపదార్థం: రథ్యంబుల= గుఱ్ఱాల; దగ= దాహం; ఉడుపను= పోగొట్టటానికిని; సారథి= సూతుడి; దప్పియున్= దాహంకూడా; తీర్పను= పోగొట్టటానికిని; రథంబున్= తేరును; సన్నాహంబు చేయను= సిద్ధం చేయటానికి; వలయున్= అవశ్యం; అనినన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనగా; ప్రీతిన్+ఒంది= సంతోషపడి; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ ధర్మరాజు; పనుపన్= ఉత్తరువు చేయగా; తద్‌జ్ఞులు+ఐన= ఆయా పనులు తెలిసినవారైన; పరిచారకులు= సేవకులు; ఆ+తురంగంబులన్= ఆ గుర్రాలను; నీరికిన్+తిగిచి= నీళ్ళకు తీసికొనిపోయి; ఖాణంబు= ఆహారాన్ని (గుర్రాలకు ఉలవలు మొదలయిన తిండి వస్తువులను); ఎత్తి= ఎత్తి; తడవి= నిమిరి (గుర్రాల శరీరాన్ని నిమిరి, అందుచేత వాటికి ఉత్సాహం కలుగుతుంది); దారుక+అనుజుండు= దారుకుడి తమ్ముడు; అగు= అయిన; ఆ సూతున్= ఆ సారథిని; ఉపయుక్త= ఉపయోగించబడిన; ఆహారుం చేయుటయున్= ఆహారం కలవానిని చేయటమూ; వాఁడును= ఆ సూతుడును; విశిష్ట= విశేషమైన; ఆయుధసమేతంబుగాన్= యుద్ధానికి కావలసిన అస్త్రశస్త్రాలతో; ఆ+ఆరదంబున్= ఆ తేరును; సుకల్పితంబు+చేసి= బాగా ఏర్పాటుచేసి; సింహధ్వజంబు= సింహపతాకం; క్రాలన్= వెలుగగా; తెచ్చెన్= తీసికొని వచ్చాడు; అంతకు మున్ను= అంతకంటే ముందుగా; సాత్యకియున్= సాత్యకి కూడ; కృతస్నానుండు+ఐ= స్నానం చేసినవాడై; ఆప్యాయన= తృప్తిని కలిగించే; మధుపానంబునన్= మధుపానంతో (మత్తును కలిగించే సురాపానంతో); ఎలమిన్+పొంది= సంతోషాన్ని పొంది (తృప్తిని పొంది); ఆ+మహీపతి= ఆ ధర్మరాజు; పాదంబులకున్+ప్రణతుండు+ఐనన్= పాదాలకు దండం పెట్టగా; కౌఁగిలించుకొని= కౌగిలిలోకి తీసికొని; అతండు= ఆ ధర్మరాజు; దీవించినన్= దీవనలు ఇవ్వగా; పెండ్లికిన్+పోవు లీలన్= పెండ్లికి వెళ్ళే విధంగా; తేరు+ఎక్కి= తన తేరుమీదకు ఎక్కి; ఎక్కిడిన= ఎక్కుపెట్టిన; విల్లును= ధనుస్సును; మెచ్చువచ్చు అమ్ములును= కీర్తిని తెచ్చే బాణాలను; తొడలపైన్= తన తొడలపై; పెట్టికొని= ఉంచుకొని; కదలి చను= బయలుదేరు; సమయంబునన్= వేళలో; భీమసేనుండును= భీముడును; అగ్రజునకున్= అన్నకు; ప్రణామంబు చేసి= నమస్కారం చేసి; తనతోడన= తనతోనే; రాన్+కదలినన్= రావటానికి బయలుదేరగా; కని= చూచి; ఆ శినిపుంగవుండు= ఆ శిని వంశంలో ఉత్తముడు (సాత్యకి); అతనికిన్= ఆ భీముడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సాత్యకి ధర్మరాజుతో తన గుర్రాల దప్పికను, సారథి దాహాన్ని తీర్చి తేరును సిద్ధం చేయవలసి ఉందన్నాడు. ధర్మరాజు సంతోషంతో ఉత్తర్వు చేశాడు. ఆయా పనులు తెలిసిన సేవకులు గుర్రాలకు నీళ్ళు తాగించి దాణా తినిపించి, వాటి ఒంటిని నిమిరారు. దారుకుని తమ్ముడయిన సారథికి ఆహారం తగినంతగా ఇచ్చారు. (శ్రీకృష్ణుడి సారథి దారుకుడు. అతడి తమ్ముడి సారథి దారుకుడి తమ్ముడు); ఆ సారథి సర్వసన్నద్ధంగా తేరును అలంకరించాడు. విశేషాయుధాలను సిద్ధం చేశాడు. శుచిగా యుద్ధానికి పోవటానికి సాత్యకి స్నానం చేసి, ఉత్సాహానికై మధువును ఆస్వాదించాడు. ఆశీర్వచనానికై ధర్మరాజుకు నమస్కరించాడు. ఆతడి దీవెనలతో పెండ్లికి వెళ్ళే విధంగా బయలుదేరి తేరెక్కాడు. తన వింటినీ, బాణాలను ఒడిలో పెట్టుకొన్నాడు. ఆతడి వెంట వెళ్ళటానికై భీమసేనుడు అన్నగారి ఉత్తర్వును తీసికొనటానికి ఆయనకు నమస్కరించాడు. తనతో బయలుదేరే భీముడితో శినివంశంలో శ్రేష్ఠుడయిన సాత్యకి ఈ విధంగా అన్నాడు:

క. 'అక్కట! రావలవదు నా । కెక్కటి యీ సేన దటిసి యేఁగుట భరమే?
యిక్కడన నిలువు; ద్రోణుని । యుక్కునఁ బతి కెడరు వుట్టకుండఁగ వలయున్.' 306

ప్రతిపదార్థం: అక్కట! రావలవదు= అయ్యో! (నీవు) రావద్దు; నాకున్= నాకు; ఎక్కటి= ఒక్కడుగా; ఈ సేనన్= ఈ సైన్యమును; దటిసి= చేరి; ఏఁగుట= పోవటం; భరమే?= కష్టమా? (కష్టంకాదు); ఈ+కడన= ఈ చోటనే; నిలువు= నిలిచిపొమ్ము (ఉండుము); పతికిన్= రాజునకు (ధర్మరాజుకు); ద్రోణుని= ద్రోణాచార్యుడి; ఉక్కునన్= బలంతో; ఎడరు= ఆపద; పుట్టకుండఁగన్ వలయున్= కలుగకుండా ఉండాలి.

తాత్పర్యం: 'నీవు నాతో రావద్దు. ఇక్కడనే ఉండుము. నేను ఒక్కడుగానే ఈ సేనవద్దకు చేరటం కష్టం కాదు. ద్రోణుడి వలన కలిగే ఆపద రాకుండా ధర్మరాజునకు అండగా ఉండుము.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనవుడు నతం 'డట్ల కాక యేను రాజ రక్షణంబునకు నిలిచెద; నీ వప్రమత్తుండవయి యరుగు' మనిన వదనంబు వికసింప' నీ యట్టి పెనుబ్రాపు గలుగ నా కెదు రెవ్వరు? సవ్యసాచి సైంధవుం దెగటార్చినం బేర్చిన కౌతుకంబున వచ్చి నిన్నును నీయన్ననుం గౌఁగిలించుకొనియెద' నని పలికి యవ్వీరుని నిలిపి లేళ్ళ గమిం గనుంగొను బెబ్బులియుంబోలె నీ సేనం జూచుచు నడచె నని యిట్లు సంజయుండు సాత్యకి సంరంభంబు ధృతరాష్ట్రునకుం జెప్పె నని చెప్పిన వేడ్క యుల్లంబున నివ్వటిల్లఁ 'బదంపడి చెల్లిన భండనంబు వినిపింపు' మనుటయు. **307**

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; అతండు= ఆ భీమసేనుడు; అట్లు+అ+కాక= అట్లేకానిమ్ము; ఏను= నేను; రాజరక్షణంబు నకున్= రాజును కాపాడటానికై; నిలిచెదన్= ఆగుతాను; ఈవు= నీవు; అప్రమత్తుండవు+అయి= జాగరూకుడవయి; అరుగుము= వెళ్ళుము; అనినన్= అనగా; వదనంబు వికసింపన్= ముఖం వికసించగా; నీ అట్టి= నీవంటి; పెను= పెద్ద; ప్రాపు=అండ; కలుగన్= ఉండగా; నాకున్+ఎదురు+ఎవ్వరు?= నన్నెవరెదుర్కోగలరు?; సవ్యసాచి= అర్జునుడు; సైంధవున్= సైంధవుడిని; తెగటార్చినన్= చంపినట్లయితే; పేర్చిన= ఎక్కువ అయిన; కౌతుకంబునన్= సంతోషంతో; వచ్చి= తిరిగివచ్చి; నిన్నును మీ అన్ననున్= నిన్నూ మీ అన్నగారినీ; కౌఁగిలించుకొనియెదన్= కౌగిలించుకొంటాను; అని పలికి= అని చెప్పి; ఆ+వీరుని నిలిపి= ఆ వీరుడైన భీముడిని ఆపి; లేళ్ళగమిన్= జింకల గుంపును; కనుంగొను= గుర్తించే; బెబ్బులియున్+పోలెన్= పెద్దపులి మాదిరిగా; నీసేనన్+చూచుచున్= నీ సైన్యాన్ని చూస్తూ (కౌరవ సైన్యాన్ని); నడచెన్+అని= ముందు కురికాడని; ఇట్లు= ఈ విధంగా; సంజయుండు= సంజయుడు; సాత్యకి= సాత్యకియొక్క; సంరంభమున్= తొందరను; ధృతరాష్ట్రునకున్ చెప్పెన్= ధృతరాష్ట్రుడికి చెప్పాడు; అని చెప్పినన్= అని చెప్పగా; వేడ్క= ఉత్సాహం; ఉల్లంబునన్= మనసులో; నివ్వటిల్లన్= కలుగగా; పదంపడి= ఆ మీద; చెల్లిన= సాగిన; భండనంబు= యుద్ధపు; విధంబు= పద్ధతిని; వినిపింపుము= వినజేయుము; అనుటయున్= అని అనగా. (ధృతరాష్ట్రుడు సంజయుడిని ప్రశ్నించాడు).

తాత్పర్యం: దాని కాతడు అట్లే అన్నాడు. రాజునకు తాను అండగా ఉంటాననీ, సాత్యకిని జాగ్రత్తగా వెళ్ళుమనీ భీముడు కోరాడు. అపుడు సాత్యకి మొగం సంతోషంతో వికసించింది. 'అర్జునుడు సైంధవుడిని చంపిన తరువాత అతిశయించి ఉత్సాహంతో వచ్చి నిన్నూ, మీ అన్ననూ కౌగిలించుకొంటాను' అని చెప్పుతూ జింకల గుంపును చూచిన పెద్దపులి మాదిరిగా కౌరవసైన్యం మీదకు ఆతడు దూకాడు - అని సాత్యకి సంరంభాన్ని సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పగా ఆ మీదట. (తరువాతి ఆశ్వాసంలోని వచనంతో అన్వయం).

ఆశ్వాసాంతము

ఉ. నిర్మల చిత్తభృంగ రమణీయ వికస్వర పుండరీకతా
ధర్మ నిరూఢ! సంసరణ తాప నిరాకరణ ప్రగాఢ స
త్కర్మ ఫలాకృతీ! భువన తాపి భవప్రకృతీ! తపఃక్రియా
కర్మఠ సంయమీశ్వర సఖా! సమతా సమవేత! చిత్సుఖా! **308**

ప్రతిపదార్థం: నిర్మల= స్వచ్ఛమైన; చిత్తభృంగ= మనస్సనే తుమ్మెదకు; రమణీయ= అందమైన; వికస్వర= వికసించిన; పుండరీకతా= తెల్లతామరయొక్క; ధర్మ= గుణ విశేషంతో; నిరూఢ!= ప్రసిద్ధి పొందినవాడా!; సంసరణ= సంసారం వలని; తాప= బాధలను;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిరాకరణ= తిరస్కరించే; ప్రగాఢ= దట్టమైన; సత్కర్మ= మంచిపనియొక్క; ఫల= పంటయొక్క; ఆకృతీ!= ఆకారమైనవాడా!; భువన= ప్రపంచం యొక్క; తాపి= తపింపజేయు; భవప్రకృతీ!= సంసారమునకు మూలభూతమైనవాడా!; తపఃక్రియా= తపస్సు చేయటంలో; కర్మఠ= ఆసాంతము పనిని చేయునట్టి; సంయమీశ్వరసఖా!= ఋషీశ్వరుల పుత్రుడైనవాడా!; సమతా= సమానత్వంతో; సమవేత!= సంబంధం కలవాడా!; చిత్సుఖా!= జ్ఞానసౌఖ్యం కలవాడా!

తాత్పర్యం: తుమ్మెదలు పద్మములందు విహరించుట్లు కామక్రోధాదులులేని నిర్మల చిత్తములు నీయందు విహరించును. సర్వజనులను తపింపజేయు సంసార దుఃఖమునకు మాయయే హేతువగుటచే ఆ దుఃఖమును పోగొట్టు వాడవు నీవు మాత్రమే. సత్కర్మాచరణమునకు ఆనందరూపుడవగు నిన్ను పొందుటయే ఫలము. దృఢదీక్షతో కర్మముల నాచరించువారికి మిత్రుడవై వారి దుఃఖమును పోగొట్టుదువు. సర్వభూతములయందును నీవు సమభావముతో నుందువు. ఆనంద చైతన్యములే నీ వాస్తవ స్వరూపము.

క. పరిధాన ప్రావరణీ । కరణాదృత పీతవసన గజచర్మ! సము
ద్ధుర వాహనీకృతోజ్జ్వల । గరుడ వృషభ! పరమ మోక్షకర! దురితహరా! 309

ప్రతిపదార్థం: పరిధాన= కట్టు వస్త్రముగాను; ప్రావరణీ= ఉత్తరీయంగాను; కరణ= చేయుటచే; ఆదృత= ఆదరింపబడిన; పీతవసన= పసుపుపచ్చని వస్త్రమూ; గజచర్మ!= ఏనుగుతోలు గలవాడా! - హరికి పట్టు వస్త్రము కట్టుబట్ట, హరునకు గజచర్మము ఉత్తరీయము; సముద్ధుర= మిక్కిలి గొప్పవైన; వాహనీకృత= వాహనములుగా చేయబడిన; ఉజ్జ్వల= ప్రకాశించెడి; గరుడ= గరుత్మంతుడు; వృషభ!= ఎద్దు గలవాడా! - హరికి గరుడుడు వాహనము, హరునకు ఎద్దు వాహనము; పరమ మోక్షకర!= మిక్కిలి ఉత్కృష్టమైన మోక్షమును ఇచ్చువాడా!; దురితహరా!= పాపములను పోగొట్టువాడా! హరిహరనాథా!.

తాత్పర్యం: పీతాంబరం కట్టుబట్టగాను, గజచర్మం ఉత్తరీయంగాను ఆదరించిన వాడా! గరుత్మంతుని, ఎద్దును వాహనముగా చేసికొన్నవాడా! ఉత్కృష్టమైన ముక్తిని ప్రసాదించువాడా! పాపహరా! హరిహరనాథా!

విశేషం: అలంకారం: యథాసంఖ్యం.

మాలిని.

నిరుపమ గుణరాశీ! నిర్గుణిత్వ ప్రకాశీ!
భరిత భువన కార్యా! భవ్యనైష్కర్మ్యధుర్యా!
విరతి నిరత భావ్యా! విశ్వలోకైక సేవ్యా!
స్ఫురిత బహు శరీరా! శుద్ధ వైరూప్యసారా! 310

ప్రతిపదార్థం: నిరుపమగుణరాశీ!= సాటిలేని గుణములప్రోవు కలవాడా!; నిర్గుణిత్వప్రకాశీ!= గుణరాహిత్యం చేత ప్రకాశించేవాడా!; భరిత+భువనకార్యా!= భరింపబడిన ప్రపంచపు పనులు కలవాడా!; భవ్యనైష్కర్మ్యధుర్యా!= యోగ్యమగు నిష్కర్మ ధుర్యుడా!; విరతి నిరత భావ్యా!= సర్వకర్మ సన్న్యాసమందు ఆసక్తిగలవానిచే భావింపదగినవాడా!; విశ్వలోకైక సేవ్యా!= ప్రపంచమంతటిలోనూ సేవింపదగినవాడా!; స్ఫురితబహుశరీరా!= అనేక శరీరాలతో వెలిగేవాడా! (అవతారా లెత్తేవాడా!); శుద్ధ= స్వచ్ఛమైన; వైరూప్య= శుద్ధ విరూపత్వముయొక్క సారము గలవాడా!; సారా!= సారమైన వాడా!

తాత్పర్యం: సాటిలేని గుణములకు నిధియైనవాడా! గుణరహితుడవై వెలిగేవాడా! ప్రపంచంలోని భారమైన పనులు కలవాడా! యోగ్యమైన నిష్కర్మ సిద్ధాంతాన్ని వివరించటంలో దిట్ట అయినవాడా! ప్రపంచానికంతటికినీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సేవ్యమానుడా! అనేకావతారాలతో స్వచ్ఛమగు విశేష రూపం కలవాడా! వైరూప్య సారమా! (అని హరిహరనాథులను ప్రార్థించాడు).

విశేషం: అలం: అంత్యాను ప్రాసం.

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున ద్రోణపర్వంబునందుఁ దృతీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది ఉభయ కవిమిత్రుడనే బిరుదం కలవాడు, కొమ్మనామాత్యుడి పుత్రుడు, పండితులను ఆరాధించటం చేత ప్రకాశించేవాడు (పండితులచేత ఆరాధించబడటం చేత ప్రకాశించేవాడు) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలోని ద్రోణపర్వంలోని మూడవ ఆశ్వాసం.

ద్రోణపర్వంలోని తృతీయాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 10

కర్ణపర్వము

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య

డా|| యస్.వి.రామారావు

డా|| మరుపూరి కోదండరామిరెడ్డి

ప్రధాన సంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Karna parvamu of Tikkana Somayaji
Vol.X .

Commentary by
Sri Eluripati Annanta Ramaiah - 1st Canto
Dr. S.V.Ramarao - 2nd Canto
Dr. Marupuri Kodanda Rami Reddy 3rd Canto

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Publications Series No.609
First Edition : 2004
First Re-print : 2006

Second Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D., Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్పైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

మన జాతీయకావ్యం మహాభారతం. ఇందులో వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తులు–వీటిసారం సముచితంగా చోటుచేసుకున్నందువల్ల ఈ గ్రంథం పంచమవేదంగా ప్రశస్తి పొందింది. మహాభారతంలో పాండవుల, కౌరవుల చరిత్రలు చక్కగా ఆవిష్కరింపబడ్డాయి. పాండవులు ధార్మిక, సాత్త్వికాది, దైవీ గుణసంపత్తి కలవారు. కౌరవులు అధార్మిక, రాజస, తామసిక శక్తుల సమగ్ర స్వరూపాలు. ఇలా దైవీరాక్షస శక్తుల మధ్య జరిగిన సంఘర్షణే భారత సంగ్రామం. ధార్మిక జీవనప్రవృత్తికి మహాభారతం ప్రాణాధారం.

అటువంటి మహాభారతాన్ని వ్యాఖ్యానసహితంగా ప్రజలకు అందించాలనే మహోన్నతాశయంతో తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం 1982–83 నన్నయ సంవత్సరంలో నిర్ణయించింది. సామాన్యప్రజలకు సందేశంతోపాటు, నేటియువతరానికి కర్తవ్యాన్ని బోధించేవిధంగా కవిత్రయభారతాన్ని ప్రతిపదార్థ తాత్పర్య విశేషాంశాలతో ప్రకటించాలని సంకల్పించింది. మహాభారత ప్రచురణను ఒక మహాయజ్ఞంగా భావించి, నిర్విరామంగా ఈ పనిని చేపట్టింది. ఆంధ్రదేశంలోని ముప్పైమంది ప్రసిద్ధ విద్వాంసులచే, మహాభారతానికి వ్యాఖ్యానం వ్రాయించడం జరిగింది. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారికి 1996–97 లో సంపాదకత్వ బాధ్యతలు ఒప్పజెప్పటం జరిగింది. త్వరితగతిన భారతేతిహాసాన్ని ముద్రించి ప్రజలముందు ఉంచాలనే దృఢసంకల్పంతో ముందుకు వెళ్తున్నాం.

ఈ సదాశయంలో భాగంగానే ఆది, సభా, ఆరణ్య, విరాట పర్వాలను 2000 సంవత్సరంలోను, 2003 సంవత్సరంలోను గోదావరి పుష్కరాల సందర్భంగా ఆరణ్య, విరాటపర్వాలను; 2004 లో కృష్ణాపుష్కరాల సందర్భంగా ఉద్యోగ, భీష్మ, ద్రోణ పర్వాలను వెలువరించడం జరిగింది.

ఇప్పుడు కర్ణపర్వం మీముందు ఉంచుతున్నాం. ఈ పర్వానికి శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య, డా॥ యస్వీ. రామారావు, శ్రీ మరుపూరు కోదండరామిరెడ్డి గారలు వ్యాఖ్యానం సంతరించారు. ప్రతిపర్వానికివలెనే ఈ పర్వానికికూడ ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు ప్రధాన సంపాదకత్వం వహించి విపుల పీఠికను, కథాసంగ్రహాన్ని సమకూర్చారు. ఇందుకు వ్యాఖ్యాతలకు, ప్రధానసంపాదకులకు మా ధన్యవాదాలు.

ఎప్పటిలాగే పాఠకులు గ్రంథాన్ని సమాదరిస్తారని ఆశిస్తున్నాను.

కార్యనిర్వహణాధికారి
తి.తి. దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతీ సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమస్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాది కార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు:

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 - 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జూలై 11వ తేదీన హైదరాబాదు బాలాజీభవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం:

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్యపర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అరసున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో

ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసియున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్పురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిగమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగా పర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జూలై 3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన:

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డిగారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి. ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ నివేదిక సారాంశం:

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు	**ప్రొ।। ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ।।కె. సర్వోత్తమరావు	**శ్రీ డి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా।। రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంత ప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం:

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిన అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు'

'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జూలై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీ డి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు:

మొదటి మూడుపర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్నభిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీ స్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలోని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం:

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది.

భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్ల కొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పంద్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులుబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి''.

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాస్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదకమండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

సంపాదక మండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు — శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య — డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
డా॥ కె.జె. కృష్ణమూర్తి — డా॥ కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే. — డా॥ బిరుదురాజు రామరాజు
అన్నమాచార్యప్రాజెక్ట్ డైరెక్టర్, తి.తి.దే. — డా॥ ఎం. కులశేఖరరావు
ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి, తి.తి.దే. — డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలులలోని సభ్యులయొక్క సంయుక్తసమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటాలన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్తపాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ప్రథమసంపుటం ఆదిపర్వం (రెండుభాగాలు), ద్వితీయసంపుటం-సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి. సుబ్బారావుగారి తరువాత కార్యనిర్వహణాధికారి అయిన డా॥ పి. కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారు వచ్చిన తత్క్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణనుగూర్చి ఆస్తకితో గమనిస్తూ అన్ని విధాల సహకరించి ఆది, సభాపర్వాల విడుదలకు ఏర్పాటుచేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాలనిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ప్రణాళిక వ్యాఖ్యాసహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. అప్పట్లో తీవ్రతరం అయిన ప్రయత్నంతో గోదావరి పుష్కరాల సమయానికి ఆరణ్యపర్వం (2 భాగాలు), విరాటపర్వం విడుదల అయ్యాయి. తర్వాత శ్రీ అజేయ కల్లంగారు కార్యనిర్వహణాధికారిగా విచ్చేసిన వెనువెంటనే ఈ మహాభారత వ్యాఖ్యానసహితప్రచురణ ప్రణాళికను మరింత వేగిరపరచి కృష్ణాపుష్కరాల లోపల యుద్ధ పంచకాన్ని విడుదల చేయాలనీ, 2004 సంవత్సరం చివరకు మిగిలిన పర్వాష్టకము వెలుగు చూడాలనీ నిర్ణయించడం జరిగింది. ఆ మార్గదర్శక సూత్రానుగుణంగా ఇప్పుడిప్పుడే ఉద్యోగ, భీష్మపర్వాలు వెలువడ్డాయి. ప్రస్తుతం ద్రోణపర్వం కూడ వెలుగు చూడబోతున్నది. మున్ముందు అనగా కృష్ణాపుష్కరాలలోపల శాంతిపర్వంవరకు వెలుగుచూచే అవకాశం ఉన్నది. 2004 సంవత్సరంలోపల మిగిలిన పర్వాలన్నీ విడుదల చేయడానికి సర్వయత్నాలు సాగుతున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారత' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. సాహిత్యప్రియులూ, తి.తి.దేవస్థానం సంయుక్తకార్యనిర్వహణాధికారిగా ఉండిన శ్రీ ఆర్. అప్పారావు, ఐ.ఏ.ఎస్., గారికి వందనములు.

సంబంధిత విభాగాధిపతిగా, సలహామండలి ఎక్స్ అఫిషియోసభ్యులైన డా॥ పి. రంగారావు, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి-వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగా సహాయ సహకారాలందించిన తదితర అధికారిగణానికి నమస్సులు. ఈ ప్రణాళికద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధానపాత్ర వహించిన-వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదకమండలి, సలహామండలి) విద్యావేత్తలకు, ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారికి- నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి.దేవస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడంలో వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్ కమిటీవారు దానికొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానిక పండితవర్యుల ఉపసంఘం (ఎడిటోరియల్ సెల్) నిర్మాణానికి సిఫారసు చేయగా, దేవస్థానం ఆమేరకు **పండితవరేణ్యులు డా॥ కె.సర్వోత్తమరావు, శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీ ముదివర్తి కొండమాచార్యులు గారలతో** ఎడిటోరియల్‌సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈ సెల్ ఉపకారం మరువరానిది. వీరు వర్క్‌షాపువలె నిర్వహింపబడుతున్న కవిత్రయ మహాభారత యజ్ఞంలో పాలుపంచుకుంటున్నారు. ఆ కారణంగానే తక్కిన పర్వాలు త్వరితంగా వెలువరించగలుగుతున్నాం.

"సప్తగిరి" సంపాదకులుగా, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి అమరులయ్యేవరకూ ప్రముఖపాత్ర వహించిన కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె. రాధారమణ, డాక్టర్ ఎ. సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి. ఎన్. శ్రీనివాసన్ గారలకు, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పాఠకులకు తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయాధికారి శ్రీ ఐ. పార్వతీశ్వరరావుగారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగుచూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ఎన్.ఎస్. రామమూర్తి
కన్వీనర్
సంపాదకుడు - సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి

అధ్యక్షులు

శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకుడు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం

సంపాదకమండలి సభ్యులు

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆచార్య ఎం. బుద్ధన్న

డా॥ పి. రంగారావు, (పౌరసంబంధాధికారి)
(ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ మేడసాని మోహన్, డైరెక్టర్
అన్నమాచార్య ప్రాజెక్టు, (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద, కార్యదర్శి
ధర్మప్రచార పరిషత్తు (ఎక్స్ అఫిషియో సభ్యులు)

కన్వీనర్

డా॥ ఎన్.ఎస్.రామమూర్తి,

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

	వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1.	డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2.	డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3.	డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా 1,2
4.	డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5.	డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. 1
6.	డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7.	శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8.	డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9.	డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10.	డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11.	శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12.	శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13.	డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14.	డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15.	డాక్టర్ కె. రాజన్నశాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16.	శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17.	డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18.	డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19.	డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20.	డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21.	డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22.	డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23.	డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24.	శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25.	డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26.	డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	ఆను. ఆశ్వా. 1,2
27.	డాక్టర్ శలాక రఘునాథశర్మ	ఆను. ఆశ్వా. 3,4
28.	డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఆను. ఆశ్వా. 5
29.	శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30.	డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది.	–	ఆదిపర్వం
సభా.	–	సభాపర్వం
ఆర.	–	ఆరణ్యపర్వం
విరా.	–	విరాటపర్వం
ఉద్యో.	–	ఉద్యోగపర్వం
భీష్మ.	–	భీష్మపర్వం
ద్రోణ.	–	ద్రోణపర్వం
కర్ణ.	–	కర్ణపర్వం
శల్య.	–	శల్యపర్వం
సౌప్తి.	–	సౌప్తికపర్వం
స్త్రీ.	–	స్త్రీ పర్వం
శాంతి.	–	శాంతిపర్వం
అను.	–	ఆనుశాసనికపర్వం
అశ్వ.	–	అశ్వమేధపర్వం
ఆశ్ర.	–	ఆశ్రమవాసపర్వం
మౌస.	–	మౌసలపర్వం
మహా.	–	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	–	స్వర్గారోహణపర్వం
సం.	–	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	–	సంస్కృత మహాభారతము
అను.	–	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	–	ప్రధాన సంపాదకుడు

క.	–	కందపద్యం
వ.	–	వచనం
ఆ.	–	ఆటవెలది
తే.	–	తేటగీతి
సీ.	–	సీసం
ఉ.	–	ఉత్పలమాల
చ.	–	చంపకమాల
మ.	–	మత్తేభ విక్రీడితం
శా.	–	శార్దూల విక్రీడితం
ఆశ్వా.	–	ఆశ్వాసం
క్రీ.శ.	–	క్రీస్తుశకం
య.	–	యగణం
మ.	–	మగణం
త.	–	తగణం
ర.	–	రగణం
జ.	–	జగణం
భ.	–	భగణం
న.	–	నగణం
స.	–	సగణం
ల.	–	లఘువు
గ.	–	గురువు
అలం.	–	అలంకారం
సం.	–	సంవత్సరం
మొ.	–	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పీఠిక

[పీఠిక విషయసూచిక:-1.మహాభారతంలో కర్ణుడు ఉపప్రతినాయకుడు - పు.1* 2. విషాదాంత వీరుడు - పు.6* 3.కర్ణపర్వం ఒక ప్రబంధం - పు.9* 1).ఇతిహాస స్వభావం - పు.9* 2).ఆఖ్యాన కథాకథన చాతుర్యం - పు.11* 3). ఆఖ్యానానికి అనుకూలమైన ఉపాఖ్యానాల కథనం -పు.13* (i).త్రిపురాసుర సంహారం -పు.14* ii). హంసకాకీయోపాఖ్యానం- పు.15* 4). నాటకీయతను పోషించే సంభాషణ సంవిధానం -పు.17* 5). వర్ణనా వైదగ్ధ్యం: రచనా శిల్పం-పు.21* 6).రసరామణీయకం-పు.26* 4. కర్ణుడి జన్మవృత్తాంతం: ఒక అద్భుతం - పు.28* 5. కర్ణపర్వం: అంతరార్థం -పు.33* 6. కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం -పు.34* కర్ణపర్వ కథాసారం -పు. 37]

ఉ. ‘అనలుఁడు భాస్కరుండును సుధాంశుఁడు నధ్వరసంప్రవర్తకుల్
వినుము నరేంద్ర! యీ క్రతువు విష్ణుమయం; బిది నిర్వహించి ర
ర్జునుఁడును గర్ణుఁడున్ సమరరూపమునం; దగ నీ ప్రబంధ మిం
పొనరఁ బఠించినన్ వినిన నొందు నరుం జిరసౌఖ్యసంపదల్.’ (కర్ణ. 3. 397)

తిక్కన మహాకవి సోమయాజి కావటంచేత కర్ణపర్వాన్ని విష్ణుమయ మహాయజ్ఞంగా భావించాడు: మహాభారతాన్ని ప్రబంధమండలిగా సంభావించాడు. కాబట్టి కర్ణపర్వాన్ని ప్రబంధంగా నిర్మించాడు. ఇది సమరరూప యజ్ఞంగా నిర్వహించినవారు అర్జునుడు, కర్ణుడు. యజ్ఞాన్ని ప్రవర్తిల్లచేసినవారు అగ్ని, సూర్యుడు, చంద్రుడు. అందుచేత ఇది పుణ్యప్రబంధంగా పరిగణించబడింది. దీనిని చదివినా, విన్నా చిరసౌఖ్యసంపదలు లభించటం ఫలశ్రుతి! ఇది ఈ కర్ణ పర్వ వివేచనానికి ఉపశ్రుతి!!

1. మహాభారతంలో కర్ణుడు ఉపప్రతినాయకుడు:

మహాభారతేతిహాస కథానాయకుడు ధర్మరాజు. అతడి పక్షంలో ఉపనాయకుడు శ్రీకృష్ణుడు. కథలో ప్రతినాయకుడు దుర్యోధనుడు. అతడి పక్షంలో ఉపనాయకుడు కర్ణుడు.

శ్రీకృష్ణుడి మాటలలో ధర్మరాజు ధర్మతరువు. అర్జునుడు స్కంధం, భీముడు శాఖ, నకుల సహదేవులు పుష్పఫలాలు; శ్రీకృష్ణుడూ, బ్రాహ్మణులూ, వేదాలూ ఆ ధర్మవృక్షమూలాలు! దుర్యోధనుడు రోషమయ తరువు. కర్ణుడు స్కంధం, శకుని కొమ్మ; దుశ్శాసనుడు పుష్పఫలాలు, ఆ వృక్షమూలం ధృతరాష్ట్రుడు. (ఉద్యో. 1.355, 356). రెండు తరువులలో స్కంధాలు అర్జునుడు, కర్ణుడు. వృక్షం మూలశక్తితో బ్రతుకుతుంది. స్కంధశక్తితో నిలుస్తుంది. శాఖాబలంతో విస్తరిస్తుంది. పుష్పఫలాలతో శోభిల్లుతుంది. మూలశక్తి ఉన్నా బోదె డొల్లపడిపోతే తరువు కూలిపోతుంది. కాబట్టి ధర్మజుడి స్థిరత్వం అర్జునుడిపైనా, దుర్యోధనుడి అస్తిత్వం కర్ణుడిమీద ఆధారపడి ఉన్నాయన్నమాట! కర్ణపర్వ నిర్మాణంలో ఉన్న కథా శక్తి కూడా ఇదే!

కర్ణ దుర్యోధన ప్రథమ సమావేశం ఒక విచిత్ర సన్నివేశం. కుమారాస్త్ర విద్యా ప్రదర్శన సందర్భంలో అర్జునుడి వివిధాద్భుతాస్త్ర విద్యా ప్రదర్శనాన్ని చూచి దుర్యోధనుడు అవమానపడి తెల్లబోయాడు. ఘటబద్ధమైన ఉగ్రోరగంవలె తనలో తాను బుసలు కొట్టుకొన్నాడు. సహాయంకొరకు ప్రతీక్షించాడు. ఎదుట.

శా. 'సాలప్రాంశు' నిజోజ్జ్వలత్కవచు, శశ్వత్కుండలోద్భాసితున్
బాలార్కప్రతిమున్, శరాసనధరున్, బద్ధోగ్రనిస్త్రింశు, శౌ
ర్యాలంకారు, సువర్ణవర్ణు. ఘనుఁ, గర్ణాఖ్యున్ జగత్కర్ణపూ
ర్ణాలోలద్గుణుఁ జూచి' **(ఆది. 6.31)**

తేరుకొన్నాడు. ఆతడి పరాక్రమాన్ని గమనించి కౌఁగిలించుకొని 'నాతో బద్ధసఖ్యుండవయి, నాకును బాంధవులకును హితంబుసేసి నన్నుం గురురాజ్యం బేలించి నా యైశ్వర్యం బుపయోగింపు'మన్నాడు. కర్ణుడు 'అట్లే చేయుదు'నని అంగీకరించాడు. అతడి స్నేహానికి చిహ్నంగా అర్జునుడి ఎదుట నిలచి పోరే రాజ్యాధికారపు హక్కు ఏర్పడటానికి సూచికగా దుర్యోధను డతడికి అంగరాజ్యాభిషేకం చేసి గౌరవించాడు. నాటినుండి కర్ణుడు దుర్యోధనుడిని కురురాజ్యం ఏలించటానికై సమర్థించాడు. అతడికి ప్రాణమిత్రుడై ఆరవప్రాణంగా నిలిచాడు. అప్పటినుండి కర్ణుడు అన్నమాటకు కట్టుబడి, ఎన్నో ఘట్టాలలో దుర్యోధనుడికి కుడిభుజమై నిలిచి అతడి ఆనందమే పరమార్థంగా భావించి కార్యసాధన చేశాడు.

శుభాంగీ స్వయంవర మహోత్సవంలో బలవంతాన ఆమెను దుర్యోధనుడు తెచ్చేటప్పుడు, అతడిమీద తిరుగబడిన అరివర్గాలను జయించి, జరాసంధుడిని ఓడించి, మాలినీనగరాన్ని ఆక్రమించి కర్ణుడు మిత్రుడి మానాన్ని కాపాడి, మగువను దక్కించాడు. దుర్యోధనుడు చేసేది న్యాయమా? అన్యాయమా? అనే ప్రశ్న అతడికి లేదు. అతడి మనసు రంజింపజేయటమే అతడి ఆదర్శం! దానినే సేవాధర్మ మని భావించాడు. అందువలన దుర్యోధనుడి అచంచల విశ్వాసాన్ని చూరగొన్నాడు.

'మనకుఁ బాండురాజ తనయ వర్గమునకు నెట్లు పొందు గలుగు? నేను రాజ్యభాగ మీను' అని దుర్యోధనుడి మతం. దాని ననుసరించి పాండవులపై ఆతడు పన్నిన కుతంత్రాలకు లెక్కలేదు. వాటికన్నిటికి కర్ణుడి సమర్థనమే మూల కారణం. అయినను వాటి నాచరించే విధానాలను దుర్యోధనుడు సూచించే మార్గంకంటె కర్ణుడు ప్రతిపాదించే పద్ధతి సాధారణంగా వీరోచితంగా ఉంటుంది. పాండవ వివాహానంతరం ద్రౌపదీపాండవుల మధ్య కలతలు కల్పించి, ఉపాంశు ప్రయోగంతో భీముడిని వధించి, అర్జునుడిపై కర్ణుడిని ప్రయోగించాలని దుర్యోధనుడు భావించాడు. కాని, ఇదివరలో భీముడిపట్ల విఫలాలైన ప్రయత్నాలను కర్ణుడు పేర్కొని '......విక్రమము భూరియశః ప్రియులైన రాజనందనులకు సర్వసాధనము, ధర్మువు శత్రు నిబర్హణంబులన్' అని సూచించాడు. దానిని నిరాదరించిన కురువృద్ధులను లెక్కచేయలేదు.

తే. 'ముదుసళులు దమ కిమ్ముగాఁ జదికొండ్రు
గాక! పతులకు హితమగు కర్జ మేల
యొలసి చెప్పుదు? రహితులఁ గలిపికొనుట
ధర్మ్మ వని; రిది నయవిరుద్ధంబు గాదె?' **(ఆది. 8.38)**

అన్నాడు. దుర్యోధనుడిని సమర్థించే కర్ణుడిని కురుసభలో అదుపున పెట్టేవా రెవ్వరూ లేరు. రారాజు అతడి కంతటి స్వాతంత్ర్యం ఇచ్చి అతడి ప్రతినిధిగా కురుసభలో చెలామణి చేయించాడు.

దుర్యోధన స్వార్థ దావాగ్నికి కర్ణుడనే ఝంఝామారుతం తోడైంది. చివరకు కౌరవాటవి పూర్తిగా దగ్ధమైపోయింది. అందులో కర్ణుడిపని అగ్నిని ప్రజ్వలింపజేయటమే. కర్ణుడు సమయం చూచి దుర్యోధనుడి మనోనిశ్చయానికి అనుగుణంగా సందర్భాలను పోషించాడు. దానిని అండగా తీసికొని దుర్యోధనుడు పెచ్చుపెరిగిపోయేవాడు!

కురుసభలో ద్రౌపదికి జరుగుతున్న అవమానం చూచి వికర్ణుడు ఆమె అధర్మ విజిత అనీ, ఆ కోమలిని ఆ విధంగా నిండు సభలోనికి తీసికొనిరావటం అన్యాయమనీ ఉపన్యసించాడు. అంతవరకు సభ్యులు అన్యాయ శ్రవణవికర్ణులై ఉండటం చేత దుర్యోధనుడి చర్యలు అవిమర్శకంగా, నిరాఘాటంగా సాగాయి. వికర్ణుడి ప్రశ్న దుర్యోధనుడి ప్రయత్నానికి 'మొదలంట నఱకు గొడ్డలిపెట్టు' వంటిది. దానిని సుయోధనుడు స్వయంగా సమర్థించుకొంటాడా? అతడి చర్యలు న్యాయాన్యాయ విచక్షణతో సాగినవి కావు. ఆనాడు మయసభలో 'సహస్రవిలాసినీ పరివృత యయియున్న ద్రౌపది నగి'న నవ్వు హృదయశల్యమై ఉండగా, దానికి ప్రతిచర్య చేసి, ద్రౌపదినీ పాండవులనూ అవమానించవలెననే పట్టుదలతో మాత్రమే చేసినవి. ఈ పగసాధించటంలో ధర్మాధర్మాలు లేవు. దానికి సమాధానం దుర్యోధనుడు ఏమని చెప్పగలడు?' అప్పుడు కర్ణుడు - అంతవరకు మిన్నకున్నవాడు - లేచి దుర్యోధనుడిని సమర్థిస్తూ ఉపన్యసించాడు.

రజస్వలా, ఏకవస్త్ర అయిన ద్రౌపదిని సభకు బలవంతాన లాగికొనిరావటం అన్యాయమని వాదించే వికర్ణుడిని మందలించి, 'భార్యకు దైవవిహితుండయిన భర్త యొక్కరుండ. ఇది యనేకభర్తృక గావున బంధకి యనంబడు; నిట్టిదాని విగతవస్త్రం జేసి తెచ్చిన ధర్మవిరోధంబు లేదు' అని దుర్యోధనుడి చర్యను సమర్థించాడు కర్ణుడు. అసలే ప్రతీకారవాంఛతో కన్నుమిన్ను గానక వర్తిస్తున్న దుర్యోధనుడి కతని మాటలు ఆలంబనా లయ్యాయి. 'ఇట్టి దానిని విగతవస్త్రం జేసినను పాపము లే'దని కర్ణుడు చెప్పాడు కదా! నారీజనాలకు అవమానంలో పరాకాష్ఠ అనదగిన అటువంటి అవమానం ద్రౌపదికి కలిగితే ఇక కావలసిం దేమిటి? ఎదుట ఉన్న భర్తలకు అంతకంటె తలవంపులేమి కావాలి? కర్ణుడి సూచనకు దుర్యోధనుడు ఉబ్బిపోయాడు. ఆవేశం కళ్ళు కప్పింది. దుర్యోధనుడు దుశ్శాసనుడిని పిలిచి 'ఇప్పాండవులయు, ద్రౌపదియు వస్త్రంబు లపహరింపు'మని ఆజ్ఞాపించాడు. దీనికి కారణం కర్ణుడే.

అంతటితో ఆగక ద్రౌపది నుద్దేశించి

తే. 'తరుణి! యేవురకంటె నొక్కరుఁడ భర్త । యగుట లగ్గు; జూదంబున నాలి నోటు
వడనివానిఁగాఁ దగు భర్తఁ బడయు మింక' । ననుచు రాధేయుఁ డుల్లసమాడె నంత!'**(సభా.3.246)**

ఈ మాటలు పాండవ హృదయపుట భేదనం చేశాయి. ద్రౌపదికి అవమాన హేతువులయ్యాయి. దుర్యోధనుడికి సంతోషకారకా లయ్యాయి. 'తగు భర్తఁ బడయు మింక!' అన్నమాటలు మాయాద్యూతంలో విజయుడై ఉన్న దుర్యోధనుడి పరంగా సూచించబడ్డాయి. దానితో దుర్యోధనుడు పట్టపగ్గాలు లేక విజృంభించాడు.

ఉ. 'అమ్ముదితన్ విభీతహరిణాక్షిఁ గలాపవిభాసి కేశభా
రమ్మున నొప్పుదానిఁ దన రమ్యపృథూరుతలంబు నెక్కఁగా
రమ్మని సన్న సేసె ధృతరాష్ట్రసుతాగ్రజుఁడు.' **(సభా. 3.247)**

దానితో భీముడిచేత సుయోధనుడూ, అర్జునుడిచేత కర్ణుడూ చావటానికి తమ గోతులు తామే త్రవ్వుకొన్నారు. దీనికి మూలకారణం కర్ణుడు దుర్యోధనుడిని సమర్థించటానికై పలికిన పలుకులే. అవి పాండవులకు ఆజన్మాంతం మరపురానివి. భారతంలో ఈతడి పలుకులు పాండవుల హృదయాలలో విరిగిన బల్లెపు ములుకులవలె కలతపెట్టి బాధపెట్టుతూ ఉండటం గమనిస్తాం.

అంతటితో ఆగక ఘోషయాత్రకు దుర్యోధనుడిని ప్రేరేపించినవాడు కర్ణుడు 'అనవరతశీతవాతాతపకర్శితాంగులై బహు దుఃఖసాగరంలో మునిగియున్న' పాండవులను నీవు 'సకల సామ్రాజ్య విభవంబు మెఱసి చని, యందు నీ తేజంబు ఘర్మసమయంబునాటి తపను తేజంబై పగతుర కన్నులు గమర నతిదుస్సహం బగునట్లుగాఁ జేయు' మనీ 'మిత్రజన మోదంబును శత్రుజనఖేదంబునుఁ గదా సంపదలకుం దగియెడు ఫలంబు' అనీ ప్రబోధించి అతడి చిత్తంలో అణగారి ఉన్న మాత్సర్యాగ్నిని మరొకసారి రగులజేశాడు.

తే. 'అతుల సౌభాగ్య పుణ్యసమగ్ర గరిమ । నొప్పుచున్న నీ దేవుల యొప్పు సూచి
ధృతి దఱిఁగి తన్నుఁ దాన నిందించుకొనుచు । హృదయమునఁ బాండవాంగన యెరియవలదె?

(అరణ్య. 5.350)

అని రాజబెట్టాడు. దానితో దుర్యోధనుడి హృదయంలో వెనుకటి పరాభవాగ్ని ప్రకోపించింది. తన ఉన్నతికి మిట్టిపడింది. దానికి కర్ణుడనే ఝుంఝూమారుతం తోడైంది.

పై కథాంశాలనుబట్టి కర్ణుడు ప్రతినాయకుడైన దుర్యోధనుడికి సహాయులైనవారిలో ప్రథమగణ్యు డనటంలో ఎటువంటి విప్రతిపత్తి లేదు. దుర్యోధనుడు సచివాయత్త సిద్ధుడు. కాబట్టి అతడి చరిత్రలో కర్ణాది సచివుల - లేక - సహాయకుల ప్రాధాన్యం అధికంగా ఉండటం సహజం.

లాక్షణికులు పురుషార్థ సాధనలో నాయకుడికి ముఖ్యంగా ఉపచరించేవారిని ఉపనాయకులనీ, అనునాయకులనీ పేర్కొన్నారు. నాయకుడివలెనే ప్రతినాయకుడికి కూడా ఉపనాయకులూ, అనునాయకులూ సహాయకులుగా ఉంటారు. మహాభారతంలో ప్రతినాయకుడైన దుర్యోధనుడికి ఉపనాయకుడుగా కర్ణుడు తీర్చిదిద్దబడ్డాడు.

భరతమహర్షి నాయకుల స్వరూప స్వభావాలను గురించి నిర్దేశించాడే కాని కడమవారిని గురించి తలపెట్టనేలేదు. కథానాయకుడితోపాటు తరువాత రాదగినవాడూ - రామాయణంలో సుగ్రీవుడివలె ప్రత్యేక వృత్తాంతం కలిగి ఉన్నా రాముడికి తోడ్పడేవాడు - అంటే ఉపవృత్త నాయకుడు - ఉండవలసి ఉంటుందని మొదట గుర్తించినవాడు ఆనందవర్ధనాచార్యులు. ఆయన "కథానాయకః ధీరోదాత్తాది భేదభిన్నః పూర్వః తదనంతరోవా" అని చెప్పి, కథానాయకులు ఇరువురనీ, వారు 'పూర్వ' (ప్రధాన) నాయకుడనీ, 'తదనంతర' కథానాయకు డనీ నిర్దేశించాడు. కాని, ఆ 'తదనంతర' కథానాయకుడు ఎట్లా ఉండాలో 'ధీరోదాత్తాది భేద భిన్నః' అనే పదంతో సూచించాడు కాని ఇదమిత్థమని నిర్ణయించలేదు. ఆ తరువాత ధనంజయుడు అట్టి 'తదనంతర' నాయకుడి నామస్వరూప నిరూపణం చేయదలచి కామశాస్త్రం నుండి- అందులో పేర్కొన్న నాయకసహాయకులలో ప్రధానుడైన 'పీఠమర్దు' డిని గ్రహించి, అతడిని ఆ పేరుతో వ్యవహరించటమే

కాకుండా అతడు 'విచక్షణు'డనీ, నాయకుడికి అనుచరుడనీ, భక్తుడనీ, అతడికంటె కించిత్ న్యూనగుణుడౌతాడనీ ఒక లక్షణం ఏర్పరచాడు. కాని, రామచంద్రుడు ఉపకథాబంధానికి నాయకుడైనవాడిని ధనంజయుడివలె పీఠమర్దుడు అని పిలవటానికి (అతడు కామశాస్త్ర మాత్ర ప్రయోజ్యు డనదగినవాడని కాబోలు) సంకోచించి, మిగిలిన లక్షణాలను పేర్కొనక అగ్ర్యనాయకుడికంటె కించి దూనవృత్తం కలవాడనీ, 'అముఖ్యనాయకు' డనీ తెలిపాడు. భోజరాజు కూడా అట్లాగే భావించి "తతః కైశ్చిద్గుణైర్న్యూనః పూజ్య శ్చైవోపనాయకః" అని చెప్పి, అభినవగుప్తపాదుడు ప్రతిపాదించిన 'ఉపనాయక' పదంతో అతడిని వ్యవహరించాడు. శారదాతనయుడు "పతాకానాయక స్తేషా ముపనాయక ఉచ్యతే । తస్యై వాను చరో భక్తః కించి దూనశ్చ తద్గుణైః" అని స్పష్టంగా ఉపనాయక లక్షణాలను పేర్కొన్నాడు. అతడు ధనంజయుడి లక్షణంలోని పీఠమర్దుడికి బదులుగా ఉపనాయకుడిని ఆదేశించి, అతడి పతాకానాయకత్వంతోపాటు కడమ లక్షణాలను కూడా అతడివలెనే నిర్దేశించాడు. అందువలన ఉపనాయకుడు ఎప్పటికీ ఉపవృత్త (పతాకా) నాయకుడని ఏర్పడుతున్నది.

ఉపనాయక గుణాలలో "తద్గుణైః" - అనేది ప్రధాన నాయక సామాన్యగుణపదం కాగా, 'కించి దూనశ్చ తద్గుణైః' అనేదే అతడి స్వభావాన్ని తెలుపుతూ, నాయక స్వభావంతో గల భిన్నతనుకూడ విశదీకరిస్తున్నది. 'తస్యైవానుచరో భక్తః' అనే పదాలు ఉపనాయకుడికి నాయకుడితో ఉండే సంబంధాన్ని నిరూపించటమే కాక అతడి అనుచరత్వంచేత ప్రధానేతివృత్తంలో స్వోపవృత్తం లీనంకాగా అతడు ప్రధాన నాయకుడిని అనుసరిస్తా డనీ స్పష్టమౌతున్నది. భోజరాజు "పూజ్యశ్చైవోపనాయకః' అనిన దానినిబట్టి ఉపనాయకుడు స్వయంగా 'పూజ్యుడే' అయినా "పూజ్యేషురాగో భక్తిః" అనే సూక్తిని అనుసరించి నాయకుడితో తనకు ఏర్పడిన 'తాద్గుణ్య' సంబంధంవలన అతడిపై తనకు విశేషమైన అనురాగం అతిశయించగా, నాయకుడిపట్ల పూజ్యభావం కలిగి ఉంటాడని అన్వయించుకొనవచ్చును. అందువలన ఇతివృత్త నిర్వహణంలో నాయకుడికి సహాయుడిగా ఉంటూ, ఉపనాయకుడు తన వృత్తంతో సామాజికులలో పూజ్యభావాన్ని పొందగలుగుతాడని ఏర్పడుతున్నది.

"కథానాయకశ్చ ధీరోదాత్తాది భేదభిన్నః పూర్వ స్తదనంతరోవా" అనే ఆనందవర్ధనాచార్యుల ఆదేశాన్నిబట్టి ప్రధాననాయకుడు ఎట్లా ధీరోదాత్తాది భేదభిన్నుడో, 'తదనంతరం' నాయకుడూ-లేక-ఉపనాయకుడూ అట్లే ధీరోదాత్తాది భేదభిన్నుడు కావలసివచ్చునని ఏర్పడుతున్నది. దీనివలన నాయకులవలెనే ఉపనాయకులు కూడా చతుర్విధా లౌతారు. ఉదాత్తుడు ధర్మపురుషార్థసాధనలో సహాయుడౌతాడు. ఉద్ధతుడు అర్థసాధన సహాయభూతు డౌతాడు. లలితుడు కామపురుషార్థ సహాయుడూ, శాంతుడు మోక్షపురుషార్థ సహాయకుడూ ఔతారు. ఈవిధంగా ఉపనాయకు లెప్పుడూ పురుషార్థ సాధనలో నాయకుడికి సహాయభూతు లౌతూ, విధిగా ప్రాసంగికేతివృత్తంలో వ్యాపిత్వం పొందినవారై ఉంటారు. కథావ్యాపిత్వం లేకుండా, ఉపవృత్తాధికారులు కాకుండా ఉంటే ఎవ్వరూ ఉపనాయకులు కాలేరు. వారు సాధారణ నాయక సహాయులు మాత్రమే ఔతారు. మహాభారతంలో విరాట ద్రుపదులు సాధారణ నాయక సహాయకులు. శ్రీకృష్ణుడు ఉపనాయకుడు. భీమాదులు అనునాయకులు.

నాయకేతివృత్తంతో పెనవేసికొన్న వృత్తం కలవాడై నాయకాభ్యుదయంలో అభ్యుదయం పొందుతూ, అతడికి సహాయకుడుగా ఉండేవాడు అనునాయకుడు. అతడు నాయకుడితోపాటు అధికారికేతివృత్తంలో సమవ్యాపకత్వాన్నివహించి ఉన్నా, సమప్రాధాన్యాన్ని వహించని, అస్వతంత్రమైన చరిత్రం కలవాడు. రామాయణంలో లక్ష్మణాదులూ, భారతంలో

భీమాదులూ అట్టివారు. ఉపనాయకు డంటే ప్రాసంగికేతివృత్తానికి నాయకుడై అనునాయకుడివలె పూర్తిగా విలీనత పొందజాలని వృత్తంకలవాడై ఉంటాడు.

మహాకావ్యాలలో, ఇతిహాసాలలో, నాటకాలలో నాయకానునాయకోపనాయకుల కెంత ప్రాధాన్యం ఉంటుందో ప్రతినాయకుడికీ, అతడికి సహాయం చేసే అనునాయకులకూ, ఉపనాయకులకూ అంత ప్రాధాన్యం ఉంటుంది. సామాన్యంగా కావ్యాలలో నాయకుడు ధీరోదాత్తుడైతే ప్రతినాయకుడు ధీరోద్ధతుడై ఉంటాడు. ప్రతినాయక విజృంభణంలో అతడికి సహాయకులుగా నిలిచేవారూ, తత్తద్గుణ విశిష్టులై ఉంటారు. కాబట్టి కావ్యనాయకోపనాయక విభాగం ప్రతినాయకోపనాయకులకు కూడా వర్తింపజేయవచ్చును. అట్లా అయితే - మహాభారతంలో ప్రతినాయకుడైన దుర్యోధనుడికి సహాయభూతుడై, ప్రాసంగికేతివృత్తాన్నీ, కథావ్యాపిత్వాన్నీ పొంది, ఉపవృత్తాధికారాన్ని పొంది ఉన్న కర్ణుడు ప్రతినాయక పక్షంలో ఉపనాయకుడు అనదగి ఉన్నాడు. ఇట్టివాడిని ఉపప్రతినాయకుడని వ్యవహరించవచ్చును.

మహాభారతంలో శ్రీకృష్ణుడి వృత్తానికి వలెనే కర్ణుడి వృత్తాంతానికి కూడ ప్రత్యేక ప్రతిపత్తి ఉన్నది. కర్ణుడు కన్య అయిన కుంతికి సూర్యుడివలన జన్మించి, తల్లిచేత పరిత్యక్తుడై, సూతపుత్రుడుగా ప్రసిద్ధి కెక్కాడు. సహజకవచకుండలధారీ, అసహాయ పరాక్రమశాలీ అయిన అతడిలో సహజక్షత్రతేజం సహస్రకిరణాలతో వెలుగొందుతూ ఉండేది. దానికి గుర్తింపు, గౌరవం కావలసి వచ్చింది. అదే అతడి జీవిత లక్ష్యం. తల్లక్ష్యసిద్ధికై సహాయంచేసి, అతడిని ఆదరించినవాడు దుర్యోధనుడు. అందువలన అతడి బ్రతుకు ఆ సుయోధనుడితో ముడిపడింది. ఉప (పతాకా) నాయకు డెప్పుడూ స్వీయకార్యసిద్ధికై నాయకుడిని ఆశ్రయిస్తాడు. నాయకుడు అతడికార్యాన్ని సాధించిపెట్టుతాడు. ఆ పైన ఉపనాయకుడు నాయక కార్యసిద్ధికి తోడ్పడతాడు. తత్ప్రయత్న విశేషాలచేత అతడికి కథావ్యాపిత్వ మబ్బుతుంది. శ్రీకృష్ణుడు జరాసంధ వధకై పాండవుల సాయం తీసికొన్నాడు. ఆపైన పాండవులకు అతడు అండదండగా నిలిచాడు. రామాయణంలో సుగ్రీవుడు కూడా వాలి వధానంతరం రాముడికి సహాయం చేశాడు. అట్లాగే కర్ణుడి వృత్తాంతం కూడా. కర్ణుడు స్వీయ అస్తిత్వం కొరకు దుర్యోధనుడి సహాయం పొందాడు. అతడిని రాజ్యమేలించే యత్నంలో సహాయాన్ని జీవితాంతం సాగించాడు. అందువలన అతడి వృత్తం స్వతంత్రమైనా నాయకేతివృత్తానికి ఉపపోషకంగా ఉంటుంది.

ప్రతినాయకుడైన దుర్యోధనుడు ధీరోద్ధతుడు కావటంచేత దురహంకారిగానూ, కపటిగానూ, ధర్మవిరహితుడుగానూ చిత్రించబడ్డాడు. అతడిని సమర్థించి ప్రేరేపించిన కర్ణుడి చరిత్రంలో కూడా ఆ ఛాయలు పడకమానవు. కాబట్టి దుర్యోధనుడి దుష్టకార్య సహాయ సాధకుడుగా అతడు నిందితుడయ్యాడు. ధర్మరాజువలె దుర్యోధనుడు ఉభయాయత్తసిద్ధుడు కాడు. చాలవరకు సచివాయత్త సిద్ధుడే. కాబట్టి సుయోధనుడి చరిత్రలో కర్ణుడికి అధికప్రాధాన్యం ఏర్పడింది. కర్ణుడు ఆడించినట్లు ఆడాడు దుర్యోధనుడు. దుర్యోధనుడి మనసెరిగి అతడిని సమయోచితంగా సమర్థించాడు కర్ణుడు. చివరివరకు ప్రతినాయకుడి కొరకు ప్రతిపక్షులతో పోరి ప్రాణాలను అర్పించాడు. కాని, దుర్యోధనుడికి అపకీర్తి మిగిలింది. కర్ణుడికి కీర్తితోపాటు కొంత కళంకంకూడా ఏర్పడినా, విషాదాంత నాయకుడివలె పఠితల సానుభూతిని పొందటం జరిగింది.

2. విషాదాంత వీరుడు:

ప్రతినాయకుడిపై లేని సానుభూతి అతడి ఉపనాయకుడిపై ఎందుకు కలుగుతున్నది? సూక్ష్మంగా పరిశీలిస్తే అతడి వ్యక్తిగత చరిత్రం, అంతర్వర్తనం దానికి కారణాలని తోచకమానదు. విధి కెదురీత ఈదిన విషాదవీరుడు కర్ణుడు. అతడి

బ్రతుకులో అతడివలన లాభం పొందినవారే కాని, అతడి మేలు కోరినవారు తక్కువ. అతడు స్వయంగా ప్రజ్వలించిన మహాగ్నిజ్వాల! దాని చుట్టూ చేరిన మిత్రులు గాని, శత్రువులు గాని తల కొక ఇంధనాన్ని ఈవలికి తీసి మంట నార్పటానికి యత్నించినవారే కాని సాదరంగా ఒక్క సమిధను సవరించినవారు లేరు. కర్ణుడు తన అంతర్గతతాపాన్ని తనలోనే దాచుకొన్నాడు కాని పరులకు పంచి ఇచ్చి తాను సుఖించలేదు. అతడు మహావీరుడు, మహాదాత, ఉజ్జ్వలుడు. అతడు స్వతంత్ర నాయకుడై రాణించగలిగినవాడు. కాని, విధి ఆతడి కా అవకాశం ఇవ్వలేదు. ఆతడి ఉజ్జ్వల గుణాలను గుర్తించి గౌరవించినవాడు దుర్యోధనుడు. కాని, అతడు అతడి స్వతంత్ర వ్యక్తిత్వాన్ని మన్నించలేదు; సహించలేదు. అతడు అతడిని స్వప్రయోజనాలకొరకు వాడుకొన్నాడు. అందువలన దుర్యోధనుడి కొరకై కర్ణుడు చేసిన కార్యకలాపమంతా అర్థసాధనైకలక్షితమై శుద్ధధర్మాన్ని విరోధించింది.

కర్ణుడు ధర్మస్వరూపం తెలియని అజ్ఞాని కాడు. అతడు ఎంతటి వీరుడో అంతటి ధర్మజ్ఞుడు. అర్జునుడి కంటె మేటి వీరుడనిపించుకొనాలని అభిలషించాడు. ఆ సాధనకు అతడి సూతకులం అడ్డం వచ్చింది. అతడికి రాచరికం కల్పించినవాడు దుర్యోధనుడు. దానితో అతడికి అర్జున ప్రత్యర్థిగా నిలువగలిగే అర్హత లభించింది. అతడు నిలిస్తే కదా ఆయన లక్ష్యసాధనం! అతడు నిలవాలంటే అతడి ప్రభువైన సుయోధనుడు నిలవాలి. కాబట్టి దుర్యోధనుడిచేత కురురాజ్య మేలించటం అతడి సేవాధర్మమై నిలిచింది. దుర్యోధనుడు ధర్మబద్ధంగా రాజ్యార్హతలేనివాడు. పాండవులు అతడి ప్రత్యర్థులు. వారు ధర్మనిరతులు. ఆ సంగతి ఆతడికి తెలుసు. అయినా పాండవులకు కీడు తలపెట్టితే కాని అతడి సేవాధర్మం, వీరధర్మం నిలువవు. అంపశయ్యమీద ఉన్న భీష్ముడు కర్ణుడితో అతడి జన్మవృత్తాంతాన్ని చెప్పి పాండవులతో కలిసి ఉండుమని హితవు చెప్పినప్పుడు అత డన్నమాట లివి -

ఉ. 'మాటలు పెక్కులాడి, యనుమానము లేక సభం గడంగి ప
ల్మాటుఁ బరాభవించితిఁ; జలంబునఁ బాండవకోటి కెప్పుడుం
జేటు దలంచి యే బలువు సేసితి వైరము; నాకు నింక నీ
వీటికి వారి వీటికిని వెక్కస మయ్యెడు కయ్య మొప్పగున్'.

శా. 'దైవాధీనము సర్వమున్; మనమతిం దప్పింపఁగా వచ్చునే?
నీ వింకన్ నను నొండు వల్కక పరానీకంబుపైఁ బంపు; మ
త్సేవాధర్మము నిర్వహించెద; బలోత్సేకంబు లోకంబునం
భావింపన్ విహరించెదన్; మురరిపుం బార్థుం దలంకించెదన్'. **(భీష్మ. 3.450 - 451)**

'మత్సేవాధర్మము నిర్వహించెద' నన్నాడు కర్ణుడు. కాబట్టి పాండవులపట్ల ద్వేషబుద్ధితో కాక, దుర్యోధనుడు తనను నమ్మి పోషించినందుకు ప్రతిఫలంగా, తన కర్తవ్యంగా పాండవద్వేషాన్ని వహించా డన్నమాట! సేవాధర్మానికి తన జీవిత కుసుమాన్ని అంకితం చేశాడన్నమాట!

అయినా ధర్మనిష్ఠుడైన ధర్మరాజు కురుక్షేత్ర యుద్ధంలో విజయం సాధిస్తాడనీ, అతడే రాజ్యమేల దగినవాడనీ కర్ణుడు భావించినట్లు ఆతడు శ్రీకృష్ణుడితో అనిన మాటలవలన తెలుస్తున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'అనుజులు ఋత్విజులుగ నీ । పని యిటు సేయు మని నీ వుపద్రష్టవుగా
విను! కురుకుమార పశు విశ । సనమున రణయజ్ఞ మతఁడు (ధర్మరాజు) సమ్మతిఁ జేయున్'

(ఉద్యో. 4.45)

అని ఉద్యోగ పర్వంలో కర్ణుడు తన మనోగతాన్ని బైట పెట్టాడు.

ఇక్కడ మనం ఒక విషయం గమనించాలి. కౌరవపక్షవర్తులైన భీష్మాదులు పాండవుల ధర్మవర్తనాన్ని బాహాటంగా సమర్థిస్తూనే సేవాధర్మాన్ని ఆశ్రయించి సుయోధన పక్షాన యుద్ధం చేశారు. వారిలో గూఢవర్తనం ఎక్కడా కానరాదు. మరి కర్ణు డట్లా కాదు. అతడి ప్రవర్తనలో కొంత రహస్యం ఉన్నది. కొంత ప్రకాశం ఉన్నది. కర్ణుడి హృదయం గూఢం. దానిలో దాగి ఉన్న రహస్యాన్ని కృష్ణభీష్మాదులు కొన్నిసార్లు గుండెకవాటం తెరచి చూపించారు కాని, ఆ చూపించటం కూడా ఒక రహస్యమే. కర్ణుడి హృదయం కృష్ణుడు, భీష్ముడు ఎరుగవచ్చును కాని, దానిని బయటపెట్టే ఉద్దేశంతో కర్ణుడితో అన్నారా? కాదు. కర్ణుడి హృదయం బయటపెట్టటానికే అన్నారు. దుర్యోధనుడి దుష్టవర్తనాన్ని నివారించాలనే యత్నంలోనే వారన్నారు. దుష్టచతుష్టయంలో ఒక్క కర్ణుడు మారితే భారత కథయే మారిపోతుందని భావించి అన్నారు. ఆ సత్యం ఆ కర్ణుడికి కూడా తెలుసు. వారందరూ కర్ణుడి హృదయంలోని అర్జునజయార్థి అయిన ఉత్సాహతేజాన్ని చల్లబరచటానికై యత్నిస్తున్నారని అతడు తెలియనివాడు కాడు. అట్లా కాకపోతే అతడి జన్మరహస్యం తెలిసికొన్న మహామహు లందరునూ దానిని గుండెలలో దాచికొని అతడికే ప్రత్యేకంగా రహస్యంగా, స్వీయకార్య సాధనోపాయంగా ఎందుకు చెప్పవలసి వచ్చింది? భీష్ముడు కాని, కృష్ణుడు కాని, కౌరవసభలో ఎందుకు ఆ సంగతి చెప్పలేదు? ధర్మజుడికి ఎందుకు తెలియజేయలేదు? కన్నతల్లి కుంతి మూగనోము ఎందుకు పట్టింది? పాండవ రక్షణార్థమే కన్నతల్లి కర్ణ జన్మ రహస్యాన్ని చెప్పింది చాలక అతడిని మృత్యువునోట నెట్టేందుకే యత్నించింది. సూర్యభగవాను డన్నట్లు అతడి జన్మకథ దేవరహస్యం కావచ్చును. లేదా, మానవ రహస్యం కావచ్చును. రాజనీతి రహస్యం కావచ్చును. ఆ రహస్యం అతడి కిచ్చే తిలోదకాలు గాని లోకానికి చాటలేదు. అది అట్లా జరుగుతుందని కర్ణుడికి కూడా తెలుసు. అందరికీ అన్నీ తెలిసినా దానిని రహస్యంగా ఉండేటట్లు చేయటమే విధి నిర్ణయం- 'దైవాధీనము సర్వమున్' అని నిట్టూర్చిన కర్ణుడు విధిజ్ఞుడు కాదంటామా? ధర్మం అతడికి తెలియదంటామా? విధి విలాసం వలన విషాదాంతానికి గురి అయిన వీరశేఖరుడు. విషాదాంత నాయకుడి వంటి వాడు కర్ణుడు!

కర్ణుడి హృదయం దుర్యోధనుడికి తెలియదు: పాండవులకు తెలియదు: విధి అతడి జన్మ రహస్యాన్ని లోకానికి తెలిసేటట్లు చేయలేదు. కర్ణుడు తన హృదయాన్ని లోకానికి చాటలేదు. కాని, పఠితకు రహస్యాలన్నీ తెలుసు. కథలోని ఈ కీలకమే కర్ణుడికి అపారసానుభూతిని సంపాదించిపెట్టింది.

కావ్యాలలో ప్రతినాయకుడు యుద్ధంలో విజితుడు కావటమో, హతుడు కావటమో జరిగితీరుతుందని పఠిత కొక పరిజ్ఞానం మనదేశంలో సామాన్యంగా ఉంటుంది. అట్లాగే ప్రతినాయక పక్షవర్తి అయిన ఉపనాయకుడి వధ సంభావ్యమే అని తలంచబడుతూ ఉంటుంది. కాబట్టి పఠితలు అత డెట్లా జీవించి, ఎట్టి పరిస్థితులలో చనిపోయినట్లు చిత్రించబడుతాడో తెలిసికొనటానికి ఉత్సుకులై ఉంటారు. ప్రతినాయక పక్షం నాయకపక్షంవారికి అడుగడుగునా అగ్నిపరీక్షలు పెట్టగల విగ్రహశక్తీ, ధైర్యసాహసాలూ కలిగి జీవించగలగటమే జీవించటం అనబడుతుంది. శక్తివంచన లేకుండా పురుషకారం చేస్తూ

నాయకుడితో పోటీపడి, ఓడి శరణు వేడటమో, ప్రాణా లర్పించి పరువు కాపాడుకొనటమో కావాలి. కర్ణుడు శత్రువులకు సింహస్వప్నమై బ్రతికాడు. చివరకు రణనిహతుడయ్యాడు. ఆ రణమరణం కరుణారసపూరితం. ఎంతటివాడు ఎట్లా మరణించాడని సహృదయులు కన్నీరు కారుస్తారు.

ధర్మరాజుకు దుర్యోధను డంటే భయం లేదు కాని, కర్ణు డంటే కలవరపాటు. అరణ్యాజ్ఞాతవాస కాలంలో-

సీ. 'పదుమూఁడు వర్షముల్ పగలును రేలును । గర్ణుదర్పం బెట్లు గడతు నొక్కొ!
యనుచింతఁ జేసి యాహారనిద్రలు లేక । పరితాప మందితిఁ; బశువుఁ జేయ
విప్రులు పట్టరా వెఱ సొచ్చి యొదిఁగెడు । గవయంబు చాడ్పునఁ గర్ణ భీతి
నుల్లల నుడుకుచు నుండుదుఁ గర్ణుండు । విడువక మోమున వ్రేలునాకు'. **(కర్ణ. 3.33)**

అని చెప్పుకొన్నాడు. కర్ణుడి శరపాండిత్యమే పార్థుడిచేత తపస్సు చేయించింది. పాండవ వీరులందరూ అంతో ఇంతో యుద్ధాలలో ఓడించబడినవారే. అందరికంటె అవమానం పొందినవాడు ధర్మరాజు. అందరికంటె భయపడ్డవాడు అర్జునుడు. యుద్ధంలో కర్ణుడికి ఓడి, బాణాఘాతాలకు గురి అయి శిబిరానికి తిరిగివచ్చిన ధర్మరాజు, అతడిని చంపివస్తానని శపథంచేసి వెళ్ళిన పార్థుడు తనను పలకరించటానికి మధ్యలోనే తిరిగిరాగా అర్జునుడితో కోపంతో అన్నమాటలు కర్ణ ప్రతాపానికి ఆతడు పడిన భయాన్ని తెలిపాయి.

క. 'విను! కర్ణున కే నోడితి । నన నేటికి? నీవు నోడి; తనిలజ మాద్రీ
తనయులు మున్నే యోడిరి; । మనతోఁ గూడంగఁ గంసమర్దనుఁ డోడెన్.'

క. 'కావున మన మిఁక ననికిం । బోవం బని లేదు; విపినభూమికిఁ జని య
చ్చో వెఱపు దక్కి తపసుల । మై విచ్చలవిడిఁ జరింత మందఱముఁదగన్'.

క. 'కాదేని బిరుదు లాడక । సాదులమై వినయ మొప్పఁ జని కురునాథుం
డేది పనిచినను జేసి ద । యాదృష్టి నతండు చూచున ట్లుండఁదగున్.' **(కర్ణ. 3. 53-55)**

నాయకుడు ఓడితే అనునాయకులూ, ఉపనాయకులూ కూడా ఓడినట్లే పరిగణించుమన్నాడు ధర్మరాజు. దానికి ప్రతిగా అనునాయకుడు కాని, ఉపనాయకుడు కానీ శత్రువు నోడించి నాయకుడికి ఫలం దక్కించాలి. ఆ స్థితిలో అర్జునుడు అన్నమాటలు గమనించదగినవి.

తే. 'పట్టపగలింటి సూర్యుని పగిదిఁ గర్ణుఁ । డుగ్రమూర్తియై వెలుఁగుచునున్నవాఁడు;
మన రథం బిప్డు మాధవ! మరలనిమ్ము; । బ్రతికియుండిన శుభములు వడయ వచ్చు'. **(కర్ణ. 3.18)**

అట్లని కర్ణుడిని అర్జునుడోడించలేడని కాదు. ఈ మాట లన్నది కర్ణుడి చివరినాటి యుద్ధంలోనే. అంతకు ముందు కర్ణుడిని చూచి పార్థుడు భయపడిన ఘట్టం అరుదు! కర్ణుడు అర్జునుడిచేత ఓడించబడని ఘట్టం కూడా అరుదు! కాని. ఆనాడు కర్ణుడితో యుద్ధమనగానే పార్థుడికి నఖశిఖాపర్యంతం ముచ్చెమటలు పట్టాయి. కర్ణుడికి దీటైన వీరుడు శ్రీకృష్ణు డొక్కడే అనీ అంటూ, 'నీ (ధర్మరాజుయొక్క) నేర్పు, భీము లావు. నరుని విలుబల్మి యతనికి (కర్ణుడికి) హరికిఁ గల్గు'నని నారదుడు లెక్కవేసి చెప్పాడు.

ఇటువంటి మేటివీరుడు, పురుషకారం వెలార్చి, కురుక్షేత్రంలో అర్జునుడితో తలపడి ఘోరయుద్ధం చేశాడు. విక్రమం ప్రదర్శించినా విధిచాలక అతడు నేలకూలాడు. నాయకపక్షంవారి తీవ్రయత్నానికి ఏకైక హేతువు కావటం కంటె వీరుడికి కావలసిన గుర్తింపు మరే ముంటుంది? అట్టివాడు ప్రతినాయకోపనాయకుడైతే బ్రతుకవలసిన దానికంటె ఘనంగా బ్రతికినట్లే. అట్టి కర్ణుడికి - పరశురాముడి వద్ద భార్గవాస్త్రాంతం బాణవిద్య నభ్యసించిన జోదుకు - కృష్ణుడి మాయచేత ఇంద్ర దత్తమైన శక్తి, సర్పముఖాస్త్రం, రౌద్రమంత్రపూరితమైన బాణం వమ్మైపోవటంతో కన్నీరు నిండింది. రథచక్రం నేలలో క్రుంగటంతో మనసులో ధైర్యం కుంటువడింది. భార్గవాస్త్రం స్ఫురించకపోవటంతో సర్వం ముగిసింది. కఠినమైన విధి కసితీర్చుకొన్నప్పుడే కరుణమాలిన శత్రువు కుత్తుక త్రెంచటంతో కర్ణుడి కన్నుమూత కరుణారసభరితమై పోయింది. కన్నీరు కార్చే కొడుకులు కూడా కదనరంగంలో కన్నులు మూశారు. మిత్రుడైన రారాజు 'హే కర్ణా!' అంటూ అందరిబదులు తానొక్కడే ఎలుగెత్తి శోకించాడు.

మహాభారతకథలో కర్ణుడు చివరకు మరణించటం కంటె మరొక ప్రత్యామ్నాయం లేదు. కర్ణుడుండగా దుర్యోధనుడికి చావు లేదు. ధర్మరాజుకు విజయం లేదు. కథకు ప్రగతి లేదు. ఒకవేళ కర్ణుడికంటె ముందే దుర్యోధనుడు చనిపోతే కర్ణుడు బ్రతికి ఫలం లేదు. పైపెచ్చు ధర్మరాజుకు రాజ్యసిద్ధి లేదు. అంటే నాయకుడికి ఫలభుక్తి లేదు. ఇన్ని లేములకు కలిమి కలిగించింది కర్ణుడి విషాదాంతం. ఉపనాయకుడుగా ఇతిహాసంలో ఉపజీవించి, ప్రతినాయక ప్రతిష్ఠను పెంచి, శత్రుపక్షంనుండి ప్రశంసలు పొంది, ప్రతినాయక సహాయకుడిగా మాత్రమే కాక, స్వతంత్ర ప్రతిపత్తి గల వీరుడుగా రాణించిన కర్ణుడు భారత పాత్రలలో విశిష్టుడు. ఉపప్రతినాయకుడుగా ఉజ్జ్వలవృత్తాన్ని నిర్వహించి అపార ప్రతిష్ఠను గడించిన విషాదవీరుడు కర్ణుడు. అందుకే 'కర్ణుడు లేని భారతం' భారతమే కాదని విజ్ఞుల వివేచన! కర్ణుడి తల భారతమనే నానుడి ఏర్పడింది.

3. కర్ణపర్వం ఒక ప్రబంధం:

మహాభారతేతిహాస నాయకులైన పాండవుల చరిత్రను పుట్టిందిమొదలు గిట్టేంతవరకు పురుషార్థ సాధనరూపమైన జీవితవివరాలతో వర్ణించటం ఇతిహాస లక్షణం. అట్లాగే భారతవీరుల చరిత్రలుకూడా పుట్టిందిమొదలు గిట్టేంతవరకూ ప్రధానకథకు పరిపోషకంగా సాగటం కూడ ఇతిహాస కథావిశేష స్వభావం. అందులో యుద్ధపర్వాలకు ప్రత్యేక ప్రతిపత్తి ఉన్నది. నాయక ప్రతినాయక పక్షాలవారు విజయం కొరకు ప్రతిదినం చేసే యుద్ధ ప్రయత్నం ఒక రసవత్తర ఘట్టం కావచ్చును. కౌరవపక్షంలోని సర్వసైన్యాధ్యక్షుడు చేసే యుద్ధవ్యూహాలూ, విజయఘట్టాలూ, విఫలయత్నాలూ, ఫలితాంశాలూ కలిసి ఒక స్వయంసమగ్రమైన ప్రబంధంగా రాణిస్తుంది. ఆ దృష్టితో చూస్తే భీష్మద్రోణ పర్వాల వలెనే కర్ణపర్వం కూడా ఒక ప్రబంధం!

ఇతిహాసంలో భాగమైన ప్రబంధంలో కానవచ్చే ప్రధానాంశాలు:-

(1). ఇతిహాస స్వభావాన్ని వ్యక్తీకరించే కథకశ్రోతృసంబంధ నిర్వహణం.

(2). ఆఖ్యాన కథాకథన చాతుర్యం.

(3). ఆఖ్యానానికి అనుకూలమైన ఉపాఖ్యానాల కథనం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(4). నాటకీయతను పోషించే సంభాషణ సంవిధానం.

(5). వర్ణనా వైదగ్ధ్యం: రచనాశిల్పం.

(6). రసరామణీయకం.

ఇవన్నీ కర్ణపర్వం కర్ణపర్వం (చెవులపండుగ - వినటానికి ఇంపు కలిగించేది) కావటానికి తోడ్పడ్డాయి.

(1). ఇతిహాస స్వభావం:

ఇది ఇట్లా జరిగింది అని చూచి చెప్పిన కథనం ఇతిహాస స్వభావం. భారతయుద్ధ పర్వాలలో కథకుడు సంజయుడు. ప్రథమశ్రోత ధృతరాష్ట్రుడు. కథకుడు చూచినదానిని కాలక్రమ పద్ధతిలో చెప్తుతుంటాడు. శ్రోత ఆసక్తితో కొన్ని వివరాలు అడుగవచ్చును. లేదా, ఒక ఘట్టాన్ని ముందుగా చెప్పమని అడుగవచ్చును; లేదా, ఎక్కడైనా ధర్మసందేహంగాని, అనుమానంగాని కలిగితే దానిని తీర్చికొనటానికి కొన్ని ప్రశ్నలు వేయవచ్చును; లేదా; వింటున్న సన్నివేశాలకు స్పందించవచ్చును. లేదా, కొన్ని విషయాలు చర్చించవచ్చును. ఇంత వైవిధ్యంతో కూడుకొన్న శ్రోతృ ప్రవృత్తిని సర్వాంగసుందరంగా ధృతరాష్ట్రుడు ప్రదర్శించటం కర్ణపర్వంలో విశేషం. మచ్చుకు కొన్ని ఉదాహరణలు:

(అ) శోకోపహతుఁడైన ధృతరాష్ట్రుడు తన సంశయం తీరేటట్లు కర్ణుడి మరణానికి ముందు చనిపోయిన వారిని స్పష్టంగా పేర్కొనుమని అడిగాడు. దీనివలన ఈ పర్వపూర్వరంగ సంస్మరణానికి వీలయింది.

(ఆ) కర్ణుడి మరణవార్త విని ధృతరాష్ట్రుడు హాహాకారాలు చేస్తూ దుఃఖించాడు. కర్ణుడిని ప్రశంసిస్తూ విలపించాడు. మరణోద్యుక్తు డయ్యాడు. ద్రోణుడు గతించినప్పుడు కూడ ఇంతగా బాధపడలేదు. సంజయుడు ఓదార్చగా తేరుకొని, పెక్కు భంగుల నెవ్వగలు బయలుపడేటట్లు పలికి కర్ణుడు చనిపోయిన విధాన్ని వివరంగా వినిపించుమని కోరాడు.

ఉ. 'పాండవకోటి సూతసుతుపై నడతెంచిన చంద మెట్టు? లా
ఖండలసూతి సర్పముఖ కాండము తాఁకున రూపుమాసి పో
కుండుట యెట్లు కల్గె? సమరోద్ధతి దక్కటి నల్వురందు నె
ట్లుండె బలద్వయంబు? నెటు లోపి పెనంగె దినద్వయంబునన్?' **(కర్ణ. 1.46)**

ధృతరాష్ట్రుడు వేసిన ఈ ప్రశ్న కర్ణపర్వంలోని కథాంశాల ప్రాధాన్యాన్ని నిర్దేశిస్తూ, కీలకాంశ విస్తరణకు మార్గం చూపింది.

(ఇ) దుర్యోధనుడివైపున్న వీరులు పడిపోతున్నా, కౌరవులవైపు మహావీరులు పోరాడుతున్నా పాండవులలో ఒక్కడుకూడా కీడుపొందకుండా ఉండటాన్ని సహించలేక 'దైవం బలవంత' మయింది అని నిట్టూర్చాడు. విదురుడు ఆ పరిస్థితుల కన్నింటికీ ధృతరాష్ట్రుడే మూలకారణమని పలికాడు. ధృతరాష్ట్రుడు మరేమీ మాట్లాడలేక రెండవనాటి యుద్ధం ప్రారంభించే సందర్భంలో కర్ణుడు ఆలస్యంగా రణరంగానికి రావటానికి వెనుకనున్న కారణాన్ని తెలుపుమని కోరాడు. ఈ ప్రశ్న కర్ణుడికి శల్యుడిని సారథిగా ఉండటానికి దుర్యోధనుడు చేసిన ప్రయత్నాన్నీ, శల్యుడు పెట్టిన నియమాలను గురించి వివరంగా చెప్పటానికి కథనంలో అవకాశం కలిగించింది.

(ఈ) భీముడు కర్ణుడిని యుద్ధంలో మూర్ఛితుడిని చేసి నాలుక కోయబోగా శల్యుడి హితబోధను విని అతడు ఆ ప్రయత్నం నుండి విరమించాడన్న వార్తను విని ధృతరాష్ట్రుడు పొందిన స్పందన విశిష్టమైనది.

క. 'పాండవుల నాజి నోర్చు ని । తం డని మీ రాజు సూతతనయునిఁ బొగడున్;
గం డడఁచె భీముఁ; డిట్టి మ । గండు గలఁడె? పిదప నెట్లు గయ్యము సెల్లెన్?' (కర్ణ. 2.215)

'ఇట్టి మగండు గలఁడె?' అనే వాక్యం కర్ణుడి కెంతగా వర్తిస్తుందో, భీముడికి కూడా అంతగా వర్తిస్తుంది. అయితే ఒకరి అర్థంలో అధిక్షేప వాక్యం! రెండవవారి అర్థంలో ప్రశంసావాక్యం ఔతుంది! స్పందనను మెరుపువలె ఒకపద్యంలో నిబంధించి పఠితలలో దాని కాంతి ననుభవించే స్ఫూర్తిని ప్రసాదించటం ఈ రచనా ప్రయోజనం.

(ఉ) ధర్మరాజు కర్ణుడితో పోరి ఓడిపోయి పలాయనం చిత్తగించగా ధృతరాష్ట్రుడు సహజశ్రోత వలె ఆసక్తితో ఇట్లా అన్నాడు:

ఆ. 'మొదలిరాజు సభయముగ నిట్లు సమరంబు । దొఱఁగి చనియె నట్టి పెఱబలంబు
దొరలు నిలిచిపోరు టరిది; యనంతర । వర్తనంబు విప్రవర్య చెపుమ!' (కర్ణ. 2.397)

ద్వితీయాశ్వాసాంతాన ఈ ప్రశ్న నడిగించి, సమాధానం తృతీయాశ్వాసంలో మొదలుపెట్టటం భావికథలో ఆసక్తిని పెంచటం కొరకే. ఇది ఆశ్వాసవిభాగంలో పాటించే కథనశిల్పం.

(ఊ)క. 'అనిలజునకుఁ జాలఁడె నా । తనయుఁడు? మోసంబు గాక ధర్మజుఁ డ ట్ల
బ్బినఁ బోనిచ్చుట రాధా । తనయునకున్ బుద్ధి యగునె? తప్పెం దప్పెన్'. (కర్ణ. 3.3)

కర్ణుడు ధర్మరాజును చంపకుండా వదలిపెట్టినందుకు మూలకారణం తెలియక ధృతరాష్ట్రుడు వ్యక్తం చేసిన అనుమానం ఇది. ఇది కథలో ఎంత ప్రాముఖ్యాన్ని కలిగి ఉంటుందో కర్ణుడి శీలచిత్రణంలో కూడా అంత వైశిష్ట్యాన్ని పొంది ఉంటుంది.

2. ఆఖ్యాన కథాకథన చాతుర్యం:

మహాభారతంలో కర్ణుడికథ ఆరు ఘట్టాలలో అద్భుతంగా ప్రకాశిస్తుంది. 1. సూర్యుడివరంతో కన్య అయిన కుంతికి పుట్టి ఆమెచేత పరిత్యక్తుడై రాధేయుడై పెరగటం; జన్మరహస్యం దేవరహస్యంగా మిగలటం. 2. గురువుల వద్ద వివిధాస్త్ర శస్త్ర పాండిత్యాన్ని సాధించటం. 3. బ్రాహ్మణ భార్గవాదుల వలన కలిగిన శాపాల వృత్తాంతాలు. 4.దుర్యోధనుడితో స్నేహం చేసి, ఆతడికొరకు చేసిన యుద్ధాలలో కలిగిన విజయ పరాజయాలు. 5. కురుక్షేత్ర యుద్ధంలో క్రమంగా శాపాల ప్రభావాలకు గురికావటం. 6. కర్ణమరణానంతరం అతడిని గురించిన ప్రశంసలు, స్మృతులు, జన్మరహస్య ప్రకాశనం. లోకప్రకాశకుడైన సూర్యుడికి జన్మించినా కన్న తల్లిదండ్రుల పేర్లు బయటపడకుండా చీకటిలోనే కర్ణుడు జీవించాడు. ఎడనెడ కొందరికి ఆతడి జన్మరహస్యం తెలిసినా అది ప్రకటితం కాకుండా దేవరహస్యంగానే మిగిలిపోయింది. అతడికి అస్త్రా లెన్ని ఉన్నాయో శాపాలు కూడా అన్ని తగిలాయి. అతడిని మిత్రుడిగా మన్నించి అంగరాజ్యాభిషేకం చేసిన దుర్యోధనుడి హృదయాన్ని మెప్పించటానికి ఎన్నో వ్యూహాలు పన్నాడు, యుద్ధాలు చేశాడు. జయాపజయాలను పొందాడు. అయితే అతడు సేవాధర్మానికే అంకితమయ్యాడు. అతడు మహాదాత. పుట్టుకతో వచ్చిన కవచకుండలాలను సైతం ఇంద్రుడికి దానం చేసి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దానకర్ణ డనిపించుకొన్నాడు. కురుక్షేత్ర యుద్ధం సంభవించటానికి దుర్యోధనుడి దురాలోచనం ఎంత కారణమో, కర్ణుడి దుర్నీతి అంత కారణమైంది. సంధియత్నం చేయటానికి వచ్చిన కృష్ణుడిని బంధించే యత్నానికి మూలకారణం కర్ణుడే. దుర్యోధనుడికి అంతటి ఆప్త మిత్రుడు మరొకడు లేడు. అయినా, ప్రభుసేవాధర్మం కంటె స్వీయధర్మాన్ని కలుషితం కాకుండా రక్షించుకొన్న ఆత్మాభిమాని. అతడి తపస్సులు, అస్త్రబలాలు, శాపాలు ఎన్ని ఉన్నా కుంతి కర్ణజన్మరహస్యాన్ని ఎంత భద్రంగా దాచిందో అట్లాగే తన శాపరహస్యాలను కడుపులో దాచుకొని తల్లిపోలికలను ప్రకటించాడు. రహస్యంగా తల్లికి పార్థుడిని తప్ప మిగిలిన పాండవులను చంపనని మాట ఇచ్చాడు. ఇవన్నీ దుర్యోధనుడికి తెలియవు. అందువలన కర్ణుడు ద్విపాత్రాభినయం చేసిన నాయకుడయ్యాడు. అయితే ఎన్ని శాపాలున్నా, అన్ని వరాల్లాగా ఆయుధ సంపత్తిని సంపాదించుకొన్నాడు. అస్త్రాలలో ముఖ్యమైనవి ఇంద్రదత్తమైన శక్తి, నాగాస్త్రం. ఈ రెండింటినుండి తప్పించుకొని అర్జునుడు ప్రాణాలతో బయటపడటం అసాధ్యమని భావించాడు. కాని, శ్రీకృష్ణుడు తన దివ్యమాయతో ఆ రెండింటిని విఫలం చేశాడు. కర్ణుడి జీవితాన్ని అర్జునుడితో ముగింపజేశాడు. కర్ణుడి పరాక్రమాన్ని తలచి ధర్మరాజు నిద్రపోలేదు; కర్ణుడు కన్నుమూసేంతవరకు కృష్ణుడు కనురెప్ప వేయలేదు. కర్ణుడిని చంపి శపథం నెగ్గించుకొనేంతవరకు అర్జునుడు శాంతితో ఉండలేదు. వెలుగునీడల కర్ణజీవితం విధి నిర్వహించిన వింతనాటకం; మంత్ర ప్రభావంతో పుట్టిన మహావీరుడు అంతం కావటానికి విధి నిర్వహించిన వింతతంత్రం ఎంత నడిచిందో తెలిపే కర్ణవృత్తాంతం ఆద్యంతం అద్భుతం. శాంతిపర్వంలో నారదమహర్షి ధృతరాష్ట్రుడితో కర్ణసంహారం ఎంతమంది ఎన్నివిధాలుగా చేశారో పేర్కొన్నాడు.

చ. ‘వినుము నరేంద్ర! విప్రు డలివెన్; జమదగ్ని సుతుండు శాప మి
చ్చె; నమరభర్త వంచనము సేసె; వరం బని కోరి కుంతి మా
న్చె నలుక; భీష్ముఁ డర్ధరథుఁ జేసి యడంచెఁ; గలంచె మద్ర రా
జనుచిత మాడి, శౌరి విధి యయ్యె, నరుం డనిఁ జంపెఁ గర్ణునిన్’. **(శాంతి. 1.35)**

శ్రీకృష్ణుడు అర్జునుడితో అన్నట్లుగా లోకంలో బహుళ ప్రచారంలో ఒక చాటువు కూడా ఉన్నది.

క. ‘నరుచేతను, నా చేతను । వర మడిగిన కుంతిచేత, వాసవుచేతన్
ధరచేత, శల్యుచేతను । అరయంగా కర్ణుఁ డీల్గె నార్వుర చేతన్’’

ఈ పద్యానికి అంత ప్రజాదరణం రావటానికి కారణం ఆ మాటలు కృష్ణుడు చెప్పినందుకే. కృష్ణుడు పాండవ సహాయకుడుగా కాక, ‘శౌరి విధియయ్యె’ నని చెప్పిన నారదోక్తులలోని సత్యాన్ని ప్రజలు నమ్మారు కాబట్టి. అంటే కర్ణుడి మరణానికి తెరవెనుక వ్యూహాన్ని విరచించిన విధి కృష్ణ డనేమాట సత్యం కాబట్టి. విధి మాటకు తిరుగులేదు కాబట్టి. విధి-అదృష్టానికీ, భగవంతుడికీ మారుపేరు.

మానవుడు చేసే శుభాశుభ కర్మలలో విధి జోక్యం చేసికొనడు. కాని, వాటి ఫలాలను అతడు అనుభవించే విధానానికి సాక్షిగా నిలిచి అది వర్తిల్లేటట్లు చూస్తాడు. అందులో విధి తన కర్తృత్వాన్ని ప్రదర్శించడు. కాని, కర్మకు తగిన ఫలం అనుభవింపచేసే శక్తిగా గోచరిస్తాడు. మహాభారతయుద్ధం ప్రారంభ మయ్యేవరకు కర్ణుడు నిర్వహించిన పాత్ర ధర్మాధర్మ కర్మనిర్వహణ రూపమైనది. వాటి మిశ్రమ ఫలం అనుభవించే భాగం యుద్ధపర్వాలలో సాగుతుంది. మొదట్లోనే భీష్ముడు అతడిని అర్ధరథుడిగా నిర్ణయించాడు. దానికి ఆత్మాభిమాని అయిన కర్ణుడు కోపించి భీష్మమరణానంతరంగాని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యుద్ధంలో పాల్గొననని శపథం చేశాడు. అందుచేత అతడి యుద్ధప్రవేశం ద్రోణపర్వంలో జరిగింది. ద్రోణపర్వంలో కర్ణుడు ఇంద్రదత్తమైన శక్తిని ఘటోత్కచుడిపై ప్రయోగించి ఆత్మరక్షణం చేసికొన్నాడు. దానితో అర్జునుడికి ఒక ప్రాణగండం తప్పిందని శ్రీకృష్ణుడు సంతోషించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు మరొక రహస్యాన్ని కూడా బయటపెట్టాడు. ప్రతిరోజూ యుద్ధానికి బయలుదేరేముందు శక్తి ప్రయోగంతో ఆనాడు అర్జునుడిని చంపుతానని మిత్రుల ముందు కర్ణుడు ప్రతిజ్ఞచేసేవాడట! కాని, శ్రీకృష్ణుడి మాయాప్రభావం వలన యుద్ధంలో కర్ణు డాసంగతే మరచిపోయేవాడట! అది విధి ప్రదర్శించిన వైష్ణవమాయ!

ద్రోణపర్వంలో శక్తి విరహితు డయ్యాడు కర్ణుడు. కర్ణపర్వంలో ఇక శాపాలు తమప్రభావాలను ప్రదర్శించటం ప్రారంభించాయి. నాగాస్త్రం శ్రీకృష్ణుడి చాకచక్యంతో అర్జునుడి మెడ త్రుంచకుండా కిరీటాన్ని నేలపై పడవేసింది. కిరీటం పడటం తల నేలమీద పడటం వంటిదని ధర్మసూక్ష్మం చెప్పుకొంటే విధి అయిన శ్రీకృష్ణుడు అటు కర్ణుడి కోరికనూ, సర్పాస్త్ర ప్రతీకారాన్నీ కూడా లాంఛనప్రాయంగా తీర్చినవాడయ్యాడు. పార్థుడు బ్రతికాడు. ఇక మిగిలిన శాపాలు వర్తిల్లాలంటే కర్ణుడు జగదేకవీరుడుగా ప్రకాశించాలి; అతడికి దీటుగా అర్జునుడు మహావీరుడుగా రాణించాలి. కర్ణవిజృంభణంతో అతడికి విజయం సిద్ధించే స్పృహ రణరంగంలో ఏర్పడాలి. అర్ధరథుడికి అర్జునుడు సరి అయిన ప్రత్యర్థి కాడు. అయినా, ఆనాడు కర్ణుడు మహారథుడుగా వెలుగొందాలి. అర్జునుడిని ఓడించి చంపివేసే ప్రతాపాన్ని ప్రదర్శించాలి. శాపాల ప్రకారం అప్పుడే రథచక్రం క్రుంగిపోవాలి, భార్గవాస్త్రం స్ఫురించకుండా పోవాలి, మహాస్త్రాలు వమ్ముకావాలి, విధి బలీయమై వక్రించి కర్ణుడు పార్థుడిచేత మృతిచెందాలి. ఈ కార్యక్రమాన్ని పార్థసారథి విధిపాత్రగా నిర్వహించాడు. కాబట్టి కర్ణపర్వం విధి నిర్వహించే కథాసంవిధానం.

విధిపాత్ర నిర్వహించే భగవంతుడు ఎంతటి గడుసరివాడంటే - తాను కారకుడైనట్లుగా గాని, కర్త అయినట్లుగా గాని, ఫలప్రదాత అయినట్లుగా గానీ బయటపడడు. అంటే కర్తృత్వస్పృహను ప్రకటించడు. కాని, జరిగిన కార్యాన్ని, తాను జరిపించిన క్రమాన్ని కల్లాకపటం లేకుండా ప్రకటిస్తాడు. అది లోకులకు విధిలీలగా గాని, విధివంచనగా గానీ తోచవచ్చును. కాని, ఆ రెండింటికీ అతడు అతీతుడుగా ఉండటం విధిపాత్ర నిర్వహించే శ్రీకృష్ణుడి విశిష్టవ్యక్తిత్వం! ఆ వ్యక్తిత్వం వస్తుధ్వని నాశ్రయించి ప్రతీయమానం కావటం కథన చాతుర్యం.

3. ఆఖ్యానానికి అనుకూలమైన ఉపాఖ్యానాల కథనం:

కర్ణపర్వంలో కర్ణార్జునుల బలతారతమ్య నిరూపణ ఘట్టాలు కథానిర్మాణంలో కీలకపాత్ర నిర్వహిస్తాయి. ఈ అంశాన్ని ఉపాఖ్యానాల ద్వారా కూడా పోషించటం ఒక కథాకథన శిల్పం. దుర్యోధనుడు చెప్పిన త్రిపురాసుర సంహారం, శల్యుడు చెప్పిన హంసకాకీయోపాఖ్యానం కర్ణపర్వంలో ఆసక్తికరమైన కథా ప్రయోజనాలను సాధించాయి.

కర్ణుడి మొదటినాటి యుద్ధంలో ద్వంద్వయుద్ధాలు బాగా జరిగాయి. తులనాత్మక పరిశీలనంలో కృష్ణసారథ్యంవలన అర్జునుడు అసాధ్యుడు కావటంచేత కర్ణుడికంటె అతడికి ఎక్కువ విజయావకాశాలు కనబడ్డాయి. అందువలన రెండవనాటి ఉదయం కర్ణుడు శల్యుడిని తన రథసారథిగా ఉండేటట్లు ఒప్పించుమని దుర్యోధనుడిని కోరాడు. శల్యుడు ప్రశంసాప్రియుడనీ, అభిమానధనుడనీ, ఇచ్చినమాటకు కట్టుబడతాడనీ తెలిసిన దుర్యోధనుడు అతడిని సముచిత సంభాషణతో ఒప్పించాడు. ఆ ఒప్పించటానికి అతడు మూడంచెల పథకాన్ని ముందుకు తెచ్చాడు.

1. శల్యుడి వ్యక్తిత్వాన్ని ప్రశంసించి, కర్ణసారథ్యం నిర్వహించవలసిన ఆవశ్యకతను ప్రస్తావించి శల్యుడిని ప్రార్థించి అతడిని సుముఖుడిగా చేసికొనటానికి ప్రయత్నించటం.

సీ. 'సత్యవ్రతంబును, శాత్రవ దుర్దశా । పాదనంబును, మహాభాగతయును
నీకు నైజంబులు; నాకుఁ బెద్దయుఁ గూర్తు । గావున ని న్నేను గారవించి
వినతుండ నై వేఁడికొనియెద, రాజుల । నడుమ నీ దగు సౌమనస్య మెఱిఁగి
యర్జును ననిఁ దెగటార్పఁగ వలయుట । యూహించి, సంభృతోత్సాహలీలఁ

ఆ. గావు మితని' ననుచుఁ, గర్ణునిఁ జూపి యా । తని రథంబు గడపు మనఘ! యిట్టు
లైన నితఁడు పగఱఁ బోనీక పొదివి య । స్ఖలిత గతుల నొంపఁ జంపఁ జాలు'. **(కర్ణ. 1.245)**

భీష్మద్రోణులు పోయిన తరువాత పలుచబడిన కౌరవసైన్యంతో జయాన్ని కోరే దుర్యోధనుడు కర్ణుడినే నమ్ముకొన్నట్లే పేర్కొని, ఆ విజయాన్ని సాధించిపెట్టే కర్ణసారథిగా అంగీకరించుమని శల్యుడిని ప్రార్థించాడు.

2. శల్యుడు సూతకులజుడికి సారథ్యం చేయటం అవమానకరమనీ, పరాక్రమంలో కర్ణుడి కంటె తానే మిన్న అనీ, అవసరం వస్తే సర్వసైన్యాధ్యక్ష పదవి నిర్వహించగలిగినవాడ ననీ, కర్ణుడు తనలో పదునారవ అంశానికికూడా సరిపోడనీ పలికి కర్ణపక్షపాతంతో తనను అవమానించటం తగదని తన అసమ్మతిని తెలిపాడు. అతడి అసమ్మతిని మాన్పే నిపుణమైన సమాధానాన్ని సహేతుకంగా చెప్పి అతడిని ఒప్పించటం రెండవ అంచె.

'శల్యుడా! నిన్ను మించిన రథికు లెవరున్నారు? కర్ణుడు మాత్రం అంతేకాదా? బలవంతులైన శత్రువులకు హృదయశల్యంగా ఉండేవాడివి కాబట్టి నీకు శల్యు డనేపేరు సార్థకమయింది. నా అభిప్రాయం వినుము. అర్జునుడి కంటె రథికగుణాలలో కర్ణుడు గొప్పవాడు. అశ్వహృదయ పరిజ్ఞానంలో కృష్ణుడికంటె నీవు అధికుడవు. అర్జునుడికి ప్రతివీరుడిగా కర్ణుడిని నిలిపాము కాబట్టి కృష్ణుడి ఎత్తులకు ఎదురు ఎత్తులు వేసి, విజయం సాధించటానికి నిన్ను కోరాను. ఆ పని నీవు తప్ప మరొకరు చేయలేరు' - అని ప్రశంసించాడు. దుర్యోధనుడి మాటలలో అర్జునుడికంటె కర్ణుడు గొప్పవాడనే అంశాన్ని వదలి, తనను కృష్ణుడికంటె అధికుడని గుర్తించినందుకు కృతజ్ఞుడై కర్ణసారథ్యానికి ఒప్పుకొన్నాడు. తన ఒప్పుకోలుకు ప్రతిఫలంగా మరొక కోర్కె కోరాడు.

క. 'జనవల్లభ! యొకసమయము విను । మీతనితోడ నేను విచ్చలవిడిఁ దోఁ
చినమాట లెల్ల నాడుదు; । నను నెగ్గులు వట్టకుండినం బొం దొనరున్'. **(కర్ణ. 1. 255)**

దీనిని దుర్యోధనుడు అంగీకరించాడు. ఇందులో శల్యుడు దుర్యోధనుడికంటె విజ్ఞు డనిపించుకొన్నాడు. బెట్టు చేసి రాజుపై పట్టు సాధించాడు. కర్ణుడు అర్జునుడికంటె ఘనుడని శల్యుడు వాచ్యంగా ఒప్పుకొనలేదు. పైపెచ్చు ధర్మరాజుకు తా నిచ్చిన వాగ్దానానికి అనుగుణంగా దుర్యోధనుడినుండి స్వేచ్ఛాప్రసంగవరం పొందాడు. ఇందులో మరొక అంశం కూడా ఉన్నది. శల్యు డానాడు కర్ణుడితో మాటలాడే పలుకులు బహిర్గతమై దుర్యోధనుడి దాకా చేరే అవకాశం ఉండదు. ధర్మజుడి అంచనా ప్రకారం శల్యుడు సారథిగా నొగలెక్కిన నాడే కర్ణుడి మృత్యువు తప్పదు. ఈ రహస్యం దుర్యోధనుడికి తెలియదు.

కర్ణు డెంత గూఢవర్తనుడో, శల్యుడు కూడా అంత గూఢవర్తను డయ్యాడు. ఇద్దరూ రథిక సారథులుగా కుదరటం విధినిర్ణయం.

(3) శల్యుడికి వరమిచ్చినా రారాజుకు అనుమానశల్యం మనసులో మిగిలింది. కర్ణుడిని తూలనాడుతా డేమో అని లోలోన భయపడ్డాడు. ప్రశంసాప్రియు డైన శల్యుడు కర్ణుడికంటె కూడ ఘనుడని చెప్పటానికీ, రథికుడి కంటె సారథి గుణాధికుడై ఉంటాడని నిరూపించటానికీ ఒక దివ్య ఇతిహాసాన్ని పేర్కొన్నాడు.

i). త్రిపురాసుర సంహారం:

దేవతలు త్రిపురాసుర సంహారం చేయుమని పరమేశ్వరుడిని ప్రార్థించారు. మయుడు భూమండలాన్ని రథంగా చేశాడు. సూర్యచంద్రులను రథచక్రాలుగా అమర్చాడు. సముద్రాన్ని అక్షంగా ఉంచాడు. హిమగిరినీ, వింధ్యపర్వతాన్నీ, సప్తగిరులనూ రథాంగాలుగా తీర్చాడు. టెక్కాన్ని త్రేతాగ్నులతో చేశాడు. గొడుగును మేరుపర్వతంతో నిర్మించాడు. గుర్రాలుగా వేదాలనూ, సంవత్సరాన్ని విల్లుగానూ, బాణంగా వాసుదేవుడినీ చేశాడు. శివుడు తనకు సారథి ఎవరు? అని ప్రశ్నించాడు. 'మీకు నచ్చినవాడిని సారథిగా చేసికొను' మని దేవత లన్నారు. అప్పుడు శివుడు ఇట్లా అన్నాడు:

తే. 'అరయ నెవ్వా(డు నాకంటె నధికు(డతని । మీరు యెఱి(గి యొనర్పు(డు సారథిత్వ
మునకు' నని చెప్పటయు, మహామునుల(గూర్చి । కొని యమర్త్యులు సంభృతవినయు లగుచు'.
(కర్ణ. 1.287)

బ్రహ్మదేవుడి వద్దకుపోయి రుద్రరథసారథికి కావలసిన గుణాలన్నీ ఆయనకు ఉన్నట్లు కీర్తించి, అంగీకరించుమని ప్రార్థించి తమను రక్షించుమని కోరారు. అప్పుడు బ్రహ్మ కరుణించి ఇట్లా అన్నాడు.

ఉ. 'మీరు నిజంబు చెప్పితిరి; మిక్కిలి నేర్పును లావు గల్గినన్
సారథి పోరులన్ రథికసత్తము(దా గెలిపించు బుద్ధిదో
స్సార విలాస భంగులకు శర్వు(డు మెచ్చ(గ, నాగమాత్మకో
దార హయంబులన్ నడపెదన్ దనుజుల్ వెఱ(గందునట్లుగన్'. **(కర్ణ. 1.289)**

బ్రహ్మసారథ్యంతో శివుడు త్రిపురాసుర సంహారం చేశాడు. దేవతలు కృతకృత్యులయ్యారు. ఆ కథను దుర్యోధనుడు చెప్పి 'ఇవ్విధంబున లోకహితార్థంబుగా నప్పరమేష్ఠి శివునకు సారథ్యం బనుష్ఠించె; నీవు నటపోలె గౌరవ రక్షణార్థంబుగా రాధేయు రథంబు గడపు; మిక్కర్ణునకు నక్కిరీటికి(గృష్ణునకున్ బలశౌర్యంబుల నెక్కుడయిన వా(డవు; మదీయ జీవితంబును రాజ్యంబును భవదధీనంబులు; వానిం గలిగింపను, జయంబును, సుఖంబును గావింపను నీవ యొడయుండ; విక్కార్యం బాచరించి నన్ను రక్షింపు' మని ప్రార్థించాడు.

ఈ ఉపాఖ్యానం చెప్పి దుర్యోధనుడు - శల్యుడు కర్ణుడికంటె గొప్పవాడే కాక కృష్ణార్జునుల కంటె కూడ గొప్పవాడని పేర్కొని, అట్టి గొప్పవాడే రథసారథిగా ఉండదగినవాడని ఇతిహాస సాక్ష్యంగా నిరూపించి, అతడిని ఒప్పించాడు. శల్యుడు

అంగీకరించటం ఉభయతారకంగా ఉండటం చేత భావికథకు సర్వార్థసాధకంగా అమరింది. వ్యక్తుల బలాబలాలను ఇతిహాస సుందరంగా ధ్వనింపచేయటం ఈ ఉపాఖ్యానం ప్రదర్శించటంలోని విశేషం.

ii). హంస కాకీయోపాఖ్యానం:

రథికులలో అర్జునుడికంటె కర్ణుడు గొప్పవాడని దుర్యోధను డన్నాడు. దానిని శల్యుడు అంగీకరించలేదు కాని, కృష్ణుడికంటె తాను గొప్పవాడన్నందుకు సంతోషించాడు. అయితే, రథమెక్కగానే కర్ణుడికంటె అర్జునుడే మిన్న అని శల్యుడు ఉపన్యసించటం ప్రారంభించాడు. కర్ణుడి బలహీనతలు, ఓటములు మొదలైన వాటిని పేర్కొంటూ అధిక్షేపించటం ఆరంభించాడు. మచ్చుకు శల్యుడి మాటలు కొన్ని.

సీ. 'రోషమహాటోప భీషణ హరితోడ । సమరంబునకు హరిణము గడంగి,
దానధారాభీల దంతావళముతోడ । సంగ్రామమునకు శశంబు గడఁగి,
చండస్వభావోగ్ర వుండరీకముతోడ । నాజికి సారమేయంబు గడఁగి,
దారుణ తుండాతిఘోర గృధ్రముతోడఁ । గలహంబునకు నురగంబు గడఁగి'

ఆ. యడరునట్లు గాదె యస్త్ర కళాసము । జ్జ్వలుఁడు పార్థుతోడ సంగరమున
కీవు గడఁగి యడరు టెల్ల రాధేయ! నీ । కెట్టి బలము నమ్మ నెందుఁ గలదు?' (కర్ణ. 2.42)

శల్యుడి వాక్యాలకు కర్ణుడు స్వాభిమానంతో సమాధానం చెప్పాడు. మచ్చుకు -

సీ. 'అర్జును నస్త్రవిద్యా ప్రమాణంబు నా । యెఱిఁగినయంత నీ వెఱుఁగ; వతని
కొలఁదియు వనమాలికొలఁదియుఁ గాంచి నా । కొలఁదియు నెఱిఁగి వారల మదీయ
దివ్యాస్త్ర బలమునఁ దెగటార్ప నగు నని । యే నిశ్చయించితి; నెట్టు లనినఁ
గడుఁ బెద్దకాలంబు గంధపుష్పాదుల । నర్చించుచున్నాఁడ ననుదినంబు

ఆ. దొనఁ గరంబు భక్తి నునిచిన నున్నది । యహిమయంబు దారుణాస్త్ర; మింత
యంత యనక యెదిరి నాహుతి గొను దాన । జిష్ణు నోర్తు నొండెఁ గృష్ణు నోర్తు'. (కర్ణ. 2.45)

కర్ణుడు స్వీయపరాక్రమాన్ని ప్రతిపాదించుకొంటున్నాడు. అతడి ప్రతాపం ముందు పాండవులను సైతం తేలికగా తీసివేయలేదు. శల్యుడు కూడ కర్ణుడి బలపరాక్రమాలు తెలియని వాడు కాడు, అయినా ధర్మజుడి కిచ్చిన మాటకు బద్ధుడై, కర్ణుడికి హితవు చెప్పటానికి దుర్యోధనుడి అనుమతి పొందినవాడై, రథికుడికంటె సారథి దక్షుడని దుర్యోధనుడు చెప్పిన ఇతిహాస తాత్పర్యాన్ని మరువనివాడై శల్యుడు మూడు మొనల త్రిశూలంవలె మాట్లాడాడు. తనను నిందిస్తూ పలికితే గదతో తల పగులకొడతానని కర్ణుడు బెదిరించినా, మాటలు మానక తాను చెప్పేవి నీతులనీ, వాటిని చెప్పటం సూతధర్మమనీ ఇట్లా అన్నాడు:

ఉ. 'సారథి దక్షుఁడై రథికసారము రథ్యబలంబు నాయుధో
దారత మౌనమున్ రణవిధంబు నిమిత్త శుభాశుభత్వ ని
ర్ధారణమున్ మదిం గని హితం బెఱిఁగించుట నీతి గాన, నీ
వీరసమెత్త నోఁ బలికితేనియుఁ జెప్పుదు సూతనందనా!' (కర్ణ. 2.52)

సారథి స్వభావానికి లక్షణవాక్యం వలె సాగిన ఈ పద్యం పైకి ధర్మసూత్రంగా, లోన భేదమంత్రంగా భాసించే ద్విముఖ వాక్యవిన్యాసం. దీనికితోడు అర్జునుడిని హంసగా, కర్ణుడిని కాకిగా స్ఫురింపజేసి వారిరువురి నడుమగల బలతారతమ్యాన్ని ధ్వనింపజేసే దృష్టాంత రూపమైన కథ (Parable)ను హంసకాకీయోపాఖ్యానంగా చెప్పాడు.

సముద్రంలో ఒక గొప్ప ద్వీపం ఉన్నది. దానిని ధర్మవర్తి అనేరాజు పాలిస్తున్నాడు. ఆ నగరంలో ఒక వైశ్యశ్రేష్ఠుడున్నాడు. అతడు యజ్ఞయాగాలు చేశాడు, శాంతిదాంతులు, కరుణాది ఉత్తమగుణాలు కలవాడు, ధనధాన్యాలతోపాటు దానశీలంకూడా కలవాడు. బహుపుత్రలాభం కలవాడు. అతడి ఇంటిలో ఒక కాకి చేరింది. అతడిపుత్రులు దానిమీద దయతో ఎంగిళ్ళు పెట్టి పొగిడారు. దానితో అది పెరిగి పెద్దదై కడు బలిసి, లోకంలో తనకు సాటివచ్చే పక్షులు లేవని అహంకరించి, ఎవరినీ లెక్కచేయకుండా అనేకవిధాలుగా ఆటలాడుతున్నది.

అట్లా ఉండగా ఒకనాడు గరుత్మంతుడి రెక్కలవంటి రెక్కలబలం గల హంసలు కొన్ని సముద్ర సమీపంలో వాలాయి. వాటిని వైశ్యపుత్రులు చూచి కాకితో ఇట్లా అన్నారు -

క. 'పులుఁగులలో నీ వెక్కుడు । విలసద్గతి నంచ లిట్లు వినువీథిఁ గరం
బెలమిం జనియెడు వీనిం । గలసి పఱచి గెలువవలదె గతుల బహులతన్'. **(కర్ణ. 2.56)**

తారతమ్యజ్ఞాన రహితులైన వారిమాటలు విని ఎంగిళ్ళు తిని బలిసిన అవివేకబుద్ధితో ఆ కాకి ఒక మేటి హంసను చూచి 'పరుగెత్తుదాం రా' అని పిలిచింది. హంసలన్నీ పెద్దగా నవ్వి ఇట్లా అన్నాయి. 'మేము మానససరోవరంలో ఉంటాం. పక్షులన్నీ మెచ్చేటట్లు తరుగనిబలంతో దూరదూరతీరాలకు ఎగిరిపోతాం. హంసలం కావటంచేత ఎంతదూరమైనా కష్టంలేకుండా ప్రయాణిస్తాం. మాలో ఉత్తమహంసను పిలిచావు. ఇంతకుముందు ఎక్కడైనా ఎన్నడైనా హంసలను ఓడించిన కాకిని చూచావా?' అని బింకంగా పలికాయి.

అహంకారి అయిన కాకి హంసలతో ఇట్లా అన్నది. 'నాకు నూటొక్క గతులు తెలుసు. ఒక్కొక్కరకమైన గతితో నూరుయోజనాలు ఎగరగలను. నిలువుగా నింగికి ఎగరటం, అక్కడినుండి సూటిగా నేలకు దిగటం, దూరప్రాంతానికి సూటిగా పోవటం, అందంగా వక్రయానాలు చేయటం, గుండ్రంగా తిరగటం మొదలైన వెన్నోగతులు నాకు తెలుసు. మీరు కోరినట్లుగా నే నన్నిరీతులను ప్రదర్శించగలను.' ఆ బడాయి మాటలు విన్న హంస పోటీపడి ఆకాశానికి ఎగిరింది. 'నీకు నూరు రకాల గతులు వచ్చినా పక్షులన్నీ ప్రసరించే సామాన్యగతిలో సముద్రం మీద ఆకాశంలో పరుగు పందెంలో పాల్గొందాం రమ్ము' అని హంస కాకిని పిలిచింది. 'నాతో పోటీపడి నీవు ఓడిపోవటం నిజం' అని కాకి ఎగతాళి చేసింది.

హంస యానం ప్రారంభించింది. కాకి గర్వంగా పరుగులు పెట్టింది. రెండూ సముద్రంమీద సాగుతున్నాయి. కాకి వేగంగా ముందుకు సాగింది. హంస నిదానంగా ఎగురుతున్నది. హంసను చూచి కాకి త్వరగా రమ్మని పిలిచేది, వెనుకకు వచ్చి ముక్కుతో ముక్కును పొడిచేది. చుట్టూ తిరిగి ఈకలతో ఒరసి చిత్రగతులు ప్రదర్శిస్తూ నవ్వేది. తుళ్ళి తుళ్ళి పడుతూ హంస ఓడిపోతుందని పెద్దగా అరిచేది.

కాకి ప్రదర్శించే ఆ పటాటోపం చూచి హంస ఉత్సహించింది. ఎత్తుగా వేగంగా ఎగురుతూ పడమటి దిశగా పయనించింది. హంస వేగాన్ని అందుకొనటానికీ, అధిగమించటానికీ కాకి ప్రయత్నించి బడలిపోయింది. హంస వేగం

తగ్గలేదు. కాకికి విశ్రాంతి స్థలాలైన చెట్లుగాని, కొండలుగాని కనబడలేదు. లోతైన సముద్రం మాత్రమే కనబడింది. పడితే జలజంతువులు బ్రతకనివ్వవు. పరిస్థితిని గమనించి కాకి భయపడింది. దప్పికతో డీలాపడింది, ఒడలు వశంతప్పి తూలుతూ క్రమంగా ఎత్తునుండి క్రిందకు జారటం మొదలైంది. అప్పుడు హంస ఇట్లా అధిక్షేపించింది.

ఆ. ‘ నీ వనేక గతులు నే, ర్తిది యేగతిఁ । జనుట చెపుమ వాయసంబ! యేను
గడవ నరిగి పిలువఁగా నేల తడసెద? । వెఱక లేటి కిట్టు లెడల విడువ?’ (కర్ణ. 2.72)

కాకి నీరసపడి ఎగురలేక నీటిలో పడి విలవిలలాడుతూ ఉండగా హంస ‘మాట లెన్నైనా అనవచ్చును, కాని అన్నమాటను నిలబెట్టుకొనటం ఎంతమందికి సాధ్యమౌతుంది?’ అని అవహేళన చేసింది. కాకి ‘ఎంగిళ్ళు తిని బలిసి, గర్వించి నాకెదురు ఎవ్వరు లేరని ఇంతవరకూ అనుకొనేవాడిని; కాని, నా బల మేమిటో ఇప్పుడు తెలిసివచ్చింది. కరుణామయుడవైన హంసరాజమా! నన్ను దయతో చూచి, రక్షించి, మా కాకులలో నన్ను కలిపి పుణ్యం కట్టుకొమ్ము!’ అని ప్రార్థించింది. హంస కరుణించి కాకిని కాకుల గుంపులో దింపింది. ‘నేనింక ఇటువంటి అవినయపు పనులు చేయ’ నని కాకి పరితాపం వ్యక్తం చేసింది.

అన్యాపదేశంగా ఒకరిని అధిక్షేపించే రీతిలో చెప్పబడిన కథ ఇది. దీనిని శల్యుడే సూచించాడు. ‘నీవు కోమటికొడుకుల యెంగిలికూటం బెరిఁగిన యక్కాకంబు చందంబునఁ గురుకుమారుల యెంగిళులు గుడిచి క్రొవ్వి యెక్కుడువారల ధిక్కరించెదవు. నీకొలఁది యెఱుంగవు. దానం జేటు వాటిల్లు’ నని విశదపరిచాడు.

మొత్తంమీద శల్య సారథ్యానికి సాకు కల్పించింది త్రిపురాసుర సంహారకథ. శల్యశపథానికి దారి చూపించింది హంసకాకీయోపాఖ్యానం.

4. నాటకీయతను పోషించే సంభాషణ సంవిధానం:

ప్రబంధంలో కథనాత్మక శైలికి, వర్ణనాత్మకశైలికి, నాటకీయశైలికి సమయోచిత ప్రాధాన్యం ఏర్పడుతూ ఉంటుంది. కర్ణపర్వంలో ఈ మూడింటిలో నాటకీయ సంభాషణ శైలికి అధికప్రాధాన్యం ఉన్నది. సంభాషణలలో వైవిధ్యంతో కూడుకొన్న రీతులు గోచరించటం వలన ఈ పర్వం రసవత్తరంగా, నాటకీయంగా సాగి ఆమూలాగ్రం ఆస్వాదయోగ్యంగా అమరింది. కథాకథనం కంటె సంభాషణలు పాత్రల శీలాలనూ, సన్నివేశ బలాలనూ, నాటకీయ ప్రయోజనాలనూ, అధిక్షేపాది రచనా రీతులనూ వ్యక్తం చేయటానికి బలమైన ప్రక్రియలుగా తోడ్పడతాయి. మచ్చుకు కొన్ని ఉదాహరించటం సముచితం.

కర్ణు డంటే పాండవు లందరికీ పగతో కూడిన ప్రతీకారవాంఛ పడగలెత్తి బుసలు కొడుతూ ఉంటుంది. కర్ణపర్వంలో అది తారాస్థాయిలో కనబడుతుంది.

(అ) నకుల కర్ణుల రణరంగ సంభాషణ:

నకులుడు -

క. ‘కౌరవపాండవులకు నీ । వైరము నీవలనఁ గాదె వచ్చెను! విను మ
ద్ఘోర శరనిహతిఁ బడఁ గ । న్నారఁ గనుంగొనక కోప మాఱునె యొంటన్?’

చ. 'అనవుడు 'రాజసూతివి మహాస్త్రవిదుండవు నైన నీకు ని
ట్లనుట దలంప నర్హమగు; నైనను జెన్నఁటి పల్కు లేల? నె
ట్టన భుజశక్తి మార్తుర కడంక యడంచినఁ బల్కు టొప్పుఁగా
క! నిలిచి చూపు నీచలముకల్మియుఁ జేతులబల్మియుం దగన్' (కర్ణ. 1.124-125)

అని అన్నాడు కర్ణుడు. ఇరువురూ అభిమాన ధనులు, పౌరుషోపేతులు, మాటపడని మహితాత్ములు. యుద్ధంలో నకులుడిని ఓడించి అతడు పారిపోతుంటే వెన్నడించి ధనువును అతడి కంఠానికి తగిలించి లాగి జుట్టుపట్టుకొని చిరునవ్వు నవ్వుతూ కసిగా కర్ణుడు ఇట్లా అన్నాడు:

క. 'పలుకులు వృథగా నన్నుం । బలికితి; ము న్నింక నెన్ని పలుకవలసినం
బలుకుము నీకేఁ దగ; నా । యలవుఁ జలము నీ వెఱింగి తంతియ చాలున్.'

క. 'అలవెఱిఁగి పెనఁగు పెనఁగం । దలఁచిన నది గాక సిగ్గు దలకొని యనికిం
దొలఁగుట యిం కిటఁ దగు, వి । చ్చలవిడి నర్జునునికడకుఁ జనుము కుమారా!'(కర్ణ. 1.136, 137)

కర్ణుడి పాత్రలో అభిమానంనుండి ఆగ్రహంవరకు పరిణమించిన మానసికావస్థలకు ప్రతిబింబాలుగా పలికిన పలుకులు ప్రతిధ్వనించాయి.

(ఆ) కృపాచార్యుల చేతిలో ధృష్టద్యుమ్నుడు డీలాపడిపోయి ఎదుర్కొనలేకపోయాడు. అప్పుడు సారథి అన్నమాట లివి-

చ. 'వినుము కుమార! విప్రుభుజవీర్య మవార్యతఁ దేజరిల్లెడుం;
జనవు భవత్సమగ్ర శరజాలము లీతనిమీఁద; దైవసం
జనితము సువ్వె! యియ్యెడరు; సంగర మిట్టిది తొల్లి యెందు నా
కనినది లేదు; తేరు దొలఁగం గొనిపోవుట కార్య మిత్తఱిన్.'

వ. 'నీయట్టివాని విక్రమంబునుం దిట్టినయట్లు సమయుటం జేసి యిమ్మహాత్ముం డవధ్యుం డని నిశ్చయించితి; నామాట కియ్యకొనుము'... (కర్ణ. 1. 156-157)

సారథి మాటలకు ధృష్టద్యుమ్నుడు సుముఖంగా ఇట్లా అన్నాడు:

చ. 'చరణములుం గరంబులును సంచలభావము నొందఁ జొచ్చె, మేన్
విరవిరఁ బోవుచున్నయది, విహ్వల మయ్యె మనంబు, నీతలం
పరయఁగ మేలు; మారుత సురాధిపసూనులలోన నల్ల నా
క్కరు దెసకై రథంబు దొలఁగం గొని పో; మ్మడిబీర మేటికిన్?' (కర్ణ. 1.158)

రథికుడికీ, సారథికీ నడుమ ఉండవలసిన ఆదర్శసంబంధం ఈ సంభాషణలో అచ్చంగా ప్రతిబింబించింది. ఓడిన వీరుడు మనస్సు వికలమైనప్పుడు ప్రదర్శించే సాత్త్వికాభినయం వర్ణనాతీతం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(ఇ) శల్యుడు కర్ణుడిని అధిక్షేపించే వ్యంగ్యోక్తులు.

సీ. ‘రాత్రిమైఁ దాఁకి క్రూరతఁ బోరి మగఁటిమి । వాపిన యంగారపర్ణుకంటె,
ఘోషయాత్రావిధిఁ గురురాజుఁ జెఱపట్టి । మానమేదిన చిత్రసేనుకంటెఁ,
ఖాండవోద్యానంబుఁ గావనేఱక సిగ్గు । వడి చన్న నిర్జరప్రభునికంటెఁ,
గ్రీడాకిరాతుఁడై క్రోడంబునకుఁ గాఁగఁ । బెనఁగి చిక్కిన త్రిలోచనునికంటె

ఆ. నెక్కుడైన వీరుఁడే నర్జునునితోడఁ । బొడుతు నొడుతు ననినఁ బోలుఁ గాక
వినుము సూతతనయ! మనబోఁటు లాతనిఁ । జెఱుతు మనుట నోరిచేటు గాదె!’ **(కర్ణ. 2.24)**

అంగారపర్ణుడు, చిత్రసేనుడు, ఇంద్రుడు, పరమేశ్వరుడు మొదలైన వీరులను, దివ్యులను ఓడించిన అర్జునుడికంటె మేటివీరుడు మాత్రమే ‘అతడిని పొడుస్తాను, చంపుతాను’ అని ప్రతిజ్ఞలు చేయటానికి అర్హుడు గాని కర్ణుడివంటి వారు కాదని శల్యుడి అధిక్షేపం. కర్ణుడు జయించిన వీరులు ఆ స్థాయివారు కాకపోగా అర్జునుడిని ఒక్కసారైనా ఓడించి బిరుదం సాధించిన సాహసం కర్ణు డంతవరకు చేయలేదు. పౌరుషోక్తులు మాత్రం పెల్లుగా పలకటం ఆయన నైజం. ఈ మాటలు అందుకు సాక్ష్యాలు.

సీ. ‘వలను శోభిల్ల నెవ్వాఁడైన - ‘వీఁడె య । ర్జునుఁ’ డని నా కిప్డు సూపె నేనిఁ
బసదనం బే నిచ్చుభంగి యందఱకును । వివరించి చెప్పెద వినుఁడు; ‘మీరు
వొగడంగఁ దగు రథ్యములతోడి సౌవర్ణ । రథములు వలసిన రయము లావు
బొలుపును గలుగు కాంభోజ హయంబుల । వలసినఁ బేర్చు సత్త్వంబునందుఁ

తే. బరిణతము లగు సుందరకరివరముల । వలసినను, జారులావణ్యవతుల వలసి
నను, మహాగ్రామములు వలసినను గోర్కి । నెక్కు డమ్మేటిమగని కే నిచ్చువాఁడ.’ **(కర్ణ. 2.30)**

ఈ మాటలు ప్రగల్భాలకు పరాకాష్ఠ. ఈ పద్యంలోని వ్యంగ్య మేమంటే - కర్ణుడి పేరు వినగానే అర్జునుడు రణరంగంనుండి పారిపోయి ఎక్కడో రహస్యస్థలంలో తలదాచుకొంటాడనీ, అతడి ఆచూకీ తెలిసి కర్ణుడికి చూపెట్టినవాడికి భూరి సత్కారాలూ, కానుకలూ ఇస్తానని కర్ణుడు ప్రకటించటం ఇందులోని భావం. ఎదురుగా తలెత్తితే కనబడే కపిధ్వజం, కృష్ణార్జునుల రథం మొదలైన సంకేతాలు అర్జునుడి అస్తిత్వాన్ని బట్టబయలు చేస్తుండగా ఈ పౌరుషవాక్యం అతడి డాంబికత్వాన్ని ధ్వనింపజేస్తున్నది.

(ఈ) పరస్పర దూషణలు:

కర్ణుడు మద్రజాతి దురాచారాలను ఏకరువు పెట్టి ఆ దేశానికి అధిపతి అయిన శల్యుడిని దూషించటం :

సీ. ‘విను, పాపదేశ సంజనితుండ వగు నీకు । దుర్బుద్ధి గాక సద్బుద్ధి గలదె?
క్షత్రియాధమ! నీచ! కలదు లోకంబున । నాబాలగోపాలమైన వాక్య;
మతికుటిలుండు, సంగతుఁడుగాఁ డేమిటఁ । జెలికిఁ గీడొనరించుఁ జెట్ట పలుకు,
దుష్టాత్మకుఁడు, గడుఁ గష్టుఁడు మద్రకుం । డను నంతవట్టుఁ బ్రత్యక్ష మయ్యె!

ఆ. వావి లేక యెల్ల వనితలుఁ బురుషులుఁ । గలయ మీకు నెగ్గు గాకయుండు;
మున్ను గల్లు పిదపఁ జన్నుఁబాలై పెరుఁ । గుదురు; సెప్ప నేల గుణము లింక?' **(కర్ణ. 2.47)**

ఎదుటివారిని తిట్ట తలచుకొంటే వారిని సూటిగా అనకుండా లోకులు ఇట్లా అంటున్నారని చెప్పటం నాగరకలక్షణం. కర్ణుడు అనదలచుకొన్న నాలుగు మాటలూ పరోక్షంగా నోటిదురద తీరేటట్లు పలకటం పై సంభాషణ శిల్పం. దీనికి బదులుగా శల్యుడు అంగ దేశీయులస్వభావాన్ని మిషగా పెట్టుకొని కర్ణుడిని నిందించాడు.

తే. 'విడుతు రాప్తుల బంధుల, వెలలు గన్న । నమ్ముదురు కులకాంతల నంగదేశ
జనితులగువారు; విభుఁడ సజ్జనుల; కిట్టు । లేవకో నొడ్ల చరితంబు లెన్న నీకు?' **(కర్ణ. 2.111)**

కోపం అంచులు దాటితే దూషణం నోటికి భూషణంగా మారుతుంది. పెద్దలైనా, పిన్నలైనా, ప్రభువులైనా, పేదలైనా ఇది మానవస్వభావం. మనోనిగ్రహం లేనివారూ, మానాభిమానులూ, ఉద్రేకస్వభావులూ ఈ రీతిలో నూతన ప్రమాణాలు సృష్టించగలరు. కర్ణశల్యులు ఆ ప్రమాణాలకు ప్రతినిధులు.

(ఉ) పరస్పర పరుషవాక్యాలు:

పగ సాధించగోరే వీరులు శత్రువులను పరుషమైన మాటలతో ఎదుర్కొంటారు. చర్యలను సూచించే మాటలు ముందుగా వెలువడటం ఇటువంటి సంభాషణలలో సర్వసామాన్యం. ఉదాహరణకు అశ్వత్థామా, ధృష్టద్యుమ్నుడూ సమరాంగణంలో ఎదురు పడ్డప్పుడు సాగిన పరుషభాషణంలో ఒక మచ్చుతునక. అశ్వత్థామ -

క. 'మా తండ్రియెడం జేసిన । పాతకము కతంబు గాఁగ బాంచాల నికృ
ష్టా! తునిమెద నిను నరుఁ డిట । కేతేరక యున్నఁ, బాఱ కీవు నిలిచినన్'. **(కర్ణ. 2.327)**

ధృష్టద్యుమ్నుడు -

క. 'మీతండ్రి కుఱికి నఱికిన । హేతియ నీకొఱకు నునిచి; తిపుడ నఱుకుదున్
నీ తులువ పలుకులకు నీ । దై తోఁచిన యుత్తరంబు నిదియ దురాత్మా!' **(కర్ణ. 2.329)**

'మాతండ్రి' అని అశ్వత్థామ మొదలెట్టితే 'మీతండ్రి' అని ధృష్టద్యుమ్నుడు ఎత్తుకొనటం, ఇద్దరూ కందపద్యాలే చెప్పటం, పాంచాలనికృష్టా! అని ఒకరు 'దురాత్మా' - అని మరొకరు నోరారా తిట్టుకొనటం - తునిమెద నని ఒకడంటే నరికెద నని మరొకరనటం పరుష భాషణలకు శాబ్దిక, ఆర్థిక సమతౌల్యాన్ని కలిగించాయి.

(ఊ) ఆత్మీయుల పరస్పర నిందలు:

శిబిరంలో విశ్రాంతి తీసికొంటున్న ధర్మరాజు యోగక్షేమాన్ని తెలిసికొని తిరిగి యుద్ధానికి పోవాలని వచ్చిన అర్జునుడిని ధర్మరాజు పలికిన నిష్ఠురవాక్యాలు:

చ. 'హరి గలుగంగ నేటికి భయంబున వచ్చితి; నీదు గాండివం
బెరవుగ నిచ్చి, నీవు నొగ లెక్కి, హరిన్ రథిఁ జేయఁ గన్న ని
ష్ఠురభుజ విక్రమోగ్రుఁ డగు సూతతనూభవుఁ దత్సహాయులం
బొరిగొనఁడే సుయోధనుని పోఁడిమి దూలఁగ నొక్కమాత్రలోన్'. **(కర్ణ. 3.65)**

అర్జునుడు గురుసంహారదోషం పోగొట్టుకొనటానికై ధర్మజుడిని అధిక్షేపించటం.

సీ. 'నీవు జూదం బాడగా వైరబంధంబు । కౌరవకోటితోఁ గలిగె మనకు;
రాజ్యనాశంబు నరణ్యవాసంబును । దాస్యదైన్యంబు నత్యంతదుఃఖ
ములుఁ దెచ్చికొంటి; సి గ్గొలయదు నీమనం । బున నించుకేనియు; ననికిఁ జాల
కున్న వానికిఁ దాల్మి యొప్పగుఁ గాక ప్ర । ల్లదములు వలికిన లాఘవంబు

తే. సెందు; ము న్నేమి సేసినఁ జేసి; తింక । నైన దుర్బుద్ధితనములు మాని, తగిన
పౌరుషము లేముసేయఁగ నూరకుండు; । మిడుమపడువారు సైతురే యివ్విధంబు?' **(కర్ణ. 3.89)**

ఈ మాటలలో ఆత్మీయులు తమతమ అంతరంగాలలో దాచుకొని ఉన్న భావాలను మొదటిసారి బయటపెట్టుకొన్నప్పుడు కలిగే గగుర్పాటు, పాపభీతి లేనితనం, నిర్మొగమాటంగా వెలువడే నిజాలనైజం మనకు గోచరిస్తుంది. కాని, అవి సందర్భోచితాలుగా తోచనందున చివరకు ఆ పాత్రలే పరితాపాన్ని వ్యక్తం చేసి ఆ రోషాన్ని పోగొట్టుకొనటంతోపాటు మనకు కూడ మనశ్శాంతిని కలిగిస్తారు. ఈ సన్నివేశాంతంలో శ్రీకృష్ణుడి ఉపశమనవాక్యాలు మనకు పరితోషకవాక్యాలు!

ఉ. 'ఈతని నొవ్వఁ బల్కుటన యీదురవస్థకు వచ్చి తక్కటా!
శాతమహాసి నీ నృపతిఁ జంపిన నె ట్లగునో; విపత్తికిం
బాతకఘోరవృత్తికిని బాసితి దైవ మనుగ్రహించుటన్;
నీతెలి వాప్తబంధుజన నిర్మిత పుణ్యవిపాక మర్జునా!' **(కర్ణ. 3.108)**

5. వర్ణనావైదగ్ధ్యం: రచనా శిల్పం:

కర్ణపర్వం రెండు రోజుల యుద్ధం వర్ణించే కథాభాగం. యుద్ధవర్ణనలలో మూడురకాలు ప్రసిద్ధం. 1.యుద్ధక్రియా వర్ణనం. 2.యుద్ధభూమి వర్ణనం. 3.యుద్ధవీరుల వర్ణనం. కర్ణపర్వంలో ఈ మూడూ ముచ్చటగా పోషించబడ్డాయి. యుద్ధాలలో దొమ్మియుద్ధం కంటె ద్వంద్వయుద్ధాలు ఎక్కువగా ఉన్న ఈ పర్వంలో యుద్ధవీరుల ప్రవృత్తులను బట్టి, శస్త్రాస్త్ర ప్రయోగ ప్రజ్ఞలనుబట్టి ఎంతో వైవిధ్యం కనబడుతుంది. కౌరవపాండవులు క్రమంగా మకర అర్ధచంద్రవ్యూహాలను పన్నుకొన్నా, కర్ణుడు హుటాహుటిగా ధర్మరాజుమీదికి దాడివెడలటంతో వ్యూహరచన దెబ్బతిన్నది. దానితో వ్యక్తులు సాగించిన పోరులకే ఈ పర్వంలో ప్రాధాన్యం ఏర్పడింది. అందులో ఎన్నో అబ్బురాలు, అనుకొనని సంఘటనలు జరగటంవలన జయాపజయాలు దైవాధీనాలన్న నానుడి సత్యమైనట్లు తోస్తుంది. కురుకుమారులలో శ్రుతవర్మ, ఉలూకుడు, శతానీకుడు, శ్రుతకీర్తి, సత్యసేనుడు మొదలైన కురుకుమారులు సైతం యుద్ధంలో తమ అస్తిత్వాన్ని నిరూపించుకొని మెరుపులవలె

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రకాశించి కొందరు ఆరిపోవటం సహజంగా ఉన్నా యువకుల సాహసప్రవృత్తిని పోషించినట్లయింది. అట్లాగే పాంచాలకుమారుల పరాక్రమ వర్ణనం కూడా పఠితల దృష్టిని ఆక్రమిస్తుంది. భీముడు శ్రుతవర్మాదులను చంపాడు. కర్ణుడు పాంచాలురను చంపాడు. ఇవన్నీ ఒక యెత్తు.

ప్రసిద్ధవీరుల నడుమ జరిగిన యుద్ధాలలో అద్భుతా లెన్నో జరిగాయి. సాత్యకి విందానువిందులను సంహరించటం, ప్రతివింధ్యుడు చిత్రుడిని వధించటం, దుశ్శాసనుడు సహదేవుడితో యుద్ధంచేసి మూర్ఛపోవటం, కర్ణుడితో నకులుడు పోరి పరాభూతుడు కావటం, ధృష్టద్యుమ్నుడు కృపాచార్యుడితో పోరి పారిపోవటం, కృతవర్మ శిఖండితో పోరుసల్పటం, సత్యసేనుడు శ్రీకృష్ణుడి మేనికి గాయాలు చేయటం, దుర్యోధనుడు ధర్మరాజుతో యుద్ధంచేసి మూర్ఛిల్లటం, భీముడు కర్ణుడిని మూర్ఛితుడిని చేసి నాలుక కోయబోయి శల్యుడి హితవు విని మానటం, ధర్మజుడిపై కర్ణుడు దాడిచేసి అతడి వెంటపడి తరమటం, భీముడు అడ్డుకొనటం, సుశర్మ వ్రేటుకు కిరీటి మూర్ఛితుడు కావటం, కృపుడికి శిఖండి ఓడి పారిపోవటం, ధృష్టద్యుమ్నుడిచేత కృపుడు పరాభూతుడు కావటం, దుర్యోధనుడు విరథుడు కావటం; కర్ణుడు ధర్మరాజును ఓడించి బాధించటం అతడి పలాయనం, భీముడు దుశ్శాసనుడిని భయంకరంగా చంపటం - మొదలైన వర్ణనలు యుద్ధవీరాన్ని అద్భుతంగా పోషించాయి.

కర్ణపర్వంలో నాయక పక్షంలో భీమార్జునుల యుద్ధం, ప్రతినాయక పక్షంలో కర్ణాశ్వత్థామల యుద్ధం విస్తృతినీ, ప్రశస్తినీ సంపాదించుకొన్నాయి. కర్ణార్జున ద్వంద్వయుద్ధాలలో శస్త్రాస్త్ర ప్రయోగవర్ణనం విస్తృతంగా వర్ణించబడింది. వారి రౌద్రకర్మలకు ఫలంగా రణరంగ భూమి బీభత్సంగా భాసించే ఘట్టాలను తిక్కన ఎక్కువగా దీర్ఘవచనాలతో, అలంకార సుందరంగా, భీషణరమణీయంగా వర్ణించి తనప్రత్యేకతను చాటుకొన్నాడు. ఉదాహరణకు ఒకటిరెండు, క్రియాప్రాధాన్యంగల యుద్ధచర్యలను కథాకథనంలోనూ, అలంకారవర్ణనంలోనూ రక్తికట్టించే నేర్పు ఉభయకవిమిత్రుడి కవితాసామర్థ్యం. శ్రుతకీర్తి శల్యుడితో పోరు సల్పే ఘట్టంలో సీసపద్యాన్ని రెండు ప్రయోజనాలకు తిక్కన ప్రక్కప్రక్కన వాడి చూపించాడు. కథాకథన రూపవర్ణనం:

సీ. 'వేఱొక్క విల్లెత్తి విచ్చుకొడు కఱు । పదినాలుగమ్ములు వఱపె మద్ర
పతిమేన, నతఁడు దొంబది తూపు లడరించి । యేసె నవ్వీరుశరాసనంబు
ఖండంబులుగ, వాఁడు గండడంగక గద । వైచినఁ బొడిసేసి యేచి, శక్తి
నిగిడింపఁ దునుమాడె, నిశితభల్లంబునఁ । ద్రుంచెఁ దదీయసూతుని శిరంబు

ఆ. వాయుజవము లైన వాహంబు లప్పుడు । గలఁగి యరద మనికిఁ దొలఁగ నీడ్చెఁ;
దెఱపి గాంచి శల్యుఁ డతిముతిఁ జొచ్చి క । లంచెఁ బాండుసుతుబలంబు నధిప!' (కర్ణ. 1.114)

అలంకృత యుద్ధవర్ణనం:

సీ. 'కమలాకరము లీలఁ గలఁచి యాడెడు గంధ । దంతావళము సముద్దండతయును,
దరమిడి మృగసముత్కరము ఘోరంబుగా । వధియించు కంఠీరవంబు నేపు,
నీరసారణ్యంబు నిర్భరాటోపతఁ । గాల్చు దావాగ్ని యుగ్రక్రమంబుఁ,
బ్రకట విక్రాంతిఁ బురత్రయంబును సమ । యించు ఫాలాక్షుని యేడ్తెఱయును,

ఆ. బోల్పుఁ బట్టు నయ్యెఁ; భుజగర్వశౌర్య ప్ర । తాపదుర్దమ ప్రకోపములకు
మద్రవిభుఁడు గోలుమసఁగి శాత్రవసైన్య । హననకేలి సల్పు నవసరమున.' (కర్ణ. 1.115)

యుద్ధక్రియా ప్రభావం యుద్ధభూమిమీద ప్రకటితమౌతుంది. యుద్ధభూమి రుద్రభూమిగా మారిన ఘట్టాలను తిక్కన సందర్భోచితంగా వర్ణించి ప్రతిభను ప్రదర్శించాడు. సామాన్యంగా యుద్ధభూమి వీరులు ప్రదర్శించే వీరకర్మకుగాని, రౌద్రకర్మకుగాని ప్రతిఫలాలుగా నిలవటం గోచరిస్తుంది. చూపరులకు అద్భుత, భయానక, బీభత్సరసాలను కలిగించే విభావంగా రణభూమిని వర్ణించటం కావ్యస్వభావం. కర్ణపర్వంలో రసోదంచిత రణస్థల వర్ణనం ప్రబంధోచితంగా నిర్వహించబడింది. మచ్చుకు ఒకటి రెండు ఉదాహరణలు:

బీభత్సుడు సంశప్తకులను శస్త్రాస్త్రాలతో రణనిహతులయ్యేట్లు విజృంభించగా రణరంగం భయంకరంగా తోచింది. చూచే వియచ్చరులకు అద్భుతాన్నీ, బీభత్సాన్నీ ఆవహింపచేసింది. తిక్కన ఆ దృశ్యాన్ని సీసపద్యంతో చిత్రించాడు.

సీ. తేరుల చెక్కలు, వారణంబుల ఖండ । ములు, భూషణంబుల పొడియు, ఘోట
కంబుల తునియలుఁ, గరవాల తోమర । శరపరిఘాదుల శకలములును
రథికజనంబుల వ్రయ్యలుఁ, జామరచ్ఛత్ర । కేతువుల యంశములు, భటుల
తుమురును, రౌతుల తుండంబులును, గంక । టముల భాగములుఁ, జిందముల నుఱుము

తే. గలిసి నెత్తుట మునిఁగి ప్రేవులఁ బెనంగి । మెదడ బ్రుంగి, వియచ్చర హృదయములకు
నద్భుతంబు బీభత్సంబు నావహింప । సంగరాంగణ మతిఘోరభంగి యయ్యె'. (కర్ణ. 1.177)

ఈ వర్ణనంలో యుద్ధభూమి పీనుగుపెంటగా మారటమే కాకుండా, చతుర్విధాంగాల శకలాలు కుప్పలుపడి, రక్తంలో మునిగిపోవటం చిత్రించబడింది. ఆ దృశ్యం చూచినప్పుడు మొదట ఘోరంగా (భయంకరంగా) స్ఫురిస్తుంది. ఆ ఘోరదృశ్యానికి కారణమైన అర్జునుడి వీరకర్మను భావించినప్పుడు అద్భుతంలో ముంచెత్తుతుంది. నెత్తుటిలో మునిగి, ప్రేగులలో చిక్కువడి ఉన్న శరీరశకలాలను చూచినప్పుడు బీభత్సం కళ్ళకు కట్టినట్లనిపిస్తుంది. స్థిరవిభావదర్శనంవలన సహృదయులచిత్తాలలో కలిగే రసభావస్ఫూర్తిని చిత్రిస్తూ పఠితలకు ఆస్వాదన సౌలభ్యాన్ని కలిగించే శిల్ప మిది.

రౌద్రరసాన్ని వీరుల హావ భావాలలోగాని, చర్యలలోగాని చిత్రించే విధంగా ఒక విధమైతే, రణరంగంలో సంకులసమరంలో గోచరించే చతురంగవిన్యాసంలో చిత్రించే విధం మరొక విధం. క్రోధోద్రేకంలో కాల్బలాలు చేసే అరుపులు, వాద్యనాదాలూ, ఆయుధాల చప్పుళ్ళూ, రథాశ్వాదులను విరిచేటప్పుడు నరికేటప్పుడు వెలువడే శబ్దాలూ మొదలైనవి రౌద్రరసవ్యంజకాలుగా భాసిస్తాయి. గజాశ్వాదులు రణరంగంలో పడి ఉన్న తీరు కూడా రౌద్ర క్రియాసూచకంగా గోచరిస్తుంది. ఉదాహరణకు ఏనుగులు దంతాలతో గుర్రాలను కుమ్మి చంపినప్పుడు, ఆ ఏనుగులను వీరులు చంపినప్పుడు, ఆశ్వికులు కాల్బలాలను చెండాడినప్పుడు, రథికులు పోరి నేలబడి నీల్గినప్పుడు ఆయా భంగిమలలో చచ్చిపడి ఉన్న, తునాతునకలై చెదరిపడి ఉన్న వైఖరి ఆయా సందర్భాలలో ప్రకటితమై రణరంగ రౌద్రవిస్ఫూర్తి వ్యక్తమౌతుంది. చచ్చిన శవాల భంగిమలు కూడా యుద్ధక్రీడలోని రౌద్రరసభంగిమలకు నిశ్చల నిదర్శనాలుగా నిలిచినట్లు వచనంలో తిక్కన వర్ణించిన తీరు పఠిత కళ్ళతో చూస్తున్న సజీవ చిత్రంగా భాసిస్తుంది. ఉదాహరణకు దుర్యోధన ధర్మరాజుల ద్వంద్వయుద్ధ ఘట్టంలోని సంకులసమర వర్ణన.

వ. 'ఇత్తెఱంగున నపరాహ్ణంబున దొరల మొత్తంబు లొక్కదెసకుం దార్కొనిన, నుభయబలంబులు నురవడించి కలయం బెరసినం, గ్రందుకయ్యం బయ్యె; నందుఁ జిందంబుల మ్రోఁతయు, నార్పుల యులివును, బాణకృపాణాది హేతి సంఘట్టనంబునం బుట్టు రణనంబును, రథావయవాస్థికపాల భంజనంబున నెసంగు నినదంబునుం గూడి పరఁగిన దిక్కులు పిక్కటిల్లెఁ; గరుల కొమ్ములం జిక్కి వ్రేలు తురంగంబులును, సందుకొని చొచ్చిన సుభటులు సెరివిన నొఱిగి కూలు శుండాలంబులును, నాశ్వికుల మొగంబునం బడి లులాయంబులు సొచ్చిన సరోవరంబుల చందంబగు కాల్బలంబులును, రథికులు వోక పెనంగిన నఱవఱలయిన యరదంబులును, నెత్తురు కాలువలును, గండల తిట్టలును, బ్రేవుల ప్రోవులును, నెమ్ముల రాసులును, నత్యంత రౌద్రంబు నావహించె....' **(కర్ణ. 1.186)**

రణరంగంలో కర్ణుడి వీరవిహారాన్ని వర్ణిస్తూ కొంత అలంకృతంగా, మరికొంత కథాకథనరూపంగా సాగిన సీసపద్యం హృద్యం.

సీ. 'సింహంబు బారిఁజొచ్చిన గజంబుల భంగిఁ, । బులి కగ్గమైన జింకల విధమున,
జ్వలనంబుఁ గిట్టిన శలభంబులట్లుఁ, బాం । చాల యోధులుఁ జేది సైనికులును
దనుఁ దాఁకి పొలియ, రాధాతనూభవుఁ డనిఁ । దనివోక ధర్మనందనుని యున్న
చక్కటి కడర, ధృష్టద్యుమ్నుఁడును, ద్రౌప । దీ పుత్రులును సహదేవుడును శి

తే. ఖండియును సాత్యకియు నకులుండుఁ జేయఁ । గల మహీశులుఁ బొదివి రక్కర్ణు; నతఁడు
పెక్కుపాములు వొదివినఁ బెనఁగు గరుడు । ననువు దోఁపఁగఁ బోరాడె మనుజనాథ!' **(కర్ణ. 2.273)**

అర్జునుడు బాణాలను ప్రయోగిస్తూ క్షణాలలో శత్రుసైన్యాన్ని మట్టు పెట్టేటప్పుడు చతురంగబలం ఆయా క్షణాలలో ఉన్న శరీరభంగిమలతో నేలగూలిన సహజస్థితిని స్వభావోక్తిలో తిక్కన వర్ణించిన తీరు రమణీయం.

సీ. 'నవ్వెడు తలలను, గ్రొవ్వారు చేతుల, । బిరుదులు వెట్టిన చరణములను,
వాతులు దెఱచిన వాజి మస్తకముల, । గిరిశృంగములఁ బోని కరిశిరముల,
నవయవభేదంబు లడఁగెడు నట్లుగఁ । దుము రైన బహుగాత్ర సముదయముల,
భయదంబులై మహిఁ బడు విమానములట్ల । యఱవఱలైనట్టి యరదములను

తే. నేలఁ గప్పుచుఁ; దన బాణజాల మడర । నెవ్వ రడ్డము సొచ్చిన నించుకయును
దవులఁబడక, సముద్ధతిఁ దివిరి మనలఁ । దేఱి చూచుచుఁ బార్థుఁ డీ దిక్కు గవిసె'. **(కర్ణ. 3.176)**

రణరంగంలో యుద్ధవీరులు ఆయా సందర్భాలలో ప్రకటించే వీర రౌద్ర రసమూర్తులను రూపుకట్టేటట్లు చేసే వాఙ్మయశిల్పం తిక్కనది. ఉదాహరణకు కొన్ని:

1. రౌద్రరసమూర్తి భీముడు.

మ. 'నరసింహుం డసురేంద్రు వ్రచ్చు కరణిన్ రౌద్రం బుదగ్రంబుగా
నురవ మత్త్యుగ్రతఁ జీరి, క్రమ్ము రుధిర మ్ముల్లాసియై దోయిట
న్వెరవారం గొని త్రావు, మెచ్చుఁ జవికి, న్మేనునన్ మొగంబున్ భయం
కరరేఖం బొరయంగఁ జల్లికొను, నక్కౌరవ్యుఁ జూచున్ బొరిన్'. (కర్ణ. 3.214)

2. కృష్ణార్జునుల వీరశృంగార మూర్తులు:

చ. 'తనువులఁ గర్ణబాణము లుదాత్త గతిం జెలువొందఁ గౌరవుల్
కనుకనిఁ బాఱ, శౌరియును గవ్వడియున్ వెలుఁగొంది రొక్కెడన్
వినుత మరీచులై పొడిచి నిర్భర సంతమసంబు నల్గడం
జన నభిరామమూర్తు లగు చంద్రుని సూర్యునిఁ బోల్పఁ బట్టుగన్'. (కర్ణ. 3.381)

3. కర్ణుడి సర్వసైన్యాధ్యక్ష వైభవం:

సీ. 'తళతళ మనియెడు దంత ప్రభలతోడ । ఘనకేతువున హస్తికక్ష్య మెఱయ,
హంసవర్ణములైన హయముల పటుగతి । నర్కప్రభం బగు నరద మొప్ప,
దీప్తకాంచన రసలిప్తమై చెలువొందు । సజ్యకార్ముకము హస్తమున వెలుఁగ,
వీటికి సమర సమాటోప మొదవ నా । భీల శంఖము దనమ్రోల మ్రోయ

తే. రణసముత్సాహలక్ష్మి వక్త్రమున వింత । చెన్ను వెలయింప, నాప్తులు సేరి రెండు
పక్కియలయందు బవరంపుఁ బలుకు లెసఁగ । నడవ సొంపాఱి, కర్ణుండు వెడలె నధిప!'(కర్ణ. 1.60)

4. పార్థుడి పరాక్రమస్ఫూర్తి:

మ. 'భ్రుకుటి స్ఫూర్జిత ఫాలభాగుఁ డగుచుఁ బొంగారి, యా సూత పౌ
త్రకు కోదండము బాహుదండములుఁ జిత్రస్ఫూర్తి దున్మాడి, మ
స్తక ముగ్రోద్ధతిఁ గ్రూరభల్ల విలస ద్ధారాహతిం ద్రుంచె, బా
ణకళాదుర్దముఁ డ న్నరుండు పతియు న్నాథేయుఁడుం జూడఁగన్'. (కర్ణ. 3.246)

5. కర్ణుడి చివరి పోరాటంలో రుధిర ప్రభామూర్తి:

ఉ. 'నెత్తుటఁ దోఁగి మేను కమనీయరుచిం గొమరార, బాణసం
పత్తి యుదగ్రతన్ మెఱయ, భాస్వరుఁడై యరదంబుమీఁద భూ
పోత్తమ! కర్ణుఁ డొప్పె నరుణోజ్జ్వల మండల కాంతిపూరము
న్మొత్తపు దీప్తులుం దగ నినుం డపరాద్రి వెలుంగు చాడ్పునన్'. (కర్ణ. 3.339)

ఈ విధంగా కర్ణపర్వం వీరచిత్రాల పరాక్రమ ప్రదర్శనశాల. అందులో చల చిత్రాలు బహుళం; స్థిర చిత్రాలు పరిమితం. ఇది విరామంలేని చైతన్యస్రవంతి. అది కర్ణపర్వ ప్రబంధకాంతి'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిక్కనది 'రసాభ్యుచిత బంధ'మని శ్రీనాథుడి తీర్పు. దానిని 'ఆంధ్రావళి మోదముం బొరయు' నట్లుగా దిద్ది తీర్చాలని తిక్కన అభిమతం. రసశబ్దాన్ని తిక్కన ప్రబంధనాటక ప్రక్రియలకు చెందిన పారిభాషిక పదంగా వాడాడు కాబట్టి నాటక ప్రక్రియలో పాత్రోచిత రచనాబంధాన్నీ, ప్రబంధ ప్రక్రియలో కావ్య రసోచిత రచనా బంధాన్నీ 'తిక్కన ప్రయోగించాడు. దీనికి తోడు ఆయన అర్థగుణాలకు ప్రాధాన్యమిచ్చే రచనను సర్వత్రా పాటించాడు. దానివలన శబ్దసంయోజనం గాని, సమాససంఘటనంగాని, తెలుగునుడికారంగాని అర్థదీప్తికి పోషకంగా ఉండే రచన తిక్కన కావ్యశైలిగా రూపొందింది. అది తెలుగునాట జనరంజకంగా ఉండటానికి రచనలో వ్యావహారికతను విరివిగా ప్రవేశపెట్టాడు. పూర్వకవుల అపూర్వ ప్రయోగాలను తాను పుక్కిటపట్టిన దానికంటె తన కాలంలోని జీవద్భాషలోని పలుకుబడితో రచనకు ప్రాణం పోశాడు. కర్ణపర్వాన్ని తెలుగు తియ్యందనంతో కర్ణపర్వంగా చేశాడు. కొన్ని ఉదాహరణలు:

1. తెలుగు పలుకుబడికి దగ్గరగా ఉండే కావ్య రచన:

* పగలింటి దివియ చందమయ్యె దినకరుండు (1.62)
* కయ్యంపు వేడుక మొగంబునం దళుకొత్త (1.69)
* నిప్పుల్ రాలు కన్దోయితోన్ (1.91)
* పాలివోని కలికి తనము (1.101)
* సిగ్గుఁ జలము డిగ్గఁద్రావి (1.133)
* చేతుల తీఁటవోవ (1.197)
* చేతుల కసివోవంగ (2.300)
* చూచియుం దిరమయి నీవు నాలుకకుఁ దెచ్చిన మాటగదా వినందగున్ (2.11)
* పాడుతు నొడుతుఁ.... జెఱుతు మనుట నోరిచేటుగాదె! (2.24)
* అర్జును నమ్ములు దుప్పువట్టెనే? (2.25)
* గద వండువు (2.222)
* మనములు మెచ్చునఁ గరఁగె (3.284)
* ఏపారి మండునె యాఱంగల దీపము (3.49)
* మొగంబు బిగు వుడిపికొని (3.92)
* నాలుక యడంచియుండు (2.109)
* పగ రాజఁబెట్టును (3.124)
* నీవిక డప్పి యార్చికొమ్మని పలికి (3.179)
* పొగలేని మంట పగిది (3.15)
* కాల్ నిలువక తెరలంగ (3.230)

2. అర్థప్రసన్నతకు తోడ్పడే అలంకార విన్యాసం:

తెలుగువారి జీవితానికి సన్నిహితమైన ప్రకృతినుండి ఉపమానాలు ఎన్నుకొని కావ్యసన్నివేశాలను చిత్రించి పఠితలకు ఆస్వాదమాధుర్యాన్ని కలిగించటం తిక్కన రచనకు సహజాలంకారం. మచ్చుకు -

* మెఱుపుతోడి లలితమేఘంబు మీఁదికిఁ బోయి వెలుఁగు భానుపొలుపు దోఁప (1.318)
* మేఘ పిహితుఁడైన మిహిరుని చాడ్పున వాఁడి లేక యున్నవాఁడు (2.121)
* పెను దుంగమడువులో గజపతి యున్మదవృత్తి గేలిసలుపు పగిది (2.340)
* నాళమునకు వికసితాంభోరుహము బావువెరవు దోఁపఁ దునిమె వెస.... శిరంబు (2.168)
* విచ్చె నబ్బలము సింగంబు గనిన లేడిగమియుఁ బోలె (2.278)
* అవిసిన కలంబు జనంబులు దీవి సేరిన యట్ల కర్ణుం జేరి, కాలుదన్ని భూమిపై నిలిచి (3.165)
* బెబ్బులి లేడికొదమం బొదువు పోలికం బొదివి (3.205)
* పెక్కుపాములు బొదివినఁ బెనంగు గరుడు ననువు దోఁపంగ' (2.273)
* అంతక కోపవహ్ని విపులాకృతి గైకొని వచ్చినట్లు (3.288)
* ఆకలిమై వచ్చు కృతాంత వక్త్ర మన (3.358)
* పెఱమూఁకలు వెఱఁగునం జెయ్వేది కరళ్ళడంగిన మున్నీటి యట్లుండె (2.274)
* మహిఁబడు విమానములట్ల యఱవఱలైనట్టి యరదములు (3.176)

6. రసరామణీయకం

'బీభత్స ప్రధానమగు రణరంగవర్ణనను గావించుచో రమణీయములగు సదృశవస్తువుల వర్ణనా సాహాయ్యమున జుగుప్సను మరుగుపరుచుట తిక్కన యనుసరించిన మఱియొక రచనా విశేషము.

సీ. 'నెత్తుటఁ దోఁగియు నిగిడి పొరెడు వీరు । లలరిన నడమోదుగుల విధంబు
గ్రక్కునఁ దెగిపడి కదలెడు బాహుదం । డములు మహాభుజంగముల భంగి
యవని రక్తాక్తంబులై యున్నయట్టి బల్ । దలలు కెందామరకొలని పగిది
దఱచుగా నెత్తిఁ దప్ప నొఱఁగిన గజములు । కులిశ భగ్నాచల కులమునట్లు

తే. దునిసి తొఱఁగిన జోదుల తొడలు సామ । జముల కరములు నొండొంటి చందములుఁ గ
నుంగొనఁగ వింత లగుటను సంగరాంగ । ణంబు రమణీయమును భీషణంబు నయ్యె'. **(శల్య.1.129)**

సంగరాంగణమును, రమణీయమును, భీషణమును నగువిధమునఁ జిత్రించుటయే తిక్కన యుద్ధవర్ణనయందలి ముఖ్యమగు విశిష్టత. సంపూర్ణ సామ్యముగల సహజోపమానముల, నుచిత సన్నివేశముల యందుఁ బ్రయోగించు విశిష్టతలోఁ, గాళిదాసున కెనవచ్చు తెలుగుకవి తిక్కన యొక్కడే. ఉదాహరణము లతని భారతభాగమున ననేకములు సర్వత్ర కానవచ్చును." (భూపతి లక్ష్మీనారాయణరావు; భారతము - తిక్కన రచన : పు. 95, 96)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉదాహరణకు -

* చారు భీషణంబులుగా నొకళ్ళొకళ్ళం జుట్టుకొని (1.77)

* రథ చిత్ర చారులఘు భీషణ సంచరణంబు లొప్పఁగన్. (1.106)

* తన రథంబు రయంబున దర్శనీయంబుగా (1.139)

* విద్విషద్భయద గదారుచి స్ఫురిత బాహువిలాసవి విభాసమానమై (2.221)

* తునిసిపడి భీమాభిరామంబులు (2.227)

* శిరము ధరడొల్లె కుండల స్ఫురణ మెఱయ (2.246)

* మత్తగజకేళీ సుందరోల్లాస మాభీలత్వం బలరింపఁ ద్రిప్పుచు (3.210)

* ఏరము వ్రచ్చి నెత్తురు దేనియ యిదె ద్రావెదన్ (3.212)

* తను వుగ్రసుందరముగా నవ్వీరుఁ డేతెంచెన్ (3.219)

* నెత్తుటఁ దోఁగి, మేను కమనీయ రుచిం గొమరార (3.339)

* అభిరామ భీషణంబగు రణాంగణంబు (3.380)

పరుష రసపోషణంలో ఆస్వాదయోగ్యతను కలిగించే గుణం రామణీయకం. కిరీటికి కిరీటం అందం. అది సర్పముఖాస్త్రంచేత భగ్నమై పడిపోయినప్పుడు కిరీటం లేని అర్జునుడు కాంతివిహీనుడయ్యాడు. కాని, అప్పుడు కూడా అతడి పాత్రను సౌందర్యరంజితంగా చిత్రించి తిక్కన రక్తికట్టించాడు.

ఉ. ‘శృంగము లేని నీలగిరి చెల్వునఁ గ్రీడి కిరీటహీనుఁ డ
యుృం గనుపట్టె వెల్ల తలయొల్లియ మౌళి దృఢంబుగా నమ
ర్చెం గురునాథ! పూర్ణశశి చెన్నునఁ బూర్వమహీధరంబు కాం
తిం గడచన్న యందము ప్రతీతము గాఁగ నటించు చాడ్పునన్’. **(కర్ణ. 3.327)**

కర్ణవధ ఘట్టం శిల్పసుందరం. అర్జునుడు ప్రయోగించిన ఘోరశస్త్రం భూనభోంతరాలను దద్దరిల్లజేస్తూ వచ్చి, కర్ణుడి శిరస్సును నేల గూల్చింది. ఆ సన్నివేశం వజ్రాయుధాఘాతానికి కూలిపోయే గైరికధాతుమయమైన కొండను తలపింపజేసిందట. ఈ ఘటన భయంకరం. భయానకం.

చ. ‘నినద సముద్భట స్ఫురణ నింగి వగుల్పఁగ సర్వభూతకం
పనమగు చమ్మొయిన్ నిగిడి పార్థివసత్తమ! యేమి సెప్పుదుం
దునిమె శిరంబు రక్తమునఁ దోఁగుచుఁ గర్ణుని యట్ట వజ్రఘో
రనిహతిఁ గూలు గైరిక ధరాధరముం దలఁపింపఁ బట్టుగన్’. **(కర్ణ. 3.361)**

భయానకరసం పరుషరసం. దానికితోడు ఆశ్చర్యం కూడా మిళితమయింది. ఈ దృశ్యం రసమయమే కాని రమణీయం కాకపోవచ్చును. ఆస్వాదయోగ్యత తరుగవచ్చును. అందుకని మరొక పద్యం తిక్కన వ్రాశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ‘చరమగిరినుండి పడియెడు । తరణి కరణి సూతపుత్రుతల వడఁ గాంతి
స్ఫురణోజ్జ్వలంబు నతి సుం । దరమును నగు కాయ మట్లు ధరణిం బడియెన్’. **(కర్ణ. 3.362)**

తలను సూర్యాస్తమయంతోనూ, శరీరాన్ని ఉజ్జ్వలసుందరమైన దానిని గానూ వర్ణించి పర్వతం కూలిన భయంకర దృశ్యం నుండి పఠిత భావనను లలితసుందరమైన సూర్యాస్తమయ సౌందర్యదృశ్యంవైపు మళ్ళించి రమణీయతను ఆపాదించాడు, ఆస్వాదమధురం చేశాడు.

ఆ తరువాత మృతుడైన కర్ణుడి పార్థివ శరీరానికి దివ్యత్వం ఆపాదించే వర్ణనను అనుసంధించాడు.

తే. ‘అధిప యంతన గను విచ్చి యఖిల జనులు । గనుఁగొనంగ నయ్యుజ్జ్వల తనువు విడిచి
చని సముద్దీప్తమైన తేజంబు వారి । జాప్త బింబంబు సొచ్చె నత్యద్భుతముగ’. **(కర్ణ. 3.363)**

కర్ణుడి భౌతికమైన మృతి భయానకం. దాని కళాభివ్యక్తి రామణీయకం. కర్ణుడి తేజస్సు సూర్యుడిలో లీనంకావటం అద్భుతం. కథ ఆస్వాదమధురంగా అద్భుతంగా ముగిసింది.

4. కర్ణుడి జన్మవృత్తాంతం ఒక అద్భుతం:

కర్ణుడి చావు ఎంత అద్భుతమో! అతడి జన్మవృత్తాంతం కూడా అంతే అద్భుతం. ‘మహాభారతేతిహాసము: కర్ణుడి పాత్ర - వ్యక్తిత్వము’ అనే గ్రంథంలో రచయిత శ్రీ అల్లాడ నారాయణరావుగారు కర్ణుడి జన్మవృత్తాంతాన్ని గురించి చెప్పిన విశేషాలు గమనించదగినవి.

“పరస్పర విరుద్ధమైన గుణాల కాశ్రయమై వివాదాస్పదమైన కర్ణుని వ్యక్తిత్వము వలెనే అతని జీవితచరిత్ర కూడా పరస్పర విరుద్ధమైన అంశాలకు నిలయమగుట విచిత్రమైన విషయము!

కుంతీదేవికి వివాహానికి పూర్వమే జన్మించిన ఈ కర్ణుని గూర్చిన ప్రస్తావన మహాభారతము ఆదిపర్వ పంచమాశ్వాసమున-పాండురాజు వివాహమును గూర్చి భీష్ముడు విదురునితో విచారించుచుండెనని-17వ పద్యమునుండి 33వ వచనము వరకు గల 17 గద్యపద్యాలలో చెప్పబడినది. మరల ఇతని జన్మవృత్తాంతము అరణ్యపర్వ సప్తమాశ్వాసమున

వ. ‘జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె.

మధురాక్కర.

కలదు దేవగుహ్యంబని కమలబాంధవుఁడు గర్ణుఁ
బలికె నని చెప్పి; తది యెద్ది? బలియుఁ డా సూతజుండు
లలితకవచంబు మణికుండలములు నెమ్మెయిఁ బడసె?
వెలయు నివ్విధ మంతయు వివరింపవలయు నాకు.’ **(అరణ్య. 7.3. 308, 309)**

అన్నపుడు వైశంపాయనుడు అతని జన్మవృత్తాంతమును 310వ వచనము నుండి 356వ వచనము వరకు గల 47 గద్యపద్యములందు చెప్పెను. కాని, ఈ విధముగా రెండు పర్వములందు చెప్పిన కథలోనే విభిన్నాంశములు చోటు చేసికొనినవి.

జననము:

ఆదిపర్వము	అరణ్యపర్వము
1. కుంతీకుమారి తండ్రిచే నియుక్తయై తమ ఇంట అతిథిగా ఉన్న దుర్వాసునకు సేవలొనర్చి ఆయన అనుగ్రహమునకు పాత్రురాలయినది. (సం. భార. 110అ. 4, 5 శ్లోకాలు) భోజనవాంఛతో అతిథిగా వచ్చిన దుర్వాసునకు కోరిన ఆహారమిచ్చి సంతుష్టుని చేసి ఆ ముని అనుగ్రహమునకు పాత్రురాలయినది. (ఆంధ్ర. భార. ఆది. పంచమా. 17, 18 పద్యాలు)	ఒక సంవత్సరము పాటు కుంతి భోజునింట అతిథిగా ఉన్న దుర్వాసునికి ఆమె పలు ప్రయాసల కోర్చి శుశ్రూషలొనర్చి, ఆయన అనుగ్రహమునకు పాత్రురాలయినది.
2. సూర్యుని అనుగ్రహమున కుంతికి కర్ణుడు సద్యోగర్భమున జన్మించాడు.	ఆమె పది నెలలు గర్భము మోసినది. కాని సూర్యుని మహిమచే ఆ విషయము రహస్యముగానే ఉండెను. (అరణ్య.339వ.) (బహుశః దీని నాధారముగా చేసికొనియే కాబోలు తిరుపతి వేంకటకవులు కృష్ణుని నోట 'పది నెలలు మోసి నిన్నుగన్న పడంతి కుంతి' - అని అనిపించి ఉందురు)
3. కుంతీదేవి కర్ణుడు పుట్టిన వెంటనే పెట్టెలో ఉంచి గంగలో విడిచినది. (30వ)	పసిబిడ్డను ఒకనాటి రాత్రి పెట్టెలో ఉంచి అశ్వనదియందు విడచినది. ఆ నది చర్మణ్వతిలో గలసి, అటు పిమ్మట భాగీరథిలోపడి చంపాపుర' ప్రాంతము చేరినది. (తెలుగున 'పంపానగరము') భార్యతోపాటు గంగాస్నానమునకు వచ్చిన అతిరథు డా పెట్టెను తీసికొనెను.
4. కుంతి తనకు గల్గిన తొలి చూలును పుట్టిన వెంటనే విడిచినది. కావున ఆ విషయమామెకు తప్ప వేరెవరికిని తెలియదు. అంతేకాక అటు తరువాత ఆ పసివా డేమయింది ఆమెకు కూడా తెలియదు.	కుంతి బిడ్డను గన్న విషయము దాదికూతు రొక దానికే తెలియును. ఆమె సాయముననే ఆ పసివానిని ఆ రాత్రి వేళ పెట్టెలో ఉంచి 'అశ్వనది' యందు విడిచినది. ఆ పసివాడు అతిరథునింట పెరుగుచున్నట్లు చారులవలన తెలిసికొని శిథిలీకృత సంతాప యయ్యెను. (వచ. 356)
5. గంగానది ఒడ్డున కుంతీకుమారి సూర్యునిచే పుత్రుని గన్నట్లు చెప్పబడెను.	అరణ్య, ఆశ్రమవాస పర్వములందు (95 నుండి 107 ప.) తన బాల్యమున మేడపై నుండియే సూర్యునాహ్వానించి గర్భవతియై గూఢమందిరాంతరమున కొడుకును గని, ఏటియందు విడిచినది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉద్యోగపర్వమున కర్ణుని కలసికొనుటకు వెళ్ళుచు ఆమె తనలో తాను 'దుర్వాసుని మంత్ర ప్రభావము తెలియగోరి తండ్రి ఇంటియందుండియే సూర్యభగవానుని ధ్యానించినట్లును, ఆయన తనకిచ్చిన గర్భమును కాపాడుకొంటి'నని అనుకొనినది. మరియు తన ఇంటనే తా నతనిని కంటినని కుమారునితో చెప్పెను.

ఈ విధముగా ఈ జన్మవృత్తాంతము పలు సన్నివేశములందు పలు విధములుగా ఉన్నది.

ఈ కర్ణ జన్మవృత్తాంతము దేవీ భాగవతమునందును కలదు. అందు దుర్వాసమహర్షి కుంతిభోజుని యింట చాతుర్మాస్య వ్రతదీక్షను జరిపెను. ఆ కాలమున కుంతీకుమారి ఆయనకు పరిచర్యలు సలిపెను.

ఆ మహర్షి తన కనుగ్రహించిన మంత్రమహిమను పరీక్షించు ఉద్దేశముతో ఆమె తన యింటినుండియే సూర్యునాహ్వానించి గర్భవతియైనది. ఈ విషయము దాదికి తప్ప వేరెవరికిని తెలియదు. అంతఃపురమునందే పసివానిని గన్నది. ఆ పసివానిని విడిచిపెట్టుటకు బాధపడుచున్న సమయమున దాది యామెకు ధైర్యము చెప్పి, పెట్టెలో నుంచి తీసికొనిపోవుచుండెను. ఆమె కెదురు వచ్చిన రాధ విషయము తెలిసికొని, గొడ్రాలినైన తన కా పిల్లవాని నిచ్చినచో పెంచుకొందునని అడిగెను. ఆ విధముగా దాదిద్వారా ఆ పసివాడు రాధ పెంపకము అనతిరథుని యింట పెరిగి పెద్దవాడయ్యెను. (ద్వితీయస్కంధము పుటలు 107, 108)

ఇతని జన్మనక్షత్రము భారతమునం దీయకపోయినను శ్రీ మహాభారత సారోద్ధారము-1వ సం. పుట 150 యందు 'అజీ జనత్సుతం....' అని వివరింపబడినది. (కాని సంవత్సరము మాత్రము వివరింపబడలేదు)

చైత్రము మొదలుకొని 11వదియగు మాఘమాసమున శుక్లపక్షమునందు పాడ్యమినాడు చంద్రునివలె కర్ణుడుద్భవించెను. అనగా మాఘ ప్రతిపత్తు నందు కర్ణుని నిషేక జన్మ - కుంతీ సూర్యుల సమాగమము గర్భోత్పత్తియు, అని యర్థము నీలకంఠీయ వ్యాఖ్య.

ఆమె సద్యోగర్భమున కుమారుని ప్రసవించినది. ('సద్యోగర్భధరా కుంతీ కర్ణం ప్రాసూత తం సుతం' పే.152)" (పు. 1-3)

ఈ అల్లాడ నారాయణరావుగారు కర్ణచరిత్రను సంగ్రహంగా సమీక్షించి సహృదయుల మన్ననల నందుకొన్నారు. వారి మాటలలో-

"దేవగణమునందు సూర్యుడు క్షత్రియుడుగా పరిగణింపబడెను. శూరసేనుని కుమార్తెయు, కుంతిభోజుని దత్తపుత్రికయునైన కుంతీదేవి క్షత్రియ కాంత. కాని వీరిరువురి సంతానమయిన కర్ణుడు సూతపుత్రుడుగా పరిగణింపబడుట విపరీతమైన అంశము!

కుంతీదేవికి దుర్వాసుండుపదేశించిన మంత్రము కర్ణునిపాలిటి శాపముగా పరిణమించగా, అదియే పాండురాజుకు వరమయి ఐదుగురు కుమారులను ప్రసాదించెను. కుంతీకుమారి పసివాడైన కర్ణుని నదిలో విడుచుచు, 'నీ ముద్దు మురిపాలను చూచి సంతసించు భాగ్యమున కే యిల్లాలు నోచుకొనెనో గద!' అని వాపోయెను. అతనిని చల్లగా చూచి కాపాడుమని సమస్త దేవతలకు మ్రొక్కుకొనెను. కాని వివాహానంతర మామె తన ప్రేమను పాండవులవరకే పరిమితము గావించుకొనెను. అంతేకాక వారిని సంహరించనని కూడా అతనినుండియే వరము పొందుట మరింత విడ్డూరము! మరణానంతరము ధర్మజునిచే రాధేయునకు తిలోదకము లిప్పించుటయే ఆమె అతనికి చేసిన మహోపకారము!

బాల్య చాపల్యముచే దుర్వాసమంత్రమును పరీక్షించబోయిన కుంతీకుమారిని నిర్బంధించి, భాస్కరు డామెకు గర్భమును ప్రసాదించెను. ఆ పసివాని మంచిచెడ్డలను తానే చూచుకొందునని ఆమెకు మాటయిచ్చెను. కాని ఆ శిశువును సూతగృహమునకు చేర్చుటతోనే ఆయన తన బాధ్యత తీరిపోయినట్లు పిదప ప్రవర్తించెను!

పాండుపుత్రుడయిన పార్థుడు ద్రోణుని ప్రియశిష్యుడయ్యెను. '....అన్న! ధనుర్ధరు లన్యులు నీ కంటె నధికులు గాకుండునట్లుగా గఱపుదు విలువిద్య ఘనముగా' (ఆది. 5ఆ. 230)నని మాట యిచ్చుటయే గాక, ఆ మాటకు కట్టుపడి ఏకలవ్యుని విద్యను మట్టిగలిపి, 'గురువ'ను మాటయొక్క గౌరవము కూడ మంటగలిపెను! ద్రుపదుని బంధించి తెచ్చి గురుదక్షిణ సమర్పించుకొన్నందుకు సంతోషముతో బ్రహ్మశిరోనామకాస్త్రమును కూడా ఉపదేశించెను!

కాని, సూతపుత్రు డయిన కారణముగా కర్ణుడు బ్రహ్మాస్త్రోపదేశమున కనర్హు డయ్యెను! అంతేగాక తన ఆభిజాత్యము మరుగుపరచి విద్యలు నేర్చుకొనెనని భార్గవరామునిచే శపింపబడెను! అతడు రాధేయుడయి హస్తినాపుర సింహాసనార్హతను కోల్పోవుటయేగాక, దుర్యోధనుని అనుగ్రహముచే అంగరాజ్యాభిషిక్తుడగుటయు, 'పవిత్రమైన పురోడాశమునకు కుక్క అనర్హమైనట్లు'గా భీమునిచే అభివర్ణింపబడి హేళనగావింపబడెను!

ఇతడు పుట్టుకనుబట్టి క్షత్రియుడైనను, సూతులకు విహితములైన సంస్కారములను పొంది యుండెను. అందుచే క్షత్రియత్వమును బట్టి ప్రహరింపగల్గియుండియును, సూతత్వముచే శత్రు ప్రహారములకు తట్టుకొనలేక పలాయితుడగుచుండెను. (నీలకంఠాచార్యోక్తి - మహాభారత తత్త్వకథనము - 6వ భా. పే.1308)

ఇంద్రు డర్జునునకు తోడునీడయై అతని మంచిచెడ్డలను విచారించెను. స్వయముగా అతనికి గురుత్వము వహించి ఐదు సంవత్సరములపా టస్త్రశిక్షణనిచ్చెను. (ఏకశ్చ పంచవర్షాణి శస్త్రా దస్త్రాణ్యశిక్షత (విరాట.అ.49.శ్లో.8) తాను పలు శస్త్రాస్త్రముల నతని కిచ్చుటయేగాక, వరుణాది దిక్పాలకులచే గూడ ఇప్పించెను. కాని, భాస్కరు డందులకు విరుద్ధముగా, తాను కర్ణునకు తండ్రినను విషయమును కూడా మరుగుపరచెను. కనీస మాతనిని భార్గవరామ, బ్రాహ్మణ శాపములనుండి తప్పించుట కయినను ప్రయత్నించలేదు! సురనాథుడు పార్థుని విజయము నాశించి రాధేయుని కవచ కుండలముల నర్థించ దలచెనను విషయము తెలిసి, వానిని దానమియ్యవలదని వారింప జూచుటయు, మరణానంతర మతనిని త్రయోదశాదిత్యునిగా పరిణమింపజేయుటయు ఆయన అతనికి చేసిన ఉపకారములు!

కన్యాగర్భమున జన్మించుటయే మహాపరాధమయినచో అందుకు కారణమయిన వారికి లేని శిక్ష యిత డనుభవింపవలెనా!

అతిరథుడు ధృతరాష్ట్రునికి మిత్రుడు. ఆ పలుకుబడితోనే అతడు కృప ద్రోణుల వద్ద తన కుమారుని శిష్యునిగా జేర్చెను. కాని, వారును సూతకులము వారి కర్హమయినంతవరకే అతనికి విద్యనేర్పిరి! విద్యావిషయమున పార్థునితో నితనికి గల స్పర్ధయు, రాజ్యకాంక్షచే దుర్యోధనునకు పాండుపుత్రులతోడి వైరము వారిరువురను ప్రాణస్నేహితులను గావించినది!

ఈ విధముగా కౌంతేయులయిన కర్ణార్జునులు కౌరవ పాండవ పక్షములలోని వారయి, పరస్పరము బద్ధశత్రువు లగుటయే గాక, ఒకరినొకరు పరిమార్చుటకు కూడా ఆద్యంతము ప్రయత్నించిరి!

పాండవులకు కృష్ణుని సహాయము లభించుటయే ఆ పక్షమువా రన్ని విధములైన గండముల నుండి గట్టెక్కి, చివరకు భరతవర్షమునకు సమ్రాట్టులగుటకు కూడా కారణమయ్యెను.

భీష్ముని సేనానాయకత్వమున తమ సేనలకు పట్టిన దుస్థితిని గూర్చి ధర్మజుడు వాసుదేవుని కడ తన గోడును వెళ్ళబోసికొనెను. ఆ సమయమున ఆయన ధర్మజు నూరార్చుచు, 'ఎవడు పాండవవైరియో వాడు నాకును వైరియనుటలో సందియ మేటికి' నీ ప్రయోజనములు మదర్థములే యగుటను నా ప్రయోజనములు త్వదర్థము లగుటలో సందియమేటి?' కనెను. (భీష్మ. 296)

ఆ సందర్భముననే ఆయన పార్థునితో తనకు గల సంబంధమును గూర్చి

తే. 'సఖుఁడు సంబంధి బంధుండు సవ్యసాచి । నాకు నతనికినై యేను నరవరేణ్య!
కూర్మిమై నిత్తు కండలు గోసియైన । నరయ నాయెడ నాతండు నట్టివాఁడ!' **(ఆం. భార. తృతీయ 283)**

అని కూడా వివరించెను. దీనికితోడు భీష్మ ద్రోణులు కౌరవపక్షమున యుద్ధమొనర్చినను వారు తమ మరణ రహస్యములను తెలుపుట ద్వారా పాండవులకు సహాయపడిరి!

ధర్మజుడు భగవంతుడైన కృష్ణుని నమ్ముకొనగా, దుర్యోధనుడు కేవలము తన బలములను నమ్ముకొనెను. దీనినిబట్టి యీ యుద్ధము దైవమానుషములకు జరిగిన సంఘర్షణగా తెలియవచ్చును!

ఒక పక్షమునకు దేవతలు సహాయముండుటయు, వేరొక పక్షమునకు దానవులు తోడుండుటయు గమనించినచో ఇది దేవదానవ సంగ్రామముగా కూడా కాన్పించును!

కర్ణార్జునుల ద్వంద్వయుద్ధ సమయమున మునులు ధనంజయుని పక్షమున నుండిరి. వైశ్యులు, సూతులు, మరియు సంకరజాతులవారును రాధేయుని పక్షమున నిలిచిరి. దీనిని బట్టి యితని నభిమానించువా రధికసంఖ్యాకులని తెలియవచ్చును!

ఇతనివలన లోకమున కొనగూడిన ఉపకారము కంటె అపకారమే అధికము కావున, నితనిని దుష్టునిగా పరిగణించిన వా రధికులు. 'ధర్మలోపముచే జనించుటచే నీ కిట్టి బుద్ధి పుట్టినది. సహవాసదోషముచే కురుసభలో పలుమార్లు పరుషముగా సంభాషించితి' వని గాంగేయు డితనితో పల్కెను. (భీష్మ. పే. 343).

క్షత్రియవర్గము యుద్ధమరణము నొందుటకై కన్యాగర్భమున నితడు సృష్టించబడినట్లు (క్షత్రం స్వర్గం కథంగచ్ఛేచ్ఛస్త్ర పూతమితిప్రభో! సంఘర్ష జనన స్తస్మాత్ కన్యా గర్భోవినిర్మితః॥ (శాంతి.అ.2. 4 శ్లో.) నారదుని వాక్యములను బట్టి తెలియుచున్నది. అందు నిమిత్తమే కౌరవులును సృష్టించబడిరి. అట్టివారు దుష్టులు గాక మంచివా రెట్లగుదురు? భూభారము తగ్గించుటకై అవతరించిన వాసుదేవుని ఆశయము నెరవేరుటకు వీరి తోడ్పాటు తప్పదు గద!

ఇతడు పాండవులపై ద్వేషము నూరిపోసెనేగాని, వారితో సయోధ్యగా మెలగుటకు ప్రోత్సహించలేదని నింద యున్నది. దుర్యోధను డితనిని పాండవులవలన భయముతో చేరదీసెనేగాని, అంతకన్న వేరే సదుద్దేశముతో ఎంతమాత్రము కాదు. హస్తినాపుర సింహాసన మధిష్ఠించుటయే అతని ప్రధానాశయము. అందు కడ్డు తగిలిన కురువృద్ధుడును, పితామహుడునయిన భీష్మునియొక్కయు, విద్యాగురువు, బ్రాహ్మణుడునయిన ద్రోణునియొక్కయు మాటలనే అతడు లక్ష్యపెట్టలేదు. అట్టివాడు కేవలము సూతపుత్రుడును, తన కాశ్రితుడునైన కర్ణుని మాటలను మాత్రము శిరసావహించునా? ఆ కారణమునను, తనను వృద్ధిలోనికి తెచ్చెనను విశ్వాసముతోను రాధేయుడు సుయోధనుని అభిప్రాయములనే సమర్థించెను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇంద్రున కితడు చేసిన దానము కూడా ప్రశస్తమయినది కాదని విమర్శయున్నది. ప్రత్యామ్నాయ దానమొనర్పుమని యితనికి సూచించినది భాస్కరుడు. అంతవర కితని కా ఉద్దేశము లేదు. అంతకుమునుపే అతడు ప్రతిదినము అసంఖ్యాకులయిన యాచకులకు పలువిధములైన దానము లిచ్చెను. కాని వారెవరినుండియు, ఏమియు నాశించలేదు. అట్టి దాతృత్వనిష్ఠను పురస్కరించుకొనియే పురందరు డీతని యాచింపనెంచెను. 'కీర్తిశరీరము మాసిపోకుండుటకై కవచకుండలములు దానమిచ్చినను, తన స్వామికార్యమునకై శక్తి నడిగి పుచ్చుకొనుటచే కీర్తిశరీరమునకు మచ్చ వచ్చె'నని వజ్ఝల వారి సమర్థన! (కర్ణచరిత్రము - పే.66)

ఇతడు తనయుడుగా కుంతీదేవి కోర్కెను తీర్చెను!

తండ్రి ఆదిత్యునకు భక్తుడై మెలగెను!

సూతదంపతుల విషయమున సుతుని బాధ్యతలను విస్మరించలేదు!

దానవీరుడుగా ఆచంద్రతారార్కమైన కీర్తిని సంపాదించెను!

నమ్మినబంటుగా తన స్వామికై ప్రాణత్యాగమొనర్చెను!

దుష్టచతుష్టయమునందు దుశ్శాసనునిలో ప్రశంసించదగిన అంశమేమియు లేదు. అందుచే అతనిపై గ్రంథములు వ్రాసినవారు కానరారు. కౌరవాధీశులు తన పూర్వులకొనర్చిన ద్రోహమునకు ప్రతీకారముగా శకుని, ధార్తరాష్ట్రులకు పాండవులతో వైరము కల్పించి, వారిని మట్టుపెట్టి తనకక్ష తీర్చుకొన్నట్లు కొన్ని రచనలున్నవి. అదే విధముగా దుర్యోధనుని రాజ్యార్హతను సమర్థించుచు, మయసభలో అతడు భంగపడిన ఘట్టములను విశ్లేషించుచు గ్రంథములు రచించిన వారును ఉన్నారు. కాని, వారందరికంటె అత్యధికమైన సానుభూతిని సంపాదించుకొని, పలువురు కవిపండితులచే పెక్కు గ్రంథములు వ్రాయించుకొనగల్గిన ఘనత మాత్రము కర్ణునకే దక్కినది!

విద్యా విషయమునగాని, సాంఘికముగా గాని ఆనా డాత డెదుర్కొనిన పరిస్థితులీనాడు లేవు. కాని, కుంతీపుత్రుల సంఖ్య మాత్రము దినదినాభివృద్ధి చెందుచుండుట చింతింపదగిన అంశము!'' (పుట 111-114).

కర్ణుడు మహావీరుడుగానే కాక దానవీరుడుగా, మానవీరుడుగా ప్రజల హృదయాలలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు. సహజకవచకుండలాలను కీర్తించి ఇంద్రుడికి దానం చేసే ఘట్టంలో అతడు పలికిన మాటలు కర్ణకీర్తిపతాకలు!

దానవీరుడుగా

సీ. 'విప్రులు గడునర్థి వేఁడినఁ గడిమితోఁ । బొచ్చెంబు సేయక యిచ్చు టొకటి;
బలితంపుఁ బగతురఁ బరిమార్చు టొక్కటి, । దండియై యనిఁజచ్చు టొండె నొకటి;
శరణాగతుని నెట్టి శత్రువునైనను । గరుణించి చంపక గాచు టొకటి;
భామినీ ద్విజవృద్ధ బాలాతురులకైన । యాపదఁ జెచ్చెరఁ బాపుటొకటి

ఆ. యనఘ! యివి వ్రతంబులై చెల్లు నాకు; నిం । దొకటి తప్పెనేని వికలకీర్తి
నగుదుఁ, గాన యిత్తు నఖిల భావముల నా । ఖండలునకుఁ గవచకుండలములు'. **(అరణ్య.7.295)**

యశోవీరుడుగా, మానవీరుడుగా -

ఆ. 'కీర్తి విడువఁజాలఁ, గీర్తితో మెలఁగంగఁ । జావు వచ్చె నేనిఁ జత్తుఁ గాని:
జగములోన నెల్ల సడికంటెఁ జావు మే । లనఁగఁ బరఁగు మాట యనఘ! వినవె!' **(అరణ్య.7.293)**

ఈ మాటలు ఇప్పటికీ ఆంధ్రుల నాల్కలమీద కర్ణకీర్తి గీతాలవలె లాస్యం చేస్తూనే ఉన్నాయి! కర్ణుడు స్వయంగా ప్రకాశించే ఉజ్జ్వల వీరనక్షత్రం.

5. కర్ణపర్వం: అంతరార్థం:

అధ్యాత్మవిదులు మహాభారతాన్ని అధ్యాత్మశాస్త్రంగా భావిస్తారు. భారతేతిహాస పురాణాలు స్వభావతః అధ్యాత్మికపరమైన ప్రతీకాత్మక ప్రవృత్తులతో ప్రకాశిస్తూ ఉంటాయి. ప్రసిద్ధ కావ్యాలూ, ప్రబంధాలూ ఈ మార్గంలో పయనించి ప్రామాణికత్వాన్ని సాధిస్తాయి. అందువలన మహాభారతం ఆధ్యాత్మిక ప్రతీకార్థ ప్రవృత్తి కలిగిన ఇతిహాసం!

కర్ణపర్వంలో అసమగ్రయోగాన్ని ఋజుమనోవృత్తితో ఎదిరించే సాధన అంతరార్థంగా నిక్షిప్తం చేయబడింది. కర్ణుడు యోగమార్గాన్నీ, దుర్యోధనుడు ముక్తిమార్గాన్నీ నాశనం చేసే తామసవృత్తికీ ప్రతీకలు. ద్రోణుడి తరువాత కర్ణుడిని సేనాపతిగా అభిషేకించాడు. ద్రోణుడంటే అసమగ్రజ్ఞానమార్గం. అది ఋజువృత్తితో సాత్త్వికవృత్తులు (ధర్మరాజాదులు) సాగించే సాధనను భ్రష్టం చేయలేకపోయింది. అప్పుడు ఆ సాధనను అసమగ్ర యోగమార్గం (కర్ణుడి) ద్వారా సాధించాలని తామసికవృత్తి పూనుకొన్నది.

దుర్యోధనుడు కర్ణుడి కోరిక మేరకు మద్రపతిని అతడి రథసారథిగా ఒప్పించాడు. 'మద్ర' అంటే అహంకార మమకారాలను అగ్నివలె నాశనంచేసే జ్ఞానమని అంతరార్థం. శల్యుడి సారథ్యం కుదిరితే కర్ణుడు కృష్ణసారథ్యం పొందిన అర్జునుడితో దీటు కాగలుగుతానని భావించాడు. అంటే యోగమార్గానికి కుంభకస్థితిలో కలిగిన సగం జ్ఞానానికి మరికొంత నిరహంకార ప్రవృత్తిగల జ్ఞానసహాయం కూడా లభిస్తే, కృష్ణసారథ్యంలో ఉన్న (నిర్వృతితత్త్వం యొక్క తోడ్పాటుతో ఉన్న ఋజుమనోవృత్తితో (అర్జునుడితో) సరితూకం పొందవచ్చునని భావించాడని అంతరార్థం. శల్యుడు ధర్మరాజుకు సహాయం చేయాలనిపోతే మార్గమధ్యంలో దుర్యోధనుడి యుక్తిలోపడి అతడికి సాయంచేస్తానని మాట ఇచ్చాడు. అటు ధర్మరాజుకూ తన సారథ్యంలో సహాయం చేస్తానని మాట ఇచ్చాడు. అంటే శల్యుడు సాధకుడిలోని ద్వైతవృత్తికి ప్రతినిధి. సాధకుడు తనకు తెలియకుండానే చంచలత్వంతో ద్వైధీభూతమైన ప్రవృత్తిని ప్రకటిస్తాడని గ్రహించాలి.

శల్యుడు కర్ణుడికంటె తాను గొప్పవాడినన్నాడు. అంటే యోగమార్గంకంటె నిరహంకార జ్ఞానమార్గం గొప్పదని అర్థం. దుర్యోధనుడు శల్యసారథ్యాన్ని కుదిరించాడు. దానివలన అర్జునుడిపై విజయం సాధించదలచాడు. అంటే- నివృత్తితత్త్వం (కృష్ణ) సహాయంతో ఋజుమనోవృత్తి (అర్జునుడు) బలం పొందినట్లుగా అహంకార మమకారరహితవృత్తియొక్క (మద్రరాజు యొక్క) సహాయంతో యోగమార్గం (కర్ణుడు) బలపడాలని తామసవృత్తి (దుర్యోధనుడు) ప్రయత్నించటం జరిగింది. యోగమార్గంలోని లోపాలను చెప్పటమే శల్యుడు కర్ణుడిని నిరుత్సాహపరచటంలోని అంతరార్థం. కర్ణుడు శల్యుడిని నిందించాడు. జ్ఞానమార్గ యోగమార్గాలలోని లోపాలను గుణాలను సవిమర్శకంగా అంతరార్థపరంగా సాధకులకు అందించటానికే శల్యకర్ణుల సాంకర్యసంవాదాన్ని వ్యాసమహర్షి కల్పించాడని అధ్యాత్మవిదులు భావిస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కర్ణపర్వంలో ప్రవర్తిల్లిన ద్వంద్వయుద్ధాలలో మొదట పేర్కొనదగింది భీమ దుశ్శాసనుల యుద్ధం. భీముడు దుశ్శాసనుడిని ఘోరంగా సంహరించాడు. దుశ్శాసనుడంటే సాధకుడిలోని తామసిక వృత్తులలో ప్రబలవృత్తి అయిన దుష్టవిషయికమైన శాసనవృత్తి. భీముడంటే సాధకుడిలోని అభయవృత్తి. దీనిని బట్టి అభయవృత్తి దుష్టవిషయక శాసనవృత్తిని నాశనం చేసేసాధనను ఆ ఘట్టం ప్రబోధిస్తున్నదని భావం.

ఈ పర్వంలో శ్రేష్ఠమయింది కర్ణార్జునుల ద్వంద్వయుద్ధం. దీనిని సాధకులు ఈ విధంగా భావన చేయాలి. తామసికవృత్తికి వశపడిన యోగమార్గమూ (దుర్యోధనుడి పోషణలో ఉన్న కర్ణుడూ) సాత్త్వికవృత్తితో కూడిన ఋజుమనోవృత్తీ (ధర్మజానుజుడైన అర్జునుడూ) తీవ్ర సంఘర్షణలు సాగించాయని గ్రహించాలి.

ఆ యుద్ధంలో కర్ణుడి రథచక్రం భూమిలో దిగబడింది. కర్ణుడు రథచక్రాన్ని పై కెత్తుతూ ఉన్న సమయంలో కృష్ణుడి ప్రోత్సాహంతో అర్జునుడు ఘోరమైన బాణంతో (అంగీరసీ కృత్యను ప్రయోగించి) చంపాడు. దీని అంతరార్థాన్ని ఇట్లా భావించాలి. యోగసాధకుడు జ్ఞానమార్గాన్ని ప్రతిఘటించి అంటే - కుంభకాన్ని విడిచినపుడు భూతత్త్వ ప్రకృతి నుండి పైకి లేవలేక ఆ భూతత్త్వ ప్రకృతిలోనే దిగబడి కూరుకొనిపోయి ఉండటాన్ని కర్ణుడి రథచక్రం క్రుంగిపోవటంలోని తాత్పర్యం. అప్పుడు సాధకుడు జ్ఞానమార్గంలోకి మారి నిర్వృతితత్త్వంయొక్క సహాయసహకారాలతో ఒక్కసారిగా ఋజువృత్తివలన దేహంలోని వాసనారాహిత్యంతో అమనస్కుడై ముక్తిని పొందవచ్చుననే తత్త్వాన్ని చెప్పేదే శ్రీకృష్ణుడి ప్రేరణతో అర్జునుడు బాణప్రయోగం చేసే ఘట్టం. కర్ణదేహంనుండి జ్యోతి వెడలి సూర్యుడిలో కలిసిపోవటంలో అంతరార్థ మదే. అర్జునుడు కర్ణుడిని చంపాడంటే - యోగమార్గాన్ని జ్ఞానమార్గం తనలో విలీనం చేసికొనటమే. జ్ఞానమార్గంలోని నిర్వృతితత్త్వంతో కూడిన ఋజువృత్తిద్వారానే తమ సాధన సిద్ధిస్తుందనీ, అట్లాకాక కేవలయోగమార్గంలో ముక్తి లభించదనీ తెలిసికొని, యోగమార్గాన్ని జ్ఞానమార్గంతో ముడిపెట్టుకొనాలనీ యోగమార్గసాధకులు గ్రహించే తత్త్వమే కర్ణపర్వ పరమార్థం! (వివరాలకు చూడు: డా॥ వేదుల సూర్యనారాయణశర్మ గారి 'అంతరార్థ భారతము'.)

6. కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం

తెలుగులో ఆదికావ్యమైన ఆంధ్రమహాభారతం అవతరించి వెయ్యేళ్ళుకావస్తున్నా, ఇంతవరకు దానికి సమగ్రవ్యాఖ్య వెలువడలేదు. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో కవిత్రయ మహాభారతానికి తెలుగులో శిష్టవ్యావహారిక భాషలో సరళవ్యాఖ్య వెలువడటం ఆంధ్రావళి ఆనందించే అపూర్వ సాహిత్యోత్సవం. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు భారతీయ వైదిక ధర్మప్రచార మహోద్యమాన్ని చేపట్టి మహనీయంగా సాగిస్తున్నారు. అందులో ఈ పంచమవేద వ్యాఖ్యాన ప్రణాళిక ఒక మహత్తర సారస్వత యజ్ఞం. ఏడుకొండలరాయడు మాత్రమే చేపట్టి ధర్మరక్షణ కళాప్రావీణ్యంతో ఈ బృహత్తర ధర్మకార్యాన్ని ప్రజలకు ప్రసన్నంగా ప్రసాదించగలిగిన పరమదయాళువు. ఆ దేవదేవుడి కృపాకటాక్షంతో పండితులు పదునెనిమిది పర్వాల ఈ దివ్యప్రబంధమండలిని పరిష్కరించి సర్వాంగసుందరంగా ప్రచురించి, సామాన్య జనులకు అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారు చేసికొన్న వెలుగుల పుణ్యం. ఈ పవిత్ర మహత్తర ప్రయత్నానికి శ్రీ తిరుమలేశుడి పక్షాన బాధ్యతవహించి, అభ్యుదయ పరంపరను విజయవంతంగా సమకూరుస్తున్న మాన్యులు, మహనీయులు టి.టి.డి. బోర్డు ఛైర్మన్, సభ్యులు, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, వారి

సహకారులూ, సంపాదక సలహామండలుల సభ్యులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, ఎడిటోరియల్‌సెల్ సభ్యులూ, పలురకాలుగా ఈ కార్యక్రమంలో తోడ్పడుతున్న అధికారులూ, అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటి. అది రెండు భాగాలుగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపుదిద్దుకొన్నది. విస్తృతమైన ఆరణ్యపర్వం మూడవసంపుటిగా రెండుభాగాలలో ప్రచురించబడింది. మొదటి భాగం నన్నయ రచించిన ఆరణ్యపర్వభాగం. రెండవభాగం ఎఱ్ఱాప్రెగడ పూరించిన అరణ్యపర్వ శేషం. ఈ విధంగా ఆరణ్యపర్వం విభజించబడి ప్రచురించబడటం తెలుగులో ప్రథమం. నాల్గవ, అయిదవ, ఆరవ, ఏడవ సంపుటులుగా విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ పర్వాలు వెలువడ్డాయి. ఇప్పటి ఈ ఎనిమిదవ సంపుటి కర్ణపర్వం.

కర్ణపర్వ వ్యాఖ్యానంలో ముగ్గురు మహాపండితులు పాల్గొన్నారు. ప్రథమాశ్వాసానికి కీ.శే.శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్యగారు, ద్వితీయాశ్వాసానికి డాక్టర్ యస్వీరామారావుగారు, తృతీయాశ్వాసానికి కీ.శే. డాక్టర్ మరుపూరి కోదండరామిరెడ్డిగారు వ్యాఖ్యానం వ్రాశారు. విద్వద్విమర్శకులైన వీరు సరసమైన రచన చేశారు. ఈ పర్వానికి తగిన పీఠికను నేను సంతరించాను. ఇవి ఆంధ్రుల ఆమోదాన్ని పొందుతాయని ఆశిస్తున్నాను.

ఈ సంపుటి ఈ విధంగా రూపొందటానికి తోడ్పడిన మిత్రులు, విద్వన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారికీ, శ్రీ కె. సత్యరామప్రసాదుగారికీ, శ్రీ ఎన్.ఎస్. హరనాథ్‌గారికీ, శ్రీ జి.రాధాకృష్ణగారికీ, శ్రీమతులు సుశీలా లక్ష్మీ విద్యానాథులకు, డాక్టర్ వి.యస్.లక్ష్మిగారికీ నా హార్దిక కృతజ్ఞతలు.

పరమ కల్యాణ భద్రమూర్తి అయిన శ్రీ పద్మావతీ సహిత శ్రీ వేంకటేశ్వరస్వామివారు వేదవేద్యులు, వేదాంత గమ్యులు, పరతత్త్వరూపులు అయినా భక్తసులభులు, సాహిత్య సంగీత కళాప్రియులు, రసానందమూర్తులు. ఆ స్వామికి ఈ పంచమవేదం అక్షరమైన తోమాలసేవ; వ్యాఖ్యానం సుగంధపరిమళ సేవ; విశేషాంశాలు ఉజ్జ్వలాలంకార సేవ. పీఠిక విరాణ్మూర్తికి మంగళనీరాజన సేవ. ఈ సర్వం స్వామివారికి సారస్వతమైన అక్షరార్చన!

సత్య శివసుందర రూపులైన స్వామివారి దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యాసంపుటిని వాఙ్మయారాధనలోని భాగంగా పుణ్యపూజకు సుమమంజరిగా సమర్పించుకొంటున్నాడు. విశ్వశ్రేయస్సును ప్రసాదించుమని స్వామివారిని వేడుకొంటున్నాను.

జి.వి.సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు

హైదరాబాదు
15-7-2004

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కర్ణపర్వ కథాసారం

రణరంగంనుండి తిరిగి వచ్చిన సంజయుడు కర్ణుడి మరణవృత్తాంతాన్ని ధృతరాష్ట్రుడికి చెప్పాడు. ఆ రాజు శోకోపహతుడై కర్ణుడితోపాటు దుర్యోధనుడు కూడా మరణించినట్లుగా భావించి మూర్ఛపోయాడు. ఆ తరువాత శైత్యోపచారాలతో సేదదీరి నిట్టూర్పులు సారిస్తూ మనస్సులో చింతిస్తూ, దురదృష్టాన్ని నిందిస్తూ, పాండవులను ప్రశంసిస్తూ, తన బుద్ధినీ శకుని కుటిలస్వభావాన్నీ నిందించుకొంటూ, దుర్యోధనుడు చావలేదని తెలిసి ఊరడిల్లి, కర్ణుడూ, తనయులు, దుర్యోధనుడి తమ్ములు చచ్చారని విని, దుశ్శాసనుడి వక్షాన్ని చీల్చి భీముడు పచ్చినెత్తురు త్రాగినసంగతి తెలిసికొని కొంతసేపు నిశ్చేష్టుడయ్యాడు. ఆ తరువాత కర్ణాదుల మరణానికి బోరున విలపించాడు. జలాగ్ని విషప్రాయోపవేశాదులలో దేనితోనైనా మరణించాలని సంకల్పించాడు. కాని, సంజయుడి అనునయోక్తులతో తేరికొని జరిగిన కథనంతా వివరంగా చెప్పుమని అడిగాడు. సంజయుడు చెప్పనారంభించాడు.

కర్ణుడిని సర్వసైన్యాధ్యక్షుడిగా అభిషేకించుమని దుర్యోధనుడికి అశ్వత్థామ సలహా చెప్పాడు. దుర్యోధనుడు సంతోషించి కర్ణుడు పాండవులను జయించగలడనే ఆశతో సర్వసైన్యాధ్యక్షుడిని చేశాడు. పాండవుల మదమణచి విజయాన్ని సాధిస్తానని కర్ణుడు శపథం చేశాడు. బంధుమిత్రులతో అర్జునుడిని రణంలో చంపి సామ్రాజ్యాభిషేకం చేస్తానని బాస ఇచ్చాడు. కౌరవు లాతడి వీరోక్తులకు ఉప్పొంగిపోయారు. కర్ణుడు రణోత్సాహంతో యుద్ధరంగంలో ప్రవేశించాడు.

మొదటినాటి యుద్ధం:

మొదటినాటి యుద్ధంలో కర్ణుడు మకరవ్యూహాన్ని పన్నాడు. అందులో తుండంలో కర్ణుడూ, కళ్ళలో శకునీ ఉలూకుడూ, శిరంలో అశ్వత్థామా, కంఠంలో దుశ్శాసనాదులూ, ఉదరంలో దుర్యోధనుడూ, అతడి ముందు ఎడమ పాదంలో నారాయణ గోపాలసేనతో కృతవర్మా, కుడిపాదంలో త్రిగర్త దాక్షిణాత్యులతో కూడిన కృపాచార్యుడూ, వెనుకభాగంలో ఎడమకుడి పాదాలలో శల్య సుషేణాదులూ, తోకలో చిత్రుడనే రాజూ, అతడి తమ్ముడు చిత్రసేనుడూ నిలిచేటట్లుగా సుస్థిరమైన వ్యూహాన్ని ఆయత్తం చేశాడు.

ధర్మరాజు చతురంగ బలోల్లాసంతో వచ్చి కౌరవసైన్యాన్ని చూచాడు. కర్ణుడిని చూపుతూ అర్జునుడితో ఇట్లా అన్నాడు: 'విజయా! చూచావా! కౌరవసైన్యం పలచబారింది. కర్ణుడు యుద్ధభారాన్నంతా తన భుజాలమీద వేసికొని మొగ్గరంలో మొదట నిలబడ్డాడు; బలగర్వాలను ప్రదర్శిస్తున్నాడు. వనవాసంలో మనలను దుఃఖవార్ధిలో ముంచిన దుర్మార్గు డీతడే. ఇతడిని బాణాలతో వధించుము. ఇప్పుడున్న కౌరవవీరులలో పరాక్రమంతో పోరగల్గినవాడూ, దుర్యోధనుడికి హితుడూ అయిన కర్ణుడిని నిర్దాక్షిణ్యంగా చంపి విజయాన్ని సాధించుము' - అని ప్రోత్సహించాడు.

అర్జునుడు కౌరవుల మకరవ్యూహానికి ప్రతిగా అర్ధచంద్రవ్యూహాన్ని పన్నాడు. తాను మధ్యప్రదేశంలో ఉన్నాడు. ఇరువైపుల శృంగాలుగా భీమ ధృష్టద్యుమ్నులను నిలిపాడు. యుధిష్ఠిర నకుల సహదేవులను పింగలిగా ఉండేటట్లు నిలిపాడు. యుధామన్యు ఉత్తమౌజులను అంగరక్షకులుగా చేశాడు.

కర్ణుడి చేతిలో కృష్ణార్జునులూ, పాండవులూ చనిపోతారని దుర్యోధనుడు మనసులో ఉప్పొంగిపోయాడు. కర్ణుడితో సహా దుర్యోధనుడు దుర్మరణం పాలౌతాడని ధర్మరాజు మనసులో తలంచాడు. పోరు ఘోరంగా ప్రారంభమయింది. రణరంగం రక్తసిక్తమైపోయింది. భీమసేనుడితో తలపడి క్షేమధూర్తి ప్రాణాలు కోల్పోయాడు. క్రమంగా ద్వంద్వయుద్ధాలు ప్రవర్తిల్లాయి. కర్ణుడిని నకులుడు, అశ్వత్థామను భీముడు, విందానువిందులను సాత్యకి, శ్రుతకర్మను చిత్రసేనుడూ,

చిత్రుడిని ప్రతివింధ్యుడూ, దుర్యోధనుడిని ధర్మరాజూ, సంశప్తకులను అర్జునుడూ, కృపాచార్యుడిని ధృష్టద్యుమ్నుడూ, కృతవర్మను శిఖండీ, శల్యుడిని శ్రుతకీర్తి, దుశ్శాసనుడిని సహదేవుడూ ఎదుర్కొన్నారు. అందులో ప్రతివింధ్యుడు చిత్రుడిని చంపాడు. సహదేవుడితో యుద్ధంచేస్తూ మూర్ఛిల్లాడు. కర్ణుడు నకులుడిని విరథుడిని చేసి అవమానించాడు. కృపాచార్యుడి చేతిలో ధృష్టద్యుమ్నుడు ఓడిపోయాడు. ధర్మరాజుతో యుద్ధంచేసి దుర్యోధనుడు విరథుడయ్యాడు, మూర్ఛిల్లాడు. ఈ విధంగా ద్వంద్వయుద్ధాలతో ఆనాటి యుద్ధం ముగిసింది.

కర్ణుడి రెండవనాటి యుద్ధం :

రెండవనాడు ధర్మరాజు బృహస్పతి మతాన్ని అనుసరించి దుర్జయవ్యూహం పన్నాడు. కర్ణుడు దుర్యోధనుడిని సమీపించాడు. 'అర్జునుడికి గాండీవమున్నా, అక్షయ తూణీరాలున్నా, అగ్నిదేవు డిచ్చిన అభేద్య రథమున్నా, ఆవధ్యరథ్యాలున్నా నాకు దిగులు లేదు. కాని, భువనప్రవర్తకుడైన శ్రీకృష్ణుడు రథసారథ్యం చేస్తూ ఉండగా పార్థుడి పరాక్రమం అసాధ్యమై ఉంటుంది. కాబట్టి సారథ్యంలో శ్రీకృష్ణుడికంటె ఎక్కువ నేర్పుగల మద్రదేశాధిపతి అయిన శల్యుడిని నాకు రథసారథిగా సమకూర్చాలి. అట్లా చేస్తే అవశ్యం అర్జునుడిని హతమారుస్తాను' - అని కోరుకొన్నాడు. దుర్యోధనుడు సంతోషించి శల్యుడి వద్దకు పోయి కర్ణుడికి రథసారథ్యం చేయుమని వినయంతో ప్రార్థించాడు. శల్యుడు ముందు కొన్ని పేచీలు పెట్టినా, చెవులకు చేదైన మాటలైనా అతడు చెప్పినవి రథికుడు వినే నియమంతో సారథ్యానికి అంగీకరించాడు. దుర్యోధనుడు శల్యుడికి త్రిపురాసుర వృత్తాంతం చెప్పాడు.

సారథి రథికుడి యోగక్షేమాలనూ, విజయాన్నీ కోరాలి. అతడిలో ఉత్సాహాన్ని రేకెత్తించే మాటలు మాట్లాడాలి. కాని, శల్యుడు ధర్మజుడి కిచ్చిన వరంప్రకారం కర్ణుడి హృదయాన్ని బాధపరిచే మాటలను, పాండవుల పరాక్రమాన్ని ప్రశంసించే వాక్యాలను, కర్ణుడి లోపాలను ఎత్తి చెప్పే ఎత్తిపొడుపు మాటలను, వద్దన్నకొద్దీ పలుకుతూ కర్ణుడి ఉత్సాహాన్ని నీరుగార్చే యత్నం చేశాడు. అందు కాతడు చెప్పిన హంసకాకీయోపాఖ్యానం చక్కని ఉదాహరణం. అందువలననే నమ్మించి మార్గదర్శకులై మనసు నొవ్వబలికే మాయావుల వర్తనాన్ని 'శల్య సారథ్యం' అని లోకంలో వ్యవహారంలోకి వచ్చింది. అడుగడుగునా శల్యుడి మాటలు శల్యాలవలె మనసును బాధించినా, అభిమానధనుడైన కర్ణుడు యుద్ధోత్సాహాన్ని పోషించుకొంటూ ముందుకు సాగాడు. మనసువిప్పి తనకుగల శాపవృత్తాంతాల నన్నింటినీ అతడితో చెప్పుకొన్నాడు.

పరశురాముడిని మెప్పించి కర్ణుడు బ్రహ్మాస్త్రాన్ని పొందాడు. కర్ణుడు బ్రాహ్మణుడనని అబద్ధమాడి అస్త్రరహస్యాలను పొందాడు. అతడి క్షత్రియోచిత వర్తనాన్ని గమనించి పరశురాముడు కోపించి 'అవసరం వచ్చినప్పుడు బ్రహ్మాస్త్రం స్ఫురించకుండా పోతుం' దని శపించాడు. ఒక బ్రాహ్మణుడి యజ్ఞధేనువును పొరపాటున తన బాణంతో చంపినందుకు ఆ విప్రుడు కోపించి, వచనశల్యాలతో నిహతుడయ్యేటట్లూ, యుద్ధంలో అత్యంతోత్సాహాన్ని ప్రకటిస్తున్నప్పుడు రథచక్రం నేలలో క్రుంగేటట్లూ, ఎవరిని ఎదుర్కొని గెలవాలని శ్రమిస్తూ ఉంటాడో అతడి చేతిలోనే కర్ణుడు చనిపోయేటట్లూ శపించాడు. ప్రపంచంలో ఏ మహావీరుడిని గురించీ తనకు భయం లేదు కాని, జామదగ్న్య బ్రాహ్మణ శాపాలు మాత్రం తనకు భయాన్ని కలిగిస్తాయని కర్ణుడు శల్యుడితో ఆత్మీయంగా చెప్పుకొన్నాడు. అతడు దానిని సాకుగా తీసికొని కర్ణుడి మనస్సు వికలమయ్యేటట్లు పలు మాటలు మాట్లాడాడు. కర్ణు డతడిని మందలించి రథాన్ని ముందుకు సాగించుమన్నాడు. శల్యుడు ఆ సమయంలో కనబడుతున్న ఉత్పాతాలను పేర్కొన్నాడు. కర్ణుడు వాటిని లెక్కచేయకుండా తన వ్యూహాన్ని ముందుకు కదలించాడు.

త్రిగర్తులు అర్జునుడిని చుట్టుముట్టారు. మేఘాలు క్రమ్ముకొన్న సూర్యుడివలె కాంతిహీనుడై ఉన్నాడని పార్థుడిని కర్ణుడు వ్యాఖ్యానించాడు. శల్యుడు మేఘాలు సూర్యుడి కాంతిని తగ్గించలేవనీ, అవి తాత్కాలికాలనీ పార్థుడి పరాక్రమాన్ని ప్రశంసించి పాండవుల బలశౌర్యాలను కీర్తించాడు. ధర్మపరులైన పాండవులకు జయం కలుగుతుందని సూచించాడు. దుర్యోధనుడు కర్ణపరాక్రమాన్ని కీర్తించి యుద్ధోత్సాహాన్ని కలిగించాడు. అశ్వత్థామ ధృష్టద్యుమ్నుడిని చంపితే తప్ప పాండవులను

ఓడించలేమని భావించి విజృంభించారు. దుర్యోధనుడు భీముడిని ఢీకొన్నాడు. కర్ణుడు ధర్మజుడిపై దాడి చేశాడు. కౌరవసైన్యం క్రమ్ముకొని పాండవసైన్యాన్ని చుట్టుముట్ట నారంభించింది. ధర్మరాజు కర్ణ విజృంభణాన్ని అర్జునుడికి చూపించి అతడిని ఓడించటానికి పురికొల్పాడు. అర్జునుడు కర్ణుడిని వధించితీరుతానని మాట ఇచ్చాడు.

రెండువైపుల నున్న వీరులు ద్వంద్వయుద్ధానికి సిద్ధమయ్యారు. భీముడు దుర్యోధనుడిని, నకులుడు వృషసేనుడిని, సహదేవుడు సౌబలుడిని, శతానీకుడు దుశ్శాసనుడిని, సాత్యకి కృతవర్మను, ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామను, ఉపపాండవులు శిఖండిని, ధర్మరాజు కృపాచార్యుడిని ఎదుర్కొని యుద్ధం చేయనారంభించారు. వ్యూహ మధ్యభాగంలో ఉన్నా కర్ణుడు లెక్కచేయక ధర్మరాజు మీదికి దూసికొని పోవసాగాడు. దానితో వ్యూహంలో నియమం తప్పి వీరులు యథేచ్ఛగా యుద్ధం చేయనారంభించారు. సంశప్తకులు పొంగినసముద్రంవలె అర్జునుడిపై పడ్డారు. ఆతడు చెలియలికట్టవలె అడ్డపడి వారిని నిలువరిస్తున్నాడు. శల్యుడు పార్థపరాక్రమాన్ని ప్రశంసించి కర్ణుడికి కన్నెర్ర కలిగించాడు. అతడు పాండవసేనపై దారుణంగా దాడి చేశాడు. పాంచాలకుమారులను అనేకమందిని బాణాలకు బలి చేశాడు. దానికి ప్రతిగా భీముడు కర్ణుడి కొడుకైన సత్యసేనుడిని చంపి విజృంభించాడు. కర్ణుడు శోకావృతుడైకూడా క్రోధావేశంతో పాండవ సైన్యాన్ని నురుమాడుతూ ధర్మజుడిని బాధించాలని పూనుకొన్నాడు. పాండవవీరులు ధర్మరాజుకు అండగా నిలిచి పోరాడారు. కౌరవవీరులు కర్ణుడికి దండగా నిలిచి పోరాడారు. సంకుల సమరం భయంకరంగా సాగింది. ధర్మరాజు కర్ణుడిపై విజృంభించాడు. కర్ణుడు క్రోధోద్రేకంతో ధర్మజుడి సూతుడిని చంపాడు. కేతువును కూల్చాడు. వాడిబాణాలతో అతడి శరీరాన్ని నొప్పించాడు. సాత్యకీ శిఖండులు ధర్మరాజుకు తోడుగా పోరాడారు. కర్ణుడు వారిని విరథులను చేశాడు. కర్ణుడి ధాటికి ఎదురు నిలువలేక ధర్మరాజు సారథిలేని తన రథాన్ని తానే నడుపుకొంటూ తొలగిపోవ నారంభించాడు. కర్ణుడు ఆయనను వెన్నంటుతూ పోయి, చుట్టుముట్టి, ఆపి, అవహేళన చేస్తూ మాట్లాడాడు. 'ధర్మరాజా! నీవు క్షత్రియకులంలో పుట్టావు. ధర్మాధర్మాలన్నీ తెలిసికొన్నావు. అట్టినీవు మహాసంగ్రామంలో ప్రాణాలు కాపాడుకొనటానికని శత్రువులకు భయపడి ఇట్లా తొలగిపోవటం న్యాయమేనా? నీ తెలివితేటలు బయటపడ్డాయి. నీకు క్షత్రియనీతి తెలియదు. బ్రాహ్మణాచారాలు తెలుసు. యజ్ఞయాగాదులు చేసికొమ్ము. యుద్ధంచేయటం మానివేయుము. నావంటి వీరులతో సాహసించి పోరాటానికి యత్నించావో ఇంతకంటె కీడు నీకు కలుగుతుంది. ఇంటికి తొందరగా పొమ్ము. లేదా కృష్ణార్జును లున్నచోటుకు పొమ్ము- అప్పుడు నీవు చావవు. ప్రాణాలు రక్షించుకొమ్ము. నామాట నమ్ముము' అని అధిక్షేపిస్తూ, తాను కుంతికిచ్చిన వరాన్ని స్మరించి ధర్మారాజును వదలిపెట్టి, పాండవసైన్యాన్ని తురుమాడాడు. ధర్మరాజు తనవైపు వీరులను ప్రోత్సహించి కర్ణుడిపై తిరిగి యుద్ధం ప్రారంభించాడు. భీముడు పాండవసైన్యాన్ని ముందుకు నడుపుతూ తుములయుద్ధాన్ని సాగించాడు. 'కర్ణుడైనా చావాలి నేనైనా చావాలి' అంటూ భీముడు కర్ణుడి మీదకు దూసుకొనిపోయాడు. భీమపరాక్రమాన్ని శల్యుడు ప్రశంసించాడు. కర్ణుడు నిరసించి భీముడిపై పోరు సాగించాడు. ద్వంద్వయుద్ధం భీకరంగా సాగింది. భీముడు భయంకరమైన భల్లంతో కర్ణుడి వక్షఃస్థలంమీద కొట్టాడు. అతడు మూర్ఛపోయాడు. భీముడు ఆగ్రహంతో అతడి రథంమీదకు దూకి 'ఈ నీచుడి నాలుకను కోస్తా' నని విజృంభించాడు. శల్యుడు మధ్యలో కల్పించుకొని 'కర్ణుడు మూర్ఛపోయాడు. ఇప్పుడు అతడి నాలుకను కోస్తే చచ్చిపోతాడు. ఇతడిని చంపుతా'నని అర్జునుడు ప్రతిజ్ఞపట్టాడు. నీవు చంపితే అతడు విచారిస్తాడు' అని చెప్పి అతడిని వారించాడు. భీముడు వెనుకకు తగ్గి 'మామా! కర్ణ డిప్పుడు ధర్మరాజును బాధించినందుకు క్రోధావేశాన్ని పొంది ఆ సంగతి మరచాను. ఈ దురాత్ముడు ఆనాటి సభలో ద్రౌపదిని అసభ్యమైన మాటలతో అవమానపరిచిన సంగతి జ్ఞాపకం వచ్చి, ఆ మాటలన్న ఇతడి నాలుకను కోస్తే ధర్మరాజు సంతోషిస్తాడని ఈ పని చేయాలని అనుకొన్నాను. నీవు సరి అయిన సమయంలో ఈ సంగతి జ్ఞాపకం చేశావు. అభిమానధనుడైన అర్జునుడు కర్ణుడు నాచేత చచ్చాడని విని తానూ నిరుత్సాహంతో చనిపోవచ్చును. అతడితోపాటు కృష్ణధర్మజులు, వారితోడి వారలు కూడా ప్రాణాలను పరిత్యజించవచ్చును. ఆ కీడునుండి కాపాడావు. కాబట్టి నీ ఆజ్ఞను దాటను' అని భీముడు ఆగాడు. శల్యుడు సంతోషించి కర్ణుడి రథాన్ని తొలగించుకొనిపోయాడు. భీము డంతటితో ఆగక రోషావేశంతో శ్రుతవర్మాది కురుకుమారులను అనేకమందిని యుద్ధంలో భీకరంగా చంపాడు.

సంశప్తకులు అర్జునుడిని చుట్టుముట్టి శస్త్రాస్త్రాలతో పొడిచారు. సుశర్మ వేసిన తీవ్రబాణానికి అర్జునుడు రథంమీద మూర్ఛపోయాడు. వెంటనే తేరికొని వారిపై ప్రళయకాలరుద్రుడివలె విజృంభించి వారిని దైన్యపరిచాడు. ఉభయసైన్యంలోని మహావీరుల నడుమ ద్వంద్వయుద్ధాలు సాగాయి. కృపాచార్యుడు సుకేతు డనే పాంచాలకుమారుడిని చంపాడు. ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుడిని ఎదిరించి అతడి రథాన్ని విరుగగొట్టాడు. అశ్వత్థామ అర్జునుడిని ఎదుర్కొని భీకరయుద్ధం చేశాడు. మంచు తెరలను చించే సూర్యుడివలె అర్జునుడు అతడి విజృంభణాన్ని మాన్పాడు. దండధారుడనే రాజును చంపాడు. అశ్వత్థామ మలయధ్వజుడనే పాండ్యభూపాలుడిని వధించాడు. కర్ణు డంతలో తేరుకొని పాండవసైన్యంపై దాడిచేసి, వీరవిహారం సలిపి, అనేకులను చంపాడు, చతురంగబలాలను దైన్యపరిచాడు. దుర్యోధనుడు భీమసేనుడితో ద్వంద్వయుద్ధానికి పూనుకొన్నాడు. అశ్వత్థామ అర్జునుడిపై పోరు సాగించాడు. కర్ణుడు ధర్మరాజుపై విజృంభించి పలు బాణాలతో బాధించాడు. అతడు భీముడివద్దకుపోయి ఒదిగాడు. కర్ణుడు అతడిని వెంటాడి వేధించాడు. ధర్మజుడు ఎదుర్కొనలేక విచారంతో నిజశిబిరానికి తిరిగివెళ్ళాడు. అంతలో భీముడు దుర్యోధనుడిని చుట్టుముట్టి తుదముట్టించబోయాడు. శల్యుడి ప్రబోధంతో కర్ణుడు ధర్మరాజును వదలి దుర్యోధనుడికి సాయం వెళ్ళాడు.

ధర్మరాజు శిబిరంచేరి తన శరీరంలో నాటి ఉన్న బాణాలను పెరికించుకొని అవమానభారంతో హృదయం క్రుంగగా, విషాదంలో మునిగాడు. తనకు తోడుగా వచ్చిన నకుల సహదేవులను భీముడికి సాయంగా పంపాడు. ధర్మరాజు దైన్యం పొందిన సంగతి తెలియక అర్జునుడు అశ్వత్థామతో యుద్ధంచేస్తూ అతడి రథపు పగ్గాలను తెంచాడు. గుర్రాలు భయంతో రథాన్ని దూరంగా లాగికొని పోయాయి. శల్యుడి ప్రేరణతో కర్ణుడు పాండవ సైన్యం మీద భార్గవాస్త్రాన్ని ప్రయోగించి, వాటిని చీకాకుపెట్టి, సింహనాదం చేసి, పొగలేని మంటవలె మహోత్సాహంతో ప్రకాశించాడు.

అతడి విక్రమాతిశయాన్ని చూచి అతడిని ఎదిరించటానికి అర్జునుడు వెనుకాడాడు. అతడి నెదిరించి చచ్చి సాధించేది ఏమీ ఉండదని పేర్కొని కృష్ణుడితో ఇట్లా అన్నాడు:

'పట్టపగలింటి సూర్యుని పగిదిఁ గర్ణుఁ । డుగ్రమూర్తి యై వెలుఁగుచు నున్నవాఁడు
మనరథం బిప్డు మాధవ! మరలనిమ్ము । బ్రదికియుండిన శుభములు వడయవచ్చు'. **(కర్ణ. 3.18)**

ఆ మాటలు విన్న కృష్ణుడు రణరంగంలో కర్ణుడిని ఎదిరించి పోరుతున్న భీమసేనుడిని చూపించాడు. ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకి ద్రౌపదేయాది రథికులు సాయపడుతూ ఉండగా పాండవ సేనను ముందుకు నడుపుతున్న భీముడు అప్పటికి శత్రువులను ఆపటానికి సమర్థుడని చెప్పి, కర్ణుడు ఇతరులతో యుద్ధం చేసి అలసిపోవటం, అర్జునుడు దప్పిక తీర్చికొనటం అప్పటికి అవసరమని కృష్ణుడు భావించాడు. కర్ణుడి వైపు రథంపోనీయక ధర్మరాజున్న శిబిరంవైపు మళ్ళించాడు. భీముడికి ఆ సంగతి తెలియజేసి అర్జునుడు ధర్మరాజున్న శిబిరానికి చేరాడు.

ధర్మజార్జునకృష్ణుల సంవాదం:

అర్జును డానాడు రణం ప్రారంభించే ముందు 'కర్ణుడిని వధించిగాని తిరిగి రా' నని ప్రతిజ్ఞ చేశాడు. ధర్మరాజుకు గలిగిన బడలికలను గురించి పరామర్శించటానికై అర్జునుడూ కృష్ణుడూ మధ్యాహ్నమే తిరిగిరావటం ఆయనకు ఆశ్చర్యానందాలు కలిగించాయి. కృష్ణార్జును లిరువురూ ధర్మరాజును కుశలప్రశ్నలతో పలకరించారు. అర్జునుడు యుద్ధంలో కర్ణుడిని చంపి వచ్చాడనే అభిప్రాయంతో అతడిని ధర్మరాజు అభినందించాడు. పరశురాముడి శిష్యుడైన కర్ణుడు మహావీరుడనీ, తలపూవు వాడకుండా అతడిని సంహరించగలగటం సంతోషకరమనీ అర్జునుడిని మెచ్చుకొన్నాడు. తనకు అంతకుముందే కర్ణుడివలన కలిగిన భంగపాటును తెలియచెప్పి, కర్ణుడు పాండవులకు చేసిన ఎగ్గులను పేర్కొని, కర్ణుడిని చంపిన విధానాన్ని వివరించుమని అర్జునుడిని ఆసక్తిగా అడిగాడు.

అర్జునుడు ఇట్లా చెప్పాడు. 'అగ్రజా! నేను సంశప్తకులతో సంకులసమరం సాగిస్తున్నప్పుడు అశ్వత్థామ నన్నెదుర్కొని బాణవర్షం కురిపించాడు. శ్రీకృష్ణుడిని బాణాలతో కప్పాడు. చాకచక్యంగా అతడి దాడిని తిప్పికొట్టి ముందుకు సాగాను. అంతలో మీరు కర్ణుడిచేత బాధితులయి రణరంగం వదలి వచ్చారని, శిబిరంలో ఉన్నారనీ భీమసేనుడివలన విన్నాను. మీ కుశలం తెలిసికొని తిరిగిపోయి కర్ణుడిని సంహరిద్దామని వచ్చాను.'

అర్జునుడి మాటలు విని ధర్మరాజు మండిపడ్డాడు. కర్ణుడింకా బ్రతికి ఉన్నాడన్న వార్త అతడికి ఉడుకెక్కించింది. కిరీటిని కినుకతో ఇట్లా అన్నాడు. 'యుద్ధంలో మరణించటం, మరలిపోవటం అనేవి రెండూ జరుగుతూనే ఉంటాయి. నేనిట్లా రణరంగాన్ని వదలి రావటంవలన మీ అందరికీ చులకనయ్యాను. అర్జునా! నేను కర్ణుడికి ఓడానన్నావు. నేనేకాదు, నీవూ ఓడావు, నకుల సహదేవులూ ఓడారు. మనతోకూడి ఉండటం వలన వాసుదేవుడూ ఓడాడు. కాబట్టి మన మింక యుద్ధానికి పోవలసిన పనిలేదు. వనాలకు పోయి తపస్వులమై ఉందాం; లేదా, వినయంతో కురురాజును సేవిద్దాం. కర్ణుడిని జయించలేనని ఆనాడే ద్వైతవనంలో చెప్పిఉంటే నే నీ యుద్ధప్రయత్నం చేసేవాడినే కాను. అశక్తుడు రాజ్యాన్ని కోరటం దోషం. కర్ణుడిని వధిస్తానని ప్రతిజ్ఞచేసి నన్ను ఇక్కడికి తెచ్చావు. నేను శత్రువుల నడుమ అవమానాలకు ఓర్చాను. నీ ప్రతిజ్ఞను ఈ వాసుదేవుడుకూడా విన్నాడు. అది వమ్మయింది. నీవు పుట్టిననాడు ఆకాశవాణీ, మహర్షులూ నిన్ను యుద్ధానికి వెనుదీయని వీరుడిగా, కురుసేనను గెలిచే యోధుడిగా కీర్తించారు. వాళ్ళమాటలు ఇప్పుడు అనుమానంలో పడ్డాయి. నీవు కర్ణుడికి భయపడతావని తెలిస్తే దుర్యోధనుడితో పగ పెట్టుకొనేవాడినే కాను. దుర్యోధనాదులు చూస్తూ ఉండగా కర్ణుడు నన్ను యుద్ధంలో అవమానాల పాలు చేశాడు. నన్ను ఆపదనుండి కాపాడినవాడు భీముడు. అత డొక్కడే ప్రాణాలను లెక్కచేయకుడా పరబలాలు బడలుపడేటట్లు పోరుతున్నాడు. ఈ రోజున అభిమన్యుడుగాని, ఘటోత్కచుడుగాని ఉన్నట్లయితే నా స్థితి ఇట్లా ఉండేదేనా?

> **"హరి గలుగంగ నేటికి భయంబున వచ్చితి? నీదు గాండివం**
> **బెరవుగ నిచ్చి నీవు నొగలెక్కి హరిన్ రథిఁ జేయఁ గన్న ని**
> **ష్ఠుర భుజవిక్రమోగ్రుఁ డగు సూతతనూభవుఁ, దత్సహాయులం**
> **బొరిగొనఁడే సుయోధనుని పోఁడిమి దూలఁగ నొక్కమాత్రలోన్'** (కర్ణ. 3.65)

కుంతీమహాదేవి కడుపున కొడుకువై పుట్టకుండా, పిండంగానే ఏదో గండానికి గురి అయి ఉండవలసింది. ఇప్పుడు ఇంత పుట్టేది కాదు.'

ధర్మరాజు మాటలకు ధనంజయుడు మండిపడ్డాడు. కత్తి పైకెత్తి ధర్మజుడిపై లంఘించాడు. కృష్ణుడు అడ్డుపడి, 'పార్థా! మనం కౌరవులమీద దాడిచేయటం లేదు. ధర్మరాజును పరామర్శిస్తున్నాం. ఇది సంతోషకాలం గాని క్రోధసమయం కాదు. అన్నగారిని వధించరాదు' - అని హెచ్చరించాడు. 'కృష్ణా! నా గాండీవాన్ని ఇతరులచేతి కిమ్మని అన్నవాడి తల పగులగొడుతా నని నేను ప్రతిజ్ఞ చేశాను. మా అన్న ధర్మాత్ముడైనా నా మాటను నేను నిలువబెట్టుకొంటాను. దీనికి నీ వేమి చెప్పుతావో చెప్పుము. సకల ధర్మసాకల్యవేదివి. నీవు చెప్పినట్లు నేను చేస్తాను' అని అర్జునుడు అన్నాడు.

'లోకంలో సత్యాహింసలు ఉత్తమధర్మయుగళం. అందులో సత్యాన్ని అహింసతో రక్షించటం ధర్మం. అహింసను అసత్యంతోనైనా రక్షించటం న్యాయమని పండితు లంటారు. సత్యరక్షణం కొరకు సోదరుడూ, ధర్మపరుడూ అయిన ధర్మరాజును చంపటం ధర్మపథం కాదు. ప్రాణహాని ఏర్పడినప్పుడు గాని, సర్వధనాపహరణ సమయంలో గాని చెప్పే సత్యం అసత్యంగా, అసత్యం సత్యంగా ఆర్యులు గ్రహిస్తారు. ఇప్పుడు ధర్మసూక్ష్మాన్ని పాటించాలి. పెద్దలను దూషించటం వారిని చంపటం వంటిదే. అందువలన నీ ప్రతిన తీరేటట్లుగా ధర్మరాజును వధించకుండా, నోరార నిందించుము. ఆ మీద

గురునిందాపాపం పోయేటట్లు మీ అన్నకు నమస్కరించి కీర్తించుము' - అని సూచించాడు శ్రీకృష్ణుడు. అర్జునుడు గోవిందుడి హితవును పాటించాడు.

అన్నను దూషించి అర్జునుడు తనను తాను చంపుకొనటానికి కత్తి ఎత్తుకొన్నాడు. 'అదేమి?' టని శ్రీకృష్ణు డడిగాడు. 'అంతటి పుణ్యాత్ముడిని, అగ్రజుడిని అనరాని మాటలని ప్రాణాలతో బ్రతికి ఉన్నదానికంటె ఆత్మహత్య ఉత్తమమని భావించా' నని అర్జునుడు బదులు చెప్పాడు. శ్రీకృష్ణుడు దానికీ ఒక ఉపాయాంతరం సూచించాడు. ఆత్మస్తుతి చేసికొంటే ఆత్మహత్యాఫలం అబ్బుతుందని చెప్పాడు. శ్రీకృష్ణుడు చూపిన ధర్మసూక్ష్మాన్ని పాటించి ఆపద్బాంధవుడిగా అతడిని అన్నదమ్ములు అర్చించారు.

ధర్మజుడి దీవెనల నందుకొని శ్రీకృష్ణుడు నొగలెక్కాడు, అర్జునుడు రథమెక్కాడు. కర్ణుడివధప్రకారాన్ని భావించే గాండీవికి చెమటలు పట్టాయి. శ్రీకృష్ణు డది గమనించి అర్జునుడితో ఆత్మస్థైర్యాన్నీ, కర్ణుడిపై క్రోధాన్నీ, యుద్ధోత్సాహాన్నీ కలిగించే మాటలు పలికాడు. 'దేవతలకే జయింపరాని మహావీరులను నీవు అవలీలగా రణంలో ఓడించగలిగావు. నీ ధనుర్వేదకౌశలం భూతలంమీద ప్రకాశించేటట్లుగా గాండీవాన్ని పట్టి నీ గర్వాన్ని ప్రకటించుము. అలనాడు నిండుసభలో ద్రౌపదిని చూచి 'లేరిచట నీకు మగలును' అని కారుకూత లరచిన కర్ణుడికి బాణాలతో బదులు చెప్పే సమయం వచ్చింది. నేను సంధికి పోయినప్పుడు నన్ను పట్టటానికి పురికొల్పింది కర్ణుడే. నీ ముద్దులకొడుకు అభిమన్యుడు అసామాన్య వీరుడుగా పోరుతున్నప్పుడు వంచనతో వెనుకనుండి విల్లును విరుగగొట్టి అతడి వధకు అంకురారోపణం చేసిన నిర్దయుడు, కపటి ఈ కర్ణుడే. అతడు మీపట్ల చేసిన అన్యాయాలకు అతడిని చంపి గ్రద్దలకు వేసినా పాపం లేదు. విజృంభించుము. కర్ణుడిని నిర్దాక్షిణ్యంగా వధించుము' అని ప్రోత్సహించాడు శ్రీకృష్ణుడు. అర్జునుడు ఉత్సాహంతో -

'నీ తోడ్పాటున నేఁ, ద్రివిష్టపములన్ గెల్వంగ నూఁకింతు; నా
చేతం గర్ణుఁడు రూపుమాలి చను; మెచ్చింతున్ నినుం; జూడుమీ
దైతేయాంతక!' యంచు శేషనిభ హస్తం బుద్ధతిం జూచి ని
ర్ధూతారాతిబలుండు పుచ్చికొనియెన్ దుర్దాంత కోదండమున్' **(కర్ణ. 3.130)**

కృష్ణార్జునులు యుద్ధభూమికి తిరిగి వచ్చే సమయాన పోరు ఘోరంగా సాగుతున్నది. భీముడు కౌరవసైన్యాన్ని నిలువరించి బలప్రదర్శనం చేస్తున్నాడు. శ్రీకృష్ణార్జునులు యుద్ధరంగ పునఃప్రవేశం చేయటం అతడికి అమితోత్సాహం కలిగించింది. శకుని భీముడిపై దాడి చేయగా తలపడి అతడిని రథంమీద మూర్ఛపడేటట్లు చేశాడు. అప్పుడు కర్ణుడు విజృంభించి అనేకమంది వీరులను ఒక్కడే ఎదుర్కొని చిక్కుపడ చేశాడు. అందరికీ ఆశ్చర్యం కలిగించాడు. అర్జునుడు కర్ణుడి రథాన్ని చూచి క్రోధావేశంతో సైన్యాన్ని ఒక వైపునుండి సంహరించటం ప్రారంభించాడు. రణరంగంలో రక్తం ఏరులుగా పారింది. ఆ తరుణంలో పదిమంది కురుకుమారులు అర్జునుడిని అడ్డుకొన్నారు. వారిని పార్థుడు అవలీలగా చంపివేశాడు.

దుశ్శాసన వధ:

ఆ సందర్భంలోనే మరొక భీషణసుందరఘట్టం సంభవించింది. అది దుశ్శాసన భీమసేనుల ద్వంద్వయుద్ధం. మదించిన ఏనుగులవలె ఇద్దరూ తలపడ్డారు. భీముడు రౌద్రావేశంతో ఇట్లా పలికాడు.

'ఆ సభలోనఁ గొన్న ఋణమంతము నీఁగఁగఁగంటి వడ్డితో;
బాస కొకింతయుం దొలఁగఁబాఱకు తీర్చెద నిప్డు; నేఁడు నా

చేసిన పుణ్య మెవ్వరును జేయరు ని న్నిటు సేరఁ దెచ్చుటం
జేసి విధాత నాకుఁ గృపసేయుట గానఁగ వచ్చెఁ దమ్ముఁడా!' (కర్ణ. 3.195)

ఈ భీషణవాక్యాలు విని దుశ్శాసనుడు కూడ పాండవ పరాక్రమాన్ని పరిహసిస్తూ పలికాడు. 'భీమా! లక్కయింట చిచ్చుపెట్టి మీకు కల్పించిన కష్టాలను నేను మరచిపోలేదు. ధర్మరాజు శకునితో జూదమాడినప్పుడు రాజ్యలక్ష్మిని గ్రహించి మిమ్ములను కానకు పంపాము. అరణ్యవాసంలో మిమ్ములను అగచాట్లపాలు చేశాము. అజ్ఞాతవాసంలో మీరు సేవకవృత్తిలో పొందిన దైన్యాన్ని ఇంకా మరవలేదు. యుద్ధానికి వచ్చి ఎందు కీ బీరాలు?' అని నవ్వాడు. భీము డాతడి మాటలకు మండిపడ్డాడు. ఇద్దరూ బాణాలతో ఆయుధాలతో పోరు తీవ్రంగా చేసికొని విరథులయ్యారు. భీముడు దుశ్శాసనుడిని నేలమీద పడవేశాడు. పదమూడేళ్ళు తాము పొందిన పాట్లను స్మరించాడు. తాను చేసిన ప్రతిజ్ఞను జ్ఞాపకం తెచ్చుకొన్నాడు. పగనంతా మనసులో మండనిచ్చాడు. పెనుగదను పైకెత్తి దుశ్శాసనుడిని చావమోదాడు. నెత్తురు ధారలు కారగా దుశ్శాసనుడు నేలపై కూలాడు. లేడిపిల్లమీదకు పెద్దపులి ఉరికి పొదివి చంపే విధంగా పైబడి మెడ చిక్కబట్టి, నొక్కికసితో ఇట్లా అన్నాడు: 'మునుపు ఆ సభలో నీవన్న మాటలకు తృప్తిలేక ఇక్కడికి నిన్ను వెదకుకొంటూ వచ్చాను. ఇప్పు డేమంటావో అనరా! నీ మాటలు వినాలని నాకోపం ఉవ్విళ్ళూరుతున్నది' - అంటూ వెక్కసమాడాడు. మదేభం తుండంతో ఎత్తినట్లుగా భీముడు దుశ్శాసనుడిని చేతితో నింగికి ఎత్తాడు. గిరగిర త్రిప్పాడు. నేలమీద పడవేశాడు. ముంగాలితో త్రోశాడు. మొగంమీద మొత్తాడు. భయంకరంగా చూచాడు. మీదపడి మోకాళ్ళతో కూర్చున్నాడు. మెడను చిక్కత్రొక్కి నిల్చాడు. నవ్వాడు. ఈ విధంగా రౌద్రక్రీడలు చేసి దుశ్శాసనుడి మొగం చూచి 'నేను నీ వక్షఃస్థలాన్ని పగులగొట్టి నెత్తురును తేనెవలె త్రాగుతాను. నన్ను సమీపించి మాన్పగలిగిన మొనగాడు ఈ రణరంగంలో ఎవడైనా నీకు దిక్కుంటే వాడిని ఎలుగెత్తి పిలుచుకొనుము' - అని వెటకారంగా పలికి, కత్తి తీసి అతడి మొగంమీద జళిపించి, నృసింహస్వామి హిరణ్యకశిపుడి వక్షాన్ని చీల్చినట్లు భీముడు దుశ్శాసనుడి కడుపును చీల్చి, ప్రేగులను పైకి లాగి, నెత్తురు త్రావి బీభత్సంగా బాధించాడు. కసితో అతడి కుత్తుకను నొక్కిపట్టి, కాలిని చేతితో పట్టి

'ఏమిర! పసులని యార్చ్వవు? । నీ మాటలు నిలువఁబడియెనే? పసరమ! మి
మ్మేము మగుడ నిదె యార్చెద; । మీ మాటకు మాఱు పల్క రెవ్వరుఁ గంటే!' (కర్ణ. 3.221)

'నన్ను తాళ్ళతో కట్టి నీళ్ళలో త్రోయటం, అన్నంలో విషం కలిపి పెట్టటం, పెనుబాముల కోరలతో కరిపించటం, పెద్దలు చూస్తూ ఉండగా నిండుసభలో ద్రౌపదిని అనరానివిధంగా నిందించటం - ఇవన్నీ సహించి ఊరుకొనేవేనా? జూదంలో ఓడటం లోకంలో లేదా? ఇంత అన్యాయమా?' అని పలికి చేతిలో గద మెరయగా సైనికుల వైపు చూపి బెదిరించాడు. ఉభయపక్షాల సైనికులు దూరంగా పరుగెత్తి భయంతో నిశ్చేష్టులై నిలిచారు. అప్పుడు భీముడు దుశ్శాసనుడిని చూచి ఇట్లా అన్నాడు:

'ప్రై వడి పోయెఁ గాన ధృతరాష్ట్రుఁడు గన్నది యేమి? యా సభం
దా వలదన్నఁ గీ డుడుగదా? పతిలేఁ డనఁ బడ్డకాంత నేఁ
డీవు గనుంగొనంగఁ బతి యేడ్తెఱ నొప్పెఁ? బతుల్ విజృంభిత
శ్రీ విలసిల్లు కామినులు సేడ్పడి రి ట్లపతిత్వదీనతన్'. (కర్ణ. 3.224)

'వినుము! నేను చేసిన ప్రతిజ్ఞలలో ఒకటి తీరింది: పాపాత్ముడైన దుర్యోధనుడిని చంపి వాడి తలను కాలితో తన్నుతాను. ఆ రెండవ ప్రతిజ్ఞ తీర్చటానికి ఇక ముందుకు సాగుతాను' అని ఎలుగెత్తి ప్రకటించి, దుశ్శాసనుడిని తుదముట్టించి అరిభయంకరుడై నిలిచాడు. అతడిపై దాడివెడలిన పదిమంది కురుకుమారులను అర్జునుడు మట్టుపెట్టాడు.

శల్యు డా సన్నివేశాన్ని చూపి కర్ణుడిని హెచ్చరించాడు. కర్ణుడి కొడుకైన వృషసేనుడు భీముడిపై విజృంభించగా అర్జునుడు ఆతడిని చంపాడు. కర్ణార్జునులు ఎదురయ్యే తరుణం ఆసన్నమయింది. ఆకసంలో దేవగణం వారి ద్వంద్వయుద్ధాన్ని చూడాలని కుతూహలంతో వేచి ఉన్నది. బ్రహ్మరుద్రేంద్రుల నడుమ వారి విజయావకాశాలను గురించి చర్చకూడా నడిచింది. వారందరు విజయుడి విజయాన్నే నిశ్చయించారు.

అప్పుడు కర్ణశల్యులూ, కృష్ణార్జునులూ ఇట్లా సంభాషించుకొన్నారు -

కర్ణుడు : 'అర్జునుడు నన్ను గెలిస్తే ఏమి చేస్తావు? చెప్పుము.

శల్యుడు : 'నేను కృష్ణార్జునులను తీవ్రబాణాలతో ఓడించి ఒంటరి గెలుపు గెలుస్తాను.'

అర్జునుడు : 'కర్ణుడు నన్ను గెలిస్తే ఏమవుతుంది?'

కృష్ణుడు : (నవ్వుతూ) సూర్యుడు నేలరాలినా, నేల ముక్కలైనా, మేరుపర్వతం ఒరిగినా, కర్ణుడి చేతిలో నీవు ఓడిపోవటం జరుగదు. ఒకవేళ అట్టి దురవస్థ కలిగితే ప్రళయమే వస్తుంది. నేను విజృంభించి కర్ణశల్యులనే కీటకాలను చేతితో నలిపివేస్తాను. కౌరవులనందరిని మట్టికరిపిస్తాను. ధర్మరాజుకు పట్టం కట్టిస్తాను!

అర్జునుడు : నేను నవ్వుల కన్నాను గాని వారిని చంపటం నాకు శక్తికి మించిన పనికాదు. నిండుకొలువులో ద్రౌపది పడ్డ పాట్లను సహించి అరణ్యాజ్ఞాతవాసవ్రతనిష్ఠతో ఇట్లా ఓర్చి ఉన్నాను. ఇక త్రిమూర్తులు కలిసి ఎదుర్కొన్నా కర్ణుడిని చంపితీరుతాను.' దుర్యోధనుడు దుఃఖంతో చూస్తూ ఉండగా కర్ణుడి తలను త్రుంచుతాను. కర్ణశల్యుల భార్యలను విధవలను చేస్తాను. నీవు సంతోషంతో ఈ వార్తను వినిపించి ద్రౌపదికీ, ధర్మరాజుకూ శ్రవణానందం కలిగించుము. ఏనుగు చెట్టును కూల్చినట్లు నేను కర్ణుడిని చంపిన ఉదంతాన్ని కన్నులకు కట్టేటట్లు చెప్పి కుంతికి వార్త పంపుము.'

ఇక కర్ణార్జునుల ద్వంద్వయుద్ధం ప్రవర్తిల్లబోతున్నది. దివ్యసమూహాలు ఆకసంలో నిలిచి గీతనృత్యవాద్యాలను మ్రోగిస్తూ ఉంటే ఉభయసైనికులు కూడా అనిమిషులైనట్లు కన్నార్పకుండా చూడటం ప్రారంభించారు. కర్ణార్జునులు కల్పాంతసూర్యుల విధంగా వెలుగొందుతూ పరస్పర విజయార్థులై పరాక్రమించనున్నారు. అప్పుడు అశ్వత్థామ దుర్యోధనుడి వద్దకుపోయి హితవు చెప్పాడు. భీష్మద్రోణులవలెనే అర్జునుడిచేత కర్ణుడు వధించబడకపూర్వమే ధర్మరాజుతో సంధి చేసికొని శాంతిని పొందుమని బోధించాడు. ధర్మరాజు ప్రసన్నుడైతే శ్రీకృష్ణభీమార్జునాదులందరూ అతడి అభిప్రాయాన్ని సమర్థిస్తారనీ, పగలు వగలు ఉపశమించి అందరు సుఖిస్తారనీ అనునయించి చెప్పాడు. కాని, కర్ణవిజయం మీద నమ్మకమున్న దుర్యోధనుడు ఆతడి మాటలను మన్నించలేదు. దుశ్శాసనుడిని చంపి భీముడు చేసిన ప్రతిజ్ఞ వినిన తరువాత కూడా సంధి చేయటానికి మనసొప్పుతుందా? అని తిరిగి ప్రశ్నించాడు. యుద్ధోత్సాహాన్ని ప్రకటించి సేనలను పురికొల్పాడు.

కర్ణ సంహారం:

కర్ణార్జునులు కరి కరి తాకినట్లు, గిరి గిరి ఢీకొన్నట్లు, మేఘం మేఘం ఒరిపిడి పొందినట్లు, ఢీకొని భూనభోంతరాళాలు దద్దరిల్లేటట్లు యుద్ధం ప్రారంభించారు. ఒకరిమీద ఒకరు దివ్యాస్త్రాలను ప్రయోగించుకొని తమ ధనుర్విద్యాపాండిత్యాన్ని చాటుకొన్నారు. దుర్యోధనుడు తన యోధులను అర్జునుడిమీద దొమ్మియుద్ధం చేయటానికి పురికొల్పాడు. బీభత్సుడు పిడుగులు పడ్డట్లు యుద్ధం చేస్తున్నాడు. అతడిమీద ప్రయోగించాలని పూజలో పోషించుకొన్న సర్పముఖాస్త్రాన్ని అర్జునుడి కంఠానికి గురిచూచి కర్ణుడు ప్రయోగించి 'ఫల్గునా! చచ్చా వీ దెబ్బతో' అని అరిచాడు. శ్రీకృష్ణుడు ప్రమాదాన్ని గుర్తించి అర్జునుడి రథాన్ని అయిదంగుళాలు క్రుంగేటట్లు బొటనవ్రేలుతో అదిమాడు. సర్పముఖాస్త్రం అర్జునుడి కంఠానికి బదులు కిరీటాన్ని తన్నుకొనిపోయింది. పార్థుడి ప్రాణాలు రక్షించబడ్డాయి. ఖాండవదహనంలో అర్జునుడివలన మంటలకు గురి

అయిన పాము కసిపట్టి తపస్సు చేసి సర్పముఖాస్త్రంగా కర్ణుడివద్దకు చేరి అర్జునవధ కొరకు అదను చూస్తున్నది. కాని, ఆనాడు లక్ష్యం సాధించలేకపోయింది. తిరిగి కర్ణుడి వద్దకు పోయి మరలా తనను ప్రయోగించుమని కోరింది. వీరుడు అస్త్రాన్ని ఒకసారే ప్రయోగిస్తాడని చెప్పి కర్ణుడు పునఃప్రయోగాన్ని తిరస్కరించాడు. ఆ తరువాత కర్ణార్జునుల శస్త్రాస్త్రప్రయోగం అపూర్వంగా సాగింది. యుద్ధంలో కర్ణుడిశరీరానికి బాగా గాయాలు అయ్యాయి. కృష్ణార్జునులకు బాగా దెబ్బలు తగిలాయి. గైరికా ధాతువులు కలిసిన ఎర్రనినీళ్ళతో నిండిన సెలయేళ్ళతో చెలువొందే పర్వతంవలె కారే రక్తధారలతో కర్ణుడు కనబడ్డాడు.

అంతలో కాలుడు అదృశ్యాకారంతో, అందరూ వినేటట్లు ఇట్లా ప్రకటించాడు. 'బ్రాహ్మణశాపంవలన కర్ణుడి రథచక్రం నేలలో క్రుంగుతుంది. అతడు అసువులను కోల్పోతాడు.' ఆ సమయంలో పరశురామదత్తమైన భార్గవాస్త్రం కర్ణుడికి స్ఫురించలేదు. అతడు క్రుద్ధుడై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అర్జునుడు ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించినా అది చాలలేదు. కవ్వడికూడా బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి కర్ణుడి బ్రహ్మాస్త్రాన్ని ఉపశమింపజేశాడు.

కర్ణుడి రథచక్రం నేలలో క్రుంగింది. కర్ణుడు కలత చెందాడు కాని, సాహసించాడు. ఒక చేతితో చక్రాన్ని ఎత్తుతూనే మరొకచేతితో యుద్ధం సాగించాడు. అర్జునుడు అతడిపై వాడి వాడి బాణాలు వేశాడు. 'రథచక్రం క్రుంగింది. దానిని ఎత్తేంతవరకు బాణాలు వేయకుము. నేను భూమిమీద ఉన్నాను. నీవు రథంమీద ఉన్నావు. నామీద బాణాలు వేయటం వీరధర్మం కాదు' అని కర్ణుడు అర్జునుడితో ధర్మపన్నాలు పలికాడు. దానికి శ్రీకృష్ణుడు స్పందించి ఇట్లా అన్నాడు. 'కర్ణా! ధర్మాలూ, నీతులూ నీకు ఈనాడు జ్ఞాపకం వచ్చాయా? కుంతీదేవీ, పాండవులూ నిద్రపోతూ ఉన్నప్పుడు అర్ధరాత్రి లక్కయింటిని కాల్పించినప్పుడూ, కపటద్యూతం కల్పించి ధర్మాత్ముడైన ధర్మరాజు సంపదను మాయోపాయంతో అపహరించినప్పుడూ, అంతటితో ఆగక ద్రౌపదిని నిండుసభకు రప్పించి అనరానిమాట లని అవమానపరచినప్పుడూ, పాండవులను చంపటానికి వ్యూహం పన్ని ఘోషయాత్ర నెపంతో దాడి చేసినప్పుడూ, బాలుడైన అభిమన్యుడిని ఒంటరివాడిని చేసి అనేకరథికులను ఒక్కసారిగా అతడిపై ఉసికొలిపి మీ దుర్యోధనుడు అన్యాయంగా చంపించినప్పుడూ-ఆ పాపాలకన్నిటికీ ఆదికర్తవు నీవే. అప్పుడంతా ఈ నీతి ఎక్కడికిపోయింది?' అని కృష్ణుడు నిలదీసి అడుగుతూ ఉంటే కర్ణుడిలోని రోషాగ్ని రోమకూపాల్లో నుండి జ్వాలాతోరణంవలె వెలువడి అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది. కర్ణుడు కోపంతో తీవ్రబాణాలను అర్జునుడిపై సంధించాడు. పోరు ఘోరంగా సాగింది. అప్పుడు శ్రీకృష్ణప్రేరితుడైన అర్జునుడు కర్ణుడిని సంహరించే సంకల్పంతో క్రూరమైన ఒక మహాస్త్రాన్ని గాండీవానికి సంధించాడు. 'నేను తపస్సులో, దానంలో, గురుజనసేవలో నిత్యవ్రతశీలుడనైతే ఈ బాణం కర్ణుడి శిరస్సును త్రెంచుగాక!' అని అంటూ వదిలాడు. ఆ బాణం ఆకాశంలో కాంతులు నింపుతూ ఉభయసేనలు మూర్ఛలో మునిగేటట్లు ప్రకాశించి మహానాదం చేస్తూ కర్ణుడి శిరస్సును ఖండించింది. తూడును వీడిన కమలంవలె కర్ణుడి శిరస్సు తెగిపడినా శరీరం తేజస్సుతో వెలుగొందింది. క్రుంగిన రథచక్రం మరల నేలమీద మామూలుగా నిలిచింది. కర్ణుడి శరీరంలోనుండి ఒక వెలుగు వెలువడి సూర్యబింబంలో కలిసింది. కర్ణుడిశరీరం నేలమీద వాలింది. బలిసిన ఆబోతును పులి చంపినట్లు కర్ణుడిని అర్జునుడు చంపగా కౌరవసేనలు భయపడి పారిపోయాయి. ప్రాణం కోల్పోయి పడి ఉన్న కొడుకును కిరణాలనే చేతులతో తాకటం వలన ఏర్పడిన మైలను పోగొట్టుకొనటానికి పావనస్నానం చేయటానికి పోతున్నాడా అన్నట్లు సూర్యుడు పశ్చిమసముద్రంలో మునిగాడు. టెక్కెం విరిగి బోసిపోయిన రథాన్ని తోలుకొని శల్యుడు తిరిగి వెళ్ళాడు. ఈ సన్నివేశాలను గమనించిన భీమసేనుడు ఆకాశం బ్రద్దలయ్యేటట్లు విజయోత్సాహంతో పెద్దగా అరిచాడు. ఆ విజయధ్వనికి పాండవసేనలు ఉప్పొంగాయి, కౌరవసేనలు దుఃఖించాయి.

శల్యుడు దుర్యోధనుడి వద్దకు వెళ్ళాడు. అతడు కంటతడి పెట్టుతున్నాడు. బిక్కమొగంతో నిట్టూర్పులు నిగుడిస్తున్నాడు. అతడితో శల్యుడిట్లా అన్నాడు: 'ప్రభూ! మనం ఎన్నో యుద్ధాలు చూచాము. కాని, క్రౌర్యంలో కర్ణార్జునుల యుద్ధంవంటి దానిని మనం ఎన్నడూ చూడలేదు. దేవతలు కూడా ఆ యుద్ధాన్ని చూచి ఆశ్చర్యపోయారు. కర్ణుడి విక్రమానికి కృష్ణార్జునులే భయపడ్డారు. నీవు రాజ్యాన్ని చిరకాలం పాలించాలని కర్ణుడితోపాటు ఎందరో మహావీరులు దేహప్రాణాలను త్యాగం చేసి రణరంగంలో పడిపోయారు. వారందరూ ఇంద్ర యమ వరుణ కుబేరులవంటి వారు. కాని వారందరి శౌర్యబాహువీర్యాలు

విఫలాలైపోయాయి. ఇది విధివిలాసం. దీనికి దుఃఖించి ప్రయోజనం లేదు' - అంటూ రక్తసిక్తమైన రణరంగాన్ని దుర్యోధనుడికి చూపించాడు.

అంతలో కృష్ణార్జునులు పాంచజన్యదేవదత్తాలను పూరించారు. ఆ భయంకర నాదానికి భయపడి కౌరవసేనలు దుర్యోధను డున్నచోటును విడిచి పరుగులు తీశాయి. శల్యుడు సంధ్యాసమయం అయింది కాబట్టి యుద్ధవిరమణ చేయుమనీ, భావికర్తవ్యాన్ని తెల్లవారిన తరువాత నిర్ణయించుకొనవచ్చుననీ సూచించాడు. అప్పుడు కృపాశ్వత్థామ కృతవర్మ శకుని సుశర్మ ప్రభృతులు రారాజు వద్దకు వచ్చి విషణ్ణులై నిలిచారు. దుర్యోధనుడు పారిపోతున్న సేనలను ప్రోత్సహించలేక, వీరులు ఉత్సాహాన్ని కోల్పోవటంచేత, శల్యుడి మాటలు సముచితంగా ఉండటంచేత, కర్ణుడిపేరు చెప్పుతూ ఎలుగెత్తి 'ఓ కర్ణా! ఓ కర్ణా!' అని విలపిస్తూ ఆనాటి యుద్ధం చాలించండని పలికాడు. కౌరవవీరులు తన వెంటరాగా శిబిరానికి తిరిగివెళ్ళాడు. ఆ వెళ్ళటం ఎట్లా ఉన్నదంటే - అలనాడు కపటద్యూతంలో ఓడి పాండవులు హస్తినాపురం వెడలి అడవికి పోయే సన్నివేశాన్ని తలపునకు తెప్పించింది.

కృష్ణార్జునులు మెరుగుటమ్ములు శరీరాలలో ప్రకాశించగా కిరణాలతో వెలుగొందే చంద్రసూర్యులవలె ప్రకాశించారు. ఆ అమ్ములను పెరికివైచికొని యుద్ధవిరామాన్ని ప్రకటించారు. భీమాదు లుప్పొంగిపోయారు. దేవతలు నరనారాయణులను ప్రశంసించారు. కృష్ణార్జునులు రథాన్ని ధర్మరాజు శిబిరం వద్దకు నడిపించి, దానిని దిగి అతడికి నమస్కరించారు. భీమాదులు వారి ననుసరించారు. ధర్మరాజు వారిని మనసారా అభినందించాడు. అప్పుడు కృష్ణు డిట్లా అన్నాడు:

కృష్ణుడు : ధర్మరాజా! లోకాలన్నీ కలిసి ఏకమై వచ్చినా కర్ణుడిని సంహరించటం సాధ్యంకాదు. అటువంటివాడు నీ కోపాగ్ని ప్రభావంతోనే దహించబడ్డాడు. ఈ మాట నిజం. కర్ణుడు కూలటంతో కౌరవబలమంతా కుప్పగూలినట్లే అని భావించుము. కౌరవులతో ఇక వైరం లేనట్లే. నీకింక ఎదురులేదు. సంతోషించుము.

ధర్మరాజు : శ్రీకృష్ణా! నీ కటాక్షం ఉంటే మాకందరికీ శుభం కలుగుతుంది. నీ ప్రేమకు పాత్రుడనైన నాకు శత్రువులపై విజయం సాధించటం కష్టమా? నీ ప్రసాదంతో జీవనం గడిపేవారం మేము. మాకు సంపదలు నీవే ప్రసాదిస్తావు. ఇది మా గట్టి నమ్మకం. అఖిలలోకరక్షకుడవైన నీవు భక్తులమైన మమ్ములను రక్షించటం మా అదృష్టం. నీ దయవలన భయాన్నీ, దుఃఖాన్నీ మాని ఈనాడు కంటినిండా నిద్రపోతాను.

కృష్ణుడు : ధర్మజా! నన్ను అభిమానించేవాడివి కాబట్టి ఈ ప్రియోక్తులు పలికావు. కాని, నేను ఈ విజయానికి నిమిత్తమాత్రుడనే. నీ తమ్ములూ, మరదులూ మహాపరాక్రమవంతులు. ఇందరి సహాయం ఉన్న నిన్ను ఎదుర్కొని ఎవడైనా చావకుండా బ్రతుకగలడా?

వారిరువురి మధ్య ఇటువంటి మధుర సల్లాపాలు సాగాయి. ఆ తరువాత ధర్మరాజు యుద్ధభూమిని చూచే కోర్కెను వెలిబుచ్చి కృష్ణుడి అనుమతి పొందాడు. రథారూఢుడై కరదీపికాసహస్రంతో బంధుమిత్ర సోదరులతో కూడి బయలుదేరాడు. కృష్ణుడిని చూచి 'ఈనాడు సమస్త ధరణీ సామ్రాజ్యానికి ప్రభువు నయ్యాను. నీ దయతో ప్రబల శత్రువులు నశించారు, ఈ అభ్యుదయం నాకు లభించింది' అని కృతజ్ఞతలు తెలిపాడు. అర్జునుడిని అభినందించాడు. సంతోషంతో పొలికలనికి పోయాడు. కర్ణుడి శిరస్సును, అతడి కొడుకుల శవాలను చూచాడు. తాను పునర్జన్మ ఎత్తినంతగా భావించాడు. ఆపదలు తొలగాయని, సంపదలు కూడాయని సంతసించి శిబిరానికి తిరిగి వచ్చాడు. ఈ విధంగా పాండవులు కర్ణసాగరాన్ని తుదముట్ట నీది పరమానందాన్ని పొందారు.

జి.వి. సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు

శ్రీమదాంధ్ర మహాభారతము

కర్ణపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
సంజయుఁడు ధృతరాష్ట్రునకుఁ గర్ణుని తెగుటం జెప్పుట	8 - 1 - 25	02
ధృతరాష్ట్రుఁడు గర్ణు మరణంబు విని పలవించుట	8 - 5 - 10	11
దుర్యోధనుఁడు గర్ణునకు సర్వసేనాధిపత్యంబు గట్టుట		28
కర్ణుని మొదటి నాఁటి యుద్ధము	8 - 7 - 14	33
క్షేమధూర్తి యను రాజు భీమునితో యుద్ధము సేసి చచ్చుట	8 - 8 - 25	41
ప్రతివింధ్యుఁడు చిత్రుఁడను రాజుం జంపుట	8 - 10 - 15	50
దుశ్శాసనుఁడు సహదేవునితో యుద్ధంబు సేసి మూర్ఛిల్లుట	8 - 17 - 30	57
కర్ణుఁడు నకులుని విరథుంజేసి యవమానించుట	8 - 17 - 91	65
ధృష్టద్యుమ్నుఁడు గృపాచార్యునితోఁ దలపడి యోడిపోవుట	8 - 18 - 41	72
దుర్యోధనుఁడు ధర్మజునితో యుద్ధంబు సేసి విరథుఁ డగుట	8 - 19 - 35	83
దుర్యోధనుఁడు ధర్మజునితో యుద్ధముచేసి మూర్ఛిల్లుట	8 - 20 - 30	89
కర్ణుని రెండవ నాఁటి యుద్ధము	8 - 22 - 10	99
దుర్యోధనుఁడు శల్యునిఁ గర్ణునకు సారథ్యంబు సేయు మని ప్రార్థించుట	8 - 23 - 1	109
దుర్యోధనుఁడు శల్యునకుఁ ద్రిపురాసురుల వృత్తాంతంబు సెప్పుట	8 - 24 - 1	117
త్రిపుర సంహారముకొఱకు బ్రహ్మాదులు రుద్రునిం బ్రార్థించుట	8 - 24 - 37	123
రుద్రుఁడు త్రిపురంబుల సంహరించి సురల సంతోషపఱుచుట	8 - 24 - 117	134
శల్యుఁడు కర్ణునకు సారథ్యంబు సేయ నొడంబడుట	8 - 25 - 6	142

ద్వితీయాశ్వాసము

శల్యుఁడు గర్ణునుత్సాహంబునకు విఘ్నకరంబు లగు వాక్యంబులు సెప్పుట	8 - 26 - 16	149
శల్యుఁ డర్జునుపరాక్రమం బుగ్గడించి కర్ణునిఁ దూలం బలుకుట	8 - 26 - 61	157
కర్ణుఁడు శల్యునిపైఁ గోపించి యతని దురాచారంబు లుగ్గడించుట	8 - 27 - 68	167
కాకము హంసముతో సముద్రముమీఁదఁ బఱచి భంగపడుట	8 - 28 - 27	173
కర్ణుఁడు శల్యునితోఁ దనకుఁ గలిగిన శాపంబుల తెఱంగు సెప్పుట	8 - 29 - 3	181
కర్ణుఁడు హంసకాకీయోపాఖ్యానము విని కోపించి శల్యుని దూఱుట	8 - 30 - 3	187
శల్యుఁడు గర్ణునితో నప్పుడు దోఁచు నుత్పాతంబులు సెప్పుట	8 - 31 - 38	194
కర్ణుఁడు ధర్మజుపైఁ గవిసి విజృంభించుట	8 - 31 - 5	203
కర్ణుఁడు పాంచాల కుమారుల ననేకులం జంపుట	8 - 43 (కుంభ)	210
భీమసేనుఁడు కర్ణనందనుఁ డగు సత్యసేనునిం జంపి విజృంభించుట	8 - 43 - 24 (కుంభ)	215
కర్ణుండు ధర్మరాజు నొప్పించి యవమానించుట	8 - 44 - 72 (కుంభ) 8 - 33 - 36 (భండా)	225
భీముండు గర్ణుని మూర్ఛితుంజేసి నాలుక గోయం బూనుట	8 - 45 - 48	233
భీముఁడు శ్రుతవర్మాది కురుకుమారులఁ బెక్కండ్ర జంపుట	8 - 35 - 4	235
సంశప్తకు లందఱు నొక్కపెట్ట యర్జును రథంబుపైఁ బడి యాఁగుట	8 - 37 - 11	243
కృపాచార్యుండు సుకేతుం డను పాంచాలకుమారునిం జంపుట	8 - 38 - 82	250
ధృష్టద్యుమ్నుఁడు దుర్యోధనుం దాఁకి విరథునిఁ జేయుట	8 - 40 - 21	257
అశ్వత్థామ యర్జునుం బేర్కొని మార్కొని సంగ్రామంబు సేయుట	8 - 40 - 110	266
దండధారుం డను రాజు వేదండంబుతోడ నర్జునుచేఁ జచ్చుట	8 - 54 - 1 (కుంభ)	273
మలయధ్వజుం డను పాండ్యమహారా జశ్వత్థామచేతఁ జచ్చుట	8 - 56 - 1 (కుంభ)	277
కర్ణుఁడు పాంచాల సైన్యంబు దైన్యంబు నొందించి విజృంభించుట	8 - 57 - 1 (కుంభ)	286
దుర్యోధనుండు భీమసేనుం దలపడి పోరుట	8 - 44 - 3	294
అశ్వత్థామ యర్జునుం దలపడి మహాహవంబు సేయుట	8 - 45 - 1	298

తృతీయాశ్వాసము

కర్ణవిజృంభణము	8 - 66 - 33	308
కృష్ణార్జునులు ధర్మరాజు క్షేమం బరయ నతని శిబిరంబునకుఁ బోవుట	8 - 45 - 64	319
ధర్మరాజు కర్ణుండు బ్రతికియున్నవాఁడని విని యర్జునుం గినిసి పలుకుట	8 - 48 - 1	328
అర్జునుఁడు తన్ను ధర్మజుఁ డాడిన పలుకులకుఁ గోపించి యతని తల నఱుక వాలు పెఱికికొనుట	8 - 49 - 1	334
కృష్ణుఁ డర్జునుఁ బ్రతిజ్ఞా భంగంబు గాకుండ ధర్మజు దూఱుమని చెప్పుట	8 - 48 - 64	339
ధర్మరాజు కృష్ణుని వాక్యంబులం గలంక దేఱి ప్రసన్నుఁ డగుట	8 - 49 - 113	347
అర్జునుఁడు కృష్ణుని వాక్యంబులచేఁ గర్ణుని వధ కుత్సహించుట	8 - 52 - 11	358
భీముఁ డర్జును రాక గోరి విశోకునితో విచారించుట	8 - 54 - 11	362
శకుని భీమసేనుం దలపడి మూర్ఛితుండై తన రథంబు మీఁదఁ గూలుట	8 - 55 - 65	370
కురుకుమారులు పదుగు రర్జునుం దాఁకి మృతు లగుట	8 - 58 - 23	378
దుశ్శాసనుఁడు భీమసేనునితోఁ బోరి చచ్చుట	8 - 60 - 29	383
భీమసేనుఁడు దుస్ససేనునియురంబు వ్రచ్చి రక్తపానంబు సేయుట	8 - 61 - 1	390
అర్జునుఁడు వృషసేనుని మృతిఁ బొందించుట	8 - 62 - 59	401
కర్ణార్జునుల ద్వంద్వ యుద్ధకాలమున బ్రహ్మరుద్రేంద్రుల ప్రశ్నోత్తరములు	8 - 63 - 46	402
అశ్వత్థామ దుర్యోధనునకు హితోపదేశంబు సేయుట	8 - 64 - 20	410
కర్ణార్జును లొండొరులమీఁద దివ్యబాణంబు లేయఁబూనుట	8 - 65 - 12	416
దుర్యోధనుఁడు తన యోధుల నర్జునుం దలపడఁ బురికొలుపుట	8 - 65 - 42	425
సర్పముఖ శరంబున నర్జునకిరీటంబు భూమిపైఁ బడుట	8 - 66 - 11	430
బ్రాహ్మణశాపంబునఁ గర్ణురథచక్రంబు భూమిం గ్రుంగుట	8 - 66 - 42	437
అర్జున ప్రయుక్తం బగు ఘోరశరంబు కర్ణుశిరంబు ద్రుంచుట	8 - 67 - 24	446
శ్రీకృష్ణుఁడు ధర్మరాజుతో సరససల్లాపంబు చేయుట	8 - 69 - 16	457

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

కర్ణపర్వము

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

కర్ణపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీ పరిణామస్థితి వి । ద్యాపారీణత్వ కారితా నిరతా పాం
గా, పరమనైష్ఠికత్వ । వ్యాపారపరానుషక్త, హరిహరనాథా ! 1

ప్రతిపదార్థం: శ్రీ= ఐశ్వర్యం యొక్క; పరిణామ స్థితి= ఆనంద స్థితిని; విద్యా= జ్ఞానమునందు; పారీణత్వ= పరిపూర్ణత్వాన్ని; కారితా= కలుగ చేయటంలో; నిరత= మిక్కిలి ఆసక్తి కల; అపాంగా= కడగంటి చూపుకలవాడా!; పరమ= పరమాత్మయందు; నైష్ఠికత్వ= స్థిరమైన శ్రద్ధ కలిగి ఉండటం అనే; వ్యాపారపర= పనిలో మునిగి ఉన్నవారియందు; అనుషక్త= అనురాగము కలవాడా!; హరి, హర, నాథా= విష్ణుమూర్తివి, శివుడవు అయిన స్వామీ!

తాత్పర్యం: ఐశ్వర్యం ఇచ్చే ఆనందస్థితిని, పరిపూర్ణ జ్ఞానస్థితిని ప్రసాదించటంలో ఆసక్తి కల కడగంటి చూపుకలవాడా! పరమాత్మయందు స్థిరంగా చిత్తాన్ని నిలుపటం అనే పనిలో నిమగ్నులైన వారియందు అనురాగం కలవాడా!; హరిహరనాథా!

విశేషం: శ్రుతి స్మృతి పురాణ విజ్ఞానవేత్త తిక్కన సోమయాజి ఈ పద్యంలో తన స్మృతి విజ్ఞానం ప్రదర్శిస్తున్నాడు. భగవద్గీతలో: **“ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీస్సమాః । శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే॥ అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్.” -6 - 40; 41** యోగభ్రష్టుడు అశ్వమేధాదియాగాలు చేసినవారి లోకాలకు వెళ్ళి, అక్కడ చాలా సంవత్సరాలున్న తరువాత విహిత ధర్మానుష్ఠాన పరులయిన సంపన్నుల ఇళ్ళలో జన్మిస్తాడు. లేదా, బుద్ధిమంతులయిన అనగా జ్ఞానులయిన యోగుల ఇళ్ళలోనే జన్మిస్తాడు అని ఉన్నది. జ్ఞానదాయకుడు దక్షిణామూర్తి మొదలయిన రూపాలలో శివు డన్నది ప్రసిద్ధం. ధర్మాచరణం కలవాడు శ్రీమంతుడయితే దానాది ధర్మమూ, యజ్ఞాదులూ అశ్రమంగా ఆచరింపగలుగుతాడు. కనుక శ్రీమంతుల ఇళ్ళలో పుట్టించి సంపదకు ఫలమయిన ధర్మాదులు ఆచరింపజేసి రక్షిస్తాడు హరి. ఈయన స్థితికారకుడు. కనుకనే 'స్థితి' పదప్రయోగం. జ్ఞానవంతులయిన యోగుల ఇళ్ళలో పుట్టిన అతడు పూర్వజన్మలో వదలిన చోట యోగసాధన ప్రారంభించి సులభంగా సిద్ధి అందుకుంటాడు. అదీ యిదీ కరుణాకటాక్ష ప్రసాద మాత్రంచేతనే కలిగిస్తాడు స్వామి అన్న దొక విశేషం. బ్రతికి ఉన్నంతకాలమూ గురుకులంలోనే బ్రహ్మచర్యవ్రతంలోనే ఉండేవాడు నైష్ఠిక బ్రహ్మచారి, వివాహం చేసుకొనటానికని స్నాతుడు కాగోరేవాడు ఉపకుర్వాణుడు. ఎల్లప్పుడు బ్రహ్మనిష్ఠుడైన, రెండర్థాలలోనూ నైష్ఠికుడైన వాని యోగక్షేమాలను పరమాత్మ వహిస్తాడనటానికి 'తేషాం సతతయుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్' నిరంతరం పరమాత్మ స్మరణాదియుక్తులైనవారి యోగక్షేమాలను నేను వహిస్తానన్న గీతావాక్యమే ప్రమాణం. (9.22)

సంజయుఁడు ధృతరాష్ట్రునకుఁ గర్ణుని తెగుటం జెప్పుట (సం. 8-1-25)

వ. దేవా, వైశంపాయనుండు జనమేజయునకిట్లనియె; 'నట్లు మహాప్రాజ్ఞుండగు సంజయుండు దండుననుండి హస్తిపురంబున కరుగుదెంచి, ధృతరాష్ట్రు మందిరంబు ప్రవేశించి, యంతఃపురంబున నున్న యన్నరనాథుం గనుంగొని, కృతప్రణాముం డగుటయు నతం డాదరించిన నాసీనుండై. 2

ప్రతిపదార్థం: దేవా= ప్రకాశమానుడవైన ఓ స్వామీ; వైశంపాయనుండు= వ్యాసుని శిష్యుడైన వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= ఆ పేరుకల మహారాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు; అట్లు= ఆ విధంగా; మహా= గొప్ప; ప్రాజ్ఞుండు+అగు= జ్ఞాని అయిన; సంజయుండు= ఆ పేరు గలిగి ధృతరాష్ట్రునికి యుద్ధవార్తలు చెప్పటానికి నియుక్తుడైన అతడు; దండుననుండి= సైన్యంలో నుండి; హస్తి పురంబునకున్= హస్తినానగరం అనే పేరుగల కౌరవుల రాజధానీ పట్టణానికి; అరుగు+తెంచి= వచ్చి; ధృతరాష్ట్ర= ఆ పేరుగల దుర్యోధనాదుల తండ్రి అయిన రాజుయొక్క; మందిరంబు= ఇంటిలోనికి; ప్రవేశించి= వెళ్ళి; అంతఃపురంబునన్+ ఉన్న= రాజస్త్రీలు నివసించే లోపలినగరి (ఇంటి)లో ఉన్న; ఆ+నరనాథున్= ప్రజలకు ప్రభువైన ఆ ధృతరాష్ట్రుని; కనుంగొని= చూచి; కృతప్రణాముండు= చేయబడిన నమస్కారం కలవాడు, నమస్కరించినవాడు; అగుటయున్= కాగా; అతండు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; ఆదరించినన్= మన్నన చేయగా; ఆసీనుండు+ఐ= కూర్చున్నవాడై. (క్రింది పద్యంతో అన్వయం)

తాత్పర్యం: స్వామీ! వైశంపాయన మహర్షి, జనమేజయ మహారాజుతో ఇట్లా చెప్పాడు. రాజా! నీ కిదివరకే నేను చెప్పినట్లు గొప్ప జ్ఞాని అయిన సంజయుడు కురుక్షేత్రంలో ఉన్న సైన్యంనుండి బయలుదేరి రాజధాని హస్తినానగరానికి వచ్చాడు. ధృతరాష్ట్రమహారాజు నివసించే భవనానికి వెళ్ళి ఆ మహారాజును దర్శించి నమస్కరించాడు. ఆయన అతడిని మన్నన చేసి కూర్చోమంటే కూర్చొని (చెప్పబోతున్నాడు).

విశేషం: అంతఃపురంలో ఉన్న ధృతరాష్ట్ర మహారాజుగారిని సంజయుడు దర్శించాడంటే, అత డాయనకు ఎంత ఆప్తుడో తెలుస్తుంది. అంతేకాక, అతడు తెచ్చిన వార్త, చెప్పవలసిన విశేషం ఎంత తీవ్రమైనదో, ఎంత ముఖ్యమైనదో, ఎంత తొందరగా అందించవలసినదో కూడా తెలుస్తుంది.

క. బలవిక్రమములు వినుతం। బులుగా మనమొనలుఁ బాండుపుత్రానీకం
బులు రెండునాళ్ళు వోరుట। దెలియంగాఁ జూచి వచ్చితిం గురునాథా! 3

ప్రతిపదార్థం: కురునాథా!= కురుమహారాజు వంశానికి చెందిన ధృతరాష్ట్ర మహారాజా! (నేను); మనమొనలున్= కౌరవసైన్యాలూ; పాండుపుత్ర= పాండవులయొక్క; అనీకంబులున్= సేనలూ; బల= శరీర శక్తులూ; విక్రమములు= మానసికాలయిన పరాక్రమాలూ; వినుతంబులుగాన్= పొగడబడునవిగా; రెండునాళ్ళు= రెండురోజులు; పోరుట= యుద్ధం చేయటం; తెలియన్+ కాన్= స్పష్టంగా అర్థం అయ్యేటట్లు; చూచి= ప్రత్యక్షంగా చూచి; వచ్చితిన్= నీ వద్దకు వచ్చాను.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! తమ శక్తీ, శౌర్యమూ అందరూ మెచ్చుకొనేటట్లు మనసైన్యమూ పాండవులసేనా చేస్తున్న యుద్ధం రెండు రోజులు స్పష్టంగా చూచివచ్చాను.

విశేషం: ఒక్కొక్క ప్రముఖుడూ పడిపోయిన తరువాత రావటమూ, ముందు అతని మరణం గురించి తెలియజేయటమూ, అనంతరం అత డెట్లా యుద్ధంచేసి పడిపోయాడో ఆ క్రమం చెప్పటమూ యుద్ధవార్తలు చెప్పటంలో సంజయుడు అనుసరిస్తున్న

పద్ధతి. చావు కబురు చల్లగా చెప్పుమన్నారు. సంజయుడు మంచి మాటకారి. ధృతరాష్ట్రుడితో సహా కౌరవులందరూ విజయాశ ఎవడిపై పెట్టుకొన్నారో ఆ కర్ణుడి మరణవార్త చెప్పబోతున్నాడు. కనుక, ఇరువాగులవారూ ప్రశంసనీయంగా పోరాడుతున్నారని ప్రారంభించటంద్వారా ఒకరు ఓడక తప్పకపోవటం సూచిస్తున్నాడు. మన మొనలని కౌరవసేనలను గురించి ముందు ప్రస్తావించటంద్వారా ఆశ కల్పిస్తున్నాడు. చెప్పబోయే కర్ణుని మరణవార్త వారికి నమ్మశక్యం కానిది. నమ్మతగిందని సూచించటానికే 'తెలియంగాఁ జూచివచ్చితి' అన్నాడు.

వ. అని పలికి కర్ణునిం బ్రశంసించి. 4

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికి= చెప్పి; కర్ణునిన్= రాధేయుడిని; ప్రశంసించి= మెచ్చుకొని. (అనియె అనే 8వ సంఖ్య కల వచనంలోని క్రియతో అన్వయం.)

తాత్పర్యం: ఆవిధంగా పలికి కర్ణుడిని మెచ్చుకొని.

చ. సరకుగొనండు పాండుసుత సైన్యనికాయము నించుకేనియుం
గరులు రథంబులున్ హరులుఁ గాల్బలముల్ దనవీఁక విచ్చియున్
మరలియుఁ దూలియుం బిలుకుమాఱియు నల్గడఁ బాఱియున్ వియ
చ్చరులకు వేడ్కసేయ భుజసారము శౌర్యముఁ జూపె నేపునన్. 5

ప్రతిపదార్థం: (కర్ణుడు) పాండుసుత= పాండవులయొక్క; సైన్య= సేనయొక్క; నికాయమున్= సమూహాన్ని; ఇంచుక+ఏనియున్= కొంచెమైనా; సరకు+కొనండు= లెక్కపెట్టడు; తన వీఁకన్= తన పరాక్రమంతో; కరులున్= ఏనుగులూ; రథంబులున్= తేరులూ; హరులున్= గుర్రాలూ; కాల్బలముల్= పదాతి సేనలూ; విచ్చియున్= చెల్లా చెదరైపోయీ; మరలియున్= (పాండవ సేనా నాయకుల ప్రోద్బలంతో కర్ణుని వైపు) తిరిగీ; తూలియున్= చలించి పడీ; పిలుకుమాఱియున్= మరణించీ; నలు+కడన్= నాలుగు దిక్కులకూ (అన్నివైపులకూ); పాఱియున్= పరుగులు తీసీ; వియత్+చరులకున్= ఆకాశంలో సంచరించే దేవతలు మొదలయిన వారికి; వేడ్క+చేయన్= వినోదం కలిగించేటట్లు; ఏపునన్= విజృంభణంతో; భుజ= తన భుజములయొక్క; సారమున్= బలాన్నీ; శౌర్యమున్= పరాక్రమాన్నీ; చూపెన్= ప్రదర్శించాడు.

తాత్పర్యం: కర్ణుడు పాండవుల సైన్యాన్ని పిసరంతైనా లక్ష్యపెట్టలేదు. అతని పరాక్రమానికి రథగజతురగ పదాతి సేన ఒకప్పుడు చెల్లాచెదరైపోయింది. ఇంకొకప్పుడు మళ్ళీ వెనక్కు వచ్చింది. మరొకప్పుడు పడిపోయింది. వేరొకప్పుడు ప్రాణాలు కోల్పోయింది. కొంత అన్నివైపులకూ పారిపోయింది. అది చూచే ఆకాశసంచారులయిన దేవతలు మొదలయిన వారికి వినోదం కలిగించింది. అట్లా అతడు విజృంభించి తనబాహుబలమూ, పరాక్రమమూ ప్రదర్శించాడు.

వ. చూపి, యక్కౌంతేయులం గలంచి యాడి, పదంపడి. 6

ప్రతిపదార్థం: చూపి= ప్రదర్శించి; ఆ+కౌంతేయులన్= ఆ పాండవులను; కలంచి= కలతపరచి; ఆడి= క్రీడించి, ఆటలంత అవలీలగా యుద్ధంచేసి; పదంపడి= తరువాత (తెగియె అనే 7వ పద్యంలోని క్రియతో అన్వయం.)

తాత్పర్యం: ప్రదర్శించి, ఆ పాండవులను కలతపెట్టి, అవలీలగా యుద్ధంచేసి, ఆ తరువాత.

విశేషం: కౌంతేయులంటే కుంతీపుత్రులని అర్థం. ఇక్కడ తిక్కనగారు పాండుపుత్రులనే అర్థంలో ప్రయోగించారు. 'పచ్చెం గుంతీసుత మధ్యముండు' అని విరాటపర్వంలో కూడా పాండవ మధ్యముడనే అర్థంలో ప్రయోగించారు. పెంచినది కుంతియే కనుకనూ సంతానం కలిగిన తరువాత మాద్రిని ప్రజలెవరూ చూడలేదు కనుకనూ అందరూ పాండవులైదుగురిని కౌంతేయులని పిలిచే వారని ఆయన అభిప్రాయంగా గ్రహించాలి.

తే. తనకుఁ బిమ్మిటియైన యర్జునునిబాహు । లీల నెమ్మెయిఁ ద్రోవంగలేక తెగియె
నధిప! యాఁబోతు బెబ్బులి కగ్గమైన । పగిదియై పాండవులకును బగ యడంగె. 7

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; ఆఁబోతు= వృషభం; బెబ్బులికిన్= పెద్దపులికి; అగ్గము+ఐన= వశపడినది అయిన; పగిది+ఐ= విధమయి; తనకున్= తనకంటె; పిమ్మిటి+ఐన= అధికుడైన; అర్జునునియొక్క; బాహులీలన్= బాహువుల విలాసాన్ని (అనగా భుజబలాన్ని); ఏ+మెయిన్= ఏ విధంగానూ; త్రోవఁగన్= త్రోసివేయటానికి, మించటానికి; లేక= శక్యంకాక; తెగియెన్= మరణించాడు; పాండవులకున్= ధర్మరాజాదులకూ; పగ= విరోధం; అడంగెన్= అణగిపోయింది, తీరింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! తన కంటె అధికుడైన అర్జునుడి బాహుబలాన్ని ఏ విధంగానూ అతిశయించలేక, పెద్దపులి వశమైన ఆబోతు వలె కర్ణుడు మరణించాడు. దానితో పాండవుల పగకూడ చల్లారింది.

విశేషం: అలం: ఉపమ. ఇందులో తిక్కనగారు అర్జునుడిని పులితోనూ, కర్ణుడిని ఆబోతుతోనూ పోల్చటమూ, పులి కంటపడిన ఆబోతువలె కర్ణుడు ఎంత ప్రయత్నించినా అర్జునుడి బాహులీలను మించలేక మరణించా డనటమూ అద్భుతం. 5వ పద్యంలో సైనికులపై కర్ణుడి విజృంభణం వర్ణించాడు. 6వ వచనంలో అది ఆటవలె సాగిందన్నాడు. ఇందులో అర్జునుడి బాహువిలాసాన్ని ఏమీ చేయలేక మరణించాడన్నాడు. ఆబోతు సామాన్య మృగాలను ఏమైనా చేయగలదు. కాని అది ఎంత బలం కలదైనా పులికి చిక్కిందో దాని పని ముగిసినట్లే. కర్ణుడు సామాన్య భటులతో అవలీలగా ఆటవలె యుద్ధంచేశాడు. అర్జునుడి చేతికి చిక్కి మరణించాడు. ఇక, పాండవులకును 'పగ అడంగె' అన్న వాక్యం. కర్ణుడు పోతే పాండవుల పగ తీరటమేమిటి? కౌరవుల జయాశకు మూలం కర్ణుడు. అతడు పోతే వారోడిపోయినట్లే. ఈ సంగతి కౌరవ పాండవుల కిద్దరికీ తెలుసు. కర్ణుడు పడగానే వాళ్ళను గెలిచామనిపించింది కనుక, పగతీరింది పాండవులకు. అదీగాక, కర్ణుడి మీద ప్రత్యేకమైన పగ పాండవులకు. ద్రౌపదిని వస్త్రహీనను చేయుమని సూచన ఇచ్చినవాడు కర్ణుడు. అయిదుగురిని కాక ఒక్కడిని భర్తగా పొందటం మంచిది. జూదంలో భార్యను ఓడిపోవని వాడిని ఇంకెవడినైన పడయుమని ఆమెను నిండుకొలువులో అన్నవాడు కర్ణుడు. పాండవులనందరినీ అవమానించినవాడు కర్ణుడు. ఘోషయాత్రకు పురికొల్పినవాడు కర్ణుడు. అభిమన్యుడి అన్యాయపు చావుకు మూలమైనవాడు కర్ణుడు. ఇలాంటి కారణాలవలన పాండవులకు అతడిపై ప్రత్యేకమైన పగ. అతడి మరణంతో ఈ రెండు పగలూ తీరాయి. పైగా, 'మరణాంతాని వైరాణి' కదా. అందువల్ల కూడా వారి పగ తీరింది.

వ. అనుచు శోకోపహతుండై సూతసూనుండు నిట్టూర్పు నిగిడించి, డగ్గుత్తిక వెట్టి యిట్లనియె. 8

ప్రతిపదార్థం: అనుచున్= అట్లా పలుకుతూ; సూతసూనుండు= రథసారథి పుత్రుడైన సంజయుడు; శోక= ఏడుపుచేత; ఉపహతుండు+ఐ= కొట్టబడినవాడై; అంటే ఏడుపు ఆపుకొనలేక; నిడు+ఊర్పు= దీర్ఘనిశ్వాసం; నిగిడించి= సాగించి, అంటే చాలాసేపు విచారసూచకంగా నిశ్వాసం విడిచి; డగ్గుత్తిక+పెట్టి= గద్గదస్వరం వచ్చేటట్లు మాటతీరు మార్చి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అని చెపుతూ, సంజయుడు దుఃఖాతిశయంతో నిట్టూర్చి, గద్గద స్వరంతో ఈ విధంగా అన్నాడు.

చ. అది యొకఁ డేల? కౌరవ చయంబు జయాశ యడంగి పోవ బె
ట్టిదుఁ డగు భీమసేనుఁడు గడింది మగంటిమి దుస్ససేను దు
ర్మద మడఁగించి పేరురము వ్రచ్చి మహోగ్రతఁ ద్రావె నెత్తు ర
య్యది దుది నింత వుట్టు నని యాప్తజనంబులు మున్న చెప్పరే? 9

ప్రతిపదార్థం: అది= కర్ణుని మరణం; ఒకఁడు= ఒకటి(మాత్రమే అనుకొనటం); ఏల?= ఎందుకు?; బెట్టిదుఁడు+అగు= గర్వి, క్రూరుడు, కఠినుడు అయిన; భీమసేనుఁడు= భీముడు; కౌరవ= కౌరవుల; చయంబు= సమూహంయొక్క; జయ+ఆశ= గెలుపుమీది ఆశ; అడంగిపోవన్= నాశనమైపోయేటట్లుగా; కడింది= అధికమైన; మగంటిమిన్= పౌరుషంతో; దుస్ససేను= దుశ్శాసనునియొక్క; దుర్మదము= దుష్టమైన పొగరు; అడఁగించి= నాశనంచేసి; పేరురము= విశాలమైన వక్షఃస్థలం; వ్రచ్చి= చీల్చి; నెత్తురు= రక్తం; మహోగ్రతన్= మిక్కిలి భయంకరత్వంతో; త్రావెన్= త్రాగాడు; ఆప్తజనంబులు= దగ్గరివారయిన మనుష్యులు; తుదిన్= చివరకు; ఇంత= ఇంతటి మహాపద; పుట్టును+అని= సంభవిస్తుంది అని; ఆ+అది= ఆ పరిణామం గురించి; మున్న= ఇదివరకే; చెప్పరే?= చెప్పలేదా?

తాత్పర్యం: కౌరవుల జయాశ నశించటానికి కర్ణుడి మరణం ఒకటే సంభవించిందనుకొనటం దేనికి? ఇంకా విచారం కలిగించే సంఘటనలు జరిగాయి. వాటిలో ఒకటి దుశ్శాసనుడి మరణం. కఠినాత్ముడైన భీమసేనుడు విపరీత పౌరుషంతో దుశ్శాసనుడి పొగరణగించి, అతడి విశాల వక్షఃస్థలాన్ని చీల్చి మహాభయంకరంగా నెత్తురు త్రాగాడు. చివరకు ఇటువంటి మహాపద ఏదో సంభవిస్తుందని ఆప్తులు ముందే చెప్పారు కదా.

విశేషం: దేహళీ దత్తదీపన్యాయంగా (రెండు గదుల మధ్య గడపమీద పెట్టిన దీపం రెండు గదులలోనికీ వెలుతురు ప్రసరింపజేసినట్లు) ముందు వెనుక వాక్యాలకన్వయించేటట్లు వాక్యాలూ వాక్యాంశాలూ ప్రయోగించి రచనకు వన్నెతేవటంలో తిక్కనగారు ప్రసిద్ధులు. ఈ పద్యంలో అట్లాంటి విన్యాసాలు రెండున్నాయి. వాటిలో 'కౌరవచయంబు జయాశ యడంగిపోవ' అన్నవాక్యం ఒకటి. కౌరవుల జయాశ నశించటానికి సంభవించినవాటిలో కర్ణుడి మరణ మొకటే అనుకొనటమెందుకు - అనీ అన్వయించవచ్చు. కౌరవుల జయాశ నశించేటట్లు భీముడు దుశ్శాసనుడి నెత్తురు త్రాగాడనే వాక్యంతోనూ అన్వయించవచ్చును.

అట్లాగే 'అయ్యది' అన్నదాని ప్రయోగం. 'నెత్తురయ్యది' అని అన్వయిస్తే ద్రౌపదిని పరాభవించే మదం కలిగించిన నెత్తురు అని అన్వయించవచ్చును. ఆ పరాభవించటానికి ఫలంగా అనీ చెప్పవచ్చును. అయ్య+ది అని విడదీసి యువరాజువంటి వారిని తెలుగులో ప్రభువుల పరివారంలోనివారు చిన్నయ్య పెద్దయ్య అని వ్యవహరించటం కద్దు కనుక, అయ్యదైన నెత్తురు అనీ అన్వయించవచ్చును. "సోమరిపోతులు కొందరయ్యలు" అని శ్రీనాథుడు ప్రయోగించినట్టు, మదంతో ద్రౌపదిని పరాభవించిన అయ్యది, ఆప్తుల హితోపదేశం పెడచెవినిబెట్టిన అయ్యది (మూర్ఖునిది) అనీ అన్వయించవచ్చును.

భీమసేనుడికి బెట్టిదుఁడు అనే విశేషణం వేశారు. దానికి ఉద్ధతుడు (గర్వి), కఠినుడు, క్రూరుడు అని అర్థాలున్నాయి. అందరూ చూస్తుండగా దుశ్శాసనుని సంహరించటంలో భీముని ఔద్ధత్యమూ, వక్షఃస్థలం చీల్చటంలో కాఠిన్యమూ, నెత్తురు త్రాగటంలో క్రౌర్యమూ కనిపిస్తున్నాయి. ఒక్క విశేషణంలో ఇది సాధించారు తిక్కనగారు.

తే. కొడుకులంత రాజ్యంబును గొనఁగ శక్తు । లను దురాశను వారల యవినయములు
నీ వుపేక్షింతు; మానునే? యా విరుద్ధ । కర్మమున ఫలమొందక కౌరవేంద్ర! 10

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= కురువంశీయుడవైన రాజా!; నీవు= నీవు; కొడుకులు= నీ కుమారులు; అంత= (నీవంతుగా దక్కిన, వారివంతని నీవిచ్చిన) సమస్తమైన; రాజ్యంబును= రాజ్యాన్నీ; కొనఁగన్= తీసికొనటానికి; శక్తులు= శక్తికలవారు; అను= అనే; దురాశను= చెడు ఆశతో; వారల= నీ కొడుకులయొక్క; అవినయములు= వినయం లేనందువల్ల చేసే చెడుపనులు; ఉపేక్షింతు= చూచీ చూడనట్లు ఊరుకున్నావు; ఆ విరుద్ధ కర్మమున= ఆ ధర్మ విరుద్ధమయిన పనియొక్క; ఫలము= ఫలితం; ఒందక= చెందక, అనుభవించక; మానునే?= పోతుందా? పోదు.

తాత్పర్యం: కౌరవరాజా! నీ కొడుకులు నీ వంతురాజ్యమే కాక, పాండవులకు నీ విచ్చిన రాజ్యం కూడా కలుపుకొని, మొత్తం రాజ్యమూ కాజేసి, నిలుపుకొనగలిగినంత సమర్థులు అనే దురాశతో వాళ్ళు చేసిన చెడ్డపనులు చూచీ, చూడనట్టు ఊరుకున్నావు. ఇది ధర్మానికీ వ్యతిరేకమైన పని. దాని ఫలం అనుభవించక తప్పుతుందా?

విశేషం: ఈ పద్యంలో ప్రాణం 'కౌరవేంద్ర' అన్న సంబోధనలో ఉన్నది. కురుమహారాజు ఇంద్రాదుల ఆక్షేపణలు కూడా కాదని లోకహితం కోసం, ధర్మక్షేత్రం కురుక్షేత్రం ఏర్పరచిన ఉత్తముడు. ఆ వంశంలో పుట్టిన ధృతరాష్ట్రమహారాజు ధర్మవిరుద్ధ కృత్యాలను పుత్రవ్యామోహంతో ఉపేక్షించటం తప్పు. చేసినకర్మ అనుభవించక తప్పదు. తెలిసి చేసినదానికి అసలు తప్పదు - అని సంజయుడి అభిప్రాయం.

వ. అనిన విని, యాంబికేయుండు, దుర్యోధనుండును దెగియెన కాఁదలంచి, విహ్వాలించి, మూర్ఛిల్లినం; దల్లడిల్లి, యార్తనాదంబులతో వివశంబులయి, వనితాజనంబులు గన్నీరుగ్రమ్మ, వసుంధర నొఱగిన; నంతకుమున్న వచ్చియున్న విదురుండును, నా సూతనందనుండును జేరి, చేసేత, శీతల జలసేచన మృదువ్యజనవీజనంబుల నన్నరనాథుని, నారీ సముదయంబును సేదదేర్చిన; నాసీనుండై యతండు దీర్ఘ నిశ్వాసంబు లడరం జింతిల్లి. యంతర్గతంబున దైవంబు గర్హించి, పాండవుల నగ్గించి, తన బుద్ధియు, శకుని వెరవును నిందించి; తన్నుందాన యుపశమించుకొని, ధైర్యంబు సిక్కంబట్టి. 11

ప్రతిపదార్థం: అనినన్= ఈ విధంగా సంజయుడు చెప్పగా; విని; ఆంబికేయుండు= అంబిక కుమారుడైన ధృతరాష్ట్రుడు; దుర్యోధనుండును= ఆపేరిటి తన జ్యేష్ఠ పుత్రుడు కూడా; తెగియెన్+అ+కాన్= మరణించియే ఉంటాడని; తలంచి= భావించి; విహ్వాలించి= అవయవాలు స్వాధీనం తప్పి; మూర్ఛిల్లినన్= సొమ్మసిల్లగా; వనితాజనంబులు= స్త్రీజనాలు, స్త్రీలు; తల్లడిల్లి= బాధపడి, జడిసి; ఆర్తనాదంబులతోన్= దుఃఖపడినవారు చేసే ధ్వనులతో, 'అయ్యో!' మొదలైన వాటితో; వివశంబులు+అయి= వశము తప్పినవి అయి; కన్నీరు+క్రమ్మన్= కన్నీరు కారగా; వసుంధరన్= భూమిపై; ఒఱగినన్= వ్రాలగా; అంతకున్= ధృతరాష్ట్రుడు సొమ్మసిల్లటానికి; మున్ను+అ= ముందుగానే; పూర్వమే; వచ్చి+ఉన్న= అక్కడికి వచ్చి ఉన్న; విదురుండును = ఆ పేరిటి ధృతరాష్ట్రుని తమ్ముడూ; సూతనందనుండును= సంజయుడూ; చేరి= వారిని సమీపించి; చేసేతన్= స్వయంగా; శీతల= చల్లని; జల= నీటితో; సేచన= తడపటంతోనూ; మృదు= సుకుమారమైన; వ్యజన= వీవనలతో; వీజనంబులతోను= విసరటములతోనూ; ఆ+నరనాథునిన్= ఆరాజు ధృతరాష్ట్రునీ; నారీ= స్త్రీలయొక్క; సముదయంబును= సమూహమునూ; సేదదేర్చినన్= మూర్ఛనుంచి తెప్పిరిల్లజేయగా; ఆసీనుండు+ఐ= కూర్చున్నవాడై; అతండు= ఆ ధృతరాష్ట్రుడు; దీర్ఘనిశ్వాసంబులు= నిట్టూర్పులు; అడరన్= అధికం కాగా (అయ్యేటట్లుగా); చింతిల్లి= విచారించి; అంతర్గతంబునన్= మనస్సులో; దైవంబున్= విధిని; గర్హించి= నిందించి; పాండవులన్= పాండురాజు కుమారులను; అగ్గించి= ప్రశంసించి; తన= కొడుకులమాటకు అడ్డుచెప్పని తనయొక్క; బుద్ధియున్= జ్ఞానాన్నీ, తెలివినీ, వివేకాన్నీ; శకుని= శకునియొక్క; వెరవును= ఉపాయాన్నీ; నిందించి= దూషించి; తన్నున్+తాను+అ= తనను తానే; ఉపశమించుకొని= శాంతింపజేసికొని, ఓదార్చుకొని, కుదుట

పరచుకొని; ధైర్యంబు= మనస్సు కలత చెందకుండా ఉండే స్థితిని; చిక్కన్= దొరికేటట్లు; పట్టి= పట్టుకొని (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: సంజయుడు ఆ విధంగా కర్ణ దుశ్శాసనుల మరణవార్త చెప్పి, 'ఈ అనర్థాని కంతటికీ నీవు నీ కుమారుల నీతిమాలిన పనులను చూచీ చూడనట్లు ఊరుకోవటమే కారణం' అని చెప్పేసరికి, ధృతరాష్ట్రుడికి దుర్యోధనుడు కూడా చనిపోయుంటా డనిపించింది. దానితో శరీరం పట్టు తప్పింది. మూర్ఛవచ్చింది. అది చూచి అంతఃపురకాంతలందరూ బాధపడి హాహాకారాలు చేస్తూ, కన్నీళ్ళు పెట్టుకొంటూ మూర్ఛిల్లి నేలపై పడిపోయారు. ధృతరాష్ట్రుడు మూర్ఛిల్లటానికి పూర్వమే అక్కడికి చేరి ఉన్నాడు విదురుడు. అతడూ సంజయుడూ వెంటనే ధృతరాష్ట్రుని ముఖంమీదనూ అంతఃపురకాంతల ముఖాలమీదనూ చల్లని నీళ్ళు చిలకరించారు. సుకుమారమైన వీవనలతో మెల్లగా విసిరారు. ఈ ఉపచారాలవలన ధృతరాష్ట్రమహారాజు మూర్ఛనుండి తేరుకొని కూర్చున్నాడు. పెద్ద పెద్ద నిట్టూర్పులు వచ్చేటట్లు విచారించాడు. ఇట్టి స్థితి కల్పించినందుకు మనస్సులో విధిని తిట్టిపోశాడు. పాండవులను వారి మంచినడతకు మెచ్చుకొన్నాడు. తన కొడుకులను దారిలో పెట్టుకొనలేక వా రాడించినట్లు ఆడిన తన తెలివిని తానే తిట్టుకొన్నాడు. శకుని చెప్పిన - అంతంలో నాశనం కలిగించే ఉపాయాన్ని (జూదమాడి పాండవులను గెలుద్దామనే ఉపాయాన్ని) దూషించాడు. వీటివలన ఎట్లాగో తనకుతానే దిటవు తెచ్చుకొన్నాడు. సంజయుడితో ఇట్లా అంటున్నాడు:

క. 'తెలియ విన నీవు సెప్పిన । పలుకులు దుర్యోధనుండు వడఁడు గదా? వై
రుల విక్రమమున సంజయ! । కల రూపెఱుఁగంగఁ జెప్పు క్రమ్మఱ నాకున్'. 12

ప్రతిపదార్థం: సంజయ!= సంజయా!; నీవు; చెప్పిన= ఇంతకుముందు వినిపించిన; పలుకులు= మాటలు; తెలియన్= మనస్సునకు స్పష్టమయ్యేటట్లు; వినన్= నేను వినలేదు; వైరుల= పగవారైన పాండవులయొక్క; విక్రమమునన్= పరాక్రమంవల్ల; దుర్యోధనుండు= నా జ్యేష్ఠకుమారుడయిన దుర్యోధనుడు; పడఁడుగదా!= పడిపోలేదు కదా!, మరణించలేదు కదా!; కలరూపు= ఉన్న స్వరూపం, యథార్థ విషయం; ఎఱుఁగంగన్= స్పష్టంగా తెలిసికొనేటట్లు; క్రమ్మఱన్= మరల; నాకున్= నాకు; చెప్పు= తెలియచేయుము.

తాత్పర్యం: 'సంజయా! నీ విదివరకు చెప్పినమాటలు దుఃఖం వలన స్పష్టంగా తెలిసేటట్లు వినలేదు. దుర్యోధనుడు శత్రువుల పరాక్రమంవలన నేల కొరగలేదు కదా! ఉన్నదున్నట్లు మళ్ళీ చెప్పుము'.

చ. అనుటయు నాతఁ డిట్లనియె 'నమ్మనుజేంద్రున కాజిఁ గర్ణుఁడుం
దనయులుఁ దమ్ములుం బడిరి దారుణ విక్రమకేలి సల్పి నె
ట్టన బలుపారఁ బట్టి వికటంబుగ వక్షము వ్రచ్చి దుస్ససే
నుని రుధిరంబు మారుత తనూజుఁడు ద్రావె మదం బెలర్పఁగన్'. 13

ప్రతిపదార్థం: అనుటయున్= ధృతరాష్ట్రుడట్లు పలుకగా; ఆతఁడు= సంజయుడు; ఆ మనుజ+ఇంద్రునకున్= ధృతరాష్ట్ర మహారాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; ఆజిన్= యుద్ధంలో; కర్ణుఁడున్= అంగరాజు; తనయులున్= కర్ణుని కుమారులూ; తమ్ములున్= కర్ణుని తమ్ములూ; పడిరి= నేల కొరగినారు; మారుతతనూజుఁడు= వాయుపుత్రుడు, భీమసేనుడు;

దారుణ= భయంకరమైన; విక్రమ= పరాక్రమం అనే; కేలి= క్రీడ; సల్పి= ఆచరించి; నెట్టన= సాహసించి; బలుపారన్= బలం ఒప్పగా; పట్టి= దుశ్శాసనుని పట్టుకొని; వికటంబుగన్= వికృతంగా, చూడటానికి అసహ్యంగా, భయంకరంగా; వక్షము= రొమ్ము; వ్రచ్చి= బ్రద్దలుచేసి; దుస్ససేనుని రుధిరంబున్= దుశ్శాసనుని రక్తాన్ని; మదంబు= గర్వం; ఎలర్పఁగన్= అతిశయింపగా; త్రావెన్= త్రాగినాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రమహారాజు అట్లా ప్రశ్నించేసరికి సంజయుడు ఆయనతో ఇట్లా చెప్పాడు: 'యుద్ధంలో పరాక్రమాన్ని ఒక క్రీడవలె ప్రదర్శించి కర్ణుడూ, అతడి కుమారులూ, తమ్ముళ్ళూ మరణించారు. మహాబలశాలి అయిన వాయుపుత్రుడు భీముడు ఒక పరాక్రమక్రీడ అన్నట్లుగా యుద్ధంచేసి, తనబలం అంతా ఉపయోగించి దుశ్శాసనుని పట్టుకొని, అతడి వక్షఃస్థలం బ్రద్దలు చేసి, తన బలగర్వం ప్రకటమయ్యేటట్లు అతడి రక్తం త్రాగాడు.

విశేషం: ఈ పద్యంలో దేహళీదత్తదీపన్యాయంగా తిక్కనగారు 'దారుణవిక్రమకేలి సల్పి' అన్నది ప్రయోగించటం విశేషం. ఇది సల్పినవారు కర్ణుడూ అతని తనయులూ తమ్ములూ అని చెప్పవచ్చును, భీమసేనుడనీ అన్వయించవచ్చు. ఇందులో మారుతాత్మజుడు అని భీముడిని పేర్కొనటం కూడా సార్థకం. బలశాలులలో బలిష్ఠుడు వాయువు. అతడి ఆత్మజుడు కనుక భీముడు దుశ్శాసనుడిని అట్లా చంపగలిగాడు అన్నది సాభిప్రాయం.

క. అనిన విని 'యంత కేమియు । నన కూరకయుండు సంజయా! నీ మాటల్
విననేరదు విభ్రాంతిని । మునిఁగినయది చిత్త' మని విమూఢాత్మకుఁడై. 14

ప్రతిపదార్థం: అనినన్= అని సంజయుడు చెప్పగా; విని= ధృతరాష్ట్రమహారాజు ఆలించి; సంజయా!= ఓ సంజయా!; అంతకున్= ఆ చెప్పిన దానికంటె అధికంగా; ఏమియున్= ఇతరమైన అశుభవార్త ఏదీ; అనక= చెప్పకుండా; ఊరక= మాటాడక; ఉండు= ఉండుము; చిత్తము= నా మనస్సు; విభ్రాంతిని= కలవరపాటులో; మునిగిన+అది= మునిగిపోయింది; నీ మాటల్= నీవికపైని చెప్పబోయే పలుకులు; వినన్= వినటానికి; నేరదు= శక్తి కలదికాదు; అని= అని పలికి; విమూఢ= కలవరపడిన; ఆత్మకుఁడు+ఐ= మనస్సు కలవాడై. (అనియెన్= అని - 15వ వచనంలోని క్రియతో అన్వయం)

తాత్పర్యం: సంజయుడు కర్ణదుశ్శాసనాదుల మరణ విషయం మళ్ళీ చెప్పేసరికి ధృతరాష్ట్రుడి మనస్సు పనిచేయటం మానేసింది. అందువలన ఆయన 'సంజయా! ఇంకేమీ చెప్పకుము. 'నా మనస్సు చాలా కలత చెందింది. అందువలన దానికి ఇక వినేశక్తి లేదు. కనుక మాటాడకుండా ఊరుకొమ్ము' అన్నాడు. అట్లా పలికి, కలత చెందిన మనస్సుతో.

వ. ధృతరాష్ట్రుండు మ్రానుపడి యుండి కొండొకసేపునకు సేదదేఱి యాసూతనందనున కిట్లనియె. 15

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రమహారాజు; మ్రానుపడి= కొయ్యబారి; ఉండి= ఉండిపోయి; కొండొకసేపునకున్= ఒక కొంత సమయానికి, సేదదేఱి= మ్రానుపాటునుంచి తెప్పరిల్లి; ఆ సూతనందనునకున్= ఆ సంజయునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ విధంగా పలికి ధృతరాష్ట్రమహారాజు కొయ్యబారిపోయాడు. అట్లా కొంతసేపు ఉండి, ఆ స్థితినుంచి తెప్పరిల్లి సంజయుడితో ఈ విధంగా పలికాడు.

క. 'నా దుర్ణయమునఁ జేసియు । నా దుర్యోధనుని బుద్ధిహాని వలననుం
గాదె? యిటులగుట మర్మ వి । భేదన మగు శోకమింత పెల్లయి యున్నే! 16

ప్రతిపదార్థం: ఇటులు= ఈ విధంగా; అగుట= పరిణమించటం; నా= నాయొక్క; దుర్ణయమునన్+చేసియున్= దుష్టమైన నీతివల్లనూ; ఆ దుర్యోధనుని= ఆ దుర్యోధనునియొక్క; బుద్ధిహానివలననున్= బుద్ధి క్షీణించటం వల్లనూ; కాదె?= కదా?; మర్మ= ఆయువు పట్టులను; విభేదనము+అగు= బ్రద్దలుచేసే; శోకము= వగపు; ఇంత= ఈ పరిమాణంలో; పెల్లు+అయి= అధికమై; ఉన్నే?= ఉండునా!.

తాత్పర్యం: 'నా దుర్నీతి వలననూ దుర్యోధనుడికి బుద్ధిలేనందువలనను కదా ఈ పరిణామం సంభవించింది! నా ఆయువు పట్టులను చీల్చే ఈ శోకం ఇంత అధికంగా ఉంటుందా!

వ. దుఃఖంబు నిస్తరింపనోపుదునొకో యని తలంచుచున్న నాదు సంశయంబు వాయ నింతకు మున్ను కయ్యంబునం గడచనిన మనవారిని వారి వారిని నేర్పడం జెప్పు' మనిన నతనికి సంజయుం డిట్లను; 'మనయందు భీష్మ ద్రోణ కర్ణ వికర్ణ వృషసేన దుశ్శాసన లక్ష్మణాదులును వారలలోన విరాట శతానీక ద్రుపద ఘటోత్కచాభిమన్యు పాండ్యప్రముఖులును బేరువేర నిట్టిట్టి వారిచేత నిట్టిట్టి వారు దెగి' రని యేర్పడ నెఱింగించిన, నమ్మహీపతి 'గురుసేన నింక నెవ్వరు గల'రని యడుగుటయు నతండశ్వత్థామ కృతవర్మ శల్య శకుని కృపాచార్యులం బేర్కొని బ్రదికియున్న కురుకుమారులను గర్ణు కొడుకులలో నున్నవారలను మఱియుంగల యోధులను జెప్పి వీరలంగొని యనికి నుత్సహించి పొనుఁగువడ్డ యగ్గి వేఁడిమి వోని వాఁడిమితో దుర్యోధనుండు ధైర్యంబవలంబించి జయార్థియై యున్నవాఁడనిన విని కొడుకుకడిమికి వెడవెడ యూఱడిల్లిన యుల్లంబునం దనవారు పెక్కండ్రు వొలిసిన యలమట మునింగి యొక్కింత ప్రొద్దూరకుండి రాధేయుదెగుట దలపోసి యమ్మనుజనాథుండు. 17

ప్రతిపదార్థం: దుఃఖంబు= బాధను; నిస్తరింపన్= దాటటానికి; ఓపుదున్+ఒకో?= సమర్థుణ్ణి కాగలనా?; అని= ఈవిధంగా; తలంచుచున్+ఉన్న= భావిస్తున్న; నాదు= నాయొక్క; సంశయంబు= సందేహం; పాయన్= తొలగిపోవటానికి; ఇంతకున్= ఇప్పటికి; మున్ను= పూర్వము; కయ్యంబునన్= యుద్ధంలో; కడచనిన= చనిపోయిన; మనవారినిన్= మన పక్షంలోనివారినీ; వారివారినిన్= పాండవుల పక్షంలోని వారినీ; ఏర్పడన్= స్పష్టం అయ్యేటట్లుగా; చెప్పుము; అనినన్= అని అడుగగా; అతనికిన్= ధృతరాష్ట్రునకు; సంజయుండు= సంజయుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా చెపుతున్నాడు; మన+అందున్= మనపక్షంవారిలో; భీష్మ ద్రోణ కర్ణ వికర్ణ వృషసేన దుశ్శాసన లక్ష్మణ+ఆదులును= భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, వికర్ణుడు, వృషసేనుడు, దుశ్శాసనుడు, లక్ష్మణుడు మొదలయిన వారూ; వారలలోనన్= పాండవుల పక్షంలో; విరాట శతానీక ద్రుపద ఘటోత్కచ+ అభిమన్యు పాండ్య ప్రముఖులును= విరాటుడూ, శతానీకుడు, ద్రుపదుడు, ఘటోత్కచుడు, అభిమన్యుడు, పాండ్యుడు మొదలయినవారూ; పేరు+పేరన్= పేరుపేరునా; ఇట్టి+ఇట్టి వారిచేతన్= ఇటువంటి ఇటువంటి వారివల్ల; ఇట్టి+ఇట్టివారు= ఇటువంటి ఇటువంటివారు; తెగిరి= మరణించారు; అని= ఈ విధంగా; ఏర్పడన్= స్పష్టం అయ్యేటట్లుగా; ఎఱింగించినన్= తెలియజేయగా; ఆ+మహీపతి= ఆ భూభర్త, ఆ రాజు ధృతరాష్ట్రుడు; కురుసేనన్= కౌరవసేనలో; ఇంకన్= మిగిలి; ఎవ్వరు= ఏ వీరులు; కలరు+అని= జీవించి ఉన్నారు అని; అడుగుటయున్= అడుగగా; అతండు= సంజయుడు; అశ్వత్థామ= ఆ పేరుగల ద్రోణపుత్రుడిని; కృతవర్మ= ఆ పేరుగల యాదవవీరుణ్ణి; శల్య= మద్రరాజునీ; శకుని= దుర్యోధనుని మేనమామనూ; కృపాచార్యులన్= ద్రోణుని బావమరది అయిన కృపాచార్యుణ్ణీ; పేర్కొని= చెప్పి; బ్రదికియున్న= జీవించి ఉండిన; కురుకుమారులను= కౌరవులను; కర్ణుకొడుకులన్= కర్ణుని కుమారులలో; ఉన్నవారలన్= జీవించి ఉన్నవారినీ; మఱియున్+ కల= వీరుకాక ఇంకా ఉన్న; యోధులను= యుద్ధవీరులనూ; చెప్పి= పేర్కొని; వీరలన్= ఈ మిగిలిన వీరుల్ని; కొని= వెంటబెట్టుకొని; దుర్యోధనుండు= దుర్యోధనుడు; అనికిన్= యుద్ధానికి; ఉత్సహించి= పూనుకొని; పొనుఁగు+పడ్డ= నివురుగప్పిన;

అగ్గి= నిప్పుయొక్క; వేఁడిమి+పోని= వెచ్చదనంవంటి; వాఁడిమితోన్= పరాక్రమంతో; ధైర్యంబు= కలతచెందని మనఃస్థితిని; అవలంబించి= ఆధారం చేసుకొని, పట్టుకొని; జయ+అర్థి+ఐ= జయంకోరువాడయి; ఉన్నవాఁడు= ఉన్నాడు; అనినన్= అని ఈ ప్రకారంగా చెప్పగా; ఆ+మనుజ నాథుండు= ఆ నరేశ్వరుడు (ఆ ధృతరాష్ట్రమహారాజు); విని= ఆలించి; కొడుకు= తన కుమారుడైన దుర్యోధనునియొక్క; కడిమికిన్= పూనికకు; వెడవెడ= కొంచెము కొంచెముగా; ఊఁడిల్లిన= కుదుటపడిన; ఉల్లంబునన్= మనస్సుతో; తనవారు= తన పక్షంవారు; పెక్కండ్రు+పొలిసిన= చాలామంది మరణించారన్న; అలమటన్= దుఃఖంలో; మునింగి= నిమగ్నుడై; ఒక్క+ఇంత= కొంచెము; ప్రొద్దు= సమయము; ఊరకుండి= మాటాడకుండా ఉండి; రాధేయు+తెగుట= కర్ణునియొక్క మరణం; తలపోసి= తలచుకొని.

తాత్పర్యం: ఈ దుఃఖం నేను వదలించుకొనగలనా? అని అనుకొంటున్నాను. ఉభయ పక్షాలలోనూ బ్రతికి ఉన్న వారెవరా పోయినవారెవరా అని సందేహంగా ఉన్నది. అది తొలగిపోయే విధంగా యుద్ధంలో ఇంతవరకు మనపక్షంలో ఎవరు పోయారో, పాండవుల పక్షంలో ఎవరు చనిపోయారో వివరంగా చెప్పుము' అని అడిగిన ధృతరాష్ట్రమహారాజుతో సంజయుడు ఇట్లా చెపుతున్నాడు. 'మన పక్షంలో భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, వికర్ణుడు, వృషసేనుడు, దుశ్శాసనుడు, లక్ష్మణుడు మొదలయిన వారు చనిపోయారు. పాండవపక్షంలో విరాటుడు, శతానీకుడు, ద్రుపదుడు, ఘటోత్కచుడు, అభిమన్యుడు, పాండ్యరాజు మొదలయినవారు నేలకొరిగారు. ఇట్లా ఇటువంటివారు ఇటువంటివారివలన ప్రాణాలు కోల్పోయారు' అని చెప్పాడు. అది విని ధృతరాష్ట్ర మహారాజు 'మనసైన్యంలో ఇంకా ఎవరు మిగిలి ఉన్నారు?' అని అడిగాడు. దానికి సంజయుడు ఇట్లా సమాధానం చెప్పాడు. అశ్వత్థామ, కృతవర్మ, శల్యుడు, శకుని, కృపాచార్యుడు బ్రదికి ఉన్నారని చెప్పాడు. ఇంకా జీవించి ఉన్న ధృతరాష్ట్రుని కుమారులపేర్లూ, కర్ణుని కొడుకులలో మిగిలినవారి పేర్లూ ఇంకా ఉన్న పోటరుల పేర్లూ చెప్పాడు. ఈ మిగిలినవారిని వెంటబెట్టుకొని యుద్ధం చేసి విజయం సాధించదలచుకొన్నాడు దుర్యోధనుడు అని చెప్పాడు. అయితే నివురుగప్పిన నిప్పు వేడి ఎలా ఉంటుందో దుర్యోధనుడి శౌర్యం ఇపుడలా ఉన్నదన్నాడు. అయినా అతడు ధైర్యంతో ఉన్నాడన్నాడు. అది వినేసరికి తన కుమారుడి ప్రయత్నంవల్ల ధృతరాష్ట్రుడికి అల్పాల్పంగా మనస్సులో ఊరట కలిగింది. అయినా తన పక్షం వాళ్ళు చాలామంది చనిపోయారే అని మళ్ళీ దుఃఖం ముంచుకొనివచ్చింది. అందువలన కొంచెంసేపు మాటాడలేదు. ఇంతలో అంతటి కర్ణుడు చనిపోవట మేమిటి అనిపించి ఇట్లా అన్నాడు:

తే. **'ఆలలోని యాఁబోతును బోలె నొప్పు। గురు బలంబులో నున్మదద్విరదమూర్తి**
సింహసంహననుండు నిస్సీమ విక్ర। మాభిరాముండు వోయెనే? యక్కటకట!' **18**

ప్రతిపదార్థం: ఆలలోని= ఆవుల మధ్యఉన్న; ఆఁబోతును+పోలెన్= వృషభంవలె; కురు, బలంబులోన్= కౌరవుల సైన్యంలో; ఒప్పు= అందగించే; ఉన్మద= మదించిన; ద్విరదమూర్తి= ఏనుగురూపంవంటి రూపం కలవాడు; సింహసంహననుండు= సింహంయొక్క మేను కలవాడు; నిస్సీమ= హద్దులేని; విక్రమ= పరాక్రమంచేత; అభిరాముఁడు= ప్రకాశించేవాడు (అయిన కర్ణుడు); పోయెన్+ఏ?= మరణించినాడా?; అక్కట+అకట!= అయ్యయ్యో!.

తాత్పర్యం: 'కర్ణుడి ఆకారం మదించిన ఏనుగువలె ఉండేది. అతడు సింహం లాంటి శరీరం కలవాడు. అతడి పరాక్రమానికి అంతులేదు. ఆలాంటి పరాక్రమంతో ప్రకాశిస్తూ అతడు కౌరవసైన్యంలో ఉంటే ఆవులమధ్య ఆబోతున్నట్లుండేది. అంతటివాడు పడిపోయాడా? అయ్యయ్యో!'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని తొడంగి హాహాకారంబు లెసంగ రోదనంబు సేయుచు. 19

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; తొడంగి= పూనుకొని; హాహాకారంబులు= అయ్యో అయ్యో అనే ధ్వనులు; ఎసంగన్= ఎక్కువ అయ్యేటట్లుగా; రోదనంబు+చేయుచున్= శోకిస్తూ. ("ఉగ్గడించినన్" అనే 24వ వచనంలోని దానితో అన్వయం)

తాత్పర్యం: ఈవిధంగా ధృతరాష్ట్ర మహారాజు అయ్యో అయ్యో అని శోకిస్తూ (సంజయుడితో ఇట్లా అన్నాడు.)

క. 'సంజయ! మురభంజనుని ధ । నంజయునిం జీరికింగొనఁడు కర్ణుం డిం
ద్రుం జెనకియైన గెలుతు న । నుం జచ్చెనె? యట్టివాఁడునుం గయ్యమునన్. 20

ప్రతిపదార్థం: సంజయ!= ఓ సంజయా!; కర్ణుఁడు= అంగరాజు; మురభంజనునిన్= శ్రీకృష్ణుడినీ; ధనంజయునిన్= అర్జునునీ; చీరికిన్+కొనఁడు= లేశమైన లక్ష్యపెట్టడు; ఇంద్రున్= దేవేంద్రుని; చెనకి+ఐనన్= ఎదిరించి కూడా; గెలుతున్= జయింతును; అనున్= అని పలికేవాడు; అట్టివాఁడునున్= అటువంటివాడు కూడా; కయ్యమునన్= యుద్ధంలో; చచ్చెన్+ఎ?= మరణించినాడా?

తాత్పర్యం: 'సంజయా! కర్ణుడు కృష్ణుడినీ, అర్జునుడినీ కొంచెమైనా లెక్కజేసేవాడు కాడు. దేవేంద్రుడిని కూడా ఎదిరించి గెలుస్తాననేవాడు. అటువంటివాడు కూడా యుద్ధంలో మరణించాడా?

విశేషం: ఇందులో తిక్కనగారు కృష్ణుడికి పర్యాయంగా 'మురభంజనుని' అని ప్రయోగించారు. మురాసురుడు నరకాసురుడి సేనానాయకుడు. నరకుడు వరుసగా గిరి-శస్త్ర-జల-అగ్ని-అనిల దుర్గాల నడుమ ఉన్నాడు. వీటినన్నిటినీ దాటినా మురాసురుడు పదివేల పాశాలతో ఏర్పరచిన జాలములున్నాయి. ఈ చివరి దుర్గం దాటడం కష్టం. దీనిని ఖడ్గంతో ఛేదించాడు కృష్ణుడు. ఈ అసురుడికి ఐదు తలలు. నీళ్ళలో నిద్రిస్తున్నాడు. కృష్ణుడు శంఖధ్వనికి లేచాడు. యుద్ధంలో అతడిని సంహరించి మురభంజనుడైనాడు కృష్ణుడు. అట్టివాడిని సంహరించిన వాడి నీతి లెక్కపెట్టడని సారస్యం. అట్టిదే అర్జున పర్యాయం 'ధనంజయుని' అన్నది. 'ధరణి యెల్ల గెల్చి తగ ధనంబులు గొనియున్కి నే ధనంజయుండ నైతి' నని అర్జునుడే ఉత్తరగోగ్రహణంలో చెప్పాడు ఉత్తరుడితో. అట్టి విశ్వవిజేతను గూడా లెక్కచేయడు అని సారస్యం. ఇంద్రుడిని ఎదిరించి గెలుస్తాననటంలో విశేషం ఉన్నది. ఊరకున్నవాడిని రెచ్చగొడితే సహజపరాక్రమానికి, ఈ రెచ్చగొట్టటం దోహదమై మరీ విజృంభిస్తాడు. అందులోనూ మహైశ్వర్యశాలి త్రిలోకాధిపతి ఇంద్రుడు. యమాదులు అతడి సహాయకులు. అతడిని ఎదిరించి అయినా గెలుస్తాననటం మరీ పగ్గె. 'కయ్యమునన్' అన్నది కూడా సవిశేషమే. ఎంతటివాడైనా ఏ దొంగచాటు దెబ్బవలననో అయితే మరణించటం సంభవం కాని, సరాసరి ముఖాముఖి జరిగిన యుద్ధంలో మరణించాడా అని వింత. 'చచ్చెనె అట్టివాఁడునున్' అనటంకూడా ధృతరాష్ట్రుడి మనఃస్థితికి సూచకమే. ఇతరుల ఆలోచనవలన ఎవరికైనా కలిసివచ్చినంతకాలం వాళ్ళు మెప్పులందుకొంటారు. ఒకడిమీద ఆశపెట్టుకొని, అదీ అతడు చెప్పిన మాటలమీద ఆశపెట్టుకొని, అది అడియాస అయితే, అందువలన సర్వనాశమయితే కలిగే ఆశ్చర్యం అంతా ఇంతా కాదు. అట్టి వాడూ చచ్చాడా? అనటం ధృతరాష్ట్రుడి మనఃస్థితిని తెలియజేస్తుంది.

ధృతరాష్ట్రుఁడు గర్ణు మరణంబు విని పలవించుట (సం. 8-5-10)

సీ. పాండుసూనులతోడి పగకోర్చె నెవ్వని । యుత్సాహమూఁది సుయోధనుండు
వైదేహపౌండ్రాదివసుధేశు లెవ్వని । కడిమి సొంపున నరిగాఁపులైరి
మనమూఁక లెవ్వని పెనుఁ బ్రాపుగాంచి గ । ర్వితములై సంగరక్రీడ సలుపు
నద్భుతం బొనరించు నమరుల కెవ్వని । యసమాన వివిధ దివ్యాస్త్ర మహిమ

ఆ. యట్టి కర్ణుఁ డీల్గెనట్టె! యింకెక్కడి । బ్రదుకు మనకు నేటి భండనంబు?
దీని వినియు నాదు మానసం బేమియుఁ । గాదు వజ్రమయము గాఁగనోపు. 21

ప్రతిపదార్థం: సుయోధనుండు= దుర్యోధనుడు; ఏ+వాని= ఎవనియొక్క; ఉత్సాహము= పూనిక; ఊఁది= అవలంబముగా చేసికొని; పాండుసూనులతోడి= పాండవులతో; పగకున్= విరోధానికి; ఓర్చెన్= సమకట్టినాడో, సిద్ధపడినాడో; వైదేహ= విదేహ దేశపురాజు; పౌండ్ర= పుండ్రదేశాధిపతి; ఆది= మొదలయిన; వసుధా+ఈశులు= భూపతులు; ఎవ్వని= ఎవ్వనియొక్క; కడిమి= పూనికయొక్క; సొంపునన్= అందముచే; అరి+కాఁపులు+ఐరి= కప్పంకట్టేవారైనారో; మన= కౌరవులయొక్క; మూఁకలు= సైన్యాలు; ఎవ్వని= ఎవ్వనియొక్క; పెను= పెద్ద, గొప్ప; ప్రాపు= అండ; కాంచి= చూచుకొని; గర్వితములై= గర్వపడినవై; సంగరక్రీడ= యుద్ధమనే ఆట; సలుపున్= చేయునో, ఆడునో; ఎవ్వని= ఎవ్వనియొక్క; అసమాన= సాటిలేని; వివిధ= రకరకాలైన; దివ్య= స్వర్గలోకంలో పుట్టిన; అస్త్ర= మంత్రప్రయుక్తాలైన ఆయుధాలయొక్క; మహిమ= ప్రభావం; అమరులకున్= దేవతలకు కూడా; అద్భుతంబు= ఆశ్చర్యం; ఒనరించున్= కలిగించునో; అట్టి= అటువంటి (ఇదివరకు చెప్పిన గుణవిశేషాలు కలిగిన); కర్ణుడు; ఈల్గెన్+అట్టె!= మరణించినాడట, ఎంత ఆశ్చర్యం!; ఇంకన్= ఇట్టి కర్ణుని మరణం తరువాత కూడా; మనకు; ఎక్కడి బ్రతుకు= బ్రతుకెక్కడ?; ఏటి= ఎక్కడి; భండనంబు?= యుద్ధం?; దీనిన్= ఈ కర్ణుని మరణాన్ని; వినియున్= వినిన తరువాతకూడా; నాదు= నాయొక్క; మానసంబు= హృదయం; ఏమియున్= ముక్కలూ, చెక్కలూ, చీలికలూ, చంచలమూ కూడా; కాదు= కాకుండా ఉన్నది; (ఇది) వజ్రమయము= (దేనిచేతనూ బ్రద్దలుకాని) వజ్రాలతో నిర్మించినది; కాఁగన్+ఓపున్= అయి ఉంటుంది.

తాత్పర్యం: కర్ణుడు సామాన్యుడు కాడు. సుయోధనుడిని సంతోషపెట్టాలనే అతడి పూనికమీదా, పాండవులను జయించాలనే అతడి అభిలాషమీదా ఆధారపడి దుర్యోధనుడు పాండవులంతటివారితో పగపెట్టుకొనటానికి సిద్ధపడ్డాడు. కర్ణుడి ప్రయత్నంవలన విదేహ దేశాధిపతి, పుండ్రదేశ ప్రభువు మొదలయిన రాజులు దుర్యోధనుడికి కప్పం కట్టుతున్నారు. కర్ణుడి అండచూచికొని కౌరవసేనలు ఆటాడినట్లు యుద్ధం చేస్తున్నాయి. కర్ణుడివద్ద ఉన్న దివ్యాస్త్రాలకు సాటి లేదు. అవి చాలా రకాలుగా ఉన్నాయి. వాటి ప్రభావం దేవతలకు కూడా ఆశ్చర్యం కొలుపుతుంది. అటువంటి కర్ణుడే మరణించాడంటే ఇంక మనకు బ్రతుకెక్కడ? మన మీ యుద్ధంలో జయించము. ఇంత నిరాశ, ఇంత దుఃఖమూ కలిగించే ఈ వార్త విన్న తరువాత కూడా నా మనస్సు అట్లాగే ఉన్నది, బ్రద్దలు కాలేదు, చీలి పోలేదు, స్తిమితం తప్పలేదు. దీనినిబట్టి ఇది రక్తమాంసాలతోకాక, దేనితోనూ బ్రద్దలుకాని వజ్రాలతో నిర్మించబడినదేమో అనిపిస్తున్నది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. 'పాండుసూనులు' అనటంలో పాండురాజే దిగ్విజయం చేసినవాడు. అతడి కుమారులు దేవాంశసంభూతులు కూడాను. అట్టివారితో పగ సామాన్యం కాదు అని చెప్పటం. 'మన మూఁకలు' అనటంలో కర్ణుడు లేని కౌరవసైన్యాలు వట్టి గుంపులు, వ్యర్థులు అనే నిరాశవలన కలిగిన తేలికబుద్ధి తెలుస్తున్నది. కర్ణుడి అస్త్రాలు స్వర్గంలో పుట్టాయి. దేవతలు స్వర్గంలో ఉంటారు. వారు అమరులు. మరణంలేనివారు. వీటి ప్రభావం వారికే ఆశ్చర్యం కలిగించేదంటే అవి సాటిలేనివి. అదీకాక, దేవతలవద్ద ఒకొక్కరి వద్ద ఒక్కొక్క దివ్యాస్త్రం ఉంటుంది. కర్ణుడివద్ద అనేకాలున్నాయి. కనుక అద్భుతం.

వ. అని విలాపించి మఱియును. 22

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; విలాపించి= శోకించి; మఱియును= ఇంకా.

తాత్పర్యం: ఈ రీతిగా శోకించి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. పొరి బంధు పుత్త్ర మిత్త్రుల । పరిభవములు వించునిట్లు ప్రాణముతో నె
వ్వరు నుండుదురే? యే నొ । క్కరుఁడును దక్కంగ నింత కష్టం బగునే?' 23

ప్రతిపదార్థం: పొరిన్= క్రమంగా; బంధు= చుట్టాలయొక్క; పుత్త్ర= కుమారులయొక్క; మిత్త్రుల= స్నేహితులయొక్క; పరిభవములు= పరాభవాలు, నాశనాలు; వించున్= వింటూ; ఏను= నేను; ఒక్కరుండును= ఒక్కణ్ణీ; తక్కంగన్= తప్ప; ఎవ్వరున్= ఎవరైనా; ఇట్లు= ఈ విధంగా; ప్రాణముతోన్= ప్రాణాలతో; ఉండుదురే?= ఉంటారా?; ఇంత= ఇంత ఎక్కువ పరిమాణంకల; కష్టంబు= బాధ; అగునే?= (ఎవరికైనా) కలుగుతుందా?

తాత్పర్యం: వరుసగా చుట్టాలూ, కొడుకులూ, మిత్రులూ చనిపోయారనీ, ఓడిపోయి అవమానం పాలయ్యారనీ వింటూ, నేను తప్ప మరొకరెవరైనా ఇట్లా ప్రాణాలతో ఉండగలరా? ఇంతకష్టం అసలు ఎవరికయినా సంభవిస్తుందా?'

వ. అని పలికి మరణోద్యుక్తుండై జలాగ్ని విషప్రాయోపవేశాదు లుగ్గడించిన విని సంజయుం డతని కిట్లనియె. 24

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికి= మాటాడి; మరణ= మరణించటానికి; ఉద్యుక్తుండై= సంసిద్ధుడై; జల= నీటిలో దూకటం; అగ్ని= నిప్పంటించుకొనటం; విష= విషం మ్రింగటం; ప్రాయోపవేశ= మరణంకోసం ఉపవసిస్తూ కూర్చోవటం; ఆదులు= మొదలయినవి; ఉగ్గడించినన్= పలుకగా; విని= ఆలకించి; సంజయుండు= సంజయుడు; అతనికిన్= ధృతరాష్ట్ర మహారాజుతో; ఇట్లు= ఈ(చెప్పబోయే) విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఇట్లా పలికి ధృతరాష్ట్ర మహారాజు ప్రాణాలు విడిచిపెట్టటానికి సిద్ధపడ్డాడు. 'నీళ్ళలో దూకుతాను లేదా నిప్పంటించుకొంటాను, లేదా విషం మింగుతాను, లేదా ప్రాణాలు పోయేవరకూ తిండి మాని కూర్చుంటాను' మొదలయిన మాటలన్నాడు. సంజయుడు ఆ మాటలన్నీ విని ఆ మహారాజుతో ఇట్లా అన్నాడు:

చ. 'కులమును శ్రీయుఁ దేజము నకుంఠితకీర్తియుఁ జూడఁ దొంటి రా
జులకెనవత్తు నీ విటులు శోక సమాకుల చిత్తవృత్తిమైఁ
గలఁగుట యొప్పునే? శ్రుతము గౌరవముం బొగ డొందునట్లుగా
నిలువుము ధీరతాతిశయ నిష్ఠఁ జలింపక యుండు భూవరా!' 25

ప్రతిపదార్థం: భూవరా!= భూమిపతీ, రాజా!; (నీకున్న) కులమును= కులమును; శ్రీయున్= ధనమూ; సంపదా, రాజ్యసంపదా, ఉన్నతస్థితీ, గొప్పదనమూ; తేజమున్= తేజస్సూ; అకుంఠిత= మొక్కవోని; కీర్తియున్= బలాదుల వల్ల వచ్చిన పేరూ; చూడన్= చూడగా; నీవు= నీవు; తొంటి= పూర్వపు; రాజులకున్= భూపతులకు; ఎనవత్తు(వు)= సాటిరాగలవు; నీవు= ఇట్టి నీవు; ఇటులున్= ఈ విధంగా; శోక= వగపు వల్ల; సమాకుల= పూర్తిగా కలతచెందిన; చిత్త= మనస్సుయొక్క; వృత్తిమైన్= చేష్టచేత; కలఁగుట= కలతపాలు కావటం; ఒప్పున్+ఏ?= తగునా?; శ్రుతము= విద్యా; గౌరవమున్= గొప్పదనమూ, మన్ననా; పొగడు+ ఒందు+అట్లుగాన్= ప్రశంసపొందే విధంగా; నిలువుము= నిలబడుము; ధీరతా= ధైర్యంయొక్క; అతిశయ= ఎక్కువయొక్క; నిష్ఠన్= ఉనికితో; చలింపక= నిలకడతో; ఉండు= ప్రవర్తించు.

తాత్పర్యం: 'రాజా! నీకున్న వంశమూ, సిరిసంపదలూ, తేజస్సూ, ఎదురులేని పేరుప్రతిష్ఠలూ చూస్తే నీవు పూర్వరాజులతో సరితూగగలవు. ఇటువంటి నీవు ఇట్లా దుఃఖపడి మనస్సు కలవరపరచుకొనటం తగదు. నీ చదువూ నీ గొప్పదనమూ నీకు గల మన్ననా నలుగురు మెచ్చుకొనేటట్లు నిలబడుము. నీ మహాధైర్యం చలించకుండా ఉండుము.'

వ. అనుటయు నాంబికేయుండు సంజయున కిట్లనియె. 26

ప్రతిపదార్థం: అనుటయున్= (సంజయుడు అట్లా) పలికిన తరువాత; ఆంబికేయుండు= అంబికా కుమారుడయిన ధృతరాష్ట్రుడు; సంజయునకున్= సంజయునితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: సంజయు డా విధంగా పలికిన తరువాత ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు:

తే. 'శోకవారిధిపారంబు నాకుఁ బొంద, । నేల వచ్చుఁ? జిత్తంబునఁ గీలుకొని య
సహ్యమై కర్ణ మరణోపజనితమైన । పరిభవం బను శల్య మాతురతఁ జేయ. 27

ప్రతిపదార్థం: కర్ణ= కర్ణునియొక్క; మరణ= మరణించటంచేత; ఉపజనితము+ఐన= సంభవించిన; పరిభవంబు= పరాభవం, నాశనం, ఓటమి; అను= అనే; శల్యము= బాణం; చిత్తంబునన్= మనస్సులో; కీలుకొని= నాటుకొని; అసహ్యము+ఐ= భరింపరానిదై; ఆతురతన్+చేయన్= పీడ కలిగిస్తుండగా; నాకున్= నాకు; శోక= వగపు అనే; వారిధి= సముద్రంయొక్క; పారంబు= అవతలిగట్టు; పొందన్= పొందుట; ఏలవచ్చున్= ఎట్లా సాధ్యమౌతుంది.

తాత్పర్యం: కర్ణుడి మరణం వలన సర్వనాశనమైపోయింది. ఓడిపోయాము అనే భావం ఒక బాణంవలె నా గుండెలో దిగి ఉండి భరించరాని బాధ కలిగిస్తున్నది. దీనివలన వస్తున్న శోకం ఒక సముద్రంవలె ఉన్నది. ఇట్టి పరిస్థితిలో ఈ శోకం అనే సముద్రాన్ని దాటటం నాకు ఎట్లా సాధ్యమౌతుంది?

క. పౌరుష మేటికి దైవం । బేరూపునఁ జూడ ఫలద మే మందము దో
స్సార నితాంతోజ్జ్వలుఁ డగు । నారాధేయుండు సచ్చె నర్జునుచేతన్. 28

ప్రతిపదార్థం: పౌరుషము= మానవ (జీవుడి) ప్రయత్నం; ఏటికి?= ఎందుకు?; దైవంబు= విధి; ఏరూపునన్= ఏ విధంగా; చూడన్= చూచినా; ఫలదము= ఫలం ఇచ్చేది; దోస్సార= బాహువులయొక్క బలంచేత; నితాంత= ఎల్లప్పుడు; ఉజ్జ్వలుఁడు+అగు= ప్రకాశించేవాడైన; ఆ రాధేయుండు= అంతటి కర్ణుడు; అర్జునుచేతన్= (అంతటివాడుకాని) అర్జునుని చేతిలో; చచ్చెన్= మరణించాడు; ఏమి+అందము= ఏమి చెప్పగలము?

తాత్పర్యం: జీవుడు చేసే ప్రయత్నం నిష్ప్రయోజనం. ఎట్లా ఆలోచించినప్పటికి చేసిన కర్మకు ఫలం ఇచ్చేది విధియే. నిరంతరం బాహుబలంతో ప్రకాశిస్తూ ఉండే అంతటి కర్ణుడు అర్జునుడి చేతిలో చనిపోయాడు. విధియే ఫలాన్నిస్తుందని అనక ఇంక ఏమి అనగలము?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. అలఘుతరాయువు నాకుం । గల దది యెట్లనినఁ బోరఁ గర్ణుని పా టేఁ
దెలియవినఁగ నా డెందము । పలువఁటియలు గాక యున్న భంగి నెఱిఁగితిన్. 29

ప్రతిపదార్థం: నాకున్= నాకు; అలఘుతర+ఆయువు= మిక్కిలి పెద్దదైన ఆయుస్సు; కలదు= ఉన్నది; అది= ఆ విషయం; ఎట్లు= ఏ విధంగా తెలిసినది; అనినన్= అనగా, అంటే; పోరన్= యుద్ధంలో; కర్ణునిపాటు= కర్ణునియొక్క పడిపోవటం; ఏన్= నేను; తెలియన్= స్పష్టంగా తెలిసేటట్లు; వినఁగన్= వినియుండినప్పటికీ; నా డెందము= నా హృదయం; పలు= అనేకమయిన; పఁటియలు= ముక్కలు; కాక= అయిపోవక; ఉన్న= ఉండిన; భంగిన్= పద్ధతిచేత; ఎఱిఁగితిన్= తెలిసికొన్నాను.

తాత్పర్యం: నాకు చాలా దీర్ఘాయువున్నది. అది ఎట్లా చెప్పగలనంటే, కర్ణుడు యుద్ధంలో మరణించాడు అనే మాట స్పష్టంగా విన్న తరువాత కూడా నా హృదయం ఎన్నో ముక్కలై పోకుండా ఉన్నందువల్ల నాకు చాలా ఆయువున్నదని తెలిసికొన్నాను.

క. మును లోకముచే సత్కృతి । గని నెగడెడు వాఁడ నాకుఁ గలవారెల్లం
జన శోచ్యుఁడ నై దుర్దశ । నునికి మనికి యగునె? దీని కోర్వఁగ వశమే? 30

ప్రతిపదార్థం: మును= పూర్వం, ఇదివరకు; లోకముచేన్= జనంచేత; సత్కృతి= సత్కారం; కని= పొంది; నెగడెడువాఁడన్= ఒప్పి ఉండేవాణ్ణి; నాకున్= అట్టినాకు; కలవారెల్లన్= ఉన్నవారందరు; చనన్= మరణించగా; శోచ్యుడను+ఐ= శోకింపదగినవాడనై; జాలిపడదగినవాడనై; దుర్దశన్= కష్టదశయందు; ఉనికి= ఉండటం; మనికి= జీవించటం; అగున్+ఎ= తగునా?; దీనికిన్= ఇట్టి స్థితిని; ఓర్వఁగన్= సహించటం; వశమే?= శక్యమా?

తాత్పర్యం: ఒకప్పుడు నన్ను లోకం గౌరవించేది. ఇప్పుడు నా బంధుమిత్రాదులందరూ మరణించారు. అందరూ నన్ను చూచి అయ్యో అని జాలిపడదగిన స్థితికి వచ్చాను. ఇట్టి స్థితిలో బ్రతకటమూ ఒక బ్రతుకా? ఇట్టి స్థితిని భరించగలనా?

సీ. దుఃఖ పరంపర ద్రొక్కునఁ బెట్టె నా । చిత్తంబు ననిమిషసింధు తనయు
పడుటయు ద్రోణుండు పరలోకమున కేఁగు । టయు సూతజుని తెగుటయును వినియు
నందుఁ గర్ణుఁడు లేమి యత్యంత దుఃఖంబు । సేసె దుర్యోధను నాస మానె
నతఁ డేడుగడయును నైయుండు నతనికి । నెవ్వరు గలరు దిక్కింకఁ జెపుమ

ఆ. మన బలంబుచేవయును వైరిసైన్యంబు । భయముఁ జెడఁగ రాధపట్టి గొంతి
పట్టిచేత సమసి పడియున్న వాఁడె? వా । సవుని కడిమిఁ బడిన జంభునట్లు. 31

ప్రతిపదార్థం: దుఃఖపరంపర= దుఃఖాల వరుస; నా చిత్తంబున్= నా మనస్సును; త్రొక్కునన్= ఒత్తిడిలో, బాధలో; పెట్టెన్= ఉంచినది; అనిమిషసింధు= దేవనది అయిన గంగానదియొక్క; తనయు= కుమారుడైన భీష్మునియొక్క; పడుటయున్= పడిపోవటమూ, మరణించనుండటమూ; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; పరలోకమునకున్+ఏఁగుటయున్= పై లోకానికి పోవటము(మరణించటమూ); సూతజుని= సూతపుత్రుడైన కర్ణునియొక్క; తెగుటయును= మరణించటమూ; వినియున్= వినికూడా; అందున్= ఆ ముగ్గురి పడిపోవటాలలోనూ, లేదా దుఃఖపరంపరలోనూ; కర్ణుడులేమి= అంగరాజు లేకపోవటం; అత్యంత= మిక్కిలి; దుఃఖంబు+చేసెన్= దుఃఖాన్ని కలిగించింది; దుర్యోధను+ఆస= దుర్యోధనునియొక్క విజయాశ, లేదా

దుర్యోధనుడు బ్రతికి ఉంటాడనే ఆశ; మానెన్= విడిచిపోయింది; అతఁడు= కర్ణుడు; అతనికిన్= దుర్యోధనునికి; ఏడుగడయునున్+ ఐ= రక్షకుడై; ఉండున్= ఉండేవాడు; ఇంకన్= ఇకముందు; దిక్కు= రక్షకులు; ఎవ్వరు= ఎవరు; కలరు?= ఉన్నారు?; చెపుము+అ= తెలియజేయి; వాసవుని కడిమిన్= ఇంద్రుని పూనికవల్ల; పడిన= మరణించిన; జంభుని+అట్లు= జంభాసురునివలె; రాధపట్టి= రాధకుమారుడు, కర్ణుడు; గొంతిపట్టి చేతన్= కుంతీపుత్రుడయిన అర్జునుని చేత; మనబలంబు= మనసైన్యంయొక్క; చేవయును= బలమూ; వైరిసైన్యంబు= శత్రుసైన్యంయొక్క; భయమున్= జడుపూ; చెడఁగన్= నశించిపోయేటట్లు; సమసి= మరణించి; పడి+ఉన్నవాడు+ఎ= పడిపోయి ఉన్నాడా?

తాత్పర్యం: ఒక దుఃఖం తరువాత మరొక దుఃఖం వచ్చిపడుతున్నందువలన నా మనస్సు ఒత్తిడికి గురి అయింది. భీష్ముడు పడిపోవటమూ, ద్రోణుడు చనిపోవటమూ, కర్ణుడు కూలిపోవటమూ దుఃఖం కలిగించాయి. ఈ మూడింటిలో కూడా కర్ణుడు లేకుండాపోవటం మరీ దుఃఖం కలిగించింది. దీనివలన దుర్యోధనుడికి తాను గెలుస్తాననే ఆశ పోయింది. నాకు దుర్యోధనుడు బ్రతికి ఉంటాడనే ఆశ పోయింది. ఎందుకంటే దుర్యోధనుడికి రక్షణ సమస్తమూ కర్ణుడేకదా. ఇంక కాపాడే వా రెవరున్నారు చెప్పుము? ఎవ్వరూ లేరు. జంభాసురుడు ఇంద్రుడిచేతిలో మరణించినట్లు అర్జునుడి చేతిలో కర్ణుడు మరణించాడా? మనసైన్యానికి ధైర్యమూ, శత్రుసైన్యానికి భయమూ పోయేటట్లు చచ్చిపడి ఉన్నడా?

విశేషం: అలం: ఉపమ. 'అనిమిషసింధుతనయుడు' అని భీష్ముడిని అనటంలో గంగాపుత్రునంతటి వాడని భీష్ముడి అజేయత్వం సూచితం. ద్రోణుఁడు అనటం కూడా అట్టిదే, ద్రోణంలో పుట్టటం అంటే అద్భుతమైన పుట్టుక కలవాడు పోవటమేమిటి అని. అందుకు 'కర్ణుడిలేమి అత్యంత దుఃఖంబుసేసె' అనటంలో భీష్మద్రోణులు చేయలేని పని కర్ణుడు చేస్తాడని ధృతరాష్ట్రుడు కూడా ఎంత ఆశపెట్టుకొన్నాడో, అది ఎంత అజ్ఞానజన్యమో తెలియజేస్తుంది.

క. 'విను పిచ్చుకకుం టతిరయ । మునఁ బోకకుఁ బడుట, పేదముదుకఁడు వేశ్యా
జనముం గోరుట దుర్యో । ధనుఁడింక జయంబు గొనఁగఁ దలఁచుట యరయన్. 32

ప్రతిపదార్థం: విను= ఆలించు; ఇంకన్= కర్ణుడు పడిపోయిన తరువాత కూడా; దుర్యోధనుఁడు; జయంబు= గెలుపు; కొనఁగన్= పొందటానికి; తలఁచుట= భావించటం; అరయన్= ఆలోచింపగా; పిచ్చుకకుంటు= కాళ్ళులేనివాడు; అతిరయమునన్= మిక్కిలివేగంతో; పోకకున్+పడుట= నడవటానికి ప్రయత్నించటం వంటిది; పేదముదుకఁడు= బీదవాడయిన వృద్ధుడు; వేశ్యాజనమున్+కోరుట= వెలకాంతలను వాంఛించటం వంటిది.

తాత్పర్యం: దుర్యోధనుడు కర్ణుడు చనిపోయిన తరువాత, ఇంకా యుద్ధంలో గెలుస్తాననుకోవటం, కుంటివాడు వడి వడిగా నడవటానికి ప్రయత్నించటం వంటిది. దరిద్రుడూ వృద్ధుడూ అయినవాడు వేశ్యలు కావాలనుకొనటం వంటిది. (నిష్ప్రయోజన మన్నమాట.)

విశేషం: అలం: నిదర్శన. పేదముదుకఁడు అనటం చాలా అర్థవంతం. వేశ్యాజనం సొమ్మిస్తేనే కాని లభించరు. వీడు పేదవాడు. పోనీ ఎంత డబ్బుమనిషికైనా వలపు ఉండవచ్చుగదా అంటే ఇతడు వృద్ధుడు కూడా. పడుచుకు వృద్ధుడిమీద వలపు అరుదు. అదీకాక, వృద్ధుడికి మాత్రం వనితవలన ప్రయోజనమేమిటి? ఎటుచూచినా ఇది వ్యర్థమైన ఆశ. మరొక విశేషం. ఈ దరిద్రవృద్ధుడు కోరుకొనేది ఒక వేశ్యను కాదు వేశ్యాజనాన్ని. ఒక్కతె కూడా అలభ్యా, అనవసరమూ అయితే జనం కావాలనుకొనటం ఇంకా వెర్రి.

క. మనలోఁ గయ్యం బేటికి । నని ధర్మసుతుండు సెప్పె నది మీ పతి గై
కొనఁ డయ్యె రోగి పథ్యా । శనమునకుం జొరని భంగి సంజయ! యెట్లున్. 33

ప్రతిపదార్థం: సంజయ!= ఓ సంజయా!; మనలోన్= అన్నదమ్ములమై కౌరవ పాండవుల మధ్య; కయ్యంబు+ఏటికిన్= యుద్ధం ఎందుకు?; అని; ధర్మసుతుండు= యుధిష్ఠిరుడు; చెప్పెన్= తెలిపినాడు; రోగి= తెగులుగొంటు; పథ్య+అశనమునకున్= మేలుకలిగించే అన్నానికి; చొరని భంగిన్= అంగీకరింపని రీతిగా; అది= ఆ యుధిష్ఠిరుని మాటలను; మీ పతి= మీ రాజయిన దుర్యోధనుడు; ఎట్లున్= ఏ విధముగానూ; కైకొనఁడు+అయ్యెన్= అంగీకరించాడు కాడు.

తాత్పర్యం: 'మీరూ మేమూ అన్నదమ్ముల బిడ్డలము, అన్నాదమ్ములము. మనలో మనకు కలహం ఎందుకు?' అని యుధిష్ఠిరుడు చెప్పాడు. జబ్బు చేసినవాడికి పథ్యం సయించదు. అట్లాగే ఆ మంచిమాట దుర్యోధనుడికి సమ్మతం కాలేదు.

విశేషం: అలం: ఉపమ. ధర్మసుతుడు అనగా ధర్మదేవత అయిన యముడి అంశవలన పుట్టిన యుధిష్ఠిరుడు. అతడు ధర్మమే చెపుతాడు. అతడు చెప్పినది మేలుచేస్తుంది అని సాభిప్రాయం. 'మీ పతి కైకొనఁడు'- ఇది తెలుగు వారి మాటతీరు పుణికి పుచ్చుకొన్న ప్రయోగం. ఒకడు ఇద్దరికీ సంబంధించిన వాడైనపుడు, మంచి చేస్తే మనవాడు, చెడుచేస్తే మీ వాడు అని పలకటం సహజం. దుర్యోధనుడు సంజయుడి కంటె ధృతరాష్ట్రుడికే కొడుకుగా దగ్గరవాడు. కాని, యుధిష్ఠిరుడి మాట వినక చెడిపోతున్నాడు. కనుక, మీ రాజుకు అంగీకారం కాలేదు అనటం. రోగితో అతనిని పోల్చటం చాలా మనోహరం. తినగూడనిది తినటమూ, తినవలసినది తినకపోవటమూ రోగానికి కారణం. ఆ రోగం పోవాలంటే మళ్ళీ మేలుచేసే ఆహారమే తినాలి. కాని, రోగికి అది సయించదు. రోగాన్ని పెంచే అపథ్యాహారమే అప్పుడూ తింటాడు. చివరికి ఆ రోగంవలన మరణిస్తాడు. దుర్యోధనుడు వినగూడని మాటలు విని పాడైపోయాడు. మేలుచేసే మాట వినలేదు.

సీ. శరతల్పమున నుండి శాంతనవుండు బీ । భత్సు దివ్యాస్త్ర వైభవము దెలుపఁ
దివిరి జలంబట్లు దెప్పించుకొని యప్డు । పాండుసూనులతోడి బాంధవంబు
నడపుము సిరి పంచి కుడుచుట మే లింత । తోఁ గయ్యముడిగి శాంతుఁడవు గమ్ము
బ్రదుకుము నీవన్న పనుపుసేయఁడు సుయో । ధనుఁ డిప్డు శోకాబ్ధి మునుఁగకున్నె?

ఆ. పడుచు లీఁక లూడ్చి పట్టి యాడెడు నట్టి । పులుఁగు చందమయ్యెఁ దలఁప నాయ
వస్థ యెందుఁ జొచ్చువాఁడ? నీ యలమట । దీర్ప నెవ్వరింక దిక్కు గలరు?' 34

ప్రతిపదార్థం: సుయోధనుఁడు= దుర్యోధనుడు (కర్త); శాంతనవుండు= శంతను మహారాజు కుమారుడైన భీష్ముడు (గర్భవాక్యంలోని కర్త); బీభత్సు= అర్జునునియొక్క; దివ్య= దేవలోకంలో పుట్టిన; అస్త్ర= మంత్రప్రయుక్తాలయిన ఆయుధాల యొక్క; వైభవము= ఐశ్వర్యాన్ని; తెలుపన్+తివిరి= తెలియజేయటానికి ప్రయత్నించి; జలంబు= పాతాళజలం; అట్లు= ఆ విధంగా; తెప్పించుకొని= అర్జునునిద్వారా వచ్చేటట్లుచేసి; అప్డు= ఆ సమయంలో; పాండుసూనులతోడి= పాండవులతో; బాంధవంబు= చుట్టరికం; నడపుము= కొనసాగించుము; సిరి= రాజ్యసంపద; పంచి= విభాగించి, (తగిన భాగం పాండవులకు విడదీసి యిచ్చి); కుడుచుట= (నీ వంతు నీవు) అనుభవించటం; మేలు= మంచిది; ఇంతతోన్= ఇంతటితో; కయ్యము+ ఉడిగి= యుద్ధము మాని; శాంతుఁడవు= శాంతించినవాడవు; కమ్ము= అగుము; నీవు; బ్రదుకుము= సుఖంగా జీవించుము; అన్న= అని చెప్పిన; పనుపు= ఆజ్ఞ; చేయఁడు= ఆచరించడు; ఇప్డు= ఇప్పుడు; శోక+అబ్ధిన్= దుఃఖం అనే సముద్రంలో;

మునుఁగక+ఉండున్+ఎ?= మునిగిపోవక జీవించి ఉంటాడా?; తలఁపన్= ఆలోచించగా; నా+అవస్థ= నాస్థితి; పడుచులు= పిల్లలు; ఈఁకలు= రెక్కలలోని భాగాలు; ఊడ్చి= పీకి; పట్టి= పట్టుకొని; ఆడెడు+అట్టి= ఆడుకొనే; పులుఁగు= పక్షియొక్క; చందము= రీతి; అయ్యెన్= అయినది; ఎందున్= ఎక్కడికి; చొచ్చువాఁడన్?= వెళ్ళేది; ఈ+అలమట= ఈ బాధ, ఈ దుఃఖం; తీర్పన్= పోగొట్టటానికి; దిక్కు= గతి; ఇంకన్= మిగిలి; ఎవ్వరు కలరు?= ఎవరు ఉన్నారు?.

తాత్పర్యం: అంపశయ్యమీద ఉన్న భీష్ముడు అర్జునుడి దివ్యాస్త్రాల గొప్పతనం ఏమిటో దుర్యోధనాదులకు తెలియజేయదలచుకొని పాతాళజలం కావాలన్నాడు. అర్జునుడు అస్త్రం ప్రయోగించి ఆ నీరు బయటికి రప్పించి ఎకాయెకి భీష్ముడి నోటిలో పడేటట్లు చేశాడు. అట్లా తెలియజేసిన తరువాత దుర్యోధనుడితో 'పాండవులతో స్నేహంతో ప్రవర్తించుము. రాజ్యం విభజించి వారివంతు వారి కిచ్చి నీ వంతు నీవు అనుభవించటం మంచిది. ఇప్పటికే చాలా నష్టపోయావు. యుద్ధం మాని శాంతి వహించి సుఖంగా జీవించుము' అని చెప్పాడు. దుర్యోధనుడు ఆయన ఆదేశం మన్నించాడు కాడు. ఇపుడు సముద్రంవంటి శోకం వచ్చిపడింది. ఇందులో మునిగిపోవక బ్రదుకగలడా? పిల్లలు పిట్టను పట్టుకొని, దాని ఈకలు లాగివేసి ఎగురలేకుండా చేసి, ఎట్లా ఆడిస్తే అది అట్లా ఆడుతూపడి ఉంటుంది. ఆలోచిస్తే నేను చేసికొన్న కర్మలు నావాళ్ళనందరినీ నాకు దూరంచేసి, నన్ను నిస్సహాయుడిని చేసి, నన్ను అలా ఆడిస్తున్నాయి. ఈ బాధ తప్పించుకొనటానికి ఎక్కడికి వెళ్ళేది? ఈ బాధ తొలగించే వారు నా కెవరు మిగిలి ఉన్నారు?'

విశేషం: అలం: ఉపమ. తిక్కనగారి మహాకవిత్వం ప్రతి పదంలోనూ కనిపిస్తున్నది. 'శరతల్పమున నుండి' అనటంలో భీష్ముడు మరణోన్ముఖుడై ఉన్నాడు, ఆయన ఇదివరకటి వలె పక్షపాత బుద్ధికలవాడు కాడు. ఇట్టి పరిస్థితిలో ఏమి చేసినా ఎల్లరిమేలుకే తప్ప స్వార్థంతో కాని, పక్షపాతబుద్ధితోకాని, ఏ పనీ చేయడని సూచితం. 'శాంతనవుండు' అనటంలో ఆయన జన్మపవిత్రత సూచితం. భీష్ముడి తండ్రి రోగగ్రస్తుడిని తన చేతులతో స్పృశిస్తే అతని రోగం తొలగి శరీరం (తనువు) శాంతి వహించేది. కనుక అతడు శాంతతనుడు - శంతనుడు అని అనిపించుకొన్నాడు. అట్టివాని పుత్రుడు అహితం చెప్పడని సూచితం.

అట్టిదే 'బీభత్స' శబ్దం. అర్జునుడి గొప్పతనం దీని ద్వారా చెప్పదలచుకొన్నాడు భీష్ముడు. అర్జునుడు యుద్ధం చేస్తుంటే యుద్ధభూమిని చూస్తే జుగుప్స కలిగేటట్లు చంపుతాడట. అందువలన అతడి కాపేరు. అట్టివాడికి దివ్యాస్త్రాలు తోడు. కనుక అతడితో స్నేహమే కార్యం అని స్ఫురిస్తుంది.

వ. అని పెక్కు భంగుల నివ్వటిలు నెవ్వగలు బయలుపడం బలు మాట లాడి రాధేయు తెగిన తెఱంగు తెలియ వినం దలంచి యిట్లనియె. 35

ప్రతిపదార్థం: అని= ఈ రీతిగా; పెక్కు= అనేకమయిన; భంగులన్= విధాలుగా; నివ్వటిలు= అధికమయే; నెఱ+వగలు= నిండు దుఃఖాలు; బయలు పడన్= వెలికి వచ్చేటట్లు; పలు= అనేకమయిన; మాటలు+ఆడి= పలుకులు పలికి; రాధేయు= కర్ణునియొక్క; తెగిన= మరణించిన; తెఱంగు= పద్ధతి; తెలియన్= స్పష్టమయ్యేటట్లు; వినన్= వినటానికి; తలంచి= ఊహించి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగ పలికెను.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి మనస్సులో రకరకాలుగా దుఃఖం పెల్లుబుకుతున్నది. అదంతా బయటపడే విధంగా ఆయన ఇంతకుముందు చెప్పినట్లు చాలా పలుకులు పలికాడు. ఆ తరువాత ఆయనకు కర్ణుడు ఎట్లా నేల కొరిగాడో తెలిసికొనాలనిపించింది. కనుక సంజయుడితో ఇట్లా అన్నాడు:

మ. 'విజయుం దాఁకి పెనంగుచో నతని దోర్వీర్యంబు సైరించెనో
భుజ దర్పోద్ధతిఁ జూప నోపెనొ చలంబుం జేవయున్ సైన్య యు
గ్మజనంబుల్ వినుతింపఁ బేర్చెనొ తొలంగం బాఱెనో తెంపు న
క్కజపుంబెంపును దీఱ డింపఁడు గదా! కర్ణుండు దీనాకృతిన్. 36

ప్రతిపదార్థం: కర్ణుండు= అంగరాజు; విజయున్= అర్జునుని; తాఁకి= ఎదుర్కొని; పెనంగుచోన్= పోరాడే సమయంలో; అతని= అర్జునునియొక్క; దోః+వీర్యంబు= బాహువులయొక్క బలం; సైరించెన్+ఓ= సహించినాడో; భుజ= భుజములయొక్క; దర్ప= గర్వంయొక్క; ఉద్ధతిన్= విజృంభణాన్ని; చూపన్+ఓపెన్+ఒ= ప్రదర్శింపగలిగినాడో; చలంబున్= పట్టుదలనూ; చేవయున్= సామర్థ్యమునూ; సైన్య= సేనలయొక్క; యుగ్మ= జంటలోని; జనంబుల్= జనులు; వినుతింపన్= మిక్కిలి పొగడునట్లుగా; పేర్చెన్+ఒ= విజృంభించినాడో; తొలంగన్= తప్పికొనగా; పాఱెన్+ఓ= పారిపోయినాడో; దీన+ఆకృతిన్= జాలికలిగించే రూపంతో; తెంపున్= సాహసమూ; అక్కజపున్= ఆశ్చర్యమును కలిగించే; పెంపును= అతిశయాన్ని; తీఱన్= నశించేటట్లుగా; డింపఁడు+కదా!= విడువడు కదా!

తాత్పర్యం: 'కర్ణుడు అర్జునుడిని ఎదుర్కొని యుద్ధం చేసేటప్పుడు అతడి బాహుబలం సహించాడా? తన భుజబల గర్వవిజృంభణం చూపించగలిగాడా? పట్టుదలా, పౌరుషమూ ఉభయసేనలలోని వారూ ప్రశంసించే విధంగా విజృంభించాడా? లేక పారిపోయాడా? సాహసాన్ని, అతిశయాన్ని దైన్యంతో విడిచిపెట్టలేదు గదా!

విశేషం: కర్ణుడి గురించి అట్లా చేశాడా, ఇట్లా చేశాడా అని అడుగుతూ ధృతరాష్ట్రుడు చివర వేసిన ప్రశ్న ఆశ్చర్యం కలిగిస్తుంది. కర్ణుడి బలశౌర్యాల మీద ధృతరాష్ట్రుడి కెంత ఆశ ఉన్నదో, అతడి దౌర్బల్యాన్ని గురించిన స్పష్టజ్ఞానం కూడా ఉన్నదని ఇందువలన తెలుస్తుంది. ఘోషయాత్రలో గంధర్వులతో యుద్ధంలో తెంపూ పెంపూ విడిచి, దుర్యోధనుడిని అతడి కర్మానికి వదలి పారిపోయాడు. పట్టిన పట్టు విడిచిపోవటం అన్నది అతడి దౌర్బల్యం. అది ధృతరాష్ట్రుడికీ తెలుసు. అయినా, అతడికీ దుర్యోధనుడికి వలెనే ఇతడిపై ఆశ. ఆశకు అంతే కాదు, అర్థం కూడా ఉండదు.

క. తక్కటి సైనికు లని న। య్యొక్కని దిగవిడిచి పాఱిరో? లావుం బే
రుక్కును మెఱయఁగఁ దోడ్పడి। పెక్కండ్రురు వడిరొ? బెరసుఁ బీనుంగులుగాన్. 37

ప్రతిపదార్థం: తక్కటి= మిగిలిన; సైనికులు= యుద్ధభటులు; అనిన్= యుద్ధములో; ఆ+ఒక్కనిన్= ఆ కర్ణుని ఒక్కడినీ; దిగన్+విడిచి= విడిచిపెట్టి; పాఱిరి+ఓ?= పారిపోయారా?; లావున్= బలమూ; పేరుక్కున్= అధికమైన ప్రతాపమూ; మెఱయంగన్= ప్రకాశింపగా; తోడ్పడి= సాయపడి; పెక్కండ్రురు= అనేకమంది సైనికులు; పెరసున్= మాంసమూ; పీనుంగులుగాన్= శవాలూ అయ్యేటట్లుగా; పడిరి+ఒ?= కూలిపోయి మరణించారా?

తాత్పర్యం: మిగిలిన యుద్ధభటులు యుద్ధంలో కర్ణుడిని ఒక్కడినీ విడిచిపెట్టి పారిపోయారా? బలమూ, అధికమైన ప్రతాపమూ ప్రకాశింపగా అనేకమంది సైనికులు సహాయపడి మాంసమూ, శవాలూ అయ్యేటట్లుగా మరణించారా?

వ. అని మఱియును. 38

ప్రతిపదార్థం: అని= అట్లా పలికి; మఱియును= ఇంకా.

తాత్పర్యం: ఇట్లా అని ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ముందర శిఖండి నిడి సం । క్రందననందనుఁడు సేరి గంగా తనయున్
వ్రుందించెఁ గపటమున నా । చంద మొకటి కర్ణునందుఁ జర్చించిరొకో? 39

ప్రతిపదార్థం: సంక్రందన నందనుఁడు= ఇంద్రుని కుమారుడైన అర్జునుడు; ముందరన్= అగ్రభాగంలో; శిఖండిన్= ఆ పేరిటి ద్రుపదమహారాజు కుమారుని; ఇడి= ఉంచి; గంగా తనయున్= గంగా కుమారుడైన భీష్ముని; చేరి= సమీపించి; కపటమునన్= మోసముతో; వ్రుందించెన్= సంహరించాడు; ఆ చందము+ఒకటి= ఆ రీతి ఉపాయం ఒకటి; కర్ణు+అందున్= కర్ణుని విషయంలో కూడా; చర్చించిరి+ఒకో?= ఆలోచన చేశారా?

తాత్పర్యం: అర్జునుడు తన అగ్రభాగంలో శిఖండిని ఉంచుకొని అతడి వెనుక తా నుంటూ భీష్ముడిని సమీపించి, మోసంతో ఆయనను సంహరించాడు కదా!, ఆ ప్రకారం కర్ణుడి విషయంలో కూడా కపటోపాయం ఒకటి పాండవులు ఆలోచించారా?

క. సామజము పడిన నశ్వ । త్థామపడియె ననఁడె? ధర్మతనయుఁడు గురునిం
దా మడియించుటకై య । ట్టే మేని యొనర్చి రొక్కొ? యితఁడు పడుటకున్. 40

ప్రతిపదార్థం: ధర్మతనయుఁడు= యుధిష్ఠిరుడు; సామజము= ఏనుగు; పడినన్= కూలిపోగా; గురునిన్= గురువైన ద్రోణుని; తాన్= తాను; మడియించుటకున్+ఐ= సంహరించటం కోసం; అశ్వత్థామ= అశ్వత్థామ; పడియెన్= కూలిపోయాడు; అనఁడు+ఎ?= అని పలుకలేదా?; ఇతఁడు= కర్ణుడు; పడుటకున్= కూలిపోవటానికి; అట్టు= ఆ తీరుగా; ఏమి+ఏని= ఏదైనా; ఒనర్చిరి+ ఒక్కొ?= చేశారా?

తాత్పర్యం: అశ్వత్థామ అను పేరుగల ఏనుగు చచ్చిపోతే, ద్రోణుడిని సంహరించాలనే అభిప్రాయంతో, యుధిష్ఠిరుడే ఆయన కొడుకు అశ్వత్థామ అన్న భ్రాంతి కలిగేటట్లు 'అశ్వత్థామ పడియె' అన్నాడు కదా! అట్లా కర్ణుడిని సంహరించటానికి కూడా ఏమైనా చేశారా?

క. మాయోపాయంబుల గాం । గేయుండును గురుఁడు ననిఁ దెగిర కాక రణ
న్యాయంబు దప్పకుండఁగ । నా యిరువుర నోర్వ నెవరికైనను వశమే? 41

ప్రతిపదార్థం: గాంగేయుండును= గంగాపుత్రుడైన భీష్ముడూ; గురుఁడును= అఖిలాస్త్రవిద్యాగురువైన ద్రోణుడూ; మాయా+ఉపాయంబులన్= వంచనకుద్దేశించిన పన్నుగడలవలన; అనిన్= యుద్ధంలో; తెగిరి+అ+కాక= ఖండింపబడినారే కాని; రణన్యాయంబు= యుద్ధధర్మం; తప్పక+ఉండఁగన్= విడిచి పెట్టకుండా; ఆ యిరువురన్= ఆ భీష్మద్రోణుల నిద్దరినీ; ఓర్వన్= ఓడించటానికి; ఎవరికిన్+ఐనను= ఎంతటివారికైనప్పటికీ; వశము+ఏ?= శక్యమా? (కాదు).

తాత్పర్యం: వంచన చేయాలని పాండవుల పన్నుగడలు పన్నినందువలన భీష్మద్రోణులు యుద్ధంలో నరకబడ్డారు కాని, యుద్ధధర్మం విడువకుండా పోరాడిన వా రెవరైనా వారినిద్దరినీ ఓడించగలరా?

సీ. పరశురాముని చేతఁ బడసిన వాఁడు బ్ర । హ్మాస్త్రంబు సర్వముఖాస్త్ర మలఁతిఁ
బోవునె? దివ్యాస్త్రములు పెక్కు మఱియును । గలవు రాధేయున కలవుమెఱసి
యభిమన్యు విల్ దునుమాడఁడె నాగాయు । తత్రాణు ననిలనందనుని బాడు
దలఁబట్టె సహదేవుఁ జులుకన మర్దించి । మందల విడువఁడే మాయలాని
తే. మేటిమగని ఘటోత్కచు గీ టడఁపఁడె । యట్టి జెట్టికిఁ బోరఁ జావెట్టి భంగి
నయ్యెఁ? దేరికి సూతున కంచితాస్త్ర । ములకు దైవోపహతిఁ జేటు మూఁడెనొక్కొ? 42

ప్రతిపదార్థం: (కర్ణుఁడు) పరశురాముని చేతన్= భార్గవరాముని నుండి; బ్రహ్మ+అస్త్రంబు= బ్రహ్మ అధిదైవతంగా గల అస్త్రాన్ని; పడసిన వాఁడు= పొందినవాడు; సర్వముఖ+అస్త్రము= సర్పం అగ్రభాగంలో గల అస్త్రం; అలఁతిన్= స్వల్పమైన కారణంవల్ల; పోవున్+ఎ?= పోతుందా?; రాధేయునకున్= కర్ణునికి; మఱియును= ఇవికాక; పెక్కు= అనేకమైన; దివ్య+అస్త్రములు= దివ్యములైన అస్త్రములు; కలవు= ఉన్నాయి; (కర్ణుడు) అలవు= ఉపాయం; మెఱసి= ప్రకాశించి; అభిమన్యు= అభిమన్యుని యొక్క; విల్= ధనుస్సు; తునుము+ఆడఁడు+ఎ= ఖండింపలేదా? (అతడు); నాగ= ఏనుగులయొక్క; అయుత= పదివేలయొక్క; త్రాణున్= బలంవంటి బలంకలవాడిని; అనిలనందనుని= వాయుపుత్రుడైన భీమసేనుని; బాడుదలన్+పట్టెన్= అవమానించాడు; సహదేవున్= (పాండవులలో చిన్నవాడైన) సహదేవుని; చులుకనన్= తేలికగా; మర్దించి= కొట్టి; మందల= ప్రాణాలతో; విడువఁడు+ఏ= విడిచిపెట్టలేదా; మాయలాని= మాయలు కలవాడు; మేటిమగని= మహావీరుడు అయిన; ఘటోత్కచున్= ఆ పేరిటి హిడింబానందనుని; గీటు+అడఁపఁడు+ఎ= చంపలేదా; అట్టి= అటువంటి; జెట్టికిన్= యోధునకు; చావు= మరణము; ఎట్టి= ఎటువంటి; భంగిన్= పద్ధతిని; అయ్యెన్?= కలిగింది?; దైవ+ఉపహతిన్= విధియొక్క వంచనచేత; తేరికిన్= రథానికీ; సూతునకున్= సారథికీ; అంచిత+అస్త్రములకున్= ఒప్పుచున్న మంత్ర ప్రయుక్తాలయిన ఆయుధాలకూ; చేటు= చెడటం, నాశం; మూఁడెన్+ఒక్కొ?= సంభవించిందా?

తాత్పర్యం: కర్ణుడు పరశురామునంతటివాడివలన బ్రహ్మాస్త్రం గ్రహించాడు. అతడి వద్ద నాగముఖాస్త్రం ఉన్నది. అది స్వల్పకారణంవలన పోయేది కాదు. ఈ అస్త్రాలు రెండూ కాక అతడి వద్ద దివ్యాస్త్రాలు చాలా ఉన్నాయి. అతడు గొప్ప ఉపాయశాలి. అందరినీ గడగడలాడించిన అభిమన్యుడి ధనుస్సు అట్టి ఉపాయంతోనే ఖండించాడు. భీమసేనుడికి పదివేల ఏనుగులకున్నంత బలం ఉన్నది. అట్టివాడిని అవమానించగలిగాడు. మహావీరుడైన సహదేవుడిని అవలీలగా కొట్టి, దయదలచి ప్రాణాలతో విడిచిపెట్టాడు. మహామాయావీ, మహావీరుడు కదా ఘటోత్కచుడు! అట్టి వాడిని సంహరించాడు. ఇటువంటి యోధుడికి మరణం ఎట్లా సంభవించింది? విధి వంచనచేత రథమూ, సారథీ దివ్యాస్త్రాలూ నశించాయా?.

విశేషం: ధృతరాష్ట్రుడు కర్ణుడు గెలవటానికే కల సాధనసంపత్తిని పేర్కొన్నాడు. అతడి శూర కృత్యాలు ఉగ్గడించాడు. అట్టివాడు మరణించాడంటే రథమూ సారథీ అస్త్రాలూ పోయి ఉండాలి. అవి పోవటానికి విధివంచనే కారణమై ఉండాలి. ఊహ సరిగానే చేశాడు. కాని, ఇంతకుముందే (41వ పద్యంలో) యుద్ధధర్మం విడువకపోతే భీష్మ ద్రోణులు పడరని వారిని మాయోపాయాలతో పడగొట్టిన ధర్మరాజార్జునులను తప్పుపట్టాడు. అదే గుక్కతో అభిమన్యుడి విల్లు నరకటం కర్ణుడి ఉపాయశాలిత్వంగా ప్రశంసిస్తున్నాడు. అంటే యేమిటి? మన ప్రయోజనంకొరకు, మనకు కిట్టనివారి నష్టంకొరకు, మనవాళ్ళు చేసిన అన్యాయం న్యాయం. అట్టిపని మనకు కిట్టని వాళ్ళు మనకు చేస్తే అది అన్యాయమా?

క. రథ మవితథమ్మైనను సా । రథిపని నెఱపిన మహాస్త్ర రాజి విధికృతిన్
వృథగాకున్నను గర్ణునిఁ । బ్రధనంబున గెల్వ దేవపతికిన్ వశమే? 43

ప్రతిపదార్థం: రథము= తేరు; అవితథము+ఐనను= వ్యర్థముకానిది అయి ఉన్న పక్షంలోనూ; సారథి= సూతుడు; పని= తనపని; నెఱపినన్= చేసిన పక్షంలోనూ; మహా+అస్త్రరాజి= గొప్పవైన మంత్రప్రయుక్తాలైన ఆయుధాల వరుస; విధికృతిన్= దైవచేష్టవల్ల; వృథ+కాక+ఉన్నను= వ్యర్థంకాకుండా ఉన్న పక్షంలోనూ; ప్రధనంబునన్= యుద్ధంలో; కర్ణునిన్= అంగరాజును; గెల్వన్= జయింపగా; దేవపతికిన్= దేవేంద్రునికైనా; వశమే?= శక్యమా?

తాత్పర్యం: రథం విరగకుండా నడుస్తుంటే, సూతుడు చెప్పిన ప్రకారం రథంతోలుతూ, అవసరమైన సలహాలిస్తూ, ఉత్సాహపరుస్తూ తన విధి నిర్వహిస్తూ ఉంటే, ఉన్న గొప్ప దివ్యాస్త్రాలు విధివశాత్తూ నిష్ప్రయోజనాలు కాకుండా ఉంటే యుద్ధంలో కర్ణుడిని జయించటం దేవేంద్రుడికైనా శక్యమవుతుందా?

విశేషం: ధృతరాష్ట్రుడి ఊహ సరైనదే. రథం క్రుంగింది. శల్య సారథ్యం దివ్యాస్త్రాలు ఉపయోగపడలేదు. కనుక, కర్ణుడు మరణించాడు.

ఉ. సారథి యెవ్వఁడాతనికి శల్యుఁడు ద్రోణ తనూభవుండు గాం
ధార విభుండునుం గృపుఁడుఁ దత్సమయంబున నేమిభంగిఁ దో
డైరి? సుయోధనుండు హృదయంబునఁ దాఁ గృతవర్మదర్పము
న్బీరము నచ్చియుండుఁ దగ నెయ్యము సూపెనె? యాతఁ డత్తఱిన్. 44

ప్రతిపదార్థం: సారథి= సూతుడు; ఆతనికిన్= కర్ణునికి; ఎవ్వఁడు= ఎవరు; శల్యుడు= మద్రరాజు; ద్రోణతనూభవుండున్= అశ్వత్థామ; గాంధారవిభుండునున్= గాంధారదేశపు రాజైన శకునీ; కృపుఁడున్= కృపాచార్యుడు; తత్సమయంబునన్= కర్ణుడు యుద్ధంచేసే సమయంలో; ఏమి= ఎట్టి; భంగిన్= పద్ధతిని; తోడు+ఐరి?= సాయపడ్డారు?; సుయోధనుండు= దుర్యోధనుడు; హృదయంబునన్= మనస్సులో; తాన్= తాను; కృతవర్మ= కృతవర్మయొక్క; దర్పమున్= గర్వమును; బీరమున్= పరాక్రమమును; నచ్చి+ఉండున్= నమ్మి ఉంటాడు; ఆతఁడు= కృతవర్మ; ఆ+తఱిన్= ఆ సమయంలో; తగన్= తగువిధంగా; నెయ్యము= స్నేహం; చూపెన్+ఎ?= చూపాడా?.

తాత్పర్యం: కర్ణుడికి సారథిగా ఉన్నవాడెవడు? సామాన్యుడా! శల్యుడు. అశ్వత్థామ, శకుని, కృపుడు ఆ సమయంలో కర్ణుడికి ఏ విధంగా తోడ్పడ్డారు? దుర్యోధనుడు తన హృదయంలో కృతవర్మ గర్వాన్ని, పరాక్రమాన్ని నమ్మి ఉన్నాడు కదా. ఆ సమయంలో ఆ కృతవర్మ తగువిధంగా స్నేహాన్ని ప్రదర్శించాడా?

క. వారలు గెలఁకుల నడవఁగ । రారాజు పిఱుందఁ గదిసి రా నెబ్భంగిం
గారణము లేదు చావఁగ । నా రాధేయునకుఁ జోద్య మయ్యెడుఁ దలఁపన్. 45

ప్రతిపదార్థం: వారలు= అశ్వత్థామ శకుని కృప కృతవర్మలు; కెలఁకులన్= ఇరుపార్శ్వాల్లా; నడవఁగన్= నడచిరాగా; రారాజు= రాజులకు రాజైన దుర్యోధనుడు; పిఱుందన్= వెనుక; కదిసి= దగ్గరగా ఉంటూ; రాన్= రాగా; ఆ రాధేయునకున్= (స్వయంగా అంతటివాడైన) ఆ కర్ణునికి; చావఁగన్= మరణించటానికి; ఏ+భంగిన్= ఏ విధంగానూ; కారణము= తగిన హేతువు; లేదు; తలఁపన్= ఆలోచింపగా (అతడు మరణించటం); చోద్యము+అయ్యెడున్= ఆశ్చర్యం కలుగుతున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అశ్వత్థామ, శకుని, కృపాచార్య, కృతవర్మలవంటి వీరులు ఆ వైపునా ఈ వైపునా నడిచి రాగా, మహావీరుడు రాజరాజు అయిన దుర్యోధనుడు వెనుక కాపుగా సమీపంలో ఉంటూ వస్తుండగా, స్వయంగా అంతటివాడైనా కర్ణుడు చనిపోవటానికి అసలు అవకాశమే లేదు. అతడు చనిపోవటం గురించి తలచుకొంటేనే ఆశ్చర్యమవుతున్నది.

ఉ. పాండవకోటి సూతసుతుపై నడతెంచిన చందమెట్టు? లా
ఖండలసూతి సర్వముఖ కాండము తాఁకున రూపుమాసి పో
కుండుట యెట్లు కల్గె? సమరోద్ధతి దక్కటి నల్వురందు నె
ట్లుండె? బలద్వయంబు నెటులోపి పెనంగె? దినద్వయంబునన్'. 46

ప్రతిపదార్థం: పాండవకోటి= పాండురాజు కొడుకుల మూక; సూతసుతుపైన్= సూతుడైన అతిరథుని కుమారుడైన కర్ణుని మీదికి; నడతెంచిన= వచ్చిన; చందము= పద్ధతి; ఎట్టులు? = ఎట్లా ఉన్నది? ఆఖండలసూతి= ఇంద్రుని కుమారుడైన అర్జునుడు; సర్వముఖ కాండము= సర్వము అగ్రభాగాన గల బాణంయొక్క; తాఁకునన్= దెబ్బచేత; రూపుమాసిపోక= రూపం నశించిపోవక, మరణింపక; ఉండుట= బ్రతికి ఉండటం; ఎట్లు= ఏ రీతిగా; కల్గెన్?= సంభవించింది?; తక్కటి= (అర్జునుడు కాక) మిగిలిన; నల్వురందున్= పాండవులు నలుగురిలోనూ; సమర+ఉద్ధతి= యుద్ధంలోని విజృంభణం; ఎట్లు+ఉండెన్?= ఏ రీతిగా ఉన్నది?; దినద్వయంబునన్= రెండు రోజులలో (కర్ణుడు సేనానాయకత్వం వహించిన రెండు రోజులలో); బలద్వయంబు= సేనలజంట(కౌరవపాండవసేనలు రెండూ); ఎటులు= ఏ రీతిగా; ఓపి= సమర్థత కలిగి; పెనంగెన్?= పోరాడినాయి?

తాత్పర్యం: పాండవ సైన్యం కర్ణుడిమీద ఎట్లా దాడిచేసింది? కర్ణుడి సర్వముఖ బాణపుదెబ్బకు మరణించకుండా అర్జునుడు ఎట్లా బ్రతికి ఉండగలిగాడు? ధర్మజ భీమ నకుల సహదేవు లెట్లా యుద్ధంచేశారు? కౌరవ పాండవసైన్యాలు రెండూ ఈ రెండు రోజులలోనూ ఎట్లా యుద్ధంచేశాయి?'

విశేషం: ఇందులోని నాలుగు ప్రశ్నలలోనూ రెండవ ప్రశ్నతీరువలన ఆ బాణపు దెబ్బకు అర్జునుడు మరణించి తీరుతాడని ధృతరాష్ట్రుడు కూడా ఎంత ఆశ పెట్టుకొన్నాడో తెలుస్తుంది.

వ. అనిన విని సంజయుండు ధృతరాష్ట్రున కిట్లనియెఁ'గయ్యంబు తెఱంగు మొదలుకొని చెప్పెద నాకర్ణింపుము. ద్రోణుండు దెగిన నశ్వత్థామ దనయోపినంత సమరంబు సేసి చాలించి సేనలఁ దివియించి మరలి వచ్చిన దుర్యోధనుం డప్పుడు గొలువిచ్చియుండి యశ్వత్థామ లోనగు దొరలం గలయం గనుంగొని మనకు నిటమీఁదఁ జేయంగల పని యెయ్యది? యని యడుగుటయు న గ్గురుసుతుండు. 47

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; సంజయుండు= సంజయుడు; విని= ఆలకించి; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రమహారాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు; కయ్యంబు తెఱంగు= యుద్ధంయొక్క పద్ధతి; మొదలుకొని= ఆదినుంచీ; చెప్పెదన్= చెపుతాను; ఆకర్ణింపుము= వినుము; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; తెగినన్= మరణింపగా; అశ్వత్థామ= అతని కుమారుడైన అశ్వత్థామ; తన+ఓపిన+అంత= తనకు శక్తి కలిగినంత వరకూ; సమరంబు+చేసి= యుద్ధం కావించి; చాలించి= విరమించి; సేనలన్+తివియించి= సైన్యాలను వెనుకకు తగ్గించి; మరలి= శిబిరాలకు తిరిగి; వచ్చినన్= రాగా; అప్పుడు= ఆ సమయంలో; దుర్యోధనుండు= దుర్యోధనుడు; కొలువు+ఇచ్చి+ఉండి= సభచేసి కూర్చున్నవాడై; అశ్వత్థామ=

గురుపుత్రుడు; లోనగు= మొదలైన; దొరలన్= ప్రభువులను; కలయన్= కలియునట్లుగా, కలిపి అందరినీ ఒక్కసారి; కనుఁగొని= చూచి; మనకున్= మిగిలిన కౌరవపక్షీయులమైన మనకందరికీ; ఇటమీఁదన్= ఇక ముందు; చేయన్+కలపని= చేయగలపని; ఏ+అది?= ఏది?; అని; అడుగుటయున్= అడుగగా; ఆ+గురుసుతుండు= ద్రోణచార్యుని పుత్రుడైన ఆ అశ్వత్థామ. (చూపిన అనే 52వ వచనంలోని క్రియతో అన్వయం)

తాత్పర్యం: ఈ విధంగా ధృతరాష్ట్ర మహారాజు ప్రశ్నించేసరికి సంజయు డిట్లా ఆయనకు చెప్పాడు. 'యుద్ధం ఎట్లా జరిగిందో మొదటినుండి చెప్పుతాను వినుము. ద్రోణాచార్యుడు పడిపోయేసరికి అశ్వత్థామ తనశక్తి మేరకు యుద్ధంచేసి, విరమించి, సేనలను వెనుకకు మళ్ళించి తిరిగి వచ్చాడు. అప్పుడు దుర్యోధనుడు కర్తవ్యాలోచనకు సభ చేశాడు. ఆ సభలో ఉన్న అశ్వత్థామ మొదలైన వీరులందరివైపూ చూచి, ఇకపైని మనకర్తవ్యం ఏమిటి? అని ప్రశ్నించాడు. అపుడు అశ్వత్థామ. (ఇట్లా చెప్పాడు)

విశేషం: 'అశ్వత్థామ లోనగు దొరలన్' అనటంలో విశేషాలున్నాయి. దుర్యోధనుడు గొప్ప తంత్రజ్ఞుడు. తాను తలచిన రీతిగా కార్యక్రమం నడపగలిగిన చతురుడు. ద్రోణుడు పడిపోయినందువల్ల తనకు కలిగిన నష్టం అట్లా ఉండగా అశ్వత్థామకు కలిగిన నష్టం అతనికి ఆవేశకారణమని తెలుసు. వంచనతో చంపినందున అశ్వత్థామ మరీ మండిపడుతున్నాడనీ తెలుసు. ఆ క్రోధంతో పాండవసైన్యాన్ని ఎంతో వినాశం చేసి వచ్చాడనీ తెలుసు. అతడు సేనానాయకత్వానికి పోటీ పడదగినవాడనీ తెలుసు. కాని, అతడికంటె సేనానాయకత్వం కర్ణుడి కివ్వటం తనకు ఇష్టం. అశ్వత్థామ చిన్నబుచ్చుకోకూడదు, అతడి క్రోధ బలశౌర్యాలు తన కుపయోగపడాలి. తా ననుకొన్నట్లు అతడు కాక కర్ణుడు సేనాపతి కావాలి. ఏం చేద్దామని అడిగినపుడు తనమీద తన కెంత నమ్మకమూ, శత్రువులమీద ఎంతక్రోధమూ ఉన్నవాడయినా, అశ్వత్థామ వంటివాడు తనకు సేనాపతిత్వం ఇమ్మని నోరుతెరచి అడగలేడు. అట్లా తాను విరమించుకొన్నపుడు విధిగా కర్ణుడి పేరు చెపుతాడు. అందువలన ముందు అశ్వత్థామను చూచి అడిగాడు. అతడనుకొన్నట్లే అశ్వత్థామ చెప్పబోతున్నాడు.

'అశ్వత్థామ లోనగు దొరలన్' అని దొరలలో అశ్వత్థామను మొదట పేర్కొనటంవలన ద్రుపదుడి రాజ్యంలో అర్ధరాజ్యానికి ఏలిక అయిన ద్రోణాచార్యుడి ఏకైక పుత్రుడయిన అశ్వత్థామ కేవల గురుపుత్రుడు కాక దొర అనీ సూచితమవుతుంది. కాని ద్రుపదుడి అర్ధరాజ్యాన్ని అతడిని అవమానించిన సందర్భంలో ద్రోణుడు తీసుకున్నట్లు సంస్కృత భారతంలో (ఆది.అధ్యా.138, శ్లో 66-72) ఉన్నదిగాని, తెలుగు భారతంలో లేదు.

క. 'విను మాదర ముత్సాహం। బనూన ధార్ష్ట్యంబు నీతి యను సద్గుణముల్
పని సఫలం బగునట్టుగ। జననాథ! యొనర్చు దైవ సాహాయ్యమునన్. 48

ప్రతిపదార్థం: జననాథ!= ప్రజారక్షకుడవయిన రాజా!; విను= ఆలించు; (ఎవని కోసం పోరాడుతున్నారో వానిపై) ఆదరము= గౌరవం; ఉత్సాహంబు= ప్రయత్నం, అభిలాష; అనూన= వెలితిలేని అంటే నిండైన; ధార్ష్ట్యంబు= దిట్టతనం, శక్తి, సామర్థ్యం, చాతుర్యం, నేర్పు; నీతి= కార్యసాధకమైన ధర్మసహితమైన విధానం; అను= అనే; సత్+గుణముల్= ఉత్తమములైన, ఉత్తములవైన గుణాలు; దైవ= విధి, లేక అదృష్టము యొక్క; సాహాయ్యమునన్= తోడ్పాటుతో; పని= తలపెట్టిన కార్యం; సఫలంబు+అగు+అట్టుగన్= ఫలవంతం అయ్యేరీతిగా; ఒనర్చున్= చేస్తాయి. (రాగాః యోగస్తథా దాక్ష్యం నయశ్చేత్యర్థ సాధకాః' అని 8-6-12 మూలం.)

తాత్పర్యం: 'రాజా! ఆదరం, ఉత్సాహం, గొప్ప శక్తి, నీతి- ఈ సద్గుణాలకు దైవం తోడైతే ఏ కార్యమైనా నెరవేరుతుంది.

చ. తలఁపఁగ సద్గుణంబులకుఁ దావలమై పెనుపొందు నుజ్జ్వలా
త్ములు సనిరైన చేభరము దోఁపఁగ నీదగుదొంటి శౌర్యముం
దలకొని నిర్వహింపు ముచితంబుగ దైవము తోడుపాటునుం
గలిగెడుఁ గాక యున్న రథికప్రవరుల్ దలపోయ నల్పులే? 49

ప్రతిపదార్థం: తలఁపఁగన్= ఆలోచింపగా; సత్+గుణంబులకున్= ఉత్తమ గుణాలకు; తావలము+ఐ= ఉనికిపట్టై; పెనుపు+ఒందు= అతిశయించే; ఉత్+జ్వల+ఆత్ములు= ప్రకాశించే మనస్సులు కలవారు; చనిరి= వెళ్ళిపోయారు; ఐన= ఐనప్పటికీ; చేభరము= చేతి అతిశయం, బాహుబలాధిక్యం; తోఁపఁగన్= కాన్పింపగా; నీది+అగు= నీది అయిన; తొంటి= ఇదివరకటి; శౌర్యమున్= ప్రతాపాన్ని; తలకొని= వహించి; ఉచితంబుగన్= తగు విధంగా; నిర్వహింపుము= నడుపుము; దైవముతోడుపాటునున్= దైవ సాహాయ్యం కూడా; కలిగెడున్+కాక= కలుగుగాక; తలపోయన్= ఆలోచింపగా; ఉన్న రథిక ప్రవరుల్= మిగిలి ఉన్న శ్రేష్ఠులయిన రథికులు; అల్పులు+ఏ?= తక్కువవారా?

తాత్పర్యం: ఆలోచించి చూస్తే, సద్గుణ నిలయులైన మహానుభావులు భీష్మద్రోణాదులు వెళ్ళిపోయారు. అయినప్పటికీ, నీ బాహుబలమూ, ఆదినుండి నీకు కల ప్రతాపమూ ఆధారంగా యుద్ధం తగువిధంగా నడిపించుము. దైవ సాహాయ్యం కూడ నీకు లభించుగాక! పరిశీలించి చూస్తే మిగిలి ఉన్న రథికశ్రేష్ఠులు మాత్రం తక్కువవారా?

క. మనము బలశౌర్య ఘనుఁ గ । ర్ణుని సేనాముఖము సేసి నూల్కొని యరిమ
ర్దన మొనరింత మితని యం । దనూనతం బొల్చు సద్గుణావలియు నృపా! 50

ప్రతిపదార్థం: నృపా!= నరులను పాలించే రాజా!; మనము= మనపక్షం వాళ్ళమందరమూ; బల= బలంచేతనూ; శౌర్య= శౌర్యంచేతనూ; ఘనున్= గొప్పవాడయిన; కర్ణుని= అంగరాజును; సేనా= సైన్యముయొక్క; ముఖము= ముఖభాగంగా; అగ్రభాగంగా ముందుండే వానినిగా, సేనానాయకునిగా; చేసి= కావించుకొని; నూలు+కొని= పురికొని; అరిమర్దనము= శత్రువులను కొట్టటం; ఒనరింతము= చేద్దాము; సత్+గుణ+ఆవలియున్+ఉత్తమ గుణ సమూహంకూడా; ఇతనియందున్= ఈ కర్ణునిలో; అనూనతన్= తక్కువకాకుండా, అధికంగా; పొల్చున్= ఒప్పుతున్నది.

తాత్పర్యం: రాజా! బలశౌర్యాలలో గొప్పవాడైన కర్ణుడిని మనం సేనానాయకుడిగా చేసుకొని, పూనికతో శత్రువులను చావగొట్టుదాము. కర్ణుడిలో సద్గుణాలు కూడా మిక్కిలిగా ఉన్నాయి.

క. వైవస్వతు చందంబున । నీ వీరుఁడు రిపుబలంబునెల్ల నడంపం
గా వలఁతి దివ్యశర శి । క్షావైభవ పరమనిష్ఠ కలిమి నరేంద్రా!' 51

ప్రతిపదార్థం: నరేంద్రా!= నరులకు ఇంద్రునివంటి వాడవైన రాజా!; ఈ వీరుఁడు= వీరుడయిన ఈ కర్ణుడు; దివ్య= స్వర్గంలో పుట్టిన; శర= బాణములయొక్క; శిక్షా= విద్యయొక్క; వైభవ= ఐశ్వర్యంయొక్క; పరమ= గొప్పదయిన; నిష్ఠ= నిలుకడ; కలిమిన్= ఉండటంచేత; వైవస్వతు చందంబునన్= యముని వలె; రిపు= శత్రువులయొక్క; బలంబున్= సైన్యాన్ని; ఎల్లన్= సమస్తాన్నీ; అడంపఁగాన్= సంహరించటానికి; వలఁతి= సమర్థుడు.

తాత్పర్యం: రాజా! ఈ కర్ణుడివద్ద దివ్యాస్త్ర విద్యాసంపద చాలా నిలుకడగా ఉన్నది. అందుచేత ఇతడు యముడివలె శత్రుసైన్యాన్ని మట్టుపెట్టటంలో సమర్థుడు.'

వ. అని సూత పుత్త్రుం జూపిన భవత్పుత్త్రుండు ప్రీతుండయి యతండు పాండవుల జయించు నను నాస యగ్గలంబైన యంతరంగంబుతో న య్యంగపతి కిట్లనియె. 52

ప్రతిపదార్థం: అని= ఇట్లాపలికి; సూతపుత్త్రున్= కర్ణుని; చూపినన్= చూపించగా; భవత్+పుత్త్రుండు= నీ కొడుకు; ప్రీతుండు+ అయి= సంతోషించినవాడై; అతండు= ఆ కర్ణుడు; పాండవులన్= పాండురాజు కుమారులను; జయించున్= గెలుస్తాడు; అను+ఆస= అనే ఆశ; అగ్గలంబు+ఐన= అధికమయిన; అంతరంగంబుతోన్= మనస్సుతో; ఆ+అంగపతికిన్= ఆ అంగరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా పలికాడు.

తాత్పర్యం: అని పలికి కర్ణుడిని చూపించాడు. ఆ మాటలకు నీ కుమారుడైన దుర్యోధనుడికి సంతోషం కలిగింది. కర్ణుడు పాండవులను గెలుస్తాడనే ఆశ మనస్సులో చాలా పెరిగింది. అట్టి స్థితిలో కర్ణుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: అశ్వత్థామ మాటలకు సంతృప్తి కలిగింది దుర్యోధనుడికి. ఇందుకు కారణా లనేకం. ఒకటి: తానూహించినట్టే అశ్వత్థామ సేనాపతిత్వం తనకు కావాలనకపోవటం; రెండు: కర్ణుడి కిమ్మనటం; మూడు: ఆ అనటానికి తగిన కారణాలు చెప్పటం. ఆ చెప్పటమూ అశ్వత్థామ మొహమోటమి లేని మాటలలో చెప్పాడు. భీష్మ ద్రోణులు సద్గుణ నిలయులయితే కర్ణుడిలో అవి అనూనంగా, తక్కువకాకుండా, ఎక్కువగా అనగా అధికభాగం ఉన్నాయి. ఇతడు యముడివలె నిర్దయుడు. ఉన్నవారిలో అందరికంటె దివ్యాస్త్రవిద్యలో అధికుడు. అశ్వత్థామ మెప్పు సామాన్యం కాదు. ఇతడికీ కర్ణుడికీ సామాన్యంగా పడదు. అట్టివాడు తూకంవేసి మరీ మెచ్చటం మరీ సంతోషకారణం. ధృతరాష్ట్రుడివలెనే దుర్యోధనుడికీ జయాశ కర్ణుడిమీదనే ఉన్నది. (అది 53వ పద్యంలో వ్యక్తమవుతుంది) అది ఈ మాటలతో ఎక్కువ అయింది.

శా. 'నీవిక్రాంతియు నా పయింగల యతి స్నేహంబుఁ బ్రఖ్యాతముల్
గావే? భీష్ముఁడు ద్రోణుఁడుం దెగుట నీ కౌరవ్య సైన్యంబులం
గావంగాఁ దగు నీకు వారల యుపేక్షం గాక యిన్నాళ్ళు లే
లా? వైరం బడఁగింప నీ వయిన లీలన్ గెల్తు కౌంతేయులన్. 53

ప్రతిపదార్థం: నీ విక్రాంతియున్= నీ పరాక్రమమూ; (నీకు) నా పయిన్+కల= నా మీద ఉన్న; అతిస్నేహంబున్= అధికమైన మైత్రీ; ప్రఖ్యాతముల్+కావు+ఏ?= ప్రసిద్ధములు కావా?; భీష్ముఁడున్= (తొలి సేనానాయకుడు) భీష్ముడూ; ద్రోణుఁడున్= (మలిసేనానాయకుడు) ద్రోణాచార్యుడూ; తెగుటన్= నరకబడినందున; ఈ కౌరవ్యసైన్యంబులన్= ఈ కౌరవపక్షసేనలను; కావంగాన్= రక్షించటం; నీకున్= (అధిక పరాక్రమమూ నా మీద అధికప్రేమా కల) నీకు; తగున్= యుక్తం; వారల= (తొలి మలి సేనానాయకులూ సమర్థులూ అయిన) భీష్మ, ద్రోణులయొక్క; ఉపేక్షన్+కాక= చూచీచూడనట్లు వదలినందున కాకపోతే; వైరంబు= శత్రుత్వం; అడఁగింపన్= నశింపజేయటానికి, పాండవులను సంహరించటానికి; ఇన్ని+నాళ్ళులు+ఏల+ఆ?= ఇన్ని రోజులెందుకూ?; నీవు+అయినన్= నీవు సేనానాయకుడవయి ఉంటే, ఇప్పుడయినా అయితే; కౌంతేయులన్= కుంతీపుత్రులను, పాండవులను; లీలన్= అవలీలగా; గెల్తు(వు)= గెలిచి ఉండేవాడవు, గెలుస్తావు.

తాత్పర్యం: 'నీ పరాక్రమమూ నామీద నీకున్న మైత్రీ జగత్ప్రసిద్ధమైనవే కదా! భీష్మద్రోణులు ఇద్దరూ పడిపోయినందున ఈ కౌరవసేనలను రక్షించ దగినవాడవు నీవే. భీష్మద్రోణు లిద్దరూ కావాలని పాండవులను చూచీ చూడనట్లు ఊరకున్నారు. లేకుంటే వారిని సంహరించి నా పగ తీర్చటానికిన్నాళ్ళు కావాలా? నీవే సేనానాయకుడవయి ఉన్న పక్షంలో అవలీలగా గెలిచి ఉండేవాడవు. ఇప్పుడైనా సేనాపతివైతే అవలీలగా గెలుస్తావు.

వ. నీవు ప్రాజ్ఞుండవు ప్రబలుండవు విశేషించి నాకేడుగడయు నీవ కావున నీకు మదీయ హితంబవశ్య కర్తవ్యం బట్లుంగాక మన మా భీష్మద్రోణుల నవమానింతుము. వారలు భండనంబునం బడిన నొదిఁగియుండ నేర్తుమే? కడంగుము పగఱకు నీకడంక చీఁకటికి సూర్యునుదయంబెట్టిదట్టి దయ్యెడుంగాక బృందారక సేన సేనాని నడపిన కైవడిం గౌరవ సైన్యంబు నడపి నన్ను గెలిపింపుము నిన్ను నీవ సర్వసేనాధిపత్యంబునకుఁ బట్టంబుగట్టి కొ'మ్మ నినం బ్రీతుండయి రాధేయుండు గాంధారేయునకుం బ్రహర్షంబుగా భూవల్లభు లెల్ల నాకర్ణింప ని ట్లనియె. 54

ప్రతిపదార్థం: నీవు= నీవు; ప్రాజ్ఞుండవు= అన్నీ తెలిసినవాడవు- సమర్థుడవు; ప్రబలుండవు= మిక్కిలి బలము కలవాడవు; విశేషించి= ప్రత్యేకించి; నాకున్= నీ మిత్రుడనైన నాకు; ఏడుగడయున్= రక్షకుడవూ; నీవు+అ= నీవే; కావునన్= కాబట్టి; నీకున్= (నా కిట్టివాడవయిన) నీకు; మదీయ హితంబు= నాదైన మేలు; అవశ్యకర్తవ్యంబు= తప్పక చేయదగిందీ; అట్లున్+కాక= ఆ విధంగానూ కాకుండా; మనము= నీవూ, నేనూ; ఆ= చంప సమర్థులయినా పాండవులను ఉపేక్షించే; భీష్మద్రోణులన్= భీష్మునీ ద్రోణునీ (పాండవులతో స్నేహం అవసరమని చెప్పినపుడు); అవమానింతుము= తిరస్కరించి భంగపరుస్తూ ఉండేవాళ్ళము; వారలు= వారిద్దరూ; భండనంబునన్= యుద్ధంలో; పడినన్= పడిపోగా; ఒదిఁగి= ముడుచుకొని, యుద్ధోత్సాహం విడిచి; ఉండన్= ఉండిపోవటానికి; నేర్తుము+ఏ?= ఇష్టపడతామా?; కడంగుము= పూనుకో; పగఱకున్= శత్రువులకు; నీ కడంక= నీ ప్రయత్నం, నీ పూనిక; చీఁకటికిన్= అంధకారానికి; సూర్య+ఉదయంబు= ప్రొద్దుపొడుపు; ఎట్టిది+అట్టిది= ఎటువంటిదో అటువంటిది; అయ్యెడున్+కాక= అగుగాక; బృందారక= దేవతల; సేనన్= దండును; సేనాని= కుమారస్వామి; నడపిన= నడిపించిన; కైవడిన్= విధముగా; కౌరవ సైన్యంబున్= కౌరవుల సైన్యాన్ని; నడపి= నడిపించి; నన్ను= (నీమీద ఆశపెట్టుకొన్న) నన్ను; గెలిపింపుము= విజయంపొందేటట్లు చెయ్యి; నీవు+అ= నీవే స్వయంగా; సర్వసేనాధిపత్యంబునకున్= సమస్త సైన్యనాయకత్వానికీ; పట్టంబు+కట్టికొమ్ము= ఆధిపత్యము చేపట్టుము; అనినన్= ఈ విధముగా పలుకగా; ప్రీతుండు= సంతృప్తిచెందినవాడు; అయి; రాధేయుండు= రాధాపుత్రుడయిన కర్ణుడు; గాంధారేయునకున్= గాంధారికొడుకైన దుర్యోధనునికి; ప్రహర్షంబు+కాన్= మిక్కిలి సంతోషం కలిగేటట్లుగా; భూవల్లభులు+ఎల్లన్= భూపతులందరూ; ఆకర్ణింపన్= వినేటట్లుగా; ఇట్లు= ఈ చెప్పబోయే రీతిగా; అనియెన్= పలికినాడు.

తాత్పర్యం: నీవు మేధావివి, సమర్థుడవు, గొప్ప బలవంతుడవు. ప్రత్యేకించి నాకు రక్షకుడవు. కనుక నీవు నాకు హితమైనది తప్పక చేయాలి. అదీకాక మనము భీష్ముడినీ, ద్రోణుడినీ అవమానించేవాళ్ళము. వారిద్దరూ యుద్ధంలో పడిపోయారు. ఇపుడు ఏమీ చేయలేనివాళ్ళవలె మనం నిరుత్సాహంగా ఎట్లా ఉండగలము? కనుక నీవు పూనుకొమ్ము. సూర్యోదయం చీకటిని నశింపజేసినట్లు నీ పూనిక శత్రువులను నశింపజేసేది కావాలి. దేవసేనను కుమారస్వామి నడిపించినట్లు కౌరవసైన్యాన్ని నీవు నడిపించి నన్ను గెలిపించుము. నిన్ను నీవే సర్వసేనానాయకత్వానికి పట్టాభిషేకం చేసికొమ్ము' అనేసరికి కర్ణుడికి చాలా సంతోషమయింది. అందువలన మిగతారాజులందరూ వింటూ ఉండగా దుర్యోధనుడికి పరమానందం కలిగేటట్లుగా అతడితో ఇట్లా అన్నాడు:

విశేషం: ఇందులో దుర్యోధనుడి మాటకారితనమూ, అతడు కర్ణుడిపై పెట్టుకొన్న ఆశా బాగా వ్యక్తమవుతున్నాయి. 'మనమా భీష్మద్రోణుల నవమానింతుము' అనటంలో ఆ మహాత్ములకు అవమానం కావాలని చేస్తూ వచ్చారని స్పష్టమవుతున్నది. వారిద్దరినీ రెచ్చగొట్టటానికి వారి చిత్తశుద్ధిని అనుమానించి, అవమానకరంగా దుర్యోధనుడు ఎన్నిసారులో, ఎన్నిమాటలో యుద్ధరంగంలో అన్నాడు. అందుకు వారిద్దరూ నిర్వేదం చెందారు. ఇంతకంటె చావటం మేలనుకొన్నారు. ఇందుకు దుర్యోధనుడి ఇప్పటి మాటలు దర్పణాలు.

మ. 'విను నీ కిచ్చిన బాస యే మఱతునే? 'వీరంబు బాహాబలం
బును ధైర్యంబును నస్త్రవీర్యమును నీ భూలోక సంచారు లె
ల్లను గీర్తింపఁగఁ బాండుపుత్రుల మదోల్లాసంబు మర్దింతు నీ
వనుమానింపక నిల్చి చూడుము మదీయంబైన సంగ్రామమున్. 55

ప్రతిపదార్థం: విను= ఆలకించు; నీకున్= (నన్ను అంగరాజును చేసిన మిత్రుడవైన) నీకు; ఇచ్చిన; బాస= మాట; ఏన్= (నీ వల్ల గౌరవాధికారకీర్తులు పొందిన) నేను; మఱతును+ఏ?= మరచిపోతానా? వీరంబున్= (నా) పరాక్రమమూ; బాహా= బాహువుల యొక్క; బలంబును= శక్తీ; ధైర్యంబునున్= కలతచెందని నిలుకడనూ; అస్త్ర వీర్యమునున్= మంత్ర ప్రయుక్తాలయిన ఆయుధాల సామర్థ్యాన్నీ; ఈ= మనం ఉన్న; భూలోక= భూలోకంలో; సంచారులు= తిరిగేవారు; ఎల్లన్= అందరూ; కీర్తింపఁగన్= ప్రశంసింపగా; పాండు= పాండురాజుయొక్క; పుత్రుల= కుమారులయిన యుధిష్ఠిరాదులయొక్క; మద+ఉల్లాసంబు= మదంయొక్క హెచ్చుపాటును; మర్దింతున్= నూరివేస్తాను, పోగొడతాను; నీవు= నా మిత్రుడవయిన నీవు; అనుమానింపక= (నేను అనినంతా చేస్తానా, చేయగలనా) అని సందేహించక; నిల్చి= ఒకచోట నిలిచి, మదీయంబు+ఐన= నాదైన; సంగ్రామమున్= యుద్ధాన్ని; చూడుము= చూడుము.

తాత్పర్యం: 'పాండవులను జయిస్తాను అని నీకు మాట ఇచ్చాను కదా. అది నేను మరచిపోతానా? ఈ భూలోకంలో తిరిగేవారంతా నా శౌర్యమూ, బాహుబలమూ, అస్త్రశక్తీ ప్రశంసించే విధంగా ఈ పాండురాజు కొడుకుల పొగరణుస్తాను. నీవు మనస్సులో సందేహం పెట్టుకొనక నా యుద్ధం ఒక చోట నిలబడి చూడుము.

దుర్యోధనుఁడు గర్ణునకు సర్వసేనాధిపత్యంబు గట్టుట

వ. నన్ను సర్వసైన్యాధిపత్యంబునకుఁ బట్టంబు గట్టు' మనవుడుఁ బొంగి రారాజు దగు రాజులుం దానును శాతకుంభకుంభంబులం బవిత్రజలంబులు దెప్పించి మహనీయమణి కుసుమౌషధిగంధాక్షత మంత్రకలనం బాచరించి సమున్నతౌదుంబరపీఠంబునం బరమాస్తరణం బొనర్చి యంగపతి నందు నిలిపి పుణ్యాహఘోషంబులుఁ దూర్యనినదంబులు వందిజనస్తుతులును జెలంగ నభిషేకించి యలంకరించి పట్టంబు గట్టిన నతండు భూసురోత్తములకు నర్థిజనంబులకును వివిధార్థంబులు దానత్యాగరూపంబున నొసంగుచు వెలింగె నప్పు డుబ్బిన శూరయోధుల జయ జయ శబ్దంబులును భూపతుల యభినందన వాక్యంబులును గృష్ణ సమేతు లగు పాండవుల గెలువుమని దీవన లిచ్చు మాగధుల యెలుంగులును నింగిముట్ట నవోదితుండైన భానుండునుం బోలె శోభిల్లు నా కర్ణుండు సముదీర్ణుండై య క్కురుపతి యాననం బాలోకించి. 56

ప్రతిపదార్థం: నన్నున్= (నీ కిష్టుడనైన) నన్ను; సర్వ= సమస్తమైన; సైన్య+ఆధిపత్యంబునకున్= సేనానాయకత్వానికీ; పట్టంబు గట్టుము= అధికారిగా చేయుము; అనవుడున్= అని పలికిన తరువాత; రారాజు= రాజులకు రాజైన దుర్యోధనుడు; పొంగి= సంతోషించి; తగు= అర్హులయిన; రాజులున్= ప్రభువులూ; తానును= స్వయంగానూ; శాతకుంభ= బంగారంతో చేసిన; కుంభంబులన్= కలశాలతో; పవిత్ర= పవిత్రములయిన; జలంబులు= నీళ్ళు; తెప్పించి= తెచ్చునట్లుచేసి; మహనీయ= గొప్పవైన; మణి= రత్నాలు; కుసుమ= పుష్పాలు; ఓషధి= మందుమొక్కలు; గంధ= చందనాది పరిమళ ద్రవ్యాలు; అక్షత= అక్షింతలు; మంత్ర= మంత్రాలు-వీటితో; కలనంబు= కూడియుండటం; ఆచరించి= చేసి (మంత్రపఠనపూర్వకంగా ఈ వస్తువులు ఆ జలకలశాలలో వేసి); సమ్+ఉన్నత= మిక్కిలి ఎత్తైన; ఔదుంబర= ఉదుంబర సంబంధమైన దాని

(మేడిచెట్టుకొయ్య)తో చేసిన; పీఠంబునన్= ఆసనంపై; పరమ+ఆస్తరణంబు= ఉత్తమమైన సువర్ణ రత్న వస్త్రమువంటిది పరచటం; ఒనర్చి= చేసి; అంగపతిన్= కర్ణుని; అందున్= ఆ ఆసనంపై; నిలిపి= కూర్చోబెట్టి; పుణ్యాహ ఘోషంబులున్= పట్టంకట్టే ముందు చేసే వైదికకర్మలోని మాటలధ్వనులూ; తూర్య= ఢక్క మొదలయిన వాద్యాల; నినదంబులున్= చప్పుళ్ళూ; వందిజన= స్తోత్రాలు చదివేవారి; స్తుతులును= స్తోత్రాలూ; చెలంగన్= రేగగా; అభిషేకించి= అభిషేకంచేసి; అలంకరించి= అలంకారాలు ధరింపజేసి; పట్టంబు గట్టినన్= అధికారిగా చేయగా; అతండు= కర్ణుడు; భూసుర+ఉత్తములకున్= ఉత్తములైన బ్రాహ్మణులకూ; అర్థిజనంబులకును= యాచకులకూ; వివిధ= రకరకములయిన; అర్థంబులు= వస్తువులూ, ధనములూ; దాన, త్యాగ రూపంబునన్= దానాలిచ్చే రూపంలో; ఒసంగుచున్= ఇస్తూ; వెలింగెన్= ప్రకాశించాడు; అప్పుడు= ఆ సమయంలో; ఉబ్బిన= పయికెగసిన; శూరయోధుల= యుద్ధభటులయొక్క; జయజయ శబ్దంబులును= జయమగుగాక, జయమగుగాక అనే ధ్వనులూ; భూపతుల= రాజులయొక్క; అభినందన= ప్రశంసించే; వాక్యంబులును= మాటలూ; కృష్ణ= కృష్ణునితో; సమేతులు+అగు= కూడియున్న; పాండవులన్= పాండురాజకుమారులను; గెలువుము+అని= జయింపుము అంటూ; దీవనలు+ఇచ్చు= ఆశీర్వాదాలిచ్చే; మాగధుల= స్తోత్రాలు చదివేవారియొక్క; ఎలుంగులును= ధ్వనులూ; నింగిన్= ఆకాశాన్ని; ముట్టన్= తాకగా; నవ+ఉదితుండు+ఐన= అప్పుడే క్రొత్తగా ఉదయించిన; భానుండునున్+పోలెన్= సూర్యునివలె; శోభిల్లు= ప్రకాశించే; ఆ కర్ణుండు= సేనానాయకుడైన కర్ణుడు; సమ్+ఉదీర్ణుండు+ఐ= అధికుడై; ఆ+కురుపతి= ఆ దుర్యోధనునియొక్క; ఆననంబు= ముఖం; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: 'నన్ను సర్వసైన్యాధిపత్యానికి అధికారిని చేయుము' అన్నాడు. ఆ మాటకు దుర్యోధనుడు పొంగిపోయాడు. తానూ ముఖ్యులైన రాజులూ కలిసి బంగారు కలశాలతో పవిత్రజలాలు తెప్పించారు. వాటిలో మంచిమణులూ, పుష్పాలూ, మందుమొక్కలూ, దీపాలవలె వెలిగే తృణజ్యోతిస్సులూ, చందనాది సుగంధద్రవ్యాలూ, అక్షింతలూ, మంత్రాలు చదువుతుండగా చేర్చారు. మేడికర్రతో చేసిన అత్యున్నతాసనం మీద సువర్ణ రత్నవస్త్రం వంటిది పరిపించారు. దానిమీద కర్ణుడిని కూర్చుండబెట్టారు. అతడిని సేనాపతిగా అభిషేకించారు. అపుడు పుణ్యాహ ఘోషలూ, మంగళవాద్యధ్వనులూ, స్తుతిపాఠకుల స్తోత్రాలూ అతిశయిల్లాయి. అపుడు కర్ణుడు బ్రాహ్మణోత్తములకూ, యాచకులకూ రకరకాల వస్తువులూ, ధనాదులూ దానాలుగా ఇచ్చాడు. ఆ సమయంలో శూరులూ యోధులూ బాగా సంతోషించి, జయజయధ్వానాలు చేశారు. రాజులు ప్రశంసించారు. స్తోత్రాలు చదివేవారు కృష్ణుడితో సహా పాండవులను జయించుమని దీవించారు. ఈ ధ్వనులన్నీ కలిసి ఆకాశందాకా వ్యాపించాయి. అపుడు కర్ణుడు అప్పుడే ఉదయించిన సూర్యుడివలె ప్రకాశిస్తూ అదివరకటికంటె అధికుడైనాడు. అతడు దుర్యోధనుడి ముఖంచూస్తూ (అన్నాడు).

విశేషం: అలం: ఉపమ.

తే. **'బంధు మిత్ర యుతంబుగఁ బార్థు రూపు । మాపి యే నిత్తు నీకు సామ్రాజ్యలక్ష్మి**
ధాత్రిఁ బాలింపు సుస్థితిఁ బుత్త్ర పౌత్త్ర । గాఢభోగార్హమగునట్లు గాఁగ నధిప! 57

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఏన్= నేను; పార్థున్= నేను; పృథ(కుంతి) కుమారుడయిన అర్జునుడిని; బంధు= చుట్టాలతో; మిత్ర= స్నేహితులతో; యుతంబుగన్= సహితంగా; రూపుమాపి= సంహరించి; నీకున్= (నన్ను అంగరాజునే కాక సమస్త సేనా నాయకుని కూడా చేసిన) నీకు; సామ్రాజ్యలక్ష్మిన్= ఏకచ్ఛత్రాధిపత్య రాజ్యసంపదను; ఇత్తున్= ఇస్తాను; (నీవు) పుత్త్ర= పుత్త్రులకూ; పౌత్త్ర= మనుమలకూ(వంశపరంపరగా) కూడా; గాఢ= అధికమైన; భోగ= అనుభవించటానికి; అర్హము+ అగునట్లుకాఁగన్= తగునట్లుగా; సుస్థితిన్= మంచి సంపదతోనూ, నిలకడతోనూ; ధాత్రిన్= భూమిని; పాలింపు= ఏలుకో.

తాత్పర్యం: 'రాజా! (నన్ను అంగదేశపు రాజును చేయటమేకాక అఖిలసైన్యానికీ అధినాథుడిని కూడా చేశావు. కనుక, ఈ సంతోషసమయంలో చెపుతున్నాను) చుట్టాలతో మిత్రులతో సహా అర్జునుడిని నేను సంహరించి సామ్రాజ్యసంపద నీ కిస్తాను. నీవు పుత్రపౌత్ర పరంపరగానూ, పుత్రపౌత్ర సహితంగానూ మహాభోగాలకు తగినట్లుగా భూమి నేలుకొమ్ము.

విశేషం: తమకు సైన్యాధిపత్యమిచ్చినపుడు సంతోషించి భీష్మద్రోణులూ దుర్యోధనునికి వరాలిచ్చారు. కాని, పాండవులను చంపుతామని కాని, చంపగలమని కాని చెప్పలేదు. పైగా సమయం దొరికినపుడెల్లా వా రవధ్యులు కనుక సంధిచేసుకొమ్మంటూనే చెప్తుతూ వచ్చారు. అసాధ్యవాగ్దానాలతో దుర్యోధనునికి ఆశ కల్పించాలని వా రనుకొనలేదు. అతడు తమ నపార్థంచేసికొన్నా పథ్యమూ, హితమే చెప్పారు. కాని, కర్ణుడు ఏమి పలికితే దుర్యోధనుడి కానందమో అది పలుకుతూ వచ్చాడు - ముఖ్యంగా అర్జునుడిని చంపుతాననటం. కారణం ఏదైతేనేం, అది నెరవేరింది కాదు.

క. వినుసత్య ధర్మ రతుఁ డగు । మనుజునకుం గార్యసిద్ధి మసలక యగు చా
డ్పున శౌర్య బాహువిక్రమ । ఘనుఁడగు నా కాజి జయము గలుగుం జులుకన్' 58

ప్రతిపదార్థం: విను= ఆలకించు; సత్య= యథార్థం పలకటంపట్లనూ; ధర్మ= ధర్మం ఆచరించటంపట్లనూ; రతుఁడు+అగు= ఆసక్తి కలవాడైన; మనుజునకున్= మానవునకు; కార్యసిద్ధి= పని నెరవేరటం; మసలక= ఆలస్యంకాకుండా, తప్పకుండా; అగు= అయ్యే; చాడ్పునన్= విధముగా; శౌర్య= ప్రతాపంచేతనూ; బాహు విక్రమ= భుజపరాక్రమం చేతనూ; ఘనుఁడు+అగు= గొప్పవాడనైన; నాకున్= నాకు; ఆజిన్= యుద్ధంలో; జయము= గెలుపు; చులుకన్= తేలికగా; కలుగున్= సంభవిస్తుంది.

తాత్పర్యం: (ఇంత అసాధ్యమైన పని ఎట్లా చేయగలవంటావేమో) వినుము, సత్య ధర్మపరాయణుడైనవాడు చేయదలచిన పని వెంటనే నెరవేరుతుంది. అట్లాగే భుజబల ప్రతాపాలున్న నేను యుద్ధంలో తేలికగా జయిస్తాను.'

విశేషం: కర్ణుడిలోని గొప్ప సుగుణం తన భుజబలపరాక్రమాల మీద ఆధారపడటం. సందర్భం వచ్చినపుడెల్లా అతడు పోరాడి గెలుద్దామంటాడు. వంచించి గెలుద్దామంటాడు శకుని. పాండవులు నలుగురూ నాలుగు దిక్కులూ గెలిస్తే, కర్ణుడొక్కడూ పాండురాజువలె దిగ్విజయం చేశాడు. కనుక తన బలప్రతాపాల మీద అతడికి నమ్మకం. కాని, అందరినీ గెలవటం వేరు, కృష్ణ రక్షితులైన పాండవులను గెలవటం వేరు.

వ. అని పలికె నిత్తెఱంగున రాధేయు సర్వ సైన్యముఖ్యుం జేసి యతని మందిరంబునకు మహావిభవ సమేతంబుగాఁ బుచ్చి సమస్త పరిజనంబులను నిజనివాసంబులకుఁ బోవం బనిచి సంతోషం బంతరంగంబు నిండి వదనంబున వెల్లిగొన నీ కొడు కభ్యంతరావాసంబున కరిగె. రాత్రి యే నిట వచ్చి ద్రోణు వృత్తాంతం బంతయు నీకుం జెప్పి నీ వనుప మగిడి చని సూర్యోదయ సమయంబున మన శిబిరంబు ప్రవేశించితి న య్యవసరంబున. 59

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; పలికెన్= అన్నాడు; ఈ+తెఱంగునన్= ఈ విధముగా; నీ కొడుకు= నీ కుమారుడైన దుర్యోధనుడు; రాధేయున్= కర్ణుని; సర్వసైన్య= సమస్తమైన సేనకూ; ముఖ్యున్= నాయకుని; చేసి= కావించి; అతనిన్= కర్ణుని; మందిరంబునకున్= అతని నివాసమునకు; మహా= గొప్ప; విభవ= వైభవ; సమేతంబుగాన్= సహితముగా; పుచ్చి= పంపించి; సమస్త పరిజనంబులను= సకల సేవకులనూ; నిజ నివాసంబులకున్= వారి వారి నివాసంబులకు; పోవన్= వెళ్ళటానికి; పనిచి=

పంపి; సంతోషంబు; అంతరంగంబు= మనస్సున; నిండి; వదనంబునన్= ముఖంపై; వెల్లి+కొనన్= ప్రవహింపగా; అభ్యంతర= లోపలి; ఆవాసంబునకున్= గృహానికి; అరిగెన్= వెళ్ళాడు; రాత్రి= ఆ రాత్రివేళ; ఏను= నేను; ఇట= ఇక్కడికి; వచ్చి= వచ్చినవాడనై; ద్రోణు= ద్రోణాచార్యునియొక్క; వృత్తాంతంబు= ఉదంతం; అంతయున్= సమస్తమూ; నీకున్= నీకు; చెప్పి= వినిపించి; సూర్య+ఉదయ= సూర్యునియొక్క ఉదయమయే; సమయంబునన్= వేళలో; నీవు; అనుపన్= పంపగా; మగిడి= తిరిగి; చని= వెళ్ళి; మనశిబిరంబు= మనయొక్క సేనలు విడిసినచోటున; ప్రవేశించితిన్= ప్రవేశించాను; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అని అన్నాడు. ఇట్లా దుర్యోధనుడు కర్ణుడిని సకల సేనానాయకుడిని చేసిన తరువాత అతడిని అతడి నివాసానికి మహావైభవంతో పంపించాడు. తన సేవకులనందరినీ కూడా వారి వారి నివాసాలకు పంపించాడు. అతడి మనస్సంతా ఆనందంతో నిండిపోయి మొగంమీదికి ప్రవహించిందా అన్నట్లు అతడి ముఖం కళకళలాడుతుండగా లోపలి మందిరానికి వెళ్ళాడు. ఆ రాత్రి నే నిక్కడికి వచ్చి నీకు ద్రోణుడి యుద్ధవార్తలన్నీ చెప్పాను. నీవు సెలవిచ్చిన తరువాత వెళ్ళి ప్రొద్దుపొడిచేసరికి మళ్ళీ మన దండు విడిసిన చోటు చేరుకొన్నాను. ఆ సమయంలో.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

సీ. **తళతళ మనియెడు దంతప్రభలతోడ । ఘనకేతువున హస్తి కక్ష్య మెఱయ**
హంసవర్ణములైన హయముల పటుగతి । నర్కప్రభం బగు నరదమొప్ప
దీప్తకాంచనరసలిప్తమై చెలువొందు । సజ్యకార్ముకము హస్తమున వెలుఁగ
వీటికి సమర సమాటోపమొదవ నా । భీలశంఖము దనమ్రోల మ్రోయ

తే. **రణసముత్సాహలక్ష్మి వక్త్రమున వింత । చెన్ను వెలయింప నాప్తులు సేరి రెండు**
పక్కియల యందు బవరంపుఁ బలుకు లెసఁగ । నడవ సొంపారి కర్ణుండు వెడలె నధిప! **60**

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; కర్ణుండు= సకల సేనానాయకుడైన కర్ణుడు; తళతళమనియెడు= కన్నులు మిరుమిట్లు గొలిపే; దంతప్రభలతోడన్= దంతాల కాంతులతో; ఘనకేతువునన్= పెద్ద జెండామీద; హస్తికక్ష్య= ఏనుగు మొలత్రాడు; మెఱయన్= ప్రకాశింపగా; హంస+వర్ణములు+ఐన= హంసయొక్క రంగువంటి రంగుకలవి; అయినటువంటి; హయముల= గుర్రాలయొక్క; పటుగతిన్= వేగమైన నడకతో; అర్క= సూర్యుడియొక్క; ప్రభంబు= కాంతివంటి కాంతిగలది; అగు= ఐనట్టి; అరదము= రథం; ఒప్పన్= ప్రకాశింపగా; దీప్త= కాలిన; కాంచన= బంగారంయొక్క; రస= ద్రవంచేత; లిప్తము+ ఐ= పూయబడినదై; చెలువు+ఒందు= అందగించునట్టి; సజ్యకార్ముకము= ఎక్కుపెట్టిన ధనుస్సు; హస్తమునన్= చేతిలో; వెలుఁగన్= ప్రకాశింపగా; వీటికిన్= దండువిడిసిన చోటికి; సమర= యుద్ధంయొక్క; సమ్+ఆటోపము= సంరంభం; ఒదవన్= కలుగగా; ఆభీలశంఖము= భయంకరమైన శంఖం; తన మ్రోలన్= తనయెదుట; మ్రోయన్= మ్రోగగా; రణ= యుద్ధనిమిత్తమైన; సముత్సాహ= సంపూర్ణమైన పూనికయొక్క; లక్ష్మి= కాంతి; వక్త్రమునన్= తనముఖం మీద; వింత= క్రొత్త, ఆశ్చర్యకరమైన; చెన్ను= అందం; వెలయింపన్= ప్రసరించేటట్లు చేయగా; రెండు పక్కియల+అందున్= ఉభయ పార్శ్వాలలోనూ; ఆప్తులు= నమ్మదగిన ముఖ్యులైన స్నేహితులు; చేరి= సమీపించి; బవరంపు= యుద్ధసంబంధములయిన; పలుకులు+ఎసఁగన్= మాటలు ఒప్పగా; నడవన్= నడచిరాగా; సొంపు+ఆరి= అందమొప్పి; వెడలెన్= బయలుదేరాడు.

తాత్పర్యం: రాజా! కర్ణుడు బయలుదేరాడు. అపుడు అతడి రథంమీది పెద్ద జెండామీద కన్నులు మిరుమిట్లు గొలిపే దంతకాంతులతో ఏనుగు మొలత్రాడు ప్రకాశిస్తున్నది. అతడి రథం తెల్లని హంసల రంగూ మంచి

వేగమూగల గుర్రాలతో సూర్యకాంతితో మెరుస్తున్నది. అతడి చేతిలో నారి ఎక్కించిన విల్లు ప్రకాశిస్తున్నది. దానికి బంగారపు ద్రవం పూసినందున చాలా అందంగా ఉన్నది. సేనా స్కంధావారంలో యుద్ధ సంరంభం కలిగేటట్లుగా అతడి ముందు భయంకరమైన శంఖం మ్రోగుతున్నది. ముఖంమీద యుద్ధోత్సాహశోభ క్రొత్త అందాన్ని సమకూరుస్తున్నది. అతడి రెండు ప్రక్కలా దగ్గరగా ముఖ్యులయిన నమ్మదగిన స్నేహితులు యుద్ధానికి సంబంధించిన మాటలు పలుకుతూ నడచి వస్తున్నారు. అట్లా అందంగా అతడు బయలుదేరాడు.

వ. అతండు పడవాళ్ళం బనిచి వెడల నియమించిన నెల్ల దొరలును దురంబునకు వెడలి రట్లు సకల బలంబులు కలనికి నడవం దొడంగిన. 61

ప్రతిపదార్థం: అతండు= కర్ణుడు; పడవాళ్ళన్= చారులను; పనిచి= పంపి; వెడలన్= యుద్ధానికి బయలుదేరటానికి; నియమించినన్= ఆజ్ఞాపింపగా; ఎల్ల= సమస్తమైన; దొరలును= సేనాధిపతులు; దురంబునకున్= యుద్ధానికి; వెడలిరి= బయలుదేరారు; అట్లు= ఆ రీతిగా; సకలబలంబులు= సమస్తమైన సైన్యాలూ; కలనికిన్= యుద్ధభూమికి; నడవన్= నడవటానికి; తొడంగినన్= పూనుకొనగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: కర్ణుడు చారులను పంపి బయలుదేరండని ఆజ్ఞాపించగానే సేనాధిపతులందరు యుద్ధానికి బయలుదేరారు. అట్లా సైన్యాలన్నీ యుద్ధానికి నడవటం ప్రారంభించేసరికి.

సీ. తురగ రింఖా ముఖోద్ధూత ధూళీపట । లములు నల్దిక్కు లలంకరించె
మాతంగ కటిగళన్మదజల బహుల ప్ర । వాహ విలాసంబు వాని నడఁచె
బహువిధవాదిత్ర భైరవారావంబు । పె ల్లంబరము పిక్కటిల్లఁ జేసె
శింజినీటంకార సింహనాదంబుల । పెక్కువ యామ్రోఁతఁ బిలుచుకొనియె

ఆ. రథిక భూషణముల రశ్ములఁ గేతన । ఛ్ఛత్ర చామరోపసక్త మణుల
రుచుల సుభటహేతి రోచులఁ బవలింటి । దివియచందమయ్యె దినకరుండు. 62

ప్రతిపదార్థం: తురగ= గుర్రాలయొక్క; రింఖా= డెక్కలయొక్క; ముఖ= అగ్రభాగాలచేత; ఉద్ధూత= ఎగురగొట్టబడిన; ధూళీపటలములు= ధూరేణువుల సమూహాలు; నల్+దిక్కులు= నాలుగు దిశలనూ; అలంకరించెన్= ముస్తాబు చేశాయి; మాతంగ= ఏనుగులయొక్క; కటి= చెక్కిళ్ళనుండి; గళత్= స్రవిస్తున్న; మదజల= మదపునీటి; బహుల= అధికమైన; ప్రవాహంబు= వెల్లువయొక్క; విలాసంబు= చక్కదనం; వానిన్= ధూరేణు సమూహాలను; అడఁచెన్= అణగగొట్టింది; బహువిధ= పలురకాలైన; వాదిత్ర= వాద్యాలయొక్క; భైరవ= భయంకరమైన; ఆరావంబు= ధ్వనియొక్క; పెల్లు= ఆధిక్యం; అంబరము= ఆకాశాన్ని; పిక్కటిల్లన్+చేసెన్= బ్రద్దలుచేసింది; శింజినీ= అల్లెత్రాళ్ళయొక్క; టంకార= టం అనే ధ్వనుల యొక్క; పెక్కువ= ఆధిక్యం; ఆ మ్రోఁతన్= ఆ వాద్యధ్వనిని; పిలుచుకొనియెన్= ఆహ్వానించింది; దినకరుండు= సూర్యుడు; రథిక= రథికులయొక్క; భూషణముల= నగలయొక్క; రశ్ములన్= కాంతులచేత; కేతన= జెండాలయందు; ఛత్ర= గొడుగులయందూ; చామర వింజామరలందూ; ఉపసక్త= అంటిఉన్న; మణుల= రత్నాలయొక్క; రుచులన్= కాంతులతోనూ; సుభట= మంచి బంటుల, వీరులయొక్క; హేతి= ఖడ్గాల, ఆయుధాలయొక్క; రోచులన్= కాంతులతోనూ; పవలింటి= పగటివేళలోని; దివియ= దీపంయొక్క; చందము+అయ్యెన్= పోలికతో ఉన్నాడు.

తాత్పర్యం: గుర్రాల డెక్కల చివళ్ళెగరగొట్టిన ధూరేణువులు అన్నివైపులా వ్యాపించాయి. ఏనుగుల చెక్కిళ్ళ నుండి కారే మదపునీటి ప్రవాహం ఆ రేణువులను అణగగొట్టింది. రకరకాలయిన వాద్యాల భయంకర ధ్వనులు ఆకాశాన్ని బ్రద్దలు చేశాయి. విండ్ల అల్లెత్రాళ్ళు లాగుతుంటే వచ్చే టంటం అనే ధ్వనులూ, వీరుల సింహనాదాలూ ఆ వాద్య ధ్వనులను తమవైపు ఆకర్షించుకొన్నాయి. (అంటే పెద్దవాళ్ళు తమకంటె చిన్నవాళ్ళను తామున్నచోటికి రమ్మని పిలుస్తారు కనుక, వాద్యధ్వనులను ఈ ధ్వనులు పిలిచాయంటే మించాయన్నమాట.) రథికులు పెట్టుకొన్న నగల కాంతులూ, జెండాలకూ గొడుగులకూ వింజామరలకూ ఉన్న మణుల కాంతులూ వ్యాపించేసరికి సూర్యుడు పగటి దీపంవలె వెలవెలబోయాడు.

విశేషం: కటి శబ్దానికి-మొల, ఏనుగుచెక్కిలి అని అర్థాలని శబ్దార్థ చంద్రిక. కట అనే పాఠం కూడ ఉండే అవకాశం ఉంది.

వ. అట్టియెడ. 63

తాత్పర్యం: అటువంటి సమయంలో.

క. జనములు భీష్మద్రోణులు । సనిన వగలు డిగ్గఁ ద్రావి సంతోషము నె
క్కొనియెడు మనములతోఁ గ । ర్ణునిఁ గనుఁగొని రతివికాసరుచిరనయనులై. 64

ప్రతిపదార్థం: జనములు= జనులు; భీష్మద్రోణులు= భీష్ముడూ, ద్రోణుడూ; చనిన= పోయిన; వగలు= దుఃఖాలు; డిగ్గన్+త్రావి= దిగమ్రింగుకొని; సంతోషము= ఆనందం; నెక్కొనియెడు= అధికమయే; మనములతోన్= మనస్సులతో; అతి వికాస= మిక్కిలిగా విచ్చుకొన్నందున; రుచిర= ప్రకాశించే; నయనులు+ఐ= కన్నులు కలవారై; కర్ణునిన్= అంగరాజును; కనుఁగొనిరి= చూచారు.

తాత్పర్యం: జనులు, భీష్మద్రోణులు లేకుండా పోయారన్న దుఃఖాన్ని దిగమ్రింగుకొని, సంతోషం నిండిన మనస్సులతో, వికసించి ప్రకాశించే కన్నులతో కౌరవసైన్యాధ్యక్షుడైన కర్ణుణ్ణి చూచారు.

కర్ణుని మొదటి నాఁటి యుద్ధము (సం. 8-7-14)

వ. ఇవ్విధంబున బలంబులకుఁ బ్రమోదం బెసంగ నడచి రాధేయుండు దుస్సహంబుగా మకర వ్యూహంబు సమకట్టునెడ నందుఁ దుండంబునఁ దాను నిలిచి నయనంబుల శకునియు నులూకుండును శిరంబున నశ్వత్థామయుఁ గంఠంబున దుర్యోధనానుజులును నుదరంబున దుర్యోధనుండును ముందట వామపాదంబున నారాయణ గోపాలయుతుండై కృతవర్మయు దక్షిణపాదంబునఁ ద్రిగర్త దాక్షిణాత్య సంవృతుండై కృపాచార్యుండును వెనుక డాకాల నానాదేశ సేనతో శల్యుండును వలకాల ననేక రథకరితురగసమేతుండై సుషేణ జననాథుండును బుచ్చంబున మహాసైన్య సమగ్రుండయి చిత్రుండను ధాత్రీపతియు నతని తమ్ముండగు చిత్రసేనుండును నిలుచున ట్లొనర్చి తక్కిన వారల నెడ నెడం బన్నించె నటమున్న యుధిష్ఠిరుం డుద్దామ సామజాది చతురంగోల్లాసభాసితుండయి నడతెంచె నట్లు నడతెంచి యమ్మనుజవిభుండు మనమొనం జూచి సవ్యసాచి కిట్లనియె. 65

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; రాధేయుండు= కర్ణుడు; బలంబులకున్= కౌరవసేనలకు; ప్రమోదంబు= సంతోషం; ఎసంగన్= వృద్ధికాగా; నడచి= యుద్ధానికి బయలుదేరి; దుస్సహంబుగాన్= (శత్రువులకు) సహించ సాధ్యముకానిదిగా; మకర వ్యూహంబు= మొసలి ఆకారపు మొగ్గరం; సమకట్టు+ఎడన్= పన్నే సమయంలో; అందున్= ఆ వ్యూహంలో; తుండంబునన్= నోటి స్థానంలో; తాను= స్వయంగా కర్ణుడే; నిలిచి= ఉండి; నయనంబులన్= రెండుకన్నుల చోట్ల; శకునియున్= దుర్యోధనుని మేనమామ అయిన శకునీ; ఉలూకుండును= అతని కొడుకైన ఉలూకుడనే అతడూ; శిరంబునన్= తలవద్ద; అశ్వత్థామయున్= ద్రోణపుత్రుడయిన అశ్వత్థామా; కంఠంబునన్= మెడవద్ద; దుర్యోధన+అనుజులును= దుర్యోధనుడి తమ్ములూ; ఉదరంబునన్= పొట్టవద్ద; దుర్యోధనుండును= దుర్యోధనుడూ; ముందట వామపాదంబునన్= (నాలుగు కాళ్ళలోనూ) ముందరి ఎడమ అడుగువద్ద; నారాయణ= నారాయణులనే పేరుగల; గోపాల= యాదవులతో; యుతుండు+ఐ= కూడిన వాడై; కృతవర్మయున్= కృతవర్మా; దక్షిణపాదంబునన్= ముందరి కుడిఅడుగు దగ్గర; త్రిగర్త= త్రిగర్త దేశీయులచేతనూ; దాక్షిణాత్య= దక్షిణదేశపు వారిచేతనూ; సంవృతుండై= కప్పబడినవాడై; కృపాచార్యుండును= కృపాచార్యుడూ; వెనుకడాకాలన్= వెనుకవైపుగల ఎడమకాలివద్ద; నానాదేశసేనతోన్= అనేక దేశాల సేనలతో; శల్యుండును= మద్రరాజూ; వలకాలన్= కుడి వెనుకకాలి వద్ద; అనేక= అధిక సంఖ్యకల; రథ= తేరులతోనూ; కరి= ఏనుగులతోనూ; తురగ= గుఱ్ఱాలతోనూ; సమేతుండు+ఐ= కూడినవాడై; సుషేణ జననాథుండును= సుషేణుడనే రాజూ; పుచ్ఛంబునన్= తోకస్థానంలో; మహాసైన్య= పెద్ద సైన్యంతో; సమగ్రుండు+అయి= పరిపూర్ణుడై; చిత్రుండు+అను= చిత్రుడు అనే పేరుగల; ధాత్రీపతియున్= రాజూ; అతని= ఆ చిత్రుని; తమ్ముండు+అగు= తమ్ముడైన; చిత్రసేనుండును= చిత్రసేనుడనే పేరుగల రాజు; నిలుచు+అట్లు+ఒనర్చి= నిలిచే విధముగా చేసి; తక్కినవారలన్= మిగిలినవారిని; ఎడనెడన్= ఆయాప్రదేశాలలో; పన్నించెన్= ఉండేటట్లు తీర్చినాడు; అట= అక్కడ, పాండవపక్షంలో; మున్ను+అ= వీరు వ్యూహం పన్నటానికి ముందుగానే; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఉద్దామ= భయంకరమైన; సామజ= ఏనుగులు; ఆది= మొదలయిన; చతురంగ= (గజ రథ తురగ పదాతులనే) నాలుగు అంగాల సైన్యంయొక్క; ఉల్లాస= ఉత్సాహంతో; భాసితుండు+అయి= ప్రకాశించినవాడై; నడతెంచెన్= (యుద్ధభూమికి) కదలి వచ్చాడు; అట్లు= ఆ రీతిగా; ఆ+మనుజ విభుండు= ఆ నరపతి - ధర్మరాజు; మన= కౌరవులయొక్క; మొనన్= వ్యూహాన్ని; చూచి= పరిశీలించి చూచి; సవ్యసాచికిన్= అర్జునునితో; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= పలికినాడు.

తాత్పర్యం: ఇట్లా కర్ణుడు సైన్యాలకు సంతోషం కలిగేటట్లు యుద్ధానికి వెళ్ళాడు. శత్రువులు భరించటానికి అశక్యమయ్యేటట్లు మకరవ్యూహం పన్నాడు. ఆ పన్నేటప్పుడు మొసలి నోటిస్థానంలో తానే నిలిచాడు. రెండు కన్నుల వద్దనూ శకునినీ, అతడి కుమారుడు ఉలూకుడినీ ఉండుమన్నాడు. తలదగ్గర అశ్వత్థామ నుంచాడు. మెడవద్ద దుర్యోధనుడి తమ్ములను నిలిపాడు. కడుపు దగ్గర దుర్యోధనుడిని ఉంచాడు. ముందరి ఎడమకాలివద్ద నారాయణ గోపాలురతోపాటు కృతవర్మ నుండుమన్నాడు. కుడిముందరి పాదం దగ్గర త్రిగర్తులతో, దక్షిణదేశాలవారితో కృపాచార్యుడిని నియమించాడు. వెనుక ఎడమకాలి సమీపంలో సకల దేశ సేనలతో శల్యుడిని నిలిపాడు. కుడివెనుక పాదం దగ్గర బహు రథ గజ తురగ సమేతంగా సుషేణుడిని ఉండుమన్నాడు. తోక వద్ద మహాసైన్యంతో చిత్రుడు, అతడి తమ్ముడు చిత్రసేనుడు అనే రాజులను నిలిపాడు. ఇంకా ఉన్నవారిని ఆయా స్థానాలలో ఉండుమన్నాడు.

అటు పాండవపక్షంలో ఇందుకు ముందుగానే యుధిష్ఠిరుడు భయంకరమైన గజ రథ తురగ పదాతి చతురంగ సైన్యోల్లాసంతో వెలిగిపోతూ యుద్ధభూమికి వచ్చాడు. వచ్చి మన వ్యూహాన్ని చూచి, సవ్యసాచితో ఇట్లా అన్నాడు:

చ. 'కనుఁగొనఁ జుల్కనైన యది కౌరవసైన్యము గంటె? సూత నం
దనుఁ డొక యొడ్డుగా నిలిపి తాను ముఖంబున నిల్చి కయ్య మె
ల్లను దనమీఁదఁ బెట్టికొని లావును బీరముఁ జూపఁ బూని యే
పున నటిమెన్ భవద్విశిఖ పుంజములం దెగటార్పు మీతనిన్. 66

ప్రతిపదార్థం: కౌరవసైన్యము= కౌరవులసేన; కనుఁగొనన్= చూడటానికి, లేదా పరిశీలించిన పక్షంలో; చుల్క+ఐన+అది= తేలిక అయింది; కంటి(వి)+ఎ?= చూశావా, ఈ సంగతి కనిపెట్టావా?; (కాని) సూతనందనుఁడు= సూతుని కొడుకైన కర్ణుడు; (దీనిని) ఒక+ఒడ్డుగాన్= ఒక వ్యూహంగా; నిలిపి= నిలబెట్టి; తాను= స్వయంగా (మొసలి); ముఖంబునన్= ముందుభాగంలో; నిలిచి= నిలబడి; కయ్యము= యుద్ధం; ఎల్లను= అంతా; తనమీఁదన్= తనపై; పెట్టికొని= ఉంచికొని; లావున్= బలమూ; బీరమున్= శౌర్యమూ; చూపన్+పూని= ప్రదర్శింపదలచుకొని; ఏపునన్= గర్వంతో; అటిమెన్= ఎదుర్కొన్నాడు; (నీవు) ఈతనిన్= ఈ కర్ణుని; భవత్= నీయొక్క; విశిఖ= బాణములయొక్క; పుంజములన్= సమూహములతో; తెగటార్పుము= చంపుము.

తాత్పర్యం: పరిశీలించి చూస్తే కౌరవ సైన్యం తేలిక అయిపోయింది. కాని, సూతపుత్రుడు దీనినొక వ్యూహంగా పన్ని, ముందుభాగంలో తాను నిల్చొని, యుద్ధభారమంతా తనమీద వేసికొని, ఈ సమయంలో తన బలప్రతాపాలు చూపిద్దామనుకొని, పొగరుతో చెలరేగుతున్నాడు. ఇతడిని నీ శరజాలంతో సంహరించుము.

విశేషం: కర్ణుడిని తలుచుకొంటే ధర్మరాజుకు నిజానికి నిద్రరాదు. కాని, ఈ పద్యంలోని మాటలలో అతడి మీద తనకు కలిగిన చులకన అంతా తెలుపుతున్నాడు. భీష్మద్రోణులే పడిపోయారు. మహావీరులు చాలామంది పోయారు. సైన్యమా కౌరవులది పలచబడిపోయింది. ఇతడు చేయగలిగింది స్వల్పమనే ధైర్యం ఒక ప్రక్కా, అర్జునుడిని పురికొల్పే నేర్పొక ప్రక్కా కనిపిస్తున్నాయి. సూతనందన శబ్దం కూడా సాభిప్రాయమే.

క. వనమునఁ బండ్రెండేఁడులు । మన ముత్కటదుఃఖవార్ధి మగ్నులమై యి
ట్లునికికిఁ దగ నితని భవ । త్సునిశిత బాణాబ్ధి ముంపు దుర్దమలీలన్. 67

ప్రతిపదార్థం: మనము= దిగ్విజయం చేసిన పాండురాజు పుత్రులము, స్వయంగా దిగ్విజయం చేసి రాజసూయం చేసిన వాళ్ళము; వనమునన్= అరణ్యంలో; పండ్రెండు= పన్నెండు; ఏఁడులు= సంవత్సరాలు; ఉత్కట= పెద్ద; దుఃఖ= దుఃఖమనే, వార్ధిన్= సముద్రంలో; మగ్నులము+ఐ= మునిగినవారమై; ఇట్లు= ఈ విధముగా; ఉనికికిన్= ఉండటానికి; తగన్= తగినట్లుగా; ఇతనిన్= ఈ కర్ణుని; భవత్= నీయొక్క; సునిశిత= మిక్కిలి వాడిఅయిన; బాణ+అబ్ధిన్= అమ్ములనే సముద్రంలో; దుర్దమలీలన్= అణపరాని విధముగా; ముంపు(ము)= ముంచివెయ్యి.

తాత్పర్యం: మనం పన్నెండు సంవత్సరాలు దుఃఖసముద్రంలో మునిగిపోయి ఉన్నందుకు తగిన విధంగా ఇతడిని ఇపుడు నీ బాణసముద్రంలో తిరుగులేని విధంగా ముంచివేయుము.

విశేషం: అపకారం చేసినవారికి ప్రత్యపకారం చేయాలనిపించటం సహజం. కర్ణుడు దుష్టచతుష్టయంలోని వాడు కావటమూ, ద్రౌపదీ పరాభవాదులకు మూలం కావటమూ, ఇతడి అండ జూచుకొనే కౌరవులు పాండవుల కెగ్గులుచేయ సాహసించటమూ ఇట్లా అనటానికి కారణాలు.

ఉ. వీఁ డొకరుండె యింక బలవిక్రమ సంపద గల్గి పోరిలో
వాఁడిమి సొంపు సూపఁ గలవాఁడు సుయోధనుపాలఁబేర్చు నీ
వేఁడిమి సూపి రూ పడఁపు వీనిఁ బురందర పుత్త్ర! యంతతోఁ
బోఁడిమి మాలు నాతఁడు ప్రభూత జయోన్నతి నిల్చు నీకడన్. 68

ప్రతిపదార్థం: పురందర పుత్త్ర!= ఇంద్ర పుత్రుడైన అర్జునా!; సుయోధనుపాలన్= దుర్యోధనుని పక్షంలో; ఇంకన్= ఈ పైని; బల= బలముయొక్క; విక్రమ= పరాక్రమంయొక్క; సంపద= సమృద్ధి; కల్గి= ఉండి; పోరిలోన్= యుద్ధంలో; వాఁడిమి సొంపు= తీక్ష్ణత అందం; చూపన్+కలవాఁడు= చూపించే సామర్థ్యం కలవాడు; వీఁడు= ఇతడు; ఒకరుండ= ఒక్కడే; పేర్చున్= చెలరేగుతున్నాడు; నీ వేఁడిమి= నీయొక్క ప్రతాపం; చూపి= ప్రదర్శించి; వీనిన్= ఇతనిని; రూపు+అడఁపు= సంహరించు; అంతతోన్= వీని మరణంతో; అతఁడు= దుర్యోధనుడు; పోఁడిమి మాలున్= శోభను కోల్పోతాడు-క్రుంగిపోతాడు; ప్రభూత= అధికమైన; జయ+ఉన్నతి= గెలుపుయొక్క ఔన్నత్యం; నీకడన్= నీ దగ్గర; నిల్చున్= నిలబడుతుంది.

తాత్పర్యం: ఇంద్రకుమారా, అర్జునా! దుర్యోధనుడి పక్షంలో ఇంకా మిగిలి, బలపరాక్రమాలుండి యుద్ధంలో ప్రతాపం చూపించగలిగిన వా డితడొక్కడే చెలరేగుతున్నాడు. నీ ప్రతాపం చూపించి ఇతడిని సంహరించుము. ఆ దెబ్బతో ఆ దుర్యోధనుడు క్రుంగిపోతాడు. మహోన్నతమైన విజయం వచ్చి నీ దగ్గర నిలబడుతుంది.

వ. నీకుం బోలిన మొగ్గరంబు గావింపు' మనవుడు నర్జునుం డర్ధ చంద్ర వ్యూహ విధానంబున మోహరించి తాను మధ్యప్రదేశస్థుండై వామదక్షిణ శృంగంబుల భీమ ధృష్టద్యుమ్నుల నిలిపి యుధిష్ఠిర నకుల సహదేవులం బింగలిగా నొనర్చె నతని చక్రరక్షకులగు యుధామన్యుండును నుత్తమౌజుండునుం గయ్యంపువేడుక మొగంబులం జిగురొత్తఁ బొలిచిరి. తక్కిన యోధులుం దగినచోట్ల నిలిచి రిట్లిరువాఁగును బన్నియున్న సమయంబున. 69

ప్రతిపదార్థం: నీకున్+పోలిన= నీకు తగిన; మొగ్గరంబు= వ్యూహం; కావింపుము= పన్నవలసినది; అనవుడున్= అని పలుకగా; అర్జునుండు= అర్జునుడు; అర్ధచంద్ర= సగమైన చంద్రునియొక్క; విధానంబునన్= పద్ధతితో; మోహరించి= పన్ని; తాను= అర్జునుడు; మధ్యప్రదేశస్థుండు+ఐ= నడిమిప్రాంతంలో ఉన్నవాడు అయి; వామ= ఎడమది; దక్షిణ= కుడిది అయిన; శృంగంబులన్= కొమ్ములలో; అగ్రభాగాలలో; భీమధృష్టద్యుమ్నులన్= భీమునీ, ధృష్టద్యుమ్నునీ; నిలిపి= ఉంచి; యుధిష్ఠిర= ధర్మరాజునీ; నకుల= నకులునీ; సహదేవులన్= సహదేవునీ; పింగలిగాన్= వెనుకభాగంగా; ఒనర్చెన్= చేశాడు; అతని= అర్జునునియొక్క; చక్రరక్షకులు+అగు= రథచక్రాలను కాపాడేవారైన; యుధామన్యుండును= యుద్ధంలో క్రోధం కలవాడనే అర్థం కల, యుధామన్యుడనే పేరుకల, అర్జునుని ఎడమ రథచక్రానికి రక్షకుడైన పాంచాలరాజకుమారుడు; ఉత్తమ+ఓజుండును= శ్రేష్ఠమైన ఓజస్సు కలవాడనే అర్థంకల పేరున్న, పాంచాల దేశీయుడై, అర్జునుని కుడి రథచక్రానికి రక్షకుడైన యోధుడు; కయ్యము+వేడుక= యుద్ధంచేయాలనే ఉబలాటం; మొగంబులన్= ముఖాలయందు; చిగురొత్తన్= కలుగగా; పొలిచిరి= ఉన్నారు; తక్కిన= మిగిలిన; యోధులున్= యుద్ధవీరులూ; తగిన చోట్లన్= తాము ఉండదగిన ప్రదేశాలలో; నిలిచిరి= ఉన్నారు; ఇట్లు= ఈ విధంగా; ఇరువాఁగును= రెండు పక్షాలు; పన్ని= వ్యూహాలుగా తీర్చి; ఉన్న= ఉండిన; సమయంబునన్= వేళలో; (పరితోషముఁ బొందె' అనే తరువాతి పద్యంలోని క్రియతో అన్వయం)

తాత్పర్యం: నీకు తగిన వ్యూహం నీవు పన్నుము' అని చెప్పాడు. అర్జునుడు అర్ధచంద్ర వ్యూహం పన్నాడు. అందులో మధ్యభాగంలో తానే ఉన్నాడు. ఎడమ చివర భీమసేనుడినీ, కుడిచివర ధృష్టద్యుమ్నుడినీ ఉండుమన్నాడు. యుధిష్ఠిరుడినీ

నకుల సహదేవులనూ వెనుకభాగంలో ఉంచాడు. అతడి చక్రరక్షకులైన యుధామన్యూత్తమౌజుల యుద్ధ కుతూహలం వ్యక్తమౌతున్న ముఖాలతో నిలిచారు. మిగిలిన యోధులు తమకు తగిన తావులలో ఉన్నారు. ఇట్లా ఉభయపక్షాల వారూ వ్యూహాలు తీర్చి ఉన్న సమయంలో.

చ. హరియును బాండునందనులు నాజి నవశ్యము నేఁడు సూడఁ బో
దురు జమునంచు నాత్మఁ బరితోషముఁ బొందె భవత్తనూజుఁడున్
దురమునఁ గర్ణయుక్తముగఁ ద్రుంగు సుయోధనుఁ డన్ తలంపుతోఁ
బరమసముద్యమస్ఫురణఁ బాండవముఖ్యుఁ డెలర్చె భూవరా! 70

ప్రతిపదార్థం: భూవరా!= భూపతీ, ధృతరాష్ట్ర మహారాజా!; భవత్= నీయొక్క; తనూజుఁడున్= కుమారుడైన దుర్యోధనుడు కూడా; హరియును+పాండునందనులున్= కృష్ణుడు, పాండవులూ; నేఁడు= ఈరోజు; ఆజిన్= యుద్ధంలో; అవశ్యము= తప్పక; జమున్= యముని; చూడన్+పోదురు= చూడటానికి వెడతారు, మరణిస్తారు; అంచున్= అనుకొంటూ; ఆత్మన్= మనస్సులో; పరితోషమున్= సంతోషాన్ని; పొందెన్= పొందినాడు; పాండవముఖ్యుడు= పాండురాజు కుమారులలో మొదటివాడైన యుధిష్ఠిరుడు; దురమునన్= యుద్ధంలో; సుయోధనుఁడు= దుర్యోధనుడు; కర్ణయుక్తముగన్= కర్ణునితోపాటు; త్రుంగున్= మరణిస్తాడు; అన్= అనే; తలంపుతోన్= ఆలోచనతో; పరమ= అత్యధికమైన; ఉద్యమ= పూనికయొక్క; స్ఫురణన్= ప్రకాశముతో; ఎలర్చెన్= సంతోషించాడు.

తాత్పర్యం: రాజా! 'ఈ వేళ కృష్ణుడూ పాండవులూ యుద్ధంలో తప్పక పడిపోతా'రని నీ కొడుకు సంతోషించాడు. దుర్యోధనుడు యుద్ధంలో కర్ణుడితో సహా కడతేరుతాడని గట్టి పూనికతో అతిశయించాడు యుధిష్ఠిరుడు.

విశేషం: ధృతరాష్ట్రుడివి అసంభావ్యములైన ఆశలు. ఆ విషయంలో అతడి పోలిక వచ్చిన అతని కొడుకువి వాటికి మించిన ఆశలు. ఈ సన్నాయి నొక్కు 'భవత్తనూజుడు' అనటంలో వినిపిస్తున్నది. పాండురాజు దిగ్విజయం చేశాడు. అతడికి తగిన అతని పెద్దకొడుకు గట్టి పూనికతో అతిశయిస్తున్నాడనటంలో యుద్ధఫలితం అపుడే కనిపించిందని సూచితం.

ఆ. ఒకటి కొకటి కంటె నుబ్బుచు వర్తించు। చాడ్పు దోఁప రెండు సైన్యములను
బొలిచెనపుడు సెలఁగె భూరి భేరీముఖ। తూర్యములు నభంబు దూఁటుకట్ట. 71

ప్రతిపదార్థం: రెండు సైన్యములను= ఉభయసేనలలోనూ; ఒకటికంటెన్= ఒకదానికన్న; ఒకటి= మరొకసేన; ఉబ్బుచున్= బాగా సంతోషిస్తూ; వర్తించు= ప్రవర్తించే; చాడ్పు= పద్ధతి; తోఁపన్= కనిపించేటట్లుగా; పొలిచెన్= ఒప్పినవి; అపుడు= ఆ సమయంలో; భూరి= అధికమైన; భేరీముఖ= భేరులు మొదలయిన; తూర్యములు= వాద్యాలు; నభంబు= ఆకాశం; తూఁటుకట్టన్= చిల్లిపడేటట్లు; చెలంగెన్= మ్రోగాయి.

తాత్పర్యం: రెండు సైన్యాలలోనూ ఒకదానిని మించి మరొకటి ఆనందపడుతున్న రీతిగ ప్రవర్తించటం కనిపించింది. అనంతరం భేరులు మొదలయిన వాద్యాలధ్వనులు ఆకాశం చిల్లులు పడేటట్లు మ్రోగాయి.

వ. చిందంబుల మ్రోఁతకు నిందు నందునం దమకించి భటులు గెలంకులం దాఁకఁ దోడ్తో నెఱపినయగ్గలిక నొండొంటి బెరయ మొగ్గరంబు లురవడించి. 72

ప్రతిపదార్థం: భటులు= సైనికులు; ఇందున్+అందునున్= ఇక్కడా అక్కడా, కౌరవపక్షంలోనూ పాండవపక్షంలోనూ; చిందంబుల= శంఖాలయొక్క; మ్రోఁతకున్= ధ్వనికి; తమకించి= ఉత్సాహించి; కెలంకులన్= పార్శ్వాలను; తాఁకన్= ఢీకొనగా; తోడు+తోన్= వెంటనే; నెఱపిన= ప్రకటించిన; అగ్గలికన్= విజృంభణంతో; ఒండు+ఒంటిన్= పరస్పరం; బెరయన్= కవియగా; మొగ్గరంబులు= వ్యూహాలు; ఉరవడించి= రేగి.

తాత్పర్యం: శంఖాల మ్రోతవలన రెండువైపుల సైనికులలోనూ ఉత్సాహం పెరిగింది. అందువలన ఉభయ పార్శ్వాలలోనూ ఢీకొనటానికి విజృంభించి రెండు వ్యూహాలు కలిసి చెలరేగాయి.

సీ. **నిబిడ ఘంటావళి నిక్వణంబులతోడ । భీషణ బృంహిత ఘోషములును**
ఘననేమి నిష్ఠుర ధ్వనుల పొందులఁ గేతు । నిర్భర కింకిణీ నినదములును
జటుల ఖురవ్రాత పటురవంబులతోడ । నాభీలహేషా మహాస్వనములు
భూరిభుజాస్ఫాలనారావములతోడ । మేదురతర సింహనాదములును

ఆ. **బరఁగి దిక్తటములఁ బగిలింప ననిమిష । ఖచర సిద్ధ యక్ష గరుడ గణము**
లంతరంగములు నితాంత కౌతుకభరి । తములు గాఁగఁ జూడ్కి గములు వఱపె. 73

ప్రతిపదార్థం: నిబిడ= దట్టమైన; ఘంటా= ఏనుగుల గంటలయొక్క; ఆవళి= సముదాయంయొక్క; నిక్వణంబుల తోడన్= ధ్వనులతోపాటు; భీషణ= భయంకరమైన; బృంహిత= గజ ఘీంకారములయొక్క; ఘోషములును= ధ్వనులూ; ఘన= గొప్పవైన; నేమి= (రథచక్రాల) పట్టాలయొక్క; నిష్ఠుర= కఠినమైన; ధ్వనుల= శబ్దాలయొక్క; పొందులన్= చెలుములతో; కేతు= జెండాలయందు; నిర్భర= నిండిన; కింకిణీ= చిరుమువ్వల; నినదములును= ధ్వనులూ; చటుల= కఠినమైన; ఖుర= గుఱ్ఱాల డెక్కలయొక్క; వ్రాత= సమూహాల; పటు= గట్టి; రవంబులతోడన్= ధ్వనులతో; ఆభీల= మిక్కిలి భయంకరాలైన; హేషా= గుఱ్ఱాల సకిలింపులయొక్క; మహాస్వనములును= పెద్ద ధ్వనులూ; భూరి= పెద్దవి అయిన; భుజా= బాహువులయొక్క; ఆస్ఫాలన= చరపులయొక్క; ఆరావములతోడన్= ధ్వనులతో; మేదురతర= మిక్కిలి దట్టమైన; సింహనాదములును= వీరుల సింహగర్జనలవంటి ధ్వనులూ; పరఁగి= వ్యాపించి; దిక్+తటములన్= దిక్ప్రదేశాలను; పగిలింపన్= బ్రద్దలుచేయగా; ఖచర= ఆకాశ సంచారులైన; సిద్ధ= సిద్ధులయొక్క; యక్ష= యక్షులయొక్క; గరుడ= గరుడులయొక్క; గణములు= సమూహాలు; అంతరంగములు= (తమ) మనస్సులు; నితాంత= మిక్కిలి వ్యాపించిన; కౌతుక= కుతూహలంచేత; భరితములు+కాఁగన్= నిండినవికాగా; చూడ్కి= చూపులయొక్క; గములు= సమూహాలను; పఱపెన్= ప్రసరింపజేశాయి.

తాత్పర్యం: ఏనుగుల గంటల ధ్వనులతో వాటి భయంకర ఘీంకార ధ్వనులు కలిశాయి. రథాల పట్టాల కఠిన ధ్వనులతో జెండాల నిండా ఉన్న చిరుమువ్వల సవ్వడులు కలిశాయి. గుఱ్ఱాల గట్టి డెక్కల చివళ్ళ చప్పుళ్ళతో భయాన్ని కలిగించే వాటి సకిలింపులు కలిశాయి. సైనికుల మల్ల చరుపుల ధ్వనులతో, సింహగర్జనలవంటి వారి హుంకార ధ్వనులు కలిశాయి. ఈ ధ్వనులన్నీ వ్యాపించి దిగ్భాగాలు పగిలిపోయాయి. అపుడు ఆకాశంలో సంచరించే దేవయోని విశేషాదులయిన సిద్ధ యక్ష గరుడుల మనస్సులు కుతూహలంతో నిండిపోయాయి. అపుడు వారు చూడసాగారు.

వ. **ఇట్లు దలపడి యిరువాఁగును బేరువాఁడిఁ బోరునెడ గరుడ ప్రహారంబుల నొచ్చిన పంచాస్య పన్నగంబులం బోని బాహువులను గాంతత్వరుచి సౌరభంబుల పెంపున సంపూర్ణ చంద్రార్క కమలంబులం గ్రేణిసేయు**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నాననంబులను సంగ్రామరంగం బలంకృతంబయ్యె వాహనంబులమీఁదనుండి భూషణకిరణంబులు మెఱయ సైనికులు నేలంగూలు నప్పుడు పుణ్యావసాన కాలంబున నాకలోక పరిభ్రష్టంబగు మహాత్మలోకంబు చందంబు దోఁచెఁ జతురంగంబులునుం దమతమ జాతిచేతంబడుటయు నేనుంగు లడరిన నరదంబులు సదియుటయు నాశ్వికులు పొదివినం గరులు ధరం దొరంగుటయు భటు లురవడించినం దురంగంబులు గడికండంబు లగుటయు రథంబులు గవిసినం గాల్వురు దుమురగుటయుఁ గ్రందున నెల్ల తెఱంగులు నన్ని దెఱంగులం గలయ బడలువఱుచుటయు రౌద్రరసంబుఁ బెనిచె నాసమయంబున సాత్యకి ధృష్టద్యుమ్న చేకితాన ద్రౌపదేయులు ప్రభద్రక చేది పాండ్య చోళ మగధ వంగాది దేశంబుల బలంబుల తోడ బరవసంబుసేసి తఱిమి రట్టియెడ. 74

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తలపడి= డీకొని; ఇరువాఁగును= ఉభయపక్షాలూ; పేరు, వాఁడిన్= మిక్కిలి ప్రతాపంతో; పోరు+ఎడన్= యుద్ధంచేసే సమయంలో; గరుడ ప్రహారంబులన్= గ్రద్దల దెబ్బలచేత; నొచ్చిన= చనిపోయిన; పంచాస్య= ఐదుముఖాల; పన్నగంబులంబోని= పాములవంటి; బాహువులను= చేతులతోను; కాంతత్వ= మనోహరంగా ఉండటంయొక్క; రుచి= కాంతియొక్కా; సౌరభంబుల= సువాసనయొక్కా; పెంపునన్= అతిశయంచేత; సంపూర్ణ= పూర్తిగా, నిండైన; చంద్ర= చంద్రునీ; అర్క= సూర్యునీ; కమలంబులన్= పద్మాలనీ; క్రేణిసేయు= తిరస్కరించే; ఆననంబులన్= ముఖాలతోనూ; సంగ్రామ రంగంబు= యుద్ధప్రదేశం; అలంకృతంబు= అలంకరింపబడినది; అయ్యెన్= అయింది; వాహనంబులమీఁదనుండి= వాహనాలపైనుండి; భూషణ= నగలయొక్క; కిరణంబులు= వెలుగులు; మెఱయన్= ప్రకాశించగా; నేలన్= భూమిపై; కూలునపుడు= పడిపోయే సమయంలో; పుణ్య= సుకృతంయొక్క; అవసాన= చివరి; కాలంబునన్= సమయంలో; నాకలోక= స్వర్గలోకం నుంచి; పరిభ్రష్టంబు+అగు= జారిపోయే; మహాత్మ= మహాత్ములయొక్క; లోకంబు= సమూహంయొక్క; చందంబు= పోలిక; తోఁచెన్= ఊహకు వచ్చింది; చతురంగంబులున్= సైన్యంలోని రథాలు; గజాలు, గుర్రాలు, కాలిబంట్లు అనే నాలుగు భాగాలు; తమ తమ; జాతిచేతన్= తెగచేత; పడుటయు= పడిపోవటమూ; ఏనుంగులు= గజాలు; అడరినన్= డీకొనగా; అరదంబులు= రథాలు; చదియుటయున్= విరిగిపోవటమూ; అశ్వికులు= రౌతులు; పొదివినన్= క్రమ్మగా; కరులు= ఏనుగులు; ధరన్= భూమిపై; తొరంగుటయున్= పడిపోవటమూ; భటులు= సైనికులు-కాలిబంట్లు; ఉరవడించినన్= విజృంభించగా; తురంగంబులు= గుర్రాలు; కడి+కండంబులు= ముక్కలు ముక్కలు; అగుటయున్= కావటము; రథంబులు= తేరులు; కవిసినన్= మీదికిరాగా; కాల్వురు= కాలిబంట్లు; తుమురు+అగుటయున్= తుక్కుకావటమూ; క్రందునన్= సందడిలో; ఎల్లతెఱంగులున్= అన్నివిధాలవారు; అన్ని తెఱంగులన్= అన్ని విధాలవారితోనూ; కలయన్= కలియగా; బడలు+ పఱుచుటయున్= అలసిపోయేటట్లు చేయటమూ; రౌద్రరసంబున్= క్రోధమనే నిలుకడగా ఉండే భావాన్ని; పెనిచెన్= పెంచాయి; ఆ సమయంబునన్= అప్పుడు; సాత్యకి= కృష్ణుని తమ్మునివరుసవాడైన సాత్యకి; ధృష్టద్యుమ్నుఁడు= పాండవ సేనానాయకుడు, ద్రౌపది అన్న అయిన ధృష్టద్యుమ్నుడు; చేకితానుఁడు= యాదవవీరుడైన చేకితానుఁడు; ద్రౌపదేయులు= ద్రౌపదికుమారులైన ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతకర్మ అనేవారూ; ప్రభద్రక+చేది+పాండ్య+చోళ+మగధ+వంగ+ ఆదిదేశంబుల బలంబుతోడన్= ప్రభద్రకం, చేది, పాండ్యం, చోళం, మగధం, వంగం మొదలయిన దేశాల సైన్యాలతో; బరవసంబు+చేసి= ఉత్సాహంతో యుద్ధంచేసి; తఱిమిరి= పారిపోయేటట్లు చేశారు; అట్టి+ఎడన్= అట్లాంటి సమయంలో (భీముడు కవిసె అని తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఇట్లా ఉభయసేనలూ డీకొని మహాప్రతాపంతో పోరాడే సమయంలో గ్రద్దల దెబ్బలకు ప్రాణాలు విడిచిన ఐదు తలల పాములవలె తెగిపడిన బాహువులతో, మనోహరకాంతి అధికంగా ఉన్నందువల్ల పూర్ణచంద్ర సూర్యులను, మనోహర పరిమళం అధికంగా ఉన్నందువల్ల పద్మాలను వెలవెలపోయేటట్లు చేసే ముఖాలతో యుద్ధభూమి

అలంకరించబడింది. వీరులు తాము పెట్టుకొన్న ఆభరణాల వెలుగులతో వాహనాలనుండి నేలపై రాలిపడుతుంటే పుణ్యం క్షీణించిన తరువాత స్వర్గభ్రష్టులై ఈ లోకానికి వచ్చి పడుతున్న మహాత్ములవలె ఉన్నారు. చతురంగ సైన్యాలలో ఏనుగులవలన ఏనుగులూ, రథాలవలన రథాలూ, గుర్రాలవలన గుర్రాలూ, కాలిబంట్లవలన కాలిబంట్లూ పడిపోతున్నారు. అదీకాక, ఏనుగులు ఢీకొంటే రథాలు తుక్కయిపోతున్నాయి. కాలిబంట్లు చెలరేగితే గుర్రాలు ముక్కలు ముక్కలయిపోతున్నాయి. రథాలు మీదికి వస్తే కాలిబంట్లు నుగ్గయిపోతున్నారు. ఇట్లా ఎన్నిరకాల వీలయితే అన్ని రకాలా కలియబడి ఎదుటివారిని అలసిపోయేటట్లు చేస్తుంటే రౌద్రం పెరిగిపోయింది. అపుడు సాత్యకీ, ధృష్టద్యుమ్నుడూ, చేకితానుడూ, ఉపపాండవులూ, ప్రభద్రక-చేది-పాండ్య-చోళ-మగధ-వంగ-ప్రభృతి దేశాల సైన్యాలతో ఉత్సాహంతో యుద్ధంచేసి తరిమారు. అపుడు.

ఉ. దంతి ఘటల్ మహోగ్ర సముదగ్రతతో నడతేర దర్ప దు
ర్దాంత గజాధిరోహణ నితాంత సముజ్జ్వల భంగిఁ బ్రౌఢ వి
క్రాంతి విలాస మొప్పఁగ నఖండిత పౌరుషుఁడైన భీముఁ డ
త్యంతసముద్ధతిం గవిసె నస్మదనీకము సంచలింపఁగన్. **75**

ప్రతిపదార్థం: అఖండిత= గొప్పదైన; పౌరుషుఁడు= పౌరుషం కలవాడు; ఐన= అయినట్టి; భీముఁడు; అస్మద్+అనీకము= మనసైన్యము; సంచలింపఁగన్= మిక్కిలి కలతనొందగా; దంతి= ఏనుగులయొక్క; ఘటల్= గుంపులు; మహోగ్ర= అతి తీక్ష్ణమైన; సం+ఉత్+అగ్రతతోన్= భయంకరత్వంతో; నడతేరన్= నడచిరాగా; దర్ప= గర్వంతో; దుర్+దాంత= అణపరాని; గజ= ఏనుగు; అధిరోహణ= ఎక్కుటచేత; నితాంత= అత్యంతమైన; సమ్+ఉత్+జ్వల= మిక్కిలి ప్రకాశించే; భంగిన్= పద్ధతితో; ప్రౌఢ= అధికమైన; విక్రాంతి= విక్రమంయొక్క విలాసము, హొయలు; ఒప్పఁగన్= తగి ఉండగా; అత్యంత= మిక్కుటమైన; సముద్ధతిన్= గర్వంతో; కవిసెన్= ఢీకొన్నాడు.

తాత్పర్యం: ఏనుగుల సమూహాలు మహాభయంకరంగా నడిచిరాగా, మహాపౌరుషశాలి అయిన భీమసేనుడు - అత్యంతకాంతితో, పరిపక్వవిక్రమ విలాసంతో, అత్యధికగర్వంతో - అణచశక్యంకాని ఒక మదపుటేనుగు నెక్కి, మన సేన మిక్కిలి కలతపడేటట్లుగా ఎదుర్కొన్నాడు.

క. ఉదయాచలమున రుచి సం। పదఁ బొలుచు పతంగు పగిదిఁ బ్రసరత్తీవ్ర
ప్రదరములు నెఱయమెఱయఁగ। మదావళము మీద వెలిఁగె మారుతి యధిపా! **76**

ప్రతిపదార్థం: అధిపా!= ధృతరాష్ట్ర మహారాజా!; మారుతి= వాయునందనుడైన భీమసేనుడు; మదావళముమీదన్= మదపుటేనుగు మీద; ప్రసరత్= వ్యాపిస్తున్న; తీవ్ర= వాడికల; ప్రదరములు= బాగా చీల్చే బాణాలు; నెఱయన్= నిండుగా; మెఱయన్= ప్రకాశింపగా; ఉదయ+అచలమునన్= పొడుపు కొండమీద; రుచి= కిరణాల; సంపదన్= ఆధిక్యంతో; పొలుచు= ప్రకాశించే; పతంగు పగిదిన్= సూర్యునివలె; వెలిఁగెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: వేస్తున్న వాడి బాణాలు వ్యాపిస్తూ నిండుగా ప్రకాశిస్తుండగా ఏనుగుమీద ఉన్న వాయుపుత్రుడు భీముడు, ఉదయపర్వతంమీద వ్యాపిస్తున్న కిరణాల ఆధిక్యంతో ఉన్న సూర్యుడివలె ప్రకాశించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ. భీముడిని ఉదయిస్తున్న సూర్యుడితో పోల్చినందున సూర్యుడెట్లా అంధకారాన్ని తరిమి వెలుతురు ప్రసరింపజేస్తాడో, అట్లాగే కర్ణుడు సేనాధిపతి అయినందున పాండవసైన్యంలో ఏమైనా నిరుత్సాహం వ్యాపించిఉన్న పక్షంలో దానిని తొలగించాడని గమ్యమానం అవుతున్నది.

క్షేమధూర్తి యను రాజు భీమునితో యుద్ధము సేసి చచ్చుట (సం. 8-8-25)

వ. అమ్మహావీరు నాలోకించి కులూతదేశాధీశుండయిన క్షేమధూర్తి నిజబలంబులం బురికొల్పికొని యేచిత్రోచి యాహ్వానంబు సేసి తన కరటిం గొలిపిన నది గిరి గిరం దాఁకు తెఱంగున నతని మాతంగంబునకు మార్కొనియె నయ్యిరువురు నొండొరులపైఁ దోమరస్తోమంబు లడరించి యార్చుచు నుద్దండ పరాక్రమంబులగు వేదండంబుల పటు ప్రచారంబులు చారు భీషణంబులుగా నొకళ్ళొకళ్ళం జుట్టుకొని వచ్చుచుం బెనంగి. 77

ప్రతిపదార్థం: కులూత= కులూతం అనే పేరుగల; దేశ= దేశంయొక్క; అధీశుండు= ప్రభువు; అయిన= ఐనట్టి; క్షేమధూర్తి= క్షేమధూర్తి అనే పేరుగలవాడు; అమ్మహావీరున్= ఆ గొప్పవీరుని; ఆలోకించి= చూచి; నిజబలంబులన్= తన సైన్యాలను; పురికొల్పికొని= ప్రోత్సాహపరచుకొని; ఏచి= చెలరేగి; త్రోచి= (తన సైన్యాలను) ముందుకు నడిపించి; ఆహ్వానంబు+చేసి= (భీమసేనుని తన పైకి రమ్మని) పిలిచి; తనకరటిన్= తన ఏనుగును; కొలిపినన్= ఉసికొలుపగా; అది= క్షేమధూర్తి ఏనుగు; గిరి= కొండ; గిరిన్= పర్వతాన్ని; తాఁకు= ఢీకొనే; తెఱంగునన్= విధంగా; అతని= భీమునియొక్క; మాతంగంబునన్= ఏనుగుతో; మార్కొనియెన్= ఢీకొన్నది; ఆ+ఇరువురున్= ఆ యిద్దరూ, (భీమసేన క్షేమధూర్తులిద్దరూ); ఒండు+ఒరులపైన్= పరస్పరం (ఒకరిపై మరొకరు); తోమర= తోమర (చిన్న యీటెలు, చిన్న గుదియలు) అనే ఆయుధాలయొక్క; స్తోమంబులు= సముదాయాలను; అడరించి= ప్రయోగించి; ఆర్చుచున్= అరుస్తూ; ఉద్దండ= భయంకరమైన; పరాక్రమంబుల= పరాక్రమం కలవి; అగు= అయిన; వేదండంబుల= ఏనుగులయొక్క; పటు= వేగంకల; ప్రచారంబులు= నడకలు; చారు= అందమైనవీ; భీషణంబులు= భయంకరములూ; కాన్= అయ్యేటట్లుగా; ఒకళ్ళు= ఒకరు; ఒకళ్ళన్= మరొకరిని; చుట్టుకొని= చుట్టూ తిరిగి; వచ్చుచున్= వస్తూ; పెనంగి= పోరాడి. (తరువాతి పద్యంలోని 'ఆపాదించిరి' అనే క్రియతో అన్వయం.)

తాత్పర్యం: కులూత దేశపురాజు క్షేమధూర్తి భీముడిని చూచాడు. తన సైన్యాలను ప్రోత్సాహపరిచి నడిపించుకొంటూ విజృంభించి, భీముడిని రమ్మని పిలిచి తన ఏనుగును అతడిమీదికి ఉసికొలిపాడు. అది కొండ కొండను ఢీకొన్నట్టుగా భీముడి ఏనుగును ఢీకొన్నది. ఆ వీరులిద్దరూ ఒకరిమీద మరొకరు చిన్న ఈటెలు ప్రయోగించుకొన్నారు. మహాపరాక్రమంకల వారి ఏనుగులు ఒక దానిచుట్టూ మరొకటి తిరుగుతూ ఉంటే అందంగానూ భయంకరంగానూ కూడా ఉన్నది. ఇట్లా వారిద్దరూ యుద్ధంచేశారు.

క. కోదండంబులు గొని బా । హాదర్పము లెసఁగఁ బోరి యన్యోన్యధను
శ్ఛేదంబులఁ బొరిఁబొరి నా । పాదించిరి రయము జనులు ప్రస్తుతి సేయన్. 78

ప్రతిపదార్థం: కోదండంబులు= ధనుస్సులు; కొని= తీసికొని; బాహా= చేతులయొక్క; దర్పములు= గర్వాలు; ఎసఁగన్= వృద్ధిచెందగా; పోరి= యుద్ధంచేసి; పొరిన్+పొరిన్= మళ్ళీమళ్ళీ; రయము= వేగాన్ని; జనులు= ప్రజలు; ప్రస్తుతి+చేయన్= పొగడగా; అన్యోన్య= ఒకరొకరి; ధనుః= విండ్లయొక్క; ఛేదంబులన్= నరకటాలను; ఆపాదించిరి= కలిగించారు.

తాత్పర్యం: ఇద్దరూ ధనుస్సులు తీసికొన్నారు. బాహుబలగర్వాలు పెరుగుతుండగా యుద్ధంచేశారు. వారి వేగాన్ని జనం మెచ్చుకొనే విధంగా ఒకరి ధనుస్సు లొకరు అనేక పర్యాయాలు నరుక్కొన్నారు.

వ. దానం గోపం బగ్గలించి. 79

ప్రతిపదార్థం: దానన్= అందువలన; కోపంబు= అలుక; అగ్గలించి= అధికమై.

తాత్పర్యం: అందువలన వారికి కోపం పెరిగి

తే. శక్తులను దోమరంబుల సరభసముగఁ । బోరుచో భీమసేనుని పేరురమున
క్షేమధూర్తి సముజ్జ్వలతోమరంబు । లేడు నాటించె దర్పంబు రూఢికెక్క. 80

ప్రతిపదార్థం: శక్తులను= ఈటెలతోనూ; తోమరంబులన్= చిన్న యీటెలతోనూ; సరభసముగన్= వేగంగా; పోరుచోన్= పోరేటప్పుడు; క్షేమధూర్తి= క్షేమధూర్తి; భీమసేనుని= భీమునియొక్క; పేరు+ఉరమునన్= విశాలమైన వక్షఃస్థలంమీద; సముజ్జ్వల= బాగా ప్రకాశిస్తున్న; తోమరంబులు= చిన్నయీటెలు; ఏడు= ఏడింటిని; దర్పంబు= తన గర్వం; రూఢికిన్+ఎక్కన్= ప్రసిద్ధిచెందగా; నాటెన్= దిగిపోయేటట్లు చేశాడు.

తాత్పర్యం: శక్తులతోనూ, తోమరాలతోనూ వేగంగా పోరాడే సమయంలో క్షేమధూర్తి, భీమసేనుడి విశాలమైన వక్షఃస్థలంపై చిన్న ఈటెలేడింటిని గ్రుచ్చుకొనేటట్లు వేశాడు. అందువలన అతడి గర్వం ప్రసిద్ధికెక్కింది.

చ. అనిల తనూభవుండు దపనాంశు నిభంబగు తోమరంబు వై
చిన నడుమం గరూశపతి చిత్రముగాఁ దునుమాడి వీఁక నా
తనిఁ బటు షష్టికాండ పరితాడిత దేహునిఁ జేయ మేటివిల్
గొని యతఁ డక్కులూతపతికుంజరమున్ వెసఁగప్పె నమ్ములన్. 81

ప్రతిపదార్థం: అనిల తనూభవుండు= వాయుపుత్రుడైన భీముడు; తపన= సూర్యునియొక్క; అంశునిభంబగు= కిరణంవంటి; తోమరంబు= చిన్న యీటెను; వైచినన్= ప్రయోగింపగా; కరూశపతి= కరూశదేశపురాజు; చిత్రముగా= వింతగా; నడుమన్= మధ్య; తునుమాడి= నరికి; వీఁకన్= పూనికతో; ఆతనిన్= భీముని; పటు= గట్టివైన; షష్టి= అరవై; కాండ= బాణాలతో; పరితాడిత= కొట్టబడిన; దేహునిన్= దేహం కలవానిని; చేయన్= చేయగా; అతఁడు= భీముడు; మేటివిల్= పెద్ద ధనుస్సును; కొని= తీసుకొని; వెసన్= వేగముతో; ఆ+కులూతపతి= ఆ కులూతదేశపురాజుయొక్క; కుంజరమున్= ఏనుగును; అమ్ములన్= బాణాలతో; కప్పెన్= కనపడకుండా చేశాడు.

తాత్పర్యం: భీముడు సూర్యకిరణంవలె మెరుస్తున్న చిన్నఈటె నొకదానిని ప్రయోగించాడు. దానిని కరూశ దేశపురాజు మధ్యలో ఆశ్చర్యకరంగా ముక్కలు చేశాడు. అంతటితో ఆగకుండ వేగంగా అరవై బాణాలు భీముడి శరీరానికి తగిలేటట్లు ప్రయోగించాడు. భీముడు ఒక పెద్దవిల్లు తీసికొని క్షేమధూర్తి ఏనుగుకు అన్నివైపులా బాణాలు దట్టంగా ప్రయోగించాడు.

వ. అట్లు భీమసేనుండు గరూశపతి విక్రమంబు సరకు సేయక యతని దిక్కునుం జూడక క్షేమధూర్తి సామజంబును సాయకమయంబు జేసిన నది మొగ తిరిగి పఱచినం బోవనీక యప్పావని వెనుకొనుటయు నక్కులూతపతి

ప్రయత్నంబున నమ్మాతంగంబు మరల్చి యతని యంగంబునను దద్గజంబు శరీరంబునను నిశాత శరపరం పరలు పఱపిన. 82

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; భీమసేనుండు= భీముడు; కరూశపతి= కరూశదేశపురాజుయొక్క; విక్రమంబు= పరాక్రమాన్ని; సరకు+చేయక= లక్ష్యపెట్టక; అతని= ఆ రాజుయొక్క; దిక్కునున్= వైపుగూడా; చూడక= చూడకుండా; సామజంబును= ఏనుగును; సాయకమయంబున్= బాణాలతో నిండినదానినిగా; చేసినన్= చేయగా; అది= ఆ ఏనుగు; మొగము+తిరిగి= పెడమొగంపెట్టి; పఱచినన్= పరుగుపెట్టినా; ఆ+పావని= ఆ వాయుపుత్రుడైన భీముడు; పోవనీక= పోవనీయక; వెనుకొనుటయున్= వెంబడించేసరికి; ఆ+కులూతపతి= ఆ క్షేమధూర్తి; ప్రయత్నంబునన్= పూనికతో; ఆ+మాతంగంబున్= ఆ ఏనుగును; మరల్చి= వెనుకకు త్రిప్పి; అతని= భీమునియొక్క; అంగంబునను= శరీరంలో; తద్+గజంబు= ఆ ఏనుగుయొక్క; శరీరంబునను= దేహంలోనూ; నిశిత= వాడి అయిన; శర= బాణాలయొక్క; పరంపరలు= వరుసలు; పఱపినన్= ప్రయోగింపగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఆ విధంగా భీముడు కరూశదేశాధిపతి పరాక్రమాన్ని లెక్కచేయక, అతనివైపు కూడ చూడకుండ, అతని ఏనుగు శరీరం నిండా బాణాలు వేసేసరికి, అది వెనుదిరిగి పరుగెత్తింది. అయినా భీముడు దాన్ని వదలకుండా వెంబడించగా, ఆ క్షేమధూర్తి ప్రయత్నించి, తన ఏనుగును మళ్ళీ భీముడివైపు మళ్ళించి, భీముడి శరీరంమీద, అతడి ఏనుగు శరీరంమీద వాడిబాణాల పరంపరలు ప్రయోగించాడు.

విశేషం: భీముడు వజ్రకాయుడు. అతడు పసితనంలోనే కుంతి చేతిలోనుండి జారి క్రిందపడితే కొండరాళ్ళు పిండి అయిపోయాయి. ఒకపాటి బాణపుదెబ్బలు అతడిమీద పనిచేయవు. ద్రోణుడి బాణాలవర్షానికే, కర్ణుడి బాణాలవర్షానికే లెక్కలేకుండా పోయింది. అందువల్ల భీముడు కరూశరాజు బాణాలు లెక్కపెట్టకపోవటం వింతకాదు.

చ. **ఉఱక సమీరసూనుఁడు దదుగ్ర ధనుర్దళనం బొనర్చి యే**
డ్తెఱఁ గరి నొంప నాతఁడు గడిందిమగంటిమి నొండువింట ను
న్మెఱుఁగులు గ్రమ్ముకోల నతనిం గడునొంచి తదీయహస్తి పా
ల్పఱి మహిమ్రొగ్గనేసిన ధరాధిప! నీ బల మార్చె నుబ్బునన్. 83

ప్రతిపదార్థం: ధరాధిప!= భూపతీ!; సమీరసూనుఁడు= వాయుపుత్రుడైన భీముడు; ఉఱక= లక్ష్యపెట్టక; తద్= అతని; ఉగ్ర= భీకరమైన; ధనుః= వింటియొక్క; దళనంబు= విరవటం; ఒనర్చి= చేసి; ఏడ్తెఱన్= పూనికతో; కరిన్= క్షేమధూర్తియొక్క ఏనుగును; నొంపన్= నొప్పింపగా; ఆతడు= క్షేమధూర్తి; కడింది= మిక్కిలి; మగంటిమిన్= పౌరుషంతో; ఒండువింటనున్= వేరే ధనుస్సుతో; మెఱుఁగులు+క్రమ్ము= కాంతులను వ్యాపింపజేసే; కోలన్= అమ్ముతో; అతనిన్= భీముని; కడున్= మిక్కిలి; నొంచి= నొప్పించి; తదీయ= ఆ భీమునిదైన; హస్తి= ఏనుగు; పొల్పు+అఱి= మరణించి; మహిన్= భూమిపై; మ్రొగ్గన్= వ్రాలునట్లుగా; ఏసినన్= బాణాలు ప్రయోగింపగా; నీ బలము= నీ బలము, నీ సైన్యం; ఉబ్బునన్= సంతోషంతో; ఆర్చెన్= అరచినది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! కులూతరాజు ప్రయోగించిన శరపరంపరను భీముడు లక్ష్యపెట్టకుండా, అతడి విల్లు విరుగగొట్టాడు. అతడి ఏనుగునూ నొప్పించాడు. అపుడు ఆ రాజు మహాపౌరుషంతో మరొక విల్లు తీసికొని, వెలుగులు చిమ్మే బాణంతో భీముడిని బాగా నొప్పించి, అతడి ఏనుగు ప్రాణాలు విడిచి నేలపై పడిపోయేటట్లు చేశాడు. దానికి సంతోషించి నీ సైన్యం అరచింది.

మ. గదసేతంగొని దంతి డిగ్గి చని యా కౌంతేయుఁ డవ్వీరు ను
న్మద మాతంగముఁ గూలనేసినఁ గృపాణస్ఫారదోర్దండుఁడై
కదియన్ వచ్చె నతండు నిష్ఠురగదాఘాతంబునం గూల్చె నే
పు దలిర్పన్ వెసనామరుత్తనయుఁ డా భూమీశు భూమీశ్వరా! 84

ప్రతిపదార్థం: భూమీశ్వరా!= భూపతీ, రాజా!; ఆ కౌంతేయుఁడు= ఆ కుంతీపుత్రుడైన భీముడు; గద; చేతన్= చేతితో; కొని= పట్టుకొని; దంతిన్= ఏనుగును; డిగ్గి= దిగి; చని= వెళ్ళి; ఆ వీరున్= ఆ వీరుడైన క్షేమధూర్తి యొక్క; ఉన్మద= మిక్కిలి మదించిన; మాతంగమున్= ఏనుగును; కూలన్+ఏసినన్= పడిపోయేటట్లు కొట్టగా; అతండు= క్షేమధూర్తి; కృపాణ= ఖడ్గంతో; స్ఫార= కదులుతున్న; దోర్దండుఁడై= దండంవంటి చేయికలవాడై; కదియన్= సమీపింపగా, మార్కొనగా; వచ్చెన్= వచ్చాడు; ఆ మరుత్+తనయుడు= ఆ వాయుపుత్రుడైన భీముడు; ఆ భూమి+ఈశున్= ఆ భూపతిని; ఏపు= ఆధిక్యం; తలిర్పన్= ఒప్పగా; నిష్ఠుర= కఠినమైన; గదా= గదయొక్క; ఆఘాతంబునన్= దెబ్బతో; వెసన్= వెంటనే; కూల్చెన్= పడిపోయేటట్లు చేశాడు, సంహరించాడు.

తాత్పర్యం: భీముడు గద చేతితో పట్టుకొని పడిపోయిన ఏనుగు మీది నుండి దిగి, క్షేమధూర్తి ఏనుగును పడగొట్టాడు. క్షేమధూర్తి కత్తిపట్టుకొని భీముడి మీదికి వచ్చాడు. మహారాజా! భీముడు వెంటనే కఠిన గదా ప్రహారంతో అతడిని సంహరించాడు.

వ. ఇవ్విధంబున నేనుంగు పీనుంగు కడన పడిన క్షేమధూర్తి వజ్రప్రహారంబునం గూలిన కులశైలంబు సమీపంబున నిర్ఘాతపాతపతితంబయిన కంఠీరవంబు కరణి నొప్పె నతనిం గనుంగొని మన మొన వెఱచఱచి పఱచినఁ బాండవ బలంబులు వెనుకొనుటయు. 85

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఇలా; ఏనుగు= గజముయొక్క; పీనుంగు కడన= కళేబరం వద్దనే; పడిన= పడిపోయిన; క్షేమధూర్తి= కులూతదేశపు రాజు; వజ్ర= ఇంద్రుని వజ్రాయుధంయొక్క; ప్రహారంబునన్= దెబ్బవల్ల; కూలిన= పడిపోయిన; కులశైలంబు= కులపర్వతంయొక్క; సమీపంబునన్= దగ్గర; నిర్ఘాత= పిడుగుయొక్క; పాత= పడటంవల్ల; పతితంబు+అయిన= పడిపోయిన; కంఠీరవంబు= సింహం; కరణిన్= వలె; ఒప్పెన్= అందగించాడు; మనమొన= మనసేన; అతనిన్= క్షేమధూర్తిని; కనుంగొని= చూచి; వెఱచఱచి= భయపడి; పఱచినన్= పారిపోగా; పాండవ బలంబులు= పాండవుల సేనలు; వెనుకొనుటయున్= వెంబడించేసరికి (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఇట్లా తన ఏనుగు కళేబరం వద్దనే పడిపోయిన క్షేమధూర్తి, ఇంద్రుడి వజ్రాయుధపు దెబ్బకు కూలిన కులపర్వతం దగ్గరనే, పిడుగుపాటుకు పడిపోయిన సింహంవలె శోభించాడు. అట్లా పోయిన అతడిని చూచేసరికి మన సేనకు భయంపుట్టి పారిపోసాగింది. దానిని పాండవసేనలు తరుముతున్నాయి. అపుడు.

విశేషం: అలం: ఉపమ. మన పురాణేతిహాసాలనుబట్టి భూమి ఏడుదీవులుగా ఉన్నది. వాటిలో ఒకటి జంబూద్వీపం. ప్రతి ద్వీపంలోనూ ఏడేసి ప్రధాన పర్వతాలున్నాయి. వాటిలో జంబూద్వీపంలోని ఏడు ఇవి: మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, గంధమాదనం, వింధ్యం, పారియాత్రం- వీటిని కులపర్వతాలంటారు.

మ. పటు బాణప్రకరంబు లంబరముఁ గప్పం గర్ణుఁ డాసేనఁ దాఁ
కుటయున్ సైన్యము దైన్యముం దొఱఁగి మార్కొన్నన్ భుజాసంపదు
త్కట గర్వోద్ధురభంగిఁ బాండుసుతులున్ దర్పంబు సొం పేర్పరిం
చుటకుం జొచ్చినఁ బేర్చెఁ బోరనిమిషస్తోమాద్భుతాపాదియై. 86

ప్రతిపదార్థం: కర్ణుఁడు= అంగరాజు; పటు= గట్టివైన; బాణ= అమ్ములయొక్క; ప్రకరంబులు= సముదాయాలు; అంబరమున్= ఆకాశాన్ని; కప్పన్= కనబడకుండా చేయగా; ఆ సేనన్= ఆ తరుముతున్న పాండవసైన్యాన్ని; తాఁకుటయున్= ఢీకొనేసరికి; సైన్యము= మనసేన; దైన్యమున్= దీనత్వాన్ని; తొఱఁగి= విడిచిపెట్టి; మార్కొన్నన్= ఢీకొనేసరికి; పాండుసుతులున్= పాండవులు; భుజాసంపద్= బాహుబలంయొక్క; ఉత్కట= అత్యధికమైన; గర్వ= పొగరువల్ల; ఉద్ధురభంగిన్= భయంకరమైన రీతిలో; దర్పంబుసొంపు= గర్వంయొక్క అందం; ఏర్పరించుటకున్= ప్రకటించటానికి; చొచ్చినన్= ప్రారంభింపగా; పోరు= యుద్ధం; అనిమిష= రెప్పపాటులేని వారైన దేవతలయొక్క; స్తోమ= సమూహానికి; అద్భుత= ఆశ్చర్యాన్ని; ఆపాది+ఐ= కలిగించేది అయి; పేర్చెన్= ప్రవర్తిల్లింది.

తాత్పర్యం: ఆకాశాన్ని కప్పివేసేటట్లు బలమైన బాణాలు ప్రయోగిస్తూ కర్ణుడు పాండవసేనను ఢీకొన్నాడు. దానితో మన సైన్యం దైన్యాన్ని విడిచి మళ్ళీ పాండవసైన్యాన్ని ఎదుర్కొన్నది. పాండవులు భయంకరంగా తమ భుజబల గర్వాన్ని ప్రకటిస్తూ తమ దర్పవిలాసం చూపించసాగారు. దానితో దేవతలకు కూడా ఆశ్చర్యం కలిగించేటట్లు యుద్ధం నడిచింది.

విశేషం: అనిమిష స్తోమ - అన్నపుడు అనిమిష శబ్దం దేవ పర్యాయంగా వాడటం సప్రయోజనం. అసలే రెప్పపాటులేని దేవతలు ఆశ్చర్యపోయేటట్లు యుద్ధం జరిగిందనటం బాగుంది. ఆశ్చర్యంతో చూచాడనటానికి కళ్ళప్పగించి చూశాడంటారు.

వ. అందు. 87

తాత్పర్యం: ఆ యుద్ధంలో.

క. సూతతనయ నారాచ। స్యూతములై వారణంబు లొఱలును సొగయున్
భూతలమునఁ బొరలు దెరలు। వే తూలును జిట్టఁ దిరుగు విచ్చుం జచ్చున్. 88

ప్రతిపదార్థం: వారణంబులు= ఏనుగులు; సూత తనయ= సూత పుత్రుడైన కర్ణునియొక్క; నారాచ= బాణాలచేత; స్యూతములు+ఐ= గ్రుచ్చబడినవై; ఒఱలున్= అరిచాయి; సొగయున్= మూర్ఛిల్లాయి; భూతలమునన్= నేలమీదపడి; పొరలున్= దొర్లాయి; తెరలున్= క్షోభపడ్డాయి; వేఁ= వెంటనే; తూలును= కూలబడ్డాయి; చిట్టన్= కోపంతో; తిరుగున్= అటూ ఇటూ గిరగిరా గమ్యంలేకుండా తిరిగాయి; విచ్చున్= చెదరిపోయాయి; చచ్చున్= మరణించాయి.

తాత్పర్యం: కర్ణుడి బాణాలు గ్రుచ్చుకొనేసరికి పాండవుల ఏనుగులు బాధతో అరిచాయి. మూర్ఛిల్లాయి, నేలమీదపడి దొర్లాయి, కలత చెందాయి, వెంటనే కూలబడ్డాయి. చిర్రెత్తుక వచ్చి తిరిగాయి, పారిపోయాయి. మరణించాయి.

వ. అప్పుడు నకులుం డతని మార్కొనియె; భీమసేనుం డశ్వత్థామను, సాత్యకి గైకేయులగు విందానువిందులను జిత్ర సేనుండనురాజు శ్రుతకర్మను, బ్రతివింధ్యుండు చిత్రుండను మనుజనాథుని, ధర్మపుత్రుండు దుర్యోధనుని,

ధనంజయుండు సంశప్తకులను, ధృష్టద్యుమ్నుండు గృపాచార్యుని, శిఖండి గృతవర్మను, శ్రుతకీర్తి శల్యుని, సహదేవుండు దుశ్శాసనునిం దలపడి రట్టియెడ. 89

ప్రతిపదార్థం: అప్పుడు= కర్ణుని చేతిలో గజసైన్యం కూలిపోతున్న సమయంలో; నకులుండు; అతనిన్= కర్ణుని; మార్కొనియెన్= ఎదుర్కొన్నాడు; భీమసేనుండు= భీముడు; అశ్వత్థామను= ద్రోణుని కుమారునీ; సాత్యకి= యుయుధానుడు, వృష్ణి వంశీయుడు, శిని మనుమడు, సత్యకుని కొడుకు - కృష్ణుడికి తమ్ముని వరుసవాడు; కైకేయులు+అగు= కేకయ వంశీయులయిన; విందానువిందులను= విందుడు అనువిందుడు అనే సోదరులనూ; చిత్రసేనుండు+అను= చిత్రసేనుడనే పేరుగల; రాజు= అభిసారదేశపు ప్రభువు; శ్రుతకర్మను= ద్రౌపదీ సహదేవుల పుత్రునీ; ప్రతివింధ్యుండు= ద్రౌపదీ యుధిష్ఠిరుల కుమారుడు; చిత్రుండు+అను= చిత్రుడనే పేరుగల; మనుజనాథుని= నరపతినీ; ధర్మపుత్రుండు= యుధిష్ఠిరుడు; దుర్యోధనుని= దుర్యోధనునీ; ధనంజయుండు= అర్జునుడు; సంశప్తకులను= అర్జునుని చంపుతామని ప్రతిజ్ఞచేసిన యోధులనూ; ధృష్టద్యుమ్నుండు= ద్రౌపది అన్న; కృపాచార్యుని= ద్రోణుని బావమరదినీ; శిఖండి= ద్రౌపది మరొక అన్న; కృతవర్మను= యదువంశంలోని భోజశాఖీయుడైన హృదికుని పుత్రునీ; శ్రుతకీర్తి= ద్రౌపదీ పార్థుల తనయుడు; శల్యుని= మద్రరాజునీ; సహదేవుండు= చివరి పాండవుడు; దుశ్శాసనునిన్= దుర్యోధనుని మొదటి తమ్మునీ; తలపడిరి= ఢీకొన్నారు; అట్టి+ఎడన్= అటువంటి సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఆ సమయంలో నకులుడు కర్ణుడిని ఎదుర్కొన్నాడు. భీమసేనుడు అశ్వత్థామనూ, సాత్యకి కేకయ వంశీయులయిన విందానువిందులనూ, చిత్రసేనుడు శ్రుతకర్మనూ, ప్రతివింధ్యుడు చిత్రుడిని, ధర్మరాజు దుర్యోధనుడిని, అర్జునుడు సంశప్తకులను, ధృష్టద్యుమ్నుడు కృపాచార్యుడినీ, శిఖండి కృతవర్మనూ, శ్రుతకీర్తి శల్యుడినీ, సహదేవుడు దుశ్శాసనుడినీ ఎదుర్కొన్నారు.

సీ. శైనేయుతోడ విందానువిందులు మహా । హవము సేయంగ నయ్యాదవోత్త
ముఁడు పేర్చి వారి కార్ముకములు రెంటిని । దునిమి యంగంబుల నినిచెఁ దూపు
లవ్వీరు లన్య శరాసనోద్ధారులై । యతనిపైఁ బఱపిరి శితశరంబు
లతఁడును వారు నన్యోన్యచాపచ్ఛిదా । వైచిత్రి నొప్పారి రేచి దొడ్డ

విల్లుగొని యతి రయమున భల్లనిహతి । నాతఁ డనువిందు తలఁద్రుంప నది ప్రదీప్త
రత్నకుండలశోభాభిరామపతన । భంగిఁ దదనీక శోకసంపాదియయ్యె. 90

ప్రతిపదార్థం: వింద+అనువిందులు= విందుడు అనువిందుడు అను కైకేయులు; శైనేయు తోడన్= శిని మనుమడైన సాత్యకితో; మహత్+ఆహవము= గొప్పయుద్ధం; చేయంగన్= చేయగా; ఆ+యాదవ+ఉత్తముఁడు= ఆ యాదవశ్రేష్ఠుడైన సాత్యకి; పేర్చి= విజృంభించి; వారి= విందానువిందులిద్దరియొక్క; కార్ముకములు= ధనుస్సులు; రెంటిని= రెండింటినీ; తునిమి= నరికి; అంగంబులన్= వారి శరీరాలలో; తూపులు= బాణాలను; నినిచెన్= నింపాడు; ఆ+వీరులు= ఆ వీరులయిన విందానువిందులు; అన్యశరాసన+ఉత్+ధారులు+ఐ= వేరే ధనుస్సులు తీసికొన్నవారై; అతనిపైన్= సాత్యకిమీద; శితశరంబులు= వాడి బాణాలను; పఱపిరి= ప్రయోగించారు; అతడును= సాత్యకీ; వారున్= విందానువిందులూ; అన్యోన్య= పరస్పరం, ఒకళ్ళొకళ్ళ; చాపచ్ఛిదా= ధనుస్సులను నరుకుకొనటంలోని; వైచిత్రిన్= వింతతో; ఒప్పారిరి= శోభించారు; ఆతఁడు= సాత్యకి; ఏచి= విజృంభించి; దొడ్డవిల్లు= పెద్ద ధనుస్సును; కొని= తీసికొని; అతిరయమునన్= మిక్కిలి వేగంతో; భల్లనిహతిన్= బాణపు దెబ్బతో; అనువిందు= అనువిందునియొక్క; తలన్= శిరస్సును; త్రుంపన్= నరకగా; అది= ఆ తల; ప్రదీప్త= మిక్కిలిగా

వెలుగుతున్న; రత్న= రత్నాలు కల; కుండల= కర్ణభూషణాలయొక్క; శోభా= కాంతితో; అభిరామ= మనోహరమైన; పతనభంగిన్= పడే పద్ధతితో; తద్+అనీక= అతడి సైన్యానికి, లేదా కౌరవ సైన్యానికి; శోక= వగపును; సంపాది= సంపాదించేది; అయ్యెన్= అయినది.

తాత్పర్యం: విందానువిందులు సాత్యకితో గొప్పయుద్ధం చేశారు. అందులో సాత్యకి విజృంభించి వారి రెండు ధనుస్సులూ నరికాడు. వారి శరీరాల నిండా బాణాలు నింపాడు. వారిద్దరూ వేరే ధనుస్సులు తీసికొని అతడిమీద వాడి అమ్ములు ప్రయోగించారు. తరువాత సాత్యకి, విందానువిందులూ ఒకరి ధనుస్సులు మరొకరు వింత వింతగా ఖండించుకొన్నారు. సాత్యకి ఒక పెద్ద ధనుస్సు తీసికొని మిక్కిలి వేగంతో బాణం ప్రయోగించి అనువిందుడి తల నరికాడు. అది బాగా మెరుస్తున్న రత్నకుండలశోభతో మనోహరంగా ఉండి పడుతూ, అతడి సైన్యానికీ మనసైన్యానికీ కూడా శోకం కలిగించింది.

మ. **కని విందుండు ప్రదీప్తచాప ధరుఁడై కాండప్రసారంబులన్**
శినివీరుం గుసుమాఢ్య కింశుకసముం జేయంగ నయ్యోధుఁ డా
తని యంగంబులఁ బంచవింశతి శితాస్త్రంబుల్ వడిం గ్రుచ్చె నే
పున వారొండొరుసూతులం దునిమి నిప్పుల్రాలు కన్దోయితోన్. **91**

ప్రతిపదార్థం: విందుండు= విందుడు; కని= (తమ్మునిపాటు) చూచి; ప్రదీప్త= ఎక్కువగా మెరుస్తున్న; చాప= ధనుస్సును; ధరుండు+ఐ= ధరించినవాడై; కాండ= బాణాలయొక్క; ప్రసారంబులన్= వ్యాప్తులతో; శినివీరున్= శినిమనుమడైన వీరుడు సాత్యకిని; కుసుమాఢ్య= పువ్వులుగల; కింశుక= మోదుగుచెట్టుతో; సమున్= సమానమైన వానినిగా; చేయంగన్= చేయగా; ఆ+యోధుఁడు= సాత్యకి; ఆతని= విందుయొక్క; అంగంబులన్= అవయవాలమీద; పంచవింశతి= ఇరవై ఐదు; శిత+అస్త్రంబుల్= వాడిబాణాలు; వడిన్= వేగంతో; క్రుచ్చెన్= నాటినాడు; వారు= సాత్యకీవిందుడూ; ఏపునన్= విజృంభణంతో; ఒండు+ఒరు= ఒకరు మరొకరియొక్క; సూతులన్= సారథులను; నిప్పుల్= అగ్నికణాలు; రాలు= క్రిందపడవేసే; కన్దోయితోన్= కన్నుల జంటతో; తునిమి= ఖండించి.

తాత్పర్యం: విందుడు తన తమ్ముడి పాటు చూచాడు. బాగా మెరుస్తున్న ధనుస్సు పట్టుకొన్నాడు. అమ్ములు ప్రయోగించి సాత్యకిని పువ్వులతో ఉన్న మోదుగుచెట్టువలె చేశాడు. (అనగా పలుగాయాలు కలుగజేసి ఆ గాయాల నుంచి నెత్తురు వచ్చేటట్లు చేశాడు. అందువలన ఆ గాయాలు మోదుగు పువ్వులవలె ఎర్రగా ఉన్నందున సాత్యకి పూలతో ఉన్న మోదుగుచెట్టువలె ఉన్నాడని భావం.) అపుడు సాత్యకి విందుని అవయవాలపై ఇరవై ఐదు బాణాలు నాటాడు. అట్లా వారిద్దరూ విజృంభించి కోపంతో కన్నులు నిప్పులు రాల్చుతున్నవా అన్నట్లు ఎర్రబడిన కన్నుల జంటతో ఒకరి సూతుని మరొకరు చంపుకొని.

విశేషం: అలం: ఉపమ.

తే. **ఒకళు లొకళుల హయముల నుర్విఁగూల్చి । యొండొరుల కార్ముకమ్ములు ఖండితములు**
సేసి తేరులు డిగ్గి రుద్భాసి తాసి । చర్మశోభిత హస్తులై సరభసముగ. **92**

ప్రతిపదార్థం: ఒకళులు= ఒకరు; ఒకళుల= మరియొకరియొక్క; హయములన్= గుర్రాలను; ఉర్విన్= నేలపై; కూల్చి= పడిపోయేటట్లుచేసి, సంహరించి; ఒండు+ఒరుల= ఒకరు మరియొకరి యొక్క; కార్ముకములు= ధనుస్సులను; ఖండితములు+చేసి= నరకబడినవిగా చేసుకొని; ఉద్భాసిత= మిక్కలిగా మెరసే; అసి= ఖడ్గాలతో; చర్మ= డాలులతో; శోభిత= విలసిల్లే; హస్తులు+ఐ= చేతులు కలవారై; సరభసముగన్= త్వరతో; తేరులు= రథాలు; డిగ్గిరి= దిగినారు.

తాత్పర్యం: ఒకరి గుర్రాలను మరొకరు చంపుకొన్నారు. ఒకరి ధనుస్సులను మరొకరు నరుకుకొన్నారు. ఇరువురూ కత్తులతో డాలులతో తమ చేతులు ప్రకాశిస్తుండగా గబగబా రథాలనుండి నేలకు దిగారు.

వ. ఇట్లు పాదచారులై మండల ప్రచారంబుల మెఱయుచు. 93

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; పాదచారులు+ఐ= (వాహనాలపై ఉండక) కాళ్ళతో నడుస్తున్నవారై; మండల ప్రచారంబులన్= వలయాలుగా తిరగటములతో; మెఱయుచున్= ప్రకాశిస్తూ. (పై పద్యంలోని పొలిసెన్ అన్న క్రియతో అన్వయం.)

తాత్పర్యం: ఇట్లా కాలినడకతో వలయాలుగా తిరుగుతూ.

క. చేరి బహు చిత్ర గతులం । బోరంగా నొడ్డనములఁ బొలిసెం బలకల్
నేరిమిమైఁ గెళవున శిని । వీరుం డిరువఱియగాఁగ విందుని వ్రేసెన్. 94

ప్రతిపదార్థం: చేరి= సమీపించి; బహు= అనేకమైన; చిత్ర= వింతలైన; గతులన్= నడకలతో; పోరంగాన్= యుద్ధంచేయగా; పలకలు= డాళ్ళు; ఒడ్డనములన్= కత్తి దెబ్బలకు కాపుగా పెట్టటమువల్ల; పొలిసెన్= బ్రద్దలైపోయాయి; శినివీరుండు= సాత్యకి; విందునిన్= విందుని; ఇరు= రెండు; పఱియగాఁగన్= ముక్కలయ్యేటట్లు; నేరిమిమైన్= నేర్పుతో; కెళవునన్= పార్శ్వంలో; వ్రేసెన్= నరికాడు.

తాత్పర్యం: సమీపించి చిత్ర విచిత్ర గమనాలతో పోరాడే సమయంలో, వారి డాళ్ళు రెండూ కత్తి దెబ్బలకు మాటుగా పెట్టటంవలన పగిలిపోయాయి. సాత్యకి ప్రక్కనుంచి నేర్పుతో రెండు ముక్కలయ్యేటట్లు విందుడిని ఖండించాడు.

వ. ఇత్తెఱంగున నయ్యిరువురం జంపి సాత్యకి యుధామన్యు తేరెక్కి యుక్కున వేఱొక్క రథంబు సన్నద్ధంబు గావించుకొని కైకేయబలంబులం బఱపెఁ జిత్రసేనుండును నీ మనుమండగు శ్రుతకర్మయుం బెనంగునెడ నాశ్రుతకర్ముండు. 95

ప్రతిపదార్థం: సాత్యకి= యుయుధానుడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఆ+ఇరువురన్= ఆ విందానువిందులనిద్దరినీ; చంపి= సంహరించి; యుధామన్యు= అర్జునుని చక్రరక్షకుడైన యుధామన్యునియొక్క; తేరు+ఎక్కి= రథం ఎక్కి; ఉక్కునన్= ప్రతాపంతో; వేఱు+ఒక్క= వేఱే ఒక; రథంబు= తేరు; సన్నద్ధంబు= సంసిద్ధం; కావించుకొని= చేయించుకొని; కైకేయ బలంబులన్= కేకయదేశ సేనలను; పఱపెన్= తరిమాడు; చిత్రసేనుండును= చిత్రసేనుడనే అభిసారదేశపు రాజు; నీ మనుమండు+అగు= నీ తమ్ముని మనుమడు కనుక నీకు మనుమడే అయిన; శ్రుతకర్మయున్= ద్రౌపదీ సహదేవుల పుత్రుడయిన శ్రుతకర్మ; పెనంగు= పోరాడే; ఎడన్= సమయంలో; ఆ= ప్రసిద్ధుడైన; శ్రుతకర్ముండు= శ్రుతకర్మ. (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: సాత్యకి ఇట్లా విందానువిందులిద్దరినీ సంహరించాడు. యుధామన్యుడి రథమధిరోహించాడు. ప్రతాపంతో మరొక్కతేరు సిద్ధం చేయించుకొన్నాడు. అభిసారదేశపు రాజు చిత్రసేనుడూ, ద్రౌపదీసహదేవుల కుమారుడు శ్రుతకర్మా పోరాడుతుండగా శ్రుతకర్మ.

క. ఆ రాజు నైదు వాలిక । నారసముల నొంప నతఁడు నవశరముల న
క్కౌరవుని నేసి నొంచెను । సారథి నై దింట నధిక సంరంభమునన్. 96

ప్రతిపదార్థం: ఆ రాజున్= చిత్రసేనుని; ఐదు= అయిదు; వాలిక= వాడియయిన; నారసములన్= కేవలం ఇనుముతో చేసిన బాణాలతో; నొంపన్= నొప్పింపగా; అతఁడు= చిత్రసేనుడు; అధికసంరంభమునన్= అధికమైన త్వరతో; ఆ+కౌరవునిన్= ఆ కురువంశీయుడైన శ్రుతకర్మను; నవశరములన్= తొమ్మిది అమ్ములతో; ఏసి= కొట్టి; అతని సారథిన్= అతని సూతుని; ఐదింటన్= ఐదు బాణాలతో; నొంచెను= నొప్పించాడు.

తాత్పర్యం: ఆ అభిసార దేశపు రాజును వాడికల ఐదు ఇనుపబాణాలతో నొప్పించగా, అతడు తొమ్మిది బాణాలతో మిక్కిలి త్వరతో శ్రుతకర్మను కొట్టి, ఐదు బాణాలతో అతడి సారథిని నొప్పించాడు.

సీ. శ్రుతకర్మ కోపించి క్రూరనారాచ మ । జ్జన నాథుజత్రుదేశమున నాటఁ
బడి మూర్ఛవోయినఁ బైపయి వెండియు । నేయఁ దెప్పిఱి యతం డెసకమెసఁగ
నుక్కునఁ దునుమాడె నక్కుమారుని శరా । సన మతఁడొండొక చాపమెత్తి
తఱచుటమ్ముల నేదు వెఱిఁగిన చందంబు । సేసె రయంబునఁ జిత్రసేను

తే. నాతఁ డాతనియురమున శాతశరము । దూఱనేయ నబ్బాలుండు తోన వివిధ
బాణముల నాన్నృపుని ముంచి శోణితమున । భల్లమొక్కటఁ దల నేల డొల్లనేసె. 97

ప్రతిపదార్థం: శ్రుతకర్మ= ద్రౌపదీ సహదేవుల కుమారుడు; కోపించి= అలిగి; క్రూర నారాచము= కఠినమైన బాణం; ఆ+ జననాథు= ఆ రాజుయొక్క; జత్రుదేశమునన్= భుజము శిరస్సు రొమ్మూ కలిసే ప్రదేశంలో; నాటన్= దిగేటట్లు వేయగా; పడి= క్రిందపడి; మూర్ఛ+పోయినన్= మూర్ఛిల్లగా; పై+పయి= ఆ పైని; వెండియున్= మళ్ళీ; ఏయన్= బాణం ప్రయోగింపగా; అతండు= చిత్రసేనుడు; తెప్పిఱి= మూర్ఛనుండి తేరుకొని; ఎసకము= విజృంభణం; ఎసఁగన్= ఒప్పగా; ఉక్కునన్= ప్రతాపంతో; ఆ+కుమారుని= ఆ బాలునియొక్క; శరాసనము= ధనుస్సును; తునుము+ఆడెన్= నరికాడు; అతడు= శ్రుతకర్మ; ఒండు+ఒక= మరొక; చాపము= ధనుస్సును; ఎత్తి= తీసికొని; రయమునన్= వేగంతో; తఱచు= దట్టముగా, ఎడములేకుండా పడిన; అమ్ములతోన్= బాణాలతో; చిత్రసేనున్= చిత్రసేనుని; ఏదు= ఏదుపంది, ముండ్లపంది; వెఱిఁగిన= విజృంభించిన, అనగా ముడుచుకొని ఉన్న ముళ్ళువిప్పిన; చందంబు= విధముగా; చేసెన్= చేశాడు; ఆతఁడు= ఆ చిత్రసేనుడు; శాతశరము= వాడియైన బాణం; ఆతని= ఆ శ్రుతకర్మయొక్క; ఉరమునన్= రొమ్ములో; దూఱన్= చొచ్చిపోయేటట్లుగా; ఏయన్= ప్రయోగింపగా; ఆ+బాలుండు= శ్రుతకర్మ; తోన్+అ= వెంటనే; వివిధ= పలురకములయిన; బాణములన్= అమ్ములతో; ఆ నృపుని= ఆ రాజును; శోణితమునన్= రక్తంలో; ముంచి= మునిగేటట్లుచేసి; భల్లము= బాణము; ఒక్కటన్= ఒకదానితో; తల= ఆ రాజు శిరస్సు; నేలన్= భూమిపై; డొల్లన్= దొర్లేటట్లుగా; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: శ్రుతకర్మకు కోపం వచ్చి, ఒక గట్టి బాణంతో ఆ రాజును భుజముశిరస్సూ రొమ్మూ కలిసేచోట కొట్టాడు. దానితో ఆ రాజు మూర్ఛిల్లాడు. శ్రుతకర్మ అట్లా ఉన్నవాడిని మళ్ళీ కొట్టాడు. అపు డారాజుకు తెలివి

వచ్చింది. అపుడు అతడు విజృంభించి ప్రతాపంతో శ్రుతకర్మ ధనుస్సును విరగ్గొటాడు. శ్రుతకర్మ మరొక విల్లు తీసుకొని ఆరాజు శరీరం నిండా బాణాలు నాటితే ఆయన ఏదుపంది ఒళ్ళు పెంచినట్టు (ముళ్ళు నిక్కబొడుచుకొనేటట్లు చేసినట్టు) కనిపించాడు. చిత్రసేనుడు వెంటనే శ్రుతకర్మ వక్షఃస్థలంలో దిగేటట్లొక వాడి బాణం ప్రయోగించాడు. శ్రుతకర్మ వెంటనే ఆ రాజును రక్తంలో మునిగేటట్లుచేసి, ఒక బాణంతో అతడి తల నేలపై పడి దొర్లేటట్లు కొట్టాడు.

ప్రతివింధ్యుఁడు చిత్రుఁడను రాజుం జంపుట (సం. 8-10-15)

ఉ. **ఏలినవాని పాటుఁ గని యేడ్తెఱఁ దద్బల మొక్క పెట్ట యా**
భీలతఁ జుట్టు ముట్టుటయుఁ బేర్చినయుద్ధతిఁ దీవ్ర సాయక
జ్వాలల నేర్చి యుద్భటభుజావిభవం బలరంగ నల్గడం
దోలె నుదాత్తవిక్రమకుతూహలి నా మనుమండు భూవరా! 98

ప్రతిపదార్థం: భూవరా!= భూపతీ!; తద్+బలము= ఆ చిత్రసేనుని సైన్యం; ఏలినవాని= తమ్మేలిన రాజుయొక్క; పాటు= పడిపోవటం; కని= చూచి; ఏడ్తెఱన్= వేగంతో; ఒక్కపెట్టు+అ= ఒక్కమాఱుగా; ఆభీలతన్= భయంకరంగా; చుట్టు= అన్నివైపులా; ముట్టుటయున్= దాడి చేయగా; ఉదాత్త= గొప్పదైన; విక్రమ= పరాక్రమంయొక్క; కుతూహలి= తమకం కలవాడైన; నీ మనుమండు= శ్రుతకర్మ; పేర్చిన= పెరిగిన; ఉద్ధతిన్= గర్వంతో; తీవ్ర= తీక్ష్ణమైన; సాయక= బాణాలయొక్క; జ్వాలలన్= మంటలతో; ఏర్చి= కాల్చి; ఉద్భట= భయంకరమైన; భుజా= బాహువులయొక్క; విభవంబు= ఐశ్వర్యం, బలం; అలరంగన్= ఒప్పగా; నలు+కడన్= నాలుగు దిక్కులకు; తోలెన్= తరిమినాడు.

తాత్పర్యం: రాజా! తమ రాజు పడిపోవటం చూచిన చిత్రసేనుని సైన్యం విజృంభించింది. ఒక్కసారిగా, భయంకరంగా శ్రుతకర్మను చుట్టూ ముట్టడించింది. అతడు మహాపరాక్రమం ప్రదర్శించటానికి తమకపడుతున్నాడేమో, భయంకరమైన తన బాహుబలం విలసిల్లుతుండగా పెరిగిన గర్వంతో వాడి బాణాల మంటలతో మనసైన్యాన్ని కాల్చేసరికి అది నలుదిక్కులకూ పారిపోయింది.

సీ. **అప్పుడు ప్రతి వింధ్యుఁడైదు బాణములఁ జి । త్రుని మేనునొంచి తత్సూతు వక్ష**
మునఁ గ్రూర శరములు మూఁడు నాటించి యొ । క్కమ్మునఁ గేతు వల్లార్చి పేర్చి
యతఁడు దన్నుగ్రనవాస్త్ర పీడితుఁజేయ । విలుద్రుంచి వెసఁబంచ విశిఖ నిహతుఁ
గావించి శక్తి యుగ్రమ్ముగ వైచినఁ । బెలుచ నాలుగు దునియలుగఁ జేసె

తే. **నలిగి యాతండు గదవైచి యక్కుమారు । ఘోటకంబుల సూతునిఁ గూల్చె నదియ**
పట్టుకొని వైచె మగుడ నప్పాండు పౌత్రు । చేయి వడి నుచ్చిపోవ నచ్చిత్రుఁ డధిప! 99

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అప్పుడు= ఆ సమయంలో; ప్రతివింధ్యుడు= ద్రౌపదీ యుధిష్ఠిరుల పుత్రుడు; ఐదు; బాణములన్= అమ్ములతో; చిత్రుని= చిత్రుడియొక్క; మేను= శరీరం; నొంచి= నొప్పించి; తద్= అతని; సూతు= సారథియొక్క; వక్షమునన్= రొమ్ముపై; క్రూరశరములు= కఠినములైన బాణములు; మూఁడు= మూడింటిని; నాటించి= గ్రుచ్చి; ఒక్క+అమ్మునన్= ఒక్క బాణంతో; కేతువు= జెండా; అల్లార్చి= పడగొట్టి; పేర్చి= విజృంభించి; అతఁడు= చిత్రుడు; తన్నున్= (ప్రతివింధ్యుడనే) తనను; ఉగ్ర= తీక్ష్ణమైన; నవ+అస్త్ర= తొమ్మిది అస్త్రములతో; పీడితున్= బాధింపబడినవానిని; చేయన్= చేయగా; విలు=

(చిత్రుని) ధనుస్సును; త్రుంచి= విరిచి; వెసన్= వెంటనే; పంచ= ఐదైన; విశిఖ= బాణాలతో; నిహతున్= మిక్కిలి కొట్టబడిన వానిని; కావించి= చేసి, ఐదు బాణాలతో కొట్టి; శక్తి= (చిత్రుడు) ఈటె వంటి ఆయుధాన్ని; ఉగ్రమ్ముగన్= వేగంగా; వైచినన్= విసరగా; (ప్రతివింధ్యుడు) పెలుచన్= పరాక్రమంతో; నాలుగు= నాలుగైన; తునియలుగన్= ముక్కలుగా; చేసెన్= చేశాడు; ఆతఁడు= చిత్రుడు; అలిగి= కోపించి; గద= గుదియను; వైచి= విసరి; ఆ+కుమారు= ఆ బాలుడి; ఘోటకంబులన్= గుర్రాలను; సూతునిన్= సారథినీ; కూల్చెన్= సంహరించాడు; ఆ+చిత్రుఁడు= ఆ చిత్రుడనే రాజు; అది+అ= గదనే; పట్టుకొని= తీసికొని; ఆ+పాండు= ఆ పాండురాజుయొక్క; పౌత్రు= మనుమనియొక్క; చేయి= హస్తం; వడిన్= వేగంవల్ల; ఉచ్చిపోవన్= చీలిపోయేటట్లు; మగుడన్= తిరిగి; వైచెన్= విసిరాడు.

తాత్పర్యం: ఆ సమయంలో ప్రతివింధ్యుడు ఐదుబాణాలు ప్రయోగించి, చిత్రుడి శరీరానికి నొప్పి కలిగించాడు. అతడి సారథి రొమ్ములో మూడు బాణాలు దిగవేశాడు. ఒక బాణంతో జెండా పడగొట్టాడు. చిత్రుడు తొమ్మిది బాణాలు వేసి ప్రతివింధ్యుడికి బాధ కలిగించాడు. ప్రతివింధ్యుడు చిత్రుని విల్లు విరిచాడు. అతడిని ఐదుబాణాలతో బాగా కొట్టాడు. చిత్రుడు ఈటె విసిరాడు. ప్రతివింధ్యుడు దానిని నాలుగు ముక్కలు చేశాడు. చిత్రుడు కోపించి గద విసిరాడు. దానివలన ప్రతివింధ్యుడి గుర్రాలూ, సూతుడూ మరణించారు. చిత్రుడు మళ్ళీ గదనే ప్రయోగించి ప్రతివింధ్యుడి చేయి చీలిపోయేటట్లు చేశాడు.

ఉ. బాహువు నొచ్చినం గినిసి భాసురతోమరమెత్తి కౌరవ
వ్యూహము సంచలింప నతఁ డుగ్రత వైచినఁ గంకటంబుఁ ద
ద్దేహము నుచ్చిపోవుటయుఁ ద్రెళ్ళె నరేశ్వర! యవ్విభుండు వ
జ్రాహతిఁగూలు పర్వతమునాకృతి నుత్కట వైకృతంబుగన్. 100

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= నరనాథా, రాజా!; అతఁడు= ప్రతివింధ్యుడు; బాహువు= చెయ్యి; నొచ్చినన్= నొప్పిచెందినందువల్ల; కినిసి= కోపించి; కౌరవ= కౌరవులయొక్క; వ్యూహము= సమూహము, సైన్యము; సంచలింపన్= కదలిపోవగా; ఉగ్రతన్= రౌద్రముతో; భాసుర= ప్రకాశిస్తున్న; తోమరము= చిన్నయీటె; ఎత్తి= తీసికొని; వైచినన్= విసరగా; (అది) కంకటంబున్= కవచమూ; తద్+దేహమున్= అతని శరీరాన్ని; ఉచ్చిపోవుటయున్= చీల్చుకొనిపోవటంవల్ల; ఆ+విభుండు= ఆ రాజు; వజ్ర= వజ్రాయుధం యొక్క; ఆహతిన్= గట్టిదెబ్బవల్ల; కూలు= పడిపోయే; పర్వతము+ఆకృతిన్= పర్వతం విధంగా; ఉత్కట= అధికమైన; వైకృతంబుగన్= వికారాకారంతో; త్రెళ్ళెన్= మరణించాడు.

తాత్పర్యం: చేతికి బాధ కలిగేసరికి ప్రతివింధ్యుడికి కోపం వచ్చింది. అందువలన ఒక వెలిగే తోమరం తీసికొని రౌద్రంతో విసిరాడు. అది చూచి కౌరవసైన్యం భయపడిపోయింది. ఆ తోమరం చిత్రుడి కవచాన్నీ, అతడి దేహాన్నీ చీల్చుకొనిపోయేసరికి, అతడు వజ్రపుదెబ్బకు కూలిపోయే కొండవలె వికారాకారంతో పడిపోయాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు చిత్రుండు దెగటాఱినం గనుంగొని మన యోధులు ప్రతివింధ్యుపై నడరి యనేకాస్త్ర శస్త్రంబులం బొదివినం బొలివోని కలితనంబున నేలకుఱికి యక్కుమారుండు గోదండటంకారంబున నంబరంబు పూరించుచు బాణాసారంబు వరగింపఁ బాండవసైనికులు బెట్టిదంపుటురవడిం గదిసి యతనికిం

దోడ్పడుటయు మనవారలు విచ్చి వెన్నిచ్చి పఱచి రప్పుడశ్వత్థామభీమసేనుల సంగ్రామంబు భీమంబయి చెల్లె నందు. **101**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; చిత్రుండు= చిత్రుడు; తెగటారినన్= చనిపోగా; మనయోధులు= మన యుద్ధభటులు; కనుంగొని= చూచి; ప్రతివింధ్యుపైన్= ప్రతివింధ్యుని మీద; అడరి= చెలరేగి; అనేక+అస్త్ర= చాలా అస్త్రాలతోనూ; శస్త్రంబులన్= ఆయుధాలతోనూ; పొదివినన్= కప్పగా; ఆ+కుమారుండు= ఆ బాలుడు; పొలి+పోని= తగ్గని; కలితనంబునన్= సామర్థ్యంతో, నేర్పుతో; నేలకున్+ఉఱికి= భూమిమీదికి దూకి; కోదండ టంకారంబునన్= ధనుష్టంకారంతో; అంబరంబు= ఆకాశం; పూరించుచున్= నిండిస్తూ; బాణసారంబు= బాణముల వర్షం; పరఁగింపన్= కురిపింపగా; పాండవ సైనికులు= పాండవుల సైనికులు; బెట్టిదంపు= అతి తీవ్రమైన; ఉరవడిన్= విజృంభణంతో; కదిసి= సమీపించి; అతనికిన్= ప్రతివింధ్యునికి; తోడ్పడుటయున్= సాయపడగా; మనవారలు= మన సైనికులు; విచ్చి= చెల్లాచెదరై; వెన్ను+ఇచ్చి= వెనుకకు మరలి; పఱచిరి= పారిపోయారు; అప్పుడు= ఆ సమయంలో; అశ్వత్థామ భీమసేనుల= అశ్వత్థామయొక్క భీమునియొక్క; సంగ్రామంబు= యుద్ధం; భీమంబు+ అయి= భయంకరమై; చెల్లెన్= నడచింది; అందున్= ఆ యుద్ధంలో.

తాత్పర్యం: ఇట్లా చిత్రుడి సంహారం చూశారు మన సైనికులు. వెంటనే ప్రతివింధ్యుడి మీద దాడిచేసి ఎన్నో శస్త్రాస్త్రాలు ప్రయోగించారు. అతడు చిన్నవాడయినా సామర్థ్యం తక్కువలేదు కనుక, రథంమీద నుండి నేలకు దూకి, ధనుష్టంకారంతో ఆకాశాన్ని నింపివేస్తూ బాణవర్షం కురిపించాడు. అంతలో పాండవసైనికులు అతివేగంతో అతడివద్దకు వచ్చి సాయపడ్డారు. మనవారు వెనుదిరిగి చెల్లాచెదరై పారిపోయారు. ఇక అశ్వత్థామ భీమసేనుల యుద్ధం చూడ భయంకరంగా నడిచింది. ఆ యుద్ధంలో - (తరువాతి పద్యంతో అన్వయం).

క. గురుపుత్రుఁడు దొంబది శిత । శరములఁ బావని రథంబు సంవృతముగఁ జే
సె రయం బారఁగ సాయక । పరంపరలు వఱపె నతనిపై నతఁ డలుకన్. **102**

ప్రతిపదార్థం: గురుపుత్రుఁడు= అశ్వత్థామ; తొంబది= తొంభై; శితశరములన్= వాడిబాణాలతో; పావని రథంబు= వాయుపుత్రుడైన భీముని తేరు; సంవృతముగన్+చేసెన్= కప్పబడినదిగా చేశాడు; అతఁడు= భీమసేనుడు; అలుకన్= కోపంతో; రయంబు+ఆరఁగన్= వేగం ఒప్పగా; అతనిపైన్= అశ్వత్థామపై; సాయక పరంపరలు= అమ్ముల వరుసలు; పఱపెన్= ప్రసరింపజేశాడు.

తాత్పర్యం: అశ్వత్థామ తొంభై పదునైన బాణాలు ప్రయోగించి భీముడి తేరు కప్పివేశాడు. భీముడు కోపంతో, వేగంతో అశ్వత్థామ మీద శర పరంపర ప్రసరింపజేశాడు.

వ. వాని మగిడించి. **103**

తాత్పర్యం: ఆ బాణాలను తిరుగగొట్టి.

క. అనిలజుఫాలము గురునం । దనుఁడు పటు ప్రదరకీలితము సేయుడు నా
తని నిటలంబున నతఁ డే । పున బాణత్రయము నాటె భూవరముఖ్యా! **104**

ప్రతిపదార్థం: భూవరముఖ్యా!= భూపతులలో శ్రేష్ఠుడవయిన ధృతరాష్ట్ర మహారాజా! గురునందనుఁడు= కౌరవపాండవ గురువైన ద్రోణాచార్యుని పుత్రుడయిన అశ్వత్థామ; అనిలజు= వాయుపుత్రుడయిన భీమునియొక్క; ఫాలము= నొసటిని;

పటు= గట్టిదైన; ప్రదర= చీల్చేబాణంచేత; కీలితము= దిగబడినదిగా; చేయుడున్= చేసిన తరువాత; అతఁడు= భీమసేనుడు; ఏపునన్= పౌరుషంతో; ఆతని= అశ్వత్థామయొక్క; నిటలంబునన్= నొసట; బాణత్రయము= మూడుబాణాలు; నాటెన్= దిగగొట్టాడు.

తాత్పర్యం: రాజోత్తమా! అశ్వత్థామ భీముడి నొసట గట్టి బాణం దిగేటట్లు కొట్టాడు. వెంటనే భీముడు పౌరుషంతో అశ్వత్థామ నొసట మూడు బాణాలు దిగగొట్టాడు.

వ. మఱియును. 105

తాత్పర్యం: మళ్ళీ.

చ. గురుసుతభీమసేను లతి ఘోరవిధంబులఁ బోరి యొండొరుం
దెరలుపలేని సామ్యమున దీపితులై లయకాల విస్ఫుర
త్తరణియుగంబుఁబోలె శరధామ సమగ్రతఁ బ్రజ్వరిల్లి యొ
ప్పిరి రథ చిత్రచారులఘు భీషణసంచరణంబు లొప్పఁగన్. 106

ప్రతిపదార్థం: గురుసుత, భీమసేనులు= అశ్వత్థామ, భీముడు; అతి= మిక్కిలి; ఘోర= భయంకరమైన; విధంబులన్= పద్ధతులతో; పోరి= యుద్ధంచేసి; ఒండు+ఒరున్= ఒకరు మరొకరిని; తెరలుపలేని= అతిశయింపలేని; సామ్యమునన్= సమానతతో; దీపితులు+ఐ= ప్రకాశించినవారై; శరధామ= బాణముల తేజస్సుయొక్క; సమగ్రతన్= సంపూర్ణతచేత; ప్రజ్వరిల్లి= ప్రకాశించి; రథ= రథాలయొక్క; చిత్ర= వింతలైన; చారు= అందమైన; భీషణ= భయంకరమైన; సంచరణంబులు= సంచారములు; ఒప్పఁగన్= అందగింపగా; లయకాల= ప్రళయకాలంలో; విస్ఫురత్= మిక్కిలి ప్రకాశిస్తున్న; తరణి= సూర్యులయొక్క; యుగంబున్+ పోలెన్= జంటలా; ఒప్పిరి= వెలిగారు.

తాత్పర్యం: అశ్వత్థామా భీముడూ మహాభయంకరంగా పోరాడారు. ఒకరినొకరు మించలేని సమానత్వంతో ప్రకాశించారు. ఇద్దరూ ప్రయోగించే బాణాలు పరిపూర్ణ కాంతులు ప్రసరింపజేస్తున్నాయి. ఇద్దరి రథాలూ అందంగా, భయంకరంగా చిత్రవిచిత్రంగా నడుస్తున్నాయి. అందువలన వారు ప్రళయకాలంలోని ఇద్దరు సూర్యులవలె ప్రకాశించారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

తే. వారి వీక్షించి ఖచరులు పోరు లెందుఁ । జూడమే? దీని కెన యని యడఁగలదె?
కలుగ వింకను వీరలబలముఁ జలము । నలవు వెరవు నిట్లుండునే? యనుచునుండ. 107

ప్రతిపదార్థం: ఖచరులు= ఆకాశసంచారులు; వారిన్= అశ్వత్థామ భీములను; వీక్షించి= చూచి; పోరులు= యుద్ధాలు; ఎందున్= ఎక్కడా; చూడము+ఏ?= మనము చూడలేదా?; దీనికిన్= ఈ యుద్ధానికి; ఎన= సాటి అయిన; అని= యుద్ధం; ఆడన్= చెప్పటానికి; కలదు+ఎ?= ఉన్నదా?; ఇంకను= రానున్న కాలంలో; కలుగవు= (ఇట్టి యుద్ధాలు) సంభవింపబోవు; వీరల= ఈ యిద్దరియొక్క; బలమున్= శరీరశక్తీ; చలమున్= పట్టుదలా; అలవు= నేర్పూ; వెరవు= ఉపాయమూ; ఇట్లు+ఉండును+ ఏ?= ఈ రీతిగా ఉంటాయా?; అనుచున్= అని పలుకుతూ; ఉండన్= ఉండగా.

తాత్పర్యం: భీమాశ్వత్థామలను చూచి ఆకాశసంచారులు ఇట్లా అనుకొన్నారు. 'మనం యుద్ధాలను ఎన్నిచోట్ల చూడలేదు? వాటిలో ఏదైనా ఒకటి దీనితో పోలునని చెప్పటానికి ఉన్నదా? ఇకముందు కూడా వీరి బలగర్వాలూ, నేర్పులూ, పట్టుదలలూ ఈ విధమైనవి ఉంటాయా?' అని పలుకుతూ ఉండగా.

ఉ. ఒండొరు కేతువుల్ దునిమి యొండొరుసూతుల నొంచి యేపుమై
నొండొరు తేరివాహముల యు బ్బడఁగించి నిశాతవిస్ఫుర
త్కాండచయంబు లొండొరులకాయములన్ వడిఁ గ్రుచ్చి వ్రాలి ర
ప్పాండుసుతుండుఁ గుంభజునిపట్టియు మూర్ఛలు దమ్ముఁ గ్రమ్మినన్. 108

ప్రతిపదార్థం: ఆ+పాండు సుతుండున్= ఆ పాండురాజు కుమారుడైన భీముడు; కుంభజుని పట్టియున్= కలశ సంభవుడైన ద్రోణుని కుమారుడైన అశ్వత్థామ; ఒండు+ఒరు= ఒకరు మరొకరి; కేతువుల్= జెండాలు; తునిమి= నరికి; ఒండు+ఒరు= ఒకరు మరొకరి; సూతులన్= సారథులను; నొంచి= నొప్పించి; ఏపుమైన్= విజృంభణంతో; ఒండు+ఒరు= ఒకరు మరొకరి; తేరి వాహముల= రథపు గుర్రాలయొక్క; ఉబ్బు+అడఁగించి= పొంగు అణచి, బాధకలిగించి; నిశాత= వాడియైన; విస్ఫురత్= బాగా మెరుస్తున్న; కాండ= బాణాలయొక్క; చయంబులు= సముదాయాలను; ఒండొరుల= ఒకరు మరొకరియొక్క; కాయములన్= శరీరాలలో; వడిన్= వేగంతో; క్రుచ్చి= నాటి; మూర్ఛలు= సొమ్ములు; తమ్మున్= తమను; క్రమ్మినన్= ఆవరింపగా; వ్రాలిరి= ఒరిగినారు.

తాత్పర్యం: భీముడూ అశ్వత్థామా ఒకరి జెండా ఒకరు పడగొట్టారు. ఒకరి సూతుడి నొకరు బాధించారు. ఒకరి రథాశ్వాల ఊపును మరొకరు అణగగొట్టారు. ఒకరి దేహంలో మరొకరు పదునైన మెరుస్తున్న బాణాలు నాటి సొమ్మసిల్లి ప్రక్కకు ఒరిగారు.

వ. ఇట్లు రథంబులపై నొఱగి మూర్ఛిల్లిన. 109

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; రథంబులపైన్= తేరులపై; ఒఱగి= వ్రాలి; మూర్ఛిల్లినన్= సొమ్మసిల్లగా.

తాత్పర్యం: ఈవిధంగా రథాలమీద ఒరిగి సొమ్మసిల్లగా.

క. అనిలజు సారథియును గురు । తనయుని రథచోదకుఁడు నతని నాతనినిం
గొని యుల్లంబుల బలితపు । దునుకు సొరఁగ ననికిఁ దొలఁగఁ దోలిరి రథముల్. 110

ప్రతిపదార్థం: అనిలజు= వాయుపుత్రుడైన భీమునియొక్క; సారథియును= సూతుడు; గురుతనయుని= గురువైన ద్రోణుని కుమారుడైన అశ్వత్థామయొక్క; రథచోదకుఁడున్= రథం తోలేవాడు; ఉల్లంబులన్= తమ మనస్సులలో; బలితము= బలమైన; దునుకు= బాధ; చొరఁగన్= ప్రవేశింపగా; అతనిన్= భీమునీ; ఆతనిన్= అశ్వత్థామను; కొని= తీసికొని; అనికిన్= యుద్ధంనుంచి; తొలఁగన్= తప్పిపోయేటట్లు; రథముల్= తేరులు; తోలిరి= నడిపించుకుపోయారు.

తాత్పర్యం: భీముడియొక్క సూతుడు, అశ్వత్థామ యొక్క సారథీ తమ మనస్సులలో బలమైన బాధ ప్రవేశించగా - భీముడిని, అశ్వత్థామను తీసికొని యుద్ధంనుండి తప్పించి రథాలను నడిపించుకొనిపోయారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇక్కడ ఉస్మానియా సంశోధిత భారతం 'బలితపుఁదునుకు' అన్న పాఠం గ్రహించింది. అపుడు అది 'తునుకు' కావాలి. కాని శ.ర; సూ.ని.లు 'తునుకు' ఈ సందర్భానికి తగిన అర్థం ఇవ్వలేదు. శ.ర. దునుకు అనే పదానికి బాధ అనే అర్థం ఇచ్చింది. సూ.ని. దునుకు అనే పదానికి భయం అనే అర్థం ఇచ్చి దానికి నిర్వాహకంగా ఈ పద్యాన్నే ఉదాహరించింది. శ.ర. మరొక పద్యాన్నీ ఉదాహరించింది కాని, దానికి బాధ అన్న అర్థాన్ని కుండలీకరించి చెప్పింది. ఈ దునుకుకు తమిళ పర్యాయం తునుక్కు అనీ పేర్కొన్నది.

ఉ. క్రీడితనూజుఁడైన శ్రుతకీర్తియు శల్యుఁడు నేచి దిక్కుల
ల్లాడఁగఁ బోరుచో శరము లాఱయిదుల్ శ్రుతకీర్తి శల్యుమై
గాఁడఁగ నేయ మూఁడు పటుకాండము లాతని మేనఁ గ్రుచ్చి సం
తాడితుఁ జేసె సూతు నిశితప్రదరంబున నాతఁ డుద్ధతిన్. 111

ప్రతిపదార్థం: క్రీడి= కిరీటి, అర్జునుని; తనూజుఁడు= కుమారుడు; ఐన= అయినట్టి; శ్రుతకీర్తియున్= శ్రుతకీర్తి అనే పేరుగల ద్రౌపదీ పుత్రుడూ; శల్యుఁడున్= మద్రరాజూ; ఏచి= విజృంభించి; దిక్కులు= దిశలు; అల్లాడఁగన్= వణకగా; పోరుచోన్= యుద్ధంచేసే సమయంలో; శ్రుతకీర్తి= అర్జున పుత్రుడు; ఆఱు+అయిదుల్= ముప్పై; శరములు= బాణాలు; శల్యుమై= మద్రరాజు దేహం; గాఁడఁగన్= గాయపడేటట్లుగా; ఏయన్= ప్రయోగింపగా; ఆతడు= శల్యుడు; మూఁడు= త్రిసంఖ్యగల; పటు= గట్టి; కాండములు= బాణాలు; అతనిమేనన్= శ్రుతకీర్తి శరీరంలో; క్రుచ్చి= దింపి; ఉద్ధతిన్= గర్వంతో; సూతున్= సారథిని; నిశిత= వాడియైన; ప్రదరంబునన్= చీల్చే బాణంతో; సంతాడితున్+చేసెన్= గట్టిగా కొట్టబడిన వానినిగా చేశాడు.

తాత్పర్యం: ద్రౌపదికీ అర్జునుడికీ జన్మించిన కుమారుడు శ్రుతకీర్తి, శల్యుడు విజృంభించి యుద్ధం చేస్తుంటే దిక్కులు కంపించిపోయాయి. అపుడు శ్రుతకీర్తి శల్యుడి శరీరం చీలిపోయేటట్లు ముప్పై బాణాలు ప్రయోగించాడు. శల్యుడు గర్వంతో మూడు బాణాలు శ్రుతకీర్తి శరీరంలో నాటి, ఒకదానితో సూతుడిని గట్టిగా కొట్టాడు.

చ. నరతనయుండు దత్తనువు నాటఁగఁ దొమ్మిదియమ్ములేసి స
త్వరముగ సూతునంగమున వాలికతూపులు మూఁడు నాటి ని
ష్ఠురశరపంచకస్ఫురణ సూపినఁ గోప మెలర్ప నమ్మహీ
శ్వరుఁడు గడంగి విల్ దునిమి సప్తశరంబుల నొంచె నాతనిన్. 112

ప్రతిపదార్థం: నర= అర్జునుని; తనయుండు= కుమారుడైన శ్రుతకీర్తి; తద్= ఆ శల్యునియొక్క; తనువున్= శరీరాన్ని; నాటఁగన్= గ్రుచ్చుకొనేటట్లుగా; అమ్ములు= బాణాలు; ఏసి= ప్రయోగించి; సత్వరముగన్= వేగంతో; సూతు+అంగమునన్= సారథి శరీరంలో; వాలిక= పదునైన; తూపులు= బాణాలు; మూఁడు= మూడింటిని; నాటి= గ్రుచ్చి; నిష్ఠుర= కఠినమైన; శర= అమ్ములయొక్క; పంచక= ఐదింటియొక్క; స్ఫురణ= మెరవటం; చూపినన్= ప్రదర్శింపగా; ఆ+మహీ+ఈశ్వరుడు= ఆ భూపతి; కోపము= అలుక; ఎలర్పన్= అధికంకాగా; కడంగి= ప్రయత్నించి; విల్= ధనుస్సు; తునిమి= ఖండించి; ఆతనిన్= శ్రుతకీర్తిని; సప్తశరంబులన్= ఏడు బాణాలతో; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: శ్రుతకీర్తి శల్యుడి శరీరంలో తొమ్మిది అమ్ములు గ్రుచ్చాడు. వేగంతో సారథి శరీరంలో మూడు బాణాలు గ్రుచ్చి మళ్ళీ ఐదు గట్టి బాణాలు ప్రయోగించాడు. దానితో మద్రరాజుకు కోపం వచ్చి అతడి విల్లు విరుగగొట్టి ఏడు బాణాలతో అతడిని నొప్పించాడు.

వ. అట్టియెడ. 113

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; ఎడన్= సమయంలో.

తాత్పర్యం: అటువంటి సమయంలో.

సీ. వేఱొక్క విల్లెత్తి వివ్వచ్చుకొడు కఱు । వదినాలుగమ్ములు వఱపె మద్ర
పతిమేన నతఁడు దొంబదితూపు లడరించి । యేసె నవ్వీరు శరాసనంబు
ఖండంబులుగ వాఁడు గం డడంగక గద । వైచినఁ బొడిసేసి యేచి శక్తి
నిగిడింపఁ దునుమాడె నిశితభల్లంబునఁ । ద్రుంచెఁ దదీయ సూతుని శిరంబు

ఆ. వాయుజవములైన వాహంబు లప్పుడు । గలఁగి యరద మనికిఁ దొలఁగ నీడ్చెఁ
దెఱపిగాంచి శల్యుఁ డఱిముఱిఁ జొచ్చిక । లంచెఁ బాండు సుతుబలంబు నధిప! 114

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; వివ్వచ్చు= బీభత్సునియొక్క, అర్జునునియొక్క; కొడుకు= కుమారుడు శ్రుతకీర్తి; మద్రపతిమేనన్= మద్రరాజైన శల్యుని దేహంలో; అఱువదినాలుగు; అమ్ములు= బాణాలు; పఱపెన్= ప్రయోగించాడు; అతఁడు= శల్యుడు; తొంబది= తొంభై; తూపులు= బాణాలు; అడరించి= ప్రయోగించి; ఆ+వీరు= ఆ శూరుడైన శ్రుతకీర్తియొక్క; శరాసనంబు= ధనుస్సు; ఖండంబులుగన్= ముక్కలయ్యేటట్లుగా; ఏసెన్= కొట్టాడు; వాఁడు= శ్రుతకీర్తి; గండు+అడంగక= బలాన్ని కోల్పోక; గద= గుదియ; వైచినన్= విసరగా; పొడి+చేసి= (శల్యుడు) దానిని చూర్ణంచేసి; ఏచి= (శ్రుతకీర్తి) విజృంభించి; శక్తిన్= ఈటెను; నిగిడింపన్= ప్రయోగించగా; తునుము+ఆడెన్= (శల్యుడు) దానిని ముక్కలు చేశాడు; (ఇంకా) నిశిత= వాడియైన; భల్లంబునన్= బాణంతో; తదీయ= శ్రుతకీర్తియొక్క; సూతుని= సారథియొక్క; శిరంబున్= శిరస్సును; త్రుంచెన్= నరికాడు; అప్పుడు= ఆ సమయంలో; వాయుజవములు+ఐన= వాయువేగంకల; వాహంబులు= (శ్రుతకీర్తియొక్క) గుర్రాలు; కలఁగి= కలతచెంది; అరదము= రథాన్ని; అనికిన్= యుద్ధానికి; తొలఁగన్= తొలగునట్లుగా; ఈడ్చెన్= లాక్కొనిపోయాయి; శల్యుఁడు= మద్రరాజు; తెఱపి= ఎడము; కాంచి= చూచి; అఱిముఱిన్= వెంటనే; చొచ్చి= ప్రవేశించి; పాండు= పాండురాజుయొక్క; సుతు= కుమారుడైన యుధిష్ఠిరుని యొక్క; బలంబున్= సైన్యాన్ని; కలంచెన్= సంక్షోభపరచినాడు.

తాత్పర్యం: శ్రుతకీర్తి మరొక ధనుస్సు తీసికొన్నాడు. శల్యుడి శరీరంలో అరవైనాలుగు బాణాలు గ్రుచ్చాడు. శల్యుడు తొంభై బాణాలు ప్రయోగించి ఆ వీరుడి ధనుస్సు విరుగగొట్టాడు. శ్రుతకీర్తి బలహీనపడకుండా, గద ప్రయోగించాడు. శల్యుడు దానిని చూర్ణం చేశాడు. శ్రుతకీర్తి శక్తిని ప్రయోగించాడు. శల్యుడు దానిని ముక్కలు చేసి అతడి సారథి శిరస్సు నరికాడు. శ్రుతకీర్తి గుర్రాలు అసలే వాయువేగం కలవి. అందులో బెదిరాయి. కనుక రథాన్ని యుద్ధానికి దూరంగా లాగుకొనిపోయాయి. శల్యుడు సందు చూచుకొని వేగంగా ధర్మరాజు సైన్యంలోనికి ప్రవేశించి దానిని సంక్షోభపెట్టాడు.

సీ. కమలాకరము లీలఁ గలఁచి యాడెడు గంధ । దంతావళము సముద్దండతయును
దరమిడి మృగసముత్కరము ఘోరంబుగా । వధియించు కంఠీరవంబు నేపు
నీరసారణ్యంబు నిర్భరాటోపతఁ । గాల్చు దావాగ్ని యుగ్రక్రమంబుఁ
బ్రకటవిక్రాంతిఁ బురత్రయంబును సమ । యించు ఫాలాక్షుని యేడ్తెఱయును

ఆ. బోల్పఁ బట్టునయ్యె భుజగర్వ శౌర్య । ప్రతాపదుర్దమప్రకోపములకు
మద్రవిభుఁడు గోలుమసఁగి శాత్రవసైన్య । హననకేలి సలుపునవసరమున. 115

ప్రతిపదార్థం: మద్రవిభుఁడు= మద్రరాజు శల్యుడు; కోలుమసఁగి= మిక్కిలి విజృంభించి; శాత్రవ= శత్రువులదైన; సైన్య= సైన్యంయొక్క; హననకేలి= చంపటమనే క్రీడ; సలుపు= చేసే; అవసరమునన్= సమయంలో; భుజగర్వ= బాహువుల దర్పానికీ; శౌర్య= పరాక్రమానికీ; ప్రతాప= ఇతరులను కాల్చినట్లు బాధింపగల శక్తికీ; దుర్దమ= అణపరాని; ప్రకోపములకున్= మహాక్రోధానికీ; పోల్పన్= పోల్చేటందుకు (వరుసగా); కమలాకరమున్= పద్మాలకు పుట్టిల్లయిన సరస్సును; లీలన్= విలాసంతో; కలఁచి= సంక్షోభపరచి; ఆడెడు= క్రీడించే; గంధ= మదించిన; దంతావళము= ఏనుగుయొక్క; సముద్దండతయును= మిక్కిలి భయంకరత్వమూ; తరము+ఇడి= వరుసగా; మృగ= లేళ్ళయొక్క; సముత్కరమున్= మందను; ఘోరంబుగాన్= భయంకరంగా; వధించు= సంహరించే; కంఠీరవంబు= సింహంయొక్క; ఏపున్= విజృంభణమూ; నిర్+రస+అరణ్యంబునన్= ఎండుటడవిని; నిర్భర= నిండైన; ఆటోపతన్= సంరంభంతో; కాల్చు= తగులబెట్టే; దావ+అగ్ని= కార్చిచ్చుయొక్క; ఉగ్రక్రమంబున్= తీక్ష్ణమైన, వేగమైన గమనమూ; ప్రకట విక్రాంతిన్= అధికమైన విక్రమంతో; పురత్రయంబును= మూడు పట్టణాలనూ; సమయించు= నశింపజేసే; ఫాలాక్షు= నిటాలాక్షుడైన ఈశ్వరునియొక్క; ఏడ్తెఱయును= విజృంభణమూ; పట్టున్+అయ్యె= స్థానమయ్యాయి.

తాత్పర్యం: శల్యుడు బాగా విజృంభించి శత్రుసైన్యసంహారం ఒక ఆటవలె చేస్తున్నాడు. అప్పటి అతడి బాహుగర్వానికి పద్మాలున్న సరస్సును విలాసంతో సంక్షోభపరుస్తున్న మదపుటేనుగు భయంకరత్వం సాటివస్తుంది. పరాక్రమానికి వరసపెట్టి లేళ్ళమందను భీకరంగా సంహరిస్తున్న సింహంయొక్క విజృంభణం పోలికకు వస్తుంది. ప్రతాపానికి ఎండిపోయిన అడవిని సంపూర్ణ సంరంభంతో తగులబెట్టుతున్న దావానల శీఘ్రగమనం సరి అవుతుంది. అణపరాని క్రోధానికి అధిక పరాక్రమంతో త్రిపురనాశనం చేస్తున్న నిటలాక్షుడి విజృంభణం సమానమవుతుంది.

విశేషం: అలం: ఉపమ. యథాసంఖ్యం.

దుశ్శాసనుఁడు సహదేవునితో యుద్ధంబు సేసి మూర్ఛిల్లుట (సం. 8-17-30)

ఉ. ధీరజనోత్తముండు సహదేవుఁడు మైగలి దుస్సేనుఁడున్
వీరులు పిచ్చలింపఁ బ్రజ వి న్నద్రువం బోరినార్వఁ బోరుచో
వారక సాయకత్రయము వాఁడిమి నయ్యువరాజు నొంచె వి
స్తార మనోజ్ఞహారలసితంబగు నా ఘనబాహువక్షముల్. 116

ప్రతిపదార్థం: ధీర= ఎట్టిపరిస్థితులలోనూ కలతచెందని; జన= జనులలో; ఉత్తముండు= శ్రేష్ఠుడైన; సహదేవుఁడు= మాద్రి చిన్నకొడుకు; మైగలి= శూరుడైన; దుస్సేనుఁడున్= దుశ్శాసనుడును; వీరులు= ధైర్యము కలవారు; పిచ్చలింపన్= ప్రశంసింపగా; ప్రజ= జనం; విన్ను+అద్రువన్= ఆకాశం బ్రద్దలయ్యేటట్లు; పొరిన్= అధికముగా; ఆర్వన్= అరవగా; పోరుచోన్= యుద్ధంచేసేటప్పుడు; ఆ+యువరాజున్= ఆ కౌరవ యువరాజైన దుశ్శాసనుడు; వారక= అడ్డులేకుండా; సాయకత్రయము= మూడు బాణాలయొక్క; వాఁడిమిన్= తీక్ష్ణతచేత; విస్తార= విశాలమైన; మనోజ్ఞ= మనోహరమైన; హార= ముత్యాలపేరులచేత; లసితంబు+అగు= విలసితమైన; ఆ ఘనబాహు= ఆతని గొప్పవైన బాహువులను; వక్షమున్= వక్షఃస్థలాన్నీ; నొంచెన్= నొప్పించాయి.

తాత్పర్యం: ధీరులలో ఉత్తముడు సహదేవుడు. శూరుడు దుశ్శాసనుడు. వీరిద్దరూ యుద్ధంచేస్తుంటే ధీరులు ప్రశంసిస్తున్నారు. జనం ఆకాశం బ్రద్దలయ్యేటట్లు అరుస్తున్నారు. అపుడు దుశ్శాసనుడు మూడు బాణాల నైశిత్యంతో విశాలమైన, హారాలంకృతమైన సహదేవుడి బాహువులనూ వక్షఃస్థలాన్నీ నొప్పించాడు.

చ. **ధృతి వొగడొందనేచి సహదేవుఁడు నీసుతు శాతదీప్త స**
ప్తతి శరవిద్ధుఁ జేసి వడిఁ దద్రథచోదకు మార్గణత్రయా
హతుఁడుగఁ జేయ నల్గి వెస నాతని చాపము ద్రుంచి యాతఁ డు
ద్ధతి యలరంగ డెబ్బది శితప్రదరంబుల మేను నొంచినన్. **117**

ప్రతిపదార్థం: సహదేవుఁడు= మాద్రి చిన్నకొడుకు; ధృతి= ధైర్యం; పొగడు+ఒందన్= ప్రశంసనందగా; ఏచి= విజృంభించి; నీ సుతున్= నీ కుమారుడైన దుశ్శాసనుని; శాత= పదునైన; దీప్త= మెరుస్తున్న; సప్తతి= డెబ్బై; శర= అమ్ములచేత; విద్ధున్= కొట్టబడినవానిని; చేసి= ఒనరించి; వడిన్= వేగంతో; తద్+రథ= అతని రథంయొక్క; చోదకున్= త్రోలేవానిని, సారథిని; మార్గణత్రయ= బాణాలయొక్క మూటిచేత; మూడుబాణాలచేత; ఆహతు(డు+కన్)= అన్నివైపులగొట్టబడిన వానినిగా; చేయన్= చేయగా; ఆతఁడు= దుశ్శాసనుడు; అల్గి= కోపించి; వెసన్= వడిగా; ఆతని= సహదేవునియొక్క; చాపము= ధనుస్సు; త్రుంచి= విరిచి; ఉద్ధతి+అలరంగన్= గర్వం ఒప్పగా; డెబ్బది= డెబ్బై; నిశిత= వాడియైన; ప్రదరంబులన్= బాణాలచేత; మేను= శరీరం; నొంచినన్= నొప్పింపగా.

తాత్పర్యం: సహదేవుడు తన ధైర్యాన్ని అందరూ ప్రశంసించే విధంగా విజృంభించాడు. పదునెక్కి మెరుస్తున్న డెబ్బై బాణాలతో దుశ్శాసనుడిని కొట్టాడు. మరి మూడు బాణాలతో అతడి సారథిని ముందూ అటూ ఇటూ కొట్టాడు. అందుకు దుశ్శాసనుడికి కోపం వచ్చి అతడి ధనుస్సు విరుగగొట్టాడు. సహదేవుడు కూడ గర్వంతో తానూ డెబ్బై బాణాలు ప్రయోగించి అతడి దేహం నొప్పించాడు. అప్పుడు.

సీ. **నకులానుజుఁడు గృపాణంబున వైచిన । దుస్సేనుని విల్లు దునియలయ్యె**
నెడ గని యవ్వీరుఁడేచి బల్వింట మం । టలు గ్రమ్మున మ్మేయుటయు నతండు
గడువెస నెత్తిన కరవాలమునఁ ద్రుంచి । యతనిమై లక్షించి యదియ వైవ
నడుమన యాతండు నఱికినఁ బ్రస్ఫీత । చాపంబుగొని చతుష్షష్టి నిశిత

ఆ. **కంకపత్త్రములను గడఁక నయ్యువరాజు । పరఁగఁ జేయుటయును బాండుతనయుఁ**
డడఁచె నొక్కటొకటి నైదైదు తీవ్ర శి । లీముఖముల బాహులీల మెఱయ. **118**

ప్రతిపదార్థం: నకుల+అనుజుఁడు= నకులుని తమ్ముడు సహదేవుడు; కృపాణంబునన్= ఖడ్గముతో; వైచినన్= కొట్టగా; దుస్సేనుని= దుశ్శాసనునియొక్క; విల్లు= ధనుస్సు; తునియలు+అయ్యెన్= ముక్కలయ్యెను; ఆ+వీరుడు= ఆ ధైర్యం కలవాడు, సహదేవుడు; ఏచి= రేగి; ఎడ= సందు; కని= చూచి; బలు+వింటన్= పెద్ద ధనుస్సునుండి; మంటలు= జ్వాలలు; క్రమ్మ= వ్యాపింపజేసే; అమ్మ= బాణం; ఏయుటయున్= ప్రయోగింపగా; అతండు= దుశ్శాసనుడు; కడున్= మిక్కిలి; వెసన్= వేగంతో; ఎత్తిన= పైకెత్తిన; కరవాలమునన్= ఖడ్గముతో; త్రుంచి= (ఆ బాణాన్ని) నరికి; అదియ= ఆ ఖడ్గానే; అతని= సహదేవునియొక్క; మై= శరీరం; లక్షించి= గురిగా చేసికొని; వైవన్= విసరగా; ఆతండు= సహదేవుడు; నడుమన్+అ= మధ్యనే; నఱికినన్= ఖండింపగా; ఆ+యువరాజు= ఆ దుశ్శాసనుడు; ప్రస్ఫీత చాపంబు= మిక్కిలి బలమైన ధనుస్సు; కొని= తీసుకొని;

చతుః+షష్టి= అరవైనాలుగు; నిశిత= పదునైన; కంకపత్త్రములను= రాపులుగు రెక్కలు కట్టిన బాణాలను; కడఁకన్= పూనికతో; పరఁగన్+చేయుటయున్= ప్రసరింపజేసేసరికి; పాండుతనయుఁడు= పాండురాజు కొడుకైన సహదేవుడు; ఒక్కటిన్+ ఒక్కటిన్= ఒక్కొక్కదానినీ; ఐదు+ఐదు= ఐదేసి; తీవ్ర= వడిగల; శిలీముఖములన్= బాణాలతో; బాహులీల= చేతుల విలాసము; మెఱయన్= ప్రకాశించేటట్లుగా; అడఁచెన్= అణగగొట్టాడు.

తాత్పర్యం: సహదేవుడు ఖడ్గంతో కొట్టేసరికి దుశ్శాసనుడి ధనుస్సు ముక్కలయింది. ఆ సందు చూచుకొని సహదేవుడు విజృంభించి మంటలు క్రక్కే బాణం ప్రయోగించాడు. దుశ్శాసనుడు దానిని విచ్చిన కత్తితో నరికి సహదేవుడి శరీరం గురిచేసి ఆ ఖడ్గాన్నే విసిరాడు. సహదేవుడు దానిని నడుమనే ముక్కలు చేశాడు. అపుడు దుశ్శాసను డొక పెద్దవిల్లు తీసికొని అరవైనాలుగు రాపులుగు రెక్కలు కట్టిన బాణాలు సహదేవుడిమీద ప్రయోగించాడు. సహదేవుడా బాణాలలో ఒక బాణానికి ఐదేసి బాణాలు, అంటే మూడువందల ఇరవై బాణాలు ప్రయోగించి తన బాహువుల విలాసం ప్రకాశించేటట్లు వాటిని అణగగొట్టాడు.

వ. ఇట్లు విక్రమవిజృంభితుండై సహదేవుండు శతశాత శిలీముఖంబు లడరించిన. 119

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; సహదేవుండు= సహదేవుడు; విక్రమ= పరాక్రమంచేత; విజృంభితుండై= విజృంభించినవాడై; శతశాత= నూరు పదునైన; శిలీముఖంబులు= బాణాలు; అడరించినన్= ప్రయోగింపగా.

తాత్పర్యం: సహదేవు డిట్లా పరాక్రమంతో విజృంభించి పదునైన నూరు బాణాలు ప్రయోగించేసరికి.

చ. రయమున వాని నన్నిటి శరత్రితయంబునఁ ద్రుంచి సాయక
ద్వయమున నాతనిం బటునవప్రదరంబుల సారథిన్ భవ
త్ప్రియతనయుండు నొంచి దివి దీటుకొనంగఁ జెలంగి యార్వ న
త్యయసమవర్తిచాడ్పున నతం డుదితభ్రుకుటావిలాసుఁడై. 120

ప్రతిపదార్థం: భవత్= నీ యొక్క; ప్రియతనయుండు= ముద్దులకొడుకు దుశ్శాసనుడు; రయమునన్= వేగముతో; వానిన్= ఆ బాణాలను; అన్నిటిన్; శరత్రితయంబునన్= బాణాలు మూటితో; మూడు బాణాలతో; త్రుంచి= నరికి; సాయక ద్వయమునన్= బాణాల జంటతో; ఆతనిన్= సహదేవుని; పటు= గట్టివైన; నవ= తొమ్మిదైన; ప్రదరంబులన్= బాణాలతో; సారథిన్= అతని సూతునీ; నొంచి= నొప్పించి; దివిన్= ఆకాశంలో; దీటుకొనంగన్= నిండేటట్లు; చెలంగి= విజృంభించి; ఆర్వన్= అరవగా; అతండు= సహదేవుడు; అత్యయ= ప్రళయకాలంలోని; సమవర్తి= యముని; చాడ్పునన్= విధంగా; ఉదిత= పుట్టిన; భ్రుకుటీ= బొమముడియొక్క; విలాసుఁడు+ఐ= అందం కలవాడై.

తాత్పర్యం: నీ ముద్దుల కొడుకు దుశ్శాసనుడు వేగంతో వాటినన్నింటనీ మూడు బాణాలతో విరుగగొట్టాడు. రెండు బాణాలతో సహదేవుడినీ, తొమ్మిది బాణాలతో అతడి సారథినీ నొప్పించి విజృంభించి ఆకాశమంతా నిండేటట్లు పెద్దగా అరిచాడు. అపుడు సహదేవుడు కనుబొమలు ముడిచి ప్రళయకాల యముడివలె. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. **పటునారాచము దీప్తిజాలము నభోభాగంబునం బర్వ ను**
త్కట వేగంబున నేయఁ గంకటము వక్షఃపీఠముం దూఱి నె
త్తుటి పొం దేమియు లేక యుచ్చి చనినం దూగాడి యాతండు వ్రా
లుటయుం దేరు దొలంగ సూతుఁడు భయాలోలాకృతిం దోలినన్. **121**

ప్రతిపదార్థం: పటు= బలమైన; నారాచము= బాణం; దీప్తిజాలము= (దాని) కాంతిపుంజం; నభః= ఆకాశంయొక్క; భాగంబునన్= ప్రదేశంలో; పర్వన్= వ్యాపించేటట్లు; ఉత్కట= అధికమైన; వేగంబునన్= వడితో; ఏయన్= ప్రయోగింపగా; (అది) కంకటమున్= కవచాన్నీ; వక్షః పీఠమున్= పీటలా విశాలమూ, కఠినమూ అయిన రొమ్ములో; తూఱి= ప్రవేశించి; నెత్తుటి= రక్తంయొక్క; పొందు= చెలిమి; ఏమియున్= ఏమీ, బొత్తిగా; లేక= లేకుండా; ఉచ్చి= చీల్చుకొని; చనినన్= పోగా; ఆతండు= దుశ్శాసనుడు; తూగు+ఆడి= తూలి; వ్రాలుటయున్= ఒరగినందువల్ల; సూతుఁడు= అతని సారథి; భయ= జడుపుచేత; ఆలోల= సంపూర్ణంగా వణకుతున్న; ఆకృతిన్= రూపంతో; తేరు= రథాన్ని; తొలంగన్= యుద్ధభూమినుంచి తప్పుకొనేట్లు; తోలినన్= నడిపించుకొని పోగా.

తాత్పర్యం: కాంతిపుంజం ఆకాశప్రదేశంలో వ్యాపించేటట్లుగా ఒక గట్టిబాణం మహావేగంతో ప్రయోగించాడు. అది దుశ్శాసనుడి కవచాన్నీ, పీటవలె గట్టిగా విశాలంగా ఉన్న రొమ్మునూ చీల్చుకొని నెత్తురు కొంచెమైనా అంటకుండా వెళ్ళిపోయింది. ఆ దెబ్బకు దుశ్శాసనుడు ఊగిపోయి సొమ్మసిల్లి ఒరిగిపోయాడు. వెంటనే సారథి భయంతో నిలువెల్లా వణికిపోతూ యుద్ధభూమికి దూరంగా రథం తోలుకొని పోగా.

విశేషం: 'నెత్తుటి పొందేమియు లేక' అనటం విశేషం. బాణం చీల్చిన తరువాత రక్తం రావటానికి కొంచెంసేపు పడుతుంది. బాణం ఎంత వేగంతో ప్రవేశించి చీల్చుకొని వెళ్ళిందంటే శరీరభాగం తెగిన తరువాత రక్తం వచ్చి దీనికి తాకే వ్యవధి కూడా లేదన్నమాట. ఇది ఈ సందర్భంలో మూలంలో లేదు కూడా.

క. **అమ్మాద్రీపుత్రుఁడు వా । లమ్ముల దుశ్శాసనుని మహాసైన్యము రౌ**
ద్రమ్ముగఁ గలంచె దివిజ గ । ణమ్ము వినుతిసేయఁ దమమొనలు నలి నార్వన్. **122**

ప్రతిపదార్థం: ఆ+మాద్రీపుత్రుఁడు= ఆ మాద్రి కొడుకైన సహదేవుడు; దివిజ= దేవతలయొక్క; గణమ్ము= సమూహం; వినుతి+చేయన్= ప్రశంసింపగా; తమ= పాండవులయొక్క; మొనలు= సేనలు; నలిన్= ఉత్సాహంతో; ఆర్వన్= కేకలు పెట్టగా; దుశ్శాసనుని= దుశ్శాసనునియొక్క; మహాసైన్యమున్= పెద్దసైన్యాన్ని; వాలు+అమ్ములన్= పొడవైన పదునైన బాణాలతో; రౌద్రమ్ముగన్= భయంకరంగా; కలంచెన్= సంక్షోభిల్ల చేశాడు.

తాత్పర్యం: సహదేవుడు పొడవైన పదునైన బాణాలతో దుశ్శాసనుడి పెద్దసైన్యాన్ని కలచివేశాడు. ఆ తీరు చాలా భయంకరంగా ఉన్నది. ఆ పనికి దేవతలు ప్రశంసించారు. పాండవుల సేనలు ఉత్సాహంతో కేకలు పెట్టాయి.

చ. **నకులుఁడు సూతపుత్రుఁడుఁ బెనంగునెడన్ నకులుండు సూత పు**
త్రకునకు నిట్లనుంఁ దలఁచి దైవము నేఁడు నిజప్రసన్న దృ
ష్టికి ననుఁ బాత్రభూతుఁడుగఁ జేయుట గానఁగ వచ్చె నాదుచూ
డ్కికి నిను గోచరంబుగ ఘటించిన యా చతురత్వసంపదన్. **123**

ప్రతిపదార్థం: నకులుఁడున్= మాద్రి పెద్దకుమారుడైన నకులుడు; సూతపుత్రుఁడున్= సూతనందనుడైన కర్ణుడు; పెనంగు= పోరాడే; ఎడన్= సమయంలో; నకులుండు= నకులుడు; సూతపుత్రకునకున్= కర్ణునితో; ఇట్లు= ఇలా; అనున్= అన్నాడు; నాదు చూడ్కికిన్= నా దృష్టికి; నినున్= నిన్ను; గోచరంబుగన్= కనిపించేటట్లుగా; ఘటించిన= కూర్చిన; ఆ చతురత్వ= ఆ నేర్పరితనంయొక్క; సంపదన్= సమృద్ధిచేత; నేఁడు= ఈ దినం; దైవము= విధి; నిజ= తనయొక్క; ప్రసన్న= సంతోషించిన, దయకల; దృష్టికిన్= చూపునకు; ననున్= నన్ను; పాత్రభూతుఁడుగన్= అర్హుడైనవానిగా; చేయుట= చేయటం; కానఁగన్= కనిపింపగా; వచ్చెన్= వచ్చింది, కనిపించింది.

తాత్పర్యం: నకులుడూ కర్ణుడూ యుద్ధంచేస్తున్న సమయంలో నకులుడు కర్ణుడితో ఇట్లా అన్నాడు: 'నా కన్నులకు నీవు కనబడేటట్లుగా తాను చేసిన గొప్పనేర్పువల్ల నేడు దైవం నన్ను తన దయాదృష్టి ప్రసరించటానికి అర్హుడిగా చేయటం కనిపిస్తున్నది.

క. కౌరవ పాండవులకు నీ । వైరము నీ వలనఁ గాదె వచ్చెను నిను మ
ద్ఘోరశరనిహతిఁ బడఁ గ । న్నారఁ గనుంగొనక కోపమాఱునె? యొంటన్? 124

ప్రతిపదార్థం: కౌరవ పాండవులకున్= కౌరవులకూ, పాండవులకూ; ఈ వైరము= ఈ శత్రుత్వం; నీ వలనన్= నీ మూలాన; వచ్చెను కాదు+ఎ= వచ్చింది కదా; మత్= నాదైన; ఘోర= భయంకరమైన; శర= బాణంయొక్క; నిహతిన్= గట్టి దెబ్బతో; పడన్= పడగా; నినున్= నిన్ను; కన్ను+ఆరన్= కన్ను తృప్తిచెందేటట్లుగా; కనుంగొనక= చూడక; కోపము= క్రోధం; ఒంటన్= వేరొకదానితో; ఆఱునె?= తీరుతుందా?

తాత్పర్యం: కౌరవులకూ పాండవులకూ ఈ శత్రుత్వం నీ మూలాననే కదా వచ్చింది. అందువలన నా భయంకరమైన బాణపుదెబ్బకు పడిపోయిన నిన్ను నా కనులారా చూడనిదే, నా కోపం ఇంకొకదానివలన తీరుతుందా?

చ. అనవుడు రాజసూతివి మహాస్త్రవిదుండవు నైన నీకు ని
ట్లనుట దలంప నర్హమగు నైనను జెన్నఁటి పల్కులేల? నె
ట్టన భుజశక్తి మార్తురకడంక యడంచినఁ బల్కు టొప్పుఁగా
క నిలిచి చూపు నీ చలముకల్మియుఁ జేతులబల్మియుం దగన్'. 125

ప్రతిపదార్థం: అనవుడున్= అని పలుకగా (కర్ణుడిలా అన్నాడు:); (నీవు) రాజసూతివి= రాజకుమారుడవు; మహా= గొప్పవైన; అస్త్ర= మంత్ర ప్రయుక్తాలయిన ఆయుధాలను; విదుండవు= ఎరిగినవాడవు; నీకున్= ఇట్టి నీకు; ఇట్లు= ఇలా; అనుట= పలకటం; తలంపన్= ఆలోచింపగా; అర్హము+అగున్= తగును; ఐనను= అయినప్పటికీ; చెన్నఁటి= వ్యర్థమైన; పల్కులు= మాటలు; ఏల?= ఎందుకు?; నెట్టన= యథార్థంగా; భుజశక్తిన్= బాహుబలంతో; మార్తుర= శత్రువులయొక్క; కడంక= ప్రయత్నాన్ని; అడంచినన్= అణచినట్లైతే; పల్కుట+ఒప్పున్+కాన్= అనదగును గాని; నిలిచి= నిలబడి; నీ చలము కల్మియున్= నీకు పట్టుదల ఉండటాన్నీ; చేతుల= బాహువులయొక్క; బల్మియున్= బలాన్నీ; తగన్= నీ మాటలకు తగునట్లుగా; చూపు= చూపించు.

తాత్పర్యం: నకులుడట్లా అనేసరికి కర్ణుడిట్లా చెప్పాడు: 'నీవు క్షత్రియవంశంలో పుట్టావు. నీకు మహాస్త్రాలు తెలుసు. అందువల్ల నీవిలా అనదగును కాని, పనికిమాలిన మాటలెందుకు? నిజంగా భుజబలంతో నీవు శత్రువుల ప్రయత్నం అణచివేసి అంటే బాగుంటుంది. నిలబడి నీ మాటలకు తగినట్లుగా నీ పట్టుదలా, బాహుబలమూ చూపించుము.'

వ. అని పలికి కర్ణుండు. 126

ప్రతిపదార్థం: అని= ఇట్లా; పలికి= చెప్పి; కర్ణుండు= అంగరాజు కర్ణుడు.

తాత్పర్యం: ఇట్లా పలికి అంగరాజు.

సీ. ఉబ్బి మాద్రీసుతు డెబ్బది మూఁడు దూ । పులఁ గప్పుటయు నతఁ డలిగి యతని
పై డెబ్బది నిశితబాణంబు లేసిన । నా సూతనందనుఁ డక్కుమారు
ధనువు నుగ్గుగఁ జేసి తనువున ముప్పది । కాండముల్ సొనిపిన నొండు విల్లు
గొని డెబ్బదింట నాతని నొంచి మూఁడు మా । ర్గణములు సూతునంగమునఁ బఱపి

తే. భల్లమున విల్లుదునుమాడి యెల్ల జనులు । నద్భుతంబందఁ ద్రిశతసాయకపరీతుఁ
జేసి నకులుండు నిష్ఠురహాస భాసి । తాననాంభోజుఁడై పొలుపారె నధిప! 127

ప్రతిపదార్థం: అధిప!= రాజా! ఉబ్బి= గర్వించి; మాద్రీసుతున్= మాద్రి కొడుకైన నకులుని; డెబ్బది మూఁడు= డెబ్బైమూడు; తూపులన్= బాణాలతో; కప్పుటయున్= కప్పివేయగా; అతఁడు= నకులుడు; అలిగి= కోపించి; అతనిపైన్= కర్ణునిపై; డెబ్బది= డెబ్బై; నిశిత= పదునుగల; బాణంబులు= అమ్ములు; ఏసినన్= ప్రయోగింపగా; ఆ సూతనందనుఁడు= ఆ కర్ణుడు; ఆ+ కుమారు= ఆ బాలునియొక్క; ధనువు= విల్లు; నుగ్గుగన్+చేసి= చూర్ణమయ్యేటట్లు చేసి; తనువునన్= నకులుని శరీరంలో; ముప్పది= ముప్పై; కాండముల్= బాణాలు; చొనిపినన్= ప్రవేశపెట్టగా; నకులుండు; ఒండు= మరొక; విల్లు= ధనుస్సు; కొని= తీసికొని; డెబ్బదింటన్= డెబ్బై బాణాలతో; ఆతనిన్= కర్ణుని; నొంచి= నొప్పించి; మూఁడు= మూడైన; మార్గణములు= బాణాలు; సూతు= సారథియొక్క; అంగమునన్= శరీరంలో; పఱపి= చొనిపి; భల్లమునన్= బాణంతో; విల్లు= ధనుస్సును; తునుమాడి= నరికి; ఎల్లజనులు= అందరు ప్రజలు; అద్భుతంబు= ఆశ్చర్యం; అందన్= పొందేటట్లుగా; త్రిశత= మూడువందల; సాయక= బాణాలచే; పరీతున్= కప్పబడినవానినిగా; చేసి= చేసి; నిష్ఠుర= కఠినమైన; హాస= నవ్వుచేత; భాసిత= మెరుస్తున్న; ఆనన+అంభోజుఁడు= పద్మంవంటి ముఖం కలవాడు; ఐ= అయి; పొలుపు+ఆరెన్= ఒప్పినాడు.

తాత్పర్యం: రాజా! (కర్ణుడు) గర్వించి నకులుడిని డెబ్బై మూడు బాణాలతో కప్పివేశాడు. నకులుడు కోపించి కర్ణుడిమీద డెబ్బై వాడిబాణాలు ప్రయోగించాడు. కర్ణుడు నకులుడి ధనుస్సును పొడిపొడిగా చేసి, అతడి దేహంలో ముప్పై బాణాలు నాటాడు. నకులుడు మరొక విల్లు తీసికొని డెబ్బై బాణాలతో కర్ణుడిని నొప్పించి, మూడు బాణాలు అతడి రథసారథి శరీరంపై వేశాడు. ఇంకా ఒక బాణంతో కర్ణుడి ధనుస్సు విరుగగొట్టాడు. అందరూ ఆశ్చర్యపోయేటట్లు మూడువందల బాణాలతో అతడిని కప్పివేశాడు. కోపంతో కూడిన చిరునవ్వుతో పద్మంవంటి ముఖం మెరుస్తుండగా విలసిల్లాడు.

క. సూతసుతుఁడు బలు విలుగొని । యాతని వక్షమున నాటె నైదమ్ములు ని
ర్ఘాత సమసప్తశరముల । నాతఁ డతని నొంచి విల్లు నటిముటిఁ ద్రుంచెన్. 128

ప్రతిపదార్థం: సూతసుతుఁడు= కర్ణుడు; బలు= పెద్ద; విలు= వింటిని; కొని= తీసికొని; ఆతని వక్షమునన్= ఆ నకులుని వక్షఃస్థలం మీద; ఐదు+అమ్ములు= అయిదు బాణాలు; నాటెన్= గ్రుచ్చాడు; ఆతఁడు= నకులుడు; నిర్ఘాతసమ= పిడుగుల వంటి; సప్తశరములన్= ఏడు బాణాలతో; అతనిన్= కర్ణుని; నొంచి= నొప్పించి; విల్లు= ధనుస్సును; అటిముటిన్= వేగంగా; త్రుంచెన్= నరికాడు.

తాత్పర్యం: కర్ణుడు పెద్ద ధనుస్సు తీసికొన్నాడు. నకులుడి వక్షఃస్థలంపై ఐదు బాణాలు దింపాడు. నకులుడు పిడుగులవంటి ఏడు బాణాలతో కర్ణుడిని నొప్పించి, అతడి ధనుస్సును వెంటనే విరుగగొట్టాడు.

వ. మఱియు నొక్క మహనీయకార్ముకంబుఁ గొని కర్ణుండు గడంగె నప్పు డయ్యిరువురు నొండొరులతూపులు ద్రుంచుచు నిజమార్గణంబుల నొకళ్ళొకళ్ళ నెత్తుట ముంచుచుం బేర్చి వివిధవిశిఖ జాలంబు లడరించిన నంబరంబు శలభపటల సంవృతంబునుంబోలె నుండె నా సమయంబున నకులునగ్రభాగంబునకు వచ్చిన సోమకబలంబులు గర్ణక్రూర నారాచాది బహుళబాణపాతంబులఁబలాయితంబులయ్యెఁ గర్ణునకు బాసటయై తఱిమిన కౌరవ సైనికులు మాద్రేయు రౌద్ర విజృంభణంబున దూరవిఘటితులై ర ట్లిరువాఁగును నెడగలిగి చూచుచుండ నారథికోత్తము లుదాత్త ఘోరాకారంబుల నుల్లసిల్లిభల్లప్రముఖ ప్రదరంబులఁ బరస్పరాంగంబులం బొదివి యంబుద పిహిత మూర్తులగు మార్తాండ శశాంకుల చందంబు నొంది యన్యోన్య దివ్యాస్త్ర తేజోవిలాసంబుల నయ్యైయస్త్రంబుల వారించుచుం బోరి రట్టి యెడ. 129

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; కర్ణుండు= అంగరాజు; ఒక్క= ఒక్క; మహనీయ= పెద్ద; కార్ముకంబు= ధనుస్సును; కొని= తీసికొని; కడంగెన్= తలపడినాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+ఇరువురున్= ఆ యిద్దరూ; ఒండు+ఒరుల= ఒకరు మరొకరి; తూపులన్= బాణాలను; త్రుంచుచున్= విరగగొడుతూ; నిజ= తమ; మార్గణంబులన్= బాణాలతో; ఒకళ్ళు+ఒకళ్ళన్= ఒకరు మరొకరిని; నెత్తుటన్= రక్తంలో; ముంచుచున్= నిమగ్నులను చేస్తూ; పేర్చి= చెలరేగి; వివిధ= రకరకములయిన; విశిఖ జాలంబులు= వాడిబాణసమూహాలు; అడరించినన్= ప్రయోగింపగా; అంబరంబు= ఆకాశము; శలభ= మిడుతలయొక్క; పటల= సమూహంచేత; సంవృతంబునున్+పోలెన్= కప్పబడినదానిలా; ఉండెన్= ఉన్నది; ఆ సమయంబునన్= అప్పుడు; నకులు= నకులునియొక్క; అగ్రభాగంబునకున్= ముందరి ప్రదేశానికి; వచ్చిన= వచ్చినట్టి; సోమక బలంబులు= పాంచాల సైన్యాలు; కర్ణ= కర్ణునియొక్క; క్రూర= నిర్దయమైన; నారాచ= ఇనుపబాణములు; ఆది= మొదలయిన; బహుళ= అనేకములైన; బాణ= బాణములయొక్క; పాతంబులన్= పడటముచేత; పలాయితంబులు= పారిపోయినవి; అయ్యెన్= అయినాయి; కర్ణునకున్= అంగరాజుకు; బాసట+ఐ= సహాయమై; తఱిమిన= త్రోలిన; కౌరవ సైనికులు= కౌరవులయొక్క యుద్ధభటులు; మాద్రేయు= మాద్రి కొడుకైన నకులునియొక్క; రౌద్ర= క్రోధంయొక్క; విజృంభణంబునన్= రేగటంవల్ల; దూర= దూరంగా; విఘటితులు+ఐరి= చెదరినవారైనారు; అట్లు= ఆవిధంగా; ఇరువాఁగునున్= ఉభయపక్షాలవారూ; ఎడ+కలిగి= వ్యవధానం ఏర్పడి; చూచుచున్+ఉండన్= చూస్తూ ఉండగా; ఆ రథిక+ఉత్తములు= రథికులలో శ్రేష్ఠులైనవారు; ఉదాత్త= గొప్పవీ; ఘోర= భయంకరములైనవీ అయిన; ఆకారంబులన్= రూపాలతో; ఉల్లసిల్లి= విలసిల్లి; భల్ల= భల్లములు; ప్రముఖ= మొదలయిన; ప్రదరంబులన్= బాణాలతో; పరస్పరాంగంబులన్= ఒకళ్ళొకళ్ళ అవయవాలను; పొదివి= కప్పి; అంబుద= మేఘాలచే; పిహిత= కప్పబడిన; మూర్తులు+అగు= రూపములు కలవారైన; మార్తాండ శశాంకుల= సూర్యచంద్రుల; చందంబున్= విధాన్ని; ఒంది= పొంది; అన్య+అన్య= ఒకళ్ళొకళ్ళ; దివ్య+అస్త్ర= స్వర్గంలో జన్మించిన మంత్రప్రయుక్తములయిన ఆయుధాలయొక్క; తేజః= ప్రకాశములయొక్క; విలాసంబులన్= మెరుపులచేత; ఆ+ఆ+అస్త్రంబులన్= ఆయా మంత్రప్రయుక్తాయుధాలను; వారించుచున్= నివారిస్తూ; పోరిరి= యుద్ధం చేశారు; అట్టి= అటువంటి; ఎడన్= సమయంలో.

తాత్పర్యం: ఇంకా, కర్ణుడు ఒక పెద్ద విల్లు తీసికొని పోరాడాడు. ఆ సమయంలో కర్ణుడూ నకులుడూ ఒకరి బాణాలొకరు నరుక్కొంటూ, తమ తమ బాణాలతో ఒకరినొకరు నెత్తుటిలో ముంచుకొంటూ చెలరేగి రకరకాల బాణాలు ప్రయోగించారు. వాటితో ఆకాశం మిడుతల దండు కప్పినట్లున్నది. అపుడు ద్రుపదుడి సేనలు సాయంగా నకులుడి ముందుకు వచ్చాయి. వాటిపై కర్ణుడు కఠినాలయిన ఇనుపబాణాలు మొదలయిన రకరకాల బాణాలు ప్రయోగించి

తరిమాడు. కర్ణుడికి సాయంగా వచ్చిన కౌరవభటులు వారిని తరుముతుంటే నకులుడు రౌద్రంతో విజృంభించాడు. అపుడవి దూరంగా చెదరిపోయాయి. అట్లా ఎడమేర్పడి ఉభయపక్షాలూ చూస్తూండగా ఆ ఉత్తమరథికుల నకుల కర్ణులిద్దరూ మహా భయంకరాకారాలతో భాసించారు. భల్లములు మొదలయిన బాణాలతో ఒకరి దేహాలను మరొకరు కప్పివేశారు. అందువలన మబ్బులు కప్పిన సూర్యచంద్రులవలె ఉన్నారు. ఒకళ్ళొకళ్ళ దివ్యాస్త్రాల తేజస్సులను ఆయా దివ్యాస్త్రాలతో నివారిస్తూ పోరాడారు. అటువంటి సమయంలో.

విశేషం: అలం: ఉపమ.

క. **అలుక వొడమి కర్ణుండు న । కులు చాపము ద్రుంచి సూతుఁ గూల్చి తురంగం**

బులఁ జంపి చక్రరక్షుల । తలలు నఱికి సిడిముద్రుంచి దరహాసముతోన్. **130**

ప్రతిపదార్థం: కర్ణుండు= అంగరాజు; అలుక= కోపం; పొడమి= కలిగి; నకులు= నకులునియొక్క; చాపము= ధనుస్సును; త్రుంచి= నరికి; సూతున్= సారథిని; కూల్చి= పడగొట్టి; తురంగంబులన్= గుఱ్ఱాలను; చంపి= సంహరించి; చక్రరక్షుల= చక్రరక్షకుల; తలలు= శిరస్సులు; నఱికి= ఖండించి; సిడము= జెండా; త్రుంచి= నరికి; దరహాసముతోన్= చిరునవ్వుతో.

తాత్పర్యం: కర్ణుడికి కోపం వచ్చింది. అందువలన నకులుడి ధనుస్సు విరుగగొట్టాడు. సారథిని పడగొట్టాడు. గుఱ్ఱాలను చంపాడు, చక్రరక్షకుల శిరస్సులు ఖండించాడు, జెండా నరికాడు, చిరునవ్వుతో.

వ. **మెఱసినం గుపిత చిత్తుండై.** **131**

ప్రతిపదార్థం: మెఱసినన్= ప్రకాశింపగా; కుపితచిత్తుండు+ఐ= కోపించిన మనస్సు కలవాడై.

తాత్పర్యం: ప్రకాశించగా కోపించి.

చ. **పలకయు వాలునుం గొనియెఁ బాండుకుమారుఁడు రెండు చెక్కలై**

యిలఁ దొరఁగంగ నేసె గదయెత్తినఁ ద్రుంచె రథంబు డిగ్గి యు

జ్జ్వలపరిఘాభిరాముఁడయి వచ్చిన నప్పరిఘంబు రూపుమా

పి లసిత లాఘవ స్ఫురణ పెంపునఁ గర్ణుఁడు నొంచె నాతనిన్. **132**

ప్రతిపదార్థం: పాండుకుమారుఁడు= పాండురాజు కొడుకైన నకులుడు; పలకయున్= డాలునూ; వాలునున్= ఖడ్గమును, కత్తినీ; కొనియెన్= తీసుకొన్నాడు; కర్ణుఁడు= అంగరాజు; రెండు చెక్కలు+ఐ= రెండు బ్రద్దలు అయి; ఇలన్= భూమిపై తొరఁగంగన్= పడగా; ఏసెన్= బాణంతో కొట్టాడు; గద= గుదియ; ఎత్తినన్= పై కెత్తగా; త్రుంచెన్= (కర్ణుడు) నరికాడు; రథంబు; డిగ్గి= (నకులుడు) దిగి; ఉజ్జ్వల= మిక్కిలి మెరిసే; పరిఘా= ఇనుపకట్ల గుదియచేత; అభిరాముఁడయి= మనోహరుడై, (ఇనుపకట్ల గుదియ తీసుకొని); వచ్చినన్= రాగా; ఆ+పరిఘంబు= ఆ ఇనుపకట్ల గుదియను; రూపు మాపి= (కర్ణుడు) ముక్కలు చేసి; లసిత= ప్రకాశిస్తున్న; లాఘవ= నేర్పుయొక్క; స్ఫురణ= మెరుపుయొక్క; పెంపుతోన్= సమృద్ధితో; ఆతనిన్= నకులుని; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: నకులుడు డాలూ వాలూ తీసికొన్నాడు. కర్ణుడు ఆ డాలు రెండు బ్రద్దలై నేలమీద పడేటట్లు కొట్టాడు. నకులుడు విసరటానికి గద పైకెత్తాడు. కర్ణుడు దానినీ ముక్కలు చేశాడు. నకులుడు రథం దిగి మెరుస్తున్న పరిఘ తీసికొని వచ్చాడు. కర్ణుడు దానినీ ముక్కలు చేసి, తననేర్పు ప్రకటమయ్యేటట్లు నకులుడిని నొప్పించాడు.

ఆ. మర్మభేదులైన మార్గణంబుల కోహ । టించి సిగ్గుఁ జలము డిగ్గఁ ద్రావి
యెల్లజనులుఁ జూడఁ బొల్లఁదనంబున । కోర్చి యక్కుమారుఁ డోడిపాఱె. 133

ప్రతిపదార్థం: ఆ+కుమారుఁడు= ఆ బాలుడు నకులుడు; మర్మభేదులు+ఐన= ఆయువుపట్టులను బ్రద్దలుగొట్టే; మార్గణంబులకున్= బాణాలకు; ఓహటించి= జంకి; సిగ్గున్= లజ్జనూ; చలమున్= పట్టుదలనూ; డిగ్గఁద్రావి= విడిచి; ఎల్లజనులున్= సమస్తజనులూ; చూడన్= చూడగా, చూస్తుండగా; పొల్లఁదనంబునకున్= తేలికతనానికి; ఓర్చి= సహించి; ఓడి= ఓడిపోయి; పాఱెన్= పారిపోయాడు.

తాత్పర్యం: కర్ణుడి బాణాలు ఆయువుపట్టులను బ్రద్దలు చేస్తుంటే నకులుడు వాటికి భయపడి, సిగ్గువిడిచి పట్టుదల వదలి, తనను అందరూ చూస్తూ ఉండగా తేలికతనానికి సహించి, ఓడిపోయి పారిపోయాడు.

కర్ణుఁడు నకులుని విరథుంజేసి యవమానించుట (సం. 8-17-91)

క. వెనుకొని రాధేయుఁడు నిజ । ధను వాతని కంధరమునఁ దగిలిచి నలిఁ బ
ట్టిన నింద్రచాప పరిగత । ఘనాకృతిని బొలిచె నతఁడు కౌరవనాథా! 134

ప్రతిపదార్థం: కౌరవనాథా!= కురువంశీయుడైన ధృతరాష్ట్ర మహారాజా!; రాధేయుడు= రాధాపుత్రుడు కర్ణుడు; వెనుకొని= నకులుడిని వెంబడించి; నిజధనువు= తన విల్లు; ఆతని కంధరమునన్= నకులుని కంఠానికి; తగిలిచి= తగిలించి; నలిన్= ఉత్సాహంతో; పట్టినన్= పట్టుకొనగా; అతఁడు= నకులుడు; ఇంద్రచాప= ఇంద్రచాపంచేత; పరిగత= చుట్టబడిన; ఘన+ఆకృతిని= మేఘం రూపంతో; పొలిచెన్= అందగించాడు.

తాత్పర్యం: కౌరవవంశీయుడవయిన ధృతరాష్ట్రమహారాజా! రాధేయుడు నకులుడిని వెంబడించి, తన విల్లతడి కంఠానికి తగిలించి పట్టుకొన్నాడు. అపుడు నకులుడు చుట్టూ హరివిల్లున్న మేఘంవలె శోభించాడు.

విశేషం: అలం: ఉపమ. మేఘం వర్షించిన తరువాత ఇంద్రధనుస్సు ఏర్పడుతుంది. నకులుడు శరవర్షం కురిపించి ఆగాడు. ఇట్లా ఈ ఉపమానం ఆలోచనామృతం.

వ. ఇట్లు పాండుతనయుబాడుదలఁబట్టి మందస్మిత సుందరాననుండై. 135

ప్రతిపదార్థం: ఇట్లు= ఇలా; పాండు తనయున్= (కర్ణుడు) పాండురాజకుమారుడైన నకులుని; బాడుదలన్+పట్టి= అవమానించి; మందస్మిత= చిరునవ్వుచేత; సుందర= అందమైన; ఆననుండు+ఐ= ముఖం కలవాడై.

తాత్పర్యం: ఈ విధంగా నకులుడిని అవమానించి, చిరునవ్వుతో అందగించే ముఖం కలవాడై.

క. పలుకులు వృథగా నన్నుం । బలికితి ము న్నింక నెన్ని పలుక వలసినం
బలుకుము నీకేఁ దగ నా । యలవుఁ జలము నీ వెఱింగి తంతియ చాలున్. 136

ప్రతిపదార్థం: మున్ను= ఇంతకుముందు; నన్నున్; పలుకులు= మాటలు; వృథగా= వ్యర్థంగా; పలికితి= మాట్లాడావు; ఇంకన్= ఇకమీదట; ఎన్ని పలుక వలసినన్= ఎన్ని మాటలు మాట్లాడదలచుకొన్నా; నీకు+ఏన్= నీకే (నీ శక్తికి మాత్రమే); తగన్=

తగినట్లుగ; పలుకుము= మాట్లాడుము; నా= నాయొక్క; అలవున్= బలాన్ని; చలము= గట్టిపట్టును; నీవు; ఎఱింగితి(వి)= (ఇప్పుడు) తెలుసుకొన్నావు; అంతియ= అంతమాత్రమే; చాలున్= చాలును.

తాత్పర్యం: ఇంతకుముందు నన్ను గూర్చి వ్యర్థంగా పెక్కు మాటలు మాట్లాడావు. ఇక ముందు ఎన్ని మాటలు మాట్లాడదలచుకొన్నా నీ శక్తికి తగినట్లు మాట్లాడు. నా బలాన్ని, పట్టును ఇప్పుడు తెలుసుకొన్నావు కదా. అదేచాలు.

క. అలవెఱిఁగి పెనఁగు పెనఁగం । దలఁచిన నదిగాక సిగ్గుదలకొని యనికిం
దొలఁగుట యింకిట దగు వి । చ్చలవిడి నర్జునుని కడకుఁ జనుము కుమారా!' 137

ప్రతిపదార్థం: పెనఁగన్= పోరాడటానికి; తలఁచినన్= తలచుకొంటే; అలవు= (ఎదిరిదీ, నీదీ) శక్తి; ఎఱిఁగి= తెలిసికొని; పెనఁగు= పోరాడు; అది+కాక= పోరాటం కాకుండా; ఇంకన్= ఈ పైని; ఇట= ఇక్కడ; సిగ్గు= లజ్జ; తలకొని= వహించి; అనికిన్= యుద్ధానికి; తొలగుట; తగున్= యుక్తమవుతుంది; కుమారా!= కుర్రవాడా!; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; అర్జునుని= అర్జునునియొక్క; కడకున్= దగ్గరకు; చనుము= వెళ్ళు.

తాత్పర్యం: యుద్ధం చేద్దామనుకొంటే నీ శక్తి ఏమిటో నీ ఎదిరి శక్తి ఏమిటో తెలిసికొని మరీ చేయుము. అట్లా యుద్ధంచేయటం కాక సిగ్గుతెచ్చుకొని యుద్ధానికి దూరంగా పోవటం ఇకమీద నీకు తగిన పని. (విడిచిపెడుతున్నాను, చిన్నవాడవని) కుర్రవాడా! స్వేచ్ఛగా అర్జునుడి దగ్గరకు పొమ్ము'.

విశేషం: 136, 137 పద్యాలు వాటికవే సాటి. మాటలు చిన్నవే కాని తేలుకొండెల్లా విషపూరితాలు. 'నీ దిక్కున్నచోటికి పో' అన్నట్టు అర్జునుని దగ్గరకు పొమ్మనటం, 'కుమారా' అనటం మరీ చురుకైనవి.

క. అని విడిచె నకులుఁ గుంతి వ । చనములు దృఢవృత్తి చిత్త సంకలితములై
యునికిం గర్ణుం డతఁడు ను । జని ధర్మజునరదమెక్కె సవ్రీడముగన్. 138

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా పలికి; కర్ణుండు= అంగరాజు; కుంతి వచనములు= కుంతీదేవి మాటలు; దృఢవృత్తి= గట్టిగా; చిత్త= మనస్సులో; సంకలితములు+ఐ= లగ్నములై; ఉనికిన్= ఉండటంచేత; నకులున్= నకులుని; విడిచెన్= విడిచిపెట్టాడు; అతఁడున్= ఆ నకులుడూ; సవ్రీడముగన్= సిగ్గుతో; చని= వెళ్ళి; ధర్మజు= యుధిష్ఠిరునియొక్క; అరదము= తేరు (రథము); ఎక్కెన్= ఆరోహించాడు.

తాత్పర్యం: కర్ణు డిట్లా పలికి, తన కుమారులను చంపవద్దని కోరిన కుంతీదేవి మాటలు గట్టిగా మనస్సులో ఉన్నందున నకులుడిని విడిచిపెట్టాడు. నకులుడు కూడా సిగ్గుతో వెళ్ళి యుధిష్ఠిరుడి తేరెక్కాడు.

వ. ఎక్కి నిట్టూర్పు నిగుడం గుంభనిక్షిప్త భుజంగంబుచందంబున నుండె నవ్విధంబున మాద్రీపుత్ర మాన మథనవిజృంభితుం డగునవ్వీరుం డప్పుడు మధ్యందినగతంబైన మార్తాండబింబంబునకుం బ్రతిబింబంబునుం బోలెఁ బ్రదీప్త మూర్తియై వెలిమావులును దెలిపడగయు నుల్లసిల్ల శోభిల్లు తన రథంబు రయంబున దర్శనీయంబుగాఁ బాంచాలబలంబు దఱిసి పెక్కు తెఱంగుల మెఱుంగుటమ్ములగములు గదియించి. 139

ప్రతిపదార్థం: ఎక్కి= అధిరోహించి; నిడు+ఊర్పు= నిట్టూర్పు; నిగుడన్= సాగగా; కుంభ= కుండలో; నిక్షిప్త= ఉంచబడిన; భుజంగంబు= పాము; చందంబునన్= విధంగా; ఉండెన్= ఉన్నాడు; ఆ+విధంబునన్= ఆ ప్రకారంబుగా; మాద్రీపుత్ర= మాద్రికొడుకైన నకులునియొక్క; మాన= అభిమానంయొక్క; మథన= తరచటంచేత; విజృంభితుండు+అగు= చెలరేగిన వాడైన; ఆ+వీరుండు= ఆ కర్ణుడు; అప్పుడు= ఆ సమయంలో; మధ్యందిన= మిట్టమధ్యాహ్నానికి; గతంబు+ఐ= చేరినదైన; మార్తాండ= సూర్యునియొక్క; బింబంబునకున్= మండలానికి; ప్రతిబింబంబునున్+పోలెన్= ప్రతిఫలనంలా; ప్రదీప్త= మిక్కిలి వెలుగుతున్న; మూర్తి+ఐ= రూపంకలవాడై; వెలిమావులును= తెల్లని గుర్రాలూ; తెలిపడగయున్= తెల్లని జెండాయూ; ఉల్లసిల్లన్= ప్రకాశింపగా; శోభిల్లు= అందగించే; తన రథంబు= తన తేరు; రయంబునన్= వేగంతో; దర్శనీయంబుగాన్= చూడదగినదిగా, కనబడేటట్లుగా; పాంచాల బలంబు= పాంచాల సేనను; దఱిసి= సమీపించి; పెక్కుతెఱంగుల= అనేక విధాలైన; మెఱుంగు= మెరసే; అమ్ముల= బాణాలయొక్క; గమి+లు= సముదాయాలను; కదియించి= ప్రయోగించి.

తాత్పర్యం: నకులుడట్లా యుధిష్ఠిరుడి రథమెక్కి కుండలో పెట్టిన పాము బుసకొట్టుతూ ఉన్నట్లు విచారంతో నిట్టూర్పులు విడుస్తూ కూర్చున్నాడు. అట్లా నకులుడి పరువు తీయటంతో కర్ణుడికి విజృంభణం వచ్చింది. అపుడు కర్ణుడు మిట్టమధ్యాహ్నపు సూర్యబింబానికి ప్రతిబింబంలా వెలిగాడు. తెల్లగుర్రాలతో, తెల్లని జెండాతో మెరుస్తున్న తన రథాన్ని పాంచాలసైన్యం వద్దకు పోనిచ్చి, రకరకాల మెరిసే అమ్ముల గుంపులు ప్రయోగించి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలంకారం: ఉపమ.

సీ. **సూతులఁ దెగటార్చి కేతనంబుల వీట । తాటంబుసేసి రథ్యములఁ గూల్చి**
చామరచ్ఛత్రభూషణములు పొడిసేసి । రథికజనముల శిరములు ద్రుంచి
కొమ్ములునఱికి యంకుశములుదునిమి తొం । డములు ఖండించి కుంభములు వ్రచ్చి
జోదులతనువులు భేదించి మోరలు । గళ్యాల తోడఁ జెక్కలుగఁ జేసి

ఆ. **కంధరములుడుల్చి కాళ్ళులు ద్రెంచి యా । శ్వికులఁ జంపి చర్మవిశిఖకుంత**
ముసలముద్గరప్రముఖసాధనములు భ । గ్నములు సేసి భటుల సమయఁ జూచి. **140**

ప్రతిపదార్థం: సూతులన్= సారథులను; తెగటార్చి= సంహరించి; కేతనంబులన్= జెండాలను; వీటతాటంబు+చేసి= తారుమారు చేసి; రథ్యములన్= గుర్రాలను; కూల్చి= పడగొట్టి; చామర= వింజామరలు; ఛత్ర= గొడుగులూ; భూషణములు= నగలూ; పొడి+చేసి= నుగ్గుచేసి; రథికజనముల= రథికులయొక్క; శిరములు= తలలు; త్రుంచి= నరికి; కొమ్ములు= (ఏనుగులయొక్క) దంతములు; నఱికి= ఖండించి; అంకుశములు= ఏనుగు కుంభస్థలాన్ని పొడిచే ఆయుధాలు; తునిమి= విరగగొట్టి; తొండములు= తుండాలు; ఖండించి= నరికి; కుంభములు= కుంభస్థలాలు; వ్రచ్చి= చీల్చి; జోదుల= కాలిబంటులయిన యోధులయొక్క; తనువులు= దేహాలను; భేదించి= బ్రద్దలుచేసి; మోరలు= (గుర్రాల) ముఖాలు; కళ్యాలతోడన్= కళ్ళేలతోసహా; చెక్కలుగన్+చేసి= బ్రద్దలుచేసి; కంధరములు= మెడలు; డుల్చి= నరికి; కాళ్ళులు= కాళ్ళు; త్రెంచి= తెగవేసి; ఆశ్వికులన్= రౌతులను; చంపి= ప్రాణాలు తీసి; చర్మ= డాలు; విశిఖ= బాణాలు; కుంత= ఈటెలు; ముసల= రోకళ్ళు; ముద్గర= సమ్మెటలు; ప్రముఖ= మొదలయిన; సాధనములు= ఉపకరణాలు; భగ్నములు+చేసి= విరుగగొట్టి; భటులన్= సైనికులను; సమయన్+చూచి= మరణించునట్లుచేసి, చంపి.

తాత్పర్యం: సారథులను చంపాడు. జెండాలు తార్మారు చేశాడు. గుర్రాలను పడగొట్టాడు. వింజామరలూ గొడుగులూ నగలూ నుగ్గు చేశాడు. రథికుల తలలు నరికాడు. ఏనుగుల దంతాలు విరిచాడు. వాటి కుంభస్థలాలమీద పొడిచే అంకుశాలను ముక్కలు చేశాడు. వాటి తుండాలు ఖండించాడు. వాటి కుంభస్థలాలు బ్రద్దలు చేశాడు. వాటిమీది యోధుల శరీరాలు చీల్చాడు. గుర్రాల ముఖాలు కళ్ళేలతో సహా బ్రద్దలు చేశాడు. కంఠాలు ఖండించాడు. కాళ్ళు నరికాడు, రౌతులను సంహరించాడు. డాళ్ళు, బాణాలు, ఈటెలు, రోకళ్ళు, సమ్మెటలు మొదలయిన సాధనాలను విరుగగొట్టాడు. అనేకులయిన సైనికులను సంహరించాడు.

వ. బాహువిలాసంబు మెఱయ నెఱయంబొలిచె భవత్సుతుండగు యుయుత్సుండు పర్వతప్రతిముండగు నులూకుపయిం గవిసి కులిశనిభంబగు విశిఖంబున నొంచినఁ గోపించి యా బల్లిదుండు విల్లు విఱుగ నేయుటయు నక్కుమారుండు. 141

ప్రతిపదార్థం: బాహు= చేతులయొక్క; విలాసంబు= క్రీడ; మెఱయన్= ప్రకాశింపగా; నెఱయన్= నిండుగా; పొలిచెన్= ఉండెను; భవత్= నీయొక్క; సుతుఁడు= కుమారుడు; అగు= అయిన; యుయుత్సుండు= ఆ పేరుగలిగి పాండవపక్షంలో యుద్ధారంభంలో చేరినవాడు; పర్వత ప్రతిముండు+అగు= పర్వతముతో సాటిరాదగిన వాడైన; ఉలూకుపయిన్= ఆ పేరుకలిగిన శకుని కుమారునిమీద; కవిసి= దాడిచేసి; కులిశ= వజ్రాయుధానికి; నిభంబు+అగు= సాటి అయిన; విశిఖంబునన్= బాణంతో; నొంచినన్= నొప్పించగా; కోపించి= అలిగి; ఆ బల్లిదుండు= ఆ బలశాలి; విల్లు= ధనుస్సు; విఱుగన్= విరిగేటట్లు; ఏయుటయున్= బాణం ప్రయోగింపగా; ఆ+కుమారుండు= ఆ నీ కుమారుడు యుయుత్సుడు.

తాత్పర్యం: ఇట్లా తన చేతి యుద్ధక్రీడ ప్రకాశించగా కర్ణుడు నిండుగా యుద్ధం చేస్తున్నాడు. అపుడు నీ కుమారుడు యుయుత్సుడు పర్వతంవంటి ఉలూకుడి మీదికి వెళ్ళాడు. వెళ్ళి వజ్రాయుధంవంటి బాణంతో అతడిని నొప్పించాడు. ఉలూకుడు కోపపడి అతడి ధనుస్సు విరుగగొట్టాడు. అపుడు యుయుత్సుడు.

తే. మేలు విలుగొని యఱువది నాలుగమ్ము। లతనిమెయిఁ గ్రుచ్చి సాయక త్రితయ నిహతి
సూతు నొప్పించి మఱియు నిశాత శరచ। యమ్ము వరఁగించె నధిక రయమ్ము మెఱయ. 142

ప్రతిపదార్థం: మేలు= శ్రేష్ఠమైన; విలు= ధనుస్సును; కొని= తీసికొని; అఱువది నాలుగు= అరవైనాలుగు; అమ్ములు= బాణాలు; అతని= ఉలూకునియొక్క; మెయిన్= దేహంలో; క్రుచ్చి= నాటి; సాయక= బాణాలయొక్క; త్రితయ= మూడింటియొక్క; నిహతిన్= గట్టిదెబ్బతో; సూతున్= సారథిని; నొప్పించి= బాధించి; మఱియున్; అధికరయమ్ము= మిక్కిలివేగం; మెఱయన్= ప్రకాశింపగా; నిశాత= పదునుగల; శర= బాణాలయొక్క; చయమ్మున్= సముదాయాన్ని; పరఁగించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: మంచి ధనుస్సు తీసికొన్నాడు. అరవైనాలుగు బాణాలు ఉలూకుడి శరీరంలో నాటాడు. మూడు బాణాలతో గట్టిగా కొట్టి, సారథికి బాధ కలిగించాడు. ఇంకా వాడి బాణాల సమూహాలు మిక్కిలి వేగంతో ప్రయోగించాడు.

వ. దానం గనలి. 143

ప్రతిపదార్థం: దానన్= అందువలన; కనలి= కోపించి.

తాత్పర్యం: అందువలన కోపించి.

క. బలువిడి నులూకుఁ డిరువది । శిలీముఖము లొడలఁ జొనిపి సిడము రయముమై
నిలఁ గూల్చిన నీ సుతుఁ డు । జ్జ్వల విశిఖములయిదు నాటె వాని యురమునన్. 144

ప్రతిపదార్థం: ఉలూకుడు= శకుని కొడుకు; బలువిడిన్= ఉద్రేకంతో; ఇరువది= ఇరవై; శిలీముఖములు= బాణాలు; ఒడలన్= యుయుత్సుడి దేహంలో; చొనిపి= ప్రవేశపెట్టి; రయముమైన్= వేగంతో; సిడమున్= జెండాను; ఇలన్= భూమిపై; కూల్చినన్= పడగొట్టగా; నీ సుతుఁడు= నీ కుమారుడైన యుయుత్సుడు; వాని= ఉలూకుడియొక్క; ఉరమునన్= రొమ్ముపై; ఉజ్జ్వల= మిక్కిలి ప్రకాశించే; విశిఖములు= బాణాలు; అయిదు= ఐదు; నాటెన్= గ్రుచ్చాడు.

తాత్పర్యం: ఉలూకుడు ఉద్రేకంతో ఇరవై బాణాలు యుయుత్సుడి దేహానికి గ్రుచ్చి, అతడి జెండాను వేగంగా పడగొట్టాడు. యుయుత్సుడు అతడి రొమ్ముమీద మెరుస్తున్న అయిదు బాణాలు దింపాడు.

వ. ఇట్లు నాటించిన నొచ్చి యా సౌబలనందనుండు రౌద్రంబు రూపంబు దాల్చిన రుద్రువిధంబున విజృంభించి. 145

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నాటించినన్= గ్రుచ్చగా; ఆ సౌబల= ఆ శకునియొక్క; నందనుండు= కొడుకైన ఉలూకుడు; రౌద్రంబు= స్థిరమైన క్రోధం; రూపంబు+తాల్చిన= ఆకారం ధరించిన; రుద్రు= శివునియొక్క; విధంబునన్= పోలికతో; విజృంభించి= చెలరేగి.

తాత్పర్యం: ఇట్లా బాణాలు దింపేసరికి, ఉలూకుడు స్థిరమైన క్రోధం ఆకారం ధరించిన మహేశ్వరుడివలె చెలరేగాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

శా. భల్లం బొక్కటఁ జంపె సూతునిఁ జతుర్బాణాహతిన్ వాజులన్
డొల్లం జేసె నిశాతపంచవి శిఖాటోపంబునంజించె వీ
రోల్లాసంబు వికాసముం బొరయ మే నుక్కేది నీ నందనుం
డెల్లం జూడఁగఁ బాటి యొండొక రథం బెక్కెం గురుగ్రామణీ! 146

ప్రతిపదార్థం: కురుగ్రామణీ!= కురువంశ శ్రేష్ఠుడా!, ధృతరాష్ట్ర మహారాజా!; ఉలూకుడు; భల్లంబు+ఒక్కటన్= ఒక్కబాణంతో; సూతునిన్= యుయుత్సుని సారథిని; చంపెన్= సంహరించాడు; వాజులన్= అతని తేరిగుర్రాలను; చతుర్+బాణ+ఆహతిన్= నాలుగు బాణాలయొక్క దెబ్బలతో; డొల్లన్+చేసెన్= పడిపోయేటట్లు చేశాడు; నిశాత= వాడియైన; పంచ= ఐదు; విశిఖ= బాణాలయొక్క; ఆటోపంబునన్= విజృంభణంతో; వీర+ఉల్లాసంబు= వీరులయొక్క ఉత్సాహం; వికాసమున్= వృద్ధిని; పొరయన్= పొందగా; మేను= యుయుత్సుడి శరీరాన్ని; చించెన్= చీలికలయ్యేటట్లు చేశాడు; నీ నందనుండు= నీ కొడుకైన యుయుత్సుడు; ఉక్కు+ఏది= బలం క్షీణించి; ఎల్లన్= అందరూ; చూడన్= చూడగా, చూస్తుండగా; పాటి= పాటిపోయి; ఒండు+ఒక= మరొక; రథంబు= తేరు; ఎక్కెన్= అధిరోహించాడు.

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠా, ధృతరాష్ట్ర మహారాజా! ఒక బాణంతో యుయుత్సుడి సారథిని చంపాడు, నాలుగు బాణాలతో కొట్టి, అతడి రథాశ్వాలను పడగొట్టాడు. ఐదు వాడిబాణాలు ప్రయోగించి వీరుల సంతోషం పెరిగేటట్లు,

అతడి శరీరాన్ని చీల్చాడు. యుయుత్సుడి బలం క్షీణించింది. అందువలన అందరూ చూస్తుండగా పరుగుపెట్టి, మరొక తేరెక్కాడు.

విశేషం: పారిపోయేవాడిని పేర్కొనటానికి అనేక మార్గాలుండగా పనిగట్టుకొని నీ నందనుడనటం ధృతరాష్ట్రుడిని సంతోషపెట్టటానికి మాత్రం కాదు.

క. గెలుపున మెయి పొదలఁగ సౌ । బలసూనుఁడు రథమువఱపి పాంచాలబలం
బలుగులపడఁ బలు దెఱఁగుల । యలవుల విహరించె నుద్భటాటోపమునన్. 147

ప్రతిపదార్థం: సౌబల సూనుఁడు= సుబలుని కుమారుడైన శకుని కొడుకైన ఉలూకుడు; గెలుపునన్= యుయుత్సుని గెలవటంతో; మెయి= ఒళ్ళు; పొదలఁగన్= పొంగగా; రథము; పఱపి= తోలించి; పాంచాల బలంబు= పాంచాలసైన్యం; అలుగులపడన్= కలత చెందేటట్లు; పలు+తెఱఁగుల= అనేకమైన విధాల; అలవులన్= నేర్పులతో; ఉద్భట= భయంకరమైన; ఆటోపమునన్= విజృంభణంతో; విహరించెన్= విహారంచేశాడు.

తాత్పర్యం: యుయుత్సుడిని గెలిచేసరికి ఉలూకుడికి ఉత్సాహం వచ్చింది. దానితో అతడు రథం తిన్నగా పాంచాల సైన్యంమీదికి పోనిచ్చాడు. అది కలత చెందేటట్లు రకరకాల నేర్పులతో భయంకరంగా విజృంభించి, వీరవిహారం చేశాడు.

సీ. శ్రుతకర్మ నకులునిసుతుని శతానీకుఁ । దాఁకి యశ్వంబుల ధరణిఁ గూల్చి
సూతునిఁ బరిమార్చె నాతఁడు గదవైచి । రథవాహనముల సారథిని గేత
నముఁ బొలియించె భూరమణ! యిమ్మెయి నీదు । తనయుండు నకులనందనుఁడు విరథు
లై యొండు దేరుల కరిగిరి శ్రుతసోముఁ । దలపడి కడిమి గాంధార నాథుఁ

తే. డతని నడరించి వివిధ సాయకము లెల్లఁ । దునిమి బాణత్రయంబునఁ దనువు నొంచి
తురగముల నరదమ్ముఁ గేతువుఁ దిల ప్ర । మాణ శకలంబులుగఁ జేసె మద మెలర్ప. 148

ప్రతిపదార్థం: శ్రుతకర్మ= నీ కుమారుడైన శ్రుతకర్మ; నకులుని= నకులునియొక్క; సుతుని= కుమారుని; తాఁకి= ఢీకొని; అశ్వంబులన్= గుర్రాలను; ధరణిన్= భూమిపై; కూల్చి= పడగొట్టి; సూతునిన్= సారథిని; పరిమార్చెన్= సంహరించాడు; ఆతండు= శతానీకుడు; గదన్; వైచి= విసరి; రథ= రథాన్నీ; వాహనములన్= గుర్రాలనూ; సారథిని= సూతునీ; కేతనమున్= జెండానూ; పొలియించెన్= పడగొట్టాడు; భూరమణ!= భూపతీ, ధృతరాష్ట్ర మహారాజా!; ఈ+మెయిన్= ఈ విధంగా; నీదు తనయుండున్= నీ కుమారుడూ; నకులనందనుండున్= నకులుడి కుమారుడయిన శతానీకుడూ; విరథులై= రథములు పోయినవారై; ఒండు= వేరే; తేరులకు= రథాలకు; అరిగిరి= వెళ్ళారు; గాంధారనాథుఁడు= గాంధారదేశపు రాజైన శకుని; శ్రుతసోమున్= ద్రౌపదీ భీమసేనుల పుత్రుని; తలపడి= ఢీకొని; అతని= ఆ శ్రుతసోముడిని; అడరించి= బాణప్రయోగంచేసి; వివిధ= పలురీతులయిన; సాయకములు= శ్రుతసోముడు ప్రయోగించిన బాణాలు; ఎల్లన్= అన్నింటినీ; తునిమి= ముక్కలుచేసి; బాణ= బాణాలయొక్క; త్రయంబునన్= మూడింటిచేత; తనువున్= శ్రుతసోముని శరీరాన్ని; నొంచి= నొప్పించి; మదము= తన గర్వం; ఎలర్ప(న్)= విలసిల్లగా; తురగములన్= గుర్రాలనూ; అరదమ్మున్= తేరునూ; కేతువున్= జెండానూ; తిలప్రమాణ= నువ్వుగింజలంతలైన; శకలమ్ములుగన్= ముక్కలుగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: శ్రుతకర్మ, ద్రౌపదీ నకులుల కుమారుడైన శతానీకుడిని ఢీకొన్నాడు. అతడి గుర్రాలను పడగొట్టాడు. సారథిని చంపాడు. శతానీకుడు గద విసరి, శ్రుతకర్మ రథాన్ని విరుగగొట్టాడు. గుర్రాలనూ సూతుడినీ చంపాడు. జెండా పడగొట్టాడు. ధృతరాష్ట్ర మహారాజా! ఇట్లా నీ కొడుకూ, నకులుడి కొడుకూ రథాలు పోగొట్టుకొని వేరే రథాలకొరకు వెళ్ళారు. ద్రౌపదీ భీమసేనుల కుమారుడైన శ్రుతసోముడిని శకుని ఢీకొన్నాడు. అపుడు శ్రుతసోముడు బాగా విజృంభించి రకరకాల బాణాలు శకునిమీద ప్రయోగించాడు. శకుని వాటినన్నింటినీ ముక్కలుగా చేశాడు. ఇంకా గర్వం పెరుగుతుండగా, మూడు బాణాలు వేసి, అతడి శరీరం నొప్పించాడు. గుర్రాలనూ, రథాన్నీ, జెండానూ నువ్వుగింజలంతలుగా ముక్కలు చేశాడు.

మ. **విరథుండై పొలివోని బీరమునఁ బృథ్వీభాగసంచారియై**
శరజాలంబుల భీమసేనసుతుఁ డాశ్చర్యంబుగా నీ మఱం
ది రథం బేడ్తెఱఁ గప్పినం దునిమె నుత్సేకోగ్రుండై యమ్మహీ
వరుఁ డబ్బాలుని చాపదండము భుజావష్టంభ మేపారఁగన్. **149**

ప్రతిపదార్థం: భీమసేన సుతుఁడు= ద్రౌపదీ భీముల కుమారుడైన శ్రుతసోముడు; ఆశ్చర్యంబుగాన్= వింతగొలిపేటట్లు; పొలి+పోని= తగ్గని; బీరమునన్= పరాక్రమంతో; పృథ్వీభాగ= భూభాగంమీద; సంచారియై= తిరుగుతున్నవాడై; శర= బాణాలయొక్క; జాలంబులన్= సమూహాలతో; నీ మఱంది= నీ బావమరిది అయిన శకునియొక్క; రథము= తేరు; ఏడ్తెరన్= సామర్థ్యంతో; కప్పినన్= మరుగుపడేటట్లు చేయగా; ఆ+మహీవరుఁడు= ఆ భూపతి అయిన శకుని; ఉత్సేక= అతిశయించిన; ఉగ్రుఁడై= కోపముకలవాడై; ఆ+బాలుని= ఆ చిన్నవానియొక్క; చాపదండము= వింటికట్టెను; భుజావష్టంభము= భుజగర్వం; ఏపారఁగన్= అతిశయించగా; తునిమెన్= ఖండించాడు.

తాత్పర్యం: రథంపోయినా, శ్రుతసోముడి పరాక్రమం తగ్గలేదు. అతడు నేలమీద నడుస్తూనే నీ బావమరది శకుని రథాన్ని బాణ పరంపరతో కనబడకుండా చేశాడు. అది చాలా ఆశ్చర్యం కలిగించింది. శకుని అతిశయించిన కోపంతో తన భుజబలగర్వం అధికమయ్యేటట్లు ఆ కుర్రవాడి విల్లు నరికాడు.

చ. **అతఁడు ప్రదీప్తఖడ్గము రయంబుమెయిం గొని యా నృపాలుఁ డు**
ద్ధతిఁ బరఁగించు సాయకశతంబులు ద్రుంచుచు నుల్లసిల్ల న
ప్పతి పటుభల్లఖండిత కృపాణునిఁ జేసిన నీడఁబోక చే
తితునియ బెట్టువైచె జగతీవర! యాతని విల్లు రెండుగన్. **150**

ప్రతిపదార్థం: జగతీవర!= భూపతీ!; అతఁడు= శ్రుతసోముడు; ప్రదీప్త= మిక్కిలిగా మెరిసే; ఖడ్గము= కత్తి; రయంబుమెయిన్= వేగంతో; కొని= తీసికొని; ఆ నృపాలుఁడు= ఆ రాజు శకుని; ఉద్ధతిన్= గర్వంతో; పరఁగించు= ప్రయోగించే; సాయక= బాణాలయొక్క; శతంబులు= వందలు; త్రుంచుచున్= నరుకుతూ; ఉల్లసిల్లన్= విజృంభించగా; ఆ+పతి= ఆ భూపతి, ఆ రాజు శకుని; పటు= దృఢమైన; భల్ల= బాణంచేత; ఖండిత= నరకబడిన; కృపాణునిన్+చేసినన్= ఖడ్గం కలవాడినిగా చేయగా; ఈఁడన్+పోక= వెనుదీయక; చేతితునియ= చేతిలోని కత్తిముక్కను; ఆతని విల్లు= శకుని ధనుస్సు; రెండుగన్= రెండు ముక్కలయ్యేటట్లు; బెట్టువైచెన్= వడిగా విసిరాడు.

తాత్పర్యం: శ్రుతసోముడు తళతళమెరిసే కత్తి తీసికొని, శకుని వేగంతో, పొగరుతో ప్రయోగిస్తున్న వందలకొలది బాణాలను ముక్కలు చేయసాగాడు. అపుడు శకుని ఒకగట్టి బాణం వేసి, ఆ కత్తిని విరుగగొట్టాడు. అయినా, శ్రుతసోముడు వెనుదీయకుండా ఆ చేతిలో మిగిలిన కత్తిముక్కను గట్టిగా విసరి, శకుని ధనుస్సును రెండు ముక్కలు చేశాడు.

వ. **ఇట్లు కోదండంబు దుండంబులుసేసి తొలంగి యక్కుమారుండు శ్రుతకీర్తి స్యందనంబెక్కె సౌబలుండు వేఱొక్క విల్లెత్తియత్తెఱఁపి నురవణించి పాండవరథికులం గలంచెఁ గృపాచార్య ధృష్టద్యుమ్నులు పెనంగునెడ గౌతముండు పాంచాలవరుం బొదువునాటోపం బాలోకించి యక్కౌంతేయసైనికులు దమలోన. 151**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఆ+కుమారుండు= ఆ బాలుడు; కోదండంబు= విల్లు; తుండంబులు+చేసి= ముక్కలుచేసి; తొలంగి= ఆ ప్రదేశంనుంచి తప్పుకొని; శ్రుతకీర్తి= శ్రుతకీర్తియొక్క; స్యందనంబు+ఎక్కెన్= రథం అధిరోహించాడు; సౌబలుండు= సుబలుని పుత్రుడైన శకుని; వేఱు+ఒక్క= మరొక; విల్లు+ఎత్తి= ధనుస్సు తీసికొని; ఆ+తెఱపిన్= ఆ ఎడంలో; ఉరవణించి= విజృంభించి; పాండవ= పాండవ పక్షీయులైన; రథికులన్= రథంమీద ఉండి యుద్ధం చేసేవారిని; కలంచెన్= సంక్షోభపెట్టాడు; కృపాచార్య ధృష్టద్యుమ్నులు= కృపాచార్యుడూ, ధృష్టద్యుమ్నుడూ; పెనంగు= యుద్ధంచేసే; ఎడన్= చోట, సమయంలో; గౌతముండు= గౌతమసగోత్రుడయిన కృపాచార్యుడు; పాంచాలవరున్= పాంచాలదేశీయ శ్రేష్ఠుడయిన ధృష్టద్యుమ్నుని; పొదువు= ఆక్రమించే; ఆటోపంబు= ప్రయత్నాన్ని; ఆలోకించి= చూచి; ఆ+కౌంతేయ= ఆ కుంతీపుత్రులయిన పాండవుల పక్షంవారైన; సైనికులు= యుద్ధభటులు; తమలోనన్= తమలో తాము.

తాత్పర్యం: శ్రుతసోము డిట్లా శకుని విల్లు రెండు ముక్కలుగా చేసి, అక్కడి నుండి తప్పుకొని, శ్రుతకీర్తి రథమెక్కాడు. శకుని మరొక విల్లు తీసికొని ఆ సందులో విజృంభించి పాండవుల రథికులలో సంక్షోభం కలిగించాడు. కృపాచార్యుడూ ధృష్టద్యుమ్నుడూ యుద్ధంచేసే సమయంలో కృపాచార్యుడు ధృష్టద్యుమ్నుడిని పడగొట్టాలని గట్టిగా దాడి చేస్తున్నాడు. అది చూచి పాండవుల సైనికులు వారిలో వారు (ఇట్లా అనుకొన్నారు).

ధృష్టద్యుమ్నుఁడు గృపాచార్యునితోఁ దలపడి యోడిపోవుట (సం. 8-18-41)

ఉ. **'ద్రోణు పరాభవం బధికరోషము సేయఁగ నున్న యీతఁ డ**
క్షీణ పరాక్రమంబు విలసిల్లఁగ నీ ద్రుపదాత్మజున్ గత
ప్రాణునిఁ జేయ కే లుడుగుఁ బైకొను నంతటఁ బోక విస్ఫుర
ద్బాణవిలాసముల్ నెఱపుఁ దా మనసైన్యము దల్లడిల్లఁగన్'. 152

ప్రతిపదార్థం: ద్రోణు= ద్రోణునియొక్క; పరాభవంబు= అవమానం; అధికరోషము= ఎక్కువ క్రోధాన్ని; చేయఁగన్= కలిగింపగా; ఉన్న= అవకాశంకోసం ఎదురుచూస్తున్న; ఈతఁడు= ఆయన బావమరది అయిన కృపాచార్యుడు; అక్షీణ= తరగని, గొప్ప; పరాక్రమంబు= విక్రమం; విలసిల్లఁగన్= ప్రకాశింపగా; ఈ ద్రుపద+ఆత్మజున్= ఈ ద్రుపదుడి కొడుకైన ధృష్టద్యుమ్నుడిని; గత= పోయిన; ప్రాణునిన్= ప్రాణాలు కలవానిని; చేయక= చేయకుండా (చంపకుండా); ఏల+ఉడుగున్= ఎందుకు ఊరకుంటాడు?; పైకొను+అంతటన్+పోక= ఎదురుకొనేటంత మాత్రంతో వదలకుండా; తాన్= కృపాచార్యుడు; మనసైన్యము= పాండవసేన; తల్లడిల్లఁగన్= కలతపడగా; విస్ఫురత్= మెరుస్తున్న; బాణ= బాణాలయొక్క; విలాసముల్= ఆటలు; నెఱపున్= ప్రదర్శిస్తాడు.

తాత్పర్యం: ద్రోణుడి తల నరికి ఆయనను అవమానించిన ధృష్టద్యుమ్నుని, కృపాచార్యుడు తన గొప్ప పరాక్రమం విలసిల్లగా చంపకుండా ఊరుకుంటాడా? అతడిని ఎదుర్కోవటం మాత్రమే కాదు - మనసేన తల్లడిల్లేటట్లు అతడి విస్తృత బాణప్రయోగ విలాసాలన్నీ ప్రదర్శిస్తాడు.

వ. అని వెండియు. 153

ప్రతిపదార్థం: అని= ఇలా పలికి; వెండియు= ఇంకా.

తాత్పర్యం: అని మళ్ళీ.

మ. 'వరదివ్యాస్త్రవిదుండు బాహుబల గర్వస్థేమ నిర్వాహకుం
డరులం జీరికిఁ జేకొనం డితఁడు క్రోధాత్తాత్ముఁడై నేఁడు ని
ర్భర శౌర్యంబు నుదాత్త ధైర్యము నుదగ్రస్ఫూర్తి శోభిల్ల దు
స్తర దర్పోద్ధతిఁ దేకయున్నె? మనలం దా నేలకుంగోలకున్. 154

ప్రతిపదార్థం: వర= శ్రేష్ఠమయిన; దివ్య= స్వర్గంలో పుట్టిన; అస్త్ర= మంత్రప్రయుక్తాలయిన ఆయుధాలను; విదుండు= ఎరిగినవాడు; బాహు= చేతులయొక్క; బల= శక్తియొక్క; గర్వ= గర్వంయొక్క; స్థేమ= బలాన్ని; నిర్వాహకుండు= నెరవేర్చేవాడు అయిన; ఇతఁడు= ఈ కృపాచార్యుడు; అరులన్= శత్రువులను; చీరికిన్= లేశమునకైనా; చేకొనండు= కైకొనడు, లెక్కచేయడు; నేఁడు= ఈ దినం; క్రోధ= కోపంచేత; ఆత్త= పొందబడిన - కోపంగల - అని భావం; ఆత్ముఁడై= మనస్సు కలవాడై; నిర్భరశౌర్యంబున్= నిండు పరాక్రమమూ; ఉదాత్త ధైర్యమున్= అధికమైన ధైర్యమూ; ఉదగ్ర స్ఫూర్తి= భయంకరమైన ఆవేశమూ; శోభిల్లన్= ప్రకాశింపగా; దుస్తర= దాటరాని; దర్ప+ఉద్ధతిన్= గర్వంయొక్క విజృంభణంతో; మనలన్= మనలనందరినీ; తాన్= తాను; నేలకున్= భూమికీ; కోలకున్= ఆయుధానికీ; తేక= తీసికొనిరాకుండా; (నేలకుం గోలకున్ దెచ్చు= క్రింద మీఁదు చేయు (శ.ర.) ఉన్నె?= ఉంటాడా?

తాత్పర్యం: ఈ కృపాచార్యుడు గొప్ప దివ్యాస్త్రవేత్త, భుజబలగర్వం అధికంగా ఉన్నవాడు. శత్రువులను కొంచెం కూడా లెక్కపెట్టడు. ఈ వేళ మహాక్రోధంతో ఉన్నాడు. నిండు శౌర్యమూ, మహాధైర్యమూ, భీకరావేశమూ మెరుస్తుండగా మనలను తలక్రిందు చేయకుండా ఉంటాడా?

వ. ధృష్టద్యుమ్నుండును బెండువడియున్నవాఁ డనుచు నుండి రట్టియెడ బెట్టిదంబులగు గృపాచార్యులతూపుల యేపు రథ్యంబుల నొంచి సారథి క్రొవ్వడంచి యా ద్రుపదనందనుతనువు నెత్తుటం దోఁచి యుల్లంబు గలంచె నప్పుడాతని సూతుం డతనితో నిట్లనియె. 155

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్నుండును= ద్రౌపది అన్నగారు కూడా; బెండుపడి= నీరసించి; ఉన్నవాఁడు= ఉన్నాడు; అనుచున్= అంటూ; ఉండిరి= ఉన్నారు; అట్టి+ఎడన్= అటువంటి సమయంలో; బెట్టిదంబులు+అగు= కఠినములైన; కృపాచార్యుల= కృపాచార్యునియొక్క; తూపుల= బాణాలయొక్క; ఏపు= ఆధిక్యం; రథ్యంబులన్= (ధృష్టద్యుమ్నుని) గుర్రాలను; నొంచి= నొప్పించి; సారథి= సూతునియొక్క; క్రొవ్వు= మదం; అడంచి= పోగొట్టి; ఆ= గురుద్రోహి అయిన; ద్రుపదనందను= ద్రుపదుని కుమారుడయిన ధృష్టద్యుమ్నునియొక్క; తనువు= శరీరాన్ని; నెత్తుటన్= రక్తంలో; తోఁచి= తడిపి; ఉల్లంబు= మనస్సును; కలంచెన్= కలతపెట్టింది; అప్పుడు= ఆ సమయంలో; ఆతని సూతుండు= ధృష్టద్యుమ్నుని సారథి; అతనితోన్= ధృష్టద్యుమ్నునితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు:

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు కూడా నీరసించి ఉన్నాడు' అని అనుకొంటున్నారు. అటువంటి సమయంలో కృపాచార్యుడు కఠినబాణాలు చాలా ప్రయోగించాడు. కృపాచార్యుని బాణాల తీవ్రత ధృష్టద్యుమ్నుడి రథాశ్వాలను బాధించింది. సారథి మదాన్ని అణగించింది. ఆ ద్రుపదనందనుని శరీరాన్ని నెత్తుటిలో ముంచింది. అతని మనస్సును కలత పెట్టింది. అప్పుడాతని సారథి ధృష్టద్యుమ్నుడితో ఇట్లా అన్నాడు:

చ. 'వినుము కుమార! విప్రుభుజవీర్య మవార్యతఁ దేజరిల్లెడుం
జనవు భవత్సమగ్రశరజాలము లీతని మీఁద దైవ సం
జనితము సువ్వె! యియ్యెడరు సంగరమిట్టిది తొల్లియెందు నా
కనినది లేదు తేరు దొలఁగం గొనిపోవుట కార్య మిత్తఱిన్. 156

ప్రతిపదార్థం: కుమార!= చిన్నవాడా!; వినుము; విప్రు= బ్రాహ్మణుడైన కృపాచార్యుని; భుజవీర్యము= భుజముల బలము; అవార్యతన్= నివారించకపోవటంచేత; తేజరిల్లెడున్= ప్రకాశిస్తున్నది; భవత్= నీయొక్క; సమగ్ర= సంపూర్ణములైన; శర= బాణాలయొక్క; జాలములు= గుంపులు; ఈతని మీఁదన్= ఈ కృపాచార్యుడిపైకి; చనవు= వెళ్ళటంలేదు; ఈ+ఎడరు= ఈ ఆపద; దైవసంజనితము+చువ్వె!= దైవంవలన కలిగినది సుమా!; సంగరము= యుద్ధము; ఇట్టిది= ఇటువంటిది; తొల్లి= ఇదివరకు; ఎందున్= ఎక్కడా; నా కనినది= నేను చూచినది; లేదు; ఈ+తఱిన్= ఈ సమయంలో; తేరు= రథం; తొలఁగన్+కొనిపోవుట= తీసికొనిపోవటం; కార్యం= చేయదగినది.

తాత్పర్యం: 'నాయనా! వినుము. ఈ బ్రాహ్మణుడి భుజబలం ఆపరానిదిగా ప్రకాశిస్తున్నది. నీ బాణా లీతడిపైకి వెళ్ళటం లేదు. ఈ ఆపద దైవం చేసినది సుమా! ఇటువంటి యుద్ధం నేనిదివరకెన్నడూ చూడలేదు. ఈ సమయంలో మనరథాన్ని దూరంగా తీసికొనిపోవటం కర్తవ్యం.

వ. నీ యట్టి వాని విక్రమంబునుం దిట్టిన యట్లు సమయుటంజేసి యిమ్మహాత్ముం డవధ్యుండని నిశ్చయించితి నా మాటకియ్యకొను' మనవుడు నా పృషత పౌత్రుం డిది యట్టిద యని నిశ్చయించి పలికి మఱియు హీనస్వరంబున నిట్లనియె. 157

ప్రతిపదార్థం: నీ+అట్టివాని= నీవంటివానియొక్క; విక్రమంబునున్= పరాక్రమం కూడా; తిట్టినయట్లు= శపించినవిధంగా; సమయుటన్+చేసి= నశించినందువల్ల; ఈ+మహాత్ముండు= ఈ ఘనత వహించినవాడు; అవధ్యుండని= వధింపబడేవాడు కాడని; నిశ్చయించితిన్= నిర్ణయించాను; నా మాటకున్= నా పలుకునకు; ఇయ్యకొనుము= అంగీకరింపుము; అనవుడున్= అని పలుకగా; ఆ పృషత= ఆ పృషతునియొక్క; పౌత్రుండు= కొడుకుయొక్క కొడుకు - ధృష్టద్యుమ్నుడు; ఇది= ఈ కార్యం; అట్టిది+అ= అటువంటిదే; అని; నిశ్చయించి= నిర్ణయించి; పలికి= చెప్పి; మఱియున్= ఇంకా; హీనస్వరంబునన్= స్వల్పమయిన కంఠధ్వనితో; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా పలికాడు.

తాత్పర్యం: నీ వంటి వీరుడి పరాక్రమం కూడా శాపంవలన అన్నట్లుగా నశించిపోయింది. అందువలన ఈ ఘనత వహించిన కృపాచార్యుడు వధించబడడని నిశ్చయించాను. కనుక నా మాటకు ఒప్పుకొమ్ము' అని అన్నాడు. అపుడు ధృష్టద్యుమ్నుడు 'ఈ పని ఇటువంటిదే' అని నిర్ణయించి పలికాడు. మళ్ళీ తగ్గిపోయిన కంఠధ్వనితో ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. 'చరణములుం గరంబులును సంచల భావము నొందఁ జొచ్చె మేన్
విరవరఁ బోవుచున్నయది విహ్వలమయ్యె మనంబు నీతలం
పరయఁగ మేలు మారుతసురాధిపసూనులలోన నల్ల నొ
క్కరుదెసకై రథంబు దొలఁగం గొని పొ మ్మడిబీర మేటికిన్.' 158

ప్రతిపదార్థం: చరణములున్+కరంబులును= కాళ్ళూ, చేతులూ; సంచలభావమున్= వణకుటను; ఒందన్+చొచ్చెన్= పొందటానికి మొదలుపెట్టాయి; మేన్= శరీరం; విరవిరన్+పోవుచున్+ఉన్న+అది= విహ్వలత్వాన్ని (పట్టు ఊడిన స్థితిని) పొందుతూ; ఉన్నది; మనంబున్= మనస్సుకూడా; విహ్వలము+అయ్యెన్= సడలినది ఐనది; అరయఁగన్= ఆలోచింపగా; నీ తలంపు= నీ ఆలోచన; మేలు= శ్రేష్ఠమైనది; మారుత= వాయువుయొక్క; సురాధిప= దేవేంద్రునియొక్క; సూనులలోనన్= కుమారులలో; అల్లన్= మెల్లగా; ఒక్కరు= ఒకడియొక్క; దెసకున్+ఐ= దిక్కునకై; రథంబు+తేరు; తొలఁగన్= తప్పించి; కొనిపొమ్ము= తీసుకొనిపొమ్ము; అడిబీరము= వ్యర్థమైన పరాక్రమం; ఏటికిన్= ఎందుకు?

తాత్పర్యం: కాళ్ళూ చేతులూ అల్లాడిపోతున్నాయి. ఒళ్ళు పట్టు సడలిపోతున్నది, (లేదా తడి ఆరిపోతున్నది) మనస్సూ పట్టుతప్పిపోతున్నది. ఆలోచించి చూస్తే, నీ ఆలోచన శ్రేష్ఠంగా ఉన్నది. కనుక రథాన్ని తప్పించి వాయుపుత్రుడు భీముడి వద్దకుగాని, ఇంద్రపుత్రుడు అర్జునుడి వద్దకుగాని తీసికొనిపొమ్ము. వ్యర్థమైపోయిన పరాక్రమం ఎందుకు?'

చ. అనవుడు సూతుఁ డెంతయు రయంబునఁదేరు వృకోదరాంతికం
బున కెగవంగ శంఖరవమున్ గుణనిస్వనమున్ నిగిడ్చి యే
పునఁ గృపుఁ డుజ్జ్వలప్రదరపుంజములం బరఁగంగఁ జేయుచున్
వెనుకొనిపొల్చి నిల్చె గిరి వెన్కొని నిల్చిన వజ్రికైవడిన్. 159

ప్రతిపదార్థం: అనవుడున్= అని పలుకగా; సూతుండు= సారథి; ఎంతయున్= మిక్కిలిగా; రయంబునన్= వేగముతో; తేరు= రథం; వృకోదర= భీమునియొక్క; అంతికంబునకున్= సమీపానికి; ఎగవంగన్= త్రోలగా; కృపుఁడు; శంఖరవమున్= శంఖంయొక్క; ధ్వని; గుణనిస్వనమున్= వింటి అల్లెత్రాటి చప్పుడూ; నిగిడ్చి= పొడిగించి, వ్యాపింపజేసి; ఏపునన్= ఉత్సాహంతో; ఉజ్జ్వల= మిక్కిలి ప్రకాశించే; ప్రదర పుంజములన్= బాణసముదాయాలను; పరఁగింపన్= వ్యాపింప; చేయుచున్= కావిస్తూ; వెనుకొని= ధృష్టద్యుమ్నుడిని వెంబడించినవాడై; గిరిన్= పర్వతాన్ని; వెన్కొని= వెంబడించి; నిల్చిన= ఉన్న; వజ్రికైవడిన్= వజ్రాయుధం కలవాడైన ఇంద్రునివలె; పొల్చి= ఒప్పి; నిల్చెన్= ఆగెను.

తాత్పర్యం: అని ధృష్టద్యుమ్నుడు పలికేసరికి, అతడి సారథి మహావేగంగా రథం భీమసేనుడివద్దకు తోలుకొనిపోయాడు. కృపాచార్యుడు ఉత్సాహంతో శంఖం ఒత్తి, ధనుష్టంకారం చేస్తూ, బాగా మెరిసే బాణాల గుంపులు ప్రయోగిస్తూ, తరిమి ఆగాడు. అది పర్వతాన్ని తరిమి వజ్రాయుధధారి ఇంద్రుడు ఆగినట్లున్నది.

విశేషం: 'పర్వతాన్ని వెంబడించి, 'తరిమి ఆగినట్టి' - వజ్రితో కృపాచార్యుణ్ణి పోల్చటం జరిగింది. వజ్రి దెబ్బ తప్పించుకొన్న పర్వతం ఒక్కటే - మైనాకుడు. అందువల్ల ధృష్టద్యుమ్నుణ్ణి ఇక్కడ మైనాకుడితో పోల్చి స్పష్టంగా చెప్పకున్నా ఆ పోలిక ధ్వనిస్తున్నది.

తే. కడఁగి కృతవర్మతోడ శిఖండి పెనఁగు । చుండి శరపంచకంబున నురము నొంప
నతని నయ్యాదవోత్తముఁ డలఘు షష్టి । విశిఖవిద్ధునిఁ జేసి విల్ విఱుగ నేసె. 160

ప్రతిపదార్థం: శిఖండి; కడఁగి= పూనుకొని; కృతవర్మతోడన్= కృతవర్మతో; పెనఁగుచున్+ఉండి= యుద్ధంచేస్తూ ఉండి; శరపంచకంబునన్= ఐదు బాణాలతో; ఉరమున్= వక్షఃస్థలాన్ని; నొంపన్= నొప్పించగా; ఆ= ప్రసిద్ధుడయిన; యాదవ+ఉత్తముఁడు= యాదవులలో మేటి అయిన కృతవర్మ; అలఘు= గొప్పవైన; షష్టి= అరవై; విశిఖ= బాణాలచేత; విద్ధునిన్= కొట్టబడినవాడినిగా; చేసి; విల్= ధనుస్సు; విఱుగన్= విరిగిపోయేటట్లుగా; ఏసెన్= బాణం ప్రయోగించాడు.

తాత్పర్యం: శిఖండి ఎదిరించి కృతవర్మతో యుద్ధంచేస్తూ, ఐదు బాణాలు ప్రయోగించి అతడి వక్షఃస్థలాన్ని నొప్పించగా, కృతవర్మ శిఖండిని అరవై బాణాలతో కొట్టి, అతడి వింటిని విరుగగొట్టాడు.

క. ఒండు శరాసన మెత్తి శి । ఖండి గురియు నవతి సాయకమ్ములు పెలుచన్
ఖండించె నతఁడు తత్కో । దండం బాద్రుపదనృపతితనయుఁడు నఱకెన్. 161

ప్రతిపదార్థం: ఒండు= మరొక; శరాసనము= ధనుస్సు; ఎత్తి= తీసికొని; శిఖండి; కురియు= వానకురిసినట్లు ప్రయోగించే; నవతి= తొంభై; సాయకమ్ములు= బాణాలు; అతఁడు= కృతవర్మ; పెలుచన్= ఆగ్రహంతో; ఖండించెన్= నరికాడు; ఆ ద్రుపద తనయుడు శిఖండి; తద్= ఆ కృతవర్మయొక్క; కోదండంబు= వింటిని; నఱకెన్= ఖండించాడు.

తాత్పర్యం: శిఖండి మరొక ధనుస్సు తీసికొన్నాడు. వాన కురిసినట్లు తొంభై బాణాలు ప్రయోగించాడు. వాటిని కృతవర్మ ఆగ్రహంతో నరికాడు. శిఖండి అతడి ధనుస్సును ఖండించాడు.

క. 'ధనువు దునిమి కొమ్ములు మురి । సిన వృషభము చందమగుడు శీఘ్రస్ఫురణం
దనువున శితశరములు వడిఁ । జొనిపి యతం డతని గళితశోణితుఁ జేసెన్. 162

ప్రతిపదార్థం: అతఁడు= శిఖండి; ధనువు= వింటిని; తునిమి= నరికి (కృతవర్మ); కొమ్ములు; మురిసిన= విరిగిన; వృషభము చందము= ఎద్దులా; అగుడున్= కాగా; శీఘ్రస్ఫురణన్= వేగం తోచగా; శితశరములు= వాడిబాణాలు; తనువునన్= శరీరంలో; వడిన్= బలంతో; చొనిపి= దూర్చి; అతనిన్= కృతవర్మను; గళిత= స్రవించిన; శోణితున్= రక్తం కలవాడినిగా; చేసెన్= కావించాడు.

తాత్పర్యం: అట్లా శిఖండి కృతవర్మయొక్క విల్లు విరుగగొట్టినందువలన అతడు కొమ్ములు విరిగిన ఎద్దువలె అయిపోయేసరికి, శిఖండి వేగం స్ఫురించే వాడియైన బాణాలు అతడి శరీరంలో గ్రుచ్చి, నెత్తురు స్రవించేటట్లు చేశాడు.

చ. అలుక మనంబునం గదిరి యాదవసత్తముఁ డొండువింట దో
ర్బల మెసఁగంగ డెబ్బది శరంబుల నాతని మేన రక్త ధా
రలు దొరఁగించి పెక్కు ప్రదరంబులు పైపయి నేయుచుండ న
గ్గలికఁ బెనంగె వెండియు శిఖండి విచిత్రరథప్రచారుఁడై. 163

ప్రతిపదార్థం: యాదవసత్తముఁడు= యాదవులలో శ్రేష్ఠుడైన కృతవర్మ; అలుక= కోపం; మనంబునన్= మనస్సులో; కదిరి= హెచ్చి; ఒండు వింటన్= మరొక ధనుస్సుతో; దోస్+బలము= బాహువులశక్తి; ఎసఁగంగన్= ఒప్పగా; డెబ్బది శరంబులన్= డెబ్బై బాణాలతో; ఆతని మేనన్= శిఖండి దేహంమీద; రక్తధారలు= నెత్తుటి ధారలు; తొరఁగించి= ప్రవహింపజేసి; పెక్కు= చాలా; ప్రదరంబులు= బాణాలను; పై+పయిన్= ఒక దానిపై ఒకటి; ఏయుచున్+ఉండన్= ప్రయోగిస్తూ+ఉండగా; శిఖండి; వెండియున్= ఇంకా; విచిత్ర= వింత అయిన; రథ= రథంయొక్క; ప్రచారుఁడు+ఐ= గమనములు కలవాడై; అగ్గలికన్= అతిశయంతో; పెనంగెన్= యుద్ధంచేశాడు.

తాత్పర్యం: కృతవర్మ మనస్సులో కోపం పెరిగింది. మరొక వింటితో భుజబలం ఒప్పగా డెబ్బై బాణాలు ప్రయోగించి, శిఖండి శరీరంమీద రక్తం ప్రవహింపజేశాడు. అనేక బాణాలు ఒకదానిమీద ఒకటి ప్రయోగిస్తుండగా, శిఖండి తన రథాన్ని విచిత్ర గమనాలతో త్రిప్పుతూ, ఇంకా ఎక్కువగా యుద్ధంచేశాడు.

వ. ఆ ద్రుపదనందనుండు జత్రుదేశంబున నంబకత్రయంబు నాటించిన. 164

ప్రతిపదార్థం: ఆ ద్రుపదనందనుండు= ఆ ద్రుపదుని కొడుకు; జత్రుదేశంబునన్= కృతవర్మయొక్క భుజశిరస్సునూ రొమ్ము ఎముకను కలిపే ప్రదేశంలో; అంబకత్రయంబు= మూడు బాణాలు; నాటించినన్= గ్రుచ్చగా.

తాత్పర్యం: ఆ శిఖండి కృతవర్మయొక్క భుజ శిరస్సూ రొమ్ము ఎముకా కలిసేచోట మూడు బాణాలు గ్రుచ్చుకొనేటట్లు కొట్టేసరికి.

శా. క్రూరోల్లాసము పల్లవింపఁ గృతవర్ముం డుగ్రదీప్తి స్ఫుర
న్నారాచంబులు పెక్కు లొక్క మొగి మేనంగ్రువ్వ మూర్ఛిల్లె న
వ్వీరాగ్రేసరుఁ డప్డు సారథి భయావిర్భావదీనాత్ముఁడై
తే రచ్చోటు దొలంగఁ దోలుటయు భీతింబాఱెఁ దత్సేనయున్. 165

ప్రతిపదార్థం: కృతవర్ముండు; క్రూర= క్రూరమైన, కనికరంలేని; ఉల్లాసము= సంతోషం; పల్లవింపన్= చిగురించగా; ఉగ్రదీప్తి= అధికమైన కాంతితో; స్ఫురత్= ప్రకాశిస్తున్న; నారాచంబులు= ఇనుప బాణాలు; పెక్కులు= చాలా; ఒక్కమొగిన్= ఒక్కసారి; మేనన్= శరీరంలో; క్రువ్వన్= గ్రుచ్చగా; ఆ+వీర+అగ్రేసరుఁడు= ఆ వీరులలో శ్రేష్ఠుడైన శిఖండి; మూర్ఛిల్లెను= మూర్ఛనందినాడు; అప్డు= ఆ సమయంలో; సారథి= శిఖండి సూతుడు; భయ= జడుపుయొక్క; ఆవిర్భావ= కలగటంచేత; దీన+ఆత్ముఁడు+ఐ= దుఃఖితమగు మనస్సు కలవాడై; తేరు= రథం; ఆ+చోటు= ఆ ప్రదేశంనుంచి; తొలంగన్= దూరంగా; తప్పించుకొనటానికి; తోలుటయున్= నడిపించుకొని పోగా; తద్= ఆ శిఖండియొక్క; సేనయున్= సైన్యంకూడా; భీతిన్= భయంతో; పాఱెన్= పారిపోయింది.

తాత్పర్యం: కృతవర్మ కనికరం లేని సంతోషం పెరుగుతుండగా, అధికమైన కాంతితో మెరసే చాలా ఇనుపబాణాలు ఒక్కసారిగా శరీరంలో నాటుకొనేటట్లు కొట్టేసరికి, అంతటి మహావీరుడైన శిఖండి కూడా మూర్ఛలో మునిగిపోయాడు. వెంటనే అతడి రథసారథి భయపడి, మనసులో దుఃఖపడుతూ రథాన్ని అక్కడి నుంచి తప్పించి, తోలుకొనిపోయాడు. అందువలన శిఖండి సేనకూడా భయపడి పారిపోయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. వివ్వచ్చు విక్రమవిహారంబున కోర్చి శిబిత్రిగర్తసాల్వసంశప్తకసైన్య నారాయణ గోపాలోపేతుండై సత్యసేన చంద్రదేవ మిత్త్రదేవ మిత్త్రవర్మ సౌశ్రుతి సువర్మ సుశర్మాదు లగు సోదరసుతులు బాసటగాఁ ద్రిగర్తపతి పెనంగు నప్పుడు. 166

ప్రతిపదార్థం: త్రిగర్తపతి= త్రిగర్తదేశపురాజు; వివ్వచ్చు= బీభత్సుని, అర్జునునియొక్క; విక్రమ= పరాక్రమంతోచేసే; విహారంబునకున్= (వీర) విహారానికి; ఓర్చి= సహించి; శిబి త్రిగర్త సాల్వ సంశప్తక= శిబి, త్రిగర్తం, సాల్వం అనే దేశాలకు చెందిన; సంశప్తక= అర్జునుని చంపుతామని ప్రతిజ్ఞచేసినది అయిన; సైన్య= సేనలతోను; నారాయణ= నారాయణులనే పేరుకల; గోపాల+ఉప+ఇతుండు+ఐ= గోపాలురతోనూ కూడినవాడై, సత్యసేన చంద్రదేవ మిత్త్రదేవ మిత్త్రవర్మ సౌశ్రుతి సువర్మ సుశర్మాదులగు= సత్యసేనుడు; చంద్రదేవుడు, మిత్త్రదేవుడు, మిత్త్రవర్ముడు, సౌశ్రుతి, సువర్మ, సుశర్మ; ఆదులు+అగు= మొదలగువారైన; సోదర సుతులు= (తన) అన్నదమ్ములూ, కుమారులు; బాసట+కాన్= సహాయంగా; పెనంగు+అప్పుడు= యుద్ధంచేసే సమయంలో.

తాత్పర్యం: అర్జునుడు పరాక్రమంతో చేసే వీరవిహారాన్ని ఓర్చుకొని త్రిగర్తరాజు యుద్ధంచేస్తున్నాడు. అతడికి సహాయంగా శిబిత్రిగర్తసాల్వదేశ సేనలున్నాయి. అర్జునుడిని చంపుతామని ప్రతిజ్ఞ చేసిన సంశప్తకసేన ఉన్నది. నారాయణులనే గోపాలురసైన్యం ఉన్నది. సత్యసేనుడు, చంద్రదేవుడు, మిత్త్రదేవుడు, మిత్త్రవర్మ, సౌశ్రుతి, సువర్మ, సుశర్మ మొదలయిన అతడి సోదరులూ కుమారులూ ఉన్నారు. ఆ సమయంలో.

సీ. సత్యసేనుఁడు మూఁడు సాయకంబుల, మిత్త । దేవుండు షష్టి సందీప్త మార్గ
ణంబులఁ గ్రూరబాణంబులు మూఁటను, । జంద్రదేవుఁడు శరసప్తకమున,
మిత్త్రవర్ముఁడు గంకపత్త్రత్రిసప్తతి, । సౌశ్రుతి యేడు నిశాతవిశిఖ
ములను, శత్రుంజయుఁ డలఘు వింశతి కాండ । ములను, సుశర్ముఁ డుజ్జ్వల నవాస్త్ర

తే. ములను గప్పి రప్పార్థు నాబలియుఁ డంబు । దముల ధారలు వొదువ నుదాత్తరేఖ
గరము పొలుపారు మేదినీధరము భంగిఁ । దలఁపఁ బట్టగుధీరతఁ బొలిచె నధిప! 167

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా! సత్యసేనుఁడు; మూఁడు= మూడైన; సాయకంబులన్= బాణాలతోనూ; మిత్రదేవుండు; షష్టి= అరవై; సందీప్త= మిక్కిలిగ వెలిగే; మార్గణంబులన్= బాణాలతోనూ; క్రూరబాణంబులు= కఠినములైన అమ్ములు; మూఁటను= మూడింటితోనూ; చంద్రదేవుఁడు; శరసప్తకమునన్= బాణాలయొక్క ఏడింటితోనూ, ఏడు బాణాలతోనూ; మిత్రవర్ముఁడు; కంకపత్త్రత్రిసప్తతిన్= రాపులుగు రెక్కలు కట్టిన డెబ్బైమూడు బాణాలతోనూ; సౌశ్రుతి; ఏడు; నిశాత విశిఖములను= వాడి అయిన శరములతోనూ; శత్రుంజయుఁడు; అలఘు= పెద్దవయిన; వింశతి= ఇరవై; కాండములను= బాణాలతోనూ; సుశర్ముఁడు; ఉజ్జ్వల= మిక్కిలి ప్రకాశిస్తున్న; నవ+అస్త్రములను= తొమ్మిది బాణాలతోనూ; ఆ+పార్థున్= ఆ పృథా (కుంతి) కుమారుడైన అర్జునుడిని; కప్పిరి= మరుగు చేశారు; ఆ బలియుఁడు= ఆ బలశాలి అయిన అర్జునుడు; అంబుదముల= మేఘాలయొక్క; ధారలు+పొదువన్= ధార క్రమ్మగా; ఉదాత్త= ఉన్నతమైన; రేఖ= తీరు; కరము= మిక్కిలి; పొలుపు+ఆరు= అందగించే; మేదినీధరము భంగిన్= కొండలా; తలఁపన్= భావించటానికి; పట్టు+అగు= స్థానమైన; ధీరతన్= ధైర్యంతో; పొలిచెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! సత్యసేనుడు మూడూ, మిత్రదేవుడు అరవైమూడూ, చంద్రదేవుడు ఏడూ, మిత్రవర్మ డెబ్బైమూడూ, సౌశ్రుతి ఏడూ, శత్రుంజయుడు ఇరవై, సుశర్మ తొమ్మిది బాణాలతో అర్జునుని కప్పివేశారు.

అయినా అర్జునుడు మేఘాలు వానధారలు కురిపిస్తుంటే మహోదాత్త రమణీయంగా కొండ ఎట్లా ఉంటుందో అట్లా ధైర్యంతో నిలిచాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు సుస్థిరుండై మిత్త్రదేవు నంగంబునఁ గంకపత్త్రశతంబును, సత్యసేను తనువున మార్గణత్రయంబును, సుశర్మమిత్త్రవర్మల శరీరంబుల శిలీముఖాష్టకనవకంబులను బఱపి, శత్రుంజయు శిలాశితశరంబులం బడవైచి, సౌశ్రుతిం బంచవింశతి కాండంబుల గీటడంగించియుఁ జంద్రదేవుని నెనిమిది యమ్ములం దునిమి యుల్లసిల్లిన. 168

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; సుస్థిరుండు+ఐ= మిక్కిలి నిలుకడ కలవాడు అయి; మిత్త్రదేవు= మిత్రదేవుడియొక్క; అంగంబునన్= శరీరంపై; కంకపత్ర= రాపులుగు రెక్కలు గల బాణాలయొక్క; శతంబును= వంద; సత్యసేను= సత్యసేనునియొక్క; తనువునన్= దేహంలో; మార్గణ= బాణాలయొక్క; త్రయంబును= మూడు; సుశర్మ మిత్త్రవర్మల= సుశర్మయొక్క, మిత్త్రవర్మయొక్క; శరీరంబులన్= దేహాలలో వరుసగా; శిలీముఖ= బాణాలయొక్క; అష్టక= ఎనిమిదినీ; నవకంబులను= తొమ్మిదినీ; పఱపి= ప్రయోగించి; శత్రుంజయు= శత్రుంజయుడు అనేవాడిని; శిలాశిత= రాతిమీద నూరి పదునుపెట్టిన; శరంబులన్= బాణాలతో; పడవైచి= పడగొట్టి; సౌశ్రుతిన్; పంచవింశతి= ఇరవై అయిదు; కాండంబులన్= బాణాలతో; గీటు+ అడంగించియున్= సంహరించీ; చంద్రదేవునిన్; ఎనిమిది; అమ్ములన్= బాణాలతో; తునిమి= నరికి; ఉల్లసిల్లినన్= ప్రకాశించగా.

తాత్పర్యం: ఇట్లా స్థిరంగా నిలబడి, మిత్త్రదేవుడి దేహంలో రాపులుగు రెక్కలు కట్టిన బాణాలు వంద దించాడు. సత్యసేనుడి శరీరంలో మూడు బాణాలు గ్రుచ్చాడు. సుశర్మమేనిలో ఎనిమిది బాణాలు నాటాడు. మిత్త్రవర్మ ఒడలిలో తొమ్మిది బాణాలు దిగగొట్టాడు. రాతిపై నూరిన బాణాలతో శత్రుంజయుడిని సంహరించాడు. సౌశ్రుతిని ఇరవై ఐదు బాణాలతో చంపాడు. చంద్రదేవుడిని ఎనిమిది బాణాలతో ఖండించాడు. ఇట్లా అర్జునుడు ప్రకాశిస్తుండగా.

చ. కనకపుఁగామతోమరము గర్వ మెలర్పఁగ నెత్తి పద్మ నా
భుని భుజశాఖ యుచ్చిచన భూరిబలుం డగు సత్యసేనుఁ డు
క్కున నిగిడింపఁ జేతి మునికోలయుఁ బగ్గములున్ మహీతలం
బున నొగలందునుం బడిన భూవర! పార్థుఁడు గ్రోధదీప్తుఁడై! 169

ప్రతిపదార్థం: భూవర!= భూపతీ!; భూరి= అధికమైన; బలుండగు= శక్తి కలవాడైన; సత్యసేనుఁడు; కనకపున్= బంగారంతో చేసిన; కామ= దండంకల; తోమరమున్= ఈటెను; గర్వము= మదం; ఎలర్పఁగన్= ఒప్పగా; ఎత్తి= పైకెత్తి; పద్మనాభుని= శ్రీకృష్ణునియొక్క; భుజశాఖ= కొమ్మవంటి భుజాన్ని; ఉచ్చి= చీల్చి; చనన్= పోయేలా; నిగిడింపన్= ప్రయోగించగా; చేతి= శ్రీకృష్ణునియొక్క చేతిలో ఉన్న; మునికోలయున్= (గుఱ్ఱాలను త్రోలే) ములుకోల; పగ్గములున్= గుర్రాల పగ్గాలు, క్రమంగా; మహీతలంబునన్= భూప్రదేశంమీద; నొగలందునున్= రథం తొట్టెలోనూ; పడినన్= పడిపోగా; పార్థుఁడు= అర్జునుడు; క్రోధదీప్తుఁడు+ఐ= కోపంతో మండినవాడై.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! మహాబలశాలి సత్యసేనుడు బంగారపు దండం కల ఈటెను గర్వంతో విసిరాడు. అది శ్రీకృష్ణుడి కొమ్మవంటి భుజాన్ని చీల్చుకొంటూ పోయింది. అందువలన ఆయన చేతిలోని ములుకోల నేలమీద పడిపోయింది. పగ్గాలు తేరితొట్టెలో పడిపోయాయి. అట్లా కొట్టినందుకు అర్జునుడు కోపంతో మండిపడి,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. హరి దెసఁ గన్గొని యాతని । యరదముఁ గదియంగ నడపు మరద మనుడుఁ జె
చ్చెర నొండొక మునికోలం । గరముద్ధతి నడపె ఘోటకంబుల నతఁడున్. 170

ప్రతిపదార్థం: హరిదెసన్= కృష్ణునివైపు; కన్గొని= చూచి; ఆతని= ఆ సత్యసేనుడియొక్క; అరదమున్= రథాన్ని; కదియంగన్= సమీపించేటట్లు; అరదమున్= రథాన్ని; నడపుము= నడిపింపుము; అనవుడున్= అని పలుకగా; అతఁడున్= శ్రీకృష్ణుడు; చెర+ చెరన్= త్వరత్వరగా; ఒండు+ఒక= మరియొక; మునికోలన్= ములుకోలతో; కరము= మిక్కిలి; ఉద్ధతిన్= వడితో; ఘోటకంబులన్= గుఱ్ఱాలను; నడపెన్= తోలాడు.

తాత్పర్యం: (అర్జునుడు) కృష్ణుడివైపు చూచి, 'మన రథం సత్యసేనుడి రథానికి దగ్గరగా నడిపించు' అన్నాడు. కృష్ణుడు త్వరత్వరగా మరొక ములుకోల తీసికొని, దానితో గుఱ్ఱాలను మిక్కిలి వడిగా నడిపించాడు.

క. తే రతని యరదమునకుం । జేరువ యగుటయును గ్రీడి శితబహుభల్ల
స్ఫారగతుల గాత్ర శిరో । దారణ మొనరించి యొప్పె దరహాసముతోన్. 171

ప్రతిపదార్థం: తేరు= రథం; అతని= సత్యసేనుడి; అరదమునకున్= రథానికి; చేరువ= దగ్గర; అగుటయును= కాగా, ఐన తరువాత; క్రీడి= అర్జునుడు; శిత= పదునైన; బహు= అనేకమైన; భల్ల= బాణాలయొక్క; స్ఫార= విస్తార; గతులన్= గమనాలతో; గాత్ర= శరీరంయొక్క; శిరః= శిరస్సుయొక్క; దారణము= బ్రద్దలుచేయటం; ఒనరించి= కావించి; దరహాసముతోన్= చిరునవ్వుతో; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: వారి రథం సత్యసేనుడి రథాన్ని సమీపించింది. అపుడు అర్జునుడు చాలా వాడి అయిన బాణాలు విస్తారంగా ప్రయోగించి అతడి ఒళ్ళూ తలా నరకి, చిరునవ్వు నవ్వాడు.

వ. ఇట్లు సత్యసేనుని చిత్రవధంబు చేసి. 172

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సత్యసేనుని= సత్యసేనుడు అనే వాని యొక్క; చిత్రవధంబు= చిత్రవధ; చేసి= కావించి,

తాత్పర్యం: ఇట్లా సత్యసేనుడిని చిత్రవధ చేసి.

చ. ఘనతర వత్సదంతశరఘాతమునం బడవైచి మిత్త్రవ
ర్మని రథసూతు నట్టిదొక క్రూరపుఁ దూపున నుర్విఁగూల్చె నా
తని సముదీర్ణమై పెలుచఁ దాఁకి త్రిగర్తబలంబు సుట్టు ము
ట్టిన వివిధోగ్రసాయకపటిష్ఠత నొప్పి కలంచె నేపునన్. 173

ప్రతిపదార్థం: ఘనతర= మిక్కిలి పెద్దదైన; వత్సదంత= వత్సదంతం అనే లేగపంటివంటి మొనగల; శర= బాణంయొక్క; ఘాతమునన్= దెబ్బచేత; మిత్త్రవర్మునిన్= మిత్త్రవర్మను; పడన్వైచి= పడగొట్టి; రథసూతున్= అతని రథసారథిని; అట్టిది= అటువంటిదే ఐన, వత్సదంతం అనే; ఒక= ఒక్క; క్రూరపున్= భయంకరమైన; తూపునన్= బాణంతో; ఉర్విన్= నేలపై; కూల్చెన్= పడగొట్టాడు, సంహరించాడు; త్రిగర్త బలంబు= త్రిగర్త సైన్యం; ఆతనిన్= అర్జునుని; సమ్+ఉదీర్ణము+ఐ= బాగుగా గర్వించినదై; పెలుచన్= పట్టుదలతో; తాఁకి= ఎదుర్కొని; చుట్టు ముట్టినన్= నలువైపులా ముట్టడింపగా; వివిధ=

రకరకములయిన; ఉగ్ర= తీక్ష్ణమైన; సాయక= బాణములయొక్క; పటిష్ఠతన్= అత్యధికమైన పటుత్వంతో; ఒప్పి= తగి; ఏపునన్= విజృంభణంతో; కలంచెన్= కలతపెట్టాడు.

తాత్పర్యం: అర్జునుడు లేగదూడ పంటివంటి మొన గల మిక్కిలి పెద్దదైన బాణంతో మిత్రవర్మను పడగొట్టాడు. అటువంటి బాణమే (వత్సదంతమే) మరొకటి ప్రయోగించి అతడి రథసారథిని చంపాడు. అపుడు త్రిగర్త సైన్యం మించిన గర్వంతో అర్జునుడిని ఎదిరించి చుట్టుముట్టింది. అతడు ఆ సైన్యాన్ని రకరకాల వాడి బాణాలతో విజృంభించి కలతపెట్టాడు.

వ. వెండియు సుశర్ముని జ్ఞాతులు వోక పెనంగిన. 174

ప్రతిపదార్థం: వెండియున్= ఇంకా; సుశర్ముని= సుశర్మయొక్క; జ్ఞాతులు= దాయాదులు; పోక= తొలగిపోకుండా; పెనంగినన్= యుద్ధంచేయగా.

తాత్పర్యం: అప్పటికి సుశర్మ దాయాదులు తొలగిపోకుండా యుద్ధం చేయగా.

ఆ. వెండిపింజఁ బొలుచు వెడఁద యమ్మున మిత్ర । సేనధరణినాథుశిరముఁ ద్రుంచి
వాఁడినారసము సువర్మవక్షంబున । నాటె నయ్యమర్త్యనాథసుతుఁడు. 175

ప్రతిపదార్థం: ఆ= ప్రసిద్ధుడైన; అమర్త్యనాథ= దేవేంద్రునియొక్క; సుతుఁడు= కొడుకైన అర్జునుడు; వెండి= వెండితో చేసిన; పింజన్= అల్లెత్రాటికి తగిలించే బాణంయొక్క మొదటిభాగం (పుంఖం)తో; పొలుచు= మెరిసే; వెడఁద= విశాలమైన, వెడల్పయిన; అమ్మునన్= బాణంతో; మిత్రసేన= మిత్రసేనుడనే; ధరణినాథు= భూపతియొక్క; శిరమున్= తలను; త్రుంచి= నరికి; వాఁడినారసము= పదునైన నారాచమనే ఇనుపబాణం; సువర్మ= సువర్మయొక్క; వక్షంబునన్= రొమ్ముపై; నాటెన్= గ్రుచ్చాడు.

తాత్పర్యం: అర్జునుడు వెండితో చేసిన పుంఖం ఉన్న వెడల్పైన ఒక బాణంతో మిత్రసేనరాజు శిరస్సు నరికాడు. పదునైన ఇనుప బాణం సువర్మ రొమ్ముపై గ్రుచ్చాడు.

వ. అట్టియెడ సంశప్తక గణంబులన్నియు నార్పులునింగిముట్ట నలుదిక్కులం గిట్టి బెట్టిదంబులగు నస్త్ర శస్త్ర పరంపరలు గురిసిన నమ్మేటివిలుకాఁ డలుక మానిన యలంతి నవ్వు చెలువంబు మొగంబునకు వింత చెన్నొసంగ విజృంభించి యైంద్రాస్త్రంబు ప్రయోగించిన నది ప్రదీప్త భల్లాంజలిక ప్రముఖ విశిఖరూపంబులం బరఁగుటయు. 176

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; ఎడన్= సమయంలో; సంశప్తక= అర్జునుని చంపుతామని ప్రతిజ్ఞచేసిన; గణంబులు= సేనా సమూహాలు; అన్నియున్= అన్నీ; ఆర్పులు= అరుపులు; నింగిన్= ఆకాశాన్ని; ముట్టన్= తాకగా; నలు= నాలుగు; దిక్కులన్= వైపులనూ; కిట్టి= చేరుకొని, చుట్టుముట్టి; బెట్టిదంబులు+అగు= కఠినములయిన; అస్త్ర= మంత్రప్రయుక్తాలయిన ఆయుధాలయొక్క; శస్త్రంబులన్= బాణాలు మొదలయిన ఆయుధాలయొక్క; పరంపరలు= వరుసలు; కురిసినన్= వానలా ప్రయోగింపగా; ఆ+మేటి= ఆ శ్రేష్ఠుడైన; విలుకాడు= ధనుర్ధారి అయిన అర్జునుడు; అలుక= కోపం; మానిన= విరమించిన; అలంతినవ్వు= చిరునవ్వుయొక్క; చెలువంబు= అందం; మొగంబునకున్= ముఖానికి; వింత= క్రొత్తదైన, ఆశ్చర్యకరమైన;

చెన్ను= చక్కదనాన్ని; ఒసంగన్= ఈయగా; విజృంభించి= చెలరేగి; ఐంద్ర= ఇంద్రుడు అధిదైవంగా గల; అస్త్రంబు= ఆయుధాన్ని; ప్రయోగించినన్= వదలగా; అది= ఆ ఐంద్రాస్త్రం; ప్రదీప్త= మిక్కిలి వెలిగే; భల్ల+అంజలిక= భల్లం, అంజలిక మొదలయిన; విశిఖ= బాణాలయొక్క; రూపంబులన్= రూపాలతో; పరఁగుటయున్= ప్రసరించగా.

తాత్పర్యం: అపుడు సంశప్తకులు అందరూ శబ్దం ఆకాశాన్ని తాకేటట్లు అరుస్తూ అర్జునుడిని నలువైపులా చుట్టుముట్టి, కఠిన శస్త్రాస్త్రాలు ఎడతెగకుండా వానకురిసినట్లు అతడిమీద ప్రయోగించారు. ఆ మహాధానుష్కుడైన అర్జునుడికి కోపం పోయి, వారి సాహసానికి చిరునవ్వు వస్తే దాని సొగసు అతడి ముఖానికే క్రొత్త సోయగం తెచ్చిపెట్టింది. అప్పు డతడు విజృంభించి, ఐంద్రాస్త్రం ప్రయోగించాడు. అది భల్లం, అంజలిక మొదలయిన బాణాల రూపం ధరించి ప్రసరించింది.

విశేషం: భల్లం అంటే బల్లెం అని కూడా అర్థం. బల్లెం అగ్రభాగంవంటి అగ్రభాగంగల బాణం భల్లం. అంజలిక అంటే చిట్టెలుక. దాని మూతివంటి అగ్రభాగంగల బాణం అంజలిక.

సీ. **తేరుల చెక్కలు వారణంబుల ఖండ । ములు భూషణంబుల పొడియు ఘోట**
కంబుల తునియలుఁ గరవాలతోమర । శరపరిఘాదుల శకలములును
రథికజనంబుల వ్రయ్యలుఁ జామర । ఛత్రకేతువుల యంశములు భటుల
తుమురును రౌతుల తుండంబులును గంక । టముల భాగములుఁ జిందముల నుఱుముఁ

తే. **గలిసి నెత్తుటమునిఁగి ప్రేపులఁ బెనంగి । మెదట బ్రుంగి వియచ్చర హృదయములకు**
నద్భుతంబు బీభత్సంబు నావహింప । సంగరాంగణ మతిఘోరభంగియయ్యె. **177**

ప్రతిపదార్థం: తేరుల= రథాలయొక్క; చెక్కలున్= బ్రద్దలూ; వారణంబుల= ఏనుగులయొక్క; ఖండములు= ముక్కలు, భూషణంబుల= నగలయొక్క; పొడియున్= చూర్ణము; ఘోటకంబుల= గుర్రాలయొక్క; తునియలున్= తునుకలూ; కరవాల= కత్తుల; తోమర= ఈటెలు; శర= అమ్ములు; పరిఘ= ఇనుపకట్ల గుదియలు; ఆదుల= మొదలయిన వాటియొక్క; శకలములును= ముక్కలూ; రథిక జనంబుల= రథికులయిన జనులయొక్క; వ్రయ్యలున్= చీలికలూ; చామర= వింజామరలయొక్క; ఛత్ర= గొడుగులయొక్క; కేతువుల= జెండాలయొక్క; అంశములున్= భాగాలూ; భటుల= కాలిబంట్లయొక్క; తుమురును= సన్నసన్నముక్కలూ; రౌతుల= అశ్వికులయొక్క; తుండంబులును= ముక్కలూ; కంకటముల= కవచాలయొక్క; భాగములున్= అంశాలూ; చిందముల= శంఖాలయొక్క; నుఱుమున్= పొడియు; కలిసి= మిళితమై; నెత్తుటన్= రక్తంలో; మునిఁగి= నిమగ్నమై; ప్రేవులన్= ప్రేగులతో; పెనంగి= మెలిగొని; మెదటన్= మెదడులో; బ్రుంగి= దిగబడి; వియత్+చర= ఆకాశ సంచారుల; హృదయములకున్= మనస్సులకు; అద్భుతంబున్= ఆశ్చర్యాన్నీ; బీభత్సంబున్= జుగుప్సను; ఆవహింపన్= కలిగింపగా; సమరాంగణము= యుద్ధప్రదేశము; అతిఘోర= మిక్కిలి భయంకరమైన; భంగి= విధము కలది; అయ్యెన్= అయినది.

తాత్పర్యం: రథాలు, ఏనుగులు, నగలు, గుర్రాలు, కత్తులు, ఈటెలు, బాణాలు, ఇనుపకట్ల గుదియలు, రథికులు, చామరాలు, గొడుగులు, జెండాలు, కాలిబంట్లు, అశ్వికులు, కవచాలు, శంఖాలు-వీటి ముక్కలూ పొడులూ నెత్తుటిలో మునిగిపోయి, ప్రేగులతో మెలివడిపోయి, మెదడులో దిగబడిపోయి, ఆకాశచారులకు ఆశ్చర్యమూ ఏవగింపూ పుట్టిస్తున్నాయి. యుద్ధప్రదేశం మహాభయంకరంగా అయిపోయింది.

వ. అప్పుడు. 178

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో

తాత్పర్యం: ఆ సమయంలో

క. కరిహయశవముల విఱిగిన । యరదంబుల విషమమైన యాజి క్షితి నె
త్తురు రొంపిలోన రథ్య । స్ఫురణ కతనఁ దవులఁబడక శోభితగతియై. 179

ప్రతిపదార్థం: కరి= ఏనుగులయొక్క; హయ= గుర్రాలయొక్క; శవములన్= కళేబరాలతోనూ; విఱిగిన= విరిగినటువంటి; అరదంబులన్= తేరులతోనూ; విషమమైన= ఎగుడు దిగుడైన; ఆజి క్షితిన్= యుద్ధభూమిమీద; నెత్తురు రొంపిలోనన్= నెత్తుటి బురదలో; రథ్య= గుర్రాలయొక్క; స్ఫురణ= కదలిక; కతనన్= కారణంచేత; తవులన్+పడక= చిక్కుపడక; శోభిత= ప్రకాశించే; గతి+ఐ= గమనంకలవాడై.

తాత్పర్యం: యుద్ధభూమినిండా ఏనుగుల కళేబరాలూ, గుర్రాల కళేబరాలూ, విరిగిపోయిన రథాలూ పడి ఉన్నందున అది ఎగుడు దిగుడు అయిపోయింది. దానికి తోడు నెత్తురు బురద ఏర్పడింది. గుర్రాల కదలిక వలన ఆ బురదలో చిక్కుపడకుండా సంచరిస్తూ.

దుర్యోధనుఁడు ధర్మజునితో యుద్ధంబు సేసి విరథుఁ డగుట (సం. 8-19-35)

తే. నరుఁడు దీవ్రశరార్చులు వరఁగఁ జేయఁ । గలఁగి హతశేషసంశప్తకవ్రజంబు
పలుగడల విచ్చుటయుఁ బొగ వాసి మెఱయు । నగ్నియునుబోలె వెలుఁగొందె నాతఁ డధిప! 180

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నరుఁడు= అర్జునుడు; తీవ్ర= వాడిగల; శర= బాణాలయొక్క; అర్చులు= జ్వాలలు; పరఁగఁజేయన్= వ్యాపింపజేయగా; హత= చావగా; శేష= మిగిలిన; సంశప్తక వ్రజంబు= అర్జునుని చంపుతామని ప్రతిజ్ఞచేసినవారి సముదాయం; కలఁగి= కలతచెంది; పలు+కడలన్= చాలా దిక్కులకు, అన్నివైపులకు; విచ్చుటయున్= చెదరిపోగా; ఆతఁడు= అర్జునుడు; పొగ+పాసి= ధూమం తొలగిపోయినందువల్ల; మెఱయు= ప్రకాశించే; అగ్నియున్ బోలెన్= నిప్పులా; వెలుఁగు+ఒందెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: అర్జునుడు వాడి బాణాల జ్వాలలు (కాంతులు) వ్యాపింపజేసేసరికి హతశేషులయిన సంశప్తకులు క్షోభపడి, అన్నివైపులకూ పారిపోయారు. అపుడు అర్జునుడు పొగ తొలగిపోయిన తరువాత మెరిసే అగ్నివలె ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ.

ఉ. కౌరవరాజు ధర్మజుఁడు గయ్యము సేయునెడం గడంకమైఁ
గౌరవరాజు ధర్మజుని కాయమునన్ నవసాయకంబులన్
సారథిమేన నొక్క పటుసాయకమున్ నిగిడింప నాతఁడు
న్ఘోరతరాక్షుఁడై యతని నొంచెఁ ద్రయోదశసాయకాహతిన్. 181

ప్రతిపదార్థం: కౌరవరాజు= దుర్యోధనుడు; ధర్మజుఁడు= యుధిష్ఠిరుడు; కయ్యము= యుద్ధం; చేయు= చేసే; ఎడన్= సమయంలో; కడంకమైన్= పూనికతో; కౌరవరాజు= దుర్యోధనుడు; ధర్మజుని= యుధిష్ఠిరునియొక్క; కాయమునన్= శరీరంపై; నవ= తొమ్మిది; సాయకంబులన్= బాణాలను; సారథి= సూతునియొక్క; మేనన్= శరీరంపై; ఒక్క; పటు= గట్టి; సాయకమున్= బాణాన్నీ; నిగిడింపన్= ప్రయోగింపగా; ఆతఁడున్= యుధిష్ఠిరుడు; ఘోరతర= మిక్కిలి భయంకరాలైన; అక్షుఁడు+ఐ= కన్నులు గలవాడై; త్రయోదశ= పదమూడు; సాయక= బాణాలయొక్క; ఆహతిన్= దెబ్బతో; అతనిన్= దుర్యోధనుని; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు, ధర్మరాజు యుద్ధం చేస్తున్నారు. అపుడు దుర్యోధనుడు పూనికతో ధర్మరాజు మీద తొమ్మిది బాణాలు, అతడి సూతుడిమీద ఒక గట్టి బాణం ప్రయోగించాడు. ధర్మరాజు మహాభయంకరంగా చూస్తూ పదమూడు బాణాలు ప్రయోగించి దుర్యోధనుడిని నొప్పించాడు.

వ. నొంచి తోడన. 182

ప్రతిపదార్థం: నొంచి= నొప్పించి; తోడన్+అ= వెంటనే.

తాత్పర్యం: నొప్పించి; వెంటనే.

తే. తునియలుగఁ జేసె హరులఁ జతుశ్శరముల । సూతుఁ బంచమమున ఘనకేతుయష్టి
షష్ఠమునఁ జాపదండంబు సప్తమమున । నలిగి యెత్తిన కరవాల మష్టమమున. 183

ప్రతిపదార్థం: హరులన్= గుర్రాలను; చతుః+శరములన్= నాలుగు బాణాలతోనూ; సూతున్= సారథిని; పంచమమునన్= ఐదవదానిచేతను; ఘన= పెద్దదైన; కేతు= జెండాయొక్క; యష్టిన్= కట్టెను; షష్ఠమునన్= ఆరవదానిచేతనూ; చాపదండంబున్= వింటికర్రను; సప్తమమునన్= ఏడవదానిచేతనూ; అలిగి= కోపించి; ఎత్తిన= తీసిన; కరవాలము= ఖడ్గాన్ని; అష్టమమునన్= ఎనిమిదవదానిచేతను; తునియలుగన్= ముక్కలుగా; చేసెన్= కావించాడు.

తాత్పర్యం: గుర్రాలను నాలుగు బాణాలతోనూ, సారథిని ఐదవదానితోనూ, పెద్దజెండా కర్రను ఆరవదానితోనూ, ధనుస్సును ఏడవదానితోనూ, కోపంతో తీసికొన్న ఖడ్గాన్ని ఎనిమిదవ దానితోనూ ముక్కలు చేశాడు.

క. ఆలోనన యజ్జనపతి । వాలికనారసములైదు వక్షమున వడిం
గీలించి ధైర్యసారముఁ । దూలించినఁ దొలఁగి నీ సుతుం డిల కుఱికెన్. 184

ప్రతిపదార్థం: ఆలోనన్+అ= అంతలోపలనే; ఆ+జనపతి= ఆ యుధిష్ఠిర నరపతి; వాలిక= పొడవైన; నారసములు= నారాచములు (ఇనుప బాణాలు); ఐదు= ఐదింటిని; వక్షమునన్= దుర్యోధనుని రొమ్ముపై; వడిన్= వేగంతో; కీలించి= నాటి; ధైర్యసారమున్= ధీరత్వంయొక్క బలాన్ని; తూలించినన్= నశింపజేయగా; నీ సుతుండు= నీ కొడుకు; తొలఁగి= తప్పుకొని; ఇలకున్= నేలకు; ఉఱికెన్= దుమికాడు.

తాత్పర్యం: యుధిష్ఠిరుడు అంతలోనే పొడవైన ఐదు ఇనుపబాణాలను దుర్యోధనుడి రొమ్ముమీద గుచ్చుకొనేటట్లు ప్రయోగించాడు. దానితో ధైర్యాన్ని కోల్పోయి నీ కొడుకు దుర్యోధనుడు యుద్ధంనుండి తప్పించుకొని, రథమునుండి నేలకు దూకాడు.

చ. వికలరథ ప్రయత్నుఁ బృథివీపతిఁ గన్గొని ద్రోణపుత్ర క
ర్ణ కృపులుఁ దక్కునుం గలుగు నాయకులున్ రయమార వచ్చి కూ
డికొనుట సూచి యెంతయు వడిం జనుదెంచిరి ధర్మసూను పొం
తకు సముదగ్రులై యతనితమ్ములు సంగరకౌతుకమ్మునన్. 185

ప్రతిపదార్థం: ద్రోణపుత్ర= అశ్వత్థామ; కర్ణ; కృపులు; తక్కునున్= ఇంకా; కలుగు= ఉన్న; నాయకులున్= సేనానాయకులు; వికల= పాడైపోయిన; రథ= తేరు; ప్రయత్నున్= పూనికగల; పృథివీపతిన్= దుర్యోధనుని; కన్గొని= చూచి; రయము= వేగం; ఆరన్= ఒప్పగా; వచ్చి; కూడికొనుట= చేరుట; చూచి; ధర్మసూను పొంతకున్= ధర్మరాజువద్దకు; అతని తమ్ములు= ధర్మరాజు తమ్ముళ్ళు భీమార్జున నకుల సహదేవులు; సంగర= యుద్ధంలోని; కౌతుకమ్మునన్= కుతూహలంతో; సమ్+ ఉదగ్రులు+ఐ= భయంకరులై; ఎంతయు= ఎంతైనా, చాలా; వడిన్= వేగంతో; చనుదెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: దుర్యోధనుడి రథం విరిగిపోవటం, అయినా పోరాడటానికి అతడు చేసిన ప్రయత్నం అక్కరకు రాకపోవటం చూచి అశ్వత్థామ, కర్ణుడూ, కృపాచార్యుడు ఇంకా ఉన్న రాజులు, సేనానాయకులు అతడి వద్దకు వేగంగా వచ్చి కలిసికొనటం చూచిన భీమార్జున నకుల సహదేవులు - వారూ వారితో యుద్ధంచేయాలనే కుతూహలంతో చాలా వేగంగా భయంకరులై ధర్మరాజు దగ్గరికి వచ్చారు.

వ. ఇ త్తెఱంగున నపరాహ్ణంబున దొరలమొత్తంబు లొక్క దెసకుం దార్కొనిన నుభయబలంబులు నురవడించి కలయన్ బెరసినం గ్రందుకయ్యంబయ్యె నందుఁ జిందంబుల మ్రోఁతయు నార్పుల యులివును బాణ కృపాణాదిహేతి సంఘట్టనంబునం బుట్టు రణనంబును రథావయవాస్థికపాలభంజనంబున నెసంగు నినదంబునుం గూడి పరఁగిన దిక్కులు పిక్కటిల్లెఁ గరులకొమ్ములం జిక్కివ్రేలు తురంగంబులును సందుకొని సొచ్చిన సుభటులు సెరివిన నొఱగి కూలు శుండాలంబులును నాశ్వికుల మొగంబునంబడి లులాయంబులు సొచ్చిన సరోవరంబుల చందం బగు కాల్బలంబులును రథికులు వోక పెనంగిన నఱవఱలయిన యరదంబులును నెత్తురు కాలువలును గండల తిట్టలును బ్రేవుల ప్రోవులును నెమ్ముల రాసులును నత్యంత రౌద్రంబు నావహించె' ననుటయు నాంబికేయుండు. 186

ప్రతిపదార్థం: ~~ఈ~~+తెఱంగునన్= ~~ఈ~~ రీతిగా; అపర+అహ్నంబునన్= మధ్యాహ్నం తరువాత; దొరల= రాజులయొక్క; మొత్తంబులు= సమూహాలు; ఒక్క= ఒక; దెసకున్= దిక్కుకు; తారు+కొనినన్= చేరుకొనగా; ఉభయ= ఇరు; బలంబులున్= సేనలు; ఉరవడించి= విజృంభించి; కలయన్= కూడునట్లుగా; బెరసినన్= ఢీకొనగా; క్రందు కయ్యంబు= దొమ్మికయ్యం; అయ్యెన్= సంభవించింది; అందున్= ఆ యుద్ధంలో; చిందంబుల= శంఖాలయొక్క; మ్రోఁతయున్= ధ్వనీ; ఆర్పుల= కేకల; ఉలివును= ధ్వనీ; బాణ= అమ్ములు; కృపాణ= ఖడ్గాలు; ఆది= మొదలైన; హేతి= ఆయుధాలయొక్క; సంఘట్టనంబునన్= తాకిడిచేత; పుట్టు= కలిగే; రణనంబును= ధ్వనీ; రథ= తేరులయొక్క; అవయవ= అంగాలయొక్క; అస్థి= ఎముకలయొక్క; కపాల= తలలయొక్క; భంజనంబునన్= విరగటంచేత పగలటంచేత; ఎసంగు= కలిగే; నినదంబునన్= ధ్వనీ; కూడి= కలిసి; పరఁగినన్= వ్యాపించగా; దిక్కులు= దిశలు; పిక్కటిల్లెన్= పగిలిపోయాయి. కరుల= ఏనుగులయొక్క; కొమ్ములన్= దంతాలలో; చిక్కి= చిక్కుకొని; వ్రేలు= వ్రేలాడే; తురంగంబులును= గుర్రాలూ; సందుకొని= అవకాశం చూచికొని; చొచ్చిన= ప్రవేశించిన; సుభటులు= మంచి, గొప్పయోధులు - యుద్ధభటులు; చెరివినన్= ఖండించగా; ఒఱిగి= వాలిపోయి; కూలు= పడిపోయే, మరణించే; శుండాలంబులును= ఏనుగులు; ఆశ్వికుల= రౌతుల; మొగంబునన్+పడి= ఎదుటపడి; లులాయంబులు=

కారెనుపోతులు; చొచ్చిన= ప్రవేశించిన; సరోవరంబుల= చెరువులయొక్క; చందంబు+అగు= విధం అయ్యే; కాల్బలంబులును= పదాతి సేనలు; రథికులు= రథాలపై నుండి యుద్ధంచేసే వీరులు; పోక= వెళ్ళిపోకుండా; పెనంగినన్= పోరాడగా; అఱవఱలు= చిన్నముక్కలు; అయిన; అరదంబులును= తేరులు; నెత్తురు= రక్తపు; కాలువలును= కాలువలు, కుల్యలూ; కండల= మాంసపుముక్కల; తిట్టలును= గుట్టలూ; ప్రేవుల= ప్రేగులయొక్క; ప్రోవులును= కుప్పలూ; ఎమ్ముల= ఎముకలయొక్క; రాసులును= కుప్పలూ; అత్యంత= మిక్కిలి అధికమైన; రౌద్రంబున్= భయంకరత్వాన్ని; ఆవహించెన్= కలిగించాయి; అనుటయున్= అని చెప్పగా; ఆంబికేయుండు= అంబికపుత్రు డయిన ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: ఇట్లా మధ్యాహ్నం దాటిన తరువాత రాజులు ఒక్కచోటికి చేరేసరికి, ఇరుపక్షాల సైనికులు విజృంభించారు. ఒకరితో ఒకరు కలబడేసరికి దొమ్మికయ్యం సంభవించింది. శంఖధ్వని, అరుపుల ధ్వని, బాణాలు ఖడ్గాలు మొదలయిన ఆయుధాల తాకిడికి పుట్టేధ్వని, రథాలు, ఎముకలు విరుగుతూ ఉంటే బుర్రలు పగులుతూ ఉంటే కలిగేధ్వనీ కలిసి వ్యాపించేసరికి దిక్కులు పగిలిపోయాయి. ఏనుగుల దంతాలమధ్య ఇరుక్కొని వ్రేలాడుతున్నాయి గుర్రాలు. ఎడం చూచికొని ప్రవేశించి మహావీరులు నరుకుతుంటే పడిపోతున్నాయి ఏనుగులు. పదాతిసైన్యం రౌతుల ముందుకు వచ్చి దున్నపోతులు దిగిన చెరువులవలె సంక్షోభం చెందుతున్నాయి. వదలకుండా రథికులు పోరాడినందున ముక్కలయిపోతున్నాయి రథాలు. నెత్తురు కాలువలు కట్టింది. మాంసం గుట్టలుగా పడింది. ప్రేగులు ప్రోగులుగా ఏర్పడ్డాయి. ఎముకలు రాసులుగా పడ్డాయి. వీటితో యుద్ధభూమి భయంకరంగా పరిణమించింది.' అని సంజయుడు చెప్పాడు. అది విని ధృతరాష్ట్రుడు

విశేషం: అలం: ఉపమ.

చ. **'సమరము పెంపు సెప్పెదవు సంజయ! చెప్పవు నీవు మీమహీ**
రమణుని భంగి ధర్మజుశరంబులచే విరథత్వ మొంది మా
నముఁ జలముం దెగం దొలఁగెనా? మగుడం బురికొంట లేదే? ని
క్కము సెపుమా! తనూజు భుజగర్వవిహీనత నొంచెఁ జిత్తమున్.' **187**

ప్రతిపదార్థం: సమరము= యుద్ధంయొక్క; పెంపు+చెప్పెదవు= పెంపు చెపుతున్నావు; సంజయ!= ఓ సంజయా!; నీవు; మీ మహీరమణుని భంగి= మీ రాజు విధం గురించి చెప్పవు, చెప్పటంలేదు; ధర్మజు= ధర్మపుత్రునియొక్క; శరంబులచేన్= బాణాలచేత; విరథత్వము= రథంలేనివాడు కావటం; ఒంది= పొంది; మానమున్= అభిమానము; చలము= పట్టుదల; తెగన్= పోగా; తొలఁగెనా= దూరంగా వెళ్ళాడా?; మగుడన్= తిరిగి; పురికొంట= ఉత్సాహవంతుడు కావటం; లేదు+ఎ= లేదా?; నిక్కము= సత్యం; చెపుమా!= తెలియజేయి సుమా!; తనూజ= కుమారుడైన దుర్యోధనునియొక్క; భుజ= బాహువులయొక్క; గర్వ= దర్పంయొక్క; విహీనత= లేకపోవటం; చిత్తమున్= మనస్సును; నొంచెన్= బాధించింది.

తాత్పర్యం: 'సంజయా! యుద్ధవిస్తారం గురించి చెప్పుతావు కాని, దుర్యోధనుడి తీరు చెప్పటం లేదు. యుధిష్ఠిరుడి బాణాలకు విరథుడై మానమూ, పట్టుదలా విడిచి అతడు దూరంగా వెళ్ళిపోయాడా? తిరిగి అతనికి ఉత్సాహం రాలేదా? నిజం చెప్పుము. కొడుకు భుజబలదర్పం పోవటం మనస్సును నొప్పించింది.

వ. **అనిన నాసూతనందనుం డమ్మానవపతి కిట్లనియె.** **188**

ప్రతిపదార్థం: అనినన్= ఈ రీతిగా అడుగగా; ఆ సూతనందనుండు= ఆ సూతుని కుమారుడయిన సంజయుడు; ఆ+మానవపతికిన్= ఆ నరనాథునికి; ఇట్లు= ఇట్లా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అట్లా అడుగగా, సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

తే. **'విరథుఁ డయ్యెన కాని యవ్వీరుఁ డాహ । వంబు దక్కక యొందురథంబు వన్ని**
కొని సముద్ధతివచ్చి సక్రోధమైన । మనముతో సూతునకు నిట్టు లనియె నధిప! 189

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; ఆ+వీరుడు= ఆ శూరుడైన దుర్యోధనుడు; విరథుఁడు= రథంలేనివాడు; అయ్యెన్= అయినాడు; కాని= అయినా; ఆహవంబు= యుద్ధం; తక్కక= విడవక; ఒండు= మరొక; రథంబు; వన్నికొని= సంసిద్ధం చేసికొని; సమ్+ఉద్ధతిన్= మిక్కిలి గర్వంతో వచ్చి, పోరాడటానికి వచ్చి; సు(క్రోధము+ఐన= కోపంతో కూడినది అయిన; మనముతోన్= మనస్సుతో; సూతునకున్= తన సారథితో; ఇట్టులు= ఇలా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! ఆ వీరుడు రథం కోల్పోయాడే కాని, యుద్ధం విడిచిపెట్టలేదు. మరొక రథం సిద్ధం చేసికొని, మళ్ళీ దర్పంతో సంగ్రామం చేయటానికి వచ్చాడు. కోపంతో కూడిన మనస్సుతో అపుడు తన సారథితో ఇట్లా అన్నాడు.

ఆ. **'తెల్ల సీవిరులును వెల్లనిగొడుగు నై । యల్లవాఁడె పాండవాగ్రజుండు**
మెఱసియున్నవాఁడు వఱపు మచ్చోటికి । రథము ఘోటకములరయము మెఱయ.' 190

ప్రతిపదార్థం: తెల్ల= తెల్లనివైన; సీవిరులును= వింజామరలు; వెల్లని= తెల్లని; గొడుగున్+ఐ= ఛత్రము కలవాడై; అల్లవాఁడు+ఎ= అడుగో అతడే; పాండవ+అగ్రజుండు= యుధిష్ఠిరుడు; మెఱసి= ప్రకాశించి, ప్రకాశిస్తూ; ఉన్నవాఁడు= ఉన్నాడు; ఘోటకముల= గుర్రాలయొక్క; రయము= వేగం; మెఱయన్= ప్రకాశింపగా; రథము= తేరు; ఆ+చోటికిన్= అతడున్న ప్రదేశానికి; వఱపుము= తోలుము.

తాత్పర్యం: 'అడుగో తెల్లనిచామరాలతో తెల్లని గొడుగులతో వెలుగుతున్నాడే, అతడే యుధిష్ఠిరుడు. గుర్రాలవేగం ప్రకటమయ్యేటట్లు రథాన్ని అతడున్న చోటికి పోనిమ్ము.'

వ. **అనుటయు నతండు నట్లచేయ నయ్యుధిష్ఠిరుండు నిజసారథి నాలోకించి యహికేతుమహితంబై వచ్చుచున్న ధృతరాష్ట్రనందన స్యందనంబునకు సమ్ముఖంబుగా మనరథంబు నడపుమనుటయు నాతం డవ్విధం బాచరింప నయ్యిరువు రతిరథికులకుఁ బ్రకట ప్రధనంబయ్యె నట్టియెడ.** 191

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; అతండును= అతడి సారథి కూడా; అట్లు+అ= అట్లాగే; చేయన్= చేయగా; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; నిజసారథిన్= తన సూతుడిని; ఆలోకించి= చూచి; అహి= సర్పచిహ్నంకల; కేతు= జెండాతో; మహితంబు+ఐ= గొప్పది అయి; వచ్చుచున్+ఉన్న= వస్తూ ఉన్న; ధృతరాష్ట్రనందన= ధృతరాష్ట్రుని కుమారుడైన దుర్యోధనుడియొక్క; స్యందనంబునకున్= రథానికి; సమ్ముఖంబుగాన్= ఎదురుగా; మన రథంబు= మన తేరు; నడపుము= నడిపించుము; అనుటయున్= అనినందువల్ల; ఆతండు= ఆ సూతుడు; ఆ+విధంబు= ఆ ప్రకారం; ఆచరింపన్= చేయగా; ఆ+ఇరువురు= ఆ ఇద్దరు; అతిరథులకున్= అనేకులైన విలుకాండ్రతో యుద్ధం చేయగలవారు అతిరథులు, అట్టివారైన

యుధిష్ఠిర దుర్యోధనులకు; ప్రకట= అధికమైన; ప్రధనంబు= యుద్ధం; అయ్యెన్= సంభవించింది; అట్టి= అటువంటి; ఎడన్= సమయంలో.

తాత్పర్యం: అట్లా చెప్పేసరికి, ఆ సూతుడు రథాన్ని ధర్మపుత్రుడి దగ్గరకు తోలుకొని వెళ్ళుతుండగా, యుధిష్ఠిరుడు తన సారథిని చూచి, సర్పధ్వజంతో గొప్పగా వస్తున్న ఆ దుర్యోధనుడి రథానికి ఎదురుగా మన రథాన్ని తోలుము' అని చెప్పాడు. అత డట్లాగే తోలాడు. అపుడు ఆ అతిరథులు యుధిష్ఠిర దుర్యోధను లిద్దరికీ మహాయుద్ధం జరిగింది. ఆ సమయంలో.

సీ. **పాండవు చాపంబు ఖండించె నీ కొడు । కొండొక ధనువెత్తి యుఱక యాతఁ**
డక్కురునాథువిల్ గ్రక్కునఁ దునుమాడె । నతఁడు వేఱొక వింటనతని నేయ
నయ్యుధిష్ఠిరుఁడు నానాస్త్రంబు లేసిన । నాచ్ఛాదితంబయ్యె నంబరంబు
వారొండొరుల రక్తధారాప్లుతులఁ జేసి । పుల్లకింశుక భంగిఁ బొలిచి రేచి

ఆ. **ఘోరశక్తి వైచెఁ గౌరవపతి యది । నడుమఁ దునిమి ధర్మనందనుండు**
నొంచె నిశితవిశిఖపంచకమ్మున నమ్మ । హీశు నురము దర్పమెసకమెసఁగ. **192**

ప్రతిపదార్థం: నీ కొడుకు= నీ కుమారుడైన దుర్యోధనుడు; పాండవు= పాండురాజు కుమారుడైన యుధిష్ఠిరునియొక్క; చాపంబు= ధనుస్సును; ఖండించెన్= నరికాడు; అతఁడు= యుధిష్ఠిరుడు; ఉఱక= (ఆ నరకటం) లక్ష్యపెట్టక; ఒండు+ఒక= మరొక; ధనువు= విల్లు; ఎత్తి= తీసికొని; ఆ+కురునాథు= ఆ కురురాజైన దుర్యోధనునియొక్క; విల్= ధనుస్సును; గ్రక్కునన్= వెంటనే; తునుమాడెన్= ఖండించాడు; అతఁడు= ఆ దుర్యోధనుడు; వేఱు+ఒక= మఱొక; వింటన్= ధనుస్సుతో; అతనిన్= ఆ యుధిష్ఠిరుని; ఏయన్= బాణంతో కొట్టగా; ఆ+యుధిష్ఠిరుఁడు= ఆ ధర్మపుత్రుడు; నానా= అన్ని రకాలయిన; అస్త్రంబులు= ఆయుధాలు; ఏసినన్= ప్రయోగింపగా; అంబరంబు= ఆకాశం; ఆచ్ఛాదితంబు= అంతటా కప్పబడినది; అయ్యెన్= అయింది; వారు= యుధిష్ఠిర దుర్యోధనులు; ఒండొరులన్= ఒకరు మరొకరిని; రక్త= రక్తములయొక్క; ధారా= ధారలచేత; ఆప్లుతులన్= మునిగినవారిని; చేసి= కావించి; పుల్ల= వికసించిన; కింశుక= మోదుగుచెట్టుయొక్క; భంగిన్= విధముగ; పొలిచిరి= ఒప్పినారు; కౌరవపతి= కౌరవరాజైన దుర్యోధనుడు; ఏచి= విజృంభించి; ఘోరశక్తి= భయంకరమైన ఈటెను; వైచెన్= ప్రయోగించాడు; ధర్మనందనుండు= యుధిష్ఠిరుడు; అది= ఆ శక్తిని; నడుమన్= మధ్యనే; తునిమి= నరికి; అమ్మహీశు= ఆ భూపతియొక్క; ఉరమున్= వక్షఃస్థలాన్ని; నిశిత= వాడియయిన; విశిఖ= బాణాలయొక్క; పంచకమునన్= ఐదింటితో; దర్పము= గర్వము; ఎసకమెసఁగన్= వృద్ధిచెందగా; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు యుధిష్ఠిరుడి విల్లు విరుగఁజేశాడు. యుధిష్ఠిరుడు అది లక్ష్యపెట్టక, మరొక ధనుస్సు తీసికొని దుర్యోధనుడి ధనుస్సు ఖండించాడు. అతడు వేరొక ధనుస్సుతో యుధిష్ఠిరుడి మీద బాణాలు ప్రయోగించాడు. యుధిష్ఠిరుడు సకలవిధ బాణాలు ప్రయోగించేసరికి ఆకాశమంతా కప్పువడిపోయింది. యుధిష్ఠిరదుర్యోధను లిద్దరూ ఒకరినొకరు నెత్తుటి ధారలతో ముంచికొని, పూచిన మోదుగుచెట్లవలె ఉన్నారు. దుర్యోధనుడు చెలరేగి ఒక ఈటెను విసిరాడు. యుధిష్ఠిరుడు దానిని మధ్యనే విరుగగొట్టి, ఐదు వాడి బాణాలు దుర్యోధనుడి రొమ్ముపై ప్రయోగించి, గర్వాతిశయంతో దుర్యోధనుడికి బాధ కలిగించాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు కౌంతేయముఖ్యుచేత నొచ్చియు గాంధారీ నందనుండు. 193

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; గాంధారీనందనుండు= గాంధారి కొడుకయిన దుర్యోధనుడు; కౌంతేయముఖ్యుచేతన్= కుంతి కొడుకులలో మొదటివాడైన యుధిష్ఠిరుని చేత; నొచ్చియున్= బాధపడినప్పటికీ.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజుచేత బాధపడినప్పటికీ.

చ. బరవసమొప్పఁ గ్రూరనవభల్లవిదారితుఁ జేసె నమ్మహీ
శ్వరు నతఁ డల్గి బల్పిడుగుచాడ్పు శిలీముఖ ముచ్చిపోవ న
క్కురుపతి నేయఁ గయ్యమునకుం దుది యప్పుడ చేయువాఁడుగా
నరదము డిగ్గె నాతఁడు గదాకలనోద్ధట బాహుదండుఁ డై. 194

ప్రతిపదార్థం: బరవసము= ధైర్యం; ఒప్పన్= తగగా; క్రూర= కఠినమైన; నవ= క్రొత్తదైన; భల్ల= బాణంచేత; ఆ+మహీశున్= ఆ భూపతిని; విదారితున్= చీల్చబడినవానిని; చేసెన్= కావించాడు; అతఁడు= యుధిష్ఠిరుడు; అల్గి= కోపించి; బల్= పెద్ద; పిడుగు చాడ్పు= పిడుగువంటి; శిలీముఖము= బాణం; ఆ+కురుపతిన్= ఆ కౌరవరాజైన దుర్యోధనుని; ఉచ్చిపోవన్= చీల్చుకొని పోయేటట్లుగా; ఏయన్= ప్రయోగింపగా; ఆతఁడు= ఆ దుర్యోధనుడు; గదాకలన= గదతో కూడినది; ఉద్ధత= పైకెత్తబడినది అయిన; బాహు= చేయి అనే; దండుఁడు+ఐ= దండంకలవాడై; కయ్యమునకున్= యుద్ధానికి; తుది= అంతం; అప్పుడు+అ= అప్పుడే; చేయువాఁడుగాన్= చేసేవాడిలా; అరదము= రథం నుంచి; డిగ్గెన్= దిగాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ధైర్యంతో ఒక గట్టి క్రొత్త బాణంతో యుధిష్ఠిరుడిని చీల్చాడు. యుధిష్ఠిరుడు కోపపడి, పెద్ద పిడుగువంటి బాణమొకటి చీరుకొని పోయేటట్లుగా దుర్యోధనుడిపై ప్రయోగించాడు. దుర్యోధనుడు గదతో చేయిపైకెత్తి, యుద్ధం అప్పుడే పూర్తిచేసేవాడివలె రథం నుండి దిగాడు.

క. డిగి రయమునఁ గదిసిన నా । జగతీపతి యేచి యుగ్రశక్తి నురము బె
ట్టుగ వైచిన నీతనయుఁడు । మగుడఁగ రథ మెక్కె వింటమార్కొనువాఁడై. 195

ప్రతిపదార్థం: డిగి= దిగి; రయమునన్= వేగంగ; కదిసినన్= సమీపించగా; ఆ జగతీపతి= ఆ భూపతి యుధిష్ఠిరుడు; ఏచి= విజృంభించి; ఉగ్ర= భయంకరమైన; శక్తిన్= ఈటెతో; ఉరము= వక్షఃస్థలంపై; బెట్టుగన్= గట్టిగా; వైచినన్= కొట్టగా; నీ తనయుఁడు= నీ కొడుకైన దుర్యోధనుడు; వింటన్= ధనుస్సుతో; మార్కొనువాఁడు+ఐ= ఎదిరించేవాడై; మగుడఁగన్= తిరిగి; రథము+ఎక్కెన్= తేరు ఆరోహించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు రథం దిగి, వేగంగ యుధిష్ఠిరుడిని సమీపించాడు. యుధిష్ఠిరుడు చెలరేగి, భయంకరమైన ఒక ఈటెతో గట్టిగా దుర్యోధనుడి రొమ్ముపై పొడిచాడు. అపుడు దుర్యోధనుడు ధనుస్సును ధరించి, పోరాడాలని మళ్ళీ రథమెక్కాడు.

దుర్యోధనుఁడు ధర్మజునితో యుద్ధముచేసి మూర్ఛిల్లుట (సం. 8-20-30)

క. అత్తఱిఁ గడుఁ బెల్లుగఁ గ్రొ । న్నెత్తురు వడియుటయు నతఁడు నిర్భరమూర్ఛా
యత్తుఁడగుడుఁ గృతవర్ముఁ డు । దాత్తత నెడసొచ్చె బాహుదర్పము నెఱయన్. 196

ప్రతిపదార్థం: అత్తఱిన్= ఆ సమయంలో; కడున్= మిక్కిలి; పెల్లుగన్= అధికంగా; క్రొత్త+నెత్తురు= క్రొత్తరక్తం; వడియుటయున్= స్రవించినందువల్ల; అతఁడు= దుర్యోధనుడు; నిర్భర= నిండు; మూర్ఛాయత్తుఁడు= చొక్కుకు లొంగినవాడు; అగుడున్= కాగా; కృతవర్ముఁడు= కృతవర్మ; ఉదాత్తతన్= గొప్పదనంతో; బాహు దర్పము= చేతుల గర్వం; నెఱయన్= నిండగా; ఎడ= వారిద్దరి నడుమను; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: ఆ సమయంలో క్రొత్త నెత్తురు జాలువారింది. అందువలన దుర్యోధనుడు మూర్ఛిల్లాడు. అపుడు కృతవర్మ నిండు భుజగర్వంతో ఉదాత్తంగా యుధిష్ఠిరదుర్యోధనుల మధ్య ప్రవేశించాడు.

ఉ. ఆతనిఁ దాఁకె వీఁక ననిలాత్మజుఁ డప్డు బలంబు మారుతో
ద్ధూతపయోధివోలె వడిఁ దోడ్పడియెం గృతవర్మ కంత ను
ద్ద్యోతితభంగి వచ్చి విజయుండు వెసం దునుమాడె లీలమైఁ
జేతులతీఁటవోవ రథసింధురవాజి భటోత్కరంబులన్. 197

ప్రతిపదార్థం: అనిల+ఆత్మజుఁడు= వాయుపుత్రుడైన భీముడు; వీఁకన్= శౌర్యంతో; ఆతనిన్= కృతవర్మను; తాఁకెన్= ఎదిరించాడు; అప్డు= అపుడు; బలంబు= కౌరవసైన్యం; మారుత= వాయువుచేత; ఉద్ధూత= లెస్సగా కదలిన; పయోధివోలెన్= సముద్రంలా; వడిన్= వేగంతో; కృతవర్మకున్= హృదికుని కుమారుడైన యాదవవీరునికి; తోడ్పడియెన్= సాయపడింది; అంతన్= అంతలో; విజయుండు= అర్జునుడు; ఉత్+ద్యోతిత భంగిన్= ప్రకాశించే విధానంతో; వెసన్= వేగంతో; వచ్చి= అక్కడకు చేరి; లీలమైన్= విలాసంతో; చేతుల= బాహువులయొక్క; తీఁట= దురద; పోవన్= పోయేటట్లుగా; రథ= రథాలు; సింధుర= ఏనుగులయొక్క; వాజి= గుర్రాలయొక్క; భట= కాలిబంటులయొక్క; ఉత్కరంబులన్= సమూహాలను; తునుము+ ఆడెన్= నరికాడు.

తాత్పర్యం: భీమసేనుడు శౌర్యంతో కృతవర్మను డీకొన్నాడు. అపుడు కౌరవసైన్యం ప్రచండ వాయువుకు కదిలిన సముద్రంవలె వేగంతో కదిలి కృతవర్మకు సాయపడింది. అంతలో అక్కడికి వేగంతో వెలిగిపోతూ వచ్చాడు అర్జునుడు. వచ్చి, విలాసంగా చేతుల దురదపోయేటట్లు రథ గజ తురగ పదాతి చతుర్విధ సైన్యాలనూ సంహరించాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. అంత. 198

ప్రతిపదార్థం: అంతన్= తరువాత.

తాత్పర్యం: తరువాత.

క. కురుపతి దెప్పిఱి బాహు। స్ఫురణంబు దలిర్ప నింద్రజుని మార్కొని ని
ష్ఠురవివిధవిశిఖవినిహత। శరీరుఁ జేయుటయు నతఁడు సక్రోధుండై. 199

ప్రతిపదార్థం: కురుపతి= కురువంశపు రాజైన దుర్యోధనుడు; తెప్పిఱి= తేరుకొని; బాహుస్ఫురణంబు= చేతుల తేజస్సు; తలిర్పన్= ఒప్పగా; ఇంద్రజునిన్= ఇంద్ర పుత్రుడైన అర్జునుని; మార్కొని= డీకొని; నిష్ఠుర= కఠినమైన; వివిధ= రకరకాలైన;

విశిఖ= బాణాలచేత; వినిహత= ఎక్కువగా కొట్టబడిన; శరీరున్= దేహంకలవాడిని; చేయుటయున్= చేసినందువల్ల; అతఁడు= అర్జునుడు; సక్రోధుండు+ఐ= క్రోధంతో కూడి ఉన్నవాడయి.

తాత్పర్యం: దుర్యోధనుడు మూర్ఛనుండి తేరుకొన్నాడు. చేతులబలం ప్రకటమయ్యేరీతిగా అర్జునుడిని, ఎదుర్కొని అతడిని కఠినమైన రకరకాల బాణాలతో గాయపరచాడు. దానితో అర్జునుడికి బాగా కోపం వచ్చింది.

తే. **కార్ముకముఁ గేతువును ఘోటకముల సూతు । వెడఁదబలుతూపులేడింటఁ బుడమిఁ గూల్చి**
భల్ల మొక్కట నతని పెన్విల్లు దునిమి । ప్రాణముల్ గొనఁ జాలెడు బాణమేసె. **200**

ప్రతిపదార్థం: కార్ముకమున్= ధనుస్సును; కేతువును= జెండాను; ఘోటకములన్= గుర్రాలనూ; సూతున్= సారథినీ; వెడఁద= వెడల్పైన; బలు= పెద్దవైన; తూపులు= బాణాలు; ఏడింటన్= ఏడింటితో; పుడమిన్= భూమిపై; కూల్చి= పడగొట్టి; భల్లము= బాణం; ఒక్కటన్= ఒకదానితో; అతని= దుర్యోధనునియొక్క; పెన్విల్లు= పెద్ద ధనుస్సు; తునిమి= ఖండించి; ప్రాణముల్= ప్రాణాలు; కొనఁజాలెడు= తీసికొనటానికి సమర్థమైన; బాణము+ఏసెన్= బాణము ప్రయోగించాడు.

తాత్పర్యం: విల్లును, జెండాను, నాలుగు గుర్రాలను, సారథిని- ఏడు బాణాలతో అర్జునుడు పడగొట్టాడు. ఒక బాణంతో అతడి మహాధనుస్సు విరగగొట్టాడు. తరువాత అతడి ప్రాణాలు తీయగలిగిన బాణం ఒకటి ప్రయోగించాడు.

క. **కని యాఱమ్ముల నెడ నది । దునియలు గావించె గురుసుతుం డాతని వి**
ల్లును హరులఁ దునిమి పార్థుఁడు । దను మార్కొను కృపుని చాపదండము ద్రుంచెన్. **201**

ప్రతిపదార్థం: గురుసుతుండు= గురువైన ద్రోణుని పుత్రుడైన అశ్వత్థామ; అది= ఆ బాణాన్ని; కని= చూచి; ఆఱు+అమ్ములన్= ఆరుబాణాలతో; ఎడన్= కొంతదూరంలో ఉండగానే; తునియలు= ముక్కలు; కావించెన్= చేశాడు; పార్థుఁడు= అర్జునుడు; అతని= అశ్వత్థామయొక్క; విల్లును= ధనుస్సును; హరులన్= గుర్రాలను; తునిమి= ఖండించి; తనున్= అర్జునుడైన తనని; మార్కొని= ఎదిరించే; కృపుని= కృపాచార్యునియొక్క; చాపదండము= వింటిబద్దను; త్రుంచెన్= నరికాడు.

తాత్పర్యం: అశ్వత్థామ దానిని చూచి, ఇంకా దుర్యోధనుడిని అది తాకే ఎడముండగానే ఆరు బాణాలు ప్రయోగించి, దానిని ముక్కలు చేశాడు. అర్జునుడు అశ్వత్థామ ధనుస్సును ఖండించి, గుర్రాలను సంహరించాడు. తన మీదికి కృపాచార్యుడు వస్తే అతడి ధనుస్సును కూడ ఖండించాడు.

చ. **వడిఁ గృతవర్మ దాఁకిన నవారణఁ దద్ధనువున్ హయంబులున్**
సిడమును రూపుమాపి విలసిల్లి యెదిర్చిన దుస్ససేనువిల్
నడిమికిఁ ద్రుంచి గాండివగుణధ్వని దిక్కులు పిక్కటిల్ల నె
క్కుడు మదమొప్పఁ గర్ణుదెసకుం జన నా రథికుం డుదగ్రుఁడై. **202**

ప్రతిపదార్థం: వడిన్= వేగంతో; కృతవర్మ; తాఁకినన్= డీకొనగా; అవారణన్= ఆపులేకుండా; తద్+ధనువున్= అతడి విల్లునూ; హయంబులున్= గుర్రాలనూ; సిడమును= జెండానూ; రూపుమాపి= నాశనంచేసి; విలసిల్లి= ఒప్పి; ఎదిర్చిన= తనను మార్కొనిన; దుస్ససేను= దుశ్శాసనుని; విల్= ధనుస్సును; నడిమికిన్= సగానికి; త్రుంచి= ఖండించి; గాండివ= (తన ధనుస్సు అయిన) గాండీవం యొక్క; గుణ= అల్లెత్రాటియొక్క; ధ్వనిన్= చప్పుడువల్ల; దిక్కులు= దిశలు; పిక్కటిల్లన్=

పగులగా; ఎక్కుడు= అధికమైన; మదము= గర్వం; ఒప్పన్= ఒప్పి ఉండగా; కర్ణుదెసకున్= కర్ణుడివైపు; చనన్= వెళ్ళగా; ఆ రథికుండు= ఆ రథికుడైన కర్ణుడు; ఉదగ్రుండు+ఐ= భయంకరుడై.

తాత్పర్యం: వేగంతో కృతవర్మ అర్జునుడిని ఎదిరించాడు. అర్జునుడు అతడి ధనుస్సునూ, జెండానూ త్రుంచాడు. గుర్రాలను చంపాడు. దుశ్శాసనుడు ఎదిరిస్తే అతడి ధనుస్సును సగానికి ఖండించాడు. దిక్కులు పిక్కటిల్లేటట్లుగ గాండీవ ధనుష్టంకారం చేసి, గర్వాతిశయంతో కర్ణుడివైపు వెళ్ళగా, ఆ కర్ణుడు కోపోద్రిక్తుడై.

క. **అన్నరుని మూఁడు శరముల । వెన్నుని నిరువదినిశాతవిశిఖముల వెసన్**
భిన్నాంగులఁ జేసి విజయు । మున్నేసినయన్ని బాణముల బిట్టేసెన్. 203

ప్రతిపదార్థం: ఆ+నరునిన్= ఆ అర్జునుని; మూడు శరములన్= మూడు బాణాలతోనూ; వెన్నునిన్= శ్రీకృష్ణుని; ఇరువది= ఇరవై; నిశాత= పదునైన; విశిఖములన్= బాణాలతోనూ; వెసన్= వేగంగా; భిన్న= చీరిన; అంగులన్= అవయవములు కలవారినిగా; చేసి; విజయున్= అర్జునుని; మున్ను= ఇదివరకు; ఏసిన= ప్రయోగించిన; అన్ని బాణములన్= అన్ని అమ్ములతో; బిట్టు+ఏసెన్= గట్టిగా కొట్టాడు.

తాత్పర్యం: అర్జునుడిని మూడు బాణాలతోనూ, కృష్ణుడిని ఇరవై పదునైన బాణాలతోనూ, వేగంగా వారి అవయవాలు చీలిపోయేటట్లుగ కర్ణుడు కొట్టాడు. అర్జునుడిని ఇదివరకు కొట్టినన్ని బాణాలతో గట్టిగా కొట్టాడు.

వ. **అంతకు మున్ను సాత్యకితోడం బోరిపోరి యారాధేయుండు దనదెస కడరిన కవ్వడిం గని యక్కడ మొగం బయి యిటుపరాక్రమించినం జూచి యేచి యా సవ్యసాచి కడ్డపడి యక్కేశవానుజుండు. 204**

ప్రతిపదార్థం: అంతకున్= అది జరగటానికి; మున్ను= ముందు; ఆ రాధేయుండు= ఆ కర్ణుడు; సాత్యకి తోడన్; పోరిపోరి= మిక్కిలి పోరాడి; తన దెసకున్= తనవైపు; అడరిన= విజృంభించిన; కవ్వడిన్= రెండు చేతులతోనూ బాణప్రయోగం చేసే వేగంగల అర్జునుని; కని= చూచి; అక్కడన్= ఆ అర్జునుడి వైపు; మొగంబు+అయి= ముఖంపెట్టి; ఇటు= తన (సాత్యకి) వైపు; పరాక్రమించినన్= విక్రమం చూపుతుండగా; చూచి= కనుగొని; ఆ+కేశవ+అనుజుండు= ఆ కృష్ణుడికి తమ్ముడి వరుసవాడైన సాత్యకి; ఏచి= విజృంభించి; ఆ సవ్యసాచికిన్= కర్ణుడితో పోరాడుతున్న ఆ అర్జునుడికి; అడ్డుపడి= అడ్డంవచ్చి.

తాత్పర్యం: అంతకు ముందు చాలసేపు సాత్యకితో పోరాడుతున్న కర్ణుడు, తన మీదికి అర్జునుడు విజృంభించి రావటం చూచాడు. అర్జునుడివైపు ముఖంపెట్టి, ఇటు తన మీద పరాక్రమాన్ని చూపటం సాత్యకి గమనించి, అర్జునుడి మీదికి కర్ణుడు పూర్తిగా విజృంభించకుండా తాను అడ్డుపడ్డాడు.

తే. **నవతిశరముల నవమార్గణముల శత శి । లీ ముఖంబుల నేసి దోర్లీల మెఱయ**
సారథి ధ్వజహయరథసహితముగ ను । దీర్ణదర్పుఁడై కప్పె నక్కర్ణుఁ డధిప! 205

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; నవతి= తొంభై; శరములన్= బాణాలతోనూ; నవమార్గణములన్= తొమ్మిది; అమ్ములతోనూ; శత శిలీ ముఖంబులన్= వంద బాణాలతోనూ; ఏసి= కొట్టి; దోర్లీలన్= బాహువిలాసంతో; మెఱయన్= ప్రకాశింపగా; ఆ+కర్ణుఁడు= ఆ అంగరాజు; ఉదీర్ణ= గొప్పదైన; దర్పుఁడై= గర్వంకలవాడై; సారథి= సూతుడితో; ధ్వజ= జెండాతో; హయ= గుర్రాలతో; రథ= తేరితో; సహితముగన్= సమేతముగా; కప్పెన్= సాత్యకిని మరుగుపరిచాడు.

తాత్పర్యం: రాజా! కర్ణుడు విజృంభించిన గర్వంతో, తన బాహుబల విలాసం ప్రకాశించేటట్లుగా, నూటతొంబది తొమ్మిది బాణాలతో సాత్యకిని, సూతుని, జెండాను, గుర్రాలను, రథాన్ని కప్పివేశాడు.

వ. అప్పుడు యుధామన్యుండును శిఖండియు ద్రౌపదేయులు నుత్తమౌజుండును యుయుత్సుండును గవలును ధృష్టద్యుమ్నుండును జేకితానుండును బ్రభద్రకచేది కరూశ మాత్స్య కేకయవత్సబలసమేతంబుగా ధర్మనంద నోత్సాహదీపితాటోపశోభితులయి కవిసి వివిధాస్త్రశస్త్ర వాతము లూసూత సూనుపయి నడరించిన నవ్వీరుండు. 206

ప్రతిపదార్థం: అప్పుడు; యుధామన్యుండును= అర్జునుని ఎడమచక్రాన్ని కాపాడే పాంచాల రాజకుమారుడు; శిఖండియున్= శిఖండి అనే ద్రౌపది అన్నగారు; ద్రౌపదేయులున్= ద్రౌపది కుమారులయిన ఉపపాండవులూ; ఉత్తమౌజుండును= అర్జునుని కుడిచక్రాన్ని కాపాడే పాంచాలయోధుడు; యుయుత్సుండును= ధృతరాష్ట్రుని వైశ్యపత్నీ పుత్రుడు; కవలును= నకుల సహదేవులూ; ధృష్టద్యుమ్నుండును; చేకితానుండును; ప్రభద్రక చేది కరూశ, మాత్స్య కేకయ వత్స బల సమేతంబుగాన్= ప్రభద్రకం, చేది, కరూశం, మాత్స్యం కేకయం వత్సం- అనే దేశాల; బల= సైన్యాలతో; సమేతంబుగాన్= సహితంగా; ధర్మనందన= ధర్మపుత్రునియొక్క; ఉత్సాహ= ప్రయత్నంచేత; దీపిత= వెలిగిన, పెరిగిన; ఆటోప= విజృంభణంచేత; శోభితులు+ అయి= విలసిల్లుతున్నవారై; కవిసి= ఎదుర్కొని; వివిధ= రకరకములైన; అస్త్ర= మంత్రప్రయుక్తాలైన ఆయుధాలయొక్క; శస్త్ర= బలంతో ప్రయోగించే ఆయుధాలయొక్క; వ్రాతములు= గుంపులు; ఆ సూత సూనుపయిన్= ఆ కర్ణుడి మీద; అడరించినన్= ప్రయోగించగా; ఆ+వీరుండు= ఆ శూరుడైన కర్ణుడు.

తాత్పర్యం: ఆ సమయంలో యుధామన్యుడు, శిఖండి, ద్రౌపది కుమారులూ, ఉత్తమౌజుడూ, యుయుత్సుడూ, నకుల సహదేవులూ, ధృష్టద్యుమ్నుడూ, చేకితానుడూ, ప్రభద్రక, చేది, కరూశ, మాత్స్య కేకయ వత్స - దేశాల సైన్యాలతో కలిసి, యుధిష్ఠిరుడి ప్రోత్సాహంతో విపరీతంగా విజృంభించి కర్ణుడిని ఎదిరించి, పలురకాల అస్త్రాలనూ, ఆయుధాలనూ అతడిమీద ప్రయోగించారు. అపుడు ఆ కర్ణుడు.

మ. అవి వేగంబ మరల్చి భూరిపవనవ్యాపారనిర్మర్దితా
టవులం బోలఁగఁ జేసి దంతిభటఘోటస్యందనశ్రేణులన్
దివిజవ్రాతము పిచ్చలింప రభసోద్రేకంబు రౌద్రంబుఁ బెం
ప విజృంభించె ధనుర్గుణధ్వని నభోభాగంబు భేదింపఁగన్. 207

ప్రతిపదార్థం: అవి= ఆ శస్త్రాలను; వేగంబు+అ= వెంటనే; మరల్చి= మరలించి; దంతి= ఏనుగులయొక్క; భట= కాలిబంటులయొక్క; ఘోట= గుర్రాలయొక్క; స్యందన= రథాలయొక్క; శ్రేణులన్= వరుసలను; భూరి= పెద్ద; పవన= గాలియొక్క; వ్యాపార= వీచటంచేత; నిర్మర్దిత= నలగగొట్టబడిన; అటవులన్= అడవులకు; పోలఁగన్= సాటిఅయ్యేటట్లు; చేసి= కావించి; దివిజ= స్వర్గంలో జన్మించినవారైన దేవతలయొక్క; వ్రాతము= సమూహం; పిచ్చలింపన్= భయపడగా; రభస+ఉద్రేకంబు= త్వరయొక్క విజృంభణం; రౌద్రంబున్= (పగవారితో) కోపాన్ని; పెంపన్= వృద్ధిచేయగా; ధనుః= వింటియొక్క; గుణ= అల్లెత్రాటియొక్క; ధ్వని= మ్రోత; నభః= ఆకాశపు; భాగంబున్= ప్రదేశాన్ని; భేదింపన్= బ్రద్దలుచేయగా; విజృంభించెన్= చెలరేగాడు.

తాత్పర్యం: ఆ ఆయుధాలనన్నిటినీ కర్ణుడు వెంటనే త్రిప్పికొట్టాడు. రథ గజ తురగ పదాతి చతురంగ సైన్యాన్ని పెనుగాలి తాకిడికి కూలిపోయిన అడవులకు సాటిగా చేశాడు. అది చూచి (తమకు శత్రుపక్షంవాడైన కర్ణుడెక్కడ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గెలుస్తాడో అని) దేవతలు భయపడిపోయారు. అతడు ధనుష్టంకారం చేస్తూ ఉంటే దాని ధ్వనికి ఆకాశం బ్రద్దలై పోయింది. అట్లా అతడు విజృంభించాడు.

మ. కని గాండీవధరుండు దర్ప మెసఁగం గర్ణాస్త్రజాలంబు నీ
సున వారించి శిలీముఖార్చులు పరిస్ఫూర్జత్ప్రభం బర్వఁ బే
ర్చినఁ గార్చి చ్చడరన్ మృగంబులు భయోద్రేకంబునం బాఱు చా
డ్పున నీమూఁకలు నల్గడం బఱచె నుద్భూతభ్రమార్తంబులై. 208

ప్రతిపదార్థం: గాండీవ ధరుండు= గాండీవమనే ధనుస్సును ధరించిన అర్జునుడు; కని= కర్ణ విజృంభణంచూచి; దర్పము= గర్వం; ఎసఁగన్= వృద్ధికాగా; కర్ణ= కర్ణునియొక్క; అస్త్ర= ఆయుధాలయొక్క; జాలంబున్= సముదాయాన్ని; ఈసునన్= కోపంతో; వారించి= ఆపి; శిలీముఖ= బాణాలయొక్క; అర్చులు= కాంతులు; పరిస్ఫూర్జత్= భగభగలాడే; ప్రభన్= కాంతితో; పర్వన్= వ్యాపించగా; పేర్చినన్= విజృంభించగా; కార్చిచ్చు= దావానలం; అడరన్= చెలరేగగా; మృగంబులు= లేళ్ళు మొదలయిన అడవి జంతువులు; భయ= జడుపుయొక్క; ఉద్రేకంబునన్= ఆధిక్యంతో; పాఱు= పరిగెత్తే; చాడ్పునన్= పోలికతో; నీ మూఁకలు= నీ గుంపులు - కౌరవసైన్యాలు; ఉద్భూత= కలిగిన; భ్రమ= తిరుగుడువడుటచేత; ఆర్తంబులై= దుఃఖంతో పీడించబడినవై; నల్గడన్= నాలుగు దిక్కులకూ; పఱచెన్= పరుగుపెట్టాయి.

తాత్పర్యం: అర్జునుడు అది చూచి, కోపించి గర్వంతో విజృంభించి, కర్ణుడు ప్రయోగించిన ఆయుధాలు ఆపు చేశాడు. బాణప్రభలు భగభగలాడుతూ వ్యాపిస్తుండగా, అతిశయించిన దావానలం అలముకొనేసరికి మహాభయంతో పారిపోయే అడవిమృగాలవలె, కౌరవసేనలు తిరుగుడువడి బాధపడుతూ అన్ని వైపులకూ పరుగులు పెట్టాయి.

వ. అంత నంశుమంతుం డపరగిరియవులకుం జనుటయు ధరాధూళికిఁ దోడు సంధ్యారాగ మిళితంబైన తిమిరంబు గవిసిన నెద్దియుం గానరామిం జిత్తంబులు గలంగ రాత్రి యుద్ధంబునకు నోహటించుటంజేసి మన దొరలఁ బాండవసైనికులు దఱిమినం దాల్మి వాటింపక తిరిగిపోయిరి. జయంబుసేకొని వీరి నవ్వుచు వారు గవ్వడిం గమలనాభునిం బ్రశంసించుచుం జని రవ్విధంబున నుభయసైన్యంబులు నిజశిబిరంబుల కరిగి విశ్రామంబు నొందె' నని చెప్పుటయు సంజయునకు ధృతరాష్ట్రుం డిట్లనియె. 209

ప్రతిపదార్థం: అంతన్= అంతలో; అంశుమంతుండు= సూర్యుడు; అపరగిరి= పడమటికొండయొక్క; అవులకున్= అవతలివైపు; చనుటయున్= వెళ్ళినందువల్ల; ధరాధూళికిన్= నేల దుమ్ముకు; తోడు= సాయం; సంధ్యా= పగటికీ రాత్రికీ నడిమివేళలోని; రాగ= ఎరుపుతో; మిళితంబు+ఐన= కలిసినట్టి; తిమిరంబు= చీకటి; కవిసినన్= అలముకోగా; ఎద్దియున్= ఏ వస్తువూ ప్రాణీ దిక్కూ ఎత్తు పల్లము మొదలైనవి; కానరామిన్= చూడశక్యం కాకపోవటంవల్ల; చిత్తంబులు= మనస్సులు; కలంగన్= కలతచెందగా; రాత్రి యుద్ధంబునకున్= రాత్రివేళచేసే పోరాటానికి; ఓహటించుటన్+చేసి= వెనుదీసినందువల్ల; మన దొరలన్= మనరాజులను, పాండవసైనికులు; తఱిమినన్= పారిపోయేవారిని వెంబడించి తరుమగా; తాల్మి= ధైర్యము; పాటింపక= (మనదొరలు) వహింపక; తిరిగి= వెనుదిరిగి; పోయిరి= పారిపోయారు; జయంబు= గెలుపు; చేకొని= తీసికొని; వారు= పాండవసైనికులు; వీరిన్= మన దొరలను గురించి; నవ్వుచున్= పరిహాసం చేస్తూ; కవ్వడిన్= అర్జునుడినీ; కమలనాభునిన్= కృష్ణుడినీ; ప్రశంసించుచున్= పొగడుతూ; చనిరి= వెళ్ళారు; ఆ+విధంబునన్= అట్లా; ఉభయసైన్యంబులు= కౌరవ పాండవుల రెండు

సేనలు; నిజ= తమ తమ; శిబిరంబులకున్= దండువిడిసిన చోటులకు; అరిగి= వెళ్ళి; విశ్రామంబున్= విశ్రాంతిని; ఒందెన్= పొందాయి; అని= ఈ ప్రకారం; చెప్పుటయున్= చెప్పగా; సంజయునకున్= సంజయునితో; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు; ఇట్లు= ఇలా; అనియెన్= పలికినాడు.

తాత్పర్యం: అంతలో ప్రొద్దు క్రుంకింది. నేలమీది నుంచి లేచిన దుమ్ముకు సాయంకాలపు సంధ్యాసమయంలోని ఎరుపుతో కలిసిన చీకటి తోడై అలముకొన్నది. అందువలన కనులు కనిపించటం మానేశాయి. కనుక మన దొరల మనస్సులు కలతచెందాయి. అందుచేత వారు రాత్రి యుద్ధానికి వెనుదీశారు. దాని కారణంగా పాండవసైనికులు వారిని తరిమికొట్టారు. అపుడైనా వారు ధైర్యంతో నిలబడక, పారిపోయారు. అట్లా కర్ణుడి మొదటినాటి యుద్ధంలో గెలుపు పాండవసైనికుల దయింది. అందువలన వారు మన దొరలను వేళాకోళంచేస్తూ, అర్జునుడినీ, కృష్ణుడినీ పొగడుతూ, వెళ్ళిపోయారు. అట్లా రెండు సైన్యాలూ తమ విడిదిపట్లకు వెళ్ళి విశ్రాంతి తీసికొన్నాయి - అని చెప్పేసరికి ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు:

ఉ. 'తెల్లము మిమ్ము నందఱ వధింపఁగ నయ్యమరేంద్రనందనుం
డొల్లక పోక వాఁడు దన యుగ్రత సూపెద నన్న మీమహీ
వల్లభు వారి కేల? యమవహ్నుల కైనను రూపుతోడఁ బోఁ
జెల్లదు గాన తద్భుజవిశేషము రూఢము గాదె సంజయా! 210

ప్రతిపదార్థం: సంజయా!= ఓ సంజయా! ఆ= ప్రసిద్ధుడైన; అమరేంద్ర నందనుండు= దేవేంద్ర పుత్రుడైన అర్జునుడు; మిమ్మున్= దుర్యోధనుని పక్షంవారిని; అందఱన్= ఎల్లరినీ; వధింపఁగన్= చంపటానికి; ఒల్లక= ఇష్టపడక; పోక= వెళ్ళిపోవటం; తెల్లము= స్పష్టమవుతున్నది; వాఁడు= ఆ అర్జునుడు; తన+ఉగ్రతన్= తన తీక్ష్ణత్వాన్ని; చూపెదన్= చూపిస్తాను; అన్నన్= అనుకొనిన పక్షంలో; మీ మహీవల్లభువారికిన్+ఏల?= మీ భూపతి, దుర్యోధనుడి పక్షంవారికే అనటం ఎందుకు?; యమవహ్నులకున్+ఐనను= యముడికీ, అగ్నికీ ఐనప్పటికీ; రూపుతోడన్= దేహంతో; పోన్= తిరిగి ఇంటికి వెళ్ళటానికి; చెల్లదు= శక్యంకాదు; కాన= అందువల్ల; తద్+భుజవిశేషము= అతని బాహువులయొక్క ప్రత్యేకత; రూఢము+కాదు+ఎ!= ప్రసిద్ధం కాదా!.

తాత్పర్యం: 'ఓ సంజయా! ఇప్పుడు నీవు చెప్పిన దానినిబట్టి అర్జునుడు దుర్యోధనుడివైపువారినందరినీ నాడే చంపటం ఇష్టంలేక తిరిగివెళ్ళిపోయాడు కాని, వాడు ఆనాడే తన శక్తిని పూర్తిగా చూపించదలచుకొంటే, దుర్యోధనుడే కాదు - యముడూ, అగ్నీకూడా తిరిగి తమ శరీరాలతో ఇళ్ళకు వెళ్ళలేరు. అతడి బాహుబలంయొక్క విశిష్టత సందేహం లేకుండా రూఢి అయింది కదా.

విశేషం: అర్జునుడు అమరేంద్ర నందనుడు, దుర్యోధనుడు భూపతి మాత్రుడు అనటం చేతనే అర్జునుడి విశిష్టత స్పష్టం అవుతున్నది. యమవహ్నులకైనా అని పేర్కొనటం సాభిప్రాయం. అందరి ప్రాణాలు తీసేవాడు యముడు. ఎవరినైనా దేనినైనా కాల్చగలవాడు వహ్ని. వారికి కూడా స్వశరీరాలతో తిరిగి వెళ్ళటం అశక్యం అనటం అర్జునుని పరాక్రమానికీ ధృతరాష్ట్రుడి నైరాశ్యానికీ నిదర్శనం.

సీ. **యాదవ వీరచయంబు నాటోప స । ముద్రేక ముడిపి సుభద్రఁ దెచ్చె**
ఖాండవం బాహుతిగా లీల నొనరించి । సప్తార్చి నత్యంత తృప్తుఁ జేసె
శబరవేషముఁ దాల్చి చనుదెంచి తొడరిన । శివునితోఁ బెనఁగి మెచ్చించె నతని
గంధర్వుచేఁ బడ్డ కౌరవసత్తము । విడిపించె లావును వెరవు మెఱయఁ

ఆ. **గాలకేయకులముఁ గాలునిప్రోలికి । ననిచె నఖిల నృపుల ననికి నియ్య**
కొలిపెఁ గ్రీడి జగము గొనియాడ నేక కో । దండ చండ విలసితమునఁ గాదె! **211**

ప్రతిపదార్థం: క్రీడి= కిరీటి, అర్జునుడు; జగము= లోకం; కొనియాడన్= పొగడగా; ఏక= ఒక్క; కోదండ= ధనుస్సుయొక్క; చండ= తీక్ష్ణమైన; విలసితమునన్+కాదె!= విలాసంచేతగదా!; యాదవ= యదువంశీయులైన; వీర= వీరులయొక్క; చయంబు= సమూహంయొక్క; ఆటోప= వేగిరంతోకూడిన; సముద్రేకము= పూర్తి క్రోధాన్ని; ఉడిపి= పోగొట్టి; సుభద్రన్= కృష్ణుడి చెల్లెలిని; తెచ్చెన్= (బలరామాదుల సమ్మతిలేకుండా) తీసుకొని వచ్చాడు; ఖాండవంబు= ఖాండవవనాన్ని; లీలన్= విలాసంతో; ఆహుతి+కాన్= హోమద్రవ్యం అయ్యేటట్లు; ఒనరించి= చేసి; సప్త+అర్చిన్= ఏడు జిహ్వాలుగల అగ్నిని; అతి+అంత= మిక్కిలి; తృప్తున్= తనివి చెందినవాడిని; చేసెన్= కావించాడు; శబర= కిరాతునియొక్క; వేషమున్= రూపాన్ని; తాల్చి= ధరించి; చను+తెంచి= వచ్చి; తొడరిన= ఎదిరించిన; శివునితోన్= శంకరుడితో; పెనఁగి= పోరాడి; అతనిన్= శంకరుని; మెచ్చించెన్= మెచ్చుకొనజేశాడు; గంధర్వు= గంధర్వుడైన చిత్రసేనునియొక్క; చేపడ్డ= చేతిలో పడిన, కౌరవసత్తమున్= కౌరవశ్రేష్ఠుడైన దుర్యోధనుడిని; లావును= బలము; వెరవున్= ఉపాయము; మెఱయన్= ప్రకాశించేటట్లు; విడిపించెన్= విముక్తుడిని చేశాడు; కాలకేయకులమున్= కాలకేయులనే రాక్షసవంశాన్ని; కాలుని ప్రోలికిన్= యముని పట్టణానికి; అనిచెన్= పంపించాడు, సంహరించాడు; అఖిల నృపులన్= సమస్తమైన రాజులను; అనికిన్= యుద్ధానికి; ఇయ్యకొలిపెన్= అంగీకరింపజేశాడు.

తాత్పర్యం: అర్జునుడు ప్రపంచమంతా మెచ్చుకొనేటట్లు తన ఒక్క ధనుస్సు ఆధారంగానే కదా! - యాదవవీరుల విజృంభణం తగ్గించి సుభద్రను తీసికొని వచ్చాడు, ఖాండవవనాన్ని అవలీలగా హవిస్సువలె దహింపజేసి అగ్నిని పూర్తిగా సంతృప్తిపరచాడు, ఈశ్వరుడు కిరాతరూపంలో వచ్చి డీకొంటే అతడితో యుద్ధంచేసి అతడి మెప్పు పొందాడు, చిత్రసేనుడనే గంధర్వుడికి బందీ అయిన దుర్యోధనుడిని తన బలంతో, ఉపాయంతో విడిపించాడు, కాలకేయరాక్షసవంశాన్ని సంహరించాడు, రాజులనందరినీ యుద్ధాని కంగీకరింపజేశాడు!

విశేషం: నిజానికి పాండవులమీద అసూయ కల ధృతరాష్ట్రుడు అర్జునుడిని ప్రశంసించిన తీరు సత్యమై అతడి పరాక్రమానికి పెద్ద నిష్పాక్షికమైన సాక్ష్యంగా ఉన్నది, కర్ణార్జునుల తారతమ్యాన్ని తెలుపుతున్నది. కర్ణుడు యాదవులను గెలువలేదు - అర్జునుడు గెలిచాడు. యాదవుల సుభద్రను వారి అభిప్రాయానికి వ్యతిరేకంగా అర్జునుడు తీసికొనిరాగలిగితే, కర్ణుడు దుర్యోధనుడి కూతురిని సాంబుడితో సహా బలరాముడికి జడిసి వారికి అప్పగించవలసి వచ్చింది. శివుడిని మెప్పించటం కర్ణుడిపట్ల కాని, మరే కౌరవులలోకాని లేదు. కర్ణుడితో సహా కౌరవవీరులను ఓడించిన గంధర్వుడు చిత్రసేనుడిని, అర్జునుడు శక్తియుక్తు లుపయోగించి, గెలిచి, దుర్యోధనుడిని విడిపించాడు. కాలకేయుల వంశాన్ని నశింపజేయటం దేవతలకు కూడా అలవికానిది - అర్జునుడు సాధించాడు. ఇట్టిపని కౌరవుల పక్షంలో చేసినవాడు లేడు. కనుక అర్జునుడి చేతిలో ఓటమి లజ్జావహం కాదని తరువాతి వచనంలో ధృతరాష్ట్రుడనటం ఎట్లా చూచినా సమంజసమే.

వ. **కావున మనవారికి నోటమి యక్కిరీటి వలనం గలిగె నను కలుచ వారి గర్వింపం దగ దట్టి జెట్టితోడం బెనంగుటఁ బ్రశంసకుందగుదురు పదంపడి వారేమిసేసి' రనిన ధృతరాష్ట్రునకు సంజయుం డిట్లనియె.** **212**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కావునన్= అందువల్ల; మనవారికిన్= మనపక్షంవారికి; ఓటమి= అపజయం; ఆ+కిరీటివలనన్= అటువంటి అర్జునుడివలన; కలిగెన్= సంభవించింది; అను= అనే; కలుచన్= కలతవల్ల; వారిన్; గర్హింపన్= నిందించటం; తగదు= యుక్తంకాదు; అట్టి= అటువంటి, అంతటి; జెట్టితోడన్= శూరుడితో; పెనంగుటన్= యుద్ధంచేసినందువల్ల; ప్రశంసకున్= పొగడ్తకు; తగుదురు= అర్హులు; పదంపడి= తరువాత; వారు= కౌరవులు; ఏమి; చేసిరి; అనినన్= అని అడుగగా; ధృతరాష్ట్రునకు(న్)= ధృతరాష్ట్ర మహారాజుతో; సంజయుడు; ఇట్లు; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అందువలన అంతటి అర్జునుడివలన మనవారు ఓడిపోయారన్న కలతతో వారిని నిందించటం యుక్తం కాదు. అంతటి శూరుడితో యుద్ధంచేశారంటేనే ప్రశంసించదగిన విషయం. ఆ తరువాత మనవారేమి చేశారో చెప్పుము'. అని అడిగేసరికి, సంజయుడు ధృతరాష్ట్రమహారాజుతో క్రిందివిధంగా చెప్పుతున్నాడు.

ఆ. **అట్లు దివిసిపోయి యాటుఁ బోటు నొడళ్ళఁ । గలయఁ గలిగి డప్పి గదిరి సొలయు**
దొరలుఁ దాను నపుడు దుర్యోధనుఁడు విచారాభి యుక్తినున్న యవసరమున. **213**

ప్రతిపదార్థం: అట్లు= ఆవిధంగా; తివిసి= మరలి, వెనుదీసి; పోయి= వెళ్ళి; ఆటున్+పోటున్= (బాధయొక్క) తగ్గ హెచ్చులు; కలయన్+కలిగి= మిశ్రమంగా కలిగినందున; డప్పి= దాహం; కదిరి= హెచ్చి; సొలయు= ఒడళ్ళు పట్లు తప్పుతూ బాధపడుతున్న; దొరలున్= రాజులు; తానున్= తానూ, దుర్యోధనుఁడు= దుర్యోధనుడు; అపుడు; విచార+అభియుక్తిన్= ఆలోచనలోని ఆసక్తితో; ఉన్న; అవసరమునన్= సమయంలో.

తాత్పర్యం: అట్లా వెనుదీసివెళ్ళిన తరువాత శరీరాలలో బాధలు తగ్గుతూ హెచ్చుతూ ఉండగా, దప్పిక ఎక్కువై ఒడళ్ళు పట్లు తప్పుతున్న రాజులు దుర్యోధనుడు ఆలోచనచేస్తున్న సమయంలో.

వ. **పార్థుదెసఁ బలుకుపుట్టినం గ్రోధంబున నూర్పులు సందడింపఁ గర్ణుఁడు భగ్నదంష్ట్రంబయి విషంబులేని భుజంగంబునుం బోల్పం దగి పరాజయంబు నొంది దీనదశకు వచ్చియున్న యారథిక వరులం గలయం గనుంగొని కౌరవేశ్వరున కిట్లనియె.** **214**

ప్రతిపదార్థం: పార్థుదెసకున్= అర్జునుని దిక్కున, అర్జునుని గురించి; పలుకు= మాట; పుట్టినన్= కలుగగా, రాగా; కర్ణుఁడు= అంగరాజు; క్రోధంబునన్= కోపంతో; ఊర్పులు= నిట్టూర్పులు; సందడింపన్= అధికంకాగా; భగ్న= విరిగిన; దంష్ట్రంబు= కోరలు కలది; అయి; విషంబులేని= గరళంలేని; భుజంగంబును= పామును; పోల్పన్= పోటితేవటానికి; తగి= అర్హుడై; పరాజయంబున్= ఓటమిని; ఒంది= పొంది; దీనదశకున్= శోచనీయస్థితికి; వచ్చి+ఉన్న= వచ్చి ఉండిన; ఆ రథికవరులన్= రథికులలో శ్రేష్ఠులైనవారిని; కలయన్= అందరినీ కలియునట్లు, ఒక్కసారి; కనుంగొని= చూచి; కౌరవేశ్వరునకున్= కురువంశీయుడైన రాజు దుర్యోధనుడితో; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: అర్జునుని గురించిన మాట రాగానే, కర్ణుడికి అర్జునుడిమీద కోపంవలన నిట్టూర్పులు ఎక్కువై, కోరలు విరిగి విషములేని పామువంటివాడై - ఓడిపోయి దీనంగా ఉన్న రథికోత్తముల నందరిని ఒక్కసారి కలయచూచి, దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. 'అలవు వెరవుఁ దలఁపఁ గలఁ డితం డన వాసి । కెక్కి నట్టి రథికుఁ డక్కిరీటి
వలయు నెడల నతని వాసుదేవుండు బో । ధించు నెల్ల తెఱఁగుఁ దేటపడఁగ. 215

ప్రతిపదార్థం: ఆ+కిరీటి= ఆ అర్జునుడు; తలఁపన్= ఆలోచింపగా; "ఇతఁడు= ఈ అర్జునుడు; అలవున్= శక్తీ; వెరవున్= యుక్తీ; కలఁడు= కలవాడు"; అనన్= అని అందరూ పలుకగా; వాసికెక్కినట్టి= పేరుపొందినటువంటి; రథికవరుఁడు= రథికులలో శ్రేష్ఠుడు, వాసుదేవుడు= కృష్ణుడు; వలయు= అవసరమైన, కావలసిన; ఎడలన్= సమయాలలో; ఎల్ల= సమస్తమైన; తెఱఁగున్= పద్ధతినీ; తేటపడఁగన్= విశదమయ్యేటట్లు; అతనిన్= అర్జునునికి; బోధించున్= తెలియజేస్తాడు.

తాత్పర్యం: 'ఇతడు శక్తియుక్తులు కలవాడు' అని పేరు పొందిన రథికశ్రేష్ఠుడు అర్జునుడు. దానికి తోడు శ్రీకృష్ణుడు అవసరమైనప్పుడు అతడికి అన్ని పద్ధతులు స్పష్టమయ్యేటట్లు వివరిస్తూ ఉంటాడు.

విశేషం: కర్ణుడు వట్టి సమయాలలో 'వాయపురజ్జులాఁడు' అనిపించుకొన్నా సమయం వచ్చినపుడు, అందులోనూ, సేనానాయకుడుగా ఉన్నపుడు తన శక్తినీ, ఎదిరిశక్తినీ సరిగానే తూకం వేస్తాడు. తన వైఫల్యానికి కృష్ణుడితో సమానుడయిన సారథి తనకు లేకపోవటం కారణమనటానికి ఇది నాంది.

క. అనిమిషనాథుం డిచ్చిన । ఘనశక్తికి నసుర నొడ్డి గాండివిఁ దొలఁ గిం
చిన హరి వంచన పదపడి । మన మెల్లను దెలియ వినమె? మనుజాధీశా! 216

ప్రతిపదార్థం: మనుజ+అధి+ఈశా!= నరేశ్వరా?, రాజా!, దుర్యోధనా!; అనిమిషనాథుండు= దేవేంద్రుడు; ఇచ్చిన= నాకు (కవచకుండలాలిచ్చిన సమయంలో అందుకు ప్రతిగా) ఇచ్చినటువంటి; ఘనశక్తికిన్= (ఎవరిమీద ప్రయోగిస్తే వారెంతటివారైనా వారినొకరిని మాత్రం తప్పక సంహరించగల; అర్జునుడికోసం అట్టేపెట్టిన) గొప్ప శక్తికి; అసురుడైన ఘటోత్కచుని; ఒడ్డి= అడ్డముగా పెట్టి; గాండివిన్= అర్జునుని; తొలఁగించిన= ఆ శక్తినుంచి తప్పించిన; హరి= కృష్ణునియొక్క; వంచన= మోసం; పదపడి= అది జరిగిన తరువాత; తెలియన్= తెలియగా; మనము+ఎల్లను= మనమందరము; వినము+ఎ?= విన్నాము కాదా?

తాత్పర్యం: రాజా! దేవేంద్రుడు నాకు గొప్పశక్తి నిస్తే నేను దానిని అర్జునుడికొరకు అట్టేపెడితే, దానికి ఘటోత్కచుడిని అడ్డంపెట్టి, అర్జునుడిని తప్పించి, కృష్ణుడు చేసిన మోసం ఆ తరువాత మనమంతా విన్నాము కదా!

విశేషం: కర్ణుడి మాటనేర్పూ, లోకస్వభావమూ ఈ పద్యంలో తెలుస్తున్నాయి. ఘటోత్కచుడు సర్వనాశనం చేస్తూ ఉంటే కౌరవ పక్షీయులందరూ ప్రయోగించుమని కోరితే కర్ణుడు ప్రయోగించాడు. 'దానితో అర్జునుడిని చంపి ఉండేవాడిని. కృష్ణుడు మోసంచేశాడు. అర్జునుడిని చంపనిచ్చాడు కాదు' అంటున్నాడు.

క. అగుఁగాక యతని నాతని । మగఁటిమియును నేర్పునెల్లి మాన్పెద నీ కుం
బగ యనియెడు మాటయు ని । జ్జగమునఁ గలుగంగనీను జగతీనాథా!' 217

ప్రతిపదార్థం: జగతీనాథా!= భూపతీ దుర్యోధనా!; అగుఁగాక= అట్లాగేకానీ; అతనిన్= ఆ అర్జునుడినీ; ఆతని= ఆ అర్జునుడియొక్క; మగటిమియును= పౌరుషమూ; నేర్పున్= చాతుర్యమూ; ఎల్లి= రేపు; మాన్పెదన్= పోగొట్టుతాను; నీకున్= (నా వంటివాని మిత్రుడవయిన) నీకు; పగ= విరోధం; అనియెడు= అనే; మాటయున్= మాటకూడా; ఈ+జగమునన్= ఈ లోకంలో; కలుగఁగన్+ఈను= ఉండనివ్వను, ఇకపై పుట్టనివ్వను.

తాత్పర్యం: అట్లాగే కానిమ్ము, రాజా!, ఆ అర్జునుడినీ, అతడి పౌరుషాన్నీ, నేర్పునీ రేపు లేకుండా చేస్తాను. ఈ లోకంలో నీకు (పగవాడినే కాదు) పగ అనే మాటే ఉండనివ్వను, పుట్టనివ్వను.'

కర్ణుని రెండవ నాఁటి యుద్ధము (సం. 8-22-10)

వ. అనినం బ్రియం బంది నీనందనుం డతనిం దగువారలను నిజనివాసంబులకుం బోవం బనిచి తానును నభ్యంతర మందిరంబున కరిగె నారాత్రి సుఖనిద్ర సేసి రేపకడ సమస్త జనంబులు సంగ్రామంబునకు నడచి రంత నక్కడ నుక్కుమిగిలి పాండవబలంబులుం దోతెంచె ధర్మనందనుండు బృహస్పతి మతంబున దుర్జయ వ్యూహంబు వన్నించినం జూచి మనవారును దానికిం బ్రతిగా మోహరించుటకై రాధేయు రాకకు నెదురు చూచుచు నొకభంగిం బన్ని' రనిన విని యాంబికేయుండు. 218

ప్రతిపదార్థం: అనినన్= ఇట్లా చెప్పగా; ప్రియంబు+అంది= ప్రీతి పొంది; నీ నందనుండు= నీ కుమారుడైన దుర్యోధనుడు; అతనిన్= కర్ణుడినీ; తగువారలను= తగినవారినీ; నిజ= తమతమ; నివాసంబులకున్= విడిది పట్టులకు; పోవన్= వెళ్ళటానికి; పనిచి= సెలవిచ్చి; తానును= స్వయంగా తానూ; అభ్యంతర= లోపలి; మందిరమునకున్= నివాసానికి; అరిగెన్= వెళ్ళాడు; సమస్త జనంబులు= ఎల్ల జనులూ; ఆ రాత్రి= నాటి రాత్రి; సుఖ= సుఖకరమైన; నిద్ర+చేసి= నిద్రపోయి; రేపకడ= ఉదయమే; సంగ్రామంబునకున్= యుద్ధానికి; నడిచిరి= వెళ్ళారు; అంతన్= అంతలో; ఆ+కడన్= పాండవ పక్షంలో; ఉక్కుమిగిలి= బలం అతిశయించి; పాండవ బలంబులున్= పాండవుల సైన్యాలూ; తోతెంచెన్= కనిపించాయి; ధర్మనందనుండు= ధర్ముని పుత్రుడైన యుధిష్ఠిరుడు; బృహస్పతి= దేవమంత్రి అయిన బృహస్పతియొక్క; మతంబునన్= అభిప్రాయం ప్రకారం; దుర్జయ వ్యూహంబు= దుర్జయమనే మొగ్గరం; పన్నించినన్= ఏర్పాటు చేయించగా; చూచి; మనవారును= మన పక్షంలోనివారు; దానికిన్= ఆ దుర్జయ వ్యూహానికి; ప్రతిగాన్= ఎదిరిగా, సాటిగా; మోహరించుటకై= పన్నటంకోసం; రాధేయు= కర్ణునియొక్క; రాకకున్= రావటానికి; ఎదురుచూచుచున్= నిరీక్షణచేస్తూ; ఒక భంగిన్= ఒక రీతిగా; పన్నిరి= మోహరించారు; అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ఆంబికేయుండు= అంబిక కుమారుడయిన ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: ఆవిధంగా కర్ణుడు చెప్పేసరికి నీ కొడుకు దుర్యోధనుడు చాలా సంతోషించాడు. కర్ణుడినీ, తాను చెప్పదగిన వారినీ 'మీ నివాసాలకు వెళ్ళం' డని పంపించాడు. తానూ లోపలినివాసానికి వెళ్ళాడు. అందరూ ఆ రాత్రి సుఖంగా నిద్రపోయారు. మర్నాడు ప్రొద్దున్నే యుద్ధానికి అందరు బయలుదేరారు. ఇక ఆ పాండవపక్షంలో సైన్యాలు బలం అతిశయించినట్లు అగుపించగా ధర్మపుత్రుడు బృహస్పతి అభిప్రాయానుగుణంగా దుర్జయవ్యూహం మోహరింపజేశాడు. దానిని చూచి, మనవారు దానికి దీటుగా వ్యూహం పన్నటంకొరకు కర్ణుడు ఎప్పుడు వస్తాడా- అని ఎదురు చూస్తూ అందాకా ఒక మాదిరి మొగ్గరంగా ఏర్పడ్డారు' అని చెప్పాడు. అది విని ధృతరాష్ట్రుడు.

క. శీతార్తజనంబులు ప్ర । ద్యోతను నుదయంబు గోరుచున్న కరణిఁ దా
నేతేరఁ గోరు జనులకు । నాతఁడు నిజ తేజమునఁ బ్రియం బొసఁగెనొకో? 219

ప్రతిపదార్థం: శీత= చలిచేత; ఆర్త= పీడితులైన; జనంబులు= జనులు; ప్రద్యోతను= సూర్యునియొక్క; ఉదయంబు; కోరుచున్= కావాలనుకొంటూ; ఉన్న= ఉండిన; కరణిన్= రీతిగా; తాను= కర్ణుడు; ఏగు+తేరన్= రావటానికి, రావటం; కోరు= కాంక్షించే; జనులకున్; ఆతఁడు= కర్ణుడు; నిజతేజమునన్= తన పరాక్రమంతో; ప్రియంబు= ప్రీతిని; ఒసఁగెనొకో?= ఇచ్చాడా, కలిగించాడా?

తాత్పర్యం: 'చలితో బాధపడుతున్న వాళ్ళు ప్రొద్దు పొడుపుకోసం ఎదురుచూస్తున్నట్లుగా తన రాకకొరకు ఎదురుచూస్తున్న వారికి కర్ణుడు తన పరాక్రమంతో సంతోషం కలిగించాడా?

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. సూర్యుడు తన తేజస్సుతో చలిని పోగొట్టి వెచ్చదనాన్నిస్తాడు. ఓటమితో బాధపడుతున్న జనానికి ఆ బాధను పోగొట్టి కర్ణుడు తన తేజస్సుతో (పరాక్రమంతో) సంతోషం కలిగించాడా? కాంతీ, పరాక్రమమూ అన్న అర్థాలు కల తేజశ్శబ్దప్రయోగం ఇక్కడ రమణీయం.

ఉ. **అమ్మెయి ధర్మనందనుని యగ్గలికం దొలునాఁడు రాజు బ**
న్నమ్ములపాటు సూచుచు రణంబుకడంక దొఱంగి చన్న బం
టెమ్మెయి నద్దినంబున నహీనపరాక్రమలీల సూపెనో
తమ్ము నెఱుంగరేమియు నతండును నాతఁడు నేమి సేయుదున్? **220**

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ విధంగా; ధర్మనందనుని= ధర్మపుత్రుడైన యుధిష్ఠిరునియొక్క; అగ్గలికన్= విజృంభణంతో; తొలునాఁడు= తాను సేనా నాయకత్వం వహించిన మొదటి రోజు; రాజు= తన ఏలిక అయిన దుర్యోధనునియొక్క; బన్నమ్ములపాటు= కష్టాలు పడటం; చూచుచున్= చూస్తూ; రణంబు= యుద్ధంయొక్క; కడంక= పూనిక; తొఱంగి= విడిచి; చన్న= వెళ్ళిన; బంటు= వీరుడు; ఏ+మెయిన్= ఏ రీతిగా; ఆ+దినంబునన్= రెండవనాడు; అహీన= గొప్ప; పరాక్రమ= విక్రమంయొక్క; లీల= విలాసం; చూపెనో= చూపించాడో; అతండును= కర్ణుడు; ఆతఁడున్= దుర్యోధనుడు; తమ్మున్= తమగురించి కూడా; ఎఱుంగరు= తెలిసినవారు కారు; ఏమి+చేయుదున్= నేను ఏమిచేయాలి?

తాత్పర్యం: కర్ణుడు తాను సేనా నాయకుడుగా ఉండి యుద్ధం నడిపిస్తున్న మొదటినాడే యుధిష్ఠిరుడు విజృంభించి, ఎవరినో కాదు రాజు దుర్యోధనుడిని అన్ని బాధలు పెట్టితే, కళ్ళారా చూచి కూడా అడ్డలేక తప్పించుకొన్న వీరుడు, ఆ రాజుకు నమ్మిన బంటు, రెండవనాడు మహాపరాక్రమం చూపించాడా? ఈ కర్ణదుర్యోధనులకు తమశక్తి ఏమిటో తమకు తెలియదు. ఇక వీళ్ళను కాపాడటానికి నేను చేయగలిగింది ఏమున్నది?

విశేషం: ధృతరాష్ట్రుడికి ఈ దశలో కలిగిన నిరాశా, తన కుమారుడి మూర్ఖత్వం మీదా, అతడిని ఎగసన ద్రోసినవారి నిష్ప్రయోజకత్వం మీదా కలిగిన ఏవమూ మరెన్నడూ కలుగలేదు. 'తమ్మున్ ఎఱుంగరు' అనటంలో 'న్' తో తిక్కన్నగారు మహార్థాన్ని సాధించారు. ఎవరికైనా ఎదుటివారి శక్తి ఎంతటిదో తెలియదంటే అర్థం చేసికొనవచ్చును; వీళ్ళకు ధర్మజాదుల శక్తి సరిగా తెలియలేదు. పోనీ, తమ శక్తి ఏ పాటిదో అది అయినా తప్పక తెలిసి ఉండాలి కదా! 'వీళ్ళ కది కూడా తెలియక చెడిపోతున్నారు' అని బాధ. అట్లాగే రాజు బంటు పదాల ప్రయోగం. ఎంతమైత్రీ అభేదభావమూ చూపినా, దుర్యోధనుడు రాజు, కర్ణుడు బంటు. బంటుపని ప్రాణాలిచ్చి అయినా తన రాజు మానప్రాణాలు కాపాడటం. ఈ కర్ణుడు దుర్యోధనుడి అవమానమూ, ప్రాణాలు పోయే పరిస్థితి చూచి కూడ తప్పించుకొని పోయాడు కాని, చేసిందేమీ లేదు. ఇతడి మీద నమ్మకం దుర్యోధనుడికి. ఈ కర్ణుడు ఘోషయాత్రలోనూ ఇంతే చేశాడు. అవతలి వాడు గంధర్వుడు కదా అని సరిపెట్టుకొని ఉండాలి. అలా చేయలేదు. ఈ కర్ణుడు అప్పుడూ అంతే - ఇప్పుడూ అంతే. 'ఏమి చేయుదున్' అని బాధపడటం కంటే నేను చేయదగింది ఏముంది అన్నది ధృతరాష్ట్రుని అభిప్రాయం, అసహాయత.

తే. **కర్ణుఁ డట్టె? కలనఁ గౌంతేయ వర్గంబుఁ । గృష్ణయుతముగాఁగ గెలవఁ జాలు**
నేమి సెప్పఁ గలదు? మీ మానవేంద్రుని చిత్తమాంద్య మతనిఁ జెఱుపకున్నె? **221**

ప్రతిపదార్థం: కర్ణుఁడు+అట్టె?= కర్ణుడటే= కర్ణుడా?; కలనన్= యుద్ధంలో; కౌంతేయ వర్గంబున్= కుంతీపుత్రుల పక్షాన్ని; కృష్ణయుతము+కాఁగన్= కృష్ణుడితోపాటుగా; గెలువన్+చాలున్= జయించటానికి సమర్థుడవుతాడు; చెప్పన్= చెప్పటానికి; ఏమికలదు?= ఇంకేమున్నది; మీ మనుజపతి= మీ రాజు దుర్యోధనుడియొక్క; చిత్త= మనస్సుయొక్క; మాంద్యము= జడత్వము; అతనిన్= దుర్యోధనుని; చెఱుపకున్నె?= సంహరించకుండా ఉంటుందా?

తాత్పర్యం: కర్ణుడు పాండవపక్షాన్ని కృష్ణునితో కూడ యుద్ధంలో జయించగలుగుతాడా? దుర్యోధనుడి మనస్సు మందగించింది. అది అతడిని నాశనం చేయకుండా ఉంటుందా?

క. సౌబలు నీతియుఁ గర్ణు భు । జాబలమును గూడి తనకు సామ్రాజ్యం బీఁ
గా బలసి వెలయు వాఁడై । యా బే లూఱడు మనంబునం దేప్రొద్దున్. 222

ప్రతిపదార్థం: సౌబలు= సుబలుని కొడుకైన శకునియొక్క; నీతియున్= కపటనీతి; కర్ణు= అంగరాజుయొక్క; భుజాబలమును= భుజబలము; కూడి= కలిసి; తనకున్= దుర్యోధనుడికి; సామ్రాజ్యంబు= చక్రవర్తిత్వాన్ని, విశాలమైనరాజ్యాన్ని; ఈఁగాన్= ఈయగా; బలసి= అతిశయించి; వెలయువాఁడు+ఐ= విలసిల్లేవాడై; ఆ బేల= ఆ అవివేకి దుర్యోధనుడు; మనంబునందున్= మనస్సులో; ఏ ప్రొద్దున్= ఎల్లప్పుడూ; ఊఱడున్= ఊరడిల్లుతూ ఉంటాడు.

తాత్పర్యం: ఆ అవివేకి దుర్యోధనుడు, శకుని కపటనీతీ, కర్ణుని బాహుబలమూ తనకు విశాల సామ్రాజ్యాన్ని తెచ్చిపెట్టుతాయని మనస్సులో ఎల్లప్పుడూ ఊరడిల్లుతూ ఉంటాడు.

క. జూదంబునాఁడు మొలచిన । యాదుర్దశ పెరిఁగి సంజయా! నిర్భర దుః
ఖోదయపరంపరా సం । పాదినియై మనసునిట్లు పఱిగొనియెడినే? 223

ప్రతిపదార్థం: సంజయా!; జూదంబునాఁడు= జూదమాడిననాడు; మొలచిన= పుట్టిన; ఆ దుః+దశ= ఆ చెడుదశ; పెరిఁగి= పెద్దదై; నిర్భర= నిండైన; దుఃఖ+ఉదయ= దుఃఖాల పుట్టుకలయొక్క; పరంపరా= వరుసలను; సంపాదిని+ఐ= సమకూర్చేది అయి; మనసున్= మనస్సును; ఇట్లు= ఈ విధంగా; పఱిగొనియెడినే= బ్రద్దలు చేస్తుందా?

తాత్పర్యం: సంజయా! జూదమాడిననాడు పుట్టింది దుర్దశ. అది క్రమంగా పెరుగుతూ దుఃఖం తరువాత దుఃఖాన్ని తెచ్చిపెడుతూ మనస్సును బ్రద్దలు చేస్తున్నది. ఇది ఇంత బాధపెడుతుందా?

విశేషం: అంతవరకూ జీవితం ఒక రాతిభవనంవలె సుఖంగా ఉన్నది. రాతిభవనం మీద రావిమొక్క మొలచినట్టు ఈ జీవితంలో దుర్దశ జూదంనాడు ప్రారంభమయినది. మొక్క పెరుగుతూ ఉంటే భవనం బీటలు వారుతూ ఉంటుంది. ఈ పరిస్థితిని గమనించే ధృతరాష్ట్రుడు బాధపడుతున్నాడు.

క. దుర్యోధనుచేసిన యవ । కార్యంబున వచ్చినట్టి కష్టంబులు దా
త్పర్యంబున వినియెదఁ బ్రతి । కార్యంబులు గామి మనసు గందుచునుండన్. 224

ప్రతిపదార్థం: దుర్యోధను చేసిన= దుర్యోధనుడు కావించిన; అవకార్యంబునన్= చెడు పనిచేత; వచ్చినట్టి కష్టంబులు= కలిగిన కష్టాలు; తాత్పర్యంబునన్= తత్పరత్వం, ఆసక్తితో; ప్రతికార్యంబులు= మారుచేయదగినవి; కామిన్= కాకపోవటంచేత; మనసు= హృదయం; కందుచున్= తాపం పొందుతూ; ఉండన్= ఉండగా; వినియెదన్= వింటున్నాను.

తాత్పర్యం: దుర్యోధనుడు చెడుపని చేశాడు. దానివలన కష్టాలు వచ్చి పడ్డాయి. అయితే వాటికిపుడు చేయదగిన ప్రతిక్రియ లేదు. అందువలన మనస్సుకు బాధకలుగుతుండగా, ఆ కష్టాలను గురించి వింటున్నాను.

క. పాండునృపుసుతులలో నొ । క్కండైనను నొవ్వఁ డింతకును మును వనితా
మండలి చేరువ మెలఁగెడు । గండున మెఱసెదరు కురునికాయము నడుమన్. 225

ప్రతిపదార్థం: పాండు నృపు= పాండురాజుయొక్క; సుతులలోన్= కుమారులలో; ఒక్కండు+అయినను= ఒక్కడు కూడా; ఇంతకున్+మును= ఇప్పటికి పూర్వం; నొవ్వఁడు= బాధపొందడు; (వారు= పాండవులు); కురునికాయము= కురు వీర సమూహంయొక్క; నడుమన్= మధ్య; వనితా= స్త్రీల; మండలి= సమూహంయొక్క; చేరువన్= సమీపంలో; మెలఁగెడు= తిరిగే; గండునన్= పౌరుషంతో; మెఱసెదరు= ప్రకాశిస్తున్నారు.

తాత్పర్యం: పాండురాజు కొడుకులలో ఇంతవరకూ దెబ్బతిన్న వా డొక్కడూ లేడు. మన వీరుల మధ్య స్త్రీలలో తిరిగినంత పౌరుషంతో పాండవులు తిరుగుతున్నారు.

వ. దైవంబు బలవంతం' బనిన విని సంజయుం డజ్జననాథునితో 'దేవా! వినుము. వగచినం గృతపడిన కార్యంబు గ్రమ్మఱం బొడమునే? డెందము గుందునంతియకాక యట్లుంగాక నీవుసేసిన యదియ చూవె ఫలించె భండనంబు వలదని యెన్ని భంగులం జెప్పినం బాండవులకుం గీడు దలంచి యప్పలుకులు గైకొనవైతివి వారలవలన ము న్ననేక పాపంబు లాచరించితి నీవలన జనక్షయంబు వాటిల్లెం గావునఁ గడవంబడిన దానికి వగవం బనిలేదు దారుణంబైన రణప్రకారంబు విను' మనుటయు నతండు 'కర్ణుండట్లు దడసిన కారణంబుఁ దొడంగి యెఱిఁగింపు' మనుటయు నమ్మానవేశ్వరునకు నా సూతనందనుం డిట్లనియె. 226

ప్రతిపదార్థం: దైవంబు= విధి; బలవంతంబు= బలం కలది; అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; సంజయుండు= సంజయుడు; ఆ+జననాథునితోన్= ఆ రాజుతో; దేవా= రాజా!; వినుము= విను; వగచినన్= దుఃఖించినందువల్ల; డెందము= హృదయం; కుందున్= బాధపడును; అంతియకాక= అంతేగానీ; కృతము+పడిన= కడచిన; కార్యంబు= పని; క్రమ్మఱన్= మరల; పొడమున్+ఏ?= కలుగునా, జరుగునా?; అట్లున్+కాక= అట్లా మాత్రమేకాక; (కడచిన పనితిరిగి రాకపోవటమే, మనసు బాధపడటమూ మాత్రమే కాక); నీవు; చేసిన+అదియ+చూవె= నీవుచేసినదే సుమా!; ఫలించెన్= పండినది, ఇలా పరిణమించినది; భండనంబు= యుద్ధం వలదు+అని= వద్దని; ఎన్ని= ఎంత సంఖ్యకల; భంగులన్= విధాలుగా; చెప్పినన్= వినిపించినా; పాండవులకున్= నీ తమ్ముడే అయిన పాండురాజు కుమారులకు; కీడు= హాని; తలంచి= తలపెట్టి, కావాలని; ఆ+పలుకులు= ఆ మాటలు; కైకొనవు+ఐతివి= స్వీకరించావు కావు; వారల వలనన్= వారి విషయంలో; మున్ను= ఇదివరకు; అనేక= చాలా; పాపంబులు= పాపపు పనులు; ఆచరించితి(వి)= చేశావు; నీవలనన్= నీ వల్ల; జనక్షయంబు= జనుల నాశం; పాటిల్లెను= కలిగింది; కావునన్= కనుక; కడవం బడిన దానికిన్= కడచిన దానికి; వగవన్= విచారించవలసిన; పని= కార్యం; లేదు; దారుణంబు+ఐన= భయంకరమైన; రణప్రకారంబు= యుద్ధంయొక్క రీతి; వినుము; అనుటయున్= అని పలుకగా; అతండు= ధృతరాష్ట్రుడు; కర్ణుండు; అట్లు; తడసిన= ఆలస్యం చేసిన; కారణంబున్; తొడంగి= ప్రారంభించి మొదటినుంచీ; ఎఱింగింపుము= తెలియజేయుము; అనుటయున్= అని పలుకగా; ఆ+మానవేశ్వరునకున్= ఆ ప్రజానాథునికి, ఆ రాజుకు; ఆ= ప్రసిద్ధుడైన; సూతనందనుండు= సూతుడి పుత్రుడైన సంజయుడు; ఇట్లు; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఇంతకూ విధి బలం కలది' అనేసరికి, సంజయు డా మాటలు విని ధృతరాష్ట్రుడితో 'రాజా! వినుము; కడచిన పనికి విచారించినందువలన అది (సరిచేయటానికి) తిరిగిరాదు; పైగా మనస్సు బాధపడుతుంది. అంతకంటె

ప్రయోజనం లేదు. అదీకాక, (ఇది దుర్యోధనుడు చేసిన దాని ఫలం కాదు) నీవు చేసిన దానికే ఫలం ఇట్లా కలిగింది. యుద్ధం వద్దు అని ఎన్ని విధాల చెప్పినా యుద్ధం తప్పించటానికి ఒప్పుకొన్నావు కావు. పాండవులకు హాని చెయ్యాలన్న ఆలోచన నీకుండటమే అందుకు కారణం. ఇదివరకు నీవు పాండవులకు ఎన్నో పాపకార్యాలు చేశావు. నీవలననే ఈ జననాశం సంభవించింది. అందువలన గతించిన దానికి విచారించవలసిన పని లేదు. భయంకరమైన యుద్ధం జరిగి తీరుతుంది వినుము.' అన్నాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు 'కర్ణుడు యుద్ధానికి రావటానికి ఎందుకు ఆలస్యం చేశాడో అక్కడనుండి మొదలుపెట్టి చెప్పుము.' అన్నాడు. ఆ తరువాత సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా చెప్పాడు:

క. **రేపకడ సకల బలములు । భూపాలురు వెడలి నడువఁ బోరికి బిదపన్**
నీపుత్త్రుఁడు వెడలెను సా । టోపతఁ దమ్ములును గర్ణుఁడును దో నడవన్. **227**

ప్రతిపదార్థం: రేపకడ= ఉదయమే; పోరికన్= యుద్ధానికి; సకలబలములు= సమస్త సైన్యాలూ; భూపాలురున్= రాజులు; వెడలి= బయలుదేరి; నడువన్= వెళ్ళగా; పిదపన్= తరువాత; నీ పుత్త్రుఁడు= నీ కుమారుడు దుర్యోధనుడు; సాటోపతన్= ఆడంబర భావంతో; తమ్ములున్= తన తమ్ముళ్ళూ; కర్ణుఁడును= సేనా నాయకుడైన కర్ణుడూ; తోన్= తనతోపాటు; నడవన్= రాగా; వెడలెను= బయలుదేరాడు.

తాత్పర్యం: తెల్లవారగానే, యుద్ధానికి సమస్త సైన్యాలూ, రాజులూ బయలుదేరి వెళ్ళారు. ఆ తరువాత దుర్యోధనుడు ఆడంబరంగా తన తమ్ముళ్ళూ, కర్ణుడూ తనతోకూడా రాగా బయలుదేరాడు.

వ. **అయ్యవసరంబున.** **228**

ప్రతిపదార్థం: ఆ= దుర్యోధనాదులు బయలుదేరిన; అవసరంబునన్= సమయంలో.

తాత్పర్యం: ఆ దుర్యోధనాదులు బయలుదేరిన సమయంలో.

సీ. **రథము రథమ్ముఁ జేరఁగఁదెచ్చి యమ్మేది । నీశ్వరుతోఁ గర్ణుఁ డిట్టు లనియె**
'నాకుఁ గృత్యంబు లనేకముల్ గలిగె ము । న్నా ధనంజయునకు నట్ల కాన
యీరసంబున మాకు నిద్దఱ కొండొరు । విడువక పెనఁగఁ జొప్పడద యింకఁ
గలహ మొక్క మొగంబు గావున నేఁ డేము । దలపడి పోరుదు మలవుఁ జలము

ఆ. **నుల్లసిల్ల నొక్క రొకరుని నొంపను । జంపఁ జూతు మా నిలింపనాథు**
వలనఁగన్నశక్తి వొలియుట నా మీఁద । నలుకు లేక తఱుము నాతఁ డధిప! **229**

ప్రతిపదార్థం: కర్ణుఁడు= అంగరాజు; రథము= తన తేరు; రథమ్మున్= దుర్యోధనుని రథాన్ని; చేరఁగన్= సమీపించేటట్లు; తెచ్చి= తోలించి తీసికొనివచ్చి; ఆ+మేదినీ+ఈశ్వరునితోన్= ఆ భూపతితో, దుర్యోధనుడితో; ఇట్టులు= ఇట్లా; అనియెన్= అన్నాడు; అధిప!= ప్రభూ!; మున్ను= ఇదివరకు; నాకున్= నాకు; కృత్యముల్= పనులు; కలిగెన్= సంభవించాయి; ఆ= నా ప్రతివీరుడైన; ధనంజయునకున్= అర్జునునికీ; అట్ల= అట్లాగే (కృత్యాలు కలిగాయి); కాన= కనుక; ఈరసంబునన్= కోపంతో; మాకున్= నాకూ అర్జునుడికీ; ఇద్దఱకున్= ఇద్దరికీ; ఒండొరున్= ఒకరు ఒకరిని; విడువక= విడిచిపెట్టకుండా;

పెనఁగన్= యుద్ధంచేయటానికి; చొప్పడదు+అ= కలుగనేలేదు; ఇంకన్= ఈపైని; కలహము= యుద్ధం; ఒక్క= ఒక; మొగంబు= ముఖంకలది, ఏకముఖంగా అవుతుంది; కావున; నేఁడు; ఏము= నేనూ, అర్జునుడూ; తలపడి= ఎదిరించి; అలవున్= సామర్థ్యమూ; చలమున్= పట్టుదలా; ఉల్లసిల్లన్= ప్రకాశింపగా; పోరుదుము= యుద్ధంచేస్తాము; ఒక్కరు= ఒకరు; ఒకరునిన్= మరొకరిని; నొంపను= నొప్పించటానికి; చంపన్= సంహరించటానికీ; చూతుము= ప్రయత్నిస్తాము; ఆ= ప్రసిద్ధుడైన; నిలింపనాథులవలనన్= దేవేంద్రునివల్ల; కన్న= పొందిన; శక్తి= శక్తి అనే ఆయుధం; పొలియుటన్= (ఘటోత్కచుడిపై ప్రయోగించినందున) పోవటంవల్ల; అతడు= అర్జునుడు; అలుకులేక= భయంలేకుండా; నా మీఁదన్= నాపైని; తఱుమున్= పడతాడు.

తాత్పర్యం: కర్ణుడు తన రథం దుర్యోధనుడి రథానికి దగ్గరగా పోనిచ్చాడు. అతడితో ఇట్లా అన్నాడు. 'ప్రభూ, ఇదివరకు నేను చేయవలసిన పనులు అనేకమున్నాయి. అర్జునుడికీ అట్లాగే ఉన్నాయి. అందువలన మేమిద్దరమూ ఒకరినొకరు ఎదిరించి విడిచిపెట్టకుండా పట్టుదలతో పోరాడే అవకాశం దొరకనే లేదు. ఇకమీద యుద్ధం ఏకముఖంగా నడుస్తుంది. అందువలన ఈవేళ మేము డీకొని మా సామర్థ్యమూ, పట్టుదలా ఉపయోగించి పోరాడుతాము. ఒకరినొకరం బాధించటానికీ, చంపటానికీ ప్రయత్నిస్తాము. ఇంద్రుడు నా కిచ్చిన శక్తి లేకుండా పోయినందువలన అర్జునుడు భయంలేకుండా నా మీద పడగలడు.

వ. అప్పుడు చే నెత్తురు గాకుండ నక్కిరీటి గీటడంగించు విధం బూహింపుము. 230

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; చే= చేతికి; నెత్తురు+కాక+ఉండన్= రక్తం అంటకుండా, శ్రమలేకుండా, సులభంగా; ఆ+కిరీటిన్= ఆ అర్జునుని; గీటు+అడంగించు= బలం అణగగొట్టే, సంహరించే; విధంబు= ప్రకారం; ఊహింపుము= ఆలోచించుము.

తాత్పర్యం: అటువంటి సమయంలో శ్రమలేకుండా అర్జునుడిని సంహరించే ఉపాయం గురించి ఆలోచించుము.

చ. సరి యగు నాకు దివ్యశరజాలములం దలపోసి చూడ న
న్నరుఁడు దృఢత్వ లాఘవగుణంబులఁ దక్కువ దూరపాత వి
స్ఫురణఁ గరంబు వట్రపడు భూవర! సౌష్ఠవరేఖ నేమియున్
దొరయఁడు ధైర్యశౌర్య పటు దోర్విభవంబుల హీనుఁడెంతయున్. 231

ప్రతిపదార్థం: భూవర!= భూపతీ, దుర్యోధన మహారాజా!; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; తలపోసి= ఆలోచించి; చూడన్= పరిశీలించగా; దివ్య= స్వర్గంలో జన్మించిన, గొప్పవైన; శర= అమ్ములయొక్క ఆయుధాలయొక్క; జాలములన్= సముదాయాలలో; నాకున్= నాతో; సరి= సమానుడు; అగున్= ఔతాడు; దృఢత్వ= గట్టిదనం; లాఘవ= చురుకుదనం-అనే ఈ; గుణంబులన్= లక్షణాలలో; తక్కువ= నాకంటే తక్కువవాడు; దూరపాత= దూరంలో ఉన్న లక్ష్యంపై ఆయుధాన్ని ప్రయోగించడంలోని; విస్ఫురణన్= ప్రకాశంతో; కరంబు= చాలా; వట్రము+పడున్= తక్కువ అవుతాడు; సౌష్ఠవరేఖన్= నేర్పు తీరులో; ఏమియున్= ఏ కొంచెమూ; దొరయఁడు= సాటికాడు; ధైర్య= ధీరత, నిలకడలోనూ; శౌర్య= శూరత్వంలోనూ; పటు= గట్టి; దోః= చేతులయొక్క; విభవంబులన్= శక్తిలోనూ; ఎంతయున్= చాలా; హీనుఁడు= తక్కువవాడు.

తాత్పర్యం: దుర్యోధన మహారాజా! అర్జునుడి వద్ద దివ్యాయుధాలున్నాయి. ఈ ఒక్క విషయంలో మాత్రం అతడు నాతో సమానుడవుతాడు. కాని, గట్టిదనంలోనేమి, చురుకుదనంలోనేమి, నాకంటె తక్కువ. దూరంలో ఉన్న లక్ష్యాన్ని కొట్టటంలో చాలా తక్కువ. నేర్పులో పోలికే లేదు. ధైర్యంలోనూ, శౌర్యంలోనూ, బాహుబలంలోనూ ఎంతో తక్కువ.

క. మును విశ్వకర్మ దేవేం । ద్రునకై నిర్మించె మహిత రూపము విజయం
బను చాపము దానను బహు । దనుజుల మర్దించె నతఁ డుదగ్రస్ఫూర్తిన్. 232

ప్రతిపదార్థం: మును= పూర్వం; విశ్వకర్మ= దేవతల శిల్పి, మహితరూపము= గొప్ప ఆకారం కల; విజయంబు+అను= విజయం అనే పేరుకల; చాపము= ధనుస్సును; దేవ+ఇంద్రునకై= దేవేంద్రుడి కొరకు; నిర్మించెన్= చేశాడు; అతఁడు= దేవేంద్రుడు; దానను= ఆ ధనుస్సుతో; ఉదగ్ర స్ఫూర్తిన్= గొప్ప భయంకరమైన ప్రకాశంతో; బహుదనుజులన్= పెక్కుమంది రాక్షసులను; మర్దించెన్= సంహరించాడు.

తాత్పర్యం: పూర్వం విశ్వకర్మ దేవేంద్రుడి కోసం ఒక పెద్ద విల్లు తయారుచేశాడు. దానిపేరు విజయం. దానితో దేవేంద్రుడు భయంకరంగా ప్రకాశిస్తూ, ఎందరినో దానవులను సంహరించాడు.

చ. పరిచయసక్తచిత్తుఁడయి భార్గవరామున కాతఁ డిచ్చినం
బరుష పరాక్రమమ్మున నృపాలుర నెల్లను నమ్మహాభుజుం
డిరువదియొక్కమాఱు సమయించెఁ దదీయ నితాంతశక్తి న
ప్పరమదయాపరుం డొసఁగెఁ బార్థివ! నాకది గూర్మి పెంపునన్. 233

ప్రతిపదార్థం: పార్థివ!= రాజా!; ఆతఁడు= దేవేంద్రుడు; పరిచయ= స్నేహంచేత; సక్త= తగుల్కొనిన; చిత్తుఁడు+అయి= మనస్సు కలవాడై; భార్గవ రామునకున్= భృగువంశీయుడైన పరశురాముడికి; ఇచ్చినన్= ఈయగా; ఆ+మహాభుజుండు= ఆ గొప్ప బాహువులుగల పరశురాముడు; ఇరువది యొక్క మాఱు= ఇరవై ఒక్కసారులు; పరుష= కఠినమైన; పరాక్రమమ్మునన్= విక్రమంతో; నృపాలురన్+ఎల్లను= రాజులనందరనూ; తదీయ= ఆ ధనుస్సుయొక్క; నితాంత= అతి విస్తారమైన; శక్తిన్= బలంతో; సమయించెన్= సంహరించాడు; అప్పరమ దయాపరుండు= ఆ గొప్పదయకు వశుడైన పరశురాముడు; కూర్మి= వాత్సల్యంయొక్క; పెంపునన్= అతిశయంతో; నాకున్= శిష్యుడనైన నాకు; ఒసఁగెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: దేవేంద్రుడు తనకు పరశురాముడితో కల స్నేహంవలన దానిని ఆయనకిచ్చాడు. ఆ మహావీరుడు పరుషమైన పరాక్రమంతో దాని మహాశక్తితో రాజులనందరినీ ఇరవై ఒక్కసారులు సంహరించాడు. అనంతరం ఆ పరమదయాశాలి నా మీద వాత్సల్యం కొలదీ నాకు దాని నిచ్చాడు.

ఉ. ఆ మహనీయ చాపమున నర్జును దర్పమడంచి నేఁడు సం
గ్రామము నుజ్జగించెద నకంటక సుస్థితి గల్గ మేటినై
భూమి యమర్చెదం గొనుము భూవర! నీదగు పుత్త్ర పౌత్త్రులన్
శ్రీమహిమన్ సమస్తజన సేవ్య మహోన్నతిఁ బొందు' నట్లుగన్.' 234

ప్రతిపదార్థం: భూవర!= భూపతీ, దుర్యోధనా!; ఆ మహనీయ చాపమునన్= ఆ గొప్ప ధనుస్సుతో; నేఁడు= ఈవేళ; అర్జును= అర్జునునియొక్క; దర్పము= గర్వం; అడంచి= అణగగొట్టి, అతనిని సంహరించి; సంగ్రామమున్= యుద్ధాన్ని; ఉజ్జగించెదన్= (పూర్తిచేసి) విడిచి పెడతాను; మేటినై= పరాక్రమంలో శ్రేష్ఠుడనై; అకంటక= శత్రువులులేని; సుస్థితి= మంచి నిలుకడ; కల్గన్= కలుగునట్లుగా; భూమి= నేల, సమస్త రాజ్యం; అమర్చెదన్= ఏర్పరచి ఇస్తాను; నీదు+అగు= నీ యొక్క; పుత్త్ర= కుమారులను; పౌత్త్రులన్= మనుమలను, వంశపారంపర్యంగా; శ్రీమహిమన్= సంపదయొక్క, గొప్పదనంతో; సమస్త జన= అఖిల జనులచేతనూ; సేవ్య= సేవింపబడే; మహా+ఉన్నతిన్= గొప్ప ఔన్నత్యంతో; పొందున్+అట్లుగన్= సంక్రమించే రీతిని; కొనుము= స్వీకరించుము.

తాత్పర్యం: భూపతీ, దుర్యోధనా! ఈ వేళ ఆ మహాధనుస్సుతో అర్జునుడిని సంహరించి, యుద్ధం విడిచిపెట్టుతాను. పరాక్రమశాలులలో శ్రేష్ఠుడనై ఈ భూలోక సామ్రాజ్యమంతా శత్రువులు లేకుండా స్థిరంగా ఉండేటట్లు చేసి, నీకు సమర్పిస్తాను. నీవు గొప్ప సంపదతో, సమస్త జనులూ సేవించే మహౌన్నత్యంతో, నీ పుత్ర పౌత్రులకు సంక్రమించేటట్లు దానిని స్వీకరించుము.

వ. అని పలికి వెండియు నిట్లను 'నా విజయంబును విజయు గాండీవంబును నొక్కరూప యతనికి నక్షయ తూణీరంబులు నగ్నిదేవుం డిచ్చిన యభేద్యరథంబును నవధ్య రథ్యంబులును గల వవి యెక్కుడయినను దాని కంతఁ జింతింప. 235

ప్రతిపదార్థం: అని= ఇట్లా; పలికి= చెప్పి; వెండియున్= మళ్ళీ; ఇట్లు; అనున్= అన్నాడు; నా విజయంబును= నా యొక్క విజయం అనే ధనుస్సు; విజయు= అర్జునునియొక్క; గాండీవంబునున్= గాండీవం అనే పేరుగల విల్లు; ఒక్క; రూపు+అ= సమానమైనవే; అతనికిన్= అర్జునుడికి; అక్షయ= క్షయంకాని, ఎన్ని బాణాలు తీసినా బాణాలు తరగని; తూణీరంబులున్= అమ్ముల పొదులు; అగ్నిదేవుండు+ఇచ్చిన= అగ్నిదేవుడు ఒసగిన; అభేద్య= భేదింపబడని, విరుగగొట్టబడని; రథంబును; అవధ్య= వధింపబడని; రథ్యంబులున్= గుర్రాలు; కలవు= ఉన్నాయి; అవి= అట్టి అమ్ముల పొదులూ, అట్టి రథమూ, అట్టి గుర్రాలూ; ఎక్కుడు= నా కంటె అతడికి విశేషంగా ఉన్నవి; అయినను= అయినప్పటికినీ; దానికిన్= ఆ ఎక్కువకు; అంతన్= అంతగా; చింతింప(న్)= విచారించను.

తాత్పర్యం: అని చెప్పి, మళ్ళీ ఇట్లా అన్నాడు: 'నా విజయమూ అర్జునుడి గాండీవమూ రెండూ సమానమైనవే. ఇక అర్జునుడివద్ద ఎన్ని తీసినా తరగని అమ్ములపొదులున్నాయి. అగ్నిదేవుడు ఇచ్చిన విరుగగొట్ట సాధ్యంకాని రథమున్నది, చంపశక్యంగాని గుర్రాలున్నాయి. ఈ మూడూ అతడికి నా కంటే ఎక్కువే. అయినా వీటిని గురించి నే నంతగా విచారించను.

**క. నారాచము లాదిగఁ గల । ఘోరప్రదరములు బండ్లఁ గొని వచ్చెద బల్
తేరులు దృఢవాజులు నా । తేరి వెనుకఁ బె క్కమర్చి తెచ్చెద నధిపా! 236**

ప్రతిపదార్థం: అధిపా!= రాజా దుర్యోధనా!; నారాచములు= ఇనుప బాణాలు; ఆదిగన్+కల= మొదలయినవి ఉన్న; ఘోర= భయంకరాలయిన; ప్రదరములు= బాణాలు; బండ్లన్= బళ్ళపై; కొని= తీసికొని; వచ్చెదన్= వస్తాను; బల్ తేరులున్= పెద్ద రథాలూ; దృఢ= గట్టివైన; వాజి+లున్= గుర్రాలూ; నా తేరి= నా రథంయొక్క; వెనుకన్= వెనుకవైపున; పెక్కు= అనేకమైనవి; అమర్చి= ఉండేటట్లు చేసి; తెచ్చెదన్= తీసుకొని వస్తాను.

తాత్పర్యం: (ఆ లోపాలు మూడింటి గురించీ ఎందుకంతగా విచారించనంటే - వాటి నిట్లా పూడ్చుకొనవచ్చును గనుక) ఇనుప బాణాలూ మొదలయిన భయంకరా లయిన బాణాలను బండ్లమీద వచ్చే ఏర్పాటు చేస్తాను. (అట్లా అక్షయ తూణీరాలు లేని లోటు తీరుతుంది.) పెద్ద రథాలూ, గట్టి గుర్రాలూ నా రథం వెనుకనే వచ్చేటట్లు చేస్తాను. (అలా విరగని రథమూ, చావని గుర్రాలూ లేనిలోటు తీరుతుంది.)

విశేషం: అయినా, అమ్ముల కట్టలయిపోతే బండ్లమీదనుండి తెచ్చి రథంమీద పెట్టాలి. విరిగిన రథం దిగి కొత్త రథమెక్కాలి. పడిపోయిన గుర్రాలను వదలి కొత్త గుర్రాలను రథానికి కట్టాలి. ఇట్లా ఇది సహజసిద్ధమైన వాటికి సంపూర్ణమైన సాటిరాగల

ప్రతిక్రియ కాదు. అందుకే అంతగా విచారించననటం, కొంత విచారించవలసింది ఉన్నదని ఆ 'అంత' వలననే తెలుస్తున్నది. అర్జునుడి ఆధిక్యం ఎరిగి ఎరిగీ దుర్యోధనుడి సంతుష్టికి అతడిని ఎదిరించవలసి రావటం కర్ణుడికి వచ్చిన దుర్దశ.

వ. మఱియు నొక్కం డాకర్ణింపుము; భువన ప్రవర్తకుండయిన కృష్ణుండు సారథ్యంబు సేయుట నప్పార్థు పరాక్రమం బసాధ్యంబై యుండు నట్లగుటం జేసి. 237

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఒక్కండు= ఒకటి; ఆకర్ణింపుము= వినుము; ఆ+పార్థు= ఆ పృథా కుమారుడయిన అర్జునునియొక్క; పరాక్రమంబు= విక్రమం; భువన= లోకాలకు; ప్రవర్తకుండు+అయిన= నడిపేవాడయిన; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; సారథ్యంబు= సూతునిపని; చేయుటన్= కావించే కారణంచేత; అసాధ్యంబు+ఐ= సాధింపరానిది అయి, ఓడింపరానిదయి; ఉండున్= ఉంటుంది; అట్లు+అగుటన్+చేసి= అట్లా అయినందువల్ల, (కనుక).

తాత్పర్యం: ఇంకొక మాట వినుము. అన్ని లోకాలనూ నడిపే కృష్ణుడు అర్జునుడి రథం నడుపుతున్నాడు. కనుక, అర్జునుడి పరాక్రమాన్ని ఏమీ చేయలేకపోతున్నాము. అందువల్ల

విశేషం: దుర్యోధనుడిని మెప్పించటానికి ఇంత వరకూ ఏమనినా, ఏమిచేసినా, శ్రీకృష్ణు డంటే ఏమిటో కర్ణుడికి బాగా తెలియు ననటానికి 'భువన ప్రవర్తకుడు' అన్న ఒకమాట చాలు. తెలిసి తెలిసి అర్జునుని ఎదిరించవలసి వచ్చినందుకు కర్ణుడిపై మరీ జాలి కలుగుతుంది.

తే. భండనము నేర్పుమెయిఁ గృష్ణుపాటియనఁగ। మహిఁ బొగడ్తకు నెక్కిన మద్రనాథు
నాకు సారథిగాఁగ నొనర్ప వలయు। గెలుతు నట్లైన నన్నరు నలవు మెఱయ. 238

ప్రతిపదార్థం: భండనము నేర్పు మెయిన్= యుద్ధంలోని చాతుర్యంచేత; కృష్ణుపాటి= కృష్ణునంతటివాడు; అనఁగన్= అని పలుకగా; మహిన్= భూమిలో; పొగడ్తకున్+ఎక్కిన= ప్రశంస చెందిన; మద్రనాథున్= శల్యుని; నాకున్= (ఈ లోటు తీరితే అర్జునుడిని గెలువగల) నాకు; సారథి+కాఁగన్= సూతుడు అయ్యేటట్లు; ఒనర్పన్+వలయున్= చెయ్యాలి; అట్లు+ఐనన్= అట్లా అయితే; ఆ+నరున్= ఆ అర్జునుడిని; అలవు= బలం; మెఱయన్= ప్రకాశింపగా; గెలుతున్= గెలుస్తాను.

తాత్పర్యం: యుద్ధచాతుర్యంతో కృష్ణుడంతటివాడు అని పృథ్విలో ప్రశంస పొందిన శల్యుడిని నాకు సూతుడు అయ్యేటట్లు చెయ్యాలి. అట్లా అయితే బలం ప్రకాశించేటట్లు ఆ అర్జునుడిని గెలుస్తాను.

క. హరి కెక్కుడరయ మద్రే। శ్వరుఁ డశ్వజ్ఞానమున నసంశయ మే న
న్నరునకు మిక్కిలి బలవి। స్ఫురణంబునఁ గర్మకుశలబుద్ధిఁ దలంపన్. 239

ప్రతిపదార్థం: మద్ర+ఈశ్వరుఁడు= మద్రదేశపు రాజైన శల్యుడు; అశ్వజ్ఞానమునన్= గుర్రాలను గురించిన తెలివిలో; అరయన్= పరిశీలింపగా; హరికిన్= కృష్ణునికంటె; ఎక్కుడు= అధికుడు; అసంశయము= సందేహంలేదు; ఏన్= నేను; బలవిస్ఫురణంబునన్= శరీర బలం ప్రదర్శించటంలోనూ; కర్మకుశల= పనిలో నేర్పుగల; బుద్ధిన్= తెలివిలోనూ; తలంపన్= ఆలోచింపగా; ఆ+నరునకున్= ఆ అర్జునుడికంటె; మిక్కిలి= ఎక్కువవాడను.

తాత్పర్యం: గుర్రాలను గురించిన తెలివిలో పరిశీలిస్తే కృష్ణుడికంటె గొప్పవాడు శల్యుడు. బలప్రదర్శనంలోనూ, కార్యసాధన కవసరమైన నేర్పరితనంలోనూ, ఆలోచిస్తే - అర్జునుడికంటె గొప్పవాడను నేను. సందేహం లేదు.

క. కావున నవ్వర మి మ్మటు । గావించుట యెల్లహితముఁ గావించిన య
ట్టై వెలయు! నింత సేసి మ । హీవర! ననుఁ జూడు పోర నె ట్లేచెదనో. 240

ప్రతిపదార్థం: కావునన్= కనుక; మహీవర!= భూపతీ!; ఆ+వరము= ఆ కోరినది, శల్యుడి సారథ్యం; ఇమ్ము= ఈయవలసినది; అటు= అలా; కావించుట= చేయటం; ఎల్ల= సమస్తమైన; హితము= మేలు; కావించిన+అట్టు+ఐ= చేసినట్లు అయి; వెలయున్= ఒప్పును; ఇంత= ఈ చిన్నపని; చేసి= కావించి; పోరన్= యుద్ధంలో; ఎట్లు+ఏచెదను+ఓ= (అర్జునుని) ఎలా విజృంభిస్తానో; చూడు= పరిశీలించు.

తాత్పర్యం: కనుక, రాజా! నాకు ఆ వరం ఇమ్ము. అట్లా చేయటం అంటే నాకు అన్ని మేళ్ళూ చేయటమే. ఈ చిన్నిపని చేసి, నేను యుద్ధంలో ఎలా విజృంభిస్తానో చూడు.

క. విను మి తెఱఁగున నే న । య్య నిమిషవర్గంబునైన నాజి జయింతున్
మనుజులు పాండుతనూజులు । జననాయక! నాకు నొక్క సరకే? తలఁపన్.' 241

ప్రతిపదార్థం: జననాయక!= ప్రజానాథా! దుర్యోధనా!; వినుము= విను; ఈ+తెఱఁగునన్= ఈ విధంగా; శల్యుడి సారథ్యంతో; నేను; ఆ+అనిమిష= ఆ దేవతలయొక్క; వర్గంబున్= సమూహాన్ని; ఐనన్= ఐనప్పటికీ; ఆజిన్= యుద్ధంలో; జయింతున్= గెలుస్తాను; పాండు తనూజులు= పాండురాజు కొడుకులు; మనుజులు= మనుష్య మాత్రులు; తలఁపన్= ఆలోచింపగా; నాకున్= ఇంత శక్తిమంతుడనైన నాకు; ఒక్క= ఒక; సరకు+ఏ?= లెక్కా?

తాత్పర్యం: రాజా! ఇట్లా శల్యుడు సారథి అయిన పక్షంలో నేను యుద్ధంలో ఆ దేవతలనైనా జయించగలుగుతాను. ఈ పాండవులు వట్టి మనుష్యులు. ఆలోచిస్తే వీళ్ళు నాకొక లెక్కా?'

వ. అనిన విని నీ పుత్త్రుండు ప్రీతుం డయి రాధేయు నగ్గించి నీకెల్ల భంగిని శల్యు సారథిం గావించెదనని పలికి యుత్సాహదీప్తుం డై. 242

ప్రతిపదార్థం: అనినన్= ఇలా పలుకగా; విని; నీ పుత్త్రుండు= నీ కుమారుడైన దుర్యోధనుడు; ప్రీతుండు+అయి= సంతోషించి; రాధేయున్= కర్ణుని; అగ్గించి= ప్రశంసించి; నీకున్= నీకు (కర్ణుడికి); ఎల్లన్= సమస్తమైన; భంగిన్= విధాలా; శల్యున్= మద్రరాజును; సారథిన్= సూతుని; కావించెదన్= చేస్తాను; అని; పలికి= చెప్పి; ఉత్సాహ= (శల్యుని ఒప్పించాలి అనే) పూనికచేత; దీప్తుండు+ఐ= ప్రకాశిస్తున్న వాడై.

తాత్పర్యం: అని కర్ణుడు చెప్పగా విని నీ కుమారుడు సంతోషించి, కర్ణుడిని ప్రశంసించాడు. అన్నివిధాలా ప్రయత్నించి నీకు శల్యుడిని సారథిగా చేస్తానని చెప్పాడు. ఎట్లాగైనా శల్యుడిని ఒప్పించాలి అనే పూనికవలన అతడు మెరిసిపోతూ. (ఇంకా కర్ణుడితో ఇట్లా అన్నాడు:)

క. అమ్ముల బండ్లును రథ ర । థ్యమ్ములునుం బెక్కుదెత్తు నవనీశులు నా
తమ్ములు నేనును నీ పా । ర్శ్వమ్మున నడచెదము బరవసం బుగ్రముగన్. 243

ప్రతిపదార్థం: అమ్ముల బండ్లును= బాణాల శకటాలు; రథ= రథాలూ; రథ్యమ్ములునున్= గుఱ్ఱాలూ; పెక్కు= చాలా; తెత్తున్= నీ వెనుకనే తీసికొని వస్తాను; అవనీ+ఈశులున్= రాజులూ; నా తమ్ములున్; నేను= స్వయంగా నేనూ; నీ

పార్శ్వమ్మునన్= నీ ప్రక్క; బరవసంబు= ఉత్సాహం, ధైర్యం, పట్టుదల; ఉగ్రముగన్= తీక్ష్ణం అయ్యేటట్లుగా; నడచెదము= వస్తూ ఉంటాము.

తాత్పర్యం: (నీవు చెప్పినట్లే నీ వెనుకనే) బాణాల బళ్ళూ, రథాలూ, గుర్రాలూ అధిక సంఖ్యలో రప్పిస్తాను. నీకూ మాకూ కూడా ఉత్సాహమూ, ధైర్యమూ పట్టుదలా పెరుగుతూ ఉండే విధంగా, యుద్ధం చేస్తున్న రాజులూ, నా తమ్ముళ్ళూ, నేనూ కూడా నీ ప్రక్కనే వస్తూ ఉంటాము.

క. **అని చెప్పి ప్రీతుఁ డగు నా । తనిఁ దోడ్కొని నడచి సముచితంబుగ శల్యుం**
గని భక్తిఁ బ్రణతుఁడై యి । ట్లను దుర్యోధనుఁడు సవినయముగ నతనితోన్. **244**

ప్రతిపదార్థం: అని= ఈ రీతిగా; దుర్యోధనుఁడు; చెప్పి= పలికి; ప్రీతుఁడు+అగు= (తన మాటలకు) సంతోషించినవాడైన; ఆతనిన్= ఆ కర్ణుని; తోడ్కొని= తీసుకొని; నడచి= వెళ్ళి; సముచితంబుగన్= తగిన రీతిని; శల్యున్= మద్రరాజును; కని= దర్శించి; భక్తిన్= గౌరవంతో కూడిన ప్రేమతో; ప్రణతుఁడై= నమస్కరించినవాడై; సవినయముగన్= వినయంతో; అతనితోన్= శల్యునితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= పలికాడు.

తాత్పర్యం: ఈ రీతిగా చెప్పి దుర్యోధనుడు, తన మాటలకు సంతోషించిన కర్ణుడిని వెంట తీసికొని వెళ్ళి, శల్యుడిని సముచితంగా దర్శించి, భక్తితో నమస్కరించి, సవినయంగా అతడితో ఇట్లా అన్నాడు:

దుర్యోధనుఁడు శల్యునిఁ గర్ణునకు సారథ్యంబు సేయు మని ప్రార్థించుట (సం. 8-23-1)

సీ. **'సత్యవ్రతంబును శాత్రవదుర్దశా । పాదనంబును మహాభాగతయును**
నీకు నైజంబులు నాకుఁ బెద్దయుఁ గూర్తు । గావున ని న్నేను గారవించి
వినతుండనై వేఁడికొనియెద రాజుల । నడుమ నీ దగు సౌమనస్య మెఱిఁగి
యర్జును ననిఁ దెగటార్పఁగ వలయుట । యూహించి సంభృతోత్సాహలీలఁ

ఆ. **గావు మితని ననుచుఁ గర్ణునిఁ జూపి యీ । తనిరథంబు గడపు మనఘ! యిట్టు**
లైన నితఁడు పగఱఁ బో నీక పొదివి య । స్ఖలితగతుల నొంపఁ జంపఁ జాలు. **245**

ప్రతిపదార్థం: సత్యవ్రతంబును= సత్యంపై దీక్షా; శాత్రవ= పగవారికి; దుర్దశా= దుఃఖస్థితిని; ఆపాదనంబును= కలిగించటము; మహాభాగతయును= మిక్కిలి ప్రసిద్ధీ, భాగ్యము, పవిత్రతా కలిగి ఉండటము; నీకున్= నీకు; నైజంబులు= సహజమైనవి, స్వతస్సిద్ధాలు; నాకున్= నీపై ఆధారపడిన నాకు; పెద్దయున్= మిక్కిలిగా; కూర్తు= కూర్తువు, ఇష్టపడతావు; కావునన్= కనుక; నిన్నున్= ఇట్టివాడవైన నిన్ను; ఏను= (నీవు కావాలని ప్రయత్నించి కష్టపడి తెచ్చుకొన్న) నేను; గారవించి= గౌరవించి, మన్ననచేసి; వినతుండను+ఐ= నమస్కరించిన వాడనై; నీది+అగు= నీది అయిన; సౌమనస్యము= మంచి మనస్సు కలిగి యుండుట; ఎఱిఁగి= తెలిసి; రాజుల నడుమన్= ప్రభువుల మధ్య; వేఁడికొనియెదన్= అడుగుకొంటున్నాను; అర్జునున్; అనిన్= యుద్ధంలో; తెగటార్పఁగన్= సంహరింపగా; వలయుట= అవసరంకావటం; ఊహించి= ఆలోచించి; సంభృత= చక్కగా పూనిన; ఉత్సాహ= ధైర్యంయొక్క; లీలన్= విలాసంతో; ఇతనిన్= ఈ కర్ణుని; కావుము= కాపాడుము; అనుచున్= అని చెపుతూ; కర్ణునిన్= అంగరాజును; చూపి; ఈతని రథంబు= ఇతని తేరు; కడపుము= తోలుము; అనఘ!= ఓ పాపరహితుడా!; ఇట్టులు= ఇట్లా; ఐనన్= సంభవించినపక్షంలో; ఇతఁడు= కర్ణుడు, అంగరాజు; పగఱన్= శత్రువులను; పోన్+ఈక= తప్పించుకొని

పోనివ్వకుండా; పొదివి= క్రమ్మి; అస్ఖలిత= జారుపాటులేని; గతులన్= పద్ధతులతో; నొంపన్= నొప్పించటానికీ; చంపన్= సంహరించటానికీ; చాలు(న్)= సమర్థుడవుతాడు.

తాత్పర్యం: 'ఓ పాపరహితుడా!, సత్యదీక్షా, శత్రువులకు కష్టాలు కలిగించటమూ, గొప్పతనమూ నీ సహజ లక్షణాలు. నేనంటే నీకు చాలా ఇష్టం. అందువలన నీ మంచి మనస్సు తెలిసికొని, ఇందరు రాజుల మధ్య నేను నిన్ను చాలా గౌరవించి, నమస్కరించి, ప్రార్థిస్తున్నాను. అర్జునుడిని సంహరించటం అవసరం. కనుక ఇతడిని పూర్తి ప్రయత్నంతో రక్షించుము.' అని కర్ణుడిని చూపించి, నీ వితడి రథము నడుపుము అని, అట్లా అయితే ఇతడు శత్రువులను తప్పించుకొని పోనివ్వక ఆక్రమించి, ఏ జారుపాటూ లేకుండా బాధించగలుగుతాడు, చంపగలుగుతాడు అని అన్నాడు.

చ. గురుఁడును భీష్ముఁడుం జనినఁ గొంచెపు మూఁకలతోడ నేను సం
గరవిజయంబు గోరి భుజగర్వమునన్ సడిసన్న పాండుభూ
వరసుతవర్గముం దొడరువాఁడనకా మది నిశ్చయించు టె
వ్వరిఁగొని యింత నీ వెఱుఁగవా? నినుఁ గర్ణునిఁ గాదె? నమ్మితిన్. 246

ప్రతిపదార్థం: గురుఁడును= గురువైన ద్రోణాచార్యుడూ; భీష్ముఁడున్= భీష్మపితామహుడూ; చనినన్= వెళ్ళిపోయినప్పటికీ; కొంచెపు మూఁకలతోడన్= కొద్ది సైన్యముతో; నేను= (పెద్ద ఆధారం పోయిన) నేను; సంగర= యుద్ధంలో; విజయంబు= గెలుపు; కోరి= కావాలని; భుజ= బాహువులయొక్క; (బల) గర్వమునన్= (బలంమీది) పొగరుతో; సడి+చన్న= పేరుకెక్కిన; పాండు భూవర= పాండురాజుయొక్క; సుత= కుమారులయొక్క; వర్గమున్= సమూహాన్ని; తొడరు= ఢీకొనే; వాఁడనకాన్= అట్టివాడినే అయ్యేటట్లు; మదిన్= మనస్సులో; నిశ్చయించుట= నిర్ణయించటం; ఎవ్వరిన్= ఎవరిని; కొని= ఆధారంచేసికొని; ఇంత= ఇదంతా; నీవు; ఎఱుఁగవా?= నీకు తెలియదా?; నినున్= నిన్నూ; కర్ణునిన్= అంగరాజునూ; నమ్మితిన్= నమ్మాను; కాదె?= కాదా?

తాత్పర్యం: భీష్మద్రోణు లిద్దరూ వెళ్ళిపోయిన తరువాత పలుచబడిపోయిన సామాన్య సైనికుల సాయంతో నేను యుద్ధంలో గెలవాలని భుజబల గర్వానికి పేరుకెక్కిన పాండవులను ఢీకొనటానికే మనస్సులో నిర్ణయించుకొన్నానంటే ఎవరిని చూచుకొని? నిన్నూ, కర్ణుడినే కదా నేను నమ్మినది! ఇదంతా నీకు తెలిసినదే కదా!

విశేషం: సత్యానికి కొంత మాటలనేర్పు జోడించి, స్వకార్యసాధనకు తెలివయిన వారు ఎట్లా ప్రయత్నిస్తారో దుర్యోధనుడి మాటలవలన తెలుస్తుంది. నిన్నూ, కర్ణుడినీ నేను నమ్ముకొని యుద్ధం కొనసాగిస్తున్నానంటాడు. ఇది సత్యమే, శల్యు డట్లా ఆధారపడదగిన వాడే. కనుకనే కర్ణుడి తరువాత ఆయననే సేనానాయకుడిని చేశాడు. కాని నమ్మటంలోని ప్రాధాన్యక్రమం మాత్రం దుర్యోధనుడు చెప్పినది కాదు. నిన్నూ, కర్ణుడినీ అన్నది నిజానికి కర్ణుడినీ, నిన్నూ అనాలి. అందుకే శల్యుడినికాక, కర్ణుడిని సేనానాయకుడిని చేశాడు. కానీ మొగం ముందు మాట్లాడేటప్పుడు శల్యుడికి ద్వితీయస్థానం ఇవ్వటం కార్యకారికాదు. అందుకని 'నిన్నూ కర్ణుడినీ' అంటున్నాడు.

క. ఇ మ్మివ్వరమ్ము సార । థ్య మ్మితనికిఁ జేయు మినున కరుణుఁడు సాహా
య్య మ్మొనరిచినట్లుగఁ దిమి । రమ్ము క్రియన్ రూపుసెడి యరాతు లడంగన్. 247

ప్రతిపదార్థం: ఈ+వరమ్ము= ఈ వరం; ఇమ్ము; ఇనునకున్= సూర్యునికి; అరుణుఁడు= ఆ పేరుగల సూర్యుడి సారథి; సాహాయ్యమ్ము= సాయం; ఒనరిచినట్లుగన్= చేసినట్లుగా; తిమిరమ్ము క్రియన్= చీకటిలా; అరాతులు= శత్రువులు; రూపు+ చెడి= ఆకారంపోయి, యుద్ధంలోకూలి, అడంగన్= అణగిపోగా; నశించగా; ఇతనికిన్= ఈ కర్ణునికి; సారథ్యమ్ము= సూతునిపని, రథం తోలటం; చేయుము.

తాత్పర్యం: నా కీ వరం ఇమ్ము. ఇతడికి సూతుడిపని చేసిపెట్టుము. అదెంతటిదంటే సూర్యుడికి అరుణుడు సాయంచెయ్యటం వంటిది. అరుణుడి సాయంవలన చీకట్లణగిపోతున్నాయి. నీవు కర్ణుడి రథం తోలటంవలన శత్రువులంతా ఆకారాలు పోయి అణగారిపోతారు.

విశేషం: చేయవలసిన పని నీచపు పని అయి, చేయవలసినవాడు గొప్పవాడయినప్పుడు పనిని గొప్పచేసి పేర్కొనటం, అదీ మంచి మాటలతో చెప్పటం ఎల్లకాలాలలోనూ ఉన్నదే. ఈ పోలికా అట్టి ప్రయత్నమే. సూర్యుడూ, అరుణుడూ ఒకే తండ్రి కశ్యపుడి వలన ఇద్దరు తల్లులకు వరుసగా అదితికీ వినతకూ కలిగినవారు. అరుణుడు తక్కువపని అనుకొనక తిమిరనాశనంలో అన్నకు సాయపడుతున్నాడు. సారథ్యం చెయ్యటమంటే వట్టి తేరి గుర్రాలను తోలటం కాదు కదా, తగిన సలహాలు రథికుని కివ్వటమూ అవసరమైనపుడు అతడిని రక్షించటమూ మొదలైన ముఖ్యమైన పనులు చాలా ఉన్నాయి చేయవలసినవి. అన్ని మాటలకూ కిరీటం వంటిది పద్యం మొదట ఉన్న 'ఇమ్మివ్వరమ్ము' అన్నది ఈ సారథ్యం చేయటం భగవంతుడు భక్తుడికి వరం ఇవ్వటం వంటిది.

ఈ పద్యం మూడవ పాదం 'య్యమ్మొనరించినట్లుగఁదిమి' అని ఉన్నది. ఇందులో రెండవ గణం రగణం అవుతున్నది. ఇది కందపద్యంలో ఉండదగినదిగా లాక్షణికులు పేర్కొన్న గణాలలోనిది కాదు. ఉస్మానియా ప్రతిలోనే కాక వావిళ్ళవారి 1963 ప్రతిలోనూ అట్లాగే ఉన్నది. దీన్ని సవరించటానికన్నట్లు ఏర్పడిన పాఠాంతరాలను రెండు ప్రతులూ గమనించాయి గాని వాటిని పాఠాంతరాలుగానే ఇచ్చాయి. ఉస్మానియా ప్రతిలో 'య్యమొనరించినట్లుగఁ' అని కూడా ఉన్నది కాని అచ్చులో ఈ మావత్తు రాలిపోయినదిగా భావించాము. 'రించి'లో సున్న లేకపోయినా సరిపోయేది. లక్షణవిరుద్ధం కనుక సున్న లేని పాఠం మేము ఇచ్చాము. ఆం.ప్ర.సా.అ. వారి (తె.వి) ప్రతిలో మాత్రం సున్నలేదు. ప్రకాశకుల విజ్ఞప్తి, చివరలది శుక్ల ఉగాదివాడు వ్రాసినట్లున్నది. అని ఇటీవల 22-6-2000న మేము గుర్తించాము. కాని ఆ ప్రతి ఎప్పుడు అచ్చువేశారో- అందులో లేదు.

క. అనిన విని కెంపుసొంపునఁ । గనుఁగవ యుగ్రముగ బొమలు గదియఁగ ఫాల
మ్మునఁ జెమటవొడమ నీ సుతుఁ । గనుఁగొని యిట్లనియె నతఁడు కటము లదరఁగన్. 248

ప్రతిపదార్థం: అనినన్= ఇలా చెప్పగా; అతఁడు= శల్యుడు; విని= ఆలకించి; కెంపుసొంపునన్= పద్మరాగమణియొక్క అందంవంటి అందంతో, పద్మరాగమణిలా; కనుఁగవ= కన్నుల జంట; ఉగ్రముగన్= భయంకరం కాగా; బొమలు= కనుబొమలు; కదియఁగన్= ఒకదానినొకటి సమీపింపగా; ఫాలమ్మునన్= నొసట; చెమట; పొడమన్= కలుగగా; కటములు= చెక్కిళ్ళు; అదరఁగన్= కదలగా; నీ సుతున్= నీ కుమారుడైన దుర్యోధనుని; కనుఁగొని= చూచి; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: దుర్యోధనుడు పలికిన మాటలు వినేసరికి కోపంతో శల్యుడి కన్నులు ఎర్రబడ్డాయి. కనుబొమలు ఒకదానికొకటి దగ్గరగా వచ్చాయి. నొసట చెమట పట్టింది. చెక్కిళ్ళు కదిలాయి. ఇవి జరుగుతుండగా, అతడు దుర్యోధనుడిని చూచి, ఇట్లా అన్నాడు:

సీ. 'ననునింత నీచపుఁ బనికిఁ బంపఁగ నీకుఁ । దగునె? భూవర! వర్ణధర్మవిధము
లెఱుఁగవే? శూద్రుల కే నాఁటఁ బరిచర్య । సేసిరి? మూర్ధాభిషిక్తులైన
రాజులు సూతజు రాధేయు దొరఁజేసి । కొని యేను సారథ్యమునకుఁ జొరఁగఁ
జాల నీతని బలశాలిగాఁ దలచెదు । నాకంటె నిట్టిబన్నంబుఁ గలదె?

ఆ. పగఱలోన నొకనిఁ బాల్వెట్టు మెట్టి వాఁ । డైన సమయఁజూచి యరుగువాఁడ
నట్టిభంగి సాలదంటేనిఁ దరవాయి । గొని వధింతు శత్రుకోటి నెల్ల. 249

ప్రతిపదార్థం: భూవర!= భూపతీ!, దుర్యోధనా!; ననున్= (మద్రదేశాధీశ్వరుని, మాటకు కట్టువడి మేనల్లుళ్ళకు వ్యతిరేకంగా నీకు సాయం వచ్చిన వాడిని, భీష్మద్రోణులు పోయినా జయాశ కల్పించిన వాడనని నీవే ఇపుడే పేర్కొన్నవాడిని, వర్ణక్రమంలో రెండవదైన క్షత్రియ వర్ణం వానిని) నన్ను; ఇంత= (ఊహించటానికి కూడా వీలులేని మరీ) ఇంత; నీచపు+పనికిన్= నికృష్టమైన కార్యానికి; పంపఁగన్= ఆజ్ఞాపింపగా, పంపించగా; నీకున్= (యుక్తాయుక్తజ్ఞానంతో పరిపాలన చేసి తగినవారికి తగినపని చెప్పదగిన క్షత్రియ పరిపాలకుడవైన) నీకు; తగునె= తగునా? తగదు; వర్ణ= నాలుగు వర్ణములయొక్క; ధర్మ= ధర్మాలయొక్క; విధములు= విధానాలు; ఎఱుఁగవే?= తెలిసినవాడవు కావా?; మూర్ధ= శిరస్సున; అభిషిక్తులు= రాజ్యంలో అభిషేకింపబడిన; రాజులు= రెండవ వర్ణంవారైన క్షత్రియులు; ఏ నాఁటన్= ఏ దినాన, ఏ సమయంలో; శూద్రులకున్= నాల్గవ జాతి వారికి; పరిచర్య= సేవ; చేసిరి= చేశారు?, (ఎన్నడూ ఎక్కడా చేయలేదు); ఏను= మూర్ధాభిషిక్త క్షత్రియుడనైన నేను; సూతజున్= సూతకులంలో పుట్టిన; రాధేయున్= రాధాపుత్రుడయిన కర్ణుని; దొరన్= ప్రభువును, రథికుని; చేసికొని= కావించుకొని; సారథ్యమునకున్= సూతుని పనికి; చొరఁగన్= పూనుకొనగా; చాలను= (సమర్థుడనుకాను), ఇష్టపడజాలను; ఈతనిన్= ఈ సూతపుత్రుని; నాకంటెన్= బలశాలినైన నాకంటె; బలశాలిన్+కాన్= బలం కలవానినిగా; తలఁచెదు= భావిస్తున్నావు; ఇట్టి= ఇటువంటి; బన్నంబు= భంగపాటుకూడా, అవమానంకూడా; కలదు+ఎ= ఉన్నదా?; పగఱలోనన్= శత్రువులలో; ఒకనిన్= ఒకడిని; పాల్వెట్టుము= (అతనిని చంపటం) నా వంతని ఇమ్ము; ఎట్టివాఁడు= అతడు ఎంతటి, ఎటువంటి వాడైనప్పటికీ; సమయన్= మరణించేటట్లు; చూచి; అరుగువాఁడన్= వెళ్ళిపోతాను; అట్టి భంగి= అట్టి పద్ధతి; చాలదు= సరిపోదు; అంటి(వి)+ ఏనిన్= అనిన పక్షంలో; తరవాయిన్+కొని= మునుముపెట్టి (మునుము పెట్టటం అంటే వరి మొదలయినవి కోసేటప్పుడు లేదా కలుపు తీసేటప్పుడు, ఒక వరుసగా ఉండి పనిచేసుకొంటూ ముందుకు పోయే పనివారు ఒక్కడి నుంచి ఒక్కడి వరకూ కోసుకొంటూ లేదా కలుపు తీసుకొంటూ పోవాలి అని కొంత భాగాన్ని తమవంతు భాగంగా పెట్టుకొనటం. అట్లా సైన్యంలో ఇంతమేర ఉన్న భాగాన్ని నరుక్కొంటూ ముందుకు పోతానని ఇక్కడ అర్థం); శత్రుకోటిన్= శత్రువుల సమూహాన్ని; ఎల్లన్= అంతనూ, సమస్తాన్నీ; వధింతున్= సంహరిస్తాను.

తాత్పర్యం: రాజా! దుర్యోధనా! మూర్ధాభిషిక్తుడనైన, క్షత్రియుడనైన, నన్ను ఇంత నికృష్టపు పని చేయుమనటం నీకు తగదు. వర్ణధర్మాలెటువంటివో నీకు తెలియదా? మూర్ధాభిషిక్తులై రెండవ వర్ణంవారైన క్షత్రియులు నాలుగవ వర్ణం వారికి ఎన్నడైనా ఎక్కడైనా సేవ చేశారా? అందుచేత సూతపుత్రుడు రాధకు పుట్టినవాడు అయిన కర్ణుడు రథికుడుగా నే నతడికి రథంతోలేపని చేయలేను. ఈ కర్ణుడు నాకంటె బలమయినవా డనుకొంటున్నావు నీవు. ఇటువంటి పరాభవం కూడా ఉంటుందా? నా బలం ఏమిటో తెలియాలంటే, నే నితనికంటె తక్కువ బలం కలవాడినో, ఎక్కువ బలం కలవాడినో తెలియాలంటే నీ శత్రుపక్షంలో ఉన్నవారిలో నీ ఇష్టం వచ్చిన వాడిని ఒక్కడిని పేర్కొని, అతడిని చంపటం నా వంతు అని చెప్పుము. ఆ పని చేసి నా దారిని నేను పోతాను. అట్లా చేస్తే చాలదంటావా, మొత్తం శత్రువులనందరినీ మునుము పెట్టి సంహరిస్తాను.

విశేషం: ఇందులోని వర్ణాల ఎక్కువ తక్కువల ప్రసక్తిని నేటి దృష్టితో కాక నాటి దృష్టితోనే చూడాలి. నేడైనా ప్రభుత్వంలోని నాలుగవతరగతి ఉద్యోగిక్రింద రెండవతరగతి ఉద్యోగిని పనిచేయుమంటే ఒప్పుకోడు.

క. **విను మేను విక్రమింపఁగ । గనుఁగొనియెడునంతవాఁడుఁ గలఁడే? కులశై**
ల నికాయంబు వగల్తును । వననిధులు గలంతు ధరణి వ్రత్తుం గలయన్. **250**

ప్రతిపదార్థం: వినుము= విను; ఏను= నేను; విక్రమింపఁగన్= పరాక్రమం ప్రదర్శిస్తే; కనుఁగొనియెడు= చూడగలిగిన; అంతవాఁడున్= అంతటి సామర్థ్యం కలవాడు కూడా; కలఁడే?= ఉన్నాడా?; కులశైల నికాయంబు= కులపర్వతాల సముదాయాన్ని; వగల్తును= బ్రద్దలు చేస్తాను; వన నిధులు= సముద్రాలను; కలంతున్= సంక్షోభింపజేస్తాను; ధరణి= భూమిని; కలయన్= అంతటా; వ్రత్తున్= చీల్చివేస్తాను.

తాత్పర్యం: వినుము, నేను పరాక్రమం ప్రదర్శిస్తే (ఎదిరించటమూ, మించటమూ మాట అట్లా ఉంచి) చూడగల సామర్థ్యం కలవాడు కూడా లేడు. నేను కులపర్వతాలను పగులగొట్టగలను. సముద్రాలను కలచి వెయ్యగలను. భూమినంతటినీ చీల్చి వెయ్యగలను.

విశేషం: 'నికాయంబులు వగలుతు' అని ఉస్మానియా, వావిళ్ళ ప్రతులు రెంటిలోనూ ఉన్నది. నికాయంబులన్ అని ద్వితీయాంతమైతే 'ఁబగలుతు' అని ఉండాలి ప్రథమాంతమైతే 'నికాయంబులు వగలుతు' అని ఉండాలి. సూ.ని.లో.పగులుచు ఉన్నది కాని వగలుచు లేదు.

చ. **నరవర! చూడవే తెలియ నాదగు బాహులు మద్బలంబు నీ**
వరయక పల్కితే నొకని కక్కట! సారథినై రథిత్వ వి
స్ఫురణము దక్క నోపుదునె? సూతతనూజుఁడు షోడశాంశమున్
దొరయఁడు నాకు వాసవసుతున్ మురమర్దనుఁ జీరికిం గొనన్. **251**

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; మత్+బలంబున్= నా శక్తిని; నీవు; అరయక= పరిశీలింపక; పల్కితి(వి)+ఏన్= పలికిన పక్షంలో; తెలియన్= (నా బలం) తెలియటానికి; నాదగు= నావి అయిన; బాహువులు= చేతులు; చూడవు+ఏ= చూడు; అకట!= అయ్యో!; ఒకనికిన్= అల్పునికి, ఎవడో ఒకడికి; సారథిన్+ఐ= సూతుడనై; రథిత్వ= రథికునితనంయొక్క; విస్ఫురణము= మెరవటం, రథికుడుగా పేరుకెక్కటం; తక్కన్= తప్పిపోవటానికి; ఓపుదునె?= సహింపగలనా?; సూత తనూజుఁడు= సూత పుత్రుడైన కర్ణుడు; నాకున్= నాకు; షోడశ= పదహారవ; అంశమున్= పాలుగూడా; దొరయఁడు= సరికాడు; (నేను) వాసవ సుతున్= ఇంద్రుని కుమారుడైన అర్జునుడినీ; మురమర్దనున్= నరకుని సేనాని అయిన మురాసురుని సంహరించిన కృష్ణుడినీ; చీరికిన్+కొనన్= లక్ష్యపెట్టను.

తాత్పర్యం: రాజా! నీవు నా బలం తెలియనందువలన కర్ణుడికి సారథివి కమ్మని పలికిన పక్షంలో నా బలం తెలియాలంటే నా చేతు లెట్లా ఉన్నాయో చూడుము. అబ్బా, నేను ఒక అల్పుడికి, ఎవడో ఒకడికి సారథినయి, రథికుడిగా నా పరాక్రమం ప్రదర్శించే అవకాశం కోల్పోవటాన్ని సహించగలనా? ఈ సూతపుత్రుడు శక్తిలో నా పదహారవ పాలుకు కూడా సాటి రాలేడు. దేవేంద్రుడి కొడుకైన అర్జునుడినీ, మురాంతకుడైన కృష్ణుడినీ కూడా నేను లేశమైనా లెక్కపెట్టను.

వ. ఇట్లగుటెఱుంగక చెప్పితి వెఱింగియుం గర్ణుపక్షపాతంబున నన్నవమానించెదేని మా భూమికింబోయి వచ్చెద' నని పలికి రాజమధ్యంబున నుండి వెడలిపోవం జూచినం గురుపతి సప్రణయబహుమానంబునం జని నిలువరించి సాంత్వన స్వరంబున 'మధురాక్షర విన్యాసంబుగా నతనితోఁ 'గర్ణుండ యేల తక్కునీకెక్కుడయిన రథికులుం గలరే? కడిందిపగఱకు హృదయశల్యం బగుటఁగాదె! నీకు శల్యుండను నభిధానంబయ్యె నాయభిప్రాయంబు వినుము ధనంజయునకు రథికగుణంబులం గర్ణుండు మిక్కిలి కృష్ణునకు నశ్వహృదయజ్ఞానంబున నీ వధికుండవు ధనంజయునకుఁ బ్రతివీరుంగా మనము కర్ణుం జాలించితి మది కృష్ణుండు సెల్లనీ కునికిం జేసి కృష్ణువర్తనంబునకుఁ బ్రతివిధానం బాచరింప నిన్నుం గోరితి నింతపని నీకుందక్క నొరులకు శక్యం బగునే' యనిన విని ముదిత హృదయుండయి మద్రేశ్వరుండు. 252

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; అగుట= ఉండుట; ఎఱుంగక= తెలియక; చెప్పితివి= (సారథివి కమ్మని) చెప్పావు; ఎఱింగియున్= తెలిసికూడా; కర్ణు= కర్ణుడియొక్క; పక్ష= వైపు; పాతంబునన్= ఒరగటంచేత; నన్నున్= ఇటువంటి నన్ను; అవమానించెదు+ ఏనిన్= ఇలా పరాభవిస్తున్న పక్షంలో; మా భూమికిన్= మా దేశానికి; పోయివచ్చెదన్= వెళ్ళివస్తాను; అని; పలికి= చెప్పి; రాజమధ్యంబుననుండి= రాజుల నడుమనుంచి; వెడలిపోవన్= వెళ్ళిపోవటానికి; చూచినన్= ప్రయత్నించగా; కురుపతి= కురువంశీయుడయిన రాజు దుర్యోధనుడు; సప్రణయ= ప్రేమతో కూడిన; బహుమానంబునన్= గౌరవంతో; చని= వెళ్ళి; నిలువరించి= ఆపి; సాంత్వన= ఊరడింపుతో కూడిన; స్వరంబునన్= కంఠస్వరంతో; మధుర= తీయని; అక్షర= అక్షరాల యొక్క; విన్యాసంబుగాన్= ఉంచుట కలిగేటట్లు (తీయని) మాటలతో; అతనితోన్= శల్యుడితో; కర్ణుండఏల= కర్ణుడే ఏమి; తక్కు= మిగిలినవారిలో; నీకున్= నీకంటే; ఎక్కుడు= అధికులు; అయిన= ఐన; రథికులున్= రథం ఎక్కి యుద్ధం చేసేవారు కూడా; కలరే= ఉన్నారా? కడింది= గొప్పవారైన; పగఱకున్= శత్రువులకు; హృదయ శల్యంబు= గుండెలో దిగినబాణం; అగుటన్+కాదె!= ఐనందువలన కదా!; నీకున్= నీకు; శల్యుండు+అను= శల్యుడు అనే; అభిధానంబు= పేరు; అయ్యెన్= కలిగింది; నా+అభిప్రాయంబు= నాయొక్క ఉద్దేశం; వినుము; కర్ణుండు= అంగరాజు; రథిక గుణంబులన్= రథికులకు ఉండే గుణాలలో; ధనంజయునకున్= అర్జునుడికంటె; మిక్కిలి= అధికుడు; నీవు= మద్రదేశాధీశ్వరుడవైన నీవు; అశ్వ= గుర్రాలయొక్క; హృదయ= మనస్సులయొక్క; జ్ఞానంబునన్= తెలివిలో; కృష్ణునకున్= శ్రీకృష్ణుడికంటె కూడా; అధికుండవు= ఎక్కువవాడవు; మనము= నీవూ తదితరులమూ; ధనంజయునకున్= అర్జునుడికి; ప్రతివీరున్+కాన్= ఎదిరియోధుడిగా; కర్ణున్= అంగరాజును; చాలించితిమి= సమర్థుడిగా చేశాము; అది= కర్ణుడి ప్రతివీరత్వాన్ని; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; చెల్లనీక= సాగనివ్వక; ఉనికిన్+ చేసి= ఉండినందువలన; కృష్ణు= కృష్ణుడియొక్క; వర్తనంబునకున్= నడవడికి; ప్రతివిధానంబు= మారుపద్ధతి; ఆచరింపన్= చేయటానికి; నిన్నున్= సమర్థుడవైన నిన్ను; కోరితిని= ప్రార్థించాను; ఇంతపని= కృష్ణుడి ఎత్తుకు పై ఎత్తుగా నడపటమంత గొప్పకార్యం; నీకున్= సమర్థుడవైన నీకు; తక్కన్= తప్ప; ఒరులకున్= ఇతరులకు; శక్యంబు= చేయదగినది; అగునే= కాగలదా?; (కాదని అర్థం); అనినన్= అని చెప్పగా; విని; ముదిత= సంతోషించిన, హృదయుండు= మనస్సు కలవాడు; అయి; మద్రేశ్వరుండు= మద్రదేశపు రాజైన శల్యుడు.

తాత్పర్యం: విషయం ఇటువంటి దని నీకు తెలియనందున కర్ణుడి రథం తోలుమన్నావు; తెలిసికూడా కర్ణుడిమీద ఎక్కువ ప్రేమ ఉన్నందున నన్ను పరాభవిద్దామనుకుంటున్నావో, నేను మా దేశానికి వెళ్ళిపోతాను.' అని చెప్పి, శల్యుడు రాజుల మధ్యనుండి వెళ్ళిపోబోతుంటే దుర్యోధనుడు వెళ్ళి, ప్రేమతో, గౌరవంతో ఆపాడు. ఊరడిస్తున్న గొంతుతో తియ్యని పలుకులు ఉచ్చరిస్తూ శల్యుడితో ఇట్లా అన్నాడు. 'కర్ణుడే కాదు నిన్ను మించిన రథికులు మరెవరూ కూడా లేరు. (కనుక, రథికులలో కర్ణుడు నీకంటె ఎక్కువవాడని కాని, అతడికంటె నీవు తక్కువవాడవని కాని ని న్నతడికి

సారథివి కమ్మనలేదు.) నీవు గొప్ప శత్రువుల గుండెలో శల్యం(బాణం) వంటి వాడవైనందువలన కదా, నీకు శల్యుడనే పేరు వచ్చింది! (అయితే నన్నీ నీచకార్యానికెందుకు నియమించావంటే అట్లా నిన్ను సారథ్యం వహించమనటంలో) నా ఉద్దేశమేమిటో కొంచెం వినుము. (ఇక్కడ రథికులలో నీవెక్కువా కర్ణుడెక్కువా అన్నది కాదు ఆలోచించవలసినది) రథికుడి కుండవలసిన లక్షణాలలో అర్జునుడికంటె గొప్పవాడు కర్ణుడు, గుర్రాల మనస్సు తెలిసికొనటంలో కృష్ణుడికంటె గొప్పవాడవు నీవు. అర్జునుడికి ప్రతివీరుడిగా మనం కర్ణుడిని తగినవాడిని చేశాము (ఇదీ అశ్వత్థామ ఇట్లా చేయుమని చెప్పినందున మీ అందరూ ఆమోదించినందువలన అతడు సేనానాయకు డైనాడు. కాని, నా పక్షపాతంవలన కాదు.) మన ఈ నిర్ణయాన్ని కృష్ణుడు అర్జునుడికి సారథిగా ఉండి నిరుపయోగం చేస్తున్నాడు. దానికి తగిన ప్రతిక్రియ చేయాలంటే, కృష్ణుడి ఎత్తులకు పైఎత్తులు వెయ్యాలంటే సమర్థుడవు నీ వొక్కడవే కనుక ని న్నిలా ప్రార్థించాను. (కనుక ఎక్కువ తక్కువలు ఆలోచించవలసినది నీకూ కృష్ణుడికీ మధ్య మాత్రమే. కృష్ణుడికంటె నీవధికుడవనుకోబట్టే నిన్ను ప్రార్థించినది. ఇది నిన్నెక్కువ గౌరవించటం కాని పరాభవించటం కాదు.) ఇంత మహాకార్యం నీ వలన కావాలి. కాని, ఇతరులవలన కాదు' అని చెప్పేసరికి శల్యుడికి మనస్సులో చాలా సంతోషం కలిగింది. అందువలన ఇట్లా అన్నాడు:

క. 'ననుఁ గృష్ణుకంటె నధికుం । డని యిమ్మనుజేంద్రకోటి యాకర్ణింపం
గొనియాడితి విమల యశో । ఘనుఁ డగు కర్ణునకు రథము గడపెద నధిపా!' 253

ప్రతిపదార్థం: అధిపా!= రాజా దుర్యోధనా!; ననున్= నన్ను; కృష్ణుకంటెన్= సర్వాధికుడని అందరిచేతా కీర్తింపబడుతున్న కృష్ణుడికంటె; అధికుండని= గొప్పవాడనని; ఈ+మనుజేంద్ర= ఈ రాజులయొక్క; కోటి= సమూహం; ఆకర్ణింపన్= వినగా; కొనియాడితి(వి)= ప్రశంసించావు; విమల= స్వచ్ఛమైన; యశః= (దానాదుల వలన కలిగిన) కీర్తి చేత; ఘనుఁడు= గొప్పవాడు; అగు= అయిన; కర్ణునకున్= అంగరాజుకు; రథము= తేరు; కడపెదన్= తోలుతాను.

తాత్పర్యం: 'రాజా! ఇంతమంది రాజులు వింటూ ఉండగా, నీవు నన్ను కృష్ణుడికంటె గొప్పవాడివి అని ప్రశంసించావు. కనుకనూ, స్వచ్ఛమైన కీర్తి చేత గొప్పవాడైన కర్ణుడికి నేను రథం నడుపుతాను.

విశేషం: ఎవరి నెట్లా పడగొట్టాలో దుర్యోధనుడికి బాగా తెలుసు. ఇప్పుడు శల్యుడిని పడగొట్టటం అతని ఉద్దేశం. అందుకతడు వేసిన ఎత్తు రెండోసారి ఫలించింది. ఒకడి రథం నేను తోలటమేమిటి అని అనుకొన్నప్పుడు కర్ణుడు సూతజుడుగా, రాధేయుడుగా (249వ పద్యం) అతడికి కనిపించాడు. నీవు కృష్ణుడికంటె గొప్పవాడవనేసరికి అదే కర్ణుడు విమల యశోఘనుడుగా కనిపించాడు. పొగడ్తలకు లొంగిపోయే వారి స్వభావాలు ఈలాగే ఉంటాయి.

వ. అని యా సూతనందను నుద్దేశించి వెండియు నిట్లనియె. 254

ప్రతిపదార్థం: అని= ఇలా పలికి; ఆ సూతనందనున్= ఆ సూతపుత్రుడయిన కర్ణుడిని; ఉద్దేశించి= మనస్సులో పెట్టుకొని; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని కర్ణుడి విషయమై మళ్ళీ ఇట్లా అన్నాడు:

విశేషం: పుట్టుకతో పుట్టిన బుద్ధి పోయేదికాదు. దుర్యోధనుడి మాటల నేర్పువలన ఒప్పుకొన్నా తన ఆధిక్యం వదులుకొనటం శల్యుడికి సమ్మతం కాలేదు. కనుక మళ్ళీ విమలయశోఘనుడు సూతనందనుడై పోయాడు. ఈ మాట అంటున్నది

సంజయుడే అయినా శల్యుడి మనసు ననుసరించి అంటున్నాడు. అంతేకాదు, శల్యుడు తన సారథ్యానికి ఒక 'షరత్తు' విధిస్తున్నాడు.

క. 'జనవల్లభ! యొకసమయము । విను మీతనితోడ నేను విచ్చలవిడిఁ దోఁ
చిన మాట లెల్ల నాడుదు । నను నెగ్గలు వట్ట కుండినం బొం దొనరున్.' 255

ప్రతిపదార్థం: జనవల్లభ!= ప్రజానాథా! రాజా! దుర్యోధనా!; ఒక; సమయము= నియమం; వినుము= విను; ఈతనితోడన్= ఈ కర్ణుడితో; నేను= కృష్ణుడికంటె అధికుడనైన నేను; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; తోఁచిన= మనస్సుకు స్ఫురించిన; మాటలెల్లన్= పలుకులన్నీ; ఆడుదున్= పలుకుతాను; ననున్= అలా పలికిన నన్ను; ఎగ్గలు+పట్టక= తప్పులు పట్టక; ఉండినన్= ఉండినట్లయితే; పొందు= స్నేహం; ఒనరున్= కలుగుతుంది.

తాత్పర్యం: 'రాజా! ఒక నియమం విను. నేను ఇతడితో నా ఇష్టం వచ్చినట్లు నాకు తోచిన మాటలన్నీ మాట్లాడుతాను. అందుకు నన్ను తప్పుపట్టకుండా ఉంటే స్నేహం కుదురుతుంది.'

క. అనుటయు గారవమున నీ । తనయుఁడు రాధేయుఁ జూచి తగు ని ట్లగుఁగా
కని పలికి శల్యునిం గనుఁ । గొని యిది గడులెస్స యనియెఁ గురువంశనిధీ! 256

ప్రతిపదార్థం: కురువంశనిధీ!= కురుకులానికి నిధివంటి ధృతరాష్ట్ర మహారాజా!; అనుటయున్= అని చెప్పగా; నీ తనయుఁడు= నీ కుమారుడైన దుర్యోధనుడు; గారవమునన్= గౌరవంతో; రాధేయున్= రాధాపుత్రుడైన కర్ణుడిని; చూచి= పరికించి; తగున్= శల్యుడు అలా మాటాడటం యుక్తం; ఇట్లు+అగున్+కాక= ఇట్లాగే అగుగాక!; అని= అలా; పలికి; శల్యునిన్= శల్యుడిని; కనుఁగొని= చూచి; ఇది= ఈ నియమం; కడున్= మిక్కిలి; లెస్స= మంచిది; అనియెన్.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అట్లా శల్యుడు పలుకగానే దుర్యోధనుడు గౌరవంతో కర్ణుడిని చూచి, శల్యుడట్లా మాట్లాడటం యుక్తమే. అట్లాగే కానీ అని చెప్పి శల్యుడితో 'ఇది చాలా మంచిది' అన్నాడు.

వ. ఇట్లభినందించి యన్నరేంద్రుం డమ్మద్రపతి మనం బురియాడునో యని శంకించి యతనితో మఱియు నిట్లను 'నివ్విధం బాచరించుటకు విచారంబు వలవదు తొల్లింటి పెద్దల వృత్తాంతంబు వినుము మార్కండేయ మహాముని మాతండ్రి కేను వినుచుండఁ జెప్పినయది నీకుం జెప్పెద సురలతోడి దురంబున నసురవరుండగు తారకుండు దెగిన పిదపఁ దదీయ తనయులు విద్యున్మాలియుఁ దారకాక్షుండును గమలాక్షుండును నను వారలు వారిజాసను నుద్దేశించి. 257

ప్రతిపదార్థం: ఇట్లు; అభినందించి= సంతోషకరంగా పలికి; ఆ+వర+ఇంద్రుండు= ఆ రాజు దుర్యోధనుడు; ఆ+మద్రపతి= ఆ మద్రదేశపురాజైన శల్యుడియొక్క; మనంబు= మనస్సు; ఉరియాడునో= బాధపడుతుందేమో; ఊగిసలాడుతుందేమో; అని; శంకించి= సందేహించి; అతనితోన్= ఆ శల్యుడితో; మఱియున్= ఇంకా; ఇట్లు; అనున్= అన్నాడు; ఈ+విధంబు= ఈ ప్రకారం; ఆచరించుటకున్= చేయటానికి; విచారంబు= చింత; వలవదు= వద్దు; తొల్లింటి= పూర్వపు; పెద్దల= పెద్దవారియొక్క; వృత్తాంతంబు= ఉదంతం; వినుము; మార్కండేయ మహాముని= మార్కండేయుడు అనే ఒక గొప్ప ఋషి; మాతండ్రికిన్= మా తండ్రి అయిన ధృతరాష్ట్రుడితో; ఏను= నేను; వినుచుండన్= వింటూ ఉండగా; చెప్పిన+అది= చెప్పిన వృత్తాంతం;

నీకున్= నీకు; చెప్పెదన్= చెపుతాను; సురలతోడి= దేవతలలోనైన; దురంబునన్= యుద్ధంలో; అసురవరుండు+అగు= అసురులలో శ్రేష్ఠుడైన; తారకుండు= తారకుడనే రాక్షసుడు; తెగిన పిదపన్= మరణించిన తరువాత; తదీయ= అతడి వారైన; తనయులు= కుమారులు; విద్యుత్+మాలియున్+తారక+అక్షుండును; కమల+అక్షుండును= విద్యున్మాలి, తారకాక్షుడు, కమలాక్షుడు; అనువారలు= అనే పేరులు గలవారు; వారిజాసనున్= పద్మం ఆసనంగా గల బ్రహ్మను; ఉద్దేశించి= గురించి.

తాత్పర్యం: దుర్యోధనుడు అట్లా సంతోషపెట్టేమాట పలికాడు. తరువాత శల్యుడి మనస్సు బాధపడుతుందేమో అనీ, ఊగిసలాడుతుందేమో అనీ సందేహించి అతడితో ఇంకా ఇట్లా అన్నాడు: 'ఈ విధంగా చేయవలసి వచ్చిందే అని విచారించవద్దు. పూర్వకాలానికి చెందిన పెద్దవారి ఉదంతం ఒకటి చెప్పుతాను వినుము. ఒకప్పుడు మార్కండేయ మహర్షి మా తండ్రి ధృతరాష్ట్రుడితో దీనిని చెప్పాడు. అప్పుడు నేను కూడా వింటూ అక్కడ ఉన్నాను. దేవతలతో జరిగిన యుద్ధంలో తారకాసురుడు మరణించాడు. ఆ తరువాత అతడి ముగ్గురు కుమారులు - విద్యున్మాలి, తారకాక్షుడు, కమలాక్షుడు అనేవారు బ్రహ్మను గురించి. (తరువాతి పద్యంతో అన్వయం).

దుర్యోధనుఁడు శల్యునకుఁ ద్రిపురాసురుల వృత్తాంతంబు సెప్పుట (సం. 8-24-1)

క. 'దమమున నియమంబున ను । త్తమమును ఘోరంబు నైన తప మతినిష్ఠం
బ్రముదితులై చేయఁగ న । క్కమలభవుఁడు దోఁచి పరమకారుణ్యమునన్. 258

ప్రతిపదార్థం: దమమునన్= బాహ్యేంద్రియ నిగ్రహంతోనూ; నియమంబునన్= నియమంతోనూ (నియమం అన్నది ఎనిమిది అంగాలలో ఒకటి. ఇది ఐదు విధాలు: 1. బాహ్యాభ్యంతర శౌచం, 2. సంతోషం, 3. తపస్సు, 4. స్వాధ్యాయం, 5. ఈశ్వర ప్రణిధానం) ఉత్తమమును= శ్రేష్ఠమైనదీ; ఘోరంబును= భయంకరమైనదీ; ఐన= అయిన; తపము= తపస్సు; అతినిష్ఠన్= మిక్కిలి నిష్ఠతో; ప్రముదితులు= మిక్కిలి సంతుష్టులు; ఐ= అయి; చేయఁగన్= కావించగా; ఆ+కమలభవుఁడు= పద్మంనుండి జన్మించిన బ్రహ్మ; పరమ కారుణ్యమునన్= మిక్కిలి దయతో; తోఁచి= ప్రత్యక్షమై.

తాత్పర్యం: (వాళ్ళు) ఇంద్రియ నిగ్రహరూపమైన దమంతోనూ, శౌచ, సంతోష, తపస్స్వాధ్యాయ, ఈశ్వరప్రణిధాన రూపమైన అష్టాంగాలలో ఒకటైన నియమంతోనూ, ఉత్తమమై భయంకరమైన తపస్సు మిక్కిలి నిష్ఠతో బహు సంతుష్టితో చేశారు. దానికి గొప్ప దయ కలిగి, బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై. (తరువాతి గద్యంతో అన్వయం).

వ. 'వరంబులు గోరికొం' డనవుడు వారందఱు 'నొక్కమాటయకా సకలభూతంబులవలనను సర్వకాలంబుల యందును నవధ్యత్వంబు మాకు నీయవలయు' నని యడుగుటయు నయ్యజుండు. 259

ప్రతిపదార్థం: వరంబులు= కోరికలు; కోరికొండు= కోరుకోండి; అనవుడున్= అని పలుకగా; వారు= ఆ అసురకుమారులు; అందఱున్= ముగ్గురూ; ఒక్కమాట+అ+కాన్= ఒకేమాట అయ్యేటట్లు; సకల= సమస్తమైన; భూతంబులవలనను= ప్రాణులవలన; సర్వకాలంబుల యందును= అన్ని కాలాలలోనూ; అవధ్యత్వంబు= చంపబడకుండటం; మాకున్= మా ముగ్గురికీ; ఈయవలయున్= ఇవ్వాలి; అని; అడుగుటయున్= అడుగగా; ఆ+అజుండు= ఆ బ్రహ్మ.

తాత్పర్యం: 'కోరికలు కోరుకొనండి' అన్నాడు. అపుడు వారు ముగ్గురూ ఒకేమాటగా 'మాకు ఎన్నడూ ఏ ప్రాణివలనా మరణం రాకూడదు. ఈ వరమి'మ్మని అడిగారు. అపు డా బ్రహ్మ; (ఇట్లా అన్నాడు).

క. 'ఆ చంద మెందుఁ గల దది । గోచరమే? యిచ్చుటకును గొనుటకుఁ దగుమై
సూచి యడుగుండు శుభదం । బై చెల్లెడునట్లుగాఁ బ్రియంబున నిత్తున్.' 260

ప్రతిపదార్థం: ఆ చందము= ఆ పద్ధతి; ఎందున్= ఎక్కడ; కలదు?= ఉన్నది?; అది= మరణం లేకుండా ఉండటం; గోచరమే= ఎక్కడైనా అగుపిస్తుందా? - అంటే ఉంటుందా; ఇచ్చుటకును= ఇవ్వటానికీ; కొనుటకున్= పుచ్చుకొనటానికీ; శుభదంబై= శుభాన్నిచ్చేదై; చెల్లెడునట్లుగాన్= చెల్లుబడి అయ్యేటట్లుగా; తగు= తగిన; మై= పద్ధతి; చూచి= ఆలోచించి; అడుగుండు= కోరండి; ప్రియంబునన్= ఇష్టంతో; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: 'అట్లాంటి పద్ధతి ఎక్కడైనా ఉన్నదా? మరణం లేకుండా ఉండటం ఎక్కడైనా అగుపిస్తుందా? అందువల్ల తగినది, శుభప్రదమైనదీ, ఇవ్వటానికి వీలైనదీ, ఆలోచించి అడగండి. ప్రీతితో ఇస్తాను.

వ. అనవుడు నయ్యసుర 'లట్లేని మాకు ముప్వురకు మూఁడు పురంబు లెల్ల సుఖంబులుం గలిసి కామగమనంబులై దేవదానవ యక్షోరగాది జాతులకుం జెఱుపరాక విలసిల్లునట్లుగా నొసంగు మేము భవత్ప్రసాదంబు సొంపున నిర్భయులమై పెంపొంది సంచరించెద' మనుటయుఁ బద్మభవుం 'డిది లెస్స దీనికిఁ దుది యిట్టిద' యని నుడివి 'యట్టిది గాకుండ నప్రమత్తులరై వర్తిలుం డనిన నద్దనుజేంద్రు 'లప్పురంబు లప్పు డొక్కెడం గూడెనప్పుడు బలియుండగువాఁడు సెఱుపం దలంచినం జెడునదిగా నొడంబడితిమి త్రిపురంబులు సంగతంబులు గాకున్న నసాధ్యంబులై వెలయువలయు' నని పల్కిన న ద్దేవుండు 'మీరు పురత్రయంబును సంపాదించుకొనుం డే నమ్మహానుభావంబులం బొందునట్లుగా నిచ్చితి నని నిజస్థానంబునకుం జనియె నిత్తెఱంగున.' 261

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; ఆ+అసురులు= ఆ రాక్షసులు; అట్లేనిన్= అలా అయితే; మాకున్= మాకు; ముప్వురకున్= ముగ్గురకూ; మూడు పురంబులు= మూడు నగరాలు; ఎల్లన్= సమస్తమైన; సుఖంబులున్+కలిగి= సుఖాలూ ఉండి; కామ గమనంబులై= సంకల్పాన్నిబట్టి పోయేవి అయి; దేవ= దేవతలు; దానవ= రాక్షసులు; యక్ష= యక్షులు; ఉరగ= నాగులు; ఆది= మొదలైన; జాతులకున్= తెగలవారికీ; చెఱుపన్ రాక= నాశనం చేయటానికి శక్యం కాక; విలసిల్లునట్లుగాన్= ఒప్పేవిధంగా; ఒసంగుము= ఇవ్వు; ఏము= మేము; భవత్= నీయొక్క; ప్రసాదంబు= అనుగ్రహంయొక్క; సొంపునన్= అందంతో; నిర్భయులము+ఐ= భయంలేనివారమై; పెంపు+ఒంది= వృద్ధిచెంది; సంచరించెదము= తిరుగుతుంటాము; అనుటయున్= అని చెప్పగా; పద్మభవుండు= పద్మమందు జన్మించిన బ్రహ్మ; ఇది= ఈ పద్ధతి; లెస్స= మంచిది; దీనికిన్; తుది= అంతం; ఇట్టిది+అ= ఈ ప్రకారమైనదే; అని; నుడివి= చెప్పి; అట్టిది= ఆ ప్రకారం; కాకుండన్= సంభవించకుండా; అప్రమత్తులరు+ఐ= ఏమరుపాటు కలవారు కాకుండా; వర్తిలుండు= ప్రవర్తించండి; అనినన్= అని చెప్పగా; ఆ+దనుజేంద్రులు= ఆ రాక్షసరాజులు; ఆ+పురంబులు= ఆ నగరాలు; ఎప్పుడు= ఏ సమయంలో; ఒక్కెడన్= ఒక్కచోట; కూడెన్= కలుస్తాయో; అప్పుడు= ఆ సమయంలో; బలియుండు= బలవంతుడు; అగువాఁడు= ఐనవాడు; చెఱుపన్= నాశనం చేయటానికి; తలంచినన్= సంకల్పిస్తే; చెడునదిగాన్= నశించే పద్ధతిగా; ఒడంబడితిమి= ఒప్పుకొన్నాము; త్రిపురంబులు= మూడు నగరాలు; సంగతంబులు= కూడినవి; కాక= కాకుండా; ఉన్నన్= ఉన్న పక్షంలో; అసాధ్యంబులై= సాధింపరానివై, చెరుపరానివై; వెలయన్‌వలయున్= విలసిల్లాలి; అని; పల్కినన్= పలుకగా; ఆ+దేవుండు= ఆ బ్రహ్మదేవుడు; మీరు= మీరు ముగ్గురూ; పురత్రయంబును= మూడు నగరాలను; సంపాదించుకొనుండు= గడించుకోండి; ఏను= నేను; ఆ+మహానుభావంబులన్= (అవి) ఆ ప్రభావాలను; పొందునట్లుగాన్= పొందే విధంగా; ఇచ్చితిన్= వరం ఇచ్చాను; అని; నిజస్థానంబునకున్= తన నివాసస్థానానికి; చనియెన్= వెళ్ళాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా.

తాత్పర్యం: అట్లా అనేసరికి, ఆ అసురులు 'అట్లా అయితే మాకు ముగ్గురికీ మూడు నగరాలిమ్ము. వాటిలో అన్ని సౌఖ్యాలూ ఉండాలి. మేము మనస్సులో అనుకొంటే చాలు అని ఎక్కడికైనా ప్రయాణం చెయ్యగలగాలి. వాటిని దేవతలు, దానవులు, యక్షులు, నాగులు మొదలయిన జాతులవారికి కూడా నాశనం చేయటం శక్యం కాకూడదు. ఇట్లా వరమిమ్ము. నీ అనుగ్రహం వలన మేము ఏ భయమూ లేకుండా తిరుగుతాము' అన్నారు. అపుడు బ్రహ్మ 'ఇది మంచిది మరి దీనికి అంతం ఇట్లా ఉంటుంది' అని కూడా చెప్పి, అట్టి పరిస్థితి రాకుండా ప్రవర్తించుకొనండి. అన్నాడు. దాని కా రాక్షసరాజులు 'ఆ నగరాలు ఎప్పుడు ఒకచోట కలుస్తాయో, అప్పుడు బలం ఉన్నవాడు వాటిని పడగొట్టదలచుకొంటే పడిపోవచ్చు. ఇందుకు ఒప్పుకొన్నాము. ఈ మూడూ ఒక్కచోటికి చేరకపోతే మాత్రం వీటిని ఎవరూ ఏమీ చేయలేకపోవాలి' అన్నారు. అప్పుడు బ్రహ్మదేవుడు 'సరే! మీరు మూడు నగరాలూ గడించుకోండి, నేనూ వాటికా ప్రభావం కలిగేటట్లు వరమిచ్చాను' అని చెప్పి తన లోకానికి వెళ్ళిపోయాడు. ఈ ప్రకారంగా- (తరువాతి పద్యంతో అన్వయం).

తే. వరము వడసిన యాదైత్యవరులు దమకుఁ। బురము లొనరింప దానవపూజ్యు మయుని
వేఁడికొనుటయు నాతఁడు విపులతపము। కలిమి నొప్పారు పురవర్మములు ఘటించె. 262

ప్రతిపదార్థం: వరము= బ్రహ్మనుండి వరం; పడసిన= పొందిన; ఆ దైత్యవరులు= ఆ రాక్షసశ్రేష్ఠులు; తమకున్= తమ ముగ్గురికోసమూ; పురములు= నగరాలు; ఒనరింపన్= నిర్మించటానికి; దానవపూజ్యున్= దానవులకు పూజింపదగిన; మయుని= మయుడు అనేవానిని; వేఁడికొనుటయున్= కోరుకొనగా; ఆతడు= ఆ మయుడు; విపుల= విశాలమైన; అధికమైన; తపముకలిమిన్= తపస్సుచేసి ఉన్నందువలన; ఒప్పారు= అన్నివిధాలా తగిన; పురవర్మములు= నగరకవచాలు; ఘటించెన్= సమకూర్చాడు.

తాత్పర్యం: ఇట్లా బ్రహ్మనుండి వరంపొందిన రాక్షసులు ముగ్గురూ తమకోసం నగరాలు నిర్మించి పెట్టుమని మయుడిని ప్రార్థించారు. అతడు దానవులకు పూజనీయుడు, మహాతపశ్శాలి. కనుక వారి అభిప్రాయానికి అన్నివిధాలా తగిన నగరాలనే కవచాలు నిర్మించాడు.

వ. అవియుం బ్రాకార గోపురప్రాసాదప్రముఖ వివిధావయవంబులు పసిండియు వెండియు నినుమును నై నాలుగు దిక్కులు నూఱేసి యోజనంబులు గలిగియుండు నందుఁ బసిండిం జేసినయది దివంబునను వెండి నొనరించినయది యంతరిక్షంబునను నినుమునం గావించినయది భూమిని సంచరింపను వరుసన వానికిం దారకాక్షుండును గమలాక్షుండును విద్యున్మాలియు రాజులయి దివ్యంబులగు నంబరంబులను నాభరణంబులను మాల్యానులేపనంబులను మఱియు ననేక విధంబుల నుజ్జ్వలులై నెగడుదు రిట్లు పురత్రయ విహారంబున జగత్త్రయంబును నాక్రమించి యసురత్రయం బప్రతిహత విభూతిమై వర్తించు నమ్మువ్వురుం దన్ను నాశ్రయించుటం జేసి వారల యోగక్షేమంబు లరసికొని యెవ్వరికి నెయ్యది యిష్టం బయ్యదియెల్లం దన మాయా బలంబున మయుం డొదవించుచుండు నవ్విధంబునఁ బరమసౌఖ్యంబు లనుభవించుచుండ బహుకోటి సంవత్సరంబులు సనియె నట్టియెడ. 263

ప్రతిపదార్థం: అవియున్= ఆ పురాలూ; ప్రాకార= చుట్టుగోడలు; గోపుర= పురద్వారాలు; ప్రాసాద= రాజభవనాలు; ప్రముఖ= మొదలయిన; వివిధ= అనేకప్రకారాల; అవయవంబులు= భాగాలు; పసిండియున్= బంగారమూ; వెండియున్= రజతమూ;

ఇనుమునన్= ఇనుమూ అయి; నాలుగు దిక్కులు= నలువైపుల (ఎటు చూసినా); నూఱు+ఏసి= వందేసి; యోజనంబులు కలిగి= యోజనాల మేర కలిగి; (యోజనమంటే నాలుగుక్రోసులు, క్రోసుకు వేయి దండాలు, దండానికి నాలుగు హస్తాలు. హస్తమంటే ఒకమూర, రెండువేల దండాలు ఒక క్రోసని మరొకమతం) ఉండున్= ఉంటుంది; అందున్= ఆ పురాలలో; పసిండిన్= బంగారంతో; చేసిన+అది= నిర్మించినది; దివంబునను= స్వర్గంలోనూ; వెండిన్= రజతంతోనూ; కావించిన+అది= చేసినది; అంతరిక్షంబుననున్= ఆకాశంలోనూ; ఇనుమునన్= ఇనుముతో; కావించిన+అది= చేసింది; భూమిని= భూలోకంలోనూ; సంచరింపను= తిరుగుతుండగా; వరుసన= వరుసగా; వానికిన్= ఆ పురాలకు; తారకాక్షుండు= తారకాక్షుడు అనే పేరుగలవాడూ; కమలాక్షుండును= కమలాక్షుడనే పేరుకలవాడూ; విద్యున్మాలియున్= విద్యున్మాలి అనే పేరుకలవాడూ; రాజులయి= అధిపతులై; దివ్యంబులు= స్వర్గంలో పుట్టినవి; అగు= అయిన; అంబరంబులను= వస్త్రాలచేతనూ; ఆభరణంబులను= నగలచేతనూ; మాల్యానులేపనంబులను= మాల్య= దండలచేతనూ; అనులేపనంబులను= పూతలచేతనూ; మఱియున్= ఇంకా; అనేక= చాలా; విభవంబులన్= ఐశ్వర్యాలచేతనూ; ఉజ్జ్వలులై= మిక్కిలి ప్రకాశమానులై; నెగడుదురు= ఒప్పుదురు; ఇట్లు= ఈ ప్రకారం; పురత్రయ= మూడు పట్టణాలతో; విహారంబునన్= విహరించటంచేత; జగత్+త్రయంబును= మూడులోకాలనూ; ఆక్రమించి= అధీనం చేసికొని; అసురత్రయంబు= ముగ్గురు రాక్షసులు; అప్రతిహత= అడ్డులేని; విభూతిమైన్= ఐశ్వర్యంతో; వర్తించు= ప్రవర్తించేవారు; ఆ+ముగ్వురున్= ఆ ముగ్గురు అసురులూ; తన్నున్= తనను; ఆశ్రయించుటన్+చేసి= అండగొనినందువలన; వారల= వారి ముగ్గురియొక్క; యోగ= లేనిది వచ్చి కలియటం; క్షేమంబులు= ఉన్నది బాగా ఉండటం -ఈ రెంటినీ; అరసికొని= చూచుకొంటూ; ఎవ్వరికిన్= ఎవరికి; ఏ+అది= ఏది; ఇష్టంబు= ప్రియమైనదేదో; ఆ+అది= అది; ఎల్లన్= సమస్తమూ; తన= తనయొక్క; మాయాబలంబునన్= మాయయొక్క శక్తితో; మయుండు= మయాసురుడు; ఒదవించుచున్= కలిగిస్తూ; ఉండున్= ఉండేవాడు; ఆ+విధంబునన్= ఆ ప్రకారంగా; పరమ= గొప్పవైన; సౌఖ్యంబులు= సుఖాలు; అనుభవించుచుండన్= అనుభవిస్తుండగా; బహు= చాలా; కోటి= కోట్ల సంఖ్యలుకల; సంవత్సరంబులు= ఏళ్ళు; చనియెన్= వెళ్ళిపోయాయి; అట్టి+ఎడన్= అటువంటి సమయంలో.

తాత్పర్యం: ఆ పురాలు కూడా - చుట్టుగోడలు, పురద్వారాలు, రాజభవనాలు మొదలయిన పలురకాల ప్రధాన భాగాలు ఒకదానిలో బంగారపువీ, మరొకదానిలో వెండివీ, ఇంకొకదానిలో ఇనుపవీ ఉండి, ప్రతిపురమూ ఎటు చూచినా, నూరేసి యోజనాలమేర ఉండేవి. వాటిలో సువర్ణపురం స్వర్గంలోనూ, రజతపురం ఆకాశంలోనూ, లోహపురం భూలోకంలోనూ తిరుగుతూ ఉండేవి. వాటిలో స్వర్ణపురానికి తారకాక్షుడూ, రజతపురానికి కమలాక్షుడూ, లోహపురానికి విద్యున్మాలీ రాజులుగా ఉండేవారు. దివ్యవస్త్రాలు ధరించి, దివ్యభూషణాలు పెట్టుకొని, దివ్యమాల్యాలు వేసికొని, దివ్యములైన మైపూతలు పూసికొంటూ, ఇంకా రకరకాల ఐశ్వర్యాలతో ఒప్పి ఉండేవారు. ఇట్లా ముగ్గురు అసురులూ మూడు పురాలలోనూ తిరుగుతూ మూడు లోకాలనూ ఆక్రమించికొని, ఎదురు లేని ఐశ్వర్యంతో ఉండేవారు. ఇట్టి వాళ్ళు తన నాశ్రయించుకొని ఉంటున్నందున మయాసురుడు వారి యోగక్షేమాలు చూస్తూ ఉండేవాడు. ఎవరి కేది ఇష్టముంటే అది అంతా వారికి తన మాయాబలంతో సృష్టించి ఇస్తూ ఉండేవాడు. ఇట్లా వారు మహాసౌఖ్యాల ననుభవిస్తూ ఉండగా, ఎన్నికోట్ల సంవత్సరాలో గడచిపోయాయి.

సీ. **తారకాక్షున కొక్క తనయుండు హరియన । జనియించి వారిజాసను గుఱించి**
తపము సేయంగఁ బ్రత్యక్షమై యద్దేవుఁ । డడుగుము వరమన్న నతఁడు త్రిపుర
ములవార లాయుధంబులు దాఁకి చచ్చినఁ । బీనుఁగుల్ నీరలోఁ బెట్టి తడుప
నొక్కఁడు వదుగురై యెక్కుడు లావును । బీరంబు మెఱయ సంప్రీతి నుల్ల

ఆ. సిల్లునట్టి బావి చిరతరతోయమై । మా పురములఁ జిత్ర మహిమ వెలయ
నావహిల్ల వలయు ననిన నిచ్చితి నని । యమ్మహాత్ముఁ డరిగె నదియుఁ గలిగె. 264

ప్రతిపదార్థం: తారకాక్షునకున్= తారకాక్షుడనే సువర్ణపురాధిపతికి; ఒక్క= ఒక; తనయుండు= కుమారుడు; హరియనన్= హరి అనే పేరుతో; జనియించి= పుట్టి; వారిజ+ఆసను గుఱించి= పద్మాసనుడైన బ్రహ్మదేవునుద్దేశించి; తపము+చేయంగన్= తపస్సు చేయగా; ప్రత్యక్షమై= సాక్షాత్కరించి; వరము= కోరిక; అడుగుము= కోరుకొమ్ము; అన్నన్= అనగా; అతఁడు= ఆ హరి అనే అసురుఁడు; త్రిపురముల వారలు= మూడు నగరాలలోని వారూ; ఆయుధంబులు; తాఁకి= తగిలి; చచ్చినన్= చనిపోయిన పక్షంలో; పీనుఁగుల్= వారి శవాలు; నీరిలోన్= నీటిలో; పెట్టి= ఉంచి; తడుపన్= తడిపితే; ఒక్కఁడు= చనిపోయిన ఒక పౌరుడు; పదుగురు+ఐ= పదిమంది పౌరులయి; ఎక్కుడు= (అంతకు పూర్వం చనిపోయిన ఆ ఒక్కడికి ఉన్నదానికంటె) అధికమైన; లావును= బలమూ; బీరంబున్= వీరత్వమూ; మెఱయన్= ప్రకాశింపగా; సంప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; ఉల్లసిల్లునట్టి= ప్రకాశింపజేసేటటువంటి; బావి= దిగుడుబావి; చిరతోయమై= చాలాకాలం నీరు ఉండేది అయి; మా పురములన్= మా నగరాలలో; చిత్రమహిమన్= వింతగొలిపే ప్రభావం; వెలయన్= ఒప్పగా; ఆవహిల్ల వలయున్= ఉండాలి; అనినన్= ఇట్లా పలుకగా; ఇచ్చితిన్= ఇచ్చాను; అని= ఇలా పలికి; ఆ+మహాత్ముఁడు= ఆ మహాత్ముడైన బ్రహ్మదేవుడు; అరిగెన్= వెళ్ళాడు; అదియున్= అట్టి బావికూడా; కలిగెన్= ప్రతిపట్టణంలోనూ ఏర్పడింది.

తాత్పర్యం: తారకాక్షాసురుడికి ఒక కొడుకున్నాడు. అతడి పేరు హరి. అతడు బ్రహ్మను గురించి తపస్సు చేశాడు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నాడు. అతడు ఈ మూడు పురాలలోని జనమూ ఏవైనా ఆయుధాలవలన చనిపోయిన పక్షంలో వారి శవాలను నీటిలో ఉంచి తడిపితే ఒక శవం పదిమంది జనం కావాలి, ఆ పదిమందికీ ఆ చనిపోయినవాడు బ్రతికి ఉన్నపుడు అతడికి ఎంత బలమూ, ఎంత శౌర్యమూ ఉండేవో అవి అంతకంటె ఎక్కువ ఉండాలి, వారు సంతుష్టితో ఉండాలి, వీరిని-ఇటువంటివారిని-చేయటానికి అవసరమైన నీరు చాలాకాలం ఉండే విచిత్రప్రభావం కల దిగుడుబావి ఒకటి ఈ త్రిపురాలలోని ప్రతిపురంలోనూ ఉండాలి - అనేసరికి ఆ మహానుభావుడు ఇచ్చానని చెప్పి వెళ్ళిపోయాడు. నగరాని కొక బావి అట్లాంటిది ఏర్పడింది.

వ. ఇట్లు మహా ప్రభావంబైన యబ్బావి వడసి యప్పురంబులవారు పోరికి శంకింపక నిర్జర భయంకరులగుచు భువనంబులన్నియు బాధించుచుం బెఱిగి లోభమోహావశతం బొంది విచ్చలవిడిం దిరుగం దొడంగిన దేవ పితృమునిజనస్థానంబులకు హానిపుట్టినం బురందరుం డఖిల బృందారకులుఁ బరివేష్టింప నప్పురంబులపై నెత్తిచని పెనంగి భేదింపంజాలక విషణ్ణుండయ్యె నంత నతండు దివిజులుం దాను సంయమి సహితుండై చతురాననుపాలికిం బోయి ప్రణామపూర్వకంబుగా నద్దానవుల తెఱంగెఱింగించి తద్వధోపాయం బడిగిన నతండు వారల కిట్లనియె. 265

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మహాప్రభావంబు= గొప్ప ప్రభావంబు కలది; ఐన= అయిన; ఆ+బావి= ఆ దిగుడుబావి; వడసి= పొంది; ఆ+పురంబులవారు= ఆ పురాల జనం; పోరికిన్= యుద్ధానికి; శంకింపక= జంకక; నిర్జర= దేవతలకు; భయంకరులు= జడుపు కలిగించేవారు; అగుచున్= అవుతూ; భువనంబులు+అన్నియున్= లోకాలన్నింటినీ; బాధించుచున్= బాధపెడుతూ; పెఱిగి= విజృంభించి; లోభ= పిసినిగొట్టుతనానికీ; మోహ= అజ్ఞానానికీ; కామానుబంధానికీ; వశతన్= లొంగటాన్ని; పొంది= లభింపజేసుకొని, లోభమోహాలకి లొంగిపోయి; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; తిరుగన్= సంచరించటానికి; తొడంగినన్= పూనుకోగా; దేవ= దేవతలయొక్క; పితృ= పితృదేవతలయొక్క; మునిజన= మునులయొక్క; స్థానంబులకున్= పదవులకూ,

వారి నివాసాది ప్రదేశాలకూ; హాని= కీడు; పుట్టినన్= కలుగగా; పురందరుండు= ఇంద్రుడు; అఖిల= సమస్తమైన; బృందారకులున్= దేవతలూ; పరివేష్టింపన్= తన చుట్టూ చేరిరాగా; ఆ+పురంబులపైన్= ఆ పట్టణాలపై; ఎత్తి= దండెత్తి; చని= వెళ్ళి; పెనంగి= పోరాడి; భేదింపన్= (పురాలను) బ్రద్దలు కొట్టటానికి; చాలక= సమర్థుడుకాక; విషణ్ణుండు= విషాదపడినవాడు; అయ్యెన్= అయినాడు; అంతన్= ఆ తరువాత; అతండు= ఇంద్రుడు; దివిజులున్+తానున్= దేవతలూ, తానూ; సంయమి= మునీశ్వరులతో; సహితుండు+ఐ= కూడినవాడై; చతురానను పాలికిన్+పోయి= నాలుగు ముఖాలు కల బ్రహ్మదేవుడి వద్దకువెళ్ళి; ప్రణామ= నమస్కారం; పూర్వకంబుగాన్= ముందు కలదిగా, ముందు నమస్కారం పెట్టి; ఆ+దానవుల= ఆ రాక్షసులయొక్క; తెఱంగు= విధం; ఎఱింగించి= తెలిపి; తద్+వధ= వారిని వధించటానికి; ఉపాయంబు; అడిగినన్= ప్రశ్నించగా; అతండు= ఆ బ్రహ్మదేవుడు; వారలకున్= వారితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా మహాప్రభావం కలిగిన బావి దొరికేసరికి, ఆ నగరాలవారికి యుద్ధమంటే జంకుగొంకులు పోయాయి. వారంటే దేవతలూ భయపడేవారు. అట్లా వారు లోకాలనన్నింటినీ బాధిస్తూ పెరిగారు. లోభమోహాలకు లొంగారు. ఇష్టం వచ్చినట్లు తిరుగసాగారు. అందువలన దేవస్థానాలకూ, పితృస్థానాలకూ, మున్యాశ్రమాలకూ హాని పుట్టింది. కనుక ఇంద్రుడు దేవతలందరూ తన చుట్టూ రాగా, ఆ నగరాలపై దండెత్తి వెళ్ళాడు. కాని, వాటిని బ్రద్దలు చేయలేక విచారగ్రస్తుడయ్యాడు. ఆ తరువాత అతడూ, దేవతలూ, మునులూ కలిసి బ్రహ్మదగ్గరకు వెళ్ళారు. ఇంద్రుడు ఆయనకు నమస్కారం చేసి ఆ రాక్షసుల సంగతి తెలియజేశాడు. వారిని సంహరించటానికి ఉపాయం చెప్పుమన్నాడు. అపుడాయన వారితో ఇట్లా అన్నాడు:

ఉ. 'ఏచిన యా పురత్రయము నేకశరంబున రూపుమాపఁగాఁ
జూచినఁ బోవుఁగాని పెఱచొప్పనఁ బోవదు సంగరోన్ముఖుం
డై చనుదెంచె నేని మదనాంతకుచే నదిసెల్లు నొండ్లకు
న్గోచర మెట్లగుం? జనుఁడు గొబ్బున నమ్మహితాత్ము పాలికిన్.' 266

ప్రతిపదార్థం: ఏచిన= అతిశయించిన; ఆ= ప్రసిద్ధమైన; పురత్రయమున్= మూడు నగరాలనూ; ఏకశరంబునన్= ఒక బాణంతో; రూపుమాపఁగాన్= నాశనం చేయటానికి; చూచినన్= ఆలోచిస్తే; పోవున్= నశిస్తాయి; కాని= అంతేకాని; పెఱచొప్పునన్= మరొకపద్ధతితో; పోవదు= నశించదు; సంగర= యుద్ధానికి; ఉన్ముఖుండు= అనుకూలుడు; ఐ= అయి; చనుదెంచెన్+ఏని= వచ్చినట్లయితే; మదనాంతకుచేన్= మన్మథుడి సంహారకుడయిన రుద్రునిచేత; అది= పురత్రయం; చెల్లున్= నశిస్తుంది; ఒండ్లకున్= ఇతరులకు; గోచరము= కనిపించేది; ఎట్లు= ఎలా; అగునె?= అవుతుంది?; ఆ+మహాత్ము= ఆ గొప్ప మనస్సుకల రుద్రుడియొక్క; పాలికిన్= చేరువకు; గొబ్బునన్= తొందరగా; చనుఁడు= వెళ్ళండి.

తాత్పర్యం: 'ఆ మూడు పురాలూ ఇపుడు చాలా బలపడ్డాయి. వాటిని ఒకే బాణంలో నశింపజేయటానికి ఆలోచిస్తే తప్ప, మరేవిధంగానూ అవి నశించవు. యుద్ధం చేయటానికి సిద్ధపడి రుద్రుడు వస్తే అట్లా కొట్టటమూ, అవి నశించటమూ సంభవిస్తుంది కాని, ఇతరులకు ఆ ఉపాయమూ, సామర్థ్యమూ తెలియదు కనుక ఆ మహాత్ముని దగ్గరకు వెంటనే వెళ్ళండి.'

ఆ. అనిన నట్లకాక యని దివ్యవర్ష స । హస్రకంబు వారలధిక నిష్ఠ
నతుల తపముసేసి యత్యంత శుద్ధాత్ము । లై మహేశుకడకు నరుగునపుడు. 267

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; వారలు= దేవతలూ, మునులూ, ఇంద్రుడూ; అట్ల= అట్లాగే; కాక= ఔగాక; అని= అని పలికి; దివ్యసహస్రకంబు= సంవత్సరాలయొక్క వెయ్యి, దేవమానం ప్రకారం వెయ్యి సంవత్సరాలు; అధిక నిష్ఠన్= అధికమైన నిష్ఠతో; అతుల= సాటిలేని; తపము+చేసి= తపస్సు చేసి; అత్యంత= మిక్కిలి; శుద్ధ= పరిశుద్ధమైన; ఆత్ములు+ఐ= మనస్సుకలవారై; మహేశు= మహేశ్వరుడియొక్క; కడకున్= చేరువకు; అరుగునపుడు= వెళ్ళే సమయంలో.

తాత్పర్యం: అట్లా బ్రహ్మ చెప్పేసరికి, సరే అని ఆ దేవతలూ, మునులూ, దేవేంద్రుడూ వెయ్యి దివ్య సంవత్సరాలు మహానిష్ఠతో అసమానమైన తపస్సు చేశారు. అందువలన వారి మనస్సులు పరిశుద్ధములయ్యాయి. తరువాత వారు మహేశ్వరుడి దగ్గరకు వెళ్ళే సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: మన శుక్లపక్షం దేవతలకు పగలు, కృష్ణపక్షం రాత్రి. అంటే మన నెల వారికి అహోరాత్రం. ఇలాంటి ముప్పై అహోరాత్రాలు వారికి నెల. అట్టి పన్నెండు నెలలు ఒక వర్షం అంటే సంవత్సరం. ఇది దివ్యవర్షం. ఇట్లాంటి వెయ్యి దివ్యసంవత్సరాలు వారు తపస్సు చేశారన్నమాట.

వ. అ వ్విరించి బ్రార్థించి పురస్సరుం జేసికొని యరిగి. 268

ప్రతిపదార్థం: ఆ+విరించిన్= ఆ బ్రహ్మను; ప్రార్థించి= కోరి; పురస్సరున్= ముందు నడిచేవానిని, నాయకుని; చేసికొని= కావించుకొని; అరిగి= వెళ్ళి.

తాత్పర్యం: ఆ బ్రహ్మదేవుడిని ప్రార్థించి, ఆయనను తమకు నాయకుడిగా చేసికొని వెళ్ళి.

క. వరదు శరణ్యు శశాంక । స్ఫురితశిరోభాగు సర్వభూతేశ్వరు శం
కరు సాంఖ్యయోగ నిష్ఠా । పర సులభు ననంగదమనుఁ బరమాత్ము శివున్. 269

ప్రతిపదార్థం: వరదున్= వరాలు ఇచ్చేవానిని; శరణ్యున్= శరణుకోరదగినవానిని; శశాంక= చంద్రుడిచేత; స్ఫురిత= ప్రకాశించే; శిరోభాగున్= శిరస్సుయొక్క ప్రదేశం కలవాడిని; సర్వభూత+ఈశ్వరున్= సమస్తమైన ప్రాణులకు శాసకుడైన వాడిని; శంకరున్= శుభం కలిగించేవానిని; సాంఖ్యయోగ నిష్ఠాపర= సాంఖ్య నిష్ఠాపరులు, యోగనిష్ఠాపరులు అయినవారికి; సులభున్= తేలికగా లభించేవాడిని; అనంగదమనున్= మన్మథుడిని జయించినవానిని; పరమాత్మున్= పరమాత్ముడు అయినవానిని; శివున్= శివుని, మంగళస్వరూపుడిని.

తాత్పర్యం: శివుడు వరాలిస్తాడు. ఎవరైనా శరణు కోరదగినవాడు. చంద్రుడు ఆయన శిరస్సున ప్రకాశిస్తూ ఉంటాడు. ఆయన సకల ప్రాణులకూ ప్రభువు. ఆయన అందరికీ మంగళకరుడు. ఆయన జ్ఞానయోగాన్నీ, యోగాన్నీ అవలంబించేవారికి సులభుడు. ఆయన కాముడిని జయించాడు. ఆయన పరమాత్ముడు. అట్టి శివుడిని (తరువాతి వచనంతో అన్వయం).

త్రిపుర సంహారముకొఱకు బ్రహ్మాదులు రుద్రునిం బ్రార్థించుట (సం. 8-24-37)

వ. కని ఫాలంబులు భూమిసోఁకం బ్రణమిల్లిన నద్దేవుండు 'లెండు మీ రాకకుం గారణంబేమి?' యనవుడు లేచి నిలిచి వారు కరకమలంబులు భక్తి మొగిడ్చి. 270

ప్రతిపదార్థం: కని= దర్శించి; ఫాలంబులు= నొసళ్ళు; భూమిన్= నేలను; సోఁకన్= తాకేటట్లుగా; ప్రణమిల్లినన్= నమస్కారం చేయగా; ఆ+దేవుండు= ఆ శివుడు; లెండు= లేచి నిలవండి; మీ రాకకున్= మీరు రావటానికి; కారణంబు= హేతువు; ఏమి= ఏమిటి?; అనవుడు= అని పలుకగా; లేచి= పైకిలేచి; నిలిచి= నిలబడి; వారు= బ్రహ్మ; ఇంద్రుడు, దేవతలు, మునులూ; కరకమలంబులు= పద్మాలవంటి చేతులు; భక్తిన్= భక్తితో; మొగిడ్చి= మోడ్చి.

తాత్పర్యం: (మహాదేవుడిని దర్శించారు.) నొసళ్ళు నేలకు ఆనుకొనేటట్లు సాగిలబడి నమస్కరించారు. అపుడు ఆ దేవుడు 'లేచి నిలబడండి. ఏమి పనిమీద వచ్చారు?' అన్నాడు. ఆపైన వారు లేచి, నిలిచి, భక్తితో పద్మాలవంటి చేతులు మోడ్చి.

క. **'స్తుత్యానుభావ నిర్మల । నిత్యానందస్వరూప! నిగమవిరోధి**
స్థిత్యపనయనోన్ముఖ! చి । త్సత్యాత్మక! భక్తలోక దౌర్గత్యహరా! **271**

ప్రతిపదార్థం: స్తుత్యానుభావ!= పొగడదగిన ప్రభావం కలవాడా!; నిర్మల= స్వచ్ఛమైన; నిత్య= శాశ్వతమైన; ఆనంద= ఆనందమయమైన; స్వరూప!= రూపం కలవాడా; నిగమ= వేదాలయొక్క; విరోధి= శత్రువులైనవారి; స్థితి= ఉనికిని; అపనయన= తొలగించటానికి; ఉన్ముఖ!= అనుకూలమైనవాడా!; చిత్= జ్ఞానమయమైన; సత్యాత్మక!= సత్యమైన రూపం కలవాడా!; భక్తలోక= భక్తులైన జనులయొక్క; దౌర్గత్య= దుర్గతిభావాన్ని; హరా!= హరించేవాడా!

తాత్పర్యం: 'నీ ప్రభావం స్తుతించదగినది. నీది నిత్యమైన, నిర్మలమైన ఆనందస్వరూపం. నీవు వేదశత్రువుల ఉనికిని తొలగించటానికి సదా అనుకూలుడవై ఉంటావు. నీవు జ్ఞానస్వరూపుడవూ, సత్యస్వరూపుడవూను.'

వ. **అని మఱియు ననేక ప్రకారంబుల బ్రస్తుతించినం బ్రసన్నుండై భవుండాదరించి 'మీకు భయంబు వలవదు మీ చెప్పిన యట్ల చేసెద వలయు కార్యంబెయ్యది?' యనిన దేవమునిసంఘంబులు ప్రహర్షంబు నొందె నరవింద భవుం డప్పరమేశ్వరున కిట్లనియె.** **272**

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగాను; మఱియున్= ఇంకా; అనేక ప్రకారంబులన్= బహువిధాలుగాను; ప్రస్తుతించినన్= మిక్కిలిగా స్తుతించగా; ప్రసన్నుండు+ఐ= సంతోషించినవాడై; భవుండు= శివుడు; ఆదరించి= మన్నించి; మీకు= దేవాదులయిన మీకు; భయంబు= జడుపు; వలవదు= వద్దు; మీ= మీరు; చెప్పిన; అట్ల= ఆ విధంగానే; చేసెదన్= చేస్తాను; వలయు= కావలసిన; కార్యంబు= పని; ఏ+అది?= ఏది?; అనినన్= అని అడుగగా; దేవముని సంఘంబులు= దేవతల సంఘములు, మునుల సంఘములు, ప్రహర్షంబున్= ప్రకృష్టమైన సంతోషాన్ని; ఒందెన్= పొందాయి; అరవింద= పద్మమందు; భవుండు= జన్మించిన బ్రహ్మ; ఆ+పరమేశ్వరునకున్= ఆ మహేశ్వరుడితో; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: ఇట్లా, ఇంకా చాలా విధాలుగానూ, బాగా స్తోత్రం చేశారు. అపుడు శివుడు సంతోషించి వారిని గౌరవించాడు. 'మీకు భయం లేదు మీరు కోరిన విధంగానే చేస్తాను. కావలసిన పని ఏమిటో చెప్పండి' అన్నాడు. ఆ మాటలకు దేవతలూ, మునులూ చాలా సంతోషించారు. అపుడు పరమేశ్వరుడితో బ్రహ్మదేవు డిట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'ప్రజలకుఁ బతిగాఁగఁ బనిచితి నీవు న । న్నట్లు పదస్థుండ నగుటఁజేసి
విచ్చలవిడి వరంబిచ్చితి నసురత్ర । యమునకు దుర్గత్రయంబు గలిగి
యమ్ముమ్మువ్వురును దారుణాక్రమమున భువ । నత్రయ సంబాధనం బొనర్చు
చున్నారు వారల నొరులకు నుడుప శ । క్యముగాదు నీవు శీఘ్రంబు చెఱుప

ఆ. వలయు మునులు దేవతలు నేను శరణు చొ । చ్చితిమి నిన్నుఁ గరుణ జేకొనంగ
వలదె? మమ్ము నొరులు గలరె జగంబులు । గావ భూతనాథ! నీవు దక్క' 273

ప్రతిపదార్థం: నీవు= సకల నియామకుడవైన నీవు; నన్నున్= నీ అనుగ్రహపాత్రుడనైన నన్ను; ప్రజలకున్+పతి+కాఁగన్+ పనిచితివి= ప్రజలకు నేను సృష్టించిన ప్రాణుల కన్నింటికిని; పతిగాఁగన్= పోషణ పాలనాదులు చూచే ఏలికగా; పనిచితి(వి)= ఆజ్ఞాపించావు; అట్లు= ఆ విధంగా; పదస్థుండను= (చేసికొన్న కర్మలకు తగిన ఫలం ఈయవలసిన స్థానంలో) అధికారంలో ఉన్నవాడను; అగుటఁజేసి= అయిన కారణంచేత; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; అసురత్రయమునకున్= ముగ్గురు అసురులకూ; వరంబు= ఇతరులకు అభేద్యాలయిన నగరాలుండే వరం; ఇచ్చితిన్= ఇచ్చాను; ఆ+మువ్వురును= ఆ ముగ్గురు అసురులూ; దుర్గత్రయంబు+కలిగి= ఇతరులు చొరరాని మూడు పురాలు కలిగినందున; దారుణ= భయంకరమైన; ఆక్రమమునన్= ఆక్రమణంతో; భువనత్రయ= మూడులోకాలకూ; సంబాధనంబు= మిక్కిలిపీడ; ఒనర్చుచున్నారు= కలిగిస్తున్నారు; ఒరులకున్= ఇతరులకు; వారలన్= ఆ అసురులను; ఉడుపన్= పీడ విరమింపజేయటం; శక్యంబుగాదు= సాధ్యంకాదు; నీవు= సర్వశక్తి మంతుడవైన నీవు; శీఘ్రంబు+అ= వెంటనే; చెఱుపవలయున్= వారిని నశింపజెయ్యాలి; మునులు= ఋషులూ; దేవతలున్= అసురులూ; నేనున్= (నీవు చెప్పిన పనిచేస్తూ చిక్కులలో పడిన) నేనూ; నిన్నున్= (దుష్టశిక్షకుడవూ; శిష్టరక్షకుడవూ అయిన) నిన్ను, శరణు చొచ్చితిమి= శరణు వేడుకొంటిమి; మమ్మున్; కరుణన్= దయతో; చేకొనంగన్= స్వీకరింపఁగా; వలదె?= వద్దా?, స్వీకరించాలి; భూతనాథ!= సకల ప్రాణులకూ స్వామివి, రక్షకుడవు అయినవాడా!; జగంబులు= లోకాలను; కావన్= రక్షించటానికి; నీవు+తక్కన్= నీవు తప్ప; ఒరులు= ఇతరులు; కలరె?= ఉన్నారా? (లేరని భావం.)

తాత్పర్యం: 'నీవు నన్ను ప్రజాపతి పదవిలో నియమించావు. అందువలన, ఆ పదవిలో ఉన్న కారణంచేత, తగిన తపస్సు చేశారు కనుక, నాకు గల స్వాతంత్ర్యం వినియోగించి, ముగ్గురు అసురులకూ మూడు అభేద్యనగరాలుండే వరమిచ్చాను. వాటి చాటున వారుముగ్గురూ ముల్లోకాలనూ భయంకరంగా ఆక్రమిస్తూ, ఆయా లోకాలకు పీడ కలిగిస్తున్నారు. అది మానిపించే శక్తి ఇతరులకు లేదు. వారిని నీవు వెంటనే నాశనం చేయాలి. ఈ మునులూ దేవతలూ, నేనూ నిన్నాశ్రయించాము. నీ రక్షణ కోరుతున్నాము. నీవు దయతో మమ్ములను ఆదుకొనాలి. నీవు సకల ప్రాణులకూ రక్షకుడవూ, పోషకుడవూ కూడాను. కనుక లోకాలను రక్షించగలవారు కాని, రక్షించవలసినవారు కాని నీవు తప్పితే ఇతరులు లేరు.

విశేషం: ఈ సీసపద్యం మూడవపాదం మొదట ఉస్మానియా ప్రతిలో 'యిమ్ముమ్మువ్వురును' అని ఉన్నది. యతిభంగం. 1963 వావిళ్ళ ప్రతిలోనూ అంతే. అదే దీనికి తల్లి. అక్కడి అచ్చు తప్పు ఇక్కడ యథాతథంగా దిగింది. కనుక 'యి' 'య' చేశాము. ఇటీవలి తె.వి. ప్రతిలో మేము దిద్దినట్లే ఉన్నది.

వ. అనవుడు నద్దేవుం డయ్యసురులు సెఱుపవలయువారగుదురు వారలు బలవంతు లేనొంటిమై నా పనికి నుత్సహింపనేర మదీయంబు లయిన తేజోబలంబులం దర్ధంబు పుచ్చికొని మీరందఱుం గూడి యా దుష్ట

దైత్యుల మర్దించుట కార్యం' బనిన నద్దివిజులు 'మాకందఱకు గల తేజోబలంబులకు నద్దనుజుల తేజోబలంబులు రెట్టియయి యుండు నట్లగుటం జేసి మా చేతం జెడ రదియునుంగాక భవదీయ తేజోబలంబులు భరియింప మేము శక్తులము గాము మా యందఱ తేజో బలంబులలో సగంబు పుచ్చికొని నీవ యాశత్రుల సమయింపు మెల్ల భంగిని నీకు రక్షణీయుల మగు మమ్ము రక్షింపు' మనుటయు నజ్జగన్నాథుండు. 274

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; ఆ+దేవుండు= ఆ దేవుడైన రుద్రుడు (ఇలా అన్నాడు:); అయ్యసురులు= ఆ రాక్షసులు; చెఱుపవలయువారు= సంహరింపవలసినవారు; అగుదురు= అయినవారు; (కాని); వారలు= ఆ అసురులు; బలవంతులు= శక్తికలవారు; ఏను= నేను; ఒంటిమైన్= ఒంటరిగా; ఆ+పనికిన్= ఆ కార్యానికి; ఉత్సహింపన్= పూనుకొనటానికి; నేరన్= శక్తి కలవాడనుకాను; మదీయంబులు= నావి; అయిన; తేజః+బలంబులు+అందున్= పరాక్రమములో, శక్తిలో; అర్ధంబు= సగముభాగం; పుచ్చికొని= తీసికొని; మీరందఱున్= మీరంతా; కూడి= కలిసి; ఆ= ఆ ముగ్గురు; దుష్టదైత్యులన్= దుర్మార్గులయిన అసురులను; మర్దించుట= సంహరించుట; కార్యంబు= కర్తవ్యం; అనినన్= అనిచెప్పగా; ఆ+దివిజులు= ఆ దేవతలు; మాకున్= మా దేవతలకు; అందఱకున్= ఎల్లరికీ; కల= ఉన్న; తేజోబలంబులకున్= పరాక్రమానికీ, బలానికీ; ఆ+దనుజుల= ఆ అసురలయొక్క; తేజోబలంబులు= పరాక్రమమూ, శక్తీ; రెట్టి+అయి= రెండింతలై; ఉండున్= ఉంటాయి; అట్లు; అగుటన్+జేసి= అయినందువలన; మా చేతన్= మా వల్ల; చెడరు= నశింపరు; అదియున్+కాక= అదీకాక, అంతేకాక; భవదీయ= నీవి అయిన; తేజోబలంబులు= పరాక్రమమూ, శక్తీ; భరియింపన్= సహించటానికి; మేము= అల్పశక్తిమంతులమైన మేము; శక్తులము+కాము= శక్తికలవారము కాము; మా+అందఱ= మా అందరియొక్క; తేజోబలంబులలోన్= పరాక్రమంలో శక్తిలో; సగంబు పుచ్చికొని= అర్ధభాగం తీసికొని; నీవ= నీవే; ఆ శత్రులన్= ఆ పగవారిని; సమయింపుము= సంహరింపుము; ఎల్ల= సమస్తమైన; భంగిని= విధాలనూ; నీకున్= సర్వశక్తిమంతుడవైన నీకు; రక్షణీయులమగు= రక్షింపదగినవారమైన; మమ్మున్= మమ్ము; రక్షింపుము= కాపాడుము; అనుటయున్; ఆ+జగత్+నాథుండు= ఆ లోకాలకు రక్షకుడైన శివుడు.

తాత్పర్యం: అట్లా బ్రహ్మదేవుడు చెప్పేసరికి ఆ పరమేశ్వరుడు ఇట్లా అన్నాడు: 'ఆ రాక్షసులు వధింపదగినవారే, అయితే, వారు బలం కలవాళ్ళు, వారిని నే నొంటరిగా సంహరించటానికి పూనుకోలేను, నా పరాక్రమంలోనూ, శక్తిలోనూ సగం మీకిస్తాను. వాటితో మీరందరూ ఏకమై, ఆ రాక్షసులను సంహరించటం కర్తవ్యం' అన్నాడు. అపుడా దేవతలు 'మా పరాక్రమానికీ, శక్తికీ రెండింతలుంటాయి ఆ రాక్షసుల పరాక్రమమూ, శక్తీను. కనుక, వాళ్ళు మా చేతిలో చావరు. అదీకాక, నీ పరాక్రమాన్నీ, శక్తినీ మేము భరించగలమా? మా కంత శక్తిలేదు. కనుక మా అందరి పరాక్రమంలోనూ, శక్తిలోనూ సగం నీవే తీసికొని, నీవే ఆ పగవారిని సంహరించుము. మమ్ములను అన్నివిధాలా రక్షించవలసినవాడవు నీవు. అన్నివిధాలా రక్షింపబడవలసిన వాళ్ళం మేము. కనుక రక్షించుము' అనేసరికి ఆ జగన్నాథుడు.

క. 'అమరులకు నసురులకు నే। సముఁడ శివం బఖిల భూతజాలంబులకున్
సమత నొనరింప శివ నా। మము నాకుం జెల్లు లోకమాన్యం బగుచున్. 275

ప్రతిపదార్థం: అమరులకున్+అసురులకున్= దేవతలకూ, రాక్షసులకూ; నేన్= నేను; సముఁడన్= ఏకరీతివాడను; అఖిల= సమస్తమైన; భూత= ప్రాణులయొక్క; జాలంబులకున్= సమూహాలకూ; శివంబు= శుభం; సమతన్= సమభావంతో; ఒనరింపన్= కావించటంవలన; శివ నామము= శివుడనే పేరు; లోకమాన్యంబు= లోకాలచేత మన్నింపబడేది; అగుచున్= అవుతూ; నాకున్= నాకు; చెల్లున్= ఒప్పుతున్నది.

తాత్పర్యం: 'నేను దేవతలపట్లనూ రాక్షసులపట్లనూ సమానభావంతో ప్రవర్తిస్తూ ఉంటాను. మీ ఇద్దరి విషయంలోనే కాదు. సమస్త ప్రాణులపట్లనూ సమభావంతో శుభాన్ని కలిగిస్తూ ఉన్నందువలననే నాకు శివుడనే పేరు - అఖిల లోకాలవారూ మన్నించేటట్లు ఉంటున్నది.

వ. అయినను. 276

ప్రతిపదార్థం: అయినను= అయినప్పటికీ.

చ. అనయముఁ గ్రూరకర్ములగునట్టి విమూఢులఁ బిల్కుమార్పఁ బూ
నన తగు ధర్మవర్తను లనంజను మీయెడ ద్రోహులైన య
ద్దనుజులఁ ద్రుంచి మీకుఁ బ్రమదం బొనరించెదఁ దేజమున్ బలం
బును సగపాలు వెట్టి ననుఁ బొందఁగఁ జేయుఁడు మీరలందఱున్.' 277

ప్రతిపదార్థం: అనయమున్= ఎల్లప్పుడూ; క్రూరకర్ములు= ఇతరులకు బాధాకరములైన పనులు చేసే; విమూఢులన్= మిక్కిలి మందబుద్ధులైనవారిని; పిల్కుమార్పన్= నశింపజేయటానికి; పూనన= పూనుకొనటమే; తగున్= యుక్తం; ధర్మ= ధర్మసహితమైన; వర్తనులు= నడవడి కలవారు; అనన్= అని పలుకటానికి; చను= తగిన; మీ+ఎడన్= మీ విషయంలో; ద్రోహులు= అపకారులు; ఐన= అయినట్టి; ఆ= త్రిపురాలకు చెందిన; దనుజులన్= రాక్షసులను; త్రుంచి= సంహరించి; మీకున్= దేవతలకూ, మునులకూ; ప్రమదంబు= సంతోషం; ఒనరించెదన్= కలిగిస్తాను; మీరలు+అందఱున్= మీరంతా; తేజమున్= పరాక్రమమూ; బలంబును= శక్తీ; సగపాలు= సగభాగం; పెట్టి= ఇచ్చి; ననున్= నన్ను; పొందఁగన్= చేరేటట్లు; చేయుఁడు= కావించండి.

తాత్పర్యం: నిరంతరమూ పరులను పీడించే పనులు చేసే మరీ బుద్ధిహీనులైన వారిని సంహరించటానికి ప్రయత్నించటమే యుక్తం. మీరు ధర్మప్రకారం నడుచుకొనే వారని పేరు పొందినవారు. ఇటువంటి మీకు అపకారం చేస్తున్న ఆ రాక్షసులను సంహరించి, మీకు సంతోషం కలిగిస్తాను. కనుక మీ రంతా మీమీ పరాక్రమంలోని సగభాగమూ, శరీరబలంలోని సగం భాగమూ నన్ను చేరుకొనేటట్లు చేయండి.'

వ. అని 'మఱియు నొక్కటి సెప్పెద లోకంబులకెల్లను బశుత్వంబును నాకుం బశుపతిత్వంబును గావలయు నట్లయినఁ బశుహననంబునం బాపంబు లేకుండు. 278

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం చెప్పి; మఱియున్= ఇంకా; ఒక్కటి= ఒకటి; చెప్పెదన్= చెపుతాను; లోకంబులకున్= లోకాలకు; ఎల్లన్= అన్నింటికీ; పశుత్వంబును= పశుభావమూ; నాకున్= నాకు; పశుపతిత్వంబునున్= పశువులకు పతిభావమూ; కావలయున్= కలగాలి; అట్లైనన్= అట్లా అయితే; పశుహననంబునన్= పశువులను చంపటంవలన; పాపంబు= పాపం; లేక+ఉండున్= లేకుండా ఉంటుంది, ఉండకుండా పోతుంది.

తాత్పర్యం: అని చెప్పి (ఇట్లా అన్నాడు:) 'ఇంకా ఒక సంగతి చెప్పుతున్నాను. అదీకాక ఈ లోకాలకన్నింటికీ పశుభావం కలగాలి, నాకు పశుపతిభావం కలగాలి. ఇట్లా ఇవి కలిగినందువలన పశువులను చంపటంమూలంగా వచ్చే పాపం నాకు రాకుండా ఉంటుంది.

విశేషం: ఈ పద్యంలో 'ఒక్కటి సెప్పెద' అన్న 'ఒక్కటి' లో ఒక అంశం ఇక్కడ చెప్పి, తరువాతిపద్యంలో రెండవ అంశం చెపుతున్నాడు.

క. ఒనరింపుఁడు దివ్యరథం । బును దచ్చోదకుని నశ్వముల విల్లును న
మ్మును నాకు నట్టులైనను । దనుజుల దుర్గములు వినిహతములగు నాచేన్.' 279

ప్రతిపదార్థం: నాకున్= నాకోసం; దివ్య= దివిలోపుట్టిన, గొప్పదైన; రథంబును= తేరిని; తద్= ఆ రథంయొక్క; చోదకునిన్= సారథినీ; అశ్వములన్= గుఱ్ఱాలనూ; విల్లునూ= ధనుస్సునూ; అమ్మునున్= బాణాన్నీ; ఒనరింపుఁడు= నిర్మించండి; అట్టులు= అలా; ఐనను= సమకూడితే; నాచేన్= నాచేత; దనుజుల= దానవులయొక్క; దుర్గములు= (రాక్షసుల త్రిపురాలనే) కోటలు; వినిహతములు+అగున్= పూర్తిగా ధ్వంసం చేయబడతాయి.

తాత్పర్యం: నాకొరకు దివ్యమైన రథమూ, సారథీ, అశ్వాలూ, ధనుస్సూ, బాణమూ నిర్మించి ఇవ్వండి. అట్లా అయితే త్రిపురాసురుల పురదుర్గాలు నా చేత ధ్వంసమవుతాయి.'

ఆ. అనిన విని పశుత్వమునకు శంకించి । విషణ్ణులైన సురల చందమెఱిఁగి
భయము గొనఁగవలదు పశుభావమోక్షణ । విధియుఁ గలదు దాని వినుఁడు మీరు.' 280

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; పశుత్వమునకున్= అందరికీ పశుభావం కలగాలన్నదానికి; శంకించి= జంకి, సందేహించి, విషణ్ణులైన= ఖిన్నులైన; సురల= దేవతలయొక్క; చందమెఱిఁగి= విధము తెలిసికొని; మీరు= దేవతలూ, మునులూ; భయము= జడుపు; కొనఁగన్= తీసికొనగా (అనగాభయపడటం); వలదు= వద్దు; పశుభావ= పశుత్వం నుంచి; మోక్షణ విధియున్= విడుదల కలిగే పద్ధతీ; కలదు= ఉన్నది; వినుఁడు= ఆ పద్ధతి గురించి వినండి.

తాత్పర్యం: అట్లా చెప్పేసరికి విని, దేవతలు పశుత్వం కలగటం గురించి జంకుగొంకులతో విషాదగ్రస్తులుకాగా, వారి వైఖరి తెలిసికొని, 'మీ రేమీ భయపడవద్దు. పశుత్వం నుంచి విముక్తి లభించే విధానమూ ఉన్నది. వినండి.'

వ. అని పలికి హరుండు వారలతోఁ బాశుపత వ్రతానుష్ఠానంబునం బశుత్వ మోక్షణంబగు నదియును ద్వాదశాబ్దంబులు నడపవలయు నిష్ఠానురూపంబుగా సంవత్సరంబునఁ దదర్ధంబున ఋతువున మాసంబునఁ బండ్రెండు దినంబుల మాత్రను ఫలించు' ననుటయు నట్లకాక యని వారలందఱును లోకంబులకు లోకేశ్వరునకుఁ బశుత్వంబుఁ బశుపతిత్వంబు గలుగుటకు నొడంబడి యమ్మహాత్మునిఁ బశుపతి వని పేర్కొని నిజతేజోబలార్ధంబులు సమర్పించినం గైకొని యత్యధిక బలుండై తొల్లింటికంటె వెలింగె నప్పుడద్దేవునకు దేవతలు విభవంబెసఁగఁ బురహననంబునకయి యభిషేకంబు సేసి త్వష్టనాలోకించి 'మహాదేవునకు దివ్య రథంబును దగియెడు సాధనంబులను గల్పింపు' మనవుడుఁ దపఃప్రభావ మహనీయుండగు విశ్వకర్మ యవహితుండై. 281

ప్రతిపదార్థం: అని; పలికి= చెప్పి; హరుండు= శివుడు; వారలతోన్= ఆ దేవతలతో; పాశుపతవ్రత= పాశుపతవ్రతమనే వ్రతంయొక్క; అనుష్ఠానంబునన్= ఆచరణంవలన; పశుత్వమోక్షణంబు= పశుభావం నుంచి విడుదల; అగున్= కలుగుతుంది; అదియును= ఆ వ్రతానుష్ఠానంకూడా; ద్వాదశ= పన్నెండు; అబ్దంబులు= సంవత్సరాలు; నడపవలయున్= నడిపించాలి; నిష్ఠా= శ్రద్ధకు; అనురూపంబుగాన్= తగినట్లుగా; సంవత్సరంబునన్= ఒక ఏడాదిలోనూ; తద్+అర్ధంబునన్= అందులో సగభాగం

ఆరునెలలలోనూ; ఋతువునన్= రెండునెలలలోనూ; మాసంబునన్= ఒక నెలలోనూ; పంద్రెండు= పన్నెండు; దినంబుల మాత్రను= దినంబుల పరిమితిలోనూ; ఫలించున్= ఫలాన్నిస్తుంది; అనుటయున్= అని చెప్పేసరికి; అట్లకాక= అట్లే అగుగాక; అని; వారలు+అందఱును= ఆ సమస్త దేవతలూ, మునులూ; లోకంబులకున్= లోకాలకు; పశుత్వంబును= పశుభావమూ; లోక+ఈశ్వరునకున్= లోకాలకు స్వామి అయిన శివుడికి; పశుపతిత్వంబున్= పశుపతిభావమూ; కలుగుటకున్= సంభవించటానికి; ఒడంబడి= అంగీకరించి; ఆ+మహాత్మునిన్= ఆ గొప్ప మనస్సు కలవాడిని; పశుపతివి+అని= పశువులకు స్వామివి అని; పేర్కొని= పిలిచి; నిజ= తమయొక్క; తేజః+బల+అర్ధంబులు= పరాక్రమం యొక్క సగంభాగమూ, శక్తియొక్క సగంభాగమూ; సమర్పించినన్= ఈయగా; కైకొని= స్వీకరించి; అతి+అధిక= మిక్కిలి ఎక్కువ అయిన; బలుండై= బలం కలవాడై; తొల్లింటికంటెన్= పూర్వంకంటే; వెలింగెన్= ప్రకాశించాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+దేవునకున్= ఆ శివదేవునికి; దేవతలు= అమరులు; విభవంబు= ఐశ్వర్యం; ఎసఁగన్= అతిశయింపగా; పురహననంబునకయి= త్రిపురసంహారంకోసం; అభిషేకంబు+చేసి= పలురకాల మణులతో, మంత్రాలతో, ఓషధులతో, అక్షతలతో, సుగంధద్రవ్యాలతో కలిసిన వివిధ నదుల పవిత్రోదకంతో మంత్రపూర్వకంగా పట్టాభిషిక్తుని చేసి; త్వష్టన్= త్వష్టతో; ప్రజాపతిని= విశ్వకర్మను; ఆలోకించి= చూచి; మహాదేవునకున్= పరమేశ్వరునికి; దివ్యరథంబును= దివ్యమైన రథం; తగియెడు= (ఆయనకూ, ఆ రథానికీ తలపెట్టిన మహాకార్యానికీ) తగిన; సాధనంబులను= ఉపకరణాలనూ, పనిముట్లను; కల్పింపుము= కావించుము; అనవుడున్= అని చెప్పగా; తపః= తపస్సుయొక్క; ప్రభావ= మహిమచేత; మహనీయుండగు= గొప్పవాడైన; విశ్వకర్మ; అవహితుండై= శ్రద్ధకలవాడై.

తాత్పర్యం: ఇట్లా పలికి, శివుడు వారితో (ఇట్లా అన్నాడు): 'పాశుపత వ్రతం ఆచరించినందువలన పశుత్వం నుంచి విడుదల కలుగుతుంది. ఆ వ్రతం పన్నెండు సంవత్సరాలు ఆచరించాలి. చేసేవారికిగల శ్రద్ధకు తగినట్లు ఒక సంవత్సరం అయినా ఆరునెలలయినా, రెండు నెలలయినా, ఒక నెల అయినా పన్నెండు దినములయినా ఫలాన్నిస్తుంది.' అని చెప్పేసరికి, వారు అట్లాగే అని లోకాలకు పశుత్వమూ, లోకేశ్వరుడయిన పరమేశ్వరుడికి పశుపతిత్వమూ కలగటానికి ఒప్పుకొన్నారు. ఆ మహామనస్విని 'పశుపతివి' అన్నారు. తమ తమ పరాక్రమం నుండి శరీరబలం నుండి సగం భాగం ఆయనకు సమర్పించారు. వాటిని ఆయన స్వీకరించి, మిక్కిలిగ ఎక్కువైన బలంతో ఇదివరకటికంటె గొప్పగా ప్రకాశించాడు. ఆ మహాదేవుడిని దేవతలు తగిన వైభవంతో త్రిపుర సంహారానికి అభిషిక్తుడిని చేశారు. త్వష్టతో 'మహాదేవుడి కొక రథమూ, దానికీ ఆయనకూ ఈ మహాకార్యానికీ తగిన పనిముట్లూ నిర్మించుము' అన్నారు. తపఃశక్తి మాహాత్మ్యంతో గొప్పవాడైన ఆ విశ్వకర్మ మిక్కిలి శ్రద్ధతో. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. సామర్థ్యమొప్ప విశ్వంభరా చక్రంబు । రథముగఁజేసి చంద్రముని నుష్ణ
కరునిఁ జక్రంబులుగాఁ బెట్టి వారిధి । నక్ష మొనర్చి హిమావనీధ
రంబున వింధ్యనగంబున నస్తా చ । లంబున నుదయశైలమున బలుపు
టవయవంబులు దీర్చి యగ్నుల మూఁటఁ బ్రి । వేణుకరచనఁ గావించి మేరు

ఆ. పర్వతమున నాతపత్రంబుఁ గల్పించి । హరులు వేదములు శరాసనంబు
వత్సరంబు శరము వాసుదేవుండును । గాఁగ సంఘటించె గౌరవమున. 282

ప్రతిపదార్థం: సామర్థ్యము+ఒప్పన్= శక్తీ, నేర్పూ ఒప్పేటట్లుగా, విశ్వంభరా చక్రంబున్= భూమండలాన్ని; రథముగన్= తేరుగా; చేసి= కావించి; చంద్రమునిన్= చంద్రుడినీ; ఉష్ణకరునిన్= వేడి కిరణాలుగల సూర్యుడినీ; చక్రంబులుగాన్= చక్రాలుగా; పెట్టి= ఉంచి; వారిధిన్= సముద్రాన్ని; అక్షము= ఇరుసుగా; ఒనర్చి= కావించి; హిమ+అవనీధరంబునన్= హిమాలయపర్వతంతోనూ;

వింధ్యనగంబునన్= వింధ్యాచలంతోనూ; అస్త+అచలంబునన్= అస్తమయగిరితోనూ; ఉదయశైలంబునన్= ఉదయాద్రితోనూ; బలువు+అవయవంబులు= బలమైన భాగాలు; తీర్చి= ఏర్పరచి; అగ్నులన్ మూఁటన్= మూడగ్నులతోను; త్రివేణుక రచనన్= త్రివేణుకములనే రథభాగాలయొక్క; రచనన్= నిర్మాణాన్ని; కావించి= చేసి; మేరుపర్వతమునన్= మేరుగిరితో; ఆతపత్రంబున్= గొడుగును; కల్పించి= చేసి; హరులు= గుర్రాలు; వేదములున్= నాలుగువేదాలూ; శరాసనంబు= ధనుస్సు; వత్సరంబున్= సంవత్సరమూ; శరము= బాణం; వాసుదేవుండును= విష్ణువూ; కాఁగన్+అయ్యేటట్లు; గౌరవమునన్= మన్ననతో; సంఘటించెన్= కూర్చాడు.

తాత్పర్యం: నేర్పుతో భూమిని రథం చేశాడు. చంద్రసూర్యులను దాని చక్రాలుగా ఉంచాడు. సముద్రాన్ని ఇరుసు చేశాడు. హిమాచల, వింధ్యాచల, అస్తాచల, ఉదయాచలాలను బలమైన భాగాలుగా పెట్టాడు. త్రేతాగ్నులను త్రివేణుకములనే భాగాలుగా ఉంచాడు. మేరుపర్వతాన్ని గొడుగుగా ఉంచాడు. వేదాలు గుర్రాలుగా, సంవత్సరం ధనుస్సుగా, బాణం విష్ణువుగా మన్ననతో సమకూర్చాడు.

విశేషం: ఈ రథ నిర్మాణంలో ఆయా భాగాలుగా ఏర్పడిన వాటి గురించి వివిధ పురాణాలలో రకరకాలుగా ఉన్నది. ఒక్కొక్క దానిలోని వర్ణన ఒక్కొక్క కల్పంలోనిదిగా భావించాలి. ఇట్లాంటి భిన్న వృత్తాంతాలలో ఏది ఏ కల్పంలోనిది అని చెప్పటం సాధ్యమవుతుందేమో పరిశోధన జరగాలి.

వ. ఇట్లు చరాచరాత్మకంబై తేజరిల్లు నత్తేరు వీక్షించి ఫాలాక్షుండు గ్రహమండిత వ్యోమమండలం బుపాదానకారణంబుగా విశ్వకర్మ గావించిన కవచంబు దొడిగి శరాసనంబు ధరియించి శరంబు పుచ్చికొని దానవ సంత్రాసనోత్సాహుం డగుచు రథారోహణంబు సేసి వృషభధ్వజంబునం బొలుపొందె. 283

ప్రతిపదార్థం: ఇట్లు= ఇలా; చరాచరాత్మకంబు+ఐ= కదిలే, కదలని ప్రాణులు గల విశ్వంతో ఏర్పడిన రూపమై; తేజరిల్లు= ప్రకాశించే; ఆ+తేరు= ఆ రథాన్ని; వీక్షించి= బాగా చూచి; ఫాల+అక్షుండు= నొసట కన్నుగల శివుడు; గ్రహమండిత= గ్రహాలచేత అలంకరింపబడిన, వ్యోమ మండలంబు= ఆకాశచక్రం; ఉపాదానకారణంబుగాన్= అవినాభావ సంబంధ కారణంగా, ముఖ్యపదార్థంగా; విశ్వకర్మ= త్వష్ట; కావించిన= చేసిన; కవచంబు; తొడిగి= ధరించి; శర+ఆసనంబు= ధనుస్సు; ధరియించి= పట్టుకొని; శరంబు= బాణం; పుచ్చికొని= తీసికొని; దానవ= రాక్షసులను; సంత్రాసన= భయపెట్టే; ఉత్సాహుండు= పూనికకలవాడు; అగుచున్= అవుతూ; రథ+ఆరోహణంబు+చేసి= తేరెక్కి; వృషభధ్వజంబునన్= ఎద్దుగుర్తు గల పతాకంతో; పొలుపొందె= అందగించె.

తాత్పర్యం: ఇట్లా చరాచర ప్రాణిమయమైన విశ్వరూపంతో ప్రకాశిస్తున్న ఆ రథాన్ని బాగా చూచాడు నిటలాక్షుడు. కవచం తొడుగుకొన్నాడు. (ఆ కవచాన్ని విశ్వకర్మ గ్రహాలతో అలంకృతమైన ఆకాశంతో చేశాడు.) విల్లు పట్టుకొన్నాడు. అమ్ము తీసికొన్నాడు. రాక్షసులను గడగడలాడించే పూనికతో రథం ఎక్కాడు. దానిమీద వృషభచిహ్నం కల జెండా అందగిస్తున్నది.

ఆ. 'అప్సరోగణంబు లాడుచుఁ బాడుచు। సంతసమునఁ జెలఁగ సకల మునులు
బహువిధములఁ దన్నుఁ బ్రస్తుతిసేయంగ। నమరవరులఁ జూచి యల్లనగుచు. 284

ప్రతిపదార్థం: అప్సరస్+గణంబులు= దేవవేశ్యలగుంపులు; ఆడుచున్= నృత్యంచేస్తూ; పాడుచున్= గానంచేస్తూ; సంతసమునన్= సంతోషంతో; చెలఁగన్= ఉత్సహించగా; సకలమునులు= సమస్త ఋషులు; బహువిధములన్= అనేకవిధాల; తన్నున్= తనను;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రస్తుతి= మిక్కిలిస్తోత్రం; చేయఁగన్= కావించగా; అమరవరులన్= దేవతలలో శ్రేష్ఠులైనవారిని; చూచి= వీక్షించి; అల్లన్= మెల్లగా, కొంచెముగా; నగుచున్= నవ్వుతూ.

తాత్పర్యం: అప్సరసలు నృత్యం చేస్తూ పాటలు పాడుతూ, సంతోషంతో ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. మునీశ్వరులందరూ తనను అనేక విధాలుగా బాగా స్తోత్రాలు చేస్తున్నారు. అపుడు దేవనాయకులను చూచి చిరునవ్వు నవ్వుతూ.

క. **'సారథి యెవ్వం? డనుటయు । వారలు 'నీ చిత్తమునకు వచ్చిన వానిం**
గారుణ్యంబునఁ గైకొని । తేరునడపఁ బనుపుమనిరి ధీరవిచారా! **285**

ప్రతిపదార్థం: ధీరవిచారా!= స్థిరమైన ఆలోచనకలవాడా! శల్యా!; (శివుడు); సారథి= సూతుడు; ఎవ్వండు= ఎవడు; అనుటయున్= అని అడుగగా; వారలు= దేవనాయకులు; నీ చిత్తమునకున్= నీ మనస్సుకు; వచ్చిన= నచ్చిన; వానిన్= అతడిని; కారుణ్యంబునన్= దయతో; కైకొని= స్వీకరించి; తేరు= రథాన్ని; నడపన్= త్రోలటానికి; పనుపుము= ఆజ్ఞాపించు; అనిరి= అన్నారు.

తాత్పర్యం: 'స్థిరమైన ఆలోచన కల శల్యా!, శివుడు 'సారథి ఎవడు?' అని అడిగాడు. దేవతలు 'నీకు నచ్చినవాడిని నీవే దయతో తీసికొని రథం నడుపు మనుము' అన్నారు.

వ. **అనవుడు నద్దేవుండు.** **286**

ప్రతిపదార్థం: అనవుడున్= అట్లా అనగా; ఆ+దేవుండు= ఆ దేవుడైన శివుడు.

తాత్పర్యం: అట్లా అనగా ఆ దేవుడైన శివుడు.

తే. **'అరయ నెవ్వాఁడు నాకంటె నధికుఁ డతని । మీర యెఱిఁగి యొనర్పుఁడు సారథిత్వ**
మునకు' ననిచెప్పటయు మహామునులఁ గూర్చి । కొని యమర్త్యులు సంభృతవినయు లగుచు **287**

ప్రతిపదార్థం: అరయన్= ఆలోచింపగా; ఏ+వాఁడు= ఎవడు; నాకంటెన్= నాకన్నా; అధికుఁడు= గొప్పవాడో; అతనిన్= అతడిని; మీరు+అ+ఎఱిఁగి= మీరే తెలిసికొని; సారథిత్వమునకున్= సూతభావానికి, రథంత్రోలేపనికి; ఒనర్పుఁడు= నియమించండి; అని; చెప్పుటయున్= చెప్పినందువలన; అమర్త్యులు= దేవతలు; మహామునులన్+కూర్చి= మహర్షులను సమావేశపరిచి; సంభృత= బాగా నిండిన; వినయులు= అణకువ కలవారు; అగుచున్= అవుతూ.

తాత్పర్యం: 'నాకంటె గొప్పవాడెవడో ఆలోచించి మీరే తెలిసికొని, అతడిని నాకు సారథిగా నియమించండి' అని చెప్పాడు. అపుడు దేవతలు మహామునులనందరినీ ఒకచోట సమావేశపరిచి, మిక్కిలి వినయంతో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. **కమలాసను కట్టెదిరికిం జని భక్తిం బ్రణమిల్లి 'దేవా! నీ వలన నీలగ్రీవుండు ప్రసన్నుం డయ్యె భవదాజ్ఞ 'నే మితనికి రథంబుం దగు సాధనంబులు సమకట్టితిమి సారథి దొరకకున్నవాఁ డది యెట్లనిన సారథ్యం బాచరించు పురుషుండు బలసత్త్వంబుల రథికునకధికుండు గావలసియుండు రథంబు పృథ్వి, రథ్యంబులు వేదంబులు, రథికుండు రుద్రుండు, రథచోదకుండు సులభుం డగునే? గుణాధికుండ వగు నీ విప్పనికిం**

బూనవలయు దానవ భయభ్రాంతులమైన మమ్ము రక్షింపుము మా కేడుగడయు నీవ భవదీయ ప్రసాదంబున బ్రదికెద' మని చాఁగిలి మ్రొక్కినం బరమాదరంబున నెత్తి యప్పరమేష్ఠి వారలం గారుణ్యంబునం గనుంగొని. **288**

ప్రతిపదార్థం: కమలాసను= పద్మాసనుడైన బ్రహ్మయొక్క; కడు+ఎదిరికిన్= మిక్కిలిముందరికి; చని= వెళ్ళి; భక్తిన్= భక్తితో; ప్రణమిల్లి= నమస్కరించి, దేవా!= దేవుడా!; నీ వలనన్= నీపట్ల; నీలగ్రీవుండు= నీలకంఠుడైన శివుడు; ప్రసన్నుండు= సంతోషించినవాఁడు; అయ్యెన్= ఐనాడు; భవత్= నీయొక్క; ఆజ్ఞన్= ఆజ్ఞచేత; ఏము= మేము; ఇతనికిన్= ఈ రుద్రుడికి; రథంబున్= తేరునూ; తగు= తగిన; సాధనంబులు= పనిముట్లు; సమకట్టితిమి= సిద్ధంచేశాము; సారథి= సూతుడు; దొరకకున్నవాఁడు= దొరకటంలేదు; అది= ఆ ప్రకారం; ఎట్లు+అనినన్= ఎలాగంటే; సారథ్యంబు= రథంత్రోలేపని; ఆచరించు= చేసే; పురుషుండు= మగవాడు; బల= శరీరబలంచేతనూ; సత్త్వంబులన్= మనశ్శక్తి చేతనూ; రథికునకున్= రథంపై ఉండి యుద్ధంచేసేవాడికంటె; అధికుండు= గొప్పవాడు; కావలసి= అయియుండవలసి; ఉండున్= ఉంటాడు; రథంబు= తేరు; పృథ్వి= భూమి; రథ్యంబులు= గుర్రాలు; వేదంబులు= వేదాలు; రథికుండు= తేరిపై ఉండి యుద్ధంచేసేవాడు; రుద్రుండు= మహేశ్వరుడు; రథచోదకుండు= రథం త్రోలేవాడు; సులభుండు= తేలికగా లభించేవాడు; అగునే?= అవుతాడా?; గుణ= సుగుణాలచేత రుద్రునిదైన తమోగుణంకంటె గొప్పదైన రజోగుణంచేత; అధికుండవు= గొప్పవాడవు; అగు= అయిన; నీవు= సృష్టికర్తవయిన నీవు; ఈ+పనికిన్= ఈ రథం త్రోలేపనికి; పూనవలయున్= పూనుకొనాలి; దానవ= రాక్షసులవలన వచ్చిన; భయ= భయంచేత; భ్రాంతులము+ఐన= తిరుగుచున్నవారమైన, భ్రమకలవారమైన; మమ్మున్= మమ్ములను; రక్షింపుము= కాపాడుము; మాకున్= శరణాగతులమైన మాకు; ఏడుగడయున్= రక్షకుడవూ; నీవు+అ= నీవే; భవదీయ= నీదైన; ప్రసాదంబునన్= అనుగ్రహంచేత; బ్రదికెదమని= జీవిస్తాము అని; చాఁగిలి= సాష్టాంగముగా నేలపైపడి; మ్రొక్కినన్= నమస్కరింపగా; పరమాదరంబునన్= మిక్కిలి గౌరవంతో; ఎత్తి= లేవనెత్తి; ఆ+పరమేష్ఠి= ఆ బ్రహ్మ; వారలన్= ఆ దేవతలను; కారుణ్యంబునన్= దయతో; కనుంగొని= చూచి.

తాత్పర్యం: (వా రందరూ) బ్రహ్మదేవుడి సమక్షానికి వెళ్ళారు. భక్తితో నమస్కారం చేశారు. 'దేవా! నీలకంఠుడు నీ పట్లనూ, నీవు కారణంగా మాపట్లనూ సంతుష్టుడయ్యాడు. నీ ఆజ్ఞతో మే మీయనకు ఒక రథమూ, తగిన పనిముట్లూ సమకూర్చిపెట్టాము. సారథి ఒకడే దొరకలేదు. అదెట్లా అంటే సారథి అయినవాడు బలంలోకాని, మానసికబలంలోకాని రథికుడికంటె గొప్పవాడు కావాలి. రథం భూమి, గుర్రాలు వేదాలు, రథికుడు రుద్రుడు అయినప్పుడు తగిన సారథి అంత తేలికగా ఎట్లా దొరుకుతాడు? నీవు గుణాధికుడవు. కనుక నీవే సారథివి కావాలి. మేము రాక్షసుల భయంతో భ్రాంతులమైపోయాము. మమ్ములను రక్షించుము. మాకు రక్షకుడవు నీవే. నీ అనుగ్రహంతో బ్రతుకుతాము' అని నమస్కరించేసరికి, మిక్కిలి ఆదరంతో వారిని పైకి లేవదీసి, బ్రహ్మదేవుడు కరుణతో చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. **'మీరు నిజంబ చెప్పితిరి మిక్కిలి నేర్పును లావుగల్గినన్**
సారథి పోరులన్ రథికసత్తముఁ దా గెలిపించు బుద్ధి దో
స్సార విలాస భంగులకు శర్వుఁడు మెచ్చఁగ నాగమాత్మ కో
దార హయంబులన్ నడపెదన్ దనుజుల్ వెఱఁగందు నట్లుగన్.' **289**

ప్రతిపదార్థం: మీరు= మీరందరునూ; నిజంబు+అ= సత్యమే; చెప్పితిరి= పలికితిరి; మిక్కిలి= రథికుడికంటె అధికమైన; నేర్పును= చాతుర్యమూ; లావు= బలమూ; కల్గినన్= ఉన్నట్లయితే; సారథి= సూతుడు; తాన్= స్వయంగా; రథికసత్తమున్=

రథికులలో శ్రేష్ఠుడైనవాడిని; పోరులన్= యుద్ధాలలో; గెలిపించున్= విజయం పొందేటట్లు చేస్తాడు; బుద్ధి= తెలివియొక్క; దోస్సార= భుజబలంయొక్క; విలాస భంగులకున్= మెరసే రీతులకు; శర్వుడు= రుద్రుడు; మెచ్చన్= మెచ్చుకొనేటట్లూ; దనుజుల్= రాక్షసులు; వెఱఁగందునట్లుగన్= ఆశ్చర్యపోయేటట్లూ, భయపడేటట్లూ; ఆగమ+ఆత్మక= వేదరూపాలయిన; ఉదార= గొప్పవైన; హయంబులన్= గుఱ్ఱాలను; నడపెదన్= నడుపుతాను.

తాత్పర్యం: మీరు నిజమే చెప్పారు. రథికుడికంటె అధికమైన నేర్పూ, బలమూ తనకుంటేనే సారథి యుద్ధాలలో రథికుడిని గెలిపిస్తాడు. కనుక, నా తెలివినీ, భుజబలాన్నీ రుద్రుడు మెచ్చుకొనేరీతిగ, దానవులు భయపడేటట్లుగ, ఆశ్చర్యపోయేటట్లుగ వేదాశ్వాలను నడుపుతాను.'

వ. అని పలికి సురగణంబు ముదంబునం బొదలఁ దనచేతి కమండలు వొక్కెడనిడి జడముడి బిగియించి యజిన పరిధానంబు దృఢంబుగా బంధించి ప్రణవంబునం ద్వష్టయొనర్చిన మునికోల వుచ్చికొని నొగ లెక్కె నిట్లు లోకపితామహుని సురలు శంకరునకు సారథ్యంబు సేయించి' రని చెప్పి దుర్యోధనుండు వెండియు నిట్లనియె.

290

ప్రతిపదార్థం: అని; పలికి= చెప్పి; సురగణంబు= దేవతల సమూహం; ముదంబునన్= సంతోషంతో; పొదలన్= ఒప్పగా; తనచేతి= తన హస్తంలోని; కమండలువు= జలపాత్ర; ఒక్క+ఎడన్= ఒకచోట; ఇడి= ఉంచి; జడముడిన్= తలమీది జడలబంధాన్ని; బిగియించి= గట్టిగాకట్టి; అజిన= జింకతోలు అనే; పరిధానంబు= మొలనున్న వస్త్రం; దృఢంబు+కాన్= గట్టిగా; బంధించి= కట్టి; ప్రణవంబునన్= ఓంకారంతో; త్వష్ట= విశ్వకర్మ; ఒనర్చిన= చేసిన; మునికోల= కమ్చీకర్ర; పుచ్చికొని= తీసికొని; నొగలు= తొట్టిలోనికి; ఎక్కెన్= ఆరోహించాడు; ఇట్లు; సురలు= దేవతలు; లోకపితామహునిన్= లోకాలకు తాత అయిన బ్రహ్మను, బ్రహ్మచేత; శంకరునకున్= శివుడికి; సారథ్యంబు= సూతుడిపని; రథంతోలటం; చేయించిరి= కావించేటట్లు చేశారు; అని; చెప్పి; దుర్యోధనుడు; వెండియున్= మళ్ళీ, ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: ఇట్లా చెప్పి, దేవతలందరూ సంతోషించేటట్లు తన చేతిలో ఉన్న కమండలువు ఒకచోట పెట్టాడు. తలమీది జడలముడి బిగించాడు. మొలన వలువగా ఉన్న జింకతోలు గట్టిగా కట్టాడు. విశ్వకర్మ ఓంకారంతో రూపొందించిన ములుకోల తీసుకొన్నాడు. తొట్టిలోని కెక్కాడు. ఇట్లా దేవతలు బ్రహ్మదేవుడిచేత శంకరుడి రథం తోలించారు.' అని చెప్పి, దుర్యోధను డింకా ఇట్లా అన్నాడు:

క. 'హరు లమ్మహాత్ము లిరువుర । భరియించుట కోర్వలేక పడుటయు నెత్తెన్
వెరవున లావున వాగెలు । ధరియించుచుఁ బద్మభవుఁడు ధరణీనాథా! 291

ప్రతిపదార్థం: ధరణీనాథా!= భూపతీ! శల్యా!; హరులు= గుర్రాలు; ఆ+మహాత్ములు= ఆ మహనీయులను; ఇరువురన్= ఇద్దరినీ; భరియించుటకున్= మోయటానికి; ఓర్వలేక= తాళలేక; పడుటయున్= పడిపోయినందువలన; పద్మభవుఁడు= పద్మంలో పుట్టిన బ్రహ్మ; వెరవునన్= ఉపాయంతోనూ; లావునన్= బలంతోనూ; వాగెలు= పగ్గాలు; ధరియించుచున్= పట్టుకొంటూ; ఎత్తెన్= లేవదీశాడు.

తాత్పర్యం: 'మద్రరాజా! శల్యా! ఆ గుర్రాలు ఆ మహానుభావులనిద్దరినీ మోయలేక పడిపోయాయి. అపుడు బ్రహ్మ శక్తియుక్తులతో గుర్రాల పగ్గాలు పట్టుకొంటూ వాటిని పైకి లేవదీశాడు.

వ. ఎత్తి యత్తురంగంబులకు వెండియు వీర్యశౌర్యంబులు గలుగ ననుగ్రహించి రథంబు గడపం దత్కోశలంబు గొనియాడి కామదమనుం 'డా దనుజుల దుర్గంబుల దెసకు నరదంబు వఱపుము నేఁడు జగంబుల యలజడి మాన్చెద నాచేతి బలువుసూడు' మని పలికిన నప్పరమ సారథి మనోమారుత జవసత్త్వంబులు గలుగు నవ్వేదాశ్వంబులం బఱప నథర్వాంగిరసులు చక్రరక్షకులయి చనుదేర నత్తేరా పురంబుల కడరిన నయ్యాదిమ రథికుండు. 292

ప్రతిపదార్థం: ఎత్తి= లేవదీసి; ఆ+తురంగంబులకున్= ఆ గుర్రాలకు; వెండియున్= ఇంకా; వీర్యశౌర్యంబులు= వీరత్వమూ, శూరత్వమూ; కలుగన్= కలిగేటట్లుగా; అనుగ్రహించి= దయచూపి; రథంబు= తేరు; కడపన్= నడపగా; తద్+కౌశలంబు= అతడినేర్పును; కొనియాడి= ప్రశంసించి; కామదమనుండు= మన్మథుడిని జయించిన పరమేశ్వరుడు; ఆ దనుజుల= ఆ దానవులయొక్క; దుర్గంబుల= పురాలయొక్క; దెసకున్= దిక్కునకు; అరదంబు= తేరు; పఱపుము= త్రోలుము; నేఁడు= ఈ దినం; జగంబులు= లోకాలయొక్క; అలజడి= ఆపదను; మాన్పెదన్= పోగొడతాను; నాచేతి= నా హస్తంయొక్క; బలుపు= బలం; చూడుము+అని; పలికినన్= పలుకగా; ఆ+పరమసారథి= ఆ గొప్పసూతుడు; మనః= మనస్సుయొక్క; మారుత= వాయువుయొక్క; (వరుసగా) జవ= వేగమూ; సత్త్వంబులు= బలమూ; కలుగు= ఉండిన; ఆ+వేద= ఆ వేదాలనే; అశ్వంబులన్= గుర్రాలను; పఱపన్= త్రోలగా; అథర్వ+అంగిరసులు= అథర్వుడు, అంగిరసుడు అనే మునులు; చక్రరక్షకులయి= రెండు చక్రాలకూ రక్షణ చేసేవారై; చనుదేరన్= రాగా; ఆ+తేరు= ఆ రథం; ఆ పురంబులకున్= ఆ త్రిపురాలవైపునకు; అడరినన్= త్వరపడగా; ఆ+ఆదిమ రథికుండు= ఆ ప్రథమ రథికుడైన పరమేశ్వరుడు.

తాత్పర్యం: అట్లా లేవనెత్తి. ఆ గుర్రాలకు ఇంకా వీరత్వమూ, శౌర్యమూ కలిగేటట్లు దయ చూపించాడు. రథం నడిపించాడు. అపుడు కామాంతకుడైన హరుడు బ్రహ్మయొక్కనేర్పును ప్రశంసించాడు. 'ఆ రాక్షసుల పట్టణాలవైపు రథం తోలుము. ఈవేళ లోకాల ఆపద, బాధ తొలగిస్తాను. నాచేతి బలం చూడుము' అన్నాడు. ఆ మహాసారథి బ్రహ్మదేవుడు మనోవేగమూ, మారుతబలమూ కల ఆ వేదాలనే గుర్రాలను త్రోలాడు. అథర్వుడూ, అంగిరసుడూ అనే మునులు చక్రరక్షకులుగా వచ్చారు. అట్లా ఆ రథం త్రిపురాలమీదికి వెళ్ళేసరికి ఆ ప్రథమరథికుడు హరుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఉస్మా. వావి. ప్రతులు అథర్వకు బదులు అధర్వ అనటం ముద్రాప్రామాదికం.

రుద్రుఁడు త్రిపురంబుల సంహరించి సురల సంతోషపఱుచుట (సం. 8-24-117)

సీ. కోప సందీప్తుఁడై చాపంబు సజ్యంబు । గావించి మౌర్వి మార్గణముఁ గూర్చి
పాశుపతాస్త్ర సంబద్ధంబుగాఁ జేసి । పురములు మూఁటిని బుద్ధినిలుప
నవి యొక్కచోటికి నప్పుడ కూడిన । మునులును సురలును ముదముఁ బొంది
గెలుగెలుమంచు నగ్గింప నయ్యుగ్రుండు । దెగ వాపి యేసిన దితిజయుతము

ఆ. గాఁ బురత్రయంబు కాలి నీఱై పశ్చి । మాబ్ధిఁ దొరఁగ నమ్మహాగ్ని లోక
ములు దహింపఁజొచ్చెఁ బురహరుఁ డది మాన్చె । సంతసిల్లె సకల జంతువులును. 293

ప్రతిపదార్థం: కోప= అలుకచేత; సందీప్తుఁడు+ఐ= మిక్కిలి వెలిగినవాడై; చాపంబు= ధనుస్సు; సజ్యంబు+కావించి= ఎక్కుపెట్టి; మౌర్విన్= అల్లెత్రాటిపై; మార్గణమున్= అమ్మును; కూర్చి= సంధించి; పాశుపత+అస్త్ర= పాశుపతమనే అస్త్రంతో; సంబద్ధంబు= కూడినది; కాన్+చేసి= అయ్యేటట్లు కావించి; పురములు= నగరాలు; మూఁటిని= మూడింటిని; బుద్ధిన్= మతిలో; నిలుపన్= ఉంచగా, స్మరించగా; అవి= ఆ త్రిపురాలు; ఒక్కచోటికిన్= ఒక్క ప్రదేశానికి; అప్పుడు+అ= ఆ సమయంలోనే; కూడినన్= చేరగా; మునులును= ఋషులూ; సురలును= దేవతలూ, ముదమున్+పొంది= సంతోషం చెంది; గెలు= జయించు; గెలుము= జయించుము; అంచున్= అని పలుకుతూ; అగ్గింపన్= ప్రశంసించగా; ఆ+ఉగ్రుండు= ఆ రుద్రుడు; తెగ= ఎక్కుపెట్టిన అల్లెత్రాడు; పాపి= తొలగించి లాగి; ఏసినన్= ప్రయోగించగా; దితిజయుతముగాన్= దైత్యులతోసహా; పురత్రయంబు= త్రిపురాలు; కాలి= తగులబడి; నీఱు+ఐ= భస్మమై; పశ్చిమ+అబ్ధిన్= పడమటి సముద్రంలో; తొరఁగన్= పడగా; ఆ+మహా+అగ్ని= ఆ గొప్ప నిప్పు; లోకములు= లోకాలను; దహింపన్= తగులబెట్టడానికి; చొచ్చెన్= ప్రారంభించింది; పురహరుఁడు= త్రిపురాలను హరించిన హరుడు - శివుడు; అది= ఆ అగ్నిని; మాన్చెన్= ఆర్పినాడు; సకల జంతువులును= సమస్త ప్రాణులూ; సంతసిల్లెన్= సంతోషించాయి.

తాత్పర్యం: (శివుడు) కోపంతో వెలిగిపోతూ, ధనుస్సు ఎక్కుపెట్టాడు. అల్లెత్రాటికి అమ్ము సంధించాడు. దానికి పాశుపతాస్త్రం జోడించాడు. మనస్సులో త్రిపురాలను తలచుకొన్నాడు. వెంటనే అవి ఒకచోటికి చేరాయి. ఋషులూ, దేవతలూ జయజయ! అంటూ ప్రశంసించారు. అప్పుడు రుద్రుడు నారిలాగి, ప్రయోగించాడు. దానితో దానవులతో సహా త్రిపురాలు తగులబడి బూడిద అయిపోయి, పడమటి సముద్రంలో పడ్డాయి. ఆ మహాగ్ని లోకాలను దహింపసాగింది. త్రిపురహరుడు హరుడు దానిని ఆర్పివేశాడు. సమస్త ప్రాణులూ సంతోషించాయి.

వ. **అప్పు డనిమిష మునిజనంబులు గృతకృత్యులయి భూతనాథుం బ్రణుతించి యతం డనుమతిసేయ నంబుజాసనుండు లోనుగా నందఱు నిజస్థానంబులకుం జని రివ్విధంబున లోకహితార్థంబుగా నప్పరమేష్ఠి శివునకు సారథ్యం బనుష్ఠించె నీవు నట్ల పోలెఁ గౌరవ రక్షణార్థంబుగా రాధేయు రథంబు గడపు మిక్కర్ణునకు నక్కిరీటికిఁ గృష్ణునకున్ బలశౌర్యంబుల నెక్కుడయినవాఁడవు మదీయ జీవితంబును రాజ్యంబును భవదధీనంబులు వానిం గలిగింపను జయంబును సుఖంబును గావింపను నీవ యొడయండ విక్కార్యం బాచరించి నన్ను రక్షింపు' మని ప్రార్థించి నీ పుత్రుండు మద్రపతికి మఱియు నిట్లనియె.** **294**

ప్రతిపదార్థం: అప్పుడు; అనిమిషమునిజనంబులు= దేవతలూ, మునులూ, లేదా దేవమునులు, కృత= చేయబడిన; కృత్యులు= (తమ) పనికలవారు; అయి= ఐ; భూత= సమస్తప్రాణులకూ; నాథున్= స్వామిని; ప్రణుతించి= మిక్కిలి స్తుతించి; అతండు= శివుడు; అనుమతి+చేయన్= అనుజ్ఞ ఈయగా, అంబుజాసనుండు= పద్మం ఆసనంగా గల బ్రహ్మదేవుడు; లోనుగాన్= మొదలుగా; అందఱున్= ఎల్లరూ; నిజస్థానంబులకున్= తమ ప్రదేశాలకు, తమ నివాసాలకు; చనిరి= వెళ్ళారు; ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; లోక= లోకాలయొక్క; హిత+అర్థంబుగాన్= మేలుకోసమై; ఆ+పరమేష్ఠి= ఆ బ్రహ్మదేవుడు; శివునకున్= శివుడికి; సారథ్యంబు= సూతుడిపని; అనుష్ఠించెన్= చేశాడు; నీవున్= నీవుకూడా; అట్లు+అ+పోలెన్= ఆ విధముగానే; కౌరవరక్షణ+అర్థంబుగాన్= కౌరవులను కాపాడేనిమిత్తంగా; రాధేయురథంబు= కర్ణుడితేరును; కడపుము= నడుపుము; ఈ+కర్ణునకున్= ఈ అంగరాజుకీ; ఈ+కిరీటికిన్= ఈ అర్జునుడికీ; కృష్ణునకున్= కృష్ణుడికీ; బలశౌర్యంబులన్= బలంలోనూ, శూరత్వంలోనూ; ఎక్కుడు+అయినవాఁడవు= అధికుడవైనవాడవు; మదీయ= నాదైన; జీవితంబును= ప్రాణమూ; రాజ్యంబును= రాజ్యమూ; భవత్= నీయొక్క; అధీనంబులు= వశంలోనివి; వానిన్= ప్రాణాన్నీ, రాజ్యాన్నీ; కలిగింపను= కలుగజేయటానికీ; జయంబును= గెలుపునూ; సుఖంబును= సౌఖ్యాన్నీ; కావింపను= కలిగించటానికీ; నీవు+అ= నీవే; ఒడయండవు= భర్తవు,

ప్రభువవు; ఈ+కార్యంబు= ఈ పని; ఆచరించి= చేసి; నన్నున్= నిన్నాశ్రయించిన నన్ను; రక్షింపుము+ అని= కాపాడుమని; ప్రార్థించి= వేడికొని; నీ పుత్రుండు= నీ కుమారుడు; మద్రపతికిన్= మద్రరాజుతో; మఱియున్+ఇట్లు+ అనియెన్= ఇంకా ఇట్లు చెప్పాడు:

తాత్పర్యం: అపుడు దేవతలూ, మునులూ కావాలనుకొన్న పని అయిపోయింది కనుక, భూతపతి ఉమాపతిని బాగా స్తుతించారు. ఆయన అనుజ్ఞ ఇచ్చినందున బ్రహ్మాదులందరూ తమ తమ నివాసాలకు వెళ్ళారు. ఇట్లా బ్రహ్మ అంతటివాడు లోకం మేలుకోసం శివుడి రథం నడిపాడు. కనుక నీవు కూడా కౌరవరక్షణకొరకు కర్ణుడి రథం నడిపించుము. నీవే కర్ణుడికంటె, ఆ అర్జునుడికంటె, కృష్ణుడికంటె బలంలోనూ, శౌర్యంలోనూ గొప్పవాడవు. నా ప్రాణమూ, రాజ్యమూ నీ అధీనంలో ఉన్నాయి. నాకు ప్రాణం పోయాలన్నా, రాజ్యమివ్వాలన్నా, నన్ను గెలిపించాలన్నా, సుఖపెట్టాలన్నా - నీవే అధికారివి కాబట్టి, ఈ పని చేసిపెట్టి నన్ను రక్షించుము' అని నీ కుమారుడు దుర్యోధనుడు ప్రార్థించి, శల్యుడితో ఇంకా ఇట్లా అన్నాడు:

సీ. **'ఇది యొక్క యితిహాస మే నొద్దనుండ ధ । ర్మ ప్రవీణుండగు బ్రాహ్మణుండు**
ధృతరాష్ట్ర వసుమతీపతికిఁ జెప్పిన యది । వినుము భార్గవ వంశమునఁ బ్రసిద్ధుఁ
డగు జమదగ్నికి నత్యంతనిర్మల । మతి రాముఁ డుదయించె నతనిచేయు
తపమున హరుఁడు ప్రత్యక్షమై నిలిచిన । నతఁడు దివ్యాస్త్రంబు లడుగుటయును

ఆ. **నమ్మహాత్ముఁ డశుచు లైనవారల నవి । నిర్దహించుఁగాన నీవు పరమ**
శుచివిగమ్ము నీకుఁ జొప్పడు నఖిల మ । హాస్త్ర వీర్య' మనియె నాదరమున. **295**

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పబోయేది; ఒక్క= ఒక; ఇతిహాసము= మునుపు జరిగినకథ; ఏను= నేను; ఒద్దన్= సమీపంలో; ఉండన్= ఉండగా; ధర్మప్రవీణుండు= ధర్మమునందు నిపుణుడు; అగు= అయిన; బ్రాహ్మణుండు= ఒక విప్రుడు; ధృతరాష్ట్ర వసుమతీపతికిన్= ధృతరాష్ట్ర భూపతికి; చెప్పిన+అది= చెప్పినది; వినుము; భార్గవవంశమునన్= భృగువంశంలో; ప్రసిద్ధుఁడు= పేరుకెక్కినవాడు; అగు= అయిన; జమదగ్నికిన్= జమదగ్ని అనే మునికి; అత్యంత= మిక్కిలి; నిర్మలమతి= స్వచ్ఛమైన బుద్ధిగల; రాముఁడు= పరశురాముడు; ఉదయించెన్= జన్మించాడు; అతనిచేయు= అతడుచేసే; తపమునన్= తపస్సువలన; హరుఁడు= శివుడు; ప్రత్యక్షమై= సాక్షాత్కరించి; నిలిచినన్= నిలబడితే; అతఁడు= పరశురాముడు; దివ్యాస్త్రంబులు= దివ్యములైన మంత్రప్రయుక్తాలయిన ఆయుధాలు; అడుగుటయునున్= ఇమ్మని కోరగా; ఆ+మహాత్ముఁడు= ఆ ఉదారస్వభావం గల శివుడు; ఆదరమునన్= వాత్సల్యంతో; అశుచులైన వారలను= శుచిగా ఉండనివారిని; అవి= ఆ దివ్యాస్త్రాలు; నిర్దహించున్= పూర్తిగా తగలబెడతాయి; కాన= కనుక; నీవు; పరమశుచివి+కమ్ము= మిక్కిలి పరిశుద్ధుడవు కమ్ము; నీకున్= శుచివైన నీకు; అఖిల= సమస్తమైన; మహా+అస్త్ర= గొప్ప అస్త్రములయొక్క; వీర్యము= శక్తి; చొప్పడున్= లభిస్తుంది; అనియెన్= అనిచెప్పాడు.

తాత్పర్యం: 'ఇది మునుపు జరిగిన ఒక వృత్తాంతం. ధర్మనిపుణుడైన బ్రాహ్మణుడొకడు నేను ధృతరాష్ట్ర మహారాజు దగ్గర ఉన్న సమయంలో ఆయనతో చెప్పాడు. అది వినుము. భృగువంశంలో ప్రసిద్ధుడు జమదగ్ని. ఆయనకు జన్మించాడు అత్యంత నిర్మల బుద్ధిశాలి పరశురాముడు. ఆయన తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమయ్యాడు. పరశురాముడు దివ్యాస్త్రాలు కావాలన్నాడు. అపుడు ఉదారస్వభావం కల శివుడు వాత్సల్యంతో ఆయనతో 'అవి శుచులు కాని వారిని తగులబెట్టుతాయి. కనుక నీవు పరమ పరిశుద్ధుడవు కమ్ము, నీకు ఆ మహాస్త్రాలన్నింటి శక్తి వస్తుంది' అని చెప్పాడు.

వ. అనిన విని జామదగ్న్యుండు వినతుండై 'నాకెప్పుడు పాత్రత్వంబు గలిగె నప్పుడ నీవుతలంచి దయసేతువు గాక నీకు శుశ్రూష సేయుచుండునట్లుగాఁ బ్రసాదింపవలయు' నని విన్నవించిన విని కరుణాయత్తచిత్తుండగు భవుం డవ్వరం బిచ్చిన నమ్మహాత్ముండు నియమ నిష్ఠాపరుండై పూజోపహార ప్రముఖ విధానంబుల నద్దేవు నారాధించు చుండ ననేక సంవత్సరంబులు సన నొక్కనాఁడు పరమేశ్వరుండు ప్రసాదలసితాననుండై గౌరీదేవికి నతనిం జూపుచు. 296

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= విని; జామదగ్న్యుండు= జమదగ్ని పుత్రుడైన పరశురాముడు; వినతుండు+ఐ= నమస్కరించినవాడై; నాకున్= నిన్ను మెప్పించిననాకు; ఎప్పుడు= ఏ సమయానికి; పాత్రత్వంబు= అర్హత; కలిగెన్= కలుగుతుందో; అప్పుడు= ఆ సమయంలోనే; నీవు; తలంచి= సంకల్పించి; దయ+చేతువుగాక= ఇత్తువుగాక; నీకున్= ఈయటానికి అంగీకరించిన నీకు; శుశ్రూష= సేవ; చేయుచున్= చేస్తూ; ఉండునట్లుగాన్= ఉండేటట్లుగా; ప్రసాదింపుము= అనుగ్రహించుము; అని; విన్నవించినన్= విజ్ఞప్తిచేయగా; విని= ఆలకించి; కరుణా= జాలికి; ఆయత్త= వశమైన; చిత్తుండు= మనస్సుకలవాడు; అగు= అయిన; భవుండు= శివుడు; ఆ+వరంబు= ఆ వరం; ఇచ్చినన్= ఇవ్వగా; ఆ+మహాత్ముండు= ఆ ఘనత వహించిన పరశురాముడు; నియమనిష్ఠాపరుండు+ఐ= తపః సంతోష స్వాధ్యాయ ఈశ్వర ప్రణిధాన రూప నియమమందు స్థిరమైన ఆసక్తి కలవాడై; పూజా+ఉపహార= అర్చనచేయటం, నైవేద్యం పెట్టటం; ప్రముఖ= మొదలయిన; విధానంబులన్= పద్ధతులతో; ఆ+దేవున్= ఆ పరమేశ్వరుడిని; ఆరాధించుచుండన్= సేవిస్తుండగా; అనేక= బహు; వత్సరంబులు= సంవత్సరాలు; చనన్= గడవగా; ఒక్కనాఁడు= ఒకరోజున; పరమ+ఈశ్వరుండు= మిక్కిలి గొప్ప ప్రభువైన శివుడు; ప్రసాద= సంతోషంచేత, దయచేత; లసిత= ప్రకాశిస్తున్న; ఆననుండై= ముఖం కలవాడై; గౌరీదేవికిన్+ఆతనిన్= గౌరీదేవికి పరశురాముడిని; చూపుచున్= చూపిస్తూ.

తాత్పర్యం: అట్లా చెప్పేసరికి, వినిన పరశురాముడు పరమేశ్వరుడికి ప్రణామంచేశాడు. 'నా కెప్పుడు అర్హత కలిగితే అపుడే నీవు సంకల్పించి ఇద్దువుగాని. అంతవరకూ నీ సేవచేస్తూ ఉండేటట్లు అనుగ్రహించుము' అని విజ్ఞప్తి చేశాడు. శివుడు మనస్సులో కరుణ కలిగి, ఆయన దాని కంగీకరించాడు. పరశురాముడు నియమనిష్ఠలతో అర్చన నైవేద్య సమర్పణ ప్రకారాలతో ఆ మహాదేవుడిని ఆరాధిస్తుండగా, చాలా సంవత్సరాలు గడచిపోయాయి. ఒకనాడు సంతోషానుగ్రహాలతో ముఖం కళకళలాడుతుండగా పరమేశ్వరుడు గౌరీదేవికి అతడిని చూపిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: దయసేతువు - దయసేయుదువు అని ఉండాలి. తిక్కన 'చేతువు' అని ప్రయోగించి ఉండడు. ఎక్కడో పొరపాటు జరిగి ఉండాలి. ఛందోనిర్బంధం లేదు కదా. గద్యమే కదా!

క. 'రాముఁడు విమలవ్రత చ। ర్యామహితుఁడు నాకు భక్తుఁ' డని పలుమాఱుం
దా ముద్దు సేసి మృదువచ। నామృత సంసిక్తుఁ జేయు నా సమయమునన్.' 297

ప్రతిపదార్థం: రాముఁడు= భార్గవరాముడు; విమల= స్వచ్ఛమైన; వ్రతచర్యా= వ్రతాన్ని ఆచరించటంచేత; మహితుఁడు= గొప్పవాడు; నాకున్= నాపై; భక్తుఁడు= భక్తి కలవాడు; అని; పలుమాఱున్+తాన్= అనేక పర్యాయాలు తాను; ముద్దుచేసి= వాత్సల్యం చూపిస్తూ; మృదు= సుకుమారమైన; వచన+అమృత= మాటలనే అమృతంచేత; సంసిక్తున్= బాగా తడిసిన వానినిగా; చేయు= చేసే; ఆ సమయమునన్= ఆవేళలోనే.

తాత్పర్యం: 'రాముడు నిష్కళంకంగా వ్రతాన్ని ఆచరిస్తాడు. అందువలన గొప్పవాడు. నా భక్తుడు' అని చాలాసార్లు వాత్సల్యం చూపిస్తూ పలుకులనే అమృతంతో అతడిని పూర్తిగా తడిపివేస్తున్న ఆ సమయంలోనే.

వ. బలవంతులగు దనుజులచేత బాధితులయి బృందారకు లయ్యిందుధరు పాలికి భయ సంభ్రమములతో నరుగుదెంచి తమ యలజడి యెఱింగించిన. 298

ప్రతిపదార్థం: బలవంతులగు= బలంకలవారైన; దనుజులచేతన్= రాక్షసులచేత; బాధితులు+అయి= పీడింపబడినవారై; బృందారకులు= దేవతలు; ఆ+ఇందుధరు= ఆ చంద్రుడిని ధరించే శివుడియొక్క; పాలికిన్= వద్దకు; భయ సంభ్రమములతోన్= జడుపుతోనూ, తొట్రుపాటుతోనూ; అరుగుదెంచి= వచ్చి; తమ= తమయొక్క; అలజడి= కలత; ఎఱింగించిన(న్)= తెలియజేయగా.

తాత్పర్యం: బలవంతులైన రాక్షసులు బాధలు పెట్టుతుంటే, దేవతలు ఆ శివుడి దగ్గరకు భయంతోనూ, త్రొటుపాటుతోనూ వచ్చి, తమకు కలిగిన కలత గురించి తెలియజేశారు. అందువలన. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. జామదగ్న్యుఁ జూచి చయ్యనఁ జని దాన । వుల వధించి దేవతలకుఁ బ్రీతి
యాచరింపు మనియె హరుఁడు దానికి మది । ముదముఁ బొంది కేలుమొగిచి యతఁడు. 299

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు; జామదగ్న్యున్= జమదగ్ని పుత్రుడైన రాముడిని; చూచి; చయ్యనన్= వేగంగా; చని= వెళ్ళి; దానవులన్= రాక్షసులను; వధించి= సంహరించి; దేవతలకున్= అమరులకు; ప్రీతి= సంతోషం; ఆచరింపుము= చేయుము; అనియెన్= అన్నాడు; దానికిన్= ఆ మాటకు; అతఁడు= భార్గవరాముడు; మదిన్= మనస్సులో; ముదమున్= సంతోషమును; పొంది= పొందినవాడై; కేలు= చేతులు; మొగిచి= మోడ్చి, నమస్కరించి.

తాత్పర్యం: హరుడు భార్గవరాముడిని చూచి 'వెంటనే వెళ్ళి రాక్షసులను సంహరించి, దేవతలకు సంతోషం కలిగించుము' అన్నాడు. రాముడు ఆ మాటకు మనస్సులో సంతోషించాడు. ఆయనకు నమస్కరించి.

క. 'అకృతాస్త్రుఁడ నగు నాకుం । బ్రకటభుజాబలులు నస్త్రపారీణులునై
సకల సురనికర సంబా । ధకులగు దానవుల గెలువఁదరమే?' యనుడున్. 300

ప్రతిపదార్థం: అకృత+అస్త్రుఁడన్+అగు= అభ్యసించని అస్త్రాలు కలవాడను; అగు= ఐన; నాకున్= నాకు; ప్రకట= ప్రచురమైన, ప్రసిద్ధమైన; భుజాబలులున్= బాహువులయొక్క బలంకలవారూ; అస్త్రపారీణులును+ఐ= మంత్రప్రయుక్తములయిన ఆయుధాల (ప్రయోగం)లో నిపుణులూ అయి; సకల= సమస్తమైన; సుర= దేవతలయొక్క; నికర= సమూహానికీ; సంబాధకులగు= మిక్కిలి బాధించేవారైన; దానవులన్= రాక్షసులను; గెలువన్+తరమే?= జయించటానికి శక్యమా?; అనుడున్= అని పలుకగా.

తాత్పర్యం: 'నే నే అస్త్రాలనూ అభ్యసించలేదు. దానవులా - సకలదేవతలనూ బాగా బాధించగలిగినంత భుజబలమూ, అస్త్రప్రావీణ్యమూ ఉన్నవారు. వారిని గెలవటం నాకు శక్యమౌతుందా?' అనేసరికి.

తే. అంబికానాథుఁ డిట్లను నతనితోడఁ । 'దలఁపు నీదెస నిలిపెద దానఁజేసి
పగఱ నిర్జింపనగుఁ బదంపడి మనోర । థంబు సిద్ధించు నరుగుము దడయ కనఘ!' 301

ప్రతిపదార్థం: అంబికానాథుఁడు= పార్వతీపతి; అతనితోడన్= భార్గవరాముడితో; ఇట్లు; అనున్= పలికాడు; తలఁపు= ఆలోచన; నీ దెసన్= నీ దిక్కున, నీవైపు; నిలిపెదన్= ఉంచుతాను; దానన్+చేసి= దానిచేత; పగఱన్= శత్రువులను; నిర్జింపన్= గెలవటానికి; అగున్= శక్యమవుతుంది; పదంపడి= తరువాత; మనోరథంబు= కోరిక; సిద్ధించున్= నెరవేరుతుంది; అనఘ!= పాపరహితుడా!; తడయక= ఆలస్యం చేయక; అరుగుము= వెళ్ళు.

తాత్పర్యం: పార్వతీపతి రాముడితో ఇట్లా అన్నాడు: 'నా ఆలోచన నీవైపే ఉంచుతాను. దానివలన శత్రువులను గెలవటం శక్యమవుతుంది. తరువాత కోరిక నెరవేరుతుంది. కనుక, పాపరహితుడా! ఆలస్యం చేయకుండా వెళ్ళుము'.

విశేషం: శివుడు అస్త్ర సంపన్నుల మీదికి యుద్ధానికి వెళ్ళుమన్నపుడే పరశురాముడి కార్యసిద్ధి అయింది. అతడు శివుని అనుగ్రహానికి పాత్రుడయ్యాడు. సందేహం అనవసరం. అయినా వచ్చింది కనుక, 'అనఘ!= పాపరహితుడా!' అనిన సంబోధనతోనే తీర్చివేశాడు శివుడు. విష్ణుచిత్తీయంలో పాండ్యుని సభకు వెళ్ళి విష్ణు పారమ్యం స్థాపించుమన్న విష్ణువుకు విష్ణుచిత్తుడు తన అశక్తత వెల్లడించటం కూడా ఇట్టిదే.

చ. అనవుడు నట్లకాకయని యా జమదగ్నిసుతుండు ధీరతం
జని సముదగ్రులైన సురశత్రులఁ దీవ్రతరాయుధోత్కరం
బున వధియించి వారి బలుపోటుల నొచ్చినమేనితోడ వ
చ్చినఁ బురవైరి నిర్వ్రణునిఁ జేసెఁ గరంబున నంటి యాతనిన్. 302

ప్రతిపదార్థం: అనవుడున్= అని పలుకగా; అట్లకాక= అట్లే అగుగాక; అని; ఆ జమదగ్నిసుతుండు= ఆ జమదగ్ని కుమారుడైన పరశురాముడు; ధీరతన్+చని= ధైర్యంతో వెళ్ళి; సముదగ్రులు+ఐన= భయంకరులైన; సురశత్రులన్= దేవతల శత్రువులయిన రాక్షసులను; తీవ్రతర= వారి ఆయుధాలకంటె తీవ్రమయిన; ఆయుధ= ఆయుధాలయొక్క; ఉత్కరంబునన్= సముదాయంతో; వధియించి= సంహరించి; వారి= ఆ దానవులయొక్క; బలు= బలమైన, పెద్దవైన; పోటులన్= ఆయుధాలతో పొడిచిన గాయాలతో; నొచ్చిన= బాధపడిన; మేనితోడన్= శరీరంతో; వచ్చినన్= రాగా; పురవైరి= త్రిపురశత్రువు - రుద్రుడు; కరంబునన్= తన చేతితో; అంటి= తాకి; ఆతనిన్= భార్గవరాముడిని; నిర్వ్రణునిన్= గాయాలు లేనివాడినిగా; చేసెన్= కావించాడు.

తాత్పర్యం: అని శివుడు చెప్పేసరికి భార్గవరాముడు 'అట్లాగే కాని' మ్మని ధైర్యంతో వెళ్ళాడు. రాక్షసులు భయంకరులు. వారివి తీవ్రమయిన ఆయుధాలు. అయినా వాటికంటె తీవ్రమైన ఆయుధాలతో వారిని సంహరించి వచ్చాడు. వారి ఆయుధాల పోటులతో అతడి శరీరమంతా గాయాలై ఉన్నది. అతడిని తన చేతితో స్పృశించి పురాంతకుడు అతడి ఒడలిమీద గాయం లేకుండా చేశాడు.

వ. ఇవ్విధంబునం బ్రదీప్త శరీరున్ గావించి భర్గుం డాభార్గవు పయిం బ్రీతిశీతలంబగు నాలోకం బొలయ నాతని కిట్లనియె. 303

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; ప్రదీప్త= మిక్కిలి వెలుగుతున్న; శరీరున్= శరీరంకలవాడినిగా; కావించి= చేసి; భర్గుండు= శివుడు; ఆ భార్గవుపయిన్= ఆ భార్గవరాముడిపై; ప్రీతి= ప్రేమచేత; శీతలంబు+అగు= చల్లనిదైన; ఆలోకంబు= చూపు; ఒలయన్= ఒప్పగా; అతనికిన్+ఇట్లు+అనియెన్= భార్గవరాముడితో ఇట్లు అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా మిక్కిలి ప్రకాశిస్తున్న స్థితిలో అతడి శరీరం ఉండేటట్లు రుద్రుడు ఆ రాముడిని ప్రేమతో చల్లగా చూస్తూ, ఇట్లా అన్నాడు:

క. 'అనివర్తనమతిఁ గవయఁగ । నని నీదగు తనువు సునిశితాయుధములు దాఁ
కిన నొవ్వదు శత్రులు వ న్నిన నుడుపుము గర్వ మడఁచి నిర్మల చరితా! 304

ప్రతిపదార్థం: నిర్మల చరితా!= స్వచ్ఛమైన చరిత్రకలవాడా!; అనివర్తన= తిరుగులేని; మతిన్= బుద్ధితో; కవయఁగన్= మార్కొనగా; అనిన్= యుద్ధంలో; నీదు+అగు= నీదైన; తనువు= శరీరం; సునిశిత= మిక్కిలి పదునైన; ఆయుధములు= ఆయుధాలు; తాఁకినన్= తగిలినప్పటికీ; నొవ్వదు= నొప్పిచెందదు; శత్రులు= పగవారు; పన్నినన్= తలపడితే; అడఁచి= కొట్టి; గర్వము= పొగరు; ఉడుపుము= పోగొట్టుము.

తాత్పర్యం: వెనుకకు తిరిగిరాని బుద్ధితో, శత్రువులను నీవు ఢీకొంటే. యుద్ధంలో నీ శరీరానికి మిక్కిలి పదునైన ఆయుధాలు తగిలినా బాధ కలుగదు. స్వచ్ఛమైన చరిత్ర కలవాడా! శత్రువులే నీపై తలపడితే కొట్టి వారి గర్వం అణగగొట్టుము.

వ. కావున వరప్రతిగ్రహంబున కిదియ సమయంబు. 305

ప్రతిపదార్థం: కావునన్= కనుక; వర= వరంయొక్క; ప్రతిగ్రహంబునకున్= స్వీకరణానికి, వరం తీసికొనటానికి; ఇది+అ= ఇదే; సమయంబు= తగిన సమయం.

తాత్పర్యం: కనుక వరం తీసికొనటానికి ఇదే తగిన సమయం.

క. కొను' మని దివ్యంబగు న । స్త్రనికాయము శస్త్రచయము దద్దయు దయ ని
చ్చిన నవి యాతఁడు సాష్టాం । గనమస్కారంబు సేసి కైకొనియె నృపా! 306

ప్రతిపదార్థం: నృపా= శల్యరాజా!; కొనుము+అని= తీసుకొమ్ము అని పలికి; దివ్యంబగు= దివిలో పుట్టిన లేదా గొప్పదైన; అస్త్రనికాయము= మంత్రప్రయుక్తమైన ఆయుధ సముదాయమూ; శస్త్ర చయము= శరీరబలంతో ప్రయోగించే ఆయుధ సముదాయమూ; తద్దయున్= మిక్కిలి; దయన్= కృపతో; ఇచ్చినన్= ఈయగా; అవి= వాటిని; ఆతఁడు= భార్గవరాముడు; సాష్టాంగ నమస్కారంబు+చేసి= ఎనిమిది అంగాలూ నేలకు తగిలే రీతిగా ప్రణామం కావించి; కైకొనియెన్= తీసికొన్నాడు.

తాత్పర్యం: తీసికొమ్ము' అని దివ్యమైన అస్త్ర సముదాయమూ, ఆయుధ సముదాయమూ మిక్కిలి దయతో ఇవ్వగా, పరశురాముడు సాష్టాంగ నమస్కారం చేసి వాటిని తీసికొన్నాడు.

వ. తదనంతరంబ లోకగురుండగు నా హరునిచేత ననుజ్ఞాతుండై యతండు నిజస్థానంబునకుం జనియె నయ్యుతిహాసప్రకారం బిట్టిది యివ్విధంబున వివిధ దుష్కరసత్కర్మానుష్ఠానఫలంబులై వచ్చిన సర్వదివ్యాస్త్రంబులు నా రాముండు రాధేయునకుఁ బ్రీతచేతస్కుండై యొసంగె నట్టి మహాత్ములు హీనకుల జాతుల నాదరింతురే? యప్పుణ్యపురుషుండు గయికొనుటఁ గర్ణుం దుత్కృష్ట యోనిజాతుండని తలంచెద వదన వక్షోబాహు ప్రముఖాంగంబులు సూడ దేవకుమారుండుంబోలె నున్నవాఁడు ప్రకృతి కాంత కాంచన

కుండలవజ్ర కవచంబులతోడ నాదిత్యసన్నిభుండగు కొడుకుం గాంచునే? సింగంబులేడి కెట్లు వుట్టు? నితనికి సూత సంవర్ధితుండైన కీడుదొడరె నింతియ కానోపు రుద్రశిష్యత్వంబున విశ్రుతుండగు భార్గవరామునకుఁ బ్రియశిష్యుండగు నంగరాజు ననంగ దమనుం బరిగ్రహించిన విరించి భంగిఁ బరిగ్రహించి నీవు సారథ్యం బాచరింపు మఖిల గుణంబులను సారథి రథికున కధికుండు గావలయునను నీతి కలదు నీవు ప్రసన్నుండవగుటం జేసి నాకోర్కె సిద్ధించె ననుటయు. 307

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ శస్త్రాస్త్ర గ్రహణం చేసిన తరువాత; లోక= లోకాలకూ; గురుండగు= గురువైన; ఆ హరునిచేతన్= ఆ రుద్రుడిచేత; అనుజ్ఞాతుండై= అనుమతింపబడినవాడై; అతండు= భార్గవరాముడు; నిజ= తనయొక్క; స్థానంబునకున్= నివాసస్థానానికి; చనియెన్= వెళ్ళాడు; అయ్యితిహాస= ఆ పూర్వం జరిగిన వృత్తాంతం యొక్క; ప్రకారంబు= విధం; ఇట్టిది= ఇటువంటిది; ఈ+విధంబునన్; వివిధ= పలురకాలయిన; దుష్కర్మ= చేయకష్టమైన; సత్కర్మ= మంచి కర్మలయొక్క; అనుష్ఠాన= ఆచరణంయొక్క; ఫలంబులై= ఫలాలై; వచ్చిన= లభించిన; సర్వ= సమస్తమైన; దివ్య+అస్త్రంబులున్= దివ్యములైన అస్త్రాలూ; ఆ రాముండు= ఆ భార్గవరాముడు; రాధేయునకున్= కర్ణునకు; ప్రీతచేతస్కుండై= సంతోషించిన మనస్సుకలవాడై; ఒసంగెన్= ఇచ్చాడు; అట్టి= అటువంటి; మహాత్ములు= ఘనతవహించినవారు; హీనకుల= తక్కువకులంలో; జాతులన్= పుట్టినవారిని; ఆదరింతురే?= మన్నిస్తారా?; ఆ+పుణ్య పురుషుండు= ఆ పవిత్రుడైన పురుషుడు; కయికొనుటన్= స్వీకరించటంచేత; కర్ణుండు= అంగరాజు; ఉత్కృష్ట= గొప్పదైన; యోని= జాతిలో; జాతుండు= పుట్టినవాడు; అని; తలంచెదన్= భావిస్తాను; వదన= ముఖం; వక్షః= వక్షఃస్థలం; బాహు= చేతులు; ప్రముఖ= మొదలయిన; అంగంబులు= అవయవాలు; చూడన్= చూస్తే; దేవకుమారుండున్= అమరునిపుత్రుడిలా; ఉన్నవాఁడు= ఉన్నాడు; ప్రకృతికాంత= సామాన్యస్త్రీ; కాంచనకుండల= బంగారు కుండలాలతో; వజ్రకవచంబులతోడన్= వజ్రాల కవచంతో; ఆదిత్య సన్నిభుండగు= సూర్యుడితో సమానుడైన; కొడుకున్= కుమారుడిని; కాంచునే?= కంటుందా?, సింగంబు= సింహం; లేడికిన్= హరిణానికి; ఎట్లు; పుట్టున్?= జన్మిస్తుంది?; ఇతనికిన్= ఈ కర్ణుడికి; సూతసంవర్ధితుండైన= సూతుడిచేత పెంచబడిన; కీడు= దోషం; తొడరెన్= కలిగింది; ఇంతియ= ఇంతే; కాన్+ఓపు= అయి ఉంటుంది; రుద్ర= శివుడియొక్క; శిష్యత్వంబునన్= శిష్యుడై ఉండటంచేత; విశ్రుతుండగు= ప్రసిద్ధుడగు; రామునకున్= భార్గవరాముడికి; ప్రియశిష్యుండగు= ఇష్టుడైన శిష్యుడైన; అంగరాజున్= అంగదేశ ప్రభువైన కర్ణుడి; అనంగ= మన్మథుడి; దమనున్= నిగ్రహించిన శివుడిని; పరిగ్రహించిన= తనకు రథికుడిగా స్వీకరించిన; విరించిభంగిన్= బ్రహ్మదేవుడిలా; పరిగ్రహించి= రథికునిగా స్వీకరించి; నీవు; సారథ్యంబు= సూతుడిపని; ఆచరింపుము= కావించుము; అఖిలగుణంబులను= అన్నిగుణాలలోనూ; సారథి= సూతుడు; రథికునకున్= రథంపై ఉండి యుద్ధం చేసేవాడికంటె; అధికుండు= గొప్పవాడు; కావలయున్= కావాలి; అను; నీతి= యుద్ధనీతి; కలదు= ఉన్నది; నీవు= గొప్పవాడవైన నీవు; ప్రసన్నుండవగుటన్+చేసి= సంతోషించినవాడవు; దయాశాలివి అయినందువలన; నా కోర్కె= నా కోరిక; సిద్ధించెన్= నెరవేరినది; అనుటయున్= అని పలుకగా.

తాత్పర్యం: ఆ తరువాత అఖిల లోకాలకూ గురువయిన హరుడి వద్ద సెలవు తీసికొని రాముడు తన నివాసానికి వెళ్ళాడు. పూర్వం జరిగిన ఆ కథ ఇట్లా ఉన్నది. ఇట్లా చేయ శక్యం కాని ఎన్నో ఉత్తమ కర్మలు ఆచరించినందుకు ఫలాలుగా రాముడికి అనేక దివ్యాస్త్రాలు లభించాయి. ఆయన వాటినన్నిటినీ సంతోషంతో కర్ణుడికిచ్చాడు. భార్గవరాముడివంటి మహానుభావులు తక్కువ కులంలో పుట్టినవారిని ఆదరించరు. ఆ పుణ్యాత్ముడు కర్ణుడిని శిష్యుడిగా స్వీకరించినందువలన కర్ణుడు ఎక్కువకులంలో పుట్టినవాడనే భావిస్తాను. అదీకాక, కర్ణుడి ముఖమూ, వక్షఃస్థలమూ, చేతులూ మొదలయిన అవయవాలు చూస్తే, ఇతడే దేవపుత్రుడో అనిపిస్తుంది. సామాన్యస్త్రీ ఇటువంటి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బంగారు కుండలాలూ, వజ్రాల కవచమూ కల భాస్కరుడి వంటి బాలుడిని కనగలుగుతుందా? లేడికి సింహ మెట్లా పుట్టుతుంది? అయితే, ఇతడిని సూతుడు పెంచాడన్న దొకటే దోషం. కనుక రుద్రుడి శిష్యుడిగా ప్రఖ్యాతుడైన భార్గవరాముడికి ప్రియశిష్యుడయిన కర్ణుడిని, మదనాంతకుడిని బ్రహ్మదేవుడు స్వీకరించినట్లు, రథికుడిగా స్వీకరించి అతడికి సారథికృత్యం చేసిపెట్టుము. అన్ని విషయాలలో కూడా సారథి రథికుడి కంటె గొప్పవాడయి ఉండాలని యుద్ధనీతి ఉన్నది. నీవు సంతోషించి, దయ చూపించావు. అందువలన నా కోరిక నెరవేరినది.' అనేసరికి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: నిదర్శన: ఉపమ.

తే. **'క్రుచ్చి మద్రవిభుండు నీకొడుకుఁ గౌఁగి । లించి ప్రియ మాననమునఁ దలిర్ప నృపకు**
మార! నీవు నాకొలఁది యిట్లరయ నెఱుఁగు । దేని యిది లెస్స నీకోర్కి యేను దీర్తు.' **308**

ప్రతిపదార్థం: మద్ర విభుండు= మద్రరాజు శల్యుడు; నీ కొడుకున్= నీ కుమారుడైన దుర్యోధనుడిని; క్రుచ్చి= గ్రుచ్చుకొనేటట్లు గట్టిగా; కౌఁగిలించి= ఆలింగనం చేసికొని; ఆననమునన్= ముఖంమీద; ప్రియము= ప్రీతి; తలిర్పన్= శోభిల్లగా; నృపకుమార!= రాజకుమారా!; నీవు= ఇంతటివాడవైన నీవు; నాకొలఁది= నామేర; ఇట్లు; అరయన్= పరిశీలింపగా, పరిశీలించటం; ఎఱుఁగుదు+ఏని= తెలిసినవాడవైతే; ఇది= ఈ పని; లెస్స= యుక్తం; ఏను= నేను; నీకోర్కి= నీ కోరిక; తీర్తున్= తీరుస్తాను.

తాత్పర్యం: శల్యుడు దుర్యోధనుడిని గ్రుచ్చి కౌగిలించుకొని, సంతోషంతో కళకళలాడే ముఖంతో రాజకుమారా! నే నెంతటివాడనో ఇట్లా పరిశీలించటం నీకు తెలిసిన పక్షంలో ఈ సారథ్యం యుక్తమే. నేను నీ కోరిక తీర్చుతాను.'

వ. **అని మఱియును.** **309**

తాత్పర్యం: అని పలికి ఇంకా.

శల్యుఁడు కర్ణునకు సారథ్యంబు సేయ నొడంబడుట (సం. 8-25-6)

క. **'వీనులకుం బలుకులు సేఁ । దైనను జెప్పుదు హితంబులగు కార్యంబుల్**
దానికి నోర్వఁగవలయుం । గాని యలుక వలదు నీకుఁ గర్ణున కధిపా!' **310**

ప్రతిపదార్థం: వీనులకున్= చెవులకు; పలుకులు= మాటలు; చేఁదు+ఐనను= అప్రియాలుగా ఉన్నప్పటికీ; హితంబులు అగు= మేలుకూర్చునట్టి; కార్యంబుల్= చేయదగిన పనులను; చెప్పుదున్= చెపుతాను; దానికిన్= అలా చెప్పినందుకు; ఓర్వఁగన్= సహింపగా; వలయున్= ఇష్టపడాలి; కాని= అంతేకాని; అధిపా= రాజా!; నీకున్= నీకూ; కర్ణునకున్= కర్ణుడికీ; అలుక= కోపం; వలదు= వద్దు.

తాత్పర్యం: 'రాజా! నా మాటలు వినటానికి కటువుగా అనిపించినప్పటికీ, మేలుకలిగించే పనులు ఏవి చేయటం అవసరమో చెప్పుతూ ఉంటాను. వాటిని ఓపికపట్టి వినాలి కాని, నీవూ, కర్ణుడూ కోపపడకూడదు.'

ఆ. **అనినఁ గర్ణుఁ డిట్టులను మద్రపతితోడ । హరున కజుఁడు నరున కచ్యుతుండుఁ**
బోలె హితుఁడ వగుము బుద్ధి పరాక్రమ । శాలి నాకు నీవు సంగరమున. **311**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; కర్ణుఁడు= అంగరాజు; మద్రపతితోడన్= మద్రదేశపురాజైన శల్యుడితో; ఇట్టులు= ఇలా; అనున్= అన్నాడు; హరునకున్= రుద్రుడికి; అజుఁడు= బ్రహ్మ; పోలెన్= వలె; నరునకున్= అర్జునుడికి; అచ్యుతుండున్ పోలెన్= కృష్ణుడి వలె; బుద్ధిపరాక్రమశాలి= బుద్ధిశాలివీ, పరాక్రమశాలివీ అయిన; నీవు; నాకున్= నాకు; సంగరమునన్= యుద్ధంలో; హితుఁడవు+అగుము= ఇష్టమైనవాడవు, చెలికాడవు, హితవరివి కమ్ము.

తాత్పర్యం: అని శల్యుడు చెప్పేటప్పటికి, కర్ణుడు శల్యుడితో ఇట్లా అన్నాడు: 'బుద్ధి పరాక్రమశాలీ! రుద్రుడికి బ్రహ్మవలె, అర్జునుడికి కృష్ణుడివలె, నీవు యుద్ధంలో నాకు హితుడవు కమ్ము.

విశేషం: దుర్యోధనుడిది గొప్ప దౌర్భాగ్యం - ఎవడికి వాడే విడివిడిగా లోకాన్ని లొంగదీయగలవాళ్ళు అతడికి తోడుగా నిలిచారు. కాని అది అంతా అతడిమీద అనురాగంతో కాదు - వివిధ కారణాలవలన, ఇష్టానిష్ట మనస్సులతో! ఈ మహావీరులలో చాలామందికి ఒకరంటే మరొకరికి పడదు. తప్పనిసరై పరస్పరం తోడ్పడవలసి వచ్చినా ఎవడి దర్పం వాడు వదలడు. ఇట్లా మునిగిపోయింది దుర్యోధనుడి పుట్టి. దుర్యోధను డెన్ని తిప్పలు పడినా, శల్యుడి మనస్సు పూర్తిగా మారదు. శల్యుడి సాయం తానే కోరినా కర్ణుడి దర్పం కర్ణుడిది. అందులోనూ శల్యుడి మాటలలో ఆ వగరు కనిపిస్తే అది పైకి రాకమానదు. అదంతా ఈ ఇద్దరి మాటలలోనూ కనిపిస్తుంది. దుర్యోధనుడు కార్యసాధనకొరకు ఎంతో తగ్గి మాట్లాడుతున్నాడు. శల్యుడు కావాలని ఆదినుండి అతడి వెనుక గొయ్యి త్రవ్వుతూనే ఉన్నాడు.

వ. అనవుడు నట్లకాక యని శల్యుండు వెండియు 312

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; అట్లకాక= ఆలాగే అవుగాక; అని= అని పలికి; శల్యుండు= శల్యుడు; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని చెప్పగా అట్లాగే అని శల్యుడు పలికి మళ్ళీ.

క. 'తగువార లొరులఁ దెగడుట । పొగడుట యగు పలుకు పొంతఁ బోవరు హితకా
ర్యగతులు సెప్పఁగఁ దెగ డగుఁ । బొగ డగు నెదురోర్వవలయు బుద్ధిగలిగినన్. 313

ప్రతిపదార్థం: తగువారలు= తగినవారు; ఒరులన్= ఇతరులను; తెగడుట= నిందించటం; పొగడుట= ప్రశంసించటం; అగున్= అవుతుంది; పలుకుపొంతన్= మాట వద్దకు; పోవరు= వెళ్ళరు; హిత= మేలైన; కార్యగతులు= కార్యవిధానాలను; చెప్పఁగన్= చెప్పేటప్పుడు; తెగడు+అగున్= నిందించటమూ అవుతుంది; పొగడు+అగున్= ప్రశంసించటమూ ఉంటుంది; బుద్ధి+కలిగినన్= వివేకం ఉన్నట్లయితే; ఎదురు= తమ తలపోతకు ఎదురుచెప్పటం; ఓర్వవలయున్= సహించాలి.

తాత్పర్యం: 'చెప్పదగినవారు ఇతరులను నిందించటం - ప్రశంసించటం జరుగుతుంది. వారు మాటలకు ప్రాధాన్యం ఇవ్వరు. మేలు కూర్చే పనులతీరు చెప్పేటప్పుడు నిందా ఉంటుంది. ప్రశంసా ఉంటుంది. వివేకం ఉన్న పక్షంలో తమ ఆలోచనకు ఎదురు చెప్పినా సహించాలి.

తే. శక్రుతేరైన నడపంగఁ జాలువాఁడ । నుఱవు సెప్పుదు రథికునేమఱఁగ నీను
గృష్ణసారథ్యఘనుఁడగు క్రీడి గెలువఁ । దలఁచు నీ కేను గడపుటదగు రథంబు.' 314

ప్రతిపదార్థం: శక్రుతేరైనన్= దేవేంద్రుడి రథమైనా; నడపంగన్= తోలటానికి; చాలువాఁడన్= సమర్థుఁడను; ఉఱవు= యుక్తమైనది; చెప్పుదున్= చెపుతాను; రథికున్= రథంపై నుండి యుద్ధం చేసేవాడికి; ఏమఱఁగన్= పరాకు పడటానికి; ఈను= అవకాశం

ఇవ్వను; కృష్ణు= శ్రీకృష్ణుడియొక్క; సారథ్యఘనుఁడు+అగు= సారథ్యంచేత ఘనుఁడైన; క్రీడిన్= అర్జునుడిని; గెలువన్+ తలఁచు= జయింపగోరే; నీకున్= నీకు; ఏను= నేను; రథంబు= తేరు; కడపుట= నడపటం; తగున్= యుక్తం.

తాత్పర్యం: నేను దేవేంద్రుడి రథాన్ని అయినా నడుపగలను. యుక్తమైనది, ఉచితమైనది చెప్తుతూ ఉంటాను. రథికుడికి ఏమరుపాటు రానివ్వను. అర్జునుడు శ్రీకృష్ణుడి సారథ్యం వలన ఘనుడైనాడు. అతడిని గెలువదలస్తున్నావు నీవు. నీ రథం నేను తోలటం ఉచితమే.'

చ. అన విని భూవిభుండు ప్రియమారఁగఁ గర్ణునిఁ జూచి 'దేవకీ
తనయుఁడు మద్రనాథునకుఁ దక్కువ మాతలియుం దలంప నీ
తని కెనరాఁడు భాగ్యము కతంబున సారథియయ్యె నీకు నీ
యనఁ గొని నీవు పార్థునియహంకృతి మాన్పుము ధీరమానసా!' 315

ప్రతిపదార్థం: అనన్= అని చెప్పగా; విని= ఆలకించి; భూవిభుండు= భూపతి(రాజు దుర్యోధనుడు); ప్రియము+ఆరఁగన్= ప్రియమొప్పగా; కర్ణునిన్= అంగరాజును; చూచి= వీక్షించి; దేవకీతనయుఁడు= దేవకీపుత్రుడైన శ్రీకృష్ణుడు; మద్రనాథునకున్= మద్రదేశాధిపతి అయిన శల్యుడికంటె; తక్కువ= తక్కువవాడు; తలంపన్= ఆలోచించగా; మాతలియున్= ఇంద్రుడి సారథి అయిన మాతలి కూడా; ఈతనికిన్= ఈ శల్యుడికి; ఎన= సాటి; రాఁడు= కాడు, (ఇట్టి ఇతడు); భాగ్యము కతంబునన్= అదృష్టంకొద్దీ; నీకున్= సేనా నాయకుడవైన నీకు; సారథి+అయ్యెన్= సూతుడైనాడు; ఈయనన్= ఈ శల్యుడిని; కొని= సారథిగా స్వీకరించి; ధీరమానసా!= స్థిరమైన మనస్సు కల కర్ణా!; పార్థుని= అర్జునుడియొక్క; అహంకృతి= అహంకారం; మాన్పుము= పోగొట్టు.

తాత్పర్యం: అని చెప్పగా, ఆలకించాడు దుర్యోధనుడు. అతడు ప్రేమతో కర్ణుడిని చూచి 'కృష్ణుడు శల్యుడికంటె సారథ్యంలో తక్కువవాడు. ఆలోచించి చూస్తే మాతలికూడా ఈయనకు సాటిరాడు. ఇటువంటి శల్యుడు దైవవశాత్తు నీకు సారథిగా లభించాడు. ఓ స్థిరబుద్ధి గల కర్ణా! ఇతడిని సారథిగా చేసికొని, అర్జునుడి అహంకారం పోగొట్టుము' అన్నాడు.

క. అని యతఁడు శల్యుఁగనుఁగొని । వినతుండై 'నీవు లావు వెరవును మెఱయం
దనుఁగాన నంగపతి య । ర్జునుఁ గలన జయించువాఁడు రూఢిగ' ననుడున్. 316

ప్రతిపదార్థం: అని= అలా పలికి; అతఁడు= దుర్యోధనుడు; శల్యున్= మద్రరాజును; కనుఁగొని= చూచి; వినతుండు+ఐ= నమస్కరించినవాడై; నీవు= (కృష్ణుడికంటె మాతలికంటె అధికుడవైన) నీవు; లావు= బలమూ; వెరవును= ఉపాయమూ; మెఱయన్= ప్రకాశింపగా; తనున్= తనను; కావన్= కాపాడగా; అంగపతి= అంగరాజు; అర్జునున్= పాండవ మధ్యముడిని; కలనన్= యుద్ధంలో; రూఢిగన్= తప్పక; జయించువాఁడు= జయిస్తాడు; అనుడున్= అని పలుకగా.

తాత్పర్యం: అట్లా చెప్పి దుర్యోధనుడు శల్యుడిని చూచి నమస్కరించి, 'నీవు బలమూ, ఉపాయమూ ఒప్పేటట్లుగా తనను రక్షిస్తుండగా కర్ణుడు యుద్ధంలో తప్పక జయిస్తాడు' అనేసరికి.

వ. అట్లయ్యెడుం గాక యని పలికి మద్రేశ్వరుండు సారథ్యంబున కనురూపంబగు సన్నాహంబున నుత్సాహంబు వాటించినం బ్రీతుం డగుచు సూతనందనుండు దన సూతు నాలోకించి తగు రథంబునకుం గల్పన

యొనర్పుమని సత్వరంబుగాఁ బనిచిన వాఁడును రయంబున దృఢసుందరంబగు స్యందనంబు సుకల్పితంబుసేసి తెచ్చి దీవించి యిచ్చిన నయ్యరదంబుఁ బూజింపఁ బురోహితు నియమించి తదీయ మంగళవిధానానంతరంబ తాను నర్చించి కృతప్రదక్షిణుండై ప్రణమిల్లి భాస్కరోపస్థానం బాచరించి సవినయంబున శల్యు నారోహణంబుసేయు మనుటయు నతం డచలతటంబునకు లంఘించు సింగంబు చందంబున నొగలెక్కిన. 317

ప్రతిపదార్థం: అట్లు+అయ్యెడున్+కాక= అట్లాగే అవుగాక; అని; పలికి= చెప్పి; మద్రేశ్వరుండు= శల్యుడు; సారథ్యంబునకున్= రథం తోలటానికి; అనురూపంబు= తగినది; అగు= అయిన; సన్నాహంబునన్= ప్రయత్నమునందు; ఉత్సాహంబు+పాటించినన్= ఉత్సాహాన్ని చూపగా; ప్రీతుండు= సంతోషించినవాడు; అగుచున్= అవుతూ; సూతనందనుండు= కర్ణుడు; తన; సూతున్= సారథిని; ఆలోకించి= చూచి; తగు= తగిన; రథంబునకున్= తేరికి; కల్పన= ఏర్పాటు; ఒనర్పుము= కావించుము; అని; సత్వరంబుగాన్= త్వరతో; పనిచినన్= ఆజ్ఞాపించగా; వాఁడును= ఆ సూతుడును; రయంబునన్= వేగంతో; దృఢ= గట్టిదైన; సుందరంబు+అగు= అందమైన; స్యందనంబు= తేరు; సుకల్పితంబు+చేసి= చక్కగా సిద్ధము చేసి; తెచ్చి= తీసికొనివచ్చి; దీవించి= ఆశీర్వదించి; ఇచ్చినన్= సమర్పించగా; ఆ+అరదంబున్= ఆ తేరిని; పూజింపన్= అర్చించటానికి; పురోహితున్= పురోహితుని; నియమించి= నియోగించి; తదీయ= ఆ పురోహితునిదైన; మంగళ= శుభంకోసమయిన; విధాన= పద్ధతి ఆచరించిన; అనంతరంబ= తరువాతనే; తానును+అర్చించి= తాను-కర్ణుడు కూడా పూజించి; కృత= (రథానికి) చేయబడిన; ప్రదక్షిణుండు= (మూడుసారులు) చుట్టి తిరిగివచ్చుట కలవాడై; ప్రణమిల్లి= నమస్కరించి; భాస్కర= సూర్యుడియొక్క; ఉపస్థానంబు= ఉపాసన; ఆచరించి= చేసి; సవినయంబునన్= వినయంతో; శల్యున్= మద్రరాజును; ఆరోహణంబు+చేయుము= తేరెక్కుము; అనుటయున్= అని అనగానే; అతండు= ఆ శల్యుడు; అచల= పర్వతంయొక్క; తటంబునకున్= చరియమీదికి; లంఘించు= దూకే; సింగంబు= సింహంయొక్క; చందంబునన్= విధముగ; నొగలు= రథంయొక్క తొట్టి (సారథి కూర్చొనేచోటు) ఎక్కినన్= ఆరోహించగా.

తాత్పర్యం: అట్లాగే అగుగాక!' అని పలికి, శల్యుడు రథం తోలటానికి అవసరమైన ఏర్పాట్లమీద పూనిక చూపించే సరికి, కర్ణుడు సంతోషించి, అప్పటివరకు తన సారథిగా పనిచేస్తున్న వానిని చూచి, శల్యుడి సారథ్యానికి తగిన రథం ఏర్పాటు చేయుమని ఆజ్ఞాపించగా, అతడు వెంటనే దృఢంగా, అందంగా ఉన్న ఒక రథాన్ని సిద్ధం చేసి, తీసికొని వచ్చాడు. అట్లా తెచ్చి, కర్ణుడిని దీవించి దానిని అతడికి అప్పగించాడు. అపుడు కర్ణుడు ఆ రథాన్ని పూజించవలసినదిగా పురోహితుడికి చెప్పాడు. అతడు ఆ మంగళకృత్యం నెరవేర్చిన తరువాత, తానూ పూజించాడు. ఆ రథం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణం చేసి నమస్కరించాడు. సూర్యుడిని ఉపాసించాడు. వినయంతో శల్యుడిని తేరెక్కవలసినదని చెప్పాడు. వెంటనే అతడు కొండచరియమీదికి దూకే సింహంవలె తేరి తొట్టెలోనికి ఎక్కాడు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. మెఱుఁగు తోడి లలిత మేఘంబు మీఁదికిఁ। బోయి వెలుఁగుభాను పొలుపు దోఁప
మద్రరాజసహితమహితమై యొప్పు న। త్తేరు కర్ణుఁ డెక్కి తేజరిల్లె. 318

ప్రతిపదార్థం: మెఱుఁగు తోడి= విద్యుత్తుతో కూడిఉన్న; లలిత= అందమైన; మేఘంబు= మబ్బుయొక్క; మీఁదికిన్+పోయి= పైకివెళ్ళి; వెలుఁగు= ప్రకాశించే; భాను= సూర్యుడియొక్క; పొలుపు తోఁపన్= అందం స్ఫురించగా; మద్రరాజసహిత=

శల్యుడితో కూడినందున; మహితము+ఐ= గొప్పదై; ఒప్పు= శోభిస్తున్న; ఆ+తేరు= ఆ రథం; కర్ణుఁడు+ఎక్కి= అంగరాజు ఆరోహించి; తేజరిల్లెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: మెరుపుతో కూడి మనోహరంగా ఉన్న మేఘం మీదికిపోయి ప్రకాశించే సూర్యుడి శోభ స్ఫురించేటట్లుగ, మద్రరాజుతో కూడి గొప్పగా ఒప్పుతున్న ఆ రథాన్ని కర్ణుడధిరోహించి వెలిగాడు.

విశేషం: అలం. ఉపమ.

వ. అని యిట్లు కర్ణసారథిత్వంబు శల్యుండు, మెయికొనుట సంజయుండు ధృతరాష్ట్రునకుం జెప్పె ననిన విని యటమీఁది వృత్తాంతం బెఱింగింపు మనుటయు. 319

ప్రతిపదార్థం: అని+యిట్లు= ఈ ప్రకారం; కర్ణసారథిత్వంబు= కర్ణుడికి సూతుడు కావటం; శల్యుండు= మద్రరాజు; మెయికొనుట= అంగీకరించటం; సంజయుండు= సంజయుడు; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రమహారాజుకు; చెప్పెన్= చెప్పాడు; అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; అటమీఁది= ఆ తరువాతి; వృత్తాంతంబు= ఉదంతం; ఎఱింగింపుము= తెలియజెయ్యి; అనుటయున్= అని అడిగేసరికి - 'వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె' అనిన రెండవ ఆశ్వాసంలోని 2వ వచనంలోని క్రియతో అన్వయం.

తాత్పర్యం: ఇట్లా శల్యుడు కర్ణుడి రథసారథి కావటానికి అంగీకరించటం సంజయుడు ధృతరాష్ట్ర మహారాజుకు చెప్పాడు అని వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు చెప్పేసరికి. ఆ మహారాజు తరువాతి వృత్తాంతం తెలియచేయుమనగా

ఆశ్వాసాంతము

చ. అవిరళ దర్శనస్థిర మహాముని మానసవాస ఖేలనో
త్సవరసికా! రసాత్మక! నితాంతకృపాకర దివ్యచిత్త! స
త్త్వవిభవ సంభృతైక్య సుఖతామయదేహా! నిరామయా! పున
ర్భవ పరిహార హారిపద పద్మయుగస్తవ! హృద్యసంస్తవా! 320

ప్రతిపదార్థం: అవిరళ= ఎడతెగకుండా; దర్శన= చూడటంలో; స్థిర= కుదురైన; మహాముని= మహర్షులయొక్క; మానస= మనస్సు అనే; వాస= నివాసంలో; ఖేలనోత్సవ= క్రీడించటం అనే ఉత్సవంలో; రసికా!= ప్రీతి కలవాడా!; రసాత్మక!= రసస్వరూపుడవైనవాడా!; నితాంత= అతి విస్తారమైన; కృపాకర= దయకు జన్మస్థానమైన; దివ్యచిత్త!= దివ్యమైన మనస్సు కలవాడా!; సత్త్వ= సత్త్వగుణంయొక్క; విభవ= ఐశ్వర్యంచేత; సంభృత+ఐక్య= నిండిన ఏకత్వంతో; సుఖతామయదేహా!= సుఖమయమయిన శరీరంకలవాడా!; నిరామయా!= దోషరహితుడా!; పునర్భవ= పునర్జన్మను; పరిహార= తొలగించే; హారి= మనోహరమైన; పదపద్మ= పద్మాలవంటి పాదాలయొక్క; యుగ= జంటయొక్క; స్తవ= స్తోత్రం కలవాడా; హృద్యసంస్తవా= మనోహరమైన చక్కని స్తుతులు కలవాడా!

తాత్పర్యం: ఎల్లప్పుడు నిన్ను దర్శించటంచేత స్థిరంగా ఉన్న మహర్షుల మనస్సులనే నివాసాల్లో క్రీడించటం అనే వేడుకలో ప్రీతి కలవాడా! రసస్వరూపా! అంతులేని దయకు ఉనికి పట్టయిన దివ్యచిత్తం కలవాడా! సత్త్వగుణ

సంపద చేత నిండిన ఏకత్వంతో సుఖమయమైన దేహం కలవాడా! దోషరహితుడవైనవాడా! పునర్జన్మను లేకుండా చేసే మనోహరాలైన పాదపద్మాల జంటను గూర్చిన స్తోత్రం కలవాడా! మనస్సుకు ఇంపైన చక్కని స్తుతులు కలవాడా!

క. కమలవన సదృశదృగ్రుచి । సముదయశమితార్తి భక్త సంఘా! లక్ష్మీ
రమణత్వ శివాప్రియతా । సమవా యాలంబ్యమాన సౌందర్యనిధీ! 321

ప్రతిపదార్థం: కమలవన= పద్మవనంతో; సదృశ= సమానమయిన; దృక్= నేత్రములయొక్క; రుచిసముదయ= కాంతి సమూహంచేత; శమిత= శాంతింపజేయబడిన; ఆర్తి= పీడకల; భక్తసంఘా!= భక్తుల సమూహంకలవాడా!; లక్ష్మీరమణత్వ= లక్ష్మీపతిభావం (హరిత్వం) యొక్క; శివాప్రియతా= పార్వతీప్రియభావం (హరత్వం) యొక్క; సమవాయ= అవినాభావంచేత; ఆలంబ్యమాన= ఆధారపడుతున్న; సౌందర్య= అందానికి; నిధీ= నిధివంటివాడా.

తాత్పర్యం: కమలవనం వంటి కన్నులకాంతి పుంజంతో భక్తజనుల ఆర్తిని పోగొట్టే లక్ష్మీపతి, పార్వతీపతి భావాలకు అవినాభావాధారమైన సౌందర్యానికి నిధివంటి, వాడా, హరిహరనాథా!

మాలిని.

అనుభవశమరమ్యా! హంసభావైక గమ్యా!
వినమదఘవిదారీ! విశ్వలోకోపకారీ!
దినకరశశినేత్రా! ధీపరిస్పందచిత్రా!
దనుజమథనలీలా! ధర్మతత్త్వానుకూలా! 322

ప్రతిపదార్థం: అనుభవ= అనుభవపూర్వకమైన; శమ= శాంతిచే; రమ్యా!= సుందరుడవైనవాడా!; హంసభావైక గమ్యా!= హంసభావానికి ఏకైక గమ్యమైనవాడా; హంసభావమంటే అహం+సః అనేభావం. అనగా అహం= నేను; సః= ఆ బ్రహ్మస్వరూపాన్ని అనే భావం; ఇది అవిరామంగా పలుకుతుంటే; సః+అహమ్= సోऽహమ్ సోऽహమ్ సోऽహంసః= ఇలా హంసగా పరిణమిస్తుంది. ఈ అద్వైతభావానికి ఒకే ఒక గమ్యమైన రూపం హరిహరనాథాద్వైత రూపం. దీనిని మరొకవిధంగా కూడా చెపుతారు. సర్వప్రపంచమూ లయమైనా పరమేశ్వరుడొకడు మాత్రం కేవలుడై నిలిచిఉంటాడు; శరీరంలోని ఇంద్రియాలన్నీ నిద్రావస్థలో విశ్రాంతినందినా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు మాత్రం నిలిచి ఉంటాయి. దీనిని హంసస్థితి లేక భావం అంటారు. ఇదే పరమేశ్వరభావం. దీనిని ఉపాసకులు హంసగాయత్రీ రూపంతో ఉపాసిస్తారు. ఈ రకమైన ఉపాసనచే పొందదగినవాడు అని; వినమత్= నమస్కరిస్తున్నవారియొక్క; అఘ= పాపాలను; విదారీ!= బ్రద్దలు కొట్టేవాడా!; చీల్చేవాడా!; విశ్వ= సమస్తమైన; లోక+ఉపకారీ!= లోకాలకు మేలుచేసేవాడా!; దినకర= సూర్యుడు; శశి= చంద్రుడూ; నేత్రా!= నయనములు(కన్నులు)గా కలవాడా!; ధీ పరిస్పందచిత్రా!= బుద్ధియొక్క కదలిక, చాంచల్యం చేత చిత్రంగా కనిపించేవాడా; దనుజ= రాక్షసులను; మథన= సంహరించటం; లీలా!= విలాసంగా కలవాడా!; ధర్మతత్త్వానుకూలా!= ధర్మతత్త్వానికి అనుకూలమైనవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! నీ రూపం అనుభవపూర్వకమైన శాంతిచే రమ్యమైనది. నీవు హంసభావంచేత పొందదగినవాడవు. నీకు నమస్కరిస్తూ ఉండేవారి పాపాలను పోగొట్టుతావు. సకలలోకాలకూ నీవు ఉపకారివి. సూర్యచంద్రులు నీ నేత్రాలు. కేవలుడవైన నీవు బుద్ధి చాంచల్యంచేత చిత్రంగా అనేకంగా కనిపిస్తావు. ధర్మవిరోధు లయిన రాక్షసులను సంహరించటం నీకొకక్రీడ. నీవు ధర్మతత్త్వానికి, ధర్మసంస్థాపనకు సదా అనుకూలుడవు.

విశేషం: అలం: అంత్యానుప్రాసం.

గద్యము.

ఇది శ్రీమ దుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కనసోమయాజి ప్రణీతంబయిన శ్రీ మహాభారతంబున కర్ణపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈ గ్రంథభాగం; శ్రీమత్= శోభాశాలులు అయిన; ఉభయకవి= సంస్కృతాంధ్రములు రెంటిలోను కవులయిన వారియొక్క; మిత్త్ర= స్నేహితుడయిన అనగా రెండు భాషలలోను కవి అయినవాడునూ; కొమ్మనామాత్యపుత్త్ర= కొమ్మన అనే పేరుగల మంత్రియొక్క కుమారుడునూ; బుధ= పండితులను; ఆరాధన= పూజించటంచేత; విరాజి= ప్రకాశించేవాడునూ; తిక్కనసోమయాజి= సోమయాగం చేసిన, తిక్కన అనే పేరుగల కవిచేత; ప్రణీతంబు+అయిన= రచించబడినది అయిన; శ్రీమహాభారతంబునన్= శ్రీకరమయిన మహాభారతమనే గ్రంథంలో; కర్ణపర్వమునందున్= కర్ణపర్వంలో; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసం; సమాప్తం= పూర్తి అయినది.

తాత్పర్యం: ఇది ఉభయ కవిమిత్త్ర బిరుదాంచితుడూ, కొమ్మనామాత్యుడి కుమారుడూ, పండితులను పూజించటం చేత ప్రకాశించేవాడూ అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శ్రీ మహాభారతంలోని కర్ణపర్వం మొదటి ఆశ్వాసం సమాప్తం.

కర్ణపర్వంలోని ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

కర్ణపర్వము -ద్వితీయాశ్వాసము

క. శ్రీ నిష్పాదన నిపుణ! కృ । పా నిరతి శయార్ద్రభావ! భావాతీతా!
భాను సహస్ర ప్రభ! ర । మ్యానంత వపుః ప్రకాశ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ, నిష్పాదన నిపుణ!= ఐశ్వర్యమును కలిగించుటలో నైపుణ్యం కలవాడా!; కృపానిరతిశయ+ఆర్ద్రభావ!= అపార కరుణచేత మెత్తనైన చిత్తంకలవాడా!; భావ+అతీతా!= ఊహలకు అందనివాడా!; భాను సహస్ర ప్రభ!= వేయి సూర్యులకాంతి గలవాడా!; రమ్య+అనంత= మనోహరము-అనంతము అయిన; వపుఃప్రకాశ!= దేహకాంతి గలవాడా!; హరిహరనాథా!

తాత్పర్యం: హరిహరనాథా! నీవు భక్తులకు ఐశ్వర్యం కలిగించేవాడవు. వారిపై అపారమైన కరుణను కురిపించే ఆర్ద్రహృదయుడవు. నీవు ఊహాతీతుడవు. సహస్ర సూర్యదీప్తితో ప్రకాశించేవాడవు. అంతులేని మనోహర దేహకాంతి కలవాడవు.

విశేషం: ప్రతి అశ్వాస ప్రారంభంలో వలెనే కృతిపతి అయిన హరిహరనాథుడిని స్తుతించాడు తిక్కన. సూర్యసుతుడైన కర్ణుడి యుద్ధవర్ణనగల పర్వం ఆరంభంలో హరిహరనాథుని భానుసహస్రప్రభను నుతించటం సముచితంగా ఉన్నది.

శల్యుఁడు గర్ణునుత్సాహంబునకు విఘ్నకరంబు లగు వాక్యంబులు సెప్పుట (సం.8-26-16)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు దన సుతుండు సూతసుతు కోర్కి దీర్పంబూని యతి ప్రయత్నంబు సేయుట యాకర్ణించి యాంబికేయుండు. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు; జనమేజయునకున్+ఇట్లు+అనియెన్= జనమేజయుడితో ఇట్లా అన్నాడు; అట్లు= ఆ విధంగా; తన సుతుండు= తన పుత్రుడు (దుర్యోధనుడు); సూతసుతుకోర్కి= కర్ణుని కోరికను; తీర్పన్+పూని= తీర్చదలచి; అతిప్రయత్నంబు చేయుట= మిక్కిలియత్నం చేయటం; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; ఆకర్ణించి= విని.

తాత్పర్యం: శల్యుడిని తనకు సారథిగా నియమించుమని కర్ణుడు కోరగా దుర్యోధనుడు ఎంతో ప్రయత్నంతో శల్యుడిని అందుకు ఒప్పించాడు. ఈ విషయం సంజయుడి ద్వారా విన్న ధృతరాష్ట్రుడు.

ఆ. 'ఎట్లు ప్రియ మొనర్చె? నట్లు సంప్రార్థితుం । డైన మద్రనాథుఁ డంతఁ గోరి
తేరు గడప నతని తెచ్చికొన్నట్టి య । వ్వీరుఁ డేమి భంగి విక్రమించె?' 3

ప్రతిపదార్థం: అట్లు సంప్రార్థితుండు+ఐన= ఆ విధంగా ప్రార్థించబడిన; మద్రనాథుఁడు= శల్యుడు; ఎట్లు ప్రియము+ఒనర్చెన్?= ఏ విధంగా (కర్ణ దుర్యోధనుల) ఇష్టాన్ని నెరవేర్చాడు?; అంతన్+కోరి= అంతగా ఇష్టపడి; తేరు కడపన్= రథం తోలటానికి; అతని తెచ్చికొన్నట్టి= శల్యుడిని సారథిగా నియమించుకొన్నట్టి; ఆ+వీరుఁడు= కర్ణుడు; ఏమి భంగిన్= ఏ రీతిగా; విక్రమించెన్?= పరాక్రమించాడు?

తాత్పర్యం: కర్ణదుర్యోధనులు అంతగా వేడుకొని తెచ్చుకొన్న శల్యుడు ఏ విధంగా వారి ఇష్టాన్ని నెరవేర్చాడు. తన తేరు నడపటానికి అంతగా కోరి ఆ శల్యుణ్ణి తెచ్చుకొన్న కర్ణుడు ఏ విధంగా పరాక్రమించాడు.

వ. **అని యడిగిన సంజయుం డిట్లనియె, నట్లు రథికసారథులు విలసిల్లి వందిమాగధ ప్రస్తూయమాను లగుచుఁ దనవలను గౌరవంబునం గనుంగొనుటయుఁ, గురురా జయ్యంగరాజు నుద్దేశించి.** 4

ప్రతిపదార్థం: అని అడిగినన్= (ధృతరాష్ట్రుడు) అడుగగా; సంజయుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అట్లు= ఆ విధంగా; రథిక సారథులు= కర్ణుడు, శల్యుడు, వందిమాగధ ప్రస్తూయమానులు+అగుచున్= వందిమాగధులచేత పొగడబడిన వారై; విలసిల్లి= ఒప్పుచు; తనవలను= తనవైపు; గౌరవంబునన్= గౌరవంతో; కనుంగొనుటయున్= చూడగా; కురురాజు= దుర్యోధనుడు; ఆ+అంగరాజున్= కర్ణుడిని; ఉద్దేశించి= చూచి.

తాత్పర్యం: అని ప్రశ్నించిన ధృతరాష్ట్రుడితో సంజయుడు చెప్పసాగాడు. ఆ సేనాధిపతిని, సారథిని చూచి వందిమాగధులు ప్రశంసలు చేస్తూ, దుర్యోధనుడివైపు గౌరవభావంతో చూచారు. అప్పుడు అతడు కర్ణుడితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: వంది= స్తుతిచేసి జీవించేవాడు; మాగధుడు= వంశావళిని కీర్తించేవాడు. వీరు ఆనాడు యుద్ధభూమికి కూడా వచ్చేవారని ద్యోతకమవుతున్నది.

చ. **గురుఁడును భీష్ముఁడున్ నరునకున్ బకవైరికి నగ్గలంబు, వీ**
రిరువురు వారి నిద్దఱ నహీన పరాక్రమ లీల గీటడం
తురు ధ్రువమంచు నాత్మఁ బరితోషముఁ బొందుదు; నట్లు గాక ని
ర్భర బల శౌర్యముల్ మెఱయ గ్రక్కున నాపని నిర్వహింపుమీ! 5

ప్రతిపదార్థం: గురుఁడును భీష్ముఁడున్= ద్రోణుడు, భీష్ముడు; నరునకున్, బకవైరికిన్= అర్జునుడికి, భీముడికి; అగ్గలంబు= మించిన శౌర్యం కలవారు; వీరు+ఇరువురు= భీష్మద్రోణులు; వారిన్+ఇద్దఱన్= భీమార్జునులను; అహీన పరాక్రమలీలన్= గొప్ప పరాక్రమంతో; గీటు+అడంతురు= గర్వం అణచుతారు (సంహరిస్తారు); ధ్రువము+అంచున్= ఇది తథ్యమని; ఆత్మన్= మనసులో; పరితోషమున్= సంతోషమును; పొందుదున్= పొందేవాడిని; అట్లుకాక= ఆ విధంగా కాక; నిర్భర బలశౌర్యముల్= అధికబల పరాక్రమాలు; మెఱయన్= ప్రకాశించగా; గ్రక్కునన్= శీఘ్రంగా; ఆ పని నిర్వహింపుమీ!= భీమార్జునులను సంహరించే కార్యాన్ని నెరవేర్చుము.

తాత్పర్యం: అధిక పరాక్రమశాలులైన భీష్ముడు, ద్రోణాచార్యుడు భీమార్జునులను తప్పక సంహరించగలవారని ఎంతో సంతోషించేవాడిని. కాని నా కోరిక తీరలేదు. నీవైనా నీ బలశౌర్యాలు ప్రదర్శించి నా అభీష్టాన్ని నెరవేర్చుము.

విశేషం: బలవంతులైన పాండవులను భీష్మద్రోణులు సంహరించలేకపోయినా కర్ణుడు అందుకు సమర్థుడని దుర్యోధనుడి నమ్మకం. అతడి అండ చూచికొనే దుర్యోధనుడు మహాభారత సంగ్రామానికి సిద్ధపడ్డాడు.

తే. **బాడుదల నొండెఁ బట్టుము పాండు తనయ । ముఖ్యు; వీరు వా రన నేల? మునుము వట్టి**
వైరివర్గంబు నెల్లను బారిసమరి । సైన్యయుతముగ నద్భుత జయము గొనుము.' 6

ప్రతిపదార్థం: బాడు+తలన్+ఒండెన్= అవమానించియో-మరొక విధంగానో; పాండు తనయ ముఖ్యున్= ధర్మరాజును; పట్టుము= బంధించుము; వీరువారు+అనన్+ఏల; మునుము పట్టి= వరుస(పెట్టి); వైరివర్గంబున్+ఎల్లను= శత్రుసమూహమునంతటిని; బారిసమరి= హింసించి; సైన్యయుతముగన్= సేనతోకూడ; అద్భుత జయము కొనుము= ఆశ్చర్యకరమైన విజయం పొందుము.

తాత్పర్యం: ఏ విధంగానైనా పాండవాగ్రజుడయిన ధర్మరాజును బంధించుము. వారూ వీరని చూడక శత్రువర్గము నంతటినీ సైన్యంతో సహా రూపుమాపి విజయాన్ని సాధించుము'.

వ. **నడపు మనుటయు, నమ్మాటఁ గైకొని కర్ణుండు శల్యునిం దేరు నడపు మనిన నతం డట్ల చేసె; నప్పుడు శంఖ భేరీ ప్రముఖ తూర్యనాదంబులు రోదసీ గహ్వరంబు విహ్వలంబు గావించె; నవ్విధంబునం జనిచని గర్వాగ్రహ విధేయుం డగు రాధేయుం డమ్మద్రపతి కిట్లనియె.** 7

ప్రతిపదార్థం: నడపుము+అనుటయున్= సేనను నడిపించుమని అనగా; ఆ+మాటన్+కైకొని= దుర్యోధనుని మాటలు విని; కర్ణుండు, శల్యునిన్= శల్యుడితో; తేరు నడపుము+అనినన్= రథాన్ని నడిపించుమనగా; అతండు+అట్లు+అ చేసెన్= శల్యుడు ఆ ప్రకారమే చేశాడు; అప్పుడు; శంఖభేరీ ప్రముఖ= శంఖం, భేరి మొదలగు, తూర్యనాదంబులు= వాద్యధ్వనులు; రోదసీగహ్వరంబు= ఆకాశ ప్రాంతమును; విహ్వలంబు గావించెన్= భయభ్రాంతం చేశాయి; (ప్రతిధ్వనింపజేశాయి); ఆ విధంబునన్; చనిచని= ముందుకువెళ్ళి; గర్వ+ఆగ్రహ విధేయుండు+అగు= గర్వానికి కోపానికి వశుడైన; రాధేయుండు= కర్ణుడు; ఆ+మద్రపతికిన్= శల్యుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడి మాట ప్రకారం రథాన్ని ముందుకు నడిపించుమని కర్ణుడు శల్యుడిని కోరాడు. వెనువెంటనే శంఖాలు, భేరి మొదలైన యుద్ధవాద్యాల ధ్వనులు ఆకాశమంతటా మారుమ్రోగాయి. ఆ విధంగా ముందుకు సాగుతున్న కర్ణుడు గర్వంతో పాండవుల మీది కోపంతో శల్యుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఆ రోజుల్లో సైన్యాలు వాద్యఘోషల మధ్య యుద్ధానికి బయల్దేరుతుండేవి.

శా. **'నారాచాది మహోగ్ర బాణ పటలీ నానావిధోల్లాసముల్**
సైరింపన్ ధృతిలేక పాండుతనయుల్ సంభ్రాంతి నొందంగ, వి
స్మేరంబై ఖచర వ్రజంబు వొగడన్, మెచ్చంగ నీ చూడ్కి దు
ర్వారో దగ్రత నేఁడు సూపెద భుజావష్టంభ సంరంభినై'. 8

ప్రతిపదార్థం: నారాచ+ఆది= ఇనుప బాణాలు మొదలైన; మహా+ఉగ్రబాణ, పటలీ= మహాభయంకరాలైన బాణాల సమూహముయొక్క; నానావిధ+ఉల్లాసముల్= పెక్కు ప్రకాశములను; సైరింపన్, ధృతిలేక= సహించే ధైర్యంలేక; పాండు

తనయుల్= పాండవులు; సంభ్రాంతిన్+ఒందంగన్= నిశ్చేష్టులు కాగా; ఖచర, వ్రజంబు= దేవతలసమూహం; విస్మేరంబు+ఐ= నవ్వుతో కూడినదై; పొగడన్= ప్రశంసించగా; నీ, చూడ్కి, మెచ్చంగన్= నీ చూపు మెచ్చుకోగా; భుజ+అవష్టంభ సంరంభిన్+ఐ= బాహు గర్వంయొక్క ఆటోపం కలవాడినై; నేఁడు= ఈనాడు; దుర్వార+ఉదగ్రతన్= అడ్డుకొన సాధ్యంకాని భీకరత్వాన్ని; చూపెదన్= చూపిస్తాను.

తాత్పర్యం: పాండవులు (నేను ప్రయోగించే) మహాభయంకరాలైన నానావిధ బాణాల నానావిధ కాంతుల తాకిడిని తట్టుకోగల ధైర్యంలేక తల్లడిల్లగా, ఆశ్చర్యంతో ఆకాశ సంచారులంతా ప్రశంసించగా, నీవు కూడ చూచి మెచ్చుకోగా, బాహుబల గర్వాతిశయంతో ఎవ్వరూ అడ్డుకోలేని భీకరత్వాన్ని ఈ రోజు (యుద్ధరంగంలో) ప్రదర్శిస్తాను.

సీ. అన విని మద్రరా జాతని కిట్లను, । 'సత్య పరాక్రముల్ శౌర్యఘనులు
భుజ వీర్య మహితులు భూరి తేజోధను । లఖిలాస్త్ర విత్తము లార్యు లమర
పతికైన రణమున భయము పుట్టింపంగ । నోపుదు రప్పాండుభూపతనయు,
లేల వారల నింత దూలవోఁ బలికెద, । విప్పుడు వల్క రాదెట్లు నీకు

తే. గాండివ జ్యా నినాదమ్ము గ్రమ్మి కర్ణ । విదళనము సేసినను భీము గద మెఱుంగు
లొలసి చూడ్కులు మిఱుమిట్లు గొలిపినను భ । యంబు పెల్లున నపుడు వా యడఁగుఁ గాక!' 9

ప్రతిపదార్థం: అనన్+విని= (కర్ణుడు) అనగా విని; మద్రరాజు= శల్యుడు; అతనికిన్+ఇట్లు+అనున్= కర్ణునితో ఇట్లా అంటున్నాడు; ఆ+పాండు భూప తనయులు= ఆ పాండురాజు కుమారులు; సత్య పరాక్రముల్= సత్యశీలురు; శౌర్యఘనులు= శౌర్యంలో గొప్పవారు; భుజవీర్య మహితులు= గొప్ప భుజ బలశాలులు; భూరితేజోధనులు= గొప్ప తేజోధనం కలవారు; అఖిల+అస్త్రవిత్తముల్= సకలాస్త్రవిదులలో శ్రేష్ఠులు; ఆర్యులు= సజ్జనులు; అమరపతికైనన్= ఇంద్రుడికైనా; రణమునన్= యుద్ధమున; భయమున్ పుట్టింపంగన్+ఓపుదురు= భీతి కలిగించగలవారు; ఇప్పుడు, ఏల, వారలన్+ఇంత+తూలవోన్+పలికెదవు= ఇప్పుడు ఎందుకీవిధంగా వారిని తూలనాడుతున్నావు; గాండివజ్యానినాదమ్ము= అర్జునుడి వింటిత్రాటి ధ్వని; క్రమ్మి= ఆక్రమించి; కర్ణవిదళనము చేసినను= చెవులు బద్దలు చేసినపుడును; భీము గద మెఱుంగుల్+ఒలసి= భీముడి గదకాంతులు వ్యాపించి; చూడ్కులు మిఱుమిట్లు గొల్పినను= కనులకు మిరుమిట్లు గొలిపినపుడును; భయంబు పెల్లునన్= భయాతిశయంతో; అపుడు; వాయి అడఁగున్+కాక= నోరు పడిపోతుంది; ఎట్లు= ఏ విధంగా కూడా; నీకు; పల్కరాదు= మాట్లాడటం సాధ్యంకాదు;

తాత్పర్యం: కర్ణుడి అహంకారం చూచి శల్యుడు అతడితో ఇట్లా అంటున్నాడు. పాండవులు సత్యపరాక్రమం కలవారు, బలపరాక్రమ సంపన్నులు, తేజోధనులు, అస్త్ర విద్యా విశారదులు. దేవేంద్రుడైనా రణరంగంలో వారిని ఎదుర్కొనలేడు. వాళ్ళను ఇంత తక్కువ చేసి ఇప్పుడు మాట్లాడుతున్నావు. అర్జునుడి వింటి ధ్వనికి నీ చెవులు బద్దలైనపుడు, భీముడి గద మెరుపులు నీ కళ్ళకు మిరుమిట్లు గొల్పినపుడు నీ నోట మాటరాక నిశ్చేష్టుడవై ఏమీ అనలేవు.

విశేషం: 'కర్ణవిదళనము' అన్న పదంలో చెవులతోపాటు కర్ణుడు అన్న అర్థంకూడా స్ఫురిస్తుంది. వీనులు, కనులు నిశ్చేష్టమైనపుడు వాక్కు కూడా మూగబోతుంది.

వ. అని వెండియు. 10

తాత్పర్యం: అని మళ్ళీ.

చ. **'నరుని శరంబులన్ రథ గణంబులు గూలఁగ, భీము నుల్లస**
త్పరిఘమునన్ గజ వ్రజము భగ్నముగాఁ బెఱ తమ్ములున్ యుధి
ష్ఠిరుఁడును దాఁకినం జలము డించి దొరల్ గలఁగంగఁ జూచియుం
దిరమయి నీవు నాలుకకుఁ దెచ్చిన మాటగదా వినందగున్.' **11**

ప్రతిపదార్థం: నరుని శరంబులన్= అర్జునుడి బాణాలచేత; రథగణంబులు= రథ సమూహాలు, కూలఁగన్= పడిపోగా; భీము+ఉల్లసత్+పరిఘమునన్= భీముడి మెరిసే ఇనుపగట్ల గుదియతో; గజవ్రజము= ఏనుగుల గుంపు; భగ్నముకాన్= చెదరిపోగా; పెఱతమ్ములున్= మిగతా సోదరులు(నకుల సహదేవులు); యుధిష్ఠిరుఁడును= ధర్మరాజు; తాఁకినన్= మీదపడగా; చలముడించి= పట్టుదల వీడి; దొరల్= యోధులు; కలఁగంగన్= క్షోభచెందగా; చూచియున్= చూచికూడా; నీవు; తిరము+అయి= స్థిరంగా నిలబడి; నాలుకకున్+తెచ్చిన మాటకదా= మాట్లాడిన మాట గదా; వినన్+తగున్= వినతగును.

తాత్పర్యం: 'అర్జునుడి బాణాలకు నీ రథసైన్యం, భీముడి పరిఘాయుధం మెరుపులకు గజసైన్యం, ధర్మజ నకుల సహదేవుల తాకిడికి యోధసమూహం చెల్లాచెదరైపోవటాన్ని చూచికూడ, నీవు కలతపడకుండా స్థిరంగా నిలబడి మాట్లాడినమాటలు కదా వినదగును.'

విశేషం: ఉపప్లావ్యంలో ఉన్నప్పుడే ధర్మరాజు శల్యుడితో కర్ణుడికి సారథిగా ఉండి అతడిని నిరుత్సాహపరచి తమకు సహకరించవలసిందిగా కోరి రప్పించాడు. ఆ ప్రకారమే శల్యుడు కర్ణుడిముందు మాటిమాటికీ పాండవుల పరాక్రమాన్ని పొగడుతున్నాడు. శల్యుడిని సారథిగా కోరుకొని కర్ణుడు తన దురదృష్టాన్ని తానే కోరి తెచ్చుకొన్నాడు.

క. **అను పలుకులు వినియుం దా । వినని చెవులు సేసి, మద్రవిభుతో రాధా**
తనయుఁడు 'నా చేతి బరువు । గనుఁగొనియెద విపుడ' యనియె గండ మరంగన్.' **12**

ప్రతిపదార్థం: అను, పలుకులు, వినియున్= అనే శల్యుడి మాటలు వినికూడా; రాధాతనయుఁడు= కర్ణుడు; తాన్= తాను; వినని చెవులు చేసి= విననట్లుగా నటిస్తూ; గండు+అమరంగన్= పౌరుషం ఒప్పగా; నా చేతి బరువు= నా చేతి బలుపు; ఇపుడ= ఇప్పుడే; కనుగొనియెదవు= చూస్తావు గదా; అనియె(న్)= అన్నాడు.

తాత్పర్యం: శల్యుడి మాటలు విన్నా విననట్లుగా నటిస్తూ కర్ణుడు, నా చేతి బలాన్ని ఇప్పుడే చూస్తా'వని పౌరుషంతో అన్నాడు.

వ. **ఇట్లు సంగరోత్సాహ దీప్తుండై నడతెంచు నతని నుపలక్షించి.** **13**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సంగర+ఉత్సాహదీప్తుండు+ఐ= రణోత్సాహంతో ప్రకాశిస్తున్నవాడై; నడతెంచు+అతనిన్= వస్తున్న కర్ణుడిని; ఉపలక్షించి= చూచి.

తాత్పర్యం: యుద్ధోత్సాహం చేత ప్రకాశిస్తూ వస్తున్న కర్ణుడిని చూచి.

చ. **కురుబల ముబ్బి యార్చెఁ, బటు ఘోటక హేషిత నిస్వనంబులుం**
గరివర బృంహిత ధ్వనులు గాఢములై విలసిల్లె, నెత్తురుల్
గురిసె, నభంబు మ్రోయఁ బిడుగుల్ మొరసెం, బొరి నుల్క లెల్లెడం
దొరఁగెఁ బ్రదీప్త మారుతము ధూళిఁ గడున్ వడిఁ జల్లె భూవరా! 14

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; కురుబలము= కౌరవసైన్యం; ఉబ్బి+ఆర్చెన్= పెద్దగా సంతోషించి అరచింది; పటుఘోటక= బలిష్ఠమైన అశ్వాల; హేషిత నిస్వనంబులున్= సకిలింపుల ధ్వనులు; కరివర బృంహిత ధ్వనులు= శ్రేష్ఠాలైన ఏనుగుల ఘీంకార ధ్వనులు; గాఢములు+ఐ విలసిల్లెన్= దట్టములైనవై వ్యాపించాయి; నెత్తురుల్+కురిసె(న్)= రక్తధారలు కురిశాయి; నభంబు మ్రోయన్= ఆకాశం ధ్వనించగా; పిడుగుల్ మొరసెన్= పిడుగులు శబ్దం చేశాయి; పొరిన్= వెనువెంట; ఉల్కలు+ఎల్లెడన్+ తొరఁగెన్= అన్నివైపులా ఉల్కలు పడసాగాయి; ప్రదీప్త, మారుతము= తీవ్రమైన గాలి; కడున్ వడిన్= ఎంతో వేగంతో; ధూళిన్ చల్లె(న్)= దుమ్మును వెదజల్లింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! కౌరవ సైన్యంలోని వారు సంతోషాతిశయంతో బిగ్గరగా అరిచారు. గుర్రాల సకిలింతలు, ఏనుగుల ఘీంకారాలు పెద్దగా వినిపించాయి. నెత్తురు కురిసింది. పిడుగుల మ్రోతలు ఆకాశం ధ్వనించేటట్లుగా మ్రోగాయి. అన్నివైపులా ఉల్కలు పడసాగాయి. తీవ్రమైన గాలి దుమ్మును వెదజల్లింది.

వ. **మఱియు బహువిధోత్పాతంబులు గౌరవులకు నాశం బగుటం దెలుపుచుం దోఁచెఁ; దోఁచిన నవి యెల్ల సరకు గొనక వారు దైవమోహితులు గావున శల్య సహితుండైన కర్ణుం గనుంగొని కుంతీనందను లతనిచే నిర్జింపఁ బడుదురకాఁ దలంచి సంతోషించి; రతండు భీష్మద్రోణుల దోర్వీర్యంబులు పాండుతనయులచేతఁ గోలుపోయె నని మనంబున వారల మెచ్చక ముంగలియై మెఱసి నడచుచుండి పార్థపరాక్రమ స్మరణంబునం గ్రోధంబు జనియించి యూర్పులు సందడింప మాన దర్పోన్మాదంబున మద్రపతి కిట్లనియె.** 15

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; బహువిధ+ఉత్పాతంబులు= అనేకవిధాలైన అపశకునాలు; కౌరవులకున్; నాశంబు+అగుటన్= నష్టం కలగటాన్ని; తెలుపుచున్= సూచిస్తూ; తోఁచెన్= అగుపడ్డాయి; తోఁచినన్= అట్లా కనపడినప్పటికీ; వారు= ఆ కౌరవులు; దైవమోహితులు కావున(న్)= విధివంచితులవటంవలన; అవి+ఎల్లన్+సరకుగొనక= వాటిని అన్నిటినీ లెక్కపెట్టక; శల్యసహితుండైన కర్ణున్= శల్యుడితో ఉన్న కర్ణుడిని; కనుంగొని= చూచి; కుంతీ నందనులు= పాండవులు; అతనిచేతన్= కర్ణుడిచేత; నిర్జింపఁ బడుదురు+అ, కాన్= సంహరించబడగలరని; తలంచి= భావించి; సంతోషించిరి= ఆనందించారు; అతండు= కర్ణుడు; భీష్మద్రోణుల దోన్+వీర్యంబులు= భీష్మద్రోణుల బాహుబలములు; పాండుతనయులచేతన్= పాండవులచేత; కోలువోయెన్+అని= వ్యర్థములైనాయని; మనంబునన్= మనసులో; వారలన్+మెచ్చక= వారిని లక్ష్యపెట్టక; ముంగలి+ఐ మెరసి= సేనకు ముందుగా ఒప్పుతూ; నడచుచుండి= నడుస్తూ; పార్థ పరాక్రమ స్మరణంబునన్= అర్జునుడి శౌర్యం తలపునకు రాగా; క్రోధంబు జనియించి= కోపం తలెత్తి; ఊర్పులు సందడింపన్= నిట్టూర్పులు అతిశయించగా; మానదర్ప+ఉన్మాదంబునన్= పౌరుష గర్వోన్మాదంతో; మద్రపతికిన్= శల్యుడితో; ఇట్లు+అనియె(న్)= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇంకా కౌరవ వినాశ సూచకాలయిన అపశకునాలు పెక్కు గోచరించాయి. అయినా విధివశులైన కౌరవులు వాటిని లెక్కచేయక కర్ణుడు శల్యసారథ్యంతో పాండవులను తప్పక సంహరిస్తాడని సంతోషించసాగారు. సేనకు అగ్రభాగంలో ఉన్న కర్ణుడు, పాండవుల ముందు ఓడిపోయారని భీష్మద్రోణులను మెచ్చుకోక, అర్జునుడు తలపునకు రాగానే క్రోధంతో నిట్టూర్పులు విడుస్తూ పౌరుషగర్వం నిండినవాడై శల్యుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఉత్పాతాలు (అపశకునాలు) మూడు విధాలు-దివ్యం, ఆంతరిక్షం, భౌమం అని, 'ఉల్కలు, పిడుగులు పడటం' మొదలైనవి అంతరిక్ష సంబంధమైనవి. ఇవి దుఃఖకారకాలు అని పూర్వుల అభిప్రాయం.

మ. 'అరదం బెక్కి శరాసనంబు గొని తెంపారంగ నేనేచి సం
గర సంక్రీడకుఁ జొచ్చినం దృణ సముంగాఁ గొందు, న ద్దేవతా
వరునైనన్ గురు నాపగాతనయుఁ జావం జూచుటన్ వైరు లే
తురు చెండాడెద నుగ్రతం దలలు, నా దోర్దర్పముం జూడుమీ!' 16

ప్రతిపదార్థం: అరదంబు+ఎక్కి= రథం ఎక్కి; శర+అసనంబు(న్)+కొని= ధనుస్సు చేబట్టి; తెంపు+ఆరంగన్= ధైర్యంతో; ఏన్+ఏచి= నేను విజృంభించి; సంగర సంక్రీడకున్= యుద్ధక్రీడకు; చొచ్చినన్= పూనుకొంటే; ఆ+దేవతావరున్+ఐనన్= ఆ దేవేంద్రుని సైతం; తృణసముంగాన్+కొందున్= గడ్డిపరకతో సమంగా చూస్తాను; గురున్+ఆపగా తనయున్= ద్రోణ భీష్ములను; చావన్+చూచుటన్= పతనమొందించినందువల్ల; వైరులు= శత్రువులు; ఏతురు= విజృంభిస్తారు; తలలు= వారి తలలు; ఉగ్రతన్= భయంకరంగా; చెండాడెదన్= నరుకుతాను; నా దోః+దర్పమున్+చూడుమీ!= నా భుజపరాక్రమాన్ని చూడుము.

తాత్పర్యం: రథ మెక్కి విల్లు చేబట్టి రణరంగంలో నేను విజృంభిస్తే దేవేంద్రుడిని కూడా తృణీకరిస్తాను. ద్రోణాచార్య భీష్మపితామహులను పడగొట్టామన్న గర్వంతో ఉన్న వైరుల తలలు ఖండించే నా భుజపరాక్రమాన్ని చూడుము.

వ. అని పలికి, యనంతరంబ 'గాంగేయ కుంభసంభవులంతటిమానుసులు నిట్లు రిత్తసావు సత్తురే!' యని యుగ్గడించి మఱియు నిట్లనియె. 17

ప్రతిపదార్థం: అని పలికి; అనంతరంబు= తర్వాతనే; గాంగేయ కుంభ సంభవుల+అంతటి మానుసులన్= భీష్మ ద్రోణులంతటి వారు కూడా; ఇట్లు; రిత్తచావు చత్తురే?= వ్యర్థమరణం పొందుతారా?; అని+ఉగ్గడించి= అని వచించి; మఱియున్+ఇట్లు+అనియెన్= ఇంకా ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'భీష్మద్రోణులంతటివారు ఈ విధంగా వ్యర్థమైన చావు చస్తారా! అని, కర్ణుడు శల్యుడితో ఇంకా ఇట్లా అన్నాడు:

ఉ. వారల లోకవీరుల నవధ్యుల గీటడఁగించి, పల్వురన్
వారల యట్ల యెందు ననివార్యు లనం జను మేదినీశులం
బోర వధించి, రౌద్రమునఁ బొంగి క్రమాగత మృత్యు వొక్కొ నాఁ
గా రణకేళికిం గడఁగు గాండివి నేన యెదిర్చి యోర్చెదన్. 18

ప్రతిపదార్థం: లోకవీరులన్= గొప్పవీరులు; అవధ్యులన్= వధింప సాధ్యంకాని వారు అయిన; వారలన్= ఆ భీష్మద్రోణులను; గీటు+అడఁగించి= గర్వం అణచి; వారల+అట్ల= వారివలెనే; ఎందున్+అనివార్యులు+అనన్+చను= ఎవరిచేతకూడా వారించబడనివారు అనదగినట్టి; పల్వురన్, మేదినీశులన్= పెక్కుమంది రాజులను; పోరన్+వధించి= యుద్ధములో చంపి; రౌద్రమున(న్)+పొంగి= రౌద్రావేశంతో చెలరేగి; క్రమ+ఆగత, మృత్యువు+ఒక్కొ, నాన్+కా= వరుసగా వచ్చిన మృత్యువేమో అన్నట్లుగా; రణకేళికిన్+కడఁగు= యుద్ధక్రీడకు పూనుకొనే; గాండివిన్= అర్జునుడిని; ఏన= నేనే; ఎదిర్చి+ఓర్చెదన్= ఎదిరించి ఓడిస్తాను.

తాత్పర్యం: లోకైక వీరులైన భీష్మద్రోణులను, వారివలెనే అనివార్యులైన ఎందరో రాజులను వధించి రౌద్రంతో విజృంభించి వరుసగా వచ్చే మృత్యువా అన్నట్లు యుద్ధక్రీడకు పూనుకొనే అర్జునుడిని నేనే ఎదిరించి సంహరిస్తాను.

విశేషం: 'క్రమాగత మృత్యువాక్కొ' అని కర్ణుడు పేర్కొన్న అర్జునుడు తర్వాతి కథలో కర్ణుని పాలిటి మృత్యువుగా పరిణమించటం గమనించదగింది. అలం: ఉత్ప్రేక్ష.

ఉ. పాండు నృపాగ్రనందనుఁడుఁ బావనియుం గవలుం జలంబుమై
నొండొరు మూదలించుకొని యొక్కటఁ దాఁకినఁ దీవ్ర విస్ఫుర
త్కాండ విదారితాంగకులఁ గా నొనరించి యలంచి లీలమై
గం డడఁగింతుఁ బోక పెనఁగం గల చంద మెఱింగి చెండుదున్. 19

ప్రతిపదార్థం: పాండునృప+అగ్రనందనుఁడున్= పాండు కుమారులలో పెద్దవాడైన ధర్మరాజు; పావనియున్= భీముడు; కవలున్= నకులసహదేవులు; చలంబుమైన్= పూనికతో; ఒండొరు మూదలించుకొని= ఒకరినొకరు హెచ్చరించుకొని; ఒక్కటన్+ తాఁకినన్= ఒక్కటై మీదబడినా; తీవ్ర విస్ఫురత్+కాండతీక్ష్ణమైన ప్రకాశంతో కూడిన బాణాలచేత; విదారిత+అంగకులన్+కాన్= చీల్చబడిన అవయవములు కలవారినిగా; ఒనరించి= చేసి; అలంచి= శ్రమపెట్టి; లీలమైన్= అవలీలగా; గండు+అడఁగింతున్= గర్వం అణచుతాను; పోక పెనఁగన్= యుద్ధ విముఖులు గాక నన్నెదురుకొన్నట్లయితే; కలచందము= ఉన్న విధాన్ని; ఎఱింగి= గ్రహించి; చెండుదున్= నరుకుతాను.

తాత్పర్యం: ధర్మరాజు, భీముడు, నకుల సహదేవులు ఒక్కటై మీదపడినా, వాడి బాణాలతో అవలీలగా వారి అంగాలను ఖండించి వారి గర్వం అణుస్తాను. వాళ్ళు వెనుదిరుగక ఇంకా నాతో యుద్ధం చేస్తే నరుకుతాను.

విశేషం: క్రిందటి పద్యంలోనే అర్జునుడిని ప్రస్తావించటం వలన, ఇక్కడ నలుగురు సోదరులనే పేర్కొనటం జరిగింది.

క. అని పలికి వెండియును ని । ట్లను, భీష్ముఁడు దెగిన ద్రోణుఁ డతులిత దివ్యా
స్త్రనిచయము దోర్విలాసం । బును జాలం గలిగియుండె భూనుత మగుచున్. 20

ప్రతిపదార్థం: అని పలికి; వెండియున్= ఇంకా; ఇట్లు+అను(న్)= కర్ణుడు శల్యుడితో ఇట్లా అంటున్నాడు; భీష్ముడు+తెగిన= భీష్ముడు మరణించగా; ద్రోణుడు, అతులిత= సాటిలేని; దివ్య+అస్త్ర నిచయము= దివ్యాస్త్ర సమూహం; దోః+విలాసంబును= భుజబల శోభను; భూనుతము+అగుచున్= లోకంచే పొగడబడేది అవుతూ; చాలన్+కలిగి ఉండె(న్)= అధికంగా కలిగిఉన్నాడు.

తాత్పర్యం: అని పలికి కర్ణుడు శల్యుడితో ఇంకా ఇట్లా అన్నాడు: 'వీరుడైన భీష్మ పితామహుడు అస్తమించినా, ద్రోణాచార్యుడివద్ద లోకం పొగడే దివ్యాస్త్రాలూ, బాహుబలమూ ఉన్నాయి.

సీ. ద్రోణుండు బహుదివ్య బాణదీప్తుఁడు భుజా । బలశాలి శౌర్య సంపన్న హృదయుఁ
డక్షీణ విక్రముఁ డతిరథ శ్రేష్ఠుఁ; డ । వ్వీరుండు పార్థుచేఁ బోరఁ బడిన
ధార్తరాష్ట్రుల యేపు దఱిఁగెఁ; దదాప్త సై । నికులు గం డడఁగిరి; నీ వెఱుంగ
నైనను రాము కృపాతిశయంబునఁ । గనిన యీ రథమును గార్ముకాది

ఆ. దారుణాస్త్ర శస్త్ర తతులును గలిమి నే। నతనిఁ దొడరి దివిజు లడ్డపడినఁ
గూల్తు, నెల్లభంగిఁ గురురాజు మన్నన। యప్పు దీర్తుఁ బ్రాణ మాసపడక.' 21

ప్రతిపదార్థం: ద్రోణుండు= ద్రోణుడు; బహుదివ్య బాణ దీప్తుఁడు= అనేక దివ్యబాణాలచేత ప్రకాశించేవాడు; భుజాబలశాలి= గొప్ప భుజబలం గలవాడు; శౌర్యసంపన్న హృదయుఁడు= పరాక్రమధనుడు; అక్షీణ విక్రముఁడు= అధిక బలవంతుడు; అతిరథశ్రేష్ఠుఁడు= అతిరథులలో శ్రేష్ఠుడు - అతిరథశ్రేష్ఠుడన్న స్థాయి కలవాడు; ఆ+వీరుండు= అట్టి ద్రోణాచార్యుడు; పార్థుచేన్= అర్జునుడి చేత; పోరన్+పడినన్= యుద్ధములో మరణించగా; ధార్తరాష్ట్రుల= కౌరవుల; ఏపు+తరిగెన్= విజృంభణం తగ్గింది; నీవు+ఎఱుంగన్= నీవు చూచినట్లుగానే; తద్+ఆప్తసైనికులు= వారి ఆప్తులైన సైనికులు; గండు+అడఁగిరి= నశించారు; అయినను= అయినప్పటికీ; రాము= పరశురాముని; కృపా+అతిశయంబునన్= అనుగ్రహ విశేషంతో; కనిన= పొందిన; ఈ రథమును= ఈ రథాన్ని; కార్ముక+ఆది= ధనుస్సు మొదలైన; దారుణ+అస్త్రశస్త్ర తతులును= శత్రుభయంకరములైన అస్త్ర శస్త్రాల సముదాయాలను; కలిమిన్= కలిగి ఉండటంచేత; నేను= నేను; అతనిన్+తొడరి= అర్జునుడిని తాకి; దివిజులు+అడ్డపడినన్= దేవతలు అడ్డువచ్చినా; ఎల్లభంగిన్= ఏ విధంగానైనా; కూల్తున్= సంహరిస్తాను; ప్రాణము+ఆసపడక= ప్రాణంకూడా లెక్కచేయక; కురురాజు= దుర్యోధనుడి; మన్నన+అప్పు+తీర్తున్= సమ్మానము అనే ఋణాన్ని తీర్చుకొంటాను.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు దివ్యబాణసంపన్నుడు. గొప్ప పరాక్రమవంతుడు. అతిరథశ్రేష్ఠుడు. అంతటి మహావీరుడు అర్జునుడితో యుద్ధంలో మరణించగా కౌరవుల ధైర్యం సన్నగిల్లింది. సైనికుల గర్వం అంతరించింది. అయినా పరశురాముడిని సేవించి పొందిన రథం, అస్త్రశస్త్రాల బలంతో ఏ విధంగానైనా అర్జునుడిని సంహరించి తీరుతాను. నా ప్రాణం కూడా లెక్కచేయక, దుర్యోధనుడు నన్ను సమ్మానించినందుకు ఋణం తీర్చుకొంటాను.'

విశేషం: అనేకమందితో యుద్ధం చేసేవాడు అతిరథుడు. భీష్ముడి దృష్టిలో దుర్యోధనుడు, శల్యుడు, ద్రోణుడు మొ॥ వారు అతిరథులు, కర్ణుడు తాను బ్రాహ్మణుడనని చెప్పి పరశురాముడి వద్ద శిక్షణ పొంది బ్రహ్మాస్త్ర భార్గవాస్త్రాలను సంపాదించాడు.

శల్యుఁ డర్జును పరాక్రమం బుగ్గడించి కర్ణునిఁ దూలం బలుకుట (సం. 8-26-61)

వ. అనిన విని శల్యుండు గర్ణున కి ట్లనియె. 22

తాత్పర్యం: అని కర్ణుడనగా, శల్యుడు ఇట్లా అన్నాడు:

చ. 'వినిన జనంబు లీతఁ డవివేకి యనన్ వల దింత రజ్జు ల
ర్జును బలశౌర్య సంపదలు సూచి యెఱుంగమె మున్ను? నిన్ను నా
తనిఁ గలనన్ జగం బెఱుఁగదా యతఁ డద్భుత విక్రమోజ్జ్వలుం
డెనయుదె నీవు పౌరుషవిహీనుఁడ వద్దివిజేంద్రనందనున్. 23

ప్రతిపదార్థం: వినిన జనంబుల్= (నీమాటలు) విన్న ప్రజలు; ఈతడు+అవివేకి+అనన్= కర్ణుడు మూర్ఖుడని అనగా; ఇంతరజ్జులు వలదు= ఇంతటి వ్యర్థమైన మాటలు పలుకకుము; అర్జును, బల, శౌర్య, సంపదలు= అర్జునుడి బలపరాక్రమ సంపదలు; మున్ను= ఇంతకుముందు; చూచి+ఎఱుంగమె= చూసినవారం కాదా; నిన్నున్+ఆతనిన్= నిన్ను, అతడినీ; కలనన్= రణములో; జగంబు+ఎఱుఁగదా= లోకం చూచి ఎరుగదా; అతడు+అద్భుత+విక్రమ+ఉజ్జ్వలుండు= అర్జునుడు

అద్భుత పరాక్రమంచేత లెస్సగా ప్రకాశించేవాడు; నీవు, పౌరుషవిహీనుఁడవు= మగటిమి లేనివాడవు; ఆ+దివిజ+ఇంద్రనందనున్= దేవేంద్ర తనయుడైన ఆ విజయుడికి; ఎనయుదె!= సాటి కాగలవా!

తాత్పర్యం: విన్న జనం కర్ణుడింత అవివేకియా! అనేటట్లు ఇంత వ్యర్థమైన మాటలు మాట్లాడవద్దు. అర్జునుని బలపరాక్రమ సంపదలు ఇంతకుముందు చూచాముకదా! మీ ఇద్దరిని లోకం కూడ యుద్ధంలో చూచింది కదా! అర్జునుడు అద్భుత పరాక్రమంచేత ప్రకాశించేవాడు. పౌరుషహీనుడవైన నీవు ఆ దేవేంద్రనందనునకు సాటికాగలవా?

సీ. **రాత్రిమైఁ దాఁకి క్రూరతఁ బోర మగఁటిమి । వాసిన అంగారపర్ణుకంటె,**
ఘోషయాత్రా విధిఁ గురురాజుఁ జెఱ పట్టి । మాన మేదిన చిత్రసేనుకంటె,
ఖాండవోద్యానంబుఁ గావ నేరక సిగ్గు । వడి చన్న నిర్జరప్రభునికంటెఁ,
గ్రీడాకిరాతుఁ డై క్రోడంబునకుఁ గాఁగఁ । బెనఁగి చిక్కిన త్రిలోచనునికంటె

ఆ. **నెక్కు డైన వీరుఁ; డే నర్జునునితోడఁ । బొడుతు నొడుతు ననినఁ బోలుఁ గాక;**
వినుము సూతతనయ! మనబోఁటు లాతనిఁ । జెఱుతు మనుట నోరిచేటు గాదె? **24**

ప్రతిపదార్థం: సూత తనయ!= కర్ణా!; రాత్రిమైన్+తాకి= రాత్రి సమయంలో ఎదుర్కొని; క్రూరతన్+పోరి= ఘోరంగా యుద్ధంచేసి; మగఁటిమి పాసిన= పౌరుషం కోల్పోయిన; అంగారపర్ణుకంటెన్= అంగారపర్ణుడి కన్న; ఘోషయాత్రావిధిన్= ఘోషయాత్రా సంఘటనలో; కురురాజున్+చెఱపట్టి= దుర్యోధనుడిని బంధించి; మానము+ఏదిన చిత్రసేనునికంటెన్= గర్వాన్ని కోల్పోయిన చిత్రసేనుడి కన్న; ఖాండవ+ఉద్యానంబున్= ఖాండవవనాన్ని; కావ నేరక= రక్షించలేక; సిగ్గుపడిచన్న= సిగ్గుతో మరలిన; నిర్జర ప్రభునికంటెన్= దేవేంద్రుడికన్న; క్రీడాకిరాతుడై= వేటగాని వేషం ధరించి; క్రోడంబునకున్+కాఁగన్= పందికొరకు; పెనఁగి,చిక్కిన= పోరి ప్రక్కకు తొలగిన; త్రిలోచనునికంటెన్= శివుడికన్న; ఎక్కుడు+ఐన వీరుడేన్= మించిన వీరుడైతే; అర్జునునితోడన్= పార్థుడితో; పొడుతున్= పోరుతాను; ఒడుతున్= ఓడిస్తాను; అనినన్+పోలున్+కాక= అంటే చెల్లుతుంది కాని; మనబోటులు= మనవంటి సామాన్యులు; ఆతనిన్+చెఱుతుము+అనుట= అర్జునుడిని రూపుమాపుతామనటం; నోరిచేటు కాదె?= మననోటికే నష్టం కదా!;

తాత్పర్యం: రాత్రి సమయంలో పోరు సలిపి ఓడిపోయిన అంగారపర్ణుడి కన్నా, ఘోషయాత్రలో దుర్యోధనుడిని బంధించి భంగపడిన చిత్రసేనుడి కన్నా, ఖాండవవనాన్ని రక్షించలేక పారిపోయిన ఇంద్రుడికన్నా, వరాహం కోసం పోరాడి తప్పుకొన్న శివుడికన్నా మించిన వీరుడైతే అర్జునుడితో పోరుతాను, అతడిని ఓడిస్తాను అంటే సరిపోతుందిగాని, సూతనందనా! మనలాంటివారు అతడిని సంహరిస్తాననటం నోటి చేటే కదా.

విశేషం: అంగారపర్ణుడు కుబేరుడి మిత్రుడైన గంధర్వుడు, పాండవులు ద్రుపదుడి నగరం ప్రవేశిస్తున్న సందర్భంలో రాత్రిపూట తన అడవిలో చొరబడ్డారని ఆటంకపరచి అర్జునుడి చేతిలో ఓడిపోయాడు. ద్వైతవనంలో ఉన్న పాండవులను అవమానిద్దామన్న దురుద్దేశంతో ఘోషయాత్రకు వచ్చిన దుర్యోధనుడిని బంధించిన చిత్రసేనుడిని, భీమార్జునులు ఓడించి, అతడిని విడిపించారు. అగ్నిదేవుడి ఆహుతికి గురి అయిన ఖాండవవనాన్ని రక్షించాలని వచ్చిన ఇంద్రుడు అర్జునుడి ధాటికి తట్టుకొనలేక వెనుతిరిగాడు. పాశుపతాస్త్రం కొరకు తపస్సు చేస్తున్న అర్జునుడిని పరీక్షించాలని కిరాతరూపంలో వచ్చిన పరమశివుడు అతడి భుజబలాన్ని చూచి యుద్ధంనుండి తప్పుకొన్నాడు. 'నోరిచేటు' చక్కని జాతీయం. సూతనందనా! అనటం శల్యుడు కర్ణుడిని కించపరచటమే?

చ. నృపుఁడును భీష్ముఁడుం గృపుఁడు నీవు గురుండును దత్సుతుండు ను
గ్రపు బలమేచి తో నడవఁగా బెనుదాడిగఁ బోయి మత్స్య నా
థుపసులఁ బట్టి యద్దొరలతోఁ జెడి పాఱితి కర్ణ! యప్డు క
య్యపు బలుపాడె, డిప్డు మన యర్జును నమ్ములు ద్రుప్పు వట్టెనే? 25

ప్రతిపదార్థం: కర్ణ!= ఓ రాధేయా!; అప్డు= అప్పుడు; నృపుఁడును= దుర్యోధనుడును; భీష్ముఁడున్, కృపుఁడు, నీవున్; గురుండును= ద్రోణాచార్యుడును; తద్+సుతుండున్= అతడిపుత్రుడు అశ్వత్థామయు; ఉగ్రపుబలము+ఏచి= భయంకరమైన సైన్యము విజృంభించి, తోన్ నడవఁగాన్= వెంబడి+రాగా; పెనుదాడిగన్+పోయి= పెద్ద దండయాత్రగా వెళ్ళి; మత్స్యనాథు పసులన్+ పట్టి= మత్స్యదేశపు రాజు విరాటుడి పశువులను బంధించి; ఆ+దొరలతోన్= ఆ వీరులతో; చెడిపాఱితి(వి)= ఓడి పారిపోయావు; ఇప్డు= ఈనాడు; కయ్యపు బలుపు+ఆడెదు= యుద్ధోత్సాహపు మాటలు పలుకుతున్నావు; మన అర్జును+అమ్ములు= మన అర్జునుడి బాణాలు; త్రుప్పు పట్టెనే?= చిలుం పట్టాయా?

తాత్పర్యం: దుర్యోధనుడు, భీష్ముడు, కృపుడు, నీవు, ద్రోణాచార్యుడు, అశ్వత్థామ-విజృంభించిన భయంకర సైన్యం వెంటరాగా, పెద్ద దండయాత్రగా వెళ్ళి, విరాటరాజు పశువులను పట్టి, అర్జునునిచేత ఆ ప్రముఖ వీరులతో సహా ఓడి పారిపోయావు కదా కర్ణా! ఇప్పుడు ఇలా యుద్ధోత్సాహపు మాటలు మాట్లాడుతున్నావు. అర్జునుడి బాణాలు త్రుప్పుపట్టాయా? (లేదు కదా).

ఉ. ముందరియట్లు గాదు, జనముల్ దెగడన్ వెఱఁ బాఱ నేఁడు సం
క్రందనసూతి మార్కొని తిరంబయి పోరెద, దాఁపఁ బ్రాణముల్,
నిందకుఁ జాల నింక నను నిక్కపుఁబల్కులు పల్కు టొప్పు; దా
నం దుదిఁ జచ్చినం జను; మొనన్ నరుఁ దాఁకుట రిత్త వోవునే?' 26

ప్రతిపదార్థం: జనముల్ తెగడన్= లోకులు నిందించగా; వెఱన్+పాఱన్= భయంతో పారిపోవటానికి; ముందరి అట్లు కాదు= మునుపటి వలె కాదు; నేఁడు= ఈ రోజు; సంక్రందన సూతిన్= ఇంద్రతనయుడైన అర్జునుడిని; మార్కొని= ఎదిరించి; తిరంబు+అయి పోరెద= స్థిరంగా యుద్ధం చేస్తాను; ప్రాణముల్, దాఁపన్= ప్రాణాలు దాచకుండా పోరాడుతాను; నిందకున్, చాలన్+ఇంకన్= ఇక నిందలు భరించలేను; అను, నిక్కపున్, పల్కులు= అన్న నిజమైన మాటలు; పల్కుట+ఒప్పున్= పలకటం తగును; దానన్+తుదిన్= అపుడు చివరకు; చచ్చినన్+చనున్= చనిపోయినా తగును; మొనన్, నరున్+తాఁకుట= యుద్ధరంగంలో అర్జునుడిని ఎదిరించటం; రిత్తపోవునే?= వ్యర్థమగునా?

తాత్పర్యం: ఇంతకుముందువలె లోకులనిందకు గురి అయి పారిపోవటం కుదరదు. ప్రాణాలకు తెగించి అయినా అర్జునుడితో పోరాడతానని వచించావు. ఈ అపనిందలకన్నా రణరంగంలో మరణమైనా మేలన్నావు. అవి నిజాలే కావచ్చును. దానివలన చివరకు పోరులో చచ్చినా నీవన్నమాటే నిలుపుకొన్నట్లు ఔతుంది. కాకపోతే అర్జునుడితో తలపడటం అంటే ఊరికే పోతుందా?'

వ. అనవుడు నలుక వొడమిన నడంచికొని రాధేయుండు మద్రపతి కి ట్లనియె. 27

ప్రతిపదార్థం: అనవుడున్= (శల్యుడు) ఆ విధంగా పలుకగా; అలుక పొడమినన్= ఆగ్రహం కలిగినా; అడంచికొని= అణచిపెట్టికొని; రాధేయుండు= కర్ణుడు; మద్రపతికిన్+ఇట్లు+అనియెన్= శల్యుడితో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: శల్యుడి మాటలవల్ల కలిగిన కోపాన్ని అణచుకొని కర్ణుడు, అతడితో ఇట్లా అంటున్నాడు:

చ. 'నరునకుఁ బూని పల్కితి వినం జవిమాలిన దొడ్డ పల్కు లే
నరగలి లేక బెట్టడరినప్పుడు సూడుము నన్ను నాతనిం
దిరమయి బాహు శక్తియును ధీరతయున్ వెరవుం జలంబు నె
వ్వరిదెసఁ గాంచి తెక్కుడుగ వారి నుతింపుము మాను మంతకున్.' 28

ప్రతిపదార్థం: వినన్+చవిమాలిన= చెవులకు రుచించని; దొడ్డపల్కులు= పెద్దమాటలు; నరునకున్+పూనిపల్కితి(వి)= అర్జునుడి పక్షం వహించి పలికావు; ఏన్+అరగలి లేక= నేను ఎట్టి సందేహమూ లేక; బెట్టు+అడరిన+అప్పుడు= మిక్కిలి విజృంభించినప్పుడు; నన్నున్+ఆతనిన్= నన్ను, పార్థుడిని; చూడుము= చూడు; బాహు శక్తియును= భుజబలం; ధీరతయున్= ధైర్యం; వెరవున్= ఉపాయం; చలంబున్= పూనిక; తిరము+అయి= స్థిరమై; ఎవ్వరిదెసన్= ఎవరియందు; ఎక్కుడుగ కాంచితి(వి)= అధికంగా చూస్తావో; వారి నుతింపుము= అతడిని ప్రశంసించుము; మానుము+అంతకున్= అంతవరకు ఊరుకొమ్ము.

తాత్పర్యం: అర్జునుడి పక్షం వహించి వినటానికి రుచించని పెద్ద పెద్ద మాటలు మాట్లాడావు. సందేహానికి తావులేకుండ లెస్సగ విజృంభించినప్పుడు నన్ను, అర్జునుని చూడు. బాహుబలం, ధైర్యం, ఉపాయం, పట్టుదల ఎవరిలో స్థిరంగా, ఎక్కువగా అగుపిస్తాయో వారిని పొగడు. అంతదాకా మాట్లాడకు.

విశేషం: 'నిన్ను నాతని గలనన్ జగంబెఱుఁగదా' అన్న శల్యుడి మాటలకు (23వపద్యం) 'చూడుము నన్ను నాతనిన్' అన్న వాక్కులు సమాధానంగా ఉన్నాయి.

వ. అనుటయు 'నట్ల చేసెద నని పలికి శల్యుం డూరకుండెఁ, 'దేరువో ని' మ్మని రాధేయుండు దఱిమి పలికిన నమ్మద్రేశ్వరుండును దురంగంబుల సత్వరంబుగా నడపె, నివ్విధంబునం జని మనమొన సొచ్చి సైనికులు సంతసిల్ల వారలం గలయం గనుంగొని కర్ణుం డిట్లనియె. 29

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; శల్యుండు; అట్ల, చేసెదన్, అని= అట్లాగే చేస్తానని; ఊరకుండెన్= మాట్లాడకుండెను; రాధేయుండు= కర్ణుడు; తేరుపోనిమ్ము అని; తఱిమి, పలికినన్= తొందరపెట్టగా; ఆ మద్రేశ్వరుండును= శల్యుడు; తురంగంబులన్= అశ్వాలను; సత్వరంబుగాన్ నడపెన్= త్వరగా నడిపాడు; కర్ణుండు; ఈ, విధంబునన్, చని= ఈ విధంగా ముందుకువెళ్ళి; మన మొన చొచ్చి= మన సైన్యం చేరి; సైనికులు, సంతసిల్లన్= సంతోషించగా; వారలన్ కలయన్ కనుంగొని= వారందరిని చూచి; ఇట్లు, అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అని కర్ణుడనగా శల్యుడు అట్లాగే చేస్తానని ఊరకున్నాడు. కర్ణుడు తేరుపోనిమ్మని త్వరపెట్టగా, శల్యుడు గుర్రాలను వేగంగా నడిపాడు. కర్ణుడు మన సైన్యాన్ని చేరుకొని, కలయచూచి సైనికులు సంతోషించేటట్లుగా ఇట్లా అన్నాడు.

సీ. వలను శోభిల్ల నెవ్వాఁ డైన వీఁడె య । ర్జునుఁ డని నా కిప్డు సూపెనేనిఁ
బసదనం బేనిచ్చు భంగి యందఱకును । వివరించి చెప్పెద వినుఁడు మీరు
వొగడంగఁ దగు రథ్యముల తోడి సౌవర్ణ । రథములు వలసిన, రయము లావుఁ
బొలుపును గలుగు కాంభోజ హయంబుల । వలసినఁ, బేర్చు సత్త్వంబునందుఁ

తే. బరిణతములగు సుందర కరివరముల। వలసినను, జారులావణ్యవతుల వలసి
నను, మహాగ్రామములు వలసినను, గోర్కి। కెక్కు డమ్మేటి మగని కే నిచ్చువాఁడ. 30

ప్రతిపదార్థం: వలను శోభిల్లన్= నేర్పు మెరయగా; ఎవ్వాఁడు+ఐనన్= ఎవరైనా; వీడె అర్జునుఁడు అని= ఇతడే అర్జునుడని; నాకు ఇష్ఘ చూపెనేనిన్= నాకు ఇప్పుడు చూపితే; ఏను= నేను; పసదనంబు, ఇచ్చు, భంగి= కానుక ఇచ్చే విధం; అందరకును; వివరించి చెప్పెదన్; మీరు వినుఁడు; పొగడంగన్+తగు, రథ్యములతోడి= కొనియాడదగిన గుర్రాలతో కూడిన; సౌవర్ణ, రథములు, వలసినన్= బంగారు రథాలు కావాలన్నా; రయము, లావు, పొలుపును గలుగు= వేగం; బలం, అందం కలిగిన; కాంభోజహయంబుల వలసినన్= కాంభోజదేశపు అశ్వాలను కోరినా; పేర్చు, సత్త్వంబునందు, పరిణతములు+అగు= అధికశక్తితో ఒప్పు; సుందర, కరివరముల, వలసినను= అందమైన ఏనుగుల కోరినను; చారు, లావణ్య వతుల, వలసినను= అందమైన సుందరీమణులను కోరినా; మహా(గ్రామములు, వలసినను= పెద్దఊళ్ళు కావాలన్నా; కోర్కికిన్ ఎక్కుడు= కోరిన వాటికంటే ఎక్కువగా; ఆ మేటిమగనికిన్= ఆ గొప్ప వీరునికి; ఏన్, ఇచ్చువాఁడన్= నేను ఇస్తాను.

తాత్పర్యం: ఎవరైనా నాకు అర్జునుడిని చూపించగలిగితే వారు కోరిన కానుకలు ఇవ్వగలను. అశ్వశ్రేష్ఠములతో కట్టబడిన బంగారు రథాలైనా, బలం, వేగం, అందం కలిగిన గుర్రాలైనా, శక్తిమంతములైన గజశ్రేష్ఠములైనా, అందగత్తెలైన స్త్రీలైనా, పెద్ద గ్రామాలైనా, కోరిన వాటికంటే ఎక్కువగా వారికి ఇస్తాను.

క. మఱి యొక్కటి సెప్పెద, ని। ద్దఱు కృష్ణులఁ జంపి వారి ధనములు నా కి
త్తఱిఁ దద్రథ మిదియే యని। యెఱిఁగించిన యతని కిత్తు నేను ముదమునన్.' 31

ప్రతిపదార్థం: మరి, ఒక్కటి, చెప్పెదన్= ఇంకొక సంగతి చెప్తున్నాను; నాకు+ఈ+తఱిన్= నాకు ఈ సమయంలో; తద్+ రథము+ఇదియే అని= ఆ(అర్జునుని) రథము ఇదేనని; ఎఱిఁగించిన అతనికిన్= తెలిపినవానికి; నేను, ఇద్దరు కృష్ణులన్= కృష్ణార్జునులను; చంపి; వారి ధనములు= వారి సంపద; ముదమునన్, ఇచ్చుదున్= సంతోషంతో ఇస్తాను.

తాత్పర్యం: అంతేకాదు- అర్జునుని రథాన్ని గుర్తించి నాకు తెలిపిన వారికి కృష్ణార్జునులను చంపి వారి ధనం అంతా సంతోషంతో ఇస్తాను.

విశేషం: భారతంలో కృష్ణుడు, అర్జునుడు, వ్యాసుడు, ద్రౌపది (కృష్ణ) నల్లనివారుగా చెప్పబడ్డారు. విరాటపర్వంలో అర్జున నామానికి తెల్లనివాడని అర్థం ఉన్నా మిగిలిన చోట్ల నీలోత్పలవర్ణుడుగానే పేర్కొనబడ్డాడు. పై పద్యంలో అర్జునుడిని తెలిపినవారికి, ప్రస్తుత పద్యంలో అతడి రథాన్ని చూపినవారికి కానుకలు చెప్పబడ్డాయి.

వ. అని పలికి శంఖం బొత్తిన దుర్యోధనుం డనుజ సహితంబుగాఁ బ్రమోదంబు నొందె; నప్పుడు నిస్సాణాది తూర్య నిస్వనంబులు దిక్కులం బిక్కటిల్లె; మన యోధవరులును వరూథినియు నుబ్బునఁ బేర్చి యార్చిన నినదంబులు నింగిముట్టె; నయ్యెడఁ బ్రహాసభాసుర ముఖుండై మద్రవిభుండు రాధేయున కి ట్లనియె. 32

ప్రతిపదార్థం: అని పలికి శంఖంబు ఒత్తినన్= అని కర్ణుడు శంఖం పూదగా; దుర్యోధనుండు, అనుజసహితంబుగాన్= సోదరులతో సహా; ప్రమోదంబును+ఒందెన్= ఆనందించాడు; అప్పుడు; నిస్సాణ+ఆది, తూర్య, నిస్వనంబులు= చర్మవాద్యం మున్నగు వాద్యాల ధ్వనులు; దిక్కులన్+పిక్కటిల్లెన్= అన్ని దిశలలో మారుమ్రోగాయి; మన యోధవరులును, వరూథినియును=

మనవీరశ్రేష్ఠులు, సైన్యం; ఉబ్బునన్, పేర్చి, ఆర్చినన్= గర్వంతో పెద్దగా అరువగా; నినదంబులు= ఆ ధ్వనులు; నింగిముట్టెన్= ఆకాశాన్ని అంటాయి; ఆ+ఎడన్= అప్పుడు; మద్రవిభుండు= శల్యుడు; ప్రహాస, భాసుర, ముఖుండు+ఐ= నగుమోము కలవాడు+ఐ; రాధేయునకున్, ఇట్లు, అనియెన్= కర్ణుడితో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: కర్ణుడు ఆ విధంగా పలికి శంఖం ఊదగా సోదర సహితుడైన దుర్యోధనుడు ఆనందించాడు, యుద్ధవాద్యాలు దిక్కులు బ్రద్దలయ్యేటట్లుగ మారుమ్రోగాయి, మన సైనికులు ఉత్సాహంతో బిగ్గరగా అరిచిన అరుపులు ఆకాశాన్ని అంటాయి. అప్పుడు శల్యుడు నవ్వుమొగంతో కర్ణుడితో ఇట్లా అంటున్నాడు:

ఉ. 'ఎవ్వరు సూప నేల?, నరు నిప్పుడ కాంచెదు; రిత్త వారికిం
గ్రొవ్వున నుజ్జ్వలార్థములు గొండని యీ వల; దిట్టు లిచ్చినన్
నవ్వు జనంబు, మిక్కిలి ధనంబులు గల్గినఁ జేయరాదె నీ
కెవ్విధి నైన సద్వ్యయము, లెందు నపాత్రపు టీవి యొప్పునే?' 33

ప్రతిపదార్థం: నరున్ ఎవ్వరు చూపన్ ఏల?= అర్జునుడిని ఎవ్వరో చూపటం ఎందుకు?; ఇప్పుడ కాంచెదు= ఇప్పుడే చూస్తావు; రిత్తవారికిన్= పనికిమాలినవారికి; క్రొవ్వునన్= గర్వంతో; ఉజ్జ్వల+అర్థములు= గొప్పసంపదలు; కొండు+అని= తీసికొనండని చెప్పి; ఈవలదు= ఇవ్వవద్దు; ఇట్టులు+ఇచ్చినన్= ఇట్లు ఇస్తే; జనంబు నవ్వు(న్)= చూసేవారు నవ్వుతారు; నీకున్= నీ దగ్గర; మిక్కిలి ధనంబులు కల్గినన్= ఎక్కువ సంపదలు ఉంటే; ఏ విధిన్+ఐనన్= ఏ విధంగానైనా; సత్+వ్యయముల్= సద్వినియోగము చేయరాదె!= చేయవచ్చుగదా!; ఎందున్= ఎక్కడైనా; అపాత్రపు+ఈవి= అపాత్రదానం; ఒప్పునే?= తగునా?

తాత్పర్యం: ఎవరో చూపటం ఎందుకు? అర్జునుణ్ణి ఇప్పుడే చూస్తావు. తీసుకోండని పనికిమాలిన వాళ్ళకు అధిక సంపదలు గర్వించి ఇవ్వవద్దు. ఇట్లా ఇస్తే జనం నవ్వుతారు. అంత ఎక్కువగా సంపదలు ఉంటే సద్వినియోగం చేయవచ్చుగదా: అయోగ్యులకు దానం ఇవ్వటం తగునా?

వ. అని యంత నిలువక. 34

తాత్పర్యం: అని అంతటితో ఆగకుండా (తరువాతి పద్యంతో అన్వయం).

క. కొలఁది యెఱుంగక కృష్ణులఁ । గలన గెలుతు ననియె దీవు, గంటిమె సింగం
బుల నెత్తఱి నైనను నే । పొలమున నేనియును నక్క పోరి గెలువఁగన్. 35

ప్రతిపదార్థం: కొలఁది ఎఱుంగక= నీ శక్తి తెలిసికొనకుండా; ఈవు= నీవు; కలనన్= యుద్ధంలో; కృష్ణులన్= కృష్ణార్జునులను; గెలుతున్+అనియెదు= గెలుస్తానంటున్నావు; ఏతఱిన్+ఐనను= ఎప్పుడైనా; ఏ పొలమునన్+ఏనియును= ఏ ప్రదేశంలోనైనా; ఎక్కడైనా; నక్క; పోరి= పోరాడి; సింగంబులన్= సింహాలను; గెలువఁగన్ కంటిమె?= గెలువటం చూచామా?

తాత్పర్యం: నీశక్తి ఏమిటో తెలుసుకోకుండా కృష్ణార్జునులను జయిస్తానని పలుకుతున్నావు. నక్క ఎప్పుడైనా, ఎక్కడైనా సింహాలతో పోరి గెలవటం చూచామా?

ఉ. అగ్గి సొరం దలంచునటు లర్జును నెక్కటి దాఁకఁ గోర్కి నీ
కెగ్గిది మాను; మీ పలుకు లెవ్వరుఁ జెప్పఁగ లేరు; రూపఱ
న్రగ్గఁగఁ గాలమయ్యె నొకొ! నా వచనంబు లొకింత కర్ణము
ల్దగ్గర నిచ్చి యోధులు బలంబులుఁ దోడుగఁ బోరు టొప్పగున్. 36

ప్రతిపదార్థం: అగ్గి= నిప్పులో; చొరన్+తలంచునటులు= దూకాలని అనుకొన్నట్లుగ; అర్జునున్= అర్జునుడిని; ఎక్కటితాఁకన్= ఒంటరిగా (ద్వంద్వయుద్ధంలో) ఎదిరించే; కోర్కి= కోరిక; నీకున్, ఎగ్గు= నీకు హానికరం; ఇది, మానుము= ఈ ఆలోచన వదలిపెట్టుము; ఈ పలుకులు= ఈ మాటలు; ఎవ్వరున్+చెప్పఁగలేరు= ఎవరుకూడా చెప్పలేరు; రూపఱన్+ప్రగ్గగన్= రూపు చెడి నశించునట్లు; కాలము+అయ్యెన్+ఒకొ!= సమయం దాపురించిందా; నా వచనంబులు+ఒక+ఇంత= నా మాటలు కొద్దిగా; కర్ణముల్+దగ్గరన్+ఇచ్చి= చెవులను సమీపింపజేసి; యోధులు, బలంబులున్, తోడుగన్= వీరులు సైనికులు తోడురాగా; పోరుట ఒప్పు+అగున్= పోరాడటం తగును.

తాత్పర్యం: అర్జునుడితో ఒంటరిగా పోరాడాలనే కోరిక అగ్నిలో దూకాలనుకోవటం వంటిది. నీకు హానికరం. అది మానుకో. ఈ మాటలు ఎవరుకూడ చెప్పలేరు. రూపు చెడి నశించే కాలం నీకు సమీపించిందా ఏమి? నా మాటలు కొంచెం విని, వీరులు, సైనికులు తోడురాగా పోరాడటం తగును.

ఆ. ఏను ధార్తరాష్ట్ర హిత మాచరించుట । కై పెనంగి చెవుల కప్రియంబు
లైన నిన్ని మాటలాడితి; నా బుద్ధి । విని దురాగ్రహంబు విడువవలయు.' 37

ప్రతిపదార్థం: ఏను= నేను; ధార్తరాష్ట్ర హితము= కౌరవులకు మేలు; ఆచరించుటకై, పెనంగి= పోరాడి - అనగా పట్టుపట్టి; చెవులకున్+అప్రియంబులు+ఐనన్= నీవు వినటానికి అనిష్టములైనా; ఇన్నిమాటలు+ఆడితిన్= ఇన్నిమాటలు పలికాను; నా బుద్ధి విని= (నీ మేలు కొరకు, చెప్పిన) నా మాటలు విని; దురాగ్రహంబు విడువవలయున్= నాపై ఆగ్రహం చెందకుము.

తాత్పర్యం: కౌరవుల హితాన్ని దృష్టిలో పెట్టుకొని నీకు అప్రియమైనా ఇన్ని మాటలు ఆడవలసి వచ్చింది. నాపై కినుక వహించక నా హితవును వినుము.'

విశేషం: శల్యుడి వాక్కులు పై పై మాటలే కాని మనసులోని మాటలు కావు. పాండవుల కిచ్చిన మాట ప్రకారం కర్ణుడిని నిరుత్సాహపరచటమే అతడి ఉద్దేశం.

చ. అనవుడు నల్గి సూతసుతుఁ డాతని కిట్లను 'మద్బలంబు న
మ్మిన నను నిత్తెఱంగునకు మేకొన కుండఁగ మాన్ప వజ్రహ
స్తునకు వశంబుగా ద నినఁ జొప్పడునే నిను బోఁటి కాప్తిఁజె
ప్పిన క్రియఁ జెప్పి నీవు వెఱపించిన నే వెఱ పెక్కు వాఁడనే?' 38

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; సూతసుతుఁడు= కర్ణుడు; అల్గి= కోపించి; ఆతనికిన్+ఇట్లు+అను(న్)= శల్యుడితో ఇట్లా అన్నాడు; మత్+బలంబు, నమ్మిన, ననున్= నా బలాన్ని నమ్ముకొన్న నన్ను; ఈ తెఱంగునకున్= ఈ పద్ధతికి (అర్జునుడితో ఎక్కటి పోరుకు); మే కొనకుండఁగన్= పూనుకొనకుండా; మాన్పఁగన్= మాన్పించటానికి; వజ్రహస్తునకున్=

వజ్రాయుధము చేత ధరించిన ఇంద్రుడికి సైతం వశంబు కాదు; అనినన్= సాధ్యం కాదు అంటే; నినుబోఁటికిన్= నీవంటివాడికి; చొప్పడునే?= వీలవునా?; ఆప్తిన్+చెప్పిన, క్రియన్, చెప్పి= హితం చెప్పినట్లుగా పలికి; నీవు, వెరపించినన్= నీవు భయపెట్టగా; నే వెఱపు+ ఎక్కువాఁడనే?= నేను భయపడతానా?

తాత్పర్యం: శల్యుడి మాటలకు కోపించిన కర్ణుడు అతడితో ఇట్లా అన్నాడు. నా బలాన్ని నమ్ముకొన్న నన్ను, అర్జునుడితో ఒంటరిపోరుకు పూనుకోకుండా ఆపటానికి ఆ దేవేంద్రుడికే సాధ్యం కాదంటే - నీ వంటివాడికి సాధ్యమౌతుందా? హితం చెప్పినట్లేచెప్పి నన్ను భయపెట్టితే నేను భయపడేవాడినా?

వ. అనుటయు నతని నగ్గలంబు కోపింపం జేయుటకై శల్యుండు మఱియు ని ట్లనియె. 39

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; అతనిన్= కర్ణుడిని; అగ్గలంబు, కోపింపన్, చేయుటకు+ఐ= ఇంకా అధికమైన ఆగ్రహం చెందేటట్లు చేయటానికి; శల్యుండు; మఱియున్+ఇట్లు+అనియెన్= మళ్ళీ ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: కర్ణుడికి ఇంకా ఎక్కువ కోపం తెప్పించటానికి శల్యుడు మళ్ళీ అతడితో ఇట్లా అన్నాడు:

తే. 'ఇప్పుడే నీకు బుద్ధులు సెప్ప నేల? । నరుఁడు గాండీవ గుణ నిక్వణంబు సెలఁగఁ
గదిసి నీ మెయి బలుతూపుగములు నిగుడఁ । జేసి నిను బుద్ధిమంతుని జేయుఁగాక!' 40

ప్రతిపదార్థం: ఇప్పుడు+ఏ; నీకు, బుద్ధులు+చెప్పన్+ఏల?= ఇప్పుడే నేను నీకు బుద్ధులు చెప్పటం ఎందుకు?; నరుఁడు= అర్జునుడు; గాండీవగుణ నిక్వణంబు= (తన ధనుస్సు అయిన) గాండీవం యొక్క వింటినారి ధ్వని; సెలఁగన్= మ్రోగగా; కదిసి= నిన్నుతాకి; నీ మెయి(న్)= నీ మేనిపై; బలు, తూపు, గములు= బలమైన బాణాల సమూహాలు; నిగుడన్+చేసి= నాటేటట్లుగా చేసి; నినున్= నిన్ను; బుద్ధిమంతునిన్= బుద్ధిమంతుడిగా; చేయు(న్)+కాక= చేయుగాక.

తాత్పర్యం: నేనిప్పుడు నీకు బుద్ధులు చెప్పటం ఎందుకు? అర్జునుడు తన గాండీవం అనే వింటియొక్క నారి మ్రోగించి, నీ శరీరంమీద బలమైన బాణసమూహాలు నాటి నిన్ను బుద్ధిమంతుడిగా చేస్తాడులే.

వ. అని యంతం దనివోక యతండు. 41

ప్రతిపదార్థం: అని= అని పలికి; అంతన్+తని+పోక= అంతటితో - అంటే ఆ మాటలతో తృప్తి చెందక; అతండు= శల్యుడు.

తాత్పర్యం: శల్యుడు పై మాటలతో తృప్తిపడక.

సీ. 'రోష మహాటోప భీషణ హరితోడ । సమరంబునకు హరిణము గడంగి,
దాన ధారాభీల దంతావళము తోడ । సంగ్రామమునకు శశంబు గడఁగి,
చండ స్వభావోగ్ర పుండరీకము తోడ । నాజికి సారమేయంబు గడఁగి,
దారుణ తుండాతి ఘోర గృధ్రము తోడఁ । గలహంబునకు నురగంబు గడఁగి,

ఆ. యడరునట్లు గాదె యస్త్రకళా సము । జ్జ్వలుఁడు పార్థుతోడ సంగరమున
కీవు గడఁగి యడరు టెల్ల రాధేయ! నీ । కెట్టి బలము నమ్మ నెందుఁ గలదు?' 42

ప్రతిపదార్థం: రాధేయ!= ఓ కర్ణా!; అస్త్ర కళా సముజ్జ్వలుఁడు= వివిధ అస్త్రాలతో ప్రకాశించేవాడైన; పార్థుతోడన్= అర్జునుడితో; ఈవు= నీవు; సంగరమునకున్= యుద్ధానికి; కడఁగి, అడరుట+ఎల్లన్= సిద్ధపడటమంతా; రోష, మహా+ఆటోప, భీషణ, హరితోడ(న్)= కోపంయొక్క విజృంభణంతో భయం గొలిపే సింహంతో; హరిణము= జింక; సమరంబునకున్+కడంగి= యుద్ధానికి పూనుకొని; దాన, ధారా+ఆభీల, దంతావళముతోడ(న్)= మదజలంతో అతిశయించే ఏనుగుతో; శశంబు= కుందేలు; సంగ్రామమునకున్+కడఁగి= యుద్ధానికి పూనుకొని; చండస్వభావ+ఉగ్ర పుండరీకముతోడన్= తీవ్రకోపంతో భయంకరమైన బెబ్బులితో; సారమేయంబు= కుక్క; ఆజికిన్ కడఁగి= రణమునకు పూనుకొని; దారుణ, తుండ+అతిఘోర, గృధ్రముతోడన్= వాడిఅయిన ముక్కుతో భయం గొలిపే గద్దతో; ఉరగంబు= పాము; కలహంబునకున్+కడఁగి= పోరుకు పూనుకొని; అడరునట్లు కాదె!= సిద్ధపడటం వంటిది కదా!; నీకున్+ఎట్టి బలము= నీకు ఎటువంటి బలం; నమ్మన్+ఎందున్+కలదు?= నమ్ముకొనుటకు ఎక్కడ ఉన్నది?

తాత్పర్యం: 'కర్ణా! వివిధాస్త్ర సంపన్నుడైన అర్జునుడితో నీవు యుద్ధానికి సిద్ధం కావటం భయంకరమైన సింహంతో హరిణం, మదించిన ఏనుగుతో కుందేలు, క్రోధావేశం నిండిన పులితో కుక్క, తీక్ష్ణమైన ముక్కు కలిగి భయం గొల్పే గద్దతో పాము సంగ్రామానికి సిద్ధపడటం వలె ఉన్నది. ఏ విధంగా చూచినా అర్జునుడితో పోరు సల్పగల బలం నీ కెక్కడిది?

విశేషం: కర్ణుడిలో పిరికిమందు పోయటానికి వరుసగా పై నాలుగు ఉపమానాలు (పోలికలు) పేర్కొంటేగాని శల్యుడికి తనివి తీరలేదు. పర్యాయపదాలతో, క్రమమైన తూగుతో నడచిన ఈ సీసపద్యం తిక్కన రచనాశైలికి ఒక మచ్చుతునక. అలంకారం నిదర్శన.

వ. అనియె, ని వ్విధంబున నధిక్షేపింపంబడి కర్ణుండు గోపించి కెంపారు కన్నుల నాశల్యు నాలోకించి. 43

ప్రతిపదార్థం: అనియెన్= (శల్యుడు) అన్నాడు; ఈ+విధంబునన్= ఈ విధంగా; కర్ణుండు; అధిక్షేపింపన్+పడి= నిందించబడి; కోపించి, కెంపు+ఆరుకన్నులన్= ఎర్రబడిన కనులతో; ఆ శల్యున్+ఆలోకించి= శల్యుడిని చూచి.

తాత్పర్యం: నిందాపూర్వకమైన శల్యుడి మాటలకు కోపించి కర్ణుడు ఎర్రనైన కన్నులతో అతడిని చూచి (ఇట్లా అన్నాడు).

క. 'గుణవంతుల గుణములు ని । ర్గుణుఁ డెఱుఁగమి దెల్ల; మీవు గుణహీనుఁడ వీ
గుణ మితనియందుఁ గల దని । గణుతింపఁగ నైపుణంబు గలదే నీకున్? 44

ప్రతిపదార్థం: గుణవంతుల, గుణములు; నిర్గుణుఁడు+ఎఱుఁగమి= గుణహీనుడు తెలుసుకోలేక పోవటం; తెల్లము= స్పష్టం; ఈవు= నీవు; గుణహీనుఁడవు; ఈ, గుణము+ఇతని, అందున్+కలదని= ఈ గుణము ఇతనిలో ఉన్నదని; గణుతింపఁగ= గుర్తించుటకు; నైపుణంబు= నేర్పు; నీకున్ కలదే?= నీకు ఉందా?

తాత్పర్యం: గుణవంతుల గుణాలు, గుణవంతుడే గ్రహించగలడు గాని, గుణహీనుడు గ్రహించలేడు. గుణ హీనుడవైన నీకు ఈ వ్యక్తిలో ఈ గుణం కలదని గుర్తించగల నేర్పు ఉన్నదా?

సీ. **అర్జును నస్త్రవిద్యా ప్రమాణంబు నా। యెఱిఁగిన యంత నీ వెఱుఁగ వతని**
కొలఁదియు వనమాలి కొలఁదియు గాంచి నా। కొలఁదియు నెఱిఁగి వారల మదీయ
దివ్యాస్త్ర బలమునఁ దెగటార్ప నగునని। యే నిశ్చయించితి; నెట్టు లనినఁ
గడుఁ బెద్దకాలంబు గంధ పుష్పాదులు। నర్చించుచున్నాఁడ ననుదినంబు

ఆ. **దొనఁ గరంబు భక్తి నునిచిన దున్న ది। యహిమయంబు దారుణాస్త్ర; మింత**
యంత యనక యెదిరి నాహుతి గొను దాన। జిష్ణు నోర్తు నొండెఁ గృష్ణు నోర్తు. 45

ప్రతిపదార్థం: అర్జును+అస్త్రవిద్యా ప్రమాణంబు= అర్జునుడి అస్త్రవిద్యాపరిమితి; నా, ఎఱిఁగిన, అంత= నాకు తెలిసినంతగా; నీవు ఎఱుఁగవు= నీకు తెలియదు; అతని కొలఁదియున్= ఆ అర్జునుడి బల పరిమాణం; వనమాలి కొలఁదియున్= శ్రీకృష్ణుడి బల పరిమాణం; కాంచి= తెలిసి; నా కొలఁదియును+ఎఱిఁగి= నా బల పరిమాణమును తెలిసి; వారలన్= కృష్ణార్జునులను; మదీయ, దివ్య, అస్త్ర, బలమునన్= నా దివ్యాస్త్రాల బలంతో; తెగటార్పన్+అగును+అని= సంహరింపగలనని; ఏ(న్)= నేను; నిశ్చయించితిన్= నిర్ణయించాను; ఎట్టులు+అనినన్= అది ఎట్లా సాధ్యమంటే; అహిమయంబు= సర్పమయమైన; దారుణ+అస్త్రము= భయంకరమైన అస్త్రం; దొనన్= పొదిలో; కరంబుభక్తిన్= కడు భక్తితో; ఉనిచినన్+ఉన్నది= ఉంచగా ఉంది; కడున్+పెద్దకాలంబు= చాలాకాలం నుండి; అనుదినంబు= ప్రతిరోజు; గంధపుష్ప+ఆదులన్= గంధం; పూలు మొ॥వాటితో; అర్చించుచున్, ఉన్నాఁడను= పూజిస్తున్నాను; ఇంత అంత అనక= ఇంతవాడు అంతవాడు అనక ఎంతటివాడినైనా; ఎదిరిన్= ఎదుటివాడిని; ఆహుతికొనుదాన(న్)= బలిగొనునట్టి దానిచేత; జిష్ణున్+ఓర్తున్= విజయుడిని ఓడిస్తాను; ఒండెన్+కృష్ణున్+ఓర్తు(న్)= అట్లుకాని పక్షంలో కృష్ణుడినైనా ఓడిస్తాను.

తాత్పర్యం: అర్జునుడి అస్త్రవిద్యాబల పరిమాణం గురించి నాకు తెలిసినంతగా నీకు తెలియునా? కృష్ణార్జునుల బలం, నా శక్తీ తెలిసినవాడిని కాబట్టే వాళ్ళను సంహరించగలననే నమ్మకంతో ఉన్నాను. నా దగ్గర ఉన్న సర్పాస్త్రాన్ని నిత్యం భక్తితో గంధపుష్పాలతో పూజిస్తున్నాను. ఎంత బలవంతుడినైనా రూపుమాపగలిగిన ఆ దారుణాస్త్రంతో విజయుడినైనా సరే, లేకుంటే కృష్ణుడినైనా సరే ఓడించగలను.

విశేషం: ఖాండవదహన సమయంలో అర్జునుడివలన తన తల్లి మరణించగా, అతడిపై పగబట్టిన అశ్వసేనుడనే నాగకుమారుడు శరం ఆకారాన్ని ధరించి కర్ణుడివద్ద ఉంటున్నాడు. కర్ణుడు దాన్ని బంగారుబరిలో ఉంచి నిత్యం అర్చన చేస్తున్నాడు.

వ. **భార్గవాస్త్రంబున నొక్కనిం బొరిపుత్తు నట్లుఁ గాక యాదవ పాండవ నివహంబులోనం గృష్ణార్జునులయందు లక్ష్మీ విజయంబులు సుప్రతిష్ఠితంబులై యుండు; నయ్యిరువురం బొదివి పెనంగం గనుటకంటె మేలునుం గలదే? వారల గరుడ కపి ధ్వజంబులుఁ జక్ర గాండీవంబులు బెండు మానుసులకు భీషణంబులు గాని నాకుఁ బరితోషణంబులు వేవురు గోవిందులుఁ బదివేవురు పార్థులుఁ బన్నినం బొరెద; నీవు మహాయుద్ధ కోవిదుండవు గామింజేసి వెఱచఱచి కాఱు లఱచెద; వక్కడి పక్షపాతంబునఁ బ్రేలెదవో యెఱుంగ నింకనిట్టి మాటలాడితేని ప్రాణంబుల కొఱ యొల్ల వని పలికి వెండియు.'** 46

ప్రతిపదార్థం: భార్గవ+అస్త్రంబునన్= భార్గవాస్త్రంతో; ఒక్కనిన్+పొరిపుత్తున్= ఒకరిని చంపుతాను; అట్లున్+కాక= అంతేకాక; యాదవ, పాండవ, నివహంబులోనన్= యాదవుల పాండవుల సమూహంలో; కృష్ణ+అర్జునులఅందున్= కృష్ణార్జునులలో; లక్ష్మీ

విజయంబులు= ఐశ్వర్యం, జయం; సుప్రతిష్ఠితంబులు+ఐ= చక్కగా నెలకొల్పబడినవై; ఉండున్= ఉంటాయి; ఆ ఇరువురన్= వారిద్దరిని; పొదిలి, పెనంగన్+కనుటకంటెన్= తాకి పోరటం కంటె; మేలునున్+కలదే?= మేలైన పని ఉన్నదా; వారల, గరుడ, కపిధ్వజంబులున్= శ్రీకృష్ణుడి గరుడధ్వజం, అర్జునుడి కపిధ్వజం; చక్రగాండీవంబులు= ఆయుధాలైన సుదర్శనచక్రం గాండీవం; బెండుమానుసులకున్= బలహీనులకు; భీషణంబులు కాని= భయం గొల్పేవికాని; నాకున్, పరితోషణంబులు= నాకు సంతోషకరములు; వేవురు, గోవిందులున్= వేయిమంది కృష్ణులు; పదివేవురు, పార్థులున్= పదివేలమంది అర్జునులు; పన్నినన్= ఎదురైనా సరే; పోరెద(న్)= పోరాడగలను; నీవు; మహాయుద్ధ, కోవిదుడవు, కామిన్+చేసి= గొప్ప రణకౌశలం లేనివాడవు కాబట్టి; వెరచరచి= భయపడి; కాఱులు+అఱచెదవు= కారుకూతలు పలుకుతున్నావు; అక్కడి పక్షపాతంబునన్= ఆ పాండవులపై పక్షపాతంతో; ప్రేలెదవో, ఎఱుంగన్= ఈ కారులు ప్రేలుతున్నావేమో తెలియకున్నాను; ఇంకన్, ఇట్టిమాటలు, ఆడితి(వి)+ఏని= ఇకముందు ఇట్లా మాట్లాడితే; ప్రాణంబుల కొఱ ఒల్లవు= నీ ప్రాణాలు దక్కవు; అని పలికి వెండియున్= అని ఇంకా (కర్ణుడు అనబోతున్నాడు)

తాత్పర్యం: భార్గవాస్త్రంతో మరొకరిని సంహరించగలను. అంతేగాక ఐశ్వర్య, విజయాలకు నెలవులైన కృష్ణార్జునులతో పోరు సల్పటం కంటె అదృష్టం ఏముంది! వారి ధ్వజాలను, ఆయుధాలను చూచి బెదరిపోయేవాడిని కాను నేను. వేయిమంది కృష్ణులు, పదివేలమంది పార్థులు ఎదురువచ్చినా పోరాడగల సామర్థ్యం నాకు ఉన్నది. రణవిద్యా కౌశలం ఎరుగని వాడవు కాబట్టి భయంతో నీవు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నావు. పాండవ పక్షపాతంతో ఇట్లా పలుకుతున్నావేమో తెలియదు. నీ మాటలు ఇట్లాగే కొనసాగితే నీ ప్రాణాలు నీకు దక్కవు సుమా!

కర్ణుఁడు శల్యునిపైఁ గోపించి యతని దురాచారంబు లుగ్గడించుట (సం. 8-27-68)

సీ. **'విను పాపదేశ సంజనితుండ వగు నీకు । దుర్బుద్ధి గాక సద్బుద్ధి కలదె?**
క్షత్రియాధమ! నీచ! కలదు లోకంబున । నా బాల గోపాలమైన వాక్య
మతి కుటిలుండు సంగతుఁడు గాఁ డేమిటఁ । జెలికిఁ గీడొనరించుఁ జెట్ట వలుకు
దుష్టాత్మకుఁడు గడుఁ గష్టుఁడు మద్రకుం । డనునంత వట్టుఁ బ్రత్యక్షమయ్యెఁ;

ఆ. **వావి లేక యెల్ల వనితలుఁ బురుషులుఁ । గలయమీకు నెగ్గుగాక యుండు**
మున్నుగల్లు పిదపఁ జన్నుబాలై పెరుఁ । గుదురు సెప్ప నేల గుణము లింక? **47**

ప్రతిపదార్థం: క్షత్రియ+అధమ!= క్షత్రియులలో అధముడా!; నీచ!= నీచుడా; విను; పాప, దేశ, సంజనితుండవు+అగు, నీకున్= పాపం నిండిన దేశంలో పుట్టిన నీకు; దుర్బుద్ధికాక, సద్బుద్ధికలదె?= చెడుబుద్ధి కాక మంచిబుద్ధి ఉంటుందా; లోకంబునను= లోకంలో, ఆ బాలగోపాలమైన వాక్యము= చిన్న పెద్ద అందరూ పలికే మాట; కలదు= ఉంది; మద్రకుండు= మద్రదేశీయుడు; దుష్ట+ఆత్మకుఁడు= దుష్టబుద్ధి; కడున్+కష్టుఁడు= మిక్కిలి నీచుడు; అతి, కుటిలుఁడు= ఎంతో కపటం కలవాడు; ఏమిటన్, సంగతుఁడు కాడు= ఎందులోను చేరదగినవాడు కాదు; చెలికిన్= మిత్రుడికి; కీడు+ఒనరించున్= హాని చేస్తాడు; చెట్ట, పలుకున్= చెడుమాటలు మాట్లాడుతాడు; అనునంతవట్టున్= అనుకొనే మాటలన్నీ; ప్రత్యక్షము+అయ్యెన్= నిజమైనాయి; వావి, లేక= వరుసలేక; ఎల్లవనితలున్+పురుషులున్= స్త్రీ పురుషులందరు; కలయన్= కలియగా; మీకున్+ఎగ్గుకాక ఉండున్= మీకు దోషం కాదు; మున్ను, కల్లు, పిదపన్, చన్నుపాలు+ఐ= ముందు కల్లును ఆ తరువాత చనుబాలను త్రాగి; పెరుఁగుదురు= పెరుగుతారు; గుణములు+ఇంక చెప్పన్+ఏల?= మీ గుణాలు ఇంక ఏమని చెప్పాలి?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శల్యా! నీవు 'క్షత్రియాధముడవు, నీచుడవు, పాపదేశంలో జన్మించినవాడవు అయిన నీకు దుర్బుద్ధేకాని సద్బుద్ధి ఎక్కడిది? మద్రదేశంవారు చాలా దుష్టులు, దుర్మార్గవర్తనులు, మిత్రులకు కూడా కీడు తలపెట్టేవారు, ఎప్పుడూ చేరదీయతగనివారు అని అందరూ అనుకొనే మాటలు ఇప్పుడు నీలో ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి. మీ జాతిలో ఆడ మగ వావి వరుసలు లేక సంచరిస్తారు. మీకది తప్పు కాదు. చనుబాలకు ముందే మద్యాన్ని సేవిస్తారు మీరు. మీ గుణగణాలు ఇంకా ఏమని చెప్పాలి?

విశేషం: మద్రదేశంలోని దురాచారాల గురించి (మద్యపానం, వ్యభిచారం మొ॥) మూలభారతంలో విపులంగా ప్రస్తావించబడింది. 'మున్ను కల్లు పిదప చన్నుబాలు' చక్కని జాతీయం.

క. పలువురకుఁ బుట్టి నిచ్చలుఁ । గలు ద్రావుచుఁ బెరిఁగి యెట్లు గఱతురు శీలం
బులు నుచితము లగు భాషణ । ములు, నీ విమ్మాట లుడిగి పొదపొద మనికిన్. 48

ప్రతిపదార్థం: పలువురకున్ పుట్టి= ఎందరికో జన్మించి; నిచ్చలున్= నిత్యమూ; కలు త్రావుచున్= మద్యం సేవిస్తూ; పెరిఁగి= పెరుగుతూ; శీలంబులును= సత్ప్రవర్తనలు; ఉచితములు+అగు భాషణములు= మంచిమాటలు; ఎట్లు కఱతురు?= ఎట్లా నేర్వగలరు?; నీవు+ఈ+మాటలు+ఉడిగి= నీవు ఈ మాటలు కట్టిపెట్టి; అనికిన్= యుద్ధానికి; పొదపొదము= పదపద.

తాత్పర్యం: ఎందరికో జన్మించి మద్యపానంతో పెరిగేవారికి మంచి నడవడి, మంచిమాటలు ఎట్లా అబ్బుతాయి? ఈ నీ మాటలు కట్టిపెట్టి రథాన్ని ముందుకు నడుపుము.

చ. మఱియొకఁ డేను జెప్పెద, నమానుష విక్రమలీల నల్గడం
బఱపియుఁ జంపియున్ రిపునృపాలక సైన్యము రూ పడంచి మై
దొఱఁగుట యొప్పదే? తనువు దూఁటులుగాఁ బెఱవారి గెల్పుకో
లుఱ దొకొ! నాదు పెం పుడుప నోపుదురే నిను బోఁటు లెమ్మెయిన్? 49

ప్రతిపదార్థం: మఱి, ఒకఁడు+ఏను, చెప్పెదన్= మరొక్కమాట నేను చెప్తాను(విను); అమానుష, విక్రమలీల= మానవాతీత పరాక్రమంతో; రిపు, నృపాలక, సైన్యము= శత్రురాజు సైన్యాన్ని; నలు+కడన్+పఱపియున్= నాలుగు వైపులా పారద్రోలి; చంపియున్= సంహరించి; రూపు+అడంచి= రూపుమాపి; తనువు, తూఁటులు కాన్= శరీరం చిల్లులుపడగా; మై, తొఱఁగుట= దేహాన్నివదలుట-అంటే మరణించుట; ఒప్పదే?= ఒప్పుకాదా!; పెఱవారి గెల్పుకోలు= శత్రుపక్షం విజయం; ఉఱదొకొ!= ఉచితమా!; నినుబోఁటులు= నీవంటి వారు; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; నాదు పెంపు+ఉడుపన్+ఓపుదురే?= నా విజృంభణాన్ని ఆపగలుగుతారా?

తాత్పర్యం: ఇంకొక మాట చెపుతా వినుము. గొప్ప పరాక్రమంతో శత్రుసైన్యాన్ని నాశనం చేసి వీరమరణం పొందటం మేలుకదా! నీవు శత్రుపక్షం గెలుపును కోరటం న్యాయమా? నీ బోటివారు ఏ విధంగానూ నా యుద్ధోత్సాహాన్ని ఆపలేరు.

వ. కినియించి గదం దలవగుల వ్రేటువడక యూరక తేరువోని మ్మనవుడు మద్రపతి యతని నవలోకించి. 50

ప్రతిపదార్థం: కినియించి= నన్ను కోపింపజేసి; గదన్+తలపగుల= గదచే తలబ్రద్దలయ్యేటట్లు; వ్రేటుపడక= దెబ్బతినక; ఊరక, తేరుపోనిమ్ము= అడ్డుచెప్పక రథంనడపు; అనవుడున్= అని అనగా; మద్రపతి= శల్యుడు; అతనిన్ అవలోకించి= కర్ణుడిని చూచి.

తాత్పర్యం: నాకు కోపం తెప్పించి నా గదతో నీ తల బద్దలు కాకముందే మారుమాటాడక రథాన్ని ముందుకు తోలుము' అని కర్ణుడనగా శల్యుడు అతడిని చూచి.

ఆ. 'హితము సెప్పఁదగనె యే నీకు? నదియును । గాక నీ రథంబు గడపుచుండి
కౌరవాధినాథ కార్యార్థి నగు నాకు । నున్నరూపు సెప్పకుండ నగునె? 51

ప్రతిపదార్థం: ఏన్+నీకున్= నేను నీకు; హితము= మేలు; చెప్పన్+తగనె?= చెప్పటానికి తగనా?; అదియును కాక= అంతేకాక; నీ, రథంబు, కడపుచు+ఉండి= నీ రథాన్ని తోలుతూ ఉండి; కౌరవ+అధినాథ= కురురాజైన దుర్యోధనుడి; కార్య+ఆర్థిన్+అగు, నాకున్= కార్యము చేయగోరిన నాకు; ఉన్నరూపు= వాస్తవం; చెప్పకుండన్+అగునె?= చెప్పకుండటం తగునా?

తాత్పర్యం: దుర్యోధనుడికి సహాయం చేయగోరి నీకు సారథిగా ఉన్న నేను నీకు హితం చెప్ప తగునా? యథార్థం చెప్పకపోవటం న్యాయమా?

ఉ. సారథి దక్షుఁడై రథికసారము రథ్యబలంబు నాయుధో
దారత మానమున్ రణవిధంబు నిమిత్త శుభాశుభత్వ ని
ర్ధారణమున్ మదిం గని హితం బెఱిఁగించుట నీతి; గాన నీ
వీరసమెత్త నోఁబలికితేనియుఁజెప్పుదు సూతనందనా! 52

ప్రతిపదార్థం: సూతనందనా!= కర్ణా!; సారథి= రథసారథి అయినవాడు; దక్షుఁడు+ఐ= సమర్థుడై; రథికసారము= రథికుడి శక్తి; రథ్య, బలంబు= గుర్రాల బలం; ఆయుధ+ఉదారత= ఆయుధాల మేలిమి; మానమున్= పౌరుషమును; రణవిధంబు= యుద్ధంతీరు; నిమిత్తశుభ+అశుభత్వ, నిర్ధారణమున్= శకునాల శుభాశుభాల నిర్ణయాన్ని; మదిన్+కని= ఎరిగి; హితంబు+ ఎఱిఁగించుట= హితవు చెప్పటం; నీతి, కానన్= ధర్మం కాబట్టి; ~~ఈవు+ఈరసము~~+ఎత్తన్= కోపగించి; నోన్+పలికితేనియున్= నొచ్చుకొనేటట్టు నీవు పలికినప్పటికీ; చెప్పుదున్= చెప్పుతాను.

తాత్పర్యం: సూతనందనా! కర్ణా! రథసారథి అయిన వాడికి రథికుడి బలం, పౌరుషం, ఆయుధాల మేలిమి, యుద్ధవిధానం, అశ్వాల శక్తి, శకునాల ఫలం మొదలైన విషయాలు బాగా తెలిసి ఉండాలి. ఆ తెలివితోనే నీకు హితం చెప్పుతున్నాను అట్లా చెప్పటం నీతి. కాబట్టి నీకు కోపం వచ్చి నన్ను నొవ్వ పలికినా నేను చెపుతాను.

విశేషం: సారథి లక్షణాలు ఇందులో పేర్కొనబడ్డాయి. సూతనందనా! అనేది కర్ణుడిని కించపరిచే సంబోధన.

వ. ఏ నేమి తప్పు సేసిన గదం దలవగుల వ్రేసెదవు? నీ విట్లుంటివి గదా యని హితోపదేశంబు సేయ మాన నేర్తునే? యిది యొక దృష్టాంతంబు వివరించెద వినుము; విని నీవు నా చెప్పినట్ల చేసితేనియు మేలు, సేయకుండినం గడు మే లని యి ట్లనియె. 53

ప్రతిపదార్థం: ఏను+ఏమి, తప్పు, చేసిన= నేను ఏం తప్పు చేశానని; గదన్+తలపగుల, వ్రేసెదవు= గదతో నా తల బ్రద్దలు చేస్తావు; నీవు+ఇట్లు+అంటివికదా, అని= నీవు ఇట్లా అన్నావని; హిత+ఉపదేశంబు= హితబోధ; చేయన్= చేయటం; మాననేర్తునే?= మానుతానా?; ఇది ఒక దృష్టాంతంబు= ఒక నిదర్శనం; వివరించెదన్+వినుము= వివరిస్తాను వినుము; విని, నీవు, నా చెప్పిన+ అట్ల చేసితి+ఏనియున్= నేను చెప్పినట్లుగా చేస్తే(చాలు); మేలు=శుభం; చేయకుండినన్= చేయకపోయినా; కడుమేలు= ఎంతోమంచిది; అని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: నేను ఏం తప్పు చేశానని గదతో నా తల బద్దలు చేస్తానంటున్నావు? నీవు ఇట్లా అంటున్నా వని నీకు హితబోధ చేయటం మానుకొంటానా! ఒక వృత్తాంతం చెబుతాను వినుము. విని నేను చెప్పినట్లు చేస్తే మేలు. చేయకుంటే అంతకంటె మేలు' అని శల్యుడు కర్ణుడికి చెప్పసాగాడు.

సీ. **'అంబుధిలో నొక్క యలఘుతర ద్వీప । మున ధర్మవర్తినాఁ జను నరేంద్రు**
పురమున నొక వైశ్యవరుఁ డధ్వరాది స । త్కర్మరుఁడును శాంతిదాంతియుతుఁడుఁ
గరుణాపరుఁడు దాననిరతుండు ధన ధాన్య । శోభియు బహుపుత్ర లాభ విలసి
తుండు నై వర్తించుచుండఁగ నిలు సేరె । నొక కాకి; యతని పుత్రకులు దాని

తే. **కెంగిళులు పెట్టి కొనియాడ నెలమిఁ బెరిఁగి । క్రొవ్వి కడుమీఱి యెట్టి పక్షులును దన్నుఁ**
బోల వనియెడు దుర్మానమునఁ దృణీక । రించి యది పెక్కు భంగులఁ గ్రీడ సలుపు. **54**

ప్రతిపదార్థం: అంబుధిలోన్= సముద్రంలోని; ఒక్క, అలఘుతర, ద్వీపమునన్= ఒక విశాల ద్వీపంలో; ధర్మవర్తినాన్+చను= ధర్మమూర్తివలె ఒప్పుతున్న; నర+ఇంద్రుపురమునన్= రాజనగరంలో; ఒక, వైశ్యవరుఁడు= ఒక వైశ్యశ్రేష్ఠుడు; అధ్వర+ఆది సత్+కర్మరుఁడును= యజ్ఞాలు మున్నగు సత్కర్మలు చేసేవాడును; శాంతి, దాంతియుతుండున్= శాంతుడు, ఇంద్రియనిగ్రహం కలవాడును; కరుణాపరుఁడు= దయాబుద్ధియు; దాననిరతుండు= దానాలు చేసేవాడును; ధనధాన్యశోభియున్= భాగ్యవంతుండును; బహుపుత్రులాభ విలసితుండును+ఐ= పెక్కుమంది పుత్రులుండటం అనే లాభంచేత ఒప్పుతున్నవాడును అయి; వర్తించుచుండఁగన్= నివసిస్తూ ఉండగా; ఒక కాకి; ఇలు, చేరెన్= (అతడి) ఇంటికి వచ్చింది; అతని, పుత్రకులు= ఆ వైశ్యుడి కుమారులు; దానికిన్= ఆ కాకికి; ఎంగిళులు, పెట్టి= ఎంగిళ్ళుపెట్టి; కొనియాడన్= పొగడగా; అది= ఆ కాకి; ఎలమిన్+ పెరిఁగి= సంతోషంతో పెరుగుతూ; క్రొవ్వి= గర్వించి; కడున్+మీఱి= మిక్కిలి అతిశయించి; ఎట్టి, పక్షులును= ఎటువంటి పక్షులుకూడా; తన్నున్+పోలవు+అనియెడు= తనకు సాటిరావనే; దుః+మానమునన్= దురహంకారంతో; తృణీకరించి= లక్ష్యపెట్టక; పెక్కుభంగులన్= పలువిధాలుగా; క్రీడ, సలుపున్= విహరించసాగింది.

తాత్పర్యం: సముద్రంలో-ఒక విశాల ద్వీపంలో ధర్మాత్ముడైన రాజుగారి నగరంలో ఒక వైశ్యుడుండేవాడు. అతడు యజ్ఞాలు చేస్తూ శాంతం, కరుణ, సంయమనం మొదలైన గుణాలతో ఒప్పుతుండేవాడు. పెక్కుమంది పుత్రులతో, భోగభాగ్యాలతో విలసిల్లుతూ దానాలు చేస్తుండేవాడు. ఒక కాకి అతడి ఇంటికి రాగా అతడి కుమారులు దానికి ఎంగిళ్ళు పెట్టి పెంచసాగారు. అది ఆ ఎంగిళ్ళతో పెరుగుతూ గర్వించి ఇతర పక్షులేవీ తనకు సాటిరావన్న దురహంకారంతో ఎన్నో విధాల క్రీడిస్తూ తిరుగుతూ ఉండేది.

వ. **ఇట్లు విహరించుచుండ నొక్కనాఁడు గొన్ని హంసంబులు పక్షబలంబున సుపర్ణుతో సరిసేయం దగునట్టివి సముద్రంబు చేరువఁ జనం గని యా కోమటికొడుకు లక్కాకంబునకు వానిం జూపి యి ట్లనిరి.** **55**

ప్రతిపదార్థం: ఇట్లు, విహరించుచుండన్= ఆ కాకి ఇట్లా విహరిస్తూ ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజు; పక్షబలంబునన్= రెక్కల బలంలో; సుపర్ణుతోన్= గరుడుడితో; సరిచేయన్+తగునట్టివి= సమానమైనట్టివి అయిన; కొన్ని, హంసంబులు= కొన్ని హంసలు; సముద్రంబు చేరువన్= సముద్రం దగ్గరగా; చనన్+కని= రాగా చూచి; ఆ కోమటి కొడుకులు= వైశ్యపుత్రులు; ఆ+కాకంబునకున్= ఆ కాకికి; వానిన్+చూపి= హంసలను చూపి; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు:

తాత్పర్యం: ఆ విధంగా కాకి విహరిస్తూ ఉండగా గరుడుడితో సమానమైన రెక్కల శక్తి గలిగిన కొన్ని హంసలు సముద్రాన్ని చేరవచ్చాయి. వైశ్యకుమారులు ఆ హంసలను చూపిస్తూ కాకితో ఇట్లా అన్నారు:

క. 'పులుఁగులలో నీ వెక్కుడు; । విలసద్గతి నంచ లిట్లు వినువీథిఁ గరం
బెలమిం జనియెడు వీనిం । గలసి పఱచి గెలువవలదె గతుల బహులతన్?' 56

ప్రతిపదార్థం: నీవు; పులుగులలోన్= పక్షులన్నింటిలో; ఎక్కుడు= గొప్పదానివి; అంచలు= హంసలు; విలసత్+గతిన్= ఒప్పయిన గమనంతో; ఇట్లు= ఈ విధంగా; వినువీథిన్= ఆకాశమార్గంలో; కరంబు+ఎలమిన్= కడువేడ్కతో; చనియెడున్= తిరుగుతున్నాయి; గతుల బహులతన్= వివిధగతులలో; వీనిన్+కలసి= హంసలతో కలిసి; పఱచి= పరుగెత్తి; గెలువవలదె!= గెలువరాదా!

తాత్పర్యం: 'హంసలు ఆకాశవీథిలో కడు వేడుకతో ప్రకాశిస్తూ విహరిస్తున్నాయి. పక్షులన్నింటిలో గొప్పదానివైన నీవు పలురీతుల గమనాలతో హంసలతో కలిసి పరుగెత్తి వాటిని ఓడించాలి.'

వ. అని తారతమ్య జ్ఞానహీను లగు నయ్యల్పబుద్ధులు సెప్పిన, నుచ్ఛిష్ట దర్పితం బగు నదియును మౌర్ఖ్యంబునం దానంతటి దాన నని తలంచి వానిదెసకుం జని మనంబున వీనిలో మేటి యెయ్యదియో యనుచుం జేరి, తన చూడ్కికి వచ్చిన యంచం బురుడించి, పఱతము రమ్మని పిలిచిన, నయ్యంచలన్నియు నిలిచి పెలుచ నవ్వి యవ్వాయసంబున కి ట్లనియె. 57

ప్రతిపదార్థం: అని, తారతమ్యజ్ఞానహీనులు+అగు= ఎక్కువ తక్కువలను గూర్చిన జ్ఞానం లేనట్టి; ఆ+అల్పబుద్ధులు= ఆ తక్కువ తెలివిగలవారు; చెప్పినన్= చెప్పగా; ఉచ్ఛిష్ట దర్పితంబు+అగు+అదియును= ఎంగిళ్ళు తిని గర్వంతో ఉన్న ఆ కాకి; మౌర్ఖ్యంబునన్= మూర్ఖత్వంతో; తాను+అంతటిదానను+అని, తలంచి= తాను అంత గొప్పదాననే అని భావించుకొని; వాని దెసకున్+చని= ఆ హంసలున్న దిశకు వెళ్ళి; మనంబునన్= తన మనసులో; వీనిలో మేటి ఏ+అదియో= వీనిలో గొప్ప హంస ఏదో; అనుచున్+చేరి= అనుకొంటూ వాటిని సమీపించి; తన, చూడ్కికి, వచ్చిన, అంచన్= తన దృష్టిని ఆకర్షించిన ఒక హంసను; పురుడించి= తనకు సాటిగా తలంచి; పఱతము= పరుగెత్తుదము; రమ్ము+అని, పిలిచినన్= రమ్మని పిలువగా; ఆ+అంచలు+అన్నియున్= ఆ హంసలన్నీ; నిలిచి= వచ్చిచేరి; పెలుచన్ నవ్వి= బిగ్గరగా నవ్వి; ఆ+వాయసంబునకున్= ఆ కాకితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాయి;

తాత్పర్యం: అని తారతమ్య భేదం ఎరుగని ఆ అజ్ఞానులు కోరగానే ఎంగిళ్ళు తిని గర్వించిఉన్న మూర్ఖమైన ఆ కాకి, తాను అంతటిదాననే అని తలంచి, ఆ హంసలను దగ్గరకు వెళ్ళి, వాటిలో మేటిగా గోచరించిన దానిని పిలిచి, తనతో సమానంగా పరుగెత్తుమని అడుగగా, ఆ హంసలు నవ్వుతూ కాకితో ఇట్లా అన్నాయి:

క. ‘మానససరసి వసింతు మ । హీనబలము జవముఁ బక్షు లెల్లను బొగడం
గా నెందుఁ దిరుగుదుము; ద । వ్వైనను ఖేదంబు లేదు హంసల మగుటన్. 58

ప్రతిపదార్థం: మానస సరసిన్ వసింతుము= మానస సరోవరంలో నివసిస్తాము; అహీనబలమున్, జవమున్= అమితమైన మా బలమును వేగమును; పక్షులు+ఎల్లను= పక్షులన్నీ; పొగడంగాన్= ప్రశంసించగా; ఎందున్+తిరుగుదుము= ఎక్కడైనా తిరగగలవారము; హంసలము+అగుటన్= హంసలం కాబట్టి; దవ్వు+ఐనను= దూరమైనా; ఖేదంబు లేదు= బాధ లేదు.

తాత్పర్యం: మానససరోవరం మా నివాసం. మా బలాన్నీ, వేగాన్నీ చూచి పక్షులన్నీ పొగడే విధంగా ఎంత దూరమైనా ఎటువంటి కష్టం లేకుండా ఎగిరిపోగలము.

విశేషం: హిమవత్పర్వత ప్రాంతంలోని మానస సరస్సులో హంసలు నివసిస్తుంటాయనీ, ఇతర ఋతువులలో వేరు ప్రాంతాలకు వెళ్ళినా శరదృతువు రాగానే తిరిగి మానససరోవరం చేరుకుంటాయనీ ప్రసిద్ధి.

వ. ఇట్టి మాయందును. 59

తాత్పర్యం: ఇటువంటి మాలో కూడా.

క. బలశాలి యైన హంసముఁ । బిలిచితి పురుడించి పాఱ బేలతనమునన్;
గలవే యింతకు మును హం । సలతో బురుడించు వాయసంబులు జగతిన్. 60

ప్రతిపదార్థం: బలశాలి అయిన హంసమున్= ఎంతో బలవంతురాలయిన హంసను; పురుడించి పాఱన్= నీతో పోటీగా పరుగెత్తుటకు; బేలతనమునన్= అమాయకత్వంతో; పిలిచితి(వి)= పిలిచినావు; జగతిన్= లోకంలో; హంసలతో(న్) పురుడించు= హంసలతో సాటి రాగల; వాయసంబులు= కాకులు; ఇంతకున్+మును, కలవే?= ఇంతకుముందు ఉన్నాయా?

తాత్పర్యం: మాలో బలశాలి అయిన హంసనే అవివేకంతో పోటీకి రమ్మని పిలుస్తున్నావు. అసలు హంసలతో సాటిరాగల కాకులు ఇంతవరకు ఎక్కడైనా ఉన్నాయా?

సీ. అనుటయుఁ గాక మిట్లను హంసములతోడ, । ‘గతులు నూటొక్కటి గలవు వాన
నొక్కటొక్కట శతయోజన వ్యాప్తి నే । మెఱయుదుఁ బొడవుగా మీఁది కెగసి
చనుట యచ్చటినుండి చక్క నేలకుఁ జోడు । వట్టి డిగ్గుట దూరపాత భంగి
సంగతి పరువడి చారులీలా గతి । వక్రయానము వలయక్రమంబు

ఆ. లోనుగాఁగ నెట్టు లైనను మీకోరి । నట్ల పఱచి మేటి యంచ యైన
దాని నిపుడ గెలుతుఁ; దక్కటి యంచలు । భయము వొందఁ గాకి పదుపు వొంగ.’ 61

ప్రతిపదార్థం: అనుటయున్= అని హంసలు పలుకగా; కాకము= కాకి; హంసములతోడన్ ఇట్లు+అనున్= హంసలతో ఇట్లా అన్నది; గతులు నూట+ఒక్కటి కలవు= నూట ఒక్క విధములైన గమనము ఉన్నాయి; వానన్+ఒక్కట+ఒక్కటన్= ఒక్కొక్క గమనంలో; నేన్= నేను; శతయోజనవ్యాప్తి= నూరు ఆమడల దూరం; మెఱయుదున్= ప్రకాశిస్తాను (పరుగెత్తగలను); పొడవుగాన్ మీఁదికిన్+ఎగసి చనుట= పొడవుగా పైకి ఎగిరి వెళ్ళటం; అచ్చటినుండి= పై నుండి; చక్కన్= చక్కగా; నేలకున్+

జోడు+పట్టి డిగ్గుట= (అదే విధంగా) భూమిమీదికి సమానంగా దిగటం; దూరపాతభంగి సంగతి= దూరంగా పడుతూ వెళ్ళే పద్ధతి; పరువడిన్= క్రమంగా; చారు, లీలాగతిన్= మనోహరమైన నడకతో; వక్రయానము= వంకరగా వెళ్ళటం; వలయక్రమంబు= గుండ్రంగా తిరగటం; లోనుగాఁగన్= మున్నగునవి; ఎట్టులు+ఐనను= ఏ విధములైనా; మీ కోరిన+అట్ల, పఱచి= మీరు కోరిన విధంగా ఎగిరి; మేటి అంచ+ఐన= ఎంత గొప్ప హంస అయినా; తక్కటి, అంచలు= మిగతా హంసలు; భయము+పొందన్= భయపడేటట్లుగా; కాకి, పదుపు+పొంగన్= కాకుల సమూహం ఆనందంతో పొంగిపోగా; దానిన్+ఇపుడు+అ గెలుతున్= ఆ హంసను ఇపుడే గెలుస్తాను.

తాత్పర్యం: అని హంసలు అనగానే కాకి వాటికి సమాధానంగా ఇట్లా అన్నది: 'నూట ఒక్క గతులు వేటిలోనైనా నేను నూరు ఆమడల దూరం వెళ్ళగలను. పొడవుగా మీదికి ఎగిరి అదే విధంగా నేలకు దిగి రాగలను. మనోహర గతులతో వంకరగా, వలయాకారంగా మీరు కోరిన విధంగా పరుగెత్తి ఎటువంటి హంసనైనా ఓడించగలను. మిగిలిన హంసలన్నీ భయపడేటట్లుగ, కాకులు నన్ను చూచి పొంగిపోయేటట్లుగ దానిని గెలుస్తాను.

విశేషం: పక్షుల నడకలను పేర్కొనటంలో తిక్కన సూక్ష్మపరిశీలన, లోకజ్ఞత సువ్యక్తమౌతున్నాయి. యోజనము= నాలుగు కోసుల దూరం (ఆమడ).

కాకము హంసముతో సముద్రముమీఁదఁ బఱచి భంగపడుట (సం. 8-28-27)

వ. అనుటయు విని ము న్నాహూతం బైన హంసం బక్కాకంబు నాలోకించి. 62

ప్రతిపదార్థం: అనుటయున్+విని= అనగా విని; మున్ను+ఆహూతంబు+ఐన= ముందు పిలువబడిన; హంసంబు= హంస; ఆ+కాకంబున్+ఆలోకించి= ఆ కాకిని చూచి.

తాత్పర్యం: కాకి మాటలు విని ముందు పందెపు పోటీకి పిలువబడిన హంస దానిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'నూఱుగతుల నీవు వాఱుదే నన్నియు । నెఱుఁగఁ బులుఁగు లెల్ల నెట్లు వాఱు
నడరి యాకసమున నిడుబాట నట్ల పా । ఱుదము రమ్ము జలధి చదల' ననిన. 63

ప్రతిపదార్థం: నూఱుగతులన్= నూరు నడకలలో; నీవు పాఱుదు+ఏన్= నీవు ఎగురగలిగితే; అన్నియున్+ఎఱుఁగన్= అవి అన్నీ నాకు తెలియవు. పులుఁగులు+ఎల్లన్= అన్నిపక్షులు; ఆకసమునన్= ఆకాశమార్గమునందు; అడరి= అతిశయించి; నిడుబాటన్= చక్కగా; ఎట్లుపాఱున్= ఎట్లా పరుగెత్తుతాయో; జలధి, చదలన్= సముద్రంమీది ఆకాశంలో; అట్ల పాఱుదము రమ్ము= అట్లా ఎగురుదాము రమ్ము; అనినన్= అనగా;

తాత్పర్యం: నూరుగతులలో పరుగెత్తగలనన్నావు గదా. అవన్నీ నాకు తెలియవు. ఆకాశమార్గంలో పక్షులన్నీ నిడువుగా ఎట్లా ఎగురుతాయో అట్లా సముద్రంపై ఆకాశమార్గంలో చక్కగా పరుగెత్తుదాము రమ్ము' అని హంస పలుకగా.

విశేషం: హంస మాటలలో వినయంతో కూడిన ఆధిక్యం, హుందాతనం గోచరిస్తున్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అయ్యెడం గూడిన కాకంబు లపహసించి 'శతప్రకారగతి యగు దీనితో నేకయాన పర్యవసానహీన సముత్సాహ దోహలి వగు నీ వెట్లు మచ్చరించెదవు; పఱచి భంగపడియెదవు గాక' యనుటయు, నమ్మరాళం బా గమిం బాసి పఱవం దొడంగినం దోన యవ్వాయసంబునుం బఱచె; నిట్లు రెండును మున్నీటిపై మిన్ను దఱిసి పాఱునట్టియెడ. 64

ప్రతిపదార్థం: ఆ+ఎడన్+కూడిన, కాకంబులు= అక్కడ గుమిగూడిన కాకులు; అపహసించి= ఎగతాళిచేసి; శతప్రకారగతి అగు దీనితోన్= నూరుగతులలో సంచరించగల ఈ కాకితో; ఏకయాన పర్యవసాన= ఒక్క నడకలో మాత్రమే; హీనసముత్సాహ దోహలివి+అగు నీవు= అల్పోత్సాహ సంరంభం గల నీవు; ఎట్లు మచ్చరించెదవు?= ఎట్లు పోటీపడతావు?; పఱచి= పరుగెత్తి; భంగపడియెదవు గాక= అవమానం పొలగుదువు కాని; అనుటయున్= అనగానే; ఆ+మరాళంబు= ఆ హంస; ఆ గమిన్+పాసి= ఆ గుంపును విడిచి; పఱవన్ తొడంగినన్= పరుగెత్తసాగగా; తోన్+అ= వెంబడి; ఆ+వాయసంబునున్+పఱచెన్= ఆ కాకి కూడా ఎగిరింది; ఇట్లు, రెండును= హంస, కాకి; మున్నీటిపైన్= సముద్రంపై గల; మిన్ను దఱిసి= ఆకాశాన్ని సమీపించి; పాఱునట్టి ఎడన్= పరుగెత్తుతున్న సమయంలో.

తాత్పర్యం: అక్కడ చేరిన కాకులు 'శతగతులు నేర్చిన ఈ కాకితో ఏకైక గమనవగు నీవు పోటీపడి అవమానం పాలు కావలసిందే కాని, ఏ విధంగా సాటి కాగలవు?' అని హంసను పరిహసించగా, ఆ హంస మారుమాటాడక వాటిని వదలి సముద్రం పైమార్గంలో పరుగెత్తసాగింది. కాకికూడా దానిని వెంబడించింది. ఈ విధంగా రెండూ పోటీపడి ఎగురుతూ ఉండగా.

క. రాయంచ మందగతిఁ జను । వాయస మతితీవ్రభంగి వలను మెఱసి లీ
లాయితము లొప్ప బహుగమ । నాయాసము నొంది పఱచు నగ్గలిక మెయిన్. 65

ప్రతిపదార్థం: రాయంచ= రాజహంస; మందగతిన్+చను= మందగమనంతో వెళ్ళుతున్నది; వాయసము= కాకి; అతి తీవ్రభంగిన్= మిక్కిలి వేగంగా; వలను మెఱసి= నేర్పు చూపుతూ; లీలా+ఆయితములు+ఒప్పన్= విలాసక్రీడలతో; అగ్గలిక మెయిన్= ఉత్సాహంతో; బహుగమన+ఆయాసమున్= వివిధ గతులవలన కలిగిన అలసటను; ఒంది= పొంది; పఱచున్= పరుగెత్తుతున్నది.

తాత్పర్యం: రాజహంస అలసట లేకుండా మందగమనంతో వెళ్ళుతుంటే, వాయసం ఉత్సాహంతో క్రీడావిలాసంతో తన నేర్పులు చూపుతూ వివిధగతులలో వేగంగా వెళ్ళటం వలన అలసట చెందుతూ పరుగెత్తుతున్నది.

ఆ. ఎలమిఁ గడచి పోవుఁ బిలుచుఁ గ్రమ్మఱ వచ్చి । ముక్కు ముక్కు మీఁద మోపుఁ జుట్టు
నేచి తిరుగు నీఁక లీఁకలతో రాయు । నోరయుఁ జిత్రగతుల మురియు నవ్వు. 66

ప్రతిపదార్థం: ఎలమిన్+కడచిపోవున్= ఆనందంతో (హంసను) దాటిపోతుంది; క్రమ్మఱ వచ్చి పిలుచున్= తిరిగివచ్చి పిలుస్తుంది; ముక్కుమీఁద ముక్కు మోపున్= ముక్కుమీద ముక్కు ఉంచుతుంది; చుట్టున్+ఏచి తిరుగున్= చుట్టూ విజృంభించి తిరుగుతుంది; ఈఁకలు+ఈఁకలతోన్, రాయున్= (తన) ఈకలతో (హంస) ఈకలను రాసేది; చిత్రగతుల ఒరయున్= చిత్రమైన గతులతో తాకుతుంది; మురియున్= మురిసిపోతుంది; నవ్వున్= నవ్వుతుంది.

తాత్పర్యం: ఆ కాకి హంసను దాటిపోయి తిరిగివచ్చి పిలిచేది. దాని ముక్కుమీద ముక్కు మోపేది. ఈకలను ఈకలతో రాసేది. దానిచుట్టూ విజృంభించి తిరిగేది. చిత్రమైన నడకలతో వచ్చి తాకేది. తనలో తాను మురిసిపోతూ నవ్వేది.

విశేషం: మిడిసిపాటు నిండిన కాకి చేష్టలు పొడిమాటల్లో స్వాభావికంగా చిత్రితమైనాయి.

వ. ఇవ్విధంబునం గాకం బనేక ప్రకార ప్రసరణ చతురంబై సంచరించుటం జూచి ముదితంబు లైన వాయసంబు లధిక స్వరంబుల మెఱయుచు హంసంబుల గేలికొని నవ్వుచుఁ దరువులపయిం ద్రుళ్లి త్రుళ్లి యాడుచు 'మరాళంబు పరాభవంబుఁ బొందెడుఁ జూడుం' డని పెద్ద యెలుంగునం బలుకుచుండఁ దదీయ కలకలం బాలించి హంసంబు భరితోత్సాహం బై. 67

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; కాకంబు= కాకి; అనేక ప్రకార= వివిధములైన; ప్రసరణ చతురంబు+ఐ= గతుల నేర్పు కలిగినదై; సంచరించుటన్+చూచి= పరుగెత్తటం చూచి; ముదితంబులు+ఐన వాయసంబులు= సంతోషించిన కాకులు; అధికస్వరంబులన్, మెఱయుచున్= పెద్దగా అరిచి ప్రకాశిస్తూ; హంసంబులన్= హంసలను; గేలికొని నవ్వుచున్= గేలిచేస్తూ నవ్వుతూ; తరువుల పయిన్= చెట్లపై; త్రుళ్ళి త్రుళ్ళి ఆడుచున్= గంతులు వేస్తూ; మరాళంబు= హంస; పరాభవంబున్+పొందెడున్= అవమానం పాలవుతుంది; చూడుండు+అని= చూడండి అని; పెద్ద ఎలుంగునన్ పలుకుచుండున్= పెద్ద గొంతుతో అంటూ ఉండగా, హంసంబు= హంస; తదీయ కలకలంబు= వాటి అరపులు; ఆలించి= విని; భరిత+ ఉత్సాహంబు+ఐ= నిండు ఉత్సాహం కలదై.

తాత్పర్యం: కాకి ఈ విధంగా వివిధ గతుల నేర్పులు ప్రదర్శిస్తూ పరుగెత్తటం చూచిన తోటి కాకులు, సంతోషంతో అరుస్తూ, హంసలను గేలిచేస్తూ చెట్లపై గంతులు వేయసాగాయి. 'హంస ఓడిపోతుంది' అని పెద్ద గొంతులతో అరవసాగాయి. వాటి అరపులు విన్న హంస నిండు ఉత్సాహంతో-

క. పొడవునకు నెగసి యెప్పటి । పడమటి దెస నిగిడి పెలుచఁ బఱచినఁ గూడం
గడు రయమునఁ జని యంచం । గడవంగా కీలకఱచి కాకము పాఱున్. 68

ప్రతిపదార్థం: పొడవునకున్+ఎగసి= నిలువుగా పైకి ఎగిరి; ఎప్పటి పడమటి దెస నిగిడి= మునుపటివలె పడమరదిక్కున వెళ్ళి; పెలుచన్+పఱచినన్= అధికవేగంతో పారగా; కాకము= కాకి; కూడన్= వెంబడి; కడురయమునన్+చని= మిక్కిలి వేగంగా వెళ్ళి; అంచన్+కడవన్+కాక= హంసను దాటశక్యంగాక; ఈలకఱచి= ఊపిరి బిగబట్టి; పాఱున్= పరుగెత్తింది.

తాత్పర్యం: పొడవుగా పైకి ఎగిరి పడమటివైపు పారగా, కాకి కూడ దానివెంట వేగంగా వెళ్ళి ఆ హంసను దాటటానికి శక్యం కాక ఊపిరి బిగబట్టి పరుగెత్తసాగింది.

వ. పాటిపాటి డయ్యుటయు నయ్యంచ యుదంచిత త్వరితగమన కళా వైదగ్ధ్యంబు మెఱయం బఱచిన బీఱువడి కాకం బాకులాంతరంగంబును వికలాంగంబును నై యిట్లని వితర్కించు. 69

ప్రతిపదార్థం: పాటి, పాటి, డయ్యుటయున్= పరుగెత్తి పరుగెత్తి అలసిపోగా; ఆ+అంచ= ఆ హంస; ఉదంచిత= ఒప్పయిన; త్వరితగమన కళావైదగ్ధ్యంబు= శీఘ్రగమన చాతుర్యం; మెఱయన్+పఱచినన్= చూపుతూ పారగా; కాకంబు= కాకి; బీఱువడి=

దిటవు కోల్పోయి; ఆకుల+అంతరంగంబును= చెదరిన మనసు; వికల+అంగంబునున్+ఐ= శక్తి కోల్పోయిన శరీరం కలదై; ఇట్లు+అని= ఈ విధంగా; వితర్కించున్= ఆలోచించసాగింది.

తాత్పర్యం: హంస, శీఘ్రగమన చాతుర్యాన్ని ప్రదర్శిస్తూ పారగా, దానితోపాటు పరుగెత్తుతూ అలసిపోయిన కాకి శక్తికోల్పోయి బలహీనమయి మనసు కలతనొందగా ఇట్లా చింతించసాగింది.

క. 'నేరక తొడరితిఁ గాల్కొన । భూరుహములు లతలు గిరులుఁ బొద లేమియు లేఁ;
వారయ బహుసత్త్వ మయము । వారిధి డిగి సోఁకినపుడ వలయుం బొలియన్.' 70

ప్రతిపదార్థం: నేరక, తొడరితిన్= తెలియక పందానికి పూనుకొన్నాను; కాల్కొనన్= కాలుపెట్టటానికి; భూరుహములు= చెట్లు; లతలు= తీగలు; గిరులున్= కొండలు; పొదలు+ఏమియున్, లేవు= పొదలు ఏవీ లేవు; వారిధి= సముద్రం; ఆరయన్= చూడగా; బహుసత్త్వమయము= పెక్కు జంతువులతో నిండినది; డిగి సోకినపుడు+అ= దిగగా అవి ముట్టుకుంటేనే; పొలియన్ వలయున్= చనిపోవాలి.

తాత్పర్యం: 'ఎరుగక హంసతో పోటీకి సిద్ధపడ్డాను. కాలు నిలపటానికి మార్గంలో చెట్లు, తీగలు, పొదలు, గట్లు ఏవీ లేవు. నీటిపై దిగుదామా అంటే సముద్రంలోని జంతువుల బారిన పడక తప్పదు.'

వ. అనుచు దీన మానసం బయి భయంబునం గలంగి డప్పి సొగసి యవశత నంతకంతకు డిగుచున్న యక్కాకిం గనుంగొని కలహంసం బి ట్లనియె. 71

ప్రతిపదార్థం: అనుచున్= అనుకొంటూ; దీనమానసంబు+అయి= దిగులు చెందిన మనసు కలదై; భయంబునన్+కలంగి= భయంతో కలతచెంది; డప్పిన్+సొగసి= దాహంతో అలసి; అవశతన్= వశంతప్పి; అంతకున్+అంతకున్, డిగుచున్న= మెల్లమెల్లగా దిగుతున్న; ఆ+కాకిన్= ఆ కాకిని; కనుంగొని= చూచి; కలహంసంబు+ఇట్లు+అనియెన్= రాజహంస ఇట్లా అన్నది.

తాత్పర్యం: అని అనుకొంటూ దిగులుతో, భయంతో కలతచెందిన మనసు గలదై కాకి, దప్పితో వశంతప్పి క్రమంగా క్రిందికి దిగసాగింది. దాన్ని చూచిన హంస ఇట్లా అంటున్నది.

ఆ. 'నీ వనేకగతులు నే ర్తివి యే గతిఁ । జనుట చెపుము వాయసంబ! యేను
గడవ నరిగి పిలువఁగా నేల తడసెద? । వెఱక లేటి కిట్టు లెడల విడువ?' 72

ప్రతిపదార్థం: వాయసంబ!= ఓ కాకమా!; ఏను= నేను; కడవన్+అరిగి= (నిన్ను) దాటిపోయి; పిలువన్+కాన్= పిలువగా; ఏల తడసెదవు?= ఎందుకు ఆలస్యం చేస్తున్నావు?; ఎఱకలు= రెక్కలు; ఇట్టులు= ఈ విధంగా; ఎడలన్+విడువన్= (నీకు) దూరమైపోయినట్లు విడవటం; ఏటికిన్?= ఎందుకు?; నీవు, అనేకగతులు= ఎన్నో నడకలు; నేర్తు(వు)= నేర్చినదానవు; ఇది, ఏ గతిన్ చనుట= ఏ నడకతో వెళ్ళుటో; చెపుమ= చెప్పుము.

తాత్పర్యం: 'ఓ వాయసమా! నేను నిన్ను దాటి పిలిచినా నీవు బదులు పలుకక జాప్యం చేస్తున్నావు. నీ రెక్కలు నీకు దూరమైపోయినట్లు చాస్తున్నావు. నీవు నేర్చిన పెక్కు గతులలో ఇది ఏ రకమైన గమనమో చెప్పుతావా?'

విశేషం: నూటొక్క గతులలో ఆరితేరినదానను(63ప.) అన్న కాకి మాటలకు బదులుగా ఇది ఎత్తిపొడుపు.

వ. అనియె నట్టియెడ. 73

ప్రతిపదార్థం: అనియెను; అట్టిఎడన్= అప్పుడు.

తాత్పర్యం: అని హంస కాకితో హేళనగా పలుకగా, అప్పుడు.

క. తలకొని జలములు పక్షం। బులు దుండము దోఁక సోఁక బోరిఁబోరి నెగయన్
బలమఱి మెయి దిగఁబడఁగా। సొలసి యెగయలేక వాయసుఁడు వెగడొందెన్. 74

ప్రతిపదార్థం: తలకొని= పూని; జలములు= సముద్ర జలాలు; పక్షంబులు= రెక్కలు; తుండము= ముక్కు; తోఁక= తోకను; సోఁకన్= తాకగా; పొరిన్ పొరిన్+ఎగయన్= మాటిమాటికి ఎగిసిపడగా; బలము+అఱి= బలము నశించి; మెయి దిగఁబడఁగాన్= శరీరం క్రిందికి వ్రాలగా; వాయసుఁడు= కాకి; సొలసి= అలసి; ఎగయ లేక= ఎగర లేక; వెగడు+ఒందెన్= భయపడెను.

తాత్పర్యం: సముద్ర జలాలు రెక్కలను, ముక్కును, తోకను తాకుతూ ఉండగా, మాటిమాటికి మీదికి ఎగురుతూ, బలహీనపడి క్రిందికి వ్రాలుతూ ఉండగా - అలసిపోయి ఎగురలేక భయపడింది.

విశేషం: 'వాయసుఁడు' అన్న మాటలో గర్వంతో కన్నూమిన్నూ కానని 'మానవుడు' స్ఫురిస్తాడు.

వ. ఇట్లు మున్నీటి నీటి పయింబడి యగ్గలం బగు దురవస్థకు బెగ్గలంబు నొందు కాకంబు నాలోకించి 'పలుకనగుం గాక; పలికినట్ల యెవ్వరికిఁ జేయఁ దీరుఁ? బని తీరెంగదా' యనిన రాయంచకు న క్కాకం బి ట్లనియె. 75

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మున్నీటి నీటి పయిన్+పడి= సముద్రజలంమీద పడి; అగ్గలంబు+అగు దురవస్థకున్= మిక్కిలి హీనస్థితికి; బెగ్గలంబున్+ఒందు= భయపడుతున్న; కాకంబున్+ఆలోకించి= కాకిని చూచి; పలుకన్+అగున్+కాక= (మాటలు) పలుకవచ్చునుకాని; పలికిన+అట్లు+అ= పలికినట్లుగానే; ఎవ్వరికిన్+చేయన్+తీరున్?= చేయుటానికి ఎవరికి వీలవుతుంది?; పని తీరెన్+కదా అనినన్= నీ పని ముగిసింది కదా అనగా; రాయంచకున్= రాజహంసతో; ఆ+కాకంబు+ ఇట్లు+అనియెన్= ఆ కాకి ఇట్లా అన్నది:

తాత్పర్యం: ఈ విధంగా పైకి ఎగురలేక సముద్రపు నీటిమీదపడి, తన బలహీనస్థితికి భయపడుతున్న కాకిని చూచి రాజహంస ఇట్లా అన్నది: 'మాటలు ఎన్నయినా చెప్పవచ్చు. కాని చెప్పినదంతా చెయ్యటం ఎవరికి సాధ్యమౌతుంది. గొప్పలు పలికిన నీ పని అయిపోయింది కదా!' అన్న హంస మాటలు విని కాకి ఇట్లా అంటున్నది:

క. 'ఎంగిళులు గుడిచి క్రొవ్వునఁ। బొంగిన మెయితోడ గర్వమునఁ దిరుగుచు నా
కుం గలదె యెందు నెదురు? వి। హంగమ పతి నైన గెలుతు' నని మును దలఁతున్. 76

ప్రతిపదార్థం: ఎంగిళులు, కుడిచి= ఎంగిళ్ళు తిని; క్రొవ్వునన్+పొంగిన మెయితోడన్= కొవ్వుతో బలసిన దేహంతో; గర్వమునన్ తిరుగుచున్= గర్వంగా తిరుగుతూ; నాకున్= నాకు; ఎందున్= ఎక్కడైనా; ఎదురు కలదె?= ఎదురు ఉన్నదా?; విహంగమపతిన్+ ఐనన్= పక్షిరాజైన గరుడుని కూడా; గెలుతును+అని= గెలువగలనని; తలఁచుదున్= ఇంతకుముందు భావించాను.

తాత్పర్యం: ఎంగిళ్ళు తిని, బలిసిన దేహంతో గర్వించి, నాకు ఎదురు ఎవరూ లేరని భావిస్తూ గరుత్మంతుడిని సైతం ఓడించగలనని తలచేదానిని.

క. నా కొలఁది యిప్పుడెఱిఁగితి । నీ కరుణాలోకనంబు నిగిడించి శర
ణ్యా! కావు నన్నుఁ మగుడం । గాకులలోఁ గలుపఁ దగవు గాదే నీకున్?' 77

ప్రతిపదార్థం: నా కొలఁది ఇప్పుడు+ఎరిగితిన్= నా పరిమితి ఇప్పుడు తెలిసికొన్నాను; శరణ్యా!= శరణు పొందదగినవాడా!; నీ కరుణా+ఆలోకనంబు= నీ దయాదృష్టిని; నిగిడించి= ప్రసరించి; కావు= రక్షించు; నన్నున్; మగుడన్= మళ్ళీ; కాకులలోన్= కాకుల్లో; కలుపన్= చేర్చగా; నీకున్= నీకు; తగవు కాదే?= న్యాయం కదా!

తాత్పర్యం: నా అల్పత్వం ఎంతో ఇప్పుడు తెలుసుకొన్నాను. నిన్ను శరణు కోరుతున్నాను. నాపై దయ చూపి నన్ను రక్షించు. నా తోటి కాకులలో మళ్ళీ నన్ను చేర్చుము. ఇది నీకు న్యాయం కదా.

వ. అని యిత్తెఱంగున. 78

తాత్పర్యం: అని ఈ విధంగా.

క. ఆకులతఁ బొంది పలుకుచుఁ । గా కా యని చంచుఁ దెఱచి కడు నఱచుచు నీ
రాకరమున మునిఁగెడు న । క్కాకిం గని హంస పరమకారుణ్యమునన్. 79

ప్రతిపదార్థం: ఆకులతన్+పొంది= కలతచెంది; కా కా అని= కావు కావు అని; పలుకుచున్= పలుకుతూ; చంచున్ తెఱచి= ముక్కు(నోరు) తెరచి; కడున్+అఱచుచున్= ఎంతగానో అరుస్తూ; నీరాకరమునన్= సముద్రంలో; మునిఁగెడు= మునుగుతున్న; ఆ+కాకిన్+కని= ఆ కాకిని చూచి; హంస; పరమ కారుణ్యమునన్= మిక్కిలి దయతో.

తాత్పర్యం: వ్యాకులమైన మనసుతో కావు కావు మని ఎంతగానో అరుస్తూ నీటిలో మునిగిపోతున్న కాకిని చూచి హంస దయతో-

క. వెరవునఁ దత్తనువుం దన । చరణంబుల నిఱికి యెత్తి చా వుడిపి బల
స్ఫురణంబు మెఱయ వీఁపున । ధరియించుచు వచ్చెఁ బక్షితతులు నుతింపన్. 80

ప్రతిపదార్థం: వెరవునన్= ఉపాయంతో; తద్+తనువున్= ఆ కాకి దేహాన్ని; తన చరణంబులన్= తన కాళ్ళలో; ఇఱికి ఎత్తి= ఇరికించుకొని పైకెత్తి; చావు+ఉడిపి= చావునుంచి కాపాడి; బల స్ఫురణంబు మెఱయన్= బలస్ఫూర్తి ప్రకాశించగా; వీఁపున ధరియించుచున్= వీపుపై మోసికొని; పక్షితతులు, నుతింపన్= పక్షులన్నీ కొనియాడగా; వచ్చెన్= వచ్చింది.

తాత్పర్యం: కాకిని తన కాళ్ళతో పట్టి పైకెత్తి, దాని ప్రాణాలు కాపాడి, బలమొప్పగా వీపున మోసికొని వస్తున్న హంసను చూచి పక్షులన్నీ పొగడసాగాయి.

వ. ఇవ్విధంబునం దెచ్చి యెప్పటి నెలవున డించి, రాయంచ యక్కాకి దెప్పిఱిన, దానితో నచ్చటి కాకులు విన 'నింక నిట్టి యవినయంబు లెన్నండును జేయకు' మని పలికి నిజ సహచరంబు లగు మరాళంబులుం

దానును వలయు చోటికిం జనియె; నీవు నా కోమటి కొడుకుల యెంగిలి కూటం బెరిఁగిన యక్కాకంబు చందంబునఁ గురుకుమారుల యెంగిళులు గుడిచి క్రొవ్వి, యెక్కుడువారల ధిక్కరించెదవు; నీ కొలఁది యెఱుంగవు; దీనం జేటు వాటిల్లుఁ గాన తేటపడ నెఱింగించెద నాకర్ణింపుము. 81

ప్రతిపదార్థం: రాయంచ= రాజహంస; ఈ విధంబునన్+తెచ్చి= కాకిని ఈ విధంగా మోసికొనివచ్చి; ఎప్పటి నెలవునన్ డించి= దాని నివాసంలో దించి; ఆ+కాకి తెప్పిఱినన్= కాకి తెప్పరిల్లగా; అచ్చటి కాకులు వినన్= అక్కడ ఉన్న కాకులు వినేటట్లుగా; దానితోన్= ఆ కాకితో; ఇంకన్= ఇకముందు; ఇట్టి అవినయంబులు= అహంభావంతో కూడిన పనులు; ఎన్నండును చేయకుము= ఎప్పుడూ చేయవద్దు; అని పలికి= అని వచించి; నిజ సహచరంబులు+అగు, మరాళంబులున్= తనతోటి హంసలూ; తానును= తానూ; వలయుచోటికిన్+చనియెన్= తమ కోరిన ప్రదేశానికి వెళ్ళాయి; నీవును= నీవు కూడా(కర్ణుడు); ఆ కోమటి కొడుకులు= ఆ వైశ్య పుత్రుల ఎంగిలి కూటన్+పెరిఁగిన= ఎంగిలికూడుతో పెరిగిన; ఆ+కాకంబు చందంబునన్= ఆ కాకివలెనే; కురు కుమారుల= దుర్యోధనాదుల; ఎంగిళులు కుడిచి= ఎంగిళ్ళు తిని; క్రొవ్వి= గర్వించి; ఎక్కుడు వారల= నీ కంటె అధికులైన వారిని (కృష్ణార్జునులను); ధిక్కరించెదవు= తిరస్కరిస్తున్నావు; నీ కొలఁది ఎఱుంగవు= నీ పరిమితి తెలిసికొనలేకుండా ఉన్నావు; దీనన్+చేటు+పాటిల్లున్+కానన్= ఇందువలన నీకు హాని కలుగుతుంది కాబట్టి; తేటపడన్+ ఎఱింగించెదన్= తెలిసేటట్లుగా చెబుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: హంస ఈ విధంగా కాకిని మోసికొని వచ్చి దాని స్థానంలో దింపింది. కాకి స్తిమితపడిన తర్వాత తోటి కాకులు వినేటట్లుగా ఇక ముందెప్పుడూ గర్వంతో ఈ విధమైన పనులకు పూనుకొనవద్దని బుద్ధి చెప్పి తోడి హంసలతో కలిసి వెళ్ళిపోయింది. కాకి హంసల కథను కర్ణుడికి వినిపించి శల్యుడు అతడితో 'వైశ్యకుమారులు పెట్టిన ఎంగిళ్ళు తిని గర్వించిన కాకివలెనే నీవు కూడా కౌరవుల ఎంగిళ్ళు తిని, నీ శక్తిని మరచి, నిన్ను మించినవారితో తలపడుతున్నావు. దీనివలన నీకే హాని జరుగుతుంది కాబట్టి నా మాటలు వినుము.' అంటూ.

విశేషం: 28 పద్యగద్యాలలో కొనసాగిన హంస వాయసముల కథ ద్వారా కర్ణుడిని అవమానపర్చాలన్న శల్యుడి ఉద్దేశం ప్రస్ఫుటమవుతున్నది. ఈ ఉపాఖ్యానానికి ముందు 'హితోపదేశంబు సేయ మాననేర్తునే' అంటూ చివర 'చేటు వాటిల్లుఁగాన తేటపడ నెఱింగించెద' అనటంలో ప్రధానకథకు భంగం కలగకుండా పొందికను కూర్చటంలో తిక్కన రచనా నైపుణ్యం వెల్లడి అవుతున్నది.

చ. **'విరటుని గోవులన్ మరల వెల్చి మదంబున నీదు తమ్మునిం**
బొరిగొనఁ బార్థుఁ దాక కెటుపోయితి నాఁ డల ఘోషయాత్రలోఁ
గురుపతి డించి క్రీడి కృపకుం దగు పాత్రము సేసి యెక్కడన్
సురిఁగితి చెప్పుమా నిజము సూతతనూభవ! నాకు నేర్పడన్.' 82

ప్రతిపదార్థం: సూత తనూభవ!= సూతుని కుమారుడవైన ఓ కర్ణా!; విరటుని గోవులన్= విరాటరాజు గోవులను; మరల వెల్చి= వెనుకకు మరలించి; మదంబునన్= గర్వంతో; నీదు తమ్మునిన్= నీ సోదరుడిని; పొరి+కొనన్= చంపగా; పార్థున్+తాఁకక= అర్జునుడిని ఎదుర్కొనకుండా; నాఁడు= ఆనాడు; ఎటుపోయితి?= ఎటువెళ్ళావు?; అల, ఘోషయాత్రలోన్= ఆ ఘోషయాత్రలో; కురుపతి డించి= దుర్యోధనుడిని దింపి; క్రీడి కృపకున్= అర్జునుడి దయకు; తగు పాత్రము+చేసి= తగినవాడినిగా చేసి; ఎక్కడన్ సురిఁగితి?= ఎక్కడ దాగుకొన్నావు?; నాకున్+ఏర్పడన్= నాకు తెలిసేటట్లుగా; నిజము చెప్పుమా!= నిజం వచించుము.

తాత్పర్యం: 'కర్ణా! ఆనాడు ఉత్తరగోగ్రహణ సందర్భంలో అర్జునుడు నీ తమ్ముడిని సంహరించి విరాటుడి గోవులను మరల్చినపుడు నీవు ఎటు వెళ్ళావు? ఆ ఘోషయాత్రలో దుర్యోధనుడిని దించి, అతడిని అర్జునుడి దయకు వదలి ఎక్కడ దాగుకొన్నావు? నిజం చెప్పుము.'

వ. అని వెండియు. 83

తాత్పర్యం: శల్యుడు ఈ విధంగా అని ఇంకా.

చ. 'పనివడి జామదగ్న్యుఁడు సభన్ వినిపింపఁడె మీకు నెల్ల న
ర్జును భుజవైభవంబు మధుసూదను పెంపును నాఁడ ద్రోణ శాం
తనవులుఁ జెప్పరే బహువిధంబుల? వారల గెల్వరామి మున్
వినమె? యెఱింగియున్ మఱియు వీఱిఁడి మాటలు వేయు నేటికిన్? 84

ప్రతిపదార్థం: అర్జును భుజ వైభవంబు= అర్జునుడి భుజబల పరాక్రమాన్ని; మధుసూదను పెంపును= కృష్ణుడి గొప్పతనాన్ని; జామదగ్న్యుఁడు= పరశురాముడు; పనివడి= పనికట్టుకొని; సభన్= సభలో; మీకున్+ఎల్లన్= మీ అందరికీ; వినిపింపఁడె?= చెప్పలేదా?; నాఁడ= ఆనాడే; ద్రోణ, శాంతనవులున్= ద్రోణభీష్ములు; వారలన్+గెల్వ, రామి= వారిని జయించలేమన్న విషయాన్ని; బహువిధంబులన్= ఎన్నో విధాలుగా; చెప్పరే?= చెప్పలేదా?; మున్ వినమె?= ఇంతకుముందు వినలేదా?; ఎఱింగియున్= తెలిసికూడా; మఱియున్= ఇంకా; వీఱిఁడి మాటలు= వెఱ్ఱివాడి మాటలవంటిమాటలు; వేయున్+ఏటికిన్= ఇన్ని ఎందుకు?

తాత్పర్యం: 'పరశురాముడు, భీష్మద్రోణులు అర్జునుడి భుజబలాన్ని, శ్రీకృష్ణుడి ఆధిక్యాన్ని గురించి సభలో ఎన్నో విధాలుగా మీకు వివరించారు కదా! అవన్నీ తెలిసికూడా ఇంకా ఎందుకు ఈ మూర్ఖమైన మాటలు?

విశేషం: వీఱిఁడి - వేఱిఁడి యొక్క రూపం - వీఱిఁడియైన మానిసికి వెండి వివేకము గల్గ నేర్చునే? (ఉద్యో. 3 ఆ)

క. ఒంటి మెయిఁ దాఁక నా ము। క్కంటికి వశమగునె కృష్ణ గాండీవుల ని
ట్లంట యుడిగి తగు రథికుల। జంటగొని రణమ్ము సలుపు శత్రులు దలఁకన్. 85

ప్రతిపదార్థం: కృష్ణ గాండీవులన్= కృష్ణార్జునులను; ఒంటిమెయిన్+తాఁకన్= ఒంటరిగా ఎదుర్కొనటానికి; ఆ ముక్కంటికిన్= ఆ శివుడికి; వశము+అగునె?= సాధ్యం అవుతుందా?; ఇట్లు+అనుట+ఉడిగి= ఈ విధంగా మాట్లాడటం మాని; తగు రథికుల= సమర్థులైన వీరులను; జంట+కొని= జతచేసికొని; శత్రులు+తలఁకన్= శత్రువులు కలత చెందగా; రణమ్ము సలుపు(ము)= యుద్ధం చేయుము.

తాత్పర్యం: కృష్ణార్జునులతో ఒంటరిగా తలపడటానికి ఆ పరమశివుడికైనా శక్తి చాలదు, కాబట్టి ఈ ఆలోచన విడిచిపెట్టి తగిన వీరులను జతచేసికొని వారితో యుద్ధం చేయుము.

తే. గొంతికొడుకును దేవకికొడుకు మనము। గనియెదము దినకర నిశాకరులుఁ బోలె
వెలుఁగ; నయ్యెడ ఖద్యోత విలసితంబు। తోడి దగుఁ గాక నీ పెంపు దోఁపఁగలదె? 86

ప్రతిపదార్థం: గొంతి కొడుకును= అర్జునుడు; దేవకి కొడుకు= కృష్ణుడు; దినకర నిశాకరులున్+పోలెన్ వెలుఁగన్= సూర్య చంద్రులవలె ప్రకాశించగా; మనము+కనియెదము= మనం చూస్తాము; ఆ+ఎడన్= ఆ కాంతిముందు; నీ పెంపు= నీ అతిశయం; ఖద్యోత విలసితంబు తోడిది+అగున్+కాక= మిణుగురు పురుగు వెలుగుతో సమానం అవుతుంది కాని; తోఁ పన్+కలదె?= ప్రకాశిస్తుందా?

తాత్పర్యం: అర్జున శ్రీకృష్ణులు సూర్యచంద్రులవలె ప్రకాశించటం మనం చూస్తాము. ఆ సమయాన నీ పరాక్రమం మిణుగురు పురుగు కాంతివంటిది అవుతుందిగాని, నీ ఆధిక్యం అగుపిస్తుందా?

విశేషం: అలం: ఉపమ.

వ. **అనిన విని కర్ణుండు 'గమలనాభుని పెంపును బార్థు బలిమియు నెఱుంగక యే నేల వారిఁ దొడరెద? నీ వెట్లు చెప్పినను దొడరుదుఁ, దొడరి వారొండె నేనొండె నగుదు నింతియ నీవు వెడమాట లాడక యుడుగు' మని పలికి యచ్చటి మహీపతులు విన నమ్మద్రపతి కి ట్లనియె.** **87**

ప్రతిపదార్థం: అనిన విని= (శల్యుడు) అనగా విని; కర్ణుండు= కర్ణుడు; కమలనాభుని పెంపును= శ్రీకృష్ణుడి ఆధిక్యాన్ని; పార్థు బలిమియున్= అర్జునుడి పరాక్రమాన్ని; ఎఱుంగక= తెలియకుండా; ఏను+ఏల= నేను ఎందుకు; వారిన్+తొడరెదన్?= వారితో తలపడతాను?; నీవు+ఎట్లు చెప్పినను= నీవు ఎంత చెప్పినా; తొడరుదున్= ఎదిరిస్తాను; తొడరి= ఎదిరించి; వారు+ ఒండె= వారో; నేను+ఒండె= నేనో; అగుదున్= అవుతాను; ఇంతియ= ఇంతేకాని; నీవు, వెడమాటలు+ఆడక= వ్యర్థవాక్కులు పలుకక; ఉడుగుము= ఊరుకో; అని పలికి= అని(కర్ణుడు); అచ్చటి మహీపతులు వినన్= అక్కడ ఉన్న(సేనలోని) రాజులు వినేటట్లుగా; ఆ+మద్రపతికిన్+ఇట్లు+అనియెన్= శల్యుడితో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: శల్యుడి మాటలు విన్న కర్ణుడు 'కృష్ణార్జునుల పరాక్రమం గురించి తెలియకుండానే నేను వారితో తలపడతానా? నీవు ఎన్ని చెప్పినా నేను వారిని ఎదుర్కొనకుండా మానను. వారో - నేనో మిగిలేది. అంతేకాని నీ వ్యర్థమైన మాటలు మానుకో. 'అంటూ సేనలోని రాజులు వినేటట్లుగా ఇంకా శల్యుడితో ఇట్లా అన్నాడు:

కర్ణుఁడు శల్యునితోఁ దనకుఁ గలిగిన శాపంబుల తెఱంగు సెప్పుట (సం. 8-29-3)

సీ. **'తలఁచిన నెదకు సంతాపంబు సేయంగఁ। జాలెడునట్టివి జామదగ్న్య**
కోపంబు బ్రాహ్మణ శాపంబు గాక యే। సరకు గొందునె మురహరుఁ గిరీటిఁ
జెప్పెద విను మస్త్రశిక్షార్థినై మహేం। ద్ర నగంబునకు జమదగ్ని సుతునిఁ
గోరి పోయినఁ గృపాంభోరాశి యగు నమ్మ। హాముని కులము నన్నడుగుటయును

తే. **బొంకునకు నోర్చి బ్రహ్మాస్త్రమునకుఁ గాఁగ। బ్రాహ్మణుఁడనని చెప్పి తత్పాదభక్తి**
గలిగి మెలఁగంగ శిక్షించె నలఘు బహువి। ధాస్త్ర శస్త్ర సంవేదిఁగా నతఁడు నన్ను. **88**

ప్రతిపదార్థం: జామదగ్న్య కోపంబు= పరశురాముడి ఆగ్రహం; బ్రాహ్మణ శాపంబు= బ్రాహ్మణుడు పెట్టినశాపాన్ని; తలఁచినన్= తలచుకుంటేనే; ఎదకున్= మనసుకు; సంతాపంబు= బాధ; సేయంగ చాలెడున్+అట్టివి= కలిగించేవి; కాక=

అట్లుకానిచో; మురహరున్= కృష్ణుడిని; కిరీటిన్= అర్జునుడిని; ఏన్= నేను; సరకుకొందునె?= లెక్కపెడతానా?; అస్త్రశిక్షా+అర్థినై= అస్త్రవిద్యనభ్యసించాలని; జమదగ్ని సుతునిన్+కోరి= పరశురాముడిని కోరి; మహేంద్రనగంబునకున్= మహేంద్రపర్వతానికి; పోయినన్= వెళ్ళగా; కృపా+అంభః+రాశి+అగు= దయాసముద్రుడైనట్టి; ఆ+మహాముని= పరశురాముడు; నన్ను కులము+అడుగుటయును= నా కులం అడుగగా; బ్రహ్మాస్త్రమునకున్+కాఁగన్= బ్రహ్మాస్త్రము కొరకు; బొంకునకున్+ఒర్చి= అబద్ధానికి సిద్ధమై; బ్రాహ్మణుఁడను+అని, చెప్పి= బ్రాహ్మణుడిని అని వచించి; తద్+పాదభక్తి+కలిగి= అతనిపై భక్తితో; మెలఁగంగన్= వర్తించగా; అతఁడు= పరశురాముడు; నన్నున్; ఆలఘు, బహువిధ+అస్త్రశస్త్ర సంవేదిగాన్= మహాస్త్రశస్త్ర జ్ఞానం కలవానిగా; శిక్షించెన్= విద్య బోధించాడు.

తాత్పర్యం: పరశురాముడి కోపం, బ్రాహ్మణశాపం నా మనసుకు సంతాపాన్ని కలిగిస్తున్నాయి. లేకుంటే నేను కృష్ణార్జునులను లెక్కపెట్టేవాడిని కాను. మహేంద్రపర్వతంపై ఉన్న పరశురాముడివద్ద అస్త్రవిద్య నేర్చుకొందామని వెళ్ళగా ఆయన నా కులం తెలుపుమని అడిగాడు. బ్రహ్మాస్త్రం కొరకు అసత్యానికి కూడా వెనుదీయక నేను బ్రాహ్మణుడిని అని చెప్పాను. భక్తిశ్రద్ధలతో మెలగిన నాకు ఆయన మహాస్త్రశస్త్రవిద్యలను బోధించాడు.

వ. భార్గవాభిదానంబగు మహాస్త్రంబు లోనుగా ననేక దివ్యాస్త్రంబు లిచ్చెఁ; బదంపడి బ్రాహ్మంబగు నస్త్రంబు నొసంగె నొసంగి సమరంబున నాపత్సమయంబున దీనిం బ్రయోగింపుమని యానతిచ్చె; మఱునాఁ డత్త పోధన సత్తముండు మదీయాంక తలంబున నొఱగి నిద్రించుచుండ నొక్క జంతువు నా క్రింది తొడం దొలిచిన నమ్మహాత్మునకు నిద్రాభంగం బయ్యెడు నని కదలకుండితిఁ దదనంతరంబ మేలుకని యతండు నెత్తుటి వెల్లువఁ గని తత్ప్రకారం బడిగి ఏను జెప్ప విని మద్ధైర్యంబున కచ్చెరువడి నీవు బ్రాహ్మణుండవు గా వెవ్వఁడవని యొత్తి యడుగుటయు వెఱచి సూతసుతుండ నని చెప్పితిఁ జెప్పునప్పు డక్కీటకంబు నాలోకించిన నది యదృష్టపూర్వ వికృతాకారంబై యుండె నర్జున హితంబు గోరి యింద్రుం డమ్మునీంద్రునకు నన్నుఁ దేటపఱచి యతనిం గోపింపంజేయువాఁడై కీట తనువు దాల్చి యట్లు సేసెంగా నోపు నా సంయమి కోపించి కపటంబున బ్రహ్మాస్త్రంబుఁ బరిగ్రహించి తది నీకు వలయు కాలంబున దోఁపమియు మృత్యువాసన్నంబైనం దోఁచుటయు నాపద ముట్టినయెడ భార్గవాస్త్రంబు దోఁపకుండుట యుం గలిగెడుమని శపించె; నిది జామదగ్న్య కోపంబు తెఱంగు బ్రాహ్మణ శాపంబు తెఱంగెఱింగించెద నాకర్ణింపుము. 89

ప్రతిపదార్థం: భార్గవ+అభిదానంబు+అగు మహా+అస్త్రంబు లోనుగాను= భార్గవ నామకమైన మహాస్త్రం మొదలుగా; అనేక దివ్య+అస్త్రంబులు+ఇచ్చెన్= పెక్కు దివ్యాస్త్రాలు ఇచ్చాడు; పదంపడి= పిదప; బ్రాహ్మంబు+అగు+అస్త్రంబున్= బ్రహ్మాస్త్రమును; ఒసంగెన్= ఇచ్చాడు; ఒసంగి= ఇచ్చి; సమరంబునన్= యుద్ధంలో; ఆపద్+సమయంబునన్= ఆపద సమయంలో; దీనిన్+ ప్రయోగింపుము+అని= దీనిని ఉపయోగించుము అని; ఆనతి+ఇచ్చెన్= ఆజ్ఞాపించాడు; మఱునాడు, ఆ+తపోధన సత్తముండు= పరశురాముడు; మదీయ+అంక తలంబునన్= నా ఒడిలో; ఒరిగి; నిద్రించుచున్+ఉండన్= నిద్రిస్తుండగా; ఒక్క జంతువు= ఒక కీటకం; నా క్రిందితొడన్+తొలిచినన్= నా తొడ క్రిందిభాగాన్ని తొలువగా; ఆ+మహాత్మునకున్= ఆ మహానుభావుడికి; నిద్రాభంగంబు+అయ్యెడున్+అని= నిద్రాభంగం అవుతుందని; కదలక+ఉండితిన్= కదలకుండా ఉన్నాను; తద్+అనంతరంబు+ అ మేలుకొని= ఆ తర్వాత మేలుకొని; అతండు= పరశురాముడు; నెత్తుటి వెల్లువన్+కని= రక్తప్రవాహాన్ని చూచి; తద్+ప్రకారంబు+ అడిగి= దాన్ని గురించి అడిగి; ఏను చెప్పవిని= నేను(జరిగిన సంగతి) చెప్పగా విని; మత్+ధైర్యంబునకున్+అచ్చెరువడి= నా

ధైర్యానికి ఆశ్చర్యం చెంది; నీవు, బ్రాహ్మణుండవు కావు= నీవు బ్రాహ్మణుడవు కావు; ఎవ్వఁడవు+అని= ఎవరు అని; ఒత్తి+ అడుగుటయున్= గుచ్చి అడుగగా; వెరచి= భయపడి; సూతసుతుండను+అని చెప్పితిన్= సూత పుత్రుడను అని చెప్పాను; చెప్పునప్పుడు= అట్లా చెబుతున్నపుడు; ఆ కీటకంబును+ఆలోకించినన్= ఆ పురుగును వెదకగా; అది= ఆ పురుగు; అదృష్టపూర్వ= మునుపుచూడనట్టి; వికృత+ఆకారంబు+ఐ+ఉండెన్= వికారరూపంతో కనిపించింది; అర్జున హితంబు కోరి= అర్జునుడి మేలుకోరి; ఇంద్రుండు= ఇంద్రుడు; ఆ+మునీంద్రునకున్= ఆ పరశురాముడికి; నన్నున్+తేటపఱిచి= నన్ను తెలిపి; అతనిన్+కోపింపన్+చేయువాఁడై= అతడికి కోపం తెప్పించాలని; కీటతనువు+తాల్చి= కీటకరూపం ధరించి; అట్లు+ చేసెన్+కానోపును= అట్లా చేసి ఉంటాడు; ఆ సంయమి= పరశురాముడు కోపించి; కపటంబునన్= మోసంతో; బ్రహ్మ+ అస్త్రంబున్= బ్రహ్మాస్త్రమును; పరిగ్రహించితి(వి)= గ్రహించావు; అది నీకున్; వలయుకాలంబునన్= అవసరమైనప్పుడు; తోఁపమియున్= గుర్తుకు రాకపోవటం; మృత్యువు+ఆసన్నంబు+ఐనన్= మరణం సమీపించినప్పుడు; తోఁచుటయున్= తలపునకు రావటం; ఆపద, ముట్టిన, ఎడన్= ఆపద సమీపించినప్పుడు; భార్గవ+అస్త్రంబు+తోఁపకుండుటయును= భార్గవాస్త్రం గుర్తుకురాకపోవటం; కలిగెడున్+అని= జరుగుగాక అని; శపించెన్= శాపం పెట్టాడు; ఇది; జామదగ్న్య కోపంబు తెఱంగు= పరశురాముడు కోపించిన విధము; బ్రాహ్మణ శాపంబు తెఱంగు= బ్రాహ్మణుడి శాపవృత్తాంతం; ఎఱింగించెదన్+ఆకర్ణింపుము= తెలుపుతాను వినుము.

తాత్పర్యం: భార్గవాస్త్రం మొదలైన అనేక దివ్యాస్త్రాలను ఇచ్చాడు. బ్రహ్మాస్త్రం బోధించి యుద్ధంలో ఆపద సమయంలో మాత్రమే దాన్ని ప్రయోగించుమని చెప్పాడు. ఒకరోజు పరశురాముడు నా ఒడిలో నిద్రిస్తూ ఉండగా ఒక కీటకం నా తొడ క్రిందిభాగాన్ని తొలువసాగింది. గురువుకు నిద్రాభంగం కాకూడదని నేను చలించకుండా అట్లాగే ఉన్నాను. ఆయన నిద్రలేచి ఎదురుగా కారుతున్న రక్తాన్ని చూచి నన్ను ప్రశ్నించాడు. నేను జరిగిన సంగతి చెప్పగానే నా ధైర్యానికి ఆశ్చర్యపడి నీవు బ్రాహ్మణుడవు కావు, ఎవరివని గుచ్చి గుచ్చి అడుగగా, నేను భయపడి సూతపుత్రుడ నన్న నిజాన్ని చెప్పాను. ముందెప్పుడూ చూడని వికారరూపంతో ఉన్న కీటకాన్ని చూచి బహుశా అర్జునుడి మేలుకోరి ఇంద్రుడు ఆ విధంగా చేసి ఉంటాడని నేను ఊహించాను. పరశురాముడు నాపై ఆగ్రహించి మోసంచేసి బ్రహ్మాస్త్రాన్ని గ్రహించావు. అవసరమైనప్పుడు అది గుర్తుకు రాకుండా మరణసమయంలో మాత్రమే స్ఫురిస్తుందని, భార్గవాస్త్రం ఆపదసమయంలో గుర్తుకు రాకుండా పోతుందని శాపం ఇచ్చాడు. ఇక బ్రాహ్మణశాపం గురించి చెబుతాను వినండి.

విశేషం: శాంతిపర్వం (1ఆ. 20-24)లో ఈ కీటక ప్రసక్తి మరొకవిధంగా ఉన్నది. తాను గ్రస్తుడనే పేరుగల రాక్షసుడననీ, భృగుపత్నిని అపహరించినందుకు శాపంపొంది కీటక రూపమైనానని, కర్ణుడి కృపావిలోకనంతో నిజరూపం ధరించానని వచించాడు.

సీ. **శ్రమమునకై యేను సకలాంబకములు నె । క్కుడు వెస నేయ నయ్యెడకు నొక్క**
యాఁబెయ్య యుఱికి నా యజ్ఞానమున నంప । తాఁకునఁ గూలుడు దానిఁ గలుగు
బ్రాహ్మణుం డధికకోపంబున నిది హోమ । ధేనువత్సం బిట్లు దీని శల్య
నిహతంబుఁ జేసితి నీవు నా వచన శ ।ల్యంబున నిహతుండ వగుము నీకు

తే. **సమర మేకాగ్ర నిర్భరోత్సాహవృత్తి । నడవ నరదంబు చక్రంబు పుడమిఁ గ్రుంగ**
వలయు నెవ్వరు మార్కొని గెలువఁ గోరి । శ్రమము సేసెద వతనిచేఁ జావు మీవు.' **90**

ప్రతిపదార్థం: ఏను= నేను; శ్రమమునకై= అభ్యాసం కొరకు; సకల+అంబకములున్= అన్ని అమ్ములు; ఎక్కుడు వెసన్+ఏయన్= మిక్కిలివేగంతో వేయగా; ఆ+ఎడకున్= ఆ దిశకు; ఒక్క ఆవు+పెయ్య+ఉఱికి= ఒక ఆవుదూడ పరుగెత్తి; నా అజ్ఞానమునన్= అది ఉన్నట్లు నాకు తెలియనందువల్ల; అంపతాఁకునన్= బాణం వేటుకు; కూలుడున్= చనిపోగా; దానిన్+కలుగు బ్రాహ్మణుండు= దాని యజమానుడు అయిన బ్రాహ్మణుడు; అధికకోపంబునన్= ఎంతో కోపంతో; ఇది; హోమధేనువత్సంబు= యజ్ఞపు ఆవుదూడ; ఇట్లు= ఈ విధంగా; దీనిన్= దీనిని; శల్య నిహతంబున్+చేసితి(వి)= బాణంతో చంపావు; నా వచన శల్యంబునన్= నా వాగ్బాణంతో; నీవు; నిహతుండవు+అగుము= మరణించుము; నీకున్, ఏకాగ్ర నిర్భర+ఉత్సాహవృత్తిన్= శ్రద్ధతో కూడిన ఉత్సాహవర్తనతో; సమరము నడవన్= యుద్ధం సాగగా; అరదంబు చక్రంబు= రథచక్రం; పుడమిన్= నేలలో; క్రుంగవలయున్= దిగబడాలి; ఎవ్వరు మార్కొని= ఎవరిని ఎదుర్కొని; గెలువన్+కోరి= గెలువదలచి; శ్రమము చేసెదవు= శ్రమిస్తున్నావో; అతనిచేన్= అతనిచేత; ఈవు, చావుము= నీవు చనిపొమ్ము.

తాత్పర్యం: నేను శిక్షణకొరకై ఎంతో వేగంగా బాణాలు వేస్తుండగా నాకు తెలియకుండానే ఒక ఆవుదూడ నా బాణానికి గురై ప్రాణాలు కోల్పోయింది. దాని యజమాని నాపై కోపగించి, 'హోమధేనువు దూడను బాణంతో చంపావు. అందుకు ప్రతిఫలంగా నా వాగ్బాణంతో నీవు చావు' అని ఉత్సాహంగా యుద్ధం చేస్తున్నపుడు నీ రథచక్రం నేలలో దిగబడుతుందని, ఎవరిని జయించాలని నీవు విలువిద్యను అభ్యసిస్తున్నావో అతడిచేతనే నీవు చస్తావని నన్ను శపించాడు.'

చ. **అనుటయు భీతి వేఁడికొని 'యావులు వేయును నెడ్ల నాఱునూ**
ఱును రథముల్ శతంబును మెఱుంగుల మొత్తముఁ బోని యంగనా
జన శతకంబు దంతి శత సప్తకముం గొని శాంతిఁ బొందవే!'
యనినను మానదయ్యె వసుధామరు కోపము తీవ్రరూపమై. **91**

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; భీతి, వేఁడికొని= భయంతో అతడిని ప్రార్థించి; ఆవులు వేయునున్= వేయి ఆవులను; ఎడ్లను+ఆఱునూఱును= ఆరునూర్ల ఎద్దులను; రథముల్, శతంబును= నూరు రథాలను; మెరుంగుల మొత్తమున్+పోని= విద్యుల్లతల సమూహాన్ని పోలిన; అంగనాజన శతకంబు= నూరుమంది స్త్రీలను; దంతి, శత, సప్తకమున్= ఏడునూర్ల ఏనుగులను; కొని= గ్రహించి; శాంతిన్+పొందవే= శాంతి చెందుము; అనినన్= అని కోరినా; వసుధా+అమర కోపము= ఆ బ్రాహ్మణుడి కోపం; తీవ్రరూపము+ఐ= ఎంతో అధికమై; మానదు+అయ్యెన్= తగ్గలేదు.

తాత్పర్యం: ఆ శాపానికి భయపడి నేను ఆ బ్రాహ్మణుడిని ప్రార్థిస్తూ వేయి ఆవులు, ఆరువందల ఎద్దులు, నూరురథాలు, ఏడువందల ఏనుగులు, వందమంది అందమైన స్త్రీలను స్వీకరించి నన్ను అనుగ్రహించుమని కోరినా అతడి ఆగ్రహం తీవ్రమైనదై ఏమాత్రం తగ్గలేదు.

వ. **మానక యున్న మఱియును.** **92**

ప్రతిపదార్థం: మానక+ఉన్నన్= తగ్గకుండ ఉండగా; మఱియును= ఇంకా.

తాత్పర్యం: అతడి కోపం తగ్గకపోగా, ఇంకా.

క. **'నాకుఁ గల సొమ్ములెల్లను । నీ కిచ్చెద ననుఁ బ్రసాద నిరత కటాక్షా**
లోకితుఁ జేయు' మనుడు నతఁ ।'డీ కాఱులు మాను' మనుచు నేఁగెం బెలుచన్. 93

ప్రతిపదార్థం: నాకున్+కల సొమ్ములు+ఎల్లను= నావద్ద ఉన్న సొమ్ములన్నీ; నీకున్+ఇచ్చెదన్= నీకు ఇస్తాను; ననున్= నన్ను; ప్రసాద నిరత= అనుగ్రహంతో నిండిన; కటాక్ష+ఆలోకితున్+చేయుము= చూపులు ప్రసరించబడినవాడినిగా చేయుము; అనుడున్= అనినంతనే; అతఁడు= ఆ బ్రాహ్మణుడు; ఈ కాఱులు= ఈ వ్యర్థ వచనాలు; మానుము+అనుచున్= పలుకకుమని; పెలుచన్= కోపంతో; ఏఁగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'నా దగ్గరున్న సొమ్ములన్నీ నీకు ఇస్తాను. నీ కరుణాకటాక్షంతో నన్ను అనుగ్రహించుము' అని ఎంత వేడినా 'ఈ వెడ మాటలు వ' ద్దంటూ ఆ బ్రాహ్మణుడు కోపంతో వెళ్ళిపోయాడు.

వ. **ఇ ట్లరుగుచు నలుక పెంపునం గన్నుల నిప్పులు రాల మరలి కనుంగొని 'నా పలుకులకు బొంకునుం గలదే? నీకీ దుష్కర్మంబు పరలోకంబున బాధకంబు గాకుండ నిదియ ప్రాయశ్చిత్తం బయ్యెడుం గాక పొమ్ము సూతనందనా! యే నెట్లంటి నట్లగుట దప్ప దరుగు' మనియెం గావున నా జామదగ్న్య; బ్రాహ్మణుల శాపంబులకు వెఱతు సత్యంబ పలికితి నీ యున్న రాజులను నాతోడి సుఖ దుఃఖంబులకుం గలవా రగుటం జేసి కృష్ణార్జునులకు నే వెఱవ నింద్ర యమ వరుణ కుబేరులు వజ్ర దండ పాశ గదా హస్తులై బెట్టుముట్టి నను బెదర నని యాడుదుఁ; దక్కిన వారిం జెప్పనేల? యిప్పుడు బ్రహ్మాస్త్రంబునుం దోఁచుచున్నది; యన్నరుని యున్నెడకు మనరథంబు నడపుము పుడమి జనంబులు మదీయ కోదండ పాండిత్యం బొండొరులకుం జెప్పికొని యచ్చెరువందు చుండునట్లు సేసెద; నమ్మేటి మగని మృత్యు నివాసంబు నొందించెద.** 94

ప్రతిపదార్థం: ఇట్లు+అరుగుచున్= ఈ విధంగా వెళ్ళిపోతూ; అలుక, పెంపునన్= కోపాధిక్యంతో; కన్నుల నిప్పులు రాల= కన్నులు ఎర్రబడగా; మరలి కనుంగొని= వెనుకకు తిరిగి చూచి; నా పలుకులకున్= నా మాటలకు; బొంకునున్+కలదే?= అబద్ధంకావటం ఉన్నదా?; ఈ దుష్కర్మంబు= ఈ చెడ్డపని; నీకున్, పరలోకంబునకున్ బాధకంబు కాకుండన్= స్వర్గప్రాప్తికి ఆటంకం కాకుండ; ఇదియ ప్రాయశ్చితంబు+అయ్యెడున్+కాక= ఇదే ప్రాయశ్చిత్తం కాగలదు; పొమ్ము= వెళ్ళుము; సూతనందనా!= కర్ణా!; ఏను+ఎట్లు+అంటిన్+అట్లు+అగుట, తప్పదు= నేను అన్న ప్రకారంగా జరుగుట తప్పదు. అరుగుము+అనియెన్= వెళ్ళుము అన్నాడు; కావునన్= అందువలన; ఆ జామదగ్న్య, బ్రాహ్మణుల, శాపంబులకున్= ఆ పరశురామ, బ్రాహ్మణుల శాపాలకు; వెఱతున్= భయపడుతాను; సత్యంబు+అ, పలికితిన్= నిజమే వచించాను; ఈ+ఉన్న రాజులును= ఇక్కడున్న రాజులందరు; నా తోడి, సుఖ, దుఃఖంబులకున్+కలవారు+అగుటన్+చేసి= నాతో సమంగా సుఖదుఃఖాలు పంచుకొనేవారు కావటంవలన; కృష్ణ+అర్జునులకున్= కృష్ణార్జునులకు; ఏన్+వెఱవన్= నేను భయపడను; ఇంద్ర, యమ, వరుణ, కుబేరులు= దిక్పాలకులు నలుగురూ; వజ్ర, దండ, పాశ, గదా హస్తులు+ఐ= వరుసగా వజ్రాయుధం; యమదండం, పాశం గదలతో కూడినవారై; బెట్టు ముట్టినను= గట్టిగా తాకినా; బెదరను+అని+ఆడుదున్= భయపడను అని అంటున్నాను; తక్కినవారిన్+ చెప్పన్+ఏల?= మిగతా వీరుల సంగతి చెప్పటం ఎందుకు?; ఇప్పుడు బ్రహ్మాస్త్రంబునున్+తోఁచుచున్నది= ఇప్పుడు బ్రహ్మాస్త్రం స్ఫురిస్తున్నది; ఆ+నరుని+ఉన్న+ఎడకున్= అర్జును డున్న చోటికి; మన, రథంబు, నడపుము= మన రథాన్ని పోనిమ్ము; పుడమి జనులు= భూమిపై గల సకల జనులు; మదీయ కోదండ, పాండిత్యంబు= నా ధనుర్విద్యా కౌశలం; ఒండు+ఒరులకున్+ చెప్పికొని= ఒకరికొకరు చెప్పికొని; అచ్చెరువున్+అందుచుండ+అట్లు చేసెదన్= ఆశ్చర్యపడేటట్లుగా చేస్తాను; ఆ మేటి మగని= ఆ వీరుడైన అర్జునుడిని; మృత్యు నివాసంబున్+ఒందించెదన్= మృత్యువు నివసించే చోటు పొందేటట్లు చేస్తాను - సంహరిస్తాను.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణుడు వెళ్ళిపోతూ నా వైపు కోపంగా తిరిగి చూచి 'నా మాటలకు తిరుగు లేదు. నీవు చేసిన పని నీ పరలోక ప్రాప్తికి మాత్రం అడ్డురాదు. ఇదే నీకు ప్రాయశ్చిత్తం. కర్ణా! నేను అన్న ప్రకారం జరిగి తీరుతుంది.' అని అన్నాడు. ఆ పరశురామ, బ్రాహ్మణుల శాపాలకు భయపడుతున్నాను కాని, కృష్ణార్జునులకు కాదు. ఈ యోధులందరూ నాతోపాటు సుఖదుఃఖాలు పొందేవారు కాబట్టి నిజం చెప్తున్నాను. ఇంద్ర, యమ, వరుణ, కుబేరులు తమ తమ ఆయుధాలతో వచ్చి తాకినా నాకు భయం లేదు. ఇప్పుడు బ్రహ్మాస్త్రం గుర్తుకు వస్తున్నది. రథాన్ని అర్జునుడున్న వైపు మళ్ళించుము. నా విలువిద్యాకౌశలాన్ని ప్రదర్శించి అతడిని సంహరిస్తాను.

సీ. కాండ మహా తరంగముల వైరుల ముంచు । విజయాంబురాశికి వేల నగుదు;
బాణరశ్ములఁ బరిపంథులఁ బొదివెడు । నర్జునాదిత్యున కభ్ర మగుదు;
విశిఖోగ్ర శిఖల విద్విషుల నేర్చు కిరీటి । ఘోర దావాగ్ని కాసార మగుదుఁ;
బ్రదర వేగమున నరాతులఁ గూల్చు పా । ర్థాతి వాయువునకు నచల మగుదు;

తే. విల్లు వట్టెడు వారికి నెల్ల నెక్కు । డనఁగ నెగడిన గాండీవి నాహవమునఁ
దొడరఁ బ్రాణంబులకు నాసపడు లఘు ప్ర । కారులకు వచ్చునే నాకుఁ గాక శల్య!' 95

ప్రతిపదార్థం: కాండ మహాతరంగముల= బాణాలనే పెద్ద అలలతో; వైరులన్+ముంచు= శత్రువులను ముంచివేసే; విజయ+అంబురాశికిన్= అర్జును డనే సముద్రానికి; వేలన్+అగుదున్= చెలియలికట్ట నవుతాను; బాణ, రశ్ములన్= బాణాలనే కాంతులతో; పరిపంథులన్= శత్రువులను; పొదిలెడు= చుట్టుముట్టే; అర్జున+ఆదిత్యునకున్= అర్జునుడనే సూర్యుడికి; అభ్రము+అగుదున్= మేఘం అవుతాను; విశిఖ+ఉగ్ర, శిఖలన్= బాణాలనే భయంకర జ్వాలలతో; విద్విషులన్+ఏర్చు= శత్రువులను దహించే; కిరీటి ఘోరదావ+అగ్నికిన్= అర్జునుడనే కార్చిచ్చుకు; ఆసారము+అగుదున్= జడివాన కాగలను; ప్రదర వేగమునన్= బాణ వేగంతో; అరాతులన్+కూల్చు= శత్రువులను కూలగొట్టే; పార్థ+అతి, వాయువునకున్= అర్జునుడనే పెనుగాలికి; అచలము+అగుదున్= పర్వతమై నిలుస్తాను; శల్య!= శల్యుడా!; విల్లు పట్టెడువారికిన్+ఎల్లన్= విలుకాండ్రందరిలో; ఎక్కుడు+అనఁగన్, నెగడిన= శ్రేష్ఠుడని పేరు పొందిన; గాండీవిన్= అర్జునుడిని; ఆహవమునన్+తొడరన్= యుద్ధంలో ఎదుర్కొనటానికి; నాకున్+కాక= నాకు తప్ప; ప్రాణంబులకున్+ఆసపడు= ప్రాణాలపై తీపిగల; లఘు ప్రకారులకున్= శక్తిహీనులకు; వచ్చునే?= శక్యమగునా?

తాత్పర్యం: తన బాణాలనే పెద్ద అలలతో శత్రువులను ముంచే అర్జునుడనే సముద్రానికి చెలియలికట్టనవుతాను. బాణాలనే కిరణాలతో శత్రువులను ఆక్రమించే విజయుడనే సూర్యుడిని మేఘంలా కప్పివేస్తాను. బాణాలనే మహాభయంకర జ్వాలలతో శత్రువులకాల్చే అర్జునుడనే దావాగ్నిని జడివాననై చల్లార్చుతాను. బాణాల వేగంతో శత్రువుల కూల్చే పార్థుడనే పెనుగాలికి పర్వతాన్నై అడ్డు తగులుతాను. శల్యా! ధనుర్ధారులలో ప్రసిద్ధికెక్కిన అర్జునుడిని యుద్ధంలో ఎదుర్కొనటానికి ప్రాణాలకు సైతం వెనుదీయని నాకు తప్ప ప్రాణాలకు ఆశపడే శక్తిహీనులకు సాధ్యమౌతుందా?

విశేషం: అలంకారం - రూపకం.

వ. అని పలికిన విని యమ్మద్రపతి 'వీని యంతరంగంబు గలంగెఁ; దా నర్జును చేతం జచ్చుట నిర్ణయించె; నెట్లనిన నిట్టి యప్పుడు జనులు దన మీఁదం జాలమి వెట్ట కుండుటకుం గాదె జామదగ్న్య బ్రాహ్మణుల

శాపంబులు భూపాలురు విన నుగ్గడించె; నిక్కలంక యే నీ రజ్జులానికి నర్జును గుణ విశేషంబు లెఱింగించి మదం బడంచిన కతంబునం గలిగెఁ; గౌంతేయాగ్రజునకు నా యిచ్చిన వరంబు సఫలం బయ్యె' నని మనంబునం దలంచి సంతోషించె మనుజేశ్వర వినుమా శల్యుండు సెప్పిన యాఖ్యానంబునం జిత్తం బెరియుచునికిం జేసి యా సూతనందనుం డతనితోఁ గనలుచు మఱియు నిట్లనియె. 96

ప్రతిపదార్థం: అని పలికిన విని= (కర్ణుడు) అనగా విని; ఆ+మద్రపతి= శల్యుడు; వీని, అంతరంగంబు, కలంగెన్= ఇతడి మనసు కలత చెందింది; తాను; అర్జునుచేతన్+చచ్చుట= అర్జునుని చేత చనిపోవుటను; నిర్ణయించెన్= నిశ్చయించాడు; ఎట్లు+అనినన్= అది ఎట్లా అంటే; ఇట్టి+అప్పుడు= ఇటువంటి సమయంలో; జనులు= ప్రజలు; తనమీఁదన్= తనపై; చాలమిపెట్టక+ఉండుటకున్+కాదె= అసమర్థతాదోషాన్ని ఆరోపించకూడదనే కదా!; జామదగ్న్య బ్రాహ్మణుల శాపాలు; భూపాలురు= రాజులు; వినన్= వినునట్లుగ; ఉగ్గడించెన్= చెప్పాడు; ఏను= నేను; అర్జునగుణ విశేషంబులు= అర్జునుడి పరాక్రమ విశేషాలు; ఎఱింగించి= తెలిపి; మదంబు+అడంచిన, కతంబునన్= గర్వం అణచటం వలన; ఈ రజ్జులానికిన్= ఈ ఆత్మస్తుతి పరుడైన కర్ణుడికి; ఈ+కలంక= ఈ కలత; కలిగెన్= కలిగింది; కౌంతేయ+అగ్రజునకున్= ధర్మరాజునకు; నా ఇచ్చిన వరంబు= నేను ఇచ్చినమాట; సఫలంబు+అయ్యెన్+అని= నెరవేరింది అని; మనంబునన్+తలంచి= మనసులో అనుకొని; సంతోషించెన్= ఆనందించాడు; మనుజేశ్వర!= ధృతరాష్ట్రమహారాజా!; వినుము; ఆ శల్యుండు చెప్పిన ఆఖ్యానంబునన్= శల్యుడు వినిపించిన హంసకాకీయోపాఖ్యానం వలన; ఆ సూతనందనుఁడు= కర్ణుడు; చిత్తంబు+ఎరియుచున్+ఉనికిన్+చేసి= మనసు బాధపడటంతో; కనలుచున్= కోపిస్తూ; అతనితోన్= శల్యుడితో; మఱియున్+ఇట్లు+అనియెన్= ఇంకా ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కర్ణుడి మాటలు విని శల్యుడు తనలో ఇట్లా అనుకొన్నాడు: ఇతడి మనసు కలతచెంది అర్జునుడి చేత చావు తప్పదన్న నిశ్చయానికి వచ్చాడు. అందుకే తనకు అసమర్థతా దోషం అంటకుండా సైన్యంలోని రాజులముందు పరశురాముడి, బ్రాహ్మణుడి శాపాలు ఏకరువు పెట్టాడు. నేను అర్జునుడి బలవిశేషాలు వెల్లడించి తన గర్వం అణచటంవలననే అతడి మనసు ఇట్లా దుర్బలమైనది. నేను ధర్మజుడికి ఇచ్చిన మాట ఈ విధంగా సఫలమైనది' అనుకొంటూ శల్యుడు ఎంతో సంతోషించాడు. ధృతరాష్ట్ర మహారాజా! వినుము. శల్యుడు వినిపించిన కాకి-హంసల కథతో మనసులో బాధపడుతున్న కర్ణుడు శల్యుడిపై మండిపడుతూ ఇట్లా అనసాగాడు:

కర్ణుఁడు హంసకాకీయోపాఖ్యానము విని కోపించి శల్యుని దూఱుట (సం. 8-30-3)

**క. 'దృష్టాంతము సెప్పెద నని । కష్టాత్మా! నీవు నన్నుఁ గాకము నరు ను
త్కృష్ట మరాళము గాఁగ ని । కృష్టంపుఁ గథఁ జెప్పి; తిది సఖిత్వము తెఱఁగే? 97**

ప్రతిపదార్థం: కష్ట+ఆత్మా!= దుర్బుద్ధివైన శల్యుడా!; దృష్టాంతము చెప్పెదను+అని= ఉదాహరణం చెప్పుతానని; నీవు; నన్నున్= నన్ను; కాకము= కాకిగానూ; నరున్= అర్జునుడిని; ఉత్కృష్టమరాళముకాఁగన్= గొప్ప హంసగానూ; నికృష్టంపు+కథన్= హీనమైన కథను; చెప్పితి(వి)= చెప్పావు; ఇది= ఇట్లా చేయటం; సఖిత్వము తెఱఁగే?= స్నేహధర్మమేనా?

తాత్పర్యం: 'దుష్టుడవైన ఓ శల్యుడా! ఉదాహరణ చెబుతానని నీవు నన్ను నీచమైన కాకిగా, అర్జునుడిని శ్రేష్ఠమైన హంసనుగా భావించి హీనమైన కథను వచించావు. స్నేహితుడవైన నీకు ఇది న్యాయమా?

ఆ. నీచులకు బలంబు నెట్టన పరుసని । కాఱు లఱచు చున్కి గాన యిట్లు
పలికి తింతఁ జేసి భయ మయ్యెనే నాకు? । నట్టిమాట లింక నాడ కుడుగు. 98

ప్రతిపదార్థం: నీచులకున్= దుర్జనులకు; పరుసని కాఱులు= కఠినమైన వ్యర్థ వాక్కులు; అఱచుచున్+ఉన్కి= పలుకుతుండటం; నెట్టనబలంబు= అడ్డులేని బలం; కానన్= అందుచేతనే; ఇట్లు పలికితి(వి)= ఈ విధంగా మాట్లాడినావు; ఇంతన్+చేసి= ఇంత చేసినా; నాకున్= నాకు; భయము+అయ్యెనే?= భయం కలిగిందా?; అట్టిమాటలు= అటువంటి (వ్యర్థమైన) మాటలు; ఇంకన్+ ఆడక+ఉడుగు(ము)= ఇంక పలుకవద్దు.

తాత్పర్యం: నీచులకు వ్యర్థమైన నిష్ఠురవాక్కులు పలుకుతుండటమే బలం. అందువల్లనే నీవు ఈ విధంగా పలికావు. అయినా నీ మాటలవల్ల నాకు భయం కలిగిందా? లేదే. వాటిని కట్టిపెట్టుము.

క. అడిగితినే నిను నా క । వ్వడి భుజబల మెట్టిదని? యవారణ నీ వి
ప్పుడు నృపు లెల్లను విన వా । విడిచి పొగడె దిట్లు వంది విధమున నతనిన్. 99

ప్రతిపదార్థం: ఆ కవ్వడి, భుజబలము+ఎట్టిది+అని= అర్జునుడి పరాక్రమం ఎంతటి దని; నినున్= నిన్ను; అడిగితినే?= అడిగానా?; నీవు+ఇప్పుడు= నీవు ఇప్పుడు; నృపులు+ఎల్లను, వినన్= రాజులందరు వినేటట్లుగా; వా విడిచి= నోరు విప్పి; అవారణన్= అడ్డులేక; వంది విధమునన్= భట్టువలె; అతనిన్= అర్జునుడిని; ఇట్లు పొగడెదు= ఈ విధంగా పొగడుతున్నావు.

తాత్పర్యం: అర్జునుడి పరాక్రమం గురించి నేను నిన్ను అడిగానా? వంది వలె అడ్డులేకుండా రాజులందరిముందు అతడిని పొగడుతున్నావు.

చ. అని మొన శత్రులం బొగడు టారయ మూర్ఖతగాదె? యిట్టి దు
ర్జనుల సహింతురే? పెలుచఁ జంపక; సైరణసేయుకాల మై
నినుఁ దెగఁ జూడనైతి ధరణీపతి కయ్యముపై భరంబునన్
గొనకొని సూతకృత్యమునకుం దగఁ బంచినవాఁడు గావునన్?' 100

ప్రతిపదార్థం: అనిమొనన్= యుద్ధరంగంలో; శత్రులన్+పొగడుట= వైరులను స్తుతించటం; అరయన్= చూడగా; మూర్ఖతకాదె?= అవివేకం కాదా?; ఇట్టి దుర్జనుల= ఇటువంటి దుష్టులను; పెలుచన్+చంపక= ఆగ్రహంతో చంపకుండా; సహింతురే?= ఊరుకొంటారా?; ధరణీపతి= దుర్యోధనుడు; కయ్యముపై భరంబునన్= యుద్ధభారంతో; గొనకొని= పూనుకొని; సూతకృత్యమునకున్+తగన్= సారథిగా ఉండటానికి; పంచినవాడు, కావునన్= పంపించాడు కాబట్టి; సైరణ, చేయుకాలము+ఐ= సహింపవలసిన సమయం కావటంతో; నినున్+తెగన్+చూడన్+ఐతిన్= నిన్ను చంపలేకపోతున్నాను.

తాత్పర్యం: ఆలోచించి చూస్తే యుద్ధానికి ముందు శత్రువులను పొగడుట మూర్ఖత కదా! ఇలాంటి దుష్టులను సంహరించకుండా ఎవరైనా సహిస్తారా? కాని, దుర్యోధనుడు యుద్ధభారాన్ని వహించి, సూతకృత్యానికి నిన్ను పంపినాడు కనుక, ఇది నిన్ను సహించవలసిన సమయం కనుక, నిన్ను చంపకుండా ఉన్నాను.

వ. అని వెండియు. 101

తాత్పర్యం: అని ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **'అకుటిలుం డగు నాకు నత్యంత కుటిల। వృత్తి సహితంబు సేసెద విత్తెఱంగు**
మిత్త్ర వంచన మారయ మైత్రి సప్త। పద కృతోద్భూతి యనియెడు పలుకు వినవె? 102

ప్రతిపదార్థం: అకుటిలుండు+అగు నాకున్= నిర్మలుడైన నాకు; అత్యంత కుటిలవృత్తి సహితంబు= ఎంతయో మోసంతోకూడినదానిని; చేసెదవు= చేస్తున్నావు; ఈ+తెఱంగు= ఈ పద్ధతి; ఆరయన్= విచారించి చూడగా; మిత్రవంచనము= మిత్రద్రోహం; మైత్రి= స్నేహం; సప్తపదకృత+ఉద్భూతి= ఏడు మాటలవలననే ఏర్పడుతుంది; అనియెడు పలుకు= అన్న మాట; వినవె?= వినలేదా?

తాత్పర్యం: ఏడు మాటలతోనే స్నేహం ఏర్పడుతుందని వినలేదా? విచారించిచూస్తే మంచివాడినైన నన్ను ఎంతో మోసగించి మిత్రద్రోహానికి పాల్పడుతున్నావు.

విశేషం: 'సఖ్యం సాప్తపదీనం' అని ప్రసిద్ధి. కలిసి ఏడు అడుగులు నడిచినా, ఏడు మాటలు మాట్లాడినా అపరిచితుల మధ్య స్నేహభావం ఏర్పడుతుంది.

క. **జను లెట్టిది మిత్త్రవిధం। బని చెప్పుదు రట్టి చంద మఖిలము దుర్యో**
ధనునందుఁ గలదు నా యెడ। మన మూఱడియుండు నా కమంద ప్రీతిన్. 103

ప్రతిపదార్థం: మిత్రవిధంబు= స్నేహపద్ధతి; ఎట్టిది అని= ఎటువంటిదని; జనులు చెప్పుదురు= లోకులు చెపుతుంటారో; అట్టి చందము+అఖిలము= ఆ విధం (స్నేహభావం) అంతా; నా+ఎడన్= నాపై; దుర్యోధనునందున్ కలదు= దుర్యోధనుడిలో ఉన్నది; అమందప్రీతిన్= అట్టి అధికానందంతో; నాకు; మనము+ఊఱడి, ఉండున్= మనసు ఊరటగా ఉంటుంది.

తాత్పర్యం: లోకుల దృష్టిలో స్నేహం అనేది ఎటువంటిదో, అటువంటి స్నేహభావం అంతా దుర్యోనుడికి నాపై ఉన్నది. ఆ మైత్రిని తలచుకొని నేను ఎంతో ఆనందిస్తుంటాను.

క. **జను లెట్టిది శత్త్రు విధం। బని చెప్పుదు రట్టి చంద మారయఁగా దు**
ర్జనుఁడ వగు నీకు నాయెడ। వినుము కలిగె; దీన మనసు విచ్చెం గుటిలా! 104

ప్రతిపదార్థం: కుటిలా!= దుర్జనుడా!; ఎట్టిది, శత్రువిధంబు+అని= ఎటువంటిది శత్రుత్వం అని; జనులు చెప్పుదురు= లోకులు చెపుతుంటారో; అట్టిచందము= ఆ శత్రుభావం; ఆరయఁగాన్= చూడగా; దుర్జనుఁడవు+అగు నీకున్= చెడ్డవాడివైన నీకు; నా ఎడన్ కలిగెన్= నా పై కలిగింది; వినుము; దీనన్ మనసు విచ్చెను= ఈ ప్రవర్తన వలన నా మనసు కలత చెందింది.

తాత్పర్యం: వైరం అన్నది ఎట్లా వుంటుందని లోకులు చెపుతుంటారో అటువంటి శత్రుభావం దుష్టుడివైన నీకు నాపై ఉన్నది. దీనివలన నా మనసు ఎంతో బాధపడుతున్నది.

ఉ. **కావున నీకు నప్రియముఁ గౌరవ రాజునకుం బ్రియంబునుం**
గా విధి మెచ్చ బాహుబల గర్వ మఖర్వముగాఁగ లక్షికిం
జేవయుఁ గీర్తి కున్నత విజృంభణముం గలుగన్ ముకుంద గాం
డీవులఁ దాఁకి గెల్చెదఁ గడింది మగంటిమి యుల్లసిల్లఁగన్. 105

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; బాహుబల గర్వము= భుజబలదర్పం; అఖర్వముకాఁగన్= అతిశయించగా; లక్ష్మికిన్+ చేవయున్= లక్ష్మికి బలం; కీర్తికిన్+ఉన్నత విజృంభణమున్= యశస్సుకు మిక్కిలి వ్యాప్తి; కలుగన్= కలిగేటట్లుగా; విధి మెచ్చన్= విధి మెచ్చేటట్లుగా; నీకున్+అప్రియమున్= నీకు అప్రీతిని; కౌరవరాజునకున్+ప్రియంబునన్= దుర్యోధనుడికి సంతోషం; కా(న్)= అయ్యేటట్లుగా; ముకుంద, గాండీవులన్= కృష్ణార్జునులను; తాఁకి= ఎదుర్కొని; కడిందిమగంటిమి+ ఉల్లసిల్లఁగన్= గొప్ప పౌరుషం ఉప్పొంగగా; గెల్చెదన్= జయిస్తాను.

తాత్పర్యం: కాబట్టి మిత్రుడైన దుర్యోధనుడికి ప్రియం, శత్రువైన నీకు అప్రియం కలిగేటట్లుగా నా బాహుబలగర్వం అతిశయించగా, విధి మెచ్చేటట్లుగా, లక్ష్మికి బలం, కీర్తికి ఉన్నతి కలిగేటట్లుగ కృష్ణార్జునులను ఎదుర్కొని ఓడిస్తాను. నా పౌరుషం ఉప్పొంగగా గెలుస్తాను.

వ. అని పలికి మఱియును. 106

తాత్పర్యం: కర్ణుడు ఈ విధంగా పలికి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. 'భండనంబునఁ బార్థుచేఁ బడక నేఁడు । మేలుచేయైతి నేనియు మృత్యువునకు
నెన్నఁడును నగపడ నాకు; నివ్విధంబు । సందియము లేక చిత్తంబునందుఁ దోఁచె. 107

ప్రతిపదార్థం: నేఁడు= ఈరోజు; భండనంబునన్= యుద్ధంలో; పార్థుచేన్+పడక= అర్జునుడిచే ఓడిపోక; మేలుచేయి+ఐతిన్+ ఏనియున్= పై చేయి కలవాడిని అయితే(గెలిస్తే); మృత్యువునకున్= మరణానికి; ఎన్నఁడునున్+అగపడన్= ఎప్పుడూ అగుపించను; ఈ విధంబు= ఈ విషయం; సందియము లేక= నిస్సందేహంగా; నాకున్; చిత్తంబునందున్+తోఁచెన్= మనసులో అనిపిస్తున్నది.

తాత్పర్యం: ఇప్పుడు అర్జునుడిని యుద్ధంలో గెలవగలిగితే ఇంక ఎప్పుడూ మృత్యువు నా దరి చేరదని నా మనసుకు దృఢంగా తోస్తున్నది.

విశేషం: మేలు చేయైతినేనియు జాతీయం.

చ. వినుత మహాస్త్రముల్ వఱపి విక్రమ సంపద నాకుఁ జూపు న
ర్జున భుజలీల కోర్చెద; వసుంధరఁ జక్రము గ్రుంగి నా రథం
బునకు నవార్యమై యెడరు పుట్టక తక్కిన శల్య! చూడుమీ!
నను విశిఖావలీ విలసనంబున నాతని యేపు మాపెదన్. 108

ప్రతిపదార్థం: శల్య!= ఓ శల్యుడా!; వినుత, మహా+అస్త్రముల్+వఱపి= ప్రసిద్ధమైన మహాస్త్రములను ప్రయోగించి; నాకున్= నాకు; విక్రమ సంపద చూపు= పరాక్రమాన్ని చూపునట్టి; అర్జునుడి, భుజలీలకున్+ఓర్చెదన్= అర్జునుడి భుజబల విలాసాన్ని ఎదుర్కొని నిలుస్తాను; వసుంధరన్+చక్రము క్రుంగి= చక్రం భూమిలో దిగబడి; నా రథంబునకున్+అవార్యమై= నా రథానికి తప్పనిదై; ఎడరు పుట్టక తక్కినన్= ఆపద కలుగకుండా ఉంటే; విశిఖ+ఆవలీ విలసనంబునన్= బాణప్రయోగ చాతుర్యంతో; ఆతని= అర్జునుడి యొక్క; ఏపు, మాపెదన్= గర్వం అణచుతాను; ననున్ చూడుమీ!= (అప్పుడు) నా బలం చూడుము.

తాత్పర్యం: శల్యా! ప్రసిద్ధ మహాస్త్రాలను ప్రయోగించే అర్జునుడి పరాక్రమాన్ని అడ్డుకొని నిలుస్తాను. నా రథచక్రం భూమిలో క్రుంగే ఆపద సంభవించకపోతే నా బాణప్రయోగచాతుర్యంతో అర్జునుడి గర్వం అణచి తీరుతాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: యుద్ధం చేస్తుంటే రథచక్రం భూమిలో క్రుంగిపోతుందన్న బ్రాహ్మణ శాపభయం కర్ణుడిని వెన్నాడుతున్నది.

వ. నీకు వెఱపింప నయ్యెడు కొలంది వారిని వెఱపింపుము; కర్ణుండు విక్రమంబునకుం గీర్తికి నా స్పదంబగుటకు జనియించిన వాఁడు గాని భయంబు గొనుటకుం గాదు కురుపతి సన్నిధి నీవు సారథ్యంబునకుం బూనుచుండి పలికికొన్న బాసకతంబున బ్రదికిపోయి' తనిన విని శల్యుం డీ 'యనర్థ ప్రలాపంబులం బ్రయోజనం బేమి? వినుము; కర్ణ కర్ణులు వేవురైనం గిరీటిని గెలువం జాలుదురే?' యనుటయు నతండు గినుక నెఱ్ఱనైన కన్నుంగవతోడి నవ్వు నవ్వుచు నిట్లను 'ధృతరాష్ట్ర మహీపతి సన్నిధి నుత్తమ ద్విజుల గోష్ఠి నఖిల దేశాచార విదుండైన వృద్ధ బ్రాహ్మణుండు సెప్పవింటి బాహ్లిక దేశంబునవారు గోమాంసంబు నంజికొని మద్యపానంబు సేసి నగ్నులై యసంగత దురాలాపంబు లాడుచుఁ దిరుగుదు రని తొడంగి యనేక ప్రకారంబుల బాహ్లిక దేశ నిందోపన్యాసంబు సేసె; నట్టి బాహ్లికుల కొడయుండవు తత్కృతంబులగు పుణ్యపాపంబుల నాఱవపాలు నిన్నుం జేరు; నట్లుంగాక వారి యనాచారంబులు వారింపమిం జేసి యా కల్మషంబు లెల్లను నిన్నుం బొందు; బాహ్లికుల కంటెను మద్రదేశ జాతు లవినీతులని యార్యులు సెప్పుదురు; ని న్నేమి సెప్పంగల? దింతవట్టు నెఱింగి నాలుక యడంచి యుండు' మనవుడు నమ్మద్రేశ్వరుండు. 109

ప్రతిపదార్థం: నీకు వెరపింపన్+అయ్యెడు, కొలంది వారిని= నీవు భయపెట్ట శక్యమైన వారిని; వెఱపింపుము= భయపెట్టుము; కర్ణుండు= కర్ణుడు(తాను); విక్రమంబునకున్= పరాక్రమానికి; కీర్తికిన్+ఆస్పదంబు+అగుటకున్= కీర్తికి నెలవైనవాడు అగుటకు; జనియించినవాఁడు= జన్మఎత్తినవాడు; కాని; భయంబు+కొనుటకున్+కాదు= భయపడటానికి కాదు; కురుపతి సన్నిధిన్= దుర్యోధనుని సమక్షంలో; నీవు సారథ్యంబునకున్+పూనుచుండి= నీవు సూతకృత్యానికి అంగీకరిస్తూ; పలికికొన్న బాస కతంబునన్= ఆడిన మాట కారణంగా; బ్రదికిపోయితి(వి)= రక్షింపబడ్డావు; అనినన్= అనగా; శల్యుండు విని= శల్యుడు ఆ మాటలు విని; కర్ణ!= ఓ కర్ణా!; ఈ అనర్థప్రలాపంబులన్= ఈ వ్యర్థవాక్కులచేత; ప్రయోజనంబు+ఏమి?= ఏమిలాభం?; వినుము= విను; కర్ణులు వేవురు+ఐనన్= వేయిమంది కర్ణులైనా; కిరీటిని గెలువన్+చాలుదురే?= అర్జునుడిని గెలువగలరా!; అనుటయున్= అనగానే; అతండు= కర్ణుడు; కినుకన్+ఎఱ్ఱనైన= కోపంతో ఎర్రబడిన; కన్ను+కవతోడి; రెండు కనులతో; నవ్వు నవ్వుచున్; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు; ధృతరాష్ట్ర మహీపతి సన్నిధిన్= ధృతరాష్ట్ర మహారాజు ఎదుట; ఉత్తమ ద్విజుల గోష్ఠిన్= బ్రాహ్మణోత్తముల సభలో; అఖిలదేశ+ఆచార విదుండు+ఐన= అన్ని దేశాచారాలు ఎరిగిన; వృద్ధబ్రాహ్మణుండు= ముసలి బ్రాహ్మణుడు; చెప్పన్ వింటిన్= చెప్పగా విన్నాను; బాహ్లిక దేశంబునవారు= బాహ్లికదేశ ప్రజలు; గోమాంసంబు నంజికొని= ఆవుమాంసం నంజుకొంటూ; మద్యపానంబు+చేసి= మద్యం సేవించి; నగ్నులు+ఐ= వస్త్రహీనులై; అసంగత దుస్+ఆలాపంబులు+ఆడుచున్= అనవసరమైన చెడుమాటలు పలుకుతూ; తిరుగుదురు+అని= తిరుగుతుంటారు అని; తొడంగి= ప్రారంభించి; అనేక ప్రకారంబులన్= అనేక విధాలుగా; బాహ్లికదేశ నింద+ఉపన్యాసంబు+చేసెన్= బాహ్లిక దేశీయులను నిందిస్తూ మాట్లాడాడు; అట్టి బాహ్లికులకున్+ఒడయుండవు= అటువంటి బాహ్లిక దేశస్థులకు రాజవు; తద్+కృతంబులు+అగు పుణ్యపాపంబులన్= వారు చేసే పుణ్యపాపాలలో; ఆఱవపాలు= ఆరవభాగం; నిన్నున్+చేరున్= నీకు చెందుతాయి; అట్లున్+కాక= అంతేకాకుండా; వారి అనాచారంబులు వారింపమిన్+చేసి= వారి చెడుపనులు ఆపనందువలన; ఆ కల్మషంబులు+ఎల్లను= ఆ పాపాలన్నీ; నిన్నున్+పొందున్= నీకు చెందుతాయి; బాహ్లికుల కంటెను= బాహ్లిక దేశస్థులకన్నా; మద్రదేశజాతులు= మద్రదేశ ప్రజలు; అవినీతులు+అని= నీతి మాలిన వారని; ఆర్యులు+చెప్పుదురు= విజ్ఞులు చెబుతారు; నిన్నున్+ఏమి+చెప్పన్+కలదు?= నీ గురించి ఇంక ఏం చెప్పాలి?; ఇంతవట్టున్+ఎఱింగి= ఇదంతా గ్రహించి; నాలుక+అడంచి+ఉండుము= మాట్లాడక ఊరుకో; అనవుడున్= అని అనగా; ఆ+మద్ర+ఈశ్వరుండు= ఆ మద్రరాజగు శల్యుడు.

తాత్పర్యం: నీవు భయపెట్టగలిగిన వారిని భయపెట్టు. పరాక్రమానికి, కీర్తికి పాత్రుడు కావటానికే కర్ణుడు పుట్టాడుకాని, భయపడటానికి కాదు. కురుపతి యెదుట నీవు నా సారథ్యానికి అంగీకరిస్తూ చెప్పిన మాటకారణంగా బ్రతికి పోయావు' అని, కర్ణుడు అనేసరికి, శల్యుడు 'కర్ణా! ఈ వ్యర్థప్రలాపాలవల్ల ప్రయోజనం ఏముంది? విను. వెయ్యిమంది కర్ణులైనా అర్జునుని గెలువగలరా?' అన్నాడు. అందుకు కర్ణుడు కోపంతో ఎరుపెక్కిన కళ్ళతో నవ్వుతూ 'ధృతరాష్ట్రుని సమక్షంలో జరిగిన బ్రాహ్మణోత్తముల సభలో - అన్ని దేశాల ఆచారాలను తెలిసిన ఒక వృద్ధ బ్రాహ్మణుడు, బాహ్లిక దేశప్రజలు ఆవుమాంసాన్ని నంజుకుంటూ, మద్యపానంచేసి, అసభ్యంగా మాట్లాడుతూ, అంగమొలతో తిరుగుతుంటారని బాహ్లికులను అనేక విధాల నిందిస్తూ మాట్లాడాడు. అది నేను విన్నాను. ఆలాంటి బాహ్లికులకు రాజువైన నీకు, వాళ్ళ పాపపుణ్యాలలో ఆరవభాగం చెందుతుంది. అంతేకాదు. వాళ్ళు చేసే చెడుపనులను ఆపనందువల్ల, వాళ్ళ పాపాలు కూడ నీకు అంటుకుంటాయి. బాహ్లికుల కంటె మద్రదేశప్రజలు మరీ అవినీతిపరులు అని విజ్ఞులంటారు. ఇంతకంటె నిన్ను గూర్చి చెప్పటానికి ఇంకేముంది? ఇది గుర్తుంచుకొని నోరుమూసుకో. ఊరుకో' అనగానే ఆ మద్రపతి----

విశేషం: కోపంతో ఎర్రబడిన కనులతో నవ్వుతూ అన్నాడు అనటంలో శల్యుడిపై వెకిలింత గోచరమవుతున్నది. తిక్కన వివిధ రకాలైన నవ్వులను పేర్కొనటం మనస్తత్వ వివేచనకు నిదర్శనం. నాలుక యడంచి యుండుము (నోరుమూసుకో) - చక్కని నుడికారం

(1) తిక్కనగారు ఆయాపాత్రల మనోభావాల ప్రకటనకు, ఆ యా సందర్భాల్లో అనేక విధాలైన నవ్వులను వర్ణించాడు. నవ్వును నవరసాలఖనిగా చేశాడు. ఇక్కడ కర్ణుడు తన కోపాన్ని వ్యక్తం చేస్తూ, శల్యుని నీతి నియమాలు లేని స్థితిని వెక్కిరిస్తూ ఎరుపెక్కిన కన్నుగవతో నవ్వాడని అనటం విశేషం.

(2) నోరుమూసుకో అనటానికి - నాలుక యడంచి యుండుము అన్నది నాజూకైన వాక్యవిన్యాసం.

క. 'లావులు రథాతిరథ సం । ఖ్యావేళం దెలియఁ జెప్పెఁగాదే భీష్ముం
డా వచనమ్ములు మనమున । భావింపుము క్రోధ మేల బలియుఁడ! నీకున్? 110

ప్రతిపదార్థం: బలియుఁడ!= బలవంతుడవైన కర్ణా!; రథ+అతిరథ సంఖ్యావేళన్= రథికులను; అతిరథులను నిర్ణయించే సమయంలో; భీష్మండు; లావులు= అందరి బలములు; తెలియన్+చెప్పెన్+కాదే!= వివరించినాడు కదా!; ఆ వచనమ్ములు= ఆ మాటలు; మనమునన్ భావింపుము= తలపునకు తెచ్చుకొమ్ము; నీకున్ క్రోధము+ఏల?= నీకు కోప మెందుకు?

తాత్పర్యం: బలవంతుడవైన కర్ణా! భీష్ముడు కౌరవసేనలోని వీరులను రథాతిరథులుగా నిర్ణయించే సమయంలో, ఎవరెవరి కొలది ఏమిటో తెలియచెప్పాడు గదా. ఆ మాటలు గుర్తుతెచ్చుకో. నీకు కోపం ఎందుకు?

విశేషం: భీష్ముడు కర్ణుని అర్ధరథుడుగా లెక్కించిన విషయాన్ని పరోక్షంగా గుర్తుచేస్తున్నాడు శల్యుడు.

తే. విడుతు రాప్తుల బంధుల వెలలుగన్న । నమ్ముదురు కులకాంతల నంగదేశ
జనితులగువారు విభుఁడ వజ్జనుల కిట్టు । లేలొకో నొడ్ల చరితంబు లెన్న నీకు? 111

ప్రతిపదార్థం: అంగదేశ జనితులు+అగువారు= అంగదేశంలో జన్మించినవారు; ఆప్తులన్+బంధులన్= స్వజనులను; విడుతురు= విడిచిపెడతారు; వెలలు కన్నన్= ధర(బేరం) కుదిరితే; కులకాంతలన్= కులస్త్రీలను; అమ్ముదురు= అమ్ముతారు; ఆ+జనులకున్=

అట్టి అంగదేశీయులకు; విభుడవు= రాజవు; ఇట్టులు= ఈ విధంగా; నీకు; ఒడ్ల చరితంబులు+ఎన్నన్= ఇతరుల నడవడి గురించి మాట్లాడటం; ఏల+ఒకో?= ఎందులకు?

తాత్పర్యం: అంగదేశస్థులు ఆత్మబంధువులను విడనాడుతారు. కులస్త్రీలను అమ్మటానికి కూడా వెనుదీయరు. ఆలాంటి అంగదేశానికి రాజువైన నీకు ఇతరుల దోషాలను ఎన్నటం భావ్యమేనా?

క. పరదోషము సెప్పఁగ నే। ర్తురు గా, కాత్మీయమైన దోషంబు మదిం
బరికింపఁగ నధములు నే। ర్తురె? తలఁపక యంటి వలుకతో నుండకుమీ!' 112

ప్రతిపదార్థం: అధములు= నీచులు; పరదోషము, చెప్పగ నేర్తురు కాక= ఇతరుల దోషాలనే ఎత్తిచూపుతారు కాని; ఆత్మీయము+ఐన దోషంబు= తమ తప్పును; మదిన్+పరికింపఁగన్, నేర్తురె?= మదిలో గుర్తించగలరా; తలఁపక+అంటి(వి)= ఆలోచించకుండా మాట్లాడుతున్నావు; అలుకతోన్+ఉండకుమీ= కోపం తెచ్చుకొనవద్దు.

తాత్పర్యం: అధములు ఇతరుల దోషాలను ఏకరువు పెడుతుంటారు కాని స్వీయదోషాలను గుర్తించరు. కోపం తెచ్చుకొని అనాలోచితంగా మాట్లాడకుము'.

వ. అని యుల్లసంబాడి మఱియును. 113

ప్రతిపదార్థం: అని+ఉల్లసంబు+ఆడి= అని పరిహసించి; మఱియును= ఇంకా.

తాత్పర్యం: అని శల్యుడు కర్ణుని పరిహసించి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. 'సకల దేశములను సన్మార్గ వర్తులు। గలరు దుష్టతతియుఁ గలిగియుండు;
మది నెఱుంగ నేర్చు మధ్యస్థు లదియును। నదియు నుగ్గడింతు రెదురు మెచ్చ. 114

ప్రతిపదార్థం: సకల దేశములను= అన్ని దేశాలలోను; సన్మార్గ వర్తులున్= మంచిమార్గంలో నడిచేవారు; కలరు= ఉన్నారు; దుష్టతతియున్= దుర్మార్గుల సమూహాలను; కలిగిఉండు= కలిగిఉంటారు; మదిన్= మనస్సులో; ఎఱుంగనేర్చు= తెలుసుకొన గలిగిన; మధ్యస్థులు= పక్షపాతం లేనివారు; ఎదురు మెచ్చన్= ఎదుటివారు మెచ్చునట్లుగా; అదియునున్+అదియును= ఆ రెండు విధముల (సజ్జన దుర్జనుల) గురించి; ఉగ్గడింతురు= చెపుతారు.

తాత్పర్యం: మంచిమార్గంలో నడుచుకొనేవారు, దుర్మార్గులు అన్నిదేశాల్లోనూ ఉన్నారు. దీన్ని తెలుసుకోగలిగిన పక్షపాతరహితులు, ఎదుటివారు మెచ్చుకొనే విధంగా ఉభయులను గూర్చి చెపుతారు. (నీ వలె ఒకరిని గురించి మాత్రమే మాట్లాడరు)

వ. ఒకదేశంబు దాఁ గీడ యగుట కలుగునే? యట్లుం గాక సదాచార దురాచారంబులు దైవం బెఱింగెడు; నీ వనాత్మజ్ఞుండ వూరకుండు మనియె; నట్లయ్యిరువురు వివాదంబు సేయుట యాలించి చేరి కౌరవపతి సఖీభావం బుపన్యసించి రాధేయు రాజత్వ గౌరవంబు గొనియాడి మద్రవిభుని వారించిన నా సూత నందనుండు నగుచు శల్యునుద్దేశించి పొద పొద రథమ్ము పోనిమ్ము పోనిమ్మని పలికె; నట్లలిగి శల్యుండు

సస్మితుం డగుచు వెండియు నర్జును నుగ్గడించి కృష్ణుండు సారథియును గాండీవంబు సాధనంబునునై యప్రతిహత మనోరథుం డగు నా రథికు తోడం బెనంగ నోపితేని నీవు మాకెల్లను రాజ వమ్మేటి మగని యరదంబు మన మొగ్గరంబు సొచ్చి చిక్కు వఱుచుట గలుగు నని ఎఱుంగ నయ్యెడు మన మేమఱక యుండవలయు; నీ తోఁచు దుర్నిమిత్తంబు లనుసంధింపుము. 115

ప్రతిపదార్థం: ఒక దేశంబు= ఏ దేశమైనా; తాన్= అది; కీడు+అగుట కలుగునే?= చెడ్డదే అయి ఉండునా?; అట్లున్+కాక= అంతేకాక; సదాచార దురాచారంబులు= మంచి చెడులు; దైవంబు+ఎఱింగెడున్= దైవానికి తెలుసు; నీవు+అనాత్మజ్ఞుండవు= నీవు ఆత్మజ్ఞానం లేనివాడివి; ఊరకుండుము+అనియెన్= మాట్లాడవద్దు అన్నాడు; అట్లు+ఆ+ఇరువురు= ఆ విధంగా కర్ణ శల్యులు ఇద్దరూ; వివాదంబు చేయుట= వాదిస్తూ ఉండటం; కౌరవపతి= దుర్యోధనుడు; ఆలించి= విని; చేరి= వారిని సమీపించి; సఖాభావంబు+ఉపన్యసించి= స్నేహభావాన్ని బోధించి; రాధేయు రాజత్వగౌరవంబు= కర్ణుడి రాజత్వముయొక్క గొప్పతనాన్ని; కొనియాడి= ప్రశంసించి; మద్రవిభుని, వారించినన్= శల్యుడిని అడ్డుకొనగా; ఆ సూతనందనుండు= ఆ కర్ణుడు; నగుచున్= నవ్వుతూ; శల్యున్+ఉద్దేశించి= శల్యుడిని చూచి; పొద పొద= పద పద; రథమ్ము పోనిమ్ము పోనిమ్ము= రథాన్ని పోనీ పోనీ; అని పలికెన్= అని అన్నాడు; శల్యుండు; అట్లు+అరిగి= ఆ విధంగా బయల్దేరి; సస్మితుండు+అగుచున్= నవ్వుతున్నవాడై; వెండియున్+అర్జునున్+ఉగ్గడించి= మళ్ళీ అర్జునుడిని పొగడి; కృష్ణుండు సారథియును= కృష్ణుడు రథసారథిగా; గాండీవంబు సాధనంబునున్+ఐ= గాండీవం ధనుస్సుగా కలిగి; అప్రతిహతమనోరథుండు+అగు= అడ్డులేని కోరికగలవాడైన; ఆ రథికు తోడన్= అర్జునుడితో; పెనంగన్+ఓపితి(వి)+ఏని= పోరాడగలిగితే; నీవు, మాకున్+ఎల్లను రాజవు= నీవే మా అందరి విభుడవు; ఆ+మేటి మగని+అరదంబు= ఆ మహావీరుడి రథం; మన మొగ్గరంబు చొచ్చి= మన వ్యూహం ప్రవేశించి; చిక్కు పఱుచుట కలుగును+అని= చిక్కులు కలిగిస్తుందని; ఎఱుంగన్+అయ్యెడున్= గోచరిస్తున్నది; మనము+ఏమరక+ ఉండవలయున్= మనం జాగ్రత్తగా ఉండాలి; ఈ తోఁచు దుర్నిమిత్తంబులు= ఈ కనబడుతున్న అపశకునాలు; అనుసంధింపుము= పరిశీలించుము.

తాత్పర్యం: 'ఒక దేశం పూర్తిగ చెడునే కలిగి ఉంటుందా? అంతేకాదు. ఏవి సదాచారాలో ఏవి దురాచారాలో ఒక్క దేవుడికే తెలుసు. నీవు ఆత్మజ్ఞానశూన్యుడివి. ఊరుకో' అన్నాడు. దుర్యోధనుడు ఆ యిద్దరి వాదులాట విని, చేరువగా వచ్చి, స్నేహభావం ఎలా ఉండాలో తెలియచెప్పి, కర్ణుడి రాజత్వగౌరవాన్ని కొనియాడి, శల్యుడు తన అధిక ప్రసంగాన్ని పొడిగించకుండా ఆపాడు. అప్పుడు కర్ణుడు నవ్వుతూ 'పద పద', 'రథాన్ని పోనీ పోనీ' అని శల్యుణ్ణి త్వరపెట్టాడు. శల్యుడు రథాన్ని నడుపుతూ, చిరునవ్వు నవ్వుతూ మళ్ళీ అర్జునుని ప్రశంసించటం ప్రారంభించి 'శ్రీకృష్ణుడు సారథిగా, గాండీవం సాధనంగా, కోరుకొన్నదానిని నిరాటంకంగా సాధించుకోగల ఆ కిరీటితో నీవు పోరాడగలిగితే, నీవే మా అందరికి అధిపతివి. ఆ మహావీరుడి రథం మనసేనలోకి చొచ్చుకువచ్చి చిక్కుపరుస్తున్నట్లు తెలుస్తున్నది. మనం జాగ్రత్తగా ఉండాలి. అగుపిస్తున్న ఈ అపశకునాలను సమన్వయించుకో.

శల్యుఁడు గర్ణునితో నప్పుడు దోఁచు నుత్పాతంబులు సెప్పుట (సం. 8-31-38)

క. వఱఁకులు మన చేరువఁ బె। ల్లఱచుట బెట్టెదురు గాలి యడరుట గ్రద్దల్
తఱచయి యాడుట వికృతపు। టఱపులతో రేఁగి కాకు లఱచుట గంటే? 116

ప్రతిపదార్థం: వఱళులు= నక్కలు; మన చేరువన్= మన సమీపంలో; పెల్లు+అఱచుట= పెద్దగా అరవటం; బెట్టు+ఎదురుగాలి= పెద్దగా ఎదురుగాలి; అడరుట= విజృంభించటం; గ్రద్దల్= గ్రద్దలు; తఱచయి ఆడుట= ఎక్కువగా తిరగటం; కాకులు; రేఁగి= చెలరేగి; వికృతపు+అఱపులతోన్= వికారధ్వనులతో; అఱచుట= అరవటం; కంటే= చూచావా?

తాత్పర్యం: నక్కలు సమీపించి పెద్దగా అరుస్తున్నాయి. పెద్దగా ఎదురుగాలి వీస్తున్నది. గ్రద్దలు ఎక్కువగా తిరుగుతున్నాయి. కాకులు వికారధ్వనులతో అరుస్తున్నాయి. ఈ అపశకునాలు చూశావా?

వ. అని వెండియు. 117

తాత్పర్యం: అని మళ్ళీ.

ఆ. సిడము కామ సూడు వడఁకెడు మన తేరి । చుట్టు మెఱయఁ గట్టినట్టి చిఱుత
పడగలందుఁ గంటె వెడలెడు మంట లు । గ్రంబు గాఁగ నోపు రణము నేఁడు.' 118

ప్రతిపదార్థం: సిడము+కామ= ధ్వజం (జెండాకర్ర); వడఁకెడున్+చూడు= వణకుతున్నది చూడుము; మన తేరిచుట్టు= మన రథం చుట్టూ; మెఱయన్+కట్టినట్టి= మెరిసేటట్టు కట్టిన; చిరుత, పడగలందున్= చిన్న టెక్కెములందు; మంటలు వెడలెడున్= మంటలు వస్తున్నాయి; కంటె?= చూశావా?; నేఁడు= ఇవాళ; రణము= యుద్ధం; ఉగ్రంబు, కాఁగన్+ఓపు!= తీవ్రంగా సాగవచ్చును.

తాత్పర్యం: మన జెండాకర్ర వణకుతున్నది, రథంచుట్టూ మెరిసే టెక్కెములలో మంటలు వస్తున్నాయి. ఈ నాటి యుద్ధం భయంకరమౌతుందేమో!

వ. అనియె నప్పుడు రాధేయుండు ధృష్టద్యుమ్నాభిరక్షితంబైన ధర్మతనయ వ్యూహంబు గనుంగొని రథికవరులం దగినయెడల నమర్చి తన మోహరం బాయితంబు సేసికొని యురవడింప నమ్మద్రపతి యట్టెత్తి యాలోకించి. 119

ప్రతిపదార్థం: అనియెన్= (శల్యుడు) అన్నాడు; అప్పుడు= ఆ సమయంలో; రాధేయుండు= కర్ణుడు; ధృష్టద్యుమ్న+అభిరక్షితంబు+ఐన= ధృష్టద్యుమ్నుడు రక్షకుడుగా ఉన్న; ధర్మతనయ, వ్యూహంబు= ధర్మరాజు వ్యూహాన్ని; కనుంగొని= చూచి; రథికవరులన్= వీరులను; తగిన ఎడలన్+అమర్చి= తగినచోట్ల ఉంచి; తన, మోహరంబు= తన వ్యూహాన్ని; ఆయితంబు చేసికొని= సిద్ధం చేసికొని; ఉరవడింపన్= వేగిరింపగ; ఆ+మద్రపతి= శల్యుడు; అఱ్ఱు+ఎత్తి= మెడ ఎత్తి; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: శల్యుడి మాటలు విన్న కర్ణుడు ధర్మరాజు వ్యూహాన్ని పరికించి, వీరులతో తన వ్యూహాన్ని సిద్ధం చేయగానే శల్యుడు మెడ ఎత్తి చూచి.

ఉ. అల్లదె! యర్జున ధ్వజ విహారము గానఁగ నయ్యెడుం గపీం
ద్రోల్లసనంబునన్ మెఱసి యుద్భటు లైన త్రిగర్తు లేపు శో
భిల్లఁగ వారె! యన్నరుని బెట్టుగఁ దాఁకి రతండు నంప పె
న్వెల్లి నిగిడ్చి ముంచె నదె! నింగి గుణధ్వని వొంగ వారలన్.' 120

ప్రతిపదార్థం: అల్లదె!= అదిగో; కపి+ఇంద్ర+ఉల్లసనంబునన్ మెరసి= హనుమంతుడి కాంతితో ప్రకాశిస్తూ; అర్జున ధ్వజవిహారము= అర్జునుడి కేతనం కదలటం; కానఁగన్+అయ్యెడున్= కనిపిస్తున్నది; ఉద్భటులు+ఐన త్రిగర్తులు= బలశాలులైన త్రిగర్తదేశపు వీరులు; వారె!= అదిగో!; ఏపు శోభిల్లఁగన్= గర్వం ఒప్పగా; ఆ+నరునిన్= అర్జునుడిని; బెట్టుగన్+తాఁకిరి= గట్టిగా ఎదుర్కొన్నారు; అతండున్= అర్జునుడు; అదె!= అదిగో!; నింగిన్= ఆకసంలో; గుణధ్వని పొంగన్= వింటివారి ధ్వని వ్యాపించగా; వారలన్= త్రిగర్త వీరులను; అంప పెను+వెల్లి= అమ్ముల ప్రవాహం; నిగిడ్చి= వ్యాపింపచేసి; ముంచెన్= ముంచాడు.

తాత్పర్యం: అదిగో! రణరంగంలో కపీంద్రుడైన హనుమంతుని చిహ్నము ప్రకాశించగా అర్జునుడి ధ్వజవిహారం (రథవిహారం) అగుపిస్తున్నది. ఆ అగుపించేవారే! బలవంతులైన త్రిగర్తులు. శోభిల్లే గర్వంతో అర్జునుని గట్టిగా ఎదుర్కొన్నారు. అదిగో! అర్జునుడు తన అల్లెత్రాటి ధ్వని ఆకాశం అంతా వ్యాపించగా, వాళ్ళను బాణాల వెల్లువలో ముంచాడు.

ఆ. అనినఁ గర్ణుఁ డిట్టు లనియె 'సంశప్తక । బలముచేతఁ బొదువఁబడి కిరీటి
మేఘ పిహితుఁడైన మిహిరుని చాడ్పున । వాఁడి లేక యున్నవాఁడు గంటె!। 121

ప్రతిపదార్థం: అనినన్+కర్ణుడు+ఇట్టులు+అనియెన్= అనగా విని కర్ణుడు ఇట్లా అంటున్నాడు; కిరీటి= అర్జునుడు, సంశప్తక బలముచేతన్= సంశప్తకులచేత (త్రిగర్తరాజు, సుశర్మ, అతని సోదరులు), పొదువన్‌పడి= ఆక్రమింపబడి; మేఘపిహితుఁడు+ ఐన= మబ్బుచేత కప్పబడిన; మిహిరుని చాడ్పునన్= సూర్యుడివలె; వాఁడిలేక ఉన్నవాఁడు+కంటె= కాంతిహీనుడై ఉన్నాడు చూచావా?

తాత్పర్యం: అని (శల్యుడు) అనగా అర్జునుడు త్రిగర్తీయులైన సంశప్తకులచేత ఆక్రమింపబడి, మేఘం కప్పిన సూర్యుడివలె కాంతివిహీనుడై ఉన్నాడు చూచావా! అని కర్ణుడు బదులు పలికాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. అనుటయు శల్యుఁడు. 122

తాత్పర్యం: (కర్ణుడు) అనగానే శల్యుడు.

చ. 'వరుణుఁడు నీళ్ళ చేఁ జెడునె? వాయుసఖుండు మహేంధనోత్కర
స్ఫురణ నడంగునే? నరుఁడు పోరుల నేపఱు టేల కల్గు? నె
వ్వరికిని వానిఁ గీడ్పఱుప వచ్చునె? గాలిఁ బరాభవింపఁగా
దొరకొనినం జలంబు మెయిఁ దోయధి యంతముఁ ద్రావ వచ్చినన్. 123

ప్రతిపదార్థం: వరుణుఁడు= వరుణదేవుడు; నీళ్ళచేన్+చెడునె?= నీటిచే నశిస్తాడా?; వాయుసఖుండు= అగ్నిదేవుడు; మహా+ ఇంధన+ఉత్కర - స్ఫురణన్= గొప్ప కట్టెల సమూహపు కాంతిచేత; అడంగునే?= కప్పబడునా?; నరుఁడు= అర్జునుడు; పోరులన్+ఏపు+అఱుట= యుద్ధాలలో విజృంభణను వీడుట; ఏల కల్గున్?= ఎందుకు జరుగుతుంది?; గాలిన్+పరాభవింపఁగాన్, దొరకొనినన్= వాయువును అడ్డగించ పూనినా; చలంబుమెయిన్= పట్టుదలతో; తోయధి+అంతయున్= సముద్రమునంతా; త్రావవచ్చినన్= త్రా వగలిగినా; ఎవ్వరికిని= ఎవరికైనా; వానిన్= ఆ అర్జునుడికి; కీడు+పఱుపవచ్చునె?= కీడు కలిగించటం సాధ్యమౌతుందా?

తాత్పర్యం: నీళ్ళ చేత వరుణుడు నశిస్తాడా? కట్టెల మోపుచేత అగ్ని కప్పువడుతాడా? అర్జునుడు యుద్ధాల్లో ఆధిక్యాన్ని కోల్పోతాడా? గాలిని అడ్డుకొని అవమానించటానికి పూనుకొన్నా, పట్టుపట్టి సముద్రాన్నంతా త్రాగ గలిగినా, అర్జునుడిని పడగొట్టటం ఎవరికి సాధ్యమౌతుంది.

విశేషం: అలం: నిదర్శన.

ఆ. **దేవతలకునైన దేవేంద్రపుత్రుని । నాహవమున గెలువ నలవి గాదు;**
మనము గెలుతు మిట్టి మాట లాతనిఁ జేరఁ । జనక యాడి దీన సంతసింపు. **124**

ప్రతిపదార్థం: దేవతలకున్+ఐనన్= దేవతలకైనా సరే; దేవ+ఇంద్రపుత్రునిన్= దేవేంద్రుని కొడుకైన అర్జునుడిని; ఆహవమునన్= యుద్ధంలో; గెలువన్+అలవి కాదు= గెలువ సాధ్యం కాదు; మనము, గెలుచుదుము= మనం జయిస్తాం; ఇట్టి మాటలు= ఇటువంటి మాటలు; ఆతనిన్+చేరన్+చనక= అతడిని సమీపించకుండా; ఆడి= పలికి; దీనన్= దీనితోనే (ఈ మాటలతోనే); సంతసింపు(ము)= సంతోషించుము.

తాత్పర్యం: దేవతలకైనా సరే అర్జునుడిని యుద్ధంలో గెలువటం సాధ్యం కాదు. అతడిని మనం గెలుస్తాం అనే మాటలు ఆతడి చెవిన బడకుండా అనుకొని సంతోషించు. (వినబడితే పరువు దక్కదని భావం).

ఉ. **మేరువు వోలె నొప్పిన సమీరణపుత్రుని పేర్మియున్ మహో**
దారుఁడు ధర్మనందను నుదాత్తతయున్ విజయానుజన్ము లే
పారఁగ నున్న సొంపును నహంకృతి యేర్పడ ద్రౌపదీసుతు
లీవిరల మీఱి పొల్పెసఁగు లీలయుఁ జూడుము సూతనందనా! **125**

ప్రతిపదార్థం: మేరువువోలెన్+ఒప్పిన= మేరుపర్వతం వంటి; సమీరణపుత్రుని పేర్మియున్= భీముడి గౌరవము; మహా+ఉదారుఁడు, ధర్మనందను= గొప్ప ఉదారుడైన ధర్మరాజుయొక్క; ఉదాత్తతయున్= గొప్పదనం; విజయ+అనుజన్ములు= అర్జునుని తమ్ములైన నకులసహదేవులు; ఏపారఁగన్+ఉన్న, సొంపును= అతిశయంతోఉన్న విలాసం; ద్రౌపదీసుతుల్= ద్రౌపదీపుత్రులు; అహంకృతి+ఏర్పడన్= గర్వం ఒప్పగా; వీరలన్+మీఱి= వీరిని మించి; పొల్పు+ఎసఁగు లీలయున్= ప్రకాశించేవిధం; సూతనందనా!= కర్ణా!; చూడుము.

తాత్పర్యం: మేరుపర్వతంవలె ప్రకాశిస్తున్న భీమసేనుని ఆధిక్యం, మహోదారుడైన ధర్మపుత్రుని గొప్పతనం, నకుల సహదేవుల విజృంభణ విలాసం, వాళ్ళందరినిమించి అహంకారంతో వెలుగుతున్న ఉపపాండవుల విధం - సూతపుత్రా! చూడు.

విశేషం: ద్రౌపదికి ఐదుగురు భర్తలవలన వరుసగా జన్మించిన ఉపపాండవులు - ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడు అనేవారు.

వ. **పాండవులు ధర్మపరు లెవ్వలన ధర్మంబు గలుగు నవ్వలనికి జయంబు గలుగుట దప్ప' దను సమయంబున సంశప్తక కులంబుం గనుంగొని మన సైన్యంబును సవ్యసాచిం జూచి వారి సేనయును గడంగి**

యొండొంటితోఁ దాఁకిన గంగా యమునల సంపాతంబు చందంబు దోఁచె; నట్టి యెడం గురురాజు రాధేయుని మద్రరాజుం దగు రాజులను సాదరావలోకనంబున సంభావించి యి ట్లనియె. 126

ప్రతిపదార్థం: పాండవులు, ధర్మపరులు= పాండవులు ధర్మప్రవర్తనగలవారు; ఏ వలన ధర్మంబు, గలుగున్= ఏవైపు ధర్మం ఉంటుందో; ఆ+వలనికిన్= ఆ వైపు; జయంబు కలుగుట తప్పదు= జయం కలగటం తప్పదు; అను సమయంబునన్= అని శల్యుడు అంటున్న సమయంలో; సంశప్తక కులంబున్+కనుంగొని= త్రిగర్తవీరులను చూచి; మనసైన్యంబును= మన సైన్యం; సవ్యసాచిన్+చూచి= అర్జునుడిని చూచి; వారి సేనయును= పాండవసైన్యం; కడంగి= పూనుకొని; ఒండు+ఒంటితోన్+ తాఁకినన్= ఒకదానితో నొకటి తలపడగా; గంగా యమునల= గంగా యమునానదుల; సంపాతనంబు, చందంబు+తోచెన్= తాకిడివలె గోచరించింది; అట్టి+ఎడన్= అప్పుడు; కురురాజు= దుర్యోధనుడు; రాధేయునిన్= కర్ణుడిని; మద్రరాజున్= శల్యుడిని; తగురాజులను= ఇతరరాజులను; స+ఆదర+అవలోకంబునన్= ఆదరపూర్వకమైన చూపుతో; సంభావించి= గౌరవించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: పాండవులు ధర్మపరులు. ధర్మం ఎవరిపక్షాన ఉంటుందో వారికే జయం లభిస్తుంది' అని శల్యుడు అంటుండగా, సంశప్తకుల సమూహాన్ని చూచి కౌరవసైన్యం, అర్జునుడిని చూచి పాండవసైన్యం ఉత్సాహంతో ఒకదానితో మరొకటి తలపడగా, ఆ సన్నివేశం గంగా యమునలు ఒకదాని మీద మరొకటి పడినట్లనిపించింది. దుర్యోధనుడు కర్ణశల్యులను, ఇతర రాజులను గౌరవపూర్వకంగా చూచి ఇట్లా అన్నాడు:

ఆ. 'ఎద్ది ప్రియము సేయు నేపారు శూరుల। చిత్తములకు నది యుదాత్తభంగి
నొదవె మీకు బాహుమదమునఁ గొనియాడుఁ। డుగ్ర శౌర్యమహిమ యుల్లసిల్ల. 127

ప్రతిపదార్థం: ఏపారు, శూరుల, చిత్తములకున్= గర్వించే వీరుల మనస్సులకు; ఎద్దిప్రియము, చేయున్= ఏది సంతోషము కలిగించునో; అది ఉదాత్తభంగిన్= అది గొప్పదైన విధంగా; మీకున్ ఒదవెన్= మీకు లభించింది; ఉగ్రశౌర్యమహిమ= భయంకరమైన వీరత్వంయొక్క ప్రభావం; ఉల్లసిల్లన్= ఒప్పగా; బాహుమదమునన్= భుజబలదర్పంతో; కొనియాడుండు= ప్రశంసలు పొందండి.

తాత్పర్యం: 'పరాక్రమవంతులకు ఇష్టమైన (యుద్ధంచేసే) అవకాశం నేడు గొప్పగా మీకు లభించింది. మీరు విజృంభించి మీ భుజబల దర్పాన్ని చూపి ప్రశంసలు పొందండి.

క. బలుపెసఁగఁ బాండుపుత్రులఁ। బొలియించిన నతుల రాజ్యభోగంబును వా
రలచేతం బొలిసిన ను। జ్జ్వల నాకసుఖంబు గలుగు వ్రాలుఁడు పోరన్.' 128

ప్రతిపదార్థం: బలుపు+ఎసఁగన్= బలము ఒప్పగా; పాండుపుత్రులన్= పాండవులను; పొలియించినన్= సంహరిస్తే; అతుల రాజ్యభోగంబును= సాటిలేని రాజ్యవైభవం; వారలచేతన్+పొలిసినన్= పాండవులచేత మీరు చనిపోతే; ఉజ్జ్వల, నాకసుఖంబు= గొప్ప స్వర్గసుఖం; కలుగున్= లభిస్తాయి; పోరన్ వ్రాలుఁడు= రణరంగంలోకి దూకండి.

తాత్పర్యం: మీరు పాండవులను సంహరిస్తే అంతులేని రాజ్యవైభవం లభిస్తుంది. వారిచేత మీరే గనుక మరణిస్తే గొప్ప స్వర్గభోగం అనుభవిస్తారు. కాబట్టి సందేహించకుండా యుద్ధానికి ముందుకు దూకండి.

వ. **అనిన వారలందఱు నుబ్బి సింహనాదంబులు సేయఁ దూర్య నినదంబులు సెలంగ సైన్యంబులు సంతసంబునం బొదలె; నప్పు డశ్వత్థామ రథిక జనంబుల మనంబులం బ్రమదం బెసంగ ని ట్లనియె.** **129**

ప్రతిపదార్థం: అనినన్= (దుర్యోధనుడు) అనగా; వారలు+అందఱున్+ఉబ్బి= కౌరవవీరులందరు ఉప్పొంగి; సింహనాదంబులు చేయన్= పెద్ద ధ్వనులు చేయగా, తూర్య, నినదంబులు, చెలంగన్= వాద్యధ్వనులు చెలరేగగా; సైన్యంబులు= సేనలు; సంతసంబునన్+పొదలెన్= సంతోషంతో ఒప్పాయి; అప్పుడు; అశ్వత్థామ; రథికజనంబుల, మనంబులన్= వీరుల మనసులలో; ప్రమదంబు+ఎసంగన్= ఆనందం నిండగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: దుర్యోధనుడి మాటలకు కౌరవసైన్యంలోని వారంతా ఉబ్బిపోయి బిగ్గరగా కేకలు వేశారు. వాద్యధ్వనులు చెలరేగాయి. వారికి సంతోషం కలిగిస్తూ అశ్వత్థామ ఇట్లా అన్నాడు:

క. **'ఆయుధము విడిచి యుండఁగ । సాయకగురు మీరు సూడఁ జంపిన కష్టో**
పాయుని ధృష్టద్యుమ్నుని । మాయించియ కాని తొడినమఱు వే నూడ్పన్. **130**

ప్రతిపదార్థం: సాయక, గురున్= విలువిద్యా గురువైన ద్రోణాచార్యుడిని; ఆయుధము, విడిచిఉండఁగన్= ఆయుధం వదలి ఉండగా; మీరు, చూడన్= మీరు చూస్తూఉండగా; చంపినన్= సంహరించిన; కష్ట+ఉపాయునిన్ ధృష్టద్యుమ్ననిన్= దుర్మార్గుడైన ధృష్టద్యుమ్నుడిని; మాయించియ కాని= చంపిన పిదప కాని; ఏను= నేను; తొడిన, మఱుపు= ధరించిన కవచం; ఊడ్పన్= విడువను.

తాత్పర్యం: అస్త్ర విద్యాగురువైన ద్రోణాచార్యుడు ఆయుధం విడిచిఉండగా, దుష్టబుద్ధితో ఆతడిని చంపిన ఆ ధృష్టద్యుమ్నుడిని మట్టుబెట్టి కాని నేను కవచాన్ని విడువను.

విశేషం: ధర్మరాజు మాటలు వినబడి తన సుతుడైన అశ్వత్థామ మరణించాడని భావించి ద్రోణుడు అస్త్రసన్న్యాసం చేశాడు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు ద్రోణుడి తల నరికాడు.

క. **కడువడి వడముడియును గ । వ్వడియు నతనిఁ గావఁ బూని వచ్చిరయేనిం**
జెడుదురు మచ్చాపంబున । వెడలు వివిధ విశిఖ శిఖల వేఁడిమిచేతన్.' **131**

ప్రతిపదార్థం: వడిముడియును= భీముడు; కవ్వడియున్= అర్జునుడు; కడువడిన్= వేగంగా; అతనిన్= ధృష్టద్యుమ్నుడిని; కావన్+పూని వచ్చిరి+అ+ఏనియున్= రక్షించటానికి వచ్చినప్పటికీ; మత్+చాపంబునన్ వెడలు= నా ధనుస్సునుంచి వెలువడే; వివిధ విశిఖ శిఖల= పలువిధాలైన బాణాల జ్వాలలయొక్క; వేఁడిమి చేతన్= వేడివలన; చెడుదురు= మాడిపోతారు.

తాత్పర్యం: భీమార్జునులు గనుక ధృష్టద్యుమ్నుడిని కాపాడటానికి వెంటనే వచ్చినా నా బాణాల జ్వాలలవేడిమికి అంతమైపోతారు'.

విశేషం: వడముడి= (శత్రువులకు) తాపం కలిగించేవాడు. (భీముడు).

చ. అన విని యవ్వరిష్ఠ రథికావలి పెల్లుగఁ బాండుపుత్త్ర యో
ధనులపయిన్ వెసంగవియు దర్పము వార లుదగ్ర వృత్తి మా
ర్కొనిన మహోగ్రభంగియును ఘోరపులీలల విస్మయం బొన
ర్చె ననిమిషాంతరంగములఁ జెల్లె రణంబు నుదీర్ణ రౌద్రమై. 132

ప్రతిపదార్థం: అనన్‌విని= అనగా విని; ఆ+వరిష్ఠరథిక+ఆవలి= ఆ శ్రేష్ఠులైన వీరుల సమూహం; పాండుపుత్ర, యోధనుల, పయిన్= పాండవవీరులపై; పెల్లుగన్= తీవ్రంగా; వెసన్+కవియు, దర్పము= వేగంగా ఆక్రమించిన భుజబలం; వారలు= పాండవులు; ఉదగ్ర, వృత్తిన్= భీతిగొల్పునట్లుగా; మార్కొనినన్= ఎదుర్కొనిన; మహా+ఉగ్రభంగియును= గొప్ప పరాక్రమం తీరు; ఘోరపు లీలలన్= భయంకరమైన విన్యాసాలతో; అనిమిష+అంతరంగములన్= దేవతల మనసులలో; విస్మయంబు+ ఒనర్చెన్= ఆశ్చర్యం కలిగించాయి; రణంబున్= యుద్ధం; ఉదీర్ణ రౌద్రము+ఐ= అతిశయించిన రౌద్రం కలదై; చెల్లెన్= కొనసాగింది.

తాత్పర్యం: అశ్వత్థామ మాటలకు పొంగి కౌరవ రథికశ్రేష్ఠులు విజృంభించి భుజబలాలు ప్రదర్శిస్తూ పాండవుల పైబడగా, వారు కూడా మహాపరాక్రమంతో భయంకరంగా శత్రువులను ఎదుర్కొన్నారు. ఇరుపక్షాల విజృంభణలు దేవతలకు కూడా విస్మయాన్ని కలిగిస్తూ, యుద్ధం ఘోరంగా కొనసాగింది.

క. జనసంక్షయంబు పె ల్లే। మనవచ్చుం బ్రళయకాల మయ్యెనొ కా కెం
దును నిట్టివి గలవే? యని। మనమునఁ దలపోయవలసె మముబోఁటులకున్. 133

ప్రతిపదార్థం: జనసంక్షయంబు, పెల్లు= జననష్టంయొక్క ఆధిక్యం; ఏమి+అనవచ్చున్= ఏమని చెప్పాలి; ప్రళయకాలము+ అయ్యెనొ= ప్రళయకాలం అయిందా; కాక+ఎందునున్+ఇట్టివి కలవే+అని= లేకపోతే ఎక్కడైనా ఇటువంటివి జరిగాయా అని; మముబోఁటులకున్= మా బోటివారికి; మనమునన్, తలపోయన్, వలసె= మనసులో అనుకొనవలసి వచ్చింది.

తాత్పర్యం: యుద్ధంలో జరిగే అధిక జననాశనాన్ని గురించి ఏమని చెప్పాలి! ప్రళయకాలం సమీపించిందా ఏమి? అని మేమంతా (సంజయాదులు) లేకుంటే ఇంత జననాశం ఎక్కడైనా జరిగిందా - అని అనుకోవలసివచ్చింది.

వ. అట్టి యెడ. 134

ప్రతిపదార్థం: అట్టి+ఎడ= ఆ సమయంలో.

తాత్పర్యం: అప్పుడు.

ఉ. ప్రీతి యెలర్ప వీరుల వరించుటకుం జనుదెంచి యప్సరో
వ్రాతము గంధపుష్ప పరివర్షణకేళి యొనర్ప సౌరభం
బాతతి సంచరించు లలితానిలుఁ డెక్కుడు సేసి వీచె సం
జాత నవీన ఘర్మజల జాలక సైనిక లాలనీయుఁ డై. 135

ప్రతిపదార్థం: అప్సరః+వ్రాతము= అప్సరసల సమూహం; ప్రీతి+ఎలర్పన్= ఆనందం అతిశయింపగా; వీరులవరించుటకున్+ చనుదెంచి= వీరులను వరించటానికి వచ్చి; గంధపుష్ప పరివర్షణకేళి+ఒనర్పన్= పరిమళభరితమైన పుష్పవర్షం కురిపించగా;

ఆతతిన్= అప్పుడు; సంచరించు= ప్రసరిస్తున్న; లలిత+అనిలుఁడు= మృదువైన వాయువు; సంజాత, నవీన, ఘర్మజలజాలక= (పోరుచే) కలిగిన చెమట బిందువులతో ఒప్పుతున్న; సైనిక లాలనీయుఁడు+ఐ= సైనికులచేత బుజ్జగింపబడినవాడై; సౌరభంబు= పరిమళం; ఎక్కుడు+చేసి వీచెన్= ఎక్కువచేసి వీచాడు.

తాత్పర్యం: రణరంగంలో మరణించే వీరులను వరించటానికి అప్సరసలు వచ్చి ఆనందంతో పూలవర్షం కురిపించగా, మృదువుగా వీస్తున్న వాయువు ఆ పూల పరిమళాన్ని హెచ్చుగా ప్రసరింపజేస్తూండగా, చెమటతో తడిసిన సైనికులు ఆ వాయువును బుజ్జగించారు - మెచ్చుకొన్నారు.

విశేషం: యుద్ధంలో అసువులు బాసిన వీరులకు స్వర్గసుఖాలతోపాటు అప్సరసల పొందు లభిస్తుందని నాటి విశ్వాసం.

ఉ. ఆ సమయంబునం గురుకులాగ్రణి భీమునిఁ దాఁకె సం
త్రాసన మత్త వారణ కదంబ సముద్భటుఁడై యతండునుం
జేసె రణంబు దత్ప్రబలసేన దలంకెడునట్లుగా సము
ద్భాసిత దుర్నివార్య బహుబాణ విసారణ దారుణోద్ధతిన్. 136

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అప్పుడు; కురుకుల+అగ్రణి= దుర్యోధనుడు; వైరి, సంత్రాసన= శత్రుభయంకరమైన; మత్తవారణ కదంబ= మదపుటేనుగుల సమూహంతో; సముద్భటుఁడు+ఐ= మిక్కిలి అధికుడై; భీమునిన్+తాఁకెన్= భీముడిని ఎదుర్కొన్నాడు; అతండునున్= భీముడుకూడా; సమ్+ఉద్భాసిత= లెస్సగా ప్రకాశితమైన; దుః+నివార్య= అడ్డులేని; బహుబాణ విసారణ= అనేక బాణప్రయోగాల; దారుణ+ఉద్ధతిన్= భయంకర విజృంభణంతో; తద్+ప్రబలసేన= ఆ (దుర్యోధనుడి) గొప్పసైన్యం; తలంకెడు+అట్లుగాన్= చలించేటట్లుగా; రణంబు చేసెన్= పోరు సల్పాడు.

తాత్పర్యం: అప్పుడు దుర్యోధనుడు శత్రు భయంకరమైన మద గజ సైన్యంతో కూడినవాడై విజృంభించి భీముడిని ఎదుర్కొనగా, అతడు కూడా కౌరవసేన కలత చెందే విధంగా అడ్డుకొన సాధ్యంకాని అనేక బాణ ప్రయోగాలతో భయంకరంగా విజృంభించాడు.

క. పదపడి రాధేయుం డు। న్మద వృత్తిం గవిసె గుణ నినాదంబును బె
ట్టిద మగు రథనిస్వనముం। జదల నిగుడఁ బాండవాగ్రజన్ముని దెసకున్. 137

ప్రతిపదార్థం: పదపడి= తరువాత; రాధేయుండు= కర్ణుడు; గుణనినాదంబును= వింటినారి ధ్వని; బెట్టిదము+అగు రథనిస్వనమున్= కఠోరమైన రథధ్వని; చదల నిగుడన్= గగనభాగంలో మారుమ్రోగగా; పాండవ+అగ్రజన్ముని, దెసకున్= ధర్మరాజువైపునకు; ఉన్మదవృత్తిన్+కవిసెన్= గర్వంతో తలపడ్డాడు.

తాత్పర్యం: తరువాత కర్ణుడు తన అల్లెత్రాటిధ్వని, రథధ్వని ఆకాశంలో మారుమ్రోగగా ధర్మరాజుపై విజృంభించాడు.

వ. ఇట్లు గవిసిన మన సైనికు లిట్లని రివ్విధంబున ధర్మనందనుం గదియ నడరిన నరుండు వచ్చి యడ్డంబు సొచ్చునపుడు. 138

ప్రతిపదార్థం: ఇట్లు కవిసినన్= ఇట్లు కర్ణుడు ఎదుర్కొనగా; మన సైనికులు+ఇట్లు+అనిరి= మన సైనికులు ఇట్లా అన్నారు; ఈ+విధంబునన్= ఈ విధంగా; ధర్మనందనున్= ధర్మరాజును; కదియన్+అడరిన= తాకుటకు పూనుకోగా; నరుండు వచ్చి= అర్జునుడు వచ్చి; అడ్డంబు+చొచ్చు+అపుడు= అడ్డుకొనే సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా కర్ణుడు ధర్మరాజుపై తలపడగా మన సైనికులు ఇట్లా అన్నారు: 'ఈ విధంగా కర్ణుడు ధర్మరాజుపై తలపడగా అర్జునుడు వచ్చి అడ్డుకొనే సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **నరునకు సూతసూతికి రణం బగు నేఁ డతిఘోరభంగి నం**
దరయ నితండు గీ టడఁచు నాతని నన్నటులున్నవాఁడు దు
ర్భర రిపుబాధ దక్కి కురురాజు సుఖిత్వముఁ బొందునిప్డు రం
డరదము సేరి యీతని మహాస్త్ర విలాసము సూత మేర్పడన్. **139**

ప్రతిపదార్థం: నేఁడు= ఈ రోజు; నరునకున్, సూతసూతికిన్= అర్జునునకు కర్ణునికి; అతిఘోరభంగిన్= మిక్కిలి భయంకరంగా; రణంబు+అగున్= యుద్ధం జరుగుతుంది; అరయన్= చూడగా; అందున్= యుద్ధంలో; ఇతండు= కర్ణుడు; ఆతనిన్= అర్జునుడిని; కీటు+అడఁచున్= చంపును; అన్నటులు+ఉన్నవాఁడు= అన్నట్లు గోచరిస్తున్నాడు; కురురాజు= దుర్యోధనుడు; దుర్భర, రిపు, బాధ, దక్కి= భరించలేని శత్రుబాధ తొలగి; సుఖిత్వమున్+పొందున్= సుఖాన్ని పొందుతాడు; రండు= కదలిరండి; అరదము చేరి= రథాన్ని సమీపించి; ఈతని= కర్ణుడి; మహా+అస్త్రవిలాసము= మహాస్త్రముల పెంపు; ఏర్పడన్= తెలిసేటట్లుగా; చూచుదము= చూద్దాం.

తాత్పర్యం: ఈ రోజు కర్ణార్జునులకు మహాభయంకరమైన యుద్ధం జరుగుతుంది. చూస్తుంటే కర్ణుడు అతడిని సంహరించేటట్లుగా గోచరిస్తున్నాడు. ఇక వైరి బాధ తొలగి దుర్యోధనుడు సుఖంగా ఉంటాడు. కర్ణుడి రథాన్ని చేరి అతడి మహాస్త్రప్రయోగాన్ని తిలకిద్దాం రండి.

క. **గెలు పెల్ల భంగి నితనికిఁ । గలుగు నను తలంపు వుట్టఁగా నిపుడు మనం**
బుల జనియించు మనోరథ । మలవడుటయుఁ బోర నెఱుఁగనయ్యెడు నదియున్.' **140**

ప్రతిపదార్థం: ఇతనికిన్= ఈ కర్ణుడికి; ఎల్లభంగిన్= అన్ని విధాలుగా; గెలుపు= జయము; కలుగున్+అను తలంపు= కలుగుతుందన్న భావం; పుట్టఁగాన్= తలెత్తగా; ఇప్పుడు, మనంబులన్, జనియించు, మనోరథము= మన మనసులలో కలిగే కోరిక; అలవడుటయున్= నెరవేరటం; అదియున్= అది; పోరన్+ఎఱుఁగన్+అయ్యెడున్= యుద్ధంలోనే వెల్లడి అవుతుంది.

తాత్పర్యం: అన్ని విధాల కర్ణుడికి జయం కలుగుతుందని మన మనస్సులో ఇప్పుడు కలుగుతున్న కోరిక తీరుతుందా అన్నది యుద్ధంలోనే వెల్లడి అవుతుంది.

వ. **అనుచుఁ గూడుకొని రథ కరి తురగ సమ్మర్ద నిర్దళిత భూభాగంబుగా నురవడింప రాధేయుం డరిభీషణం బగు రథంబున.** **141**

ప్రతిపదార్థం: అనుచున్+కూడుకొని= (సైనికులు) ఇట్లా అంటూ కలిసి; రథ, కరి, తురగ, సమ్మర్ద= రథ, గజ, అశ్వసైన్యముల సందడిచే; నిర్దళిత భూభాగంబుగాన్= భేదింపబడిన భూభాగం కలిగేటట్లు; ఉరవడింపన్= త్వరపెట్టగా; రాధేయుండు= కర్ణుడు; అరిభీషణంబు+అగు రథంబునన్= శత్రుభయంకరమైన రథంమీద.

తాత్పర్యం: సైనికులు ఈ విధంగా అంటూ రథ గజ అశ్వ సైన్యాలతో భూభాగాన్ని భేదించుకొని ముందుకు సాగగా కర్ణుడు శత్రుభయంకరమైన రథంమీద (ఆసీనుడై).

తే. మిగిలి యప్పాండవాగ్రజు మగఁటిమియును । జలముఁ గోల్పుచ్చి తూలఁబోఁ బలికి మెఱసె
నధిప! యతినికి వీఁకమై నడ్డపడఁగఁ । గడఁగు నద్దెస యోధుల గర్వ మడఁచి. 142

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; వీఁకమైన్= పరాక్రమంతో; అతనికిన్= కర్ణుడికి; అడ్డపడఁగన్= అడ్డుపడుటకు; ఆ+దెస= ఆవైపు; కడఁగు= పూనుకొనెడి; యోధుల, గర్వము+అడఁచి= వీరుల గర్వాన్ని అణచి; మిగిలి= అతిశయించి; ఆ+పాండవు+అగ్రజు= ధర్మరాజు; మగఁటిమియును= పౌరుషమును; చలమున్= పట్టుదలను; కోలు+పుచ్చి= నశింపజేసి; తూలన్+పోన్+పలికి= (అతడు) తక్కువచేసి పలికి; మెఱసెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! కర్ణుడు - పాండవ పక్షాన తన కడ్డువచ్చిన యోధుల గర్వమడచి, అతిశయించి ధర్మరాజు పౌరుషాన్ని, పట్టుదలను అణగించి, తక్కువచేసి మాట్లాడి గొప్పగా ప్రకాశించాడు.

కర్ణుఁడు ధర్మజుపైఁ గవిసి విజృంభించుట (సం. 8-31-5)

వ. అనిన విని సంజయునకు ధృతరాష్ట్రుం డిట్లనియెఁ 'గర్ణుండు దన మొన యె ట్లాయితంబు సేసెఁ? గౌంతేయ ముఖ్యసైన్య సన్నాహం బెట్టి? దతం డతనిం బొదివిన యప్పుడు గవ్వడి యెవ్వలన నుండె? నవ్వీరుం డన్న కడ నున్న నా సూతనందనున కట్లు సేయ వశంబగునే? వాసవుండు సకల సురగణంబులతోఁ బన్ని యన్నరునిపై వచ్చి ఖాండవంబు గాల్పకుండఁ గావం జాలెనే? బ్రదుకున కాసపడు మగల కతని మార్కొనవచ్చునే? రాధేయునకు వచ్చుంగాక? యనుటయు. 143

ప్రతిపదార్థం: అనినన్ విని= (సంజయుడు) చెప్పగా విని; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్= సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; కర్ణుండు= కర్ణుడు; తనమొన= తనవ్యూహం; ఎట్లు+ఆయితంబు+చేసెన్= ఏ విధంగా సిద్ధపరచాడు; కౌంతేయముఖ్య= ధర్మరాజు మున్నగువారి; సైన్యసన్నాహంబు+ఎట్టిది?= సైన్యవ్యూహాలు ఎలాంటివి?; అతండు+అతనిన్= కర్ణుడు ధర్మజుని; పొదివిన+అప్పుడు= తాకినప్పుడు; కవ్వడి= అర్జునుడు; ఏ+వలనన్+ఉండెను?= ఎక్కడ ఉన్నాడు?; ఆ+వీరుండు= అర్జునుడు; అన్నకడన్+ఉన్నను= అన్నదగ్గరఉంటే; ఆ సూతనందనునకున్= కర్ణుడికి; అట్లు+చేయవశంబు+అగునే?= (ధర్మజుని తాకటానికి) అట్లా చేయటానికి సాధ్యమవుతుందా?; వాసవుండు= ఇంద్రుడు; సకల సురగణంబులతోన్+పన్ని= సకల దేవసమూహాలతో కూడి; ఆ+నరునిపైన్ వచ్చి= అర్జునుడిపై తలపడి; ఖాండవంబు+కాల్పకుండన్= ఖాండవవనాన్ని దహించేయకుండా; కావన్+చాలెనే?= కాపాడగలిగినాడా?; బ్రదుకునకున్+ఆసపడు మగలకున్= ప్రాణంమీద ఆశగల వీరులకు; ఆతనిన్+మార్కొనవచ్చునే?= అర్జునుడిని ఎదుర్కొనటం సాధ్యమా?; రాధేయునకున్ వచ్చున్+కాక= కర్ణుడికి సాధ్యమవుతుందేమో కాని; అనుటయున్= అని అడుగగా.

తాత్పర్యం: సంజయుడి మాటలు విని ధృతరాష్ట్రుడు ఇట్లా ప్రశ్నలు వేయసాగాడు. 'కర్ణుడు, ధర్మరాజు తమ వ్యూహాలను ఏ విధంగా ఏర్పరచుకొన్నారు? కర్ణుడు అతడిపైకి వెళ్ళినపుడు అర్జునుడు ఎక్కడున్నాడు? అతడే ఉంటే కర్ణుడు అట్లా చేయగలిగేవాడా? ఖాండవవనదహనం సందర్భంలో దేవేంద్రుడు సకల దేవగణంబులతో అర్జునుడి మీదికి దండెత్తి ఖాండవాన్ని కాల్పకుండ రక్షించగలిగాడా? బ్రతుకుమీద ఆశగల వీరులతని నెదుర్కొనగలరా? అది ఒక్క కర్ణుడికే సాధ్యం కాగలదేమో!

విశేషం: ఈ ప్రశ్న పరంపరవలన ధృతరాష్ట్రుడి ఆతురత వ్యక్తమవుతున్నది.

తే. **ఇట్టు లను సంజయుం డమ్మహీశ్వరునకు । 'నంగపతి మోహరంబు తెఱంగు, ధర్మ సుతుని యొడ్డు విధంబు, నర్జునుఁడు వారి । పోరునెడ లేమియును మీఁది పోరు వినుము.** **144**

ప్రతిపదార్థం: సంజయుండు= సంజయుడు; ఆ+మహీశ్వరునకున్= ధృతరాష్ట్రుడితో; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; అంగపతి, మోహరంబు, తెఱంగు= కర్ణుడి వ్యూహవిధానం; ధర్మసుతుని, ఒడ్డు, విధంబు= ధర్మరాజు పన్నిన వ్యూహరచన; అర్జునుఁడు; వారిపోరు+ఎడన్= వారి యుద్ధసమీపంలో; లేమి= లేకపోవటం; మీఁదిపోరు= తర్వాత కొనసాగిన యుద్ధం; వినుము= వినుము.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి ప్రశ్నలకు సంజయుడు ఇట్లా సమాధానం చెప్పాడు. 'కర్ణుడి వ్యూహరచన, ధర్మరాజు ప్రతివ్యూహరచన, అర్జునుడు అక్కడ లేకపోవటం, అప్పటి యుద్ధవిశేషాలు వివరంగా చెప్పుతాను వినుము.'

వ. **కృపాచార్యుండును గృతవర్మయు మాగధులు వలపట, శకునియు నులూకుండును గుఱ్ఱపు దడంబులతో వారికెలనను, సంశప్తక గణం బిరువది నాలుగు వేలు రథిక ముఖ్యు లగ్గలిక నుల్లసిల్లి దాపటను, నీ కొడుకులందుఁ గొందఱు కాంభోజ శక యవన సైన్య సమేతంబుగా వారియవులను, బాహుబల భాసితుండై దుశ్శాసనుండు వెనుకనుం, గతిపయసోదర పరివృతుండై, కురురాజు పిఱుందను, నశ్వత్థామ ప్రముఖ యోధులు గరినికరకృత సన్నాహులై యన్నరపతి నియోగింప నతనిపజ్జ నిలువ నిజపుత్రులుఁ దన చుట్టునుఁ, గదిసి యెసకమెసఁగు పరవశంబున మెఱయ సూతసూనుండు సేనాముఖంబునకుం దిలకంబై నిలిచి వొలిచె నట్లు మోహరించి మదకల మాతంగంబుల తఱచు కతంబున మొయిళ్ళ మొత్తంబుల కైవడిం గాఱుకొను నమ్మొన నురవడి నడిపించు నా కర్ణునిం గనుంగొని కౌంతేయాగ్రజుండు గాండీవి రావించి యి ట్లనియె.** **145**

ప్రతిపదార్థం: కృపాచార్యుండును, కృతవర్మయున్= కృపాచార్యుడు, కృతవర్మ; మాగధులు= మగధదేశ వీరులు; వలపటన్= కుడివైపు; శకునియున్+ఉలూకుండును= శకుని, ఉలూకుడు; గుఱ్ఱపు దడంబులతోన్= అశ్వసైన్యంతో; వారికెలనను= వారి ప్రక్క; సంశప్తక గణంబు= త్రిగర్త దేశీయులు; ఇరువది నాలుగువేలు రథికముఖ్యులు= ఇరవైనాలుగువేలమంది రథికవీరులు; అగ్గలికన్+ఉల్లసిల్లి= శౌర్యంతో ఒప్పి; దాపటను= ఎడమవైపున; నీ కొడుకులందున్+కొందఱు= నీ కొడుకులలో కొందరు; కాంభోజ, శక, యవన, సైన్య, సమేతంబుగాన్= కాంభోజ, శక, యవన రాజుల సైనికులతో కూడి; వారి+అవులను= వారిఅవతల; దుశ్శాసనుండు= దుశ్శాసనుడు; బాహుబలభాసితుండు+అయి= భుజబలంతో ప్రకాశిస్తూ; వెనుకనున్= వెనుకవైపు; కురురాజు= దుర్యోధనుడు; కతిపయ, సోదర, పరివృతుండు+అయి= కొందరు తమ్ములతో కలిసి; పిఱుందనున్= ఆ వెనుకనూ; అశ్వత్థామ ప్రముఖయోధులు= అశ్వత్థామ మొదలగు వీరులు; కరినికర కృత, సన్నాహులు+అయి= గజసైన్యంతో కూడినవారై; ఆ+నరపతి నియోగింపన్= దుర్యోధనుడు నియమించగా; అతని పజ్జన్ నిలువన్= కర్ణుడిప్రక్క నిలబడి ఉండగా; సూతసూనుండు= కర్ణుడు; నిజపుత్రులున్= తన కుమారులు; తన చుట్టునున్+కదిసి= తన చుట్టుచేరి; ఎసకము+ ఎసఁగు+పరవశంబునన్+మెఱయన్= అతిశయ దర్పంతో ఒప్పగా; సేనాముఖంబునకున్+తిలకంబు+అయి= సేన అగ్రభాగానికి బొట్టుగా; నిలిచిపొలిచెను= నిలిచి ఒప్పారాడు; అట్లు మోహరించి= ఆ విధంగా వ్యూహం పన్ని; మదకల మాతంగంబుల= మదపుటేనుగుల; తఱచు కతంబును= ఆధిక్యంచేత; మొయిళ్ళ మొత్తంబుల కైవడిన్= మబ్బుల గుంపువలె; కాఱుకొను= సందడి చేయుచున్న; ఆ+మొనను= ఆ వ్యూహాన్ని; ఉరవడిన్+నడిపించు= వేగంగా నడిపిస్తున్న; ఆ కర్ణునిన్+కనుంగొని=

ఆ కర్ణుడిని చూచి; కౌంతేయ+అగ్రజుండు= ధర్మరాజు; గాండీవిన్ రావించి= అర్జునుడిని పిలిచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: కర్ణుడి వ్యూహానికి కుడివైపు కృపాచార్యుడు, కృతవర్మ, మగధవీరులు; వారి ప్రక్కన శకుని, ఉలూకుడు; ఎడమవైపు త్రిగర్తవీరులు; వారిప్రక్కన కాంభోజ శకయవనులతో కూడిన కౌరవులు; వెనుకవైపు దుశ్శాసనుడు; అతడి వెనుక సోదర సమేతుడైన దుర్యోధనుడు నిలిచి ఉండగా, కర్ణుడు తన ప్రక్కన అశ్వత్థామ మున్నగు వీరులు, తన చుట్టు తన కుమారులతో కూడినవాడై కౌరవసేన అగ్రభాగంలో తిలకంగా ప్రకాశించాడు. మదగజాలు అధికంగా ఉండి మేఘసమూహాల వలె శబ్దం చేస్తున్న ఆ సేనను ముందుకు నడిపిస్తున్న కర్ణుడిని చూచి, ధర్మరాజు అర్జునుడిని పిలిచి అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం: కర్ణుడు పన్నినవ్యూహం మకరవ్యూహం. తుండం కర్ణుడు. శకుని, ఉలూకుడు రెండు కన్నులు. కంఠస్థానంలో రారాజు తమ్ములు, ఉదరస్థానంలో దుర్యోధనుడు ఉన్నారు. కృతవర్మ, కృపాచార్యుడు రెండు పాదాలు. ఇది పదహారవరోజు సంగ్రామం.

ఉ. **'సూతతనూజు మోహరము సూచితె? యెంతయు గట్టియై సము**
ద్ద్యోతిత భంగిఁ దోఁచె నది యుక్కునఁ బైఁబడి యిబ్బలంబు ని
ర్ఘాతము సేయకుండఁగ నెదుర్కొని యెమ్మెయి నిల్వరింత మ
న్నీతి విధింపుమా? బలుపు నేర్పును దద్జ్ఞులు పిచ్చలింపఁగన్.' **146**

ప్రతిపదార్థం: సూత, తనూజు, మోహరము= సూతసుతుడైన కర్ణుడి వ్యూహం; చూచితె?= చూచావా?; ఎంతయున్ గట్టి ఐ= ఎంతో దృఢమై; సముద్ద్యోతిత భంగిన్+తోఁచెను= ఉజ్జ్వలంగా కనిపిస్తున్నది; అది= ఆ సేన; ఉక్కునన్+పైన్+పడి= శౌర్యంతో మనపై విజృంభించి; ఈ+బలంబు= (మన) సేనను; నిర్ఘాతము చేయక+ఉండఁగన్= చెదరగొట్టకుండా; ఎదుర్కొని= ఎదిరించి; ఏ+మెయిన్= ఏ విధంగా; నిల్వరింతము= అడ్డుకొనగలమో; తద్జ్ఞులు= విజ్ఞులు; బలుపు, నేర్పును= మన బలము, నేర్పు; పిచ్చలింపఁగన్= ప్రశంసించగా; ఆ+నీతి= ఆ వ్యూహ పద్ధతిని; విధింపుమా!= రూపొందించుము.

తాత్పర్యం: సూతపుత్రుడైన కర్ణుడి వ్యూహం చూచావా? ఎంతో దృఢంగా, దేదీప్యమానంగా అగుపిస్తూ ఉంది. ఆ సేన బలంతో మన సేనమీద పడి చెదరగొట్టకుండా, ఏ విధంగా దానిని ఎదుర్కొని అడ్డుకోగలమో, ఆ విధంగా - మన బలాన్ని, నేర్పును విజ్ఞులు ప్రశంసించేటట్లుగా వ్యూహరచన చేయుము.

వ. **అనుటయు సంక్రందన నందనుండు.** **147**

ప్రతిపదార్థం: అనుటయున్= (ధర్మరాజు) అనగా; సంక్రందన నందనుండు= అర్జునుడు.

తాత్పర్యం: అని అనగా, ధర్మరాజు మాటలకు అర్జునుడు.

తే. **సారవంత మై కర్ణుని సైన్య మురవ। ణించుఁ గా కేమి దీనికి నృపవరేణ్య!**
పూని చేయంవగలయదుఁ బ్రధానకార్య। మతని సమయించుటయ; నాకు నది భరంబె?' **148**

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజా!; కర్ణుని సైన్యము; సారవంతము+అయి= శ్రేష్ఠమై; ఉరవణించున్+కాక+ఏమి?= విజృంభిస్తే ఏమి?; దీనికిన్= దీనికి; ప్రధాన కార్యము= ముఖ్యమైన పని; నాకున్= నాకు; పూని= పూనుకొని; చేయంగవలయున్= చేయవలసి ఉన్నది; అతనిన్+సమయించుటయ= కర్ణుని సంహరించటమే; అది= ఆ పని; భరంబె?= కష్టమా?

తాత్పర్యం: పటిష్ఠమైన కర్ణుడి సేన విజృంభించి మనపైకి వస్తే రానిమ్ము. కాని, దానికి ప్రతిగా మనం చేయదగిన ముఖ్యమైన పని అతడిని సంహరించటం. అది నాకు కష్టమైన పని కాదు.'

వ. అనిన విని యమ్మనుజపతి యతని కిట్లను 'నట్లేని నీవు రాధేయుని గెలుపుము; భీమసేనుండు సుయోధనుని, నకులుండు వృషసేనుని, సహదేవుండు సౌబలుని, శతానీకుండు దుశ్శాసనుని, సాత్యకి కృతవర్మను, ధృష్టద్యుమ్నుండు ద్రోణపుత్రుని, ద్రౌపదేయులు శిఖండియుం దారును దక్కటి ధార్తరాష్ట్రులం దలపడువా; రేను గృపాచార్యుని తోడం బెనంగెద' ననుటయు 'నట్లకాక' యని యతండు మున్ను దను నిలిచిన నెలవునకుం జనునెడ నయ్యుధిష్ఠిరు పనుపు తెఱంగు వారలందఱకు నెఱింగించె; నతండు వలపటి వలన సైన్యాగ్రవర్తి యయ్యును, వృకోదరుండు వామపార్శ్వవర్తి యయ్యును. శైనేయ ద్రౌపదేయ సమేతంబుగా నప్పాండవాగ్రజుండు మధ్యభాగస్థుండయ్యు నున్న యమ్మోహరం బా సూతనందను మొన యురవడి సరకు గొనక మార్కొనియె' ననవుడు నాంబికేయుండు. 149

ప్రతిపదార్థం: అనినన్ విని= (అర్జునుడు) అనగా విని; ఆ+మనుజపతి= ఆ ధర్మరాజు; అతనికిన్+ఇట్లు+అనున్= అతడితో ఇట్లా అన్నాడు; అట్లు+ఏనిన్= అట్లా అయితే; నీవు, రాధేయునిన్, గెలువుము= నీవు కర్ణుడిని జయింపుము; భీమసేనుండు సుయోధనునిన్= భీముడు దుర్యోధనుడిని; నకులుండు వృషసేనునిన్= నకులుడు వృషసేనుడిని; సహదేవుండు సౌబలునిన్= సహదేవుడు శకునిని; శతానీకుండు దుశ్శాసనునిన్= శతానీకుడు దుశ్శాసనుడిని; సాత్యకి కృతవర్మను= సాత్యకి, కృతవర్మను; ధృష్టద్యుమ్నుండు ద్రోణపుత్రునిన్= ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామను; ద్రౌపదేయులు= ఉపపాండవులు; శిఖండియున్+తారును= శిఖండి తాము కలిసి; తక్కటి ధార్తరాష్ట్రులన్= మిగతా కౌరవులను; తలపడువారు= ఎదుర్కొంటారు; ఏను+కృపాచార్యుతోడన్= నేను కృపాచార్యుడితో; పెనంగెదను+అనుటయును= తలపడతాను అని అనగా; అతండు= అర్జునుడు; అట్లకాక+అని= సరే అని; మున్ను+తలన నిలిచిన నెలవునకున్= ముందు తానున్న స్థలానికి; చను+ఎడన్= వెళ్ళేటప్పుడు; ఆ+యుధిష్ఠిరు= ధర్మరాజుయొక్క; పనుపుతెఱంగు= ఆజ్ఞావిషయం; వారలందఱకును+ఎఱింగించెను= వారందరికీ తెలిపాడు; అతండు= అర్జునుడు; వలపటివలనన్= కుడివైపు; సైన్య+అగ్రవర్తి+అయ్యును= సైన్యానికి ముందుండగా; వృకోదరుండు= భీముడు; వామపార్శ్వవర్తి+అయ్యును= ఎడమవైపు నిలువగా; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ ధర్మరాజు; మధ్యభాగస్థుండు+అయ్యును= నడమనుండగా; ఉన్న= నిలిచిన; ఆ+మోహరంబు= ఆ వ్యూహం; ఆ సూతనందను మొన+ఉరవడిన్= కర్ణుడి వ్యూహ వేగాన్ని; సరకుగొనక= లెక్కచేయక; మార్కొనియెన్= ఎదుర్కొన్నది; అనవుడున్+ఆంబికేయుండు= (సంజయుడు) అని చెప్పగా ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: కర్ణుడి సైన్యంలోని వారితో పాండవసేనలోని వీరులు ఎవరెవరు ఎట్లా తలపడాలో ధర్మరాజు అర్జునుడితో చెప్పాడు. అర్జునుడు తన సేనలోని వారికి ఆ విధానాన్ని వివరించి తన వ్యూహంతో కౌరవసేనను ఎదుర్కొన్నాడు. అప్పుడు సంజయుడితో ధృతరాష్ట్రు డిట్లా అన్నాడు:

విశేషం: కర్ణుడి మకరవ్యూహానికి ప్రతిగా అర్జునుడు అర్ధచంద్ర వ్యూహాన్ని ఏర్పరచాడు. తాను అగ్రస్థానంలో ఉండి భీమధృష్టద్యుమ్నులను రెండు పార్శ్వాలలో నిలిపాడు. మిగిలిన ముగ్గురు పాండవులు వారి వెనుక ఉన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. 'నరుఁ డమ్మై విని వచ్చె నన్నరునకు న్సంశప్తకశ్రేణికి
న్దుర మత్యుద్భట భంగిఁ జెల్లుటయు మున్సూచించితీ వయ్యుధి
ష్ఠిరునిం గర్ణుఁడు దాఁకి యోర్చె ననియుం జెప్పంగ వింటిన్ రణం
బరయం జిత్రము; సెప్పు మత్తెఱఁగు సువ్యక్తంబుగా సంజయా!' 150

ప్రతిపదార్థం: సంజయా!; నరుఁడు= అర్జునుడు; ఆ+మై, వినివచ్చెన్= ఆ విధం (ధర్మరాజుమాటలు) విని వచ్చాడు; ఆ+ నరునకున్= అర్జునుడికి; సంశప్తక, శ్రేణికిన్= త్రిగర్తవీరుల సమూహానికి; అతి+ఉద్భటభంగిన్= ఎంతో భయంకరంగా; దురము= యుద్ధం; చెల్లుటయున్= జరగటం; ఈవు= నీవు; మున్+సూచించితి(వి)= ఇంతకుముందు చెప్పావు; ఆ+ యుధిష్ఠిరునిన్= ఆ ధర్మరాజును; కర్ణుఁడు తాకి; ఓర్చెను+అనియున్= ఓడించాడని కూడా; చెప్పంగ వింటిన్= చెప్పగా విన్నాను; అరయన్= చూడగా; రణంబు చిత్రము= యుద్ధం విచిత్రమైనది; ఆ+తెఱఁగు= ఆ విధము; సువ్యక్తంబుగాన్= విశదంగా; చెప్పుము= వివరించుము.

తాత్పర్యం: 'అర్జునుడికీ త్రిగర్త వీరులకు ఘోరయుద్ధం జరిగిందనీ, కర్ణుడు ధర్మరాజు పైబడి ఓడించాడనీ నీవు చెప్పగా నేను విన్నాను. సంజయా! చిత్రమైన ఆ యుద్ధవిశేషాలు వివరంగా చెప్పుము.'

వ. అని యడిగిన సంజయుం డమ్మానవపతి కిట్లను 'నట్లు ధర్మజుండు సెప్పెఁ; గాని యయ్యిరువాఁగుం గదిసినప్పు డన్నియమంబు నడవక కయ్యంపు టౌచిత్యంబున నొండు దెఱంగు సెల్లె నది యెఱింగించెద నవధరింపు; మవ్విధంబున మొనలు రెండును నొండొంటిం దార్కొను సమయంబున సవ్యసాచి కర్ణు నడచు చక్కటికి నడరం గడంగినఁ గ్రాలు కపికేతనంబు గనుంగొని తెంపు పెంపునఁ బొంపిరివోవుచుఁ ద్రిగర్తాది సంశప్తకులు సరభసంబుగా నడ్డపడి పైకొని తఱిమి పొంగిన పయోనిధిం బోలిన నబ్బలియుండు సెలియలికట్టం బోలి నిలువరించి మాతంగ ప్రముఖ సేనాంగ సకలాంగ శకలంబుల నిలాతలంబు గప్పుచుండ నొండొండ పేర్చి యా బలం బా బలమర్దన నందను నరదంబు ముంచికొనిన నవ్వీరుండు విజృంభిత విక్రముండై బడబాగ్ని కీలాకలాపంబు చందం బగు సాయక నికాయంబు నిగిడించుచు నెక్కుడుమదంబున నమ్మూఁకలం ద్రెక్కొనుచుండఁ దత్ప్రకారం బాలోకించి రాధేయునకు శల్యుం డి ట్లనియె. 151

ప్రతిపదార్థం: అని+అడిగినన్= అని అడుగగా; సంజయుండు= సంజయుడు; ఆ+మానవపతికిన్= ధృతరాష్ట్రుడితో; ఇట్లు+ అనున్= ఇట్లా అన్నాడు; అట్లు ధర్మజుండు+చెప్పెన్+కాని= ఆ విధంగా ధర్మరాజు చెప్పాడు (నియమించాడు) కాని; ఆ+ఇరువాఁగున్+ కదిసినప్పుడు= ఆ రెండు పక్షాలూ తలపడినప్పుడు; ఆ+నియమంబు నడవక= ఆ నియమం కుదరక; కయ్యంపు+ ఔచిత్యంబునన్= యుద్ధపు ఔచిత్యంతో; ఒండు తెఱంగు చెల్లెను= వేరేవిధంగా జరిగింది; అది+ఎఱింగించెదను+అవధరింపుము= దానిని వివరిస్తాను వినుము; ఆ+విధంబునన్= ఆ విధంగా; మొనలు రెండునున్= సైన్యాలు రెండూ; ఒండు+ఒంటిన్+తార్కొను, సమయంబునన్= ఒకదానిని మరొకటి ఢీ కొన్న సమయంలో; సవ్యసాచి= అర్జునుడు; కర్ణు+నడచు చక్కటికిన్= కర్ణుడు నడుచు చోటికి; అడరన్+కడంగినన్= పూని విజృంభించగా; క్రాలు, కపికేతనంబు+కనుంగొని= ప్రకాశిస్తున్న కపిధ్వజాన్ని చూచి; త్రిగర్త+ఆది సంశప్తకులు= త్రిగర్తీయులు మున్నగు సంశప్తకులు; తెంపుపెంపునన్= పొంపిరిపోవుచున్= ధైర్యంతో విజృంభిస్తూ; సరభసంబుగాన్+అడ్డపడి= వేగిరంగా అడ్డుకొని; పైకొని తఱిమి= పైబడి తరిమి; పొంగిన పయోనిధిన్+పోలినన్= ఉప్పొంగిన సముద్రాన్ని పోలగా; ఆ+బలియుండు= ఆ వీరుడు (అర్జునుడు); చెలియలికట్టన్+పోలి= చెలియలికట్టవలె; నిలువరించి= అడ్డుకొని; మాతంగ ప్రముఖ, సేనా+అంగ= మదగజాలు మొదలైన

సేనాంగాలయొక్క; సకల+అంగశకలంబులన్= అన్ని అవయవాల ముక్కలు; ఇలా తలంబు+కప్పుచుండన్= భూమండలాన్ని కప్పుతుండగా; ఒండు+ఒండ పేర్చి= ఒకదానిపై ఒకదాన్ని పేర్చి; ఆ బలంబు= సంశప్తకసేన; ఆ బలమర్దన నందను= అర్జునుడి; అరదంబు ముంచికొనినన్= రథంపై క్రమ్ముకొనగా; ఆ+వీరుండు= అర్జునుడు; విజృంభిత, విక్రముండు+ఐ= విజృంభించిన పరాక్రమం కలవాడై; బడబా+అగ్నికీలా కలాపంబు చందంబు+అగు= బడబాగ్ని జ్వాలల సమూహము వంటి; సాయకనికాయంబు= బాణసమూహం; నిగిడించుచున్= కురిపిస్తూ; ఎక్కుడు మదంబునన్= అతిశయించిన గర్వంతో; ఆ+మూఁకలన్+త్రెక్కొనుచుండన్= శత్రుసేనలను సంహరిస్తుండగా; తద్+ప్రకారంబు+ఆలోకించు= ఆ పరిస్థితిని చూచి; శల్యుండు= శల్యుడు; రాధేయునకున్= కర్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అని అడుగగా, సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. ఆ విధంగా ధర్మరాజు చెప్పాడుగాని, ఇరుపక్షాల సైన్యాలు ఢీ కొన్నప్పుడు ఆయన చెప్పినట్లు జరుగలేదు. మరో విధంగా జరిగింది. అది చెపుతాను విను. రెండు సైన్యాలు ఢీ కొన్నప్పుడు అర్జునుడు కర్ణుడున్న చోటికి వచ్చి, అతడి మీద విజృంభించాడు. మెరుస్తున్న అతని కపికేతనాన్ని చూచి, త్రిగర్తకులు మొదలైన సంశప్తకులు అతిశయించిన సాహసంతో అతివేగంగా వచ్చి అడ్డుపడి, పొంగిన సముద్రంలా అగుపించారు. అయినా ఆ బలశాలి అర్జునుడు చెలియలి కట్టవలె ఆ సైన్యసాగరాన్ని నిలువరించాడు. గజసైన్యం మొదలుగా చతుర్విధసైన్యాల సకలావయవాల ముక్కలు నేలను కప్పుతుండగా, ఒక్కొక్కటిగా వాటిని పేర్చి, ఆ త్రిగర్తాది సంశప్తకుల సైన్యం అర్జునుని రథాన్ని ముంచింది. అప్పుడు అర్జునుడు, విజృంభించిన పరాక్రమంతో బడబాగ్ని జ్వాలలవంటి బాణ సమూహాలు ప్రయోగిస్తూ, అతిశయించిన గర్వంతో ఆ శత్రు సమూహాలను సంహరించసాగాడు. అది చూచి కర్ణుడు శల్యుడితో ఇట్లా అన్నాడు.

ఉ. **'అల్లదె యర్జున ధ్వజ విహారము గానఁగనయ్యెడుం గపీం**
ద్రోల్లసనంబునన్ మెఱపి యుద్భటులైన త్రిగర్తు లేపు శో
భిల్లఁగ వారె! యన్నరుని బెట్టుగఁ దాఁకి; రతండు నంప సె
న్వెల్లి నిగిడ్చి ముంచె నదె నింగి గుణధ్వని వొంగ వారలన్.' **152**

ప్రతిపదార్థం: అల్లదె= అదిగో; అర్జున ధ్వజవిహారము= అర్జునుడి కేతనం విహరించటం; కపి+ఇంద్ర+ఉల్లసనంబునన్, మెఱపి= హనుమంతుడి కాంతితో ప్రకాశిస్తూ; కానఁగన్+అయ్యెడున్= కనిపిస్తున్నది; ఉద్భటులు+అయిన త్రిగర్తులు= బలశాలులైన త్రిగర్తదేశపు వీరులు; వారె= అదిగో; ఏపు, శోభిల్లగన్= గర్వం ప్రకాశిస్తూ ఉండగా; ఆ+నరుని= ఆ అర్జునుడిని; బెట్టుగన్+తాఁకిరి= గట్టిగా ఎదుర్కొన్నారు; అతండును= అర్జునుడు; అదె= అదుగో; నింగిన్= ఆకాశంలో; గుణధ్వని పొంగన్= వింటినారి ధ్వని వ్యాపించగా; వారలన్= త్రిగర్తీయులను; అంప సెను+వెల్లి= అమ్ముల ప్రవాహం; నిగిడ్చి= వ్యాపింపచేసి; ముంచెన్= ముంచాడు.

తాత్పర్యం: అదిగో! రణభూమిలో కపీంద్రుడైన హనుమంతుని చిహ్నం ప్రకాశించగా, అర్జునుడి ధ్వజవిహారం (రథవిహారం) అగుపిస్తున్నది. ఆ అగుపించే వారే త్రిగర్తులు. ప్రకాశించే గర్వంతో అర్జునుని గట్టిగా ఎదుర్కొన్నారు. అడుగో! అర్జునుడు తన వింటి అల్లె త్రాటి ధ్వని ఆకాశం అంతా వ్యాపించగా, వాళ్ళను బాణాలవెల్లువలో ముంచాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని చెప్పి చూపెఁ బదంపడి భారద్వాజ పుత్రుని బరవసంపు మాటల నాటోపంబు మిగిలి మన రథికులు గవిసిన దారుణ రణం బయ్యె నని యాకర్ణించి తది యేర్పడ వినుము వివరించెద. 153

ప్రతిపదార్థం: అని, చెప్పి, చూపెన్= అంటూ చూపించాడు; భారద్వాజ పుత్రుని= అశ్వత్థామయొక్క; బరవసంపు మాటలన్= ధైర్యవచనాలకు; ఆటోపంబు మిగిలి= గర్వం అతిశయించి; మన రథికులు కవిసినన్= మన వీరులు పైబడగా; దారుణ రణంబు+అయ్యెనని= ఘోరయుద్ధం జరిగిందని; ఆకర్ణించితి(ని)= విన్నాను; అది= ఆ విషయం; ఏర్పడన్= స్పష్టమగునట్లు; వివరించెదన్ వినుము= వివరిస్తాను వినుము.

తాత్పర్యం: అని శల్యుడు చూపించాడు. ఆపై అశ్వత్థామ ధైర్యపూరిత వాక్కులు విని మన వీరులు శత్రువులపై బడగా, రణం తీవ్రమైంది. దాన్ని వివరిస్తాను వినుము.

సీ. కృపుఁడు సౌబలుఁడును గృతవర్మయును నలిఁ జెలఁగు మూఁకలతోడఁ బెలుచఁ గవిసి
కాశ కైకయ మాత్స్య కోసల పాండ్యాది । బలములఁ దాఁకి రగ్గలిక మెఱయ
నా రెండు వాఁగుల నాయుధంబుల యెఱ । మంటలుఁ బొళ్ళును మింటఁ బుడమిఁ
జూడ నక్కజముగ శోణిత ధారలు । ప్రచుర ధూళీ తిమిరముల నడఁప

తే. భగ్న రథములు నిపతితేభములు నిహత । హయములును మృతభటులును రయమునకు వి
ఘాత మొనరింప నున్మద గమనభంగు । లందు వెరవులు మెఱయ బోరాడి రధిప! 154

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; కృపుడు సౌబలుఁడును కృతవర్మయును= కృప, శకుని, కృతవర్మలు; నలిన్+చెలఁగు, మూఁకలతోడన్= మిక్కిలి చెలరేగిన సైనికులతో; పెలుచన్+కవిసి= తీవ్రంగా తాకి; అగ్గలిక, మెఱయన్= అతిశయమొప్పగా, కాశ, కైకయ, మాత్స్య, కోసల, పాండ్య+ఆదిబలములన్+తాఁకిరి= కాశ కైకయ మత్స్య కోసల పాండ్య దేశ సైన్యాలను ఎదుర్కొన్నారు; ఆ రెండు వాఁగులన్= ఇరుపక్షాలవారి; ఆయుధముల+ఎఱమంటలున్+పొళ్ళును= ఆయుధాల రాపిడితో కలిగిన ఎర్రని మంటలు, ధూళియు; మింటన్+పుడమిన్= నింగి నేలలందు; చూడన్+అక్కజముగన్= చూడ అచ్చెరువు కలిగించగా; శోణితధారలు= రక్తధారలు; ప్రచురధూళీ, తిమిరములన్+అడఁపన్= దట్టమైన్ ధూళి అనెడి చీకట్లను అణచగా; భగ్నరథములు= విరిగిన రథాలు; నిపతిత+ఇభములు= కూలిన ఏనుగులు; నిహత హయములును= హతమైన అశ్వాలు; మృత భటులును= మరణించిన సైనికులు; రయమునకున్ విఘాతము+ఒనరింపన్= సైన్యవేగానికి అడ్డుకలిగించగా; ఉన్మద గమన భంగులందున్= తీవ్రమైన నడక విధములందు; వెరవులు, మెఱయన్= ఉపాయాలు ఒప్పగా; పోరాడిరి= పోరు సలిపారు.

తాత్పర్యం: కృపుడు, శకుని, కృతవర్మ చెలరేగిన శత్రుసేనలతో పోరుతూ, అతిశయంతో వివిధ దేశ సైన్యాలను ఎదుర్కొన్నారు. వారి ఆయుధాల తాకిడికి మంటలు, పొడలు ఏర్పడ్డాయి. రక్తధారలు దట్టమైన ధూళి అనే చీకట్లను అణచాయి. నేలపై కూలిన రథ గజ తురగ పదాతులు తమ గమనానికి ఆటంకంగా ఉన్నా, వివిధ గతులతో ముందుకు సాగి వారు పోరు సలిపారు.

వ. ఆ లోన. 155

తాత్పర్యం: అంతలో.

కర్ణుఁడు పాంచాల కుమారుల ననేకులం జంపుట (సం. 8-43 (కుంభ))

ఉ. మేలి మదావళంబులును మేటి హయంబులుఁ దమ్ము పిండు నా
భీలతఁ జుట్టిరాఁగ రథబృందముతోఁ గురురాజు కర్ణుదో
ర్లీలకుఁ దోడ్పడం గడఁగె రేణు వుదీర్ణముగా నతండు పాం
చాల బలంబుపై నడరె శౌర్య సముద్భటబాహువీర్యుఁ డై. 156

ప్రతిపదార్థం: మేలి, మదావళంబులును= ఉత్తమ మదగజాలు; మేటి హయంబులున్= శ్రేష్ఠమైన అశ్వాలు; తమ్ముపిండున్= సోదరసమూహం; ఆభీలతన్+చుట్టిరాఁగన్= భీతిగొల్పుతూ వెంటరాగా; కురురాజు= దుర్యోధనుడు; రథబృందముతోన్= రథ సముదాయంతో; రేణువు+ఉదీర్ణముగాన్= దుమ్ము చెలరేగగా; కర్ణ, దోః+లీలకున్= కర్ణుడి భుజదర్పానికి; తోడ్పడన్+ కడఁగెన్= సహాయపడటానికి పూనుకొన్నాడు; అతండు= కర్ణుడు; శౌర్య, సముద్భట, బాహువీర్యుఁడు+ఐ= పరాక్రమాతిశయంతో కూడిన బాహుబలంకలవాడై; పాంచాల బలంబుపైన్+అడరెన్= పాంచాల సేన మీదికి విజృంభించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు శ్రేష్ఠ గజ తురగ సమూహంతో, రథ సమూహంతో సోదరులతో కూడి దుమ్ము చెలరేగగా కర్ణుడికి సహాయంగా వెళ్ళాడు. కర్ణుడు పరాక్రమాతిశయంతో పాంచాల సైన్యంమీద విజృంభించాడు.

వ. అబ్బలంబునకు బాసటయై చేది సైన్యంబును బెనుఁబ్రాపై పాండవానీకంబునుం దఱిమినఁ బెఱిగిన దర్పంబునం బ్రదీప్తుండయి యక్కర్ణుం డా గట్టి మూఁకలం దఱిసి మెఱుంగు వాలమ్ములు వఱప. నవి పీనుంగు పెంటలగుచుండ నుఱక యుక్కునం బొదివిన బలు మగలకుం గీర్తియు స్వర్గంబును నొసంగి, తమ వారికంటెఁ బ్రమోద భరితులం జేయుచు సాయకాసారంబులు వరఁగించుచు బహువిధ రథ ప్రచారంబు లుల్లసిల్ల నా సేనలును గృప కృతవర్మాది యోధ బృందంబులతోఁ బెనంగు మొనలును నొక్కటిగాఁ గలంచి యందు శోణిత జలంబునను మాంసమజ్జా మస్తిష్క కర్దమంబులను బతితాతపత్ర హంసంబులనుం బొలుచునట్టి నదీ ప్రవాహంబులు వఱపె ననుటయు ధృతరాష్ట్రుండు ధర్మనందనుం గర్ణుండు గదియు నప్పు డతని కక్కడ నడ్డపడుట కెవ్వరు గడంగి? రిక్కడ నితనికిఁ దోడ్పడ నెవ్వారు గలిగి రనుటయు సంజయుం డవ్విభున కి ట్లనియె. 157

ప్రతిపదార్థం: ఆ+బలంబునకున్= పాంచాలసేనకు; బాసట+ఐ= అండగా; చేది సైన్యంబును= చేది దేశ సైన్యాన్ని; పెను+ ప్రాపు+అయి= పెద్ద రక్షణగా; పాండవ+అనీకంబునున్= పాండవసైన్యాన్ని; తఱిమినన్= పంపగా; ఆ+కర్ణుండు= ఆ కర్ణుడు; పెఱిగిన దర్పంబునన్+ప్రదీప్తుండు+అయి= హెచ్చిన గర్వంతో ప్రకాశిస్తూ; ఆ గట్టిమూఁకలన్+దరిసి= ఆ బలమైన సేనలను తాకి; మెఱుంగు వాలమ్ములు+పఱపన్= మెరిసే బాణాలను వేయగా; అవి= శత్రుసేనలు; పీనుంగు పెంటలు+అగుచుండన్= శవాల ప్రోవులు అగుచుండగా; ఉఱక= లక్ష్యపెట్టక; ఉక్కునన్= గర్వంతో; పొదివిన= తాకిన; బలుమగలకున్= బలవంతులగు వీరులకు; కీర్తియున్, స్వర్గంబునున్+ఒసంగి= యశస్సు స్వర్గప్రాప్తి కలిగించి; తమవారికంటెన్= తమ పక్షంలోని వీరులకంటె; ప్రమోదభరితులన్+చేయుచున్= ఆనందభరితులుగా చేస్తూ; సాయక+ఆసారంబులు, పరఁగించుచున్= బాణవర్షం కురిపిస్తూ; బహువిధరథ ప్రచారంబులు+ఉల్లసిల్లన్= వివిధ రథ గతులతో ఒప్పగా; ఆ సేనలును= పాంచాల సైన్యాలూ; కృప, కృతవర్మ+ఆది యోధ బృందంబులతోన్= కృప, కృతవర్మ మొదలైన వీరులతో; పెనంగు మొనలును= పోరుతున్న వివిధ దేశవీరులు; ఒక్కటిగాన్+కలంచి= మొత్తం అందరినీ కలతపెట్టి; అందున్= ఆ యుద్ధంలో; శోణితజలంబునను= రక్తమనెడి నీటితోనూ;

మాంస మజ్జామస్తిష్కకర్దమంబులనున్= మాంసం, ఎముకల్లోని కొవ్వు మెదడు అనెడి బురదతో; పతిత+ఆతపత్ర హంసంబులనున్= పడిపోయిన శ్రేష్ఠమయిన గొడుగులనే హంసలతో; పొలుచునట్టి= నిండిన; నదీ ప్రవాహంబులు పరపెను= నదీ ప్రవాహాలు కలిగించాడు; అనుటయున్= అని(సంజయుడు) అనగా; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; ధర్మనందనున్= ధర్మరాజును; కర్ణుండు+కదియు+అప్పుడు= కర్ణుడు తాకినప్పుడు; అతనికిన్= ఆ కర్ణునికి; అక్కడన్+అడ్డపడుటకున్= అక్కడ అడ్డుకొనటానికి; ఎవ్వరు+కడంగిరి?= ఎవరు పూనుకొన్నారు; ఇక్కడన్= ఇక్కడ; ఇతనికిన్+తోడ్పడన్= కర్ణుడికి తోడ్పడటానికి; ఎవ్వారు+కలిగిరి+అనుటయున్= ఎవ్వరు ముందుకు వచ్చారు అని అడుగగా; సంజయుండు; ఆ+విభునకున్+ ఇట్లు+అనియెన్= ఆ ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: ఆ పాంచాల సైన్యానికి బాసటగా చేది, పాండవసైన్యాలు రాగా, కర్ణుడు, అతిశయించిన గర్వంతో వెలుగుతూ బలమైన ఆ సైన్యాలను సమీపించాడు. మెరిసే బాణాలు ప్రయోగించాడు. ఆ సైన్యాలు పీనుగుల కుప్పలు కాసాగాయి. అయినా అది లెక్కపెట్టక గర్వంతో తన్నెదుర్కొన్న మేటివీరులకు కర్ణుడు కీర్తిని, స్వర్గప్రాప్తిని కలుగచేశాడు. అవి కలుగచేసి తమ వైపు వీరులకంటె వారినే ఎక్కువ సంతోషపరిచాడు. శరవర్షాన్ని కురిపిస్తూ, వివిధ రథ గతులతో ఆ సేనలను, కృప కృతవర్మాది యోధులతో పెనగుతున్న శత్రుసేనలను ఒకే విధంగా కలతపెట్టాడు. రక్తం నీరుగా, మాంసం, ఎముకల్లోని కొవ్వు, మెదడు బురదగా, పడిపోయిన గొడుగులు హంసలుగా నదీ ప్రవాహాలు ఏర్పడేటట్లు చేశాడు' అని, సంజయుడు చెప్పగా ధృతరాష్ట్రుడు విని - కర్ణుడు, ధర్మరాజును ఎదుర్కొన్నప్పుడు ఇతడిని అడ్డుకోవటానికి ఆ వైపు (పాండవులవైపు) ఎవరు ప్రయత్నించారు? ఈ వైపు ఇతడికి (కర్ణుడికి) సాయంగా ఎవరు నిలబడ్డారు? అని, అడుగగా సంజయుడు ఇట్లా అన్నాడు.

విశేషం: అలంకారం: రూపకం.

తే. **ఇవ్విధంబున సేనల క్రొ వ్వడంచి । సూతసూనుండు ధర్మజు కేతనంబు**
దెసకు నడర ధృష్టద్యుమ్నుఁ డెసకమెసఁగ । బంధులును దాను వడి నడ్డపడియె నధిప! **158**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఈ+విధంబునన్= ఈ విధంగా; సేనల, క్రొవ్వు+అడంచి= శత్రుసేనల మదం అణచి; సూతసూనుండు= కర్ణుడు; ధర్మజు, కేతనంబుదెసకున్= ధర్మరాజు ధ్వజం ఉన్న దిశకు; అడరన్= వెళ్ళగా; ధృష్టద్యుమ్నుఁడు; ఎసకము+ఎసఁగన్= విజృంభణంతో; బంధులును+తానున్= బంధువులతోకూడి తాను, వడిన్+అడ్డపడియెను= వేగంగా అడ్డుకొన్నాడు.

తాత్పర్యం: రాజా! కర్ణుడు ఈ విధంగా శత్రుసేనల మదం అణచి ధర్మరాజు ఉన్నవైపు వెళ్ళాడు. అది చూచిన ధృష్టద్యుమ్నుడు ఎంతో విజృంభించి బంధువర్గంతో కలిసి కర్ణుడిని అడ్డుకొన్నాడు.

క. **వారలఁ గడచి ప్రభద్రకు । లా రాధేయు పయిఁ గవియ నాతండు మహో**
దారుల నేడ్వుర భద్రా । కారుల నారాచ సప్తకంబునఁ గూల్చెన్. **159**

ప్రతిపదార్థం: వారలన్+కడచి= వారిని దాటి; ప్రభద్రకులు; ఆ రాధేయుపయిన్+కవియన్= కర్ణుడిపై బడగా; ఆతండు= ఆతడు; మహా+ఉదారులన్= గొప్ప ఉదారులు; భద్రాకారులన్= రూపవంతులు అయిన; ఏడ్వురన్= ఏడుగురిని; నారాచసప్తకంబునన్+కూల్చెన్= ఏడు బాణాలతో వధించాడు.

తాత్పర్యం: ప్రభద్రకులు త్రోసికొని వచ్చి కర్ణుడిపై బడగా, అతడు గుణవంతులు, రూపవంతులు అయిన ఆ ఏడుగురిని ఏడు బాణాలతో చంపాడు.

క. కని పాంచాలురు గోపం । బును దర్పము నెఱయ మెఱయఁ బొదివిన రాధా
తనయుం డిరువదియేవురఁ । దునిమె నిరువదేను వెడఁద తూపులఁ బెలుచన్. 160

ప్రతిపదార్థం: పాంచాలురు= పాంచాలదేశ వీరులు; కని= అది చూచి; కోపంబును, దర్పమున్= కోపం, గర్వం; నెఱయన్ మెఱయన్= అధికమై ఒప్పగా; పొదివినన్= తాకగా; రాధాతనయుండు= కర్ణుడు; పెలుచన్= ఆగ్రహంతో; ఇరువది+ఏను వెడఁద తూపులన్= ఇరవై అయిదు వెడల్పయిన బాణాలతో; ఇరువది+ఏవురన్= ఇరవై అయిదుగురు పాంచాలురను; తునిమెన్= చంపాడు.

తాత్పర్యం: ప్రభద్రకుల మరణాన్ని చూచి, పాంచాలురు కోపగర్వాలతో కర్ణుడిని తాకగా, అతడు ఆగ్రహించి ఇరవై అయిదు బాణాలతో ఇరవై అయిదుగురిని వధించాడు.

క. వెండియు నేపునఁ బైకొని । చండ శర ప్రకరములు వెసం గురియఁగ ను
ద్దండతఁ బాంచాలురఁ గ । ర్ణుం డేవురఁ జంపె నైదు క్రూరాస్త్రములన్. 161

ప్రతిపదార్థం: వెండియున్= ఇంకా; ఏపునన్+పైకొని= గర్వంతో విజృంభించి; కర్ణుండు= కర్ణుడు; ఉద్దండతన్= అతిశయించి; చండశరప్రకరములు= వాడియైన బాణసముదాయాలను; వెసన్+కురియంగన్= వేగంగా కురిపించగా; ఐదుక్రూర+అస్త్రములన్= ఐదు భయంకరఅస్త్రాలతో; పాంచాలురన్, ఏవురన్= ఐదుగురు పాంచాలురను; చంపెన్= చంపాడు.

తాత్పర్యం: ఇంకా పాంచాలురు పైకొని వాడి అయిన బాణాలను కురిపించగా, కర్ణుడు ఐదు భయంకరాలైన అస్త్రాలతో ఐదుగురు పాంచాలురను వధించాడు.

వ. ఇట్లు భానుదేవ చిత్రసేన సేనాబిందు తపన శూరసేనులం గీటడంచి యాటోప దీపితుండయి చక్ర రక్షకులగు సుషేణ సత్యసేనులు వెనుక బలసివచ్చు వృషసేనుండు నిమ్ముమ్వురు గొడుకులుఁ గడిమి రూఢి కెక్కం దనకు రణక్రీడకుం దోడుపడియెడు నుల్లాసంబున నుల్లంబు పల్లవింపం బాండవ బలంబులం గలంచు నయ్యంగ పతి మీఁద ధృష్టద్యుమ్న శిఖండి జనమేజయ ప్రముఖ పాంచాల కుమారులును సాత్యకి నకుల సహదేవ ద్రౌపదేయులును గేకయ మాత్స్య యోధవీర వ్రాతంబును భీమసేన పురస్సరంబుగాఁ దోతెంచిన బహుళ జలధరంబులు ధరణీధరంబు పయిం గురియు పెనుసోన చందంబు దోఁప వివిధాస్త్ర శస్త్రంబు లతనిపయిం దొరంగింపం గనుంగొని కౌరవేశ్వరుండు దుశ్శాసన శకుని తదీయ తనయులు దనకెలంకులం దఱుమం గరిఘటలతోడం గడంగి యవ్వడముడిని మార్కొని. 162

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; భానుదేవ, చిత్రసేన, సేనాబిందు, తపన, శూరసేనులన్= ఈ ఐదుగురు పాంచాల కుమారులను; గీటు+అడంచి= సంహరించి; ఆటోప, దీపితుండు+అయి= దర్పంతో ప్రకాశించినవాడై; చక్రరక్షకులు+అగు= వ్యూహ రక్షకులైన; సుషేణ సత్యసేనులు; వెనుకబలసివచ్చు; వృషసేనుండున్= వెనుకవైపు బలంగా వస్తున్న వృషసేనుడు; ఈ+ముమ్వురు కొడుకులున్= అను తన కుమారులు ముగ్గురు; కడిమి రూఢికిన్+ఎక్కన్= పరాక్రమం ప్రసిద్ధికెక్కగా; తనకు

రణక్రీడకున్+తోడుపడియెడు+ఉల్లాసంబునన్= తనకు యుద్ధంలో సహాయంగా ఉన్నారన్న సంతోషంతో; ఉల్లంబు పల్లవింపన్= మనసు పొంగగా; పాండవబలంబులన్+కలంచు= పాండవ సైన్యాన్ని కలవరపెడుతున్న; ఆ+అంగపతిమీఁదన్= ఆ కర్ణుడిపై; ధృష్టద్యుమ్న, శిఖండి, జనమేజయ, ప్రముఖ పాంచాల కుమారులును= ధృష్టద్యుమ్నుడు, శిఖండి, జనమేజయుడు మున్నగు పాంచాలురు; సాత్యకి, నకుల, సహదేవ, ద్రౌపదేయులును= సాత్యకి, నకులుడు, సహదేవుడు, ఉపపాండవులు; కేకయ, మాత్స్య, యోధవీర, వ్రాతంబును= కేకయ మత్స్యదేశవీరుల సమూహము; భీమసేన పురస్సరంబుగాన్= భీమసేనుడు ముందుండగా; తోతెంచినన్= రాగా; బహుళజలధరంబులు= ఎన్నో మేఘాలు; ధరణీధరంబుపయిన్+కురియు= పర్వతంపై కురిసే; పెనుసోన చందంబు తోఁపన్= పెద్దవర్షం వలె గోచరించగా; వివిధ+అస్త్రశస్త్రంబులు= వివిధ అస్త్రశస్త్రాలు; అతనిపయిన్+తొరఁగింపన్= కర్ణుడిపై కురియగా; కౌరవ+ఈశ్వరుండు= దుర్యోధనుడు; కనుంగొని= చూచి; దుశ్శాసన, శకుని, తదీయతనయులు= దుశ్శాసనుడు శకుని వారి కుమారులు; తనకెలంకులన్+తఱుమన్= తనకు రెండువైపుల వెంబడిరాగా; కరిఘటలతోడన్+కడంగి= ఏనుగుల సమూహంతో కూడి; ఆ+వడముడిని= ఆ భీముడిని; మార్కొని= ఎదుర్కొని.

తాత్పర్యం: కర్ణుడు ఈ విధంగా ఐదుగురు పాంచాల కుమారులను చంపి గర్వంతో తన ముగ్గురు కుమారులు తనకు తోడుగా ఉన్నారన్న ఆనందంతో పాండవ సేనను కలవరపెట్టసాగాడు. అప్పుడు భీముడు, ముందుండగా ధృష్టద్యుమ్న శిఖండి జనమేజయ ప్రభృతులు, సాత్యకి నకుల సహదేవులు, ఉపపాండవులు తదితర వీరులు వచ్చి, పర్వతం మీద మేఘ సమూహం పెద్దగా వర్షించినట్లు కర్ణుడిపై వివిధ అస్త్రశస్త్రాలు ప్రయోగించారు. అది చూచిన దుర్యోధనుడు, శకుని దుశ్శాసనులు, వారి కుమారులు తోడుగా గజసమూహంతో తరలి భీముడిని ఎదుర్కొని.

క. **తానును వారును దూపుల । వాన పయిం గురియ నతఁడు వారించి గళ**
ద్దానాంబులోల మధుకర । మైన గజ వ్రజముఁ బటు శరార్చులఁ బొదివెన్. **163**

ప్రతిపదార్థం: తానును, వారును= దుర్యోధనుడు - అతడివెంట ఉన్నవారు; తూపులవాన, పయిన్+కురియన్= అమ్ములవర్షం కురిపించగా; అతఁడు= భీముడు; వారించి= అడ్డగించి; గళత్+దాన+అంబులోల మధుకరము+అయిన= కారుతున్న మదజలము నాస్వాదిస్తున్న తుమ్మెదలతో కూడిన; గజవ్రజమున్= గజసమూహాన్ని; పటుశర+అర్చులన్= వాడిఅయిన బాణాగ్నులతో; పొదివెన్= తాకెను.

తాత్పర్యం: దుర్యోధనుడు తనవారితో కలిసి భీముడిపై బాణవర్షం కురిపించగా, అతడు వాటిని అడ్డుకొని స్రవిస్తున్న మదజలాన్ని త్రావుతున్న తుమ్మెదలతో కూడిన గజసమూహంపై తీవ్ర బాణాగ్నులను ప్రయోగించాడు.

క. **పొదివెడునప్పుడు శౌర్యో । న్మదుఁ డగు నయ్యనిలతనయు మార్గణములు బె**
ట్టిదముగఁ గవియుడు నోటతి । ఎదురుపలేరైరి కురునరేంద్రుఁడు వారున్. **164**

ప్రతిపదార్థం: పొదివెడు+అప్పుడు= వేయునప్పుడు; శౌర్య+ఉన్మదుఁడు+అగు= పరాక్రమ గర్వితుడైన; ఆ+అనిలతనయు మార్గణములు= ఆ భీముడి బాణాలు; బెట్టిదముగన్+కవియుడున్= గట్టిగా తాకగా; కురు, నర+ఇంద్రుఁడు, వారున్= దుర్యోధనుడు, అతడి వెంబడి ఉన్నవారు; ఓటతి= శక్తిహీనులై; ఎదురుపలేరు+ఐరి= ఎదిరించలేకపోయారు.

తాత్పర్యం: భీముడు వేసేబాణాలు గట్టిగా తాకగా, దుర్యోధనుడు అతని సహాయులు శక్తిహీనులై వాటిని ఎదుర్కొనలేకపోయారు.

మ. బలుగాలిన్ నలుదిక్కులం జెదరు నభ్రశ్రేణిచాడ్పు న్సము
జ్జ్వల సూర్యాంశులచేత విచ్చు నిబిడధ్వాంతంబు నందంబుఁ జూ
డ్కులకుం దోఁచెఁ బ్రచండ సంగర పటిష్ఠుండైన యా భీము తూ
పుల మొత్తం బడరం గరిప్రకర ముద్భూతార్తియై తూలినన్. 165

ప్రతిపదార్థం: ప్రచండ, సంగర, పటిష్ఠుండు+అయిన= తీవ్ర యుద్ధమునందు ఆరితేరిన; ఆ భీము తూపుల మొత్తంబు+అడరన్= భీముని బాణసమూహం విజృంభించగా; కరిప్రకరము= ఏనుగుల గుంపు; ఉద్భూత+ఆర్తి ఐ తూలినన్= దుఃఖపూరితమై పడిపోగా; బలుగాలిన్= బలమైన గాలికి; నలుదిక్కులన్+చెదరు= నాలుగువైపులా చెదరిపోయే; అభ్రశ్రేణి చాడ్పున్= మబ్బుల చందమూ; సముజ్జ్వల సూర్య+అంశులచేతన్= ప్రకాశించే సూర్యకిరణాలకు; విచ్చు నిబిడ ధ్వాంతంబున్+అందంబున్= నశించే చీకట్ల అందమూ; చూడ్కులకున్+తోఁచెన్= కనులకు గోచరించింది.

తాత్పర్యం: పెనుగాలికి చెదిరిపోయే మబ్బులవలె, సూర్యరశ్మికి తొలగిపోయే చీకట్లవలె, భయంకరయుద్ధంలో బలవంతుడై ఉన్న ఆ భీముడి బాణాల దెబ్బలకు ఏనుగులు నేలపై కూలిపోయాయి.

విశేషం: అలం: ఉపమ.

వ. అట్టియెడం గృప ప్రముఖ రథికులు రాధానందన భవన్నందనులకుం దలకడచి పవన నందను పార్శ్వంబులం దఱుము ధృష్టద్యుమ్నాది యోధులం దలపడిరి దుశ్శాసన ప్రభృతులును వారిం గూడికొనిరి కర్ణ నందను లక్కిమ్మీరమర్దనుం దాఁకి; రందు సుషేణుండు. 166

ప్రతిపదార్థం: అట్టిఎడన్= ఆ సమయంలో; కృప, ప్రముఖ, రథికులు= కృపుడు మొదలగు ముఖ్యవీరులు; రాధానందన, భవత్+నందనులకున్= కర్ణుడికి, నీ కుమారులకు; తలకడచి= దాటి; పవననందను= భీముడి; పార్శ్వంబులన్+తఱుము= ప్రక్కలపోరుతున్న; ధృష్టద్యుమ్న+ఆది యోధులన్= ధృష్టద్యుమ్నుడు మున్నగు వీరులను; తలపడిరి= ఎదుర్కొన్నారు; దుశ్శాసన, ప్రభృతులును= దుశ్శాసనుడు మొదలైనవారు కూడా; వారిన్+కూడికొనిరి= వారితో కలిశారు; కర్ణనందనులు= కర్ణుడి కొడుకులు; ఆ+కిమ్మీరమర్దనున్= కిమ్మీరుడనే రాక్షసుని సంహరించిన ఆ భీముడిని; తాఁకిరి= ఎదుర్కొన్నారు; అందున్= వారిలో; సుషేణుండు= సుషేణుడు.

తాత్పర్యం: అప్పుడు కృపాచార్యుడు మొదలైన ప్రముఖ వీరులు కర్ణుడిని, కౌరవ సోదరులను దాటి భీముడితో కూడిఉన్న ధృష్టద్యుమ్నాదులను ఎదుర్కొన్నారు. దుశ్శాసనుడు మున్నగువారు కూడా వారిని కలిశారు. కర్ణుడి కుమారులు భీముడిపైకి వెళ్ళారు. సుషేణుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఖర భల్లంబున నాతని। శరాసనము ద్రుంచి నారసములు రయముమై
నురమున నేడు సొనిపి ని। ష్ఠుర నినదం బెసఁగ నార్చె సురలు నుతింపన్. 167

ప్రతిపదార్థం: ఖర, భల్లంబునన్= వాడి అయిన బల్లెంతో; ఆతని, శరాసనము, త్రుంచి= భీముడి విల్లును విరిచి; రయముమైన్= వేగంగా; ఉరమునన్= వక్షమునందు; ఏడు నారసములు= ఏడుబాణాలు; చొనిపి= నాటి; నిష్ఠుర నినదంబు+ఎసఁగన్= పెద్దధ్వని ఒప్పగా; సురలు నుతింపన్= దేవతలు ప్రశంసించగా; ఆర్చెన్= అరిచాడు.

తాత్పర్యం: కర్ణ తనయుడైన సుషేణుడు భీముడి ధనుస్సును బల్లెంతో విరిచి, అతడి వక్షఃస్థలంలో ఏడుబాణాలు వేసి పెద్దగా అరిచాడు. అది చూచి దేవతలు ప్రశంసించారు.

భీమసేనుఁడు కర్ణనందనుఁ డగు సత్యసేనునిం జంపి విజృంభించుట (సం. 8-43-24 (కుంభ))

సీ. కనలి యొండొక విల్లు గొని కీచకాంతకుఁ । డక్కుమారుని చాపయష్టి విఱుగ
నేసి మై బల్తూపు లీరేడు నాటించి । తన్నప్డు దొడరు రాధా తనూజు
నుబ్బు వాలమ్ములు డెబ్బదిమూఁట వా । రించి తత్సుతుఁడు దోర్లీల మెఱయఁ
జేరిన నా సత్యసేను రథ్యంబుల । సూతుఁ గార్ముకమును గేతనంబు

తే. నేడు తూపులఁ దునుమాడి యేచి మూఁడు । నారసము లంగమునఁ గ్రుచ్చి నాళమునకు
వికసితాంభోరుహముఁ బాపు వెరవు దోఁపఁ । దునిమె వెసఁ గత్తివాతి యమ్మున శిరంబు. 168

ప్రతిపదార్థం: కీచక+అంతకుఁడు= కీచకుని అంతం చేసిన భీముడు; కనలి= కోపించి; ఒండు+ఒక విల్లు, కొని= వేరొకవిల్లు తీసుకొని; ఆ+కుమారునిన్= సుషేణుడిని; చాపయష్టి విఱుగన్+ఏసి= ధనుస్సు దండము విరిగేటట్లుగ కొట్టి; మైన్= శరీరమునందు; ఈరు+ఏడు= పద్నాలుగు; బల్+తూపులు= బలమైన బాణాలు; నాటించి= వేసి; తన్నున్+అపుడు+తొడరు= తనను అప్పుడు ఎదుర్కొన్న; రాధాతనూజు= రాధా తనయుడైన కర్ణుడి; ఉబ్బున్= గర్వాన్ని; వాలు+అమ్ములు, డెబ్బదిమూఁటన్= వాడిబాణాలు డెబ్బది మూడింటితో; వారించి= అడ్డుకొని; తద్+సుతుఁడు= అతడి కుమారుడు; దోః+లీల మెఱయన్+ చేరినన్= భుజబలదర్పం ప్రకాశించునట్లు రాగా; ఆ సత్యసేను= ఆ సత్యసేనుడి; రథ్యంబులన్= అశ్వాలను; సూతున్= సారథిని; కార్ముకమును= ధనువును; కేతనంబున్= ధ్వజమును; ఏడుతూపులన్+తునుమాడి= ఏడుబాణాలతో ఖండించి; ఏచి= విజృంభించి; మూఁడు, నారసములు= మూడుబాణాలు; అంగమునన్+క్రుచ్చి= దేహమునందు నాటి; నాళమునకున్= తామరకాడకు; వికసిత అంభోరుహమున్= వికసించిన పద్మమును; పాపు, వెరవు+తోపన్= తొలగించే విధం తోచగా; వెసన్= వెంటనే; కత్తివాతి, అమ్మునన్= కత్తి అంచువంటి అమ్ముతో; శిరంబున్= తలను; తునిమెన్= ఖండించాడు.

తాత్పర్యం: దానితో భీముడు కోపించి వేరొక విల్లును గ్రహించి సుషేణుడి ధనువు విరిచి, అతడిపై పద్నాలుగు బాణాలు గుప్పించాడు. అప్పుడు కర్ణుడు తనపైకి రాగా డెబ్బయిమూడు బాణాలతో అడ్డగించాడు. అతడి కుమారుడు, సత్యసేనుడు రాగా అతడి గుర్రాలను, సారథిని, ధనువును, కేతనమును ఏడుబాణాలతో ఖండించి, మేనుపై మూడు బాణాలను వేసి, కత్తి అంచువంటి వాడిఅమ్ముతో శిరస్సును ఖండించాడు. ఆ దృశ్యం తామరకాడనుంచి వికసించిన పద్మాన్ని తునిమినట్లుగా ఉన్నది.

విశేషం: అలం: ఉపమ. సత్యసేనుడి శరీరం తామరకాడవలె, తెగిపడిన అతనితల పద్మంవలె ఒప్పినాయి.

వ. తునిమి దోస్సారంబు దుర్వారంబుగా నుక్కునం దక్కటి రథిక జనంబుల పయి నడరి కృప కృతవర్మాది రథికవరుల కోదండంబులు దుండంబులు సేసి వారిం గ్రూరమార్గణంబుల మర్దించి దుశ్శాసనుని సాయక త్రయంబునను సౌబలునిఁ దద్ద్విగుణ బాణంబులను స్రుక్కించి యులూకుని నతని తమ్ముని నొక్కుమ్మడి విరథులం గావించి కర్ణుకొడుకుం గనుంగొని 'యోరి సుషేణా! పొలిసితి పొ' మ్మనుచు బలు నారసంబు

నిగిడించిన నది నడుమన కర్ణుండు నఱికి మెఱుంగుటమ్ములు మూఁడు మేనం బఱప నుఱక మఱియు నట్టి మార్గణం బక్కుమారు నుపలక్షించి ఏసిన నా సూతనందనుం డదియునుం ద్రుంచి యవ్వడముడిమీఁదం ద్రిసప్తతి తీవ్ర ప్రదరంబులు పరఁగించె నప్పుడు; నకులుండు గవిసిన. 169

ప్రతిపదార్థం: తునిమి= ఖండించి; దోః+సారంబు దుర్వారంబుగాన్= భుజబలము అడ్డులేనిదై; ఉక్కునన్= గర్వంతో; తక్కటి రథిక జనంబుల పయిన్= మిగిలిన రథికులమీద; అడరి= మార్కొని; కృప, కృతవర్మ+ఆది రథికవరులు= కృప కృతవర్మ మున్నగు రథికశ్రేష్ఠుల; కోదండంబులు, తుండంబులు సేసి= ధనుస్సులు తునుకలు చేసి; వారిన్+క్రూరమార్గణంబులన్, మర్దించి= వారిని వాడిబాణాలతో కొట్టి; దుశ్శాసనునిన్; సాయక త్రయంబునను= మూడుబాణాలతోనూ; సౌబలునిన్= శకునిని; తద్+ద్విగుణ బాణంబులను= దానికి రెట్టింపు(ఆరు) బాణాలతోనూ; స్రుక్కించి= గాయపరిచి; ఉలూకునిన్+అతని తమ్మునిన్= ఉలూకుడిని, అతడి తమ్ముడిని; ఒక్కుమ్మడి విరథులన్+కావించి= ఒకేసారి రథహీనులను చేసి; కర్ణుకొడుకున్+కనుంగొని= కర్ణుడి కొడుకును చూచి; ఓరి సుషేణా!= ఓ సుషేణుడా!; పొలిసితి(వి) పొమ్ము+అనుచున్= చచ్చావుపో అంటూ; బలునారసంబు నిగిడించినన్= వాణిబాణం వేయగా; కర్ణుండు= కర్ణుడు; అది నడుమన= దానిని మధ్యలోనే; నఱికి= తునిమి; మెఱుంగు+అమ్ములు మూఁడు= మెరిసేబాణాలు మూడు; మేనన్+పఱపన్= దేహమునందు నాటగా; ఉఱక, మరియును+అట్టి మార్గణంబు= లెక్కపెట్టక ఇంకా అటువంటి బాణం; ఆ+కుమారునిన్= సుషేణుడిని; ఉపలక్షించి+ఏసినన్= గురిపెట్టి వేయగా; ఆ సూతనందనుండు= కర్ణుడు; అదియునున్+త్రుంచి= దాన్నికూడా నరికి; ఆ+వడముడిమీఁదన్= ఆ భీముడిమీద; త్రిసప్తతి= డెబ్బయిమూడు; తీవ్ర ప్రదరంబులు= వాడిబాణాలు; పరఁగించెను= ప్రయోగించాడు; అప్పుడు నకులుండు, కవిసినన్= అప్పుడు నకులుడు తాకగా.

తాత్పర్యం: భీముడు ఆ విధంగా సత్యసేనుడిని చంపి, భుజబలగర్వంతో కృపాచార్య కృతవర్మ ప్రభృతుల ధనుస్సులు విరిచి, వారిపై వాడిబాణాలు వేశాడు. దుశ్శాసనుడిని మూడుబాణాలతో, శకునిని ఆరుబాణాలతో నొప్పించి, ఉలూకుడిని, అతడి తమ్ముడిని రథహీనులుగా చేసి, కర్ణుడి కొడుకునుచూచి 'సుషేణా చచ్చావు పోరా' అంటూ సుషేణుడిపై వాణిబాణాన్ని వేశాడు. కర్ణుడు మధ్యలోనే దానిని నరికి, భీముడిపై మూడు మెరిసేబాణాలు వేశాడు. భీముడు మళ్ళీ సుషేనుడిపై బాణం వేయగా దానిని కూడా ఖండించి, డెబ్బయిమూడు తీవ్రశరాలు అతడిపై కురిపించాడు. అప్పుడు నకులుడు వచ్చి తాకగా.

ఆ. చిత్ర చాపముక్త శితశర పంచకా । హత శరీరుఁ జేసె నా సుషేణుఁ
డేచి నకులుఁ డతని నిరువది యమ్ముల । నొంచి కర్ణు మనము నొవ్వ నార్చె. 170

ప్రతిపదార్థం: ఆ సుషేణుఁడు; చిత్రచాపముక్త= చిత్రమైన ధనుస్సునుండి వదలబడిన; శిత, శరపంచక= వాడియైన అయిదుబాణాలతో; హతశరీరున్+చేసెన్= (నకులుడి) దేహాన్ని గాయపరచాడు; నకులుఁడు ఏచి= నకులుడు విజృంభించి; అతనిన్= సుషేణుడిని; ఇరువది అమ్ములన్+నొంచి= ఇరవై బాణాలతో నొప్పించి; కర్ణు మనము నొవ్వన్+ఆర్చెన్= కర్ణుడి మనసుకు బాధ కలిగేటట్లుగా అరచాడు.

తాత్పర్యం: సుషేణుడు చిత్రమైన తన ధనుస్సునుండి వాడిఅయిన బాణాలు నకులుడిపై వేయగా, అతడు విజృంభించి ఇరవైబాణాలు సుషేణుడిపై ప్రయోగించి కర్ణుడికి బాధ కలిగేటట్లు పెద్దగా అరిచాడు.

చ. అలిగి సుషేణుఁ డెంతయు రయంబునఁ దొమ్మిది దొడ్డవాఁడి తూ
పులు మెయిఁ జొన్పి విల్ దునిమి పొంగిన నొండొక దీప్త చాప మ
గ్గలిక దలిర్ప నెత్తి వెసఁ గార్ముక దండము ద్రుంచి నొంచె దో
ర్బల విభవం బుదాత్తముగఁ బార్థునితమ్ముఁడు సూతు నాతనిన్. 171

ప్రతిపదార్థం: సుషేణుఁడు అలిగి= సుషేణుడు కోపించి; ఎంతయున్, రయంబునన్= ఎంతో వేగంగా; తొమ్మిది దొడ్డ వాడి తూపులు= తొమ్మిది పెద్ద వాడిబాణాలు; మెయిన్+చొన్పి= దేహంపై వేసి; విల్+తునిమి= విల్లును నరికి; పొంగినన్= గర్వించగా; పార్థుని, తమ్ముడు= నకులుడు; ఒండు+ఒక, దీప్త, చాపము= మరొక కాంతిమంతమైన ధనుస్సు; అగ్గలిక+ తలిర్పన్+ఎత్తి= అతిశయమొప్పగా గ్రహించి; వెసన్= శీఘ్రంగా; కార్ముకదండము+త్రుంచి= (సుషేణుడి) ధనుస్సును విరిచి; దోః+బలవిభవంబు+ఉదాత్తముగన్= గొప్ప భుజబలదర్పంతో; సూతున్+ఆతనిన్= రథసారథిని, సుషేణుడిని; నొంచెన్= బాధించాడు.

తాత్పర్యం: సుషేణుడు కోపంతో నకులుడిపై తొమ్మిది బాణాలు వేసి విల్లును విరువగా, అతడు మరొకవిల్లును ధరించి సుషేణుడి ధనువును తునిమి, బాహుబలప్రకాశంతో అతడిని, అతడి రథసారథిని నొప్పించాడు.

ఆ. అన్యచాపలసిత హస్తుఁడై కడఁగి సు। షేణుఁ డతని షష్టి బాణగాఢ
నిహత దేహుఁ జేసె సహదేవుఁ డడరిన। మేటి తూపు లేడు మేనఁ గ్రుచ్చె. 172

ప్రతిపదార్థం: సుషేణుఁడు; అన్య, చాప, లసిత, హస్తుఁడు+ఐ= మరొక చాపంచేత ప్రకాశించిన చేయి గలవాడై; కడఁగి= పూని; అతనిన్= నకులుడిని; షష్టి బాణ గాఢ నిహత దేహున్+చేసెన్= అరవై బాణాలతో తీవ్రంగా గాయపడిన శరీరం కలవాడిగాచేసి; సహదేవుడు; అడరినన్= పైబడగా; మేటి తూపులు+ఏడు= ఏడు మేటిబాణాలు; మేనన్+క్రుచ్చెన్= శరీరంపై నాటాడు.

తాత్పర్యం: సుషేణుడు మరొకవిల్లును ధరించి నకులుడిపై అరవైబాణాలు గుప్పించి నొప్పించాడు. సహదేవుడు అడ్డురాగా అతడిపై ఏడుబాణాలు వేశాడు.

క. అయ్యిరువుర యబ్బాలుని। కయ్య మమర దైత్యరణము కరణి మహోగ్రం
బయ్యెఁ; వృషసేనుఁ డత్తఱి। నియ్యని సాత్యకి నెదిర్చె నిషుచయ మడరన్. 173

ప్రతిపదార్థం: ఆ+ఇరువుర= ఆ నకుల సహదేవుల; ఆ+బాలుని= ఆ సుషేణుడి; కయ్యము= యుద్ధం; అమర, దైత్యరణము కరణిన్= దేవతలు రాక్షసుల సంగ్రామంవలె; మహా+ఉగ్రంబు+అయ్యెన్= మహాభయంకరంగా సాగింది; వృషసేనుఁడు; ఇషుచయము+అడరన్= బాణసమూహం క్రమ్మగా; ఆ తఱిన్= ఆ సమయంలో; ఈ+అని= ఈ యుద్ధంలో; సాత్యకిన్+ ఎదిర్చెన్= సాత్యకిని ఎదిరించాడు.

తాత్పర్యం: నకుల సహదేవులకు సుషేణుడితో జరిగినయుద్ధం దేవదానవ సంగ్రామం వలె భయంకరంగా సాగింది. సుషేణుడి సోదరుడైన వృషసేనుడు ఈ యుద్ధంలో సాత్యకిని బాణాలతో ఎదుర్కొన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

సీ. **సాత్యకి వృషసేను సప్త సప్తతి మార్గ । ణంబులఁ బొదివి బాణత్రయంబు**
సూతుమైఁ బఱపిన నాతఁ డాతని పెనుఁ । గడఁత వాలికయమ్ము గాఁడ నేయఁ
గోపించి మూఁడు బల్తూపుల సారథి । నొక భల్లమున విల్లు నుజ్జ్వలాస్త్ర
సప్తక నిహతి నశ్వంబుల నేకకాం । డ స్ఫూర్తిఁ గేతుదండంబుఁ దునిమి

ఆ. **శినివరుండు వక్షమున మూఁడు శరములు । నాట సొగసి కర్ణ నందనుండు**
దెలిసి కనలి వాలుఁబలకయుఁ గొని తేరు । డిగ్గి కవియ నవియు నుగ్గు సేసె. **174**

ప్రతిపదార్థం: సాత్యకి= సాత్యకి; వృషసేనున్= వృషసేనుడిని; సప్త సప్తతి మార్గణంబులన్+పొదివి= డెబ్బయిఏడు బాణాలతో తాకి; సూతుమైన్= సారథిదేహంపై; బాణత్రయంబు= మూడుబాణాలు; పఱపినన్= వేయగా; ఆతఁడు= వృషసేనుడు; ఆతని పెను+కడఁతన్= సాత్యకి విశాలమైన కణతపై; వాలిక+అమ్మున్= వాడిబాణాన్ని; కాడన్+ఏయన్= నాటేటట్లు వేయగా; శినివరుండు= సాత్యకి; కోపించి; మూఁడు బల్+తూపులన్ సారథిన్= మూడు బాణాలతో సారథిని; ఒక భల్లమునన్ విల్లున్= ఒక బల్లెంతో విల్లును; ఉజ్జ్వల+అస్త్రసప్తక నిహతిన్= ప్రకాశించే ఏడుఅస్త్రాలతో; అశ్వంబులన్= గుఱ్ఱాలను; ఏకకాండ స్ఫూర్తిన్= ఒకే బాణప్రయోగంతో; కేతుదండంబున్= ధ్వజపు కఱ్ఱను; తునిమి= ఖండించి; వక్షమునన్= వృషసేనుడి వక్షఃస్థలమునందు; మూడుశరములు నాటన్= మూడుబాణాలు వేయగా; సొగసి= మూర్ఛిల్లి; కర్ణనందనుండు= వృషసేనుడు; తెలిసి= తెప్పరిల్లి; కనలి= కోపించి; వాలున్+పలకయున్+కొని= కత్తి, డాలువాఱు(కేడెము) తీసికొని; తేరు డిగ్గి= రథం దిగి; కవియన్= ఎదుర్కొనగా; అవియున్ నుగ్గు చేసెన్= వాటినికూడా ఖండించాడు.

తాత్పర్యం: సాత్యకి వృషసేనుడిపై డెబ్బయిఏడు బాణాలు, సూతుడిపై మూడుబాణాలు వేయగా, అతడు సాత్యకి నొసటిపై వాడిబాణం వేసి నొప్పించాడు. దానికి కోపించిన సాత్యకి మూడుబాణాలతో అతడి సారథిని, బల్లెంతో విల్లును, ప్రకాశించే ఏడు అస్త్రాలతో అశ్వాలను, ఒకే బాణంతో ధ్వజాన్ని ఖండించి, వృషసేనుడి వక్షంపై మూడుబాణాలు నాటగా, అతడు మూర్ఛిల్లి కొంతసేపటికి తేరుకొని కత్తి, డాలు గైకొని రథం దిగి ఎదుర్కొనగా అతడు వాటిని కూడా ఖండించాడు.

వ. **ఇ వ్విధంబున విరథుండును నిరాయుధుండును నగు నక్కుమారుం గనుంగొని దుశ్శాసనుండు రయంబున నెయిది చెయిచాచి నిజరథంబు మీఁదికిం దిగిచికొని తొలంగం గొనిపోయిన, నతండు వేఱొక్క యరదం బెక్కి యెప్పటియట్ల కర్ణుతేరి వెనుక వర్తించె; నయ్యంగపతి తొమ్మిది యమ్ము లడరించి శైనేయు సూతాశ్వ చాపంబులు రూపడంచి యతని ఫాలమ్మున మూఁడు వాలిక యమ్ములు నాటించె; నా సత్యక నందనుం డన్యస్యందనారూఢుం డయి కవిసి కర్ణునకుఁ దోడుపడు బలంబులం గలంచి యతని తనువున నేడు నారసంబులు నిగిడించెఁ; గూడికొని శతానీకుం డన్నియ శరంబు లేసె నప్పు డురువడించి తక్కటి ద్రౌపదేయులు డెబ్బది మూఁడును ధృష్టద్యుమ్నుండును శిఖండియుం బదిపదియు భీమసేనుం డఱువది నాల్గును సహదేవుం డేడును నకులుండు ముప్పదియును యుయుధానుం డేడును బాండవాగ్రజుండు నూఱును బాణంబు లా సూతపుత్రుపయిం గుప్పించి నొప్పించిన.** **175**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; విరథుండును= రథహీనుడూ; నిరాయుధుండునున్+అగు= ఆయుధాలు లేనివాడూ అయిన; ఆ+కుమారున్= వృషసేనుడిని; దుశ్శాసనుడు; కనుంగొని= చూచి; రయంబునన్+ఎయిది= వేగంగా వెంబడించి; చెయి చాచి= చెయ్యిసాచి; నిజరథంబు మీఁదికిన్+తిగిచికొని= తన రథంపైకి లాగికొని; తొలంగన్+కొనిపోయినన్= అక్కడినుండి తొలగించి తీసికొనిపోవగా; అతండు= వృషసేనుడు; వేఱు+ఒక్కఅరదంబు+ఎక్కి= మరొక రథం ఎక్కి; ఎప్పటి+అట్లు= మునుపటివలె; కర్ణుతేరి వెనుకన్, వర్తించన్= కర్ణుడి రథం వెనుకకు చేరాడు; ఆ+అంగపతి= ఆ కర్ణుడు; తొమ్మిది+అమ్ములు+అడరించి= తొమ్మిదిబాణాలు వేసి; శైనేయు, సూత+అశ్వ+చాపంబులు= సాత్యకి సారథిని గుఱ్ఱాలను, విల్లును; రూపు+అడంచి= నశింపజేసి; అతని ఫాలమ్మునన్= అతని నొసటిపై; మూఁడు వాలిక+అమ్ములు నాటించెన్= మూడు వాడిబాణాలు వేశాడు; ఆ సత్యకనందనుండు= సత్యకుని కొడుకైన ఆ సాత్యకి; అన్యస్యందన+ఆరూఢుండయి= వేరొక రథం అధిరోహించినవాడై; కవిసి= ఆక్రమించి; కర్ణునకున్+తోడుపడు, బలంబులన్= కర్ణుడికి సహాయంగా ఉన్న సైన్యాలను; కలంచి= చెదరగొట్టి; అతని తనువునన్= అతని శరీరంపై; ఏడు నారసంబులు= ఏడుబాణాలు; నిగిడించెన్= గురిపెట్టి వేశాడు; శతానీకుండు= (నకులుడి కుమారుడైన) శతానీకుడు; కూడికొని= చేరి; అన్నియ శరంబులు+ఏసెన్= అన్నే బాణాలు (ఏడు) వేశాడు; అప్పుడు+ఉరువడించి= అప్పుడు విజృంభించి; తక్కటి ద్రౌపదేయులు= మిగిలిన ఉపపాండవులు; డెబ్బదిమూఁడును= డెబ్బదిమూడు బాణాలు; ధృష్టద్యుమ్నుండును శిఖండియున్+పది పదియున్= ధృష్టద్యుమ్నుడు శిఖండి చెరి పదిబాణాలు; భీమసేనుండు+అఱువది నాల్గును= భీముడు అరవైనాలుగు బాణాలు; సహదేవుండు+ఏడును= సహదేవుడు ఏడుబాణాలు; నకులుండు ముప్పదియును= నకులుడు ముప్పయి బాణాలు; యుయుధానుండు+ఏడును= యుయుధానుడు ఏడు; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; నూఱును బాణంబులు= నూరుబాణాలు; ఆ సూతపుత్రుపయిన్= కర్ణుడిపై; గుప్పించి, నొప్పించినన్= వేసి నొప్పించగా.

తాత్పర్యం: ఈ విధంగా రథవిహీనుడు, ఆయుధాలు లేనివాడు అయిన వృషసేనుణ్ణి, దుశ్శాసనుడు చూచి, వేగంగా వచ్చి, చెయ్యిచాచి తన రథంమీదికి ఎక్కించుకొని, రణరంగంనుండి తప్పించి తీసుకొని వెళ్ళాడు. తరువాత వృషసేనుడు వేరొక రథం ఎక్కి ఎప్పటిలాగే తండ్రి (కర్ణుడి) రథం వెనుకకు చేరాడు. కర్ణుడు తొమ్మిదిబాణాలు వేసి సాత్యకి సారథిని, గుఱ్ఱాలను, విల్లును త్రుంచాడు. మూడు వాడిబాణాలను అతడి నుదుట నాటాడు. అప్పుడా సాత్యకి ఇంకొక రథం ఎక్కి విజృంభించి, కర్ణుడికి సహాయంగా ఉన్న సైన్యాలను చెల్లాచెదురు చేసి, అతడి శరీరం మీద ఏడుబాణాలు వేశాడు. నకులుడి కొడుకు శతానీకుడు కూడ అక్కడికి చేరుకొని, తాను కూడ ఏడుబాణాలు వేశాడు. అప్పుడు తక్కిన ఉపపాండవులు డెబ్బదిమూడు బాణాలు, ధృష్టద్యుమ్న శిఖండులు చెరి పదిబాణాలు, భీమసేనుడు అరువదినాలుగు బాణాలు, సహదేవుడు ఏడుబాణాలు, నకులుడు ముప్పదిబాణాలు, యుయుధానుడు ఏడుబాణాలు, ధర్మరాజు నూరుబాణాలు కర్ణుడిమీద గుప్పించి, నొప్పించగా----

క. ముదమున నతఁ డందఱఁ బది । పది తూపుల నే పడంచి బహువిధగతులన్
దదనీకంబునఁ దే రొ । ప్పిదముగ వడి సంచరింపఁ బెద్దయు మెఱసెన్. 176

ప్రతిపదార్థం: అతఁడు= కర్ణుడు; ముదమునన్= ఉత్సాహంగా; అందరన్= ఆ శత్రువీరులనందరినీ; పది పది తూపులన్= పది పది బాణాలతో; ఏపు+అడంచి= గర్వం అణచి; తద్+అనీకంబునన్= ఆ సైన్యంలో; తేరు= రథం; బహువిధగతులన్= పెక్కు నడకలతో; ఒప్పిదముగన్, వడి, సంచరింపన్= ఒప్పుగా వేగంగా తిరుగగా; పెద్దయున్ మెఱసెన్= ఎంతో ప్రకాశించాడు.

తాత్పర్యం: కర్ణుడు పది పది బాణాలతో శత్రువీరుల గర్వాన్ని అణచి, తన రథం వివిధ గతులతో సంచరింపగా యుద్ధరంగంలో ప్రకాశించాడు.

శా. శైనేయుండును భీమసేనుఁడును ధృష్టద్యుమ్నుఁడున్ ద్రౌపదీ
సూనుల్ ము న్నడరంగఁ గిట్టి విశిఖ స్తోమంబు లొక్కుమ్మడిన్
మేనం గ్రువ్వ శిఖండియున్ భుజబలోన్మేషంబు సూపన్ వెసం
దా నయ్యోధుల సూతసూతి విరథత్వస్తబ్ధులం జేసినన్. 177

ప్రతిపదార్థం: శైనేయుండును= సాత్యకియూ; భీమసేనుఁడును= భీముడూ; ధృష్టద్యుమ్నుఁడున్= ధృష్టద్యుమ్నుడు; ద్రౌపదీసుతుల్= ఉపపాండవులు; మున్ను+అడరంగన్+కిట్టి= ముందుండగా గర్వంతో సమీపించి; విశిఖస్తోమంబులు= బాణపరంపర; ఒక్కుమ్మడిన్= ఒక్కసారిగా; మేనన్+క్రువ్వన్= శరీరంపై గుప్పించగా; శిఖండియున్= శిఖండి కూడా; భుజబల+ఉన్మేషంబు+చూపన్= భుజబలగర్వం చూపగా; సూతసూతి= కర్ణుడు; వెసన్= వెంటనే; తాన్+అ+యోధులన్= తాను ఆ వీరులను; విరథత్వ స్తబ్ధులన్+చేసినన్= రథహీనతచే నిశ్చేష్టులను చేయగా.

తాత్పర్యం: సాత్యకి ధృష్టద్యుమ్నుడు భీముడు ఉపపాండవులు కవిసి కర్ణుడిపై బాణపరంపర కురిపించారు. శిఖండి కూడా తన భుజబలాన్ని ప్రదర్శించాడు. దానికి ప్రతిగా కర్ణుడు వారందరినీ విరథులను చేసి నిశ్చేష్టులను కావించాడు. అట్లా చేయగా.

వ. వియచ్చరులు వెఱఁగందిరి; వెండియు నవ్వీరుండు వారలనందఱ నస్త్రధారలం బొదువుచు నేడ్తెఱం బెఱవారిని బాణాంధకారంబునఁ గప్పినం ద్రిప్పికొనియును దొలంగియు దెరలియు మరలియు నా రథికసంఘంబు దైన్యంబు నొందె; నంత ధర్మనందనుని బాధింపఁ దలంపెయ్యిన. 178

ప్రతిపదార్థం: వియత్+చరులు= ఆకాశమునందు చరించేవారు(దేవతలు); వెఱఁగు+అందిరి= ఆశ్చర్యపోయారు; ఆ+వీరుండు= కర్ణుడు; వెండియును= ఇంకా; వారలన్+అందఱన్= శత్రువీరులందరినీ; అస్త్రధారలన్+పొదువుచున్= అస్త్రపరంపరలతో కప్పుచు; ఏడ్తెఱన్= పరాక్రమంతో; పెఱవారిని= మిగతావీరులను; బాణ+అంధకారంబునన్+కప్పినన్= బాణాలనే చీకట్లతో దట్టంగా కప్పగా; ఆ రథిక సంఘంబు= ఆ రథవీరుల సమూహం; త్రిప్పికొనియును తొలంగియున్= తిరుగుడువడి, తొలగివెళ్ళి; తెరలియున్= కలతపొంది; మరలియున్= వెనుకకుమరలి; దైన్యంబున్+ఒందెన్= దీనస్థితిని పొందారు; అంతన్= అప్పుడు; ధర్మనందనుని= ధర్మరాజును; బాధింపన్+తలంపు+ఎయ్యిన= బాధపెట్టాలన్న ఆలోచన తలెత్తగా.

తాత్పర్యం: కర్ణుడి పరాక్రమానికి దేవతలు ఆశ్చర్యపడ్డారు. ఇంకా కర్ణుడు వారందరిని అస్త్రపరంపరలతో కప్పుతూ, తక్కినవారిని బాణాలనే చీకటిలో ముంచగా, కొందరు తిరుగుడువడ్డారు. కొందరు తొలగివెళ్ళారు. కొందరు కలతపొందారు. కొందరు వెనుకకు మరలారు. మొత్తంమీద ఆ రథికవీరులంతా దైన్యం పొందారు. అప్పుడు ధర్మరాజును నొప్పించాలనే ఆలోచన కర్ణుడిలో తలయెత్తగా -

క. ఆ రాధేయుం డాతని । పై రయమునఁ గవియు ఘోరభంగిఁ గని మహో
దారంబుగఁ జేది బలము । బోరన నెడసొచ్చెఁ దూర్యములు మొరయంగన్. 179

ప్రతిపదార్థం: ఆ రాధేయుండు= కర్ణుడు; అతనిపైన్= ధర్మరాజుపై; రయమునన్+కవియు= వేగంగా తాకునట్టి; ఘోరభంగిన్+కని= భయంకరస్థితిని చూచి; చేది బలము= చేదిసైన్యం; మహా+ఉదారంబుగన్= చాలగొప్పగా; తూర్యములు, మొరయంగన్= వాద్యధ్వనులు మ్రోగగా; బోరనన్= శీఘ్రంగా; ఎడసొచ్చెన్= ప్రవేశించింది.

తాత్పర్యం: కర్ణుడు ధర్మరాజును తాకునట్టి భయంకరస్థితిని చూచి, చేదిసైన్యం ఆతడికి సహాయంగా శీఘ్రంగా అరుదెంచింది.

ఉ. సూతతనూజుఁ డబ్బలము సొచ్చి శతత్రయ యోధవీరులం
జేతుల తీఁట వో నుఱుము సేసి విశృంఖల దర్ప దుర్దముం
డై తఱుమంగఁ గల్పిత రథాక్రమ మొప్పఁగ వచ్చి ధర్మజుం
బ్రీతునిఁ జేయుచుం గడిమిఁ బేర్చిరి సాత్యకియున్ శిఖండియున్. 180

ప్రతిపదార్థం: సూత తనూజుఁడు= కర్ణుడు; ఆ+బలముచొచ్చి= ఆ సైన్యమునందు ప్రవేశించి; శతత్రయ యోధవీరులన్= మూడువందలమంది వీరులను; చేతుల తీఁటపోన్= చేతుల దురద తీరగా (తృప్తి తీరగా); నుఱుము చేసి= చంపి; విశృంఖల, దర్ప, దుర్దముండు+ఐ= అదుపులేని భుజబలంతో విజృంభించినవాడై; తఱుమంగన్= వెంటబడగా; సాత్యకియున్, శిఖండియున్= సాత్యకీ శిఖండీ; కల్పిత రథాక్రమము+ఒప్పఁగన్= కల్పించుకొన్న రథాలతో చుట్టుముట్టి; వచ్చి= చేరి; ధర్మజున్+ప్రీతుని, చేయుచున్= ధర్మరాజుకు ఆనందం కలిగిస్తూ; కడిమిన్+పేర్చిరి= పరాక్రమంతో విజృంభించారు.

తాత్పర్యం: కర్ణుడు శత్రుసైన్యంలోకి చొచ్చుకొని వెళ్ళి, తన చేతుల దురద తీరేటట్లుగ మూడువందలమంది యోధవీరులను చంపి, అదుపులేని భుజగర్వంతో విజృంభించి తక్కినవారిని తరుమగా, మళ్ళీ రథాలను ఏర్పరచుకొని సాత్యకీ, శిఖండీ ధర్మరాజుకు సంతోషం కలిగేటట్లుగా లెస్సగ విజృంభించారు.

క. వారికిఁ దోడ్పడి యక్కడి । వీరులు గొందఱు గడంగి వివిధోగ్ర శరా
సారము లంగాధీశ్వరు । పై రయమునఁ గురిసి రుగ్రభంగిఁ జెలఁగుచున్. 181

ప్రతిపదార్థం: వారికిన్= సాత్యకి శిఖండులకు; తోడ్పడి= సహాయపడి; అక్కడి వీరులు, కొందఱు= అక్కడ ఉన్న కొందరు వీరులు; కడంగి= పూనుకొని; ఉగ్రభంగిన్+చెలగుచున్= భయంకరంగా ధ్వనిచేస్తూ; అంగ+అధీశ్వరుపైన్= అంగరాజైన కర్ణుడిపై; వివిధ+ఉగ్ర శర+ఆసారములు= వాడియైన వివిధ బాణవర్షాలు; రయమునన్+కురిసిరి= శీఘ్రంగా కురిపించారు.

తాత్పర్యం: సాత్యకి, శిఖండులకు సహాయంగా మరికొందరు వీరులు పూనుకొని కర్ణుడిపై వివిధ బాణవర్షాలు కురిపించారు.

క. కురుపక్ష యోధులును స । త్వరులై యా రథికవరులఁ దాఁకి భుజావి
స్ఫురణము సూపిన నద్భుత । కర మయ్యెఁ దదవసరమునఁ గయ్యం బధిపా! 182

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; కురుపక్ష, యోధులును= కౌరవవీరులు; సత్వరులు+ఐ= వేగిరపాటుకలవారై; ఆ రథిక వీరులన్+తాఁకి= ఆ రథవీరులను ఎదుర్కొని; భుజా, విస్ఫురణము, చూపినన్= భుజ పరాక్రమం ప్రదర్శించగా; తద్+ అవసరమునన్= ఆ సమయంలో; కయ్యంబు= యుద్ధం; అద్భుతకరము+అయ్యెన్= ఆశ్చర్యకరం అయ్యింది.

తాత్పర్యం: కౌరవవీరులు వెంటనే శత్రువులను తాకి తమ భుజబలాన్ని చూపగా యుద్ధం ఆశ్చర్యకరంగా కొనసాగింది.

వ. ఆ సంకుల సమరంబునందు. 183

తాత్పర్యం: తీవ్రమైన ఆ యుద్ధంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

శా. బాణజ్వాలలు బెట్టు పర్వ గగన ప్రక్షోభణ జ్యాలతా
క్వాణస్ఫూర్తి ఛటచ్ఛటారవముగాఁ గర్ణోగ్ర దావాగ్ని య
క్షీణోదగ్రత వైరి సైన్యవన భస్మీభావ నిర్వాహ పా
రీణంబై వెలుఁగొందె నిర్జరులు వర్ణింపంగ నే మ్ముబ్బఁగన్. 184

ప్రతిపదార్థం: బాణజ్వాలలు, బెట్టు, పర్వన్= బాణములు అనే మంటలు తీవ్రంగా వ్యాపించగా; గగన ప్రక్షోభణ= ఆకాశం మిక్కిలి కలతనొందేటట్లు చేసే; జ్యాలతా క్వాణస్ఫూర్తి= తీగవంటి వింటినారి ధ్వనుల స్ఫురణ; ఛట+ఛట+ఆరవముగాన్= ఛటఛట అనే శబ్దం కాగా; కర్ణ+ఉగ్రదావ+అగ్ని= కర్ణుడు అనే భయంకరమైన కార్చిచ్చు; అక్షీణ+ఉదగ్రతన్= మిక్కిలి విజృంభణంతో; వైరి సైన్య, వన= శత్రుసైన్యం అనే అడవిని; భస్మీభావ నిర్వాహపారీణంబు+ఐ= భస్మం చేయటంలో ఆరితేరినదై; నిర్జరులు వర్ణింపంగన్= దేవతలు కొనియాడగా; ఏము+ఉబ్బఁగన్= మేము హర్షించగా; వెలుఁగొందెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: బాణాలనే మంటలు తీవ్రంగా వ్యాపించి ఆకాశాన్ని మిక్కిలి కలతపెట్టగా, వింటినారి ధ్వనులు ఛటఛట అనే శబ్దం చేయగా, కర్ణుడనే భయంకరమైన కార్చిచ్చు - అతి భయంకరంగా విజృంభించి శత్రుసైన్యం అనే అడవిని బూడిద చెయ్యటంలో ఆరితేరినదై, దేవతలు ప్రశంసించగా, మేము సంతోషించగా ప్రకాశించింది.

విశేషం: అలం: రూపకం.

వ. అమ్మహోగ్ర విజృంభణంబున. 185

ప్రతిపదార్థం: ఆ+మహా+ఉగ్ర విజృంభణంబున= ఎంతో భయంకరమైన ఆ పరాక్రమం ధాటికి.

తాత్పర్యం: ఆ మహా భయంకరమైన కర్ణుడి ధాటికి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆటోప మడఁగి యచ్చటి । మేటి మగలు టిచ్చవడిరి మెయిగలి గర్ణుం
డేటలవికిఁ గవిసె ధను । ర్జ్యాటంకృతి సెలఁగఁ బాండవాగ్రజుమీఁదన్. 186

ప్రతిపదార్థం: అచ్చటి మేటిమగలు= అక్కడున్న గొప్పవీరులు; ఆటోపము+అడఁగి= అతిశయం తగ్గి; టిచ్చపడిరి= చేష్టలుడిగారు; మెయిగలి= శూరుడైన; కర్ణుండు= కర్ణుడు; ధనుః+జ్యాటంకృతి చెలఁగన్= వింటినారి ధ్వని వ్యాపించగా; పాండవ+అగ్రజుమీఁదన్= ధర్మరాజుమీద; ఏటు+అలవికిన్= బాణప్రయోగాతిశయానికి; కవిసెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: కర్ణుడి ధాటికి అక్కడున్న వీరులంతా వెరగు చెందారు. శూరుడైన అతడు ధనుష్టంకారం చేస్తూ ధర్మరాజుపై అధికంగా బాణాలు వేయసాగాడు.

వ. ఇత్తెఱంగునం గవిసిన నతనిమీఁద నమ్మేదినీనాయకుండు సాయకజాలంబులు పరఁగించిన నతం డుఱక యతి రయంబున నవి వారించి. 187

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్+కవిసినన్= ఈ విధంగా బాణాలతో తాకగా; ఆ+మేదినీ నాయకుండు= ఆ ధర్మరాజు; అతనిమీఁదన్= కర్ణుడిమీద; సాయకజాలంబులు= బాణసమూహాలు; పరఁగించినన్= వేయగా; అతండు= కర్ణుడు; ఉఱక= లక్ష్యపెట్టక; అతిరయంబునన్= మిగుల వేగంతో; అవి వారించి= ఆ బాణాలను అడ్డుకొని.

తాత్పర్యం: కర్ణుడు ఈ విధంగా ధర్మరాజుపై బాణాలు వేయగా, అతడుకూడా కర్ణుడిపై బాణసమూహాలు గుప్పించాడు. కర్ణుడు వేగంగా వాటిని వారించి. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. నవ్వుచుఁ జాపంబు నడిమికిఁ ద్రుంచి మై । మఱువుఁ దొంబది శితమార్గణముల
భేదింప రత్న ప్రభాదీప్త మగునది । సౌదామనీ చారు జలద మంబు
జాప్తుని తనువున కడ్డమై యుండి వా । తాహతంబై పాయునట్లు వోలెఁ
బడుటయు, మణిమయాభరణ సుందరమైన । యతని గాత్రము సతారాంబరంబుఁ

తే. బోలి యప్పుడ యా సూతపుత్రుచేత । రక్తమయమయి పల్లవోద్రిక్త కల్ప
తరువు చందంబు నొందె; నతండు రాజ । ధర్మమూఁది చలింప కదల్చె నధిప! 188

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; నవ్వుచున్= నవ్వుతూ; చాపంబు= ధనుస్సు; నడిమికిన్+త్రుంచి= మధ్యకు విరిచి; తొంబది శితమార్గణములన్= తొంబయి వాడిబాణాలతో; మైమఱువున్= కవచాన్ని; భేదింపన్= ఖండించగా; రత్నప్రభాదీప్తము+అగు+అది= రత్నకాంతులతో ప్రకాశించే ఆ కవచం; సౌదామనీ చారు జలదము= విద్యుల్లతతో మెరిసే మేఘం; అంబుజ+ఆప్తుని= సూర్యుడి; తనువునకున్+అడ్డము+అయి+ఉండి= దేహానికి అడ్డంగా ఉండి; వాతాహతంబు+ఐ= గాలిచే కొట్టబడి; పాయున్+అట్లు పోలెన్= పడేటట్లుగా; పడుటయున్= పడిపోగా; మణిమయ+ఆభరణ సుందరము+అయిన= మణిమయ భూషణాలతో అందంగా ఉన్న; అతని గాత్రము= అతడి దేహం; సతార+అంబరంబున్ పోలి= నక్షత్రాలతో కూడిన ఆకాశం వలె ఒప్పి; అప్పుడు+అ= అప్పుడే; ఆ సూత పుత్రుచేతన్= కర్ణుడిచేత; రక్తమయము+అయి= రక్తంతో నిండినదయి; పల్లవ+ఉద్రిక్త, కల్పతరువు చందంబున్+ఒందెన్= చిగుళ్ళతో నిండిన కల్పవృక్షం వలె ఒప్పింది; అతండు= ధర్మరాజు; రాజధర్మము+ఊఁది= క్షత్రియధర్మాన్ని పాటించి; చలింపక= కదలక; అదల్చెన్= కోపంతో గద్దించాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! కర్ణుడు ధర్మరాజు ధనువును ఖండించి, తొంభైబాణాలతో అతడి కవచాన్ని భేదించగా, రత్నకాంతిమయమైన ఆ కవచం విద్యుల్లతతో కూడిన మేఘం గాలికి సూర్యుడి దేహానికి అడ్డుతొలగినట్లు పడిపోయింది. మణిమయ ఆభరణాలతో కూడి ఉన్న అతడి శరీరం నక్షత్రాలతో కూడిన ఆకాశంవలె అందంగా ఒప్పింది. కర్ణుడు గాయపరచగా రక్తం కారుతున్న అతడి శరీరం చిగుళ్ళతో నిండిన కల్పవృక్షంవలె ఒప్పారింది. అయినా ధర్మరాజు చలించకుండా నిలిచి అతడిని ఎదిరించాడు.

విశేషం: అలం: ఉపమ. సూర్యపుత్రుడైన కర్ణుడు భేదించిన కవచం సూర్యుడికి అడ్డుగా నిలిచిన మేఘం తొలగినట్లు పడిపోయిందనటంలో స్వారస్యం ఉంది.

వ. ఇ ట్లదల్చుచు. 189

తాత్పర్యం: ఈ విధంగా ఎదిరిస్తూ.

క. చదల మెఱుంగులు పర్వం। గొదమ పిడుగునట్లు నిగుడఁ గుంతీసుతుఁ డు
బ్బుదలిర్ప శక్తి వైచిన। నది కర్ణుఁడు సప్త భల్లహతి నెడఁ దునిమెన్. 190

ప్రతిపదార్థం: కుంతీసుతుఁడు= ధర్మరాజు; ఉబ్బు తలిర్పన్= గర్వముప్పగా; చదలన్= గగనభాగంలో; మెఱుంగులు పర్వన్= కాంతులు చిమ్మగా; కొదమపిడుగు+అట్లు= పిల్ల పిడుగువలె; నిగుడన్= వ్యాపించగా; శక్తి వైచినన్= శక్తి అనే ఆయుధం వేయగా; కర్ణుడు; సప్తభల్లహతిన్= ఏడుబల్లెముల దెబ్బతో; అది= దానిని; ఎడన్= నడుమనే; తునిమెన్= ఖండించాడు.

తాత్పర్యం: ధర్మరాజు అతిశయంతో పిడుగువంటి శక్తిని విసరగా, కర్ణుడు దానిని ఏడు బల్లెములతో మధ్యలోనే ఖండించాడు.

విశేషం: శక్తి అంటే బల్లెం, ఈటె. ఇది ఇనుముతో చేయబడింది. దీనికి బంగారుపూతవేసి గజ్జెలతో అలంకరించేవారు.

సీ. పాండవాగ్రజుఁడు దర్పంబును వేగంబు। నొప్ప నవ్వీరుని యురమునందుఁ
గరముల ఫాలభాగంబున నాల్గు తో। మరములు సొనిపి నెత్తురులు వఱపి
యార్చినఁ, బేర్చిన యగ్గలికంబున। నా సూతనందనుఁ డతని సూతుఁ
జంపి కేతువుఁ ద్రుంచి శాతశరంబుల। నంగంబు నొప్పించె; నపుడు సాత్య

తే. కియు శిఖండియు నెడసొచ్చి రయము బలువు। మెఱయ రాధాతనూజుని మేన నమ్ము
లొక్క మొగి నింప, నయ్యోధుఁ డుఱక వారి। విరథులుగఁ జేసి విండులు విఱుగనేసె. 191

ప్రతిపదార్థం: పాండవ+అగ్రజుఁడు= ధర్మరాజు; దర్పంబును వేగంబును+ఒప్పన్= గర్వము, వేగమూ ఒప్పగా; ఆ+వీరుని= కర్ణుడి; ఉరమునందున్= వక్షమునందు; కరములన్= చేతులందు; ఫాలభాగంబునన్= నొసటిపై; నాల్గు తోమరములు= నాల్గు చిల్లకోలలు; చొనిపి= నాటి; నెత్తురులు వఱపి= రక్తం కారజేసి; ఆర్చినన్= అరువగా; ఆ సూతనందనుఁడు= ఆ కర్ణుడు; పేర్చిన అగ్గలికంబునన్= హెచ్చిన శౌర్యంతో; అతని సూతున్+చంపి= ధర్మరాజు సారథిని చంపి; కేతువున్+త్రుంచి= ధ్వజమును ఖండించి; శాత శరంబులన్= వాడిఅయిన బాణాలతో; అంగంబు నొప్పించెన్= దేహాన్ని గాయపరిచాడు; అప్పుడు; సాత్యకియున్, శిఖండియున్= సాత్యకీ, శిఖండీ; ఎడచొచ్చి= నడుమ ప్రవేశించి; రయము బలువు మెరయన్= వేగం, బలం ఒప్పగా; రాధా తనూజుని మేనన్= కర్ణుడి శరీరమునందు; అమ్ములు+ఒక్కమొగిన్ నింపన్= బాణాలు ఒక్కుమ్మడి కురిపించగా; ఆ+యోధుఁడు= కర్ణుడు; ఉఱక= లక్ష్యపెట్టక; వారిన్ విరథులుగన్+చేసి= వారిని రథహీనులుగా చేసి; విండులు విఱుగన్+ఏసెన్= ధనువులు విరిగేటట్లుగా బాణాలు వేశాడు.

తాత్పర్యం: ధర్మరాజు గర్వం, వేగం ఒప్పగా కర్ణుడి వక్షంమీద, చేతులమీద, నొసటిమీద నాలుగు తోమరాలు దిగబడేటట్లు వేసి, నెత్తురు కారేటట్లుగా చేసి సింహనాదం చేశాడు. అప్పుడు కర్ణుడు హెచ్చిన శౌర్యంతో ధర్మరాజు సారథిని, ధ్వజాన్ని ఖండించి, వాడిబాణాలతో అతడి దేహాన్ని గాయపరిచాడు. ఆ సమయంలో సాత్యకి, శిఖండి మధ్యలో ప్రవేశించి వేగం, బలం ఒప్పగా కర్ణుడి శరీరంమీద ఒక్కుమ్మడిగా బాణాలు నింపారు. అయినా కర్ణుడు లెక్కపెట్టక వారిని విరథులుగా చేసి, వారి విండ్లు విరుగకొట్టాడు.

విశేషం: తోమరం కొయ్యపిడితో కూడి వంపు కలిగిన బాణం. దీనికి విషం పూస్తారు. అందువలన దీనిని విషతోమరమని అంటారు.

క. తనువులఁ బటు బాణంబులు । నినిచి వెగడు పఱిచి కడచి నిరతిశయ రయం
బునఁ గదిసి ధర్మనందను । ననేక సాయక పరిక్షతాంగుం జేసెన్. 192

ప్రతిపదార్థం: తనువులన్= వారి శరీరాలపై; పటు బాణంబులు నినిచి= వాడి బాణాలు నింపి; వెగడు పఱిచి= తల్లడిల్లజేసి; కడచి= దాటి; నిరతిశయ రయంబునన్+కదిసి= ఎంతో వేగంతో సమీపించి; ధర్మనందనున్= ధర్మరాజును; అనేక సాయక= పెక్కుబాణాలతో; పరిక్షత+అంగున్+చేసెన్= గాయపడిన దేహం కలవాడిగా చేశాడు.

తాత్పర్యం: కర్ణుడు వారి దేహాలపై బాణాలు వేసి కలతపరచి, వేగంగా ధర్మరాజును చేరి పెక్కు బాణాలతో అతడి శరీరాన్ని గాయపరిచాడు.

వ. ఇ వ్విధంబున రాధేయుండు నొప్పించినం దదీయ సంరంభంబు సైరింపంజాలక యమ్మహీపతి హతసారథికం బగు నిజరథంబు దొలంగం దోలుకొని పోయినం దోడన తవిలి పొదివి నిలువరించి హాసభాసితుం డగుచు నయ్యంగపతి యతనితో ని ట్లనియె: 193

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; రాధేయుండు= కర్ణుడు; నొప్పించినన్= గాయపరచగా; తదీయ సంరంభంబు= అతని ఆటోపం; సైరింపన్+చాలక= సహించలేక; ఆ+మహీపతి= ధర్మరాజు; హతసారథికంబు+అగు= సారథిహతుడైనట్టి; నిజరథంబు= తనరథం; తొలంగన్+తోలుకొని పోయినన్= తప్పించి (తానే) తోలుకొనిపోగా; తోడన తవిలి= వెంబడించి; నిలువరించి= అడ్డగించి; ఆ+అంగపతి= కర్ణుడు; హాసభాసితుండు+అగుచున్= నవ్వుతున్నవాడై; అతనితోన్+ఇట్లు+అనియెన్= ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: ఈ విధంగా కర్ణుడు ధర్మజుడిని నొప్పించగా, అతడి విజృంభణాన్ని తట్టుకోలేక ధర్మజుడు, సారథిలేని తన రథాన్ని తానే తోలుకొని తొలగివెళ్ళాడు. అయినా కర్ణుడు అతడిని వెంబడించి అడ్డగించి పరిహాసం చేస్తూ ఇట్లా అన్నాడు:

కర్ణుండు ధర్మరాజు నొప్పించి యవమానించుట (సం. 8-44-72 (కుంభ) 8-33-36 (భం))

సీ. 'క్షత్రియ కులమున జన్మించి యిది ధర్మ । మిది యధర్మం బని యెల్ల నెఱఁగి
నట్టి నీ కిట్టి మహాహవమునఁ బ్రాణ । ములు దాఁచికొన శాత్రవులకుఁ దొలఁగి
పోవుట దగునె? నీ బుద్ధి గానఁగనయ్యెఁ । నృపనీతి యెఱుఁగవు; నీవు బ్రాహ్మ
ణాచార వేదివి; యాగాధ్యయనముల । వర్తింపు, కయ్యంబు వలవ; దుడుగు

తే. మింక ననుబోఁటిఁ దొడరిన నింతకంటె । నెడరు వాటిల్లు వేగపొ మ్మింటికడకు
హరియుఁ బార్థుడు నున్నెడకైన నరుగు; । మేను దెగ నీదు ప్రాణాన కింత నిజము.' 194

ప్రతిపదార్థం: క్షత్రియకులమునన్ జన్మించి= క్షత్రియవంశంలో జన్మించి; ఇది ధర్మము+ఇది అధర్మంబు+అని= ధర్మాధర్మాలను; ఎల్లన్+ఎఱిఁగినట్టి నీకున్= అన్నీ తెలిసిన నీకు; ఇట్టి మహా+ఆహవమునన్= ఇటువంటి మహారణంలో; ప్రాణములు, దాఁచికొనన్= ప్రాణాలు దాచుకొనటానికి; శాత్రవులన్+తొలఁగిపోవుట తగునె?= శత్రువుల నుండి పారిపోవటం తగునా?; నీ బుద్ధి కానఁగన్+అయ్యెన్= నీ బుద్ధి బయటపడింది; నృపనీతి ఎఱుఁగవు= రాజధర్మం నీకు తెలియదు; నీవు; బ్రాహ్మణ+

ఆచారవేదివి= బ్రాహ్మణధర్మాలు తెలిసినవాడివి; యాగ+అధ్యయనములన్ వర్తింపు(ము)= యజ్ఞాలు వేదాధ్యయనాలతో గడపుము; కయ్యంబు వలవదు= యుద్ధం తగదు; ఉడుగుము+ఇంకన్= ఇక దాన్ని విడిచిపెట్టుము; ననుబోఁటిన్+తొడరినన్= నావంటివాడితో తలపడితే; ఇంతకంటెన్+ఎడరు+పాటిల్లున్= ఇంతకంటే ఆపద కలుగుతుంది; ఇంటికడకున్ వేగ పొమ్ము= వెంటనే ఇంటికి వెళ్ళుము; హరియున్+పార్థుఁడున్= కృష్ణార్జునులు; ఉన్న+ఎడకైనన్+అరుగు(ము)= ఉన్న వైపుకైనా వెళ్ళుము; నీదు ప్రాణానకున్= నీ ప్రాణానికి; ఏను= నేను; తెగన్= ముప్పుతెచ్చే సాహసం చేయను; ఇంత నిజము= ఇది నిజం.

తాత్పర్యం: క్షత్రియకులంలో జన్మించావు. ఇది ధర్మము, ఇది అధర్మము అని అన్నీ తెలిసినవాడివి. ఇంతటి మహాయుద్ధంలో ప్రాణాలు కాపాడుకోవటానికి శత్రువులనుండి పారిపోవటం నీకు తగునా? నీ బుద్ధి బయటపడింది. నీకు రాజధర్మం తెలియదు. నీవు బ్రాహ్మణాచారాలు తెలిసినవాడివి. యాగాలతో, వేదాధ్యయనాలతో కాలం గడుపు. నీకు యుద్ధం తగదు. మానుకో. ఇక నాలాంటివారితో యుద్ధానికి పూనుకొంటే ఇంతకంటె ఆపద కలుగుతుంది. వెంటనే ఇంటికి పొమ్ము, లేదా కృష్ణార్జునులున్న చోటికైనా వెళ్ళు. నీ ప్రాణాలు తీయటానికి నేను తెగించను. ఇది నిజం.

వ. అని పలికి గొంతి వచనంబులు మనంబున నునికిం జేసి వధియింప నొల్లనివాఁడై యప్పాండవాగ్రజు విడిచి యా పురుషసత్తముండు తదీయ సేనాసముదయంబు నానాస్త్ర నిహతంబు సేసె; లజ్జాకుల మానసుం డగు నమ్మానవపతియును దత్ప్రదేశంబున నిలువక తొలంగిపోయెం; బోవుటయు. 195

ప్రతిపదార్థం: అని పలికి= అని వచించి; గొంతి వచనంబులు= కుంతికి ఇచ్చిన మాటలు; మనంబునన్+ఉనికిన్+చేసి= మనసులో మెదలటం వలన; వధియింపన్+ఒల్లనివాఁడు+అయి= అతడిని చంపటం ఇష్టం లేనివాడై; ఆ+పాండవ+అగ్రజున్ విడిచి= ఆ ధర్మరాజును వదలి; ఆ పురుషసత్తముండు= ఆ పురుషశ్రేష్ఠుడు - కర్ణుడు; తదీయ సేనాసముదయంబు= అతని సైన్యసమూహాన్ని; నానా+అస్త్రనిహతంబు చేసెన్= వివిధ అస్త్రాలతో బాధించాడు; లజ్జా+ఆకుల మానసుండు+అగు= సిగ్గుతో నిండినవాడైన; ఆ+మానవపతియును= ధర్మరాజుకూడ; తద్+ప్రదేశంబున నిలువక= అక్కడ ఉండక; తొలంగిపోయెన్= మరలివెళ్ళాడు; పోవుటయున్= పోవగా.

తాత్పర్యం: కర్ణుడు ఈ విధంగా పరిహసించి, కుంతికి ఇచ్చిన మాట గుర్తుకు వచ్చి, ధర్మరాజును వధించకుండా విడిచి, అతడి సైన్యంపై వివిధాస్త్రాలు ప్రయోగించాడు. ధర్మరాజు సిగ్గుతో అక్కడ నిలువలేక వెనుదిరిగి వెళ్ళాడు. అప్పుడు.

క. విను మతని యోధజనములు । మొనయుఁ దిరిగె; నట్లు సమరమున విముఖంబై
చను నబ్బలముం గని వెను । కొనియెం గర్ణుండు నీదు కొడుకులుఁ దానున్. 196

ప్రతిపదార్థం: అతని యోధజనములు= ధర్మరాజు పక్షంలోని సైనికజనం; మొనయున్= సైన్యం; అట్లు= ఆ విధంగా; సమరమునన్ విముఖంబు+అయి= యుద్ధవిముఖమై; తిరిగెన్= వెనక్కు తిరిగాయి; చను+ఆ+బలమున్+కని= మరలుతున్న ఆ సైన్యాన్ని చూచి; కర్ణుండు= కర్ణుడు; నీదు, కొడుకులున్+తానున్= నీ కుమారులతో కలిసి తానూ; వెనుకొనియెన్= వెంబడించాడు; విను= వినుము.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! వినుము. ధర్మరాజు సైన్యం యుద్ధం విడిచి వెనుకకు తిరిగివెళ్ళగా కర్ణుడు నీ కుమారులతో కలిసి దాన్ని వెంబడించాడు.

క. పటు సింహనాద తూర్యో । త్కట రవగుణ నిస్వనములు గలసి యఖిల ది
క్తట దారణ కేలి సము । ద్భటము లగుచుఁ గురుబలమునఁ బరఁగె నరేంద్రా! 197

ప్రతిపదార్థం: నరేంద్రా!= రాజా!; కురుబలమునన్= కౌరవసైన్యంలో; పటు, సింహనాదతూర్య= సింహనాదంవంటి వాద్యాల; ఉత్కటరవ= పెద్దధ్వనులు; గుణ నిస్వనములు= వింటినారిధ్వనులు; కలసి= కలిసి; అఖిల దిక్+తట, దారణకేలి సముద్భటములు+అగుచున్= దిక్కులన్నీ బద్దలు చేసేటంత భయంకరములై; పరఁగెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! కౌరవసైన్యంలో యుద్ధ వాద్యాల ధ్వనులు, ధనుష్టంకారాలు కలిసి దిక్కులను బద్దలు చేస్తూ మారుమ్రోగాయి.

ఉ. ఇమ్మెయి సూతనందనుని యేడ్తెఱ కోడిన యోధవీర సం
ఘమ్ములఁ బాండవాగ్రజుఁడు గన్గొని పేర్కొని పేరెలుంగునం
గ్రమ్మఱి పేర్చి కౌరవ నికాయము గర్వమడంపుఁ డన్న ధై
ర్య మ్మిగురొత్త వే తిరిగి రా రథికుల్ మరలెన్ బలంబులున్. 198

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; సూతనందనుని= కర్ణుడి; ఏడ్తెరకున్+ఓడిన= పరాక్రమానికి ఓడిపోయిన; యోధవీర సంఘమ్ములన్= వీరుల సమూహాలను; కన్గొని= చూచి; పాండవ+అగ్రజుఁడు= ధర్మరాజు; పేరు+ఎలుంగునన్= పెద్దగొంతుతో; పేర్కొని= పిల్చి; క్రమ్మఱి పేర్చి= మళ్ళీ విజృంభించి; కౌరవ నికాయము గర్వము+అడంపుఁడు+అన్నన్= కౌరవసైన్యం గర్వాన్ని అణచివేయండి అనగా; ఆ రథికులు= ఆ రథవీరులు; ధైర్యమ్ము+ఇగురు+ఒత్తన్= ధైర్యం చిగురించగా; వే తిరిగిరి= వెంటనే మరలారు; బలంబులున్ మరలెన్= సైన్యాలు కూడా మరలాయి.

తాత్పర్యం: ఈ విధంగా కర్ణుడి పరాక్రమానికి నిలువలేక వెనుదిరుగుతున్న వీరులను, సైనికులను చూచి ధర్మరాజు వారిని బిగ్గరగా పిలిచి, మళ్ళీ విజృంభించి కౌరవసైన్యాన్ని అణచండి అనగా వారు ధైర్యం తెచ్చుకొని ముందుకు సాగారు.

వ. ఇవ్విధంబున వృకోదర పురస్సరంబుగాఁ బాండవ బలంబులు మార్కొనిన మన మూఁకలుం గూడికొని తిరంబై త్రోచి తలపడుటయు నయ్యిరువాఁగునందు. 199

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; పాండవ బలంబులు= పాండవసైన్యాలు; వృకోదరపురః+సరంబుగాన్= భీముడిని ముందుంచుకొని; మార్కొనినన్= ఎదుర్కొనగా; మనమూఁకలున్+కూడికొని; మన సైనికులు కూడా చేరి; తిరంబు+అయి= స్థిరంగా నిలిచి; త్రోచి, తలపడుటయున్= తాకి తలపడగా; ఆ+ఇరువాఁగు+అందున్= ఆ రెండు పక్షాలలో.

తాత్పర్యం: పాండవసైన్యం భీముడిని ముందుంచుకొని కౌరవులతో తలపడగా, వారుకూడా స్థిరంగా నిలిచి వారిని ఎదిరించారు. ఆ రెండు పక్షాలలో. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. **కరిబృందంబులు ద్రెళ్ళెఁ బెల్లుగఁ దురంగ స్తోమముల్ పెక్కు గూ**
లె రథానీకము లగ్గలంబు గెడసెన్ లెక్కింపఁ బెక్కైన కా
ల్వుర మొత్తంబులు రూపడంగె సిడము ల్నుగ్గయ్యె నన్నేల నె
త్తురు వెల్లిన్ మునిఁగెన్ మరుత్ఖచర పంక్తుల్ వెక్కసంబందఁగన్. 200

ప్రతిపదార్థం: మరుత్+ఖచర, పంక్తుల్= యక్ష గంధర్వాది గగన సంచారుల సమూహాలు; వెక్కసంబు+అందఁగన్= సహించలేకపోగా; పెల్లుగన్= హెచ్చుగా; కరిబృందంబులు త్రెళ్ళెన్= ఏనుగుల సమూహాలు కూలాయి; తురంగస్తోమముల్= అశ్వాల గుంపులు; పెక్కుకూలెన్= చాలా నేలకూలాయి; రథ+అనీకములు= రథ సమూహాలు; అగ్గలంబు, కెడసెన్= అధికంగా కూలాయి; లెక్కింపన్+పెక్కు+అయిన= అధిక సంఖ్యాకమైన; కాల్వుర, మొత్తంబులు= సైనికుల గుంపులు; రూపు+అడంగెన్= నశించాయి; సిడముల్+నుగ్గు+అయ్యెన్= జెండాలు చూర్ణం అయ్యాయి; ఆ+నేల= ఆ భూమి; నెత్తురు వెల్లిన్; మునిగెన్= నెత్తుటి వరదలో మునిగింది.

తాత్పర్యం: దేవతలు, ఆకాశసంచారులు సహించలేనంత ఎక్కువగా ఏనుగులసమూహాలు, గుర్రాలసమూహాలు, రథసమూహాలు, సైనికులసమూహాలు కూలటం జరిగింది. ధ్వజాలు పొడి అయ్యాయి. నేల నెత్తుటి వరదలో మునిగింది.

వ. **అట్టి సందడి కయ్యంబున భీమసేనుండును శైనేయుండును బెట్టిదంపు టురవడిం గవిసిన ధృష్టద్యుమ్నాది రథిక ప్రకరంబును బరవసంబు సేయం గురుబలంబు వెఱచఱచి పఱచినఁ, గర్ణుం డదల్చి కరతలంబెత్తి నిలునిలు మని పలికి నమ్మోహరంబు నిలువదయ్యెఁ; నవష్టంభ విజృంభితుండైన యా సూతసూనుండు వెండియుం గౌరవుల వేఱు వేఱ పురికొల్పి మరల్చిన నమ్మొనయును మొగకట్టి నిలిచె; నంతం బవమానసూనుం దాను మార్కొన నగ్గలించె; నతం డతని నాలోకించి యంతకుమున్న శ్రుతకీర్తి స్యందనం బెక్కియున్న తమయన్న వలను సాత్యకి ధృష్టద్యుమ్నులకుం జూపి వారలతో ని ట్లనియె. 201**

ప్రతిపదార్థం: అట్టి సందడి కయ్యంబునన్= ఆ సంకుల సమరంలో; భీమసేనుండును= భీముడును; శైనేయుండును= సాత్యకియు; బెట్టిదంపు+ఉరవడిన్= తీవ్రవేగంతో; కవిసినన్= పైబడగా; ధృష్టద్యుమ్న+ఆది= ధృష్టద్యుమ్నుడు మున్నగు; రథిక ప్రకరంబును= వీరుల సమూహం; బరవసంబు చేయన్= ధైర్యం చూపగా; కురుబలంబు= కౌరవసైన్యం; వెఱచఱచి, పఱచినన్= భయపడి పరుగిడగా; కర్ణుండు+అదల్చి= కర్ణుడు గద్దించి; కరతలంబు+ఎత్తి= చేయెత్తి; నిలునిలుము+అని పలికినన్= ఆగండి ఆగండి అని అనగా; ఆ+మోహరంబు= ఆ సైన్యం; నిలువదు+అయ్యెన్= నిలువలేదు; ఆవష్టంభ విజృంభితుండు+అయిన ఆ సూతసూనుండు= గర్వంతో విజృంభించిన ఆ కర్ణుడు; వెండియున్= మళ్ళీ; కౌరవులన్= కౌరవులను; వేఱు వేఱ పురికొల్పి= వేర్వేరుగా ప్రేరేపించి; మరల్చినన్= మరలించగా; ఆ+మొనయును= ఆ సైన్యం; మొగకట్టి నిలిచెన్= శబ్దంచేస్తూ నిలిచింది; అంతన్= అపుడు; పవమానసూనున్= భీముడిని; తాను మార్కొనన్+అగ్గలించెన్= తాను ఎదుర్కొనాలని పూనుకొన్నాడు; అతండు= భీముడు; ఆతనిన్+ఆలోకించి= కర్ణుడిని చూచి; అంతకున్+మున్న= అంతకుముందే; శ్రుతకీర్తిస్యందనంబు+ఎక్కిఉన్న= శ్రుతకీర్తి రథంపై ఎక్కిఉన్న; తమ+అన్న వలను= ధర్మరాజు ఉన్నవైపు; సాత్యకి ధృష్టద్యుమ్నులకున్+చూపి= సాత్యకి ధృష్టద్యుమ్నులకు చూపి; వారలతోన్+ఇట్లు+అనియెన్= వాళ్ళతో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అటువంటి సంకులసమరంలో భీమసేనుడు, సాత్యకి తీవ్రవేగంతో మీదికి రాగా, ధృష్టద్యుమ్నుడు మొదలైన వీరులు ధైర్యం చూపగా - కౌరవసైన్యం భయపడి పరుగెత్తింది. అప్పుడు కర్ణుడు గద్దించి, చెయ్యెత్తి

ఆగండి ఆగండని అన్నా ఆ సైన్యం ఆగలేదు. గర్వంతో విజృంభించిన కర్ణుడు, మళ్ళీ కౌరవులను వేరువేరుగా పురికొల్పి మరలించగా, ఆ సైన్యం శబ్దం చేస్తూ నిలిచింది. అప్పుడు కర్ణుడు భీమసేనుణ్ణి ఎదుర్కోటానికి పూనుకొన్నాడు. భీముడు, కర్ణుణ్ణి చూచి, అంతకుముందే శ్రుతకీర్తి రథాన్ని అధిరోహించియున్న అన్న ధర్మరాజును సాత్యకీ ధృష్టద్యుమ్నులకు చూపి, ఇట్లా అన్నాడు.

ఉ. 'ఈతఁడు దుర్దశం బొరసె నేను గనుంగొనఁ గర్ణుఁ డేచి దు
ర్నీతి పరున్ సుయోధనునిఁ బ్రీతునిఁ జేయుటకై కడంగె; మీ
చేతికి నిచ్చి యిట్లరువు సేసెద నిన్నరనాథు నాకు నా
సూతతనూభవున్ సమయఁ జూడక పోదు విషాద మెమ్మెయిన్. 202

ప్రతిపదార్థం: నేను కనుంగొనన్= నేను చూడగా; ఈతడు దుర్దశన్+పొరసెన్= ఈ ధర్మజుడు దుస్స్థితి పొందాడు; కర్ణుఁడు+ఏచి= కర్ణుడు విజృంభించి; దుర్నీతి పరున్ సుయోధనునిన్= అవినీతిపరుడైన దుర్యోధనుడిని; ప్రీతునిన్+చేయుటకై కడంగెన్= సంతోషపరచటానికి పూనుకొన్నాడు; ఈ+నరనాథున్= ధర్మరాజును; మీ చేతికిన్+ఇచ్చి= మీ చేతిలో బెట్టి; ఇట్లు+అరువు సేసెదన్= ఋణం ఇస్తున్నాను; నాకున్+ఆ సూత తనూభవున్= నాకు ఆ కర్ణుడిని; సమయన్+చూడక= చచ్చేటట్లు చేయకుండా; ఏ+మెయిన్= ఏ విధంగానూ; విషాదము పోదు= దుఃఖం తొలగదు.

తాత్పర్యం: దుర్యోధనుడికి ప్రీతి కలిగించటానికి పూనుకొని కర్ణుడు ఇట్లా చేస్తున్నాడు. నా కళ్ళముందు అగ్రజుడైన ధర్మరాజుకు దుర్దశ కలగటం బాధగా ఉన్నది. ఆయనను మీకు అప్పుగా ఇస్తున్నాను. (అంటే మళ్ళీ ఆయనను నాకు క్షేమంగా అప్పగించాలి అని) కర్ణుడిని సంహరించకుండా నా దుఃఖం తీరదు.

క. ఏ నొండె నతనిచే నా । చేనొండె నతండు దెగుట సిద్ధముగ మదిం
బూని కడంగెద; మీ రీ । భూ నాథునిఁ గాచికొనియ పోరు నడపుఁడీ!' 203

ప్రతిపదార్థం: అతనిచేన్= కర్ణుడిచేత; ఏను+ఒండెన్= నేనో; అతండు= కర్ణుడు; నాచేన్+ఒండెన్= నా చేతనో; తెగుట సిద్ధముగన్= చావటం నిశ్చయంగా; మదిన్+పూని కడంగెదన్= మనసులో భావించి పూనుకొంటాను; మీరు= మీరు; ఈ భూనాథునిన్+కాచికొనియ= ధర్మజునికి రక్షగా ఉండియే; పోరు నడపుఁడీ!= యుద్ధం చేయండి.

తాత్పర్యం: కర్ణుడి చేత నేనో, నా చేత కర్ణుడో చావటాన్ని నిశ్చయించి యుద్ధానికి పూనుకొంటాను. మీరు ఈ ధర్మరాజును కాపాడుకొంటూ యుద్ధం చేయండి.'

చ. అని పటుసింహనాదమున నంబరముం బగిలించి తేరు క
ర్ణుని దెసఁ బోవనిచ్చినఁ గనుంగొని శల్యుఁడు కర్ణుతోడ ని
ట్లను 'మనమీఁద వచ్చు ననిలాత్మజుఁ జూచితె! యంతరంగ మే
ర్చు నలుక కామిషం బిడఁగఁ జూచిన చందము గాననయ్యెడున్. 204

ప్రతిపదార్థం: అని, పటు, సింహనాదమునన్= అని తీవ్ర సింహగర్జనతో; అంబరమున్+పగిలించి= ఆకాశాన్ని బద్దలుచేసి; తేరు, కర్ణుని దెసన్+పోవనిచ్చినన్= రథం కర్ణుడివైపు మరల్చగా; శల్యుఁడు; కనుంగొని= చూచి; కర్ణుతోడన్+ఇట్లు+అనున్=

కర్ణుడితో ఇట్లా అన్నాడు; మనమీఁదన్, వచ్చు= మనపైకి వస్తున్న; అనిల+ఆత్మజున్+చూచితె?= భీముడిని చూచావా?; అంతరంగము+ఏర్చు+అలుకకున్= మనసును దహించే ఆగ్రహానికి; ఆమిషంబు+ఇడఁగన్+చూచిన చందము= ఆహారం ఇవ్వదలచిన విధం; కానన్+అయ్యెడున్= గోచరిస్తున్నది.

తాత్పర్యం: అని, భీముడు ఆకాశం బ్రద్దలయ్యేటట్లు సింహగర్జనచేసి, రథాన్ని కర్ణుడివైపు పోనిచ్చాడు. అతడిని చూచి కర్ణుడు శల్యుడితో ఇట్లా అన్నాడు. మనమీదికి వస్తున్న భీముణ్ణి చూచావా? (ధర్మరాజును మనం అవమానించినందుకు) తన మనస్సును దహించే కోపానికి (మనల్ని) ఆహారంగా ఇవ్వదలచినట్లు అగుపిస్తున్నాడు.

చ. **'అలిగిన మూఁడు లోకముల నైనను జీరికిఁ జేకొనం డితం**
డలఘు పరాక్రమ స్ఫురణుఁ డర్జున సూనుఁడు నాత్మపుత్త్రుఁడుం
బొలిసిర కాని కోపమునఁ బొంగఁడు నాఁడును నాఁడు నింత దో
ర్బలమును శౌర్యసారముఁ దిరంబయి చూపఱు మెచ్చఁ జూపుమీ!' **205**

ప్రతిపదార్థం: ఇతండు= భీముడు; అలఘు పరాక్రమ స్ఫురణుఁడు= గొప్ప పరాక్రమశాలి; అలిగినన్= కోపిస్తే; మూఁడు లోకములన్+అయినను= మూడు లోకాలనైనా; చీరికిన్+చేకొనండు= లెక్కపెట్టడు; అర్జునసూనుఁడున్= అభిమన్యుడూ; ఆత్మపుత్త్రుఁడున్= ఘటోత్కచుడూ; పొలిసిరకాని= మరణించినా కాని; నాఁడును నాఁడున్= అభిమన్యుడు చచ్చిపోయిన నాడూ, ఘటోత్కచుడు చచ్చిపోయిననాడూ-ఆనాడు; కోపమునన్+పొంగఁడు= ఆవేశం చూపలేదు; ఇంత దోః+బలమును శౌర్యసారమున్= ఇంతటి భుజబలం; పరాక్రమం; తిరంబు+అయి= స్థిరమై; చూపరు మెచ్చన్+చూపుమీ!= అందరు మెచ్చగా చూపించుము.

తాత్పర్యం: 'గొప్ప పరాక్రమశాలి అయిన భీముడు అలిగితే మూడు లోకాలను కూడా లెక్కచేయడు. అభిమన్యు ఘటోత్కచుల మరణ సందర్భాలలో కూడా అతడిలో ఇంత ఆవేశాన్ని చూడలేదు. నీవు కూడా అంతటి బలాన్ని ప్రదర్శించి చూపరులను మెప్పించుము.'

విశేషం: ధర్మజుడికి కలిగిన అవమానానికి భీముడు అంత ఆగ్రహం చెందాడంటే అన్నగారిపై అతడికి గల గౌరవం వ్యక్తమవుతున్నది.

చ. **అనవుడు భీముఁ జూచి యతఁ డాతని కిట్లను 'నట్టివాఁడ కా**
కనిలజుఁ డల్పుఁ డెట్లు? సమరాగ్రమునన్ భవదుక్తి యట్ల యిం
తనువగునే కిరీటిఁ దెగటార్పఁగ నీతని నొంపఁ జంపఁ దాఁ
గని వెసవచ్చు నాతఁ డధికం బగు మద్బల మిప్డు సూడుమీ! **206**

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; భీమున్+చూచి= భీముడిని చూచి; అతడు+అతనికిన్+ఇట్లు అనున్= కర్ణుడు శల్యుడితో ఇట్లా అన్నాడు; అనిలజుఁడు= భీముడు; అట్టివాఁడకాక= అట్టివీరుడుకాక; అల్పుఁడు+ఎట్లు?= తక్కువవాడెట్లా అవుతాడు; భవత్+ఉక్తి+అట్ల= నీమాట ప్రకారం; సమర+అగ్రమునన్= యుద్ధంలో ముందుగ; కిరీటిన్+తెగటార్పఁగన్= నేను అర్జునుడిని సంహరించటానికి; ఇంత+అనువు+అగునే= ఇంత సులభంగా వీలు అవుతుందా? ఈతనిన్= భీముడిని;

నొంపన్+చంపన్= నొప్పింపగా లేదా చంపగా; ఆతఁడు= అర్జునుడు; తాన్+కని= తాను చూచి; వెసన్+వచ్చున్= శీఘ్రంగా వస్తాడు; అధికంబు+అగు మత్+బలము= అధికమైన నా శౌర్యం; ఇపుడు చూడుమీ!= ఇప్పుడు చూడుము.

తాత్పర్యం: అని అనగా భీముణ్ణి చూచి కర్ణుడు శల్యుడితో ఇట్లా అన్నాడు. భీముడు గొప్పవీరుడు కాక, తక్కువవాడు ఎట్లా అవుతాడు? నీ వన్నట్లు అర్జునుణ్ణి యుద్ధంలో ముందుగ సంహరించటం ఇంత సులభంగా వీలౌతుందా? భీముణ్ణి నొప్పించినా, చంపినా - అది చూచి అర్జునుడు వెంటనే వస్తాడు. నా బలాధిక్యాన్ని ఇప్పుడు చూడు.

చ. **తరమిడి చంపెఁ గీచక శతంబు నితం; డది యేల? యెల్లెడన్**
బిరు దనఁగా బలాఢ్యుఁ డనఁ బెద్దయుఁ బేర్చినవాఁ డగున్ వృకో
దరుఁ డటు లైన నీతని మదం బడఁగించుట లీల నాకు నీ
వరదము సమ్ముఖంబుగ రయంబునఁ బోవఁగ నిమ్ము భూవరా! **207**

ప్రతిపదార్థం: ఇతండు= భీముడు; తరము+ఇడి= వరుసబెట్టి; కీచకశతంబున్= నూరుమంది కీచకులను; చంపెన్= చంపాడు; అది ఏల?= అదంతా ఎందుకు?; వృకోదరుఁడు= భీముడు; ఎల్ల+యెడన్ బిరుదు+అనఁగాన్= అన్నిచోట్ల వీరుడుగా; బల+ఆఢ్యుఁడు+అనన్= బలవంతుడని; పెద్దయున్+పేర్చినవాఁడు+అగున్= చాలా విజృంభించేవాడవును; నాకున్; ఈతని మదంబు= ఇతడి గర్వం; అడఁగించుట లీల= అణచటం విలాసం; భూవరా!= శల్యా!; నీవు+అరదము= నీవు రథం; సమ్ముఖంబుగన్= అతడి ఎదురుగా; రయంబునన్+పోవఁగన్+ఇమ్ము= వేగంగా తీసికొని వెళ్ళుము.

తాత్పర్యం: మద్రభూపతీ! భీముడు నూరుమంది కీచకులను వధించాడు. తాను ఎంతో వీరుడినని, బలవంతుడినని గర్వంతో అన్నిచోట్ల విజృంభిస్తాడు. అతడి గర్వాన్ని అణచటం నాకు లీల. రథాన్ని అతడికి ఎదురుగా త్వరగా తీసికొని వెళ్ళు.

విశేషం: భీముడి పరాక్రమ విశేషాల గురించి కర్ణశల్యులు చేసిన సంభాషణ వరుసగా నాలుగు చంపకమాలా పద్యాలలో ఉండటం విశేషం.

ఉ. **నావుడుఁ దేరు మద్రనరనాథుఁడు భీముని ది క్కుదగ్రతం**
బోవఁగ నిచ్చెఁ దూర్య రవముల్ సెలఁగెన్ దివి పిక్కటిల్ల న
ప్పావని నవ్వుచున్ బలము పాయపడం గడు బెట్టు గిట్టినం
జేవ దలిర్ప నా రథికసింహునిఁ గర్ణుఁడు గప్పెఁ దూపులన్. **208**

ప్రతిపదార్థం: నావుడున్= అనగా; మద్రనరనాథుఁడు= శల్యుడు; తేరు= రథాన్ని; భీముని, దిక్కు+ఉదగ్రతన్= భీముడివైపు భయంకరంగా; పోవఁగన్+ఇచ్చెన్= పోనిచ్చాడు; దివి, పిక్కటిల్లన్= ఆకాశం మారుమ్రోగగా; తూర్య, రవముల్, చెలఁగెన్= వాద్యధ్వనులు వినిపించాయి; ఆ+పావని= భీముడు; నవ్వుచున్= నవ్వుతూ; బలము= కౌరవసైన్యం; పాయవడన్= చెదరునట్లుగా; కడుబెట్టుగిట్టినన్= మిక్కిలి తీవ్రంగా తాకగా; కర్ణుఁడు; చేవ, తలిర్పన్= బలమొప్పగా; ఆ రథికసింహునిన్= రథికశ్రేష్ఠుడైన ఆ భీముడిని; తూపులన్ కప్పెన్= బాణాలతో కప్పివేశాడు.

తాత్పర్యం: శల్యుడు రథాన్ని భీముడివైపు భయంకరంగా పోనిచ్చాడు. యుద్ధవాద్యాలు దిక్కులు పిక్కటిల్లేటట్లు మారుమ్రోగాయి. భీముడు శత్రుసేనను మహాతీవ్రంగా తాకగా, కర్ణుడు అతడిని బాణాలతో ముంచెత్తాడు.

వ. కప్పి యాలోన. 209

తాత్పర్యం: కప్పి, ఆ లోపల.

క. వెస నతని యురము బలు నా । రసమున నొంచుటయు నతఁడు రాధేయ తను
ప్రసరన్నవ నారాచో । ల్లసితుండై మెఱసెఁ గురుబలంబు దలంకన్. 210

ప్రతిపదార్థం: వెసన్= వెంటనే; అతని ఉరము= భీముడివక్షాన్ని; బలునారసమునన్= వాడిబాణంతో; నొంచుటయున్= నొప్పించగా; అతఁడు= భీముడు; కురుబలంబు, తలంకన్= కౌరవసేన చలించగా; రాధేయ తను= కర్ణుడి దేహమునందు; ప్రసరత్+నవ, నారాచ+ఉల్లసితుండు+ఐ= వ్యాపిస్తున్న తొమ్మిది బాణాలచేత (తొమ్మిది బాణాలు నాటి) ప్రకాశించినవాడై; ఉల్లసించినవాడై; కురుబలంబు తలంకన్= కౌరవుల బలం చలించగా; మెఱసెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: భీముడి వక్షాన్ని బాణంతో నొప్పించగా, అతడు కర్ణుడి దేహంనందు తొమ్మిదిబాణాలు నాటి కురుబలం చలించేటట్లు ప్రకాశించాడు.

ఉ. సూతతనూభవుం డనిలసూనుని చాపము ద్రుంచి యేచి యు
ద్ద్యోతిత మార్గణంబు మెయి నుచ్చి చనన్ నిగిడింప నొండు వి
ల్లాతఁడు ధైర్య సారము రయంబును జూపఱుమెచ్చ నెత్తి సం
స్ఫీత శరోత్కరం బతని పేరుర మాడఁగ నేసి యార్చినన్. 211

ప్రతిపదార్థం: సూత తనూభవుండు= కర్ణుడు; అనిలసూనుని= భీముడి; చాపము, త్రుంచి= విల్లు ఖండించి; ఏచి= విజృంభించి; ఉద్ద్యోతిత, మార్గణంబు= ప్రకాశించే బాణం; మెయిన్+ఉచ్చి, చనన్, నిగిడింపన్= దేహమునందు దూరిపోయేటట్లు వేయగా; ఆతఁడు= భీముడు; ధైర్యసారము, రయంబును= శౌర్యం, వేగం; చూపఱు మెచ్చన్= చూచువారు మెచ్చుకోగా; ఒండువిల్లు= మరొకవిల్లు; ఎత్తి= గైకొని; సంస్ఫీత శర+ఉత్కరంబు= పెక్కు బాణసమూహాన్ని; అతని పేరు+ఉరము+ ఆడఁగన్= అతని విశాలవక్షమునందు నాటగా; ఏసి ఆర్చినన్= వేసి అరవగా.

తాత్పర్యం: కర్ణుడు భీముడి విల్లు తునిమి విజృంభించి అతడి దేహమునందు దూరిపోయేటట్లుగా మెరిసే బాణం వేశాడు. చూపరులు మెచ్చుకొనగా భీముడు మరొక విల్లునందుకొని అతడి విశాల వక్షమునందు అనేక బాణాలు వేసి బిగ్గరగా అరిచాడు.

తే. ఈడఁబోక రాధాసుతుఁ డేసె నిరువ । దేను నారాచములు పవమాన తనయు
కత్తళము తూఱి యంగంబు గాఁడి పాఱి । నిలువ కటచని మేదినీతలము సొరఁగ. 212

ప్రతిపదార్థం: పవమాన తనయు= భీముడి; కత్తళము తూఱి= కవచం చొచ్చుకొని; అంగంబు కాఁడిపాఱి= దేహం తొలిచికొని; నిలువక= ఆగక; అట చని= ముందుకు వెళ్ళి; మేదినీతలము చొరఁగన్= భూమిపై పడగా; రాధాసుతుఁడు= కర్ణుడు; ఈడన్+పోక= వెనుదీయక; ఇరువది+ఏను నారాచములు= ఇరవైఅయిదు బాణాలు; ఏసెన్= వేశాడు.

తాత్పర్యం: భీముడి కవచాన్ని తాకి దేహంలోనికి చొచ్చుకొని వెళ్ళి భూమిలోకి దూరిపోయేటట్లుగ కర్ణుడు వెనుదీయక ఇరవైఅయిదు బాణాలు వేశాడు.

మ. అలుకం గెంపు గనుంగవం గదురఁగా నప్పాండవుం డేసినం
గులిశంబో యనఁ బ్రజ్వరిల్లి నిగిడెన్ ఘోరంపు భల్లం బుర
స్థ్సలి భేదిల్లఁగఁ దేరిమీఁదఁబడి మూర్ఛంబొంది కర్ణుండు ని
శ్చలతం జచ్చిన యట్టులుండె వెఱఁ దత్సైన్యంబుఁ దూలెం గడున్. 213

ప్రతిపదార్థం: ఆ+పాండవుండు= ఆ భీముడు; అలుకన్= కోపంతో; కనుంగవన్= కనులజంటలో; కెంపు= ఎరుపు; కదురఁగా= నిండగా; ఘోరంపుభల్లంబు= క్రూరమైన బల్లెం; ఏసినన్= వేయగా; కులిశంబో అనన్= వజ్రాయుధమో అన్నట్లుగా; ప్రజ్వరిల్లి నిగిడెన్= కాంతితో ఒప్పింది; కర్ణుండు= కర్ణుడు; ఉరః+స్థలి భేదిల్లఁగన్= వక్షం చొచ్చుకొనిపోగా; తేరిమీఁదన్+పడి= రథంమీద పడి; నిశ్చలతన్= చలనం లేక; చచ్చిన అట్టులు+ఉండెన్= చచ్చినట్లుగా ఉన్నాడు; వెఱన్= భయంతో; తద్+ సైన్యంబున్= అతడిసేనకూడా; కడున్+తూలెన్= మిక్కిలిగా చలించింది.

తాత్పర్యం: భీముడు క్రోధంతో కన్నులెర్రబడగా వ్రజాయుధమో అన్నట్లుగా ఉన్న బల్లెం కర్ణుడిపైకి విసిరాడు. అది అతడివక్షాన్ని భేదించగా రథంపై చలనం లేకుండా చచ్చినట్లు పడిపోయాడు. అదిచూచి అతడి సైన్యం భయంతో తల్లడిల్లింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

భీముండు గర్ణుని మూర్ఛితుంజేసి నాలుక గోయం బూనుట (సం. 8-45-48)

వ. అప్పు డయ్యనిలతనయుండు దన యరదంబు గదియం దెచ్చి యా సూతనందనుం గనుంగొని 'యినీచు నాలుకం గోసెద' ననుచుం గట్టిన యలుఁగు వెఱికి యతని యరదంబుమీఁది కరుగ నుత్సహించిన జూచి, మద్రవిభుండు వారించి 'యిది మూర్ఛగాని మరణంబు గా; దీ యవస్థ నాలుక గోసినం జచ్చు; నితనిం జంపుటకుఁ బార్థుండు ప్రతిన పట్టినవాఁడు నీవు సంపిన నతండు నెవ్వగం బొందు' ననిన విని యవ్వీరుండు వీఁ డిప్పుడు పాండవాగ్రజుని బాధించినం గ్రోధాంధుండనై యది మఱచితిం గాని చావుగామియు నిట్టియెడ నాలుక గోయం దడవఁ జచ్చుటయు నెఱుంగుదు; నిత్తెఱంగు నీవు దలంపించి లెస్సచేసి; తిద్దురాత్ముండు సభలోన నసభ్యంబు లగు మాటలు ద్రౌపది నుద్దేశించి యాడిన నుద్దీపించిన కోపం బజాతశత్రునకుఁ బ్రియంబుగా నడంచికొని యుండితి; నేఁడు తద్వేదన వెలార్పం జూచితి; నట్ల చేసితినేని మానధనుం డైన ధనంజయుండు దన చేసిన పూనిక నెఱపం గానక మనంబునం గుంది మడియుఁ; గృష్ణ యుధిష్ఠిరులు నాతని తోడివార; యింత ప్రమాదంబు నీవు గలిమిం దెలిసితి; మేలయ్యె; మాతులా! నీ యాజ్ఞ యుల్లంఘింప నని పలికి నిలిచె; శల్యుండును సంతసిల్లి తేరు దొలంగించె; ననుటయు నాంబికేయుండు సంజయున కి ట్లనియె. 214

ప్రతిపదార్థం: అప్పుడు; ఆ+అనిలతనయుండు= భీముడు; తన అరదంబు= తన రథం; కదియన్+తెచ్చి= దగ్గరకు తెచ్చి; ఆ సూతనందనున్+కనుంగొని= కర్ణుడిని చూచి; ఈ+నీచు నాలుకన్+కోసెదన్ అనుచున్= ఈ నీచుడి నాలుకను కోస్తా నని; కట్టిన అలుఁగు పెఱికి= కట్టి ఉన్న ఖడ్గం లాగి; అతని అరదంబుమీఁదికిన్+అరుగన్+ఉత్సహించినన్= అతని రథంపైకి

వెళ్ళటానికి పూనుకొనగా; మద్రవిభుండు, చూచి, వారించి= శల్యుడు చూచి వద్దని; ఇది మూర్ఛకాని మరణంబు కాదు= ఇతడు మూర్ఛిల్లాడు కాని చావలేదు; ఈ అవస్థన్ నాలుక కోసినన్+చచ్చున్= ఈ స్థితిలో నాలుక కోస్తే చస్తాడు; ఇతనిన్+ చంపుటకున్= ఇతడిని చంపటానికి; పార్థుండు ప్రతిన పట్టినవాఁడు= అర్జునుడు ప్రతిజ్ఞ చేశాడు; నీవు చంపినన్+అతండు నెవ్వగన్+పొందును+అనినన్= నీవు చంపితే ఆతడు బాధపడతాడు అనగా; ఆ+వీరుండు= భీముడు; విని; వీడు+ఇప్పుడు పాండవ+అగ్రజుని బాధించినన్= ఈ కర్ణుడు ధర్మరాజును బాధపెట్టినందుకు; క్రోధ+అంధుండను+ఐ= కోపంచేత గ్రుడ్డివాడనయి; అది మఱచితిన్+కాని= ఆ సంగతి మరచాను కాని; చావు కామియున్= ఇది మరణం కాదని; ఇట్టి ఎడన్ నాలుక కోయన్= మూర్ఛలో ఉండగా నాలుకను కోస్తే; తడవన్+చచ్చుటయున్+ఎఱుంగుదున్= వెంటనే చనిపోతాడని తెలుసు; ఈ+తెఱంగు= ఈ విషయం; నీవు తలఁపించి= నీవు గుర్తుచేసి; లెస్స చేసితి(వి)= మంచిపని చేశావు; ఈ+ దురాత్ముండు= కర్ణుడు; ద్రౌపదిన్+ఉద్దేశించి= ద్రౌపదిగురించి; సభలోనన్+అసభ్యంబులు+అగు మాటలు= సభలో అసభ్యమైన మాటలు; ఆడినన్= మాట్లాడగా; ఉద్దీపించిన కోపంబు= అధికమైన కోపం; అజాతశత్రునకున్+ప్రియంబుగాన్= ధర్మరాజుకు సంతోషం కలిగించాలని; అడంచికొని ఉండితి= అణచిపెట్టుకొని ఉన్నాను; నేఁడు తద్+వేదన వెలార్పన్+చూచితిన్= ఇపుడు ఆ కోపం బయలు వెడలించాలని చూచాను; అట్ల చేసితిన్+ఏనిన్= కోపంతో అతడిని చంపితే; మానధనుండు+అయిన, ధనంజయుండు= అభిమానవంతుడైన అర్జునుడు; తన చేసిన పూనిక= తాను చేసిన ప్రతిజ్ఞ; నెఱపన్+కాక= పూర్తిచేయలేక; మనంబునన్+కుంది, మడియున్= మనసులో వెతజెంది మరణిస్తాడు; కృష్ణయుధిష్ఠిరులున్= శ్రీకృష్ణ ధర్మజులు కూడా; ఆతనితోడివారు= అతనినే అనుసరిస్తారు; ఇంత ప్రమాదంబు= ఇంత ఆపద; నీవు కలిమిన్= నీవు ఉండటం చేత; తెలిసితిన్= తెలిసికొనగలిగాను; మేలు+అయ్యెన్= మేలు జరిగింది; మాతులా!= మామా!; నీ ఆజ్ఞ ఉల్లంఘింపను+అని పలికి, నిలిచెన్= నీ ఆజ్ఞ జవదాటను అని ఆగాడు; శల్యుండును, సంతసిల్లి= శల్యుడు కూడా సంతోషించి; తేరు తొలఁగించెన్+అనుటయున్= రథం తప్పించాడు అని చెప్పగా; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్+ఇట్లు+అనియెన్= సంజయుడితో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అప్పుడు భీముడు తన రథాన్ని కర్ణుడి రథానికి దగ్గరగా తెచ్చి, అతణ్ణి చూచి, 'ఈ నీచుడి నాలుక కోస్తా' అని అంటూ, కట్టి ఉన్న కత్తిని దూసి, అతడి రథం మీదికి వెళ్ళాలన్న ఉత్సాహంతో ఉండగా, శల్యుడు చూచి, భీముణ్ణి అడ్డుకొని 'ఇతడు (ఈ కర్ణుడు) మూర్ఛిల్లాడు గాని, మరణించలేదు. ఈ స్థితిలో ఇతడి నాలుకకోస్తే చస్తాడు. ఇతణ్ణి చంపటానికి పార్థుడు ప్రతిజ్ఞ చేశాడు. ఇప్పుడు నీవు చంపితే అతడు చాల బాధపడుతాడు' అనే సరికి, భీముడు 'వీడిప్పుడు ధర్మరాజును బాధించేసరికి ఆగ్రహావేశంతో అవివేకినై ఆ విషయం (అర్జునుని ప్రతిజ్ఞ విషయం) మరచాను. ఇది చావు కాదని, ఈ స్థితిలో నాలుక కోస్తే వెంటనే చస్తాడని తెలుసు. ఈ విషయాన్ని నీవు గుర్తుచేసి చాల మంచిపని చేశావు. ఈ దుర్మార్గుడు ఆనాటి కౌరవసభలో ద్రౌపదిని ఉద్దేశించి అసభ్యాలైన మాటలు మాట్లాడితే, ఆనాడు పెల్లుబికిన నా కోపాన్ని అన్నగారికి ప్రీతి కలిగించటానికై అణచుకొన్నాను. ఈ రోజు ఆ వేదన తీర్చుకోవాలని చూచాను. ఆ విధంగా చేస్తే అభిమానధనుడైన అర్జునుడు తన ప్రతిజ్ఞ నెరవేర్చుకోటానికి వీలుగాక, మనస్సులో దుఃఖించి మరణించి ఉండేవాడు. శ్రీకృష్ణ ధర్మజులు కూడ అతనితో పాటే మరణించేవారు. ఇంత ప్రమాదం నీవు ఉండటంవల్ల తెలుసుకొన్నాను. 'మామా! మేలైంది. నీ ఆజ్ఞ ఉల్లంఘించను' అని పలికి భీముడు ఆగాడు. శల్యుడు కూడ సంతోషించి తేరు ప్రక్కకు తప్పించాడు - అని చెప్పగా, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

క. 'పాండవుల నాజి నోర్చు ని । తం డని మీ రాజు సూతతనయునిఁ బొగడున్;
గం డడఁచె భీముఁ డిట్టి మ । గండుఁ గలఁడె? పిదప నెట్లు గయ్యము సెల్లెన్?' 215

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇతండు= కర్ణుడు; పాండవులన్+ఆజిన్+ఓర్చున్= పాండవులను యుద్ధంలో ఓడిస్తాడు; అని= అని; మీ రాజు= దుర్యోధనుడు; సూతతనయునిన్+పొగడున్= కర్ణుడిని పొగడుతుంటాడు; భీముఁడు; గండు+అడఁచెన్= గర్వం అణచాడు; ఇట్టి మగండున్+కలఁడె?= ఇటువంటి వీరుడు ఉన్నాడా?; పిదపన్+ఎట్లు కయ్యము చెల్లెన్?= తర్వాత యుద్ధం ఎట్లా కొనసాగింది?

తాత్పర్యం: 'పాండవులను యుద్ధంలో ఓడిస్తాడు అని దుర్యోధనుడు కర్ణుడిని గురించి గొప్పగా చెప్తుతుంటాడు. ఇపుడు భీముడు అతడి గర్వం అణచాడు. తర్వాత యుద్ధం ఎట్లా జరిగిందో చెప్పుము.

భీముఁడు శ్రుతవర్మాది కురుకుమారులఁ బెక్కంద్ర జంపుట (సం. 8-35-4)

వ. అనవుడు సంజయుం డాంబికేయున కిట్లను నట్లు బాధితుండయిన రాధేయుం గనుంగొని కురుపతి తమ్ములతో నిట్లను 'భీమసేనుచేత సూతసూనుండు గడు నొచ్చెం గావలయు వేగం బెయిదుఁ' డనుటయు శ్రుతవర్మాది కుమారులు గొందఱు పటుగతిం గవిసి యక్కౌంతేయుం జుట్టుముట్టిన నతండుఁ దదనుచరుల నేనూట యేఁబండ్రు వీర రథికులం బిలుకుమార్చి శ్రుతవర్మ శిరంబు భల్లంబునం ద్రుంచిన, నది ముఖకాంతి మెఱయం జంద్రమండలంబు మహికెఱఁగు తెఱంగు దోఁపం బడియెఁ; బటుబాణద్వయంబున వికటుని సముని బెట్టేసిన బెడిదంపు గాలిం దూలు తరువుల కరణి ధరణిం ద్రెళ్ళిరి; తదనంతరంబ తీవ్ర నారాచంబునఁ గ్రాథుం గూల్చి, నందోపనందుల నొక్కపెట్ట పెక్కమ్ములం బొరివుచ్చె నిట్లు నీ కొడుకు లార్వురుం దెగినఁ దక్కటి వారు వచ్చి దైన్యంబు నొందిన సైన్యంబు గలంగెఁ; నంతకుఁ దెప్పిఱి యెప్పటి బరవసంబు శోభిల్లం గర్ణుండు గడంగి డగ్గఱి. 216

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; సంజయుండు+ఆంబికేయునకున్+ఇట్లు+అనున్= సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా చెప్పసాగాడు; అట్లు= అట్లా; బాధితుండు+అయిన= బాధపెట్టబడిన; రాధేయున్+కనుంగొని= కర్ణుడిని జూచి; కురుపతి, తమ్ములతోన్+ఇట్లు+అనున్= దుర్యోధనుడు సోదరులతో ఇట్లా అన్నాడు; భీమసేనుచేతన్= భీముడిచే; సూతసూనుండు= కర్ణుడు; కడునొచ్చెన్+కావలయున్= ఎంతోబాధకు గురి అయ్యాడు కాబోలు; వేగంబు+ఎయిదుఁడు+అనుటయున్= వెంటనే అతడిని వెంబడించండి అనగా; శ్రుతవర్మ+ఆది కుమారులు= శ్రుతవర్మ మున్నగువారు; కొందఱు= కొంతమంది; పటుగతిన్+ కవిసి= బలంగా తాకి; ఆ+కౌంతేయున్+చుట్టుముట్టినన్= భీముడిని చుట్టుముట్టగా; అతండు= భీముడు; తద్+అనుచరులన్+ ఏనూట ఏబండ్రు వీరరథికులన్= అతని అనుచరులైన ఐదువందల యాభైమంది వీరులను; పిలుకుమార్చి= వధించి; శ్రుతవర్మ శిరంబు= శ్రుతవర్మ తలను; భల్లంబునన్+త్రుంచినన్= బల్లెంతో ఖండించగా; అది= ఆ శిరము; ముఖకాంతి మెఱయన్= ముఖకాంతి ప్రకాశించగా; చంద్రమండలంబు= చంద్రబింబం; మహికిన్ ఎఱఁగు, తెఱంగు= భూమికి నమస్కరించిన విధంగా; తోఁపన్+పడియెన్= అనిపించేటట్లు పడింది; పటుబాణద్వయంబునన్= రెండు వాడిబాణాలతో; వికటుని, సముని, బెట్టు+ఏసినన్= వికటుని సముడిని గట్టిగా కొట్టగా; బెడిదంపుగాలిన్+తూలు, తరువుల, కరణిన్= తీవ్రమైన గాలికి కూలిన చెట్లవలె; ధరణిన్+త్రెళ్ళిరి= భూమిమీద పడ్డారు; తదనంతరంబు+అ= తర్వాత; తీవ్ర నారాచంబునన్= వాడి బాణంతో; క్రాథున్+కూల్చి= క్రాథుడిని చంపి; నంద+ఉపనందులన్= నందుడిని ఉపనందుడిని; ఒక్కపెట్టన్= ఒక్కసారిగ; పెక్కు+ అమ్ములన్+పొరివుచ్చెన్= పెక్కుబాణాలు వేసి చంపాడు; ఇట్లు= ఈ విధంగా; నీ కొడుకులు+ఆర్వురున్+తెగినన్= నీ కొడుకులు ఆరుగురు చనిపోగా; తక్కటివారు వచ్చి దైన్యంబున్+ఒందినన్= మిగిలినవారు వచ్చి దీనస్థితి పొందగా; సైన్యంబు

కలంగెన్= కౌరవసైన్యం కలత చెందింది; కర్ణుండు= కర్ణుడు; అంతకున్+తెప్పిరి= అంతలోనే (మూర్ఛ) తేరుకొని; ఎప్పటి బరవసంబు శోభిల్లన్= మునుపటి ధైర్యం ఒప్పుగా; డగ్గఱి= సమీపించి; కడంగి= పూనుకొని.

తాత్పర్యం: అనగా సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. ఆ విధంగా బాధింపబడిన కర్ణుని చూచి దుర్యోధనుడు తమ్ముళ్ళతో ఇట్లా అన్నాడు. 'కర్ణుడు భీముడి చేత చాల దెబ్బ తిన్నట్లున్నాడు. వెంటనే అతడికి తోడ్పడండి అనగానే', శ్రుతవర్మ మొదలైన కురుకుమారులు కొందరు గట్టిగా భీమసేనుణ్ణి ఎదుర్కొన్నారు. భీముడు ఆ కురుకుమారుల అనుచరులను అయిదువందల యాభైమందిని చంపి, శ్రుతవర్మ శిరస్సును ఒక భల్లంతో త్రుంచగా, అది ప్రకాశిస్తున్న ముఖకాంతితో చంద్రమండలం భూమికి మ్రొక్కుతున్నదని అనిపించేటట్లుగ నేలమీద పడింది. వికటుడు, సముడు అనే వీరులను రెండు వాడిబాణాలతో కొట్టగా, వాళ్ళు పెనుగాలికి నేలకూలే చెట్లవలె పడిపోయారు. తరువాత ఒక తీవ్రమైన బాణంతో క్రాథుణ్ణి చంపాడు. పెక్కుబాణాలతో ఒక్కసారిగ నందోపనందుల్ని సంహరించాడు. ఈ విధంగా నీ కొడుకులు ఆరుగురు మరణించేసరికి, మిగిలినవారు వచ్చి దీనస్థితినొందగా, కౌరవసైన్యం కలత పొందింది. అంతలో కర్ణుడు మూర్ఛతేరుకొని, మునుపటి ధైర్యం మెరయగా, పూనిక వహించి దగ్గరికి వచ్చి ----

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, ఉపమ.

చ. **అనిలజుమీఁద నేయ నతఁ డా శరముల్ దునుమాడి సప్తకాం**
డ నిహతుఁజేసె నాతని దృఢప్రదరంబులఁ గప్పె; నాతఁడున్
వినుము సముజ్జ్వల ప్రదర విద్ధునిఁగా నొనరించి యమ్మరు
త్తనయుఁడు పేర్చి యార్వ వసుధావర! యా రథికుం డుదగ్రుఁడై. **217**

ప్రతిపదార్థం: అనిలజు మీఁదన్+ఏయన్= భీముడిమీద (బాణాలు) వేయగా; అతఁడు+ఆ, శరముల్, తునుము+ఆడి= అతడు ఆ బాణాలను ఖండించి; సప్తకాండ నిహతున్+చేసెన్= ఏడుబాణాలతో గాయపరచాడు; ఆతఁడున్= కర్ణుడును; ఆతనిని= భీముడిని; దృఢప్రదరంబులన్+కప్పెన్= పటువైన బాణాలతో కొట్టాడు; వసుధావర!= రాజా!; వినుము; ఆ+మరుత్+తనయుఁడు= భీముడు; సముజ్జ్వల, ప్రదర, విద్ధునిన్+కాన్+ఒనరించి= కాంతిమయములైన బాణములచేత కొట్టబడిన వానినిగా చేసి; పేర్చి ఆర్వన్= విజృంభించి అరవగా; ఆ రథికుండు+ఉదగ్రుఁడు+అయి= కర్ణుడు కోపించినవాడై.

తాత్పర్యం: కర్ణుడు భీముడిపై బాణాలు వేయగా, అతడు వాటిని ఖండించి, ఏడు బాణాలు ప్రయోగించి కర్ణుని గాయపరిచాడు. కర్ణుడు మళ్ళీ అతడిని బలమైన బాణాలతో కప్పగా, భీముడు అతడిపై కాంతిమంతమైన బాణాలు ప్రయోగించి పెద్దగా అరిచాడు. ధృతరాష్ట్ర మహారాజా! వినుము. అప్పుడు కర్ణుడు ఆగ్రహించి.

మ. **పది బాణంబుల నొంచి విల్లు దునుమం బ్రస్ఫీత దీప్త్యుజ్జ్వల**
ద్గద వైచెం బవనాత్మజుం దది యెడన్ ఖండించె; నవ్వీరుఁ డు
న్మదుఁడై పాండవుఁ డొండు విల్లు గొని నానాకంకపత్రంబులం
బొదువం గర్ణుఁడు నొంచెఁ దత్తను వతిస్ఫూర్జద్దశాస్త్రంబులన్. **218**

ప్రతిపదార్థం: పదిబాణంబులన్ నొంచి= పదిబాణాలతో నొప్పించి; విల్లు తునుమన్= ధనువును త్రుంచగా; పవన+ఆత్మజుండు= భీముడు; ప్రస్ఫీతదీప్తి+ఉజ్జ్వలత్+గద వైచెన్= మిక్కిలి ఎక్కువ కాంతితో ప్రకాశించే గదను వేశాడు; ఆ+వీరుఁడు= కర్ణుడు; అది ఎడన్ ఖండించెన్= దానిని దూరంలోనే త్రుంచాడు; ఉన్మదుఁడు+ఐ పాండవుఁడు= గర్వితుడై భీముడు; ఒండు, విల్లు, కొని= వేరొక విల్లు గైకొని; నానా కంకపత్రంబులన్+పొదువన్= వివిధ బాణాలు వేయగా; కర్ణుఁడు, అతి స్ఫూర్జత్+దశ+అస్త్రంబులన్= మిక్కిలి ప్రకాశించే పది అస్త్రాలతో; తద్+తనువున్ నొంచెన్= భీముడి దేహాన్ని నొప్పించాడు.

తాత్పర్యం: కర్ణుడు భీముడిపై పదిబాణాలు వేసి ధనుస్సు ఖండించగా, భీముడు అతడిపై మిక్కిలి కాంతితో ప్రకాశించే గదను వేశాడు. కర్ణుడు దానిని ఖండించగా, భీముడు వేరొక ధనువు తీసికొని వివిధ బాణాలు వేశాడు. అప్పుడు కర్ణుడు ప్రకాశమానమైన పది అస్త్రాలను అతడిపై ప్రయోగించాడు.

వ. దానం గోపించి. 219

తాత్పర్యం: దానికి కోపించి.

చ. పటుతరమైన నారసము పాండునృపాత్మజుఁ డుగ్రుఁడై యుర
స్తటమున బెట్టు గ్రువ్వ బెడిదం బయి వీఁపున నుచ్చి పోవ ను
త్కట ధరణీ ప్రకంప చలితం బగు శైలముఁ బోలి తాల్మి మి
క్కుటముగ రోష రంజిత ముఖుం డయి కర్ణుఁడు ఘూర్ణితాకృతిన్. 220

ప్రతిపదార్థం: పాండునృప+ఆత్మజుఁడు= భీముడు; ఉగ్రుడు+ఐ= కోపించి; పటుతరము+ఐన= వాడి అయిన; నారసము= బాణం; ఉరః+తటమునన్ బెట్టు క్రువ్వన్= వక్షఃస్థలాన గాఢంగా నాటగా; బెడిదంబు+అయి వీఁపునన్+ఉచ్చిపోవన్= కఠినంగా వీపులో గుచ్చుకొనిపోగా; కర్ణుఁడు; ఉత్కట, ధరణీ, ప్రకంప చలితంబు+అగు శైలమున్ పోలి= తీవ్ర భూకంపానికి కంపించిన పర్వతంవలె; ఘూర్ణిత+ఆకృతిన్= తిరుగుడు పడిన ఆకారంతో; తాల్మి మిక్కుటముగన్= హెచ్చిన ధైర్యంతో; రోషరంజిత ముఖుండు+అయి= క్రోధంతో ఎర్రబడిన ముఖం కలవాడై.

తాత్పర్యం: భీముడు క్రోధంతో కర్ణుడి వక్షంలో వాణిబాణం నాటగా అది వీపులో నుండి వెడలగా, అతడు తీవ్ర భూ కంపానికి చలించిన పర్వతంవలె గోచరిస్తూ క్రోధంతో ఎర్రబడిన ముఖం కలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

చ. రయమునఁ బంచవింశతి శరంబులు మేన నిగిడ్చి భల్ల సం
చయహతి విల్లు సక్కడిచి సస్మిత వక్త్ర సహస్ర పత్రల
క్ష్మియతిశయిల్ల రథ్యములఁ జెండిన మారుతి యేచి విద్విష
ద్భయద గదారుచి స్ఫురిత బాహువిలాస విభాసమానుఁడై. 221

ప్రతిపదార్థం: రయమునన్= వేగంగా; పంచవింశతి శరంబులు= ఇరవైఐదు బాణాలు; మేనన్, నిగిడ్చి= భీముడి దేహంపై వేసి; భల్లసంచయహతిన్= బల్లెముల సమూహాల దెబ్బతో; విల్లుచక్కడిచి= విల్లును విరిచి; సస్మిత= చిరునవ్వుతో కూడిన;

వక్త్ర సహస్ర పత్ర లక్ష్మి అతిశయిల్లన్= ముఖపద్మంయొక్క కాంతి అధికంకాగా; రథ్యములన్+చెండినన్= గుర్రాలను కూల్చగా; మారుతి= భీముడు; ఏచి= విజృంభించి; విద్విషత్+భయద= శత్రుభయంకరమైన; గదారుచి, స్ఫురిత= గదకాంతిచేత ప్రకాశిస్తున్న; బాహు విలాస విభాసమానుఁడు+ఐ= భుజవిలాసంయొక్క ప్రకాశం కలవాడై.

తాత్పర్యం: కర్ణుడు వేగంగా దేహంపై ఇరవైఅయిదు బాణాలు వేసి, బల్లెములతో విల్లును తునిమి, చిరునవ్వుతో ముఖపద్మకాంతి అతిశయిల్లగా గుర్రాలను చంపగా, భీముడు అరిభయంకరమైన గదతో కూడిన బాహువిలాస ప్రకాశం కలవాడై.

వ. **అరదంబు డిగ్గనుఱికి కర్ణుని దెసం గవియం గురుపతి సేనం గల యేనుంగులం బదియేడింటిం బురికొల్పిన నవి దివాకరుఁ బొదువు నంబుదంబుల చందంబున నా జెట్టిమగనిం గిట్టిన, నతండు జోదులతోడంగూడ నగ్గజంబులఁ జదుపుటయు, సౌబలుని ఘోటకంబు లాటోపంబున మూఁడువే లొక్కట నురవడించిన వాని ప్రాపున నరదంబులుం గాలు బలంబులుం గవిసి కూడికొని పొదివిన మదం బొదవి యమ్మహాబలనందనుండు దారుణ రణ విహారంబున నొండొండ పేర్చిన, యబ్బలం బుజ్జ్వలానలంబున వైచిన చర్మంబు చాడ్పున ముడింగి యొదిగె; నప్పు డా శకుని యోధులు పంచ శత రథికులు రభసంబున నడరిన వారల సూతాశ్వ కేతు స్యందన సమేతంబుగా నటిముటి నుఱుమాడి యగ్గలిక మెఱసినం గని యగ్గాంధారరాజు పనుపం గడంగిన యవన దేశీయులగు నాశ్వికులం ద్రిసహస్ర సంఖ్యుల నవ్వడముడి పొడిసేయు చప్పుళ్ళు గార్చిచ్చు వెదురుటడవి నేర్చు తెఱంగునం దోఁచె; నిట్లు గదపండువు సేసి యొండురథం బెక్కి యక్కౌంతేయుండు భండనంబు సేయ, రాధేయుండు పాండవేయాగ్రజుం దాకి తీవ్ర ప్రకాండంబుల గప్పి సారథి సమయించినఁ దేరు తురంగంబులు దొలంగ నీడ్చికొని పాఱిన, వెనుకొను నయ్యంగపతిం గనుంగొని.** **222**

ప్రతిపదార్థం: అరదంబు, డిగ్గన్+ఉరికి= రథము దిగి పరుగెత్తి; కర్ణుని దెసన్+కవియన్= కర్ణుడివైపు విజృంభించగా; కురుపతి= దుర్యోధనుడు; సేనన్+కల= కౌరవసైన్యంలో ఉన్న; ఏనుంగులన్+పది ఏడింటిన్+పురికొల్పినన్= పదిహేడు ఏనుగులను పురికొల్పగా; అవి= ఆ ఏనుగులు; దివాకరున్+పొదువు= సూర్యుడిని కప్పే; అంబుదంబుల చందంబునన్= మబ్బులవలె; ఆ జెట్టి మగనిన్+కిట్టినన్= ఆ బలశాలిని చుట్టుముట్టగా; అతండు= భీముడు; జోదుల తోడన్+కూడన్= యోధులతో సహా; ఆ+గజంబులన్+చదుపుటయున్= ఆ గజాలను చంపగా; సౌబలుని, ఘోటకంబులు= శకుని గుర్రాలు; మూడువేలు= మూడువేలు; ఆటోపంబునన్= అతిశయంతో; ఒక్కటన్+ఉరవడించినన్= ఒక్కుమ్మడి విజృంభించగా; వాని ప్రాపునన్= వాటి అండలో; అరదంబులున్+ కాలుబలంబులున్= రథాలు, పదాతిసైన్యాలు; కవిసి కూడికొని పొదిలిన= కూడి చుట్టుముట్టగా; ఆ+మహాబలనందనుండు= భీముడు; మదంబు+ఒదవి= గర్వంతో; దారుణ, రణ, విహారంబునన్= భయంకరమైన యుద్ధవిహారం చేస్తూ; ఒండొండ పేర్చినన్= అంతకంతకు విజృంభించగా; ఉజ్జ్వల+అనలంబునన్= మీది కెగసి మండుతున్న అగ్నిలో; వైచిన చర్మంబు చాడ్పునన్= వేసిన చర్మంవలె; ఆ+బలంబు= ఆ సేన; ముడింగి+ఒదిగెన్= తగ్గి నశించింది; అప్పుడు; ఆ శకుని యోధులు= శకుని సైనికులు; పంచశత, రథికులు= ఐదువందలమంది వీరులు; రభసంబునన్+అడరినన్= వేగంగా వచ్చిపడగా; వారలన్= వారందరినీ; సూత+అశ్వ, కేతు, స్యందన సమేతంబుగాన్= సారథులతో, గుర్రాలతో, ధ్వజాలతో, రథాలతో కూడ; అటిముటి నుఱుము+ఆడి= సంభ్రమంతో చంపి; అగ్గలికన్, మెఱసినన్+కని= గర్వంతో ప్రకాశించగా చూచి; ఆ+గాంధారరాజు= శకుని; పనుపన్+కడంగిన= పంపగా యుద్ధానికి పూనుకొన్న; యవనదేశీయులు+అగు+ ఆశ్వికులన్+త్రిసహస్ర సంఖ్యులన్= యవన దేశ ఆశ్వికులు మూడువేలమందిని; ఆ+వడముడి= ఆ భీముడు; పొడిచేయు

చప్పుళ్ళు= నుగ్గు చేయగా కలిగిన ధ్వనులు; కారు+చిచ్చు= దావాగ్ని; వెదురు+అడవిన్= వెదురుచెట్లతో నిండిన అడవిని; ఏర్చు తెఱఁగునన్+తోఁచెన్= దహించే విధంగా గోచరించింది; ఇట్లు= ఈ విధంగా; ఆ+కౌంతేయుఁడు= భీముడు; గదపండువు చేసి= గదకు పండుగచేసి; ఒండు రథంబు+ఎక్కి= వేరొక రథం ఆరోహించి; భండనంబు చేయన్= యుద్ధం చేయగా; రాధేయుండు= కర్ణుడు; పాండవేయ+అగ్రజున్+తాఁకి= ధర్మరాజును తాకి; తీవ్ర ప్రకాండంబులన్+కప్పి= వాడి బాణాలతో కప్పి; సారథిన్+సమయించినన్= సారథిని చంపగా; తేరు= రథం; తురంగంబులు+తొలంగన్= గుర్రాలు తొలగిపోగా; ఈడ్చికొని పాటినన్= ఈడ్చుకొంటూ వెళ్ళగా; వెనుకొను= వెంబడించిన; ఆ+అంగపతిన్+కనుంగొని= ఆ కర్ణుడిని చూచి.

తాత్పర్యం: రథం దిగి పరుగెత్తి కర్ణుడివైపు విజృంభించగా, దుర్యోధనుడు కౌరవసైన్యంలో ఉన్న పదిహేడు ఏనుగులను పురికొల్పాడు. అవి సూర్యుణ్ణి కప్పే మబ్బులవలె ఆ బలశాలి భీముణ్ణి ఎదుర్కొన్నాయి. అప్పుడతడు వాటిమీద ఉన్న వీరులతో సహా ఆ యేనుగులను చంపివేశాడు. శకుని గుర్రాలు మూడువేలు ఒక్కుమ్మడి వేగంగా విజృంభించగా, వాటి అండలో రథాలు, పదాతిసైన్యాలు కూడుకొని చుట్టుముట్టగా, ఆ వాయువుపుత్రుడైన భీముడు గర్వంతో మహాభయంకరంగా వీరవిహారం చేస్తూ, అంతకంతకు విజృంభించగా - మీదికెగసి మండుతున్న అగ్నిలో వేసిన చర్మంవలె ఆ సేన తగ్గి తగ్గి నశించింది. అప్పుడు శకుని సైనికులు, అయిదువందలమంది రథికులు వేగంగా వచ్చి మీద పడగా, వాళ్ళందరిని సారథులతో, గుర్రాలతో, ధ్వజాలతో, రథాలతో సహా త్వరత్వరగ చంపి గర్వంతో ప్రకాశించాడు. అది చూచి శకుని మళ్ళీ మూడువేలమంది యవనదేశీయులైన ఆశ్వికులను పంపగా, వాళ్ళను పొడిచేశాడు. ఆ చప్పుళ్ళు-వెదుళ్ళ అడవిని దావాగ్ని దహిస్తున్నట్లు అనిపించే విధంగా ఉన్నాయి. ఈ విధంగా భీముడు తన గదకు పండుగ చేసి వేరొక రథం ఎక్కి యుద్ధం చేయగా, కర్ణుడు ధర్మరాజును ఎదుర్కొని వాడి బాణాలతో కప్పి, అతడి సారథిని చంపగా, గుర్రాలు రథాన్ని ప్రక్కకు ఈడ్చుకొని వెళ్ళాయి. అయినా ధర్మరాజును వెంటాడుతున్న ఆ కర్ణుణ్ణి చూచి -

విశేషం: అలం: ఉపమ. 'గదపండువు సేసి' జాతీయం.

ఉ. **భీముఁ డదల్చుచున్ రథము భీమగతిం గవియింప నాతఁ డు**
ద్దామత మాఱుకొన్న వివిధ స్ఫుర దస్త్ర పరంపరాద్వయ
శ్రీ మొన లప్పు డచ్చెరువుఁ జెంది నుతించె మురాంతకానుజుం
డా మరుదాత్మజుం గడచి యంగపతిన్ వెసఁ దాఁకెఁ; దాఁకినన్. **223**

ప్రతిపదార్థం: భీముఁడు; రథము+అదల్చుచున్= రథాన్ని తోలుకొంటూ; భీమగతిన్+కవియింపన్= భయం గొలిపే విధంగా రాగా; ఆతఁడు+ఉద్దామతన్ మాఱుకొన్నన్= కర్ణుడు తీవ్రంగా ఎదుర్కొనగా; వివిధ= అనేక; స్ఫురత్+అస్త్ర పరంపరా= కాంతిమంతములైన అస్త్ర సమూహాలతో కూడిన; ద్వయశ్రీ మొనలు= రెండు పక్షాల సేనలు; అచ్చెరువున్+చెంది నుతించెన్= ఆశ్చర్యపడి ప్రశంసించాయి; ముర+అంతక+అనుజుండు= శ్రీకృష్ణుడి సోదరుడు (సాత్యకి); ఆ మరుత్+ఆత్మజున్+కడచి= భీముడిని దాటి; అంగపతిన్ వెసన్+తాఁకెన్= కర్ణుడిని వెంటనే తాకాడు; తాఁకినన్= ఢీకొనగా.

తాత్పర్యం: భీముడు రథాన్ని అదల్చి భయంకరంగా పరాక్రమించి రాగా, కర్ణుడు అతడిని ఎదుర్కొన్నాడు. అది చూచి ఇరుపక్షాల సేనలూ కొనియాడాయి. అప్పుడు సాత్యకి భీముడిని దాటి కర్ణుడిని ఎదుర్కొన్నాడు. అప్పుడు.

క. ఆ యిరువురు నిబిడ కన । త్సాయక పటలములు నిగుడ సరి మధ్యాహ్న
స్సాయత్త్వ భాఢ్యుఁ డయ్యుం । దోయజబాంధవుఁడు మింటఁ దోఁపక యుండెన్. 224

ప్రతిపదార్థం: ఆ ఇరువురు= వారిద్దరియొక్క; నిబిడ, కనత్+సాయకపటలములు= దట్టమైన కాంతిమయ బాణసమూహాలు; నిగుడన్= వ్యాపించగా; సరి= సరిగా; మధ్యాహ్నస్సాయత్+ప్రభా+ఆఢ్యుఁడు అయ్యున్= మధ్యాహ్న కాలంలోవిస్తృతకాంతితో కూడుకొన్నవాడైనా; తోయజ బాంధవుఁడు= పద్మాలకు బంధువైన సూర్యుడు; మింటన్+తోఁపక+ఉండెన్= ఆకాశంలో కనిపించలేదు.

తాత్పర్యం: ఆ యిద్దరు దట్టంగా కురిపించిన బాణాల గుంపులు వ్యాపించేసరికి, విస్తృతకాంతితో వెలిగే మధ్యాహ్న సూర్యుడు కూడా ఆకాశంలో అగుపించలేదు.

వ. వా రొండొరుల శరపరంపర లడఁగించి రా సమయంబున. 225

ప్రతిపదార్థం: వారు+ఒండు+ఒరుల= వారు ఒకరు మరొకరి; శరపరంపరలు+అడఁగించిరి= బాణాల సమూహాలను నశింపజేశారు; ఆ సమయంబునన్= అప్పుడు

తాత్పర్యం: వారిద్దరూ ఒకరు మరొకరి బాణసమూహాలను అణచారు. అప్పుడు.

చ. తన కరముల్ నిగిడ్చి యుచితంబుమెయిం గొనియాడి యంతటం
దనియక లీలఁ జేరి సముదంబుగఁ బద్మినిఁ బొందె భాస్కరుం
డనుటకుఁ దావలం బయి జనాధిప! చూడ శమంతపంచకం
బున విరిదమ్మి తేనియలఁ బొల్పెసఁగెం బ్రతిబింబ మెంతయున్. 226

ప్రతిపదార్థం: జనాధిప!= రాజా!; భాస్కరుఁడు= సూర్యుడు; తన కరముల్ నిగిడ్చి= తన కిరణాలు ప్రసరింపజేసి; ఉచితంబు మెయిన్= తగినవిధంగా; కొనియాడి= పొగడి; అంతటన్+తనియక= దానితో తృప్తిచెందక; లీలన్+చేరి= విలాసంగా తాకి; సముదంబుగన్= ఆనందంతో; పద్మినిన్+పొందెన్= పద్మలతను పొందాడు; అనుటకున్+తావలంబు+అయి= అనటానికి నిదర్శనంగా; శమంత పంచకంబునన్= (కురుక్షేత్రంలోని)శమంతములనే ఐదు మడుగుల్లో; చూడన్= చూడగా; విరితమ్మి తేనియలన్= పద్మాల మకరందంలో; ప్రతిబింబము= ఆ సూర్యుడి ప్రతిబింబం; ఎంతయున్+పొల్పు+ఎసఁగెన్= ఎంతో అందంగా గోచరించింది.

తాత్పర్యం: సూర్యుడు తన కరాలు సాచి తగువిధంగా కొనియాడి, అంతటితో తృప్తిచెందక, విలాసంగా దగ్గరకు చేరి ఆనందంగా పద్మాలను పొందాడనటానికి నిదర్శనంగా - శమంతపంచకంలోని పద్మాల తేనియల్లో ఆయన ప్రతిబింబం అందంగా ప్రకాశించింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. రణరంగాన్ని భీమాభిరామంగా (బీభత్సంలో సౌందర్యం) వర్ణించటం తిక్కన విశిష్టత. పరశురాముడు క్షత్రియసంహారం చేసి వారి రక్తాన్ని ఐదు మడుగులుగా చేశాడు. ఆ ప్రాంతాన్ని శమంతపంచకం అంటారు. కురుపాండవులు యుద్ధం చేసిన ప్రదేశం కాబట్టి కురుక్షేత్రం అయింది. ఇక్కడ 'శమంతపంచకం' శబ్దం సాభిప్రాయంగా ఉన్నది.

వ. అప్పుడు కృప సౌబల కృతవర్మాశ్వత్థామల యుద్దామ సాహాయ్యంబున సమధికోత్సాహుం డగు నా సూత నందనుని సంరంభంబునం గౌరవానీకంబు దర్పోద్రేకంబునం గడంగినం బాండవబలంబునుం బొంగె; నివ్విధంబున నిరువాఁగును గలయన్ బెరసిన నార్పుల నదల్పులం బొగడుటలం దెగడుటల నెసఁగు నులివు తూర్య రవంబుల గెలువ నమ్మేదిని నెత్తుటన్ జొత్తిల్లి కెంజాయ రంజిల్లు పుట్టంబు ముసుంగు వెట్టిన యంగన చందంబు నొందె; మస్తక ప్రముఖావయవంబులును గోదండాద్యాయుధంబులును మకుట ప్రభృతి భూషణంబులును నాతపత్ర ధ్వజ చామరంబులుం దునిసిపడి భీమాభిరామంబులుగాఁ గరిహయనర సమూహంబులు రక్తసిక్తంబు లైన నకాలబాలాతపలీల యావహిల్లం దక్కిన సేనాంగంబుల మిగిలిన మాతంగంబులు పెనంగిన కనకలిప్తకాండంబు లూఁదికొనం దాఁకిన నెరగళ్ళు పోవు కొండల కైవడిం బొలుచునవియును నస్త్రశస్త్ర పాతంబులం గ్రమ్ము రుధిరమ్ముల గైరిక నిర్ఝరంబులతోడి ధరాధరంబుల ననుకరించునవియును మెయిమఱువు లఱువు బళ్ళె నానానిశిత శరంబులు నోనాటినం జేష్టలు దక్కిటెక్కలు దెగియున్న శైలంబులం బోలునవియును నగుచుండఁ జెలంగి చతురంగంబులును బెరయఁ బెనంగు నుల్లాసంబున శోణితం బడంగ మట్టవిసి రేణువు లెగసినం జూడ్కులు నిగుడకున్ననుం దఱియ నుఱికి నిజాభిధానంబులను జననీ జనక నామంబుల బిరుదాంకంబులం దమ్మెఱింగించికొనుచు వీరుల పోరు చక్కటికిం జొచ్చి ప్రాపై పేరువాడు తదీయ బంధుమిత్రులం బొగడు నమరుల యెలుంగులు నింగినిండం బెల్లుదొరఁగు కీలాలం బా ధూళి నడంచిన కొలఁది నిలువక యేఱులయి పాఱ నుబ్బి భూత బేతాళ క్రవ్యాదంబు లోలలాడుచుం ద్రావుచు మదించి నృత్తంబులు సేయ నంబరంబున నట్టలాడ వెక్కసపాటొనర్పంజాలు నా సమయంబున మనంబు లెప్పటి తమకంబున ననిం దనివిసనమిం గవిసి కయ్యంబు సేయు సైనికోత్తముల సింహనాదంబులు దిక్కులం బిక్కటిల్ల నా కలని కెలన నటమున్న తన్నుఁ బొదివిన త్రిగర్త కోసల నారాయణ గోపాల బలంబుల నబ్బలసూదనసూనుండు గాండీవారావం బాకసంబు వగిలింప నొప్పించి. 227

ప్రతిపదార్థం: అప్పుడు; కృపసౌబల కృతవర్మ+అశ్వత్థామల= కృపుడు, శకుని, కృతవర్మ, అశ్వత్థామల; ఉద్దామ సాహాయ్యంబునన్= గొప్ప సహాయంతో; సమధిక+ఉత్సాహుండు+అగు= అధికమైన ఉత్సాహం పొందినవాడైన; ఆ సూతనందనుడి సంరంభంబునన్= ఆ కర్ణుడి ఆటోపంవలన; కౌరవ+అనీకంబు= కౌరవసేన; దర్ప+ఉద్రేకంబునన్+కడంగినన్= గర్వంయొక్క ఆవేశంతో పూనుకోగా; పాండవ బలంబునున్+పొంగెన్= పాండవసేన కూడా ఉప్పొంగింది; ఈ విధంబునన్= ఈ విధంగా; ఇరువాఁగును= రెండుపక్షాలూ; కలయన్= కలయగా-కలియబడగా; బెరసిన= వ్యాపించిన; ఆర్పులన్= అరుపులతో; అదల్పులన్= అదలింపులతో; పొగడుటలన్+తెగడుటలన్= పొగడ్తలతో, నిందలతో; ఎసఁగు= ఒప్పు; ఉలివు= ధ్వని; తూర్య రవంబుల గెలువన్= మ్రోగుతున్న యుద్ధవాద్యధ్వనులను మించగా; ఆ+మేదిని= ఆ యుద్ధభూమి; నెత్తుటన్ జొత్తిల్లి= నెత్తుటితో ఎఱ్ఱపడి; కెంజాయ రంజిల్లు పుట్టంబు= ఎరుపురంగుతో ముచ్చటగొలిపే వస్త్రాన్ని; ముసుంగు+పెట్టిన= ముసుగు వేసుకొన్న; అంగన, చందంబున్+ఒందెన్= స్త్రీ రూపాన్ని పొందింది. మస్తక ప్రముఖ+అవయవంబులును= తలలు మొదలైన అవయవాలు; కోదండ+ఆది+ఆయుధంబులును= ధనుస్సులు మొదలైన ఆయుధాలు; మకుట, ప్రభృతి, భూషణంబులునున్= కిరీటం మొదలగు ఆభరణాలు; ఆతపత్ర, ధ్వజ, చామరంబులున్= గొడుగులు ధ్వజాలు వింజామరలు; తునిసిపడి= తెగిపడి; భీమ+అభిరామంబులుగాన్= భయంకర రమ్యంగా; కరి, హయ, నర, సమూహంబులు= గజ అశ్వ పదాతులు; రక్తసిక్తంబులు+

ఐనన్= రక్తమయములు కాగా; అకాలబాల+ఆతపలీల+ఆవహిల్లన్= అకాలంలో ప్రకాశించే లేయెండవలె ఒప్పగా; తక్కినసేనా+ అంగంబులన్= మిగతా సేనావిభాగాలలో; మిగిలిన మాతంగంబులు= మిగిలిన ఏనుగులు; పెనంగిన= పోరగా; కనక, లిప్త, కాండంబులు= బంగారుపూతగల బాణాలు; ఊఁదికొనన్+తాఁకినన్= గట్టిగా తాకగా; ఎరగళ్ళుపోవు= కార్చిచ్చు అంటుకొన్న; కొండల కైవడిన్+పొలుచునవియును= పర్వతాలవలె గోచరించునవి; అస్త్రశస్త్ర పాతంబులన్= అస్త్రశస్త్రాల పాటులచే; క్రమ్మ, రుధిరమ్ములు= పెల్లుబుకు రక్తాలతో; గైరిక, నిర్ఝరంబులతోడి= ఎర్రని గైరిక ధాతు ప్రవాహాలతో కూడిన; ధరాధరంబులను+ అనుకరించునవియును= పర్వతాలవలె కనిపించేవి; మెయిమఱువులు= కవచాలు; అఱువుళ్ళు+ఐ= శిథిలములై - ముక్కలై; నానా, నిశిత, శరంబులు, నోనాటినన్= వివిధములైన వాడిబాణాలు నాటగా; చేష్టలుదక్కి= నిశ్చేష్టములై; ఱెక్కలు తెగిఉన్న శైలంబులన్= రెక్కలు తెగిన పర్వతాలను; పోలునవియునున్+అగుచుండన్= పోలునట్టివి అగుచుండగా; చతుః+అంగంబులును= రథ గజ తురగ పదాతులు; చెలంగి= చెలరేగి; బెరయన్+పెనంగు+ఉల్లాసంబునన్= కలియబడి పోరుతున్న ఉత్సాహంలో; శోణితంబు+అడంగ= రక్తం అణిగేటట్లుగా; మట్టు+అనిసి= అతిక్రమించి; రేణువులు+ఎగసినన్= ధూళి వ్యాపించగా; చూడ్కులు నిగుడకున్ననున్= కళ్ళు కనిపించకపోయినా; దరియన్+ఉఱికి= దగ్గరగా వెళ్ళి; నిజ+ఆభిధానంబులను= తమ పేర్లను; జననీ జనకనామంబులన్= తల్లిదండ్రుల పేర్లను; బిరుద+అంకంబులన్= బిరుదుల చిహ్నాలను చెప్పి; తమ్ము+ఎఱింగించికొనుచున్= తమను తెలుపుకొంటూ; వీరులపోరు చక్కటికిన్= వీరులు యుద్ధంచేసే చోటికి; చొచ్చి= చొచ్చుకొనివెళ్ళి; ప్రాపు+అయి= అండగా ఉండి; పేరువాడు= పేరుకెక్కిన-ప్రసిద్ధిపొందిన; తదీయ బంధుమిత్రులన్+పొగడు= వారి బంధుమిత్రులను కొనియాడు; ఆమరుల ఎలుంగులు= దేవతల కంఠధ్వనులు; నింగి నిండన్= గగనభాగంలో వ్యాపించగా; పెల్లుతొరఁగు, కీలాలంబు= హెచ్చుగా కారుతున్న రక్తం; ఆ ధూళిన్+అడంచిన కొలఁది= ఆ దుమ్మును అణచినప్పటికీ; నిలువక, ఏరులై పాఱన్= ఆగక నదులై పారగా; ఉబ్బి= పొంగి; భూతబేతాళ క్రవ్యాదులు= భూత బేతాళ రాక్షసులు; ఓలలాడుచున్+త్రావుచున్= (ప్రవాహంలో) మునిగి త్రాగుతూ; మదించి నృత్తంబులు సేయన్= మత్తిల్లి నాట్యం చేయగా; అంబరంబునను+అట్టలాడన్= ఆకాశంలో మొండెములు ఆడగా; వెక్కసపాటు+ఒనర్పన్+చాలు= వెగటు కలిగించే; ఆ సమయంబున= ఆ సమయంలో; మనంబులు= మనసులు; ఎప్పటి, తమకంబునన్= ఎప్పటివలే ఉరకలేస్తూ; అనిన్+తనివిచనమిన్= యుద్ధంలో తృప్తి తీరకపోగా; కవిసి కయ్యంబు చేయు= తాకి యుద్ధం చేసే; సైనిక+ఉత్తములు= వీరశ్రేష్ఠుల; సింహనాదంబులు= అరపులు; దిక్కులన్+పిక్కటిల్లన్= దిశలందు వ్యాపించగా; ఆ కలనికెలనన్= ఆ యుద్ధభూమి సమీపంలో; అటమున్న= అంతకుముందే; తన్నున్+పొదివిన= తన్ను చుట్టిముట్టిన; త్రిగర్తకోసల నారాయణ గోపాలబలంబులను= త్రిగర్త కోసలదేశ నారాయణ గోపాల సేనలను; ఆ+ బలసూదన సూనుండు= అర్జునుడు; గాండీవ+ఆరావంబు= తన వింటినారి ధ్వని; ఆకసంబు పగిలింపన్= ఆకాశం బద్దలగునట్లుగా; నొప్పించి= వారికి బాధ కలిగించి.

తాత్పర్యం: అప్పుడు కృపశకుని కృతవర్మాశ్వత్థామల తోడ్పాటుతో, అధికోత్సాహం పొందిన ఆ కర్ణుడి విజృంభణం వల్ల కౌరవసేన గర్వావేశంతో యుద్ధానికి పూనుకొన్నది. అప్పుడు పాండవసేన కూడ గొప్పగ ఉప్పొంగింది. ఈ విధంగా ఇరుపక్షాలు ఎదుర్కోగా - అరుపులతో, అదలింపులతో, పొగడ్తలతో, తెగడ్తలతో చెలరేగిన శబ్దం, యుద్ధవాద్యాల శబ్దాన్ని మించింది. యుద్ధభూమి నెత్తుటితో ఎర్రబడి, ఎరుపురంగుతో శోభిల్లే వస్త్రాన్ని ముసుగుగా వేసుకొన్న స్త్రీవలె ఉంది. తలలు మొదలైన ముఖ్యావయవాలు, ధనుస్సులు మొదలైన ఆయుధాలు, కిరీటాలు మొదలైన ఆభరణాలు, గొడుగులు, ధ్వజాలు, వింజామరలు విరిగిపడి భయంకర రమ్యాలయ్యాయి. గజాశ్వపదాతి సమూహాలు రక్తమయాలయ్యేసరికి అకాలంలో లేయెండ ఉన్నట్లుంది. అప్పుడు తక్కిన సేనావిభాగాల్లో మిగిలిన ఏనుగులు పోరాడాయి. వాటికి బంగారుపూతగల బాణాలు గట్టిగా నాటుకొనేసరికి అవి కార్చిచ్చు అంటుకొన్న కొండల్లా- శస్త్రాస్త్రాల దెబ్బలకు పెల్లుబికిన రక్తధారలతో గైరికధాతు ప్రవాహాలతో కూడిన పర్వతాల్లా - కవచాలు ముక్కలై నానావిధాలైన వాడిబాణాలు నొప్పి కలిగేటట్లు నాటుకోవటం వల్ల చేష్టలుడిగి రెక్కలు తెగిన పర్వతాల్లా అయ్యాయి.

చెలరేగి చతురంగబలాలు కలియబడి పోరుతున్న ఉత్సాహంలో - రక్తాన్ని అణిగించి అతిశయిల్లిన ధూళి వ్యాపించే సరికి కళ్ళు కన్పించకపోగా, పరుగెత్తి దగ్గరకు చేరి, తమ పేర్లతో, తల్లిదండ్రుల పేర్లతో, తమ బిరుదులతో, చిహ్నాలతో తామెవరో తెలుపుతూ పోరుతున్న వీరులున్న చోటికి ప్రవేశించి, అండగా నిలిచి, పేరుకెక్కిన వారి బంధు మిత్రులను పొగడే దేవతల కంఠధ్వనులు ఆకాశం అంతా నిండాయి. అధికంగా కారుతున్న రక్తం ఆ ధూళిని అణచటంతో ఆగకుండా ఏరులై పారింది. భూతబేతాళ రాక్షసులు ఉప్పొంగి ఆ నెత్తుటి ప్రవాహాల్లో ఓలలాడుతూ, త్రాగుతూ మదించి నాట్యం చేశారు. ఆకాశంలో తలలు తెగి శరీరాలు ఆడాయి. మనస్సులు ఎప్పటివలె ఉరకలేస్తూ, యుద్ధంలో తృప్తి తీరక ఢీ కొని యుద్ధం చేస్తున్న వీరశ్రేష్ఠుల సింహనాదాలు దిక్కుల వ్యాపించాయి. ఆ యుద్ధభూమి సమీపంలో అంతకుముందే తన్ను చుట్టుముట్టిన త్రిగర్త కోసల నారాయణ గోపాల సైన్యాలను అర్జునుడు, తన గాండీవధ్వని ఆకాశాన్ని బ్రద్దలు చేయగా నొప్పించి---

చ. తఱిమి సుశర్మఁ దాఁకిన నతండుఁ దదంగమునన్ దశాస్త్రముల్
వఱపి మురాసురాంతకుని బాహువునం బటు మార్గణ త్రయం
బఱిముఱి జొన్పి బల్వెడఁద యమ్మున నుజ్జ్వల కేతుదండ మే
డ్తెఱఁ జలియింప నేసిన నుదీర్ణతఁ దత్కపి యార్చె; నార్చినన్. 228

ప్రతిపదార్థం: తఱిమి= వెంబడించి; సుశర్మన్, తాఁకినన్= సుశర్మను ఎదుర్కొనగా; అతండున్= సుశర్మ; తద్+అంగమునన్= అర్జునుడి శరీరమునందు; దశ+అస్త్రముల్, వఱపి= పది అస్త్రాలు వేసి; ముర+అసుర+అంతకుని, బాహువునన్= మురుడనే రాక్షసుని సంహరించిన శ్రీకృష్ణుడి భుజమునందు; బటుమార్గణ త్రయంబు= వాడి అయిన మూడు బాణాలు; అఱిముఱిన్+చొన్పి= సంభ్రమంతో వేసి; బలు+వెడఁద+అమ్మునన్= బలమైన వెడల్పయిన బాణంతో; ఉజ్జ్వల, కేతు, దండము= ప్రకాశించే జెండా కర్రను; ఏడ్తెఱన్+చలియింపన్+ఏసినన్= పరాక్రమంతో కదిలిపోయేటట్లుగా కొట్టగా; తద్+కపి= ఆ ధ్వజమునందలి హనుమంతుడు; ఉదీర్ణతన్= పెద్దగా; ఆర్చెన్= అరిచాడు; ఆర్చినన్= అట్లు అరవగా.

తాత్పర్యం: (అర్జునుడు) వెంటబడి సుశర్మతో యుద్ధం చేయగా, ఆ సుశర్మ అర్జునుడి శరీరంమీద పదిఅస్త్రాలు వేశాడు. మూడు బలమైనబాణాలు కృష్ణుడి బాహువులోకి దూరేటట్లు ప్రయోగించాడు. ఒక బలమైన వెడల్పు బాణంతో ధ్వజదండం అమితంగా ఊగిపోయేటట్లు కొట్టేసరికి, అందున్న హనుమ పెద్దగా అరిచాడు. అట్లు అరవగా..... (తరువాతి పద్యంతో అన్వయం)

సంశప్తకు లందఱు నొక్కపెట్ట యర్జును రథంబుపైఁ బడి యాఁగుట (సం. 8-37-11)

సీ. వెగడునఁ జె య్యేది వేగంబ తేఱి । సంశప్తకు లర్జును సాయకముల
కోహటింపక సముత్సాహంబు వదల కం । దఱు నొక్కపెట్ట తద్రథము వొదివి
హరులతో గాడియు హరికేలు నొగలును । బలుగాఁడియును గండ్లు బట్టి మెలఁగ
మిడుకరాకుండ నమ్మేటివిల్కాని మే । నును నిగ్రహించుట గనుఁగొనంగ

తే. నద్భుతం బయ్యె నపుడు సేయార్చి శౌరి । లీలఁ గొందఱ మత్త శుండాల భంగి
మెఱయఁ దూలించెఁ గాలను గుఱుచ తూపు । గములఁ బార్థుండు పలువుర సమయఁ జేసె. 229

ప్రతిపదార్థం: సంశప్తకులు; వెగడునన్= భయంతో; చెయ్వు= చేష్ట; ఏది= ఉడిగి; వేగంబ= త్వరగా; తేఱి= తేరుకొని; అర్జును= అర్జునునియొక్క; సాయకంబులకు= బాణాలకు; ఓహటింపక= వెనుదీయక; సమ్+ఉత్సాహంబు= నిండైన ఉత్సాహాన్ని; వదలక= విడువక; అందఱున్= (సంశప్తకులు) అందరు; ఒక్కపెట్ట= ఒక్కుమ్మడిగా; తద్= ఆ అర్జునుడియొక్క; రథము= రథాన్ని; పొదివి= చుట్టుముట్టి; హరులతోన్= గుఱ్ఱాలతో కూడ; కాడియు= కాడిని; హరి= శ్రీకృష్ణునియొక్క; కేలు= చేతిని; నొగలును= (రథం యొక్క) నొగలను; పలుగాడియును= పలుగాడిని; కండ్లు= (రథచక్రాల) కండ్లను; పట్టి= పట్టుకొని; మెలగ= పనిచేయుటకు; మిడుక= కదలుటకు; రాకుండ= వీలులేకుండ; ఆ+మేటి= ఆ శ్రేష్ఠుడైన; విలుకాని= విల్లునుపట్టిన వానియొక్క (అర్జునునియొక్క); మేనును= శరీరాన్ని; నిగ్రహించుట= పట్టుకొనుట; కనున్+కొనంగన్= చూచుటకు; అద్భుతంబు= ఆశ్చర్యము; అయ్యెన్= అయినది; అప్పుడు= ఆ సమయంలో; శౌరి= శ్రీకృష్ణుడు; చేయి; ఆర్చి= ఆడించి; మత్త= మదించిన; శుండాలంబు= ఏనుగు; భంగి= విధము; మెఱయన్= ప్రకాశించగ; లీలన్= విలాసంగా; కొందఱు= కొంతమందిని; తూలించెన్= తొలగత్రోసెను; పార్థుడు= అర్జునుడు; కాలను= కాలితో; కుఱుచ= పొట్టివైన; తూపు= బాణాలయొక్క; గములు= సమూహాలతో; పలువుర= పెక్కుమందిని; సమయన్+చేసె= చచ్చేటట్లు చేశాడు.

తాత్పర్యం: సంశప్తకులు భయంతో చేష్టలుడిగి, వెంటనే తేరుకొని, అర్జునుని బాణాలకు వెనుదీయక, ఉత్సాహాన్ని కోల్పోక, అందరు ఒక్కుమ్మడిగా అతడి రథాన్ని చుట్టుముట్టారు. గుఱ్ఱాలతో సహా అతడి రథం కాడిని, శ్రీకృష్ణుడి చేతిని, రథం నొగలను, పలుగాడిని, చక్రాల కండ్లను, ఆ మేటి విలుకాడైన అర్జునుడి శరీరాన్ని కదలటానికి వీలులేకుండ గట్టిగా పట్టుకొన్నారు. అది చూడటానికి అద్భుతంగా ఉంది. అప్పుడు శ్రీకృష్ణుడు చెయ్యి ఆడించి, మదగజంవలె ప్రకాశిస్తూ, విలాసంగా కొంతమంది సంశప్తకులను తొలగత్రోశాడు. అర్జునుడు కాలితో, కురుచ బాణాలతో పెక్కుమందిని పరిమార్చాడు.

వ. అంతఁ గొంత యూరుపువోయినం జిఱునవ్వు నవ్వి కవ్వడి కమలనాభున కి ట్లనియె. 230

ప్రతిపదార్థం: అంతన్= అపుడు; కొంత ఊరుపుపోయినన్= కొంత ఊరట కలుగగా; కవ్వడి= అర్జనుడు; చిఱునవ్వు నవ్వి= చిన్నగా నవ్వి; కమలనాభునకున్+ఇట్లు+అనియెన్= కృష్ణుడితో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అపుడు కొంత ఊరటచెందిన అర్జునుడు చిరునవ్వుతో కృష్ణుడితో ఇట్లా అన్నాడు:

ఆ. 'తేరు గదలనీక వైరులు బలువిడిఁ। బొదివిపట్ట రాచ పొల్ల నైన
యేను దక్క నృపతిసూనుఁ డి ట్లొరుఁడు స। హించు నెట్లు విక్రమించుఁగాక!' 231

ప్రతిపదార్థం: వైరులు= శత్రువులు; తేరు కదలనీక= రథం కదలనివ్వకుండా; బలువిడిన్+పొదివిపట్టన్= బలంగా చుట్టుముట్టి పట్టుకోగా; రాచపొల్లను+అయిన+ఏను+తక్కన్= క్షత్రియులలో వ్యర్థుడనైన నేను తప్ప; ఒరుఁడు, నృపతి సూనుఁడు= వేరొక రాజకుమారుడు; ఇట్లు= ఈ విధంగా; సహించున్+ఎట్లు?= ఎట్లా సహిస్తాడు?; విక్రమించున్ కాక= పరాక్రమిస్తాడు కాని.

తాత్పర్యం: 'శత్రువులు బలంగా క్రమ్ముకొని రథాన్ని కదలనివ్వకుండా పట్టుకొంటే, నా బోటి వ్యర్థుడు తప్ప వేరొక క్షత్రియుడు ఇట్లా సహిస్తాడా?'

క. అని పలికి చూడు మా న। న్ననుచు భుజంగాస్త్ర మేయ నది యరులకు గ్ర
క్కునఁ బాదబంధ మొనరిం।చిన ముంచె నతండు వారి శితవిశిఖములన్. 232

ప్రతిపదార్థం: అతండు= అర్జునుడు; అని పలికి= ఆ విధంగా అని; చూడుమీ, నన్ను+అనుచున్= ఇప్పుడు నన్ను)నా పరాక్రమం) చూడుము అంటూ; భుజంగ+అస్త్రము+ఏయన్= సర్పాస్త్రం ప్రయోగించగా; అది+అరులకున్= అది శత్రువులకు; గ్రక్కునన్= వెంటనే; పాదబంధము+ఒనరించినన్= పాదాలను బంధించగా; వారిన్= వారిని; శిత, విశిఖములన్= వాడి బాణాలతో; ముంచెన్= ముంచివేశాడు.

తాత్పర్యం: అని 'ఇప్పుడు నా పరాక్రమం చూడు' అంటూ అర్జునుడు, సర్పాస్త్రాన్ని ప్రయోగించగా అది వైరుల పాదాలను బంధించింది. తరువాత అర్జునుడు వాడిబాణాలను వారిపై గుప్పించాడు.

విశేషం: శత్రువులు తన రథాన్ని కదలనివ్వకుండా చేసినందుకు ప్రతీకారంగా అర్జునుడు వారి పాదాలను బంధించి వారిని కదలనివ్వకుండా చేశాడు.

వ. ఇ వ్విధంబున. 233

తాత్పర్యం: ఈ విధంగా.

ఆ. నాగ పాశ బంధనంబుల గుదివడి । వారు వివిధ బాణ దారితాంగు
లై రథంబు విడిచి; రప్పు డా సంశప్త । క వ్రజంబుఁ గని త్రిగర్తవిభుఁడు. 234

ప్రతిపదార్థం: నాగపాశ, బంధనంబులన్= నాగాస్త్రంయొక్క బంధాలతో; గుదివడి= చిక్కుకొని; వారు= సంశప్తకులు; వివిధ బాణ, దారిత+అంగులు+అయి= పెక్కు బాణాలతో చీల్చబడిన శరీరంకలవారై; రథంబు విడిచిరి= రథాన్ని వదలిపెట్టారు; అప్పుడు; త్రిగర్తవిభుఁడు= సుశర్మ; సంశప్తక వ్రజంబున్+కని= త్రిగర్త వీరులను చూచి.

తాత్పర్యం: అర్జునుడు వేసిన నాగాస్త్రబంధాలలో చిక్కుకొని, అతడి బాణాలకు గాయపడిన వారై సంశప్తకులు రథాన్ని వదలిపెట్టారు. అప్పుడు త్రిగర్తరాజు సుశర్మ వారిని చూచి.

క. గరుడాస్త్రం బేసిన న । చ్చెరువుగ గరుడములు గవిసి చీరెం జంచు
స్ఫురణము మెఱయఁ గ వెస న । య్యురగాత్మక బంధ మూడ నుర్వీనాథా! 235

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= రాజా!; గరుడ అస్త్రంబు+ఏసినన్= గరుడాస్త్రం ప్రయోగించగా; గరుడములు+కవిసి= గరుడ పక్షులు క్రమ్ముకొని; అచ్చెరువుగన్= ఆశ్చర్యకరంగా; వెసన్= వెంటనే; ఆ+ఉరగ+ఆత్మక, బంధము+ఊడన్= నాగాస్త్రబంధం విడిపోగా; చంచుస్ఫురణము మెఱయఁగన్= తమ ముక్కుల వాడి గోచరించగా; చీరెన్= పొడిచాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్రమహారాజా! సుశర్మ గరుడాస్త్రం ప్రయోగించగా గరుడపక్షులు క్రమ్ముకొని వాడి అయిన తమ ముక్కులతో పొడిచి నాగాస్త్ర బంధాలను విడిపించాయి.

క. తన కడిమి బంధమోక్షము । గనిన రథికకోటి గడఁగి గాండివిపయి నే
పునఁ దూపులు దొరఁగింపఁగ । ఘనభుజుఁడు సుశర్ముఁ డేసెఁ గన దస్త్రమునన్. 236

ప్రతిపదార్థం: తన కడిమిన్= తన పరాక్రమంతో; బంధమోక్షము, కనిన, రథిక, కోటి= బంధాలు ఊడిన రథికుల సమూహం; కడఁగి= పూనుకొని; గాండివి, పయిన్= అర్జునుడిమీద; ఏపునన్+తూపులు, తొరఁగింపఁగన్= శౌర్యంతో బాణాలు వేయగా; ఘనభుజుఁడు, సుశర్మ్ముఁడు= బాహుబలుడైన సుశర్మ; కనత్+అస్త్రమునన్= కాంతిమయ అస్త్రంతో; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: త్రిగర్తవీరులు నాగాస్త్రబంధాలు వీడగా అర్జునుడిపై బాణాలు కురిపించారు. సుశర్మకూడా ప్రకాశించే అస్త్రాన్ని ప్రయోగించాడు.

చ. **అది నరుడెంద మాడుటయు నాతఁడు మూర్ఛ మునింగి తేరిపైఁ**
జదికిలఁబడ్డ నుబ్బి 'యద్దె చచ్చె సుశర్మ్ముని యేటు దాఁకి బ
ల్లిదుఁ డగు పార్థుఁ డంచు మదలీలల నార్చిరి నీదు సైనికుల్;
సదలను దిక్కులం బరఁగె శంఖముఖోద్ధట తూర్య నాదముల్. **237**

ప్రతిపదార్థం: అది, నరుడెందము+ఆడుటయున్= ఆ అస్త్రం అర్జునుడి గుండెను తాకగా; అతడు మూర్ఛ మునింగి= అతడు మూర్ఛపోయి; తేరిపైన్+చదికిలన్+పడ్డన్= రథంపై పడిపోగా; నీదు సైనికులు= నీ సైనికులు; ఉబ్బి= పొంగిపోయి; సుశర్మ్ముని ఏటుతాఁకి= సుశర్మ బాణం దెబ్బ తగిలి; బల్లిదుఁడు+అగుపార్థుఁడు= బలశాలి అయిన అర్జునుడు; అదె చచ్చెన్= అదిగో చనిపోయాడు; అంచున్ మదలీలన్+ఆర్చిరి= అంటూ గర్వంగా అరిచారు; శంఖముఖ+ఉద్ధట తూర్యనాదముల్= శంఖం మొదలైన యుద్ధవాద్యధ్వనులు; చదలను, దిక్కులన్+పరఁగన్= గగనంలోనూ అన్ని దిక్కులలోనూ వ్యాపించాయి.

తాత్పర్యం: సుశర్మ వేసిన అస్త్రం తాకిడికి అర్జునుడు మూర్ఛపోయి రథంపై చతికిలపడిపోగా, అతడు చనిపోయాడని భావించి కౌరవసేన గర్వంతో కేకలు వేసింది. యుద్ధవాద్యాల ధ్వనులు ఆనందసూచకంగా అంతట మారుమ్రోగాయి.

సీ. **అంతఁ దెప్పిఱి విలయాంతకు కైవడిఁ గవ్వడి యేచి మార్గణ చయంబు**
పె ల్లడరించిన బీఱువోయె సుశర్మ । యా సేనమీఁద నైంద్రాస్త్ర మక్కి
రీటి నవ్వుచు నేయ నాటోపమున నది । వివిధ బాణాకృతిఁ గవిసి నుఱుము
గావింపఁగాఁ బదివేవురు సంశప్త । కాగ్రేసరులు దెగటాఱి రప్పు

ఆ. **డుక్కు దక్కి తలరి తక్కటి యోధులు । చేష్టితంబు లెడలఁ జిత్రరూపు**
లట్టులైరి ధూమ మడఁగిన వెలుఁగొందు । ననలు చందమయ్యె నన్నరుండు. **238**

ప్రతిపదార్థం: అంతన్+తెప్పిఱి= అంతలోనే తేరుకొని; కవ్వడి= అర్జునుడు; విలయ+అంతకు, కైవడిన్= ప్రళయకాల యముడివలె; ఏచి= విజృంభించి; మార్గణచయంబు= బాణసమూహం; పెల్లు+అడరించినన్= అధికంగా కురిపించగా; సుశర్మ; బీఱుపోయెన్= నిశ్చేష్టుడయ్యాడు; ఆ+కిరీటి= అర్జునుడు, ఆసేనమీఁదన్= త్రిగర్తసేనమీద; ఐంద్ర+అస్త్రము= ఇంద్రాస్త్రం; నవ్వుచున్+ఏయన్= పరిహసిస్తూ ప్రయోగించగా; ఆటోపమునన్+అది= అతిశయంతో ఆ అస్త్రం; వివిధబాణ+ఆకృతిన్+కవిసి= వివిధబాణాల రూపంలో తాకి; నుఱుము కావింపఁగాన్= చంపివేయగా; పదివేవురు సంశప్తక+అగ్రేసరులు= పదివేలమంది త్రిగర్తవీరులు; తెగటాఱిరి= మరణించారు; అప్పుడు; తక్కటియోధులు= మిగిలిన వీరులు; ఉక్కు+తక్కి= ధైర్యం నశించి; తలరి= చలించి; చేష్టితంబులు+ఎడలన్= చేష్టలుడుగగా; చిత్రరూపులు+అట్టులు+ఐరి= చిత్రాలవలె అయ్యారు; ఆ+నరుండు= అర్జునుడు; ధూమము+అడఁగినన్= పొగ నశించగా; వెలుఁగొందు+అనలు చందము+అయ్యెన్= ప్రకాశించే అగ్నివలె ఒప్పాడు.

తాత్పర్యం: అర్జునుడు వెంటనే మూర్ఛనుండి తేరుకొని విజృంభించి బాణాలగుంపులు గుప్పించగా, సుశర్మ నిశ్చేష్టుడయ్యాడు. ఇంద్రాస్త్రం ప్రయోగించగా అది పెక్కుబాణాలుగా వెలువడి పదివేలమంది త్రిగర్తవీరులను బలిగొన్నది. ధైర్యం నశించిన మిగతా యోధులు చిత్రాలవలె చలనరహితులయ్యారు. పొగ తొలగిపోగా ప్రకాశించే అగ్నివలె అర్జునుడు ఒప్పారాడు.

విశేషం: సుశర్మ అస్త్రం తాకిడికి అర్జునుడు మూర్ఛపోయినా అది క్షణకాలం మాత్రమే. అతడు నివురుగప్పిన నిప్పువలె పరాక్రమధనుడు అని భావం. ఉపమాలంకారం. పొగఅంతా పోగా మంట వేడి ఎక్కువవుతుంది.

వ. హతశేషులైన సంశప్తకులు చతుర్దశ సహస్రయోధముఖ్యు లవ్విజయు విజయంబు సహింపక యొండొరులం బురికొల్పి బలంబులతోడం గడంగిన నతం డతిదారుణంబగు రణంబుసేయఁ దక్కటి పాండవుల దెసఁబోరు కౌరవ బలంబు తద్బల శౌర్యంబు లోర్వక భీతిఁగలంగి పఱచినం గృతవర్మ కృపగురు పుత్ర కర్ణులు నులూక సౌబల సుయోధనులు దుశ్శాసనాది కుమారులును బరవసంబు సేసి యా సైన్యంబుఁ దైన్యంబు వాయ విక్రమించి; రట్టియెడఁ గృపుని యపరిమిత శరజాలంబు పాంచాల పుంజంబుం బొదివినం గనలి శిఖండి యమ్మహీసురవరుని మార్కొనియె; నయ్యిరువుర సమరంబు రామ రావణుల రణంబు కరణి నొప్పె; నట్లు పోరి పోరి శారద్వతుండు. 239

ప్రతిపదార్థం: హత శేషులు+ఐన సంశప్తకులు= చావగా మిగిలిన త్రిగర్తవీరులు; చతుః+దశ సహస్రయోధ ముఖ్యులు= పద్నాలుగు వేలమంది; ఆ+విజయు, విజయంబు= ఆ అర్జునుడి గెలుపును; సహింపక= తట్టుకోలేక; ఒండు+ఒరులన్+ పురికొల్పుకొని= ఒకరినొకరు పురికొల్పికొని; బలంబులతోడన్+కడంగినన్= సేనలతో తరలిరాగా; అతండు= అర్జునుడు; అతిదారుణంబు+అగు= రణంబుచేయన్= మిక్కిలి భయంకరమైన యుద్ధం చేయగా; తక్కటి పాండవులదెసన్+పోరు= మిగతా పాండవ సోదరులతో యుద్ధం చేసే; కౌరవబలంబు= కౌరవసైన్యం; తద్+బలశౌర్యంబులు+ఓర్వక= ఆ పాండవుల బలపరాక్రమాలు సహించలేక; భీతిన్+కలంగి= భయానికి గురై; పఱచినన్= పారిపోగా; కృతవర్మ, కృప, గురుపుత్ర, కర్ణులున్= కృతవర్మ, కృపుడు, అశ్వత్థామ, కర్ణుడు; ఉలూక, సౌబల, సుయోధనులు= ఉలూకుడు శకుని దుర్యోధనుడు; దుశ్శాసన+ఆది కుమారులును= దుశ్శాసనుడు మున్నగు కౌరవులు; బరవసంబుసేసి= ధైర్యం వహించి; ఆ సైన్యంబు= ఆ కౌరవసేన; దైన్యంబుపాయన్= దీనస్థితి తొలగగా; విక్రమించిరి= పరాక్రమించారు; అట్టిఎడన్= ఆ సమయంలో; కృపుని= కృపాచార్యుని; అపరిమిత శరజాలంబు= అసంఖ్యాక బాణసముదాయం; పాంచాల పుంజంబున్+పొదివినన్= పాంచాలురసమూహాన్ని తాకగా; శిఖండి; కనలి= కోపించి; ఆ+మహీసురవరుని= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుని-కృపాచార్యుని; మార్కొనియెన్= ఎదుర్కొన్నాడు; ఆ ఇరువురు సమరంబు= శిఖండి కృపుల యుద్ధం; రామరావణుల రణంబు- కరణిన్+ఒప్పెన్= రామరావణ యుద్ధంవలె గోచరించింది; శారద్వతుండు= కృపాచార్యుడు; అట్లు పోరి పోరి= ఆ విధంగా యుద్ధం చేసి, చేసి.

తాత్పర్యం: చావగా మిగిలిన పదునాల్గువేలమంది సంశప్తకవీరులు అర్జునుని విజయాన్ని సహించక, ఒకరినొకరు పురికొల్పుకొంటూ తమసేనలతో తరలిరాగా, అర్జునుడు అతి భయంకరమైన యుద్ధం చేశాడు. తక్కిన పాండవులతో యుద్ధం చేస్తున్న కౌరవసైన్యం, వారి బలపరాక్రమాలు సహించలేక భీతిల్లి, కలతపడి పారిపోగా - కృతవర్మ, కృపుడు, అశ్వత్థామ, కర్ణుడు, ఉలూకుడు, శకుని, సుయోధనుడు, దుశ్శాసనాది కురుకుమారులు ధైర్యం వహించి, ఆ కౌరవసైన్యంయొక్క దైన్యం తొలగేటట్లు విజృంభించారు. అప్పుడు కృపాచార్యుని అపరిమిత బాణసమూహం

పాంచాలసైన్యాన్ని తాకగా, శిఖండి ఆగ్రహించి, ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడైన కృపాచార్యుణ్ణి ఎదుర్కొన్నాడు. ఆ యిద్దరి యుద్ధం రామరావణయుద్ధం వలె ఒప్పింది. ఆ విధంగా కృపాచార్యుడు పోరి పోరి ......

విశేషం: అలం: ఉపమ.

చ. **హరులను సూతుఁ జంపిన నుదగ్రత నా ద్రుపదాత్మజుండు వి**
స్ఫురిత కృపాణ చర్మ పరిశోభితుఁడై యరదంబు డిగ్గి స
త్వరముగ నేఁగుదేర శరవాహిని పై నిగిడించె; నాతఁ డ
య్యరి వెఱఁగందుచున్ నిలుచునట్టుగ జోదులు పిచ్చలింపఁగన్. **240**

ప్రతిపదార్థం: హరులను, సూతున్+చంపినన్= అశ్వాలను సారథిని చంపగా; ఆ ద్రుపద+ఆత్మజుండు= శిఖండి; ఉదగ్రతన్= భయం గొల్పుతూ; విస్ఫురిత, కృపాణ, చర్మ, పరిశోభితుఁడు+ఐ= ప్రకాశించే కత్తి డాలుతో కూడినవాడై; అరదంబు డిగ్గి= రథం నుండి దిగి; సత్వరముగన్+ఏఁగుదేరన్= వేగంగా రాగా; ఆతఁడు= కృపుడు; ఆ+అరి= ఆ శత్రువైన శిఖండి; వెఱఁగు+అందుచున్+నిలుచునట్టుగన్= ఆశ్చర్యపోయేటట్లుగా; జోదులు= యోధులు; పిచ్చలింపఁగన్= ప్రశంసించేవిధంగా; శరవాహిని= బాణవర్షం; పైన్+నిగిడించెన్= అతడిపై కురిపించాడు.

తాత్పర్యం: కృపాచార్యుడు అతడి గుర్రాలను, సారథిని చంపగా శిఖండి రథం దిగి కత్తి, డాలు ధరించి అతడివైపు రాగా, కృపుడు శిఖండి ఆశ్చర్యపోయేటట్లుగ, యోధులు ప్రశంసించేటట్లుగ అతడిమీద బాణవర్షం కురిపించాడు.

వ. **అట్లేచిన కృపాచార్యుపై నురవడించిన ధృష్టద్యుమ్నుం గృతవర్మయు ధర్మతనయ ద్రౌపదేయుల నశ్వత్థామయుఁ గవలం గురుపతియును వృకోదరుం గర్ణుండునుం దలపడి నిలువరించి రగ్గౌతముండు శిఖండి పలక పఱియలు సేసిన నతండు దెరలక కేవల కరవాలంబున విక్రమింపం గడంగిన నయ్యతిరథుండు.** **241**

ప్రతిపదార్థం: అట్లు+ఏచిన, కృపాచార్యుపైన్= ఆ విధంగా విజృంభించిన కృపుడిపై; ఉరవడించిన ధృష్టద్యుమ్నున్= వేగంతో తాకిన ధృష్టద్యుమ్నుడిని; కృతవర్మయున్= కృతవర్మ; ధర్మతనయ, ద్రౌపదేయులన్= ధర్మరాజును, ఉపపాండవులను; అశ్వత్థామయున్= అశ్వత్థామ; కవలన్+కురుపతియును= నకుల సహదేవులను దుర్యోధనుడు; వృకోదరున్+కర్ణుండును= భీముడిని కర్ణుడు; తలపడి, నిలువరించిరి= ఎదుర్కొని అడ్డగించారు; ఆ+గౌతముఁడు= కృపుడు; శిఖండిపలక= శిఖండి కేడెము(వారు)ను; పఱియలు చేసినన్= బద్దలు చేయగా; అతండు తెరలక= అతడు తొలగక; కేవల, కరవాలంబున, విక్రమింపన్+కడంగినన్= కేవలం కత్తితోనే పరాక్రమించగా; ఆ+అతిరథుండు= అతిరథుడైన ఆ కృపుడు.

తాత్పర్యం: ఆ విధంగా విజృంభించిన కృపుడిమీదికి వచ్చిన ధృష్టద్యుమ్నుడిని కృతవర్మ, ధర్మరాజును, ఉపపాండవులను, అశ్వత్థామ, నకుల సహదేవులను దుర్యోధనుడు, భీముడిని కర్ణుడు ఎదుర్కొని అడ్డగించారు. కృపాచార్యుడు శిఖండి కేడెము(వారు)ను బద్దలు చేయగా అతడు చలించకుండా కత్తితోనే పోరు సాగించాడు. అప్పుడు కృపుడు.

క. **వాలిక తూపులు మేనం। గీలుకొలిపి నొంపఁ గన సుకేతుఁడు బాణ**
జ్వాలలు నిగుడ నడరి యా। భీలత నా కృపునితోడఁ బెనఁగె నరేంద్రా! **242**

ప్రతిపదార్థం: నరేంద్రా!= రాజా!; వాలిక తూపులు= వాడి అయిన బాణాలు; మేనన్+కీలు కొలిపి, నొంపన్= శరీరమునందు నాటి నొప్పించగా; సుకేతుడు కని= సుకేతుడు (ద్రౌపది కుమారుడు) చూచి; బాణజ్వాలలు నిగుడన్= బాణాలమంటలు చెలరేగేటట్లు; అడరి= విజృంభించి; ఆభీలతన్= భయంకరంగా; ఆ కృపునితోడన్+పెనఁగెన్= కృపాచార్యుడితో పోరు సల్పాడు;

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! కృపుడు శిఖండిపై వాడిబాణాలు వేసి నొప్పించగా, చూచి సుకేతుడు అతడిపై బాణాలజ్వాలలు చెలరేగేటట్లుగ విజృంభించి భయంకరంగా పోరాడాడు.

తే. **తనకు నెడ సొచ్చి యిట్టు లతండు పెనఁగ । ద్రుపదనందనుఁ డల్లన తొలఁగిపోయె;**
నా సుకేతుండు గృపునిమై నాఁట నిరువ । దాఱు శరములు వఱపి రయంబు మెఱయ. **243**

ప్రతిపదార్థం: తనకున్+ఎడ+చొచ్చి= తనకు మధ్యగా వచ్చి; ఇట్టులు+అతండు పెనఁగన్= ఇట్లా సుకేతుడు పోరుతుండగా; ద్రుపదనందనుఁడు= శిఖండి; అల్లన తొలఁగిపోయెన్= అక్కడినుండి వెళ్ళిపోయాడు; ఆ సుకేతుండు= సుకేతుడు; కృపుని, మైన్ నాఁటన్= కృపుడి దేహమునందు నాటేటట్లుగా; ఇరువది+ఆఱు శరములు పఱపి= ఇరవై ఆరుబాణాలు వేసి; రయంబు మెఱయన్= వేగం అతిశయించగా.

తాత్పర్యం: సుకేతుడు మధ్యలో వచ్చి కృపుడితో పోరగా, శిఖండి అటనుండి వెళ్ళిపోయాడు. కృపుడిపై సుకేతుడు ఇరవై ఆరుబాణాలు వేసి వెంటనే. (తరువాతి గద్యంతో అన్వయం).

వ. **ధనువు దునిమి యొండు కోదండం బెత్తిన నదియును ఖండించి.** **244**

ప్రతిపదార్థం: ధనువు తునిమి= విల్లును విరిచి; ఒండు కోదండంబు+ఎత్తినన్= మరొకవిల్లును చేపట్టగా; అదియును ఖండించి= దానిని కూడా ఖండించి.

తాత్పర్యం: కృపుడి విల్లును విరిచి ఆయన మరొక ధనువు చేపట్టగా దానిని కూడా ఖండించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **తోడన హయసూతుల మెయిఁ । గాఁడఁగ నేయుటయు నతఁడు గనలుచు బలువిల్**
క్రీడయ పోలెం గొని మే । న్గాఁడఁగ నిగిడించెఁ ద్రిదశనారాచంబుల్. **245**

ప్రతిపదార్థం: తోడన= వెంటనే; హయసూతుల మెయిన్+కాఁడఁగన్+ఏయుటయున్= అశ్వసారథుల మేనులందు గ్రుచ్చుకొనేటట్లు బాణాలు వేయగా; ఆతడు= కృపుడు; కనలుచున్= కోపపడుతూ; బలువిల్= బలమైన ధనువును; క్రీడ+ఆ పోలెన్+కొని= అవలీలగా గైకొని; త్రిదశ నారాచంబుల్= ముప్పదిబాణాలు; మేను+కాఁడఁగన్, నిగిడించెన్= సుకేతుడి శరీరంమీద నాటుకొనేటట్లు వేశాడు.

తాత్పర్యం: వెంటనే అశ్వసారథులపై బాణాలు వేసి నొప్పించగా, కృపుడు కోపించి విలాసంగా బలిష్ఠమైన ధనువును చేబూని సుకేతుడి శరీరంమీద గ్రుచ్చుకొనేటట్లు ముప్పదిబాణాలు వేశాడు.

కృపాచార్యుండు సుకేతుం డను పాంచాలకుమారునిం జంపుట (సం. 8-38-82)

తే. **అట్టు నొప్పింపఁ దూఁగాడు నా సుకేతు। కంధరము మెఱుఁగారెడు కత్తివాతి**
దొడ్డ తూపున నేపునఁ ద్రుంచుటయును। శిరము ధర డొల్లెఁ గుండలస్ఫురణ మెఱయ. 246

ప్రతిపదార్థం: అట్టు నొప్పింపన్= ఆ విధంగా బాణాలతో నొప్పించగా; తూఁగాడు= ఊగుతున్న; ఆ సుకేతు కంధరము= సుకేతుడి మెడ; మెఱుఁగారెడు= కాంతిమంతమైన; కత్తివాతి= కత్తివాతి, దొడ్డతూపునన్= అర్ధచంద్రాకారంగా ఉన్న పెద్ద బాణంతో; ఏపునన్+త్రుంచుటయును= గర్వంతో ఖండించగా; శిరము= సుకేతుడి శిరస్సు; కుండల, స్ఫురణ, మెఱయన్= చెవిపోగులు ప్రకాశించగా; ధరన్+డొల్లెన్= నేలపై రాలింది.

తాత్పర్యం: కృపుడు తన బాణాల దెబ్బలకు తూలుతున్న సుకేతుడి శిరస్సును బలమైన అర్ధచంద్రాకార బాణంతో ఖండించగా, కర్ణకుండలాల కాంతితో ప్రకాశిస్తూ అతడి తల నేలపై పడి దొరిలింది.

వ. **ఇట్లు సుకేతుండు సచ్చిన నతని మూఁకలు విచ్చె; ధృష్టద్యుమ్నుండు గృతవర్మయుం బోరునెడ ధృష్టద్యుమ్నుండు గృతవర్మ వక్షస్థలంబు విశిఖ నవకంబున నొప్పించుటయు' నప్పాంచాల వరునతండు సూతకేతు హయస్యందన సమేతంబుగా నిబిడ శరజాలంబునం బొదివిన నవ్వీరుండు బలాహకపిహితమూర్తి యగు మార్తాండు ననుకరించి తాను సైంధవ వధ దినంబునం బారావతవర్ణంబు లగు రథ్యంబు లగ్గురు నరుణాశ్వంబులన్ బెరయం బఱపిన తెఱంగున. 247**

ప్రతిపదార్థం: ఇట్లు, సుకేతుండు చచ్చినన్= ఈ విధంగా సుకేతుడు మరణించగా; అతని మూఁకలు విచ్చెన్= అతడి సైన్యం చెల్లాచెదరయింది; ధృష్టద్యుమ్నుండున్+కృతవర్మయున్+పోరు+ఎడన్= ధృష్టద్యుమ్న కృతవర్మలు పోరాడేటప్పుడు; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; కృతవర్మ వక్షఃస్థలంబు= కృతవర్మ వక్షమును; విశిఖ నవకంబునన్+నొప్పించుటయున్= తొమ్మిది బాణాలతో బాధించగా; ఆ+పాంచాల, వరున్= ఆ పాంచాలశ్రేష్ఠుడైన ధృష్టద్యుమ్నుడిని; అతండు= కృతవర్మ; సూత, కేతు, హయ, స్యందన, సమేతంబుగాన్= సారథి ధ్వజం అశ్వాలు, రథములతో కూడ, నిబిడ శరజాలంబునన్+ పొదివినన్= దట్టమైన బాణాలగుంపుతో కప్పివేయగా; ఆ+వీరుండు= ధృష్టద్యుమ్నుడు; బలాహక పిహితమూర్తి+అగు= మేఘాలచేత కప్పబడినట్టి; మార్తాండున్+అనుకరించి= సూర్యుడిని పోలినవాడై; తాను; సైంధవ వధ దినంబునన్= సైంధవుడు చంపబడిన రోజు; పారావత వర్ణంబులు+అగు రథ్యంబులు= పావురం రంగు కలిగిన(తెల్లని) గుఱ్ఱాలు; ఆ+గురు+అరుణ+ అశ్వంబులన్= ద్రోణాచార్యుడి ఎరుపురంగు గుఱ్ఱాలను; బెరయన్+పఱపిన తెఱంగునన్= తాకునట్లు పోరినవిధంగా.

తాత్పర్యం: ఈ విధంగా సుకేతుడు మరణించగా అతడిసైన్యం చెదరిపోయింది. ధృష్టద్యుమ్న కృతవర్మల యుద్ధంలో ధృష్టద్యుమ్నుడు కృతవర్మ వక్షంపై తొమ్మిదిబాణాలు వేయగా అతడు సారథి, అశ్వాలు, ధ్వజం, రథంతో సహా ధృష్టద్యుమ్నుడిని బాణాలతో కప్పివేయగా, మేఘాలతో కప్పబడిన సూర్యుడివలె ధృష్టద్యుమ్నుడు ఒప్పారాడు. సైంధవవధ సమయంలో తన తెల్లగుఱ్ఱాలు ద్రోణుడి ఎఱ్ఱనిగుఱ్ఱాలను తాకినవిధంగా.

విశేషం: పద్మవ్యూహంలో అభిమన్యుడు చిక్కుపడి మరణించటానికి కారకుడైన సైంధవుడిని అర్జునుడు సంహరించిననాటి యుద్ధంలో ధృష్టద్యుమ్నుడు ద్రోణుడితో పైవిధంగానే తలపడ్డాడు. 'అప్పాంచాలకుల ప్రదీపకుండు గోపాద్దీపితుండయి పారావత వర్ణంబులగు రథ్యంబుల నగ్గురు నరుణాశ్వంబులన్ బెరయ నరదంబు వరపించి..... నతని తేరికడ నొగ ద్రొక్కి మెక్కి

కాడిపయిం జిత్రగతులు మెరసి' (ద్రోణ. తృ. 124) అవే పదాలు ఈ సందర్భంలోని వచనంలో కూడా పునరుక్తి కావటం గమనార్హం.

తే. అలిగి నొగ నొగతోఁ దాఁక నతిరయమునఁ। దేరు వఱపి కృపాణ ప్రదీప్త పాణి
యగుడు, గద పుచ్చికొనియును నఱుమ లేక। చలము డిగఁ ద్రావి కృతవర్మ యిలకు దాఁటె. 248

ప్రతిపదార్థం: అలిగి= కోపించి; నొగ నొగతోన్+తాఁకన్= (తన) రథం నొగలుతో కృతవర్మ నొగలును తాకగా; కృతవర్మ; అతిరయమునన్+తేరు+వఱపి= వేగంగా రథం నడిపి; కృపాణ ప్రదీప్త పాణి అగుడున్= ఖడ్గం చేత ప్రకాశించే చేయి కలవాడై; గద పుచ్చికొనియును= గద తీసికొని కూడా; అఱుమ లేక= పొడిచేయలేక; చలము, డిగన్+త్రావి= పట్టుదలను దిగమ్రింగుకొని; ఇలకు దాఁటెన్= క్రిందకు దిగి వెళ్ళాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ఆగ్రహించి తన రథం నొగ కృపాచార్యుని రథం నొగను తాకేటట్లుగా అతి వేగంగా రథాన్ని నడిపి, చేత ఖడ్గాన్ని ధరించగా, కృతవర్మ గదను చేత పుచ్చుకొని కూడ పోరాడలేక రథం మీది నుండి క్రిందికి దిగాడు.

వ. అక్కుంభసంభవు చందంబుగాక వంచకుండై యప్పరుసున నబ్బలు మగండు దొలంగిన నయ్యరదంబు మీఁదికి లంఘించి యా ధృష్టద్యుమ్నుండు. 249

ప్రతిపదార్థం: ఆ+బలుమగండు= ఆ మేటివీరుడు(కృతవర్మ); ఆ+కుంభసంభవు చందంబు కాక= ద్రోణుడివలె ఎదిరించలేక; వంచకుండు+ఐ= కపటి అయి; ఆ+పరుసునన్= ఆ విధంగా; తొలంగినన్= తప్పించుకొనగా; ఆ ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; ఆ+అరదంబు మీఁదికిన్ లంఘించి= ఆ కృతవర్మ రథంపైకి దూకి.

తాత్పర్యం: కృతవర్మ ద్రోణాచార్యుడివలె ధైర్యంగా ఎదిరించలేక మోసంతో తప్పించుకొనగా, ధృష్టద్యుమ్నుడు అతడి రథంమీదికి దూకి.

క. ఆ రథికు నచటఁ గానక। సారథి తల దునుముటయును, సంతసమునఁ బొం
గారి తన శబ్ద మిచ్చి మ। హారవమున నిక్క డిక్క డనియె నతండున్. 250

ప్రతిపదార్థం: ఆ రథికున్+అచటన్+కానక= ఆ వీరుని (కృతవర్మను) అక్కడ కనుగొనలేక; సారథి, తల, తునుముటయును= రథసారథి తలను ఖండించగా; సంతసమునన్+పొంగారి= ఆనందంతో ఉప్పొంగి; అతండున్= ఆ కృతవర్మ; తన శబ్దము+ఇచ్చి= తన గొంతువిచ్చి; మహారవమునన్= పెద్దశబ్దంతో; ఇక్కడ+ఇక్కడ+అనియెన్= ఇక్కడ ఇక్కడ (ఉన్నానని) అన్నాడు.

తాత్పర్యం: కృతవర్మ కనబడకపోగా, అతడి సారథి తలను ఖండించాడు ధృష్టద్యుమ్నుడు. అంతట కృతవర్మ తన గొంతెత్తి 'నేనిక్కడ ఉన్నా' నన్నాడు.

చ. విని కృతవర్మఁ గాంచి పటువిక్రమకేళి యొనర్ప నాత్మ వా
హనమున కేఁగి యేచి ద్రుపదాత్మజుఁ డాతఁడు లోను గాఁగ న
మ్మొనఁ గల మేటి జోదుల సముద్ధతి యేడ్తెఱ నిల్వరింప వి
ల్గొనెఁ బటు శౌర్య శోభితబలుం డగు నయ్యదుముఖ్యుఁ డొక్కఁడున్. 251

ప్రతిపదార్థం: విని= కృతవర్మ కంఠధ్వని విని; ద్రుపద+ఆత్మజుఁడు= ధృష్టద్యుమ్నుడు; కృతవర్మన్+కాంచి= కృతవర్మను చూచి; పటు విక్రమకేలి+ఒనర్పన్= గొప్ప పరాక్రమ క్రీడ ప్రదర్శించటానికి; ఆత్మవాహనమునకున్+ఏఁగి= తన రథం మీదికి వెళ్ళి; ఏచి= విజృంభించి; అతడు లోనుకాఁగన్= కృతవర్మ మొదలుకొని; ఆ+మొనన్+కలమేటి, జోదుల= ఆ సేనలో ఉన్న మహావీరులయొక్క; సముద్ధతి= ఆటోపం; ఏడ్తెఱ= విజృంభణం; నిల్వరింపన్= ఆపగా; పటు, శౌర్య, శోభిత, బలుండు+అగు= బలమైన పరాక్రమంతో ప్రకాశించే శక్తిశాలి అయిన; ఆ+యదుముఖ్యుఁడు= యాదవులలో శ్రేష్ఠుడైన ఆ కృతవర్మ; ఒక్కఁడున్= ఒక్కడే; విల్+కొనెన్= ధనుస్సును చేపట్టాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు కృతవర్మ కేకవిని, అతనిని చూచి బలమైన పరాక్రమక్రీడ ప్రదర్శించటానికి తన రథం మీదికి వెళ్ళి విజృంభించి, కృతవర్మ మొదలైన కౌరవవీరుల ఆటోపాన్ని పూనికతో అడ్డుకోగా, శౌర్యశోభితుడైన ఆ యాదవవీరుడు కృతవర్మ ఒక్కడు మాత్రమే పోరాడాలని విల్లందుకొన్నాడు.

వ. అట్టియెడ నొక్క రథికుండు రయంబున నిజరథంబుమీఁదికిఁ గృతవర్మం దిగిచికొని యనికిం దొలంగం గొనిపోయెఁ; బాంచాలోత్తముండును దన మునుము బలంబు గలంగం బరాక్రమించుచుండె. 252

ప్రతిపదార్థం: అట్టి ఎడన్= ఆ సమయంలో; ఒక్క రథికుండు= ఒక రథవీరుడు; రయంబునన్= వేగంగా; నిజరథంబు మీఁదికిన్= తన రథంపైకి; కృతవర్మన్+తిగిచికొని= కృతవర్మను లాగికొని; అనికిన్+తొలంగన్+కొనిపోయెన్= యుద్ధంనుండి దూరంగా తీసికొనివెళ్ళాడు; పాంచాల+ఉత్తముండును= ధృష్టద్యుమ్నుడుకూడా; తన మునుము బలంబు కలంగన్= తన ఎదురుగా ఉన్న సేన కలత చెందగా; పరాక్రమించుచుండెన్= యుద్ధం చేయసాగాడు.

తాత్పర్యం: అప్పుడు ఒక వీరుడు వేగంగా కృతవర్మను తన రథం మీదికి లాగికొని, దూరంగా తరలించుకొని పోయాడు. ధృష్టద్యుమ్నుడు శత్రుసేన కలత పొందేటట్లు తన పరాక్రమాన్ని చూపసాగాడు.

సీ. ధర్మపుత్త్రుఁడు గురుతనయుతోఁ బెనఁగుచో । బాసటయై శినిపౌత్త్రుఁ డడరె
నా యిద్దఱును ద్రౌపదేయులు వెఱఁగందు । నట్లు వారలను సైన్యంబుఁ బొదివి
బహుళాంధకార మాపాదించి యమ్మేటి । విలుకాని సాయక వితతి నింగి
ఘనమయంబుగఁ బర్వ జననాథ వా రల్గి । యొక్కొక్కరుం డనేకోగ్ర బాణ

ఆ. నిహతుఁ జేయ, నతఁడు ప్రహసిత వదనుఁడై । యొకని నొకని బహు సముజ్జ్వలాస్త్ర
విద్ధుఁ జేసి కడఁగి వివ్వచ్చుకొడుకు చా । పంబు దునిమెఁ గ్రూరభల్లనిహతి. 253

ప్రతిపదార్థం: జననాథ= ధృతరాష్ట్ర మహారాజా! గురుతనయుతోన్+పెనఁగుచోన్= అశ్వత్థామతో రణం చేస్తుండగా; శినిపౌత్రుఁడు= సాత్యకి; బాసట ఐ= అండగా; అడరెన్= నిలిచాడు; ఆ ఇద్దఱును= ధర్మరాజు సాత్యకియు; ద్రౌపదేయులు= ఉపపాండవులును; వెఱఁగు+అందు+అట్లు= ఆశ్చర్యపడేటట్లుగా; ఆ+మేటి విలుకాని= ఆ అశ్వత్థామయొక్క; సాయక వితతి= బాణసమూహం; వారలను సైన్యంబున్+పొదివి= వారిని, (వారి)సేనను కప్పి; బహుళ+అంధకారము+ఆపాదించి= పెనుచీకటిని క్రమ్మజేసి; నింగి ఘనమయంబుగన్+పర్వన్= ఆకాశము మబ్బులతో నిండునట్లు వ్యాపించగా; వారు+అల్గి= ఉపపాండవులు కోపించి; ఒక్కొక్కరుండు= ఒక్కొక్కడు; అనేక+ఉగ్రబాణ నిహతున్+చేయన్= పెక్కు వాడిబాణాలతో కొట్టగా; అతఁడు ప్రహసిత వదనుఁడు+ఐ= అశ్వత్థామ నవ్వుమొగంకలవాడై; ఒకనిన్+ఒకనిన్= ఒక్కొక్కరిని; బహు సముజ్జ్వల+అస్త్రవిద్ధున్+చేసి= అస్త్రాలు

నాటుకొనేటట్లు చేసి; కడఁగి= పూని; క్రూరభల్లనిహతిన్= పదునైన బల్లెములతో; విప్వచ్చుకొడుకు చాపంబున్= అర్జునుడి కుమారుడి (శ్రుతకీర్తి) ధనుస్సు; తునిమెన్= ఖండించాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ధర్మరాజు అశ్వత్థామతో యుద్ధం చేస్తుండగా, సాత్యకి సాయంగా వచ్చాడు. ధర్మరాజు, సాత్యకి, ఉపపాండవులు ఆశ్చర్యపడేటట్లుగా ఆ మేటి విలుకాడైన అశ్వత్థామ ప్రయోగించిన బాణసమూహం వారిని, వారి సైన్యాన్ని కప్పి, పెనుచీకటి క్రమ్ముకొనేటట్లుగ చేసి, ఆకాశం మబ్బులతో నిండినట్లుగ వ్యాపించగా, వారు (ధర్మజుడు, సాత్యకి, ఉపపాండవులు) ఆగ్రహించి, ఒక్కొక్కరు పెక్కు వాడిబాణాలతో అశ్వత్థామను కొట్టారు. అప్పుడతడు నవ్వుమొగంతో లెస్సగా మెరిసే పెక్కుబాణాలు ఒక్కొక్కరిని నాటుకొనేటట్లు వేశాడు. అంతేకాదు, పూనిక వహించి పదునైన బల్లెంతో అర్జున సుతుని (శ్రుతకీర్తి) ధనుస్సు త్రుంచాడు.

క. **ధృతి నొండు విల్లు కొని యా । శ్రుతకీర్తి దదీయ తనువు సొనిపెం బ్రదర**
త్రితయంబుఁ గనలి యాతం । డతనిం దత్పార్శ్వచరుల నమ్ముల ముంచెన్. **254**

ప్రతిపదార్థం: ఆ శ్రుతకీర్తి; ధృతిన్+ఒండు విల్లుకొని= ధైర్యంతో మరొకవిల్లు గైకొని; ప్రదర త్రితయంబున్= మూడు బాణాలను; తదీయ, తనువు, చొనిపెన్= అశ్వత్థామ దేహంలో నాటాడు; అతండు= అశ్వత్థామ; కనలి= కోపించి; అతనిన్+తద్+పార్శ్వచరులన్= శ్రుతకీర్తిని అతడి ప్రక్కనున్నవారిని; అమ్ములన్ ముంచెన్= బాణాలతో ముంచాడు.

తాత్పర్యం: శ్రుతకీర్తి మరొకవిల్లు తీసికొని అశ్వత్థామదేహంలో మూడుబాణాలు నాటగా, అతడు కోపించి శ్రుతకీర్తిని, అతడి సహాయులను బాణాలతో ముంచాడు.

క. **ముంచు మహోద్ధతి యాలో । కించి తనదు చూడ్కి దట్ట కెం పెసఁగం గో**
పించి శరనికరములు గు । ప్పించుచు ధర్మజుఁడు గవిసె భీషణభంగిన్. **255**

ప్రతిపదార్థం: ముంచు, మహా+ఉద్ధతి= (ఆ విధంగా) ముంచుతున్న (బాణాలతో కొట్టుతున్న అతడి) మహావిజృంభణాన్ని; ఆలోకించి= చూచి; ధర్మజుఁడు= ధర్మరాజు; తనదుచూడ్కి= తనచూపు; దట్టకెంపు+ఎసఁగన్+కోపించి= బాగా ఎర్రబడేటట్లు కోపించి; శరనికరములు గుప్పించుచున్= బాణాలసమూహాలు కురిపిస్తూ; భీషణభంగిన్= భయం గొల్పేటట్లుగా; కవిసెన్= తాకాడు.

తాత్పర్యం: అశ్వత్థామ విజృంభణాన్ని చూచిన ధర్మరాజు ఆగ్రహంతో కళ్ళు ఎర్రజేసి అతడిపై బాణసమూహం గుప్పిస్తూ భయంకరంగా ఎదుర్కొన్నాడు.

చ. **కదిసిన నమ్మహాభుజుఁడు గార్ముకముం దనుమాడి మూఁడు బె**
ట్టిదపు మెఱుంగు తూపులఁ బటిష్ఠత సూపిన నా నృపాలుఁ డు
న్మదుఁ డయి మేటివింట బలుమార్గణముల్ వెస నేసె మూఁడు న
ర్వదియును నద్ధరామరునిపై శినివంశవరుండు దోడ్పడన్. **256**

ప్రతిపదార్థం: కదిసినన్= ఎదుర్కొనగా; ఆ+మహాభుజుఁడు= ఆ గొప్పబాహువులు గల అశ్వత్థామ; కార్ముకమున్+తునుము ఆడి= విల్లును త్రుంచి; మూఁడు బెట్టిదపు మెఱుంగు తూపులన్= మూడు వాడి అయిన ప్రకాశించే బాణాలతో;

పటిష్ఠత+చూపినన్= బలం ప్రదర్శించగా; ఆ నృపాలుఁడు= ఆ ధర్మరాజు; ఉన్మదుఁడు+అయి= ఆవేశం పొంది; శినివంశ, వరుండు, తోడ్పడన్= సాత్యకి సహాయపడగా; మేటివింటన్= గొప్ప ధనువునుండి; మూఁడును+అర్వదియును= అరవైమూడు; బలుమార్గణముల్= వాడిబాణాలు; ఆ+ధరా+అమరునిపైన్= ఆ బ్రాహ్మణుడిపై (అశ్వత్థామ)పై; వెసన్+ఏసెన్= శీఘ్రంగా ప్రయోగించాడు.

తాత్పర్యం: (ఆ విధంగా ధర్మరాజు) ఎదుర్కోగా ఆ బలశాలి అయిన అశ్వత్థామ, అతడి విల్లు త్రుంచి, మూడు వాడి మెరుగుటమ్ములతో తన బలమేమిటో చూపాడు. ఆ బాణాల దెబ్బకు ధర్మరాజు ఆగ్రహావేశపరుడై, తనకు సాత్యకి తోడుపడగా, వేరొక పెద్దవిల్లు చేపట్టి, అరవైమూడు వాడిబాణాలు అశ్వత్థామమీద వేగంగా ప్రయోగించాడు.

వ. ఇట్లు ప్రాపై కడంగి. 257

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; ప్రాపు+ఐ= అండగా ఉండి; కడంగి= పూనుకొని.

తాత్పర్యం: సాత్యకి ఈ విధంగా తోడ్పడి.

ఆ. అర్ధచంద్రబాణహతి గురుపుత్రుని । ధనువు శినివరుండు దునుముటయును,
శక్తి వైచి యతఁడు సారథిఁ గూల్చి బల్ । వింటఁ గురిసె బహుళవిశిఖ వృష్టి. 258

ప్రతిపదార్థం: శినివరుండు= సాత్యకి; అర్ధచంద్రబాణహతిన్= అర్ధచంద్రాకారంగల బాణందెబ్బతో; గురుపుత్రుని ధనువు= అశ్వత్థామ ధనుస్సును; తునుముటయును= ఖండించగా; అతఁడు= అశ్వత్థామ; శక్తిన్+వైచి= బల్లెం వేసి; సారథిన్+కూల్చి= సారథిని చంపి; బహుళ విశిఖవృష్టిన్= పెక్కు బాణాలవర్షాన్ని; బల్ వింటన్+కురిసెన్= బలిష్ఠమైన ధనుస్సుతో గుప్పించాడు.

తాత్పర్యం: సాత్యకి అర్ధచంద్రాకారబాణంతో అశ్వత్థామ విల్లును త్రుంచగా, అశ్వత్థామ బల్లెంతో సాత్యకి సారథిని చంపి, అతడిమీద బాణవర్షం కురిపించాడు.

క. సారథి లేమిని సాత్యకి । తే రీడ్చెఁ దురంగమములు దే రటు వాఱన్
భూరమణ! ధర్మనందను । వారు వొదివి రంపగముల వడి గురుతనయున్. 259

ప్రతిపదార్థం: భూరమణ!= రాజా!; సారథిలేమిని= సారథి లేకపోవటంతో; తురంగమములు= గుర్రాలు; సాత్యకి తేరు+ఈడ్చెన్= సాత్యకి రథాన్ని ఈడ్చుకువెళ్ళాయి; తేరు+అటు పాఱన్= రథం అటు తొలగిపోగా; ధర్మనందనువారు= ధర్మరాజు వెంటనున్నవారు; వడిన్= వేగంగా; అంపగములన్= బాణాలగుంపులతో; గురుతనయున్= అశ్వత్థామను; పొదివిరి= తాకారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! సారథిలేని సాత్యకి తేరును గుర్రాలు ఈడ్చుకొనివెళ్ళాయి. ధర్మరాజు పక్షంలోని వీరులు అది చూచి బాణ సమూహాలు ప్రయోగిస్తూ వెంటనే అశ్వత్థామను ఎదుర్కొన్నారు.

క. భీమాస్త్రశిఖల నశ్వ । త్థామాగ్ని దహించె ధర్మతనయానుచర
స్తోమాటవి నొక వ్రేల్మిడి । నామెయి జన్మవిస్మయావహం బయ్యె నృపా! 260

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; అశ్వత్థామ+అగ్ని= అశ్వత్థామ అనే దావాగ్ని; భీమ+అస్త్ర శిఖలన్= భయంకర అస్త్రములనే జ్వాలలతో; ధర్మతనయ+అనుచరస్తోమ+అటవిన్= ధర్మజుడి అనుచరుల సముదాయమనే అడవిని; ఒక వ్రేల్మిడిన్= క్షణంలో; దహించెన్= దహించింది; ఆమెయి= ఆ తీరు; జన విస్మయ+ఆవహంబు+అయ్యెన్= చూపరులకు ఆశ్చర్యం కలిగించింది.

తాత్పర్యం: ఓ రాజా! అశ్వత్థామ అనే దావాగ్ని, భయంకరాస్త్రాలనే మంటలతో, ధర్మరాజు అనుచరసమూహం అనే అడవిని ఒక్క క్షణంలో దహించివేయగా అది చూపరులకు ఆశ్చర్యం కలిగించింది.

విశేషం: అలం: రూపకం.

వ. **అప్పుడు కురురాజు పాండవుల నాచార్య నందనుచేతం దెగినవారలంగాఁ దలంచె నంతఁ దఱిమి యుధిష్ఠిరుండు ప్రచండ కాండంబుల నవ్విప్రవరుం బీడితుం జేసి.** **261**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కురురాజు= దుర్యోధనుడు; పాండవులను= పాండవులను; ఆచార్య నందనుచేతన్= అశ్వత్థామచేత; తెగినవారలన్+కాన్+తలంచెన్= చంపబడ్డవారుగా భావించాడు; అంతన్= అప్పుడు; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; తఱిమి= వెంబడించి; ఆ+విప్రవరున్= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడైన అశ్వత్థామను; ప్రచండ కాండంబులన్= తీక్ష్ణమైన బాణాలతో; పీడితున్+చేసి= నొప్పించి.

తాత్పర్యం: అప్పుడు పాండవులు అశ్వత్థామచేత సంహరించబడ్డారని దుర్యోధనుడు సంతోషించాడు. ఇంతలోనే ధర్మరాజు అశ్వత్థామను తరుముతూ వాడిబాణాలతో నొప్పించి.

సీ. **అలవును వెరవును గలవు కృతాస్త్రుండ । వని నిన్ను నెఱుఁగుదు; నైన నెల్ల**
సొంపు పార్షతునకుఁ జూపనోపినఁ దెల్ల । మగు; నది యట్లుండె; నరయ నీకు
నెయ్యంబు వాటించునేర్పు కృతజ్ఞత । యనునివి లేవు; బ్రాహ్మణుఁడు దపము
దమమును గల్గు వర్తనమున నుండుఁగా । కని సేయునే? యెంత యడిచిపడినఁ

ఆ. **బడితిగాని యడ్డపడలేవు కౌరవ । కులము నెల్లభంగి గెలుతు మేము**
నీవ చూడ' ననుడు నా వీరుఁ డేమియు । ననక నగుచుఁ బఱపె నంపవెల్లి. **262**

ప్రతిపదార్థం: అలవును, వెరవును, గలవు= బలం ఉపాయం నీలో ఉన్నాయి; నిన్నున్= నిన్ను; కృత+అస్త్రుండవు+అని= అస్త్రాలలో ఆరితేరినవాడవని; ఎఱుఁగుదున్= నాకు తెలుసు; ఐనన్= అయినా; ఎల్లసొంపు= నీ గొప్పతనం; పార్షతునకున్= ధృష్టద్యుమ్నుడికి; చూపన్+ఓపినన్+తెల్లము+అగున్= చూపినప్పుడే తెలుస్తుంది; అది+అట్లు+ఉండెన్= ఆ సంగతి అట్లా ఉంచుము; అరయన్= చూడగా; నీకున్; నెయ్యంబు+పాటించునేర్పు= స్నేహాన్ని పాటించే తెలివి; కృతజ్ఞత+అను+ఇవిలేవు= కృతజ్ఞతాభావం అనేవి లేవు; బ్రాహ్మణుఁడు= ద్విజుడు; తపము దమమును గల్గు వర్తనమునన్ ఉండున్+కాక= తపస్సు, సంయమనంతో కూడిన ప్రవర్తన కల్గిఉంటాడు కాని; అనిచేయునే?= యుద్ధం చేస్తాడా?; ఎంత+అడిచి పడినన్+పడితి(వి)+ కాని= ఎంత మిడిసిపడినా పడ్డావుగాని; అడ్డపడలేవు= మా విజృంభణాన్ని నిలువరింపలేవు. (కౌరవులను కాచుకొనలేవు); కౌరవకులమున్= కౌరవసమూహాన్ని; నీవు+అ చూడన్= నీవే చూడగా; ఏము, ఎల్లభంగి(న్) గెలుతుము= మేము ఏ విధంగానైనా జయిస్తాము; అనుడున్= అనగా; ఆ వీరుఁడు= అశ్వత్థామ; ఏమియున్+అనక= బదులు పలుకకుండా; నగుచున్= నవ్వుతూ; అంపవెల్లిన్= బాణవర్షాన్ని; పఱపెన్= గుప్పించాడు.

తాత్పర్యం: 'నీవు బలం, చాతుర్యం కలవాడవని అస్త్రవిశారదుడవని నాకు తెలుసు. కాని సేనాధిపతి అయిన ధృష్టద్యుమ్నుడి ముందు నీ పరాక్రమం చూపినప్పుడే నీ గొప్పతనమంతా అందరికీ గోచరం అవుతుంది. అయినా నీలో స్నేహభావం, కృతజ్ఞత అనేవే లేవు. బ్రాహ్మణుడైనవాడు తపస్సుతో కాలం గడుపుతూ నిగ్రహవంతుడై ఉండాలి కాని, గర్వంతో యుద్ధం చేయడు. నీవు యుద్ధం చేసినా మాకు అడ్డుగా నిలువలేవు. కౌరవులను మేము గెల్చి తీరుతాం' అని ధర్మరాజు అన్న మాటలకు బదులు చెప్పకుండా అశ్వత్థామ బాణవర్షం కురిపించాడు.

వ. ఆ వెల్లికి నోర్వలేక యా భూవిభుండు దొలంగె; ని ట్లంతటి మానిసిం గెలిచినవాఁడై నిలిచి నిజపార్శ్వంబుల మూఁకలం గనుఁగొని గురుపుత్రుండు గ్రూర విహారంబునకు నమరి మెఱసె; మారుతితోడం బోరు కర్ణుండు దదనుచరంబులగు కరూశ చేది సృంజయ పుంజంబులుం దన్నుఁబొదివిన నబ్బలంబునకు బాహుబలంబు సూపుచుండ నతని విడిచి యా భీమసేనుండు గౌరవసేనపయిం గవిసి కనుపుగొట్టె; నా రాధేయ వృకోదరుల మునుములు ధనంజయ మునుము భంగిం బ్రజాక్షయం బగుచుండె; నీ దుర్మంత్రంబున ననేకులకుం బొలియవలసె; నయ్యవసరంబున. 263

ప్రతిపదార్థం: ఆ వెల్లికిన్+ఓర్వలేక= ఆ బాణప్రవాహానికి తట్టుకొనలేక; ఆ భూవిభుండు తొలంగెన్= ధర్మరాజు వెనుదిరిగాడు; ఇట్లు= ఈ విధంగా; అంతటి మానిసిన్= వీరుడైన ధర్మజుడిని; గెలిచినవాఁడు+ఐ నిలిచి= జయించి నిలిచి; గురుపుత్రుండు= అశ్వత్థామ; నిజ పార్శ్వంబుల మూఁకలన్+కనుఁగొని= తన ప్రక్కనున్న సైనికులను చూచి; క్రూరవిహారంబునకున్= ఘోరయుద్ధానికి; అమరి మెఱసెన్= సిద్ధమై ఒప్పారాడు; మారుతితోడన్+పోరు, కర్ణుండు= భీముడితో యుద్ధం చేస్తున్న కర్ణుడు; తద్+అనుచరంబులు+అగు= అతడికి సహాయులైన; కరూశ, చేది, సృంజయ, పుంజంబులున్= కరూశచేది దేశీయుల సృంజయుడి సైన్యసమూహాలు; తన్నున్+పొదివినన్= తనను చుట్టుముట్టగా; ఆ బలంబునకున్= ఆ సైన్యాలకు; బాహుబలంబు, చూపుచుండన్= తన భుజబలాన్ని చవిచూపుతూ ఉండగా; ఆ భీమసేనుండు= భీముడు; అతనిన్ విడిచి= కర్ణుడిని వదలి; కౌరవసేనపయిన్+కవిసి= కౌరవసేనను తాకి; కనుపుకొట్టెన్= క్షోభపెట్టాడు; ఆ, రాధేయ, వృకోదరుల మునుములు= కర్ణ, భీముల ముందున్న సేనలు; ధనంజయు, మునుము భంగిన్= అర్జునుడి ముందున్న సేనవలె; ప్రజాక్షయంబు+అగుచుండె= జననాశం పొందసాగింది; నీ దుర్మంత్రంబునన్= నీ కుటిలనీతివల్ల; అనేకులకున్+పొలియన్ వలసెన్= ఎందరో చావవలసి వచ్చింది; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ బాణప్రవాహానికి తట్టుకోలేక ధర్మరాజు ప్రక్కకు తప్పుకొన్నాడు. ఈ విధంగా ధర్మరాజంతటి వానిని గెలిచిన అశ్వత్థామ, తన ప్రక్కల ఉన్న సైన్యాలను చూచి ఘోరయుద్ధానికి సిద్ధమై నిలిచాడు. భీముడితో పోరాడుతున్న కర్ణుడు, భీముడికి సహాయంగా ఉన్న కరూశ, చేదిదేశాల సైన్యాలు, సృంజయుడి సైన్యం తన్ను చుట్టుముట్టగా, ఆ బలగాలకు తనబాహుబలం చవిచూపుతుండగా, భీముడు కర్ణుని వదలి కౌరవసైన్యం మీదికి విజృంభించి క్షోభపెట్టాడు. ఆ కర్ణుడి ముందు భీముడి ముందు ఉన్న సైన్యాలు, అర్జునుడి ముందున్న సైన్యం వలె నశించసాగింది. ధృతరాష్ట్ర మహారాజా! నీ కుటిలనీతివల్లనే ఇంత జనక్షయం.

విశేషం: కరూశదేశానికి దంతవక్త్రుడు, చేదిదేశానికి శిశుపాలుడు రాజులు, సృంజయుడు సువర్ణష్ఠీవి తండ్రి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. కవలతోఁ బెనఁగెడు కౌరవనాథుఁ డ । న్నకులు నంగంబున నవ శరములు
సొనిపి యా సహదేవు కనకపు సిడము ద్రుం । చిన, వార లిరువురు నెనిమిదింటఁ
బది తూపులను నొంపఁ; బతి రెండు విండులుఁ । దునుమాడుటయు నన్యధనువు లెత్తి
యన్నయుఁ దమ్ముండుఁ దన్నుఁ బెక్కమ్ములఁ । బొదివినఁ గనలి యా భూవిభుండు

తే. వారి దివ్యాస్త్రములఁ గప్పు ఘోరభంగి । గాంచి జను లక్కుమారులు గాలవశతఁ
బొందుదుర కాఁ దలంప నప్పుడు గడంగి । యడ్డపడియె ధృష్టద్యుమ్నుఁ డతి రయమున. 264

ప్రతిపదార్థం: కవలతోన్= నకుల సహదేవులతో; పెనఁగెడు కౌరవనాథుఁడు= పోరుతున్న దుర్యోధనుడు; ఆ+నకులు+ అంగంబునన్= ఆ నకులుడి దేహంలో; నవ శరములు చొనిపి= తొమ్మిది బాణాలు నాటి; ఆ, సహదేవు, కనకపు, సిడము, త్రుంచినన్= ఆ సహదేవుడి బంగారుధ్వజం ఖండించగా; వారలు+ఇరువురున్= నకుల సహదేవులిద్దరు; ఎనిమిదింటన్ పదితూపులను నొంపన్= వరుసగా ఎనిమిది పది బాణాలతో నొప్పించగా; పతి= దుర్యోధనుడు; రెండువిండులున్ తునుము+ ఆడుటయున్= ఇద్దరి ధనుస్సులు రెండింటిని ఖండించగా; అన్నయున్+తమ్ముండున్= నకుల సహదేవులు; అన్యధనువులు+ ఎత్తి= వేరే విల్లులు చేపట్టి; తన్నున్+పెక్కు+అమ్ములన్+పొదివినన్= తనను పెక్కు బాణాలతో ఆక్రమించగా; ఆ భూవిభుండు= కౌరవరాజు; కనలి= కోపించి; వారిన్ దివ్య+అస్త్రములన్+కప్పు= వారిద్దరిని దివ్యాస్త్రాలతో ముంచుతున్న; ఘోరభంగి కాంచి= భయంగొల్పే విధం చూచి; జనులు= చూపరులు; ఆ+కుమారులు= నకుల సహదేవులు; కాలవశతన్+పొందుదుర కాన్+తలంపన్= మృత్యువు పాలగుదు రని భావించగా; అప్పుడు= ఆ సమయంలో; కడంగి= పూనుకొని; ధృష్టద్యుమ్నుఁడు; అతి రయమునన్= కడువేగంతో; అడ్డపడియెన్= అడ్డుకొన్నాడు.

తాత్పర్యం: నకుల సహదేవులతో యుద్ధం చేస్తున్న దుర్యోధనుడు, నకులుడి దేహాన తొమ్మిదిబాణాలు నాటి, సహదేవుడి బంగారుధ్వజాన్ని ఖండించగా, ఆ అన్నదమ్ములిద్దరు వరుసగా ఎనిమిది, పది బాణాలతో దుర్యోధనుని నొప్పించారు. దుర్యోధనుడు ఆ యిద్దరి ధనుస్సులను ఖండించాడు. అప్పుడు ఆ యిద్దరు వేరే విల్లులు చేపట్టి అనేక బాణాలతో దుర్యోధనుని నొప్పించారు. దుర్యోధనుడు ఆగ్రహించి ఆ యిద్దరిని దివ్యాస్త్రాలతో ముంచుతున్న భయంకరపద్ధతిని చూచి, జనులంతా నకుల సహదేవులు మృత్యువాత పడ్డారని భావించారు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు పూనుకొని అమితవేగంగా అడ్డుపడ్డాడు.

వ. ఇట్లు పాండవ సేనాపతి భూనాథుం దాఁకి యేసిన నతండు. 265

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవ సేనాపతి= ధృష్టద్యుమ్నుడు; భూనాథున్+తాఁకి+ఏసినన్= దుర్యోధనుడిని ఎదుర్కొని బాణాలు ప్రయోగించగా; అతండు= దుర్యోధనుడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుణ్ణి ఎదుర్కొని బాణాలు వేయగా అతడు.

ధృష్టద్యుమ్నుఁడు దుర్యోధనుం దాఁకి విరథునిఁ జేయుట (సం. 8-40-21)

ఆ. ఇరువదేను నిశిత శరముల నొప్పింప । నలిగి యాతఁ డతని యంగకముల
నలువదేను తూపు లడరింప నలికె న । క్కొరవేశ్వరుండు గార్ముకంబు. 266

ప్రతిపదార్థం: ఇరువది+ఏను నిశిత, శరములన్, నొప్పింపన్= ఇరవై అయిదు బాణాలతో బాధించగా; ఆతఁడు= ధృష్టద్యుమ్నుడు; అలిగి= కోపించి; అతని అంగకములన్= దుర్యోధనుడి అంగాలపై; అఱువది+ఏను తూపులు+అడరింపన్= అరవై అయిదు బాణాలు వేయగా; ఆ+కౌరవ+ఈశ్వరుండు= ఆ దుర్యోధనుడు; కార్ముకంబు= అతడి ధనుస్సును; నఱకెన్= ఖండించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడిపై ఇరవైఅయిదు బాణాలు వేయగా, అతడు కోపించి బదులుగా అరవై అయిదు బాణాలు గుప్పించాడు. దుర్యోధనుడు అతడి వింటిని ఖండించాడు.

మ. బలువి ల్లుగ్రత నెత్తి యొక్క మొగి నప్పాంచాలవర్యుండు దీ
ప్తులు గ్రమ్మం బదియేను మార్గణము లా భూమీశుపై నేసినం
గలయం బూచిన కింశుకంబు చెలు వంగం బొందఁ దచ్చాపముం
బెలుచం ద్రుంచి యతండు ఫాలమున గుప్పించెన్ దశోగ్రాస్త్రముల్. 267

ప్రతిపదార్థం: ఆ+పాంచాలవర్యుండు= ఆ ధృష్టద్యుమ్నుడు; బలువిల్లు+ఉగ్రతన్+ఎత్తి= బలిష్ఠమైన విల్లును భయంకరంగా ఎత్తి; దీప్తులు క్రమ్మన్= కాంతులు ప్రసరించగా, ఒక్క మొగిన్= ఒక్కసారిగా; పది+ఏను, మార్గణములు= పదునైదు బాణాలు; ఆ భూమి+ఈశుపైన్+ఏసినన్= దుర్యోధనుడిపై వేయగా; అతండు= అతడు; అంగంబు= తన శరీరం; కలయన్+పూచిన, కింశుకంబు చెలువు= నిలువెల్లా పూచిన మోదుగు అందం; ఒందన్= పొందగా; తద్+చాపమున్= ధృష్టద్యుమ్నుడి విల్లును; పెలుచన్+త్రుంచి= కోపంతో విరిచి; ఫాలమునన్= నొసటిపై; దశ+ఉగ్ర+అస్త్రముల్= పది భయంకర అస్త్రాలను; గుప్పించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు బలమైన విల్లు చేబూని దుర్యోధనుడిపై ఒక్కసారిగా పదిహేను బాణాలు గుప్పించాడు. శరీరం పూచిన మోదుగు అందాన్ని పొందగా అతడు కోపించి ధృష్టద్యుమ్నుడి ధనుస్సును ఖండించి అతడి నొసటిపై పది అస్త్రాలను ప్రయోగించాడు.

క. కాలాయసనారాచము। లోలి నుదుట నాటి యున్న నొప్పారెం బాం
చాలవరు ముఖము మధుకర। మాలికచేఁ బొలుచు తమ్మి మాడ్కిం జూడన్. 268

ప్రతిపదార్థం: కాల+ఆయస నారాచములు= నల్లనైన ఇనుపబాణాలు; ఓలిన్ నుదుట నాటి ఉన్నన్= వరుసగా ఫాలభాగము నందు నాటుకొనగా; పాంచాలవరుముఖము= ధృష్టద్యుమ్నుడి ముఖం; చూడన్= చూడగా; మధుకర మాలికచేన్+పొలుచు, తమ్మి, మాడ్కిన్= తుమ్మెదల వరుసతో కూడిన పద్మంవలె; ఒప్పారెన్= అందంగా ఒప్పింది.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడి నొసటిపై నాటిన నల్లని ఇనుపబాణాలతో అతడి ముఖం, తుమ్మెదల గుంపు వాలిన పద్మంవలె ఒప్పారింది.

విశేషం: అలం: ఉపమ.

సీ. కనలి యవ్వీరుండు గార్ముకాంతరమునఁ। గ్రూర భల్లంబుల ఘోటకముల
సారథిఁ జాపంబుఁ దేరును గొడుగును। దునుమాడఁగా భవత్పుత్రుఁ డేపు
గుందక శక్తి నిగుడ్పఁగఁ ద్రుంచె నే। డ్తెఱఁ గృపాణము గొన నుఱుము సేసె;
గద యెత్తఁ బఱియలు గావించె; నుబ్బి ర। త్నమయాహి కేతువు నఱకి వైచె;

తే. నిట్లు హయసూత కోదండహీను దళిత । రథుని విగతాతపత్త్రు నిర్భగ్న శక్తి
ఖడ్గ ముద్గర కేతు విఖండితాపి । ధానుఁ జేసె నప్పార్షతుం డా నరేంద్రు. 269

ప్రతిపదార్థం: ఆ+వీరుండు= ధృష్టద్యుమ్నుడు; కనలి= కోపించి; కార్ముక+అంతరమునన్= మరొక ధనువుతో; క్రూరభల్లంబులన్= వాడియైన బాణాలతో; ఘోటకములన్= గుర్రాలను; సారథిన్, చాపంబున్= రథసారథిని ధనుస్సును; తేరును గొడుగును= రథాన్ని, గొడుగును; తునుమాడఁగాన్= ఖండించగా; భవత్+పుత్త్రుఁడు= నీ కుమారుడు (దుర్యోధనుడు); ఏపు, కుందక= అతిశయం తగ్గక; ఏడ్తెఱన్= పరాక్రమంతో; శక్తి నిగుడ్పఁగన్+త్రుంచెన్= బల్లెము నెత్తగా దానిని ఖండించాడు; కృపాణము+కొనన్= కత్తి చేబూనగా; నుఱుముచేసెన్= పొడిచేశాడు; గద ఎత్తన్+పఱియలు కావించెన్= గద తీసుకోగా దాన్ని బద్దలు చేశాడు; ఉబ్బి= ఉప్పొంగి; రత్నమయ+అహికేతువు= రత్నమయమైన సర్పధ్వజాన్ని; నఱకివైచెన్= విరిచాడు; ఇట్లు= ఇట్లా; ఆ+పార్షతుండు= ధృష్టద్యుమ్నుడు; ఆ నరేంద్రున్= దుర్యోధనుడిని; హయ, సూత, కోదండ, హీనున్= అశ్వాలు సారథి విల్లు లేనివాడిగా; దళిత రథుని= రథహీనునిగా; నిర్భగ్న, శక్తి, ఖడ్గ, ముద్గర, కేతున్= భగ్నం చేయబడిన ఈటె కత్తి ఇనుపగుదియ ధ్వజం కలవాడిగా; విఖండిత+అపిధానున్+చేసెన్= ఖండించబడిన కవచం కలవాడిగా చేశాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు కోపించి వేరొక విల్లు తీసుకొని, వాడిబాణాలతో దుర్యోధనుడి గుర్రాలను, సారథిని, ధనుస్సును, రథాన్ని, ఛత్రాన్ని ఖండించగా, నీ కుమారుడు గర్వం తగ్గక బల్లెం ఎత్తగానే దాన్ని ఖండించాడు. పరాక్రమంతో ఖడ్గాన్ని చేపట్టగా, దాన్ని పొడి చేశాడు. గదను తీసుకోగా దాన్ని బ్రద్దలు చేశాడు. పెల్లుబికి రత్నమయమైన సర్పధ్వజాన్ని నరికివేశాడు. ఈ విధంగా ఆ ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుణ్ణి రథాశ్వసూత కోదండ విహీనునిగా చేసి, అతని ఈటెను, కత్తిని, ఖడ్గాన్ని, ముద్గరాన్ని, ధ్వజాన్ని, కవచాన్ని కూడా ఖండించాడు.

తే. వికల సాధనుఁ డైన యవ్విభుని నతని । తమ్ముఁ డగు దండధారుండు దనదు తేరి
మీఁద నిడుకొని శత్రు సమీప భూమి । వాయఁ గొనిపోయెఁ జూచి రాధేయుఁ డపుడు. 270

ప్రతిపదార్థం: వికల సాధనుఁడు+ఐన ఆ+విభునిన్= అన్ని సాధనాలు కోల్పోయిన ఆ దుర్యోధనుని; అతని తమ్ముఁడు+అగు దండధారుండు= అతడి సోదరుడైన దండధారుడు; తనదు తేరిమీఁదన్+ఇడుకొని= తన రథంపై చేర్చుకొని; శత్రుసమీప భూమి+పాయన్+కొనిపోయెన్= శత్రుభూమికి దూరంగా తీసికొనివెళ్ళాడు; రాధేయుఁడు= కర్ణుడు; చూచి= అది చూచి; అపుడు.

తాత్పర్యం: అన్ని సాధనాలూ కోల్పోయిన దుర్యోధనుని అతడి సోదరుడు తన రథంమీదికి లాగికొని యుద్ధభూమి నుంచి దూరంగా తీసికొనివెళ్ళాడు. అది చూచిన కర్ణుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. శినివంశవరునితోడం । బెనఁగి పెనఁగి యతని విడిచి పెలుచ ద్రుపదనం
దనుని రథమునకు నెదురుగఁ । దన యరదము సనఁగ నిచ్చె ధరణీనాథా! 271

ప్రతిపదార్థం: ధరణీనాథా= ధృతరాష్ట్ర మహారాజా!; శినివంశవరునితోడన్+పెనఁగి పెనఁగి= సాత్యకితో పోరాడి పోరాడి; అతనిన్ విడిచి= అతడిని వదలి; పెలుచన్= అతిశయంతో; ద్రుపదనందనుని రథమునకున్+ఎదురుగన్= ధృష్టద్యుమ్నుడి రథానికి ఎదురుగా; తన అరదము చనఁగన్+ఇచ్చెన్= తన రథాన్ని పోనిచ్చాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! సాత్యకితో పోరాడుతున్న కర్ణుడు అతడిని విడిచి ధృష్టద్యుమ్నుడి రథానికి ఎదురుగా తన రథాన్ని పోనిచ్చాడు.

వ. సాత్యకియును శరంబులు గురియుచుఁ దోన తవిలె; నుభయసేనాపతులగు నా సూతనందన ధృష్టద్యుమ్ను లట్లు దార్కొనిన నయ్యిరువాఁగునందు నొక్కరుండైన నోలమాసగొనక కడంగినం బోరు ఘోరంబయ్యె నట్టియెడఁ బాంచాలకుమారులు వ్యాఘ్రకేతు సుశర్మ శుక్ల చిత్రోగ్రాయుధులును, జయరోచమాన సింహసేనులును, బలుదేరుల మొత్తంబులతోఁ దన్నుం గవిసినం గర్ణుం డయ్యెనమండ్రు వీరుల నెనిమిది భల్లంబులం దునిమి, తత్సహచరుల బహుసహస్ర రథికుల సమయించినం జేది రథిక ప్రవరులు జిష్ణు జిష్ణు కర్మ దేవాపిభద్రులును దండ చిత్ర చిత్రాయుధులును హరిసింహ కేతు రోచమాన శలభులును సబలంబుగాఁ దలపడిన నా పదునొక్కండ్ర నొక్కపెట్ట బెట్టిదంపు టంపఱ పాలుచేసి మఱియును బిరుదులయి పయింబడిన దొరలను వారి పరివారంబులను వసుధం గూల్చియు నలంచియుం గలంచియుం గడిమి మెఱయుచు నిట్టిచందంబు భీష్మద్రోణులయందుఁ జూడమని జనంబులు వెక్కసపడ వివిధ సమరవిహారంబు సలిపి, వెండియు. 272

ప్రతిపదార్థం: సాత్యకియును= సాత్యకికూడా; శరంబులు కురియుచున్= బాణాలు కురిపిస్తూ; తోన తవిలెన్= వెంటపడ్డాడు; ఉభయ సేనాపతులు+అగు= ఉభయపక్షాలకు సేనాధిపతులైన; ఆ సూతనందన ధృష్టద్యుమ్నులు= కర్ణ ధృష్టద్యుమ్నులు; అట్లు తార్కొనినన్= ఆ విధంగా తలపడగా; ఆ+ఇరువాఁగునందున్= ఆ రెండు పక్షాలలో; ఒక్కరుండు+ఐనన్= ఒక్కరు కూడా; ఓలము+ఆసగొనక= దేహరక్షణకు ఆశపడకుండా; కడంగినన్+పోరు ఘోరంబు+అయ్యెన్= పూనుకోగా యుద్ధం తీవ్రమైంది; అట్టిఎడన్+పాంచాలకుమారులు= అప్పుడు పాంచాల కుమారులైన; వ్యాఘ్రకేతు సుశర్మ శుక్ల చిత్ర+ఉగ్రాయుధులును= వ్యాఘ్రకేతు సుశర్మ శుక్లుడు, చిత్రుడు, ఉగ్రాయుధుడు; జయరోచమాన సింహసేనులును= జయుడు రోచమానుడు సింహసేనుడు అనేవారు; పలుతేరుల మొత్తంబులతోన్= అనేక రథ సమూహాలతో; తన్నున్+కవిసినన్= తనతో తలపడగా; కర్ణుండు+ఆ+ఎనమండ్రు వీరులన్= కర్ణుడు ఆ ఎనిమిదిమంది వీరులను; ఎనిమిది భల్లంబులన్+తునిమి= ఎనిమిది బల్లెములతో చంపి; తద్+సహచరుల బహు సహస్ర రథికులన్= వారి అనుచరులైన వేలమంది వీరులను; సమయించినన్= సంహరించగా; చేది రథిక ప్రవరులు= చేది దేశవీరులైన; జిష్ణు జిష్ణుకర్మ దేవాపి భద్రులును; దండచిత్ర చిత్రాయుధులును; హరిసింహకేతు రోచమాన శలభులును; సబలంబుగాన్+తలపడినన్= తమ సైన్యాలతో ఎదుర్కొనగా; ఆ పదునొక్కండ్రన్+ ఒక్కపెట్టన్= ఆ పదకొండుమంది వీరులను ఒకేసారి; బెట్టిదంపు+అంపరపాలు చేసి= క్రూరబాణాలకు గురిచేసి; మఱియును బిరుదులయి= ఇంకా వీరులై; పయిన్+పడిన దొరలను= తనపైకి వచ్చిన రాజులను; వారి పరివారంబులను= వారి సైన్యాలను; వసుధన్+కూల్చియున్= నేలపై కూల్చియు; నలంచియున్+కలంచియున్= అలయించి కలతపెట్టియు; కడిమి మెఱయుచున్= పరాక్రమంతో ప్రకాశిస్తూ; ఇట్టి చందంబు భీష్మద్రోణులయందున్+చూడము= ఇటువంటి పరాక్రమం భీష్మద్రోణాచార్యులయందుకూడా చూడము; అని జనంబులు వెక్కస పడన్= అని జనులంతా ఆశ్చర్యపడగా; వివిధ సమర విహారంబు సలిపి= పెక్కు తీరులుగా యుద్ధం చేసి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: సాత్యకికూడా బాణాలు కురిపిస్తూ, అతడి వెంటపడ్డాడు. పాండవ కౌరవ సేనాపతులైన ధృష్టద్యుమ్న కర్ణులు తలపడగా ఇరుపక్షాలవారూ ప్రాణాలను సైతం లెక్కచేయక యుద్ధానికి పూనుకోగా పోరు తీవ్రమైంది. పాంచాలకుమారులు ఎనిమిదిమంది రథసైన్యంతో వచ్చి తనను ఎదుర్కొనగా, కర్ణుడు వారిని సంహరించాడు. వారి సహచరులు వేలమంది వీరులను కూడా అంతం చేశాడు. చేది దేశవీరులు పదకొండుమంది ఎదుర్కోగా ఆ పదకొండుమందిని వారి అనుచరులను బాణాలతో కూల్చాడు. ఇంకా వీరులైన పెక్కుమంది రాజులు, వారి సేనలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తనపైకిరాగా అందరిని సంహరించి పరాక్రమంతో ప్రకాశించాడు. ఇంతటి పరాక్రమం భీష్మ ద్రోణుల్లో కూడ చూడలేదని జనం ఆశ్చర్యపడగా కర్ణుడు అనేకవిధాల యుద్ధవిహారం చేసి, ఇంకా.....

సీ. సింహంబుబారిఁ జొచ్చిన గజంబుల భంగిఁ, । బులి కగ్గమైన జింకల విధమున,
జ్వలనంబుఁ గిట్టిన శలభంబులట్లుఁ, బాం । చాల యోధులుఁ జేది సైనికులును
దనుఁ దాఁకి పొలియ రాధాతనూభవుఁ । డనిఁ దనివోక ధర్మనందనుని యున్న
చక్కటి కడర ధృష్టద్యుమ్నుఁడును ద్రౌప । దీపుత్రులును సహదేవుఁడును శి

తే. ఖండియును సాత్యకియు నకులుండు జేయఁ । గల మహీశులుఁ బొదివి రక్కర్ణు; నతఁడు
పెక్కు పాములు వొదివినఁ బెనఁగు గరుడు । ననువు దోఁపగఁ బోరాడె మనుజనాథ! 273

ప్రతిపదార్థం: మనుజనాథ!= ధృతరాష్ట్ర మహారాజా!; పాంచాలయోధులున్+చేది సైనికులును= పాంచాల చేదివీరులు; సింహంబు బారిన్, చొచ్చిన, గజంబుల, భంగిన్= సింహం బారిన పడిన ఏనుగులవలె; పులికిన్+అగ్గము+ఐన, జింకల, విధమునన్= పులి బారిన పడిన జింకలవలె; జ్వలనంబున్+కిట్టిన, శలభంబులట్లున్= అగ్నిని తాకిన మిడుతలవలె; తనున్+ తాఁకి పొలియన్= తనను ఎదుర్కొని చనిపోగా; రాధాతనూభవుఁడు= కర్ణుడు; అనిన్+తనివోక= ఆ రణంతో తృప్తిచెందక; ధర్మనందనుని, ఉన్న చక్కటికిన్+అడరన్= యుద్ధంలో ధర్మరాజు ఉన్న వైపునకు వెళ్ళగా; ధృష్టద్యుమ్నుఁడును, ద్రౌపదీపుత్రులును, సహదేవుడును, శిఖండియును, సాత్యకియు, నకులుండున్; చేయన్+కల మహీశులున్= సమర్థులైన రాజులును; ఆ+కర్ణున్; పొదివిరి= ఆ కర్ణుడిని చుట్టిరి; అతఁడు; పెక్కు, పాములు, పొదివినన్= పలుసర్పాలు చుట్టుముట్టగా; పెనఁగు గరుడు+అనువు తోఁపఁగన్= పోరాడు గరుడుడివలె; పోరాడెన్= పోరు సలిపాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! పాంచాలయోధులు, చేది సైనికులు కర్ణుని ఎదిరించి, సింహంబారిన పడిన ఏనుగులవలె, పులికి చిక్కిన జింకలవలె, నిప్పును తాకిన మిడుతలవలె నశించారు. అయినా కర్ణుడు యుద్ధంలో తృప్తినొందక, ధర్మరాజు ఉన్న చోటికి వెళ్ళగా - ధృష్టద్యుమ్నుడు, ఉపపాండవులు, సహదేవుడు, శిఖండి, సాత్యకి, నకులుడు, సమర్థులైన రాజులు అతడిని ఎదుర్కొన్నారు. పెక్కుపాములు చుట్టుముట్టగా పోరాడే గరుడునివలె వారితో కర్ణుడు పోరాడాడు.

విశేషం: అలం: మాలోపమ.

వ. ఆ సమయంబున భీమసేను బారింబడిన కౌరవసైన్యంబునం బ్రబల చతురంగంబు లొక్కమొగిన్ బడలువడి రణాంగణంబు మూసికొనియెం; బెఱమూఁకలు వెఱఁగునం జెయ్వేది కర ళ్ళడంగిన మున్నీటియ ట్లుండె గాండీవి సంశప్తకుల ననేకుల మేటిమగల గీటడంచి హతశేషంబగు బలంబు విచ్చుటయు, వాసుదేవు నాలోకించి. 274

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అప్పుడు; భీమసేనుబారిన్+పడిన= భీముడిబారిని పడిన; కౌరవసైన్యంబునన్= కౌరవసేనలో; ప్రబల చతురంగంబులు= బలమైన రథ గజ తురగ పదాతులు; ఒక్కమొగిన్ బడలువడి= ఒకేసారి అలసిపోయి; రణ+అంగణంబు మూసికొనియెన్= రణభూమినుండి తొలగారు; పెఱమూఁకలు= ఇతర సైన్యాలు; వెఱఁగునన్+చెయ్వు+ఏది= భయంతో చేష్టలుడిగి; కరళ్ళు+అడంగిన, మున్నీటిఅట్లు+ఉండెన్= అలలు అణగిన సముద్రంవలె గోచరించాయి; గాండీవి= అర్జునుడు;

సంశప్తకులను+అనేకుల మేటిమగలన్= త్రిగర్త వీరులను అనేక యోధులను; గీటడంచి= సంహరించి; హతశేషంబు+అగు బలంబు విచ్చుటయున్= చావగా మిగిలిన సేన చెల్లాచెదరు కాగా; వాసుదేవునిన్+ఆలోకించి= శ్రీకృష్ణుడిని చూచి.

తాత్పర్యం: అప్పుడు, భీముడు తలపడగా కౌరవసేనలోని రథ, గజ, తురగ, పదాతులు అలసి రణభూమినుండి ఒక్కసారిగ వైదొలగాయి. ఇతర సైన్యాలు భయంతో చేష్టలుడిగి, నిశ్చలమైన సముద్రంవలె ఒప్పాయి. అర్జునుడు వీరులైన త్రిగర్త యోధులననేకుల సంహరించి, మిగిలిన వీరులు చెల్లాచెదరు కాగా, కృష్ణుడిని చూచి.

విశేషం: అలం: ఉపమ. అలలు అణగిన సముద్రంవలె విస్తారమైన సైన్యం స్తంభించిపోయింది.

ఆ. అమరులకు నజయ్యు లగునట్టి సంశప్త । కులు మదీయ బాణ ఘోర భంగి
కోహటించి పాఱుచున్నారు; భీముని । మునుము కౌరవులును మొనయ లేరు. 275

ప్రతిపదార్థం: అమరులకును+అజయ్యులు+అగునట్టి సంశప్తకులు= దేవతలు కూడా జయించలేని త్రిగర్త దేశీయులు; మదీయ బాణ ఘోరభంగికిన్+ఓహటించి= నా బాణాల తాకిడికి భయపడి; పాఱుచున్నారు= పారిపోతున్నారు; భీముని మునుము= భీముడి సేనను; కౌరవులును మొనయలేరు= కౌరవులు ఎదుర్కొనజాలరు.

తాత్పర్యం: దేవతలకు కూడ జయింప సాధ్యంకాని సంశప్తకులు, నా బాణాల ధాటికి నిలువలేక పారిపోతున్నారు. కౌరవులు కూడా భీముడి సేనను ఎదుర్కొనలేరు.

క. కర్ణుం డొక్కరుఁడును సము । దీర్ణుండై సిడము మెఱయఁ దిరిగి బలువిడిన్
ఘూర్ణితము సేసె మనసై । న్యార్ణవమున మంథనగము నను వమరంగన్. 276

ప్రతిపదార్థం: కర్ణుండు+ఒక్కరుఁడును= కర్ణుడు ఒక్కడు; సముదీర్ణుండు+ఐ= మిక్కిలి అధికుడై; సిడము మెఱయన్= ధ్వజం ప్రకాశించగా; మన సైన్య+అర్ణవమునన్= మన సైన్య మనెడి సముద్రంలో; మంథనగము+అనువు+అమరంగన్= మంథర పర్వతంవలె ఒప్పగా; బలువిడిన్ తిరిగి= పరాక్రమంతో తిరిగి; ఘూర్ణితము చేసెన్= కలచివేశాడు.

తాత్పర్యం: కర్ణుడు ఒక్కడు మిక్కలి అధికుడై తన ధ్వజం ప్రకాశిస్తుండగా మన సైన్యసముద్రంలో మంథర పర్వతం వలె విహరించి కలతపెట్టాడు.

విశేషం: అలం: ఉపమ.

చ. 'అరదము పోవనిమ్ము రయ మారఁగ నాతని దిక్కు' నావుడున్
దరహసితంబుతో నలిననాభుఁడు భీమునిచేతఁ బోదు నీ
శరముల వేఁడిఁ గౌరవుల సంగరవాంఛ యడంపు మన్న న
న్నరుఁడును నియ్యకొన్నఁ గురునాథుని యోధులు బెగ్గడిల్లఁగన్. 277

ప్రతిపదార్థం: అరదము= రథం; రయమారఁగన్= త్వరగా; ఆతని దిక్కు= కర్ణుడివైపు; పోవనిమ్ము= పోనిమ్ము; నావుడున్= అని అనగా; నలిననాభుఁడు= కృష్ణుడు; దరహసితంబుతోన్= చిరునవ్వుతో; కౌరవుల సంగరవాంఛ= కౌరవుల యుద్ధవాంఛ;

భీముని చేతన్+పోదు= భీముడిచేత పోదు; నీ శరములవేడిన్= నీబాణాల తాపంతో; అడంపుము+అన్నన్= అణచుము అని అనగా; ఆ+నరుఁడునున్= అర్జునుడుకూడా; ఇయ్యకొన్నన్= దానికి అంగీకరించగా; కురునాథుని, యోధులు, బెగ్గడిల్లఁగన్= దుర్యోధనుడి సైన్యంలోని వీరులు భయపడగా.

తాత్పర్యం: 'ఆ కర్ణుడివైపు రథాన్ని త్వరగా పోనిమ్ము' అని అర్జునుడనగా, 'కౌరవుల యుద్ధవాంఛ నీ బాణాల తాపం చేత తప్ప భీముడిచేత తీరేది కాదు' అని కృష్ణుడు చిరునవ్వుతో అన్నాడు. దానికి అర్జునుడు సరే అనగా కౌరవసైన్యం భయపడేటట్లుగా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అమ్మురారి ధవళ హయములు మెఱయ న । ద్దిక్కు సత్వరముగఁ దేరు పోవ
నిచ్చుటయును జూచి విచ్చె నబ్బలము సిం । గంబుఁ గనిన లేడిగమియుఁ బోలె. 278

ప్రతిపదార్థం: ఆ+మురారి= ఆ శ్రీకృష్ణుడు; ధవళ హయములు మెఱయన్= తెల్లగుర్రాలు ప్రకాశించగా; ఆ+దిక్కు= కౌరవసేనవైపు; సత్వరముగన్+తేరుపోవనిచ్చుటయును= తేరును వేగంగా పోనివ్వగా; చూచి; సింగంబున్+కనిన లేడిగమియున్+పోలెన్= సింహాన్ని చూచిన లేళ్ళగుంపువలె; ఆ+బలము= ఆ సైన్యం; విచ్చెన్= చెదరిపోయింది.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు రథాన్ని కౌరవసేనవైపు మళ్ళించగా, సింహాన్ని చూచి బెదరిన లేళ్ళగుంపువలె ఆ సైన్యం చెల్లాచెదరైంది.

విశేషం: అలం: ఉపమ.

వ. అప్పుడు నీ కొడుకు సంశప్తకులం బురికొల్పిన రెండు వేల రథంబులును మున్నూ ఱేనుంగులును జతుర్దశ సహస్ర తురంగంబులును లక్ష ద్వయ పదాతులును నప్పార్థుపయిం గవిసిన, నతండు శింజినీ టంకారంబునం బటు శరాసారంబున నింగి నించి పదివేవు రుద్భటక్షత్రియులం బొలియించి, యక్కెలనం గాంభోజ బలంబు దోఁచిన నం దుఱికి తదీయ సైనికుల కరంబులు శిరంబులు నఱకిన, నది మహావాతనిహతవిటపంబైన యారామంబు చందం బయ్యెః నట్టియెడ. 279

ప్రతిపదార్థం: అప్పుడు; నీ కొడుకు= దుర్యోధనుడు; సంశప్తకులన్+పురికొల్పినన్= త్రిగర్తదేశీయులను ప్రేరేపించగా; రెండువేల రథంబులును; మున్నూఱు+ఏనుంగులును= మూడువందల గజాలు; చతుర్దశ సహస్ర తురంగంబులును= పద్నాలుగువేల గుర్రాలు; లక్షద్వయ పదాతులును= రెండులక్షల కాల్బలం; ఆ+పార్థుపయిన్+కవిసినన్= ఆ అర్జునుడిపై బడగా; అతండు= అర్జునుడు; శింజినీటంకారంబునన్= అల్లెత్రాటి ధ్వనితో; పటుశర+ఆసారంబునన్= బలమైన బాణాల జడివానతో; నింగి నించి= గగనభాగాన్ని నింపి; పదివేవురు+ఉద్భట క్షత్రియులన్+పొలియించి= పదివేలమంది క్షత్రియవీరులను చంపి; ఆ+కెలనన్= ఆ ప్రక్కన; కాంభోజ బలంబు తోఁచినన్= కాంభోజసైన్యం కనబడగా; అందున్+ఉఱికి= అందులో ప్రవేశించి; తదీయ, సైనికుల, కరంబులు, శిరంబులు నఱకినన్= ఆ సైనికుల చేతులు, తలలు నరకగా; అది, మహావాత, నిహత= అది పెనుగాలికి కూలిన; విటపంబు+ఐన ఆరామంబు చందంబు+అయ్యెను= కొమ్మలుగల తోటవలె ఒప్పింది.

తాత్పర్యం: అప్పుడు దుర్యోధనుడు త్రిగర్తవీరులను పురికొల్పగా అసంఖ్యాకమైన రథ గజ తురగ పదాతులతో అర్జునుడిపై బడగా అతడు బాణవర్షంతో వేలమంది క్షత్రియులను సంహరించి కాంభోజసైన్యంలోనికి చొచ్చి ఆ

సైనికుల చేతులు, తలలు నరికాడు. గాలివానకు కూలిన కొమ్మలతో ఉద్యానవనంవలె ఆ ప్రదేశం ఒప్పారింది. ఆ సమయంలో.

విశేషం: అలం: ఉపమ.

క. అడరి సుదక్షిణు తమ్ముఁడు । గడువడి నేయుటయు, నతని కరశాఖలు గ
వ్వడి యర్ధచంద్రశరముల । వెడంద తూపున శిరంబు వ్రేల్మిడిఁ ద్రుంచెన్. 280

ప్రతిపదార్థం: సుదక్షిణుతమ్ముఁడు= (కాంభోజరాజు) సుదక్షిణుడి సోదరుడు; అడరి= విజృంభించి; కడువడిన్+ఏయుటయున్= తీవ్రవేగంతో బాణాలు వేయగా; కవ్వడి= అర్జునుడు; అర్ధచంద్రశరములన్= అర్ధచంద్రాకారంగల బాణాలతో; అతని కరశాఖలు= కొమ్మలవంటి అతడి చేతులు; వెడందతూపునన్= విశాలబాణంతో; వ్రేల్మిడిన్= క్షణంలో; శిరంబు త్రుంచెన్= శిరస్సును ఖండించాడు.

తాత్పర్యం: సుదక్షిణుడి సోదరుడు అర్జునుడిపై వడిగా బాణాలు వేయగా, అర్జునుడు అతడి చేతులను, అర్ధచంద్రాకార బాణాలతో, శిరస్సును విశాలమైన బాణంతో క్షణంలో ఖండించాడు.

క. యవన శక సైన్యములు పైఁ గవిసినఁ దద్రుధిర జలము గాలువలై పా
ఱ వెసం బఱపెను వివిధా । స్త్ర వితానము ల క్కిరీటి ధరణీనాథా! 281

ప్రతిపదార్థం: ధరణీనాథా!= రాజా!; యవన శక సైన్యములు; పైన్+కవిసినన్= పైబడగా; ఆ+కిరీటి= ఆ అర్జునుడు; తద్+ రుధిరజలము కాలువలై పాఱన్= వారి రక్తం కాలువలై ప్రవహించగా; వివిధ+అస్త్రవితానములు= పెక్కు అస్త్రాల సమూహాలు; వెసన్+పఱపెను= వెంటనే ప్రయోగించాడు.

తాత్పర్యం: యవన శకసైన్యాలు అర్జునుడిపై వచ్చి పడగా, అతడు వివిధఅస్త్రాలు ప్రయోగించి, వారి రక్తం అనే నీటిని కాలువలై పారేటట్లు చేశాడు.

మ. కని సంశప్తకు లేచి యొక్క మొగి నా కౌంతేయునిం జుట్టుము
ట్టిన సేనాంగ చతుష్టయాంగములు ఖండీభూతముల్ సేసె నా
తని బాణోత్కర వేగ ముత్కట మరుత్సంక్రీడ జీమూత పా
టనముం జేసిన భంగిఁ జిత్రబల గాఢస్ఫూర్తి శోభిల్లఁగన్. 282

ప్రతిపదార్థం: కని= అది చూచి; సంశప్తకులు+ఏచి= త్రిగర్తీయులు విజృంభించి; ఒక్కమొగిన్= ఒక్కసారిగా; ఆ కౌంతేయునిన్+ చుట్టుముట్టినన్= ఆ అర్జునుడిని చుట్టుముట్టగా; ఉత్కట మరుత్+సంక్రీడ= తీవ్రమారుత క్రీడ; జీమూత పాటనమున్+ చేసిన భంగిన్= మేఘాలను చెదరగొట్టినవిధంగా; చిత్రబలగాఢ స్ఫూర్తిశోభిల్లఁగన్= అచ్చెరువు గొల్పే బలపరాక్రమం ప్రకాశించగా; ఆతని బాణ+ఉత్కరవేగము= అర్జునుడి బాణాలవేగం; సేనా+అంగ చతుష్టయ+అంగములు= సేనాంగాలైన నాలుగు విభాగాలను (రథ, గజ, తురగ, పదాతి విభాగాలను); ఖండీభూతముల్ చేసెన్= ఖండాలుగా చేశాడు.

తాత్పర్యం: సంశప్తకులు ఒక్కుమ్మడిగా అర్జునుడిని చుట్టుముట్టగా, అతడు పెనుగాలి మేఘాలను చెదరగొట్టినట్లు బాణవేగంతో వారి చతురంగబలాలను ఖండఖండములు కావించాడు.

విశేషం: అలం: ఉపమ.

క. హరి వెరవున ధవళాశ్వ । స్ఫురణమున రథంబు మెఱయఁ బొలుపారెడు న
న్నరు నత్యద్భుత విక్రమ । పరిణతి సూడఁ గనుదోయి పదివేల్ వలయున్. 283

ప్రతిపదార్థం: హరి= కృష్ణుడు; వెరవునన్= నేర్పుతో; ధవళ+అశ్వ స్ఫురణమునన్= తెల్లనిగుర్రాల కాంతితో; రథంబు మెఱయన్= రథం ప్రకాశించగా; పొలుపారెడు= ఒప్పుతున్న; ఆ+నరు+అతి+అద్భుత విక్రమ పరిణతి= ఆ పార్థుడి అద్భుత పరాక్రమం; చూడన్= చూడటానికి; కనుదోయి= కన్నుల జంటలు; పదివేల్= పదివేలు; వలయున్= కావాలి.

తాత్పర్యం: కృష్ణుడు చాతుర్యంతో ధవళాశ్వాలు పూన్చిన రథం మెరయించగా, ప్రకాశించే పార్థుడి అద్భుత పరాక్రమాలు చూడటానికి పదివేల కనులజంటలు కావాలి.

క. నను బోఁటుల మనములు మె । చ్చునఁ గరఁగె ననంగ నేల? సురతతి గృష్ణా
ర్జునులం గని దుందుభి ని । స్వనములతోఁ గురిసె విరుల వాన వొగడుచున్. 284

ప్రతిపదార్థం: సురతతి= దేవతాసమూహం; కృష్ణ+అర్జునులన్+కని= కృష్ణార్జునులను చూచి; పొగడుచున్= పొగడుతూ; దుందుభి నిస్వనములతోన్= జయభేరి ధ్వనులతో; విరుల వాన కురిసెన్= పూలవాన కురిసింది; ననుబోఁటుల= నాబోటివారి; మనములు= మనసులు; మెచ్చునన్= ప్రశంసతో; కరఁగెన్+అనంగన్+ఏల?= కరిగిపోయాయి అని చెప్పటమెందుకు?

తాత్పర్యం: కృష్ణార్జునులను చూచి దేవతలు పొగడుతూ జయభేరి ధ్వనుల మధ్య పూలవాన కురిపించారంటే ఇక నాబోటి వారి మనసులు ప్రశంసలతో కరిగాయని వేరే చెప్పటం ఎందుకు?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి.

వ. అ య్యవసరంబున నాకసంబున నశరీరవాణి యయ్యిరువుర నుద్దేశించి యఖిల జనంబులు నాకర్ణింప వీరు చంద్రార్కులం గడచిన కాంతిదీప్తుల నుల్లసిల్లెదరు; తొల్లి యేక రథస్థు లైన బ్రహ్మేశానుల విధంబున వెలింగెదరు గంటిరే! వీరలు పరమ మునులగు నారాయణుండును నరుండునుజుండీ యనియె; నిట్లు మహనీయాశ్చర్యంబులు గనియును వినియును మాత్సర్యధుర్యుం డగునాచార్యనందనుం డలిగి యమ్మహాత్ముల మార్కొని మార్గణోజ్జ్వలం బగు దక్షిణ కరంబున నా ఫల్గునుఁ బిలిచి హాసభాసిత ముఖుండగుచుఁ గుపితుండగు నతని కిట్లనియె. 285

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; ఆకసంబునన్+అశరీరవాణి= ఆకాశమునందు అశరీరవాణి; ఆ+ఇరువురన్+ఉద్దేశించి= కృష్ణార్జునుల గురించి; అఖిలజనంబులున్+ఆకర్ణింపన్= సకలజనులు వినేటట్లుగా; వీరు= ఈ ఇద్దరు; చంద్ర+అర్కులన్+కడచిన= చంద్రసూర్యులను మించిన; కాంతిదీప్తులన్+ఉల్లసిల్లెదరు= కాంతులతో ప్రకాశిస్తారు; తొల్లి ఏకరథస్థులు+ఐన= పూర్వం ఒకే రథంపై ఉన్న; బ్రహ్మ+ఈశానుల విధంబునన్, వెలింగెదరు= బ్రహ్మమహేశ్వరులవలె ప్రకాశిస్తారు; కంటిరే!= చూశారా!; వీరలు= వీరిద్దరు; పరమమునులు+అగు= పరమమునులైన; నారాయణుండును నరుండును చుండీ+అనియెన్= నరనారాయణులు సుమా అన్నది; ఇట్లు= ఇట్లా; మహనీయ+ఆశ్చర్యంబులు కనియును వినియును= గొప్ప వింతలు చూస్తూ వింటూ కూడా; మాత్సర్య ధుర్యుండు+అగు+ఆచార్యనందనుండు= మత్సర భావాన్ని వహిస్తున్న అశ్వత్థామ;

అరిగి+ఆ, మహాత్ములన్ మార్కొని= ముందుకు వెళ్ళి వారిని ఎదుర్కొని; మార్గణ+ఉజ్జ్వలంబు+అగు దక్షిణ కరంబునన్= శరాలతో ప్రకాశిస్తున్న కుడిచేతితో; ఆ ఫల్గునున్+పిలిచి= ఆ అర్జునుడిని పిలిచి; హాసభాసితముఖుండు+అగుచున్= చిరునవ్వుచేత వెలిగిన ముఖం కలవాడై; కుపితుండు+అగు+అతనికిన్+ఇట్లు+అనియెన్= క్రోధంతో ఉన్న అతడితో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అప్పుడు ఆకాశంలోని అశరీరవాణి కృష్ణార్జునులిద్దరు చంద్రసూర్యులను మించిన కాంతి గలవారని, పూర్వం ఏకరథస్థులైన బ్రహ్మ రుద్రులని, పరమమునులైన నర నారాయణులని అందరూ వినేటట్లుగా వచించింది. ఆ వింతలు చూచి, మాటలు విని కూడా మాత్సర్యగ్రస్తుడైన అశ్వత్థామ వారి ముందుకు వెళ్ళి, బాణంతో శోభించే కుడిచేయినెత్తి, అర్జునుడిని పిలిచి ఇట్లా అన్నాడు:

అశ్వత్థామ యర్జునుం బేర్కొని మార్కొని సంగ్రామంబు సేయుట (సం. 8-40-110)

క. ననుఁ దగియెడు నతిథింగా । మనంబునఁ దలంచి నీవు మన్నించెదవే
నిని వచ్చెద నీ పాలికి । ననఘా! సంగ్రామ మొసఁగు మాతిథ్యముగన్. 286

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; ననున్+తగియెడు+అతిథిన్+కాన్= నన్ను తగిన అతిథినిగా; నీవు; మనంబునన్ తలంచి= మనసులో భావించి; మన్నించెదవేనిని= గౌరవిస్తే కనుక; నీ పాలికిన్= నీవద్దకు; వచ్చెదన్= వస్తాను; ఆతిథ్యముగన్= నాకు అతిథ్యంగా; సంగ్రామము+ఒసఁగుము= యుద్ధాన్ని ఇమ్ము.

తాత్పర్యం: నన్ను అతిథినిగా భావించి గౌరవిస్తే నీ దగ్గరకు రాగలను. నాకు యుద్ధాన్ని ఆతిథ్యంగా ఇమ్ము.

ఆ. అనినఁ గృష్ణుఁ జూచి యర్జునుఁ డాచార్య । తనయు గెలువ కునికి దైన్య మిపుడు
సమయఁ జూడవలయు సంశప్తకులను నీ । మనసు వచ్చు పనికిఁ బనుపు మనుడు. 287

ప్రతిపదార్థం: అనినన్+కృష్ణున్+చూచి= (అశ్వత్థామ) అనగా కృష్ణుడిని చూచి; అర్జునుఁడు= పార్థుడు; ఆచార్య తనయు గెలువకునికి= అశ్వత్థామను జయించకపోవటం; దైన్యము= దీనత్వం; ఇపుడు; సంశప్తకులను సమయన్+చూడవలయున్= సంశప్తకులను సంహరించవలసిఉన్నది; నీ మనసువచ్చు పనికిన్+పనుపుము+అనుడున్= నీకు నచ్చినపనికి నన్ను ఆజ్ఞాపించుము అనగా.

తాత్పర్యం: అశ్వత్థామ మాటలకు అర్జునుడు కృష్ణుడిని చూచి ఇట్లా అన్నాడు: 'అశ్వత్థామతో పోరి యుద్ధం చేయకపోవటం అగౌరవం, కాని సంశప్తకులను కూడా అంతం చేయవలసి ఉన్నది, నీ ఇష్టమైన పనికి నన్ను ఆజ్ఞాపించుము.

ఉ. తేరు మురారి ద్రోణుసుతుదిక్కునకుం జననిచ్చి 'మేలు మేల్
పోరు ఋణంబు దీర్చు కురుభూపతికిన్; నరబాహులీలకు
నైరణ గల్గి నిల్వు' మనినన్ విని 'యట్టుల కాక' యంచు న
వ్వీరుఁడు షష్టిబాణముల వెన్నుని నేసె నుదగ్రుఁడై వెసన్. 288

ప్రతిపదార్థం: మురారి= కృష్ణుడు; తేరు= రథాన్ని; ద్రోణుసుతు, దిక్కునకున్= అశ్వత్థామవైపునకు; చనన్+ఇచ్చి= వెళ్ళనిచ్చి; మేలు మేల్= సెబాసు; కురుభూపతికిన్= దుర్యోధనుడికి; పోరు= నీవు చేసే పోరాటం; ఋణంబు తీర్చు= రుణంతీరుస్తుంది; నరబాహులీలకున్= అర్జునుడి బాహుబలానికి; సైరణగల్గి నిల్వుము+అనినన్= సహించి నిలువుము అనగా; ఆ+వీరుఁడు= అశ్వత్థామ; అట్టులు కాక అంచున్= అట్లే అగునని అంటూ; ఉదగ్రుఁడు+ఐ= భయంకరరూపుడై; వెసన్= వెంటనే; షష్టిబాణములన్= అరవైబాణాలు; వెన్నునిన్+ఏసెన్= కృష్ణుడిపై ప్రయోగించాడు.

తాత్పర్యం: కృష్ణుడు అశ్వత్థామవైపు రథాన్ని మరలించి మేలు! మేలు! 'దుర్యోధనుడి రుణం తీరేటట్లుగా పోరు సలుపుము. అర్జునుడి తాకిడికి తట్టుకొని నిలబడుము' అనగా అతడు సరే అంటూ తత్క్షణమే కృష్ణుడిపై అరవై బాణాలు వేశాడు.

ఉ. **అమ్ములు మూఁడు పార్థుతను వాడఁగ నేసినఁ ద్రుంచివైచెఁ జా**
ప మ్మతఁ డమ్మహాద్విజుఁడు భారవహమ్మగు నొండు విల్లు శీ
ఘ్రమ్మున నెత్తి చేతులను గాళ్ళను మోమున వింటి కొమ్మునం
గ్రమ్మిన భంగిగా శితశరప్రతతుల్ నిగిడించెఁ బైపయిన్. **289**

ప్రతిపదార్థం: అమ్ములు మూఁడు= మూడుబాణాలు; పార్థుతనువు+అడఁగన్+ఏసినన్= అర్జునుడి శరీరం చలించేటట్లు నాటగా; అతఁడు= అర్జునుడు; చాపమ్ము= విల్లును; త్రుంచివైచెన్= ఖండించాడు; ఆ+మహాద్విజుఁడు= అశ్వత్థామ; భారవహమ్ము+అగు= బరువైన; ఒండువిల్లు= మరొకవిల్లు; శీఘ్రమ్మునన్+ఎత్తి= వెంటనే పైకి ఎత్తి; చేతులను కాళ్ళను= చేతులందు, కాళ్ళయందు; మోమునన్= ముఖంలో; వింటికొమ్మునన్+క్రమ్మిన భంగిగాన్= విల్లుకొనపై క్రమ్మేవిధంగా; శితశర ప్రతతుల్= వాడిఅయిన బాణసమూహాలను; పై పయిన్ నిగిడించెన్= వెంట వెంటనే వేశాడు.

తాత్పర్యం: మూడుబాణాలు అర్జునుడిపై వేయగా అతడు అశ్వత్థామ ధనుస్సును త్రుంచివేశాడు. అశ్వత్థామ మరొక బలమైన విల్లును వెంటనే గైకొని అర్జునుడి చేతులమీద, కాళ్ళమీద, ముఖంమీద, వింటికొన మీద వెంట వెంట వాడిబాణసమూహాలు వేశాడు.

క. **కడుఁ బెక్కు వేలు దూపుల । వడిఁ గృష్ణార్జునుల సరథవాహంబుగ నె**
క్కుడు మదమునఁ బొదివినఁ జె । య్యెడలి వెఱఁగుపడిరి వార లిద్దఱు నధిపా! **290**

ప్రతిపదార్థం: అధిపా!= ధృతరాష్ట్ర మహారాజా!; కడున్+పెక్కువేలుతూపులన్= పెక్కువేల బాణాలతో; వడిన్= వేగంగా; కృష్ణ+అర్జునులన్= కృష్ణార్జునులను; సరథవాహంబుగన్= రథ అశ్వములతో సహా; ఎక్కువ మదమునన్+పొదివినన్= అధిక అతిశయంతో క్రమ్మగా; వారలు+ఇద్దఱున్= ఆ కృష్ణార్జునులు ఇద్దరూ; చెయ్యు+ఎడలి= చేష్టలుడిగి; వెఱఁగుపడిరి= దిగ్భ్రాంతి చెందారు.

తాత్పర్యం: రాజా! అశ్వత్థామ కృష్ణార్జునులను వారి రథాశ్వాలను వేలబాణాలతో కప్పివేయగా వారు నిశ్చేష్టులయ్యారు.

వ. **ఇ వ్విధంబున వివిధ విశిఖ జాలంబులఁ గాలు సేయార్వరాకుండఁ గప్పి యార్చిన, నప్పార్థుం డతనిచేతఁ దనవిక్రమంబు ప్రతిహతంబయ్యె నని తలంపఁ దత్సైన్యంబున హాహాకారంబు లెసంగం జారణ సిద్ధగణంబు**

లట్లు నిశ్చేష్టితు లైన యాలోకరక్షకుల నాలోకించి 'లోకంబులకు బ్రదుకు గలుగునో' యని పలుక
నప్పద్మనాభుండు గనలి య క్కవ్వడి నుద్దేశించి. 291

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; వివిధ విశిఖ జాలంబులన్= పెక్కుబాణ సమూహాలతో; కాలుచేయి+ ఆర్వరాకుండన్= కాళ్ళుచేతులు కదలనివ్వకుండా; కప్పి+ఆర్చినన్= కప్పి అరువగా; ఆ+పార్థుండు= అర్జునుడు; అతనిచేతన్= అశ్వత్థామచేత; తన విక్రమంబు ప్రతిహతంబు+అయ్యెన్+అని= తన పరాక్రమం దెబ్బతిన్నదని; తలంపన్= భావించగా; తద్+సైన్యంబునన్= పాండవసైన్యంలో; హాహాకారంబులు+ఎసంగన్= హాహాకారాలు వ్యాపించగా; చారణ సిద్ధ గణంబులు= ఆకాశంలో చరించే చారణులు దేవతాజాతికి చెందిన సిద్ధులు; అట్లు నిశ్చేష్టితులు+ఐన= ఆ విధంగా చేష్టారహితులైన; ఆ లోకరక్షకులను+ఆలోకించి= ఆ లోకాలకు రక్షకుడవైన నర నారాయణులను చూచి; లోకంబులకు, బ్రదుకు, గలుగునో, అని, పలుకన్= లోకాలకు రక్షణ ఉన్నదా అని సందేహంతో అనగా; ఆ+పద్మనాభుండు కనలి= కృష్ణుడు కోపించి; ఆ+కవ్వడిన్+ఉద్దేశించి= అర్జునుడిని చూచి.

తాత్పర్యం: అశ్వత్థామ ఆ విధంగా కృష్ణార్జునులను కదలనివ్వకుండా బాణాలతో కప్పి, ఆనందంతో అరువగా అర్జునుడు అతడిముందు తన పరాక్రమం మొక్కవోయిందని బాధపడగా, పాండవసైనికులు హాహాకారాలు చేశారు. ఆకాశంలోని సిద్ధచారణులు లోకరక్షకులైన ఆ కృష్ణార్జునులను చూచి, ఇక లోకాలకు రక్షణ లేదని తలచారు. అప్పుడు కృష్ణుడు కోపంతో అర్జునుడిని చూచి.

క. 'గురుసుతుఁడు నిన్ను మిగులుట । గర మాశ్చర్యంబు! ముష్టి గాండీవము దాఁ
దిరమయి యుండదొ? బాహుల । వెరవు బలుపు గుందెనో? వివేకింపు మెడన్. 292

ప్రతిపదార్థం: గురుసుతుఁడు, నిన్ను, మిగులుట= అశ్వత్థామ నిన్ను మించిపోవటం; కరము+ఆశ్చర్యంబు!= చాలా ఆశ్చర్యం; ముష్టిన్, గాండీవము, తాన్+తిరము+అయి ఉండదొ?= పిడికిలిలో; గాండీవం స్థిరంగా లేదా?; బాహుల వెరవు బలువు కుందెనో?= నీ భుజాల ఉపాయమూ బలమూ తగ్గిపోయాయా?; ఎడన్= నీ హృదయంలో; వివేకింపుము= ఆలోచించుము.

తాత్పర్యం: 'అశ్వత్థామ నిన్ను మించిపోవటం ఆశ్చర్యకరమైన విషయం! నీ గాండీవం నీ గుప్పిటలో నిలకడగా లేదా? నీ నేర్పు భుజబలం అణగారిపోయిందా? ఆత్మ పరిశీలన చేసికొమ్ము.

క. 'గురునికొడు కను తలంపునఁ । బరుసఁదనంబునకుఁ జొరక భంగపడితొ? యు
ద్ధురతఁ గడుఁ జెడియె? ననవుడు । సరోష సంరంభుఁ డై విజయుఁ డాతనితోన్. 293

ప్రతిపదార్థం: గురుని కొడుకు+అను తలంపునన్= గురువైన ద్రోణుడి కుమారుడనే భావంతో; పరుసఁదనంబునకున్+చొరక= కాఠిన్యం వహించక; భంగపడితొ?= ఓడిపోయావా?; ఉద్ధురతన్+కడున్+చెడియెన్= గర్వం విషయంలో మిక్కిలి చెడింది; అనవుడున్= అనగా; విజయుఁడు= అర్జునుడు; సరోష సంరంభుఁడు+ఐ= రోషం పొందినవాడై; అతనితోన్= శ్రీకృష్ణుడితో.

తాత్పర్యం: అశ్వత్థామ గురుపుత్రుడని తలచి అతడితో గట్టిగా వ్యవహరించక భంగపడ్డావా? లేక నీవు గర్వం కోల్పోయావా?' అని కృష్ణుడనగా అర్జునుడు రోషం చెందినవాడై అతడితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'వెసఁ బెక్కమ్ములు మనపై । ముసుఁగువడం బఱపి యతఁడు మురభంజన! సం
తస మందెడు; నింతన యేఁ । గసిమసఁగెదఁ జూడు నన్ను గాండీవంబున్. 294

ప్రతిపదార్థం: మురభంజన!= మురారీ!; ఆతఁడు= అశ్వత్థామ; పెక్కు+అమ్ములు= అనేకబాణాలు; మనపైన్= మనమీద; వెసన్= వేగంగా; ముసుఁగుపడన్+పరపి= కప్పువడేటట్లు కురిపించి; సంతసము+అందెడున్= సంతోషిస్తున్నాడు; ఇంతన= ఇంతలోనే; ఏన్= నేను; కసిమసఁగెదన్= విజృంభిస్తాను; నన్నున్ గాండీవంబున్= నన్ను నా ధనుస్సును; చూడు.

తాత్పర్యం: 'కృష్ణా! అశ్వత్థామ మనలను దట్టంగా బాణాలతో కప్పివేసి అంతమాత్రంతోనే సంతోషిస్తున్నాడు. ఇక నేను విజృంభిస్తాను చూడుము.'

మ. అని భల్లప్రకరంబులన్ గురుతనూజాస్త్రప్రతానంబుఁ ద
ద్ధనువుం గేతువు నాతపత్రమును జిత్రస్ఫూర్తిఁ దున్మాడి గ్ర
క్కున నవ్విప్రుఁడు శక్తియున్ గదయు నుక్కుందాల్మియుం దోఁప నె
త్తినఁ దోడ్తో నవి ద్రుంచి వైచె సమరస్థేమాభిరామాకృతిన్. 295

ప్రతిపదార్థం: అని= అని వచించి; భల్లప్రకరంబులన్= బల్లెముల సమూహాలతో; గురుతనూజ+అస్త్ర ప్రతానంబున్= అశ్వత్థామ అస్త్రసమూహాన్ని; తద్+ధనువున్= అతడి ధనుస్సును; కేతువున్+ఆతపత్రమును= ధ్వజచ్ఛత్రములను; చిత్రస్ఫూర్తిన్+తునుమాడి= చిత్రంగా ఖండించి; ఆ+విప్రుఁడు= అశ్వత్థామ; గ్రక్కునన్= వెంటనే; ఉక్కున్+తాల్మియున్, తోఁపన్= గర్వం బలం గోచరించగా; శక్తియున్, గదయున్= బల్లెమును, గదను; ఎత్తినన్= పైకెత్తగా; సమరస్థేమ+అభిరామ+ఆకృతిన్= యుద్ధమునందలి శారీరకబలముచేత మనోహరమైన రూపం కలవాడై; తోడ్తోన్= వెంటనే; అవి త్రుంచివైచెన్= వాటిని ఖండించివేశాడు.

తాత్పర్యం: అంటూ అర్జునుడు, అశ్వత్థామ అస్త్రాలు, విల్లు, ధ్వజం, ఛత్రం మున్నగువాటిని బల్లెములతో ఖండించాడు. అశ్వత్థామ బలదర్పం విడనాడక బల్లెం, గదను ఎత్తగా అర్జునుడు యుద్ధము నందలి శారీరక బలముచేత మనోహరమైన రూపము కలవాడై వాటిని కూడా ఖండించివేశాడు.

ఆ. ఇట్లు ద్రోణసుతుని యేపు పార్థుఁడు దుహి । నంబుఁ జెఱుచు నినువిధంబు మెఱయఁ
జెఱిచె నంతఁ బొదివె నుఱక యా రథికు సం । శప్తక వ్రజంబు సరభసముగ. 296

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పార్థుఁడు= అర్జునుడు; తుహినంబున్ చెఱుచు+ఇనువిధంబు= మంచును నశింపజేసే సూర్యుడివలె; మెఱయన్= ఒప్పునట్లుగా ద్రోణ సుతుని ఏపు= అశ్వత్థామ గర్వం; చెఱిచెన్= అణచివేశాడు; అంతన్= అప్పుడు; సంశప్తక వ్రజంబు= త్రిగర్తవీరుల సమూహం; సరభసముగన్= శీఘ్రంగా; ఆ రథికున్= అర్జునుడిని; ఉఱక= లక్ష్యపెట్టక; పొదివెన్= ఎదుర్కొనెను.

తాత్పర్యం: ఈ విధంగా అశ్వత్థామ గర్వాన్ని, అర్జునుడు మంచును కరిగించివేసే సూర్యుడివలె ప్రకాశిస్తూ అణచివేశాడు. అంతలోనే ఆ సంశప్తకసమూహం అర్జునుణ్ణి లక్ష్యపెట్టక శీఘ్రంగా తాకింది.

విశేషం: అలం: ఉపమ.

క. ఎందఱు వొదివిరి వారల । కందఱకును దమక తమక యర్జున చటుల
స్యందన మెదురైనట్లు మ । దిం దోఁచెఁ దదీయ' బాణ తీవ్ర బహులతన్. 297

ప్రతిపదార్థం: ఎందఱు పొదివిరి= ఎంతమంది తాకారో; వారలకున్+అందఱకును= వారందరికీ; తదీయ, బాణ తీవ్రబహులతన్= అర్జునుడి బాణాల బాహుళ్యంచేత; తమక తమక= ప్రతిఒక్కరికీ; అర్జున చటుల స్యందనము= అర్జునుడు తిరుగుతున్న రథం; ఎదురు+ఐనట్లు, మదిన్+తోఁచెన్= ఎదురైనట్లుగా మనస్సుకు గోచరించింది.

తాత్పర్యం: అర్జునుడి బాణవేగానికి సంశప్తకులలోని ప్రతివీరుడూ అతడి రథం ఎదురు వచ్చినట్లుగా భావించారు.

విశేషం: శ్రీకృష్ణుడి సారథ్యంలో అర్జునుడి రథం అంత వేగంగా తిరుగుతున్నది.

క. అప్పుడు గురుతనయాద్రిం । గప్పఁగ వజ్రోపమాన కాండములు వెసం
గుప్పనఁగూర వఱప నరుఁ । డప్పరుసఁదనమున కోర్చి యతఁడుఁ బెనంగెన్. 298

ప్రతిపదార్థం: అప్పుడు; నరుఁడు= అర్జునుడు; గురుతనయ+అద్రిన్+కప్పఁగన్= అశ్వత్థామ అనే పర్వతాన్ని కప్పేటట్లుగ; వజ్ర+ఉపమాన కాండములు= వజ్రాయుధంవంటి బాణాలు; వెసన్= శీఘ్రంగా; కుప్పనఁగూర+వఱపన్= కుప్పలుగా కురిపించగా; ఆ+పరుసదనమునకున్+ఓర్చి= ఆ తీవ్రమైన తాకిడికి సహించి; ఆతఁడున్+పెనంగెన్= అశ్వత్థామ కూడా యుద్ధం చేశాడు.

తాత్పర్యం: అర్జునుడు అశ్వత్థామ అనే కొండను కప్పివేసేటట్లుగ వజ్రాయుధం వంటి బాణాలు ప్రయోగించగా, అతడు వాటి తీవ్రమైన తాకిడికి తట్టుకొని పోరు సల్పాడు.

విశేషం: అలం: రూపకం. వృత్రాసుర సంహారం కొరకు దధీచి ఎముకలచేత చేయబడిన ఇంద్రుడి ఆయుధం వజ్రాయుధం. అతడు దానితో మేరుపర్వతం రెక్కలను ఖండించాడు. కుప్పనగూరవఱపు - జాతీయం.

వ. అ ట్లశ్వత్థామ పెనంగుచుండ సంశప్తకవ్రజంబునందు. 299

ప్రతిపదార్థం: అట్లు+అశ్వత్థామ పెనంగుచుండన్= ఆ విధంగా అశ్వత్థామ పోరు సల్పుతుండగా; సంశప్తక, వ్రజంబునందున్= సంశప్తకసమూహంలో.

తాత్పర్యం: అశ్వత్థామ ఆ విధంగా రణం చేస్తుండగా సంశప్తకులలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. చేతులు దలలును బహువిధ । హేతులఁ దునియలుగఁ జేసి యిలఁ దొరఁగించెం
జేతుల కసి పోవంగ న । రాతులు బెగ్గిలఁగఁ గ్రీడి ప్రకటస్ఫురణన్. 300

ప్రతిపదార్థం: క్రీడి= అర్జునుడు; ప్రకటస్ఫురణన్= పరాక్రమం ఒప్పగా; అరాతులు బెగ్గిలఁగన్= శత్రువులు భీతిచెందగా; చేతుల కసి పోవంగన్= చేతుల దురద తీరేటట్లుగా; బహువిధ హేతులన్= పలు ఆయుధాలతో; చేతులు, తలలును= చేతులు, తలలు; తునియలుగన్+చేసి= తునుకలుగా చేసి; ఇలన్+తొరఁగించెన్= నేలపై పడగొట్టాడు.

తాత్పర్యం: అర్జునుడు పరాక్రమాన్ని చూపి శత్రువులు భీతిచెందేటట్లుగ, చేతుల దురద తీరేటట్లుగ పెక్కు ఆయుధాలతో శత్రువుల తలలు, చేతులు ఖండించి వాటిని నేలపై పడగొట్టాడు.

విశేషం: కసిపోవు- కసితీరుట (జాతీయం), చేతుల తీటపోవ మనసుకే కాక చేతులకు కూడా కసి కల్పించబడింది. (క.1-197)

క. తురగ ద్విప రథ తూర్యా। భరణ ధ్వజ చామరాతపత్ర శకలముల్
పొరిఁబొరి ధరఁ గప్పఁగ నె। త్తురు టేఱులు వానిఁ దొలఁగఁ ద్రోచుచు వచ్చెన్. 301

ప్రతిపదార్థం: తురగ= గుఱ్ఱాలు; ద్విప= ఏనుగులు; రథ= రథాలు; తూర్య+ఆభరణ= వాద్యాలు ఆభరణాలు; ధ్వజ= జెండాలు; చామర+ఆతపత్ర= చామరములు గొడుగులు; శకలముల్= తునకలు; పొరిన్+పొరిన్= ఒకదానిపై ఒకటి; ధరన్+కప్పఁగన్= నేలను కప్పివేయగా; నెత్తురు+ఏఱులు= రక్తప్రవాహాలు; వానిన్=వాటినన్నింటిని; తొలఁగన్+త్రోచుచున్= త్రోసికొంటూ; వచ్చెన్= వచ్చాయి.

తాత్పర్యం: రథ, గజ, తురగాలు, ధ్వజ, చామర, ఛత్రాలు తునుకలై నేలపై పడగా సైనికుల రక్తపుకాల్వలు వాటిని త్రోసికొంటూ ప్రవహించాయి.

విశేషం: పొరి బొరి - మాటిమాటికి (ఆమ్రేడితం) అడ్డంగా ఉన్న చెత్తను త్రోసుకొంటూ నీటిప్రవాహం ప్రవహించేవిధాన్ని స్ఫురింపజేస్తుంది ఈ వర్ణన.

వ. అట్టియెడ. 302

తాత్పర్యం: ఆ సమయంలో.

తే. అంగ వంగ నిషాద కళింగ బలము। లర్జునునిమీఁదఁ బెల్లుగ నడరుటయును
గురుతనూభవుఁ డతనిని మురవిరోధి। నంపపెనువెల్లి ముంచి బెట్టార్చి పేర్చి. 303

ప్రతిపదార్థం: అంగ, వంగ, నిషాద, కళింగ, బలములు= అంగ, వంగ, కళింగ నిషాద సేనలు; అర్జునుని మీఁదన్+పెల్లుగన్+ అడరుటయును= అర్జునుడిపై అధికంగా విజృంభించగా; గురు తనూభవుఁడు= అశ్వత్థామ; అతనిని మురవిరోధిన్= పార్థ కృష్ణులను; అంప పెనువెల్లిన్+ముంచి= పెక్కుబాణాల ప్రవాహంలో ముంచి; బెట్టు+ఆర్చి పేర్చి= గట్టిగా అరచి విజృంభించగా.....

తాత్పర్యం: అంగ, వంగ, నిషాద, కళింగ దేశాల సేనలు అర్జునుడిపై విజృంభించగా, అశ్వత్థామ అది అదనుగా తీసికొని కృష్ణార్జునులను బాణాలప్రవాహంలో ముంచి గర్వంగా గర్జించి, విజృంభించగా

వ. ఆ విక్రమవిశేషంబునకు రోషంబు నొంది. 304

ప్రతిపదార్థం: ఆ+విక్రమ విశేషంబునకున్= ఆ అశ్వత్థామ పరాక్రమ విశేషానికి; రోషంబున్+ఒంది= అర్జునుడు రోషం చెంది.

తాత్పర్యం: అశ్వత్థామ విజృంభణకు (అర్జునుడు) రోషం చెంది. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆ వీరుం డవ్విప్రుని। క్రొవ్వును నా సైన్యసమితి క్రూరోద్ధతియున్
నివ్వటిలనీక ఖచరులు। నివ్వెఱపడ సమరకేళి నిపుణత మెఱసెన్. 305

ప్రతిపదార్థం: ఆ+వీరుండు= అర్జునుడు; ఆ+విప్రుని క్రొవ్వునున్= అశ్వత్థామ గర్వాన్ని; ఆ, సైన్య, సమితి, క్రూర+ఉద్ధతియున్= ఆ సైన్యసమూహాల దారుణమైన అతిశయాన్ని; నివ్వటలనీక= విజృంభించనీయకుండా; ఖచరులు నివ్వెఱపడన్= ఆకసంలో విహరించే దేవతలు ఆశ్చర్యపడేటట్లుగా; సమరకేళి నిపుణతన్= యుద్ధక్రీడానైపుణ్యంతో; మెఱసెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: అర్జునుడు అశ్వత్థామ, సైన్య సమూహాల విజృంభణాన్ని అడ్డుకొని దేవతలు మెచ్చేటట్లుగా యుద్ధ కౌశలాన్ని ప్రదర్శించాడు.

వ. మెఱసిన నెఱసినరోషంబున మఱియును. 306

ప్రతిపదార్థం: మెఱసిన= ప్రకాశించిన; నెఱసిన రోషంబునన్= నిండైన రోషంతో; మఱియును= ఇంకా.

తాత్పర్యం: (అర్జునుడు ఆ విధంగా యుద్ధవిద్యను ప్రదర్శించగా) అశ్వత్థామ అధికమైన రోషం ప్రకాశించగా

మ. గురుపుత్రుం డసురాంతకున్ విజయునిం గ్రూరాస్త్ర సంతాన ని
ష్ఠుర పాతంబున నొంప నాహరి దదాటోపంబు సైరింప క
న్నరుతో 'నౌషధ మూఁది చేసి తెవులు న్మర్దింపకున్నం దుది
న్భరమై యుండదె యే పడంపుము రిపు న్సంరంభివై నావుడున్. 307

ప్రతిపదార్థం: గురుపుత్రుండు= అశ్వత్థామ; అసుర+అంతకున్= శ్రీకృష్ణుడిని; విజయునిన్= అర్జునుడిని; క్రూర+అస్త్రసంతాన= భయంకర అస్త్ర సమూహాలయొక్క; నిష్ఠుర పాతంబునన్+నొంపన్= తీవ్ర ధాటితో నొప్పించగా; ఆ హరి= శ్రీకృష్ణుడు; తద్+ ఆటోపంబు సైరింపక= అతడి పరాక్రమాన్ని సహించలేక; ఔషధము+ఊఁదిచేసి= మందును ఉపయోగించి; తెవులున్+ మర్దింపకున్నన్= రోగాన్ని రూపుమాపకపోతే; తుదిన్+భరము+ఐ+ఉండదె?= చివరకు భారంగా పరిణమించదా?; సంరంభివి+ఐ= ఉత్సాహం కలవాడవై; రిపున్= శత్రువును; ఏపు+అడంపుము= గర్వాన్ని అణచుము అని; ఆ+నరుతోన్= అర్జునుడితో; నావుడున్= అనగా.

తాత్పర్యం: అశ్వత్థామ కృష్ణార్జునులను క్రూర అస్త్రాలతో నొప్పించగా, కృష్ణుడు దానిని సహించలేక అర్జునుడితో 'మందును ప్రయోగించి రోగాన్ని నశింపజేయకపోతే అది చివరకు భారం కాదా? ఉత్సాహపూరితుడవై శత్రువుల గర్వాన్ని అణచివేయుము' అని అన్నాడు.

క. అతండు విజృంభించి గుణంబు సారించి. 308

ప్రతిపదార్థం: అతండు= అర్జునుడు; విజృంభించి= అతిశయించి; గుణంబు సారించి= వింటినారిని లాగి.

తాత్పర్యం: ఆ మాటలకు అర్జునుడు విజృంభించి, విల్లు ఎక్కుపెట్టి, నారి లాగి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. శిరమునఁ గంఠదేశమునఁ జేతులయందు నురస్స్థలంబునం
జరణములన్ శరంబులు వెసన్ నిబిడంబుగఁ గీలుకొల్పుచున్
వెరవునఁ బగ్గముల్ దునుమ వేగమ యీడ్చెఁ దురంగమంబు ల
గ్గురుసుతుతేరు గయ్యమునకుం గడు దవ్వు దొలంగ భూవరా! 309

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; శిరమునన్= తలపై; కంఠ దేశమునన్= కంఠమునందు; చేతుల+అందున్= చేతులందు; ఉరః+స్థలంబునన్= వక్షమునందు; చరణములన్= పాదములందు; శరంబులు= బాణాలు; వెసన్= వేగంగా; నిబిడంబుగన్= దట్టంగా; కీలుకొల్పుచున్= ప్రయోగిస్తూ; వెరవునన్+పగ్గముల్ తునుమన్= చాతుర్యంతో రథం పగ్గాలు ఖండించగా; తురంగమంబులు= గుర్రాలు; ఆ+గురుసుతుతేరు= అశ్వత్థామ రథాన్ని; కయ్యమునకున్+కడుదవ్వు తొలంగన్= యుద్ధభూమికి చాల దూరంగా పోయేటట్టు; వేగమ ఈడ్చెన్= వెంటనే ఈడ్చుకువెళ్ళాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుడు అశ్వత్థామ వివిధాంగాలపై దట్టంగా బాణాలు ప్రయోగించి పగ్గాలు కూడ ఉపాయంతో ఖండించగా, గుర్రాలు అతడి రథాన్ని యుద్ధానికి దూరంగా ఈడ్చుకొనివెళ్ళాయి.

వ. ఆ భూదేవుండును భగ్నోత్సాహుండై యల్లన సూతనందను సమీపంబునకుం జనియె; నప్పుడు శౌరి సంశప్తక సైన్యంబు దెసకుం దేరు నడపుచుం దమ సేన దిక్కు కోలాహలం బాకర్ణించి చూడ్కియట నిగిడించి యర్జును నుద్దేశించి 'వేదండారూఢుండైన దండధారుండు మన బలంబులం గలంచుచున్నవాఁ డమ్మగధోత్తముండు భగదత్తు నంతవాఁడ; యతని మడియించి మఱి చేయంగలపని సూచికొంద' మని పలికిన న క్కవ్వడి యొడంబడ నక్కడ కరదంబు పోవనిచ్చె; నట్టియెడ. 310

ప్రతిపదార్థం: ఆ భూదేవుండును= ఆ అశ్వత్థామయు; భగ్న+ఉత్సాహుండు+ఐ= చెదిరిపోయిన ఉత్సాహము కలవాడై; అల్లన= మెల్లగా; సూతనందను సమీపంబునకున్+చనియెన్= కర్ణుడి చెంతకు వెళ్ళాడు; అప్పుడు; శౌరి= శ్రీకృష్ణుడు; సంశప్తక సైన్యంబు దెసకున్= సంశప్తకులవైపు; తేరు నడపుచున్= రథం పోనిస్తూ; తమసేన దిక్కు= తమ సేనవైపు; కోలాహలంబు+ఆకర్ణించి= సందడి విని; చూడ్కి అట నిగిడించి= దృష్టిని ఆ వైపు ప్రసరింపజేసి; అర్జునున్+ఉద్దేశించి= అర్జునుడితో; వేదండ+ఆరూఢుండు+ఐన= ఏనుగుపై ఎక్కి ఉన్న; దండధారుండు; మన బలంబులన్+కలంచుచున్నవాఁడు= మన సైన్యాన్ని బాధపెడుతున్నాడు; ఆ+మగధ+ఉత్తముండు= ఆ మగధదేశపురాజు; భగదత్తు+అంతవాఁడ= భగదత్తునంతటివాడే; అతనిన్ మడియించి= అతడిని వధించి; మఱి చేయన్+కల, పని= తరువాత చేయవలసిన పనిని; చూచికొందము+అని పలికినన్= చూద్దాం అనగా; ఆ+కవ్వడి ఒడంబడన్= అర్జునుడు సరే అనగా; అక్కడకున్+అరదంబు పోవన్+ఇచ్చెన్= అటువైపు రథాన్ని పోనిచ్చాడు; అట్టిఎడన్= అప్పుడు.

తాత్పర్యం: అశ్వత్థామ ఉత్సాహహీనుడై కర్ణుడివైపు వెళ్ళాడు. సంశప్తకులవైపు రథం మళ్ళించబోతూ కృష్ణుడు తమ సేనలో సందడి విని చూపునటు త్రిప్పి 'మగధరాజైన దండధారుడు గజారూఢుడై మన సైన్యాన్ని కలతపెడుతున్నాడు. అతడు భగదత్తుడి వంటివాడే. ముందు అతడిని సంహరించు, తరువాత తక్కినపని చూచుకొందాము? అని అర్జునుడితో అన్నాడు. అతడు సరే అనగా కృష్ణుడు రథాన్ని అటువైపు తోలాడు. ఆ సమయంలో.

విశేషం: భగదత్తుడు నరకాసురుడి కుమారుడు. కౌరవపక్షంలో యుద్ధం చేస్తూ తండ్రి ఇచ్చిన వైష్ణవాస్త్రమును అర్జునుడిపై ప్రయోగించగా కృష్ణుడు దానిని అడ్డగించాడు. సుప్రతీకం అనే ఏనుగుపై యుద్ధం చేస్తున్న అతడిని వాహనంతో సహా అర్జునుడు సంహరించాడు.

దండధారుం డను రాజు వేదండంబుతోడ నర్జునుచేఁ జచ్చుట (సం. 8-54-1 (కుంభ))

క. పాండవ సైన్యంబుల వే। దండంబుల ఘోటముల రథంబుల భటులం
జండగతి మగధపతి నిజ। శుండాలముఁ బఱపి యేపుఁ జూపి తెరల్చెన్. 311

ప్రతిపదార్థం: పాండవ సైన్యంబుల= పాండవసేనలలోని; వేదండంబులన్= ఏనుగులను; ఘోటములన్= గుఱ్ఱాలను; రథంబులన్= రథాలను; భటులన్= సైనికులను; మగధపతి= దండధారుడు; చండగతిన్= తీవ్రంగా; నిజ శుండాలమున్+పఱపి= తన ఏనుగును పంపి; ఏపున్+చూపి తెరల్చెన్= పరాక్రమం చూపి కలత పొందించాడు.

తాత్పర్యం: దండధారుడు తన గజంతో విజృంభించి పాండవసేనలోని రథ, గజ, తురగ, పదాతులను కలచివేశాడు.

వ. అ వ్విక్రమ విహారంబు వీక్షించి. 312

ప్రతిపదార్థం: ఆ+విక్రమ విహారంబు= అతని పరాక్రమవిహారాన్ని; వీక్షించి= చూచి.

తాత్పర్యం: దండధారుని రణసంరంభాన్ని చూచి.

తే. మాగధుని కోల్తలకుఁ గాక మనబలంబు । విఱిగెఁ బొద పాదమని తాను దఱిమెఁ దేరు
హరియుఁ బఱపంగ నర్జునుం డడ్డపడియెఁ । జండ చేష్టితోద్దండ వేదండమునకు. 313

ప్రతిపదార్థం: మాగధుని కోల్తలకున్+కాక= దండధారుడి యుద్ధానికి తట్టుకొనలేక; మన బలంబు= మనసైన్యం; విఱిగెన్= చెదరిపోయింది; పాదపాదము+అని= పదపద అని; తాను= అతడు; తేరు= రథం; తఱిమెన్= త్వరపెట్టాడు; హరియున్+పఱపంగన్= కృష్ణుడు రథం పరుగెత్తించగా; అర్జునుండు= అర్జునుడు; చండవేష్టిత= తీవ్రమైన చేష్టలతో కూడిన; ఉద్దండ వేదండమునకున్= భయంకర గజానికి; అడ్డపడియెన్= అడ్డుగా వెళ్ళాడు.

తాత్పర్యం: దండధారుడి ధాటికి తట్టుకోలేక మన సైన్యం చెల్లాచెదరయింది. 'రథాన్ని త్వరగా తోలుము' అని అర్జునుడు అనగా కృష్ణుడు రథం పరుగెత్తించాడు. అప్పుడు తీవ్రంగా విజృంభిస్తున్న దండధారుడి గజాన్ని అర్జునుడు అడ్డుకొన్నాడు.

క. అగ్గలిక దండధారుఁడు । దిగ్గజనిభ నిజ గజంబుఁ దీవ్రత మెఱయన్
డగ్గఱఁగఁ బఱపి హయముల । నగ్గరుడధ్వజుని నరుని నమ్ములఁ గప్పెన్. 314

ప్రతిపదార్థం: దండధారుడు; అగ్గలికన్= ఉత్సాహంతో; దిగ్గజనిభ, నిజ, గజంబున్= దిగ్గజం వంటి తన ఏనుగును; తీవ్రత మెఱయన్= వేగం అతిశయించగా; డగ్గఱగన్+పఱపి= దగ్గరగా తీసికొనివెళ్ళి; హయములన్= గుఱ్ఱాలను; ఆ+గరుడధ్వజునిన్= శ్రీకృష్ణుడిని; నరునిన్= అర్జునుడిని; అమ్ములన్+కప్పెన్= బాణాలతో కప్పాడు.

తాత్పర్యం: దండధారుడు దిగ్గజంవంటి తన ఏనుగును వేగంగా వారి దగ్గరకు తీసుకొని వెళ్ళి కృష్ణార్జునులను, గుఱ్ఱాలను బాణాలతో ముంచెత్తాడు.

చ. అలిగి కిరీటి మాగధధరాధిపు బాహులు ద్రెంచి, గ్రక్కునం
దలయును ద్రుంచి, యేనుఁగు నుదగ్రతఁ బీనుఁగుఁ జేసె; నప్డు గొం
దల మొకయింత లే కతని తమ్ముఁడు దండుఁడు దాఁకి తోమరం
బులు వరఁగింప గేలు శిరముం గరటిం దునుమాడె నుగ్రతన్. 315

ప్రతిపదార్థం: కిరీటి= అర్జునుడు; అలిగి= కోపించి; మాగధ ధర+అధిపు, బాహులు, త్రెంచి= దండధారుడి భుజాలు నరికి; గ్రక్కున్+తలయును, ద్రుంచి= వెంటనే తలను కూడ ఖండించి; ఏనుఁగును; ఉదగ్రతన్+పీనుఁగున్+చేసెన్= భయంకరంగా శవముగా చేశాడు; అప్డు= అపుడు; అతడి తమ్ముడు దండుడు; కొందలము+ఒక ఇంతలేక= కలత ఏమాత్రము లేకుండా; తాఁకి, తోమరంబులు పరఁగింపన్= (అర్జునుడిని) ఎదుర్కొని బాణాలు ప్రయోగించగా; కేలు శిరమున్+కరటిన్= చెయ్యి, తల, ఏనుగును; ఉగ్రతన్= భయంకరంగా, తునుమాడెన్= ఖండించాడు.

తాత్పర్యం: అర్జునుడు ఆగ్రహం చెంది, దండధారుని చేతులు, తలను నరికి అతడి ఏనుగును వధించాడు. అప్పుడు అతడి తమ్ముడు దండుడు ఏమాత్రం కలత చెందకుండా బాణాలు ప్రయోగించగా, అర్జునుడు అతని చేతిని, తలను, ఏనుగును ఖండించాడు.

క. తదనీకంబు గజంబులు । పొదివిన బలుగాలి మేఘములఁ దీవ్రగతిన్
జెదరించు పగిది నరుఁ డు । న్మదుఁడై నలుదెసలఁ దోలె మనుజాధీశా! 316

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= రాజా!; తద్+అనీకంబు= ఆ దండుని సైన్యం; గజంబులు పొదివిన= ఏనుగులు తాకగా; నరుఁడు+ఉన్మదుఁడు+ఐ= అర్జునుడు విజృంభించినవాడై; బలుగాలి= తీవ్రమైన గాలి; మేఘములన్= మబ్బులను; తీవ్రగతిన్= బలంతో; చెదరించుపగిదిన్= చెదరగొట్టే విధంగా; నలుదెసలన్+తోలెన్= అన్ని దిక్కులకూ చెదరగొట్టాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! దండుడి సైన్యం గజాలు వచ్చి తాకగా పెనుగాలి మేఘాలను చెదరగొట్టేటట్లుగ అర్జునుడు వాటిని నలుదెసలకూ చెదరగొట్టాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇవ్విధంబున మగధ సైన్యంబు మర్దించి సంశప్తక సైన్యంబుపైఁ గవిసి కపికేతనంబు మెఱుంగులు మెఱయ మధుమథను వెరవున వెలిమావుల గతు లక్కజంబుగా నుక్కునఁ బార్థుండు భల్లనారాచ ప్రముఖ ప్రదర పరంపరల సొంపును బాహువీర్య ధైర్యంబుల పెంపును నిలింప నికరంబు వర్ణింప నందు మహార్ణవంబునం దిరుగు మందరనగంబు చందంబున నిజస్యందనం బొప్ప నప్పటప్పటి కెక్కు డొదవు మదంబునం ద్రిగర్తాదులగు నమ్మార్తురు పైపయిం గ్రమ్మికురియు నస్త్రశస్త్రంబులు విదళితచ్ఛిన్న చూర్ణితంబులు సేయుచుఁ దదీయ గాత్రంబులం గరటి ఘోటక తనువులుం దునియ లయ్యును నుగ్గు లయ్యును బఱియ లయ్యును గుదులయ్యును ధరం దొరఁగఁ దామరబావిం గేలి సల్పు సామజంబు చాడ్పున విహరించి యవిహతి ధృతి వ్రతమహితు లగు నహితుల నత్యుత్తమ లోకంబులకుం బుచ్చినం గొంచెపు మూఁక విచ్చినం బెద్ద వెనుకొనక యరదంబు మరల్చి వచ్చునెడ నచ్యుతుం డర్జును నుద్దేశించి 'భవద్విక్రమ విహార స్థలంబు సూచితే?' యని పలికి వివిధాయుధ ఖండంబులను వేదండాశ్వ రథ పదాతి శకలంబులను భూషణాతపత్రకేతు చామరాంశంబులను జక్షుశ్చమత్కరణపరిణతం బగు రణస్థలంబు సూపె; నప్పుడు గొఱ ప్రాణంబులతో నొఱలు నర తురగ ద్విరదంబులను గొందఱు దమవారిం గానక కన్నీళ్ళు నించుచు నాలింగన రోదన ప్రముఖంబు లైన కరుణా భాషణంబు లగు నవస్థా విశేషంబులం బొందువారలం గృపాళురై యాలోకించుచు

నయ్యిరువురుఁ దమ మోహరంబున నెసంగు కలకలంబు విని యుదీర్ణగమనంబునం జనుదెంచుచుండి; రటమున్న కౌరవ్యుల మొనయును గర్ణుని మొగ్గరంబును రెండు ముఖంబులం బెనంగుచుండి కయ్యపు టుచితత్వంబునం గలసె; నట్టియెడ రారాజు పురికొల్ప రాధేయునకుఁ బ్రాపయి పుళింద బాహ్లిక టేంకణాంధ్ర భోజానీకంబు గవిసినం గౌంతేయ బలంబునకు భరం బగుటయు. 317

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; మగధ సైన్యంబు మర్దించి= మగధ సైన్యాన్ని చంపి; సంశప్తక సైన్యంబుపైన్+కవిసి= సంశప్తకసైన్యాన్ని తాకి; కపికేతనంబు, మెఱుంగులు, మెఱయన్= కపిధ్వజం ప్రకాశించగా; మధుమథను వెరవునన్= కృష్ణుడి నేర్పుతో; వెలిమావుల, గతులు+అక్కజంబుగాన్= తెల్లగుర్రాల నడకలు ఆశ్చర్యం గొలుపగా; పార్థుండు= అర్జునుడు; ఉక్కున= శౌర్యంతో; భల్ల, నారాచ, ప్రముఖ, ప్రదర, పరంపరల సొంపును= బల్లెములు, బాణాలు మొదలైన ఆయుధాల వరుసల ప్రకాశమూ; బాహువీర్య, ధైర్యంబుల, పెంపును= భుజబల ధైర్యాల అతిశయమూ; నిలింపనికరంబు వర్ణింపన్= దేవతల సమూహం పొగడగా; అందున్= ఆ యుద్ధభూమిలో; మహా+అర్ణవంబునన్+తిరుగు మందర నగంబు చందంబునన్= మహా సముద్రంలో తిరిగే మందర పర్వతంవలె; నిజస్యందనంబు+ఒప్పన్= తన రథం ఒప్పగా; అప్పటప్పటికిన్+ఎక్కుడు+ ఒదవుమదంబునన్= అంతకంతకు అధికమైన గర్వంతో; త్రిగర్త+ఆదులు+అగు+ఆ+మార్తురు= త్రిగర్తీయులు మొదలైన ఆ శత్రువులు; పైపయిన్+ క్రమ్మి= మీదిమీదికివచ్చి; కురియ+అస్త్ర శస్త్రంబులు= వేసే అస్త్రశస్త్రాలు; విదళిత+ఛిన్న, చూర్ణితంబులు, చేయుచున్= చీల్చబడిన ముక్కలుగా పొడిగా చేస్తూ; తదీయ గాత్రంబులున్= వారి దేహాలు; కరటి, ఘోటక, తనువులున్= ఏనుగులు, గుర్రాల శరీరాలు; తునియలు+అయ్యును= తునకలై; నుగ్గులు+అయ్యును= చూర్ణములై; పఱియలు+అయ్యును= బద్దలై; గుదులు+అయ్యును= గుత్తులై; ధరన్+తొరఁగన్= నేలపై పడగా; తామరబావిన్+కేలిసల్పు= తామరకొలనులో క్రీడించు; సామజంబు చాడ్పునన్ విహరించి= ఏనుగువలె విహరించి; అవిహత, ధృతి, వ్రత, మహితులగు+అహితులన్= కొట్టబడని ధైర్యంచే గొప్పవారైన శత్రువులను; అత్యుత్తమలోకంబులకున్+పుచ్చినన్= వీరస్వర్గానికి పంపగా; కొంచెపు, మూఁక విచ్చినన్= అల్పసైనికులు చెదరిపోగా; పెద్ద వెనుకొనక= మిక్కిలి వెంబడించకుండా; అరదంబు మరల్చివచ్చునెడన్= రథం మరలించి వస్తుండగా; అచ్యుతుండు+అర్జునున్+ఉద్దేశించి= కృష్ణుడు అర్జునుడితో; భవత్+విక్రమ విహారస్థలంబు+చూచితే!= నీవు పరాక్రమం చూపిన స్థలం చూచావా?; అని పలికి= అని వచించి; వివిధ+ఆయుధఖండంబులను= అనేక ఆయుధాల తునుకలతో; వేదండ+అశ్వరథ పదాతి శకలంబులను= గజ అశ్వరథ పదాతుల ఖండాలతో; భూషణ+ఆతపత్ర= ఆభరణాలు, ఛత్రాలు, కేతు చామర+అంశంబులను= ధ్వజ చామరాల ముక్కలతో; చక్షుః+చమత్కరణ పరిణతంబు+అగు= చూపులకు రమ్య మనోహరంగా ఉన్న; రణస్థలంబు చూపెన్= యుద్ధరంగం చూపించాడు; అప్పుడు; కొఱ ప్రాణంబులతోన్+ఒఱలు= కొనప్రాణములతో మ్రోగే; నరతురగ ద్విరదంబులను= సైనిక అశ్వగజాలను; తమవారిన్+కానక= తమ వాళ్ళు కనిపించక; కన్నీళ్ళు నించుచున్= ఏడుస్తూ; ఆలింగనరోదన ప్రముఖంబులు+ఐన= కౌగిలించుకొని ఏడ్చునట్టి; కరుణాభాషణంబులు+అగు= జాలిగొలిపే మాటలు పలికే; అవస్థా విశేషంబులన్= వివిధ అవస్థలను; పొందువారలన్= పొందినవారిని; కృపాళుర+ఐ ఆలోకించుచున్= జాలిగలవారై చూస్తూ; ఆ+ఇరువురున్= కృష్ణార్జునులు; తమ మోహరంబునన్= తమ సైన్యంలో; ఎసంగు కలకలంబు విని= కలిగిన సందడి విని; ఉదీర్ణగమనంబునన్= మిక్కిలివేగంగా; చనుదెంచుచుండిరి= వస్తున్నారు; అటమున్న= అంతకుముందే; కౌరవ్యుల మొనయును= కౌరవసేనయు; కర్ణుడి మొగ్గరంబును= కర్ణుడిసేనయు; రెండు ముఖంబులన్+ పెనంగుచుండి= ఇరువైపులుగా పోరుతూ; కయ్యపు+ఉచితత్వంబునన్+కలసెన్= యుద్ధంలో తగునట్లుగా కలిశాయి; అట్టి ఎడన్= అప్పుడు; రారాజు పురికొల్పన్= దుర్యోధనుడు ప్రేరేపించగా; రాధేయునకున్+ప్రాపయి= కర్ణుడికి అండగా; పుళింద బాహ్లిక టేంకణ+ఆంధ్ర భోజ+అనీకంబు= పుళింద బాహ్లిక టేంకణ ఆంధ్ర భోజసైన్యాలు; కవిసినన్= తాకగా; కౌంతేయబలంబునకున్= పాండవసైన్యానికి; భరంబు+అగుటయున్= దుస్సహం కాగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా మగధసైన్యాన్ని చంపి, సంశప్తక సైన్యం మీద విజృంభించాడు. కపికేతనం ప్రకాశించగా, శ్రీకృష్ణుని చాకచక్యంతో తెల్లనిగుర్రాల నడకలు ఆశ్చర్యం గొలుపగా, పరాక్రమంతో పార్థుడు-బల్లెములు, ఇనుప బాణాలు మొదలైన బాణాల పరంపరల సొంపును, తన బాహుబల ధైర్యాల పెంపును దేవతలసమూహం శ్లాఘించగా, మహాసముద్రంలో తిరిగే మందరపర్వతం మాదిరిగ తన రథం ఒప్పారగా, అంతకంతకు అతిశయించే గర్వంతో ఆ త్రిగర్తులు మొదలైన శత్రువులు మీదిమీదికి వచ్చి కురిపించే శస్త్రాస్త్రాలు విరిగి ముక్కలై పొడి అయ్యేటట్లు చేస్తూ, వాళ్ళ శరీరాలు, గజాశ్వాల శరీరాలు తునకలై, చూర్ణాలై, గుత్తులై నేలమీద పడగా, తామరకొలనులో క్రీడించే ఏనుగువలె విహరించాడు. మొక్కవోని ధైర్యంతో గొప్పవారైన శత్రువులను స్వర్గానికి పంపాడు. మిగిలిన కొద్ది సైన్యం చెల్లాచెదరైపోగా, అట్టె దాన్ని వెంటాడక, రథాన్ని మరలించి తిరిగి వచ్చేటప్పుడు, శ్రీకృష్ణుడు అర్జునుడితో, 'నీవు పరాక్రమంతో విహరించిన స్థలాన్ని చూచావా?' అన్నాడు. వివిధాయుధాల ముక్కలతో, గజాశ్వరథ పదాతి సైన్యాల ఖండాలతో, ఆభరణాల, గొడుగుల, ధ్వజాల, వింజామరల తునుకలతో కన్నులకు ఆశ్చర్యాన్ని గొలిపే ఆ యుద్ధభూమిని చూపాడు. అప్పుడు కొస ఊపిరులతో మూల్గుతున్న సైనికులను, గజ తురగాలను - తమవారు కనపడక కన్నీళ్ళుకారుస్తూ, కౌగిలించుకోవటం, ఏడవటం, పెద్దగా జాలిగొలిపే మాటలు మాట్లాడటం వంటి నానావస్థలు పడుతున్నవారిని- దయతో చూస్తూ ఆ కృష్ణార్జునులు తమ సైన్యంలో చెలరేగిన సందడిని విని మిక్కిలి వేగంగా రాసాగారు. అంతకుముందే కౌరవసేన, కర్ణునిసేన వేర్వేరు వైపుల యుద్ధం చేస్తూ, ఒకటిగా కలియటం యుద్ధం దృష్ట్యా ఉచితమని కలిశాయి. అప్పుడు దుర్యోధనుడు పురికొల్పగా కర్ణుడికి సాయంగా పుళింద, బాహ్లిక, టేంకణ, ఆంధ్ర, భోజసైన్యాలు పాండవసైన్యాన్ని ఎదుర్కోగా, ఆ తాకిడి పాండవసైన్యానికి భరించటం కష్టమైంది.

మలయధ్వజుం డను పాండ్యమహారా జశ్వత్థామచేతఁ జచ్చుట (సం. 8-56-1 (కుంభ))

సీ. **పాండ్యుఁ డా సేనలపై బెట్టిదంబుగ । నదరి బాహాబల మక్కజముగఁ**
బేరిచి పీనుంగుపెంటగాఁ జతురంగ । ముల రూపుమాపె న య్యలఘుభుజుఁడు
ద్రోణ భీష్ములు దనతోఁబాటి యను పలు । కున కోర్వఁ డచ్యుతార్జునులు దనకు
నెక్కుడు నా విన్న నేవగించుచునుండు । నవ్వీరుఁ డమ్మెయి నాక్రమింపఁ

ఆ. **గని కడంగి యెదురు చని గురుతనయుండు । నగుచుఁ 'బగఱ నీవు మృగకులంబు**
గలఁచు హరియుఁ బోలెఁ గలఁచెదు నా దిక్కు । మొగము సేసి యనికి మొనయు' మనియె. **318**

ప్రతిపదార్థం: పాండ్యుఁడు= మలయధ్వజుడు; ఆ సేనలపైన్= కౌరవసేనలపై; బెట్టిదంబుగన్+అదరి= తీవ్రంగా విజృంభించి; బాహాబలము+అక్కజముగన్= భుజబలం అచ్చెరువు గొల్పగా; పేరిచి= విజృంభించి; చతురంగములు= రథ, గజ, తురగ, పదాతులను; పీనుంగు పెంటగాన్= శవాల కుప్పగా; రూపుమాపెన్= నాశనం చేశాడు; ఆ+అలఘుభుజుఁడు= గొప్ప భుజములు కలవాడైన మలయధ్వజుడు; ద్రోణభీష్ములు= ద్రోణాచార్యుడు, భీష్ముడు; తనకున్+పాటి అను పలుకునకున్+ఓర్వఁడు= తనతో సమానం అన్నమాట సహించలేడు; అచ్యుత+అర్జునులు= కృష్ణార్జునులు; తనకున్+ఎక్కుడునాన్ విన్నన్+ ఏవగించుచునుండున్= తనకంటె అధికులని వింటే అసహ్యపడుతాడు; ఆ+వీరుఁడు+ఆ+మెయిన్+ఆక్రమింపన్= ఆ వీరుడైన మలయధ్వజుడు ఆ విధంగా పైబడగా; గురుతనయుండు= అశ్వత్థామ; కని= చూచి; కడంగి= పూని; ఎదురు చని= ఎదురుగా వెళ్ళి; నగుచున్= నవ్వుతూ; మృగకులంబు కలఁచు హరియున్+పోలెన్= జింకల గుంపును కలతపెట్టే సింహంవలె;

నీవు; పగఱన్= శత్రువులను; కలఁచెదు= బాధపెడుతున్నావు; నా దిక్కుమొగము చేసి= నాకు ఎదురుగా వచ్చి; అనికిన్ మొనయుము+అనియెన్= యుద్ధానికి తలపడుము అన్నాడు.

తాత్పర్యం: పాండ్యరాజైన మలయధ్వజుడు భుజబలంతో విజృంభించి కౌరవసేనలోని చతురంగబలాలను పీనుగుపెంట కావించాడు. అతడు భీష్మద్రోణులు తనకు సాటికాగలరని అన్నా, కృష్ణార్జునులు తనకంటె మేటి వీరులని విన్నా సహించలేని శౌర్యధనుడు. అతడి విక్రమాన్ని చూచిన అశ్వత్థామ నవ్వుతూ అతడితో 'లేళ్ళగుంపును బెదరగొట్టే సింహంవలె కౌరవసైన్యాన్ని నీవు కలతపెడుతున్నావు. నాకు ఎదురుగా వచ్చి నాతో యుద్ధం చేయుము' అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

చ. **అన విని మేను వొంగ మలయధ్వజుఁ డుగ్రపు నారసంబుఁ ద**
త్తనువునఁ గ్రుచ్చి మౌర్వి నినదంబు నభంబునఁ బర్వ నంప వె
ల్లి నిగుడఁ జేయఁ దొమ్మిది శిలీముఖముల్ వెస నమ్మహీశుపై
ననిమిషవర్ణనీయగతి న గ్గురునందనుఁ డేసె నేసినన్. **319**

ప్రతిపదార్థం: అనన్+విని= అనగా విని; మలయధ్వజుఁడు; మేను పొంగన్= దేహం ఉప్పొంగగా; ఉగ్రపునారసంబున్= భయంకరమైన బాణాన్ని; తద్+తనువునన్+క్రుచ్చి= అశ్వత్థామ దేహంలో నాటి; మౌర్వినినదంబు నభంబునన్ పర్వన్= వింటినారి ధ్వని ఆకాశంలో వ్యాపించగా; అంపవెల్లి నిగుడన్+చేయన్= బాణవర్షం కురిపించగా; వెసన్= వెంటనే; ఆ+ గురునందనుఁడు= అశ్వత్థామ; అనిమిష వర్ణనీయగతిన్= దేవతలు పొగడునట్లుగా; ఆ+మహీశుపైన్= ఆ పాండ్యుడిపై; తొమ్మిది శిలీముఖముల్= తొమ్మిది బాణాలు; ఏసెన్= ప్రయోగించాడు. ఏసినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: అశ్వత్థామ మాటలకు మలయధ్వజుడు మేను ఉప్పొంగగా అతడి శరీరంపై నిశితబాణం నాటి, అల్లె త్రాటి ధ్వని ఆకాశమంతా వ్యాపింపగా బాణవర్షం కురిపించాడు. అశ్వత్థామ కూడా దేవతలు మెచ్చేటట్లుగా అతడిపై తొమ్మిదిబాణాలు వేసి నొప్పించాడు.

వ. **అ త్తొమ్మిదింటిలోన.** **320**

తాత్పర్యం: ఆ తొమ్మిది బాణాలలో.

క. **ప్రతిశరములు పాండ్య మహీ। పతియును బరఁగింప నైదు భగ్నము లయ్యెన్**
గతి సెడక నిగిడి రథ్య। ప్రతతి ధరం గూల్చె నాల్గు బాణము లధిపా! **321**

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; పాండ్య మహీపతియును= మలయధ్వజుడు; ప్రతిశరములు= ప్రతిగా బాణాలు; పరఁగింపన్= వేయగా; ఐదు, భగ్నములు+అయ్యెన్= ఐదు బాణాలు విరిగిపోయాయి; నాల్గుబాణములు= మిగిలిన నాల్గుబాణాలు; గతి+చెడక నిగిడి= గురి తప్పక వెళ్ళి; రథ్యప్రతతి= గుఱ్ఱాల సమూహాన్ని; ధరన్+కూల్చె= నేల కూల్చాయి.

తాత్పర్యం: మలయధ్వజుడు కూడా ప్రతిగా బాణాలు వేయగా, అశ్వత్థామ వేసిన తొమ్మిది బాణాలలో ఐదు మధ్యలో విరిగాయి. నాలుగు బాణాలు గురితప్పక గుఱ్ఱాలను నేలకూల్చాయి.

తే. **మఱియు గురుపుత్త్రుఁ డేయ నమ్మలయకేతుఁ । డా శరంబులు దద్ధనుర్జ్యాలతయును**
దునిమెఁ; దునిమిన నతి రయంబున నతండు । నారి సంధించి యమ్ముల నభముఁ గప్పె. **322**

ప్రతిపదార్థం: మఱియున్= మరల; గురుపుత్త్రుఁడు+ఏయన్= అశ్వత్థామ బాణాలు ప్రయోగించగా; ఆ మలయకేతుఁడు= మలయధ్వజుడు; ఆ శరంబులు= ఆ బాణాలు; తద్+ధనుః+జ్యాలతయును= అతని వింటినారిని; తునిమెన్= ఖండించాడు; తునిమినన్= ఖండించగా; అతండు+అశ్వత్థామ; అతిరయంబునన్= కడువేగంతో; నారి సంధించి= మరొక నారిని ఎక్కించి; అమ్ములన్= బాణాలతో; నభమున్+కప్పెన్= ఆకాశాన్ని కప్పాడు.

తాత్పర్యం: మళ్ళీ అశ్వత్థామ బాణాలు వేయగా మలయధ్వజుడు వాటిని, అతడి వింటినారిని ఖండించాడు. అశ్వత్థామ వెంటనే మరొక నారిని సంధించి బాణాలతో ఆకాశాన్ని కప్పాడు.

వ. **అ ప్పాండ్యమహీపతి పరివార సామర్థ్యంబున రథ్యవంతుం డయి వాయవ్యాస్త్రంబున నయ్యంప పరంపరఁ బ్రతిహతంబు సేసి తదీయ చక్రరక్షకులం దెగటార్చి యార్చినం గెరలి యగ్గురునందనుం దత్సహచరుల నుఱుమాడి రత్నమయాగురు చందనసుందరంబైన మలయగిరి ప్రకారంబునం బొలుచు కేతనంబు గూల్చి గుఱ్ఱంబుల గీటడంగించి సూతు ప్రాణంబులు గొని చాపంబు ద్రుంచి తేరు దుమురు సేసి యతండు పొలివోని పౌరుషంబునం బ్రయోగించు నస్త్ర శస్త్రంబుల నుఱక నఱికి యగ్గమై యున్నను గయ్యంబువలని వేడుక నతని సమయింప నొల్లక యరవాయి గొనిన యాలోనఁ బతిత యోధం బైన సుకల్పిత మాతంగంబు నెక్కి గిరి శిఖరంబు నలంకరించు కేసరియ ట్లొప్పి యా ద్రవిడేశ్వరుండు సామజంబు నుద్దామగతిం దఱిమి భీమాభిరామం బైన తోమరంబు వైచిన మణిగణోజ్జ్వలంబైన యా ద్రౌణి శిరోభూషణంబు ధరణిం బడినఁ ద్రొక్కంబడిన భుజంగంబు పోలికం గనలి యబ్బలుమగండు తత్పార్శ్వవర్తుల నార్వుర రథికవరులఁ దద్వేదండంబుఁ దుండంబును చరణ చతుష్టయంబును నమ్మేదినీపతి పాదంబులుఁ గరంబులు శిరంబును నతి తీవ్ర భల్లంబులం దునుమాడిన నద్దిక్కు మూఁకలు విచ్చెం; గురుభూవరుం డమ్మహీసురవరుం జేరం జని యగ్గించె నప్పుడు.** **323**

ప్రతిపదార్థం: ఆ+పాండ్య మహీపతి= మలయధ్వజుడు; పరివార సామర్థ్యంబునన్= అనుచరుల సామర్థ్యం వల్ల; రథ్యవంతుండు+ఐ= రథసమూహాలు కలవాడై; వాయవ్య+అస్త్రంబునన్= వాయవ్యాస్త్రంతో; ఆ+అంపపరంపరన్+ప్రతిహతంబుచేసి= ఆ బాణసమూహాన్ని మరలింపజేసి; తదీయ చక్రరక్షకులన్+తెగటార్చి= ఆతడి చక్రరక్షకులను వధించి; ఆర్చినన్+కెరలి= అరువగా విజృంభించి; ఆ+గురునందనున్+తద్+సహచరులన్= ఆ అశ్వత్థామను, అతనియొక్క సహచరులను; నుఱుమాడి= చూర్ణంచేసి; రత్నమయ+అగురు చందన సుందరంబు+అయిన= రత్నమయమైన అగురుగంధపుచెట్లతో అందగించే; మలయగిరి ప్రకారంబునన్+పొలుచు= మలయపర్వతంవలె ఒప్పుతున్న; కేతనంబు కూల్చి= ధ్వజాన్ని కూల్చి; గుఱ్ఱంబుల గీటు+అడంగించి= గుఱ్ఱాలగర్వాన్ని అణచి; సూతుప్రాణంబులుకొని= సారథిని చంపి; చాపంబు త్రుంచి= ధనువును విరిచి; తేరు తుఱుము చేసి= రథాన్ని ముక్కలు చేసి; అతండు= మలయకేతువు; పొలిపోని పౌరుషంబునన్= తగ్గని పౌరుషంతో; ప్రయోగించు+అస్త్రశస్త్రంబులన్= వేసే అస్త్రశస్త్రాలను; ఉఱక నఱికి= అవలీలగా నరికి; అగ్గము+ఐ ఉన్నను= అధికుడై ఉన్నను; కయ్యంబువలని వేడుకన్= యుద్ధమునందలి ఉత్సాహంతో; అతని సమయింపన్+ఒల్లక= అతడిని చంప పూనుకొనక; అరవాయి కొనిన ఆలోనన్= సంకోచపడినంతలో; పతితయోధంబు+అయిన= పడిన యోధులుగల- యోధులను పడగొట్టు;

సుకల్పితమాతంగంబున్+ఎక్కి= శ్రేష్ఠమైన ఏనుగు నధిరోహించి; ఆ ద్రవిడ+ఈశ్వరుండు= పాండ్యదేశపురాజు; గిరిశిఖరంబును+ అలంకరించు; కేసరి అట్లు+ఒప్పి= పర్వతశిఖరంమీద కూర్చున్న సింహంవలె ఒప్పుతూ; సామజంబును+ఉద్దామగతిన్+తటిమి= ఏనుగును ఉద్ధండంగా నడిపి; భీమ+అభిరామంబు+అయిన= భయంకరమూ రమ్యమూ ఐన; తోమరంబు వైచినన్= తోమరము అనే ఆయుధాన్ని వేయగా; మణిగణ+ఉజ్జ్వలంబు+అయిన= మణుల సమూహంతో గొప్పగా ప్రకాశించుచున్న; ఆ ద్రౌణి శిరోభూషణంబు= అశ్వత్థామ శిరస్సున ధరించిన ఆభరణం; ధరణిన్+పడినన్= నేలపై పడగా; ఆ+బలుమగండు= ఆ వీరుడు; త్రొక్కంబడిన భుజంగంబు పోలికన్+కనలి= తొక్కబడిన పామువలె కోపించి; తద్+పార్శ్వవర్తులన్+ఆర్వురు రథికవరులన్= మలయకేతువు ప్రక్కల ఉన్న ఆరుగురు వీరులను; తద్+వేదండంబు తుండంబును= ఆ ఏనుగు తొండమును; చరణచతుష్టయంబును= నాలుగుకాళ్ళను; ఆ+ మేదినీపతి= పాండ్యరాజు; పాదంబులున్+కరంబులు శిరంబునున్= పాదాలను, చేతులను, శిరస్సును; అతితీవ్ర భల్లంబులన్+ తునుమాడినన్= మిక్కిలి వాడి అయిన బల్లెములతో ఖండించగా; ఆ+దిక్కుమూఁకలు విచ్చెన్= ఆవైపున ఉన్న సైన్యాలు చెల్లాచెదరయినాయి; కురు భూవరుండు= దుర్యోధనుడు; ఆ+మహీసురవరున్+చేరన్+చని= అశ్వత్థామవద్దకు వెళ్ళి; అగ్గించెన్= ప్రశంసించాడు; అప్పుడు.

తాత్పర్యం: ఆ పాండ్యరాజు తన పరివార సామర్థ్యంవల్ల రథసమూహాలు కలిగినవాడై, వాయవ్యాస్త్రంతో ఆ బాణ సమూహాన్ని అడ్డుకొని, అశ్వత్థామ చక్రరక్షకులను సంహరించి, సింహనాదం చేశాడు. అప్పుడశ్వత్థామ అతడి సహచరులను నుగ్గుచేశాడు. రత్నాలతో నిండి, అగరు చందనవృక్షాలతో అందంగా ఉన్న మలయపర్వతం వలె శోభిల్లే అతడి రథకేతనాన్ని కూల్చాడు. రథాశ్వాలను చంపాడు. సారథి ప్రాణాలు తీశాడు. వింటిని త్రుంచాడు. రథాన్ని ముక్కలు ముక్కలు చేశాడు. ఆ పాండ్యరాజు తరుగని పౌరుషంతో ప్రయోగిస్తున్న శస్త్రాస్త్రాలను లెక్కపెట్టక, ముక్కలు చేసి తాను అతిశయించి ఉన్నా, ఇంకా అతడితో యుద్ధం చెయ్యాలన్న అభిలాషతో, అతడిని చంపటానికి ఇష్టపడక సంకోచిస్తుండగా - ఆ పాండ్యరాజు మలయధ్వజుడు, యోధులను పడగొట్టిన ఒక గొప్ప గజాన్ని అధిరోహించి, పర్వతశిఖరాన్ని అలంకరించిన సింహంవలె ప్రకాశించి, ఆ మదపుటేనుగును మహాతీవ్రవేగంతో అశ్వత్థామమీదికి తరిమాడు. భయంకరంగా, అందంగా ఉన్న తోమరాయుధాన్ని అతడిమీద ప్రయోగించాడు. ఆ దెబ్బకు మణులసమూహంతో ఎంతగానో ప్రకాశించే అశ్వత్థామ శిరోభూషణం నేలమీద పడేసరికి, ఆ మహావీరుడు తోక తొక్కబడిన సర్పంవలె ఆగ్రహించి, పాండ్యరాజు ప్రక్కనున్న ఆరుగురు రథికులను, ఆ ఏనుగుతొండాన్ని, దాని నాలుగుకాళ్ళను, ఆ పాండ్యరాజు పాదాలను, చేతులను, శిరస్సును తీవ్రాతితీవ్రాలైన బల్లేలతో త్రుంచాడు. అప్పుడు పాండవపక్షసైన్యాలు చెల్లాచెదరయ్యాయి. దుర్యోధనుడు అశ్వత్థామ దగ్గరకు వచ్చి అతడిని ప్రశంసించాడు. అప్పుడు......

క. నిలు నిలు మని తమ మూఁకల । నిలిపి వృకోదరుఁడు గవిసె నీ బలములపైఁ
దలకొని ధృష్టద్యుమ్నా । దులు సంరంభోద్భటముగఁ దోడ్పడి రధిపా ! 324

ప్రతిపదార్థం: వృకోదరుఁడు= భీముడు; నిలుమునిలుము+అని= ఆగుము ఆగుమని; తమ మూఁకలన్ నిలిపి= తమ సేనలను ఆపి; నీ బలములపైన్= నీ సైన్యాలపై; కవిసెన్= దూకాడు; ధృష్టద్యుమ్న+ఆదులు= ధృష్టద్యుమ్నుడు మొదలైనవారు; తలకొని= పూని; సంరంభ+ఉద్భటముగన్= ఉత్సాహం విజృంభించగా; తోడ్పడిరి+అధిపా!= సహాయపడ్డారు రాజా!

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! భీముడు తమ సేనలను ఆపి నీ సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. ధృష్టద్యుమ్నాదులు విజృంభించిన ఉత్సాహంతో అతడికి అండగా నిలిచారు.

క. వారల వడి కోర్వక య। క్కౌరవ సైన్యంబు దెరలఁ గర్ణుఁడు దర్ప
స్ఫారత నదల్చి నిలిపి యు। దారగతిన్ వైరిరథికతతి మార్కొనియెన్. 325

ప్రతిపదార్థం: వారలవడికిన్+ఓర్వక= ఆ సేనలధాటికి నిలువలేక; ఆ+కౌరవసైన్యంబు తెరలన్= కౌరవసైన్యం చెదరగా; కర్ణుఁడు; దర్పస్ఫారతన్+అదల్చి నిలిపి= గర్వంయొక్క అతిశయంతో (వారిని) గద్దించి ఆపి; ఉదారగతిన్= గొప్పగా; వైరి రథికతతిన్ మార్కొనియెన్= శత్రువీరుల సమూహాన్ని ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: పాండవసైన్యం ధాటికి కౌరవసైన్యం నిలువలేకపోగా, కర్ణుడు గర్వాతిశయంతో గద్దించి వారిని ఆపి, గొప్పగ వైరి వీరులసమూహాన్ని ఎదుర్కొన్నాడు.

వ. అతనికి బాసటయై యడరిన యశ్వత్థామచేతం బలువురు పాంచాలురు వొలిసిరి; కృష్ణుండు గ్రీడికిం బాండ్యమహీపతి సమయుట సూపి సమీరనందన కర్ణాదులగు నిరువాఁగు రథికుల పరాక్రమంబును వేఱువేఱ నిరూపించి చూపిన నతండును రథంబు మన సేనలోనికి బోవనిమ్మనిన నచ్యుతుం డట్లు చేయ నుబ్బిన పాండవానీకంబునకును రాధేయ గురుపుత్రుల రభసంబునం బేర్చిన మనమొనకును సంకుల సమరం బయ్యె; నం దాకర్ణునకు ధృష్టద్యుమ్నునకుం బరస్పర శరకర్తనంబును నితరేతర ఛ్ఛత్రకేతుఖండనంబును నన్యోన్య వర్మ విదారణంబును మిథశ్శరీర పాతనంబును నగు సంగ్రామంబు సెల్లె; నట్టియెడ నా సూతనందనునకుం దలకడచి గురునందనుండు ద్రుపదనందనుం గవిసి 'బ్రహ్మఘ్న! నిలు నిలు; మేను గలుగ నెట్లు బ్రదికెద'వని పలికి వెండియు. 326

ప్రతిపదార్థం: అతనికిన్ బాసట ఐ అడరినన్= కర్ణుడికి అండగా నిలిచి విజృంభించిన; అశ్వత్థామ చేతన్= అశ్వత్థామచేత; పలువురు పాంచాలురు పొలిసిరి= చాలామంది పాంచాలవీరులు హతమైనారు; కృష్ణుండు= కృష్ణుడు; క్రీడికిన్= అర్జునుడికి; పాండ్యమహీపతి= పాండ్యరాజు; సమయుట చూపి= మరణించటం చూపి; సమీరనందన కర్ణాదులు+అగు= భీముడు, కర్ణుడు మున్నగు; ఇరువాగు రథికుల పరాక్రమంబును= రెండుపక్షాల వీరుల శౌర్యాన్ని; వేఱువేఱ నిరూపించి చూపినన్= విడమరిచి చెప్పగా; అతండును= అర్జునుడు; రథంబు మనసేనలోనికిన్ పోవన్+ఇమ్ము+అనినన్= రథాన్ని మన సైన్యం మధ్యకు తీసికొనివెళ్ళుము అనగా; అచ్యుతుండు+అట్లు చేయన్= కృష్ణుడు అట్లా చేయగా; ఉబ్బిన పాండవ+అనీకంబునకును= పొంగిపోయిన పాండవసైన్యానికీ; రాధేయ గురుపుత్రుల రభసంబునన్= కర్ణ అశ్వత్థామల ఉత్సాహంతో; పేర్చిన మన మొనకును= అతిశయించిన మన సైన్యానికీ; సంకుల సమరంబు+అయ్యెన్= తీవ్రయుద్ధం సాగింది; అందున్+ఆ కర్ణునకున్, ధృష్టద్యుమ్నునకున్= ఆ యుద్ధంలో కర్ణుడికీ, ధృష్టద్యుమ్నుడికీ; పరస్పర శరకర్తనంబునున్= ఒకరి బాణాలను ఇంకొకరు ఖండించటం; ఇతరేతర+ఛత్ర, కేతు; ఖండనంబునున్= ఒకరి ఛత్రధ్వజాలను మరొకరు ఖండించటం; అన్యోన్యవర్మ విదారణంబును= ఒకరి కవచాన్ని మరొకరు భేదించటం; మిథః శరీరపాతనంబునున్= పరస్పర దేహాలను పడవేయటం; అగు సంగ్రామంబు+చెల్లెన్= అయినట్టి యుద్ధం కొనసాగింది. అట్టి ఎడన్= ఆ సమయంలో; ఆ సూతనందనునకున్+తలకడచి= ఆ కర్ణుడిని దాటి; గురునందనుండు= అశ్వత్థామ; ద్రుపదనందనున్+కవిసి= ధృష్టద్యుమ్నుడిని తాకి; బ్రహ్మఘ్న!= బ్రాహ్మణహంతా!; నిలు నిలుము= ఆగుము; ఏను కలుగన్= నేనుండగా; ఎట్లు బ్రదికెదవు?= ప్రాణాలతో ఎట్లా జీవిస్తావు?; అని పలికి వెండియున్= అని ఇంకా.

తాత్పర్యం: అశ్వత్థామ కర్ణుడికి బాసటగా నిలిచి పలువురు పాంచాలవీరులను హతమార్చాడు. కృష్ణుడు అర్జునుడికి పాండ్యరాజు మరణాన్ని గురించి, భీముడు, కర్ణుడు మొదలైన ఇరుపక్షాల వీరుల బలాబలాలగురించి చెప్పగా,

అర్జునుడు రథాన్ని మనసైన్యం మధ్యకు (అంటే కౌరవసైన్యం మధ్యకు) తీసికొనివెళ్ళుమని కోరాడు. అర్జునుడిని చూచి పాండవసైన్యం, కర్ణ అశ్వత్థామలను చూచి కౌరవసైన్యం పొంగిపోయి తీవ్రంగా తలపడ్డాయి. కర్ణ ధృష్టద్యుమ్నుల మధ్య పరస్పరం బాణాలు వేసికొని ఛత్ర, ధ్వజాలను, కవచాలను ఖండించుకొని దేహాలను గాయపరచుకోవటం వంటి యుద్ధం జరిగింది. అంతలో అశ్వత్థామ కర్ణుని దాటి ధృష్టద్యుమ్నుడిని ఎదుర్కొని 'బ్రాహ్మణహంతా! నేనుండగా నీవు ప్రాణాలతో ఎట్లా బయటపడగలవు?' అని పలికి, ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మాతండ్రియెడం జేసిన । పాతకముకతంబు గాఁగఁ బాంచాల నిక్ర
ష్టా! తునిమెద నిను నరుఁ డిట । కేతేరకయున్నఁ బాఱ కీవు నిలిచినన్.' 327

ప్రతిపదార్థం: పాంచాల నికృష్టా!= నీచుడవైన పాంచాలుడా!; మా తండ్రి ఎడన్+చేసిన పాతకము= నా తండ్రిఅయిన ద్రోణుడిపట్ల నీవుచేసిన పాపం; కతంబుకాఁగన్= కారణంగా; నరుఁడు+ఇటకున్+ఏతేరక+ఉన్నన్= అర్జునుడు ఇటకు రాకుంటే; ఈవు పాఱక నిలిచినన్= నీవు పారిపోకుండా ఉంటే; నినున్ తునిమెదన్= నిన్ను చంపుతాను.

తాత్పర్యం: నీచుడవైన ఓ ధృష్టద్యుమ్నా! అర్జునుడు ఇటకు రాకుండా, నీవు పారిపోకుండా ఉంటే నీవు మా తండ్రి పట్ల చేసిన పాపానికి నిన్ను చంపకుండా వదిలిపెట్టను.'

వ. అన విని ధృష్టద్యుమ్నుం డతని కిట్లనియె. 328

ప్రతిపదార్థం: అనన్+విని= అశ్వత్థామ మాటలు విని; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; అతనికిన్+ఇట్లు+అనియెన్= అతడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అశ్వత్థామ మాటలకు ధృష్టద్యుమ్నుడు అతడితో ఇట్లా అన్నాడు:

క. 'మీ తండ్రి కుటికి నఱికిన । హేతియ నీ కొఱకు నునిచితిపుడ నఱుకుదున్
నీ తులువపలుకులకు నీ । డై తోఁచిన యుత్తరంబు నదియ దురాత్మా!' 329

ప్రతిపదార్థం: దురాత్మా!= నీచుడా!; మీ తండ్రి కుటికి నఱికిన= మీ తండ్రి అయిన ద్రోణునిమీదికి ఉరికి నరికిన; హేతియ= ఖడ్గాన్నే; నీ కొఱకున్+ఉనిచితిన్= నీ కొరకు దాచిపెట్టాను; ఇపుడ నఱుకుదున్= ఇప్పుడే నిన్ను చంపుతాను; నీ తులువ పలుకులకును= నీ కుత్సితవాక్కులకు; ఈడై తోచిన ఉత్తరంబున్+అదియ= సరియైన సమాధానం అదే.

తాత్పర్యం: "ఓ దురాత్ముడా! నీ తండ్రి ద్రోణుడి తలను సరికిన ఖడ్గాన్నే నీ కొరకు కూడా దాచాను. ఇప్పుడే నిన్ను చంపుతాను. నీ కుత్సితపు మాటలకు సరి అయిన సమాధానం అదే".

వ. అని యంత నిలువక. 330

తాత్పర్యం: అని అంతటితో ఆగక.

తే. 'వినుము బ్రహ్మఘ్నుఁ డన నీకు జనునె? బ్రాహ్మ । ణ బ్రువఘ్నుఁడ నై సమున్నతి వహించు
నన్నుఁ గిల్బిషపరుఁ డను నిన్ను జనకు । కడకుఁ బుచ్చెద వేగిరపడక నిలుము.' 331

ప్రతిపదార్థం: వినుము; బ్రహ్మఘ్నుఁడు+అనన్ నీకున్+చనునె?= నన్ను బ్రాహ్మణ హంతవనటం నీకుతగునా?; బ్రాహ్మణ బ్రువఘ్నుఁడను+ఐ= బ్రాహ్మణుడు గాకపోయినా, బ్రాహ్మణుడనని చెప్పుకొంటున్న వాడిని సంహరించినవాడనై; సమున్నతి వహించునన్నున్= ఆధిక్యం పొందిన నన్ను; కిల్బిషపరుఁడు+అను నిన్నున్= పాపాత్ముడవని పలికే నిన్ను; జనకుకడకున్+ పుచ్చెదన్= నీ తండ్రివద్దకు పంపిస్తాను; వేగిరపడక నిలుము= తొందరపడక నిలబడుము.

తాత్పర్యం: నన్ను బ్రహ్మఘ్నుడనటం నీకు తగునా? బ్రాహ్మణుడు గాకపోయినా బ్రాహ్మణుడనని చెప్పుకొంటున్న వాడిని సంహరించిన గొప్పవాడినైన నన్ను పాపాత్ముడనంటున్నావు. నిన్ను చంపి నీ తండ్రివద్దకు పంపిస్తాను. తొందరపడకు.'

విశేషం: క్షాత్రధర్మం అవలంబించిన ద్రోణాచార్యుడు బ్రాహ్మణుడు కాడని, బ్రాహ్మణబ్రువుడు మాత్రమేనని, అతడిని సంహరించటం పాపం కాదని ధృష్టద్యుమ్నుడు తనను సమర్థించుకొన్నాడు.

వ. అనియె నట్లయ్యిరువురు నొండొరులం బరుషంబులు పలికి తలపడి వియత్తలంబు విశిఖ శిఖా కలాపంబులం గప్పిరి రాధేయుండు యుధామన్యు నుత్త మౌజో ద్రౌపదేయ శైనేయులను మఱియుం జేయంగల పాండవ పాంచాల యోధులను బొదివి భండనంబు సేయుచుండె; నా ధృష్టద్యుమ్నుండు గురుపుత్రు కోదండంబు దుండంబులు సేసినం గుపితుండై యొండు విల్లుగొని యవ్వీరుండు. 332

ప్రతిపదార్థం: అనియెను= అన్నాడు; అట్లు+ఆ+ఇరువురున్= ఆ విధంగా ఇద్దరూ; ఒండు+ఒరులన్= ఒకరినొకరు; పరుషంబులు పలికి= నిందించుకొని; తలపడి= పోరాడి; వియత్తలంబు= ఆకాశాన్ని; విశిఖ, శిఖా, కలాపంబులన్+కప్పిరి= బాణజ్వాలా సమూహంతో కప్పారు; యుధామన్యున్+ఉత్తమౌజున్+ద్రౌపదేయ, శైనేయులను= యుధామన్యుడు ఉత్తమౌజుడు ఉపపాండవ శిని వంశీయులను; మఱియున్= ఇంకనూ; చేయన్+కల పాండవ, పాంచాల యోధులను= ఇంకా బలశాలులైన పాండవ, పాంచాలవీరులను; రాధేయుండు= కర్ణుడు; పొదివి భండనంబు చేయుచుండెన్= తాకి యుద్ధం చేయసాగాడు; ఆ ధృష్టద్యుమ్నుండు= ఆ ధృష్టద్యుమ్నుడు; గురుపుత్రు కోదండంబు= అశ్వత్థామ విల్లును; తుండంబులు+చేసినన్= ముక్కలు చేయగా; ఆ+వీరుండు= అశ్వత్థామ; కుపితుండు+ఐ= కోపించి; ఒండు విల్లుకొని= మరొక విల్లు తీసికొని.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ఆ విధంగా అనగా ఆ యిద్దరూ ఒకరినొకరు నిందించుకొంటూ బాణ పరంపరలతో ఆకాశాన్ని కప్పారు. యుధామన్యు ఉత్తమౌజులను, ఉపపాండవ శైనేయులను, పాంచాల పాండవ వీరులను కర్ణుడు ఎదుర్కొని యుద్ధం చేశాడు. ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామ విల్లును విరువగా అతడు కోపించి వేరొక విల్లును గైకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సూత తురంగ స్యందన । కేతన చాపములు నఱికి కేలిమెయిన్ ను
గ్గైతొరఁగ నేసెఁ దోడ్తో । నాతత శక్తియును గదయు నతఁ డెత్తంగన్. 333

ప్రతిపదార్థం: సూత తురంగ స్యందన కేతన చాపములు నఱికి= సారథిని, గుర్రాలను, రథాన్ని, ధ్వజాన్ని, ధనువును నరికి; ఆతత శక్తియును గదయును= పొడవైన బల్లెమును, గదను; అతడు+ఎత్తంగన్= ధృష్టద్యుమ్నుడు చేబట్టగా; తోడ్తోన్= వెంటనే; కేలిమెయిన్= అవలీలగా; నుగ్గు+ఐ తొరఁగన్+ఏసెన్= అవి చూర్ణమయ్యేటట్లుగా బాణాలు వేశాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడి సారథిని, రథాన్ని, అశ్వాలను, ధ్వజాన్ని, ధనువును ఖండించి, అతడు గద, బల్లెములు తీసికొనగా వాటిని కూడా అవలీలగా త్రుంచివేశాడు.

వ. **అప్పాంచాలోత్తముండు వాలునుం బలుకయుం గొని కవియం గడంగిన నవియును దుమురు సేసి పెల్లేసి పడకున్న నశ్వత్థామ వేగిరపడి వెఱఁగందుచుఁ జేతి బాణాసనంబు విడిచి కృపాణంబు గొని భుజంగంబు దెస కడరు విహంగపతి విధంబునఁ జనుట సూచి సవ్యసాచితో శౌరి ధృష్టద్యుమ్నుండు గురుపుత్త్రు బారింబడియెం గావవలయు ననుచు నద్దిక్కు సూపిన నతండు సత్వరుండై యవ్వీరుం డా ద్రుపదపుత్త్రుం గవిసిన కొలందిఁ గ్రూరంబు లగు నారాచంబులు గుప్పించి నొప్పించిన నమ్మహీసురవరుం డయ్యుత్సాహంబు వదలి మరలి యరదంబున కరుగ సహదేవుండు దన తేరిపైకి నప్పార్షతుం దిగిచికొని తొలంగం గొనిపోయె నక్కుంభసంభవ సంభవుం డగ్గాండీవి మార్కొని పెనంగి బెట్టిదంబుగాఁ గనుకనిం దాఁకి యతండు నాటిన సునిశిత శరంబున సోలె; సారథి రథం బొండు వలనికిం దోలె నర్జునుం డట్లు నిజసేనానాథు రక్షించి ద్రౌణి మదం బడఁగించుట గనుంగొని కౌంతేయ సైనికులు సింహనాదంబులు సేయ నక్కడ నిస్సాణాదుల నాదం బెసంగి నింగి నిండిన.** **334**

ప్రతిపదార్థం: ఆ+పాంచాల+ఉత్తముండు= ఆ ధృష్టద్యుమ్నుడు; వాలునున్+పలుకయున్+కొని= కత్తి డాలు గైకొని; కవియన్+కడంగినన్= యుద్ధానికి పూనుకొనగా; అశ్వత్థామ; అవియును తుమురుచేసి= వాటిని కూడా పొడిగాచేసి; పెల్లు+ఏసి పడకున్నన్= పెక్కుబాణాలు వేసినా చలించనందువలన; వేగిరపడి వెఱఁగు+అందుచున్= భయంతో త్వరపడి; చేతిబాణాసనంబు విడిచి= చేతిలోని విల్లును వదలి; కృపాణంబు కొని= ఖడ్గాన్ని పూని; భుజంగంబు దెసకున్+అడరు= పాము ఉన్న వైపునకు వెళ్ళు; విహంగపతి విధంబునన్= గరుత్మంతుడి వలె; చనుట చూచి= వెళ్ళగా చూచి; సవ్యసాచితోన్= అర్జునుడితో; శౌరి= కృష్ణుడు; ధృష్టద్యుమ్నుండు; గురుపుత్త్రు బారిన్+పడియెన్= అశ్వత్థామ చేతిలో చిక్కాడు; కావవలయును+అనుచున్= కాపాడాలి అంటూ; ఆ+దిక్కు చూపినన్= ఆ వైపు చూపగా; అతండు సత్వరుండు+ఐ= అర్జునుడు వేగిరంగా; ఆ+వీరుండు= ఆ అశ్వత్థామ; ఆ ద్రుపద పుత్రున్+కవిసిన కొలందిన్= ధృష్టద్యుమ్నుడిని తాకినకొద్దీ; క్రూరంబులు+అగు నారాచంబులు గుప్పించి= వాడి అయిన బాణాలు వేసి; నొప్పించినన్= బాధించగా; ఆ+మహీసురవరుండు= ఆ అశ్వత్థామ; ఆ+ఉత్సాహంబు వదలి= పూనిక మాని; మరలి అరదంబునకున్+అరుగన్= వెనుదిరిగి రథంమీదికి వెళ్ళగా; సహదేవుండు= సహదేవుడు; ఆ పార్షతున్= ఆ ధృష్టద్యుమ్నుని; తన తేరిపైకిన్= తన రథంమీదికి; తిగిచికొని= లాగికొని; తొలంగన్+కొనిపోయెన్= అక్కడినుండి తీసికొనివెళ్ళాడు; ఆ+కుంభసంభవ, సంభవుండు= అశ్వత్థామ; ఆ+గాండీవిన్ మార్కొని పెనంగి= అర్జునుడిని ఎదుర్కొని పోరి; బెట్టిదంబుగాన్+కనుకనిన్+తాకి= తీవ్రంగా సంభ్రమంతో తాకి; అతండు నాటిన= అర్జునుడు వేసిన; సునిశిత శరంబునన్= పదునైన బాణంతో; సోలెన్= పడిపోయాడు; సారథి= అశ్వత్థామ రథసారథి; రథంబు+ఒండు వలనికిన్+తోలెన్= రథాన్ని వేరొకవైపు తరలించాడు; అర్జునుండు+అట్లు, నిజసేనా నాథు రక్షించి= అర్జును డావిధంగా తమ సేనాపతిని కాపాడి; ద్రౌణిమదంబు+అడంగించుట కనుంగొని= అశ్వత్థామ గర్వాన్ని అణచటం చూచి; కౌంతేయ సైనికులు= పాండవసైనికులు; సింహనాదంబులు+చేయన్= బిగ్గరగా అరవగా; అక్కడన్= ఆ ప్రదేశంలో; నిస్సాణ+ఆదుల నాదంబు+ఎసంగి= తప్పెటలు మొదలైన యుద్ధవాద్యాల ధ్వనులు వ్యాపించి; నింగి నిండినన్= గగనభాగం నిండగా.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు కత్తి, డాలు గైకొని రాగా అశ్వత్థామ వాటిని కూడ ఖండించాడు. అనేక బాణాలు వేసినా లొంగని అతడిపైకి ధనుస్సును వదలి పాములపైకి దూకి వచ్చే గరుడుడి వలె ఖడ్గంతో విజృంభించాడు. కృష్ణుడు,

ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామ బారినపడ్డాడు రక్షించుమని అర్జునుడికి చెప్పగా క్రూరబాణాలు వేసి అతడు అశ్వత్థామను నొప్పించాడు. దానికి తట్టుకొనలేక అశ్వత్థామ రథంపైకి వెళ్ళగా, సహదేవుడు ధృష్టద్యుమ్నుడిని తన రథంమీదికి లాగికొని ప్రక్కకు తీసికొని వెళ్ళాడు. అశ్వత్థామ అర్జునుడిని ఎదుర్కొని అతడి బాణానికి మూర్ఛపడిపోగా సారథి రథాన్ని మరలించాడు. అశ్వత్థామ గర్వాన్ని అణచి తమ సేనాధిపతిని కాపాడిన అర్జునుడిని చూచి పాండవ సైనికులు సింహనాదాలు చేశారు. యుద్ధవాద్యధ్వనులు గగనభాగం నిండాయి.

విశేషం: అలం: ఉపమ.

తే. **సూతసుతుఁడు ధనంజయుఁ జూచి రోష। కలుషితాక్షుఁ డై తలపడఁ దలఁచె నపుడు**
తత్‌క్షణమున సంశప్తక తతియుఁ దోఁచె;। రెండుఁ గని యిట్టు లనియె నా క్రీడి హరికి. **335**

ప్రతిపదార్థం: సూతసుతుఁడు= కర్ణుడు; ధనంజయున్ చూచి= అర్జునుడిని చూచి; రోష కలుషిత+అక్షుఁడు+ఐ= క్రోధంచేత ఎర్రబడిన కనులు కలవాడై; తలపడన్ తలఁచెన్+అపుడు= అతడితో యుద్ధానికి, సిద్ధమైనాడు; తత్‌క్షణమునన్= అప్పుడే; సంశప్తక తతియున్+తోఁచెన్= త్రిగర్తవీరులు కూడా గోచరించారు; రెండున్+కని= వాళ్ళను ఇరువురిని చూచి; ఆ క్రీడి= అర్జునుడు; హరికిన్= కృష్ణుడితో; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: కర్ణుడు క్రోధపూరితుడై అర్జునుడితో యుద్ధానికి సిద్ధమైనాడు. అప్పుడే త్రిగర్తవీరులు కూడా ముందుకు వచ్చారు. వాళ్ళను ఇద్దరినీ చూచి అర్జునుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు:

వ. **'కర్ణుండు మనల మార్కొనం గడంగెడు సంశప్తకులు గ్రుమ్మఱం బొదివిరి; కర్ణుచేతం దగులుపడితిమేని సంశప్తకుల కోహటించిన వార మగుదుము వారల దిక్కు దేరు పోవనిమ్ము.'** **336**

ప్రతిపదార్థం: కర్ణుండు= కర్ణుడు; మనల మార్కొనన్+కడంగెడున్= మనలను ఎదుర్కొనటానికి పూనుకొన్నాడు; సంశప్తకులు= త్రిగర్తీయులు; క్రుమ్మఱన్+పొదివిరి= తిరిగి చుట్టుముట్టారు; కర్ణుచేతన్+తగులుపడితిమి+ఏనిన్= కర్ణుడి చేతిలో పడితే; సంశప్తకులకున్; ఓహటించినవారము+అగుదుము= ఓడిపోయినవారం అవుతాం; వారల దిక్కు తేరుపోవన్+ఇమ్ము= రథం వాళ్ళవైపు పోనిమ్ము.

తాత్పర్యం: 'ఒకవైపు కర్ణుడు, మరొకవైపు సంశప్తకులు తలపడబోతున్నారు. కర్ణుడిని ఎదుర్కొంటే, సంశప్తకులకు ఓడినవారం అవుతాం కాబట్టి ముందు వారివైపు తేరు పోనిమ్ము'.

చ. **అన విని యట్ల చేసె నతఁ డర్జునుఁ డా రిపుకోటి ముట్టి యే**
పున నుఱుమాడుచుండెఁ గురుభూవర! యప్పుడు ధర్మసూతనం
దనులు సముద్ధతిం గడఁగ దందడి క్రొత్తగ వారి సేనయున్
మన మొనయం బెనంగె నుపమా రహితంబగు విక్రమంబునన్. **337**

ప్రతిపదార్థం: కురుభూవర!= ధృతరాష్ట్ర మహారాజా!; అన విని= అర్జునుడి మాటలు విని, అతడు= ఆ కృష్ణుడు; అట్లచేసెన్= అట్లాగే చేశాడు. అర్జునుఁడు+ఆ, రిపుకోటిన్, ముట్టి= అర్జునుడు ఆ శత్రువులను తాకి; ఏపునన్, నుఱుమాడుచుండెన్= దర్పంతో నుగ్గుచేయసాగాడు; అప్పుడు; ధర్మసూతనందనులు= ధర్మరాజు, కర్ణుడు; సముద్ధతిన్+కడఁగన్= ఉత్సాహంతో

తలపడగా; వారిసేనయున్ మన మొనయున్= వారి సైన్యం, మనసైన్యం; ఉపమారహితంబు+అగు విక్రమంబునన్= సాటిలేని పరాక్రమంతో; దందడి క్రొత్తగన్= యుద్ధం అపూర్వంకాగా; పెనంగెన్= పోరు సలిపాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుడి మాటలు విని, కృష్ణుడు సంశప్తకులవైపు రథం మరల్చాడు. అర్జునుడు శత్రువులను నుగ్గు చేయసాగాడు. అప్పుడు కర్ణుడు, ధర్మరాజు తలపడగా ఇరుసేనలూ పరాక్రమంతో అపూర్వరీతిలో విజృంభించాయి.

ఉ. సంగర మేను బెక్కు దివసంబులు సూచితిఁ గాని యెప్డు నా
భంగి మునుంగ దచ్చెరువుపాటునఁ జిత్తము వోరు చున్కియో
త్రుంగుచు నున్కియో యెఱుఁగఁ దూలక పైపయిఁ గ్రమ్ముఁ గూలు సే
నాంగములందు నిందుఁ గలహంబు మహోగ్రత యేమి సెప్పుదున్! 338

ప్రతిపదార్థం: ఏను= నేను; సంగరము= యుద్ధం; పెక్కు దివసంబులు చూచితిన్+కాని= ఎన్నో రోజులు చూచాను కాని; ఎప్డున్= ఎప్పుడూ; ఆ భంగిన్= ఆ విధంగా; చిత్తము= మనసు; అచ్చెరువుపాటునన్= ఆశ్చర్యంతో; మునుంగదు= మునుగలేదు; అందున్+ఇందున్= రెండు పక్షాలలోనూ; సేనా+అంగములు= రథ, గజ, తురగ, పదాతులు; పోరుచున్+ఉన్కియో= పోరుతున్నాయో; త్రుంగుచున్+ఉన్కియో= నశిస్తున్నాయో; ఎఱుఁగన్= తెలియుటంలేదు; తూలక= తొలగకుండా; పైపయిన్+క్రమ్మన్= మీదిమీదికి శత్రుసైన్యాన్ని క్రమ్ముతాయి; కూలు= పడిపోయాయి; కలహంబు మహా+ ఉగ్రత= ఆ యుద్ధతీవ్రతను; ఏమి చెప్పుదున్!= ఏమని చెప్పాలి?

తాత్పర్యం: ఎన్నో రోజులు యుద్ధాన్ని చూచానుగాని, ఎప్పుడూ ఆ విధంగా నా మనస్సు ఆశ్చర్యంతో మునుగలేదు. చతుర్విధ సేనాంగాలు ఇరుపక్షాల్లో పోరాడుతున్నాయో, నశిస్తున్నాయో నా కర్థంకాలేదు. వెనుకాడకుండ ఒకదాని నొకటి క్రమ్ముకొంటున్నాయి. పడిపోతున్నాయి. ఆ యుద్ధతీవ్రతను ఏమని చెప్పేది?

కర్ణుఁడు పాంచాల సైన్యంబు దైన్యంబు నొందించి విజృంభించుట (సం.8-57-1 (కుంభ))

తే. అందుఁ బాంచాల వీరుల నశ్వసూత । రథ సమేతంబుగా నంగరాజు దర్ప
మెసఁగ నేవురఁ బదువుర నేడ్వురను మ । హాస్య మార్గణములఁ దునుమాడె నధిప! 339

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; అంగరాజు= కర్ణుడు; దర్పము+ఎసఁగన్= గర్వమొప్పగా; అందున్= ఆ యుద్ధంలో; పాంచాలవీరులను= పాంచాలవీరుల్ని; ఏవురన్+పదువురన్+ఏడ్వురన్= ఐదుగురిని, పదుగురిని, ఏడుగురిని; అశ్వసూతరథ సమేతంబుగాన్= అశ్వాలు సారథి రథములతో కూడా; మహా+ఆస్యమార్గణములన్= గొప్పముఖాలు గల బాణాలతో; తునుమాడెన్= ఖండించాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఆ యుద్ధంలో కర్ణుడు పరాక్రమాతిశయంతో పాంచాలవీరులు పలువురిని రథాశ్వ సారథులతో సహా విశాలముఖ బాణాలతో వధించాడు.

క. పదపడి పాండవ యోధు । ల్వోదివినఁ బెనుఁదుంగ మడువులో గజపతి యు
న్మదవృత్తిఁ గేలిసలుపు ప । గిది నాతఁడు పోరె సురలు కీర్తన సేయన్. 340

ప్రతిపదార్థం: పదపడి= తర్వాత; పాండవ యోధులు+పొదిలినన్= పాండవవీరులు చుట్టుముట్టగా; పెనుతుంగ మడువులో= పెద్ద పొడవైన కొలనులో; గజపతి= గజరాజు; ఉన్మదవృత్తిన్= ఉన్మాదంతో; కేలిసలుపు పగిదిన్= క్రీడించేవిధంగా; సురలు కీర్తన+చేయన్= దేవతలు పొగడునట్లుగా; ఆతఁడు పోరెన్= కర్ణుడు యుద్ధం చేశాడు.

తాత్పర్యం: పాండవయోధులు తనపైకి రాగా, కర్ణుడు మదగజం పెద్దకొలనులో క్రీడించేవిధంగా దేవతలు ప్రశంసించగా రణవిహారం చేశాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. అట్టియెడ. 341

తాత్పర్యం: ఆ సమయంలో.

చ. ద్రుపద తనూజులుం గవలు ద్రోవది పుత్రులు శౌరితమ్ముఁడుం
గుపితమనస్కులై బలుపుఁ గోల్తలఁ దాకి; రతం డదల్చి యు
గ్రపు రభసంబునన్ శరపరంపరలం బరఁగించెఁ గౌరవా
ధిపు హృదయంబు మోదమునఁ దేలఁగ నందఱ యంగకంబులన్. 342

ప్రతిపదార్థం: ద్రుపద తనూజులున్= పాంచాలురు; కవలు= నకుల సహదేవులు; ద్రోవది పుత్రులు= ఉపపాండవులూ; శౌరి తమ్ముఁడున్= సాత్యకియూ; కుపితమనస్కులు+ఐ= కోపించిన మనస్సుకలవారై; బలుపు+కోల్తలన్+తాఁకిరి= బలంతో ఎదురుగా నిలచి తాకారు; అతండు= కర్ణుడు; అదల్చి= వారిని అడ్డగించి; కౌరవ+అధిపుహృదయంబు= దుర్యోధనుడి చిత్తం; మోదమునన్+తేలఁగన్= ఆనందంలో తేలగా; ఉగ్రపు రభసంబునన్= భయంకర సంభ్రమంతో; అందఱ అంగకంబులన్= అందరి అవయవాలలో; శరపరంపరలన్+పరఁగించెన్= బాణాలవరుసను కురిపించాడు.

తాత్పర్యం: పాంచాలవీరులు, నకుల సహదేవులు, ఉపపాండవులు, సాత్యకి ఆగ్రహించి తన ఎదురుగా నిల్చి, బలంతో తలపడగా కర్ణుడు వారి అంగాలలో బాణపరంపరలు నాటి దుర్యోధనుడికి ఆనందం కలిగించాడు.

వ. వారలపై నక్కురుభూనాథుం డేనుఁగు కయ్యంబునకు వెరవు గల కళింగ వంగాంగ మగధ సుహ్మపౌండ్రాది దేశంబుల బలంబులం గవియించిన నవి తదీయ చతురంగ బలంబుల మట్టి మల్లాడి చిత్రవధ విహారంబు సలుప నగ్గజ ప్రధాన సేన లగ్గలికం జించి చెండాడుచు నా దండి మగలును జేకితాన ప్రభద్రకులును రౌద్రరసంబునం బెనఁచినఁ గనుంగొని మదంబునం బొదలి యొత్తరించి యురవడించిన. 343

ప్రతిపదార్థం: ఆ+కురు భూనాథుండు= దుర్యోధనుడు; ఏనుఁగు కయ్యంబునకున్+వెరవుకల= గజయుద్ధంలో ఆరితేరిన; కళింగ వంగ+అంగ మగధ సుహ్మపౌండ్ర+ఆది దేశంబుల బలంబులన్= కళింగ వంగ అంగ మగధ సుహ్మపౌండ్ర దేశాల సైన్యాలను; వారలపైన్= శత్రువులపై; కవియించినన్= పురికొల్పగా; అవి= ఆ సైన్యాలు; తదీయ చతురంగ బలంబులన్= వారి సేనాంగాలను; మట్టి మల్లాడి= తీవ్రంగా పెనుగులాడి; చిత్రవధ విహారంబు సలుపన్= చిత్రవధ చేయగా; ఆ+గజప్రధాన సేనలు= వారి గజసైన్యాలు; అగ్గలికన్+చించి చెండు+ఆడుచున్= అతిశయంతో చీల్చి చెండాడుతూ; ఆ దండిమగలును=

ఆ పాండవవీరులును; చేకితాన ప్రభద్రకులును= చేకితానుడు, ప్రభద్రకుడును; రౌద్రరసంబునన్+పెనఁచినన్= క్రోధావేశంతో పోరాడగా; కనుంగొని= చూచి; మదంబునన్+పొదలి= మదంతో ఉప్పొంగి; ఒత్తరించి ఉరవడించినన్= ఆక్రమించి వేగిరంపగా.

తాత్పర్యం: దుర్యోధనుడు గజసైన్యంతో కూడిన కళింగ, అంగ, వంగ, మగధ, పౌండ్రక, సుహ్మదేశ వీరులను పాండవులపైకి పురిగొల్పగా, వారు పాండవసేనలోని చతురంగాలను త్రొక్కి చిత్రవధ చేస్తూ చెండాడారు. పాండవ యోధులు చేకితాన ప్రభద్రకులు క్రోధంతో ఎదుర్కొనగా ఆ గజసైన్యాలు మదంతో ఉప్పొంగి వారిని ఆక్రమించి సంభ్రమం కలిగించాయి.

శా. వంగాధీశుఁ గరీంద్రుతో నడఁగ గర్వస్ఫూర్తి శైనేయుఁ డే
యం గేలీగతి మాద్రి లేఁగొడుకు పౌండ్రాధీశ్వరుంగిట్టి యా
భంగిం గూల్పఁ దదగ్రజుం డటుల దర్పం బొప్ప సుహ్మాధి నా
థుం గోపంబునఁ ద్రుంప నేచెఁ గరటిస్తోమంబు లంతంతకున్. 344

ప్రతిపదార్థం: శైనేయుఁడు= సాత్యకి; వంగాధీశున్= వంగరాజును; కరి+ఇంద్రుతోన్+అడఁగన్= గజశ్రేష్ఠంతోపాటు అణచుతూ; గర్వస్ఫూర్తిన్= గర్వం ఒప్పగా; ఏయన్= బాణాలు వేయగా; మాద్రి లేఁత+కొడుకు= సహదేవుడు; కేలీగతిన్= అవలీలగా; పౌండ్ర+అధీశ్వరున్+కిట్టి= పౌండ్రరాజును సమీపించి; ఆ భంగిన్+కూల్పన్= ఆ విధంగా చంపగా; తద్+అగ్రజుండు= నకులుడు; అటుల దర్పంబు+ఒప్పన్= అలా గర్వమొప్పగా; సుహ్మ+అధినాథున్= సుహ్మదేశరాజును; కోపంబునన్+త్రుంపన్= క్రోధంతో వధించగా; కరటి, స్తోమంబులు= ఏనుగుల సమూహాలు; అంత+అంతకున్= మరింతగా; ఏచెన్= విజృంభించాయి.

తాత్పర్యం: సాత్యకి బాణాలు వేసి వంగరాజును గజంతోపాటు అణచగా, సహదేవుడు పౌండ్రరాజును, నకులుడు, సుహ్మరాజును వధించగా ఏనుగుల సమూహాలు వారిపైకి విజృంభించాయి.

క. విను మ ట్లేచి నకులుఁ బొది । వె నుదగ్రధ్వని ననేక వేదండములం
దెనిమిదిటిఁ గూల్చె బాణము । లెనిమిది యెనిమిదులఁ దమ్ముఁ డేద్దెర నధిపా! 345

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; వినుము= విను; అనేక వేదండములు= పెక్కు ఏనుగులు; అట్లు+ఏచి= అట్లా చెలరేగి; ఉదగ్రధ్వనిన్= పెద్ద అరుపులతో; నకులున్+పొదివెన్= నకులుడిని చుట్టుముట్టాయి; తమ్ముఁడు+ఏడ్దెఱన్= సహదేవుడు పరాక్రమించి; బాణములు+ఎనిమిది ఎనిమిదులన్= ఎనిమిది ఎనిమిది బాణాలతో; అందున్= వాటిలో; ఎనిమిదిటిన్+కూల్చెన్= ఎనిమిది గజాలను చంపాడు.

తాత్పర్యం: రాజా! వినుము. పలు ఏనుగులు ఆ విధంగా చెలరేగి పెద్ద ధ్వనులతో నకులుడిని చుట్టుముట్టగా, సహదేవుడు ఎనిమిది బాణాలు వేసి వాటిలో ఎనిమిది ఏనుగులను వధించాడు.

క. ఆ ధృష్టద్యుమ్నాదులు । గ్రోధాంధత నడరి యేనుఁగుల నస్త్రహతిన్
వ్యాధూతములుగఁ జేయుచు । రాధేయుం గదియ సంగరము పేర్చె నృపా! 346

ప్రతిపదార్థం: నృపా= రాజా!; ఆ ధృష్టద్యుమ్న+ఆదులు= ధృష్టద్యుమ్నుడు మొదలైన వీరులు; క్రోధ+అంధతన్+అడరి= కోపమనే చీకటితో పూనుకొని; ఏనుఁగులన్= ఆ ఏనుగులను; అస్త్రహతిన్= అస్త్రముల తాకిడితో; వ్యాధూతములుగన్+

చేయుచున్= ఎగురకొట్టబడినవానినిగా చేయుచు; రాధేయున్+కదియన్= కర్ణుడిని తాకగా; సంగరము పేర్చెన్= యుద్ధం తీవ్రం అయింది.

తాత్పర్యం: రాజా! ధృష్టద్యుమ్నాదులు కోపించి అస్త్రాలతో ఏనుగులను కూల్చి కర్ణుడిని ఎదుర్కొనగా యుద్ధం తీవ్రమైనది.

వ. ఆ సమయంబున శోణితంబు పెల్లున మున్నెగసిన రేణు వడంగిన నిరువాఁగు సైనికులును దమతమ యడియాలంబులతోడి గొడుగులును సిడంబులును బెద్దయు మెఱయఁ బెనంగుచుండ సంశప్తక సంచయంబు గించిదవశిష్టంబుగా నష్టంబుసేసిన సవ్యసాచికి శౌరి యక్కౌరవ పాండవ బలంబుల పోరు సూపి యప్పుడు దుర్యోధనుండు దనయందుఁ జేయంగలవారును దానును ధర్మనందనుం బట్టు తలంపున బెట్టు పాదువుటయు నమృతంబున కాసపడి యడరు నసురుల మరల్చు శక్రాగ్నుల చందంబున భీమసేనుండును సాత్యకియు వారలం బ్రతిహతులం జేయుటయు, నంత నిలువక యక్కురువిభుండును గర్ణ కృపాశ్వత్థామలును నుద్దామగతి నయ్యిరువుర శరజాలంబుల నమ్ముల జడియుచుం గదిసి యక్కొంతేయాగ్రజు కంకటంబు ద్రుంచివైచుటయుఁ గర్ణు నుత్సాహంబునం గడంగు ధార్తరాష్ట్రుల సింహనాదంబులకుం దెరలక మరుత్సుతుండు మండలప్రచారుం డగుటయు నా సూతనందనుండు మొదలగు నమ్మేటిమగల మార్గణమ్ము లమ్మనుజపతిపైఁ బరఁగుటయు నకుల సహదేవ సాత్యకి ధృష్టద్యుమ్న ద్రౌపదేయ ప్రభృతులైన పాండవేయ పాంచాలాది యోధులం గలంచి యక్కర్ణుండు కమలాకరంబునం గేలిసలుపు శుండాలంబు లీల నటించుటయు నవ్వీరుం డగ్గలిక నక్కవ్వడి రాక గోరి కపికేతనం బాలోకించుటయుం గలిగిన యప్పరిపాటి యంతయు నేర్పడం జెప్పి యా రాధేయు రభసం బుగ్గడించి మఱియు నిట్లనియె. 347

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అప్పుడు; శోణితంబు పెల్లునన్= రక్తం అధికం కావటంచేత; మున్ను+ఎగసిన రేణువు+ అడంగినన్= ముందు లేచిన ధూళి అణగగా; ఇరువాఁగు సైనికులును= రెండుపక్షాల సైనికులు; తమ తమ అడియాలంబులతోడి గొడుగులును= తమ తమ చిహ్నాలతో కూడిన ఛత్రాలు; సిడంబులును= ధ్వజాలు; పెద్దయున్ మెఱయన్= గొప్పగా ఒప్పగా; పెనంగుచుండన్= పోరుచుండగా; సంశప్తక సంచయంబు= సంశప్తకుల సమూహం; కించిత్+అవశిష్టంబుగాన్= కొద్దిగా మాత్రమే మిగిలేటట్లు; నష్టంబు+చేసినన్= వాటిని నశింపచేయగా; శౌరి= కృష్ణుడు; సవ్యసాచికిన్= అర్జునుడికి; ఆ+కౌరవ పాండవ బలంబుల పోరు చూపి= కౌరవపాండవ సైన్యాల యుద్ధం చూపించి; అప్పుడు= ఆ సమయంలో; దుర్యోధనుండు= దుర్యోధనుడు; తనయందున్+చేయంగలవారును తానును= తనకు సహాయపడుతున్నవారు, తాను; ధర్మనందనునున్+ పట్టు తలంపునన్= ధర్మరాజును బంధించాలనే ఆలోచనతో; బెట్టుపాదువుటయును= గట్టిగా చుట్టుముట్టగా; అమృతంబునకున్+ ఆసపడి= అమృతానికి ఆశపడి; అడరు+అసురుల మరల్చు= అతిశయించిన రాక్షసులను మరిలించే; శక్ర+అగ్నుల చందంబునన్= ఇంద్రాగ్నులవలె; భీమసేనుండును సాత్యకియున్= భీముడు సాత్యకి; వారలన్+ప్రతిహతులన్+చేయుటయున్= వారిని కొట్టబడిన వారినిగా చేయడాన్ని అనగా వారిని కొట్టటాన్ని; అంతన్ నిలువక= అంతటితో ఆగక; ఆ+కురువిభుండును= దుర్యోధనుడు; కర్ణ కృప+అశ్వత్థామలునున్= కర్ణుడు, కృపుడు, అశ్వత్థామలు; ఉద్దామగతిన్= తీవ్రమైనవిధంగా; ఆ+ఇరువుర= భీమ, సాత్యకుల; శరజాలంబులన్= బాణాలను; అమ్ములన్= బాణాలతో; జడియుచున్= నివారించుచూ; కదిసి= ఎదుర్కొని; ఆ+ కౌంతేయ+అగ్రజు కంకటంబున్= ఆ ధర్మరాజు కవచాన్ని; త్రుంచివైచుటయున్= ఖండించటాన్ని; కర్ణు+ఉత్సాహంబునన్+

కడంగు= కర్ణుడి ఉత్సాహంతో రెచ్చిన; ధార్తరాష్ట్రుల సింహనాదంబులకున్+తెరలక= కౌరవుల అరుపులకు చలించక; మరుత్+సుతుండు= భీముడు; మండల ప్రచారుండు+అగుటయున్= వలయాకారంగా తిరుగుటకలవాడు అగుటను; ఆ సూతనందనుండు మొదలగు= ఆ కర్ణుడు మున్నగు; ఆ+మేటిమగల మార్గణమ్ములు= మేటి వీరుల బాణాలు; ఆ+ మనుజపతిపైన్+పరఁగుటయున్= ధర్మరాజుపై పడుటను; నకుల సహదేవ సాత్యకి, ధృష్టద్యుమ్న ద్రౌపదేయ ప్రభృతులు+ఐన= నకుల సహదేవులు సాత్యకి, ధృష్టద్యుమ్నులు ఉపపాండవులు మొదలగు; పాండవేయ పాంచాల+ఆది యోధులన్+కలంచి= పాండవ పాంచాల వీరులను కలతపెట్టి; ఆ+కర్ణుండు= కర్ణుడు; కమలాకరంబునన్+కేలి సలుపు= తామరకొలనులో క్రీడించే; శుండాలంబు లీలన్ నటించుటయును= ఏనుగువలె విహరించుటను; ఆ+వీరుండు= కర్ణుడు; అగ్గలికన్= అతిశయంతో; ఆ+కవ్వడి రాక కోరి= అర్జునుడి రాకను కోరి; కపి కేతనంబు+ఆలోకించుటయున్= కపిధ్వజాన్ని చూచుటను; కలిగిన ఆ+ పరిపాటి అంతయున్= జరిగిన ఆ విధం అంతా ఏర్పడన్+చెప్పి= స్పష్టంగా వివరించి; ఆ రాధేయు రభసంబు+ఉగ్గడించి= కర్ణుడి ఆటోపాన్ని పేర్కొని; మరియును= ఇట్లు+అనియెన్= ఇంకా ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: ఆ సమయంలో రక్తం అధికంగా ప్రవహించినందున, ముందు లేచిన ధూళి అణగగా, ఉభయపక్షాల సైనికులు తమతమ గుర్తులతో కూడిన ఛత్రాలు, ధ్వజాలు, బాగా ప్రకాశించగా యుద్ధం చేయసాగారు. సంశప్తకుల సమూహాన్ని కొద్దిగా మాత్రమే మిగిలేటట్లు పరిమార్చిన పార్థుడికి శ్రీకృష్ణుడు - కురుపాండవ సైన్యాల పోరుచూపించి, ఆ సమయంలో దుర్యోధనుడు తన సహాయకులతో కలిసి ధర్మరాజును బంధించాలనే ఆలోచనతో ఆయనను చుట్టుముట్టగా, అమృతానికి ఆశపడి విజృంభించిన రాక్షసులను మరలించిన ఇంద్రాగ్నుల వలె, భీమసాత్యకులు వాళ్ళను (దుర్యోధనుని, అతని సహాయకులను) కొట్టటాన్ని - దుర్యోధన కర్ణ కృపాశ్వత్థామలు విజృంభించి, ఆ భీమసాత్యకుల బాణాలను తమ బాణాలతో నివారించి, ధర్మరాజు కవచాన్ని ఖండించటాన్ని - కర్ణుడి ప్రోత్సాహంతో చెలరేగిన కౌరవుల సింహనాదాలకు చలించక భీమసేనుడు వలయాకారంగా తిరగటాన్ని - కర్ణుడు మొదలైన మేటివీరుల బాణాలు ఆ ధర్మరాజుమీద పడటాన్ని - నకుల సహదేవ సాత్యకీ ధృష్టద్యుమ్న ద్రౌపదీ పుత్రాది పాండవ పాంచాల వీరులను కలతపెట్టి కర్ణుడు తామరకొలనులో క్రీడించే మదపుటేనుగువలె విహరించటాన్ని - ఆధిక్యంతో ఆ కర్ణుడు కిరీటి తన సమీపానికి రావాలని కోరుకొని, అతని కపికేతనంవైపు చూస్తూ ఉండటాన్ని- స్పష్టంగా వివరించి, కర్ణుడి ఆటోపాన్ని తెలియచెప్పి - ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. 'నినుఁ దలపడఁజూచిన యీ । తని యేడ్తెఱ మంట సొరఁగఁ దలఁచు మిడుత యు
బ్బున కెనయై నాకుం దోఁ । చినయది ప్రుందింపు మితని శితవిశిఖములన్.' 348

ప్రతిపదార్థం: నినున్+తలపడన్+చూచిన= నీతో పోరు సలపాలని తలచిన; ఈతని ఏడ్తెఱ= ఈ కర్ణుడి తొందర; మంట చొరఁగన్+తలచు= మంటలో పడబోయే; మిడుత ఉబ్బునకున్+ఎన ఐ= మిడుత గర్వానికి సాటియై; నాకున్+తోఁచిన+అది= నాకు గోచరమవుతున్నది; శితవిశిఖములన్= వాడిబాణాలతో; ఇతనిన్+ప్రుందింపుము= ఇతడిని సంహరించుము.

తాత్పర్యం: నిన్నెదుర్కోవాలని చూచే ఈ కర్ణుడి తొందర, మంటలో దూకాలనుకొనే మిడుత ఉబలాటంవలె నాకు తోస్తున్నది. వాడి బాణాలతో ఇతడిని నేలగూల్చు.

విశేషం: అలం: ఉపమ.

వ. అని పలికి యతని కప్పుడు దోడ్పడ నుత్సహించు భవత్సుతు నుపలక్షించి బీభత్సునకుం జూపి. 349

ప్రతిపదార్థం: అని పలికి; అతనికిన్+అప్పుడు తోడ్పడన్+ఉత్సహించు= కర్ణుడికి తోడ్పడాలని పూనుకొన్న; భవత్+సుతున్+ ఉపలక్షించి= నీ కుమారుడి(దుర్యోధనుడి)ని చూచి; బీభత్సునకున్+చూపి= అర్జునుడికి చూపి.

తాత్పర్యం: అని పలికిన కృష్ణుడు కర్ణుడికి తోడుగా ఉండాలని తలచిన దుర్యోధనుడిని అర్జునుడికి చూపి (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'ఇత్తఱిఁ ద్రుళ్ళు సూపి నిను నేపున మార్కొని గెల్తు నన్ తలం
పెత్తి సుయోధనుం డదె యహీనబలంబులఁ గూర్చెఁ గర్ణుతో
మత్తగజంబులీల నెలమామిడిఁ గూల్చినభంగిఁ బాండు పు
త్రోత్తమ! వీనిఁ గూల్పు; మతఁ డొంటిగ రాజ్యము నీకుఁ జేకుఱున్.' 350

ప్రతిపదార్థం: ఈ+తఱిన్= ఇప్పుడు; సుయోధనుండు= దుర్యోధనుడు; త్రుళ్ళు చూపి= గర్వించి; నినున్+ఏపునన్ మార్కొని= అతిశయంతో నిన్ను ఎదుర్కొని; గెల్తును+అన్ తలంపు+ఎత్తి= గెలుస్తాననే ఆలోచన కలిగి; కర్ణుతోన్= కర్ణుడికి అండగా; అదె, అహీనబలంబులన్+కూర్చెన్= అదిగో గొప్ప సైన్యాలను సమకూర్చాడు; పాండుపుత్ర+ఉత్తమ!= అర్జునా!; మత్తగజంబు= మదపుటేనుగు; లీలన్= అవలీలగా; ఎలమామిడిన్+కూల్చినభంగిన్= లేత మామిడిచెట్టును కూల్చేవిధంగా; వీనిన్+కూల్పుము= ఈ బలాలను చంపుము; అతఁడు+ఒంటిగన్= అతడు ఒంటరివాడు కాగా; రాజ్యము నీకున్+చేకుఱున్= అపుడు రాజ్యం నీకు లభిస్తుంది.

తాత్పర్యం: 'అర్జునా! దుర్యోధనుడు నిన్ను గెలుస్తానన్న గర్వంతో కర్ణుడికి తోడుగా అధిక సేనలను సమకూర్చాడు. మదగజం లేమావిచెట్టును కూల్చినట్లుగా ఆ సేనలను కూల్చుము; అతడు ఒంటరి అవుతాడు. అప్పుడు రాజ్యం నీకే దక్కుతుంది.'

విశేషం: అలం: ఉపమ.

వ. అను నవసరంబున. 351

తాత్పర్యం: అంటున్న సమయంలో.

మ. సమదాటోపత వాయునందనుఁడు ధృష్టద్యుమ్న శైనేయు లే
కమనోవృత్తిఁ గడంగి తో నడర దోర్గర్వంబు శోభిల్ల శౌ
ర్యము సొంపార నిలింపకోటి వొగడన్ రారాజు సైన్యంబు లో
క్కొ మొగిం బెల్లగిలంగ బెట్టడరె సక్రోధాంతరంగంబుతోన్. 352

ప్రతిపదార్థం: వాయునందనుఁడు= భీముడు; ధృష్టద్యుమ్న శైనేయులు= ధృష్టద్యుమ్న, సాత్యకులు; ఏకమనస్+వృత్తిన్+కడంగి= ఒకే లక్ష్యంతో పూని; తోన్+అడరన్= తనవెంట రాగా; స మద+ఆటోపతన్= గర్వాతిశయంతో; దోస్+గర్వంబు శోభిల్లన్=

భుజబలం ప్రకాశించగా; శౌర్యము సొంపారన్= పరాక్రమం ఒప్పగా; నిలింపకోటి, పొగడన్= దేవతలు ప్రశంసించగా; సక్రోధ+అంతరంగంబుతోన్= కోపం నిండిన మనసుతో; రారాజు సైన్యంబులు= దుర్యోధనుడి సేనలు; ఒక్కొమ్మొగిన్+పెల్లగిలంగన్= ఒక్కుమ్మడిగా పారిపోగా; బెట్టు+అడరెన్= మిక్కిలి విజృంభించాడు.

తాత్పర్యం: క్రోధాంతరంగంతో, పరాక్రమాతిశయంతో భీముడు, ధృష్టద్యుమ్న సాత్యకులు తనకు తోడు రాగా, దుర్యోధనుడి సేనలు పారిపోయేటట్లుగా విజృంభించాడు. అది చూచి దేవతలు ప్రశంసించారు.

క. అడరి పటు బాణజాలం । బడరింపఁగ వారిబలము లధికరయము నె
క్కుడు మదము నొలయఁ బైకొని । బడలువడఁగఁజేసె నీదు బలముల నధిపా! 353

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; అడరి= విజృంభించి; పటు, బాణజాలంబు+అడరింపఁగన్= వాడి అయిన బాణసమూహాన్ని ప్రయోగించగా; వారి, బలములు= పాండవసేనలు; అధిక రయమున్= మిక్కిలివేగం; ఎక్కుడు మదమున్+ఒలయన్= అధికగర్వం ఒప్పగా; పైకొని= కవిసి; నీదు, బలములన్= నీ సైన్యాలను; బడలుపడఁగన్+చేసెన్= అలిసేటట్లుగా చేశాయి.

తాత్పర్యం: రాజా! భీముడు అట్లా విజృంభించి తీవ్రబాణాలను ప్రయోగించగా, పాండవసేన కూడా వేగంగా, గర్వాతిశయంతో కౌరవసేనపై బడి అలిసిపోయేటట్లు చేసింది.

క. వడిఁ బొదివి భీముఁ డార్చినఁ । జెడ విఱిగిన సేన నేమి సెప్పదుఁ దన దొం
దడిఁ దాన చదిసె వెనుకొను । కడిఁదిమగలచేత గాసి గాదె నరేంద్రా! 354

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా!; వడిన్+పొదివి= వేగంగా తాకి; భీముఁడు+ఆర్చినన్= భీముడు అరవగా; చెడన్ విఱిగిన సేనన్= పతనమైన సైన్యాన్ని గూర్చి; ఏమి చెప్పుదున్?= ఏమని చెప్పగలను?; వెనుకొను కడిఁది మగలచేతన్= వెంటాడే గొప్ప శూరులచేత; గాసి కాదె!= బాధనొందదా!; తన దొందు+దడిన్+తాన చదిసెన్= తన సందడిలో తానే నలిగిపోయింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! భీముడు వేగంగా తాకి సింహనాదం చేయగా నాశనమైన మన సైన్యం గురించి ఏమని చెప్పగలను? తమను వెంబడించిన వీరులచేత బాధించబడి తన సమ్మర్దంలో తానే నలిగిపోయింది.

ఉ. మ్రొగ్గెడు వాహనంబులును, మోములు వాడఁగ వాహనంబుల
న్డిగ్గి తలంగు సైనికులు, నేలకుఁ గష్టపుఁజొప్పు సొప్పడం
ద్రగ్గు సిడంబులుం, గులముఁ దన్నుఁ దలంచి యెదిర్చి యొంటిమై
మ్రగ్గెడువారు నై కురు ధరావరు సైన్యము రూపుమాయఁగన్. 355

ప్రతిపదార్థం: మ్రొగ్గెడు వాహనంబులును= కూలుతున్న అశ్వగజాది వాహనాలు; మోములు, వాడఁగన్= ముఖాలు వాడిపోగా; వాహనంబులన్+డిగ్గి, తలంగు, సైనికులు= వాహనాలనుండి దిగి తొలగిపోయే సైనికులు; కష్టపున్+చొప్పు, చొప్పడన్= కష్టమైన విధం ఏర్పడగా; నేలకున్= భూమిపై; త్రగ్గు, సిడంబులున్= తెగిపడిన ధ్వజాలు; కులమున్+తన్నున్+తలంచి= తన వంశాన్ని తనను తలచుకొని; ఎదిర్చి= ఎదుర్కొని; ఒంటిమై, మ్రగ్గెడు, వారున్+ఐ= ఒంటరిగా చచ్చేవారు అయి; కురుధరావరు సైన్యము= కౌరవరాజు సైన్యం; రూపుమాయఁగన్= నశించగా.

తాత్పర్యం: అశ్వగజాది వాహనాలు నేలపై పడిపోగా, వాడిన ముఖాలతో సైనికులు వాహనాలు దిగి తొలగిపోగా, ఘోరయుద్ధానికి ధ్వజాలు తెగిపడగా, తమ వంశపౌరుషాన్ని తలచుకొని ఒంటరిగా పోరాడిన వీరులు నేలపై కూలగా కురురాజుసైన్యం నశించింది.

ఆ. పావనికి నిషాదపతి నందనుఁడు మాఱు। కొనిన నాతఁ డతని కుంజరంబు
కరముతోఁ దదీయ కరములు శిరమును। నఱకె శితశరములు నాలుగింట. 356

ప్రతిపదార్థం: నిషాదపతి నందనుడు= నిషాదరాజు కుమారుడు; పావనికిన్= భీముడితో; మాఱుకొనినన్= తలపడగా; అతఁడు= భీముడు; అతని కుంజరంబు= అతడి ఏనుగును; కరముతోన్= తొండంతోకూడ; తదీయకరములు శిరమును= అతడి చేతులు, తలను; శితశరములు నాలుగింటన్= నాలుగు వాడిబాణాలతో; నఱకెన్= నరికాడు.

తాత్పర్యం: నిషాద రాజకుమారుడు భీముడితో తలపడగా, భీముడు అతడి చేతులను, తలను, ఏనుగును, దాని తొండాన్ని నాలుగు వాడిబాణాలతో ఖండించాడు.

క. మూఁ డక్షౌహిణు లిమ్మెయిఁ। బోఁడిమి సెడి పాఱఁ బవనపుత్రుని యెదురన్
వేఁడిమి సూపఁగ నొకఁడు। న్వాఁడిమగఁడు లేఁడ; యేమనం గల దధిపా! 357

ప్రతిపదార్థం: మూఁడు+అక్షౌహిణులు= మూడు అక్షౌహిణుల సైన్యం; ఈ+మెయిన్= ఈ విధంగా; పోఁడిమి చెడి పాఱన్= సొంపుచెడి పారిపోగా; పవనపుత్రుని ఎదురన్= భీముడి ఎదుట; వేఁడిమి చూపఁగన్= పరాక్రమం చూపటానికి; ఒకఁడున్+ వాఁడి మగఁడు లేఁడు+అ= ఒక్కవీరుడు కూడా లేడు; ఏమనన్+కలదు+అధిపా!= ఏమని చెప్పాలి రాజా!

తాత్పర్యం: ఈ విధంగా (అతడిముందు నిలువలేక) మూడు అక్షౌహిణుల సైన్యం సొంపుచెడి పారిపోగా, భీముడిని ఎదుర్కొనటానికి ఒక్క వీరుడు కూడా లేడంటే - ఇక చెప్పగలిగింది ఏమున్నది ధృతరాష్ట్ర మహారాజా!

విశేషం: అక్షౌహిణి: 218170 రథాలు, 218170 గజాలు, 65610 గుర్రాలు, 109350 కాల్బలం గల సైన్యం - అక్షౌహిణి.

వ. ఇవ్విధంబున విక్రమించిన భీమసేను బరవసంబును దదీయసైనికుల సంరంభంబునుం బద్మనాభుండు ఫల్గుననకుం జూపి చెప్పె ననిన విని సంజయునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. 358

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్ విక్రమించిన= ఈ విధంగా పరాక్రమం చూపిన; భీమసేను బరవసంబును= భీముడి ధైర్యం; తదీయ సైనికుల సంరంభంబునున్= అతడి సైనికులసందడిని; పద్మనాభుండు= కృష్ణుడు; ఫల్గుననకున్+చూపి చెప్పెన్= అర్జునుడికి చూపి వివరించాడు; అనినన్+విని= అనగా విని; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్= సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: భీముడి సాహసాన్ని, అతడి సైనికులసందడిని శ్రీకృష్ణుడు అర్జునుడికి వివరించి చెప్పాడు అని చెప్పగా విన్న ధృతరాష్ట్రుడు, సంజయుడితో ఇట్లా అన్నాడు:

క. 'నీ చెప్పెడుమెయి సూడఁగ। నీచత వాటిల్లె మన యనీకమునకుఁ దా
రే చేటు సెడిరొ కౌరవు। లా చరిత ముపన్యసింపు మంతయుఁ దెలియన్.' 359

ప్రతిపదార్థం: నీ, చెప్పెడు, మేయి, చూడఁగన్= నీవు చెప్పే విధం చూస్తే; మన అనీకమునకున్= మన సైన్యానికి; నీచత పాటిల్లెన్= అగౌరవం ఏర్పడింది; కౌరవులు; ఏ చేటు+చెడిరొ= ఏవిధంగా నశించారో; ఆ చరితము= ఆ వృత్తాంతం; అంతయున్+తెలియన్= పూర్తిగా తెలిసేటట్లుగ; ఉపన్యసింపుము= చెప్పుము.

తాత్పర్యం: 'నీ మాటలవలన మన సైన్యం గౌరవం చెడిందని తెలుస్తున్నది. కౌరవులు ఏ విధంగా చెడ్డారో ఆ విషయమంతా వివరంగా చెప్పుము.'

క. **అనవుడు నతఁ డిట్లను న । మ్మనుజపతికి 'హితులు సెప్ప మానక నీచే**
సిన దుర్ణయమునఁ జేటొం । దెను; వగవక రణము వినుము ధీరవిచారా!' **360**

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; ఆ+మనుజపతికిన్= ఆ ప్రభువుకు; అతఁడు+ఇట్లు+అనున్= సంజయుడు ఇట్లా బదులు పలికాడు; ధీర విచారా!= ధైర్యంతోడి ఆలోచన గలవాడా - ధృతరాష్ట్రరాజా!; హితులుచెప్పన్= హితులు ఎంత చెప్పినా; మానక= వినకుండా; నీ చేసిన దుర్ణయమునన్= నీవు చేసిన దుర్నీతివలన; చేటు+ఒందెను= ఈ నష్టం కలిగింది; వగవక రణము వినుము= విచారించక యుద్ధవిధం వినుము.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి మాటలకు సంజయుడు ఇట్లా బదులు పలికాడు: 'ఓ రాజా! నీ మేలు కోరిన వారి మాటలు వినకుండా నీవు చేసిన కుటిలనీతి వలననే ఇంతనష్టం వాటిల్లింది. జరిగిన దానికి విచారించక యుద్ధవృత్తాంతం వినుము.'

వ. **ఇట్లు భీము కడంక గని కవ్వడి దన మునుము కొంచెము మూఁకలం దోలి మగిడి మన సేనల మర్దించుటకుం దమవారిఁ జేరంజనఁ గౌరవపతి యమ్మారుతి మార్కొని.** **361**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; భీముకడంక కని= భీముడి పూనిక చూచి; కవ్వడి= అర్జునుడు; తనమునుము= తన ఎదురుగా ఉన్న; కొంచెము మూఁకలన్+తోలి= కొద్దిమంది సైనికులను పారదోలి; మగిడి= తిరిగి; మన సేనలన్ మర్దించుటకున్= మన సైన్యాలను అణచటానికి; తమవారికిన్+చేరన్+చనన్= తమవారిని కలిసికొనుటకు వెళ్ళగా; కౌరవపతి= దుర్యోధనుడు; ఆ+మారుతిన్+మార్కొని= ఆ భీముడిని ఎదుర్కొని.

తాత్పర్యం: అర్జునుడు తనముందున్న కొద్దిమంది సైనికులను పారద్రోలి తన పక్షంవారిని చేరబోగా, దుర్యోధనుడు భీముడిని ఎదుర్కొని. (తరువాతి పద్యంతో అన్వయం).

దుర్యోధనుండు భీమసేనుం దలపడి పోరుట (సం. 8-44-3)

తే. **'ఎందు వచ్చెదు? నిలు నిలు; మేను గలుగఁ । గడిమి సెల్లునె నీకు; నీ క్షణమ నిన్ను**
నంతకుని పాలి కనిచెద' ననుచు రోష । రక్తలోచన రుచుల శరములు వఱపె. **362**

ప్రతిపదార్థం: ఎందున్ వచ్చెదు?= ఎక్కడికి వస్తున్నావు? నిలు నిలుము= ఆగుము ఆగుము; ఏను కలుగన్= నేను ఉండగా; నీకున్= నీకు; కడిమి చెల్లునె?= పరాక్రమం తగునా?; ఈ క్షణము+అ= ఇప్పుడే; నిన్నున్= నిన్ను; అంతకుని పాలికిన్+అనిచెదను= యముని వద్దకు పంపుతాను; అనుచున్= అంటూ; రోషరక్తలోచన రుచులన్= క్రోధంతో ఎర్రబడిన కనుల కాంతులతో; శరములు పఱపెన్= బాణాలు వేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఎక్కడికి వస్తున్నావు? ఆగుము. నా ముందు నీ సాహసం చెల్లదు. ఇప్పుడే నిన్ను యమలోకం పంపుతాను చూడుము?' అంటూ దుర్యోధనుడు క్రోధపూరిత నేత్రాలతో చూస్తూ బాణప్రయోగం చేశాడు.

క. రాధేయుండు నుదీర్ణ । క్రోధుం డై గర్జతోడి గుణరవము నభో
బాధం బొనర్పఁగా నిజ । యోధులఁ బురికొల్పికొని సముద్ధతిఁ గడఁగెన్. 363

ప్రతిపదార్థం: రాధేయుండున్= కర్ణుడుకూడా; ఉదీర్ణక్రోధుండు+ఐన= మహా ఆగ్రహం కలవాడై; గర్జతోడి, గుణరవము= అరుపుతో కూడిన వింటినారిధ్వని; నభస్+బాధంబు+ఒనర్ప+కాన్= గగనంలో ప్రతిధ్వనించగా; నిజయోధులన్+పురికొల్పికొని= తన యోధులను ప్రోత్సహించి; సముద్ధతిన్+కడఁగెన్= అతిశయంతో విజృంభించాడు.

తాత్పర్యం: కర్ణుడు కూడా క్రోధపూరితుడై పెద్దగా గర్జిస్తూ వింటినారి ధ్వనిని చేస్తూ తన సైనికులను ప్రోత్సహించి శత్రుసేనపైకి వెళ్ళాడు.

వ. అ ట్లయ్యిరువురు నుత్సాహంబు వాటించి నిజానీకంబు నిలువరించిన నది పురికొని పోరికి నమరుటయుఁ బాండవబలంబును దిరంబయి పెనంగందొడంగె; నట్టియెడ నక్కడ నిక్కడఁ జేయంగల దొరలు దలపడి యుక్కున నక్కజం బగు సమరక్రీడ సలిపి; రందు. 364

ప్రతిపదార్థం: అట్లు+ఆ+ఇరువురున్= ఆ విధంగా దుర్యోధన కర్ణులు ఇద్దరు; ఉత్సాహంబు పాటించి= ఉత్సాహం కలిగి; నిజ+అనీకంబు నిలువరించినన్= తమ సైన్యాన్ని నిలబెట్టగా; అది పురికొని పోరికిన్+అమరుటయున్= అది ప్రేరణ చెంది యుద్ధానికి సిద్ధపడగా; పాండవ బలంబును= పాండవసైన్యంకూడా; తిరంబు+ఐ= స్థిరంగా నిల్చి; పెనంగన్+తొడంగెన్= పోరు సల్పసాగింది; అట్టిఎడన్= అప్పుడు; అక్కడన్+ఇక్కడన్= రెండు పక్షాలలో; చేయంగల దొరలు= సమర్థులైన వీరులు; తలపడి= పోరి; ఉక్కునన్= గర్వంతో; అక్కజంబు+అగు= ఆశ్చర్యం గొలిపే విధంగా; సమరక్రీడన్ సలిపిరి= యుద్ధం చేశారు; అందున్= ఆ రణంలో.

తాత్పర్యం: దుర్యోధనుడు, కర్ణుడు ఆ విధంగా తమ సైన్యంలో ఉత్సాహాన్ని రేకెత్తించి, యుద్ధానికి సిద్ధం చేయగా, పాండవసేనకూడా చలించకుండా నిల్చి పోరు సలిపింది. రెండు పక్షాలలోని వీరులు తలపడి అచ్చెరువు గొల్పే విధంగా యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో.

సీ. కర్ణుఁ డేపారి శిఖండి రథ్యముల సా । రథిఁ గేతువును గూల్చి రయము మెఱయ
విగతాయుధుఁడు బాణవిహతాంగుఁడును గా ను । దగ్రుఁ డై తఱుమ నతండు దొలఁగఁ
బాఱె; దుశ్శాసన పార్షతు లొండొరు । తనువులు నొంచుచు ననిమిషులకు
నచ్చెరు వగు నట్టి యని సేయ వారల । తనువులు లెడసొచ్చి పెనఁగి రంగ

తే. రాజు సూడఁ దత్పుత్త్రు సారథి శిరంబు । నకులుఁ డొక భల్లమునఁ ద్రుంప, జకిత మై క
లంగు నచ్చటి మూఁకఁ జలంబు మెఱయ । నిలిపె నా సూతసూనుండు నృపవరేణ్య! 365

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= ధృతరాష్ట్ర మహారాజా!; కర్ణుఁడు+ఏపారి= కర్ణుడు విజృంభించి; శిఖండి రథ్యములన్= శిఖండి గుఱ్ఱాలను; సారథిన్+కేతువును కూల్చి= సారథిని ధ్వజాన్ని నరికి; విగత+ఆయుధుఁడు= ఆయుధహీనుడు; బాణవిహత+

అంగుఁడునుగాన్= బాణాలతో గాయపరచబడిన శరీరుడు కాగా; రయముమెఱయన్= వేగంగా; ఉదగ్రుడై తఱుమన్= భయంకరంగా తరుమగా; అతండు తొలఁగన్+పాఱెన్= అతడు పారిపోయాడు; దుశ్శాసన పార్షతులు= దుశ్శాసనుడు, ధృష్టద్యుమ్నుడు; ఒండొరు తనువులు నొంచుచున్= ఒకరి దేహాన్ని ఒకరు నొప్పిస్తూ; అనిమిషులకున్+అచ్చెరువు+అగునట్టి= దేవతలకు కూడా ఆశ్చర్యం కలిగించే; అనిచేయన్= యుద్ధం చేయగా; వారల అనుచరులు= వారిభటులు; ఎడచొచ్చి పెనఁగిరి= దూరంనుండి పోరు సలిపారు; నకులుఁడు; అంగరాజుచూడన్= కర్ణుడు చూస్తుండగా; తద్+పుత్రు సారథిశిరంబు= వృషసేనుడి సారథి తలను; ఒక భల్లమునన్+త్రుంపన్= ఒక బల్లెంతో ఖండించగా; చకితము+ఐ కలంగు+అచ్చటిమూఁకన్= రిచ్చవడి చెదరిపోయే సైన్యాన్ని; ఆ సూతసూనుండు= కర్ణుడు; చలంబు మెఱయన్ నిలిపెన్= పట్టుదల ప్రకాశింపగా నిలిపాడు.

తాత్పర్యం: ఓ రాజా! కర్ణుడు శౌర్యంతో శిఖండి గుర్రాలను, సారథిని, ధ్వజాన్ని ఖండించాడు. శిఖండిని బాణాలతో గాయపరచి తరుమగా అతడు పారిపోయాడు. దుశ్శాసన, ధృష్టద్యుమ్నులు ఒకరిని మరొకరు బాధిస్తూ తీవ్రయుద్ధం సల్పారు. నకులుడు వృషసేనుడి సారథి తలను బల్లెంతో ఖండించగా, సైనికులు చకితులై చెదరిపోసాగారు. కర్ణుడు పట్టుదలతో వారిని నిలువరించాడు.

వ. అట్లు సారథిరహితుండైన వృషసేనుండు వేఱొక్కసూతు నమర్చికొని తండ్రికిం జక్రరక్షకుండై నిలిచె; నకులుండు నొండు దెస కడరె; సహదేవుం డులూకుని విరథునిం జేసి పఱపె; సాత్యకిసౌబలు లన్యోన్య కేతు పాతనంబును బరస్పర కంకట కర్తనంబునుం జేసి; రా సమయంబున శైనేయుండు దురంగంబులం జదిపిన నరదంబు డిగ్గనుఱికి యోసరించు న గ్గాంధారవిభుం గని యులూకుండు. 366

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; సారథి రహితుండు+ఐన వృషసేనుండు= సారథిని కోల్పోయిన వృషసేనుడు; వేఱొక్క సూతున్+అమర్చికొని= మరొకసారథిని కూర్చుకొని; తండ్రికిన్+చక్రరక్షకుండు+ఐ నిలిచెన్= కర్ణుడికి రథచక్ర రక్షకుడిగా నిలిచాడు; నకులుండును= నకులుడు; ఒండు దెసకున్+అడరెన్= వేరేవైపు వెళ్ళాడు; సహదేవుండు= సహదేవుడు; ఉలూకునిన్= ఉలూకుడిని; విరథునిన్+చేసి, పఱపెన్= రథహీనుడిగా చేసి పారద్రోలాడు; సాత్యకి, సౌబలులు= సాత్యకి శకునులు; అన్యోన్య కేతు పాతనంబును= ఒకరి ధ్వజాన్ని ఒకరు పడగొట్టటం; పరస్పర కంకట, కర్తనంబునున్+చేసిరి= ఒకరి కవచాన్ని ఒకరు ఛేదించటం చేశారు; ఆ సమయంబునన్= అప్పుడు; శైనేయుండు= సాత్యకి తురంగంబులన్+చదిపినన్= గుర్రాలను చంపగా; అరదంబు, డిగ్గన్+ఉఱికి= రథంనుండి దూకి; ఓసరించు= తొలగిపోతున్న; ఆ+గాంధారవిభున్= శకునిని; ఉలూకుండు= ఉలూకుడు; కని= చూచి.

తాత్పర్యం: సారథిరహితుడైన వృషసేనుడు మరొక సారథిని కూర్చుకొని తండ్రి రథచక్రరక్షకుడై నిలిచాడు. నకులుడు మరొకవైపు వెళ్ళాడు. సహదేవుడు ఉలూకుడిని రథహీనుడిని చేసి పారద్రోలాడు. సాత్యకి, శకునులు ఒకరి ధ్వజ కవచాలను మరొకరు ఛేదించారు. ఆ సమయంలో సాత్యకి అతడి గుర్రాలను కూల్చగా రథం దిగి పారిపోతున్న శకునిని చూచి ఉలూకుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. మును సహదేవుం డెగువం । జనినప్పడ యొండు దేరు సవరించుకొనం
గనుట నది పేర్చి యతనిం । గొనిపోయెను సంగరమునకుం దొలఁగంగన్. 367

ప్రతిపదార్థం: మును= ఇంతకుముందు; సహదేవుండు= సహదేవుడు; ఎగువన్+చనినప్పుడు+అ= పైకి వెళ్ళినప్పుడే; ఒండు తేరు సవరించుకొనన్= మరొకరథం సమకూర్చుకొనగా; అది పేర్చి= అది విజృంభించి; సంగరమునకున్+తొలఁగంగన్= యుద్ధానికి దూరంగా; అతనిన్+కొనిపోయెను= అతడిని తీసికొనివెళ్ళింది.

తాత్పర్యం: ఇదివరకు సహదేవుడు (తన్ను విరథుని చేసి) ముందుకు వెళ్ళినప్పుడే వేరొక రథాన్ని సమకూర్చుకొని ఉండటంవల్ల, అది శకునిని యుద్ధభూమినుండి పక్కకు తీసికొని వెళ్ళింది.

ఉ. అచ్చటిమూఁక నల్గడల నాతురతం జెడి పాఱె భీముచేఁ,
జచ్చెఁ గురుక్షితీశ్వరుని సారథి; కూలె హయాళి నుగ్గుగాఁ
జొచ్చె రథం; బతండు వెఱ సొచ్చి ధరిత్రికి దాఁటి పోయి వె
న్నిచ్చిన నీదు యోధవరు లేడ్తెఱ మార్కొని రమ్మరుత్సుతున్. 368

ప్రతిపదార్థం: అచ్చటిమూఁక= అక్కడున్న సైన్యం; ఆతురతన్= వేగిరపాటుతో; నలు+కడలన్= నాలుగు దిశలకు; చెడి పాఱెన్= చెదిరి పారిపోయింది; కురుక్షితి+ఈశ్వరుని సారథి= దుర్యోధనుడి సారథి; భీముచేన్+చచ్చెన్= భీముడిచేత చచ్చాడు; హయ+ఆళి కూలెన్= గుఱ్ఱాల సమూహం కూలిపోయింది; రథంబు= రథం; నుగ్గుగాన్+చొచ్చెన్= పొడి కాపోయింది; అతండు వెఱచొచ్చి= దుర్యోధనుడు భయపడి; ధరిత్రికిన్ దాఁటిపోయి= రణభూమిని దాటి; వెన్ను+ఇచ్చినన్= వెన్నుచూపగా; నీదు యోధవరులు= మీ సేనలోని వీరులు; ఏడ్తెఱన్= పరాక్రమంతో; ఆ+మరుత్+సుతున్= ఆ భీముడిని; మార్కొనిరి= ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: అక్కడున్న సైన్యం నాలుగు వైపులా చెదిరిపోగా భీముడు దుర్యోధనుడి సారథిని వధించాడు. అతడి గుఱ్ఱాలు, రథం కూలిపోగా భయంతో వెనుదిరిగి రణభూమినుండి తొలగిపోయాడు. అయినా కౌరవవీరులు భీముడిని ధైర్యంతో ఎదుర్కొన్నారు.

వ. యుధామన్యుండుఁ గృపాచార్యు ధనువు దునిమిన నమ్మహాత్ముండు వేఱొక్కవిల్లెత్తి. 369

ప్రతిపదార్థం: యుధామన్యుండున్= యుధామన్యుడును; కృపాచార్యు ధనువు తునిమినన్= కృపాచార్యుడి ధనుస్సును ఖండించగా; ఆ+మహాత్ముండు= ఆయన; వేఱొక విల్లు+ఎత్తి= మరొక ధనువు చేబట్టి.

తాత్పర్యం: యుధామన్యుడు కృపాచార్యుడి ధనుస్సును ఖండించగా, అతడు మరొక విల్లు చేపట్టి.

ఆ. కేతనంబు గూల్చి యాతపత్రము దును । మాడి సూతుఁ జంప నధికభయము
గదిరి తేరు దాన కయ్యంబునకుఁ దొలఁ । గంగఁ దోలె నతఁడు కౌరవేంద్ర! 370

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= ధృతరాష్ట్ర మహారాజా!; కేతనంబున్+కూల్చి= ధ్వజం పడగొట్టి; ఆతపత్రము తునుమాడి= ఛత్రం ముక్కలుచేసి; సూతున్+చంపన్= సారథిని చంపగా; అతఁడు= యుధామన్యుడు; అధికభయము కదిరి= మిక్కిలి భయపడి; తేరు= రథాన్ని; తాన్+అ= తానే; కయ్యంబునకున్+తొలఁగంగన్+తోలెన్= యుద్ధంనుండి తొలగేటట్లుగా తోలాడు.

తాత్పర్యం: రాజా! కృపుడు యుధామన్యుడి ధ్వజచ్ఛత్రాలను నరికి సారథిని చంపగా అతడు భయపడి తనరథాన్ని తానే యుద్ధంనుండి దూరంగా తోలుకొనిపోయాడు.

క. శితశరము లుత్తమౌజుఁడు । గృతవర్ముని మేన నింపఁ గినుక గదిరి మూ
ర్ఛితుఁ డుగఁ జేసె; నతఁడు వెస । నతనిం దత్సూతుఁ డెగచె నరదము దొలఁగన్. 371

ప్రతిపదార్థం: ఉత్తమౌజుఁడు= ఉత్తమౌజుడు; కృతవర్ముని మేనన్= కృతవర్మ దేహంపై; శితశరములు= వాడిబాణాలు; నింపన్= నాటగా; అతఁడు= కృతవర్మ; కినుక గదిరి= కోపం వహించి; వెసన్= వెంటనే; అతనిన్= ఉత్తమౌజుని; మూర్ఛితుఁడుగన్+చేసెన్= మూర్ఛిల్ల జేశాడు; తద్+సూతుఁడు= అతని (ఉత్తమౌజుని) సారథి; అరదమున్ తొలఁగన్= రథం తొలగగా; ఎగచెన్= తరిమాడు.

తాత్పర్యం: ఉత్తమౌజుడు కృతవర్మ దేహంలో వాడిబాణాలు నాటగా, కృతవర్మ కోపించి వెంటనే ఉత్తమౌజుడిని మూర్ఛిల్లజేశాడు. ఉత్తమౌజుడి సారథి రథం తొలగిపోయేటట్లు తరిమాడు.

అశ్వత్థామ యర్జునుం దలపడి మహాహవంబు సేయుట (సం. 8-45-1)

చ. గురుతనయుం డనేకరథికుల్ దన పార్శ్వములం దుదగ్రు లై
దురము కడంకమైఁ దఱుమ దోర్బల శౌర్యము లుల్లసిల్ల ని
ష్ఠుర శరవృష్టి ముంచె మధుసూదను మధ్యమపాండవున్ వియ
చ్చరులు ప్రశంస సేయఁగ నిజధ్వజినీనయనోత్సవంబుగన్. 372

ప్రతిపదార్థం: గురు తనయుండు= అశ్వత్థామ; అనేక రథికుల్= పెక్కుమంది వీరులు; తన పార్శ్వములందున్= తన ప్రక్కలఉండి; ఉదగ్రులు+ఐ= భయంగొల్పుతూ; దురము= యుద్ధం; కడంకమైన్= పూనికతో; తఱుమన్= వేగవంతంచేయగా దోః+బలశౌర్యములు+ఉల్లసిల్లన్= భుజబలశౌర్యం ఒప్పగా; వియత్+చరులు ప్రశంససేయఁగన్= దేవతలు ప్రశంసించగా; నిజధ్వజినీ నయన+ఉత్సవంబుగన్= తన సైనికులకు నేత్రానందంగా; మధుసూదనున్ మధ్యమపాండవున్= కృష్ణార్జునులను; నిష్ఠుర శరవృష్టిన్ ముంచెన్= తీవ్ర బాణవర్షంతో ముంచాడు.

తాత్పర్యం: అశ్వత్థామ పలువురు వీరులు తనకు అండగా ఉండి యుద్ధం వేగం అందుకొనేటట్లు చేయగా, భుజబల పరాక్రమాలు ఒప్పగా దేవతలు మెచ్చుకొనగా, తన సైనికులకు కనుల పండువుకాగా కృష్ణార్జునులపై శరవర్షం కురిపించాడు.

క. అలిగి నరుఁ డైంద్ర మాదిగఁ । గల దివ్యాస్త్రంబు లేయఁగా నయ్యై యు
జ్జ్వల మార్గణంబులను న । క్కలశభవసుతుండు మాన్చెఁ గౌరవముఖ్యా! 373

ప్రతిపదార్థం: కౌరవముఖ్యా!= ధృతరాష్ట్ర రాజా!; నరుండు= అర్జునుడు; అలిగి= ఆగ్రహించి; ఐంద్రము+ఆదిగన్+కల= ఇంద్రాస్త్రం మొదలైన; దివ్య+అస్త్రంబులు+ఏయఁగాన్= దివ్యాస్త్రాలు ప్రయోగించగా; ఆ+కలశభవసుతుండు= అశ్వత్థామ; ఆ+ఆ+ఉజ్జ్వల మార్గణంబులనున్= ఆయా కాంతిమంతములైన బాణాలను; మాన్పెన్= ఆపాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుడు ఆగ్రహంతో అశ్వత్థామపై ఐంద్రాస్త్రం మొదలుగ అనేక దివ్యాస్త్రాలు ప్రయోగించగా, అతడు వాటిని అడ్డుకొన్నాడు.

వ. ఇ వ్విధంబున వివిధాస్త్రజాలంబులం బోరి పోరి. 374

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; వివిధ+అస్త్రజాలంబులన్= వివిధ అస్త్రాల సమూహాలతో; పోరి పోరి= యుద్ధం చేసి చేసి.

తాత్పర్యం: ఈ విధంగా అశ్వత్థామ, అర్జునులు అస్త్రయుద్ధం చేసి చేసి.

సీ. ఉఱక యశ్వత్థామ యుగ్రబాణంబులు । విజయుని దక్షిణభుజము దూఱ
మూఁడేయ నొచ్చియుఁ బోఁడిమి సెడక య । బ్బలియుం డదల్చెఁ దత్పార్శ్వవర్తు
లగు పెనుమూఁకల నమ్ములవెల్లిఁ బే । రల్క నక్కుంభజునాత్మజుండు
రథ్యచయంబు నారాయణు వానర । ధ్వజము నవ్వీరు గాత్రమును బొదివె

తే. మెఱుఁగు వాలంపగముల నమ్మెయి నరుండు । ద్రౌణితోడ భరంపడి రణ మొనర్చు
చుండ నట మున్న ధర్మజుఁ డురవడించి । చిత్రసేనుని నమ్ములఁ జిక్కువఱిచి. 375

ప్రతిపదార్థం: అశ్వత్థామ= అశ్వత్థామ; ఉఱక= లక్ష్యపెట్టక; విజయుని, దక్షిణ, భుజము, దూఱన్= అర్జునుడి కుడిభుజంలో దూసుకొనిపోయేటట్లు, ఉగ్రబాణంబులు= వాడిబాణాలు; మూఁడు+ఏయన్= మూడింటిని వేయగా; నొచ్చియున్= బాధచెందినా; పోఁడిమి చెడక= ధైర్యం కోల్పోక; ఆ+బలియుండు= అర్జునుడు; తద్+పార్శ్వవర్తులు+అగు పెనుమూఁకలను= అశ్వత్థామకు సహాయులుగా ఉన్న పెక్కు సైనికులను; అమ్ములవెల్లిన్= బాణప్రవాహంతో; అదల్చెన్= నొప్పించాడు; ఆ+కుంభజు+ఆత్మజుండు= అశ్వత్థామ; పేరు+అల్కన్= పెనుకోపంతో; రథ్యచయంబు= గుర్రాల సమూహాన్ని; నారాయణున్= శ్రీకృష్ణుడిని; వానరధ్వజమున్= కపిధ్వజమును; ఆ+వీరుగాత్రమును= అర్జునుడి దేహాన్ని; మెఱుఁగువాలు+అంపగములన్= కాంతిగల వాడిబాణాల సమూహాలతో; పొదివెన్= తాకాడు; ఆ+మెయిన్= ఆ విధంగా; నరుండు= అర్జునుడు; ద్రౌణితోడన్= అశ్వత్థామచేత; భరంపడి= అణచబడి; రణము+ఒనర్చుచుండన్= యుద్ధం చేస్తుండగా; అటమున్న= అంతకుముందే; ధర్మజుఁడు= ధర్మరాజు; ఉరవడించి= వేగంగా; చిత్రసేనునిన్= చిత్రసేనుడిని; అమ్ములన్+చిక్కుపఱిచి= బాణాలతో ముంచి.

తాత్పర్యం: అశ్వత్థామ లక్ష్యపెట్టక అర్జునుడి కుడిభుజంలో మూడుబాణాలు నాటినా అతడు ధైర్యాన్ని కోల్పోక అశ్వత్థామ అనుచరులపై బాణవర్షం కురిపించాడు. అశ్వత్థామ అమితంగా ఆగ్రహించి అర్జునుడిని, సారథి అయిన కృష్ణుడిని, కపిధ్వజాన్ని, అశ్వాలను తేజోమయాలైన బాణాలతో కొట్టగా అర్జునుడు భంగపడి పోరు సలిపాడు. ధర్మరాజు ఒకవైపు చిత్రసేనుడిపై బాణాలు కురిపించి.

క. తఱిమి తన మునుము సైన్యము । నురుమాఁడఁగఁ గని సుయోధనుఁడు మున్నుగ నే
డ్తెఱ నీ యోధులు మార్కొని । యఱిముఱి నొప్పించి పట్ట నమరి పొదివినన్. 376

ప్రతిపదార్థం: తఱిమి= (చిత్రసేనుడిని)తరిమి; తన మునుము సైన్యము= తనముందు సైన్యాన్ని (ధర్మరాజు); నుఱుమాడఁగన్+కని= నుగ్గుచేయగా చూచి; సుయోధనుఁఁడు మున్నగు= దుర్యోధనుడు మొదలైన; నీ యోధులు= నీ సైనికులు; ఏడ్తెఱన్= పరాక్రమంతో; మార్కొని= ఎదుర్కొని; అఱిముఱి నొప్పించి= సంభ్రమంతో నొప్పించి; పట్టన్+అమరి పొదివినన్= పట్టుకొనుటకు సిద్ధమై చుట్టుముట్టగా.

తాత్పర్యం: ధర్మరాజు చిత్రసేనుడిని తరిమి తన ముందరిసైన్యాన్ని నుగ్గుచేయగా చూచిన దుర్యోధనుడు మున్నగు వీరులు పరాక్రమంతో అతడిని ఎదుర్కొని ససంభ్రమంగా నొప్పించి పట్టుకోవటానికి సిద్ధమై చుట్టుముట్టారు.

ఉ. పావని మున్నుగాఁ గవలుఁ బార్షతుఁడున్ వెస వారిఁ దాఁకినం
జేవ దలిర్ప నచ్చటికిఁ జెచ్చెరఁ గర్ణుఁడు వచ్చి తీవ్ర బా
ణావృతమూర్తిఁ జేసె మనుజాధిప! యా రథికావలిన్ ధను
ర్జ్యా వితత స్వనంబున వియద్వివరంబు ప్రపూరితంబుగన్. 377

ప్రతిపదార్థం: మనుజ+అధిపా!= ధృతరాష్ట్ర మహారాజా!; పావని మున్నుగాన్+కవలున్= భీముడు ముందుండగా నకులసహదేవులు; పార్షతుఁడున్= ధృష్టద్యుమ్నుడు; వెసన్ వారిన్+తాఁకినన్= వెంటనే వారిని తాకగా; కర్ణుఁడు= కర్ణుడు; చేవ తలిర్పన్= ధైర్యం అతిశయిల్లగా; చెచ్చెరన్= శీఘ్రంగా; అచ్చటికిన్= అక్కడికి; వచ్చి; ధనుః+జ్యా వితత, స్వనంబునన్= వింటినారియొక్క పెద్ద ధ్వనిచేత; వియత్+వివరంబు= ఆకాశభాగం; ప్రపూరితంబుగన్= నిండిపోగా; ఆ రథిక+ఆవలిన్= ఆ వీరులసమూహాన్ని; తీవ్రబాణ+ఆవృతమూర్తిన్+చేసెన్= తీవ్రబాణాలతో ముంచివేశాడు.

తాత్పర్యం: భీముడు, నకుల సహదేవులు, ధృష్టద్యుమ్నుడు దుర్యోధనాదులను ఎదుర్కొనగా, ధైర్యం అతిశయిల్ల కర్ణుడు అతివేగంగా అటకు వచ్చి వింటినారిధ్వని ఆకాశమంతా నిండగా మ్రోయిస్తూ, తీవ్రబాణాలతో వారిని ముంచాడు.

క. అట్టియెడ మాద్రి పిదపటి । పట్టి కురున్నృపాలు రెండుపదులమ్ములు దా
బెట్టుగ నేసిన వేదన । ముట్టుడుఁ జేడ్పడియె నతఁడు మొనయును దలఁకెన్. 378

ప్రతిపదార్థం: అట్టిఎడన్= అప్పుడు; మాద్రిపిదపటిపట్టి= సహదేవుడు; కురున్నృపాలున్= దుర్యోధనుడిని; రెండుపదులు+అమ్ములు= ఇరవైబాణాలు; తాన్ బెట్టుగన్+ఏసినన్= తానుగట్టిగా వేయగా; వేదన ముట్టుడున్= నొప్పి కలుగగా; అతఁడు= దుర్యోధనుడు; చేడ్పడియెన్= తొలగిపోయాడు; మొనయును తలఁకెన్= సేన కూడా బెదరిపోయింది.

తాత్పర్యం: అప్పుడు సహదేవుడు దుర్యోధనుడిపై ఇరవైబాణాలు గుప్పించగా అతడు ఎంతోబాధను పొందాడు. అతడి సైన్యం కూడా కలతపొందింది.

మ. కని రాధేయుఁడు దివ్యబాణనిహతిం గౌంతేయ సైన్యంబు నె
ల్లను నొప్పించిన బీఱువోయె నది యుల్లాసోగ్రుఁ డై ధర్మ
నందను నమ్మేటిమగండు గిట్టుటయు నాతం డల్గి పె ల్లేసినన్
విను మందస్మితసుందరుం డగుచు నవ్వీరుండు ధీరోద్ధతిన్. 379

ప్రతిపదార్థం: రాధేయుఁడు= కర్ణుడు; కని= అది చూచి; దివ్యబాణనిహతిన్= దివ్యబాణాల దెబ్బచే; కౌంతేయ సైన్యంబును+ ఎల్లను, నొప్పించినన్= పాండవసేననంతా బాధపెట్టగా; అది= ఆ సైన్యం; బీఱుపోయె= శక్తిహీనమైంది; ఉల్లాస+ఉగ్రుఁడు+ అయి= ఉల్లాసంచే భయంకరుడయి; ఆ+మేటిమగండు= ఆ వీరుడు; ధర్మనందనున్= ధర్మరాజును; కిట్టుటయున్= సమీపించగా; అతండు= అతడు; అల్గి= కోపించి; పెల్లు+ఏసినన్= పెక్కుబాణాలు వేయగా; మందస్మిత సుందరుండు+అగుచున్= చిరునవ్వుతో అందగించినవాడై; ఆ+వీరుండు= కర్ణుడు; ధీర+ఉద్ధతిన్= ధైర్యాతిశయంతో; విను= (ఏం చేశాడో) వినుము.

తాత్పర్యం: రాధేయుడు అది చూచి దివ్యబాణాలు వేసి పాండవసైన్యాన్ని కలతపెట్టగా అది ధైర్యహీనమయింది. ఆ ఉత్సాహంతో ధర్మరాజును సమీపించగా అతడు పలుబాణాలు వేశాడు. దానికి కర్ణుడు చిరునవ్వుతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. అనేక చండ కాండంబు లంగంబునం గీలించి. 380

ప్రతిపదార్థం: అనేక చండ కాండంబులు= పటువైన పెక్కుబాణాలు; అంగంబునన్+కీలించి= అతడి దేహంలో నాటి.

తాత్పర్యం: తీవ్రబాణాలను ధర్మరాజుశరీరంలో నాటి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. వలుఁద నారసంబు వక్షంబుఁ దూఱంగ । నేయుటయును బాండవేయుఁ డార్తిఁ
గూరి నిలువలేక కూర్చుండఁబడి సూతు । నరద మెగవు తొలఁగ ననియె నధిప! 381

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వలుఁద నారసంబు= విశాలమైన బాణం; వక్షంబున్+తూఱంగన్+ఏయుటయున్= వక్షంలో నాటేటట్లు వేయగా; పాండవేయుఁడు+ఆర్తిన్+కూరి= ధర్మరాజు బాధనొంది; నిలువలేక కూర్చుండఁబడి= నిలబడలేక కూలబడి; సూతున్= సారథిని; అరదము= రథం; ఎగవుతొలఁగన్+అనియెన్= వేగంగా తోలుమని అన్నాడు.

తాత్పర్యం: కర్ణుడు ధర్మరాజు ఎదలో విశాలబాణాన్ని నాటగా అతడు బాధతో కూలబడిపోయి సారథిని రథం త్వరగా తొలగిపోనిమ్మని అన్నాడు.

వ. అనుటయు వాఁ డట్ల చేయం గౌరవులు గడంగి పోనీక పొదువుం డను నెలుంగులతో నక్కౌంతేయాగ్రజు వెన్నాడి కవిసినం గేకయ పాంచాల బలంబు లడ్డపడి పెనంగె; భీమసేనుండు సుయోధనుని 'నిలు నిలు' మని యదల్చి యమ్ములం గప్పె; నప్పుడు రాధేయుండు రభసంబున. 382

ప్రతిపదార్థం: అనుటయున్ వాఁడు+అట్లచేయన్= అనగా సారథి అట్లాగే చేయగా; కౌరవులు కడంగి= కౌరవులు పూని; పోనీక పొదువుండు అను+ఎలుంగులతోన్= ధర్మరాజును; పోనివ్వకుండా ఆపండి అను అరుపులతో; ఆ+కౌంతేయ+అగ్రజున్ వెన్నాడి కవిసినన్= ఆ ధర్మరాజును వెంబడించి పోరగా; కేకయ పాంచాల బలంబులు+అడ్డపడి= కేకయ పాంచాల సైన్యాలు అడ్డుకొని; పెనంగెన్= పోరుసల్పాయి; భీమసేనుండు= భీముడు; సుయోధనునిన్= దుర్యోధనుడిని; నిలునిలుము+అని అదల్చి= ఆగుము ఆగుము అని బెదరించి; అమ్ములన్+కప్పెన్= బాణాలతో కప్పాడు; అప్పుడు రాధేయుండు= అప్పుడు కర్ణుడు; రభసంబునన్= వేగిరపాటుతో.

తాత్పర్యం: ధర్మరాజు అనగానే సారథి అట్లాగే చేశాడు. కౌరవులు ధర్మరాజును పోనీయకుండా వెంబడించి తాకారు. అప్పుడు కేకయ పాంచాల వీరులు అడ్డుకొని వారిని తాకారు. భీముడు దుర్యోధనుడిని ఆగుమాగుము అని ఆపి బాణాలతో కప్పాడు. అప్పుడు కర్ణుడు సంభ్రమంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. పాంచాలురఁ గేకయుల ను । దంచిత గర్వమున వాలురమ్ములవెల్లిన్
ముంచిన నోటటి యరికరి । పంచాననమూర్తి భీముపజ్జ కొదిఁగినన్. 383

ప్రతిపదార్థం: పాంచాలురన్+కేకయులును= పాంచాల కేకయ వీరులను; ఉదంచిత గర్వమునన్= ఎక్కువైన గర్వంతో; వాలు+అమ్ముల వెల్లిన్= వాడియైన బాణాల ప్రవాహంతో; ముంచినన్= కప్పగా; ఓట+అటి= ఓడిపోయి; అరికరి పంచాననమూర్తి= శత్రుగజమునకు సింహరూపమైన; భీముపజ్జకున్+ఒదిఁగినన్= భీముని ప్రక్కలో చేరగా.

తాత్పర్యం: కర్ణుడు పాంచాల, కేకయ వీరులను బాణవర్షంతో ముంచెత్తగా వారు భయపడి శత్రుభయంకరుడైన భీముడి అండను చేరారు.

వ. **అక్కర్ణుండు నిజరథంబు మెఱయ ధర్మనందను వెనుకొనియె; నతండు విశిఖ వేదనం జేడ్పడిన చిత్తంబుతోడ నిజశిబిరంబున కల్లనల్లన పోవుచుండియుఁ దన్ను నా సూతనందనుండు మూఁడుదూపుల నేసిన మరలి యమ్మేటిమగని మేనం బలుమార్గణంబులు సొనిపి తత్సారథి సాయక త్రయంబునకు హయంబుల శరచతుష్టయంబునను స్రుక్కించె నట్టియెడ.** **384**

ప్రతిపదార్థం: ఆ+కర్ణుండు= కర్ణుడు; నిజ రథంబు మెఱయన్= తన రథం ప్రకాశించగా; ధర్మనందనున్ వెనుకొనియెన్= ధర్మరాజును వెంబడించాడు; అతండు= ధర్మరాజు; విశిఖవేదనన్= బాణందెబ్బచే కలిగిన నొప్పితో; చేడ్పడిన చిత్తంబుతోడన్= బాధపడిన హృదయం తోడై; నిజ శిబిరంబునకున్= తన శిబిరానికి; అల్ల+అల్లన పోవుచుండియున్= మెల్లమెల్లగా పోతూ; తన్నున్+ఆ సూతనందనుండు= తనను ఆ కర్ణుడు; మూఁడుతూపులన్+ఏసినన్= మూడుబాణాలతో కొట్టగా; మరలి= అతడివైపు తిరిగి; ఆ+మేటిమగని మేనన్= ఆ కర్ణుడి శరీరంలో; పలు మార్గణంబులు చొనిపి= పెక్కుబాణాలు నాటి; తత్సారథిన్= అతడి సారథిని; సాయకత్రయంబునను= మూడు బాణాలతోనూ; హయంబులన్= గుర్రాలను; శర చతుష్టయంబునను= నాలుగు బాణాలతోనూ; స్రుక్కించెన్= పడగొట్టాడు; అట్టి ఎడన్= అప్పుడు.

తాత్పర్యం: కర్ణుడు తన రథంపై వెలుగొందుతూ ధర్మరాజును వెంబడించాడు. బాణాల దెబ్బలకు బాధపడుతూ మెల్లగా శిబిరానికి పోతున్న అతడిపై మూడుబాణాలు వేశాడు. ధర్మరాజు మరలి కర్ణుడిపై పలుబాణాలు కురిపించి, మూడుబాణాలతో అతడి సారథిని, నాలుగుబాణాలతో గుర్రాలను పడగొట్టాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **ఇరుదెసల నున్న కవ ల । న్నరపతి దురవస్థ సూచి నారాచపరం**
పరలు పరఁగించుచును జె । చ్చెరఁ గర్ణునిఁ దాఁకి రతఁడు చిఱున వ్వొలయన్. **385**

ప్రతిపదార్థం: ఇరుదెసల నున్న కవలు= రెండువైపుల ఉన్న నకుల సహదేవులు; ఆ+నరపతి దురవస్థ+చూచి= ధర్మరాజు కష్టాన్ని చూచి; చెచ్చెరన్= వెంటనే; కర్ణునిన్= కర్ణుడిని; అతఁడు చిఱునవ్వు+ఒలయన్= అతడు చిరునవ్వు నవ్వగా; నారాచ పరంపరలు పరఁగించుచును= బాణపరంపర కురిపిస్తూ; తాఁకిరి= ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: ప్రక్కలనున్న నకుల సహదేవులు ధర్మరాజు ఇబ్బందిని చూచి, అతడికి సహాయంగా నిలిచి కర్ణుడిపై బాణాలు కురిపించారు. కర్ణుడు చిరునవ్వు నవ్వుతూ.

తే. **వార లిరువుర నుగ్రంపు నారసములఁ । గప్పి దంత వర్ణములును గాలవాల**
సుందరంబులు నగు ధర్మనందనుని తు । రంగమంబులఁ బడనేసె రయము మెఱయ. **386**

ప్రతిపదార్థం: వారలన్+ఇరువురన్= వారిద్దరినీ; ఉగ్రంపు నారసములన్+కప్పి= క్రూరబాణాలతో కప్పి; దంత వర్ణములును= తెలుపురంగులు; కాల, వాల, సుందరంబులు+అగు= నల్లని తోకలచే సుందరములైన; ధర్మనందనుని తురంగమంబులన్= ధర్మరాజు గుర్రాలను; పడన్+ఏసి= పడగొట్టి; రయము మెఱయన్= వేగం ప్రకాశం కాగా.

తాత్పర్యం: కర్ణుడు నకుల సహదేవులపై వాడిబాణాలు వేసి, తెల్లనిరంగు గల మేనులతో, నల్లని తోకలతో అందమైన ధర్మరాజు గుర్రాలను వేగంగా కూలవేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **అతని శిరస్త్రాణంబును । శితవిశిఖ నిపాతితంబు సేసి యుదారో**
ద్ధతి నకులు కార్ముకము హయ । తతియుం దునుమాడుటయు నతండును నతఁడున్. **387**

ప్రతిపదార్థం: అతని శిరస్త్రాణంబును= ధర్మరాజు తలతొడుగు; శిత విశిఖ నిపాతితంబు చేసి= వాడిబాణాలచేత పడగొట్టి; ఉదార+ఉద్ధతిన్= గొప్ప పరాక్రమంతో; నకులు కార్ముకము హయతతియున్= నకులుడి విల్లు, గుర్రాలను; తునుమాడుటయును= ఖండించగా; అతండునున్+అతఁడున్= ధర్మజ, నకులులు.

తాత్పర్యం: వాడిబాణాలతో ధర్మరాజు తలకు రక్షగా ఉన్న తొడుగును పడగొట్టి పరాక్రమించి నకులుడి గుర్రాలను, విల్లును ఖండించగా ధర్మరాజు, నకులుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **సహదేవుని తే రెక్కిన । నహితాంతకుఁ డైన కర్ణుఁ డమ్మువ్వుర సం**
పిహిత శరీరులఁ జేసెను । బహువిధ బాణములఁ జలము బలమును మెఱయన్. **388**

ప్రతిపదార్థం: సహదేవుని తేరు+ఎక్కినన్= సహదేవుడి రథంపైకి ఎక్కగా; అహిత+అంతకుఁడు+ఐన కర్ణుడు= శత్రుహంతమైన కర్ణుడు; చలము బలమును మెఱయన్= పట్టుదల పరాక్రమం ఒప్పగా; బహువిధ బాణములన్= అనేక బాణాలతో; ఆ+ మువ్వురన్= ధర్మజనకుల సహదేవులను; సంపిహిత శరీరులన్+చేసెన్= కప్పబడినవారిగా చేశాడు.

తాత్పర్యం: (ధర్మరాజు, నకులులు) సహదేవుడి రథంపైకి రాగా, కర్ణుడు వారి ముగ్గురినీ బలంతో చలంతో పలురకాల బాణాలతో నొప్పించి ముగ్గురి శరీరాలను కప్పేశాడు.

చ. **కనుఁగొని శల్యుఁ డి ట్లనియెఁ గర్ణునితో 'నిది యేల? ధర్మనం**
దనుపయి నాగ్రహించెదు; హితం బగు కార్యమె యిమ్మహీశు నీ
వనిఁ దెగటార్చినట్లయిన నర్జునుఁ డుత్కట శోకరోషమున్
పెనఁగొన నిన్నుఁ గౌరవులఁ బీనుఁగుపెంటలు సేయకుండునే? **389**

ప్రతిపదార్థం: శల్యుఁడు= శల్యుడు; కనుఁగొని= చూచి; కర్ణునితోన్= కర్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; ఇది ఏల ధర్మనందనుపయిన్+ఆగ్రహించెదు= ఇట్లా ధర్మరాజుపై ఆగ్రహిస్తావెందుకు?; హితంబు+అగు కార్యమె?= మేలుకలిగించే పనియా?; ఈ+మహీశు= ఈ రాజును; నీవు+అనిన్= నీవు యుద్ధంలో; తెగటార్చినట్లు+అయినన్= చంపితే గనుక; అర్జునుడు; ఉత్కట శోకరోషముల్ పెనఁగొనన్= అధిక దుఃఖ ఆవేశాలు పెనగొనగా; నిన్నున్+కౌరవులన్= నిన్నూ, కౌరవులనూ; పీనుఁగు పెంటలు చేయకుండునే?= శవాలుగా చేయకుండా ఉంటాడా?

తాత్పర్యం: శల్యుడది చూచి కర్ణుడితో ఇట్లా అన్నాడు: 'ధర్మరాజుపై నీ ఆగ్రహం చూపిస్తున్నావెందుకు? ఇది మేలు చేసే పనియా? అతడిని నీవు యుద్ధంలో వధిస్తే, శోక కోపావేశాలు పెనగొన్న అర్జునుడు నిన్ను, కౌరవులను సంహరించకుండా ఉంటాడా?'

విశేషం: ఆదినుండీ కర్ణుడి ప్రయత్నాలకు ఆటంకం కలిగించటమే శల్యుడు పనిగా పెట్టుకొన్నాడు.

తే. **ఇతఁడు దెగటాఱెనేనియు నేమి ఫలము । గలదు? నరుఁ బొలియించుట యలఘుశౌర్య;**
మది కురుక్షితిపాలున కఖిల రాజ్య । సిద్ధియును జేయు; నింక నా బుద్ధి వినుము. **390**

ప్రతిపదార్థం: ఇతఁడు తెగటాఱెను+ఏనియున్= ఇతడు చనిపోయినా; ఏమి ఫలముకలదు?= లాభమేమున్నది?; నరున్+ పొలియించుట అలఘుశౌర్యము= అర్జునుడిని వధించటమే గొప్ప పరాక్రమం; అది; కురుక్షితిపాలునకున్= దుర్యోధనుడికి; అఖిల రాజ్య సిద్ధియును చేయున్= సమస్త రాజ్యాన్ని లభింపచేస్తుంది; ఇంక నా బుద్ధి వినుము= ఇక నా మాట వినుము.

తాత్పర్యం: ధర్మరాజు మరణం వలన నీకు ఏమి లాభం? అర్జునుడిని వధించటమే నీ ఘనతకు నిదర్శనం. దానివలన దుర్యోధనుడికి సమస్తరాజ్యం దక్కుతుంది. ఇక నా మాట వినుము.

వ. **అదియునుం గాక.** **391**

తాత్పర్యం: అంతే కాక.

క. **వాఁడె కురుక్షితిపాలుఁడు । పోఁడిమి సెడి భీముచేతఁ బొదువఁబడియె న**
వ్వాఁడిమగని కడ్డము నీ । వేఁడిమి దక్కంగఁగలదె వేఱొకఁ డరయన్? **392**

ప్రతిపదార్థం: వాఁడె కురుక్షితిపాలుఁడు= అదిగో అతడే కురురాజు దుర్యోధనుడు; పోఁడిమి చెడి= ఒప్పు కోల్పోయి; భీముచేతన్= భీముడిచేత; పొదువన్+పడియెన్= తాకబడినాడు; ఆ+వాఁడిమగనికిన్+అడ్డము= ఆ మేటివీరుడికి అడ్డు; నీ వేఁడిమి తక్కంగన్= నీ శౌర్యంతప్ప; వేఱొకఁడు+అరయన్= మరొకటి చూడగా; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: అదిగో! దుర్యోధనుడు ధైర్యహీనుడై భీముడిచేత చిక్కాడు. నీవు తప్ప వేరెవరు అతడిని ఎదుర్కొన గలరు?

క. **పవనసుతు చేత నా భూ ।ధవుఁ డీల్గినయేని నీవు ధర్మతనయునిం**
గవలన్ సమయించుట దలఁ । ప వృథాస్ఫురణంబు గాదె పరబలభేదీ!' **393**

ప్రతిపదార్థం: పరబలభేదీ!= శత్రుబలాన్ని ఖండించేవాడా (కర్ణా!); పవనసుతుచేతన్= భీముడిచేత; ఆ భూధవుఁడు+ఈల్గిన, ఏనిన్= దుర్యోధనుడు చచ్చినట్లయితే; నీవు; ధర్మతనయునిన్+కవలన్= ధర్మజ నకుల సహదేవులను; సమయించుట= వధించటం; తలఁపన్= చూడగా; వృథాస్ఫురణంబు కాదె?= వ్యర్థ పరాక్రమమే కాదా?

తాత్పర్యం: కర్ణా! దుర్యోధనుడు భీముడిచేత చనిపోయిన తరువాత, నీవు ధర్మజ, నకుల, సహదేవులను వధించినా వ్యర్థమే కదా!'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **అన విని యఱ్ఱెత్తి భవ । త్తనయుని దెసఁ జూచి వాయుతనయునిచే నా**
తని పొదువఁబడుట యేర్పడఁ । గని రాధాతనయుఁ డతని గావఁగఁ జనియెన్. 394

ప్రతిపదార్థం: అనన్+విని= శల్యుడనగా విని; అఱ్ఱు+ఎత్తి= తలఎత్తి; భవత్+తనయుని, దెసన్+చూచి= నీకుమారుడివైపు చూచి; వాయుతనయునిచేన్+ఆతని పొదువఁబడుట= భీముడు ఆక్రమింపబడటం; ఏర్పడన్+కని= స్పష్టంగా చూచి; రాధాతనయుఁడు= కర్ణుడు; అతనిన్+కావఁగన్+చనియెన్= అతడిని కాపాడటానికి వెళ్ళాడు.

తాత్పర్యం: శల్యుడి మాటలు విని, కర్ణుడు భీముడిచేత పొదువబడిన దుర్యోధనుడిని చూచి అతడిని కాపాడటానికి వెళ్ళాడు.

క. **చనుటయు నజాతశత్రుఁడు । దన శిబిరంబునకుఁ బిన్నతమ్ముని యరదం**
బున నతని నతని యన్నను । గొని చనియెను సత్వరముగఁ గురుకులముఖ్యా! 395

ప్రతిపదార్థం: కురుకుల ముఖ్యా!= ఓ ధృతరాష్ట్ర రాజా!; చనుటయున్= వెళ్ళగానే; అజాతశత్రుడు= ధర్మరాజు; పినతమ్ముని అరదంబునన్= సహదేవుడి రథంపై; అతనిన్+అతనిఅన్నను= అతడిని, అతని అన్నయైన నకులుడిని; తన శిబిరంబునకున్= తన శిబిరానికి; సత్వరంబుగన్= శీఘ్రంగా; కొని చనియెను= తీసికొని వెళ్ళాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! కర్ణుడు అటు వెళ్ళగానే ధర్మరాజు వెంటనే నకుల సహదేవులతో తన శిబిరం చేరుకొన్నాడు.

వ. **అని యిట్లు సంజయుండు ధృతరాష్ట్రునకు ధర్మనందను పలాయనం బెఱింగించె ననుటయు. 396**

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ విధంగా; సంజయుండు= సంజయుడు; ధృతరాష్ట్రునకున్= కురురాజుకు; ధర్మనందను పలాయనంబు= ధర్మరాజు పారిపోవటం; ఎఱింగించెన్+అనుటయున్= వివరించాడు అనగానే.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు పలాయనం గురించి సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్పాడని వైశంపాయనుడు అనగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. **మొదలిరాజు సభయముగ నిట్లు సమరంబు । దొలఁగి చనియె నట్టె; పెఱబలంబు**
దొరలు నిలిచి పోరు టరిది; యనంతర । వర్తనంబు విప్రవర్య! చెపుమ. 397

ప్రతిపదార్థం: విప్రవర్య!= వైశంపాయనా!; మొదలిరాజు= ధర్మరాజు; సభయముగన్= భయంతో; ఇట్లు సమరంబు తొలఁగి చనియెన్+అట్టె= ఇట్లా యుద్ధం వదలి వెళ్ళాడా; పెఱబలంబు దొరలు= ఇతరసేనలోని వీరులు; నిలిచిపోరుట+అరిది= స్థిరంగా నిలచి పోరటం అరుదు; అనంతర వర్తనంబు= తర్వాత జరిగింది; చెపుమ= చెప్పుము.

తాత్పర్యం: వైశంపాయనా! ధర్మరాజు భయంతో అట్లా యుద్ధభూమినుండి తొలగిపోయాడా? ఇతరసేనలోని వీరులు స్థిరంగా నిలిచి పోరాడటం కష్టం. జరిగినదంతా వివరించుము.

వ. **అని యడుగుటయు. 398**

తాత్పర్యం: అని జనమేజయుడు అడుగగా. (తరువాతి ఆశ్వాసంలోని రెండవవచనంతో అన్వయం.)

విశేషం: మహాభారతగాథను వైశంపాయనుడు జనమేజయుడికి వివరించి చెబుతున్నాడు.

ఆశ్వాసాంతము

చ. **అనిమిషవంద్యమాన! ఘనసాదరశీల సుధాయమాన! స**
త్త్వనలిన గంధరూప! విబుధ ద్విషదంతకర ప్రతాప సం
జనిత నిరస్తకామ! మునిసంఘ మహార్ణవ పూర్ణసోమ! వే
దనికర సంవిధేయ నిజతత్త్వ పరిష్క్రియ నిత్యనిష్క్రియా **399**

ప్రతిపదార్థం: అనిమిష వంద్యమాన!= దేవతలచే నమస్కరింపబడుతున్నవాడా!; ఘనసాదరశీల= గొప్ప ఆదర స్వభావంచేత; సుధాయమాన!= అమృతంవంటివాడా!; సత్త్వనలిన గంధరూప!= సత్త్వగుణమనెడి పద్మానికి పరిమళరూపమైనవాడా!; విబుధద్విషత్+అంతకర ప్రతాప!= దేవతల శత్రువులైన రాక్షసులను సంహరించే పరాక్రమవంతుడా!; సంజనిత నిరస్తకామ!= పుట్టిన నశించిన మన్మథుడు కలవాడా!; మునిసంఘ మహా+అర్ణవ= మునులసమూహం అనే గొప్ప సాగరానికి; పూర్ణసోమ!= నిండు చంద్రుడా!; వేదనికర సంవిధేయ= వేదసమూహములందు తెలియదగిన; నిజతత్త్వ పరిష్క్రియ!= స్వీయతత్త్వ పరిష్కారం కలవాడా; నిత్యనిష్క్రియా!= ఎట్టి వ్యాపారం లేనివాడా!

తాత్పర్యం: హరిహరనాథా! దేవతలందరికీ పూజనీయుడా!, భక్తులకు అమృతరూపుడా!, సత్త్వగుణ భరితుడా!, అయినా సమయం వచ్చినప్పుడు పరాక్రమించి రాక్షససంహారం కావించేవాడా!, కాముడి జనన నాశనకర్తా!, మునుల హృదయసాగరాన్ని ఉప్పొంగించే పూర్ణచంద్రుడా!, వేదాలలో నిరూపించబడిన నిజస్వరూపం కలవాడా! నిర్వ్యాపారుడా!

విశేషం: 'అనిమిష' శబ్దంచేత రెప్పపాటు విరామం కూడా లేకుండా - అనే ధ్వని ప్రతీయమానం అవుతుంది. 'సుధాయమాన' అనటంలో చల్లని చూపుతో కూడిన కరుణ, 'గంధరూప' అనటంలో ఎడబాయని సత్త్వగుణం వెల్లడవుతున్నాయి. హరిరూపంలో కాముని పుట్టుకకు కారకుడై, హరుని రూపంలో అతడిని నశింపజేశాడు కాబట్టి, హరిహరనాథుఁడు 'సంజనిత నిరస్తకాముడు.'

క. **ప్రమితి విదూరా! సుమన । స్సమితి సమారాధన ప్రసన్నాకారా!**
గమనా గమన నిరసనా! శమన దమన సాధ్యపరమ సారోల్లసనా! **400**

ప్రతిపదార్థం: ప్రమితి విదూరా!= ప్రమాణాలకు అందనివాడా; సుమనస్+సమితి సమారాధన= నిర్మలచిత్తులైన జ్ఞానుల దేవతలసమూహంయొక్క అర్చనలచేత; ప్రసన్న+ఆకారా!= సుప్రసన్నమగు ఆకారం గలవాడా!; గమన+ఆగమన నిరసనా!= వెళ్ళుట, వచ్చుట అనే క్రియలు లేనివాడా!; శమన దమన సాధ్య= శాంతిదాంతులచేత తెలియదగిన; పరమసార+ఉల్లసనా!= ఉత్తమజ్ఞాన వికాసం కలవాడా!.

తాత్పర్యం: హరిహరనాథా! లోకంలో, వివిధ ప్రమాణాలకు అతీతుడవైన వాడా! నిన్ను అర్చించే నిర్మలజ్ఞానులకు సుప్రసన్నుడవైనవాడా! గమనాగమనములు లేనివాడా! శాంతిదాంతులచేత తెలియదగిన తత్త్వం కలవాడా!

విశేషం: లోకంలోని వస్తువులను వివిధ ప్రమాణాలతో తూచినట్లు హరిహరనాథుడిని తూచలేము. ఆయన అన్నిటికీ అతీతుడు. సర్వవ్యాపకుడవటంచేత గమనాగమన వర్జితుడు.

మాలిని.

ద్విజపతి వృషభాంకోదీర్ణ! కారుణ్య పూర్ణా!
భజన నిరతరక్షా ప్రౌఢ! నిర్భేదరూఢా!
గజదురిత సముత్సేకఘ్న! హృత్పద్మనిఘ్నా!
యజన విధి ఫలత్వవ్యాప్త! నిత్య ప్రదీప్తా! **401**

ప్రతిపదార్థం: ద్విజపతి వృషభాంక+ఉదీర్ణ!= గరుడ వృషభవాహనాలతో కూడిన శ్రేష్ఠుడా!; కారుణ్యపూర్ణా!= కరుణాభావంతో నిండినవాడా!; భజన నిరతరక్షాప్రౌఢ!= భక్తులను ఎల్లప్పుడు కాపాడటంలో ప్రావీణ్యం కలవాడా!; నిర్భేదరూఢా= భేదంలేకపోవటంచేత ప్రసిద్ధుడా!; గజదురితసముత్సేకఘ్న!= ఏనుగుయొక్క దుఃఖాతిశయాన్ని నశింపజేసినవాడా!; హృద్+పద్మనిఘ్నా!= హృదయ కమలంలో ఇమిడేవాడా!; యజనవిధి ఫలత్వవ్యాప్త!= యజ్ఞకర్మమునకు ఫలంగా స్వరూపం పొందినవాడా!; నిత్యప్రదీప్తా!= నిత్య తేజోరూపుడా!

తాత్పర్యం: హరిగా గరుడ వాహనంచేత, హరుడిగా వృషభ వాహనంచేత ప్రసిద్ధమైనవాడా! హరిహరనాథా! ఆర్తులపట్ల కరుణామూర్తివి, నిరంతర భక్తరక్షకుడవు. భేదరహితుడవు. గజనాథుడి బాధను హరిరూపంలో, గజాసురుడి దురితాన్ని హరుడి రూపంలో నశింపజేసినవాడా! సర్వవ్యాపకుడవై హృదయకోశంలో నిలిచేవాడా! యజ్ఞఫలస్వరూపుడా! నిత్య తేజోరూపుడా!

విశేషం: పై మూడు పద్యాలూ తిక్కన కృతినాథుడైన హరిహరనాథుడి స్తుతులు. ఆశ్వాసాంతంలో కృతిపతిని స్తుతించే పద్యాలు రచించటం ప్రాచీనకవి సంప్రదాయం. మొదటి పద్యంలో వృత్త వైవిధ్యం పాటించి మిగిలిన రెండూ వరుసగా కందం, మాలిని చందస్సులలో వ్రాయటం తిక్కన అవలంబించిన పద్ధతి.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున కర్ణపర్వంబునందు ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఉభయ కవిమిత్రుడూ, కొమ్మనామాత్య పుత్రుడూ, పండితులను పూజించేవాడూ (పండితులచేత పూజించబడి ప్రకాశించేవాడూ) అయిన తిక్కన సోమయాజి రచించిన మహాభారతంలోని కర్ణపర్వ ద్వితీయాశ్వాసం ఇది.

మహాభారతంలో కర్ణపర్వంలోని ద్వితీయాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

కర్ణపర్వము - తృతీయాశ్వాసము

శ్రీమచ్చరణాంబుజ యుగ । ళీ మధుమూర్తి, ప్రభావిలీన విమల చే
తోమత్తభృంగ, భక్తజ । నామృత సరసీస్వరూప! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీమత్= (సర్వ)సంపదలు గల శుభాలకు మూలమైన; చరణ+అంబుజ= పాదములనెడి పద్మాల; యుగళీ= జతయందున్న; మధు= తేనెయొక్క (కృపారసముయొక్క); మూర్తి= రూపంగల; ప్రభా= కాంతియందు; విలీన= పూర్తిగ మునిగిన (బాహ్యస్ఫురణ లేక); విమలచేతః= మాలిన్యంచేత చిత్తముగల (బాహ్యస్ఫురణయే మాలిన్యం. అనగా వేరు చింత లేక భగవంతుడికి పూర్తిగ అర్పితమైన మనస్సులు గల); మత్తభృంగ= పారవశ్యం పొందిన తుమ్మెదలనెడు (మేలుజాతి తుమ్మెదలని చెప్పవలెను. మత్తగజముల వలె); భక్తజన= భక్తులకు; అమృత సరసీ స్వరూప!= మోక్షపు కొలను రూపం కలవాడా!; హరిహరనాథా!= ఓ హరిహరనాథా!

తాత్పర్యం: అన్ని సంపదలకు ఆకరములైన నీ పాద పంకజాలలోని (కృప అనెడు) తేనెరూపు మహిమలో (ఏకాగ్రంగా) పూర్తిగా మునిగిన నిర్మలచిత్తులైన మేలు తుమ్మెదలనెడి భక్తజనులకు మోక్షప్రద స్వరూపుడా! హరిహరనాథా!

విశేషం: అలం: రూపకం.

కర్ణవిజృంభణము (సం. 8-66-33)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు కర్ణుండు గౌంతేయాగ్రజు విడిచి, దుర్యోధన సంరక్షణంబునకుం జనుటవిని, ధృతరాష్ట్రుండు దన మనంబున. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ హరిహరనాథా!; వైశంపాయనుండు; జనమేజయునకున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; అట్లు= ఆ విధంగా; కర్ణుండు; కౌంతేయ+అగ్రజున్= ధర్మరాజును; విడిచి= వదలి; దుర్యోధన= దుర్యోధనుడియొక్క; సంరక్షణంబునకున్= భద్రతకొరకై; చనుట= వెళ్ళటం; విని; ధృతరాష్ట్రుండు; తన మనంబునన్= తన మనసులో.

తాత్పర్యం: దేవా! వైశంపాయనుండు జనమేజయుడితో ఇట్లా అన్నాడు: కర్ణుడు కుంతీపుత్రులలో మొదటివాడిని (ధర్మరాజును) వదలి దుర్యోధనుడిని కాపాడటానికి వెళ్ళాడని విని, ధృతరాష్ట్రుడు తన మనస్సులో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'అనిలజునకుఁ జాలఁడె నా । తనయుఁడు? మోసంబుగాక ధర్మజుఁ డ ట్ల
బ్బినఁ బో నిచ్చుట రాధా । తనయునకున్ బుద్ధి యగునె? తప్పెం దప్పెన్!' 3

ప్రతిపదార్థం: అనిలజునకున్= వాయువునకు పుట్టిన భీముడికి!; నాతనయుఁడు= నా కుమారుడు; చాలఁడె?= సమానుడు కాడా?; ధర్మజుఁడు= ధర్మరాజు; అట్లు+అబ్బినన్= ఆ విధంగా దొరికినపుడు; పోనిచ్చుట= వదలిపెట్టటం; రాధాతనయునకున్= రాధాపుత్రుడైన కర్ణుడికి; బుద్ధి యగునె?= వివేకమగునా?; మోసంబు గాక!= ఇది మోసంగాక (ఏమగును); తప్పెన్ తప్పెన్= ధర్మం తప్పాడు.

తాత్పర్యం: వాయుపుత్రుడికి నా కుమారుడు తీసిపోయాడా? ధర్మరాజు అట్లా దొరికినప్పుడు వదలిపెట్టటం రాధేయుడికి తగిఉన్నదా? చూస్తే ఇదంతా నమ్మకద్రోహంగాక ఏమౌతుంది? ఇంతకు అతడు ధర్మం ముమ్మాటికి తప్పాడు. చేతికి చిక్కిన అవకాశం తప్పిపోయింది.

వ. **అని వగచి, 'యుధిష్ఠిరుండు సనినపిదప నెత్తెఱంగున సంగరంబు సెల్లె?' నని యడిగిన, సంజయుం డతనికి ట్లనియె; నట్లు సని యా ధర్మతనయుండు రథావతరణంబు సేసి శిబిరంబు ప్రవేశించి, సెజ్జ నొడలు సేర్చి, నాటియున్న యమ్ములు పెఱికించుకొని, హృదయంబున నమ్మెయి నున్న పరిభవంబు పీడ యొనర్ప, విషాద వివర్ణవదనుం డగుచుఁ గవలం గనుంగొని- 'మీరు సమీరనందనుకడకుం జనుం' డని చెప్పె., నటమున్న నకులుం డొక్కయరదం బాయితంబు సేసికొనియుండుట, నయ్యిరువురుఁ ద్వరితగతిం జని, యంబుదంబు చందంబున గర్జిల్లుచుఁ గౌరవులతోడం గయ్యంబు సేయుచున్న భీమసేనుఁ జేరం జని, యవష్టంభ విజృంభణంబునం బొలిచి; రంత నప్పాండవాగ్రజు తెఱం గేమియు నెఱుంగక నరుండు ద్రౌణితోడ భరంపడి రణం బొనర్చుచుండి.** **4**

ప్రతిపదార్థం: అని వగచి= అని దుఃఖించి; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; చనిన పిదపన్= వెళ్ళిపోయిన తరువాత; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; సంగరంబు= యుద్ధం; చెల్లెన్?= సాగింది?; అని, అడిగనన్= అని అడుగగా; సంజయుండు ఆతనికిన్ ఇట్లు+ అనియెన్; ఆ ధర్మతనయుండు= ఆ ధర్మజుడు; రథ+అవతరణంబు+చేసి= రథం దిగి; శిబిరంబు= దండు విడిది చేసే చోటు; ప్రవేశించి; సెజ్జన్= పడకయందు; ఒడలు+చేర్చి= దేహాన్ని ఆనించి; నాటి ఉన్న అమ్ములన్= శరీరంలో గుచ్చుకొని ఉన్న బాణాలను; పెఱికించుకొని= తీయించుకొని; హృదయంబునన్= మనస్సులో; ఆ+మెయిన్+ఉన్న= ఆ విధంగా నెలకొని ఉన్న; పరిభవంబు= అవమానము; పీడ ఒనర్పన్= బాధిస్తూ ఉండగా; విషాద= దుఃఖంవలన; వివర్ణ= రంగుమారిన- కాంతిహీనమైన; వదనుండు+అగుచున్= ముఖం కలవాడై; కవలన్= జోడుగ పుట్టిన నకుల సహదేవులను (అమడలు); కనుంగొని= చూచి; మీరు; సమీర నందనుకడకున్= వాయుపుత్రుడైన భీముడి దగ్గరకు; చనుండని చెప్పెన్= వెళ్ళండని చెప్పాడు; అటమున్న= అంతకుముందే; నకులుండు ఒక్క; అరదంబు= రథమును; ఆయితంబు= సిద్ధం చేసికొని; ఉండుటన్= ఉండటం వలన; ఆ ఇరువురున్= ఆ యిద్దరు; త్వరిత గతిన్= వేగంగా; చని= పోయినవారై; అంబుదంబు చందంబునన్= నీరిచ్చు మబ్బువలె; గర్జిల్లుచున్= ఉరుముచు; కౌరవులతోడన్ తలపడి; కయ్యంబు చేయుచున్న= యుద్ధం చేస్తున్న; భీమసేనున్= భీముడిని; చేరన్+చని= సమీపించి; అవష్టంభ= గర్వముయొక్క; విజృంభణంబునన్= అతిశయంతో (చెలరేగి); పొలిచిరి= ఒప్పారారు; అంతన్; ఆ+పాండవ+అగ్రజు= ఆ పాండవులలో మొదటివాడైన (ధర్మరాజు) యొక్క; తెఱంగు= పరిస్థితి; ఏమియున్ ఎఱుంగక; నరుండు= అర్జునుడు; ద్రౌణితోడన్= ద్రోణాచార్యుడి పుత్రుడైన అశ్వత్థామతో; భరంపడి= ప్రయాసతో; రణంబు+ఒనర్చుచుండి= యుద్ధం చేస్తూ ఉండగా.

తాత్పర్యం: ఇట్లా చింతించి, 'ధర్మరాజు వెళ్ళిన తర్వాత ఏ విధంగా యుద్ధం సాగింది?' అని, ధృతరాష్ట్రుడు అడుగగా, సంజయుడు ఆయనతో ఇట్లా అన్నాడు: 'ఆ ధర్మరాజు ఆ విధంగా బయలుదేరిపోయి, తేరు దిగి,

శిబిరం చేరి, పడకమీద దేహాన్ని వాల్చి, ఒంటికి గుచ్చుకొన్న బాణాలను బయటకు లాగివేయించికొన్నాడు. కాని, మనస్సున అనుభవించిన ఆ అవమానం పీడిస్తూనే ఉన్నది. ఆ పరితాపం ఆయన దేహకాంతిని వెలవెల బారించగా, నకుల సహదేవులను చూచి, 'మీరు వాయుపుత్రుడున్న చోటికి పొండి' అని చెప్పాడు. దానికి ముందే నకులుడు రథం సిద్ధం చేసి పెట్టుకొని ఉన్నాడు. వెంటనే ఆ ఇద్దరూ దానినెక్కి త్వరత్వరగా పోయారు. అప్పుడక్కడ, వర్షించే మేఘంవలె ఉరుముతూ కౌరవులతో యుద్ధం చేస్తున్న భీముడిని సమీపించారు. గర్వాతిశయంతో ఒప్పారారు. ఆ తరువాత, పాండవులలో పెద్దవాడి పరిస్థితి ఏమీ తెలియక నరుడు అశ్వత్థామతో ప్రయాసపడి యుద్ధం చేస్తున్నాడు.

విశేషం: అంబుదంబు చందంబున - అలంకారం. ఉపమ.

క. నెఱి దగఁ దేజితమై, గమి । మెఱుఁగు లడరు నారసమున మిక్కిలివడి నే
డ్తెఱ మెఱయ నురము నొంచిన । నుఱ కవ్విప్రుండు వైచె నుగ్రంపు గదన్. 5

ప్రతిపదార్థం: నెఱిన్= ఉత్సాహంతో; తగన్+తేజితమై= తగినవిధంగా పదును ఎక్కించబడి ఉన్న; గమి మెఱుఁగులు= కాంతుల సమూహం; అడరు= వ్యాపింపజేస్తున్న; నారసమునన్= ఇనుప బాణంతో; ఏడ్తెఱ మెఱయన్= పరాక్రమం అందగించగా; మిక్కిలి వడిన్= అత్యంత వేగంతో; ఉరము= రొమ్మును; నొంచినన్= (అర్జునుడు) బాధించగా; ఉఱక= లెక్కచేయక; ఆ+ విప్రుండు= ఆ బ్రాహ్మణుడు - అశ్వత్థామ; ఉగ్రంపు గదను= భయంకరమైన గదను; వైచెన్= విసిరివేశాడు.

తాత్పర్యం: అర్జునుడు తగినవిధంగా పదును చేయబడిన ఇనుపబాణాన్ని లాఘవం సొంపారగా అత్యంత వేగంగా మెరుగులు గ్రక్కేటట్లు ప్రయోగించి అశ్వత్థామ ఎదను బాధపెట్టగా, ఆ బ్రాహ్మణుడు గణింపక భయంకరమైన గదను అర్జునుడిపై విసిరాడు.

వ. వైచిన నవ్వీరుండు. 6

తాత్పర్యం: వేయగా ఆ వీరుడు (తరువాతి పద్యంతో అన్వయం).

చ. అది దునుమాడి, మేనఁ బదియమ్ములు గ్రమ్మఱఁ గ్రుచ్చి, సూతు బె
ట్టిద మగు కోలఁ గూల్చినఁ, గడింది మగంటిమి దాన రథ్య సం
పదయును నూలుకొల్పికొని పార్థునిఁ గృష్ణుని నొంచె విస్మయం
బొదవఁగ దేవకోటికి నృపోత్తమ! యగ్గురుపుత్రుఁ డుగ్రుఁ డై. 7

ప్రతిపదార్థం: నృపోత్తమ!= రాజశ్రేష్ఠా!; అది= దానిని; తునుమాడి= ఖండించి; క్రమ్మఱన్= మరల; మేనన్= శరీరంలో; పది అమ్ములన్= పది బాణాలను; క్రుచ్చి= చొప్పించి; సూతున్= రథసారథిని; బెట్టిదము+అగు= క్రూరమైన (పదునైన); కోలన్= బాణంతో; కూల్చినన్= చంపగా; ఆ+గురు పుత్రుఁడు= కౌరవులకు శస్త్రగురువైన ద్రోణుడి కుమారుడు; ఉగ్రుఁడు+ఐ= కోపోద్దీపితుడై; కడింది= సహింపశక్యంగాని; మగంటిమిన్= మగతనంతో (శౌర్యముతో); తాను+అ= తానే స్వయంగా; రథ్యసంపదయును= అశ్వ బలమును; నూలుకొల్పికొని= సమకూర్చుకొని; దేవకోటికిన్= దేవతల సమూహానికి; విస్మయంబు+ ఒదవఁగన్= ఆశ్చర్యం కలుగగా; పార్థునిన్= అర్జునుడిని; కృష్ణునిన్; నొంచెన్= బాధించాడు.

తాత్పర్యం: రాజశ్రేష్ఠా! అర్జునుడు దానిని వాడి అయిన బాణంతో ముక్కలుగా చేసి, ఇంకా పదిబాణాలు అశ్వత్థామ శరీరంలో గ్రుచ్చుకొనేటట్లు చేశాడు. సారథినొక బాణంతో హతమార్చాడు. అప్పుడు అశ్వత్థామ పట్టరాని కోపంతో, శత్రువు సహించరానంత పరాక్రమంతో తానే స్వయంగా అశ్వబలాన్ని సమకూర్చుకొని, చూస్తున్న దేవతలకు ఆశ్చర్యం కలిగేటట్లుగా అర్జునుని, శ్రీకృష్ణుని అలయింపజేశాడు.

వ. అ ట్లద్భుతవిక్రమంబున నశ్వత్థామ విజృంభించిన సహింపక; 8

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; అద్భుత= ఆశ్చర్యకరమైన; విక్రమంబున= పరాక్రమంతో; అశ్వత్థామ; విజృంభించిన= చెలరేగగా; సహింపక= ఓర్చుకొనలేక.

తాత్పర్యం: గురుపుత్రుడు ఆ విధంగా ఆశ్చర్యకరమైన శౌర్యంతో చెలరేగగా, అది సహించలేక అర్జునుడు- (తరువాతి పద్యంతో అన్వయం).

చ. హయములు పగ్గముల్ వెడఁదయమ్మున నుగ్గుగఁ గ్రీడి యేయుడున్
రయమున నీడ్చెఁ దే రటు దురంబునకుం దొలఁగంగ; నెంతయున్
భయమున నీమొనల్ గలఁగి పాఱె; నరేశ్వర! వారిసైన్యసం
చయ మెగవన్ మహీతలము సంభృతకంపము గాఁగ నల్గడన్. 9

ప్రతిపదార్థం: క్రీడి= అర్జునుడు; వెడఁద అమ్మునన్= పెద్దదైన బాణంతో; పగ్గముల్ నుగ్గుగన్= పగ్గాలు తునాతునకలయ్యేటట్లుగా; ఏయుడున్= కొట్టగా; హయములు= గుర్రాలు; తేరు= రథమును; అటు= ఆ విధంగా; దురంబునకున్= యుద్ధమునకు; తొలఁగంగన్= దూరమైపోయేటట్లుగా; రయమునన్= త్వరగా; ఈడ్చెన్= లాగుకొనిపోయాయి; నీ మొనల్= నీ సైన్యాలు; ఎంతయున్, భయమునన్= ఎంతో భయంతో; కలఁగి పాఱెన్= కలవరమొంది పరుగెత్తిపోయాయి; (ఆ తరువాత) వారి; సైన్య, సంచయము= భటులగుంపులు; మహీతలము= భూప్రదేశం; నల్గడన్= నాలుగు దిక్కులా; సంభృత కంపము కాఁగన్= పొందిన కంపము గలది కాగా; ఎగవన్= చుట్టుపక్కలంతా అలముకొనగా (దీనివలననే ఆ భూకంపం).

తాత్పర్యం: అర్జునుడు వెడల్పు అయిన బాణంతో గుర్రాల పగ్గాలు తునాతునకలుగా చేయగా, వెంటనే అవి ఆ రథాన్ని యుద్ధానికి దూరంగా త్వరత్వరగా లాగుకొనిపోయాయి. కౌరవసైన్యం భీతిచెంది పారిపోయింది. ఇక వారి సైన్యాల జయోత్సాహం దిక్కులన్నీ ఆక్రమించుకొన్నది. ఈ భారంతో భూమి అంతా గడ గడ అదిరిపోయింది.

ఉ. పాఱినఁ జూచి, కౌరవ నృపాలుఁడు సూతతనూజుతోడ 'నీ
కాఱియ మద్బలంబునకుఁ గాఁ దగునే వివిధాస్త్ర సంపదన్
మీఱిన నీవె సూడఁగ? నమేయపరాక్రమ,! నీకుఁ బాండవు
ల్మాఱె తలంప, నీదగు బలంబును జేవయుఁ జూపు మిత్తఱిన్!' 10

ప్రతిపదార్థం: పాఱినన్ చూచి= ఇట్లు కౌరవసేన పలాయనం కావడం చూచి; కౌరవ నృపాలుఁడు= కౌరవరాజు దుర్యోధనుడు; సూత తనూజుతోడన్= రథం నడిపేవాడి కుమారుడగు కర్ణుడితో (ఈ రథం నడిపేవాడి పేరు అధిరథుడు); ఈ కాఱియ= ఈ యాతన, కళంకము; మత్+బలంబునకున్= నా సైన్యానికి; వివిధ+అస్త్ర సంపదన్= అనేక విధాలైన అస్త్రాల సమృద్ధి

చేత; మీఱిన= అతిశయించిన; నీవె చూడఁగన్= నీవు చూస్తుండగనే (నీ కండ్ల ఎదుటనే); కాన్+తగునె?= సంభవించదగునా?; అమేయ= మితిమీరిన; పరాక్రమ!= శరీర బలసామర్థ్యం కలవాడా!; తలంపన్= యోచించి చూడగా; నీకున్ పాండవులు= నీకు పాండవులు; మాఱె?= ఎదుర్కొన సమర్థులా?; ఇత్తఱిన్= ఈ సమయంలో; నీదగు= నీ దైన; బలంబును= బలమును; చేవయున్= సమర్థతను; చూపుము= ప్రదర్శించుము.

తాత్పర్యం: కౌరవసేన ఆ విధంగా వెనుదిరిగి పరుగెత్తిపోతుండగా చూచి కౌరవరాజు కర్ణుడితో ఇట్లా అన్నాడు: అనేక విధాలైన అస్త్ర సంపదతో అతిశయించినవాడవై ఉన్న నీవు చూస్తుండగానే నా సైన్యానికి ఇట్టి కళంకం రావటం తగి ఉన్నదా? నీ శౌర్య సంపదకు ఎల్లలు లేవు. యోచించి చూస్తే పాండవులు నీ కొక లెక్కా? ఇక ఈ సమయంలో నీ బాహుబలాన్ని, ధైర్యాన్ని చూపవయ్యా!

వ. అనిన విని, యబ్బలుమగండు మదోద్రేకంబున మద్రపతి నాలోకించి యిట్లనియె: 11

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విని; ఆ+బలుమగండు= ఆ గొప్పవీరుడు (కర్ణుడు); మద+ఉద్రేకంబునన్= గర్వాధిక్యంతో; మద్రపతిన్= మద్రదేశాధీశుడైన శల్యుడిని; ఆలోకించి= చూచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని కర్ణుడు మదాతిశయంతో శల్యుడిని చూచి ఇట్లా అన్నాడు:

చ. 'కనుఁగొను! మిప్డు డేను మురఘస్మరుఁ బార్థుని భీమసేనునిం
దునిమెద; నస్త్రసంపదయు దోర్విభవంబును శౌర్యసారము
న్జనులకు నెల్లఁ దెల్లముగ నాదగు పూనిక పార మెయ్దు; మే
దినిఁ గురునాథుఁ డొక్కఁడె యతిస్థిరసౌఖ్యత నేలునట్లుగన్.' 12

ప్రతిపదార్థం: ఇప్పుడు ఏను= ఇప్పుడు నేను; ముర ఘస్మరున్= మురుడనే వాడిని నాశనం చేసిన కృష్ణుడిని; పార్థునిన్= పృథ(కుంతి) కొడుకైన అర్జునుడిని; భీమసేనునిన్; అస్త్ర సంపదయున్= ఆయుధాల సమృద్ధి; దోస్+విభవంబును= భుజబలం యొక్క గొప్పతనం; శౌర్యసారమున్= శూరత్వపు నిగ్గు అయిన బలం; జనులకున్+ఎల్లన్= ప్రజలందరికి; తెల్లముగన్= తెలిసేటట్లు; తునిమెదన్= ముక్కలు ముక్కలుగ చేస్తాను; కనుఁగొనుము= చూడుము; మేదినిన్= ఈ భూమిపై; కురునాథుఁడు+ఒక్కఁడే= కౌరవరాజొక్కడే; అతిస్థిర సౌఖ్యతన్= అత్యంత శాశ్వతమైన సుఖసంపదతో; ఏలునట్లుగన్= పరిపాలించేటట్లు; నాదగు పూనిక= నా ఈ ప్రయత్నం; పారమెయ్దన్= (ఒడ్డు చేరుట) సఫలీకృతంగా నెరవేర్చుటే అని ప్రకటితమయ్యేటట్లు (వారినందరిని సంహరిస్తాను).

తాత్పర్యం: ఇకచూడుము! ఇప్పుడు నేను నా శస్త్రాస్త్రసంపద, భుజబల ప్రకాశనం, నా ప్రతాపంయొక్క నిగ్గు లోకులకెల్ల తెలిసేటట్లుగా మురారి అయిన కృష్ణుడిని, అర్జునుడిని, భీముడిని ఖండిస్తాను! దీనితో ఈ భూమిపై శాశ్వతమైన సుఖసౌభాగ్యాలతో ఒక్క కౌరవనాథుడే పరిపాలించేటట్లుగా చేయటమే నా ప్రయత్న సఫలత అని లోకవిదితం కాగలదు. (ఇది కర్ణుడి ధర్మదీక్ష).

వ. 'రథరథ్యగతులు నెఱయ మెఱయ వలయుం జుమ్మీ!' యని పలికి, విజయంబు వీక్షించి గుణంబు సారించి 'గాండీవంబు నీ కెదురే?' యని యగ్గించి, యప్పుడు పై పయి నురవడించు పరసైనికులం జే యెత్తి యదల్చి, భార్గవాస్త్రంబు ప్రయోగించిన నమ్మహనీయసాధనంబు. 13

ప్రతిపదార్థం: రథ రథ్య= తేరుకు పూన్చిన గుర్రాలయొక్క; గతులు= కదలికలు; నెఱయన్= అత్యంతం; మెఱయ వలయున్ చుమ్మీ!= తళుకొత్తవలెను సుమా!; అని పలికి; విజయంబు = విజయమనే తన ధనుస్సును; వీక్షించి= బాగా తేరిపారచూచి; గుణంబు సారించి= నారి లాగి; గాండీవంబు= అర్జునుడి ధనుస్సు; నీ కెదురే?= నీకు ప్రతియా?; అని; అగ్గించి= కొనియాడి; అప్పుడు= అదే సమయంలో; ఉత్సాహభరితులు+ఐ= ఉత్సాహంతో నిండినవారై; పైపయినురవడించు= మీదిమీదికి దూకుతున్న; పరసైనికులన్= శత్రుసైనికులను; చేయెత్తి; అదల్చి= బెదరించి; భార్గవ+అస్త్రంబు= పరశురాము డిచ్చిన అత్యంత మంత్రపూతమైన ఆయుధం; ప్రయోగించినన్; ఆ+మహనీయ సాధనము= ఆ మహిమోపేతమైన ఆయుధం.

తాత్పర్యం: 'రథగతులు, గుర్రాలగతులు మిక్కిలి ప్రకాశించాలి సుమా!' అని పలికి, విజయమనే తన విల్లును చూచి, అల్లెత్రాడును సారించి, 'గాండీవం నీకు సాటి రాదు' అని దానిని పొగడి, అదే సమయంలో ఉత్సాహంతో పైపైకి దూకుతున్న శత్రు సైనికులను చేయెత్తి బెదిరించి, భార్గవాస్త్రాన్ని ప్రయోగించగా, ఆ మహిమోపేతమైన ఆయుధం.

విశేషం: యుద్ధవీరులు తాము ఊదే శంఖాలకు; ఉపయోగించే శరాసనాదులకు పేర్లుబెట్టి కొనియాడటం ఒక వీరోచిత సంప్రదాయం. దాని ప్రకారమే కర్ణుడు తన ధనుస్సు 'విజయము'ను కొనియాడుతున్నాడు. ఈ పొగడ్త సంస్కృత భారతం (వావిళ్ల ప్రతి)లో లేదు. ఇది రసాత్మకమైన, తిక్కన మనస్సులో పుట్టిన పరిమళ సుమం. ఇంకొక రసవత్తర ఖండిక. ప్రాణం లేనిదానిని, ప్రాణమున్నదానివలెనే పలుకరించి మాట్లాడటం ఒక అలంకారం. దీనిని ఇంగ్లీషులో Pathetic Fallacy అంటారు (మిథ్యానుభూతి- భావాభాస). సారవంతమైన సోమయాజి మనస్సు దీనిని స్వయంగా సృష్టించినట్లున్నది. కర్ణుడి విజయం, అర్జునుడి గాండీవం సమానమైనవి. రెండును విశ్వకర్మ నిర్మితాలు. పరశురాముడే విజయమును కర్ణుడికిచ్చాడు (కర్ణ 1-233). పేరులో కాస్త వ్యత్యాసం - అమరకోశము కర్ణుడి విల్లు పేరు "కాలపృష్ఠ" మంటున్నది. వేణీసంహార నాటకములో (4. అంక) ఇదే పేరున్నది.

శా. **ఘోరానేకశరాకృతిం బరఁగి సంక్షోభంబు గావించుచుం,**
దేరుల్ ద్రుంగఁగ, వారణంబులు ధరం ద్రెళ్ళంగ, నశ్వాళి ను
గ్గై రక్తంబునఁ దేలఁగా, భటచయం బత్యంత చూర్ణీకృతా
కారత్వంబు భజింపఁ, గేళి సలిపెం గౌంతేయ సైన్యంబునన్. **14**

ప్రతిపదార్థం: ఘోర+అనేక శరాకృతిన్= భయంకరమైన అనేక బాణాలరూపంలో; పరఁగి= ఒప్పి; సంక్షోభంబు= అల్లకల్లోలం; కావించుచున్= చేస్తూ; తేరుల్= రథాలు; త్రుంగఁగన్= తుత్తునియలు కాగా; వారణంబులు= ఏనుగులు; ధరన్ త్రెళ్ళంగన్= భూమిపై పడగా; అశ్వ+ఆళి= గుర్రాలసమూహం; నుగ్గై= ముక్కలై; రక్తంబునన్+తేలఁగా= నెత్తురులో పైకి తేలగా; భటచయంబు= సైనికసమూహం; అత్యంత చూర్ణీకృత= మిక్కిలి పిండైపోయిన; ఆకారత్వంబు= రూపం; భజింపన్= పొందగా; కౌంతేయ సైన్యంబునన్= కుంతీపుత్రుల సైన్యంలో; కేళి సలిపెన్= చెర్లాటమాడింది.

తాత్పర్యం: కర్ణుడు ప్రయోగించిన భార్గవాస్త్రం భయంకరాలైన పలురూపాలలో వ్యాపించి, అల్లకల్లోలం చేసింది. దానితో రథాలు నుగ్గునూచైనవి. ఏనుగులు నేలకొరిగిపోయాయి. గుర్రాలగుంపు ముక్కలై నెత్తుటిమడుగులో తేలియాడుతున్నాయి. సైన్యం పిండి అయిపోయిన రూపమును పొందింది. ఇట్లా భార్గవాస్త్రం కుంతీపుత్రుల సైన్యంతో క్రీడించింది.

వ. ఇప్పరుసున భార్గవాస్త్ర బాధితంబై యప్పాండవ బలంబు వెఱచఱచి మరలి పఱచిన, మనమూఁకలు వెన్నడిం దఱుమ, నా సూతనందనుం డట్లేచి యార్చి యంటందాఁకి విశిఖశిఖలు నిగిడించుచుఁ, బొగ లేనిమంట పగిదిఁ బ్రదీప్తుం డయినఁ; దదుత్సాహంబున కోటువడి యా సైన్యంబును జనంబులు హాహాకారంబు లెసఁగ దీనదశం బొంది, ముకుంద పురందరనందనులం బేర్కొని యాక్రందించి; రట్టియెడ. 15

ప్రతిపదార్థం: ఈ+పరుసునన్= ఈ విధంగా; భార్గవ+అస్త్ర= భార్గవాస్త్రంచేత; బాధితంబు+ఐ= బాధించబడి; ఆ+పాండవ బలంబు= ఆ పాండవులసేన; వెఱచఱచి= భయపడి; పఱచినన్= పారిపోగా; మనమూఁకలు= మన సేనలు; వెన్నడిన్= వెంటబడి; తఱుమగా= పరుగెత్తిపోయేటట్లు తరుమగా; ఆ సూతనందనుండు= ఆ కర్ణుడు; అట్లు+ఏచి= ఆ విధంగా విజృంభించి; ఆర్చి= ఉత్సాహంతో కేకలుపెట్టి; అంటన్ తాఁకి= కలియబడేటట్లు సమీపించి; విశిఖ= బాణాల; శిఖలు= మంటలను; నిగిడించుచున్= వ్యాపింపజేస్తూ; పొగలేని మంట పగిది= పొగలేని మంటవలె; ప్రదీప్తుండు+అయినన్= మిక్కిలి వేడిమితో ప్రకాశిస్తున్న వాడుకాగా; తద్+ఉత్సాహంబునకున్= ఆ ఉత్సాహానికి; ఓటువడి= జంకి; ఆ సైన్యంబును; జనంబులు= చూస్తున్న ప్రజలు; హాహాకారంబులు+ఎసఁగన్= (సంభ్రమాశ్చర్యాలతో) కేకలు అతిశయించగా; దీన దశన్+పొంది= కనికరించదగిన దశలోపడి (పాండవసైన్యం); ముకుంద= కృష్ణుని; పురందర నందనులన్= ఇంద్రుడి పుత్రుడైన అర్జునుడిని; పేర్కొని= పేరుబెట్టి పిలిచి; ఆక్రందించిరి= ఏడ్చిరి; అట్టి ఎడన్= ఆ సమయంలో. (పొగలేని మంట= మంటలో ఉన్న కార్బన్ పొగరూపంలో క్షయమై పోగా, మంటకు వేడిమి ఎక్కువగుతుంది. ఇది సైన్సు విషయం.)

తాత్పర్యం: పైన చెప్పినట్లుగా భార్గవాస్త్రం చేత కష్టపెట్టబడిన పాండవసైన్యం భయపడి వెన్నుచూపి పరుగెత్తి పోతున్నది. అది చూచి కర్ణుడు ఉత్సాహంతో చెలరేగి, కేకలు పెట్టుతూ దెబ్బతాకుడు మేరలోకి పోయి, బాణాగ్ని జ్వాలలు ప్రసరింపజేస్తూ పొగలేని మంట మాదిరి వెలిగాడు. ఆ కర్ణుడి ఉత్సాహన్ని చూచి భయపడి ఆ సైన్యము, జనం కేకలు పెట్టసాగారు. ఆ దీనస్థితిలో ఇరుక్కొన్న పాండవసైన్యం కృష్ణార్జునులను పేరుపెట్టి పిలుస్తూ ఏడ్వసాగింది. ఆ పరిస్థితిలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఈ ఘట్టమంతా ఒక నాటకీయ ఫక్కీలో సాగుతున్నది. కథనపాండితి దృశ్యాలకు ప్రాణం పోసి పాఠకుడి ఎదుట నిలబెట్టుతున్నది. యుద్ధభీతికి సౌందర్యరేఖల సంతనపరచి హాయిని కూరుస్తున్నది. వీరరసానికి ఇది కొత్త తొడుగు, హావభావ వర్ణ, పదప్రయోగ ఔచిత్యం ఇందలి మెరుగులు.

ఉ. గాండివి శౌరి కిట్టులనుఁ: 'గర్ణునిఁ జూచితె? యేకవిక్రమో
ద్దండతఁ దెంపు సేసి పటుదర్పము సూపుచుఁ, దేఱి చూడ రా
కుండెడునట్లుగా నలుక నుగ్రత మండెడు; నిప్పు నేర్పుమై
నుండక యీసునం దొడరి, యోటమి దెచ్చికొనంగ నేటికిన్?' 16

ప్రతిపదార్థం: గాండివి= అర్జునుడు; శౌరికిన్= కృష్ణుడితో; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; కర్ణునిన్+చూచితె?= కర్ణుడిని చూచావా?; ఏక విక్రమ+ఉద్దండతన్= ఒక్క పరాక్రమాతిశయం చేతనే; తెంపు చేసి= తెగించి; పటుదర్పము= అతిశయమైన గర్వాన్ని; చూపుచున్; తేఱిచూడరాకుండెడునట్లుగాన్= కన్నెత్తి చూచుటకు సాధ్యం కానట్లుగా; అలుకన్+ఉగ్రతన్= కోపతీవ్రతతో; మండెడున్= మండిపోతున్నాడు; ఇప్డు; నేర్పుమైన్+ఉండక= సమయోచితమైన చాకచక్యంతో ప్రవర్తించకుండా; ఈసునన్= కోపంతో; తొడరి= సాహసించి ఎదుర్కొని; ఓటమిన్= ఓటమిని; తెచ్చుకొనంగన్+ఏటికిన్= తెచ్చుకొనటం ఎందుకు?

తాత్పర్యం: అర్జునుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు: 'కర్ణుడిని చూస్తున్నావుగదా! ఉన్న సాహసాన్నంతా ఒకటిగా చేర్చి, భీతిగొల్పేటట్లుగా తెగించి ఎక్కువైన బలాన్ని చూపుతున్నాడు. కన్నెత్తి చూడటానికి వీలుగానట్లుగా కోపపు పొంగుతో మండిపోతున్నాడు. ఇప్పుడు సమయానికి తగినట్లు తెలివిని ఉపయోగించకుండా కోపంతో యుద్ధానికి దిగి, వృథాగా అపజయాన్ని నెత్తికి తెచ్చిపెట్టుకోవటం ఎందుకు?

క. **'వచ్చిన మఱి గెల్వ గొనన్ । వచ్చునె? తనయొడలు గలుగ వైరుల గెలువన్**
వచ్చుం దఱి వచ్చిన; నది । మెచ్చు జయార్థులకు మరుదమిత్రధ్వంసీ!' 17

ప్రతిపదార్థం: మరుదమిత్ర ధ్వంసీ!= దేవతలకు శత్రువులైన రాక్షసులను నాశనం చేసినవాడా- కృష్ణా!; వచ్చినన్ మఱి= పైబడివచ్చినాడేపో; గెల్వకొనన్= విజయాన్ని సాధించగా; వచ్చునె?= సాధ్యమగునా?; తఱి వచ్చినన్= అనుకూలసమయం వచ్చినప్పుడు; తన ఒడలు కలుగన్= తన శరీరం ఉంటే (అంటే బ్రతికి ఉంటే); వైరులన్ గెలువవచ్చున్= శత్రువులను జయింపవచ్చును; జయార్థులకున్= జయం కోరేవారికి; అది= ఆ పద్ధతి; మెచ్చు= మెచ్చుకోదగినది.

తాత్పర్యం: దేవతా విరోధులైన రాక్షసులను ధ్వంసం చేసిన ఓ కృష్ణా! (ఇప్పుడితడు) దండెత్తి వస్తే జయాన్ని సాధించటం సాధ్యమా? ప్రాణం ఉంటే సమయం ఆసన్నమైనపుడు వైరులను జయించవచ్చును. జయం కాంక్షించేవారికి అది తగి ఉన్నది. (అనుకూల సమయమైన చేష్ట, ప్రశంసింపదగినది.)

విశేషం: యుద్ధాల్లో మూర్ఖ పరాక్రమం కంటె వివేక పరాక్రమమే విజయహేతువు.

తే. **'పట్టపగలింటి సూర్యుని పగిదిఁ గర్ణుఁ । డుగ్రమూర్తియై వెలుఁగుచు నున్నవాఁడు!**
మన రథం బిప్డు మాధవ, మరలనిమ్ము । బ్రదికియుండిన శుభములు వడయవచ్చు.' 18

ప్రతిపదార్థం: మాధవ!= కృష్ణా!; పట్టపగలింటి= మిట్టమధ్యాహ్న సమయంలోని; సూర్యుని; పగిదిన్= వలె; ఉగ్రమూర్తి+ఐ= మహా భయంకరుడై; కర్ణుఁడు; వెలుఁగుచున్+ఉన్నవాఁడు= మిరుమిట్లు గొలుపుతున్నాడు; ఇప్డు= ఇక; మన రథంబు= మన తేరును; మరలనిమ్ము= వెనుకకు త్రిప్పుము; బ్రతికి ఉండినన్= ప్రాణాలతో ఉంటే; సుఖములు; పడయవచ్చున్= పొందవచ్చు.

తాత్పర్యం: శ్రీకృష్ణా! అదిగో చూడుము. కర్ణుడు మధ్యందిన మార్తాండుడివలె తీక్ష్ణరూపుడై ప్రకాశిస్తున్నాడు. ఇక మన రథాన్ని వెనుకకు త్రిప్పుము. ప్రాణాలు మిగిలి ఉంటే సుఖాలు పొందవచ్చు.

విశేషం: అరివీర భయంకరుడైన సవ్యసాచి ఇట్లనటం పిరికితనం కాదు. సమయజ్ఞత. వీరానికి విచక్షణ ఉండటం అవసరమని గదా అనుభవజ్ఞుల మాట. ఈ పట్టున అర్జునుడు పరాభూతుడై ఉంటే భారతకథాదీపమే చల్లారిపోయిఉండేది.

వ. **అనిన విని, వాసుదేవుండు వడముడిదిక్కు విలోకించు నెడ, నతండు కర్ణునకు మార్కొని పరాక్రమించె. పాండవసైన్యంబు నిలువరించి, ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకి ద్రౌపదేయాదిరథికు లా రథికునిం దలపడఁ, దానును గౌరవులపయిం గడంగె; న ట్లమ్మేటిమగని యాటోపం బప్పటికి వైరినివారణంబునకుఁ జాలి యునికి యనుసంధించి, రాధేయుం డొరులతో డయ్యం బోరుటయుఁ, బార్థుండు 'డప్పి దీర్చుకొనుటయు మేలకాక' యని యూహించి, యమ్మురారి దే రక్కురుసేనాధిపతి సంగ్రామంబు సేయుచక్కటి కెడ గలుగం గొని చని,**

యన్నరునితో 'మన మశ్వత్థామతోడి పెనఁకువం జిక్కిన సమయంబున ధర్మనందనుండు సూతనందనున కగ్గమై యుండె; నాతం డతనియమ్ముల నొచ్చెనో యని తలంచెద. నయ్యవనీశు నవస్థ యెఱింగి, మఱి నీ వయ్యంగరాజు సమయింపం గల వాఁడ' వనుటయు. 19

ప్రతిపదార్థం: అనినన్ విని; వాసుదేవుండు= కృష్ణుడు; వడముడిదిక్కు= (శత్రువులకు తాపం కలిగించే) భీముడివైపు; విలోకించు ఎడన్= చూడగా; అతండు= భీముడు; కర్ణునకున్= కర్ణుడిని; మార్కొని= ఎదిరించి; పరాక్రమించెన్= విజృంభించాడు; పాండవ సైన్యంబును; నిలువరించి= పారిపోకుండా నిలిచి యుద్ధం చేసేటట్లు చేసి; ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకి; ద్రౌపదేయ+ఆది= ద్రౌపది కుమారులైన ఉపపాండవులు; ఆది= మొదలైన; రథికులు= రథమునెక్కి యుద్ధం చేసే యోధులు; ఆ రథికుని= ఆ కర్ణుడిని; తలపడన్= ఎదుర్కొనగా; తానును= భీముడు; కౌరవులపయిన్; కడంగెన్= నిలిచి ఎదుర్కొన్నాడు; ఆ మేటి మగని= మొనగాడైన ఆ శూరుడి; ఆటోపంబు= విజృంభణం; అప్పటికిన్= ఆ సమయానికి; వైరి నివారణంబునకున్= శత్రువును అడ్డగించి నిలపటానికి; చాలి ఉనికిన్= తగినంత సమర్థంగా ఉండటం చేత; అనుసంధించి= మనస్సుకు నచ్చజెప్పుకొని; రాధేయుండు; ఒరులతోన్= ఇతరులతో; డయ్య పోరుటయు= అలయింప జేయునట్లుగా యుద్ధము చేయుటను చూచి; పార్థుండు; డప్పిదీర్చుకొనుట మేలు+అ కాక+అని= ఇక దప్పిక దీర్చుకొనుటే మంచిపని అవుతుందని; ఊహించి= తలచి; ఆ+మురారి= ఆ కృష్ణుడు; తేరు= రథం; ఆ+కురుసేనాధిపతి= ఆ కర్ణుడు; సంగ్రామంబు చేయు= యుద్ధం చేస్తున్న; చక్కటికిన్= ప్రదేశానికి; ఎడ కలుగన్= దూరమయ్యేటట్లు; కొని చని= కొనిపోయి; ఆ+నరునితోన్= ఆ అర్జునుడితో- (ఇట్లనును); మనము; అశ్వత్థామతోడి; పెనఁకువన్= పోరులో; చిక్కిన సమయంబునన్= చిక్కుకొని ఉన్నపుడు; ధర్మనందనుండు; సూతనందనునకున్= కర్ణుడికి; అగ్గము+ఐ+ఉండెన్= వశమై యుండినాడు; అతండు= ఆ ధర్మజుడు; అతని+అమ్ములన్= ఆ కర్ణుడి బాణాలచే; నొచ్చెనో= బాధపడెనేమో; అని తలంచెదన్= అని భావిస్తాను; ఆ+అవనీశు= ఆ రాజుయొక్క; అవస్థన్+ ఎఱింగి= స్థితిని తెలిసికొని; మఱి; నీవు; ఆ+అంగరాజు= ఆ అంగదేశాధిపతి అయిన కర్ణుడిని; సమయింపన్+కలవాఁడవు= తుదముట్టింతువుగాని; అనుటయున్= అనగా.

తాత్పర్యం: ఇట్లు చెప్పిన అర్జునుడి మాటలు విని, కృష్ణుడు, భీముడివైపు చూచేసరికి, అప్పుడాయన కర్ణుడితో తలపడి చెలరేగి, పాండవసైన్యాన్ని పారిపోకుండా యుద్ధానికి పూనుకొనేటట్లు చేయగా, అప్పుడు ధృష్టద్యుమ్న, శిఖండి, సాత్యకీ ద్రౌపదేయాది యోధులు కర్ణుడిపైబడి బీరం చూపుతున్నారు. భీముడు కూడ ప్రతాపించి కౌరవులపై విజృంభించాడు. ఆ సమయానికి ఆ భీముడి విజృంభణం, విరోధులను ప్రతిఘటించటానికి తగినంతగా ఉన్నదని మనస్సులో కృష్ణుడు వితర్కించుకొన్నాడు. కర్ణుడు ఇతరులపై బడి, వారు అలసిపోయేటట్లు చేస్తున్నాడని గమనించాడు. 'ఇక, అర్జునుడు అలసట తీర్చుకొనటమే మేలు' అని ఊహించాడు. తమ రథాన్ని కర్ణుడున్న యుద్ధభూమి నుండి దూరంగా తోలుకొనిపోయాడు. ఆ తర్వాత- మురారి; 'మన అశ్వత్థామతో పోరాడుతున్న సమయంలో ధర్మజుడు కర్ణుడి చేతిలో చిక్కిఉన్నాడు. అతడు ధర్మజుడిని బాణాలతో బాధించాడేమో అని అనుకుంటున్నాను. మనం మొదట ఆ మహీపతి స్థితిని తెలిసికొనవలసి ఉన్నది. ఆ తరువాత అంగదేశాధిపతిఅయిన కర్ణుడిని సంహరించుదువు గాని' అనిన తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అన్న నొచ్చె నన్న యమ్మాట చిత్తంబు । గలఁప, నిజబలంబుఁ గలయఁ జూచి,
యన్నరేంద్రుఁ గాన కనిలనందను కడ । కేఁగి యడిగె; నతఁడు నిట్టు లనియె. 20

ప్రతిపదార్థం: అన్న నొచ్చెన్+అన్న= అన్న బాధపడినాడనిన; ఆ+మాట= ఆ మాట; చిత్తంబు కలఁపన్= మనస్సును కలతపెట్టగా; నిజబలంబున్= తన దండును; కలయన్+చూచి= ఎగాదిగా బాగా చూచి; ఆ+నరేంద్రున్+కానక= ఆ ధర్మరాజు కనబడకపోగా; అనిలనందను కడకున్+ఏఁగి= వాయుపుత్రుడైన భీముడివద్దకు వెళ్ళి; అడిగెన్= అడిగాడు; అతఁడు+ఇట్లు+అనియెన్= భీముడు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అన్న బాధపడినాడనే మాట మనస్సును కలతపెట్టగా అర్జునుడు, తన సైన్యాన్ని బాగా పరికించి చూచాడు. వారిలో ధర్మరాజు కనిపించనందున భీముడి దగ్గరకు పోయి అడుగగా, అత డిట్లా బదులు పలికాడు.

ఉ. 'కౌరవకోటి నేఁ బొదివి క్రందుగఁ గయ్యము సేయఁ, గర్ణుఁ డా
భూరమణున్ వడిం గదిసి భూరిశరంబులు మేన నింప, నొ
వ్వారుటయుం దొలంగె నతఁ, డాహవరంగమునందు లేఁడు; నీ
వారయు మింత కె ట్లగునొ? యచ్యుతుఁ డుండఁగ నట్టు లే లగున్?' 21

ప్రతిపదార్థం: కౌరవకోటిన్= కౌరవ భట సమూహాన్ని; ఏన్= నేను; పొదివి= తలపడి; క్రందుగన్= అతిశయంతో; కయ్యము చేయన్= యుద్ధం చేయగా; కర్ణుఁడు; ఆ భూరమణున్= ఆ రాజైన ధర్మజుడిని; వడిన్+కదిసి= వేగంగా పైకొని; భూరిశరంబులు= పెద్ద బాణాలు; మేనన్+నింపన్= శరీరంలో నిండేటట్లు చేయగా; నొవ్వు+ఆరుటయున్= బాధపడడంవలన; తొలంగెన్= వైదొలగిపోయాడు; అతఁడు= ఆయన; ఆహవరంగమునందులేఁడు= యుద్ధభూమిలో లేడు; ఇంతకున్= ఇంతకు; ఎట్లు+అగునొ?= ఏమైనదో?; నీవు+ఆరయుము= నీవు విచారించి తెలిసికొమ్ము; అచ్యుతుఁడు+ఉండఁగన్= కృష్ణుడు మన అండనుండగా; అట్టులు+ఏల?+అగున్?= అట్లా ఎందుకు జరుగుతుంది?

తాత్పర్యం: కౌరవసేనా సమూహాన్ని నేను చుట్టుముట్టి విజృంభించి పోరాడుతుండగా, కర్ణుడు ఆ రాజును ఎదుర్కొని పెద్ద పెద్ద బాణాలతో ఆయన శరీరమంతా నింపివేశాడు. ఆ దెబ్బలకు బాధపడటంచేత ఆతడు వైదొలగిపోయాడు. ఆయన ఇప్పుడు పొలికలనులో లేడు. ఇంతకు ఏమైందో నీవు విచారించి తెలిసికొమ్ము. కృష్ణుడు మన ప్రక్క నుండగా అట్లా ఎందుకు జరుగుతుంది?

వ. అనిన వివ్వచ్చుండు వృకోదరున కిట్లనియె. 22

తాత్పర్యం: అనగా విని అర్జునుడు భీముడితో ఇట్లా అన్నాడు:

క. 'క్రూరము లగు సూతసుతుని । నారాచము లొడలఁ బెక్కు నాటినఁ జేత
స్సారము సెడి శిబిరమునకు । నా రా జేఁగెనొకొ? యకట! యటు గా నోపున్. 23

ప్రతిపదార్థం: క్రూరములు+అగు= హింసించగలిగిన; సూత సుతుని= కర్ణుడి; నారాచములు= పూర్తిగా ఇనుముతో చేయబడిన అమ్ములు; పెక్కు= చాలా; ఒడలన్ నాటినన్= శరీరమునందు గ్రుచ్చుకొనగా; చేతస్+సారము చెడి= మనోధైర్యం పొడయి; ఆ రాజు; శిబిరమునకున్= దండు విడిదికి; ఏఁగెనొకొ!= చేరినాడా ఏమి?; అకట!= అయ్యో!; అటుగానోపున్!= అట్లే జరిగి ఉంటుందేమో?

తాత్పర్యం: బాధాకరమైన కర్ణుడి ఇనుపబాణాలు అనేకములు ఒంట నాటుకొనగా, రాజు మానసిక పటుత్వం చెడి శిబిరానికి పారిపోయాడేమో పాపం! అట్లే జరిగి ఉంటుంది.

క. 'ద్రోణాచార్యుని యుగ్రపు । బాణంబులు కోర్చి యతఁడు పడునంతకు న
క్షీణధృతి నసమ సమర । క్షోణి నిలిచి, కర్ణుచేతఁ గోల్పోయెఁ గదే!' 24

ప్రతిపదార్థం: ద్రోణాచార్యుని; ఉగ్రపు బాణంబులకున్= తీక్ష్ణమైన బాణాలకు; ఓర్చి= తట్టుకొని నిలబడి; అతఁడు= ద్రోణుడు; పడునంతకున్= చచ్చి నేలవడే వరకు; అక్షీణధృతిన్= తరుగని స్థిరత్వంతో; అసమ, సమర క్షోణిన్= సాటిలేని యుద్ధభూమిలో; నిలిచి= నిలబడి; (చివరకు) కర్ణుచేతన్= కర్ణుడిచేత; కోల్పోయెన్ కదే= ఓడిపోయాడు కదా!.

తాత్పర్యం: 'ద్రోణాచార్యుడు ప్రయోగించిన పదునైన బాణాలకు ఓర్చుకొని, ఆ ద్రోణుడు నేలకొరిగేవరకు యుద్ధభూమిలో స్థిరంగా నిలబడి ఎదిరించి, తుట్టతుదకు ధర్మరాజు కర్ణుడి చేతిలో ఓడిపోవలసి వచ్చిందే!

వ. అని పలికి, యనిలనందను నాలోకించి యన్నరుం 'డా నృపాలుతెఱం గెఱుంగుటకు నీ వరుగు; మేను సేనమొగంబున నిలిచెద' ననిన విని, యవ్వీరుం 'డవ్విధంపు నడవడి నీకుఁ జనుం గాని, జనంబులు న న్నయినం బోరి కోహటించి పోయె నని యాడుదు'రని చెప్పిన, నప్పార్థుండు. 25

ప్రతిపదార్థం: అని పలికి; అనిల నందనున్= భీముడిని; ఆలోకించి= చూచి; ఆ+నరుండు= ఆ అర్జునుడు (అన్నాడు); ఆ నృపాలు తెఱంగు= ఆ రాజు విధము; ఎఱుంగుటకున్= తెలుసుకోవడానికి; నీవు+అరుగుము; నేను; సేనమొగంబునన్= సైన్యానికి మొదట; నిలిచెదన్; అనిన విని; ఆ+వీరుండు= ఆ శూరుడైన భీముడు; ఆ+విధంపు నడవడి= ఆ రీతి ప్రవర్తన; నీకున్+చనున్+కాని= నీకు తగి ఉన్నదిగాని (నాకు సరిపోదనుట); జనంబులు= ప్రజలు; నన్నుయినన్= నన్ను మాత్రం; పోరికిన్= యుద్ధంలో; ఓహటించి= ఓడిపోయి; పోయెను+అని= పారిపోయెనని; ఆడుదురు= మాట్లాడుతారు; అని; చెప్పినన్; ఆ+పార్థుండు= ఆ అర్జునుడు (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: అని పలికి అర్జునుడు భీముడితో 'ధర్మరాజు స్థితిని తెలిసికొనటానికి నీవు వెళ్ళుము. నేను సేన మొదట నిలిచి పోరాడుతాను' అని అన్నాడు. ఆ మాటలు విని భీముడు 'ఈ విధమైన నడవడి నీకు చెల్లుతుంది కాని నాకు చెల్లదు. నేనట్లా పోతే జనులు యుద్ధం చేయలేక పోయాడని అంటారు' అని అన్నాడు. అప్పుడు అర్జునుడు.

విశేషం: భీముడిది ఆటుపోటులేని బీరము, రొమ్ము చూపి ఎదిరిని మార్కొంటాడు. సమయానుకూలమైన విక్రమం కాదాయనది. కలిసివచ్చి అన్నిటా గెలుస్తున్నాడు. పగ సాధింపులో నీతులు వల్లె వేయడు. పాండవులను అన్ని క్లిష్టసమయాలలో ఈయన తెంపే కాపాడినది. మెత్తదనం చూపడం పిరికితనమనేది ఈయన అభిప్రాయం.

ఆ. 'సరభసముగ నన్ను సంశప్తకులు వీరె! తొడరుచున్నవారు, దొలఁగి నాకు
నరుగ నెట్లు వచ్చు?' నని చూపె నతనికి; । నపుడు గడఁగి వచ్చు నబ్బలముల. 26

ప్రతిపదార్థం: సరభసముగన్= ఉద్రేకంతో కూడిన ఆటోపంతో; సంశప్తకులు= (యుద్ధంలో పెడమొగం పెట్టమని ఒట్టుపెట్టుకొన్న శూరులు); నన్నున్; తొడరుచున్నవారు= మార్కొంటున్నారు; తొలఁగి= వీరికి దూరంగా; అరుగుట= పోవుట; నాకున్ ఎట్లువచ్చున్?= నాకు ఏ విధంగా సరిపోతుంది?; అని; అపుడు; కడఁగి= అతిశయించి; వచ్చు= పైకి వచ్చే; ఆ+బలములన్= నా సైన్యాన్ని; చూపెన్= చూపించాడు.

తాత్పర్యం: 'అదిగో చూడుము! సంశప్తకులు ఆటోపంతో నాపై పడుతున్నారు. ఈ పట్టున వైదొలగిపోవటం నాకెట్లా వీలుపడుతుంది?' అని పూనికతో తనపైబడవస్తున్న సైన్యాలను ఆయనకు చూపాడు.

క. చూపుటయు, నగ్గలం బగు । నేపునఁ గిమ్మీరవైరి 'యేన కలఁచెదన్
రూపు సెడఁగ నిమ్మొనలను । భూపతి నరయంగ నీవ పా' మ్మనియె నృపా! 27

ప్రతిపదార్థం: నృపా!= రాజా! ధృతరాష్ట్రా!; చూపుటయున్= చూపిన తరువాత; అగ్గలంబు+అగు= అతిశయించిన; ఏపునన్= గర్వంతో; కిమ్మీరవైరి= కిమ్మీరుడిని చంపిన భీముడు; ఈ+మొనలను= ఈ సైన్యాలను; రూపు చెడఁగన్= రూపుమాపేటట్లు; ఏను+అ కలఁచెదన్= నేనే కల్లోలపరుస్తాను; భూపతిన్+అరయంగన్= ధర్మరాజును విచారించటానికి; నీవు+అ+పొమ్ము+ అనియెన్= నీవే పొమ్మన్నాడు.

తాత్పర్యం: చెలరేగి పైబడవస్తున్న సంశప్తక దళాలను చూపగానే భీముడుప్పొంగిన ఉత్సాహంతో 'ఈ దండును నే నొక్కడనే తుదముట్టిస్తాను, మన రాజు పరిస్థితి తెలిసికొనటానికి నీవే పొ'మ్మన్నాడు.

కృష్ణార్జునులు ధర్మరాజు సేమం బరయ నతని శిబిరంబునకుఁ బోవుట (సం. 8-45-64)

వ. అనిన, నట్ల కాక యని, యర్జునుం డచ్యుతు నాలోకించి 'యా మహీపాలుం గనునంతకు నామనంబు గలంగెడు; రథంబు రయంబునం బోవ ని'మ్మని పలుకుటయు, నతండు భీముం జూచి 'యేము మీయన్న సేమం బరయుట వలయుపని గావునం జనియెదము; నీవు కురుసైన్యంబుల జయించుట యరుదే? గెలుపు గొను'మని యగ్గించు తెఱంగున దీవన లిచ్చి, తురంగమంబులం ద్వరితగతి నడపె; నివ్విధంబున మాధవ ధనంజయులు సమరంబునకు సమీరనందనుం జాలించి, శిబిరంబున కరిగి ధర్మనందను మందిరంబు ప్రవేశించి, యేకతంబ శయ్యాతలంబున నున్న యన్నరపతిం గని, యాతండు గుశలి యయి యునికికి ముదంబు నొందుచుం, దదీయచరణంబులకుఁ బ్రణతులయి; రా ధరణీనాథుండు వారలు రాధేయు వధించి వచ్చిరకాఁ దలంచి డెందం బలర, మందస్మితంబుతో నభినందించి, వారల వదనంబులు వీక్షించి యి ట్లనియె: 28

ప్రతిపదార్థం: అనినన్; అట్లు+అ+కాక అని= అట్లే కానిమ్మని; అచ్యుతున్+ఆలోకించి= కృష్ణుడిని చూచి; ఆ మహీపాలున్= ఆ రాజును; కనునంతకున్= చూచునంతవరకు; నా మనంబు= నా మనస్సు; కలంగెడున్= కలతజెందుతుంది; రథంబును; రయంబునన్= వేగంగా పోనిమ్మని; పలుకుటయున్= చెప్పగా; అతండు= ఆ కృష్ణుడు; భీమున్+చూచి; ఏము= మేము; మీ అన్న సేమంబు= మీ అన్న క్షేమమును; అరయుట= తెలుసుకొనటం; వలయుపని కావునన్= చేయవలసిన పని కనుక; చనియెదము= వెళ్ళుతాము; నీవు కురుసైన్యంబుల జయించుట; అరుదే!= ఒక ఆశ్చర్యకరమైన విషయమా!; గెలుపు+కొనుము= జయం సంపాదించుము; అని అగ్గించు తెఱంగునన్= అని కొనియాడేవిధంగా; దీవనలు+ఇచ్చి= ఆశీర్వదించి; తురంగమంబులన్= గుర్రాలను; త్వరితగతిన్= వేగంగా; నడపెన్= నడిపెను; ఈ+విధంబునన్= ఇట్లు; మాధవ ధనంజయులు= కృష్ణార్జునులు; సమరంబునకున్= యుద్ధానికి; సమీరనందనున్= వాయుపుత్రుడిని; చాలించి= చాలినవానిగజేసి (అప్పగించి); శిబిరంబునకున్+అరిగి; ధర్మనందను మందిరంబు ప్రవేశించి= ధర్మనందనుడి మందిరం ప్రవేశించి; ఏకతంబ+అ= ఒంటరిగా; శయ్యాతలంబునన్+ఉన్న= పడకలో ఉన్న; ఆ నరపతిన్+కని= ఆ రాజును చూచి; ఆతండు; కుశలియై= క్షేమవంతుడై;

ఉనికికిన్= ఉండుటకు; ముదంబు నొందుచున్= సంతోషిస్తూ; తదీయ చరణంబులకున్= ఆయన పాదాలకు; ప్రణతులు+ఐరి= నమస్కరించారు; ఆ ధరణీ నాథుండు= ఆ రాజు; వారలు= వారిద్దరు; రాధేయున్ వధించి= కర్ణుడిని చంపి; వచ్చిరి+అ+కాన్= వచ్చారని; తలంచి= భావించి; డెందంబు= మనస్సు; అలరన్= సంతోషించగా; మందస్మితముతోన్= చిరునవ్వుతో; అభినందించి= మెచ్చుకొని; వారల వదనంబులు= వారి ముఖాలను; వీక్షించి= చూచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ మాట విని 'సరే' అని అర్జునుడు శ్రీకృష్ణుడిని చూచి, 'ఆ ధర్మరాజును చూచేందుకు నా మనసు కలవరపడుతున్నది. రథాన్ని త్వరగా పోనిమ్ము' అని అన్నాడు. కృష్ణుడు భీముడిని చూచి 'మేము మీ అన్నగారి యోగక్షేమం తెలిసికొనవలెను. కాబట్టి వెళ్ళుతాము. నీవు కౌరవసైన్యాన్ని జయించటం పెద్ద విషయమా? గెలుపును సాధించు' మని ప్రశంసించినట్లుగ దీవెనలుకూడా ఇచ్చి, రథాశ్వాలను వేగంగా నడిపాడు. ఈ విధంగా కృష్ణార్జునులు యుద్ధనిర్వహణను భీముడిపై నుంచి శిబిరానికి వెళ్ళారు. ధర్మరాజు మందిరంలో ప్రవేశించారు. ఒంటరిగా శయ్యపై పరుండి ఉన్న ధర్మరాజును చూచారు. క్షేమంగా ఉన్నాడని తెలిసి సంతోషించారు. అతడి పాదాలకు నమస్కరించారు. ధర్మరాజు వారిరువురు కర్ణుడిని సంహరించి వచ్చారని భావించి, సంతోషించి, అభినందించి, వారలను చూచి ఇట్లా అన్నాడు:

మ. **'సుర లైనం జలమెత్తి కర్ణుని రణక్షోణిన్ జయింపంగ నే**
ర్తురె? యవ్వీరుఁడు జామదగ్న్య కలితాస్త్రుం; డిద్ధతేజంబునన్
దొర సప్తార్చికి, లావునం బవనుతోఁ దుల్యుండు; కల్యుండు సం
గర సంక్రీడలయందుఁ బేర్కొనఁ దగున్ గాంభీర్య ధైర్యంబులన్. **29**

ప్రతిపదార్థం: సురలు+ఐనన్= దేవతలైనను; చలము+ఎత్తి= కోపగించి; కర్ణునిన్; రణక్షోణిన్= యుద్ధభూమిలో; జయింపంగన్ నేర్తురె?= ఓడింప జాలియున్నారా?; ఆ+వీరుఁడు= ఆ శూరుడు; జామదగ్న్య, కలిత అస్త్రుండు= పరశురాముడి వలన అస్త్రాలు పొందినవాడు; ఇద్ధ తేజంబునన్= ఉగ్రమైన ప్రకాశంలో; సప్తార్చికిన్= అగ్నికి; దొర= సాటి; లావునన్= బలమునన్; పవనుతోన్+తుల్యుండు= వాయువుతో సమానుడు; సంగర క్రీడల+అందున్= యుద్ధక్రీడలలో; కల్యుండు= సమర్థుడు; గాంభీర్య= చలించని గుణమునందును; ధైర్యంబులన్= ధీరగుణంలోను; పేర్కొనన్+తగున్= చెప్పుకోదగును.

తాత్పర్యం: 'దేవతలైనా పగబట్టి యుద్ధభూమిలో కర్ణుని జయింపజాలుదురా? ఆ పరాక్రమవంతుడు పరశురాము డిచ్చిన అస్త్రాలు కలిగినవాడు; ప్రతాప తీక్ష్ణతలో అగ్నికి సాటియైనవాడు. బలంలో వాయుసమానుడు. యుద్ధక్రీడలలో సమర్థుడు, గాంభీర్య ధైర్య గుణాల విషయంలో చెప్పుకోదగినవాడు.

తే. **అట్టి బల్లిదు ననిఁ దెగటార్చి, మీర । లేమియును గాక వచ్చితి' రింతసంత**
సంబు దొరకొనునే నామనంబు? చింత । వంత యెల్లను జెడ నరవర్యులార! **30**

ప్రతిపదార్థం: నరవర్యులార!= మానవ శ్రేష్ఠులారా!; అట్టి బల్లిదున్= అటువంటి మొనగాడిని; అనిన్= యుద్ధంలో; తెగటార్చి= తుదముట్టించి; మీరలు; ఏమియును+కాక= ఎటువంటి విపత్తు కలగకుండా; వచ్చితిరి= తిరిగివచ్చారు; చింత వంత= దుఃఖబాధ; ఎల్లను+చెడన్= అంతా తుదముట్టేటట్లు; ఇంత; సంతసము= సంతోషం; దొరకొనునే?= లభ్యపడుతుందా?

తాత్పర్యం: మానవ శ్రేష్ఠులారా! అటువంటి శక్తిమంతుడిని యుద్ధంలో తుదముట్టించి, మీకు కించిత్తయినా హాని కలుగకుండా, విజయదీప్తితో వచ్చారు. నా మనస్సులోని చీకుచింతలన్నీ మాసిపోగా, నా మదికి ఇంత గొప్ప సంతోషం కలగటాన్ని నమ్మలేకపోతున్నాను.

తే. **అతనికి నాకునుం గలిగె నాహవ మింతకు ముంద; రందుఁ బా**
ర్షతుఁడును సత్యకాత్మజుఁడు శాంతనవాంతకరుండు ద్రౌపదీ
సుతులును జూడఁగా, నతఁడు సూత హయ ధ్వజ పాతనంబు సే
సి, తనువు దీవ్రకాండములఁ జెండఁగ, నే వెగడందితిం గడున్. **31**

ప్రతిపదార్థం: ఇంతకున్ ముందు+అ= ఇంతకు ముందుగానే; అతనికిన్; నాకునున్; ఆహవము కలిగెన్= యుద్ధం జరిగింది; అందున్= ఆ యుద్ధంలో; పార్షతుఁడును= ద్రుపదపుత్రుడు ధృష్టద్యుమ్నుడు; సత్యకాత్మజుఁడు= సత్యకుడి కుమారుడు సాత్యకీ; శాంతనవ+అంతకరుండు= శిఖండీ; ద్రౌపదీసుతులునున్= ఉపపాండవులూ; చూడఁగాన్= చూస్తూ ఉండగానే; అతఁడు= ఆ కర్ణుడు; సూత= సారథిని; హయ= గుర్రాలను; ధ్వజ= టెక్కమును; పాతనంబు చేసి= విరిగిపడి పోయేటట్లు చేసి; తనువు= నా శరీరాన్ని; తీవ్ర= తీవ్రములయిన; కాండంబులన్= బాణాలచేత; చెండఁగన్= చెండివేయగా; నేను; కడున్= మిక్కిలి; వెగడు+అందితిన్= తబ్బిబ్బు అయ్యాను.

తాత్పర్యం: ఇంతకు ముందుగానే కర్ణుడికీ నాకూ పోరు జరిగింది. ఆ యుద్ధంలో ధృష్టద్యుమ్నుడు, సాత్యకీ, శిఖండీ, ఉపపాండవులూ మొదలైన వీరులందరి ఎదుటనే అతడు నా సారథిని, గుర్రాలను, పతాకాన్ని విరుగగొట్టాడు. నా శరీరం వాడి అయిన బాణాల దెబ్బలకు గురికాగా, నేను ఎంతో భయభ్రాంతుడనయ్యాను.

వ. **అప్పుడు దుర్యోధన ప్రభృతి ధార్తరాష్ట్రులకు భీమసేను ప్రభావంబున బ్రదుకరాని యంత పుట్టిన, నన్ను విడిచి యాతం డట వోవ, నే నిట వచ్చితి'నని చెప్పి వెండియు గాండీవి నుద్దేశించి:** **32**

ప్రతిపదార్థం: అప్పుడు; దుర్యోధన; ప్రభృతి= మొదలగు; ధార్తరాష్ట్రులకున్= ధృతరాష్ట్రుడి కుమారులకు; భీమసేను= భీముడియొక్క; ప్రభావంబునన్= శక్తిసామర్థ్యాలచేత; బ్రతుకరాని+అంత= జీవించి ఉండను వీలుగానంత; పుట్టినన్= పరిస్థితి కలుగగా; నన్నున్ విడిచి; ఆతండు= ఆ కర్ణుడు; అటుపోవన్= ఆ వైపునకు పోగా; నే నిట వచ్చితిన్= నేను ఇక్కడికి వచ్చాను; అని చెప్పి; వెండియున్= మరల; గాండీవిన్+ఉద్దేశించి= అర్జునుడితో (అన్నాడు).

తాత్పర్యం: అప్పుడు దుర్యోధనాదులైన కౌరవులకు భీముడివలన బ్రతుకరాని పరిస్థితి ఏర్పడగా, నన్ను విడిచి కర్ణుడు అటుపోయాడు. నేను ఇటు వచ్చాను' అని చెప్పి ధర్మరాజు అర్జునుడితో ఇంకా ఇట్లా అన్నాడు:

సీ. **'పదుమూఁడువర్షముల్ పగలును రేలును। గర్ణుదర్పం బెట్లు గడతు నొక్కొ?**
యను చింతఁ జేసి, యాహారనిద్రలు లేక। పరితాప మందితిఁ; బశువుఁ జేయ
విప్రులు పట్ట రా వెఱ పొచ్చి యొదిఁగెడు। గవయంబుచాడ్పునఁ, గర్ణభీతి
నుల్లల నుడుకుచు నుండుదుఁ; గర్ణుండు। విడువక మోమున వ్రేలు నాకు!

తే. **సురనదీసుతుచేతను గురునిచేతఁ। బడని పరిభవమున వాఁడు వఱిచె నన్ను**
నంతయును నీఁగఁ గాంచి నీయట్టియనుజు। వలనఁ దేజంబు వడసితి నలఘుచరిత! **33**

ప్రతిపదార్థం: పదుమూఁడు వర్షముల్= పదమూడు సంవత్సరాలు; కర్ణ దర్పంబు= కర్ణుడి పొగరుబోతుదనాన్ని; ఎట్లు+కడతు నొక్కొ!= ఏ విధంగా అతిక్రమిస్తానో; అను= అనే; చింతన్‌చేసి= దిగులువలన; పగలు, రేలును= రేయింబవళ్ళు; ఆహార నిద్రలు లేక= తిండీ నిద్రా లేకుండా; పరితాపము+అందితిన్= దుఃఖించాను; పశువున్+చేయన్= బలిపశువుగా చేయటానికి; విప్రులు= ఋత్విక్కులు; పట్ట రాన్= పట్టుకొనిపోవటానికి రాగా; వెఱ చొచ్చి= భయభ్రాంతమై; ఒదిగెడు= దాగుకొనే; గవయంబు= బలసిన పశువు; చాడ్పునన్= వలె; కర్ణభీతిన్= కర్ణుడికి భయపడి; ఉల్లలన్= కుతకుతా; ఉడుకుచున్= పరితపిస్తూ; ఉండుదున్= ఉంటున్నాను; కర్ణుండు= కర్ణుడు; విడువక= వదలిపెట్టకుండా; నాకున్; మోమునన్= ముఖం ఎదుట; వ్రేలు= (చిత్రపటాన్ని ఎదుట తగిలించినట్లు) వ్రేలాడగట్టినట్లు కనబడుతుంటాడు; సురనదీసుతుచేతన్= భీష్ముడిచేత; గురుచేతన్= ద్రోణుడిచేత; పడని పరిభవమునన్= అనుభవించని అవమానాన్ని; వాఁడు; నన్నున్; పఱిచెన్= బాధించాడు; అంతయున్; నీయట్టి అనుజువలనన్= నీబోటి తమ్ముడివలన; ఈఁగన్+కాంచి= పోగొట్టుకొని; అలఘుచరిత!= గురుతరమైన చరిత్ర కలవాడా!; తేజంబు= ప్రభావమును; పడసితిన్= పొందాను.

తాత్పర్యం: కర్ణుడి బాహుబలాటోపాన్ని ఎట్లా ఓర్చుకొనగలనా?- అని పదమూడేండ్లు రేయింబవళ్లు తలపోసి తలపోసి, కూడు, నిద్ర లేకుండా బాధపడ్డాను. యజ్ఞపశువును పట్టుకొన సమీపించిన బ్రాహ్మణులను చూచి భయపడి దాగుకొనే పశువువలె కర్ణుడి భయంవలన మనసు నలిగి దిగులుపడుతూ కాలం గడుపుతున్నాను. ఆ కర్ణుడి ఆకారమే నా ఎదుట వ్రేలాడుతూ ఉంటుంది. భీష్మద్రోణాదులచేత అనుభవించని అవమానాన్ని వాడు నాకు కలిగించాడు. కీర్తిసాంద్రా! నీవంటి తమ్ముడివలన ఈ యాతనలన్నిటిని లేకుండా జేసికొని ఊరటతో ప్రాణాలను తిరిగి పొందాను.

విశేషం: వచనం మాదిరి నడిచే ఈ సీసపద్యంలో సహజోక్తులతోపాటు చిత్రీకరణం కళకళలాడుతున్నది. తిక్కన సీసపద్యాలన్నీ- కవికి, కంసాలికి సీసాలు తేలిక - అన్న రీతిలో ఉన్నవి. కొన్ని భావ చిత్రీకరణలో గంభీరంగా ఆబోతెద్దు మాదిరిగా నడుస్తున్నవి. శ్రీనాథుడూ యిట్టి పద్ధతినే అనుసరించాడు.

చ. **వెరవును లావు దివ్యశరవీర్యము శౌర్యముఁ గల్గు కర్ణు నె**
వ్వరుసునఁ జంపి? తీ వతని బంధులు మిత్త్రులు బుత్త్రులున్ సము
ద్ధురబలు లాజికేలి నిరతుల్ ధృతరాష్ట్రునిపుత్త్రు లెల్లఁ ద
త్పరిజను లెట్టు లట్టు లనిఁ బ్రాణము లిత్తురు వాని కడ్డ మై. **34**

ప్రతిపదార్థం: (కర్ణుడిని చంపి వచ్చినారనుకొని కల్పిత సంతోషంతో పలికే మాటలివి. ఈ స్థితి రానున్న పరిణామానికి భిన్న స్థితి.) వెరవును= ఉపాయం (చాకచక్యం); లావున్= దేహ పటుత్వం; దివ్యశరవీర్యము= దేవదత్తమైన బాణాల పరాక్రమం; కల్గు= కలుగు; కర్ణున్; ఏ+వరుసునన్= ఏ విధంగా; ఈవు చంపితివి?= నీవు చంపితివి?; సముద్ధుర బలులు= బలమున్నదని దుడుకుపడేవారు; ఆజి కేళిన్= యుద్ధక్రీడయందు; నిరతుల్= మిక్కిలి ఆసక్తి పట్టుదలగలవారు (అయిన); అతని బంధులు మిత్త్రులు; పుత్త్రులున్= నలుగురు పుత్రులును (సుశేష, సత్యసేన, చిత్రసేన, వృషసేనులు అంగరక్షకులుగా నిలిచి హతులైరి); ధృతరాష్ట్రుడి పుత్త్రులు; ఎల్లన్= అందరూ; తద్+పరిజనులు= అతడి సహచరులు; ఎట్టులు ప్రాణములు+ఇత్తురు= ఏ విధంగా ప్రాణాలు ఇస్తారో; అట్టులు= ఆ విధంగానే; అనిన్= యుద్ధములో; వానికిన్+అడ్డమై= వాని చుట్టూ మూగి; ప్రాణములు+ఇత్తురు= ప్రాణాలిస్తారు.

తాత్పర్యం: చాకచక్యం, దేహబలం, దేవదత్తాలైన బాణాల బిగువు, తెగించి ముందు కురికే పట్టుదల గలిగిన ఆ కర్ణుడిని నీవు ఎట్లా తుదముట్టించగలిగావు? బలగర్వితులు, యుద్ధాన్ని ఒక ఆటగా సాగించే ఆసక్తిగలవారు అయిన అతడి చుట్టాలు, స్నేహితులు, కొడుకులు, ధృతరాష్ట్రుడి కొడుకులు, వీరందరూ కూడి, ఆ కర్ణుడి భటులవలెనే ప్రాణాలకు తెగించి ఎట్లా ఆయన చుట్టూ ఏ విధంగా మూగుతారో అట్లే చేయగల సాహసులు.

చ. **అరు దిది! నీవు నొవ్వక మహాబలుఁ గర్ణు వధించి, తాతఁ డ**
క్కురుపతి సంతసింప నరుఁ గూల్చెద సంగరభూమి నేన యొ
క్కరుఁడను వీఁకఁ దాఁకి యను గర్వపుమాట సనంగ నీక, నేఁ
టి రణములోన నిట్లు ప్రకటింతె భవద్భుజ వీర్య శౌర్యముల్! **35**

ప్రతిపదార్థం: నీవు నొవ్వక= నీవు బాధచెందక; మహాబలున్+కర్ణున్= అధిక బలసంపన్నుడైన కర్ణుడిని; వధించితి(వి)= చంపావు; అరుదు+ఇది= ఇది ఆశ్చర్యకరమైన విషయం; ఆతఁడు; ఆ+కురుపతి సంతసింపన్= ఆ దుర్యోధనుడు సంతోష పడేటట్లు; వీఁకన్+తాఁకి= గర్వోత్సాహంతో పైబడి; సంగర భూమిన్= సమరాంగణంలో; నేను+అ+ఒక్కరుఁడన్= నేనొక్కడినే; నరున్ కూల్చెదన్= అర్జునుడిని పడగొట్టుతాను; అను; గర్వపుమాట= అహంభావపు మాట; చనంగనీక= చెల్లేటట్లు కాకుండా; నేటి రణములోనన్= ఈనాటి యుద్ధములో; భవద్భుజవీర్య శౌర్యముల్= నీ బాహువుల పరాక్రమం; ఇట్లు ప్రకటింతె?= ఇట్లా ప్రదర్శింతువా?

తాత్పర్యం: నీవు కొంచెం కూడా గాయపడక, ఎక్కువైన చేవగలిగిన కర్ణుడిని చంపావు. నిజంగా ఇది చోద్యపుచేత; ఆ కౌరవనాథుడు సంతోషంతో ఉబ్బిపోయేటట్లుగా- 'నేను ఒంటరిగా ఎదిరించి అర్జునుడిని చంపుతాను' అనే కర్ణుడి గర్వోక్తిని చెల్లనీయకుండా, నీ బాహుబలసంపద, వీరగుణ పాండిత్యం ఈనాటి యుద్ధంలో లోకానికి వెల్లడి చేసికొనగలిగావు.

చ. **పలికిన నేమి? బీరములు పల్కుట సేవక నీతి! యాసభం**
బలుకునె యట్లు జూదపు నెపంబున ద్రౌపది నింతకాల మ
ప్పలుకు లలంచుచుండె; మదిఁ బాయవు గ్రీఁతినయమ్ము లట్ల; దో
ర్బల దృఢలీల నిప్పు డవి వాపితి; తీర్చి తలంత యంతయున్. **36**

ప్రతిపదార్థం: పలికినన్+ఏమి?= పలికిన మాత్రాన ఏమి పోయింది?; బీరములు= బింకాలు; పల్కుట; సేవకనీతి= సేవకుల ధర్మం; ఆ సభన్= ఆ కొలువులో; జూదపు నెపంబునన్= జూదములో ఓడిపోయినారన్న సాకుతో; ద్రౌపదిన్+అట్లు= ద్రౌపదిని అట్లా; పలుకునె?= తూలనాడుతాడా?; ఇంతకాలము; ఆ+పలుకులు= ఆ మాటలు; అలంచుచుండెన్= బాధిస్తున్నాయి; గీఁటిన అమ్ములట్లు+అ, గోకి గాయపరచిన బాణాలమాదిరి; మదిన్ పాయవు= మనస్సును వదలిపోవు; దోర్బల దృఢలీలన్= పటుతర బాహుబలవిన్యాసంతో; ఇప్పుడు; అవి= వాటిని; పాపితి(వి)= నివారింపజేశావు; అలంత అంతయున్= బాధనంతా; తీర్చితి(వి)= నివారించితివి.

తాత్పర్యం: అట్లా మాట్లాడినంత మాత్రాన ముంచుకొనిపోయినదేమీ లేదు. డాంబికపుమాటలు పలకటం సేవలకు ధర్మం, లేకుంటే ఆ సభలో జూదంలో ఓడిపోయినారన్న మిషతో ద్రౌపదిని అట్లా కారుకూతలు కూస్తాడా?

ఇంతదాకా ఆ మాటలు నన్ను గీరి పుండు చేసిన బాణాలవలె మనస్సును బాధిస్తూనే ఉన్నాయి. ఎంత ప్రయత్నించినా అవి మనస్సును వదలిపెట్టిపోవు. కాని, ఇప్పుడు నీ బలప్రయోగ నైపుణ్యంతో వాటిని పోగొట్టావు; మదిలోని యాతననంతా తొలగించావు.

క. అతిగర్వ సమున్నత మగు । నతని శిరము వానివార లందఱు బాష్పో
ద్గతితోఁ జూడఁగ సమర । క్షితి డొల్లెనె? విజయ! నీదు శిత భల్లమునన్. 37

ప్రతిపదార్థం: విజయ!= అర్జునా!; నీదు శితభల్లమునన్= వాడియైన నీ బరిసెపోటుతో; అతిగర్వ= మిక్కిలి పొగరుబోతుతనంతో; సమున్నతము+అగు= ఎక్కువగా నిక్కినీల్గిన; అతడి శిరము= అతని తల; వానివారలు+అందఱున్= అతడికి చెందిన వారందరూ; బాష్ప+ఉద్గతితోన్= ఉబుకుతున్న కన్నీటితో; చూడఁగన్= చూస్తుండగా; సమరక్షితిన్= యుద్ధభూమిలో; డొల్లెనె?= ఊడిపడిపోయిందా?

తాత్పర్యం: మితిమీరిన అహంకారంతో పైకెత్తబడిన అతడి తల; అతడి వాళ్ళంతా, కన్నీటి వరదలో మునిగిన కండ్లతో చూస్తుండగా నీ బాణాలదెబ్బకు తెగి, పొలికలనులో పడిపోయిందా! విజయా!

క. ఈరసమునఁ గదిసి శరా । సారము పైఁ గురియ నీవు సక్రోధుఁడ వై
పేరురమున వెస నాటిన । తోరం బగు నారసమునఁ ద్రుళ్ళి కెడసెనే?' 38

ప్రతిపదార్థం: ఈరసమునన్= అసూయతో; కదిసి= పైబడి; శరాసారము= బాణాల జడివాన; నీపైన్+కురియన్= నీపై కురిపించగా; నీవు; సక్రోధుఁడవు+ఐ= అతి కోపంతో చెలరేగి; పేరురమునన్= పెద్ద వక్షస్థలాన; వెసన్, నాటిన= వేగంగా గుచ్చిన; తోరంబు+అగు= బలిష్ఠమైన; నారసమునన్= ఇనుపబాణపు తాకిడికి; త్రుళ్ళి= ఎగిరి; కెడసెనే?= చచ్చాడా?

తాత్పర్యం: అసూయతో కర్ణుడు నీపై తెరిపిలేని వానవలె బాణాలను వేయగా, నీవు కోపపుపొంగుతో విజృంభించి అతడి విశాలమైన ఎదలో గట్టి ఇనుపబాణాన్ని గ్రుచ్చగా, అతడు ఎగిరిపడి నేలకొరిగి చచ్చాడు కదా!'

విశేషం: అర్జునుడు కర్ణుడిని తప్పక చంపి ఉంటాడనే బలమైన ఊహతో ధర్మరాజుచేత ఇన్నిమాటలు పలికించటం అర్జునుడికి మరింత అవమానభారం కలిగించడానికే.

వ. అనిన ధర్మనందనునకుఁ బురందరనందనుం డిట్లను; 'నేను సంశప్తకులతోడఁ బెనంగుచుండ, ననేక రథ సమూహ సమేతుం డయి యశ్వత్థామ వచ్చి, నన్నుం బొదివిన. 39

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; ధర్మనందనునకున్; పురందరనందనుండు= ఇంద్రుడి కుమారుడైన అర్జునుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; నేను; సంశప్తకులతోడన్; పెనంగుచుండన్= పోరాడుతూ ఉండగా; అనేక రథ సమూహ, సమేతుండు+అయి= పెక్కు తేరుల గుంపును కూడగట్టుకొనినవాడై; అశ్వత్థామ వచ్చి; నన్నున్; పొదివినన్= చుట్టుముట్టగా.

తాత్పర్యం: అనగా విని అర్జునుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: 'నేను సంశప్తకులతో యుద్ధం చేస్తూ ఉండగా అశ్వత్థామ అనేక రథసమూహాలతో వచ్చి నన్ను చుట్టుముట్టగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **ఏనూఱురథంబులు వెసఁ। బీనుఁగు పెంటలుగఁ జేసి పేర్చినఁ, గుపితుం**
డై నిప్పు లురలు కన్నుల। తో నక్కోదండగురుసుతుఁడు నామీఁదన్. 40

ప్రతిపదార్థం: ఏనూఱు రథంబులు= ఐదువందల రథాలు; వెసన్= వేగంతో; పీనుఁగు పెంటలన్+చేసి= శవాల కుప్పలయ్యేటట్లు చేసి; పేర్చినన్= (నేను) అతిశయించగా; కుపితుండు+ఐ= కోపపడినవాడై; నిప్పులు+ఉరలు= నిప్పులు గ్రక్కే; కన్నులతో; ఆ కోదండ గురుసుతుఁడు= ఆ బాణాచార్యుడి కొడుకు అశ్వత్థామ; నామీఁదన్= నా మీద.

తాత్పర్యం: ఐదువందల రథాలను తునాతునకలై జీవంలేని శవాలగుట్టలవలె చేసి, నేను ఆటోపం చూపగా కోపగించుకొని, అశ్వత్థామ నాపై నిప్పులు వెదజల్లే కన్నులతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **ఉఱక యడరి మెఱసిన యే। డ్తెఱ నెఱయఁగ గుడుసువడి, యతిస్ఫురిత రుచిన్**
మెఱసి, ధను వనల వలయము। తెఱఁగునఁ జక్షుర్గతి ప్రతిహతిం జేసెన్. 41

ప్రతిపదార్థం: ఉఱక= లెక్కపెట్టక; అడరి= కోపంతో పైకొని; మెఱసిన= మిరుమిట్లుగొలిపే; ఏడ్తెఱన్= పరాక్రమంతో; నెఱయఁగన్= చెలరేగగా; గుడుసుపడి= గుండ్రంగా చుట్టుకొని; అతి= మిక్కిలి; స్ఫురిత రుచిన్= వెలుగొందే కాంతితో; మెఱసి= దీపించి; ధనువు= ధనుస్సు; అనల వలయము తెఱఁగునన్= గుండ్రంగా చేయబడిన నిప్పువలె (ధనుస్సు రెండు కొనలు లాగి కలిపినపుడు గుండ్రంగా కనపడుతుంది. ఇది బాణప్రయోగ తీవ్రతను సూచిస్తుంది); చక్షుర్గతి ప్రతిహతిన్+ చేసెన్= నేత్ర గమనమును నిరోధించింది.

తాత్పర్యం: 'అశ్వత్థామ నన్ను లెక్కపెట్టక కోపోద్దీపితుడై మాపైబడి మిరుమిట్లు గొలిపే పరాక్రమంతో చెలరేగి మా సైన్యాలను చుట్టుకొని, ధనుస్సును మండే నిప్పు గుండ్రంగా చుట్టుకొన్నట్లు చేసి, మా చూపులను చెదరగొట్టి ఏమీ కనపడకుండా చేశాడు.

క. **స్వాతిగతుం డగు శుక్రుం। డేతెఱఁగునఁ బరఁగఁజేయు నెసకపు వర్షం,**
బాతెఱఁగున సాయక। వర్షాతిశయం బావహించె నతఁడు నరేంద్రా! 42

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ధర్మరాజా!; స్వాతిగతుండు+అగు శుక్రుండు= స్వాతినక్షత్రయుక్త తులారాశిలో చేరిన శుక్రుడు; ఏ+తెఱఁగునన్= ఏ విధంగా; ఎసకపు= ఎక్కువైన; వర్షంబు+పరఁగన్+చేయున్= వానను పెంపొందింపజేయునో; ఆ తెఱఁ గునన్= అదే విధంగా; అతఁడు= అశ్వత్థామ; సాయక= బాణాలనే; వర్ష+అతిశయంబు= వానపెంపును; ఆవహించెన్= కలిగించాడు.

తాత్పర్యం: రాజా! స్వాతినక్షత్రంలో చేరిన శుక్రుడు వానలనెట్లా ఎక్కువ కురిపిస్తాడో, అదే విధంగా అశ్వత్థామ విపరీత బాణవర్షాన్ని కురిపించాడు.

విశేషం: అలంకారం: ఉపమ.

క. **తన యరదం బెద్దెసఁ జూ। చిన మొగమున వ్రేల, దీప్తశిత విశిఖములన్**
ననుఁ గృష్ణుం గప్పిన, నే। ననఘా!, కెల వరయఁజాల నైతి వెగడునన్. 43

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; తన; అరదము= రథం; ఏ+దెసన్+చూచినన్= ఏ దిక్కున చూచినా; మొగమునన్ వ్రేలన్= ముఖం ముందు కనబడేటట్లుగ; దీప్తశిత= ప్రకాశిస్తూ వాడియైన; విశిఖములన్= బాణాలతో; ననున్ కృష్ణున్= నన్ను, కృష్ణుడిని; కప్పినన్= కప్పివేయగా; ఏన్= నేను; వెగడునన్= తత్తరపాటుతో; కెలవు= పరిస్థితిని; అరయన్ చాలనైతిన్= తెలిసికొనలేకపోయాను.

తాత్పర్యం: ఓ పుణ్యాత్మా! ఎటు చూచినా ముఖం ముందు తన రథమే కన్నులకు కట్టేటట్లు కనబడుతుండగా, మిరుమిట్లు గొలిపే పదునైన బాణాలతో నన్నూ, కృష్ణుడినీ కప్పివేయగా, నేను తడబాటుతో, ఉన్న పరిస్థితులను తెలిసికొనలేకపోయాను.

క. పదపడి, యొకభంగి నతని । మద మడఁచినఁ దొలఁగఁ బాఱె మానము దూలం;
దదనంతరంబ నిన్ను । న్వెదకితి నరనాథ!, మన యనీకములోనన్. 44

ప్రతిపదార్థం: నరనాథ!= ధర్మరాజా!; పదపడి= తరువాత; ఒక భంగిన్= ఒక విధంగా; మదము+అడఁచినన్= పొగరణచగా; మానము= పరువు; తూలన్= పోగా; తొలఁగన్+పాఱెన్= తొలగిపోయాడు; తదనంతరంబు+అ= ఆ తరువాతనే; నిన్నున్= నిన్ను; మన; అనీకము లోనన్= సైన్యంలో; వెదకితిన్= వెదికాను.

తాత్పర్యం: ఆ తరువాత ఒక విధంగా అతడి పొగరును అణగగొట్టగా, అభిమానం చెడి అశ్వత్థామ యుద్ధంనుండి తొలగిపోయాడు. ధర్మరాజా! ఆపైన సైన్యాలలో నిన్ను వెదికాను.

క. ఆలోఁ గర్ణునిచేతం । దూలని చతురంగములను దొరలను ధరణీ
పాల! మనమొనలఁ గానను । వ్రాలిన దర్పమున మెఱయు వడముడిఁ దక్కన్. 45

ప్రతిపదార్థం: ధరణీపాల!= ధర్మరాజా!; వ్రాలిన దర్పమునన్= అతిశయించిన గర్వంతో; మెఱయు= ప్రకాశించే; వడముడిన్+ తక్కన్= భీముడిని తప్ప; ఆలోన్= ఆ లోపల; కర్ణుని చేతన్= కర్ణుడి వలన; తూలని= విరిగిపడని; చతురంగములను; దొరలను= వీరులను; మనమొనలన్= మన సైన్యాలలో; కానను= చూడనైతిని.

తాత్పర్యం: ఓ భూపాలా! అతిశయించిన దర్పంతో ప్రకాశించే ఒక్క భీముడు తప్ప, మన సైన్యాలలో కర్ణుడిచేత బాధపడని చతురంగబలాలుగాని, రణవీరులుగాని నాకు కనబడలేదు.

క. ఆతనిచే నీ విక్కడ । కేతెంచుట వింటి; సేమ మెఱుఁగు తలఁపు మై
నేతెంచితి; నవ్వీరుని । చేతులలా వస్మదీయ సేన నిలుపుటన్. 46

ప్రతిపదార్థం: ఆతనిచేన్= ఆ భీముడివలన; నీవు+ఇక్కడకున్; ఏతెంచుట= వచ్చుటను; వింటిన్= విన్నాను; ఆ+వీరుని= ఆ కర్ణుడి; చేతులలావు= భుజబల సామర్థ్యాన్ని; అస్మదీయ సైన్యము= మన సైన్యం; నిలుపుటన్= ఆపుటచేత; సేమము+ ఎఱుఁగు తలఁపుమైన్= నీ క్షేమం తెలిసికొనాలన్న యోచనతో; ఏతెంచితిన్= వచ్చాను.

తాత్పర్యం: భీముడివల్ల నీ విక్కడికి రావటాన్ని గూర్చి విన్నాను. ఆ వీరుడి భుజబలం మనసేనను నిలబడేటట్లు చేస్తూ ఉండగా, నీ క్షేమాన్ని తెలుసుకోవాలని వచ్చాను.

క. మనుజేంద్ర! కుశలి వగు నినుఁ । గని, నామన మూఱడిల్లెఁ గావున మగుడం
జనియెదఁ, గొనియెద రాధా । తనయుని తల చలము నెఱయ దర్పము మెఱయన్. 47

ప్రతిపదార్థం: మనుజేంద్ర!= ధర్మరాజా!; కుశలివి+అగు= క్షేమంగా ఉన్న; నినున్+కని= నిన్ను చూచి; నా మనము= నా మనసు; ఊఱడిల్లెన్= కుదుటపడింది; కావునన్= అందుచే; మగుడన్+చనియెదన్= తిరిగి వెళ్ళుతాను; చలము= నా పట్టుదల; నెఱయన్= నిండుకొనగా; దర్పము మెఱయన్= గర్వం ప్రకాశించగా; రాధాతనయుని తలన్= కర్ణుడి తలను; కొనియెదన్= తీసికొంటాను.

తాత్పర్యం: మనుజేంద్రా!, సురక్షితంగా ఉన్న నిన్ను చూచి నా మది నెమ్మదించింది. అందువలన మరల తిరిగి యుద్ధభూమికి పోతాను. నా పంతం ఫలప్రదమయ్యేటట్లు, నా గర్వానికి వన్నె చేకూరేటట్లు కర్ణుడి శిరస్సు ఖండిస్తాను.

క. ననుఁ జూడుము వేడుకకుం । జనుదెంచి భవద్బలంబు సంతస మందం
దునిమెదఁ గర్ణుని దుర్యో । ధను కోర్కియు నీమనంబు తాపముఁ దీఱన్. 48

ప్రతిపదార్థం: భవద్బలంబు= నీ సైన్యం; సంతసము+అందన్= సంతోషపడేటట్లు; దుర్యోధను కోర్కియున్= దుర్యోధనుడి ఆశయు; తీఱన్= నిష్ఫలమయ్యేటట్లు; నీ మనంబు= నీ మనస్సు; తాపమున్= ఆవేదన; తీఱన్= ఉపశమించేటట్లు; కర్ణునిన్= కర్ణుడిని; తునిమెదన్= ఖండించివేస్తాను; వేడుకకున్= వినోదార్థం; చనుదెంచి= నీ వక్కడకు వచ్చి; ననున్; చూడుము.

తాత్పర్యం: నీ సేనలు ఆనందించగా, దుర్యోధనుడు పెట్టుకొన్న ఆశలు వమ్ముకాగా, నీ చిత్తతాపం తీరిపోగా, కర్ణుడిని నరికివేస్తాను. నీవు అక్కడకు వచ్చి నన్ను, నా కార్యాన్ని వేడుకగా చూడుము.

మ. ధనురాచార్యుని చావు సూచి, తగ రాధానందనుం డా సుయో
ధనునిం దమ్ముల వారి సైన్యములనుం దాఁ గాచువాఁడై రణం
బునకుం బూనుట, నింత సేయ వలదే? భూపాల! యేపారి మం
డునె యాఱం గల దీప! మ ట్లతఁడు మండుం గాక! యే నార్చెదన్. 49

ప్రతిపదార్థం: భూపాల!= రాజా!; ధనురాచార్యుని= (అస్త్రవిద్యాగురువైన) ద్రోణునియొక్క; చావు చూచి= మరణాన్ని చూచి; రాధానందనుండు= కర్ణుడు; సుయోధనుని= దుర్యోధనుడిని; తమ్ములన్; వారి సైన్యములన్; తాన్+కాచువాఁడై= తానే రక్షించువాడైనట్లు; తగన్= దానికి తగినట్లు; రణంబునకున్+పూనుటన్= యుద్ధానికి దిగుటచేత; ఇంత చేయవలదే?= ఇంత గొప్పగా (యుద్ధం) చేయవలసిన అవసరం లేదా?; ఏపారి మండునె?= అతిశయించి మండుతున్నాడే?; ఆఱంగల దీపము+అట్లు= ఆరిపోబోతున్న దీపంవలె; అతఁడు= కర్ణుడు; మండున్ గాక= మండితే మండు గాక; ఏన్ ఆర్చెదన్= నే నార్పివేస్తాను.

తాత్పర్యం: బాణాచార్యుడైన ద్రోణుడి చావుతో, ఇక తానొక్కడే రారాజును, ఆయన తమ్ముళ్ళను, వారి సైన్యాన్నీ రక్షించగలవాడైనట్లు, యుద్ధానికి దిగాడు కనుక ఇంత గొప్పగ యుద్ధం చేయవలసిందే. ఆరిపోయే దీపం అతిశయించి వెలుగునట్లు అతడు మండిపడుతున్నాడు. మండనీ, నేను ఆర్పివేస్తాను.

చ. నరవర! పంపు! మేను బ్రధనంబున కేఁగిన సూతసూనుఁ డు
ద్ధురత నెదిర్చెనేనిఁ దల ద్రుంపక తక్కిన, విప్రుతోడ ని
ప్పరుసున నిచ్చువాఁడ నని పల్కి పదంపడి యీక తక్కు దు
ష్పురుషునిఁ జూచుమాడ్కి ననుఁ జూడుఁడు నీవును వాసుదేవుఁడున్. 50

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; పంపుము= యుద్ధం చేయపంపుము; నేను; ప్రధనంబునకున్= యుద్ధానికి; ఏఁగినన్= పోయినట్లయితే; సూతసూనుఁడు= కర్ణుడు; ఉద్ధురతన్= చెలరేగి; ఎదిర్చెనేని= నన్ను ఎదుర్కొన్నట్లయితే; తల+త్రుంపక= తలత్రుంచక; తక్కినన్= తప్పి వైదొలగిపోతే; విప్రుతోడన్= బ్రాహ్మణునితో; ఈ+పరుసునన్= ఈ విధముగా; ఇచ్చువాఁడను= ఇవ్వగలవాడ నని; పల్కి= చెప్పి; పదంపడి= తరువాత (వెంటనే); ఈక తక్కు= ఇవ్వకుండా మాట తప్పే; దుష్పురుషునిన్= చెడ్డవాడిని; చూచుమాడ్కిన్= చూచే విధంగా; నీవును= నీవునూ; వాసుదేవుడున్= కృష్ణుడూ; నన్నున్+ చూడుఁడు= నన్ను చూడండి.

తాత్పర్యం: ఓ రాజా! నన్ను యుద్ధానికి పంపుము. నేను యుద్ధానికి దిగితే కర్ణుడు విక్రమించి నన్నెదిరిస్తే అతడి తల నరికివేయకపోతే- ఈ విధంగా ఇస్తానని బ్రాహ్మణుడికి చెప్పి ఆ తర్వాత ఇవ్వకపోయిన దురాత్ముడిని చూచినట్లే మీరూ, శ్రీకృష్ణుడూ నన్ను చూడండి.

విశేషం: అలంకారం: ఉపమ. దీనివలన ఆ కాలంలో బ్రాహ్మణులకు చేసిన వాగ్దానం ఎంత పవిత్రమో, దానిని తీర్చటం ఎంత అవసరమో తెలుస్తుంది.

వ. భీమసేనునకు సేనాముఖంబునఁ దాన నిలుచుట భరం బయి యుండు; నేనునుం దడయుట గర్జంబు గాదు; పోయెద'ననిన విని, యమ్మనుజపతి గర్ణుండు గుశలియై యుండుట యెఱింగి, యతని బాణంబుల నొచ్చినవాఁ డగుట నలుక గదిరి యక్కిరీటితో నిట్లనియె: 51

ప్రతిపదార్థం: భీమసేనునకున్; సేనాముఖంబునన్= దండుముందు; తాన్+అ= తానొక్కడే; నిలుచుట; భరంబు+అయి ఉండున్= భారమై ఉంటుంది; ఏనునున్= నేనూ; తడయుట= ఇంక ఆలసించటం; కర్జంబు కాదు= ఉచితమైన పనికాదు; పోయెదన్; అనినన్= అని పలుకగా; విని; ఆ+మనుజపతి= ఆ ధర్మరాజు; కర్ణుండు; కుశలి+ఐ ఉండుట= క్షేమంగా ఉన్నాడని; ఎఱింగి= తెలిసికొని; అతని; బాణంబులన్= బాణాలవలన; నొచ్చినవాఁడు+అగుటన్= బాధపడినవాడవటంచేత; అలుక= కోపం; కదిరి= అతిశయించి; ఆ+కిరీటితోన్= ఆ అర్జునుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: తానొక్కడే సేనాముఖంలో నిలిచి పోరాడటం భీమసేనుడికి భారం అయి ఉండవచ్చును. నేను కూడా ఆలస్యం చేయటం న్యాయం కాదు. నేను యుద్ధరంగానికి పోతాను' అని అర్జునుడు అనగా, కర్ణుడు క్షేమంగా ఉన్నాడని తెలిసికొని ధర్మరాజు అతడి బాణాలవలన బాధపడి ఉండటం వలన కోపించి' అర్జునుడితో ఇట్లా అన్నాడు:

ధర్మరాజు కర్ణుండు బ్రతికియున్నవాఁడని విని యర్జునుం గినిసి పలుకుట (సం. 8-48-1)

క. 'అనిలోఁ దెరలుట దొలఁగుట। యనునివి సనుఁ గాక, నొచ్చియైనను గల నె
ల్లను వెడలఁ జనునె? యే న। ట్లును గా కిట వచ్చుటం జులుకనైతిఁ గడున్.' 52

ప్రతిపదార్థం: అనిలోన్= యుద్ధంలో; తెరలుట= మరణించుట; తొలఁగుట= వైదొలగిపోవుట; అను+ఇవి= అనేవి; చనున్+కాక= జరుగవచ్చుగాక; నొచ్చి ఐనను= దెబ్బతిని; కలను+ఎల్లను= యుద్ధమునంతా; వెడలచనునె?= వదలిపెట్టి పోవుట యుక్తమా?; ఏను= నేను; అట్లును+కాక= ఆ విధంగా కూడా కాక; ఇట వచ్చుటన్= ఇక్కడకు రావటం వల్ల; కడున్= మిక్కిలి; చులుకన+ ఐతిన్= తేలికవాడనైనాను.

తాత్పర్యం: యుద్ధంలో మరణించటం, తొలగిపోవటం జరుగవచ్చు. కాని, దెబ్బతిని పూర్తిగా యుద్ధాన్ని వదలి వెళ్ళటం తగునా? నేను అట్లా యుద్ధంలో నిలబడకుండా ఇక్కడకు రావటంతోనే కదా చులకనైపోయాను.

విశేషం: పుండుపై కారం చల్లినట్లు దెబ్బలతో బాధపడుతూ, చులకన చేయబడినందుకు కుములుతూ ధర్మజుడు అనిన మాటలు, ఆత్మగౌరవంలో ప్రతీకార దీక్షతో వక్రోక్తిమయంగా ఉన్నవి.

క. **'విను! కర్ణున కే నోడితి । నన నేటికి? నీవు నోడి; తనిలజ మాద్రీ**
తనయులు మున్నే యోడిరి; మనతోఁ గూడంగఁ గంసమర్దనుఁ డోడెన్!' **53**

ప్రతిపదార్థం: విను= వినుము; కర్ణునకున్= కర్ణుడికి; ఏను= నేను; ఓడితిన్+అనన్+ఏటికిన్?= ఓడిపోయినానని అనటం ఎందుకు?; నీవున్ ఓడితి(వి)= నీవు కూడ ఓడావు; అనిలజ= భీముడు; మాద్రీతనయులు= మాద్రిపుత్రులు నకుల సహదేవులు; మున్నే= ఇంతకుముందే; ఓడిరి= ఓడారు; మనతోన్+కూడంగన్= మనతో కలసినందున; కంసమర్దనుఁడు= కంసుడిని చంపిన ఆ కృష్ణుడు కూడా; ఓడెన్= ఓడాడు. (మంచి ఎత్తిపొడుపు)

తాత్పర్యం: 'బాగా వినుము. నేనొక్కడనే కర్ణుడిచేత ఓడించబడినానని అనటం ఎందుకు? నీవూ ఓడావు. భీమ నకుల సహదేవులు ముందుగనే ఓడారు. మనతో చేరి కృష్ణుడు కూడా పరాభూతుడయ్యాడు. (పరాభవానల దగ్ధుడైనందువలన ఆయన మాటలు వేడిగా ఉన్నవి.)

విశేషం: కృష్ణుడనక కంసమర్దనుడనటం - మహావీరుడైన కంసుడిని సంహరించిన కృష్ణుడే ఓడాడని చెప్పటానికి.

క. **'కావున మన మిఁక ననికిం । బోవం బని లేదు; విపినభూమికిఁ జని య**
చ్చో వెఱపు దక్కి తపసుల । మై, విచ్చలవిడిఁ జరింత మందఱముఁ దగన్!' **54**

ప్రతిపదార్థం: కావునన్= కావున; మనము; ఇఁకన్= ఇకపైన; అనికిన్= యుద్ధానికి; పోవన్ పని లేదు= పోవలసిన అవసరం లేదు; విపిన భూమికిన్= అరణ్యానికి; చని= పోయి; ఆ+చోటన్= అక్కడ; తపసులము+ఐ= మునివృత్తిలో ప్రవేశించి; వెఱపు దక్కి= భయం పోగొట్టుకొని; తగన్= ఆ చోటుకు తగినట్లు; అందరము; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; చరింతము= తిరుగుదాము.

తాత్పర్యం: 'కాబట్టి ఇకమీదట మనం యుద్ధానికి దిగవలసిన అవసరం లేదు. అడవికేగి తాపసులమై, జంకు లేకుండా స్వేచ్ఛగా మనమందరం తగువిధంగా సంచరిద్దాము.'

క. **'కాదేని, బిరుదు లాడక । సాదుల మై వినయ మొప్పఁ జని, కురునాథుం**
డేది పనిచినను జేసి, ద । యాదృష్టి నతండు సూచున ట్లుండఁదగున్.' **55**

ప్రతిపదార్థం: కాదు+ఏనిన్= కాకుంటే; బిరుదులు+ఆడక= ప్రగల్భాలు పలుకకుండా; సాదులము+ఐ= సాత్త్వికులమై; వినయము+ఒప్పన్= అందరిపట్ల అణకువ గలిగి; చని= కౌరవులవద్దకు చేరి; కురునాథుడు; ఏది పనిచినన్= ఏమి చేయుమని చెప్పినా; చేసి= ఆ పని చేసి; దయాదృష్టిన్= (ఆయన) కనికరపు చూపుతో; అతండు; చూచునట్లున్= చూచేటట్లుగా; ఉండన్+తగున్= ప్రవర్తించటం ఉచితం.

తాత్పర్యం: అట్లాకాకపోతే ప్రగల్భాలు పలుకకుండా, సాధువులమై వినయ విధేయతలు చూపుతూ, కురునాథుడి దగ్గర చేరి, ఆయన అక్కడ ఏమి పనిచేయుమని చెప్పితే అది చేసి, ఆయన దయాదాక్షిణ్యాలకు పాత్రులమయ్యేటట్లు ఉండటమే చేయదగినపని.

వ. అని కెంజాయ రంజిల్లు కన్నుల నన్నరు నాలోకించి. 56

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; కెంపు+చాయ= ఎర్రరంగు; రంజిల్లు= ప్రకాశించే; కన్నులన్= కన్నులతో; ఆ+నరున్= ఆ అర్జునుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అని పలికి, కన్నులు ఎర్రబారగా అర్జునుడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'నీతెఱఁ గిట్టిదేని? రణనిష్ఠకుఁ బూనక కార్యవాది వై
ద్వైతవనంబునంద సముదగ్రభుజాబలదుర్జయుండు రా
ధాతనయుండు, వాని ననిఁ దాఁక నశక్యము నాకు నన్న, నే
నీతెరు వేల వత్తు? మహి యేల నశక్తుఁడు వాంఛ సేయునే?' 57

ప్రతిపదార్థం: నీ తెఱఁగు= నీ కార్యాచరణ; ఇట్టిది+ఏనిన్= ఇటువంటిదే అయితే; రణనిష్ఠకున్= యుద్ధదీక్షకు; పూనక= ప్రయత్నించకుండా; కార్యవాదివై= తగిన కార్యాచరణవిధానం చెప్పునట్టివాడివై; ద్వైతవనంబునందున్+అ= ద్వైతవనమునందే (ఉండిపోయి); సమ్+ఉదగ్ర= అతిశయమైన; భుజాబల= భుజబలంచేత; దుర్జయుండు= జయించ వీలుగానివాడు; రాధాతనయుండు= కర్ణుడు; వానిన్= అట్టివాడిని; అనినన్+తాఁకన్= యుద్ధంలో ఎదుర్కొనటం; నాకున్; అశక్యము= సాధ్యంకాని పని; అన్నన్= అని చెప్పి ఉంటే; ఏను= నేను; ఈ తెరువు= (ఈ దారికి) ఈ జోలికి; ఏల వత్తున్= ఎందుకు వచ్చి ఉంటాను?; అశక్తుఁడు= బలహీనుడు; మహిన్+ఏలన్= భూమిని పాలించటానికి; వాంఛ+చేయునే?= కోరుకొంటాడా?

తాత్పర్యం: 'నీ తీరు ఇటువంటిదే అయి ఉండినట్లయితే, యుద్ధం చేస్తాననే పట్టుదలకు పోకుండా, సమయోచిత కార్యాచరణమే యోగ్యమనే వాడవైతే మనం ద్వైతవనంలో నున్నప్పుడే - భయంకర బాహుబలం కలవాడు, జయింప శక్యంగానివాడు కర్ణుడిని, యుద్ధంలో ఎదుర్కొనటం నాచేతగాని పని - అని నీవు ముందే అని ఉంటే - నేను ఈ యుద్ధమార్గానికి ఎందుకు వస్తాను? బలహీనుడు భూపాలన చేయాలని కోరుకొంటాడా?'

విశేషం: అలంకారం: అర్థాంతరన్యాసం.

క. 'అని వధించెదఁ గర్ణు నే నని ప్రతిజ్ఞ। సేసి, యిటు దెచ్చిన న న్నిట్లు సేసి, తింత
కెట్లు నేర్చితి? పాడవుగా నెత్తి నేల। వైవ నోర్చితి ననుఁ బగవారి నడుమ.' 58

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధంలో; కర్ణున్= కర్ణుడిని; ఏను= నేను; వధించెదను+అని= చంపెదనని; ప్రతిజ్ఞ చేసి= బాస చేసి; నన్నున్; ఇటు తెచ్చి= ఇక్కడకు తీసికొనివచ్చి; ఇట్లు చేసితి(వి)= ఇట్టి దురవస్థలపాలు చేశావు; ఇంతకున్ ఎట్లు నేర్చితి(వి)?= ఇంతపని చేయటాన్ని ఎట్లా నేర్చుకొన్నావు?; ననున్= నన్ను; పగవారి నడుమన్= శత్రువులమధ్య; పొడవుగాన్+ఎత్తి= ఎక్కువగా పైకెత్తి; నేలన్+వైవన్= నేలపై విసిరికొట్ట; ఓర్చితి(వి)= కలిగావు.

తాత్పర్యం: 'యుద్ధంలో కర్ణుడిని తుదముట్టిస్తానని శపథం చేసి, నన్ను ఇక్కడకు తీసికొనివచ్చి, ఇట్లా అవమానం పాలు చేశావు. ఇంత పని చేయటానికి ఎట్లా నేర్చుకొన్నావు? కానివారి ఎదుట నన్ను పైకెత్తి క్రిందకు విసిరికొట్టగలిగావు.'

ఉ. **'పంకజనాభుఁడున్ వినఁగఁ బల్కిన యప్పలు కిమ్మెయిం దుదిన్**
బొంకగుటోర్చి తిట్టి నినుఁ బుట్టినయప్డు నుతించెఁ బోరికిన్
శంక గొనండు, గెల్చుఁ గురుసంఘము నీతఁడు పుణ్యుఁ డన్న యా
బొంకరి దివ్యవాణియుఁ దపోధనులున్ మము ని ట్లలంతురే!' **59**

ప్రతిపదార్థం: పంకజనాభుఁడున్= కృష్ణుడుకూడా; వినఁగన్= వినేటట్లు; పల్కిన ఆ+పలుకులు= పలికిన ఆ మాటలు; బొంకు+అగుట+ఓర్చితి(వి)= అబద్ధాలు కావటానికి ఓర్చావు; తుదిన్= చివరకు; ఈ+మెయిన్= ఈ విధంగా; ఇట్టి నినున్= ఇట్టి నిన్ను; పుట్టిన అప్డు= పుట్టిన సమయంలో; నుతించెన్= ఇట్లు కొనియాడినారు; పోరికిన్= యుద్ధం చేసేందుకు; శంకగొనండు= జంకడు; కురు సంఘమున్= కౌరవుల సమూహాన్ని; ఈతఁడు గెల్చున్= ఇతడు గెలుస్తాడు; పుణ్యుఁడు= పవిత్రుడు, అన్న= అని పలికిన; ఆ బొంకరి= ఆ కల్లలాడే; దివ్యవాణి= ఆకాశవాణియు; తపోధనులున్= తపస్సంపన్నులును; మమ్మున్; ఇట్లు అలంతురే?= ఇట్లా బాధపెడతారా?

తాత్పర్యం: కృష్ణుడి ఎదుట నీవు చెప్పిన మాటలు ఇట్లా అబద్ధమయ్యేటట్లు చేశావు. ఇటువంటి నీ జన్మ సమయంలో ఆకాశవాణి, తపస్సే సంపదగా గలిగిన మునులు 'ఇతడు యుద్ధమంటే వెనుకాడడు. కౌరవులను గెలుస్తాడు. ఇతడు పుణ్యాత్ముడు' అని పొగడారు. ఇట్లా అబద్ధమాడి మమ్మలను కష్టపెడతారా? (నొవ్వజేయడం ఉచితం కాదని భావం).

క. **'విను! మప్పలుకులు పాటిగఁ। గొని దుర్యోధనునితోడఁ గొంటిని బగ ము**
న్ను; నిజంబుగ నెఱుఁగను వీఁ। డని రాధేయునకు వెఱచునని యే నిన్నున్.' **60**

ప్రతిపదార్థం: వినుము; ఆ+పలుకులు= ఆ మాటలు; పాటిగన్+కొని= ఆధారంగా చేసికొని; దుర్యోధనుని తోడన్; మున్ను= ఇంతకుముందు; పగ కొంటిని= పగతెచ్చుకొన్నాను; వీఁడు= అర్జునుడు; అనిన్= యుద్ధంలో; రాధేయునకున్= కర్ణుడికి; వెఱచును+అని= భయపడతాడని; ఏ నిన్నున్= నేను నిన్ను; నిజంబుగన్+ఎఱుఁగను= నిజంగా తెలుసుకోలేదు.

తాత్పర్యం: వినుము. ఆ మాటలు నమ్మి, దుర్యోధనుడితో వైరం తెచ్చుకొన్నాను. అర్జునుడు కర్ణుడితో యుద్ధమంటే వెనుకాడుతాడని నిజంగా అప్పుడు నాకు తెలియదు.

సీ. **'దేవత లిచ్చిన తేరు నశ్వంబులుఁ। గపికేతనంబును గలవు; దైవి**
కంబు చే నున్నది; గాండీవ మనఁ దాటి। యంతవి ల్లది గాక, హరి రథంబు
గడపెడు నటె! పరికర మిట్టి దై యుండ। నెట్లు కర్ణున కోడి యిట్టు వలియఁ
బాఱుతెంచితి నీవు? భండనంబునఁ గర్ణుఁ। గని పాఱు దని సుయోధనుఁడు సెప్పె;

తే. నది నిజంబుగఁ గొనక బే లైతి; నాదు । బేలతనమునఁ గాదె పాంచాల మాత్స్య
పాండ్యులాదిగఁ గలిగిన బంధుమిత్త్ర । జనులు దెగటాఱి రప్రయోజనము గాఁగ.' 61

ప్రతిపదార్థం: దేవతలు+ఇచ్చిన తేరు= దేవతలిచ్చిన రథం; అశ్వంబులు= గుర్రాలు; కపికేతనంబును= కపిధ్వజం; కలవు= ఉన్నాయి; దైవికంబు= దివ్యశక్తి సంపన్నమైన; గాండీవం; చేన్+ఉన్నది= చేతిలో ఉన్నది; గాండీవమనన్= ఆ గాండీవమనే; తాటియంత= తాటిచెట్టంత; విల్లు= ధనుస్సు; అదిగాక= అదికూడ గాక; హరి= కృష్ణుడు; రథంబు గడపెడునటె!= రథం తోలునట!; పరికరము= ఆయుధసామగ్రి; ఇట్టిదై ఉండగన్= ఇటువంటిదై ఉండగా; ఎట్లు కర్ణునకున్= ఎట్లా కర్ణుడిచేత; ఓడి= పరాజితుడవై; ఇట్టు= ఈ విధంగా; వలియన్= శక్తిహీనుడవై; నీవు; పాఱితెంచితి(వి)?= పారిపోయి వచ్చినావు?; భండనమునన్= యుద్ధంలో; కర్ణునిన్= కర్ణుడిని; కని= చూచి; పాఱుదు(వు)+అని= పరుగెత్తిపోతావని; సుయోధనుఁడు; చెప్పెన్= ముందే చెప్పాడు; అది= దానిని; నిజంబుగన్= యథార్థమని; కొనక= గ్రహించక; బేల+ఐతిన్= మోసపోయిన వాడనైతిని; నాదుబేలతనమునన్ కాదె!= నా అమాయకత్వంవలననే కదా!; పాంచాల మాత్స్యపాండ్యులు; ఆదిగాన్+కలిగిన= మొదలైన; బంధుమిత్త్రజనులు= చుట్టాలు, స్నేహితులు; అప్రయోజనము కాఁగన్= ఏ ప్రయోజనమూ లేకుండా; తెగటాఱిరి= చచ్చారు.

తాత్పర్యం: 'దేవత లిచ్చిన రథం, అశ్వాలు, కపిధ్వజం నీకున్నాయి. వీటికి తోడు దైవశక్తి శోభితమైన గాండీవం నీచేతనున్నది. ఈ గాండీవం తాటిచెట్టంత పొడవు, లావు, చేవగల్గింది. ఇవికాకుండా శ్రీహరియే సారథియై ఉన్నాడు. నీ యుద్ధసామగ్రి ఇంత గొప్పదై ఉండగా, నీవెట్లా కర్ణుడి దెబ్బకు ఆగలేక పిరికిపందవై పరుగెత్తి వచ్చావు? నీవు యుద్ధంలో కర్ణుడిని ఎదిరించలేవని దుర్యోధనుడు ముందుగానే చెప్పాడు. ఇది నిజమని నమ్మలేక మోసపోయి ఇంత తెచ్చుకొన్నాను. నా అమాయికత్వంవల్లనే కదా యుద్ధానికి దిగి, పాంచాలురు, మాత్స్యులు, పాండ్యులు మొదలైన బంధుమిత్త్రులంతా నిష్ప్రయోజనంగా ప్రాణాలు కోల్పోయారు!'

వ. అని పలికి, కృష్ణునాననం బాలోకించి; 'కర్ణు నిగ్రహించుట యశక్యం బయ్యెఁ; సుయోధనాది కౌరవులు గనుంగొన వానిచేతం బరిభవింపఁబడి యేను జీవంబుతో నునికిం గడచిన కష్టంబునుం గలదే? యది యట్లుండె; నేను జావు దప్పివచ్చుట వడముడి కతంబునం గలిగె; నతం డొక్కరుండును బ్రాణంబులు డాఁపక పరబలంబులు బడలువడం బోరుచున్నవాఁడు.' 62

ప్రతిపదార్థం: అని పలికి; కృష్ణు+ఆననము= కృష్ణుడి ముఖం; ఆలోకించి= చూచి; కర్ణున్= కర్ణుడిని; నిగ్రహించుట= ఎదిరించి ఆపుట; అశక్యంబు+అయ్యెన్= సాధ్యం కాకపోయింది; సుయోధనాది కౌరవులు= దుర్యోధనుడు మొదలైన కౌరవులు; కనుంగొనన్= చూస్తూ ఉండగా; వానిచేతన్= ఆ కర్ణుడిచేత; పరిభవింపఁబడి= అవమానించబడి; ఏను= నేను; జీవంబుతో ఉనికిన్= ప్రాణాలతో బ్రతికి ఉండుటకంటె; కడచిన కష్టంబునున్ కలదె?= అతిశయించిన కష్టం కలదా?; అది అట్లుండెన్= ఆ సంగతి అట్లుండనిమ్ము; నేను చావు తప్పివచ్చుట; వడముడి= భీముడి; కతంబునన్= వలన; కలిగెన్= జరిగినది; అతండు+ఒక్కరుండునున్= అతడొక్కడే; ప్రాణంబులు డాఁపక= ప్రాణాలు దాచిపెట్టుకొనకుండా; పరబలంబులు= శత్రుసైన్యాలు; బడలువడన్= అలసిపోయేటట్లు; పోరుచున్+ఉన్నవాఁడు= పోరుతున్నాడు.

తాత్పర్యం: అని పలికి ధర్మరాజు కృష్ణుడివైపు చూచి 'కర్ణుడిని జయించటం అసాధ్యమైన పని అయింది. దుర్యోధనాది కౌరవవీరులు చూస్తూ ఉండగా కర్ణుడిచేత నేను అవమానించబడి ప్రాణాలతో ఉండటంకంటె బాధాకరమైన విషయమేముంటుంది? అది అట్లా ఉండనిమ్ము. భీముడివలన నేను చావుతప్పి బయటపడ్డాను. అతడొక్కడే ప్రాణాలను లెక్కపెట్టక శత్రుసేనలు బడలిపోయేటట్లు యుద్ధం చేస్తున్నాడు?'

క. అని, పార్థుఁ జూచి యతఁ డి। ట్లను; 'నేఁ డభిమన్యుఁ డొండె హైడింబుం డొం
డెను గలిగిన ని ట్లగునే? విను! మును చేసినది యనుభవింపఁగ వలదే?' 63

ప్రతిపదార్థం: అని పార్థున్+చూచి= అని పలికి అర్జునుడిని చూచి; అతఁడు; ఇట్లు+అనున్; నేఁడు; అభిమన్యుఁడు; ఒండెన్= కాని; హైడింబుండు= ఘటోత్కచుడు; ఒండెను= కాని; కలిగినన్= ఉండి ఉంటే; ఇట్లు+అగునే?= ఈ విధంగా జరిగేదా?; విను; మును చేసినది= చేసినదాని ఫలితం; అనుభవింపఁగ వలదే?= అనుభవించక తప్పుతుందా?

తాత్పర్యం: అట్లా పలికి ధర్మరాజు అర్జునుడిని చూచి ఇట్లా అన్నాడు: 'ఈనాడు అభిమన్యుడు గాని, ఘటోత్కచుడు గాని ఉండి ఉంటే ఇట్లా జరిగేదా? వినుము. పూర్వకర్మఫలం అనుభవించక తప్పుతుందా?

ఆ. 'నిన్నుఁ దృణముఁ జేసి, న న్నాదురాత్ముండు। బంధుహీనుఁ బోలెఁ బఱుప, నెదరు
దోఁచి నప్పు డొదవి తొలఁగించువానిఁ గా। కన్యు నేల బంధుఁ డండ్రు జనులు?' 64

ప్రతిపదార్థం: నిన్ను, తృణమున్+చేసి= నిన్ను గడ్డిపోచ మాదిరిగా చేసి; నన్నున్+ఆ దురాత్ముండు= నన్నా దుర్మార్గుడు; బంధుహీనున్+పోలెన్= చుట్టపక్కాలు లేనివానినివలె; పఱుపన్= పాటుబడజేయగా; ఎడరు తోఁచినప్పుడు= ఆపద కలిగినప్పుడు; ఒదవి= ఆదుకొని; తొలఁగించు వానిన్+కాక= నివారించేవాడినిగాక; అన్యున్= ఇతరుని; ఏల= ఎట్లు; జనులు= ప్రజలు; బంధుఁడు+అండ్రు?= చుట్టమంటారు?

తాత్పర్యం: దుర్మార్గుడు నిన్ను గడ్డిపోచను చేశాడు. నన్ను బంధువుల ఆదరణ లేని దీనుడిగా జేసి కష్టపెట్టాడు. ఆపద కలిగినపుడు సహాయపడి ఆపదను వారించేవాడినిగాక, ఇతరుడిని ప్రజలు ఎందుకు చుట్టమంటారు?

విశేషం: అలంకారం: అర్థాంతరన్యాసం.

చ. 'హరి గలుగంగ నేటికి? భయంబున వచ్చితి నీదు గాండివం
బెరవుగ నిచ్చి, నీవు నొగ లెక్కి, హరిన్ రథిఁ జేయఁగన్న ని
ష్ఠుర భుజవిక్రమోగ్రుఁ డగు సూతతనూభవుఁ దత్సహాయులం
బొరిగొనఁడే సుయోధనునిపోఁడిమి దూలఁగ నొక్కమాత్రలోన్?' 65

ప్రతిపదార్థం: హరి, కలుగంగన్= కృష్ణుడు అండగా ఉండగా; ఏటికిన్?= ఏల?; భయంబునన్ వచ్చితి(వి)= భయపడి వచ్చావు; నీదు గాండివంబు= నీ గాండీవాన్ని; ఎరవుగన్+ఇచ్చి= తాత్కాలికంగా ఇచ్చి, నీవు నొగలు+ఎక్కి= నీవు తేరునొగలెక్కి, సారథివై; హరిన్, రథిన్= కృష్ణుడి రథంలో కూర్చున్నవాడినిగా; చేయన్ కన్నన్= చేయగలిగితే; నిష్ఠుర= తీవ్రమైన; భుజవిక్రమోగ్రుఁడు అగు= బాహుబల విజృంభణతో భయంకరుడైన; సూత తనూభవుడిన్= కర్ణుడిని; తత్సహాయులన్= అతనికి తోడ్పడేవారిని; పోడిమి= ఒప్పు; తూలఁగన్= తగ్గిపోయేటట్లు, ఒక్క మాత్రలోన్= ఒక్క క్షణంలో; పొరిగొనడే?= చంపివేయడా?

తాత్పర్యం: కృష్ణుడు అండగా ఉండగా భయపడి ఎందుకు వచ్చావు? నీవు గాండీవాన్ని ప్రస్తుతం కృష్ణుడికిమ్ము. నీవు నొగలెక్కి కూర్చుండి రథచోదకుడివగుము. ఆయనను రథికునిగా చేయుము, భుజబలంతో తీక్ష్ణరూపుడైన కర్ణుడిని, అతడికి అండగా నిలిచిఉన్న వారిని, క్షణంలో ఆయన పడగొట్టడా?

ఆ. 'గొంతి కడుపునందుఁ గొడుకుచూలై నీవు । దోఁపకుండ వైతి; తోఁచినట్టి
పిండ మెడలి యైనఁ బిదప దిగంబడ । దయ్యె; నింత పుట్ట దట్టు లైన.' 66

ప్రతిపదార్థం: నీవు= నీవు(అర్జునుడవు); గొంతి కడుపునందున్= కుంతీదేవి గర్భంలో; కొడుకుచూలు+ఐ= మగబిడ్డవై; తోఁపకుండవు= పుట్టకుండ; ఐతి(వి)= ఉండకపోయావు; తోఁచినట్టి= పుట్టటానికి ఏర్పడిన; పిండము= పిండం; ఎడలి+ఐనన్= స్రావమై పోయినట్లయి; పిదప= తరువాత; దిగన్+పడదు+అయ్యెన్= దూసి క్రిందపడకపోయింది; అట్టులు+ఐనన్= ఆ విధంగా గర్భస్రావమై ఉన్నట్లయితే; ఇంత పుట్టదు= ఇంత జరిగేది కాదు.

తాత్పర్యం: కుంతీగర్భంలో నీవు మగపిండంగా ఏర్పడకుండా ఉండవలసింది. ఒకవేళ ఏర్పడినా ఆ పిండం ఆ తరువాత దూసిపోయి క్రింద పడి ఉండవలసింది. అట్లా అయినట్లయితే ఇంత జరిగేది కాదు.

అర్జునుఁడు తన్ను ధర్మజుఁ డాడిన పలుకులకుఁ గోపించి యతని తల నఱుక వాలు పెఱికికొనుట (సం. 8-49-1)

సీ. అనినఁ, గృపాణంబుఁ గొని సవ్యసాచి య । వ్విభు వ్రేయఁ దలఁచిన, విష్ణుఁ డెఱిఁగి,
'వాలు గేల నమర్ప వలసిన పని యేమి? । కౌరవు లియ్యెడ లేరు; మనము
ధరణీశ్వరుని సేమ మరయంగ వచ్చితి; । మీతని కుశల మి ట్లేర్పడంగఁ
గంటిమి; సంతోషకాలంబు గా కిది । క్రోధ కాలమె? వధ్యకోటి యిచట

ఆ. నేది గాఁగ నలిగి తీ' వని పలికిన । రూక్షభంగి యగు కటాక్షదృష్టి
యా నరేంద్రుమీఁద నడరంగ నర్జునుఁ । డ మ్మురారి కిట్టు లనియె నధిప!' 67

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! ధృతరాష్ట్రా!; అనినన్= ధర్మరాజు ఆ విధంగా అనగా; సవ్యసాచి= అర్జునుడు; కృపాణంబు కొని= ఖడ్గం చేపట్టి; ఆ+విభున్= ఆ ధర్మజుడిని; వ్రేయన్+తలఁచినన్= కొట్టవలెనని అనుకోగా; విష్ణుఁడు, ఎఱిఁగి= కృష్ణుడు తెలుసుకొని; వాలు= పదునైన కత్తిని; కేలన్+అమర్పన్+వలసిన పని ఏమి?= చేతబట్టవలసిన అవసరమేమి వచ్చింది?; కౌరవులు; ఈ+ఎడన్ లేరు= ఇక్కడ లేరుగదా; మనము; ధరణి+ఈశ్వరుని= రాజుయొక్క; సేమము+అరయంగన్= క్షేమాన్ని తెలిసికొనుటకు; వచ్చితిమి; ఈతని; కుశలము= క్షేమస్థితి; ఇట్లు+ఏర్పడంగన్= ఈ విధంగా ఉండగా; కంటిమి= కనులారా చూచాము; ఇది సంతోష కాలంబుగాక; క్రోధకాలమె?= కోపంతో పగతీర్చుకొనే సమయమా?; వధ్యకోటి= చంపదగిన శత్రు సమూహం; ఇచటన్; ఏది గాఁగన్= ఎవరున్నారని; ఈవు= నీవు; అలిగితివి?= కోపపడ్డావు?; అని పలికినన్= అని అనగా; రూక్షభంగి అగు= కోపగించుకొనే విధం కలదియైన; కటాక్షదృష్టిని= క్రీగంటి చూపును; ఆ నరేంద్రుమీఁదన్; అడరంగాన్= వ్యాపింపచేయగా; అర్జునుఁడు; ఆ మురారికిన్= ఆ కృష్ణుడితో; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: ధర్మరాజు పైవిధంగా పలికిన తరువాత కవ్వడి కత్తిని లాగి ఆ రాజును నరకదలచుకొనగా, కృష్ణు డిది గమనించి 'కత్తిని చేతపట్టవలసినపని ఏమి వచ్చింది? మన విరోధులైన కౌరవులిక్కడ ఎవరూ లేరే? మనం రాజు క్షేమం తెలిసికొనవచ్చాము. ఆయన పరిస్థితి క్షేమంగా ఉండటం చూచాము. ఇది సంతోషించవలసిన సమయమే గాని కోపపడవలసిన సమయం కాదే! ఇక్కడ చంపవలసిన విరోధులెవరున్నారని క్రోధమూర్తివైనావు? అని అనగా,

కోపంవలన ఏర్పడిన కంటి ఎరుపు ఇంకా ఆరకుండగానే క్రీగంటి చూపులను ఆ రాజుపై ప్రసరింపజేసి, అర్జునుడు మురారితో ఇట్లా అంటున్నాడు.

విశేషం: కోపంతో చెలరేగిన వ్యక్తిని పరిహాసపు మాటలతో చల్లారజేసి నిష్ఠుర కార్యోన్ముఖతనుండి విరమింపజేయడం నాణ్యమైన పద్ధతి. ఇది ఇక్కడ చక్కగ వ్యక్తమైంది.

క. 'విను! మొరులకు గాండివ మి । మ్మని, న న్నెవ్వండు పలికె నతనిశిరము గ్ర
క్కున బగులవ్రేయుటకుఁ జే । సినవాఁడఁ బ్రతిజ్ఞ నాదు చిత్తములోనన్.' 68

ప్రతిపదార్థం: వినుము; ఒరులకున్= ఇతరులకు; గాండివము+ఇమ్మని; నన్ను+ఎవండు, పలికెన్= నాతో ఎవడు పలికాడో; అతడి శిరము= అతడి శిరస్సు; గ్రక్కునన్= వెంటనే; పగులవేయుటకున్= పగుల కొట్టుటకు; నాదుచిత్తము లోనన్= నా మనస్సులో; ప్రతిజ్ఞ చేసినవాఁడన్= ఒట్టుపెట్టుకొన్నవాడనై (ఉన్నాను).

తాత్పర్యం: 'ఇతరులకెవరికైనా నా గాండీవాన్ని ఇమ్మని ఎవరు అంటారో అట్టివాడి తలను వెంటనే పగులగొట్టాలని మనసులో ప్రతినబూని ఉన్నాను.'

తే. 'ఇట్టికష్టపు గేలికై యిట్లు సేయఁ । బ్రతిన వట్టుట దగదె? యిప్పలుకు నీవు
వినఁగ నితఁ డాడ, నిమ్మహీవిభుఁడు ధర్మ । వంతుఁ డగుఁగాక చంపనవలయుఁ గృష్ణ!' 69

ప్రతిపదార్థం: కృష్ణ!; ఇట్టి= ఇటువంటి; కష్టపు= కష్టం కలిగించే; గేలికై= పరిహాసానికి తగినట్లుగా; ఇట్లు చేయన్= ఇట్లా చేస్తానని; ప్రతిన పట్టుట= ప్రతిజ్ఞ చేయటం; తగదె?= ఉచితమై ఉండలేదా?; ఈ+పలుకులు= ఈ మాటలు; నీవు వినఁగన్= నీవు వింటుండగానే; ఇతఁడు+ఆడన్= ఇతడు పలుకగా; ఈ+మహీవిభుఁడు= ఈ రాజు; ధర్మవంతుఁడు+అగున్+గాక= ధర్మశీలుడగుగాక; చంపన్+అ వలయున్= తప్పక తుదముట్టించాలి.

తాత్పర్యం: కృష్ణా! 'మనసు నొప్పించే ఇటువంటి ఎగతాళిమాటలకు తగినట్లుగా, తల తరుగుతానని బాస చేయటం తగి ఉండలేదా? ఇంతకూ ఈ మాటలు నీ ఎదుటనే పలికి ఉన్నాడు. ఈ చులకనమాటలు పలికిన భూపాలుడు సత్యధర్మపరాయణుడైనప్పటికి ఇతడిని వెంటనే చంపివేయాలి.'

వ. 'చంపి పాలిత ప్రతిజ్ఞుండ నైన నాకు నసత్యంబు రాకుండఁ బరిహరించెద; దీనికి నీ వేమి సెప్పెదవు? సెప్పుము! నీవు జగత్కృత్యసాకల్యవేదివి; నీ చెప్పినట్ల చేయంగలవాఁడ' ననుటయు, నచ్యుతుండు 'పో పా మ్మెక్కడివాఁడ'వని యదల్చి వెండియు ని ట్లనియె: 70

ప్రతిపదార్థం: చంపి= అటువంటివాడిని చంపి; పాలిత= ఆచరించబడిన; ప్రతిజ్ఞుండను+ఐ= శపథం కలవాడనై; నాకున్; అసత్యంబు= ఆడినమాట తప్పినాడన్న అపవాదం; రాకుండ; పరిహరించెదన్= నివారిస్తాను; దీనికిన్; నీవు+ఏమి చెప్పెదవు; చెప్పుము; నీవు; జగత్కృత్య= లోకం పాటించదగిన; సాకల్య= సమస్తాన్ని; వేదివి= తెలిసినవాడివి; నీ చెప్పినట్లు= నీవు చెప్పినట్లు; చేయన్+కలవాఁడన్= చేయగలవాడను; అనుటయున్; అచ్యుతుండు= కృష్ణుడు; పోపొమ్ము= పోవయ్యా చాలు; ఎక్కడివాఁడవు!= ఎక్కడినుండి వచ్చావయ్యా!; అని; అదల్చి= బెదిరించి; ఇట్లు+అనియెన్; (కృష్ణుడు కుంతి మేనల్లుడు, అర్జునుని బావమరిది, ఆ చనువు ఈ మాటలలో కనబడుతున్నది.)

తాత్పర్యం: 'చంపి, ప్రతిజ్ఞ పాలించినవాడనైతే, అసత్యదోషం రాకుండా నివారించుకొంటాను. దీనికి నీవేమి అంటావు? చెప్పుము. నీవు లోకవ్యవహారాలన్నీ తెలిసినవాడివి. నీవు చెప్పినట్లు చేస్తాను!' అన్నాడు అర్జునుడు. శ్రీకృష్ణుడు 'పోవయ్యా! ఎక్కడివాడవయ్యా నీవు?' అని గద్దించి మళ్ళీ ఇట్లా అన్నాడు:

ఆ. 'నీకు వృద్ధసేవ లేకున్కి యెఱుఁగంగ । నయ్యె; రిత్త యిట్టు లడిచిపడుటఁ
బట్టి; ధర్మవిధి విభాగజ్ఞు లైన వా । రేల చేయఁ జొత్తు రిట్టిదాని?' 71

ప్రతిపదార్థం: రిత్త= ఊరకే; ఇట్టుల; అడిచి పడుటన్ పట్టి= కోపంతో త్రుళ్లిపడే కారణంగా; నీకున్; వృద్ధసేవ= పెద్దలను సేవించటం; లేక+ఉన్కి= అలవాటులేదన్న సంగతి; ఎఱుఁగంగన్+అయ్యెన్= తెలియవచ్చినది; ఇట్టులు= ఈ విధంగా (ఇట్టి తొందరపాటును); ధర్మవిధి= ధర్మశాస్త్ర ఆదేశాలయొక్క; విభాగజ్ఞులు+ఐనవారు= విషయాలను వేరుచేయగల విధానాన్ని తెలిసినవారు; ఇట్టి దానిన్= ఇటువంటి ఉల్లంఘనాన్ని; ఎందుకు; చేయన్+చొత్తురు?= చేయపూనుకొంటారు?

తాత్పర్యం: 'తగిన కారణం లేకుండానే నీవు ఇట్లు ఎగసిపడటాన్ని బట్టి చూస్తే పెద్దలను గౌరవించడం నీకు తెలియదన్న విషయం బయటపడినది. ధర్మశాస్త్రసూత్రాలను విభజించి అందున్న సూక్ష్మవిషయాలను తెలిసికొన్న వారు ఇట్టిపని చేయటాని కెందుకు పూనుకొంటారు?

క. 'చేయంగ వలయువానిం । జేయుట, యిట్టివియె కొన్ని చేయకునికి, ధ
ర్మాయత్తచిత్తుఁడై నా । నా యోగ్యస్థలము లెఱిఁగి నడవఁగ వలదే!' 72

ప్రతిపదార్థం: చేయంగ వలయువానిన్= చేయవలసినవాటిని; చేయుట; ఇట్టివియె= ఇటువంటివే; కొన్ని చేయక+ఉనికి= కొన్నిటిని చేయకుండా ఉండటం; ధర్మ+ఆయత్తచిత్తుఁడు+ఐ= ధర్మానికి అధీనమైన మనస్సు కలవాడై; నానా యోగ్య స్థలములు= అనేకములైన తగిన తావులను (విషయాలను) ఎఱిఁగి; నడవఁగ వలదే?= ప్రవర్తించవలసి ఉన్నది కదా!

తాత్పర్యం: చేయవలసిన వాటిని చేయటం, ఇటువంటివే కొన్ని చేయకుండా ఉండటం, ధర్మానికి అధీనమైన మనస్సు కలవాడై, చేయదగిన వివిధ విషయాలు తెలుసుకొని నడుచుకోవాలి కదా.

క. 'సత్యంబు నహింసయు నను । నత్యుత్తమధర్మయుగళ మందు, నహింసన్
సత్యము గాచుట ధర్మ, మ । సత్యమున నహింసఁ గావఁ జను నండ్రు బుధుల్.' 73

ప్రతిపదార్థం: సత్యంబు; అహింసయున్; అను; అతి+ఉత్తమ= మిక్కిలి శ్రేష్ఠములైన; ధర్మ= ఆచరణయోగ్యములైన; యుగళము+అందున్= జంటలో; అహింసన్= అహింసచే, సత్యము; కాచుట= రక్షించటం; ధర్మము= న్యాయసమ్మతమైన సూత్రం; అసత్యమునన్= అసత్యముతో; అహింసన్ కావన్= అహింసను కాపాడుట; చనున్= తగును; (అని) బుధులు= వివేకవంతులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: సత్యం, అహింస - అనే ఈ రెండు ఉత్తమధర్మాలలో, అహింసతో సత్యాన్ని కాపాడటం ధర్మం. అయినా అసత్యంతో అహింసను కూడ కాపాడతగునని జ్ఞానధనులంటారు.

ఆ. 'కర్మసూక్ష్మభంగి గానక యిమ్మెయి । సత్యరక్షణంబు సలుపుపొంటె
భ్రాత ధర్మపరుఁడు రా జిమ్మహాత్ముఁ జం । పఁగఁ దలఁచుట ధర్మపథము గాదు.' 74

ప్రతిపదార్థం: కర్మసూక్ష్మభంగి= కార్యాచరణంలోని (ధర్మ) సూక్ష్మతను; కానక= కనుగొనక; ఈ+మెయిన్= ఈ ప్రకారంగా; సత్య రక్షణంబు= నిజాన్ని కాపాడటం; సలుపుపొంటెన్= చేయుటకు; భ్రాత ధర్మపరుఁడు= (నీ)అన్నగారు, ధర్మాచరణం తెలిసినవాడు; రాజు= మనలను పాలించేవాడు అయిన; ఈ+మహాత్మున్; చంపఁగన్ తలఁచుట= చంపాలనుకొనటం; ధర్మపథము కాదు= ధర్మమార్గం (న్యాయమైన విధానం) కాదు.

తాత్పర్యం: చేయవలసిన పనిలో ఉండే (ధర్మ) సూక్ష్మతను తెలుసుకోకుండా, సత్యాన్ని రక్షించటానికని, తోబుట్టువు, ధర్మాత్ముడు, ప్రభువు అయిన ఈ మహానుభావుడిని చంపాలనుకొనటం ధర్మమార్గంకాదు.

క. 'విను! పిన్ననాఁడు నీ వీ । యనుచిత మగువ్రతము వట్టి; తది గాకయు, బె
ట్టనృతము సూనృతమును నీ । కనియెడు చందంబు బుధులు గయికొన రెందున్.' 75

ప్రతిపదార్థం: విను; పిన్ననాఁడు= పసితనంలో; నీవు; ఈ అనుచితము+అగు= ఈ తగని; వ్రతమును= దీక్షాచరణ విధానాన్ని; పట్టితి(వి)= కైకొన్నావు; అదిగాకయున్= అంతే కాకుండా; బెట్టు= దుర్లభమైన (అధికమైన); అనృతము= బొంకు;? సూనృతము= నిజం (వీటి విషయంలో); నీవు కనియెడు= నీవు చూచే; చందంబు= విధం (నీవు అనుకొనే విధంగా); బుధులు= పండితులు; ఎందున్= ఏ విధంగా గూడ; కయికొనరు= చేపట్టరు.

తాత్పర్యం: బాగా వినుము. నీవు చిన్నప్పుడు లోకపు తీరు తెలియని ప్రాయంలో ఈ యోగ్యం కాని వ్రతాన్ని చేపట్టావు. అంతే కాకుండా పాలించటం కష్టమైన సత్యాసత్యాల విషయంలో నీవు అనుకొనే విధాన్ని, విషయం తెలిసిన పెద్దలెవ్వరూ ఆమోదించరు.'

క. అది యెట్లంటేని; 76

తాత్పర్యం: అది ఎట్లా అంటావా? (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'ప్రాణహాని వచ్చుపట్టున, సర్వధ । నాపహార వేళయందు నడపు
సత్య మనృత మం; డ్రసత్యంబు సూనృత । మని పరిగ్రహింతు రార్యజనులు.' 77

ప్రతిపదార్థం: ప్రాణహాని, వచ్చు, పట్టునన్= ప్రాణానికి కీడు కలుగనున్న సమయంలో; సర్వధన= ఉన్న ధనమంతా; అపహార వేళ అందున్= మోసంగా దొంగిలించబడే సమయంలో; నడపు= సాగించే; సత్యము; అనృతము+అంద్రు= కల్ల అంటారు; అసత్యంబు= అబద్ధాన్ని; సూనృతము+అని= సత్యమని; ఆర్యజనులు= పూజ్యులు; పరిగ్రహింతురు= చేపట్టుతారు.

తాత్పర్యం: 'ప్రాణానికి ముప్పు ఏర్పడినప్పుడు, ఉన్న ఆస్తినంతా దోచుకొని పోయేటప్పుడు చెప్పే నిజాన్ని కల్లగా, బొంకును సత్యంగా పెద్దలు స్వీకరిస్తారు.'

విశేషం: ప్రాణ రక్షణం చేసిన అబద్ధం యోగ్యమైనదవుతుంది గాని, కొంపలు కూల్చిన సత్యం ఎట్లా సుగుణం అవుతుంది? ప్రాణహితమైనదే సత్యమని గదా ప్రమాణవాక్యం! నిజం చెప్పేందుకు తెలివితో పనిలేదుగాని, అబద్ధం చెప్పేందుకే బుద్ధి వికాసం కావాలి.

వ. 'విను: పెద్దయు వినికి లేనివాఁడు కౌశికుండను నొక్కవిప్రుం డొక్క విశిష్ట గ్రామంబున కనతిదూరంబున సరిత్సంగమ పుణ్యక్షేత్రంబున వసియించి, సత్యంబ పలుకువాఁడ నని వ్రతంబు వట్టి, సత్యవాది యనం బ్రసిద్ధుండయి తపంబు సేయుచుండ; నొక్కనాఁడు, మ్రుచ్చులం గని వెఱచఱచి పఱతెంచిన జనులు గొంద అయ్యాశ్రమంబు చేరువం బొదలఁ దూఱి; రంత వెను తగిలి వచ్చు మ్రుచ్చు లత్తపోధనునికడ కేతెంచి, 'యిప్పు డిట వచ్చినవార లెటవోయి?' రని యడిగిన, నతండు సత్య విభాగ విధిజ్ఞుండు గామింజేసి, తన కసత్యంబు వాటిల్లు ననుశంక 'నీ గుల్మలతా గహనంబు సొచ్చి' రని చూపి చెప్పిన, నత్తెక్కలికాఱు వారలం జంపి ధనమ్ముగొని; రమ్ముని తద్వచన దోషంబున నరకప్రాప్తుం డయ్యె నను నితిహాసంబు విందుము, హింసాకరం బగు సత్యంబు ధర్మంబు గాదు; తొలుత వినిన దానిన పట్టి మూఢుండు పెద్దల నడిగి తెలిసికొనక వర్తించి దుర్గతిం బొందు; నింతవట్టు విచారించి యజాతశత్రుండు వధ్యుం డవుం, గాఁ డని నిశ్చయింపు' మనుటయు, నర్జునుం డిట్లనియె: 78

ప్రతిపదార్థం: విను; పెద్దయున్= ఎక్కువగా; వినికి లేనివాడు= పెద్దలు చెప్పిన మాటలు విని ఉండనివాడు; కౌశికుండు; అను విప్రుండు; ఒక్క= ఒకానొక; విశిష్ట గ్రామంబునకున్= మట్టు మర్యాద లెరిగిన పల్లెటూరికి; అనతి దూరంబునన్= ఎక్కువగాని దూరంలో (దగ్గరగా) ఉన్న; సరిత్సంగమ= నదులు గలసిన (కూడలిలో); పుణ్యక్షేత్రంబునన్; వసియించి= స్థావరం ఏర్పరచుకొని ఉంటూ; సత్యంబు+అ పలుకువాఁడను+అని= నిజమే పలుకుతానని; వ్రతంబు పట్టి= దీక్ష బూని; సత్యవాది అనన్; ప్రసిద్ధుండు+ఐ= పేరుమోసినవాడై; తపంబు చేయుచుండన్; ఒక్కనాఁడు; మ్రుచ్చులన్+కని= దొంగలను చూచి; వెఱచఱచి= భయపడి; పఱతెంచిన= పరుగెత్తి వచ్చిన; జనులు; కొందఱు; ఆ+ఆశ్రమంబు చేరువన్= ఆ ఆశ్రమ సమీపంలో; పొదల దూఱిరి; అంతన్; వెనుతగిలివచ్చు= వెన్నంటి వచ్చే; మ్రుచ్చులు= దొంగలు; ఆ+తపోధనుని కడకున్= తపస్సే ధనంగా గలిగిన ఆయన దగ్గరకు; ఏతెంచి= వచ్చి; ఇప్పుడు ఇచట వచ్చిన వారలు; ఎటు పోయిరి?= ఎక్కడికి పోయారు?; అని అడిగినన్; అతండు= ఆ ముని; సత్య విభాగ= సత్యంలో ఉన్న వేరు వేరు అంశాలను; విధిజ్ఞుండు= ఎరిగినవాడు; కామిన్+చేసి= కానందువలన; తనకున్; అసత్యంబు; వాటిల్లును= అంటుకొంటుంది; అనుశంకన్= అనే సందేహంతో; ఈ, గుల్మలతా, గహనంబున్= ఈ పొదల తీగలతో కూడిన చొరరాని ప్రదేశమును; చొచ్చిరి; అని; చూపి చెప్పినన్= వేలుపెట్టి చూపుతూ చెప్పగా; అ+తెక్కలికాఱు= ఆ దొంగలు; వారలన్; చంపి; ధనమ్ము కొనిరి; ఆ+ముని= ఆ తపసి; తద్+వచన, దోషంబునన్= ఆ మాటలవలన ఏర్పడిన పాపంతో; నరకప్రాప్తుండు= నరకం పొందిన వాడుగా; అయ్యెన్; అను= అనే; ఇతిహాసంబు= పరంపరగా చెప్పుకొంటూ వస్తున్న గాథను; విందుము= వింటున్నాము; హింసాకరంబు+అగు= పీడను కలిగించే; సత్యము; ధర్మంబు కాదు= శాస్త్ర సమ్మతం కాదు; తొలుత వినినదానిన్+అ; పట్టి= ముందు వినినదానినే అనుసరించి; మూఢుండు= తెలివితక్కువవాడు; పెద్దలన్+అడిగి తెలిసికొనక; వర్తించి= నడచుకొని; దుర్గతిన్= నరకమును; పొందున్= పొందుతాడు; ఇంతవట్టు= ఇంతవరకు; విచారించి= యోచించి; అజాతశత్రుండు= శత్రువులు లేని ధర్మరాజు (పదసార్థక్యం); వధ్యుండు= చంపదగినవాడు; అవున్+కాఁడు+అని= అవునో కాదో అని; నిశ్చయింపుము= నిర్ణయం తీసికొనుము; అనుటయున్= అనిన తరువాత; అర్జునుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: వినుము. పెద్దలనుండి ఎక్కువగా తెలిసికొనని కౌశికుడనే బ్రాహ్మణుడు ఒక మంచి గ్రామంలో కొద్ది దూరంగా ఉన్న నదీసంగమ పుణ్యక్షేత్రంలో నివసిస్తూ, సత్యమే పలకాలని వ్రతం పట్టి, సత్యవాది అని ప్రసిద్ధుడై, తపస్సు చేసికొంటూ ఉన్నాడు. ఒకనాడు దొంగలు వెంబడించగా కొందరు జనులు భయంతో పారివచ్చి, అతడి ఆశ్రమప్రాంతంలో ఉన్న పొదలలో దూరి దాగికొని ఉన్నారు. దొంగలు వచ్చి ఆ జనులు ఎక్కడికి వెళ్ళారని ఆ

తపస్విని అడిగారు. అతడు సత్యాసత్య నిరూపణ వివేకం లేనివాడు కావటంచేత తనకు అసత్యదోషం కలుగుతుందని భావించి, ఆ పొదరిళ్ళలో దాగికొన్న జనులను చూపించి చెప్పాడు. ఆ దొంగలు వారిని చంపి, వారి ధనాన్ని దోచుకొన్నారు. ఆ ముని తాను చేసిన దోషంవలన నరకాన్ని పొందాడు. ఈ ఇతిహాసం లోకంలో ప్రసిద్ధికెక్కింది. హింసకు దారితీసే సత్యం ధర్మం కాదు. తనకు తెలిసిందే ధర్మమని భావించి పెద్దలనడిగి తెలిసికొనని మూఢుడు దుర్గతి పొందుతాడు. ఈ తాత్పర్యాన్ని భావించి ధర్మరాజు వధ్యుడా? కాదా? అనే అంశాన్ని నిశ్చయించుము' అనగా విని అర్జునుడు ఈ విధంగా అన్నాడు:

తే. 'తల్లిదండ్రులమాడ్కి హితంబు సెప్పి । నన్ను ననుచితకృత్యంబునకుఁ దొలంగఁ
ద్రోచితివి! లోకమున నీకు గోచరంబు । గాని ధర్మ నిబోధంబు గలదె కృష్ణ?' 79

ప్రతిపదార్థం: కృష్ణ!= కృష్ణా!; తల్లిదండ్రుల మాడ్కి= తల్లిదండ్రులవలె; హితంబు= మేలు కలుగజేసే మాట; చెప్పి; నన్నున్; అనుచిత= యోగ్యంకాని; కృత్యంబునకున్= చేతకు; తొలంగన్ త్రోచితివి= దూరం చేశావు; లోకమునన్; నీకు; గోచరముగాని= మనస్సుకు తట్టని; ధర్మ= అనుసరించదగిన సన్మార్గములయొక్క; నిబోధంబు= ఎరుక; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: 'కృష్ణా! తల్లిదండ్రులవలె కార్యాచరణవిధానాన్ని తెలియజేసి, నన్ను అయోగ్యమైన కార్యం చేయకుండా బయట పడవేశావు. ఈ లోకంలో నీ బుద్ధికి తోచని ధర్మస్వరూపం కలదా?'

క. 'జనములు వృథాప్రతిజ్ఞుం । డని నను నిందింపకుండ, నగ్రజుఁడు సుఖం
బునికియుఁ గలిగెడునట్లుగ । ననుగ్రహముఁ జేసి, చేయునది పనుపు దగన్.' 80

ప్రతిపదార్థం: జనములు= లోకులు; వృథా ప్రతిజ్ఞుండు= పనికిమాలిన బాసలు చేసేవాడని; ననున్= నన్ను; నిందింపకుండఁగన్= నిందించకుండా; అగ్రజుండు= అన్న; సుఖంబు ఉనికియున్= హాయిగా ఉండుట; కలిగెడునట్లుగన్= ప్రాప్తించేవిధంగా; అనుగ్రహము చేసి= దయచూపి; చేయునది= అనుసరించవలసిన పద్ధతిని; తగన్= తగిన విధంగా పనుపుము= ఆజ్ఞాపించుము.

తాత్పర్యం: 'లోకులు నన్ను వ్యర్థ ప్రతిజ్ఞలు చేసేవాడని తిట్టకుండా, సోదరుడు సురక్షితంగా ఉండేటట్లు, ఏది చేయదగునో దయచేసి చెప్పుము.

వ. అనిన నతం డతని కిట్లనియె. 81

తాత్పర్యం: అనగా విని కృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు:

కృష్ణుఁడర్జునుఁ బ్రతిజ్ఞా భంగంబు గాకుండ ధర్మజు దూఱుమని చెప్పుట (సం. 8-48-64)

చ. 'అతిశిత కర్ణ బాణహతి నంగము నొచ్చిన దాన నల్గి, యి
ప్పతి నిను నివ్వఁ బల్కు టిది ప్రాభవ; మింతియె కాక, నీయెడన్
మతిఁ బటుకోపముం గలదె? మారుతసూనుఁడు నీవుఁ దమ్ములుం
జతుర వినీతి నీతని వశంబునఁ గాదె చరింతు రెప్పుడున్?' 82

ప్రతిపదార్థం: అతిశిత= మిక్కిలి వాడి అయిన; కర్ణ= కర్ణుడి; బాణహతిన్= బాణాల దెబ్బలచేత; అంగము= శరీరం; నొచ్చిన దానన్= బాధపడినందువలన; అల్గి= కోపించి; ఈ+పతి= ఈ రాజు; నినున్; నొవ్వన్, పలుకుట= నీకు వేదన కలిగేటట్లు మాట్లాడటం; ఇది; ప్రాభవము= ప్రభుత్వము; ఇంతియె కాక= ఇంతే కాకుండా; మతిన్= ఆయన మనస్సులో; నీ ఎడన్= నీ పట్ల; పటు కోపమున్ కలదె?= ఎక్కువ కోపమున్నదా? (లేదనుట); మారుత సూనుఁడు= వాయుపుత్రుడు- భీముడు; నీవున్= నీవు; తమ్ములున్; చతుర= చాకచక్యం గలిగిన; వినీతిన్= వినయవిధానంతో; ఈతని వశంబునన్+కాదె= ఈయన అధీనంలో ఉండేగదా; సదా= ఎప్పుడున్; చరింతురు?= నడచుకొంటున్నారు?

తాత్పర్యం: 'కర్ణుడు ప్రయోగించిన కరకుబాణాల దెబ్బచేత, శరీరం బాధపడినందువలన కోపంతో నీ మనస్సు బాధపడేటట్లు మాట్లాడటం ప్రభువైన ఇతనికి తగును. ఇంతేగాని ఆయన మనస్సులో కోపమనేది లేదు. భీముడు, నీవు, నీ తమ్ములు నేర్పుతోడి వినయవిధానంతో ఆయనకు వశవర్తులై ఎప్పుడూ నడచుకొంటున్నారు గదా!'

క. **'కావునఁ బ్రభుత్వ సంపద । నీ విభుఁ డాడినది యెల్ల నెగ్గుగొనక, నా**
చే వినుము; నీదు ప్రతినకు । నేవిధి సేయనగు దాని నేర్పడ ననఘా!' **83**

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; కావునన్; ప్రభుత్వ సంపదన్= అధికారంతో; ఈ విభుఁడు ఆడినది+ఎల్లన్= ఈ ప్రభువు పలికిన పలుకులన్నీ; ఎగ్గు కొనక= తప్పుగా భావించక; నీదు ప్రతినకున్= నీ ప్రతిజ్ఞకు; ఏది చేయన్+అగున్= ఏమి చేయ తగునో; దానిని; ఏర్పడన్= ఆ వివరం బాగా తెలిసేటట్లు; నాచేన్ వినుము= నా వలన వినుము.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! (మీ మీది) అధికారంతో, మీ అన్న పలికిన మాటలు తప్పుగా భావించక నీ ప్రతిజ్ఞ విషయం ఏమి చేయాలో నేను చెపుతా విను.

క. **'నీ విట్టివాఁడ వని ధర । ణీవిభునిం బలుకు; మదియ నీచంపుట సం**
భావించి, పిదపఁ బ్రణతుఁడ । వై వినయము సేయు చిత్తమలర నతనికిన్.' **84**

ప్రతిపదార్థం: నీవు; ఇట్టివాడవు అని; ధరణీ విభునిన్= రాజును; పలుకుము; అదియ= అదే; నీ చంపుట= నీవు అనుకొన్న వధ; పిదపన్= ఆ తరువాత; సంభావించి= గౌరవించి; అతనికిన్= ఆ ధర్మరాజుకు; చిత్తము+అలరన్= మానసం సంతోషించేటట్లు; ప్రణతుఁడవై= మ్రొక్కినవాడవై; వినయము చేయు(ము)= మర్యాద చూపుము.

తాత్పర్యం: నీవు చంపుతానన్న దానినే మనస్సులో పెట్టుకొని ఆ రాజును నీవిట్టివాడవని తిట్టుము. వెంటనే గౌరవంతో ఆయనకు సవినయంగా నమస్కరించుము. దానితో ఆయన మనస్సు సంతోషిస్తుంది.

వ. **అట్లయిన నసత్యదోషంబునకు గురువధపాతకంబునకుం దొలంగి, సమాహితుండ వగుదు; తదనంతరంబ కర్ణుని సమయింపఁ జనుటకు నమ్మనుజపతి యనుమతి వడయుద' మనుటయు, నప్పలుకుల కభినందించి, పురందరనందనుండు ధర్మనందను నుద్దేశించి.** **85**

ప్రతిపదార్థం: అట్లయినన్; అసత్యదోషంబునకున్= అబద్ధమాడిన తప్పిదానికి; గురువధ పాతకంబునకున్= గురువును చంపిన పాపానికి; తొలంగి= పరిహరించబడినవాడవై; సమాహిత చిత్తుండవు+అగుదు(వు)= కుదుటపడిన మనస్సు కలవాడవు కాగలవు; తదనంతరంబు+అ= ఆ తరువాత; కర్ణుని; సమయింపన్= చంపడానికి; చనుటకున్; ఆ+మనుజపతి= ఆ

రాజుయొక్క; అనుమతి వడయుదము= అనుజ్ఞను సంపాదించుదాము; అనుటయున్= అనగా; ఆ+పలుకులకున్= కృష్ణుడు ఆడిన ఆ మాటలకు; అభినందించి= కొనియాడి; పురందర నందనుండు= అర్జునుడు; ధర్మనందనున్ ఉద్దేశించి= ధర్మరాజుతో.

తాత్పర్యం: 'ఆ విధంగా అయితే అసత్యదోషము, గురువధాపాతకము తొలగి, నీ మనస్సు కుదుటపడుతుంది. తరువాత కర్ణవధకు ఆయన అనుమతి పొందుదాము' అని కృష్ణుడనగా, అర్జునుడు శ్రీకృష్ణుని కొనియాడి, అన్నగారితో (తరువాతి పద్యంతో అన్వయం)

మ. **'కనదస్త్రంబుల నుజ్జ్వలోద్భట గదాఘాతంబులం గాలఁ గే**
లను విద్విట్చతురంగ సంఘములు గూలం గేలి సల్పంగఁ జా
లిన యాభీముఁడు పల్కఁగాక నను; దోర్లీలాసమగ్రుండ వై
యనిలో నిల్వఁగ లేని నీ విటుల కీ డాడంగ నర్హుండవే?' **86**

ప్రతిపదార్థం: కనత్= ప్రకాశమానాలైన; అస్త్రంబులన్= దివ్యశక్తియుతాలైన బాణాలచే; ఉజ్జ్వల= ప్రకాశమానమైన; ఉద్భట= ఎక్కువైన; గదాఘాతంబులన్= గదల దెబ్బలచే; విద్విట్= శత్రువుల; చతురంగ= చతుర్విధసైన్యాల; సంఘములు= గుంపులను; కాలన్+కేలను= కాళ్ళతోనూ చేతులతోనూ; కూలఁగన్= పతనమయ్యేటట్లు; కేలి సల్పంగన్= క్రీడ సల్పుటకు; చాలిన ఆ భీముఁడు= తగినవాడైన ఆ భీముడు; ననున్; పల్కన్+కాక= అనునుకాక (నన్ను విమర్శించ తగినవాడు); దోర్లీలా= భుజబల ప్రదర్శనంలో; అసమగ్రుండవై= పూర్తి సామర్థ్యం లేనివాడవై; అనిలోన్= యుద్ధంలో; నిల్వఁగన్ లేని= నిలబడి పోరాడలేని; నీవు+ఇటుల; కీడు ఆడంగన్= తప్పుబట్టటానికి; అర్హుండవే?= తగినవాడవా? (కావనుట).

తాత్పర్యం: తళుకొత్తే దివ్యశరాలచే, తీవ్రమై శోభించే గదల దెబ్బలచే విరోధుల చతురంగ బలాలను కాళ్ళతో చేతులతో నుగ్గునూచ చేయగల ఆ భీముడు నన్ను పరిహసించి మాట్లాడవచ్చును గాని, భుజబల ప్రదర్శనంలో సామర్థ్యం లేక, యుద్ధభూమిలో నిలిచి పోరాడలేని నీకు, ఇట్లా నన్ను నొప్పించే చెడ్డమాటలాడే యోగ్యత ఎక్కడున్నది?'

క. **'న న్నెఱిఁగి యెఱిఁగి యిట్లనఁ । జన్నే? నీ జిహ్వ పెక్కు శకలములై పో**
కున్నది యే లొకొ? రణమున । నెన్నఁడు నీ వేమి సేసి తింత యనుటకున్?' **87**

ప్రతిపదార్థం: నన్నున్ ఎఱింగి ఎఱిఁగి= నా సంగతి బాగా తెలిసికూడ; ఇట్లు+అనన్= ఇట్లా మాట్లాడటం; చన్నే?= తగునా?; ఏలొకొ?= ఎందుకో?; నీ జిహ్వ= నీ నాలుక; పెక్కు శకలములు+ఐ= పలుముక్కలై; పోకున్నది?= పోకుండా ఉన్నది?; ఇంత అనుటకున్= ఇట్లా మాట్లాడటానికి; రణమునన్= యుద్ధంలో; ఎన్నఁడున్= ఎప్పుడైనా; నీవు ఏమి చేసితి(వి)?

తాత్పర్యం: 'నా సంగతి బాగా తెలిసి కూడా ఇట్లా మాట్లాడ తగునా? ఇట్లన్న నీ నాలుక పెక్కుముక్కలుగా ఎందుకు చీలిపోలేదో తెలియటం లేదు! ఇంతగా మాట్లాడేటందుకు, నీ వెప్పుడైనా యుద్ధంలో ఏమైనా చేసి ఉన్నావా చెప్పుము.

క. **'నకులుఁడు సహదేవుండును । బ్రకటభుజాస్ఫురణమున నరాతిబలము నే**
లకుఁ గోలకుఁ దెత్తురు; నో । రికి వచ్చినయట్టు లాడిరే యిబ్భంగిన్?' **88**

ప్రతిపదార్థం: నకులుఁడు; సహదేవుండును; ప్రకట= వెల్లడి చేయబడిన; భుజాస్ఫురణమునన్= బాహువిక్రమంతో; అరాతి బలమున్= శత్రుసేనలను; నేలకున్+కోలకున్+తెత్తురు= అతలాకుతలం చేస్తారు; ఈ+భంగిన్= ఈ విధంగా; నోరికిన్ వచ్చినట్లు= నోటికి వచ్చినట్లు; ఆడిరే?= పలికారా?

తాత్పర్యం: 'నకులుడు, సహదేవుడు తమ తమ బాహుబలంతో, విరోధి సైన్యాలను బాణాఘాతములతో అతలాకుతలం చేస్తారు. కాని, నీ మాదిరిగా ఇట్లా నోటికి వచ్చినట్లు మాట్లాడారా (వదరినారా)?'

సీ. **నీవు జూదం బాడఁగా వైరబంధంబు । కౌరవకోటితోఁ గలిగె; మనకు;**
రాజ్యనాశంబు నరణ్యవాసంబును । దాస్యదైన్యంబు నత్యంతదుఃఖ
ములుఁ దెచ్చికొంటి; సిగ్గొలయదు నీ మనం । బున నించుకేనియు; ననికిఁ జాల
కున్న వానికిఁ దాల్మి యొప్పగుఁ గాక! ప్ర । ల్లదములు పలికిన లాఘవంబు

తే. **సెందు మున్నేమి సేసినఁ జేసి; తింక । నైన దుర్బుద్ధితనములు మాని, తగిన**
పౌరుషము లేము సేయఁగ నూరకుండు; । మిడుమ వడువారు సైఁతురే యివ్విధంబు?' **89**

ప్రతిపదార్థం: నీవు జూదంబు; ఆడఁగాన్= ఆడినందువలననే; కౌరవ కోటితోన్= కౌరవ సమూహంతో; వైర బంధంబు= పగ లంకె; మనకున్; కలిగెన్; రాజ్యనాశంబున్= రాజ్యాన్ని పోగొట్టుకొనటం; అరణ్యవాసంబునున్= అరణ్యములో ఉండటం; దాస్య దైన్యంబున్= బానిస ఊడిగం చేయవలసిన హీనస్థితి; అత్యంతదుఃఖములున్= ఎడతెరిపిలేని కడగండ్లు; తెచ్చుకొంటివి(వి)= కలిగించుకొన్నావు; నీ మనంబునన్= నీ మనస్సులో; ఇంచుకేనియున్= కొంచెమైనా; సిగ్గు; ఒలయదు= కలుగదు; అనికిన్= యుద్ధానికి; చాలకున్నవానికిన్= శక్తిలేనివాడికి; తాల్మి= ఓర్పు; ఒప్పగున్+కాక!= తగి ఉంటుంది; ప్రల్లదములు= పొగరుమాటలు; పలికినన్= మాట్లాడితే; లాఘవంబు చెందున్= చులకనపాలు అవుతాడు; మున్ను+ఏమి చేసిన చేసితి(వి); ఇంకన్+ఐనన్= ఇకనైనా; దుర్బుద్ధితనము= దుష్టత్వం; మాని; తగిన= చాలినంత; పౌరుషములు= పురుషకారం; ఏము= మేము; చేయఁగన్= చేస్తూ ఉండగా (చూస్తూ); ఊరకుండుము; ఇడుమ= బాధ; పడువారు= అనుభవించేవారు; ఈ+విధంబున్= ఈ రీతిని; సైఁతురే?= ఓర్చుకొని ఊరకుంటారా?

తాత్పర్యం: నీవు జూదమాడినందువల్లనే కౌరవపక్షంతో మనకు పగ కలిగింది. దానితో మనకు రాజ్యం పోగొట్టుకొనటం, అడవులపాలుకావటం, సేవకవృత్తి నెరపటం మొదలైన భరించజాలని కష్టాలు తెచ్చిపెట్టావు. ఇంతైనప్పటికీన్నీ, ఇసుమంత సిగ్గు నీ మనస్సులో పుట్టటం లేదు. యుద్ధం చేయలేనివాడికి ఓర్పు రాణిస్తుంది. శక్తిలేనివాడు పొగరుబోతువాడివలె ఎగసి మాట్లాడితే చులకనైపోతాడు. ఇంతవరకు నీవు చేసినదేదో చేశావు. ఇంకనైనా వక్రబుద్ధిమాని, మేము పౌరుషం ప్రదర్శిస్తుంటే దుశ్చేష్టలు మాని ఊరకుండుము. కష్టాలు పడేవారు ఈ నీ పద్ధతిని సహిస్తారా?

వ. **అని యగ్రజు నప్రియంబులు పలికి, యంతరంగంబు సంతాపంబు వొంద నిట్టూర్పు నిగిడించి, యంతకుము న్నొఱఁ బెట్టిన వాలు వెతికినం గనుంగొని, పద్మనాభుండు 'గ్రమ్మఱ నిది యేమి?' యని యడిగిన, నతం 'డే నిన్నరనాథు నొవ్వనాడిన పలుకులకుఁ బ్రాయశ్చిత్తంబు దలఁద్రెంచుకొనుటయకా నిశ్చయించితి' ననుటయు, నమ్మహాత్ముఁ; 'డాత్మప్రశంస సేయు, మది మరణం బని పెద్దలు సెప్పుదు' రనుటయు. 'నీ చెప్పినట్ల చేయ కునికికిం గడచిన యధర్మంబును గలదె? యిట్లు సేయువాఁడన కాక' యని, యా ధనంజయుండు ధనుర్ధరుండై ధర్మనందనున కి ట్లనియె:** **90**

ప్రతిపదార్థం: అని; అగ్రజున్= అన్నను - ధర్మరాజును; అప్రియంబులు= మనస్సుకు గిట్టని నిష్ఠురోక్తులు; పలికి; అంతరంగంబు= మనస్సు; సంతాపంబు పొందన్= దుఃఖము పొందగా; నిట్టూర్పు= నిడుద అయిన శ్వాసను; నిగిడించి= పరపి; అంతకున్ మున్ను; ఒఱన్+పెట్టిన= ఒరలో పెట్టి ఉంచిన; వాలు= పెద్ద కత్తిని; పెఱికినన్= బయటకు లాగగా; కనుంగొని= చూచి; పద్మనాభుండు= కృష్ణుడు; క్రమ్మఱన్= మరలా; ఇది ఏమి?; అని అడిగినన్= అని అడుగగా; అతండు= ఆ అర్జునుడు; ఏన్= నేను; ఈ+నరనాథుని= ఈ ప్రభువును; నొవ్వన్+ఆడిన పలుకులకున్= మనస్సు బాధపడేటట్లు పలికిన పలుకులకు; ప్రాయశ్చిత్తంబు= పాప పరిహారంగా చేసేపనిగా; తల= నా తలను; త్రెంచుకొనుట+అ కాన్= నరుకుకొనుటే అని; నిశ్చయించితిన్= తీర్మానించుకొన్నాను; అనుటయున్= అని చెప్పగా; ఆ+మహాత్ముఁడు= ఆ కృష్ణుడు; ఆత్మప్రశంస చేయుము= నిన్ను నీవు పొగడుకొమ్ము; అది= అదే; మరణంబు+అని; పెద్దలు; చెప్పుదురు= అంటారు; అనుటయున్= అనగా; (తన్ను తాను పొగడుకొనటం తాను చావటంతో సమానమని జనవాక్యం); నీ చెప్పినట్లు= నీవు చెప్పిన ప్రకారం; చేయక ఉనికికిన్= చేయకుండా ఉండటంకన్నా; గడచిన= అతిశయించిన; అధర్మంబును; కలదే?= ఉన్నదా? ఇట్లు; చేయువాఁడను+అ కాక= చేసినవాడనే అగుదునుగాక; అని= పలికినవాడై; ఆ ధనంజయుండు= అర్జునుడు; ధనుర్ధరుండు+ఐ= ధనుస్సును చేబూనినవాడై; ధర్మనందనునకున్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని ధర్మరాజును నిష్ఠురోక్తులతో నిందించి, మనస్సులో బాధపడి, నిట్టూర్పులు వదలి, అంతకుముందు ఒరలో పెట్టి ఉంచిన కత్తిని పైకి తీయగా కృష్ణుడు గమనించి, 'మళ్ళీ ఇది ఏమిటి?' అని అడిగాడు. 'ధర్మరాజును తూలనాడినందుకు ప్రాయశ్చిత్తం తల నరకుకొనటమే సుమా!' అని అర్జునుడు సమాధానమిచ్చాడు. అప్పుడు శ్రీకృష్ణుడు 'నిన్ను నీవు పొగడుకొనుము. అది మరణంతో సమానమని పెద్దలంటారు.' అని సూచించాడు. అర్జునుడు ఆ సూచన నంగీకరించి, ధనుస్సును చేత దాల్చి ధర్మరాజుతో ఇట్లా పలికాడు.

ఆ. **'హరుఁడు దక్కఁ జాపధరుఁ డొరుఁ డెన నాకుఁ । ద్రిభువనముల లేఁడు! దిశలు గెలిచి**
తెచ్చి నీకుఁ బ్రీతి నిచ్చితిఁ, బెనుపారు । ధనము రాజసూయ దక్షిణలకు.' **91**

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు; తక్కన్= తప్ప; చాపధరుఁడు= విలుకాడు; ఒరుఁడు= ఇతరుడు; త్రిభువనములన్= ముల్లోకాలలో; నాకున్; ఎన= సమానుడు; లేఁడు; దిశలు గెలిచి= ఎనిమిది దిక్కులలో విజయయాత్రలు సాగించి; పెనుపారు= ఎక్కువైన; ధనము; తెచ్చి= తీసికొనివచ్చి; రాజసూయ= రాజులను జయించి చేసే యజ్ఞంలో; దక్షిణలకున్= పెద్దలకు చేసే దానాలకుగా; నీకు; ప్రీతిన్= సంతోషముతో; ఇచ్చితిన్= ఇచ్చాను.

తాత్పర్యం: ముల్లోకాలలో శివుడు తప్ప ఇంకొక ధనుస్సు పట్టినవాడు నాకు సాటి రాగలిగినవాడు లేడు. నీవు చేసిన రాజసూయయాగంలో దక్షిణలుగా ఇచ్చేందుకు దిగ్విజయాలు సాగించి, అపారమైన ధనరాసులను తెచ్చి చిత్తమలరగా నీకు ఇచ్చి ఉన్నాను.

వ. **'దీప్త ప్రతాపంబగు సంశప్తక సంచయంబు నడఁగించి, కించిదవశిష్టంబుగా, నష్టంబు సేసితిఁ; గురుసేన నా చేతం గూలి యెట్లున్నదియో యటు సూడు;' మని పలికి, మొగంబుబిగు వుడిపికొని, సవినయంబుగా దండప్రణామంబు సేసి నిలిచి, చేతులు మొగిడ్చి, యజాతశత్రున కప్పురుహూతపుత్రుం డి ట్లనియె:** **92**

ప్రతిపదార్థం: దీప్త ప్రతాపంబు+అగు= ప్రకాశమానమైన శౌర్యం కలిగిన; సంశప్తక సంచయంబున్= సంశప్తకవీరుల సమూహాన్ని; అడఁగించి= అణగద్రొక్కి; కించిత్= కాస్త; అవశిష్టంబు= మిగిలేటట్లు; నష్టము; చేసితిన్= కలిగించాను; కురుసేన= కౌరవ

సేన; నాచేతన్; కూలి= నా వలన చనిపోయి; ఎట్లు+ఉన్నదియో; అటు చూడుము; అని పలికి; మొగంబు బిగువు= మొగంలో కనపడుతున్న పట్టును (క్రౌర్యాన్ని); ఉడిపికొని= లేకుండా చేసికొని; సవినయంబుగాన్= అణకువగా; దండప్రణామంబు= సాష్టాంగనమస్కారం; చేసి; నిలిచి; చేతులు; మొగిడ్చి= జోడించి; అజాత శత్రునకున్= ధర్మరాజుకు; పురుహూత పుత్రుండు= ఇంద్రుడి కుమారుడైన అర్జునుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'మహాపరాక్రమవంతులైన సంశప్తకులనే వీరులసమూహాన్ని అణచి, కొంతమంది మాత్రమే మిగిలేటట్లు చేయగలిగాను. కౌరవసేన నా చేత నశించి ఎట్లా దీనంగా ఉన్నదో నీవు కన్నారా చూడుము' అని పలికి, మొగంలో బిగువుతనం వదలుకొని, వినయంగా ధర్మరాజుకు దండప్రణామం చేసి, చేతులు కట్టుకొని ముందు నిలిచి అతడితో అర్జునుడు ఇట్లా అన్నాడు:

క. 'నను సుప్రసాద దృష్టిం । గనుఁగొను; మే నిపుడు కొన్ని కాఱు లఱచితిన్;
మనుజేంద్ర! వానిఁ బెడచెవు । లను బెట్టుము వేఱుగాఁ దలంపక దయతోన్.' 93

ప్రతిపదార్థం: మనుజేంద్ర!= రాజా!; ననున్; సుప్రసాద= మంచి అనుగ్రహం చూపే; దృష్టిన్= చూపుతో (కటాక్ష వీక్షణాలతో); కనుఁగొనుము= చూడుము; నేను; ఇప్పుడు; కొన్ని; కాఱులు= నీచపు కూతలు; అఱచితిన్= వాగినాను; దయతోన్; వేఱుగాన్ తలంపక= అన్యథా భావించకుండా; వానిన్= వాటిని; పెడచెవులను= విననివానిగా (వినబడకుండా చెవిని మళ్లించి); పెట్టుము= చేయుము.

తాత్పర్యం: 'రాజా! నేనిప్పుడు పెడసరపుమాటలు కొన్ని వాగాను! అయినా నన్ను ఇప్పుడు దయాపూర్ణమైన చూపులతో చూడుము (మనసున పెట్టక మన్నింపుము). దయచేసి వాటిని అన్యథా భావించకుండా చెవులలో దూరకుండా చేయుము.'

తే. 'వినుము సత్యంబ పలికెదఁ; దనువుఁ బ్రాణ । ములును నీ సొమ్ముగా మదిఁ దలఁతు నేను;
నాదు వృత్తంబు భవదధీనం బనంగ । నేల పనుపవు నను భీముపాలి కధిప! 94

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వినుము= ఆలకింపుము; సత్యంబ, పలికెదన్= నిజమే చెపుతాను; నేను; తనువు= నా శరీరం; ప్రాణములును= ప్రాణాలును; నీ సొమ్ముగాన్= నీ ధనముగా; మదిన్= మనస్సులో; తలఁతున్= భావిస్తాను; నాదువృత్తంబు= నా జీవనం; భవదధీనము= నీ స్వాధీనం; అనంగన్= అని చెప్పుచుండగా; ఏల?= ఏ కారణం వలన?; ననున్ భీము పాలికిన్= నన్ను భీముడి దగ్గరకు (సహాయపడటానికి); పంపవు?= పంపకుండా ఉన్నావు?'

తాత్పర్యం: 'నేను నిజం చెప్పుతున్నాను. నా దేహం, ప్రాణం నీ ఆస్తిగానే నా మనసులో ఎల్లప్పుడూ భావిస్తాను. నా జీవితం నీ అధీనం అని ప్రకటిస్తున్నప్పటికీ పోరాడుతున్న భీముడికి సహాయంగా నన్ను ఎందుకు పంపవు?

క. 'ఓపి యతని రణ భారము । వాపెదఁ; గౌరవ్యసేన బడలువఱిచి సా
టోపతఁ గర్ణునిఁ దునిమెద; । మాపెదఁ గురురాజు దురభిమానము బలమున్' 95

ప్రతిపదార్థం: ఓపి= కార్యభారం వహించి పట్టుదలతో; అతని= భీముడి; రణ భారము= యుద్ధములోని ఒత్తిడిని; పాపెదన్= పోగొట్టుతాను; కౌరవ్యసేనన్; బడలు పఱిచి= అలయింపజేసి; సాటోపతన్= విజృంభణంతో; కర్ణునిన్; తునిమెదన్= సంహరిస్తాను; కురురాజు= దుర్యోధనుడి; దురభిమానమున్= పొగరును; బలమున్= చతురంగశక్తిని; మాపెదన్= అణగింపజేస్తాను.

తాత్పర్యం: నా శక్తినంతా ఉపయోగించి, ఒంటరిగా పోరాడుతున్న భీముడిపైనున్న యుద్ధభారాన్ని పోగొట్టుతాను. శత్రుసేనలు అలసిపోయి నిర్వీర్యులయ్యేటట్లు చేసి, కర్ణుడిని సంహరిస్తాను; దుర్యోధనుడి అనుచితగర్వాన్నీ, సైనికశక్తినీ అణచివేస్తాను.'

వ. 'ఎల్లభంగుల నేఁడు రాధం బుత్త్రరహితం జేసెదఁ; గాదేని గొంతియైన నట్టిద యగుం గాక!' 96

ప్రతిపదార్థం: ఎల్లభంగులన్= అన్ని విధాల; నేఁడు; రాధన్= రాధాదేవిని; పుత్త్రరహితన్= కొడుకు లేనిదానిగా; చేసెదన్; కాదు+ ఏనిన్= అట్లు నేను చేయకపోతే; గొంతి అయినన్= కుంతీదేవి అన్నా; అట్టిది+అ అగున్+కాక!= కొడుకు లేనిది అగుగాక!

తాత్పర్యం: అన్నివిధాల ఈ రోజు యుద్ధంలో కర్ణుడిని చంపి రాధను బిడ్డను కోల్పోయినదానిగా చేస్తాను. అట్లా నేను చేయలేకపోతే కుంతీదేవి పుత్రహీన అగుగాక! (కర్ణుడో అర్జునుడో ఆనాటి యుద్ధంలో చనిపోవటం తథ్యమని భావం.).

చ. అన విని, యమ్మహీరమణుఁ డాతని కిట్లను; 'మీకు నాకతం
బున బహుదుఃఖముల్ గలిగె; భూరికులంబున కప్రియం బొన
ర్చిన యవినీతుఁ బాపపరు వ్రేయఁదగుం దల ద్రెవ్వ; నీ మనం
బునఁ గృప పుట్టి కాచినను, బోయెద నిప్పుడ యేను గానకున్.' 97

ప్రతిపదార్థం: అనన్ విని= అని అర్జునుడు పలుకగా విని; ఆ+మహీరమణుఁడు= ఆ భూభర్త (ధర్మరాజు); ఆతనికిన్= అర్జునుడికి; ఇట్లు+అనున్; మీకు; నాకతంబునన్= నా కారణంవలన; బహు దుఃఖముల్= అనేక కష్టాలు; కలిగెన్; భూరికులంబునకున్= ప్రఖ్యాతమైన పెద్ద వంశానికి; అప్రియంబు= గిట్టని పని; ఒనర్చిన= చేసిన; అవినీతున్= న్యాయం తప్పినవాడిని (సత్ప్రవర్తన లేనివాడిని); పాపపరున్= పాపి అయిన నన్ను; తల; త్రెవ్వన్= తెగేటట్లు; వేయన్+తగున్= దెబ్బకొట్టటానికి తగినవాడిని; నీ మనంబునన్; కృప పుట్టి= దయకలిగి; కాచినను= కాపాడినప్పటికిని; ఇప్పుడు+అ; ఏను; కానకున్= అడవికి; పోయెదన్= పోతాను.

తాత్పర్యం: అర్జునుడాడిన ఆ మాటలు విని, ధర్మరాజు ఇట్లన్నాడు: 'మీకు నావలన అనేక కష్టాలు సంభవించాయి. ప్రఖ్యాతమైన పెద్ద కుటుంబానికి మనసుకు నచ్చని పనులు చేసి, న్యాయం తప్పిన పాపాత్ముడనైన నన్ను చంపదగి ఉన్నది. నీకు దయగలిగి రక్షించినా, నేను ఇప్పుడే అడవికి పోతాను.'

క. 'ననుఁ దొఱఁగి నీవు సౌఖ్యం । బున నుండుము; సమరభీతు భుజబలహీనున్
జనపతిఁగాఁ జేయుట యొ । ప్పునె? కట్టుము పట్ట మనిలపుత్త్రునిఁ బ్రీతిన్.' 98

ప్రతిపదార్థం: ననున్= నన్ను; తొఱఁగి= విడిచిపెట్టి; నీవు; సౌఖ్యంబునన్+ఉండుము= సుఖంగా జీవించుము; (నాబోటి) సమరభీతున్= యుద్ధమంటే పిరికివాడై పోయేవాడిని; భుజ బల హీనున్= బాహుబలంలేనివాడిని; జనపతిన్+కాన్= ప్రజలను పాలించే వాడినిగా; చేయుట; ఒప్పునె?= తగునా?; ప్రీతిన్= సంతోషంతో; అనిలపుత్త్రునికిన్= వాయుపుత్రుడైన భీముడికి; పట్టము కట్టుము= పట్టాభిషేకం చేయుము.

తాత్పర్యం: 'అర్జునా! నన్ను తొలగ ద్రోచి నీవు హాయిగా జీవించుము. నాబోటి పిరికిపందకు, ఆయుధాలు పట్టే శరీరదార్ఢ్యం లేనివాడికి, ప్రజారక్షణ బాధ్యత అప్పగించటం ఉచితమా? కాబట్టి భీముడికి సంతోషంగా రాజ్యాభిషేకం చేయుము.'

వ. అని పలికి, సెజ్జ డిగ్గి వనవాస గమనోన్ముఖుం డయినం, గనుంగొని కమలనాభుం డాభూపతి చరణంబులకుం బ్రణతుండై యిట్లనియె: 99

ప్రతిపదార్థం: అని పలికి; సెజ్జ డిగ్గి= పడకనుండి లేచి దిగి; వనవాస గమన+ఉన్ముఖుండు+అయినన్= అడవిలో నివసించటానికై పోవుటకు సిద్ధపడినవాడు కాగా; కనుంగొని= చూచి; కమలనాభుండు= కృష్ణుడు; ఆ భూపతి చరణంబులకున్= ఆ ధర్మరాజు పాదాలకు; ప్రణతుండు+ఐ= బాగా వంగి నమస్కరించినవాడై; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని అంటూ పక్కదిగి, వనవాసానికి బయలుదేరటానికై సిద్ధంకాగా, శ్రీకృష్ణుడు చూచి, అతడి పాదాలకు నమస్కరించి ఇట్లా అన్నాడు.

సీ. 'నరుని ప్రతిజ్ఞ భూవర! మున్నెఱుంగని । యింతియ కా దేను; నితఁడు నిప్పు
డాడిన మాటలు నంతరంగంబునఁ । బట్టవు; పేర్చు కోపమున నీకుఁ
దను నెవ్వఁ డుఱక యన్యునకు గాండీవ మి । మ్మని ధిక్కరించె, నాతని వధింప
బ్రతిన పట్టినవాఁడు; భావ్యంబు గానియ । ప్పలు కీవు పలికితి; పరమధర్మ

ఆ. మైన సత్యనిష్ఠ హానిఁ బొందుట కోర్వ । కునికిఁ జూచి, యేన యుల్లమునఁ ద
లంచి యట్లు పలుకఁ బంచితి; గురునిఁ గీ । డాడుటయు వధించు టగుటఁ జేసి.' 100

ప్రతిపదార్థం: భూవర!= ఓ రాజా!; నరుని ప్రతిజ్ఞ= అర్జునుడి శపథం; ఏనున్= నేను; మున్ను+ఎఱుంగని= ఇంతకుముందు తెలిసికొననిది; ఇంతియ కాదు= ఇంతే కాదు; ఇతఁడు; ఇప్పుడు+ఆడిన మాటలు; పేర్చు కోపమునన్= రేగిన కోపంలో; నీకున్ అంతరంగంబునన్= మనస్సులో; పట్టవు= ఇమడలేదు; తను= తనను; ఎవ్వఁడు; ఉఱక= ఊరకే (కారణం లేకుండానే); అన్యునకున్= ఇతరుడికి; గాండీవము ఇమ్మని; ధిక్కరించెన్= ఎదిరించి నిందించుతాడో; ఆతనిన్; వధింపన్; ప్రతిన పట్టినవాఁడు= ప్రమాణం చేశాడు; భావ్యంబు కాని= అనవసరమైన; అ+పలుకులు= ఆ మాటలు; నీవు పలికితి(వి); పరమ ధర్మము+ఐన= ఆచరించవలసిన వాటిలో శ్రేష్ఠతమమైన; సత్యనిష్ఠ= సత్యమే పలుకుతానన్న దీక్ష; హానిన్+పొందుట= అపచారానికి గురికావటం; ఓర్వకునికిన్= సహించనందున; చూచి; ఏన= నేనే స్వయంగా; గురునిన్= పెద్దవాడిని; కీడు+ఆడుట+అ= దూషించటమే; వధించుట= చంపటం; అగుటన్+చేసి= కావటంచేత; ఉల్లమునన్= మనస్సులో; తలంచి= భావించి; అటు= ఆ విధంగా; పలుకన్+పంచితి(ని)= మాట్లాడుమని నియమించాను.

తాత్పర్యం: 'ధర్మరాజా! అర్జునుడి ప్రతిజ్ఞ ఇదివరకు నాకు తెలిసింది కాదు. ఇతడు ఇప్పుడు పలికిన మాటలు కోపావేశంవలన నీ మనసున ఇముడలేదు. ఎవడు తన గాండీవాన్ని ఇతరులకిమ్మని ధిక్కరిస్తాడో ఆతడిని వధిస్తానని శపథం పట్టాడు కాబట్టి కోపాతిశయంతో ఉన్నాడు. నీవు ఉచితంగాని ఆ మాట పలికావు. అతడి సత్యనిష్ఠ చెడకుండా ఉండాలని మనసులో తలచి, నేనే ఈ విధంగా మాట్లాడుమని చెప్పాను. పెద్దలను దూషించటం వారిని చంపటంతో సమానం కదా!'

క. 'శరణము వేఁడెదను భవ । చ్చరణంబులు వట్టికొని, నిసర్గదయా ని
ర్భరబుద్ధిని గావుము మ । మ్మిరువుర; నీతప్పు సైఁపు మెల్ల విధములన్.' 101

ప్రతిపదార్థం: భవత్+చరణంబులు= నీ పాదాలు; పట్టుకొని; శరణు వేడెదను= రక్షించుమని ప్రార్థిస్తాను; నిసర్గ= సహజమైన; దయా= దయారసపూర్ణమైన; నిర్భర= అధికమైన; బుద్ధిని= మనసుతో; మమ్మున్+ఇరువురన్= మా ఇద్దరిని (కృష్ణార్జునులను); కావుము= రక్షించుము; ఎల్లవిధములన్= అన్నివిధాల; ఈ తప్పు; సైఁపుము= ఓర్చుకొనుము.

తాత్పర్యం: 'నీ పాదాలు పట్టుకొని శరణాగతుడనవుతున్నాను. నీకు సహజమైన దయాగుణాతిశయంతో మా ఇద్దరిని రక్షించుము. అన్నివిధాల ఈ తప్పును త్రోసిపుచ్చి ఓర్చుకొనుము.'

క. 'సూతసుతుని మెడనెత్తురు । భూతలమున నివుర నేఁడు భూనాయక! నీ
వాతనికి నలిగినప్పుడ । చూ తెగియెం బూని యేన చుమ్ము పలికెదన్.' 102

ప్రతిపదార్థం: భూనాయక!= భూపాలా!; సూతసుతుని= కర్ణుడి; మెడ నెత్తురు= మెడ తెగటంవలన కారే నెత్తురు; భూతలమునన్= భూమిపైన; నేఁడు= ఈనాడు; ఇవురున్= పడి ఇంకుతుంది; నీవు+ఆతనికి; అలిగినప్పుడు+అ= కోపపడినప్పుడే; చూ= చూడగా; తెగియెన్= (వాడి మెడ)తెగిపోయింది; ఏన చుమ్ము= నేనే సుమా; పూని= పట్టుదలతో; పలికెదన్= చెపుతున్నా?

తాత్పర్యం: 'భూపాలా! ఆ కర్ణుడిమెడ నెత్తురు ఈ దినమే నేలమీద పారి ఇంకిపోగలదు. నీవు అతడిపై కోపగించుకొన్నప్పుడే వాడి మెడ తెగిపోయింది! ఈ మాట నేను పట్టుదలతో చెపుతున్నాను సుమా వినుము.

క. 'విను సత్యం బాడెదఁ; బా । ర్థునిచే నేఁ డెల్లభంగిఁ దునుమంబడు క
ర్ణునిదెసఁ జింతయు వంతయు । మనుజేశ్వర! విడువు; పంపు మమ్ముఁ దెలివితోన్.' 103

ప్రతిపదార్థం: మనుజేశ్వర!= ధర్మరాజా!; విను= వినుము; సత్యంబు+ఆడెదన్= యథార్థం పలుకుతాను; నేఁడు; ఎల్లభంగిన్= సర్వవిధాలా; పార్థునిచేన్= అర్జునుడిచేత; తునుమంబడు= ఖండింపబడనున్న; కర్ణుని దెసన్= కర్ణుడిపట్ల, చింతయున్= ఎప్పుడు అనుకొంటూ పడే బాధ; వంతయున్= దిగులు; విడువు= వదలుము; మమ్మున్; తెలివితోన్= మానసిక వికాసంతో; పంపు= సాగనంపుము.

తాత్పర్యం: రాజా! బాగా వినుము. ఉన్న సంగతి చెపుతున్నాను. ఈ దినం అన్ని విధాల అర్జునుడిచేత కర్ణుడు చంపబడుతాడు. అట్టి కర్ణుడిపట్ల ఊరకే, దిగులుపడటంగాని, బాధపడటంగాని మానుకొమ్ము. ఇక మమ్ము యుద్ధానికి ఉల్లాసంగా పంపుము.

ధర్మరాజు కృష్ణుని వాక్యంబులం గలంకదేఱి ప్రసన్నుఁడగుట (సం. 8-49-113)

వ. అనుటయు ధర్మసూనుండు ససంభ్రమంబుగాఁ గృష్ణు నెత్తి, యతండు ప్రాంజలి యై యుండ నతని కి ట్లనియె: 104

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ధర్మసూనుండు; ససంభ్రమంబుగాన్= త్వరత్వరగా; కృష్ణున్+ఎత్తి= (వంగి వందన మాచరిస్తున్న) కృష్ణుడిని లేవదీసి; అతండు= ఆ కృష్ణుడు; ప్రాంజలియై ఉండన్= చేతులు కలిపి నమస్కరిస్తుండగా; అతనికిన్+ఇట్లు+అనియెన్;

తాత్పర్యం: అనగా, ధర్మరాజు తొట్రుపాటుతో కృష్ణుడిని పైకెత్తి, అతడు చేతులు జోడించి ఎదుట నిలువబడగా అతడితో ఇట్లా అన్నాడు:

క. 'ఇది యట్టిద మోసంబునఁ । బదిలుఁడఁ గా కేను మున్ను పదరినకతనన్
హృదయము గలఁగిన, నా కె । య్యదియును దోఁపమి, వికారి నైతి మహాత్మా!' 105

ప్రతిపదార్థం: మహాత్మా!= మహాత్ముడవైన శ్రీకృష్ణా!; ఇది అట్టిది+అ= ఈ విషయం అటువంటిదే; మోసంబునన్= ప్రమాదంతో; పదిలుఁడన్= కుశలుడను (సమర్థుడను); కాక= కానందున; ఏను= నేను; మున్ను= ఇంతకుముందు; పదరిన కతనన్= తీరుమాలి వాగినందున; హృదయము; కలఁగిన= కలత చెందినందున; నాకున్; ఎయ్యదియును తోఁపమి= ఏమి చేయుటకు తోచకపోయినందున; వికారిని+ఐతిన్= తబ్బిబ్బు అయిన మనస్సు కలవాడినయ్యాను. (ఏమియు తోచలేదనుట).

తాత్పర్యం: మహాత్మా! ఆ పరిస్థితులు అటువంటివి. ప్రమాదవశాత్తు జాగరూకత లేనివాడను అయినందున ఇంతకుముందు నోటికి వచ్చినట్లు కారుకూతలాడినందున. నా మనస్సు కలతబారింది. అందువలన ఏమి చేయాలో మనస్సుకు రాక, పిచ్చివాడనై ఉన్నాను.'

ఆ. 'ఇట్టి నన్ను ననునయించి బోధించితి; । కరుణ పేర్మిఁ జేసి గారవమున
నజ్ఞులైన మమ్ము నాపత్పయోనిధి । మునుఁగకుండఁ గాచి తనఘమూర్తి!' 106

ప్రతిపదార్థం: అనఘమూర్తి!= పాపరహిత స్వరూపుడా! కృష్ణా!; ఇట్టి నన్నున్= ఇటువంటి స్థితిలో ఉన్న నన్ను; అనునయించి= మంచిమాటలతో తేర్చి; కరుణ పేర్మిన్+చేసి= అతిశయమైన దయకలిగినవాడవగుటచేత; బోధించితివి= మంచిబుద్ధి కలుగజేశావు; గారవమునన్= అభిమానం చూపుతూ; అజ్ఞులు+ఐన మమ్మున్= తెలియనివారమైన మమ్ము; ఆపద్+పయోనిధిన్= కడగండ్ల మున్నీటిలో; మునుఁగకుండన్; కాచితి(వి)= రక్షించావు.

తాత్పర్యం: కలతచెంది ఉన్న నన్ను మంచి మాటలతో తేరుకొనేటట్లు చేసి, దయాపూర్ణమతితో హితాన్ని బోధించావు. అజ్ఞానులమైన మమ్ము ఆపదలనెడి సముద్రంలో మునిగిపోకుండా అభిమానంతో కాపాడావు. కృష్ణా! పుణ్యస్వరూపుడవు నీవు.'

వ. అనియె, నప్పుడు వివర్ణంబగు వదనంబు వాంచియున్న వాసవిం జూచి, వాసుదేవుండు; 'నీ విట్లు విషణ్ణుండ వగుట గర్జంబుగా; దిమ్మేదినీపతి ముఖప్రసాదం బభినందించి యనుమతి వడసి చని, రాధేయ వధ విహారంబున నితనికిం బ్రియం బాపాదింతుగాక! యింకఁ దడయ నేల?' యని పలికి వెండియు. 107

ప్రతిపదార్థం: అనియెన్= అని పలికాడు; అప్పుడు; వివర్ణంబు+అగు= కళాహీనమై ఉన్న; వదనంబు= ముఖమును; వాంచి ఉన్న= వంచికొని ఉన్న; వాసవిన్= ఇంద్రుడి కొడుకైన అర్జునుడిని; చూచి; వాసుదేవుండు= కృష్ణుడు (ఇట్లా అన్నాడు); నీవు ఇట్లు; విషణ్ణుండవు అగుట= దుఃఖితుడవగుట; కర్జంబుకాదు= తగినపని కాదు; ఈ+మేదినీ పతి= ఈ భూభర్త; ముఖ ప్రసాదంబు= ముఖవికాసాన్ని; అభినందించి= కొనియాడి; అనుమతి పడసి= అంగీకారాన్ని పొంది; చని= యుద్ధానికి పోయి; రాధేయవధ= కర్ణుడిని చంపటం అనే; విహారంబునన్= క్రీడోత్సవంతో; ఇతనికిన్= ధర్మరాజుకు; ప్రియంబు= ప్రీతి; ఆపాదింతు(వు)గాక!= కలుగచేయుదువు గాక!; ఇంకన్= ఇక; తడయన్+ఏల?= ఆలస్యం చేయటం ఎందుకు?; అని పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అన్నప్పుడు అర్జునుడు వెలవెలబోయిన ముఖాన్ని వాల్చి ఉన్నాడు. కృష్ణుడు ఆతడిని చూచి 'నీ విట్లా విషాదంతో ఉండటం కార్యం కాదు. ధర్మరాజు ప్రసన్నుడైనాడు. అతడిని అభినందించి, అనుమతిని పొంది, యుద్ధానికి వెడలి, రాధేయుడిని చంపే యుద్ధవీరవిహారాన్ని ప్రదర్శించి అతడికి సంతోషాన్ని కలిగించాలి సుమా! ఇంక ఆలస్యం ఎందుకు?' అని పలికి, ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'ఈతని నొవ్వఁ బల్కుటన, యీ దురవస్థకు వచ్చి తక్కటా!
శాతమహాసి నీ నృపతిఁ జంపిన నెట్లగుదో? విపత్తికిం
బాతకఘోరవృత్తికిని బాసితి దైవ మనుగ్రహించుటన్;
నీ తెలి వాప్తబంధుజన నిర్మిత పుణ్యవిపాక మర్జునా!' 108

ప్రతిపదార్థం: అర్జునా!; ఈతని= ఈయనను (ధర్మజుడిని); నొవ్వన్= బాధపడేటట్లు; పల్కుటను+అ= పలుకటం చేతనే; అక్కటా!= అయ్యో!; ఈ దురవస్థకున్= ఈ దుస్థితికి; వచ్చితి(వి); శాత= మిక్కిలి పదునైన; మహా+అసిన్= పెద్ద ఖడ్గంతో; ఈ నృపతిన్= ఈ రాజును; చంపినన్= చంపినట్లయితే; ఎట్లు+అగుదో?= ఏ గతికి వచ్చి ఉందువో గదా?; విపత్తికిన్= ఆపదలకు; పాతక ఘోర వృత్తికిన్= పాపభూయిష్ఠమైన దారుణమైన ప్రవర్తనకు; దైవము; అనుగ్రహించుటన్= ప్రసాదం చూపుట వలన; పాసితి(వి)= వైదొలగినావు; నీ తెలివి= నీవు చూపిన వివేకం; ఆప్తబంధుజన= నీకు కావలసిన దగ్గరి చుట్టాలచే; నిర్మిత= చేకూర్చబడిన; పుణ్యవిపాకము= సుకృతంయొక్క భాగ్యం.

తాత్పర్యం: అర్జునా! ఈ ధర్మరాజు మనస్సు బాధపడేటట్లు మాట్లాడిన మాత్రాననే - అయ్యో! ఇంత దుఃఖస్థితికి వచ్చావే, పదునైన ఖడ్గంతో ఈయనను నీవు చంపి ఉంటే ఏ గతికి వచ్చి ఉందువో గదా! ఆ దేవదేవుడి అనుగ్రహం వలన, రానున్న కడగండ్లు తప్పించుకొన్నావు. ఘోరమైన పాపప్రవర్తనకు దూరమైనావు. ఈ సమయంలో నీవు చూపిన తెలివి నీ మేలుకోరే బంధువులు చేకూర్చి పెట్టిన పుణ్యపరిపక్వతయే సుమా!'

వ. అనిన, నతండు గన్నీ రొలుక, నన్న పాదంబులపైఁ బడిన; నప్పాండవాగ్రజుండును బాష్పప్లావితముఖుం డగుచు నతనిమీఁద నొఱగె; ని ట్లయ్యిరువురు నొండొరులం బట్టికొని యేడ్చి; రచ్యుతుం డుడుప నుడిగి, తత్కాలోపగత సముచిత పరిజనానీత జలంబుల ముఖప్రక్షాళనంబు సేసికొనిరి; తదనంతరంబ ధర్మనందనుండు దమ్మునిం గౌఁగిలించుకొని మూర్ధాఘ్రాణంబు సేసి, చిఱునవ్వుతో 'మనల నింత వఱచునే కర్ణుం?' డని పలికి, మఱియును. 109

ప్రతిపదార్థం: అనినన్; అతండు= అర్జునుడు; కన్నీరు+ఒలుకన్= కన్నీరు జారగా; అన్న పాదంబులపైన్; పడినన్= పడగా; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ ధర్మరాజు కూడా; బాష్ప= కన్నీటిచేత; ప్లావిత= తడుపబడిన; ముఖుండు+అగుచున్= ముఖము కలవాడగుచు; అతనిమీఁదన్= అర్జునుడిపై; ఒఱగెన్= వ్రాలినాడు; ఇట్లు; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరూ; ఒండొరులన్= ఒకరినొకరు; పట్టుకొని; ఏడ్చిరి; అచ్యుతుండు= కృష్ణుడు; ఉడుపన్= నివారించగా; ఉడిగి= దుఃఖించటం మాని; తత్కాల= అప్పుడు; ఉపగత= దగ్గరకు వచ్చిన; సముచిత= యోగ్యమైన; పరిజన+ఆనీత= సేవకులు కొనితెచ్చిన; జలంబులన్= నీళ్ళతో; ముఖప్రక్షాళనంబు చేసికొనిరి= ముఖం కడుగుకొన్నారు; తదనంతరంబ= ఆ తర్వాత; ధర్మనందనుండు; తమ్మునిన్ కౌఁగిలించుకొని; మూర్ధ= నొసలు; ఆఘ్రాణంబు చేసి= మూచూచి; చిఱునవ్వుతో; కర్ణుండు; మనలన్; ఇంత పఱచునె?= ఇంతగా బాధిస్తాడా?; అని పలికి; మఱియునున్= ఇంకా (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: అనగా, అర్జునుడు కన్నీరు కారుస్తూ అన్న పాదాలమీద పడి నమస్కరించాడు. ఆ ధర్మరాజు కూడా కన్నీరునిండిన ముఖంతో అర్జునుడిమీద ఒరిగి, ఇరువురూ ఒకరినొకరు పట్టుకొని ఏడ్చారు. కృష్ణుడు వారిని ఓదార్చగా శాంతించారు. ఆ సమయానికి అనుగుణంగా పరిచారులు తెచ్చిన నీటితో వారిరువురూ ముఖాలు కడిగికొన్నారు. ఆ తరువాత ధర్మరాజు అర్జునుడిని కౌగిలించుకొని, నెన్నుదురును ఆని, చిరునవ్వుతో 'మనలను కర్ణుడు ఎంత గాసిపరచాడు?' అని పలికి మరల ఇట్లా అన్నాడు:

విశేషం: సహజరీతిలో తిక్కన సాగించిన ఈ హావభావాభివర్ణనం నాటకీయం; సహృదయం హృదయాహ్లాదకరం.

ఆ. 'ఎల్లఁజూడ, సిడము విల్లు నశ్వంబుల । సూతుఁ దునిమి, నన్ను నాతఁ డలవు
నెఱయ గెలిచె; నతని నీ విప్డు సంపక । యున్న నాకు బ్రదికి యుండఁ దగునె?' 110

ప్రతిపదార్థం: ఎల్లన్+చూడన్= అందరూ చూడగా; సిడము= ధ్వజం; విల్లు; అశ్వంబులన్; సూతున్= సారథిని; తునిమి= ముక్కలు ముక్కలుగా చేసి; నన్నున్; ఆతఁడు= కర్ణుడు; అలవు నెఱయన్= ఖడ్గయుద్ధ చాతుర్యం ప్రకాశించేటట్లుగా; గెలిచెన్; అతనిన్; నీవు+ఇప్డు; చంపక ఉన్నన్= చంపకుండా ఉంటే; నాకు బ్రతికి యుండన్; తగునె?= ఉచితంగా ఉంటుందా? (జీవించి ఉండటం గౌరవప్రదం కాదనుట).

తాత్పర్యం: 'అందరూ చూడగా నా రథధ్వజాన్నీ, విల్లునూ, గుఱ్ఱాలనూ, సారథినీ చంపి, కర్ణుడు తన నైపుణ్యం ప్రకాశించగా నన్ను గెలిచాడు; అతడిని నీ విప్పుడు చంపకపోతే నేను బ్రదికి ఉండటం ఉచితమా?'

చ. అనవుడు, నమ్మహీపతికి నర్జునుఁ డిట్లను; 'నేఁడు కర్ణు నే
ననిఁ బడవైతు; నీయడుగు లాన! తదీయ సుహృద్గణంబుతో;
విను మటు సేయ కే మగిడి వెల్వెలఁ బాఱెడు మోముతోడు వ
త్తునె? యిట కృష్ణసారథియుఁ దూలునె మానవిహీనవృత్తియై?' 111

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; ఆ+మహీపతికిన్= ఆ ధర్మరాజుతో; అర్జునుడు; ఇట్లు+అను= ఈ విధంగా అన్నాడు; నేఁడు= ఈ దినం; అనిన్= యుద్ధంలో; కర్ణున్; నేను; నీ అడుగులు+ఆన!= నీ పాదాల సాక్షిగా; తదీయ= అతడియొక్క; సుహృద్= మనసు కలసిన (ఆప్తుల); గణంబుతోన్= వర్గముతోసహా; పడవైతున్= పడగొడతాను; విను; అటు+చేయక; ఏన్= నేను; వెల్వెల+పాఱెడు= తెల్లబోయిన; మోముతోడన్; మగిడి= తిరిగి; వత్తునె?= వస్తానా?; ఇట= ఇక్కడ; కృష్ణ సారథియున్= కృష్ణుడిని సారథిగా గల్గిన ఈ అర్జునుడు; మానవిహీన వృత్తి ఐ= పరువు పోగొట్టుకొన్నవాడి చేష్టలతో, తూలునె?= దుఃఖిస్తూ వైదొలగి ఉంటాడా?

తాత్పర్యం: ధర్మజుడి మాటలు విని అర్జునుడు ఇట్లా అన్నాడు: 'ఈ దినం నేను యుద్ధంలో నీ పాదాలసాక్షిగా కర్ణుడిని అతడి మిత్రబృందంతోసహా పడగొట్టుతాను. నీవూ వినుము. అట్లా చేయక వెలవెలపోయే మొగంతో మరలి మీ దగ్గరకు రాను. కృష్ణుడిని సారథిగాగల ఈ పార్థుడు మానహీనుడై తొలగిపోతాడా?

వ. అని గోపాలదేవు నాలోకించి: 'నీ మనంబునం గర్ణుండు దెగటాఱ వలయు నని యించుక దలంపుము దాన నే నతని వధియింతు' ననిన, నమ్మహాత్ముం 'డట్టి పనికిం జాలుదు!' వని యుత్సాహదీప్తుండై పలుకుటయుఁ,

బార్థుండు నిజరథంబు సవిశేషకల్పితంబు సేయించి, రథ్యంబుల జలపాన ఖాద్యఖాదనంబులం బ్రబలంబులఁ గావించి పూన్పించి, యగ్రజు వీడ్కొని గమనోన్ముఖుం డగుటయు, నచ్యుతుం డవ్విభు వీక్షించి 'నీ తమ్మునిం గారుణ్యార్ద్ర కటాక్షంబుల నిరీక్షింపుము; దీవనయిచ్చి పనుపు' మని చెప్పిన, నన్నరవరుండు గిరీటిం దిగిచి బిగియారు కౌఁగిటం జేర్చి, 'నీవు కృష్ణుపనుపునం దగుమాటలాడి; తత్తెఱంగు నేనునుం దెలిసితి; నా యెఱుంగమి నిన్నుం బలికిన పలుకులకు నుమ్మలింపకుమీ' యనుటయు, నతండు వికసితవదనుం డగుచుఁ దత్పాదద్వయంబు ఫాలంబు సోఁకం బ్రణతుం డయిన; నమ్మానవపతి యెత్తి పునఃపునరాలింగనంబు సేసి, 'కర్ణుని గెలువు విజయ! నీకు విజయంబు శాశ్వతం బయ్యెడు' మని దీవించిన నమ్మేటి మగండు నాటోపంబుగా 'దేవ! నిన్ను నొప్పించిన యప్పాపకర్ము మత్కార్ముకముక్త శిలీముఖంబులం బొలిపుచ్చి, యిదె వచ్చెద!' ననుచు నంజలి పుటంబు నిటలంబునఁ గదియించి వీడ్కొనియెఁ; దదనంతరంబ దామోదరుండును నన్నరుండును నరదం బెక్కి, యలరునుల్లంబులతో నరిగి శుభప్రదంబు లగు నిమిత్తంబులకుం బ్రమోదంబు నొందిరి; పదంపడి రాధేయ వధ ప్రకార చింతా క్రాంతుండైన గాండీవి తనువునం బ్రస్వేదకణమ్ములు గ్రమ్మినం గనుంగొని, కమలనాభుం డతని కిట్లనియె: 112

ప్రతిపదార్థం: అని; గోపాలదేవున్= గోపాలునిరూపంలో ఉన్న ఆ దేవదేవుడిని; ఆలోకించి= సాభిప్రాయంగా చూచి; కర్ణుండు; తెగటాఱవలయును+అని= చచ్చిపోవాలని; నీ మనంబునన్; ఇంచుక= కాస్త; తలంపుము; దానన్= ఆ వాంఛా బలంతో; నేను+అతనిన్, వధింతున్, అనినన్; ఆ+మహాత్ముండు= ఆ మహామతి అయిన కృష్ణుడు; అట్టి పనికిన్; చాలుదువు= తగిన సామర్థ్యం కలవాడవౌతావు; అని; ఉత్సాహదీప్తుండు+ఐ= పట్టుదలతో తేజరిల్లినవాడై; పలుకుటయున్= పలికినందున; పార్థుండు; నిజ= తనయొక్క; రథంబు; సవిశేష కల్పితము= కావలసిన హంగులన్నిటితో పూర్తి అయిన దానిగా; చేయించి; రథ్యంబులన్= గుర్రాలను; జలపాన= నీరు త్రాపుటచే; ఖాద్య= తినే గడ్డి మొదలగు వాటియొక్క; ఖాదన= తినిపించుటచేత; ప్రబలంబులన్= చేకూడిన ఉత్సాహం కలవిగా; చేసి; పూన్పించి= రథానికి కట్టించి; అగ్రజున్= అన్నను; వీడ్కొని= సెలవు తీసికొని; గమన+ఉన్ముఖుండు= ప్రయాణానికి సిద్ధమైనవాడుగా; అగుటయున్= కాగా; (పనికి పూనించే ముందు గుర్రాలకు చేయవలసిన ఉపచారాల వర్ణన గ్రామీణవాసికి అలవియగు పనులు. ఇట్టి లోకపు తీరుతెన్నులు - తిక్కన రచనలకు సహజ శోభను కలిగిస్తాయి. కార్యాచరణ సరళిని పొలిపోకుండా చెప్పటం ఈయన ప్రత్యేకత); అచ్యుతుండు; ఆ+విభున్= ఆ రాజును ధర్మజుని; వీక్షించి= చూచి; నీ తమ్మునిన్; కారుణ్య= దయతో, ఆర్ద్ర= నెమ్మయిన; కటాక్షంబులన్= క్రీగంటి చూపులతో; నిరీక్షింపుము= చూడుము; దీవన ఇచ్చి; పనుపుము= పంపుము; అని చెప్పినన్; ఆ+నరవరుండు= ఆ మానవ శ్రేష్ఠుడు - ధర్మరాజు; కిరీటిన్= అర్జునుడిని; తిగిచి= దగ్గరికి లాగికొని; బిగియారు= గట్టి; కౌఁగిటన్+చేర్చి; నీవు; కృష్ణుని; పనుపునన్= అనుమతితో; తగు మాటలు+ఆడితి(వి)= సమయోచితమైన పలుకులు పలికావు; ఆ+తెఱంగున్= ఆ విధానాన్ని; నేనును; తెలిసి(తిని)= తెలిసికొన్నాను; నా ఎఱుంగమి= నేను గ్రహించకపోవటంవలన; నిన్నున్; పలికిన పలుకులకున్= అన్న మాటలకు; ఉమ్మలింపకుమీ!= నొచ్చుకొనవద్దు; అనుటయున్; అతండు= అర్జునుడు; వికసిత వదనుండు+అగుచున్= సంతోషంతో విప్పారిన ముఖం కలవాడై; తద్+పాదద్వయంబు= ఆయన కాళ్ళు రెండు; ఫాలంబు సోఁకన్= నొసలు తాఁకునట్లు; ప్రణతుండు+అయినన్= బాగుగా వంగి నమస్కరించినవాడు కాగా; ఆ+మానవ పతి; ఎత్తి; పునః పునః= మరల మరలా; ఆలింగనంబు చేసి= కౌగిలించుకొని; కర్ణుని గెలువు(ము); విజయ!= అర్జునా!; (సార్థకనామం అయేటట్లుగా); నీకు; విజయము= గెలుపు; శాశ్వతంబు+అయ్యెడున్= విజయకీర్తి చిరస్థాయి కాగలదు అని; దీవించినన్; ఆ+మేటి మగండు= మొనగాడైన ఆ వీరుడు; ఆటోపంబుగాన్= సంభ్రమంగా; దేవా!; నిన్నున్; నొప్పించిన= కష్టపెట్టిన; ఆ+పాపకర్ము= పాపపు పనులు చేసిన అతడిని; మత్+కార్ముక ముక్త= నా ధనుస్సునుండి వదలిపెట్టబడిన; శిలీముఖంబులన్= బాణాలతో;

పొలిపుచ్చి= చంపి; ఇదె వచ్చెదన్= ఇదిగో తిరిగి వస్తా; అనుచున్; అంజలి పుటంబులు= దొప్పగా చేయబడిన దోసిలిని; నిటలంబునన్= నొసట; కదియించి= చేర్చి; వీడ్కొనియెన్= సెలవుతీసికొన్నాడు; తదనంతరంబు+ఎక్కి= రథం ఎక్కి; అలరు= సంతోషంతో నిండిన; ఉల్లములతోన్= మనస్సులతో; అరిగి= పోయి; శుభప్రదంబులు+అగు= మంగళకరమైన, మంచిని సూచించే; నిమిత్తంబులకున్= శకునాలకు; ప్రమోదంబున్+ఒందిరి= సంతోషించారు; పదంపడి= తరువాత; రాధేయ= కర్ణుడి; వధప్రకార= చంపే విధానాన్ని గురించిన; చింతాక్రాంతుండు+ఐన= యోచనతో నిండిన మనస్సు కలవాడైన; గాండీవి= గాండీవమును చేతబట్టిన అర్జునుడియొక్క; తనువునన్= దేహమునందు; ప్రస్వేదకణంబులు= చెమటబొట్లు; క్రమ్మినన్= అలముకొనగా; కనుంగొని= చూచి; కమలనాభుండు= కృష్ణుడు; అతనికిన్= ఆయనతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని కృష్ణుని చూచి అర్జునుడు 'నీ మనసులో కర్ణుడు చావాలి అని కొద్దిగా సంకల్పించుము. దాని బలంతో నేను అతడిని సంహరిస్తాను' - అన్నాడు. శ్రీకృష్ణుడు 'ఆ పనికి నీవు సమర్థుడవు' అని ఉత్సాహావేశంతో పలికాడు. అర్జునుడు తన రథాన్ని విశేషంగా సిద్ధంచేయించాడు. గుర్రాలకు నీరు త్రావించి, కావలసిన దాణాలు పెట్టించి బలోపేతం చేయించాడు. ధర్మరాజును వీడ్కొని యుద్ధానికి బయలుదేరాడు. అప్పుడు కృష్ణుడు ధర్మరాజును చూచి 'నీ తమ్ముడిని దయార్ద్రమైన చూపులతో చూచి దీవించి పంపు'మన్నాడు. అప్పుడు ధర్మరాజు అర్జునుడిని దగ్గరకు లాగికొని, గట్టిగా కౌగిలించుకొన్నాడు. 'నీవు కృష్ణుడి అనుమతితో సముచితమైన మాటలు పలికావు. దానిని నేను తెలిసికొన్నాను. ఆ సంగతి తెలియక పూర్వం నిన్నన్న మాటలకు మనసులో బాధపడకుము' అని బుజ్జగించాడు. అర్జునుడు ముఖం వికసించగా అన్నగారి పాద పద్మాలకు నెన్నుదురు తాకగా నమస్కరించాడు. అతడిని ఎత్తి ధర్మరాజు కౌగిలించుకొని 'విజయా! నీవు కర్ణుడిని గెలువుము; నీకు విజయనామం శాశ్వతమౌతుంది' అని దీవించాడు. 'ధర్మరాజా! నిన్ను బాధించిన ఆ దుష్టకర్ణుడిని నా బాణాలతో చంపి తిరిగి వస్తాను' అని అంటూ అంజలి ఘటించి సెలవుతీసికొని వెళ్ళాడు. ఆ తరువాత కృష్ణార్జునులు రథమెక్కి, శుభశకునాలను గమనిస్తూ, సంతోషంతో ముందుకు సాగారు. అప్పుడు అర్జునుడు కర్ణుడిని వధించే వ్యూహాన్ని ఆలోచిస్తూండగా అతడికి ముచ్చెమటలు పట్టాయి. దానిని చూచి కృష్ణుడు ఇట్లా అన్నాడు.

ఆ. 'అమరులకు నజయ్యు లగువారిఁ బెక్కండ్ర । గెలిచి తీవు; నీకుఁ గల యుదాత్త
దివ్యబాణములు నుదీర్ణధనుర్వేద । కౌశలంబు బలముఁ గలదె యెందు?' 113

ప్రతిపదార్థం: అమరులకున్= మరణంలేని దేవతలకు; అజయ్యులగు వారిన్= జయించ శక్యంగానివారిని; పెక్కండ్రన్= చాలామందిని; గెలిచితి+ఈవు= నీవు గెలిచావు; నీకున్+కల; ఉదాత్త= గొప్పవైన; దివ్యబాణములున్= దేవతలిచ్చిన అస్త్రములు; ఉదీర్ణ= గొప్ప; ధనుర్వేద కౌశలంబు= విలువిద్య అందలి నేర్పు; బలము= సత్తువ; ఎందున్= ఎక్కడనైనా; ఎవరికైనా, కలదె?= ఉన్నదా?.

తాత్పర్యం: దేవతలకే గెలువ నలవిగాని చాలామందిని నీవు ఓడించావు. దీనికి తోడు నీకు గల గొప్ప దివ్యబాణాలు, ధనుర్విద్యాపాటవం ఇంకెవరికైనా ఎక్కడైనా కలవా?

చ. 'అమరనదీతనూభవుఁడు, నస్త్రగురుండు భవన్మహాస్త్ర ది
వ్యమహిమలో నడంగిరి జయద్రథు చా వధికాద్భుతంబు; మ
ర్త్యమునన కాదు లోకముల నన్నిట నీ కెదు రెవ్వ? రేల చి
త్తమునఁ గలంక? యూఱడుము దర్పము నెక్కెడు నంతకంతకున్.' 114

ప్రతిపదార్థం: అమరనదీ తనూభవుఁడు= గంగాతనయుడైన భీష్ముడు; అస్త్ర గురుండు= అస్త్రవిద్యాగురువైన ద్రోణుడు; భవత్+మహాస్త్ర= నీ యొక్క గొప్ప అస్త్రముల; దివ్యమహిమలోన్= దైవబలోపేతమైన గొప్పదనంతో; అడంగిరి= అణగిపోయారు; జయద్రథుడి; చావు; అధిక+అద్భుతము= అత్యంత ఆశ్చర్యకరమైన విషయం; మర్త్యమునన కాదు= ఈ మానవలోకంలోనే కాదు- లోకములన్నిట; నీకు; ఎదురు+ఎవ్వరు?= ఎదుర్కొనే వారెవ్వరు?; చిత్తమునన్= మనస్సున; కలంక+ఏల?= వ్యాకులపాటు ఎందుకు?; ఊఁఁడుము= తెప్పరిల్లుము; అంతకంతకున్= పోను పోను; దర్పము= నీ గర్వం; ఎక్కెడున్= పెంపొందుతుంది.

తాత్పర్యం: 'భీష్మద్రోణులు నీ బలోపేతమైన ఆయుధప్రయోగ దక్షతలో రూపు లేకుండా పోయారు. ఆ జయద్రథుడి మరణం అత్యంత ఆశ్చర్యకరం. ఈ భూలోకంలోనే గాదు, అన్ని లోకాలలోను నిన్ను ఎదిరించేవారు ఎవ్వరున్నారు? ఇక దిగులుపాటెందుకు? మనస్సు చిక్కబట్టుకొని ఉత్సాహాన్ని పొందుము. పోను పోను నీ శౌర్యం ఎదిగిపోగలదు.'

క. **'బలమును శౌర్యముఁ దేజముఁ । గలఁ డని కౌరవులు నమ్మి కర్ణుని నీతోఁ**
దలపెట్టిరి; నీ బాణం । బులఁ గూలెడు నతఁడు; కీర్తి వొందెదు నిన్నున్. **115**

ప్రతిపదార్థం: బలమును= కండబలం; శౌర్యము= పరాక్రమం; తేజము= ఇవి కలిగించే కాంతిరేఖలు; కలఁడు+అని= కలిగి ఉన్నాడని; కౌరవులు; నమ్మి= ఆ విశ్వాసంతో; నీతోన్; కర్ణుని; తలపెట్టిరి= ఎదుర్కొనటానికి సిద్ధపరచారు; అతఁడు; నీ భాణంబులన్= నీ బాణాలచేత; కూలెడున్= చచ్చి నేలపై పడతాడు; నిన్నున్; కీర్తి; పొందెడున్= పొందుతుంది.

తాత్పర్యం: కర్ణుడి బలపరాక్రమాలను, అతడు గడించిన ఖ్యాతిని కౌరవులు బాగా నమ్మి, నీతో తలపడటానికి అతడిని సిద్ధం చేశారు. కాని, నీ బాణాహతికి అతడు కుప్పకూలిపోతాడు. నీకు కీర్తి కలుగుతుంది.

క. **కురుపతి యాశలు మాలఁగ । దురమున రాధాతనూజుఁ దునుమాడి, జయ**
స్ఫురణంబునఁ గృతకృత్యతఁ । బొరయుము, నీవారు మోదమునఁ దేలంగన్.' **116**

ప్రతిపదార్థం: కురుపతి ఆశలు; మాలఁగన్= తుదముట్టగా; దురమునన్= యుద్ధంలో; రాధాతనూజున్= కర్ణుడిని; తునుమాడి= చంపి; జయస్ఫురణంబునన్= జయం ప్రకటితమయ్యేటట్లు; (దీనితో) నీవారు; మోదమునన్= సంతోషంతో; తేలంగన్= తృప్తిపడేటట్లుగా; కృతకృత్యతన్= అనుకొన్నపనిని నెరవేర్చుటతో; పొరయుము= ప్రవర్తిల్లుము.

తాత్పర్యం: నీ వారు సంతోషంతో తేలిపోయేటట్లు, దుర్యోధనుని ఆశలు వమ్ము అయ్యేటట్లు యుద్ధంలో కర్ణుడిని తుదముట్టింపుము. విజయము అందరికి తెలిసేటట్లు, అనుకొన్న పనిని సాధించావన్న సంతోషంతో ప్రవర్తించుము.'

వ. **అని వెండియు.** **117**

తాత్పర్యం: అని ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. **'కౌరవసైన్య మగ్గలము గాదె కడున్? భవదీయ సేన క**
వ్వారణకోటు లా తురగ వర్గము లా రథ సంచయంబు లా
వీర భటావళుల్ బహుళ విక్రమకౌతుకి వైన నీ శరా
సారములన్ బడల్పడఁ గృశం బగు టిప్పుడు నీకుఁ దోఁప దే?' **118**

ప్రతిపదార్థం: కౌరవ సైన్యము; భవదీయ సేనకున్= నీ సైన్యానికి; కడున్= మిక్కిలి; అగ్గలము కాదె?= అధికమైనది కాదా?; ఆ వారణ, కోటులు= ఆ ఏనుగుల గుంపులు; ఆ, తురగ, వర్గములు= ఆ గుర్రాల సమూహాలు; ఆ రథ సంచయంబులు= ఆ తేరుల సమూహాలు; ఆ వీర భట+ఆవళుల్= ఆ శూర సైనిక దళాలు; బహుళ విక్రమ= భిన్న భిన్న రీతులైన శౌర్య ప్రదర్శనకు; కౌతుకివి+ఐన= ఉత్సాహం చూపుతున్న; నీ శర+ఆసారమునన్= నీ అమ్ముల జడివానలో; బడల్పడన్= అలసిపోగా; కృశంబు+అగుట= క్షీణించిపోవటం; ఇప్పుడు; నీకున్ తోఁపదే?= నీకు కనపడటం లేదా?

తాత్పర్యం: కౌరవుల సేన నీ సైన్యంతో పోలిస్తే చాలా ఎక్కువైనదే కదా! అయినప్పటికిని తెరిపిలేని వానవలె కురిపించే నీ బాణాలతో రథగజ తురగాదులగు ఆ వైరి బలాలను అలయింపజేసి హీనపరచిన ఆ దృశ్యం ఇప్పుడు నీకు గోచరించటం లేదా?'

క. 'కురుసేనలకుం బతియై । సరిత్సుతుఁడు పదిదినములు సమరము సేసెన్;
శరమహిమ నతఁడు నీచే । స్థిర శరతల్ప గతుఁ డయ్యె ధీరవిచారా!' 119

ప్రతిపదార్థం: ధీరవిచారా!= ధైర్యం ఆలోచించేవాడా! అర్జునా!; కురుసేనలకున్; పతి ఐ= నాయకుడై; సరిత్+సుతుఁడు= నదీపుత్రుడైన భీష్ముడు; పది దినములు; సమరము చేసెన్= యుద్ధం చేశాడు; శరమహిమన్= నీ బాణశక్తి వలన; అతఁడు= భీష్ముడు; స్థిర= గట్టిదైన; శరతల్పగతుఁడు= బాణాలతో ఏర్పాటైన మంచంమీద ఉన్నవాడుగా; అయ్యెన్= అయినాడు.

తాత్పర్యం: భీష్ముడు కౌరవసేనకు అధ్యక్షుడై పదిరోజులు యుద్ధం చేశాడు. చివరకు నీ బాణప్రయోగ ప్రభావంచేత అంపశయ్యమీద పరుండిపోయాడు.

విశేషం: ఉ.వి. ప్రతిలోని 'పరిరక్షితుఁడైన సైన్యపాలు మిగిలినే?' అన్న పాఠం కంటె 'స్థిరశరతల్పగతుఁ డయ్యె ధీరవిచారా!' అనే పాఠాంతరమే యోగ్యమైనదని భావించి దానిని పాఠంగా స్వీకరించటమైనది.

చ. 'అతని శిఖండి బాణముల క ట్లెరసేసితి; ద్రోణునిం జమూ
పతియుఁగ జేసెఁ గౌరవ నృపాలకుఁ; డగ్గురుఁడున్ భవచ్చమూ
పతి నడఁగించెనే దివసపంచక, మమ్మెయిఁ బోరి తావకా
ప్రతిహత బాహురక్ష యిరువాఁగును జూడదె పాండవోత్తమా!' 120

ప్రతిపదార్థం: పాండవ+ఉత్తమా!= పాండవులలో శ్రేష్ఠుడవైనవాడా! అర్జునా!; అతనిన్= ఆ భీష్ముడిని; శిఖండి బాణములకున్; అట్లు= ఆ విధంగా; ఎర+చేసితి(వి)= తిండి చేశావు (చంపినావు); కౌరవ నృపాలకుఁడు= కౌరవరాజు దుర్యోధనుడు; ద్రోణునిన్; చమూపతియుఁగన్= సైన్యాధిపతిగా; చేసెన్= చేసెను; ఆ+గురుఁడున్= ఆ గురువు కూడా; భవత్= నీ యొక్క; చమూపతిని= సేనానాయకుడిని; దివస పంచకము= ఐదు దినములు; ఆ+మెయిన్ పోరి= ఆ విధంగా పోరాడి; అడఁగించెనే?= అణచగలిగాడా?; తావక= నీ యొక్క; అప్రతిహత= ఎదుర్కొన సాధ్యంకాని; బాహురక్ష= నీ భుజబలంవలన కలిగిన రక్షణను; ఇరువాఁగును= ఉభయ పక్షాలును; చూడదె?= చూడటం లేదా?

తాత్పర్యం: 'పాండవశ్రేష్ఠా! ఆ విధంగా భీష్ముడిని శిఖండి బాణాలకు ఆహారం చేశావు; ఆ తరువాత దుర్యోధనుడు ద్రోణాచార్యుడిని సేనాధిపతిగా నియమించాడు. ఆ గురువు కూడా నీ సైన్యాధిపతి ధృష్టద్యుమ్నుడిని అణచగలిగాడా?

ఇట్లు ఐదుదినాలు యుద్ధం సాగింది. ఆ సమయంలో నీ భుజబలమువలన కలిగిన రక్షణను ఇరుపక్షాలూ గమనించలేదా?'

క. 'భీముని రణవిహరణ ము। ద్దామం బగు టెల్ల నీదు దర్పంబునఁ గా
దే! మాఱు లేని భవద। స్త్రామేయబలంబు దెలియు నంతయు నాకున్.' 121

ప్రతిపదార్థం: భీముని; రణవిహరణము= యుద్ధవిహారం; ఉద్దామంబు+అగుట, ఎల్లన్= భయంకరం కావటం అంతా; నీదు దర్పంబునన్ కాదే!= నీ పరాక్రమం వలననే కదా!; మాఱులేని= తిరుగులేని; భవత్= నీ యొక్క; అస్త్ర+అమేయ బలంబు= అస్త్రాల అపరిమితమైన శక్తి; అంతయున్; నాకున్ తెలియున్= నాకు బాగా తెలుసును.

తాత్పర్యం: భీముడు అట్లా వీరవిహారం చేసి భయంకరుడు కావటం అంతా నీపరాక్రమ ప్రభావమే కదా! సాటిలేని నీ అస్త్రశక్తి అంతా నాకు బాగా ఎరుక.

వ. 'కృపాశ్వత్థామ కృతవర్మ కర్ణశల్యులు నీచేతం బోయెడువారు 'కృపాశ్వత్థామల దెసం గృప సేసితేనియుం జంపక గెలిచి విడువుము; చుట్టం బని యరవాయి గొనుట కర్జంబుగాదు, గృతవర్మను సమయింపుము; శల్యుండు మేనమామ యైనను బగవారిం గూడి పరాక్రమించు చున్నవాఁడు గావున నతని వధించుట పాపం బని తలంపవలదు; కర్ణుండు జతుగృహదాహంబును గపటద్యూతోత్సాహంబును లోనుగాఁ గల దుర్యోధను దుర్నయంబులకు మూలం; బట్లుగాక జూదంబునప్పుడా సభలోన ద్రౌపది నుద్దేశించి యప్పాపాత్ముండు. 122

ప్రతిపదార్థం: కృప; అశ్వత్థామ; కృతవర్మ; కర్ణ; శల్యులు= నీచేతన్; పోయెడువారు= చనిపోతారు; కృప, అశ్వత్థామల; దెసన్= పట్ల; కృపచేసితి+ఏనియున్= దయదలచినట్లయితే; గెలిచి= ఓడించి; చంపక విడువుము= చంపకుండా వదలివేయుము; చుట్టంబు+అని; అరవాయి గొనుట= సంకోచపడుట; కర్జంబు కాదు= కార్యాచరణ విధానం కాదు; కృతవర్మను; సమయింపుము= చంపుము; శల్యుండు (నీకు) మేనమామ; ఐనను= అయినప్పటికి; పగవారిన్+కూడి= శత్రువులతో చేరి; పరాక్రమించుచున్నవాడు; కావునన్; అతనిన్; వధించుట= చంపటం; పాపంబు+అని= పాపమని; తలంపవలదు= అనుకొనవద్దు; కర్ణుండు; జతుగృహ దాహంబునన్= లక్కఇల్లు కాల్చివేయటాన్ని; కపటద్యూత= వంచనతో కూడిన జూదపు ఆట; ఉత్సాహంబును= ప్రోత్సాహపరచటం; లోనుగాన్+కల= మొదలైన; దుర్యోధను= దుర్యోధనుడి; దుర్నయములకున్= చెడ్డపనులకు; మూలంబు= ఆధారభూతుడు; అట్లున్+కాక= అంతేకాకుండా; జూదంబు+అప్పుడు= జూదమాడుతున్నప్పుడు; ఆ సభలోనన్; ద్రౌపదిన్; ఉద్దేశించి= గురించి; ఆ+పాపాత్ముండు= ఆ దుష్టుడు (కర్ణుడు).

తాత్పర్యం: 'అర్జునా! నీ చేత కృపాచార్యుడు, అశ్వత్థామా, కృతవర్మా, కర్ణుడూ, శల్యుడూ చావగలరు. నీవు కృపాశ్వత్థామల మీద జాలిచూపితే వారిని చంపకుండా ఓడించి వదలిపెట్టుము. చుట్టమని సందేహించటం కార్యం కాదు. కృతవర్మను చంపుము; శల్యుడు మీకు మేనమామ అయినా శత్రుపక్షాన పరాక్రమిస్తున్నాడు కాబట్టి అతడిని చంపటం పాపంకాదు. ఇక కర్ణుడా - లక్కయింటిని కాల్చటం, మాయాద్యూతానికి ప్రోత్సహించటం మొదలైన, దుర్యోధనుడి చెడ్డపనులన్నింటికి మూలకారకుడు. అంతేకాక జూదపుసభలో ద్రౌపదిని గురించి ఆ పాపాత్ముడైన కర్ణుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'లే రిచట మగలు నీకును; । వీరలు జూదమున నోడి విడిచిరి నిన్నున్;
వారిజలోచన! నీపైఁ । గూరిమి గలమగని వెదకికొను మొరు' ననఁడే! 123

ప్రతిపదార్థం: వారిజలోచన!= తామరలవంటి కన్నులు కలదానా!; నీకును= నీకు; ఇచట; మగలు= భర్తలు; లేరు; వీరు= నీ భర్తలైన పాండవులు; జూదమునన్; ఓడి; నిన్నున్; విడిచిరి= వదలిపెట్టారు; నీపైన్; కూరిమి= ప్రేమ; కలమగనిన్; ఉన్న మగడిని; ఒరున్= ఇంకొకరిని; వెదకికొనుము!= చూచుకొమ్ము; అనఁడే= అని అనలేదా?

తాత్పర్యం: 'వీరు నిన్ను జూదంలో ఓడిపోయి వదలివేసినారు. ఇక ఇక్కడ నీకు భర్తలు లేరు. పద్మాలవంటి కన్నులు గలదానా, నీపై ప్రీతి, అనురాగం గలిగిన ఇంకొక మగడిని వెతకి చేపట్టుము అని ఆ కర్ణుడు అనలేదా?

తే. 'ఏను సంధికిఁ బోయినఁ దాను ధార్త । రాష్ట్ర మానసములఁ బగ రాఁజఁ బెట్టి
నన్నుఁ బట్టింపఁ జూడఁడె? యెన్నఁ డైన । నాదికారణ మతఁడ మీయాపదలకు. 124

ప్రతిపదార్థం: ఏను= నేను; సంధికిన్+పోయిన= రాజీ కుదర్చటానికి రాయబారం పోయినప్పుడు; తాను= రాధేయుడు; ధార్తరాష్ట్ర మానసములన్= ధృతరాష్ట్ర పుత్రుల మనస్సులలో; పగ= పగను; రాఁజన్+పెట్టి= మండేటట్లు చేసి; నన్నున్; పట్టింపన్= బంధించేటట్లు; చూడఁడె?= ప్రయత్నించలేదా?; ఎన్నఁడైనన్= ఎప్పుడైనా గాని; మీ ఆపదలకున్; అతఁడు= ఆ కర్ణుడే; ఆదికారణము= మూలకారణం.

తాత్పర్యం: నేను సంధికొరకు వారి ఆస్థానానికి పోయినప్పుడు, ధృతరాష్ట్రుడి పుత్రుల హృదయాలలో పగ రగుల్కొల్పి నన్ను బంధించటానికి కూడా అతడు ప్రయత్నించలేదా? ఏ కష్టం మీకు సంభవించినా దానికి మూలకారణం ఆ కర్ణుడే.

చ. వినుము! సుభద్ర పట్టి బలు విల్ మును వంచన వాఁడు డాసి త్రుం
చిన, మఱి కాదె యందఱును జేరి వధించుట? యా పరాభవం
బనలమ పోలె నున్నది యహర్నిశముం బరితాపకారి యై
మనమున నస్త్రవృష్టి నది మాన్పుము, బంధులు మోద మందఁగన్. 125

ప్రతిపదార్థం: వినుము; మును= పూర్వం; వంచనన్= మోసంతో; వాఁడు= ఆ కర్ణుడు; డాసి= సమీపించి; సుభద్ర పట్టి= అభిమన్యుడి; బలువిల్= శక్తిమంతమైన ధనువును; త్రుంచినన్= విరుగగొట్టినందున; మఱి కాదె= అందువలనే కదా; అందఱును చేరి= అందఱును చుట్టిముట్టి; వధించుట= చంపటం (జరిగింది?); ఆ పరాభవంబు= ఆ అవమానం; మనమునన్= మనస్సులో; అహర్నిశమున్= పగలు రాత్రులు; అనలము+అ పోలెన్= నిప్పు మాదిరిగా; పరితాపకారి ఐ= వ్యథను కలిగిస్తున్నదై; ఉన్నది= రేగుతున్నది; అస్త్ర వృష్టిన్= బాణాలనే వానతో; అది= దానిని; బంధులు= చుట్టాలు; మోదము+అందఁగన్= సంతోషించేటట్లు; మాన్పుము= ఆర్పివేయుము.

తాత్పర్యం: 'ఇది బాగా వినుము. వంచనతో ఈ కర్ణుడు దొంగచాటుగా ఆ అభిమన్యుని పద్మవ్యూహారంభంలో సమీపించి ఆయన శక్తిమంతమైన ధనుస్సును విరగ్గొట్టినందువలననేకదా - అందరూ ఆయనచుట్టూ మూగి చంపగలిగారు! ఆ అవమానం మనస్సులో చేరి ఎడతెరిపి లేకుండా ఆరని నిప్పువలె నొప్పిస్తున్నది. ఇక చుట్టాలు సంతోషించేటట్లు ఆ అగ్నిని బాణాలనే వానతో ఆర్పివేయుము.

విశేషం: అలంకారం: ఉపమా, రూపకములు.

క. 'ఆ సభ నా దుష్టాత్ముఁడు । సేసిన దుర్నయము సూచి, చిత్తమునఁ గడున్
నోసిన బంధులు వానిని । గాసిగ గ్రద్ధగమి దొలువఁ గనుఁగొని వలదే!' 126

ప్రతిపదార్థం: ఆ సభన్; ఆ దుష్టాత్ముఁడు= దుష్టబుద్ధిగల కర్ణుడు; చేసిన; దుర్నయము= అన్యాయాన్ని; చూచి= గమనించి; చిత్తమునన్= మనస్సులో; కడున్= మిక్కిలి; నోసినన్ బంధులు= నొచ్చిన చుట్టాలు; వానినిన్; గ్రద్ధగమి= గ్రద్దల గుంపు; గాసిగన్= బాధపడేటట్లు; తొలువన్= చీల్చివేయటం; కనుఁగొన వలదే!= చూడాలిగదా!

తాత్పర్యం: ఆ సభలో ఆ పాపాత్ముడైన కర్ణుడు చేసిన దుశ్చేష్టలను చూచి ఆప్తబంధువులు మనస్సులో చాలా బాధపడ్డారు. వాళ్ళంతా వాడి దేహాన్ని గ్రద్దలగుంపు చుట్టూమూగి వాటి పదునైన ముక్కులతో చీల్చి ముక్కలు చేయటం చూడాలి గదా! (కసిదీరే మాటలు)

వ. 'వాఁడు వడినం దక్కటి రాజులుం గౌరవులు నీకు మొనకట్ట' రని చెప్పె; నిట్లు సెప్పుచు, సమర స్థలంబున కనతి దూరంబుగాఁ జని యట్లెత్తి చూచి, కర్ణుండు సంగరంబు సేయు సంరంభం బుగ్గడించి, యగ్గాండీవికిం జూపి పుండరీకాక్షుండు వెండియు. 127

ప్రతిపదార్థం: వాఁడు= ఆ కర్ణుడు; పడినన్= చనిపోగానే; తక్కటి రాజులు= మిగిలి ఉన్న ఇతర రాజులు; కౌరవులు; నీకున్; మొన కట్టరు= (సైన్యాలను సమకూర్చుకొని, వ్యూహాలుపన్ని నిన్ను ఎదుర్కొనేందుకు) ఉత్సహించరు; అని చెప్పెన్= అని కృష్ణుడు (అర్జునుడితో) చెప్పాడు; ఇట్లు చెప్పుచున్= ఈ విధంగా చెప్పుతూ; సమర స్థలంబునకున్= యుద్ధభూమికి; అనతి దూరంబుగాన్= కొంత దూరంగా; చని; అట్టు+ఎత్తి చూచి= మెడ (తల) ఎత్తి చూచి; కర్ణుండు; సంగరంబు చేయు= యుద్ధం చేస్తున్న; సంరంభంబు= ఆటోపాన్ని; ఉగ్గడించి= ఎరిగించి; ఆ+గాండీవికిన్ చూపి= ఆ అర్జునుడికి చూపి; పుండరీకాక్షుండు= తెల్లతామరలవంటి కన్నులుగల కృష్ణుడు; వెండియున్= ఇంకను (అన్నాడు).

తాత్పర్యం: కర్ణుడు మరణిస్తే మిగిలినరాజులూ, కౌరవులూ ఉత్సాహంతో నీ కెదురుగా వ్యూహం పన్ని నిలువలేరు'. అని ఇట్లా చెప్పుతూ యుద్ధస్థలానికి కొద్ది దూరంగా చేరి, మెడలు సాచి చూచి, కర్ణుడు యుద్ధంచేసే ఆటోపాన్ని గురించి చెప్పి, అర్జునుడికి చూపి, కృష్ణుడు ఇంకా ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'కేతనము రథముఁ దురగ । వ్రాతముఁ బొడిచేసి, నీ శరంబులఁ గర్ణున్
వే తునిమినఁ గని, శల్యుఁడు । వాతెఱ యెండంగఁ బాఱవలదె కిరీటీ! 128

ప్రతిపదార్థం: కిరీటీ!= అర్జునా!; నీ శరంబులన్= నీ బాణాలచేత (కర్ణుని); కేతనము= టెక్కెం; రథము; తురగ వ్రాతమున్= గుఱ్ఱాలగుంపును; పొడి చేసి= నామరూపాలు లేకుండా దుమ్ము చేసి; కర్ణున్+వే= కర్ణుడిని త్వరగా; తునిమినన్= ముక్కలు ముక్కలుగా చేసి చంపివేయగా; కని= చూచి; శల్యుఁడు= కర్ణుడి సారథియైన శల్యుడు; వాతెఱ= పెదవులు; ఎండంగన్= ఎండిపోగా; పాఱవలదె!= పరుగెత్తిపోవాలిగదా!

తాత్పర్యం: నీ బాణాలతో ధ్వజాన్నీ, తేరునూ, గుఱ్ఱాలసమూహాన్ని నుగ్గునుగ్గు చేసి, వెంటనే ఆ కర్ణుడిని ముక్కలుగా చేయటం చూచి, సారథి శల్యుడు తన పెదవుల తడి ఆరిపోగా పరుగెత్తిపోవాలిగదా!

వ. పూనిక నెఱపి, శోకం బుజ్జగించి, లోకంబు సంస్తుతింప సుఖివి గ'మ్మనినం బ్రముదిత హృదయుండై.' 129

ప్రతిపదార్థం: పూనికన్= పట్టుదలను; నెఱపి= సాగించి; శోకంబు; ఉజ్జగించి= పోద్రోసి; లోకంబు= ప్రపంచం; సంస్తుతింపన్= కొనియాడగా; సుఖివి కమ్ము; అనినన్= అని కృష్ణుడనగా; ప్రముదిత= సంతోషించిన; హృదయుండు+ఐ= మనస్సు కలవాడై.

తాత్పర్యం: ప్రయత్నించి శోకంమాని, లోకం కీర్తించేటట్లు సుఖివి కమ్ము' అని కృష్ణుడు అనగా అర్జునుడు సంతసించిన మనస్సుతో (ఇట్లా అన్నాడు).

శా. 'నీ తోడ్పాటున నేఁ ద్రివిష్టపముల న్గెల్వంగ నూఁకింతు; నా
చేతం గర్ణుఁడు రూపు మాలి చను; మెచ్చింతున్; ననుం జూడుమీ
దైతేయాంతక!' యంచు శేషనిభ హస్తం బుద్ధతిం జాఁచి, ని
ర్ధూతారాతిబలుండు పుచ్చికొనియెన్ దుర్దాంత కోదండమున్. 130

ప్రతిపదార్థం: దైతేయ+అంతక!= రాక్షసులను సంహరించేవాడా - కృష్ణా!; నీ తోడ్పాటునన్= నీ సహాయంతో; ఏన్= నేను; త్రివిష్టపములన్= మూడులోకాలను; గెల్వంగన్; ఊఁకింతు= ప్రయత్నిస్తాను; నాచేతన్; కర్ణుఁడు; రూపుమాలి= ఆకారం చెడి; చనున్= పోవును; మెచ్చింతున్= మెప్పిస్తాను; ననున్= నన్ను; చూడుమీ; అంచున్= అంటూ; శేషనిభ= ఆదిశేషుడివంటి; హస్తంబు= చేతిని; ఉద్ధతిన్= గర్వంతో; చాచి; నిర్ధూత= అణచివేయబడిన; అరాతిబలుండు= శత్రువుల బలం కలవాడు; దుర్దాంత= అజేయమైన; కోదండమున్= ధనువును; పుచ్చికొనియెన్= చేపట్టాడు.

తాత్పర్యం: రాక్షససంహారా! నీ ఆదర సహకారాలతో మూడు లోకాలను జయించేందుకు ఉత్సాహపడుతున్నాను; మీ ప్రశంసలకు పాత్రమయ్యేటట్లు ఆ కర్ణుడు ఆకారమే లేకుండా పోతాడు. ఇదిగో! శౌర్యదీప్తంగా ఉండే నన్ను బాగా చూడుము' అంటూ తన బలంతో శత్రువులను రూపుమాపిన ఆ గాండీవి అపజయమెరుగని తన ధనుస్సును చేత పట్టుకొన్నాడు.

అర్జునుఁడు కృష్ణుని వాక్యంబులచేఁ గర్ణుని వధ కుత్సహించుట (సం. 8-52-11)

వ. ఇట్లు గాండీవం బెత్తి యెక్కువెట్టి, యన్నరుండు 'నేఁడు నా బాణంబులు బాణాసనంబును నరదంబునుం జూచి సుయోధనుండు శకునిచేతి యడ్డసాళ్ళును పలకయు నమ్మండపంబును దలంపవలయుఁ; దన నమ్మిన బంటైన కర్ణుండు నే నేయు తూపుల తాఁకున రూ పడంగినం గని, యవ్వెంగలి దాను విదురుబుద్ధి వినమికి వగం బొందవలయు; ధృతరాష్ట్రుండు దనకుం గార్యదర్శనంబు లేమి యుగ్గడించి తన్నుం దాన నిందించుకొనవలయు; నతండు గొడుకుల దెసను వారు రాజ్యంబుదెసను విగతాశులు గావలయు' నని పలికి, మఱియును. 131

ప్రతిపదార్థం: ఇట్లు; గాండీవంబు; ఎత్తి= ఎత్తుకొని; ఎక్కుపెట్టి= నారి మొదలగువాటిని సిద్ధంచేసి; ఆ+నరుండు= ఆ అర్జునుడు (అన్నాడు); నేఁడు; నా బాణంబులు; నా బాణాసనంబును= విల్లును; అరదంబును= తేరును; సుయోధనుండు= దుర్యోధనుడు; చూచి; శకునిచేతి= శకుని చేతిలోని; అడ్డసాళ్ళును= పాచికలను; పలుకయున్= చదరంగపు చెక్కను; ఆ మండపంబును= జూదమాడిన వేదికను; తలంప వలయున్= తలచుకొనాలి; తన నమ్మిన బంటైన= తనకు విశ్వాసపాత్రుడైన

సేవకుడైన కర్ణుడు; నేన్= నేను; ఏయు తూపుల= వదలే బాణాలయొక్క; తాఁకునన్= తాకిడిచేత; రూపడంగినన్= రూపు మాసిపోగా; కని= చూచి; ఆ+వెంగలి= ఆ వెర్రివాడు; తాను; విదురుబుద్ధిన్= విదురుడు చెప్పిన హితమును; వినమికిన్= వినకపోయినందుకు; వగన్ పొందవలయున్= దుఃఖించాలి; ధృతరాష్ట్రుండు; తనకు; కార్యదర్శనంబు= జరిగే విషయాలను చూడగలగటం; లేమి= లేకపోవటం; ఉగ్గడించి= తెలియజేసి; తన్నున్, తాను= తనను తాను; నిందించుకొనవలయున్; అతండు= ధృతరాష్ట్రుడు; కొడుకుల దెసను= కొడుకుల పట్ల; వారు; రాజ్యంబు దెసను= రాజ్య విషయంలోను; విగత+ ఆశులు= కోల్పోయిన ఆశలు కలవారు కావలయున్; అని పలికి; మఱియును.

తాత్పర్యం: ఈ విధంగా గాండీవాన్ని ఎత్తి, ఎక్కుపెట్టి అర్జునుడు ఇట్లా అన్నాడు: 'ఈనాడు నా బాణాలను, విల్లును, రథాన్ని చూచి, దుర్యోధనుడు శకునిచేతిలోని పాచికలను, పలకను, ఆ జూదమాడిన మంటపాన్నీ గుర్తుచేసుకోవాలి. తనకు నమ్మినబంట్రైన కర్ణుడు నా బాణాలకు చనిపోగా చూచి, ఆ వెర్రివాడు విదురనీతి విననందుకు దుఃఖించాలి. ధృతరాష్ట్రుడు తనకు ముందుచూపు లేదని వాపోయి తనను తాను నిందించుకోనాలి. ధృతరాష్ట్రుడు కొడుకులమీద ఆశలను, కౌరవులు రాజ్యంమీది ఆశలను వదలుకొనాలి' అని, మరల (ఈ విధంగా పలికాడు).

ఆ. 'రాజరాజుఁ బాసి రాజ్యసంపద ధర్మ। తనయుఁ జేరుపెంపు దారు దెలియఁ
గాంచి, సాత్యకియును గవలును భీముండు। గారవించువారు గాక నన్ను.' 132

ప్రతిపదార్థం: రాజ్యసంపద= రాజ్యలక్ష్మి; రాజరాజున్= దుర్యోధనుడిని; పాసి= వదలి; ధర్మతనయున్; చేరుపెంపు= చేరగా కలిగిన అతిశయాన్ని; తారు= తాము; తెలియన్+కాంచి= తెలిసేటట్లు చూచి; సాత్యకియును; కవలును= నకుల సహదేవులు; భీముండు; నన్నున్; గారవించువారుగాక!= గౌరవించేవారు అగుదురుగాక!

తాత్పర్యం: రాజరాజును రాజ్యసౌభాగ్యం విడిచిపెట్టి ధర్మరాజును చేరి, ఆయన ఉన్నతిని అతిశయింపజేయగా చూచి, సాత్యకీ, నకుల సహదేవులూ, భీముడూ నన్ను ఇంకా ఎక్కువగా గౌరవిస్తారు.

క. 'సుర గరుడోరగ విద్యా। ధరాది భూతములు సూతతనయుని నేఁ డేఁ
బొరి పుచ్చిన నను౦ బొగడుచు। నరుగుంగా కునికిపట్ల కంబుజనాభా!' 133

ప్రతిపదార్థం: అంబుజనాభా!= కృష్ణా!; సుర; గరుడ; ఉరగ; విద్యాధర; ఆది= మొదలగు; భూతములు= దైవాంశతో పుట్టినవారు; సూతతనయునిన్= కర్ణుడిని; నేఁడు; ఏన్= నేను; పొరిపుచ్చఁగన్= చంపగా; ననున్; పొగడుచున్= అభినందిస్తూ; ఉనికి పట్లకున్= తమ తమ నివాసాలకు; అరుగున్ గాక= పోదురుగాక.

తాత్పర్యం: పంకజనాభా! కర్ణుడిని ఈ దినం నేను చంపివేయగా చూచి, వివిధ దేవగణాలు నన్ను కొనియాడుతూ తమతమ స్థానాలకు మరలిపోవుదురు గాక!

వ. అని యిట్లు సల్లాపంబు సేయుచుం, గృష్ణార్జునులు; నిజ సేనఁ జేరి; రంతకు మున్న యిరువాఁగునం జేయంగల దొరలు దలపడినం బోరు ఘోరం బయ్యె; నందు. 134

ప్రతిపదార్థం: అని; కృష్ణార్జునులు; ఇట్లు= ఈ రీతిగా; సల్లాపంబు= పరస్పర మధుర సంభాషణ; చేయుచున్; నిజసేనన్= తమ సైన్యాన్ని; చేరిరి; అంతకుమున్న= దానికి ముందే; ఇరువాఁగునన్= ఉభయ సైన్యాలలో; చేయంగల దొరలు= సమర్థులైన నాయకులు; తలపడినన్= ఎదుర్కొనగా; పోరు= యుద్ధం; ఘోరంబు+అయ్యెన్= దారుణరూపం తాల్చింది; అందున్= ఆ యుద్ధంలో.

తాత్పర్యం: ఈ విధంగా కృష్ణార్జునులు మాట్లాడుకొంటూ తమ సేనను సమీపించారు. అంతకు ముందే రెండువైపుల వారిలో వీరులైన దొరలు పరస్పరం యుద్ధానికి పూనుకొనగా పోరు భయంకరంగా సాగుతూ ఉన్నది. అందులో. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. కర్ణసూనులలో నొకం డుత్తమౌజుని చేతఁ । జచ్చుటయు, శోకాతురుండుఁ
గ్రోధదీప్తుండు నగుచుఁ గర్ణుఁ డాతని । తురగ కేతనములఁ దునుము నాతఁ
డడిదంబు సేకొని యరదంబు డిగి కృపా । చార్యు రథ్యంబులఁ జంపి భీష్మ
వైరి తేరెక్కె; నాశారద్వతుం డట్లు । విరథుఁ డయ్యును బలువిడిఁ గడంగ

ఆ. నతఁడు పాదచారి యని యా శిఖండి య । వ్విప్రు నేయఁ డయ్యె; వేగ మెయ్ది
ద్రౌణి యతనిఁ దన రథంబుపై నిడికొని । యనికిఁ దొలఁగి చనియె మనుజనాథ! **135**

ప్రతిపదార్థం: మనుజనాథ!= ప్రభూ!; కర్ణ సూనులలోన్= కర్ణుడి కుమారులలో; ఒకండు; ఉత్తమౌజుని చేతన్; చచ్చుటయును; కర్ణుఁడు; శోక+ఆతురుండు= దుఃఖంతో ఉద్విగ్నుడై; క్రోధ= పగసాధింపుబుద్ధితో; దీప్తుండు= వెలుగుతున్నవాడు; అగుచున్; ఆతని; తురగ కేతనములన్= గుర్రాలను, టెక్కెములను; తునుమన్= ఖండించగా; ఆతఁడు= ఆ ఉత్తమౌజుడు; అడిదంబు= ఖడ్గాన్ని; చేకొని= చేబూని; అరదంబు డిగి= తేరు దిగి; కృపాచార్యుడి; రథ్యంబులన్= గుర్రాలను; చంపి; భీష్మవైరి= శిఖండి; తేరు ఎక్కెన్; ఆ శారద్వతుండు= ఆ కృపుడు; అట్లు; విరథుండు+అయ్యును= తేరు లేక పాదచారి అయి కూడ; బలువిడిన్= వేగంగా; కడంగన్= (యుద్ధానికి) పూనుకోగా; అతఁడు; పాదచారి అని= కాలినడక ఉన్నవాడని; ఆ శిఖండి; ఆవిప్రున్= ఆ బ్రాహ్మణుడిని, కృపుడిని; ఏయఁడు+అయ్యెన్= దెబ్బవేయడయ్యె; వేగము= త్వర; ఎయ్ది= పొంది; ద్రౌణి= ద్రోణుడి కుమారుడు - అశ్వత్థామ; అతనిన్= అతడిని; తన రథంబుపైన్= తన తేరుమీద; ఇడికొని= ఎక్కించుకొని; అనికిన్= యుద్ధంనుండి; తొలఁగి చనియెన్= వైదొలగిపోయాడు.

తాత్పర్యం: కర్ణుడి కుమారులలో ఒకడు ఉత్తమౌజుడి చేతిలో చచ్చాడు. అందుకు అతడు శోకం పొందినా, వెంటనే క్రోధాతిశయంతో అతడి గుర్రాలనూ, టెక్కాన్నీ నరికివేశాడు. ఉత్తమౌజుడు కత్తి చేపట్టి, రథం దిగి నడుస్తూ కృపాచార్యుడి రథపు గుర్రాలను చంపాడు. ఆ పైన శిఖండియొక్క రథాన్ని ఎక్కాడు. కృపాచార్యుడు విరథుడై కూడ, వేగంగా నడుస్తూ యుద్ధానికి పూనుకోగా, అతడు పాదచారి అని, శిఖండి అతడిని బాణాలతో కొట్టలేదు. అప్పుడు అశ్వత్థామ కృపాచార్యుడిని తన రథంమీద కెక్కించుకొని రణరంగంనుండి తొలగిపోయాడు.

వ. అట్టియెడ. **136**

తాత్పర్యం: ఆ సయమంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. అనిలసుతుండు తీవ్రవిశిఖాంశులు పర్వఁగ నేచి, యంబరం
బు నడుమఁ దేజరిల్లు రవిఁ బోలెడు వేఁడిమి కోహటించి నీ
మొన దెరలంగ, నా రథికముఖ్యుఁడు పార్థుఁ దలంచి సారథిం
గనుఁగొని, మానసంబు దలఁకం బ్రధనోగ్రత దక్కి యిట్లనున్. 137

ప్రతిపదార్థం: అనిల సుతుండు= వాయునందనుడు- భీముడు; తీవ్ర= పదునైన; విశిఖ+అంశులు= బాణకాంతులు; పర్వఁగన్= వ్యాపించేటట్లు; ఏచి= అతిశయించి; అంబరంబు, నడుమన్= ఆకాశమధ్యాన; తేజరిల్లు= ప్రకాశించే; రవిన్= సూర్యుడిని; పోలెడు= పోలునట్టి; వేఁడిమికిన్= తాపానికి; ఓహటించి= భయపడి వెనుదీసి; నీమొన= నీ సైన్యం; తెరలంగన్= తొలగిపోగా (ఇది సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్పినట్లు); ఆ రథికముఖ్యుఁడు= ఆ రథమునెక్కి యుద్ధం చేసేవారిలో ప్రధానుడు- భీముడు; పార్థున్ తలంచి; సారథిన్= సారథిని; కనుఁగొని= చూచి; మానసంబు; తలఁకన్= చలించగా; ప్రథన+ ఉగ్రతన్= యుద్ధతీవ్రతను; తక్కి= విడనాడి; ఇట్లు+అనున్= సారథితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీముడు మట్టమధ్యాహ్నపు సూర్యుడి వేడిమివలె నిశితమైన బాణకాంతులు వ్యాపించేటట్లు చేయగా, ఆ వేడికి తట్టుకొనలేక నీ సైన్యం (కౌరవబలం) భయపడి రణరంగంనుండి తొలగిపోయింది. భీముడికి వెంటనే అర్జునుడి సంగతి గుర్తుకు వచ్చింది. దీనితో అతడి మనస్సు చలించింది. తోడనే యుద్ధతీవ్రతను తగ్గించి, తన రథసారథి అయిన విశోకుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: అలంకారం: ఉపమ.

క. 'నరుఁ డన్నవర్తనము తెఱఁ । గరయుటకై మది గలంగ నట చనినాఁ; డ
న్నరపతి దుర్దశ గని దు । స్తరశోకం బడరి, తానుఁ దదవస్థుఁ డగున్.' 138

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; అన్న వర్తనము= అన్న నడవడి; తెఱఁగు= విధం; అరయుటకై= తెలిసికొనుటకై; మది కలంగన్= మనస్సు కలవరపడగా; అట చనినాఁడు= అక్కడికి పోయాడు; ఆ+నరపతి= ఆ ధర్మరాజు; దుర్దశ కని= అభాగ్యస్థితిని చూచి; దుస్తర శోకంబు= భరింపరాని దుఃఖాన్ని; అడరి= పొంది; తాను= తానుగూడ; తదవస్థుఁడు= అదే స్థితి కలవాడు; అగున్= అగును.

తాత్పర్యం: అర్జునుడు అన్నప్రవర్తన మెట్లున్నదో తెలిసికొనాలన్న తలంపుతో మనస్సు బాధపడగా, ఆయన దగ్గరకు పోయాడు. అక్కడ ఆ రాజు దుస్థితిని చూచి, తాను కూడా అదే స్థితిలో పడినాడేమో!'

తే. అయ్యిరువురకు నొకటి యైనట్టిదైన । మనము, కౌరవసంఘంబు మ్రగ్గఁ జేసి
గెలుపుగొంటిమి యేనియు, ఫలము దాన । నేమి గల దనువగఁ జిత్త మెరియఁ జొచ్చె.' 139

ప్రతిపదార్థం: ఆ+ఇరువురకున్= ఆ ఇద్దరికి; ఒకటి ఐనట్టిదైన= ఏదైనా కీడు కలిగితే; మనము; కౌరవ సంఘంబు; మ్రగ్గన్+ చేసి= రూపులేకుండా చేసి; గెలుపు గొంటిమి= విజయము సాధించినాము; ఏనియున్= అయినప్పటికి; దానన్= దానివలన ఫలం; ఏమి కలదు+అను= ప్రయోజనం ఏమి ఉన్నదనే; వగ= పరితాపం; చిత్తమున్= మనస్సును; ఎరియన్+చొచ్చెన్= కాల్చివేస్తోంది.

తాత్పర్యం: ఆ ఇద్దరికీ ఏదైనా కీడు మూడితే మనం కౌరవ సైన్యసమూహాలను నాశనం చేయగలిగినప్పటికీ దానివలన మనకేమి ప్రయోజనం కలగబోతుంది? అన్న ఆవేదన నా మనస్సును దహించివేస్తున్నది!

భీముఁ డర్జును రాక గోరి విశోకునితో విచారించుట (సం. 8-54-11)

క. 'ఐనను నిప్పటిదుఃఖము । మానింపఁగ మనకు నొండు మం దెయ్యది? యీ
సేనల దొరలను గౌరవ । భూనాథుని సమయఁ జూచి పోవుట దక్కన్?' 140

ప్రతిపదార్థం: ఐనను= అయినప్పటికి; ఇప్పటి దుఃఖమును= ఇప్పటి మనోవ్యథను; మానింపంగన్= మాన్పటానికి; మనకున్; ఈ సేనల దొరలను= ఈ కౌరవసేనలను, వీరులను; కౌరవ భూనాథుని= దుర్యోధనుని; సమయన్+చూచి= చంపి చూచి; పోవుట; తక్కన్= తప్ప; ఒండు= వేరొక; మందు+ఎయ్యది?= మందేమున్నది?.

తాత్పర్యం: అయినప్పటికిని, ఇప్పుడు మన దుఃఖం పోవటానికి వేరే మందేమున్నది? ఉంటే ఒక్కటే. అది, మన విరోధి సేనలను, వీరులను, దుర్యోధనుని చంపిపోవటం.

వ. అని పలికి, యవ్విశోకునకు మనదిక్కు సిడంబులు సూపి, 'యవి యెవ్వరెవ్వరి చిహ్నంబు లేర్పడం జూచికొనుము; మన శరంబుల కొలంది యెట్లున్న దరయుము' మనవుడు, నతండు 'వీ రెవ్వరైననేమి? నీ వలిగినఁ బడక పాఱక నిలువం జాలు వాఁ డిం దెవ్వం? డస్త్ర శస్త్రంబుల సంపద యడుగవలదు; నేఁడు దెచ్చినవానిలోన నా ఱెడ్లు వ్రేఁగుపడి పూనివచ్చు బండియొక్కటి యించుకయును వెలితిగాక యున్నయది! గాకున్న నేమి? భవద్బాహుదండంబునకు మూలధనంబైన గదాదండం బెల్లపనులకుం జాలు' నని చెప్పిన బవమానసూతి యాసూతు చేసేత నప్పళించి. 141

ప్రతిపదార్థం: అని పలికి; ఆ+విశోకునకున్= ఆ విశోకుడికి; మన దిక్కు= మనవైపు; సిడంబులు= కేతనములను; చూపి; అవి; ఎవ్వరెవ్వరి; చిహ్నంబులో= గుర్తులో; ఏర్పడన్= నిర్ణయమయ్యేటట్లు; చూచికొనుము; మన; శరంబుల= బాణాల; కొలంది= సామర్థ్యం; ఎట్లున్నది; అరయుము= తెలిసికొనుము; అనవుడు= అనగా; అతండు= ఆ సారథి; వీ రెవ్వరైన ఏమి?; నీవు; అలిగినన్= కోపగించుకొంటే; పడక= చచ్చిపడకుండా; పాఱక= పరుగెత్తిపోకుండా; నిలువన్+చాలు= నిలువగలిగిన వాడు; ఇందున్; ఎవ్వండు?; అస్త్రశస్త్రంబుల; సంపద= సమృద్ధి; అడుగ వలదు= అడుగవలసిన పనే లేదు; నేఁడు తెచ్చినవానిలోనన్; ఆ ఱెడ్లు= మూడు జతల ఎద్దులు; వ్రేఁగుపడి= కష్టపడి; పూనివచ్చు= కాడెలకు కట్టి లాగుకొని వచ్చిన; బండి ఒక్కటి; ఇంచుకయున్= రవ్వంతగూడ; వెలితిగాక ఉన్నది= కొరవడక ఉన్నది; కాకున్నన్ ఏమి?= అట్లా కాకపోయినంత మాత్రాన కొరత ఏమీ లేదు; భవత్= నీ; బాహుదండంబునకున్= కొయ్యగడలవంటి చేతులకు; మూలధనంబు+ఐన= పెట్టుబడి అయిన; గదాదండంబు= గద; ఎల్లపనులకున్; చాలును= సమర్థమై ఉన్నది; అని చెప్పినన్; పవనసూతి= భీముడు; ఆ సూతు= ఆ సారథి; చే చేతన్+అప్పళించి= చేయి చేయితో కలిపి చరచి (అన్నాడు).

తాత్పర్యం: భీము డా విధంగా పలికి సారథి అయిన విశోకుడికి కౌరవసైన్యంలోని టెక్కాలను చూపి 'అవి ఎవరెవరి గుర్తులో గుర్తించుము, మన బాణాల సంపద ఎంత ఉన్నదో గమనించుము' అన్నాడు. అప్పు డా సారథి, 'శత్రువీరులెవరైనా సరే, నీవు కోపగిస్తే వారు చావటమో, పారిపోవటమో చేయక తప్పదు. మన అస్త్రశస్త్ర సంపదను

గురించి దిగులుపడవద్దు. ఆరెద్దుల బండినిండా నింపిన ఆయుధాలు అట్లాగే ఉన్నాయి. ఏమయినా నీ బాహుదండానికి మూలధనమైన గదాదండం అన్ని పనులూ సాధించి పెట్టగలదు' అనగా భీముడు సంతోషించి సారథి చేతితో చేయి కలిపి చరచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. **'వేడుకఁజూడు మేను బటువిక్రమకౌతుకలీలఁ బేర్చి చెం**
డాడెద వైరులన్; విదురుఁ డప్పుడు సెప్పఁడె? జూద మిట్లు గా
వాడెనె రాజరా జకట! యా ప్రతినల్ గడతేర్చుఁ గాక! బొం
కాడునె ధర్మజావరజుఁ డంచుఁ దదాప్తులు వంతఁ బొందఁగన్. **142**

ప్రతిపదార్థం: విదురుడు; అప్పుడు= జూదం ఆడేటప్పుడు; చెప్పఁడె= చెప్పాడు కదా; రాజరాజు= దుర్యోధనుడు; అక్కట= అయ్యో!; జూదము; ఇట్లు+కాన్+ఆడెనే= ఈ విధంగా అయ్యేటట్లు ఆడాడా?; ధర్మజ+అవరజుఁడు= ధర్మరాజు తరువాత పుట్టినవాడు - తమ్ముడు - భీముడు; ఆ, ప్రతినల్= ఆ ప్రతిజ్ఞలను (జూదం ఆడేటప్పుడు చేసిన ప్రతిజ్ఞలను); కడతేర్చున్+కాక= నెరవేరుస్తాడు గాని; బొంకు+ఆడునె= అబద్ధం ఆడుతాడా?; అనుచు= అంటూ; తద్+ఆప్తులు= అతని ఆత్మీయులు; వంతన్= దుఃఖాన్ని; పొందన్+కన్= పొందగా; ఏను= నేను; పటు= బలమైన; విక్రమ= పరాక్రమంయొక్క; కౌతుక= ఉత్సాహంయొక్క; లీలన్= విలాసంతో; వైరులన్= శత్రువులను; చెండాడెదన్= సంహరిస్తాను; వేడుకన్= (ఆ) సంబరాన్ని; చూడుము.

తాత్పర్యం: 'విదురుడు అప్పుడే చెప్పాడు కదా! అయ్యో! రారాజు జూదం ఈ విధంగా అయ్యేటట్లు ఆడాడా? ధర్మరాజు తమ్ముడు (భీముడు) తన ప్రతిజ్ఞలు నెరవేరుస్తాడు గాని, 'అబద్ధం ఆడుతాడా?' అని, దుర్యోధనుని ఆప్తులంతా దుఃఖపడేటట్లుగ, నేను మహాపరాక్రమోత్సాహంతో విజృంభించి వైరులను సంహరిస్తాను. ఆ వేడుక చూడుము.

వ. **అని వెండియు.** **143**

తాత్పర్యం: అని ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. **ఉత్తమకర్మ మిట్టి దని యొక్కరుఁడుం దగఁ జెప్పలేఁడ నా**
కిత్తఱి; నేన పోలుతెఱఁ గెల్లను జేసెద నట్లుఁ గాక, నా
చిత్తము మార్గవర్తియుఁగ శిక్షక మయ్యెడు దైవ' మంచు, న
ట్టెత్తి భవద్బలంబుపయి నెల్లను జూ పడరించె నేపునన్.' **144**

(ఈ భాగమంతా సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్పిన విధంగానే సాగుతున్నది)

ప్రతిపదార్థం: ఉత్తమ కర్మము= మంచిపని; ఇట్టిది అని; ఒక్కరుఁడున్= ఏ ఒక్కడుగూడ; నాకున్; ఈ+తఱిన్= ఈ సమయంలో; తగన్+చెప్పలేఁడు+అ= ఉచితరీతిలో చెప్పలేడు; నేన= నేనే; పోలుతెఱఁగు= ఉచితమైన విధాన్ని; ఎల్లన్= అంతటిని; చేసెదన్; అట్లున్+కాక= ఆ రీతిగాకపోయినట్లయితే; దైవము= దైవం నా చిత్తము; మార్గవర్తియుఁగన్= త్రోవచూపేవాడుగా; శిక్షకము+అయ్యెడున్= శిక్షణ పొందుతుంది; అంచున్= అనిచెప్పుతూ; అట్టు+ఎత్తి= తల ఎత్తి; భవత్+బలంబు పయిన్= (భీముడు) నీ సేనపై; ఎల్లను= పూర్తిగా; చూపు= దృష్టిని; ఏపునన్= గర్వంతో; అడరించెన్= వ్యాపింపచేశాడు.

తాత్పర్యం: ఈ సమయంలో ఇదీ ఉత్తమమైన కార్యాచరణవిధానమని ఎవ్వరూ నాకు చెప్పలేరు. అందుచేత నేనే ఉచితమైన విధానాలనన్నిటిని ఆచరిస్తాను. దేవుడే నా మనస్సుకు ఉచితమైన దారి చూపేవాడుగ నా మనస్సు ప్రవర్తిల్లుతుంది' అని భీముడు తలయెత్తి కౌరవసైన్యాలపై గర్వంతో చూపు ప్రసరింపచేశాడు.

వ. ఇట్లు గలయం గనుంగొని, యద్దిక్కు గలగుండు గొనుట యెఱింగి, విశోకునితోఁ 'గౌరవసైన్యంబు మనము దఱుమకయ తాన కలంగెఁ; గెలనం గవ్వడి గదిసెనొ కాక!' యనుటయు; వాఁడు నిపుణంబుగా నిరూపించి ముదంబునం బొదలుచు. 145

ప్రతిపదార్థం: ఇట్లు; కలయన్ కనుంగొని= తేరిపారజూచి; ఆ దిక్కు= ఆ దిశలో; కలగుండు గొనుట= కలకలం రేగటం; ఎఱింగి; విశోకునితోన్; మనము; తఱుమక+అ= తరుమకుండానే; కౌరవసైన్యంబు; తాను+అ= తనకు తానే; కలంగెన్= కలత చెందింది; కెలనన్= ఆ సమీపంలో; కవ్వడి= అర్జునుడు; కదిసెనొ,కాక!= తలపడినాడేమో!; అనుటయున్; వాఁడు; నిపుణంబుగాన్= నేర్పరితనంతో; నిరూపించి= చూచి; ముదంబునన్= సంతోషంతో; పొదలుచున్= ఉబ్బుతూ.

తాత్పర్యం: ఆ విధంగా తేరిపారచూచి, ఆ దిక్కున సేనలు కలతచెందటం చూచి మనం తరుమకుండానే కలత పడుతూ ఉంది. ఆ సమీపంలో అర్జునుడు దాడిచేసి ఉంటాడేమో! అని అనగా, సారథి దానిని నిపుణంగా తెలుసుకొని, మనస్సు ఉప్పొంగగా (ఇట్లా అన్నాడు).

క. 'నరుఁ డదె కంటే! కౌరవ । కరిసేనం గవిసెఁ గేతుకపి రుచు లంభో
ధరబృందముపైఁ గలయం । బరఁగు తటిల్లతలఁ దలఁపఁ బట్టయి నిగుడన్.' 146

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; అదె= అదిగో; కంటే= చూచావా?; కేతు కపిరుచులు= పతాకమందలి హనుమంతుడి కాంతులు; అంభోధర= మబ్బుల; బృందముపైన్= సమూహంపై; కలయన్= అంతటా; పరఁగు= వ్యాపించే; తటిల్లతలన్= మెరుపు తీగలను; తలఁపన్= తలంచటానికి; పట్టు అయి= ఆకరమై; నిగుడన్= వ్యాపింపగా; కౌరవ= కౌరవులయొక్క; కరిసేనన్= ఏనుగుల సైన్యాన్ని; కవిసెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: అదిగో! నరుడు చూచినావా, కౌరవుల గజసేనతో ఢీకొని ఉన్నాడు. ఆయన పతాకమునందున్న హనుమంతుడి కాంతులు మేఘపంక్తులపై పడిన మెరుపు తీగలను తలపునకు తెస్తున్నవి.

విశేషం: అలంకారం: ఉపమ.

క. 'హరిమేనికాంతియును నరు । కిరీటరత్నాంశువులును గిఱిగొన, రథ ర
థ్యరుచులు బెరసి విచిత్ర । స్ఫురణంబునఁ దేజరిల్లెఁ జూడు కుమారా!' 147

ప్రతిపదార్థం: కుమారా!= భీమా!; హరి= శ్రీకృష్ణునియొక్క; మేనికాంతియును= శరీర కాంతియును; నరు కిరీట= అర్జునుడి కిరీటమందలి; రత్నాంశువులును= రత్నకాంతికిరణాలు; గిఱికొనన్= చుట్టుముట్టగా; రథ; రథ్య= గుర్రాల; రుచులు= ప్రభలు; బెరసి= వ్యాపించి; విచిత్ర, స్ఫురణంబునన్= రంగు రంగుల ప్రకాశంతో గోచరిస్తూ; తేజరిల్లెన్= ప్రకాశిస్తున్నాయి; చూడు= అదె కనుగొనుము.

తాత్పర్యం: కుమారా! అదిగో చూడుము. కృష్ణుడి నల్లని శరీరశోభ, కిరీటి కిరీటమందలి రత్నాలకాంతులు, తేరుల గుఱ్ఱాల కాంతులు వ్యాపించి వివిధమైన రంగులతో గోచరిస్తూ ప్రకాశిస్తుండటం చూడుము.

వ. అనిన విని, యంతరంగంబు సంతోషమయంబు గా నంగంబు పొంగ, నేర్పడ నాలోకించి, విశోకునకు వృకోదరుం డి ట్లనియె: 148

ప్రతిపదార్థం: అనినన్+విని; అంతరంగంబు= మనస్సు; సంతోషమయంబుగాన్= ఆనందంతో నిండినది కాగా; అంగంబు= దేహం; పొంగన్= ఉప్పొంగగా; ఏర్పడన్= స్పష్టంగా; ఆలోకించి= చూచి; విశోకునకున్; వృకోదరుండు= భీముడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని, హృదయం సంతోషంతో పొంగి, శరీరం ఉత్తేజం పొందగా చూచి, విశోకుడితో భీముడు ఇట్లా అన్నాడు.

తే. 'వరవుడుల నూర్వురను, మేలివాజు లిరువ । దింటి, నూళులు పదునాల్గు నిత్తు నీకుఁ
బసదనము; నీవు నాకు బీభత్సురాక । సూపి ముద మొనరించితి సూతవర్య!' 149

ప్రతిపదార్థం: సూతవర్య!= సారథి శ్రేష్ఠ!; నీకున్; వరవుడులన్= సేవకుల; నూర్వురన్; మేలి వాజులు= మేలు జాతి గుఱ్ఱాలు; ఇరువదింటిన్; ఊళులు= ఊళ్ళు; పదునాల్గున్; నీకున్; పసదనము= కానుకగా; ఇత్తున్= ఇస్తాను (ఎందుకంటే); నీవు; నాకున్; బీభత్సు= యుద్ధరంగాన జుగుప్సాకరమైన దృశ్యాలను సృష్టించే అర్జునుడి; రాకచూపి= రాకను తెలిపి; ముదము+ఒనరించితి(వి)= సంతోషము కలుగజేసినావు.

తాత్పర్యం: విశోకుడా! నీవు నాకు అర్జునుడి రాకను చూపి సంతోషాన్ని కలిగించినందుకు కానుకగా వందమంది సేవకులనూ, ఇరవై గుఱ్ఱాలను పద్నాలుగు గ్రామాలను ఇస్తాను.'

వ. అనియె; నప్పుడు వారణ ఘటావిదారణంబు సేసి, వాసవి వాసుదేవుతో 'మన తేరు భీమసేనుఁ జేరం బోవ ని' మ్మనుటయు. 150

ప్రతిపదార్థం: అనియెన్; అప్పుడు; వారణఘట= ఏనుగుల గుంపును; విదారణంబు= చీల్చి చంపటం; చేసి; వాసవి= ఇంద్రనందనుడు - అర్జునుడు; వాసుదేవుతోన్= కృష్ణుడితో; మనతేరు; భీమసేనున్; చేరన్ పోవనిమ్ము; అనుటయున్= అన్నంతనే.

తాత్పర్యం: అని అన్నాడు. అప్పుడు ఏనుగులను చీల్చి చెండాడి అర్జునుడు కృష్ణుడితో 'మన రథాన్ని భీమసేనుడి సమీపానికి పోనిమ్ము' అనగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అతఁడు హరులఁ దఱుమఁగ ను । ద్ధతిఁ జనునెడ, మనబలంబు దర్పమహోగ్రా
కృతిఁ బొదివినఁ జతురంగ । ప్రతతుల నన్నరుఁడు నేలపాలుగఁ జేసెన్. 151

ప్రతిపదార్థం: అతఁడు= శ్రీకృష్ణుడు; హరులన్= గుఱ్ఱాలను; తఱుమఁగన్= త్రోలగ; ఉద్ధతిన్= గర్వంతో; చనునెడన్= వెళ్ళేటప్పుడు; మన బలంబు= మన కౌరవసేన; దర్పమహా+ఉగ్రాకృతిన్= గర్వంచేత మహా భయంకరమైన రూపంతో; పొదివినన్= చుట్టుముట్టగా; చతురంగ ప్రతతులన్= రథ గజ తురగ పదాతి సమూహాలను; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; నేలపాలుగన్+చేసెన్= దుమ్ములో కలిసిపోయేటట్లు చేశాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు గుఱ్ఱాలను త్రోలగ అర్జునుడు విజృంభించి పోయేటప్పుడు మనసైన్యం భయంకరరూపాన్ని తాల్చిన పరాక్రమంతో ముట్టడించగా, ఆ నరుడు మన సైన్యపు నాలుగు విభాగాలనూ నేలకూలేటట్లు చేశాడు.

ఆ. మందరంబుచేత మథితమై తిరుగు సా । గరము నులివు గెలిచె ధరణి నాథ!
పార్థుఁ డురవణింప బలువడిఁ గలఁగెడు । కౌరవేంద్రుసేన కలకలంబు. 152

ప్రతిపదార్థం: ధరణినాథ!; పార్థుడు; ఉరవణింపన్= దండెత్తగా; బలువడిన్= మిక్కిలి వేగంగా; కలఁగెడు= కలకబారెడు; కౌరవేంద్రు సేన= దుర్యోధనుని సేనయొక్క; కలకలంబు= కోలాహలధ్వని; మందరంబుచేతన్= మందర పర్వతముచేత; మథితమై= చిలుకబడి; తిరుగు= అటు నిటు తిరుగుచు అల్లకల్లోలమైన; సాగరము= సముద్రము యొక్క; ఉలివున్= శబ్దాన్ని; గెలిచెన్= జయించింది.

తాత్పర్యం: భూపాలా! పార్థుడు దండెత్తగా, కౌరవేంద్రుడి సైన్యంలో కలిగిన కలకలపు తీవ్రత, పాలసముద్రంలో మందరపర్వతంతో చిలికినప్పుడు పుట్టిన శబ్దాన్ని గెలిచింది.

వ. కేతు చామ రాతపత్ర భూషణ శకలంబుల నా శౌర్యభూషణుండు రణక్షోణికి విభూషణం బాచరించె; నట్లు కర్ణువధంబునకు వేగిరపడి తఱుమ నుఱుక, మన మొన వెండియు నొండొండ పయిం గ్రమ్మిన, నమ్మేటి మగండు. 153

ప్రతిపదార్థం: కేతు= ధ్వజాలయొక్క; చామర= వింజామరలయొక్క; ఆతపత్ర= గొడుగులయొక్క; భూషణ= నగల యొక్క; శకలంబులన్= తునుకలతో; ఆ శౌర్య భూషణుండు= ప్రతాపమే అలంకారంగా కలిగిన ఆ అర్జునుడు; రణక్షోణికిన్= యుద్ధభూమికి; విభూషణంబు= విశేష అలంకారంగా; ఆచరించెన్= జరిపాడు; అట్లు; కర్ణు; వధంబునకున్= సంహారానికి; వేగిరపడి= తొందరపడి; తఱుమన్= తరిమికొట్టేందుకు; ఉఱుకన్= ముందుకు దూకగా; మనమొన= మన సైన్యం; వెండియున్= మరల; ఒండొండ= క్రమంగా; క్రమ్మినన్= క్రమ్ముకొనగా; ఆ+మేటి మగండు= ఆ గొప్ప శూరుడు.

తాత్పర్యం: ధ్వజాలను, వింజామరలను, గొడుగులను, సొమ్ముల ముక్కలను యుద్ధభూమికి నగలుగా అర్జునుడు అలంకరించాడు. ఆ విధంగా కర్ణుడి వధకు త్వరపడి తరిమికొట్టగా మన సేనలు మరల సమకూడి క్రమ్మగా అర్జునుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. పేరు గల రథికముఖ్యుల । సారథి రథ రథ్య కేతుసహితంబుగ దు
ర్వార విశిఖ స్ఫురణ వి । హారంబున శతచతుష్టయము పొడి చేసెన్. 154

ప్రతిపదార్థం: పేరుకల= ప్రసిద్ధులైన; రథిక ముఖ్యులన్= రథమెక్కి యుద్ధంచేసే వారిలో ముఖ్యులను; సారథి; రథ; రథ్య= గుఱ్ఱాలు; కేతుసహితంబుగన్= జెండాలతో గూడ; శతచతుష్టయంబు= నన్నూటిని; దుర్వార= అడ్డగించుటకు సాధ్యం కాని; విశిఖ= బాణాలయొక్క; స్ఫురణ= ప్రకాశం తోడి; విహారంబునన్= క్రీడావినోదంతో; పొడిచేసెన్= పిండిగా చేశాడు.

తాత్పర్యం: పార్థుడు రథంపై నుండి యుద్ధం చేసే పేరుగాంచిన వీరులను - సారథితో, రథంతో, గుఱ్ఱాలతో, జెండాలతో కూడ - నాలుగువందలకు పైగా బాణాలు విలాసంగా ప్రయోగించి పిండి చేశాడు.

వ. అవ్వేఁడిమికి వెఱచఱచి యచ్చటిమూఁక విచ్చుటయుఁ, గర్ణుముందటి మోహరం బుత్సాహతీవ్రం బయి యురవణించినం గని, యన్నరుం డురగ నికరంబునకుఁ గవియు గరుడుని కైవడి నద్దెస కడరె; నట్లడరుట యాలోకించి తనకట్టెదుటి మొనబెట్టు దాఁకి. 155

ప్రతిపదార్థం: ఆ+వేఁడిమికిన్= తీవ్ర బాణప్రయోగం పుట్టించిన ఉష్ణానికి; అచ్చటిమూఁక= అక్కడ ఉన్న సేన; వెఱచఱచి= భయపడి; విచ్చుటయున్= విడిపోవటం వలన; కర్ణుముందటి= కర్ణుడి ఎదురుగా సాగుతున్న; మోహరంబు= యుద్ధం; ఉత్సాహ తీవ్రంబు+అయి= ఉత్సాహంచేత తీవ్రమై; ఉరవణించినన్= పై బడగా; కని; ఆ+నరుండు; ఉరగ= పాముల; నికరంబునకున్= సమూహానికిగా; కవియు= పైబడు; గరుడునికైవడిన్= గరుత్మంతుడివలె;? ఆ+దెసకున్= ఆ దిక్కుకు; అడరెన్= విజృంభించాడు; అట్లు+అడరుట= ఆ విధంగా చెలరేగటం; ఆలోకించి= చూచి; తనకట్టెదుటన్= తన కళ్ళముందరే ఉన్న; మొనన్= సైన్యాన్ని; బెట్టు= దృఢముగా; తాఁకి= ఎదిరించి.

తాత్పర్యం: అర్జునుడు సాగించిన యుద్ధతీవ్రతకు పుట్టిన తీక్ష్ణతకు తట్టుకొనలేని కౌరవసైన్యం, పిరికితనంతో చెల్లాచెదరై పోసాగింది. కాని కర్ణుడి ఎదుట సాగుతున్న సమరం ఉత్సాహజనిత ప్రకోపంతో వేడి ఎక్కగా, కౌరవసేనలు పాండవ దళాలపై పడ్డాయి. ఇది గమనించిన కవ్వడి పాములగుంపుపై పడిన గరుడపక్షివలె, కర్ణుడున్న రంగానికి త్వరత్వరగా పోగా, ఇది చూచి భీముడు తన ఎదుట నున్న సైన్యాన్ని తాకి.

విశేషం: అలంకారం: ఉపమ.

తే. వాయుసత్త్వుండు వాయుజవ ప్రదీప్త । తనుఁడు వాయుతనూజుఁ డుదగ్రవృత్తి
నేచి, బాహాసముల్లాస మెసకమెసఁగఁ । గనుపు గొట్టె వాలమ్ములఁ గౌరవేంద్ర! 156

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= ధృతరాష్ట్రా!; వాయుసత్త్వుండు= వాయుదేవుడి బలమంత బలం కలిగినవాడు; వాయుజవ= వాయువుతో సమానమైన వేగంతో; ప్రదీప్త= ప్రకాశమానమైన; తనుఁడు= దేహం కలవాడు అయిన; వాయు తనూజుఁడు= వాయుపుత్రుడు భీముడు; ఉదగ్రవృత్తిన్= భయంకరమైన ప్రవర్తనతో; ఏచి= విజృంభించి; బాహాసముల్లాసము= భుజబలం కలిగించిన ఆనందాతిశయము; ఎసకము+ఎసఁగన్= అతిశయింపగా; వాలమ్ములన్= పొడవైన నిశితమైన బాణాలతో; కనుపుగొట్టెన్= ఖండించెను.

తాత్పర్యం: భీముడు వాయుపుత్రుడు కాబట్టి తండ్రి గుణాలైన బలం, వేగం గల దేహంతో విజృంభించి భుజబలోల్లాసం వెల్లివిరియగ పొడవు, పదునుగల బాణాలతో విరోధులను ఖండించాడు.

వ. అవ్వీరు నాటోపంబు సూచి, కురుభూపతి ప్రధాన సైనికులకుం జూపి 'యితండు సమసిన నక్కడ సకలంబు సమయు, మీ రొక్కుమ్మడిం బొదివి పొరివుచ్చుం'డనిన, వారును వారణాది చతురంగంబుల యగ్గలిక మెఱయ నతనిం జుట్టుముట్టి, యస్త్రశస్త్రంబులం బొదువుటయు, నతండు, 157

ప్రతిపదార్థం: ఆ+వీరు= ఆ వీరుడియొక్క; ఆటోపంబు= ఉత్సాహపూర్ణమైన బలప్రదర్శనాన్ని; చూచి; కురుభూపతి= దుర్యోధనుడు; ప్రధానసైనికులకున్= సైనిక ముఖ్యులకు; చూపి; ఇతండు; సమసినన్= తుదముట్టినచో; అక్కడన్= పాండవ శిబిరంలో; సకలంబు= అంతా; సమయున్= ముగిసిపోతుంది; మీరు; ఒక్కుమ్మడిన్= ఒక్కపెట్టున; పొదివి= చుట్టుముట్టి;

పోరి పుచ్చుండు= చంపండి; అనినన్; వారును= ఆ సైనికులు కూడా; వారణ+ఆది= ఏనుగులు మొదలైన; చతురంగ బలంబుల= నాలుగు సైనిక విభాగాలలో; అగ్గలిక= పూనిక; మెఱయన్= ప్రకాశించగా; అతనిన్; చుట్టుముట్టి; అస్త్ర శస్త్రంబులతోన్; పొదువుటయున్= క్రమ్ముకొనగా; అతండు= ఆ భీముడు.

తాత్పర్యం: ఆ భీముడి బలప్రదర్శనను చూచి, దుర్యోధనుడు తన సైనిక ముఖ్యులకు చూపి, 'ఈ భీముడు చనిపోతే పాండవపక్షంలో అంతా ముగిసిపోతుంది. కాబట్టి మీరందరు అతడిని చుట్టుముట్టి చంపివేయండి' అనగా వారు చతురంగబలాలతో, పూనికతో అతడిని చుట్టుముట్టి శస్త్రాస్త్రాలతో క్రమ్మగా భీముడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. వానినెల్లఁ ద్రుంచి, వల వ్రచ్చికొని లీల । నిగుడు చోఱవోలె వెగడు పడక
తఱిమి, రక్తనదులు వఱపె మస్తక కూర్మ । హస్తభుజగ తతుల నతిశయిల్ల! 158

ప్రతిపదార్థం: వానిన్+ఎల్లన్= వాటినన్నింటిని; త్రుంచి= చంపి; వల= వలను; వ్రచ్చికొని= చీలుకొని; నిగుడు= నీల్గే; చోఱవోలెన్= సొరచేప వలె; వెగడుపడక= తబ్బిబ్బుకాక; తఱిమి; రక్తనదులు= నెత్తురు టేరులు; పఱపెన్= ప్రవహింపజేశాడు; మస్తకకూర్మములు= తలలనే తాబేళ్ళు; హస్తభుజగ= చేతులనే పాములు; తతులన్= (వీటి) సమూహాలతో; అతిశయిల్లన్= ఎక్కువ కాగా.

తాత్పర్యం: క్రూరమైన సొరచేప, వలను ముక్కలుచేసి బయటపడి విహరించే మాదిరి, భీముడు శత్రువులు ప్రయోగించిన ఆయుధాల అడ్డంకిని ఛేదించుకొని బయటపడ్డాడు. వెంటనే అతడు శత్రుసేనలను చంపగా, వాటినెత్తురు ఏరులై పారింది. అందులో సైనికుల తలలు తాబేళ్ళవలె, చేతులు పాములవలె తిరుగాడుతూ అతిశయిస్తున్నాయి.

విశేషం: సొరచేప, రంపపు పళ్ళవంటి కూచిపళ్ళు ఇరువైపుల కలిగి పొడవైన ముక్కు కలిగి ఉంటుంది. నీళ్ళను చెలగుతు పోతూ కనబడిన జంతువులను కోరతో ముక్కలు చేసి తింటూ క్రూరవిహారం చేస్తూంటుంది. అందుచేత జాలరులు దీని జోలికి పోరు. ఇంగ్లీషులో దీనిని **Shark** అంటారు. అలంకారం: ఉపమ. రూపకానుప్రాణితము.

క. కురు విభుఁడు సూచి శకునిం । బురికొల్పిన, నాతఁ డుగ్రముగ మార్కొని, పే
రురమున నారాచంబులు । గురిసినఁ, బవనజుఁడు సరకుగొన, కారథికున్. 159

ప్రతిపదార్థం: కురువిభుఁడు= దుర్యోధనుడు; చూచి; శకునిన్; పురికొల్పినన్= ప్రేరేపించగా; ఆతఁడు= శకుని; ఉగ్రముగన్= భయంకరంగా; మార్కొని= ఎదుర్కొని; పేరురమునన్= వెడదరొమ్మున; నారాచంబులు= ఇనుప బాణాలను; కురిసినన్= వానవలె తెరపిలేకుండా వదలగా; పవనజుఁడు= భీముడు; సరకుగొనక= లెక్కచేయక; ఆ రథికున్= ఆ రథయోధుడిని - శకునిని.

తాత్పర్యం: దుర్యోధనుడు చూచి శకునిని పురికొల్పగా, అతడు భయంకరంగా ఎదుర్కొన్నాడు. భీముడి రొమ్మున బాణాలు కురిపించాడు. అయినా భీముడు లెక్కచేయక శకునిమీద. (తరువాతి పద్యంతో అన్వయం).

క. బలునారసమున నేసిన, । నలఘు లఘుత మెఱయ నాతఁడది యిరు మూఁడ
మ్ములఁ దునియలు సేయుడు, నతఁ । డలిగి యతని ధనువు దునిమె నల్లన నగుచున్. 160

ప్రతిపదార్థం: బలు నారసమునన్= శక్తిమంతమైన బాణంతో; ఏసినన్= కొట్టగా; అలఘు లఘుత= మిక్కిలి లాఘవంతో; మెఱయన్; ఆతఁడు= శకుని; అది= దానిని; ఇరుమూఁడు+అమ్ములన్= ఆరు బాణాలతో; తునియలు చేయుడున్= తునుకలు చేయగానే; అతఁడు= ఆ భీముడు; అలిగి= కోపగించుకొని; అతని= శకునియొక్క; ధనువున్; అల్లనన్= మెల్లగా; నగుచున్= చిరునవ్వు చిందుతూ; తునిమెన్= విరుగగొట్టాడు.

తాత్పర్యం: శక్తిమంతమైన బాణంతో కొట్టగా, శకుని మిక్కిలి లాఘవంతో దానిని ఆరు బాణాలతో ముక్కలు చేశాడు. భీముడు కోపించి నవ్వుతూ అతడి విల్లును విరిచాడు.

ఉ. ఒండొకవిల్లు పుచ్చికొని, యుజ్జ్వల షోడశ భల్లముల్ సము
ద్దండత నేసె నీమఱఁది తత్తను వాడఁగఁ, జాప కేతువుల్
ఖండములై పడంగఁ, దురగంబులు నొవ్వఁగ, సూతుమేనఁ బెన్
గండలు నెత్తురుల్ దొరఁగఁ, గౌరవ పుంగవుఁ డిచ్చ మెచ్చఁగన్. 161

ప్రతిపదార్థం: ఒండొక విల్లు పుచ్చికొని= ఇంకొక ధనువు చేపట్టి; నీ మఱఁది= నీ బావమరిది శకుని; ఉజ్జ్వల= ప్రకాశమానమైన; షోడశ= పదహారు; బాణాలను; తద్+తనువు+ఆడఁగన్= ఆయన శరీరం కంపించగా; ఉద్దండతన్= ప్రకోపించి; ఏసెన్= ప్రయోగించాడు (దానితో); చాపకేతువుల్= ధనుస్సు టెక్కెము; ఖండములై పడంగన్= ముక్కలై పడేటట్లుగా; తురగంబుల్= గుఱ్ఱాలు; నొవ్వఁగన్= బాధపడేటట్లుగా; సూతుమేనన్= సారథి శరీరంలో; పెన్= పెద్ద; కండలు; నెత్తురుల్; తొరఁగన్= పారేటట్లు; కౌరవ పుంగవుఁడు= కౌరవ శ్రేష్ఠుడు; ఇచ్చన్= మనస్సులో; మెచ్చన్= కొనియాడగా; ఉద్దండతన్= బలంతో; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: శకుని ఇంకొక విల్లు చేబూని, తళతళలాడే పదహారు బాణాలను భీముడి శరీరం కంపించగా ప్రయోగించాడు. ఆ దెబ్బలతో ధనుస్సు, టెక్కెము తునకలై నేలపాలైనవి. గుఱ్ఱాలు బాధతో మూల్గినవి. రథసారథి శరీరం నుండి నెత్తురు కాలువలు కట్టగా, కండరాలు చితికిపోగా దానిని చూచి దుర్యోధనుడు మనసారా మెచ్చుకొన్నాడు.

తే. అలిగి జమునాలుకయుఁబోని యతులశక్తి । వాయుపుత్త్రుఁ డారథికుపై వైచె, నతఁడు
వెరవుమైఁ బట్టి, దాన నవ్వీరుబాహు । వుచ్చిపో వైవ, మనమొన యుబ్బి యార్చె. 162

ప్రతిపదార్థం: అలిగి= కోపించి; వాయుపుత్రుఁడు; జమునాలుకయున్+పోని= యముని నాలుకవంటి; అతులశక్తిన్= సాటిలేని శక్తిని; ఆ రథికుపైన్= ఆ రథవీరుడిమీద; వైచెన్= వేశాడు; అతడు (దానిని); వెరవుమైన్= ఉపాయంతో; పట్టి= చేజిక్కించుకొని; దానన్= దానితోనే; ఆ+వీరునిన్= ఆ యోధుని; బాహువు= చేయి; ఉచ్చిపోవైవన్= చీల్చుకొని పోయేటట్లు విసరివేయగా; మన మొన= మన సేన; ఉబ్బి= సంతోషంతో పొంగిపోయి; ఆర్చెన్= కేకలు వేసింది.

తాత్పర్యం: శకుని చేసిన బాణప్రయోగానికి, భీముడు రేగిన కోపంతో యముడి నాలుకను పోలిన శక్తిని శకునిపై ప్రయోగించినాడు. అతడు మెలకువగా దానిని పట్టుకొని, తిరిగి భీముడిపై విసరివేసినాడు. ఆ దెబ్బకు అతనిచేయి బాగా గాయపడింది. అది చూచి కౌరవసేన సంతోషంతో కేకలు పెట్టింది.

విశేషం: అలంకారం: ఉపమ.

శకుని భీమసేనుం దలపడి మూర్ఛితుండై తన రథంబు మీఁదఁ గూలుట (సం. 8-55-65)

చ. **అనిలజుఁ డట్లు పెల్లెసఁగు నార్పులు సైఁపక మేటివిల్లు వే**
కొని, కనుదోయి గెంపుగ నకుంఠిత విక్రమ మొప్పఁ ద్రుంచె నా
తని ఘనకార్ముకంబు, నిశితప్రదరంబులు మేన నించె; నిం
చిన నతఁ డుర్విఁ గూలెఁ గురుసేనకు బెగ్గల మగ్గలంబుగన్. **163**

ప్రతిపదార్థం: అనిలజుఁడు= వాయునందనుడు భీముడు; అట్లు= ఆ విధంగా; పెల్లు+ఎసఁగు= మిక్కిలి అతిశయించిన; ఆర్పులు= ఆ కేకలను; సైఁపక= ఓర్చుకొనలేక; వే= త్వరగా; మేటివిల్లు= గొప్ప ధనుస్సును; కొని= తీసికొని; కనుదోయి= రెండు కన్నులు; కెంపుగన్= ఎరుపెక్కగా; అకుంఠిత= మొక్కవోని; విక్రమము+ఒప్పన్= శౌర్యం రాణించగా; ఆతని= శకుని యొక్క; ఘనకార్ముకంబు= పెద్ద విల్లును; త్రుంచెన్= విరుగగొట్టాడు; నిశిత= వాడి అయిన; ప్రదరంబులు= బాణాలు; మేనన్= అతడి శరీరంలో; నించెన్= నిండించాడు; నించినన్= నాటగా; అతఁడు= శకుని; కురుసేనకున్= కౌరవసైన్యానికి; బెగ్గలము= భయము; అగ్గలంబుగన్= అధికము కాగా; ఉర్విన్ కూలెన్= భూమిపై కూలబడిపోయాడు.

తాత్పర్యం: కౌరవసేన సేసిన అల్లరికి భీముడు ఓర్చుకొనలేక, గొప్ప ధనుస్సును వడివడిగా తీసికొని ఎరుపెక్కిన కన్నులతో మొక్కవోని ప్రతాపం అందగించగా, శకుని ధనుస్సును విరగగొట్టి, అతడి దేహాన్ని పదునైన బాణాలతో నింపివేశాడు. కౌరవసేనకు భయం అధికంకాగా ఆ దెబ్బలతో శకుని నేలపై కూలిపోయాడు.

తే. **కూలి మూర్ఛ మునింగినఁ, గురువిభుండు । దన రథంబుపై నిడికొని యనికిఁ దొలఁగఁ**
బోవుటయుఁ జూచి, తమ తమ పోరు మాని । దొరలు దెరలిన, మూఁకలు మరలి పఱచె. **164**

ప్రతిపదార్థం: కూలి= పడిపోయి; మూర్ఛన్ మునింగినన్= స్పృహదప్పి ఉండగా (శకునిని); కురువిభుండు= దుర్యోధనుడు; తన రథంబుపైన్; ఇడికొని= ఎత్తి పెట్టుకొని; అనికిన్= యుద్ధరంగానికి; తొలఁగన్= దూరమై; పోవుటయున్= పోయినందున; చూచి; తమతమ పోరు= పరస్పర యుద్ధాలను; మాని; దొరలు= సైన్యాధిపతులు; తెరలినన్= వైదొలగిపోయినందున; మూఁకలు= సైనికుల గుంపులు; మరలి= వెనుదిరిగి; పఱచెన్= పరుగెత్తిపోయాయి.

తాత్పర్యం: భీముడి దెబ్బలకు శకుని ఒళ్ళు తెలియకుండా పడిపోయినందున, దుర్యోధనుడు అతడిని తన తేరుమీద పెట్టుకొని యుద్ధరంగంనుండి వైదొలగిపోయాడు. అది చూచి సేనాధిపతులు యుద్ధాన్ని మాని తొలగిపోయారు. దీనితో భటులగుంపులు కూడా వెన్ను జూపి పారిపోయాయి.

వ. **ఇట్లు వెఱచఱచి, యవిసిన కలంబు జనంబులు దీవి సేరిన యట్లు కర్ణుం జేరి కాలుదన్ని నిలిచె నని విని, ధృతరాష్ట్రుండు సంజయున కి ట్లనియె.** **165**

ప్రతిపదార్థం: ఇట్లు; వెఱచఱచి= భయపడి; అవిసిన= పగిలిపోయిన; కలంబు= పడవలో ఉన్న; జనంబులు; దీవి= లంకను (నీటి నడుమనున్న భూమిని); చేరి అట్లు; కర్ణున్+చేరి= కర్ణుని అండను చేరి; కాలు దన్ని= కాలుమోపి స్థిరంగా; నిలిచెన్; అనన్‌విని= అని చెప్పగా విని; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా భయపడి, పగిలిపోయిన పడవలో ఉన్న జనులు ఒక ద్వీపాన్ని చేరినట్లుగా, కర్ణుడి వద్దకు చేరి నిలద్రొక్కుకొని ఉన్నారు. ఈ సంగతి విని ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలంకారం: ఉపమ.

తే. **'అట్టియెడఁ గృతవర్మ ద్రోణాత్మజుండుఁ । గృపుఁడు నృపతియుఁ గర్ణుండుఁ గినియఁ జాల**
రయిరె? కిమ్మీరవైరి కయ్యంబు కడఁక । యిట్టు లుండునె? పదపడి యెట్టు లయ్యె?' **166**

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో; కృతవర్మ= కృతవర్మ; ద్రోణ+ఆత్మజుండు= ద్రోణుడి పుత్రుడైన అశ్వత్థామ; కృపుఁడు= కృపాచార్యుడు; నృపతియున్= రాజైన దుర్యోధనుడు; కర్ణుండున్= రాధేయుడు మొదలయినవారు; కినియన్+ చాలరయిరె?= కోపపడలేకపోయారా!; కిమ్మీరవైరి= కిమ్మీరుడనే రాక్షసుడిని చంపిన భీముడి; కయ్యంపు= యుద్ధంపట్ల; కడఁక= పూనిక; ఇట్టులు+ఉండునె?= ఇట్లా ఉంటుందని ఊహించలేదే?; పదపడి= ఆ తరువాత; ఎట్టులు+అయ్యెన్?= ఏ విధంగా సాగింది?

తాత్పర్యం: 'ఆ సమయంలో కృతవర్మ, అశ్వత్థామ, కృపుడు, దుర్యోధనుడు, కర్ణుడు - కోపగించలేదా? భీముడి యుద్ధోత్సాహం అట్లా ఉండేదా? ఆ తరువాత యుద్ధం ఎట్లా జరిగింది?'

వ. **అనిన, సంజయుం డమ్మహీపతి కిట్లనియె: నప్పుడు కరూశ పాంచాల చేది సైన్యంబులఁ దఱుముటయుం గని, కర్ణుండు గడంగిన మనమూఁకలుం బురికొని పవనతనయుతోడం బోరె. నప్పాండవసేనా సముదయంబు రభసంబున నా రాధేయుం బొదివిన.** **167**

ప్రతిపదార్థం: అనినన్; సంజయుండు; ఆ+మహీపతికిన్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్; అప్పుడు; కరూశ పాంచాల చేది= ఈ దేశాల; సైన్యంబులన్= సైన్యాలను తఱుముటయున్= పారద్రోలగా; కని= చూచి; కర్ణుండు; కడంగినన్= పూనగా; మన మూఁకలున్= మన సైన్యాలు కూడ; పురికొని= ఉత్సాహంతో చెలరేగి, పవన తనయుతోడన్= భీముడితో; పోరెన్= పోరాడాయి; ఆ+పాండవ, సేనా, సముదయంబు= ఆ పాండవ సైనికసమూహం; రభసంబునన్= కోపాతిశయంతో; ఆ రాధేయునిన్; పొదివినన్= చుట్టుముట్టగా.

తాత్పర్యం: అని అనగా సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా చెప్పాడు. అప్పుడు కరూశ, పాంచాల, చేది సైన్యాలను తరిమివేయటం చూచి కర్ణుడు పూనుకొనగా, మనసైన్యాలు కూడా అతడికి తోడ్పడి, భీముడితో యుద్ధంచేశాయి. పాండవ సైన్యసమూహాలు ఉద్రేకంతో కర్ణుడిని చుట్టుముట్టగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **అతఁడు వివిధోగ్ర విశిఖ । ప్రతతులు నిగిడించి ఘోరభంగి నుదారో**
ద్ధతి సూపినఁ, జేడ్పడి త । చ్చతురంగంబులును గలఁగె జగతీనాథా! **168**

ప్రతిపదార్థం: జగతీనాథా!= రాజా!; అతఁడు= కర్ణుడు; వివిధ+ఉగ్ర= అనేక విధాలైన తీవ్రమైన; విశిఖ ప్రతతులు= బాణ సమూహాలు; నిగిడించి= ప్రయోగించి; ఘోరభంగిన్= భయంకర రూపంతో; ఉదార= విరివి అయిన; ఉద్ధతిన్= విజృంభణాన్ని; చూపినన్= ప్రదర్శించగా; చేడ్పడి= బాధపడి; తద్= ఆ; చతురంగ బలంబులును; కలఁగెన్= కలత నొందాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! కర్ణుడు నానావిధాలైన నిశిత బాణ పరంపరను ప్రయోగించి, తీవ్రంగా తన బలోన్నతిని, తన పరాక్రమాతిశయాన్ని ప్రదర్శించగా, పాండవసైన్యాలు బాధతో కలతచెందాయి.

చ. **కనుఁగొని, భీమసేనుఁడు శిఖండియు సైన్యవిభుండు ద్రౌపదీ**
తనయులుఁ గేశవానుజుఁడు దాఁకిన, నందఱ కన్నిరూపులై
తనువులు సించుచున్ హయవితానము నొంచుచుఁ గేతుదండ ఖం
డన మొనరించుచుం బెనఁగె డయ్యక క్రుయ్య కతండు గండునన్. **169**

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; భీమసేనుఁడు; శిఖండియున్; సైన్యవిభుండున్= ధృష్టద్యుమ్నుడు; ద్రౌపదీ తనయులున్= ఉపపాండవులు అయిదుగురు; కేశవ+అనుజుఁడున్= కేశియను రాక్షసుని చంపిన కృష్ణుని తమ్ముడు- సాత్యకియు; తాఁకినన్= పైబడగా; అతండు= ఆ కర్ణుడు; అందఱకున్; అన్ని రూపులు+ఐ= అన్ని రూపాలలో; తనువులు చించుచున్= శరీరాలను చీల్చివేస్తూ; హయవితానమున్= గుర్రాల సమూహాన్ని; నొంచుచున్= బాధపెట్టుతూ; కేతుదండ= పతాకాలు కట్టిన ధ్వజాలను; ఖండన మొనరించుచున్= నరికి ముక్కలు చేస్తూ; డయ్యక= అలయక; క్రుయ్యక= వెనుదీయక; గండునన్= పౌరుషంతో; పెనఁగెన్= పోరాడాడు.

తాత్పర్యం: కర్ణుడి వీరవిహారాన్ని చూచి భీముడు, శిఖండి, ధృష్టద్యుమ్నుడు, ఉపపాండవులు, సాత్యకి అతడిపై బడ్డారు. దీనితో కర్ణుడు రెచ్చిపోయి ఉగ్రుడై ఒక్కొక్కరికి ఒక్కొక్క ఆకృతిగా అగుపిస్తూ భటుల శరీరాలను చీల్చివేస్తూ, గుర్రాలను అణచివేస్తూ, కేతనాలను తునుకలు చేస్తూ అలయక, సొలయక వెనుకడుగు వేయక పౌరుషంతో పోరాడాడు.

క. **నకుల సహదేవులును వా । రికిఁ దోడ్పడి నిశితశర పరీతునిఁ జేయం,**
బ్రకటిత బలశౌర్యుఁడు సూ । త కులోద్వహుఁ డేచి, వారిఁ దలఁకం జేసెన్. **170**

ప్రతిపదార్థం: నకుల సహదేవులును; వారికిన్= ఆ భీమశిఖండి ధృష్టద్యుమ్న ఉపపాండవ సాత్యకులకు; తోడ్పడి= సహాయం చేస్తూ; నిశిత శర= వాడి అయిన అమ్ములతో; పరీతునిన్= చుట్టుముట్టినవాడినిగా; చేయన్; ప్రకటిత= వెల్లడించిన; బలశౌర్యుఁడు= శక్తి సాహసాలు కలిగినవాడు; సూతకుల= సారథుల కులంలో; ఉద్వహుఁడు= శ్రేష్ఠుడు (రాధేయుడు); ఏచి= విజృంభించి; వారిన్; తలఁకన్= భయపడి వెనుదీసేటట్లు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: నకుల సహదేవులు వారితో చేరి, వాడి అయిన బాణాలతో కర్ణుడిని ముంచివేశారు. పేరుకెక్కిన బలపరాక్రమాలు కలవాడు సూతకుల పుత్రుడు అయిన రాధేయుడు వీరవిహారం చేసి వారిని భయపడి పరుగెత్తేటట్లు చేశాడు.

క. **పెక్కండ్రతోడఁ గర్ణుం । డొక్కఁడ పోరాడి, యెక్కు డుక్కున వారిం**
జిక్కువడం జేయుట గడు । నక్కజ మై యుండెఁ గౌరవాధిప! చూడన్. **171**

ప్రతిపదార్థం: కౌరవాధిప!= ధృతరాష్ట్రా!; పెక్కండ్ర తోడన్= అనేకులతో; కర్ణుడు; ఒక్కఁడు+అ= ఒక్కడే; పోరాడి; ఎక్కుడు= అతిశయించే; ఉక్కునన్= బలంతో; వారిన్ చిక్కుపడన్+చేయుట= వారిని చిక్కులలో పెట్టటం; చూడన్= చూడగా; కడున్= మిక్కిలి; అక్కజము+ఐ ఉండెన్= ఆశ్చర్యకరంగా ఉండింది.

తాత్పర్యం: పెక్కుమందితో కర్ణుడు ఒక్కడే పోరాడి వారందరిని చిక్కులలో పెట్టటం చూస్తే ఆశ్చర్యకరంగా తోచింది.

వ. ఇవ్విధంబున న ద్దెసఁ జేయంగల మేటిమగల వెగ డందించినం, బోక పొదువు పాంచాల చేది మాత్స్యాదివర్గంబులపై నతం డనర్గళ ప్రసారంబులగు శరాసారంబులు నిగిడించినం, గరి రథ ఘోటక భటావయవ ఖండంబులును వివిధాస్త్ర శస్త్రశకలంబులును జామర చ్ఛత్ర కేతు భూషణ భాగంబులును భూ భాగంబునం దొరఁగం బెరిఁగి, నెత్తురు టేఱులు వాఱ; మఱియుం బాండవ యోధవరులు వరుసం బోరి పోరి యంత కంతకు నివ్వటిల్లు నాకర్ణు క్రొవ్వున నివ్వెఱ పడిన, నవ్వీరుండు గోవులం దోలు కోల్పులికైవడిఁ గౌంతేయ బలంబులం బఱపఁ, బాంచాలురు వెండియు దండితనంబున నతనిం దలపడిన; నాతండు పంచవింశతి రథికులం దునిమి వైవస్వతు చందంబునం బేర్చినం, దూర్య రవంబులు సెలంగం దత్పుత్రులును దుర్యోధన కృప దుశ్శాసనులు నశ్వత్థామ శకుని కృతవర్మలుం బైకొని, యా ధర్మనందను సైన్యంబు సమయింప; నది విచ్చిన, నెలుం గిచ్చి పోనీక నిలిపి, భీమ నకుల సహదేవ ధృష్టద్యుమ్న శిఖండి ద్రౌపదేయులు గడంగి కౌరవ సైనికులం గనుపుగొట్టం దొడంగినం, బోరు ఘోరంబయ్యెఁ; నిత్తెఱంగున రెండు దెఱంగుల మూఁకలు దెగటాఱుచుండ, గాండీవి దమ మోహరంబున కుత్సాహం బెసంగ నొక్కవలన మనమొనల నెత్తుటం జొత్తిల్లం జేయుచుం గదిసి, దలయెత్తి చూచి శౌరి నుద్దేశించి. 172

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; ఆ+దెసన్= ఆ పక్షంలో; చేయన్+కల= సమర్థులైన; మేటి మగల= అధికులైన వారి; వెగడు= భయం; అందించినన్= కలిగించినా; పోక= తృప్తిపడక; పొదువు= పైకొనే; పాంచాల-చేది-మత్స్య; ఆది= మొదలైన; వర్గంబులపైన్= విభాగాలపై; అతండు= ఆ కర్ణుడు; అనర్గళ= అడ్డులేని; ప్రసారంబులు+అగు= వ్యాపకములుగల; శర= బాణాలనే; ఆసారంబులు= జడివానలను; నిగిడించినన్= పెంపొంద చేయగా; కరి; రథ; ఘోటక= గుర్రాల; భట; అవయవ= (వీటి) శరీరభాగాల; ఖండంబులును= తునకలను; వివిధ+అస్త్ర శస్త్ర; శకలంబులును= ముక్కలును; చామర= వింజామర; ఛత్ర= గొడుగుల; కేతు= పతాకాల; భూషణ= నగల; భాగంబులును= విరిగిన తునుకలున్నూ; భూభాగంబునన్; తొరఁగన్= రాలిపడగా; పెరిఁగి= అతిశయిల్లి; నెత్తురుటేరులు; పారున్= పారగా; మఱియున్; పాండవ; యోధవరులు= యుద్ధంచేసే ప్రముఖ వీరులు; వరుసన్= ఒకరి తర్వాత ఒకరు; పోరి పోరి; అంతకంతకున్= క్రమంగా; నివ్వటిల్లు= అతిశయించే; ఆ కర్ణు; క్రొవ్వునన్= మదమునకు; నివ్వెఱపడిన= చేష్టలు దక్కిన; ఆ+వీరుండు= ఆ శూరుడు కర్ణుడు; గోవులన్ తోలు= ఆవులను తరిమే; కోల్పులికైవడిన్= పెద్దపులివలె; కౌంతేయ బలంబులన్; పఱపన్= పరుగెత్తిపోయేటట్లు చేయగా; పాంచాలురు; వెండియున్= మరల; దండితనంబునన్= శౌర్యంతో; అతనిన్= ఆ కర్ణుడిని; తలపడినన్= ఎదుర్కొనగా; అతండు; పంచవింశతి= ఇరవైఐదుమంది; రథికులన్= రథవీరులను; తునిమి= ఖండించి; వైవస్వతు= యముని; చందంబునన్= విధంగా; పేర్చినన్= అతిశయంచగా; తూర్య, రవంబుల్= వాద్యముల ఘోష; చెలంగన్= అతిశయించగా; తద్+పుత్రులును= ఆయన కుమారులును; దుర్యోధన-కృప-దుశ్శాసనులు - అశ్వత్థామ శకుని - కృతవర్మలున్; పైకొని= పైబడి; ఆ ధర్మనందను సైన్యంబు; సమయింపన్= చంపగా; అది= ఆ సైన్యం; విచ్చినన్= చెల్లాచెదరై పరుగెత్తగా; ఎలుంగు+ఇచ్చి= కేకవేసి; పోనీక నిలిపి; భీమ-నకుల- సహదేవ - ధృష్టద్యుమ్న - శిఖండి - ద్రౌపదేయులు= భీముడు, నకులుడు, సహదేవుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి ద్రౌపదిపుత్రులు; కడంగి= పూని; కౌరవసైనికులన్; కనుపుగొట్టన్= ఖండించుటకు; తొడంగినన్= పూనుకొనగా; పోరు= జగడం; ఘోరంబు+అయ్యెన్= భయంకరమయింది; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; రెండు తెఱంగుల= ఉభయపక్షాల; మూఁకలు= గుంపులు; తెగటాఱుచుండన్= సంహరించబడుతుండగా; గాండీవి; తమ; మోహరంబునకున్= సేనావ్యూహానికి;

ఉత్సాహంబు; ఎసంగన్= పొంగగా; ఒక్క వలనన్= ఒక ప్రక్కన; మన మొనలన్; నెత్తుట; జొత్తిల్లన్+చేయుచున్= మునుగజేస్తూ; కదిసి= మార్కొని; తలయెత్తి చూచి; శౌరిన్ ఉద్దేశించి= కృష్ణుడితో (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ఈ విధంగా ఆ పక్షంలోని మేటి వీరులను కలతపెట్టి, అంతటితో తృప్తిపడక తనను చుట్టుముట్టిన పాంచాల, చేది, మత్స్యాది రాజవర్గాలపై ఎడతెరిపిలేని బాణవర్షాలు కురిపింపగా రథ గజాశ్వ కాల్బలాల మేని ముక్కలు వివిధాస్త్రాల, రథాంగాల ముక్కలు నేలపై కుప్పలుగా పడ్డాయి. నెత్తురుటేరులు పారాయి. ఆ పాండవవీరులు-వరుసగా పోరిపోరి అంతకంతకు అతిశయించే కర్ణుడి పౌరుషానికి అందరూ నివ్వెరపోయారు. అతడు బెబ్బులి గోవులమందలను తోలినట్లు పాండవసైన్యాలను పరుగెత్తేటట్లు చేశాడు. పాంచాలురు ఇంకా పౌరుషంతో ఎదుర్కొగా కర్ణుడు ఇరవైఅయిదుమంది రథవీరులను చంపి యముడివలె విజృంభించాడు. వాద్యాలు మ్రోగగా, దుర్యోధన కృప దుశ్శాసనాశ్వత్థామ శకుని కృతవర్మాదులు అందరూ కూడి పాండవసైన్యాన్ని చంపగా, అది కకావికలైపోతుండగా, భీమ నకుల సహదేవ ధృష్టద్యుమ్న శిఖండి ద్రౌపదేయులందరు కలిసి గొంతెత్తి దానిని పోనీక నిలిపి కౌరవ సైనికులను చంపసాగారు. అంతట పోరు ఘోరంగా సాగింది. ఈ విధంగా రెండు వైపుల సైన్యాలు చనిపోతూ ఉండగా అర్జునుడు తన యుద్ధవ్యూహంలో ఉత్సాహం అతిశయించగా ఒక్కచోట మొదలుపెట్టి మన కౌరవసైన్యాన్ని రక్తంలో ముంచివేస్తూ సమీపించి, తలయెత్తి చూచి కృష్ణుడితో (ఇట్లా అన్నాడు).

విశేషం: అలంకారం: ఉపమ.

సీ. **'కర్ణునికేతువు గ్రాలెడుఁ జూచితే। భీమాదులైన యుద్దామ రథిక**
జనులు పెక్కండ్రతో నని సేయుచున్నవాఁ। డితని ప్రాపున గురుసుతుఁడు గృపుఁడుఁ
గృతవర్మయును గురుపతి సురక్షితుఁ జేసి। కొని, వీఁకఁ బాంచాలకోటి బడలు
వఱిచెద రురవడిఁ దఱిమి; యా రాధేయు। గీటడఁగింతము, ఘోటకములఁ

తే. **బటురయమునఁ బోని' మ్మని పలుకుటయును। శౌరి యట్టులు సేయంగ శల్యుఁ డమ్మ**
హోగ్ర రథవేగమును, నరునుజ్జ్వలంపు। టేపుఁ గని, సూతపుత్రుతో నిట్టు లనియె: **173**

ప్రతిపదార్థం: చూచితే?= అదిగో చూచినావా?; కర్ణుని; కేతువు= టెక్కెము; క్రాలెడున్= రెపరెపలాడుతూ మెరుస్తూ ఉంది; భీమాదులు+ఐన= భీముడు మొదలైన; ఉద్దామ= భయంకరులైన; రథికజనులు= రథ సైనికులు; పెక్కండ్రతోన్= చాలామందితో; అని చేయుచున్నవాఁడు= యుద్ధం చేస్తున్నాడు; ఇతని ప్రాపునన్= ఇతడి (కర్ణుడి) అండతో; గురుసుతుఁడు= అశ్వత్థామ; కృపుఁడున్; కృతవర్మయున్; కురుపతిన్; సురక్షితున్ చేసికొని= కాపాడుకొని; వీఁకన్= పట్టుదలతో; పాంచాల; కోటిన్= సమూహాన్ని; ఉరవడిన్= విజృంభణంతో; తఱిమి; బడలు పఱిచెదరు= బాధతో డస్సిపోయేటట్లు చేస్తున్నారు; (కావున) ఆ రాధేయున్= ఆ కర్ణుడిని; గీటు+అడఁగింతము= చంపివేద్దాము; ఘోటకములన్= గుర్రాలను; పటురయమునన్= మహావేగంగా; పోనిమ్ము= తోలుము; అని పలుకుటయున్= అని చెప్పగా; శౌరి= కృష్ణుడు; అట్టులు+చేయంగన్; శల్యుఁడు= కర్ణుడి సారథి అయిన శల్యుడు; ఆ+మహా+ఉగ్ర= ఆ తీవ్రమైన; రథవేగమును; నరు= అర్జునుడి; ఉజ్జ్వలంపు; ఏపున్= మిరుమిట్లు గొలిపే ఉద్ధతిని; కని= చూచి; సూతపుత్రునితోన్; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అదిగో - కర్ణుడి టెక్కెం ఎలా మిరుమిట్లు గొలుపుతూ మెరుస్తున్నదో చూడు! భీముడు మొదలైన ఉద్దండ రథయోధులు పెక్కండ్రతో యుద్ధం చేస్తున్నాడు. కర్ణుడి అండ చూచుకొని అశ్వత్థామాదులు దుర్యోధనుడికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రక్షణ కల్పిస్తూ, పాంచాల సైనికసమూహాలను అలసిపోయేటట్లు చేస్తున్నారు. వేగంగా వెంటాడి ఆ కర్ణుని హతమారుద్దాము. గుర్రాలను వేగంగా తోలుము' అని చెప్పగా కృష్ణుడు అట్లాగే చేశాడు. కర్ణుడి తేరు తోలుతున్న శల్యుడు అర్జునుడి రథవేగ తీవ్రతను, అతని దేదీప్యమానమైన విజృంభణమును చూచి, కర్ణుడితో ఇట్లా అన్నాడు.

క. 'కేతన కపి భయదంబై । తోఁతేరఁగఁ, జక్రధర చతుర సారథ్య
ద్యోతితవల్గన చారు । శ్వేతహరులు మెఱయ వచ్చు వీరునిఁ గంటే!' 174

ప్రతిపదార్థం: కేతనకపి= పతాకంలో ఉన్న హనుమంతుడు; భయదంబు+ఐ= భయాన్ని పుట్టిస్తూ; తోఁతేరఁగన్= రాగా; చక్రధర= కృష్ణుడి; చతుర= చాకచక్యమైన; సారథ్య= సారథ్యం చేత; ద్యోతిత= ప్రకాశించిన; వల్గన= అశ్వగతుల వలన; చారు= అందగిస్తున్న; శ్వేతహరులు= తెల్లగుర్రాలు; మెఱయన్= దీపించగా; వచ్చు; వీరునిన్= అర్జునుడిని; కంటే?= చూచావా?

తాత్పర్యం: 'కపిధ్వజం భయంకలిగిస్తూ కనిపించగా, కృష్ణుడి నిపుణమైన రథసారథ్యంవలన చిత్రవిచిత్రంగా దూకుతున్న ఆ తెల్లని రథాశ్వాలూ వెలుగొందగా వస్తున్న అర్జునుడినీ చూచావా?'

వ. అని మఱియును; 175

తాత్పర్యం: అని ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'నవ్వెడు తలలను, గ్రొవ్వారు చేతుల । బిరుదులు వెట్టిన చరణములను,
వాతులు దెఱచిన వాజి మస్తకముల, । గిరిశృంగములఁ బోని కరిశిరముల,
నవయవ భేదంబు లడఁగెడునట్లుగఁ దుము । రైన బహుగాత్ర సముదయముల
భయదంబు లై మహిఁ బడు విమానములట్ల । యఱవఱ లైనట్టి యరదములను

తే. నేలఁ గప్పుచుఁ; దన బాణ జాల మదర, । నెవ్వ రడ్డము సొచ్చిన నించుకయును
దవులఁబడక, సముద్ధతిఁ దివిరి మనలఁ । దేఱి చూచుచుఁ బార్థుఁ డీ దిక్కు గవిసె. 176

ప్రతిపదార్థం: నవ్వెడు తలలను= నవ్వుతున్న తలలను; క్రొవ్వారు= బలసిన; చేతులను; బిరుదులు పెట్టిన= విజయ చిహ్నాలుగా పెట్టబడిన కాలి కంకణాలు మొదలైన వాటితో ఉన్న; చరణములను= కాళ్ళను; వాతులు= నోళ్ళు; తెఱచిన; వాజి= గుర్రాల; మస్తకములన్= తలలను; గిరిశృంగములన్= కొండకొమ్ములను; పోని= పోలిన; కరిశిరములను= ఏనుగు తలలను; అవయవ భేదంబు= అంగముల భేదం; అడఁగెడునట్లుగన్= తెలియకుండా పోయేటట్లుగా; తుమురు+ఐన= చిదురైన; బహుగాత్ర= అనేక శరీరాల; సముదయములన్= సమూహాలను; భయదంబులు+ఐ= భీతి కొలుపునవై; మహిన్‌పడు= భూమిపై పడుతున్న; విమానములు+అట్ల= ఆకాశంలో ఎగిరే విమానాలవలె (ఇది కవి ఊహాశక్తికి తార్కాణం); అఱవఱలు+ ఐనట్టి= ముక్కలు ముక్కలు ముక్కలైనట్టి; అరదములన్= తేరులను; నేలన్ కప్పుచున్= భూమిమీద అంతా పరచిపెట్టుతూ; తన బాణజాలము+అదరన్= తన బాణసమూహం విజృంభిస్తూ ఉండగా; ఎవరు; అడ్డము; చొచ్చినన్= దూరినా; ఇంచుకయును= కొంచెమైనా; తవులఁబడక= నిరోధించబడక; సముద్ధతిన్= దుడుకుతనంతో; తివిరి= ప్రయత్నించి, పూని; మనలన్; తేఱి చూచుచున్= బాగా పరికిస్తూ; పార్థుఁడు= అర్జునుడు; ఈ దిక్కు; కవిసెన్= అలముకొన్నాడు.

తాత్పర్యం: (ముక్కలైపోయి, రణరంగాన్నంతా పరుచుకొనిపోయి, భయానికి అందాన్ని చేకూరుస్తున్న దృశ్యాన్నంతా బాగా పరిశీలించి శల్యుడు వర్ణిస్తున్నాడు.) 'నవ్వుతుండగా నరికివేయబడిన ఆ తలల్లో నవ్వు ఇంకా మాసిపోలేదు. కండలు తిరిగిన చేతులు తునుకలై ఉన్నవి. జయచిహ్నాలైన వీరుల ఉంగరాలతో ఉన్న కాళ్ళు, నోరులు తెరచికొని ఉన్న గుర్రాల తలలు, కొండకొమ్ముల పోలిన ఏనుగుల శిరస్సులు, తల, తోక తెలియని విధంగా నరుకబడి ఉన్న శరీర సముదాయాలు, భయంకరములై నేల గూలు విమానాలవలే ముక్కలు ముక్కలైన తేరులు రణభూమినంతా కప్పివేసి ఉన్నవి. తన శరపరంపర అతిశయిల్లుతుండగా, ఎవరు అడ్డం వచ్చినా లెక్కచేయక ఎదుర్కొంటూ చెలరేగి పార్థుడు చుట్టుపట్ల పరికించి చూస్తూ, మన దిక్కుకు తరలివచ్చాడు.

విశేషం: అలంకారం: ఉపమ. (కాలి బొటనవ్రేలికి పెట్టిన ఉంగరాన్ని మద్దియ అంటారు. పూర్వం విజయి అయిన రాజు ఓడిన రాజులపేర్లు చెక్కిన మద్దియ ఉంగరాన్ని ధరించి అని, అర్థం. తమిళ మహాకవి- కంబరు దశరథుడికి ఈ మద్దియలను తొడిగి వర్ణిస్తాడు. తిక్కన కాకతివీరుల కాళ్ళలో వీటిని చూచినాడు కాబోలు)

క. తోడై డాపట వలపటఁ । గూడి తఱుమువారు లేరు; కోపంబున నీ
తోడి బవరమున కడరెడుఁ । గ్రీడి; మనతలంపు గూడె, గెలుపుము గడఁకన్. 177

ప్రతిపదార్థం: (అట్లు రేగిన అర్జునుడికి) తోడై= తోడుగా; డాపటన్= ఎడమప్రక్క; వలపటన్= కుడిప్రక్క; కూడి= చేరి, తఱుమువారు లేరు; కోపంబునన్; నీతోడి= నీతో; బవరమునకున్= యుద్ధానికి; క్రీడి= అర్జునుడు; అడరెడున్= విజృంభించాడు; మన తలంపు= మన యోచన; కూడెన్= ఫలించింది; కడఁకన్= ప్రయత్నంతో; గెలువుము;

తాత్పర్యం: 'అర్జునుడి కుడి ఎడమల కూడి పోరాడేవారు లేరు. కోపంతో తా నొక్కడే నీతో యుద్ధానికి విజృంభించి వస్తున్నాడు. మన ఆలోచన కలిసి వచ్చింది. పూనికతో జయించుము.

ఆ. పాయ వడియె సేన; బరవస మలరంగ । మార్కొనంగ మేటిమగఁ డొకండుఁ
గలుగ నోపఁ, డేపు దలకొన మనమ యి ।బ్బలియుఁ దలపడంగ వలయుఁ గర్ణ! 178

ప్రతిపదార్థం: కర్ణ!; సేన; పాయ పడియెన్= చీలింది; బరవసము= ధైర్యము; అలరంగన్= ఒప్పారగా; మార్కొనంగన్= ఎదుర్కొనటానికి; మేటిమగండు= సమర్థుడైన వీరుడు; ఒకండు= ఒక్కడూ; కలుగన్ ఓపఁడు= సిద్ధమవటానికి చాలడు; మనము+అ= మనమే; ఈ+బలియున్= ఈ బలశాలిని; ఏపు= పెంపు; తలకొనన్= కూడివచ్చేటట్లు; తలపడంగన్ వలయున్= ఎదుర్కొనాలి.

తాత్పర్యం: కర్ణా! సైన్యం పాయలుగా చీలిపోయింది. ఉత్సాహంతో శత్రువు నెదుర్కొనే సామర్థ్యం కలిగిన ప్రతాపశాలి ఒక్కడూ కనపడటంలేదు. కాబట్టి మనమే శక్తిని పెంచుకొని, ఈ బలవంతుడితో తలపడవలసి ఉన్నది.'

వ. అనిన విని, కర్ణుండు గవ్వడి బాహాబలంబును శౌర్య సారంబును దపః ప్రభావంబును ముక్కంటితోడ నెక్కటి పోరుటయును బాశుపతాది దివ్యాస్త్రంబులు వడయుటయును, బురందర ప్రముఖ బృందారకులకు నజయ్యులగు కాలకేయుల నిర్జించుటయు విరాటు పసుల మరల్చుటయు లోనుగాఁ గల విశేషంబు లుగ్గడించి, కృష్ణుమాహాత్మ్యంబు వొగడి: 'యిట్టివారల నే నొక్కరుండన మార్కొని మదం బడఁగించెద

మద్రనాయక! మన తేరు వారి యరదంబునకు సమ్ముఖంబుగాఁ జననిʼమ్మనిన, నతం డట్ల చేయఁ గనుంగొని, కురుపతి పురికొలుపఁ గృపకృతవర్మ గురుపుత్ర గాంధార విభులును గొందఱు కుమారులును విక్రమాటోపంబు దీపింప నయ్యంగరాజుం గడచి యడరి యాఫల్గునుం బొదివిన, నమ్మహాభుజుండు హరిణ కులంబు గనిన సింగంబు విధమున విజృంభించి, యా రథికులపైఁ గలయ వివిధ విశిఖంబులు నిగిడించి, ధనువులు దునిమియు, ఘోటకంబులఁ గూల్చియు సారథుల సమయించియుఁ దత్సేనా చతురంగంబుల బడలువఱిచియు నబ్బలు మగలం దెరల్చి యొత్తరించి, కెలనన దురంబు సేయు నమ్మరుత్తనయుం జేరం జని, బహువిరోధిజన పయోధిమగ్నుం డగుచున్న యతని నుద్ధరించి, సంప్రీతుం డగు నతనికి నగ్రజుకుశలం బెఱింగించి సంతోష సాగరంబునం దేల్చి, 'నీ విఁక డప్పి యార్చికొʼమ్మని పలికి, రాధేయ రభసోత్సాహ సహితం బగు నీ బలంబుమీఁదం గవిసిన. 179

ప్రతిపదార్థం: అనిన విని; కర్ణుండు; కవ్వడి= సవ్యసాచియొక్క; బాహాబలంబును= భుజబలాన్ని; శౌర్య సారంబును= ప్రతాపపు నిగ్గును; తపః ప్రభావంబును= తపస్సు కలిగించిన శక్తిని; ముక్కంటితోడన్= శివుడితో; ఎక్కటిపోరును= ఒంటరిగా చేసిన పందెపు జగడాన్నీ; పాశుపత+ఆది= పాశుపతము మొదలైన; దివ్య= దైవ ప్రభావం కలిగిన; అస్త్రాలను; పడయుటయును= పొందటాన్ని; పురందర= ఇంద్రుడు; ప్రముఖ= మొదలైన; బృందారకులకున్= దేవతలకు; అజయ్యులు+అగు= జయింపవీలుకాని; కాలకేయుల; నిర్జించుటయున్= ఓడించటాన్ని; విరాటు; పసులన్= పశువులను; మరల్చుటయున్= వెనుకకు మరలించటాన్ని; లోనుగాన్ కల= మొదలైన; విశేషంబులు= అతిశయాలను; ఉగ్గడించి= పొగడి; కృష్ణుమాహాత్మ్యంబు; పొగడి= ప్రశంసించి; ఇట్టివారల; నేను+ఒక్కరుండను+అ= నేను ఒక్కడినే; మార్కొని= ఎదిరించి; మదంబు+అడఁగించెదన్= పొగరు అణగగొట్టుతాను; మద్రనాయక!= శల్యా!; మనతేరు; వారి; అరదంబునకున్= తేరునకు; సమ్ముఖంబుగాన్= ఎదురుగా; చననిమ్ము= పోనిమ్ము; అనినన్; అతండు; అట్లు+చేయన్= ఆ ప్రకారమే చేయగా; కనుంగొని; కురుపతి= దుర్యోధనుడు; పురికొలుపన్= ప్రేరేపింపగా; కృప-కృతవర్మ-గురుపుత్ర-గాంధార విభులును; కొందఱు కుమారులును; విక్రమ+ఆటోపంబు= శౌర్యవిలసనం; దీపింపన్; ఆ+అంగరాజున్= ఆ కర్ణుడిని; కడచి= దాటి; అడరి= విజృంభించి; ఆ ఫల్గునున్= అర్జునుడిని; పొదివినన్= చుట్టుముట్టగా; ఆ+మహాభుజుండు= ఆ బాహుబలదర్పితుడు; హరిణకులంబున్= జింక జాతిని; కనిన= చూచిన; సింగంబు విధమునన్= సింహంవలె; విజృంభించి; ఆ రథికులపైన్= ఆ యోధులపై; కలయన్= అంతటా; వివిధ= నానావిధాలైన; విశిఖంబుల= బాణాలను; నిగిడించి= ప్రయోగించి; ధనువులు తునిమియున్= ధనుస్సులను విరుగగొట్టి; ఘోటకంబులన్= గుర్రాలను; కూల్చియున్= పడగొట్టియు; సారథులన్; సమయించియున్= చంపియు; తద్=ఆ; సేనా= సేనలోని; చతురంగబలంబులన్; బడలు పఱిచియున్= అలయింపచేసియు; ఆ+బలుమగలన్= బలవంతులైన ఆ మొనగాండ్రను; తెరల్చి= తొలగించి; ఒత్తరించి= ఆక్రమించి; కెలనన= సమీపాన; దురంబు చేయు= యుద్ధం చేస్తున్న; ఆ+మరుత్+తనయున్= ఆ భీముడిని; చేరన్+చనిసమీపించి; బహువిరోధిజన= పెక్కుమంది విరోధిజనమనే; పయోధిమగ్నుండు+అగుచున్న= సముద్రంలో మునిగిపోతున్న; అతనిని= భీముడిని; ఉద్ధరించి= పైకి తేల్చి; సంప్రీతుండు+అగు= మిక్కిలి సంతోషించినవాడగు; అతనికిన్; అగ్రజు= అన్న; కుశలంబు+ ఎఱింగించి= క్షేమం తెలిపి; సంతోషసాగరంబునన్= సంతోషము అనే సముద్రములో; తేల్చి= తేల చేసి; నీవు; ఇఁక; డప్పి= బడలిక; ఆర్చికొమ్ము+అని= తీర్చుకొమ్మని; పలికి; రాధేయ; రభస+ఉత్సాహ= సంతోషాతిశయంతో; సహితంబు+అగు= కలిసికొని ఉన్న; నీ బలంబుమీఁదన్= నీ సేనపై; కవిసినన్= పైబడగా;

తాత్పర్యం: అనగా విని, కర్ణుడు పార్థుడి బాహుబలాన్నీ, పరాక్రమాన్నీ, తపఃప్రభావాన్నీ, శివుడితో చేసిన ఒంటరిపోరునూ, పాశుపతాలవంటి దివ్యాస్త్రాలను పొందటాన్నీ, ఇంద్రాదులకు అసాధ్యులైన కాలకేయులను

జయించటాన్నీ, విరాటుడి గోవులను మళ్ళించటాన్నీ, ఇట్లా అనేక విశేషాలను పేర్కొని, కృష్ణమాహాత్మ్యాన్ని పొగడి, 'అటువంటి వీరులను నేనొక్కడినే ఎదుర్కొని వారి మదాన్ని అణగిస్తా'నని అన్నాడు. 'ఓ శల్యా! మన రథాన్ని వారి తేరుకు ఎదురుగా పోనిమ్మ' అన్నాడు. శల్యు డట్లాగే చేశాడు. అంతలో దుర్యోధనుడి ప్రేరణతో కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ, శకుని, కొందరు కుమారులను కర్ణుడికంటె ముందుగానే సాగి, అర్జునుడిని చుట్టుముట్టారు. లేళ్ళగుంపును చూచిన సింహంవలె అర్జునుడు వారిమీద విజృంభించి, బాణాలతో వారి విండ్లను, గుర్రాలను, సారథులను నశింపజేసి వారి చతురంగ బలాలను బలహీనపరిచాడు. వారిని చంపి, సమీపంలో యుద్ధం చేస్తున్న భీముడివద్దకుపోయి, పెక్కుమంది విరోధులనే సముద్రంలో మునిగిఉన్న అతడిని ఉద్ధరించి, అతడిని సంతోషపెట్టి, ధర్మరాజుకుశలాన్ని తెలిపి, ఆనందపరచి, 'ఇక నీవు బడలిక తీర్చుకొనుము' అని చెప్పి, కర్ణుడి సైన్యంమీద దాడి చేశాడు.

కురుకుమారులు పదుగు రర్జునుం దాఁకి మృతు లగుట (సం. 8-58-23)

చ. **తొడరి భవత్తనూజులు పదుండ్రు సముద్ధట సింహనాదు లై**
వడిఁ దనుఁ జుట్టుముట్టుటయు, వారల సూత హయధ్వజంబులం
బొడి పొడి సేసి, యాతఁడు రిపుల్ వెగడంద వెడంద తూపులన్
మెడలు దెగంగ నేసి రణమేదినికిన్ బలి సేసె నత్తలల్. **180**

ప్రతిపదార్థం: తొడరి= పూని కూడినవారై; భవత్తనూజులు= నీ కుమారులు; పదుండ్రు= పదిమంది; సముద్భట= గొప్పవైన; సింహనాదులై= సింహ గర్జనలతో; వడిన్; తనున్= తనను; చుట్టుముట్టుటయున్= చుట్టుముట్టగా; వారల= వారి; సూత= సారథి; హయ; ధ్వజంబులన్; పొడి పొడిచేసి; ఆతఁడు= ఆ అర్జునుడు; రిపుల్ వెగడందన్= శత్రువులు భయకంపితులు కాగా; వెడంద= వెడల్పు అయిన; తూపులన్= బాణాలతో; మెడలు తెగంగన్; ఏసి= ప్రయోగించి; రణ మేదినికిన్= యుద్ధభూమికి; ఆ+తలల్= వారి తలలను; బలి చేసెన్= బలిగా ఇచ్చాడు.

తాత్పర్యం: పూనుకొని నీ కొడుకులు పదిమంది, సింహాలవలె గర్జిస్తూ అర్జునుని చుట్టుముట్టగా, ఆయన వారి సారథులను, గుర్రాలను, జెండాలను పిండి పిండిగా చేశాడు. వెడల్పు అయిన బాణాలతో మెడలు తెగనరికి, ఆ తలలను యుద్ధభూమికి బలిగా సమర్పించాడు.

వ. **అట్టియెడ.** **181**

తాత్పర్యం: ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **నవతి కౌరవ రథికులు గవిసి కడిమిఁ । బొదువుటయు, నన్ని శరముల భూరి రయము**
మెఱయ నందఱఁ దెగటార్చి తఱుము నతనిఁ । దాఁకె వేయుమున్నూఱు దంతావళములు. **182**

ప్రతిపదార్థం: నవతి= తొంబదిమంది; కౌరవ రథికులు= కౌరవ రథసైనికులు; కవిసి= పైబడి; కడిమిన్= పట్టుదలతో; పొదువుటయున్= మార్కొనగా; అన్ని శరములన్= రథికుల సంఖ్యతో సమానమైన బాణాలతో; భూరి రయము= అత్యంత వేగం; మెఱయన్= తళుకొత్తగా; అందఱన్; తెగటార్చి= చంపి; తఱుము= (మిగిలినవారిని) తరిమికొట్టే; అతనిన్= ఆ అర్జునుడిని; వేయుమున్నూఱు= పదుమూడువందల; దంతావళములు= ఏనుగులు; తాఁకెన్= పైనపడ్డాయి.

తాత్పర్యం: ఇట్లా వీరవిహారం చేస్తున్న అర్జునుడిని, తొంబదిమంది కౌరవ రథికులు పైనబడి, పేర్చిన పట్టుదలతో చుట్టుముట్టినారు. ఒక్కొకరిని ఒక్కొక్క బాణంతో మహావేగంతో అర్జునుడు అందరినీ చంపివేశాడు. ఇంకా మిగిలి ఉన్నవారిని వెంటాడుతున్న ఆ అర్జునుడిపైకి పదమూడు వందల ఏనుగులు దూకాయి.

వ. ఇట్లు దాఁకిన, యాభీరాది మ్లేచ్ఛనికరంబుల నతం డనేకవిధ విశిఖంబుల విరియింపం, బై పైఁ గరి తురగ సుభట రథ సమూహమ్ములు గ్రమ్మినం, గని కడంగిన వడముడి తోడ్పాటునం జేడ్పడియు నవి వోక పొదివి పెనంగిన, గద గొని యరదంబు డిగ్గి యగ్గలిక నప్పవనతనయుండు దారుణ రణ విహారంబుననెఱయ, మెఱయం; దఱుచుగా మెఱుంగు వాలంపగములు గాండీవి గుప్పింప నప్పు డమ్ముఖంబు చతురంగంబులయం దొక్కఁడేనియు రక్తంబునం దోఁగనియట్టిది లేక యుండె; నట్లు గార్చిచ్చు వొదివిన కాననంబు చందం బయి యా సైన్యంబు రూపఱ విఱిగి 'కర్ణ! కర్ణ! కావు కావు'మను నెలుంగులతో నతనివెనుక కొదిఁగిన నీ కొడుకు లబ్బలుమగని బలసి నిలువ, నా వీరుండు దీవికైవడి సమరార్ణవంబున మునుంగ నీక యమ్మోహరంబు నుద్ధరించి, మౌర్విఁ దాటించి కిరీటి దెసకు నడరె; నంతకు మున్న యరదం బెక్కి యనిలతనయుం డా ధనంజయునిం గూడుకొనిన నయ్యిరువురకుం దల కడచి పాంచాలు రా సూతనందనుం దలపడుటయు. 183

ప్రతిపదార్థం: ఇట్లు తాఁకినన్= ఇట్లా పైనబడగా; ఆభీర+ఆది= ఆ భీరదేశస్థులు మొదలైన; మ్లేచ్ఛ= హిందువులు కానివారి; నికరంబులన్= సమూహాలను; అతండు; అనేకవిధ= భిన్న స్వరూపాలైన; విశిఖంబులన్= బాణాలతో; విరియింపన్= చంపగా; కరి తురగ-సుభట రథ సమూహమ్ములు; పైన్; క్రమ్మినన్; కని= అది చూచి; కడంగిన= పూనుకొన్న; వడముడి= భీముడి; తోడ్పాటునన్= సహాయంతో; చేడ్పడియున్= బాధింపబడి కూడా; అవి పోక= అవి పోకుండా; పొదివి= పైబడి; పెనంగినన్= పోరాడగా; గద కొని= గద చేపట్టి; అరదంబు డిగ్గి= రథం దిగి; అగ్గలికన్= ఎక్కువైన పూనికతో; ఆ+పవన తనయుండు= ఆ భీముడు; దారుణ= కఠినమైన; రణవిహారంబునన్= యుద్ధ విహారంలో; నెఱయన్= విశేషంగా; మెఱయన్= ప్రకాశిస్తుండగా; తఱుచుగాన్= పదే పదే; గాండీవి; మెఱుంగు; వాలు= పదునైన; అంపగములు= బాణ సమూహాలను; గుప్పింపన్= ప్రయోగించగా; అప్పుడు; ఆ+ముఖంబు= ఆ సైన్యపు ముందుభాగంలో ఉన్న; చతురంగ బలంబులయందున్; ఒక్కఁడేనియున్; రక్తంబునన్= నెత్తుట; తోఁగని అట్టిది= తడియనిది; లేక ఉండెన్= లేకుండింది; అట్లు; కార్చిచ్చు= అడవిమంట; పొదివిన= చుట్టుకొన్న; కాననంబు చందంబు= అడవివలె; అయి= మారి; ఆ సైన్యంబు; రూపు+అఱన్= రూపు పోయేటట్లు; విఱిగి= నాశనమై; కర్ణ! కర్ణ!; కావుకావుమను= రక్షించు-రక్షించుమనే; ఎలుంగులతోన్= కేకలతో; అతని వెనుకకున్; ఒదిఁగిన= ముడుచుకొని దాగుకొన్న; నీ కొడుకులు (కౌరవులు) ఆ+బలుమగని= ఆ మహాబలుని; బలసి నిలువన్= చుట్టూ నిలబడగా; ఆ వీరుండు= కర్ణుడు; సమర+అర్ణవమునన్= యుద్ధమనే సముద్రంలో; దీవి కైవడిన్= దీవి మాదిరిగా; మునుంగనీక= మునిగిపోకుండా కాపాడి; ఆ మోహరంబును= ఆ సేనా వ్యూహమును; ఉద్ధరించి= రక్షించి; మౌర్విన్= అల్లెత్రాడును; తాటించి= బిగించి; కిరీటి దెసకున్; అడరెన్= విజృంభించినాడు; అంతకున్ మున్న= అంతకుముందే; అరదంబు+ఎక్కి; అనిలతనయుండు= భీముడు; ఆ ధనంజయునిన్= ఆ అర్జునుడిని; కూడుకొనినన్= కలుసుకొనగా; ఆ+ఇరువురకున్= ఆ యిద్దరికి; తల కడచి= అతిక్రమించి; పాంచాలురు; ఆ సూతనందనున్= ఆ కర్ణుడిని; తలపడుటయున్= ఎదుర్కొనుటయు.

తాత్పర్యం: ఇట్లా పై బడగా ఆభీరాది మ్లేచ్ఛుల సమూహాలపై అనేకవిధ బాణాలను ప్రయోగించి, మీదికి చతురంగ సైన్యం క్రమ్ముకొనగా చూచి, భీముడి సహాయంతో వాటిని క్షీణింపజేసినా, అవి పోక క్రమ్ముకొని యుద్ధం చేయగా,

గదను చేపట్టి, రథం దిగి, ప్రయత్నంతో భీముడు భయంకర రణవిహారం చేశాడు. అర్జునుడు వాడి బాణాలను గుప్పించగా, వాటివలన రక్తంకారని సైనికుడు రణరంగంలో ఒక్కడు కూడా లేడు. రక్తం కారని గజాదులు లేవు. ఆ విధంగా కార్చిచ్చు వ్యాపించిన అడవివలె సైన్యం రూపుమాయగా 'కర్ణా! కావుము, కావుము' అని కేకలు వేస్తూ ఆ సైన్యాలు అతడి వెనుకకు ఒదిగాయి. కౌరవులు కూడా అతడి చుట్టూ నిలిచారు. కర్ణుడు దీవివలె సైన్యాన్ని యుద్ధసముద్రంలో మునగకుండా రక్షించాడు. అల్లెత్రాడు బిగించి అర్జునుడివైపు సాగాడు. అంతకుముందే భీముడు రథమెక్కి అర్జునుడితో కలిశాడు. ఆ యిద్దరికంటె ముందుగా పాంచాలురు కర్ణుడిని ఎదుర్కొన్నారు.

విశేషం: అలంకారం: ఉపమ.

తే. **ద్రౌపదీనందనులును సాత్యకియు లోను ౹ గాఁగఁ బాండవ సైనికోత్కరము గవిసి**
కూడికొనియెఁ బాంచాలురఁ గురువరేణ్య! యందఱకు నన్నిరూపులై యతఁడు పెనఁగె. **184**

ప్రతిపదార్థం: కురువరేణ్య!= ధృతరాష్ట్రా!; ద్రౌపదీ నందనులును= ద్రౌపది కుమారులు; అయిదుగురు; సాత్యకియున్; లోనుగాఁగన్= మొదలగు; సైనిక ఉత్కరము= సైనికుల సమూహం; కవిసి= ఎదుర్కొని; పాంచాలురన్; కూడుకొనియెన్= కలుసుకొన్నాయి; అందఱకున్; అన్నిరూపులై= ఒక్కొక్కరికి ఒక్కొక్క రూపుగ; అతఁడు= కర్ణుడు; పెనఁగెన్= పోరాడాడు.

తాత్పర్యం: కురువంశ శ్రేష్ఠా! ఉపపాండవులు మొదలగు పాండవ సైనికసమూహం ఏకమై పాంచాలబలాన్ని కలుసుకొన్నది. అప్పుడు కర్ణుడు ఒక్కొక్క విరోధికి ఒక్కొక్క రూపై యుద్ధం సాగించాడు.

వ. **అప్పుడు.** **185**

తాత్పర్యం: ఆ సమయంలో.

సీ. **జనమేజయునిసూతుఁ దునిమి రథ్యంబుల ౹ నో నేసి, భీమతనూజ నకుల**
సుతుల చాపములు ఖండితములు సేసి, ధృ ౹ ష్టద్యుమ్ను మావుల సమయఁ జూచి
మెయి వెంచి సాత్యకి హయములఁ గూల్చి, కే ౹ కయుకుమారుని జముకడకు ననుపఁ;
దజ్జనకుం డల్గి తన్ను నొప్పించి ప్ర ౹ సేనునిఁ దాఁ జూడఁ జెలఁగి చంపు

తే. **టయును, బుత్రశోకంబు గిన్కయు మనంబు ౹ నందుఁ బిరిగొన రాధేయుఁ డతని నఱకె;**
శినివరుం డొండువాజులఁ దన రథమునఁ ౹ బూన్చికొని వచ్చి, తత్సుతుఁ బొదివె నధిప! **186**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; జనమేజయుని= జనమేజయునియొక్క; సూతు= తేరు నడుపువానిని; తునిమి= ఖండించి; రథ్యంబులన్= గుర్రాలను; నోనేసి= నొచ్చునట్లు బాణాలు ప్రయోగించి; భీమ తనూజ= భీముడి కొడుకుయొక్క; నకుల సుతుల= నకులుడి కొడుకుయొక్క (వీరి); చాపములు= విండ్లు; ఖండితములు చేసి= తెగగొట్టి; ధృష్టద్యుమ్ను; మావులన్= గుర్రాలను; సమయన్+చూచి= చంపి; మెయి పెంచి= దేహాన్ని ఉబ్బజేసి; సాత్యకి హయములన్ కూల్చి= సాత్యకి గుర్రాలను పడగొట్టి; కేకయ కుమారునిన్; జముకడకున్= యముడివద్దకు; అనుపన్= పంపగా; తద్+జనకుండు= ఆయన తండ్రి; అల్గి= కోపించి; తన్నున్= కర్ణుడిని; నొప్పించి= బాధపెట్టి; ప్రసేనుని; తాన్= తాను; చూడన్= చూస్తుండగనే; చెలఁగి= రేగి; చంపుటయును; పుత్రశోకంబు; కిన్కయున్= కోపమును; మనంబునందున్; పిరి కొనన్= మెలివడగా; రాధేయుడు; అతనిన్;

నఱకెన్; శినివరుండు= సాత్యకి; ఒండు వాజులన్= వేరే గుఱ్ఱాలను; తన రథమునన్= రథమునకు; పూన్చికొని= కట్టుకొని; వచ్చి; తత్సుతున్= అతని కొడుకును; పొదివెన్= చుట్టుముట్టాడు.

తాత్పర్యం: కర్ణుడు జనమేజయుడి సారథిని, గుఱ్ఱాలను చంపాడు, భీముడికొడుకు వింటిని, నకులపుత్రుడి వింటిని విరిచాడు. ధృష్టద్యుమ్నుడి గుఱ్ఱాలను చంపాడు. ఆవేశంతో సాత్యకి గుఱ్ఱాలను కూల్చివేశాడు. కేకయ పుత్రుడిని చంపాడు. కేకయరాజు కోపించి కర్ణుడిని నొప్పించి అతడు చూస్తూ ఉండగానే అతడి కొడుకైన ప్రసేనుడిని చంపాడు. కర్ణుడు ఇటు పుత్రశోకం, అటు కోపం మనసులో పెనగొనగా అతడిని చంపాడు. సాత్యకి తన రథానికి మరొకరి గుఱ్ఱాలను పూన్చికొని అతడి కొడుకును చుట్టుముట్టాడు.

విశేషం: ఈ జనమేజయుడు కర్ణుడితో పోరాడిన వీరుడు. (పాండవుల మునిమనుమడు కాదు) భారతంలో ప్రస్తావించబడ్డ జనమేజయులు 9 మంది ఉన్నారు. వారిలో ఈ జనమేజయుడు కూడా ఒకడుగా చెప్పబడింది.

వ. ఇట్లు సూతపౌత్రుఁడగు సుషేణుం బొదివి శినిపౌత్రుండు. 187

ప్రతిపదార్థం: ఇట్లు; సూతపౌత్రుఁడగు= కర్ణుడి మనుమడు అగు; సుషేణున్; పొదివి; శిని పౌత్రుండు= శినిమనుమడు-సాత్యకి.

తాత్పర్యం: ఈ విధంగా కర్ణుడి మనుమడైన సుషేణుడిని చుట్టుముట్టి సాత్యకి.

చ. హయములఁ జంపి, ముప్పది శితాస్త్రములం దెగటార్పఁ జూచి, తం
డ్రి యముని చందమై 'తెగితిరే శినివీరుఁడ' యంచు నేయుడు,
న్భయద మహోగ్రతన్ నిగుడునారసమున్ నడుమన్ శిలీముఖ
త్రయమునఁ ద్రుంచి మేనఁ బ్రదర త్రితయంబు శిఖండి గ్రుచ్చినన్. 188

ప్రతిపదార్థం: హయములన్ చంపి; ముప్పది; శిత+అస్త్రములన్= వాడి ఆయుధాలను; తెగటార్పన్= నాశనంచేయగా; చూచి; తండ్రి; యముని చందమై= యముడివంటివాడై; శినివీరుఁడ!; తెగితిరే= నరుకుడుబడ్డావురా?; అంచున్; ఏయుడున్= బాణాలను ప్రయోగించగా; శిఖండి; భయద= వెరపించే; మహా+ఉగ్రతన్= మహా భయంకరత్వంతో; నిగుడు= వ్యాపించు; నారసమున్= (పైకివచ్చే) బాణాన్ని; నడుమన్= మార్గమధ్యంలోనే; శిలీ ముఖత్రయమునన్= మూడు బాణాలచేత; త్రుంచి= విరుగగొట్టి; మేనన్= శరీరంలో; ప్రదర త్రితయంబు= మూడు బాణాలు; గ్రుచ్చినన్= నాటగా.

తాత్పర్యం: గుఱ్ఱాలను చంపి, ముప్పది వాడిబాణాలతో చంపటానికి చూడగా, కర్ణుడు యముడివలె 'శినివీరుడా! చచ్చావురా?' అని భయంకరమైన బాణం వేయగా, శిఖండి మూడుబాణాలతో దానిని విరుగగొట్టి, మూడు బాణాలను అతడి శరీరంలో గ్రుచ్చాడు.

తే. కనలి యా సూతపుత్రుఁ డాతని సిడంబు । ధనువుఁ దునుమాడి, పార్షత తనయుఁ డగు సు
దేవుఁ దండ్రులు గనుఁగొనంగా వధించి, । యేసె సుతసోముఁ డడరిన నేపు దఱుఁగ. 189

ప్రతిపదార్థం: ఆ సూతపుత్రుడు= ఆ కర్ణుడు; కనలి= కోపగించుకొని; ఆతని= శిఖండియొక్క; సిడంబు= ధ్వజాన్ని; ధనువున్; తునుమాడి= విరుగగొట్టి; పార్షత= ద్రుపదునియొక్క; తనయుఁడు+అగు, సుదేవున్; తండ్రులు= వాని జనకులు;

కనుగొనంగాన్= చూస్తుండగానే; వధించి; సుతసోముఁడు; అడరినన్= విజృంభించగా; ఏపు అతిశయం; తఱుఁగన్= తగ్గిపోయ్యేటట్లు; ఏసెన్= బాణాలు ప్రయోగించాడు.

తాత్పర్యం: రాధేయుడు కోపోద్రిక్తుడై శిఖండి టెక్కెమును వింటిని విరుగగొట్టి, ద్రుపదుని తనయుడైన సుదేవుడిని అతడి తండ్రులు చూస్తూ ఉండగానే చంపివేసి, సుతసోముడి పొగరు అణగేటట్లు బాణప్రయోగం చేశాడు.

వ. వెండియుఁ బాంచాల రథిక సంఘంబులు రాధేయుమీఁద నురవణింప, సమీరణసుత సహాయుం డగు సవ్యసాచి వానిం గడచి యక్కర్ణు నరదంబున కడరె; నట్టియెడ నుత్తమౌజుండును జనమేజయుండును యుధామన్యుండును శిఖండియు ధృష్టద్యుమ్నుండును నతనిం దల మిగిలి, యబ్బలుమగనిం బొదివి, యింద్రియంబులు దృఢాత్మునిం గలంపం జాలనిచందంబున నా సూతనందనుఁ దెరల్పం జాలరైరి; వారల కేతు చ్ఛత్ర సూత తురగ ధను స్తూణీరంబులు రేణువులు సేసి బహుబాణంబులఁ దనువులు నోనేసి సింహనాదంబు సేసిన, యయ్యంగపతిపై సుసంగతులై ద్రౌపది కొడుకులు గవిసిరి; వారిం గూడికొని శినివరుం డా సేనాపతి వారి నేయు సాయకంబులు ద్రుంచి, యాతనికిం దోడ్పడుటకుం గడంగిన కౌరవపతి యంగంబున నెనిమిది సునిశిత విశిఖంబులు గ్రుచ్చి పేర్చిన. 190

ప్రతిపదార్థం: వెండియున్= మరల; పాంచాల; రథిక సంఘంబులు= తేరు భటుల గుంపులు; రాధేయు మీఁదన్; ఉరవణింపన్= ఎదుర్కొనగా; సమీరణ= వాయుదేవుడి; సుత= కొడుకునకు; సహాయుండు+అగు; సవ్యసాచి= అర్జునుడు; వానిన్+కడచి= వాటిని తప్పించుకొని; ఆ+కర్ణు; అరదంబునకున్; అడరెన్= ఆటోపంతో సమీపించినాడు; అట్టి ఎడన్; ఉత్తమౌజుండును - జనమేజయుండును-యుధామన్యుండును-శిఖండియున్-ధృష్టద్యుమ్నుండును; అతనిన్= రాధేయుడిని; తల మిగిలి= అతిశయించి; ఆ+బలుమగనిన్= ఆ మేటి వీరుడిని; పొదివి= చుట్టుముట్టి; ఇంద్రియంబులు; దృఢ+ఆత్మునిన్= ధీరచిత్తుడిని; కలంపన్+ చాలని= కలవరపెట్టజాలని; చందంబునన్= విధంగా; ఆ సూతనందనున్= కర్ణుడిని; తెరల్పన్+చాలరైరి= వెనుకకునెట్టి వేయ శక్తిమంతులు కాలేకపోయారు; వారల= వాళ్ళ; కేతు; ఛత్ర; సూత; తురగ; ధనుస్; తూణీరంబులు= అమ్ముల పొదులును; రేణువులు= దుమ్ము; చేసి; బహు బాణంబులన్; తనువులు= దేహాలు; నోనేసి= నొచ్చునట్లు చేసి; సింహనాదంబు చేసినన్= సింహగర్జన చేయగా; ఆ+అంగపతిపైన్= ఆ కర్ణుడిపై; ద్రౌపది కొడుకులు; సుసంగతులై= చక్కగ కూడినవారై; కవిసిరి= పైనపడ్డారు; శినివరుండు= సాత్యకి; వారిన్ కూడికొని; ఆ సేనాపతి; వారిన్+ఏయు= వారిపై ప్రయోగించే; సాయకంబులు= బాణాలను; త్రుంచి; ఆతనికిన్= అతడికి; తోడ్పడుటకున్; కడంగినన్= పూనుకోగా; కౌరవపతి= దుర్యోధనునియొక్క; అంగంబునన్= శరీరంలో; ఎనిమిది; సునిశిత= మిక్కిలి వాడియైన; విశిఖంబులన్; గ్రుచ్చి; పేర్చినన్= అతిశయించగా.

తాత్పర్యం: మరల కర్ణుడిమీద పాంచాల రథవీరులు దాడి ముమ్మరం చేశారు. భీమసహాయుడైన అర్జునుడు వాళ్ళను దాటి, కర్ణుడి రథాన్ని సమీపించాడు. అప్పుడు ఉత్తమౌజుడు, జనమేజయుడు, యుధామన్యుడు, శిఖండి, ధృష్టద్యుమ్నుడూ అతడిని దాటి కర్ణుడిని చుట్టుముట్టి, ఇంద్రియాలు స్థిరచిత్తుడిని ఎట్లా కలత చెందింపజేయలేవో అట్లాగే వారందరూ కలిసికూడా కర్ణుడిని ఓడించలేకపోయారు. కర్ణుడు వారందరి ధ్వజాలను, సారథులను, గొడుగులను, గుఱ్ఱాలను, విండ్లను, అమ్ముల పొదులను నుగ్గునుగ్గుచేసి సింహనాదం చేశాడు. అప్పుడు ద్రౌపది కొడుకులు కర్ణుడిని చుట్టుముట్టారు. వారితో కలిసి శినివరుడు కర్ణుడు వేసే బాణాలను త్రుంచాడు. కర్ణుడికి తోడ్పడాలని యత్నించిన దుర్యోధనుడి శరీరంలో వాడి అయిన ఎనిమిది బాణాలను గ్రుచ్చి అతిశయించాడు.

విశేషం: అలంకారం: ఉపమ.

క. అలిగిన యన్నరనాథుని । కెలఁకుల వెసఁ దటిమి, కర్ణ కృప కృతవర్మల్
బలుతూపుల నేయఁగ న । న్నలువుర స్రుక్కించె నతఁడు నారాచములన్. 191

ప్రతిపదార్థం: అలిగిన= కోపపడిన; ఆ+నరనాథుని= ఆ దుర్యోధనుని; కెలఁకులన్= ప్రక్కలకు; వెసన్+తటిమి= వెంటనే తరిమి; కర్ణ-కృప-కృతవర్మల్; బలుతూపులన్+ఏయఁగన్; ఆ+నలువురను= ఆ నలుగురిని; అతఁడు; నారాచములన్= బాణాలతో; స్రుక్కించెన్= అలయింపచేశాడు.

తాత్పర్యం: అర్జునుడు కోపపడిన దుర్యోధనుడి చుట్టుప్రక్కల వారిని తరమికొట్టగా, కర్ణాదులు బాణ పరంపరను విసరారు. ఆ నలుగురిని అతడు అమ్ములతో అదరగొట్టి అలసిపోయేటట్లు చేశాడు.

తే. దొరలఁ గడఁచి బలంబు లుద్ధురత నిగుడ । వారి మొనలు నెదిర్చిన, ఘోర తుముల
సంగరంబయ్యెఁ; నయ్యవసరమునందుఁ । దాఁకె దుశ్శాసనుఁడు వాయుతనయుతోడ. 192

ప్రతిపదార్థం: దొరలన్= నాయకులను; కడఁచి= దాటి; బలంబులు; ఉద్ధురతన్= గర్వంతో; నిగుడన్= రేగగా; వారి= కౌరవులయొక్క; మొనలు= సైన్యాలు; ఎదిర్చినన్= ప్రతిఘటించగా; ఘోర; తుముల= దొమ్మిరూపంలో; సంగరంబు+అయ్యెన్= యుద్ధం జరిగింది; ఆ+అవసరమునందున్= ఆ సమయంలో; దుశ్శాసనుఁడు; వాయుతనయుతోడన్= భీముడితో; తాఁకెన్= తలపడ్డాడు.

తాత్పర్యం: చమూపతులు చాలామందిని దాటుకొని పాండవసేనలు గర్వంతో చెలరేగగా, కౌరవసేనలు కూడ గట్టిగా ఎదిరించాయి. దీనితో ఇరువాగుల మధ్య దొమ్మిపోరు రేగింది. ఇట్టి దశలో దుశ్శాసనుడు భీముడితో తలపడ్డాడు.

దుశ్శాసనుఁడు భీమసేనునితోఁ బోరి చచ్చుట (సం. 8-60-29)

తే. సారథుల యుబ్బు వాజుల చటులతయును । మెఱయ నొప్పారు తేరుల మీఁదఁ బొలిచి
రపుడు గయ్యంపు వేడుక, నాతఁడును న । తండుఁ జూపఱ కన్నులపండు వగుచు. 193

ప్రతిపదార్థం: సారథుల= తేర్లు తోలేవారి; ఉబ్బు= సంతోషాతిశయం; వాజుల= గుఱ్ఱాల; చటులతయును= మిరుమిట్లు కొలిపే సంచారం; మెఱయన్= మెరుస్తుండగా; ఒప్పారు= సొంపుమీరే; తేరులమీఁదన్= రథాలమీద; అప్పుడు; కయ్యంపు వేడుకన్= యుద్ధంమీది అభిలాషతో; అతఁడును= దుశ్శాసనుడు; అతండున్= భీముడును; చూపఱ= ప్రేక్షకులకు; కన్నుల పండువు+అగుచున్= చూపులకు విందు ఔతూ ఉండగా; పొలిచిరి= ప్రకాశించారు.

తాత్పర్యం: సారథుల సంతోషాతిశయం, గుఱ్ఱాల కదలిక మెరుస్తుండగా, యుద్ధాన్ని ఒక వినోదక్రీడగా చూచేవారి కండ్లకు విందుగా, భీమదుశ్శాసనులిద్దరు యుద్ధంమీది అభిలాషతో వారి రథాల్లో ప్రకాశించారు.

క. ఒండొరులమీఁద నుజ్జ్వల । కాండము లడరించు చట్లు గదిసినయెడ, భీ
ముండు ప్రమోదభరిత చి । త్తుం డయి, తగ నిట్టు లనియె దుశ్శాసనుతోన్. 194

ప్రతిపదార్థం: ఒండొరుల మీఁదన్= ఒకరిపై నొకరు; ఉజ్జ్వల= ప్రకాశమానమైన; కాండములు= బాణాలు; అడరించుచున్= ప్రయోగిస్తూ; అట్లు= ఆ విధంగా; కదిసిన, ఎడన్= కలియబడినప్పుడు; భీముండు; ప్రమోద భరిత= సంతోషంతో నిండిన; చిత్తుండు+ఐ= మనస్సు కలవాడై; దుశ్శాసనుతోన్; తగన్= ఒప్పిదంగా; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీమ దుశ్శాసనులు ఒకరిమీద ఒకరు బాణాలు ప్రయోగించుకొంటూ, కలియబడినప్పుడు భీముడు ఆనందంతో ఉప్పొంగి దుశ్శాసనుడితో సమయోచితంగా ఇట్లా అన్నాడు.

ఉ. 'ఆ సభలోనఁ గొన్నఋణ మంతయు నీఁగఁగఁ గంటి వడ్డితోఁ;
బాస కొకింతయుం దొలఁగఁ బాఱక తీర్చెద నిప్డు; నేఁడు నా
చేసినపుణ్య మెవ్వరును జేయరు; ని న్నిటు సేరఁ దెచ్చుటం
జేసి విధాత నాకుఁ గృప సేయుట గానఁగ వచ్చెఁ దమ్ముఁడా!' 195

ప్రతిపదార్థం: తమ్ముఁడా! ఆ సభలోనన్+కొన్న= ఆ (కౌరవ) సభలో తీసికొన్న; ఋణము+అంతయున్= అప్పంతయు; వడ్డితోన్= వడ్డీతో సహా; ఈఁగఁగన్= తీర్చటానికి; కంటిన్= నోచుకొన్నాను; బాసకున్= చేసిన ప్రతిజ్ఞకు; ఒకింతయున్= కాస్తకూడా; తొలఁగన్ పాఱక= తొలగిపోక; ఇప్డు= ఇప్పుడే; తీర్చెదన్= తీరుస్తాను; నేఁడు= ఈ దినము; నా చేసిన పుణ్యము= నేను కావించిన సుకృతం; ఎవ్వరును+చేయరు= ఎవరూ చేయలేదు; నిన్నున్+ఇట్లు; చేరన్+తెచ్చుటన్= తీసికొనివచ్చుటను; చేసి= సమకూర్చి; విధాత= బ్రహ్మదేవుడు; నాకున్; కృప+చేయుట= అనుగ్రహం చూపుట; కానఁగన్+వచ్చెన్= గోచరించినది; (ఈ పట్టున తమ్ముఁడా! అనే సంబోధన అవహేళనతో కూడినది).

తాత్పర్యం: 'తమ్ముఁడా! ఆనాడు సభలో (అవమానాలను) నీ దగ్గర అప్పుగా తీసికొన్నాను. తప్పక ఇప్పుడు ఆ ఋణాన్ని వడ్డీతో సహా తీరుస్తాను. అప్పుడు చేసిన శపథాన్ని రవ్వంతకూడా జవదాటను. నా అంతటి పుణ్యాత్ములు ఇంకెవరూ లేరు. ఆ విధాత నిన్ను నేడు ఇక్కడకు తీసికొనిరావటం నా పట్ల చూపిన అనుగ్రహంగానే కనబడుతున్నది.'

వ. అనిన విని, యతఁ డతని కిట్లనియె. 196

ప్రతిపదార్థం: అనినన్ విని; అతఁడు= ఆ దుశ్శాసనుడు; అతనికిన్= భీముడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని దుశ్శాసనుడు భీముడితో ఇట్లా అన్నాడు.

సీ. 'ఎఱుఁగుదు మఱచితినే లక్కయింటఁ జి । చ్చిడి మిమ్ముఁ బఱచినయిడుమ? లవియుఁ
గాకయు, నమ్మెయి గాంధారరాజు మీ । యన్నతో వెడజూద మాడి రాజ్య
లక్ష్మిఁ జేకొని కానలకుఁ బోవ నడిచితి; । మందుఁ బెక్కాపద లనుభవించి,
యజ్ఞాతవాసార్థ మవ్విరాటుని ప్రోలి । కరిగి యత్యంత దైన్యంబు నొంది.

ఆ. యట్ల మీర లునికి యప్రసిద్ధమె? యివి । యేల రిత్తమాట లేటు పోటు
దలకు వచ్చి?' యనుడు; దరహాసమునఁ గెంపు । గదురఁ బవనసుతుఁడు గడఁగి డాసి. 197

ప్రతిపదార్థం: ఎఱుఁగుదున్= బాగా తెలుసు; మఱచితినే?= మరచిపోయాననుకొంటున్నావా?; లక్కయింటన్; చిచ్చు+ఇడి= నిప్పుపెట్టి; మిమ్మున్+పఱచిన= మీకు కలిగించిన; ఇడుమలు= ఇక్కట్లు; అవియున్+కాకయున్; ఆ+మెయిన్= ఆ విధంగా;

గాంధారరాజు= శకుని; మీ అన్నతోన్; వెడజూదము= కపటమైన జూదం; ఆడి; రాజ్యలక్ష్మిన్; చేకొని= స్వాధీనంచేసికొని; కానలకున్= అడవులకు; పోవన్= పోయేటట్లు; నడిచితిమి= ప్రవర్తించాము; అందున్; పెక్కు+ఆపదలు; అనుభవించి; అజ్ఞాతవాస+ అర్థము= ఎవ్వరికి తెలియకుండా జీవించేందుకు; ఆ+విరాటుని; ప్రోలికిన్= పట్టణానికి; అరిగి= పోయి; అత్యంత= మిక్కిలి; దైన్యంబున్= హీనస్థితిని; ఒంది= పొంది; అట్లు+అ= ఆ విధంగానే; మీరలు; ఉనికి= ఉండటం; అప్రసిద్ధమె?= అందరికీ తెలియనిదా?; ఏటు పోటుదలకున్ వచ్చి= రణరంగానికి వచ్చి; ఇవి ఏల రిత్త మాటలు?= ఈ వట్టి మాటలు ఎందుకు?; అనుడున్= అనగా; పవన సుతుఁడు= భీముడు; దరహాసమునన్= చిరునవ్వుతో; కెంపు= ఎరుపు; కదురన్= వ్యాపించగా; కడఁగి= సాహసించి; డాసి= సమీపించి.

తాత్పర్యం: నాకు బాగా తెలుసు, మరచిపోయాననుకొన్నావా? లక్కయిల్లు కాల్చి మిమ్ము పెట్టిన బాధలు. శకుని మాయజూదంలో మీ రాజ్యలక్ష్మిని దోచుకొనటం; మిమ్ములను అడవులకు పంపి పెక్కు బాధ లనుభవింపజేయటం, అజ్ఞాతవాసంలో విరాటుడి నగరంలో దీనాతిదీనమైన జీవితం గడుపుతూ మీరు నివసించటం ఎవరికి తెలియవు? కత్తిగట్టి కదనానికి దూకి, ఇప్పుడు ఆ పనికిమాలిన మాటలతో పని యేమి? అనగానే వాయునందనుడు చిరునవ్వు నవ్వి, ఆ నవ్వులో ఎరుపురంగు వ్యాపించగా కోపావేశంతో దుశ్శాసనుడిని సమీపించాడు.

క. భల్లములు మూఁట సిడమును । విల్లు నతికి, సూతకంఠ విదళనమున శో
భిల్లి, నిటలమునఁ బటు ద । ర్పోల్లసితుం డగుచు నాటె నొక నారసమున్. 198

ప్రతిపదార్థం: భల్లములు= బాణాలు; మూఁటన్= మూటితో; సిడమును= ధ్వజాన్ని; విల్లున్; నతికి; సూతకంఠ= సారథి మెడను; విదళమునన్= చీల్చివేయటంతో; శోభిల్లి= అందగించి; పటుదర్ప= దట్టమైన గర్వంతో; ఉల్లసితుండు+అగుచున్= దీపించేవాడు అవుతూ; నిటలమునన్= అతని నుదుట; ఒక నారసమున్= ఒక బాణాన్ని; నాటెన్= గ్రుచ్చాడు.

తాత్పర్యం: భీముడు మూడుబాణాలతో దుశ్శాసనుడి టెక్కెమును, ధనువును ఖండించి, సారథి మెడను చీల్చాడు. ఆ విజయగర్వంతో పొంగి అతడి నొసట కూడ ఒకబాణాన్ని నాటాడు.

వ. దాన బీఱువోవక దుశ్శాసనుండు. 199

ప్రతిపదార్థం: దానన్= దానితో; బీఱుపోవక= అధైర్యపడక; దుశ్శాసనుండు.

తాత్పర్యం: దానితో అధైర్యపడక దుశ్శాసనుడు.

క. తురగములఁ దాన నడపుచు । వెరవు రయము మెఱయ నొండువిలు గొని, గాఢ
స్ఫురణమున భీము తనువునఁ । బరఁగించె మెఱుంగు లడరఁ బండ్రెం డమ్ముల్. 200

ప్రతిపదార్థం: తురగములన్= గుర్రాలను; తాను+అ నడపుచున్= తానే నడుపుకొంటూ; వెరవు= ఉపాయం; రయము= వేగము; మెఱయన్= దీపించేటట్లు; ఒండు విలుగొని= వేరొక ధనుస్సును చేపట్టి; గాఢస్ఫురణమునన్= గట్టి తాకుడుతో; భీము తనువునన్= భీముడి దేహంమీద; మెఱుంగులు+అడరన్= కాంతులు ఈనుతుండగా; పండ్రెండు; అమ్ముల్= బాణాలను; పరఁగించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: గుర్రాలను స్వయంగా నడుపుకొంటూ శీఘ్రగతితో నిజసామర్థ్యం మెరయగా ఇంకొక విల్లు చేబూని, గట్టిగా తాకేటట్లు కాంతులీనే పన్నెండు అమ్ములను భీముడి శరీరంమీద ప్రయోగించాడు.

క. తోడన కోదండము దును । మాడెను. సూతుమెయిఁ గ్రుచ్చె నాఱుఅమ్ములు, సం
క్రీడయ పోలెను ముప్పది । యాడించెను మఱియుఁ దూపు లనిలజు మేనన్. 201

ప్రతిపదార్థం: తోడన్+అ= వెంటనే; కోదండము= విల్లును; తునుమాడెను= విరుగగొట్టాడు; సూతుమెయిన్= సారథి శరీరంలో; ఆఱు+అమ్ములు; క్రుచ్చెన్= గ్రుచ్చాడు; మఱియున్; అనిలజు= వాయుపుత్రుడైన భీముడి; మేనన్= శరీరంలో; తూపులు= బాణాలు; ముప్పది; సంక్రీడయ పోలెన్= క్రీడవలె; ఆడించెను= నాటాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు భీముడి విల్లును విరుగగొట్టాడు. రథసారథి దేహంలో ఆరుబాణాలు గ్రుచ్చాడు. భీముడి శరీరంలో ముప్పది అమ్ములు నాటాడు. ఇదంతా అవలీలగా ఒక ఆట ఆడిన విధంగా కావించాడు.

మ. ధను వొం డుగ్రత నెత్తి, యేఁబది శితాస్త్రంబుల్ మరుత్సూనుఁ డా
తనిగాత్రంబునఁ గ్రుచ్చినం, గినుకమై ధైర్యంబు శౌర్యంబు నొ
ప్ప నతం డుజ్జ్వల భల్లయుగ్మ యుగళ స్ఫారాహతిన్ వాజులం
దునిమెం, జూపఱు పిచ్చలింప విలసద్దోర్గర్వ దుర్వారుఁ డై. 202

ప్రతిపదార్థం: మరుత్సూనుఁడు= వాయుపుత్రుడు - భీముడు; ధనువు, ఒండు= ధనుస్సును మరొక దానిని; ఉగ్రతన్= కోపంతో; ఎత్తి; ఏఁబది; శిత+అస్త్రంబుల్= వాడి బాణాలను; ఆతని= దుశ్శాసనుడి; గాత్రంబునన్= శరీరంలో; క్రుచ్చినన్= నాటుకొనేటట్లు వేయగా; కినుకమైన్= కోపంతో; ధైర్యంబు= ధీరత్వం (గాంభీర్యం); శౌర్యంబు= పరాక్రమం; ఒప్పన్= ప్రకాశించగా; అతండు= దుశ్శాసనుడు; ఉజ్జ్వల= ప్రకాశిస్తున్న; భల్లయుగ్మ= బాణాల జంటయొక్క; యుగళ= జతయొక్క; స్ఫార= విస్పష్టమైన; ఆహతిన్= దెబ్బతో; విలసత్= దీప్తమైన; దోః+గర్వ= భుజగర్వంవలన; దుర్వారుఁడు+ఐ= నివారింప అలవిగానివాడై; చూపఱు= చూచేవారు; పిచ్చలింపన్= భయకంపితులై ఉండగా; వాజులన్= గుర్రాలను; తునిమెన్= ఖండించాడు.

తాత్పర్యం: వాయునందనుడి చేతనుండిన ధనువు విరుగగొట్టబడగా అతడు కోపోద్దీపితుడై ఇంకొక ధనుస్సును చేపట్టి, ఆ దుశ్శాసనుడి దేహంలో యాభై పదునైన బాణాలను చొప్పించాడు; దీనితో అతడు ఆగ్రహించి ధీరత్వం శూరత ఒప్పిదమై ఉండగా, నాలుగు బాణాలను ప్రయోగించి, భీముడి రథాశ్వాలను చంపివేశాడు. అట్లా అతడు ప్రకాశమానమైన భుజబల గర్వంతో నిర్నిరోధంగా చెలరేగటం చూచినవారు సంభ్రమాశ్చర్యాలతో నిండిపోయారు.

వ. ఇట్లు విరథుండై వృకోదరుండు మెయి వెంచి. 203

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; విరథుండు+ఐ= రథాన్ని కోల్పోయినవాడై; వృకోదరుండు= భీముడు; మెయి= దేహాన్ని; పెంచి.

తాత్పర్యం: వృకోదరు డిట్లా తేరులేనివాడై దేహాన్ని పెంచి. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. గద లీలం గొని తేరు డిగ్గి, మెఱుఁగుల్ గ్రమ్మంగ సారించి యు
న్మద యానంబునఁ గిట్టి, ఘోటకములన్ ప్రుందించి, బాహా బలం
బు దలిర్పన్ భవదీయ సూను నరదంబుం ద్రెళ్ళఁ ద్రోవంగ, బె
ట్టిదపుం దోమర మెత్తికొం చతఁడు దాఁటెన్ నేలకున్ గ్రక్కునన్. 204

ప్రతిపదార్థం: గద= గదను; లీలన్= సవిలాసంగా; కొని= చేతికి తీసికొని; తేరు, డిగ్గి= రథము దిగి; మెఱుఁగుల్ క్రమ్మంగన్= కాంతులావరింపగా; సారించి= త్రిప్పి; ఉన్మద యానంబునన్= పొగరుబోతుతనం చాటే నడకతో; కిట్టి= సమీపించి; ఘోటకములన్= గుఱ్ఱాలను; ప్రమందించి= చంపి; బాహాబలంబు; తలిర్పన్= అతిశయించగా; భవదీయ సూను= నీ కొడుకు దుశ్శాసనుడియొక్క; అరదంబున్= తేరును; త్రెళ్ళన్ త్రోవంగన్= విరిగిపోయేటట్లు నెట్టివేయగా; బెట్టిదపున్= బలమైన; తోమరము= ఇనుప గుదియను; ఎత్తికొంచున్; అతఁడు= దుశ్శాసనుడు; గ్రక్కునన్= త్వరగా; నేలకున్= నేలపైకి; దాఁటెన్= దూకాడు.

తాత్పర్యం: భీముడు గడుసైన విన్యాసంతో గదను చేబూని, తేరు దిగి, కాంతిప్రభలు చుట్టూ వ్యాపించేటట్లుగా గదను త్రిప్పుతూ, గర్వోన్మీలంగా నడచి దుశ్శాసనుడి రథాన్ని సమీపించాడు. వెంటనే గుఱ్ఱాలను చంపివేశాడు. తన బాహుబలం అతిశయిల్లగా దుశ్శాసనుడి రథాన్ని విరుగద్రోశాడు. అంతట దుశ్శాసనుడు కూడా బలమైన ఒక గుదియను ఎత్తుకొని తటాలున నేలమీదికి దూకాడు.

విశేషం: ఇది త్వరత్వరగా జరిగిన పనుల వరుస. దానిని తెల్పటానికి చాలా క్రియలను ఒకేపద్యంలో చొప్పిస్తాడు తిక్కన. ఆయన కవితారీతులలో ఇది ఒక అందమైన హేల.

వ. అట్లు దాఁటి, బెట్టువైచిన యత్తోమరంబునం గాఁడ నేసి, యక్కీచకారాతి పదుమూఁడువత్సరంబులు దమపడినపాట్లును బ్రతినచందంబును డెందమున నావహిల్ల, నుద్దండ గదాదండంబున దుశ్శాసను వైవ నతండు తద్గదాఘాతంబున నెత్తురు దొరఁగ ధరణిం బడిన, బెబ్బులి లేడికొదమం బొదువు పోలికం బొదివి మెడ నిక్కం ద్రొక్కి యెక్కుడు మదంబున నక్కుమారునితో ని ట్లనియె. 205

ప్రతిపదార్థం: అట్లు దాఁటి= ఆ విధంగా దూకి; బెట్టు వైచినన్= గట్టిగా విసరివేయగా; ఆ+తోమరంబునన్= ఆ తోమరాయుధాన్ని; కాఁడన్+ఏసి= విరుగగొట్టి; ఆ+కీచక+అరాతి= ఆ కీచకుడి శత్రువు - భీముడు (కీచకుడికి పట్టిన గతే పట్టనున్నదని సూచన); పదుమూఁడు వత్సరంబులు; తమపడినపాట్లను= తామనుభవించిన అగచాట్లను; ప్రతిన చందంబును= తాను చేసిన ప్రతిజ్ఞ తీరును; డెందంబునన్= మనస్సులో; ఆవహిల్లన్= కలుగగా; ఉద్దండ= భయంకరమైన; గదా దండంబునన్= గదతో; దుశ్శాసనున్; వైవన్= కొట్టగా; అతండు; తద్= ఆ; గదాఘాతంబునన్= గదదెబ్బతో; నెత్తురు; తొరఁగన్= కారగా; ధరణిన్= భూమిపై; పడినన్; బెబ్బులి= పెద్దపులి; లేడి కొదమన్= జింకపిల్లను; పొదువు= చుట్టుకొను; చందంబునన్= విధంగా; పొదివి= ఆక్రమించి; మెడనిక్కన్ త్రొక్కి= మెడను నిక్కేటట్లు కాలితో అణగజేసి; ఎక్కుడు మదంబునన్= అధికమైన పొగరుతో; ఆ+కుమారునితోన్= ఆ ధృతరాష్ట్ర పుత్రుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు అట్లా దూకి తోమరాన్ని బలంగా భీముడిపై ప్రయోగించగా, ఆతడు దానిని విరుగగొట్టి, తన మనసులో పదమూడేళ్ళు తాము పడిన పాట్లూ, తాను చేసిన ప్రతిజ్ఞా ఒక్కసారి మనస్సును ఆవేశించగా భయంకరమైన గదాదండంతో దుశ్శాసనుడిని బాదాడు. ఆ గదదెబ్బకు నెత్తురు కారగా నేలమీద పడ్డాడు దుశ్శాసనుడు.

పెద్దపులి లేడిపిల్ల మీదపడి క్రమ్ముకొనే విధంగా ఆతడిని భీముడు ఆక్రమించి మెడ నిక్కేటట్లు త్రొక్కి, మహోద్రేకంతో అతడితో ఇట్లా అన్నాడు.

క. 'మును సభఁ బలికినదానం। దని వోవక యిచ్చటికి వెదకి వచ్చితి యే
మనియె దనుము; నీ మాటలు। వినుటకు నా కినుక సాల వేడ్కపడియెడున్.' 206

ప్రతిపదార్థం: మును= ఇంతకుముందు; సభన్= సభలో; పలికిన దానన్= మాట్లాడినదానితో; తనివోవక= తృప్తిచెందక; ఇచ్చటికిన్; వెదకి= వెదకుకొంటూ; వచ్చితి(వి)= వచ్చావు; ఏమి+అనియెదు+అనుము= ఏమంటావో అనుము; నీ మాటలు వినుటకున్; నా కినుక= నా కోపం; చాలన్= ఎక్కువగా; వేడ్కపడియెడున్= కుతూహలపడుతుంది.

తాత్పర్యం: 'పూర్వం ఆ సభలో నీవు అనిన మాటలతో తృప్తి చెందక ఇక్కడకు వెదకుకొంటూ వచ్చావా? ఇంకా ఏమంటావో అను. నీ మాటలు వినాలని నా మండే కోపం తహతహపడుతున్నది.'

వ. అని, యమ్మహాబలనందనుండు మహోగ్రలోచన ప్రభలు నిగుడ మన బలంబులం జూచిన. 207

ప్రతిపదార్థం: అని; ఆ+మహాబలనందనుండు= ఆ వాయుపుత్రుడు భీముడు; మహా+ఉగ్ర= మహాభయంకరమైన; లోచన ప్రభలు= కన్నుల కాంతులు; నిగుడన్= వ్యాపించగా; మనబలంబులన్= మన సైన్యాలను; చూచినన్= చూడగా.

తాత్పర్యం: అని, ఆ మహాబలుడైన వాయుపుత్రుడు భీముడు కోపపు చూపుతో ఎర్రనికాంతులు వ్యాపించగా మన సేనలవైపు చూడగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. నిగుడు దవాగ్ని జ్వాలల। వెగడందిన మృగకులంబు విధమున, నతి భీ
తి గదిరి నలుగడ విచ్చిన,। జగతీశ్వర! యతఁడు మెఱసెఁ జక్కని బయలన్. 208

ప్రతిపదార్థం: జగతీశ్వర!= రాజా!; నిగుడు= అలముకొంటున్న; దవాగ్ని= కార్చిచ్చు; జ్వాలల= మంటలకు; వెగడు+అందిన= భయపడిన; మృగకులంబు= జంతువుల సమూహం; విధమునన్= వలె; అతిభీతి= మిక్కిలి భయం; (మనసేనలు) కదిరి= చెంది; నలుగడన్= నాలుగు దిక్కులకు; విచ్చినన్= పరుగెత్తిపోగా; అతఁడు= భీముడు; చక్కని బయలన్= సైన్యం పరుగెత్తిపోయినందున ఏర్పడిన అడ్డం, ఆపులేని విశాలప్రదేశంలో; మెఱసెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: రేగి చుట్టుప్రక్కల అలముకొంటున్న కార్చిచ్చు మంటలకు భయపడి పారిపోయే జంతుసమూహం వలె, భయవిహ్వలమై మన సైన్యం చెదరి నాలుగు మూలలకు పరుగెత్తిపోగా, ఏర్పడిన ఆ పెద్ద ఆరుబయలులో భీముడు ప్రకాశించాడు.

విశేషం: అలంకారం: ఉపమ.

వ. అప్పుడు నీయందుఁ జేయంగల సైనికులు సూచి, తత్తేజో విశేషంబునం జూడ్కులు మిఱుమిట్లు గొన వెఱచఱచి, యంతంత ఱిచ్చవడియుండ. 209

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; నీయందున్= నీ పట్ల (నీ పక్షంలో); చేయంగల= కార్యం నెరవేర్చగలిగిన (నీ విశ్వాసపాత్రులు); సైనికులు; చూచి= ఆ భీముడి భీషణరూపాన్ని ఆరుబయలులో బాగా చూచి; తత్తేజోవిశేషంబునన్= అతడి

పరాక్రమం అతిశయించటంచేత; చూడ్కులు= చూపులు; మిఱుమిట్లు గొనన్= చెదరిపోగా; వెఱచఱచి= భయపడి; అంతంతన్= ఎక్కడివారక్కడ; ఊచ్చ పడి ఉండన్= చేష్టలు దక్కి నిలబడి ఉండగా.

తాత్పర్యం: అప్పుడు నీ పక్షంలో యుద్ధంచేయగల సైనికులందరూ చూచి, అతడి పరాక్రమ తేజస్సును కళ్ళు మిరుమిట్లు గొలిపేటట్లు చూచి భయపడి ఎక్కడివారు అక్కడ చేష్టలు దక్కి నిలిచిపోయి ఉండగా.

శా. **లీలం గేల నమర్చి, మత్తగజ కేళీ సుందరోల్లాస మా**
భీలత్వం బలరింపఁ ద్రిప్పుఁ, జదలం బృథ్వీస్థలిన్ వైచు, ముం
గాలం ద్రోయు, మొగంబు వ్రేయు, దెస లుగ్రస్ఫూర్తి వీక్షించు, మోఁ
కా లూఁదుం బయిఁ, గ్రమ్మఱంగ మెడ చిక్కం ద్రొక్కి నిల్చున్, నగున్. **210**

ప్రతిపదార్థం: లీలన్= విలాసంగా; కేలన్= చేతితో; అమర్చి= పట్టుకొని; మత్తగజ= మదపుటేనుగుయొక్క; కేళీ= ఆటవలె; సుందర ఉల్లాసము= అందగిస్తున్న విలాసం; ఆభీలత్వంబు= భయద స్వరూపాన్ని; అలరింపన్= సంతోషపెట్టుతుండగా; త్రిప్పున్= గిర గిర త్రిప్పాడు; చదలన్= ఆకాశంపైకి; పృథ్వీస్థలిన్= భూప్రదేశానికి; వైచున్= విసరివేయును (పైకెత్తి క్రిందికి కొట్టాడు); ముంగాలన్= పాదాగ్రముతో; త్రోయున్= నెట్టివేయును; మొగంబు= ముఖమును; వ్రేయున్= మోదును; దెసలు= చుట్టుప్రక్కల; ఉగ్రస్ఫూర్తిన్= కోపపు పొంగుతో; వీక్షించున్= చూచును; పయిన్= దేహంమీద; మోకాలు; ఊఁదున్= త్రొక్కిపట్టును; క్రమ్మఱంగన్= అతడు ప్రక్కకు తిరిగితే; మెడ; చిక్కన్= గట్టిగా; త్రొక్కి= అదిమి; నిల్చున్= మెడపై నిలబడును; నగున్= పకపకా నవ్వును.

తాత్పర్యం: అతడి శరీరాన్ని ఒక ఆటలో వలె విలాసంగా చేజిక్కించుకొని, ఒక మదపుటేనుగు చేసే చెర్లాటంవలె మనోజ్ఞమైన సంతోషం భయంకరస్వరూపానికి అందాన్ని చేకూరుస్తుండగా, ఆతడి దేహాన్ని భీముడు గిరగిర త్రిప్పాడు. పైకెత్తి నేలపై విసిరి కొట్టాడు. పాదాగ్రంతో దానిని నెట్టివేశాడు, ముఖాన్ని చరిచాడు. కోపోద్దీపితుడై చుట్టుప్రక్కలా ఉరిమి చూచాడు. ఆ శరీరాన్ని మోకాలితో అదిమాడు, మెడను మరల గట్టిగా త్రొక్కాడు, లేచి నిలబడ్డాడు. నవ్వాడు. ఇట్లా అక్కసునంతా వెడల గ్రక్కాడు.

విశేషం: అలంకారం: స్వభావోక్తి.

వ. **ఇవ్విధంబునం ఘోరవిహారంబు సలిపి, భీమవిక్రముం డగు నా భీమసేనుం డయ్యువరాజు నాననం బాలోకించి.** **211**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; ఘోర, విహారంబు సలిపి= భయంకరంగా విహరిస్తూ; భీమవిక్రముండు+అగు= భయంకరమైన బాహుపరాక్రమం కలవాడైన; ఆ భీమసేనుండు; ఆ+యువరాజు= ఆ దుశ్శాసనుడి; ఆననంబు= ముఖాన్ని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఆ విధంగా భయంకర వీర విలాసాన్ని ప్రదర్శించి, భీముడు ఆ దుశ్శాసనుడి మొగం చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: పిల్లికి చెర్లాటం, ఎలుకకు ప్రాణసంకటం - అన్నట్లు, భీముడు దుశ్శాసనుడిపై క్రూరమైన వినోదం ప్రదర్శిస్తున్నాడు.

క. 'ఏ నురము వ్రచ్చి నెత్తురు । తేనియ యిది ద్రావెదం; । గదిసి ననుఁ గడిమిన్
మానుప దిక్కు గలిగిన । వ్రాని మ్మెలుఁగింపు మీ మొనం గలవారిన్.' 212

ప్రతిపదార్థం: ఏను= నేను; ఉరము= రొమ్మును; వ్రచ్చి= చీల్చి; నెత్తురు, తేనియు= నెత్తురు అనెడి తేనెను; ఇది త్రావెదన్; ననున్= నన్ను; కదిసి= సమీపించి; కడిమిన్= పట్టుదలతో; మానుపన్= నివారించేందుకు; దిక్కు కలిగినన్= ఆదరువు (సహాయం) ఉన్నట్లయితే; రానిమ్ము= వారిని రమ్మను; మీ మొనన్= మీ సైన్యంతో; కలవారికిన్= ఉన్నవారికి; ఎలుఁగింపు= ఎలుగెత్తి చాటుము.

తాత్పర్యం: 'ఇదిగో! నీ గుండె చీల్చి, నెత్తురు అనే తేనెను ఆత్రంతో త్రాగుతాను. మీ సైన్యంలో నన్ను ఆపగల దిక్కెవరైనా నీకు ఉంటే వారిని రమ్మను(రప్పింపుము) గొంతెత్తి వారిని పిలువుము'.

వ. అని పెలుచం బలికి, కుఠారంబు వెఱికి యతని మొగంబుమీఁద జళిపించి. 213

ప్రతిపదార్థం: అని; పెలుచన్+పలికి= పెద్దగా కఠినంగా చెప్పి; కుఠారంబు= గండ్రగొడ్డలిని; పెఱికి= లాగుకొని; అతని మొగంబుమీఁద; జళిపించి= ఆడించి.

తాత్పర్యం: అని బిగ్గరగా పలికి, గండ్రగొడ్డలిని పెరికి అతడి మొగంమీద ఆడించి. (తరువాతి పద్యంతో అన్వయం).

భీమసేనుఁడు దుస్ససేనుని యురంబు వ్రచ్చి రక్తపానంబు సేయుట (సం. 8-61-1)

మ. నరసింహుం డసురేంద్రు వ్రచ్చుకరణి, న్రౌద్రం బుదగ్రంబుగా
నుర మత్యుగ్రతఁ జీరి, క్రమ్ము రుధిర మ్ముల్లాసియై దోయిట
న్వెర వారం గొని త్రావు, మెచ్చుఁ జవికి, న్మేనున్ మొగంబున్ భయం
కర రేఖం బొరయంగఁ జల్లికొను, నక్కౌరవ్యుఁ జూచుం బొరిన్. 214

ప్రతిపదార్థం: నరసింహుండు= నరసింహస్వామి; అసుర+ఇంద్రున్= రాక్షసరాజు హిరణ్యకశిపుని; వ్రచ్చు కరణిన్= చీల్చిన విధంగా; రౌద్రంబు= రౌద్రం; ఉదగ్రంబు+కాన్= భయంకరం కాగా; ఉరము= రొమ్ము; అత్యుగ్రతన్= మిక్కిలి క్రూరంగా; చీరి= చీల్చి; క్రమ్మ= చిమ్మే; రుధిరమ్ము= నెత్తురు; ఉల్లాసి+ఐ= సంతోషించినవాడై; దోయిటన్= దోసిట; వెరవు, ఆరన్= నేర్పుమీరగా; కొని= తీసికొని; త్రావు; చవికిన్= ఆ రుచికి; మెచ్చున్= మెచ్చుకొనును; మేనున్= శరీరాన్ని; మొగంబున్; భయంకర రేఖన్= భీతిగొలిపే విధంగా; పొరయంగన్= పొందగా; చల్లుకొనున్= (ఒంటిపైన ముఖంపైన) చల్లుకొంటాడు; ఆ కౌరవ్యున్= కురువంశము వాడైన ఆ దుశ్శాసనుడిని; పొరిన్= మాటి మాటికి; చూచున్= చూస్తాడు.

తాత్పర్యం: నృసింహస్వామి హిరణ్యకశిపుడి పొట్ట చించినట్లు, భీముడు ప్రచండ రౌద్రమూర్తి అయి కసిదీరేటట్లు దుశ్శాసనుడి రొమ్మును చీల్చి, పైకి పొంగే నెత్తుటిని నేర్పుగ దోసిటినిండా తీసుకొని, ఉల్లాసంగా త్రాగుతూ దాని రుచికి మెచ్చుకొన్నాడు. (అందరికి) భయం గొలిపేటట్లుగ ముఖంమీద ఒంటిమీద చల్లుకొన్నాడు. మాటిమాటికి ఆ దుశ్శాసనుడిని చూచాడు. (ఈ చూపులే తన విజయోత్సాహాన్ని శత్రువుల దీనస్థితిని సూచిస్తున్నవి.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ. ఆనాడు ద్రౌపదిని అంతఘోరంగా అవమానించిన దుశ్శాసనుడి మీద భీముడి గుండెలో ఎంత కసి దాగి ఉందో - అది ఎంత భయానక బీభత్సంగా ఇప్పుడు పైకి పొంగిందో తిక్కన కంటికి కట్టినట్లు అద్భుతంగా వర్ణించాడు. భీముడి ప్రతిజ్ఞల్లో ఒకటి తృప్తిగా తీరింది. ఇంకొకటి- దుర్యోధనుడి విషయంలో చేసింది - మిగిలిఉంది.

వ. ఇట్లు దారుణ భంగిం బ్రతిజ్ఞాకరణ పూరణం బాచరించి. 215

ప్రతిపదార్థం: ఇట్లు దారుణభంగిన్= ఇట్లు క్రూరంగా; ప్రతిజ్ఞాకరణ పూరణంబు= చేసిన బాస పూర్తి అయ్యేటట్లు; ఆచరించి= చేసి

తాత్పర్యం: ఈ విధంగా భయంకరమైన పద్ధతిలో ప్రతిజ్ఞను పూర్తిచేసికొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. 'తల్లి చన్నుల పా లేను ద్రావ నెట్టు । లాననే పలుతెఱఁగుల తేనియలును
ఖండశర్కరతోడి దుగ్ధంబు లనుభ । వింపఁబడవే! యవియు నింత యింపు గావు.' 216

ప్రతిపదార్థం: ఏను; తల్లిచన్నులపాలు= తల్లి చనుబాలు; త్రావన్+ఎట్టులు?= నేను త్రాగలేదా?; పలుతెఱంగుల= అనే రకాలైన; తేనియలును; ఎట్టులు ఆననే!= ఏదో విధంగా తాగి ఉన్నాను గదా!; ఖండశర్కర= కలకండ; తోడి= కలిపిన; దుగ్ధంబులు= పాలు; అనుభవింపఁబడవే!= నేను త్రాగి అనుభవించినానుగదా!; అవియున్= అవి అన్నీకూడా; ఇంత ఇంపు గావు= ఇంతటి ఆనందాన్ని కలిగించలేదు.

తాత్పర్యం: 'తల్లి చనుబాలు త్రాగాను. రకరకాల తేనెలు చవిచూచాను. కలకండతో కలిపి పాలు త్రాగాను. కాని అవన్నీ కూడా ఇంతటి తృప్తినిగాని ఆనందాన్నిగాని కలిగించలేదు.'

చ. అని యెలుఁ గెత్తి పల్కు నలి నాడు, మహోద్ధతిఁ ద్రుళ్ళు, నార్చుఁ, బె
ల్చన భుజ మప్పళించుఁ దమ సైనికులున్ మనవారు రక్కసుం
డని వెఱఁ గందువారు, గళితాయుధు లయ్యెడువారు, భీతి మూ
ర్ఛను బడువారునై రణ విరామముఁ బొంద మదోత్కటాకృతిన్. 217

ప్రతిపదార్థం: మదోత్కట ఆకృతిన్= లోపొగరుపైకి ఉబుకగా పొందిన స్వరూపంతో; అని= (పై విధంగా) అని; ఎలుఁగెత్తి పల్కున్= గొంతెత్తి అరుస్తాడు; నలిన్= ఉత్సాహంతో; ఆడున్= ఎగిరి గంతులు వేస్తాడు; మహోద్ధతిన్= గొప్ప వేగంతో; త్రుళ్ళున్= మిడిసిపడతాడు; ఆర్చున్= కేకలు వేస్తాడు; పెల్చన= గట్టిగా; భుజము= భుజాలను; అప్పళించున్= చరచుకొంటాడు (ఇదంతా చూచి); తమ సైనికులున్= ఆయన సేన; మనవారు= కౌరవులు; రక్కసుండు+అని= రాక్షసుడని; వెఱఁగందువారు= ఆశ్చర్యపడేవారు; గళితాయుధులు+అయ్యెడువారు= ఆయుధములు జారిపోయినవారు; భీతిన్ మూర్ఛనుపడువారునై= భయంతో ఒళ్ళు తెలియకుండా నేల కొరిగేవారు కాగా; రణవిరామము పొందన్= దీనితో యుద్ధం నిలిచిపోగా.

తాత్పర్యం: అని బిగ్గరగా అంటాడు. ఉత్సాహంతో గంతులు వేస్తాడు, ఆ వేగంతో త్రుళ్ళుతాడు, అరుస్తాడు, గట్టిగా భుజాలను చరచుకొంటాడు, ఇరువైపు సైనికులూ అతడిని చూచి రాక్షసుడేమో అని నిశ్చేష్టులయ్యారు. ఆయుధాలను భయంతో వదలిపెట్టారు. మూర్ఛలు కూడా పోయారు. అతడి మదభయంకరమైన రూపాన్ని చూచి అందరూ యుద్ధం మాని నిలిచిపోయారు.

వ. పదంపడి. 218

తాత్పర్యం: తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. గద సేతం గొని, యంత్యకాల యమరేఖం బేర్చి, రక్తంబు చా
య దలిర్పం దను వుగ్రసుందరముగా నవ్వీరుఁ డేతెంచి, యు
న్మద మాతంగము లీల దోఁప; మన సేనం బొల్పఱం దోలి వే
పొదివెం గ్రమ్మఱ దుస్ససేను వికటస్ఫూర్తి స్ఫురన్మూర్తియై. 219

ప్రతిపదార్థం: గద చేతన్+కొని= గదను చేతితో పట్టుకొని; అంత్యకాల= ప్రళయవేళయందలి; యమరేఖన్= యముడివలె; పేర్చి= అతిశయించి; తనువు= శరీరం; రక్తంబు చాయ= నెత్తురు రంగుతో; తలిర్పన్= అతిశయిల్లగా; ఉగ్రసుందరముగాన్= రమణీయ భయానకము కాగా; ఆ+వీరుఁడు= ఆ వీరుడు-భీముడు; ఉన్మద= మత్తెక్కిన; మాతంగము= ఏనుగుయొక్క; లీల= విలాసం; తోఁపన్= మనస్సుకు తోచేటట్లు; ఏతెంచి= విచ్చేసి; మనసేనన్= మనసేనను; పొల్పు= స్థైర్యము; అఱన్= నశించేటట్లు; తోలి= పరుగెత్తేటట్లు చేసి; వే= వెంటనే; క్రమ్మఱన్= మరల; వికటస్ఫూర్తి స్ఫురత్+మూర్తి+ఐ= వెగటుదనం స్ఫురించే ఆకారంతో; దుస్ససేనున్; పొదివెన్= పైకొన్నాడు.

తాత్పర్యం: గదను చేత ధరించి ప్రళయకాల యముడివలె విజృంభించి, దేహం రక్తవర్ణంతో భయంకర సుందరం కాగా, మత్తెక్కిన ఏనుగువలె వచ్చి, మనసేనను పారద్రోలి, వెగటుగొలిపే రూపంతో మళ్ళీ దుశ్శాసనుడిమీద పడ్డాడు.

విశేషం: భీముడికి దుశ్శాసనుడిపై ఇంకా కసి తీరలేదు. అందుకే మళ్ళీ అతడిమీద పడ్డాడు. హిడింబ, కీచకులను చంపటంలో ఇంత క్రౌర్యం లేదు. ఇది అవమాన ప్రతీకార రూపం. కాబట్టి వేడి ఎక్కువ. చేష్టలు వికటంగా కనుపించినా, కవి దానిని సౌందర్యరేఖలతో దిద్ది, హాయిని కల్పిస్తున్నాడు. నెత్తురు త్రావటం రాక్షసకృత్యమైనా అది అతని ప్రతిజ్ఞలో భాగమే. అలంకారం: ఉపమ.

వ. చలంబు నెఱయ నతని కాలు గేల నమర్చి మొగంబు గనుంగొనుచు నక్కిమ్మీరవైరి యి ట్లనియె. 220

ప్రతిపదార్థం: చలము= కోపం; నెఱయన్= రేగగా; అతని= దుశ్శాసనుడి; కాలు; కేలన్+అమర్చి= తనచేతపట్టుకొని; మొగంబు కనుగొనుచున్= అతడి మొగం చూస్తూ; ఆ+కిమ్మీరవైరి= కిమ్మీరుడనే రక్కసుడికి విరోధి భీముడు; ఇట్లు+అనియెన్. (భావిఫలం అట్టిదేనని సూచించటం ఇందులో కలదు).

తాత్పర్యం: పగ పెచ్చు పెరగగా అతడి కాలును చేతితో పట్టుకొని, మొగాన్ని చూస్తూ భీముడు ఇట్లా అన్నాడు.

క. 'ఏమిర! పసు లని యార్వవు? నీ । మాటలు నిలువఁబడియెనే? పసరమ! మి
మ్మేము మగుడ నిదె యార్చెద; । మీ మాటకు మాఱు పల్క రెవ్వరుఁ గంటే?' 221

ప్రతిపదార్థం: ఏమిర!= (ఎంతటి తిరస్కారభావం. ఎంతటి చులకన!); పసులు అని= పశువులు అని; ఆర్వవు?= ఎందుకు అరవవు?; నీ మాటలు నిలవఁబడియెనే?= నీ మాటలు పడిపోయాయా?; పసరమా!= పశువా!; మిమ్మున్; ఏము; మగుడన్= మరలా; ఇదె= ఇదిగో ఇప్పుడే; ఆర్చెదము= పెద్దగా పశువులని అంటాము; ఈ మాటకున్= ఈ మాటకు; ఎవ్వరున్= ఎవ్వరు; మాఱు పల్కరు= ఎవ్వరు ఎదిరించి మాట్లాడరు; కంటే?= గమనించినావా?

తాత్పర్యం: 'ఏమిరా! పశువులని అరవవేమి? నీ నోరు పడిపోయిందా? పశువా! మిమ్ములను మరల మే మిప్పుడు పశువుల్లారా! అని పెద్దగా పిలుస్తాము. ఈ మాటకు మీ వారిలో ఎవ్వరు బదులు పలకటం లేదు చూచావా?.

ఉ. 'నెట్టన యల్గినం దగునె? నీళ్ళను ద్రోచుటయున్ విషాన్నముం
బెట్టుటయున్ మహాభుజగ భీషణ దంష్ట్రలపాలు సేఁతయుం
జుట్టలుఁ బెద్దలుం జెలులుఁ జూడ సభన్ నెఱిమాలి యిమ్మెయిం
దిట్టున కోర్చు టెందుఁ గలదే? విను గెల్వరె జూద మెవ్వరున్?' 222

ప్రతిపదార్థం: నెట్టన= అనాలోచితంగా; అల్గినన్= కోపపడితే; తగునె= సరిపోతుందా?; నీళ్ళను త్రోచుటయున్= నీళ్ళలో త్రోయటం; విష+అన్నము= విషం కలిపిన అన్నము; పెట్టుటయున్; మహాభుజగ= పెద్దపాములయొక్క; భీషణదంష్ట్రల= భయంకరమైన కోరల; పాలుచేఁతయున్= వశమయ్యేటట్లు చేయటం; చుట్టలున్= బంధువులును; పెద్దలున్; చెలులున్= స్నేహితులు; చూడన్= చూస్తుండగా; సభన్= ఆ సభలో; నెఱిమాలి= న్యాయం తప్పి; ఈ+మెయిన్= ఈ విధంగా; తిట్టునకున్= తిట్టుకు; ఓర్చుట= సహించి ఊరకుండటం; ఎందున్= ఎక్కడైనా; కలదే?= ఉన్నదా?; విను= (నేను చెప్పే దానిని) వినుము; ఎవ్వరున్= ఇంకెవ్వరు; జూదము= జూదం; గెల్వరు= గెలిచి ఉండలేదా? (గెలిచి ఇట్లా అత్యాచారం చేశారా?)

తాత్పర్యం: 'నీవు అనవసరంగా కోపపడటం తగునా? నన్ను నీళ్ళలో త్రోశారు. విషం కలిపిన అన్నం పెట్టారు. పెద్ద విషపుపాముల కోరలకాటుకు బలిచేశారు. ఆ సభలో బంధుమిత్రులు పెద్దలు చూస్తుండగా నీతి తప్పి ఇట్లా మీరు దూషించటం, దానికి మేము ఓర్చుకొని ఊరకుండటం, ఇంకెక్కడైనా ఇలా జరిగిందా? యోచించుము. ఇంతకుముందు జూదంలో గెలిచినవారు ఇంకెవ్వరు లేరా?' (జూదమాడినవారున్నారుగాని ఇట్టి దుశ్చేష్టలు చేసినవారు లేరని భావం).

క. అని పలికి, క్రమ్మఱఁగ మన । మొన మీఁదన్ బ్రమరి వాఱి, ముద్గరి లలితం
బునఁ గేలు మెఱయఁ జని, తన । కన లడఁగక దుస్ససేనుఁ గనుగొని పలుకున్. 223

ప్రతిపదార్థం: అని పలికి; క్రమ్మఱఁగన్= వెనుదిరిగి పోగా; మన మొనమీఁదన్= మనసైన్యాల చుట్టూ; బ్రమరి వాఱి= చుట్టు తిరిగి; ముద్గర లలితంబునన్= సొంపైన గదావిన్యాసంతో; కేలు మెఱయన్= చేయి తళతళలాడుతుండగా; చని= పోయి; తన కనలు= తన కోపం; అడఁగక= ఉపశమించకపోగా; దుస్ససేనున్; కనుగొని= చూచి; పలుకున్.

తాత్పర్యం: అని పలికి భీముడు మన సైన్యాలచుట్టూ తిరిగి చూచి, గద త్రిప్పటంతో మనోజ్ఞమై చూపట్టుతున్న బాహువిన్యాసంతో, తన కోపం ఇంకా శాంతించనందున దుస్ససేనుడిని చూచి ఇట్లా అన్నాడు.

ఉ. 'ప్రై వడి పోయెఁ గాన ధృతరాష్ట్రుఁడు గన్నది యేమి? యా సభం
దా వల దన్నఁ గీ డుడుగదా! పతి లేఁ దనఁబడ్డ కాంత నేఁ
డీవు గనుంగొనంగఁ బతి యేడ్తెఱ నొప్పెఁ బతుల్ విజృంభిత
శ్రీ విలసిల్లు కాములు సేడ్పడి రిట్లపతిత్వ దీనతన్.' 224

ప్రతిపదార్థం: ప్రైవడి= నిందపాలై; పోయెన్; కానన్= కాబట్టి; ధృతరాష్ట్రుఁడు; కన్నది= చూచింది (అనుభవించింది); ఏమి?; ఆ సభన్; తాన్= తాను; వలదన్నన్= వద్దని వారించి ఉంటే; కీడు= ఆపద; ఉడుగదా?= నివారింపబడి ఉండదా?; పతి

లేఁడు అనన్+పడ్డ= మగడు లేడు అని చెప్పబడిన; కాంత= ద్రౌపది; నేఁడు; ఈవు కనుంగొనంగన్; పతి= భర్త; ఏడ్తెఱన్= పరాక్రమాతిశయంతో; ఒప్పెన్= అలరారుతున్నాడు; పతుల్= తమ భర్తలు; విజృంభిత శ్రీ విలసిల్లు= పెంపొందిన సంపదతో శోభిల్లు; కామినులు= స్త్రీలు; ఇట్లు= ఈ విధంగా; అపతిత్వ దీనతన్= మగలులేని దైన్యంతో; చేడ్పడిరి= చిక్కులపాలైరి.

తాత్పర్యం: 'ధృతరాష్ట్రుడు నిందపాలు కావటం తప్ప వేరేమి చూడగలిగాడు? ఆ సభలో తాను వద్దంటే కీడు తప్పి ఉండేది కదా! మగడు లేడు అన్న ఆ కాంతకే ఇప్పుడు నీవు చూస్తుండగానే భర్త పరాక్రమదీప్తితో ప్రకాశిస్తున్నాడు. పెంపొందిన సంపదతో విలసిల్లిన కౌరవకాంతలు కష్టాలపాలై ఇప్పుడు తమకు మగలులేరని కనికరించవలసిన స్థితిలో ఉన్నారు.

క. విను! మేను జేయఁ బూనిన । పనులం దొకటి గడతేఱెఁ; బాపాత్ము సుయో
ధనుఁ బొరిగొని తల దన్నుదు । నను రెండవ పనియుఁ దీర్ప నరిగెద నెలమిన్'. 225

ప్రతిపదార్థం: వినుము; ఏను; చేయన్+పూనిన; పనులందున్; ఒకటి; కడతేఱెన్= నెరవేరింది; పాపాత్మున్; సుయోధనున్; పొరిగొని= చంపి; తల తన్నుదున్; అను; రెండవ పనియున్; తీర్పన్= పూర్తి చేసేందుకు; ఎలమిన్= ఉల్లాసంతో; అరిగెదన్= ముందుకు సాగుతాను.

తాత్పర్యం: శ్రద్ధగా వినుము. నేను బాస చేసి చేయబూనిన వాటిలో ఒకటి పూర్తి అయింది. ఇక ఆ సుయోధనుడిని చంపి, అతడి తలను తన్నుతాను - అనేది మిగిలి ఉన్నది. ఆ కోరికను తీర్చుకొనేందుకు- ఇదిగో! అధికోత్సాహంతో ముందుకు సాగుతాను.

చ. అని యెలుఁ గెత్తి చెప్పి, యతఁ డాతని గీ టడఁగించి యార్చెఁ గ
ర్ణనకును లోనుగా మన వరూథినియోధులకున్ మహాభయం
బున మనముల్ గలంగఁబడి పోరికి నూల్కొననీని ఱిచ్చపా
టున సకలాంగకంబులు గడున్ శిథిలంబులుగా మహోగ్రుఁడై. 226

ప్రతిపదార్థం: అని; ఎలుఁగెత్తి చెప్పి= పెద్దగా అరచి చెప్పి; అతఁడు= భీముడు; ఆతనిన్= దుస్ససేనుడిని; గీటు+అడఁగించి= చంపి; కర్ణనకును లోనుగా= కర్ణుడు మొదలైన; మన; వరూథిని యోధులకున్= సైనికవీరులకు; మహాభయంబునన్= గొప్పభయంతో; మనముల్= హృదయాలు; కలంగఁబడి= కలతచెంది; పోరికిన్= యుద్ధం చేయటానికి; నూల్కొననీని= పూనుకొనేటట్లు చేయని; ఱిచ్చపాటునన్= కలవరపాటున; సకల+అంగకంబులు= శరీర అవయవాలన్నీ; కడున్= మిక్కిలి; శిథిలంబులుగాన్= వికలమయ్యేటట్లు; మహా+ఉగ్రుఁడై= అధికమైన కోపం కలవాడై; ఆర్చెన్= అరిచాడు.

తాత్పర్యం: అని గొంతెత్తి పెద్దగా చెప్పాడు. దుశ్శాసనుడిని తుదముట్టించాడు. కర్ణుడు మొదలుగా మన సైనిక వీరులకు భయంతో మనస్సులు కలతచెంది, యుద్ధానికి పూనుకోలేని నిశ్చేష్టతతో, అవయవాలన్నీ పని చేయని స్థితి ఏర్పడేటట్లుగా మహాభయంకరుడై అరిచాడు.

క. జనపతియుఁ గృప ప్రముఖులుఁ । గనుఁగొన, ని ట్లనిలసుతుఁడు గ్రౌర్య మొదల్ గై
కొనినట్లు పేర్చి దుశ్శా । సనుఁ జంపుటఁ జూచి, రోష సంరంభమునన్. 227

ప్రతిపదార్థం: జనపతియున్= రాజు దుర్యోధనుడు; కృప ప్రముఖులు= కృపాచార్యుడు మొదలైన ప్రఖ్యాతవీరులు; కనుఁగొనన్= చూస్తుండగా; క్రౌర్యము= క్రూరస్వభావం; ఇట్లు; ఒడల్ గైకొనినట్లు= మానవాకృతిని తాల్చినట్లు; అనిలసుతుఁడు= వాయునందనుడు, భీముడు; పేర్చి= ఉప్పొంగి; దుశ్శాసనున్; చంపుటన్+చూచి= చంపటాన్ని చూచి; రోష సంభ్రమమునన్= కోపాతిశయంతో.

తాత్పర్యం: ఈ విధంగా భీముడు-దుర్యోధనుడు, కృపుడు మొదలైన ప్రముఖులు చూస్తూ ఉండగా, క్రూరత్వమే రూపుదాల్చిందా అన్నట్లు విజృంభించి దుశ్శాసనుణ్ణి చంపటాన్ని చూచి, రోషాతిశయంతో.... (తరువాతి వచనంతో అన్వయం)

వ. **నీ కొడుకులు కవచియు నిషంగియుఁ బాశియు దండధారుండును ధనుర్గ్రహుండును నలోలుపుండును సహుండును షండుండును వాతవేగుండును సువర్చసుండును గూడి కవిసి, వివిధ విశిఖంబుల నతనిం బొదివిన; నంతకుమున్న దుశ్శాసన రక్తపాన కౌతుకాధీన మానసుం డైన యా భీమసేనుపై నెవ్వరు గడంగుదురో యని కన్నిడి యుండి, యతం డప్రతిహతంబుగాఁ బ్రతిన దీర్చుటకుఁ బ్రీతచిత్తుం డగు ఫల్గునుండు భల్లదశకంబున నక్కుమార దశకంబు శిరంబులు దునుమాడె; నట్టి భీమార్జునుల యాటోపంబున కోటఱి నీ సైన్యంబు సమర విముఖం బయ్యె, నా సూతనందనుండును భీతుండై వదనంబు వెలవెలఁ బాఱ నూరకుండె; నప్పుడు శల్యుం డతని నాలోకించి యి ట్లనియె.** **228**

ప్రతిపదార్థం: నీ కొడుకులు- కవచియు, నిషంగియు, పాశియు, దండధారుండును, ధనుర్గ్రహుండును, ఆలోలుపుండును, సహుండును, షండుండును, వాతవేగుండును, సువర్చసుండును; కూడి= ఒక్కటై; కవిసి= విజృంభించి; వివిధ విశిఖంబులన్= అనేకవిధాలైన బాణాలతో; అతనిన్= భీముడిని; పొదివినన్= ఎదుర్కోగా; అంతకుమున్ను+అ= అంతకుముందే; దుశ్శాసన, రక్తపాన= దుశ్శాసనుడి నెత్తురు త్రాగుటచేత; కౌతుక+అధీన= సంతోషమునకు వశమైన; మానసుండు+ఐన= మనస్సు కలవాడైన; ఆ భీమసేను పైన్; ఎవ్వరు; కడంగుదురో= మార్కొంటారో; అని; కన్ను+ఇడి ఉండి= కనిపెట్టుకొని ఉండి; అతండు; అప్రతిహతంబుగాన్= అడ్డగించేవారు లేనివాడై; ప్రతిన తీర్చుటకున్= ప్రతిజ్ఞ పూర్తిచేయటంవలన; ప్రీత చిత్తుండు+ అగు= సంతోషించిన మనస్సు కలవాడగు; ఫల్గునుండు= అర్జునుడు; భల్ల+దశకంబునన్= పదిబాణాలతో; ఆ+కుమార దశకంబు= ఆ కురుకుమారులు పదిమందియొక్క; శిరంబులు; తునుమాడెన్= త్రుంచాడు; అట్టి భీమార్జునుల; ఆటోపంబునకున్= విజృంభణానికి; ఓటఱి= భయభ్రాంతమై; నీ సైన్యంబు; సమర విముఖంబు+అయ్యెన్= పోరుకు పెడమొగం పెట్టింది; ఆ సూతనందనుండును= ఆ కర్ణుడు కూడా; భీతుండు+ఐ= భయపడినవాడై; వదనంబు= మోము; వెలవెలన్+పాఱన్= కాంతిహీనంకాగా; ఊరకుండెన్; అప్పుడు; శల్యుండు; అతనిన్= కర్ణుడిని; ఆలోకించి= చూచి; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: నీ కొడుకులు కవచి, నిషంగి, పాశి, దండధారుడు, ధనుర్గ్రహుడు, అలోలుపుడు, సహుడు, షండుడు, వాతవేగుడు, సువర్చసుడు - అనేవారు ఒకటిగా చెలరేగి వివిధ బాణాలతో భీముడిని చుట్టుముట్టారు. అంతకుముందే దుశ్శాసనుడి రక్తం త్రాగి సంతోషిస్తూ ఉన్న భీముడిపై ఎవరు దాడి చేస్తారో అని గమనిస్తూ, అతడు నిరాఘాటంగా ప్రతిజ్ఞ తీర్చికొన్నందుకు సంతోషించిన అర్జునుడు, పది భల్లాలతో ఆ పదిమంది కుమారుల శిరస్సులను త్రుంచాడు. ఆ విధంగా భీమార్జునుల విజృంభణంతో భయభ్రాంతమైన నీ సైన్యం యుద్ధానికి విముఖమయింది. ఆ కర్ణుడు కూడా భయపడి, మొగం వెలవెలపోగా ఊరకున్నాడు. అప్పుడు శల్యుడు అతడిని చూచి ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. 'ఉగ్రుఁడై దుస్ససేనుని యురము వ్రచ్చి । రుధిర ముగ్రతఁ ద్రావు మరుత్తనూజుఁ
జూచి చేడ్పడి చెయ్వేదెఁ జూచితే సు । యోధనుని? నీవు నట్లైన నొప్పు నెట్లు? 229

ప్రతిపదార్థం: ఉగ్రుఁడు+ఐ= కోపోద్దీపితుడై; దుస్ససేనుని; ఉరము= ఎద; వ్రచ్చి= చీల్చి; రుధిరము= నెత్తురు; ఉగ్రతన్= క్రోధంతో; త్రావు= త్రాగే; మరుత్తనూజున్= భీముడిని; చూచి; చేడ్పడి= భయపడి; చెయ్వేదెన్= చేష్టలు ఉడిగాడు; సుయోధనునిన్; నీవుచూచితే?= నీవు చూచావా?; నీవున్= నీవు కూడా; అట్లు+అయినన్= అట్లే నిర్వీర్యుడవైతే; ఎట్లు; ఒప్పున్?= సరిపోతుంది?

తాత్పర్యం: తీవ్రకోపంతో దుస్ససేనుడి ఎద చీల్చి, ఆవేశంతో నెత్తురు త్రాగిన భీముడిని చూచి సుయోధనుడు భయకంపితుడై చేష్టలు దక్కి ఎట్లా నిలబడిపోయాడో చూచావా? నీవు కూడ అట్లే అయితే ఎట్లా?

క. 'బలియు రగు రాజులును గాల్ । నిలువక తెరలంగ, వీరె నీ ప్రాపున శ
త్రులఁ దాఁక దలంచి కృపా । దులు నిలిచిరి కూర్చికొను మతులధైర్యమునన్.' 230

ప్రతిపదార్థం: బలియురు+అగు= బలవంతులైన; రాజులును= రాజులుకూడా; కాల్ నిలువక= కాలూని నిలబడలేక; తెరలంగన్= వైదొలగిపోగా; వీరె= వీళ్ళే; నీ ప్రాపునన్= నీ రక్షణలో; కృపాదులు= కృపాచార్యుడు మొదలైనవారు; శత్రులన్+ తాఁకన్= విరోధులపై పడాలని; తలంచి= అనుకొని; నిలిచిరి= సిద్ధంగా నిలబడి ఉన్నారు; అతుల ధైర్యమునన్= సాటిలేని ధైర్యంతో; కూర్చికొనుము= వీరిని కూడగట్టుకొనుము.

తాత్పర్యం: 'బలవంతులైన రాజులు కాలూని నిలబడలేక పరుగెత్తిపోయారు. కృపుడు మొదలైనవారు నీ రక్షణలో శత్రువులపై దాడిచేయాలని నిలబడి ఉన్నారు. అకుంఠితమైన ధైర్యంతో వీరిని కూడగట్టుకొని యుద్ధానికి పూనుకొమ్ము.'

చ. 'కడు వెగడంది యున్న నినుఁ గన్గొని వీఁడె యుదారధైర్య మే
ర్పడ వృషసేనుఁ డొక్కరుఁడుఁ బాండుతనూజుల మార్కొనంగఁ బో
యెడు; నరు నీవు దాఁక వలదే? రణభారము నీభుజంబునం
దిడియె సమస్తముం గురునరేంద్రుఁడు; దానిఁ దలంపు మిత్తఱిన్.' 231

ప్రతిపదార్థం: కడున్= మిక్కిలి వెగడు= కలవరపాటు; అంది ఉన్న= పొంది ఉన్న; నినున్+కన్గొని; వీఁడె= వీడు; వృషసేనుఁడు; ఒక్కరుఁడున్= ఒక్కడే; ఉదార= గొప్పదగు; ధైర్యము; ఏర్పడన్= రూపొందగా; పాండు తనూజులన్= పాండురాజు పుత్రులను; మార్కొనంగన్= ఎదిరించేదానికి; పోయెడున్= పోతున్నాడు; నరున్= అర్జునుడిని; నీవు; తాఁకఁవలదే?= పైబడి యుద్ధం చేయాలిగదా?; కురునరేంద్రుఁడు= దుర్యోధనుడు; రణభారము= యుద్ధభారాన్ని; సమస్తమున్= పూర్తిగా; నీ భుజంబునందున్= నీ భుజాలమీద; ఇడియెన్= ఉంచాడు; దానిన్= ఆ విషయాన్ని; ఈ+తఱిన్= ఈ అదనున; తలంపుము= తలచుకొనుము.'

తాత్పర్యం: 'మిక్కిలి వికలమనస్కుడవై ఉన్న నిన్ను చూచి, (నీ కుమారుడు) వృషసేనుడు ఒంటరిగా నిరాఘాటమైన సాహసంతో పాండవులను ఎదిరించేందుకు బయలుదేరి పోతున్నాడు. నీవు అర్జునుడిని ఎదుర్కోవద్దా? కురురాజు యుద్ధభారాన్ని నీ భుజాలపై మోపి ఉన్నాడు. ఆ విషయాన్ని నీవు ఈ సమయంలో తలచుకొనుము.'

వ. అనిన విని, యతండు సమరోన్ముఖుం డయ్యె; వృషసేనుండు భీమసేనుపై నురవణింప నకులుం డడ్డపడి, యక్కుమారుని సిడంబును గొడుగును గోదండంబును ఖండించిన. 232

ప్రతిపదార్థం: అనినన్, విని= అని (శల్యుడు) అనగా; అతండు= కర్ణుడు; సమర+ఉన్ముఖుండు+అయ్యెన్= యుద్ధానికి సిద్ధమైనాడు; వృషసేనుండు; భీమసేనుపైన్; ఉరవణింపన్= ఎదుర్కొనపోగా; నకులుండు; అడ్డపడి; ఆ+కుమారుని= ఆ రాధేయుడి పుత్రుడియొక్క; సిడంబు= ధ్వజాన్ని; గొడుగును; కోదండంబును; ఖండించినన్= తునుకలు చేయగా.

తాత్పర్యం: అనగా విని, కర్ణుడు యుద్ధానికి సుముఖుడయ్యాడు. వృషసేనుడు భీముడిమీదికి లంఘించాడు. నకులుడు అడ్డుపడి, అతడి ధ్వజాన్నీ, గొడుగునూ, విల్లునూ త్రుంచివేయగా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **అలిగి యతండు వేఱొక శరాసన మెత్తి, రథమ్ము ఘోటక**
మ్ముల నిలఁ గూల నేయఁ, బొలివోవని ధైర్యము పేర్మి వాలునుం
బలకయుఁ గొంచు, మాద్రితొలుపట్టి ధరిత్రికి దాఁటి బెట్టు గో
ల్తలఁ జని తత్సహాయభట దారుణకేలి యొనర్చి పేర్చినన్. **233**

ప్రతిపదార్థం: అతండు= వృషసేనుడు; అలిగి= కోపగించుకొని; వేఱొక= ఇంకొక; శరాసనము= విల్లు; ఎత్తి= చేపట్టి; రథమ్ము= రథాన్ని; ఘోటకమ్ములన్= గుర్రాలను; ఇలన్+కూలన్= భూమిపై పడేటట్లు; ఏయన్= ప్రయోగించగా; పొలివోవని= వెలితిపడని; ధైర్యము పేర్మిన్= సాహసాతిశయంతో; వాలునున్= ఖడ్గాన్ని; పలకయున్= డాలు; కొంచున్= చేబూని; మాద్రి తొలుపట్టి= మాద్రి తొలికొడుకు-నకులుడు; ధరిత్రికిన్= భూమిపైకి; దాఁటి= ఎగిరి దూకి; బెట్టు= గట్టిగా; కోల్తలన్= ఎదుట నిలిచి యుద్ధం చేయటానికి; చని= వెళ్ళి; తత్సహాయభట= ఆయనకు సహాయంగా ఉన్న సైనికులతో; దారుణకేళి= క్రూరమైన యుద్ధవిహారం; ఒనర్చి= చేసి; పేర్చినన్= అతిశయించగా.

తాత్పర్యం: కర్ణపుత్రుడు వృషసేనుడు కోపోద్దీపితుడై వేరే ధనుస్సును తీసికొని, నకులుడి తేరును అశ్వాలను నేలపాలు చేశాడు. దీనితో నకులుడు శౌర్యం పెచ్చు పెరగగా, కత్తిని, డాలును తీసికొని నేలకు దూకి, గట్టిగా ఎదుట నిలిచి యుద్ధం చేయటానికి వెళ్ళి, వృషసేనుడికి సహాయంగా ఉన్న సైనికులను హింసించి ఉప్పొంగగా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. **కర్ణసుతుఁడు పలక ఖండించి, కృష్ణ స । ర్పంబుఁ బోని పటు కృపాణ ముఱక**
నఱికి, నారసములు నాటించె నయ్యర్జు । నానుజన్ముమేన నల్ల నగుచు. **234**

ప్రతిపదార్థం: కర్ణసుతుఁడు= వృషసేనుడు; పలక= పలకను; ఖండించి; కృష్ణ సర్పంబున్+పోని= నల్లత్రాచువంటి; పటు= దిట్టమైన; కృపాణము= ఖడ్గమును; ఉఱక= అవలీలగా; నఱికి; నారసములు= బాణాలు; ఆ+అర్జున= ఆ అర్జునుడి; అనుజన్ము మేనన్= తోబుట్టినవాడి దేహమును; అల్ల నగుచున్= మెల్లగా నవ్వుతూ; నాటించెన్= గుచ్చుకొనేటట్లు చేశాడు.

తాత్పర్యం: వృషసేనుడు నకులుని ఖేటకాన్ని తునకలుచేసి, నల్లత్రాచువంటి ఆయన ఖడ్గాన్ని సులభంగా ఖండించి, నవ్వుతూ, బాణాలను ఆయన శరీరమంతా నాటాడు.

వ. **అప్పుడు ధృష్టద్యుమ్నుండు యుధామన్యుండును నుత్తమౌజుండును శిఖండియు జనమేజయుండును సాత్యకియు ద్రౌపదేయులును రౌద్రంబు శోభిల్ల రుద్రుల కైవడి వృషసేనుపయిం గవిసినఁ గృతవర్మ కృప ద్రోణి దుర్యోధనులును శకునియుఁ దత్సోదరులు గొందఱును గ్రందం దఱిమి, దుర్వార విశిఖ వర్షంబుల వారలం గప్పినం గని, గజ సాధను లగు కుళిందు లురవణించి.** **235**

ప్రతిపదార్థం: అప్పుడు; ధృష్టద్యుమ్నుండు; యుధామన్యుండును; ఉత్తమౌజుండును; శిఖండియు; జనమేజయుండును; సాత్యకియును; ద్రౌపదేయులును; రౌద్రంబు శోభిల్లన్= రౌద్రం ప్రకాశించగా; రుద్రులకైవడిన్= భీకరాకారుడైన శివుడి రూపం వంటి రూపం దాల్చినవారై; వృషసేనుపయిన్; కవిసినన్= పైబడగా; కృతవర్మ; కృప; ద్రౌణి= అశ్వత్థామ; దుర్యోధనులును; శకునియున్; తద్ సోదరులు కొందఱును= ఆతనియొక్క తమ్ములలో కొందరు; క్రందన్= ఏడుస్తూ పోయేటట్లు; తఱిమి= తరిమికొట్టి; దుర్వార= అడ్డగింప వీలుకాని; విశిఖ వర్షంబులన్= బాణాల వానలతో; వారలన్; కప్పినన్= క్రమ్మివేయగా; కని= చూచి; గజ సాధనులు+అగు= గజసైన్యాన్ని ఉపయోగించుటలో ఆరితేరిన; కుళిందులు; ఉరవణించి= పరాక్రమించి.

తాత్పర్యం: అప్పుడు ధృష్టద్యుమ్నుడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, శిఖండి, జనమేజయుడు, సాత్యకి, ఉపపాండవులు కోపోద్రేకంతో రుద్రులవలె వృషసేనుడితో డీకొన్నారు. కృతవర్మ, కృపుడు, అశ్వత్థామ, దుర్యోధనుడు, శకుని, అతడి సోదరులు కొందరు వాళ్ళను బాధపడేటట్లు తరిమికొట్టి, ఆపరాని బాణవర్షంతో వారిని కప్పారు. అది చూచి గజసేనా పతులైన కుళిందులు పరాక్రమించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కృతవర్మ సిక్కువడ, భూ। పతి సేడ్పడ, శకుని వెగడుపడఁ దదవరజ
ద్వితయము ధరఁ బడఁ, దీవ్రో। ద్ధతిఁ బోరిరి చాప టంకృతంబులు సెలఁగన్. 236

ప్రతిపదార్థం: కృతవర్మ; చిక్కువడన్= కలతచెందగా; భూపతి= రాజు (దుర్యోధనుడు); చేడ్పడ= బాధపొందగా; శకుని; వెగడుపడన్= బెదరగా; తద్= ఆతనియొక్క; అవరజ= తమ్ముల; ద్వితయము= జంట; ధరన్+పడన్= నేలపై కూలగా; తీవ్ర ఉద్ధతిన్= తీంద్రించిన శౌర్యంతో; చాప టంకృతంబులు= అల్లెత్రాళ్ళ మ్రోతలు; చెలఁగన్= ధ్వనించగా; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: కృతవర్మ చిక్కువడేటట్లు, దుర్యోధనుడు బాధపడేటట్లు, శకుని బెదిరిపోయేటట్లు, అతని తమ్ములిద్దరు నేల కూలేటట్లు మహాపరాక్రమంతో అల్లెత్రాళ్ళ ధ్వనులు చెలరేగగా యుద్ధం చేశారు.

వ. ఇ తెఱంగునం బోరినం గనలి కడంగి, 237

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; పోరినన్= యుద్ధం చేయగా; కనలి= కోపగించుకొని; కడంగి= పూనుకొని.

తాత్పర్యం: ఈ విధంగా యుద్ధం చేయగా కోపించి పూనుకొని.

విశేషం: ఉ.వి.సంశోధిత ప్రతిలో కర్ణుడు అనే పదం ఉంది. వావిళ్ల ప్రతిలో అది లేదు. కాబట్టి ఈ సందర్భంలో వావిళ్ల ప్రతిలోని పాఠం సముచితమనిపిస్తుంది.

క. ఆ ముప్వురుఁ జలమున ను। ద్దామ ద్విప సహిత చిత్ర దళనంబున సం
గ్రామ తలము రక్తాక్తం। బై మెఱయ బలాధిపత్రయముఁ బొరిగొనినన్. 238

ప్రతిపదార్థం: ఆ ముప్వురున్; చలమునన్= మచ్చరముతో; ఉద్దామ= భయంకరమైన; ద్విప= (తొండముతో, నోటితో రెంటితో త్రాగే) ఏనుగుల; సహిత= కూడిన; చిత్రదళనంబునన్= వింతగొలిపే విధంగా ఖండించటంచేత; సంగ్రామతలము= యుద్ధభూమి; రక్త+అక్తంబై= నెత్తురుచేత వ్యాప్తమై; మెఱయన్= తళుకొత్తగా; (మిగిలిన) బలాధిపత్రయమున్= (రథ తురగ పదాతుల నాయక త్రయం) మూడు విభాగాల అధిపతులను; పొరిగొనినన్= నశింపజేయగా.

తాత్పర్యం: ఆ ముగ్గురూ పగ సాధించుకొనాలన్న అక్కసుతో బలవత్తరమై భయంపుట్టించే ఏనుగుల గుంపును చిత్రహింసచేసి తుదముట్టించారు. చచ్చిన ఏనుగుల నెత్తుటితో యుద్ధభూమి అంతా మెరిసినది. మిగిలిన మూడు విభాగాలూ తీవ్రమైన పోరుసల్పి నశించాయి.

క. తక్కటి రథిక జనులు పే । రుక్కున నయ్యిభచయంబు నొదిఁగించియునుం
జిక్కువఱిచియుం దునిమియు । నెక్కడు మద మొప్ప మెఱసి రిభపురనాథా! 239

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= ఓ హస్తినాపుర ప్రభూ!; తక్కటి= మిగిలిన, ఇతర; రథికజనులు= రథ సైనికులు; పేరు+ఉక్కునన్= అతిశయించిన బలంతో; ఆ+ఇభచయంబున్= ఆ ఏనుగుల సమూహమును; ఒదిఁగించియునున్= ప్రక్కకు తరిమికొట్టియు; చిక్కుపఱిచియున్= చిక్కులలో ఇరకబెట్టియు; తునిమియున్= నరికివేసియు; ఎక్కుడు; మదము+ఒప్పన్= కండకావరం రేగగా; మెఱిసిరి= ప్రకాశించారు.

తాత్పర్యం: (పైబడిన మూడు దళాలవారు పోగా) మిగిలిన రథసైనికులు అతిశయించిన బలంతో ఆ గజ సమూహాన్ని ప్రక్కకు తరిమి, ఇక్కట్లలో ఇరికించి, చేజిక్కిన వాటినంతా నరికి మదాతిరేకంతో ప్రకాశించారు.

వ. మెఱసినం జూచి. 240

తాత్పర్యం: ఆ విధంగా ప్రకాశించగా చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అరద మెక్కి తఱిమె ననిల తనూజుఁ డ । వ్వీరుతోన పాండవేయ సేనఁ
జేయఁ గలుగు దొరలు శితశరాసారంబు । లడర వారిమీఁద నడరుటయును. 241

ప్రతిపదార్థం: అనిల తనూజుఁడు= వాయుపుత్రుడు - భీముడు; అరదము+ఎక్కి= రథాన్ని ఎక్కి; తఱిమెన్= తరిమాడు; ఆ+వీరుతోన= ఆ వీరుడితో పాటే; పాండవేయసేనన్= పాండవసైన్యంలో; చేయన్+కలుగు దొరలు= కార్యనిర్వహణ దక్షులైన పాలకులు; శిత= పదునైన; శర+ఆసారంబులు= బాణవర్షములు; అడరన్= విజృంభించగా; వారిమీఁదన్; అడరుటయును= పైబడి విజృంభించగా.

తాత్పర్యం: భీముడు రథారూఢుడై వారందరిని తరిమికొట్టాడు. పాండవ సేనానాయకులు నేర్పుతో ఆయన వెంట నడిచారు. తోడ్తోడనే ఎదిరిపై అమ్ముల జడివాన కురిపించి పైకొన్నారు. ఆ తరువాత. (తరువాతి వచనంతో అన్వయం).

వ. రణంబు దారుణం బయ్యె; నందు. 242

తాత్పర్యం: పోరు ఘోరరూపం తాల్చింది. అందులో.

సీ. కర్ణుని యగ్రభాగంబునఁ గరిఘటల్ । దునుమాడు నకులనందనునిఁ గిట్టి,
వృషసేనుఁ డమ్ములవెల్లి పైఁ బరఁగించి । శితభల్లమున సూతుశిరము ద్రుంపఁ,
గనుఁగొని యక్కర్ణతనయుని మీఁదఁ బా । ర్థాదులు గవిసిన; నతఁడు పార్థు
ననిలజు మూఁడుమూఁ డమ్ముల నొప్పించి । యాశతానీకుని నట్ల చేసి,

తే. నకులు తనువున బాణసప్తకము సొనిపి. । శార్ఙ్గధరు మేనఁ బంద్రెండు సాయకములు
వఱపి పేర్చినఁ, గౌరవప్రతతి మెచ్చి, । పార్థువేఁడిమి యూహించి భయముఁ బొందె. 243

ప్రతిపదార్థం: కర్ణుని; అగ్ర భాగంబునన్= ముందుభాగంలో; కరిఘటల్= ఏనుగుల గుంపులను; తునుమాడు= నరికివేస్తున్న; నకులనందనునిన్= నకులుని కుమారుడిని; కిట్టి= సమీపించి; వృషసేనుఁడు; అమ్ములవెల్లి= బాణవర్షాన్ని; పైన్+పరఁగించి= కురిపించి; శిత భల్లమునన్= వాడి అయిన ఈటెతో; సూతుశిరము= సారథి తలను; త్రుంపన్= నరికివేయగా; కనుఁగొని= చూచి; ఆ+కర్ణ తనయునిమీఁదన్= ఆ కర్ణుడి కొడుకుపై; పార్థ+ఆదులు= అర్జునుడు మొదలైనవారు; కవిసినన్= పైకొనగా; అతఁడు= వృషసేనుడు; పార్థున్= అర్జునుడిని; అనిలజున్= భీముడిని; మూఁడు అమ్ములన్= మూడేసి బాణాలతో; నొప్పించి= బాధపెట్టి; ఆ శతానీకునిన్= ఆ శతానీకుడిని కూడా; అట్లు చేసి; నకులు= నకులుడి; తనువునన్= దేహంలో; బాణ సప్తకము= బాణాలు ఏడింటిని; చొనిపి= చొప్పించి; శార్ఙ్గధరు= కృష్ణుడి; మేనన్= దేహమున; పంద్రెండు; సాయకములు= బాణాలు; వఱపి= ప్రయోగించి; పేర్చినన్= అతిశయించగా; కౌరవప్రతతి= కౌరవసమూహం; మెచ్చి= కొనియాడి; పార్థు వేడిమి= అర్జునుడి కోపతాపమును; ఊహించి; భయమున్ పొందెన్.

తాత్పర్యం: వృషసేనుడు కర్ణుడి ముందుభాగంలో ఏనుగుల సమూహాలను తునియలుగా నరికివేస్తున్న నకులపుత్రుడి మీద అమ్ములవాన కురిపించి, రథసారథి తలను ఒక పదునైన బల్లెంతో త్రుంచివేశాడు. ఇది చూచి అర్జునుడు మొదలైనవారు కర్ణుడి కుమారుడిపై క్రమ్ముకొనగా అతడు పార్థుడిని, భీముడిని మూడేసి అమ్ములతో బాధపెట్టాడు. శతానీకుడికి, ఇదే గతి పట్టించాడు. నకులుడి దేహంలో ఏడు బాణాలను, కృష్ణుడి దేహాన పంద్రెండు బాణాలను నాటి బాధించాడు. దీనితో కౌరవసమూహాలు వృషసేనుడిని పొగడ్తలతో ముంచెత్తాయి. తోడనే వారు పార్థుడి కోపతాపాన్ని తలచుకొని భయభ్రాంతులయ్యారు.

చ. కెలఁకుల యోధులం గడచి, క్రీడి వడిన్ వృషసేనుమీఁద న
మ్ములు నిగిడింప; నా రథిక ముఖ్యుని మూఁపున నక్కుమారుఁ డే
పలరఁగ వాఁడి తూపులు రయంబు మెయిం బది బెట్టు గ్రుచ్చి, య
గ్గలిక ముకుందు నేసె నవకాండములన్ దివి ముట్ట నార్చుచున్. 244

ప్రతిపదార్థం: కెలఁకుల= ప్రక్కల ఉండే; యోధులన్= యుద్ధవీరులను; కడచి= దాటి; క్రీడి= అర్జునుడు; వడిన్= వేగంగా; వృషసేనుమీఁదన్; అమ్ములు; నిగిడింపన్= వ్యాపింపజేయగా; ఆ+కుమారుఁడు= ఆ వృషసేనుడు; ఏపు అలరఁగన్= అతిశయం శోభించగా; ఆ రథిక ముఖ్యుని= ఆ రథవీర శ్రేష్ఠుడి; (అర్జునుని) మూఁపునన్= భుజం మీద; వాఁడి తూపులు= వాడి అయిన బాణాలు; పది; రయంబు మెయిన్= వేగంగా; బెట్టు= గట్టిగా; క్రుచ్చి= చొప్పించి; ముకుందున్= శ్రీకృష్ణుని; అగ్గలికన్= ఆధిక్యంతో; దివిముట్టన్= ఆకాశం అంటేటట్లు; ఆర్చుచున్= కేకలు+పెట్టుతూ; నవకాండములన్= తొమ్మిది బాణాలను; ఏసెన్= కొట్టెను.

తాత్పర్యం: అర్జునుడు చుట్టుప్రక్కల ఉండే సైనికులను తప్పించుకొనిపోయి, వృషసేనుడిపై బాణప్రయోగం చేశాడు. ఆ యువకవీరుడు కాకలుతీరిన ఆ యోధుడి భుజాన పది బాణాలను గ్రుచ్చుకొనేటట్లు వేసి, ఆకాశం దద్దరిల్లేటట్లు కేకలు వేస్తూ మరల ముకుందుడిని తొమ్మిది బాణాలతో కొట్టాడు.

వ. ఇట్లు విజృంభించిన. 245

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా విజృంభించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

అర్జునుఁడు వృషసేనుని మృతిఁ బొందించుట (సం. 8-62-59)

మ. భ్రుకుటిస్ఫూర్జిత ఫాలభాగుఁ డగుచుం బొంగారి, యాసూతపా
త్రకు కోదండము బాహుదండములుఁ జిత్రస్ఫూర్తిఁ దున్మాడి, మ
స్తక ముగ్రోద్ధతిఁ గ్రూరభల్ల విలస ద్ధారాహతిం ద్రుంచె, బా
ణకళాదుర్దముఁ డన్నరుండు పతియు న్రాధేయుఁడుం జూడఁగన్. 246

ప్రతిపదార్థం: భ్రుకుటి స్ఫూర్జిత= కనుబొమలముడిచే వెలుగొందిన; ఫాలభాగుఁడు+అగుచున్= నొసలుగలవాడవుతూ; పొంగారి= పొంగి; బాణకళా= బాణప్రయోగ శిల్పమును; దుర్దముఁడు= చెనకరాని; ఆ+నరుండు= ఆ అర్జునుడు; ఆ సూత పౌత్రకు= సూతుని మనుమడైన వాని; కోదండము= ధనుస్సును; బాహుదండములున్= దుడ్డుకర్రవంటి చేతులను; చిత్రస్ఫూర్తిన్= వింత గొలిపే విన్యాసంతో; తున్మాడి= విరుగగొట్టి; క్రూరభల్ల= కరకుటమ్ముయొక్క; విలసత్= మెరిసే; ధారాహతిన్= పదునైన భాగపు దెబ్బతో; మస్తకము= తలను; ఉగ్రోద్ధతిన్= కోపపు పొంగుతో; పతియున్= రాజైన దుర్యోధనుడు; రాధేయుండున్= కర్ణుడు; చూడఁగన్= చూస్తుండగానే; త్రుంచెన్= ఖండించాడు.

తాత్పర్యం: ఆశ్చర్యకరమైన విధంగా బాణప్రయోగ విద్యయందు ఎదురులేనివాడైన ఆ ఫల్గునుడు, కనుబొమల ముడితో వీరత్వాన్ని చాటుతున్న నుదురుతో ప్రదీప్తుడై, ఆ సూతుడి మనుమడియొక్క ధనుస్సును, బలసిన భుజములను ఆశ్చర్యకరమైన విలాస వైఖరితో ముక్కలు చేశాడు. వెంటనే తళతళలాడే బాణంయొక్క పదునైన ప్రక్కభాగపు దెబ్బతో అతడి తలను కసిదీరా నరికివేశాడు. ఇదంతా ఊరక చూస్తూనే ఆ దుర్యోధనుడు, కర్ణుడు నిలబడిపోయారు.

వ. ఇ వ్విధంబున వృషసేను సమయించుటం జూచి, కర్ణుండు శోకవ్యాకులచిత్తుండై కన్నీ రొలుకం, గోపాటోపంబున నుద్భటుం డగుచు, నమ్మహారథుని తేరికి సమ్ముఖంబుగాఁ దనయరదంబు వఱపించి, 'యర్జున! యర్జున!' యని యాహ్వానంబు సేసిన; నతండును సవిశేషోత్సాహంబునం బొదలి యడరె; నట్టియెడ దురంబు దక్కి యిరువాఁగునుం బరమ కౌతుకంబునం గనుంగొనుచుండ నయ్యిరువురు రామసన్నిభంబులు నాదిత్య సంకాశంబులుఁ ద్రినయన ప్రతిమంబులు నగు నాకారంబుల నుల్లసిల్లిరి; వారల యెక్కటి కయ్యం బాలోకించు కుతూహలంబున సుర పితృ విద్యాధర సంయమి సంఘంబులును శచీపతి ప్రజాపతి పశుపతులును లోనుగా ననేక దివ్యు లేతెంచి నభోభాగంబున నిలిచి; రప్పుడు బ్రహ్మ రుద్రున కిట్లనియె. 247

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; వృషసేనున్; సమయించుటన్= చంపుటను; చూచి; కర్ణుండు; శోకవ్యాకులచిత్తుండు+ఐ= దుఃఖంతో కలతచెందిన మనస్సుకలవాడై; కన్నీరు+ఒలుకన్= కన్నీరు కారుతుండగా; కోపాటోపంబునన్= కోపాధిక్యంతో; ఉద్భటుండు= శౌర్యోద్దీపితుడు; అగుచున్; ఆ+మహారథుని= ఆ రథికశ్రేష్ఠుడైన అర్జునుని; తేరికిన్; సమ్ముఖంబుగాన్= ఎదురుగా; తన అరదంబు; వఱపించి= తోలించి; 'అర్జున! అర్జున!' అని; ఆహ్వానంబు చేసినన్= పిలువగా; అతండును= ఆయనయు; సవిశేష= ప్రత్యేకమైన; ఉత్సాహంబునన్= కుతూహలంతో; పొదలి= ఒప్పారి; అడరెన్= శోభిల్లాడు; అట్టి ఎడన్=

అప్పుడు; దురంబు= యుద్ధం; తక్కి= మాని; ఇరువాఁగునున్= ఉభయపక్షాలవారును; పరమ కౌతుకమునన్= అత్యంతమైన అభిలాషతో; కనుంగొనుచుండన్= చూస్తూండగా; ఆ+ఇరువురు= ఆ కర్ణార్జునులు ఇద్దరు; రామసన్నిభులు= రామునితో సమానులుగా; ఆదిత్య సంకాశంబులు= సూర్యుడివంటివారుగా; త్రినయన= శివుడి; ప్రతిమంబులుగన్= పోలినవారుగా; అగు; ఆకారంబులన్= స్వరూపాలతో; ఉల్లసిల్లిరి= కనుపించారు; వారల; ఎక్కటికయ్యము= ద్వంద్వయుద్ధం; ఆలోకించు= చూచే; కుతూహలంబునన్= అపేక్షతో; సుర; పితృ; విద్యాధర; సంయమి= దేవతల, పితృదేవతల, విద్యాధరుల, మునుల; సంఘంబులును= సమూహాలున్ను; శచీపతి= ఇంద్రుడును; ప్రజాపతి= బ్రహ్మ; పశుపతులున్ను= శివుడును; లోనుగాన్= మొదలైన; అనేక దివ్యులు= చాలామంది దేవతలు; ఏతెంచి= విచ్చేసి; నభోభాగంబునన్= ఆకాశతలాన; నిలిచిరి; అప్పుడు; బ్రహ్మ; రుద్రునకున్= శివుడితో; ఇట్లు+అనియెన్. (ఈ యుద్ధానికి అలౌకిక శోభను చేకూర్చడానికి బ్రహ్మ రుద్రాదులచేత యుద్ధవర్ణన చేయిస్తాడు కవి.)

తాత్పర్యం: ఈ విధంగా వృషసేనుడిని చంపటం చూచి, కర్ణుడు దుఃఖంతో వ్యాకులత చెంది కన్నీరు కార్చాడు. కోపాటోపాన్ని చెందాడు. అర్జునుడి రథానికి ఎదురుగా తన రథాన్ని నడిపి 'అర్జునా! అర్జునా!' అని ఆహ్వానించాడు. అతడు కూడా అధికోత్సాహంతో కర్ణుడివైపు ఎదురు నడిచాడు. రెండు వైపుల సైన్యాలూ యుద్ధం మాని, వారిని చూస్తూ నిలబడ్డాయి. రాములవలె, సూర్యులవలె, రుద్రులవలె ఉన్న వారి ఆకారాలను చూచి ఉత్సాహపడ్డారు. వారి ద్వంద్వయుద్ధం చూద్దామని ఆకాశంలో దేవతలు, పితృదేవతలు, విద్యాధరులు, ఋషిసమూహాలు, ఇంద్రుడు, బ్రహ్మ, శివుడు మొదలైన పెక్కుమంది దివ్యులు నిలిచి ఉన్నారు. అప్పుడు బ్రహ్మ రుద్రుడితో ఇట్లా అన్నాడు.

కర్ణార్జునుల ద్వంద్వ యుద్ధకాలమున బ్రహ్మరుద్రేంద్రుల ప్రశ్నోత్తరములు (సం. 8-63-46)

క. 'ఇరువురు నతిరథులు సమ । స్ఫురణులు విక్రాంతిపరులు శూరులు వీ రొం
డొరువులతోఁ బెనఁగఁగ న । శ్వర మగు జగ; ముడుపరాదె సమరం బనఘా!' 248

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; ఇరువురున్= ఇద్దరూ; అతిరథులు= పెక్కుమంది రథికులతో పోరాడే యోధులు; సమస్ఫురణులు= సమఉజ్జీలు; విక్రాంతిపరులు= పరాక్రమం చూపటంలో దిట్టలు; శూరులు; వీరు; ఒండొరువులతోన్= ఒకరితో ఒకరు; పెనఁగఁగన్= పోరాడితే; జగము; నశ్వరము+అగున్= నశించిపోగలదు; సమరంబు= యుద్ధాన్ని; ఉడుపన్‌రాదె?= మాన్పించకూడదా?

తాత్పర్యం: పెక్కుమంది ధనుష్మంతులైన యోధులకు నాయకత్వం వహించగలిగిన నాయకులు, సమఉజ్జీలు, శౌర్యంతో విక్రమించగలిగినవారు, ధైర్యసాహసోపేతులు - ఇట్టి మొనగాండ్రు ఒకరినొకరు ఎదుర్కొని యుద్ధం చేయటంవలన జగత్తు నాశనమై పోగలదు. అందుచేత ఈ కయ్యాన్ని మాన్పించరాదా?' అని బ్రహ్మ శివుడితో అన్నాడు.

క. అన విని యా దేవుం డ । వ్వనజభవున కిట్టు లను: 'నవార్యోద్ధతు లీ
ఘనభుజులు వీరి రణ మె । ట్లును జెల్లుం, దప్పు; దప్పులుకు విడు మింకన్.' 249

ప్రతిపదార్థం: అనన్, విని= అని చెప్పగా ఆలకించి; ఆ దేవుండు= ఆ రుద్రుడు; ఆ+వనజభవునకున్= బ్రహ్మకు; ఇట్టులు+ అనున్; ఈ ఘనభుజులు= ఈ గొప్ప దోశ్శక్తిగలవారు; అవార్య= అడ్డగించటానికి అలవిగాని; ఉద్ధతులు= ప్రకోపించిన

పరాక్రమవంతులు; (కావున); వీరి; రణము; ఎట్లును= ఏవిధంగానైనా; చెల్లును= జరుగుతుంది; తప్పదు; ఆ+పలుకు; ఇంకన్= ఇక మీద; విడుము= వదలుము.

తాత్పర్యం: రుద్రుడు ఆయన చెప్పింది విని బ్రహ్మదేవుడితో ఇట్లంటున్నాడు - వీరిద్దరు వారింప శక్యంకాని గర్వం కలవారు, భుజబల సంపన్నులు. వీరి యుద్ధం తప్పదు. కాబట్టి నివారించటమనే మాట మానుకొమ్ము.

వ. అని యి ట్లమ్మహాత్ములు సల్లాపంబులు సేయ, నాకర్ణించి పాకశాసనుండు సప్రణయంబుగా బ్రహ్మ కిట్లనియె. 250

ప్రతిపదార్థం: అని ఇట్లు; ఆ+మహాత్ములు; సల్లాపంబు= పరస్పర సంభాషణం; చేయన్= చేయగా; ఆకర్ణించి= విని; పాకశాసనుండు= ఇంద్రుడు; సప్రణయంబుగాన్= ప్రేమపూర్వకంగా; బ్రహ్మకు; ఇట్లనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ఆ మహాత్ములు మాట్లాడుకొనగా విని, ఇంద్రుడు వినయంగా బ్రహ్మతో ఇట్లా అన్నాడు.

చ. 'తపము నుదాత్తశౌర్యము నుదగ్రబలంబును గల్గు క్రీడి క
య్యపు వెర వెక్కుడై, గెలుచునట్లుగ నీవు దలంపవే? పురా
ణ పురుషు లైన కృష్ణుల రణంబున శాత్రవు లాక్రమించుటం
గుపిత మనస్కు లైన నిలకున్ బ్రదు కెమ్మెయిఁ గల్గ నేర్చునే?' 251

ప్రతిపదార్థం: తపము= తపస్సుచేసి ఆర్జించుకొన్న బలం (ఆ తపము ఫలితమే పాశుపతాస్త్ర లాభం); ఉదాత్తశౌర్యము= గొప్ప పరాక్రమం; ఉదగ్రబలంబునున్= భయావహమైన శక్తి; కల్గు= కలిగిన; క్రీడికిన్; కయ్యపు వెరవు= యుద్ధనైపుణ్యం; ఎక్కుడై= అతిశయమై; గెలుచునట్లుగన్= విజయంపొందేటట్లుగ; నీవు; తలంపవే= సంకల్పించుము; పురాణపురుషులు+ఐన= విష్ణువు అంశలో జన్మించినవారైన; కృష్ణులన్= నరనారాయణులైన కృష్ణులను (కృష్ణార్జునులను); రణంబునన్; శాత్రవులు= శత్రువులు; ఆక్రమించుటన్= లోబరుచుకొనటంచేత; కుపిత మనస్కులైనన్= కోపగించిన మనస్సు కలవారైతే; ఇలకున్= ఈ భూమికి; బ్రదుకు= మనగలగటం; ఏ+మెయిన్= ఏ విధంగా; కల్గన్ నేర్చునే?= సంభవించగలదు? (సాధ్యం కాదని భావం).

తాత్పర్యం: తపోబలం, కీర్తిప్రదమైన సాహసం, శత్రువులను భయకంపితులను జేసే శరీరశక్తి కలిగిన క్రీడికి యుద్ధనైపుణ్యం ఎక్కువై గెలుస్తాడని నీవు సంకల్పించు. నరనారాయణావతారులైన కృష్ణులను (కృష్ణార్జునులను) శత్రువులు కప్పివేస్తే వారు కోపోద్రిక్తులైతే ఈ లోకాలు మనగలుగుతాయా?

వ. 'నరనారాయణులకు నెందును జయంబు ధ్రువం బని తొల్లియుం జెప్పితి; రిమ్మహాత్ములు జయించుట లోకహితంబు; గర్ణుండు ద్రోణ భీష్మ ప్రాప్తంబైన పుణ్యలోకంబు వడయుఁ; గిరీటి చిరకాల బిడుమలం బడినవాఁడు గావున రాజ్య సుఖంబు లనుభవించుం గాక' యనిన నప్పరమేష్ఠి 'వీరల జయాపజయంబులు నిశ్చయించి పలుకనేల?' యనుటయు, నీశానుం డతని నాలోకించి 'నిశ్చయించుట మేల కాక యెగ్గేమి? నిశ్చయింత' మని కలిపికొని యతండునుం దానును వాసవు వలను విలోకించి కృష్ణార్జునుల నుద్దేశించి. 252

ప్రతిపదార్థం: నరనారాయణులకున్; ఎందును= ఎక్కడైనా; జయంబు; ధ్రువంబు+అని= నిశ్చయమని; తొల్లియున్= మునుపుకూడా; చెప్పితిరి; ఈ+మహాత్ములు; జయించుట; లోకహితంబు= ప్రపంచానికి క్షేమకరం; కర్ణుండు; ద్రోణభీష్మ=

ద్రోణ, భీష్ములకు; ప్రాప్తంబు+ఐన= లభించిన; పుణ్యలోకంబు; పడయున్= పొందుతాడు; కిరీటి; చిరకాలంబు; ఇడుమలన్= కష్టాలు; పడినవాఁడు= అనుభవించినవాడు; కావునన్; రాజ్యసుఖంబులు= రాజ్యాధికారసౌఖ్యాలు; అనుభవించున్ గాక; అనినన్; ఆ+పరమేష్ఠి= ఆ బ్రహ్మ; వీరల; జయాపజయంబులు= గెలుపు ఓటములను; నిశ్చయించి= ముందే నిర్ణయించి; పలుకన్+ఏల?= అనటం ఎందుకు?; అనుటయున్; ఈశానుండు= ఐశ్వర్యం కలవాడు - శివుడు; అతనిన్= బ్రహ్మను; ఆలోకించి; నిశ్చయించుట= స్థిరపరచుట; మేలు+అ కాక= మేలే కాని; ఎగ్గు+ఏమి= కీడు ఎట్లవుతుంది?; (కాబట్టి) నిశ్చయింతము+అని= తీర్మానించి చెపుదామని, కలిపికొని; అతండునున్= రుద్రుండును; తానును బ్రహ్మ; వాసవువలను= ఇంద్రుడివైపు; విలోకించి= చూచి; కృష్ణార్జునులను; ఉద్దేశించి. (పలుకుతున్నారు).

తాత్పర్యం: 'కృష్ణార్జునులకు విజయం తప్పదని పూర్వం కూడా మీరన్నారు. వీరు జయించటం లోకానికి మేలు. కర్ణుడు, ద్రోణ భీష్ములు పొందిన పుణ్యలోకాలు పొందుతాడు. అర్జునుడు చాలాకాలం కష్టాలు పడ్డాడు. కాబట్టి రాజ్యసుఖం అనుభవిస్తాడు గాక!' - అని అన్నాడు. అనగా, బ్రహ్మ వీరి జయాపజయాలను గురించి ముందే నిశ్చయించి పలకటమెందుకు?' - అన్నాడు. శివు డాతడిని చూచి 'ఇట్లా నిశ్చయించటం మేలే; ఇందులో ఎగ్గేముంది? నిశ్చయిద్దాం' అని వారిని కలుపుకొని, కృష్ణార్జునుల నుద్దేశించి ఇంద్రుడితో ఇట్లా అన్నాడు.

తే. **'మహితమును లగు వీ రెందు మాఱు లేక । మెలఁగువా రయి కాదె! జన్మించినారు?**
వినుము! నీ చెప్పినట్టుల వీరి నొరు ల । ధఃకరించుట లోకహితంబు గాదు.' **253**

ప్రతిపదార్థం: మహిత, మునులు+అగు= మహిమాతిశయులైన మునులైన; వీరు (మహిత-మునులు= ఋషులు); ఎందున్= ఏ విషయంలోగూడ; మాఱులేక= వీరికి బదులు వేరేవారులేక; మెలఁగువారు+అయి= అన్యోన్య మైత్రితో ప్రవర్తించేవారై; కాదె!= కదా!; జన్మించినారు?; వినుము; నీ చెప్పినట్టుల; వీరిన్; ఒరులు= ఇతరులు; అధఃకరించుట= క్రిందుచేయుట; లోకహితంబు కాదు= లోకానికి శ్రేయస్కరం కాదు.

తాత్పర్యం: మహామునులగు ఈ ఇద్దరూ ఎక్కడా సాటిలేని వారై కదా జన్మించారు. ఇక నీ వన్నట్లు ఇతరులు వీరిని జయించి తక్కువ చేయటం లోకానికి మేలు కాదు.

వ. **'వీరికి జయంబు ధ్రువం'బని పలికి, యంత నిలువక 'వీరి జయంబు ధ్రువంబయ్యెడు' మనవుడు, నయ్యమర విభుండు సుర ముని ప్రభృతులం గలయం గనుంగొని, 'దేవదేవు లిరువురు నేకమతంబుగా నిశ్చయించిన లోకహితం బగు నానతి యాకర్ణించితిరే! మీ చిత్తంబు లిత్తెఱంగున కనుకూలంబులు గావలయు' ననిన, నందఱు 'నది యిట్టిద కాక యొం డగునే?' యని; రనిమిషులు గుసుమ వర్షంబులు గురియించుచు దివ్య దుందుభి ధ్వానంబులు సెలంగించి; రయ్యవసరంబున నఖిల భూతంబులును విస్మయోత్ఫుల్ల నయనంబులగుచు నమ్మహా ద్వంద్వ యుద్ధంబు వీక్షించు వేడుక నొండు దలంపులు దక్కియుండె; నట్లు దార్కొనిన మహనీయ రథంబులు రెంటియందును సన్నాహసముజ్జ్వలులై యొప్పు వాసుదేవార్జునులును గర్ణశల్యులును దమ తమ శంఖంబు లొత్తి; రప్పుడు.** **254**

ప్రతిపదార్థం: వీరికిన్; జయంబు; ధ్రువంబు= నిశ్చయం; అని పలికి; అంతన్ నిలువక= అంతటితో ఆగక; వీరి జయంబు ధ్రువంబయ్యెడున్; అనవుడున్= అని అనగా; ఆ+అమర విభుండు= ఆ దేవతాప్రభువు-ఇంద్రుడు; సుర-ముని ప్రభృతులన్= దేవతలు, ఋషులు మున్నగువారిని; కలయన్+కనుంగొని= అందరిని బాగా చూచి; దేవదేవులు+ఇరువురు= దేవాధిదేవులైన

బ్రహ్మ శివు లిద్దరు; ఏకమతంబుగాన్= ఒకే అభిప్రాయంగా; నిశ్చయించిన= నిర్ణయించిన; లోకహితంబు+అగు= ప్రపంచానికి శ్రేయస్కరమైన; ఆనతి= ఆజ్ఞ; అకర్ణించితిరే!= విన్నారు కదా!; మీ చిత్తంబులు= మీ మనస్సులు; ఈ+తెఱంగునకున్= ఈ విధానికి; అనుకూలంబులు; కావలయున్; అనిన; అందఱున్; అది; ఇట్టిది+కాక= అదే విధమైనది కాకుండా; ఒండు+అగునే?= వేరొకవిధంగా జరుగుతుందా? (జరుగదనుట); అనిరి; అనిమిషులు= రెప్పపాటు లేనివారు- దేవతలు; పుష్పవర్షంబులు= పూలవాన; కురియించుచున్; దివ్య= దేవతలకు సంబంధించిన; దుందుభి= భేరి; ధ్వానంబులు= శబ్దాలను; చెలంగించిరి= రేగేటట్లు చేశారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; అఖిల; భూతంబులును= ప్రాణికోటి; విస్మయ= ఆశ్చర్యంవలన; ఉత్ఫుల్ల= బాగా వికసించిన; నయనంబులు+అగుచున్= కన్నులు కలవై; ఆ+మహాద్వంద్వయుద్ధంబును; వీక్షించు వేడుకన్= చూడాలన్న అభిలాషతో; ఒండు= ఇతర; తలంపులు= యోచనలు; తక్కి ఉండెన్= విడనాడి ఉన్నారు; అట్లు; తార్కొనిన= ఎదుర్కొనిన; మహనీయ= మహిమోపేతమైన; రథంబులు; రెంటియందును= రెండింటిలో; సన్నాహ సముజ్జ్వలులు+ఐ= ప్రయత్నంతో (పూనికతో) ప్రకాశమానులై; ఒప్పు= శోభిల్లు; వాసుదేవ-అర్జునులును= కృష్ణార్జునులును; కర్ణశల్యులును; తమ తమ; శంఖంబులు; ఒత్తిరి= పూరించారు; అప్పుడు.

తాత్పర్యం: 'వీరికి జయం తప్పదు' అని అంతతో ఆగక 'వీరి జయం నిశ్చితమౌతుంది' అన్నాడు శివుడు. అప్పుడు ఇంద్రుడు సురముని సమూహాలను చూచి, 'దేవదేవులిద్దరూ కలిసి ఏకవాక్యంగా నిశ్చయించిన లోకహితాన్ని మీరు విన్నారు కదా! మీ సంకల్పాలు కూడా దాని కనుకూలంగా సాగనివ్వండి' అనగా అందరూ' అది అట్లాగే ఔతుంది. మరొకవిధంగా ఎట్లా ఔతుంది?' అన్నారు. దేవతలు పూలవానలు కురిపించారు. దివ్యదుందుభులు మ్రోగించారు; అప్పుడు అన్ని భూతాలు ఆశ్చర్యంతో వికసించిన నేత్రాలతో వారి ద్వంద్వయుద్ధం చూడాలన్న కోరికతో ఏకాగ్రచిత్తంతో ఉన్నాయి. సర్వసన్నాహాలతో రథారూఢులై ఉన్న కృష్ణార్జునులు, శల్యకర్ణులు శంఖాలు పూరించారు.

తే. **రెండు సేనల శంఖభేరీ ముఖంబు । లైన బహుతూర్యముల పటుధ్వాన మడరి**
నింగి పొంగారె; నత్యంత నిశ్చలంబు । లయ్యె సైనిక నికరంబు లద్భుతముగ. **255**

ప్రతిపదార్థం: రెండుసేనల; శంఖ+భేరి ముఖంబులైన= శంఖాలు, భేరులు మొదలైన; బహు= అనేకములైన; తూర్యముల= వాద్యముల; పటు= బెట్టిదమైన; ధ్వానము= శబ్దం; అడరి= రేగి; నింగి= ఆకాశం; పొంగారెన్= ఉబికింది; సైనిక నికరంబులు= సైనిక సమూహాలు; అద్భుతముగాన్= ఆశ్చర్యజనకంగా; అత్యంత= మిక్కిలి; నిశ్చలంబులు+అయ్యెన్= కదలక, మెదలక, నిలిచిపోయాయి.

తాత్పర్యం: ఉభయసేనలు చేసిన నిష్ఠురమైన నానావిధ వాద్య ఘోషలతో ఆకాశం నిండిపోయింది. సేనాసమూహాలు నిశ్చేష్టితాలై నిలిచి ఆశ్చర్యం కలిగించాయి.

సీ. **కపి కేతనము హస్తికక్ష్యయు నమ్మహా । బలు లిద్దఱును దపోబలము వలనఁ**
గన్నవియై, బుద్ధిగల్గి శోభిల్లు ను । ర్వీశ! యప్పుడు కపి యెరఁగి హస్తి
కక్ష్యపై నడరినఁ గయ్య మారెంటికిఁ । గలిగె; నం దా హస్తికక్ష్య దెరలె
నంబుజాక్షుండు మద్రాధినాథుండును । దృక్కలహంబునఁ దేజరిల్లి;

తే. **రర్జునుండును గర్ణుండుఁ దర్జనంబు । లైన చూడ్కు లొండొరువుల యాననములఁ**
బఱపి రా కృష్ణపార్థుల బలుపు, శల్య । కర్ణ చిత్తదౌర్బల్యముల్ గానవచ్చె. **256**

ప్రతిపదార్థం: ఉర్వీశ!= భూపాలకా!; ధృతరాష్ట్ర మహారాజా! కపికేతనము= హనుమంతుడి చిహ్నంతో కూడిన జెండా; హస్తికక్ష్యయున్= ఏనుగు నడుముకు కట్టిన పట్ట (కర్ణుడి); ఆ+మహాబలులు= వాయుదేవునంత బలశాలులరగు ఇద్దరు; తపోబలమువలనన్= కఠిన తపస్సు ఫలితంగా; కన్నవి+ఐ= సంపాదించినవి అయినందున; బుద్ధికల్గి= మానసిక వికాసం కలిగి; శోభిల్లున్= ప్రకాశిస్తున్నవి; అప్పుడు; కపి ఎరఁగి= కోతి ఎగిరి పైకి దూకి; హస్తికక్ష్యపై; అడరినన్= ఆధిక్యం చూపగా; కయ్యము= యుద్ధము; ఆ రెంటికి; కలిగెన్= సంభవించింది. (రెండూ కూడా తపశ్శక్తి చేత సంపాదించుకొనినవి కాబట్టి ప్రాణంలేని యుద్ధ చిహ్నాలైనప్పటికీ సజీవశక్తులవలె పోరాడుకొంటున్నవి అని సరిపెట్టుకోవలసి ఉన్నది); అందున్= ఆ పోరాటంలో; హస్తికక్ష్యయు; తెరలెన్= కలతనొందింది. అంబుజాక్షుండు= కమలనేత్రుడు - కృష్ణుడు; మద్ర+అధినాథుండు= మద్రదేశ పాలకుడైన శల్యుడు; దృక్ కలహంబునన్= చూపుల కలహంతో; తేజరిల్లిరి= ప్రకాశించారు; అర్జునుండును; కర్ణుండును; తర్జనంబులు+ ఐన= బెదిరించే; చూడ్కులు= చూపులు; ఒండొరువుల= పరస్పరం (ఒకరిముఖాన్ని ఇంకొకరు); ఆననములన్= ముఖాలపై; పఱపిరి= వ్యాపింపజేసికొనిరి; ఆ కృష్ణ పార్థుల= కృష్ణార్జునుల; బలుపు= బలం; శల్యకర్ణ= శల్యకర్ణులయొక్క; చిత్త దౌర్బల్యముల్= మానసిక బలహీనతలు; కానవచ్చెన్= కన్పించాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుడి కపిధ్వజం, కర్ణుడి ఏనుగు కక్ష్య మహా బలశాలులైన ఆ ఇద్దరు (అర్జునుడు, కర్ణుడు) తపోబలంతో పొందినవైనందువలన అచేతనాలైకూడ చేతనాలై బుద్ధిబలంతో ప్రకాశిస్తున్నవి. అప్పుడు కపి ఎగిరి కక్ష్యపై విజృంభించగానే ఆ రెండింటికి పోరాటం ప్రారంభమైనది. ఆ పోరాటంలో కక్ష్య కలత పొందింది. కృష్ణ శల్యులు చూపుల కలహంతో ప్రకాశించారు. కర్ణార్జునులు కోపపు చూడ్కులతో ఒకరినొకరు బెదిరించుకొంటూ చూచుకొన్నారు. అప్పుడు కృష్ణార్జునుల బలము, కర్ణ శల్యుల మానసిక బలహీనత అగుపించింది.

వ. అట్టియెడ నా సూతనందనుండు మద్రపతి నాలోకించి. 257

ప్రతిపదార్థం: అట్టి ఎడన్= ఆ సమయంలో; ఆ సూతనందనుండు= కర్ణుడు; మద్రపతి అగు శల్యుడిని తేరిపార చూచి.

తాత్పర్యం: ఆ సమయంలో కర్ణుడు మద్రపతిని చూచి (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'అర్జునుఁడు నన్ను నోర్చిన యట్టులైన । నెట్లు సెప్పుమ?' యనుడు మద్రేశుఁ 'డేను
గృష్ణు లిద్దఱ నొక్కటఁ గిట్టి, తీవ్ర । బహుళ శరజాలముల పాలుపఱుతు' ననియె. 258

ప్రతిపదార్థం: అర్జునుఁడు; నన్నున్= నన్ను; ఓర్చిన= జయించిన; అట్టులు+ఐన= అట్లయితే; ఎట్లు= ఎట్లా; చెప్పుము+అ; అనుడున్= అనగా; మద్రేశుఁడు; ఏను= నేను; కృష్ణులు+ఇద్దఱన్= కృష్ణార్జునులిద్దరిని; ఒక్కటన్= ఒకేమారు; కిట్టి= చుట్టుముట్టి; తీవ్ర; బహుళ= అనేకరకాలైన; శరజాలముల పాలుపఱుతున్= బాణపరంపరపాలు గావిస్తాను.

తాత్పర్యం: 'అర్జునుడు నన్నే కనుక జయించినట్లయితే అప్పుడు ఏమి జరుగుతుందో చెప్పు అని కర్ణుడు శల్యుడిని అడుగగా, మద్రేశుడు 'నేను ఆ ఇద్దరు కృష్ణులను చుట్టుముట్టి పైకొని వారిని పదునైన అనేక బాణపరంపర పాల్జేస్తా' నని ప్రత్యుత్తర మిచ్చాడు.

ఆ. అట్ల సవ్యసాచి యడిగిన మురవైరి । నగుచు నినుఁడు గూలినను ధరిత్రి
పతియ లైన మేరు వొఱగినఁ గర్ణుచే । నీవు గోలుపోవు టేల కలుగు?' 259

ప్రతిపదార్థం: అట్లు+అ= అదే విధంగా; సవ్యసాచి= అర్జునుడు; అడిగినన్= అడుగగా; మురవైరి= మురారి అయిన కృష్ణుడు; నగుచున్= నవ్వుతూ (ఇట్లన్నాడు); ఇనుఁడు= సూర్యుడు; కూలినను= తన స్థానమునుండి క్రిందకు జారిపడినా; ధరిత్రి= భూమి; పఱియలు+ఐనన్= బ్రద్దలుగా చీలిపోయినా; మేరువు; ఒఱగినన్= ఏటవాలుగ ప్రక్కకు వాలిపోయినా; కర్ణుచేన్; నీవు; కోలుపోవుట= ఓడిపోవటం; ఏల= ఎందుకు; కలుగున్?= సంభవిస్తుంది?

తాత్పర్యం: ఇదే విధమైన ప్రశ్నను అర్జునుడు అడుగగా కృష్ణుడు హాసదీప్త వదనారవిందుడై బదులు పలుకుతున్నాడు. 'సూర్యుడు గగనమునుండి క్రిందపడినా, భూమి బ్రద్దలైనా, మేరుపర్వతం ఒక ప్రక్కకు ఒరిగిపోయినా, కర్ణుడిచేతిలో నీవు ఓడిపోవటం మాత్రం జరుగదు.'

వ. అని వెండియు. 260

తాత్పర్యం: అని మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. అట్టిద లోకపర్యవస మా దురవస్థకు స్రుక్క నేర్తునే?
కిట్టుదుఁ గర్ణశల్యు లను కీటములం గరతాడనంబులం
బెట్టుదు నేలఁ గౌరవులఁ బీనుఁగుపెంటలు గాఁగ, ధర్మజుం
గట్టుదుఁ బట్ట మన్న నగి, గాండివి యద్దనుజారి కిట్లనున్. 261

ప్రతిపదార్థం: లోక పర్యవసము= లోకంలో ముగింపు; అట్టిద= నీవు భావించినట్లే అయితే; ఆ దురవస్థకున్= ఆ సంకటస్థితిని; స్రుక్కన్ నేర్తునే?= క్రుంగిపోతానా?; కరతాడనంబులన్= చేతిదెబ్బలతోడనే; కర్ణశల్యులు అను; కీటములన్= పురుగులను; కిట్టుదున్= చంపివేస్తాను; కౌరవులన్; పీనుఁగు పెంటలు; కాఁగన్= అయ్యేటట్లు; నేలన్+పెట్టుదున్= భూస్థాపితం చేస్తాను; ధర్మజున్= ధర్మరాజుకు; పట్టము= రాజ్యాధికారపదవిని; కట్టుదున్= ధరియింపజేస్తాను; అన్నన్= అని కృష్ణుడు అనగా; నగి= నవ్వి; గాండివి; ఆ+దనుజారికిన్= ఆ రాక్షస శత్రువైన కృష్ణుడితో; ఇట్లనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కృష్ణుడు కిరీటితో అన్నాడు: 'నీవు అనుకొంటున్నదే నిజమైతే అట్టి దురవస్థకు నేను క్రుంగిపోతానా? కర్ణుడు, శల్యుడు అనే పురుగులను చేతితో కొట్టి చంపివేస్తాను. కౌరవులను పీనుగు పెంటలుగా నేల కూలుస్తాను. ధర్మరాజుకు పట్టం కట్టుతాను,' అనగా గాండీవి నవ్వి కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: కర్ణశల్యులను కీటములన్ - అలంకారం: రూపకం.

ఉ. 'నవ్వుల కంటిఁ గాక, యది నాకు నశక్యమె కర్ణశల్యులం
గ్రొవ్వడఁగించు టే ద్రుపదు కూఁతురు గొల్వునఁ బడ్డ పాటునన్
నెవ్వగఁ బొందుచున్ సమయనిష్ఠ నడంగితిఁ గాని, యింక నా
ముప్పురుఁ బూని వచ్చినను ముట్టెదఁ గర్ణుని నేలఁ బెట్టెదన్. 262

ప్రతిపదార్థం: నవ్వులకున్= ఎగతాళికి (నవ్వులాటకు); అంటిన్= అన్నాను; కాక= అంతేగాని; కర్ణశల్యులన్= కర్ణశల్యులను; క్రొవ్వు+అడఁగించుట+అది= పొగరణచుటయనునది; నాకున్= నాకు; అశక్యమె?= అలవిగాని పనియా? (కాదనుట); ద్రుపదుకూఁతురు= ద్రౌపది; కొల్వునన్= రాజసభలో; పడ్డపాటునన్= పాల్పడిన అవస్థవలన; నెవ్వగన్= అతిశయమైన

సంతాపం; పొందుచున్= అనుభవించుచు; సమయనిష్ఠన్= ప్రతిజ్ఞాపాలనదీక్షకు; అడంగితిన్= అణగి ఉన్నాను; కాని= అయినప్పటికిన్ని ఇంకన్; ఆ మువ్వురు= ఆ త్రిమూర్తులు; పూనివచ్చినను= గట్టి ప్రయత్నంతో పైకి వచ్చినప్పటికిన్ని; ముట్టెదన్= వారిపైబడుతాను; కర్ణునిన్; నేలన్+పెట్టెదన్= మట్టిలో కలుపుతాను.

తాత్పర్యం: 'ఆ మాటలు ఎగతాళికన్నవే. కర్ణశల్యులు క్రొవ్వణగించుట నాకు అసాధ్యమా? ఆ నిండుసభలో ద్రౌపది పడిన భంగపాట్లకు మనస్సు బాధపడగా, కట్టువడి నా ప్రతాపాన్ని లోలోన అణచుకొన్నాను. అంతేకాని, ఆ త్రిమూర్తులు ఏకమై గట్టి పూనికతో మనపైకి వచ్చినా ఎదుర్కొని అడ్డగిస్తాను; కర్ణుడిని నేలపాలు గావిస్తాను.

మ. అరదంబున్ సిడమున్ హయవ్రజము శల్యాంగంబులుం జాపముం
గరకాండంబులఁ బెక్కుభల్లముల నుగ్రస్ఫూర్తిఁ దున్మాడి, ని
ష్ఠురభల్లం బొకటన్ సుయోధనుని చూడ్కుల్ నీఱుగా నిప్డ యు
ద్ధుర గర్వోన్నతమైన కర్ణుతలఁ ద్రుంతుం జూడుమీ వేడుకన్. 263

ప్రతిపదార్థం: అరదంబున్= తేరును; సిడమున్= ధ్వజాన్ని; హయవ్రజమున్= గుఱ్ఱాలసమూహాన్ని; శల్య+అంగంబులున్= సారథియైన శల్యుని అవయవాలను; చాపమున్= ధనుస్సును; కరకాండంబులన్= కాండములవంటి చేతులనూ; పెక్కు= అనేక; భల్లములన్= బాణాలతో (బరిసెలతో); ఉగ్రస్ఫూర్తిన్= కోపావేశంతో; తున్మాడి= తునుకలుచేసి; సుయోధనుని= దుర్యోధనుడి; చూడ్కుల్= చూపులు; నీఱుగాన్= బూడిదయ్యేటట్లుగా; నిష్ఠుర= గట్టిదైన; భల్లంబు= బాణం; ఒకటన్= ఒకదానితో; ఇప్డు+అ= ఇప్పుడే; ఉద్ధుర= బలమైన (అతిశయించిన); గర్వోన్నతమైన= గర్వంతో పైకెత్తబడిన; కర్ణుతల; త్రుంతున్= నరికివేస్తాను; (దానిని) వేడుకన్= ఉల్లాసంతో; చూడుమీ!= చూడవయ్యా!

తాత్పర్యం: రథాన్ని, ధ్వజాన్ని, గుఱ్ఱాలను, సారథి అయిన శల్యుడి అవయవాలను, ధనుస్సును, బాహువులను, కోపావేశంతో ముక్కలుచేసి, దుర్యోధనుడి చూపులు మాడి మసి అయిపోయేటట్లు, ఇప్పుడే అతిశయించిన గర్వంతో నిక్కి ఉన్న కర్ణుడి తలను నరికివేస్తాను. ఈ వేడుకను చూడు.

ఆ. కర్ణ మద్రపతుల కాంతల విధవలఁ । జేయువాఁడ నీవు సెన్ను మిగిలి
నగుచు, నేఁడు ద్రుపదనందన వీనుల । ధర్మసుతుని చెవులఁ దనుపు నినుపు. 264

ప్రతిపదార్థం: కర్ణ మద్రపతులు= కర్ణ శల్యుల; కాంతలన్= భార్యలను; విధవలన్= భర్తలేనివారినిగా; చేయువాఁడన్; నీవు; చెన్ను మిగిలి= సంతోషంతో అతిశయించి; నగుచున్= నవ్వుతూ; నేఁడు; ద్రుపదనందన= ద్రుపదుని కూతురు ద్రౌపదియొక్క; వీనులన్= చెవులలో; ధర్మసుతుని చెవులన్= ధర్మరాజు చెవులలో; తనుపు= తృప్తి; నినుపు= నింపుము.

తాత్పర్యం: కర్ణశల్యుల భార్యలను విధవలుగా జేస్తాను చూడుము. నీవు నవ్వుతో అందగించినవాడవై, ఈ రోజు ద్రౌపదీ ధర్మనందనులకు ఈ విషయం చెప్పి, వారి చెవుల్లో తృప్తి నింపుము. (సంతోషవార్త వారి చెవులలో వేయుము.)

క. సంతసపువార్త పుచ్చుము । కుంతికి నే దంతి దరువుఁ గూల్చినక్రియ దు
ర్దాంతిగతిఁ గర్ణుఁ గూల్చుట । యంతయుఁ గన్నారఁ జూచి యచ్యుత! యెలమిన్.' 265

ప్రతిపదార్థం: అచ్యుత!= ఓ కృష్ణా!; నే= నేను; దంతి= ఏనుగు; తరువున్= చెట్టును; కూల్చిన క్రియన్= పడగొట్టిన (విధంగా) పనివలెనే; దుర్దాంతగతిన్= అడ్డులేనివిధంగా; కర్ణున్; కూల్చుట= పడగొట్టుట; అంతయున్= పూర్తిగా; కన్నారన్= కన్నుల పండువుగా; చూచి; ఎలమిన్= సంతోషంతో; ఈ సంతసపు= ఈ సంతోషకరమైన; వార్త= సమాచారాన్ని; కుంతికిన్; పుచ్చుము= చెప్పిపంపుము.

తాత్పర్యం: శ్రీకృష్ణా! ఏనుగు చెట్టును కూలద్రోసిన విధంగా నేను అడ్డుం ఆపు లేకుండా కర్ణుడిని పడగొట్టటాన్ని నీవు కనులారా చూచి, సంతోషంతో ఈ ఆనందకర వృత్తాంతాన్ని కుంతికి వినిపింపుము.'

విశేషం: అలంకారం: ఉపమ.

వ. అని పలికె; నా సమయంబున నుభయ సైన్యంబుల జనంబులకు నంబరంబున నున్న దివ్యసమూహంబులు నందు గీతనృత్తంబుల నుల్లసిల్లు నప్సరోగణంబులుం గాననైన నద్భుతంబున వారు ననిమిషులైయుండి, రప్పు డేకనిశ్చయు లగు కర్ణుండును దుర్యోధనుండును నచ్చెరువాటునం బొరయక, దురంబుమీఁది భరంబునం బొలిచి, రిరువాఁగు సైనికులు గిరీటికిఁ గర్ణునకు నభిముఖంబుగాఁ దల మిగులం దగదను బుద్ధిని భయంబునను దద్రథంబులు రెంటిని బలసి నిలిచి; రమ్మహావీరులు ధనుర్ద్యుతులను బాణ ప్రభలను దీవ్రతేజంబులను బ్రదీప్తులై కల్పాంత సూర్యుల చందంబగుచు నొండొరుల నోర్చు కడంకలఁ బేర్చి; రయ్యవసరంబున నశ్వత్థామ గురుపతిఁ జేరం జని కరంబు సేతం దెమల్చి సాంత్వన స్వరంబున నిట్లనియె: 266

ప్రతిపదార్థం: అని పలికెన్; ఆ సమయంబునన్; ఉభయ సైన్యంబుల; జనంబులకున్; అంబరంబునన్+ఉన్న= ఆకాశమందున్న, దివ్యసమూహంబులున్= దేవతాగణములు; అందున్= వారిమధ్య; గీతనృత్తంబులన్= పాటలతో, ఆటలతో; ఉల్లసిల్లు= ఆనందిస్తున్న; అప్సరోగణంబులును= దేవవేశ్యాసమూహములు; కాననైనన్= కనబడగా; అద్భుతంబునన్= ఆశ్చర్యంతో; వారు; అనిమిషులై ఉండిరి= రెప్పవాల్చక చూచుచున్నవారై ఉన్నారు; అప్పుడు; ఏకనిశ్చయులు+అగు= ఒకే నిర్ణయాన్ని కలిగిఉన్న; కర్ణుండును; దుర్యోధనుండును; అచ్చెరుపాటునన్= ఆశ్చర్యమును; పొరయక= పొందక; దురంబుమీఁది= యుద్ధముపై ఉంచిన; భరంబునన్= భారముతో (బాధ్యతతో) పొలిచిరి= ఒప్పారు; ఇరువాఁగు సైనికులు= ఉభయపక్షాల భటులు; కిరీటికిన్; కర్ణునకున్; అభిముఖంబుగాన్= ఎదురెదురుగా; తలమిగులన్= ముందుగా ఎదుర్కొనుట; తగదను; బుద్ధిని= తలంపుతోను; భయంబునను= భీతితోను; తద్+రథంబులు రెంటిని= ఆ రెండు తేరులకు; బలసి నిలిచిరి= పరివేష్టించి చేరి నిలిచారు; ఆ+మహావీరులు= ఆ యోధశ్రేష్ఠులు; ధనుః+ద్యుతులను= ధనుస్సుల కాంతులతోను; బాణప్రభలను= బాణాల కాంతులతోను; తీవ్రతేజంబులను= గొప్ప పరాక్రమదీప్తితోను; ప్రదీప్తులై= అత్యంత ప్రకాశంతో వెలుగువారై; కల్పాంత= ప్రళయకాలంలోని; సూర్యుల; చందంబులు+ అగుచున్= పోలినవారవుతూ; ఒండొరులన్= ఒకరినొకరు; ఓర్చు= ప్రతిఘటించి జయించే; కడంకలన్= ప్రయత్నాలతో; పేర్చిరి= విజృంభించారు; ఆ+ అవసరంబునన్= ఆ సమయంలో; అశ్వత్థామ; కురుపతిన్; చేరన్+చని= సమీపించి; కరంబు= తనచేతిని; చేతన్= ఆయన చేతితో; తెమల్చి= కలిపి; సాంత్వన= బ్రతిమాలే; స్వరంబునన్= మాటలతీరుతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: వారు అట్లా పలికే సమయంలో రెండువైపుల సైనికులకు ఆకాశంలో ఉన్న దేవతలలో గీతనృత్యాలు చేస్తున్న అప్సరోగణాలు కనబడ్డారు. ఆ అద్భుతాన్ని చూచి వారు కూడా అనిమిషులై (రెప్పపాటులేనివారై) పోయారు.

అప్పుడు కర్ణ దుర్యోధనులు కృతనిశ్చయులై ఆశ్చర్యపడక, యుద్ధభారంలో నిమగ్నులయ్యారు. ముందుగా కలియబడ కూడదని పాండవసైన్యం కర్ణుడికి అభిముఖంగా, కౌరవసైన్యం అర్జునునికి ఎదురుగా నిలిచాయి. అర్జున కర్ణులు బాణకాంతులతో కల్పాంత సూర్యులవలె ప్రకాశిస్తూ ఇరువురూ జయకాంక్షతో నిలిచారు. అప్పుడు అశ్వత్థామ దుర్యోధనుడి వద్దకు పోయి, ప్రీతితో తన చేతితో అతని చేయి పట్టుకొని బ్రతిమాలే గొంతుతో ఇట్లా అన్నాడు.

అశ్వత్థామ దుర్యోధనునకు హితోపదేశంబు సేయుట (సం. 8-64-20)

చ. 'కలన గురుండు భీష్ముఁడును గాండివిచేఁ బడి, రంగరాజు వా
రల కధికుండె? యాతని దురంబున నోర్వఁ గలండె? పూని యే
వల దని బుద్ధి సెప్పిన నవశ్యము నాతఁడు నిల్చు, నీతనిన్
నిలుపుము, నీవు ధర్మసుతునిం దగుమాటలఁ దేర్పఁ జొప్పడున్. 267

ప్రతిపదార్థం: కలనన్= యుద్ధంలో; గురుండును= ద్రోణుడు; భీష్ముఁడును; గాండివిచేన్+పడిరి= అర్జునుడిచేతిలో కూలినారు; అంగరాజు= అంగదేశాధీశుడైన కర్ణుడు; వారలకున్+అధికుండె?= వారలను మించినవాడా?; ఆతనిన్= అర్జునుడిని; దురంబునన్= యుద్ధంలో; ఓర్వన్+కలండె?= గెలువగలడా?; పూని= ప్రయత్నించి; ఏన్= నేను; వలదని= వద్దని; బుద్ధిచెప్పినన్= హితం చెప్పితే; అవశ్యము= తప్పక; ఆతఁడు= అర్జునుడు; నిల్చున్= విరమించుకొని నిలిచిపోతాడు; నీవు; ఈతనిన్= ఈ కర్ణుడిని; నిలుపుము= మాన్పింపుము; ధర్మసుతునిన్; తగుమాటలన్= సమయోచితమైన మాటలతో; తేర్పన్= మనసు కుదుటపడి తేరుకొనేటట్లు చేయగా; చొప్పడున్= తగును.

తాత్పర్యం: 'యుద్ధంలో ద్రోణభీష్ములు గాండీవిచేత పతనమయ్యారు. ఈ కర్ణుడు వారికంటె మొనగాడా ఏమి? అర్జునుడిని యుద్ధంలో గెలువగలడా? నేను పట్టుదలతో అర్జునుడికి తగినమాటలు చెప్పితే తప్పక నామాటలకు కట్టుబడి యుద్ధం మానుతాడు. ఇక నీవు ఈ కర్ణుడిని యుద్ధ ప్రయత్నం నుండి మాన్పించుము. నీవు ధర్మరాజును సమయోచితమైన మాటలతో మనసు కుదుటపడేటట్లు చేయగలిగితే అంతా సర్దుకొనిపోతుంది.

వ. తెలిసిన దామోదరుండు దెలివి నొందు. 268

ప్రతిపదార్థం: తెలిసినన్= ఇది తెలిసికొన్న; దామోదరుండు= కృష్ణుడు; తెలివినొందున్= ప్రసన్నుడౌతాడు.

తాత్పర్యం: ఇది తెలిస్తే కృష్ణుడు కూడా సంతోషిస్తాడు.

క. భీముఁడుఁ గవలును ధర్మజు । చే మరలెడువార, లేను జెప్పెడిపలుకుల్
భూమీశ! కురుకులమునకు । నీ మొనరాజులకుఁ బ్రజకు హిత మూహింపన్. 269

ప్రతిపదార్థం: భూమీశ!;= రాజా; భీముఁడు; కవలును= నకుల సహదేవులు; ధర్మజుచేన్= ధర్మజుడు చెపితే; మరలెడువారు= యుద్ధవిరమణ చేస్తారు (మనసు మార్చుకొంటారు); నేను చెప్పెడి పలుకుల్= నేను చెప్పే మాటలు; కురుకులమునకున్; నీమొనరాజులకున్= నీ సైన్యమందలి ఏలికలకు; ప్రజకున్= ప్రజలకు; ఊహింపన్= యోచించి చూస్తే; హితము= మంచిది.

తాత్పర్యం: భూమీశా! భీముడూ నకుల సహదేవులూ ధర్మరాజు చెపితే యుద్ధం మానుకొనేవారే. నేను చెప్పేమాటలు కౌరవవంశానికీ, నీ సైన్యాధిపతులకూ, జనసామాన్యానికీ శ్రేయోదాయకాలు. బాగుగా యోచించుకొమ్ము.

చ. **వలవదు నన్నునుం గృపు నవధ్యులఁగాఁ గొని క్రీడి గెల్వ శ**
క్తు లని తలంప; భీష్ముఁడును ద్రోణుఁడు లోక మెఱుంగఁగా నవ
ధ్యుల; హరికల్మి నారథికు దోర్బలలీల నడంగిపోరె! య
చ్చలమొ ఫలంబొ? యింకయిన సంధి యొనర్చుట మేలు వారితోన్. **270**

ప్రతిపదార్థం: నన్నునున్; కృపుని; అవధ్యులన్+కాన్= చంపశక్యం కానివారినిగా; కొని= పరిగణించి; క్రీడిన్= అర్జునుడిని; గెల్వన్; శక్తులని= శక్తికలవారని; తలంపన్= భావించుట; వలవదు= తగదు; లోకము+ఎఱుంగఁగాన్= ప్రజలకు తెలిసేటట్లు (అనుకొన్నట్లు) భీష్మడును; ద్రోణుడును; అవధ్యులు+అ= చంపసాధ్యంకాని వారే (అయినను); హరి కల్మి= కృష్ణుడి సంబంధ భాగ్యం వలన; ఆ రథికు= ఆ రథయోధుడు అర్జునుడి, దోర్బలలీలన్= భుజబల విన్యాసంవలన; అడంగిపోరె?= అణగిపోలేదా?; అచ్చలమొ ఫలంబొ?= ఆ అసూయాఫలితమో ఏమో?; ఇంకయినన్= ఇప్పటికైనా; వారితోన్= పాండవులతో; సంధి ఒనర్చుట= పొత్తు కుదుర్చుకొనటం, రాజీపడుట; మేలు= శ్రేయోదాయకం.

తాత్పర్యం: నేనుకృపాచార్యుడు - చంపుటకు అలవిగానివారమనీ, మేము విజయుని ఓడించగల శక్తి సంపన్నులమనీ అనుకొనటం పొరపాటు. భీష్మద్రోణులు ఓడించటానికి అలవిగాని వారని లోకమంతా అనుకొన్నప్పటికీ పాండవులు కృష్ణుడిని తమపక్షాన కలిగి ఉండటం చేత అర్జునుడి బాహుబలం చేత పడిపోయారు కదా! ఇది అసూయవలన కలిగిన ఫలితం ఔనో కాదో గాని ఆ పాండవులతో సఖ్యం చేయటం మంచిది.'

చ. **హరి సనుదెంచినప్డు మన మమ్మెయిఁ బల్కితి; మింక సంధికి**
న్వెర వగు టేల గల్గు? నని నీవు దలంపకు; మాంబికేయు భూ
వరుఁడుఁగ జేయు ధర్మజుఁ డవశ్యముఁ బాండునృపాలుపాల యే
వురకు నమర్చుఁగాని చనవున్ వెలిమెచ్చును నొల్లఁ డేమియున్. **271**

ప్రతిపదార్థం: హరి= కృష్ణుడు; చనుదెంచినప్డు= రాయబారానికి వచ్చినప్పుడు; మనము; ఆ+మెయిన్= ఆ విధంగా; పల్కితిమి= మాట్లాడాము; ఇంకన్= ఇక; సంధికిన్; వెరవు= ఉపాయం; అగుట= కలగటం; ఏల= ఎందుకు; కల్గున్+అని= పొసగుతుందని; నీవు; తలంపకుము; ధర్మజుఁడు; ఆంబికేయున్= అంబిక కుమారుడు - ధృతరాష్ట్రుడిని; భూవరుఁడుఁగన్= రాజుగా; అవశ్యము= తప్పక; చేయున్= చేస్తాడు; పాండునృపాలు= పాండురాజు; పాలు+అ= భాగమే; ఏవురకున్= ఐదుగురకు; అమర్చున్= సరిపెట్టును; కాని= అంతేగాని; చనవున్= పరిచయం కలిగించే చులుకదనమును; వెలిమెచ్చును= పై పై పొగడ్తను; ఏమియున్= ఏ విధంగా కూడా; ఒల్లఁడు= ఒప్పుకొనడు.

తాత్పర్యం: కృష్ణుడు దూతగా మన ఆస్థానానికి వచ్చినపుడు ఏమేమో మాట్లాడినాము, అందువలన మనమధ్య సయోధ్య ఎట్లా కుదురుతుందని అనుకోవద్దు. ధర్మజుడు తప్పక ధృతరాష్ట్రుడిని రాజుగా చేస్తాడు. పాండురాజు రాజ్యం ఐదుగురికీ సమభాగంగా పంచుతాడు. అంతేగాని చులుకనచేసి పై మెచ్చుల కపటానికి ఏ విధంగా కూడా అంగీకరించడు.

తే. **పాండవుల యట్ల రాధాసుతుండు నాదు । పలుకులకు నియ్యకొను; నీవు బ్రదుకు తెరువు**
పట్టు; బ్రదికిన నెల్లశుభములుఁ గలుగు; । నీసు మానుము చచ్చిన నేమి గలదు? **272**

ప్రతిపదార్థం: పాండవుల అట్ల= పాండవులవలె; రాధాసుతుండు= కర్ణుడు; నాదుపలుకులకున్= నా మాటలకు; ఇయ్యకొనున్= సమ్మతిస్తాడు; నీవు; బ్రతుకుతెరువు= జీవించే మార్గం; పట్టు= అనుసరించుకో!; బ్రదికినన్= జీవించి ఉంటే; ఎల్లశుభములున్= అన్ని మేళ్ళూ; కలుగున్= కలుగుతాయి; ఈసు= అసూయ; మానుము; చచ్చినన్ ఏమి కలదు?= చచ్చిన తరువాత ఇంకేముంది?

తాత్పర్యం: పాండవుల మాదిరిగానే కర్ణుడు కూడా నా మాటలు వింటాడు. నీవు బ్రతికే విధం చూచుకొమ్ము. బ్రతికి ఉంటే గదా అన్ని విధములగు మేళ్ళు పొందగలము! ఇక అసూయను మానుము. చచ్చిన తరువాత ఇంకేముంది!

క. వెడతలఁపు లుడిగి, సంధికి । నొడఁబడు; మిది లెస్స; దీని కొడఁబడమి గడుం
జెడు తెరు; విప్పటి పదనున్ । గడవఁబడుట ద్రాటఁ దప్పుకరణియ చుమ్మీ!' 273

ప్రతిపదార్థం: వెడతలపులు= చెడు ఆలోచనలు; ఉడిగి= మాని; సంధికిన్= పొందుకు; ఒడఁబడుము= అంగీకరించుము; ఇది లెస్స= ఇది శ్రేయస్కరం; దీనికిన్; ఒడఁబడమి= ఒప్పుకొనకపోవటం; కడున్= మిక్కిలి; చెడుతెరువు= హానికరమైన మార్గం; ఇప్పటి పదనున్= ఈ సమయాన్ని (అవకాశాన్ని); కడవన్+పడుట= దాటటం; త్రాటఁ తప్పు కరణియ= త్రాడును వదలటం వంటిది; చుమ్మీ!= సుమా!

తాత్పర్యం: విపరీతపు యోచనలు మాని, సంధి చేసికొనటమే మేలు. దీనిని అంగీకరించకపోవటం త్రాడుపట్టును వదలి క్రింద పడటం వంటిదే సుమా!'

విశేషం: అలంకారం: దృష్టాంతం.

చ. అన విని, యమ్మహీరమణుఁ డాతని కిట్లను 'నిప్డు దుస్ససే
నుని పని దీర్చి, మారుతతనూభవుఁ డాడిన మాట యేర్పడ
న్వినియును సంధి సేయుటకు నీ వభిలాషము సేఁత యొప్పునే?
పెనఁకువ కర్ణుఁ డే లుడుగు? బేలవె? మానుము ద్రోణనందనా! 274

ప్రతిపదార్థం: అనన్ విని; ఆ+మహీరమణుఁడు= ఆ భూభర్త (దుర్యోధనుడు); ఆతనికిన్= అశ్వత్థామతో; ఇట్లు+అనున్; ద్రోణనందనా!; ఇప్డు; దుస్ససేనుని; పని= సంబంధించిన పని; తీర్చి= పూర్తిచేసి(దుశ్శాసనుడిని చంపి); మారుతి తనూభవుఁడు= వాయుపుత్రుడు - భీముడు; ఆడినమాట; ఏర్పడన్= వివరంగా; వినియున్= వినికూడా; సంధిచేయుటకున్; నీవు అభిలాషము చేఁత= నీవు కోరటం; ఒప్పునే?= తగి ఉన్నదా?; పెనఁకువ= యుద్ధము; కర్ణుఁడు; ఏల= ఎందుకు; ఉడుగున్?= మానుతాడు?; బేలవె?= నీవంత అమాయకుడవా?; మానుము= ఈ ప్రయత్నం మానుకొమ్ము.

తాత్పర్యం: అశ్వత్థామ పలుకులు విని దుర్యోధనుడు అతడితో ఇట్లా అన్నాడు: 'ద్రోణనందనా! ఇప్పుడే భీముడు మాట్లాడిన మాటలు విన్నావు గదా! దుస్ససేనునిపని పూర్తి చేశాడు. ఇక రెండవపని పూర్తి చేయక మానుతాడా? ఇదంతా విని కూడా నీవు సర్దుబాటు చేయటానికి పూనటం ఉచితమా?, పోతే కర్ణుడెట్లా యుద్ధం మానుతాడు? నీ వింత వెర్రివాడవైతే ఎట్లా? ఈ ప్రయత్నం మానుకొమ్ము.

శా. శ్రాంతిం బొందినవాఁడు పార్థుఁ, డపరిశ్రాంతుండు గర్ణుండు; దు
ర్దాంతోదగ్రత నేఁడు గీటడఁచు నీతం డాతనిన్; వహ్ని య
త్యంతంబున్ శిశిరత్వ మొందినను గోత్రాళుల్ వడం కాడినం,
గుంతీసూనునిచేతఁ గర్ణున కనిం గోల్పాటు వాటిల్లునే?' 275

ప్రతిపదార్థం: పార్థుఁడు= అర్జునుడు; శ్రాంతిన్= అలసటను; పొందినవాఁడు= పొందాడు; కర్ణుండు; అపరిశ్రాంతుండు= అలసట పొందనివాడు; దుర్దాంత= అణచరాని; ఉదగ్రతన్= భయంకర స్వరూపంతో; నేఁడు; ఈతఁడు= ఈ కర్ణుడు; ఆతనిన్= అర్జునుడిని; గీటడఁచున్= సంహరిస్తాడు; వహ్ని= నిప్పు; అత్యంతంబు= మిక్కిలి; శిశిరత్వము= చల్లదనాన్ని; ఒందినను= పొందినను; గోత్ర+ఆళుల్= పర్వతశ్రేణులు; వడంకు+ఆడినన్= గడగడ కంపించినప్పటికీన్నీ; కుంతీసూనునిచేతన్= అర్జునుడిచేత; కర్ణునకున్; అనిన్= యుద్ధంలో; కోల్పాటు= ఓటమి; పాటిల్లునే?= సంభవిస్తుందా?

తాత్పర్యం: పార్థుడు అలసట పొంది ఉన్నాడు. కాని కర్ణుడు అలసట పొందనివాడు. ఈ దినం కర్ణుడు అర్జునుడిని నిర్నిరోధమైన కోపాతిశయంతో తుదముట్టిస్తాడు. నిప్పునకు చల్లదనం క్రమ్మినా, కొండలు కంపించిపోయినా, కుంతీపుత్రుడి వలన యుద్ధంలో రాధాతనయుడికి ఓటమి కలుగుతుందా?'

వ. అని పలికి, యజ్జనపతి తన సైనికుల నాలోకించి సమరసముత్సాహ పోషణంబులగు భాషణంబుల ముఖరుం డగుటయు నఖిల తూర్యంబు లొండొండ మ్రోసెఁ బాండవబలంబునను భేరీ పణవాదుల రణనంబులు నిగిడె; నప్పుడు కర్ణుండును నర్జునుండును. 276

ప్రతిపదార్థం: అని పలికి; ఆ+జనపతి= ఆ రాజు; తన సైనికులన్; ఆలోకించి= తేరిపారజూచి; సమరసముత్సాహ= యుద్ధోత్సాహప్రయత్నాలను; పోషణంబులు+అగు= పెంపొందజేసే; భాషణంబుల= మాటలను; ముఖరుండు= మాట్లాడేవాడు; అగుటయున్; అఖిల తూర్యంబులు= వివిధములైన వాద్యాలు; ఒండొండ= క్రమంగా; మ్రోసెన్= మ్రోగాయి; పాండవబలంబునను; భేరీ= దుందుభి; పణవాదులు= తప్పెటలు మొదలగువాటియొక్క; రణనంబులు= మ్రోతలు; నిగిడెన్= వ్యాపించాయి (సంకులశబ్దాలు రేగినవి); అప్పుడు; కర్ణుండును; అర్జునుండును.

తాత్పర్యం: అని పలికి, దుర్యోధనుడు తన సైనికులను చూచి యుద్ధయత్నానికి బలంచేకూర్చే మాటలు మాట్లాడగా, యుద్ధవాద్యాలు క్రమంగా మ్రోగాయి; పాండవబలంలో కూడా మ్రోగాయి. అప్పుడు కర్ణుడూ, అర్జునుడూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కరి కరి, గిరి గిరి, నంభో । ధర మంభోధరముఁ బెలుచఁ దాఁకిన క్రియఁ దాఁ
కిరి కడఁగి గగన తటియును । ధరణియు మ్రోయుచు వడంక ధరణీనాథా! 277

ప్రతిపదార్థం: ధరణీనాథా!; కరి కరిన్= ఏనుగు ఏనుగును; గిరి గిరిన్= కొండ కొండను; అంభోధరము= మేఘం; అంభోధరమున్= మేఘాన్ని; పెలుచన్= గట్టిగా; తాఁకిన క్రియన్= ఎదుర్కొన్న విధంగా; గగనతటియును= ఆకాశభాగమూ; ధరణియున్= భూమీ; మ్రోయుచున్ వడంకన్= శబ్దిస్తూ దద్దరిల్లి చలించపోగా; కడఁగి= పూనుకొని; తాఁకిరి= ఒకరినొకరు ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: ఏనుగు ఏనుగును ఢీ కొన్నట్లు, కొండతో కొండ కలియబడినట్లు, మబ్బు మబ్బుతో ఒరుసుకొన్నట్లు ఆకాశం, భూమి శబ్దంతో దద్దరిల్లి చలించగా ఒకరినొకరు పూనికతో ఎదుర్కొన్నారు.

క. మెఱయు వెలిమావులును, గడు మెఱుఁ గారెడు నరదములును, మింటను మంటల్
వఱపెడు వాలమ్ములుఁ జూ । పఱ నత్తొలుతాఁకు వెఱఁగుపడఁ జేసె నృపా! 278

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; మెఱయు= ప్రకాశించే; వెలిమావులును= తెల్లగుర్రాలు; (అర్జునుడి రథానికి పూన్చిన నాలుగు గుర్రాలు); కడున్= మిక్కిలి; మెఱుఁగు+ఆరెడు= తళుకొత్తే; అరదములును= తేరులు; మింటను= ఆకాశంలో; మంటల్; పఱపెడు= వ్యాపింపజేసే; వాలమ్ములున్= వాడిబాణాలు (వీటి); ఆ-తొలుతాఁకు= ఆ మొదటి తాకిడి; చూపఱన్= చూస్తున్నవారిని; వెఱఁగుపడ చేసెన్= ఆశ్చర్యపడేటట్లు చేశాయి.

తాత్పర్యం: రాజా! మెరుస్తున్న తెల్ల గుర్రాలు, అత్యంత కాంతులు ప్రసరించే రథాలు, ఆకాశమంతా మంటలతో నింపే పదునైన బాణాలు - వీటితో కూడిన ఆ కర్ణార్జునుల మొదటి తాకిడి ప్రేక్షకులను బిత్తరపోయేటట్లు చేసింది.

వ. ఇ వ్విధంబున నవ్వీరోత్తము లుదాత్తభంగిం దలపడి పెనంగం దొడంగిన, నుభయ సేనలవారలు నార్పులు నింగి ముట్టఁ జెలంగి; రట్టియెడ. 279

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; ఆ+వీరోత్తములు= ఆ శూరాగ్రేసరులు; ఉదాత్తభంగిన్= గౌరవప్రదమైన విధంగా; తలపడి= ఎదుర్కొని; పెనంగన్+తొడంగినన్= పోరనారంభించగా; ఉభయసేనలవారలు= రెండువైపుల ఉన్న సైనికుల; ఆర్పులు= పెడబొబ్బలు; నింగిముట్టన్= ఆకాశం అంటుకొనగా; చెలంగిరి= మ్రోయించారు; అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈవిధంగా ఆ వీరశ్రేష్ఠులిద్దరూ గొప్పగా తలపడి పోరాడుతూ ఉండగా, రెండు సేనలలో ఉన్నవాళ్ళ కేకలు ఆకాశాన్ని అంటాయి. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. 'భరితోత్సాహతఁ బేర్చి, దీప్తు లడరన్ భల్లమ్ము లొక్కుమ్మడిం
బరఁగం జేయుము కర్ణు గాత్రములలోఁ బార్థుండ! వే త్రుంపు మి
క్కురుభూపాలకు రాజ్యకాంక్ష, దొరయే కోదండపాండిత్య వి
స్ఫురణ గర్ణుఁడు నీకు? నీబలువు నేపుం జూపు మత్యుగ్రతన్.' 280

ప్రతిపదార్థం: పార్థుండ!= ఓ అర్జునా!; భరిత+ఉత్సాహతన్= పరిపూర్ణమైన ఉత్సాహంతో; పేర్చి= విజృంభించి; దీప్తులు+అడరన్= కాంతులు వ్యాపించేటట్లు; భల్లమ్ములు; ఒక్కుమ్మడిన్= ఒక్కపెట్టున; కర్ణు గాత్రములలోన్= కర్ణుడి శరీరభాగాలలో; పరఁగన్ చేయుము= ప్రవర్తిల్లేటట్లు - నాటుకొనేటట్లు చేయుము; ఈ+కురు భూపాలకు; రాజ్యకాంక్ష= రాజ్యంపై గల ఆశను; వే= త్వరగా; త్రుంపుము= త్రెంచివేయుము; కర్ణుఁడు; కోదండ పాండిత్య= ధనుర్విద్యా సామర్థ్యముయొక్క; విస్ఫురణన్= కౌశలమునందు; నీకున్; దొరయే?= సమానుడా ఏమి?; నీ బలుపున్= నీశక్తిని; ఏపున్= ఆధిక్యమును; అత్యుగ్రతన్= విశేషించిన ఆగ్రహావేశంతో; చూపుము= ప్రదర్శించుము.

తాత్పర్యం: 'ఓ పార్థా! పౌరము ముట్టిన ఉత్సాహంతో విజృంభించి ఒక్కపెట్టున కాంతులు విరజిమ్మేటట్లుగ బాణాలు కర్ణుడి దేహంలో దిగబడేటట్లు వేయుము. ఆ దుర్యోధనుడి రాజ్యకాంక్షను త్రుంచివేయుము. ధనుర్విద్యా పాటవంలోను, దాని ప్రయోగదక్షతలోను కర్ణుడు నీకు సమానుడా ఏమి? ఇక నీ భుజబలసామర్థ్యాన్ని చండప్రచండంగా చూపుము.'

వ. అని పాంచాలురు పార్థజయార్థ సంభాషణంబులు సేసిరి, కౌరవులు గర్ణు డగ్గఱి. 281

ప్రతిపదార్థం: అని, పాంచాలురు; పార్థజయార్థ సంభాషణంబులు= విజయుడి విజయమును అపేక్షించే సంభాషణంబులు; చేసిరి; కౌరవులు; కర్ణుడిని; డగ్గఱి= సమీపించి.

తాత్పర్యం: అని పాంచాలదేశీయులు అర్జునుడి విజయంకొరకు పై సంభాషణలు చేశారు. కౌరవులు కూడా కర్ణుడిని సమీపించి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'కడఁగుము నీదుబాణములఁ గవ్వడి గూలినఁ జాలు నంతతోఁ
జెడుదురు పాండవుల్ రణము సేయు నుదగ్రత యెల్లఁ దక్కి పే
రడవుల కేఁగి సాధుమునులై చరియింతురు; కౌరవేంద్రుఁ డీ
పుడమి సమస్తముం బొగడు పొంపిరివోవఁగ నేలు లీలతోన్!' 282

ప్రతిపదార్థం: కడఁగుము= గట్టి పూనికతో ప్రయత్నించుము; నీదు బాణములన్; కవ్వడి= సవ్యసాచి అయిన అర్జునుడు; కూలినన్= చనిపోతే; చాలున్= ఇంకే ప్రయత్నంతో పనిలేదు; అంతతోన్= దానితో; పాండవుల్; రణము చేయు; ఉదగ్రత= ఆధిక్యం; ఎల్లన్+తక్కి= అంతా పోగొట్టుకొనినవారై; చెడుదురు= పాడైపోతారు; పేరడవులకున్= దట్టమైన అడవులకు; ఏఁగి; సాధుమునులై= శాంతస్వభావం కలిగి తపస్సు చేసికొనేవారై; చరియింతురు= తిరుగాడుతారు; కౌరవ+ఇంద్రుఁడు; ఈ పుడమి సమస్తమున్= ఈ భూమండలాన్నంతా; పొగడు= కీర్తి; పొంపిరిపోవఁగన్= వ్యాపిస్తుండగా; లీలతోన్= అవలీలగా; ఏలున్= పరిపాలిస్తాడు.

తాత్పర్యం: 'యుద్ధానికి సిద్ధం కమ్ము. నీబాణాహతితో, రెండు చేతులా బాణాలు విసరే ఆ అర్జునుడు పుటమారి పోతే చాలు! దానితో పాండవులు ఆధిక్యాన్ని కోల్పోయి నిర్వీర్యులై కారడవులకు పోయి, మునివృత్తితో మెత్తటివారై సంచరిస్తూ ఉంటారు. ఆ తర్వాత కౌరవేంద్రుడు కీర్తిని పెంపొందగ ఈ పుడమినంతా పాలిస్తాడు.

వ. అని తఱిమి పలికిరి; ప్రొద్దునుం జాల వ్రాలెఁ, గాలాంతక ప్రతిము లగు నప్పార్థకర్ణు లన్యోన్య జయార్థు లై పెనంగునప్పుడు. 283

ప్రతిపదార్థం: అని, తఱిమి పలికిరి= వెంటబడి గట్టిగా చెప్పారు; ప్రొద్దునున్= సూర్యుడు కూడా; చాల వ్రాలెన్= అస్తంగతు డౌతున్నాడు; కాలాంతక= ప్రళయకాల యముడికి; ప్రతిములు అగు= మారురూపాలు అగు; ఆ+పార్థ కర్ణులు; అన్యోన్య జయ+అర్థులు+ఐ= ఒకరినొకరు ఓడించి తాము గెలవాలనుకొన్న కోరిక గలవారై; పెనంగునప్పుడు= పోరాడుతున్న సమయంలో.

తాత్పర్యం: అని వెంటపడి గట్టిగా చెప్పారు. ప్రొద్దుకూడా బాగా వాలింది. ప్రళయకాలంలో యముడివలె ఆకారాలు గల అర్జునుడూ, కర్ణుడూ ఒకరిపై ఒకరు జయంకోరి యుద్ధం చేస్తున్నప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

కర్ణార్జును లొండొరులమీఁద దివ్యబాణంబు లేయఁబూనుట (సం. 8-65-12)

సీ. కర్ణుండు పది చండకాండంబు లర్జును । తనువునఁ జొనుప, నర్జునుఁడు దీప్త
ఘనబాణములు పదునెనిమిది కర్ణు మైఁ । బరఁగింప నయ్యంగపతి దశోగ్ర
చక్రమార్గణముల సరభసంబున నొంచె । నన్నరు, నాతండు నట్టి వన్ని
శరములు రాధేయు నురమున నాటించె । నతఁడు దొమ్మిది వాలుటమ్ము లతని

తే. వక్షమునఁ గ్రుచ్చి సాయకద్వయము శౌరి । మేన నిగిడింప, బీభత్సుఁ డేను మెఱుఁగు
తూపు లా సూతపుత్త్రు నెత్తుట మునుంగ । నేసె బాహాసముల్లాస మెసక మెసఁగ! 284

ప్రతిపదార్థం: కర్ణుండు; అర్జును తనువునన్= అర్జునుడి దేహమునందు; పది; చండకాండములు= దారుణమైన బాణాలను; చొనుపన్= చొప్పించగా; అర్జునుఁడు; దీప్తఘన= వెలుగొందే గొప్ప; బాణములు; పదునెనిమిది; కర్ణుమైన్= కర్ణుడి శరీరంలో; పరఁగింపన్= అలముకొనచేయగా; ఆ+అంగపతి= ఆ అంగదేశాధీశుడైన కర్ణుడు; దశ= పది; ఉగ్ర= తీక్ష్ణమైన; చక్ర= చక్రంవలె గుండ్రమైన (చక్రాలు-బాణాలు అని కూడా); మార్గణములన్= బాణాలతో; ఆ+నరున్= ఆ అర్జునుడిని; సరభసంబునన్= అత్యంతవేగంతో; నొంచెన్= బాధించాడు; ఆతండు= ఆ నరుడు; అట్టివి= అదే విధమైన; అన్ని= అదే సంఖ్యగల; శరములు= బాణాలను; రాధేయు; ఉరమునన్= ఎదురురొమ్మున; నాటించెన్= గ్రుచ్చి నిలబెట్టాడు; (దీనికి ప్రతిఫలంగా) అతఁడు= కర్ణుడు; తొమ్మిది; వాలు+అమ్ములు= వాడి బాణాలను; అతని= అర్జునుడి; వక్షమునన్= ఎదలో; గ్రుచ్చి; సాయకద్వయము= రెండు బాణాలను; శౌరిమేనన్= కృష్ణుడి దేహంలో; నిగిడింపన్= నాటగా (దీనితో); బీభత్సుఁడు= అర్జునుడు; ఏను= అయిదు (ఐదు); మెఱుఁగు= మెరిసే; తూపులు= బాణాలు; ఆ సూతపుత్రున్= ఆ సారథి పుత్రుడైన కర్ణుడిని; నెత్తుటన్= నెత్తురులో; మునుంగన్= మునిగిపోయేటట్లు; బాహాసముల్లాసము= భుజ బల భీకరాకృతి; ఎసకమెసఁగన్= అతిశయించే విధంగా; ఏసెన్= ప్రయోగించాడు; (కర్ణుడి బాణసంపత్తిలో ఒక ప్రత్యేకత; తన బాణాలపై తన పేరు చెక్కించి, వాటిని బండ్లమీద తోలించుకొని వచ్చేవాడు. (కర్ణ. 1. 236; ద్రోణ- 5-113).

తాత్పర్యం: కర్ణుడు అర్జునుడి మేనిలో పది తీవ్రబాణాలను గుచ్చగా, దానికి ప్రతిగా అర్జునుడు పద్దెనిమిది ప్రకాశవంతములైన బాణాలను ప్రయోగించాడు. కర్ణుడు దానికి ప్రతిగా చక్రాలవంటి బాణాలు పదింటితో అర్జునుడిని బాధించాడు. అప్పుడు అర్జునుడు అన్నే బాణాలను కర్ణుడి వక్షఃస్థలంపై గ్రుచ్చాడు. తిరిగి కర్ణుడు తొమ్మిది వాడి బాణాలను అర్జునుడిపైన, రెండు బాణాలను కృష్ణుడిపైన ప్రయోగించాడు. దానితో అర్జునుడు తన బాహుబలం అతిశయించేటట్లుగా, ఆ సూతపుత్రుడు నెత్తుటిలో మునిగేటట్లుగా ఐదు మెరుగు బాణాలు వేశాడు.

చ. అలిగి కడంగి సూతసుతుఁ డచ్యుతపార్థులఁ దీవ్రబాణపం
క్తులఁ బొదువం బరాక్రమ కుతూహలి య వ్విజయుండు పిన్న న
వ్వొలసి ముఖాంబుజంబునకు నొప్పుగఁ దద్రథ రథ్య కేతు సూ
తులను దదీయగాత్రమును దూపులవెల్లి మునుంగఁ జేసినన్. 285

ప్రతిపదార్థం: సూతసుతుఁడు= కర్ణుడు; అలిగి= కోపగించుకొని; కడంగి= ప్రయత్నపూర్వకంగా; అచ్యుతపార్థులన్= కృష్ణార్జునులను, తీవ్రబాణ పంక్తులన్= నిశితమైన బాణపరంపరలతో; పొదువన్= దెబ్బతీయగా; పరాక్రమ కుతూహలి= తన శౌర్యమును ప్రదర్శించేందుకు తహతహపడే; ఆ+విజయుండు; ముఖాంబుజమునకున్= ముఖ కమలమునకు; ఒప్పుగన్=

రాణింపుగా; పిన్ననవ్వు= చిరునవ్వు; ఒలసి= ప్రసరింపజేసి; తద్= ఆ కర్ణుడి; రథ రథ్య కేతుసూతులను= తేరును, గుర్రాలను, టెక్కమును, రథం తోలేటివాడిని; తదీయగాత్రమును= కర్ణుడి దేహమును; తూపులవెల్లిన్= అమ్ములవెల్లువలో; మునుంగన్= మునిగిపోయేటట్లు; చేసినన్= చేయగా.

తాత్పర్యం: కర్ణుడు కోపోద్దీపితుడై కృష్ణార్జునులను పదునైన బాణాల వరుసతో దెబ్బ తీశాడు. దీనితో, ఎప్పుడును తన శౌర్యసంపదను ప్రదర్శించేందుకు ఉత్సాహపడే విజయుడు, చిరునవ్వుతో ముఖపద్మం శోభిల్లగా కర్ణుడి శరీరాన్ని, రథాన్ని, గుర్రాలను, ధ్వజాన్ని, సారథిని, బాణప్రవాహంలో మునిగిపోయేటట్లు చేయగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **ఆతఁడును దురగ సారథి। కేతుయుతము గాఁగ ముంచెఁ గ్రీడయపోలెన్**
శాతశరవృష్టి నన్నరు। నీతెఱఁగున మఱియుఁ బెనఁగి రిద్దఱుఁ గడఁకన్. **286**

ప్రతిపదార్థం: ఆతఁడును= కర్ణుడు కూడా; క్రీడయ పోలెన్= శ్రమలేకుండా ఒక ఆటవలె; ఆ+నరున్= ఆ అర్జునుడిని; తురగ= గుర్రాలు; సారథి; కేతు యుతము కాఁగన్= జెండాతో సహా; శాత= వాడి అయిన; శరవృష్టిన్= అమ్ములవానలో; ముంచెన్= మునిగిపోయేటట్లు చేశాడు; ఈ తెఱఁగునన్= ఈ విధంగా; మఱియున్; ఇద్దఱున్; కడఁకన్= పట్టుదలతో; పెనఁగిరి= పోట్లాడుకొన్నారు.

తాత్పర్యం: కర్ణుడు కూడా అర్జునుడి గుర్రాలను, సారథిని, ధ్వజాన్ని ఒక ఆటవలె అవలీలగా పదునైన బాణవర్షంలో మునిగిపోయేటట్లు చేశాడు. ఈ తీరుగ గట్టిప్రయత్నంతో వారిద్దరూ పోరు సాగించారు.

శా. **ఆయుగ్రాహవకేలి నిట్లు నిపుణుం డై యొప్ప, నప్పార్థుఁ డా**
గ్నేయాస్త్రం బరివోసి దారుణ మహాగ్ని జ్వాలికల్ భీషణ
స్ఫాయద్భంగి నభస్థ్సలిన్ నిగుడ, దర్పస్ఫూర్తి శోభిల్ల రా
ధేయాంగోద్దహనాభిలాష మెడఁదన్ దీపింప బె ట్టేసినన్. **287**

ప్రతిపదార్థం: ఆ; ఉగ్ర= భీకరమైన; ఆహవకేలిన్= వినోదరూపమైన యుద్ధమునందు; ఇట్లు; నిపుణుండు+ఐ ఒప్పన్= ఆరితేరినవాడై ఉండగా; ఆ+పార్థుఁడు; ఆగ్నేయ+అస్త్రంబు; అరివోసి= సంధించి; దారుణ= భయంకర; మహాగ్ని జ్వాలికల్= ప్రచండమైన అగ్నిజ్వాలలు; భీషణ= భయంకరంగా; స్ఫాయత్ భంగిన్= విశాలంగా వ్యాపించే విధంగా; నభఃస్థలిన్= గగనతలాన; నిగుడన్= అలముకొనగా; దర్పస్ఫూర్తిన్= నిండైన సాహసంతో; శోభిల్లన్= ప్రకాశించగా; రాధేయ= కర్ణుడిని; అంగ= శరీరభాగాలను; ఉద్దహనాభిలాషన్= ఎక్కువగా కాల్చివేయాలన్న కోరిక; ఎడఁదన్= మనస్సులో; దీపింపన్= ప్రకాశించగా; బెట్టు+ఏసినన్= తీవ్రంగా ప్రయోగించగా.

తాత్పర్యం: దారుణమైన యుద్ధాన్ని ఒక వినోదక్రీడగా సాగించటంలో ఘటికుడైన ఆ పార్థుడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. దాని ప్రచండ జ్వాలలు ఆకాశాన్నంతా అలముకొని, వెలుతురు ముంచివేసినవి. తన శౌర్యాటోపం రాణించేటట్లు రాధేయుడి శరీరాంగములన్నింటిని మాడ్చివేయాలన్న తీవ్రమైన అభిలాషతో ఆయన మది ఉప్పొంగగా ఆ ఆగ్నేయాస్త్రం ప్రయోగించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. అంతక కోపవహ్ని విపులాకృతి గైకొని వచ్చినట్లు, మి
న్నంతయుఁ దాన యై కవియు నవ్విశిఖంబు మనంబులోన నా
వంతయు శంక లేక, సముదగ్రత వారుణ మార్గణా హతిన్
శాంతముఁ జేసె విక్రమ విశాలుఁడు గర్ణుఁడు మాకు నుబ్బుగన్. 288

ప్రతిపదార్థం: అంతక= యముడియొక్క; కోపవహ్ని= కోపాగ్ని; విపులాకృతిన్= సర్వత్రా వ్యాపించిన స్వరూపాన్ని; కైకొనివచ్చినట్లు= చేకొని ప్రత్యక్షమైన విధంగా; మిన్ను+అంతయున్= ఆకాశమంతా; తాన ఐ= తన రూపమే అయినట్లు; (అంతటా అలముకొని); కవియు= సమీపించే; ఆ+విశిఖంబు= ఆ బాణాన్ని (అర్జునుడు ప్రయోగించిన ఆగ్నేయాస్త్రాన్ని); మనంబులోనన్= చిత్తంలో; ఆవంతయున్= కొద్దిపాటైనా; శంక లేక= సందేహంలేకుండా; విక్రమవిశాలుఁడు= సాహసం నిండారి ఉన్న (శౌర్యం ప్రత్యంగమునందు దీపించి ఉన్న); కర్ణుఁడు; మాకున్; ఉబ్బుగన్= సంతోషాతిశయం కలిగేటట్లు; సముదగ్రతన్= అత్యంత తీక్ష్ణమైన విధంగా; వారుణ= జలసంబంధమైన; మార్గణ+ఆహతిన్= బాణపుదెబ్బతో; శాంతము చేసెన్= ఆర్పివేశాడు; (ఆగ్నేయాస్త్రాన్ని ఆర్పటానికి వారుణాస్త్రమే ఉచితమైనది).

తాత్పర్యం: యముడి కోపాగ్ని వ్యాపించి భీషణాకారాన్ని ధరించి ప్రత్యక్షమైనట్లు, అర్జునుడు ప్రయోగించిన ఆగ్నేయాస్త్ర శక్తి ఆకాశమంతా వ్యాపించి తన్ను సమీపించినా, కించిత్తు కూడా కలకబారని మనస్సుతో సాహసమే రూపాంతరం పొంది ఉన్నట్లు విలసిల్లే కర్ణుడు కడు బెట్టిదమైన వారుణాస్త్రాన్ని దానిపై ప్రయోగించి, ఆ మంటలను ఆర్పివేశాడు. ఇది కౌరవవర్గం ఉబ్బితబ్బిబ్బు అయ్యేటట్లు చేసింది.

ఆ. ఫల్గునుండు మేఘబాణ మేసిన, భూన । భోంతరంబు సంభృతాంధకార
మయ్యెఁ; సూతసూనుఁడనిలాస్త్ర మేయుడు । నా తమంబు విరిసె నా క్షణంబ! 289

ప్రతిపదార్థం: ఫల్గునుండు= అర్జునుడు; మేఘబాణము; ఏసినన్; భూనభోంతరంబు= భువి దివి మధ్య ప్రదేశమంతా; సంభృత అంధకారము+అయ్యెన్= చక్కగా, చిక్కగా అలముకొన్న చీకటితో నిండిపోయింది; సూతసూనుఁడు= కర్ణుడు; అనిల+అస్త్రము= వాయురూపమైన అస్త్రాన్ని; ఏయుడున్= ప్రయోగించగా; ఆ తమంబు= ఆ చీకటి; ఆ క్షణంబు+అ= అప్పటికప్పుడే; విరిసెన్= చెదరిపోయింది.

తాత్పర్యం: ఫల్గునుడు మేఘబాణం వేశాడు. తోడనే రోదసి అంతా కారుమబ్బులు అలముకొని, అంధకారమై పోయింది. దానికి కర్ణుడు విరుగుడుగా వాయవ్యాస్త్రం ప్రయోగించగా ఆ చీకటి అంతా ఆ క్షణంలోనే విరిసిపోయింది.

ఉ. అర్జునుఁ డైంద్రబాణము సమంచిత భక్తి ధరించి మంత్రవి
స్ఫూర్జిత గాండివుం డయి రిపుప్రకరంబులు సంచలింప న
త్యూర్జితశక్తి నేయుడు, మహోగ్రబహు ప్రదర ప్రకారతా
దుర్జయ లీల నిర్మథన దోహలి యై యది కర్ణుఁ గిట్టినన్. 290

ప్రతిపదార్థం: అర్జునుఁడు; ఐంద్రబాణము= ఇంద్రశక్తియుతమైన బాణాన్ని; సమంచితభక్తిన్= ఒప్పిదమైన భక్తిభావంతో; ధరించి; మంత్రవిస్ఫూర్జిత= మంత్రశక్తిచేత అత్యంత ప్రకాశమానమైన; గాండివుండు+అయి= గాండీవాన్ని ధరించినవాడై; రిపుప్రకరంబు= శత్రుసమూహం; సంచలింపన్= వణకిపోగా; అతి+ఊర్జితశక్తిన్= విశేషంగా పెంపొందిన బలంతో; ఏయుడున్=

ప్రయోగించగా; మహోగ్ర= మిక్కిలి భయంకరమయిన; బహుప్రదర= అనేక బాణాల; ప్రకారతా= విధమైన; దుర్జయలీలన్= జయింప సాధ్యంగాని విలాసంతో; నిర్మథన= నిర్మూలించుటయందు; దోహలి ఐ= సమర్థమై; అది= ఆ ఇంద్రబాణం; కర్ణున్; కిట్టినన్= సమీపించగా.

తాత్పర్యం: అర్జునుడు ఇంద్రబాణాన్ని అత్యంత భక్తితోచేపట్టి, గాండీవం మంత్రపూతమై శక్తిమంతము కాగా, అత్యధికబలంతో శత్రుసమూహాలు వణకిపోగా ప్రయోగించాడు. ఆ బాణం అత్యంత తీక్ష్ణమైన శస్త్రసమూహంవలె నిర్నిరోధమైన విలాసంతో సర్వం నిర్మూలించ సమర్థమై కర్ణుడిని సమీపించగా (తరువాతి పద్యంతో అన్వయం).

క. **అతఁ డభిమంత్రిత బాణ । ప్రతతిఁ దదుద్రేక మడఁచి పార్థుని మేనన్**
శిత శరములు నినిచిన మా । రుతపుత్త్రుఁడు గనలి, యన్నరున కి ట్లనియెన్. **291**

ప్రతిపదార్థం: అతఁడు= కర్ణుడు; అభిమంత్రిత= మంత్రింపబడిన; బాణ; ప్రతతిన్= సమూహంతో; తద్+ఉద్రేకము= దాని తీవ్రాటోపాన్ని; అడఁచి= పోగొట్టి; పార్థుని మేనన్; శితశరంబులు= వాడిబాణాలు; నినిచినన్= నింపగా; మారుతపుత్రుఁడు= భీముడు; కనలి= కోపగించుకొని; ఆ+నరునికిన్= ఆ అర్జునుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: తోడనే కర్ణుడు మంత్రశక్తిదీప్తమైన బాణసముదాయంతో ఆ ఇంద్రబాణశక్తిని అణచి, అర్జునుడి దేహంలో పదునైన శరములు నాటాడు. ఇది చూచి భీముడు కోపోద్రిక్తుడై, అర్జునుడితో ఇట్లా అన్నాడు:

ఉ. **'సూతసుతుండు నీయెదుర స్రుక్కక నిల్చుట కాక, నీశర**
వ్రాతము నిల్వరించి యనివారణ నొంపఁ దొడంగె; ఖాండవం
బే తెలివొంది కాల్చితి మహేంద్రుఁడు నివ్వెఱఁగందియుండఁగా
నా తెలి వాత్మ నూల్కొలిపి యగ్గలికం దెగటార్పు మీతనిన్. **292**

ప్రతిపదార్థం: సూతసుతుండు= కర్ణుడు; నీ ఎదురన్; స్రుక్క= భయపడి వెనుదీయక; నిల్చుటకాక= నిలబడటమే కాకుండా; నీ శరవ్రాతమున్= నీ బాణసమూహాన్ని; నిల్వరించి= అరికట్టి; అనివారణన్= అడ్డులేకుండా; నొంపన్= (నిన్ను) నొవ్వజేయుటకు; తొడంగెన్= పూనుకొన్నాడు; మహేంద్రుఁడు= ఇంద్రుడు; నివ్వెఱఁగంది ఉండఁగన్= ఆశ్చర్యంతో చేష్టలుడిగి నిలబడి ఉండగా; ఖాండవము= ఖాండవారణ్యాన్ని; ఏ తెలివి+ఒంది= ఎట్టి వివేకాన్ని పొంది; కాల్చితి(వి)= తగలబెట్టావో; ఆ తెలివిన్= ఆ వివేకాన్నే; ఆత్మన్= మనస్సులో; నూల్కొలిపి= గట్టిచేసికొని; అగ్గలికన్= ఉత్సాహంతో; ఈతనిన్= ఈ కర్ణుడిని; తెగటార్పుము= చంపివేయుము.

తాత్పర్యం: 'కర్ణుడు నీ యెదుట నిలబడి నీవు ప్రయోగించిన బాణసమూహాన్ని నడుమ నిలిపివేయటమే కాకుండా, నిర్నిరోధంగా నిన్ను నొప్పింపసాగాడు. ఇంద్రుడు ఆశ్చర్యంతో నిలిచి చూస్తుండగా ఖాండవ మహారణ్యాన్ని ఏ నైపుణ్యంతో కాల్చివేశావో, ఆ దక్షతనే మనసులో నిలుపుకొని, ఉత్సాహంతో ఇతడిని తుదముట్టించుము.

చ. **తెగి మన కగ్గమై యరుగుదెంచిన వాఁ డితఁ డల్కి యింక నొం**
డుగడకుఁ బోవకుండఁగఁ గడున్ వెస దగ్గఱి, యేఁ గపాలముం
బగులుతునో గదానిహతిఁ బార్థ! భవత్ప్రకటప్రతిజ్ఞకై
తగ దని మాన్చె దేని, నిశిత ప్రదరంబులఁ ద్రుంపు కంఠమున్.' **293**

ప్రతిపదార్థం: పార్థ!= ఓ అర్జునా!; తెగి= తెగించి (అటో ఇటో తేల్చుకొనాలని సాహసించి) మనకున్; అగ్గమై= అసాధ్యుడై; అరుగుదెంచినవాఁడు; ఇతడు; అల్కి= భయపడి; ఇంకన్+ఒండు= ఇంకొొక; కడకున్= దిక్కుకు; పోవకుండఁగన్= పోకుండేటట్లు; కడున్= మిక్కిలి; వెసన్= అత్యంత శీఘ్రంగా; ఏన్= నేను; డగ్గఱి= సమీపించి; గదానిహతిన్= గదదెబ్బతో; ఏన్= నేనే; కపాలమున్= తలను; పగులుతునో= పగులగొట్టియుందునో కదా (కాని); భవత్+ప్రకట= నీవు చాటిపలికిన; ప్రతిజ్ఞకై= శపథపాలనకై (కర్ణుడిని చంపుతానని చేసిన బాస నెరవేరటానికి); తగదని= చంపటం పనికిరాదని; మాన్చెదు+ఏని= మాన్పించేటట్లయితే, నన్ను విరమింపజేసేటట్లయితే; (అతని-కర్ణుడి) కంఠమున్= మెడను; నిశిత= పదునైన; ప్రదరంబులన్= అమ్ములతో; త్రుంపు(ము)= నరికివేయుము.

తాత్పర్యం: తెగించి అటో ఇటో తేల్చుకొనాలని మనతో తలపడేందుకు వచ్చినవాడు ఈ కర్ణుడు. భయంతో ఇంకొొక దిక్కుకు పోకుండా అడ్డగించి, త్వరత్వరగా అతడిని సమీపించి, నా గదదెబ్బతో అతడి తలను ముక్కలుగా చేసియుండేవాడినే. కాని, నీవు ఆ కర్ణుడిని చంపుతానని చేసిన శపథంవలన తగదని నా పూనికను మాన్పించేటట్లయితే, నీవే పదునైన బాణాలతో అతడి మెడను త్రుంచివేయుము.

వ. అని పలికె నప్పుడు. 294

తాత్పర్యం: అని (భీముడు) అన్నాడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. పుండరీకాక్షుండు గాండీవితో 'నీదు । దివ్యబాణములు రాధేయుచేతఁ
దూలపోవుటయు, బల్ దూపుల నాతండు । నిను నొంచి యిట్లు పేర్చిన విధంబు
నుత్సాహ మెడలి నీ వునికియుఁ గని, కురు । సంతతి యార్వఁ బాంచాలకోటి
పిఱుసనిపోవంగ నెఱుఁగవో? యెఱిఁగియుఁ । దగఁ జేయునది లేక వెగడుపడితొ?

తే. చక్ర మిచ్చెద నతని మస్తకము దునుము' । మనిన నగుచుఁ గిరీటి, బ్రహ్మాస్త్ర మధిక
నిష్ఠమై నేయ నది బహునిష్ఠుర ప్ర । దీప్త శరమూర్తిఁ గర్ణుని దెసకు నడరె. 295

ప్రతిపదార్థం: పుండరీకాక్షుండు= శ్రీకృష్ణుడు; గాండీవితోన్= అర్జునునితో; నీదు= నీయొక్క; దివ్యబాణములు= దైవికశక్తిచేత ఊర్జితములైన బాణాలు; రాధేయుచేతన్; తూలపోవుటయున్= నిర్వీర్యమై పోవటమేకాక; బల్ తూపులన్= గొప్ప బాణాలతో; ఆతండు; నిన్; నొంచి= బాధించి; ఇట్లు; పేర్చిన విధంబు= విజృంభించిన రీతి; ఉత్సాహము; ఎడలి= సడలి(తగ్గి); నీవు+ ఉనికియున్= నీవుండుటయు; కని= చూచి; కురుసంతతి= కౌరవసమూహం; ఆర్వన్= కేకలుపెట్టగా; పాంచాలకోటి= పాండవసమూహం; పిఱు చని పోవంగన్= వెనుదిరిగిపోవటం; ఎఱుఁగవో!= తెలిసికొనలేవా!; ఎఱిఁగియున్= తెలిసికూడా; తగన్+చేయునది లేక= ప్రతిక్రియను చేయటం చేతగాక; వెగడుపడితొ?= తబ్బిబ్బు అయినావో?; (ఏదైనా) చక్రము+ఇచ్చెదన్; అతని మస్తకము= కర్ణుడి తలను; తునుముము= నరికివేయుము; అనినన్; నగుచున్= నవ్వుతూ; కిరీటి; బ్రహ్మాస్త్రము; అధికనిష్ఠమైన్= అత్యంత శ్రద్ధతో; ఏయన్= ప్రయోగించగా; అది; బహునిష్ఠుర= అత్యంత కఠినమైన (శక్తిమంతమైన); దీప్త శరమూర్తిన్= ప్రకాశించే బాణాకృతితో; కర్ణుని; దెసకున్= దిక్కుకు; అడరెన్= విజృంభించింది.

తాత్పర్యం: కృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు: 'దైవదత్తాలైన నీ బాణాలు కర్ణుడిచేతిలో పనికిరాకుండా పోవటమేగాక, అతడు అనేకబాణాలతో నిన్ను బాధపెట్టిన విధాన్ని, అతడి విజృంభణతో నీ ఉత్సాహం, నీ యుద్ధ

ప్రేరణశక్తి నిన్ను వదలిపెట్టిపోయిన నీ దైన్యస్థితిని చూచి కౌరవులు ఉప్పొంగి బొబ్బలు పెట్టారు. దీనితో పాండవ పక్షంవారు పిరికివారై వెన్ను చూపి మరలిపోవటం నీ మనసుకు పట్టలేదా? లేక తెలిసికూడ దానికి విరుగుడు చేయలేక తడబడుతున్నావో - తెలియటం లేదు. ఏదైతేనేమి? నా చక్రమిస్తాను, కర్ణుడి తలను నరకి పారవేయుము' అనగా, అర్జునుడు నవ్వుతూ అతిశ్రద్ధతో బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు; అది శక్తిమంతమైన, తేజోవిలాసమైన ఒక బాణాకృతిని దాల్చి, కర్ణుడివైపు అతివేగంగా దూసుకొని పోయింది.

క. ఆ రథికుఁడు దలఁకక నియ । మారూఢ ప్రౌఢభావుఁ డగుచుఁ దదస్త్రో
దారతర బలమునన త । ద్దారుణ సంరంభ ముడిపె ధరణీనాథా! 296

ప్రతిపదార్థం: ధరణీనాథా!= రాజా!; ఆ రథికుఁడు= ఆ కర్ణుడు; తలఁకక= జంకి వెనుదీయకుండా; నియమ ఆరూఢ= నియమావళిని పాటించుటయందు పరిపూర్ణత చెందిన; ప్రౌఢభావుఁడు-ధీరచిత్తుడు; అగుచున్; తద్= ఆ; అస్త్ర= అస్త్రముయొక్క; ఉదారతర= ఎక్కువగా పెంపొందిన; బలమునన= శక్తితోనే; తద్= ఆ బ్రహ్మాస్త్రముయొక్క; దారుణ సంరంభమున్= ఉపద్రవకరమైన దాని ఆర్భాటమును; ఉడిపెన్= తగ్గించివేశాడు.

తాత్పర్యం: ఆ కర్ణుడు నియమాలను పాలించటంలో ప్రౌఢుడై, నిశ్చలచిత్తుడై, ప్రయోగింపబడిన అస్త్రముయొక్క తీవ్రతరమైన బలముతోనే దాని భయంకరమైన విజృంభణాన్ని శక్తిహీనం చేశాడు.

విశేషం: కర్ణార్జునులు ఇద్దరు ఒకే కడుపున పుట్టినా, పుట్టినది మొదలు ప్రతి విషయంలో తీవ్ర ప్రత్యర్థులు, అయినా, ఇద్దరూ స్వధర్మ దీక్షా కంకణబద్ధహస్తులు. రణకళాపారీణతయందు, భయద దివ్యఅస్త్రసంపదయందు అకుంఠిత శౌర్యాటోపము నందు సమతుల్యులుగానే పోషించబడ్డారు. ఇక మరణించిన ఆయనకు వీరస్వర్గం, బ్రతికిన ఆయనకు ప్రాపంచిక కీర్తి మకుటం. కర్ణుడు సమర సముదాచారానికి భంగంగా తల దునుమబడినప్పుడు, ఆయన దివ్యతేజం వారిజాప్తబింబమందే కలిసింది. ఇట్టి మహిమోపేతమైన మరణయోగం భారతీయవీరులలో ఇంకెవరికీ దక్కలేదు. అయినా, పార్థుడికి శాశ్వత తత్త్వశాస్త్ర రంగంలో శోభాయమానమైన కీర్తిస్థానం లభించినది. సర్వమత సమన్వయరూపమై, ఉపనిషత్తుల సారభూతమై ప్రపంచదార్శనికులకు ఆదర్శమై ఇంటింట జ్ఞానదీపమై వెలుగుతున్న భగవద్గీతలో పృచ్ఛకుడై ధన్యుడైనాడు. ఇది అపూర్వఫలం. మతములున్నంత వరకూ ఈయన పేరు నిలిచి ఉంటుంది. ఇట్లా భారతేతిహాసానికి శిరోభూషణమైనాడు.

తే. ఉడిపి, తోడన కవ్వడి యొడలఁ గృష్ణు । మేన మూఁడుమూఁ డడరించె మెఱుఁగుఁదూపు
లన్నరుఁడు గర్ణుతనువు శల్యాంగకములుఁ । జించెఁ దొమ్మిది తొమ్మిది శితశరముల. 297

ప్రతిపదార్థం: ఉడిపి= అట్లు దాని శక్తిని తగ్గించి; తోడన= వెంటనే; కవ్వడి= అర్జునుడి; ఒడలన్= దేహమునందు; కృష్ణుమేనన్= కృష్ణుడి దేహమునందు; మెఱుఁగు తూపులు= కాంతితో తళతళలాడే బాణాలు; మూఁడు మూఁడు= మూడేసి; అడరించెన్= ప్రయోగించాడు; ఆ+నరుఁడు; (దీనికి ప్రతిక్రియగా) కర్ణు తనువున్= కర్ణుడి దేహమును; శల్య+అంగకములున్= శల్యుడి అవయవాలను; తొమ్మిది తొమ్మిది= తొమ్మిదేసి; శితశరములన్= వాడి బాణాలతో; చించెన్= చీల్చివేశాడు.

తాత్పర్యం: పార్థుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రం ఆర్భటిని వమ్ముజేసి, కర్ణుడు కృష్ణార్జునుల దేహాలలో మూడేసి పదునైన బాణాలను చొప్పించాడు. వెంటనే ఆ నరుడు కర్ణుడి దేహాన్ని, శల్యుడి అవయవాలను తొమ్మిది తొమ్మిది బాణాలతో చీల్చివేశాడు.

ఆ. మొనసి క్రీడి మఱియు మూఁడు నెనిమిదియు । రెండు నాల్గు పదియుఁ జండమార్గ
ణములు గ్రుచ్చె; సూతనందనుమై నతఁ । డుఱక యతని మౌర్వి యూడ నేసె! 298

ప్రతిపదార్థం: క్రీడి= అర్జునుడు; మొనసి= పూని; మఱియున్= మరల; మూఁడు ఎనిమిదియు రెండు నాల్గు పదియున్; చండ మార్గణములు= తీవ్రమైన బాణాలను జోడించి; సూతనందను= కర్ణుడి; మైన్= శరీరంలో; గ్రుచ్చెన్= చొనిపినాడు; అతఁడు= ఆ కర్ణుడు; ఉఱక= అవలీలగా, అతని= అర్జునుడి; మౌర్వి= అల్లెత్రాడు; ఊడన్+ఏసెన్= ఊడిపోయేటట్లు బాణం ప్రయోగించాడు.

తాత్పర్యం: కర్ణుడి ప్రయోగాన్ని ప్రతిఘటిస్తూ కిరీటి తీవ్రబాణ సముదాయాన్ని సూతనందనుడి దేహాన నాటాడు. అతడు అనాయాసంగా పార్థుడి అల్లెత్రాటిని ఊడగొట్టాడు.

వ. ఏసి మఱియు శితశరంబులం బొదువం బొలివోవక, పార్థుం డా గుణంబు సమాహితంబు సేసి పెల్లేసిన రయంబున రాధేయుం డతని శింజిని శిథిలంబు గాద కాక యని తలంచె; నాధనంజయుం డతని వింటినారి వికలంబుగాఁ జేసె. 299

ప్రతిపదార్థం: ఏసి= ఆ విధంగా ప్రయోగించి; మఱియున్= ఇంకా; శితశరంబులన్= వాడి అమ్ములను; పొదువన్= ప్రయోగించగా; పార్థుండు; పొలిపోవక= భంగపడక; ఆ గుణంబును= జారిన ఆ అల్లెత్రాటిని; సమాహితంబు+చేసి= సరిచేసి; పెల్లు+ఏసినన్= ఎక్కువగా బాణాలను ప్రయోగించగా; రాధేయుండు; అతని= కిరీటియొక్క; శింజిని= అల్లెత్రాడు; శిథిలంబు కాద కాక= నాశనం కాలేదని; అని తలంచె; ఆ ధనంజయుండు= ఆ అర్జునుడు; అతని= కర్ణుడి; వింటినారిన్= అల్లెత్రాడును; వికలంబున్+కాన్+చేసి= తెగేటట్లుచేసి -

తాత్పర్యం: అట్లా కొట్టి వాడిబాణాలతో క్రమ్ముకొన్నాడు. అయినా అర్జునుడు వెనుకాడక అల్లెత్రాటిని సరిచేసికొని పెక్కుబాణాలు వేయగా, కర్ణుడు అర్జునుడి అల్లెత్రాడు తెగలేదని తలంచాడు. అంతలో అర్జునుడు కర్ణుడి వింటి నారిని త్రెంచివేశాడు.

క. చిఱునగవుతోడ మైమఱువుఁ । వఱువుళ్ళుగఁ జేసి యతనియంగము దోఁగం
బఱపె రుధిరంబు, బెడిదపు । మెఱుఁగు వెడఁద యంపగమి నమిత్రులు దలఁకన్. 300

ప్రతిపదార్థం: చిఱునగవుతోడన్= చిన్ననవ్వుతోడన్; మైమఱువున్= కవచాన్ని; అఱువుళ్లుగన్= శిథిలముగా; చేసి; బెడిదపు= గట్టి; మెఱుఁగు; వెడఁద= వెడల్పుగల; అంపగమిన్= బాణసమూహముతో; అమిత్రులు= శత్రువులు; తలఁకన్= అదరిపోగా; అతడి అంగము= అతడి (కర్ణుడి) శరీరము; రుధిరంబు= రక్తంబు; దోఁగన్= కారునట్లు; పఱపెన్= చేసినాడు.

తాత్పర్యం: (అర్జునుడు) చిరునవ్వు చిందులాడగా కవచాన్ని చిదురుగా చేసి, భయంకరకాంతులు చిమ్మే విశాల బాణసమూహంతో కర్ణుడి శరీరం నెత్తురు కారేటట్లు చేశాడు. దీనితో విరోధులు భయపడిపోయారు.

చ. తెరలక కర్ణుఁ డవ్విజయుఁ దీవ్ర శర త్రయవిద్ధుఁ జేసి, మం
దరధరు నస్త్రపంచక నితాంతహతిం గడు నొంచె నా శరో
త్కరము వరప్రభావకలితం బగుటన్ మగుడంగ వచ్చె ని
ష్ఠుర రభసం బెలర్ప మధుసూదనుఁ గ్రమ్మఱ నేసె నాతఁడున్. 301

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కర్ణుఁడు; తెరలక= వైదొలగిపోకుండా; ఆ+విజయున్; తీవ్రశరత్రయ= మిక్కిలి పదునైన మూడుబాణాలతో; విద్ధున్+చేసి= బాధించి; మందరధరున్= మందరపర్వతము నెత్తిన (మోసిన) కృష్ణుడిని; అస్త్రపంచక= అయిదుబాణాల; నితాంతహతిన్= తెరిపి లేని దెబ్బలతో; కడున్ నొంచెన్= ఎక్కువగా బాధించాడు; ఆ శర+ఉత్కరము= ఆ బాణసమూహం; వరప్రభావ కలితంబు+అగుటన్= దైవం ప్రసాదించిన వరంచేత శక్తిమంతమైనది కావటంవలన; నిష్ఠుర= కర్కశమైన; రభసంబు= వేగం; ఎలర్పన్= అతిశయించగా; మగుడంగన్+వచ్చెన్= లక్ష్యాన్ని తాకి తిరిగి వచ్చింది; మధుసూదను= మధురాక్షస సంహారి అగు కృష్ణుడిని; ఆతఁడున్= కర్ణుడు; క్రమ్మఱన్= మరల; (దానిని); ఏసెన్= (బాణాలతో) కొట్టాడు.

తాత్పర్యం: పార్థుడు చేసిన బాణప్రయోగానికి కర్ణుడు వెనుదీయకుండా నిలిచి, ఆ విజయుడిని మూడు బాణాలతో బాధించాడు. కృష్ణుడిని ఐదుబాణాలతో అలయింపజేశాడు. కర్ణుడుపయోగించిన బాణాలన్నీ దైవానుగ్రహంతో శక్తిస్ఫూర్తిని పొందినవైనందున, లక్ష్యాన్ని తాకి వెనుదిరిగి వచ్చి కర్ణుడిని చేరాయి. వెంటనే ఆతడు కృష్ణుడిపై ఆగ్రహావేశంతో వాటిని తిరిగి ప్రయోగించాడు.

విశేషం: సారథియైన శ్రీకృష్ణ భగవానుడికి కూడా ఆ సూతుడి దెబ్బలు తప్పలేదు. శ్రీకృష్ణుడి చక్రం వలెనే కర్ణుడి బాణాలు కూడా లక్ష్యాన్ని దెబ్బతీసి, తిరిగి ఆయన చేతికి వస్తున్నవి. (ఆస్ట్రేలియా ఆదిమజాతులు కొడవలివలె వంక తిరిగిన కొయ్య సాధనం విసిరితే అది దెబ్బకొట్టి తిరిగివచ్చి, వారిచేతిలో చేరుతుందట. ఇందు హస్తలాఘవం, ఆ పనిముట్టు తీరేగాని వరప్రసాదం లేదేమో?)

క. అలఘు పటుభల్ల పంచక । ముల రెంటం గ్రీడి చిత్రముగ నయ్యస్త్ర
మ్ములు మూఁడు మూఁడు శకల । మ్ములుగాఁ దునుమాడె, జనులు పొగడ నరేంద్రా! 302

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా!; అలఘు= తక్కువగాని; పటు= పటిష్ఠమైన; భల్ల పంచకముల= ఐదుబాణాల; రెంటన్= రెండుబాణాలతో; క్రీడి; చిత్రముగన్= ఆశ్చర్యంగా; ఆ+అస్త్రమ్ములు= కర్ణుడు వేసిన (అయిదు) బాణాలు; జనులు పొగడన్= ప్రజలు పొగడగా; మూఁడు మూఁడు; శకలమ్ములుగాన్= తునకలుగా; తునుమాడెన్= ఖండించాడు.

తాత్పర్యం: కర్ణుడు మళ్ళీ ప్రయోగించిన పటిష్ఠమైన అయిదుబాణాలను అర్జునుడు రెండుబాణాలతో మూడేసి తుంటలుగా విరుగగొట్టాడు. ఆశ్చర్యకరంగా జరిగిన ఈ విధ్వంసాన్ని చూచినవారు కొనియాడారు.

క. కర్ణునిమెయి నాలోనన । కర్ణాంతాకృష్ట చండకాండము లధికో
దీర్ణక్రోధంబున న । భ్యర్ణగతుం డగుచుఁ గ్రుచ్చె నతఁ డే పలరన్. 303

ప్రతిపదార్థం: ఆలోనన= ఆలోపలనే; కర్ణాంత+ఆకృష్ట= చెవులు తాకేటట్లు లాగబడిన; చండకాండములు= దారుణమైన బాణాలను; అధిక ఉదీర్ణ= అత్యంతము అధికమైన; క్రోధంబునన్= కోపంతో; అభ్యర్ణ గతుండు+అగుచున్= సమీపించినవాడై; అతఁడు= అర్జునుడు; కర్ణుడి మెయిన్= కర్ణుడిదేహంలో; ఏపు అలరన్= విజృంభణం ఒప్పగా; క్రుచ్చెన్= చొరబడచేశాడు.

తాత్పర్యం: ఆ లోపలనే కిరీటి చెవులంట లాగివిడిచిన బాణాలను అత్యంతం రేగిన క్రోధంతో కర్ణుడిని సమీపించి, ఉప్పొంగుతూ అతడి శరీరంలో నాటాడు.

చ. మఱియు నరుండు సూతసుతు మర్మవిభేదన మాచరించిన
న్నెఱుఁగులు గ్రమ్మునమ్ముల వినిశ్చలధైర్యము పేర్మి నాతఁ డు
క్కఱక పెనంగె దానఁ గన లగ్గలమై వెస నమ్మహాభుజుం
డఱిముఱిఁ జీఁకటుల్ గవియు నట్లుగ రోదసి నించెఁ దూపులన్. 304

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; నరుండు; సూతసుతు= కర్ణుడి; మర్మ= జీవస్థానాలను; విభేదనము= చీల్చటం; ఆచరించినన్= చేయగా; అతండు= కర్ణుడు; ఉక్కు= సత్తువను; అఱక= పోగొట్టకొనకుండా; మెఱుఁగులు క్రమ్మ= కాంతులు వ్యాపింపజేసే; అమ్ములన్= బాణాలతో; వినిశ్చల ధైర్యము= అచంచలమైన ధైర్యముయొక్క; పేర్మిన్= వృద్ధితో; పెనంగెన్= పోరాడాడు; దానన్= దానితో; కనలు= కోపం; అగ్గలమై= అతిశయించి; వెసన్= వెంటనే; ఆ+మహాభుజుండు= ఆ బాహుబలశాలి; అఱిముఱి= సంభ్రమించి (త్వరపడి); చీఁకటుల్; కవియునట్లుగన్= వ్యాపించేటట్లుగా; రోదసి= భూమ్యాకాశాల మధ్య ప్రదేశమంతా; తూపులన్= బాణాలతో; నించెన్= నిండింపచేశాడు.

తాత్పర్యం: అంతేకాక అర్జునుడు కర్ణుడి జీవస్థానాలైన మర్మాంగాలను భేదించగా, ఆ దెబ్బలకు కర్ణుడు చెక్కు చెదరని ధైర్యంతో ప్రజ్వలించే నిశిత శరపరంపరను ప్రయోగిస్తూ యుద్ధం సాగించాడు. దానితో ఇంకా కోపం ఉగ్రమై పెరగగా, ఆ దోర్బలశాలి అర్జునుడు వెంటనే అత్యంత ఉత్సాహి అయి భూనభోంతరాలు చీకట్లు క్రమ్ముకొనేటట్లు బాణాలతో నింపాడు.

తే. వెగడువడి చక్రరక్షకుల్, వెనుక దిక్కు । గాచు రథికులుఁ బార్శ్వసంగతులుఁ దమ్ము
విడువఁ జాలక లజ్జ వో విడిచి రపుడు । గర్ణువారలు వాఱుట గని, విభుండు. 305

ప్రతిపదార్థం: వెగడు+పడి= తడబాటు పొంది; చక్రరక్షకుల్= రథచక్రాలను కాపాడుతున్నవారు; వెనుక దిక్కు= వెనుక పార్శ్వమును; కాచు= కావలికాస్తున్న; రథికులున్= రథ సైనికులు; పార్శ్వసంగతులు= ప్రక్కల ఉన్న సైనికులు; తమ్మ విడువజాలక= రథమందున్నవారిని విడిచిపెట్టి పోయేందుకు మనస్కరించకపోయినా; లజ్జ పోన్ విడిచిరి= సిగ్గు విడిచి; పరుగెత్తి పోసాగారు; అపుడు; కర్ణువారలు= కర్ణుడి మనుష్యులు; పాఱుట= పలాయనులవటం; కని= గమనించి; విభుండు= ప్రభువైన దుర్యోధనుడు.

తాత్పర్యం: రథచక్రాలను రక్షించేవారు, వెనుక దిక్కు రక్షగా ఉండేవారు, రథానికి రెండుప్రక్కల రక్షగా ఉండేవారు- తమతమ స్థానాలను వదలిపోలేక, చివరకు భయపడి సిగ్గువిడిచి పారిపోయారు. ఈ విధంగా కర్ణుడి సహాయకులు పరుగెత్తిపోవటం చూచి దుర్యోధనుడు - (తరువాతి పద్యంతో అన్వయం)

క. ఆ దిక్కువారు భీముం । డాదిగ నని సేయకుండు నన్నియతి యెడం
దా దైన్యమొంది తప్పం । గా దని యూహింపనీని కలఁక కతమునన్. 306

ప్రతిపదార్థం: భీముండు+ఆదిగన్= భీముడు మొదలుకొని; ఆ దిక్కువారు= ఆ పక్షంవారు; అని చేయకుండు= యుద్ధం చేయరాదనే; ఆ+నియతి= ఆ కట్టడి; ఎడన్= పట్ల; తాన్= తాను; దైన్యమొంది= దిగులుపడి; తప్పన్+కాదని= అది తప్పించుకొనటానికి వీలుకానిదని; ఊహింపనీని= యోచించేందుకు వీలు కల్పించకుండా చేసిన; కలఁక= దిగులు; కతమునన్= కారణంవలన.

తాత్పర్యం: ప్రతిపక్షంలో భీముడు మొదలైనవారు యుద్ధంలో పాల్గొనరాదు అన్న నియమంపట్ల దుర్యోధనుడు బాధపడి, ఇది తొలగించుకుందామని అనుకోవటానికి కూడా అవకాశమివ్వని మనోవ్యాకులతవల్ల. (తరువాతి గద్యంతో అన్వయం).

దుర్యోధనుఁడు తన యోధుల నర్జునుం దలపడఁ బురికొలుపుట (సం. 8-65-42)

వ. ఇరుగెలంకుల మూఁకలం గలయం గనుఁగొని యెలుంగెత్తి. 307

ప్రతిపదార్థం: ఇరు కెలంకుల= ఉభయపక్షాల; మూఁకలన్= గుంపులను; కలయన్ కనుఁగొని= పరికించి చూచి; ఎలుంగెత్తి= ఉదాత్తస్వరంతో.

తాత్పర్యం: ఉభయపక్షాల సైనికులను కలయచూచి గొంతెత్తి (ఇట్లా అన్నాడు). (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'తొడరుఁడు పొదువుం డేయుఁడు । పొడువుఁడు బీభత్సుఁ బ్రిదిలి పోనీక వెసం
బడవైపుం డొక్కుమ్మడిఁ । గడఁగి!' యనుచుఁ జేయి వీచెఁ గౌరవనాథా!' 308

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ధృతరాష్ట్రుడా!; తొడరుఁడు= ధిక్కరించండి; పొదువుండు= పైబడి క్రమ్ముకొనండి; ఏయుఁడు= దెబ్బతీయండి; పొడువుఁడు; ఒక్కుమ్మడిన్= కలిసికట్టుగా ఏకమైన ప్రయత్నంతో; కడఁగి= సాహసం చూపి; బీభత్సుని= వివ్వచ్చుడిని; ప్రిదిలి పోనీక= తప్పించుకొని పోనీయకుండా; వెసన్= వెంటనే; పడవైవుండు= నేలపై పడేటట్లు చేయండి; అనుచున్= అంటూ; చేయి వీచెన్= చేయి ఆడించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు గొంతెత్తి సమరోత్సాహ దీపకాలైన ప్రబోధవాక్యాలతో, 'అర్జునుడు తప్పించుకొని పోకుండా పట్టండి, పొడవండి నేలపాలు చేయండి. అందరూ ఒక్కుమ్మడిగా క్రమ్ముకోండి' అని అంటూ చేయివీచి ప్రోత్సాహించాడు.

క. విను, మతఁ డిమ్మెయిఁ బురికొలి । పిన, రథ కరి తురగ సుభటబృందములు రయం
బున నురవణించె నయ్యు । ర్జును పైఁ దగువారు నిలిచి చూచుచు నుండన్. 309

ప్రతిపదార్థం: విను= బాగా చెవియొగ్గుము; అతఁడు= దుర్యోధనుడు; ఈ+మెయిన్= ఈ విధంగా; పురికొలిపినన్= కవ్వించేటట్లు చేయగా; రథ; కరి= ఏనుగులు; తురగ= గుర్రాల; సుభటబృందములు= ఆరితేరిన గట్టి సైనికుల సమూహాలు; రయంబునన్= త్వరత్వరగా; ఆ+అర్జునునిపైన్; తగువారు= అర్హులైనవారు; నిలిచి చూచుచున్; ఉండన్= ఉండగా; ఉరవణించెన్= విజృంభించాయి.

తాత్పర్యం: ఇట్లా రెచ్చగొట్టగా చతురంగ బలాలు, అందరు చూస్తుండగా వెంటనే మహావేగంగా అర్జునుడిపై పడి చుట్టుకొన్నారు.

వ. ఎదిరి సైన్యంబు సమరంబు దొలంగి యుండుట యెఱింగి కడఁగుట పాడిగా దని దొరలు దురంబునకుం జొరకుండిరి; గాండీవి కోదండగుణ రణన భరిత భూనభోంతరుం డగుచు వివిధ విశిఖ జ్వాలా

కలాపంబుల వేఁడిమి సూపిన, నేపఱీ వెఱచి యమ్మూఁకలు పఱచినం గనుంగొని యక్కురునాథుం డద్దొరల నుద్దేశించి. 310

ప్రతిపదార్థం: ఎదిరి సైన్యంబు= విరోధిసేన; సమరంబు= యుద్ధమును; తొఱఁగి= విడనాడి; ఉండుట ఎఱింగి; కడఁగుట= పైబడి తాకుట; పాడికాదు+అని= ఉచితం కాదని; దొరలు= నాయకులు; దురంబునకున్= యుద్ధమునకు; చొరకుండిరి= పూనుకొనకుండిరి; గాండీవి= అర్జునుడు(తన); కోదండగుణ= వింటి అల్లెత్రాటి; రణన= మ్రోతతో; భరిత= నిండిన; భూనభోంతరుండు+అగుచున్= దివి భువి మధ్యప్రదేశం కలవాడవుతూ; వివిధ విశిఖ= పలురకాలైన బాణాల; జ్వాలాకలాపంబుల= నిప్పుల సమూహంతో; వేఁడిమి చూపినన్= ఉడుకు చూపగా; ఏపు అఱి= ఉద్ధృతి అణగి; వెఱచి= భయపడి; ఆ+మూఁకలు= ఆ సైన్యసమూహాలు; పఱచినన్= పారిపోగా; కనుంగొని; ఆ+కురునాథుండు= ఆ దుర్యోధనుడు; ఆ+దొరలన్= ఆ సేనాపతులను; ఉద్దేశించి= వారితో ఇట్లాఅన్నాడు.

తాత్పర్యం: పాండవసైన్యం యుద్ధంమాని ఉండటం గమనించి కౌరవపక్షం యుద్ధం చేయటం న్యాయం కాదని నాయకులు ఊరకున్నారు. అర్జునుడు గాండీవి గుణధ్వనిని భూనభోంతరాలు మ్రోగేటట్లు చేశాడు. పలురకాలైన బాణాల మంటలతో వేడి పుట్టేటట్లు చేయగా ఆ మూకలు పరుగెత్తిపోయాయి. అది చూచి దుర్యోధనుడు ఆ రాజులతో (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'బీరమును లావుఁ గల్గిన । మీరందఱుఁ గర్ణు నొకని మీఁదన యిమ్మైఁ
బోరెల్లఁ ద్రోచి ఫల్గును । జేర కునికి యాయుధోపజీవుల తెఱఁగే?' 311

ప్రతిపదార్థం: బీరమును= పరాక్రమం; లావున్= దేహసౌష్ఠవమిచ్చిన బలం; కల్గిన; మీరు+అందఱున్; ఈ+మెయిన్= ఈ విధంగా; పోరు+ఎల్లన్= సంపూర్ణ సమర నిర్వహణబాధ్యతను; కర్ణునొకని మీఁదన= ఒక్క కర్ణుడి తలపైననే నెట్టిపెట్టి; ఫల్గునున్= అర్జునుని; చేరకునికి= ఎదుర్కొనకుండటం; ఆయుధ= ఆయుధాలవలననే; ఉపజీవుల= బ్రతికే మీయొక్క; తెఱఁగే?= విధానమా? (ఉచితం కాదని భావం.)

తాత్పర్యం: పరాక్రమం, బలం కలిగిన మీరంతా, ఈ యుద్ధనిర్వహణ బాధ్యతనంతా కర్ణుడొక్కడిమీదనే మోపి, అర్జునుడి జోలికి పోకుండా ఉండటం పోరులతోనే పొట్టపోసికొని బ్రతికే మీ బోంట్లకు తగి ఉన్నదా?'

వ. అనిన విని, యుల్లంబుల లేని యుత్సాహంబు దెచ్చికొని వా రొక్కుమ్మడి నురవడించిన. 312

ప్రతిపదార్థం: అనినన్ విని; ఉల్లంబులన్= మనస్సులలో; లేని; ఉత్సాహంబు; తెచ్చికొని; వారు; ఒక్కుమ్మడిన్= ఒక్కపెట్టున; ఉరవడించినన్= పరాక్రమించగా.

తాత్పర్యం: అనగా విని కౌరవవీరుల మనసులలో లేని ఉత్సాహాన్ని బలవంతంగా పొందుపరచుకొని ఒక్కసారిగా విజృంభించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. భరిత క్రోధ మహోగ్రవృత్తి సిడముల్ భంజించుచున్, సూతుల
న్ధరణిం గూల్చుచుఁ, జాపముల్ నఱకుచున్, రథ్యంబులం జంపుచున్,
నరుఁ డాభీల పరాక్రముం డగుడు దైన్యం బంది వెన్నిచ్చి వి
చ్చిరి వా రందఱు; దివ్యసంఘము నుతించెం జూచి యవ్వీరునిన్. 313

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; ఆభీల= భయంకరమైన; పరాక్రముండు= పరాక్రమవంతుడు; అగుడున్= కాగా; భరిత= పరిపూర్ణమైన; క్రోధ= కోపంయొక్క; మహా+ఉగ్రవృత్తిన్= మహాభయంకరమైనవిధంగా; సిడముల్= పతాకధ్వజాలను; భంజించుచున్= విరుగగొట్టుతూ; సూతులన్= రథాలు నడిపేవారిని; ధరణిన్= నేలపై; కూల్చుచున్= పడగొట్టుతూ; చాపముల్ నఱకుచున్= విల్లులు తుంటలు చేస్తూ; రథ్యంబులన్= తేరులు లాగే గుర్రాలను; చంపుచున్= చంపివేస్తూ; (ఆభీల పరాక్రముడు కాగా); వారందఱున్= విరోధి సైనికులందరు; దైన్యంబు+అంది= దీనస్థితిని పొంది; వెన్ను+ఇచ్చి= వీపు చూపి; విచ్చిరి= చెల్లాచెదరై పారిపోయారు; చూచి= దీనిని చూచి; దివ్య సంఘము= దేవతాగణం; ఆ+వీరున్= మొనగాడైన ఆ అర్జునుడిని; నుతించెన్= పొగడింది.

తాత్పర్యం: భయంకర పరాక్రమోపేతుడైన పార్థుడు కోపాతిరేకంతో మహాదారుణంగా విజృంభించి విరోధివీరుల పతాకాలను, సారథులను నేలపాలు చేస్తూ, గుర్రాలను, విల్లులను తునుమాడుతూ చెలరేగగా విరోధిసైన్యాలు దీనస్థితిలో పడి, వెనుదిరిగి చెల్లాచెదరై పరుగెత్తిపోయాయి. దీనిని చూచిన దేవతలు విజయుడిని స్తుతించారు.

చ. **కురుపతి వెండియుం దఱుమఁ గోల్తల సేయర క్రమ్మఱంగ నె**
వ్వరు నతిభీతి నిట్లు మనవా రెడగాఁ జని చూచుచుండి; ర
ప్పరుసున నా సమిద్ధరణిభాగము శూన్యతఁ బొందఁ గర్ణుఁ డ
న్నరుఁ దలపడ్డ నప్పటి రణంబు మహాద్భుత మయ్యె భూవరా! **314**

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; కురుపతి= దుర్యోధనుడు; వెండియున్= మరలా; తఱుమన్= ముందుకు రండని త్వరపెట్టగా; అతిభీతిన్= మిక్కిలి భయంతో; క్రమ్మఱంగన్= వెనుదిరిగి పోరు చేయటానికీ; కోల్తల= ఎదురెదురుగా నిలబడి చేసే యుద్ధం; చేయరు+అ= చేయలేకుండిరి; ఇట్లు; మనవారు; ఎడగాన్+చని= దూరంగా పోయి; చూచుచుండిరి; ఆ+ పరుసునన్= ఆ విధంగా; ఆ సమిద్ధరణిభాగము= ఆ యుద్ధ భూభాగము; శూన్యతన్+ఒందన్= ఎవరూ లేకుండా వట్టిది కాగా; కర్ణుఁడు; ఆ+నరున్; తలపడ్డన్= ఎదుర్కొనగా; అప్పటి రణంబు= ఆ సమయంలో యుద్ధం; మహాద్భుతము+అయ్యెన్= అత్యంత ఆశ్చర్యకరమైనది అయింది.

తాత్పర్యం: దుర్యోధనుడు పరుగెత్తి వచ్చిన సైనికులను మరల ముందుకు తరుమగా, భయభ్రాంతులై వారందరూ ముఖాముఖి పోరాటానికి విముఖులై, దూరంగా పోయి జరిగే యుద్ధాన్ని చూస్తూ నిలబడిపోయారు. వారి పోకతో, ఆ యుద్ధభూమి వట్టి బయలైనది. అప్పుడు కర్ణార్జునులు తలపడ్డారు. ఆ యుద్ధం చాలా వింత గొల్పింది.

చ. **శ్రమమున సోలుచుండియుఁ బరాక్రమసంపద సొంపు మీఱ, దు**
ర్దమ వివిధాస్త్రజాల తిమిరంబుల నొండొరుఁ గప్పి కప్పి శౌ
ర్యములును బాహువీర్యములు రాజుల నచ్చెరు వందఁజేయ ను
గ్రముగఁ బెనంగి రయ్యమరరాజతనూజుఁడు సూతసూనుఁడున్. **315**

ప్రతిపదార్థం: శ్రమమునన్= పడిన కష్టంవలన; సోలుచుండియున్= తూలిపోతూ ఉండి కూడా; ఆ+అమర రాజ తనూజుఁ డున్= ఆ దేవేంద్ర తనయుడగు అర్జునుడు; సూతసూనుఁడున్= సారథి పుత్రుడగు కర్ణుడు; పరాక్రమ సంపదన్= శౌర్య సమృద్ధి; సొంపుమీఱన్= అందగించగా; దుర్దమ= ఎదురులేని; వివిధ+అస్త్రజాల= నానావిధాలైన ఆయుధాల సమూహాలచే (కల్పించిన); తిమిరంబులన్= చీకట్లతో; ఒండొరులన్= ఒకరినొకరు; కప్పి, కప్పి; శౌర్యములును= వారి ప్రతాపములు;

బాహువీర్యములున్= బాహుబలములు; రాజులన్= చూస్తున్న ప్రభువులను; అచ్చెరువు+ఒందన్+చేయన్= ఆశ్చర్యపడేటట్లు చేయగా; ఉగ్రముగన్= భయంకరంగా; పెనంగిరి= పోరాడారు.

తాత్పర్యం: కర్ణార్జునులిరువురూ యుద్ధక్లేశంతో తూలిపోతున్నప్పటికీ, శౌర్యలక్ష్మీశోభతో అణచ శక్యంగాని నానావిధ ఆయుధాలప్రయోగంతో, అలముకొన్న చీకట్లతో ఒకరినొకరు కప్పివేసికొంటూ భయంకరంగా పోరాడారు. ఇది చూస్తూఉండిన నానారాజ్య పాలకులు వీరిద్దరు చూపుతున్న ప్రతాపానికీ, భుజబలశక్తికీ ఆశ్చర్య చకితులైనారు.

వ. అట్టియెడఁ, దక్షకునపత్యంబై తత్సోదరుం డగు నైరావతుండు పెనిచి యుపలాలింప నుల్లసిల్లిన యశ్వసేనాభిధానుం డగు నాగకుమారుండు, సర్పముఖశరాకారంబుగైకొని తనయొద్ద నుండఁ, దాను బసిండి యొఱం బెట్టి యనుదినంబును గంధపుష్పంబులు నక్షతంబుల నర్చించుచు నయ్యర్జునుమీఁదం బ్రయోగించువాఁడై యున్న, యట్టి యమ్మహనీయాస్త్రంబు రోషావేశ వివశుం డగుచుఁ బుచ్చికొని, తల దెగవ్రేయుటకై యక్కర్ణుండు సముదీర్ణ జ్వాలాజాలంబు లంబరంబునం బర్వఁ జూపఱులు హాహాకారంబులు సేయం గార్ముకగుణంబున సంధించి తెగవాపినం గని, యారథికుచూపు కంఠంబు దక్కటికిం గాక తప్పి యపాంగ ప్రదేశంబు కొలంది యగుటంజేసి, యది నెపంబుగా శల్యుం డతనికిఁ జిత్తవైకల్యం బాపాదింపం దలంచి 'యీ సంధానంబు మెడ దునుముట కనుగుణంబు గాదు! నిపుణంబుగా నిరూపించి యొండుభంగి సంధింపు' మనినఁ గర్ణుండు గనలునఁ గనుఁగవఁ గెంపు గడలుకొన, నమ్మద్రపతిం జుఱచుఱం జూచి.

316

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో; తక్షకు అపత్యంబై= తక్షకుడి సంతానమై; తద్= ఆ తక్షకుడి; సోదరుండు+అగు= తోబుట్టువగు; ఐరావతుండు; పెనిచి= పెంచి; ఉపలాలింపన్= బుజ్జగించగా; ఉల్లసిల్లిన= వికాసంపొందిన; అశ్వసేన, అభిధానుండు+ అగు= అశ్వసేనుడనే పేరు కలవాడగు; నాగకుమారుండు; సర్పముఖ= పాముపడగవంటి; శరాకారంబు= బాణరూపాన్ని; కైకొని= తాల్చి; తనయొద్దన్= తనదగ్గర; ఉండన్= ఉండగా; తాను; (దానిని) పసిండి ఒఱన్= బంగారు ఒరలో; పెట్టి; అనుదినము= ప్రతిదినం; గంధపుష్పంబులన్; అక్షతంబులన్; అర్చించుచున్; ఆ+అర్జునుమీఁదన్; ప్రయోగించువాఁడై= ఉపయోగించాలనే సంకల్పం కలవాడై; ఉన్నన్= ఉండగా; అట్టి= అటువంటి; మహనీయ అస్త్రంబు= గొప్ప మంత్రచోదిత బాణం; రోష ఆవేశ= రేగిన కోపపు పొంగువలన; వివశుండు+అగుచున్= తన వశం దప్పిన మనస్సుగల వాడౌతూ; పుచ్చికొని= చేపట్టి; తల తెగ వ్రేయుటకై= (అర్జునుని) తల నరికివేసేందుకు; ఆ+కర్ణుండు; సముదీర్ణ= మిక్కిలి గొప్పదైన; జ్వాలాజాలంబులు= మంటలసమూహం; అంబరమునన్= ఆకాశంలో; పర్వన్= వ్యాపించగా; చూపఱులు= చూచేవారు; హాహాకారంబులు= బొబ్బరింతలు; చేయన్= చేస్తుండగా; కార్ముక గుణంబునన్= వింటి అల్లెత్రాడుతో; సంధించి= కలిపి; తెగవాపినన్= ఎక్కుపెట్టగా; కని= చూచి; ఆ రథికు= ఆ యోధాగ్రేసరుడైన కర్ణుడి; చూపు= దృష్టి; కంఠంబు చక్కటికిన్= గొంతు దగ్గరకు; కాక తప్పి= కాకుండా తొలగిపోయి (లక్ష్యం దాటిపోయి); అపాంగ ప్రదేశంబు= కడగంట చూపు పారే స్థలం; కొలంది అగుటన్+చేసి= వరకు ఉండటం వలన; అది నెపంబుగన్= అది ఒక సాకుగా; శల్యుండు; అతనికిన్; చిత్తవైకల్యంబు= మతిభ్రమ; ఆపాదింపన్+తలంచి= కలిగించుటకు నిర్ణయించుకొని; ఈ సంధానంబు= బాణాన్ని వింటినారిలో అమర్చే పద్ధతి; మెడ దునుముటకున్= గొంతు త్రుంచుటకు; అనుగుణంబుకాదు= అనుకూలం కాదు; నిపుణంబుగాన్= నేర్పరితనంతో; నిరూపించి= ఏర్పరచి; ఒండు భంగిన్= ఇంకొక విధంగా; సంధింపుము= అమ్మును అమర్చుము; అనినన్; కర్ణుండు; కనలునన్= కోపంతో; కనుంగవన్= రెండు కన్నులలో; కెంపు= ఎర్రదనం; కడలుకొనన్= వ్యాపించగా; ఆ+మద్రపతిన్= మద్రదేశాధీశుడైన శల్యుడిని; చుఱచుఱన్= కరకుగా; చూచి.

తాత్పర్యం: అప్పుడు తక్షకుడి కొడుకు - అతడి సోదరుడైన ఐరావతుడు పెంచి ఉపలాలించిన అశ్వసేనుడు అనే పేరుగల నాగకుమారుడు సర్పముఖ బాణాకారంలో తన వద్ద ఉండగా, దానిని బంగారుఒరలో పెట్టి గంధపుష్పాలతో ప్రతిదినం పూజిస్తూ, అర్జునుడి మీద ప్రయోగించాలని దాచి ఉంచిన ఆ మహాస్త్రాన్ని కర్ణుడు రోషావేశంతో చేపట్టి అర్జునుడి తల తెగవేయాలని లక్షించి, మంటలు చెలరేగి ఆకాశాన్ని అంటగా, చూచేవారు హాహాకారాలు చేయగా, వింటికి అల్లెత్రాడు సంధించి ప్రయోగించటానికి సిద్ధం అయ్యాడు. అప్పుడు అతడి గురి కంఠాన్ని తప్పి క్రీగంటి ప్రాంతంలో తగిలేటట్లు ఉండగా గమనించి, దానిని నెపంగా చేసికొని శల్యుడు కర్ణుడికి మనశ్చాంచల్యాన్ని కలిగించటానికి 'ఈ లక్ష్యం మెడ నరకటానికి అనుగుణంగా లేదు. నేర్పరితనంతో నిరూపించి మరొకవిధంగా సంధించుము' అని అనగా కర్ణుడు కోపంతో కన్నుల నిప్పులు రాలగా శల్యుడిని చురచుర చూచి (ఇట్లా అన్నాడు).

క. 'ననుబోఁటి జోదునుం గా । దని పలుకఁగ నేర్పు నీకు నంత గలదె? య
ట్లును గాక వినుము కర్ణుం । డినుమాఱొక శరము దొడుగునే పరులు నగన్?' 317

ప్రతిపదార్థం: ననుబోఁటి= నావంటి; జోదునున్= యుద్ధవీరుడిని; కాదని= త్రోసిపుచ్చి; పలుకఁగ నేర్పు= అనగలిగిన సామర్థ్యం; నీకున్; అంతకలదె?= నీకు అంతగా ఉన్నదా?; అట్లునుగాక= అదీగాక; వినుము; పరులు= ఇతరులు; నగన్= నవ్వేటట్లు; కర్ణుండు; ఇనుమాఱు= రెండుసార్లు; ఒక శరము= ఒకే బాణాన్ని; తొడుగునే?= ధనుస్సుకు సంధిస్తాడా?

తాత్పర్యం: నా వంటి యోధుడిని త్రోసిపుచ్చి మాట్లాడే సామర్థ్యం నీకు అంతగా ఉన్నదా? అదీగాక నా సంగతి వినుము. ఇతరులచేత నగుబాట్ల పాలయ్యేటట్లు ఈ కర్ణుడు ఒకమారు గురిపెట్టి సంధించిన బాణాన్ని మళ్ళీ గురి మార్చి సంధిస్తాడా?

వ. అని పలికి, కలుషం బగుచిత్తంబుతో నెలుంగెత్తి 'ఫల్గున! ఫల్గున! పొలిసి' తంచు నేసిన. 318

ప్రతిపదార్థం: అని పలికి; కలుషంబగు= కలకబారిన; చిత్తంబుతోన్; ఎలుంగెత్తి= బిగ్గరైన కంఠస్వరంతో; ఫల్గున! ఫల్గున!= అర్జునా!; పొలిసితి(వి)= చచ్చిపోయావు; అంచున్= అని కేకలేస్తూ; ఏసినన్= (బాణం) వేయగా.

తాత్పర్యం: అని పలికి కోపగించిన మనస్సుతో గొంతెత్తి 'అర్జునా! అర్జునా! ఈ దెబ్బతో చచ్చావు' అంటూ ప్రయోగించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. పలుదెస మంటలు ప్రబ్బఁగ । నలఘుస్ఫురణమున నిగుడు నయ్యస్త్రంబున్
జలజాక్షుఁడు గని పంచాం । గుళ మాత్రము రథము ధరణిఁ గ్రుంగ నదుముడున్. 319

ప్రతిపదార్థం: పలుదెస= అన్నిదిక్కులా; మంటలు; ప్రబ్బంగన్= వ్యాపించగా; అలఘు= తక్కువగాని; స్ఫురణమునన్= ప్రకాశంతో; నిగుడు= అలముకొనే; ఆ+అస్త్రంబున్; జలజాక్షుఁడు= కమలాక్షుడు - కృష్ణుడు; కని= చూచి; పంచ అంగుళమాత్రము= సరిగా అంగుళాల పరిమాణముగా; రథము; ధరణిన్= భూమిలో; క్రుంగన్= దిగబడిపోయేటట్లు; అదుముడున్= నొక్కివేయగా. (ఈ అంగుళపు కొలత పేరు తిక్కనకాలం నాటిదే.)

తాత్పర్యం: అన్ని దిక్కులా నిప్పులు క్రక్కుతూ అత్యధిక కాంతితో వ్యాపించే ఆ అస్త్రాన్ని కృష్ణుడు కనిపెట్టి, రథ చక్రాలను ఐదు అంగుళాల లోతుకు నేలలో క్రుంగేటట్లు అదిమాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. సుర గరుడ ఖచర విద్యా । ధర ఖేచరు లంబరం బుదాత్తధ్వనిసం
భరితముగఁ బొగడి రమ్ముర । హరు దివ్య ప్రసవ విరచితార్చనతోడన్. 320

ప్రతిపదార్థం: సుర; గరుడ; ఖచర= ఆకాశంలో సంచరించేవారు; విద్యాధర; ఖేచరులు= దేవతలు మొదలైన దివ్యులు; అంబరంబు= ఆకాశము; ఉదాత్త= ఘనమైన; ధ్వని= ధ్వనితో; సంభరితముగన్= నిండిపోయేటట్లు; ఆ+మురహరున్= ఆ మురసంహారుడైన కృష్ణుడిని; దివ్యప్రసవ= స్వర్గ పుష్పాలచేత; విరచిత= కావించబడిన; అర్చనతోడన్= పూజావిధానంతో; పొగడిరి= స్తోత్రం చేశారు.

తాత్పర్యం: స్వర్గ, ఆకాశ చరులైన వివిధ దేవతాగణాలవారు, శ్రీకృష్ణుడిని స్వర్గ తరు పుష్పాలతో పూజించి, స్తోత్ర ధ్వని గగనతలం నిండేటట్లు ప్రశంసించారు.

సర్పముఖ శరంబున నర్జునుకిరీటంబు భూమిపైఁ బడుట (సం. 8-66-11)

మ. కురువంశోత్తమ! వారిదిక్కు ప్రజ సంక్షోభింప నప్పాఁప తూ
పు రయం బుగ్రము గాఁగ బి ట్టడరి, దంభోళిప్రభగ్న క్షమా
ధర శృంగాకృతిగా హరించె బహురత్నస్ఫీత రశ్మిచ్ఛటా
స్ఫురితం బైన కిరీటమున్ విజయునొప్పుం దేజముం గుందఁగన్. 321

ప్రతిపదార్థం: కురువంశోత్తమ!= కురువంశశ్రేష్ఠా! వారి దిక్కు ప్రజ= పాండవపక్షమందున్న జనం; సంక్షోభింపన్= తల్లడిల్లగా; ఆ+పాఁపతూపు= ఆ నాగాస్త్రం; రయంబు= వేగం; ఉగ్రము కాఁగన్= తీక్ష్ణముకాగా; బిట్టు= అధికంగా; అడరి= వ్యాపించి; దంభోళి= వజ్రాయుధంచేత; ప్రభగ్న= ఎక్కువగా ఖండించబడిన; క్షమాధర= పర్వత; శృంగాకృతిగాన్= శిఖరరూపంతో ఉన్న; విజయు= అర్జునుడి; ఒప్పున్= అందమైన తీరు; తేజమున్= కాంతి; కుందఁగన్= క్షీణించిపోయేటట్లు; బహురత్న= నానావిధ రత్నాలచేతను; స్ఫీత= అధికమైన; రశ్మి= కాంతి; ఛటా= పుంజముచేత; స్ఫురితంబు+ఐన= దీపించే; కిరీటమున్; హరించెన్= తొలగించింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! కర్ణుడు ప్రయోగించిన ఆ నాగాస్త్రం పాండవపక్షంవారిని తల్లడిల్లచేసి, పుంజుకొన్న వేగం భయంకరంకాగా, బహువిధరత్నాల బహుళ కాంతులతో ప్రకాశించే పార్థుని కిరీటాన్ని - అతని అందమైన తీరు, తేజస్సు క్రుంగేటట్లుగ, వజ్రాయుధం పర్వతశిఖరాన్ని పడగొట్టినట్లు పడగొట్టింది.

విశేషం: ఉపమానంయొక్క సొంపు, పదబంధ గాంభీర్యం, ప్రాణప్రదమైన దృశ్యవర్ణన ఈ పద్యానికి మెరుగులు. తిక్కన కవితాశిల్ప భూరిమందిరంలో ఇట్టి పద్యాలు రత్నఖచిత కీర్తిస్తంభాలు. అలంకారం: ఉపమ.

తే. జనులు విహ్వలు లగునట్టి ఘనరవంబు । దిశలయందు నాకసమున దీటుకొనఁగఁ
గర్ణుఁ డట్లు భేదించె దిక్పతులచేత । నైనఁ జెడని కిరీట మయ్యహిశరమున. 322

ప్రతిపదార్థం: జనులు; విహ్వలులు అగునట్టి= భయంచేత మనస్సులు చలించినవారు అగునట్లు చేసిన; ఘనరవంబు= మేఘఘర్జనతో సమానమైన ఆ శబ్దం; దిశలందున్= ఎనిమిది దిక్కులందు; ఆకసమునన్= ఆకాశంలో; దీటుకొనఁగన్= అలముకొనగా; దిక్పతులచేతనైన= దిక్పాలకులచేతకూడా; చెడని= చెడగొట్టబడరాని; కిరీటము; ఆ+అహిశరంబునన్= ఆ నాగాస్త్రంచేత; కర్ణుండు; అట్లు= పై విధంగా; భేదించెన్= పడగొట్టాడు.

తాత్పర్యం: ఆ నాగాస్త్రం పుట్టించిన బెట్టిదమైన మేఘగర్జనవంటి ఆ శబ్దం ప్రజలను భయభ్రాంతులను చేసి భూనభోంతరాళాల్లో నిండింది. దిక్పాలకులకు కూడా చెరుప సాధ్యపడని ఆ కిరీటాన్ని నాగాస్త్రంతో కర్ణుడు సులభంగా పడగొట్టాడు.

క. సురపతి తపంబు సేసినఁ । బరమేష్ఠి ప్రియంబుఁ బొంది, బహుమానపుర
స్సరముగ నిచ్చినయది య । క్కిరీట మరిభీషణత్వ కీర్తిదము నృపా! 323

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; సురపతి= దేవేంద్రుడు; తపంబు= తపస్సు; చేసినన్= చేయగా; పరమేష్ఠి= బ్రహ్మ; ప్రియంబునొంది= ప్రీతుడై; బహుమాన పురస్సరముగన్= ఆదరించి సగౌరవంగా ఇచ్చే పారితోషికంగా; ఇచ్చినది; ఆ+కిరీటము; (అది) అరిభీషణత్వ= శత్రువులకు భయాన్ని కలిగిస్తూ; కీర్తిదము= కీర్తిని ఇచ్చేది.

తాత్పర్యం: ప్రభూ! దేవేంద్రుడు చేసిన తపస్సుకు బ్రహ్మ మెచ్చి గౌరవపురస్కారంగా, బహూకరించింది ఆ కిరీటం. అది కీర్తిని చేకూర్చేదే కాక శత్రువులను భయపెట్టి తరుమగొట్టేది.

ఆ. వనధివాసులగు నివాత కవచులను । దనుజు లాపురందరున కజయ్యు
లైన, నతఁడు వనుప నర్జునుఁ డోర్చిన । మెచ్చి యక్కిరీట మిచ్చె నధిప! 324

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వనధి= సముద్రమున; వాసులు+అగు= నివసించే; నివాతకవచులు; అను; దనుజులు= రాక్షసులు; ఆ పురందరునకున్= ఆ ఇంద్రుడికి; అజయ్యులు= జయింప సాధ్యంగానివారు; ఐనన్= కాగా; అతఁడు= ఇంద్రుడు; పనుపన్= పంపగా; (పనిపెట్టగా); అర్జునుఁడు; ఓర్చినన్= ఆ రాక్షసులను ఓడించగా; మెచ్చి= ఆమోదంతో పొగడి; ఆ కిరీటము+ఇచ్చెన్= అర్జునుడికి ఆ కిరీటం ఇచ్చాడు. (ఇట్టి చరిత్రగల కిరీటాన్ని ధరించినవాడగుటచే ఆ పార్థుడు 'కిరీటి' పేర ప్రఖ్యాతుడయ్యాడు.)

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! సముద్రంలో నివసించే నివాతకవచులనే రాక్షసులు ఇంద్రుడికి అణచటానికి సాధ్యం కాని వారు కాగా, ఇంద్రుడు పంపగా వెళ్ళి అర్జునుడు వారిని అణిచివేశాడు. అందుకు మెచ్చి ఇంద్రుడు ఆ కిరీటాన్ని అర్జునుడి కిచ్చాడు.

చ. వినుము నరేంద్ర! చూడ విన విస్మయ మిట్టిది పాఁపరమ్ము వా
త నెగయు ఘోర రూప భయద ప్రథమాన విషాగ్ని జిహ్వకల్
దనికినఁ బెల్చ మండుచు నిలాస్థలి డొల్లె నినుండు పశ్చిమాం
బునిధి నితాంతదృశ్యరుచి పొల్పెసఁగం బడుభంగి దోఁపఁగన్. 325

ప్రతిపదార్థం: వినుము; నరేంద్ర!= ఓ రాజా!; ఇట్టిది= ఈ విధమైనది; చూడన్ వినన్= చూచుటకు, వినుటకు; విస్మయము= ఆశ్చర్యం; ఇనుండు= సూర్యుడు; పశ్చిమ+అంబునిధిన్= పడమటి సముద్రంలో; నితాంత= ఎడతెగని; దృశ్యరుచి= దర్శనకాంతి; పొల్పు+ఎసఁగన్= అందం అతిశయించేటట్లుగా; పడుభంగిన్= క్రుంకేవిధాన్ని; తోఁపఁగన్= జ్ఞప్తికి తెస్తుండగా; పాఁపరమ్ము= కర్ణుడు ప్రయోగించిన ఆ నాగాస్త్రం; వాత= నోటినుండి వెడలెడు; ఘోరరూప= భయంకరాకృతితో; ప్రథమాన= పెరిగిపోతున్న; విష+అగ్ని= విషమనే అగ్నితో కూడుకొన్న; జిహ్వకల్= నాలుకలు; తనికినన్= మండి మెరయుటను; పెల్చన్= అధికంగా; మండుచున్= ప్రజ్వలిస్తూ; ఇలాస్థలిన్= భూభాగంపై; డొల్లెన్= పడి దొర్లింది.

తాత్పర్యం: సూర్యుడు నిరంతరాయమైన తన దర్శనకాంతి అతిశయించి అందగించే విధంగా పడమటి సముద్రంలో క్రుంకేరీతిని మనస్సుకు తెస్తూ ఆ నాగాస్త్రం, నోటినుండి వెలువడుతున్న విషపూర్ణమైన నిప్పు నాలుకలు అనుక్షణం వృద్ధిపొందుతూ అంటుకొన్నందున పెల్లెగసి మంటలు క్రక్కుతూ నేలపై పడింది.

విశేషం: అలంకారం: ఉపమ.

వ. అప్పుడు. **326**

తాత్పర్యం: ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. శృంగములేని నీలగిరి చెల్వునఁ గ్రీడి కిరీటహీనుఁ డ
య్యుం గనుపట్టె వెల్లతల యొల్లియ మౌళి దృఢంబుగా నమ
ర్చెం గురునాథ! పూర్ణశశి చెన్నునఁ బూర్వమహీధరంబు కాం
తిం గడచన్నయందము ప్రతీతము గాఁగ నటించు చాడ్పునన్. **327**

ప్రతిపదార్థం: కురునాథ= ధృతరాష్ట్రా!; క్రీడి= అర్జునుడు; కిరీటహీనుఁడు+అయ్యున్= కిరీటంలేనివాడై కూడా; శృంగము లేని= శిఖరంలేని; నీలగిరి= నల్లకొండ; చెల్వునన్= అందంతో; కనుపట్టెన్= కనుపడినాడు; (ఈ దృశ్యాన్ని మంచి ఉపమానంతో ప్రాణంపోసి, కవి మన కనుల ఎదుట నిలబెట్టుతున్నాడు); పూర్ణశశి= నిండుచంద్రునియొక్క; చెన్నునన్= అందంతో; పూర్వమహీధరంబు= తూర్పుకొండ; కాంతిన్= ప్రకాశంతో; కడచన్న అందము= అతిశయించిన అందము; ప్రతీతము కాఁగన్= ప్రసిద్ధికెక్కేటట్లుగ; నటించు= అనుకరించే; చాడ్పునన్= విధంగా; వెల్లతల ఒల్లియ= తెల్లని తలపాగాను; మౌళిన్= శిరస్సుపై; దృఢంబుగాన్= గట్టిగా; అమర్చెన్= సమకూర్చాడు.

తాత్పర్యం: ఇట్లు కిరీటి, కిరీటం లేనివాడైనా శిఖరంలేని నల్లకొండవలె శోభిల్లాడు. పూర్ణచంద్రబింబకాంతితో పూర్వాద్రికాంతి అతిశయిల్లే అందంతో ప్రసిద్ధం కావటాన్ని అనుకరిస్తున్న విధంగా, తెల్లని తలపాగాను తలకు గట్టిగా చుట్టుకొన్నాడు.

వ. అట్లు రాధేయకర ప్రముక్తంబై కిరీటంబు నిర్దహించి నేలం గలసిన యమ్మహోరగంబు గ్రమ్మఱం గవిసినం గని, కమలనాభుండు గవ్వడితో 'మనమీఁద మగుడ నిమ్మహాసర్పంబు సనుదెంచు చున్నయది' యనిన నతం 'డిది యెక్కడి పా? మిట్లు వచ్చుటకుఁ గతం బేమి?' యని యడిగిన 'దీని నెఱుంగవే? ఖాండవం బేర్చునప్పుడు దనతల్లిని రక్షించుకొని యనలంబునకుఁ దప్పిపోవం, బోవ నీక, నీ వేసిన నన్నాగాంగన మృతిం బొందె; నప్పగ వాటించికొని కర్ణుకడ నమ్మెయి నున్న యశ్వసేనాభిధాన భుజంగంబు.' **328**

ప్రతిపదార్థం: అట్లు; రాధేయ; కరప్రముక్తంబు+ఐ= చేతినుండి వదలబడినదై; కిరీటంబున్= ఆ కిరీటాన్ని; నిర్దహించి= బాగా కాల్చివేసి; నేలన్+కలిసిన= భూమిపాలైన; ఆ+మహా+ఉరగంబు= ఆ గొప్పపాము; క్రమ్మఱన్= వెనుదిరిగి మరల; కవిసినన్= పైబడగా; చూచి; కమలనాభుండు; కవ్వడితో; మనమీఁదన్; మగుడన్= మరల; ఈ+మహాసర్పంబు= ఈ పెద్దపాము; చనుదెంచుచున్న+అది; అనినన్; అతండు= అర్జునుడు; ఇది ఎక్కడి పాము?; ఇట్లు వచ్చుటకు; కతంబు+ఏమి?= కారణమేమి?; అని అడిగినన్; దీనిన్ ఎఱుంగవే?; ఖాండవంబు= ఖాండవవనాన్ని; ఏర్చునపుడు= కాల్చేటపుడు; తన తల్లిని రక్షించుకొని;

అనలంబునకున్= నిప్పునుండి; తప్పిపోవన్= తప్పించుకొని పోబోతుండగా; పోవనీక; నీవు ఏసినన్= నీవు ప్రయోగించగా; ఆ నాగాంగన= ఆ ఆడపాము; మృతిబొందెన్; ఆ+పగ= ఆ ద్వేషాన్ని (కసిని); పాటించికొని= పాటించుకొని; కర్ణుకడన్; ఆ+మెయిన్= ఆ ప్రకారంగా; ఉన్న= చేరి ఉన్నటువంటి; అశ్వసేన; అభిధాన= అనుపేరుగల; భుజంగంబు= పాము (అది).

తాత్పర్యం: అట్లా రాధేయుడు ప్రయోగించిన నాగాస్త్రం అర్జునుడి కిరీటాన్ని దహించి నేల కలిసి తిరిగి రాగా, చూచి, కృష్ణుడు అర్జునుడితో 'మనమీద మరల ఈ మహాస్త్రం వస్తున్నది' అనగా, అతడు 'ఇది ఎక్కడిపాము? ఇట్లా రావటానికి కారణం ఏమిటి?' అని అడిగాడు. 'ఇది నీకు తెలియదా? ఖాండవవనం దహించేటప్పుడు తన తల్లిని రక్షించుకొని అగ్నినుండి తప్పుకొనిపోతుండగా నీవు ఆ నాగాంగనను పోనీయక బాణంతో కొట్టగా ఆమె చనిపోయింది. అప్పటినుండి నీ మీద పగపట్టి' నాగాస్త్రంగా కర్ణుడివద్ద ఈ విధంగా ఉన్న అశ్వసేనుడనే పాము ఇది.

తే. **'ఆతఁ డేయఁ గిరీటంబు నపహరించి । దానఁ గోపంబు వోవక తాన కడఁగి**
నిన్నుఁ బరిమార్పఁ గడఁగెడు' నన్న నెఱిఁగి । యాఱు పటుభల్లములఁ దునుమాడె నతఁడు. **329**

ప్రతిపదార్థం: ఆతఁడు= కర్ణుడు; ఏయన్= ప్రయోగించగా; కిరీటంబున్; అపహరించి= దొంగిలించి; దానన్= దానితో; కోపంబు పోవక= కసి తీరక; తాన= స్వయంగా తానే; కడఁగి= ప్రయత్నించి; నిన్నున్; పరిమార్పన్= చంపుటకు; కడఁగెడున్= సాహసిస్తున్నది; అన్నన్= అనగా; ఎఱిఁగి= తెలిసికొని; ఆరు; పటుభల్లములతోన్= గట్టి బాణాలతోన్; అతఁడు= అర్జునుడు; తునుమాడెన్= (దానిని) ముక్కలుచేశాడు.

తాత్పర్యం: ఆ నాగాస్త్రం అర్జునుడి కిరీటాన్ని పడగొట్టి, ఆక్రోశం తీరక, స్వయంగా తానే అర్జునుడిని చంపటానికి ఉద్యుక్తమయిందని విని, కిరీటి ఆరు పటుబాణాలు ప్రయోగించి ముక్కలు చేశాడు.

వ. **అత్తెఱంగున.** **330**

తాత్పర్యం: ఆ ప్రకారంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **ఉరగంబుఁ దునిమి, వే మరలి కర్ణునిమీఁదఁ । బదియుఁ బంద్రెండును బటుశరములు**
నిగిడించి యుజ్జ్వలంబగు దొడ్డనారసం । బేసిన, నది రుధిరాసవంబు
పానంబు సేయుచు మే నుచ్చి చనిన, దం । డాహతం బైన మహాహివోలె
నా సూతనందనుఁ డత్యుదగ్రుం డయ్యు । నంతకుమును పాఁపరమ్ము చేత

తే. **నర్జునుఁడు సావమికి వెఱఁగంది యాతఁ । డటులు గెరలి పంద్రెండువాలమ్ము లేసి**
పద్మనాభుని నొప్పించి, పార్థు నొకటి । కొఱఁతగా నూరు శరముల నుఱక నొంచె. **331**

ప్రతిపదార్థం: ఉరగంబున్= పామును; తునిమి= ముక్కలు చేసి; వేః= వెంటనే; మరలి= కర్ణుడివైపు తిరిగి; కర్ణుడిమీఁదన్; పదియు పంద్రెండును; పటుశరంబులు= పటిష్ఠమైన తూపులు; నిగిడించి= ప్రయోగించి; ఉజ్జ్వలంబు+అగు= ప్రకాశించే; దొడ్డ నారసంబు= పెద్ద బాణం; ఏసినన్; అది; రుధిర ఆసవంబు= నెత్తుటి తేనెను; పానంబు చేయుచున్= త్రాగుతూ; మేనున్= కర్ణుడి శరీరమును; ఉచ్చి చనినన్= చీల్చుకొని బయటపడగా; దండాహతంబు+ఐన= కర్రచేత దెబ్బతిన్న; మహా అహివోలెన్= పెద్దపామువలె; ఆ సూతనందనుండు; అతి ఉదగ్రుండు+ఐ= మిక్కిలి భయోత్పాది అగుచు; అంతకుమును= అంతకుముందు; అర్జునుఁడు; పాఁపరమ్ముచేతన్= నాగబాణంచేత; చావమికిన్= చచ్చిపోనందుకు; వెఱఁగంది= ఆశ్చర్యపడినవాడై; అతఁడు=

కర్ణుడు; అటులు= ఆ విధంగా; కెరలి= చెలరేగి; పండ్రెండు; వాలమ్ములు= వాడి పొడవైన బాణాలు; ఏసి= ప్రయోగించి; పద్మనాభునిన్; నొప్పించెన్= బాధించాడు; పార్థున్= అర్జునుడిని; ఒకటి కొఱంతగాన్= ఒకటి తక్కువగా; నూఱుశరములన్= నూరుబాణాలతో; ఉఱక= అవలీలగా; నొంచెన్= బాధించాడు.

తాత్పర్యం: కర్ణుడు విసరిన నాగాస్త్రాన్ని పార్థుడు ముక్కలు చేసి, కర్ణుడివైపు తిరిగి ఆయన ఒంటినిండా పది పన్నెండు గట్టి బాణాలు విసిరాడు. వెంటనే కాంతులు చిమ్మే ఒక పెద్ద బాణం వేశాడు. ఆ దారుణశస్త్రం కర్ణుడి నెత్తురును తేనెవలె త్రాగి, శరీరంగుండా దూసుకొనిపోయింది. దీనితో కర్ణుడు కర్రదెబ్బ తిని బుసపెడుతూ రేగిన పెద్దపాము మాదిరి కోపోద్దీపితుడయ్యాడు. తన నాగాస్త్రంవలన అర్జునుడు చావలేదని తెలిసికొని ఆశ్చర్యపడి, పొడవు వాడిగల పన్నెండు బాణాలతో ఆ పద్మనాభుడిని నొప్పించాడు. ఒకటి తక్కువ నూరమ్ములతో పార్థుడిని బాధించాడు.

విశేషం: అలంకారం: ఉపమ.

క. వెండియు బలువిడి నయ్యా । ఖండలసుతు నురము గ్రూరకాండంబుల నొం
డొండ కడు నొవ్వనేసి, య । తం డుబ్బున నార్చె గగనతల మద్రువంగన్. 332

ప్రతిపదార్థం: వెండియున్= మరల; బలువిడిన్= పరాక్రమంతో; ఆఖండలసుతు= పర్వతాలను భేదించిన ఇంద్రుడి కుమారుడైన అర్జునుడియొక్క; ఉరము= రొమ్ము; క్రూరకాండములన్= భయంకరాలైన బాణాలచేత; ఒండొండ= క్రమంగా; కడు నొవ్వన్+ ఏసి= మిక్కిలి బాధించి; అతండు= కర్ణుడు; గగనతలము= ఆకాశప్రదేశం; అద్రువంగన్= కంపించేటట్లు; ఉబ్బునన్= సంతోషంతో; ఆర్చెన్= కేకలు వేశాడు.

తాత్పర్యం: సత్తువ చేకూర్చుకొని, అర్జునుడి ఎదను భీకర నారాచాలతో బాధపెట్టి, ఆకాశమంతా అదిరిపోయేటట్లు సంతోషాతిశయంతో కర్ణుడు కేకలు వేశాడు.

తే. ఆర్చి పెలుచ నట్టహాసంబు సేసిన । నలిగి యతఁడు భల్లములఁ దదీయ
భూరికంకటంబు పాలు పఱ నఱికి, యు । ల్లసిత మకుటకుండలములు డులిచె. 333

ప్రతిపదార్థం: ఆర్చి= ఇట్లు పెద్దగా అరిచి; పెలుచన్= గట్టిగా; అట్టహాసంబు= పెద్దనవ్వు; చేసినన్; అలిగి= కోపగించుకొని; అతఁడు= అర్జునుడు; భల్లములన్= బాణాలతో; తదీయ= కర్ణుడికి చెందిన; భూరికంకటంబు= పెద్ద కవచాన్ని; పొలుపు అఱన్= అతిశయం పోకారేటట్లు; నఱికి; ఉల్లసిత= ప్రకాశమానమైన; మకుట, కుండలంబులు= కిరీటాన్ని, చెవిపోగులను; డులిచెన్= ఊడిపడేటట్లు కొట్టాడు.

తాత్పర్యం: ఇట్లా కర్ణుడు వీరవిహారంగా, అట్టహాసం చేయగా, కిరీటి కుపితుడై, అతడి కవచాన్ని రూపులేకుండా ఖండించి, ప్రకాశించే అతడి కిరీటాన్ని, చెవిపోగులను (అంటుజోడును) నేలరాల్చాడు.

విశేషం: సహజకవచము, కర్ణ కుండలాలతో పుట్టినందువల్లనే కర్ణుడనే నామం వచ్చిందని ప్రతీతి. ఈ వంటబుట్టిన వాటిని ఇంతకుముందే కోసి దానం చేసి ప్రాణాపాయం నెత్తికి తెచ్చుకొన్నాడని పెద్దల వచనం. భారతం కూడా ఇట్లే నుడువుతున్నది. ఇవి పెట్టుకొన్న కవచకుండలాలు.

వ. దులిచిన నబ్బలుమగండు. 334

తాత్పర్యం: అట్లా నేలపై రాల్చగా ఆ వీరుడైన కర్ణుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. శిరమునఁ గర్ణంబుల నె । త్తు రొలుక బరిమేనితోడఁ దూలక బాహు
స్ఫురణంబు మెఱయ సాయక । పరంపరలు నరునిమీఁదఁ బఱపెం బెలుచన్. 335

ప్రతిపదార్థం: శిరమునన్= తలమీద; కర్ణంబులన్= చెవులలో; నెత్తురు ఒలుకన్= నెత్తురు కారుతుండగా; బరిమేనుతోడన్= కవచము కిరీట కుండలాలులేని శరీరంతో; తూలక= తూలిపడిపోకుండా; బాహు స్ఫురణంబు= బలప్రకాశనం; మెఱయన్= తళతళలాడగా; నరునిమీఁదన్; సాయక పరంపరను= బాణాల వరుసను; పెలుచన్= తీవ్రంగా; పఱపెన్= నింపాడు.

తాత్పర్యం: అర్జునుడి దెబ్బలకు కర్ణుడు తల, చెవులనుండి నెత్తురు కారుతుండగా తొనకక, కవచము, కిరీట కుండలాలు లేని శరీరంతో తూలి పడిపోకుండా తన బాహు పరాక్రమ దీప్తిని వ్యాపింపజేస్తూ, అమ్ములను వరుసలు వరుసలుగా అర్జునుడి మీద ప్రయోగించాడు.

తే. వానిఁ దునుమాడి యాపాండుసూనుఁ డలఘు । శరచతుశ్శతిఁ బొదివి నెత్తురులు మేనఁ
బఱప గైరిక నిర్ఝరప్రకర శోభి । తాచలము వోలి పొలిచె నయ్యంగరాజు. 336

ప్రతిపదార్థం: ఆ+పాండుసూనుఁడు= ఆ పాండురాజు కొడుకు - అర్జునుడు; వానిన్= వాటిని; తునుమాడి= విరుగగొట్టి; అలఘు= గట్టి; శరచతుశ్శతిన్= నాలుగువందల బాణాలతో; పొదివి= (ఆయనను) కప్పి; నెత్తురులు; మేనన్= ఒంటిమీద; పఱపన్= వ్యాపింపజేయగా; ఆ+అంగరాజు= ఆ అంగదేశాధీశుడైన కర్ణుడు; గైరిక= గిరికొండ చాలుకు సంబంధించిన (కొండరాళ్ళ వన్నెలతో కనబడే); నిర్ఝర ప్రకర= సెలయేళ్ళ సమూహంచేత; శోభిత= ఒప్పారే; అచలము పోలి= కొండవలె; పొలిచెన్= చెలువొందాడు.

తాత్పర్యం: కర్ణుడేసిన బాణాలను అర్జునుడు విరుగగొట్టి, గట్టి నన్నూరు బాణాలను విసరి, ఆ కర్ణుడి శరీరమంతా రక్తం పారేటట్లు చేశాడు. అప్పుడు రక్తసిక్త దేహుడైన ఆ వీరుడు, ఎర్రని పర్వత ధాతువులవర్ణంతో సొంపుమీరే కొండవాగులతో శోభిల్లే చలించని పర్వతంవలె అందగించాడు.

విశేషం: అలం: ఉపమ.

ఉ. అమ్మెయి నుగ్రుఁడై మఱియు నర్జునుఁ డుజ్జ్వలవత్సదంతకాం
డమ్ములు పెక్కు సత్వర దృఢస్ఫురణం బలరంగ నేసి, ర
థ్యమ్ముల సూతుఁ గేతనము నాతనితేరును గూడఁ గప్పె, మే
ఘమ్ముల గ్రమ్మి భూధరము గప్పినభంగిఁ దలంపఁ బట్టుగన్. 337

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; అర్జునుఁడు; ఆ+మెయిన్= ఆ విధంగా; ఉగ్రుఁడై= భయం కొల్పువాడై; పట్టుగన్= పట్టుదలతో; ఉజ్జ్వలవత్= జ్వలిస్తున్న; సదంతకాండంబు= ఆవు దూడ దంతంవలె కూచి అయిన బాణాలను; పెక్కు= పెక్కింటిని; సత్వర= వేగవంతమైన; దృఢస్ఫురణంబు= బలమైన పూనిక; అలరంగన్= ఒప్పగా; ఏసి= ప్రయోగించి; రథ్యంబులన్=

గుఱ్ఱాలను; సూతున్= సారథిని; కేతనమున్= పతాకాన్ని; ఆతని; తేరును గూడన్= రథాన్ని కూడా; మేఘంబులు= మబ్బులు; క్రమ్మి= చుట్టుకుని; భూధరమున్= పర్వతాన్ని; కప్పిన భంగిన్= మూసిపెట్టినవిధాన్ని; తలంపన్= మనసుకు వచ్చేటట్లు, కప్పెన్= కప్పాడు.

తాత్పర్యం: ఇంకా అర్జునుడు ఆ విధంగా కోపోద్దీపితుడై, తళతళలాడే ఆవుదూడ దంతాలవలె ఉండే చాలా బాణాలను వేగం, బిగువు చూపుతూ పట్టుదలతో విసరాడు. వీటితో కర్ణుడి గుఱ్ఱాలను, సారథిని, ధ్వజాన్ని, రథాన్ని కూడ మబ్బులు క్రమ్మి కొండ శిఖరాన్ని కప్పివేసిన విధం మనస్సులో తోచేటట్లు కప్పివేశాడు.

విశేషం: అలంకారం: ఉపమ.

వ. ఇ వ్విధంబున విక్రమ కుతూహలియై విజృంభించె నప్పుడు. 338

ప్రతిపదార్థం: ఇవ్విధంబునన్= ఈ రీతిగా; విక్రమకుతూహలి+ఐ= తన ప్రతాపాన్ని ప్రదర్శించాలన్న గట్టి అపేక్షకలవాడై; విజృంభించెన్; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ రీతిగా పరాక్రమ ప్రదర్శనంలో ఆసక్తి కలవాడై విజృంభించాడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. నెత్తుటఁ దోఁగి మేను కమనీయరుచిం గొమరార, బాణసం
పత్తి యుదగ్రతన్ మెఱయ, భాస్వరుఁడై యరదంబుమీఁద భూ
పోత్తమ! కర్ణుఁ డొప్పె నరుణోజ్జ్వలమండల కాంతిపూరము
న్మొత్తపు దీప్తులుం దగ నినుం డపరాద్రి వెలుంగుచాడ్పునన్. 339

ప్రతిపదార్థం: భూప+ఉత్తమా!= రాజశ్రేష్ఠా! (ధృతరాష్ట్ర మహారాజా!); నెత్తుటన్= నెత్తుటితో; తోఁగి= తడిసి; మేను= శరీరం; కమనీయ= మనోహరమైన; రుచిన్= కాంతితో; కొమరార= అందంగా అగుపించగా; బాణ= బాణాలయొక్క; సంపత్తి= సంపద; ఉదగ్రతన్= భీకరత్వంతో; మెఱయ= ప్రకాశించగా; అరుణ+ఉత్+జ్వల= ఎరుపురంగుచేత మిక్కిలి కాంతిమంతమైన; మండల= ప్రదేశమునందలి; కాంతి పూరమున్= కాంతి ప్రవాహము; మొత్తపు, దీప్తులున్= అన్ని కాంతులు; తగన్= ఒప్పగా; ఇనుండు= సూర్యుడు; అపర+అద్రి= (తాను) అస్తమించే కొండమీద; వెలుంగు, చాడ్పునన్= వెలిగే విధంగా; కర్ణుడు; భాస్వరుడు+ఐ= వెలుగుతూ ఉన్నవాడై; అరదంబు మీద= రథం మీద; ఒప్పెన్= తగువిధంగా ఉన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! నెత్తుటితో తడిసిన శరీరం చూడముచ్చటైన కాంతితో శోభిల్లగా, బాణసంపద భయంకరంగా ప్రకాశించగా - ఎర్రగా మిక్కిలి కాంతిమంతమైన మండలమందలి కాంతిప్రవాహము, అన్ని కాంతులు అలరారగా, అస్తాద్రిమీద వెలిగే సూర్యుడివలె కర్ణుడు వెలుగుతూ తన రథంమీద తగువిధంగా ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ. అనతికాలంలో వీరమరణం చెందనున్న కర్ణుడిని అస్తమించే సూర్యుడితో పోల్చటం సముచితం.

వ. ఇట్లు సూతనందనుండు నొచ్చియుఁ బొలివోనిబంటుతనంబున జంట మెఱుంగులు చదలం బరఁగ శరంబు లడరించుచు, బహుబాణంబులు రేణువులుగాఁ జేయుచుండ సవ్యసాచి దివ్యాస్త్ర విలాసంబు భాసమానం బయ్యె నయ్యవసరంబునఁ గాలుం డదృశ్యాకారంబున. 340

ప్రతిపదార్థం: ఇట్లు= పైన చెప్పిన రీతిగా; సూతనందనుండు= కర్ణుడు; నొచ్చియున్= బాధితుడయ్యు; పొలివోని= తరుగని; బంటుతనంబునన్= శౌర్యంతో; జంటమెఱుంగులు= రెండేసిగా కలసిన కాంతులు; చదలన్= ఆకాశంలో; పరcగన్= వ్యాపించేటట్లు; శరంబులు; అడరించుచున్= ప్రయోగం చేస్తూ; బహుబాణంబులు; రేణువులుగాన్= దుమ్ము దుమ్ముగా; చేయుచుండన్; సవ్యసాచి= రెండు చేతుల బాణప్రయోగం చేసే అర్జునుడి; దివ్యాస్త్ర= దేవదత్తమైన అస్త్రముల; విలాసంబు= సౌందర్యవికాసం; భాసమానము+అయ్యెన్= ప్రకటితమై చెలువొందింది. (అర్జునుడు ఎదురు ప్రయోగం చేస్తున్నాడు); ఆ+ అవసరంబునన్= ఆ సమయంలో; కాలుండు= యముడు; అదృశ్య+ఆకారంబునన్= కంటికి కనపడని రూపంలో.

తాత్పర్యం: ఈవిధంగా కర్ణుడు బాధపొంది కూడా మొక్కవోని పరాక్రమంతో జంటమెరుపులు ఆకాశంలో వ్యాపించగా బాణాలు వేస్తూ, అనేకబాణాలను పొడిపొడిగా చేస్తూ ఉండగా, అర్జునుని దివ్యబాణాల విలాసం ప్రకాశించింది. ఆ సమయంలో యముడు అదృశ్యమైన ఆకారంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

బ్రాహ్మణశాపంబునc గర్ణురథచక్రంబు భూమింగ్రుంగుట (సం. 8-66-42)

క. 'భూసురశాపంబున నిదె । యీ సూతజు రథము చక్ర మిలc గ్రుంగెడు, వీ
తాసుc డగు నీతc' డని సే । నాసముదయ యుగ్మకము వినం బలికె నృపా! 341

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; (యముడు) భూసురశాపంబునన్= బ్రాహ్మణునియొక్క శాపంవలన; ఇదె= ఇదే అనతికాలంలోనే; ఈ సూతజు; రథము; చక్రము; ఇలన్= భూమిలో; క్రుంగెడున్= కూరుకొనిపోతుంది; ఈతcడు; వీత= పోయిన; అసుcడు= ప్రాణం కలవాడు; అగున్= అవుతాడు; అని; సేనాసముదయ= సైన్యసమూహముయొక్క; యుగ్మకము= రెండును (ఉభయపక్షాలు); వినన్; పలికెన్.

తాత్పర్యం: బ్రాహ్మణుడి శాపంవలన ఈ కర్ణుడి రథచక్రం భూమిలో పాతుకొనిపోతుంది. ఇతడి బ్రతుకు కాలం తీరిపోయింది.' అని కురుపాండవ సేనలు రెండూ వినేటట్లు యముడన్నాడు.

వ. పరశురామదత్తంబయిన భార్గవాస్త్రంబను పేరిటి మహనీయసాధనం బప్పుడు రాధేయునకుం బ్రతిభాసింప కుండె; దాపటికల్లు గ్రుంగినc దేరు ఘూర్ణిల్లె; నట్లు జామదగ్న్య మహీసురుల శాపంబు లస్త్రబలంబునకు రథంబునకు వైకల్యం బాపాదించి చిక్కువఱుచుటయును, సర్పముఖశరం బాభంగి నిష్ఫలప్రయత్నం బగుటయును దనమనంబున నొ వ్వడరి యక్కర్ణుండు గరంబులు విదుర్చుచు. 342

ప్రతిపదార్థం: పరశురామదత్తంబు+అయిన= పరశురాముడిచేత ఇవ్వబడిన; భార్గవ+అస్త్రంబు+అను; పేరిటి= పేరు గలిగిన; మహనీయ= మహిమోపేతమైన; సాధనంబు= ఆయుధం; అప్పుడు; రాధేయునకున్; ప్రతిభాసింపక= మనసుకు తోచక; ఉండెన్= ఉన్నది; దాపటి కల్లు= ఎడమచక్రం (దాపటి- వెలపటి అనే పదాలు ఇంకా నెల్లూరు పల్లెలలో వాడుకలో ఉన్నవి. చక్రానికి కల్లుగాలు అనేవి సామాన్య పదాలు); క్రుంగినన్= అణగిపోగా; తేరు; ఘూర్ణిల్లెన్= మోతతో తిరగబడింది; అట్లు; జామదగ్న్య= జమదగ్ని కుమారుడు పరశురాముడి; మహీసురుల= బ్రాహ్మణుల; శాపంబులు; అస్త్రబలంబునకున్= ఆయుధశక్తికి; రథంబునకున్; వైకల్యంబు+ఆపాదించి= చెడగొట్టి; చిక్కు పఱుచుటయును= ఇరుకున పడవేయటంవలనను (అవస్థల పాల్జేయుటవలనను); సర్పముఖశిరము= నాగాస్త్రం; ఆ భంగి= ఆ విధంగా; నిష్ఫల ప్రయత్నంబు+అగుటయున్= వమ్మయి ప్రయోగానికి పనికిరానిదగుటవలనను; తన మనంబునన్; నొవ్వు+అడరి= బాధ అధికమై; ఆ+కర్ణుండు; కరంబులు= చేతులు; విదుర్చుచున్= విదిలించుకొంటూ.

తాత్పర్యం: పరశురాముడిచ్చిన భార్గవాస్త్రం కర్ణుడికి అప్పుడు జ్ఞాపకం రాలేదు. రథపు ఎడమచక్రం నేలలో క్రుంగింది. రథం పెళపెళలాడింది. ఆ విధంగా పరశురాముడూ, బ్రాహ్మణుడూ ఇచ్చిన శాపాలవలన అస్త్రబలం, రథబలం వికలమైపోయాయి. చిక్కులో పడవేశాయి. సర్పముఖబాణం ఆ విధంగా నిష్ఫలమైపోవటంచేత మనస్సు బాధపడగా కర్ణుడు చేతులు విదిలించుకొంటూ. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **'ధర్మవాదులు, ధర్మతత్త్వ ప్రధాన । చిత్తులగువారిఁ బూని రక్షించు ధర్మ**
మందు; రది బొంకు గావించె నతులధర్మ । శీలుఁ డగు నాకు ధర్మువు సెలవు లేద?' **343**

ప్రతిపదార్థం: ధర్మవాదులు= ధర్మమును గురించి చెప్పేవారు; ధర్మతత్త్వ ప్రధానచిత్తులు అగువారిన్= ధర్మతత్త్వమునే మనసున గట్టిగా నిలుపుకొనినవారిని; పూని= పట్టుదలతో; ధర్మము; రక్షించున్= కాపాడును; అని; అందురు= అంటారు; అది; బొంకు కావించెన్= అబద్ధమని చాటింది; అతులధర్మశీలుఁడు+అగు= అత్యంతం ధర్మమునే పాలించే; నాకు; ధర్మువు= సత్యశీలం; సెలవు లేద?= ఆజ్ఞ - రక్షణ లేదా?

తాత్పర్యం: 'ధర్మం పలికేవారిని, ధర్మతత్త్వాన్ని మనసులో ఉంచుకొన్నవారినీ ధర్మం తప్పక రక్షిస్తుందని అంటారు. కాని, అది ఇప్పుడు అబద్ధమయింది. అత్యంత ధర్మాచరణస్వభావం గల నన్ను ధర్మం అనుగ్రహించదా?'

క. **అని ధర్మంబును దూఱఁగఁ । దను నర్జును బాణవితతి తద్దయ వడిఁ దాఁ**
కినఁ గర్ణుండు విషాదం । బున వెండియుఁ బెద్ద దూఱు భూవరముఖ్యా! **344**

ప్రతిపదార్థం: భూవరముఖ్యా!= రాజులలో ప్రధానుడవైన ఓ ధృతరాష్ట్రా!; అని= ఆ విధంగా; ధర్మంబును; దూఱఁగన్= నిందించగా; తనున్= తనను; అర్జును= అర్జునుని యొక్క; బాణవితతి= శరసమూహం; తద్దయున్= ఎక్కువగా; వడిన్= వేగంతో; తాఁకినన్= దెబ్బతీయగా; కర్ణుండు; విషాదంబునన్= దుఃఖాతిరేకంతో; వెండియున్= మరల; పెద్ద దూఱున్= ఎక్కువగా తిట్టసాగాడు.

తాత్పర్యం: కర్ణుడు ఈ విధంగా ధర్మాన్ని దూషిస్తుండగా, అర్జునుడి శరసమూహం పెద్దమోపున ఆయనను దెబ్బతీశాయి. దానితో ఆయన వెత ఎక్కువై, పెద్దగా దూషణను మొదలుపెట్టాడు.

క. **కన లధికమైన లావె । క్కిన యయ్యంగపతి నొంచెఁ గృష్ణార్జునులన్**
సునిశిత శరములు మఱియుం । జొనిపెను దనధైర్యమహిమ సుర లగ్గింపన్. **345**

ప్రతిపదార్థం: కనలు= కోపం; అధికమైనన్= ఎక్కువ కాగా; లావు= చేవ(బలం); ఎక్కినన్= పెరగగా; ఆ+అంగపతి= అంగదేశాధీశుడైన కర్ణుడు; కృష్ణార్జునులన్; సునిశిత= ఎక్కువ పదునైన; శరములు= బాణములు; మఱియున్= అధికంగా; తన ధైర్య మహిమను= తన ధీరత్వపు గొప్పదనాన్ని; సురలు= దేవతలు; అగ్గింపన్= కొనియాడగా; చొనిపెన్= వారి దేహాలలో చొప్పించాడు.

తాత్పర్యం: ఆగ్రహంతోపాటు కర్ణుడికి దేహబలం కూడా పెరిగింది. చూస్తున్న దేవతలు తన ధైర్యాతిశయాన్ని మెచ్చుకొంటుండగా, వాడీ, వేడీ అయిన బాణాలను కృష్ణార్జునుల దేహాలలో నాటాడు.

వ. అలిగి, యర్జునుం డాశీవిషంబులుంబోని విశిఖంబు లాఱు కర్ణుమే నుచ్చి చననేసినం గ్రోధభాషితుండై, యతండు బ్రహ్మాస్త్రంబు ప్రయోగించుటయు; నప్పార్థుం డైంద్రాస్త్రంబు ప్రయోగించిన. 346

ప్రతిపదార్థం: అలిగి= కోపగించుకొని; అర్జునుండు; ఆశీవిషంబులున్ పోని= విషపాములవంటి; విశిఖంబులు= బాణాలు; ఆఱు; కర్ణుమేను= కర్ణుడిశరీరం; ఉచ్చి చనన్= చీల్చుకొనిపోయేటట్లు; ఏసినన్; అతండు= కర్ణుడు; క్రోధ= పగచేత; భాసితుండై= ప్రకాశించిన; బ్రహ్మాస్త్రంబు; ప్రయోగించుటయున్= ప్రయోగించగా; ఆ+పార్థుండు; ఐంద్రాస్త్రంబు; ప్రయోగించినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: అర్జునుడు అలిగి, విషసర్పాలవంటి ఆరుబాణాలను కర్ణుడి శరీరంలో గ్రుచ్చుకొనిపోయేటట్లు వేయగా, కర్ణుడు కోపోద్రేకంతో బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించగా, అర్జునుడు ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు.

క. అమితబలం బగు బ్రహ్మ। స్త్రముచే నయ్యస్త్ర మపహృతం బగుటయుఁ, జి
త్తమున విషాదము దనుకఁగఁ। గమలాక్షుఁడు గారవమున గాండివితోడన్. 347

ప్రతిపదార్థం: అమితబలంబు+అగు= మేరలు లేని శక్తియుతమైన; బ్రహ్మాస్త్రముచేన్; ఆ+అస్త్రము= ఆ ఐంద్రాస్త్రం; అపహృతము= నిర్వీర్యం (దొంగిలింపబడిన శక్తి గలది); అగుటయున్; చిత్తమునన్; విషాదము; తనుకఁగన్= కలుగగా; కమల+అక్షుండు= తామరలవంటి కన్నులు గలవాడు - కృష్ణుడు; గారవమునన్= ఆదరంతో; గాండివితోడన్= అర్జునుడితో (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: అఖండశక్తిమంతమైన బ్రహ్మాస్త్రంచేత తాను ప్రయోగించిన ఐంద్రాస్త్రం ఉడిగినందున కిరీటి మనస్సులో బాధపడుతుండగా, కృష్ణుడు గాండీవితో ప్రేమాభిమానపూర్వకంగా అర్జునుడితో (తరువాతి పద్యంతో అన్వయం).

వ. 'నీ యస్త్రం బిప్పుడు కర్ణాస్త్రంబుచే విధ్వస్తం బయ్యెఁ; నిట్లుగా నేల? యనవుడుఁ గవ్వడి బ్రహ్మాస్త్రప్రయోగంబున నమ్మహనీయ సాధనంబు బాధితంబు సేసి రాధేయాంగంబు బాణజాలంబులం బొదివి నొప్పించిన, నమ్మేటిమగండు గాండీవంబు మౌర్వికోటిఁ బాసిపో నేసిన, నా సవ్యసాచి మగుడ నమర్చి మార్గణంబులు నిగిడించిన, రయంబున నా సూతపుత్రు చూడ్కి కమ్మౌర్వి యూడుట దోఁపకుండె; నవ్వీరుండు వివ్వచ్చు విశిఖంబులు వారించి యతని తనువు నొంచిన వెండియుఁ బుండరీకాక్షుండు సహస్రాక్షనందను నుద్దేశించి. 348

ప్రతిపదార్థం: నీ అస్త్రంబు; ఇప్పుడు; కర్ణాస్త్రంబుచేన్; విధ్వస్తంబు+అయ్యెన్= పూర్తిగా నాశనమైనది; ఇట్లుకాన్+ఏల?= ఈ విధంగా ఎందుకైంది?; అనవుడున్= అనగా; కవ్వడి= అర్జునుడు; బ్రహ్మాస్త్ర ప్రయోగంబునన్= తానుగూడ బ్రహ్మాస్త్రమును ప్రయోగించి; ఆ+మహనీయ= ఆ గొప్ప; సాధనంబును= ఆయుధమును; బాధితంబుజేసి= దెబ్బతినేటట్లు చేసి; రాధేయాంగంబు= కర్ణుడి శరీరం; బాణజాలంబులన్= బాణసమూహాలచేత; పొదివి= కప్పి; నొప్పించినన్; ఆ+మేటిమగండు= శక్తి సామర్థ్యములో మొనగాడై ఆ కర్ణుడు; మౌర్వి= అల్లెత్రాటి; కోటిన్= చివరిభాగాన్ని; పాసిపోన్+ఏసినన్= వీడిపోయేటట్లు బాణంతో కొట్టగా; ఆ సవ్యసాచి; మగుడన్= మరల; అమర్చి= సరిజేసి; మార్గణంబులు= బాణాలను; నిగిడించినన్= ప్రయోగించగా; రయంబునన్= వేగంతో; ఆ సూతపుత్రు; చూడ్కికిన్= చూపునకు; ఆ మౌర్వి; ఊడుట; తోఁపకుండెన్= కనిపించకుండా పోయింది; ఆ+వీరుండు= ఆ శూరుడు-కర్ణుడు; వివ్వచ్చు= బీభత్సుడి- విజయుడి; విశిఖంబులు= వాడి అమ్ములను; వారించి= అడ్డగించి;

అతని= ఆ అర్జునుడిని; తనువున్= శరీరాన్ని; నొంచినన్= బాధించగా; వెండియున్= మరల; పుండరీకాక్షుండు= తెల్లతామరల వంటి కన్నులు కలిగిన కృష్ణుడు; సహస్రాక్ష= వేయికన్నులు కలిగిన ఇంద్రుడి; నందనున్= కొడుకును; ఉద్దేశించి= చూచి (అన్నాడు).

తాత్పర్యం: 'నీ అస్త్రం ఇప్పుడు కర్ణుడు ప్రయోగించిన అస్త్రంచేత ఎందుకు ధ్వంసమైనది?' అని కృష్ణుడు అర్జునుడిని ప్రశ్నించాడు. అప్పుడు అర్జునుడు బ్రహ్మాస్త్రప్రయోగంతో కర్ణుడి అస్త్రాన్ని బాధితం చేశాడు. కర్ణుడి శరీరం నిండా బాణాలు చొప్పించి బాధించాడు. కర్ణుడు అర్జునుడి గాండీవపు కొప్పునుండి అల్లెత్రాడు ఊడేటట్లు బాణంతో కొట్టాడు. అర్జునుడు వెంటనే దానిని సరిచేసికొన్నాడు. ఆ సంగతి కర్ణుడు గ్రహించలేకపోయాడు. కర్ణుడు అర్జునుడి బాణాలను అడ్డగించి అతడి శరీరాన్ని నొప్పించాడు. మరల శ్రీకృష్ణుడు అర్జునుడితో (ఇట్లా అన్నాడు).

క. 'నిను నొంచువాఁడె కర్ణుం? । డనితర సులభప్రకారమగు భుజవీర్యం
బున నసమానోజ్జ్వల ఖే । లనమునఁ దెగటార్చు శరవిలాస నిరూఢా!' 349

ప్రతిపదార్థం: కర్ణుడు; నిను; నొంచువాఁడె?= నొప్పించగలవాడా? (కాదనుట); అనితర= ఇతరులకు సాధ్యంకాని; సులభప్రకారము+అగు= సులభమైన పద్ధతితోకూడిన; భుజవీర్యంబునన్= బాహుబలంతో; అసమాన= సాటిలేని; ఉజ్జ్వల= ప్రకాశవంతమైన; ఖేలనమునన్= యుద్ధక్రీడతో; శరవిలాసనిరూఢా!= బాణప్రయోగకళారహస్యాలు తెలిసినవాడా!; (కర్ణుని); తెగటార్పుము= తుదముట్టించుము.

తాత్పర్యం: బాణప్రయోగపాటవముయొక్క కిటుకులు తెలిసిన ఓ కిరీటీ! నిన్ను ఆ కర్ణుడు నొప్పించగలవాడా? ఇతరులకు సాధ్యంకాని సులభమైన పద్ధతితో కూడిన బాహుబలంతో, సాటిలేని ప్రకాశంతో కూడిన యుద్ధక్రీడతో కర్ణుని సంహరించుము.

వ. అనునప్పుడు, విష విస్ఫుర ద్భుజంగ భంగికం బైన బాణంబు రౌద్రమంత్ర సహితంబు సేసి, కర్ణుండు పార్థప్రాణంబులు గొన నప్పళించి సంధింప, మున్ను కొండొక క్రుంగిన చక్రంబు కుండ మునుంగం దిగఁబడిన, నొడ్డగెడవై యరదం బేటునకు ననువీక తక్కిన, నుక్కఱి యక్కర్ణుం డప్రతీకారంబులగు రోష విషాదంబులఁ గన్నీరొలుక, రథంబు డిగ్గి కవ్వడిదెసఁ గనుంగొనుచు నిట్లనియె: 350

ప్రతిపదార్థం: అనునప్పుడు= అని అంటూ ఉండగ; విష= విషముచేత; విస్ఫురత్= ప్రకాశించే; భుజంగ= పాముయొక్క; భంగికము+ఐన= విధముగలదైన; బాణంబు; రౌద్రమంత్ర= భయంకరమైన నాశనకారి అయిన రుద్ర సంబంధిత మంత్రంతో; సహితంబుజేసి= కలిపి; కర్ణుండు; పార్థ ప్రాణంబులు= అర్జునుడి ప్రాణాలను; కొనన్= తీసికొనుటకు; అప్పళించి= పూనుకొని; సంధింపన్= ధనుస్సుకు జోడించగా; మున్ను= ఇంతకుముందే; కొండొక= కొద్దిగా; క్రుంగిన; చక్రంబు= చక్రముయొక్క; కుండ= చక్రపు ఆకులు బిగించిన గుండ్రటి తుండు (దీనిగుండానే బండి ఇరుసుదూరి త్రిప్పుతుంది); మునుంగన్= బాగా నేలలో కూరుకొనిపోయేటట్లు; దిగఁబడినన్= చొచ్చుకొనిపోగా; అరదంబు; ఒడ్డగెడవై= వాటుపడి - తల క్రిందులై; ఏటునకున్= దెబ్బతీయటానికి; అనువు, ఈక= వీలు కల్పించక; తక్కినన్= తొలగిపోయినందున; ఉక్కఱి= బలం-ధైర్యం పోగొట్టుకొని; ఆ+కర్ణుండు; అప్రతీకారంబులు+అగు= ప్రతీకారము లేని; రోష= కోపంతో; విషాదంబులన్= దుఃఖంతో; కన్నీరు; ఒలుకన్= కారుతుండగా; రథంబు; డిగ్గి= దిగి; కవ్వడి దెసన్= అర్జునుడి వైపు; కనుంగొనుచున్= చూస్తూ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అంటూండగా విషం క్రక్కే సర్పంలాంటి బాణాన్ని రుద్రమంత్ర ప్రభావితంచేసి కర్ణుడు అర్జునుడి ప్రాణాలను తీసే ప్రయత్నంచేసి వింటికి తొడుగగా అంతకుముందే భూమిలో దిగబడిన రథచక్రం మరింత నేలలో కూరుకుపోయింది. దానితో రథం పూర్తిగా ప్రక్కకొరిగి బాణప్రయోగానికి వీలు చిక్కలేదు. అప్పుడు కర్ణుడు ధైర్యాన్ని కోల్పోయి రోషవిషాదాలతో కన్నీరు కారుస్తూ, రథం దిగి, అర్జునుడిని చూస్తూ ఇట్లా అన్నాడు.

సీ. **'అరదంబు చక్రంబు ధరఁ జాలఁ గ్రుంగిన । నెత్తెద, నంతకు నేయ కుండు;**
మేను భూమిస్థుఁడ నీవు రథస్థుండ । వియ్యెడఁ దగ వగు నేయ కునికి;
విరిదలవానిని విరథుని నాయుధం । బిడినవానిని శూరు లేయ రెందు;
మహిత శూరుఁడ వనుమాత్రగా దుత్తమ । కులుఁడవు, రణధర్మకోవిదుండ,

ఆ. **విట్టి నీవు దగిన యట్టి భంగిన యని । సేయవలయు; నిట్లు సెప్ప టెల్లఁ**
బాడి యేర్పడంగఁ బలుకుట గాని, గో । విందునకును, నీకు వెఱచి కాదు!' **351**

ప్రతిపదార్థం: అరదంబు= రథంయొక్క; చక్రంబు; ధరన్= నేలలోనికి; చాలన్= ఎక్కువ; క్రుంగినన్= దిగబడిపోయినందున; ఎత్తెదన్= పైకి లేవదీస్తాను; అంతకున్= దానిని పైకి ఎత్తేవరకు; ఏయకుండుము= బాణప్రయోగం చేయకుండా ఊరకుండుము; ఏను; భూమిస్థుఁడన్= నేలమీద ఉన్నవాడను; నీవు= నీవో; రథస్థుండవు= రథమెక్కి ఉన్నవాడవు; ఈ+ఎడన్= ఈ సమయంలో; ఏయక+ఉనికి= బాణాలు విసరకుండా ఉండటం; తగవు+అగున్= ఉచితమగును; విరిదలవానిని= తలవెంట్రుకలు విరబోసుకొన్నవాడిని; విరథునిన్= తేరు విరిగి భూమిపైనున్నవాడిని; ఆయుధంబు; ఇడినవానిని= విడిచిపెట్టినవాడిని; ఎందున్= ఎక్కడా; శూరులు= వీరులు; ఏయరు= బాణప్రయోగం చేయరు; మహిత= పేర్గాంచిన; శూరుఁడవు అను మాత్రకాదు= శూరుడవు మాత్రమే కాదు; (క్షాత్రధర్మం ఎరిగినవాడవేగాక దానిని ఆచరణలో పెట్టేవాడవు); ఉత్తమకులుఁడవు= ఉత్తమ వంశానికి (కురువంశానికి) చెందినవాడవు; రణధర్మకోవిదుండవు= యుద్ధనీతిని ఎరిగినవాడవు; ఇట్టి నీవు= ఇట్టి గుణగరిష్ఠుడవగు నీవు; తగిన అట్టి భంగిన్+అ= ఉచితమైన రీతిలోనే; అని చేయవలయున్= యుద్ధం చేయవలెను; ఇట్లు చెప్పుట; ఎల్లన్= అంతా; పాడి= ధర్మపద్ధతి; ఏర్పడంగన్= స్పష్టమయ్యేటట్లు; పలుకుటకాని= చెప్పటమే గాని; గోవిందునకున్; నీకున్; వెఱచి కాదు= భయపడి మాత్రం కాదు.

తాత్పర్యం: 'రథచక్రం భూమిలో చాల క్రుంగింది. దానిని ఎత్తేంతవరకు బాణాలు వేయకుము. నేను నేలమీద ఉన్నాను. నీవు రథంమీద ఉన్నావు. బాణప్రయోగం చేయకుండటం న్యాయం, తలజుట్టు విరబోసికొన్నవాడిని, రథం లేని వానిని, ఆయుధం విడిచినవాడిని శూరులు బాణాలతో కొట్టరు. నీవు గొప్ప వీరుడవే కాదు ఉత్తమక్షత్రియ వంశంలో పుట్టినవాడివి, యుద్ధధర్మాలు తెలిసినవాడివి, అటువంటి నీవు తగినవిధంగా యుద్ధం చేయాలి. ఇట్లా చెప్పటం ధర్మం తెలియచెప్పటానికే కాని, కృష్ణుడికీ, నీకూ భయపడికాదు.'

విశేషం: ఈ పద్యం కర్ణుడి గుణగౌరవానికి నిలువుటద్దము. పుట్టినది మొదలు ముళ్ళకిరీటాన్ని ధరించియున్నాడు. పొరపొచ్చెము లేని రీతిలో జీవయాత్ర సాగించినాడు. అంతకంతకు పేర్చే అధిపు మన్నన అప్పుదీర్చను శరాసనాన్ని దించకుండా, రణరంగాన గావించిన ఆత్మబలిదానంతో తీర్చుకొన్నాడు. తన సహజ కవచకుండలాలను కోసి దానం చేసిన త్యాగి. ధర్మదీక్షా కంకణబద్ధుడై, చలించని మానసంతో మిత్రసేవ చేసినాడు. తనతోపాటు తన కొడుకులను బలియిచ్చిన కర్మయోగి- ఈ రాధేయుడు.

వట్టిమాటలకే గాక చేతలకు అన్నిట చాలినవాడు, కాబట్టే రణనీతిసూక్తులు పలుకుటకు చాలికూడా ఉన్నాడు. విరోధి వంశగౌరవాన్ని, శౌర్యవిలాసాన్ని, రణరంగనీతిని కొనియాడి, నడివడికను దిద్దుకోమని చెప్పటం ఒక మహోదాత్త భావసరణి. అందువలన తాను ఇరుక్కొని ఉన్న అవస్థను గమనించి, నడుచుకొనుమంటున్నాడు. నీటికంటె నెత్తురు చిక్కన అయినదిగదా! తాను అర్జునుడి అగ్రజుడని తల్లి, కృష్ణులవలన తెలిసికొనే ఉన్నాడు. అయినా ప్రభుభక్తితో శక్తి వంచనలేకుండ అర్జునుడితో పోరాడాడు. ఇందు ఇంకొక చమత్కారం. ఈ మాటలు నిన్నూ ఆ కృష్ణుడిని చూచి పిరికి మనస్సుతో అనటంలేదు. యుద్ధధర్మాన్ని గుర్తుచేయటానికి మాత్రమే అని అనటం.

వ. అనిన విని, యచ్చ్యుతుం డతని కిట్లనియె : 352

తాత్పర్యం: అనగా విని కృష్ణుడు, కర్ణుడితో ఇట్లా అన్నాడు:

క. 'ఏమీ! తగవును ధర్మము । నీ మనమున నేఁడ పుట్టెనే? గర్వము ను
ద్దామ దురభిమానము నే । లా మఱచితి కర్ణ? యా చలం బెటఁ బోయెన్?' 353

ప్రతిపదార్థం: కర్ణ!= ఓ కర్ణుడా!; ఏమీ!= ఏమేమి! (ఎగతాళితో కలిసిన ఎత్తిపొడుపు); తగవును= న్యాయము; ధర్మమున్= ధర్మము; నీ మనమునన్= నీ మనస్సులో; నేఁడు+అ పుట్టెనే?= ఈ దినమే కలిగినట్లున్నవే? (లేకుంటే); గర్వమున్= అహంకారాన్ని; ఉద్దామ= భయంకరమైన; దురభిమానమున్= అనుచితగర్వాన్ని; (నీకున్నవాటిని); ఏలా మఱచితి(వి)= ఎందుకు మరచిపోయినావు?; ఆ చలంబు= ఆ మాత్సర్యం; ఎటన్ పోయెన్?= (నిన్నువదలి) ఎక్కడికి పోయిందయ్యా!

తాత్పర్యం: 'ఎట్లెట్లా? ఈ న్యాయము, ధర్మము నీ మనసులో ఈనాడే పుట్టాయా? లేకుంటే నీ అహంకారాన్ని, ఆ చెడ్డ ఉత్కర్షను ఎట్లా మరచిపోయావయ్యా కర్ణా! ఆ ద్వేషం, ఆ అసూయ నిన్ను వదలి ఎక్కడికి పోయాయి?'

ఆ. 'పరమధర్మపరులు పాండుభూవల్లభ । సుతులు, వారి నతులశుభము లొందు;
ధర్మహీను లైన ధార్తరాష్ట్రులకుఁ బా । టిల్లు నివ్విధమున నెల్లచేటు.' 354

ప్రతిపదార్థం: పాండు భూవల్లభసుతులు= పాండురాజు కుమారులు; పరమధర్మపరులు= అత్యంత ధర్మపరులు; వారిని; అతుల= సాటిలేని; శుభములు= శ్రేయస్సులు; ఒందున్= చేరుతాయి; ధర్మహీనులు+ఐన= అధర్మపరులైన; ధార్తరాష్ట్రులకున్= ధృతరాష్ట్రుని కుమారులకు; ఈ విధమునన్; ఎల్లచేటు= అన్ని విధాలైచెడ్డలు; పాటిల్లున్= కలుగుతాయి. (ప్రాప్తిస్తాయి).

తాత్పర్యం: 'అత్యుత్తమమైన ధర్మాన్ని పాటించే పాండవులకు శ్రేయస్సులు కలుగుతాయి. అవినీతిపరులైన ధృతరాష్ట్రుడి పుత్రులకు ఈ విధంగానే అన్ని అరిష్టాలు సంభవిస్తాయి.'

వ. 'దీనికి నీవు కటకటంబడినం బోవునే?' యని పలికి వెండియు. 355

ప్రతిపదార్థం: దీనికిన్= రానున్న ఈ దురదృష్టాలకు; నీవు; కటకటన్+పడినన్= బాధపడితే; పోవునే?= తప్పిపోతాయా?; (దుఃఖించినంత మాత్రాన దుఃఖాలు గడచిపోవు) అని పలికి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: 'దీనికి నీవు బాధపడితే అవి తొలగిపోతాయా?' అని పలికి ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'గొంతియు నందఱు గొడుకులు సుప్తులై । యుండంగ లక్కయిల్ మండఁ జేసి
కపటంపు జూదంబు ఘటియించి ధర్మాత్ముఁ । డగు ధర్మసుతు సిరి యపహరించి,
యంతఁ బోవక ద్రుపదాత్మజఁ దెచ్చి స । భాస్థలి నమ్మెయి భంగపఱిచి,
యమ్మహాత్ములఁ జంప నడవికి ఘోషయాత్రావిధి నెపమున దాడి వెట్టి,

తే. బాలు నభిమన్యు నొక్కని బహురథికులఁ । బనిచి చంపించె మీసుయోధనుఁడు; దలఁపఁ
గాని, యిప్పాపముల కాదికర్త నీవ; । యిన్ని యెడలను నీపాడి యెందుఁ బోయె?' 356

ప్రతిపదార్థం: గొంతియున్= కుంతియు; అందఱు కొడుకులు; సుప్తులు+ఐ ఉండంగన్= నిద్రపోతూ ఉండగా; లక్కయిల్= లక్కఇల్లు; మండన్+చేసి= కాలేటట్లు చేసి; కపటంపు జూదంబున్; ఘటియించి= కల్పించి; ధర్మాత్ముఁడగు; ధర్మసుతు= ధర్మరాజుయొక్క; సిరి= సంపదను; అపహరించి= దొంగిలించి; అంతన్+పోవక= దానితో ఊరకుండక; ద్రుపద+ఆత్మజన్= ద్రుపదుడి కూతురుని ద్రౌపదిని; తెచ్చి= తీసికొనివచ్చి; సభాస్థలిన్= ఆ పెద్ద కొలువుకూటంలో; ఆ+మెయిన్= ఆ విధంగా; భంగపఱిచి= అవమానించి; ఆ+మహాత్ములన్= ఆ గొప్పవారిని-పాండవులను; చంపన్= చంపేటందుకు; అడవికిన్= అడవికి; ఘోషయాత్రా విధి= ఘోషయాత్రా విధానం అనే; నెపమునన్= సాకుతో; దాడి+పెట్టి= దాడిచేసి; బాలున్= చిఱుతప్రాయంవాడైన; అభిమన్యున్; ఒక్కనిన్= ఒంటరివాడిని; బహురథికులన్= అనేక రథసైనికులను; పనిచి= పంపి; మీ సుయోధనుఁడు; చంపించెన్; తలఁపన్+కాని= తలచుకోవటానికి తగని కూడా అతని పాపాలన్నిటికి; ఆదికర్త= మొదటివాడవు; నీవు+అ= నీవే; ఇన్ని ఎడలనున్= ఈ సందర్భాలన్నిటిలోను; నీ పాడి= నీవు చెప్పే ఈ న్యాయం (ధర్మోపదేశం); ఎందున్+పోయెన్?= ఎక్కడికి పోయింది?

తాత్పర్యం: 'కుంతీ, ఆమె కొడుకులూ నిద్రపోతూ ఉండగా లక్కయింటిని కాల్పించి, కపటపుజూదం కల్పించి, అందులో ధర్మరాజు సంపదనంతా దొంగిలించి, అంతటితో ఆగక ద్రౌపదిని నిండుసభలో ఆ విధంగా అవమానించి, పాండవులను చంపటానికి ఘోషయాత్ర నెపంతో దాడిచేసి, బాలుడైన అభిమన్యుడిని ఒక్కడిగా చేసి అనేక రథికులను అతడిపైకి పంపించి చంపించాడు మీ దుర్యోధనుడు. అనుకోవటానికి కూడా తగని ఈ పాపాలకన్నిటికీ మూలకర్తవు నీవే. ఈ సందర్భాలన్నింటిలో నీ విప్పుడు పలికే న్యాయం ఎక్కడికి పోయింది?

వ. అని యిట్లు, కృష్ణుండు గర్ణుతో నాడుమాటలఁ దోడ్తోడం బెరిఁగిన యర్జునంజయు మనంబు రోషానలంబు రోమకూపంబులఁబటుజ్వాలారూపంబుల వెడలుట, యతివిస్మయ ప్రదంబై యుండె; నయ్యుగ్రమూర్తి సముదగ్ర పరాక్రమంబునం గురియు పటుబాణా సారంబు వారించి, యవ్వీరు నంగంబున నయ్యంగపతి నిశితాస్త్రంబులు నిగిడించుట మహాద్భుతంబయ్యె; నత్తెఱంగున నీడంబోక పెనంగు నతం డతిరయంబున నన్నరునిం బది దొడ్డనారసంబుల నొప్పించిన, నత్తేజోధనుం డాజ్యధారాచ్ఛటాసేకంబున నుద్రేకంబు నొందిన హుతవహుండునుం బోలె మండి, శత్రుసంత్రాసనంబును మిత్రోల్లాసనంబును బ్రగుణమణి జాంబూనదమయంబును జనప్రస్తుతి పాత్రంబును హస్తికక్ష్యాత్మకంబును నగు నతని కేతనంబును గనకపుంఖప్రభా భాసితంబైన భల్లంబునఁ బడనేసినం గౌరవులు నిజ యశో బలదర్ప ప్రియంబుల మొత్తంబులు వడుటగాఁ దలంచుచు హాహాకారంబులతో నా రాధేయుని దెస నిరాశులై; రట్లు ప్రస్ఫీతకేతుపాతనం బాచరించిన, దానం గనలి కర్ణుం డతినిశిత క్రూరనారాచజాలంబులు గృష్ణార్జునులమీఁదం

గురిసి వెగడుపఱిచి యరదంబు పిఱిందికొమ్ము క్రిందికి మూఁపు సొనిపి లావున నెత్తిన, రథచక్రంబు విడువక, భూమి గులపర్వత కానన సముద్రసహితం బాఱంగుళంబు లెగసె; నట్లు కర్ణుండు రథంబు నిలిపి, మీఁదికిం జని, యెప్పటి బాణంబు సంధింప వెండియుఁ జక్రంబు దిగంబడినఁ; గ్రమ్మఱ రథంబు డిగ్గి యెత్తనమరెఁ; నయ్యవసరంబునఁ గృష్ణుపనుపునం గ్రీడి దోడన. 357

ప్రతిపదార్థం: అని ఇట్లు; కృష్ణుండు; కర్ణుతోన్; ఆడు మాటలన్= పలికిన మాటలచేత; తోడ్తోడన్= వెనువెంటనే; పెరిఁగిన= అతిశయమైన; ఆ+ధనంజయు= ఆ అర్జునుడి; మనంబు= మనస్సునందలి; రోష+అనలంబు= కోపం అనే నిప్పు; రోమకూపంబులన్= వెంట్రుకల పాదులలో; పటు= తీవ్రమైన; జ్వాలారూపంబులన్= మంటలవలె; వెడలుట= బయటపడటం అతి విస్మయప్రదంబు+ఐ= మిక్కిలి ఆశ్చర్యం కలిగించేదై; ఉండెన్; ఆ+ఉగ్రమూర్తి= ఆ కోపమే రూపం తాల్చినట్లున్న వీరుడు; సముదగ్ర= అతిశయమైన; పరాక్రమంబునన్= శౌర్యంతో; కురియు= వానవలె కురిపిస్తున్న; పటుబాణ+ఆసారంబున్= దిట్టమైన బాణాల జడివానను; వారించి= నిలిపివేసి; ఆ+వీరు= ఆ శూరుడైన అర్జునుడి; అంగంబునన్= శరీరమునందు; ఆ+అంగపతి= ఆ అంగదేశాధీశుడైన కర్ణుడు; నిశిత+అస్త్రంబులు= పదునైన బాణాలను; నిగిడించుట= వ్యాపింపచేయటం; మహాద్భుతంబు= గొప్పవింత; అయ్యెన్; ఆ+తెఱంగునన్= ఆ విధంగా; ఈడఁబోక= వెనుదీయక; పెనంగు; అతండు= కర్ణుడు; అతిరయంబునన్= మహావేగంతో; ఆ+నరునిన్= ఆ అర్జునుడిని; పది; దొడ్డ= పెద్ద; నారసంబులన్= బాణాలతో; నొప్పించినన్= కష్టపెట్టగా; ఆ+తేజోధనుండు= కాంతి సంపన్నుడగు ఆ నరుడు; ఆజ్యధారా= నేతి పోత చాలుయొక్క; ఛటా= సమూహంయొక్క; సేకంబున= తడుపుటచేత; ఉద్రేకంబు= పొంగు; ఒందిన= పొందిన; హుతవహుండునున్= వేల్చబడిన వస్తువులు ధరించే అగ్నిహోత్రుడి; పోలెన్= విధంగా; మండి; శత్రుసంత్రాసనంబు= విరోధులకు భయమును; మిత్ర+ఉల్లాసంబును= స్నేహితులకు సంతోషాతిశయాన్ని; కలుగన్+చేయు; ప్రగుణ= శ్రేష్ఠములైన; మణి= మణులతో; జాంబూనదమయంబును= బంగారుతో చేయబడినదియు; జనప్రస్తుత= ప్రజాప్రశంసలకు; పాత్రంబును= తగినదియు; హస్తి= ఏనుగుయొక్క; కక్ష్యాత్మకంబు= పొట్టక్రింద పట్ట రూపమును పొంది ఉన్నటువంటిదియు; అగు= అయినటువంటి; అతని= కర్ణుడి; కేతనంబును= ధ్వజాన్ని; కనకపుంఖ= బంగారు కాడ మొదలుతో; ప్రభాభాసితంబైన= (బంగారు) కాంతితో ప్రకాశిస్తున్న; భల్లంబునన్= బాణంతో (ఈటెతో); పడవేసినన్= పడగొట్టగా; (దీనితో) కౌరవులు; నిజ= తమయొక్క; యశః= కీర్తి; బలదర్ప= శక్తిగర్వం; ప్రియంబుల= ఇష్టమైనవాటి; మొత్తంబులు= అన్నీ పూర్తిగా; పడుటకాన్= భగ్నమైనట్లుగా; తలంచుచున్= అనుకొంటూ; హాహాకారంబులతోన్= కేకలతో; ఆ రాధేయుని; దెసన్= పట్ల; నిరాశులు+ఐరి= ఆశలు పోగొట్టుకొన్నవారైరి (కర్ణుడు జయిస్తాడన్న ఆశలు కోల్పోయిన వారైరి); అట్లు= ఆ విధంగా; ప్రస్ఫీత= మిక్కిలి పేర్గాంచిన; కేతు= టెక్కెముయొక్క; పాతనంబు= పడగొట్టుటను; ఆచరించినన్= చేయగా; దానన్= దానివలన; కర్ణుండు; కనలి= కోపగించుకొని; అతి నిశిత= మిక్కిలి పదునైన; క్రూర= కరకై బాధపెట్టునట్టి; నారాచజాలంబులు= బాణసమూహాలను; కృష్ణార్జునులమీఁదన్; కురిసి= వర్షింపజేసి; వెగడుపఱిచి= తల్లడిల్లజేసి, వ్యాకులపాటును కలిగించి; అరదంబు; పిఱింది= వెనుకటి; కొమ్ము= పొడవు దూలమునకు (దీనిని పరము అంటారు); క్రిందికి; మూఁపు; చొనిపి= దూర్చి; లావునన్= శక్తితో; ఎత్తినన్= పై కెత్తగా; రథచక్రంబు= రథచక్రాన్ని; విడువక= వదలక; భూమి; కులపర్వతములు= ఏడు కులపర్వతాలు; కానన= అడవులు; సముద్ర సహితంబు= సప్త సముద్రాలతో; ఆఱు అంగుళంబులు; ఎగసెన్= పైకి ఉబికినది; అట్లు= ఆ విధంగా; కర్ణుండు; రథంబు నిలిపి; మీఁదికిన్+చని= ఆ తేరుమీదికి ఎక్కి; ఎప్పటి బాణంబు= ఆ పాతబాణమును; సంధింపన్= ఎక్కుపెట్టగా; వెండియున్= మరల; చక్రంబు; దిగన్+పడినన్= నేలలో కూరుకొనిపోగా; క్రమ్మఱన్= మరల; రథంబు; డిగ్గి= దిగి; ఎత్తన్= పైకి లేవదీయటానికి; అమరెన్= సిద్ధపడ్డాడు; ఆ+అవసరమునన్= ఆ సమయంలో; కృష్ణుని పనుపునన్= కృష్ణుడు చెప్పినట్లు; క్రీడి= అర్జునుడు; తోడన్= వెనువెంటనే.

తాత్పర్యం: కృష్ణుడు కర్ణుడితో అన్నమాటలు, అర్జునుడి మనస్సులో ఆత్మగౌరవం ప్రేరేపించిన కోపాగ్నిని ప్రతివెంట్రుక కూపంనుండి మంటల రూపంలో బయటపడేటట్లు చేసింది. అందరికీ ఆశ్చర్యం కలిగించింది. భయంకరాకారుడై ఉన్న ఆ అర్జునుడు పెల్లుబికిన భీకర పరాక్రమంతో కురిపించే అమ్ములవానను ఆపి కర్ణుడు ఆ ప్రతాపశాలి కిరీటి దేహంలో బాణాలను చొప్పించటం ఇంకా అద్భుతంగా కనుపట్టింది. ఆ విధంగా వెనుకాడక, ఆ వీరుడు పోరాడుతూ, అత్యంతవేగంగా పది పెద్దబాణాలతో నరుడిని నొప్పించాడు. దీనితో పరాక్రమమే సంపదగా కలిగిన నరుడు నేతిధారలతో ప్రజ్వరిల్లిన అగ్నిదేవుడివలె మండి బంగారుకాడ గలిగి తళుకొత్తే ఈటెతో - శత్రువులకు భయోత్పాదకమైనట్టియు, మిత్రులకు సంతోషదాయకమైనట్టియు నానావిధాలైన రత్నాలు పొదువబడి బంగారుమయమై ప్రజల స్తోత్రాలకు అర్హమైనదియు, ఏనుగు నడుముపట్టి రూపాన్ని పొంది ఉన్న ఆ కర్ణుడి ధ్వజాన్ని పడగొట్టాడు. కౌరవులు ఈ ధ్వంసాలన్నీ తమ యశస్సు, బలం, గర్వం మొదలైన ప్రీతిపాత్రాల మొత్తం వికలమైనట్లుగా భావించి దుఃఖంతో కేకలు వేస్తూ కర్ణుడిపట్ల ఆశను వదలుకొన్నారు.

ఈ విధంగా ప్రఖ్యాతిగాంచిన తన ధ్వజం పడిపోవటం చూచి కర్ణుడు కోపపడి, బాధాకరమైన వాడి బాణాలను కృష్ణార్జునులమీద వానమాదిరి కురిపించి బాధించాడు. తోడ్తోడనే కర్ణుడు దిగబడిన తన తేరు వెనుకటి పాడవు దూలం క్రిందకు తన భుజాన్ని దూర్చి, ఉన్న బలాన్నంతా కూడగట్టుకొని ఎత్తగా, ఆ రథచక్రాన్ని వదలక భూమి కులపర్వతాలతో, అరణ్యాలతో అన్నీ సముద్రాలతోపాటు ఆరు అంగుళాలు పైకి లేచింది. (ఆ ప్రయత్న బలమట్టిది). ఆ విధంగా ఆ కర్ణుడు రథాన్ని నిలిపి, దానిపై కెక్కి చేతనున్న బాణాన్ని సంధించాడు. ఆ చక్రం ఇంకా లోతుకు దిగబడింది. మరలా ఆయన రథందిగి, పైకి ఎత్తటం ప్రారంభించాడు. ఆ సందు చూచుకొని కృష్ణుడి మాటమీద కిరీటి వెంటనే. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: కర్ణుడు రణధర్మాన్ని ప్రస్తావించేసరికి, అంతవూనికతో యుద్ధం చేస్తున్న అర్జునుడు అతడిని కొట్టటానికి తటపటాయించటాన్ని - కృష్ణుడు పాండవులకు జరిగిన అపకారాలన్నింటిని ఏకరువు పెట్టి, వాటిలో కర్ణుని పాత్రను ప్రస్తావించి, అర్జునుణ్ణి అమితంగా రెచ్చగొట్టి, అతడు రణధర్మాన్ని ప్రక్కన పెట్టి కర్ణుణ్ణి కొట్టటానికి పూనుకొనేటట్లు చేయటాన్ని - మనోధర్మజ్ఞుడైన తిక్కన మహాకవి చిత్రించిన తీరు అద్భుతం. అలాగే కర్ణుడు ఏమాత్రం సడలని ధైర్యంతో తన మూపుమోపి క్రుంగిన రథచక్రాన్ని పైకెత్తటానికి ప్రయత్నించటాన్ని కళ్ళకుకట్టినట్లు చిత్రించిన ఆ మహాకవి నాటకీయకవితా శిల్పం కూడ అమోఘం.

మ. **కులిశ ప్రస్ఫురణాపహాసనవిభాగుచ్ఛంబులం గల్గి యాఁ**
కలిమైవచ్చు కృతాంతవక్త్ర మన నుగ్రంబై మురారాతి రు
ద్రుల చక్రంబును శూలముం దెగడుచుం గ్రూరంపు టొప్పారు నం
జలికంబైన మహాస్త్రముం దొడివి కర్ణుం బుబ్బునం జేయుచున్. **358**

ప్రతిపదార్థం: కులిశ= వజ్రాయుధంయొక్క; ప్రస్ఫురణ= గొప్పవెలుగును; అపహాసన= గేలిచేసే; విభాగుచ్ఛంబులన్= కాంతిపుంజాలను; కల్గి= పొంది; ఆఁకలిమైన్ వచ్చు= ఆకలితోవచ్చే; కృతాంత= యముడి; వక్త్రము అనన్= నోరా ఏమి?- అన్నట్లు; ఉగ్రంబు+ఐ= భయంకరమై; ముర+అరాతి= మురారి-కృష్ణుడి; చక్రంబును= చక్రాన్ని; రుద్రుని= శివుడి; శూలమున్; తెగడుచున్= పరిహాసం చేస్తూ; క్రూరంపు= క్రౌర్యముయొక్క; ఒప్పారున్= అమరికతో; అంజలికంబైన= చేతులు జోడించదగిన;

మహా+అస్త్రమున్= గొప్పబాణాన్ని; తొడివి= తొడిగి; కర్షంబును= లాగుటను; ఉబ్బునన్ చేయుచున్= పొంగుతో చేస్తూ (అర్జునుడు).

తాత్పర్యం: వజ్రాయుధంయొక్క గొప్ప వెలుగును గేలిచేసే కాంతి సమూహాలను కలిగి, ఆకలితో వచ్చే యముడి నోరా అన్నట్లు భయంకరమై, శ్రీకృష్ణుడి చక్రాన్ని, శివుడి శూలాన్ని తిరస్కరించే క్రౌర్యంయొక్క అమరికతో, చేతులు జోడించి నమస్కరింపదగిన ఒక గొప్ప అస్త్రాన్ని వింట సంధించి, ఉప్పొంగి అల్లెత్రాటిని లాగుతూ (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'ఇది భయానికి ఇంపు గూర్చిన దీర్ఘ ఉపమాలంకారం. కర్ణుడి మెడ నరకటానికి ఇంతటి సన్నాహం కావలసి ఉన్నదంటే దాని బిగువును వెల్లడిస్తున్నది కదా!

క. **'ఏను దపశ్చరణంబున । దానంబున గురుజనాభితర్పణమున, ని**
త్యానూన వ్రతశీలుఁడ । నేనియుఁ గర్ణుతలఁ ద్రెంచు నీశర' మనియెన్. **359**

ప్రతిపదార్థం: ఏను= నేను; తపః+చరణంబునన్= తపమాచరించుటలో; దానంబునన్= దానము చేయుటలో; గురుజన= గురుదేవులకు; అభితర్పణమునన్= సంతృప్తిని కలిగించుటలో; నిత్యం= సదా; అనూన= తక్కువకాని; వ్రతశీలుఁడను= పుణ్యకర్మలాచరించేవాడను; ఏనియున్= అయినట్లయితే; ఈ శరము; కర్ణుతలను; త్రెంచున్= నరికివేయును; అనియెన్= (ప్రతిజ్ఞాపూర్వకంగా) అన్నాడు.

తాత్పర్యం: 'నేనే గనుక తపస్విని, దాతను, సేవలతో గురుదేవులకు సంతృప్తిని కలిగించేవాడను, పుణ్యకర్మలను ఎల్లప్పుడు ఆచరించేవాడను అయితే, ఈ బాణం కర్ణుడి తల నరికివేస్తుంది.' అని ప్రతిజ్ఞావచనం పలికాడు.

క. **అని, తెగ నిండఁ దిగిచి యే । సిన, నయ్యస్త్రంబు రోదసీకుహరంబుం**
దనమెఱుఁగుల నించుచు నిరు । మొనల జనుల గాఢమూర్ఛ ముంచుచు నిగిడెన్. **360**

ప్రతిపదార్థం: అని; తెగనిండన్= పూర్తిగా; తిగిచి= లాగి; ఏసినన్= వదలగా; ఆ+అస్త్రంబు= మంత్రబల సంపన్నమైన ఆ ఆయుధం; రోదసీ= భూమి ఆకాశమధ్య ప్రదేశములయొక్క; కుహరంబున్= దొప్పవంటి భూమ్యాకాశాల మధ్య ప్రదేశమందు; తన మెఱుఁగులన్= తన కాంతులను; నించుచున్= పూర్తిగా నిండింపజేస్తూ; ఇరుమొనల జనులన్= ఉభయపక్షాల జనులను; గాఢమూర్ఛన్; ముంచుచున్; నిగిడెన్= వ్యాపించింది.

తాత్పర్యం: అని సత్తువంతా చూపి పూర్తిగా లాగి ప్రయోగించిన ఆ అస్త్రం గగనతలాన్నంతా తన కాంతులతో నింపుతూ, చూచి వెరగందిన ఉభయపక్షాలవారిని గాఢమూర్ఛలో ముంచుచు దూసుకు వెళ్ళింది.

అర్జున ప్రయుక్తం బగు ఘోరశరంబు కర్ణుశిరంబు ద్రుంచుట (సం. 8-67-24)

చ. **నినద సముద్ఘటస్ఫురణ నింగి వగుల్పఁగ సర్వభూతకం**
పన మగు చమ్మెయిన్ నిగిడి, పార్థివసత్తమ! యేమి సెప్పదుం?
దునిమె, శిరంబు రక్తమునఁ దోఁగుచుఁ గర్ణుని యట్ట వజ్రఘో
రనిహతిఁ గూలు గైరిక ధరాధరముం దలఁపింపఁ బట్టుగన్. **361**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పార్థివసత్తమ!= రాజోత్తమా!; నినద= శబ్దంయొక్క; సముద్భట; స్ఫురణన్= భయంకరస్ఫూర్తిచేత; నింగి= ఆకాశం; పగుల్పఁగన్= బీటలు తీయగా; సర్వభూత= ఎల్ల భూతాలయొక్క; కంపనము+అగుచున్= చలనము కలది ఔతూ; ఆ+మెయిన్= ఆ విధంగా; నిగిడి= రేగి; ఏమి చెప్పుదున్?= ఏమని చెప్పగలను?; రక్తమునన్; తోఁగుచున్= తడిసిపోతూ (నెత్తురు కారుతుండగా); కర్ణుని; అట్ట= మొండెం; వజ్రఘోరనిహతిన్= వజ్రాయుధంయొక్క బెట్టిదమైన దెబ్బతో; కూలు; గైరిక= గైరికాది ధాతువులను తాల్చిన; ధరాధరమున్= కొండను; తలఁపింపన్= స్ఫురింపజేయటానికి; పట్టుగన్= స్థానం అయ్యేటట్టు; శిరంబు= తలను; తునిమెన్= ఖండించింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఏమని చెప్పగలను! ఆ అస్త్రం తన కఠోర శబ్దం దెబ్బతో ఆకాశాన్ని బ్రద్దలు చేస్తూ, అన్ని భూతాలను కంపింప చేస్తూ, రక్తంతో తడుస్తూ కూలుతున్న కర్ణుడి మొండెం వజ్రాయుధంయొక్క భయంకరమైన దెబ్బకు ఎర్రటి గైరిక ధాతువులతో కూలిపడే పర్వతాన్ని తలపిస్తుండగా అతడి శిరస్సును ఖండించింది.

విశేషం: కర్ణుడి మరణ వర్ణన కూడ అతని మహోన్నత వ్యక్తిత్వానికి అనుగుణంగా మహోదాత్తంగా కంటికి కట్టినట్లు సాగింది. తిక్కనగారి పాత్రోచితవర్ణన, వస్తు ప్రత్యక్షీకరణ శిల్పం అమోఘం.

క. చరమగిరినుండి పడియెడు । తరణికరణి సూతపుత్రుతల వడఁ గాంతి
స్ఫురణోజ్జ్వలంబు నతి సుం । దరమును నగు కాయమట్లు ధరణిం బడియెన్. 362

ప్రతిపదార్థం: చరమగిరి నుండి= పడమటి కొండమీదనుండి; పడియెడు; తరణి కరణి= సూర్యుడివలె; సూతపుత్రుని; తల; పడన్= పడిపోగా; కాంతి స్ఫురణ= కాంతి వెదజల్లుతూ; ఉజ్జ్వలంబు= మిక్కిలి ప్రకాశిస్తూ; అతిసుందరమును అగు= మిక్కిలి అందమైన; కాయము= దేహం; అట్లు= ఆ విధంగా; ధరణిన్+పడియెన్= నేలపై పడింది.

తాత్పర్యం: పడమటి కొండనుండి పడే సూర్యుడివలె కర్ణుడి తల పడగా, వెలుగును వెదజల్లుతూ మిక్కిలి ప్రకాశిస్తూ, ఎంతో అందమైన అతడి దేహం ఆ విధంగా (ముందు పద్యంలో వర్ణించినట్లుగ) నేల మీద పడింది.

విశేషం: అలంకారం: ఉపమ.

తే. అధిప! యంతన గను విచ్చి యఖిల జనులు । గనుఁగొనంగ, నయ్యుజ్జ్వలతనువు విడిచి
చని సముద్దీప్త మైన తేజంబు వారి । జాప్తబింబంబు సొచ్చె నత్యద్భుతముగ. 363

ప్రతిపదార్థం: అధిప!; అంతన= వెంటనే; కను విచ్చి= కనులు తెరచి; అఖిల జనులు కనుఁగొనంగన్= ఉన్నవారంతా చూస్తుండగా; సముద్దీప్తము+ఐన= ఎక్కువకాంతితో ప్రకాశించే; తేజము= ప్రకాశం; సముజ్జ్వల తనువు= దేదీప్యమానమైన శరీరాన్ని; విడిచి చని= విడిచిపెట్టిపోయి; వారిజ+ఆప్త, బింబంబు= కమలములకు కూర్చువాడైన సూర్యుడి మండలాన్ని; అతి+అద్భుతముగన్= ఆశ్చర్యజనకంగా; చొచ్చెన్= ప్రవేశించింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఉన్నవారంతా బాగా కన్నులు తెరచి చూస్తుండగా అత్యంత ప్రకాశమాన కాంతిపుంజం కర్ణుడి తేజోవంతమైన శరీరాన్ని త్యజించి, కమలాప్తుని బింబంలో ఆశ్చర్యజనకంగా ప్రవేశించింది.

వ. అట్టి యెడ. 364

తాత్పర్యం: ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినుము! మహీసురుశాపము । మనుజేంద్రా! సూతపుత్రు మరణాంతం బై
యునికినొ, రథచక్రము మే । దినిఁ గ్రుంగుట లేక తొంటితెఱఁగున నుండెన్. 365

ప్రతిపదార్థం: మనుజేంద్రా; వినుము; మహీసురు= భూదేవునియొక్క; శాపము; సూతపుత్రుని; మరణాంతంబు+ఐ= మరణంతో పరిసమాప్తి నొందినదై; ఉనికినొ= ఉండటంవలన కాబోలు; రథచక్రము; మేదినిన్= భూమిలో; క్రుంగుట లేక= దిగబడటం లేక; తొంటి తెఱఁగునన్= మొదటి రీతిగానే (యథాపూర్వకంగా); ఉండెన్= ఉండింది.

తాత్పర్యం: మనుజేంద్రా! ఆ బ్రాహ్మణశాపం కర్ణుడి మరణంతోనే ముగిసిపోయినట్లున్నది. అందువలననే కాబోలు ఆ రథచక్రం నేలలో దిగబడటం మానుకొని మునుపటివలెనే నేలపై నిలిచిఉన్నది.

తే. దారుణాస్త్రజాలాంశుల వైరిసైన్య । తాప మొనరించి, యా సూతతనయ తరణి
పార్థదుస్తరకాలవైభవము గడవ । ననువు లేమి, నవ్విధమున నస్తమించె. 366

ప్రతిపదార్థం: దారుణ= భయంకర; అస్త్రజాల= ఆయుధాలసమూహం అనెడి; అంశులన్= కిరణాలతో; వైరిసైన్య= శత్రుసేనకు; తాపము= వేడి; ఒనరించి= పుట్టించి; ఆ సూతతనయ= ఆ సారథిపుత్రుడనే (కర్ణుడనే); తరణి= సూర్యుడు (సూర్యుడు కాబట్టి వడదెబ్బ కలిగించటం సహజంగానే ఉన్నది); పార్థ= అర్జునుడి; దుస్తర= దాటరాని; కాలవైభవము= కాలమహిమను; కడవన్= సాగించటానికి; అనువు లేమిన్= అవకాశం లేనందున; ఆ+విధమునన్; అస్తమించెన్= క్రుంగిపోయాడు.

తాత్పర్యం: క్రూరాలైన ఆయుధసమూహకాంతులతో శత్రుసైన్యాలను వేడిదెబ్బ కొట్టి, కర్ణుడనే సూర్యుడు అస్తమించాడు. దీనికి కారణం - అర్జునుడు అనే దాటరాని కాలమహిమను గడవడానికి వీలులేనందున ఆ విధంగా అస్తమించాడు.

విశేషం: అలంకారం: రూపకం. కర్ణుడికీ, సూర్యుడికీ, అస్త్రాలకూ, కిరణాలకూ, అర్జునుడికీ కాలమహిమకూ - లేదా పార్థుడనే దుస్తరమైన కాల (యమ) మహిమకూ అభేదం చెప్పబడింది కాబట్టి రూపకం.

క. సూతతనూజుఁడు పడినం । బ్రీతిం బాంచాలు రార్వఁ బెల్లుగఁ దూర్య
వ్రాతంబు సెలఁగ, సమ్మో । దాతిశయము వొందెఁ బాండవానీకంబుల్. 367

ప్రతిపదార్థం: సూతతనూజుఁడు= కర్ణుడు; పడినన్= చనిపోయినందున; ప్రీతిన్= ఆనందంతో; పాంచాలురు; ఆర్వన్= కేకలు పెట్టగా; పెల్లుగన్= ఎక్కువగా; తూర్యవ్రాతంబు= వాద్యసమూహపు ధ్వని; చెలఁగన్= చెలరేగగా; పాండవ+అనీకంబులు= పాండవసైన్యాలు; సమ్మోద+అతిశయము= ఎక్కువైన సంతోషమును; పొందెన్= పొందినవి.

తాత్పర్యం: కర్ణుడు కూలగా సంతోషంతో పాంచాలురు బిగ్గరగా కేకలుపెట్టారు. యుద్ధవాద్యాలు తీవ్రంగా మ్రోగాయి. పాండవపక్షం వారందరూ అమితంగా సంతసిల్లారు.

క. నిడుఁగేలున్ బలుతొడలు । న్వెడఁదయురమునై రణావనిం గర్ణునొడల్
పడియున్నఁ గని విషాదం । బడరి తొలఁగుమాడ్కిఁ గ్రుంకె నర్కుం డంతన్. 368

ప్రతిపదార్థం: నిడుఁగేలున్= పొడవైన చేయి; బలుతొడలున్= బలసిన తొడలు; వెడద= వెడల్పు అయిన; ఉరమును+ఐ= రొమ్ము కలిగి; రణావనిన్= యుద్ధభూమిలో; కర్ణు ఒడల్= కర్ణుడి దేహం; పడి ఉన్నన్; కని= చూచి; విషాదంబు+అడరి= దుఃఖం పొంగి; తొలఁగుమాడ్కిన్= వైదొలగిపోయిన విధంగా; అంతన్= అప్పుడు; అర్కుండు= సూర్యుడు; గ్రుంకెన్= అస్తమించాడు.

తాత్పర్యం: దీర్ఘబాహువులు, బలిష్ఠమైన తొడలు, విశాలమైన రొమ్ముతో యుద్ధభూమిలో పడి ఉన్న కర్ణుడి కళేబరాన్ని చూచి, సూర్యుడు (తన పుత్రుడైనందున) దుఃఖితుడై తొలగిపోయినట్లు ఆ సమయంలో అస్తమించాడు.

విశేషం: అలంకారం: ఉత్ప్రేక్ష.

తే. **నిర్గతప్రాణు రాధేయు నిజకరములఁ । గరుణ పెంపున నంటుట కారణముగఁ**
బావనస్నాన మొనరింపఁ బోవునట్టు । లపరజలనిధిలోనికి నరిగె నినుఁడు! **369**

ప్రతిపదార్థం: నిర్గత ప్రాణున్= వెడలిపోయిన అసువులు కలిగిన; రాధేయున్= కర్ణుడిని; నిజకరములన్= సొంత చేతులతో (కిరణములతో); కరుణపెంపునన్= దయాతిశయంతో, అంటుట కారణముగన్= తాకినకారణంగా; పావనస్నానము= పవిత్ర స్నానమును; ఒనరింపన్= చేయుటకుగా; పోవునట్టులు; అపర జలనిధిలోనికిన్= పడమటి కడలిలోనికి; ఇనుఁడు= సూర్యుడు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ప్రాణంపోయి పడి ఉన్న రాధేయుడిని తన కిరణాలతో (చేతులతో) కరుణాతిశయంతో తాకి మైలపడిన దోషపరిహారార్థం స్నానం చేయుటకో అనునట్లు, పడమటి సముద్రంలోనికి సూర్యుడు వెళ్ళాడు.

విశేషం: సూర్యతేజస్సుతో జన్మించి, సూర్యతేజస్సులో లీనమైన కర్ణుని వ్యక్తిత్వం మహోజ్జ్వలం. జీవితం మాత్రం విషాదాంతం. పరిస్థితుల ప్రాబల్యంవల్లనే కావచ్చు - మంచి చెడుతో చెయ్యి కలిపింది. చెడ్డపేరు తెచ్చుకొంది. చివరకు చెడుఫలితాన్ని పొందింది. విధి బలీయం. మహాభారతంలో పాఠకుల సానుభూతిని పొందే మరణం కర్ణునిది. కడకు అది శల్యుని సానుభూతిని కూడ పొందటం విశేషం.

వ. **అప్పుడు.** **370**

తాత్పర్యం: ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **కామఁ బాసిన కమలంబుకరణిఁ బొలుచు । కర్ణుతల యిలఁ బడియు నుదీర్ణకాంతి**
నొప్పు నట్టయుఁ జూచి శల్యుండు సిడము । ద్రెస్సి మోడైన యరదంబు ద్రిప్పె నధిప! **371**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; కామన్= తూటిని; పాసిన= విడనాడిన; కమలంబు= తామరపువ్వు; కరణిన్= విధంగా; పొలుచు= అందగిస్తున్న; కర్ణు తల; ఇలన్= భూమిపై; పడియున్= పడి కూడ; ఉదీర్ణ= గొప్పదైన; కాంతిన్+ఒప్పు= కాంతితో ప్రకాశిస్తున్న; అట్టయున్= మొండెమును చూచి; శల్యుండు; సిడము= పతాకధ్వజం; త్రెస్సి= తెగి; మోడైన= రూపం చెడి మోడుబారి ఉన్న; అరదంబు= రథాన్ని; త్రిప్పెన్= వెనుకకు మరలించాడు.

తాత్పర్యం: తూటినుండి వేరైన తామరపువ్వువలె ఉన్న కర్ణుని తలను, నేలమీద పడి ఉన్నా మిక్కిలి కాంతితో ప్రకాశిస్తున్న అతడి మొండెమును చూచి శల్యుడు టెక్కెము త్రెగి, మోడుబారిన ఆ తేరును వెనుద్రిప్పి తోలుకొని పోయాడు.

విశేషం: అలంకారం: ఉపమ.

క. **బలితపువెస నాఁబోతుం । బులి గొనినం, బసులు వాఱుపోలికిఁ గ్రోధో**
జ్జ్వలుఁ డగు పార్థుఁడు గర్ణునిఁ । బొలియించిన నీదుసైన్యములు వెఱఁ బఱచెన్. 372

ప్రతిపదార్థం: బలితపువెసన్= బలంతో కూడుకొనిన వేగంతో; ఆఁబోతున్= ఆబోతును; పులి కొనినన్= పెద్దపులి చంపి లాగుకొనిపోగా; పసులు= పశువులు; పాఱుపోలికిన్= పరుగెత్తిపోయే మాదిరిగా; క్రోధ+ఉజ్జ్వలుఁడు+అగు= పగపెంపుతో మండిపోతున్న; పార్థుఁడు; కర్ణునిన్; పొలియించినన్= చంపివేయగా; నీదు సైన్యములు; వెఱన్= భయంతో; పఱచెన్= పరుగెత్తిపోయాయి.

తాత్పర్యం: బలవత్తరవేగంతో పైబడి ఆబోతెద్దును పులి లాగుకొనిపోగా పరుగెత్తిపోయే పసుల మందవలె - ప్రతీకారక్రోధంతో మండిపడే పార్థుడు కర్ణుడిని తుదముట్టించగా, నీ సైన్యాలు భయపడి పరుగెత్తిపోయాయి.

విశేషం: అలంకారం: ఉపమ.

తే. **దీనవృత్తి శల్యుండు నీ సేనజనులు, నట్లు పాంచాలు రుబ్బున నార్వ, సిగ్గు**
వడక పాండవమధ్యము సిడము మరలి । మరలి చూచుచుఁ బాఱిరి మనుజనాథ! 373

ప్రతిపదార్థం: దీనవృత్తి= దీనమైన వర్తనంతో; శల్యుండున్; నీ సేనజనులున్= నీ సేనలోనివారూ; అట్లు= ఆ రీతిగా; పాంచాలురు ఉబ్బునన్= సంతోషంతో; ఆర్వన్= అరవగా; సిగ్గు+పడక; పాండవ మధ్యము సిడమున్= అర్జునుడి ధ్వజాన్ని; మరలి మరలి= తిరిగి తిరిగి; చూచుచున్ పాఱిరి= పరుగెత్తారు.

తాత్పర్యం: ఆ విధంగా పాంచాలురు విజయోత్సాహంతో ఉబ్బిపోయి కేకలు వేస్తుండగా, శల్యుడు, నీ సైనికులు సిగ్గుమాలి పాండవపుత్రులలో మూడవవాడైన పార్థుడి కేతనాన్ని తిరిగి తిరిగి చూస్తూ పలాయనం చిత్తగించారు.

విశేషం: పాండవమధ్యముడు అర్జునుడు. కుంతీసుత మధ్యముడు భీముడు. మధ్యమ శబ్దానికి నడిమివాడని అర్థం. కాని కొందరు చెప్పేటట్లు మూడవవాడని చెప్పటం సరిగాదు.

ఉ. **గాండివ ముక్తబాణమునఁ గర్ణుఁడు గూలుటయుం, గడంగి శ**
ల్యుం డరదంబు దోలుటయు, నొక్కమొగిన్ భవదీయ సేన లొం
డొండ కలంగి పాఱుటయు నుల్లసితుం డయి చూచి, వాయుపు
త్రుండు మహావిరావమున రోదసి పిక్కటిలంగ నార్చినన్. 374

ప్రతిపదార్థం: గాండివముక్త= గాండీవం నుండి విడువబడిన; బాణమునన్= బాణంచేత; కర్ణుఁడు; కూలుటయున్= పడిపోవటమూ; శల్యుండు; కడంగి= పూని; అరదంబు; తోలుటయున్= మరలించుటయు; ఒక్క మొగిన్= అందరు ఒక్కసారిగా; భవదీయ సేనలు= నీ సేనలు; ఒండొండ= క్రమక్రమంగా; కలంగి= కలతచెంది; పాఱుటయున్= పరుగెత్తిపోవటం; వాయుపుత్రుండు= భీముడు; ఉల్లసితుఁడు+ఐ= ఉల్లాసం చెందినవాడై; చూచి; మహా విరావమునన్= పెద్ద ధ్వనితో; రోదసి= గగనతలం; పిక్కటిలంగన్= నిండిపోయేటట్లు; ఆర్చినన్= అరవగా.

తాత్పర్యం: గాండీవం నుండి వదలబడిన బాణంచేత కర్ణుడు పడిపోవటం, శల్యుడు రథాన్ని వెనుకకు తోలుకొని పోవటం, కౌరవసేనలు ఒక్కసారిగ భయపడి పరుగెత్తిపోవటం, భీముడు చూచి సంతోషాతిశయంతో గగనభాగం మారుమ్రోగేటట్లు ఆర్వగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆ నినదంబునఁ బాండవ । సైనికహృదయములు సౌఖ్యసంపద నొందెన్
మానవనాథ! భవత్సుత । మానసములు శోకఘూర్ణమానము లయ్యెన్. 375

ప్రతిపదార్థం: మానవనాథ!= రాజా!; ఆ నినదంబునన్= ఆ మ్రోతలో; పాండవసైనిక; హృదయములు= మనస్సులు; సౌఖ్యసంపదన్= సుఖభాగ్యాన్ని; ఒందెన్= పొందాయి; భవత్సుత= నీ కొడుకుల; మానసములు= హృదయాలు; శోక= దుఃఖంచేత; ఘూర్ణమానములు= తిరుగుడుపడినవిగా; అయ్యెన్= అయ్యాయి.

తాత్పర్యం: మానవనాథా! భీముడు చేసిన ఆ శబ్దానికి పాండవసైనికుల హృదయాలు ఆనందాన్ని అనుభవించాయి. నీ కొడుకుల మనస్సులు దుఃఖంతో కలతచెందాయి.

వ. ఇవ్విధంబున కేతనరహితంబై మోడువడియున్న యరదంబు దోలికొని యరిగి, యమ్మద్రపతి బాష్పాకుల లోచనుండును దీనాననుండును సుదీర్ఘతర నిశ్వాసుండును నై యున్న కౌరవేశ్వరుం జేరంజని యతనితో నిట్లనియె : 376

ప్రతిపదార్థం: ఈ విధంబునన్; కేతనరహితంబు+ఐ= టెక్కెం లేనిదై; మోడుపడి+ఉన్న= బోసిపోయి ఉన్న; అరదంబున్; తోలుకొని; అరిగి= వెళ్ళి; ఆ+మద్రపతి= ఆ శల్యుడు; బాష్ప+ఆకుల= కన్నీటితో కలతపడిన; లోచనుండు= కన్నులు కలవాడును; దీన+ఆననుండును= దిగులుతో కూడిన ముఖం కలవాడును; సుదీర్ఘతర= అత్యంతం పెద్దవైన; నిశ్వాసుండును= నిట్టూర్పులు కలవాడును; అయి; ఉన్న; కౌరవ+ఈశ్వరున్= దుర్యోధనుడిని; చేరన్+చని= సమీపించి; అతనితోన్+ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా టెక్కెం లేనిదై, బోసిపోయిన రథాన్ని శల్యుడు తోలుకొనిపోయి, కన్నీటితో కలతపడినవాడు, దీనమైన ముఖంతో ఉన్నవాడు, పెద్ద నిట్టూర్పులు నిగిడిస్తున్నవాడు - అయిన దుర్యోధనుడి దగ్గరకు వెళ్ళి, అతడితో ఇట్లా అన్నాడు.

చ. 'నరవర! యెందుఁ జూడమె రణంబులు! కర్ణుఁడు నర్జునుండు సం
గర మొనరింతురే యిటులు? క్రౌర్యనిరూఢికి దివ్యు లొంది ర
చ్చెరు; వది యట్టులుండె; విను చెప్పెద; నెంతయు భీతిఁ బొంది రా
హరియు నరుండుఁ గర్ణువడి; కంత విధాతృఁడు దప్పె వానికిన్.' 377

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; ఎందున్= ఎక్కడైనా; రణంబులు= యుద్ధాలు; చూడమె!= చూడమా!; కర్ణుఁడు; అర్జునుండు; ఇటులు= ఈ విధంగా; సంగరము= యుద్ధం; ఒనరింతురె!= చేస్తారా!; క్రౌర్య నిరూఢికిన్= క్రూరత్వాన్ని ప్రదర్శించిన ఆ నేర్పునకు; దివ్యులు= దేవతలు; అచ్చెరువు= ఆశ్చర్యం; ఒందిరి; అది అట్టులు+ఉండెన్= ఆ సంగతిని అట్లా ఉండనీ; విను చెప్పెదన్; కర్ణుని వడికిన్= కర్ణుడి ఆయుధప్రయోగవేగానికి; ఆ హరియున్= ఆ శ్రీకృష్ణుడు; ఆ నరుండున్= ఆ అర్జునుడు;

ఎంతయున్= మిక్కిలి; భీతిన్+పొందిరి= భయాన్ని పొందారు; అంతన్= అప్పుడు; విధాతృఁడు= ఆయుస్సు నిచ్చే బ్రహ్మ; వానికిన్= ఆ కర్ణుడికి; తప్పెన్= అనుకూలుడు కాకుండా పోయాడు. (అందువలననే కర్ణుడు ప్రాణాలు కోల్పోయాడు.)

తాత్పర్యం: 'నరవరా! ఇంతకుముందు ఎన్నెన్నో యుద్ధాలు చూచి ఉన్నాం కదా! కాని, కర్ణార్జునులు ఈ యుద్ధంలో ప్రదర్శించిన క్రూరత్వం ఎక్కడైనా చూచామా? అట్టిపోరును అట్లా సాగించినారే! ఆ యుద్ధ క్రూరత్వానికి దేవతలే ఆశ్చర్యపడ్డారు. ఆ విషయం అట్లుండనిమ్ము. కర్ణుడి యుద్ధతీవ్రతకు, వేగానికి ఆ నరనారాయణులిద్దరూ భయపడిపోయారు. ఇంతకూ కర్ణుడికి విధి చాలలేదు. ఆయుస్సు నిచ్చే బ్రహ్మదేవుడే అతడిపట్ల విముఖుడయ్యాడు. (కాబట్టే శౌర్యమున్నా ఆ చావు తప్పలేదు.)

వ. అని వెండియు. 378

తాత్పర్యం: అని మరల. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. 'ధరణీచక్రము నీవ యేలుటకు నుత్సాహంబు వాటించి పో
రిరి, ప్రాణంబులు డాఁపమిం బడిరి వీరిం జూడు!' మంచుం దురం
గ రథేభంబులు చుట్టుఁ గూలి వికటాకారంబులై యుండ నొ
ప్పి రణోర్విం బడియున్న భూపతులఁ జూపెం; జూపి యా రాజుతోన్. 379

ప్రతిపదార్థం: ధరణీచక్రము= భూవలయాన్ని; నీవు+అ= నీవే; ఏలుటకున్= పాలించటానికి; ఉత్సాహంబు= ఆసక్తి; పాటించి; ప్రాణంబులు డాఁపమిన్= ప్రాణాలు దాచిపెట్టుకోనందున; పడిరి= నిహతులయ్యారు; (అట్టి) వీరిన్; చూడుము; అంచున్= అంటూ; తురంగ, రథ, ఇభంబులు= గుర్రాలు, రథాలు, ఏనుగులు; చుట్టున్; కూలి= చచ్చిపడి; వికట+ఆకారంబులు+ఐ= విరూపరూపాలై; ఉండన్= కన్పించగా; రణ+ఉర్విన్= యుద్ధభూమిలో; ఒప్పి= రాణించేటట్లు; పడి ఉన్న; భూపతులన్= రాజులను; చూపెన్; చూపి= అట్లా చూపించి; ఆ రాజుతోన్ (అన్నాడు)

తాత్పర్యం: నీ వొక్కడవే భూమినంతా పాలించాలని తమ ప్రాణాలను దాచుకొనకుండా పోరాడి, నిహతులై భూపతులు యుద్ధభూమిలో పడి ఉన్నారు. వీరిని చూడుము. 'చూపునకు వికటించే విధంగా పడిఉన్న వీరిచుట్టూ గుర్రాలు, తేరులు, ఏనుగులు కూలిపోయి ఉన్నవి. ఆ వీరుల ఒప్పిదాన్ని రాజరాజుకు చూపిస్తూ శల్యుడు ఇంకా అన్నాడు. (రణక్షేత్ర భీషణత్వానికి చారుత్వం చేకూర్చబడుతున్నది.) (తరువాతి పద్యంతో అన్వయం).

వ. మఱియు నమ్మద్రపతి 'యింద్ర యమ వరుణ కుబేరులఁ బోల్పందగిన యింత లింతలు మేటిమగలు మనకార్యంబునకై శౌర్యంబును బాహు వీర్యంబును మెఱయించి ధైర్యంబు వొగడొందం బెనంగుట విఫలం బగుట విధికృతంబు; దీనికి వగవం బనిలే దని చెప్పి ధనుఃఖండంబుల నాయుధ శకలంబులఁ గేతనాతపత్ర చామర గజఘంటా తురంగ కింకిణుల తునియలం, గంకణ కేయూర హారమకుటంబుల తుముళ్ళ నభిరామ భీషణం బగు రణాంగణంబు సూపి నీకయి పెనంగి సమసిన సైన్యంబు నాలోకింపు' మనునప్పు డసురాంతక పార్థులు పాంచజన్య దేవదత్తంబులు పూరించిన నింగి వగుల్చు నమ్మహారవంబున గుండియ లవిసి కురుబలంబు లత్యంతవికలంబు లయి, వినిపాతిత రావణనందనుఁ డగు సుమిత్రానందను సింహనాదంబున

భయం బంది పఱచు దానవసేనల చందంబున, నీ కొడు కున్న నెలవు విడిచి వలియంబాఱిన వెలవెలంబాఱు నక్కురుపతితో నా శల్యుండు 'సంధ్యాసమయం బయ్యె నేఁటికిఁ గయ్యంబు సాలింపుము; వేగుటయుఁ జేయవలయు కర్జంబు సూచికొంద' మనియె; నట్టియెడఁ గృపాశ్వత్థామ కృతవర్మ శకుని సుశర్మ ప్రభృతులగు దొరలు పాండవ జయంబునకు దైన్యంబు నొందిన మానసంబులతో నిశ్వాసంబులు నిగుడ, నక్కురుపతిఁ జేరం జనుదెంచిన నతండు మూఁకల మరల్ప రామియు దొరల యుత్సాహ వైకల్యంబును శల్యుమాటల తెఱంగు నూహించి, మరలి కర్ణుం బేర్కొని విలాపంబు సేయుచు 'హా కర్ణ! హా కర్ణ!' యను నెలుంగులతో బలంబులఁ దివియ నియమించినఁ, దివిసి కౌరవులు దోడం జనుదేర నిజ శిబిరంబునకుం బోయె; న ప్పోవుట జూదంబున నోడి పాండునృపకుమారులు హస్తినాపురంబు వెడలి యడవికిం బోవునప్పటి భంగి యై యుండె; నయ్యవసరంబున. 380

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఆ+మద్రపతి= ఆ మద్రదేశాధీశుడైన శల్యుడు; ఇంద్ర, యమ, వరుణ, కుబేరులన్; వీరితో; పోల్పన్+తగి= సదృశులని చెప్పదగిన; ఇంతలు+ఇంతలు= ఇంతింత; మేటిమగలు= అగ్రశ్రేణి వీరపురుషులు; మన కార్యంబునకై; శౌర్యంబును= పరాక్రమాన్నీ; బాహువీర్యమును= భుజబల దర్పాన్నీ; మెఱయించి= ప్రకాశింపజేసి; ధైర్యంబు= వారు చూపిన సాహసం; పొగడు+ఒందన్= కొనియాడబడేటట్లు; పెనంగుట= యుద్ధం చేయటం; విఫలంబు+అగుట= ఫలితం దక్కకపోవటం; విధికృతంబు= పూర్వకర్మ ఫలితమైన నుదుటివ్రాత; దీనికిన్; వగవన్ పని లేదు= పశ్చాత్తాపపడవలసిన అగత్యం లేదు; అని; చెప్పి; ధనుఃఖండంబులన్= విల్లుల తునుకలను; ఆయుధ శకలంబులను= పోరు పనిముట్ల ముక్కలను; కేతన= ధ్వజ; ఆతపత్ర= గొడుగుల; చామర= చమరీమృగాల తోకవెంట్రుకలతో కుచ్చువలె కూర్చబడిన వింజామరల; గజఘంటా= ఏనుగుకు కట్టిన మువ్వల (గంటల); తురంగ= గుర్రాల; కింకిణుల= మువ్వల; తునియలన్= విరిగిపోయిన ముక్కలను; కంకణ= మానవులు ధరించే ముంజేతి వలయముల; కేయూర= రెట్ట కడియాల; హార= దండల; మకుటంబుల= కిరీటాల; తుముళ్ళన్= పొడితో; అభిరామ భీషణంబు+అగు= కనులపండువుగా ఉండియు, భీతిని పుట్టిస్తున్న; రణ+అంగణంబు= యుద్ధప్రదేశాన్ని; చూపి; నీకయి= నీకొరకు; పెనంగి= పోరాడి; సమసిన= మరణించిన; సైన్యంబున్; ఆలోకింపుము= బాగా పరికించి చూడుము; అనునప్పుడు= చెప్పే సమయంలో; అసుర+అంతక= రాక్షససంహారి కృష్ణుడు; పార్థులు (తమ); పాంచజన్య - దేవదత్తములు (శంఖముల పేర్లు - వరుసగా); పూరించినన్= ఊదగా; నింగి= ఆకాశమును; పగుల్చు= పగలకొట్టే; ఆ+మహారవంబునన్= ఆ గొప్పశబ్దం వలన; గుండియలు; అవిసి= పగిలి; కురుబలంబులు; అత్యంత= మిక్కిలి; వికలంబులు+ఐ= కలవరపడి; వినిపాతిత= చంపబడిన; రావణనందనుఁడు+అగు= రావణుడి కుమారుడైన మేఘనాథుని కలిగిన; సుమిత్రానందను= సుమిత్రాదేవి కుమారుడైన లక్ష్మణుని; సింహనాదంబునన్= సింహగర్జన శబ్దంబువలన; భయంబు+ అంది= భయపడి; పఱచు= పరుగెత్తిపోయే; దానవసేనల చందంబునన్= రాక్షస సేనలవలె; నీ కొడుకు; ఉన్న; నెలవు= స్థావరాన్ని; విడిచి= వదలిపెట్టి; వలియన్+పాఱినన్= వణకుతూ పరుగెత్తిపోగా; వెలవెలన్‌పాఱు= కాంతివిహీనుడైన; ఆ+ కురుపతితోన్= ఆ దుర్యోధనుడితో; ఆ శల్యుండు; సంధ్యాసమయంబు+అయ్యెన్= మాపటివేళ అయింది; నేఁటికిన్= ఈ దినానికి; కయ్యంబు= యుద్ధం; చాలింపుము; వేగుటయున్= తెల్లవారిన తరువాత; చేయవలసిన= ఆచరించవలసిన; కర్జంబు= కార్యాచరణ విధానం; చూచికొందము= చూచుకొనవచ్చును; అనియెన్; అట్టి+ఎడన్= ఆ సమయంలో; కృప అశ్వత్థామ కృతవర్మ శకుని సుశర్మ - ప్రభృతులు అగు= మొదలగువారైన; దొరలు= నాయకులు; పాండవజయంబునకున్; దైన్యంబు నొందిన= దీనత్వంలో వెలవెలబారిన; మానసంబులతోన్= మనస్సులతో; నిశ్వాసంబులు నిగుడన్= గట్టిగా దీర్ఘంగా ఊపిరి వదలుతూ; ఆ+కురుపతిన్= ఆ రారాజును; చేరన్= కలిసికొనుటకు; చనుదెంచినన్= రాగా; అతండు= దుర్యోధనుడు; మూఁకలన్= సైన్యాలను; మరల్పరామియున్= పొయ్యేవారిని నిలిపి తమతట్టు త్రిప్పుకొనజాలకపోవటాన్ని; దొరల; ఉత్సాహ=

ప్రేరకశక్తి; వైకల్యంబును= విరిగిపోవటాన్ని; శల్యుమాటల= శల్యుడి మాటల; తెఱంగున్= ధోరణిని; ఊహించి= మనస్సుకు తెచ్చుకొని; మరలి= వెనుకకు తిరిగి; కర్ణునిన్+పేర్కొని= కర్ణుడి పేరును పలుకుతూ; విలాపంబుచేయుచున్= ఏడుస్తూ; హాకర్ణ! హాకర్ణ!; అను ఎలుంగులతోన్= అంటున్న కంఠస్వరాలతో; బలంబులన్; తివియన్= వెనుకకు తగ్గమని; నియమించినన్= ఆజ్ఞాపించగా; తివిసి= తిరిగి; కౌరవులు; తోడన్= వెంట; చనుదేరన్= రాగా; నిజశిబిరంబునకున్= తన విడిదికి; పోయెన్; ఆ+పోవుట; జూదంబునన్; ఓడి; పాండునృపకుమారులు; హస్తినాపురంబు వెడలి; అడవికిన్; పోవునప్పటి భంగియై= పొయ్యేటప్పటి విధంగా; ఉండెన్; ఆ+అవసరంబునన్= ఆ సందర్భంలో.

తాత్పర్యం: శల్యుడు 'ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు మొదలైనవారితో పోల్చదగిన మహావీరులు మన కార్యసాధనకు పరాక్రమాన్నీ, బాహుబలాన్నీ ప్రదర్శించి ధైర్యంతో యుద్ధం చేయటం, అది విఫలం కావటం విధిప్రభావం. దానికి విచారించవద్దు' అని చెప్పాడు, విండ్లముక్కలు, ఆయుధాలముక్కలు, జెండాకర్రల, గొడుగుల, వింజామరల, ఏనుగుగంటల, గుర్రాల మువ్వల ముక్కలు, కంకణాల, కేయూరాల, హారాల, కిరీటాల పొడులు రణరంగమంతా పడి ఉన్నాయి. సుందరంగానూ, భయంకరంగానూ ఉన్న ఆ యుద్ధభూమిని చూపి 'నీ కొరకు పోరి ప్రాణాలు వదలిన సైన్యాన్ని చూడుము' అని అన్నాడు. అప్పుడు కృష్ణార్జునులు పాంచజన్య, దేవదత్త శంఖాలను ఊదారు. ఆకాశం బ్రద్దలయ్యే ఆ శబ్దానికి గుండెలుపగిలి కౌరవసైనికులు వికావికలయ్యారు. రామరావణయుద్ధంలో మేఘనాథుడు చనిపోగా లక్ష్మణుడు చేసిన సింహనాదానికి భయపడి పరుగెత్తిన రాక్షససైన్యంవలె కౌరవసేనలు దుర్యోధనుడున్న చోటును వదలి పరుగెత్తగా దుర్యోధనుడు వెలవెలపోయాడు. 'సంధ్యాసమయమయింది. నేటికి యుద్ధంచాలించి, తెల్లవారేసరికి తరువాతి కర్తవ్యాన్ని నిర్ణయించుకొనవచ్చు' నని శల్యుడు పలికాడు. కృపుడు, అశ్వత్థామ, కృతవర్మ, శకుని, సుశర్మ మొదలైనవారు పాండవవిజయానికి ఖిన్నులై నిట్టూర్పులు వదలుతూ దుర్యోధనుడి వద్దకు వచ్చారు. సేనలా - మరలి వచ్చేటట్లు లేవు. దొరలా - ఉత్సాహం కోల్పోయారు. ఆ పరిస్థితిలో శల్యుడి మాటలు స్మరించి, 'కర్ణా! కర్ణా!' అని ఎలుగెత్తి శోకిస్తూ, బలాలకు విరామమిచ్చి, కౌరవులు వెంటరాగా దుర్యోధనుడు తన శిబిరానికి వెళ్ళాడు. ఆ పోవటం కపటద్యూతంలో ఓడి పాండవులు హస్తినాపురాన్ని వదలి అడవికి పోయినప్పటి విధంగా ఉన్నది. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలంకారం: స్మృతి.

చ. **తనువులఁ గర్ణబాణము లుదాత్తగతిం జెలువొందఁ గౌరవుల్**
కనుకనిఁ బాఱ, శౌరియును గవ్వడియున్ వెలుఁగొంది రొక్కెడ
న్వినుత మరీచులై పొడిచి నిర్భర సంతమసంబు నల్గడం
జన నభిరామ మూర్తు లగు చంద్రుని సూర్యునిఁ బోల్పఁ బట్టుగన్. **381**

ప్రతిపదార్థం: తనువులన్= శరీరములందు; కర్ణబాణములు= కర్ణుడి బాణాలు; ఉదాత్త భంగిన్= గొప్పగా; చెలువు+ఒందన్= అందగించగా; కౌరవుల్; కనుకనిన్= సంభ్రమంతో; పాఱన్= పరుగెత్తికొనిపోగా; శౌరియున్= కృష్ణుడూ; కవ్వడియున్= అర్జునుడూ; వినుత మరీచులు+ఐ= పొగడబడే కిరణాలుగలవారై; పొడిచి= ఉదయించి; నిర్భర సంతమసంబు= సంపూర్ణమైన చీకటి; నల్గడన్= నాలుగువైపులకూ; చనన్= పోగా; అభిరామ మూర్తులు+అగు= మనోహరాకారులగు; చంద్రునిన్; సూర్యునిన్; పోల్పన్= పోల్చుటకు; పట్టుగన్= స్థానమగునట్లు; ఒక్క+ఎడన్= ఒకచోట; వెలుఁగొందిరి= ప్రకాశించారు.

తాత్పర్యం: శరీరాల్లో కర్ణుడు నాటిన బాణాలు గొప్పగా ప్రకాశిస్తూఉండగా, కౌరవులు భయంతో పరుగెత్తిపోగా కృష్ణార్జునులు - స్తుతింపదగిన కిరణాలతో ఉదయించి, దట్టమైన చీకట్లు నలువైపులకు తొలగిపోగా మనోహరాకారులైన చంద్రసూర్యులతో పోల్చదగినవారై ఒక చోట శోభిల్లారు.

విశేషం: అలంకారాలు: ఉపమ - ఉత్ప్రేక్ష.

వ. **ఇ ట్లొప్పి, యమ్మెఱుంగుటమ్ములు పెఱికివైచి, యొండొరుల యాననంబు లాలోకించి 'రాత్రి ముఖం బయ్యె విరోధుల వెనుకొనుటకు సమయంబుగా' దని సంభాషణంబులు సేసి, తమ సేనలం దివియ నియమించి; 382**

ప్రతిపదార్థం: ఇట్లు+ఒప్పి= ఈ విధంగా రాణించి; ఆ+మెఱుంగు+అమ్ములు= తళతళలాడే ఆ బాణాలను; పెఱికివైచి; ఒండొరుల ఆననంబులు= ఒకరిముఖం ఒకరు; ఆలోకించి= చూచుకొని; రాత్రిముఖంబు+అయ్యెన్= రేయి తలచూపించి (చీకటి క్రమ్ముకొంటున్నదనుట); విరోధుల; వెనుకొనుటకున్= తరుముటకు; సమయంబు కాదు; అని; సంభాషణంబులు= సల్లాపాలు; చేసి; తమసేనలన్; తివియన్= ఉపసంహరించుకొనుటకు; నియమించి= ఆజ్ఞాపించి.

తాత్పర్యం: అట్లా శోభిల్లి, ఆ మెరిసే అమ్ములను పీకివేసికొని, ఒకరిమొగం మరొకరు చూచుకొంటూ 'రాత్రి కావస్తున్నది. శత్రువులను వెన్నాడటానికి సమయం కాదిది' అని పలికి, తమ సేనలను పోరు విరమించండని ఆజ్ఞాపించి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **బలునిఁ దెగటార్చి మరలు గోపతియు హరియుఁ । బోలెఁ గర్ణుని సమయించి లీల మెఱయ**
మరలి రత్యంత మోదసంభరితు లగుచుఁ । గవ్వడియుఁ గృష్ణుఁడును బంధుగణము లలర. 383

ప్రతిపదార్థం: బలునిన్= బలుడనే రాక్షసుడిని; తెగటార్చి= సంహరించి; మరలు= తిరిగివచ్చే; గోపతియున్= ఇంద్రుడును; హరియున్; పోలెన్; కర్ణుని; సమయించి= చంపి; లీల మెఱయన్= విలాసంశోభిల్లగా; అత్యంత= మిక్కిలి; మోదభరితులు+ అగుచున్= సంతోషంతో నిండిన వారౌతూ; కవ్వడియున్= అర్జునుడూ; కృష్ణుడును; బంధుగణములు= చుట్టాలు; అలరన్= సంతోషిస్తుండగా; మరలిరి= వెనుదిరిగిపోయారు.

తాత్పర్యం: బలుడనే అసురుడిని వధించి తిరిగివచ్చే ఇంద్ర ఉపేంద్రులవలె, కర్ణుడిని సంహరించి అర్జునుడు, కృష్ణుడూ ఆనందభరితులై, సంతోషంతో బంధుజనులు ఉప్పొంగుతుండగా, తిరిగి శిబిరం చేరారు.

విశేషం: అలంకారం: ఉపమ. బలుడు మాయాసురుని కుమారుడు. అతలం అనే అధోలోక నివాసి. పలుమాయలతో దేవతలను బాధించేవాడు. అతనితో జరిగిన యుద్ధంలో ఓడిపోయి ఇంద్రుడు అతడిని కీర్తించగా మెచ్చి బలుడు ఇష్టమైన వరాన్ని కోరుకో ఇస్తానన్నాడు. ఇంద్రుడు అతని దేహాన్ని కోరుతాడు. వెంటనే బలుడు తన శరీరాన్ని ముక్కలు చేసి ఇంద్రుడికి అర్పిస్తాడు. వాటిని ఇంద్రోపేంద్రులు అన్ని వైపుల విసరి వేయగా అవిపడిన చోట్లు వజ్రపుతునుకలవుతాయి. తన భర్తను బ్రతికించుమని అతనిభార్య ప్రభావతి కులగురువైన శుక్రచార్యులను వేడుకొంటుంది. అతడిని బ్రదికించడం శక్యం కాదనీ కంఠధ్వని వినేటట్లు చేయగలనని గురువుచెపుతారు. నీ శరీరాన్ని వదలి నన్ను చేరుకొమ్మని బలుడి గొంతు వినిపించగా ఆమె వెంటనే మరణించి అతడితో కలసి నదిగా మారుతుంది.

వ. అప్పుడు దివ్యు లన్నరనారాయణుల ననేకప్రకారంబులం బ్రశంసించుచు, నిజనివాసంబులకుం జనిరి; పాండవ సేనా జనంబులు సంతసంబునం దేలుచు ధనంజయుం జెలంగి పొగడుచుం బోయి; రివ్విధంబున జయంబునం బొంపిరి వోవుచుఁ బాండవులు విడిదల కరిగి, ధర్మనందను నగరిమొగసాలఁ జొచ్చి; రట్టియెడ. 384

ప్రతిపదార్థం: అప్పుడు; దివ్యులు= దేవతలు; ఆ+నారాయణులన్= ఆ కిరీటిని కృష్ణుని; అనేక ప్రకారంబులన్= అనేక విధాలుగా; ప్రశంసించుచున్= కొనియాడుతూ; నిజనివాసంబులకున్= తమ తమ గృహాలకు; చనిరి; పాండవసేనాజనంబులు; సంతసమునన్= సంతోషంతో; తేలుచున్= తేలాడుతూ; ధనంజయుని= అర్జునుడిని; చెలంగి= ఉప్పొంగి; పొగడుచున్; పోయిరి; ఆ+విధంబునన్; జయంబునన్= సాధించిన విజయంవలన; పొంపిరిపోవుచున్= అతిశయమైన ఆనందాన్ని వెల్లడిస్తూ; పాండవులు; విడిదలకున్= విశ్రాంతి స్థావరానికి(బసకు); అరిగి; ధర్మనందను; నగరిమొగసాలన్= అంతఃపుర ప్రాంగణం; చొచ్చిరి= ప్రవేశించారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అప్పుడు దేవతలు ఆ కృష్ణార్జునులను పలురకాలుగా కీర్తిస్తూ తమ ఇండ్లకు వెళ్ళారు. పాండవసైనికులు సంతోషంతో పొంగుతూ అర్జునుడిని ఉల్లాసంతో పొగడుతూ పోయారు. ఈ విధంగా జయంతో పొంగిపోతూ పాండవులు విడిదులకు చేరి, ధర్మరాజు నగరి ప్రాంగణంలో ప్రవేశించారు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. చెన్నునఁ బాంచాలురు మును । ము న్నానృపుకడకు నేఁగి, ముదితాత్ముం డై
యున్న యతనిఁ గని, దీవన । ల న్నతులను సమ్మదానులాపములఁ దగన్. 385

ప్రతిపదార్థం: పాంచాలురు; మునుమున్ను= మొట్టమొదటిసారిగా (ప్రప్రథమంగా); చెన్నునన్= వికాసంతో (అందగించేటట్లు); ఆ నృపుకడకున్= ఆ రాజు ధర్మజుడిదగ్గరకు; ఏఁగి= పోయి; ముదిత+ఆత్ముండై ఉన్న= సంతోషచిత్తుడైయున్న; అతనిన్+ కని= ఆయనను చూచి; దీవనలన్= ఆశీర్వాదాలతో; నతులను= నమస్కారాలతో; సమ్మద= సంతోషంతో కూడిన; అనులాపములన్= మాటలతో; తగన్= ఉచితరీతులలో.

తాత్పర్యం: పాంచాలురు అందరి కంటె ముందుగ ఆనందంతో ఉన్న ధర్మరాజు దగ్గరకు వెళ్ళి చూచారు. దీవించేవారు దీవించి, నమస్కరించి, ముచ్చట మాటలను చెప్పి, ఆయనను తగిన రీతులలో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. గారవించిరి; వివ్వచ్చుండు వేగంబ యరదంబు డిగ్గి చని, యజ్జనపతి చరణంబులకుఁ బ్రణతుండైన, నతం డెత్తి యాలింగనంబును మూర్ధాఘ్రాణంబును జేసె; భీమ నకుల సహదేవు లన్నరదేవోత్తమునకుఁ బ్రణమిల్లి, పార్థుం గౌఁగిలించిరి, కృష్ణసాత్యకు లప్పాండవాగ్రజునకు సవినయ ప్రణామంబు లాచరించిన నమ్మహీవరుం డత్యాదరంబున నభినందించె; నప్పుడు కృష్ణుం డతని కిట్లనియె: 386

ప్రతిపదార్థం: గారవించిరి= గౌరవించారు; వివ్వచ్చుండు= అర్జునుడు; వేగంబ= త్వరగా; అరదంబు= రథం; డిగ్గి= దిగి; చని; ఆ+జనపతి= ఆ ధర్మరాజుయొక్క; చరణంబులకున్= పాదాలకు; ప్రణతుండు+ఐనన్= వంగి నమస్కరించగా; అతండు= ఆ ధర్మజుడు; ఎత్తి= లేవదీసి; ఆలింగనంబును= కౌగిలింతను; మూర్ధ+ఆఘ్రాణంబును= శిరస్సును మూర్కొనుటను; చేసెన్; భీమ నకుల సహదేవులు; ఆ+నరదేవ+ఉత్తమునకున్= ఆ రాజశ్రేష్ఠునకు; ప్రణమిల్లి= నమస్కరించి; పార్థున్;

కౌఁగిలించిరి; కృష్ణసాత్యకులు (ఇద్దరు); ఆ+పాండవ+అగ్రజనకున్= ఆ పాండవ జ్యేష్ఠుడికి; సవినయ= వినయముతో కూడిన; ప్రణామంబులు= వందనాలు; ఆచరించినన్; ఆ+మహీవరుఁడు= ధర్మరాజు; అభినందించెన్= కొనియాడాడు; అప్పుడు; కృష్ణుండు; అతనికిన్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: (ఆ విధంగా అందరు) గౌరవించారు. అర్జునుడు వేగంగా రథం దిగి, ధర్మరాజు పాదాలకు నమస్కరించాడు. ధర్మరాజు అతడిని ఎత్తి కౌగిలించుకొని శిరస్సు నాఘ్రాణించాడు. భీమనకుల సహదేవులు ధర్మరాజుకు నమస్కరించి, అర్జునుడిని కౌగిలించుకొన్నారు. కృష్ణ సాత్యకులు కూడా ధర్మరాజుకు సవినయ నమస్కారాలు చేయగా అతడు వారిని అభినందించాడు. అప్పుడు కృష్ణుడు అతడితో ఇట్లా అన్నాడు:

శ్రీకృష్ణుఁడు ధర్మరాజుతో సరససల్లాపంబు చేయుట (సం. 8-69-16)

క. 'భువనము లన్నియు నొక్కఁ। గవిసియుఁ గర్ణుఁ బరిమార్పంగా నోపునె? భూ
ధవ! భవదీయ క్రోధా। గ్ని విహతుఁడై క్రాఁగెఁ గాక నిక్కం బరయన్.' 387

ప్రతిపదార్థం: భూధవ!= భూభర్తా!; నిక్కంబు+అరయన్= నిజాన్ని విచారించి తెలిసికొంటే; భవదీయ= నీయొక్క; క్రోధ+అగ్ని= కోపం అనే అగ్నితో; నిహతుఁడు+ఐ= చంపబడి; క్రాఁగెన్+కాక= కాలిపోయాడు కాని; భువనములు= జగత్తులు; అన్నియున్; ఒక్కటన్+కవిసియున్= ఒక్కటై ఎదుర్కొనినను; కర్ణున్= కర్ణుడిని; పరిమార్పంగాన్= చంపుటకు; ఓపునె?= చాలి ఉన్నవా?.

తాత్పర్యం: 'భూనాథా! ఈ లోకాలన్నీ ఒక్కటై ఎదుర్కొన్నా కర్ణుణ్ణి సంహరించగలవా? నిజాన్ని నిగ్గు దేల్చి చూస్తే, నీ క్రోధాగ్ని చేతనే అతడు చచ్చి కాలిపోయాడు. అంతే.'

విశేషం: అలంకారం: రూపకం.

ఆ. 'రథిక వర్యుఁడైన రాధేయు పొలిసిన। యపుడ యెల్లఁ బొలిసె నని తలంపు
కౌరవులు; కడంగె వైరంబు, నీ కింక। నెదురు లేదు; ప్రీతిఁ బొదలు మధిప!' 388

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; రథికవర్యుఁడు+ఐన= రథయోధులలో శ్రేష్ఠుడయిన; రాధేయు పొలిసినన్= కర్ణుడు చనిపోయిన; అపుడు+అ= వెంటనే; ఎల్లన్= అన్నీ; పొలిసెన్+అని= నాశనమైపోయినవని; తలంపు= తలంపుము; కౌరవులకున్; వైరంబు= విరోధం; అడంగెన్= తీరిపోయింది; నీకున్; ఇంకన్; ఎదురులేదు= ప్రతిపక్షమే లేదు; ప్రీతిన్= సంతృప్తితో; పొదలుము= అభివృద్ధిని పొందుము.

తాత్పర్యం: 'రాజా! రథయోధులలో శ్రేష్ఠుడైన కర్ణుడు చావటంతోనే కౌరవులకు అన్నీ పోయాయని భావింపుము. దీనితో నీకు ఎదురే లేకుండా పోయింది. ఇక నీవు సంతోషంగా ప్రవర్తిల్లుము.'

చ. అన విని, యమ్మురాంతకున కా నృపుఁ డిట్లను 'నీవు చక్కఁ జూ
చిన సులభంబు శోభనము శ్రీధర! నీదగు కూర్మి కేను భా
జన మటె! నాకు దుష్కరమె శత్రుజయంబు? భవత్ప్రసాద జీ
వనులము మాకు సంపదలు వచ్చు నవశ్యము నింత నమ్ముదున్.' 389

ప్రతిపదార్థం: అనన్ విని; ఆ+మురఅంతకునకున్= మురుని చంపిన ఆ కృష్ణుడితో; ఆ నృపుఁడు= ఆ ధర్మరాజు; ఇట్లు+ అనున్= ఇట్లా అన్నాడు; శ్రీధర!= శ్రీకృష్ణా!; నీవు; చక్క-చూచినన్= బాగా చూస్తే; శోభనము= శుభంబుకలుగుట; సులభంబు; నీదగు= నీయొక్క; కూర్మికిన్= వాత్సల్యానికి; ఏను= నేను; భాజనము+అటె!= పాత్రుడనయ్యానే; నాకున్; శత్రుజయంబు= పగవారిని జయించుట; దుష్కరమె?= కష్టమా? (సులభసాధ్యం); భవత్= నీయొక్క; ప్రసాద= అనుగ్రహంవలన; జీవనులము= జీవిస్తూ ఉండేవారము; (అయిన); మాకున్; సంపదలు= సౌభాగ్యాలు; అవశ్యమున్= తప్పక; వచ్చున్= కలుగుతాయి; ఇంత= దీనిని; నమ్మెదున్= విశ్వసిస్తాను.

తాత్పర్యం: చెప్పినదంతా విని ఆ కృష్ణుడితో ధర్మరాజు ఇట్లా అన్నాడు: 'కృష్ణా! నీవు కృపాదృష్టితో చూచినంత మాత్రాననే శుభం సులభంగా ప్రాప్తిస్తుంది. నీ ప్రేమకు నేను తగినవాడినయ్యాను గదా. ఇక శత్రుజయం నాకు కష్టమా? నీ దయతో జీవిస్తున్నవారము. అందువలన మాకు సంపదలు తప్పక చేకూరుతాయి. దీనిని గట్టిగా నమ్మి ఉన్నాను.'

ఆ. 'అఖిల రక్షకుండ వగు నీకు భక్తుల । మైన మమ్ముఁ గాచు టరుదె? తలఁప
భయము నెవ్వగయును బాసి నా కంటికి । నిదుర వచ్చు నేఁడు నీరజాక్ష!' 390

ప్రతిపదార్థం: నీరజాక్ష!= కమలనయనా! కృష్ణా!; తలఁపన్= ఆలోచింపగా; అఖిల= సమస్త ప్రపంచానికి; రక్షకుండవు+అగు= కాపాడేవాడవైన; నీకు; భక్తులము+ఐన, మమ్మున్; కాచుట= ప్రోచుట; అరుదె?= ఏమంత ఆశ్చర్యకరమైన విషయమా?; భయము; నెవ్వగయును= ఎక్కువైన దుఃఖం; పాసి= పోగొట్టుకొని; నేఁడు; నాకంటికిన్; నిదురవచ్చున్.

తాత్పర్యం: 'పద్మలోచనా! నీవు సర్వలోకాలను కాపాడేవాడవు. భక్తత్రాణ పరాయణుడవు. కాబట్టి, నీ భక్తులమైన మమ్ము రక్షించటం అంత ఆశ్చర్యకరమైన విషయమా! భయం, దిగులు పోయి ఇప్పుడు నా కంటికి హాయిగా నిద్రపట్టుతుంది.'

వ. అనవుడు, నచ్యుతుండు. 391

ప్రతిపదార్థం: అని అనగా శ్రీకృష్ణుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'మనమునఁ గూర్తు గాన, తగుమాటల నాకుఁ బ్రియం బొనర్చు టొ
ప్పును; విను మీ జయంబునకు భూవర! యేను నిమిత్తమాత్ర; మీ
యనుజులు నీమఱందులు మహాద్భుత విక్రమశీలు; రిట్టి ని
న్ను నొకఁడు పోర మార్కొనఁగ నూల్కొని రూపఱకుండ నేర్చునే?' 392

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; మనమునన్= మదిలో; కూర్తు(వు)= ఇష్టపడతావు; కాన= కాబట్టి; తగుమాటలన్= సందర్భోచితమైన మాటలతో; నాకు; ప్రియంబు+ఒనర్చుట= ప్రీతిని కలిగించటం; ఒప్పును= తగి ఉన్నది; విను; మీ జయంబునకున్; ఏను; నిమిత్తమాత్రము= ఒక సాధనప్రాయుడను; ఈ అనుజులు= ఈ తమ్ములు; నీ మఱందులు= నీ బావమరదులు; మహాద్భుత= ఆశ్చర్యం కలిగించే; విక్రమశీలురు= పరాక్రమగుణ సంపన్నులు; ఇట్టి= ఇటువంటి; నిన్నున్; ఒకఁడు= ఎవడో ఒకడు; పోరన్= యుద్ధంలో; మార్కొనఁగన్= ఎదిరించేటందుకు; నూల్కొని= పూనుకొని; రూపఱకుండన్= రూపుమాసిపోకుండా ఉండటానికి; నేర్చునే?= సాధ్యమా?

తాత్పర్యం: 'రాజా! నీ మనసుకు ఇష్టమైనవాడిని కావటంచేత తగు మాటలతో నాకు సంతోషాన్ని కలిగించటం ఉచితమే. అయినా ఉన్న సంగతి వినుము. మీరు సాధించిన విజయానికి నేను కేవలం ఒక నిమిత్తమాత్రుడనే. నీ తమ్ములు, నీ బావమరదులు అద్భుతమైన పరాక్రమవంతులు, ఇలాంటి నిన్ను ఎవడో ఒకడు యుద్ధంలో ఎదిరిస్తే, రూపుమాసిపోకుండా నిలబడగలడా?

వ. అని యిట్లు, మధుర సల్లాప సౌఖ్యంబు నొంది, ధర్మనందనుండు పొలికలను సూచువేడుక దనకుం బుట్టినఁ, గృష్ణునితోడం జెప్పి యతం డనుమతి సేయం, గాలవాలంబులు దంత వర్ణంబులునగు రథ్యంబులఁ దన రథంబునఁ బూన్పించి, యారోహణంబు సేసి, కరదీపికా సహస్రంబులు వెలుంగ, సమస్తబంధు మిత్ర సోదర పరివృతుండై యరుగునప్పుడు, కృష్ణు నాలోకించి. 393

ప్రతిపదార్థం: అని; ఇట్లు; మధుర= తీయని; సల్లాప= సంభాషణలతో; సౌఖ్యంబు= హాయిని; ఒంది= అనుభవించి; ధర్మనందనుండు; పొలికలను= యుద్ధభూమిని; చూచు వేడుక= చూడాలన్న అభిలాష; తనకున్; పుట్టినన్= కలుగగా; కృష్ణుడితోడన్ చెప్పి; అతఁడు; అనుమతి చేయన్= ఒప్పుకొనగా; కాల వాలంబులు= నల్లటితోకలు; దంతవర్ణంబులున్+అగు= ఏనుగుకొమ్ములవలె తెల్లని మెయిచాయ కలిగిన; (తెల్లనిగుర్రాలకు నల్లటితోకలు ఒకశోభ); రథ్యంబులు= తేరులాగే గుర్రాలను; తన రథంబునన్; పూన్పించి= కట్టించి; ఆరోహణంబు చేసి= ఎక్కి; కరదీపికా= చేతికాగడాల; సహస్రంబులు= వేలకొలది; వెలుంగన్= వెలుగుతుండగా; సమస్త= అందరు; బంధుమిత్రసోదర; పరివృతుఁడై= చుట్టూ చేరినవాడై; అరుగునప్పుడు= వెళ్ళేటప్పుడు; కృష్ణున్; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఇట్లా తియ్యని ప్రీతిమాటలవలని సుఖాన్ని పొంది, ధర్మరాజుకు యుద్ధభూమిని చూడాలనే కోరిక కలుగగా శ్రీకృష్ణుడితో చెప్పి అతడి అనుమతి పొంది, నల్ల తోకలుగల తెల్లని గుర్రాలు పూన్చిన రథమెక్కి వేయి కాగడాలు వెలుగుతూ ఉండగా సమస్త బంధుమిత్ర సోదరబృందాలు వెంటరాగా వెళ్ళుతూ కృష్ణుడిని చూచి (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. 'సకలధరణివలయ సామ్రాజ్యమునకు నేఁ। డేను భర్తనైతి! నెల్ల పెంపు
గలిగి నీదుకరుణఁ గడిఁదిమగం డగు। పగతుఁ డశ్రమమునఁ దెగుటఁ జేసి!' 394

ప్రతిపదార్థం: కడిఁది= గొప్ప; మగండు= వీరుడు; అగు; పగతుఁడు= శత్రువు; అశ్రమమునన్= అనాయాసంగా; తెగుటన్+చేసి= హతుడగుటవలన; నీదుకరుణన్= నీ దయవలన; సకలధరణివలయ= సమస్త భూచక్ర; సామ్రాజ్యమునకున్= సంపూర్ణ ఆధిపత్యానికి; ఎల్లపెంపున్+కలిగి= సమస్త వైభవము సమకూడి; నేఁడు= ఈనాడు; ఏను; భర్తను+ఐతిన్= ప్రభుడనయ్యాను.

తాత్పర్యం: 'శౌర్యఘనుడైన, శత్రువు సులభంగా చంపబడటంచేత, నీ దయవలన మొత్తం మండల సామ్రాజ్యానికి సంపూర్ణ వైభవంతో సమ్రాట్టునయ్యాను.

క. అని కీర్తించుచు, నరుఁ గనుఁ। గొని యగ్గించుచు, ముదంబు గూరిన మదితోఁ
జని కర్ణునిశిరమును ద। త్తనయుల గాత్రములుఁ జూచె ధరణీనాథా! 395

ప్రతిపదార్థం: ధరణీనాథా!= రాజా!; అని; కీర్తించుచున్= కొనియాడుతూ; నరున్; కనుఁగొని= చూచి; అగ్గించుచున్= పొగడుతూ; ముదంబు= సంతోషం; కూరిన= నిండిన; మదితోన్= మనస్సులో; చని= దగ్గరకు వెళ్ళి; కర్ణు శిరమును; తద్+ తనయుల= ఆయన కుమారుల; గాత్రములున్= శరీరాలను; చూచెన్= వీక్షించాడు.

తాత్పర్యం: భూమీశా! ధర్మజుడు శ్రీకృష్ణుడిని ఈ విధంగా స్తుతిస్తూ, అర్జునుడివైపు తిరిగి ఆయనను పొగడుతూ, సంతోషంతో నిండిన చిత్తంతో పోయి తెగిపడి ఉన్న కర్ణుడి తలను, ఆయన పుత్రుల దేహాలను చూచాడు.

వ. **చూచి తన్నప్పుడు గ్రమ్మఱ జన్మించినవానిఁగాఁ దలంచి, యాపదలకుం బాసి సంపదలకు భాజనంబ నైతి నని యూఱడిల్లి, యుల్లాసంబున మరలె; నిట్లు కర్ణసాగరంబు గడవ నీఁది పాండునందనులు పరమానందంబు నొంది రని, సంజయుండు ధృతరాష్ట్రునకుం జెప్పె నని జనమేజయునకు వైశంపాయనుం డిట్లనియె:** **396**

ప్రతిపదార్థం: చూచి; తన్నున్ అప్పుడు; క్రమ్మఱన్= మరలా; జన్మించినవానిన్+కాన్= పుట్టినవానినిగా(పునర్జన్మ పొందినవానినిగా); తలంచి= భావించుకొని ఆపదలకున్; పాసి= దూరమై; సంపదకున్; భాజనంబు+అ= పాత్రం; అయితిని; అని; ఊఱడిల్లి= ప్రశాంతచిత్తుడై; ఉల్లాసంబునన్= సంతోషంగా; మరలెన్= తిరిగిపోయాడు (ధర్మరాజు); ఇట్లు= ఈ విధంగా; కర్ణసాగరంబున్= కర్ణుడనే మహాసముద్రాన్ని; కడవన్= దాటేటట్లు; ఈది; పాండు నందనులు= పాండురాజు అయిదుగురు పుత్రులు; పరమ+ ఆనందంబు= పరిపూర్ణ సంతోషాన్ని; ఒందిరి= పొందారు; అని; సంజయుడు; ధృతరాష్ట్రునికి; చెప్పెనని= చెప్పాడని; జనమేజయునకున్; వైశంపాయనుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: చూచి, తాను అప్పుడు పునర్జన్మ ఎత్తినట్లుగా భావించి, కష్టాలు తీరి, సంపదలు పొందానని ఊరడిల్లి సంతోషంతో తిరిగి వెళ్ళాడు. ఈ విధంగా కర్ణుడనే సముద్రాన్ని చివరిదాకా ఈది, పాండవులు అధికసంతోషం పొందారని సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్పగా వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలంకారం: రూపకం.

చ. **అనలుఁడు భాస్కరుండును సుధాంశుఁడు నధ్వరసంప్రవర్తకుల్**
వినుము! నరేంద్ర! యీ క్రతువు విష్ణుమయం; బిది నిర్వహించి ర
ర్జునుఁడును గర్ణుఁడున్ సమరరూపమునం దగ; నీప్రబంధ మిం
పొనరఁ బఠించినన్ వినిన నొందు నరుం జిరసౌఖ్యసంపదల్. **397**

ప్రతిపదార్థం: నరేంద్ర!= ఓ రాజా; వినుము; ఈ క్రతువు= ఈ యజ్ఞం; విష్ణుమయంబు= విష్ణువునకు ప్రీతికరం గావించబడింది; అనలుఁడున్= అగ్నిదేవుడు; భాస్కరుండును= సూర్యుడును; సుధాంశుఁడున్= అమృతకిరణుడైన చంద్రుడు; అధ్వర= ఈ యజ్ఞాన్ని; సంప్రవర్తకుల్= నడిపినవారు; అర్జునుడును; కర్ణుడును; సమర రూపమునన్= యుద్ధరూపంలో; తగన్= ఉచితరీతిని; నిర్వహించిరి= నెరవేర్చారు; ఈ ప్రబంధమున్= ఈ కావ్యమును; ఇంపు+ఒనరన్= మది సంతసమందేటట్లు; పఠించినన్= చదివినా; వినినన్= విన్నా; నరున్= మానవుడికి; చిర= శాశ్వతమైన; సౌఖ్యము; సంపదల్= ఐశ్వర్యములు; ఒందున్= కలుగుతాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఈ యుద్ధమనే యజ్ఞం విష్ణుమయం. అగ్ని, సూర్యుడు, చంద్రుడు ఈ యజ్ఞానికి ఋత్విజులు. దీనిని అర్జునుడు, కర్ణుడు యుద్ధరూపంగా నిర్వహించారు. ఈ ప్రబంధాన్ని ఆసక్తిగా చదివినా, వినినా శాశ్వత సౌఖ్యాలను, సంపదలను నరుడు పొందుతాడు.

వ. అనుటయు. 398

తాత్పర్యం: అని అనగా. (తరువాతి ఆశ్వాసంలోని వచనంతో అన్వయం).

ఆశ్వాసాంతము

చ. ప్రకట మహార్థ సౌరభ పరాశర నందన వాక్యమంజరీ
ప్రకర సమర్చితా! పరమపావననామ! జగత్త్రయీ విధా
యక! పరిరక్షక! ప్రతిసమాహృతికారక! చిత్తవృత్తిభా
వక! భవబంధమోచన! దివాకర చంద్రకృశానులోచనా! 399

ప్రతిపదార్థం: ప్రకట= స్పష్టంచేయబడిన; మహా+అర్థ= గొప్ప అర్థం - తత్త్వార్థం అనే; సౌరభ= సువాసన గల; పరాశరనందన= వ్యాసుడియొక్క; వాక్యమంజరీ ప్రకర= వాక్యరూపాలైన (ఇతిహాస పురాణ బ్రహ్మ సూత్రరూప) కుసుమ గుచ్ఛాల సముదాయంచేత; సమర్చితా!= పూజింపబడేవాడా! పరమ పావననామ!= మిక్కిలి పవిత్రమైన పేరు కలవాడా!; (ఆ పరమేశ్వరుడి నామస్మరణ చేతనే సకలదోషాలు తొలగుతాయి అని భావం); జగత్త్రయీ= లోకాలు మూడింటి; విధాయక= సృష్టికర్తవై; పరిరక్షక= రక్షకుడవై; ప్రతి సమాహృతి కారక!= సంహారకర్తవై ఉన్నవాడా!; బ్రహ్మవిష్ణు రుద్ర రూపాలలో చేసేవాడా!; చిత్తవృత్తి భావక!= సకలప్రాణుల మనోవ్యాపారాన్ని అంతర్యామిరూపంలో ప్రవర్తింపజేసేవాడా!; భవబంధ మోచన!= సంసారబంధాలనుండి విడిపించేవాడా!; దివాకర= సూర్య; చంద్ర= చంద్ర; కృశానులోచనా!= అగ్నులు నేత్రాలుగా కలవాడా!

తాత్పర్యం: స్పష్టంచేయబడిన తత్త్వార్థం అనే సువాసన గల వ్యాసమహర్షి వాక్యాలనే పుష్పగుచ్ఛాలతో అర్చించబడేవాడా! మిక్కిలి పవిత్రమైన నామం కలవాడా! మూడులోకాల సృష్టి స్థితి సంహార కారకుడవైనవాడా! సకలప్రాణుల మనోవ్యాపారాన్ని అంతర్యామిరూపంలో ప్రవర్తింపచేసేవాడా! భక్తులను సంసారబంధంనుండి విముక్తులను చేసేవాడా! సూర్యచంద్రాగ్ని లోచనాలు కలవాడా! హరిహరనాథా!

క. వినత దురిత నిరసన శుభ । జనన కలాకల్య చరణ! సంభావన పా
వన తటినీమాల్య! సమ । స్తనిగమ సంవేద్య! పరమసంయమిహృద్యా! 400

ప్రతిపదార్థం: వినత= శిరస్సు వంచి నమస్కరించే భక్తులయొక్క; దురిత= పాపాలను; నిరసన= పోగొట్టటం; శుభజనన= కల్యాణం కలిగించటం అనే; కలా= విద్యలో; కల్య= నేర్పుగల; చరణ!= పాదాలు కలవాడా!; సంభావన= ప్రసిద్ధిగల; పావన= పవిత్రమైన; తటినీ మాల్య!= నదిని (గంగను) పూదండగా కలవాడా!; సమస్త నిగమ= సర్వశ్రుతులచేత; సంవేద్య!= తెలియదగినవాడా!; పరమసంయమి హృద్యా!= ఉత్తమయోగులకు - అనగా జ్ఞానులకు ఆనందం కలుగజేసేవాడా!

తాత్పర్యం: నమస్కరించిన వారి పాపాలను తొలగించి శుభాలను కలిగించే విద్యలో సమర్థమైన పాదాలు కలవాడా! ప్రసిద్ధమై పవిత్రమైన గంగానదిని పూలదండగా కలవాడా! సర్వశ్రుతులచేత తెలియదగినవాడా! ఉత్తమయోగులకు ఆనందం కలిగించేవాడా!

మాలిని.

కరణఫల పరిత్యాగ వ్రతోదాత్తచేతః । పరిణత సుఖపీఠ భ్రాజమానా! నతాంహో
నిరసన చరణాబ్జోన్నిద్రతా రాజమానా! । నిరవధి పరిణాహా! నిర్భరానంద దేహా! 401

ప్రతిపదార్థం: కరణ= యజ్ఞాది కర్మలయొక్క; ఫల= ఫలితాన్ని; పరిత్యాగ= విడవటం అనే; వ్రత= వ్రతముచేత; ఉదాత్త= గొప్పదైన; చేతః పరిణత= మానసిక పక్వత అనే; సుఖపీఠ= హాయినిగొలిపే ఆసనంలో; భ్రాజమానా!= ప్రకాశించేవాడా!; నత= ప్రణతులగు భక్తులయొక్క; అంహః= పాపాలను; నిరసన= పోగొట్టునటువంటి; చరణ+అబ్జ= పాదపద్మాలయొక్క; ఉన్నిద్రతా= వికాసంతో; రాజమానా!= ప్రకాశించేవాడా!; నిరవధి= పరిమితి లేని; పరిణాహా!= వైశాల్యం కలవాడా! (సర్వవ్యాపకుడా!); నిర్భర+ ఆనంద దేహా!= సంపూర్ణమైన ఆనందమే దేహంగా కలవాడా!

తాత్పర్యం: యజ్ఞయాగాది కర్మఫలాన్ని కూడ త్యజించటం అనే వ్రతంచేత గొప్పదైన మానసికపక్వత అనే హాయిని గొలిపే పీఠంమీద ప్రకాశించేవాడా! శిరస్సువంచి నమస్కరించిన భక్తుల పాపాలను తొలగించునటువంటి పాదపద్మాల వికాసంతో వెలుగొందేవాడా! సర్వవ్యాపకుడా! ఆనందస్వరూపుడా! హరిహరనాథా!

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన
శ్రీ మహాభారతంబున కర్ణపర్వంబునందు సర్వంబును తృతీయాశ్వాసము.

తాత్పర్యం: ఉభయ కవిమిత్రుడూ, కొమ్మనామాత్య పుత్రుడూ, పండితులను పూజించటంచేత ప్రకాశించేవాడూ (పండితులచేత పూజింపబడటంచేత వెలుగొందేవాడూ) అయిన తిక్కన సోమయాజి రచించిన మహాభారతంలోని కర్ణపర్వ తృతీయాశ్వాసం ఇది.

కర్ణపర్వం తృతీయాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్రమహాభారతంలో కర్ణపర్వం ఇంతటితో ముగిసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

కర్ణపర్వము

పద్య - గద్య ప్రథమపాద సూచి

పద్యము	పుట
అ	
అంగవంగ నిషాద	271
అంత	90
అంతఁ గొంత యూరుపు	244
అంతఁ దెప్పిఱి విలయాంత	246
అంతకకోపవహ్నివిపులా	418
అంతకు మున్ను	92
అంత నంశుమంతుం	94
అందు	45
అందుఁ బాంచాలవీరు	286
అంబికానాథుఁడిట్లను	138
అంబుధిలోనొక్క యలఘు	170
అకుటిలుండగునాకు	189
అకృతాస్త్రుఁడనగు నాకుం	138
అక్కర్ణుండు నిజరథంబు	302
అక్కుంభసంభవుచందం	251
అఖిలరక్షకుండవగు	458
అగుఁగాక యతని	98
అగ్గలిక దండధారుఁడు	274
అగ్గిసొరం దలంచు	163
అచ్చటిమూఁక నల్గడల	297
అట్టిద లోకపర్యవస	407
అట్టి బల్లిదు ననిఁ	320
అట్టియెడం గృపప్రముఖ	214
అట్టియెడఁ గృతవర్మ	371
అట్టియెడఁ దక్షకు	428
అట్టియెడ	33

పద్యము	పుట
అట్టియెడ	56
అట్టియెడ	200
అట్టియెడ	271
అట్టియెడ	287
అట్టియెడ	360
అట్టియెడ	378
అట్టియెడ	447
అట్టియెడ	81
అట్టియెడ నా సూత	406
అట్టియెడ నొక్క రథికుం	252
అట్టియెడ మాద్రి పిదపటి	300
అట్టియెడ సంశప్తక	81
అట్టి సందడి కయ్యంబున	228
అట్టు నొప్పింపఁ దూఁగాడు	250
అట్లద్భుతవిక్రమంబున	311
అట్లయిన నసత్యదోషంబు	340
అట్లయ్యిరువురు నుత్సాహం	295
అట్లయ్యేడుం గాకయని	144
అట్లశ్వత్థామ పెనంగు	270
అట్ల సవ్యసాచి యడిగి	406
అట్లు దాఁటి బెట్టువైచిన	387
అట్లు దివిసిపోయి	97
అట్లు భీమసేనుండు	42
అట్లు రాధేయకర	432
అట్లు సారథిరహితుం	296
అట్లేచిన కృపాచార్యుపై	248
అడరి పటుబాణజాలం	292

పద్యము	పుట
అడరి సుదక్షిణుతమ్ముఁడు	264
అడిగితినే నిను నా	188
అతండు పడవాళ్ళం	32
అతండు విజృంభించి	272
అతఁ డభిమంత్రితబాణ	419
అతఁడు ప్రదీప్తఖడ్గము	71
అతఁడు వివిధోగ్రవిశిఖ	371
అతఁడు హరులఁ దఱుమఁ	365
అతనికి నాకునుం గలిగె	321
అతనికి బాసటయై	281
అతని శిఖండిబాణముల	354
అతని శిరస్త్రాణంబును	303
అతిగర్వసమున్నత	324
అతిశిత కర్ణబాణ	339
అత్తఱిఁ గడు బెల్లుగఁ	89
అత్తెఱంగున	433
అత్తొమ్మిదింటిలోన	278
అది దునుమాడి మేనఁ	310
అది నరుడెంద మాడుట	246
అదియునుంగాక	304
అది యెట్లంటేని	337
అదియొకఁడేల కౌరవ	5
అధిప! యంతన గను	447
అనయముఁగ్రూరకర్ముల	127
అనలుఁడు భాస్కరుండు	460
అన విని ధృష్టద్యుమ్నుం	282

పద్యము	పుట
అన విని భూవిభుండు	144
అన విని మద్రరాజాతని	152
అన విని మేనువొంగ	278
అన విని యట్లచేసె	285
అన విని యమ్మహీరమణుఁ	345
అన విని యమ్మహీరమణుఁ	412
అన విని యమ్మురాంతకు	457
అన విని యట్టైత్తి	305
అన విని యవ్వరిష్ఠ	200
అన విని యా దేవుండ	402
అనవుడు నచ్యుతుండు	458
అనవుడు నట్లకాక యని	139
అనవుడు నట్లకాక యని	143
అనవుడు నతఁడిట్లను	294
అనవుడు నద్దేవుండు	131
అనవుడు నద్దేవుండయ్యె	125
అనవుడు నమ్మహీపతికి	350
అనవుడు నయ్యసుర	118
అనవుడు నలుకవొడమి	159
అనవుడు నల్గి సూతసుతుఁ	163
అనవుడు భీముఁజూచి	230
అనవుడు రాజసూతివి	61
అనవుడు సంజయుం	235
అనవుడు సూతుఁ డెంతయు	75
అని కీర్తించుచు నరుఁ	459
అని కెంజాయ రంజిల్లు	330
అని గోపాలదేవు నాలోకించి	350
అని చెప్పి చూపెఁ బదంపడి	209
అని చెప్పి ప్రీతుఁడగు	109
అని తఱిమి పలికిరి ప్రొద్దునుం	415
అని తారతమ్యజ్ఞాన	171
అని తెగనిండఁదిగిచి	446
అని తొడంగి హాహాకారంబు	11
అని ధర్మంబును దూఱఁగ	438
అనినఁ గర్ణుఁడిట్టులనియె	196

పద్యము	పుట
అనినఁ గర్ణుఁ డిట్టులను	142
అనినఁ గృపాణంబు గొని	334
అనిన గృష్ణుఁ జూచి	266
అనినం బ్రియంబంది	99
అనిన ధర్మనందనునకుఁ	324
అనిన నట్లకాకయని	122
అనిన నట్లకాకయని	319
అనిన నతం డతని	339
అనిన నతండు గన్నీ రొలుక	349
అనిన నాసూతనందనుం	86
అనిన వారలందఱు	199
అనిన విని నీ పుత్రుండు	108
అనిన విని కర్ణుండు	181
అనిన విని కర్ణుండు	376
అనిన విని కెంపుసొంపు	111
అనిన విని జామదగ్న్యుం	137
అనిన విని పశుత్వము	128
అనిన విని యంత కేమియు	8
అనిన విని యంతరంగం	365
అనిన విని యచ్యుతుం	442
అనిన విని యతండు	396
అనిన విని యతఁడతని	384
అనిన విని యబ్బలు	312
అనిన విని యమ్మనుజ	206
అనిన విని యాంబికేయుం	6
అనిన విని యుల్లంబుల	426
అనిన విని వాసుదేవుం	315
అనిన విని శల్యుండు	157
అనిన వివ్వచ్చుండు	317
అనిన విని సంజయుండు	23
అనిన విని సంజయునకు	203
అనిన సంజయుం డమ్మహీ	371
అనిన పటుసింహనాదము	229
అని పలికి కర్ణుండు	62
అని పలికి కర్ణునిం	3

పద్యము	పుట
అని పలికి కలుషం	429
అని పలికి కృష్ణునాననం	332
అని పలికి క్రమ్మఱఁగ	393
అని పలికి గొంతివచనం	226
అని పలికి చూడు	244
అని పలికిన విని	186
అని పలికి మరణోద్యుక్తుం	13
అని పలికి మఱియును	190
అని పలికి యజ్ఞనపతి	413
అని పలికి యతని కప్పుడు	291
అని పలికి యనంతరంబ	155
అని పలికి యనిల	318
అని పలికి యవ్విశోకునకు	362
అని పలికి వెండియు	106
అని పలికి వెండియును	156
అని పలికి శంఖంబొత్తి	161
అని పలికి సురగణం	133
అని పలికి సెజ్జ	346
అని పలికి హరుండు	128
అని పలికె నిత్తెఱంగున	30
అని పలికె నప్పుడు	420
అని పలికె నా సమయం	409
అని పాంచాలురు పార్థ	415
అని పార్థుఁ జూచి యతఁ	333
అని పెక్కుభంగుల	18
అని పెలుచంబలికి	390
అని భల్లప్రకరంబులన్	269
అని మఱియు ననేక	124
అని మఱియును	19
అని మఱియును	142
అని మఱియును	375
అని మఱియునొక్కటి	127
అనిమిషనాథుం డిచ్చిన	98
అనిమిషవంద్యమాన	306
అని మొన శత్రులం	188

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అని యంతం దనివోక	164
అని యంత నిలువక	162
అని యంత నిలువక	282
అని యగ్రజు నప్రియం	342
అని యడిగిన సంజయుం	150
అని యడిగిన సంజయుం	207
అని యడుగుటయు	305
అని యతఁడు శల్యుఁ	144
అని యమ్మహాబలనందనుం	388
అని యాసూతనందను	115
అని యిట్లు కర్ణసారథి	146
అని యిట్లు కృష్ణుండు	443
అని యిట్లు మధుర	459
అని యిట్లమ్మహాత్ములు	403
అని యిట్లు సంజయుండు	305
అని యిట్లు సల్లాపంబు	359
అని యిత్తెఱంగున	178
అని యుల్లసంబాడి	193
అనియె నట్టియెడ	177
అనియె నట్లయ్యిరువురు	283
అనియె నప్పుడు రాధేయుం	195
అనియె నప్పుడు వారణ	365
అనియె నప్పుడు వివర్ణం	348
అనియె నివ్విధంబున	165
అని యెలుఁగెత్తి చెప్పి	394
అని యెలుఁగెత్తి పల్కు	391
అనిజుఁడట్లు పెల్లెసఁగు	370
అనిలజునకుఁ జాలఁడె?	308
అనిలజుఫాలము గురు	52
అనిలజుమీఁద నేయ	236
అనిలజుసారథియును	54
అనిలతనూభవుండు	42
అనిలసుతుండు తీవ్ర	361
అనిలోఁ దెరలుట	328
అని వగచి యుధిష్ఠిరుం	309
అని వధించెదఁ గర్ణునేనని	330
అనివర్తననుతిఁ గవయ	140
అని విడిచె నకులుఁ	66
అని విలాపించి మఱియు	12
అని వెండియు	73
అని వెండియు	152
అని వెండియు	180
అని వెండియు	188
అని వెండియు	195
అని వెండియు	353
అని వెండియు	363
అని వెండియు	407
అని వెండియు	452
అని సూతపుత్రుం జూపిన	26
అనుచుఁ గూడుకొని రథ	202
అనుచు దీనమానసం	176
అనుచు శోకోపహతుం	4
అనుటయుఁ గాక మిట్లను	172
అనుటయు	461
అనుటయు గారవమున	116
అనుటయు ధర్మసూనుం	347
అనుటయు నతండు	87
అనుటయు నతని	164
అనుటయు నట్ల చేసెద	160
అనుటయు నాంబికేయుం	14
అనుటయు నాతఁడిట్లనియె	7
అనుటయు భీతి వేఁడి	184
అనుటయు వాఁడట్ల	301
అనుటయు విని మున్నాహూతం	173
అనుటయు శల్యుండు	196
అనుటయు సంక్రందన	205
అనునప్పుడు విషవిస్ఫుర	440
అనునవసరంబున	291
అను పలుకులు వినియుం	153
అనుభవశమరమ్యా	147
అనేక చండకాండంబు	301
అన్న నొచ్చెనన్న యమ్మాట	316
అన్నరుని మూఁడుశరముల	92
అన్యచాపలసితహస్తుఁ	217
అప్పాంచాలోత్తముండు	284
అప్పాండ్యమహీపతి	279
అప్పుడనిమిషముని	135
అప్పు డయ్యనిలతనయుం	233
అప్పుడు	83
అప్పుడు	380
అప్పుడు	432
అప్పుడు	449
అప్పుడు కురురాజు	255
అప్పుడు కృపసౌబల	241
అప్పుడు గురుతనయాద్రిం	270
అప్పుడు చేనెత్తురు	104
అప్పుడు దివ్య లన్నర	456
అప్పుడు దుర్యోధన	321
అప్పుడు ధృష్టద్యుమ్నుండు	397
అప్పుడు నకులుం డతని	45
అప్పుడు నీ కొడుకు	263
అప్పుడు నీయందుఁ జేయం	388
అప్పుడు ప్రతివింధ్యుఁ డైదు	50
అప్పుడు యుధామన్యుండు	93
అప్సరోగణంబు లాడుచుఁ	130
అబ్బలంబునకు బాసట	210
అమరనదీతనూభవుఁ	352
అమరులకు నజయ్యులగు	262
అమరులకు నజయ్యులగు వారిఁ	352
అమరులకు నసురులకు	126
అమితబలంబగు బ్రహ్మాస్త్ర	439
అమ్మహావీరు నాలోకించి	41
అమ్మహోగ్ర విజృంభణంబున	222
అమ్మాద్రీపుత్రుఁడు	60
అమ్మురారి ధవళహయము	263

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అమ్ముల బండ్లును రథ	108
అమ్ములు మూఁడు పార్థు	267
అమ్మెయి ధర్మనందనుని	100
అమ్మెయి నుగ్రుఁడై మఱియు	435
అయివమ	127
అయ్యవసరంబున	103
అయ్యవసరంబున నాకసంబు	265
అయ్యిరువురకు నొకటి	361
అయ్యిరువుర యబ్బాలుని	217
అయ్యెడం గూడిన కాకంబు	174
అరదంబు చక్రంబు	441
అరదంబు డిగ్గ నుఱికి	238
అరదంబున్ సిడమున్	408
అరదంబెక్కి శరాసనం	155
అరదము పోవనిమ్ము	262
అరదమెక్కి తఱిమె	399
అరయ నెవ్వాఁడు నాకంటె	131
అరుదిది నీవు నొవ్వక	323
అర్జునుఁడు నన్ను నోర్చిన	406
అర్జునుఁ డైంద్రబాణము	418
అర్జును నస్త్ర విద్యా	166
అర్ధచంద్ర బాణహతి	254
అలఘుతరాయువు	15
అలఘు పటుభల్ల పంచక	423
అలవును వెరవును	255
అలవు వెరవుఁ దలఁపఁ	98
అలవెఱిఁగి పెనఁగు	66
అలిగి కడంగి సూతసుతుఁ	416
అలిగి కిరీటి మాగధ	274
అలిగి జము నాలుకయుఁ	369
అలిగిన మూఁడు లోకముల	230
అలిగిన యన్నరనాథుని	383
అలిగి నరుడైంద్ర మాదిగఁ	298
అలిగి నొగనొగతోఁ	251
అలిగి యతండు వేఱొక	397

పద్యము	పుట
అలిగి యర్జునుం డాశీ	439
అలిగి సుషేణుఁ డెంతయు	217
అలుకం గెంపు గనుం	233
అలుక మనంబునం	76
అలుక వొడమి కర్ణుండు	64
అల్లదె యర్జున ధ్వజ	195
అల్లదె యర్జున ధ్వజ	208
అవియుం బ్రాకార గోపుర	119
అవిరళ దర్శనస్థిర	146
అవి వేగంబ మరల్చి	93
అవ్విక్రమ విశేషంబు	271
అవ్విక్రమ విహారంబు	274
అవ్విరించి బ్రార్థించి	123
అవ్వీరుం డవ్విప్రుని	271
అవ్వీరు నాటోపంబు	367
అవ్వేఁడిమికి వెఱచఱచి	367

ఆ

పద్యము	పుట
ఆకులతఁ బొంది పలుకు	178
ఆ చంద మెందుఁ గలదది	118
ఆటోపమడఁగి యచ్చటి	222
ఆతఁడును దురగసారథి	417
ఆతఁడేయఁ గిరీటంబు	433
ఆతనిఁ దాఁకె వీఁక	90
ఆతనిచే నీ విక్కడ	326
ఆ దిక్కువారు భీముం	424
ఆ ద్రుపదనందనుండు	77
ఆ ధృష్టద్యుమ్నాదులు	288
ఆ నినదంబునఁ బాండవ	451
ఆ భూదేవుండును	273
ఆ మహనీయచాపమున	105
ఆ ముువ్వురుఁ జలమున	398
ఆ యిరువురు నిబిడ	240
ఆ యుగ్రాహవకేళి నిట్లు	417
ఆయుధము విడిచి	199

పద్యము	పుట
ఆ రథికుఁడు దలఁకక	421
ఆ రథికు నచటఁ గానక	251
ఆ రాజు నైదు వాలిక	49
ఆ రాధేయుం డాతని	220
ఆర్చిపెలుచ నట్టహాసం	434
ఆలలోని యాఁబోతును	10
ఆలోఁ గర్ణుని చేతం	326
ఆలోన	209
ఆలోనన యజ్ఞపతి	84
ఆ వెల్లికి నోర్వలేక	256
ఆ సభ నా దుష్టాత్ముఁడు	357
ఆ సభలోనఁ గొన్న	384
ఆ సమయంబున భీమసేను	261
ఆ సమయంబున శోణితంబు	289
ఆ సమయంబునం	201
ఆ సంకులసమరంబు	222

ఇ

పద్యము	పుట
ఇట్టి కష్టపు గేలికై	335
ఇట్టి నన్ను ననునయించి	348
ఇట్టి మాయందును	172
ఇట్టులను సంజయుం	204
ఇట్లగు టెఱుంగక	114
ఇట్లదల్చుచు	223
ఇట్లభినందించి యన్నరేం	116
ఇట్లరుగుచు నలుక	185
ఇట్లు కోదండంబు	72
ఇట్లు కౌంతేయముఖ్యు	89
ఇట్లు గలయం గనుంగొని	364
ఇట్లు గవిసిన మన	201
ఇట్లు గాండీవంబెత్తి	358
ఇట్లు చరాచరాత్మకంబై	130
ఇట్లు చిత్రుండు	51
ఇట్లు దలపడి	38

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
ఇట్లు దాఁకిన యాభీరాది	379	ఇది యట్టిద మోసంబునఁ	348	ఇవ్విధంబున వృషసేను	401
ఇట్లు దారుణభంగి	391	ఇది యొక్క ఇతిహాసమే	136	ఇవ్విధంబున సేనల	211
ఇట్లు ద్రోణసుతుని యేపు	269	ఇది శ్రీమదుభయ కవిమిత్ర	148	**ఈ**	
ఇట్లు నాటించిన నొచ్చి	69	ఇది శ్రీమదుభయ కవిమిత్ర	307	ఈడఁబోక రాధాసుతుఁ	232
ఇట్లు పాండవసేనాపతి	257	ఇది శ్రీమదుభయ కవిమిత్ర	462	ఈతఁడు దుర్దశం బొరసె	229
ఇట్లు పాండుతనయు	65	ఇవ్విధంబున	44	ఈతని నొవ్వఁ బల్కుటన	349
ఇట్లు పాదచారులై	48	ఇవ్విధంబున	373	ఈరసమునఁ గదిసి	324
ఇట్లు ప్రాపై కడంగి	254	ఇప్పురుసున భార్గవాస్త్ర	314	**ఉ**	
ఇట్లు భానుదేవ చిత్ర	212	ఇప్పుడే నీకు బుద్ధులు	164	ఉగ్రుఁడై దుస్ససేనుని	396
ఇట్లు భీము కడంక	294	ఇమ్మివ్వరమ్ము సారథ్య	110	ఉడిపి తోడన కవ్వడి	421
ఇట్లు మహాప్రభావంబైన	121	ఇమ్మెయి సూతనందనుని	227	ఉత్తమ కర్మ మిట్టిదని	363
ఇట్లు మున్నీటి నీటి పయిం	177	ఇరుగెలంకుల మూఁకలం	425	ఉదయాచలమున	40
ఇట్లు రథంబులపై	54	ఇరుదెసల నున్న	302	ఉబ్బి మాద్రీసుతు డెబ్బది	62
ఇట్లు విక్రమ విజృంభితుం	59	ఇరువదేను నిశిత	257	ఉరగంబుఁ దునిమి	433
ఇట్లు విజృంభించిన	400	ఇరువురు నతిరథులు	402	ఉఱక యడరి మెఱసిన	325
ఇట్లు విరథుండై వృకోదరుం	386	ఇవ్విధంబున	245	ఉఱక యశ్వత్థామ	299
ఇట్లు విహరించుచుండ	170	ఇవ్విధంబున కేతన	451	ఉఱక సమీరసూనుఁడు	43
ఇట్లు వెఱచఱచి	370	ఇవ్విధంబునం గాకం	175	**ఎ**	
ఇట్లు సంగరోత్సాహ	153	ఇవ్విధంబునం ఘోర	389	ఎంగిళులు గుడిచి	177
ఇట్లు సత్యసేనుని	80	ఇవ్విధంబునం దెచ్చి	178	ఎందఱు వొదివిరి వారల	270
ఇట్లు సుకేతుండు	250	ఇవ్విధంబునం బ్రదీప్త	139	ఎందు వచ్చెదు? నిలు	294
ఇట్లు సుస్థిరుండై	79	ఇవ్విధంబున నద్దెస	373	ఎక్కి నిట్టార్పు నిగుడం	66
ఇట్లు సూతనందనుండు	436	ఇవ్విధంబున నవ్వీరోత్త	414	ఎట్లు ప్రియమొనర్చె? నట్లు	149
ఇట్లు సూతపాత్రుండగు	381	ఇవ్విధంబున నేనుంగు	44	ఎత్తి యత్తురంగంబుల	134
ఇట్లొప్పి యమ్మెఱుంగు	455	ఇవ్విధంబున బలంబుల	33	ఎదిరి సైన్యంబు సమరం	425
ఇతఁడు దెగటాటె	304	ఇవ్విధంబున మగధ	275	ఎద్ది ప్రియము సేయు	198
ఇత్తుఱేఁ ద్రుళ్లు సూపి	291	ఇవ్విధంబున రాధేయుండు	225	ఎఱుఁగుదు మఱచితినే	384
ఇత్తెఱంగునం గవిసిన	222	ఇవ్విధంబున విక్రమ	436	ఎలమిఁ గడచిపోవు	174
ఇత్తెఱంగున నపరాహ్ణంబు	85	ఇవ్విధంబున విక్రమించిన	293	ఎల్లఁజూడ సిడము విల్లు	350
ఇత్తెఱంగున నయ్యిరువురం	48	ఇవ్విధంబున విరథుం	218	ఎల్లభంగుల నేఁడు	345
ఇత్తెఱంగునం బోరినం	398	ఇవ్విధంబున వివిధ	267	ఎవ్వరు సూపసేల? నరు	162
ఇత్తెఱంగున	48	ఇవ్విధంబున వివిధాస్త్ర	299		
ఇత్తెఱంగు	85	ఇవ్విధంబున వృకోదర	227		

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఏ	
ఏచిన యా పురత్రయము	122
ఏను దపశ్చరణంబు	446
ఏను ధార్తరాష్ట్రహిత	163
ఏ నురము వ్రచ్చి నెత్తురు	390
ఏను సంధికిఁ బోయినఁ	356
ఏనూఱు రథంబులు వెసఁ	325
ఏనేమి తప్పుసేసిన	169
ఏనొండె నతనిచే	229
ఏమిర పసులని యార్పవు	392
ఏమీ తగవును ధర్మము	442
ఏలిన వాని పాటుఁగని	50
ఏసి మఱియు శిత	422
ఐ	
ఐనను నిప్పటి దుఃఖము	362
ఒ	
ఒంటి మెయిఁ దాఁక	180
ఒండు శరాసన మెత్తి	76
ఒండొక విల్లు పుచ్చికొని	369
ఒండొరు కేతువుల్	54
ఒండొరులమీఁద నుజ్జ్వల	383
ఒకటి కొకటి కంటె నుబ్బుచు	37
ఒకదేశంబు దాఁగీడ	193
ఒకళు లొకళుల హయముల	47
ఒనరింపుఁడు దివ్యరథంబు	128
ఓ	
ఓపి యతని రణభారము	344
క	
కడఁగి కృతవర్మతోడ	76
కడఁగుము నీదుబాణము	415
కడుఁ బెక్కు వేలు దూపుల	267
కడువడి వడముడియును	199
కడు వెగడంది యున్న	396
కదిసిన నమ్మహాభుజుఁడు	253
కనకపుఁ గామతోమరము	79
కనదస్త్రంబుల నుజ్జ్వలోద్భట	341
కన లధిక మైన	438
కనలి యవ్వీరుండు	258
కనలి యా సూతపుత్త్రుఁ	381
కనలి యొండొక విల్లు	215
కని గాండీవధరుండు	94
కని పాంచాలురు గోపం	212
కని ఫాలంబులు భూమి	123
కని యాఱమ్ముల నెడ నది	91
కని రాధేయుఁడు దివ్య	300
కని విందుండు ప్రదీప్త	47
కని సంశప్తకు లేచి	264
కనుగొనఁ జుల్కనైన	35
కనుగొని భీమసేనుఁడు	372
కనుఁగొని శల్యుఁడిట్లనియె	303
కనుఁగొను మిప్పుడేను	312
కపికేతనము హస్తి	405
కప్పి యాలోన	232
కమలవన సదృశ	147
కమలాకరము లీలఁ	56
కమలాసను కట్టెదిరికిం	131
కరణఫలపలత్యాగ	462
కరి కరి గిరి గిరి నంభో	413
కరి బృందంబులు డ్రెళ్లె	228
కరిహయ శవముల	83
కర్ణ మద్రపతుల కాంతల	408
కర్ణసుతుఁడు పలక	397
కర్ణుండు పది చండకాండం	416
కర్ణుండు మనల మార్కొనం	285
కర్ణుం డొక్కరుఁడును	262
కర్ణుఁ డట్టె కలన	100
కర్ణుఁ డేపారి శిఖండి	295
కర్ణుని కేతువు గ్రాలెడుఁ	374
కర్ణునిమెయి నాలోనన	423
కర్ణుని యగ్రభాగంబునఁ	399
కర్ణసూనులలో నొకం డు	360
కర్మ సూక్ష్మభంగి గానక	337
కలన గరుండు భీష్ముఁడును	410
కవలతోఁ బెనఁగెడు	257
కాండమహాతరంగముల	186
కాదేని బిరుదు లాడక	329
కామఁ బాసిన కమలంబు	449
కార్ముకముఁ గేతువును	91
కాలాయస నారాచము	258
కావున నవ్వర మిమ్మటు	108
కావున నీకు నప్రియముఁ	189
కావునఁ బ్రభుత్వసంపద	340
కావున మనమిఁక ననికిం	329
కావున మనవారికి	96
కావున వరప్రతిగ్రహం	140
కినియించి గదం దల	168
కురుపతి దెప్పిఱి బాహు	90
కురుపతి యాశలు మాలఁగ	353
కురుపతి వెండియుం	427
కురుపక్ష యోధులును	221
కురుబల ముబ్బి యార్చెఁ	154
కురువంశోత్తమ! వారి	430
కురువిభుఁడు సూచి శకునిం	368
కురుసేనలకుం బతియై	354
కులమును శ్రీయుఁ దేజము	13
కులిశప్రస్ఫురణాపహ	445
కూలి మూర్ఛ మునింగినఁ	371
కృతవర్మ సిక్కువడ	398
కృపాచార్యుండును గ్రత	204

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
కృపాశ్వత్థామ కృతవర్మ	355
కృపుఁడు సౌబలుఁడును	209
కెలఁకుల యోధులం	400
కేతనంబు గూల్చి యాత	297
కేతన కపి భయదంబై	375
కేతనము రథముఁ దురగ	357
కేతు చామరాతపత్ర	366
కొడుకు లంత రాజ్యంబు	5
కొనుమని దివ్యంబగు	140
కొలఁది యెఱుంగక	162
కోదండంబులు గొని	41
కోపసందీప్తుఁడై చాపంబు	134
కౌరవకోటి నేఁ బొదివి	317
కౌరవ పాండవులకు	61
కౌరవరాజు ధర్మజుఁడు	83
కౌరవ సైన్య మగ్గలము	353
క్రీడి తనూజుఁడైన	55
క్రుచ్చి మద్రవిభుండు	142
క్రూరములగు సూతసుతుని	317
క్రూరోల్లాసము పల్లవింపఁ	77
క్షత్రియ కులమున జన్మించి	225
ఖ	
ఖరభల్లంబున నాతని	214
గ	
గదలీలంగొని తేరు డిగ్గి	387
గదసేతంగొని దంతి	44
గదసేతంగొని యంత్య	392
గరుడాస్త్రం బేసిన	245
గాండివ ముక్తబాణమునఁ	450
గాండివి శౌరి కిట్టులనుఁ	314
గారవించిరి వివ్వచ్చుండు	456
గుణవంతుల గుణములు	165
గురుఁడును భీష్ముఁడుం	110
గురుఁడును భీష్ముఁడున్	150
గురుతనయుం డనేక	298
గురుని కొడుకను తలంపునఁ	268
గురుపుత్రుం డసురాంతకున్	272
గురుపుత్రుఁడు దొంబది	52
గురుసుత భీమసేను	53
గురుసుతుఁడు నిన్ను	268
గెలుపున మెయివొదలఁగ	70
గెలుపెల్ల భంగి నితనికి	202
గొంతి కడుపునందుఁ	334
గొంతి కొడుకును దేవకి	180
గొంతియు నందఱు గొడుకులు	443
ఘ	
ఘనతర వత్సదంత	80
ఘోరానేక శరాకృతిం	313
చ	
చంపి పాలిత ప్రతిజ్ఞుండ	335
చదల మెఱుంగులు పర్వం	224
చనుటయు నజాతశత్రు	305
చరణములుం గరంబులు	75
చరమగిరినుండి పడి	447
చలంబు నెఱయ నతని	392
చిందంబుల మ్రోఁతకు	37
చిత్రచాపముక్త శిత	170
చిఱునగవుతోడ మైమఱువుఁ	422
చూచి తన్నప్పుడు గ్రమ్మఱ	460
చూపి యక్కొంతేయులం	3
చూపుటయు నగ్గలంబగు	319
చెన్నునఁ బాంచాలురు	456
చేతులు దలలును బహు	270
చేయంగ వలయు వానిం	336
చేరి బహుచిత్రగతులం	48
జ	
జనపతియుఁ గృప	394
జనములు భీష్మద్రోణులు	33
జనములు వృథాప్రతిజ్ఞం	339
జనమేజయుని సూతుఁ	380
జనవల్లభ యొక సమయము	116
జనసంక్షయంబు పెల్లే	200
జనులు విప్రులు లగునట్టి	430
జనులెట్టిది మిత్రవిధంబని	189
జనులెట్టిది శత్రువిధంబని	189
జామదగ్న్యుఁ జూచి చయ్యనఁ	138
జూదంబునాఁడు మొలచిన	101
డ	
డిగిరయమునఁ గదిసిన	89
డులిచిన నబ్బలుమగండు	435
త	
తక్కటి రథికజనులు	399
తక్కటి సైనికు లనిన	19
తగువార లొరులఁ దెగడుట	143
తదనంతరంబ లోక	140
తదనీకంబు గజంబులు	275
తన కడిమి బంధమోక్షము	245
తనకరముల్ నిగిడ్చి	240
తనకు నెడసొచ్చి	249
తనకుఁ బిమ్మిటియైన	4
తన యరదం బెద్దెసఁ	325
తనువులఁ గర్ణబాణములు	454
తనువులఁ బటు బాణంబులు	225
తపము సుదాత్త శౌర్యము	403
తరమిడి చంపెఁ గీచక	231
తఱిమి తన మునుము	299
తఱిమి సుశర్మఁ దాఁకిన	243

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
తలఁచిన నెదకు సంతాపంబు	181
తలఁపఁగ సద్గుణంబులకుఁ	25
తలకొని జలములు	177
తల్లి చన్నుల పా లేను	391
తల్లిదండ్రులమాడ్కి	339
తళతళ మనియెడు	31
తానును వారును దూపుల	213
తారకాక్షున కొక్క తనయుం	120
తునిమి దోస్సారంబు	215
తునియలుగఁ జేసె హరులఁ	84
తురగ ద్విపరథ తూర్యా	271
తురగములఁ దాన నడపుచు	385
తురగ రింఖా ముఖోద్ధూత	32
తెగి మన కగ్గమై యరుగు	419
తెరలక కర్ణుఁ డద్విజయుఁ	422
తెలియ విన నీవు సెప్పిన	7
తెలిసిన దామోదరుండు	410
తెల్లము మిమ్ము నందఱ	95
తెల్లసీవిరులును వెల్లని	87
తే రతని యరదమునకుం	80
తేరు గదలనీక వైరులు	244
తేరు మురారి ద్రోణసుతు	266
తేరుల చెక్కలు వారణంబుల	82
తొడరి భవత్తనూజులు	378
తొడరుఁడు పాదువుం డేయుఁడు	425
తోడన కోదండము	386
తోడన హయసూతుల	249
తోడై డాపట వలపటఁ	376
ద	
దంతిఘటల్ మహోగ్ర	40
దమమున నియమంబున	117
దానం గనలి	68
దానం గోపం బగ్గలించి	42
దానం గోపించి	237
దాన బీఱువోవక	385
దారుణాస్త్రజాలాంశుల	448
దీనవృత్తి శల్యుండు	450
దీనికి నీవు కటకటం	442
దీప్త ప్రతాపంబగు	343
దుఃఖంబు నిస్తరింప	9
దుఃఖపరంపర ద్రొక్కున	15
దుర్యోధను చేసిన యవ	101
దృష్టాంతము సెప్పెదనని	187
దేవతలకు నైన దేవేంద్ర	197
దేవత లిచ్చిన తేరు	331
దేవా వైశంపాయనుండు	2
దేవా వైశంపాయనుండు	149
దేవా వైశంపాయనుండు	308
దైవంబు బలవంతంబనిన	102
దొరలఁ గడచి బలంబు	383
ద్రౌపదీనందనులును	380
ద్రుపదతనూజులుం	287
ద్రోణాచార్యుని యుగ్రపు	318
ద్రోణుండు బహుదివ్య	156
ద్రోణు పరాభవం బధిక	72
ద్విజపతి వృషభాంకోద్దీర్ణ	307
ధ	
ధనువు దునిమి కొమ్ములు	249
ధనువు దునిమ యొండు	76
ధనురాచార్యుని చావు సూచి	327
ధను వొండుగ్రత నెత్తి	386
ధరణీచక్రము నీవ	452
ధర్మపుత్రుఁడు గురుతనయుతోఁ	252
ధర్మవాదులు ధర్మతత్త్వ	438
ధీరజనోత్తముండు	57
ధృతరాష్ట్రుండు మ్రానుపడి	8
ధృతి నొండు విల్లుగొని	253
ధృతి వొగ డొందదేచి	58
ధృష్టద్యుమ్నుండును బెండు	73
న	
నకుల సహదేవులును	372
నకులానుజుఁడు గృపాణం	58
నకులుఁడు సహదేవుండును	341
నకులుఁడు సూతపుత్రుఁడుఁ	60
నడపుమనుటయు నమ్మాటఁ	151
ననుఁ గృష్ణుకంటె నధికుం	115
ననుఁ జూడుము వేడుకకుం	327
ననుఁ దగియెడు నతిథిం	266
ననుఁ దొఱగి నీవు సౌఖ్యంబున	345
నను నింత నీచవుఁ బనికి	112
ననుబోఁటి జోదునుం	429
నను బోఁటుల మనములు	265
నను సుప్రసాద దృష్టిం	344
నన్ను సర్వసేనాధిపత్యంబునకుఁ	28
నన్నెఱిఁగి యెఱిఁగి యిట్లనఁ	341
నరతనయుండు దత్తనువు	55
నరనారాయణులకు నెందును	403
నరవర! చూడవే తెలియ	113
నరవర పంపు! మేను	328
నరవర యెందుఁ జూడమె	451
నరసింహుం డసురేంద్రు	390
నరుఁడదె కంటే కౌరవ	364
నరుఁడన్న వర్తనము	361
నరుఁ డమ్మై వినివచ్చె	207
నరుఁడు దీవ్రశరార్చులు	83
నరునకుఁ బూని పల్కితి	160
నరునకు సూతసూతికి	202
నరుని ప్రతిజ్ఞ భూవర	346
నరునిశరంబులన్ రథ	153

పద్యము	పుట
నవతి కౌరవ రథికులు	378
నవతిశరముల నవ	92
నవ్వుచుఁ జాపంబు నడిమి	223
నవ్వులకంటెఁ గాక యది	407
నవ్వెడు తలలను గ్రొవ్వారు	375
నాకుఁ గల సొమ్ము లెల్లను	185
నా కొలఁది యిప్పు డెఱిఁగితి	178
నాగపాశబంధనంబుల	245
నా దుర్ణయమునఁ జేసియు	8
నారాచము లాదిగఁగల	106
నారాచాది మహోగ్ర	151
నావుడుఁ దేరు మద్రనర	231
నిగుడు దవాగ్నిజ్వాలల	388
నిడుఁగేలున్ బలుతొడలు	448
నినదసముద్భటస్ఫురణ	446
నినుఁ దలపడఁ జూచిన	290
నిను నొంచువాఁడె కర్ణుం	440
నిన్నుఁ దృణముఁ జేసి	333
నిబిడ ఘంటావళి నిక్వణం	38
నిర్గత ప్రాణు రాధేయు	449
నిలు నిలు మని తమ	280
నీకుం బోలిన మొగ్గరంబు	36
నీకు వృద్ధసేవ లేకున్కి	336
నీకు వెఱపింప నయ్యెడు	191
నీ కొడుకులు కవచియు	395
నీచులకు బలంబు నెట్టన	188
నీ చెప్పెడుమెయి నూడఁగ	293
నీ తెఱఁగిట్టిదేని రణనిష్ఠకుఁ	330
నీ తోడ్పాటున నేఁ ద్రివిష్ట	358
నీ యట్టివాని విక్రమంబునుం	74
నీ యస్త్రం బిప్పుడు కర్ణాస్త్రం	439
నీ వనేకగతులు నేర్తిది	176
నీ విక్రాంతియు నాపయిం	26
నీ విట్టివాఁడ వని ధరణీ	340
నీవు జూదంబాడఁగా వైర	342
నీవు ప్రాజ్ఞుండవు ప్రబలుండవు	27
నూఱు గతుల నీవువాఱుదే	173
నృపుఁడును భీష్ముఁడుం	159
నెట్టన యల్గినం దగునె	393
నెత్తుటఁదోఁగిమేను	436
నెఱిదగఁ దేజితమై	310
నేరకతొడరితిఁ గాల్కొన	176
నొంచితోడన	84
ప	
పంకజనాభుఁడున్ వినఁగఁ	331
పటుతరమైన నారసము	237
పటునారాచము దీప్తి	60
పటుబాణప్రకరంబు	45
పటుసింహనాద తూర్యోత్కట	227
పట్టపగలింటి సూర్యుని	315
పదంపడి	392
పదపడి పాండవయోధు	286
పదపడి యొకభంగి	326
పదపడి రాధేయుం	201
పదుమూఁడు వర్షముల్	321
పదిబాణంబుల నొంచి	236
పనివడి జామదగ్న్యుఁడు	180
పరదోషము సెప్పఁగ	193
పరమధర్మపరులు	442
పరశురామదత్తం బయిన	437
పరశురామునిచేతఁ	21
పరిచయసక్తచిత్తుఁడయి	105
పలకయు వాలునుం	64
పలికిన నేమి? బీరములు	323
పలుకులు వృథగా నన్నుం	65
పలుదెస మంటలు ప్రబ్బఁగ	429
పలువురకుఁ బుట్టినిచ్చలుఁ	168
పవనసుతుచేత నాభూధవుఁ	304
పాంచాలురఁ గేకయుల	301
పాండవకోటి సూతుసుతు	23
పాండవసైన్యంబుల	273
పాండవాగ్రజుఁడు దర్పంబు	224
పాండవు చాపంబు ఖండించె	88
పాండవుల నాజినోర్చు	234
పాండవులయట్ల రాధాసుతుం	411
పాండవులు ధర్మపరు లెవ్వలన	197
పాండునృపాగ్రనందనుఁడుఁ	156
పాండునృపుసుతులలో	102
పాండుసూనులతోడి పగ	11
పాండ్యుఁడా సేనలపై	277
పాయవడియె సేన	376
పార్థుదెసఁ బలుకుపుట్టినం	97
పాఱినఁ జూచి కౌరవ	311
పాఱిపాఱి డయ్యుటయు	175
పావని మున్నుగాఁ గవలుఁ	300
పావనికి నిషాదపతి	293
పుండరీకాక్షుండు గాండీవితో	420
పులుఁగులలో నీవెక్కుడు	171
పూనిక నెఱపి శోకం	358
పెక్కంద్రతోడఁ గర్ణుం	372
పేరుగల రథికముఖ్యుల	366
పొడవునకు నెగసి	175
పొదివెడు నప్పుడు	213
పౌరి బంధు పుత్ర మిత్రుల	13
పౌరుషమేటికి దైవం	14
ప్రకట మహార్థసౌరభ	461
ప్రజలకుఁ బతి గాఁగఁ	125
ప్రతిశరములు పాండ్య	278
ప్రమితివిదూరా! సుమన	306
ప్రాణహాని వచ్చుపట్టున	337

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ప్రీతి యెలర్ప వీరుల	200
ప్రైవడి పోయెఁగాన ధృత	393
ఫ	
ఫల్గునుండు మేఘబాణ	418
బ	
బంధుమిత్ర యుతంబుగఁ	29
బరవసమొప్పఁగ్రూర	89
బలమును శౌర్యముఁ దేజముఁ	353
బలవంతులగు దనుజుల	138
బలవిక్రమములు వినుతం	2
బలశాలియైన హంసముఁ	172
బలితపువెస నాఁబోతుం	450
బలియురగు రాజులును	396
బలుగాలిన్ నలుదిక్కులం	214
బలునారసమున నేసిన	369
బలునిఁదెగటార్చి మరలు	455
బలు పెసఁగఁ బాండుపుత్త్రులఁ	198
బలువిడి నులూకుఁ డిరువది	69
బలువిల్లుగ్రత నెత్తి	258
బాడుదలనొండెఁ బట్టుము	151
బాణజ్వాలలు బెట్టు పర్వ	222
బాహువిలాసంబు మెఱయ	68
బాహువునొచ్చినం గినిసి	51
బీరమును లావుఁ గల్గిన	426
భ	
భండనంబునఁ బార్థుచేఁ	190
భండనము నేర్పుమెయి	107
భరితక్రోధ మహోగ్ర	426
భరితోత్సాహతఁ బేర్చి	414
భల్లం బొక్కటఁ జంపె	69
భల్లములు మూఁట సిడము	385
భార్గవాభిదానంబగు	182

పద్యము	పుట
భార్గవాస్త్రంబున నొక్కనిం	166
భీమసేనునకు సేనాముఖం	328
భీమాస్త్ర శిఖలనశ్వ	254
భీముఁ డదల్చుచున్ రథము	239
భీముఁడుఁ గవలును ధర్మజు	410
భీముని రణవిహరణ	355
భువనము లన్నియు నొక్కటఁ	457
భూసుర శాపంబున నిదె	437
భ్రుకుటిస్ఫూర్జిత ఫాలభాగుఁ	401
మ	
మందరంబుచేత మథితమై	366
మనమునఁ గూర్తుగాన	458
మనము బలశౌర్యఘనుఁ	25
మనలోఁగయ్యంబేటికి	17
మనుజేంద్ర! కుశలివగు	327
మర్మభేదులైన మార్గణం	65
మఱియు గురుపుత్త్రుఁడేయ	279
మఱియు నమ్మద్రపతి	452
మఱియు నరుండు సూత	424
మఱియును	53
మఱియు నొక్కం డాకర్ణింపు	107
మఱియు నొక్క మహనీయ	63
మఱియు బహువిధోత్పాతం	154
మఱియొకఁడేను జెప్పెద	168
మఱి యొక్కటి సెప్పెద	161
మహిత మునులగు వీరెందు	404
మాగధుని కోల్తలకుఁ	274
మా తండ్రియెడం జేసిన	282
మానకయున్న మఱియును	184
మానససరసి వసింతు	172
మాయోపాయంబుల గాంగేయుం	20
మిగిలి యప్పాండవాగ్రజు	203
మీ తండ్రి కుఱికి నఱికిన	282

పద్యము	పుట
మీరు నిజంబ చెప్పితిరి	132
ముంచు మహోద్ధతి	253
ముందర శిఖండినిడి	20
ముందరి యట్లుగాదు	159
ముదమున నతఁడందఱుఁ	219
మును లోకముచే సత్కృతి	15
మును విశ్వకర్మ దేవేంద్రునకై	105
మునుసభఁ బలికిన	388
మును సహదేవుం డెగు	296
మూఁడక్షౌహిణు లిమ్మెయిఁ	293
మెఱయు వెలిమావులును	414
మెఱసినం గుపిత	64
మెఱసినం జూచి	399
మెఱసిన నెఱసిన	272
మెఱుఁగుతోడి లలిత	145
మేరువు వోలె నొప్పిన	197
మేలి మదావళంబులును	210
మేలు విలుగొని యఱువది	68
మొదలిరాజు సభయముగ	305
మొనసి క్రీడి మఱియు	422
మ్రొగ్గెడు వాహనంబులు	292
య	
యవనశక సైన్యములు	264
యాదవ వీరచయంబు	96
యుధామన్యుండు గృపా	297
ర	
రణంబు దారుణంబయ్యె	399
రథమవితథమైనను	22
రథము రథమ్ముఁ జేరఁగఁ	103
రథరథ్యగతులు నెఱయ	312
రథికవర్యుడైన రాధేయు	457
రయమునఁ బంచవింశతి	237
రయమున వాని నన్నిటి	59

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
రాజరాజుఁ బాసి రాజ్య	359
రాత్రిమైఁ దాఁకి క్రూరతఁ	158
రాధేయుండు సుదీర్ఘ	295
రాముడు విమలవ్రత	137
రాయంచ మందగతిఁ జను	174
రెండుసేనల శంఖభేరీ	405
రేపకడ సకల బలములు	103
రోషమహాటోప భీషణ	164
ల	
లావులు రథాతిరథ	192
లీలంగేల నమర్చి	389
లేరిచట మగలు నీకును	356
వ	
వంగాధీశుఁ గరీంద్రుతో	288
వచ్చిన మఱిగెల్చుగొనన్	315
వడిఁ గృతవర్మ దాఁకిన	91
వడిఁ బొదివి భీముఁడార్చిన	292
వనధివాసులగు నివాత	431
వనమునఁ బండ్రెండేఁడులు	35
వరంబులు గోరికొం డనవుడు	117
వరదివ్యాస్త్రవిదుండు	73
వరదు శరణ్యు శశాంక	123
వరము వడసిన యాదైత్య	119
వరవుడుల నూర్వురను	365
వరుణుఁడు నీళ్ళచేఁ జెడునె?	196
వఱళులు మన చేరువఁ	194
వలను శోభిల్ల నెవ్వాఁడైన	160
వలవదు నన్నునుం గృపు	411
వలుఁద నారసంబు	301
వాఁడు వడినం దక్కటి	357
వాఁడె కురుక్షితిపాలుఁడు	304
వానిఁ దునుమాడిఁయా పాండు	435
వానినెల్లఁ ద్రుంచి వల వ్రచ్చి	368

పద్యము	పుట
వాని మగిడించి	52
వాయుసత్త్వుండు వాయు	367
వారలఁ గడచి ప్రభద్రకు	211
వారలపై నక్కురుభూనాథుం	287
వారల లోకవీరుల నవ	155
వారల వడికోర్వక	281
వార లిరువుర నుగ్రంపు	302
వారలు గెలఁకుల నడవఁగ	22
వారికిఁ దోడ్పడి యక్కడి	221
వారి వీక్షించి ఖచరులు	53
వారొండొరుల శరపరంపర	240
వాలికతూపులు మేనం	248
వికలరథ ప్రయత్నుఁ	85
వికలసాధనుఁడైన యవ్విభుని	259
విజయుం దాఁకి పెనంగుచో	19
విడుతు రాప్తుల బంధుల	192
వినత దురిత నిరసన	461
విని కృతవర్మఁగాంచి	251
వినిన జనంబు లీతఁ	157
విను కర్ణున కే నోడితి	329
వినుత మహాస్త్రముల్	190
విను నీకిచ్చిన బాస	28
విను పాపదేశ సంజనితుండ	167
విను పిచ్చుక కుంటతిరయ	16
విను పిన్ననాఁడు నీ వీ	337
విను పెద్దయు వినికిలేని	338
విను మట్లేచి నకులుఁ	288
విను మతఁ డిమ్మెయి	425
విను మతని యోధజన	226
విను మప్పలుకులు పాటిగఁ	331
వినుమాదర ముత్సాహం	24
వినుమిత్తెఱఁగున నేన	108
వినుము కుమార! విప్రు	74
వినుము నరేంద్ర చూడ	431

పద్యము	పుట
వినుము బ్రహ్మఘ్నుఁడన	282
వినుము మహీసురు శాపము	448
వినుము సత్యంబ పలికెదఁ	344
వినుము సుభద్రపట్టి	356
విను మేను జేయఁబూనిన	394
విను మేను విక్రమింపఁగఁ	113
విను మొరులకు గాండివ	335
విను సత్యం బాడెదఁ	347
విను సత్య ధర్మరతుఁడగు	30
వియచ్చరులు వెఱఁగందిరి	220
విరటుని గోవులన్ మరల	179
విరథుండై పొలివోని	71
విరథుఁడయ్యెన కాని	87
వివ్వచ్చు విక్రమవిహారం	78
వీఁడొకరుండె యింక	36
వీనులకుం బలుకులు	142
వీరికి జయంబు ధ్రువం	404
వెండిపింజఁ బొలుచు	81
వెండియుఁ నేపునఁ బైకొని	212
వెండియు బలువిడి నయ్యా	434
వెండియుఁ బాంచాల	382
వెండియు సుశర్మని	81
వెగడునఁ జెయ్వేది	243
వెగడువడి చక్రరక్షకుల్	424
వెడతలఁపు లుడిగి	412
వెనుకొని రాధేయుఁడు	65
వెరవునఁ దత్తనువుం	178
వెరవునులావు దివ్య	322
వెసఁ బెక్కమ్ములు మనపై	269
వెస నతని యురము	232
వేడుకఁజూడు మేను	363
వేఱొక్క విల్లెత్తి వివ్వచ్చు	56
వైచిన నవ్వీరుండు	310
వైవస్వతు చందంబున	25

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
శ	
శక్తులను దోమరంబుల	42
శక్రుతేరైన నడపంగఁ	143
శరణము వేఁడెదను	347
శరతల్పమున నుండి	17
శితశరము లుత్తమౌజుఁడు	298
శినివంశవరునితోడం	259
శిరమునఁ గంఠదేశమునఁ	272
శిరమునఁ గర్ణంబుల	435
శీతార్త జనంబులు	99
శృంగములేని నీలగిరి	432
శైనేయుండును భీమసేనుఁడును	220
శైనేయుతోడ విందాను	46
శోకవారిధి పారంబు	14
శ్రమమునకై యేనుసకలాంబ	183
శ్రమమున సోలుచుండియుఁ	427
శ్రాంతిం బొందినవాఁడు	413
శ్రీ నిష్పాదన నిపుణ!	149
శ్రీ పరిణామస్థితి విద్యా	1
శ్రీమచ్చరణాంబుజ యుగ	308
శ్రుతకర్మ కోపించి క్రూర	49
శ్రుతకర్మ నకులుని సుతుని	70
స	
సంగరమేను పెక్కుదివసంబులు	286
సంజయ మురభంజనుని	11
సంతసపు వార్త పుచ్చుము	408
సకలదేశములను సన్మార్గ	193
సకల ధరణి వలయ	459
సత్యంబు నహింసయు	336
సత్యవ్రతంబును శాత్రవ	109
సత్యసేనుఁడు మూఁడు	78
సమదాటోపత వాయునందనుఁ	291
సమరము పెంపుసెప్పెదవు	86
సరకుగొనండు పాండు	3
సరభసముగ నన్ను	318
సరియగు నాకు దివ్య	104
సహదేవుని తేరెక్కిన	303
సాత్యకియును శరంబులు	260
సాత్యకి వృషసేను సప్త	218
సామజము వడినశ్వ	20
సామర్థ్యమొప్ప విశ్వం	129
సారథిదక్షుఁడై రథిక	169
సారథి యెవ్వండనుటయు	131
సారథి యెవ్వఁడాతనికి	22
సారథి లేమిని సాత్యకి	254
సారథుల యుబ్బువాజుల	383
సారవంతమై కర్ణునిసైన్య	205
సింహంబు బారిఁజొచ్చిన	261
సిడము కామ సూడు వడఁకెడు	195
సురగరుడఖచరవిద్యా	430
సురగరుడోరగవిద్యా	359
సురపతి తపంబు సేసినఁ	431
సురలైనం జలమెత్తి	320
సూతతనయ నారాచ	45
సూతతనూజుఁ డబ్బలము	221
సూతతనూజుఁడు వడినం	448
సూతతనూజు మోహరము	205
సూతతనూభవుం డనిల	232
సూత తురంగ స్యందన	283
సూతసుతుండు నీ యెదుర	419
సూతసుతుఁడు ధనంజయుఁ	285
సూతసుతుఁడు బలువిలు	62
సూత సుతుని మెడనెత్తురు	347
సూతులఁ దెగటార్చి కేతనం	67
సౌబలు నీతియుఁ గర్ణు	101
స్తుత్యానుభావ నిర్మల	124
స్వాతిగతుండగు శుక్రుం	325
హ	
హతశేషులైన సంశప్త	247
హయములఁ జంపి ముప్పది	381
హయములు పగ్గముల్	311
హరి కెక్కు డరయ మద్రేశ్వర	107
హరి గలుగంగ నేటికి?	333
హరిదెసఁ గన్గొని యాతని	80
హరిమేని కాంతియును	364
హరియును బాండునందనులు	37
హరి వెరవున ధవళాశ్వ	265
హరి సనుదెంచినప్డు మన	411
హరుఁడు దక్కఁ జాపధరుఁ	343
హరులను సూతుఁ జంపిన	248
హరు లమ్మహాత్ము లిరువుర	133
హితము సెప్పఁదగనె	169

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 11

శల్య, సౌప్తిక, స్త్రీ పర్వములు

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డా॥ పి.వెంకటరాజు
విద్వాన్ సింగరాజు సచ్చిదానందం
డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు
డా॥ హెచ్.యస్. బ్రహ్మానంద

ప్రధానసంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Shalya, Souptika, Sthri parvamulu of Tikkana Somayaji
Vol. XI

Commentary by
Dr. P. Venkataraju - Salya Parvam 1st Canto
Vidwan Singaraju Sacchidanandam - Salya Parvam - 2nd Canto
Dr. Jonnalagadda Mruthyunjaya Rao - Soupthika Parvam
Dr. H.S. Brahmananda - Sthri Parvam

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Series No.610
First Edition : 2005

Second Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D. Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా అధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నందూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

మహాభారతం వేదాల, శాస్త్రాల, ఉపనిషత్తులసారం. అందుకే ఈ గ్రంథాన్ని పంచమ వేదంగా పరిగణిస్తారు. "భరతానాం మహజ్జన్మ మహాభారత ముచ్యతే" అని, "మహత్త్వాద్భారవత్త్వాచ్చ మహాభారత ముచ్యతే" అని మహాభారతనామ నిష్పత్తి. అన్నితరాలను అలరించి ధర్మాన్ని, జ్ఞానాన్ని బోధించే మహేతిహాసం మహాభారతం.

ఇంతటి ప్రాశస్త్యం గల మహాభారతాన్ని వ్యాఖ్యానసహితంగా ప్రజలకు అందించాలని తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం 1982–83 నన్నయ సంవత్సరంలో నిర్ణయం తీసుకున్నది. అందుకు అనుగుణంగా సామాన్యులకు కూడా అనువైన రీతిలో ప్రతిపదార్థ, తాత్పర్య విశేషాలతో రూపొందించాలని సంకల్పించింది. ఈ మహాభారత ప్రచురణ ఒక మహాయజ్ఞంలాగా కొనసాగుతున్నది. ఆంధ్రదేశంలోని ముప్పైమంది ప్రసిద్ధ విద్వాంసులు, మహాభారత వ్యాఖ్యానంలో పాలుపంచుకున్నారు. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు ప్రధాన సంపాదకత్వం వహించారు. ఇందులో భాగంగా ఆది, సభా పర్వాలను 2000 సంవత్సరంలోను, 2003 సంవత్సరంలో గోదావరీ పుష్కరాల సందర్భంగా అరణ్య, విరాటపర్వాలను, 2004లో కృష్ణా పుష్కరాల సందర్భంగా ఉద్యోగ, భీష్మ, ద్రోణ పర్వాలను వెలువరించటం జరిగింది. తరువాత 2005లో కర్ణపర్వాన్ని ప్రత్యేక సంపుటంగా ప్రకటనకు సిద్ధం చేయడమైనది. ప్రస్తుతం శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలను ఒకే సంపుటంగా మీముందుంచుతున్నాం.

పగ, ద్వేషం, ప్రతీకారం, ఈర్ష్యకు లోనైన కౌరవులు పోరుకు సిద్ధపడటం, తద్ద్వారా కలిగిన పరిణామాలకు ఫలితంగా 'శోకరసం' ఈ పర్వాలలో మూర్తీభవించింది. శల్యునిసారథ్యాన్ని ఆతని మరణాన్ని, దుర్యోధనుని పతనాన్ని వర్ణించే పర్వమే శల్యపర్వం. సౌప్తిక పర్వంలో అశ్వత్థామ కరడుగట్టిన ప్రతీకార హింసాయుత ప్రవృత్తి గలవాడుగా గోచరించగా, ధర్మ పరిరక్షణ కోసం అవతరించిన భగవానుడుగా శ్రీ కృష్ణమూర్తి దర్శనమిస్తాడు. ఇక స్త్రీ పర్వంలో గాంధారి, కుంతి మున్నగు స్త్రీల మనఃప్రవృత్తుల చిత్రీకరణలో శోకరసం పెల్లుబికింది.

ఈ పర్వాలకు డా॥పి. వేంకటరాజు, విద్వాన్ సింగరాజు సచ్చిదానందం, డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు, డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద వ్యాఖ్యానం అందించారు. వీరికి మా ధన్యవాదాలు. ప్రధాన సంపాదకులైన ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు విపులపీఠికను, కథాసంగ్రహాన్ని సమకూర్చారు. వారికి మా కృతజ్ఞతలు.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీవేంకటేశ్వరస్వామి వారి దివ్యానుగ్రహంతో తిరమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవశ్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భఆగవతం ప్రధమ స్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 -' 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాసపీఠము' - అనే ప్రశస్తసంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనాప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జూలై 11వ తేదీన హైదరాబాదు బాలాజీభవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శకసూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అర సున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయతల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్లవేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్పురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్లవేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిక్రమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగాపర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీమధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జూలై 3వ తేదీన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డి గారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యంలో 1992 నవంబరు 5వ తేదీన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥ కే. సర్వోత్తమరావు	**శ్రీ డి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥ రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిని అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికి, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికి సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జులై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీడి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీస్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలో ని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్లకొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పండ్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి, విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి''.

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాష్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదక మండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

సంపాదక మండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు	శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య	డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
డా॥ కె.జె. కృష్ణమూర్తి	డా॥ కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే.	డా॥ బిరుదురాజు రామరాజు
అన్నమాచార్యప్రాజెక్ట్ డైరెక్టర్, తి.తి.దే.	డా॥ ఎం. కులశేఖరరావు
ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి, తి.తి.దే.	డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
	డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలుల లోని సభ్యులయొక్క సంయుక్తసమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటాలన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్తపాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ప్రథమసంపుటం ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం-సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి. సుబ్బారావుగారి తరువాత కార్యనిర్వహణాధికారి అయిన డా॥పి. కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారు వచ్చిన తత్క్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణనుగూర్చి ఆసక్తితో గమనిస్తూ అన్ని విధాల సహకరించి ఆది,సభా పర్వాల విడుదలకు ఏర్పాటుచేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాలనిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ప్రణాళిక వ్యాఖ్యాసహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. అప్పట్లో తీవ్రతరం అయిన ప్రయత్నంతో గోదావరి పుష్కరాల సమయానికి ఆరణ్యపర్వం (2 భాగాలు), విరాటపర్వం విడుదల అయ్యాయి. తర్వాత శ్రీ అజేయ కల్లంగారు కార్యనిర్వహణాధికారిగా విచ్చేసిన వెనువెంటనే ఈ మహాభారత వ్యాఖ్యన సహితప్రచురణ ప్రణాళికను మరింత వేగిరపరచి కృష్ణాపుష్కరాలలోపల యుద్ధ పంచకాన్ని విడుదల చేయాలనీ, 2004 సంవత్సరం చివరకు మిగిలిన పర్వాష్టకము వెలుగు చూడాలనీ నిర్ణయించడం జరిగింది. ఆ మార్గదర్శక సూత్రానుగుణంగా ఉద్యోగ, భీష్మ, ద్రోణపర్వాలు వెలువడ్డాయి. ఇప్పుడు కర్ణపర్వం విడుదలయింది. ప్రస్తుతం శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలను మూడింటిని కలిపి ఒకే సంపుటంగా మీముందు ఉంచుతున్నాము. పర్వాలన్ని విడుదల చేయటానికి సర్వయత్నాలు సాగుతున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారత' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. సాహిత్యప్రియులూ, తి.తి.దేవస్థానం సంయుక్తకార్యనిర్వహణాధికారిగా ఉండిన శ్రీ ఆర్. అప్పారావు, ఐ.ఏ.ఎస్., గారికి వందనములు.

సంబంధిత విభాగాధిపతిగా, సలహామండలి ఎక్స్ అఫిషియోసభ్యులైన డా॥పి రంగారావు, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి-వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగా సహాయ సహకారాలందించిన తదితర అధికారిగణానికి నమస్సులు. ఈ ప్రణాళికద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధానపాత్ర వహించిన-వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదకమండలి, సలహా మండలి) విద్యావేత్తలకు, ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారికి- నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి.దేస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడంలో వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్ కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానిక పండితవర్యుల ఉప సంఘం (ఎడిటోరియల్ సెల్) నిర్మాణానికి సిఫారసు చేయగా, దేవస్థానం ఆమేరకు **పండితవరేణ్యులు డా॥ కె.సర్వోత్తమరావు, శ్రీసముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీముదివర్తి కొండమాచార్యులు గారలతో** ఎడిటోరియల్‌సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈ సెల్ ఉపకారం మరువరానిది. వీరు వర్క్‌షాపువలె నిర్వహింపబడుతున్న కవిత్రయ మహాభారత యజ్ఞంలో పాలుపంచుకుంటున్నారు. ఆ కారణంగానే తక్కిన పర్వాలు త్వరితంగా వెలువరించగలుగుతున్నాం.

"సప్తగిరి" సంపాదకులుగా, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి అమరులయ్యేవరకూ ప్రముఖపాత్ర వహించిన కాట్రపాటిసుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె. రాధారమణ, డాక్టర్ ఎ. సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి. ఎన్. శ్రీనివాసన్ గారికి, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్ది పాఠకులకు తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయాధికారి శ్రీ ఐ. పార్వతీశ్వరరావు గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగుచూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ఎన్.ఎస్. రామమూర్తి
కన్వీనర్
సంపాదకుడు - సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి

అధ్యక్షులు

శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకులు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం,

సంపాదక మండలి సభ్యులు

శ్రీపొత్తూరి వేంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆచార్య ఎం. బుద్ధన్న

డా॥ పి. రంగారావు, పౌరసంబంధాధికారి (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ మేడసాని మోహన్, డైరెక్టర్ అన్నమాచార్య ప్రాజెక్టు, (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద, కార్యదర్శి, ధర్మప్రచార పరిషత్తు (ఎక్స్ అఫిషియో సభ్యులు)

కన్వీనర్

డా॥ ఎస్.ఎస్.రామమూర్తి,

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా 1,2
4. డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5. డాక్టర్ కే. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9. డాక్టర్ కే. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్నశాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	ఆను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	ఆను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఆను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది.	-	ఆదిపర్వం
సభా.	-	సభాపర్వం
ఆర.	-	ఆరణ్యపర్వం
విరా.	-	విరాటపర్వం
ఉద్యో.	-	ఉద్యోగపర్వం
భీష్మ.	-	భీష్మపర్వం
ద్రోణ.	-	ద్రోణపర్వం
కర్ణ.	-	కర్ణపర్వం
శల్య.	-	శల్యపర్వం
సౌప్తి.	-	సౌప్తికపర్వం
స్త్రీ.	-	స్త్రీ పర్వం
శాంతి.	-	శాంతిపర్వం
అను.	-	అనుశాసనికపర్వం
అశ్వ.	-	అశ్వమేధపర్వం
ఆశ్ర.	-	ఆశ్రమవాసపర్వం
మౌస.	-	మౌసలపర్వం
మహా.	-	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	-	స్వర్గారోహణపర్వం
సం.	-	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	-	సంస్కృత మహాభారతము
అను.	-	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	-	ప్రధానసంపాదకుడు

క.	-	కందపద్యం
వ.	-	వచనం
ఆ.	-	ఆటవెలది
తే.	-	తేటగీతి
సీ.	-	సీసం
ఉ.	-	ఉత్పలమాల
చ.	-	చంపకమాల
మ.	-	మత్తేభవిక్రీడితం
శా.	-	శార్దూలవిక్రీడితం
ఆశ్వా.	-	ఆశ్వాసం
క్రీ.శ.	-	క్రీస్తుశకం
య.	-	యగణం
మ.	-	మగణం
త.	-	తగణం
ర.	-	రగణం
జ.	-	జగణం
భ.	-	భగణం
న.	-	నగణం
స.	-	సగణం
ల.	-	లఘువు
గ.	-	గురువు
అలం.	-	అలంకారం
సం.	-	సంవత్సరం
మొ.	-	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

సౌప్తికపర్వము-ద్వితీయాశ్వాసము

శ్రీ శాశ్వతత్వ కరణ క । లాశాలి! దయాది నిర్మల జ్ఞానమయా!
నాశోత్పత్తి రహిత! శు । ద్ధాశయ సంభజన మహిత! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= సిరియొక్క; శాశ్వతత్వ= స్థిరత్వంయొక్క; కరణ= చేయటం అనే; కలా= విద్యచేత; శాలి!= ప్రకాశించేవాడా!; దయా+ఆది= దయ మొదలైనవీ; నిర్మల= అమలినమైన; జ్ఞానమయా!= జ్ఞానమూ స్వరూపంగా కలవాడా!; నాశ+ఉత్పత్తి రహిత!= మరణమూ, పుట్టుకా లేనివాడా!; శుద్ధ+ఆశయ సంభజన మహిత!= పరిశుద్ధ చిత్తవృత్తులు గలవారియొక్క ఉత్తమసేవచేత పూజింపబడేవాడా!, హరిహరనాథా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! చంచలయైన శ్రీని స్థిరంగా చేసే కళ కలవాడా! దయ మొదలైన సద్గుణాలూ, విమలజ్ఞానమూ స్వరూపంగా కలవాడా! నాశనం, ఉత్పత్తీలేనివాడా! పరిశుద్ధాత్ముల ఉత్తమ సేవచేత పూజించబడువాడా!

విశేషం: శ్రీకి స్వభావమైన చాంచల్యాన్ని పోగొట్టి స్థిరత్వం కల్పించటం ఒకకళ. అటువంటి కళ కలవాడు హరిహరనాథుడు. అతడు దయాది స్వరూపుడు. నిర్మలజ్ఞాన స్వరూపుడు. 'నాశోత్పత్తి రహిత' పుట్టటం, ఉండటం, పెరగటం, మార్పుచెందటం, క్షీణించటం, నశించటం అని పదార్థానికి ఆరు స్థితులు. షడ్భావవికారాలు. వాటిలో ఆద్యంతాలను (పుట్టటం, నశించటం) నిషేధించటం చేత మధ్యలో ఉన్న నాలుగూ కూడా పరమేశ్వరుడికి లేవని స్పష్టపడుతున్నది. 'నాశోత్పత్తి రహిత' అనే విశేషణంలో ఉత్పత్తికంటె నాశాన్నే మొదట పేర్కొనటం, ప్రాణులకు మరణం సహజం అని చెప్పటానికి.

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. నట్లు సూర్యోదయంబైన యా సమయంబున సమీరనందనాదిసోదరులును, శౌరిసాత్యకులుం బరివేష్టింపనున్న ధర్మతనయు పాలికిఁ బఱతెంచి ధృష్టద్యుమ్నుని సారథి సాష్టాంగ దండ ప్రణామంబు సేసి కరకమలంబులు మొగిడ్చి. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ భగవంతుడా! హరిహరనాథా!; వైశంపాయనుండు; జనమేజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అట్లు; సూర్య+ఉదయంబు+ఐనన్= సూర్యోదయంకాగా; ఆ సమయంబునన్= ఆవేళ; సమీరనందన+ఆది సోదరులును= భీముడు మున్నగు సోదరులూ; శౌరి సాత్యకులున్= కృష్ణసాత్యకులూ; పరివేష్టింపన్+ఉన్న= చుట్టువారగా ఉన్న; ధర్మతనయు పాలికిన్= ధర్మరాజు వద్దకు; పఱతెంచి= వచ్చి; ధృష్టద్యుమ్నుని సారథి= ధృష్టద్యుమ్నుడియొక్క సారథి; సాష్టాంగదండ ప్రణామంబు= దండాకారంగా ఎనిమిది అంగాలు నేలకు తగిలేటట్టుగా నమస్కారం; చేసి; కరకమలంబులు= హస్తపద్మాలు; మొగిడ్చి= ముడిచి.

తాత్పర్యం: దేవా! హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు: అట్లా సూర్యోదయం కాగా ఆ సమయంలో భీముడూ మొదలైన సోదరులూ, కృష్ణసాత్యకులూ చుట్టూరా ఉన్న ధర్మరాజు దగ్గరకు వచ్చి ధృష్టద్యుమ్నుడి రథసారథి సాష్టాంగ నమస్కారం చేసి, హస్తపద్మాలు ముడిచి.

విశేషం: సాష్టాంగ దండప్రణామం - జానువులూ, పాదాలూ, చేతులూ, ఉరస్సూ, ధీ, శిరస్సూ, వచస్సూ, దృష్టీ - ఈ ఎనిమిదింటినీ నేలకు తగిల్చి కర్ర ఆకారంగా బోర్లా పరుండి చేసే నమస్కారం.

సీ. **'నరవర! మన వీడు నడిరేయి కృతవర్మ । యును గృపాచార్యుండుఁ దనకుఁ దోడు**
గా వచ్చి జనులు నిద్రావివశాత్ములై । యుండ నశ్వత్థామ యొకఁడు సొచ్చి
తొలుత ధృష్టద్యుమ్నుఁ ద్రుంచి తత్సోదర । తనయాది పాంచాల తతుల ముట్టి
యన్యాయవిధిని నింద్యంబైన విక్రమ । లీలాతిశయమున నేలఁ గలిపి

ఆ. **చేది బలము నెల్లఁ జెండి మాత్స్య ప్రభ । ద్రకులు మేలుకాంచి ద్రౌపదేయు**
లను శిఖండిఁ గూర్చికొని తన్నుఁ దాఁకిన । బెట్టు చంపె నంతవట్టు వారి. **3**

ప్రతిపదార్థం: నరవర!= రాజా! ధర్మరాజా!; మనవీడు= మనశిబిరం; నడిరేయి= అర్ధరాత్రి; కృతవర్మయును; కృపాచార్యుండున్; తనకున్; తోడు+కాన్= సహాయంగా; వచ్చి; జనులు; నిద్రా వివశ+ఆత్ములు+ఐ= నిద్రలో ఒళ్ళు మరచినవారై; ఉండన్= ఉండగా; అశ్వత్థామ+ఒకఁడు= అశ్వత్థామ ఒక్కడూ; చొచ్చి= ప్రవేశించి; తొలుతన్= మొదట; ధృష్టద్యుమ్నున్; త్రుంచి= వధించి; తద్+సోదర తనయ+ఆది పాంచాల తతులన్= అతడి సోదరులూ, కొడుకులూ మొదలైన పాంచాలవీరుల సమూహాలను; ముట్టి= తాకి; అన్యాయవిధిని= అధర్మపద్ధతిలో; నింద్యంబు+ఐన= నిందింపదగిన; విక్రమ లీలా+అతిశయమునన్= పరాక్రమలీల ఆధిక్యంతో; నేలన్+కలిపి= చంపి; చేది బలమున్+ఎల్లన్= చేది దేశపుసేన నంతనూ; చెండి= వధించి; మాత్స్య ప్రభద్రకులు= మాత్స్యులూ, ప్రభద్రకులూ; మేలుకాంచి= మేల్కొని; ద్రౌపదేయులను= ద్రౌపది కొడుకులనూ; శిఖండినీ= శిఖండినీ; కూర్చికొని= కూడగట్టుకుని; తన్నున్= తనను; తాఁకినన్= మార్కొనగా; అంతవట్టువారిన్= వాళ్ళను అంతమందినీ; బెట్టు= క్రూరంగా; చంపెన్= చంపాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! మన శిబిరంలోకి అర్ధరాత్రి కృతవర్మా, కృపాచార్యుడూ తనకు తోడుగా వచ్చి, జనం నిద్రలో ఒళ్ళు మరచిపోయి ఉండగా, అశ్వత్థామ ఒక్కడూ ప్రవేశించి, మొదట ధృష్టద్యుమ్నుడిని వధించి, అతడి సోదరులూ, కొడుకులూ మొదలైన పాంచాల వీరులను అధర్మ పద్ధతిలో నింద్యమైన పరాక్రమం ప్రదర్శించి చంపి, చేది సైన్యాన్ని అంతనూ వధించి, మాత్స్యులూ, ప్రభద్రకులూ మేలుకొని ద్రౌపదికొడుకులనూ, శిఖండినీ కూడగట్టుకుని తనను ఎదిరిస్తే, వాళ్ళను అంతమందినీ దారుణంగా చంపాడు.

వ. **మఱియును.** **4**

తాత్పర్యం: ఇంకా.

స్రగ్ధర.
వీడెల్లం దల్లడిల్లన్, వివిధ గతులమై విక్రమోల్లాస మొందం,
గ్రీడాకల్పంబుగా, నాకృతిఁగని ప్రజ శంకించి దైత్యుం డనం, జెం
డాడెన్. శీర్ష వ్రజంబున్, హరులగముల వేటాడె, నేనుంగులం దు
న్మాడెం, గౌక్షేయ హేలాభ్యసనలసిత బాహార్గళా భీషణుండై. **5**

ప్రతిపదార్థం: వివిధ గతులమైన్= రకరకాల పద్ధతులతో; విక్రమ+ఉల్లాసము+ఒందన్= పరాక్రమం ప్రకాశించగా; క్రీడా+కల్పంబుగాన్= ఆటలాగా; ప్రజ= జనం; ఆకృతిన్= ఆకారాన్ని; కని= చూచి; శంకించి= అనుమానించి; దైత్యుండు+అనన్= రాక్షసుడనగా; కౌక్షేయ= ఖడ్గంయొక్క; హేలా+అభ్యసన= సౌలభ్యంకోసమైన అభ్యాసంచేత; లసిత= ప్రకాశించిన; బాహా+అర్గళ= తలుపు గడియల వంటి బాహువులచేత; ఆభీషణుండు+ఐ= మిక్కిలి భయంకరుడై; వీడు+ఎల్లన్= శిబిరమంతా; తల్లడిల్లన్= కలతచెందగా; శీర్షవ్రజంబున్= తలల సమూహాన్ని; చెండాడెన్= ఖండించాడు; హరుల గములన్= గుర్రాల గుంపులను; వేఁటాడెన్; తున్మాడెన్= ఖండించాడు.

తాత్పర్యం: అశ్వత్థామ రకరకాల పద్ధతులతో పరాక్రమం ఒప్పేటట్లు, ఆటవలె, జనం తన ఆకారం చూచి అనుమానించి రాక్షసుడనగా, ఖడ్గలీలాభ్యాసంచేత ప్రకాశించే భుజార్గళాలు కలిగి భయంకరుడై, శిబిరం అంతా కలతచెందగా, తలల సమూహాన్ని ఖండించాడు. గుర్రాల గుంపులను వేటాడాడు. ఏనుగులను వధించాడు.

తే. **అడవి దరమిడి నఱుకంగ నందుఁ గల వి । హంగమంబులు గలగొన నఱచు తెఱఁగు**
దోఁచె నాతఁడు యోధులఁ దునుమఁ గలఁగి । యన్యజనము లాక్రందించునప్ప డధిప! **6**

ప్రతిపదార్థం: అధిప!= రాజా! ధర్మరాజా!; ఆతఁడు= ఆ అశ్వత్థామ; యోధులన్= వీరులను; తనుమన్= వధించగా; కలఁగి= కలతచెంది; అన్య జనములు= ఇతర జనులు; ఆక్రందించు+అప్పుడు= ఏడ్చేటప్పుడు; అడవి= అడవిని; తరము+ఇడి= వరసపెట్టి; నఱుకంగన్= నరకగా; అందున్+కల= అందులో ఉన్న; విహంగమంబులు= పక్షులు; కలగొనన్= వ్యాపించేటట్టు; అఱచు తెఱఁగు+తోఁచెన్= అరిచే విధం స్ఫురించింది.

తాత్పర్యం: ధర్మరాజా! ఆ అశ్వత్థామ యోధులను వధించగా కలతచెంది ఇతర జనులు ఏడుస్తూంటే, అడవిని వరుసబెట్టి నరకగా అందులో ఉన్న పక్షులు అంతటా వ్యాపించేటట్లు అరచే విధం స్ఫురించింది.

విశేషం: అలం: స్మృతి. ఇక్కడ అశ్వత్థామ యోధులను నరకగా ఇతరులు ఏడవటం చేస్తూ, అడవిని నరికినప్పుడు అందులోని పక్షులు అరవటం తోచింది- అనటంచేత అలంకారం స్మృతి. ఉపమేయోపమానాలలో ఒకదానిని చూచినప్పుడు, ఇంకొకటి స్ఫురించినదని చెప్పితే అది స్మృతిమదలంకారం అవుతుందని లక్షణం.

క. **అఱచినఁ బఱచిన వ్రేకులు । గఱచిన నతఁ డించుకయును గరుణింపక యం**
దఱ నుఱుముసేసె గుంపుల । కుఱికి యుఱికి ఖడ్గదారుణోల్లసనములన్. **7**

ప్రతిపదార్థం: అతఁడు= అశ్వత్థామ; గుంపులకున్= గుంపులలోకి; ఉఱికి+ఉఱికి= మిక్కిలి దుమికి; ఖడ్గదారుణ+ఉల్లసనములన్= కత్తియొక్క భయంకరములైన ప్రకాశాలతో; అందఱన్= అందరినీ; అఱచినన్= అరచినా; పఱచినన్= పారిపోయినా; వ్రేళులు+కఱచినన్= తమ తప్పు తాము ఒప్పుకొనటం సూచించినా; కరుణింపక= దయచూపక; నుఱుము+చేసెన్= ఖండించాడు.

తాత్పర్యం: అశ్వత్థామ గుంపులలోకి ఉరికి ఉరికి కత్తి భయంకరంగా మెరుస్తూండగా, అందరినీ అరిచినా, పరుగెత్తుకొనిపోయినా, తమ తప్పు తాము ఒప్పుకొనటం సూచించినా, దయచూపక ఖండించాడు.

వ. **ఆ సమయంబున.** **8**

తాత్పర్యం: అప్పుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మహాస్రగ్ధర.

కృపుఁడున్ హార్దిక్యుఁడున్ వాకిట నిలిచి భయాక్షిప్తయోధవ్రజంబున్
నృపులున్ వే నిర్గమింప న్వివిధ శరముల న్మేదినిం గూల్చుచున్ ఘో
రపు సంరంభంబు దుర్వారముగఁ గెరలి రౌద్రంబు రూపంబు దాల్పం
గుపితక్రవ్యాదులో నాఁ గుచరిత నిరతిం గ్రూరతాధుర్యు లైనన్. 9

ప్రతిపదార్థం: కృపుఁడున్; హార్దిక్యుఁడున్= కృతవర్మా; వాకిటన్= ద్వారదేశంలో; నిలిచి; భయ= భయంచేత; ఆక్షిప్త= కలతపడిన; యోధ వ్రజంబున్= వీరుల గుంపూ; నృపులున్= రాజులూ; వే= వేగంగా; నిర్గమింపన్= బయటికి రాగా; వివిధ శరములన్= రకరకాల బాణాలతో; మేదినిన్= భూమిమీద; కూల్చుచున్= కూలుస్తూ; ఘోరము+సంరంభంబు= భయంకరమైన సంక్షోభం; దుర్వారముగన్= వారింపరానిదికాగా; కెరలి= చెలరేగి; రౌద్రంబు= రౌద్రరసం; రూపంబు+తాల్పన్= ఆకారం ధరించగా; కుపితక్రవ్యాదులో నాన్= కోపించిన రాక్షసులూ అన్నట్లు; కుచరిత నిరతిన్= చెడునడతయందలి ఆసక్తితో; క్రూరతా ధుర్యులు+ఐనన్= క్రూరత్వపు భారం వహించినవారు కాగా- మిక్కిలి క్రూరులు కాగా.

తాత్పర్యం: కృపాచార్యుడూ, కృతవర్మ ద్వారదేశంలో నిలిచి, భయంతో కలతచెందిన వీరుల సమూహమూ, రాజులూ వేగంగా బయటికి వస్తూ ఉంటే వాళ్ళను రకరకాల బాణాలతో నేలకూలుస్తూ, మహా సంక్షోభం వారించరానిది కాగా, చెలరేగి, రౌద్రరసం ఆకారం ధరించినట్లు, కోపించిన రాక్షసులా అన్నట్లు, చెడ్డ నడత అందలి ఆసక్తితో, మిక్కిలి క్రూరులు కాగా. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. 'రౌద్రంబు రూపంబు దాల్పన్' - 'కుపిత క్రవ్యాదులోనాన్' - అలంకారాలు ఉత్ప్రేక్షలు.

వ. తత్ప్రదేశంబు నవ్వీటిలోనుంబోలెఁ బీనుంగుపెంట యయ్యె నట్లు శిబిరంబునం గల కరితురగ నర నికరంబులు నిశ్శేషత్వంబు నొందె నాయుశ్శేషంబు కతంబునం గృతవర్మచేతం బట్టువడి యతండు మందల విడువ నిట వచ్చితి' నని చెప్పినం బాండవాగ్రజుండు. 10

ప్రతిపదార్థం: తద్+ప్రదేశంబున్= ఆ ద్వారదేశంకూడా; ఆ+వీటిలోనున్+పోలెన్= ఆ శిబిరంలోపల వలెనే; పీనుంగుపెంట+ అయ్యెన్= శవాల నెలవు అయింది; అట్లు; శిబిరంబునన్+కల= శిబిరంలో ఉన్న; కరి తురగ నర నికరంబులు= ఏనుగుల, గుర్రాల, మనుష్యుల సమూహాలు; నిశ్శేషత్వంబున్+ఒందెన్= ఏమీ మిగలకుండా పోయాయి; ఆయుస్+శేషంబు కతంబునన్= ఆయుర్దాయం మిగలబట్టి; కృతవర్మచేతన్; పట్టువడి; అతండు; మందల విడువన్= ప్రాణాలతో విడిచిపెడితే; ఇటన్= ఇక్కడకు; వచ్చితిన్= వచ్చాను; అని; చెప్పినన్= చెప్పగా; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడు ధర్మరాజు.

తాత్పర్యం: ఆ ద్వారదేశంకూడా శిబిరంలోపల వలెనే పీనుగుపెంట అయింది. ఆ రీతిగా శిబిరంలో ఉన్న ఏనుగుల, గుర్రాల, మనుష్యుల సమూహాలు ఏమీ మిగలకుండా పోయాయి. ఏదో కొంత ఆయుర్దాయం ఇంకా మిగలబట్టి కృతవర్మ చేతికి దొరికి, అతడు ప్రాణాలతో విడిచిపెడితే, ఇట్లా వచ్చాను.' అని చెప్పగా ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. శోకవేగసంతప్తుఁడై సొలసిన్రాల । సంభ్రమమ్మునఁ బట్టిరి సాత్యకియును
గవలు భీమసేనుండును గరతలముల । నుమ్మలికము నెమ్మనములఁ గ్రమ్ముదేర. 11

ప్రతిపదార్థం: శోక వేగ సంతప్తుఁడు+ఐ= దుఃఖోద్రేకం చేతమిక్కిలి తపించినవాడయి; సొలసి(వ్రాలన్= మూర్ఛపోయి వాలిపోగా; సాత్యకియును; కవలున్= నకుల సహదేవులూ; భీమసేనుండును= భీముడూ; నెఱ+మనములన్= మనస్సులలో; ఉమ్మలికము= దుఃఖం; క్రమ్ముదేరన్= వ్యాపించగా; సంభ్రమమ్మునన్= వేగిరపాటుతో; కరతలములన్= అరచేతులతో; పట్టిరి.

తాత్పర్యం: దుఃఖోద్రేకంతో మిక్కిలి తపించి మూర్ఛపోయి వాలిపోగా, సాత్యకీ, నకుల సహదేవులూ, భీముడూ, మనస్సులలో దుఃఖం పొంగగా వేగిరపాటుతో ఆయనను అరచేతులతో పట్టుకొన్నారు.

వ. కొండొకసేపునకు మూర్ఛదేఱి యన్నరపాలుం డెలుంగు రాల్పడ నిట్లనియె. 12

ప్రతిపదార్థం: ఆ+నరపాలుండు= ఆ రాజు- ధర్మరాజు; కొండొకసేపునకున్= కొంతసేపటికి; మూర్ఛ+తేఱి= మూర్ఛనుండి తెప్పిరిల్లి; ఎలుంగు= కంఠస్వరం; రాల్పడన్= డగ్గుత్తిక చెందగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఆ ధర్మరాజు కొంతసేపటికి మూర్ఛనుండి తేరుకొని కంఠస్వరం డగ్గుత్తికపడగా ఇట్లా అన్నాడు:

ధర్మరాజు తన పుత్రు లశ్వత్థామచేఁ జచ్చుట విని పలవించుట (సం. 10-19-9)

సీ. 'ఎట్టివారలకైన నెఱుఁగంగ నగునె కా । ర్యంబులగతు లుపాయంబు బలుపు
వెలయంగ నట్లు శత్రుల బంధుమిత్ర పు । త్రామాత్య యుతముగ నాహవమున
నందఱ నేఁ దెగటార్చినవాఁడనై । విజయంబు సేకొని విభవమెసఁగ
నిట యేఁగుదెంచితి నట బంధుమిత్ర పు । త్రామాత్యయుతముగ నస్మదీయ

తే. బలము నెల్లను ముట్టి శత్రులు నితాంత । ఘోరముగఁ దెగటార్చిరి కుత్సితంపు
విధము వాటిల్లె నస్థిరవిజయమునఁ బ । రాజయమని యాడు నిఁక ధరాజనంబు. 13

ప్రతిపదార్థం: ఎట్టివారలకున్+ఐనన్= ఎంతటివారికైనా; కార్యంబుల గతులు= పనుల పోకడలు; ఎఱుఁగంగన్+అగునె?= తెలిసికో శక్యమవుతుందా?; ఉపాయంబు బలుపు= ఉపాయపుదార్ఢ్యం; వెలయంగన్= ఒప్పగా; అట్లు; శత్రులన్= శత్రువులను; బంధుమిత్ర పుత్ర+అమాత్య యుతముగన్= చుట్టాలతో, స్నేహితులతో, కుమారులతో, మంత్రులతో సహా; అందఱన్= అందరినీ; ఆహవమునన్= యుద్ధంలో; ఏన్= నేను; తెగటార్చినవాఁడను+ఐ= చంపినవాడినయి; విజయంబు+చేకొని= గెలుపొంది; విభవము+ఎసఁగన్= వైభవం అతిశయించగా; ఇట+ఏఁగుదెంచితిన్= ఇక్కడికి వచ్చాను; అటన్= అక్కడ; బంధుమిత్ర-పుత్ర+అమాత్య యుతముగన్= చుట్టాలతో, మిత్రులతో, కుమారులతో, మంత్రులతో సహా; అస్మదీయ బలమున్+ఎల్లను= మా సైన్యాన్ని అంతనూ; ముట్టి= తాకి; శత్రులు= వైరులు; నితాంత ఘోరముగన్= మిక్కిలిఘోరంగా; తెగటార్చిరి= చంపారు; కుత్సితము+విధము= కీడ్పడినరీతి; పాటిల్లెన్= సంభవించినది; ఇఁకన్= ఇకమీద; ధరాజనంబు= లోకం; అస్థిర విజయమునన్= నిలకడలేని గెలుపుచేత; పరాజయము+అని+ఆడున్= ఓటమి అని అంటుంది.

తాత్పర్యం: 'ఎంతటివారికైనా పనుల పోకడలు తెలిసికొనటానికి శక్యం కాదు. మంచి ఉపాయంతో ఆ రీతిగా శత్రువులను చుట్టాలతో, స్నేహితులతో, కుమారులతో, మంత్రులతో సహా అందరినీ యుద్ధంలో చంపి నేను గెలుపొంది, వైభవం అతిశయించగా ఇక్కడికి వస్తే; అక్కడ చుట్టాలతో, స్నేహితులతో, కుమారులతో, మంత్రులతో సహా మా సైన్యాన్ని అంతనూ తాకి వైరులు మిక్కిలి ఘోరంగా చంపారు. కీడ్పాటు సంభవించింది. ఇకమీద జనులు నిలకడలేని విజయం పరాజయంతో సమానం అని అంటారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్రగ్ధర.

బాణజ్వాలా నితాంత ప్రసరణముల శుంభద్ద్విషత్సాంద్ర సైన్య
శ్రేణీ కాంతారముల్ చూర్ణితములుగఁ బటుక్రీడమైఁ దేజరిల్లెన్
ద్రోణాచార్యాగ్ని; వేఁడిం దొడరక మెఱసెన్ దోర్విలాసంబు; వైరుల్
ప్రాణంబుల్ నాఁచికోల్ దప్పదు; తుది విధి యబ్బాలురం ద్రెళ్ళవైచెన్. 14

ప్రతిపదార్థం: ద్రోణ+ఆచార్య+అగ్ని= ద్రోణాచార్యుడనే అగ్ని; బాణ= బాణాలు అనే; జ్వాలా= మంటలయొక్క; నితాంత= అధికమైన; ప్రసరణములన్= ప్రసారాలచేత; శుంభత్= ప్రకాశిస్తున్న; ద్విషత్= శత్రువులయొక్క; సాంద్ర= దట్టమైన; సైన్య= సేనలయొక్క; శ్రేణీ= వరుసలు అనే; కాంతారముల్= అడవులు; చూర్ణితములుగన్= పొడులుగా; పటు క్రీడమైన్= తీవ్రమైన విహారంతో; తేజరిల్లెన్= ప్రకాశించింది; దోః(ః)+విలాసంబు= భుజబలలీల; వేఁడిన్= ఆ అగ్నివేడిని; తొడరక= పొందక; మెఱసెన్= ప్రకాశించింది - ఒప్పింది; వైరుల్= శత్రువులు; ప్రాణంబుల్; నాఁచికోల్= అపహరించటం; తప్పదు; తుదిన్= చివర; విధి= దైవం; ఆ+బాలురన్= ఆ పిల్లలను; త్రెళ్ళన్+వైచెన్= చంపించింది.

తాత్పర్యం: ద్రోణాచార్యుడనే అగ్ని బాణాలనే జ్వాలల అధికమైన ప్రసారాలతో శత్రువుల దట్టమైన సేన లనే అడవులు నుగ్గు నుగ్గు అయ్యేటట్లు తీక్షణంగా విహరించి ప్రకాశించింది. ఆ అగ్ని వేడిని పొందక మన భుజబలం ఒప్పింది. శత్రువులు మనప్రాణాలు అపహరించటం తప్పదు. చివరకు దైవం ఆ పిల్లలను చంపించింది.

విశేషం: అలం: రూపకం. 'బాణాజ్వాలా', 'సైన్యశ్రేణీ కాంతారముల్', 'ద్రోణాచార్యాగ్ని' - అనేచోట్ల ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం. శత్రువులు ప్రాణాలు తీయటం ఎటూ తప్పదు కాని చివరకు పిల్లలు పోయారే అని ధర్మరాజు బాధ.

మహాస్రగ్ధర.

శరదంష్ట్రా భీషణంబై చటుల రిపుమృగస్వైర విధ్వంసలీలా
స్ఫురణన్ శోభిల్లు రాధాసుతుఁ డను పులి విస్ఫూర్జితంబున్ సహింపన్
వెరవున్ దర్పంబు గల్గెన్; వికల రిపులచే వీటిఁబోయెం గుమారో
త్కర; మిం కేమందు? నాపత్పరికలన ప్రమాదంబునం గాక యున్నే? 15

ప్రతిపదార్థం: శర= బాణాలు అనే; దంష్ట్రా= కోరలచేత; భీషణంబు+ఐ= భయంకరమయినదయి; చటుల= చంచలమైన; రిపు= శత్రువులనెడి; మృగ= లేళ్ళయొక్క; స్వైర= తన ఇచ్చవచ్చినట్టి; విధ్వంస లీలా= వినాశలీల యొక్క; స్ఫురణన్= తోచుటతో; శోభిల్లు= ప్రకాశించే; రాధాసుతుఁడు+అను పులి విస్ఫూర్జితంబున్= రాధకొడుకు(కర్ణుడు) అనే పులియొక్క గాండ్రింపు; సహింపన్= ఓర్చుకోవటానికి; వెరవున్= ఉపాయమూ; దర్పంబున్= గర్వమూ; కల్గెన్= కలిగాయి; వికల రిపులచేన్= క్షుద్ర శత్రువులచేత; కుమార+ఉత్కరము= కుమారుల సమూహం; వీటిఁబోయెన్= నశించింది; ఇంకన్+ఏమి+అందున్?= ఇంకేమంటాను?; ప్రమాదంబునన్= ఏమరుపాటుచేత; ఆపద్+పరికలన= ఆపద్గ్రహణం; కాక+ఉన్నే?= కాకుండా ఉంటుందా?;

తాత్పర్యం: బాణాలనే కోరలచేత భయంకరమై, కదిలే శత్రువులనే లేళ్ళను ఇష్టంవచ్చినట్లు చంపి శోభిల్లే కర్ణుడనే పులి గాండ్రింపును ఓర్చుకొనే ఉపాయమూ, గర్వమూ కలిగి, క్షుద్ర శత్రువులచేత కుమారుల సమూహం నశించింది. ఇంక అనటాని కేముంది? ఏమరుపాటువలన ఆపద సంభవించకుండా ఉంటుందా?

విశేషం: అలం: రూపకం. అర్థాంతరన్యాసం. 'శరదంష్ట్రా', 'రిపుమృగ', 'రాధాసుతుఁ డను పులి' అనే చోట్ల ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడటం వలన అలంకారం రూపకం. ఇందులో 'వికల రిపులచేత వీటిఁబోయెం గుమారోత్కరము' అనే విశేషాంశం 'ఆపత్పరికలన ప్రమాదంబునం గాకయున్నే?' అనే సామాన్యాంశంచేత సమర్థింపబడింది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

స్రగ్ధర.

శాతాస్త్ర స్ఫారవీచీ సముదయ రభసాశ్చర్యసంపాది హేలా
స్ఫీతంబై క్రమ్ముదేరన్ బెదరక కలఁచెన్ భీష్మవారాశిఁ దుచ్ఛా
రాతి వ్యాపారదుర్వారతఁ దెగియెఁ గుమారవ్రజం బక్కటా! ని
ద్రా తంద్రావ్యాప్తి నక్రూరతఁ బొరసి భుజాప్రౌఢి వమ్మయ్యెఁ జుమ్మీ. **16**

ప్రతిపదార్థం: కుమార వ్రజంబు= కుమారుల సమూహం; శాత= వాడియైన; అస్త్ర= బాణాలు అనే; స్ఫార= పెద్దవైన; వీచీ= తరంగాలయొక్క; సముదయ= సమూహంయొక్క; రభస= తీవ్రతచేతా; ఆశ్చర్య సంపాది= ఆశ్చర్యాన్ని కలిగించే; హేలా= సౌలభ్యంచేత; స్ఫీతంబు+ఐ= వ్యాపించినదయి; క్రమ్ముదేరన్= పైకి ఉబుకగ; బెదరక= భయపడక; భీష్మ వారాశిన్= భీష్ముడనే సముద్రాన్ని; కలఁచెన్= కలతచెందించింది; అక్కటా!= అయ్యో!; తుచ్ఛ= నీచమైన; అరాతి= శత్రువులయొక్క; వ్యాపార= పనియొక్క; దుర్వారతన్= వారించరామిచేత; తెగియెన్= నశించింది; నిద్రా తంద్రా వ్యాప్తిన్= నిద్రవలని మైమరుపుయొక్క వ్యాప్తిచేత; అక్రూరతన్= క్రూరత్వం లేమిని; పొరసి= పొంది; భుజ-ప్రౌఢి= భుజబలనైపుణ్యం; వమ్ము+అయ్యెన్+చుమ్మీ= వ్యర్థమయింది సుమా!

తాత్పర్యం: కుమారుల సమూహం - వాడి బాణాలు అనే పెద్ద తరగల సమూహపు తీవ్రతతోనూ, ఆశ్చర్యకర సౌలభ్యం తోనూ వ్యాపించినదై మీదికిరాగా, భయపడక, భీష్మసముద్రాన్ని కలతచెందించింది. అయ్యో! ఇప్పుడు నీచశత్రువుల పని వారించరాకపోవటంచేత నశించింది. నిద్రమత్తుచేత క్రూరత్వం కోలుపోయి భుజబలనైపుణ్యం వ్యర్థమయింది సుమా!

విశేషం: అలం: రూపకం. 'శాతాస్త్ర స్ఫార వీచీ.' 'భీష్మ వారాశి' అనేచోట్ల ఉపమేయోపమానాల అభేదం వలన అలంకారం రూపకం.

ఆ. **అధికబలము గెల్చి యవనీపతులు గొంద । అతివిహీనరిపుల యాక్రమమున**
మడిసి రకట! జలధి వెడలి సన్నపుఁ గ్రయ్య । మునిఁగి రూపడంగు జనుల మాడ్కి. **17**

ప్రతిపదార్థం: జలధిన్ వెడలి= సముద్రంలోంచి వెలికివచ్చి - సముద్రాన్ని దాటి; సన్నము+క్రయ్యన్= సన్నపాటి కాలువలో; మునిఁగి; రూపు+అడంగు= నశించే; జనులమాడ్కిన్= జనులవిధంగా; అకట!= అయ్యో!; అధిక బలమున్= గొప్ప సైన్యాన్ని; గెల్చి= గెలిచి; అవనీపతులు+కొందఱు= రాజులు కొంతమంది; అతివిహీన రిపుల+ఆక్రమమునన్= మిక్కిలి నీచశత్రువుల ఆక్రమణంచేత; మడిసిరి= చచ్చిపోయారు.

తాత్పర్యం: సముద్రాన్ని దాటి సన్నపాటి కాలువలో మునిగిపోయి నశించే జనుల విధంగా, కొంతమంది రాజులు గొప్ప సేనను గెలిచి మిక్కిలి తక్కువ రకపు శత్రువుల ఆక్రమణంచేత చచ్చిపోయారు. అయ్యో!

విశేషం: అలం: ఉపమ, భీష్మ ద్రోణ కర్ణాదులవంటి మహావీరులను ఓడించి, కొంతమంది రాజులు కృపకృతవర్మాశ్వత్థామల వంటి తక్కువరకం శత్రువులచేత చచ్చారని భావం.

చ. **జనకుఁడు లేమికిం గడు విషాదము నొందెడి కృష్ణ యిమ్మెయిం**
దనయులు భ్రాతలుం దెగుట దా విని మూర్ఛ మునుంగు నెమ్మనం
బును నవశంపుమేను నయి భూస్థలిఁ ద్రెళ్ళక యున్నె? త్రెళ్ళదే
నిని బటుశోకవేగమున నిర్భరవేదనఁ జెందకుండునే? **18**

ప్రతిపదార్థం: జనకుఁడు= తండ్రి ద్రుపదుడు; లేమికిన్= లేకపోవటానికి - చచ్చిపోవటానికి; కడున్= మిక్కిలి; విషాదమున్+ఒందెడి= విచారించే; కృష్ణ= ద్రౌపది; ఈ+మెయిన్= ఈ విధంగా; తనయులున్= కొడుకులూ; భ్రాతలున్= సోదరులూ; తెగుట= నశించటం; తాన్= తాను; విని; మూర్ఛన్+మునుంగు= మూర్ఛపోయే; నెఱ+మనంబును= మనస్సూ; అవశము+మేనున్+అయి= వశం తప్పిన శరీరమూ కలదై; భూస్థలిన్= నేలమీద; త్రెళ్ళక+ఉన్నె?= కూలిపోదా?; త్రెళ్ళదు+ఏనిని= కూలిపోకపోయినా; పటుశోక వేగమునన్= తీవ్ర దుఃఖోద్రేకంతో; నిర్భర వేదనన్= తీవ్రమైన బాధను; చెందక+ఉండునే?= పొందకుండా ఉంటుందా?

తాత్పర్యం: తండ్రి అయిన ద్రుపదుడు పోయాడని మిక్కిలి పరితపించే ద్రౌపది ఈ విధంగా కొడుకులూ, సోదరులూ నశించారని విని మూర్ఛిల్లే మనస్సూ, వశంతప్పిన శరీరమూ కలదై నేలమీద కూలిపోదా? ఒకవేళ కూలిపోకపోయినా, తీవ్ర దుఃఖోద్రేకంతో మిక్కిలి బాధపడకుండా ఉంటుందా?

క. **మున్నిట్టి తెఱఁగు శోకం। బెన్నఁడుఁ దా ననుభవించి యెఱుఁగ దకట! నేఁ**
డన్నెలఁత యలఁత పెల్లున। నెన్ని యవస్థలకు వచ్చి యెట్లయ్యెడినో!' **19**

ప్రతిపదార్థం: మున్ను= ఇంతకుముందు; ఇట్టి తెఱఁగు శోకంబు= ఈ విధమైన దుఃఖం; ఎన్నఁడున్= ఎప్పుడూ; తాన్= తాను; అనుభవించి+ఎఱుఁగదు= అనుభవించి ఎరుగదు; అకట!= అయ్యో!; నేఁడు= ఇప్పుడు; ఆ+నెలఁత= ఆ ఇంతి - ద్రౌపది; అలఁత పెల్లునన్= దుఃఖాతిశయంతో; ఎన్ని అవస్థలకున్ వచ్చి= ఎంత బాధపడి; ఎట్లు+అయ్యెడినో!= ఏమయిపోతుందో!

తాత్పర్యం: ఇంతకు ముందెప్పుడూ ఈ విధమైన దుఃఖం తాను అనుభవించి ఎరుగదు. అయ్యో! ఆమె దుఃఖాతిశయంతో ఎంత బాధపడి ఏమయిపోతుందో!'

వ. **అని వగలం బొగిలి పాంచాలి రావింపం దలంచి తన పనుపున నవ్వేలంది ద్రుపద విరాటులు చచ్చిన మఱునాఁడు తదీయ పత్నులకు శోకాపనోదంబు సేయుటకై సుభద్రయు నుత్తరయును దోనరుగ విడిదలనుండి విరాటుపురంబున కరిగి ద్రుపదుండును గొడుకులు నవ్వీటికి వచ్చునాఁడు దోడన వచ్చి కోడండ్రును దానును నందయున్న యా ద్రుపదు పత్నిని, విరాటపత్నిం గాంచి పదంపడి సుభద్ర యర్జును ననుమతి వడసి ద్వారవతికిం బోవ నమ్మత్స్యపురంబున నునికిం జేసి యన్నరనాథుండు నకులుం గనుంగొని యతిత్వరితగమనంబునకుం దగు రథంబునం జటులంబులైన రథ్యంబులం బూన్చికొని యుపప్లావ్యంబున కుం జని ద్రుపదనందనను, దక్కును మనదెసలంగలుగు నంగనలను ద్రుపదమత్స్యపతి పక్షంబు భామలను**

దోడ్కొని యవ్విడిదలకుం జనుదెమ్మని చెప్పి యేము నయ్యెడకుం జనుదెంచెద మనుటయు నతండు తదుక్త ప్రకారంబునఁ జనియె. నజ్జనవల్లభుండు తక్కటి తమ్ములును, దామోదర సాత్యకులును నడలుచుఁ దన్నుం బొదివికొని చనఁ గౌరవ శిబిరంబునం గల జనంబులు గొల్చి వోవ నేడ్చుచు నిజశిబిరంబునకుం బోయి తత్ప్రదేశంబున. 20

ప్రతిపదార్థం: అని; వగలన్= దుఃఖాలతో; పొగిలి= కుమిలి; పాంచాలిన్= ద్రౌపదిని; రావింపన్+తలంచి= రప్పించనెంచి; తన పనుపునన్= తన ఆజ్ఞచేత; ఆ+వెలంది= ఆ స్త్రీ - ద్రౌపది; ద్రుపదవిరాటులు= ద్రుపదుడూ, విరాటుడూ; చచ్చిన మఱు నాఁడు= చచ్చిపోయిన మరుసటి దినం; తదీయ పత్నులకున్= వారి భార్యలకు; శోక+అపనోదంబు+చేయుటకై= దుఃఖం పోగొట్టడానికని; సుభద్రయున్= సుభద్రా; ఉత్తరయును= ఉత్తరా; తోన్+అరుగన్= వెంటరాగా; విడదలనుండి= శిబిరంనుండి; విరాటు నగరంబునకున్= విరాటుడి పట్టణానికి; అరిగి= వెళ్ళి; ద్రుపదుండును; కొడుకులున్; ఆ+వీటికిన్= ఆ పట్టణానికి; వచ్చునాఁడు= వచ్చేటప్పుడు; తోడన్+అ= వెంటనే; వచ్చి; కోడండ్రును+తానును= కోడళ్ళూ, తనూ; అందున్+అ+ఉన్న= అక్కడే ఉన్నట్టి; ఆ ద్రుపదుపత్నిని= ఆ ద్రుపదుడి భార్యనూ; విరాటపత్నిన్= విరాటుడి భార్యనూ; కాంచి= చూచి; పదంపడి= తరువాత; సుభద్ర; అర్జును+అనుమతి= అర్జునుడి సమ్మతి; పడసి= పొంది; ద్వారవతికిన్+పోన్= ద్వారకకు వెళ్ళటానికి; ఆ+ మత్స్య పురంబునన్= ఆ మత్స్యనగరంలో-విరాటనగరంలో; ఉనికిన్+చేసి= ఉండటంచేత; ఆ+నరనాథుండు= ఆ రాజు-ధర్మరాజు; నకులున్+కనుంగొని= నకులుడిని చూచి; అతి త్వరిత గమనంబునకున్= మిక్కిలి తొందరగా వెళ్ళటానికి; తగు రథంబునన్= తగిన రథానికి; చటులంబులు+ఐన= చంచలములయిన; రథ్యంబులన్= గుర్రాలను; పూన్చికొని= కట్టి; ఉపప్లావ్యంబునకున్+చని= ఉపప్లావ్యపురానికి వెళ్ళి; ద్రుపద నందనను= ద్రౌపదినీ; తక్కును= మిగిలిన; మన దెసన్+కలుగు+ అంగనలను= మనవైపు స్త్రీలను; ద్రుపద మత్స్యపతి పక్షంబు భామలను= ద్రుపదరాజు; విరాటరాజు వైపు స్త్రీలను; తోడ్కొని= వెంటబెట్టుకొని; ఆ+విడదలకున్= ఆ శిబిరానికి; చనుదెమ్ము+అని చెప్పి= రమ్మని చెప్పి; ఏమున్= మేముకూడా; ఆ+ఎడకున్= ఆ ప్రదేశానికి; చనుదెంచెదము+అనుటయున్= వస్తాము అనగా; అతండు= నకులుడు; తద్+ఉక్త ప్రకారంబునన్= అతడు (ధర్మరాజు) చెప్పిన రీతిగా; చనియెన్= వెళ్ళాడు; ఆ+జనవల్లభుండు= ఆ రాజు(ధర్మరాజు); తక్కటి తమ్ములును= తక్కిన తమ్ములూ; దామోదర సాత్యకులును= కృష్ణసాత్యకులూ; అడలుచున్= దుఃఖిస్తూ; తన్నున్= తనను; పొదివికొని= కూడుకొని; చనన్= వెళ్ళగా; కౌరవ శిబిరంబునన్+కల జనంబులు= కౌరవశిబిరంలో ఉన్న జనులు; కొల్చి+పోవన్= సేవించి నడువగా; ఏడ్చుచున్= ఏడుస్తూ; నిజ శిబిరంబునకున్= తన శిబిరానికి; పోయి; తద్+ప్రదేశంబునన్= అక్కడ.

తాత్పర్యం: అని దుఃఖంతో కుమిలి ద్రౌపదిని రప్పించనెంచాడు. తన ఆజ్ఞ చొప్పున ఆమె ద్రుపద విరాటులు చచ్చిపోయిన మర్నాడు వారి భార్యలను ఓదార్చటానికని సుభద్రా, ఉత్తరా కూడా రాగా, శిబిరం నుండి విరాటనగరానికి వెళ్ళింది. ద్రుపదుడూ, కొడుకులూ ఆ విరాటనగరానికి వచ్చేటప్పుడు వాళ్ళ వెంటనే వచ్చి కోడళ్ళతో అక్కడే ఉన్న ద్రుపదుడి భార్యను, విరాటుడి భార్యను చూచింది. తరువాత అర్జునుడి అనుమతి పొంది సుభద్ర ద్వారకకు వెళ్ళటానికి ఆ విరాట నగరంలోనే ఉన్నది. అందుచేత ధర్మరాజు నకులుడిని చూచి, మిక్కిలి తొందరగా వెళ్ళటానికి తగిన రథానికి బాగా పరిగెత్తే గుర్రాలను పూన్చి 'నీవు ఉపప్లావ్యపురానికి వెళ్ళి ద్రౌపదినీ, తక్కిన మనస్త్రీలనూ, ద్రుపద విరాటుల స్త్రీలనూ వెంటబెట్టుకొని ఆ శిబిరానికి రమ్ము. మేము కూడా అక్కడికి వస్తాము' అని చెప్పాడు. నకులుడు ధర్మరాజు చెప్పిన విధంగా వెళ్ళాడు. ధర్మరాజు తక్కిన తమ్ములూ, కృష్ణ సాత్యకులూ దుఃఖిస్తూ తనతో రాగా, కౌరవశిబిరంలో ఉన్న జనులు సేవిస్తూ నడవగా, ఏడుస్తూ తన శిబిరానికి పోయి, అక్కడ. (తరువాతి పద్యంతో అన్వయం).

మహాస్రగ్ధర.

స్ఫురదశ్వత్థామ చంచద్భుజలసదసి విస్ఫూర్జిత క్రూరధారా
పరికృత్తావ్యక్తగాత్రప్రకరుల, సఖులన్, బంధులం, బుత్రులం, దాఁ
గరుణం బుప్పొంగ నార్తిం గనుఁగొని, వికలాంగత్వముం బొంది మూర్ఛా
పరతంత్రుండై ధరిత్రిం బడినఁ, బడిరి తద్భ్రాతలుం, గేశవుండున్. 21

ప్రతిపదార్థం: స్ఫురత్= ప్రకాశిస్తున్న; అశ్వత్థామ= అశ్వత్థామయొక్క; చంచత్= చలిస్తున్న; భుజ= బాహువులలో; లసత్= ప్రకాశిస్తున్న; అసి= కత్తియొక్క; విస్ఫూర్జిత= ప్రకాశించే; క్రూర= కనికరంలేని; ధారా= అంచుచేత; పరికృత్త= ఖండించబడిన; అవ్యక్త= స్పష్టంగా తెలియబడని; గాత్ర= అవయవాలయొక్క; ప్రకరులన్= సమూహాలుగలవారైన; సఖులన్= మిత్రులనూ; బంధులన్= చుట్టాలనూ; పుత్రులన్= కొడుకులనూ, తాన్= తాను(ధర్మరాజు); కరుణంబు= కరుణరసం; ఉప్పొంగన్= పొంగిపొరలగా; ఆర్తిన్= బాధతో; కనుఁగొని= చూచి; వికల+అంగత్వమున్ పొంది= అవయవాలు వశంతప్పి; మూర్ఛా+పరతంత్రుఁడు+ఐ= మూర్ఛకు లోనైనవాడై; ధరిత్రిన్= నేలమీద; పడినన్= పడగా; తద్+భ్రాతలున్= అతడి సోదరులూ; కేశవుండున్= కృష్ణుడూ; పడిరి.

తాత్పర్యం: అశ్వత్థామ చేతిలో ప్రకాశించే కత్తిచేత ఖండించబడి, ఇది ఆ అవయవం అని తెలియకుండా ఉన్న అవయవాలు గల మిత్రులనూ, చుట్టాలనూ, కొడుకులనూ చూచి ధర్మరాజు కరుణరసం ఉప్పొంగగా బాధతో చూచి అవయవాలు వశంతప్పి మూర్ఛకు లోనయి నేలపై పడగా, అతడి సోదరులూ, కృష్ణుడూ కూడా పడ్డారు.

వ. ఇట్లు పడి సాత్యకి ప్రయత్నంబున నందఱుం దెలిసిరి. ధర్మనందనుండు వెడవెడ దెలిసియు మగుడ నిగుడు నడలున మనంబు మునుంగ వెగడొంది నందనుల తనువుల మీఁద వ్రాలుచు వదనంబు బాష్పాంబు ధారాక్రాంతంబుగాఁ బ్రకటాక్రందనంబు సేయుచుఁ బలవించుచుండెఁ; గృష్ణార్జునులు సముచిత భాషణంబుల బోధించిరి. తక్కటివారును దగుమాటల నుపచరించిరి. కొండొకసేపునకు నవ్విభుండు రోదనంబు దక్కి. 22

ప్రతిపదార్థం: ఇట్లు; పడి; సాత్యకి ప్రయత్నంబునన్= సాత్యకియొక్క ప్రయత్నంచేత; అందఱున్; తెలిసిరి= తెప్పిరిల్లారు; ధర్మనందనుండు= ధర్మరాజు; వెడవెడ= కొంచెం; తెలిసియున్= తెప్పిరిల్లీ; మగుడన్= మళ్ళీ; నిగుడు+అడలునన్= కలిగే దుఃఖంలో; మనంబు= మనస్సు; మునుంగన్= మునుగగా; వెగడు+ఒంది= తల్లడపడి; నందనుల తనువుల మీఁదన్= కొడుకుల శరీరాలపై; వ్రాలుచున్= పడుతూ; వదనంబు= ముఖం; బాష్ప+అంబు+ధారా+ఆక్రాంతంబు+కాన్= కన్నీటి ప్రవాహంచేత ఆక్రమించబడినది కాగా; ప్రకట+ఆక్రందనంబు+చేయుచున్= బిగ్గరగా మొర్రోమంటూ; పలవించుచున్+ఉండెన్= ఏడుస్తున్నాడు; కృష్ణ+అర్జునులు= కృష్ణుడూ, అర్జునుడూ; సముచిత భాషణంబులన్= తగిన మాటలతో; బోధించిరి= ఓదార్చారు; తక్కటివారును= తక్కినవారుకూడా; తగు మాటలన్= తగిన మాటలతో; ఉపచరించిరి= బోధించారు; ఆ+విభుండు= ఆ రాజు- ధర్మరాజు; కొండొకసేపునకున్= కొంతసేపటికి; రోదనంబు+తక్కి= ఏడుపుమాని.

తాత్పర్యం: ఇట్లా పడి సాత్యకి ప్రయత్నంచేత అందరూ తెప్పిరిల్లారు. ధర్మరాజు కొంచెం కొంచెంగా తేరుకొని మళ్ళీ కలిగే దుఃఖంలో మనస్సు మునుగగా తల్లడిల్లి కొడుకుల శరీరాలపై పడుతూ ముఖం కన్నీటి ప్రవాహంతో నిండగా బిగ్గరగా మొర్రోమని ఏడ్చాడు. కృష్ణార్జునులు తగిన మాటలతో ఓదార్చారు. తక్కినవాళ్ళు కూడా తగినట్లు మాటలాడి బోధించారు. కొంతసేపటికి ఆ రాజు ఏడుపుమాని. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'వ్రాలుచున్' - ఈ మాట పెక్కు ప్రతుల్లో ఉన్నదనటంచేత, అన్వయం యోగ్యతరంగా ఉంటుందని, స్వీకరించబడింది.

తే. పుత్రులకు బాంధవులకును మిత్రతతికి । నగ్నికార్యంబు వొగులుచు నాచరించి
యొక్కచోట నాసీనుఁడై యుండె ద్రుపద । తనయ వచ్చుట వార్చి నెమ్మనము దలర. 23

ప్రతిపదార్థం: (పూర్వవచనంలోని 'అవ్విభుండు' - కర్త); పొగులుచున్= ఏడుస్తూ; పుత్రులకున్= కొడుకులకూ; బాంధవులకును= చుట్టాలకూ; మిత్ర తతికిన్= స్నేహితుల సమూహానికీ; అగ్ని కార్యంబు= దహనం; పొగులుచున్= కుములుతూ; ఆచరించి= చేసి; నెఱ+మనము= మనస్సు; తలరన్= చలించగా; ద్రుపద తనయ= ద్రౌపది; వచ్చుట= రాక; వార్చి= ప్రతీక్షించి; ఒక్కచోటన్; ఆసీనుఁడు+ఐ+ఉండెన్= కూర్చున్నాడు.

తాత్పర్యం: (ధర్మరాజు) దుఃఖిస్తూ కొడుకులకూ, చుట్టాలకూ, స్నేహితుల సమూహానికీ దహనకార్యం చేసి మనస్సు చలించగా ద్రౌపదికొరకు ప్రతీక్షిస్తూ ఒకచోట కూర్చున్నాడు.

వ. అద్దేవియు నకులునిచేత నుపప్లావ్యంబున సుత సోదర మరణ ప్రకారంబు వినుటం జేసి. 24

ప్రతిపదార్థం: ఆ+దేవియున్= ఆ ద్రౌపదీదేవి కూడా; నకులునిచేతన్= నకులుడివలన; ఉపప్లావ్యంబునన్= ఉపప్లావ్యపురంలో; సుత సోదర మరణ ప్రకారంబున్= కొడుకులూ, సోదరులూ చచ్చిపోయిన విధం; వినుటన్+చేసి= వినటంచేత.

తాత్పర్యం: ఆ ద్రౌపదికూడా నకులుడివలన ఉపప్లావ్యపురంలో కొడుకులూ, సోదరులూ చచ్చిపోయిన విధం వినటంచేత. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అలఁత గదిరి నోరెండఁగఁ । బలవించుచుఁ దోడుతోడ బాష్పజలం బ
గ్గలమై క్రమ్మఁగ సొలయుచుఁ । దెలియుచు నాతనికి నడలు దీపింపంగన్. 25

ప్రతిపదార్థం: అలఁత= దుఃఖం; కదిరి= అతిశయించి; నోరు+ఎండఁగన్= నోరు ఆర్చుకొనిపోయేటట్టు(ఆమె); పలవించుచున్= రోదిస్తూ; తోడుతోడన్= వెనువెంటనే; బాష్పజలంబు= కన్నీరు; అగ్గలము+ఐ= ఎక్కువై; క్రమ్మఁగన్= అలముకోగా; సొలయుచున్= మూర్ఛపోతూ; తెలియుచున్= తెప్పిరిల్లుతూ; ఆతనికిన్= ఆ నకులుడికి; అడలు= దుఃఖం; దీపింపంగన్= అతిశయించగా.

తాత్పర్యం: దుఃఖం అతిశయించి నోరు ఆర్చుకుపోయేటట్టు (ఆమె) రోదిస్తూ వెనువెంటనే కన్నీళ్ళు ఎక్కువై అలముకోగా మూర్ఛపోతూ తెప్పిరిల్లుతూ, ఆ నకులుడి శోకం అతిశయించగా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అరుగుదెంచి యంతంత నవనీకాంతుఁగాంచి యధిక శోకాక్రాంతయై యార్తిం గూరి యాక్రందనంబు సేయ నమ్మాద్రీపుత్రుం డొయ్యన యయ్యంగన నరదంబు డించె; నుచిత వాహనంబుల నెక్కి తోడన వచ్చిన వనితాజనంబు లవతరణంబు సేసి వనట వందురుచుఁ బరివేష్టించి; రప్పు డా వధూరత్నంబు. 26

ప్రతిపదార్థం: అరుగుదెంచి= వచ్చి; అంతంతన్= కొంచెందూరం నుంచి; అవనీకాంతున్= రాజును (ధర్మరాజును); కాంచి= చూచి; అధికశోక+ఆక్రాంత+ఐ= మిక్కిలి దుఃఖంచేత ఆక్రమించబడిన దయి; ఆర్తిన్+కూరి= బాధలో మునిగి; ఆక్రందనంబు+ చేయన్= ఏడువగా; ఆ+మాద్రీ పుత్రుండు= ఆ మాద్రికొడుకు-నకులుడు; ఒయ్యన= మెల్లగా; ఆ+అంగనన్= ఆ స్త్రీని (ద్రౌపదిని); అరదంబున్+డించెన్= రథంనుండి దింపాడు; ఉచిత వాహనంబులన్= తగిన వాహనాలను; ఎక్కి; తోడన్+అ=

వెంట; వచ్చిన; వనితా జనంబులు= స్త్రీలు; అవతరణంబు+చేసి= దిగి; వనటన్= శోకంతో; వందురుచున్= దుఃఖిస్తూ; పరివేష్టించిరి= చుట్టూ కూర్చున్నారు; అప్పుడు= ఆ సమయంలో; ఆ వధూరత్నంబు= ఆ కాంతామణి - ద్రౌపది.

తాత్పర్యం: వచ్చి కొంచెం దూరంనుండి ధర్మరాజును చూచి అధిక శోకాక్రాంత అయి, బాధలో మునిగి రోదించగా ఆ నకులుడు మెల్లగా ఆమెను రథంనుండి దింపాడు. తగిన వాహనా లెక్కి వెంట వచ్చిన స్త్రీలు దిగి ఏడుస్తూ చుట్టూ కూర్చున్నారు. అప్పుడు ఆ కాంతామణి ద్రౌపది. (తరువాతి పద్యంతో అన్వయం).

క. పెనుమంచునఁ జెలువేదిన । వనజంబును బోలె నశ్రువారిపరీతా
ననము చెలువెడలఁ గొడుకలఁ । బనవుచుఁ జరణములు తొట్రువడ దీనగతిన్. 27

ప్రతిపదార్థం: పెను మంచునన్= అధికమైన మంచుచేత; చెలువు+ఏదిన= అందం కోల్పోయిన; వనజంబును+పోలెన్= పద్మంలా; అశ్రువారి పరీత+ఆననము= కన్నీళ్ళతో నిండిన ముఖం; చెలువు+ఎడలన్= అందం నశించగా; కొడుకులన్= కొడుకులను గూర్చి; పనవుచున్= ఏడుస్తూ; చరణములు= కాళ్ళు; తొట్రు+పడన్= తడబడగా; దీనగతిన్= విచారంతో.

తాత్పర్యం: అధికమైన మంచుచేత అందం కోలుపోయిన పద్మంవలె కన్నీటితో నిండిన ముఖం అందం నశించగా కొడుకులను గూర్చి ఏడుస్తూ కాళ్ళు తడబడగా దైన్యంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ. 'పెనుమంచున - చెలువెడలన్' అలంకారం ఉపమ. అశ్రువారి - పెనుమంచు, ఆననము - వనజము- ఉపమేయోపమానాలు. చెలువేదు - సామాన్యధర్మం. పోలెన్ - ఉపమావాచకం.

వ. కొన్ని యడుగులు వచ్చి వసుధాతలంబున వ్రాలిన వేగంబ వాయునందనుం డా ద్రుపదనందనఁ గ్రుచ్చియెత్తి ధర్మసూను సమీపంబునకుఁ దెచ్చిన నమ్మగువ మగుడ నిలంబడి యమ్మహీపతి యాననం బాలోకించి యెలుంగు రాలుపడ దైవమానుషంబులు సుసంగతంబులై యుండుటయు నతనికి సామ్రాజ్యంబు చొప్పడుటయు నుగ్గడించి. 28

ప్రతిపదార్థం: కొన్ని+అడుగులు వచ్చి= కొన్ని అడుగులువేసి; వసుధా తలంబునన్= నేలమీద; వ్రాలినన్= పడగా; వేగంబు+అ= వడిగా; వాయు నందనుండు= భీముడు; ఆ ద్రుపద నందనన్= ఆ ద్రౌపదిని; క్రుచ్చి+ఎత్తి= పట్టుకొని లేవదీసి; ధర్మసూను సమీపంబునకున్= ధర్మరాజు దగ్గరకు; తెచ్చినన్= తీసికొనిరాగా; ఆ+మగువ= ఆ స్త్రీ-ద్రౌపది; మగుడన్= మళ్ళీ; ఇలన్+పడి= నేలపైబడి; ఆ+మహీపతి+ఆననంబు= ఆ రాజుముఖం; ఆలోకించి= చూచి; ఎలుంగు రాలుపడన్= కంఠస్వరం డగ్గుత్తికపడగా; దైవ మానుషంబులు= దైవమూ, పురుష ప్రయత్నమూ; సుసంగతంబులు+ఐ= బాగా పొసగినవయి; ఉండుటయున్= ఉండటమూ; అతనికిన్; సామ్రాజ్యంబు; చొప్పడుటయున్= లభించటమూ; ఉగ్గడించి= ప్రశంసించి.

తాత్పర్యం: కొన్ని అడుగులు వేసి నేలమీద వాలింది. వెంటనే భీముడు ఆ ద్రౌపదిని పట్టుకొని లేవదీసి ధర్మరాజు దగ్గరకు తీసికొనిరాగా, ఆమె మళ్ళీ నేలపైబడి ఆ రాజు ముఖం చూచి డగ్గుత్తికపడ్డ కంఠస్వరంతో దైవమూ, పురుషకారమూ రెండూ బాగా పొసగినవై ఉండటమూ, అతడికి సామ్రాజ్యం లభించటమూ ప్రశంసించి. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. కలిమికి నొప్పగాఁగ బలగంబయి నీకడ నా తనూభవుల్
మెలఁగఁగఁ జూడఁ గానన; యమేయ భుజాబలశాలి విక్రమో
జ్జ్వలుఁడు సుభద్రపట్టియును వమ్మయిపోయె; ననూనభోగముల్
గలిగెన్ యేనియున్ మఱవఁగా వశమే మన కా కుమారులన్? 29

ప్రతిపదార్థం: కలిమికిన్= సంపదకు; ఒప్పు+కాఁగన్= తగినట్లుగా; బలఁగంబు+అయి= పరిజనమై; నీ కడన్= నీ దగ్గర; నా తనూభవుల్= నా కొడుకులు; మెలఁగఁగన్+చూడన్+కానన్=అ= ఉండటం చూడనేలేకపోయాను; అమేయ భుజా బలశాలి= అపరిమిత బాహుబల సంపన్నుడూ; విక్రమోజ్జ్వలుఁడు= పరాక్రమంచేత ప్రకాశించేవాడూ(అయిన); సుభద్ర పట్టియును= సుభద్రకొడుకూ-అభిమన్యుడూ; వమ్ము+అయి పోయెన్= వ్యర్థమైపోయాడు; అనూన భోగముల్= తక్కువకాని సుఖాలు; కలిగెన్+అ+ఏనిన్= ఉన్నప్పటికీ; మనకున్= మనకు; ఆ కుమారులన్= ఆ బిడ్డలను; మఱవఁగాన్+వశమే?= మరిచిపోవ తరమా?

తాత్పర్యం: సంపదకు తగ్గట్లుగా పరివారమయి నీ దగ్గర నా కుమారులు వర్తిల్లటం నేను చూడనేలేకపోయాను. అమిత బాహు బల సంపన్నుడూ, పరాక్రమశాలీ అయిన అభిమన్యుడు కూడా నశించాడు. అధిక భోగాలున్నా మనకు ఆ కుమారులను మరచిపోవ తరమా?

వ. అని యప్పు డశ్వత్థామోద్దామ రణకరణస్మరణంబు దన చిత్తం బుత్తల పెట్టఁ గోపంబు దీపింప నాసీనయై. 30

ప్రతిపదార్థం: అని; అప్పుడు= ఆ సమయంలో; అశ్వత్థామ+ఉద్దామ రణ కరణ స్మరణంబు= అశ్వత్థామయొక్క గొప్ప యుద్ధపుచేత యొక్క స్మృతి; తన చిత్తంబు= తన మనస్సును; ఉత్తలపెట్టన్= కలతపెట్టగా; కోపంబు; దీపింపన్= అతిశయించగా; ఆసీన+ఐ= కూర్చున్నదై.

తాత్పర్యం: అని అప్పుడు అశ్వత్థామ యుద్ధం చేసిన రీతి తలపుకు వచ్చి తన మనస్సును కలతపెట్టగా కోపాతిశయంతో కూర్చున్నదై.

క. 'భూరమణ! గాఢనిద్రం । గూరిన సమయమున ముట్టికొని నా సుతులం
గ్రూరతఁ దెగటార్చెను బా । పారంభుఁడు గురుతనూజుఁ డక్రమలీలన్. 31

ప్రతిపదార్థం: భూరమణ!= రాజా!; నా సుతులన్= నా కుమారులను; గాఢనిద్రన్+కూరిన సమయమునన్= గాఢంగా నిద్రపోతూన్న సమయంలో; పాప+ఆరంభుఁడు= పాపాత్ముడు అయిన; గురుతనూజుఁడు= గురుపుత్రుడు-అశ్వత్థామ; ముట్టికొని= మార్కొని; అక్రమలీలన్= అధర్మ పద్ధతిలో; క్రూరతన్= కనికరం లేకుండా; తెగటార్చెను= చంపాడు.

తాత్పర్యం: 'రాజా! నా కుమారులు మంచి నిద్రలో ఉన్న సమయంలో పాపాత్ముడైన అశ్వత్థామ మార్కొని అధర్మ పద్ధతిలో కనికరం లేకుండా చంపాడు.'

క. అది యాఱని పెను చిచ్చై । మదిఁ గాల్పఁ దొడంగె దీని మాన్ప నుపాయం
బు దలంప నొండు లే ద । య్యదయుని ముట్టుకొని నామ మడఁచుట దక్కన్. 32

ప్రతిపదార్థం: అది= ఆ ఆక్రమయుద్ధం; ఆఱని= ఆరిపోని; పెను చిచ్చు+ఐ= పెద్ద అగ్నియై; మదిన్= మనస్సును; కాల్పన్+ తొడంగెన్= దహించసాగింది; ఆ+అదయునిన్= ఆ నిర్దయుడిని; ముట్టుకొని= ఎదిరించి; నామము+అడచుట+తక్కన్= పేరులేకుండా చేయటంతప్ప; తలంపన్= ఆలోచించగా; దీనిన్= ఈ దుఃఖాన్ని; మాన్పన్= పోగొట్టటానికి; ఉపాయంబు= ఉపాయం; ఒండు లేదు= ఇంకొకటి లేదు.

తాత్పర్యం: 'అతడు చేసిన అధర్మయుద్ధం ఆరిపోని పెద్ద అగ్ని అయి మనస్సును దహించసాగింది. ఆ నిర్దయుడిని ఎదిర్చి పేరు లేకుండా చేయటం తప్ప, ఆలోచించగా, ఈ దుఃఖాన్ని ఉపశమింప చేయటానికి ఇంకొక ఉపాయం లేదు.

క. వాయుసుతుఁ బనిచి నేఁడటు । సేయింపక తక్కితేనిఁ జెప్పెద విను మేఁ
బ్రాయోపవేశమున నీ । కాయ ముపేక్షింతుఁ జుమ్ము కౌరవనాథా!' 33

ప్రతిపదార్థం: కౌరవనాథా!= కురుపతీ-ధర్మరాజా!; వాయుసుతున్= భీముడిని; పనిచి= పంపి; నేఁడు= ఈ వేళ; అటు= ఆ విధంగా; పేరుమాపేపని; చేయింపక తక్కితి(వి)+ఏనిన్= నీవు చేయించకపోతే; చెప్పెదన్+వినుము= చెపుతా విను; ఏన్= నేను; ప్రాయోపవేశమునన్= ఆమరణ నిరాహారదీక్షతో; ఈ కాయము= ఈ శరీరం; ఉపేక్షింతున్+చుమ్ము= విడుస్తాను సుమా!

తాత్పర్యం: ధర్మరాజా! భీముడిని నియోగించి ఈ వేళ ఆ విధంగా వాడి పేరు మాపే పని నీవు చేయించకపోతే, చెపుతాను వినుము - నేను ఆమరణనిరాహారదీక్షతో ఈ శరీరం విడుస్తాను సుమా!'

వ. అనుటయు నమ్మనుజపతి యమ్మానిని కిట్లనియె. 34

ప్రతిపదార్థం: అనుటయున్= ద్రౌపది అలా అనగా; ఆ+మనుజపతి= ఆ రాజు; ఆ+మానినికిన్= ఆ మానవతికి; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అట్లా అనగా ఆ ధర్మరాజు ఆ మానవతితో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: పరికరం. ద్రౌపది పట్టుదల గల స్త్రీ కాబట్టి. ఇక్కడ ఆమెకు 'మానిని' అనే విశేషణం సాభిప్రాయం. కాబట్టి అలంకారం పరికరం.

క. 'క్షితిపతి తనయులు పోర । న్మృతిఁ బొందుట తగునకాదె నీ సోదరులున్
సుతులు నతిపుణ్యపురుషో । చిత సుగతులు గనిరి వగలఁ జేడ్పడ నేలా? 35

ప్రతిపదార్థం: క్షితిపతి తనయులు= రాచబిడ్డలు; పోరన్= యుద్ధంలో; మృతిన్+పొందుట= మరణించటం; నీ సోదరులున్= నీ సోదరులూ; సుతులున్= కుమారులూ; అతి పుణ్యపురుష+ఉచిత సుగతులు= మిక్కిలి పుణ్యాత్ములకు తగిన సద్గతులు; కనిరి= పొందారు; వగలన్= దుఃఖంతో; చేడ్పడన్+ఏలా= బాధపడటం దేనికి?

తాత్పర్యం: 'రాచబిడ్డలు యుద్ధంలో మరణించటం సముచితమే కదా! నీ సోదరులూ, కుమారులూ మిక్కిలి పుణ్యాత్ములకు తగిన సద్గతులు పొందారు. ఇంక నీవు దుఃఖంతో బాధపడటం దేనికి?

వ. మనస్వినివైన నీ కుపశమించుట గర్తవ్యంబు. శోకంబు దక్కు మశ్వత్థామ యొనర్చిన పరాభవంబునఁ బుట్టిన యలుక వాని సమయింపక పోదని చెప్పుటయ కాదు, నా తలంపును నిట్లు; వాఁ డడవిం గలసినవాఁడు గానోపు; సమయించుట నీ కె ట్లెఱుంగ నగుఁ? జెప్పు' మనిన నప్పొలఁతి 'యప్పాపాత్మునకు సహజంబైన శిరోమణి గలదు, దానిం దెచ్చి యిచ్చినఁ జూచి జీవంబుతో నుండెద నని తలంచితి' నని పురుషాక్షరంబుగాఁ బలికి యప్పవమానతనయుఁ దన పాణితలంబున సంస్పర్శించి. 36

ప్రతిపదార్థం: మనస్వినివి+ఐన= ప్రశస్తమైన మనస్సు కలదానవైన; నీకున్; ఉపశమించుట= శాంతించుట; కర్తవ్యంబు= కార్యము; శోకంబు= విచారం; తక్కుము= మాను; అశ్వత్థామ+ఒనర్చిన పరాభవంబునన్= అశ్వత్థామ చేసిన అవమానంవలన; పుట్టిన= కలిగిన; అలుక= కోపం; వానిన్= అతడిని; సమయింపక పోదు= చంపకుండా పోదు; అని; చెప్పుట+అ= చెప్పటమే; కాదు; నా తలంపును= నా అభిప్రాయమూ; ఇట్లు+అ= ఇట్లే; వాఁడు= అతడు(అశ్వత్థామ); అడవిన్+కలసినవాఁడు= అడవిలో కలిసినవాడు; కాన్+ఓపున్= అయి ఉంటాడు; సమయించుట= చంపటం; నీకున్; ఎట్లు+ఎఱుంగన్+అగున్= ఎలా తెలస్తుంది?; చెప్పుము; అనినన్; ఆ+పొలఁతి= ఆ స్త్రీ (ద్రౌపది); ఆ+పాప+ఆత్మునకున్= ఆ దుష్టుడికి; సహజంబు+ఐన= పుట్టుకతో ఉన్న; శిరోమణి= తలమానికం; కలదు; దానిన్; తెచ్చి; ఇచ్చినన్; చూచి; జీవంబుతోన్+ఉండెదన్= ప్రాణాలతో ఉంటాను; అని; తలంచితిన్; అని; పరుష+అక్షరంబుగాన్= నిష్ఠురంగా; పలికి; ఆ+పవమాన తనయున్= ఆ వాయుకుమారుడిని - భీముడిని; తన పాణితలంబునన్= తన చేతితో; సంస్పర్శించి= తాకి.

తాత్పర్యం: మంచి మనస్సుగల నీవు శాంతించటం మంచిది. శోకం మానుము. అశ్వత్థామ చేసిన అవమానం వలన కలిగిన కోపం వాడిని చంపితేకాని పోదని చెప్పటం కాదు. నా అభిప్రాయం కూడా ఇదే. వాడు అడవులపాలై పోయి ఉంటాడు. చంపినట్లు నీకెట్లా తెలుస్తుంది? చెప్పుము.' అంటే, ద్రౌపది' ఆ దుష్టుడికి పుట్టుకతోనే శిరోమణి ఉన్నది. దానిని తెచ్చి ఇస్తే చూచి ప్రాణాలతో ఉందా మని అనుకొన్నాను' అని కఠినంగా పలికి భీముడిని తన చేతితో స్పృశించి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'క్షత్రధర్మ మాత్మఁ గైకొని రయమున । నరిగి పాపకర్ముఁడైన కుంభ
జన్మతనయు ముట్టి చంపుము నా మది । కనలు నడలు నుడిపి కావు నన్ను.' 37

ప్రతిపదార్థం: క్షత్రధర్మము= క్షత్రియధర్మం; ఆత్మన్= మనస్సులో; కైకొని= పూని; రయమునన్= శీఘ్రంగా; అరిగి= వెళ్ళి; పాపకర్ముఁడు+ఐన= దుర్మార్గుడైన; కుంభజన్మ తనయున్= ద్రోణుడి కొడుకైన అశ్వత్థామని; ముట్టి= తాకి; చంపుము; నా మది కనలున్+అడలున్= నా మనస్సులోని కోపాన్నీ, శోకాన్నీ; ఉడిపి= మాన్పి; నన్నున్; కావు= రక్షించు.

తాత్పర్యం: 'మనస్ఫూర్తిగా క్షత్రియోచిత ధర్మం పూని శీఘ్రమే వెళ్ళి ఆ దుష్టుడైన అశ్వత్థామను తాకి చంపుము. నా మనస్సులోని కోపాన్నీ, శోకాన్నీ మాన్చి నన్ను రక్షించుము.'

వ. వెండియు. 38

తాత్పర్యం: ఇంకా.

ద్రౌపది యశ్వత్థామం బరిభవింప భీమసేను నియోగించుట (సం. 10-11-21)

సీ. 'జతుగృహదాహావసరమునఁ జేసిన । సముదీర్ణతరపౌరుషంబుతోడ
నత్యుగ్రుఁడగు హిడింబాసుర వ్రచ్చిన । చోటఁ గైకొన్న నిష్ఠురతతోడ
యక్షులు పొదివిన యపుడు వాటించిన । యాభీల దోర్బలవ్యాప్తితోడ
సమధికబలుఁడు గీచకుని యేఁచినయెడఁ । బూనిన విక్రమస్ఫూర్తితోడఁ

ఆ. గూడ నిన్ను జనులు గొనియాడునట్టుగఁ । జనుము నీదు బలముఁ జలము మెఱయ
గీటడంపు మనల గెలిచితి నని గర్వ । మునఁ దనర్చు ద్రోణతనయు నెట్లు.' 39

ప్రతిపదార్థం: జతు గృహ దాహ+అవసరమునన్= లక్కయిల్లు కాలే సమయంలో; చేసిన; సముదీర్ణ తన పౌరుషంబుతోడన్= మిక్కిలి గొప్పదైన పౌరుషంతోనూ; అతి+ఉగ్రుఁడు+అగు= మిక్కిలి భయంకరుడైన; హిడింబ+అసురున్= హిడింబుడనే రాక్షసుడిని; వ్రచ్చినచోటన్= చంపినచోట; కైకొన్న= పూనిన; నిష్ఠురతతోడన్= కాఠిన్యంతోనూ; యక్షులు; పొదివిన+అపుడు= ఆక్రమించినప్పుడు; పాటించిన= చూపిన; ఆభీలదోస్(ః)+బల వ్యాప్తితోడన్= భయంకరమైన భుజబల విస్తరంతోనూ; సమధిక బలుఁడు= మిక్కిలి గొప్పబలం కలవాడైన; కీచకుని ఏఁచిన+ఎడన్= కీచకుడు విజృంభించినప్పుడు; పూనిన= చూపిన; విక్రమస్ఫూర్తితోడన్= పరాక్రమ ప్రకాశంతోనూ; కూడన్= కూడుకోగా; నిన్నున్; జనులు; కొనియాడునట్లుగన్= ప్రశంసించే విధంగా; చనుము= వెళ్ళుము. నీదు బలమున్+చలమున్= నీ బలమూ, పట్టుదలా; మెఱయన్= ప్రకాశించేటట్లు; మనలన్= మనలను; గెలిచితిన్+అని= గెలిచానని; గర్వమునన్= అహంకారంతో; తనర్చు= ఒప్పే; ద్రోణతనయున్= అశ్వత్థామను; ఎట్లున్= ఎలా అయినాసరే; గీటడంపు(ము)= చంపుము.

తాత్పర్యం: 'లక్క ఇల్లు కాలేటప్పుడు చూపిన మిక్కిలి గొప్ప పౌరుషంతోనూ, మిక్కిలి భయంకరుడైన హిడింబాసురుడిని చంపినప్పుడు పూనిన కాఠిన్యంతోనూ, యక్షులు ఆక్రమించినప్పుడు చూపిన భయంకర భుజపరాక్రమవిస్తరంతోనూ, మిక్కిలి బలవంతుడైన కీచకుడు విజృంభించినప్పుడు ప్రదర్శించిన పరాక్రమ ప్రకాశంతోనూ కూడుకొని, నిన్ను జనులు ప్రశంసించే విధంగా వెళ్ళుము. నీ బలమూ, చలమూ ప్రకాశించేటట్లు మనలను గెలిచానని విర్రవీగే అశ్వత్థామను ఎట్లా అయినా సరే, చంపుము.'

వ. అనిన విని యగ్గురుపుత్రుదెసం బొడమిన యమర్షంబున మేను వొంగఁ బవమానసూనుండు ద్రుపదనందనతో ధర్మనందనుం డాడిన మాట లశ్వత్థామపైఁ బోవుట కనుమతిగా నంతరంగంబున నంగీకరించి. 40

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ఆ+గురుపుత్రు దెసన్= ఆ అశ్వత్థామమీద; పొడమిన= పుట్టిన; అమర్షంబునన్= కోపంతో; మేను= శరీరం; పొంగన్; పవమానసూనుండు= భీముడు; ద్రుపదనందనతోన్= ద్రౌపదితో; ధర్మనందనుండు= ధర్మరాజు; ఆడిన మాటలు= పలికిన పలుకులు; అశ్వత్థామపైన్= అశ్వత్థామమీదికి; పోవుటకున్= వెళ్ళుటకు; అనుమతి+కాన్= అంగీకారంగా, అంతరంగంబునన్= మనస్సులో; అంగీకరించి= సమ్మతించి.

తాత్పర్యం: అనగా విని ఆ అశ్వత్థామమీద పుట్టిన కోపంతో శరీరం పొంగగా భీముడును ద్రౌపదితో ధర్మరాజన్న మాటలు అశ్వత్థామ మీదికి పోవటానికి అంగీకారంగా మనస్సులో సమ్మతించి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మహాస్రగ్ధర.

కనక ప్రస్ఫీత రత్నోత్కర పరివిసరత్కాంతి రాజన్నిజస్యం
దనముం బన్నంగ నత్యాదరమున నకులుం దా నియోగించె; నాతం
డును దీప్తోత్సాహుఁడై గండున సబలరయాటోపరథ్యాది సత్సా
ధనయోగం బొప్ప సారథ్యమునకు నమరెం దన్మనోవృత్తియుక్తిన్. 41

ప్రతిపదార్థం: తాన్= తాను-భీముడు; కనక= బంగారంయొక్క; ప్రస్ఫీత= మిక్కిలి విస్తారమైన; రత్న= మణులయొక్క; ఉత్కర= సమూహంయొక్క; పరివిసరత్= బాగా వ్యాపిస్తున్న; కాంతి= ప్రకాశంతో; రాజత్= వెలుగొందుతూన్న; నిజస్యందనమున్= తనదైన రథాన్ని; పన్నంగన్= పూన్చటానికి; అతి+ఆదరమునన్= మిక్కిలి ఆదరంతో; నకులున్; నియోగించెన్= ఆజ్ఞాపించాడు; ఆతండును= ఆ నకులుడూ; దీప్త+ఉత్సాహుఁడు+ఐ= ప్రకాశించే ఉత్సాహం కలవాడై; గండునన్= పరాక్రమంతో; సబల= బలంతోనూ; రయ= వేగంతోనూ; ఆటోప= సంభ్రమంతోనూ కూడిన; రథ్య+ఆది= గుర్రాలూ మొదలైన; సత్+సాధన యోగంబు= మంచి ఉపకరణాల కూడిక; ఒప్పన్= ఒప్పగా; తద్+మనస్(ః)+వృత్తి యుక్తిన్= ఆతని(భీముడి) మనోవ్యాపారంతోడి కూడికతో; సారథ్యమునకున్= సారథ్యానికి; అమరెన్= సిద్ధపడ్డాడు.

తాత్పర్యం: భీముడు బంగారుకాంతితోనూ, మణుల కాంతితోనూ వెలుగొందుతూన్న తన రథాన్ని సిద్ధం చేయుమని మిక్కిలి ఆదరంతో నకులుడిని నియోగించాడు. అతడు ప్రకాశించే ఉత్సాహంతో, పరాక్రమంతో, బలమూ, వేగమూ, సంభ్రమమూ కల గుర్రాలూ మొదలైన మంచిసాధన సామగ్రి ఒప్పగా, భీముడి మనోవృత్తి కనుగుణంగా సారథ్యం చేయటానికి సిద్ధపడ్డాడు.

వ. ఇట్లు సహదేవ పూర్వజుం దనకు సారథిం జేసికొని సమీరనందనుండు కోదండ గదాదండాది హేతి సంపన్నం బైన యా రథం బెక్కి శిబిరంబు వేగంబ వెడలి గురుతనయాది యోధుల యరదంబుల చొప్పు వట్టికొని యతిత్వరితగతిం జని కురుక్షేత్ర సంచారి జనంబులం గని 'యశ్వత్థామ యెక్కడ మెలంగెనో యెఱుఁగుదురే?' యని యడిగిన వార లతండు కృపకృతవర్మలతోడం గరినగరంబు దెసకు నరిగి మగిడి భాగీరథీ తీరంబున కరుగుదెంచి యయ్యెడ నయ్యిరువురుం బాసి యొక్క వలని కరుగం దానును గృష్ణద్వైపాయన మహాముని యాశ్రమంబునకై తొలఁగి తత్ప్రదేశంబున వసియించెనని చెప్పుటయు నద్దిక్కు తేరు నడప నియోగించి నట్టియెడ ధర్మనందనునకు వసుదేవనందనుం డిట్లనియె. 42

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సమీరనందనుండు= వాయుపుత్రుడు భీముడు; సహదేవ పూర్వజున్= సహదేవుడి అన్నను నకులుడిని; తనకున్= తనకు; సారథిన్= సారథిగా చేసికొని; కోదండ గదాదండ+ఆదిహేతి సంపన్నంబు+ఐన= విల్లూ, దండంవంటి గదా మొదలైన ఆయుధాలతో కూడిన; ఆ రథంబు+ఎక్కి; శిబిరంబున్= శిబిరంనుంచి; వేగంబు+అ= వేగమే; వెడలి; గురుతనయ+ఆదియోధుల+అరదంబుల చొప్పు= అశ్వత్థామ మొదలగు వీరుల రథాల మార్గం; పట్టికొని= అవలంబించి; అతి త్వరితగితిన్= మిక్కిలి తొందరగా; చని; కురుక్షేత్ర సంచారి జనంబులన్+కని= కురుక్షేత్రంలో తిరిగే జనులను చూచి; అశ్వత్థామ; ఎక్కడ; మెలంగెన్= ఉన్నాడో; ఎఱుఁగుదురే?; అని; అడిగినన్; వారలు; అతండు; కృపకృతవర్మలతోడన్; కరినగరంబు దెసకున్= హస్తినాపురివైపు; అరిగి= వెళ్ళి; మగిడి= తిరిగి; భాగీరథీ తీరంబునకున్= గంగానది ఒడ్డుకు; అరుగుదెంచి= వచ్చి; ఆ+ఎడన్= అక్కడ; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరూ; పాసి= విడిచి; ఒక్క వలనికిన్= ఒక దిక్కుకు; అరుగన్= వెళ్ళగా; తానును= తాను; కృష్ణద్వైపాయన మహాముని+ఆశ్రమంబునకై= వ్యాసమునీంద్రుడి ఆశ్రమానికి;

తొలఁగి= వెళ్ళి; తద్+ప్రదేశంబునన్= ఆ చోట; వసియించెన్= నివసించాడు; అని; చెప్పుటయున్= చెప్పగా; ఆ+దిక్కు= ఆ వైపు; తేరు= రథం; నడపన్= పోనివ్వటానికి; నియోగించిన+అట్టి+ఎడన్= నియమించిన సమయంలో; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; వసుదేవ నందనుండు= కృష్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఇట్లా భీముడు నకులుడిని తనకు సారథిగా చేసికొని విల్లూ, గదా మొదలైన ఆయుధాలతో కూడిన ఆ రథం ఎక్కి, శిబిరంనుంచి వేగమే బయలుదేరి అశ్వత్థామాది యోధుల రథాలు వెళ్ళిన మార్గాన్ని అవలంబించి, మిక్కిలి తొందరగా వెళ్ళి, కురుక్షేత్రంలో తిరిగే జనులను చూచి, 'అశ్వత్థామ ఎక్కడున్నాడో ఎరుగుదురా?' అని అడుగగా, వాళ్ళు 'అతడు కృపకృతవర్మలతో హస్తినాపురంవైపు వెళ్ళి, మరలి, గంగానది ఒడ్డుకు వచ్చి అక్కడ ఆ ఇద్దరు వీరులూ తనను విడిచి ఒక దిక్కుగా వెళ్ళగా, తాను వ్యాసాశ్రమానికి వెళ్ళి, అక్కడ నివసించాడు' అని చెప్పగా, 'ఆ వైపు రథం పోని' మ్మని నియోగించిన సమయంలో ధర్మరాజుతో కృష్ణు డిట్లా అన్నాడు:

చ. అనిలసుతుండు శోకమును నల్కయుఁ జిత్తమునం గరంబు పే
ర్చిన గురుపుత్రు ముట్టికొనఁ జెచ్చెరఁ బోయెడు; నీతఁ డొంటి యా
తనిపయిఁ బోవ భూరమణ! తప్పదె కార్యము? పెద్దగూర్తు వీ
వనుజులలోన నాతనికి; నందఱుఁ బోవుట మేలు పోరికిన్. 43

ప్రతిపదార్థం: భూరమణ!= ఓ రాజా! ధర్మరాజా!; అనిలసుతుండు= భీముడు; శోకమును= దుఃఖమూ; అల్కయున్= కోపమూ; చిత్తమునన్= మనస్సులో; కరంబు పేర్చినన్= మిక్కిలి అతిశయించగా; గురుపుత్రున్= అశ్వత్థామను; ముట్టికొనన్= మార్కొనటానికి; చెచ్చెరన్= శీఘ్రంగా; పోయెడున్= వెడతాడు; ఈతఁడు ఆతనిపయిన్= ఆ అశ్వత్థామమీదికి; ఒంటిపోవన్= ఒక్కడే పోతే; కార్యము= పని; తప్పదె?= చెడదా?; ఈవు= నీవు; అనుజులలోన్= తమ్ముళ్ళలో; ఆతనికిన్= ఆ భీముడికి; పెద్ద+కూర్తువు= మిక్కిలి ఇష్టపడతావు; పోరికిన్= యుద్ధానికి; అందఱున్= అందరూ; పోవుట= పోవటం; మేలు= మంచిది.

తాత్పర్యం: 'ధర్మరాజా! భీముడు శోకమూ, కోపమూ మనస్సులో మిక్కిలి అతిశయించగా అశ్వత్థామను మార్కొనటానికి వేగంగా వెళ్ళాడు. ఇతడు ఒక్కడూ అతడి మీదికి పోతే కార్యం చెడదా? తమ్ముళ్ళందరిలోకీ అతడంటే నీకెంతో ఇష్టం. యుద్ధానికి అందరూ వెళ్ళటం మంచిది.

వ. వినుము. 'సకల పృథివియు దహింపఁ జాలునట్టి బ్రహ్మశిరోనామకం బను దివ్యాస్త్రం బశ్వత్థామకు ద్రోణుం డిచ్చెఁ బ్రియాతిశయంబున వివ్వచ్చునకు నొసంగె. నశ్వత్థామ వివ్వచ్చుతోడి మత్సరంబునఁ దదీయబల నైపుణ్యంబునకు నసహ్యంబువడుఁ బదంపడి యెఱింగి పాండవులపై వీఁడు దీనిం బ్రయోగింప కుండవలయు నని తలంచి యమ్మహనీయ సాధనంబు మనుష్యులపైఁబ్రయోగించుకొలఁది గాకునికియుం గలదు గావున సర్వధర్మవిదుండైన యగ్గురుం డొక్కనాఁ డస్త్రవిషయ సంభాషణ సమయంబున నతనితో ని ట్లనియె.'44

ప్రతిపదార్థం: వినుము; సకల పృథివియున్= భూమినంతనూ; దహింపన్+చాలునట్టి= కాల్చగల; బ్రహ్మశిరోనామకంబు+అను= బ్రహ్మ శిరోనామకం అనే; దివ్య+అస్త్రంబు= దివ్యాస్త్రం; ద్రోణుండు= ద్రోణుడు; అశ్వత్థామకున్= అశ్వత్థామకు; ఇచ్చెన్; ప్రియ+అతిశయంబునన్= ప్రేమాతిశయంచేత; వివ్వచ్చునకున్= అర్జునుడికి; ఒసంగెన్= ఇచ్చాడు; అశ్వత్థామ; వివ్వచ్చుతోడి= అర్జునుడిమీది; మత్సరంబునన్= కోపంతో; తదీయ బల నైపుణ్యంబునకున్= అతడి బలప్రౌఢికి; అసహ్యంబు+పడున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అసూయపడతాడు; పదంపడి; తరువాత; ఎఱింగి; పాండవులపైన్= పాండవులపైన; వీఁడు; దీనిన్= దీనిని; ప్రయోగింపక+ ఉండవలయున్+అని తలంచి= ప్రయోగించకుండా ఉండాలని ఎంచి; ఆ+మహనీయ సాధనంబు= ఆ గొప్ప అస్త్రం; మనుష్యులపైన్= మనుష్యులమీద; ప్రయోగించు కొలఁది కాక+ఉనికియున్= ప్రయోగించకూడదనేదీ; కలదు కావునన్= ఉన్నది కాబట్టి; సర్వధర్మ విదుండు+ఐన ఆ+గురుండు= అన్ని ధర్మాలూ తెలిసిన ఆ ద్రోణుడు; ఒక్కనాఁడు= ఒకరోజు; అస్త్ర విషయ సంభాషణ సమయంబునన్= అస్త్రాలను గూర్చిన మాటల సందర్భంలో; అతనితోన్= అశ్వత్థామతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: వినుము. 'భూమినంతటినీ కాల్చగల బ్రహ్మశిరస్సు అనే పేరుగల దివ్యాస్త్రం అశ్వత్థామకు ద్రోణు డిచ్చాడు. ప్రేమాతిశయంచేత అర్జునుడికీ ఇచ్చాడు. అశ్వత్థామ అర్జునుడిమీది కోపం కొద్దీ అతడి బల ప్రౌఢికి అసూయపడతాడు. తరువాత తెలిసి పాండవులమీద వీడు దాన్ని ప్రయోగించకుండా ఉండాలని తలచి, ఆ గొప్ప సాధనం మానవుల మీద ప్రయోగించకూడదనేదీ ఉన్నది కాబట్టి, అన్ని ధర్మాలూ తెలిసిన ఆ ద్రోణుడు ఒకనాడు అస్త్రాలను గూర్చి మాటాడే సందర్భంలో అతడితో ఇట్లా అన్నాడు.'

క. 'మనుజులపై బ్రహ్మశిరం । బనునస్త్రం బేసితేని నశుభం బొలయున్
విను మెన్ని యాపదలు వ । చ్చిన నపరోపాయములన చెఱుపుము పుత్రా!' 45

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; వినుము= విను; మనుజులపైన్= మనుష్యులమీద; బ్రహ్మశిరంబు+అను+అస్త్రంబు= బ్రహ్మశిరోనామకాస్త్రం; ఏసితి(వి)+ఏనిన్= ప్రయోగించితివా; అశుభంబు= కీడు; ఒలయున్= కలుగుతుంది; ఎన్ని+ఆపదలు= వచ్చినన్; అపర+ఉపాయములన్+అ= ఇతరోపాయాలచేతనే; చెఱుపుము= పోగొట్టుము.

తాత్పర్యం: 'కుమారా! వినుము. మనుష్యులమీద బ్రహ్మశిరోనామకాస్త్రం ప్రయోగించితివా కీడు కలుగుతుంది. ఎన్ని ఆపదలు వచ్చినా నీవు వాటిని ఇతరోపాయాలచేతనే తొలగించుకొమ్ము.'

వ. అని చెప్పి మనోగతం బవశంబై నాలుకకు వచ్చి, 'వీఁ డెట్లును సజ్జనుల వృత్తంబునఁ బ్రవర్తిల్లెడునే?;' యని యతండు విన నుగ్గడించె. దానికి నశ్వత్థామ విషాదంబునఁ గుందియుండుఁ గాని యగ్గురుని చెప్పినట్లు సదుపదేశ కరణ నిష్ఠుండుగాఁ; డతనికి దురభిమానంబును గలదు. వినుము చెప్పెదఁ జిరజీవిత్వంబును భర్గవరప్రసాద జనక కారణంబును గలిగి యుండు ననియును దివ్యాస్త్ర శస్త్ర విద్యారహస్యంబునకు మూలం బైన యగస్త్యుచేత ద్రోణుండు వడసిన బ్రహ్మ శిరోనామకంబు దనకుం గలదనియును దత్ప్రభావంబు దేవమనుజ దనుజలోకంబులు భస్మీభూతంబులు సేయు నని యుండుం గావున మున్ను మీరు వనవాసులరై యున్నతఱిఁ దాను మా పురంబునకు వచ్చి యాదవ కుమారులతోడి వినోదంబులం దగిలియుండి యొక్కనాఁ డే నొంటిమై నుండ నా కడకుం జనుదెంచి నగుచు నిట్లనియె. 46

ప్రతిపదార్థం: అని చెప్పి; మనస్(ః)+గతంబు= మనసులో ఉన్నది; అవశంబు+ఐ= తనకు తెలియకుండానే; నాలుకకున్ వచ్చినన్= నాలుకమీదికి రాగా; వీఁడు= ఈ అశ్వత్థామ; ఎట్లును= ఎలానూ; సత్+జనుల వృత్తంబునన్= మంచివాళ్ళ ప్రవర్తనతో; ప్రవర్తిల్లెడునే?= ప్రవర్తిస్తాడా; అని; అతండు; వినన్; ఉగ్గడించెన్= పలికాడు; దానికిన్= ఆ మాటకు; అశ్వత్థామ; విషాదంబునన్= విచారంతో; కుంది+ఉండున్+కాని= బాధపడి ఉంటాడే కాని; ఆ+గురుని చెప్పిన+అట్లు= ఆ గురుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెప్పిన విధంగా; సత్+ఉపదేశ కరణ నిష్ఠుండు+కాఁడు= సదుపదేశాన్ని ఆచరించే వాడు కాడు; అతనికిన్; దురభిమానంబును= దురహంకారమూ; కలదు; వినుము; చెప్పెదన్; చిరజీవిత్వంబును= చిరంజీవిత్వంకూడా; భర్గ వర ప్రసాద జనక కారణంబును= ఈశ్వరుడి వర ప్రసాదంవలన కలిగినది; కలిగి+ఉండున్= కలిగి ఉన్నాడు; అనియును; దివ్య+అస్త్ర శస్త్ర విద్యా రహస్యంబునకున్= దివ్యాస్త్ర శస్త్ర విద్యా రహస్యానికి; మూలంబు+ఐన= మూల పురుషుడైన; అగస్త్యు చేతన్= అగస్త్యుడివలన; ద్రోణుండు; పడసిన పొందిన; బ్రహ్మశిరోనామకంబు; తనకున్; కలదు+అనియును; తద్+ప్రభావంబు= దాని మహిమ; దేవ మను దనుజలోకంబులు= దేవతల, మనుష్యుల, రాక్షసుల లోకాలు; భస్మీభూతంబులు+చేయున్+అని= బూడిదచేస్తుందని; ఉండున్; కావునన్; మున్ను= పూర్వం; మీరు; వనవాసులరు+ఐ= అడవిలో వసించేవారై; ఉన్న తఱిన్= ఉన్నప్పుడు; తాను; మా పురంబునకున్= మా నగరానికి; వచ్చి; యాదవ కుమారులతోడి= యాదవ బాలురతోడి; వినోదంబులన్= వేడుకలలో; తగిలి+ ఉండి= ఆసక్తుడై యుండి; ఒక్కనాఁడు; ఏన్= నేను; ఒంటిమైన్= ఒంటరిగా; ఉండన్= ఉండగా; నాకడకున్; చనుదెంచి= వచ్చి; నగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అని చెప్పి, మనస్సులోని మాట తనకు తెలియకుండానే నాలుకమీదకు రాగా, 'వీడు ఎట్లాగూ సజ్జనుల ప్రవర్తన కలిగి ఉంటాడా?' అని అతడు వినేటట్లు అన్నాడు. ఆ మాటకు అశ్వత్థామ విచారంతో బాధపడి ఉంటాడే కాని ఆ గురుడు చెప్పినట్లు సదుపదేశం ఆచరించేవాడు కాడు. అతడికి దురహంకారం ఉన్నది. వినుము. చెప్పుతాను. అతడికి ఈశ్వరవరప్రసాదం వలన చిరంజీవిత్వమూ కలిగింది గదా అనీ, దివ్యాస్త్ర శస్త్ర విద్యా రహస్యానికి మూల పురుషుడైన అగస్త్యుడివలన ద్రోణుడు పొందిన బ్రహ్మశిరోనామకాస్త్రం తనకున్నది కదా! అనీ, దాని మహిమవలన దేవమనుష్యరాక్షసలోకాలు బూడిద అవుతాయనీ ధీమాగా ఉంటాడు. కాబట్టి, పూర్వం మీరు వనవాసం చేస్తూండేటప్పుడు తాను మా నగరానికి వచ్చి యాదవ బాలకులతోడి వేడుకలలో ఆసక్తుడై ఉండి, ఒకనాడు నేను ఒంటరిగా ఉండగా నా దగ్గరకు వచ్చి నవ్వుతూ ఇట్లా అన్నాడు:

తే. **'విను మగస్త్యుఁడు మా తండ్రి వినుత తపము । పేర్మి కెంతయు నాత్మలోఁ బ్రీతిఁ బొంగి**
బ్రహ్మ శిరమను దివ్యాస్త్రరత్న మొసఁగెఁ; । నగ్గురుండు నాకిచ్చె నత్యాదరమున. 47

ప్రతిపదార్థం: వినుము; అగస్త్యుఁడు; మా తండ్రి= మా తండ్రియొక్క; వినుత తపము పేర్మికిన్= పొగడబడే తపస్సుయొక్క గొప్పతనానికి; ఎంతయున్= మిక్కిలి; ఆత్మలోన్= మనస్సులో; ప్రీతిన్= సంతోషంతో; పొంగి; బ్రహ్మశిరము+అను; దివ్య+ అస్త్ర రత్నము= దివ్యమైన అస్త్ర శ్రేష్ఠం; ఒసఁగెన్= ఇచ్చాడు; ఆ+గురుండు; అతి+ఆదరమునన్= మిక్కిలి వాత్సల్యంతో; నాకున్= నాకు; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: 'వినుము. అగస్త్యుడు మా తండ్రి చేసిన గొప్ప తపస్సుకు మనస్సులో ఎంతో సంతోషించి, బ్రహ్మ శిరస్సు అనే అస్త్రశ్రేష్ఠం ఇచ్చాడు. ఆ గురుడు అమిత వాత్సల్యంతో దానిని నా కిచ్చాడు.

వ. **ఆ దివ్యాస్త్రంబు నీ కిచ్చెద. నీవు నాకుఁ జక్రం బొసంగవలయు'నని పలికిన నే నద్దురభిమాని నాయెడం బరమ స్పర్ధ గలిగి యట్లడుగుట యెఱింగియు నొండనక యతనికి మదీయ చక్ర ధనుర్గదాఖడ్గంబులు సూపి 'వీనిలోన నీకు ధరింపఁ బ్రయోగింప శక్యంబైన దాని ధరింపు'మని చెప్పి 'నీవు నీ యస్త్రంబు నాకు నీ వలవదు. మిత్రుని కోరినయది యిచ్చుచుండి దానికి మాఱుగా నొకటి పుచ్చుకొనుట పురుషార్థంబు తెరువే?' యనుటయు నతండు సుదర్శనంబు వరియించినఁ; 'బుచ్చుకొ' మ్మంటి. నమ్మాటకు**

ముదితుండగుచు నమ్మూఢుండు దనవామకరంబునఁ జక్రం బవలంబించి యెత్తం జాలక దక్షిణపాణిం బట్టి యెట్లుఁ గదలఁ దివియశక్తుండు గాక యుభయ హస్తంబులును లావుసేసి తివిసినను నది కదలకుండె నాతండు డస్సి నిలిచి విషణ్ణుండై యున్న నతని నాలోకించి యిట్లంటి. 48

ప్రతిపదార్థం: ఆ దివ్య+అస్త్రంబున్; నీకున్= నీకు; ఇచ్చెదన్= ఇస్తాను; నీవు; నాకున్= నాకు; చక్రంబు= చక్రం; ఒసంగవలయున్= ఇవ్వవలెను; అని; పలికినన్= పలుకగా; నేను; ఆ+దురభిమాని= ఆ దురహంకారుడు; నా+ఎడన్= నాయందు; పరమ స్పర్ధ= మిక్కిలి అసూయ; కలిగి; అట్లు+అడుగుట= ఆ విధంగా అడగటం; ఎఱింగియున్; ఒండు+అనక= ఇంకొకమాట అనక; అతనికిన్; మదీయ చక్ర ధనుస్(ః)+గదా ఖడ్గంబులు= నా చక్రం (సుదర్శనం); ధనుస్సు (శార్‌ఙ్గం), గద(కౌమోదకి), ఖడ్గం(నందకం); చూపి; వీనిలోనన్; నీకున్; ధరింపన్= ధరించటానికి; ప్రయోగింపన్= ప్రయోగించటానికి; శక్యంబు+ఐన దానిన్; ధరింపుము= ధరించుము; అని; చెప్పి; నీవు; నీ+అస్త్రంబు; నాకున్; ఈన్+వలవదు= ఇవ్వనక్కరలేదు; మిత్రుని కోరిన+అది= స్నేహితుడు కోరినది; ఇచ్చుచున్+ఉండి= ఇస్తూ; దానికిన్; మాఱుగాన్= బదులుగా; ఒకటి; పుచ్చుకొనుట; పురుషార్థంబు తెరువే?= ధర్మమార్గమా?; అనుటయున్; అతండు; సుదర్శనంబున్; వరియించినన్= కోరగా; పుచ్చుకొమ్ము+ అంటిన్; ఆ+మాటకున్= ఆ మాటకు; ముదితుండు+అగుచున్= సంతోషించినవాడై; ఆ+మూఢుండు= ఆ తెలివితక్కువవాడు; తన వామ కరంబునన్= తన ఎడమచేతితో; చక్రంబు= చక్రం; అవలంబించి= పట్టుకుని; ఎత్తన్+చాలక= ఎత్తలేక; దక్షిణ పాణిన్= కుడిచేతితో; పట్టి; ఎట్లున్= ఏ విధంగానూ; కదలన్+తివియన్ శక్తుండు కాక= కదల్చలేక; ఉభయ హస్తంబులును= రెండు చేతులూ; లావు+చేసి= కూడగట్టి; తివిసినను= లాగినా; అది; కదలక+ఉండెన్; ఆతండు= అశ్వత్థామ; డస్సి= అలసి; నిలిచి; విషణ్ణుండు+ఐ= విషాదం పొందినవాడై; ఉన్నన్= ఉండగా; అతనిన్; ఆలోకించి= చూసి; ఇట్లు+అంటిన్= ఈ విధంగా అన్నాను.

తాత్పర్యం: ఆ దివ్యాస్త్రం నీ కిస్తాను. నీవు నాకు చక్రం ఇవ్వాలి' అని అంటే నేను ఆ దురహంకారి నాపై అసూయ కలిగి అట్లా అడుగుతున్నాడని తెలిసీ, ఇంకొకమాట అనకుండా, అతడికి నా చక్రం (సుదర్శనం), ధనుస్సూ(శార్‌ఙ్గం), గద(కౌమోదకి), ఖడ్గం (నందకం), చూపించి వీటిలో నీవు ధరించగల, ప్రయోగించగల దానిని ధరించుము' అని చెప్పి, 'నీవు నీ అస్త్రం నా కివ్వనక్కర్లేదు. స్నేహితుడు కోరినదానిని ఇస్తూ దానికి బదులుగా ఒకటి పుచ్చుకొనటం ధర్మమార్గం కాదు' - అనగా అతడు సుదర్శనం కోరితే, 'పుచ్చుకొమ్ము' అన్నాను. ఆ మాటకు సంతోషించి ఆ మందబుద్ధి తన ఎడమచేతితో-చక్రం పట్టుకొని ఎత్తలేక, కుడిచేతితో పట్టుకొని ఏ విధంగానూ కదల్చలేక, రెండు చేతులతోనూ లాగినా అది కదలకపోతే, అతడు అలసిపోయి దిగాలు పడిఉంటే, నేను అతడిని చూచి ఇట్లా అన్నాను:

తే. **'అధికనిష్ఠమై బ్రహ్మచర్య వ్రతంబు । తోడ రుక్మిణీయుతముగాఁ దుహినశైల**
తటమునందుఁ బండ్రెండు వత్సరము లుగ్ర । తప మొనర్చి యిమ్మహిత సాధనము వడసి. 49

ప్రతిపదార్థం: అధిక నిష్ఠమైన్= ఎక్కువ నిష్ఠతో; బ్రహ్మచర్య వ్రతంబుతోడన్; రుక్మిణీ యుతముగాన్= రుక్మిణితో కూడి; తుహినశైల తటమునందున్= హిమవత్పర్వతపు చరియమీద; పండ్రెండు వత్సరములు= పన్నెండేళ్ళు; ఉగ్ర తపము= ఘోరతపస్సు; ఒనర్చి= చేసి; ఈ+మహిత సాధనము+పడసి= ఈ గొప్ప సాధనం పొంది.

తాత్పర్యం: 'ఎంతో నిష్ఠతో బ్రహ్మచర్యవ్రతంతో రుక్మిణితో కూడి హిమవత్పర్వతపు చరియమీద పన్నెండేళ్ళు ఘోరతపస్సు చేసి ఈ గొప్ప సాధనం పొంది. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. దివిజ దానవ గంధర్వాది సమస్తభూతంబులు నాతోడి యెత్తు రాకుండెడు నట్టి దోర్వీర్యంబున వెలసి వర్తిల్లుదు; నట్టిది దీని మహత్త్వంబు; న న్నీ చక్రం బింతక మున్ను బలభద్ర ప్రద్యుమ్న సాంబాది యాదవశ్రేష్ఠు లెవ్వరు నడుగరు; గాండీవి శ్వేతాశ్వ కపిధ్వజంబులుఁ దపోబలంబునఁ బడసి యెక్కటికయ్యంబున రుద్రు మెప్పించి పాశుపతంబు గొనియెఁ; బ్రాణంబులకంటె నే నతనికిం గూర్తు; నద్దేవసమునకు నొసంగఁ దగనిది యెద్దియులేదు; దట్టి యర్జునుండును దీని నడిగెనే? భరతవంశాచార్యపుత్రుండవు, సకలజన మాన్యుండవు, నీ విట్లెఱుఁగక యడుగుదె? దీని నెవ్వరితోడ రణంబు సేయఁ దలంచి యడిగి?' తనిన నగ్గురునందనుం డిట్లనియె. 50

ప్రతిపదార్థం: దివిజ దానవ గంధర్వ+ఆది సమస్త భూతంబులున్= దేవతలు, రాక్షసులు, గంధర్వులు మొదలుగా అన్ని ప్రాణులూ; నాతోడి ఎత్తు రాక+ఉండెడు+అట్టి= నాతో సాటి రానట్టి; దోర్వీర్యంబునన్ (దోస్(ః)+వీర్యంబునన్)= భుజ పరాక్రమంతో; వెలసి= ఒప్పి; వర్తిల్లుదున్= ఉంటాను; అట్టిది= అటువంటిది; దీని మహత్త్వంబు= దీని గొప్పతనం; నన్నున్; ఈ చక్రంబు; ఇంతకమున్ను= ఇదివరకు; బలభద్ర ప్రద్యుమ్న సాంబ+ఆది యాదవశ్రేష్ఠులు= బలరాముడూ, ప్రద్యుమ్నుడూ, సాంబుడూ మొదలగు యాదవోత్తములు; ఎవ్వరున్= ఎవరూ; అడుగరు; గాండీవి= అర్జునుడు; శ్వేత+అశ్వ కపిధ్వజంబులు= తెల్లగుర్రాలూ, కపిధ్వజమూ; తపస్(ః)+బలంబునన్= తపశ్శక్తిచేత; పడసి= పొంది; ఎక్కటి కయ్యంబునన్= ఒక్కడూ చేసిన యుద్ధంలో; రుద్రున్= శివుడిని; మెప్పించి; పాశుపతంబున్= పాశుపతాస్త్రం; కొనియెన్= పొందాడు; నేను; ప్రాణంబులకంటెన్= ప్రాణాధికంగా; అతనికిన్+కూర్తున్= అతడిని ఇష్టపడతాను; ఆ+దేవ సమునకున్= ఆ దేవ సమానుడికి; ఒసంగన్+తగనిది= ఇవ్వరానిది; ఎద్దియున్+లేదు= ఏదీ లేదు; అట్టి అర్జునుండును= అలాంటి అర్జునుడు సైతం; దీనిన్+అడిగెనే?; భరతవంశ+ఆచార్య పుత్రుండవు= భరతవంశ గురుడి కుమారుడవు; సకల జన మాన్యుండవు= జనులందరిచేత మన్నింపదగ్గవాడవు; నీవు, ఇట్లు; ఎఱుఁగక; అడుగుదె?= అడుగుతావా?; దీనిన్; ఎవ్వరితోడన్; రణంబు+చేయన్+తలంచి= యుద్ధం చేయాలని; అడిగితి(వి)?+ అనినన్= అడిగావు? - అంటే; ఆ+గురునందనుండు= అశ్వత్థామ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు;

తాత్పర్యం: దేవతలూ, రాక్షసులూ, గంధర్వులూ మొదలైన ఎల్ల ప్రాణులూ నాతో సాటికాని భుజబలంతో ఒప్పి ఉంటాను. అదీ దీని గొప్పతనం. ఈ చక్రం ఇమ్మని నన్ను ఇంతవరకూ బలరాముడు, ప్రద్యుమ్నుడు, సాంబుడు మొదలుగా గల యాదవోత్తము లెవరూ అడగలేదు. అర్జునుడు శ్వేతాశ్వాలూ, కపిధ్వజమూ తపోబలంతో పొంది, ఒక్కడూ చేసిన యుద్ధంలో రుద్రుడిని మెప్పించి పాశుపతాస్త్రం పొందాడు. నాకు ప్రాణంకంటె ఎక్కువైన ఆ దేవసమానుడికి ఇవ్వరానిది ఏదీ లేదు. అటువంటి అర్జునుడుసైతం దీనిని అడిగాడా? భరతవంశ గురుడి కుమారుడివి, అందరి మన్ననలూ పొందదగినవాడివి నీవు ఇట్లా తెలియక అడిగావా? దీనిని పుచ్చుకొని ఎవరితో యుద్ధం చేయాలని అడిగావు?' అంటే అశ్వత్థామ ఇట్లా అన్నాడు:

చ. 'సకలజగత్ప్రసిద్ధ మగు చక్రము నీ వొసఁగంగ నిప్డు పు
చ్చి కొని భవత్పదాంబురుహసేన పదంపడి చేసియైనఁ బో
రికి నిను నియ్యకొల్పి మదిఁ బ్రీతి యెలర్పఁ బెనంగి నీకు నో
డక విలసిల్లి యెల్లఁ బొగడం పెనుపొందఁగఁ గోరి వేఁడితిన్. 51

ప్రతిపదార్థం: సకల జగత్+ప్రసిద్ధము= ఎల్ల లోకాలలోనూ గొప్పది; అగు; చక్రమున్= సుదర్శనాన్ని; నీవు; ఒసఁగంగన్= ఇస్తే; ఇప్డు= ఇప్పుడు; పుచ్చికొని= తీసుకొని; పదంపడి= తరువాత; భవత్+పద+అంబురుహ సేవ= నీ పాదపద్మ సేవ; చేసి+ఐనన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేసైనా; పోరికిన్= యుద్ధానికి; నినున్; ఇయ్యకొల్పి= ఒప్పించి; మదిన్= మనస్సులో; ప్రీతి= సంతోషం; ఎలర్పన్= అతిశయించగా; పెనంగి= యుద్ధం చేసి; నీకున్; ఓడక= జంకక; విలసిల్లి= ఒప్పి; ఎల్లన్= అంతా; పొగడన్= పొగడగా; పెనుపు+ఒందఁగన్+కోరి= అతిశయించగోరి; వేఁడితిన్= కోరాను.

తాత్పర్యం: 'ఎల్ల లోకాలలోనూ ప్రసిద్ధమైన సుదర్శనం నీవు ఇస్తే, ఇప్పుడు పుచ్చుకొని తరువాత నీ పాదపద్మసేవ చేసైనా, యుద్ధానికి నిన్ను ఒప్పించి, మనస్సులో సంతోషం అతిశయించగా, యుద్ధం చేసి నీకు జంకకుండా ఒప్పి అందరూ పొగడగా పెంపు వహించగోరి కోరాను.

వ. ఈ చక్రంబు నీక ధరియింపం దగియుండుఁ గాక, నా కిది లేకున్న నేమియగు? నెట్లును నీతోడ సంగరంబు సేయంగలవాఁడ' ననియె. నేను నవ్వుచు నట్లకాక యని ద్రోణాచార్య పుత్రత్వ బహుమానంబున మాననీయ రథ్యంబులు, నభిరామరత్నాంబరాభరణంబులు నిచ్చి పుచ్చినం జనియె; నట్టి మహాహంకారంబునకుఁ గారణంబైన బ్రహ్మశిరోనామకం బను దివ్యాస్త్రంబున నవ్యాహత సంరంభుండును, నసద్వ్యాపారారం భుండును, గ్రూర దర్శనుండును నగు నశ్వత్థామచేత భీముండు బాధితుండు గాకుండవలయు'నని పలికి పద్మనాభుండు సాత్యకి సహదేవులం జూచి మీరు శిబిరంబున నిలువుం'డని నియోగించి. 52

ప్రతిపదార్థం: ఈ చక్రంబు; నీకున్+అ= నీకే; ధరియింపన్= ధరించటానికి; తగి+ఉండున్+కాక; నాకున్; ఇది; లేక+ఉన్నన్= లేకపోతే; ఏమి+అగున్?= ఏమవుతుంది? ఎట్లును; నీతోడన్; సంగరంబు= యుద్ధం; చేయంగలవాఁడన్; అనియెన్; నేను; నవ్వుచున్; అట్లు+అ+కాక+అని= అట్లే అని; ద్రోణాచార్య పుత్రత్వ బహుమానంబునన్= ద్రోణాచార్యుడి కుమారుడనే గౌరవంతో; మాననీయ రథ్యంబులున్= ప్రశస్తాలైన గుర్రాలూ; అభిరామ రత్న+అంబర+ఆభరణంబులున్= మనోహరాలైన రత్నాలూ, వస్త్రాలూ, నగలూ; ఇచ్చి; పుచ్చినన్= పంపగా; చనియెన్= వెళ్ళాడు; అట్టి; మహా+అహంకారంబునకున్= గొప్ప పొగరుకు; కారణంబు+ఐన; బ్రహ్మశిరోనామకంబు; అను; దివ్య+అస్త్రంబునన్= దివ్యాస్త్రంచేత; అవ్యాహత సంరంభుండును= అప్రతిహతమైన సంరంభం గలవాడూ; అసత్+వ్యాపార+ఆరంభుండును= దుష్కర్మాచరణుడూ; క్రూరదర్శనుండును= క్రూరాత్ముడూ; అగు; అశ్వత్థామచేతన్; భీముండు; బాధితుండు= పీడితుడు; కాక+ఉండవలయున్= కాగూడదు; అని; పలికి; పద్మనాభుండు= కృష్ణుడు; సాత్యకి సహదేవులన్+చూచి; మీరు; శిబిరంబునన్; నిలువుండు= ఉండండి; అని; నియోగించి= నియమించి.

తాత్పర్యం: ఈ చక్రం నీకే ధరించదగ్గదై ఉండుగాక! నాకు ఇది లేకపోతే నష్టమేమున్నది? ఎట్లాగూ నీతో యుద్ధం చేస్తాను' అన్నాడు. నేను నవ్వుతూ అట్లాగే అని ద్రోణాచార్యుడి కొడుకనే గౌరవంచేత అతడికి మంచి గుర్రాలూ, మనోహర రత్నాలూ, వస్త్రాలూ, ఆభరణాలూ ఇచ్చి పంపితే వెళ్ళిపోయాడు. అటువంటి గొప్ప పొగరుకు కారణమైన బ్రహ్మశిరోనామక దివ్యాస్త్రంతో అప్రతిహతమైన సంరంభం గలవాడూ, దుష్కర్మాచరణుడూ, క్రూరాత్ముడూ అయిన అశ్వత్థామచేత భీముడు బాధితుడు కారా' దని పలికి, కృష్ణుడు సాత్యకినీ, సహదేవుడినీ చూచి 'మీరు శిబిరంలో ఉండండి' అని నియమించి.

ధర్మజధనంజయకృష్ణు లశ్వత్థామమీఁదికిఁ బోవుట (సం. 10-13-1)

సీ. ప్రద్యోతితానేక రత్న శోభితమును । సంభృతాయుధవరిష్ఠంబు నైన
మాన్య రథమ్మున శైబ్యసుగ్రీవంబు । లను మేఘపుష్పవలాహకములఁ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బూన్పించి యాభీల భుజగారికేతనం । బెత్తించి వే నొగ లెక్కుటయును,

గాండీవధరణోద్భటుండును దూణీర । యుగళసన్నాహసముజ్జ్వలుండు

ఆ. నై ధనంజయుఁడు రథారోహణము సేసె । నగ్రజుండు నెక్కెననికి నమరి

యొప్పి రమ్మురారియును వారు నప్పుడు । బలహరుండు నశ్వినులును బోలె. 53

ప్రతిపదార్థం: ప్రద్యోతిత= మిక్కిలి ప్రకాశించిన; అనేక= పెక్కు; రత్న శోభితమును= మణులచేత ఒప్పినదీ; సంభృత+ఆయుధ వరిష్ఠంబున్= నిండిన ఆయుధాలచేత మిక్కిలి గొప్పదీ; ఐన; మాన్య రథమ్మునన్= గొప్ప రథానికి; శైబ్యసుగ్రీవంబులను= శైబ్యమునూ; సుగ్రీవమునూ; మేఘపుష్ప వలాహకములన్= మేఘపుష్పమునూ; వలాహకమునూ; పూన్పించి= కట్టించి; ఆభీల భుజగ+అరి కేతనంబు= భయంకరమైన గరుడకేతనం; ఎత్తించి; వే= శీఘ్రంగా; నొగలు+ఎక్కుటయును= తొట్టిలో కూర్చుండగా; గాండీవ ధరణ+ఉద్భటుండును= గాండీవధారణచేత భయంకరుడూ; తూణీర= అమ్ములపొదులయొక్క; యుగళ= జంట చేతా; సన్నాహ= కవచంచేతా; సముజ్జ్వలుండున్= మిక్కిలి ప్రకాశించేవాడూ; ఐ; ధనంజయుఁడు= అర్జునుడు; రథ+ఆరోహణము+చేసెన్= రథం ఎక్కాడు; అగ్రజుండున్= అన్నకూడా (ధర్మరాజు కూడా); ఎక్కెన్; ఆ+ముర+అరియును= ఆ కృష్ణుడూ; వారున్= ధర్మజార్జునులూ; అప్పుడు; బలహరుండున్= ఇంద్రుడూ; అశ్వినులును+పోలెన్= అశ్వినీదేవతలవలె; అనికిన్= యుద్ధానికి అమరి= సంసిద్ధులై; ఒప్పిరి.

తాత్పర్యం: ప్రకాశించే పెక్కు మణులచేత ఒప్పినదీ, ఆయుధ సమృద్ధిచేత గొప్పదీ అయిన శ్రేష్ఠమైన రథానికి శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకాలనే కృష్ణుడి గుర్రాలను కట్టించి, భయంకరమైన గరుడకేతనం ఎత్తించి శీఘ్రమే నొగలపై కూర్చుండగా, గాండీవధారణచేత భయంకరుడూ, అంపపొదుల జంటా, కవచం అనేవాటిచేత మిక్కిలి ప్రకాశించేవాడూ అయి అర్జునుడు రథం ఎక్కాడు. అన్న ధర్మరాజు కూడా ఎక్కాడు. కృష్ణుడూ, వాళ్ళిద్దరూ అప్పుడు ఇంద్రుడూ, అశ్వినులూ అన్నట్లుగా యుద్ధానికి సంసిద్ధులై ఒప్పారు.

విశేషం: అలం: ఉపమ. 'ఒప్పి రమ్మురారియును వారు నప్పుడు - బలహరుండు నశ్వినులును బోలె.' - అలంకారం ఉపమ. మురారి, వారు - ఉపమేయం, బలహరుడు, అశ్వినులు ఉపమానం. పోలె - ఉపమావాచకం. ఒప్పిరి - సమానధర్మం. ఈ నాలుగూ ఉండటంచేత ఇది సంపూర్ణోపమ. కృష్ణుడి గుర్రాలలో ఒకదానికి సైన్యము (శైబ్యము) అని పేరు.

వ. ఇట్లు సన్నద్ధంబైన యా రథంబు భాసురప్రతోదంబు పుచ్చుకొని యద్దామోదరుండు వఱప నయ్యుత్తమ రథ్యంబుల రయాతిశయంబున సమీరనందన స్యందనంబు గొండొక సేపునకుం గూడె; నప్పుడు భాగీరథీతీరం బునఁ గ్రోధాయత్త చిత్తుండగుచు నశ్వత్థామ యున్నయెడ రోయుచుఁ బోవు నప్పావని నమ్ముప్పురు వారించి; రట్టు వారించిన నిలువక వారి ముందటం జని యతండు సూడ్కి యట నిగిడించి. 54

ప్రతిపదార్థం: ఇట్లు; సన్నద్ధంబు+ఐన= కట్టబడిన; ఆ రథంబున్; భాసుర ప్రతోదనంబున్= ప్రకాశించే కొరడాను; పుచ్చుకొని; ఆ+దామోదరుండు= ఆ కృష్ణుడు; వఱపన్= పరుగెత్తించగా; ఆ+ఉత్తమ రథ్యంబుల= ఆ శ్రేష్ఠములైన గుర్రాలయొక్క; రయ+అతిశయంబునన్= వేగాధిక్యంచేత; సమీర నందన స్యందనంబున్= భీముడి రథాన్ని; కొండొకసేపునకున్= కొంతసేపటికి; కూడెన్= కలిసికొన్నది; అప్పుడు; భాగీరథీ తీరంబునన్= గంగానది ఒడ్డున; క్రోధ+ఆయత్త చిత్తుండు+అగుచున్= కోపానికి వశమైన మనస్సుకలవాడు అవుతూ; అశ్వత్థామ+ఉన్న ఎడన్= అశ్వత్థామ ఉన్నచోటు; రోయుచున్= వెదకుతూ; పోవు+ఆ+పావనిన్= వెళ్ళే ఆ భీముడిని; ఆ+ముప్పురున్= ఆ ముగ్గురూ - ధర్మజార్జున కృష్ణులు; వారించిరి= ఆపుచేశారు; అట్టు= ఆ విధంగా;

వారించినన్= ఆపగా; నిలువక; వారి ముందటన్+చని= వారికంటె ముందువెళ్ళి; అతండు= భీముడు; చూడ్కి= చూపు; అటన్= అక్కడ; నిగిడించి= సారించి.

తాత్పర్యం: ఇట్లా కట్టబడిన ఆ రథాన్ని మంచి కొరడా పుచ్చుకొని ఆ కృష్ణుడు పరుగెత్తించగా ఆ శ్రేష్ఠములైన గుర్రాల వేగాధిక్యంచేత భీముడి రథాన్ని కొంతసేపటికి కలుసుకొన్నది. అప్పుడు గంగానది ఒడ్డున కోపంతో అశ్వత్థామ ఉన్నచోటు వెదకుతూపోయే భీముడిని ఆ ముగ్గురూ ఆపుచేశారు. అట్లా వారిస్తే నిలువక వారికంటె ముందుగా వెళ్ళి అతడు అక్కడ చూపు సారించి.

చ. **సలిల సమీపదేశమున సంయమిసంఘము గొల్వఁగా సము**
జ్జ్వల మహనీయమూర్తి యగు సాత్యవతేయుఁడు తారకాగణం
బుల నడుమం బ్రదీప్తుఁడగు పూర్ణసుధాంశుని యట్టు లుండ న
వ్వలనికిఁ బోక భక్తి నభివాదనముల్ మదిలోనఁ జేయుచున్. **55**

ప్రతిపదార్థం: (పై వచనంలోని 'అతండు' - కర్త), సలిల సమీప దేశమునన్= నీటికి దగ్గరగా ఉన్నచోట; సంయమి సంఘము= మునుల సమూహం; కొల్వఁగాన్= సేవిస్తూండగా; సముజ్జ్వల మహనీయ మూర్తి+అగు= ప్రకాశించే గొప్ప ఆకారం గలవాడు అగు; సాత్యవతేయుఁడు= వ్యాసుడు; తారకా గణంబు నడుమన్= నక్షత్రాల సమూహాల మధ్య; ప్రదీప్తుఁడు+అగు= ప్రకాశించే; పూర్ణ సుధాంశుని+అట్టులు+ఉండన్= పూర్ణచంద్రుడిలా ఉండగా; ఆ+వలనికిన్= ఆవైపు; పోక= వెళ్ళక; భక్తిన్= భక్తితో; అభివాదమున్= నమస్కారం; మదిలోనన్= మనస్సులో; చేయుచున్= చేస్తూ.

తాత్పర్యం: నీటికి దగ్గరగా ఉన్న ప్రదేశంలో ముని సమూహం సేవిస్తూండగా ప్రకాశించే గొప్ప ఆకారం కల వ్యాసుడు నక్షత్ర సమూహాల మధ్య ప్రకాశించే నిండుచంద్రుడివలె ఉండగా (భీముడు) ఆ వైపు పోక, భక్తితో మనస్సులో నమస్కరిస్తూ. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ. 'సంయమిసంఘము గొల్వఁగా.... సాత్యవతేయుఁడు తారకాగణంబుల నడుమం బ్రదీప్తుఁడగు పూర్ణసుధాంశుని యట్టులుండ'... అలంకారం ఉపమ. సంయమిసంఘము, సాత్యవతేయుడు ఉపమేయాలు. తారకాగణంబులు, పూర్ణసుధాంశుడు క్రమంగా వాటికి ఉపమానాలు. ఉండు - సమానధర్మం. 'అట్టులు' ఉపమావాచకం. నాలుగంశాలూ ఉండటంచేత ఇది సంపూర్ణోపమ. ఈ ఉపమవలన ఇతర మునులకంటె వ్యాసుడి విశిష్టత తెలుస్తున్నది. భీముడు వ్యాసుడి దగ్గరకు వెళ్ళకపోవటానికి కారణం, అశ్వత్థామను పట్టుకోవటమే ప్రస్తుతం అతడికి ముఖ్యకర్తవ్యం కాబట్టి.

వ. **కెలంకులు గలయం బరికించి యొక్కెడ.** **56**

ప్రతిపదార్థం: కెలంకులు= ప్రక్కలు; కలయన్+పరికించి= అంతటా చూసి; ఒక్క+ఎడన్= ఒక్కచోట.

తాత్పర్యం: ప్రక్కలు బాగా చూచి, ఒకచోట.

ఆ. **మేన భసిత మలఁది మాననీయ తపః ప్ర। యుక్తి నాదరించి యున్న ద్రోణ**
తనయుఁ గాంచి చాపదండంబు సజ్యంబు। సేసి మహితశరముచే నమర్చి. **57**

ప్రతిపదార్థం: (54వ వచనంలోని 'అతఁడు' - కర్త) మేనన్= శరీరంపై; భసితము= భస్మం; అలఁది= పూసి; మాననీయ తపస్(ః)+ప్రయుక్తిన్= మన్నించదగిన తపఃప్రయోగాన్ని; ఆదరించి+ఉన్న= పాటించి ఉన్నట్టి; ద్రోణతనయున్= అశ్వత్థామను;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కాంచి= చూచి; చాపదండంబున్= వింటి బద్దను; సజ్యంబు+చేసి= త్రాటితో కూడినదిగా చేసి; మహిత శరముచేన్= గొప్ప బాణంతో; అమర్చి= కూర్చి.

తాత్పర్యం: శరీరం నిండా బూది పూసికొని గొప్ప తపస్సు చేస్తూన్న అశ్వత్థామను భీముడు చూచి, వింటికి నారి తగిలించి, గొప్పబాణం కూర్చి.

వ. భ్రుకుటిత వికట ఫాలభాగుండై. 58

ప్రతిపదార్థం: భ్రుకుటిత= బొమముడి పడటంచేత; వికట= భయంకరమైన; ఫాలభాగుండు+ఐ= నుదుటి ప్రదేశం కలవాడయి.

తాత్పర్యం: బొమలు ముడిపడటంచేత భయంకరమైన నుదురు కలవాడై.

తే. 'ఓరి ధాత్రీసురాధమ! క్రూరకర్మ! । కపట ధార్మిక! యత్యంత కల్మషాభి
యుక్తిఁ బోయినరేయి మహోగ్రవృత్తిఁ । దగిలి; తెంత వేగిరమునఁ దపసివైతి! 59

ప్రతిపదార్థం: ఓరి ధాత్రీసుర+అధమ!= ఓరి నీచబ్రాహ్మణుడా!; క్రూరకర్మ!= క్రూరపు పనులు చేసేవాడా!; కపట ధార్మిక!= ధర్మం నటించేవాడా!; పోయిన రేయి= కడచిన రాత్రి; అత్యంత కల్మష+అభియుక్తిన్= మిక్కిలి పాపంతో; మహా+ఉగ్ర వృత్తిన్= మిక్కిలి ఘోరమైన ప్రవర్తనతో; తగిలితి(వి)= ఆసక్తిగలిగి ఉన్నావు; ఎంత వేగిరమునన్= ఎంతవేగంగా; తపసివి+ఐతి(వి)!= ముని వయ్యావు!

తాత్పర్యం: 'ఓరీ నీచబ్రాహ్మణుడా! క్రూరకర్ముడా! ధర్మం నటించేవాడా! గతరాత్రి మిక్కిలి పాపంతో ఘోరంగా ప్రవర్తించి, ఎంతవేగంగా ముని వయ్యావు?

వ. ఇట్టు లొదిఁగిన జావు దప్పునే? లే లెమ్ము. తపమ్ము సాలు రణమ్మునకు ర'మ్మని కఠినాక్షరంబులుగాఁ బలికె. నటు పలుకు నా భీమసేనుం గనుంగొని యతని వెనుకఁ గదియ నడచిన సవ్యసాచి ధర్మజులం జూచి సవ్యథంబగు నంతఃకరణంబుతో నగ్గురునందనుండు వారల దివ్యాస్త్రవేదిత్వం బూహించి దుస్సహంబగు నమ్మహా దురితంబునకుఁదలంకి బ్రహ్మశిరోనామకం బను దివ్యాస్త్రంబు దలంచి యొక్క యిషీకంబు వుచ్చికొని యం దయ్యస్త్రంబు నావహించి 'యపాండవం బయ్యెడు' మని దారుణ భాషణంబులతోడ రోషప్రదీప్తుం డగుచుఁ బ్రయోగించిన. 60

ప్రతిపదార్థం: ఇట్టులు= ఇలా; ఒదిఁగినన్= దాక్కుంటే; చావు; తప్పునే?; లెమ్ము+లెమ్ము; తపమ్ము+చాలున్; రణమ్మునకున్= యుద్ధానికి; రమ్ము+అని; కఠిన+అక్షరంబులు+కాన్= పరుషంగా; పలికెన్; అటు= అట్లా; పలుకు+ఆ భీమసేనున్= పలికే ఆ భీముడిని; కనుంగొని= చూచి; అతని వెనుకన్; కదియన్+నడచిన= వెంటవచ్చినట్టి; సవ్యసాచి ధర్మజులన్= అర్జునుడినీ, ధర్మరాజునీ; చూచి; సవ్యథంబు+అగు+అంతఃకరణంబుతోన్= బాధతో గూడిన మనస్సుతో; ఆ+గురునందనుండు= ఆ అశ్వత్థామ; వారల= వాళ్ళయొక్క; దివ్య+అస్త్ర+ వేదిత్వంబు= దివ్యాస్త్రజ్ఞానం; ఊహించి= తెలిసి; దుస్సహంబు+అగు+ఆ+మహత్ (మహా) దురితంబునకున్= సహించశక్యంకాని ఆ మహాపాప కార్యానికి; తలంకి= కలతచెంది; బ్రహ్మశిరోనామకంబు+అను దివ్య+అస్త్రంబు= బ్రహ్మశిరోనామకమైన దివ్యాస్త్రాన్ని; తలంచి; ఒక్క+ఇషీకంబు+పుచ్చికొని= ఒక్క రెల్లుగడ్డిపరకను పట్టుకుని; అందున్; ఆ+అస్త్రంబున్= ఆ అస్త్రాన్ని; ఆవహించి= ఆవాహనం చేసి; అపాండవంబు+అయ్యెడున్+అని= నిష్పాండవం

అవాలని; దారుణ భాషణంబులతోడన్= పరుషవాక్యాలతో; రోష ప్రదీప్తుండు+అగుచున్= కోపంతో మండిపడుతూ; ప్రయోగించినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: ఇట్లా దాక్కుంటే చావు తప్పుతుందా? లెమ్ము. లెమ్ము. తపం చాలును. యుద్ధానికి రమ్ము' అని పరుషంగా పలికాడు. అట్లా అనే భీముడిని చూచి, అతడి వెనక వచ్చిన అర్జునుడినీ, ధర్మరాజునీ చూచి బాధపడే మనస్సుతో ఆ అశ్వత్థామ వాళ్ళ దివ్యాస్త్రజ్ఞానం ఎరిగి, సహించరాని తన మహాపాపకార్యానికి కలతపడి బ్రహ్మశిరోనామక దివ్యాస్త్రం తలచుకొని ఒక రెల్లు గడ్డిపోచ పట్టుకొని దానిపైకి ఆ అస్త్రాన్ని ఆవాహనంచేసి, 'పాండవనిర్మూలనం అవుతుంది గాక!' అని పరుషంగా అంటూ, కోపంతో మండిపడుతూ ప్రయోగించగా.

స్రగ్ధర.

ఆ దివ్యాస్త్రంబునం దుద్యత మయి ఘనఘోరాగ్ని యర్చిర్వితానం
బేదిక్కుం దానయై పెల్లెసఁగుచు భవనంబెల్ల భస్మంబుగా నా
పాదింపం బేర్చుమాడ్కిం బరఁగి పెరిఁగినం బార్థునిం జూచి తద్బా
హాదర్పజ్ఞానముద్రావ్యపగతభయుఁ డై యంబుజాక్షుండు వల్కున్. 61

ప్రతిపదార్థం: ఆ దివ్య+అస్త్రంబునందున్= ఆ దివ్యాస్త్రంలోంచి; ఉద్యతము+అయి= పుట్టినదయి; ఘన ఘోర+అగ్ని= గొప్పదీ, భయంకరమైనదీ అయిన అగ్నియొక్క; అర్చిస్(ః)+వితానంబు= జ్వాలల సమూహం; ఏ దిక్కున్= ఏవైపైనా; తాను+అ+ఐ= తానే అయి; పెల్లు+ఎసఁగుచున్= మిక్కిలి విజృంభిస్తూ; భువనంబు+ఎల్లన్= లోకం అంతా; భస్మంబు+కాన్= బూడిదగా; ఆపాదింపన్= చేసేటట్టు; పేర్చుమాడ్కిన్= విజృంభించే విధంగా; పరఁగి= ఒప్పి; పెరింగినన్= వృద్ధిపొందగా; పార్థునిన్= అర్జునుడిని; చూచి; తద్= అతడియొక్క (ఆ అర్జునుడియొక్క); బాహా= భుజాలయొక్క; దర్ప= గర్వంయొక్క; జ్ఞానముద్రా= తెలివిడిగుర్తు చేత; వ్యపగత= పోయిన; భయుఁడు+ఐ= భయంగలవాడై; అంబుజ+అక్షుండు= పద్మాలవంటి కళ్ళుగలవాడు-కృష్ణుడు; పల్కున్= పలికాడు.

తాత్పర్యం: ఆ దివ్యాస్త్రంనుండి పుట్టిన పెద్దదీ భయంకరమైనదీ అయిన అగ్నిజ్వాలల సమూహం, అన్నివైపులా తాను అయి మిక్కిలి విజృంభిస్తూ లోకాన్ని అంతనీ బూడిదచేసేటట్లు అతిశయించే విధంగా ఒప్పి పెరుగగా, కృష్ణుడు అర్జునుడిని చూచి, అతడి భుజ పరాక్రమం తెలిసినవాడవటంచేత భయంలేనివాడై ఇట్లా అన్నాడు.

వ. 'అర్జున! యర్జున! యిది బ్రహ్మ శిరోనామకం బను దివ్యాస్త్రంబు. దీని నొం డస్త్రంబు ప్రతిహతంబుఁ జేయంజాలదు, బ్రహ్మ శిరంబు నీవునుం బ్రయోగించి దీని నుడిపి నిన్నును నీ సోదరులను గాచికొనుము. సత్వరుండవు గమ్ము.' 62

ప్రతిపదార్థం: అర్జున!= అర్జునా!; ఇది; బ్రహ్మ శిరోనామకంబు; అను; దివ్య+అస్త్రంబు; దీనిన్= దీనిని; ఒండు+అస్త్రంబు= ఇంకొక అస్త్రం; ప్రతిహతంబున్= తిప్పికొట్టబడిందిగా; చేయన్+చాలదు= చేయలేదు; నీవునున్= నువ్వుకూడా; బ్రహ్మశిరంబున్= బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని; ప్రయోగించి; దీనిన్; ఉడిపి= మాన్పి; నిన్నును; నీ సోదరులను; కాచికొనుము= రక్షించుకొమ్ము; సత్వరుండవు+కమ్ము= త్వరపడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'అర్జునా! అర్జునా! ఇది బ్రహ్మశిరోనామక దివ్యాస్త్రం. దీన్ని వేరే అస్త్రం తిప్పికొట్టలేదు. నీవు కూడా బ్రహ్మశిరోనామకాస్త్రాన్నే ప్రయోగించి దీనిని నిరోధించి, నిన్నూ నీ సోదరులనూ కాపాడుకొమ్ము. త్వరపడుము.'

క. అనవుడు నవ్వీరుఁడు స । య్యన నరదము డిగ్గి నియతుఁడై ధనురాచా
ర్యుని సంస్మరించి చాపము । గొని మంత్రముతోడ శరము గుణమునఁ గూర్చెన్. 63

ప్రతిపదార్థం: అనవుడున్= అన్నంతనే; ఆ+వీరుఁడు= ఆ వీరుడైన అర్జునుడు; చయ్యనన్= శీఘ్రంగా; అరదమున్+డిగ్గి= రథందిగి; నియతుఁడు+ఐ= నియమం గలవాడై; ధనుస్(ః)+ఆచార్యునిన్= ధనుర్విద్యా గురువైన ద్రోణుడిని; సంస్మరించి= తలచుకొని; చాపము+కొని= విల్లు తీసుకొని; మంత్రముతోడన్= సమంత్రకంగా; శరమున్= బాణాన్ని; గుణమునన్= అల్లెత్రాటియందు; కూర్చెన్.

తాత్పర్యం: అని కృష్ణు డనగానే ఆ వీరుడు వెంటనే రథం దిగి నియమంతో ద్రోణాచార్యుడిని తలచుకొని, విల్లు తీసికొని, సమంత్రకంగా బాణాన్ని అల్లెత్రాటితో సంధించాడు.

అశ్వత్థామార్జునుల బ్రహ్మశిరోనామకాస్త్రంబు లొండొంటిం దాఁకుట (సం. 10-15-1)

వ. కూర్చి తొలుత గురునందనునకుం గీడు వొందకుండ వలయునని ప్రార్థించి పదంపడి నాకును సోదరులకును శుభం బయ్యెడుమని పలికి యస్త్రదేవతలకు నమస్కరించి యస్త్ర మస్త్రంబునన శమియించుఁ గావుత మని శివంబుఁ జింతించుచుం బ్రయోగించిన నా దివ్యాస్త్రంబు కల్పాంతజ్వలనంబునుం బోలె నాభీలజ్వాలా మాలాకరాళంబై యుప్పరం బెల్లను దనమయంబుగా నిగిడి యశ్వత్థామాస్త్రంబు గ్రమ్మఱింప నుత్సహించిన నది క్రమ్మఱక పెరిఁగి సముద్దామధామం బగుటయు నయ్యస్త్రద్వితయంబు నాటోపంబున. 64

ప్రతిపదార్థం: కూర్చి= సంధించి; తొలుతన్= మొదట; గురు నందనునకున్= అశ్వత్థామకు; కీడు+పొందక+ఉండన్+వలయున్+అని= హాని జరగకుండా ఉండాలని; ప్రార్థించి; పదంపడి= పిమ్మట; నాకున్= నాకు; సోదరులకును; శుభంబు+అయ్యెడున్+అని= శుభం కలగాలని; పలికి; అస్త్ర దేవతలకున్; నమస్కరించి; అస్త్రము; అస్త్రంబునన్+అ= అస్త్రంచేతనే; శమియించున్+కావుతన్+అని; శాంతించాలని; శివంబున్= శుభం; చింతించుచున్= తలపెడుతూ; ప్రయోగించినన్= ప్రయోగించగా; ఆ దివ్య+అస్త్రంబు; కల్పాంతజ్వలనంబునున్+పోలెన్= ప్రళయ సమయంలోని అగ్నివలె; ఆభీల జ్వాలామాలా కరాళంబు+ఐ= భయంకరమైన జ్వాలల సమూహంచేత భయంకరమై; ఉప్పరంబు+ఎల్లను= ఆకాశం అంతా; తనమయంబు కాన్= తనే నిండగా; నిగిడి= వ్యాపించి; అశ్వత్థామ+అస్త్రంబు= అశ్వత్థామ అస్త్రం; క్రమ్మఱింపన్= మరల్చటానికి; ఉత్సహించినన్= ప్రయత్నించగా; అది, క్రమ్మఱక= మరలక; పెరిఁగి; సముద్దామ+ధామంబు+అగుటయున్= మిక్కిలి భయంకరమైన కాంతులు గలది కాగా; ఆ+అస్త్ర+ద్వితయంబు+ఆటోపంబునన్= ఆ రెండు అస్త్రాల విజృంభణం చేతా.

తాత్పర్యం: సంధించి మొదట అశ్వత్థామకు హాని కలగకుండా ఉండాలని ప్రార్థించి, తరువాత 'నాకూ నా సోదరులకూ శుభం కలగా' లని పలికి అస్త్రదేవతలకు నమస్కరించి అస్త్రం అస్త్రంచేతనే శాంతించాలని, శుభం జరగాలని కోరుతూ ప్రయోగించగా ఆ దివ్యాస్త్రం ప్రళయ సమయంలో అగ్నివలె భయంకర జ్వాలల సమూహంతో వెరపు పుట్టిస్తూ ఆకాశం అంతా తనే అయ్యేటట్టు వ్యాపించి అశ్వత్థామ అస్త్రాన్ని త్రిప్పికొట్టటానికి ప్రయత్నించగా

అది మరలక పెరిగి భయంకరకాంతులు గలిగినది కాగా, ఆ రెండస్త్రాల విజృంభణంచేత. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. 'కల్పాంతజ్వలనంబునుం బోలె' - అలంకారం ఉపమ. అశ్వత్థామ అపాండవం కావాలని కోరగా, అర్జునుడు అశ్వత్థామకు కీడు కలగకూడదని కోరాడు. అదీ వాళ్ళ శీలాలకు గల తేడా.

మహాస్రగ్ధర.

జలధుల్ ఘూర్ణిల్లె, నుల్కాశతములు వడియెం, జండభానుండు మాసెం,
గులశైలంబుల్ వడంకెం, గురిసె నురవడిన్ ఘోరపాషాణధారా
వలి, నాకాశంబు ధాత్రీవలయముఁ దిరిగెన్, వజ్రనిర్ఘోష మెందుం
జెలఁగం జొచ్చెన్, జనం బచ్చెరువును భయముం జెంది నిశ్చేష్ట మయ్యెన్. 65

ప్రతిపదార్థం: జలధుల్= సముద్రాలు; ఘూర్ణిల్లెన్= తిరుగుడుపడ్డాయి; ఉల్కాశతములు+పడియెన్= వందలకొద్దీ ఉల్కలు రాలాయి; చండభానుండు= తీక్షణమైన సూర్యుడు; మాసెన్= అంతరించాడు; కులశైలంబుల్= కులపర్వతాలు; వడంకెన్= కంపించాయి; ఆకాశంబున్= ఆకాశం; ఘోరపాషాణ ధారా+ఆవలిన్= భయంకర శిలావర్షధారల సమూహాన్ని; ఉరవడిన్= మిక్కిలి వేగంతో; కురిసెన్; ధాత్రీ వలయమున్= భూమండలమూ; తిరిగెన్; ఎందున్= అన్నిచోట్లా; వజ్ర నిర్ఘోషము= పిడుగుల చప్పుడు; చెలఁగన్+చొచ్చెన్= మ్రోగ నారంభించినది; జనంబు= మనుష్యుల సమూహం; అచ్చెరువును= ఆశ్చర్యమూ; భయమున్; చెంది; నిశ్చేష్టము+అయ్యెన్= చేష్టలుడిగింది.

తాత్పర్యం: సముద్రాలు తిరుగుడు పడ్డాయి. వందలకొద్దీ ఉల్కలు రాలాయి. తీవ్ర సూర్యుడు అంతరించాడు. కులపర్వతాలు కంపించాయి. ఆకాశం భయంకర శిలావర్షం మిక్కిలి వేగంగా కురిసింది. భూమి తిరుగుడు పడింది. అంతటా పిడుగుల చప్పుడు మ్రోగ నారంభించింది. జనులు ఆశ్చర్యమూ, భయమూ చెంది చేష్ట లుడిగారు.

విశేషం: 'కులశైలములు - మహేంద్రము, మలయము, సహ్యము, శుక్తిమంతము, గంధమాదనము, వింధ్యము, పారియాత్రము అని కులపర్వతాలు ఏడు.

వ. ధర్మాత్ముండగు నారదుం డప్పుడు సాత్యవతేయునకు సన్నిహితుండయ్యె, నతండును భరత కులోద్వహుండగు నప్పారాశర్యుండును గూడి యిట్లు జగద్భయంకర ప్రక్రమోద్దాములగు నయ్యర్జునాశ్వత్థామల నుపశమింపంజేయుట కై నడుమ నిలిచి యయ్యిరువురును నాకర్ణింప నిట్లనిరి. 66

ప్రతిపదార్థం: ధర్మ+ఆత్ముండు+అగు= పుణ్యాత్ముడైన; నారదుండు= నారదుడు; అప్పుడు; సాత్యవతేయునకున్= వ్యాసుడికి; సన్నిహితుండు+అయ్యెన్= సమీపించినవాడు అయ్యాడు; అతండును; భరతకుల+ఉద్వహుండు+అగు= భరతవంశోద్ధారకుడైన; ఆ+పారాశర్యుండును= ఆ వ్యాసుడును; కూడి= కలిసి; ఇట్లు; జగత్+భయంకర+ప్రక్రమ+ఉద్దాములు+అగు= లోక భీకరమైన ప్రయత్నంతో ఉద్దండులు అయిన; ఆ+అర్జున+అశ్వత్థామలన్= ఆ అర్జునుడినీ, అశ్వత్థామనీ; ఉపశమింపన్+చేయుటకై= శాంతింపజేయటానికి; నడుమన్= మధ్య; నిలిచి; ఆ+ఇరువురును= ఆ ఇద్దరూ; ఆకర్ణింపన్= వినేటట్టు; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: పుణ్యాత్ముడైన నారదుడు అప్పుడు వ్యాసుడి దగ్గరకు వచ్చాడు. అతడూ, భరతవంశోద్ధారకుడైన వ్యాసుడూ కలిసి, ఈ రీతిగా లోకభీకర ప్రయత్నంలో ఉద్దండులైన ఆ అర్జునుడినీ, అశ్వత్థామనీ శాంతింపజేయటానికి మధ్య నిలిచి, వాళ్ళిద్దరూ వినేటట్లు ఇట్లా అన్నారు:

క. 'పలువురు మహాస్త్ర విత్తము । లలఘు భుజావీర్యశౌర్యు లవనిఁ జనిరి వా
రలు దీనిఁ బ్రయోగించుట । గలిగెనె మానవులపై నకల్మషులారా?' 67

ప్రతిపదార్థం: పలువురు= పెక్కుమంది; మహా+అస్త్రవిత్తములు= గొప్ప అస్త్రాలు తెలిసినవారిలో శ్రేష్ఠులూ; అలఘు భుజా వీర్య శౌర్యులు= తక్కువకాని భుజబల పరాక్రమం గలవారూ; అవనిన్+చనిరి= భూమిపై; ఒప్పినారు; అకల్మషులారా!= అనఘులారా!; వారలు; దీనిన్; మానవులపైన్= మనుష్యులమీద; ప్రయోగించుట= ప్రయోగించటం; కలిగెనె?= సంభవించిందా?

తాత్పర్యం: 'ఓ అనఘులారా! ఎంతోమంది దివ్యాస్త్రవిద్యావేత్తలలో శ్రేష్ఠులూ, గొప్ప భుజబలపరాక్రమం గలవారూ భూమిలో ఉండినారు. వాళ్ళు దీనిని మనుష్యుల మీద ప్రయోగించటం సంభవించిందా?'

వ. అనిన విని సవ్యసాచి దివ్యాస్త్ర జ్వాలా కలాప మధ్యంబున నిస్సంభ్రములై యున్న సర్వధర్మరక్షణ సర్వలోక హితాచరణపరిణతులగు నప్పరమమునులం గనుంగొని తత్కాలోచితానుష్ఠానంబు నూహించి యమ్మహాత్ములతో నిట్లనియె. 68

ప్రతిపదార్థం: అనినన్; విని; సవ్యసాచి= అర్జునుడు; దివ్య+అస్త్రజ్వాలా కలాప మధ్యంబునన్= దివ్యాస్త్రాల అగ్నిజ్వాలల సమూహం నడుమ; నిస్సంభ్రములు+ఐ+ఉన్న= నిశ్చేష్టులైఉన్న; సర్వ ధర్మ రక్షణ సర్వలోక హిత+ఆచరణ పరిణతులు+అగు= అన్ని ధర్మాలనూ రక్షించటంలోనూ, అన్ని లోకాలకూ మేలు చేయటంలోనూ పండిపోయినవారైన; ఆ+పరమ మునులన్= ఆ మహర్షులను; కనుంగని= చూచి; తద్+కాల+ఉచిత+అనుష్ఠానంబున్= ఆ సమయానికి తగిన ఆచారాన్ని; ఊహించి= తలచి; ఆ+మహత్+ఆత్ములతోన్= ఆ మహనీయులతో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని అర్జునుడు దివ్యాస్త్రాల అగ్నిజ్వాలల సమూహం మధ్య నిశ్చేష్టులై ఉన్న సర్వధర్మ రక్షణంలోనూ, సకలలోక హితాచరణంలోనూ పండిపోయిన ఆ మహర్షులను చూచి, ఆ సమయానికి తగిన ఆచారాన్ని తలచి, ఆ మహనీయులతో ఇట్లా అన్నాడు:

తే. అస్త్ర మస్త్రముతో శాంత మగుటఁ గోరి । సొలవ కట్లు ప్రయోగింపవలసెఁ గాని
యొండు దలఁపునఁ గా దది యుడుపవలయు । నేని యుడిపెదఁ బరమమునీంద్రులార! 69

ప్రతిపదార్థం: పరమ ముని+ఇంద్రులార!= మహామునీశ్వరులారా!; అస్త్రము; అస్త్రముతోన్; శాంతము+అగుటన్+కోరి= శాంతించటం కోరి; సొలవక= జంకక; అట్లు= ఆ రీతిగా; ప్రయోగింపన్+వలసెన్+కాని= ప్రయోగించవలసి వచ్చింది కాని; ఒండు+తలఁపునన్+కాదు= మరొక ఉద్దేశంతో కాదు; అది; ఉడుపవలయున్+ఏని= ఉపసంహరించాలంటే; ఉడిపెదన్= ఉపసంహరిస్తాను.

తాత్పర్యం: 'మహామునీశ్వరులారా! అస్త్రం అస్త్రంతో ఉపశమిస్తుంది గదా అని జంకకుండా అట్లా ప్రయోగించవలసి వచ్చింది కాని మరొక ఉద్దేశంతో కాదు. దానిని ఉపసంహరించాలంటే ఉపసంహరిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఏను మదస్త్రం బుడుపం । గా నీ పాపాత్ముఁ డస్త్రఘనదహనమునం
దా నేర్చు నందఱను; మీ । మానసములఁ దలఁపవలయు మా సేమంబుల్.' 70

ప్రతిపదార్థం: ఏను= నేను; మత్+అస్త్రంబు= నా అస్త్రం; ఉడుపంగాన్= ఉపసంహరించగా; ఈ పాప+ఆత్ముఁడు= ఈ దుర్మార్గుడు; అస్త్ర ఘన దహనమునన్= అస్త్రంయొక్క గొప్ప కాల్పుచేత; తాన్= తాను; అందఱను= మమ్ములను అందరినీ; ఏర్చున్= దహిస్తాడు; మా సేమంబుల్= మా క్షేమాలు; మీ మానసములన్= మీ మనస్సులలో; తలఁపవలయున్= ఆలోచించాలి.

తాత్పర్యం: నేను నా అస్త్రాన్ని ఉపసంహరిస్తే, ఈ దుర్మార్గుడు తన అస్త్రపు మహాదాహశక్తిచేత మమ్ములను అందరనూ దహిస్తాడు. మరి మా క్షేమం గూర్చి మీ మనస్సులలో ఆలోచించాలి.'

తే. అనుచుఁ జయ్యన నస్త్రవిద్యాప్రవీణ । మానసుండగు నరుఁ డయ్యహీన రూప
సాధనము నశ్రమంబున సంహరించె । మెచ్చి యమ్మహామును లెదఁ బిచ్చలింప. 71

ప్రతిపదార్థం: అనుచున్; చయ్యనన్= శీఘ్రంగా; అస్త్ర విద్యా ప్రవీణ మానసుండు+అగు నరుఁడు= అస్త్రవిద్యలో నేర్పుగల మనస్సు గలవాడైన అర్జునుడు; ఆ+అహీన రూప సాధనమున్= ఆ గొప్పసాధనాన్ని; ఆ+మహా+మునులు= ఆ మహర్షులు; మెచ్చి; ఎదన్= మనస్సులో; పిచ్చలింపన్= ఆనందించగా; అశ్రమంబునన్= అనాయాసంగా; సంహరించెన్= ఉపసంహరించాడు.

తాత్పర్యం: అంటూ శీఘ్రంగా అస్త్రవిద్యా నిపుణుడైన అర్జునుడు ఆ మహాస్త్రాన్ని ఆ మహర్షులు మెచ్చి హృదయంలో ఆనందించగా అనాయాసంగా ఉపసంహరించాడు.

విశేషం: చయ్యన ద్రుతప్రకృతికం కాబట్టి 'చయ్యనన స్త్ర' అని దిద్దడమయినది.

చ. తపమును, బ్రహ్మచర్యమును, దానము, సత్యముఁ గల్గు నా సురా
ధిపతనయుండు దక్క సముదీర్ణముగా నిగిడించి యమ్మహో
గ్రపు మహితాస్త్ర మొండ్లకును రాదు మగుడ్పఁగ; నట్టి భంగి భూ
మిపతుల కాదు దేవతలు మేకొనఁ జాలరు కౌరవేశ్వరా! 72

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= కురురాజా! జనమేజయా!; తపమును; బ్రహ్మచర్యమును; దానమున్; సత్యమున్; కల్గు; ఆ సుర+అధిప తనయుండు= ఆ దేవేంద్రుడి కొడుకు - అర్జునుడు; తక్కన్= తప్ప; ఆ+మహత్+ఉగ్రము+మహిత+అస్త్రము= ఆ మిక్కిలి భయంకరమైన గొప్ప అస్త్రం; సముదీర్ణముగాన్= బాగా; నిగిడించి= ప్రయోగించి; ఒండ్లకును= ఇతరులకును; మగుడ్పఁగన్+రాదు= మరల్చరాదు; అట్టి భంగిన్= అటువంటి విధాన్ని; భూమిపతులు+అ కాదు= రాజులే కాదు; దేవతలున్= దేవతలు సైతం; మేకొనన్+చాలరు= చేయలేరు.

తాత్పర్యం: జనమేజయా! తపస్సూ, బ్రహ్మచర్యమూ, దానమూ, సత్యమూ కల ఆ అర్జునుడికి తప్ప ఆ భయంకరమైన దివ్యాస్త్రాన్ని బాగా ప్రయోగించి మరల్చటానికి ఇతరులకు సాధ్యంకాదు. ఆ పని రాజులే కాదు దేవతలు సైతం చేయలేరు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. బ్రహ్మశిరోనామకంబగు నమ్మహాస్త్రంబు దలంచి బ్రహ్మతేజోమయంబగుటం జేసి యిట్లు ప్రయోగించి వారింప శక్యంబు గాకుండు; వారించిరేని వారించిన వారిన తలద్రెంచు; గురుభక్తియు వ్రతయుక్తియు నెక్కుడు గలుగుట నక్కౌరవశ్రేష్ఠుండు నివారణపటిష్ఠుం డయ్యె; నవ్విధంబునఁ గవ్వడి యా దుర్నివారసాధనంబు వారించుట నాలోకించి యమ్మునీశ్వరు లమ్మాహాత్మ్యం బూహించి, రశ్వత్థామ నిజాస్త్ర సంహారంబు సేయంజూచి యది శక్యంబుగా కుండుటయు దీనమానసుండగుచు మాననీయోపాయుండగు సాత్య వతేయున కిట్లనియె. 73

ప్రతిపదార్థం: బ్రహ్మశిరోనామకంబు+అగు+అ+మహా+అస్త్రంబు= బ్రహ్మశిరోనామకమైన ఆ గొప్ప అస్త్రాన్ని; తలంచి; బ్రహ్మ తేజస్(ః)+మయంబు+అగుటన్+చేసి= బ్రహ్మతేజస్సుతో నిండిన దవటంచేత; ఇట్లు; ప్రయోగించి; వారింపన్= ఆపడానికి; శక్యంబు+కాక+ఉండున్= సాధ్యంకాదు; వారించిరి+ఏని= ఒకవేళ వారించితే; వారించినవారిన్+అ= వారించిన వారినే; తల+త్రెంచున్= తల ఖండిస్తుంది; గురు భక్తియున్; వ్రతయుక్తియున్= తపస్వితమూ; ఎక్కుడు+కలుగుటన్= ఎక్కువగా ఉండటంచేత; ఆ+కౌరవ+శ్రేష్ఠుండు= ఆ కురువంశోత్తముడు (అర్జునుడు); నివారణ పటిష్ఠుండు+అయ్యెన్= వారించటానికి సమర్థుడయ్యాడు; ఆ+విధంబునన్; కవ్వడి= అర్జునుడు; ఆ దుర్నివార సాధనంబున్= ఆ వారించశక్యం కాని సాధనాన్ని; వారించుటన్= వారించటం; ఆలోకించి= చూచి; ఆ+ముని+ఈశ్వరులు= ఆ మునిశ్రేష్ఠులు; ఆ+మాహాత్మ్యంబు= ఆతడి మాహాత్మ్యం; ఊహించిరి; అశ్వత్థామ; నిజ+అస్త్ర సంహారంబు= తన అస్త్రోపసంహారం; చేయన్+చూచి= చేయబోయి; అది; శక్యంబు+కాక+ఉండుటయున్= సాధ్యం కాకపోగా; దీన మానసుండు+అగుచున్= విచారంతో కూడిన మనస్సుగల వాడవుతూ; మాననీయ+ఉపాయుండు+అగు= మన్నించదగిన ఉపాయం గలవాడైన; సాత్యవతేయునకున్= వ్యాసుడికి; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని స్మరించి అది బ్రహ్మతేజస్సుతో నిండిన దవటంచేత, ఇట్లా ప్రయోగించిన తరువాత వారించటానికి శక్యం కాదు. ఒకవేళ వారిస్తే, వారించిన వారికే శిరశ్ఛేదం చేస్తుంది. గురుభక్తీ, తపోయుక్తీ అధికంగా ఉండటంచేత ఆ అర్జునుడు వారించటానికి సమర్థుడయ్యాడు. ఆ విధంగా అర్జునుడు ఆ వారించ శక్యం కాని సాధనాన్ని వారించటం చూచి ఆ మునిశ్రేష్ఠులు అతడి మాహాత్మ్యాన్ని గుర్తించారు. అశ్వత్థామ తన అస్త్రాన్ని వారించాలని చూచి, అది సాధ్యం కాకపోవటం చేత, దైన్యంతో మంచి ఉపాయశాలి అయిన వ్యాసుడితో ఇట్లా అన్నాడు:

తే. 'చంపెఁ గురువిభు నాకు లజ్జాకరముగ। భీముఁ డదియు నధర్మ సంగ్రామవృత్తి;
నంతఁ బోవక వచ్చి ప్రాణాపహార। మాచరింపఁగఁ బూని నన్నాక్రమించె. 74

ప్రతిపదార్థం: భీముఁడు; కురువిభున్= కురుపతిని - దుర్యోధనుడిని; నాకున్; లజ్జాకరముగన్= సిగ్గు అయ్యేటట్టు; చంపెన్; అదియున్= ఆ చంపటంకూడా; అధర్మ సంగ్రామ వృత్తిన్= అధర్మయుద్ధ ప్రవర్తనతో; అంతన్+పోవక= దానితో ఊరుకోక; వచ్చి; ప్రాణ+అపహారము+ఆచరింపఁగన్+పూని= ప్రాణాలు తీయటానికి ప్రయత్నించి; నన్నున్+ఆక్రమించెన్= నాపై దండెత్తాడు.

తాత్పర్యం: భీముడు నాకు సిగ్గయ్యేటట్లు దుర్యోధనుడిని చంపాడు. అదీ అధర్మయుద్ధంలో. దానితో ఊరుకొనక వచ్చి నా ప్రాణాలు తీయాలని నామీది కురికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. పరిభవజాతరోషమునఁ బ్రాణభయంబునఁ జేసి యిమ్మహా
శరము వివేకవర్జితవిచారుఁడనై యిటు లేసితిన్ మునీ
శ్వర! యిది పాండుభూపసుత వర్గము నంతటినేర్చుఁగాని యె
ప్పరుసున మాన దివ్విధము పాపమయేనియు దాని కోర్చితిన్.' 75

ప్రతిపదార్థం: ముని+ఈశ్వర!= మునిపతీ!; పరిభవజాత రోషమునన్= అవమానం వలన కలిగిన కోపంతోనూ; ప్రాణ భయంబునన్+చేసి= ప్రాణభీతితోనూ; ఈ+మహత్+శరమున్= ఈ మహాస్త్రాన్ని; వివేక వర్జిత విచారుఁడను+ఐ= వివేకశూన్యమైన ఆలోచన గలవాడనై; ఇటులు+ఏసితిన్= ఇట్లా ప్రయోగించాను; ఇది; పాండు భూపసుత వర్గమున్+అంతటిన్= పాండురాజు కొడుకుల సమూహాన్నంతటినీ; ఏర్చున్+కాని; దహిస్తుందికాని; ఏ+పరుసునన్= ఏ విధంగానూ; మానదు; ఈ+విధము; పాపము+అ+ఏనియున్= పాపమే అయినా; దానికిన్; ఓర్చితిన్= సహించాను.

తాత్పర్యం: మునీశ్వరా! అవమానంవలన కలిగిన కోపంతోనూ, ప్రాణభీతితోనూ ఈ మహాస్త్రాన్ని మంచీచెడ్డా ఆలోచించకుండా ఇట్లా ప్రయోగించాను. ఇది పాండవుల నందరినీ ఎట్లా అయినా దహించి తీరుతుంది. ఈ విధం పాపమే అని తెలిసినా, దానికి ఒడబడ్డాను.'

వ. అనిన విని యమ్మునిపతి యతని యాననంబునఁ జూడ్కి నిలిపి మీ తండ్రి యిప్పాండవమధ్యమునకు వాత్సల్యంబున నీయస్త్రం బొసంగె నీ యోధవరుండు నీకుఁ గీడు దలంపఁడు; భవదస్త్రం బుపశమించుటకునై నిజాస్త్రంబు ప్రయోగించె; మేము వలవ దన్న నుపసంహరించె; ని ట్లస్త్రవిద్యావైదగ్ధ్యంబు సడిసన్న కవ్వడి వధింప నీకు వశంబగునే? నీ యస్త్రం బతని యస్త్రంబు చేత నివారితం బయ్యెడు; నది యట్లుండె; విను; మమ్మహాస్త్రంబు మనుష్య విషయంబుగాఁ బ్రయోగించువానికి నశుభంబగు; నొకనిచేతఁ బ్రయోగింపఁబడి యన్యు నస్త్రం బుపశమించెనేని, యద్దేశంబునకుఁ బండ్రెండేం డ్లనా వృష్టి దురితం బగుం; గావునఁ బాండవులను నిన్నును నిద్దేశంబును రక్షించుటకుం జెప్పితి; మెప్పాటనయిన దీని నుపసంహరింపవలయుఁ; దపంబునకుఁ జొచ్చినవాఁడవు, రోషంబునకుఁ దొలంగి సుఖివి గమ్ము; ధర్మంబున జయంబు గొన నోపిన యిప్పార్థుండును బ్రీతుండై చనవలయు; భవదీయ శిరోమణి యీతని కి; మ్మట్లయిన నితండ కాఁడు, పాండవులందఱును నీ దగు జీవనంబు నపహరించినంతయ సంతసిల్లుదు; రిది సమీచీనంబయిన సంధిప్రకారం; బిట్లు సేయుట మే;' లనుటయు, నుమ్మలికంబుతో నగ్గురునందనుండు పరాశరనందనున కిట్లనియె. 76

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ+ముని పతి= ఆ మునీశ్వరుడు-వ్యాసుడు; అతని+ఆననంబునన్= అతని ముఖంపై; చూడ్కి= చూపు; నిలిపి; మీ తండ్రి; ఈ+పాండవ మధ్యమునకున్= ఈ అర్జునుడికి; వాత్సల్యంబునన్; ఈ+అస్త్రంబు+ ఒసంగెన్= ఈ అస్త్రాన్నిచ్చాడు; ఈ+యోధవరుండు= ఈ వీరశ్రేష్ఠుడు; నీకున్; కీడు+తలంపఁడు= హాని తలపెట్టడు; భవత్+అస్త్రంబు= నీ అస్త్రం; ఉపశమించుటకున్+ఐ= శాంతించటానికని; నిజ+అస్త్రంబు= తనదైన అస్త్రం; ప్రయోగించెన్; మేము; వలవదు+అన్నన్= వద్దంటే; ఉపసంహరించెన్= నివారించాడు; ఇట్లు; అస్త్రవిద్యా వైదగ్ధ్యంబు సడి+చన్న= అస్త్రవిద్యా నైపుణ్యంలో అనింద్యుడైన; కవ్వడిన్= అర్జునుడిని; వధింపన్= చంపటానికి; నీకున్; వశంబు+అగునే?= తరమవుతుందా?; నీ+అస్త్రంబు; ఇతని+అస్త్రంబుచేతన్; నివారితంబు+అయ్యెడున్= వారించబడుతుంది; అది; అట్లు+ఉండెన్; వినుము;

ఆ+మహా+అస్త్రంబు; మనుష్య విషయంబు+కాన్= మనుష్యులను గూర్చి-; మనుష్యులమీద; ప్రయోగించువానికిన్; అశుభంబు+అగున్= కీడు కలుగుతుంది; ఒకనిచేతన్; ప్రయోగింపఁబడి; అన్య+అస్త్రంబు= ఇతరుడి అస్త్రం; ఉపశమించెన్+ఏని= శాంతిస్తే; ఆ+దేశంబునకున్; పంద్రెండు+ఏండ్లు; అనావృష్టి దురితంబు= వర్షాభావ కష్టం; అగున్; కావునన్; పాండవులను; నిన్నును; ఈ+దేశంబును; రక్షించుటకున్; చెప్పితిమి; ఏ+పాటన్+అయినన్= ఏ విధంగానైన; దీనిన్; ఉపసంహరింపవలయున్; తపంబునకున్; చొచ్చినవాఁడవు= తపస్సు చేయటానికి పూనుకున్నవాడవు; రోషంబునకున్= కోపానికి; తొలంగి; సుఖివి+కమ్ము; ధర్మంబునన్; జయంబు+కొనన్+ఓపిన+ఈ+పార్థుండును= గెలువగల ఈ అర్జునుడూ; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; చనవలయున్= వెళ్ళాలి; భవదీయ శిరోమణి= నీ శిరోమణి; ఈతనికిన్; ఇమ్ము; అట్లు+అయినన్; ఇతండు+అ+కాఁడు; పాండవులు+అందఱును; నీది+అగు జీవనంబున్= నీ ప్రాణాన్ని; అపహరించిన+అంత+అ= తీసినంతే; సంతసిల్లుదురు= సంతోషిస్తారు; ఇది; సమీచీనంబు+అయిన= సముచితమైన; సంధి ప్రకారంబు= సంధి పద్ధతి; ఇట్లు+చేయుట; మేలు; అనుటయున్; ఉమ్మలికంబుతోన్= విచారంతో; ఆ+గురునందనుండు= ఆ అశ్వత్థామ; పరాశర నందనునకున్= పరాశరుడి కొడుకునకు వ్యాసుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని ఆ మునీశ్వరుడు (వ్యాసుడు) అతడి ముఖంపై దృష్టి నిలిపి, 'మీ తండ్రి ఈ అర్జునుడికి శిష్యవాత్సల్యంతో ఈ అస్త్రాన్నిచ్చాడు. ఈ వీరశ్రేష్ఠుడు నీకు హాని తలపెట్టడు. నీ అస్త్రం ఉపశమించటానికి తన అస్త్రం ప్రయోగించాడు. మేము వద్దంటే ఉపసంహరించాడు. ఈ విధంగా అస్త్రవిద్యా నైపుణ్యంలో ఆరితేరిన అర్జునుడిని వధించటం నీ తరమవుతుందా? నీ అస్త్రం ఇతడి అస్త్రంచేత వారించబడుతుంది. అది అట్లా ఉండనిమ్ము. వినుము. ఆ మహాస్త్రాన్ని మనుష్యులపై ప్రయోగించినవాడికి అశుభం అవుతుంది. ఒకడిచేత ప్రయోగించబడి, ఇతరుడి అస్త్రం ఉపశమిస్తే, ఆ దేశానికి పన్నెండేళ్ళు అనావృష్టి కష్టం ప్రాప్తిస్తుంది. కాబట్టి, పాండవులనూ, నిన్నూ, ఈ దేశాన్నీ రక్షించటానికి చెప్పాము. ఏ విధంగా నైనా సరే దీనిని ఉపసంహరించాలి. తపస్సుకు పూనుకొన్నవాడివి కోపం విడిచిపెట్టి సుఖపడుము. ధర్మబద్ధంగా గెలువగల ఈ అర్జునుడు కూడా సంతోషంతో వెళ్ళాలి. నీ శిరోమణిని ఇతడి కిమ్ము. అట్లా అయితే ఇతడే కాదు, పాండవులందరూ నీ ప్రాణం తీసినంతగా సంతోషిస్తారు. ఇది సముచితమైన రాజీ పద్ధతి. ఇట్లా చేయటం మంచిది' అనగా విచారంతో ఆ అశ్వత్థామ వ్యాసుడితో ఇట్లా అన్నాడు:

సీ. 'పాండునందనులకు బ్రాఁతె రత్నంబులు? । కౌరవనాథు భండార మెల్లఁ
గైకొన్నవారు; నాగభయంబుఁ, దస్కర । భయమును, దానవభయము, దేవ
భయమును, బొరయవు; బాధింప దాఁకలి । తృష, నిద్ర, రోగంబు, దీనికతన;
నిట్టిరత్నము వీరి కీఁ జాలుదునె? ముని । నాయక! నీ వచనం బలంఘ్య

ఆ. మగుట దీని నీకు నర్పించితిని; మద । స్త్రంబు పాండవేయ రాగ పాత్ర
గర్భములకు హానిఁ గావించి సంతృప్తిఁ । బొంది తాఁ బ్రశాంతిఁ బొందుఁగాత.' 77

ప్రతిపదార్థం: ముని నాయక!= మునీశ్వరా!; రత్నంబులు; పాండు నందనులకున్= పాండవులకు; బ్రాఁతె?= అపురూపమా; కౌరవ నాథు భండారము+ఎల్లన్= కురురాజైన దుర్యోధనుడి బొక్కసమంతా; కైకొన్నవారు= పొందినవారు; నాగభయంబున్= సర్పభయమూ; తస్కర భయమును= చోరభయమూ; దానవభయమున్= రాక్షసభయమూ; దేవ భయమును; పొరయవు= కలుగవు; ఆఁకలి; తృష= దప్పి; నిద్ర; రోగంబు; దీనికతనన్= దీనివలన; బాధింపదు; ఇట్టి రత్నమున్; వీరికిన్; ఈన్+చాలుదునె?=

ఇయ్యగలనా?; నీ వచనంబు= నువ్వు అనిన మాట; అలంఘ్యము+అగుటన్= దాటరానిది అవటంచేత; దీనిన్; నీకున్; అర్పించితిని= ఇచ్చాను; మత్+అస్త్రంబు= నా అస్త్రం; పాండవేయ రాగ పాత్ర గర్భములకున్= పాండవేయుల ఇష్టానికి పాత్రములైన గర్భాలకు; హానిన్+కావించి= కీడుచేసి; సంతృప్తిన్+పొంది= తృప్తిపడి; తాన్= తాను(అస్త్రం); ప్రశాంతిన్= ఉపశమనాన్ని, పొందున్= కాత పొందునుగాక!

తాత్పర్యం: 'మునీశ్వరా! దుర్యోధనుడి బొక్కసాన్నంతటినీ పొందిన పాండవులకు రత్నాలు అపురూపమా? సర్పభయమూ, చోరభయమూ, రాక్షసభయమూ, దేవభయమూ కలుగవు. దీనివలన ఆకలీ, దప్పిక, నిద్రా, రోగమూ బాధించవు. ఇట్లాంటి రత్నం వీళ్ళకు ఇవ్వగలనా? అయినా నీ మాట దాటరానిది కాబట్టి దీనిని నీకు ఇచ్చాను. నా అస్త్రం పాండవేయుల గర్భాలకు హాని కలిగించి తృప్తిపడి ఉపశమిస్తుంది గాక!'

క. అన విని కృష్ణద్వైపా । యనుఁ 'డట్టులు సేయు మొంటి కాస పడకు మీ'
యని పలుక నప్పలుకునం । గనియెను దన పలుకు తప్పగా నతఁడు మదిన్. 78

ప్రతిపదార్థం: అనన్= అనగా; విని; కృష్ణద్వైపాయనుఁడు= వ్యాసుడు; అట్టులు+చేయుము= అట్లా చెయ్యి; ఒంటికిన్= ఇంకొకదానికి; ఆసపడకుమీ= ఆశించకుమీ; అని; పలుకన్= పలుకగా; అతఁడు= అశ్వత్థామ; మదిన్= మనస్సులో; ఆ+పలుకునన్= ఆ మాటచేత; తన పలుకు= తను అన్నది; తప్పు+కాన్= తప్పుగా; కనియెను= గ్రహించాడు.

తాత్పర్యం: అనగా విని వ్యాసుడు 'అట్లా చేయుము. వేరే దానికి ఆశించకుము' అని పలుకగా, అశ్వత్థామ తన మనస్సులో, ఆతడి మాటను బట్టి తన మాట తప్పని గ్రహించాడు.

విశేషం: అశ్వత్థామ 'పాండవేయ గర్భా' లనటంలో 'పాండవుల సంతతి గర్భా' లని భావించగా, వ్యాసుడు 'పాండవులకు సంబంధించిన గర్భా' లని వేరుగా భావించాడు (పాండవేయ= పాండవ సంతతి యొక్క, పాండవులయొక్క.).

వ. కని 'పాండవేయ రాగపాత్ర గర్భంబులని తత్సంతాన సంజాత గర్భంబులనెల్ల నుగ్గడించిన వాఁడనయితి; నది పారాశర్యుండు పాండవేయ భార్యాగర్భంబులన పేరుకొనుటగాఁ జేసి 'యొంటి కాసపడకుమీ' యనియె. దీని నెఱింగినవాఁడఁ గానేని యిది యనుమతిగా భావించి సకలగర్భవిధ్వంసనంబు గావించెదంగాక' యని నిశ్చయించి యమ్మునీంద్రునితో 'నట్ల చేయువాఁడ' నని పలికె. వారల సంవాదప్రకారంబు హృషీకేశుం డెఱింగి 'వీఁడు సంయమివరు మాట గీటునం బుచ్చి తనవలసినట్లు సేయువాఁడయ్యె; నిప్పాపాత్ము నుపక్రమంబునకు నడ్డపడి చూచెదఁ; గాకున్నఁ దుది నా చేయుతెఱంగున్నదియ కాదె' యని వితర్కించె, నప్పు డశ్వత్థామ చేతోవృత్తి సాత్యవతేయుం డెఱిఁగియుం, గృష్ణుం డెఱుంగుటయు నతం డతనితో సల్లాపంబు సేయం దలంచుటయుఁ గనుంగొని యూరకుండె. 79

ప్రతిపదార్థం: కని= గ్రహించి, తెలిసి; పాండవేయ రాగ పాత్ర గర్భంబులు+అని= పాండవేయుల రాగానికి పాత్రములైన గర్భములని; తద్+సంతాన సంజాత గర్భంబులన్+ఎల్లన్= పాండవులయొక్క సంతతివలన పుట్టిన గర్భాలనన్నింటినీ; ఉగ్గడించినవాఁడన్+అయితిన్= చెప్పినవాడిని అయ్యాను; అది; పారాశర్యుండు= వ్యాసుడు; పాండవేయ భార్యాగర్భంబులన్+అ= పాండవులయొక్క భార్యల గర్భాలుగానే; పేరుకొనుటగాన్= చేసి= పేర్కొనటంచేత; ఒంటికిన్= వేరేదానికి; ఆసపడకుమీ=

ఆశించకుమీ; అనియెన్; దీనిన్= వ్యాసుడిభావం; ఎఱింగినవాఁడన్+కాన్+ఏని= తెలిసినవాడిని కాకపోతే; ఇది; అనుమతి+కాన్= అంగీకారంగా; భావించి; సకల గర్భ విధ్వంసనంబు సర్వగర్భాల నాశనం; కావించెదన్+కాక= చేస్తానుగాక; అని; నిశ్చయించి= నిర్ణయించి; ఆ+ముని+ఇంద్రునితోన్= ఆ మునీశ్వరుడితో-వ్యాసుడితో; అట్లు+అ= అట్లే; చేయువాఁడన్+అని పలికెన్= చేస్తానని పలికాడు; వారల సంవాద ప్రకారంబున్= ఆ వ్యాసాశ్వత్థామల పరస్పర సంభాషణ విధం; హృషీకేశుండు= కృష్ణుడు; ఎఱింగి= తెలిసి; వీఁడు= ఇతడు - అశ్వత్థామ; సంయమివరుమాటన్= మునీశ్వరుడైన వ్యాసుడిమాట; గీటునన్+పుచ్చి= అనాదరించి; తన వలసిన+అట్లు చేయువాఁడు+అయ్యెన్= తన ఇష్టం వచ్చినట్లు చేస్తాడు; ఈ+పాప+ఆత్ము+ ఉపక్రమంబునకున్= ఈ దుర్మార్గుడి పూనికకు; అడ్డుపడి చూచెదన్= అడ్డపడటానికి చూస్తాను; కాక+ఉన్నన్= లేకుంటే; తుదిన్= చివర; నా చేయు తెఱంగు+ఉన్నయది కాదె= నేను చేసే విధం ఉండనే ఉన్నది కదా!; అని; వితర్కించెన్= ఆలోచించాడు; అప్పుడు; అశ్వత్థామ చేతస్(ః)+వృత్తిన్= అశ్వత్థామ మనోభిప్రాయం; సాత్యవతేయుండు= వ్యాసుడు; ఎఱిఁగియున్= గ్రహించినా; కృష్ణుండు; ఎఱుంగుటయున్= గ్రహించటమూ; అతండు= కృష్ణుడు; అతనితోన్ అశ్వత్థామతో; సల్లాపంబు+చేయన్+తలంచుటయున్= మాట్లాడాలనుకోవటం; కనుంగొని= చూచి; ఊరక+ఉండెన్= ఊరుకున్నాడు.

తాత్పర్యం: గ్రహించి, 'పాండవేయ రాగ పాత్రగర్భము' లని పాండవుల సంతతి తాలూకు గర్భాలనన్నిటినీ ఉద్దేశించాను. కాని దానిని వ్యాసుడు పాండవుల భార్యల గర్భాలుగానే పేర్కొనటంచేత వేరే దానిని ఆశించకుము- అన్నాడు. అది నేను తెలిసినట్టుగా ఎందుకుండాలి? ఇది అంగీకారంగా భావించి అన్ని గర్భాలనీ నాశనం చేస్తానుగాక' అని నిర్ణయించి ఈ మునీశ్వరుడితో అట్లాగే చేస్తానని పలికాడు. వాళ్ళ పరస్పర సంభాషణక్రమం కృష్ణుడు తెలిసి 'వీడు మునీశ్వరుడి మాటను కాదని తన యిష్టం వచ్చినట్లు చేసేవాడివలె ఉన్నాడు. ఈ దుర్మార్గుడి ప్రయత్నానికి అడ్డపడటానికి చూస్తాను. లేకుంటే చివర నేను చేసే పని ఎట్లాగూ ఉండనే ఉన్నది కదా!' అని తలచాడు. అప్పుడు అశ్వత్థామ మనోభిప్రాయం వ్యాసుడు గ్రహించీ, కృష్ణుడు గ్రహించాడనీ, అతడు అశ్వత్థామతో మాటాడాలను కొంటున్నాడనీ తెలిసి, ఊరుకున్నాడు.

శ్రీకృష్ణుఁ డుత్తరగర్భంబు దగ్ధంబు గాకుండఁ జేయ నిశ్చయించుట (సం. 10-16-1)

క. వనజాక్షుఁడు ద్రౌణికి ని । ట్లనుఁ 'దునిమితి పాండు పౌత్రు లందఱఁ; బాపం
బునఁ బోయితి; గర్భంబులఁ । దునిమెద వం దొకటియైనఁ దొలఁగింపఁ దగున్.' 80

ప్రతిపదార్థం: వనజ+అక్షుఁడు= తామరలవంటి కన్నులుగలవాడు - శ్రీకృష్ణుడు; ద్రౌణికిన్= అశ్వత్థామకు; ఇట్లు+అనున్; పాండు పౌత్రులన్+అందఱన్= పాండురాజు మనుమలనందరినీ; తునిమితి(వి)= వధించావు; పాపంబునన్= పోయితి(వి)= పాపానపోయావు-పాపం కట్టుకున్నావు; గర్భంబులన్= ఆ పౌత్రుల గర్భాలను ఆ పౌత్రుల సంతతిని; తునిమెదవు= వధిస్తావు; అందున్= ఆ గర్భాలలో; ఒకటి+ఐనన్= ఒకదాన్నైనా; తొలఁగింపన్+తగున్= తొలగించాలి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అశ్వత్థామతో ఇట్లా అన్నాడు: 'పాండురాజు మనుమలనందరినీ వధించావు. పాపం కట్టుకొన్నావు. ఇప్పుడు ఆ మనుమల గర్భాలను చంపాలనుకొంటున్నావు. అందులో ఒక దాన్నైనా నీ బారినపడకుండా తొలగించాలి.'

క. 'ఏ నొక్కనిఁ బాండవ సం । తానార్థము గాఁగ నిత్తు; ధర్మముల మహా
దానంబులఁ గ్రతువుల జన । తానందితుఁ డగుచుఁ బెంపుఁ దలకొనువానిన్.' 81

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఏను= నేను; ఒక్కనిన్= ఒకడిని; ధర్మములన్= ధర్మాలతోనూ; మహా+దానంబులన్= గొప్పదానాలతోనూ; క్రతువులన్= యజ్ఞాలతోనూ; జనతా+ఆనందితుఁడు+అగుచున్= జన సమూహాన్ని సంతోషించేటట్టు చేసేవాడు అవుతూ; పెంపున్= గొప్పతనాన్ని; తలకొనువానిన్= వహించేవాడిని; పాండవ సంతాన+అర్థము+కాఁగన్= పాండవుల సంతతికోసం; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: 'నేను ధర్మాలతోనూ, గొప్ప దానాలతోనూ, యజ్ఞాలతోనూ జనులను సంతోషపెట్టి గొప్పతనం పొందే ఒకడిని పాండవవంశం నిలబెట్టటం కొరకు రక్షిస్తాను.'

తే. **'అట్టి గర్భంబు నిలుపు త క్కన్ని గర్భ । ములును భవదస్త్రమున దగ్ధములుగఁ జేయు'**
మనుడు సంరంభజృంభితుఁ డగుచు ద్రోణ । తనయుఁ డిట్లను నమ్మురాంతకుని తోడ. **82**

ప్రతిపదార్థం: అట్టి గర్భంబున్= అటువంటి గర్భాన్ని; నిలుపు(ము); తక్కు+అన్ని గర్భములును= తక్కిన గర్భాల నన్నిటినీ; భవత్+అస్త్రమునన్= నీ బాణంతో; దగ్ధములుగన్+చేయుము= నాశనం చేయుము; అనుడున్= అనగానే; ద్రోణ తనయుఁడు= అశ్వత్థామ; సంరంభ జృంభితుఁడు+అగుచున్= కోపంతో విజృంభించినవాడవుతూ; ఆ+ముర+అంతకునితోడన్= ఆ శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'అట్లాంటి గర్భాన్ని నిలుపుము. తక్కిన గర్భాలనన్నిటినీ నీ అస్త్రంతో దహించుము' అనగానే అశ్వత్థామ కోపంతో విజృంభించి ఆ శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

వ. **'పక్షపాతంబున నీ విట్లు పలికిన నే నట్లేల చేయుదు? మదస్త్రంబునకు లక్ష్యంబులుగా గర్భంబు లొండు గలుగు లేకుండు; నది యట్లుండె; విరాటనందన యగు నుత్తరగర్భంబు రక్షించెద నని చూచె; దప్పనికిఁ బూనితేనియు నా యస్త్రంబున నవశ్యం బదియును విధ్వంసంబు గావింతు' నని పలికినఁ బద్మనాభుండు.** **83**

ప్రతిపదార్థం: నీవు; పక్షపాతంబునన్= పాండవులమీదనే ఉన్న అభిమానంతో; ఇట్లు; పలికినన్= పలికితే; నేను; అట్లు+ఏల చేయుదున్?= అట్లా ఎందుకుచేస్తాను?; మదస్త్రంబునకున్= నా అస్త్రానికి; లక్ష్యంబులు+కాన్= గురిగా; గర్భంబులు+ఒండు+ కలుగున్ లేక+ఉండున్= గర్భాలలో ఒకటి ఉంటుంది, లేకపోతుంది; అది+అట్లు+ఉండెన్= అది అలా ఉండనీ; విరాట నందన+అగు= విరాటుడి కూతురైన; ఉత్తర= ఉత్తరయొక్క; గర్భంబున్= చూలు; రక్షించెదన్+అని చూచెదు= కాపాడాలని చూస్తావు; ఆ+పనికిన్; పూనితి(వి)+ఏనియున్= పూనుకున్నావో; నా+అస్త్రంబునన్= నా బాణంతో; అవశ్యం= తప్పకుండా; అదియును= దానినికూడా; విధ్వంసంబు+కావింతున్= నాశనం చేస్తాను; అని పలికినన్= అని పలుకగా; పద్మనాభుండు= పద్మం నాభియందు గలవాడు-శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: 'నీవు పాండవ పక్షపాతంతో ఇట్లా అంటే, నేను అట్లా ఎందుకు చేస్తాను? నా అస్త్రానికి ఒక గర్భం లక్ష్యం కావచ్చు కాకపోవచ్చు. అది అట్లా ఉండనిమ్ము. నీవు విరాటపుత్రి అయిన ఉత్తర గర్భాన్ని రక్షించాలని చూస్తావు. ఆ పనికి పూనుకున్నావో, నా బాణంతో దానిని కూడా తప్పకుండా నాశనం చేస్తాను.' అని పలుకగా శ్రీకృష్ణుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'అనఘుఁ డభిమన్యు తేజం । బనూనమై మాత్స్యపుత్రియం దున్నది; నీ
తునుముట గలిగిననుం ద । త్తనయున కే నాయు విచ్చెదను దీర్ఘముగన్.' 84

ప్రతిపదార్థం: అనఘుఁడు+అభిమన్యు తేజంబు= పాపరహితుడైన అభిమన్యుడి వీర్యం; అనూనము= తక్కువకానిదయి-గొప్పదయి; మాత్స్య పుత్రియందున్= విరాటుడి కూతురైన ఉత్తర గర్భంలో; ఉన్నది; నీ తునుముట= నువ్వు వధించుట; కలిగిననున్= సంభవించినా; తద్+తనయునకున్= అతడి కుమారుడికి; ఏను= నేను; దీర్ఘముగన్= దీర్ఘంగా; ఆయువు; ఇచ్చెదను.

తాత్పర్యం: పుణ్యాత్ముడైన అభిమన్యుడి వీర్యం గొప్పదయి ఉత్తర గర్భంలో ఉన్నది. నీవు దానిని వధించటం సంభవించినా అతడి కుమారుడికి నేను దీర్ఘాయు విస్తాను.

క. అనిన విని నగుచుఁ గుంభజ । తనయుం డిట్లనియె; 'నస్త్ర దగ్ధుని బ్రతికిం
చిన మేలకాదె! నీ వి । న్ననువు నెఱింగెదము గాక నరసఖ! దీనన్.' 85

ప్రతిపదార్థం: అనినన్; విని; కుంభజ తనయుండు= అశ్వత్థామ; నగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్; అస్త్రదగ్ధునిన్= అస్త్రంతో దహించబడినవాడిని; బ్రతికించినన్= బ్రతికిస్తే; మేలు+అ+కాదె!= మంచిదేకదా!; నరసఖ!= అర్జున మిత్రమా!; కృష్ణా!; దీనన్= ఈ విషయంలో; నీ విన్ననువున్= నీ నేర్పు; ఎఱింగెదము+కాక= చూద్దాములే.

తాత్పర్యం: అనగా విని అశ్వత్థామ నవ్వుతూ ఇట్లా అన్నాడు: 'అస్త్రదగ్ధుడిని బ్రతికిస్తే మంచిదేకదా! అర్జునమిత్రమా! కృష్ణా! ఈ విషయంలో నీ నేర్పు చూద్దాములే.'

వ. అని పలికి పరమాదరణీయులగు సాత్యవతేయదేవకీనందనుల వాక్యంబు లాదరింపక పాండవ సంతాన సకల గర్భవిషయంబుగా నస్త్రప్రమోచనంబు సేసిన నుపలక్షించి వాసుదేవుం డతనితో నిట్లనుఁ; 'త్రికాలవేదియగు నొక్క బ్రాహ్మణుం డుపప్లావ్యంబునకు వచ్చి యుత్తరను జూచి నీ పుణ్యంబునఁ బ్రాణంబులు పరిక్షీణంబులైన పుత్రుండు జనియింపంగలవాఁ; డది కారణంబుగా భవదీయగర్భస్థునకుఁ బరిక్షిన్నామధేయం బగునని పలికె; నమ్మహాత్ముని వచనం బనృతంబు గానేరదు; భవత్కృత్యం, బకృతసమంబ; యబ్బాలుండు పాండవవంశకరుండగు,' నని చెప్పి తన చిత్తంబున రోషం బావహిల్లుటయు, 'బాలఘాతి వగు నీకు నశనంబు దుర్లభంబై, సహాయరహితుండవై దుర్గంధరక్తంబున నంగంబు దగ్ధంబగుచుండ మూఁడు వేలేండ్లు దిరుగుము; నాచేత రక్షితుండై, యక్కుమారుండు గృపాచార్యువలన ధనుర్వేదవిదుండై సర్వశస్త్రాస్త్రంబులు వడసి బహుసంవత్సరంబులు వసుధఁ బాలింపంగలవాఁడు; వానికి జనమేజయుండను మహారాజు ప్రభవించి నీవు సూచుచుండ నుజ్జ్వలుండె ప్రవర్తించు; మదీయంబులగు తపస్సత్యంబుల మహనీయ ప్రభావంబులు సూడు;' మని యాడె నప్పుడు కృష్ణద్వైపాయనుండు గురునందనున కిట్లనియె. 86

ప్రతిపదార్థం: అని; పలికి; పరమ+ఆదరణీయులు+అగు= మిక్కిలి గౌరవించదగినవారైన; సాత్యవతేయ దేవకీనందనుల= వ్యాస శ్రీకృష్ణులయొక్క; వాక్యంబులు; ఆదరింపక= మన్నించక; పాండవ సంతాన సకల గర్భ విషయంబు+కాన్= పాండవుల యొక్క సంతతి యొక్క ఎల్ల గర్భాలు లక్ష్యంగా; అస్త్ర ప్రమోచనంబు+చేసినన్= అస్త్రంయొక్క విడుదల చేయగా - అస్త్రాన్ని విడిచిపెట్టగా; ఉపలక్షించి= చూచి; వాసుదేవుండు= కృష్ణుడు; అతనితోన్; ఇట్లు+అనున్; త్రికాలవేది+అగు+ఒక్క బ్రాహ్మణుండు=

త్రికాలజ్ఞుడైన ఒక బ్రాహ్మణుడు; ఉపప్లావ్యంబునకున్; వచ్చి; ఉత్తరను; చూచి; నీ పుణ్యంబునన్= నీ పుణ్యంచేత; ప్రాణంబులు; పరిక్షీణంబులు+ఐన పుత్రుండు= కృశించినవైన కుమారుడు; జనియింపన్+కలవాఁడు= పుట్టబోతాడు; అది; కారణంబు+కాన్; భవదీయ గర్భస్థునకున్= నీ గర్భంలో ఉన్నవాడికి; పరిక్షిత్+నామధేయంబు= పరిక్షిత్తు అనేపేరు; అగున్; అని; పలికెన్; ఆ+మహా+ఆత్ముని వచనంబు= ఆ మహానుభావుడి మాట; అనృతంబు+కాన్+నేరదు= అబద్ధం కాజాలదు; భవత్+కృత్యంబు= నీవు చేసినపని; అకృత సమంబు+అ= చేయనిదానితోనే సమానం; ఆ+బాలకుండు= ఆ పిల్లవాడు; పాండవ వంశకరుండు+ అగున్= పాండవ వంశోద్ధారకుడు అవుతాడు; అని చెప్పి; తన చిత్తంబునన్= తన మనస్సులో; రోషంబు= కోపం; ఆవహిల్లుటయున్= కలగగా; బాలఘాతివి+అగు= పిల్లలను చంపినవాడవైన; నీకున్; అశనంబు= ఆహారం; దుర్లభంబు+ఐ= పొందశక్యం కానిదై; సహాయ రహితుండవు+ఐ= నిస్సహాయుడవై; దుర్గంధ రక్తంబునన్= దుర్వాసనగల రక్తంతో; అంగంబు= శరీరం; దగ్ధంబు+అగుచున్+ఉండన్= కాలిపోతూండగా; మూఁడు వేల+ఏండ్లు; తిరుగుము; నాచేతన్; రక్షితుండు+ఐ= కాపాడబడిన వాడై; ఆ+కుమారుండు= ఆ బాలుడు; కృపాచార్యువలనన్; ధనుస్(ః)+వేద విదుండు+ఐ= ధనుర్వేదం నేర్చుకొన్నవాడై; సర్వశస్త్ర+ అస్త్రంబులు= ఎల్ల శస్త్రాలూ, అస్త్రాలూ; పడసి= పొంది; బహు సంవత్సరంబులు= చాలా ఏళ్ళు; వసుధన్= భూమిని; పాలింపఁగలవాఁడు= ఏలతాడు; వానికిన్; జనమేజయుండు+అను మహారాజు= జనమేజయుడనే పేరుగల గొప్పరాజు; ప్రభవించి= పుట్టి; నీవు+చూచుచున్+ఉండన్= నీవు చూస్తూండగానే; ఉజ్జ్వలుండు+ఐ= ప్రకాశించేవాడై; ప్రవర్తించున్; మదీయంబులు+అగు= నావయిన, తపస్+సత్యంబుల మహనీయ ప్రభావంబులు= తపస్సుయొక్క, సత్యంయొక్క, గొప్ప మహిమలు; చూడుము+అని; ఆడెన్= పలికాడు; అప్పుడు; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; గురునందనునకున్= అశ్వత్థామతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని పలికి, మిక్కిలి గౌరవించదగిన వ్యాస శ్రీకృష్ణుల మాటలు పాటించక పాండవుల సంతానం తాలూకు గర్భాలన్నింటిమీద అస్త్రం విడిచిపెట్టటం చూచి శ్రీకృష్ణుడు అతడితో ఇట్లా అన్నాడు: 'త్రికాలజ్ఞుడైన ఒక బ్రాహ్మణుడు ఉపప్లావ్యపురం వచ్చి ఉత్తరను చూచి 'నీ పుణ్యంచేత ప్రాణాలు కృశించిన కొడుకు పుట్టుతాడు. అది కారణంగా నీ గర్భంలో ఉన్నవాడికి పరిక్షిత్తు అనే పేరు కలుగుతుంది' అని పలికాడు. ఆ మహానుభావుడి వచనం అబద్ధం కాజాలదు. నీవు చేసినపని చేయనిదానితోనే సమానం. ఆ బాలుడు పాండవ వంశోద్ధారకు డవుతాడు' అని తన మనస్సులో కోపం ఏర్పడగా 'పిల్లలను చంపిన నీవు ఆహారం లేక, నిస్సహాయుడ వై, కంపు కొట్టే రక్తంతో శరీరం కాలిపోతూండగా మూడువేల సంవత్సరాలు తిరుగుము. నా చేత రక్షితుడై ఆ కుమారుడు కృపాచార్యుడి దగ్గర ధనుర్వేదం నేర్చుకొని అన్ని శస్త్రాస్త్రాలూ పొంది అనేక సంవత్సరాలు భూమిని పరిపాలిస్తాడు. అతడికి జనమేజయ మహారాజు పుట్టి, నీవు చూస్తూండగానే, గొప్పగా వెలుగొందుతాడు. నా తపస్సత్యాల మహామహిమలు చూడుము' అని పలికాడు. అప్పుడు వ్యాసుడు అశ్వత్థామతో ఇట్లా అన్నాడు:

విశేషం: 'నీ పుణ్యంబునఁ బ్రాణంబులు పరిక్షీణంబులైన పుత్రుండు జనియింపం గలవాఁ డది కారణంబుగా భవదీయ గర్భస్థునకుఁ బరిక్షిన్నామధేయంబు.' అని తెలుగు భారతంలో ఉన్నది. కాని ఇక్కడ సంస్కృత భారతంలో ఇట్లా లేదు. అందులో-

> **"పరిక్షీణేషు కురుషు పుత్ర స్తవ జనిష్యతే,**
> **ఏతద స్యపరిక్షిత్త్వం గర్భస్థస్య భవిష్యతి"**

అని ఉన్నది. 'కౌరవులు నశించిపోగా నీకు కొడుకు పుట్టుతాడు. కడుపులో ఉన్నవాడికి ఈ పరిక్షిత్త్వం కలుగుతుంది.' అని దాని భావం. అశ్వమేధపర్వంలో కూడా ఇట్లాగే ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. 'ఆత్మకులము పరిక్షీణమైన జనన । మొందెఁ గాన నియ్యభిమన్యునందనునకు
నర్థమగు పరిక్షిన్నామ మనియెఁ గృష్ణుఁ । డఖిల జనములు వినఁ బౌరవాధినాథ!' (భార. అశ్వ.)

'నీపుణ్యం కొద్దీ పరిక్షీణాలైన ప్రాణాలు గల కొడుకు పుట్టుతా' డంటే అర్థం ఏమిటి? ప్రాణాలు పరిక్షీణాలైన కొడుకు పుట్టటం పుణ్యం ఎట్లా అవుతుంది? మూలానువాదాలకు ఇక్కడ ఈ తేడా ఎందుకు వచ్చిందో! ఆలోచనీయం.

తే. 'బ్రాహ్మణుఁడ వయ్యు నిట్లు క్రూరతకు రోయ । కస్మదీయ వాక్యంబుల నాదరంబు
సేయ కీ పాపకర్మంబు సేసినాఁడ; । వచ్యుతుఁడు వల్కినట్టుల యగుము నీవు.' 87

ప్రతిపదార్థం: బ్రాహ్మణుఁడవు+అయ్యున్= నువ్వు బ్రాహ్మణుడివైనా; ఇట్లు= ఈ విధంగా; క్రూరతకున్= క్రౌర్యానికి; రోయక= వెనుదీయక; అస్మదీయ వాక్యంబులన్= నా మాటలను; ఆదరంబు+చేయక= మన్నించక; ఈ పాపకర్మంబు= ఈ పాపపుపని; చేసినాఁడవు; నీవు; అచ్యుతుఁడు= శ్రీకృష్ణుడు; పల్కిన+అట్టుల= పలికినట్లే; అగుము.

తాత్పర్యం: 'నీవు బ్రాహ్మణుడివైనా, ఈ విధంగా క్రౌర్యానికి వెనుదీయకుండా, నా మాటలను పాటించకుండా, ఈ పాపకృత్యం చేశావు. నీవు కృష్ణు డన్నట్లుగానే కమ్ము.'

వ. అని యిట్లు శపియించి 'నీచకర్ముండ! పొ'మ్మనిన, విని యశ్వత్థామ యమ్మహాత్ముని యాననం బాలోకించి 'మునీంద్రా! నీవు మనుజులలోన నుండువాఁడ' వని ప్రతిశాపం బిచ్చి, 'నీకడన యేను వర్తిల్లఁ గలవాఁడ, నీవును శౌరియు సత్యవాదు లగుదురుగాక!' యని తన శిరోమణి పాండవుల కిచ్చి తపోవనంబునకుం జనియెఁ; బాండవులును గృష్ణుండును నమ్మునీంద్రునకు నమస్కరించి వీడ్కొని యతిత్వరితగతి నరుగుదెంచి. 88

ప్రతిపదార్థం: అని; ఇట్లు; శపియించి; నీచకర్ముండ!= తుచ్ఛుడా!; పొమ్ము; అనినన్; విని; అశ్వత్థామ; ఆ+మహాత్ముని+ఆననంబు= ఆ మహానుభావుడి ముఖం; ఆలోకించి= చూచి; ముని+ఇంద్రా!= మునీశ్వరా!; నీవు; మనుజులలోనన్= మనుష్యులలో; ఉండువాఁడవు= ఉందువుగాక!; అని; ప్రతిశాపంబు+ఇచ్చి= మారుశాపం ఇచ్చి; నీకడన్+అ= నీ దగ్గరే; ఏను= నేను; వర్తిల్ల గలవాఁడన్= ఉండగలను; నీవును; శౌరియున్= కృష్ణుడూ; సత్యవాదులు= సత్యసంధులు; అగుదురు+కాక; అని; తన శిరోమణి; పాండవులకున్; ఇచ్చి; తపస్(ః)+వనంబునకున్= తపోవనానికి; చనియెన్; పాండవులును; కృష్ణుండును; ఆ+ముని+ ఇంద్రునకున్= ఆ మునీశ్వరుడికి; నమస్కరించి; వీడ్కొని= సెలవు పుచ్చుకొని; అతి త్వరితగతిన్= మిక్కిలి తొందరగా; అరుగుదెంచి= వచ్చి.

తాత్పర్యం: అని ఇట్లా శపించి 'తుచ్ఛుడా! పొమ్ము'. అనగా విని అశ్వత్థామ ఆ మహానుభావుడి ముఖం చూచి, 'మునీశ్వరా! నీవు మనుష్యులలో ఉందువుగాక!' అని ప్రతిశాపం ఇచ్చి, 'నీ దగ్గరే నేను ఉంటాను. నీవూ, కృష్ణుడూ సత్యసంధులు అవుతారుగాక!' అని తన శిరోమణిని పాండవుల కిచ్చి తపోవనానికి వెళ్ళాడు. పాండవులూ, కృష్ణుడూ ఆ మునీశ్వరుడికి నమస్కరించి సెలవు పుచ్చుకొని మిక్కిలి తొందరగా వచ్చి.

క. అరదములు డిగ్గి వగలం । బరితాపముఁ బొందుచున్న పాంచాలిం గాం
చిరి తమచేతోవృత్తులఁ । గరుణము మగుడంగఁ బొడమఁ గౌరవనాథా! 89

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కౌరవనాథా!= కురురాజా!-జనమేజయా!; అరదములు డిగ్గి= రథాలుదిగి; వగలన్= దుఃఖాలతో; పరితాపమున్+ పొందుచున్+ఉన్న పాంచాలిన్= పరితపిస్తున్న ద్రౌపదిని; తమ చేతస్+వృత్తులన్= తమ మనస్సులలో; మగుడంగన్= మళ్ళీ; కరుణము= శోకం; పొడమన్= పుట్టగా; కాంచిరి= చూశారు.

తాత్పర్యం: జనమేజయా! వాళ్ళు రథాలు దిగి దుఃఖంతో పరితపిస్తూ ఉన్న ద్రౌపదిని తమ మనస్సులలో మళ్ళీ కరుణరసం పుట్టగా చూచారు.

వ. **అట్లు గాంచి యక్కాంత చుట్టు నాసీనులై; రప్పు డగ్రజుండు పనుపఁ బవనతనయుం డమ్మణి యద్దేవికి సమర్పించి.** **90**

ప్రతిపదార్థం: అట్లు; కాంచి; ఆ+కాంత చుట్టున్= ఆ ద్రౌపది చుట్టూ; ఆసీనులు+ఐరి= కూర్చున్నారు; అప్పుడు; అగ్రజుండు= అన్న ధర్మరాజు; పనుపన్= పంపగా; పవనతనయుండు= వాయుపుత్రుడు- భీముడు; ఆ+మణి= ఆ శిరోమణిని; ఆ+దేవికిన్= ఆ ద్రౌపదికి; సమర్పించి= ఇచ్చి.

తాత్పర్యం: అట్లా చూచి ఆ ద్రౌపది చుట్టూ కూర్చున్నారు. అప్పుడు అన్నగారు పంపగా భీముడు ఆ శిరోమణిని ఆ ద్రౌపది కిచ్చి.

భీమసేనుఁ డశ్వత్థామ శిరోరత్నంబు ద్రౌపది కిచ్చుట (సం. 10-16-25)

క. **'పగతు పని సక్కనయ్యెన్; । వగ మానుము రాజధర్మ వైశిష్ట్యము పెం**
పుగ నాదరించి; నీ తా । ల్మిగదా భూపాలు నుమ్మలికముం బాచున్. **91**

ప్రతిపదార్థం: పగతు పని= శత్రుకార్యం శత్రువుని సాధించే కార్యం; చక్కన+అయ్యెన్= సమాప్తమయింది; రాజ ధర్మ వైశిష్ట్యము= రాజులకు ఉచితమైన ధర్మం యొక్క ప్రత్యేకత; పెంపుగన్= గొప్పగా-బాగా; ఆదరించి= మన్నించి; వగ మానుము= దుఃఖం విడిచిపెట్టుము; నీ తాల్మి కదా= నీ ఓరిమేకదా!; భూపాలు నుమ్మలికమున్= రాజు(ధర్మరాజు) దుఃఖాన్ని; పాచున్= పోగొట్టుతుంది.

తాత్పర్యం: 'శత్రువును సాధించేకార్యం పూర్తయింది. రాజోచిత ధర్మపు విశిష్టతను మన్నించి దుఃఖం మానుము. నీ ఓరిమే కదా ధర్మరాజు దుఃఖాన్ని పోగొట్టేది!

చ. **జనపతి పంపఁ గేశవుఁడు సంధికిఁ బోయెడునప్పు నీవు సె**
ప్పిన గరువంపు రాజసపు బెట్టిదపుం దగు మాట లెల్ల నె
మ్మనమున నెక్కొనన్ నిలుపుమా; వగవం బనియేమి? సంగరం
బునఁ బగవారు పేర్చి పొరిపుచ్చక పువ్వులకోల సాఁతురే? **92**

ప్రతిపదార్థం: జనపతి= రాజు (ధర్మరాజు); పంపన్= పంపగా; కేశవుఁడు= శ్రీకృష్ణుడు; పోయెడు+అప్డు= వెళ్ళేటప్పుడు; నీవు; చెప్పిన; గరువంపు రాజసపు బెట్టిదపుందగు, మాటలెల్లన్= గొప్పతనంతో కూడిన, రజోగుణ ప్రధానములైన - పరుషాలైన, ఉచితములైన మాటలన్నీ; నెఱి+మనమునన్= నిండు మనస్సులో; నెక్కొనన్= పాదుకొనేటట్టు; నిలుపుమా= నిలువు; వగవన్+పని+

ఏమి?= విచారించటం వలన ప్రయోజనమేమిటి?; సంగరంబునన్= యుద్ధంలో; పగవారు= శత్రువులు; పొరిపుచ్చక= చంపక; పువ్వుల కోల= పుష్పబాణం; సాఁతురే?= ప్రయోగిస్తారా?

తాత్పర్యం: ధర్మరాజు పంపగా సంధిచేయటానికి శ్రీకృష్ణుడు కౌరవసభకు వెళ్ళేటప్పుడు నీవు అతడితో చెప్పిన గొప్పతనంతో కూడిన, రజోగుణ ప్రధానములైన, పరుషాలైన, ఉచితాలైన మాటలన్నీ నీ మనస్సులో పాదుకొనేటట్టు నిలుపుము. దుఃఖించటం వలన ఏమి ప్రయోజనం? యుద్ధంలో శత్రువులు చంపక, పుష్పబాణం ప్రయోగిస్తారా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'సంగరంబున .... సాఁతురే' అనే సామాన్యాంశంచేత శత్రువులు ద్రౌపది కొడుకులను చంపారు అనే విశేషాంశం సమర్థించ బడింది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం. చాఁచు, సాఁచు అని రెండు ధాతువులూ ఉన్నాయి.

క. వినుము ధృతరాష్ట్ర! వంశం । బున మగపీచంబు నెల్లఁ బొలియించితిఁ గృ
ష్ణుని కారుణ్యము, జిష్ణుని । పెనుఁ బ్రాపును గలుగ నేను విగత భయుఁడనై. 93

ప్రతిపదార్థం: వినుము; ధృతరాష్ట్ర వంశంబున; మగపీచంబున్+ఎల్లన్= ధృతరాష్ట్రుడి వంశంలో ఉన్న శూరులగర్వాన్నంతనీ; కృష్ణుని కారుణ్యమున్= శ్రీకృష్ణుడి దయా; జిష్ణుని పెను+ప్రాపును= అర్జునుడి పెద్ద అండా; కలుగన్; నేను; విగత భయుఁడను+ఐ= నిర్భయుడినై; పొలియించితిన్= అంతమొందించాను.

తాత్పర్యం: ద్రౌపదీ! వినుము. శ్రీకృష్ణుడి దయా, అర్జునుడి పెద్ద అండా ఉండగా నేను నిర్భయుడనై ధృతరాష్ట్రుడి వంశంలో ఉన్న శూరుల గర్వాన్నంతటినీ అంతమొందించాను.

ఉ. త్రావితి దుస్ససేను రుధిరం బుర ముగ్రతఁ బేర్చి వ్రచ్చి, క్రీ
డా విధి వాని యగ్రజు తొడల్ వడి నుగ్గుగఁ జేసి, యార్చి, యా
భూవరు మౌళిఁ దన్నితి నృపుల్గని సంతసమంద; నింత హ
ర్షావసరంబు శోకసమయంబుగఁ జేయుట నీకు నర్హమే? 94

ప్రతిపదార్థం: నృపుల్= రాజులు; కని= చూచి; సంతసము+అందన్= సంతోషపడగా; ఉగ్రతన్+పేర్చి= కోపంతో; విజృంభించి; ఉరము= రొమ్ము; వ్రచ్చి= చీల్చి; దుస్ససేను రుధిరంబు= దుశ్శాసనుడి రక్తం; త్రావితిన్= త్రాగాను; క్రీడావిధిన్= ఆటవలె అవలీలగా; వాని+అగ్రజు తొడల్= వాడి అన్నయైన దుర్యోధనుడి తొడలు; వడిన్= వేగంగా; నుగ్గుగన్+చేసి= విరుగగొట్టి; ఆర్చి= బొబ్బపెట్టి; ఆ భూవరు మౌళిన్= ఆ రాజు(దుర్యోధనుడి) శిరస్సును; తన్నితిన్; ఇంత హర్షావసరంబున్= ఇంతటి సంతోష సమయాన్ని; శోక సమయంబుగన్= దుఃఖ సమయంగా; చేయుట; నీకున్; అర్హమే?= తగునా?

తాత్పర్యం: రాజులు చూచి సంతోషపడగా కోపంతో విజృంభించి రొమ్ము చీల్చి దుశ్శాసనుడి నెత్తురు త్రాగాను. వాడి అన్న అయిన దుర్యోధనుడి తొడలు ఒక ఆటవలె - అవలీలగా వేగంగా విరుగగొట్టి బొబ్బపెట్టి శిరస్సు తన్నాను. ఇంతటి సంతోషసమయాన్ని దుఃఖసమయంగా చేయటం నీకు తగునా?

క. గురుతనయుఁ డగుటఁ బ్రాణము । హరియింపఁగఁ జొరక విజయుఁ డశ్వత్థామం
బరిభూతుఁ జేసి యాయుధ । పరిగ్రహముతోడ' లజ్జఁ బాయం జేసెన్. 95

ప్రతిపదార్థం: గురు తనయుఁడు+అగుటన్= గురుపుత్రుడవటంచేత; అశ్వత్థామన్= అశ్వత్థామను; విజయుఁడు= అర్జునుడు; ప్రాణము హరియింపఁగన్+చొరక= ప్రాణం తీయటానికి పూనుకోక; పరిభూతున్+చేసి= అవమానించి; ఆయుధ పరిగ్రహముతోడన్= ఆయుధ సాధనంతో; లజ్జన్+పాయన్+చేసెన్= సిగ్గు విడిచేటట్టు చేశాడు.

తాత్పర్యం: గురుపుత్రు డవటం చేత అశ్వత్థామను అర్జునుడు ప్రాణం తీయటానికి పూనుకొనక అవమానించి ఆయుధసాధనంతో సిగ్గు విడిచేటట్లు చేశాడు.

వ. చూడామణి గోలుపోవుటంజేసి యా కుంభసంభవసంభవు కీర్తిశరీరంబు వడియె; ముఱికిఁ బొందియున్న; దింతియ; యిటువైరంబు పేరు లేకుండఁ దీర్చుట యెవ్వరికిం జను? నేమియుఁ గీడాడఁ దెఱపిలేక ధర్మతనయుండు నిర్మలకీర్తికి భాజనంబై యుల్లసిల్లెడు; నూఱడిల్లుము.' 96

ప్రతిపదార్థం: చూడామణి= శిరోమణి; కోలుపోవుటన్+చేసి= పోగొట్టుకోవటంచేత; ఆ కుంభసంభవ సంభవు కీర్తి శరీరంబు= ఆ ద్రోణకుమారుడి (అశ్వత్థామయొక్క) కీర్తి అనే శరీరం; పడియెన్= పతనంచెందినది; ముఱికిన్+పొంది ఉన్నది= కలుషితమై ఉన్నది; ఇంతియ= ఇంతే; ఇటు= ఈ రీతిగా; వైరంబు పేరులేక+ఉండన్+తీర్చుట= శత్రుత్వం నామమాత్రంగా అయినా లేకుండా అంతమొందించటం; ఎవ్వరికిన్+చనున్?= ఎవరికి సాధ్యపడుతుంది?; ఏమియున్ కీడు+ఆడన్+తెఱపిలేక= ఏమీ నిందించటానికి అవకాశం లేక; ధర్మతనయుండు= ధర్మరాజు; నిర్మల కీర్తికిన్= స్వచ్ఛమైన కీర్తికి; భాజనంబు+ఐ= పాత్రమై; ఉల్లసిల్లెడున్= సంతోషిస్తున్నాడు; ఊఱడిల్లుము= ఉపశమించుము.

తాత్పర్యం: 'శిరోమణిని పోగొట్టుకొనటంచేత ఆ అశ్వత్థామ కీర్తిశరీరం పతనం చెందింది. కలుషితమై ఉన్నది. ఇంతే. ఇట్లా శత్రుత్వం నామమాత్రంగా కూడా లేకుండా అంతమొందించటం ఎవరికైనా సాధ్యమవుతుందా? ఎంతమాత్రమూ నిందించటానికి అవకాశం లేకుండా ధర్మరాజు స్వచ్ఛమైన కీర్తికి పాత్రుడై విరాజిల్లుతున్నాడు. ఉపశమించుము.'

**తే. అనినఁ గొండొక తెలివొందు నాననంబు । తోడ నుత్థితయైన యా తోయజాక్షి
ప్రభలు పర్వంగ నొప్పు నాపద్మరాగ । రత్న మఱచేత నిడికొని రాజుఁ జూచి. 97**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; కొండొక తెలివు+ఒందు+ఆననంబు తోడన్= కొంచెం వికసించిన ముఖంతో; ఉత్థిత+ఐన= లేచిన; ఆ తోయజ+అక్షి= ఆ స్త్రీ - పద్మాలవంటి కళ్ళు గల ఆ ద్రౌపది; ప్రభలు= కాంతులు; పర్వంగన్= వ్యాపించగా; ఒప్పు; ఆ; పద్మరాగ రత్నము= పద్మరాగమణి; అఱచేతన్= అరచేతిలో; ఇడికొని= పెట్టుకుని; రాజున్= ధర్మరాజుని; చూచి.

తాత్పర్యం: అనగా, కొంచెం వికసించిన ముఖంతో లేచిన ఆ ద్రౌపది కాంతులు చిమ్ముతూ ఒప్పే పద్మరాగ మణిని అరచేతిలో పెట్టుకొని ధర్మరాజును చూచి.

వ. భీమసేను నుద్దేశించి. 98

తాత్పర్యం: భీముడితో.

**ఉ. 'నా మనమార దీనిఁ గని నందముఁ బొందితి; నింత సాలు నా,
కీ మహనీయరత్నము వహింపఁగ నర్హుఁ డితండ; యంచు నా**

భూమిపుచేతఁ బెట్టుటయు, భూవర! యాతఁడు ద్రౌణిగౌరవ
శ్రీ మది భక్తిఁ బెంపఁగ ధరించె శిరంబున దానిఁ బ్రీతుఁడై. 99

ప్రతిపదార్థం: నా మనము+ఆరన్ దీనిన్+కని= నేను మనసారా దీన్ని పొంది; నందమున్+పొందితిన్= సంతోషించాను; నాకున్; ఇంత+చాలున్= ఈ మాత్రం చాలు; ఈ మహనీయ రత్నమున్= ఈ గొప్ప రత్నాన్ని; వహింపఁగన్= ధరించటానికి; అర్హుఁడు= తగినవాడు; ఇతండు+అ= ఇతడే; అంచున్; ఆ భూమిపు+చేతన్= ఆ రాజు (ధర్మరాజు) చేతిలో పెట్టుటయున్= పెట్టగా; భూవర!= రాజా! జనమేజయా!; ఆతఁడు= ధర్మరాజు; ద్రౌణి గౌరవ శ్రీ= అశ్వత్థామమీద ఉండే గౌరవ సంపద; మదిన్= మనస్సులో; భక్తి; పెంపఁగన్= వృద్ధి పొందించగా; ప్రీతుఁడు+ఐ= సంతోషించినవాడై; దానిన్; శిరంబునన్= తలమీద; ధరించెన్= తాల్చాడు.

తాత్పర్యం: 'దీనిని పొంది నా మనసారా ఆనందించాను. నాకు ఈ మాత్రం చాలు. ఈ మహనీయ రత్నాన్ని ధరించటానికి ఇతడే అర్హు' డంటూ దానిని ఆ ధర్మరాజు చేతిలో పెట్టగా, జనమేజయా!, అతడు అశ్వత్థామపై గల గౌరవసంపద మనస్సులో అతడిపై భక్తిని పెంచగా, సంతోషంతో దాన్ని శిరస్సుపై ధరించాడు.

వ. ఇవ్విధంబున. 100

తాత్పర్యం: ఈ రీతిగా.

తే. విలసితం బగు నమ్మణి చెలువు మిగుల । మౌళియందు ధరించి యమ్మనుజనాథుఁ
డుదయరాగ నితాంత సముజ్జ్వలేందు । బింబమునఁ బోల్చు పూర్వశైలంబు వోలె. 101

ప్రతిపదార్థం: ఆ+మనుజనాథుఁడు= ఆ రాజు-ధర్మరాజు; విలసితంబు+అగు+ఆ+మణి= ప్రకాశించే ఆ మణి; చెలువు+మిగులన్= అందం అతిశయించగా; మౌళి+అందున్= శిరస్సుపై; ధరించి= తాల్చి; ఉదయరాగ నితాంత సముజ్జ్వల+ఇందు బింబమునన్= ఉదయ సమయంలోని ఎరుపుచేత అధికంగా ప్రకాశించే చంద్రబింబంచేత; పొల్చు= ఒప్పే; పూర్వ శైలంబు= తూర్పుకొండ(ను); పోలెన్.

తాత్పర్యం: ఆ ధర్మరాజు ప్రకాశిస్తూ ఉన్న ఆ మణిని అందం అతిశయించగా శిరస్సుపై ధరించి, ఉదయకాలపు ఎరుపుతో అధికంగా ప్రకాశించే చంద్రబింబంతో ఒప్పే తూర్పుకొండవలె ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ. మనుజనాథుడు, మణి-ఉపమేయాలు. పూర్వశైలం, చంద్రబింబం-వాటికి వరుసగా ఉపమానాలు. 'పోలెన్' ఉపమావాచకార్థాన్నిచ్చే సమాపక్రియ. పొల్చు= సామాన్యధర్మం. అందుచేత ఇది పూర్ణోపమాలంకారం.

వ. ఇత్తెఱంగునం బాండవాగ్రజుండు పాంచాలికిఁ బ్రియం బాచరించి తత్ప్రభృతి కాంతలును సహదేవ ప్రముఖ పురుషులును వినఁబవనతనయుం డశ్వత్థామఁబొడఁగనుట మొదలై గురునందనుండు చూడామణి యిచ్చుట తుదియైన వృత్తాంతం బంతయుఁ జెప్ప, నా భూవల్లభుండు లోనుగా నెల్లవారును నపత్యబాధకంబైన యా బ్రహ్మశిరంబు ప్రభావం బూహించి కృష్ణుని ప్రతివిధానంబు గలుగుట నూఱడిల్లియు నెట్లగునో యను శంకనుండి; రత్తఱి నుత్తరకుం దక్కఁ బాండవేయ వంశవధూజనంబులకు గర్భంబులు లేకయుండె; నయ్యస్త్రోత్తమం బవ్విరాటపుత్రి యుదరంబున నున్న పిండంబు బాధితంబు సేయుట గనుంగొని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యప్పుండరీకాక్షుండు ద్రౌణితో సల్లాపంబు సేయునవసరంబున నయ్యస్త్రఘాతవేదన లేకుండఁ దన చిత్తవృత్తిన యుడిపెం గాన నవ్విశేషం బయ్యభిమన్యువల్లభయాదిగా నెవ్వరు నెఱుంగ; రది యట్లుండెఁ; బుత్రుల దెస వగ దొఱఁగకున్న యా ధర్మనందనుండు దేవకీనందనున కిట్లనియె; 102

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; పాండవ+అగ్రజుండు= పాండవుల అన్న ధర్మరాజు; పాంచాలికిన్= ద్రౌపదికి; ప్రియంబు+ఆచరించి= ప్రీతిని చేసి; తద్+ప్రభృతి కాంతలును= ఆమె మొదలైన స్త్రీలూ; సహదేవప్రముఖ పురుషులును= సహదేవుడు మొదలైన పురుషులూ; వినన్= వినేటట్టు; పవన తనయుండు= వాయుపుత్రుడు-భీముడు; అశ్వత్థామన్; పొడఁగనుట మొదలు+ఐ= చూడటం మొదలుకొని; గురు నందనుండు= అశ్వత్థామ; చూడామణి= శిరోమణి; ఇచ్చుట తుది+ఐన= ఇవ్వటం వరకూ గల; వృత్తాంతంబు+అంతయున్= వృత్తాంతమంతా; చెప్పన్= చెప్పగా; ఆ భూ వల్లభుండు= ఆ రాజు(ధర్మరాజు); లోనుగాన్= మొదలుగా; ఎల్లవారును= అందరూ; అపత్యబాధకంబు+ఐన= సంతానాన్ని నాశనంచేసే; ఆ బ్రహ్మశిరంబు+ప్రభావంబు= ఆ బ్రహ్మశిరోనామకాస్త్రం మహిమ; ఊహించి= తలచి; కృష్ణుని ప్రతివిధానంబు= శ్రీకృష్ణుడి ప్రతిక్రియ; కలుగుటన్= ఉండటంచేత; ఊఱడిల్లియున్= ఊరటచెందీ; ఎట్లు+అగునో= ఏం జరుగుతుందో; అను శంకన్= అనే భయంతో; ఉండిరి; ఆ+తఱిన్= ఆ సమయంలో; ఉత్తరకున్+తక్కన్= ఉత్తరకు తప్ప; పాండవేయ వంశ వధూజనంబులకున్= పాండవ వంశపు స్త్రీలకు; గర్భంబులు లేక+ఉండెన్= చూలులు లేకుండా పోయాయి; ఆ+అస్త్ర+ఉత్తమంబు= ఆ అస్త్రరాజం; ఆ+విరాటపుత్రి+ఉదరంబునన్= ఆ ఉత్తర గర్భంలో; ఉన్న; పిండంబున్= పిండాన్ని; బాధితంబు+చేయుట= బాధించటం; కనుంగొని= చూచి; ఆ+పుండరీక+అక్షుండు= తెల్లతామరలవంటి కన్నులు గల ఆ శ్రీకృష్ణుడు; ద్రౌణితోన్= అశ్వత్థామతో; సల్లాపంబు+చేయు+అవసరంబునన్= సంభాషించేటప్పుడు; ఆ+అస్త్రఘాతవేదన= ఆ అస్త్రపు దెబ్బవలన కలిగే బాధ; లేక+ఉండన్= లేకుండా; తన చిత్తవృత్తిన్+అ= తన మనోవ్యాపారం చేతనే; ఉడిపెన్+కానన్= మాన్పాడు కాబట్టి; ఆ+విశేషంబు= ఆ సంగతి; ఆ+అభిమన్యు వల్లభ+ఆదిగాన్= ఆ అభిమన్యుడి భార్య (ఉత్తర) మొదలుకొని; ఎవ్వరున్; ఎఱుంగరు; అది+అట్లు+ఉండెన్; పుత్రుల దెసన్= కుమారులమీద; వగ= దుఃఖం; తొఱఁగక+ఉన్న= పోని; ఆ ధర్మనందనుండు= ఆ ధర్మరాజు; దేవకీనందనునకున్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు ద్రౌపదికి ప్రియంచేసి, ఆమె మొదలుగా స్త్రీలూ, సహదేవుడు మొదలుగా పురుషులూ వినేటట్లు భీముడు అశ్వత్థామను చూచింది మొదలుకొని అశ్వత్థామ శిరోమణి ఇవ్వటం వరకూ గల వృత్తాంతం అంతా చెప్పగా, ధర్మరాజు మొదలుగా అందరూ సంతానాన్ని నాశనం చేసే ఆ బ్రహ్మశిరోనామకాస్త్రపు మహిమను తలచుకొని, దానికి శ్రీకృష్ణుడి ప్రతిక్రియ ఉన్నదికదా అని ఊరటచెంది, ఏమవుతుందో అనే భయంతో ఉన్నారు. అప్పుడు ఉత్తరకు తప్ప పాండవవంశంలోని స్త్రీలకు చూలులు లేకుండా పోయాయి. ఆ అస్త్రరాజం ఉత్తర గర్భంలో ఉన్న పిండాన్ని బాధించటం చూచి కృష్ణుడు అశ్వత్థామతో సంభాషించేటప్పుడే ఆ అస్త్రంవలన బాధలేకుండా తన మనోవ్యాపారంచేతనే మాన్పాడు కాబట్టి ఆ సంగతి ఉత్తర మొదలుగా ఎవ్వరూ ఎరుగరు. అది అట్ల ఉండగా కుమారులకొరకు దుఃఖం విడిచిపెట్టని ధర్మరాజు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

చ. **'బలమున శౌర్యసంపద నభంగపరాక్రములైన ద్రౌపదే**
యుల నొకరుండ ముట్టికొని యుద్భటవిక్రమ ముల్లసిల్ల దు
ర్బలుల వధించు చాడ్పునఁ గృపాణకళాలలితంబు లొప్ప వి
చ్చలవిడిఁ ద్రుంచె నట్టె! గురుసంభవుఁ డంతకు నెట్టు సాలెనో! 103

ప్రతిపదార్థం: బలమునన్= బలంవలనా; శౌర్య సంపదన్= శౌర్యసంపదవలనా, అభంగ పరాక్రములు+ఐన= భంగపాటు లేని పరాక్రమంగల; ద్రౌపదేయులన్= ద్రౌపది కొడుకులను; ఒకరుండు+అ= ఒక్కడే; ముట్టికొని= ఎదుర్కొని; ఉద్భట విక్రమము= శ్రేష్ఠమైన పరాక్రమం; ఉల్లసిల్లన్= ఒప్పగా; దుర్బలులన్= బలహీనులను; వధించు చాడ్పునన్= చంపేవిధంగా; కృపాణ కళా లలితంబులు= ఖడ్గ విద్యానైపుణ్యాలు; ఒప్పన్; విచ్చలవిడిన్= ఇష్టం వచ్చినట్లు; త్రుంచెన్+అట్టె!= చంపాడట!; గురుసంభవుఁడు= అశ్వత్థామ; అంతకున్= అంతపనికి; ఎట్టు+చాలెనో= ఎట్లా సమర్థుడయ్యాడో!

తాత్పర్యం: 'బలంవలనా, శౌర్య సంపదవలనా భంగపా టెరగని పరాక్రమం గల ద్రౌపది కొడుకులను ఒక్కడూ ఎదుర్కొని శ్రేష్ఠమైన పరాక్రమం ఒప్పగా బలహీనులను వధించే విధంగా ఖడ్గవిద్యా నైపుణ్యం ప్రకాశించగా ఇష్టం వచ్చినట్లు చంపాడట! అశ్వత్థామకు ఆ సామర్థ్యం ఎట్లా వచ్చిందో!

శా. **ఉద్యోగ స్ఫురితుం, డజయ్య భుజవీర్యుం, డిద్ధ విక్రాంత సం**
పద్యోగ ప్రథితుండు, శక్రనుతసంభావ్యక్రమోద్యద్ధను
ర్విద్యావైభవశాలి, సంగరకళావిస్తారసంవేది, ధృ
ష్టద్యుమ్నుం; డతఁ డోర్వకున్కి యెటు లశ్వత్థామ యుద్రేకమున్?. **104**

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్నుండు; ఉద్యోగ స్ఫురితుండు= కార్యనిర్వహణ దక్షుడూ; అజయ్య భుజ వీర్యుండు= జయించరాని బాహుపరాక్రమం కలవాడూ; ఇద్ధ విక్రాంత సంపద్+యోగ ప్రథితుండు= అప్రతిహతమైన పరాక్రమసంపద కలిగి ఉండటంచేత ప్రసిద్ధుడూ; శక్ర నుత సంభావ్య క్రమ+ఉద్యత్+ధనుస్(ః)+విద్యా వైభవశాలి= ఇంద్రుడిచేత పొగడబడిన, సమ్మానించదగిన సామర్థ్యంతో పూనుకొనే ధనుర్విద్యా సంపదచేత ఒప్పేవాడూ; సంగర కళా విస్తార సంవేది= యుద్ధ విద్య విపులంగా తెలిసినవాడూ; అతఁడు= అటువంటి అతడు; అశ్వత్థామ ఉద్రేకమున్= అశ్వత్థామ విజృంభణాన్ని; ఓర్వక+ఉన్కి= ఓడించలేక పోవటం; ఎటులు?= ఎట్లా (సంభవించింది)?

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు కార్యనిర్వహణ దక్షుడు. జయించరాని బాహుబలం గలవాడు. అప్రతిహతమైన పరాక్రమ సంపద చేత ప్రసిద్ధుడు. ఇంద్రుడి ప్రశంస లందుకొన్న సామర్థ్యం గల ధనుర్విద్యా వైభవంతో ఒప్పేవాడు. యుద్ధవిద్య బాగా తెలిసినవాడు. అట్లాంటివాడు అశ్వత్థామ విజృంభణాన్ని ఓడించలేకపోవటం ఏమిటి?

క. **తక్కును గల పాంచాలుర । నొక్కఁడ శిబిరంబు సొచ్చి యుక్కు దలిర్పం**
బెక్కండ్రఁ దునిమె నటె; యిది । యక్కజ మగు! నేమి కతన నధికుం డయ్యెన్?' **105**

ప్రతిపదార్థం: (అశ్వత్థామ కర్త); తక్కును+కల= మిగిలిన; పాంచాలురన్= పాంచాలదేశపు వీరులను; ఒక్కఁడు+అ= ఒక్కడే; శిబిరంబు+చొచ్చి= శిబిరంలోకి ప్రవేశించి; ఉక్కు= బలం; తలిర్పన్= ఒప్పగా; పెక్కండ్రన్= అనేకులను; చంపెన్+అటె= చంపాడట; ఇది; అక్కజము+అగున్= ఆశ్చర్యంగా ఉన్నది; ఏమి కతనన్= ఏ కారణంచేత; అధికుండు+అయ్యెన్= గొప్పవాడయ్యాడు?

తాత్పర్యం: తక్కిన పాంచాలదేశపు వీరులను ఎంతమందినో ఒక్కడూ శిబిరంలో ప్రవేశించి బలం ఒప్పగా అశ్వత్థామ చంపాడట! ఇది ఆశ్చర్యకరం. అత డట్లా అధికు డవటానికి కారణం ఏమిటి?'

వ. **అనిన నమ్మహీకాంతునకు మురాంతకుం డి ట్లనియె.** **106**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అని అడుగగా; ఆ+మహీకాంతునకున్= ఆ రాజుకు; ముర+అంతకుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అని అడుగగా ధర్మరాజుతో శ్రీకృష్ణు డిట్లా అన్నాడు:

ధర్మరాజునకుఁ గృష్ణుఁడు శివప్రభావంబు చెప్పుట (సం. 10-17-6)

చ. **'హరుఁ, బరమేశ్వరేశ్వరుఁ, గృపాతిశయార్ద్రు, నమేయమూర్తి, శం**
కరు, నచలైక భక్తిరసగమ్యుని, నవ్యయు, నిందుమౌళిఁ ద
త్పరమతి నాశ్రయించి యనపాయబలోద్భటశౌర్యసంపదన్
గురుతనయుండు గాంచి యధికుం డగుటం బగదీర్చె నమ్మెయిన్. **107**

ప్రతిపదార్థం: గురు తనయుండు= గురుపుత్రుడు అశ్వత్థామ; హరున్= ఈశ్వరుడిని; పరమేశ్వర+ఈశ్వరున్= పరమేశ్వరుడైన ఈశ్వరుడిని; కృపా+అతిశయ+ఆర్ద్రున్= దయారసార్ద్రుడిని; అమేయమూర్తిన్= మితిలేని ఆకారం గలవాడిని; శంకరున్= శుభం కలగజేసేవాడిని అచల+ఏక భక్తిరస గమ్యునిన్= స్థిరమైన భక్తిరసంచేతనే పొందదగినవాడిని; అవ్యయున్= నాశనంలేని వాడిని; ఇందుమౌళిన్= చంద్రుడు శిరస్సునందు గలవాడిని; తత్పరమతిన్= ఆసక్తితో కూడిన మనస్సుతో; ఆశ్రయించి; అనపాయ బల+ఉద్భట శౌర్య సంపదన్= నాశనంలేని బలంచేత శ్రేష్ఠమైన పరాక్రమశ్రీని; కాంచి= పొంది; అధికుండు+అగుటన్= గొప్పవాడవటంచేత; ఆ+మెయిన్= ఆ రీతిగా; పగ+తీర్చెన్= పగసాధించాడు.

తాత్పర్యం: 'హరుడూ, పరమేశ్వరేశ్వరుడూ, దయారసార్ద్రుడూ, అపరిమితాకారుడూ, శంకరుడూ, స్థిరభక్తిచేతనే పొందదగినవాడూ, నాశరహితుడూ అయిన చంద్రశేఖరుడిని భక్తిశ్రద్ధలతో ఆశ్రయించి అశ్వత్థామ నాశనంలేని మహాపరాక్రమసంపత్తిని పొంది అధికు డవటంచేత ఆ రీతిగా పగసాధించాడు.

చ. **శివుఁడు ప్రసన్నుఁడైన నఱచేయునె యెవ్వరికైన? రాజపుం**
గవ! యమరత్వమైన, బలఘస్మరు గెల్వఁగ నోపునట్టి ద
ర్ప విభవమైన నిచ్చుఁ; బరిపంథు లనేకుల నొక్కరుండు బా
హువిలసనంబు ఘోరముగ నోర్వఁగఁ జాలుట యీగి చోద్యమే? **108**

ప్రతిపదార్థం: రాజపుంగవ!= రాజోత్తమా! ధర్మరాజా!; శివుఁడు; ప్రసన్నుఁడు+ఐనన్= ప్రసన్నుడైతే; ఎవ్వరికిన్+ఐనన్= ఎవరికైనా; అఱ= కొరత; చేయునె?= చేస్తాడా?; అమరత్వము+ఐనన్= దేవత్వాన్నైనా; బల ఘస్మరున్= బలాసురుడిని చంపినవాడిని - ఇంద్రుడిని; గెల్వఁగన్+ఓపు+అట్టి= గెలవగల; దర్ప విభవము+ఐనన్= పరాక్రమ సంపదనైనా; ఇచ్చున్; పరిపంథులు+అనేకులన్= శత్రువులను; పెక్కుమందిని; ఒక్కరుండున్= ఒక్కడూ; బాహు విలసనంబు= భుజక్రీడ; ఘోరముగన్= భయంకరంగా; ఓర్వఁగన్+చాలుట= ఓడించే సామర్థ్యాన్ని; ఈగి= ఇవ్వటం; చోద్యమే?= వింతా?

తాత్పర్యం: రాజోత్తమా! ధర్మరాజా! శివుడు ప్రసన్నుడైతే, ఎవరికైనా కొరతచేస్తాడా? దివ్యత్వాన్నైనా ఇస్తాడు. ఇంద్రుడిని గెలవగల పరాక్రమ సంపదనైనా ఇస్తాడు. అట్లాంటప్పుడు శత్రువు లనేకులను ఒక్కడూ భుజబలక్రీడను, భయంకరంగా ఓడించే సామర్థ్యాన్ని ఇవ్వటం ఏమి వింత?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. అమరత్వాన్నీ, ఇంద్రుడినీ ఓర్చే సామర్థ్యాన్నీ ఇచ్చేటప్పుడు, అనేక శత్రువులను ఒక్కడూ ఓడించే సామర్థ్యాన్ని ఇవ్వటంమాట చెప్పాలా? అని కైముత్యంచేత అర్థసంసిద్ధి జరుగుతోంది కాబట్టి కావ్యార్థాపత్త్యలంకారం.

ఉ. తెల్లమి గాఁగ నేను శివదేవు నెఱుంగుదు; భూతసంచయం
బెల్ల జనింప, నిల్వఁగ, లయింపఁగఁ జేయు నతండె; యవ్విభుం
డుల్లమునం దలంప భువనోత్కరవిశ్వవిధానయుక్తి వ
ర్తిల్లుచునుండు; భక్తికి విధేయుఁ, డమేయుఁడు కౌరవేశ్వరా! 109

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= కురురాజా! ధర్మరాజా!; నేను; శివదేవున్= భగవంతుడైన శివుడిని; తెల్లమి+కాఁగన్= స్పష్టంగా; ఎఱుంగుదున్; అతండు+ఎ= అతడే; భూత సంచయంబు+ఎల్లన్= ప్రాణి సమూహమంతా; జనింపన్= పుట్టేటట్టు; నిల్వఁగన్= నిలిచేటట్టు; లయింపఁగన్= నశించేటట్టు; చేయున్; ఆ+విభుండు= ఆ స్వామి; ఉల్లమునన్= మనస్సులో; తలంపన్= అనుకుంటే; భువన+ఉత్కర విశ్వ విధాన యుక్తి= లోక సమూహంయొక్క సకల సృష్టి వ్యవహారమూ; వర్తిల్లుచున్+ ఉండున్= ప్రవర్తిల్లుతూ ఉంటుంది; (అతడు); భక్తికిన్; విధేయుఁడు= వశపడేవాడు; అమేయుఁడు= మితియిడదగనివాడు.

తాత్పర్యం: ధర్మరాజా! నేను భగవంతుడైన శివుడిని బాగా ఎరుగుదును. అతడే ప్రాణి సమూహం అంతా పుట్టేటట్లూ, నిలిచేటట్లూ నశించేటట్లూ చేస్తాడు. ఆ స్వామి మనస్సులో అనుకొంటే లోక సమూహపు సర్వసృష్టి వ్యవహారమూ జరుగుతూ ఉంటుంది. అతడు భక్తికి లొంగేవాడు. ఇంతటివాడని చెప్పటానికి శక్యం కానివాడు.

వ. అమ్మహాదేవుని దివ్యలీలలు సెప్పెద నాకర్ణింపుము. 110

ప్రతిపదార్థం: ఆ+మహాదేవుని= ఆ పరమేశ్వరుడి; దివ్యలీలలు= మానవాతీతమైన లీలలు; చెప్పెదన్; ఆకర్ణింపుము= విను.

తాత్పర్యం: ఆ పరమేశ్వరుడి మానవాతీతలీలలు చెపుతాను వినుము.

సీ. భూతసంచయ సృష్టి బుద్ధిఁ దలంచి య । ప్పరమేశుఁ గానఁగ బ్రహ్మ యరిగి
తనదు మనోవృత్తి దగ నెఱింగించిన, । నమ్మహాత్ముండు తదభిమతంబు
గావింపఁ బూని తపోవిభవం బేమి । పనులకు నైనను బ్రథమసాధ
నంబని యూహించి, యంబుసమర్పిత । నిజమూర్తియై, తపోనిష్ఠ నుండె;

తే. నా విరించియు నద్దేవదేవు రాక । బహుసహస్రవర్షంబులు వార్చియుండి,
నిజతపఃప్రభావంబున నిపుణచిత్తు । దక్షుఁడనువాని సృజియించె; ధరణినాథ! 111

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా! - ధర్మరాజా!; బ్రహ్మ; భూతసంచయ సృష్టిన్= ప్రాణి సమూహపు సృష్టిని; బుద్ధిన్= మనస్సులో; తలంచి= కోరి; ఆ+పరమేశున్= ఆ పరమేశ్వరుడిని; కానఁగన్= చూడటానికి; అరిగి= వెళ్ళి; తనదు మనస్(ః)+వృత్తిన్= తన మనోభిప్రాయాన్ని; తగన్= ఒప్పేటట్టు; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; తద్+అభిమతంబు= ఆ బ్రహ్మతలపు; కావింపన్+పూని= చేయబూని; ఏమి పనులకున్+ఐనన్= ఏ పనులకైనా; తపస్(ః)+విభవంబు= తపస్సంపద; ప్రథమ సాధనంబు= మొదటిసాధనం; అని; ఊహించి= తలచి; అంబు సమర్పిత నిజమూర్తి+ఐ= నీళ్ళలో ఉంచబడిన తన ఆకారం గలవాడై; తపస్(ః)+నిష్ఠన్= తపోనియమంతో; ఉండెన్; ఆ విరించియున్= ఆ బ్రహ్మయు; ఆ+దేవదేవురాకన్= ఆ దేవదేవుడి రాకను; బహు సహస్ర వర్షంబులు= పెక్కువేలేండ్లు; వార్చి+

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉండి= కనిపెట్టుకొని ఉండి; నిజ తపస్(ః)+ప్రభావంబునన్= తనదైన తపోమహిమచేత నిపుణ చిత్తున్= నేర్పుగల మనస్సుగలవాడిని; దక్షుఁడు+అను వానిన్= దక్షుడనే వాడిని; సృజియించెన్= పుట్టించాడు.

తాత్పర్యం: ధర్మరాజా! బ్రహ్మ ప్రాణి సమూహాన్ని సృజించాలనే తలంపుతో ఆ పరమేశ్వరుడిని చూడటానికి వెళ్ళి తన మనోభిప్రాయం ఒప్పుగా చెప్పగా, ఆ మహానుభావుడు అతడి ఉద్దేశం నెరవేర్చాలని, ఏ పనులకైనా తపస్సంపద మొదటి సాధనం గదా అని తలచి, నీళ్ళలో నిలబడి తపస్సు చేయసాగాడు. బ్రహ్మ ఆ దేవదేవుడు వస్తాడు గదా! అని పెక్కు వేలేండ్లు కనిపెట్టుకొని ఉండి, తన తపోమహిమ చేత నేర్పరి అయిన దక్షుడనే వాడిని పుట్టించాడు.

వ. ఇట్లు సృజియించి యవ్విరించి యతని నాలోకించి 'ప్రజల సృజియింపు' మని పంచిన, నతండు 'పెద్దవా రొండ్లు లేరై రేనియు సృజియించెద' ననిన, నప్పరమేష్ఠి 'పరమేశ్వరుండు జలనిమగ్నుండై యున్నవాఁ; డేను నిన్ను నియోగించెద; నింక సృజియించుపెద్ద లెవ్వరును లేరు. సృజియింతువు గాక' యనవుడు నమ్మహాత్ముండు దేవాసురమనుష్యతిర్యగాత్మకభూతంబుల సృజియించిన, నాఁకొని యవి దక్షప్రజాపతి భక్షింపం గవిసిన. 112

ప్రతిపదార్థం: ఇట్లు; సృజియించి= పుట్టించి; ఆ+విరించి= ఆ బ్రహ్మ; అతనిన్= ఆ దక్షుడిని; ఆలోకించి= చూచి; ప్రజలన్; సృజియింపుము= పుట్టించుము; అని; పంచినన్= ఆజ్ఞాపించగా; అతండు; పెద్దవారు; ఒండ్లు= ఇతరులు; లేరు+ఐరి+ఏనియున్= లేకపోయినట్లయితే; సృజియించెదన్= సృష్టిస్తాను; అనన్; ఆ+పరమేష్ఠి= ఆ బ్రహ్మ; పరమేశ్వరుండు; జల నిమగ్నుండు+ఐ= నీటిలో మునిగినవాడై; ఉన్నవాఁడు; ఏను; నిన్నున్; నియోగించెదన్= నియమిస్తాను; ఇంకన్; సృజియించు పెద్దలు+ఎవ్వరును= సృష్టించే పెద్దలెవరూ; లేరు; సృజియింతువు+కాక= పుట్టించుము; అనవుడున్= అనగానే; ఆ+మహాత్ముండు; దేవ+అసుర మనుష్య తిర్యక్+ఆత్మక భూతంబులన్= దేవతలు; రాక్షసులు; మనుష్యులు; పశుపక్ష్యాదులు అనే ప్రాణులను; సృజియించినన్= పుట్టించగా; అవి; ఆఁకొని= ఆకలిగొన్నవై; దక్షప్రజాపతిన్= దక్షుడనే బ్రహ్మను; భక్షింపన్= తినటానికి; కవిసినన్= మీదపడగా.

తాత్పర్యం: ఇట్లా సృష్టించి ఆ బ్రహ్మ అతడిని చూచి, 'ప్రజలను సృజించుము' అని ఆజ్ఞాపిస్తే, అతడు 'పెద్దవాళ్ళు ఇతరులు లేకపోతే సృజిస్తాను' అన్నాడు. బ్రహ్మ 'పరమేశ్వరుడు నీళ్ళలో మునిగి ఉన్నాడు. నేను నిన్ను నియోగిస్తాను. ఇంక సృజించే పెద్దలెవ్వరూ లేరు అందుచేత నీవు సృజించుము.' అనగానే ఆ మహానుభావుడైన దక్షుడు దేవతలు, రాక్షసులు, మనుష్యులు, పశుపక్ష్యాదులు ఐన ప్రాణులను సృజించాడు, అంత అవి ఆకలిగొని దక్షప్రజాపతిని భక్షించటానికి మీదపడగా.

ఆ. అతఁడు బ్రహ్మపాలి కతిరయంబునఁ బాఱి । 'భూతతతులు నన్నుఁ బొదువకుండ
నాఁగవలయు; వాని కాహారములు గల్పి । తములు సేయవలయుఁ దగ మహాత్మ!' 113

ప్రతిపదార్థం: అతఁడు= ఆ దక్షప్రజాపతి; బ్రహ్మ పాలికిన్= బ్రహ్మ దగ్గరకు; అతి రయంబునన్= మిక్కిలి వేగంతో; పాఱి= పరుగెత్తి; మహాత్మ!= మహానుభావా!; భూత తతులు= ప్రాణులు సమూహాలు; నన్నున్; పొదువక+ఉండన్= చుట్టుముట్టకుండా; ఆఁగవలయున్= ఆపాలి; వానికిన్= ఆ భూతాలకు; తగన్= తగినట్లు; ఆహారములు; కల్పితములు+చేయవలయున్= కల్పించాలి.

తాత్పర్యం: అతడు బ్రహ్మ దగ్గరకు వేగంగా పరుగెత్తి 'మహాత్మా! ప్రాణికోట్లు నన్ను చుట్టుముట్టకుండా ఆపాలి. వాటికి తగినట్లుగా ఆహారాలు కల్పించాలి.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని యా జగత్కర్త యోషధులును ఫలమూలాదిభక్ష్యసంపదుపకారంబులుగా వృక్షలతాగుల్మంబులను గల్పించి, యా భూతంబులకు వాని నాహారంబులుగా సమర్పించి, మఱియును బలిష్ఠభూతంబులకు దుర్బల భూతంబులు భక్ష్యంబగుం గాక యనియు నాదేశించె; నంత నా భూతంబులు ప్రీతంబులై చని తత్ప్రకారంబున వృద్ధినొంది సంతానరూపంబున సమృద్ధంబు లగుచునుండెఁ; బెద్దకాలంబునకు బాలేందుధరుండు జలంబులు వెడలివచ్చి భూతకోట్ల నాలోకించి కోపించి నిజలింగంబుఁ బుచ్చి నేలనిడినం గని యా నీరజాసనుండు భవునిం బ్రశమనవాక్యంబుల ననునయించుచుఁ జేరనరిగి 'లింగంబు నిట్లేల చేసి?' తనుటయు నద్దేవుండు. 114

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ జగత్+కర్త= ఆ బ్రహ్మ; ఓషధులను; ఫలమూల+ఆది భక్ష్య సంపద్+ఉపకారంబులు+కాన్= పళ్ళు, వేళ్ళు మొదలైన భక్ష్య సంపదకు సాధనాలుగా; వృక్షలతా గుల్మంబులను= చెట్లు, తీగలు, పొదలు; కల్పించి= సృష్టించి; ఆ భూతంబులకున్= ఆ ప్రాణులకు; వానిన్; ఆహారంబులు+కాన్; సమర్పించి= ఇచ్చి; మఱియును; బలిష్ఠ భూతంబులకున్= బలవత్తమప్రాణులకు; దుర్బల భూతంబులు= బలహీనాలైన ప్రాణులు; భక్ష్యంబు+అగున్+కాక= ఆహారం అవుతాయి కాక; అనియున్; ఆదేశించెన్= ఆజ్ఞాపించాడు; అంతన్; ఆ భూతంబులు; ప్రీతంబులు+ఐ= సంతోషించినవయి; చని= వెళ్ళి; తద్+ప్రకారంబునన్= ఆ విధంగా; వృద్ధిన్+ఒంది= పెరిగి; సంతాన రూపంబునన్= సంతతి రూపంగా; సమృద్ధంబులు+అగుచున్+ ఉండెన్= బాగా వృద్ధి పొందుతున్నాయి; పెద్ద కాలంబునకున్= చాలా కాలానికి; బాల+ఇందుధరుండు= చంద్రకళను తాల్చినవాడు - శివుడు; జలంబులు వెడలి వచ్చి= నీళ్ళలో నుండి వెలికివచ్చి; భూతకోట్లన్= ప్రాణుల సమూహాలను; ఆలోకించి= చూచి; కోపించి; నిజలింగంబున్+పుచ్చి= తనదైన లింగాన్ని తీసి; నేలన్+ఇడినన్= నేలమీద పెట్టగా; కని; ఆ నీరజ+ఆసనుండు= ఆ పద్మాసనుడు-బ్రహ్మ; భవునిన్= శివుడిని; ప్రశమన వాక్యంబులన్= శాంత వచనాలతో; అనునయించుచున్= బ్రతిమాలుతూ; చేరన్+అరిగి= దగ్గరకు వెళ్ళి; లింగంబున్; ఇట్లు; ఏల చేసితి(వి)?; అనుటయున్; ఆ+దేవుండు= ఆ శివుడు.

తాత్పర్యం: అని చెప్పగా విని, ఆ సృష్టికర్త ఓషధులను, ఫలమూలాలూ మొదలైన భక్ష్య సంపదకు సాధనాలైన చెట్లనూ, తీగలనూ, పొదలనూ సృష్టించి ఆ ప్రాణులకు వాటిని ఆహారంగా సమర్పించి, ఇంకా, మిక్కిలి బలంగల ప్రాణులకు బలహీనాలైన ప్రాణులు భక్ష్యం అవుతాయని కూడా ఆదేశించాడు. అంత ఆ భూతాలు సంతోషించి, పోయి ఆ విధంగా వృద్ధినొంది సంతతి రూపంలో పెరుగుతున్నాయి. చాలాకాలం తరువాత శివుడు నీళ్ళలో నుండి వెలుపలకు వచ్చి ప్రాణికోట్లను చూచి కోపించి తన లింగాన్ని పెరికి నేలమీదపెట్టాడు. అది చూచి బ్రహ్మ శివుడిని శాంత వచనాలతో బ్రతిమాలుతూ దగ్గరకు వెళ్ళి 'లింగాన్ని ఇట్లా ఎందుకు చేశా?' వని అడిగాడు. ఆ దేవుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'భూతంబుల సృజియించుట । కై తోయములందు మునిఁగి యత్యుగ్ర తపః
స్ఫీతుఁడనై వచ్చితి నొరు । చేత సృజనమగుట నిట్లు సేసితి దీనిన్.' 115

ప్రతిపదార్థం: భూతంబులన్= ప్రాణులను; సృజియించుటకై= పుట్టించటంకోసం; తోయములందున్= నీళ్ళలో; మునిఁగి; అత్యుగ్రతపఃస్ఫీతుఁడన్+ఐ= (అతి+ఉగ్ర)+తపస్+స్ఫీతుఁడన్+ఐ= మిక్కిలి భయంకరమైన తపస్సుచేత అధికుడినయి; వచ్చితిన్; ఒరుచేతన్= ఇతరుడిచేత; సృజనము+అగుటన్= సృష్టి జరగటం చేత; దీనిన్= ఈ లింగాన్ని; ఇట్లు చేసితిన్= ఈ విధంగా చేశాను.

తాత్పర్యం: 'ప్రాణులను పుట్టించటంకొొరకు నీళ్ళలో మునిగి మిక్కిలి ఘోరమైన తపస్సుచేసి అధికుడినయి వచ్చాను. ఇంకొొకడిచేత సృష్టి జరిగిపోవటం వలన ఈ లింగాన్ని ఇట్లా చేశాను.'

వ. 'భూతంబుల సృజియించుటకుం గాక లింగంబు దన కేల?' యని పలికి సంరంభవిజృంభితుం డగుచు మాల్యవంతంబునకుఁ జని మహాతపంబు సేయుచుండ. 116

ప్రతిపదార్థం: భూతంబులన్; సృజియించుటకున్+కాక= పుట్టించటానికి కాకపోతే; లింగంబు; తనకున్+ఏల= నాకెందుకు?; అని; పలికి; సంరంభ విజృంభితుండు+అగుచున్= కోపంతో విజృంభిస్తూ; మాల్యవంతంబునకున్; చని; మహా+తపంబు+ చేయుచున్+ఉండన్= గొప్ప తపస్సు చేస్తూండగా.

తాత్పర్యం: 'భూతాలను సృష్టించటానికి కాకపోతే లింగం నా కెందుకు?' అని పలికి కోపంతో విజృంభిస్తూ మాల్యవంతమనే పర్వతం దగ్గరకు వెళ్ళి తపస్సు చేస్తూండగా.

క. ఆ సమయంబున లింగము । భాసురగతిఁ జూడ నొప్పె బ్రహ్మాదులకుం;
జేసిరి పూజలు వారలు । వాసవముఖ్యామరాదివర్గముఁ దారున్. 117

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అప్పుడు; బ్రహ్మాదులకున్= బ్రహ్మ మొదలైనవారికి; లింగము; భాసుర గతిన్= ప్రకాశించే విధంగా; చూడన్+ఒప్పెన్= చూడటానికి ఒప్పింది; వారలు; వాసవ ముఖ్య+అమర+ఆది వర్గమున్+తారున్= ఇంద్రుడు మొదలుగా గల దేవతలు మొదలైనవారి సమూహమూ, తామూ; పూజలు చేసిరి= పూజించారు.

తాత్పర్యం: అప్పుడు లింగం బ్రహ్మ మొదలైనవాళ్ళకు అందంగా కనిపించింది. ఇంద్రుడూ మొదలైన దేవతల సమూహమూ తామూ దానికి పూజలు చేశారు.

వ. అంతం బెద్దకాలంబునకు. 118

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట; పెద్దకాలంబునకున్= చాలాకాలం తరువాత.

తాత్పర్యం: పిమ్మట చాలాకాలం తరువాత.

రుద్రుఁడు దేవతలు సేయు యజ్ఞంబు సేరుట (సం. 10-18-1)

క. సుర లొక్క మహాధ్వర మా । చరింపఁగఁ దలంచి ద్రవ్యసంపద మిగులం
దొరకొల్పి భాగయోగ్యా । మరుల నిరూపించి యతిసమాహితమతులై. 119

ప్రతిపదార్థం: సురలు= దేవతలు; ఒక్క; మహా+అధ్వరము= గొప్ప యజ్ఞం; ఆచరింపఁగన్+తలంచి= చేయగోరి; ద్రవ్య సంపదన్= వస్తుసంపదను; మిగులన్= ఎక్కువగా; దొరకల్పి= సిద్ధంచేసి; భాగ యోగ్య+అమరులన్= భాగానికి అర్హులైన దేవతలను; నిరూపించి= నిర్ణయించి; అతి సమాహిత మతులు+ఐ= మిక్కిలి ఏకాగ్రతగల మనస్సులుగలవారై.

తాత్పర్యం: దేవతలు ఒక మహాయజ్ఞం చేయగోరి దానికి కావలసిన వస్తుసంపదను అధికంగా సమకూర్చికొని యజ్ఞభాగానికి అర్హులైన దేవతలను నిర్ణయించి, మిక్కిలి ఏకాగ్రతగల మనస్సులు కలవారై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. తొడంగి యనుష్ఠానప్రపంచప్రవర్తకు లగుచుండిరి గాని రుద్రుని మహానుభావం బెఱుంగమింజేసి యయ్యోగమూర్తికి భాగకల్పనం బొనర్పరైరి; దాని నెఱింగి. 120

ప్రతిపదార్థం: తొడంగి= ప్రారంభించి; అనుష్ఠాన ప్రపంచప్రవర్తకులు= ఆచరణ విస్తారాన్ని జరిపించేవారు; అగుచున్+ఉండిరి= అవుతున్నారు; కాని; రుద్రుని= శివుడియొక్క; మహానుభావంబు= గొప్పతనం; ఎఱుంగమిన్+చేసి= ఎరుగకపోవటంచేత; ఆ+యోగ మూర్తికిన్= ఆ ధ్యానస్వరూపుడికి - శివుడికి; భాగ కల్పనంబు= యజ్ఞభాగం కల్పించటం; ఒనర్పరైరి= చేయలేదు; దానిన్; ఎఱింగి.

తాత్పర్యం: ప్రారంభించి అనుష్ఠానం విస్తారంగా జరిపిస్తున్నారు కాని రుద్రుడి గొప్పతనం ఎరుగకపోవటంచేత ఆ యోగస్వరూపుడికి భాగం కల్పించలేదు. అది తెలిసి.

సీ. అతుల తపోమయం బయి యద్భుతావహం। బయిన దైర్ఘ్యంబున నతిశయిల్లి
బాలార్కసన్నిభప్రభఁ దేజరిల్లెడు। నట్లుగా నొక్క శరాసనంబు
సృజియించి దానికి శింజినీ ప్రముఖంబు। లగు నంగకములు యజ్ఞాంగకల్పి
తములు గావించి యుద్దామకోపానల। జ్వాలలు సాకారలీల నిగుడఁ

ఆ. గేలియం దమర్చి కృత్తివాసుఁడు సుర। శ్రేణిక్రతువు నియతిఁ జేయునెడకు
నరుగుదెంచె సత్వరాభీల హేలా వి। కాసభాసి యగుచుఁ గౌరవేంద్ర! 121

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కౌరవులలో శ్రేష్ఠుడా! - ధర్మరాజా!; అతుల తపస్(ః)+మయంబు+అయి= సాటిలేని వేడిమితో నిండినదై; అద్భుత+ఆవహంబు+అయిన= ఆశ్చర్యకరమైన; దైర్ఘ్యంబునన్= పొడవుతో; అతిశయిల్లి= మించి; బాల+అర్క సన్నిభ ప్రభన్= బాలసూర్యుడితో సమానమైన కాంతితో; తేజరిల్లెడు+అట్లు+కాన్= ప్రకాశించేటట్లు; ఒక్క శరాసనంబున్= ఒక ధనుస్సును; సృజియించి= పుట్టించి; దానికిన్; శింజినీ ప్రముఖంబులు+అగు+అంగకములు= నారి మొదలైన అంగాలు; యజ్ఞ+అంగ కల్పితములు= యజ్ఞ సాధనాలచే కల్పించబడినవి; కావించి= చేసి; ఉద్దామ కోప+అనల జ్వాలలు= భయంకర కోపాగ్ని శిఖలు; స+ఆకార లీలన్= మూర్తీభవించినట్లు; నిగుడన్= వ్యాపించగా; కేలియందున్= చేతిలో; అమర్చి= ధరించి; కృత్తివాసుఁడు= శివుడు (చర్మం వస్త్రంగా గలవాడు); సుర శ్రేణి= దేవతల సమూహం; క్రతువున్= యజ్ఞం; నియతిన్= నిష్ఠతో; చేయు+ఎడకున్= చేసే చోటికి; సత్వర+ఆభీల హేలా వికాస భాసి= తొందరతో గూడిన భయంకరమైన ద్వేషంయొక్క వికాసంతో ప్రకాశించేవాడు; అగుచున్; అరుగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: కురువంశ శ్రేష్ఠుడా - ధర్మరాజా! సాటిలేని వేడిమితో నిండినదై, ఆశ్చర్యకరమైన పొడవుతో మించి, బాల భాస్కరుడి తేజస్సుతో సమానమైన తేజస్సుతో ప్రకాశించేటట్లు ఒక విల్లు సృష్టించి, దానికి నారి మొదలైన అంగాలు యజ్ఞాంగాలచేత కల్పించి, భయంకరకోపాగ్ని జ్వాలలు మూర్తీభవించినట్లు వ్యాపించగా, చేత ధరించి, శివుడు దేవతలసమూహం నిష్ఠతో యజ్ఞం చేసే చోటికి సత్వరమూ, భయంకరమూ అయిన ద్వేషంతో ప్రకాశిస్తూ వచ్చాడు.

మ. ధరణీచక్రము దిర్దిరం దిరిగెఁ; బాతాళంబు ఘూర్ణిల్లె; భూ
ధరముల్ పెల్లగిలెన్; దిశావలయ ముత్కంపంబు నొందెన్; దివా

కర చంద్రాగ్నుల దీప్తి మాసె; సురలోకం బాకులం బయ్యె న

ప్పరమేశుం డటు తా మరుత్క్రతుపరిభ్రంశార్థియై వచ్చినన్. 122

ప్రతిపదార్థం: ఆ+పరమేశుండు= ఆ పరమేశ్వరుడు; అటు= ఆ విధంగా; తాన్; మరుత్+క్రతు పరిభ్రంశ+అర్థి+ఐ= దేవతల యజ్ఞనాశనం కోరినవాడై; వచ్చినన్= రాగా; ధరణీచక్రము= భూవలయం; దిర్దిరన్= గిరగిరా; తిరిగెన్; పాతాళంబు; ఘూర్ణిల్లెన్= తిరుగుడు పడింది; భూధరముల్= పర్వతాలు; పెల్లగిలెన్= పెకలాయి; దిశావలయము= దిఙ్మండలం; ఉత్కంపంబున్+ఒందెన్= అధికంగా కంపించాయి; దివాకర చంద్ర+అగ్నుల దీప్తి= సూర్యుడి, చంద్రుడి, అగ్నికాంతి; మాసెన్= నశించింది; సురలోకంబు= దేవతల సమూహం; ఆకులంబు+అయ్యెన్= కలతచెందినది.

తాత్పర్యం: ఆ పరమేశ్వరుడు ఆ విధంగా దేవతల యజ్ఞాన్ని ధ్వంసం చేయటానికి రాగా, భూవలయం గిరగిరా తిరిగింది. పాతాళలోకం తిరుగుడుపడింది. పర్వతాలు పెల్లగిల్లాయి. దిగ్వలయం మిక్కిలి కంపించింది. సూర్య చంద్రాగ్నులు తేజోవిహీనులయ్యారు. దేవతల సమూహం కలతచెందింది.

చ. అనిమిష సంఘమెల్లను భయంబునఁ జేష్టలు దక్కి యధ్వరం

బు నడప నేర్పు లేది కురుభూవర! చిత్రగతప్రకార మ

య్యె; నడరి యేసె నా క్రతువు నీశుఁడు; డెందము గాఁడఁ బాఱిపో

యె నది మృగంబుచందము వహించి హుతాశనసంయుతంబుగన్. 123

ప్రతిపదార్థం: కురు భూవర!= కురురాజా! ధర్మరాజా!; అనిమిష సంఘము+ఎల్లను= దేవతల సమూహం అంతా; భయంబునన్= భయంతో; చేష్టలు+తక్కి= నిశ్చేష్టమై; అధ్వరంబున్= యజ్ఞాన్ని; నడపన్= నడిపించటానికి; నేర్పులు+ఏది= నైపుణ్యం కోల్పోయి; చిత్రగత ప్రకారము+అయ్యెన్= చిత్తరువులో ఉన్న విధంగా నిశ్చేష్టం అయింది; ఈశుఁడు; అడరి= విజృంభించి; ఆ క్రతువున్= ఆ యజ్ఞాన్ని; ఏసెన్= కొట్టాడు; అది= ఆ యజ్ఞం; డెందము+కాఁడన్= హృదయంలో నాటుకోగా; మృగంబు చందమున్= లేడి విధం; వహించి= పొంది; హుతాశన సంయుతంబుగన్= అగ్నితో కూడా; పాఱిపోయెన్.

తాత్పర్యం: ధర్మరాజా! దేవతలందరూ భయంతో నిశ్చేష్టులై యజ్ఞ నిర్వహణానికి కావలసిన నేర్పు కోల్పోయి, బొమ్మలవలె అయిపోయారు. ఈశ్వరుడు విజృంభించి ఆ యజ్ఞాన్ని కొట్టాడు. హృదయంలో నాటుకోగా ఆ యజ్ఞం లేడి రూపాన అగ్నితో కూడి పారిపోయినది.

వ. ఇవ్విధంబున యజ్ఞం బపక్రాంతం బగుటయు నిర్జరులు నిశ్చేతనులై; రందు సవితృని బాహువులును, బూషుని దంతంబులును, భగుని లోచనంబులును ద్రిలోచనుండు గోదండాగ్రంబునఁ దునియను, డొల్లను బగులను బొడిచె నప్పుడు దలరి దివిజులు యజ్ఞాంగబులతోడంగూడఁ బలుగడలం బాఱం దొడంగిన. 124

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; యజ్ఞంబు; అపక్రాంతులు+అగుటయున్= ఆగిపోయినది కాగా; నిర్జరులు= దేవతలు; నిశ్చేతనులు+ఐరి= నిశ్చేష్టులయ్యారు; అందున్; సవిత చేతులూ; పూషుని దంతంబులును= పూషుడి పళ్ళూ; భగుని లోచనంబులును= భగుడి కళ్ళూ; త్రిలోచనుండు= ముక్కంటి శివుడు; కోదండ+అగ్రంబునన్= వింటికొనచేత; తునియను= ముక్కలయ్యేటట్టూ; డొల్లను= రాలేటట్టూ; పగులను= పగిలేటట్టూ; పొడిచెన్; అప్పుడు; దివిజులు= దేవతలు; తలరి= కంపించి; యజ్ఞ+అంగంబులతోడన్+కూడన్= యజ్ఞోపకరణాలతో సహా; పలు+కడలన్= నానా దిక్కులకు; పాఱన్+తొడంగినన్= పారిపోవ నారంభించగా.

తాత్పర్యం: ఈ విధంగా యజ్ఞం ఆగిపోగా దేవతలు నిశ్చేష్టులయ్యారు. వాళ్ళలో సవితృడి చేతులు ముక్కలయ్యే టట్లు, పూషుడి పళ్ళు ఊడేటట్లు, భగుడి కళ్ళు పగిలేటట్లు, ముక్కంటి వింటి కొనతో పొడిచాడు. అప్పుడు దేవతలు కంపించి యజ్ఞోపకరణాలతోసహా నానాదిక్కులకూ పారిపోవనారంభించగా.

క. ఆ దేవుఁడు వారందఱు । నే దిక్కులఁ బోవకుండ నెయిది భయంబా
పాదించుచు నలి నాఁగెఁ । గోదండము నారి సాఁచి గుమురులు గొనఁగన్. 125

ప్రతిపదార్థం: ఆ దేవుఁడు= ఆ శివుడు; వారు+అందఱున్; ఏ దిక్కులన్+పోవక+ఉండన్= ఏ దిక్కులకూ వెళ్ళిపోకుండా; ఎయిది= వెంటాడి; భయంబు+ఆపాదించుచున్= వెరపు పుట్టిస్తూ; కోదండము వారి సాఁచి= వింటి త్రాడు లాగి; గుమురులు+ కొనఁగన్= గుంపులు కట్టేటట్టు; నలిన్= సమర్థతతో; ఆఁగెన్= ఆపాడు.

తాత్పర్యం: ఆ దేవుడు వెంటాడి వెరపు పుట్టిస్తూ వింటిత్రాడు లాగి వాళ్ళందరూ ఏ దిక్కులకూ పారిపోకుండా, గుంపులు కట్టేటట్లు సమర్థతతో ఆపాడు.

తే. ఏయ నొల్లక యమరుల నివ్విధమునఁ । బొదివికొని యీశ్వరుఁడు వార
లొక్క మొగి 'వింటిగొనయంబు పెక్కు దునియ । లయ్యెడును' యనవుడు నది యట్ల యయ్యె. 126

ప్రతిపదార్థం: ఏయన్+ఒల్లక= కొట్టటానికి ఇష్టపడక; అమరులన్= దేవతలను; ఈ+విధమునన్; పొదివికొని= ఆక్రమించి; ఈశ్వరుఁడు; తూలపుచ్చన్= అవమానించగా; వారలు= ఆ దేవతలు; ఒక్క మొగిన్= ఒక్కుమ్మడిగా; వింటి గొనయంబు= వింటిత్రాడు; పెక్కు+తునియలు+అయ్యెడున్+అ= ముక్కలు ముక్కలయిపోవుగాక; అనవుడున్= అనగానే; అది= ఆ త్రాడు; అట్లు+అ+అయ్యెన్= అలాగే అయింది.

తాత్పర్యం: దేవతలను కొట్టటానికి ఇష్టపడక ఈ విధంగా ఆక్రమించి ఈశ్వరుడు అవమానించగా వాళ్ళందరూ ఒక్కపెట్టున 'వింటిత్రాడు ముక్కలు ముక్కలయిపోవుగాక' అని అనగానే అది అట్లాగే అయింది.

వ. ఆలోన. 127

తాత్పర్యం: అంతలోనే.

క. సుర లా క్రతువుం దారును । శరణం బను పలుకుతోడఁ జరణానతులై
కరుణకుఁ బాత్రము లగుటయు । శరణాగతవత్సలుఁడుఁ బ్రసన్నతఁ బొందెన్. 128

ప్రతిపదార్థం: సురలు= దేవతలు; ఆ క్రతువున్= ఆ యజ్ఞమూ; తారును= తామూ; శరణంబు+అను పలుకుతోడన్= శరణం అనే మాటతో; చరణ+ఆనతులు+ఐ= కాళ్ళమీద పడినవారై; కరుణకున్= దయకు; పాత్రములు= తగినవారు; అగుటయున్= కాగా; శరణ+ఆగత వత్సలుఁడు= శరణుకై వచ్చినవాళ్ళపై దయగలవాడు - ఈశ్వరుడు; ప్రసన్నతన్+పొందెన్= అనుగ్రహించాడు.

తాత్పర్యం: ఆ యజ్ఞమూ, దేవతలూ శరణంటూ కాళ్ళమీద పడి దయతో అర్హులు కాగా, శరణన్నవారిని కాచే ఈశ్వరుడు వాళ్ళను అనుగ్రహించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు ప్రసన్నుండై. 129

ప్రతిపదార్థం: ఇట్లు; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహించినవాడై.

తాత్పర్యం: ఈవిధంగా అనుగ్రహించినవాడై.

తే. ఆత్మకోపంబు పుచ్చి జలాశయమున । వైచి బాలేందుధరుఁడు దేవతల నాద
రమున వీక్షించె; నమ్మహోగ్రంపు రోష । మనలరూపమై యిగిరించె నజ్జలముల. 130

ప్రతిపదార్థం: బాల+ఇందు ధరుఁడు= చంద్రకళాధరుడు-శివుడు; ఆత్మకోపంబు= తనకోపం; పుచ్చి= తొలగించి; జలాశయమునన్= సరస్సులో; వైచి= పడవేసి; దేవతలన్; ఆదరమునన్= దయతో; వీక్షించెన్= చూశాడు; ఆ+మహత్+ఉగ్రము+ రోషము= ఆ మిక్కిలి భయంకరమైన కోపం; అనలరూపము+ఐ= అగ్నిరూపం కలదయి; ఆ+జలములన్= ఆ నీళ్ళను; ఇగిరించెన్= ఇంకించింది.

తాత్పర్యం: శివుడు తన కోపాన్ని తొలగించి సరస్సులో పడవైచి దేవతలను దయతో చూశాడు. ఆ మహాకోపం అగ్నిరూపం ధరించి ఆ నీళ్ళను ఇంకించింది.

వ. ఇత్తెఱంగునఁ గృపాయత్తచిత్తుండై సర్వేశ్వరేశ్వరుండు సవితృనకుఁ, బూషునకు, భగునకుఁ గరంబులును, దంతబులును, నయనంబులును నొసంగి యజ్ఞం బెప్పటియట్ల ప్రవర్తిల్ల ననుగ్రహార్ద్రభావంబునం బనిచిన. 131

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; సర్వ+ఈశ్వర+ఈశ్వరుండు= సర్వప్రభువులకు ప్రభువైనవాడు - పరమేశ్వరుడు; కృపా+ఆయత్త చిత్తుండు+ఐ= దయకు వశమైన మనస్సు గలవాడై; సవితృనకున్= సవితకు; పూషునకున్; భగునకున్; కరంబులును= చేతులూ; దంతంబులును= పళ్ళూ; నయనంబులును= కళ్ళూ; ఒసంగి= ఇచ్చి; యజ్ఞంబు; ఎప్పటి+అట్లు+అ= ఎప్పటిలాగే; ప్రవర్తిల్లన్= జరిగేటట్లు; అనుగ్రహ+ఆర్ద్ర భావంబునన్= దయవలని ఆర్ద్రతతో; పనిచినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఈ విధంగా పరమేశ్వరుడు దయాధీన మనస్కుడై సవితకు చేతులూ, పూషుడికి పళ్ళూ, భగుడికి కళ్ళూ ఇచ్చి యజ్ఞం యథాప్రకారంగా జరిగేటట్టు దయా భావంతో ఆజ్ఞాపించగా.

క. అమరులు భక్తిం గ్రతు భా । గము నప్పరమేశ్వరునకుఁ గల్పించి; రతం
డు మనంబునఁ బ్రీతుండై । సమాహితుండయ్యెఁ; జగము సంతోషించెన్. 132

ప్రతిపదార్థం: అమరులు= దేవతలు; భక్తిన్= భక్తితో; ఆ+పరమేశ్వరునకున్; క్రతుభాగమున్= యజ్ఞభాగాన్ని; కల్పించిరి= ఇచ్చారు; అతండు; మనంబునన్= మనస్సులో; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; సమాహితుండు+అయ్యెన్= శాంతించాడు; జగము; సంతోషించెన్.

తాత్పర్యం: దేవతలు భక్తితో ఆ పరమేశ్వరుడికి యజ్ఞభాగం కల్పించారు. అతడు మనస్సులో సంతోషించి శాంతించాడు. లోకం సంతోషించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్టివి యద్దేవదేవుని దివ్యలీల; లతండు కోపించిన భువనంబు లస్వాస్థ్యంబును, బ్రసన్నుండైన సుఖిత్వంబును గను; నా భూతనాథుండు గురుసుతునకు సన్నిహితుం డయ్యెఁ గావున నయ్యోధవరుం డొక్కరుండ శిబిరంబు ప్రవేశించి యిత్తెఱంగు పరాక్రమం బాచరించెఁ గాని యివ్విశేషం బారథికవరుని శక్తి నైనది గా; దిది చిత్తంబున నిడం బనిలేదు, భీష్మద్రోణకర్ణశల్యాదులైన మహావీరులం బోరఁ బరిమార్ప దొరకొనుటకును, దర్పదుర్దములైన ధృతరాష్ట్ర నందనాగ్రేసరులైన దుశ్శాసన దుర్యోధనులఁ జలంబు నెరయ వక్షోరక్తపానంబున, నూరుభంజనంబునం బరిమార్చుటం జేసి ప్రతిజ్ఞాపూరణాచరణశోభనంబు నొంద సంభావించుటకును గారణంబైన భవదీయ దైవమానుషయోగంబునకుఁ బరమానందంబు నొందు' మని యిట్లు గోవిందుండు ధర్మనందనునకు నాశ్వాసం బొనరించె నని జనమేజయునకు వైశంపాయనుండు సెప్పుటయు. 133

ప్రతిపదార్థం: ఆ+దేవదేవుని= ఆ పరమేశ్వరుడి; దివ్యలీలలు; అట్టివి= అటువంటివి; అతండు; కోపించినన్= కోపిస్తే; భువనంబులు= లోకాలు; అస్వాస్థ్యంబును= అనారోగ్యస్థితినీ; ప్రసన్నుండు+అయినన్= ప్రసన్నుడైతే; సుఖిత్వంబును= సౌఖ్యాన్నీ; కనున్= పొందుతాయి; ఆ భూతనాథుండు= ఆ భూతపతి-శివుడు; గురు సుతునకున్= అశ్వత్థామకు; సన్నిహితుండు+అయ్యెన్= దగ్గరయ్యాడు; కావునన్; ఆ+యోధవరుండు= ఆ వీరశ్రేష్ఠుడు; ఒక్కరుండు+అ= ఒక్కడే; శిబిరంబు; ప్రవేశించి; ఈ+తెఱంగు పరాక్రమంబు= ఈ విధమైన పరాక్రమం; ఆచరించెన్= చేశాడు; కాని; ఈ+విశేషంబు; ఆ రథిక వరుని శక్తిన్= ఆ రథిక శ్రేష్ఠుడి శక్తిచేత; ఐన+అది కాదు; ఇది; చిత్తంబునన్= మనస్సులో; ఇడన్+పనిలేదు= పెట్టుకోపనిలేదు; భీష్మ ద్రోణ కర్ణ శల్య+ఆదులు+ఐన మహావీరులన్= భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, శల్యుడు మొదలుగా గల మహావీరులను; పోరన్= యుద్ధంలో; పరిమార్పన్= చంపటానికి; దొరకొనుటకును= యత్నించటానికీ; దర్ప దుర్దములు+ఐన= అణచరాని అహంకారం గలవారైన; ధృతరాష్ట్ర నందన+అగ్రేసరులు+ఐన= ధార్తరాష్ట్రులలో పెద్దవారైన; దుశ్శాసన దుర్యోధనులన్; చలంబు= పంతం; నెరయన్= నిండగా; వక్షస్(ః)+రక్తపానంబునన్= రొమ్ము నెత్తురు త్రాగటంచేతా; ఊరు భంజనంబునన్= తొడలు విరుగగొట్టటంచేతా; పరిమార్చుటన్+ చేసి= చంపటంవలన; ప్రతిజ్ఞా పూరణ+ఆచరణ శోభనంబున్= ప్రతిజ్ఞ నెరవేర్చటం అనే శుభాన్ని; ఒందన్= పొందేటట్టు; సంభావించుటకును= ఆదరించటానికి; కారణంబు+ఐన; భవదీయ దైవ మానుష యోగంబునకున్= నీదైన దైవమానుషాల కూటమికి; పరమ+ఆనందంబున్+ఒందుము+అని= పరమానందంపొందుమని; ఇట్లు; గోవిందుండు= కృష్ణుడు; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; ఆశ్వాసంబు= ఓదార్పు; ఒనరించెన్= చేశాడు; అని; జనమేజయునకున్; వైశంపాయనుండు; చెప్పుటయున్= చెప్పగా.

తాత్పర్యం: 'ఆ దేవదేవుడైన ఈశ్వరుడి దివ్యలీలలు అటువంటివి. అతడు కోపిస్తే లోకాలు అస్వస్థతనూ, ప్రసన్నుడైతే సౌఖ్యాన్నీ పొందుతాయి. ఆ ఈశ్వరుడు అశ్వత్థామకు ప్రసన్నుడయ్యాడు. కాబట్టి ఆ వీరవరు డొక్కడే శిబిరంలోకి ప్రవేశించి ఈ విధంగా పరాక్రమించాడు. కాని, ఈ విశేషం ఆ రథికవరుడి శక్తిచేత జరిగింది కాదు. నీవు ఇది మనస్సులో పెట్టుకొననక్కరలేదు. భీష్మ ద్రోణ కర్ణ శల్యాది మహావీరులను యుద్ధంలో చంప యత్నించటానికీ, అణచరాని అహంకారం గల ధార్తరాష్ట్రులలో పెద్దవాళ్ళైన దుశ్శాసనుడినీ, దుర్యోధనుడినీ పంతం నిండగా, రొమ్ము నెత్తురు త్రాగీ, తొడలు విరగ్గొట్టి ప్రతిజ్ఞ నెరవేరటం అనే శుభాన్ని పొందేటట్లు సంభావించడానికీ కారణమైన నీ దైవమానుష సమ్మేళనానికి పరమానందపడుము' అని ఈ విధంగా శ్రీకృష్ణుడు ధర్మరాజును ఓదార్చాడు అని జనమేజయుడికి వైశంపాయనుడు చెప్పగా. (తరువాతిదైన స్త్రీ పర్వ ప్రథమాశ్వాసంలోని మొదటి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆశ్వాశాంతము

స్రగ్ధర.

సాయంప్రాతర్హుత ప్రజ్వలిత హుతవహస్వైరనిర్ధూతజాడ్య
స్ఫాయచ్చేతః ప్రసాద ప్రసృమరవిమలప్రౌఢబోధానుమోదీ!
మాయావ్యాపారదూరా! మఖతతిహృతినిర్మాణసంపాద్యమానా!
శ్రేయోరాజత్త్రిలోకాశ్రిత జనదురితక్షేపలీలావిలాసా! 134

ప్రతిపదార్థం: సాయం= సాయంకాలమందూ; ప్రాతః= ఉదయసమయమందూ; హుత= హోమం చేయబడి; ప్రజ్వలిత= బాగా జ్వలించిన; హుతవహ= అగ్నిచేత; స్వైర= స్వేచ్ఛగా; నిర్ధూత= పోగొట్టబడిన; జాడ్య= జడత్వం గలిగినట్టీ; స్ఫాయత్= వృద్ధి పొందుతున్న; చేతః+ప్రసాద= మనోనైర్మల్యమూ; ప్రసృమర= ప్రసరించే స్వభావంగల; విమల= నిర్మలమూ; ప్రౌఢ= గొప్పదీ అయిన; బోధ= జ్ఞానాన్ని; అనుమోదీ!= అంగీకరించేవాడా! (ఉభయ సంధ్యలలోనూ చేసే అగ్నిహోత్ర రూపకర్మంచేత చిత్తశుద్ధి కలిగి స్థిరమైన ఆత్మవిజ్ఞానం కలుగుతుందనీ, అలాంటి విజ్ఞానం పరమేశ్వరుడి తృప్తికి కారణమనీ భావం); మాయా వ్యాపార దూరా!= కుటిలమైన ఆచారం గలవారికి దవ్వయినవాడా! (లేదా మాయావ్యాపార మంటే జగత్ప్రవృత్తి. అధ్యాత్మ విదులకు తప్ప జగద్వ్యాపారమే యథార్థమనీ, గమ్యమనీ అనుకునే మూఢులకు దూరుడని భావం); మఖ= యజ్ఞాలయొక్క; తతి= సమూహంయొక్క; హృతి= నిర్మాణంచేత; సంపాద్యమానా!= సంపాదించబడేవాడా!; ('హృతినిర్మాణ' శబ్దంచేత త్రేతాగ్ని సంబద్ధములైన యజ్ఞాలే ప్రధానంగా గ్రాహ్యాలు); శ్రేయః= నిశ్శ్రేయస(ముక్తి) ఫలాన్నిచ్చే జ్ఞానంతో; రాజత్= ప్రకాశిస్తున్నట్టీ; త్రిలోక= మూడు లోకాలను; ఆశ్రిత= ఆశ్రయించినట్టి; జన= జనులయొక్క; దురిత= పాపాలను; క్షేప= పోగొట్టడం అనే పనే; లీలా విలాసా!= కేళీవిలాసంగా గలవాడా!- (హరిహరనాథా! అని ఈ విశేషణాలన్నీ కృతిపతియైన హరిహరనాథుడివి.)

తాత్పర్యం: హరిహరనాథా! నిష్కామంగా ఉభయ సంధ్యలలోనూ ఆచరించే అగ్నిహోత్రాది వైదిక కర్మలచేత కలిగే ఉత్తమజ్ఞానమంటే నీవు మిక్కిలి సంతోషిస్తావు. కుటిల వ్యాపారాలంటే నీకు ఎంతమాత్రమూ ఇష్టం ఉండదు. యజ్ఞస్వరూపుడవైన నీవు యజ్ఞ నిర్వహణం చేతనే సంపాదించబడతావు. సర్వలోకాలలోని జ్ఞానుల జ్ఞానాన్ని అభినందిస్తూ నీవు వాళ్ళ పాపాల నన్నింటినీ పోగొట్టుతూ మిక్కిలి వినోదిస్తావు.

క. సురనికరానందకరా! । సురారికాంతావిలాసశోభాపహరా!
కరుణాసక్తమనస్కా! । సరిద్వరా బర్హి బర్హ చారు శిరస్కా! 135

ప్రతిపదార్థం: సుర నికర+ఆనందకరా!= దేవతల సమూహానికి ఆనందాన్ని సమకూర్చేవాడా!; సుర+అరి= దేవతల శత్రువులైన రాక్షసులయొక్క; కాంతా= భార్యలయొక్క; విలాస= విలాసాలనూ; శోభా= శోభనూ; అపహరా!= అపహరించేవాడా!; (రాక్షసులను చంపేవాడా అని భావం); కరుణా+ఆసక్త మనస్కా!= దయతో గూడిన చిత్తం గలవాడా!; సరిత్+వర= నదీశ్రేష్ఠమైన గంగచేతనూ; (హరరూపంలో); బర్హి= నెమలియొక్క; బర్హ= పింఛం చేతనూ (హరిరూపంలో); చారు= మనోహరమైన; శిరస్కా!= శిరస్సుగలవాడా!

తాత్పర్యం: దేవతల సమూహానికి ఆనందాన్ని సమకూర్చేవాడా! రాక్షసుల భార్యల విలాసాలనూ, శోభనూ హరించేవాడా! (రాక్షసులను సంహరించేవాడా), దీనులయందు దయగలవాడా! హరరూపంతో నదీశ్రేష్ఠమైన గంగనూ, హరిరూపంలో నెమలి ఫింఛాన్నీ ధరించిన అందమైన శిరస్సు కలవాడా! హరిహరనాథా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మాలిని.

అకలుష హృదయాభివ్యక్త! సర్వోపయుక్తా!
సకలనిగమవేద్యా! స్వాస్థ్యవిద్యోపపాద్యా!
ప్రకృతివికృతిభావప్రాప్త సాంఖ్య ప్రదీప్తా!
సుకృతమయ విలాసా! సుస్థిరానందభాసా! **136**

ప్రతిపదార్థం: అకలుష హృదయ+అభివ్యక్త!= నిర్మలమైన చిత్తమునందే సుస్పష్టంగా గోచరించేవాడా! మాలిన్యరహితమైన దర్పణంతో ప్రతిబింబంలాగా నిర్మల చిత్తంలో పరమేశ్వరుడు సుస్పష్టంగా గోచరిస్తాడని భావం; సర్వ+ఉపయుక్తా!= విశ్వానికంతకూ ఉపకరించేవాడా!; ధర్మ సంస్థాపనం ద్వారా పరమేశ్వరుడు సర్వలోకాలకీ ఉపకరిస్తాడని భావం; సకల నిగమ వేద్యా!= సమస్త శ్రుతులచే తెలియదగినవాడా!; స్వాస్థ్య విద్యా+ఉపపాద్యా!= స్వస్థ భావాన్ని తెలిపే విద్యలచేత తెలియదగినవాడా!; స్వ= తాను అంటే ఆత్మ; స్వస్థ అంటే ఆత్మనిష్ఠుడని భావం. పరమేశ్వరుఁడు ఆత్మస్వరూపుడవటం వలన స్వాస్థ్య విద్యోపపాద్యుడని భావం; ప్రకృతి వికృతి భావ= ప్రకృతి వికృతి భావంచేత అంటే కార్యకారణభావం చేత, ప్రాప్త= పొందబడిన; సాంఖ్య= సాంఖ్య దర్శన ప్రతిపాదకమైన జ్ఞానంచేత; ప్రదీప్తా!= మిక్కిలి ప్రకాశించేవాడా!; సుకృతమయ విలాసా!= పుణ్యరూపమైన విలాసం గలవాడా! (పరమేశ్వరుడి విశ్వసృష్ట్యాదిక విలాసజ్ఞానం పుణ్యహేతువవటంచేత పరమేశ్వరుడు సుకృతమయ విలాసుడని భావం); సుస్థిర+ఆనంద భాసా!= శాశ్వతానందం చేత ప్రకాశించేవాడా!; (ఇతరములైన ఇంద్రియసుఖాదులన్నీ కార్యరూపాలు అవటంచేత అవి నశ్వరాలు. పారమేశ్వర స్వరూపానందం కారణ స్వరూపం కాబట్టి, అది సుస్థిరమని భావం).

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీవు నిర్మల హృదయాలలోనే గోచరిస్తావు. ధర్మసంస్థాపనం చేస్తూ విశ్వానికంతకూ ఉపకరిస్తావు. అధ్యాత్మ విద్యా ప్రతిపాదకాలైన వేదాలే నీ స్వరూపాన్ని తెలుపుతాయి. ప్రకృతి పురుషరూప తత్త్వాల ద్వారా విశ్వ స్వరూపాన్ని బోధించే సాంఖ్య మతంలో నీవే వెలుగొందుతున్నావు. నీ విలాసరూపమైన విశ్వసృష్టి స్థితి సంహారాల విచారం చేత జనులకు ఎంతో సుకృతం కలుగుతుంది. నీవు శాశ్వతానంద స్వరూపుడవై ప్రకాశిస్తూ ఉంటావు.

గద్యము.

ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధా రాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీమహాభారతంబున సౌప్తిక పర్వంబునందు సర్వంబును ద్వితీయాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది; శ్రీమత్+ఉభయకవిమిత్ర= శ్రీమంతుడైన ఉభయకవిమిత్ర బిరుదం కలవాడూ; కొమ్మన+అమాత్య పుత్త్ర= కొమ్మనమంత్రి కుమారుడూ; బుధ+ఆరాధన విరాజి= పండితుల-దేవతల- పూజచే ప్రకాశించేవాడూ(అయిన); తిక్కన సోమయాజి= తిక్కన అనేపేరుగల సోమయాజిచేత; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీమహాభారతంబునన్= శ్రీమహాభారతంలో; సౌప్తిక పర్వంబునందున్= సౌప్తికమనే పేరుగల పర్వంలో; ద్వితీయ+ఆశ్వాసము= రెండవ ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది శ్రీమంతుడైన ఉభయకవిమిత్ర బిరుదంకలవాడూ, కొమ్మనమంత్రి కుమారుడూ, పండితుల (దేవతల) పూజలచేత ప్రకాశించేవాడూ, అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శ్రీమహాభారతంలోని సౌప్తికపర్వంలో రెండవ ఆశ్వాసం.

సౌప్తికపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతంలో సౌప్తికపర్వం ముగిసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

స్త్రీపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీ సాంగత్య విధాయి వి। కాసోల్లాసిత కటాక్ష! కరుణామయ మూ
ర్తీ! సారబోధ భరిత। వ్యాసాది మనోనివాస! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= ఐశ్వర్య; సాంగత్య= లాభాన్ని; విధాయి= కలుగజేసేటటువంటి; వికాస+ఉల్లాసిత= వికసనంచేత ప్రకాశింపజేయబడిన; కటాక్ష!= క్రీగంటి చూపుగలస్వామీ! (హరిహరనాథా!); కరుణామయమూర్తీ!= దయాస్వరూపుడా!; సారబోధ= విశ్వానికంతా సారభూతమైన జ్ఞానంతో; భరిత= నిండిన; వ్యాసాది మనోనివాస= వ్యాసాదులైన బ్రహ్మర్షుల మనసులలో నివసించేవాడా! హరిహరనాథా! (నీకు నమస్కారం).

తాత్పర్యం: స్వామీ! హరిహరనాథా! నీ కడగంటి చూపే భక్తులకు ఐశ్వర్యాన్ని కలిగించి సంతోష పరచగలుగుతుంది. నీవు దయామయుడివి. మహాజ్ఞానమూర్తులైన వ్యాసమహర్షి మొదలైన వారు సదా నిన్ను తమ హృదయాలలో ధ్యానిస్తారు. అట్లాంటి నీకు నమస్కారం.

విశేషం: భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇట్లా చెప్పాడు:

‘చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽర్జున,
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ!”

‘అర్జునా! నన్ను నాలుగు విధాలైన పుణ్యాత్ములు ఆరాధిస్తారు. ఆర్తులు జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులు - అని నా భక్తులు నాలుగు రీతులుగా ఉన్నారు’ అని తాత్పర్యం.

ఆర్తితో తమ కష్టాన్ని తొలగించుమని కోరేవారు (ద్రౌపది, గజేంద్రుడు మొదలైనవారు), మహాతత్త్వాన్ని తెలిసికొనాలన్న తపనతో - జిజ్ఞాసువులుగా - నా వద్దకు వచ్చేవారు, (ప్రహ్లాదుడు మొదలైన వారు), ధనమో, మరో ప్రయోజనమో కోరుకొని వచ్చేవారు (కుచేలుడు ఇట్లా వచ్చినవాడే) - ఉండగా, నాకు ప్రీతిపాత్రులు, మిక్కిలి శ్రేష్ఠులు జ్ఞానులు మాత్రమే (శుక, వ్యాస, పరాశరాదులు - నారదాదులు - మహాజ్ఞానులు - వీరే జీవన్ముక్తులు) అని శ్రీకృష్ణుడు చెప్పుతున్నాడు.

వ్యాసాదులు అట్లాంటి బ్రహ్మజ్ఞాన సంపన్నులు. ఇంతవరకు భారతకథలో అంతా లోకవ్యవహారమే. అర్థకామాల లంపటంలో ఒకరిపై మరొకరు జరిపిన యుద్ధమే అంతటా కనిపించేది.

యుద్ధమైపోయింది. ధర్మరాజులో నిర్వేదం మొదలయింది. ఈ నిర్వేదమే భగవద్గీతలోని అర్జున విషాదం. దాని ఫలితమే ‘జ్ఞాన బోధ’. దానినే తిక్కన గారు ‘సారబోధ’ అని ఇక్కడ పిలుస్తున్నారు.

స్త్రీ పర్వంతో యుద్ధషట్కం పూర్తి అవుతుంది. ఇక తక్కినవి శాంతి సప్తకాలు. శాంత్యాది పర్వాలలో ధర్మరాజు ఈషణత్రయ విముక్తుడై మోక్షార్హుడు కావడానికి సంబంధించిన కథ ఉన్నది. ఈ మోక్షార్హత ‘సారబోధ’ ఉన్నవాడికే ఉంటుంది. అందుకే హరిహరనాథ స్తుతిలో వ్యాసాదుల ప్రసక్తి వచ్చింది. అన్ని పర్వాలలోను తరువాత జ్ఞాన వివేచన ప్రధానం కావటం గమనించవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. దేవా! జనమేజయ జగ । తీవరుఁడు కుతూహలము మదిన్ మొలతేరం
గా వైశంపాయన వద । నావేశిత దృగ్విలాసుఁ డై యి ట్లనియెన్. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా! (విను); జనమేజయ; జగతీవరుడు= జనమేజయ మహారాజు; మదిన్= మనసులో; కుతూహలము మొలతేరన్= కుతూహలం మొలకెత్తగా; వైశంపాయన= వైశంపాయన మహర్షియొక్క; వదన+ఆవేశిత= ముఖంలో చేర్చిన; దృక్+విలాసుఁడై= చూపుల విలాసం కలవాడై; ఇట్లు+అనియెన్= ఇట్లా అడిగాడు.

తాత్పర్యం: స్వామీ! హరిహరనాథా! తరువాతి కథ వినుము. జనమేజయ మహారాజు ఇంతవరకు విన్న సౌప్తిక పర్వ కథాసారాన్ని తలచి తరువాత ఏమి జరిగిందో అన్న కుతూహలంతో వైశంపాయనుడి ముఖంలోకి చూస్తూ ఇట్లా అడిగాడు.

వ. తన సుతుండును సైన్యంబును బాండుసుతులచేత నట్లగుట సంజయువలన విని 'ధృతరాష్ట్రుం డెబ్భంగి వర్తించె నశ్వత్థామ కృప కృతవర్మ లా రాత్రి తమ చేసిన పరాక్రమంబు తెలంగు దుర్యోధనున కెఱింగించి పోయిరని వింటిఁ బదంపడి కరినగరంబు దెస కరిగి మగిడి రనియు నాకర్ణించితి వార లట యెవ్వలనికిం జని రేల మగిడి రశ్వత్థామ కృష్ణద్వైపాయనాశ్రమంబునకుం బోవం దక్కిన యిరువురు నెక్కడ వోయి రవ్విధంబున విజయంబు నొందిన ధర్మనందనుం డేమి యాచరించె నంతయుం బరిపాటిం దేటపడం జెప్పు' మనిన నమ్ముని వరుం డిట్లనియె. 3

ప్రతిపదార్థం: తన సుతుండును= తన కుమారుడైన దుర్యోధనుడూ; సైన్యంబును= అతని సైన్యమూ; పాండు సుతులచేతన్+అట్లగుట= పాండవులచేత ఆ విధంగా నాశనం కావటం; సంజయుని వలన విని= సంజయుడు చెప్పగా విని; ధృతరాష్ట్రుండు+ఏ+భంగిన్+వర్తించెన్?= ధృతరాష్ట్రుడు ఏం చేశాడు?; అశ్వత్థామ, కృప, కృతవర్మలు; ఆ రాత్రి= ఆ రాత్రి సమయంలో; తమచేసిన పరాక్రమంబు తెలంగు= తాము చూపిన పరాక్రమాన్ని గురించి; దుర్యోధనునకున్+ఎఱింగించి= దుర్యోధనునికి చెప్పి; పోయిరని వింటిన్= పోయారని మీరు చెప్పగా విన్నాను; పదంపడి= ఆ తరువాత; కరినగరంబు దెసకున్= హస్తినాపురంవైపు; అరిగి= వెళ్ళి; మగిడిరనియున్= తిరిగి వచ్చారని కూడా; ఆకర్ణించితిన్= విన్నాను; వారలు+అట= ఆ అశ్వత్థామాదులు అక్కడ; ఏ+వలనికిన్+చనిరి?= ఏ దిక్కుగా వెళ్ళారు?; ఏల మగిడిరి?= ఎందుకు తిరిగి వచ్చారు?; అశ్వత్థామ; కృష్ణద్వైపాయ నాశ్రమంబునకున్+పోవన్= వ్యాసుడి ఆశ్రమానికి వెళ్ళగా; తక్కిన ఇరువురు= కృపుడు, కృతవర్మ; ఎక్కడ+పోయిరి?= ఎక్కడికి వెళ్ళారు?; ఆ+విధంబునన్= ఆ విధంగా; విజయంబున్+ఒందిన= విజయం పొందిన; ధర్మనందనుండు= ధర్మరాజు; ఏమి+ఆచరించెన్= ఏం చేశాడు? అంతయున్= ఈ విషయాలన్నిటినీ; పరిపాటిన్= క్రమంగా; తేటపడన్= వివరంగా; చెప్పుమనినన్= చెప్పండి అని కోరగా; ఆ మునివరుండు= వైశంపాయనుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'తన కుమారుడు అతడి సైన్యం పాండవులచేత సంపూర్ణంగా నాశనమవటాన్ని గురించి సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు ఎట్లా భరించాడు? ఏమి చేశాడు? అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ ఆ రాత్రి తాము చేసిన ఉపపాండవ సంహారాది విషయాలను దుర్యోధనుడికి చెప్పారని మీరు చెప్పగా విన్నాను. వాళ్ళు ముగ్గురూ హస్తినానగరంవైపు వెళ్ళి తిరిగి వచ్చారని కూడా విన్నాను. వారు హస్తినలో ఎక్కడికి వెళ్ళి వచ్చారు? ఎందుకు తిరిగి వచ్చారు? మరి అశ్వత్థామ వ్యాసుడి ఆశ్రమానికి వెళ్ళిపోగా కృప, కృతవర్మలు ఎక్కడికి వెళ్ళారు? అంతటి మహావిజయాన్ని పొందిన ధర్మరాజు ఏమి చేశాడు? ఈ విషయాలన్నీ వింటూ ఉంటే చాలా కుతూహలం కలుగుతున్నది.

ఆ తరువాత ఏ మేమి జరిగిందో అన్నీ వివరంగా చెప్పండి' అని జనమేజయుడు కోరగా వైశంపాయన మహర్షి ఇట్లా చెప్పటం మొదలుపెట్టాడు.

తరలము

ధరణినాయక! యట్లు పుత్త్రశతంబు వైరికులంబుచే
నిరవశేషత నొందుటన్ మహనీయ గౌరవహీనతం
బొరసి కొమ్మలు దున్మ మ్రోడ్పడు భూరుహంబును బోలె ని
ర్భర విపద్వికలాత్ముఁడై ధృతరాష్ట్రుఁ డుల్లము వమ్ముగన్. 4

ప్రతిపదార్థం: ధరణినాయక!= ఓ జనమేజయ మహారాజా!; అట్లు= ఆ విధంగా; పుత్రశతంబు= తన నూరుగురు కొడుకులు; వైరికులంబుచేన్= శత్రువులైన పాండు కుమారులచేత; నిరవశేషతన్+ఒందుటన్= నిశ్శేషం కావటం - అందరూ చనిపోవటం (వలన); మహనీయ= గొప్పదైన; గౌరవహీనతన్= గౌరవం నశించగా; ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; పొరసి= పొంది (అతిక్రూరంగా); కొమ్మలు+తున్మన్= కొమ్మలు తునిమివేయగా; మ్రోడు+పడు= మోడుగా మారిపోయిన; భూరుహంబునున్+ పోలెన్= చెట్టులాగా; నిర్భర= పరిపూర్ణమైన; విపద్+వికల+ఆత్ముఁడై= ఆపదచేత వికలమైన మనసు కలవాడై; ఉల్లము= హృదయం; వమ్ముగన్= వ్యర్థం కాగా.

తాత్పర్యం: 'ఓ రాజా! వినుము. ఆ విధంగా తన నూరుగురు సంతానమూ ఒక్కరూ మిగలకుండా ఆ పాండవులచేతిలో నశించటం వలన ఆ ధృతరాష్ట్రుడికి ఉన్న గౌరవమంతా ఒక్కపాటున పడిపోయినట్లయి పోయింది. దగ్గరికి చేరి అతిక్రూరంగా కొమ్మలన్నిటిని తునిమివేస్తే పెద్దచెట్టయినా ఎట్లా మోడువారిపోతుందో అట్లా అయిపోయాడాయన పాపం! ఆయనకు భరించరాని దుఃఖం కలిగింది. అది ఎవరూ ఆర్చలేని ఆపద. మనసంతా కకావికలైపోయింది. హృదయం శూన్యమైపోయింది.

విశేషం: అలం: ఉపమ. ఇక్కడి నుండి తిక్కనగారు స్త్రీ పర్వంలో అంతటా చాలా విశేష వృత్తాలను వాడారు. క్రీ.శ. 13వ శతాబ్దంలో భారతాన్ని రాగాత్మకంగా పాడగా శ్రోతలు విని ఆనందించేవారు. ఆధునిక కాలంలోనే కావ్యాలు మౌనంగా చదవటం అలవాటయింది. ఈ వృత్తాలన్నీ వివిధ రీతుల గతులను కలిగినవి. ముఖ్యంగా అన్నిటిలోనూ ఒక గానయోగ్యతాలక్షణం కనిపిస్తుంది. తరువాతి కథలో యుద్ధభూమిలో కౌరవ వనితలు రకరకాలుగా తమ వారిని గురించి రోదిస్తారు. ఒక్కొక్క వ్యక్తిది ఒక్కొక్క అనురాగం. దానికి తగిన రాగం, తానం, లయ, రోదనలోనూ కనిపిస్తుంది. అంతే కాకుండా ఈ స్త్రీ పర్వాన్ని ఒకే ఛందస్సులో వ్రాసి ఉంటే చదివి భరించటమూ కష్టమే. తిక్కన శోక వర్ణన చేస్తున్న ఆయా సందర్భాలలో జ్ఞాన మీమాంస సదసత్కర్మల విచారణ చేయటం ద్వారా కరుణ రసం శాంతానికి అంగభూతంగా ఉండేటట్లు చేశాడు. అందుకే భిన్న ఛ్ఛందోరూపాలను గ్రహించాడని పెద్దలు చెప్పుతారు.

ఈ పద్యంలో 'తున్మ' - అనే క్రియ ఉంది. తునుమటమంటే మొగ్గను త్రుంచటం' వంటిది. అజేయ పరాక్రమం కల దుర్యోధనాదులను శ్రీకృష్ణుడి సహాయంతో పాండవులు అవలీలగా గెలవగలిగారు. 'తునుము' అనే క్రియ ఆ లక్షణాన్ని సూచిస్తుంది.

ధృతరాష్ట్రుడిని మోడువారిన చెట్టుతో పోల్చటంలో కూడా ఒక సార్థకత ఉన్నది. ధృతరాష్ట్రుడు కాండం, కొడుకులు, బంధువులు కొమ్మలు రెమ్మలు. అవన్నీ తెగిపోగా మిగిలిన 'మోడు' వలె మహారాజు ఉన్నాడు. ఒక నిర్జీవ ప్రతిమ, జీవచ్ఛవంవలె ఉన్నాడని అర్థం. అందుకే హృదయం శూన్యమైందని చెప్పటం కూడా.

విశేషం: తరలమునకు ప్రతిపాదంలోనూ న, భ, ర, స, జ, జ, గ అనే గణాలుంటాయి. 1-12 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

వ. చింతా భరంబున నూరక యున్నం జూచి సంజయుం డతని కిట్లనియె. 5

ప్రతిపదార్థం: చింతాభరంబునన్= చింతాభారంచేత; ఊరక+ఉన్నన్= మాటా పలుకూ ఏమీలేకుండా ఉండగా; చూచి; సంజయుండు+అతనికిన్+ఇట్లు+అనియెన్= సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: చింతతో గుండె బరువైపోయింది. ధృతరాష్ట్రుడు మాటా పలుకూ లేకుండా అట్లాగే ఉండిపోయాడు. అపుడు సంజయుడు ఆయనతో ఇట్లా అన్నాడు.

ఆ. 'నీకు నితరులట్ల శోకింపఁదగునె? యె । వ్వరిఁ దలంచి యింక వనరువాఁడ
వీవు? శోకమునకు నెయ్యది తుది? యిది । వలవ దుడుగు వినుము వసుమతీశ! 6

ప్రతిపదార్థం: వసుమతీశ!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; నీకు= నీలాంటి జ్ఞానికి; ఇతరులు+అట్ల= పామర జనులవలె; శోకింపన్+తగునె?= దుఃఖపడటం తగిన పనేనా!; ఎవ్వరిన్+తలంచి= (అందరూ పోయాక) ఎవరిని తలచుకొని; ఇంకన్= ఇంక; ఈవు= నీవు; వనరువాడవు= దుఃఖిస్తావు!; శోకమునకున్= బాధకు; తుది+ఏ+అది?= అంతమెక్కడ?; ఇది= ఇట్లా శోకించటం; వలవదు= తగదు; ఉడుగు= దుఃఖం వదలిపెట్టు; వినుము= నేను చెప్పబోయే మాటలు వినుము.

తాత్పర్యం: 'ఓ రాజా! నీవు జ్ఞానవంతుడివి. అయినా పామరుడివలె దుఃఖిస్తున్నావు. ఇది తగిన పనేనా? అందరూ పోయారు. ఇక నీవు ఎవరిని గురించి బాధపడతావు? అసలు నీ బాధకు అంతముంటుందా! ఇట్లా శోకించటం తగనపని. దుఃఖాన్ని వదలిపెట్టుము. నేను చెప్పేది వినుము.

విశేషం: ఇక్కడ ధృతరాష్ట్రుడి స్థాయి యుద్ధానికి ముందు అర్జునుడి విషాదస్థాయివలె ఉన్నది. అక్కడ చనిపోతారే అని అర్జునుడు బాధపడ్డాడు. ఇక్కడ చనిపోయారే అని ధృతరాష్ట్రుడు బాధపడుతున్నాడు. అందుకే గీతోపదేశం ఈ ఇరుతెగల మనుష్యులకూ జరిగింది. కృష్ణుడు చెపుతాడు.

'గతాసూ నగతాసూంశ్చ
నానుశోచన్తి పణ్డితాః'

(చనిపోయినవారి గురించి కాని, చనిపోనివారి గురించి కాని పండితులు శోకించరు.)

అట్లా దుఃఖించటం పామరుల పద్ధతి - అని కూడా శ్రీకృష్ణుడు చెప్పాడు. అందుకే నీవు జ్ఞానివి కనుక దుఃఖించవద్దంటూ

'న త్వం శోచితు మర్హసి' (నీవు దుఃఖించటానికి తగిన వాడవు కావు) అని కూడా చెప్పాడు.

భగవద్గీతను సొంతం విన్న సంజయుడు ఈ మాటను అనటంలో ఎంతో సామంజస్యం ఉన్నది. ఇతరులు- అనే మాటకు ఇంత అర్థాన్ని భావించవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. పదునెనిమిది యక్షౌహిణులు సమసెఁ బితామహ పితృభ్రాతృ పుత్ర పౌత్ర సఖి సుహృత్సహాయులుందెగి రందు వగపునకుం బనిగాని వారలు గలరే? యేది కొలందిగా వగచె దందఱకు నగ్నికార్యంబు నిర్వర్తింపను దగిన వారలకుం దిలోదక ప్రదానంబులు సేయను వలయుఁ బొలిగలనికి వేంచేయు' మనుటయు. 7

ప్రతిపదార్థం: పదునెనిమిది+అక్షౌహిణులు= పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యమూ; సమసెన్= నశించింది; పితామహ= తాతలు; పితృ= తండ్రులు; భ్రాతృ= అన్నదమ్ములు; పుత్ర= కొడుకులు; పౌత్ర= మనుమలు; సఖి= సన్నిహితులు; సుహృద్= స్నేహితులు; సహాయులున్= సదా తోడుగా ఉన్నవారు; తెగిరి= చనిపోయారు; అందున్= వారిలో; వగపునకున్+పని+కానివారలు= దుఃఖించటానికి తగనివాళ్ళు; కలరే?= ఉన్నారా?; ఏది+కొలందిగాన్= దేనికోసమని; వగచెదు?= దుఃఖిస్తావు?; అందఱకున్= అందరికీ; అగ్నికార్యంబు= దహన సంస్కారం; నిర్వర్తింపను (వలయున్)= చేయాలి; తగినవారలకున్= సన్నిహిత బంధువర్గానికి; తిలోదక ప్రదానంబులు+చేయను వలయున్= తిలలు, నీళ్ళు వదలిపెట్టాలి (తర్పణం చేయాలి); పొలి+కలనికిన్= యుద్ధభూమికి; వేంచేయుము+అనుటయున్= బయలుదేరండి అని చెప్పగా.

తాత్పర్యం: పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యమంతా నశించింది. తాతలు, తండ్రులు, కొడుకులు, అన్నదమ్ములు, మనుమలు, సన్నిహితులు, స్నేహితులు, సదా తోడుగా పనిచేసినవారు - అందరూ చచ్చిపోయారు. వీరిలో దుఃఖించటానికి తగనివారెవరు! అందరినీ గురించి శోకించవచ్చును. ఇక దేనికొరకు ఏడుస్తావు! రాజా! ఇక ఏడుస్తూ కూర్చొనవద్దు. యుద్ధంలో చనిపోయిన వారందరికీ దహన సంస్కారం చేయాలి. సన్నిహిత బంధువర్గానికి తిలోదక ప్రదానం చేయాలి. కాబట్టి దయచేసి సకుటుంబంగా యుద్ధభూమికి బయలుదేరండి' అని సంజయుడు చెప్పగా.

విశేషం: చనిపోయిన వారిని ప్రేతలంటారు. ప్రేతకు తొలుత దహన సంస్కారాదికం కావాలి. అది బంధువులు చేయవచ్చును. ఇతరులు కూడా చేయవచ్చును. కాని, తిలోదక ప్రదానం సన్నిహిత బంధువులు మాత్రమే చేస్తారు. దేహ ఋణవిముక్తి ఈ తిలోదక ప్రదానానికి అర్థమని సంప్రదాయజ్ఞులు చెప్పుతారు.

ప్రేతకు తిలోదక, వాసోదక(వాసస్+ఉదక), పిండోదకాలు మూడూ వరుసగా నీరు, వస్త్రం, అన్నం అవుతాయని హైందవ సంప్రదాయం చెపుతున్నది. ఈ తిలోదక ప్రదానాన్ని ధర్మోదక ప్రదాన మని కూడా హైందవు లంటారు.

క. విపులార్తిఁ గూరి మనుజా । ధిప! యా భూవల్లభుండు ధృతిలేమిం జం
డపవన పతితంబగు పా । దపంబు చందంబు దోఁప ధరణిం బడియెన్. 8

ప్రతిపదార్థం: మనుజ+అధిప!= ఓ జనమేజయ మహారాజా! (వినుము); ఆ భూవల్లభుండు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; విపుల+ఆర్తిన్+కూరి= మిక్కిలి బాధలో కూరుకుపోయి; ధృతిలేమిన్= ధైర్యం కోల్పోయి; చండ= భయంకరమైన; పవన= గాలిచేత; పతితంబు+అగు= పడిపోయిన; పాదపంబు చందంబు+తోఁపన్= చెట్టులాగా; ధరణిన్+పడియెన్= నేలమీద పడ్డాడు.

తాత్పర్యం: ఓ జనమేజయా! వినుము. ఆ ధృతరాష్ట్రమహారాజు ఆ విధంగా పెద్దశోక సముద్రంలో మునిగిపోయాడు. ధైర్యం కోల్పోయాడు. భయంకరమైన గాలి తాకిడికి పడిపోయిన చెట్టువలె నేలమీద కూలిపోయాడు.

వ. పడియుండి తల దోర్చికొనుచు నిట్లనియె. 9

ప్రతిపదార్థం: పడి+ఉండి= అట్లా కొంత సేపు నేలమీద పడిఉండి; తలన్+దోర్చికొనుచున్= తల ఇటూ అటూ మోదుకొంటూ; ఇట్లనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అట్లా కొంతసేపు పడి ఉండి, పైకి లేచి, తల బాదుకుంటూ ఇలా అన్నాడు.

వసంత తిలకము

'హా! పుత్రవర్గ మిటులాఱడిఁ బోవ దీప్త। వ్యాపారమేది మది వందుచు దీన వృత్తిం
బ్రాపించి యన్యులు కృపం బరికింప నిం కే। నోపన్ భవం బెడలి యుండఁగ జీవితోడన్. **10**

ప్రతిపదార్థం: హా!= అయ్యో!; పుత్రవర్గము= కుమార సమూహం; ఇటులు= ఈవిధంగా; ఆఱడిన్+పోవన్= అతిదీనంగా చనిపోగా; దీప్త వ్యాపారము= వైభవంతోడి ఉనికిని; ఏది= పోగొట్టుకొని; మదిన్= మనసులో; వందుచున్= కుంగిపోతూ; దీనవృత్తిన్= దైన్యంగా బ్రతకటాన్ని; ప్రాపించి= పొంది; భవంబు= ప్రాధాన్యం; ఎడలి= పోగొట్టుకొని; అన్యులు= ఇతరులు; కృపన్+పరికింపన్= దయతో నన్ను చూస్తుండగా; ఇంకన్= నేను; జీవితోడన్= కేవలం ప్రాణం నిలుపుకొన్న దేహంతో; ఉండఁగన్+ఓపన్= ఉండజాలను.

తాత్పర్యం: 'అయ్యో! ఎంత దౌర్భాగ్యం వచ్చిపడింది! కొడుకులంతా అతి దీనంగా చనిపోయారు. నా బ్రతుకులోని వైభవమంతా నశించిపోయింది. మనసులో నిరంతరం క్రుంగిపోతున్నాను. అతి దీనమైన బ్రతుకు మాత్రమే మిగిలింది. ఏ ప్రాధాన్యమూ లేని ఈ ప్రాణంతోటి దేహం మాత్రం ఎందుకు? ఇకపైన ఇతరులు నన్ను దయతో జాలితో చూడగా ఇంక నేను ప్రాధాన్యం పోగొట్టుకొని ప్రాణం నిలుపుకొన్న దేహంతో ఉండలేను.

విశేషం: రాష్ట్రమంతా- దైహికమయిన సంపద; ధృత= ధరించిన వాడని అర్థం చెప్పవచ్చు. నిరంతరం ధృతరాష్ట్రుడు తన జీవితాన్ని, తన బాధను, తన కుమారుల జీవితాన్ని, వారి వైభవాన్ని, తన ప్రాముఖ్యాన్ని మాత్రమే చూచుకొంటూ బ్రతికాడని అర్థం. అందుకే ఇతరులు తనమీద కృప చూపటాన్ని కూడా సహించలేకపోయాడు. సాధారణంగా మనుష్యుల బ్రతుకు లింతే.

వసంతతిలకానికి ప్రతిపాదంలోనూ త, భ, జ, జ, గ, గ- అనే గణా లుంటాయి, 1-8 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

క. ఎఱకలు విఱిగిన గరుడుని। తెఱఁగునఁ దేజంబు సెడిన దినకరుగతి నం
దఱు బంధులు దెగి విభవం। బఱి వెలవెలఁబాఱుచునికి యది బ్రదు కగునే! **11**

ప్రతిపదార్థం: ఎఱకలు= రెక్కలు; విఱిగిన= తెగిన; గరుడుని= తెఱఁగునన్= గురుత్మంతుడిలాగా; తేజంబు= కాంతి; చెడిన= పోగొట్టుకున్న; దినకరుగతిన్= సూర్యుడిలాగా; అందఱు బంధులున్= బంధువులంతా; తెగి= చనిపోగా; విభవంబు+అఱి= వైభవం పోగొట్టుకొని; వెలవెలన్+పాఱుచున్+ఉనికి= వెలవెలపోతూ ఉండటం; అది బ్రదుకు+అగునే?= అదీ ఒక బ్రతుకేనా?

తాత్పర్యం: 'రెక్కలు తెగిన పక్షివలె, కాంతిని కోల్పోయిన సూర్యుడివలె అయిపోయింది నా బ్రదుకు. నా బంధువులంతా పోయారు. నా వైభవం అంతా పోయింది. నా బ్రతుకు మసకబారి వెలవెలపోతున్నది. ఇట్లా బ్రతకటమూ ఒక బ్రతకటమేనా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ, మాలోపమ. పురాణాలలో గరుత్మంతుడు మహా పరాక్రమవంతుడు. సూర్యుడు సాక్షాత్తు నారాయణుడుగా చెప్పబడ్డాడు. ఇంద్రుడి వజ్రాయుధానికే కేవలం ఒక ఈకను పోనిమ్మని దానంచేసినవాడు గరుత్మంతుడు. అట్లాంటి అతడి రెక్కలు పోవటం అసంభవం. సూర్యుడికి గ్రహణ సందర్భంలో కాని, మేఘాలు అలముకొన్నప్పుడు కాని కాంతి తగ్గుతుంది. మహారాజుకు గరుడుడు, సూర్యుడు స్మృతిలో మెదలటం వెనుక తన బ్రతుకు, వైభవం ఎంత గొప్పవో చెప్పుకొనటమే చాలా ప్రధానాంశం. ఇట్లా భావించటమే మనిషిలోని లోభం. పక్షికి రెక్కలు ఎటువంటివో, ధృతరాష్ట్రుడికి బంధువులు అటువంటి వారు. సూర్యుడికి తేజస్సు వంటిది ధృతరాష్ట్రుడికి విభవం అటువంటిది- అని గ్రాహ్యం.

సీ. సంధికిఁ గృష్ణుండు సనుదెంచి పెక్కుభం । గులఁ జెప్ప భీష్ముండు గుంభజుండు
నట్లు హితార్థులై యంతలంతలు మాట । లాడిరి జామదగ్న్యాదులైన
మునివరు లవ్విధంబున నొత్తి చెప్పి రా । బుద్ధులన్నియును దుర్బుద్ధి నగుటఁ
బాటింపనైతి లోభమునఁ బాండు నృపాలు । పాలు తత్సుతులకుఁ బంచి యీని

తే. నా కతంబునఁ బొలిసిరి నందనులును । జెలులుఁ జుట్టంబులును సహాయులును ధైర్య
మెట్లు కలుగు వైదికముల కెట్లు మనసు । గొలుపుఁ బ్రాణంబుతో నెట్లు నిలువ వచ్చు? 12

ప్రతిపదార్థం: సంధికిన్= రాయబారంకోసం; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; చనుదెంచి= వచ్చి; పెక్కు భంగులన్+చెప్పన్= ఎన్నో విధాలుగా చెప్పినా; భీష్ముండు= భీష్మాచార్యుడు; కుంభజుండు= ద్రోణాచార్యుడు; అట్లు= ఆ విధంగా; హిత+అర్థులు+ఐ= మేలుకోరినవారై; అంతలు+అంతలు= ఎన్నోహితోక్తులను (పెద్దమాటలను); మాటలు+ఆడిరి= చెప్పారు; జామదగ్న్య+ఆదులు+ఐన= పరశురాముడు మొదలైన; మునివరులున్= ఋషిశ్రేష్ఠులు కూడా; ఆ+విధంబునన్= అదే విధంగా; ఒత్తి+చెప్పిరి= నొక్కి నొక్కి చెప్పారు (ప్రబోధించారు); ఆ బుద్ధులు+అన్నియును= ఆ ఉపదేశాలన్నిటినీ; దుర్బుద్ధిన్+అగుటన్= దుష్టబుద్ధి కలవాడిని కావటంవల్ల; పాటింపన్+ఐతిన్= పాటించలేదు; లోభమునన్= నా లోభగుణంవల్ల; పాండునృపాలు పాలు= పాండురాజుయొక్క వంతు; తద్+సుతులకున్= పాండురాజు కుమారులకు; పంచి ఈని= భాగం ఇవ్వని; నా కతంబునన్= నావల్లనే; నందనులున్= నా కొడుకులు; చెలులున్= స్నేహితులు; చుట్టంబులును= బంధువులు; సహాయులును= సహచరులు; పొలిసిరి= మరణించారు; ధైర్యము+ఎట్లు కలుగున్= ఇక ధైర్యం ఎలా ఉంటుంది; వైదికములకున్= వైదిక కర్మలవైపు; మనసు= మనసు; ఎట్లు+కొలుపున్?= ఎలా కుదురుతుంది?; ప్రాణంబుతోన్= ప్రాణంతో; ఎట్లు నిలువవచ్చున్?= ఎట్లా బ్రతకటం?.

తాత్పర్యం: ఆనాడు రాయబారం కొరకు శ్రీకృష్ణుడు వచ్చి ఎన్నో విధాలుగా యుద్ధం నాశకరమని చెప్పాడు. భీష్మద్రోణులూ ఇట్లాగే చెప్పారు. పరశురాముడూ మునులూ ఎన్నో హితోక్తులు చెప్పారు. కాని, లోభగుణంచేత, పుత్రులమీది మమకారంచేత ఏ మాటలూ విన్నవాడిని కాను. పాండుకుమారులకు రాజ్యభాగం ఇవ్వక పోతిని. నా కారణం వలననే నా కొడుకులు, చుట్టాలు, స్నేహితులు, సహచరులు అందరూ చనిపోయారు. ఇక నాకు ధైర్యం ఎట్లా ఉంటుంది? వైదిక కర్మకాండవైపు మనసు ఎట్లా పోతుంది? అసలు ప్రాణంతో బ్రతకటం ఎట్లా?

క. నా కీడు దలఁప నేరక । శ్రీకి నెడపి పాడి యింత సేయక పుత్రా
నీక సుహృద్బాంధవులం । బోకార్చితి బ్రదుకు టింకఁ బొసఁగునె చెపుమా! 13

ప్రతిపదార్థం: నాకీడు= నాకు రాబోయే దుర్గతిని; తలఁపనేరక= ఆలోచించకుండా; శ్రీకిన్= సంపదకు; ఎడపి= (పాండవులను) దూరంచేసి; పాడి= న్యాయం; ఇంత+చేయక= కొద్దిగా కూడా నడిపించకుండా; పుత్ర+అనీక= పుత్ర సమూహాన్నీ; సుహృద్=

స్నేహితుల్నీ; బాంధవులన్= బంధువులనూ; పోకార్చితిన్= చంపుకొన్నాను; బ్రతుకుట= బ్రతకటం; ఇంకన్= ఇంక; పొసఁగునె?= కుదురుతుందా?; చెపుమా!= (సంజయా!) చెప్పుము.

తాత్పర్యం: సంజయా! నాకు రాబోయే దుర్గతిని గురించి ఆలోచించకుండా పాండవులను సంపదకు దూరంచేశాను. న్యాయం ఏ మాత్రం నడిపించకుండా ఇట్లా చేయటం వలననే నా కొడుకులను, బంధువులను, స్నేహితులను పొట్టన పెట్టుకొన్నాను. ఇక నేను బ్రతకటం సమంజసం కాదు.

వ. **దైవంబు దుఃఖ భాజనత్వం బొనర్చుటం బూర్వజన్మాచరితంబైన సుకృతంబు లేమి గాననయ్యెడు వయః పరిణామంబునఁ బంచభూత క్షయంబును దుర్వినయ పరిపాకంబున సకల బంధునాశంబును సమయ ప్రాప్తంబులయ్యెనింక బ్రహ్మపదప్రాప్తియ తగు నదియై యున్నది యది యాచరించుట సంశితవ్రత పరాయణులైన పాండు సుతులు చూతురు గాక యనిన విని యజ్జనపతి శోకంబు శాంతంబు సేయుటకు సంజయుం డిట్లనియె.** **14**

ప్రతిపదార్థం: దైవంబు= దైవం; దుఃఖభాజనత్వంబు= నా బ్రతుకును ఇలా దుఃఖంపాలుగా; ఒనర్చుటన్= చేయటం గమనిస్తే; పూర్వజన్మ ఆచరితంబు+ఐన= ముందుజన్మలో చేసుకొన్న; సుకృతంబులేమి= పుణ్యంలేకపోవటం; కానన్+అయ్యెడున్= స్పష్టంగా తెలుస్తోంది; వయః+పరిణామంబునన్= ప్రాయం మార్పుచేత; పంచభూతక్షయంబునున్= పంచభూతాల నాశనమున్నూ; దుర్వినయపరిపాకంబునన్= ఆయా వీరుల దుష్ట ప్రవృత్తి ఫలితంగా; సకల బంధునాశంబును= బంధువులందరూ ఇట్లా చనిపోవటం; సమయప్రాప్తంబులు+అయ్యెన్= కాలానికి తగినట్టు సంభవించాయి; ఇంకన్+అ= ఇక; బ్రహ్మపద ప్రాప్తిఅ= ఇట్లా మరణించినవారికి శాశ్వత బ్రహ్మలోక సిద్ధిమాత్రమే; తగునదియై యున్నది= తగిందిగా ఉంది (మిగిలింది); అది+ఆచరించుట= దానికి తగిన క్రియా కలాపాలు చేయటం; సంశిత వ్రత పరాయణులైన= పట్టిన ప్రతిజ్ఞను తీర్చుకోవటంలో దక్షులైన; పాండుసుతులు= పాండు కుమారులు; చూతురుగాక= చూసుకొంటారులే; అనినన్= అని ధృతరాష్ట్రుడు చెప్పగా; విని= సంజయుడు విని; ఆ జనపతి= ఆ మహారాజు; శోకంబు= దుఃఖాన్ని; శాంతంబు+చేయుటకున్= ఉపశమింపచేయటానికి; సంజయుడు; ఇట్లనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: నా బ్రతుకు ఇట్లా శోకమయం కావటం చూస్తే నేను పూర్వజన్మలో ఏ పుణ్యమూ చేసిన వాడివలె కనిపించటం లేదు. కాలపరిణామం ఎవరికీ తప్పించటానికి వీలులేదు. పంచభూతాలు నశిస్తుండగా ఆయా వీరులలో పుట్టిన దుష్టప్రవృత్తుల ఫలితంగానే బంధువులంతా ఇట్లా తలా ఒకరీతిలో చనిపోయారు. ఇక వీరికి సుగతి ప్రాప్తి మాత్రమే మిగిలిన పని. దానికి తగిన ఉత్తర క్రియలు చేయటానికి పాండుకుమారు లున్నారు. వారు పట్టిన ప్రతిజ్ఞను నేరవేర్చటంలో నిష్ణాతులు. వారు చేయలేని దేమున్నది!' అని ధృతరాష్ట్రుడు అంటే ఆయన శోకాన్ని ఉపశమింపచేయటంకొరకు సంజయుడు ఇట్లా అన్నాడు.

విశేషం: భారతీయులు పూర్వజన్మ సుకృతాన్నిబట్టి ఉత్తరజన్మలో ఐశ్వర్యాదులు ఉంటాయని భావిస్తారు. అందుకే ధృతరాష్ట్రుడు తాను పూర్వజన్మలో పుణ్యకార్యాలు చేసిన వాడిని కానని బాధపడుతున్నాడు.

జీవితానికి అతి గంభీరమైన వ్యాఖ్యానం చెప్పాడు వ్యాసమహర్షి. మనిషి చేసే ప్రతి పనికి 'కాల' ప్రభావం కారణం అనటం ఆ వ్యాఖ్యాన తాత్పర్యం. కాలాన్నిబట్టి ప్రకృతి (పంచభూతాలు, వాటి తన్మాత్రలు), వాటినిబట్టి మనిషి ప్రవృత్తి,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉంటాయని ధర్మరాజాదులు అట్లా ప్రవర్తించి విజయాన్ని పొందటానికీ, దుర్యోధనాదులు అట్లా ప్రవర్తించి దుర్మరణం పాలు కావటానికీ 'సమయప్రాప్తి' (కాలశక్తి) కారణమని వ్యాసుడి నిర్ణయం.

మరణించిన వారికి 'బ్రహ్మలోక' సిద్ధి కలగాలని భారతీయులు వాంఛిస్తారు. అందుకు ఏర్పడిందే వైదిక క్రియ. బ్రహ్మ పదార్థం నుంచీ పుట్టిన జీవుడు మళ్ళీ బ్రహ్మలోకి చేరిపోవటమే బ్రహ్మపదప్రాప్తి. అందుకే అందరికీ మరణానంతరం చేయగల క్రియాకలాపం 'ఉత్తరక్రియ' అని అర్థం.

సంశిత వ్రతం - అంటే పట్టిన ప్రతిజ్ఞను నెరవేర్చటం. ద్రౌపదీ వస్త్రాపహరణ సందర్భంలో భీమాదులు ఏ ప్రతిజ్ఞలు చేశారో, వాటిని నెరవేర్చుకొనటమే సంశితవ్రత దీక్ష - అంటే దృఢవ్రత దీక్ష అని భావం.

క. 'శ్రుతులును శాస్త్రములు బహు । శ్రుతులవలన వింటి శాంతి చొప్పడ వలదే?
మృతికి నృపులడలుదురె? ధీ । యుతు లీ విధమునకు రోయకుందుదురె? నృపా! 15

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; శ్రుతులును= వేదాలును; శాస్త్రములున్= శాస్త్రాలును; బహుశ్రుతులవలనన్= గొప్ప పండితుల ద్వారా; వింటి(వి)= విన్నావు; శాంతి చొప్పడవలదే?= శాంతి నీకు కలుగవలదా?; నృపులు= రాజులు; మృతికిన్= చావుకు; అడలుదురె?= శోకిస్తారా?; ధీయుతులు= జ్ఞానులు (పండితులు); ఈ విధమునకున్= ఇట్లా దుఃఖించటాన్ని; రోయక+ ఉండుదురె?= అసహ్యపడకుండా ఉంటారా?

తాత్పర్యం: 'రాజా! ఎందు కిట్లా దుఃఖిస్తావు!' ఎంతోమంది పెద్ద పెద్ద పండితుల వద్ద వేద శాస్త్రాలను విన్నావు కదా! నీవు శాంతి కలుగవలదా! రాజులు మృతికి భయపడటమా! పండితులు దీన్ని ఏవగించుకోరా! కనుక దుఃఖించవద్దు.

తొ. తొల్లి సృంజయుండు పుత్త్రశోకార్తుండైన నమరమునిసత్తముండగు నారదుం డుపన్యసించిన యితిహాసం బభిమన్యు మరణ శోక సంతప్తుండైన ధర్మతనయునకుం బరాశర తనయుండు సెప్పిన చొప్పునన యేనును జెప్ప నాకర్ణించితి గాదె! సుహృజ్జనంబు లుపదేశించిన మాటలు విననైతి నని నీవ చెప్పె దుమ్మలింపం బనియేమి? నీకును నీ కొడుకునకు మంత్రులు దుశ్శాసనుండును గర్ణుండును శకునియునటె యేమి సెప్పం గల దవధరింపుము. 16

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; సృంజయుండు= సృంజయుడు; పుత్రశోక+ఆర్తుండు+ఐనన్= పుత్రశోకంతో బాధపడుతుండగా; అమరముని సత్తముండగు= స్వర్గలోక ఋషులలో శ్రేష్ఠుడైన; నారదుండు= నారదమహర్షి; ఉపన్యసించిన= చెప్పిన; ఇతిహాసంబు= కథను; అభిమన్యు మరణశోక= అభిమన్యుని మృతిచేత పుట్టిన దుఃఖంతో; సంతప్తుండైన= కాలిపోతూ ఉండిన (బాధపడుతూ ఉండిన); ధర్మతనయునకున్= ధర్మరాజుకు; పరాశర తనయుండు= వ్యాసుడు; చెప్పిన చొప్పునన్+అ= చెప్పిన రీతిగానే; ఏనునున్+చెప్పన్= నేనూ నీకు చెప్పగా; ఆకర్ణించితి(వి)+కాదె!= విన్నావు కదా!; సుహృద్+జనంబులు= మిత్రులు; ఉపదేశించిన మాటలు= చెప్పిన ఉపదేశోక్తులను; వినన్+ఐతిన్+అని= వినకపోతినని; నీవ చెప్పెదు= నీవే చెబుతున్నావు; ఉమ్మలింపన్= బాధపడాల్సిన; పనిఏమి?= అవసరమేమున్నది?; నీకును= నీకూ; నీ కొడుకునకున్= కొడుకైన దుర్యోధనునికి; మంత్రులు= మంచి చెడులు బోధించే మంత్రి వర్యులు; దుశ్శాసనుండును, కర్ణుండును, శకునియున్+అటె!= దుశ్శాసనుండును, కర్ణుండును, శకునియున్+అటె!= దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని - వీళ్ళా!; ఏమి చెప్పన్+కలదు= ఇక ఏం చెప్పటానికున్నది!; అవధరింపుము= వినుము.

తాత్పర్యం: పూర్వం సృంజయుడు కుమారుడిని పోగొట్టుకొని బాధపడుతుండగా నారదుడు చెప్పిన ఇతిహాసాన్ని, అభిమన్యుడు పోయి దుఃఖిస్తున్న ధర్మరాజుకు వ్యాసుడు చెప్పగా, ఆ కథను నీకు నేను అట్లే చెప్పాను. విన్నావు కదా! ఇంకా శాంతి కలుగలేదా! మిత్రులు, ఆప్తులు చెప్పిన మంచిమాటలు వినకపోతినని నీవే అంటున్నావు. ఇక బాధ ఎందుకు! అయినా నీకూ, నీ కొడుకుకూ మంత్రులు దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని - వీళ్ళా! ఇక ఏమి చెప్పగలను! అయినా వినుము.

విశేషం: సృంజయు డనేరాజు కుమారుడు సువర్ణష్ఠీవి. నారదుడి అనుగ్రహంతో జన్మించినవాడు. అతని మూత్ర పురీషాలు బంగారంగా మారిపోయే వరంతో అతడు పుట్టాడు. కొందరు దుర్మార్గులు బంగారానికి ఆసపడి ఆ అబ్బాయిని చంపి చీల్చి వేశారు. సృంజయుడు బాధపడుతుండగా నారదుడు వచ్చి షోడశ మహారాజుల వృత్తాంతాలు చెప్పి అతడి దుఃఖం మాన్పి సుష్ఠర్ణష్ఠీవిని బ్రతికించాడు. ఆ కథనే ఇక్కడ గుర్తు చేస్తున్నాడు (చూ. శాంతిపర్వం)

ఆ. కొఱుత నుఱుకుఁ గాని కొడుకెన్నఁడును గార్య । తంత్రమునకుఁ జొరఁడు దాని నీవు
మాన్ప నొల్ల వతని మగఁటిమియును లావు । నచ్చి లోభ మెదఁ బెనంగొనంగ. 17

ప్రతిపదార్థం: కొఱుతన్= శూలంమీద; ఉఱుకున్+కాని= పరిగెత్తడానికి ప్రయత్నిస్తాడు (సాహస కృత్యాలు చేయబూనుతాడని అర్థం) తప్ప; కొడుకు= నీ కుమారుడైన దుర్యోధనుడు; ఎన్నఁడును= ఏనాడూ; కార్యతంత్రమునకున్= కార్యసిద్ధికి అవసరమైన క్రియా కలాపానికి; చొరఁడు= ప్రయత్నించడు; అతని మఁగటిమియును= ఆ సుయోధనుని పరాక్రమం; లావు= బలం (శక్తి); నచ్చి= నమ్మి; లోభము= లోభగుణము; ఎదన్= హృదయంలో; పెనంగొనంగన్= బాగానాటుకుపోగా; దానిన్= అట్లా చేయటాన్ని; నీవు మాన్పన్+ఒల్లవు= నీవు మాన్పవు (నీవు అడ్డు పెట్టలేకపోయావు).

తాత్పర్యం: నీ కొడుకు దుర్యోధనుడు ఎప్పుడూ ఆపదలు కొని తెచ్చుకొనే పనులు చేయటానికే సాహసించాడు తప్ప కార్యసిద్ధికి తగిన రీతులలో సమాలోచన చేశాడా? పనిని సాధించాడా? పోనీ ఆ అవివేకపు పనులను నీవు ఆపగలిగావా? అతడి పరాక్రమాన్ని, శక్తిని నమ్మి నీలో లోభగుణం బాగా మనసులో నాటుకొనిపోగా, దానిని ఆపటానికి ఇష్టపడవైతివి.

విశేషం: కొఱ్ఱు - అంటే శూలంవంటి మారణాయుధం. దానిపైన నడవటానికి ఎవరూ సాహసించరు. దానిపై పరుగెత్తటానికి ఎవరు పూనుకొంటారు! అట్లా చేసినవాడు దుర్యోధనుడు. అందుకే ఆపదలు కొనితెచ్చుకొన్నాడని తాత్పర్యం. దీనికితోడు అవివేకుల మంత్రాంగం. పైగా ధృతరాష్ట్రుడు దుర్యోధనుడి పరాక్రమం నమ్మి లోభగుణం తన మనస్సులో పెనగొనగా వారించలేదు.

క. ఆర్యులు దఱితోఁ దగియెడు । కార్యమనుష్ఠింతు రట్టుగా కప్పని మా
త్సర్యమునఁ దిగిచిపట్టి య । నార్యులు దుదిఁ దూర వగతు రాపదయైనన్. 18

ప్రతిపదార్థం: ఆర్యులు= పుణ్యాత్ములు; తఱితోన్+తగియెడు= సమయానికి తగిన; కార్యము+అనుష్ఠింతురు= పనిచేస్తారు; అట్టు+కాక= అలా కాకుండా; ఆ+పని= ఆ పనిని; మాత్సర్యమునన్= మత్సర భావంతో (అసూయతో); అనార్యులు= పాపాత్ములు; తిగిచిపట్టి= విఘ్నం కల్పించి-ఆపి; తుదిన్= చివరకు; తూరన్= విఫలంకాగా; ఆపద+ఐనన్= ఆపద వాటిల్లగా; వగతురు= ఏడుస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పుణ్యాత్ములు ఏ సమయానికి ఏం చేయాలో అది చేసి, కార్యసాధనలో సఫలీకృతులవుతారు. పాపాత్ములు ఆ పనిని అసూయాగ్రస్తులై అడ్డుకొని, తమ ప్రయత్నం విఫలం కాగా చివరకి ఏడుస్తారు. నీ కొడుకులు చేసిన పనులు అట్లాంటివే.

విశేషం: ఆర్య - అనార్య శబ్దాలను ఇతిహాసాలలో ధర్మ - అధర్మ; పుణ్య - పాప; శ్రేష్ఠ - అధమ వాచకాలుగా వాడి ఉన్నారు. పాండవులు ధౌమ్యాది పురోహితులచేత, నారదాది మహర్షులచేత ప్రరోచన పొంది కార్యసిద్ధిని పొందారు. దుర్యోధనాదులు దుర్మంత్రంతో అడుగడుగునా వారికి అడ్డుపడ్డారు. విఫలు లయ్యారు. చివరకి శోకం పాలయ్యారు.

ఆ. జున్ను డెప్పరంపు జోటైన చఱినున్నఁ। జూచి విఱుగఁబడుటఁ జూడ కాత్మ
దీపుఁ గోరి యుఱుకు తిండికాఁడును బోలె। నయితి; వగచు టింక యనుచితంబు. 19

ప్రతిపదార్థం: జున్ను= తేనెపట్టు; డెప్పరము+చోటు+ఐన= అపాయకరమైన; చఱిన్= కొండ చరియలో; ఉన్నన్= ఉండగా; చూచి; (ఆ చరియ); విఱుగన్+పడుటన్= విరిగిపోతూండటం (పడిపోవటం); చూడక= గమనించక; ఆత్మన్= చిత్తంలో; తీపున్+కోరి= తేనెలోని తియ్యదనాన్ని కోరి; ఉఱుకు= పరిగెత్తేటటువంటి; తిండికాఁడునున్+పోలె= తిండిపోతులాగా; అయితి(వి)= నీవు అయ్యావు; ఇంకన్; వగచుట= చింతించటం; అనుచితంబు= ఉచితం కాదు.

తాత్పర్యం: తేనెపట్టు కొండచరియలో శిఖరాన ఉన్నదనుకొమ్ము. దానిలోనుండి తేనె కావాలనుకొన్నవాడు ఆ చరియ గట్టిగా ఉన్నదా? లేదా? మనిషి ఎక్కినపుడు విరిగి పోతుందా? పోదా? అని ఆలోచించి మరీ ఎక్కాలి. కాని, తిండిపోతయినవాడు అదంతా పట్టించుకొనడు. ఎట్లాగైనా సరే ఆ తీపును అందుకుంటే చాలనుకొంటాడు. సరిగ్గా నీ పరిస్థితి అట్లాగే అయిపోయింది. ఇంక ఎందుకు ఏడవటం?

విశేషం: అలం: ఉపమ. జున్ను - అంటే సాధారణంగా పాలజున్ను మాత్రమే గుర్తుకువస్తుంది. తేనెపట్టును కూడా 'జున్ను' అనిపిలుస్తారు. రాజ్యసంపద - ఆ తేనెపట్టు. విరిగిపోతున్న చరియ - రాజధర్మం. అయినా లోభగుణగ్రస్తుడైన ధృతరాష్ట్రుడు దానిని పట్టించుకొనలేదు. ఆ సంపదనే కోరుకొన్నాడు. చివరికి చరియ విరిగిపోయింది - అని తాత్పర్యం. అధికంగా తిండిని కోరటానికి కూడా మనిషిలోని 'లోభ' గుణమే కారణం అని ప్రాచీనులు విశ్వసించారు.

క. వగచినఁ బోయిన కార్యము। మగుడునె? వగవంగ లోకమాన్యుండగునే?
వగ పుణ్యగతికి మూలమె? వగ పెల్లవిధముల నుడుగ వలయు నరేంద్రా! 20

ప్రతిపదార్థం: వగచినన్= దుఃఖిస్తే; పోయిన కార్యము= జరిగిపోయిన పని; మగుడునె?= మరలా తిరిగి వస్తుందా?; వగవంగన్= ఏడుస్తే; లోకమాన్యుండు+అగునే?= లోకంలో గౌరవం పొందుతాడా?; వగ= దుఃఖించటం; పుణ్యగతిన్ మూలమె?= చనిపోయిన వారికి ఉత్తమగతులు కలిగించటానికి కారణమవుతుందా?; నరేంద్రా!= ఓ రాజా!; (అందువల్ల); వగపు= దుఃఖాన్ని; ఎల్లవిధములన్= అన్ని రీతులలోనూ; ఉడుగన్+వలయున్= వదలిపెట్టాలు.

తాత్పర్యం: ఏడిస్తే ఒకసారి జరిగిపోయిన పని మళ్ళీ తిరిగి వస్తుందా? (చనిపోయిన వారు మరలివస్తారా?). ఏడిస్తే లోకం (నిన్ను) గౌరవిస్తుందా? నీవు ఏడవటం వలన చనిపోయినవారికి పుణ్యగతి కలుగుతుందా? అందుచేత బాధపడుతూ కూర్చొనటం ఏవిధంగానూ మంచిదికాదు. రాజా! దుఃఖించటం మానివేయుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మత్తకోకిల:

తాన చుట్టుఁ దగిల్చి యగ్ని యుదగ్రతం దరికొన్నఁ దా
పానుభూతికి నోర్వఁజాలక యప్రయోజన వాక్య సం
తాన శోషిత వక్త్రుఁడై యతి దైన్యమొందెడు వాని య
ట్లైన నీదు విలాప మన్యుల కాడఁ బట్టగు భూవరా! 21

ప్రతిపదార్థం: తాను+అ= తనుకుతానే (స్వయంగా); చుట్టున్= తన చుట్టూ; తగిల్చి= మంటపెట్టుకొని; అగ్ని= మంట; ఉదగ్రతన్= భయంకరంగా; దరికొన్నన్= రాజుకొనగా; తాప+అనుభూతికిన్= ఆ వేడిమి అనుభవానికి; ఓర్వన్+చాలక= తట్టుకోలేక; అప్రయోజన= నిష్ప్రయోజనకరమైన; వాక్యసంతాన= మాటల సమూహంచేత; శోషిత= ఎండిపోయిన; వక్త్రుఁడు+ఐ= నోరుగలవాడై; అతిదైన్యము+ఒందెడువాని+అట్లు+అయినన్= అతిదీన స్థితిని పొందినవాడివలె అయితే; నీదు విలాపము= నీ ఏడ్పు; అన్యులకున్= ఇతరులకు; ఆడన్+పట్టు+అగున్= నవ్వులాటకు తగినది అవుతుంది (కనుక); భూవరా!= ఓ రాజా! (ఏడ్పు మానుము).

తాత్పర్యం: స్వయంగా తానే చుట్టూ మంట పెట్టుకొని ఆ మంట ఎక్కువైపోయి భయంకరంగా చుట్టుముట్టగా ఆ వేడిమికి తట్టుకొనలేక వ్యర్థంగా ప్రలాపం చేస్తూ నోరుకూడా తడి ఆరిపోయినవాడివలె ఉన్నది నీ ఏడ్పు. నీ దీనస్థితిని చూచి అందరూ నవ్వుకొంటారు కాని, ఎవరూ సానుభూతి చూపరు. కాబట్టి ఓ రాజా! ఏడ్పును మానుము.

విశేషం: అలం: ఉపమ. సంసారంలో తగులుకోవటం సాలీడు తనచుట్టూ తాను గూడుకట్టుకొని మధ్యన నిలిచిపోవటం వంటిదని వేదాంతులంటారు. తనచుట్టూ మంటపెట్టుకోవటం కూడా అలాంటిదే. భారతంలో అన్నిటికీ మూలం ధృతరాష్ట్రుడే అని 'మూలం ధృతరాష్ట్రో మహారాజ' అనే సామెత చెబుతుంది.

మత్తకోకిలలో ప్రతి పాదానికీ ర,స,జ,జ,భ,ర అనే గణాలుంటాయి. 1-11 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉంటుంది.

ఆ. నీవుఁ గొడుకుఁ బల్కు నిష్ఠురవచనంబు । లను సమీరగతుల నతిశయిల్లు
పార్థు రోషవహ్ని పాల్పడి రధిప! నీ । వారలెల్ల నింక వగవఁ దగునె?' 22

ప్రతిపదార్థం: నీవున్= నీవూ; కొడుకున్= నీ కుమారుడు దుర్యోధనుడూ; పల్కు= పలికే; నిష్ఠుర= కఠినమైన; వచనంబులు+అను= మాటలనే; సమీర గతులన్= గాలి తాకిడికి; అతిశయిల్లు= ఎక్కువైన; పార్థు= అర్జునుడి; రోషవహ్ని= రోషమనే అగ్నికి; అధిప!= ఓ రాజా!; నీ వారలు+ఎల్లన్= నీ వారంతా; పాలు+పడిరి= పాలయ్యారు; ఇంకన్= మరి ఇక; వగవన్+తగునె?= ఏడవటం ఉచితమా?

తాత్పర్యం: నీవు, నీ కుమారుడు దుర్యోధనుడు పలికిన కఠినవాక్కులనే గాలితాకిడికి అతిశయించిన అర్జునుడి రోషమనే అగ్నికి నీ వారంతా భస్మమయ్యారు. ఇక ఏడవటం ఎందుకు?'

విశేషం: అలం: రూపకం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని యనేక భంగులం బలికిన సంజయు పలుకులకుం జెవియొడ్డి ధైర్యంబు చిక్కఁబట్టి యంకిలిదేఱిన యవ్విభు నాలోకించి 'యేల నేలఁబడి పొరలెదు? లె'మ్మని పలికి విదురుం డి ట్లనియె. 23

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; (సంజయుడు) అనేక భంగులన్= అనేక రీతులుగా; పలికినన్= చెప్పగా; (అతని) పలుకులకున్= మాటలకు; చెవియొడ్డి= చెవిని అప్పగించి (ఆ మాటలు విని); ధైర్యంబు= ధైర్యాన్ని; చిక్కన్+పట్టి= కూడదీసికొని; అంకిలి+తేఱిన= స్పృహలోకి వచ్చిన; ఆ+విభున్+ఆలోకించి= ఆ రాజును చూచి; ఏల= ఎందుకు; నేలన్+పడి= నేలమీదపడి; పొరలెదు?= పొర్లుతావు?; లెమ్ము+అని= పలికి= అంటూ; విదురుండు= విదురుడు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నారు.

తాత్పర్యం: ఇట్లా సంజయుడు ఎన్నో రీతుల చెప్పగా ధృతరాష్ట్రుడు ఆ మాటలు విని, ధైర్యం కూడదీసికొని, స్పృహలోకి వచ్చాడు. ఇదంతా చూస్తున్న విదురుడు 'రాజా! ఎందు కిట్లా మాటిమాటికి రోదిస్తావు? లే లె'మ్మని అంటూ ఇట్లా చెప్పాడు.

విదురుఁడు ధృతరాష్ట్రునకు దుఃఖోపశమనంబు చేయుట (సం. 11-2-1)

క. 'పెరుఁగుట స్రగ్గఁగ, రుచులం । బొరయుట యరుచంబు గాఁగఁ, బుట్టుట సావం,
బెరయుట పాయఁ, బదార్థో । త్కరముల నైజ; మది యెట్లు దప్పింప నగున్? 24

ప్రతిపదార్థం: పెరుఁగుట= వృద్ధిపొందటం; స్రగ్గఁగన్= తగ్గిపోవటం కోసమే; రుచులన్+పొరయుట= రుచులలో ఆసక్తిపొందటం; అరుచంబు+కాఁగన్= విరక్తిని పొందటం కోసమే; పుట్టుట= జన్మించటం; చావన్= చావటం కోసమే; బెరయుట= సమీపించటం; పాయన్= వీడిపోవటం కోసమే; పదార్థ+ఉత్కరముల నైజము= పదార్థ సమూహాల తత్త్వం (ఇది); అది= అట్లా కావటాన్ని; ఎట్లు+తప్పింపన్+అగున్?= ఎట్లా తప్పించగలుగుతాం?

తాత్పర్యం: 'పెరగటం తరిగిపోవటంకొరకే, రుచులలో ఆసక్తి చూపించటం అసలు రుచినే పోగొట్టుకొనటంకొరకే, పుట్టటం చావటంకొరకే, దగ్గర కావటం దూరం కావటంకొరకే - ఇది పదార్థ స్వభావం. దీన్ని ఎట్లా తప్పించ గలుగుతాము?

విశేషం: విదురుడు ద్వంద్వ భావాలను గురించి బోధిస్తున్నాడు. ఆయన బోధించిన వేదాంతానికి భూమిక ఈ గుణాల వివరణలో ఉన్నది. పెరుగు×విరుగు; రుచి×అరుచి; పుట్టుక×చావు; దగ్గర×దూరం - అన్నవి రెండూ పదార్థాని కున్న విరుద్ధ స్వభావాలు. ఇదే లక్షణం కౌరవ పాండవుల విషయంలోనూ సత్యమని అర్థం. భగవద్గీత కూడా సుఖదుఃఖాది ద్వంద్వభావనముండి విముక్తుడు కావటమే జ్ఞానమని బోధించింది. మృత్యువు మనిషికి సహజమైన ధర్మం. అది తప్పించటానికి వీలుకాదు. మృత్యువు ఎట్లాంటిదో ముందరి పద్యంతో విదురుడు వివరిస్తాడు.

సీ. బిరుదుల నైనను బిఱికి వాండ్రనునైనఁ । జంపుచోఁ గడపఁడు జముఁడు నేర్పు
లావును మర్త్యుని చావు మాన్పఁగలేవు । రణమొనర్చినఁ గాని రాదె మరణ
మెయ్యది యవధి? యిందెల్ల వారును దెగు । వారకా కది గడవంగ వశము
గా దింత యుమ్మలికంబేల? యట్లును । గాక నీ సుతులు సంగ్రామకేళి

తే. సలిపి యింద్రుని కతిథులై చనిరి యజ్ఞ । దానవిద్యాతపోలబ్ధ మాననీయ
గతులు సమరానివర్తన మృతుల యరుగు । నట్టి గతులకుఁ బాటిగా వండ్రు బుధులు. 25

ప్రతిపదార్థం: బిరుదులన్+ఐనను= పరాక్రమవంతుల్ని కాని; పిఱికివాండ్రనున్+ఐనన్= పిరికివాళ్ళనిగాని; చంపుచోన్= చంపేసమయంలో; జముఁడు= యమధర్మరాజు; కడపఁడు= వదలిపెట్టడు; నేర్పు= ఒక మనిషికున్న నైపుణ్యంకాని; లావును= బలంకాని; మర్త్యుని= ఆ మనిషిని; చావు= మరణం; మాన్పఁగలేవు= తప్పింపజాలవు; రణము+ఒనర్చినన్+కాని= యుద్ధం చేస్తే తప్ప; మరణము= చావు; రాదె?= రాదా?; అవధి= చావుకు హద్దు; ఏ+అది?= ఎక్కడ?; ఇందున్= ఈ జగత్తులో; ఎల్లవారును= పుట్టినవారందరూ; తెగువారు+అ= చనిపోయేవారే; కాక= తప్ప; అది= ఆ మరణం; కడవంగన్= తప్పించకోవటానికి; వశము+కాదు= సాధ్యంకాదు; ఇంత= ఇంతగా; ఉమ్మలికంబు+ఏల?= దుఃఖించటం ఎందుకు?; అట్లును+కాక= అంతేకాకుండా; నీ సుతులు= నీ కుమారులు; సంగ్రామకేళి+సలిపి= యుద్ధమనే ఆటను ఆడి; ఇంద్రునికిన్+అతిథులై= ఇంద్రుడికి అతిథులుగా; చనిరి= స్వర్గానికి వెళ్ళారు; యజ్ఞ= యాగాలు; దాన= దాన ధర్మాలు; విద్యా= చదువులు; తపస్= తపస్సులు; (వీటిచేత) లబ్ధ= లభించే; మాననీయ గతులు= ఉత్తమ గతులు; సమర= యుద్ధంలో; అనివర్తన= తిరిగిరాని; మృతుల+అరుగు+అట్టి= మరణించిన యోధులు పొందే; గతులకున్= సుగతులకు; పాటి= సమానమైనవి; కావు= కావు (అని); బుధులు= పండితులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: యముడు జీవి ప్రాణం పోయేటప్పుడు పాశంవేసి లాగికొనిపోతున్న సమయంలో వాడు పరాక్రమశాలా? పిరికివాడా? అని చూడడు. ఎవరినీ వదలిపెట్టడు. మనిషి ఎంత నిపుణుడైనా, బలోపేతుడైనా వాడి చావు మాత్రం తప్పదు. యుద్ధం చేస్తేనే చస్తారా? మనిషి ఎక్కడున్నా చస్తాడు. ఇట్లాగే చావాలన్న నియమం ఏముంది? ఈ లోకంలో అందరూ తప్పక చనిపోయేవారే. ఎవరూ చావును తప్పించుకొనలేరు. ఇంతగా చావును గురించి బాధపడటం ఎందుకు? అంతే కాదు. నీ కొడుకులు ఉత్సాహంతో ఆటవలె యుద్ధంచేసే స్వర్గానికి అతిథులుగా వెళ్ళి ఇంద్రుడి చేత సత్కారాలు పొందుతున్నారు. యజ్ఞాలు చేయటం వలనకాని, దానధర్మాలు చేయటం వలన కాని, వేదశాస్త్రాలను నిరంతరం అభ్యసించటం వలన కాని, తపోదీక్షలో చిరకాలం ఉండటం వలన కాని ఏ పుణ్యగతులు కలుగుతాయో అవి యుద్ధంలో వెన్ను చూపకుండా పోరాడి మరణించే యోధులకు కలిగే పుణ్యగతులకు ఏ మాత్రం సరిసాటి కావని పండితులు అంటారు.

విశేషం: సూర్యమండలాన్ని ఛేదించుకొని ఉత్తమ లోకప్రాప్తి (వైకుంఠప్రాప్తి) నందగలవారు ఇద్దరేనట.

"ద్వా విమౌ పురుషౌ లోకే సూర్యమండల భేదినౌ
పరివ్రాడ్యోగయుక్తశ్చ రణే చాభిముఖే హతః"

అని సంప్రదాయజ్ఞులు చెప్పుతారు. అష్టాంగ యోగంతో తనువును స్వతంత్రంగా త్యజించగలవాడు (పరివ్రాజకుడు), యుద్ధంలో ఎదురొడ్డి నిలిచి మరణించిన వాడు (యోధుడు) - వీరిరువురే వైకుంఠప్రాప్తికి అర్హులు. (కనుక నీ కొడుకులు యుద్ధంలో వీరమరణం పొందారు కాబట్టి వారు పుణ్యాత్ములయ్యారు).

వ. కావున వారికి వగవం బనిలే దది యట్లుండె. సంసారంబున మాతృ పితృ సోదర దార పుత్ర సహస్రంబు లనుభవ గోచరంబులయ్యె నందెవ్వరికి వగచెద?' వని వెండియు. 26

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; వారికిన్= నీ కొడుకులను గురించి; వగవన్= దుఃఖించటం; పనిలేదు; అనవసరం; అది= ఆ విషయం; అట్లు+ఉండెన్= అట్లా ఉన్నది; సంసారంబునన్= ఈ సృష్టిలో; మాతృ= తల్లులు; పితృ= తండ్రులు; సోదర= అన్నదమ్ములు; దార= భార్యలు; పుత్ర= కొడుకులు; సహస్రంబులు= వేలకొద్దీ; అనుభవ= అనుభవంలో; గోచరంబులయ్యెన్= కనిపిస్తున్నారు; అందున్= వీరిలో; ఎవ్వరికిన్= ఎవరికోసమని; వగచెదవు?= ఏడుస్తావు?; అని= అంటూ; వెండియున్= ఇంకా ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: కాబట్టి నీ కొడుకుల విషయంలో చింతించటం అనవసరం. అది అట్లా ఉంచుము. ఎంతోమంది తల్లులు, తండ్రులు, అన్నదమ్ములు, భార్యలు, సంతానం - వేలకొద్దీ ఈ సంసారంలో తటస్థపడుతూ ఉంటారే! వాళ్ళలో ఎవ్వరికొరకు ఏడుస్తూ కూర్చుండగలవు?' అంటూ ఇంకా ఇట్లా చెప్పాడు.

విశేషం: పై పద్యంలో 'అనుభవగోచరంబు' అనే మాట చాలా విశిష్టమైనది. ఈ ప్రపంచం ఒక అనుభవం. నాటకంలోని అనుభవం కూడా ఇట్లాంటిదే. కుటుంబం, బంధు, మిత్రాది భావన ఒక అనుభవం మాత్రమే. జ్ఞాని ప్రపంచాన్నంతా ఒక కుటుంబంగా భావిస్తాడు, అందుకే జ్ఞానిని 'విశ్వకుటుంబి' అంటారు. విదురుడు అట్లాంటివాడు. అందుకే ఈ విశ్వభావనను గురించి చెప్తున్నాడు. అంటే లోకంలో శోకించటానికి ఎంతోమంది ఇతరులూ ఉన్నారు. వారిని గురించీ ఆలోచించుము. నీ దుఃఖం పటాపంచలవుతుం దని ఈ మాటల అర్థం. ఇది 'ఆత్మవాదం'.

కాని, ధృతరాష్ట్రుడు ఎంత సేపటికీ 'దేహవాది' గానే శోకిస్తాడు. తన కొడుకులు, తన బంధువులు, తనవారు: రాష్ట్రమంటే - దేహమని కూడా అర్థం. దేహధారి అని ధృతరాష్ట్ర పదానికి అర్థం.

తే. **'యౌవనంబును రూపంబు జీవితంబు । ద్రవ్య సంచయములు ననిత్యములు గావె?**
వీని హానికి వగ పవివేక మగుటఁ । బండితులు వగఁ గూరరు పౌరవేంద్ర! 27

ప్రతిపదార్థం: పౌరవేంద్ర!= పూరువంశంలో పుట్టిన శ్రేష్ఠుడైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; యౌవనంబును= యౌవనమూ; రూపంబు= సౌందర్యమూ; జీవితంబు= జీవితమూ; ద్రవ్యసంచయములు= పదార్థాలూ; అనిత్యములు+కావె?= అశాశ్వతాలు కావా?; వీని= వీటియొక్క; హానికి= నాశనాన్ని గురించి; వగపు= దుఃఖించటం; అవివేకము+అగుటన్= అవివేకం కాబట్టి; పండితులు= ప్రాజ్ఞులు (వివేకులు); వగన్= దుఃఖంలో; కూరరు= మునిగిపోరు.

తాత్పర్యం: 'రాజా! పూరువంశంలో పుట్టిన మీకు తెలియనిది ఏ మున్నది? వయస్సు, అందమూ, జీవితమూ, పదార్థ జగత్తు - ఇవన్నీ అశాశ్వతాలే కదా! అందువలన పండితు లెపుడూ ఇట్లాంటివాటి విషయంలో దుఃఖంలో మునిగిపోరు.

విశేషం: ఆదిపర్వంలో యయాతి కథ ఉన్నది. ఆ కథలో యయాతి తన ముసలితనాన్ని తీసికొని యౌవనం ఇమ్మని కొడుకులను అడుగుతాడు. పూరుడు మాత్రం ముందుకు వచ్చి తన తండ్రికి తన యౌవనం ధారపోస్తాడు. అట్లాంటి పుణ్యాత్ముడు కాబట్టి యయాతి పూరువుకే రాజ్యాభిషేకం చేశాడని కథ. 'అట్లాంటి వంశంలో పుట్టిన నీవు నిత్యానిత్య వివేకం కలిగినవాడివి కాకపోతే ఎట్లా?' అని విదురుడు గుర్తు చేయటంకొరకే 'పౌరవేంద్రా' అని పిలుస్తున్నాడు.

వ. **పాండిత్య సంపన్నుండవగు నీవు బంధుజీవహానికి వగవందగునె? వగవకూరకునికి మే లాకర్ణింపుము.28**

ప్రతిపదార్థం: పాండిత్య= విద్యా; సంపన్నుండవు+అగు+నీవు= పాండిత్య సంపద కలిగిన నీవు; బంధుజీవహానికిన్= బంధువుల మృతికి; వగవన్+తగునె?= దుఃఖించటం న్యాయమా?; వగవక= బాధపడకుండా; ఊరక+ఉనికి= ఊరకుండటమే; మేలు= మంచిది; ఆకర్ణింపుము= ఎందుకో చెబుతాను వినుము.

తాత్పర్యం: నీవు పండితుడవు. విద్యాసంపదగలవాడివి. బంధువుల మృతికి ఇట్లా బాధపడటం న్యాయంగా ఉన్నదా? బాధపడకుండా ఊరకే ఉండటమే శ్రేయస్కరం. ఎందుకో చెప్పుతాను వినుము.

ఇంద్రవజ్ర :

చింతాపరత్వంబునఁ జెందు దుఃఖా । క్రాంతత్వ ముర్వీశ్వర! కానఁ గీడుం
జింతింపఁ డార్యాత్ముఁ డచింతనుండై । యంతః పరీతాపము నార్పఁ జాలున్. 29

ప్రతిపదార్థం: చింతాపరత్వంబునన్= చింతిస్తూ ఉండిపోవటంవల్ల; దుఃఖాక్రాంతత్వమున్+చెందున్= దుఃఖంచేత ఆక్రమింపబడతాడు; ఉర్వి+ఈశ్వర!= ఓరాజా!(వినుము); కానన్= కాబట్టి; ఆర్య+ఆత్ముఁడు= పుణ్యాత్ముడు; కీడున్= అనర్థమును; చింతింపఁడు= చింతిస్తూ కూర్చోడు; అచింతనుండు+ఐ= ఏ చింతాలేనివాడై; అంతః+పరీతాపమున్= లోపల ఉన్న బాధాగ్నిని; ఆర్పన్+చాలున్= ఆర్పివేసికొనగలుగుతాడు.

తాత్పర్యం: ఓరాజా! ఊరకే చింతిస్తూ కూర్చుంటే నిన్ను దుఃఖం ఆక్రమిస్తుంది. దానివలన అనర్థమే తప్ప మంచిదికాదు. అందుకే పుణ్యాత్ముడు ఎప్పుడూ చింతచేస్తూ కూర్చోడు. చింతను వదలి, క్రియాశీలుడై లోపల ఉన్న బాధ అనేటటువంటి అగ్నిని వివేకమనే శక్తితో ఆర్పివేయగలుగుతాడు.

విశేషం: 'చింత' చేయటం - శోకించటం లౌకిక విషయాల్లో దుఃఖకారక మవుతుంది. చింతన చేయటం - స్మరణ - భగవంతుడి విషయంలో సుఖకారి అవుతుంది. అచింతనత్వం - అంటే దుఃఖకారి అయిన వ్యామోహంపట్ల స్మరణలేకుండా ఉండటమని అర్థం. అట్లాంటి అచింతనుడు - నిరంతరం ఉత్సాహంతో క్రియాశీలిగానే ఉంటాడు. కార్య విజయాన్ని పొందుతాడు. గీతలో పరమాత్మ కూడా అర్జునుడి విషాదం 'అనార్యజుష్ట' మని (పామరపద్ధతి) అనటంలో ఉద్దేశమిదే.

ఇంద్రవజ్రలో త,త,జ,గ,గ అనే గణాలుంటాయి. 1-8 యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

క. ప్రియవస్తు వెడలుటయు న । ప్రియంబు వాటిల్లుటయుఁ బరిజ్ఞాన విని
శ్చయ హీనులైన యల్పా । శయులకు 'దుఃఖంబుఁ జేయు' జగతీనాథా! 30

ప్రతిపదార్థం: జగతీనాథా!= ఓ రాజా!; ప్రియవస్తువు= ఇష్టమైన వస్తువు; ఎడలుటయున్= నశించటం; అప్రియంబు= ప్రియంకానటువంటిది; పాటిల్లుటయున్= కలగటం; పరిజ్ఞాన= సమగ్రజ్ఞానముయొక్క; వినిశ్చయ హీనులు+ఐన= నిత్యానిత్య వివేక శూన్యులైన; అల్పాశయులకున్= సాధారణ మానవులకు (చిన్న ఆశయపరిధి ఉన్నవారికి); దుఃఖంబు+చేయున్= దుఃఖాన్ని కలుగజేస్తుంది.

తాత్పర్యం: ఓ రాజా! సాధారణ మనుష్యుల ఆశయాల పరిధి చాలా చిన్నదిగా ఉంటుంది. అట్లాంటివారికి నిత్యానిత్యవివేకం చేత కలిగిన నిశ్చిత జ్ఞానం ఉండదు. కనుక ప్రియమైన వస్తువు నశిస్తే ఏడుస్తారు. ఏ మాత్రం అనిష్టమైన పరిస్థితిలో చిక్కుకున్నా దుఃఖిస్తారు.

విశేషం: తిక్కన 'మహాశయ' శబ్దంనుండి 'అల్పాశయ' శబ్దాన్ని పుట్టించాడు. మహాశయులంటే సమగ్రజ్ఞానవంతులని అర్థం. వారి ఆశయాల పరిధి విశ్వజనీనంగా ఉంటుంది. అల్పాశయులు కుల, కుటుంబ, జీవిత పరిధిలో బ్రతుకుతూ ఉంటారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అట్లాంటివారికి ఏ చిన్న 'వస్తువు' పోయినా ఎంత చిన్న సంకట పరిస్థితి వచ్చినా ఏడుస్తూ కూర్చుంటారు. మహాశయులు ఇట్లాంటి సందర్భాలలోనే ధైర్యం వహిస్తారు.

జ్ఞానంకంటె విజ్ఞానం, దానికన్నా పరిజ్ఞానం చాలా గొప్పది. పరి - అంటే సమగ్రమైనదని అర్థం. భారత తాత్పర్యం 'ఎఱుకను సమగ్రం' చేయటం. ఆత్మజ్ఞానమే సమగ్ర జ్ఞానం. పదార్థజ్ఞానం విజ్ఞానం కావచ్చునేమో కాని పరిజ్ఞానం మాత్రం కాదు. కాబట్టి వస్తునాశం, అప్రియ సందర్భం - ఇవన్నీ తాత్కాలికాలు అనే నిశ్చితబుద్ధి పరిజ్ఞానంచేతే కలుగుతుంది.

వ. పండితుల నవి గలంపం జాల 'వనిన విని ధృతరాష్ట్రుం డతనిదిక్కు మొగంబు గాఁగఁ గూర్చుండి 'నీ సుభాషితంబుల కతంబున శోకంబు డిందువడియెఁ బండితులు ప్రియాప్రియ వస్తు వియోగ సంయోగంబు వలన జనించు మానస దుఃఖంబుల నేమిటంజేసి పొరయకుండుదు రది సెప్పు 'మనుటయు నమ్మనుజపతి కతం డిట్లనియె. 31

ప్రతిపదార్థం: (కనుక) పండితులన్= పండితులైన వారిని (పరిజ్ఞానం ఉన్నవారిని); అవి= వస్తునాశం, అప్రియసంప్రాప్తి - ఇవి రెండూ; కలంపన్+చాలవు= బాధింపజాలవు; అనినన్= అని చెప్పగా; విని; ధృతరాష్ట్రుండు; అతని దిక్కు= విదురుడివైపు; మొగంబు+కాఁగన్= ముఖంపెట్టి (ఎదురుగా); కూర్చుండి= కూర్చొని; నీ సుభాషితంబుల కతంబునన్= నీ సుభాషితాలవలన; శోకంబు= నా బాధ; డిందు+పడియెన్= నశించింది; పండితులు= ప్రాజ్ఞులు; ప్రియ+అప్రియ= ఇష్టమైన, ఇష్టంకాని; వస్తు= వస్తువులయొక్క; వియోగ= పోగొట్టుకోటంచేత; సంయోగంబువలనన్= కలయికచేత; జనించు= పుట్టునట్టి; మానస= మానసికమైన; దుఃఖంబులన్= సుఖదుఃఖాది భావాలను; ఏమిటన్+చేసి= దేనిచేత; పొరయకుండుదురు= పొందకుండా ఉంటారో; అది= అట్లా ఉండటం (ఎట్లాగో); చెప్పుము+అనుటయున్= చెప్పుమని అడుగగా; ఆ+మనుజపతికిన్= ఆ ధృతరాష్ట్రునితో; అతండు= విదురుడు; ఇట్లనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: సమగ్రమైన ఎరుక గలవారిని ప్రియాప్రియ వస్తువులు రెండూ ఏమీ చేయజాలవు' - అని చెప్పగా ధృతరాష్ట్రుడు విని, అతనివైపు తిరిగి కూర్చుండి 'నీ సుభాషితాల వలన నా బాధ తగ్గింది. ప్రాజ్ఞులు ప్రియాప్రియ వస్తువుల సంయోగ వియోగాల వలన పుట్టే ఏ మానసిక భావాలచేతా ఆక్రమించబడకుండా ఎట్లా ఉంటారు? అది ఎట్లాగో వివరించుము' - అని అడిగాడు. అప్పుడు విదురుడు ఇట్లా అన్నాడు.

విశేషం: వేదాంతం చదవటం, వినటం వేరు. అది ఆచరణలో ఉంచటంవేరు. ధృతరాష్ట్రుడు వినని విషయం ఏమున్నది? అందుచేత ప్రాజ్ఞులు ద్వంద్వభావాతీతులుగా ఎట్లా ఉంటారో తెలిసికొనాలని అడుగుతున్నాడు.

క. 'ఈ లోకము నిస్సారం । బాలోకింపంగ ననఁటియట్టుల; యని తా
లోలతఁ బొందని పురుషుం । డేలా నెవ్వగలఁ జెందనిచ్చు మనంబున్? 32

ప్రతిపదార్థం: ఈలోకము= ఈ సంసారం; ఆలోకింపంగన్= ఆలోచించిచూస్తే; అనఁటి+అట్టుల= అరటి చెట్టులాగా; నిస్సారంబు= బలంలేనిది (అందుకే దుఃఖిస్తుందని అర్థం); అని= అని భావించి; తాన్= తాను; లోలతన్= అందులో ఆసక్తి కలగి ఉండటాన్ని; పొందని పురుషుండు= పొందని మనిషి; ఏలా= ఎందుకు; మనంబున్= మనస్సును; నెఱ+వగలన్= సంపూర్ణ వ్యథలను; చెందన్+ఇచ్చున్?= పొందనిస్తాడు?

తాత్పర్యం: 'బాగా ఆలోచించి చూస్తే ఈ సంసార మనే వృక్షం అరటి చెట్టువలె దుర్బలమైనది. ఈ సంగతి గుర్తించి లోకంపట్ల ఆసక్తి పొందని మనిషి మనసును ఎందుకు వ్యథకు గురి చేస్తాడు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ. అరటి చెట్టు దుర్బలమైనది. అంతా నీరే. అందుకే దుర్యోధనుని తొడలు అరటి కాండాలవలె ఉన్నాయని (రంభోరు నిజోరుదేశమునన్- అని నన్నయగారి ప్రయోగం - సభాపర్వం 2-249). ఈ సందర్భంలో చెట్లలో వేప, మామిడి మొదలైన చెట్లకున్న సారత్వం అరటిచెట్టుకు లేకపోవటం గమనిస్తే - ఈ పోలిక అర్థమవుతుంది. సారమంటే బలమని అర్థం. ధీమంతులు సారజ్ఞానం కలవారు కాబట్టి 'ధృతి' మంతులనబడ్డారు.

తే. **అరయవచ్చినఁ దనమేను నెరవ తనకు । నొండు రూపులు దక్కక యునికి యరుదె?**
యను తలంపు ధ్రువంబుగ నలవరించి । బుధజనంబులు శోకంబుఁ బొరయ రధిప! 33

ప్రతిపదార్థం: అధిప= ఓ రాజా!; అరయవచ్చినన్= పర్యాలోచించగా; తనమేనున్= తన శరీరము; ఎరవు+అ= అన్యమైనదే; తనకున్; ఒండురూపులు= స్వరూపాలు; తక్కక+ఉనికిన్= కలగడం; అరుదె!= ఆశ్చర్యకరమా?; అను తలంపు= అనే నిశ్చయ జ్ఞానం; ధ్రువంబుగన్= దృఢంగా; అలవరించి= కలిగించుకొని (అభ్యాసంచేత సిద్ధింపజేసికొని); బుధజనంబులు= పండితులు; శోకంబున్= శోకాన్ని; పొరయరు= పొందరు.

తాత్పర్యం: పరిశీలించగా తన శరీరం కూడా తన కంటె భిన్నమయినదే. తనకు ఇతరమయిన ఆకారాలు సంభవించడం ఆశ్చర్యమా అని భావమును దృఢపరచుకొని విజ్ఞులు శోకించరు.

విశేషం: జీవుడు శరీరాన్ని ధరించి కొంతకాలం ఉండి దాన్ని పాత వస్త్రాలను వదలివేసినట్లు వదలివేస్తాడని గీత బోధిస్తున్న విషయం ఇక్కడ అనుసంధించుకుంటే 'వచ్చిన' అనే క్రియకు అర్థం తెలుస్తుంది. నెరయుట- అంటే సంపూర్ణత్వం పొందటం అని అర్థం. పుణ్యకర్మలవలన పునరావృత్తి రహితమైన బ్రహ్మలోక ప్రాప్తిని జీవి చెందుతాడు. అట్లాంటి ప్రాజ్ఞుడు మరలా మరొక రూపం పొందాలని ఆశించడు. వాడు జ్ఞానాగ్నిదగ్ధకర్ముడు - కాబట్టి కర్మపరిపాకం ఈ దేహంతోటే పూర్తి అవుతుందని అర్థం. లేనివాడే దివికి- భువికి తిరుగుతూ మరలా మరలా పుట్టుతుంటాడు. ఒండురూపులు - అంటే కొత్త కొత్త జన్మలని అర్థం.

సీ. **ఒక యింటనుండి వేఱొక యింటి కరిగిన । విధమును వస్త్రంబు విడిచి యొండు**
వస్త్రంబు గట్టిన వడువును నై యుండు । నొడలు దొఱంగి యొండొక్క యొడలు
గైకొంట నృప! విను కడవకు సారెపై । నమర మృత్తిక యిడినపుడు విరియు
టయు వెరవారఁ బట్టఁగరాక చెడుటయు । వాని యెత్తెడు నెడ వ్రయ్యుటయును

తే. **నెత్తి యొకచోట డించిన నెడలుటయును । నెండి యవియుటయును నావ మిడినఁ బగిలి**
పోవుటయు వాడు జనులచేఁ బొలియుటయును । గలుగు గతి మేనికెట్లును గలుగుఁ జేటు. 34

ప్రతిపదార్థం: నృప!= ఓ రాజా! విను; ఒడలు= శరీరము; తొఱంగి= వదలిపెట్టి; ఒండు+ఒక్క+ఒడలు= మరొక శరీరం; కై+కొంట= ధరించటం; ఒక ఇంటన్+ఉండి= ఒక ఇంటిలో నుండి; వేఱు+ఒక+ఇంటికి+అరిగిన విధమును= మరో ఇంట్లోకి వెళ్ళిన పద్ధతి; వస్త్రంబు విడిచి= కట్టిన వస్త్రాన్ని విడిచిపెట్టి; ఒండు వస్త్రంబు+కట్టిన వడువును= మరొక వస్త్రాన్ని ధరించినపద్ధతి; ఐ+ఉండున్= అయి ఉంటుంది; కడవకున్= కుండ తయారు చేయటానికై; సారెపైన్= సారెపైన; అమరన్= తగినట్టుగా; మృత్తికన్+ఇడిన+అపుడు= మట్టిని పెట్టినప్పుడు; విరియుటయున్= విరిసిపోవటం; వెరవు+ఆరన్+నేర్పు అతిశయించగా; పట్టఁగన్+రాక= కుండను తీర్చటానికి కాకుండా; చెడుటయున్= చెడిపోవటం; వాని+ఎత్తెడు+ఎడన్= అవి ఎత్తేటప్పుడు; వ్రయ్యుటయును= విరిగిపోవటం; ఎత్తి+ఒకచోటడించినన్= కుండ తయారయ్యాక ఎత్తి ఒక వైపుపెట్టగా; ఎడలుటయును=

విచ్చిపోవటం; ఎండి= ఎండిన తరువాత; అవియుటయును= చీలిపోవటం; ఆవము+ఇడినన్= ఆవంలో పెట్టాక; పగిలిపోవుటయున్= విరిగిపోవటం; వాడు+జనులచేన్= ఉపయోగించే మనుష్యులచేత; పొలియుటయును= నశించటం; కలుగు గతి= కలిగే రీతి; మేనికిన్= దేహానికి కూడా; చేటు= నాశనం; ఎట్లునున్= ఎట్లాగైనా; కలుగున్= కలుగుతుంది (తప్పదు).

తాత్పర్యం: ఓ రాజా! వినుము. ఈ శరీరం వదలి మరో శరీరాన్ని ధరించటమే మరణమంటే. ఇది ఎట్లాంటిదంటే ఒక ఇంటిలో కొంతకాలం ఉండి మరో ఇంట్లోకి మారటం వంటిది. కట్టిన బట్టను విడిచి మరో బట్టను కట్టుకొనటం వంటిది. కుండలు తయారు చేయటానికి ఎంతో నేర్పుగా సారెపైన కుమ్మరి మట్టిని అమర్చుతాడు. అప్పుడే చాలాసార్లు ఆ మట్టి విరిసిపోవటం జరుగుతుంది. మరింత నేర్పుతో కుండను తీర్చటానికి ప్రయత్నిస్తాడు. అప్పుడూ పాకం చెడి మట్టి ముద్దగా మిగిలిపోవచ్చును. కుండ తయారయిందనుకొందాము. అప్పుడు ఆ కుండను ఎత్తి నేలమీద దించేటప్పుడు విచ్చిపోవచ్చును. ఎండించిన తరువాత చీలిపోవచ్చును. ఆవంలో పెట్టి కాల్చాక కూడా విరిగిపోవచ్చును. ఇదంతా అయ్యాక ఆ కుండను ఉపయోగించేవాడిచేత ఎపుడో ఒకప్పుడు అది పగలకుండా ఉండలేదు. ఇట్లా ఆ కుండ ఏదో ఒక దశలో ఎట్లా నశిస్తుందో ఈ దేహం కూడా అంతే ఎప్పుడో ఒకప్పుడు నశించి తీరుతుంది.

విశేషం: మనిషి దేహం ఎట్లాంటిదో, బ్రహ్మాండం కూడా అట్లాంటిదే. అందుకే బ్రహ్మాండాన్ని 'భాండ' మంటారు. దానిని చేసే కుమ్మరి పేరే బ్రహ్మదేవుడు. ఈ పౌరాణిక నేపథ్యమంతా కలిగిన ఆచారమే శవసంస్కారం చేసేటప్పుడు నీటితో నిండిన కుండను శవం చుట్టూ తిప్పి పగులగొట్టటం. ఇతిహాసాలలోని ఉపమలు కూడా ధార్మిక సందేశాన్ని అందిస్తాయనటానికి ఇక్కడ శరీరాన్ని కడవతో పోల్చి చెప్పిన పద్ధతి మంచి నిదర్శనం.

వ. **అది యెట్లంటేని గర్భాధానవేళయందును బిండావస్థయందును బ్రసూతిమాత్రంబున బాల్యంబునను యౌవనంబునం బ్రౌఢత్వ సమయంబునను వార్ధకంబునం గర్మానురూపంబగు నాశంబు శరీరంబునకు సంప్రాప్తంబగు నిది కొలందియని యెఱుంగరా దట్లగుటం దమతమ సుకృతదుష్కృతంబుల తెరువులఁ బోయిన నీ తనయాదులవలని వగలం బొగులం బ్రయోజనంబు లేదు. ప్రాజ్ఞులు వివేకంబున సంసారంబు దుఃఖబహుళంబని యెఱింగి తద్రూపగహనంబు గడచి శాశ్వత సుఖంబుఁ బడయుదు'రనిన విని యాంబికేయుండు 'సంసారదుఃఖబహుళతయును దద్గహనత్వంబును నెఱిగింపు' మనుటయు నవ్విభునకు విదురుం డిట్లనియె.** **35**

ప్రతిపదార్థం: అది+ఎట్లు+అంటి(వి)+ఏనిన్= అది ఎట్లాగని అంటివా, వినుము; గర్భ+ఆధాన వేళయందును= పురుషుడు స్త్రీలో గర్భాన్ని ధరింపజేసిన సమయంలోనూ; పిండ+అవస్థయందును= పిండదశలోనూ; ప్రసూతి+మాత్రంబునన్= ప్రసవసమయంలోనూ; బాల్యంబునను= బాల్యావస్థలోనూ; యౌవనంబునన్= యౌవనంలోనూ; ప్రౌఢత్వ సమయంబునన్= పెద్దవారయ్యాక; వార్ధకంబునన్= ముసలితనంలోనూ; శరీరంబునకున్= ఈ దేహానికి; కర్మ+అనురూపంబు+అగు= తమతమ పూర్వ జన్మలలో చేసిన పాపపుణ్య కర్మలకు తగిన; నాశంబు= (రీతిలో) నశించటం; సంప్రాప్తంబు+అగున్= జరుగుతుంది; ఇది+కొలంది+అని= మరణానికి ఇదే పద్ధతి అని; ఎఱుంగరాదు= గుర్తించలేము; అట్లు+అగుటన్= అట్లాకావటంవలన; తమతమ= తాము తాము చేసిన; సుకృత దుష్కృతంబుల= పుణ్యాపాపాల; తెరువులన్= (ఫలితంగా తమకు లభించిన) దారులలో (స్వర్గానికి, నరకానికి); పోయిన= వెళ్ళిపోయిన; నీ తనయాదుల వలని= నీ కుమారులు బంధువులు - వీరివలన

ఏర్పడ్డ; వగలన్= దుఃఖంతో; పొగులన్= బాధపడి; ప్రయోజనంబులేదు= ఏమీ లాభంలేదు; ప్రాజ్ఞులు= సమగ్రమైన జ్ఞానం ఉన్నవారు; వివేకంబునన్= వివేకం కారణంగా; సంసారంబు= ఈ సంసారం; దుఃఖబహుళంబు+అని= అనేక విధాలైన దుఃఖాలకు ఆకరమని; ఎఱింగి= తెలిసికొని; తద్+రూపగహనంబున్+కడచి= ఆ సంసారంలోని భిన్నక్లేశకారకమైన ఘట్టాలను దాటి; శాశ్వత సుఖంబున్= శాశ్వతమైన మోక్ష సుఖాన్ని; పడయుదురు= పొందుతారు; అనినన్= అని విదురుడు చెప్పగా; విని; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; సంసారదుఃఖ బహుళతయును= సంసారంలో ఎక్కడెక్కడ ఎట్లా దుఃఖం ఉందో; తద్+గహనత్వంబును= దాన్ని దాటటం ఎందుకు కష్టమో; ఎఱింగింపుము+అనుటయున్= నాకు తెలుపుము- అని కోరగా; ఆ+విభునకున్= ధృతరాష్ట్రుడికి; విదురుడు; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: అది ఎట్లాగంటావా వినుము. పురుషుడు స్త్రీలో గర్భాన్ని ధరింప జేసిన సమయంలో, గర్భంలో పిండం ఎదుగుతున్న దశలో, కాన్పు జరిగేటప్పుడు, బాల్యంలో, యౌవనంలో, పెద్దవారయ్యాక ముసలితనంలో - ఈ దేహం తమ తమ కర్మలకు అనుగుణంగా ఎన్నో రీతులుగా నశిస్తూ ఉంటుంది. ఎన్ని విధాలుగా ఎప్పుడెప్పుడు నశిస్తుందో చెప్పటం కూడా కష్టమే. మరణానికి ఇదే పద్ధతి అని గుర్తించలేము. అట్లా కావటం వలన నీ కుమారులు బంధువులు కూడా తాము తాము పూర్వజన్మలలో చేసిన పుణ్యాపాప కర్మలకు అనుగుణంగా లభించిన దారులలో స్వర్గ, నరకాలకు చేరుకొన్నారు. వారిని గురించి దుఃఖించటం వలన లాభం ఏముంది? ఎరుక సమగ్రంగా ఉన్నవారు ఈ జీవితం ఎన్నో విధాలైన దుఃఖాలకు ఆకరమని తెలిసికొని ఆ దుఃఖ కారకమైన ఘట్టాలన్నింటినీ దాటి శాశ్వతమైన మోక్ష సుఖాన్ని పొందుతారు' అని విదురుడు చెప్పగా ధృతరాష్ట్రుడు విని 'సంసారంలో ఎక్కడెక్కడ దుఃఖం పరివ్యాప్తమయిందో దాన్ని దాటటం ఎందుకు కష్టమో వివరించు'మని కోరగా విదురుడు ఇట్లా చెప్పటం మొదలు పెట్టాడు.

విశేషం: తరువాతి పద్యాలలో పుట్టుకనుండి మరణందాకా జీవితంలో దుఃఖం ఏ విధంగా పెనవేసుకున్నదో విదురుడు వివరిస్తాడు. 'గహనం' అనే మాటలకు వివరణ అవసరం. కఠినమని, కష్టమని, అసాధ్యమని - సందర్భాన్నిబట్టి అర్థం చెప్పాలి. దుఃఖం ఏదో ఒక రూపంలో వచ్చి మనిషిని తాకుతుంది - ఆ తాకిడిని తట్టుకొనటం 'గహనం' (గగనమైపోయిందని వ్యవహారంలో అంటాం).

తద్రూపగహనంబు - అంటే అనేక విధాలైన కష్టాలకు ఆకరమైన కఠినమైన సంసారమని అర్థం. గహనమైన దుఃఖరూపమైన సంసారమని భావం చెప్పుకోవాలి.

తే. **'కలసి శుక్ల శోణితములు కరుడు గట్టి । విను మమేధ్య మధ్యమునఁ బ్రవృద్ధిఁ బొంది**
కాలవశత నప్పిండ మంగంబులెల్ల । గలిగి శిశువయి మారుతగతి యెలర్ప. 36

ప్రతిపదార్థం: వినుము=రాజా విను; శుక్ల శోణితములు= వీర్యము, రజస్సులు; కలసి= రెండూకలిసి; కరుడుగట్టి= ముద్దగా మారి; అమేధ్య= మురికి (మలం); మధ్యమునన్= నడుమ; ప్రవృద్ధి పొంది= పెరిగి; ఆ+పిండము= ఆ పిండం; కాలవశతన్= కాలక్రమంలో; అంగంబులు+ఎల్లన్= అన్ని అవయవాల్నీ; కలిగి= పొంది; శిశువు+అయి= శిశువుగా; మారుతగతి= ప్రాణవాయు గమనం; ఎలర్పన్= కలుగగా.

తాత్పర్యం: 'రాజా! వినుము వీర్యం, రజస్సు కలిసి ముద్దగా మారి మురికి మధ్య పెరిగి ఆ పిండం కాలక్రమంలో అన్ని అవయవాల్నీ పొంది శిశువుగా అయి, ప్రాణవాయు గమనం పొందగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వెడలునెడ గాఢ పీడం। బడి సుడివడి యోని నొత్తువడి యొక భంగిన్
వెడలఁగ గ్రహభూతముల। ప్పడు దొడఁగి యనేక దురితములు గల్పించున్. 37

ప్రతిపదార్థం: వెడలు+ఎడన్= తల్లి గర్భం నుంచి బయటపడేటప్పుడు; గాఢపీడన్+పడి= తీవ్రమైన బాధను అనుభవించి; సుడివడి= గర్భంలో గిరగిర తిరిగి; యోనిన్= యోని ముఖంలో; ఒత్తు+పడి= అదుమబడి; ఒక భంగిన్= ఏదో ఒక రీతిగా (కష్టంపైన); వెడలఁగన్= బయటపడగా; గ్రహభూతములు= గ్రహాలు, భూతాలు; అప్పుడు= ఆ సమయంలో; తొడఁగి= ప్రయత్న పూర్వకంగా (పూనుకొని); అనేక= చాలా; దురితములు= కష్టాలు; కల్పించున్= కల్పిస్తాయి.

తాత్పర్యం: అట్లా పెరిగి శిశువైన పిండం తల్లి గర్భంనుండి బయటపడేటప్పుడు తీవ్రమైన బాధను అనుభవించి గర్భాశయంలో గిరగిర తిరుగుతూ యోని ముఖంలో అదుమబడి అతికష్టంమీద బయటపడగా, సరిగ్గా అదే సమయంలో గ్రహాలు, భూతాలు వ్రాలి ఆ శిశువునకు ఎన్నో కష్టాలు కలిగిస్తాయి.

విశేషం: గ్రహ - భూత శబ్దాలకు వివరణ అవసరం. సూర్యచంద్రాదులు గ్రహాలు. గ్రహస్థితి శిశువు జాతకంమీద ప్రభావం చూపుతుంది. భూతాలు - అంటే పంచభూతాలు (పృథివి, ఆపస్సు, తేజస్సు (అగ్ని), వాయువు, ఆకాశం) - వీటి ప్రభావం కూడా శిశువు ఆరోగ్యం మీద ఉంటుంది. భూతమని పిశాచాదులకు కూడాపేరు. శ్రీకృష్ణుడి బాల్యంలో వేధించిన పూతన ఒక భూతమే. ఇట్లా శిశువుకు ఆయురారోగ్య పీడలు కలుగుతాయి అంటారు. వీటిని మొత్తం కలిపి 'బాలగ్రహ దోష' మంటారు.

వ. అట్లు జనియించి మనుజుండు. 38

ప్రతిపదార్థం: మనుజుండు= మానవుడు; అట్లు; జనియించి= పుట్టి.

తాత్పర్యం: మనుష్యుడు అట్లా పుట్టి.

క. బాలత్వంబున నవివే। కాలోలత శుచియు నశుచి యైనదియు సమం
బై లీల జుగుప్సిత విధి। శీలత నొందంగ దుర్విచేష్టలఁ దిరుగున్. 39

ప్రతిపదార్థం: బాలత్వంబునన్= బాలుడుగా; అవివేక+ఆలోలతన్= అవివేకంతో కూడిన పనులలో ఆసక్తి కలిగి; శుచియున్= పవిత్రతా; అశుచి+ఐనదియున్= అపవిత్రమైనదీ; సమంబై= ఒకటికాగా; లీల= ఆడే ఆట(లు); జుగుప్సిత= అసహ్యంకలిగించే; విధి శీలత= పనులనే లక్షణంగా కలిగినవి కాగా; దుర్విచేష్టలన్= చెడ్డనడవడులతో; తిరుగున్= కాలం గడిపివేస్తాడు.

తాత్పర్యం: ఇక బాల్యంలో వివేకం లేని పనులలోనే ఆసక్తి మెండు. పరిశుభ్రత, అపరిశుభ్రత రెండూ బాలుడికి సమానమే. ఆటలో ఎన్నో అసహ్యాకరమైన పనులు చేస్తాడు. యోగ్యం కాని పనులలో కాలం గడిపివేస్తాడు.

విశేషం: 'బాలస్తావత్ క్రీడాసక్తః' అని శంకరాచార్యులు కూడా ఈ విషయాన్ని వివరించారు. బాల్యమంటే ఆటలాడుకొనటం మాత్రమే. అవివేకపు పనుల మీద బాలుడికి ఆసక్తి మెండుగా ఉంటుంది. ఇట్లా బాల్యం వ్యర్థమవుతుంది. అప్పుడే నడవడిలో దుర్మార్గత్వం కూడా ప్రవేశించేది. అక్కడ సన్మార్గంవైపు ఎవరు మరలుతారో వారు పెద్దవా రయ్యాక బాగుపడుతారు.

క. యౌవనమున విషయ పర। త్వావేశము దుఃఖకారియై యలఁపఁగ నా
నా విధ దుర్వినయములకుఁ। దావలమై మెలఁగు నిందితప్రక్రియలన్. 40

ప్రతిపదార్థం: యౌవనమునన్= యుక్తవయస్సులో; విషయపరత్వ+ఆవేశము= ఇంద్రియపరమైన సుఖంలోని తీవ్రమైన కోరిక; దుఃఖకారియై= దుఃఖాన్ని కలిగించేదై; అలఁపఁగన్= బాధించగా; నానావిధ= అనేక విధాలైన; దుర్వినయములకున్= దుష్టప్రవర్తనలకు; తావలము+ఐ= చోటై; నిందిత= దూషితమైన; ప్రక్రియలన్= పనులలో; మెలఁగున్= ప్రవర్తిస్తాడు.

తాత్పర్యం: యౌవనం రాగానే ఇంద్రియపరమైన సుఖంలోని తీవ్రమైన కోరిక యువతీయువకులచేత ఎన్నో పనులు చేయిస్తుంది. చివరికి దుఃఖాన్నే కలిగిస్తుంది. ఎంతో బాధిస్తుంది. అనేక విధాలైన దుష్టమైన పనులు చేయటానికి ప్రేరేపిస్తుంది. ఇట్లా యౌవనం కూడా దుఃఖకారే అవుతుంది.

విశేషం: 'తరుణస్తావత్ తరుణీ సక్తః' అని శంకరాచార్యులు తరుణావస్థను వివరించారు. యౌవనంలో స్త్రీ సంబంధమైన కామన తప్ప మరొకటి 'ఇష్టంగా' ఉండదు. ఇంద్రియాలను ఆకర్షించటం, తద్ద్వారా మనస్సును భోగంవైపు లాగి బంధించటం కామలక్షణం. కామం ముందు ఏ వివేకమూ పనిచేయదు. ఆ యౌవనంలోనే ఎందరో తప్పటడుగులు వేసి ఆరోగ్యం కోల్పోతారు. అన్ని విధాలుగా భ్రష్టులై దొంగతనం, మోసం, మొదలు హత్యలు చేయటం దాకా మనిషిని పతనావస్థకు చేర్చగలగటం ఒక కామానికే సాధ్యం. చివరికి మనిషి దుఃఖంపాలు కావటం తప్ప కామం వలన మరొక లాభం లేదు - అని విదురుడి ఉపదేశ సారాంశం.

'బలవా నింద్రియగ్రామో విద్వాంస మపి కర్షతి' అని అన్నారు. ఎంత గొప్ప విద్వాంసుడు, ఇంద్రియనిగ్రహ పటువూ అయినా విషయవాసన ముందు ఆకర్షించబడతాడని అర్థం.

మత్తకోకిల:

వృద్ధుఁడైనతఱిన్ బలంబును వీఁకయుం దఱుగంగ దు
ర్బుద్ధి వాటిల మ్రగ్గి యింద్రియముల్ విశక్తతఁ బొంద దో
షోద్ధతిన్ రుజ లుద్భవింపఁగ నొండురూపగు పాశసం
బద్ధుఁ జేసి జముండు దివ్వఁగఁ బాయు నబ్భవముం దుదిన్. 41

ప్రతిపదార్థం: వృద్ధుఁడు+ఐన+తఱిన్= ముసలివాడయ్యాక; బలంబును= బలమూ; వీఁకయున్= పరాక్రమమూ; తఱుగంగన్= తగ్గిపోగా; దుర్బుద్ధి+పాటిలన్= ఉచితానుచిత పరిజ్ఞానం నశించి, 'చెడు' వైపు బుద్ధి ప్రసరిస్తుండగా; ఇంద్రియముల్= ఇంద్రియాలు; మ్రగ్గి= పడిపోయి (అరిగిపోయి); విశక్తతన్= నిశ్శక్తిని; పొందన్= పొందగా; దోష+ఉద్ధతిన్= దోషాల విజృంభణంచేత; రుజలు= రోగాలు; ఉద్భవింపఁగన్= పుట్టగా; ఒండురూపగు= ఏదో ఒక రూపంలో; పాశసంబద్ధున్+చేసి= పాశంతోకట్టి; జముండు= యముడు; తివ్వఁగన్= ప్రాణంలాగగా (మనిషి చివరకు); ఆ+భవమున్= ఆ జన్మను; తుదిన్= చివరికి; పాయున్= వదిలి వేస్తాడు.

తాత్పర్యం: చివరికి ముసలితనం రాగా మనిషి బలమూ తగ్గుతుంది. పరాక్రమమూ తగ్గిపోతుంది. ఉచితానుచిత పరిజ్ఞాన శూన్యుడై అనుచిత కార్యాలవైపే బుద్ధి ప్రసరిస్తుంది. ఇంద్రియాలు పడిపోయి నిశ్శక్తి ఆవరిస్తుంది. దోషాలు విజృంభించి రకరకాల రోగాలు పుట్టుతాయి. అప్పుడు యముడు ఏదో ఒక రూపంలో కాలపాశాన్ని వేసి మనిషి ప్రాణాన్ని లాగుతాడు. చివరికి మనిషి నిస్సహాయుడై ఆ జన్మను వదలిపెట్టుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: బలం వేరు, విజృంభించే స్వభావం వేరు. ముసలి వయసులో ఈ రెండూ తగ్గిపోతాయి.

ఉచితానుచితపరిజ్ఞానం నశించటంతో ముసలివారి ప్రవృత్తి పిల్లల ప్రవృత్తిగా మారిపోతుంది. శిక్షితమైన జీవితం కాకపోతే ఏ విషయంలోనూ నిగ్రహముండదు. అందరినీ తిడుతూ అందరికీ భారమవుతాడు.

ఇంద్రియాలు అరిగిపోతాయి. వాటి కార్యకలాపాలకు కావలసిన శక్తి ఉండదు.

సత్త్వ రజ స్తమోగుణాలకు చెందిన వాతపిత్తశ్లేష్మదోషాలు మూడూ విజృంభిస్తాయి. ఆయుర్వేదం ప్రకారం అన్ని రోగాలు ఈ త్రివిధ దోషాలతో పుట్టుతాయి.

వయస్సుపరంగా 'జర' (ముసలితనం) ఆరోగ్యం చెడిపోవటం 'రుజ' (వ్యాధి) - ఈ రెండింటిలో ఏది వచ్చినా యమపాశం సిద్ధంగా ఉంటుంది.

అందుకే దంతాలు పడకుండా ఉన్నప్పుడే, తనువులో శక్తి ఉన్నప్పుడే, కాంతాసంఘం అసహ్యించుకొనకముందే మనిషి జాగరూకుడై భగవంతునివైపు మనసు మళ్ళించి ధార్మిక కార్యాలలో మగ్నుడై యుక్తాహార విహారాలతో దేహాన్ని మనస్సును క్రమబద్ధీకరించుకొనాలని మన భారతీయ సంప్రదాయం విధించింది.

మత్తకోకిల వృత్తంలో ప్రతిపాదానికీ ర,స,జ,జ,భ,ర గణాలుంటాయి. 1-11 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

వ. **కావున సంసారంబు దుఃఖబహుళంబగుట విస్పష్టం బది యట్లుండె లోభక్రోధ మదోన్మత్తులై దుర్మతు లింద రమింతు రందలి సుఖలేశంబునకై యొండొరులం జెఱుపను జంపను జొచ్చి ధర్మపథంబు దప్పి యమ కింకరుల చేతం బడుదు రిత్తెఱంగు బుధులవలనఁ దెలియ విని విమలస్వాంతులు సన్మార్గంబున వర్తిల్లి నిత్యానంద స్వరూపు లగుదురు. దీని గహనత్వంబు పెద్దలచేత వినినతెఱంగు సెప్పెద నాకర్ణింపుము.42**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; సంసారంబు= ఈ సంసారం; దుఃఖబహుళంబు+అగుట= చాలా దుఃఖాలతో నిండినది కానటం; విస్పష్టంబు= చాలాస్పష్టమైన అంశం; అది+అట్లు+ఉండెన్= అది అట్లా ఉన్నది; లోభ, క్రోధ, మద+ఉన్మత్తులు+ఐ= లోభంతోనూ, క్రోధంతోనూ, మదంతోనూ మిక్కిలి ఉన్మాదం పొందినవారై; దుర్మతులు= దుష్టబుద్ధి కలవారు; ఇందున్+అ= ఈ విషయలంపటలోనే; రమింతురు= మునిగి సుఖాలు అనుభవిస్తుంటారు; ఇందలి= ఈ విషయజగత్తులోని; సుఖ లేశంబునకై= కొద్దిపాటిదైన ఈ సుఖంకోసం; ఒండు+ఒరులన్= ఒకరినొకరు; చెఱుపను= నాశనం చేయడానికి; చంపను= చంపివేయడానికి; చొచ్చి= బయలుదేరి; ధర్మపథంబు+తప్పి= ధర్మమార్గం వదిలి; యమకింకరులచేతన్+పడుదురు= యమభటులచేతికి చిక్కుతారు; ఈ+తెఱంగు= ఈ రీతి; బుధులవలనన్+తెలియన్+విని= పండితులవలన బాగా విని; విమల స్వాంతులు= పవిత్రమైన హృదయం కలిగినవారు (పుణ్యాత్ములు); సత్+మార్గంబునన్+వర్తిల్లి= మంచి మార్గంలో నడుచుకొని; నిత్య+ఆనంద స్వరూపులు+అగుదురు= నిత్యమైన బ్రహ్మానంద స్వరూపులవుతారు (విముక్తులవుతారు); దీని= ఈ సంసారంయొక్క; గహనత్వంబు= దాటటంలోని క్లేశం; పెద్దలచేతన్+వృద్ధులవలన; వినిన తెఱంగు= విన్న పద్ధతి; చెప్పెదన్= నీకు చెబుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అందువలన ఈ సంసారం బహుదుఃఖాలకు నిలయం - అన్నది చాలా స్పష్టమైన అంశం. అది అట్లా ఉంచుదాం. లోభ క్రోధ మదాల చేత మనుష్యులు ఒక ఉన్మాద స్థాయిలో పడిపోయి దుష్టబుద్ధులై నిరంతరం విషయ లంపటంలోనే మునిగి సుఖం అనుభవిస్తూ కాలం గడిపేస్తారు. కొద్దిపాటిదైన ఈ సుఖం కొరకు ఒకరినొకరు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెరపటానికి, చివరకి చంపటానికి కూడా వెనుదీయరు. ఈ పనిలో వాళ్ళు ధర్మపథాన్ని వదలివేసి చివరకి యమభటుల చేతుల్లో చిక్కుతారు. పుణ్యాత్ములు ఈ విధంగా దుష్ట బుద్ధులు నశించటాన్ని ప్రాజ్ఞులద్వారా విని నిత్యానిత్య వివేకం పొంది, సన్మార్గంలో వర్తిస్తూ, నిత్యమైన ఆనంద స్వరూపులై విముక్తులవుతారు. ఈ సంసారాన్ని దాటటం ఎంత క్లేశంతో కూడినదో పెద్దలనుండి నేను విన్న విషయం నీకు చెప్పుతాను వినుము.

విదురుడు ధృతరాష్ట్రునకు సంసారగహనంబు తెఱంగెఱింగించుట (సం. 11-5-1)

తరువోజ:

అతిదుర్గమగు నరణ్య ప్రదేశమున నవనీసురుం డొకఁ డరుగుచునుండ
మితిలేని ఘోరంపు మృగములు శరభమృగపతిప్రముఖముల్ మిక్కిలి భయము
మతి కావహించుచు మార్గంబునందు మల్లడిగొనుడు నున్మార్గ యానమున
ధృతి దూలఁ జన నవి తిరిగె వెన్వెనుకఁ దెక్కలికాఱు దోఁతెంచి రాతనికి. 43

ప్రతిపదార్థం: అతి= మిక్కిలి; దుర్గము+అగు= చొరటానికి వీలుకాని; అరణ్య ప్రదేశమునన్= అడవిలో; అవనీసురుండు+ ఒకఁడు= ఒక బ్రాహ్మణుడు; అరుగుచున్+ఉండన్= వెళుతుండగా; మితిలేని= లెక్కకు మిక్కిలి; ఘోరము+మృగములు= భయంకరమైన అడవి జంతువులు; శరభ= శరభాలు; మృగపతి ప్రముఖముల్= సింహాలు మొదలైనవి; మిక్కిలి భయము= గొప్ప భీతిని; మతికిన్= మనసుకి; ఆవహించుచున్= కలిగిస్తూ; మార్గంబునందున్= దారిలో; మల్లడిగొనుడున్= చుట్టుముట్టగా; ఉన్మార్గయానమునన్= దారిని తప్పించి అడ్డదారులు తొక్కి; ధృతిదూలన్= ధైర్యం నశించగా; చనన్= పరుగెత్తగా; అవి= ఆ అడవి జంతువులు; తిరిగె= వెనక్కు మళ్ళాయి; వెను+వెనుకన్= ఆ వెంటనే; ఆతనికిన్= ఆ బ్రాహ్మణుడికి; తెక్కలికాఱు= దొంగలు; తోఁతెంచిరి= అగుపడ్డారు.

తాత్పర్యం: ప్రవేశించటానికి వీలుకాని ఒక భయంకరమైన అడవిలో ఒక బ్రాహ్మణుడు వెళ్ళుతుండగా లెక్కకు మిక్కిలిగా అడవిజంతువులు, శరభాలు, సింహాలు, పులులు మొదలైనవి గొప్పభీతిని పుట్టిస్తూ అతడి చుట్టూ కమ్ముకొన్నాయి. ఆ బ్రాహ్మణుడు భయంతో వణికిపోతూ అడ్డదారులలో పడి పరిగెత్తటం మూలాన ఆ జంతువులు వెనక్కు మళ్ళాయి. ఆ వెంటనే ఆ బ్రాహ్మణుడికి ఒక దొంగల గుంపు కనిపించింది.

విశేషం: శరభం: మీగండ్లమెకము అని నిఘంటువులు చెప్పుతున్నాయి. సింహ శరభ శార్దూలాలను కలిపి చెప్పుతారు. అడవిలో మిక్కిలి భీతిని కలిగించే జంతువులు ఈ మూడూ అని అంటారు.

తరువోజలో ప్రతిపాదంలోనూ మూడు ఇంద్రగణాలూ, ఒక సూర్యగణమూ, మరల మూడు ఇంద్రగణాలూ, ఒక సూర్యగణమూ ఉంటాయి. మొదటి గణము మొదటి అక్షరమునకు, అయిదవగుణము మొదటి అక్షరమునకు యతిమైత్రి, మరల ఆఱవ గణము మొదటి అక్షరమునకు ఎనిమిదవ గణము మొదటి అక్షరమునకు యతిమైత్రి. ప్రాస నియమం కలదు.

వ. అట్టి యెడ. 44

తాత్పర్యం: ఆ సమయంలో.

తోటకము

గరుపాఱఁగ మేను ప్రకంపమునం । బొరిఁ దొట్రువడం బదముల్ దొలఁగం
జొర నెచ్చొటు లేమి నసువ్యయభీ । భర మొందినఁ జేడ్పడు భావముతోన్. 45

ప్రతిపదార్థం: మేను= శరీరం; గరుపాఱఁగన్= నిశ్చేష్టమై వెంద్రుకలు నిక్కపొడుచుకోగా; ప్రకంపమునన్= మిక్కిలి అదిరిపాటుచేత; పొరిన్= మిక్కిలిగా; తొట్రు+పడన్= తడబాటు పొందగా; పదముల్= కాళ్ళు; తొలఁగన్= అటు ఇటూ పడుతుండగా; చొరన్= ప్రవేశించటానికి (దూరటానికి); ఏ+చోటు+లేమిన్= ఏ చోటూ లేకపోవడంచేత; అసువ్యయభీభరము= ప్రాణంపోతుందన్న మిక్కిలి భయం; ఒందినన్= కలుగగా; చేడ్పుడు= చేష్టలుడిగిన; భావముతోన్= మనసుతో.

తాత్పర్యం: దొంగలను చూచి అతడి ఒళ్ళు నిక్కపొడుచుకొన్నది. భయంతో అదిరిపోయాడు. అడుగులు తడబడ్డాయి. ఎటువైపూ తప్పించుకొనటానికి వీల్లేని పరిస్థితి. ప్రాణం పోతుందన్న భయం అతిశయించి నిశ్చేష్టుడయ్యాడు.

విశేషం: అలం: స్వభావోక్తి. ప్రకరణోచితమైన ఛందస్సు. తోటకవృత్తంలో ప్రతిపాదానికీ నాలుగు సగణా లుంటాయి. మొదటి అక్షరానికీ తొమ్మిదవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

తే. దెసలు గలయంగఁ జూచుచు దిక్కుదనకు । నెవ్వరును లేమి వెగడందు నెంత దవ్వు
సనిన నడవికిఁ గడ లేమియును మృగవ్ర జంబు పొదువుటయును గొందలంబు సేయ. 46

ప్రతిపదార్థం: దెసలు= దిక్కులు; కలయంగన్= అన్నివైపులా; చూచుచున్= చూస్తూ; తనకున్; దిక్కు; ఎవ్వరును+లేమిన్= ఎవరూలేకపోవటంవలన; వెగడు+అందున్= భయపడ్డాడు; ఎంతదవ్వు+చనినన్= ఎంత దూరం పరిగెత్తినా; అడవికిన్= అడవికి; కడలేమియును= అంతం లేకపోవటం; మృగవ్రజంబు= అడవి జంతువుల సమూహం; పొదువుటయును= కమ్ముకోవటం; కొందలంబున్= చీకాకును; చేయన్= కలగజేయగా.

తాత్పర్యం: అటూ ఇటూ దిక్కులు చూస్తూ, తనను కాపాడేవారు ఎవరూ లేరని తెలిసిపోగా భయం ఎక్కువైంది. ఎంతదూరం పరుగెత్తినా అడవికి అంతం కనిపించటం లేదు. ఎటుపోయినా మృగాలు కమ్ముకొంటూనే ఉన్నాయి. వీటితో అతడు చీకాకు పడిపోగా. (తరువాతి పద్యంతో అన్వయం)

వ. అప్పు డాభీషణారణ్యంబున నేదిక్కు సూచినను దఱచుగా నొడ్డిన యురులు దోఁచె. ఘోరాకారయగు నొక్క యువిద యతనిం గౌఁగిలించుకొనియెఁ బంచశిరంబులును నగనిభంబులు నగు నాగంబు లనేకంబు లవ్వనంబునం గ్రందుకొనం దిరుగుచుండెఁ దత్ప్రదేశంబున నొక్కయుదపానంబు వల్లీవితానంబుచేత సంవృతంబై మీఁదఁ దృణంబులు వరఁగి నిగూఢంబైయున్న నప్పురుషుం డా నూతంబడి యొక్క బలుదీఁగం దవిలి తలక్రిందై వ్రేలుచుఁ గొమ్మనున్న పనసవంటి చందంబున నుండె న ట్లయ్యవస్థ నొందియు నక్కూపంబులో నొక్కభీమభుజంగంబు నాలుకలు గ్రోయ నాఱు దలలును బండ్రెండు కాళ్ళును గృష్ణశబల వర్ణంబును గల మహాగజం బానూతి దరినున్న తరువుఁ జేరంజనుదేర నందు శాఖోపశాఖల నానావర్ణంబులగు మధుకరంబులు మధుసంచయనం బాచరించి వర్తింప సితాసితంబులగు మూషికంబు లమ్మహీరుహంబు మూలంబు నఱుకు చుండ. 47

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఆ+భీషణ+అరణ్యంబునన్= ఆ భయంకరమైన అడవిలో; ఏ దిక్కు+చూచినను= ఏవైపు చూచినా; తఱచుగాన్= ఎక్కడ పడితే అక్కడ; ఒడ్డిన= పన్నిన; ఉరులు= ఉచ్చులు; తోఁచెన్= కనిపించాయి; ఘోర+ ఆకార+అగు= భయంకరమైన ఆకారమున్న; ఒక్క+ఉవిద= ఒకస్త్రీ; అతనిన్+కౌఁగిలించుకొనియెన్= అతడిని కౌగిలించుకొన్నది;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పంచశిరంబులును= ఐదు తలలున్నవి; నగ నిభంబులున్+అగు= పెద్ద కొండలలాంటివైన; నాగంబులు= ఏనుగులు; అనేకంబులు= చాలా; ఆ+వనంబునన్= ఆ అడవిలో; క్రందుకొనన్= సందడిగా; తిరుగుచుండెన్= తిరుగాడుతున్నాయి; తద్+ప్రదేశంబునన్= అక్కడ; ఒక్క+ఉదపానంబు= ఒకబావి; వల్లీవితానంబుచేతన్= తీగల గుంపుచేత; సంవృతంబు+ఐ= కప్పబడి; మీద= పైన; తృణంబులు+పరఁగి= గడ్డితోకూడి ఉండి; నిగూఢంబు+ఐ+ఉన్నన్= గుర్తించటానికి వీలుకాకుండా ఉండగా; ఆ+పురుషుండు= ఆ బ్రాహ్మణుడు; ఆ నూతన్+పడి= ఆ బావిలోపడి; ఒక్క+బలు+తీఁగన్= ఒక గట్టి తీగకు; తవిలి= తగుల్కొని; తలక్రిందు+ఐ= తలకిందుగా; వ్రేలుచున్= వేలాడుతూ; కొమ్మన్+ఉన్న= కొమ్మచివరనున్న; పనస వంటి చందంబునన్= పనసపండులాగా; ఉండెన్= ఉండిపోయాడు; అట్లు+అవస్థన్+ఒందియున్= అలాంటి దుర్దశను పొందికూడా; ఆ+కూపంబులోన్= ఆ బావిలో; ఒక్కభీమ భుజంగంబు= ఒక పెద్దపాము; నాలుకలు గ్రోయన్= నాలుకలు చాచగా; ఆఱు+ తలలున్= ఆరుతలలూ; పంఁడ్రెండు కాళ్ళును= పన్నెండు కాళ్ళూ; కృష్ణ శబలవర్ణంబును= రంగుల చారలు కలిగిన నల్లదనము; కల= కలిగిన; మహాగజంబు= పెద్ద ఏనుగు ఒకటి; ఆ నూతి దరిన్+ఉన్న= ఆ బావి దగ్గరనున్న; తరువున్+చేరన్+ చనుదేరన్= చెట్టు దగ్గరకు సమీపిస్తుండగా; అందున్= ఆ చెట్టులో; శాఖ+ఉపశాఖలన్= కొమ్మలలో రెమ్మలలో; నానా వర్ణంబులు+అగు= వివిధమైన రంగులు గల; మధుకరంబులు= తుమ్మెదలు; మధుసంచయనంబు+ఆచరించి= తేనెను ప్రోగుచేసి; వర్తింపన్= తిరుగుతుండగా; సిత+అసితంబులు+అగు= తెల్లనివి నల్లనివి అయిన; మూషికంబులు= ఎలుకలు; ఆ+మహీరుహంబు+మూలంబున్= ఆ చెట్టు మొదటిని; నఱుకుచున్+ఉండన్= కొరికివేస్తుండగా.

తాత్పర్యం: ఆ సమయంలో ఆ భయంకరమైన అడవిలో ఏవైపు చూసినా ఎక్కడబడితే అక్కడ పన్నిన ఉచ్చులు కనిపిస్తున్నాయి. భయంకరమైన ఆకారమున్న ఒక స్త్రీ ఆ బ్రాహ్మణుడిని కౌగిలించుకొన్నది. ఐదుతలలతో కొండలవలె ఉన్న పెద్ద పెద్ద ఏనుగులు ఆ అడవిలో సందడిగా తిరుగుతున్నాయి. అక్కడ ఒక బావిలో అల్లిబిల్లిగా తీగలు అల్లుకొని ఉన్నాయి. ఆ తీగలపైన గడ్డి నిండి ఉండి, లోపల ఉన్న బావి ఎవరికీ తెలియకుండా ఉన్నది. ఆ బ్రాహ్మణుడు ఆ బావిలో పడ్డాడు. కాని, ఒక గట్టి తీగకు తగుల్కొని తలకిందులుగా వేలాడుతూ కొమ్మ చివరనున్న పనసపండువలె అట్లాగే ఉండిపోయాడు. అట్లాంటి దుర్దశలో అతడుండగా, ఆ బావిలో ఒక పెద్ద సర్పం నాలుకలు చాస్తుండగా ఆరుతలలూ, పంఁడ్రెండు కాళ్ళూ ఉన్న ఒక పెద్ద ఏనుగు ఆ బావిదగ్గరున్న చెట్టును సమీపిస్తున్నది. అది రంగు రంగుల చారలున్న నల్లటి ఏనుగు. ఆ చెట్టులోని కొమ్మలు రెమ్మలు చిత్ర వర్ణాలు కలిగిన తుమ్మెదలతో నిండి ఉన్నాయి. ఆ తుమ్మెదలు ఆ పూలనుండి తేనెను బాగా చేర్చిపెట్టి నాట్యమాడుతున్నాయి. ఆ చెట్టుమూలాన్ని నల్లటివి తెల్లటివి అయిన ఎలుకలు తమ బలిష్ఠమైన పండ్లతో కొరికివేస్తున్నాయి.

ఉత్సాహవృత్తము:

> **ధరణినాథ! వినుము మధుర ధారలెల్ల ప్రొద్దునుం ।**
> **దొరుఁగుచుండ నతఁడు వాని దోహలమున నానుచుం**
> **బొరయఁ డెప్డుఁ దృప్తి వగలప్రోక యైన యట్టి దు ।**
> **స్తరపుటున్కి కొల్లఁబాటుఁ దన్కఁ డించుకేనియున్.** **48**

ప్రతిపదార్థం: ధరణినాథ!= ఓ రాజా!; వినుము= వినుము; మధురధారలు= తేనెధారలు; ఎల్ల ప్రొద్దునున్= ఎల్లప్పుడూ; తొరఁగుచుండన్= కారుతూ ఉంటే; అతడు= ఆ బ్రాహ్మణుడు; వానిన్= ఆ తేనెలను; దోహలమునన్= ఉత్సాహంతో; ఆనుచున్= తాగుతూ; ఎప్డున్= ఎప్పటికీ; తృప్తిన్= తృప్తిని; పొరయఁడు= పొందడు; వగలప్రోక+ఐన= బాధలకు రాశి (చోటు) అయిన; అట్టి= అట్లాంటి; దుస్తరము+ఉన్కికిన్= దుర్భరమైన స్థితికి; ఒల్లఁబాటున్= నిరాసక్తిని; ఇంచుకేనియున్= కొంచెంకూడా; తన్కఁడు= పొందడు.

తాత్పర్యం: రాజా! వినుము. అట్లా తేనె ధారలు ఆపైన ఉన్న చెట్టులోనుండి పడుతూ ఉంటే ఆ తేనెలను ఎంతో ఉత్సాహంతో త్రాగుతూ ఆ బ్రాహ్మణుడు అట్లాగే ఉండిపోయాడు. ఎంత త్రాగినా అతనికి తృప్తి కలగలేదు. అంత దుర్భరమైన స్థితిలో ఉండి కూడా తన స్థితిపై అతడికి అసహ్యం పుట్టలేదు.

విశేషం: ఉత్సాహవృత్తంలో ప్రతిపాదానికీ ఏడు సూర్యగణాలూ, ఒక గురువూ ఉంటాయి. మొదటి గణం మొదటి అక్షరంచే అయిదవగణం మొదటి అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు. (వాడి పానోత్సాహానికి తగినట్లుగా ఉత్సాహవృత్తం.)

వ. **ఇట్లున్న యతనికి నా బహుళవ్యాళంబులం, దెక్కలికాఱుల యురుల వలనను, నయ్యుగ్రకామినీ కారణంబున నుం, బంచశిరస్కంబులగు సామజంబుల సందడి, నా కూపంబులోనున్న యద్దారుణ దర్వీకరంబు కతంబునను నూతిదరిం జరించునగ్గజంబు ఘోరత్వంబునం జేసియు మూషికంబుల తరుపతనహేతుభావంబునను నాచంచల చంచరీకంబుల కారించుటనుం జేతోవృత్తంబు వికలతాయత్తంబై యుండ నతండు జీవితాశయు విడువం' డనిన విని విదురునకు ధృతరాష్ట్రుం డిట్లనియె.** **49**

ప్రతిపదార్థం: ఇట్లు+ఉన్న+అతనికిన్= ఇట్లా ఉన్న అతనికి; ఆ+బహు+వ్యాళంబులన్= అక్కడ తిరుగుతున్న చాలా ఏనుగులచేతనూ; తెక్కలికాఱుల= దొంగలయొక్క; ఉరులవలనను= ఉచ్చులచేతనూ; ఆ+ఉగ్ర కామినీ కారణంబుననున్= ఆ భయంకరమైన స్త్రీ కారణంగానూ; పంచశిరస్కంబులగు= ఐదు తలలున్న; సామజంబుల సందడిన్= ఏనుగుల సందడిచేత; ఆ కూపంబులోనున్న= ఆ బావిలోనున్న; ఆ+దారుణ దర్వీకరంబు+కతంబునను= ఆ భయంకరమైన పాముచేతనూ; నూతిదరిన్= బావివద్ద; చరించు= తిరుగాడే; ఆ+గజంబు= ఆ ఏనుగు యొక్క; ఘోరత్వంబునన్+చేసియున్= భయంకరమైన ఆకారంచేతనూ; మూషికంబుల= ఎలుకలయొక్క; తరుపతన= చెట్టుపడిపోవటమనే; హేతు= కారణమనే; భావంబునన్= ఆలోచనచేతనూ; ఆ+చంచల+చంచరీకంబుల= తిరుగాడే ఆ తుమ్మెదల; కారించుటనున్= పైన ముసిరి ఇబ్బంది పెట్టటంచేతనూ; చేతస్+వృత్తంబు= మనఃస్థితి; వికలత+ఆయత్తంబు+ఐ+ఉండన్= కకావికలై ఉండగా; అతండు= ఆ బ్రాహ్మణుడు; జీవితాశయున్= ప్రాణంపైన ఆశనుమాత్రం; విడువండు= వదలిపెట్టడు; అనినన్+విని= అని చెప్పగా విని; విదురునకున్= విదురుడితో; ధృతరాష్ట్రుండు+ఇట్లనియెన్= ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా తీగలపైన తలకిందుగా వేలాడుతున్న అతడికి అక్కడ మెదలుతున్న పాములు, తిరుగుతున్న దొంగలు, పన్నిన ఉచ్చులు, ఆ భయంకరమైన స్త్రీ కౌగిలింత, ఐదుతలల ఏనుగుల సంచారం, ఆ బావిలోని విషసర్పం, బావి దగ్గర తిరుగుతున్న ఏనుగు, చెట్టును కొరికేస్తున్న ఎలుకలు, చెట్టు పడిపోతుందన్న ఆలోచనవలన పుట్టిన భయం, పైగా ముసురుతున్న తుమ్మెదలు - వీటితో మనసు కకావికలై పోయింది. అయినా ఆ బ్రాహ్మణుడు ఆ సమయంలో కూడా ప్రాణాలపైన ఆశను మాత్రం కోల్పోలేదు' - అని విదురుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు.

క. **'మనమునఁ గృప పుట్టెడు న । ట్లనయముఁ గీడైన యునికి కాతం డెమ్మెఁ**
గనియెను విడుమర? దానిన్ । వినవలతుం జెప్పవే వివేకనిరూఢా!' **50**

ప్రతిపదార్థం: వివేక నిరూఢా!= వివేకంచేత సుప్రసిద్ధుడవైన ఓ విదురా!; మనమునన్= హృదయంలో; కృప+పుట్టెడున్+అట్లు= దయపుట్టేటట్లుగా; అనయమున్= నిరంతరం; కీడు+ఐన+ఉనికికిన్= అపాయకరమైన ఆ స్థితికి; ఆతండు= ఆ బ్రాహ్మణుడు;

ఏ+మైన్= ఏ విధంగా; విడుమరన్= విమోచనాన్ని; కనియెన్?= పొందాడు?; దానిన్= ఆ పద్ధతిని; వినవలతున్= వినగోరుతున్నాను; చెప్పవే= దయతో వివరించుము.

తాత్పర్యం: 'వివేకంతో పేరు పొందిన విదురా! హృదయం ద్రవించి పోయేటట్లు అట్లా నిరంతరం అపాయకరమైన ఆ స్థితినుండి అతడు ఎట్లా బయటపడ్డాడు? ఈ విషయాన్ని వివరించుము. వినాలని కోరికగా ఉన్నది'.

కవిరాజ విరాజితము

అనవుడు నిట్లను నన్నర పాలును కాతఁడు 'మోక్షము నర్థి జగ
జ్జనులకుఁ బెట్టుట సన్మతిఁ గోరి విశారదు లాదరసంభృతులై
యనఘ! సుదుస్తరమైన భవంబున కచ్చగు నీ యితిహాసము బో
ధన మహనీయ విధంబునఁ జెప్పి రుదాత్తగుణాశ్రయతామహితా! 51

ప్రతిపదార్థం: అనవుడున్= అని ధృతరాష్ట్రుడు అడుగగా; ఆ నరపాలునకున్= రాజుతో; ఆతఁడు= విదురుడు; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; విశారదులు= ప్రాజ్ఞులు; అర్థిన్= పరోపకారబుద్ధితో; జగత్+జనులకున్= ప్రపంచంలోని మనుష్యులకు; మోక్షమున్+పుట్టుట+కోరి= మోక్షం కలగటాన్ని కోరుకొని; సన్మతిన్= మంచి బుద్ధితో; ఆదరసంభృతులై= జగత్తుమీద పరమాదరం కలిగినవారై; అనఘ!= పాపరహితుడా!; సుదుస్తరమైన= దాటటానికి కష్టసాధ్యమైన; భవనంబునకున్= పుట్టుకకు (మానవజీవితానికి); అచ్చు+అగు= తుల్యమైన; ఈ+ఇతిహాసమున్= ఈ కథను; బోధన= జ్ఞానాన్ని; కలిగించే విధంగా; మహనీయ విధంబునన్= గొప్పరీతిలో; చెప్పిరి= చెప్పారు; ఉదాత్త= గొప్ప; గుణాశ్రయతా= గుణములకు ఆశ్రయం ఇవ్వటం వలన; మహితా!= మహనీయుడైన ఓ ధృతరాష్ట్ర మహారాజా! (వినుము).

తాత్పర్యం: అని రాజు అడుగగా విదురుడు ఇట్లా చెప్పాడు. 'లోకంలోని మనుష్యులకు మోక్షం అంటే ఏమిటో తెలియ చెప్పటం కొరకే పండితులు ఈ కథను లోకహితం కోరి చెప్పారు. సరిగా జీవితం ఎట్లా దాటటానికి కష్టసాధ్యమైందో ఈ కథకూడా అచ్చంగా అట్లాంటిదే. అందుకే ఈ ఇతిహాసాన్ని ప్రాజ్ఞులు కల్పించారు. ఈ కథవలన మహత్తరమైన జ్ఞానబోధ కలుగుతుంది. నీవు కూడా గొప్ప గుణాలు కలిగినవాడివే. అందుచేత ఈ కథను వింటే నీకు తెలియని విషయం ఏమీ ఉండదు.

విశేషం: ఇతి+హ+ఆస - ఇతిహాసమని పెద్దలంటారు, ఇట్లా జరిగిందని ఏ కథను పెద్దలు సందర్భవశంగా ఉదాహరిస్తూ వస్తారో అవన్నీ ఇతిహాసాలే. ఇట్లాంటి ఇతిహాసాలు ఎన్నో కలిగిన మహేతిహాసం భారతం. ఇందులో జరిగినవి కొన్ని జరిగాయని జనులు చెప్పుకొంటూ వచ్చినవి కొన్ని, సందర్భాన్నిబట్టి పండితులు కల్పించినవి కొన్ని -ఇవన్నీ కలిసి భారత తాత్పర్యాన్ని నిరూపిస్తున్నాయి. అట్లాంటి కథ ఈ కథ.

కవిరాజవిరాజితవృత్తంలో ప్రతిపాదంలోనూ న,జ,జ,జ,జ,జ లగ - అనే గణాలుంటాయి. 1-8-14-20 అక్షరాలకు యతిమైత్రి, ప్రాసమైత్రి ఉన్నది.

వ. కావున నేతత్స్వరూపం బభివ్యక్తంబుగా వివరింపవలసియుండు వినుము చెప్పెద నా దుర్గంబు సంసార గహనంబు వాలు మృగంబులుఁ దెక్కలికాఁటు నురులు రోగంబులు కామినిజర పంచ శిరస్కంబులగు గజంబు లింద్రియ ప్రపంచంబు లాకూపంబున నున్న నాగం బంతకుండు తీఁగ జీవితాశ కూపంబు నుపాంతంబున

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నున్న యవనీరుహం బాయువు దాని దెస నడచు సామజంబు సంవత్సరంబు తదీయ శిరంబు లాఱును ఋతువులు తత్పాదంబులు పండ్రెండు మాసంబులు తరుమూలంబు నఱుకు నెలుక లహోరాత్రంబులు మధుకరంబులు కామంబులు మధుధారలు కామరసంబులు మధుసంచయనం బాయువు వానివలన మానవులాసక్తులగుదు రిట్టి సంసార చక్రంబు పరివర్తనంబు బుధు లెఱుంగుదురు వారు దీని పాశంబులు ద్రెంపంజాలుదు' రనిన విని యాంబికేయుండు విదురున కిట్లనియె. 52

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఏతద్= దీని; స్వరూపంబు= స్వరూపాన్ని; అభివ్యక్తంబుగాన్= స్పష్టంగా; వివరింపవలసి యుండున్= వివరించాల్సి ఉంటుంది; చెప్పెదన్+వినుము= చెబుతాను వినుము (జాగ్రత్తగా వినుమని అర్థం); ఆ దుర్గంబు= ఇంతవరకూ వర్ణించిన ఆ అడవి; సంసారగహనంబు= సంసారమనే అడవి; వాలుమృగంబులు= క్రూరమృగాలు; తెక్కలి కాఱు= దొంగలు; ఉరులు= ఉచ్చులు; రోగంబులు= రోగాలు; కామిని= స్త్రీ; జర= ముసలితనం; పంచశిరస్కంబులగు= ఐదు తలలున్న; గజము= ఏనుగు; ఇంద్రియ ప్రపంచంబులు= ఐదు ఇంద్రియాలు (కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలు); ఆ కూపంబు= ఆ బావిలో; ఉన్న నాగంబు= ఉన్న పాము; అంతకుండు= యముడు; తీఁగ= ఆ వ్యక్తి చిక్కుకున్న తీగ; జీవిత+ఆశ= బతకాలన్న కోరిక; కూపంబు+ఉపాంతంబునన్+ఉన్న= బావిసమీపంలోని; అవనీరుహంబు= చెట్టు; ఆయువు= ఆయుస్సు; దానిదెసన్= దానివైపు; నడచుసామజంబు= నడిచివచ్చే ఏనుగు; సంవత్సరంబు= సంవత్సరం; తదీయశిరంబులు+ ఆఱును= ఆ ఏనుగుకున్న ఆరు తలలూ; ఋతువులు= ఆరు ఋతువులు; తత్పాదంబులు పండ్రెండున్= దాని పండ్రెండు కాళ్ళు; మాసంబులు= నెలలు; తరుమూలంబు నఱుకు= చెట్టుమొదలును కొరికేటువంటి; ఎలుకలు= ఎలుకలు; అహోరాత్రంబులు= పగలు, రాత్రి; మధుకరంబులు= తుమ్మెదలు; కామంబులు= కోరికలు; మధుధారలు= తేనె ప్రవాహాలు; కామరసంబులు= ఇష్టప్రాప్తివలన పుట్టే తృప్తి; సంతోషం మొదలైన భావాలు; మధు సంచయనంబు= తుమ్మెదలు దాచిన తేనె; ఆయువు= ఆయుస్సు; వానివలనన్= కామం, దాని తృప్తి, ఇంకా బ్రతకాలన్న కోరిక, మిగిలిన ఆయుస్సు - వీటివలన; మానవులు= మనుష్యులు; ఆసక్తులగుదురు= జీవితంపట్ల ఆశకలిగిన వారు అవుతారు; ఇట్టి సంసార చక్రంబు+పరివర్తనంబు= సంసారమనే చక్రం తిరగటం ఇలాంటిదని; బుధులు+ఎఱుంగుదురు= పండితులు తెలుసుకొంటారు; వారు= అలాంటి ప్రాజ్ఞులు; దీని పాశంబులు= దీని పాశాలను; త్రెంపన్+చాలుదురు= తెంచిపారవేయగలుగుతారు; అనినన్+విని= అని విదురుడు చెప్పగా విని; ఆంబికేయుండు= అంబికాతనయుడైన ధృతరాష్ట్రుడు; విదురునకున్+ఇట్లు+అనియెన్= విదురుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కాబట్టి దీని స్వరూపాన్ని వివరిస్తే కాని అర్థం కాదు. చెప్పుతాను జాగ్రత్తగా వినుము. ఇంతవరకు వర్ణించిన ఆ అడవే సంసారం. క్రూరమృగాలే దొంగలు. ఉచ్చులే రోగాలు. ఆ స్త్రీయే ముసలితనం. ఐదు తలలున్న ఏనుగు ఐదు ఇంద్రియాలకు ప్రతీక. ఆ బావిలోని పామే యమధర్మరాజు. ఆ వ్యక్తి చిక్కుకున్న తీగయే బతకాలన్న కోరిక. ఆ బావి వద్దనున్న చెట్టు ఆయుస్సు. దానివైపు నడిచి వచ్చే ఏనుగు సంవత్సరం. దాని ఆరు తలలూ ఆరు ఋతువులు, పన్నెండు కాళ్ళూ పన్నెండు నెలలు. ఆ చెట్టు మొదటిని కొరికివేస్తున్న ఎలుకలే రేయుంబవళ్ళు. (అందుకే నల్లగా తెల్లగా ఉన్నాయనటం). ఆ తుమ్మెదలే ఎడతెగని కోరికలు. కారుతున్న తేనె ప్రవాహాలే ఇష్టప్రాప్తివలన కలిగే సుఖసంతోషాదిభావాలు. ఆ తుమ్మెదలు చేర్చి ఉంచిన తేనెపట్టే ఆయుస్సు. వీటిచేత మనిషి ఇంకా బ్రతకాలని కోరుకొంటాడు. సంసారమనే చక్రం తిరగటం ఇలాంటిదని పండితులు తెలిసికొంటారు. వివేకవంతులైనవారు ఆ ఉచ్చులలో పడరు. పాశాలను ఛేదించుకొని బయటపడగలుగుతారు' అని విదురుడు చెప్పగా ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు.

విశేషం: ఆ తీగపైన తలకిందులుగా వేలాడుతున్న మనిషివంటి బ్రతుకే మానవజీవిత మని తాత్పర్యం. ఇది అసలు బ్రతుకు కాదు. ఆ బావిలోనుండి బయటపడటం ఎంతకష్టమో ఈ మానవజీవితం నుంచి విముక్తి పొందటం కూడా అంతే కష్టం.

ఈ కథలోని పాత్ర - 'బ్రాహ్మణుడు' - ప్రతిమనిషీ ఆలోచన కలిగితే బ్రాహ్మణుడే అవుతాడని అర్థం. మోక్షానికి అర్హుడేనని అర్థం. అగ్రవర్ణీయుడైనా జీవితంలోని కామాది గుణాలకు బానిస కాక తప్పదని చెప్పటంకోసమే ఈ ఇతిహాసంలోని పాత్రగా బ్రాహ్మణుడు చెప్పబడ్డాడు.

ఇంద్రియాలు ఐదు. జ్ఞానేంద్రియాలు (త్వక్, చక్షుః, శ్రోత్ర జిహ్వాఘ్రాణాలు - చర్మం, కన్ను, చెవి, నాలుక, ముక్కు); జ్ఞానేంద్రియాలు పదార్థ జ్ఞానం కలిగిస్తాయి.

కర్మేంద్రియాలు - వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థలు (నోరు, చేయి, కాలు, గుద, జననేంద్రియాలు) - ఇవి కర్మావహం కలిగినవి. మనిషి సదా ఈ రెండింటి ద్వారా అటు మనసులోనూ, ఇటు దేహంలోనూ ఏదో ఒకపని చేస్తుంటాడు. అందుకే ఆ ఏనుగు నిరంతరం తిరుగుతూనే ఉన్నదనటం.

కాలాన్ని ఎలుకలతో పోల్చి చెప్పటం కూడా ఆలోచించదగినదే. కాలం తరిగిపోతుంది. నల్ల తెల్ల వర్ణాలే రేయుంబవళ్ళు. కడచిన కాలం మళ్ళీ రాదు కాబట్టి అది కొరికివేస్తున్నదనటం.

అన్ని అనుభవాలకన్నా కోరిక సిద్ధించినపుడు కలిగే సంతోషం మధురంగా ఉంటుంది. అంచేతనే అది 'తేనె' అనటం.

కాని, చివరి నిమిషం వరకు బ్రతకాలన్న కోరిక మనిషిని మళ్ళీ ఆశాపాశాలవైపు లాగుకొని వెళ్తుంది. ఆ కోరికను ఎవడు అదుపులో ఉంచుకొని నిరాసక్తుడవుతాడో - వాడు అసంగుడవుతాడు. అసంగత్వమే - వాడికి శస్త్రమవుతుంది. అట్లాంటివాడు ఈ సాంసారిక బంధాలనుండి విముక్తి పొందగలడు.

'అసంగశస్త్రేణ దృఢేన ఛిత్వా' అని భగవద్గీత అందుకే కీర్తించింది. ఆ విషయాన్నే విదురుడు ఈ ఇతిహాసం ద్వారా ధృతరాష్ట్రునికి బోధిస్తున్నాడు. ఇది మానవునికి సార్వకాలికమైన ప్రబోధం.

క. 'హిత ముపదేశించితి వీ । వతి నిర్మల చిత్తవృత్తి వగుట సుజన సం
స్తుత గుణ! యింకను జెప్పుము । ధృతికారక వచన పద్ధతిన్ విశదముగన్.' 53

ప్రతిపదార్థం: ఈవు= నీవు (ఓ విదురా!); అతి నిర్మల= అతి పవిత్రమైన; చిత్తవృత్తివి+అగుటన్= మనోవృత్తి కలిగినవాడివి కావటంచేత; హితము+ఉపదేశించితి(వి)= నాకు మంచిని బోధించావు; సుజనసంస్తుతగుణ!= సుజనులచేత ప్రస్తుతించబడే గుణాలు కలవాడా! ఓ విదురా!; ధృతి= ధైర్యాన్ని; కారక= కలిగించే; వచనపద్ధతిన్= మాటలతో (రీతిలో); విశదముగన్= వివరంగా; ఇంకనున్+చెప్పుము= ఇంకా కాస్త బోధించుము.

తాత్పర్యం: 'విదురా! నీవు అతిపవిత్ర చిత్తవృత్తి కలవాడివి. నాకు హితాన్ని ఉపదేశించావు. నీ బోధనలవలననే సుజనులు నిన్ను ఎప్పుడూ కీర్తిస్తారు. నాకు ధైర్యం కలిగే రీతిలో ఇంకా వివరంగా ఈ విషయాన్ని బోధించుము'.

వ. అనుటయు విదురుం డవ్విభున కిట్లనియె. 54

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; విదురుండు; ఆ+విభునకున్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు పలుకగా విదురుడు ఆయనతో ఇట్లా అన్నాడు.

కవిరాజ విరాజితము:

అనయము లోలతమై విషయప్రచయంబను దుస్తర పంకమునన్
మునుఁగుచుఁ దేలుచు నుండఁగఁ గాలము ముట్టి రుజన్ జర నెవ్వగ పై
కొన దొరకొల్పి క్రమంబున నంగము క్రొవ్వును జెల్వును బాపి ప్రయో
జన రహితంబుగఁ జేసి యపాత్రపుఁజా వొనరించుఁ గురుప్రవరా! 55

ప్రతిపదార్థం: కురుప్రవరా!= రాజా!; (మానవుడు) అనయమున్= నిరంతరం; లోలతమైన్= ఆసక్తితో (వ్యామోహంతో); విషయప్రచయంబు+అను= విషయ సమూహం అనేటటువంటి; దుస్తర పంకమునన్= దాటిపోవటానికి వీల్లేని బురదలో; మునుఁగుచున్+తేలుచున్= మునుగుతూ తేలుతూ; ఉండఁగన్= ఉండగా; కాలము= (ఇంతకు ముందు వివరించిన) కాలశక్తి; ముట్టి= తాకి; రుజన్= రోగంచేతనూ; జరన్= ముసలితనంచేతనూ; నెఱ+వగ= అధికదుఃఖం; పైకొనన్= ఆక్రమించగా; దొరకొల్పి= ఉసికొల్పి; క్రమంబునన్= క్రమంగా; అంగము= దేహంయొక్క; క్రొవ్వును= శక్తిని; చెల్వును= అందాన్ని; పాపి= పోగొట్టి; ప్రయోజనరహితంబుగన్+చేసి= ఎందుకూ పనికిరాకుండా చేసి; అపాత్రము+చావు= ఆయా జన్మకు ఉచితంకాని రీతిలోనైనాసరే చచ్చే విధంగా (అనుచిత మరణాన్ని); ఒనరించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: కురువంశం రాజులలో శ్రేష్ఠుడవైన ధృతరాష్ట్ర మహారాజా! వినుము. వ్యామోహంతో నిరంతరం విషయ ప్రపంచమనే బురదలో మునిగి తేలుతూ ఒకవైపు మనిషి తననుతాను మరచి ఉండగా, మరోవైపు కాలశక్తి రోగాన్ని, ముసలితనాన్ని ఉసికొల్పి మనిషిని ఆక్రమించేటట్లు చేస్తుంది. దానితో క్రమంగా మనిషిలోని శక్తి సన్నగిల్లుతుంది. అందం తరిగిపోతుంది. దేహం ఎందుకూ పనికిరాకుండా పోతుంది. చివరికి అన్యాయపు చావు చస్తాడు. ఇంతే మనిషిగతి.

విశేషం: అలం: రూపకం. కవిరాజ విరాజితంలో ప్రతిపాదానికీ- న, జ, జ, జ, జ, జ, వ అనే గణాలుంటాయి. 1-14 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. అని మఱియును. 56

తాత్పర్యం: అని అంటూ ఇంకా.

క. 'తేరు శరీరము దానికి। సారథి సత్త్వంబు తురగచయ మింద్రియముల్
దారుణతర బుద్ధి వ్యా। పారము లొనరంగ గనప పగ్గము లధిపా! 57

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! (వినుము); శరీరము= ఈ దేహం; తేరు= రథం; సత్త్వంబు= బుద్ధి; సారథి= రథాన్ని నడిపేవాడు; ఇంద్రియముల్= అవయవాలు; తురగచయము= గుర్రాలు; దారుణతర= మిక్కిలి భయంకరమైన; బుద్ధి= మతి (చేసే); వ్యాపారములు= ఆలోచనలు; ఒనరంగన్= అమరినట్లుగా; గనప= పెద్దవైన; పగ్గములు= పగ్గాలు.

తాత్పర్యం: 'ఓ రాజా! వినుము. ఈ శరీరం ఒక రథం. దానికి సారథి బుద్ధి. కరచరణాది ఇంద్రియాలే గుర్రాలు. బుద్ధిచేసే భయంకరమైన ఆలోచనలే పగ్గాలు.

విశేషం: మనస్సు, బుద్ధి అనే మాటలను కొంత వివరించాల్సిన అవసరం ఉన్నది. మనస్సు- ఒక జ్ఞానేంద్రియం. పనులు చేయటానికి కావలసిన ప్రేరణ ఇచ్చేంతవరకే దానిపని. మంచి చెడుపనులకు రెంటికీ ప్రేరణ మనస్సే ఇస్తుంది.

బుద్ధి - మనసుకన్నా లోపలిపొర. సంకల్ప - వికల్పాలకు మీట (switch) బుద్ధి, విచక్షణ (discretion) బుద్ధి వ్యాపారం. అందుకే బుద్ధిని అంతఃకరణశక్తిగా చెప్పవచ్చును. శుశ్రూష, శ్రవణం, గ్రహణం, ధారణం, ఊహ, అపోహ, అర్థవిజ్ఞానం, తత్త్వజ్ఞానం- ఇవి బుద్ధివ్యాపారాలుగా చెప్పబడ్డాయి.

చిన్నతనంలో ఎవరిని సేవిస్తామో, ఏది వింటామో, ఏది గ్రహించి మనసులో పదిలపరుచుకొంటామో, ఎట్లా ఊహిస్తామో, ఎట్లా తర్కిస్తామో, ఇహపరాలమీద ఏ ఆలోచనలు కలిగి ఉంటామో అవన్నీ కలిసి ఏర్పడే లోపలిపొర బుద్ధి. దానినిబట్టి ఆలోచన, దాన్నిబట్టి పని ఉంటాయి.

పగ్గాలు ఎట్లా లాగితే గుర్రాలు అట్లా పరుగిడుతాయి. అందుకని అవి బలిష్ఠంగా ఉండాలి. అప్పుడే గుర్రాలను అదుపు చేయగలుగుతాయి. దుర్మార్గపుటాలోచనలు బలిష్ఠంగా ఉన్నప్పుడు ఏమవుతుందో తరువాతి పద్యంలో (58) చెప్తున్నాడు. ఆ తరువాతి పద్యంలో (59) ఆలోచనలను ఎట్లా అదుపు చేయాలో చెప్పాడు. ఆ మీది పద్యంలో (60) ఈ దేహరథం ఎట్లా యముడి అధీనమో, వివేకంతో దానిని ఎట్లా నియంత్రించుకొనవచ్చో చెప్పాడు.

ఈ నాలుగు పద్యాల మూలాన్నీ కఠోపనిషత్తులో చూడవచ్చును. నచికేతునికీ యముడికీ సంవాదరూపంలో ఉన్న ఈ ఉపనిషత్తులో ఈ విషయం ఉన్నది.

“ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు

బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ.”

(ఆత్మను రథంలోని యజమానుడిగా తెలిసికొనుము. శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సును కళ్ళెంగా తెలిసికొమ్ము.)

“ఇంద్రియాణి హయా నాహుః విషయాంస్తేషు గోచరాన్,

ఆత్మేంద్రియ మనో యుక్తం భోక్తే త్యాహు ర్మనీషిణః”.

(ఇంద్రియాలు గుర్రాలు. వాటి మార్గాలు ఇంద్రియ సుఖాలు. ధీమంతులు దేహేంద్రియ మనస్సులతో కూడిన ‘ఆత్మను’ ‘భోక్త’ అని పిలుస్తారు.)

తిక్కనగారు రథికుడు ‘ఆత్మ’ అనే విషయాన్ని అనువదించకపోయినా ‘సత్త్వం’ అనే మాటతో ‘సారథి’ని సూచించటంలో ఈ మంత్రంలోని అర్థమంతా ఉన్నది. మనస్సు కళ్ళెం అనే మాటను కూడా ‘ఆలోచనలు’గా చెప్పాడు.

“య స్త్వవిజ్ఞానవాన్ భవ త్యయుక్తేన మనసా సదా

తస్యేన్ద్రియాణ్యవశ్యాని దుష్టాశ్వా ఇవ సారథేః.”

(అయుక్తమైన మనస్సు కలవాడై అవిజ్ఞానవంతుడైన వాడికి సారథికి దుష్టాశ్వాలు వశం కానట్లు ఇంద్రియాలు వశం కావు.)

ఈ అర్థాన్నే తరువాతి పద్యంలో తిక్కనగారు చెప్తున్నారు.

క. నరవర! యేర్పడ విను మ । త్తురగంబుల పటు రయంబుతో ననుసరతం
దిరుగు పురుషుండు సంసృతిఁ । బరువడి భ్రమియించు నవశభావవ్యాప్తిన్. 58

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నరవర!= ఓ రాజా!; ఏర్పడన్= కుదురుగా; వినుము; ఆ+తురగంబుల= ఆ గుర్రాల; పటు= బలిష్ఠమైన; రయంబుతోన్= వేగంతో; అనుసరతన్= పాటుగా; తిరుగు పురుషుండు= తిరిగే మనిషి; అవశభావవ్యాప్తిన్= తన అధీనంలోలేని భావాలకు లోబడి; సంస్మృతిన్= సంసారంలో; పరువడిన్= క్రమంగా; భ్రమియించున్= అటూ ఇటూ భ్రమిస్తుంటాడు.

తాత్పర్యం: ఓ రాజా! జాగ్రత్తగా వినుము. ఆ గుర్రాలు ఎంత వేగంగా వెళ్తే వాటి కనుగుణంగా ఎవరు తిరుగుతారో వారు తమ అధీనంలోలేని భావాలకు లోబడి ఈ సంసారంలో ఉరుకులు పరుగులతో అటూ ఇటూ భ్రమిస్తుంటారు.

విశేషం: ఇంద్రియాలు చెప్పినట్లుగా వింటూ పోతే చివరకి మిగిలేది 'బంధం' మాత్రమేనని తాత్పర్యం. సంస్మృతి - అనే పదం చాలా విశిష్టమైనది. ఎప్పటికీ కొనసాగుతూ పోయేదని అర్థం. ఆ ప్రయాణానికి అంతం ఉండదు. అందుకే పరుగెత్తటం అనటం. అంతే కాదు - నిర్దిష్ట గమ్యముండదు కాబట్టి 'భ్రమించటం' అనే మాటను తిక్కనగారు వాడారు.

క. **వానిఁ దమయిచ్చ నెందుం । బోనీ కుండంగ నాఁగు పురుషుఁడు సంసా**
రానేక దుఃఖభాజన । తా నిరసనమునకు నేర్చు ధరణీనాథా! **59**

ప్రతిపదార్థం: ధరణీ నాథా!= రాజా!; వానిన్= ఆ గుర్రాలను; తమ ఇచ్చన్= తమ ఇష్టప్రకారం; ఎందున్+పోనీక+ఉండంగన్= ఎటూవైపూ పోనీకుండా ఉండేలా; ఆఁగు= ఆపేటువంటి; పురుషుఁడు= మనిషి; సంసార= సంసారంలోని; అనేక వివిధాలైన; దుఃఖ= దుఃఖాలకు; భాజనతా= పాత్రమగుటయొక్క; నిరసనమునకున్= తిరస్కారానికి; నేర్చున్= సమర్థ డౌతాడు.

తాత్పర్యం: రాజా! ఆ గుర్రాలను తమ ఇష్టం వచ్చినట్లు పోనీకుండా ఎవడు ఆపగలుగుతాడో అట్లాంటి మనిషి సంసారంలో అనేక దుఃఖాలపాలు కాకుండా ఉండటం నేర్చుకొనగలుగుతాడు.

విశేషం: పగ్గాలను రౌతు సరిగా నియమించకపోతే గుర్రాలు అదుపులో ఉండవు. తమ ఇష్టం వచ్చినట్లు పరిగెడుతాయి. ఎప్పుడు ఆలోచనలను గట్టిగా పట్టుకొని ఇంద్రియాలను అదుపుచేసికొంటామో అప్పుడు క్షేమంగా తేరును కాపాడుకొన గలుగుతాము.

కఠోపనిషత్తు ఈ విషయాన్ని ఇట్లా వివరిస్తున్నది.

"యస్తు విజ్ఞానవా న్భవతి సమనస్క స్సదా శుచిః
స తు తత్పద మాప్నోతి యస్మా ద్భూయో న జాయతే."

(ఎవడు వివేకవంతుడో, మనోనిగ్రహం కలవాడో, సదా పవిత్రుడో అట్లాంటివాడు పునరావృత్తిరహితమైన ఆ 'పరమ' పదాన్ని పొందుతాడు.

ఈ 'పరమపదం' అనే అర్థాన్నే 'దుఃఖభాజనతా నిరసన'మని తిక్కనగారు చెప్తున్నారు.

క. **యముని యధీనం బిది దుః । ఖముల ననేకములఁ జేయఁగా నోపు నృపో**
త్తమ! యీరథ మది యడఁతురు । విమలవివేకౌషధమున విను మార్యజనుల్. **60**

ప్రతిపదార్థం: నృపోత్తమ!= రాజశ్రేష్ఠుడా!; వినుము; ఇది= ఈ జీవితం; యముని= కాలస్వరూపుడైన యమధర్మరాజుయొక్క; అధీనంబు= అధీనంలో ఉంటుంది (అంతేకాదు); అనేకములన్= నానా విధాలైన; దుఃఖములన్; చేయఁగాన్= కలిగించటానికి;

ఓపున్= సమర్థమైనది; ఆర్యజనుల్= పుణ్యాత్ములు (ప్రాజ్ఞులు); విమల= పవిత్రమైన; వివేక= వివేకమనే; ఔషధమునన్= మందుతో; ఈ రథము+అది= (ఈ శరీరం ఏదైతే ఉందో) దాన్ని; అడఁతురు= అధీనంలో ఉంచుకొంటారు.

తాత్పర్యం: రాజా! వినుము. ఈ జీవితం యముడి అధీనంలో ఉంటుంది. అంతే కాకుండా ఎన్నో విధాలైన దుఃఖాలకు ఇది నిలయం. అందుచేత పుణ్యాత్ములు వివేకమనే మందుతో శరీరమనే ఈ తేరును అదుపులో ఉంచుకొంటారు.

విశేషం: అలం: రూపకం. అకార్యం (చేయదగింది, చేయరానిది) అనే రెండు విషయాలను గురించి వివేచన ఉండటమే వివేకం. బుద్ధికి ఉన్న శక్తులన్నీ కలిగించేది వివేకాన్ని. ఆ శక్తులు దురుపయోగంపాలు అయితే అవివేకం ఏర్పడుతుంది. అపుడు ఇంద్రియాలు విజృంభిస్తాయి. ఫలితం రుజ-జర ఇత్యాదిగా ఉన్న అనారోగ్యం. దీనికి మందు వివేకమే. అందుకే 'వివేకౌషధమునన్' అని చెప్పటం.

వ. **ఆ పగ్గంబులు శీలంబను వెరవుతో నలవరించి వేగం బార్యు లుడుపుదురు వారలు జననమరణాదుల వలని భయంబు నుజ్జగించి పరమసుఖంబు నొందుదు రింతయు నెఱింగి శాంతినొంది పుత్రాది జ్ఞాతులకు నౌర్ధ్వదైహికంబులు సేయించి సుఖివిగ'మ్మనిన విని యమ్మాటలన్నియుం బోవిడిచి తుదింజెవి సూఁడినట్టి దయినఁ బుత్ర పరలోక క్రియావిషయంబగు మాటకు శోకం బతిశయిల్ల మూర్ఛిల్లె నట్టి సమయంబునం గృష్ణద్వైపాయనమునీంద్రుఁ డయ్యెడకు విజయంచేసిన విదురసంజయాదులు సంభ్రమంబున నెదురువచ్చి ప్రణతులైధృతరాష్ట్రునకు శిశిరజలసేచన లలితవ్యజనవీజనంబుల నాచరించిన నతండు సేదదేఱుటయు నతని కమ్మహాత్ముని రాక యెఱింగించిన నమ్మహీపతి యతనికి దండనమస్కారంబుసేసి గద్గదిక నెలుంగు రాలుపడ నిట్లనియె.** **61**

ప్రతిపదార్థం: ఆర్యులు= పుణ్యాత్ములు; ఆ పగ్గంబులు= ఆ పగ్గాలను; శీలంబు= నడవడి; అను= అనేటువంటి; వెరవుతోన్= ఉపాయంతో; అలవరించి= నియమించి; వేగంబు= ఆ గుర్రాల వేగాన్ని; ఉడుపుదురు= నియంత్రిస్తారు; వారలు= అట్లాంటి పుణ్యాత్ములు; జనన= పుట్టుకవలన; మరణ+ఆదుల వలని= మరణం మొదలైన వాటివలన (కలిగే); భయంబున్= భయాన్ని; ఉజ్జగించి= వదలిపెట్టి; పరమసుఖంబున్= మోక్షాన్ని; ఒందుదురు= పొందుతారు; ఇంతయున్+ఎఱింగి= ఇదంతా గుర్తించి; పుత్ర+ఆది జ్ఞాతులకున్= కొడుకులకు దాయాదులందరికీ; ఔర్ధ్వదైహికంబులు= ఉత్తర క్రియలు; చేయించి; సుఖివి+కమ్ము+అనినన్= సుఖంగా ఉండుము అని చెప్పగా; విని= వినికూడా; ఆ+మాటలు+అన్నియున్= ఆ మాటలన్నిటిని; పోన్+విడిచి= వదలిపెట్టి; తుదిన్= చివరిలో; చెవి సూఁడినట్టి దయినన్= చెవిని కాల్చినటువంటిది కాగా; పుత్ర= కొడుకులయొక్క; పరలోక+ఉత్తర; క్రియా విషయంబు+అగు+మాటకున్= క్రియలకు సంబంధించిన మాటలచేత; శోకంబు+అతిశయిల్లన్= దుఃఖం పెల్లుబికిరాగా; మూర్ఛిల్లెన్= మూర్ఛపోయాడు; అట్టి సమయంబునన్= ఆ సమయంలో; కృష్ణద్వైపాయన మునీంద్రుఁడు= వ్యాసుడు; ఆ+ఎడకున్= అక్కడికి; విజయము+చేసినన్= రాగా; విదుర సంజయులు= విదురుడు, సంజయుడు; సంభ్రమంబునన్= ఆశ్చర్యంగా; ఎదురువచ్చి= ఎదుర్కొని (ఆహ్వానించి); ప్రణతులు+ఐ= నమస్కరించి; ధృతరాష్ట్రునకున్= రాజుకు; శిశిరజల= చల్లటి నీటిని; సేచన= చల్లడమూ; లలిత= సుకుమారంగా; వ్యజన వీజనంబులన్= విసనకర్రతో విసరడమూ; ఆచరించినన్= చేయగా; అతండు; సేదదేఱుటయున్= బడలికదీరగా; అతనికిన్= ధృతరాష్ట్రునికి; ఆ+మహాత్మునిరాక= వ్యాసుడిరాకను; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+మహీపతి= ఆ రాజు; అతనికిన్= వ్యాసుడికి; దండనమస్కారంబు+చేసి= సాష్టాంగ నమస్కారం చేసి; గద్గదికన్= డగ్గుత్తికతో; ఎలుంగు= కంఠధ్వని; రాలుపడన్= కంపిస్తుండగా; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: 'పుణ్యాత్ములు ఆ పగ్గాలను నడవడి అనే ఉపాయంతో నియంత్రించి ఆ గుర్రాల వేగాన్ని అదుపులో ఉంచుకొంటారు. అట్లాంటి పుణ్యాత్ములు పుట్టుక మరణం మొదలైన వాటివలన కలిగే భయాన్ని విడిచిపెట్టి మోక్షసుఖాన్ని పొందుతారు. ఇదంతా గుర్తించి నీవు నీ పుత్రాదులకు, నీ దాయాదులకు ఉత్తరక్రియలు జరిపించి సుఖంగా ఉండుము' అని చెప్పగా విని, ఆ మాటలన్నిటినీ వదలిపెట్టి చివరిలో 'నీ పుత్రులకు ఉత్తరక్రియలు చేయుము' అన్నమాట చెవిని కాల్చివేయగా, దుఃఖం పెల్లుబికి రాగా, మూర్ఛపోయాడు. ఆ సమయంలో సరిగ్గా వ్యాసుడు అక్కడికి వచ్చాడు. విదురుడు, సంజయుడు మున్నగువారు ఆశ్చర్యపడి గౌరవంతో ఆయనను ఆహ్వానించి నమస్కరించారు. మరొకవైపు ధృతరాష్ట్రుడి ముఖంపైన చల్లని నీటిని చల్లి, విసనకర్రలతో నెమ్మదిగా విసిరి ఉపచారాలు చేశారు. సేదదీరిన ధృతరాష్ట్రుడికి వ్యాసముని రాకను తెలిపారు. ఆ రాజుకూడా గౌరవంతో వ్యాసమహర్షికి సాష్టాంగ నమస్కారంచేసి డగ్గుత్తికతో గొంతు కంపిస్తుండగా ఇట్లా అన్నాడు.

విశేషం: ఇంతమంది ఇన్ని విధాలుగా ఉపదేశించినా దేహధారి తన ఇంద్రియాల మార్గంలోనే వెళ్తాడని చెప్పటం కొరకే ధృతరాష్ట్రుడి ఈ అవస్థను వర్ణించటం. రాష్ట్రమంటే-శరీరం, దానిని ధృత-ధరించినవాడు. అతడి పిల్లలే అతడి ఇంద్రియాలు. రాజ్యభోగమే అతడి మనసుకున్న లోభగుణం. అందుకే పుత్రులమాట వినగానే 'వివేకం' నశిస్తుంది. భారత కథకంతా మూలం ఇదే.

దోధక వృత్తము:

'మానుష జన్మము మాన్య వివేకా! । మానసదుఃఖ సమాజము నెల్లం
దాన ఘటించుచు దైన్యము దెచ్చుం । గాన భవంబిది గాల్పనె? తండ్రీ! **62**

ప్రతిపదార్థం: మాన్య= మహనీయమైన; వివేకా!= జ్ఞానం కలవాడా! (వ్యాసమహర్షీ); మానుషజన్మము= మానవజన్మ; మానస దుఃఖ సమాజమునెల్లన్= మనసుకు అన్ని విధాల దుఃఖాలనూ; తాను+అ= తానే; ఘటించుచున్= సృష్టిస్తూ; దైన్యమున్+తెచ్చున్= దీనస్థితిని కల్పిస్తుంది; కాన= కాబట్టి; తండ్రీ!= ఓ తండ్రిగారైన వ్యాసమహర్షీ!; భవంబు+ఇది= ఈ పుట్టుక; కాల్పనె?= కాల్చటానికా? (నిష్ప్రయోజనమని అర్థం.)

తాత్పర్యం: 'మహనీయజ్ఞాన సంపన్నుడవైన వ్యాసమహర్షీ! ఈ మానవజన్మ తానంతట అదే మనస్సుకు అన్ని విధాలైన దుఃఖాలను సృష్టించి దీనస్థితిని కల్పింపజేస్తుంది. అందుచేత తండ్రీ! ఈ జన్మం ఎందుకు? కాల్చనా? (చివరకి ఎట్లాగూ జరిగే పని అదే!) ప్రయోజనం ఏమున్నది?

విశేషం: భవశబ్దానికి పుట్టుక-జన్మ-సంసారం- అని సందర్భాన్నిబట్టి అర్థాలుంటాయి. భూ-అనే ధాతువుకు పుట్టటమని అర్థం-ఎప్పటికప్పుడు కొత్తగా అనిపిస్తూ పుట్టేదికాబట్టి దీనిని జన్మమని-కొత్తగా ఏదో సమస్య పుట్టుతూనే ఉంటుంది. కాబట్టి-సంసారమని-అంటాం.

దోధక వృత్తంలో పాదానికి - భ, భ, భ, గ, గ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ, ఏడవ అక్షరానికీ యతిమైత్రి, ప్రాస నియమం కలదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మంజుభాషిణీ వృత్తము:

ధనమంతయుం బొలియ దారుణంబుగాఁ । దనయవ్రజంబు దెగ దైన్యమారఁగాఁ

దన బంధులందఱు మృతంబుఁ బొంద నె । వ్వనినైన శోకమనువహ్ని కాల్పదే? 63

ప్రతిపదార్థం: ధనమంతయున్= ధనమంతా; పొలియన్= నశించిపోగా; దారుణంబుగాన్= ఘోరంగా; తనయవ్రజంబు= కుమారుల సమూహం; తెగన్= చనిపోగా; దైన్యము+ఆరఁగాన్= దీనత్వమతిశయించగా; తనబంధులు+అందఱున్; మృతంబున్+ పొందన్= చావును పొందగా; ఎవ్వనిన్+ఐనన్= ఎవడినైనా; శోకమను= శోకమనేటువంటి; వహ్ని= అగ్ని; కాల్పదే?= కాల్చదా?

తాత్పర్యం: ఉన్న ధనమంతా నశించి, కొడుకులందరూ చచ్చి, బంధువులందరూ ఒక్కసారిగా పోతే, ఎవడినైనా ఆ దుఃఖమనే అగ్ని దహించకుండా ఉంటుందా?

విశేషం: అలం: రూపకం. మంజుభాషిణీ వృత్తంలో ప్రతిపాదంలోనూ స, జ, స, జ, గ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ తొమ్మిదవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

ఉపజాతి వృత్తము:

మునీంద్ర! నిర్భాగ్యత ముట్టి చావుం । గానేరదయ్యెం గడుగట్టి చిత్తం

బనూన మూర్ఛం దెగటారియుఁ దా । రానేర్చె నిమ్మేనికిఁ గ్రమ్మఱంగన్. 64

ప్రతిపదార్థం: మునీంద్ర!= వ్యాసమహర్షీ!; నిర్భాగ్యత= దౌర్భాగ్యం; ముట్టి= ఆవరించి; చావున్= చావుకూడా; కాన్+నేరదయ్యెన్= రానిదయింది (రాకపోయింది); కడున్+గట్టి+చిత్తంబు= (నాది) చాలా గట్టి మనస్సు; అనూన= గొప్పదైన; మూర్ఛన్= మూర్ఛలో; తెగటారియున్= నశించికూడా; క్రమ్మఱంగన్= మళ్ళీ; ఈ+మేనికిన్= ఈ దేహంలోకి; తాన్= (ప్రాణం) తాను; రాన్+నేర్చెన్= రాగలిగింది (అంటే చనిపోతే బాగుండేదని అర్థం).

తాత్పర్యం: మహర్షీ! నా దౌర్భాగ్యం ఏమని చెప్పాలి! నాకు చావుకూడా రావటంలేదు. నాది చాలా గట్టి మనస్సు. లేకపోతే ఇంత పెద్ద మూర్ఛలో మునిగికూడా మళ్ళీ ఈ బొందిలోకి ప్రాణం రాగలిగింది.

విశేషం: ఐదు ప్రాణాలున్నాయని శారీరక శాస్త్రం చెప్తుతుంది. నాగ-కూర్మ-కృకర-దేవదత్త-ధనంజయాలని వీటిపేర్లు. నాగం-వాగ్ ద్వారంలో ఉండేది; కూర్మం-కంటిరెప్పలలో ఉంటుంది. కృకర-తుమ్మును కలిగిస్తుంది. దేవదత్తం-ఆవులింతను కలిగిస్తుంది-దేహమంతటా 'ధనంజయ' మనే ప్రాణం వ్యాపించి ఉంటుంది. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలని వరుసగా హృదయ, గుద, నాభి, కంఠ, సర్వశరీరాలను ఆశ్రయించి ఈ 'పంచప్రాణాలూ' వ్యాపించి ఉంటాయి. నాగకూర్మాది నామాలు కలిగినవి పంచప్రాణాల పేర్లు అని కొందరు. ఉపప్రాణాలు, లేదా ఉపవాయువులని కొందరు అంటారు. 'మనస్సంకల్ప' రూపంతో దృఢంగా ఉన్న 'ధనంజయ' మనే ప్రాణం వ్యాపించి ఉంటుంది.

కృష్ణద్వైపాయనముని ధృతరాష్ట్రునకు దుఃఖోపశమనంబు చేయుట (సం. 11-8-12)

వ. ఇంక నేమిసేయువాఁడ' నని పలికి యూరకున్న యన్నరనాథునకు మునినాథుం డి ట్లనియె. 65

ప్రతిపదార్థం: ఇంకన్= ఇంక; ఏమి+చేయువాఁడను?= ఏం చేయగలను?; అని పలికి; ఊరకున్నన్= ఊరకుండగా; ఆ+ నరనాథునకున్= ఆరాజుతో; మునినాథుండు= శ్రేష్ఠుడైన వ్యాసమహర్షి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లాంటి స్థితిలో నేను ఏం చేయగలను?' అనిమాత్రమని ఊరకున్న ధృతరాష్ట్రుడితో వ్యాసుడు ఇట్లా చెప్పాడు.

ఉత్సాహవృత్తము;

'నీవు ధర్మభంగి నెఱుఁగ నేర్తు నీతి కౌశలం । బావహిల్లు నీదు మనమునందుఁ గాన నేను శో
కావిలత్వ ముడుపఁబూని యరుగుదెంచితిన్ సుతా । భావజనిత దుఃఖవార్ధిపార మెయ్యు పుత్త్రకా! 66

ప్రతిపదార్థం: పుత్రకా!= కుమారా!; నీవు; ధర్మభంగిన్= ధర్మవిధిని; ఎఱుఁగన్+నేర్తు(వు)= తెలిసినవాడివి; నీదు మనమునందున్= నీ మనసులో; నీతి కౌశలంబు= నీతి పథంలోని నేర్పు; ఆవహిల్లున్= ఉంది; కానన్= అందుకే; శోక+ఆవిలత్వము= శోకంచేత పుట్టిన కలతను; ఉడుపన్+పూని= పోగొట్టాలని; నేను+అరుగుదెంచితిన్= నేనువచ్చాను; సుత+అభావ+జనిత= కొడుకులు మరణించటంచేత పుట్టిన; దుఃఖవార్ధిన్= దుఃఖమనే సముద్రాన్ని; ఎయ్యు(ము)= దాటుము.

తాత్పర్యం: 'కుమారా! నీవు ధర్మవిధి ఎరిగినవాడవు. నీవు నీతిశాస్త్ర కుశలుడవు. అందుచేత నీకు శోకాన్ని పోగొట్టి శాంతిని ప్రసాదించాలని నేను వచ్చాను. పుత్రుల మరణంచేత పుట్టిన దుఃఖసముద్రాన్ని దాటి శాంతిని పొందుము.

విశేషం: అభావం-అంటే లేకపోవటం: ఈ సందర్భంలో అభావం అంటే మరణం చేత ఏర్పడ్డ అభావమని అర్థం. వృత్తవిశేషానికి చూడండి: స్త్రీ. 1.48.

క. భూతము లనిత్యములు నీ । వీ తెరు వెప్పుడును విం దహీన ధృతిన్ నీ
చేతోగతి నలవఱుపుము । భూతానిత్యత్వ మదియ పుచ్చును వగలన్. 67

ప్రతిపదార్థం: భూతములు= ప్రాణులు; అనిత్యములు= అశాశ్వతాలు; నీవు; ఈ తెరువు= ఈ ధర్మాన్ని గురించి; ఎప్పుడును= ఎప్పుడూ; విందువు= వింటూనే ఉన్నావు; అహీన= గొప్ప; ధృతితోన్= ధైర్యంతో; భూత+అనిత్యత్వము= ప్రాణుల అశాశ్వతత్వమనే ఈ ధర్మాన్ని; చేతోగతిన్= మనసులో; అలవఱుపుము= (చక్కగా) అభ్యసించుము; అది+అ= ఆ జ్ఞానమే; వగలన్= నీ దుఃఖాన్ని; పుచ్చును= పోగొడుతుంది.

తాత్పర్యం: ప్రాణులు అన్నీ అశాశ్వతాలే. ఈ ధర్మాన్ని గురించి నీవు ఎప్పుడూ వింటూనే ఉన్నావు. గొప్ప ధైర్యంతో నీ మనస్సులో ప్రాణులు అశాశ్వతమనే ఈ ధర్మాన్ని అభ్యసించటం మొదలుపెట్టుము. ఆ జ్ఞానమే నీ దుఃఖాన్ని పోగొట్టుతుంది.

విశేషం: భూతం-అనేమాటకు నీరు, భూమి, వాయువు, ఆకాశం, అగ్ని అనే పంచభూతాలూ, ప్రాణం కలిగినవి, ప్రాణంలేనివి, జంతువులు, పక్షులు, మనుష్యులు - అనే ఇన్ని అర్థాలూ ఉన్నాయి. వెరసి మొత్తం 'ప్రకృతి' అని అర్థం. ఇది మార్పును పొందుతుంది, కాబట్టి అశాశ్వతం. ఆత్మ ఒకటే శాశ్వతమైనది- దానికి మార్పులేదు. అందుచేత ఆత్మనిత్యత్వ స్ఫురణ ఉండి 'జీవి' అశాశ్వతత్వాన్ని గురించి ఎరిగి, జీవితాన్ని ఆ జ్ఞానంతో గడపటంచేత విషాదాన్ని దాటగలడని తాత్పర్యం. కాని, ఈ జ్ఞానం వినుకలిచేత వచ్చేది కాదు. నిరంతరసాధనచేతనే వస్తుంది. అందుకే అభ్యసించుమని చెప్పటం.

ఆ. అరయ జీవలోక మధ్రువ మన నరు । నొడలి బ్రదుకు చావుఁ గడవ దనఁగ
వినియు నెల్లఁ గనియు వీతవివేకతఁ । బుత్త్ర మరణమునకుఁ బొగుల నగునె? 68

ప్రతిపదార్థం: అరయన్= బాగా ఆలోచిస్తే; జీవలోకము= ప్రాణిలోకం; అధ్రువము+అనన్= అశాశ్వతమైనదనీ; నరున్= మనిషియొక్క; ఒడలి బ్రదుకు= దేహంతోటి ఈ జీవితం; చావున్= మరణాన్ని; కడవదు+అనఁగన్= తప్పించుకోజాలదు అని; వినియున్= వినీ; ఎల్లన్+కనియున్= అన్నిటినీ చూచీ; వీత= పోయిన, వివేకతన్= జ్ఞానంతో; పుత్ర మరణమునకున్= పుత్రుల మరణానికి; పొగులన్+అగునె?= శోకించటం తగునా?

తాత్పర్యం: బాగా ఆలోచిస్తే ప్రాణిలోకం అశాశ్వతమైనదని, మనిషి దేహంతోడి ఈ జీవితం మరణాన్ని తప్పించుకొనజాలడని విని, ఇట్లాంటి నిజాలను చూచి వివేకజ్ఞానాన్ని కోల్పోయి పుత్రుల మరణానికి శోకించటం తగని పని.

వ. అదియునుం గాక. **69**

తాత్పర్యం: అంతమాత్రమే కాకుండా.

సీ. నీ వెఱుంగక యుండఁగా వచ్చెనే వైర । బంధంబు కౌరవపాండవులకు?
నీ పుత్రకుండ దీనికిఁ గారణం బిది । విధి నిర్మితంబైన విధము సువ్వె!
కౌరవజాతి సంక్షయ మవశ్యంబుగాఁ । గలయదియై చెల్లెఁగాక క్రొత్త
యైనదియే? బంధు లాజి విహార త । త్పరతమై సద్గతిఁ బడసినారు

ఆ. వారి కేల యింత వగవ నట్లును గాక । విమలబుద్ధియైన విదురుఁ డిట్టు
లగుట యెఱిఁగి బుద్ధి తగఁ జెప్పె నీకు జూ । దంబు సమయమునన దాని వినవ. **70**

ప్రతిపదార్థం: నీవు= నీవు; ఎఱుంగక+ఉండఁగాన్= తెలియకుండా; కౌరవపాండవులకున్= కౌరవులకు; పాండవులకు; వైరబంధంబు= వైరరూపమైన బంధం; వచ్చెనే?= కలిగినదా?; నీ పుత్రకుండు+అ= నీ కొడుకే; దీనికిన్= దీనికంతటికీ; కారణంబు= కారణం; ఇది= ఇట్లా కావటం; విధి= విధిచేత (దైవంచేత); నిర్మితంబు+ఐన= కల్పించబడిన; విధము+చువ్వె!= పద్ధతి సుమా!; కౌరవజాతి= కురువంశీయుల; సంక్షయము= నాశనం; అవశ్యంబుగాన్= తప్పని సరిగా; కాన్+కల+అది+ఐ= జరగాల్సి ఉండి; చెల్లెన్+కాక= అట్లా జరిగిపోయింది తప్ప; క్రొత్త+ఐనది+ఏ?= ఇదేమి కొత్త విషయమా?; బంధులు= బంధువులందరూ; ఆజి= యుద్ధం అనే; విహార తత్పరతమైన్= విహారంలో ఆసక్తి కలవారై; సత్+గతిన్= సుగతిని; పడసినారు= పొందారు; వారికిన్= వారికోసం; ఇంత= ఇంతగా; వగవన్= దుఃఖించటం; ఏల?= ఎందుకు?; అట్లునున్+కాక= అంతేకాకుండా; విమలబుద్ధి+ఐన= పవిత్ర బుద్ధి కలిగిన; విదురుఁడు; ఇట్టులు+అగుట= ఇట్లా కాబోతుందని; ఎఱిఁగి= తెలిసినవాడై; నీకున్= నీకు (నీ కుమారునికి); తగన్= ఎన్నో విధాలుగా; జూదంబు సమయమునన్+అ= జూదమాడే సమయంలోనే; బుద్ధి+చెప్పెన్= నీతి బోధించాడు; దానిన్= దానిని; వినవు+అ= నీవు వినకపోతివి.

తాత్పర్యం: నీకు తెలియకుండా కౌరవ పాండవులకు వైరం కలిగిందా! నీకొడుకే ఇంతటికీ మూలం. ఇట్లా కావటం దైవవిధి. అందుకే అనివార్యంగా కౌరవ వంశం నాశనమైంది. అంతేకాని ఇదేం కొత్త విషయం కాదే! బంధువులందరూ యుద్ధమనే ఆటలో ఆసక్తి కలవారై (ఆడి) సుగతిని పొందారు. వారికొరకు ఇంతగా దుఃఖం పొందటం ఎందుకు? అంతేకాకుండా పరమ పవిత్ర బుద్ధి కలిగిన విదురుడు ఇట్లా కాబోతుందని తెలిసినవాడై ఆనాడు ద్యూతసమయంలోనే నీకూ నీ కుమారునికీ ఎన్నో విధాలుగా నీతిబోధ చేశాడు. కాని, నీవు దానిని విన్నావు కావు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దోధక వృత్తము:

దేవ కృతంబులు ధీరులకైనన్ । భూవర! మాన్పఁగఁ బోలునె? యెట్లుం
గావున శోకముఁ గాఱియ దల్గం । గా వలదే తుది గౌరవ మొప్పన్? 71

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; దేవకృతంబులు= దైవ నిర్ణయాలు (దేవతల పనులు); ధీరులకున్+ఐనన్= ఎంత ధీరులకైనా; ఎట్లున్= ఎట్లాగైనా; మాన్పఁగన్+పోలునె?= ఆపటానికి అవుతుందా?; కావునన్= అందుచేత; శోకమున్= శోకమును; కాఱియన్= బాధను; తుదిన్= చివరికి; గౌరవము+ఒప్పన్= నీకు మన్నన ఏర్పడేలా; తల్గన్+కాన్+వలదే?= పోగొట్టుకోవద్దా?

తాత్పర్యం: రాజా! దేవతల పనులను ఎంత ధీరులైనా ఎంత ప్రయత్నించినా ఆపలేరు. అవి అట్లాగే జరుగుతాయి. అందువలన నీ గౌరవాన్ని, వంశప్రతిష్ఠను నిల్పుకొనటానికైనా నీ శోకాన్నీ, బాధనూ పోగొట్టుకొమ్ము.

విశేషం: 'భీష్మాదులు జన్మించిన సద్వంశంలో పుట్టిన నీవు శోకిస్తూ కూర్చోవటం అనుచితమైనపని' - అని వంశగౌరవాన్ని గుర్తుచేయటం అతనిలో ఆత్మవిశ్వాసాన్ని నింపటం కోసమే. వృత్తలక్షణానికి చూడండి. స్త్రీ. 1.62

వ. దేవతలకుం గృత్యంబయిన దానిఁ దత్ప్రత్యక్షంబున వింటి నది నీకు మేలు గోరిచెప్పెద నాకర్ణింపు; మే నశ్రమంబున నెందయినఁజరింతు నొక్కనాఁడు దేవసభకుంబోయితి నందుఁబురందరప్రముఖ బృందారకులను నారదాదిమునిబృందములనుంగాంచి సుఖగోష్ఠినున్న సమయంబున భూదేవి యచ్చటికి వచ్చి య వ్విబుధులతో నిట్లనియె. 72

ప్రతిపదార్థం: దేవతలకున్= దేవతలకు; కృత్యంబయిన దానిన్= చేయదగ్గ పనిని గురించి (చేయబోయే దాన్ని గురించి); తద్+ఆ దేవతల; ప్రత్యక్షంబునన్= సమక్షంలోనే; వింటిన్= విన్నాను; అది= ఆ విషయాన్ని; నీకున్; మేలు+కోరి= మేలు కావాలన్న కోరికతో; చెప్పెదన్= చెబుతాను; ఆకర్ణింపుము= వినుము; ఏను= నేను; అశ్రమంబునన్= ఏ శ్రమాలేకుండానే; ఎందయినన్= ఎక్కడికి కావాలన్నా; చరింతున్= వెళ్తాను; ఒక్కనాడు; దేవసభకున్= స్వర్గంలో దేవతల సభకు; పోయితిన్= వెళ్ళాను; అందున్= ఆ సభలో; పురందర= ఇంద్రుడు; ప్రముఖ= మొదలైన; బృందారకులను= దేవతలను; నారద+ఆది= నారదుడు మొదలైన; ముని బృందములనున్= మునుల సమూహాలను; కాంచి= చూచి; సుఖగోష్ఠినున్న సమయంబునన్= ఇష్టాగోష్ఠిలో ఉన్న సమయంలో; భూదేవి; అచ్చటికిన్+వచ్చి= ఆ సభలోకి వచ్చి; ఆ+విబుధులతోన్= ఆ దేవతలతో; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: దేవతలు ఏం చేయబోతున్నారన్న విషయాన్ని ఆ దేవతల సమక్షంలోనే ఒకప్పుడు నేను విన్నాను. ఆ విషయాన్ని నీకు జ్ఞానం కలగటం కొరకు చెప్పుతాను వినుము. నేను ఏ శ్రమా లేకుండా ఎక్కడికి కావాలన్నా వెళ్ళగలను. ఒకనాడు దేవసభకు వెళ్ళాను. ఆ సభలో ఇంద్రాది దేవతలు, నారదాది మహర్షులు ఉన్నారు. వారి నందరినీ చూచి ఇష్టాగోష్ఠిలో ఉన్న సమయంలో ఆ సభలోకి భూదేవి వచ్చి దేవతలతో ఇట్లా అన్నది.

క. 'మీరలు బ్రహ్మసభను మ । ద్భారము మాన్పుటకు నలిని బనిఁబూనితి రె
క్కారణమునఁ దడసితి రొకొ? । యేరూపునఁ దలఁగుదాన నేను భరంబున్? 73

ప్రతిపదార్థం: మీరలు= మీరందరూ (ఒకప్పుడు); బ్రహ్మసభను= బ్రహ్మదేవుడి సన్నిధిలో జరిగిన సభలో; మత్+భారము= నాపై ఉన్న దుష్ట భారాన్ని; మాన్పుటకున్= తొలగించటానికి; నలిని= ఉత్సాహంతో; పనిన్+పూనితిరి= ఏదో ఒకటి చేయాలని

పూనుకొన్నారు; ఏ+కారణమునన్= ఏ కారణంచేత; తడసితిరి+ఒకొ?= ఆలస్యం చేస్తున్నారో? (చెబుతారా); నేను; భరంబున్= ఈ భారాన్ని; ఏ రూపునన్= ఏ విధంగా తలుఁగుదానన్?= తగ్గించుకోగలను?

తాత్పర్యం: 'దేవతలారా! మీరంతా ఒకప్పుడు బ్రహ్మసన్నిధిలో జరిగిన సభలో నాపై ఉన్న దుర్భర భారాన్ని తొలగించటానికి ఎంతో ఉత్సాహంతో ఏదో ఒక పనిచేయాలని పూనుకొన్నారు. మరి ఏ కారణంచేత మీరు ఆలస్యం చేస్తున్నారో ఏమో! నేను ఈ భారాన్ని ఏ విధంగా తగ్గించుకొనగలను? (మీరే చెప్పండి)'.

వ. అనిన విని సర్వలోక నమస్కృతుండగు నారాయణుండు నవ్వుచు న వ్వెలంది కిట్లనియె. 74

ప్రతిపదార్థం: అనినన్= అని అడుగగా; విని; సర్వలోక= అన్ని లోకాలలోని వారిచేత; నమస్కృతుండు+అగు= నమస్కరింప బడేటటువంటివాడైన; నారాయణుండు= శ్రీమహావిష్ణువు; నవ్వుచున్= నవ్వుతూ; ఆ+వెలందికిన్= ఆ భూదేవితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: అని భూదేవి అడుగగా సర్వలోకాలలోనూ నమస్కరించ బడేటటువంటి శ్రీమహావిష్ణువు నవ్వుతూ ఆమెతో ఇట్లా అన్నాడు.

విశేషం: లోకానికంతా ఏది భారమో అది శ్రీమహావిష్ణువుకు ఒక ఆటలాంటిదని అర్థం. అందుకే ప్రతి అవతారమూ ఆయనకు ఒక 'లీల' అని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ లోకమంతా అతడి 'లీల' లో భాగమని భాగవతం చెబుతుంది. అందుకే విష్ణువు 'నవ్వటం'. ఈ హాసం కూడా 'లీలా విలాసం'లో భాగమేనని అర్థం. నరుడి కథలో జరగబోయే మార్పు నారాయణుడికే తెలుసునని ఈ సందర్భానికి అర్థం.

తే. 'వినుము ధృతరాష్ట్రుఁ డనురాజు తనుజశతముఁ । బడయు దుర్యోధనుం డనఁబరఁగు పెద్ద
కొడుకు నీ భారతమంతయు నుడుపు నతఁడు । తడయ కయ్యెడు నది వగఁ దక్కు మబల! 75

ప్రతిపదార్థం: అబల!= ఓ భూదేవీ!; వినుము; ధృతరాష్ట్రుఁడు+అనురాజు= ధృతరాష్ట్రుడనే పేరున్న రాజు; తనుజ శతమున్= నూరుగురు కుమారులను; పడయున్= పొందుతాడు; దుర్యోధనుండు+అనన్+పరఁగు= దుర్యోధనుడనే పేరున్న; పెద్ద కొడుకు; అతఁడు; నీ భారమంతయున్= నీ భారాన్ని అంతటినీ; ఉడుపున్= పోగొడతాడు; అది= ఆ పోగొట్టటం; తడయక+ అయ్యెడున్= తొందరలోనే జరుగుతుంది; వగన్= దుఃఖాన్ని; తక్కుము= వదలిపెట్టుము.

తాత్పర్యం: 'భూదేవీ! వినుము. ధృతరాష్ట్రుడనే రాజు నూరుగురు కొడుకులను పొందుతాడు. వారిలో దుర్యోధను డనేవాడు పెద్దకొడుకు. నీ దుర్భర భారాన్నంతా సంపూర్ణంగా పోగొట్టుతాడు. అది కూడా తొందరలోనే జరుగుతుంది. ఇక శోకించవద్దు.

వ. ఎట్లనిన. 76

తాత్పర్యం: ఎట్లాగంటే.

క. వానిం జంపను గావం । బూని సకలరాజలోకమును నీసుమెయిన్
సేనాసముదయములునుం । దానుఁ గురుక్షేత్ర సమర దారుణతఁ దెగున్. 77

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వానిన్= ఆ దుర్యోధనుడిని; చంపనున్= చంపటానికి; కావన్= కాపాడటానికి; సకల రాజలోకమునున్= రాజులందరూ; ఈ సుమెయిన్= ఈర్ష్యతో; సేనాసముదయములునున్= సేనా సమూహాలూ; తానున్= సకలరాజలోకమూ; కురుక్షేత్ర= కురుక్షేత్రంలో జరిగే; సమర దారుణతన్= భయంకర యుద్ధంలో; తెగున్= చస్తుంది.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడిని కాపాడటానికి, చంపటానికి భారతభూమిలోని రాజులందరూ ఈర్ష్యతో చేరుతారు. చివరికి కురుక్షేత్రంలో జరిగే మహాయుద్ధంలో ఆ సకలరాజలోకమూ సైన్యాలతోపాటు ఘోరంగా చనిపోతుంది.

వ. సోదరసముదయసహితంబుగా నతండును మృతుండగు; దానంజేసి భవదీయభారంబు వాయు నిశ్చింతంబునం జనుము భూతధారణం బాచరింపుము పొ'మ్మని పలికి యద్దేవిని వీడుకొలిపెఁ బదంపడి సకల ప్రజాసంహార కారణంబై కల్యంశంబున దుర్యోధనుండు జనియించె; నక్కుమారుండు. 78

ప్రతిపదార్థం: సోదర సముదయ= తమ్ముల గుంపుతో; సహితంబుగా= కూడ; అతండును= దుర్యోధనుడును; మృతుండు+ అగున్= చనిపోతాడు; దానన్+చేసి= అంచేత; భవదీయ= నీ; భారంబు+పాయున్= బరువు తగ్గిపోతుంది; నిశ్చింతంబునన్= నిశ్చింతగా; చనుము= వెళ్ళు; భూతధారణంబు= జీవులను ధరించటం; ఆచరింపుము= కొనసాగించుము; పొమ్ము; అని పలికి; ఆ+దేవిని= ఆ భూదేవిని; వీడుకొలిపెన్= పంపించాడు; పదంపడి= ఆ వెనుక; సకల ప్రజాసంహార= ప్రజలందరి మృతికీ; కారణంబు+ఐ= కారణం అవుతూ; కలి+అంశంబునన్= కలి అంశతో; దుర్యోధనుండు; జనియించెన్= పుట్టాడు.

తాత్పర్యం: సోదరులందరితో కూడా ఆ దుర్యోధనుడు చనిపోతాడు. అందువలన నీ భారం పూర్తిగా తగ్గిపోతుంది. నిశ్చింతగా వెళ్ళుము. మునుపటివలె జీవులను భరించే నీ పనిని చేస్తూ ఉండుము' - అని పలికి ఆ భూదేవిని నారాయణుడు ఓదార్చి పంపించాడు. ఆ వెనుక రాజులందరూ చనిపోవటానికి కారణమైన 'కలి' అంశతో దుర్యోధనుడు పుట్టాడు.

విశేషం: భూమికి 'భూతధాత్రి' అని పేరు - అన్ని భూతాలను ధరిస్తుంది కాబట్టి.

తే. ఒరుల యున్నతి సయిరింపనోపఁ డధిక। బలుఁడు క్రోధి శూరత్వసంపన్నబుద్ధి
బుద్ధి సెప్పిన వినియెడు ప్రోడగాఁడు। గాన వైరంబు విడువఁడు కౌరవేంద్ర! 79

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= కురువంశీయులలో శ్రేష్ఠుడా!; ఒరుల= ఇతరుల; ఉన్నతి= గొప్పతనాన్ని; సయిరింపన్+ఓపఁడు= సహించలేడు; అధికబలుఁడు= మిక్కిలి బలవంతుడు; క్రోధి= క్రోధనుడు (కోపమున్నవాడు); శూరత్వ= పరాక్రమంతో; సంపన్న= నిండిన; బుద్ధి= చిత్తవృత్తి కలిగినవాడు; బుద్ధి+చెప్పినన్= ఇతరులు నీతి చెబితే; వినియెడు= వినేటువంటి; ప్రోడ= ప్రౌఢుడు (విచక్షణ ఉన్నవాడు); కాఁడు; కానన్= అందువలన; వైరంబున్= విరోధాన్ని; విడువఁడు= వదలిపెట్టడు.

తాత్పర్యం: రాజా! ఆ 'కలి' అంశతో పుట్టటంవలన దుర్యోధనుడు ఇతరుల గొప్పతనాన్ని సహించడు. ఎంత బలవంతుడో అంత కోపం కలిగినవాడు. అతని చిత్తవృత్తి పరాక్రమంతో నిండిపోయింది. ఎవరైనా పెద్దలు నీతి చెప్పితే వినే సంస్కారం లేదు. అందుకే వైరాన్ని వదలిపెట్టలేదు.

విశేషం: కలి - అంటే 'పాప'మని సారభూతమైన అర్థం. ఈనాటి మనుష్యులలో సర్వసాధారణంగా కనిపించే ఈర్ష్య, కోపం, దుష్టమైన బలం, అసంస్కార హృదయం - ఇవన్నీ 'కలి' లక్షణాలని భారత కథ నిరూపిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తమ్ముఁడు, శకునియుఁ, గర్ణుఁడు । నమ్మానవపతికిఁ దగినయనుచరు లతనిన్
సమ్మదమునఁ గలసిన నృపు । లమ్మెయి వారలు వినాశమగు టేలుడుగున్? 80

ప్రతిపదార్థం: తమ్ముఁడు= దుశ్శాసనుడు; శకునియున్= శకుని; కర్ణుడు; ఆ+మానవపతికిన్= ఆ దుర్యోధనుడనే రాజుకు; తగిన+అనుచరులు= అన్నివిధాలా తగిన స్నేహితులు; అతనిన్= ఆ సుయోధనుని; సమ్మదమునన్= ప్రీతితో; కలసిన= చేరిన; నృపులు= రాజులందరూ; ఆ+మెయి+వారలు= అలాంటివారే (ఇక); వినాశము+అగుట= నాశనమైపోవటం అన్నది; ఏలా+ ఉడుగున్?= ఎందుకు ఆగుతుంది?

తాత్పర్యం: దుశ్శాసన శకుని కర్ణులు ఆ రాజుకు తగిన సహచరులు. అతడితో చేరిన రాజులూ అట్లాంటివారే. ఇక అందరూ నశించకుండా ఎట్లా ఉంటారు?

తోదక వృత్తము:

తమ తమ తప్పులఁ దా రెరియంగా । విమలమతీ! యిటు వీరికినై శో
కమునఁ దహింపఁగఁగాదు మనంబున్ । సముచిత మిత్తఱి శాంతము సుమ్మీ!' 81

ప్రతిపదార్థం: (అందుచేత); విమలమతీ!= నిర్మలమైన చిత్తమున్న రాజా!; తమతమ= వారువారు చేసిన; తప్పులన్= తప్పులతో; తారు= తాము; ఎరియన్+కాన్= కాలిపోగా (నశించగా); వీరికిన్+ఐ= వీరికోసమని; ఇటు= ఇలా; శోకమునన్= దుఃఖాగ్నిలో; మనంబున్= నీ మనస్సును; దహింపఁగన్+కాదు= కాల్చరాదు; ఈ+తఱిన్= ఈ సమయంలో; శాంతము= శాంతంగా ఉండటమే; సముచితము= తగింది; సుమ్మీ!= సుమా!.

తాత్పర్యం: తాము తాము చేసిన తప్పులతో తాము తాము కాలిపోయి నశించారు. అట్లాంటివారి కొరకు నీవు నీ మనస్సును ఇట్లా శోకాగ్నిలో దహించి వేయటం తగిన పనికాదు. ఈ సమయంలో శాంతంగా ఉండటమే తగిన పని సుమా!'

విశేషం: ఎరియు-మండు: దోషమనేది అగ్ని - పాపం ఎవరు చేస్తారో వారిని పాపమే దహించివేస్తుందని భారతీయుల విశ్వాసం.

'విమలమతీ!' - అనటంలో 'నిర్మలమైన చిత్తంతో ఇకనైనా ఆలోచించుము' అనే సూచనకూడా గర్భితంగా ఉంది.

తోదకవృత్తంలో ప్రతిపాదంలోనూ, న,జ,జ,య అనే గణాలుంటాయి: మొదటి అక్షరానికీ ఎనిమిదవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. అని చెప్పిన నవ్విభుండు దనకుం బాండవాగ్రజుం డవమానం బాచరించునను శంక నూని యునికి యమ్మహాముని దివ్యబోధంబునం దేటపడి యుండుం గావున నత్తాపసోత్తముండు వెండియు నిట్లనియె. 82

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని దుర్యోధనుని జన్మరహస్యాన్ని చెప్పగా; ఆ+విభుండు= ధృతరాష్ట్రుడు; తనకున్= తనకు; పాండవాగ్రజుండు= ధర్మరాజు; అవమానంబు+ఆచరించునను= అవమానం చేస్తాడని; శంకన్+ఊని+ఉనికి= అనుమానం కలిగి ఉండటం; ఆ+మహాముని= ఆ వ్యాసమహర్షి; దివ్య+బోధంబునన్= దివ్యజ్ఞానంలో (దృష్టిలో); తేటపడి+ఉండున్= స్పష్టమై ఉన్నది; కావునన్= అందుచేత; ఆ+తాపస+ఉత్తముండు= ఆ ఋషిశ్రేష్ఠుడు; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: అని వ్యాసుడు చెప్పాడు. అంతలో ధృతరాష్ట్రుడి మనసులో తనను ధర్మరాజు తప్పక సోదరులతో వచ్చి అవమానపరుస్తా డన్న అనుమానం మొలకెత్తింది. దీనిని తన దివ్యదృష్టితో గుర్తించిన వ్యాసుడు ఆయనతో ఇట్లా అన్నాడు.

క. 'పాండవుల వలని కీడొ । క్కొండును లేదధిప! నీదు కొడుకులు ధరణీ
మండలమంతయు మ్రింగిరి । పాండున్నృపతి భాగమునకుఁ బాపిరి వారిన్. 83

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; పాండవులవలని= పాండవులవలన జరిగిన; కీడు+ఒక్కొండును= ఒక అపకారంకూడా; లేదు; నీదు కొడుకులు= నీ కుమారులైన దుర్యోధనాదులు; ధరణీమండలము+అంతయున్= భూమండలాన్ని అంతా; మ్రింగిరి= మ్రింగివేశారు; పాండు నృపతి= పాండురాజు; భాగమునకున్= రాజ్యభాగానికి; వారిన్= పాండవులను; పాపిరి= దూరంచేశారు.

తాత్పర్యం: 'రాజా! వినుము. పాండవుల వలన ఎప్పుడూ ఏ కీడూ జరగలేదు. నీ కుమారులు దుర్యోధనాదులే మొత్తం భూమండలాన్నంతా మ్రింగివేశారు. పాండురాజు భాగాన్ని కూడా పాండవులకు దక్కకుండా చేశారు.

వ. దానంజేసి యిట్లు సకల కౌరవ్యులకు నఖిల భూపతులకు నిఖిల ప్రజలకును బొలియవలసె నిది యంతయు మున్న యెఱుంగుదుఁ గావున. 84

ప్రతిపదార్థం: దానన్+చేసి= అందువలన; ఇట్లు; ఈ రీతిగా; సకల కౌరవ్యులకున్= సకల కురువంశీయులకు; నిఖిల భూపతులకున్= రాజులదరికీ; నిఖిల ప్రజలకున్= ప్రజలందరికీ; పొలియన్ వలసెన్= చావవలసి వచ్చింది; ఇది+అంతయున్= ఇదంతా; ఇట్లా జరగబోతుందని; మున్ను+అ= ముందే; ఎఱుంగుదున్= నాకు తెలుసు; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: అందువలననే ఈ రీతిగా కురువంశీయులు, రాజులు, ప్రజలు - అందరూ దుర్మరణం పాలు కావలసి వచ్చింది. ఇదంతా ఇట్లా జరుగబోతుందని నాకు తెలుసు కాబట్టి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: కురువంశంలో పుట్టిన వారందరూ కౌరవ్యులే. పాండవులు, వారి బంధువులు, సంతానం కూడా కురువంశీయులే. అందుకే ఇట్లా అనటం.

ఉత్సాహవృత్తము

వినుము నారదుండు దీని వినఁగఁ జెప్పె ధర్మనం
దనున కతని మనము కరుణ దవిలియున్కి హింసకున్
గొనకొనంగఁ జొరమి నతఁడు కురుబలంబుతోడ పాం
దునక పడఁడె? జగము మెచ్చఁ దొడఁగి పెక్కు భంగులన్. 85

ప్రతిపదార్థం: వినుము= (ధృతరాష్ట్ర మహారాజా!) వినుము; నారదుండు= నారదమహర్షి; దీనిన్= ఈ విషయాన్నంతా; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; వినఁగన్= వినేలా; చెప్పెన్= చెప్పాడు; (అందువలన) అతని మనము= ధర్మరాజు మనస్సు; కరుణన్+తవిలి= కరుణలో తగుల్కొని; ఉనికి= ఉండటంచేత; హింసకున్= హింసచేయటానికి; కొనకొనంగన్+చొరమిన్= ప్రయత్నించకపోవటంవలన; అతఁడు= ఆ ధర్మరాజు; కురుబలంబు తోడన్= కురు సైన్యంతో; జగము= ప్రపంచమంతా; పెక్కుభంగులన్= ఎన్నో విధాలుగా; మెచ్చన్= మెచ్చుకోగా; తొడఁగి= ప్రయత్నించి; పొందునకున్+అ+పడఁడె= సంధికే ప్రయత్నించలేదా?

తాత్పర్యం: రాజా! వినుము. నారదుడు ఈ విషయమంతా ధర్మరాజుకు ఏనాడో వివరించాడు. అందుచేతనే ధర్మరాజు మనసులో కరుణపుట్టి హింస చేయటానికి ప్రయత్నించకుండా కురుబలంతో ప్రపంచమంతా స్తుతించే విధంగా సంధికే ప్రయత్నించాడు. ఇది నీకు తెలియని విషయమా?

విశేషం: వృత్తలక్షణానికి చూడండి: స్త్రీ. 1.48

తే. **ఏను నతనికిఁ జెప్పితిం గాన నాతఁ। డధికయత్నంబు సేసెఁ దానంతవడియు**
వైర మెమ్మెయి మాన్పంగ నేరఁ డయ్యె। నియతిఁ దప్పింప నేరికి నేర నగునె? **86**

ప్రతిపదార్థం: ఏనున్= నేనుకూడా; అతనికిన్= ఆ ధర్మరాజుకు; చెప్పితిన్+కానన్= చెప్పాను కాబట్టి; ఆతఁడు= ధర్మరాజు; అధికయత్నంబు+చేసెన్= సంధికోసం ఎంతో ప్రయత్నించాడు; తాను+అంత పడియున్= తాను అంత ప్రయత్నించికూడా; వైరము+ఏ+మెయిన్= వైరం ఏ విధంగానూ; మాన్పంగన్+నేరఁడు+అయ్యెన్= మాన్పించలేకపోయాడు; నియతిన్= విధిని; తప్పింపన్= తప్పించటానికి; ఏరికిన్= ఎవరికైనా; నేరన్+అగునె?= సాధ్యమా?

తాత్పర్యం: నేనుకూడా ఆ ధర్మరాజుకు చెప్పాను కాబట్టి అతడు సంధికొరకు ఎంతగానో ప్రయత్నించాడు కాని, శత్రుత్వాన్ని మాన్పించలేకపోయాడు. ఎంత ప్రయత్నించినా విధిని తప్పించటానికి ఎవరు సమర్థులు?

క. **ఏ నిది యంతయు నెఱుఁగుదుఁ। గాన వృథా శోక వహ్నిఁ గాలమికిని నీ**
మానసమునఁ గృపకలిమికిఁ। గా నొడివితి దేవగుహ్యగతియుఁ దెలిపితిన్. **87**

ప్రతిపదార్థం: ఏను= నేను; ఇది= ఈ విషయం; అంతయున్= అంతా; ఎఱుఁగుదున్= తెలియుదును; కానన్= కాబట్టి; వృథా శోకవహ్నిన్+కాలమికిని= వ్యర్థమైన శోకమనే అగ్నిలో కాలకుండా ఉండటానికి; నీ మానసమునన్= నీ మనస్సులో; కృపకలిమికిన్+కాన్= దయపుట్టటానికి గాను; నొడివితిన్= ఇట్లా చెప్పాను; దేవ గుహ్యగతియున్= దేవతలయొక్క రహస్యమైన విధానాన్ని గురించి; తెలిపితిన్= నీకు తెలిపాను.

తాత్పర్యం: నాకు ఇదంతా బాగా తెలుసు కాబట్టి నీవు వ్యర్థమైన శోకాగ్నిలో కాలిపోకుండా ఉండటానికి, నీ మనసులో పాండవులపైన దయపుట్టటానికి ఇదంతా చెప్పాను. పైగా దేవతల రహస్య విధానం ఎట్లా ఉందో కూడా తెలిపాను.

విశేషం: గుహ్య మంటే రహస్యమని అర్థం. మానవులకు అర్థంకాని దాన్నే 'దైవరహస్య' మంటారు. దాన్నిబట్టి మనుషుల ప్రవృత్తులు ఉంటాయి - జ్యోతిశ్శాస్త్రాదుల ద్వారా ఈ రహస్యాన్ని కొద్దిగానైనా తెలిసికొనవచ్చును కాబట్టి జ్యోతిష్కులను 'దైవజ్ఞులు' అంటారు. ఋషులు ఈ రహస్యాన్ని సంపూర్ణంగా ఎరుగుదురని ఈ సందర్భం వలన తెలిసికొనగలము.

భుజంగప్రయాతము:

వినీతుండవై ధర్మ వేదిత్వబుద్ధిం। దనర్పొందు నీ విట్లు దైన్యాతిరేకం
బునం బొంది శోకాగ్నిఁ బొక్కంగఁ గుంతీ। తనూజాగ్రజుం డాత్మఁ దాఁ గుందకున్నే? **88**

ప్రతిపదార్థం: వినీతుండవు+ఐ= పవిత్రుడవై; ధర్మవేదిత్వబుద్ధిన్= ధర్మాన్ని తెలిసిన బుద్ధితో; తనర్పు+ఒందు= ఔన్నత్యాన్ని పొందిన; నీవు; ఇట్లు= ఈ విధంగా; దైన్యాతిరేకంబునన్+పొంది= అతిశయించిన దైన్యాన్ని పొంది; శోకాగ్నిన్= శోకమనే

అగ్నిలో; పొక్కంగన్= పరితపిస్తూ ఉంటే; కుంతీ తనూజ+అగ్రజుండు= ధర్మరాజు; ఆత్మన్= తనలో; తాన్= తాను; కుందక+ఉన్నే?= బాధపడకుండా ఉంటాడా?

తాత్పర్యం: నీవు అతి పవిత్రుడవు. ధర్మవేదివి. ఎంతో ఉన్నతుడవు. అట్లాంటి నీవు మిక్కిలి దీనంగా శోకమనే అగ్నిలో పరితపిస్తూ ఉంటే చూచి కుంతి పెద్దకొడుకు (ధర్మరాజు) ఎంత బాధపడతాడో చూచావా?'

విశేషం: భుజంగ ప్రయాత వృత్తంలో ప్రతిపాదంలోనూ నాలుగు య గణాలు ఉంటాయి. మొదటి అక్షరానికీ ఎనిమిదవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాస నియమం ఉన్నది.

క. **డెందము తిర్యగ్యోనుల । యందును గరుణా సమగ్రమై యుండు భవ**
న్నందనుఁ డజాతశత్రున । కుం దచ్చరితంబు నీవుఁ గొంత యెఱుఁగవే! **89**

ప్రతిపదార్థం: భవత్+నందనుడు= నీ కుమారుడు; అజాతశత్రువునకున్= ధర్మరాజుకు; తిర్యగ్+యోనులలందునన్= పక్షుల విషయంలోను, జంతువుల విషయంలోనూ; డెందము= హృదయం; కరుణా సమగ్రమై+ఉండున్= కరుణతో నిండి ఉంటుంది; తద్+చరితంబు= అతని చరిత్ర; నీవున్= నీకూ; కొంత; ఎఱుఁగవే!= తెలుసుకదా!

తాత్పర్యం: నీ కుమారుడైన ధర్మరాజు అజాతశత్రువు. అతడికి ఈ లోకంలో శత్రువులే లేరు. అతడి హృదయంలో మనుష్యులు, జంతువులు, పక్షులు - అందరి విషయంలోనూ అన్నిటి విషయంలోనూ కరుణ మాత్రమే ఉంటుంది. అతడి చరిత్ర నీవూ కొంత ఎరుగుదువు కదా!

విశేషం: పండితుడు సమదర్శనం కలిగి ఉంటాడని భగవద్గీత చెప్పుచున్నది. ధర్మరాజు అట్లాంటివాడని ధృతరాష్ట్రుడు తెలియని వాడు కాడు. అందుకే 'కొంత' ఎరుగుదువు అనటం. ఈ సమదర్శనం ఉన్న ధర్మరాజు అజాతశత్రువే. అతడికి శత్రువే పుట్టలేదని అర్థం. అందుచేత నీ కొడుకులు కూడా అతడికి శత్రువులు కారనీ అర్థం అవుతుంది. ధృతరాష్ట్రుడికి ఈ సమభావం కలిగించాలనే దృష్టితోనే 'నీ కొడుకు ధర్మరాజు' అని గుర్తు చేస్తున్నాడు వ్యాసుడు.

మానినీ వృత్తము

కావున నీ దెస నాతనికిన్ విముఖత్వము గల్గదు; భక్తి మెయిం
దా వినయం బెనయం గొనియాడుట దప్పదు కాంచెద వాతనిపై
నీవును నెయ్యముఁ గారుణికత్వము నెక్కొనఁ దమ్ములు నవ్విభుఁడు
న్వేవుర పెట్టుగ సంతతికల్మియ నీమది నిల్పుము పెంపొలయన్. **90**

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; నీ దెసన్= నీ మీద; ఆతనికిన్= ఆ ధర్మరాజుకు; విముఖత్వము= వైముఖ్యం; కల్గదు= లేదు; (ఎందుకంటే); తాన్= అతడు; వినయంబు+ఎనయన్= వినయం పొందగా; కొనియాడుటన్= నిన్ను ఎప్పుడూ గౌరవిస్తూనే ఉండటంవలన; ఆతనిపైన్= ఆ ధర్మరాజుపై; నీవును= నీవు కూడా; నెయ్యమున్= స్నేహభావాన్ని; కాంచెదవు= పొందుతావు; తప్పదు= ఇది అనివార్యం; (నీవు కూడా); కారుణికత్వము= దయ; నెక్కొనన్= అతిశయించగా; తమ్ములున్= తమ్ములును; ఆ+విభుఁడున్= ఆ ధర్మరాజును; వేవుర= వేయిమందికి; పెట్టుగన్= మారుగా; సంతతి+కల్మి+అ= (నీ) సంతాన సంపదగానే; పెంపొలయన్= సౌభాగ్యం అతిశయించగా; నీ మదిన్= నీ హృదయంలో; నిల్పుము= నిలుపుకొమ్ము.

తాత్పర్యం: అందువలన నీ మీద ధర్మరాజుకు ఏ మాత్రం వైముఖ్యం లేదు. అతడు నిన్నెపుడూ గౌరవంతో చూస్తూనే ఉంటాడు. గమనించావు కదా! ఆ ధర్మరాజుపై నీవు కూడా తప్పకుండా స్నేహభావాన్ని పొందుతావు చూడుము. ఇది తప్పనిసరిగా జరుగుతుంది. ఇక నీవు దయతో పాండవులైదుగురినీ వెయ్యిమంది సంతానానికి మారుగా నీ హృదయంలో భావించుము. వారిని ఆదరించుము. అది మీ అందరికీ శ్రేయస్సు కలిగిస్తుంది.

విశేషం: మానినీ వృత్తంలో ప్రతిపాదానికీ ఏడు భ గణాలు, మీద గురువూ ఉంటాయి. మొదటి అక్షరానికీ పదమూడవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

తే. **దైవకృతము నా పంపు చిత్తమునఁ బెట్టి । పుత్రశోకంబు విడు పాండుపుత్రు లధిప**
తగరె! నినుఁ గొనియాడి పుత్రత్వ వృత్తిఁ । బరఁగ నది కీర్తిధర్మసంపాది గాదె! **91**

ప్రతిపదార్థం: దైవకృతము= దైవ నిర్ణయం; నా పంపు= నా ఆజ్ఞ; చిత్తమునన్+పెట్టి= మనసులో ఉంచుకొని; అధిప!= ఓ రాజా!; పుత్రశోకంబున్= నీ పుత్రుల మరణంవలన పుట్టిన శోకాన్ని; విడు= వదలిపెట్టుము; పాండుపుత్రులు= పాండవులు; నినున్+కొనియాడి= నిన్ను గౌరవిస్తూ; పుత్రత్వ+వృత్తిన్= కుమారుల ధర్మంతో; పరఁగన్= ప్రవర్తించటానికి; తగరె!= అర్హులుకారా! (ఇంతేకాకుండా); అది= అట్లా ఉంటే; (నీకు) కీర్తి= కీర్తిని; ధర్మ= ధర్మాన్ని; సంపాది= సంపాదించేది; కాదె!= అవుతుంది కదా!

తాత్పర్యం: రాజా! దైవనిర్ణయాన్ని, నా ఆజ్ఞను నీ మనసులో ఉంచుకొమ్ము. నీ శోకాన్ని మానుము. పాండవులు నిన్ను గౌరవిస్తూ నీ కొడుకులవలె వర్తించటానికి తగినవారు కారా? (నీ తమ్ముడి కుమారులే కదా!). అట్లా వారు ఉండటం నీకు కీర్తిని, ధర్మాన్ని సంపాదించి పెట్టుతుంది కదా!

వ. **వనట యనియెడు నగ్ని నెఱుక యనియెడు నీట నార్పుము. ప్రాణంబులు ధరియింపుము. సముచిత వృత్తిఁ జరియింపు' మనిన విని చింతాక్రాంతుండై కొండొకసే పూరకుండి ధృతరాష్ట్రుఁడు తేజోధనుండగు నత్తాపసోత్తమున కిట్లనియె.** **92**

ప్రతిపదార్థం: వనట= శోకం; అనియెడు= అనే; అగ్నిన్= మంటను; ఎఱుక= జ్ఞానం; అనియెడు= అనే; నీటన్= నీటితో; ఆర్పుము= చల్లార్చుము; ప్రాణంబులు= నీ ప్రాణశక్తిని; ధరియింపుము= కూడదీసుకొమ్ము; సముచిత= తగిన; వృత్తిన్= రీతిలో; చరియింపుము= నడుచుకొమ్ము; అనినన్= అని వ్యాసమహర్షి చెప్పగా; విని; చింతా+ఆక్రాంతుండు+ఐ= ఆలోచనలో మునిగిపోయి (ఆలోచనచేత ఆక్రమింపబడి); కొండొకసేపు= కొంత సమయం; ఊరకుండి; ధృతరాష్ట్రుడు; తేజస్+ధనుండు+అగు= తపస్సువలన వచ్చిన తేజస్సునే సంపదగా కలిగిన; ఆ+తాపస్+ఉత్తమునకున్= ఆ ఋషి శ్రేష్ఠునితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: 'నీ శోకం అనే మంటను జ్ఞానం అనే నీటితో ఆర్పివేయుము. నీ ప్రాణశక్తిని కూడదీసికొమ్ము. తగిన రీతిలో నడుచుకొమ్ము'. అని వ్యాసమహర్షి చెప్పగా మళ్ళీ కొంతసేపు ఆలోచనలో మునిగిపోయి తేరుకొని కాసేపు ఊరకుండి ధృతరాష్ట్రుడు తేజోధనుడైన ఆ మహర్షితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: రూపకం. అగ్ని దహిస్తుంది. శోకం కూడా పరితాపాన్ని కలిగిస్తుంది. పరితాపమంటే మళ్ళీ కాలటమే. కాబట్టే శోకాన్ని శోకాగ్ని అంటారు. జ్ఞానం నీరువలెనే ప్రవాహరూపమైంది. అంతే కాకుండా అనుద్వేగకరమైనది. శాంతమైనది. అది నీటి లక్షణం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'మును శోకానలతాపం । బునఁ బొగులుట నొండెఱుంగఁ బోలక దుఃఖం
బున మునుఁగ వలసె నీదు వ । చనములు విని మునివరేణ్య! శాంతుఁడ నైతిన్. 93

ప్రతిపదార్థం: మును= ముందు (ఇంతవరకు); శోక+అనల= దుఃఖమనే అగ్నియొక్క; తాపంబునన్= మంటలో; పొగులుటన్= కుమిలిపోవటంవలన; ఒండు+ఎఱుంగన్+పోలక= మరోదాన్ని గుర్తించలేక; దుఃఖంబునన్= దుఃఖంలో; మునుఁగన్+వలసెన్= మునుగవలసి వచ్చింది; మునివరేణ్య!= మునిశ్రేష్ఠుడా!; నీదు= నీ; వచనములు= మాటలు; విని; శాంతుఁడను+ఐతిన్= శాంతమనస్కుడిని అయ్యాను.

తాత్పర్యం: 'మునిశ్రేష్ఠుడా! ఇంతవరకు దుఃఖమనే అగ్నిలో కుమిలిపోయి ఉండటం వలన మరొక దానిని గురించి ఆలోచించలేక పోయాను. ఇప్పుడు నీ మాటలు విని మనస్సు ప్రశాంతమైనది.

విశేషం: అలం: రూపకం.

క. ధరియించెదఁ బ్రాణము మది । నెరియకయుండంగ శోక మేఁ దొఱఁగెద ని
ర్భర బాంధవంబు నొందెదఁ । బురుషోత్తములైన పాండుపుత్రకుల దెసన్'. 94

ప్రతిపదార్థం: ప్రాణమున్= ప్రాణశక్తిని; ధరియించెదన్= కూడదీసుకొంటాను; మదిన్= మనసులో; ఎరియక+ఉండంగన్= బాధపడకుండా ఉండే లాగున; ఏన్= నేను; శోకము= దుఃఖాన్ని; తొఱఁగెదన్= విడిచిపెటతాను; పురుషోత్తములు+ఐన= మానవోత్తములైన; పాండుపుత్రకుల దెసన్= పాండవుల మీద; నిర్భర= అతిశయించిన; బాంధవంబు= బాంధవ్యాన్ని; ఒందెదన్= పొందుతాను.

తాత్పర్యం: మహర్షీ! మీరు చెప్పినట్టే నా ప్రాణశక్తులను కూడదీసుకొంటాను. బాధపడటం మానివేసి దుఃఖాన్ని విడిచిపెడతాను. పాండవులు మానవోత్తములు. వారిమీద అతిశయించిన బాంధవ్యాన్ని పెంచుకొంటాను'.

వ. అనుటయు నమ్మహాత్ముం డట్లగుట మేలని పలికి యంతర్ధానంబుఁజేసె. నిట్లు ప్రబోధితుండై యాంబికేయుండు గొండొక ప్రొ ద్దూరకుండి సంజయుం బేరుకొని పయనం బాయితంబు సేయుమని చెప్పి, విదురుతో 'నీవు గాంధారిని గుంతినిం దక్కుఁగల కౌరవవధూవర్గంబును దోడ్కొని రావలయు మనము పొలికలనికిం బోవుచున్న వారమని యెఱింగించి వెలువరింపు' మనిన నయ్యిరువురు నట్ల చేసిన. 95

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధృతరాష్ట్రుడు అనగా; ఆ+మహాత్ముండు= ఆ వ్యాసమహర్షి; అట్లు+అగుట= అట్లా చేయటం; మేలు+అని= మంచిదని; పలికి= చెప్పి; అంతర్ధానంబున్+చేసెన్= అంతర్ధానమయ్యాడు; ఇట్లు= ఈ విధంగా; ప్రబోధితుండు+ఐ= ఉపదేశింపబడి; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; కొండొకప్రొద్దు= కొంతసేపు; ఊరకుండి; సంజయున్= సంజయుడిని; పేరుకొని= పిలిచి; పయనంబు= ప్రయాణం; ఆయితంబు+చేయుము+అని= సిద్ధంచేయుమని; చెప్పి; విదురుతోన్= విదురునితో; నీవు; గాంధారినిన్= గాంధారిని; కుంతినిన్= కుంతిని; తక్కుఁగల= మిగిలిన; కౌరవ వధూవర్గంబునున్= కౌరవస్త్రీలను; తోడ్కొని= పిలుచుకొని; రావలయున్= రావాలి; మనము= మనం అందరం; పొలికలనికిన్= యుద్ధభూమికి; పోవుచున్నవారము= వెళ్తున్నాము; అని; ఎఱింగించి= చెప్పి (తెలిపి); వెలువరింపుము= ప్రయాణం చేయించుము; అనినన్= అని చెప్పగా; ఆ+ఇరువురున్= ఆ సంజయ విదురులు; అట్లు+అ చేసినన్= అట్లాగే చేయగా.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు చెప్పగా వ్యాసమహర్షి 'అట్లా చేయటం మంచి' దని చెప్పి మాయమయ్యాడు. ఈ విధంగా మహర్షిచేత ఉపదేశం పొందిన ధృతరాష్ట్రుడు కొంతసేపు నిశ్శబ్దంగా ఉండి సంజయుడిని పిలిచి 'ప్రయాణానికి సిద్ధం చేయుము' అని చెప్పి విదురుడితో 'నీవు గాంధారిని, కుంతిని, తక్కిన కౌరవ స్త్రీలను పిలుచుకొని రావాలి. మనమందరం యుద్ధభూమికి వెళ్తున్నా మని వారికి తెలిపి, ప్రయాణం చేయించుము'. అని చెప్పగా ఆ ఇరువురు అట్లాగే చేయగా (తరువాతి పద్యంతో అన్వయం).

ధృతరాష్ట్రుఁడు సపరివారంబుగాఁ బొలికలనికిం బోవుట (సం. 11-9-5)

క. ఆరంగూరిన శోకము । భారంబున మేను దూలఁ బరవశగతి గాం
ధారి చనుదెంచె నవ్వసు । ధారమణుని కడకు జనవితానము వొగులన్. 96

ప్రతిపదార్థం: ఆరన్= మిక్కిలిగా; కూరిన= పొందిన; శోకము భారంబునన్= శోక భారంచేత; మేను= శరీరము; తూలన్= తూలిపోతుండగా; పరవశగతిన్= పరాధీనురాలిగా (ఇతరుల ఆసరాతో); గాంధారి= గాంధారీదేవి; ఆ+వసుధారమణుని కడకున్= ఆ ధృతరాష్ట్ర భూపాలుని వద్దకు; జనవితానము= తోడుగా ఉన్న జనసమూహం; పొగులన్= దుఃఖిస్తుండగా; చనుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: మిక్కిలిగా పొందిన శోకం బరువుచేత గాంధారి శరీరం తూలిపోతూ ఉన్నది. ఇతరుల ఆసరాతో ఆమె ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చింది. తోడుగా వస్తున్న కౌరవస్త్రీలు ఏడుస్తున్నారు.

వ. కుంతీ ప్రముఖంబైన కురువృద్ధనారీజనంబును బరివారవనితాజనసహితంబుగాఁ దరతరంబ యరుగు దెంచె నట్టియెడ. 97

ప్రతిపదార్థం: కుంతీ ప్రముఖంబైన= కుంతి మొదలైన; కురువృద్ధ నారీజనంబును= కురువంశంలోని ముసలి ఆడవారు; పరివార వనితాజన సహితంబుగాన్= పరిచారికలైన ఇతర పరివార స్త్రీ సమూహంతో కూడి; తరతరంబ= క్రమక్రమంగా కలిసి; అరుగుదెంచెన్= అక్కడికి వచ్చారు; అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: కుంతీదేవి మొదలైన కురువంశంలోని పెద్ద ఆడవారు, వారికి పరిచర్యలు చేసే ఇతర స్త్రీలు, క్రమక్రమంగా కలిసి అక్కడకు వచ్చారు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. చేతులు నడుదల సేర్చు టుత్కటశోక । మాకారములు దాల్చి నట్టులుండ
విరిసిన వేసలుల్ వెన్నులఁ బ్రక్కల । నెఱసి చూపఱ దృష్టి నీఱు సేయ
నందంద దొరఁగెడు నశ్రుజలంబుల । పెంపున మోములు ముంపఁబడఁగ
నేమియుఁ దొడవులు లేమిఁ బాడఱియున్న । యంగంబులందు దైన్యంబు నెఱయఁ

తే. బతుల నన్నలఁ దమ్ముల సుతుల హితులఁ । బేరుకొని వాతు లెండంగఁ బ్రేముడించి
పనవు పలుకులు వినువారి వనటఁ దేల్పఁ । గురుకుమార నారీజనకోటి వచ్చె. 98

ప్రతిపదార్థం: నడు+తలన్= నడినెత్తిమీద; చేతులు+చేర్చుట= తమ చేతుల్ని చేర్చడం; ఉత్కట= మిక్కిలిదైన; శోకము= శోకరసం; ఆకారములు= శరీరాలు; తాల్చినట్టులు+ఉండన్= ధరించినట్లు ఉండగా; విరిసిన= విరయబోసుకున్న; వేనలుల్= కొప్పులు; వెన్నులన్= వీపులపైనా; ప్రక్కలన్= పక్కలలోనూ; నెఱసి= వ్యాపించి; చూపఱ= చూచేవారి; దృష్టిన్= చూపును; నీఱు+చేయన్= భస్మం చేయగా (నిర్వికారంగా మార్చగా); అందంద= అక్కడక్కడా; తొరఁగెడు= వర్షిస్తున్న; అశ్రుజలంబుల= కంటి నీటియొక్క; పెంపునన్= అతిశయంచేత; మోములు= ముఖాలు; ముంపఁబడఁగన్= ముంచివేయబడగా; ఏమియున్= బొత్తిగా; తొడవులు= నగలు; లేమిన్= లేకపోవటంచేత; పాడు+అటి+ఉన్న= పాడువడినట్టున్న; అంగంబులందున్= శరీరాలలో; దైన్యంబు= దీనత్వం; నెఱయన్= నిండగా; పతులన్= భర్తలను; అన్నలన్= అన్నలను; తమ్ములన్= తమ్ముళ్ళను; పేరుకొని పేర్లు పెట్టి పిలుస్తూ; వాతులెండంగన్= నోళ్ళుతడారిపోగా; ప్రేముడించి= దుఃఖిస్తూ; పనవు పలుకులు= వారిని పేర్కొంటూ మాట్లాడుతున్న మాటలు; వినువారిన్= వినేవాళ్ళను; వనటన్= దుఃఖంలో; తేల్పన్= ముంచివేయగా; కురుకుమార= కురువంశ రాజకుమారుల; నారీజనకోటి= స్త్రీ జనసమూహం; వచ్చెన్= వచ్చారు.

తాత్పర్యం: నడి నెత్తులపై చేతులుంచుకొని దుఃఖిస్తున్న ఆ స్త్రీలు రూపం దాల్చిన శోకంవలె కనిపిస్తున్నారు. విరబోసికొన్న వారి జడకొప్పులు వీపులమీదా పక్కలలోనూ వ్యాపించి చూచేవారిని నిర్వికారంగా మార్చి వేస్తున్నాయి. వారి కళ్ళనుంచి కారుతున్న అశ్రుజలాల వర్షంలో వారి ముఖాలు మునిగిపోయాయి. ఏ ఒక్క ఆభరణమూ లేని వారి అవయవాలు పాడుబడి శిథిలాలై అతిదీనంగా కనిపిస్తున్నాయి. యుద్ధంలో చనిపోయిన తమ భర్తలను, అన్నదమ్ములను పేరు పేరునా పిలుస్తూ నోళ్ళుతడి ఆరిపోయేటట్లు వారు చేస్తున్న ఆర్తనాదాలు వినేవాళ్ళనందరినీ దుఃఖసాగరంలో ముంచి వేస్తున్నాయి. ఈ విధంగా కురువంశ రాజకుమారుల స్త్రీలందరూ యుద్ధ భూమికి తరలివస్తున్నారు.

విశేషం: అలం: స్వభావోక్తి. 'నివుఱు' అంటే బూడిద. దానికి 'నీఱు' రూపాంతరం. భస్మంచేయటం అంటే కావ్యపరంగా ఏమీలేకుండా చేయటమని అర్థం. ఏ జడకొప్పు కామాన్ని ఉద్రేకింపజేస్తుందో ఆ జడే విరబోసుకున్నప్పుడు, దుఃఖసమయంలో నిర్వికారాన్ని కలిగిస్తుందని అర్థం.

క. చెలులైనఁ జూడఁ బయ్యద । దొలఁగుటకును సిగ్గు పడు వధూజనతతి య
త్తల యెదుర నేక వస్త్రం । బులతో నంగమును వికృతిఁ బొందఁగ నడచెన్. 99

ప్రతిపదార్థం: చెలులు+ఐనన్= చెలికత్తెలయినా; చూడన్= చూస్తుండగా; పయ్యద+తొలఁగుటకును= పైట తొలగిపోతే; సిగ్గుపడు= సిగ్గుపడేటటువంటి; వధూ జనతతి= కురుకుమారుల భార్యలు; అత్తల+ఎదురన్= తమ అత్తల ఎదుటనే; ఏకవస్త్రంబులతోన్= ఒకే చీరతో (తొలగిపోయిన పైటలతో); అంగమును= తమ శరీరాలు; వికృతిన్+పొందఁగన్= శోకంచేత వికారాన్ని పొందగా; నడచెన్= నడుస్తూ వచ్చారు.

తాత్పర్యం: సాధారణంగా చెలికత్తెలు అయినా చూస్తుండగా పైటలు తొలగిపోతే సిగ్గుపడేటటువంటి కురుకుమారుల భార్యలు తమ అత్తల ఎదుట పైటలు తొలగిపోతున్నా లెక్కచేయక శోకోద్రేకంచేత వికారమైన ఆకారాలతో వస్తున్నారు.

క. కొండొక వగపున కేనియు । నొండొరువులఁ దెల్పునట్టి యువిదలు చిత్తం
బొండొండ వనట మునుఁగఁగ । నొండెవ్వరుఁ దెలుపలేక యుండి రవశలై. 100

ప్రతిపదార్థం: కొండు+ఒక= ఏ కొంచెం; వగపునకున్+ఏనియున్= బాధనైనా; ఒండు+ఒరువులన్= ఒకరికొకరు; తెల్పునట్టి= చెప్పుకొనేటువంటి; ఉవిదలు= ఆ స్త్రీలు; చిత్తంబు= మనస్సులు; వనటన్= శోకంలో; మునుఁగఁగన్= మునిగిపోగా; ఒండు+ ఎవ్వరున్= ఒకరికి మరొకరు; (ఏమీ); తెలుపలేక= చెప్పుకోలేకుండా; అవశలై= తమ మీద తమకే అదుపులేని స్థితిలో ఉండిరి= ఉన్నారు.

తాత్పర్యం: ఆ కురు కుమారుల వనితలు చాలా సుకుమారమైన మనసులున్నవారు. ఏ కొంచెం బాధకలిగినా ఒకరికొకరు చెప్పుకొనే వారుకూడా మనస్సులు శోకంలో మునిగిపోగా ఒకరి కొకరు ఏమీ చెప్పలేక తమ మీద తమకే అదుపులేని మానసిక స్థితిలో సాగిపోతున్నారు.

వ. అట్టి యెడఁ బురంబున నచ్చటచ్చట. 101

తాత్పర్యం: అట్లాంటి సమయంలో నగరంలో ఆయా చోట్ల.

తే. విపుల హర్మ్యతలంబులు వెడలునట్టి । వెలఁది మొత్తముల్ వొల్చె బల్వేఁటకాఱు
పతులఁ జంపిన గిరిగుహాప్రతతి వెడలఁ । బాఱు సింగంపుఁ బెంట్లకుఁ బాటియగుచు. 102

ప్రతిపదార్థం: విపుల= పెద్దవైన; హర్మ్యతలంబులు= ఇంటి వాకిళ్ళు; వెడలునట్టి= వదలివస్తున్న; వెలఁది మొత్తముల్= స్త్రీల సమూహాలు (కురుకుమారుల భార్యలు కాని ఇతర యోధుల వనితలు); బల్+వేటకాఱు= బలిష్ఠులైన వేటగాండ్రు; పతులన్+ చంపినన్= తమ పోతులను చంపివేయగా; గిరిగుహ ప్రతతిన్= కొండ గుహల సమూహాన్ని; వెడలన్+పాఱు= వదలి పారిపోతున్న (వస్తున్న); సింగంపున్+పెంట్లకున్= ఆడ సింహాలకు; పాటి+అగుచున్= సమానంగా; పొల్చెన్= అగుపించారు.

తాత్పర్యం: హస్తినాపురంలోని ఇతర మృతవీరుల భార్యలు విశాలమైన ఇళ్ళ నుండి బయటికి వస్తున్నారు. వారు వేటగాళ్ళు తమ పోతులను చంపివేయగా ఆక్రోశిస్తూ గుహలనుండి బయటికి వస్తున్న ఆడ సింహాలవలె వారు అగుపిస్తున్నారు.

విశేషం: అలం: ఉపమ.

క. మున్నెన్నఁడు నెవ్వరికిం । గన్నులెదురఁ బడని యట్టి కాంతలు జను లె
ల్ల న్నిలిచి చూడ వెడలిరి । కన్నులు గమరన్ సుహృన్నికాయంబులకున్. 103

ప్రతిపదార్థం: మున్ను= మునుపు; ఎన్నఁడున్= ఏనాడూ; ఎవ్వరికిన్= ఎవరికీ; కన్నుల+ఎదురన్= కళ్ళెదుట; పడని+అట్టి= కనిపించని; కాంతలు= కౌరవ కాంతలు; జనులు+ఎల్లన్= జనులందరూ; నిలిచి+చూడన్= నిలబడి చూస్తుండగా; సుహృద్+ నికాయంబులకున్= స్నేహితుల, ఆప్తులసమూహాలకు; కన్నులు కమరన్= కన్నులు కాలగా; వెడలిరి= బయలు దేరారు.

తాత్పర్యం: మునుపు ఏనాడూ ఎవరికీ కళ్ళెదుట కనిపించని కౌరవకాంతలు ప్రజలందరూ నిలబడి చూస్తుండగా ఆప్తులైనవాళ్ళకు, స్నేహితులకు వారిని చూడలేక బాధతో కళ్ళుమండిపోతుండగా బయలుదేరి వచ్చారు.

వ. అప్పుడు కురువీరాగారంబులయందు హాహాకారంబు లెసంగ నిట్లు వనితా జనవ్రాతం బేతెంచి ధృతరాష్ట్రు సూరెల నాక్రందన ధ్వనులు సెలంగ నిలిచె, విదురుండు డగ్గుత్తికపడుచు నయ్యువిదల నూరార్చుచుఁ

దగువారల నుచిత వాహనంబులపై నిడియె. నద్ధరణీనాథుండు నిజయోగ్యయానంబునఁ జనఁ దోడన యా తమ్ముండును గాంధారీప్రభృతులం దోడుకొని సంజయ సహితంబుగాఁ జనియెఁ, బిన్నలు పెద్దలనక సకల పౌరలోకంబునకు శోకం బావహిల్లినం బెల్లైన రోదనప్రణాదంబుల దిక్కులు పిక్కటిల్లెఁ. బ్రళయకాల జ్వలన జ్వాలలం బొదువంబడు జంతువు లాక్రోశించు చందంబు దోఁచెఁ, బురిఁగల వైశ్యశూద్ర శిల్పి కర్మార తక్షక క్షౌరక స్వర్ణకారక రజకాదు లమ్మహీపతి బలసి చని రివ్విధంబునం గ్రోశమాత్రంబు చని రాసమయంబున.

104

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కురువీర+అగారంబులయందు= కురు వీరుల ఇళ్ళలో; హాహాకారంబులు= ఆర్తనాదాలు; ఎసంగన్= పుట్టగా; ఇట్లు; ఈ విధంగా; వనితాజనవ్రాతంబు= స్త్రీ సమూహం; ఏతెంచి= వచ్చి; ధృతరాష్ట్రు సూరెలన్= ధృతరాష్ట్రుడి ప్రక్కల (సమీపంలో); ఆక్రందన ధ్వనులు= ఆర్తనాదాలు; చెలంగన్= మ్రోయగా; నిలిచెన్= నిలిచింది; విదురుండు= విదురుడు; డగ్గుత్తిక పడుచున్= మాట పెగలక, గద్గదస్వరంతో; ఆ+ఉవిదలన్= ఆ స్త్రీలను; ఊరార్చుచున్= ఓదారుస్తూ; తగువారలన్= ముఖ్యమైన వారిని; ఉచిత= వారి వారికి తగిన; వాహనంబులపైన్= వాహనాలమీద (బళ్ళమీద); ఇడియెన్= కూర్చోపెట్టాడు; ఆ+ధరణీనాథుండు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; నిజయోగ్య= తనకు తగిన; యానంబునన్= రథంలో; చనన్= బయలు దేరగా; తోడన్+అ= వెంటనే; ఆ+తమ్ముండును= తమ్ముడైన ఆ విదురుడు; గాంధారీ ప్రభృతులన్= గాంధారి, కుంతి మొదలైనవారిని; తోడుకొని= పిలుచుకొని; సంజయ సహితంబుగాన్= సంజయుడితో; కలిసి; చనియెన్= బయలుదేరాడు; పిన్నలు, పెద్దలు+అనక= చిన్నా పెద్దా అనే తేడా లేకుండా; సకల పౌరలోకంబునకున్= ప్రజలందరికీ; శోకంబు= దుఃఖం; ఆవహిల్లినన్= కలుగగా; పెల్లు+ఐన= అతిశయించిన; రోదన ప్ర+నాదంబులన్= పెద్ద ఏడుపులతో; దిక్కులు+పిక్కటిల్లెన్= దిక్కులు నిండాయి; ప్రళయకాల= ప్రళయకాలంలో; జ్వలన= మండుతున్న; జ్వాలలన్= మంటల్లో; పొదువంబడు= చిక్కుకున్న; జంతువులు; ఆక్రోశించు= రోదించే; చందంబు= విధం; తోఁచెన్= అగుపించినది; పురిన్+కల= ఆ నగరంలోని; వైశ్య= వైశ్యులు; శూద్ర= శూద్రులు; శిల్పి= శిల్పులు; కర్మారులు= కమ్మరులు; తక్షక= వడ్లవారు; క్షౌరక= మంగళ్ళు; స్వర్ణకారక= కంసాలులు; రజకాదులు= చాకళ్ళు మొదలైనవారు; ఆ+మహీపతిన్= ఆ రాజును; బలసి= చుట్టి లేదా చుట్టుకొని (ముందువెనుకలుగా); చనిరి= బయలుదేరారు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; క్రోశమాత్రంబు= ఒక క్రోసు దూరం; చనిరి= వెళ్ళారు; ఆ సమయంబునన్= అప్పుడు.

తాత్పర్యం: ఆ సమయంలో కురుకుమారుల ఇళ్ళలో ఆర్తనాదాలు పుట్టాయి. ఏడ్పులు రోదనాలతో కురుస్త్రీలంతా వచ్చి ధృతరాష్ట్రుడి సమీపంలో నిలిచారు. విదురుడికి నోట మాట పెగలటం లేదు. నెమ్మదిగా వారికి ఓదార్పు మాటలు చెబుతూ ముఖ్యమైన వారిని వారివారికి తగిన వాహనాలమీద కూర్చొనపెట్టాడు. ధృతరాష్ట్రుడు కూడా తనకు తగిన రథాన్ని ఎక్కి బయలుదేరాడు. అతడి వెనుకనే విదురుడు గాంధారి, కుంతి మొదలైన వాళ్ళను పిలుచుకొని సంజయుడితో కలిసి బయలుదేరాడు. చిన్నా పెద్దా అనక అందరూ శోక సముద్రంలో మునిగిపోయారు. ఏడ్పులు పెడబొబ్బలతో దిక్కులు మారుమ్రోగిపోయాయి. ప్రళయకాలంలో మంటలలో చిక్కుకొన్న జంతువులవలె ఆ స్త్రీలు ఏడుస్తున్నారు.ఆ నగరంలోని వైశ్యులు, శూద్రులు, శిల్పులు, కమ్మరులు, వడ్లవారు, మంగళ్ళు, కంసాలులు, చాకళ్ళు మొదలైన అన్ని వృత్తులవాళ్ళు ఆ రాజును చుట్టుముట్టి నడుస్తున్నారు. ఇట్లా ఒక క్రోసెడు దూరం అందరూ వెళ్ళారు అప్పుడు.

విశేషం: క్రోశం - రెండు వేల ధనుస్సుల నిడివి కలిగిన దూరమని నిఘంటువులు 'క్రోసెడు' అన్నమాటకు అర్థం చెప్పుతున్నాయి.

సీ. **ఆచార్య సుతుఁడుఁ గృపాచార్యుఁడును గృత । వర్మయు నెదురుగా వచ్చి రథము**
లంతంత డిగ్గి శోకార్తి నంగంబులు । దూల బాష్పంబులు దొరుఁగుచుండఁ
గా ధృతరాష్ట్రునిఁ గాంచి గద్గదకంఠు । లగుచు నాతని కిట్టు లనిరి 'నీదు
తనయుండు భుజబల దర్పంబు దుర్వార । శౌర్యంబు మెరయంగ సంగరంబు

తే. **సేసి యింద్రాది సురుల మెచ్చించి వారి । కతిథియై చని పరమ సుఖానుభవము**
దగిలె నేము ముప్వురమును దక్క నమ్మ । హీశుతోడన్ సైన్యంబు లెల్లఁ జనియె.' **105**

ప్రతిపదార్థం: ఆచార్యసుతుఁడున్= ద్రోణాచార్యుని కుమారుడైన అశ్వత్థామా; కృపాచార్యుఁడును= కృపుడూ; కృతవర్మయున్= కృతవర్మా; ఎదురుగాన్+వచ్చి= ఎదురుగావచ్చి; అంతంతన్= కొంచెం దూరంలో; రథములు= రథాలనుండి; డిగ్గి= దిగినవారై; శోక+ఆర్తిన్= దుఃఖబాధచేత; అంగంబులు= అవయవాలు; తూలన్= కంపిస్తుండగా; బాష్పంబులు= కంటినీరు; తొరుఁగుచుండఁగాన్= ప్రవహిస్తుండగా; ధృతరాష్ట్రునిన్+కాంచి= ధృతరాష్ట్రుడిని చూచి; గద్గద= వణుకుతున్న; కంఠులగుచున్= గొంతుకలు కలవారై; ఆతనికిన్= ఆ రాజుతో; ఇట్టులు+అనిరి= ఇట్లా అన్నారు; నీదు తనయుండు= నీ కుమారుడైన దుర్యోధనుడు; భుజబలదర్పంబు= భుజబలంచేత ఏర్పడిన గర్వం; దుర్వార= వారించటానికి వీలుకాని; శౌర్యంబు= పరాక్రమం; మెఱయంగన్= ప్రకాశించగా; సంగరంబు+చేసి= యుద్ధంచేసి; ఇంద్ర+ఆది= ఇంద్రుడు యముడు మొదలైన; సురులన్= దేవతలను; మెచ్చించి; వారికిన్+అతిథి+ఐ= వారికి అతిథిగా (స్వర్గానికి); చని= వెళ్ళి; పరమ సుఖానుభవమును= స్వర్గసుఖాన్ని; తగిలెన్= పొందాడు; ఏము= మేము; ముప్వురమును తక్కన్= ముగ్గురం తప్ప; సైన్యంబులు+ఎల్లన్= తక్కిన సైన్యమంతా; ఆ+మహీశుతోడన= ఆ రాజుతోనే; చనియెన్= చనిపోయింది.

తాత్పర్యం: ద్రోణాచార్యుడి కుమారుడైన అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ - వీరు ముప్వురూ ఎదురుగా వచ్చి కొంత దూరంలో రథాలు దిగి, దుఃఖబాధతో వారి అవయవాలు కంపిస్తుండగా, కళ్ళల్లో నీళ్ళు ధారలుగట్టి ప్రవహిస్తుండగా, ధృతరాష్ట్రుడిని చూచి గడగడలాడుతూ వణుకుతున్న కంఠాలతో ఆ రాజుతో ఇట్లా అన్నారు. 'నీ కుమారుడైన దుర్యోధనుడు తన భుజబలం దర్పంతోనూ, వారించటానికి కాని పరాక్రమంతోనూ మహాయుద్ధంచేసి ఇంద్రాది దేవతలను మెప్పించి వారికి అతిథిగా స్వర్గానికి వెళ్ళి పరమసుఖాన్ని పొందాడు. మేము ముగ్గురం తప్ప తక్కిన సైన్యమంతా ఆ మహారాజుతోనే చనిపోయింది.'

వ. **అనినఁ దదనంతరంబ.** **106**

తాత్పర్యం: అని వారు ముప్వురూ చెప్పారు. ఆ తరువాత.

కృపాచార్యుఁడు గాంధారి నూరార్చిన ప్రకారము (సం. 11-10-5)

తే. **తనుజ శోకార్తయైన గాంధారిఁ జూచి । యడలు తనదు చిత్తంబున నతిశయిల్ల**
నలఁతఁ దేర్పంగఁ దలఁచి తానల్లఁ జేరి । యమ్మహాదేవి తోడ నిట్లనియెఁ గృపుఁడు. **107**

ప్రతిపదార్థం: తనుజ= కుమారుల మరణంచేత ఏర్పడిన; శోక+ఆర్త+ఐన= దుఃఖంచేత ఆర్తురాలుగా కనిపిస్తున్న; గాంధారిన్+చూచి= గాంధారీదేవిని చూసి; కృపుఁడు= కృపాచార్యులు; తనదు చిత్తంబునన్= తన మనసులో; అడలు= దుఃఖం; అతిశయిల్లన్= అధికంకాగా; అలఁతన్= బాధను; తేర్పంగన్+తలఁచి= పోగొట్టటంకోసం (పోగొట్టాలని ఆలోచించి); తాను; అల్లన్+చేరి= నెమ్మదిగా చేరి; ఆ+మహాదేవి తోడన్= ఆ మహారాణితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తన కుమారుల మృతి చేత ఏర్పడ్డ దుఃఖంతో అతి దీనురాలుగా కనిపిస్తున్న గాంధారిని చూచి కృపాచార్యుడికి కూడా మనసులో దుఃఖం కట్టలు తెంచుకొన్నది. ఆమె బాధను పోగొట్టాలని ఆలోచించి ఆయన ఆమె వద్దకు నెమ్మదిగా వెళ్ళి ఆ మహారాణితో ఇట్లా అన్నాడు.

మణిమాలా వృత్తము:

'భవదీయ సూను లరి సైన్య పఙ్క్తిఁ గొని కాల్చిరెల్లఁ బొగడన్
వివిధాస్త్ర శస్త్రమయ సాంద్రవృష్టిఁ దెగటాఱి పెంపు మిగులన్
దివి కేఁగి యందు మహనీయ తేజ మెసఁగంగ హృద్యబలభి
ద్ధువ సౌఖ్యసంపదలు గాంచి సంతోషమునఁ దేలి రేల వగవన్? 108

ప్రతిపదార్థం: భవదీయ= నీ; సూనులు; కుమారులు; అరిసైన్య పఙ్క్తిన్= శత్రు సైన్య సమూహాన్ని; కొని= పట్టుకొని; ఎల్లన్+ పొగడన్= అందరూ ప్రశంసించగా; కాల్చిరి= బూడిద చేశారు; వివిధ= అనేకాలైన; శస్త్రమయ= శస్త్రాలతో కూడిన; సాంద్రవృష్టిన్= దట్టమైన వర్షంచేత; తెగటాఱి= చనిపోయి; దివికిన్= స్వర్గానికి; పెంపుమిగులన్= అతిశయించిన గౌరవంతో; ఏఁగి= వెళ్ళి; అందున్= ఆ స్వర్గంలో; మహనీయ= గొప్ప; తేజము= కాంతి; ఎసఁగంగన్= అతిశయించగా; హృద్య= మనోహరమైన; బలభిత్= ఇంద్ర సంబంధమైన (స్వర్గ); ధ్రువ= నిత్యమైన; సౌఖ్యసంపదలు= సుఖాలను; కాంచి= పొంది; సంతోషమునన్= సంతోషంలో; తేలిరి= సరదాగా ఉన్నారు; వగవన్= దుఃఖించటం; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: 'గాంధారీదేవీ! నీ కుమారులు శత్రుసైన్య సమూహాలను అందరూ ప్రశంసించే రీతిలో ధ్వంసంచేశారు. వివిధ శస్త్రాస్త్రమయమైన ఆయుధ వర్షంలో అందరూ చనిపోయి అతిశయించిన గౌరవంతో స్వర్గానికి వెళ్ళి అక్కడ గొప్ప కాంతితో ప్రకాశిస్తూ మనోహరమైన నిరంతర స్వర్గసౌఖ్యాన్ని పొంది సంతోషసాగరంలో తేలుతున్నారు. అట్లాంటి వారిని గురించి చింతించటం తగదు.

విశేషం: మణిమాలా వృత్తంలో ప్రతిపాదానికీ స, జ, స, జ, స, జ, స గణము లుంటాయి. మొదటి అక్షరానికీ పదకొండవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

స్వాగత వృత్తము:

అందొకండును రణావని భీతిం । బొంద కేటులను బోటుల డప్పిం
బొందియైనఁ బొలివోవఁడ దానం । బొంది రూర్ధ్వగతిఁ బుణ్యచరిత్రా! 109

ప్రతిపదార్థం: పుణ్యచరిత్రా!= పవిత్ర చరిత్ర కలిగిన ఓ గాంధారీ! అందున్= నీ కొడుకులలో; ఒకండును= ఒక్కడుకూడా; రణ+అవనిన్= బాణాల యుద్ధభూమిలో; భీతిన్+పొందక= భయపడక; ఏటులన్= బాణాల దెబ్బలతో; పోటులన్= కత్తి పోట్లతో; డప్పిన్+పొంది+ఐనన్= దప్పిక పొందినవాడై ఉండికూడా; పొలి+పోవఁడు+అ= భంగపడి యుద్ధంనుండి మరలిపోలేదు; దానన్= అంచేత; ఊర్ధ్వగతిన్= సుగతిని (స్వర్గాన్ని); పొందిరి= పొందారు.

తాత్పర్యం: ఓ పవిత్ర చరిత్ర కలిగిన గాంధారీ! నీ కొడుకులలో ఒక్కడుకూడా యుద్ధభూమిలో భయాన్ని పొందలేదు. బాణాల, గదల దెబ్బలను, బల్లెం, కత్తి మొదలైన వాటి పోటులను పొంది ఎంత దప్పిక పొందిన వారైనా భంగపడి యుద్ధం విరమించి మరలి పోలేదు. అందుచేతనే వారికి స్వర్గ ప్రాప్తి కలిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: యుద్ధంలో శత్రువులకు భయపడి వెన్నుచూపిరావటం యోధుడి లక్షణం కాదు. అట్లా ఎదురొడ్డి చనిపోయిన వారే స్వర్గాన్ని పొందుతారని భారతీయుల విశ్వాసం.

స్వాగతవృత్తంలో ప్రతి పాదానికీ ర, న, భ, గ, గ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ, ఏడవ అక్షరానికీ యతిమైత్రి, ప్రాస నియమం కలవు.

వనమయూర వృత్తము:

పోర నొడ లస్త్రపరిపూతముగ ధీరో । దారతc బిఱిందికిc బదం బిడక దృప్య

ద్వైరితతి నొంచి తెగువారగుట మేలు । ర్వీరమణకోటి కని వేదములు సెప్పన్. 110

ప్రతిపదార్థం: పోరన్= యుద్ధంలో; ఒడలు= దేహం; అస్త్ర= అస్త్రాలచేత; పరిపూతముగన్= నిండి పవిత్రంకాగా; ధీర+ఉదారతన్= పరాక్రమంచేత, ఔదార్యంచేత; పిఱిందికిన్= వెనుకకు; పదంబు+ఇడక= అడుగు పెట్టకుండా; దృప్యత్= దర్పించిన; వైరితతిన్= శత్రుసమూహాన్ని; నొంచి= నాశనంచేసి; తెగువారగుట= చచ్చినవారు కావటం; ఉర్వీరమణ కోటికిన్= రాజుల సమూహానికి; మేలు+అని= శ్రేష్ఠమని; వేదములు= వేదాలు; చెప్పున్= చెబుతాయి.

తాత్పర్యం: యుద్ధంలో శరీరం శస్త్రాస్త్రాలచేత సంపూర్ణంగా పవిత్రంగా, ధీరోదాత్తంగా పోరాడి, అడుగు వెనుకకు వేయకుండా దర్పించిన శత్రువుల సమూహాలను నాశనంచేసి చావటమే రాజులకు శ్రేష్ఠమైన కార్యమని వేదాలు చెప్పుతున్నాయి.

విశేషం: యోధుడు, యోగి - ఇరువురు మాత్రమే స్వర్గాన్ని పొందుతారు. అందుకే 'యుద్ధం ఒక యోగమే' అని భారతీయులు భావిస్తారు. వనమయూరవృత్తంలో ప్రతిపాదానికీ భ, జ, స, న, గ, గ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ తొమ్మిదవ అక్షరానికీ యతిమైత్రి.

క. దానాద్యుత్తమ కర్మ వి । ధానంబులc బడయు గతు లుదాత్త రణమునం

జా నేర్చువాని చనియెడు । మానితగతిc బోల వండ్రు మహనీయాత్ముల్. 111

ప్రతిపదార్థం: మహనీయ+ఆత్ముల్= మహాత్ములు; దాన+ఆది= దానం ధర్మం మొదలైన; ఉత్తమ= గొప్ప; కర్మవిధానంబులన్= కర్మ విధులచేత; పడయు= పొందేటటువంటి; గతులు= పుణ్యలోకాలు; ఉదాత్తరణమునన్= గొప్ప యుద్ధంలో; చాన్+నేర్చు+వాని= చనిపోగలవాడి; చనియెడు= పోయేటటువంటి; మానితగతిన్= ఉత్తమ లోకప్రాప్తిని; పోలవు+అండ్రు= సమానమైనవి కావని అంటారు (సరిపోవు అంటారు).

తాత్పర్యం: దానం, ధర్మం మొదలైన గొప్ప కర్మల విధులచేత ఏ పుణ్యలోకాలను పొందుతామో అవి మహాయుద్ధంలో మరణించే వాడు పొందే ఉత్తమ లోకప్రాప్తికి సమానం కావని మహాత్ములు అంటారు.

వ. కావునం గురుకుమారుల మరణంబు సంభావనీయం బది దా నట్లుండెc బాండుకుమారులు గెలిచితి మని సంతసింపలే దది యెట్లనిన. 112

ప్రతిపదార్థం: కావునన్= అందువలన; కురుకుమారుల= కురురాకుమారుల; మరణంబు= మృతి; సంభావనీయంబు= ఊహించదగినదే (దేవతలు ముందుగానే చెప్పారు కాబట్టి); అది+తాన్+అట్లుండెన్= అది అట్లా జరిగింది; పాండు కుమారులు= పాండవులు; గెలిచితిమి+అని= విజయం పొందామని; సంతసింపలేదు= సంతోషించలేదు; అది ఎట్లా అంటే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అందువలన కురు రాజకుమారుల మృతి ఊహించదగినదే. దేవతలు ముందు చెప్పినట్లే జరిగింది. అది అట్లా ఉండనిమ్ము. పాండవులు మాత్రం తాము గెలిచామని సంతోషపడ్డారా! అదీ ఏమీ లేదు. ఎట్లాగంటే.

నర్కుట వృత్తము:

వినుము మరుత్తనూభవుఁడు విశ్రుతధర్మగతిం
జనక కురుక్షితీశ్వరునిఁ జంపె గదాసమరం
బున నది యే మెఱింగి చనిపోయిన రేయి గడుం
గనలున ముట్టి ముప్వురముఁ గ్రౌర్య ముదగ్రముగన్. 113

ప్రతిపదార్థం: వినుము= గాంధారీదేవీ! వినుము; మరుత్+తనూభవుఁడు= మరుత్తు అంటే వాయువు - వాయుకుమారుడు - భీముడు; విశ్రుత= ప్రసిద్ధమైన; ధర్మగతిన్= ధర్మపద్ధతిలో; చనక= నడవక; కురుక్షితి+ఈశ్వరునిన్= సుయోధన మహారాజును; గదాసమరంబునన్= గదా యుద్ధంలో; చంపెన్= చంపాడు; అది= ఆ విషయం; ఏము+ఎఱింగి= మేము తెలిసికొని; చనిపోయిన రేయి= దుర్యోధనుడు చనిపోయిన ఆ రాత్రే; ముప్వురము= మేము ముగ్గురం; కనలునన్= కోపంతో; క్రౌర్యము+ఉదగ్రముగన్= కఱకుదనం అతిశయించగా.

తాత్పర్యం: గాంధారీదేవీ! వినుము. వాయుపుత్రుడైన భీముడు యుద్ధంలో పాటించే ధర్మపద్ధతిని అనుసరించకుండా సుయోధనుడిని గదాయుద్ధంలో క్రూరంగా చంపాడు. ఆ విషయం విన్న మేము ముగ్గురం అదే రాత్రి అతికోపంతో అతిశయించిన క్రౌర్యంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: నర్కుటవృత్తంలో ప్రతిపాదానికీ న, జ, భ, జ, జ, వ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ పదకొండవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. పాండవ శిబిరంబున. 114

తాత్పర్యం: పాండవుల సైనిక స్థావరంలో.

బంధుర వృత్తము:

సకల రథములను నఖిల గజములున్ సర్వహయంబులతో బెరయన్
శకలములుగ భటనికర మఖిలముం జావఁగ ద్రౌపదిపుత్రులలో
నొకఁడును బ్రదుకక పొడిపొడియుఁగ నయ్యుర్వికి వారలమామల మ
స్తకములు కడమవడక వడి బలిగా సంతసమందఁ బిశాచాతతుల్. 115

ప్రతిపదార్థం: సకల రథములను= రథాలన్నింటినీ; అఖిల గజములున్= అన్ని ఏనుగులూ; సర్వహయంబులతోన్= అన్ని గుర్రాలతో; బెరయన్= కలిసిపోయేటట్టు; శకలములుగన్= ముక్కలు ముక్కలుగా; భటనికరము+అఖిలమున్= సైన్యం మొత్తం; చావఁగన్= చచ్చిపోయేలా; ద్రౌపది పుత్రులలోన్= ఉపపాండవులలో; ఒకఁడును= ఒక్కడుకూడా; బ్రదుకక= బ్రతికి బయటపడకుండా; పొడిపొడియుఁగన్= నుగ్గునుగ్గుగా అయిపోయేలా; వారల= ఆ ఉపపాండవుల; మామల మస్తకములు= మామల తలలు; కడమ+పడక= మిగులకుండా; ఆ+ఉర్వికిన్= ఆ యుద్ధభూమికి; వడిన్= పరాక్రమంతో; బలిగాన్= బలి అయ్యేటట్లుగా; పిశాచతతుల్= పిశాచసమూహాలు; సంతసమందన్= సంతోషపడగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రథాలను, ఏనుగులను, గుర్రాలను - అన్నిటిని కలిపి నుగ్గునుగ్గుచేసి మొత్తం సైన్యమంతా చనిపోగా, ద్రౌపది కుమారులలో ఒక్కడు కూడా మిగలకుండా అందరినీ చంపి, వారి మామల తలకాయలు కూడా మిగలకుండా వీరులందరినీ పొడిపొడిచేసి, ఆ యుద్ధభూమికి మా పరాక్రమంతో బలి పెట్టాము. పిశాచ సమూహాలు సంతోషించాయి. ఈ విధంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: బంధురవృత్తంలో ప్రతిపాదానికీ న, న, న, న, స, భ, భ, గ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ పదహారవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. సమరంబు సేసితి మట్లగుట నప్పాండవుల విజయంబు వితథంబయ్యె నిటయేము సేయం దలంచిన దాని నెఱింగించెద నాకర్ణింపు మే మట్టి సమయంబున వార లాశిబిరంబున లేమింజేసి యాభంగి పరాక్రమం బాచరింప నోపితిమి గాని యమ్మహాబలుల మార్కొన శక్తులముగా మవ్వీరులట్లు దమ తనయులు మా తెగువం దెగటాఱుట విని శోక క్రోధాక్రాంతంబులగు నంతరంగంబులతో మమ్ము వెనుకొనుట దప్పదు. వారల బారికిం దప్పిపోవలయుం బోయెద మది తలం పనుజ్ఞయిమ్ము నీవు నుమ్మలింపకుండు 'మని పలికి ధృతరాష్ట్రు నుద్దేశించి 'దేవా! ధర్మపుత్రాదుల బారింబడక తొలంగుట భీతులగు మాకుం గర్తవ్యంబై యున్నయది మీ చేత ననుజ్ఞాతులమ నీ వింక దైవకృతం బలంఘనీయంబగుటఁ దలంచి వగ పుడుగు' మని యచ్చట నా కృప కృతవర్మాశ్వత్థామ లారాజునకు నద్దేవికిం బ్రదక్షిణంబుగా వచ్చి మరలి మరలి వారలం జూచుచుఁ దేరు లెక్కి భయంబున రయంబున నరదంబులు దోలుకొని గంగాతీరంబున కరిగి యచ్చట నన్యోన్యామంత్రణంబు సేసి పాసి రందుఁ గృపాచార్యుఁడు గరిపురి కేతెంచెఁ, గృతవర్మ నిజపురంబునకుఁ జనియె. నశ్వత్థామ కృష్ణద్వైపాయనాశ్రమంబు నాశ్రయించి గ్రక్కునం దపస్వియయ్యెఁ, దదనంతరంబ ధర్మజభీమార్జునులు దాడిమై వచ్చి యతని ముట్టుకొని రావృత్తాంతంబంతయు నీ విన్నయదియ తరువాతి కథ సెప్పెద విను మవ్విధంబునఁ గృపప్రముఖ రథికులు ముప్పురుం దన్ను విడిచి చనిన నాంబికేయుండు గ్రొత్తయైన నెవ్వగ పెల్లునఁ జిత్తంబు విషాద వేదనాయత్తం బగుచుండ నెడనెడ నిలుచుచుఁ జనుచుండె నక్కడ నయ్యజాతశత్రుండు గురునందను శిరోరత్నంబు దెచ్చి యిచ్చి యట్లు పాంచాలి నూరార్చియున్నంత నట వోయిన జనంబుల వలన వైచిత్రవీర్యుండు పొలికలనికి వచ్చుచున్నవాఁడని విని తదభిగ మనోన్ముఖుండై. 116

ప్రతిపదార్థం: సమరంబు= యుద్ధం; చేసితిమి= చేశాము; అట్లు+అగుటన్= అట్లా కావటంవలన; ఆ+పాండవుల విజయంబు= ఆ పాండవులు సాధించిన విజయం; వితథంబు+అయ్యెన్= వ్యర్థమయింది; ఇట= ఇక్కడ; ఏము= మేము ముగ్గురం; చేయన్+తలంచిన దానిన్+ఎఱింగించెదన్= చేయదలచినదాన్ని చెబుతాను; ఆకర్ణింపుము= వినుము; ఏము= మేము; అట్టి= సమయంబునన్= ఆ సమయంలో; వారలు+ఆ శిబిరంబునన్+లేమిన్+చేసి= ఆ పాండవులు శిబిరంలో లేరు కాబట్టి; ఆ భంగిన్= ఆ రీతిగా; పరాక్రమంబు= పరాక్రమాన్ని; ఆచరింపన్+ఓపితిమి= చూపించగలిగాము; కాని; ఆ+మహాబలులన్= ఆ మహాపరాక్రమవంతులను; మార్కొనన్= ఎదుర్కొనటానికి; శక్తులము+కాము= సమర్థులం కాము; ఆ+వీరులు= ఆ పాండవులు; తమ తనయులు= తమ కుమారులు; మా తెగువన్= మా సాహసంచేత; అట్లు= ఆ విధంగా; తెగటాఱుట విని= చనిపోవటాన్ని విని; శోక+క్రోధ+ఆక్రాంతంబులగు+అంతరంగంబులతోన్= దుఃఖం, క్రోధం నిండిన మనస్సులతో; మమ్మున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మమ్మలను; వెనుకొనుట= తరుముకొంటూ రావటం; తప్పదు= తప్పనిసరిగా జరుగుతుంది; వారల బారికిన్= వాళ్ళ బారినుండి; తప్పిపోవలయున్= తప్పించుకోవాలి; పోయెదము+అది+తలంపు= వెళ్ళిపోతాము- అది మా ఆలోచన; అనుజ్ఞ+ఇమ్ము= అనుమతిని ఇవ్వుము; నీవున్= నీవు కూడా; ఉమ్మలింపక+ఉండుము= శోకించవద్దు; అని పలికి; ధృతరాష్ట్ర+ఉద్దేశించి= ఆ మహారాజును చూచి; దేవా!= ఓ రాజా!; ధర్మపుత్రాదుల బారిన్+పడక= ధర్మరాజాదుల హింసకు చిక్కకుండా; తొలంగుట= తప్పించుకుపోవటం; భీతులు+అగు= భీతులైన; మాకున్+కర్తవ్యంబు+ఐ+ఉన్న+అది= మాకు చేయదగినపని అనిపిస్తోంది; మీచేతన్+అనుజ్ఞాతులము+అ= మీ చేత అనుమతింప బడ్డాము; నీవ, ఇంకన్= ఇకమీదట; దైవకృతంబు= దైవనిర్ణయం; అలంఘనీయంబు+అగుటన్+తలంచి= ఉల్లంఘించటానికి వీలు కాదన్నది అర్థం చేసికొని; వగపు= దుఃఖాన్ని; ఉడుగుము= విడిచిపెట్టుము; అని; అచ్చటన్= ఆ చోటే; ఆ, కృప, కృతవర్మ, అశ్వత్థామలు; ఆ రాజునకున్= రాజుకు; ఆ+దేవికిన్= గాంధారికీ; ప్రదక్షిణంబుగాన్+వచ్చి= ప్రదక్షిణంగా నమస్కరించి; మరలి మరలి= మళ్ళీ మళ్ళీ; వారలన్+చూచుచున్= వాళ్ళను చూస్తూ; తేరులు+ఎక్కి= రథాలు ఎక్కి; భయంబునన్+రయంబునన్= భయంగా, వేగంగా; అరదంబులు+తోలుకొని= రథాలు తోలుకొంటూ; గంగాతీరంబునకున్+అరిగి= గంగానదితీరానికి వెళ్ళి; అచ్చటన్= అక్కడ; అన్యోన్య+ఆమంత్రణంబు+చేసి= ఒకరినొకరు వీడ్కొని; పాసిరి= వెళ్ళిపోయారు; అందున్= వారిలో; కృపాచార్యుడు; కరిపురికిన్+ఏతెంచెన్= హస్తినాపురానికి వచ్చాడు; కృతవర్మ; నిజపురంబునకున్= ద్వారకకు; చనియెన్= వెళ్ళాడు; అశ్వత్థామ; కృష్ణద్వైపాయన= వ్యాసమహర్షి; ఆశ్రమంబున్= ఆశ్రమాన్ని; ఆశ్రయించి= చేరి; గ్రక్కునన్= ఆలస్యం చేయకుండా; తపస్వి+అయ్యెన్= తాపసి అయ్యాడు; తద్+అనంతరంబ= ఆ తరువాత; ధర్మజ భీమ అర్జునులు; దాడిమైన్= దాడిగా; వచ్చి; అతనిన్= ఆ అశ్వత్థామను; ముట్టకొనిరి= ముట్టడించారు; ఆ వృత్తాంతంబు+అంతయున్= ఆ విషయమంతా; నీవు+విన్న+అది+అ= నీవు విన్నదే; తరువాతి కథ+చెప్పెదన్+వినుము= ఆ తరువాత జరిగిన కథ చెబుతాను వినుము; ఆ+విధంబునన్= ఆ విధంగా; కృప ప్రముఖ రథికులు= కృపాచార్యుడు మొదలైన మహావీరులు; తన్నున్ విడిచి చనినన్= తనను వదలిపోగా; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; క్రొత్త+ఐన= క్రొత్తగా పుట్టిన; నెఱ+వగ పెల్లునన్= సంపూర్ణ దుఃఖాతిశయంతో; చిత్తంబు= మనస్సు; విషాదవేదనా+ఆయత్తంబు+అగుచుండన్= విషాద వేదనతో నిండినది కాగా; ఎడనెడన్= అక్కడక్కడ; నిలుచుచున్+చనుచుండెన్= ఆగి నిలబడుతూ వెళ్తూ ఉన్నాడు; అక్కడన్= ఆ శిబిరంలో; ఆ+అజాతశత్రుండు= ఆ ధర్మరాజు; గురునందను= ద్రోణకుమారుడైన అశ్వత్థామయొక్క; శిరోరత్నంబు= తలమీదనున్న రత్నాన్ని; తెచ్చియిచ్చి; అట్లు= ఆ విధంగా; పాంచాలిన్+ఊరార్చి+ఉన్న+అంతన్= ద్రౌపదిని ఓదార్చి ఉండగా; (అప్పుడు); అట+పోయిన= యుద్ధభూమికి వెళ్ళి వచ్చిన; జనంబులవలనన్= జనాలవలన; వైచిత్రవీర్యుండు= విచిత్ర వీర్యుని కుమారుడైన ధృతరాష్ట్రుడు; పొలి+కలనికిన్= యుద్ధభూమికి; వచ్చుచున్నాడు+అని+విని= వస్తున్నాడని విని; తద్+అభిగమన+ఉన్ముఖుండై= ఆయన వస్తున్న దారిలోనే (బయలుదేరాడు).

తాత్పర్యం: యుద్ధం చేశాము. అట్లా అవటం వలన ఆ పాండవులు సాధించిన విజయం నిరుపయోగమయింది. ఇక్కడ మేము చేయదలచిన దాన్ని చెబుతాను వినుము. ఆ సమయంలో పాండవులు ఆ స్థావరంలో లేకపోవటం చేతనే అట్లా పరాక్రమించి మిగిలిన వారిని చంపగలిగాము. అంతే కాని ఆ మహాపరాక్రమవంతులను ఎదుర్కొనటానికి మేము సమర్థులం కాము. ఆ పాండవులు తమ కుమారులు మా పరాక్రమంతో అట్లా చనిపోవటాన్ని గురించి విని దుఃఖం, క్రోధం నిండిన మనస్సులతో మమ్మల్ని వెన్నాడి రావటం తప్పదు. వాళ్ళబారినుండి బయటపడాలి అన్నది మా ఆలోచన. దీనికి మీరు అనుమతించండి. నీవు దుఃఖించవద్దు' - అని గాంధారికి చెప్పి, ధృతరాష్ట్రుడితో 'ఓ రాజా! ధర్మరాజాదుల బారికి చిక్కకుండా తప్పించుకొనిపోవటం మాకు ఇప్పుడు కర్తవ్యం. మీ రెట్లాగూ అనుమతించారు. ఇక నీవు దైవనిర్ణయం ఎదిరించటానికి కాదన్న విషయాన్ని అర్థం చేసికొని దుఃఖాన్ని వదలిపెట్టుము' అని ఆ చోటనే వారిరువురికీ ప్రదక్షిణనమస్కారం చేసి, మళ్ళీ మళ్ళీ వాళ్ళనే చూస్తూ రథాలు ఎక్కి భయంభయంగా

రథాలు తోలుకొంటూ గంగానదీతీరానికి చేరుకొన్నారు. అక్కడ ఒకరినొకరు వీడ్కొని తమతమ మార్గాలలో వెళ్ళిపోయారు. వారిలో కృపాచార్యుడు హస్తినకు తిరిగి వచ్చాడు. కృతవర్మ ద్వారకకు చేరుకొన్నాడు. అశ్వత్థామ వ్యాసమహర్షి ఆశ్రమాన్ని చేరుకొని వెంటనే తపస్సు మొదలుపెట్టాడు. ఆ తరువాత ధర్మరాజాదులు దాడిగా వచ్చి ఆ అశ్వత్థామను ముట్టడించారు. ఆ విషయ మంతా నీవు విన్నదే. తరువాతి కథ చెప్తుతాను వినుము (అంటూ జనమేజయుడికి వైశంపాయనుడు చెప్తుతున్నాడు). ఆ విధంగా కృపాచార్యుడు మొదలైన వీరులు తనను వదలిపోగా ధృతరాష్ట్రుడు కొత్తగాపుట్టిన దుఃఖంతో మనసు విషాదంతో వేదనతో నిండిపోగా అక్కడక్కడా ఆగి ఆగి ముందుకు సాగుతున్నాడు. అక్కడ ఆ శిబిరంలో ధర్మరాజు అశ్వత్థామ తలమీదనున్న రత్నాన్ని తెచ్చి ద్రౌపదికి ఇచ్చి ఆమెను ఓదార్చాడు. ఆ సమయంలో యుద్ధభూమినుండి తిరిగివచ్చిన వారి ద్వారా ధృతరాష్ట్రుడు యుద్ధభూమికి వస్తున్నాడని తెలిసి ఆయనను కలసికొనటానికి అదే దారిలో ధర్మరాజాదులు కూడా బయలుదేరారు.

ధర్మరాజు దమ్ములతోడ ధృతరాష్ట్రు నొద్దకుఁ బోవుట (సం. 11-11-1)

తే. **తనయులందఱుఁ బొలియుట వినిన యడలు । మానసంబు దహింప నమ్మనుజవిభుఁడు**
వొగులుచును వచ్చెనను తలపోఁతఁ జేసి । యుల్ల మక్కటికమునఁ జొత్తిల్లుచుండ. **117**

ప్రతిపదార్థం: తనయులందఱున్= కొడుకులందరూ; పొలియుట= చనిపోవటం; వినిన= విన్నటువంటి; అడలు= దుఃఖం; మానసంబున్= మనసును; దహింపన్= కాల్చివేస్తుండగా; ఆ+మనుజవిభుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; పొగులుచునున్= దుఃఖిస్తూ (బాధపడుతూ); వచ్చెన్+అను= వస్తున్నాడన్న; తలపోఁతన్+చేసి= ఆలోచనవచ్చి; ఉల్లము= హృదయం; అక్కటికమునన్= దయతో; జొత్తిల్లుచుండన్= ఆర్ద్రమై పోగా.

తాత్పర్యం: అంతమంది కొడుకులూ చనిపోయారన్న వార్త విని దుఃఖం మనసును దహించి వేస్తుండగా ఆ మహారాజు యుద్ధభూమికి వస్తున్నాడన్న ఆలోచన కలిగి ధర్మరాజుకు హృదయమంతా కనికరంతో ఆర్ద్రమై పోయింది.

క. **వదనమున విన్నఁదనముం । గదురఁగ హరిఁ జూచి రాజుఁ గానవలయు నా**
కదియెట్లు నుడుగవచ్చునె? । కదలుండని పలికి చనియెఁ గలనివలనికిన్. **118**

ప్రతిపదార్థం: వదనమునన్= ముఖంలోని; విన్నఁదనమున్= దైన్యం; కదురఁగన్= వ్యాపించగా; హరిన్+చూచి= శ్రీకృష్ణుని చూచి; రాజున్= ధృతరాష్ట్ర మహారాజును; కానన్ వలయున్= తప్పకుండా దర్శించుకోవాలి; నాకున్+అది+ఎట్లున్+ఉడుగన్ వచ్చునె?= నాకు అది తప్పనిసరి కాదా?; కదలుండు+అని= ముందుకు పదండి; అని; పలికి; కలనివలనికిన్= యుద్ధభూమివైపు; చనియెన్= సాగిపోయాడు.

తాత్పర్యం: ముఖంలో దైన్యం వ్యాపించగా ధర్మరాజు శ్రీకృష్ణుడితో 'నేను ధృతరాష్ట్రమహారాజును తప్పక దర్శించుకొనాలి. అది నాకు అవశ్యకర్తవ్యం. తప్పించుకొనటానికి వీలులేదు, ముందుకు వెళ్ళుదాము - 'అని అంటూ యుద్ధభూమివైపు సాగిపోయాడు.

ద్రుతవిలంబిత వృత్తము

చనఁగ నాతఁడు సాత్యకి వాయునం । దనుఁడు గాండివి దమ్ములు సూరెలం
జనిరి ద్రౌపది సంభృతశోక యై । చనియెఁ జుట్టపుఁ జానలు సుట్టిరాన్. **119**

ప్రతిపదార్థం: ఆతఁడు= ధర్మరాజు; చనఁగన్= వెళుతుండగా; సాత్యకి; వాయునందనుఁడు= భీముడు; గాండివి= అర్జునుడు; తమ్ములు= నకుల సహదేవులు; సూరెలన్= ఆ ప్రక్కల; చనిరి= వచ్చారు; ద్రౌపది; సంభృత= మిక్కిలి; శోక+ఐ= శోకంతో కూడినదై; చుట్టపు+చానలు= బంధువులైన స్త్రీలు; చుట్టిరాన్= వెన్నంటి వస్తుండగా; చనియెన్= ముందుకు సాగింది.

తాత్పర్యం: అట్లా ధర్మరాజు వెళ్ళుతుండగా సాత్యకి, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు ఆయనకు ఇరువైపులా బయలుదేరారు. ద్రౌపది మిక్కిలి శోకంతో కూడినదై బంధు స్త్రీలు వెన్నంటి వస్తుండగా ముందుకు సాగింది.

విశేషం: ద్రుతవిలంబితవృత్తంలో ప్రతిపాదానికీ న, భ, భ, ర అనే గణాలుంటాయి. 1-7 అక్షరాలకు యతిమైత్రి, ప్రాసనియమం కలదు.

వ. ఇట్లు మాత్స్యపాంచాల భామలు నరిగిరి. తొలునాఁడు దుర్యోధనుండు మన్నించు మానవతులం గరి నగరంబునకుం గొని చని యారాత్రి యందు నిలిచి ధృతరాష్ట్రుం బొడగానక రేపకడ మగిడి వచ్చి యున్న యుయుత్సుండును నమ్మానవపతితోన చనియె. నట్లు ధర్మసూనుండు సని సమరతలంబు దఱియునంతకు నయ్యెడకు నాంబికేయుండు సనుదెంచె. నతని ముందటి వలని వనితాజనంబు లక్కౌంతేయాగ్రజుం గనుంగొని కరంబులెత్తి యేడ్చుచు నెదుర్కొని. 120

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మాత్స్య= మత్స్యదేశానికి చెందిన స్త్రీలు; పాంచాలభామలు= పాంచాలదేశానికి చెందిన స్త్రీలు; అరిగిరి= వెళ్ళారు; తొలునాఁడు= మొదటిరోజు; దుర్యోధనుండు= సుయోధనుడు; మన్నించు= అభిమానించే; మానవతులన్= స్త్రీలను; కరినగరంబునకున్= హస్తినాపురికి; కొని చని; ఆ రాత్రి+అందున్+నిలిచి= ఆ రాత్రి అక్కడే ఉండి; ధృతరాష్ట్రున్+పొడగానక= ధృతరాష్ట్రుడు కనిపించకపోగా; రేపకడ= ఉదయాన్నే; మగిడివచ్చి+ఉన్న= తిరిగివచ్చి ఉన్న; యుయుత్సుండును= యుయుత్సుడనే ధృతరాష్ట్రుని కుమారుడు; ఆ+మానవపతితోన్+అ= ఆ మహారాజుతోనే; చనియెన్= కలిసి వెళ్ళాడు; అట్లు= ఆ విధంగా; ధర్మసూనుండు= ధర్మరాజు; చని= బయలుదేరి; సమరతలంబున్= యుద్ధభూమిని; దఱియునంతకున్= సమీపించేటప్పటికి; ఆ+ఎడకున్= ఆ చోటికి; ఆంబికేయుండు+చనుదెంచెన్= ధృతరాష్ట్రుడు కూడా వచ్చాడు; అతని ముందటి వలని వనితాజనంబులు= ఆ రాజుకు ముందు నడుస్తున్న స్త్రీలు; ఆ+కౌంతేయ+అగ్రజున్= ఆ ధర్మరాజును; కనుంగొని= చూచి; కరంబులు+ఎత్తి= చేతులు పైకెత్తి; ఏడ్చుచున్= ఏడుస్తూ; ఎదుర్కొని= ఎదురుగా వచ్చి.

తాత్పర్యం: ఈ విధంగా మత్స్య పాంచాల దేశాలకు చెందిన స్త్రీలు, ద్రౌపది ముందువెనుకలుగా బయలుదేరారు. మొదటిరోజున సుయోధనుడు అభిమానించే స్త్రీలను హస్తినాపురికి తీసికొని వెళ్ళి ఆ రాత్రి అక్కడే ఉండిన యుయుత్సుడు అక్కడ ధృతరాష్ట్రుడు లేకపోగా ఉదయాన్నే యుద్ధభూమికి చేరుకొని మహారాజు వెంబడి బయలుదేరాడు. ఆ విధంగా ధర్మరాజు బయలుదేరి యుద్ధభూమికి చేరుకొనేటప్పటికి ధృతరాష్ట్రుడుకూడా అక్కడికి చేరుకొన్నాడు. ఆ రోజు ముందు నడుస్తున్న స్త్రీలు ధర్మరాజును చూడగానే చేతులు పైకెత్తి హాహాకారాలు చేస్తూ ఏడుస్తూ ఎదురుగా వచ్చారు.

సీ. ధర్మ వేదిత్వ మీ ధరణీశ్వరునకు నెక్కడి । యది కృప యెందుఁగలదు? తలఁపఁ
దండ్రుల మామలఁ దాతలఁ గొడుకులఁ । దోడఁబుట్టువులను ద్రుంచివైచెఁ

గ్రూరత మెఱయంగ గురుజనంబులఁ గూల్చె । సఖుల సంబంధులఁ జంపె నదయుఁ

డని పల్కుదురు కొంద అప్పార్థుఁ జేరి గాం । గేయుని ద్రోణునిఁ గెడయఁ బొదువఁ

ఆ. బనుపనెట్లు నేర్చి తని పల్కుదురు గొంద । అకట! సింధురాజు ననుజమగనిఁ

దునిమి తేటి రాజ్య? మని పల్కుదురు గొంద । అతఁడు మోము వాంచి యరుగుచుండ. 121

ప్రతిపదార్థం: కొందఱు= కొంతమంది స్త్రీలు; ఈ ధరణీశ్వరునకున్= ఈ ధర్మరాజుకు; ధర్మవేదిత్వము+ఎక్కడి+అది?= ధర్మవేత్తృత ఎక్కడిది?; తలఁపన్= ఆలోచిస్తే; కృప= దయ; ఎందున్+కలదు?= ఎక్కడున్నది?; తండ్రులన్= తండ్రులను; మామలన్= మామలను; తాతలన్= తాతలను; కొడుకులన్= కొడుకులను; తోబుట్టువులను= తమ్ముళ్ళను; త్రుంచివైచెన్= చంపివేశాడు; క్రూరత= క్రౌర్యం; మెఱయంగన్= ప్రకాశించగా; గురుజనంబులన్= గురువులను; కూల్చెన్= చంపాడు; సఖులన్= స్నేహితులను; సంబంధులన్= బంధువులను; చంపెన్= చంపాడు; అదయుఁడు= ఇతడు కనికరం లేనివాడు; అని పల్కుదురు= అని అన్నారు; కొందఱు= మరికొందరు; ఆ+పార్థున్+చేరి= ఆ అర్జునుడిని సమీపించి; గాంగేయునిన్= భీష్ముడిని; కెడయన్= చంపటానికి; ద్రోణునిన్= ద్రోణాచార్యుడిని; పొదువన్+పనుపన్= ముట్టడించి చంపటానికి; ఎట్లు నేర్చితి(వి)?+అని= ఎలా సాహసించావు? అని; పలుకుదురు= ప్రశ్నించారు; కొందఱు= ఇంకొందరు; అకట!= అయ్యో!; సింధురాజున్= సింధురాజును (సైంధవుడిని); అనుజమగనిన్= నీ చెల్లెలు భర్తను; తునిమితి(వి)= చంపావు; ఏటి+రాజ్యము?= ఏమిటి మీరు సంపాదించిన రాజ్యం?; అని పల్కుదురు= అని ఎత్తి పొడిచారు; అతఁడు= ఆ అర్జునుడు; మోము+వాంచి= ముఖం వంచుకొని; అరుగుచుండన్= వెళ్ళిపోతుండగా.

తాత్పర్యం: కొంతమంది స్త్రీలు 'ఈ ధర్మరాజుకు ధర్మం ఏమి తెలియును? అసలు ఈ రాజుకు దయ ఎక్కడున్నది? తండ్రులను, మామలను, తాతలను, కుమారులను, తమ్ముళ్ళను చంపివేశాడు. విద్యనేర్పిన పెద్దలను గురువులను అతిక్రూరంగా చంపాడు. ఏ మాత్రం కనికరంలేని వాడు, ఛీ ఛీ' అన్నారు. మరికొందరు అర్జునుడిని చేరి 'కురువృద్ధుడు భీష్ముడిని చంపటానికి, గురువైన ద్రోణాచార్యుడిని ముట్టడించి తుదముట్టించటానికి, నీవు ఎట్లా సాహసించావు?' అని ప్రశ్నించారు. ఇంకొందరు 'అయ్యో! నీ చెల్లెలు భర్త అని కూడా చూడకుండా సైంధవుడిని ఎట్లా చంపావు? ఎందుకు మీరు సంపాదించిన ఈ రాజ్యమంతా? ఎవరికొరకు?' అని ఎత్తిపొడిచారు. అర్జునుడు ఏమీ మారు పలుకకుండా తల వంచుకొని వెళ్ళిపోతూ ఉండగా. (తరువాతి వచనంతో అన్వయం)

వ. మఱియుం గొందఱు. 122

తాత్పర్యం: ఇంకా కొంత మంది.

క. ఇందఱఁ జంపితినని యు । బ్బం దీఱద ద్రుపదతనయపట్టుల నభిమ

న్యుం దెగటార్చితి మఱఁదుల । నందఱ మ్రింగితి విభూతి యన నీ కెద్దీ? 123

ప్రతిపదార్థం: (ధర్మరాజును చూచి); ఇందఱన్= ఇంతమందిని; చంపితిన్+అని= చంపానని; ఉబ్బన్+తీఱదు+అ= గర్విస్తే చాలదు; ద్రుపద తనయ పట్టులన్= ద్రౌపదికొడుకులను; అభిమన్యుడిని; తెగటార్చితి(వి)= పొట్టన పెట్టుకొన్నావు; మఱఁదులన్+అందఱన్= మరదులందరినీ; మ్రింగితి(వి)= పొట్టను బెట్టుకొన్నావు; విభూతి+అనన్= సంపద అనేది? నీకున్+ఎద్దీ?= ఎక్కుడున్నది?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మరాజును చూచి' ఇంతమందిని చంపానని గర్విస్తే సరిపోదు. ద్రౌపదికొడుకులను, అభిమన్యుడిని, చంపావు. మరదులందరినీ నీ పొట్టన బెట్టుకొన్నావు. అయినా నీకు వైభవం ఎక్కడున్నది? (ఏనాడున్నది కాబట్టి ఈనాడు లేకపోవటానికి? - అని అర్థం).

వ. అని పలుకుదు రిట్లు బహుప్రకారంబులం బలుకుచుండం బలుకు వెలువరింపక పుత్రశోకార్తుఁడగు నప్పాండురాజపుత్రుండు పుత్ర శోకార్తి మిగులం బొగులు విచిత్ర వీర్యపుత్రుకడకుంజని తత్పార్శ్వవర్తులచేత నావేదితుండగుచు నా భూవల్లభు పాదంబులకుం బ్రణతుండగుటయు. 124

ప్రతిపదార్థం: అని పలుకుదురు= అని అన్నారు; ఇట్లు= ఈ విధంగా; బహుప్రకారంబులన్= రకరకాలుగా; పలుకుచుండన్= అంటుండగా; పలుకు= మాట; వెలువరింపక= మాట్లాడక; పుత్రశోక+ఆర్తుఁడగు= పుత్రులు చనిపోయిన శోకంతో దీనుడుగా ఉన్న; ఆ+పాండురాజ పుత్రుండు= ఆ ధర్మరాజు; పుత్రశోక+ఆర్తిన్= కుమారులు చనిపోయిన శోకంవలన పుట్టిన దైన్యంతో; మిగులన్= మిక్కిలిగా; పొగులుచున్న= దుఃఖపడుతున్న; విచిత్రవీర్యపుత్రు కడకున్= ధృతరాష్ట్రుడి వద్దకు; చని= వెళ్ళి; తద్+పార్శ్వ వర్తులచేతన్= ఆయన పక్కనున్నవారిచేత; ఆవేదితుండు+అగుచున్= తనరాకను అతనికి తెలియచేస్తూ (వెళ్ళి); ఆ భూవల్లభు= ఆ రాజు; పాదంబులకున్= పాదాలకు; ప్రణతుండు+అగుటయున్= నమస్కరించగా.

తాత్పర్యం: అని అన్నారు. ఈ విధంగా రకరకాలుగా ఆ స్త్రీలు అంటుండగా, మారుమాట్లాడకుండా కొడుకులు పోయిన దుఃఖంతో అతిదీనంగా ఉన్న ధర్మరాజు, తనవలెనే కొడుకులు చనిపోయిన శోకంతో అతి దీనంగా దుఃఖిస్తున్న ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి అతడి ప్రక్కనున్నవారి ద్వారా తన రాకను ఆ మహారాజుకు తెలిపి ఆ రాజు పాదాలకు నమస్కరించగా (తరువాతి పద్యంతో అన్వయం).

శుద్ధ విరాటి వృత్తము:

ఉల్లం బప్రియ మొందఁ గ్రొత్త సం । ధిల్లన్ నెవ్వగ దీనవక్త్రుఁడై
యొల్లంబోవుచు నుచ్చె నవ్విభుం । డల్లం గౌఁగిట నా నృపాలకున్. 125

ప్రతిపదార్థం: ఉల్లంబు= హృదయం; అప్రియము+ఒందన్= బాధామయం కాగా; క్రొత్త సంధిల్లన్= క్రొత్తగా కలుగగా; నెవ్వగన్= నిండు దుఃఖంతో; దీనవక్త్రుఁడు+ఐ= దీనంగా మారిపోయిన ముఖంతో; ఒల్లన్+పోవుచున్= వైకల్యంపొందుతూ; ఆ+విభుండు= ఆ ధృతరాష్ట్రుడు; ఆ నృపాలకున్= ధర్మరాజును; అల్లన్= నెమ్మదిగా; కౌఁగిటన్= కౌగిట్లో; ఉచ్చెన్= చేర్చుకున్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు వచ్చాడని' నమస్కరించాడని గుర్తించిన ధృతరాష్ట్రుడికి మళ్ళీ దుఃఖం కట్టలు తెంచుకొని ముఖం అతి దీనంగా మారిపోయింది. మనస్సు వికలమైపోయింది. అప్పుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజును నెమ్మదిగా కౌగిలించుకొన్నాడు.

విశేషం: శుద్ధవిరాటి వృత్తంలో ప్రతిపాదానికీ మ, స, జ, గ అనే గణాలుంటాయి. 1-6 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. ఇవ్విధంబున నాలింగనంబు సేసి సాంత్వన వచనంబుల నుపచరించెఁ దదనంతరంబ భీమార్జున నకుల సహదేవులు సేరిన నతనియొద్దివారు వారిం బేరు వేర నెఱిఁగించిన. 126

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; ఆలింగనంబు+చేసి= ఆలింగనం చేసికొని; సాంత్వన వచనంబులన్= ఓదార్పు మాటలతో; ఉపచరించెన్= ఉపశమనం కలిగించాడు; తద్+అనంతరంబ= ఆ తరువాత; భీమ, అర్జున, నకుల, సహదేవులు; చేరినన్= దగ్గరకురాగా; అతని+ఒద్దివారు= ధృతరాష్ట్రుని వద్ద ఉన్నవారు; వారిన్= వారిని; పేరు పేరన్= పేరు పేరునా; ఎఱింగించినన్= తెలుపగా.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజును కౌగిలించుకొని ఓదార్పు మాటలతో సాంత్వనం కలిగించాడు. ఆ తరువాత భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు మహారాజును సమీపించారు. సమీపంలో ఉన్నవారు వారిని పేరు పేరునా ధృతరాష్ట్రుడికి తెలుపగా (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **భీముఁ డనుమాట విని యతి భీమమైన । యలుక యను వహ్ని యవ్వీరుఁడను వనంబు**
దరికొనంగ నుంకింప నధర్మవిధికి । నాయితంబగు నయ్యాంబికేయుఁ జూచి. **127**

ప్రతిపదార్థం: భీముఁడు+అనుమాట+విని= భీముడు (వచ్చాడు) అనే మాట వినగానే; అతిభీమము+ఐన= అతిభయంకరమైన; అలుక+అను+వహ్ని= కోపం అనే అగ్ని; ఆ+వీరుఁడు+అను వనంబున్= ఆ మహావీరుడైన ధృతరాష్ట్రుడు అనే అడవిని; దరికొనంగన్= కాల్చివేయటానికి; ఉంకింపన్= యత్నించగా; అధర్మవిధికిన్= అధర్మకార్యానికి; ఆయితంబు+అగు= సిద్ధపడుతున్న; ఆ+ఆంబికేయున్+చూచి= ఆ ధృతరాష్ట్రుడిని (కృష్ణుడు) చూచి.

తాత్పర్యం: అర్జున నకుల సహదేవులను పరిచయం చేసినపుడు ఊరుకున్నాడు కాని 'భీముడు' అనే మాట వినగానే అతిభయంకరమైన కోపాగ్ని అతడిని దహించివేయటం ప్రారంభించింది. ఏ అధర్మకార్యం చేయటానికైనా సిద్ధపడేవాడివలె కనిపిస్తున్న ఆ మహారాజును కృష్ణుడు గమనించాడు.

విశేషం: అలం: రూపకం.

క. **మనసెఱిఁగి హృషీకేశుఁడు । దనమనమున నిద్దురాత్ము తలఁపొప్ప దిసీ**
యనుచుం బవనజు నద్దెస । జనకుండఁగ బట్టి వీతసంభ్రమలీలన్. **128**

ప్రతిపదార్థం: హృషీకేశుఁడు= విష్ణురూపుడైన కృష్ణుడు; మనసు+ఎఱిఁగి= ఆ ధృతరాష్ట్రుని మనసులో ఉన్నది తెలిసికొని; తన మనమునన్= తన మనస్సులో; ఈ+దురాత్ము+తలఁపు+ఒప్పదు= ఈ దురాత్ముడి ఆలోచన సమంజసం కాదు; ఇసీ+అనుచున్= ఛీ ఛీ అనుకొంటూ; పవనజున్= భీముడిని; ఆ+దెసన్+ఉండఁగన్= ఆ రాజు వద్దకు వెళ్ళకుండా; వీత సంభ్రమలీలన్= పోయిన సంభ్రమంతో; పట్టి= పట్టుకొని.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి మనస్సును కృష్ణుడు గుర్తించి 'ఈ దురాత్ముడి ఆలోచన చాలా దుర్మార్గమయిన' దని తలచి, భీముడిని ఆ రాజువద్దకు వెళ్ళకుండా సంభ్రమం లేక పట్టుకొన్నాడు.

వ. **ధృతరాష్ట్రుం డిట్టివాఁడు గాఁగలవాఁడని తొల్లి యెఱింగి త్రికాలవేదియైన కృష్ణుం డయోమయంబుగా భీమ ప్రతిరూపంబు సేయించి సంగ్రహించి నిగూఢ ప్రకారంబునం దత్ప్రదేశంబునకుఁ దెప్పించినవాఁడు గావున గ్రక్కున నయ్యినుపరూపు పజ్జగతీశ్వరుం జేర నిలిపె; నిలిపిన నది భీమసేనుండ కాఁ దలంచి.** **129**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు; ఇట్టివాఁడు= ఇలాంటివాడు; కాఁగలవాఁడు+అని= కాబోతాడని (ఇట్లాంటి పని ఏదో చేయబోతాడని); త్రికాల వేదియైన= మూడు కాలాలు తెలిసిన; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; తొల్లి+ఎఱింగి= ముందుగానే గుర్తించినవాడై; అయోమయంబుగాన్= ఇనుముతో; భీముని= భీముడి; ప్రతిరూపంబు= విగ్రహం; చేయించి; సంగ్రహించి= తీసికొని; నిగూఢ= రహస్య; ప్రకారంబునన్= పద్ధతిలో; తద్+ప్రదేశంబునకున్= ఆ స్థలానికి; తెప్పించినవాఁడు కావునన్= తెప్పించి ఉన్నాడు కాబట్టి; గ్రక్కునన్= వెంటనే; ఆ+ఇనురూపు= ఇనుప విగ్రహాన్ని; ఆ+జగత్+ఈశ్వరున్= రాజు దగ్గరికి; చేరన్+నిలిపెన్= చేర్చాడు; నిలిపినన్= అట్లా ఉంచగా; అది= ఆ విగ్రహం; భీమసేనుండు+అ+కాన్+తలంచి= భీముడే అని అనుకొని.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు భూత భవిష్యత్ వర్తమానాలు మూడూ తెలిసిన మహాత్ముడు కాబట్టి ధృతరాష్ట్రుడు ఇట్లాంటి పని ఏదో చేయబోతాడని ఊహించి ఇనుముతో భీముడి విగ్రహాన్ని తయారుచేయించి రహస్యంగా అక్కడికి తీసికొనివచ్చి పెట్టుకొని ఉండటంచేత వెంటనే ఆ విగ్రహాన్ని రాజు ముందరికి జరిపాడు. అట్లా విగ్రహాన్ని ఉంచగా ఆ విగ్రహమే భీమసేను డనుకొని (తరువాతి పద్యంతో అన్వయం).

క. **కోపం బుత్కటమై యా । రూపము నిరుగేలఁ బట్టి క్రూరత ఘోరా**
టోపం బెసకమెసఁగ నా । భూపతి వెసఁ గౌఁగిలించి పొలుపఱ విఱిచెన్. **130**

ప్రతిపదార్థం: కోపంబు= కోపం; ఉత్కటము+ఐ= అధికం కాగా; ఆ రూపమున్= ఆ విగ్రహాన్ని; ఇరుకేలన్+పట్టి= రెండు చేతులతోనూ అదుముకొని; క్రూరతన్= అతి క్రూరంగా; ఘోర= భయంకరమైన; ఆటోపంబు= వేగం; ఎసకము= విజృంభణ; ఎసఁగన్= అతిశయించగా; ఆ భూపతి= ఆ రాజు; వెసన్= క్షణంలో ఆలస్యం చేయకుండా; కౌగిలించి= కౌగిలించుకొని; పొలుపు+అఱన్= (ఆ విగ్రహం) అందం నశించేలా (ముక్కలయ్యేలా); విఱిచెన్= విరిచివేశాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు కోపం అతిశయించగా, ఆ విగ్రహాన్ని రెండు చేతులమధ్యా అదుముకొని అతిక్రూరంగా భయంకరమైన వేగంతో విజృంభణతో క్షణం ఆలస్యంచేయకుండా పొదువుకొని ఆ విగ్రహం ముక్కలయ్యేటట్లు విరిచిపారవేశాడు.

విశేషం: ఎంత వయస్సు ముదిరినా కామక్రోధాది గుణాలు నశించవనటానికి ధృతరాష్ట్రుని ఈ పని మంచి నిదర్శనం. విదురుడు, వ్యాసుడు చేసిన బోధలన్నీ నిష్ఫలమయ్యాయి. ఇంద్రియాలు మనస్సుకంటే బలవత్తరమైనవి అనటానికి నిరూపణమే ధృతరాష్ట్రుని ఈ క్రూరచేష్ట, అతని బలమూ భయంకరమైనదే.

లయవిభాతి:

పెరుఁగఁగ నిజాంగములు సరభసపరిస్ఫురణ । మరుదుగ జనావలులు నిరుపమవిధం బి
న్నరపతి బలంబనఁగఁ గరయుగముతోలవియ । నురము సదియం బెలుచఁ దొరఁగఁగఁ బొరిన్ నె
త్తురులు ముఖ రంధ్రములఁ బరవశత మానసము । బొరయుటకుఁ జొచ్చియును సరిగొనఁగఁ గంటిన్
వరసుతున కిప్పుడను పరమపదవిన్ మగుడఁ । గురున్నపతి యా ప్రతిమఁ బొరి నిటులు పుచ్చెన్. **131**

ప్రతిపదార్థం: నిజ+అంగములు= తన అవయవాలు; పెరుఁగఁగన్= ఛిన్నములుకాగా; సరభస పరిస్ఫురణము= గొప్పవేగంయొక్క మిక్కిలి ప్రకాశం; అరుదుగన్= ఆశ్చర్యకరం కాగా; జన+ఆవలులు= అక్కడచేరిన జనాలు; ఈ+నరపతి+బలంబు= ఈ రాజు శక్తి; నిరుపమ+విధంబు+అనఁగన్= అసామాన్యమైనది అంటుండగా; కురున్నపతి= ధృతరాష్ట్రుడు; ఆ ప్రతిమన్= ఆ

విగ్రహాన్ని; పొరిన్= దృఢంగా; ఇటులు= ఇట్లాగ; పుచ్చెన్= గట్టిగా అదుముకొన్నాడు; కరయుగముతో లవియన్= రెండు చేతులతో కౌగిలించుకొని అదుమగా; ఉరము= రొమ్ము; చదియన్= చిట్లగా; పొరిన్= మిక్కిలిగా; నెత్తురులు= రక్తం; పెలుచన్= అత్యధికంగా; ముఖరంధ్రములు= ముఖంలోని రంధ్రాలవెంబడి; తొరఁగఁగన్= కారుతుండగా; మానసము= మనస్సు; పరవశతన్+పొరయుటకున్+చొచ్చియును= అదుపుతప్పిపోవటానికి సిద్ధంగా ఉన్నా; (ఈ భీముడిని) సరిగొనఁ గన్+కంటిన్= చంపగలిగాను; వరసుతునకున్= దుర్యోధనుడికి; పరమపదవిన్+మగుడన్= పరమపదవి (మోక్షం)ని చేరటం; ఇప్పుడు+అనున్= ఇప్పుడే - అంటున్నాడు.

తాత్పర్యం: అట్లా ఆ విగ్రహాన్ని అందిపుచ్చుకొన్న ధృతరాష్ట్రుడి అవయవాలు ఛిన్నములుకాగా; కాంతిమంతంగా వ్యాకోచించటం మొదలు పెట్టాయి. చూస్తున్న జనాలు ఈ రాజు బలం నిరుపమానమైనదని అంటుండగానే రెండు చేతుల తోలు లేచిపోయింది. ఆ కౌగిలిలో ఆ బొమ్మ ముక్కలైపోయింది. ధృతరాష్ట్రుడి రొమ్ము చిట్లిపోయింది. మిక్కిలి రక్తం ధారలు ముఖంలోని అన్ని రంధ్రాల ద్వారా చిమ్మటం ప్రారంభమయింది. మనసు అదుపు తప్పే స్థితిలో ధృతరాష్ట్రుడు మూర్ఛలో పడిపోతున్నాడు. ఇప్పుడు నేను నా కొడుకు మృతికి బదులు తీర్చుకోగలిగాను అనే ఉల్లాస స్థితిలో ధృతరాష్ట్రుడు ఆ ప్రతిమను మరల విధ్వంసము చేశాడు.

విశేషం: కొడుకు పగను తండ్రి తీర్చగలిగాడు- ఇది ధృతరాష్ట్రుడికి తృప్తిని కలిగిస్తున్న అంశం. ధృతరాష్ట్రుడి రాజ్యలోభం అంత భయంకరమైన వ్యసనం. అతడి ఈ చర్యద్వారా మనిషిలోని దుర్గుణాలు చిరకాలం మనిషిని ఎట్లా వదలవో అర్థం చేసికొనవచ్చును.

లయవిభాతివృత్తంలోని ప్రతిపాదానికీ న, స, న, న, స, న, న, న - అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ 10, 19, 28 అక్షరాలకూ యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. ఇత్తెఱంగున దశసహస్రసామజ సమానబలుండగు నయ్యంధనృపతి గంధవహనందన ప్రతిరూపంబు భగ్నంబు సేసి పెంపున నెడఁద నిర్భర హర్షంబు నొందియు మెఱమెచ్చునకై భీమునిం బేర్కొని హాహాకారంబు లెసంగ రోదనంబు సేసినఁ జిఱునవ్వునం దన వదనకమలం బొప్పం గమలనాభుం డతని కిట్లనియె.132

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; దశసహస్ర= పదివేల; సామజసమాన= ఏనుగులతో సమానమైన; బలుండగు= బలం కలిగినవాడైన= ఆ+అంధ నృపతి= ఆ గ్రుడ్డి మహారాజు; గంధవహనందన= వాయుకుమారుడి; ప్రతిరూపంబున్= విగ్రహాన్ని;= భగ్నంబు+చేసి= విరుగగొట్టి; పెంపున్= మిక్కిలిగా; ఎడఁదన్= హృదయంలో; నిర్భర= అధికమైన; హర్షంబున్+ ఒందియున్= సంతోషం పొందికూడా; మెఱమెచ్చునకై= అందరూ ఏమనుకొంటారోనని (ముఖప్రీతికోసం); భీమునిన్+పేర్కొని= భీముడిని పేరుపెట్టి పిలుస్తూ; హాహాకారంబులు+ఎసంగన్= హాహాకారాలు పుట్టగా; రోదనంబు+చేసినన్= ఏడ్వగా; చిఱునవ్వునన్= చిరునవ్వుతో; తన= తనయొక్క; వదనకమలంబు+ఒప్పన్= కమలంవంటి ముఖం ప్రకాశించగా; కమలనాభుఁడు= పద్మనాభుడైన కృష్ణుడు; అతనికిన్= ధృతరాష్ట్రునితో; ఇట్లనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా పదివేల ఏనుగుల బలమున్న ఆ గ్రుడ్డి మహారాజు భీముడి విగ్రహాన్ని విరుగగొట్టి అత్యంత సంతోషం పొందిన హృదయంతో ఉండి కూడా అందరూ ఏమనుకుంటారో అని ముఖప్రీతికొరకు భీముడిని పేరుపెట్టి పిలుస్తూ హాహాకారాలు చేస్తూ ఏడుపులు మొదలుపెట్టాడు. అది చూచి చిరునవ్వుతో తన ముఖకమలం ప్రకాశిస్తుండగా శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ధృతరాష్ట్రుడి బలం పదివేల ఏనుగుల బలంతో సమానమైనదట- అంటే నిజంగా భీముడు ఆ కౌగిలిలో చిక్కి ఉంటే బ్రతికేవాడుకాడని అర్థం. అందుకే 'ధృతరాష్ట్రుడి కౌగిలి' అనేమాట లోకంలో పుట్టింది. కపటపు కౌగిలింత అనే అర్థంలో ఆ ప్రయోగం రూఢి కెక్కింది.

తే. **'అడల నేటికి? నీచేతఁ బడఁడు భీముఁ। డిపుడు భంజింపఁ బడినది యినుపరూపు**
వినుము నీ కోప మెఱిఁగియ వెనుక కతనిఁ। దిగిచి యేను నీ ముందట దీని నిడివి. **133**

ప్రతిపదార్థం: అడలన్= ఏడవటం; ఏటికిన్?= ఎందుకు?; భీముఁడు= భీమసేనుడు; నీ చేతన్= నీ చేతిలో; పడఁడు= చావలేదు; ఇపుడు= ఇప్పుడు; భంజింపన్+పడినది= విరగగొట్టబడినది; ఇనుపరూపు= ఇనుముతో చేసిన విగ్రహం; వినుము= (ఏం చేశానో చెబుతాను వినుము); నీ కోపము= నీ కెంతకోపం ఉందో; ఎఱిఁగియ= తెలిసే; అతనిన్= ఆ భీముడిని; వెనుకకున్ తిగిచి= వెనుకకు నిలిపి; ఏను= నేను; నీ ముందటన్= నీ ముందర; దీనిన్+ఇడితిన్= ఈ బొమ్మను ఉంచాను.

తాత్పర్యం: 'మహారాజా! ఎందుకు ఏడుస్తావు? భీముడు నీచేతిలో చావలేదు లెమ్ము. ఇపుడు నీవు విరచింది ఆ భీముడి ప్రతిరూపమైన ఇనుప విగ్రహాన్ని. నీకింత కోపం ఉన్నదని ఎరిగినవాడిని కాబట్టే భీముడిని వెనుకకు దాటి నీ ముందర ఈ విగ్రహాన్ని జరిపాను.

క. **బలమున నీతో దొరయఁగ। నిల నెవ్వఁడు గలఁడు? నీ మహిత భుజ శాఖల్**
తలఁపఁగఁ బ్రళయాంతకు దం। ష్ట్రలు వీనిం దగిలి వశమె? చాకుండంగన్. **134**

ప్రతిపదార్థం: బలమునన్= బలంలో; నీతోన్+దొరయఁగన్= నీతో సమానంకావటానికి; ఇలన్= ఈ భూమిలో; ఎవ్వఁడు+కలఁడు?= ఎవడు ఉన్నాడు?; తలఁపగన్= ఆలోచిస్తే; మహిత భుజశాఖల్= నీ యొక్క గొప్పవైన కొమ్మలవంటి భుజాలు; ప్రళయాంతకు= ప్రళయకాల రుద్రుడి; దంష్ట్రలు= కోరలు; వీనిన్+తగిలి= వీటితో తగులుకొని; చాకుండగన్= చావకా+ఉండా ఉండేందుకు; వశమె?= సాధ్యమా?.

తాత్పర్యం: రాజా! బలంలో నిన్ను సమీపించటానికి ఈ భూమిలో ఎవరున్నారు? నీ భుజశాఖలు ప్రళయకాలంలో విజృంభించిన రుద్రుడి కోరల్లాంటివి. వాటిని తగిలిన మనిషి మరలా బ్రతకటం సాధ్యమా!

విశేషం: అలం: రూపకం.

వ. **కావున** **135**

తాత్పర్యం: అందుచేత

ఉపేంద్రవజ్రావృత్తము:

మరుత్తనూజుం బరిమార్పఁ జూచుం। బరిస్ఫురత్కోప నిబద్ధుఁడై యి
ద్ధరావిభుండం చిది తల్గనే సం। స్మరించి యీ కోపు నమర్చికొంటిన్. **136**

ప్రతిపదార్థం: ఈ+ధరావిభుండు= ఈ భూవల్లభుడు; పరిస్ఫురత్= మిక్కిలి ప్రకాశించేటువంటి; కోప= కోపంచేత; నిబద్ధుఁడై= కట్టబడినవాడై; మరుత్+తనూజున్= వాయుకుమారుడిని; పరిమార్పన్+చూచున్= చంపటానికి ప్రయత్నిస్తాడు (అని ఆలోచించి); ఇది= ఈ అపాయం; తల్గన్= తప్పించుకోవటానికే; సంస్మరించి= బాగా ఆలోచించి; ఈ కోపున్= ఈ విధానాన్ని ఈ బొమ్మను; అమర్చికొంటిన్= ఏర్పాటు చేసికొన్నాను.

తాత్పర్యం: ఈ రాజు మిక్కిలికోపానికి దాసుడై భీముడిని తప్పకుండా చంపటానికి ప్రయత్నిస్తాడని ఊహించి ఈ అపాయం తప్పించటానికై బాగా ఆలోచించి ఈ బొమ్మను సిద్ధంగా ఉంచుకొన్నాను.

విశేషం: ఉపేంద్రవజ్రలో ప్రతిపాదానికీ పదకొండు అక్షరాలుంటాయి. జ, త, జ, గ, గ అనే గణాలుంటాయి. 1-8 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనిమయమం కలదు.

తే. తనయ శోకాతురుండవై ధర్మ మెడలి । యనిలసుతుఁ దెగటార్చెదనని తలంచి
తట్టి పనియేల నీ చేతనగు? విధాతృ । లీలఁ బరికింప నేరక బేలవైతి. 137

ప్రతిపదార్థం: తనయ= కొడుకులు చనిపోయిన; శోక+ఆతురుండవై= దుఃఖంచేత పుట్టిన తొందరపాటుతో; ధర్మము+ఎడలి= ధర్మం విడిచిపెట్టి; అనిలసుతున్= వాయుకుమారుడిని; తెగటార్చెదను+అని తలంచితి(వి)= చంపేస్తానని ఆలోచించావు; అట్టి పని= అట్లా చంపటం; నీచేత; ఏల+అగున్?= ఎందుకు వీలవుతుంది?; విధాతృలీలన్= సృష్టికర్త లీలను; పరికింపన్+నేరక= తెలుసుకోలేక; బేలవు+ఐతి(వి)= అమాయకుడివి అయ్యావు.

తాత్పర్యం: కొడుకులు చనిపోయారన్న శోకంతో పుట్టిన తొందరపాటుతో ధర్మం విడిచిపెట్టి వాయుకుమారుడిని చంపివేద్దామని ఆలోచించావు. అట్లా చంపటం నీ చేతిలో ఉందా! సృష్టికర్త లీలను గుర్తించలేక నీవే అపహాస్యం పాలయ్యావు.

వ. అదియునుం గాక. 138

తాత్పర్యం: అంతే కాకుండా.

క. వినుమొకని నేల భవదను । జుని పుత్రుల నెల్లఁ జంపఁ జొప్పడినను నీ
తనయులు మగుడఁగ వత్తురె? । యనయము పాపంబు సేసి తాఱడిఁ బోవన్. 139

ప్రతిపదార్థం: వినుము= విను; ఒకనిన్+ఏల= ఒకడిని మాత్రం ఏమిటి?; భవత్+అనుజుని పుత్రులన్+ఎల్లన్= నీ తమ్ముడి కొడుకులను అందరినీ; చంపన్+చొప్పడినను= చంపటానికి సిద్ధపడినా; నీ తనయులు= నీ కొడుకులు; మగుడఁగన్+వత్తురె?= మరలి వస్తారా?; అనయము= మిక్కిలిదైన; పాపంబు= పాపాన్ని; ఆఱడిన్+పోవన్= నిందబడేటట్టు; చేసితి(వి)= చేశావు.

తాత్పర్యం: రాజా! వినుము. ఈ ఒక్కడిని మాత్రం ఏమిటి? పాండురాజు కుమారులందరినీ చంపినా నీ కొడుకులు తిరిగివస్తారా? శాశ్వతమైన నిందమాత్రం మిగిలేటట్లు చాలా పెద్ద పాపం చేశావు.

స్రగ్విణీ వృత్తము:

ఏము నీ పుత్రుచే నెన్నియేన్ భంగులన్ । వేమఱుం బాటు నీ వెంట భావించుచున్
సామసంపాదివై సైఁపు మాతప్పులన్ । భీమహత్త్వంబు సంధిల్లు నీ కిమ్మెయిన్.' 140

ప్రతిపదార్థం: ఏము= మేము (నేను, పాండవులు); నీ పుత్రుచేన్= నీ కొడుకుచేతిలో; ఎన్నియేన్+భంగులన్= ఎన్నో రీతులలో; వేమఱున్= మాటిమాటికి; పాటు= ఆపదను (పొందినా); నీ వెంటన్= నీవు మా వెంట ఉన్నావని; భావించుచున్= భావిస్తూ (గడిపాము); (కనీసం ఇప్పుడైనా); మా తప్పులన్= మేము చేసిన తప్పులను; సామ సంపాదివై= అనుకూల్యాన్ని సాధించేవాడివై;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సైఁపు= సహించుము (క్షమించు); నీకున్+ఈ+మెయిన్= నీకు ఈ విధంగానైనా; ధీ మహత్త్వంబు= జ్ఞానంతో కూడిన బుద్ధి వైభవం; సంధిల్లున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: నేను, పాండవులు నీ కుమారుడి చేతిలో ఎన్నో రీతులలో మాటిమాటికి ఆపదపొందినా నీవు మా వెంట ఉన్నావని భావిస్తూ గడిపాము. కనీసం ఇప్పుడైనా నీవు మా తప్పులను సామరస్యం సాధించటంకొరకైనా క్షమించుము. నీకు ఈ విధంగానైనా జ్ఞానంతో కూడిన బుద్ధి వైభవం సిద్ధిస్తుంది.

విశేషం: స్రగ్విణీవృత్తంలో ప్రతిపాదానికీ ర, ర, ర, ర గణాలుంటాయి. 1-7 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. అని చెప్పె నప్పుడు ధృతరాష్ట్రు పరిచారకు లతని యవయంబుల రుధిరంబు ప్రక్షాళనంబున నపనయింపం దలంచి జలంబులు దెచ్చి యెఱింగించిన నజ్జనపతి యప్పని యాచరించె. నప్పండరీకాక్షుండు వెండియు నవ్విభున కిట్లనియె. 141

ప్రతిపదార్థం: అని= అని ఈ విధంగా; చెప్పెన్= కృష్ణుడు చెప్పాడు; అప్పుడు= ఆ తరువాత; ధృతరాష్ట్రు పరిచారకులు= ధృతరాష్ట్రుని సేవకులు; అతని= ఆ రాజుయొక్క; అవయవంబుల రుధిరంబు= అవయవాలకు అంటిన రక్తాన్ని; ప్రక్షాళనంబునన్= కడగటం ద్వారా; అపనయింపన్= పోగొట్టటానికి; తలంచి= ఆలోచించి; జలంబులు= నీళ్ళు; తెచ్చి; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+జనపతి= ఆ రాజు; ఆ+పని= ఆపని; ఆచరించెన్= చేశాడు; ఆ+పుండరీకాక్షుండు= ఆ శ్వేతకమలనేత్రుడైన కృష్ణుడు; వెండియున్= మళ్ళీ; ఆ+విభునకున్= ఆ రాజుతో; ఇట్లనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని కృష్ణుడు చెప్పాడు. ఆ తరువాత పరిచారకులు అతడి ఒంటికి అంటిన రక్తాన్ని కడిగివేయటానికై నీళ్ళు తెచ్చి ఆ విషయం రాజుకు తెలిపారు. ధృతరాష్ట్రుడు ఒడలంతా కడుక్కొన్నాడు. అప్పుడు కృష్ణుడు మళ్ళీ ఇట్లా అన్నాడు.

సీ. 'జగతీశ! వేదముల్ సదివితి శాస్త్రముల్ । వింటి వర్తిల్లితి వృద్ధగోష్ఠి
నఖిలపురాణ పర్యాలోచనము సేసి । తెల్ల ధర్మంబులు నెఱుఁగు దిట్లు
నీ తప్పు దలఁపక నెవ్వగఁ బొందెదు । కనలెద వేను శంతనసుతుండు
గురుఁడును విదురుండుఁ గూర్చొని కూర్చొని । చెవులఁ బోయమె సవిశేషకార్య

తే. వచనములు? సంజయుఁడు పెక్కువరుస లుభయ । బలవిధంబులు దెలియఁగఁ బలుకఁ డెట్లు?
నీకు నా బుద్ధులన్నియు నెమ్మనమునఁ । జేర్పఁబోలవ యింకేమి సేయవచ్చు? 142

ప్రతిపదార్థం: జగతీశ!= ఓ రాజా!; వేదముల్+చదివితి(వి)= నీవు వేదాలు చదివావు; శాస్త్రముల్+వింటి(వి)= శాస్త్రాలు విన్నావు; వృద్ధగోష్ఠిన్= పెద్దల చర్చలలో; వర్తిల్లితి(వి)= ఉన్నావు; అఖిల= అన్ని; పురాణ= పురాణాలను; పర్యాలోచనముచేసితి(వి)= బాగా ఆలోచించి అర్థంచేసుకొన్నావు; ఎల్ల ధర్మంబులు= అన్ని ధర్మాలను; ఎఱుగుదు(వు)= తెలిసినవాడివి; ఇట్లు= ఈ విధంగా; నీ తప్పున్+తలఁపక= నీ తప్పును గురించి ఆలోచించకుండా; నెఱ+వగన్+పొందెదు= మిక్కిలి దుఃఖాన్ని పొందుతున్నావు; కనలెద(వు)= లోలోపలి కోపంతో మండుతున్నావు; నేను= (రాయబార సమయంలో) నేను; శంతనసుతుండు= భీష్ముడు; గురుఁడును= ద్రోణాచార్యుడు; విదురుండు= విదురుడు; సవిశేష కార్యవచనములు= మిక్కిలి ప్రశస్తమైన చేయదగిన

పనులను గురించి మంచిమాటలు; కూర్కొని కూర్కొని= కూరికూరి; చెవులన్+పోయమె?= చెవులలో పోయలేదా?; సంజయుడు; పెక్కువరుసలు= చాలాసార్లు; ఉభయ బల విధంబులు= కురుపాండవ బలాలలోని తేడాలను; తెలియఁగన్+పలుకఁడె?= నీకు వివరంగా చెప్పలేదూ?; ఎట్లు= ఏ విధంగా; నీకున్; ఆ బుద్ధులు+అన్నియున్= ఆ నీతివాక్యాలన్నీ; నెమ్మనమునన్= (నీ) మనస్సులో; చేర్పన్+పోలవు+అ= దూరలేకపోయాయి; ఇంకన్+ఏమి+చేయవచ్చున్?= ఇక మనం ఏం చేయగలం?

తాత్పర్యం: 'ఓ రాజా! నీవు వేదాలు చదివినవాడివి. శాస్త్రాలు విన్నావు. పెద్దల చర్చలలో పాల్గొన్నవాడివి. అన్ని పురాణాలను అవలోకనం చేసి వాటి సారాన్ని గ్రహించినవాడివి. అన్ని ధర్మాలను ఎరిగినవాడివి. ఈ రీతిగా నీ తప్పును నీవు గుర్తించకుండా ఊరికే దుఃఖాన్ని పొందుతున్నావు. కోపపడుతున్నావు. నేను, భీష్ముడు, ద్రోణుడు, విదురుడు ఎన్ని మార్లు ఏంచేయాలో ఎట్లా చేయాలో నీ చెవుల్లో కూరికూరి నూరిపోశాము కదా! సంజయుడు కురుపాండవ బలాలలోని తేడాను ఎన్ని సార్లు నీకు వివరంగా చెప్పలేదు? ఆ బుద్ధులన్నీ నీ మనసులో ఏ మాత్రం దూరలేకపోయాయి. ఇక మనం ఏమి చేయగలం?

క. భీమార్జునుల రణసము । ద్దామత్వం బెఱిఁగి యెఱిఁగి తగునే తొడరం
గా మనుజుల కవ్వీరుల? । నేమనఁగల దింక నేల యీ చందంబుల్? 143

ప్రతిపదార్థం: భీమార్జునుల= భీముడు, అర్జునుడు - వీరి; రణ= యుద్ధ క్రీడలోని; సమ్+ఉద్దామత్వంబు= అతిశయించిన స్వాతంత్ర్యాన్ని; ఎఱిఁగి+ఎఱిఁగి= తెలిసి తెలిసీ; మనుజులకున్= సామాన్యులకు; ఆ+వీరులన్= ఆ ఇరువురినీ (ఆ మహావీరులిద్దరినీ); తొడరంగాన్= ఎదిరింపగా; తగునే?= అవుతుందా?; ఏమనఁగలదు?= ఏమి అనగలం?; ఇంకన్= ఇక; ఈ చందంబుల్= ఈ రీతులు (ఇట్లా శోకించటం); ఏల= ఎందుకు?

తాత్పర్యం: భీమార్జునులు రణ క్రీడలో ఎట్లా లోకోత్తరంగా స్వతంత్రిస్తారో తెలిసి తెలిసీ సామాన్యులు వారిని ఎదిరించటం సాధ్యమవుతుందా! ఇక మనం ఏమనగలం? మరింక ఎందు కిట్లా శోకాలు పెట్టటం?

క. తన మేలుఁ గీడుఁ దా మదిఁ । గనుచు హితులు సెప్ప బుద్ధిఁ గైకొని శుభముం
గొనకొని నడపు పతికి వ । చ్చునె పశ్చాత్తాప మెట్టి చోట? నరేంద్రా! 144

ప్రతిపదార్థం: తనమేలున్= తనకు ఏదిమేలో దానిని; కీడున్= తనకు ఏది చెడుపో దానిని; తాన్+మదిన్+కనుచున్= తాను స్వయంగా తెలిసికొంటూ; హితులు చెప్పు= పెద్దలు స్నేహితులు చెప్పే; బుద్ధిన్+కైకొని= నీతి వాక్యాలను స్వీకరించి; శుభమున్+గొనకొని= శుభాన్ని సాధించి; నడపు= కార్యాన్ని నిర్వహించే; పతికిన్= రాజుకు; ఎట్టిచోటన్= ఏ సందర్భంలోనూ; నరేంద్రా!= ఓ రాజా!; పశ్చాత్తాపము= చేసిన తప్పునకు చింతించటం అన్నది; వచ్చునె?= కలుగుతుందా?

తాత్పర్యం: తన మంచి చెడులను తానే స్వయంగా గుర్తిస్తూ పెద్దలు స్నేహితులు చెప్పే నీతి వాక్యాలను స్వీకరించి శుభాన్ని సాధించి కార్యం నిర్వహించే రాజుకు ఎప్పుడూ చేసిన తప్పునకు చింతించవలసిన అవసరం కలుగదు.

ప్రణవ వృత్తము:

నీ యుల్లం బొక నియతిం గార్యం । బాయత్తంబుగ ననుసంధింపం
జేయం జాలవు చెడు తెర్పుం బోఁ । బాయం ద్రోవవు బలిమిం బుత్రున్. 145

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నీ+ఉల్లంబు= నీ హృదయం; ఒక నియతిన్= ఒక నియమానికి లోబడి; కార్యంబు= పనిని; ఆయత్తంబుగన్= సొంతంగా; అనుసంధింపన్= సిద్ధింపచేసుకోవటానికి; చేయన్= నీ చిత్తాన్ని సిద్ధపరచ; చాలవు= సమర్థుడివి కావు; బలిమిన్= బలంతో; పుత్రున్= నీ కొడుకును; చెడుతెర్వున్= చెడ్డమార్గంలో; పోన్= పోతుండగా; పాయక+త్రోవవు= ఆదారి తప్పించ జాలకపోయావు.

తాత్పర్యం: నీ మనసును సొంతంగా ఒక నియమానికి లోబడి ఎన్నడూ ఒక పనిని చేసికొనటానికి నీవు సిద్ధంచేయలేదు. (ఎప్పుడూ ఇతరులమీద ఆధారపడే పని చేశావు). నీ కొడుకు చెడుదారిలో పోతున్నపుడు ఆ దారిని తప్పించిన వాడివీ కావు (నీవు చేసిన ఉపేక్షా రూపమైన తప్పు ఇదే. అందుకే కౌరవ వంశం పతనమైంది).

విశేషం: 'ఆత్మబుద్ధి స్సుఖం చైవ' అని పెద్దల మాట. ఏ పనిచేసినా నిర్ణయం తీసుకున్నా తనకు తానుగా తీసికొనాలి. పరులమీద ఆధారపడి జీవించేవాడు ఎప్పుడూ వినాశం పొందుతాడు. (పరబుద్ధిర్వినాశకః) - ధృతరాష్ట్ర దుర్యోధనులు ఆత్మబుద్ధి నిష్ఠితులు కారు. వారిని ప్రబోధించిన పరబుద్ధులు దుర్మార్గులు తప్పా సాధుసత్పురుషులు కారు. ధృతరాష్ట్రుడికి రాజ్యలోభం, పుత్రలోభం రెండూ ఉన్నాయి. అందుకే పుత్రుడి దోషాలను సైరించటమే కాక 'ఉపేక్షిస్తూ' వచ్చాడు. దానినే కృష్ణుడు ఇక్కడ గుర్తు చేస్తున్నాడు.

వృత్తలక్షణం: ప్రణవవృత్తంలో ప్రతిపాదానికీ మ, న, య, గ అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికీ ఆరవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

తే. ద్యూతమునగెల్పు నెపమున నుఱికి పుణ్య । కాంతఁ దల పట్టికొని సభాభ్యంతరమున
కీడ్చి వలువ లొలుచుటయు నెఱిఁగి సుతులఁ । జంపెనని భీముఁ జంపఁ దలంపనగునె. 146

ప్రతిపదార్థం: ద్యూతమునన్= మాయాద్యూతంలో; గెల్పు నెపమునన్= గెలిచామన్న మిషతో; ఉఱికి= దూకి (పరిగెత్తి); పుణ్యకాంతన్= పతివ్రత సుమంగళి అయిన ద్రౌపదిని; తలపట్టికొని= తలపట్టి; సభాభ్యంతరమునకున్= సభలోకి; ఈడ్చి= ఈడ్చుకొనివచ్చి; వలువలు+ఊడ్చుటయున్= బట్టలు ఊడదీయటం; ఎఱిఁగి= తెలిసి; సుతులన్= కొడుకులను; చంపెనని= చంపాడని; భీమున్+చంపన్= భీముడిని చంపటానికి; తలంపన్+అగునె= ఆలోచించవచ్చా!

తాత్పర్యం: మాయాద్యూతంలో గెలిచామనే నెపంతో పరుగెత్తిపోయి పుణ్యకాంత అయిన ద్రౌపదిని తలపట్టుకొని సభామధ్యంలోకి లాగుకొనివచ్చి బట్టలు ఊడదీసిన విషయం తెలిసి ఉండికూడా, నీ కొడుకులను చంపాడని భీముడిని నీవు చంపాలని ఆలోచించటం బాగుందా! నీవే చెప్పుము!

విశేషం: కార్యకారణ సంబంధాన్ని కృష్ణుడు వివరిస్తున్నాడు. దుర్యోధనాదులను అంతక్రూరంగా చంపటానికి సభామధ్యంలో చేసిన ప్రతిజ్ఞలు కారణం. ఆ ప్రతిజ్ఞలకు ద్రౌపదీ మానభంగం కారణం. అది తెలిసి కూడా మళ్ళీ భీముడిని చంపాలని చూడటం సమంజసం కాదని కృష్ణుడి భావం.

వ. నీ యవినీతియుం గొడుకుల దుశ్చరిత్రంబునుం దలంచి శోక రోషంబులు విడిచి శాంతుండవై యుండుమనిన నుపేంద్రునకు నన్నరేంద్రుం డిట్లనియె. 147

ప్రతిపదార్థం: నీ+అవినీతియున్= నీ అవినీతి; కొడుకుల= నీ కుమారుల; దుశ్చరిత్రంబునున్= దుష్టచరిత్రనూ; తలంచి= బాగా గుర్తుచేసుకొని; శోకరోషంబులు= శోకాన్నీ, రోషాన్నీ, విడిచి; శాంతుండవై= శాంతమూర్తిగా; ఉండుము+అనినన్= ఉండుమని చెప్పగా; ఉపేంద్రునకున్= కృష్ణునికి; ఆ+నరేంద్రుండు= ఆ మహారాజు; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నీ అవినీతినీ, నీ కొడుకుల దుష్టచరిత్రను ఒకసారి బాగా గుర్తుచేసికొమ్ము. శోకాన్ని రోషాన్ని వదలిపెట్టుము. శాంతం పొందుము' - అని కృష్ణుడు చెప్పగా ధృతరాష్ట్రు డిట్లా అన్నాడు.

జలదవృత్తము:

'నీ పలుకెల్ల నిక్కము యనింద్యగుణా! । యీ పురుషార్థహాని సుతు లీల్గుటకుం
దాపముఁ బొంది తాల్మి దిగఁ ద్రావి మహా । కోపుఁడ నైనఁ బాటిలెఁ దగుం గినియన్. 148

ప్రతిపదార్థం: అనింద్యగుణా!= ప్రశంసింపదగిన గుణాలు కలిగిన కృష్ణా!; నీ పలుకు+ఎల్లన్= నీ మాటలన్నీ; నిక్కము+అ= సత్యాలే; సుతులు= కుమారులు; ఈల్గుటకున్= చనిపోయినందువలన; తాపమున్+పొంది= బాధపొంది; తాల్మి+దిగన్+ద్రావి= ఓర్పును పోగొట్టుకొని; మహాకోపుఁడను+ఐనన్= మహాకోపం కలిగిన వాడివికాగా; ఈ పురుషార్థహాని+పాటిలెన్= ఈ ధర్మవిరుద్ధకార్యం వచ్చి పడింది; (నీవు) కినియన్= కోపగించుకోవటం; తగున్= సమంజసమైనదే.

తాత్పర్యం: 'కృష్ణా! నీవు ప్రశంసించదగిన గుణాలు మాత్రమే కలిగిన పురుషోత్తముడివి. నీ మాటలు అన్నీ సత్యాలే. కొడుకులు చనిపోయినందువలన మిక్కిలి బాధపొంది, ఓర్పును పోగొట్టుకొని మహాకోపాన్ని పొందటంవలన ఈ ధర్మహాని జరిగింది. అట్లాంటి నన్ను నీవు కోపగించటం సమంజసమే.

విశేషం: పురుషార్థాలని నాలిగింటికి పేరు - ధర్మం, అర్థం, కామం, మోక్షం. సందర్భాన్నిబట్టి ఇక్కడ 'ధర్మం' ప్రసక్తమయింది. ఇట్లా చంపాలనుకొనటం నాలోని కోపం ప్రకోపించటంచేత జరిగింది తప్ప నేను కోరి చేసినది కాదన్న విషయాన్ని మహారాజు చెప్పుతున్నాడు.

జలదవృత్తలక్షణం: ప్రతిపాదానికీ భ, ర, న, భ, గ - అనే గణాలుంటాయి. 1-10 అక్షరాలకు యతిమైత్రి - ప్రాసనియమం కలదు. దీనిని జలధరవృత్తమనీ పిలుస్తారు. (చూడండి స్త్రీ. 1.164). కొన్ని ప్రతులలో ఈ వృత్తం జలధరవృత్తంగా పేర్కొనబడి ఉన్నది.

క. తెలిసితి నీ మాటలఁ బు । త్రుల దెస నెవ్వగనెల్లఁ దొఱఁగి యనుజ పు
త్రుల నాకుఁ బ్రియ మొనర్పం । గలవారుగ నడచువాఁడఁ గంసారాతీ!' 149

ప్రతిపదార్థం: కంసారాతీ!= కంసుడి శత్రువైన కృష్ణా!; నీ మాటలన్= నీ మాటలవలన; తెలిసితిన్= జ్ఞానాన్ని పొందాను; పుత్రుల దెసన్= నా కుమారుల విషయంలో; నెవ్వగలన్+తొఱఁగి= బాధను వదలి; అనుజపుత్రులు+అ= నా తమ్ముడి కొడుకులే; నాకున్= నాకు; ప్రియము+ఒనర్పన్+కలవారుగన్= సంతోషం కలిగించగలిగే వారుగా; నడచువాఁడన్= నడుచుకొంటాను.

తాత్పర్యం: ఓ కంసవైరీ! నీ మాటలచేత 'తెలివి' ని పొందాను. నా కొడుకుల విషయంలో పడుతున్న బాధను ఇక వదలివేస్తాను. నా తమ్ముడి కుమారులే నాకు సంతోషం కలిగించగలిగేవారుగా నేను నడుచుకొంటాను.'

వ. అనుటయు నమ్మహాత్ముండు భీమార్జున నకుల సహదేవులం గానిపించినఁగ్రమంబున నమ్మానవపతి వారలం గౌఁగిలించుకొని దీవించె నప్పు డాశ్రితవత్సలుండగు శ్రీవత్సలాంఛనుండు యుయుత్సునకుఁ దదీయ సందర్శనంబు సముచిత ప్రకారంబున నడిపె నట్లు గాంచిన వణిక్కన్యాజాతునెడం బొడమిన వాత్సల్యంబున వైచిత్రవీర్యుం డతనిఁ దిగిచికొని యక్కునం జేర్చికొనియెఁ దదనంతరంబ యద్ధరణీవిభుండు ధర్మపుత్ర

ప్రభృతులగు నయ్యేవుర నుద్దేశించి 'మీరు గాంధారిం గనుం' డని పంచిన నప్పాండవేయులు పద్మనాభ పురస్సరంబుగాఁ జని వినయంబున వినతులైన నద్దేవి దీవింప నొల్లక యుల్లంబు నిజతనూజుల మరణంబునకుం దాపంబునొంద శాపంబిచ్చునదియై యజాతశత్రు నుద్దేశించిన నత్తెఱఁగు సకలప్రాణి చిత్త వృత్తంబులు దన దివ్యబోధనంబునం దేటపడం గనియెడువాఁడును మనోజవుండును సర్వలోక సంపూజ్యుండును నగు సత్యవతీ సూనుండెఱింగి తత్‌క్షణంబ సన్నిహితుండై యఖిలజనంబు లభివందనంబు సేయం గైకొనుచు నక్కోడలిం జేరి యోహో! శపింపకు శమింపుమని పలికి మఱియు నిట్లనియె. 150

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధృతరాష్ట్రుడనగా; ఆ+మహాత్ముండు= మహాత్ముడైన ఆ కృష్ణుడు; భీమార్జున నకుల సహదేవులం గానిపించినన్= భీముడిని, అర్జునుడిని, నకులుడిని, సహదేవుడిని ధృతరాష్ట్రుడి దగ్గర చూపెట్టాడు; క్రమంబునన్= వరుసగా; ఆ+మానవపతి= ఆ రాజు; వారలన్= వారిని; కౌఁగిలించుకొని దీవించెన్= కౌగిలించుకొని ఆశీర్వదించాడు; అప్పుడు= ఆశ్రిత వత్సలుండు+అగు= ఆశ్రయించినవారిని పిల్లలలాగా కాపాడే గుణమున్న; శ్రీవత్సలాంఛనుండు= శ్రీవత్సమనే పుట్టుమచ్చను గుర్తుగా కలిగిన శ్రీమహావిష్ణు రూపుడైన కృష్ణుడు; యుయుత్సునకున్= ధృతరాష్ట్రుని కుమారుడైన యుయుత్సునికి; తదీయ= ఆ ధృతరాష్ట్రుని; సందర్శనంబు= దర్శించుకోవటాన్ని; సముచిత= తగిన; ప్రకారంబునన్= విధానంలో; నడపెన్= నడిపాడు; అట్లు+కాంచిన= అలా వచ్చిచూసిన; వణిక్+కన్యాజాతుని+ఎడన్= వైశ్యకన్యాకుమారుని విషయంలో (యుయుత్సుడిపై); పొడమిన= పుట్టిన; వాత్సల్యంబునన్= కుమారత్వ భావనతో; వైచిత్రవీర్యుండు= విచిత్రవీర్యుని కుమారుడైన ధృతరాష్ట్రుడు; అతనిన్= యుయుత్సుడిని; తిగిచికొని= దగ్గరకు తీసికొని; అక్కునన్+చేర్చికొనియెన్= రొమ్ముమీద చేర్చుకున్నాడు (కౌగిలించుకొన్నాడు); తద్+అనంతంబ= ఆ తరువాత; ఆ+ధరణీవిభుండు= ఆ రాజు; ధర్మపుత్ర= ధర్మరాజు; ప్రభృతులు +అగు= మొదలైన; ఆ+ఏవురన్+ఉద్దేశించి= ఆ ఐదుగురిని చూచి (పాండవులవైపు తిరిగి); మీరు= మీరు ఐదుగురు; గాంధారిన్+కనుండు+అని= గాంధారిని చూడండి అని; పంచినన్= పంపగా; ఆ+పాండవేయులు= ఆ కుంతీకుమారులు; పద్మనాభ పురస్సరంబుగాన్= కృష్ణుడు ముందు నడుస్తుండగా; చని= వెళ్ళి; వినయంబునన్= వినయంతో; వినతులు+ఐనన్= నమస్కరించగా; ఆ+దేవీ= ఆ గాంధారి; దీవింపన్+ఒల్లక= దీవించటానికి ఇష్టపడక; ఉల్లంబు= హృదయం; నిజ తనూజుల= తన కుమారుల; మరణంబునకున్= చావుకు; తాపంబున్+ఒల్లక= దీవించటానికి ఇష్టపడక; ఉల్లంబు= హృదయం; నిజ తనూజుల= తన కుమారుల; మరణంబునకున్= చావుకు; తాపంబున్+ఒందన్= మండిపడుతుండగా; శాపంబు+ఇచ్చునది+ ఐ= శాపం ఇవ్వటానికి; అజాతశత్రున్+ఉద్దేశించిన= ఆ ధర్మరాజువైపు చూడగా (తిరుగగా); ఆ తెఱఁగున్= ఆ వైనాన్ని; సకలప్రాణి చిత్త వృత్తంబులున్= అన్ని ప్రాణుల మనసులతో జరిగే పనులను; తన= తనయొక్క; దివ్యబోధంబునన్= దివ్యజ్ఞానంలో; తేటపడన్= స్పష్టంగా; కనియెడువాఁడును= చూచేవాడూ; మనోజవుండును= మహావేగం కలగినవాడూ; సర్వలోక= లోకాలన్నిటిచేతనూ; సంపూజ్యుండును= మిక్కిలిగా గౌరవింపబడేవాడూ; అగు= అయిన; సత్యవతీసూనుండు= సత్యవతి కొడుకైన వ్యాసమహర్షి; ఎఱింగి= గుర్తించి; తద్+క్షణంబు+అ= వెంటనే; సన్నిహితుండు+ఐ= ప్రత్యక్షమై; అఖిల జనంబులు= అక్కడున్న వారందరూ; అభివందనంబు= నమస్కారాలు; చేయన్= చేస్తుండగా; కైకొనుచున్= స్వీకరిస్తూ; ఆ+కోడలిన్+చేరి= కోడలైన గాంధారిని సమీపించి; ఓహో!= ఓ గాంధారీ!; శపింపకు(ము)= శాపం పెట్టవద్దు; శమింపుము+అని+పలికి= శాంతించుము అని చెప్పి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అన్నాడు. అపుడు కృష్ణుడు భీమార్జున నకుల సహదేవులను ధృతరాష్ట్రుడి దగ్గర నిలబెట్టాడు. వరుసగా అందరినీ ఆ రాజు కౌగిలించుకొని దీవించాడు. ఆశ్రయించినవారిని కాపాడే ఆ కృష్ణుడు చివరగా యుయుత్సుడిని ధృతరాష్ట్రుడి వద్దకు పంపాడు. (యుయుత్సుడు వైశ్యకన్యకు ధృతరాష్ట్రుడికి జన్మించినవాడు - ధార్తరాష్ట్రుడే.) అతడిని చూడగానే కుమారుడు లభించాడని ఎంతో ఆనందం పొంది ఆ రాజు యుయుత్సుడిని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దగ్గర చేర్చుకొని కౌగిలించుకొన్నాడు. ఆ తరువాత మహారాజు పాండవుల వైపు తిరిగి 'మీరు గాంధారీదేవిని చూడండి' అని అన్నాడు. ఆ కుంతీకుమారులు పెదతండ్రిగారి అనుజ్ఞ మేరకు శ్రీకృష్ణుడు ముందు నడుస్తుండగా వెళ్ళి గాంధారికి వినయంతో నమస్కరించారు. అపుడు ఆమె ఆశీర్వదించటానికి ఇష్టపడక తన హృదయం మరణించిన కుమారులను గురించిన శోకంతో మండిపడుతుండగా శాపం ఇవ్వటానికి ధర్మరాజువైపు తిరిగింది. ప్రాణులందరి చిత్తాలలోనూ ఏ వికారాలు ఏర్పడుతాయో ఎట్లా ప్రవర్తిస్తారో తన దివ్యజ్ఞానంతో స్పష్టంగా చూడగలిగినవాడు, వ్యాసమహర్షి అక్కడ ప్రత్యక్షమయ్యాడు. మనోవేగం ఉన్నవాడు. అన్ని లోకాలలోనూ మిక్కిలిగా గౌరవించబడేవాడు; అట్లాంటి వ్యాసమహర్షి అక్కడ ప్రత్యక్షం కాగానే జనులందరూ ఆయనకు నమస్కరించారు. వారిని ఆశీర్వదిస్తూ మహర్షి కోడలైన గాంధారివద్దకు చేరి 'ఓ గాంధారీ! శపించవద్దు. శాంతించుము' అని అంటూ ఇంకా ఇట్లా చెప్పాడు.

విశేషం: భీముడిని కౌగిలించుకొనే సమయంలో శ్రీకృష్ణుడు అడ్డుపడ్డాడు. ఇనుపబొమ్మను పంపించి భీముడిని కాపాడాడు. ఇప్పుడు గాంధారి శాపం ఇవ్వకుండా వ్యాసమహర్షి కాపాడుతున్నాడు. గాంధారి పరమపతివ్రత. భర్తకొరకు కన్నులు మూసికొని అంధవ్రతదీక్ష చేయటమే ఆమె తపస్సు. అందుచేత మహర్షి కాపాడాడు. 'దైవం' అనుకూలమైనపుడే 'మనిషి' విజయం పొందగలడనటానికి ఇట్లాంటి సంఘటనలే నిరూపణం.

ధర్మజుని శపింపఁ బూనిన గాంధారిని వ్యాసుఁడూరార్చుట (సం. 11-13-6)

సీ. **'పాండవేయాగ్రజుపై నల్కమానుము। రాజసంబేల? యీ రాజు ధర్మ**
పరుఁడు నీ వించుక పాటించి వినవమ్మ। చెప్పెదఁ గౌరవశ్రేష్ఠుఁ డనికిఁ
జనుచుండి 'తల్లి! దీవన యిమ్ము జయముగా। నా'కని పలికిన నా కుమారు
తోడ నీ పేర్మికి నీడుగాఁ గొడుక! యె। క్కడనుండు ధర్మ మక్కడకు జయము

తే. **సేరు ననవె? భూరి ఘోర యుద్ధంబున। గెలుపుగొనిరి గాన తలఁప ధర్మ**
పరుల కాఁగవలయుఁ బాండుతనూజు ల। సూయ లేని బుద్ధిఁ జూడు మెట్లు. **151**

ప్రతిపదార్థం: పాండవేయ+అగ్రజపైన్= కుంతీకుమారులలో పెద్దవాడైన ధర్మరాజుపైన; అల్కమానుము= కోపం విడిచిపెట్టు; రాజసంబు+ఏల?= ఈ రజోగుణం ఎందుకు?; ఈ రాజు= ఈ ధర్మరాజు; ధర్మపరుఁడు= ధర్మదీక్ష కలిగినవాడు; నీవు= అంచేత నువ్వు; ఇంచుక= కొంచెం; పాటించి= శ్రద్ధతో; వినవమ్మ!= వినుతల్లీ!; చెప్పెదన్= ఎందుకు క్షమించాలో చెబుతాను; కౌరవశ్రేష్ఠుఁడు= దుర్యోధనుడు; అనికిన్+చనుచుండి= యుద్ధానికి వెళ్తున్నపుడు; తల్లి!= ఓ అమ్మా!; నాకున్= నాకు; జయము+కాన్= జయం కలిగేలా; దీవన= ఆశీస్సు; ఇమ్ము= ఈ; అని; పలికినన్= కోరగా; ఆ కుమారుతోడన్= అతనితో; నీ పేర్మికిన్= నీ ప్రేమకు; ఈడుగాన్= సాటిగా (ప్రేమను అటుంచి); కొడుకు= కుమారా!; ధర్మము= ధర్మం; ఎక్కడన్+ఉండున్= ఎక్కడ ఉంటుందో; అక్కడకున్= అక్కడికి; జయము= జయం; చేరును+అనవె?= 'చేరుతుంది' అని చెప్పలేదూ!; భూరి= మహా; ఘోర యుద్ధంబునన్= భయంకర యుద్ధంలో; గెలుపున్+కొనిరి= విజయం పొందారు; కానన్= కాబట్టి; తలఁపన్= బాగా ఆలోచిస్తే; ధర్మపరులన్= ధర్మదీక్షితులైన; పాండుతనూజులకున్= పాండుకుమారులను; ఆఁగవలయున్= సైపవలయును (కరుణించాలి); ఎట్లున్= ఎలా అయినా (అన్ని విధాలా!); అసూయలేని; బుద్ధిన్= బుద్ధితో; చూడుము= చూడు (నీకే తెలుస్తుంది).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'తల్లీ! ధర్మరాజుమీద కోపం విడిచిపెట్టుము. ఈ రజోగుణం ఇంకా నీ కెందుకు? ఈ ధర్మరాజు ధర్మదీక్ష కలవాడు. అందుచేత నీవు నేను చెప్పబోయే మాటలను శ్రద్ధతో వినుము. నీ కుమారుడు దుర్యోధనుడు యుద్ధభూమికి వెళ్ళబోతూ 'నాకు విజయం సిద్ధించేటట్లు ఆశీర్వదించుము' అని అడిగినప్పుడు నీ పుత్రాభిమానాన్ని అటుంచి 'నాయనా! ధర్మ మెక్కడో జయ మక్కడిచే చేరుతుం'దని చెప్పావు కదా! మహాఘోరమైన యుద్ధంలో వీళ్ళు గెలిచి బైటపడ్డారు. అందుచేత బాగా ఆలోచించి ధర్మదీక్షతో పోరాడి గెలిచిన పాండవులను సహించుము. ఆశ్రయ మిమ్ము. ఏ విధంగా నైనా అన్యాయం లేని బుద్ధితో ఆలోచించుము. నీకే అర్థమవుతుంది.

విశేషం: 'యతో ధర్మ స్తతోజయః' అని ప్రాచీన భారతీయుల విశ్వాసం.

గాంధారికూడా ఇదే మాటనే అన్నది. కుమారులు ధర్మపక్షాన లేరన్న వివేకం ఆమెకు ఉన్నదని ఈ మాటలు తెలుపుతాయి.

'రజోగుణం' - సత్త్వ రజస్తమోగుణాలని మూడు చెప్పబడ్డాయి. భగవద్గీతలో ఈ మూడింటి లక్షణాలు చెప్పబడ్డాయి. 'నేను అనే భావన, నాది, నాకు - అన్న కోరిక, రజోగుణ సంబంధులు. నేనే, నాకే - అన్నవి తమోగుణ సంబంధులు. ఈ రెండూలేని స్థితి సత్త్వస్థితి. యోగులు మాత్రమే ఈ స్థితిని అందుకొంటారు. భగవంతుడికి ఈ ముడు గుణాలూ లేవు. కాబట్టే ఆత్మ స్వరూపుడని పిలుస్తారు.

'తనకుమారులు చనిపోయారు. పాండవులు చంపివేశారు' అన్న భావనతోనే గాంధారీదేవి కుమిలిపోతున్నది. ఇదే రజోభావన. దానిని విడిచిపెట్టుమని వ్యాసుడి బోధ.

మేదినీవృత్తము:

విను మిటులేటికిం జనిన వృత్త మూఁ ది యల్గన్। జనము నుతించు నీదు గురుసారధీరబుద్ధిన్
నిను నతిశాంతచిత్తయని నిక్క మేనుఁ గందున్। మనమున నట్టి నీ కగునె? మత్సరంబు వత్సా! 152

ప్రతిపదార్థం: వత్స!= ఓ బిడ్డా! (ఓ అమ్మాయీ!); వినుము= నేను చెప్పేది బాగా వినుము; ఇటులు= ఈ విధంగా; చనిన= జరిగిపోయిన; వృత్తము= కథను; ఊఁది= పట్టుకొని; అల్గన్= కోపగించుకొనటం; ఏటికిన్?= ఎందుకు?; జనము= లోకం; నీదు= నీ యొక్క; గురు= గొప్పదైన; సారధీరబుద్ధిన్= జ్ఞానంతో; ధైర్యంతో కూడిన బుద్ధిని; నుతించున్= ప్రశంసిస్తుంది; నిక్కము= నిజంగా; నినున్= నిన్ను; అతిశాంత చిత్త+అని= అతి ప్రశాంతమైన మనస్సు కలిగినదానివని; ఏనున్+కందున్= నేను అనుకొంటాను; ఇట్టి నీకున్= ఇలాంటి నీకు; మనమునన్= మనస్సులో; మత్సరంబు= అసూయ; అగునె?= పుట్టవచ్చునా? (సమంజసంకాదని భావం).

తాత్పర్యం: అమ్మా! ఏనాడో జరిగిన కథలను పట్టుకొని ఇప్పుడు కోపగించుకొనటం వలన లాభం ఏముంటుంది? నీవు విచక్షణతో కూడిన జ్ఞానం కలిగిన దానివని, ధైర్యవంతురాలివని లోకం మెచ్చుకొనటం ఉన్నది. నేను ఎప్పుడూ నిన్ను ప్రశాంతమైన మనస్సు కలిగిన ఇల్లాలుగానే చూచాను. అట్లాంటి నీ మనస్సులో అసూయ పుట్టటమా! అది సమంజసంగా కనిపించటం లేదు.

విశేషం: మేదినీవృత్తంలో ప్రతిపాదానికీ న, జ, భ, జ, ర, గ - అనే గణాలుంటాయి. 1-11 అక్షరాలకు ప్రాసమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ధర్మంబు పరిగ్రహించి నీ కొడుకులగు పాండవులదెస రోషంబు నిగ్రహింపు' మనిన గంధవతీనందనునకు గాంధారరాజనందన యిట్లనియె. 153

ప్రతిపదార్థం: ధర్మంబు= (నీవు) మాతృధర్మాన్ని; పరిగ్రహించి= అవలంబించి; నీ కొడుకులు+అగు= నీ కుమారులైన; పాండవుల దెసన్= పాండవుల విషయంలో; రోషంబు= కోపాన్ని; నిగ్రహింపుము+అనినన్= అణచుకో అని చెప్పగా; గంధవతీ నందనునకున్= యోజనగంధి కొడుకు - వ్యాసమహర్షికి; గాంధారరాజనందన= గాంధార రాజకుమార్తె (గాంధారి); ఇట్లు+అనియెన్= ఇలా అన్నది.

తాత్పర్యం: నీవు ఇప్పుడైనా మాతృధర్మాన్ని అవలంబించి నీ కుమారులైన పాండవులపైన ఉన్న రోషాన్ని పోగొట్టుకొమ్ము' అని చెప్పాడు. అప్పుడు వ్యాసుడితో గాంధారి ఇట్లా అన్నది.

సీ. 'ఏ నసూయాగ్రస్తఁ గాను వీరలఁ జెడఁ। దలఁతునె? యెట్టు లుమ్మలికఁ జేసి
కలఁగితిఁ గాక యిక్కౌంతేయ వర్గంబు। గొంతికెట్లట్ల నాకును భరింప
వలదె? దుర్యోధను తులువతనంబున। శకునియుఁ గర్ణదుశ్శాసనులును
దుష్టాత్ము లగుటను ద్రుంగెఁ గౌరవకుల। మదరి పాండవులుఁ గయ్యంబుపాడిఁ

ఆ. జంపి రందఱ నది మది నొంపఁజాల। దచ్యుతుఁడు సూడఁ గురుపతి ననిలసుతుఁడు
దగునె గదపోర నాభికి దిగువ నొంచి। చంప? నత్తెఱఁ గుల్లంబు నొంపకున్నె? 154

ప్రతిపదార్థం: ఏను= నేను; అసూయాగ్రస్తన్= అసూయతో నిండిన దాన్ని; కాను= కానేకాను; వీరలన్= పాండవులను; చెడన్+తలఁతునె?= నశించాలని అనుకొంటానా?; ఎట్టులు= ఎట్లాగో; ఉమ్మలికన్+చేసి= దుఃఖాతిశయంచేత; కలఁగితిన్+కాక= కోపగించుకొన్నాను తప్ప!; ఈ+కౌంతేయవర్గంబు= ఈ కుంతి కుమారులు (పాండవులు); గొంతికిన్+ఎట్లు+అట్లు= కుంతికి ఎట్లాగో అట్లాగే; నాకును= నేనూ; భరింపవలదె?= భరించవద్దూ?; దుర్యోధను= దుర్యోధనుడి; తులువతనంబునన్= తుంటరితనంచేత; శకునియున్= శకునీ; కర్ణ దుశ్శాసనులును= కర్ణుడూ, దుశ్శాసనుడూ; దుష్టాత్మలగుటను= దుష్టాత్ములు కావటంవలన; కౌరవకులము= కురువంశం; త్రుంగెన్= నాశనమయింది; అదరి= విజృంభించి; పాండవులు= పాండుకుమారులు; కయ్యంబుపాడిన్= యుద్ధకర్మప్రకారంగా; అందఱన్= అందరినీ; చంపిరి= చంపారు; అది= అట్లా చంపటం; మదిన్= నా మనసును; నొంపన్+చాలదు= బాధపెట్టలేదు (బాధ కలిగింపజాలదు); అచ్యుతుఁడు+చూడన్= శ్రీకృష్ణుడు చూస్తూండగా; కురుపతిన్= దుర్యోధనుడిని; అనిల సుతుఁడు= వాయునందనుడైన భీముడు; గదపోరన్= గదాయుద్ధంలో; నాభికిన్+దిగువన్+నొంచి= నాభికి దిగువ కొట్టి; చంపన్+తగునె?= చంపవచ్చునా?; ఆ+తెఱఁగు= ఆ పని; ఉల్లంబున్= హృదయాన్ని; నొంపక+ఉన్నె?= బాధపెట్టకుండా ఉంటుందా?

తాత్పర్యం: 'మహర్షీ! నేను అసూయ కలిగిన దానను కాను.పాండవులు నశించాలని నేను కోరుకొంటానా? ఎట్లాగో దుఃఖం అధికం కావటం వలన కోపగించుకొన్నాను. అంతే! ఈ పాండవులు కుంతికి ఎంతో నాకూ అంతే కదా! వీరి బాధ్యత ఆమె కెంతో నాకూ అంతే. దుర్యోధనుడి తుంటరితనంచేత, శకునికర్ణదుశ్శాసనుల దుర్మార్గంచేత కౌరవకులం నాశనమయిపోయింది. యుద్ధంలో విజృంభించి యుద్ధధర్మాన్ని బట్టి ఈ పాండవులు అందరినీ చంపారు. దీనివలన నా మనసుకు ఏమీ బాధ కలుగలేదు. శ్రీకృష్ణుడు చూస్తుండగా భీముడు గదాయుద్ధంలో దుర్యోధనుడిని బొడ్డుకు క్రింది భాగంలో గదతో మోది చంపటం న్యాయంగా ఉన్నదా? ఆ పని ఈ మాతృహృదయాన్ని బాధించకుండా ఉంటుందా? (మీరే చెప్పండి).

క. విడుతురె శూరులు రణమునఁ । బడునట్టి యవస్థ తమకుఁ బాటిల్లిననుం
బుడమి సమస్తజనంబులు । నడపెడు తెఱఁ గలుక తప్పనకు రాకున్నే?' 155

ప్రతిపదార్థం: శూరులు= పరాక్రమవంతులు; రణమునన్= యుద్ధంలో; పడునట్టి= (తాము) చనిపోయే; అవస్థ= పరిస్థితి; తమకున్; పాటిల్లిననున్= కలిగినా కూడా; పుడమిన్= భూమిలో; సమస్త జనంబులు= జనులందరూ; నడపెడు తెఱఁగు= అనుసరించే పద్ధతిని (నియమాలను); విడుతురె?= విడిచిపెడతారా?; తప్పునకున్= ఎవరైనా ఈ నియమాలు తప్పితే; అలుక= కోపం; రాక+ఉన్నే?= రాకుండా ఉంటుందా?

తాత్పర్యం: పరాక్రమవంతులైన వాళ్ళు యుద్ధంలో చివరికి తాము చనిపోయే పరిస్థితి ఎదురైనా జనులంతా ఏ నియమాలను పాటించి యుద్ధంచేస్తారో దాన్నే అనుసరిస్తారు. నియమాన్ని ఉల్లంఘించరు. ఎవరైనా అట్లా ఉల్లంఘిస్తే చూచిన వారికి కోపం రాకుండా ఉంటుందా?

విశేషం: ప్రాచీన భారతీయ సమాజంలో నియమానికి (కట్టుబాటు) ఎంత విలువ ఉండేదో ఈ పద్యం సూచిస్తుంది. అట్లా నియమాన్ని తప్పినప్పుడు ఎవరైనా తప్పుపట్టే అవకాశం ఉండేదని అర్థం.

వ. అనిన భీముండు భీతికంపితుండగుచు గాంధారికి వినతుండై వినయంబున నిట్లనియె. 156

ప్రతిపదార్థం: అనినన్= గాంధారి ఇలా అనగా; భీముడు; భీతి= భయంతో; కంపితుండు+అగుచున్= కంపిస్తూ; గాంధారికి; వినతుండు+ఐ= నమస్కరించి; వినయంబునన్; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: గాంధారి ఇట్లా అనగా భీముడు భయంతో గడగడ వణకిపోతూ పెద్దతల్లికి నమస్కరించి ఇట్లా అన్నాడు.

భీముఁడు గాంధారికిఁ గోపోపశమనంబుగా నుత్తరంబు లిచ్చుట (సం. 11-14-1)

సీ. 'తలపోసి చూడంగ ధర్మమయ్యె నధర్మ । మయ్యెనేఁ బ్రాణభయంబు కతన
నట్లు సేసితిఁ గృపయార సైరింపుము । నీదు పుత్త్రుఁడు లావు నేర్పుఁ గలఁడు
గావున నమ్మెయిఁగాని యోర్వంగ రా । దదియట్టులుండె ధర్మాత్మజునకుఁ
బాడితో వచ్చెనే పరిభవం బతనిచే? । ద్రౌపది యేకవస్త్రయు రజ స్వ

ఆ. లయును గాదె? యపుడు దయమాలి కొలువున । కీడ్చి తేరఁబంచి యేమి యనియె
నతఁడు వినవె! యూరు లప్పుణ్యకాంతకుఁ । జూపు టెఱుఁగవే విశుద్ధచరిత! 157

ప్రతిపదార్థం: విశుద్ధచరిత!= పరమపవిత్రమైన చరిత్ర కలిగిన గాంధారీదేవీ! తలపోసి చూడంగన్= బాగా ఆలోచిస్తే; ధర్మము+అయ్యెన్= ధర్మం అయిందో; అధర్మము+అయ్యెన్= అధర్మమే అయిందో!; ప్రాణభయంబుకతనన్= ప్రాణభయంతో; నేను+అట్లు+చేసితిన్= నేను అట్లా చేశాను (తొడలపైన కొట్టటం); కృప+ఆరన్= కృప నిండగా (నిండు కృపతో); సైరింపుము= క్షమించుము; నీదుపుత్త్రుఁడు= నీ కుమారుడు; లావు= బలం; నేర్పున్= చాకచక్యం; కలఁడు= కలిగినవాడు; కావునన్= అందువలన; ఆ+మెయిన్+కాని= అలా తప్ప; ఓర్వంగన్+రాదు= ఓడించటం సాధ్యంకాదు; అది+అట్టులు+ఉండెన్= అది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అట్లా జరిగినది; (మరి); ధర్మాత్మజునకున్= ధర్మరాజుకు; అతనిచేన్= ఆ దుర్యోధనునిచేత; పరిభవంబు= అవమానం; పాడితోవచ్చెనే?= న్యాయపద్ధతిలో జరిగినదా?; అపుడు= ఆ జూదం సమయంలో; ద్రౌపది= పాండువుల పత్ని, నీ కోడలు అయిన ద్రౌపది; ఏకవస్త్రయున్= ఒకే చీర ధరించినది; రసజ్వలయున్= ముట్టుతో ఉన్నది; కాదె?= కాదా?; దయమాలి= కనికరంలేకుండా; కొలువునకున్= రాజసభలోకి; ఈడ్చి= ఈడ్చుకొని; తేరన్+పంచి= తీసుకురమ్మని పంపి (పిలిపించి); అతఁడు= ఆ దుర్యోధనుడు; ఏమి+అనియెన్= ఏమన్నాడో; వినవె!= నీవు విన్నావుగదా!; ఆ+పుణ్యకాంతకున్= రాజసూయ యజ్ఞంలో పవిత్రురాలైన ఆ పుణ్యస్త్రీకి; ఊరులు= తన తొడలు; చూపుట= చూపించి కూర్చోమనటం; ఎఱుఁగవే= నీకు తెలియదా!

తాత్పర్యం: 'పరమపవిత్ర చరిత్ర కలిగిన గాంధారీదేవీ! బాగా ఆలోచించిచూస్తే నేను చేసింది ధర్మమో అధర్మమో! ప్రాణభీతితో అట్లా చేశాను. నిండుదయతో మమ్మల్ని క్షమించుము. నీ కుమారుడు బలవంతుడు, చాకచక్యమున్నవాడు. అట్లాంటివాడిని అట్లా తప్ప ఓడించటం సాధ్యంకాదు. అందుచేత అట్లా చేయాల్సి వచ్చింది. అది అట్లా ఉంచుదాము. మరి ధర్మరాజుకు సభలో జరిగిన అవమానం న్యాయపద్ధతిలో జరిగిందా? ఆ సమయంలో ద్రౌపది ఏకవస్త్రంతో రజస్వలగా ఉన్నది కదా? ఏ మాత్రం దయలేకుండా నిండుకొలువులోకి ఈడ్పించుకొని వచ్చి దుర్యోధనుడు ఏమేమి అన్నాడో నీవు విన్నావు కదా! ఆ పవిత్రురాలికి తన తొడలు చూపించి కూర్చొనుమనటం నీవు ఎరుదుగువు కదా!

వ. తత్కాలోద్దీపితంబైన కోపంబున నెసంగు మనస్సంతాపంబు దాల్మి దహించిన దదూరుభంగంబు గదా దండంబునఁ జేయంగలవాఁడనని యప్పేరోలగంబునఁ బ్రతిన వట్టితి నుత్తమ క్షత్ర ధర్మజ్ఞులు ప్రతిజ్ఞాహాని నిందింతురు గాన పూనిక నెఱపితి విను మా సభలో నప్పుడ తొడలు పాడిసేసి యతనిం దెగఁ జూడఁ దగియుండ నజాతశత్రునాజ్ఞ మిగులరామించేసి యమ్మహాత్ము చేసిన సమయంబు దప్పింపక యవ్విధంబున విపినంబున కరిగి యనేకదుఃఖంబులంబడి మగిడి యజ్జనపతి సంధిగోరి శౌరిం గౌరవసభకుం బుత్తెంచుటకుం దగుమాటలాడు నవసరంబున నేనును. 158

ప్రతిపదార్థం: తద్+కాల= ఆ కాలంలో; ఉద్దీపితంబు+ఐన= ప్రకాశించిన; కోపంబునన్= కోపంతో; ఎసంగు= విజృంభించిన; మనస్+సంతాపంబు= మనసులోని పరితాపం; తాల్మిన్= ఓర్పును; దహించినన్= కాల్చివేయగా; తద్+ఊరుభంగంబు= అతడి తొడలను విరగగొట్టటం; గదాదండంబునన్= (నా) గదా దండంతో; చేయన్+కలవాఁడను+అని= చేయబోతానని; ఆ+పేరోలగంబునన్= ఆ నిండు సభలో; ప్రతిన+పట్టితిన్= ప్రతిజ్ఞ చేశాను; ఉత్తమ క్షత్ర ధర్మజ్ఞులు= ఉత్తమ క్షత్రియ ధర్మం తెలిసినవారు; ప్రతిజ్ఞాహానిన్= ప్రతిన నెరవేర్చుకోలేకపోవటాన్ని; నిందింతురు+కానన్= నిందిస్తారు కాబట్టి; పూనిక= నా పట్టుదలను; నెఱపితిన్= సాధించాను; వినుము= ఇంకా వినుము; ఆ సభలోన్= ఆ సభలోనే; అప్పుడు+అ= అప్పుడే; తొడలు= (నీ కుమారుని) తొడలు; పాడి+చేసి= నుగ్గుగచేసి; అతనిన్= ఆ దుర్యోధనుడిని; తెగన్+చూడన్+తగి+ఉండన్= చంపివేయటం బాగుండగా; అజాతశత్రు+ఆజ్ఞ= ధర్మరాజు ఆనతి; మిగులరామిన్+చేసి= మీరకూడదు కాబట్టి; ఆ+మహాత్ము చేసిన= ఆ మహాత్ముడు చేసిన; సమయంబున్+తప్పింపక= నియమం; తప్పించకుండా; ఆ+విధంబునన్= ఆ రీతిగా; విపినంబునకున్+అరిగి= అడవికి వెళ్ళి; అనేక= చాలా విధాల; దుఃఖములన్+పడి= దుఃఖాలకు లోనై; మగిడి= మళ్ళీ; ఆ+జనపతి= ఆ ధర్మరాజు; సంధిన్+కోరి= సంధిని అభిలషించి; శౌరిన్= శ్రీకృష్ణుడిని; కౌరవసభకున్= కౌరవుల సభకు; పుత్తెంచుటకున్= పంపటానికి; తగుమాటలు+ఆడు+అవసరంబునన్= తగిన మాటలు మాట్లాడుతున్న సమయంలో; నేనును= నేను కూడా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ కాలంలో అప్పటికప్పుడు పుట్టిన కోపంతో పరితాపం అధికమై మనసును దహించివేస్తుండగా అతడి తొడలను నా గదాదండంతో విరుగగొట్టుతానని ఆ నిండు సభలో ప్రతిజ్ఞ చేశాను. ఉత్తమక్షత్రియధర్మం తెలిసినవారు ప్రతినను నెరవేర్చలేకపోవటం తప్పుగా భావిస్తారు. కాబట్టి నా పట్టుదలను నెరవేర్చుకొన్నాను. ఇంకా ఒక విషయం వినుము. ఆ సభలోనే అప్పుడే ఆ దుర్యోధనుడి తొడలు నుగ్గునుగ్గుచేసి చంపివేస్తే బాగుండేది. కాని, ధర్మరాజుమాట మీరటానికి వీలులేదు. కాబట్టి ఆ మహాత్ముడు పెట్టిన నియమాలను తప్పించకుండా అడవికి వెళ్ళి, పడరాని దుఃఖాలు అనుభవించాము. చివరకు మళ్ళీ ధర్మరాజు సంధి జరిగితేనే మంచిదని శ్రీకృష్ణుడిని హస్తినాపురానికి పంపించే సమయంలో నేను కూడా (ఇట్లా అన్నాను).

తే. **'అన్నదమ్ములమై యుండియకట! మనల । నొరులు దల లెత్తి చూడ నొండొరుల తోడఁ**
బెనఁగ నేటికి? నీ నేల పెద్దవారి । బుద్ధి విని పంచికుడుచుట పోలదొక్కొ?' **159**

ప్రతిపదార్థం: అన్న+తమ్ములము+ఐ+ఉండి= అన్నదమ్ములై ఉండి కూడా; అకట!= అయ్యో! (ఈ విధంగా); మనలన్= మనలను; ఒరులు= ఇతరులు; తలలు+ఎత్తి+చూడన్= తప్పుపట్టటానికై తలలు పైకెత్తి చూచేలా; ఒండు+ఒరుల తోడన్= ఒకరు మరొకరితో; పెనఁగన్+ఏటికిన్?= పోరాడటం ఎందుకు?; ఈ నేలన్= ఈ భూమిని; పెద్దవారి బుద్ధివిని= పెద్దల మాటవిని; పంచి= పంచుకొని; కుడుచుట= అనుభవించటం; పోలదు+ఒక్కొ?= సరిపోదా?.

తాత్పర్యం: 'మనం అన్నదమ్ములమై ఉండి కూడా ఈ విధంగా ఇతరులు మనలను తప్పుపట్టటానికి వీలుకలిపిస్తూ (తలలు పైకెత్తి చూస్తుండగా) ఒకరితో మరొకరు యుద్ధం చేయటం ఎందుకు? పెద్దలు చెప్పినట్లుగా ఈ భూమిని పంచుకొని ఎవరి భాగం వారు అనుభవిస్తే సరిపోదా?'

వ. **అని నీ కొడుకునకుం జెప్పించితి దానను శాంతిం బొందక యద్దురాచారుండు చలంబున వైరంబుఁ బెనిచె నట్లగుట నవశ్యంబును ధర్మరాజునకు రాజ్యంబు సేకొనుటయు నాకుఁబ్రతిజ్ఞ దీర్చుటయుం గర్తవ్యంబులయ్యెం గావున నేమిభంగినైనం బగదీర్పవలసె నీవును సువిచార వింతయు విచారింపు' మనవుడు నద్దేవి యతని కిట్లనియె.** **160**

ప్రతిపదార్థం: అని= అని; నీ కొడుకునన్= నీ కుమారుడైన దుర్యోధనుడికి; చెప్పి పుత్తెంచితిన్= చెప్పి పంపాను; దానను= దానిచేతకూడా; శాంతిన్+పొందక= శాంతించక; ఆ+దుర్+ఆచారుండు= ఆ దుర్మార్గుడు; చలంబునన్= కసితో; వైరంబున్+పెనిచెన్= శత్రుత్వాన్ని పెంచుకొన్నాడు; అట్లు+అగుటన్= అట్లా చేయటంవలన; అవశ్యంబును= తప్పని సరిగా; ధర్మరాజునకున్= ధర్మరాజుకు; రాజ్యంబు+చేకొనుటయున్= రాజ్యాన్ని గ్రహించటం; నాకున్; ప్రతిజ్ఞ+తీర్చుటయున్= చేసిన ప్రతినలను నిర్వహించటం; కర్తవ్యంబులు+అయ్యెన్= చేయదగ్గపనులు అయ్యాయి; కావునన్= అందుచేత; ఏమిభంగిన్+ఐనన్= ఏదో ఒక పద్ధతిని అవలంబించి; పగతీర్పన్+వలసెన్= పగను తీర్చుకోవలసి వచ్చింది. నీవును= నీవుకూడా; సువిచారవు= మంచి చెడులను తెలిసిన విచక్షణ ఉన్నదానిని; ఇంతయున్= దీన్నంతా; విచారింపుము= ఆలోచించుము; అనవుడున్= అని భీముడనగా; ఆ+దేవి= గాంధారీదేవి; అతనికిన్= భీముడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అని నీ కుమారుడికి చెప్పి పంపాను. దానితో శాంతించక ఆ దుర్మార్గుడు కసితో వైరం పెంచుకొన్నాడు. దానివలన ధర్మరాజు రాజ్యాన్ని గ్రహించటం, నేను నా ప్రతిజ్ఞలు తీర్చటం తప్పనిసరి అయింది. అందుచేత ఏదో ఒక విధంగా మా పగ తీర్చుకొనవలసి వచ్చింది. నీవు కూడా మంచి చెడులు తెలిసిన దానివి. విచక్షణ ఉన్నదానివి. ఇదంతా బాగా ఆలోచించుము' అని భీము డనగా గాంధారి అతడితో ఇట్లా అన్నది.

క. 'ఆ చావు సావఁ దగు న । న్నీచునకున్ వానివలన నిక్కం బరయన్
నీ చెప్పినయన్నియుఁగల । వా చెయ్దియుఁ దగవ నీకు? నదియట్లుండెన్. 161

ప్రతిపదార్థం: ఆ+నీచునకున్= ఆ నీచుడికి; ఆ చావు= ఆ విధంగా చావటం; తగున్= తగిందే; నిక్కంబు+అరయన్= నిజం ఆలోచిస్తే; వానివలనన్= వాడిలో; నీ చెప్పిన+అన్నియున్+కలవు= నీవు చెప్పిన దుర్గుణాలు అన్నీ ఉన్నాయి; (కాని) నీకున్= నీకు; ఆ చెయ్దియున్= ఆ పని; తగవ?= తగవే (న్యాయమే); అది= అది; అట్లుండెన్= అట్లా జరిగిపోయింది.

తాత్పర్యం: 'ఆ నీచుడికి అట్లా చావటం బాగుంది. ఆలోచిస్తే నీవు చెప్పిన దుర్గుణాలు అన్నీ వాడిలో ఉన్నాయి. కాని, అట్లా తొడలు విరుగగొట్టటం నీకు మాత్రం తగిన పనే? ఏమో అది అట్లా జరిగిపోయింది.

తే. వైరి ననిఁ జంపుదురుగాక వ్రచ్చి నెత్తు । రెత్తికొని క్రోలు క్రూరాత్ము లెచట నైన
నెన్నఁడేనియుఁ గలిగిరే యీవు దక్క? । నది వృకోదర! వృకవిధ మసురభంగి.' 162

ప్రతిపదార్థం: వృకోదర!= తోడేలువంటి పొట్ట కలిగిన ఓ భీమసేనా!; అనిన్= యుద్ధంలో; వైరిన్= శత్రువును; చంపుదురు+కాక= చంపుతారు తప్ప; వ్రచ్చి= రొమ్ముచీల్చి; నెత్తురు+ఎత్తికొని= నెత్తురు తీసికొని; క్రోలు= త్రాగేటువంటి; క్రూరాత్ములు= క్రూరులు; ఎచటనైనన్= ఎక్కడైనా; ఎన్నఁడేనియున్= ఎప్పుడైనా; కలిగిరే?= పుట్టారా?; నీవు+తక్కన్?= నీవు తప్ప?; అది= అట్లా తాగటం; వృకవిధము= తోడేలు చేసేపని; అసురభంగి= రాక్షసులు చేసే పని.

తాత్పర్యం: వృకోదరా! యుద్ధంలో శత్రువును చంపుతారు తప్ప రొమ్ము చీల్చి నెత్తురు తీసికొని త్రాగేటటువంటి క్రూరులు నీవు తప్ప ఇంక ఎక్కడైనా ఎప్పుడైనా పుట్టారా? అట్లా త్రాగటం మనుషులు చేసే పనికాదు. తోడేలు అట్లా చేస్తుంది. రాక్షసులు అట్లా చేస్తారు'.

విశేషం: 'వృకం' అంటే తోడేలు. తోడేలు జీర్ణాశయంలోనే 'వృకం' అనే భాగంవల్లనే ఆ పేరు వచ్చింది. అందుచేత ఎంత తిన్నా దానికి తృప్తి కాదన్న విశ్వాసం ఉన్నది. అందుచేత భీముడు వృకోదరుడని ప్రసిద్ధి చెందాడు. ఇక్కడ భీముడికి వృకోదర అనే సంబుద్ధి సార్థకంగా ప్రయోగించబడింది.

వ. అనవుడు ననిలపుత్త్రుండు సుబలరాజపుత్త్రి కిట్లనియె. 163

ప్రతిపదార్థం: అనవుడున్= అని గాంధారి అనగా; అనిలపుత్త్రుడు= వాయునందనుడైన భీముడు; సుబలరాజ పుత్త్రికిన్= సుబలరాజు కుమార్తె అయిన గాంధారితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: అని గాంధారి అనగా భీముడు ఆమెతో ఇట్లా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జలధరవృత్తము:

ఆ సభలోని కట్లు ద్రుపదాత్మజఁ దా । గాసిగ నీడ్చి వల్వొలువఁగాఁ గినుకం

జేసిన బాసకై పెదవిఁ జేర్చితి దు । శ్శాసను శోణితం బిది నిజం బరయన్. 164

ప్రతిపదార్థం: ఆ సభలోనికిన్= ఆ ద్యూత సభలోనికి; అట్లు= ఆ విధంగా; ద్రుపదాత్మజన్= ద్రౌపదిని; తాన్= తాను (ఆ దుశ్శాసనుడు); గాసిగన్= బాధించేలా; ఈడ్చి= ఈడ్చుకొనివచ్చి; వల్వ+ఒలువన్+కాన్= చీర విప్పగా; కినుకన్= కోపంతో; చేసిన= చేసినటువంటి; బాసకై= ప్రతిజ్ఞను తీర్చుకోవటానికై; దుశ్శాసను శోణితంబు= దుశ్శాసనుడి రక్తాన్ని; పెదవిన్+చేర్చితిన్= పెదవికి తాకించాను; అరయన్= బాగా చూస్తే; నిజంబు= నిజం; ఇది= ఇంతే.

తాత్పర్యం: ఆ సభలోనికి అంత క్రూరంగా ఆమెను బాధపెడుతూ లాగుకొనివచ్చి చీర విప్పి అవమానించినందువలన కోపంతో చేసిన ప్రతిజ్ఞ తీర్చటంకొరకు అట్లా దుశ్శాసనుడి రక్తాన్ని పెదవికి చేర్చాను (తాకించాను) తప్ప, త్రాగలేదు. నిజంగా నేను చేసినది ఇంతే.

విశేషం: లాక్షణికులు దీనిని జలదవృత్తమని కూడ పిలుస్తారు. లక్షణానికి చూడండి స్త్రీ. 1.148

వ. అదియునుంగాక వినుమతని నేఁ బొదివినప్పుడు. 165

ప్రతిపదార్థం: అదియునున్+కాక= అంతేకాకుండా; వినుము= మరో విషయం ఉన్నది వినుము; అతనిన్= ఆ దుశ్శాసనుడిని; నేను; పొదివినప్పుడు= ఆక్రమించుకొన్నప్పుడు.

తాత్పర్యం: అంతేకాదు మరో విషయం కూడా ఉన్నది వినుము. నేను యుద్ధంలో దుశ్శాసనుడిని క్రిందపడవేసి ఆక్రమించుకొన్నప్పుడు.

క్రౌంచపదవృత్తము:

కౌరవసేనావీరులు లావుం గడిమియుఁ జలమును గడఁక యెలర్పన్

ధీరతసొంపుం గ్రూరతపెంపుం దెగువయు నెఱపఁగఁ దెరలక వీఁకన్

బోరనఁ ద్రోవంగా రభసం బేపును గలితనమును బొలుపు వహింపన్

వారు భయంబుం గూరుటకుం గావలసెను రుధిరము వదనము సేర్పన్. 166

ప్రతిపదార్థం: కౌరవ సేనావీరులు= కురు సేనలోని వీరులు; లావున్= బలం; కడిమియున్= పరాక్రమం; చలమును= పట్టుదల; కడఁక= పూనిక; ఎలర్పన్= అతిశయించగా; ధీరత సొంపున్= ధైర్య సమృద్ధి; క్రూరతపెంపున్= అతిశయించిన క్రౌర్యం; తెగువయున్= సాహసం; నెఱపఁగన్= చూపించటానికి; తెరలక= మరలిపోకుండా; వీఁకన్= పరాక్రమంతో; బోరనన్= వెంటనే; త్రోవంగాన్= నన్ను పట్టి తోసివేయగా; రభసంబు= వేగం; ఏపును= విజృంభణం, కలితనమును= పరాక్రమం; పొలుపు వహింపన్= అధికంకాగా; వారు= ఆ సైన్యం; భయంబున్= భయంతో; కూరుటకున్= మునగటానికి; రుధిరమున్= రక్తాన్ని; వదనము+చేర్పన్= నోటికి తాకించటం; కావలసెను= అవసరమయింది.

తాత్పర్యం: ఆ కురుసేనలోని మహావీరులు బలపరాక్రమాలతో పట్టుదల వదలకుండా విజృంభించారు. ధైర్యసమృద్ధితో, అతిశయించిన క్రూరత్వంతో సాహసం చూపుతూ వెనుదిరుగకుండా మహాపరాక్రమంతో నన్ను వెంటనే ప్రక్కకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తోసివేశారు. అపుడు నాలో వేగం, విజృంభణ, పరాక్రమం పెనవేసికొని నేనూ విజృంభించాను. ఆ సైన్యం భయపడాలంటే నా సమీపానికి రాకుండా ఉండాలంటే అట్లా రక్తాన్ని నోటికి తాకించక తప్పలేదు.

విశేషం: క్రౌంచపదవృత్తంలో ప్రతిపాదానికీ భ, మ, స, భ, న, న, య గణాలుంటాయి. 1, 11, 19 అక్షరాలకు యతిమైత్రి, ప్రాస నియమం ఉన్నది.

వ. ఆ రెండు పనులకై యట్లు ద్రావుటగా నటించితిం గాని. 167

తాత్పర్యం: వారు భయపడాలి. నన్ను సమీపించకుండా ఉండాలి. ఆ రెండుపనులు సిద్ధించటంకొరకు అట్లా నెత్తురు తాగటంవలె నటించాను తప్ప (నిజంగా రక్తం దోసిలితో పట్టి త్రాగలేదని అర్థం). (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. అన్యజనముల శోణితమైనఁ ద్రావు । టధిక పాతకమని విందు ననుజ రక్త
మాన నేనంత వెఱ్ఱినె? యంతపాప । కర్ముఁడనె? తల్లి! యంత నిష్కరుణమతినె? 168

ప్రతిపదార్థం: తల్లి!= ఓ తల్లీ!; అన్యజనముల= ఇతరుల; శోణితమైనన్= రక్తమైనా; త్రావుట= త్రాగటం; అధిక= మిక్కిలి; పాతకము+అని= పాపమని; విందును= విన్నాను; అనుజరక్తము= తమ్ముడి రక్తాన్ని; ఆనన్= తాగటానికి; నేను; అత వెఱ్ఱినె?= అంత పిచ్చివాడినా?; అంత; పాపకర్ముఁడనె= పాపిష్ఠివాడినా!; అంత; నిష్కరుణ= కరుణలేని; మతినె?= హృదయమున్నవాడినా?

తాత్పర్యం: అమ్మా! వేరే మనుష్యుల రక్తమైనా త్రాగటం మహాపాపమని విన్నాను. అట్లాంటప్పుడు తమ్ముడి రక్తాన్ని త్రాగటానికి నేనేమైనా వెర్రివాడినా! అంత పాపిష్ఠినా! లేదా అంత కరుణలేని హృదయమున్న వాడినా?'

వ. అనుటయు. 169

తాత్పర్యం: అని భీముడు చెప్పగా- (గాంధారి ఇట్లా అన్నది.)

తే. 'అంధులకు నూఁతకోలగా నకట! యొకని । నైన నిలుపక నూర్వుర నదయవృత్తి
ఖ్రింగి తందెవ్వఁ డేనియు మీకు నెగ్గు । లాచరింపని వాఁడు లేఁడయ్యెనయ్య? 170

ప్రతిపదార్థం: అంధులకున్= గుడ్డివారికి; ఊఁతకోలగాన్= ఊతకర్రగా; అకట!= అయ్యో! ఒకనినైనన్= ఒక్కడినికూడా; నిలుపక= మిగల్చకుండా; నూర్వురన్= నూరుమందినీ; అదయవృత్తిన్= కనికరం ఏ మాత్రంలేకుండా; మ్రింగితి(వి)= పొట్టనుబెట్టుకొన్నావు (చంపివేశావు); అందున్= ఆ నూరుమందిలో; ఎవ్వఁడు+ఏనియున్= కనీసం ఒక్కడైనా; మీకున్= మీ పాండవులకు; ఎగ్గులు= అపకారం; ఆచరింపనివాఁడు= చేయనివాడు; లేఁడయ్యెనయ్య?= లేకపోయాడా నాయనా!

తాత్పర్యం: 'అయ్యో! గ్రుడ్డివాళ్ళకు ఆసరాగా ఒక్కడినైనా మిగల్చకుండా నూరుమందినీ నీ పొట్టన పెట్టుకొన్నావే! ఎంత దయలేని వాడివయ్యా నీవు? ఆ వందమందిలో ఒక్కడైనా మీకు అపకారం చేయనివాడు లేకపోయాడా బాబూ!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఒక్కరుని నీవు సంపక । తక్కిన నంతటనె ప్రతిన దప్పునె? విభవం
బెక్కఁగ మీయన్న నతం । డెక్కటి రాజ్యంబు సేయ నీఁడె కుమారా!' 171

ప్రతిపదార్థం: కుమారా!= నాయనా!; ఒక్కరిని= ఒక్కడిని; నీవు+చంపక= నీవు చంపకుండా; తక్కిన+అంతటనె= వదలి వేసినంత మాత్రంలో; ప్రతిన+తప్పునె?= నీ ప్రతిజ్ఞ తప్పిపోతుందా?; అతండు= ఆ వదలివేసిన ఒకడు; మీ అన్నను= ధర్మరాజును; విభవంబు+ఎక్కఁగన్= వైభవం అతిశయించగా; ఎక్కటి రాజ్యంబు= ఏకచ్ఛత్రాధిపత్యం; చేయన్+ఈఁడె= చేయనివ్వడా!

తాత్పర్యం: నాయనా! నీవు ఒక్కడిని చంపకుండా వదలివేసినంత మాత్రంలో నీ ప్రతిజ్ఞాభంగ మవుతుందా! ఆ ఒక్కడు మీ అన్న వైభవోపేతంగా ఈ రాజ్యాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలకుండా అడ్డుపడతాడా? (ఎందు కింత క్రూరంగా అందరినీ ఊచకోత కోశావు?).'

వ. అని పలికి ధర్మనందను దెస మనసు నిగుడం బుత్రపౌత్రవధసంపీడితస్వాంతయగు నగ్గాంధారి క్రోధ పరుషాక్షరంబుల 'నమ్మహారాజెచట నున్నవాఁ?' డనిన నా భూపతి భయకంపిత గాత్రుండగుచుం జేతులు మొగిచి సవినయంబుగా మెత్తని మాటల నిదె వచ్చితి దేవీ! యేను బాండవాగ్రజుండ ననుచుం జేరం బోయి. 172

ప్రతిపదార్థం: అని పలికి ఈ విధంగా అని; ధర్మనందను దెసన్= ధర్మరాజు దిక్కు; మనసు+నిగుడన్= మనసు పోగా; పుత్ర= కొడుకుల; పౌత్ర= మనుమల; వధ= వధచేత; సంపీడిత= మిక్కిలిగా పీడించబడిన; స్వాంత+అగు= మనసు కలిగిన; ఆ+గాంధారీదేవి; క్రోధ= కోపంతోను; పరుష= కాఠిన్యంతోనూ; (నిండిన) అక్షరంబులన్= అక్షరాలతో; ఆ+మహారాజు+ఎచటన్+ ఉన్నవాఁడు+అనినన్= ఆ మహారాజు ఎక్కడ ఉన్నాడు? అని అడుగగా; ఆ భూపతి= ఆ ధర్మరాజు; భయ= భయంచేత; కంపిత= వణకుతున్న; గాత్రుండు+అగుచున్= శరీరం కలిగినవాడై; చేతులు= చేతులను; మొగిచి= ముడిచి (నమస్కరించి); సవినయంబుగాన్= వినయంతో; మెత్తని మాటలన్= మెత్తని పలుకులతో; దేవీ!= ఓ తల్లీ!; ఇదె= ఇదిగో; ఏను= నేను; పాండవ+అగ్రజుండన్= ధర్మరాజును; వచ్చితిన్= వచ్చాను చూడు; అనుచున్= అంటూ; చేరన్+పోయి= ఆమెను సమీపించి.

తాత్పర్యం: అని గాంధారి అన్నది. అప్పుడు ఆమె మనసులో ధర్మరాజు మెదిలాడు. కొడుకులు, మనుమళ్ళు క్రూరంగా చంపబడ్డారన్న వ్యథతో మిక్కిలిగా పీడించబడిన మనస్సు కలిగిన ఆ గాంధారి కోపంతోనూ, కాఠిన్యం తోనూ నిండిన కరకు ధ్వనితో 'ఎక్కడ ఆ మహారాజు?' అని అడిగింది. ఆ మాట విని ధర్మరాజు భయపడిపోయాడు. గడగడ వణుకుతూ చేతులు ముడిచి నమస్కరించి వినయంతోనూ నెమ్మదిగా. 'అమ్మా! ఇదుగో నేను ధర్మరాజును వచ్చాను చూడుము' అంటూ ఆమెను సమీపించి - (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఇక్కడ గాంధారి ధర్మరాజుకు మహారాజు అనే విశేషం ప్రయోగించటం వాత్సల్యంతోకాదు. 'కసి'తో.

క. 'నీ పుత్రులఁ జంపించిన । పాపాత్మునిఁ గ్రూరచిత్తుఁ బరివాదార్హున్
శాపంబునఁ బొలియింపుము । భూపాలకవల్లభాభిపూజిత చరణా! 173

ప్రతిపదార్థం: భూపాలక= రాజుల; వల్లభా+అభిపూజిత= భార్యలచేత ఆరాధింపబడే; చరణా!= పాదాలు కలిగిన గాంధారీదేవీ!; నీ పుత్రులన్= నీ కుమారులను; చంపించిన= చంపించినటువంటి; పాపాత్మునిన్= పాపాత్ముడైనవాడూ; క్రూరచిత్తున్= క్రూరచిత్తుడైనవాడూ; పరివాదార్హున్= నిందకు తగినవాడూ (అయిన నన్ను); శాపంబునన్= శాపంతో; పొలియింపుము= వధించు (చంపుము).

తాత్పర్యం: 'నానా రాజుల భార్యలచేత ఆరాధింపబడే చరణసీమ కలిగిన ఓ మహారాణీ (గాంధారీదేవీ!) నీ కొడుకులను చంపించిన పాపాత్ముడను నేను. అతికఠిన చిత్తుడను నేను. నిందించటానికి అన్ని విధాలా తగినవాడిని. అట్లాంటి నన్ను నీ శాపంతో చంపివేయుము.

క. **ధరణింగల రాజులకుం । బరివారమ్మునకుఁ జావు పాటిల్లుటకై**
పరుషత గైకొన్న యుధి । ష్ఠిరు దారుణ దండ కలితుఁ జేయందగదే! **174**

ప్రతిపదార్థం: ధరణిన్= భూమిలో; కల= ఉన్న; రాజులకున్= రాజులకు; పరివారమ్మునకున్= వారి పరివారానికి; చావు= మరణం; పాటిల్లుటకై= కలగటంకోసం; పరుషతన్= కాఠిన్యాన్ని; కైకొన్న= పొందిన; యుధిష్ఠిరున్= ఈ ధర్మరాజును; దారుణ= భయంకరమైన; దండ+కలితున్= దండన పొందినవానిగా; చేయన్+తగదే?= చేయదగడా?

తాత్పర్యం: ఈ భారతభూమిలోని రాజులు, వారి పరివారాలూ అందరూ మరణం పాలుకావటానికై అతి కఠినుడుగా మారిపోయిన ఈ ధర్మరాజుకు ఏదైనా దారుణమైన శిక్ష విధించవమ్మా!

మత్తకోకిల:

జీవమేటికి? రాజ్యమేటికిఁ జెల్లుఁ? జుట్టల బిడ్డలం
జావఁ జూచిన యట్టి ద్రోహికి సర్వభోగము లేటికిన్?'
నావుడున్ మఱుమాటలాడఁగ నాలుకాడక యుండి య
ద్దేవి యూర్పు నిగిడ్చె నుష్ణము దీర్ఘముం బరుషంబుగన్. **175**

ప్రతిపదార్థం: చుట్టలన్= చుట్టాలను; బిడ్డలన్= పిల్లలనూ; చావన్+చూచిన= చనిపోయేలా చేసిన; అట్టి ద్రోహికిన్= అట్లాంటి ద్రోహబుద్ధి ఉన్నవాడికి; జీవము+ఏటికిన్?= ప్రాణం ఎందుకు?; రాజ్యము+ఏటికిన్+చెల్లున్?= రాజ్యపాలనాధికారం ఎందుకు?; సర్వభోగములు+ఏటికిన్?= ఈ భోగాలన్నీ ఎందుకు?; నావుడున్= అని ధర్మరాజు అనగా; మఱుమాటలు+ఆడఁగన్= మలిమాటలాడటానికి; నాలుక+ఆడక+ఉండి= నాలుకాడక అట్లాగే మౌనంగా ఉండి; ఆ+దేవి= గాంధారి; ఉష్ణమున్= వేడిగా; దీర్ఘమున్= పొడవుగా; పరుషంబుగన్= కఠినంగా (ఉన్న); ఊర్పున్= నిట్టూర్పును; నిగిడ్చెన్= వదలిపెట్టింది.

తాత్పర్యం: బంధువులను, కుమారులను చావజూసిన ద్రోహిని నేను. నేను ఇంకా ప్రాణాలతో ఎందు కుండాలి? నాకు రాజ్యం ఎందుకు? ఈ వైభవా లెందుకు?' అని ధర్మరాజు విలపించాడు. ఇది విని గాంధారి నోట మాటరాలేదు. వేడిగా పొడవుగా కరకుగా ఉన్న పెద్ద నిట్టూర్పును మాత్రం విడిచిపెట్టింది.

విశేషం: వేడి నిట్టూర్పు - లోపల ఉన్న పరితాపాన్ని సూచిస్తుంది. పొడవు నిట్టూర్పు - లోపల ఉన్న బాధతాలూకు ఆధిక్యాన్ని సూచిస్తుంది, కరకు నిట్టూర్పు - లోపల ఇంకా ఆమెకు వారిపై కోపం పోలేదని సూచిస్తుంది. సముచితంకాదని మాటలాడకుండా ఉండిపోయిందని అర్థం. వృత్తలక్షణానికి చూడండి. స్త్రీ. 1.21.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇ ట్లా ధృతరాష్ట్ర మహిషి యతని యుచితవచనంబులు విని యూరక యుండె నతం డంజలిపుటంబు ఫాలంబున మోపి యానతుండయ్యెఁ బట్టావృతనయన యగు నప్పతివ్రత దృష్టి పట్టంబునంచు సందునం జని యజ్ఞనపతి పదనఖంబులం జెందిన నవి గందినం జూచి సవ్యసాచి జనార్దను వెనుకకుం జనియెం సమీర సుతుండును మాద్రీసుతులునుం దిరుగుడువడి రప్పడు గాంధార రాజనందన క్రోధంబు దక్కి ధర్మపుత్రాదుల దెస మాతృభావం బలవడ సాంత్వనస్వరంబునం గుంతీసందర్శనంబు సేయరన్నా! యని పలికిన నప్పురుష సత్తములు చిత్తంబుల కలంక డిందువడ నందఱు నొక్కటఁ గుంతియున్న దెసకుఁ జన నక్కుంతిభోజనందన వారిం గలయం గనుంగొని. 176

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఆ ధృతరాష్ట్ర మహిషి= ఆ గాంధారి= అతని= ధర్మరాజుయొక్క; ఉచిత= సమంజసమైన; వచనంబులు విని= మాటలు విని; ఊరక+ఉండెన్= ఊరకే ఉండిపోయింది; అతండు= ఆ ధర్మరాజుకూడా; అంజలిపుటంబు= నమస్కరిస్తున్న చేతులను; ఫాలంబునన్+మోపి= నొసటన చేర్చి; ఆనతుండు+అయ్యెన్= వంగినవాడు అయ్యాడు; పట్ట+ఆవృత+నయన+అగు= గుడ్డతో కప్పబడిన కనులు కలిగిన; ఆ+పతివ్రత= పతివ్రతఅయిన ఆ గాంధారీదేవీ; దృష్టి= చూపు; పట్టంబున్+అంచు= గుడ్డ అంచులోని; సందునన్+చని= సందులో దూరి; ఆ+జనపతి= ధర్మరాజుయొక్క; పదనఖంబులన్+చెందినన్= కాలిగోళ్ళను తాకగా; అవి= ఆ వేళ్ళు; కందినన్= ఎర్రబడగా; చూచి; సవ్యసాచి= అర్జునుడు; జనార్దను= కృష్ణుడి; వెనుకకున్= వెనుకవైపుగా; చనియెన్= వెళ్ళి దాక్కున్నాడు; సమీర సుతుండును= భీముడూ; మాద్రీ సుతులున్= నకుల సహదేవులూ; తిరుగుడు+పడిరి= దూరంగా అటూ ఇటూ వెళ్ళిపోయారు; అప్పుడు= ఆ సమయంలో; గాంధార రాజనందన= గాంధారీదేవీ; క్రోధంబు+తక్కి= కోపం విడిచిపెట్టి; ధర్మపుత్రాదులదెసన్= పాండుకుమారుల పట్ల; మాతృభావంబు= తల్లిదనం; అలవడన్= ఏర్పడగా; సాంత్వన= ఓదార్పు కలిగించే; స్వరంబునన్= ధ్వనితో; కుంతీ సందర్శనంబు చేయరన్నా!= కుంతీదేవిని చూడండి నాయనలారా!; అని; పలికిన; ఆ+పురుషసత్తములు= ఆ పురుష శ్రేష్ఠులైన పాండవులు; చిత్తంబుల= మనసులోని; కలంక= శోకం; డిందు+పడన్= నశించగా; అందఱున్+ఒక్కటన్= అందరూ కలిసి; కుంతి+ఉన్న+దెసకున్= కుంతి ఉన్నచోటికి; చనన్= వెళ్ళగా; ఆ+కుంతిభోజ+నందన= ఆ కుంతిభోజుని కుమార్తె; వారిన్= వాళ్ళను; కలయన్+కనుంగొని= అందరినీ నెమ్మదిగా చూచి.

తాత్పర్యం: ఈ విధంగా ఆ గాంధారి ధర్మరాజు యొక్క సమంజసమైన మాటలు విని ఊరకే ఉండిపోయింది. ధర్మరాజు కూడా జోడించిన చేతులను పైకెత్తి నొసటనచేర్చి వినమితుడయ్యాడు. అప్పు డా గాంధారీదేవి చూపు కన్నులకు కట్టుకొన్న గుడ్డ అంచు సందులో నుండి దూరి ధర్మరాజు కాలి గోళ్ళను తాకినది. అప్పుడు ఆ వేళ్ళు వెంటనే ఎర్రబడ్డాయి. అది చూచి అర్జునుడు కృష్ణుడి వెనుకవైపుగా వెళ్ళి నిలబడ్డాడు. భీముడు, నకుల సహదేవులు కూడా తొట్రుపాటుతో అటూ ఇటూ పోయారు. ఆ సమయంలో గాంధారి కోపం విడిచిపెట్టి పాండు పుత్రులపట్ల మాతృభావాన్ని పొంది, ఓదార్పు కలిగించే స్వరంతో 'నాయనలారా! కుంతిని దర్శించుకోండి' అని చెప్పింది. ఆ మాటలు విని పాండవుల మనసులు కాస్త తేరుకొన్నాయి. శోకం తగ్గింది. అందరూ కలిసి కుంతి ఉన్నచోటికి వెళ్ళారు. అపుడు కుంతి వారినందరిని నెమ్మదిగా చూచి (ఇట్లా అన్నది). (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: కళ్ళకు కట్టుకున్న గంతసందులో నుండి చూస్తేనే ధర్మరాజు గోళ్ళు కమలిపోయాయంటే, ఇంక ఆమె గంతలులేక నేరుగా చూస్తే పాండవులందరూ భస్మీభూతులయిపోయి ఉండే వారని గ్రహించాలి. అదీ ఆ గాంధారి పాతివ్రత్యమహిమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాండవులు కుంతీదేవి కడకు గాంధారి పంపునం బోవుట (సం. 11-15-9)

అంబురుహ వృత్తము

పెద్దయుఁగాలము వారలఁ జూడఁగఁ బ్రేముడించుచు దుర్భరా
పద్దశ నొందుట నమ్మహితాత్ముల పట్టులందఱుఁ ద్రుంగుటం
దద్దయు శోకమునం బొరి నశ్రులధార లొల్క వగర్పుతో
నద్దురవస్థ తెఱంగు గనుంగొని యంతకంటెను నార్తు లై. 177

ప్రతిపదార్థం: పెద్దయున్+కాలము= చాలా కాలంగా; వారలన్= పాండవులను; చూడఁగన్= చూడాలని; ప్రేముడించుచున్= కోరుకుంటూ; దుర్భర+ఆపద్+దశన్= భరించటానికి వీలుకాని విపత్పరిస్థితిని; ఒందుటన్= పొందటంవలన; ఆ+మహితాత్ముల= పాండవుల; పట్టులు+అందఱున్= కుమారులంతా; త్రుంగుటన్= చనిపోవటంవలన; తద్దయున్= మిక్కిలి; శోకమునన్= దుఃఖంతో; పొరిన్= ఎడతెగకుండా; అశ్రులధారలు+ఒల్కన్= కళ్ళలో నీళ్ళు కారుతుండగా; వగర్పుతోన్= నిట్టూర్పులతో (ఉన్న); ఆ+దురవస్థన్= ఆ కుంతి పడుతున్న బాధను; కనుంగొని= చూసి (పాండవులు); అంతకంటెన్= ఆమెకంటె; ఆర్తులై= బాధపడుతున్న వారై.

తాత్పర్యం: పాండవులను చూడాలని చాలాకాలం నుండి కోరుకొంటున్న కుంతీదేవి వారిని చూచి, వాళ్ళు పడ్డ దారుణమైన కష్టాలను తలచుకొని, అభిమన్యుడు, ఘటోత్కచుడు, ఉపపాండవులు మొదలైన పాండుపుత్రుల కొడుకులందరూ చనిపోయిన వైనాన్ని గుర్తుతెచ్చుకొని, మహాదుఃఖంలో మునిగిపోయింది. ఆమె కళ్ళవెంబడి నీరు ధారగా కారుతుండగా, వేడి నిట్టూర్పులు విడుస్తూ బాధపడుతుండగా, ఆమె దురవస్థ చూచి పాండవులు ఆమెకంటె దీనులు అయి - (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అంబురుహవృత్తంలో ప్రతిపాదానికి భ, భ, భ, భ, ర, స, వ అనే గణాలుంటాయి. 1 - 13 అక్షరాలకు యతిమైత్రి.

వ. చరణంబులు దొట్రిల్లం జని తచ్చరణంబుల మీఁద వ్రాలి. 178

ప్రతిపదార్థం: చరణంబులు= కాళ్ళు; తొట్రిల్లన్= తడబడగా; చని= వెళ్ళి; తద్+చరణంబులమీఁదన్= ఆమె కాళ్ళపై; వ్రాలి= పడి.

తాత్పర్యం: ఆమె బాధ చూచి వీళ్ళూ చలించిపోయారు. తడబడుతున్న కాళ్ళతో వెళ్ళి ఆమె పాదాలపై అందరూ పడి నమస్కరించి.

తే. ఏడ్వ నందఱపైఁ జేతు లిడుచుఁ బెలుచ । నేడ్చి యద్దేవి వారల నెత్తి వేఱు
వేఱ మేనులు నివురుచు వివిధ దారు । ణాస్త్ర శస్త్రవ్రణ ప్రచయములు గాంచి. 179

ప్రతిపదార్థం: ఏడ్వన్= ఏడుస్తుండగా; అందఱపైన్= అందరిమీదా; చేతులు+ఇడుచున్= చేతులు ఉంచుతూ; పెలుచన్= మిక్కిలిగా; ఏడ్చి= ఆమెకూడా ఏడ్చి; ఆ+దేవి= ఆ కుంతీదేవి; వారలన్+ఎత్తి= వారినిపైకి తీసి; వేఱువేఱ= వేరువేరుగా ప్రతి ఒక్కరి; మేనులు= శరీరాలను; నివురుచున్= నిమురుతూ; వివిధ= నానావిధాలైన; దారుణ+అస్త్ర+శస్త్ర= భయంకరమైన అస్త్రాలచేత శస్త్రాలచేత (ఏర్పడిన); వ్రణ= గాయాల; ప్రచయములు= సముదాయాన్ని; కాంచి= చూచి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అందరూ ఏడుస్తుండగా అందరిమీద చేతులు ఉంచి, కుంతికూడా కుమిలి ఏడ్చింది. వారిని ఒక్కొక్కరిని పైకి లేపి, వారి శరీరాలను నిమిరింది. వారి దేహాలలో నానావిధ శస్త్రాలచేత, అస్త్రాలచేత ఏర్పడిన గాయాలను చూచి- (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: శస్త్రం - బాహుబలంతో మాత్రమే ప్రయోగించేది. ఉదాహరణకు 'గద'. దీనికి మంత్ర ప్రయోగం ఉండదు. 'అస్త్రం' మంత్రంతో కూడి ప్రయోగించేది - ఉదాహరణకు ఆగ్నేయాస్త్రం. గాయాలు రెండింటివలన కావచ్చును. కన్నతల్లి కాబట్టి ఆమె వారి గాయాలను చూచింది. వారు పడ్డ కష్టాలకు ఆమె ప్రత్యక్ష సాక్షి. మీదు మిక్కిలి భాగస్వామిని కూడా. తల్లి అనురాగం ఎంత గాఢమైనదో ఈ పద్యం ద్వారా తెలిసికొనవచ్చునూ. ధర్మరాజాదులు తమ తల్లి అయిన కుంతికంటె ముందు గాంధారిని చూడటం విశేషం.

క. **'అచ్చోటు లంటి చూచుచు । వెచ్చని యూర్పులు నిగుడ్చు వేఁగుచుఁ బొగులుం**
గ్రుచ్చి కవుంగిటఁ జేర్చును । 'వచ్చితిరే! నృపకుమారవరులార!' యనున్. **180**

ప్రతిపదార్థం: అచ్చోటులు+అంటిచూచుచున్= ఆ గాయాలు అయిన చోట్లను తాకి చూస్తూ; వెచ్చని= వేడి; ఊర్పులు= నిట్టూర్పులు; నిగుడ్చున్= వదలిపెడుతూ; వేఁగుచున్= పరితాపంతో కాలిపోతూ; పొగులున్= ఏడుస్తుంది; గ్రుచ్చి= పట్టుకొని; కవుంగిటన్+చేర్చును= కౌగిలిలోకి చేర్చుకొంటుంది; నృపకుమార వరులార!= రాజకుమార శ్రేష్ఠులారా!; వచ్చితిరే!= వచ్చారా నాయనా!; అనున్= అంటుంది.

తాత్పర్యం: ఆ గాయాలు అయినచోట్లను తాకి చూస్తూ వేడి నిట్టూర్పులు విడుస్తూ పరితాపంతో కుమిలిపోతూ ఏడ్చింది. వారిని పట్టుకొని కౌగిలించుకొని 'నాయనలారా! వచ్చారా!' (ఇంతకాలానికి) అని అన్నది.

సీ. **ఆ సమయంబున నప్పాండుభూపాల । పత్నికి శోకాగ్ని ప్రజ్వరిల్లఁ**
దత్సమీపమునకు ద్రౌపది విన్నని । మోముపైఁ గన్నీరు ముసుఁగువడఁగఁ
బదముల నట దొట్రుపాటు వాటిల్లంగ । దైన్య మాకారంబు దాల్చినట్టి
తెఱఁగునఁ జనుదెంచి 'దేవి! సౌభద్రాదు ।లైన నీ మనుమ లెం దరిగి? రెంత

తే. **యేనిఁ గాలంబు నినుఁ జూడ రిప్ప డిచటి । కేలరా?' రంచు నడుగుల మ్రోల నేల**
వ్రాలె వికలాంగియై తెంచివైవ నెండ । దాఁకి వందిత తీఁగ చందంబు దోఁప. **181**

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అప్పుడు; ఆ+పాండు భూపాల పత్నికిన్= పాండుమహారాజు భార్య అయిన కుంతీదేవికి; శోక+అగ్ని= శోకమనే అగ్ని; ప్రజ్వరిల్లన్= అతిశయించి మండగా; తద్+సమీపమునకున్= ఆమె దగ్గరకు; ద్రౌపది; విన్నని= పాలిపోయిన; మోముపైన్= ముఖంమీద; కన్నీరు= కంటినీరు; ముసుఁగు+పడఁగన్= కప్పివేయగా; పదములన్+అట= ఆమె నడకలో; తొట్రుపాటు= తడబాటు; వాటిల్లంగన్= కలుగగా; దైన్యము= దీనత్వం; ఆకారంబు+తాల్చినట్టి= ఆకారం ధరించిన; తెఱఁగునన్+చనుదెంచి= విధంగా వచ్చి; దేవి!= అమ్మా!; సౌభద్రాదులైన= అభిమన్యుడు మొదలైన; నీ మనమలు= నీ మనవళ్ళు; ఎందు+అరిగిరి?= ఎక్కడికి వెళ్ళారు?; ఎంత+ఏనిన్+కాలంబు= ఎంత కాలం గడిచినా; నినున్+చూడరు= నిన్ను చూడలేదు; ఇప్పుడు; ఇచటికిన్= ఇక్కడికి; ఏలరారు?= ఎందుకని రారు?; అంచున్= అంటూ; అడుగుల మ్రోలన్= కుంతి పాదాల సమీపంలో; వికలాంగి+ఐ= విచ్ఛేదంపొందిన అవయవాలు కలిగినదై; తెంచివైవన్= తెంచివేయగా; ఎండ+తాఁకి=

ఎండతాకిడికి; వందిన= వాడిపోయిన; తీఁగ చందంబు= తీగ విధం; తోఁపన్= అగుపించగా; నేలన్= నేలమీద; వ్రాలెన్= కూలిపోయింది.

తాత్పర్యం: అప్పుడు కుంతీదేవికి శోకాగ్ని అతిశయించి మండటం మొదలుపెట్టింది. ఆమె దగ్గరకు ద్రౌపది పాలిపోయిన ముఖంమీద కన్నీరు తెరలుకట్టగా, తడబడుతున్న నడకతో జీవచ్ఛవంవలె దైన్యం ఆకారం దాల్చిన విధంగా వచ్చి 'అమ్మా! అభిమన్యుడు మొదలైన నీ మనవళ్ళు ఎక్కడా కనిపించరే. ఎక్కడికి వెళ్ళారు? ఇన్ని రోజులైనా నిన్ను చూడటానికి రా రెందుకు?' అని పిచ్చిదానివలె మాట్లాడుతూ కుంతి పాదాల సమీపంలో కుప్పకూలిపోయింది. కొమ్మనుండి తెంచివేయగా పైగా ఎండ తాకి వాడిపోయి నిర్జీవమైపోయిన తీగవలె ఆ ద్రౌపది కనిపించగా.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, ఉపమ.

వ. ఇట్లు మేదినింబడి రోదనంబు సేయు నయ్యుగ్మలి మీఁద నొఱగి తానునుం బెద్ద యెలుంగున నేడ్చి గ్రుచ్చి యెత్తి యక్కునం జేర్చి యూరార్చి యత్తన్వియుం దనయులుం దోడన చనుదేరఁ గుంతి గాంధారి కడకుం జనియె నప్పుడు ద్రౌపది యా ధృతరాష్ట్ర పత్ని పాదంబులకు మ్రొక్కి యడలున వెక్కుచున్న నద్దేవి యమ్ముద్దియ నుద్దేశించి. 182

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మేదినన్+పడి= నేలమీద పడి; రోదనంబు+చేయు= ఏడుస్తున్న; ఆ+యుగ్మలిమీఁదన్= ఆస్త్రీ (ద్రౌపది)మీద; ఒఱగి= ఒరిగిపోయి; తానునున్= కుంతి తానుకూడా; పెద్ద+ఎలుంగునన్= పెద్ద గొంతుకతో; ఏడ్చి; గ్రుచ్చి+ఎత్తి= పట్టుకొని ఎత్తి; అక్కునన్+చేర్చి= రొమ్మున చేర్చుకొని; ఊరార్చి= ఓదార్చి; ఆ+తన్వియున్= ఆ ద్రౌపదీ; తనయులున్= తన కుమారులూ; తోడన్= తోడుగా; చనుదేరన్= రాగా; కుంతి; గాంధారి కడకున్= గాంధారి దగ్గరకు; చనియెన్= వెళ్ళినది; అప్పుడు= ఆ సమయంలో; ద్రౌపది; ఆ+ధృతరాష్ట్ర+పత్ని= గాంధారి; పాదంబులకున్= కాళ్ళకు; మ్రొక్కి= మొక్కి; అడలునన్= దుఃఖంతో; వెక్కుచున్+ఉన్నన్= వెక్కిళ్ళు పెడుతుండగా; ఆ+దేవి= ఆ గాంధారి; ఆ+ముద్దియన్= ద్రౌపదిని; ఉద్దేశించి= చూచి (వైపు తిరిగి).

తాత్పర్యం: ఈ విధంగా నేలమీద పడి ఏడుస్తున్న ద్రౌపది మీద కుంతి ఒరిగిపోయి తానుకూడా పెద్దగా ఏడ్చింది. ఆమెను పట్టుకొని ఎత్తి కౌగిలించుకొని ఓదార్చి, కొడుకులు, ద్రౌపది వెంట రాగా కుంతి గాంధారి దగ్గరికి వెళ్ళింది. అప్పుడు ద్రౌపది గాంధారి కాళ్ళకు నమస్కరించి వెక్కిళ్ళుపెడుతూ ఏడుస్తుండగా గాంధారి ఆమెవైపు తిరిగి ఇట్లా అన్నది.

మత్తకోకిల:

'పుత్రి! యిట్లగు నమ్మ? శోకముఁ బొంది కుందుచు నున్న నీ
గాత్ర మొండొక కీడు పాటిలి కందుఁ బాండుతనూభవుల్
పుత్రవర్గము గన్నచో నెద భూరితాపముఁ బొందుడుం
బౌత్ర హీనతఁ బడ్డ గొంతికిఁ బాయనేర్చునె నెవ్వగల్? 183

ప్రతిపదార్థం: పుత్రి!= అమ్మాయీ!; ఇట్లు+అగునమ్మ?= ఇట్లా చేస్తే అవుతుందా?; శోకమున్+పొంది= దుఃఖాన్ని పొంది; కుందుచున్+ఉన్నన్= కుంగిపోతే; నీ గాత్రము= నీ శరీరం; ఒండొక కీడు= ఏదో ఒక అపాయం; పాటిలి= కలిగి; కందున్= తపిస్తుంది; పాండుతనూభవుల్= మరి పాండవులు; పుత్ర వర్గమున్+కన్నచోన్= మరణించిన కుమారులను తలచుకొంటే; భూరితాపమున్+పొందుడున్= మహావేదనను పొందగా; పౌత్రహీనతన్= మనుమళ్ళ మరణం అనే దుఃఖంలో; పడ్డ= పడిన; గొంతికిన్= కుంతీదేవికి; నెవ్వగల్= నిండుశోకాలు; పాయనేర్చునె?= వదులుతాయా?

తాత్పర్యం: 'అమ్మాయీ! ఇట్లా బాధపడితే అవుతుందా! నీ విట్లా క్రుంగిపోతే తప్పకుండా ఏదో ఒక అపాయం జరుగుతుంది. మరి పాండవులకు మాత్రం వారి కుమారులను తలచుకొంటే శోకం కలగటంలేదా? మనవళ్ళు పోగా కుంతికి మాత్రం దుఃఖం లేదా?

విశేషం: వృత్తలక్షణానికి చూడండి - స్త్రీ. 1. 21.

క. నిను నే నిట్టూరార్చెద। నను నీ వూరార్ప వలదె? నా నీ తెఱఁగుల్
విను మొక్కరూప మన కే। మనఁగలదు విధాత క్రూరుఁడై పఱుపంగన్? 184

ప్రతిపదార్థం: నినున్= నిన్ను; నేను= నేను; ఇట్టు= ఇలా; ఊరార్చెదన్= ఓదారుస్తాను; ననున్= నన్ను; నీవు= నీవు; ఊరార్పవలదె?= ఓదార్పవద్దా?; వినుము= ఒక విషయం చెబుతాను వినుము; నా, నీ, తెఱఁగుల్= నా బదుకు నీ బదుకు; ఒక్కరూప= ఒకేవిధమైనవి; మనకున్= మనపట్ల; విధాత= బ్రహ్మ; క్రూరుఁడు+ఐ= కఠినుడై; పఱుపంగన్= బాధింపగా; ఏమనగలదు= ఏమనగలము?

తాత్పర్యం: నేను ని న్నెట్లా ఓదారుస్తున్నానో నన్ను నీవూ అట్లాగే ఓదార్చుము. మరొక విషయం వినుము. నీ జీవితమూ నా జీవితమూ ఒకే విధంగా ఉన్నాయి. (నేనూ కొడుకులను పోగొట్టుకున్నాను, నీవూ కొడుకులను కోల్పోయావు). మన విషయంలో విధి చాలా క్రూరంగా వ్యవహరించింది. దీన్ని ఏమనగలము చెప్పుము?

ప్రహరణకలిత వృత్తము:

ఇది యిటులగు ట ట్లెఱిఁగి పలికె నా। విదురుండు సభఁ గోవిదులు పొగడఁగా
నది వినియును నే నడఁపన దురితం। బొదవెఁ గలఁక సే టొలయ కుడుగునే? 185

ప్రతిపదార్థం: ఇది; ఇటులు+అగుట+అట్లు= ఇలా జరగబోయేటట్లుగా; ఎఱిఁగి= తెలిసి; ఆ సభన్= ఆ సభలో; కోవిదులు= పండితులు; పొగడఁగాన్= ప్రశంసించగా; ఆ విదురుండు= ఆ మహాత్ముడైన విదురుడు; పలికెన్= (ఆనాడే) చెప్పాడు; అది వినియును= అదంతా వినికూడా; దురితంబు= ఆ దుర్మార్గాన్ని; నేను అడఁపన= అణచలేదు (అణచిన దాన్ని కాను); కలఁక= సంక్షోభం; ఒదవెన్= ఏర్పడింది; చేటు= కీడు; ఒలయక= తగులకుండా; ఉడుగునే?= తప్పుతుందా?

తాత్పర్యం: ఇది ఇట్లా అవుతుందని తెలిసి, ఆనాడే సభలో విదురుడు పెద్దవారంతా ప్రశంసిస్తుండగా ఎంతగానో చెప్పాడు. అదంతా విని కూడా నా కుమారుల దుర్మార్గాన్ని నేను ఆపలేకపోయాను. అందుకే ఈ సంక్షోభం ఏర్పడింది. ఏనాటికైనా కీడు తగలకుండా ఉంటుందా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ప్రహరణకలితవృత్తంలో ప్రతిపాదానికీ న, న, భ, న, ల, గ - అనే గణాలుంటాయి. 1 - 8 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

వ. ఇట్లనియెదం గాక నా చేతఁబోవునే యెవ్వరు నేమి సేయుదురు కాలవశంబున నవశ్యభావియైనది యయ్యె నుపశమింపు 'మని పలికెనని యిట్లు పాండవులు ధృతరాష్ట్రుని గాంధారిని ననునయించిన తెఱంగెఱింగించిన నా భంగి నుపశమితక్రోధయైన గాంధారరాజనందన పదంపడి యెవ్విధంబున వర్తించె? ధర్మతనయు ననంతర వర్తనం బెప్పాటఁ జెల్లె?నని యడుగుటయును. 186

ప్రతిపదార్థం: ఇట్లు= ఇలా; అనియెదన్‌గాక= అంటాను కాని; నా చేతన్+పోవునే?= దీన్ని ఆపడం నా సాధ్యమా?; ఎవ్వరున్+ ఏమి+చేయుదురు?= ఎవరైనా ఏం చేస్తారు?; కాలవశంబునన్= కాలానికి లోబడి; అవశ్యభావి+ఐనది= తప్పకుండా ఏది జరగాలో అది; అయ్యెన్= అయిపోయింది; ఉపశమింపుము= ప్రశాంతంగా ఉండుము; అని; పలికెన్= చెప్పింది; అని; ఇట్లు= ఈ విధంగా; పాండవులు; ధృతరాష్ట్రుని గాంధారిని= ధృతరాష్ట్ర గాంధారులను; అనునయించిన= ఓదార్చిన; తెఱంగు+ ఎఱింగించినన్= విధం తెలుపగా; అ భంగిన్= అలా; ఉపశమిత= ఉపశమించిన; క్రోధ+ఐన= కోపం కలిగిన; గాంధార రాజనందన= గాంధారీదేవి; పదంపడి= ఆ తరువాత; ఏ+విధంబునన్= ఏ విధంగా; వర్తించెన్?= నడుచుకొంది? (ఏం చేసింది?); ధర్మతనయున్= ధర్మరాజుయొక్క; అనంతరవర్తనంబు= తరువాతి ప్రవర్తన; ఏ+పాటన్= ఏ విధంగా; చెల్లెన్?= జరిగాయి? (ఏం చేశాడు?); అని; అడుగుటయున్= అడుగగా.

తాత్పర్యం: ఇట్లా అంటాను కాని నేను మాత్రం దీనిని ఆపగలిగిన దానినా? ఎవరు మాత్రం ఏమి చేయగలరు? కాలధర్మానికి లోబడి ఏది ఎట్లా జరగాలో అట్లా జరిగిపోయింది. నీవు ఇకనైనా ప్రశాంతంగా ఉండుము' అని చెప్పినది. ఇదే విధంగా పాండవులు ధృతరాష్ట్రుడిని గాంధారిని ఓదార్చారు. ఈ విషయాన్ని చెప్పగా అట్లా ప్రశాంతిపొందిన కోపంకలిగిన ఆ గాంధారి తరువాత ఏం చేసింది? ధర్మరాజు తరువాత ఏమేం చేశాడు?' అని జనమేజయుడు అడిగాడు.

ఆశ్వాసాంతము

శిఖరిణీవృత్తము:

తపస్స్వాధ్యాయాది క్షపిత మలచిత్తప్రకలితా । విపజ్జాలజ్వాలావిరమణ సుధావృష్టిలలితా!
జపాపుష్ప క్షీరచ్ఛవికిరణ సంసర్జనధురా! । సపర్యానిర్వాహప్రచుర కలన స్థైర్య మధురా! 187

ప్రతిపదార్థం: తపస్= తపస్సుచేత; స్వాధ్యాయ= వేదాధ్యయనంచేత; క్షపిత= తొలగించబడిన; మల= కల్మషమున్న; చిత్త= మనస్సులచేత; ప్రకలితా!= చక్కగా భావించబడేటటువంటి స్వామీ!; విపద్+జాల= ఆపదల సమూహాలు అనేటువంటి; జ్వాలా= మంటల; విరమణ= ఆరిపోవటానికి; సుధావృష్టి= అమృతాన్ని వర్షించే; లలితా!= మధుర స్వరూపుడైన ఓ హరిహరనాథా!; జపాపుష్ప= దాసాని పూవుయొక్క; క్షీర= పాలయొక్క; ఛవి= కాంతి ఉన్న; కిరణ= కాంతుల; సంసర్జన= కలయికచేత; ధురా!= బరువైన ఓ స్వామీ!; సపర్యా నిర్వాహ= నీకైంకర్యాన్ని నిర్వహించే (భక్తులలో); ప్రచురకలన= మిక్కిలిగా ఏర్పడే; స్థైర్య= స్థిరత్వంచేత; మధురా!= ఆనంద స్వరూపంగా అనుభూతమయ్యే స్వామీ! (నీకు నమస్కారం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ హరిహరనాథస్వామీ! నీవు తపస్సుచేత, వేదాధ్యయనంచేత పరిశుద్ధ మనస్సులు కలవారిచేత చక్కగా భావించబడతావు. ఆపదలనే మంటలు ఆరిపోవటానికి నీ దయామృతమనే వర్షాన్ని కురిపిస్తావు. దాసానిపూవువలె ఎర్రగా, పాలవలె తెల్లగా ఉన్న నీ అరుణశ్వేతకాంతి చాలా మనోహరమైనది. భక్తులు తమతమ కైంకర్యాలతో స్థిరంగా నిన్ను హృదయాలలో పదిలపరచుకొని మధురమైన అద్వైతానందానుభవాన్ని పొందుతారు. అట్లాంటి నీకు నమస్కారము.

విశేషం: అలం: రూపకం, ఉపమ. 'తపస్సు' అనేమాటకు చాంద్రాయణాది వ్రతాలు చేయటం అని ఒక అర్థమున్నది. మనస్సును, ఇంద్రియాలను ఏకాగ్రతలో చేర్చటమనే మరి ఒక అర్థముంది. వీటిచేత మనస్సు పవిత్రమవుతుందని వైదిక సంప్రదాయం చెప్పుతున్నది.

సాధారణంగా హరి నల్లటివాడని; హరుడు తెల్లటివాడని పురాణ ప్రసిద్ధం. కాని తంత్రగ్రంథాలలో శివుడు - శుక్ల వర్ణుడుగా; దేవీ - అరుణ వర్ణగా చెప్పబడ్డారు. కనుక మహేశ్వర సంబంధమైన ప్రాణశక్తి ఎరుపు. తెలుపు వర్ణాలను రెండింటిని కలిగినదని అర్థం.

"వందే గురుపద ద్వంద్వ మవాఙ్మానస గోచరమ్
రక్త శుక్ల ప్రభామిశ్ర మతర్క్యం త్రైపురం నమః"

అని తంత్ర గ్రంథ వచనం. తర్కించటానికి వీలులేని, త్రిపుర సంబంధం కలిగిన గురుపద ద్వంద్వం వాక్కుకు మనస్సుకు అతీతమైనది. అందులో రక్త శుక్ల కాంతులు రెండూ కలిసి ఉన్నాయట.

విష్ణు సహస్రనామంలో 'విక్షరో రోహితో మార్గః' (58) అనీ, 'సువర్ణ వర్ణో హేమాంగః' (93) అనీ - రెండు విధాలుగా చెప్పటం గమనిస్తే విష్ణువు అరుణవర్ణుడని, సువర్ణవర్ణుడని తెలుస్తున్నది.

భగవంతుడి ఆరాధనచేత భక్తి స్థిరమవుతుంది. 'ఓర్పు' దీని లక్షణం. దీనితో కలిగేది 'తృప్తి'. దీన్నే ఆనందంగా తిక్కనగారు పేర్కొన్నారు.

శిఖరిణీవృత్తంలో ప్రతిపాదానికీ య, మ, న, స, భ, వ అనే గణాలుంటాయి. 1-13 అక్షరాకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

క. సాత్యవతేయాది మహా। మత్యవగమ్య ప్రకార! మధుర విలాసా!
సత్యత్వానంతత్వ ని। రత్యయ శుభసారమయ సమగ్రవికాసా! 188

ప్రతిపదార్థం: సాత్యవతేయ= సత్యవతి కుమారుడైన వ్యాసమహర్షి; ఆది= మొదలైన; మహామతి= గొప్ప మనీషులచేత; అవగమ్య= తెలియదగిన; ప్రకార= విధం కలిగినవాడా!; మధుర విలాసా!= హృద్యమైన లీలా విశేషాలు కలిగినవాడా!; సత్యత్వ= నిత్య భావంచేత; అనంతత్వ= అనంతత్వంచేత; నిరత్యయ= నశించని; శుభసారమయ= కల్యాణ రూపమైన; సమగ్ర వికాసా!= సంపూర్ణ అవతార స్వరూపుడా!

తాత్పర్యం: స్వామీ! నీ అసలు రూపాన్ని వ్యాసాది మహర్షులు మాత్రమే తెలిసికొనగలరు. నీ విలాసాలు అతి మధురాలు. నీ సంపూర్ణ స్వరూపం సత్యమైనది. అనంతమైనది. శాశ్వతమైనది. కల్యాణప్రదమైనది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఆలోచన, చేష్ట, విభూతి - ఈ మూటినీ ఇక్కడ 'ప్రకార' శబ్దంచేత మనం అర్థం చేసికొనవచ్చును. 'వికాస' శబ్దానికి అవతారమని అర్థం చెప్పాలి. 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' మనే ఆర్యోక్తిని 'సత్యం శివం సుందరం' అనే సూక్తిని ఈ సందర్భంలో స్మరించవచ్చును.

హరిహర స్వరూపాన్ని గుర్తించటం ఎరుక సమగ్రమైన దనటానికి నిదర్శనం. అందుకే 'సమగ్ర వికాసా!' అని సంబోధించటం.

మాలిని:

సదసదనభిషిక్తా! సంభృతానందభక్తా! । విదళిత దురితాలీ! విశ్వనిర్వాహ శాలీ!
మదవదసురభేదీ! మానసానుప్రమోదీ! । వదనజనితవిప్రా వైభవానంద దీప్రా! 189

ప్రతిపదార్థం: సత్+అసత్+అనభిషిక్తా!= 'సత్'రూపంలోకాని, 'అసత్' రూపంలోకాని అభిషేకం పొందనివాడా!; సంభృత+ఆనంద+భక్తా!= ఆనందంతో నిండిన భక్తులు కలవాడా!; విదళిత= నశింపచేయబడిన; దురిత+ఆలీ!= పాపసముదాయం కలిగినవాడా!; విశ్వప్రపంచాన్ని; నిర్వాహశాలీ!= నిర్వహించేవాడా!; మదవత్+అసురభేదీ!= మదంతో కూడిన రాక్షసులను చంపేవాడా!; మానస+అనుప్రమోదీ!= ఆయాప్రాణుల చిత్త సంస్కారాన్నిబట్టి దానికి తగిన సంతోషాన్ని కలిగించేవాడా!; వదన జనిత విప్రా! ముఖం నుండి పుట్టిన బ్రాహ్మణులను కలవాడా!; వైభవ+ఆనంద దీప్రా!= ప్రభు సంబంధమైన ఆనందంతో ప్రకాశించేవాడా! (నీకు నమస్కారం).

తాత్పర్యం: హరిహరనాథస్వామీ! నీ రూపం సదసత్తులకు భిన్నమైనది, విలక్షణ మైనది. నిన్ను తలచే భక్తుల హృదయాలు సదా ఆనందంతో నిండి ఉంటాయి. నీవు వారి పాపాలను పటాపంచలు చేస్తావు. ప్రపంచంలో దేనిని ఎట్లా నిర్వహించాలో నీవు సమర్థంగా తెలిసినవాడవు. ధర్మహాని కలిగించే రాక్షసులను సంహరించి సాధుజన సంరక్షణ చేసేవాడవు. విజ్ఞాన స్వరూపులైన బ్రాహ్మణులు నీ ముఖం నుండే పుట్టారు. నీవు సర్వభువన నిర్వహణ రూపమైన ప్రభుత్వంతో మహానందరూపంతో ప్రకాశిస్తావు.

విశేషం: ఈ పద్యంలోని ప్రతి మాటా చాలా బరువైన అర్థాన్ని తెలుపుతుంది

సత్ - అని నేల, భూమి, అగ్ని, వాయువు మొదలైన ఇంద్రియాల అనుభవాలకు లోనయ్యే పదార్థ జగత్తును పిలుస్తాము. (అస్తి)

అసత్ - అంటే 'సత్తు' కానిది. ఇంద్రియానుభవాలకు అతీతమైన మనోబుద్ధ్యహంకారాదులన్నీ అసత్తులే (నాస్తి)

భగవంతుడి తత్త్వం 'ఆత్మ' పదార్థం- ఇది ఇంద్రియాలలాగా 'సత్తు' కాదు; మనోబుద్ధులవలె 'అసత్తు' కాదు. క్షీణతలేనిది. స్థిరమైనది. పరిణామానికి అతీతమైనది. కాబట్టి 'బ్రహ్మ' మన్నారు.

అనాదిమత్పరం బ్రహ్మ న 'సత్' తత్, 'నాసత్' ఉచ్యతే అని భగవద్గీత (13-13) - ఆ బ్రహ్మ పదార్థం సదసత్తులకు అతీతమైనదని వివరించింది.

'సంభృత' - అంటే నిండిన అని అర్థం. భక్తుడిలో భాగవతానందం తప్ప మరి ఒకటి ఉండదు. అందుకే ప్రహ్లాదాది భక్తులు భక్తి మాధుర్య పారవశ్యంలో భగవంతుడిని స్తుతించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'దురితం' అంటే పాపం - ఎన్ని పాపాలు చేసినా భగవంతుడు భక్తుడైనవాడిని క్షమించి వాడి పాపాలు తొలగిస్తాడు - అన్ని పురాణాలు ఘోషించాయి. ఎంత దురాచారుడైనా నన్ను భజిస్తే సాధువు అవుతాడని భగవద్గీత స్పష్టంగా చెప్పింది. (గీత 9-30)

'విశ్వనిర్వహణం' అంటే సృష్టి స్థితి లయాలను కలుగచేయటమని అర్థం. ఎవరిని ఎట్లా పుట్టించి, పెంచి, తెంచాలో తెలిసి అట్లా చేయటమే విశ్వనిర్వహణం. అందుకే భగవంతుడిని లోకస్రష్ట అని, లోకపాలుడని, లోకాధిపతి అని, సర్వేశ్వరుడని ఉపనిషత్తులు ప్రశంసించాయి.

భగవద్గీతలో ఈ నిర్వహణను ఇంద్రజాలికుడు జంతువు బొమ్మను ఆడించిన విధంగా ఈశ్వరుడు ఈ మానవుడిని ఆడిస్తున్నాడని క్రింది శ్లోకం చెప్పుతుంది.

"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా." (గీత 18-61)

'మదవత్' - అంటే మదం కలిగిన అని అర్థం. అసురులు విశృంఖలంగా సాధువులను హింసించి ధర్మగ్లాని కలుగచేయగా భగవంతుడు సాధువులను కాపాడి దుర్మార్గులను సంహరించి ధర్మసంస్థాపన చేయటం కొరకు పుడతాడని గీత స్పష్టంగా చెప్పుతున్నది.

"పరిత్రాణాయ సాధూనాం । వినాశాయ చ దుష్కృతాం'
ధర్మసంస్థాపనార్థాయ । సంభవామి యుగే యుగే." (గీత 4-8)

'మానస+అను+ప్రమోదీ' - ఎవరెవరి మనసు ఎట్లా ఉంటే అట్లాంటి సంతోషం అనుభవంలోకి వస్తుంది. అట్లా అనుభవంలోకి వచ్చేటట్లు చేసేవాడు పరమాత్మే. అందుచేత ఆ ఆనందానుభవం కూడా ఆయా దేహాలలో ఆవరించి ఉన్న భగవంతుడి 'అంశకు' చెందినదేనని తాత్పర్యం.

'వదన జనిత విప్రా' - పురుషసూక్తంలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు వరుసగా ఆ విశ్వరూపుడి వదన, బాహు, ఊరు, పాద సముద్భూతులని చెప్పటం కనిపిస్తుంది. అంటే ఈ భావన శ్రుతిస్మృతులలో ఉన్నదని అర్థం.

'బ్రాహ్మణోఽస్య ముఖ మాసీత్ । బాహూ రాజన్య కృతః
ఊరూ తదస్య యద్వైశ్యః । పద్భ్యాం శూద్రో అజాయత." (పురుషసూక్తం)

"లోకానాం తు వివృద్ధ్యర్థం । ముఖ బాహూరు పాదతః
బ్రాహ్మణం క్షత్రియం వైశ్యం । శూద్రం చ నిరవర్తయత్."(మనుస్మృతి)

బ్రాహ్మణాది వర్గ వాచకాలు గుణ వాచకాలే తప్ప 'కుల' వాచకాలు కావు అని భారతంలోని కథలను బట్టి తెలుస్తుంది. విజ్ఞాన-రక్షణ - వ్యాపార - శ్రమలనే ధర్మాలను బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య - శూద్రులుగా ప్రాచీనులు పిలిచారు.

'వైభవానందం' - ఆ ప్రభువువలెనే శాంత రసానందం కూడా పరమశ్రేష్ఠమైనదని చెప్పటానికే వైభవానందమనటం. అందుకే పరమేశ్వరుడిని 'ఆనందనిలయు'డని పిలవటం.

ఎక్కడ రూప, భావ, వ్యాపారాలు మూడూ అవాఙ్మానస గోచరాలో, అక్కడి అవతారాన్ని 'లీల' అంటారు. సకల సృష్టి స్థితి సంహార సమర్థుడైన హరిహరనాథుడు ఈ జగత్తును 'లీల'గా నిర్వహిస్తున్నాడని అర్థం.

విశేషం: మాలినీవృత్తంలోని ప్రతిపాదానికీ వరుసగా న, న, మ, య, య అనే గణాలుంటాయి. 1-9 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీమహాభారతంబున స్త్రీపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

తాత్పర్యం: ఉభయకవిమిత్రుడు, కొమ్మనామాత్యుడి పుత్రుడు, పండితులను గౌరవించటంలో సుప్రసిద్ధుడు, బుధులచేతి ఆరాధనచే ప్రకాశించేవాడూ అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలోని స్త్రీపర్వంలో మొదటి ఆశ్వాసం సంపూర్ణం.

స్త్రీపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

స్త్రీపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీ మత్కీర్తిమదత్యభి । రామాకృతి! సద్గుణాభిరతి! మత్పుణ్య
గ్రామాకృతి! మత్సంప । త్త్యామోదిత భక్తలోక! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీమత్= సంపదతోకూడిన; కీర్తిమత్= కీర్తికలిగిన; అతి+అభిరామ+ఆకృతి!= మిక్కిలి మనోహరమైన రూపమున్నవాడా!; సద్గుణ+అభిరతి!= మంచి గుణాలయందు ఆసక్తి ఉన్నవాడా!; మత్పుణ్య= నా (తిక్కనగారి) పూర్వగణ్య; గ్రామ= సముదాయంయొక్క; ఆకృతి!= స్వరూపం కలవాడా!; మత్= నా (తిక్కనగారి); సంపత్తి= ఐశ్వర్యంచేత; ఆమోదిత= సంతోషపెట్టబడిన; భక్తలోక!= భక్త సముదాయం కలవాడా!; హరిహరనాథా! (నీకు నమస్కారం).

తాత్పర్యం: స్వామీ హరిహరనాథా! నీవు లోకోత్తరమైన శోభను, యశస్సును, సౌందర్యాన్ని కలిగినవాడివి. సత్యశౌచాది సద్గుణాలపట్ల నీకు అభిలాష అధికం. అంతే కాదు. నీవు నా పూర్వజన్మ పుణ్యస్వరూపుడివే. అందుకే నా కున్న ఐశ్వర్యంతో భక్తులను దానాదులచేత సంతోషపెట్టటానికి నాకు మహావకాశాన్ని ఇచ్చి కరుణించావు.

విశేషం: అభిరతి - అంటే ఇష్టం. భగవంతుడు సద్గుణవంతులను ప్రేమిస్తాడు. ఇట్లాంటివారికై ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తాడన్నది పురాణ ప్రసిద్ధమైన సత్యం.

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు పాంచాలి నూఱడం బలికిన యనంతరంబ పతివ్రతాశిరోమణియు మహాభాగయు సత్యవచనయునగు నయ్యాంబికేయు భార్యకుం బారాశర్య మునీంద్ర వరప్రదానంబునం బ్రాప్తంబై తాత్కాలికం బయిన దివ్యదృష్టి విభవంబున నిజవ్రతహాని లేని తెఱంగున సంగర తలం బఖిలంబును నధికవిస్తార దూరప్రాప్తంబయ్యు నాలోకనగోచరం బగుటయు. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథ స్వామీ! (విను); వైశంపాయనుండు; జనమేజయునకున్; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు; అట్లు= ఆ విధంగా; పాంచాలిన్= పాంచాలిని; ఊఱడన్+పలికిన= ఓదార్పు మాటలు చెప్పిన; అనంతరంబు+అ= తరువాత; పతివ్రతా= పతివ్రతలలో; శిరోమణియున్= తలమానికమైనదియు; మహాభాగయున్= గొప్ప పుణ్యాత్మురాలూ; సత్యవచనయున్= ఎప్పుడూ సత్యాన్నే పలికేది; అగు= అయినటువంటి; ఆ+ఆంబికేయు+భార్యకున్= ఆ ధృతరాష్ట్రుడి భార్యకు గాంధారికి; పారాశర్య మునీంద్ర= పరాశరుడి కొడుకైన వ్యాసుడియొక్క; వరప్రదానంబునన్= వరం ఇవ్వటంచేత; ప్రాప్తంబు+ఐ= కలిగినదై; తాత్కాలికంబు+అయిన= అప్పటికి మాత్రం వచ్చిన; దివ్యదృష్టి విభవంబునన్= దివ్యదృష్టి వైభవంతో; నిజవ్రతహానిలేని తెఱంగునన్= తాను కళ్ళకు కట్టిన గుడ్డ విప్పరాదన్న నియమం పొల్లుపోకుండానే; సంగరతలంబు= యుద్ధరంగం; అఖిలంబును= అంతా; అధిక విస్తార= అధికవైశాల్యం కలిగినదై; దూరప్రాప్తంబు+అయ్యున్= దూరంగా ఉన్నప్పటికీ; ఆలోకన= చూపునకు; గోచరంబు+అగుటయున్= కనిపిస్తుండగా.

తాత్పర్యం: ఓ దేవా! తరువాతి కథను వినుము. వైశంపాయనుడు జనమేజయుడికి ఇట్లా చెప్పాడు - ఆ విధంగా పాంచాలిని ఓదార్చిన తరువాత పరమ పతివ్రత, మహాపుణ్యాత్మురాలు, సత్యవ్రతురాలు అయిన గాంధారీదేవికి వ్యాసమునీంద్రుడి వరంవలన అప్పటికప్పుడు దివ్యదృష్టి కలిగింది. దీనివలన ఆమె కళ్ళకు కట్టిన గంత తీయకుండానే యుద్ధభూమిలో సుదూరంలో ఉన్నప్పటికీ వస్తు సముదాయమంతా ప్రత్యక్షంగా కనిపించటం మొదలుపెట్టింది.

మణిగణ నికరము;

గొడుగుల పటియలు గుఱుకులు గొనుటన్ । సిడముల తునియలు సెదరి యునికి బెం
దడిగలుఁ బడగలు దఱచు మురియలై । పుడమిఁ గలయుటకుఁ బొగు లొలయ మదిన్. 3

ప్రతిపదార్థం: గొడుగుల పటియలు= గొడుగుల బద్దలు; కుఱుకులు= ప్రోవులుగా (రాశులుగా); కొనుటన్= ఏర్పడి ఉండటంవలన; సిడముల= ధ్వజాల; తునియలు= ముక్కలు; చెదరి+ఉనికిన్= చెల్లాచెదురుగా పడిఉండటంవలన; పెన్= పెద్దవైన; దడిగలు= అరిగెలు; పడగలు= టెక్కెములు; తఱచు= మిక్కిలిగా; మురియలై= ఖండఖండాలై; పుడమిన్+కలయుటకున్= నేలలో కలిసిపోవటానికి; మదిన్= మనస్సులో; పొగులు= పరితాపం; ఒలయన్= కలగగా.

తాత్పర్యం: ఆ యుద్ధభూమిలో రథాలమీద ఉన్న గొడుగులు ముక్కలు ముక్కలై పెద్ద పెద్ద రాశులుగా పడి ఉన్నాయి. ధ్వజాలు ముక్కలై చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అరిగెలు, టెక్కెములు చిన్న చిన్న ముక్కలైపోయి మట్టిలో కలిసిపోయాయి. ఇవన్నీ చూచిన గాంధారికి పరితాప మధికమై.

విశేషం: మణిగణనికర వృత్తంలో ప్రతిపాదానికీ వరుసగా నాలుగు నగణాలమీద ఒక సగణం ఉంటుంది. మొదటి అక్షరానికీ తొమ్మిదవ అక్షరానికీ యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

క. నుఱుమైన కాల్బలంబులు । నఱవఱ లయి యున్న యట్టి యరదంబులుఁ బెం
దఱచగు సూతాంగకములు । నొఱగిన రథ్యములగములు నుల్ల మలంపన్. 4

ప్రతిపదార్థం: నుఱుము+ఐన= చంపబడిన; కాల్బలంబులు= సైనికులు; అఱవఱలు+అయి+ఉన్న+అట్టి= చిన్న చిన్న ముక్కలుగా పడి ఉన్న; అరదంబులు= రథాలు; పెన్+తఱచు+అగు= ఎక్కడిపడితే అక్కడ కనిపిస్తున్న; సూత+అంగకములు= సారథుల అవయవాలు; ఒఱగిన= చనిపోయి నేలపైబడిన; రథ్యముల= గుర్రాల; గములు= గుంపులు; ఉల్లము= హృదయాన్ని; అలంపన్= బాధించగా.

తాత్పర్యం: ఆ యుద్ధ భూమిలో చనిపోయిన సైనికుల దేహాలు, చిన్న చిన్న ముక్కలై పడి ఉన్న రథాలు, ఎక్కడపడితే అక్కడ పడి ఉన్న సారథుల దేహభాగాలు, నేల కొరిగిన గుర్రాల సముదాయాలు కనిపిస్తున్నాయి. వీటిని చూచి గాంధారి హృదయం తరుక్కుపోగా.

లయగ్రాహి:

రావుతుల తుండములు మావఁతుల నుగ్గుఁ దుర । గావలి శవంబులు గజావయవ రాశీ
భావభయదస్థలులుఁ బ్రేవులును గండలును । బ్రోవులయి పెన్మెదదుపై విరిసి రక్త

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్రావమునఁ బెల్లయిన రేవమునఁ జూడఁ గడు । నేవ మగుపట్ల మృతభావగతులయ్యున్
జీవములఁ బాయరొకొ? నా వికచ వక్త్రముల । తో వఱలు రాజులు మనోవికృతి సేయన్. 5

ప్రతిపదార్థం: రావుతుల= గుర్రాలు నడిపేవారి; తుండములు= ముక్కలు; మావఁతుల= మావటివాళ్ళ; నుగ్గున్= ముక్కలు; తురగ+ఆవలి= గుర్రపు సమూహాల; శవంబులు= శవాలు; గజ+అవయవ+రాశీభావ= ఏనుగుల అవయవాలు ముక్కలై రాశులుగా పడి ఉండటంవలన; భయద= భయాన్ని పుట్టించే; స్థలులున్= చోట్లు; ప్రేవులును= ప్రేగులూ; కండలును= కండలూ; ప్రోవులు+అయి= రాశులుగా పడి; పెన్మెదడు+పైన్ విరిసి= ఏనుగు వంటిపెద్ద జంతువుల మెదళ్ళ పైగా విచ్చిపోయి; రక్తస్రావమునన్= రక్త ప్రవాహంతో; పెల్లయిన రేవమునన్= అతిశయించిన విధంగా; చూడన్= చూడటానికి; కడున్= మిక్కిలి; ఏవము+అగు= రోత కలిగించే; పట్ల= చోట్ల; అమృతభాగవతులు+అయ్యున్= మరణించినప్పటికీ; జీవములన్= ప్రాణాలను; పాయరు+ఒక్కొ+నాన్= వదలిపెట్టరా? అనిపించేటట్లు; వికచ= తెరుచుకొన్న; వక్త్రములన్= నోళ్ళతో; వఱలు= ఒప్పుతున్న; రాజులు; మనోవికృతి+చేయన్= మనసుకు వికారం కలిగించగా.

తాత్పర్యం: గుర్రాలను నడిపే రౌతుల దేహాలు ఒకపక్క, ఏనుగులను నడిపే మావటివాండ్ర శరీరాలు ఒకపక్క ఖండఖండాలై పడి ఉన్నాయి. మరోవైపు గుర్రాల శవాలు, ఇంకొకవైపు ఏనుగుల అవయవాలు రాశులుగా పడి ఉన్నాయి. వాటిని చూస్తే గుండెల్లో గుబులు పుట్టేటట్లు ఉన్నది. ఎక్కడపడితే అక్కడ పేగులు, కండలు, పోగులుగా పడి ఉన్నాయి. ఏవో మృగాల పెద్ద మెదళ్ళు విచ్చిపోయి రక్తం ఏర్లు కట్టి పారుతున్నది. అదంతా చూడటానికి చాలా అసహ్యంగా ఉన్నది. మరణించినా ఇంకా జీవించి ఉన్నారా ఏమి! అనే తలపు కలిగేరీతిగా - రాజ్యాలు ఏలిన మహారాజులు నోళ్ళు తెరుచుకొని పడి ఉన్నారు. వీరినందరినీ చూసి గాంధారి మనస్సు కకావికలయిపోగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. లయగ్రాహివృత్తంలోని ప్రతిపాదానికీ భ, జ, స, న, భ, జ, స, న, భ, య - అనే గణాలుంటాయి. 1-9-17-25 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

లయగ్రాహి:

హార రుచులన్ హృదయ హారితరమూర్తు లగు । వారు హరినీలమణి భారవిలసత్కే
యూర బహులాంశుచయ చారుతర రేఖులగు । వారు నవవజ్రరుచిరోరు ఘృణిమత్కో
టీర రమణీయులగు వారు గరుడాశ్మమయ । భూరికటకద్యుతివిహార పరిశోభా
స్ఫారులగు వారలును బోరఁబడి నెత్తురులఁ । గూరుటఁ గరంబెడఁద కారటము సేయన్. 6

ప్రతిపదార్థం: హార రుచులన్= ధరించిన దండల కాంతులచేత; హృదయహారితర= హృదయాలను మిక్కిలిగా ఆకర్షించే; మూర్తులు+అగువారు= శరీరాలు గలవారు; హరినీలమణి= ఇంద్రనీలమణుల; భారవిలసత్+కేయూర= ఆధిక్యంచేత ప్రకాశం పొందుతున్న భుజకీర్తుల; బహుల= అధికమైన; అంశుచయ= కిరణ సమూహంచేత; చారుతర= మిక్కిలి అందగించిన; రేఖలగువారు= విధంకలిగినవారు; నవవజ్ర= కొత్త వజ్రాలచేత; రుచిర= కాంతిమంతాలైన; ఉరు+ఘృణిమత్= పెద్ద వెలుతురుతోడి; కోటీర= కిరీటాలచేత; రమణీయులగు వారు= అందంగా ఉన్నవారు; గరుడ+అశ్మ+మయ= గరుడ పచ్చలతో నిండిన; భూరికటక= పెద్ద కడియాల; ద్యుతి= కాంతియొక్క; విహార= వ్యాప్తిచేత; పరిశోభా= మిక్కిలి శోభతో; స్ఫారులగు వారలును= నిండైన శోభతో కనిపిస్తున్నవారు (కూడా); పోరన్+పడి= యుద్ధంలో చనిపోయి; నెత్తురులన్+కూరుటన్= రక్తపు మడుగులో పడి ఉండటం; కరంబు= మిక్కిలిగా; ఎడఁదకున్= హృదయానికి; ఆరటము= ఆరాటం; చేయన్= కలిగించగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అక్కడపడి ఉన్న యుద్ధవీరులు ఎట్లా ఉన్నారంటే - ఒక్కొక్కరి మెడలో ఉన్న బంగారు హారాలచేత హృదయాలను మిక్కిలి ఆకర్షించేటట్లు వారి దేహాలు మిలమిలలాడుతున్నాయి. అత్యధికంగా ఇంద్రనీలమణులు పొదిగిన భుజకీర్తుల నుండి వెలువడే కాంతి సమూహంచేత వారి అందం ప్రత్యేకంగా కనిపిస్తున్నది. కొత్త వజ్రాలను పొదిగిన కిరీటాలు తళతళమెరుస్తూ ఆ వీరుల సౌందర్యాన్ని ప్రకటింపచేస్తున్నాయి. గరుడపచ్చలతో నిండిన పెద్ద పెద్ద కడియాలు వెలువరించే కాంతి దేహమంతటా పడి వారు అతి గంభీరంగా శోభాయమానంగా కనిపిస్తున్నారు. అట్లాంటి వీరులందరూ యుద్ధంలో చనిపోయి నెత్తురు మడుగులలో పడి ఉండటం చూసి గాంధారికి గుండెలో ఆరాటం కలుగగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: వృత్తలక్షణం - చూడండి స్త్రీ. 2. 5.

లయగ్రాహి:

అమ్ములును విండ్లుఁ బరిఘమ్ములును దోమర చ । యమ్ములును గుంతనికరమ్ములుఁ గనత్ఖ
డ్గమ్ములు నహీన ముసలమ్ములును జక్ర నివ । హమ్ములును లోనగు నసమ్మత మహోగ్రా
స్త్రమ్ములును గండలును నెమ్ములుఁ గపాలములు । సమ్మిళిత రూపశకలమ్ములయి సంగ్రా
మ మ్మతుల దారుణ విధమ్మగుటఁ దెల్పుట ధి । కమ్మగు కలంక హృదయమ్మున కొనర్పన్. 7

ప్రతిపదార్థం: అమ్ములును= బాణాలూ; విండ్లున్= ధనుస్సులూ; పరిఘమ్ములును= పరిఘలు; తోమరచయమ్ములును= ఈటెల సముదాయాలు; కుంతనికరమ్ములున్= బల్లెముల సముదాయాలు; కనత్= ప్రకాశించే; ఖడ్గమ్ములు= కత్తులూ; అహీన= గొప్పవైన; ముసలమ్ములును= రోకళ్ళు (పెద్ద దుడ్డు కర్రలు); చక్రనివహమ్ములును= చక్రములచే ఆయుధాలూ; లోనగు= మొదలైన; అసమ్మత= భయంకరమైన; మహా+ఉగ్ర+అస్త్రమ్ములును= మహాక్రూరమైన ఆయుధాలు; కండలును= కండలూ; ఎమ్ములున్= ఎముకలూ; కపాలములున్= పుర్రెలు; సమ్మిళిత రూప శకలమ్ములు+అయి= అన్నీ కలిసిపోయి ముక్కలు ముక్కలై; సంగ్రామమ్ము= యుద్ధము; అతుల= సాటిలేని; దారుణ= భయంకరమైన; విధమ్ము+అగుటన్= విధంగా కలదని; తెల్పుట= తెలుపుతూ ఉండటం; హృదయమ్మునకున్= హృదయానికి; అధికమ్ము+అగు= మిక్కిలి; కలంక= బాధ; ఒనర్పన్= కలిగించగా.

తాత్పర్యం: అమ్ములు, ధనుస్సులు, పరిగెలు, ఈటెలు, బల్లెములు, తళతళలాడుతున్న కత్తులు, పెద్దపెద్ద దుడ్డు కర్రలు, చక్రాలు మొదలైన మహాక్రూరమైన ఆయుధాలు, మరొకవైపు కండలు, ఎముకలు, పుర్రెలు కలిసిపోయి ముక్కలు ముక్కలుగా పడి ఉండటం చూస్తే జరిగిందే మహా ఘోరయుద్ధమని తెలుపుతూ ఉండటం గాంధారి హృదయానికి మిక్కిలి బాధ కలిగించగా.

విశేషం: వృత్తలక్షణం - చూడండి. స్త్రీ. 2.5.

లయగ్రాహి:

కుత్తుకలబంటి యగు నెత్తురులు దోయిళుల । నెత్తి చవిగ్రోలుచును జిత్తములు దృప్తిన్
జొత్తిలి నితాంత మదమత్తములుగాఁ జటుల । నృత్తములు సేయుచుఁ జలత్తను వికారో
ద్వృత్తపటుహాసముల రిత్తలగు దుర్వచన । వృత్తులను నొండొరుల నొత్తికొని మాంసం
బత్తి తినుటన్ వికటవృత్తులగు రాక్షసుల । మొత్తము పరిక్షుభితచిత్తత యొనర్పన్. 8

ప్రతిపదార్థం: కుత్తుకలబంటి+అగు= కంఠాలవరకు; నెత్తురులు= రక్తాన్ని; దోయిళులన్= దోసిళ్ళతో; ఎత్తి+చవిన్+గ్రోలుచును= ఎత్తుకొని ఇష్టంగా తాగుతూ; చిత్తములు= మనస్సులు; తృప్తిన్+జొత్తిలి= తృప్తితో మునిగిపోయి; నితాంత మదమత్తములుగాన్= మిక్కిలి మదించి; చటుల నృత్తములు+చేయుచున్= భయంకరమైన చిందులువేస్తూ; చలత్తనువికార+ఉద్వృత్త= ఊగుతున్న దేహవికారాలచేత మితిమీరిన; పటు= మొరటు; హాసములన్= నవ్వులతో; రిత్తలు+అగు= వ్యర్థాలైన; దుర్వచన వృత్తులను= బూతుమాటలతో; ఒండొరులన్= ఒకరినొకరు; ఒత్తికొని= తోసుకొంటూ; మాంసంబు+అత్తి+తినుటన్= అందరూ కలిసి మాంసం తినటంలో; వికటవృత్తులు+అగు= భయంకరంగా ప్రవర్తించే; రాక్షసుల మొత్తము= రాక్షసుల గుంపు; పరిక్షుభిత= మిక్కిలి కలత పొందిన; చిత్తతన్= మనస్థితిని; ఒనర్పన్= కలిగించగా.

తాత్పర్యం: గొంతుకలదాకా రక్తాన్ని దోసిళ్ళతో ఎత్తుకొని మహా ఇష్టంగా త్రాగుతూ, ఆ తృప్తిలో కరిగిపోయి మదమత్తులై చిందులువేస్తూ ఊగిపోతున్న దేహ వికారాలచేత ఎగిరెగిడిపడుతూ మొరటు నవ్వులతో బూతులు మాట్లాడుతూ ఒకరినొకరు తోసుకొంటూ అందరూ కలిసి మాంసం తినటంలో అతిభయంకరంగా వర్తిస్తున్న రాక్షసుల గుంపు గాంధారి మనస్సును మిక్కిలిగా కలచివేయగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: వృత్తలక్షణం - చూడండి. స్త్రీ. 2. 5

సీ. **ప్రేవులు గండలు పెటికి పేటాడి యం । గదఁగొని మెదళుల గల్చికొనుచు**
రాగిలి రక్తంబు ద్రావుచు లోచన । గుళికల నొలిచి మ్రింగుచును గుండె
కాయ లాదట మెయిఁ గబళించుచును గ్రొవ్వు । దెమలచి నమలుచు నెముక యూట
చవిగొని యానుచుఁ జావకయున్న రూ । పులు సచ్చుటకుఁ గాఁగఁ బెలుచఁ దన్ని

తే. **కొనిన దెఱఁబాయఁ బాఱుచుఁ జెనకి తొడరి । కాటులాడుచు నున్న సృగాలములును**
గాకములు రాపులుఁగులును గ్రద్దలును వృ । కంబులును మానసము వికలంబు సేయ. 9

ప్రతిపదార్థం: ప్రేవులు= పేగులను; కండలు= కండలను; పెటికి= ఊడబెరికి; పేటాడి= ముక్కలు చేసి; అంగదన్+కొని= ఆకలిగొని; మెదళులు= మెదళ్ళను; అగల్చికొనుచున్= ఊడబెరుక్కొని; రాగిలి= ఆసక్తితో; రక్తంబున్+త్రావుచు= రక్తం త్రాగుతూ; లోచన గుళికలన్= కంటి గుడ్లను; ఒలిచి= ఒలుచుకొని; మ్రింగుచును= మింగుతూ; గుండెకాయలు= గుండెకాయల్ని; ఆదటమెయిన్= ఎంతో ఆపేక్షతో; కబళించుచును= మింగుతూ; క్రొవ్వున్+తెమలిచి= కొవ్వును ఊడదీసి; నమలుచున్= తింటూ; ఎముక+ఊట= మూలుగును; చవిగొని+అనుచున్= రుచిచూస్తూ జుర్రుతూ; చావక+ఉన్న= ఇంకా చావకుండా ఉండే; రూపులు= శరీరాలు చచ్చుటకున్+కాఁగన్= చావటానికై; పెలుచన్= మిక్కిలిగా; తన్నికొనినన్= తన్నుకొంటుండగా; తెఱఁబాయన్= ప్రాణాలుపోయేలా; పాఱుచున్= మీద ఎగురుతూ; చెనకి= ఎదిరించి; తొడరి= పూనికతో; కాటులాడుచున్= కొట్లాడుతూ; ఉన్న= ఉన్నటువంటి; సృగాలములు= నక్కలు; కాకములు= కాకులూ; రాపులుఁగులును= రాబందులూ; గ్రద్దలును; వృకంబులు= తోడేళ్ళు; మానసము= మనసును; వికలంబు+చేయన్= కలచివేస్తుండగా.

తాత్పర్యం: ఆ యుద్ధభూమిలో పేగులను కండలను ఊడబెరికి ముక్కలుచేసి ఆకలిగొని తింటూ, మెదళ్ళను ఊడబెరుక్కొని ఆసక్తితో రక్తం తాగుతూ, కంటిగుడ్లను ఒలుచుకొని మింగుతూ, గుండెకాయలను ఎంతో ఆసక్తిగా కబళిస్తూ ఎముకలలోని మూలుగును రుచిచూస్తూ జుర్రుతూ, ఇంకా చావకుండా ఉండే శరీరాలు తన్నుకొంటుండగా

ప్రాణాలుపోయేటట్లు పైన ఎగురుతూ, ఎదుర్కొని ఎంతో పూనికతో ఒకదానితో ఒకటి కొట్లాడుతూ ఉన్న తోడేళ్ళు, కాకులు, రాపులుగులు, గద్దలు, నక్కలు గాంధారి మనస్సును కలచి వేయగా.

వ. అగ్గాంధార రాజనందన కలను గలయం గనుంగొనియెఁ దదవసరంబున సాత్యవతేయుండు కౌంతేయుల రావించి 'బంధు శవంబులకుఁ గాలోచితాచార సహితంబుగా నగ్ని సంస్కారంబు సేయుం'డని పనిచి యంతర్ధానంబు సేసె. వారు ధృతరాష్ట్రుం బొదివికొని వాసుదేవపురస్సరులయి యప్పనికిం జనుచుఁ గౌరవకాంతలఁ దత్ప్రదేశంబునకు నడపించిన నప్పడఁతులు పతులును సుతులును సోదరులును బౌత్రులును మిత్రులును గుణపంబులై పడియున్నఁ జూచి చెయ్వేది మేదిని నొఱగువారును వా విడిచి యఱచువారును బురపురం బొక్కువారును బడిపొరలుచుఁ బొగులువారును వేనలులు వీడి వెన్నుల విరియం దిరుగువారును బలవించువారును బేర్కొని యగ్గించువారును బ్రాన్పడువారును మోములుం దలలును మోఁదుకొనువారును నై రప్పు డా దుర్యోధనజనని జనార్దనుం బేర్కొని చేరంబిలిచి పరమశోకార్తయగుచు నతని కిట్లనియె. 10

ప్రతిపదార్థం: ఆ+గాంధార రాజనందన= ఆ సుబలరాజుకుతురు గాంధారి; కలనున్= యుద్ధభూమిని; కలయన్+ కనుంగొనియెన్= అంతా పరికించింది; తద్+అవసరంబునన్= ఆ సమయంలో; సాత్యవతేయుండు= వ్యాసుడు; కౌంతేయులన్= పాండవులను; రావించి= పిలిపించి; బంధు శవంబులకున్= బంధువుల శవాలకు; కాలోచిత+ఆచార సహితంబుగాన్= ఆ సమయానికి తగిన ఆచారాలను అనుసరించి; అగ్నిసంస్కారంబు+చేయుండు+అని= అగ్ని సంస్కారం చేయండి అని; పనిచి= ఆనతి ఇచ్చి; అంతర్ధానంబు+చేసెన్= అంతర్ధానమయ్యాడు; వారు= ఆ పాండవులు; ధృతరాష్ట్రున్+పొదివికొని= ధృతరాష్ట్రుని చుట్టుకొని (పరివేష్టించి); వాసుదేవ పురస్+సరులయి= శ్రీకృష్ణుడు ముందు నడుస్తుండగా; ఆ+పనికిన్+చనుచున్= ఆ బంధువుల అగ్నికార్యం కోసం వెళ్తూ; కౌరవకాంతలన్= కౌరవ స్త్రీలను; తద్+ప్రదేశంబునకున్= ఆ చోటికి; నడిపించినన్= పిలుచుకొని వెళ్ళగా; ఆ+పడఁతులు= ఆ స్త్రీలు; పతులును= భర్తలు; సుతులును= కుమారులు; సోదరులును= తమ్ముళ్ళు, అన్నలు; పౌత్రులును= మనుమళ్ళు; మిత్రులును= స్నేహితులు; కుణపంబులు+ఐ= శవాలై; పడి+ఉన్నన్+చూచి= పడి ఉండగా చూసి; చెయ్వు+ఏది= చేష్టలుడిగి; మేదినికిన్= నేలమీదికి; ఒఱగువారును= ఒరిగిపోయేవారు; వా+విడిచి= నోరుతెరచి; అఱచువారును= అరుస్తున్నవారు; పురపురన్+పొక్కువారును= తహతహలాడుతూ దుఃఖించేవారు; పడిపొరలుచున్= నేలమీదపడి పొర్లుతూ; పొగులు వారును= పరితపిస్తున్నవారు; వేనలులు+వీడి= జడలు వీడిపోయి; వెన్నులన్+విరియున్= వీపులమీద పరచుకొని ఉండగా; తిరుగువారును= తిరుగుతున్నవారు; పలవించువారును= పిచ్చి పిచ్చిగా అరుస్తున్నవారు; పేర్కొని= ఆయా మృతవీరుల పేర్లు పెట్టి పిలుస్తూ; అగ్గించువారును= వారిని పొగడుతున్నవారు; బ్రాను+పడువారును= నిశ్చేష్టులవుతున్నవారు; మోమున్+తలలును= ముఖాలను, తలలను; మోఁదుకొనువారును= కొట్టుకొనేవారు; ఐరి= అయ్యారు; అప్పుడు; ఆ; దుర్యోధనజనని= ఆ గాంధారి; జనార్దనున్+పేర్కొని= కృష్ణుడిని పేరుపెట్టి పిలిచి; చేరన్+పిలిచి= దగ్గరకు రమ్మని; పరమశోకార్తయగుచున్= మిక్కిలి దుఃఖంతో దీనురాలై; అతనికిన్= కృష్ణుడితో; ఇట్లనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: గాంధారి ఇట్లా బాధపడుతూ ఆ యుద్ధభూమిని అంతా పరికించింది. ఆ సమయంలో వ్యాసమహర్షి పాండవులను పిలిపించి 'మృతులైన బంధువుల శవాలకు ఆ కాలానికి తగిన ఆచారాలతో కూడిన అగ్ని సంస్కారం చేయండి' అని ఆనతిచ్చి అంతర్ధాన మయ్యాడు. అపుడు పాండవులు ధృతరాష్ట్రుడిని నడిపించుకొంటూ శ్రీకృష్ణుడు ముందు నడుస్తుండగా ఆ బంధువులకు దహన సంస్కారం చేయటంకొరకు వెళ్తూ కౌరవస్త్రీలను ఆ ప్రదేశానికి

తీసికొని వెళ్ళారు. అక్కడ వారు తమతమ భర్తలు, కొడుకులు, తమ్ముళ్ళు, అన్నలు, మనుమళ్ళు, స్నేహితులు శవాలై పడి ఉండగా చూచి చేష్టలుడిగి నేలమీద ఒరిగిపోయారు. నోళ్ళు తెరచి హాహాకారాలు చేస్తున్నారు. తహతహలాడుతూ నేలమీదపడి పొర్లుతూ పరితపిస్తున్నారు. జడలు వీడిపోయి వీరుల పేర్లు పెట్టి పిలుస్తూ వారి గుణగణాలను గురించి చెప్పుతున్నారు. నిశ్చేష్టలై కొయ్యబారిపోతున్నారు. ముఖాలను, తలలను మోదుకొంటున్నారు. అప్పుడు గాంధారి కృష్ణుడిని పిలిచి దగ్గరికి రమ్మని మిక్కిలి దుఃఖంతో దీనురాలై అతడితో ఇట్లా అన్నది.

విశేషం: కాలోచితమైన ఆచారం - అంటే కొంత వివరించాలి. ఇక్కడ చేస్తున్నది సామూహిక దహన సంస్కారం. దీని పద్ధతి సాధారణ పితృ ప్రేతకర్మవంటిది కాదని అర్థం. అందుకే ఆ సమయానికి తగిన పద్ధతిలో చేశారని అర్థం.

గాంధారి పొలికలను చూచి కృష్ణునితోఁ జెప్పి దుఃఖించుట (సం. 11-16-18)

సీ. **'చూడుము ధృతరాష్ట్రు కోడండ్రఁ గన్నార । వీరె కన్నీరు పై వెల్లి గొనఁగ**
దీనతఁ బొందెడు నాననంబుల విప్ర । లాపంబులైన సల్లాపములను
నడలు చొండొరులకు నన్నలఁ దమ్ముల । రూపించి వేర్వేఱఁ జూపుటయును
బొరిమొగంబులు సూచి పురుపురఁ బొక్కుచుఁ । దలలల్లం దూలంగ నిలుచుటలును

తే. **గలిగి యలిగెడు వారి కన్నులకుఁ బండు । వగుచునున్నారు కాకులు మగల తనువు**
లెక్కియున్నను చేష్టలు దక్కి కొంద । ఱడువఁ జేయాడకున్నవా రంబుజాక్ష! **11**

ప్రతిపదార్థం: అంబుజ+అక్ష!= కమలనేత్రుడవైన కృష్ణా!; ధృతరాష్ట్రు= ధృతరాష్ట్రుని; కోడండ్రన్= కోడళ్ళను; కన్నారన్= కళ్ళారా; చూడుము; వీరె= ఇదుగో వీరే ఆ కోడళ్ళు; కన్నీరు= కంటినీరు; పై+వెల్లికొనఁగన్= ముఖంపైన ప్రవహిస్తుండగా; దీనతన్+పొందెడు+ఆననలంబులన్= దైన్యంతో కూడిన ముఖాలతో; విప్రలాపంబులైన= పొంతనలేని; సల్లాపములను= మాటలతో; అడలుచున్= దుఃఖిస్తూ; ఒండొరులకున్= ఒకరు మరొకరికి; అన్నలన్= తమ అన్నలను; తమ్ములన్= తమ్ముళ్ళను; రూపించి= నిర్ణయించి; వేర్వేఱన్= వేరు వేరుగా; చూపుటయును= చూపించటం; పొరిన్= క్రమంగా; మొగంబులు= ముఖాలు; చూచి; పురపురన్+పొక్కుచున్= తహతహలాడుతూ ఏడుస్తూ; తలలు+అల్లన్+తూలంగన్= తలలు వాలిపోతూ ఉండగా; నిలుచుటలును= ఎట్లాగో నిలదొక్కుకొని నిలబడి ఉండటం; కలిగి; అలిగెడువారి= కోపగించుకొన్నవారి; కన్నులకున్= కళ్ళకు; పండువు+అగుచున్+ఉన్నారు= విందు అవుతున్నారు; కాకులు; (తమ); మగల తనువులు= భర్తల దేహాలు; ఎక్కి+ఉన్నను= ఎక్కిఉన్నా; చేష్టలు+తక్కి= నిశ్చేష్టలై; కొందఱు= కొందరు స్త్రీలు; అడువన్= తోలటానికి; చేయి+అడకున్నారు= చేయి ఆడించుకున్నారు.

తాత్పర్యం: 'కృష్ణా! ధృతరాష్ట్ర మహారాజు కోడళ్ళను చూడుము. ఇదుగో వీరే వారు! కంటినీరు ముఖాలపైన వెల్లువలుగట్టగా అతిదీనమైన ముఖాలతో పొంతన లేని పలుకులతో, పుట్టెడు దుఃఖంతో, ఒకరి కొకరు చనిపోయిన తమ అన్నదమ్ముల ముఖాలు చూచి ఇది 'ఫలానా వారిదే' అని నిర్ణయిస్తూ చూపిస్తున్నారు. చూపించి తాము చూచి మళ్ళీ తహతహలాడుతూ ఏడుస్తూ తలలు వాలిపోతుండగా ఎట్లాగో నిలదొక్కుకొని నిలబడి ఉన్నారు. వీళ్ళమీద కసి ఉన్నవారికి ఈ నాటికి 'కన్నులపండుగు' అయింది. తమ భర్తల దేహాలపై కాకులు కూర్చొని ఉన్నా వాటిని తోలటానికి చెయ్యి ఎత్తలేని స్థితిలో ఉన్న ఈ ఆడవారిని చూస్తే ఎంత బాధ అవుతుందో చూడుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అంత దుఃఖంలోనూ పగవారిని గురించి స్మరించటంలోనే మనుష్య సహజమైన అజ్ఞానం ఉన్నది. మమతానుబంధాలు అధికంగా ఉన్న స్త్రీలలో అది మరింత అధికమని నిరూపించటానికే 'స్త్రీ పర్వ' మనేపేరు వ్యాసమహర్షి ఉంచాడు. దుఃఖంలోనూ ద్వేషం, అసూయ, పట్టుదలలు నశించవని అర్థం.

మానిని:

కూలియుఁ గాంతి యిగుర్పఁగఁ దేజము గుందక వహ్నులు గ్రూరశిఖా
జాల మడంగియుఁ జాయ వెలింగెడు చందము నొందిరి శల్యుఁడుఁ బాం
చాలుఁడుఁ గర్ణుఁడుఁ జాపగురుండును శాంతనవుండు నిజంబున కీ
బాలుఁడు వీరి ప్రభం గడచెం గుణభద్రునిఁ గంటె సుభద్రసుతున్. **12**

ప్రతిపదార్థం: శల్యుఁడు; పాంచాలుఁడు= ద్రుపదుడు; కర్ణుఁడు; చాపగురుండును= ద్రోణుడూ; శాంతనవుండు= భీష్ముడు (వీరంతా); కూలియున్= చనిపోయికూడా; తేజము+కుందక= కాంతి తగ్గక; కాంతి+ఇగుర్పఁగన్= కొత్తకాంతులీనుతూ; వహ్నులు= అగ్నులు; క్రూర= తీక్ష్ణమైన; శిఖాజాలము= జ్వాలల సమూహం; అడంగియున్= తగ్గిపోయినా; చాయ= కాంతి; వెలింగెడు చందమున్= ప్రకాశించే విధాన్ని; ఒందిరి= పొందారు; నిజంబునకున్= నిజానికి; ఈ బాలుఁడు= ఈ బాలుడైన అభిమన్యుడు; వీరి ప్రభన్= వీరందరి కాంతిని; కడచెన్= అధిగమించాడు; గుణభద్రునిన్= సుగుణవంతులలో శ్రేష్ఠుడైన; సుభద్రసుతున్= సుభద్ర కుమారుడైన అభిమన్యుడిని; కంటె?= చూచావా?

తాత్పర్యం: కృష్ణా! శల్యుడు, ద్రుపదుడు, కర్ణుడు, ద్రోణుడు, భీష్ముడు వీరంతా యుద్ధంలో చనిపోయినా, మంటలు తగ్గాక కూడా అగ్ని కాంతి ఎట్లా కొత్త కొత్తగా పుట్టుతూ ఉంటుందో అట్లా ప్రకాశం తగ్గకుండా ఉన్నారు. నిజానికి వీరందరికన్నా ఎక్కువ కాంతితో అభిమన్యుడు మెరిసిపోతున్నాడు. సుగుణాలఖని ఈ సుభద్రకొడుకు ఈ బాలుడిని చూచావా? (శవంలో కూడా జీవకాంతులు తగ్గలేదని అర్థం).

విశేషం: అలం: ఉపమ. వృత్తలక్షణానికి చూడండి స్త్రీ. 1.90

ఆ. **ప్రభువు లంతనంత రాజిల్ల నెడనెడ । వీరయోధతతులు వెలుఁగుచుండ**
గ్రహచయమునఁ దారక ప్రకరంబున । బొలుచు గగనతలముఁ బోలెఁ గలను. **13**

ప్రతిపదార్థం: ప్రభువులు= రాజులు; అంతన్+అంతన్= అక్కడక్కడా; రాజిల్లన్= ప్రకాశిస్తుండగా; ఎడన్+ఎడన్= అక్కడక్కడా; వీరయోధతతులు= వీరులైన యోధుల సమూహాలు; వెలుఁగుచుండన్= ప్రకాశిస్తుండగా; గ్రహచయమునన్= గ్రహాలరాశితోనూ; తారక ప్రకారంబునన్= నక్షత్రాల సముదాయంతోనూ; పొలుచు= ఒప్పినటువంటి; గగన తలమున్= ఆకాశతలాన్ని; కలను= యుద్ధభూమి; పోలన్= పోలి ఉంది.

తాత్పర్యం: అక్కడక్కడా రాజులు, అక్కడక్కడా యుద్ధవీరులు కాంతులీనుతూ ప్రకాశిస్తుండగా ఈ యుద్ధభూమి గ్రహరాశులతోనూ, నక్షత్రసముదాయాలతోనూ వెలిగే ఆకాశంవలె కనిపిస్తున్నది.

విశేషం: అలం: ఉపమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. అర్జున భీష్మ చాపాచార్య భీమ క । ర్ణాదుల మహిత దివాస్త్ర వితతు
లాడిన నొండొక కీడు రానేరమి । వీతవికారమై వీరయోధ
చారుశరీరసంచయ ముండఁగా దీనిఁ । గంకశివాగృధ్రకాకకులము
లాదిగాఁ గలుగు క్రవ్యాదముల్ వీఁకు వీఁ । కాడుట నెంగిలి యయ్యెనకట!

తే. హంసతూలికా తల్పములందుఁ బొందు । భోగిజనముల మృదుగాత్రములు ముకుంద!
కంటె పరుసని ధరణి భాగమునఁ గూలి । యున్న యవి సూచువారల యుల్ల ముడుక. 14

ప్రతిపదార్థం: ముకుంద!= ఓ కృష్ణా!; అర్జున; భీష్మ; చాపాచార్య= ధనుర్విద్యాగురుడైన ద్రోణ; భీమ; కర్ణాదుల= కర్ణుడు మొదలైన మహావీరుల; మహిత= గొప్పవైన; దివ్యాస్త్ర వితతులు= దివ్యమైన అస్త్రసముదాయాలు; ఆడినన్= నాటుకోగా; ఒండొక= ఏ ఒక్క; కీడు రానేరమిన్= అపాయం కలుగనందువలన; వీత= పోయిన; వికారమై= వికారం కలిగినదై (ఏ వికారం లేకుండా); వీరయోధ= వీరులైన యోధుల; చారు= అందమైన; శరీర సంచయము= శరీర సముదాయం; ఉండఁగాన్= యుద్ధభూమిలో ఉండగా; దీనిన్= దీనిని; కంక= రాపులుగులు; శివాగృధ్రకాకకులములు= నక్కలు, గ్రద్దలు, కాకులు - వీటి సముదాయం; ఆదిగాఁగలుగు= మొదలైనటువంటి; క్రవ్యాదముల్= మాంసాన్ని తినేవి; వీఁకు వీఁకాడుటన్= ఉద్ధతితో చెలరేగి పరాక్రమించటంవలన; ఎంగిలి+అయ్యెన్+అకట!= అయ్యో! ఎంగిలి అయిపోయింది; హంసతూలికా తల్పములందున్= బూరుగు దూదితో చేసిన పరుపులందు; పొందు= విశ్రమించే; భోగిజనముల= ఈ భోగపురుషుల; మృదుగాత్రము=మెత్తటి శరీరాలు; చూచువారల= చూచేవారి; ఉల్లము+ఉడుకన్= హృదయాలు పరితపించే విధంగా; పరుసని= కఠినమైన; ధరణిభాగమునన్= నేలమీద; కూలి= పడి; ఉన్నయవి= ఉన్నాయి; కంటె= చూచావా?

తాత్పర్యం: కృష్ణా! అర్జున, భీష్మ, ద్రోణ, భీమ, కర్ణాదుల దివ్యాస్త్ర సముదాయాలు నాటినా కించిత్తు కీడు వాటిల్లని ఈ మహావీరుల దేహాలను రాపులుగులు, నక్కలు, గ్రద్దలు, కాకులు ఆక్రమించి పొడిచి పొడిచి ఎంగిలిచేశాయి. అయ్యో! హంసతూలికాతల్పాలలో విశ్రమించే ఈ విలాసపురుషుల శరీరాలు కఠినమైన ఈ నేలపై పడి ఉన్నాయి. చూచేవారికి గుండెలు తరుక్కుపోతున్నాయి. చూచావా?

క. చెవిని సొగియించు వీణా । రవమును గానంబు వేణురావము నిత్యో
త్సవముగ విను రాజులకడ । శివారుతము చెలఁగుచునికి చిత్త మలంచెన్. 15

ప్రతిపదార్థం: చెవినిన్= చెవులను; సొగియించు= సుఖింపచేసేటువంటి; వీణానాదం; గానంబు= పాట; వేణురావము= పిల్లనగ్రోవి ధ్వని; నిత్య+ఉత్సవముగన్= ప్రతిరోజూ సంతోషదాయకమైన వినోదంగా; విను= వినేటువంటి; రాజులకడన్= రాజుల సమీపంలో; శివారుతము= ఆడు నక్కల ఊళలు; చెలఁగుచునికి= ధ్వనిస్తూ ఉండటం; చిత్తము= హృదయాన్ని; అలంచెన్= బాధపెట్టుతోంది.

తాత్పర్యం: ప్రతిరోజూ వినోదకార్యక్రమాలుగా చెవులను సుఖింపచేసే వీణానాదాన్ని, మధురగానాన్ని వేణుధ్వనులను వినేటువంటి రాజుల వద్ద నక్కలు ఊళలు విజృంభించటం చూస్తే హృదయం కలత పొందుతున్నది.

తే. సారచందనహృద్య కస్తూరి కాది । లేపనాలిప్తి నుండెడు భూపవర్యు
లకట! శోణితపంకదిగ్ధాంగులగుటఁ । గనుట కోర్వరాదయ్యెడుఁ గమలనాభ!. 16

ప్రతిపదార్థం: సార= శ్రేష్ఠమైన; చందన= శ్రీగంధం; హృద్య= మనోహరమైన; కస్తూరిక+ఆది= కస్తూరి, పునుగు, జవ్వాది మొదలైన; లేపన= లేపనాల; ఆలిప్తిన్= పూతతో; ఉండెడు= సుగంధాలు చిమ్ముతూ ఉండే; భూపవర్యులు= రాజులు; అకట!= అయ్యో!; శోణిత= రక్తమనే; పంక= బురదచేత; దిగ్ధ+అంగులగుటన్= పూత పూయబడిన శరీరాలు కలవారు కావటం వలన; కమలనాభ!= ఓ కృష్ణా!; కనుటకున్= చూడటానికి; ఓర్వరాదు+అయ్యెడున్= భరించటానికి వీలుకాకుండా ఉన్నది.

తాత్పర్యం: శ్రేష్ఠమైన శ్రీగంధం, మనోహరమైన కస్తూరి, పునుగు, జవ్వాది మొదలైన లేపనాలతో సుగంధాలు చిమ్ముతూ అందంగా కనిపించే ఈ రాజుల శరీరాలు రక్తమనే బురద పూత పూయబడి చాలా దారుణంగా అగుపిస్తున్నాయి. కృష్ణా! ఎట్లా చూచి భరించటం?

క. వనితలు మేలపుమెయి మెలు । పునఁ దిగిచిన నొప్పు హారములు మొదలగు ప్ర
న్నని తొడవులు గ్రద్దలు దివి । య నరేంద్రులు గొందఱునికి యచ్చుత! కంటే? 17

ప్రతిపదార్థం: అచ్యుత!= కృష్ణా!; మేలపు మెయిన్= సరదాగా; వనితలు= తమ ప్రియురాళ్ళు; మెలుపునన్= నెమ్మదిగా; హారములు మొదలగు= దండలు మొదలైన; ప్రన్నని= చక్కటి; తొడవులు= ఆభరణాలు; తివియన్= తీసివేయగా; ఒప్పు= ప్రకాశించే; రాజులు; కొందఱు(ఇక్కడ); (ఆ నగలను); గ్రద్దలు= గద్దలు; తివియన్= లాగిపారవేస్తుండగా; ఉనికి= ఇలా పడిఉండటం; కంటే?= చూస్తున్నావా?

తాత్పర్యం: కృష్ణా! తమ ప్రియురాళ్ళు సరదాకొరకు తాము ధరించిన చక్కని ఆభరణాలను హారాలను తీసివేస్తుండగా ప్రకాశించే రాజులు ఆ నగలనే గ్రద్దలు క్రూరంగా లాగివేస్తుండగా ఈ యుద్ధభూమిలో చలనం లేకుండా పడి ఉన్నారు. చూస్తున్నావు కదా!

క. ప్రాణంబులు విడిచియును గృ । పాణాదులు విడువకున్న భటు లారయ స
ప్రాణుల పోలెం బ్రధన । క్షోణికిఁ దొడవగుచు నున్కి చూడుము కృష్ణా! 18

ప్రతిపదార్థం: కృష్ణా!= వాసుదేవా!; ప్రాణంబులు= ప్రాణాలు; విడిచియును= విడిచిపెట్టికూడా; కృపాణ+ఆదులు= కత్తులను కటార్లను; విడువక+ఉన్న= చేతులలో అట్లాగే పట్టుకొని ఉన్న; భటులు= యోధులు; ఆరయన్= బాగాచూస్తే; సప్రాణుల పోలెన్= బ్రతికి ఉన్న వారిలాగా; ప్రధన క్షోణికిన్= యుద్ధ భూమికి; తొడవు+అగుచున్= ఆభరణాలౌతూ; ఉన్కి= ప్రకాశిస్తూ ఉండటం; చూడుము.

తాత్పర్యం: వాసుదేవా! ప్రాణాలు వదిలినా కూడా కత్తులను కటార్లను తమ చేతుల్లోనే ఉంచుకొని ఉన్న ఈ వీరులు బాగా చూస్తే బ్రతికి ఉన్నవారివలెనే కనిపిస్తున్నారు. ఈ యుద్ధభూమికి సమర్పించబడిన ఆభరణాలవలె అగుపిస్తున్నారు - చూస్తున్నావా?

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. సూరెలను నందిజను లిం । పారఁగ వినుతింప నొప్పునట్టి మహీశుల్
నారీజనములు సుట్టుం । జేరి పనవుచుండ నునికి సేసె నలంతన్. 19

ప్రతిపదార్థం: సూరెలను= ప్రక్కలను; వంది జనులు= వంది మాగాధులు; ఇంపు+ఆరఁగన్= మనోహరంగా; వినుతింపన్= స్తోత్రాలు చేస్తుండగా; ఒప్పునట్టి= ప్రకాశించేటువంటి; మహీశుల్= రాజులు; నారీజనములు= తమ తమ స్త్రీలు; చుట్టున్+చేరి= చుట్టూచేరి; పనవుచుండన్= ఏడుస్తూ ఉండగా; ఉనికి= ఇట్లా ఉండటం; అలంతన్= దుఃఖాన్ని; చేసెన్= కలిగిస్తోంది.

తాత్పర్యం: వందిమాగధులు చుట్టూ నిలబడి మనోహరంగా స్తోత్రపాఠాలు చెప్పుతూ ఉంటే ప్రకాశించేటువంటి రాజులు తమతమ స్త్రీలు చుట్టూ చేరి హృదయవిదారకంగా ఏడుస్తుండగా ఇట్లా పడి ఉండటం ఎంతో బాధను కలిగిస్తున్నది.

తే. **కూరు మొన పెట్టినట్టులు గొంద ఱుజ్జ్వ । లాయుధములు గంకటములు నమర నున్నఁ**
జూచి చావని వారని చూడు చేర । నరుగకున్నవి కంక గృధ్రాదు లనికి. **20**

ప్రతిపదార్థం: కొందఱు= కొందరు యుద్ధవీరులు; కూరు మొనపెట్టిన+అట్టులు= కునుకుతీస్తున్నవారివలె; ఉజ్జ్వల= ప్రకాశిస్తున్న; ఆయుధములు= ఆయుధాలు; కంకటములు= కవచాలు; అమరన్= ఒప్పగా; ఉన్నన్= ఉండగా; చూచి; చావని వారని= చనిపోయినవారు కారని (అంటే బ్రతికినవారేనని); కంక= రాపులుగులు; గృధ్ర+ఆదులు= గద్దలు మొదలైనవి; అనికిన్= యుద్ధభూమివైపు; అరుగక+ఉన్నవి= వెళ్ళకుండా ఉన్నాయి; చూడు= చూడుము.

తాత్పర్యం: కృష్ణా! అటుచూడుము కొంతమంది వీరులు మెరిసిపోతున్న ఆయుధాలతో తళతళలాడుతున్న కవచాలతో కునుకుతీస్తున్నవారివలె అగుపిస్తూ ఉండటం చూచి వారు బ్రతికినవారే అని రాపులుగులు, గద్దలు ఆవైపుకి రాకుండా దూరదూరంగానే ఉంటున్నాయి.

విశేషం: అలం: భ్రాంతిమంతం.

వ. **ఇది యంతయు నీచే సాధితంబైన కార్యం' బని పలికి వెండియు.** **21**

తాత్పర్యం: ఇదంతా నీవు సాధించిన ఘనకార్య'మని ఎత్తిపొడిచి గాంధారి మళ్ళీ ఇట్లా అంటున్నది.

సీ. **'అట్టలకడ యుత్తమాంగముల్ గానక । యలమట నలుగడ లరయువారుఁ**
దలలు చేతులఁగొని తనువు లుత్తలమునఁ । దఱచు పీనుఁగులలోఁ దడవు వారు
శిరములు మేనులఁ జేర్చి భావించి ని । జాస్యముల్ వ్రేసికొం చఱచువారు
తునియలు పెక్కైనఁ బనివడి గూర్చి రూ । పులు గనుంగొని మూర్ఛ మునుఁగువారు

తే. **నైన కౌరవపాంచాలి మానినీ జ । నముల నచ్యుత! చూడుము నాథజనక**
పుత్రసోదరశవముల పొంతకేఁగి । పెక్కు దురవస్థ లొందెద రక్కటకట! **22**

ప్రతిపదార్థం: అచ్యుత!= కృష్ణా!; అట్టలకడన్= మొండెముల దగ్గర; ఉత్తమాంగముల్= తలలు; కానక= కనిపించక; అలమటన్= దుఃఖంతో; నలుగడలు= నాలుగువైపులా; అరయువారు= తిరిగిచూస్తున్నవారు; తలలు; చేతులన్+కొని= చేతుల్లో పట్టుకొని; తనువులు= మొండెములను; ఉత్తలమునన్= పరితాపంతో; తఱచు= అధికమైన; పీనుఁగులలోన్= శవాలలో; తడవువారు= వెదికి చూచేవారు; శిరములు= తమకు దొరికిన తలలను; మేనులన్+చేర్చి= శరీరాలతో చేర్చి; భావించి= తమవారిని

పోల్చుకొని; నిజ+ఆస్యముల్= తమ ముఖాలను; వ్రేసికొంచున్= మొత్తుకొంటూ; అఱచువారు= ఏడ్చేవారు; తునియలు+ పెక్కు+ఐనన్= శరీరాలు ముక్కలు ముక్కలయిపోగా; పనివడి= యత్నించి; కూర్చి= ఆ భాగాలను చేర్చి; రూపులు= తమవారి దేహాలను; కనుంగొని= గుర్తించి; మూర్ఛన్= మూర్ఛలో; మునుఁగువారున్= పడిపోయేవారు; ఐన= అయినటువంటి; కౌరవ= కౌరవులకు చెందిన; పాంచాల= పాంచాలురకు చెందిన; మానినీజనములన్= స్త్రీలను; చూడుము; నాథ= భర్తల; జనక= తండ్రుల; పుత్ర= కొడుకుల; సోదర= అన్నదమ్ముల; శవముల పొంతకున్+ఏఁగి= శవాల వద్దకు వెళ్ళి; అక్కటకట!= అయ్యయ్యో!; పెక్కు= ఎన్నో; దురవస్థలు= పాట్లు; ఒందెదరు= పడుతున్నారు (పొందుతున్నారు).

తాత్పర్యం: 'కృష్ణా! అటు చూడుము. మొండెముల దగ్గర తలలు కనిపించక కొందరు నాలుగు దిక్కులా పరుగెత్తి తలలు వెదుకుతున్నారు. తలలు చేతులలో పట్టుకొని మొండెములు కనిపించక పరితాపంతో ఆ పీనుగుల పెంటల్లో కొందరు మొండెములు వెదకుతున్నారు. తమకు దొరికిన తలలను శరీరాలతో చేర్చి తమ వారిని పోల్చుకొని బాధతో తలలు మొత్తుకొంటూ కొందరు ఏడుస్తున్నారు. శరీరాలు ముక్కలయిపోగా ఆ భాగాలను కూర్చుకొని తమవారి దేహాలను గుర్తించి కొందరు మూర్ఛపడిపోతున్నారు. తమ భర్తల, తండ్రుల, కొడుకుల, అన్నదమ్ముల శవాలవద్దకు వెళ్ళి, వారు పడుతున్నపాట్లు ఎట్లా చూడటం! అయ్యయ్యో!

తే. అవయవములు రూపఱఁగఁ గ్రవ్యాద భక్షి । తంబులై యున్కిఁ గొన్ని శవంబు లువిద
లెంత సూచియునవి గొంద ఱెఱుఁగ జాల । రయ్యెదరు సూడు తమ బంధులగుటఁ గృష్ణ! 23

ప్రతిపదార్థం: కృష్ణ!= వాసుదేవా!; అవయవములు= శరీర భాగాలు; రూపు+అఱఁగన్= ఆకారాలు నశించగా; క్రవ్యాద= మాంసం తినేటువంటి కాకులు గ్రద్దలు మొదలైనవాటి చేత; భక్షితంబులు+ఐ= తినబడి; ఉన్కిన్= ఉండటంవలన; తమ బంధులు+అగుటన్= తమ బంధువులు కావటంవలన; ఉవిదలు= స్త్రీలు; కొందఱు= కొంతమంది; కొన్ని శవంబులు= కొన్ని శవాలను; ఎంత చూచియున్= ఎంత పరికించినా; అవి= ఆ శవాలను; ఎఱుఁగఁజాలరు+అయ్యెదరు= గుర్తించలేకుండా పోతున్నారు!; చూడు.

తాత్పర్యం: వాసుదేవా! కొన్ని శవాల అవయవాలు నక్కలు కాకులు తినివేయటంవలన, పూర్తిగా ఆకారాలు కోల్పోవటంవలన, తమబంధువుల శవాలకొరకై వచ్చి పరికిస్తున్న కొంతమంది స్త్రీలు తమవారి దేహాలనే గుర్తించలేకుండా పోతున్నారు. ఇది ఎంత దురవస్థ!

క. ఇట్టివి యెల్లనుఁ గనుఁగొను । కట్టిఁడితన మొందునట్లుగా నేమొకొ తొ
ల్పుట్టువునం జేసితి నీ । చుట్టలనిటు సూడకుండఁ జొప్పడ దయ్యెన్. 24

ప్రతిపదార్థం: ఇట్టివి= ఇలాంటి దురవస్థలను; ఎల్లనున్= అన్నిటిని; కనుఁగొను= చూచేటువంటి; కట్టిఁడితనము= క్రూరత్వం; ఒందునట్లుగాన్= పొందేటట్లుగా; తొల్పుట్టువునన్= పూర్వజన్మంలో; చేసితిన్= (ఏ పాపాన్ని) చేశానో; ఏమొకొ= ఏమో; ఈ చుట్టలన్= ఈ బంధువులను; ఇటు= ఇలా; చూడకుండన్= చూడకుండా ఉండటానికి; చొప్పడదు+అయ్యెన్= కుదరలేదు.

తాత్పర్యం: ఇట్లాంటి దురవస్థలను చూచే క్రూరత్వం పొందేటట్లుగా పూర్వజన్మలో నేను ఏపాపం చేశానో ఏమో? ఈ బంధువులను ఇట్లా చూడకుండా తప్పింది కాదు.

క. అని పలుకునపుడు దుర్యో। ధనుని కళేబరము దృగ్గతంబగుటయు న
వ్వనిత యిలఁ ద్రెళ్ళె నతికిన। యనఁటి క్రియన్ మూర్ఛఁ జిత్త మవశం బైనన్. 25

ప్రతిపదార్థం: అని= అని పై విధంగా; పలుకునపుడు= మాట్లాడుతున్న సమయంలో; దుర్యోధనుని కళేబరము= దుర్యోధనుని శరీరం; దృక్+గతంబు+అగుటయున్= కనిపించటంతో; ఆ+వనిత= ఆ స్త్రీ (గాంధారి); మూర్ఛన్= మూర్ఛవలన; చిత్తము= మనస్సు; అవశంబు+ఐనన్= అదుపు కోల్పోగా; నతికిన= నరికివేసిన; అనఁటి క్రియన్= అరటి చెట్టువలె; ఇలన్= నేలమీద; త్రెళ్ళెన్= పడిపోయింది.

తాత్పర్యం: అని ఇట్లా మాట్లాడుతున్న సమయంలో దుర్యోధనుడి శవం గాంధారి కంటబడింది. వెంటనే ఆ తల్లి మూర్ఛవలన వివశురాలై మొదలు నరికిన అరటిచెట్టువలె నేలమీద పడిపోయింది.

విశేషం: అలం: ఉపమ.

గాంధారి దుర్యోధనుని కళేబరంబు చూచి పలవించుట (సం. 11-17-1)

వ. ఇట్లు మూర్ఛిల్లి కొండొక సేపునకుం దెలిసి గాంధారి పరిచారిక లూఁదికొని పోవ నప్పుత్ర శవంబుకడకుఁ బోయి. 26

ప్రతిపదార్థం: ఇట్లు; మూర్ఛిల్లి; కొండొకసేపునకున్= కొంతసేపటికి; తెలిసి= తెలివివచ్చి; గాంధారి; పరిచారికలు; ఊఁదికొని పోవన్= ఊతగా పట్టుకొనగా; ఆ+పుత్రశవంబు కడకున్= ఆ కుమారుడి శవంవద్దకు; పోయి.

తాత్పర్యం: ఇట్లా మూర్ఛపోయి, కొంత సేపటికి తెలివి రాగా, గాంధారిని పరిచారికలు పట్టుకొని పోగా, ఆ కుమారుడి శవం దగ్గరగా వెళ్ళి.

విశేషం: ఊఁది= ఊతగా; కొని= పట్టుకొని - అంటే ఆసరాగా నిలిచి నెమ్మదిగా నడిపించుకొని పోవటమని అర్థం.

తరలము:

విపుల వక్షముమీఁద నశ్రులు వెల్లిగొల్పుచు వ్రాలి 'యో
నృపతికుంజర! కౌరవేశ్వర! నేలనిమ్మెయి నీ యుదా
త్తపు శరీరముఁ బొందఁ బాడియె? తల్లి వచ్చిన భక్తితో
నుపచరింపక లాఁతివై యిటులూరకుండుట యుక్తమే?' 27

ప్రతిపదార్థం: విపుల= విశాలమైన; వక్షము మీఁదన్= రొమ్ముమీద; అశ్రులు= కంటినీరు; వెల్లికొల్పుచున్= ప్రవాహంలాగా కారుస్తూ; వ్రాలి= ఆశరీరంమీద వాలిపోయి; ఓ నృపతి కుంజర!= ఓ రాజశ్రేష్ఠుడా!; కౌరవేశ్వర!= కౌరవులలో శ్రేష్ఠుడా!; నీ+ఉదాత్తము+శరీరము= నీదైన గొప్ప శరీరం; ఇమ్మెయిన్= ఇంత నికృష్టంగా; నేలన్= నేలమీద; పొందన్= పడిఉండటం (నేలను చేరటం); పాడియె?= న్యాయమా?; తల్లి వచ్చినన్= తల్లి దగ్గరకు వస్తే; భక్తితోన్= భక్తితో ఉపచరింపక= లేచి నమస్కరించి సేవించకుండా; లాఁతివి+ఐ= వేరే వ్యక్తిలాగా; ఇటులు= ఈ విధంగా; ఊరక+ఉండుట= మౌనంగా కదలకుండా ఉండటం; యుక్తమే?= సమంజసమేనా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: విశాలమైన కుమారుడి రొమ్ముమీద ఎడతెగకుండా కన్నీరు కారుస్తూ గాంధారి వాలిపోయింది. 'రాజులలో పేరుపొందావు. కౌరవులలో అందరికన్నా మిన్న అనిపించుకొన్నావు. నాయనా! నీ గొప్ప దేహం ఇట్లా నికృష్టంగా నేలమీద పడి ఉండటం ఎంత అన్యాయమయ్యా! తల్లి దగ్గరికి వస్తే, లేచి నమస్కరించి ఉపచారాలు చేయకుండా వేరే వ్యక్తివలె కదలకుండా మౌనంగా ఉన్నావే! నీ కిది న్యాయంగా ఉన్నదా?' (అని బాధపడుతున్నది).

విశేషం: తరములో ప్రతిపాదానికీ న, భ, ర, స, జ, జ, గ అనే గణాలుంటాయి. 1-12 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. అని మఱియు ననేక ప్రకారంబులం బలవించుచు హాహాకారంబు లెసంగ రోదనంబు చేసి యా సుబలనందన తన సమీపంబునకుఁ జనుదెంచియున్న యుపేంద్రున కిట్లనియె. 28

ప్రతిపదార్థం: అని= ఇట్లా బాధపడి; మఱియున్= ఇంకా; అనేక= పలు; ప్రకారంబులన్= రీతులలో; పలవించుచున్= విలపిస్తూ; హాహాకారంబులు+ఎసంగన్= హాహాకారాలు అతిశయించగా; రోదనంబుచేసి= ఏడ్చి; ఆ సుబలనందన= ఆ గాంధారి; తన; సమీపంబునకున్= దగ్గరకు; చనుదెంచియున్న= వచ్చి ఉన్న; ఉపేంద్రునకున్= కృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అని ఇట్లా బాధపడి ఇంకా పలువిధాలుగా తనకుమారుడిని గురించి తలచుకొంటూ హాహాకారాలు చేస్తూ ఏడుస్తుండగా గాంధారి సమీపానికి కృష్ణుడు వచ్చాడు. ఆయనను చూచి గాంధారి ఇట్లా అన్నది.

మంగళమహాశ్రీ:

ఈతఁడు రణంబునకు నెత్తి చనుచుండియును నెంతయును భక్తిఁ గని నాకుం
బ్రీతియెసఁగం బలికి బ్రేమ మొలయం బొగడి పెద్దయు వినీతినిరతుండై
చేతులు మొగిడ్చి జయ సిద్ధియుఁగ దీవన విశిష్టదయ నిమ్మనిన ధర్మం
బే తల ననూనమగు నిద్ధజయ మా తలకు నెట్లయిన సిద్ధమగు నంటిన్. 29

ప్రతిపదార్థం: ఈతఁడు= ఈ సుయోధనుడు; రణంబునకున్= యుద్ధానికి; ఎత్తి= దండెత్తి; చనుచున్+ఉండియును= వెళ్తూ; ఎంతయును= ఎంతో; భక్తిన్+కని= భక్తితో నన్ను చూచి; నాకున్+ప్రీతి+ఎసఁగన్+పలికి= నాకు ఎంతో సంతోషం కలిగేలా మాట్లాడి; ప్రేమము+ఒలయన్+పొగడి= ప్రేమ పుట్టేలా పొగడి; వినీతి= వినయంతో; నిరతుండు+ఐ= శ్రద్ధ కలిగినవాడై; చేతులు; మొగిడ్చి= జోడించి (నమస్కరించి); జయసిద్ధియుఁగన్= జయం సిద్ధించేలాగున; విశిష్టదయన్= మిక్కిలి అనుగ్రహంతో; దీవనన్= ఆశీస్సు; ఇమ్ము+అనినన్= ఇవ్వాలమ్మా! - అని కోరగా; ధర్మంబు= ధర్మం; ఏ తలన్+అనూనము+అగున్= ఏ పక్షంలో అధికంగా ఉంటుందో; ఇద్ధజయము= గొప్పవిజయం; ఆ తలకున్+ఎట్లయినన్= ఆ వైపు ఎట్లాగైనా; సిద్ధము+అగున్= సిద్ధిస్తుంది; అంటిన్= అన్నాను.

తాత్పర్యం: ఈ సుయోధనుడు యుద్ధానికి పూనుకొని వెళ్తూ ఎంతో భక్తితో నన్ను దర్శించుకొని నాకు సంతోషం కలిగే మాటలు మాట్లాడి ప్రేమ పుట్టేటట్లు పొగడి వినయంతో కూడినవాడై చేతులు జోడించి నమస్కరించి 'తల్లీ! నాకు విజయం సిద్ధించేటట్లుగా నీవు మిక్కిలి అనుగ్రహంతో ఆశీర్వదించుము' అని కోరగా 'నాయనా! ధర్మం ఏ పక్షంలో అధికంగా ఉంటుందో ఆ పక్షానికి దిగ్విజయం ఎట్లాగయినా తప్పక సిద్ధిస్తుం' దని అన్నాను.

విశేషం: 'యతో ధర్మ స్తతో జయః' (ఎక్కడ ధర్మముంటే అక్కడ విజయమని అర్థం). ధర్మం సత్యకర్మకు సంబంధించింది. భగవంతుడు ధర్మసంరక్షణకే అవతరిస్తాడు.

'యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్' (గీత)

పాండవులు 'ధర్మ' రక్షితులని గాంధారికి తెలుసును కాబట్టి ఇట్లా అంటున్నది.

మంగళమహాశ్రీవృత్తంలో ప్రతిపాదానికీ భ, జ, స, న, భ, జ, స, న, గ, గ అనే గణాలుంటాయి. 1-9-17 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. ఇట్లన నేల? యంటేని. 30

ప్రతిపదార్థం: ఇట్లు; అనన్+ఏల?= ఎందుకు అన్నావు?; అంటి(వి)+ఏనిన్= అంటే.

తాత్పర్యం: ఇట్లా ఎందుకు అన్నానంటే.

మానినీవృత్తము:

జూదమునప్పుడు సర్వజనంబులు చూచి భయంపడి యిప్పని యి
మ్మేదిని సేనలకుం గురుకోటికి మృత్యువు గాని నిజం బలఁతిం
బోదని యాడరె? యమ్మెయి నాదగు బుద్ధికిఁ దోఁచిన సత్యము దా
మోదర! పాటిలదే కొడుకంచుఁ బ్రియోక్తులు పల్కినఁ బెంపు సెడున్. 31

ప్రతిపదార్థం: జూదము+అప్పుడు= జూదమాడే సమయంలో; సర్వజనంబులు= అక్కడ చేరిన జనులంతా; చూచి= ఆ ద్రౌపదీమాన భంగాన్ని చూసి (భీముడు చేసిన ప్రతిజ్ఞలు); భయంపడి= భయపడి; ఈ+పని= ఇట్లా చేయటం; ఈ+మేదినిన్= ఈ భూమిలో; సేనలకున్= సైన్యాలకు; కురుకోటికిన్= కౌరవ సమూహానికి; మృత్యువు+కాని= మృత్యువు తప్ప (మరొకటి కాదు); నిజంబు= సత్యం; అలఁతిన్= తేలికగా; పోదు= పొయ్యేది కాదు; అని; ఆడరె?= అనలేదా?; ఆ+మెయిన్= ఆ విధంగా; దామోదర!= ఓ కృష్ణా!;' నాదగు= నాదైన; బుద్ధికిన్= బుద్ధికి; తోఁచిన సత్యము= తోచిన సత్యం; పాటిలదే?= కలుగదా?; కొడుకు+అంచున్= కొడుకు అంటూ; ప్రియ+ఉక్తులు= మంచిమాటలు; పల్కినన్= పలికితే; పెంపు+చెడున్= శ్రేయస్సు నశిస్తుంది.

తాత్పర్యం: ఆనాడు జూదమాడుతున్న సమయంలో అక్కడ చేరిన జనమంతా ద్రౌపది మానభంగాన్ని, భీముడి ప్రతిజ్ఞలు చూచి ఇట్లా చేయటం ఈ భూమిలోని సైన్యానికి, కౌరవవంశానికి చావుకోసం తప్ప - ధర్మం అంత సులభంగా నశించదు - అని అన్నారు గదా! నా బుద్ధికి కూడా అదే తోచింది. అది జరగకపోతుందా? కుమారుడని మెప్పుకోలు మాటలు పలకటం పెంపు కలిగించదు.

విశేషం: కొడుకు ఇట్లా అడిగినప్పుడు తల్లి అట్లా చెప్పటం కేవలం ద్వాపరయుగానికి సంబంధించిన మాతృధర్మమనే చెప్పాలి. రాజనీతి ప్రకారం ఆలోచిస్తే చివరి నిమిషంలోనైనా ఈ మాటలకు విలువనిచ్చి 'సంధి' చేసుకోకుండా ఉంటాడా అన్న ఆశ కూడా ఆ తల్లికి ఉండవచ్చును. ఆశీర్వదించినా జయం పొందదు. అందుకే ధర్మమున్నచోట విజయమనిచెప్పి అతడినే ఆలోచించుకొమ్మంది. భారతంలోని స్త్రీ పాత్రలలోని విజ్ఞత, వివేకం ఉదాత్తమైనవి - అనటానికి గాంధారి పలుకులు ప్రబల నిదర్శనం.

మానినీ వృత్తంలో ప్రతిపాదానికీ ఏడు భగణాలు, మీద గురువు ఉంటాయి. 1-13 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

వ. వినుము దీవనకుం జొరక మధ్యస్థపుమాట లాడుటయకాదు మఱి నే నప్ప డతని తోడ. 32

ప్రతిపదార్థం: వినుము; దీవనకున్+చొరక= ఆశీర్వదించకుండా; మధ్యస్థపు మాటలు+ఆడుట+అ+కాదు= మధ్యస్థంగా మాటలాడటమే కాదు; మఱి; నేను; అప్పుడు+అతనితోడన్.

తాత్పర్యం: అంతేకాదు. వినుము. ఆశీర్వదించకుండా మధ్యస్థంగా మాట్లాడటమే కాదు. మరి నేను అతడితో ఇంకా- (ఇట్లా అన్నాను.) (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. 'ఆహవంబునయందు నీ వోహటించి । పోవ సడివచ్చు సడి కంటెఁ జావుమేలు;
శస్త్రజీవితఁ బరలోకసౌఖ్య మనుభ । నింపు మమరత్వసంపద వెలయు మంటి.' 33

ప్రతిపదార్థం: ఆహవంబున+అందున్= యుద్ధంలో; నీవు; ఓహటించి+పోవన్= వెనుదిరిగిపోగా; సడి= అపవాదు; వచ్చున్= వస్తుంది; సడికంటెన్= ఆ అపవాదువలన అపకీర్తి కన్నా; చావు మేలు= మరణం మేలు; (కనుక) శస్త్రజీవితన్= శస్త్రాలతో జీవించే యోధుని ధర్మంతో (వీరత్వంతో); పరలోక= స్వర్గలోక; సౌఖ్యము= సుఖాన్ని; అనుభవింపుము; అమరత్వ సంపదన్= స్వర్గంలో మరణంలేని వైభవంతో; వెలయుము+అంటిన్= ప్రకాశించుమన్నాను.

తాత్పర్యం: 'యుద్ధంలో వెనుదిరిగి వస్తే అపకీర్తి వస్తుంది. అపకీర్తికన్నా చావు నయం. నీవు యుద్ధవీరుడుగా జీవించుము. పరలోక సౌఖ్యాన్ని పొందుము. స్వర్గంలో మరణంలేని వైభవాన్ని పొందుము. సుఖించుము' అన్నాను.

క. అని చెప్పియుంటి; నా చె । ప్పిన యట్టులు సేసి యితఁడు పేరును బెంపుం
గనియుండఁగ ని ట్లడలున । మునుఁగు టరయఁ గడుపుశోకమున పెంపు సుమీ! 34

ప్రతిపదార్థం: అని= అని పై విధంగా; చెప్పి+ఉంటిన్= చెప్పాను; నా+చెప్పిన+అట్టులు+చేసి= నేను చెప్పినట్టుగా చేసి; ఇతఁడు= దుర్యోధనుడు; పేరును= కీర్తిని; పెంపున్= ప్రతిష్ఠను; కని+ఉండఁగన్= పొంది ఉండగా; ఇట్లు= ఈ విధంగా; అడలునన్= దుఃఖంలో; మునుఁగుట= మునిగిపోవటం; అరయన్= బాగా ఆలోచిస్తే; కడుపు శోకమునన్= పుత్రుడు చావటంవలన ఏర్పడిన గర్భ శోకం యొక్క; పెంపు సుమీ!= అతిశయం తప్ప మరొకటికాదు సుమా!

తాత్పర్యం: అట్లా నేను ఆనాడు చెప్పాను. నేను చెప్పినట్టుగానే చేసి దుర్యోధనుడు కీర్తి ప్రతిష్ఠలు పొందాడు. ఇక అతడిని గురించి ఇట్లా ఏడుస్తూ ఉన్నానంటే కేవలం పుత్రశోకంతో మాత్రమే తప్ప, అతడి కేమి తక్కువ?

విశేషం: శోకాలలో పుత్రశోకం నిరంతరంగా ఉంటుందని పెద్దలు చెప్పుతారు.

మాతృదుఃఖం తు షాణ్మాసం । పితృదుఃఖం తు వత్సరమ్,
భార్యాదుఃఖం పునర్భార్యా । పుత్రశోకం నిరంతరమ్.

తల్లి పోతే ఆరు నెలలు చింతిస్తారు. తండ్రిపోతే సంవత్సరంపాటు దుఃఖిస్తారు. భార్య చనిపోతే దుఃఖం మరో భార్య వచ్చే వరకే. కాని పుత్రుడి మరణం జీవితాంతం దుఃఖాన్ని కలగజేస్తుంది.

ఇక్కడ గాంధారీధృతరాష్ట్రుల శోకం తగ్గకపోవటానికి హేతువు గర్భసంబంధమే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. అరి విమర్ది యితనికై వగపేటికిఁ। బుణ్య లోకమునకుఁ బోయెననుచు
నుండ నోపెనేని నుల్లంబు ధృతరాష్ట్రు। దిక్కులేమిఁ దలఁచి పొక్కకున్నె?' 35

ప్రతిపదార్థం: అరి విమర్ది= శత్రువులను చంపిన; ఇతనికై= ఇతనికోసం; వగపు+ఏటికిన్?= చింత ఎందుకు?; పుణ్యలోకమునకున్= పుణ్యలోకాలకు; పోయెను+అనుచున్+ఉండన్+ఓపెను+ఏని= వెళ్ళిపోయాడంటూ ఉండగలిగినా; ఉల్లంబు= హృదయం; ధృతరాష్ట్రు= ధృతరాష్ట్రునియొక్క; దిక్కులేమిన్= దిక్కులేనితనాన్ని; తలఁచి= తలచుకొని; పొక్కక+ఉన్నె?= దుఃఖించకుండా ఉంటుందా?

తాత్పర్యం: శత్రువులను ఘోరంగా చంపి తానూ చనిపోయిన ఇతడికొరకు చింతించటం ఎందుకు? పుణ్యాత్ముడు స్వర్గానికి వెళ్ళిపోయా డంటూ ఉండగలిగినా ఆ పెద్దాయన ధృతరాష్ట్రుడికి ఈ వయసులో ఆసరాగా ఎవరూ లేకపోయారే? అన్న ఆలోచనతో హృదయం తరుక్కుపోతున్నది. ఈ దుఃఖం తప్పుతుందా కృష్ణా!'

వ. అని వెండియు. 36

తాత్పర్యం: అని మళ్ళీ ఇట్లా అన్నది.

సరసిజ వృత్తము:

'శ్రీరమ్యత్వం బారఁగఁ బెం పూర్జితముగ మణివిరచితమకుటములం
దారుం జూడన్ సారవిభూతిన్ ధరణిపు లనిమిషధవనిభు లగుచున్
భూరిప్రీతిన్ సూరెలఁ గొల్వన్ భువనవినుతమగు పొలుపు వెలయ ము
న్నీ రా జుండున్ దారుణ దైవం బిటు పఱచునె తుది నితని? కటకటా! 37

ప్రతిపదార్థం: శ్రీరమ్యత్వంబు= రాజ్యసంపద యొక్క మనోహరత్వం; ఆరఁగన్= ఒప్పగా; పెంపు= వైభవం; ఊర్జితముగన్= వృద్ధిచెందగా; మణి విరచిత= మణులు పొదిగిన; మకుటములన్= కిరీటాలతో; సారవిభూతిన్= గొప్ప సంపదలతో; ధరణిపులు= రాజులు; అనిమిషధవ= (దేవతలరాజు - ఇంద్రుడు) ఇంద్రుడితో; నిభులు+అగుచున్= సమానులవుతూ; తారున్+చూడన్= తాము చూస్తుండగా; భూరిప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; సూరెలన్= ప్రక్కల; కొల్వన్= సేవిస్తుండగా; భువన వినుతము+అగు= ప్రపంచ ప్రసిద్ధమైన; పొలుపు= వైభవం; వెలయన్= ప్రకాశించగా; మున్ను+ఈ రాజు+ఉండున్= మునుపు ఈ సుయోధనుడు వెలిగాడు; తుదిన్= చివరికి; దారుణదైవంబు= కరుణలేని దైవం; ఇతనిన్= ఇతడిని; ఇటు+పఱచునె?= ఇట్లా భంగపరుస్తుందా?; కటకటా!= అయ్యయ్యో!.

తాత్పర్యం: 'కృష్ణా! రాజ్యసంపదవలని మనోహరత్వంతో వృద్ధిచెందిన వైభవంతో మణులు పొదిగిన కిరీటాలు కలిగిన గొప్ప కీర్తి సంపదలతో విరాజిల్లుతూ ఇంద్రసములైన రాజులు తనచుట్టూ చేరి సేవిస్తుండగా సంతోషించినవాడు ఈ దుర్యోధనుడు. ఇతడి వైభవం ఈ భువనంలోనే సుప్రసిద్ధమైనది. అట్లాంటి ఇతడిని పాపిష్ఠి దైవం చివరకు ఇట్లా భంగపరుస్తుందా! అయ్యో ! ఎంత దారుణం!

విశేషం: సరసిజవృత్తంలో ప్రతిపాదానికీ వరుసగా మ, త, య, న, న, న, స - గణాలు ఉంటాయి. 1-10-18 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం లేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. కనకబహురత్నమయ పీఠమున మృగాక్షు । లాలవట్టంబు లిడఁ జెలు వమరునట్టి
కౌరవేంద్రుండు పెనునేలఁ గంకపక్ష । పవన హతుఁడయ్యెఁ జూచితె? పద్మనాభ! 38

ప్రతిపదార్థం: పద్మనాభ!= ఓ కృష్ణా!; మృగాక్షులు= లేడి కన్నులుగల స్త్రీలు; ఆలవట్టంబులు+ఇడన్= గుడ్డతో చేసిన గుండ్రని పెద్దవిసనకర్ర (సం. ఆలావర్తం)తో వీస్తుండగా; కనక బహురత్నమయ= బంగారుతోను, అనేక మణులతోను చేయబడిన; పీఠమునన్= సింహాసనంలో; చెలువు+అమరునట్టి= అందంగా ప్రకాశించేటటువంటి; కౌరవేంద్రుండు= దుర్యోధనుడు; పెనునేలన్= ఈ విశాలమైన, కఠినమైన నేలమీద; కంకపక్ష= రాపులుగుల రెక్కలచేత పుట్టిన; పవన= హోరుగాలిచేత; హతుఁడు+అయ్యెన్= కొట్టబడినవాడయ్యాడు - చనిపోయాడు; చూచితె?= చూచావా? (ఎంత ఘోరమో).

తాత్పర్యం: కృష్ణా! లేడికన్నులవంటి కన్నులున్న పరిచారక స్త్రీలు వస్త్రంతో తయారుచేసిన పెద్ద విసనకర్రను వీస్తుండగా మణులు పొదిగిన బంగారు సింహాసనంలో అందంగా కొలువు తీరినట్టి ఈ దుర్యోధనుడు ఈనాడు ఈ యుద్ధభూమిలో రాబందుల రెక్కలనుండి పుట్టిన హోరుగాలి తాకిడికి గురి అయ్యాడు - ప్రాణాలు పోగొట్టుకున్నాడు. చూచావా? ఎంత ఘోరంగా ఉన్నదో!

క. ఈ రాజు భీమసేను ను । దారోగ్ర పరాక్రమమున ధరణి నొఱగి దు
ర్వారమదవారణము కం । ఠీరవము విహారమునఁ బడిన గతిఁ బొలిచెన్. 39

ప్రతిపదార్థం: ఈ రాజు= అలాంటి ఈ దుర్యోధనుడు; భీమసేను= భీమసేనుడి; ఉదార+ఉగ్ర పరాక్రమమునన్= ఘనమైన క్రూరమైన పరాక్రమంచేత; దుర్వార= వారించటానికి వీలులేని; మదవారణము= మదించిన ఏనుగు; కంఠీరవము విహారమునన్= సింహంతో చేసిన వినోద క్రీడలో (లేదా సింహం వీర విహారంలో); పడిన గతిన్= చనిపోయేరీతిలో; ధరణిన్+ఒఱగి= నేలమీద ఒరిగిపోయి; పొలిచెన్= కనిపిస్తున్నాడు.

తాత్పర్యం: అట్లాంటి ఈ దుర్యోధనుడు భీమసేనుడి ఘనమైన క్రూరమైన పరాక్రమంతో ఓడి, మదపుటేనుగు సింహం చేసిన వీర విహారంలో చనిపోయినట్టుగా నేలమీద ఒరిగిపోయి కనిపిస్తున్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. విదురుఁడుఁ దండ్రియుఁ దనకుం । బదివేలవిధములఁ జెప్పఁ బాటింపఁడు దు
ర్మదమునఁ దగియెడు బుద్ధులు । విధి మూఁడిన మర్త్యుఁ డేల విను నుచితోక్తుల్? 40

ప్రతిపదార్థం: విదురుఁడు= పినతండ్రి విదురుడు; తండ్రియున్= తన తండ్రి ధృతరాష్ట్రుడు; తనకున్= తనకని; తగియెడు= తగిన; బుద్ధులు= మంచిమాటలు (నీతులు); పదివేల విధములన్= పదివేల రీతులుగా; చెప్పన్= చెప్పగా; దుర్మదమునన్= మిక్కిలి మదంతో; పాటింపఁడు= విన్నాడు కాడు; విధి= కర్మ (చేటు); మూఁడిన= సంభవించిన; మర్త్యుడు= మనిషి; ఉచిత+ఉక్తుల్= సుభాషితాలు; ఏల వినున్?= ఎందుకు వింటాడు?

తాత్పర్యం: తన పినతండ్రి, మహాజ్ఞాని విదురుడు, తన తండ్రి ధృతరాష్ట్రుడు చెవిలో ఇల్లుకట్టుకొని ఎన్ని వేల విధాలుగానో బుద్ధిమాటలు చెప్పారు. ధర్మాన్ని బోధించారు. కాని, అతడి దుర్మదం అట్లాంటిది. ఒకరి మాటలూ లెక్కచేసినవాడు కాడు. చేటుమూడిన మనిషి సుభాషితాలు వింటాడా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. పదునొకఁ డక్షౌహిణు లే। పొదవఁగ నలిఁ గొలువ నొప్పు నుర్వీశ్వరుఁడే
తుది నిష్పరివారుండై। గదఁ జేకొని యొంటి పోరి కలనిం బడియెన్. 41

ప్రతిపదార్థం: పదునొకఁడు= పదకొండు; అక్షౌహిణులు= అక్షౌహిణుల సైన్యం; ఏపు= ఆధిక్యం; ఒదవఁగన్= కలుగగా; నలిన్= ఉత్సాహంతో; కొలువన్= సహాయకారులుగా సేవించగా; ఒప్పు= ప్రకాశించే; ఉర్వీశ్వరుఁడే= ఈ సుయోధన మహారాజే; తుదిన్= చివరికి; నిష్పరివారుండు+ఐ= ఏ పరివారమూలేనివాడై; గదన్= గదను; చేకొని= తీసికొని; ఒంటి= ఒంటరిగా; పోరి= యుద్ధంచేసి; కలనిన్= యుద్ధభూమిలో; పడియెన్= నేలకు ఒరిగాడు.

తాత్పర్యం: పదకొండు అక్షౌహిణుల సైన్యం ఆధిక్యం అతిశయించగా ఉత్సాహంతో తనవెంట ఉండగా ప్రకాశించే ఈ రాజే చివరికి ఏతోడూ లేక గదను తీసికొని ఒంటరిగా పోరాడి నేలమీద పడ్డాడు.॥

తే. ధరణి గజఘోటకము లొప్ప ధార్తరాష్ట్రు। లెల్లఁ బొలుపారఁగాఁగంటి నిప్పు డవి వి
నాశ మొందినఁ బాడఱి నలిననాభ। యది పరాధీనముగఁ జూచునట్టి దయ్యె.' 42

ప్రతిపదార్థం: నలిననాభ!= పద్మనాభా! (కృష్ణా!); ధరణి= విశాలమైన రాజ్యమూ; గజ= ఏనుగులు; ఘోటకములు= గుర్రాలు; ఒప్పన్= ఒప్పుగా; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్ర కుమారులు; ఎల్లన్= అందరూ; పొలుపు+ఆరన్+కాన్= వైభవంగా ఉండటం; కంటిన్= చూశాను; ఇప్పుడు= ఈనాడు; అవి= ఆ ఏనుగులు; గుర్రాలు; వినాశమొందినన్= నశించగా; అది= ఆ భూమి; పాడఱి= శూన్యమై; పరాధీనముగన్= శత్రువులకు వశం కాగా; చూచునట్టిది+అయ్యెన్= చూసేటువంటిది అయినది (చూడటం సంభవించినది).

తాత్పర్యం: కృష్ణా! విశాలమైన ఈ రాజ్యం, ఏనుగులు, గుర్రాలు కలిగి కురుకుమారులు వైభవోపేతంగా అందరూ కలకలలాడుతూ ఉండటం చూచాను. అదే ఈనాడు ఆ ఏనుగులు, గుర్రాలు సర్వనాశనమైపోగా, ఈ విశాలభూమి శూన్యమై పరాధీనం కాగా చూచే దౌర్భాగ్యం నాకు దాపురించింది.'

వ. అని దుర్యోధనవల్లభ నిరీక్షించి మాధవు నుద్దేశించి యిట్లనియె. 43

ప్రతిపదార్థం: అని= ఇట్లా అని; దుర్యోధన వల్లభన్= దుర్యోధనుడి భార్యను (భానుమతిని); నిరీక్షించి= చూచి; మాధవున్= శ్రీకృష్ణుడి; ఉద్దేశించి= వైపు చూచి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ఇట్లా అని, గాంధారి భానుమతిని చూచి శ్రీకృష్ణుడివైపు తిరిగి ఇట్లా అన్నది.

ఆ. 'కొడుకు చావుకంటెఁ గోడలి యడలునఁ। బెరిఁగి శోకవహ్ని దరికొనంగ
నంతరంగ మిప్పు డగ్గల మెరియంగఁ। దొడఁగె దీనికేది తుది? యుపేంద్ర! 44

ప్రతిపదార్థం: ఉపేంద్ర!= కృష్ణా!; కొడుకు= కుమారుడి; చావుకంటెన్= మృతికన్నా; కోడలి= ఈ భానుమతి; అడలునన్= శోకంతో; పెరిఁగి= అధికమై; శోకవహ్ని= శోకమనే; నిప్పు; దరికొనంగన్= విజృంభిస్తుండగా; అంతరంగము= హృదయము; ఇప్పుడు= ఇప్పుడు; అగ్గలము= మిక్కిలిగా; ఎరియంగన్+తొడఁగెన్= మండటం మొదలుపెట్టింది; దీనికిన్= ఈ బాధకు; ఏది తుది?= అంతం ఎక్కడ?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'కృష్ణా! కొడుకు చనిపోవటం వలన కంటె ఈ కోడలి దుఃఖం వలన నాలో ఉన్న శోకమనే అగ్ని బాగా ప్రజ్వరిల్లి హృదయాన్ని కాల్చివేయటం మొదలుపెట్టింది. ఈ బాధకు అంతం ఎక్కడ?

విశేషం: అలం: రూపకం.

సీ. **చూడు మిమ్ముద్దియ సుతుఁజూచి వదన మ । ల్లార్చుచుఁ బ్రాణేశునాననంబు**
పైఁ జూడ్కి యడరించి పాణితలంబున । నందంద నెమ్ముగ మడిచికొనుచు
మరలఁ బుత్రునిదెస కరిగిన మనసు పే । రడలున మునుఁగంగ నతని చెన్ను
మోమునఁ దనమోము మోపి మూర్ఛల్లుచుఁ । దెలిసి వల్లభునురఃస్థలము గ్రుమ్ము

తే. **నుడుకుఁ గన్నీరఁ దడియంగ నొఱగుచును వి । చేష్టయై యూరకుండుచుఁ జెలులతోడఁ**
దిరిగి పొగులంగ వేనలి విరియ మేన । నవులఁ దిరుగుచునున్నది యక్కటకట! **45**

ప్రతిపదార్థం: చూడుము; ఈ+ముద్దియ= ఈ స్త్రీ; సుతున్+చూచి= కుమారుడిని చూచి; వదనము= ముఖం; అల్లార్చుచున్= కదలిస్తూ= అటూ ఇటూ ఊపుతూ; ప్రాణేశు+ఆననంబుపైన్= తన భర్త ముఖంమీదికి; చూడ్కి= చూపును; అడరించి= వ్యాపింపచేసి; పాణితలంబునన్= అరచేతితో; అందందన్+నెమ్మొగము= ముఖంమీద పలుమార్లు; అడిచికొనుచున్= కొట్టుకొంటూ; మరలన్= మళ్ళీ; పుత్రుని దెసకున్= కొడుకు వద్దకు; అరిగినన్= పోగా; మనసు= తన మనస్సు పేరు+అడలునన్= పెను దుఃఖంలో; మునుఁగంగన్= మునిగిపోగా; అతని చెన్నుమోమునన్= అతడి అందమైన ముఖంపైన; తన మోము= తన ముఖాన్ని; మోపి= ఆనించి; మూర్ఛిల్లుచున్= మూర్ఛపోయి; తెలిసి= తెలివి వచ్చాక; వల్లభు+ఉరఃస్థలమున్= భర్త రొమ్ముమీద; క్రుమ్మన్= తలబాదుకొంటుంది; ఉడుకు+కన్నీరన్= వేడి కన్నీటితో; తడియంగన్= తడిసేటట్లు; ఒఱగుచును= ఒరగిపోతూ; విచేష్టయై= చేష్టలుడిగి; ఊరకుండుచున్= మౌనంగా ఉండిపోతూ; చెలులతోడన్= తోడి స్త్రీలతో; తిరిగి= కలిసిమళ్ళీ; పొగులంగన్= ఏడుస్తుండగా; వేనలి= జడ; మేనన్= ఒంటిపై విరియన్= వ్యాపించగా; అవులన్= పిచ్చిదానిలాగా బయట; తిరుగుచున్నది= తిరుగుతోంది; అక్కటకట!= అయ్యయ్యో!

తాత్పర్యం: కృష్ణా! చూడుము. ఈ భానుమతి తన కొడుకును చూచి ముఖం అల్లాడిస్తూ, భర్త ముఖం వైపు చూచి అరచేతితో తన తలమీద పలుమార్లు బాదుకొంటున్నది. మళ్ళీ కొడుకువైపు మనసుపోగా దుఃఖంలో మునిగిపోయి అందమైన అతడి ముఖంమీద తన ముఖం పెట్టి మూర్ఛపోయింది. తెలివి వచ్చాక భర్త శవంవద్దకు వెళ్ళి రొమ్ముమీద తలను బాదుకొంటున్నది. ఆమె వేడి కన్నీటితో భర్త దేహం తడిసిపోయేటట్లు ఒరిగిపోయింది. నిశ్చేష్టురాలై మౌనంగా ఉండిపోయి మళ్ళీ తన తోడి స్త్రీలతో కలిసి ఏడవటం మొదలుపెట్టింది. జడ విడిపోయి దేహమంతా వ్యాపించగా పిచ్చిదానివలె బయట తిరుగుతున్నది. అయ్యయ్యో! ఎంత ఘోరం!

విశేషం: అలం: స్వభావోక్తి

వ. **అని వెండియు.** **46**

తాత్పర్యం: అని ఇంకా.

సీ. ఈ సుమధ్యమ యిమ్మహీశ్వరు బాహు త। లంబున లలితోపలాలనంబు
నొంది రాగిల్లెడునుల్లంబుతో నుండు। నింకిట నిమ్ముగ్ధ నెట్లు సూడ
వచ్చుఁ? గనుంగొన వశముగాదిది యిట్టి। కొడుకును మనుమండుఁ బుడమి నిట్లు
పడియుండఁ జూచెడు పాపజాతికి నిప్ప। డవియక నిగ్గడియైన యినుప

తే. గుండియకుఁ జేటుపాటింకఁ బుండరీక। నయన! యెన్నఁడు లేమి నిర్ణయముగాదె?
యింత కోర్చెడు నట్టివా రెన్నఁడేని। నుర్వి నెందేని గలుగుదురొక్కొ యొరులు? 47

ప్రతిపదార్థం: పుండరీక నయన!= శ్వేతకమలాక్షా! కృష్ణా!; ఈ సుమధ్యమ= ఈ స్త్రీ (చక్కని నడుముగలది); ఈ+మహీశ్వరు= ఈ సుయోధనుని; బాహుతలంబునన్= బాహువులక్రింద; లలిత+ఉపలాలనంబున్= సుకుమారమైన బుజ్జగింపును; ఒంది= పొంది; రాగిల్లెడు+ఉల్లంబుతోన్= ప్రేమమయమైన హృదయంతో; ఉండున్= ఉంటుంది; ఇంకన్+ఇటన్= ఇకమీదట; ఈ+ముగ్ధన్= ఈ ముద్దరాలిని; ఎట్లు+చూడఁగన్+వచ్చున్?= ఎట్లా చూడగలము?; కనుంగొనన్+వశము+కాదు+ఇది= ఇది చూడటానికి దుర్భరమైన విషయం; ఇట్టి కొడుకును= ఇట్లాంటి కుమారుడు; మనుమండు= ఇట్లాంటి మనుమడూ; పుడమిన్+ఇట్లు= నేలమీద ఇలా; పడి+ఉండన్+చూచెడు= పడి ఉండగా చూచేటువంటి; పాపజాతికిన్= పాపిష్ఠురాలైననాకు; ఇప్పుడు+అవియక= ఇప్పుడే బద్దలు అయిపోకుండా; నిగ్గడి+ఐన= కఠినమైన; ఇనుము+గుండియకున్= ఇనుముతో తయారైన గుండెకు; చేటు+పాటు+ఇంకన్= నాశనం ఇంక; ఎన్నఁడున్= ఏనాటికీ; లేమి= లేకపోవటం; నిర్ణయము+కాదె?= నిశ్చయమేకదా!; ఇంతకున్+ఓర్చెడు+అట్టివారు= ఇంతకష్టానికి కూడా ఓర్చుకొనేటువంటివారు; ఎన్నఁడు+ఏనిన్= ఏనాడైనా; ఉర్విన్+ఎందేనిన్= భూమిమీద ఎక్కడైనా; ఒరులు= ఇతరులు; కలుగుదురు+ఒక్కొ?= ఉంటారా మరి?

తాత్పర్యం: కృష్ణా! సన్నని నడుము గలిగిన ఈ భానుమతి ఆ సుయోధనుడి ఉన్నత బాహువుల నీడలో బుజ్జగింపబడి, అతిశయించిన ప్రేమతో సంతోషంతో కనిపించేది. ఇక పైన ఈ ముద్దరాలిని ఎట్లా చూడగలం చెప్పుము? ఇది భరించరాని విషయం. ఇట్లాంటి కొడుకును మనవడిని నేలమీద దిక్కులేకుండా ఇట్లా పడిఉండగా చూచేటటువంటి పాపిష్ఠిదాన్ని నేను. నా గుండె మామూలు గుండెకాదు. ఇనుపగుండె. అందుకే ఇంత దురవస్థను చూచీ బద్దలైపోకుండా ఇంకా అట్లాగే ఉన్నది. ఇక ఎప్పటికీ ఇది బద్దలు కాదు. ఎంత కఠినురాలిని నేను! ఇంత కష్టాన్ని ఓర్వగలిగినవారు ఏ కాలంలోనైనా భూమిమీద ఎక్కడైనా ఇతరు లున్నారా? (నేను తప్ప).

క. జననియు భార్యయు నేమై। న నేమి? వేదములు బొంకునకుఁ జొరమి నిజం
బని పుణ్యలోక మగునని। తన కార్యము సూచె నిట్లు తగునె యితనికిన్?' 48

ప్రతిపదార్థం: జననియున్= తల్లీ; భార్యయున్= భార్యా; ఏమి+ఐనన్+ఏమి?= ఏమయితే ఏమి?; వేదములు= వేదాలు; బొంకునకున్+చొరమి= అసత్యానికి సాహసించకపోవటం; నిజంబు+అని= సత్యమని; పుణ్యలోకము+అగును+అని= స్వర్గం తప్పకసిద్ధిస్తుందని; తన కార్యము+చూచెన్= తనపని తాను చూచికొన్నాడు; ఇతడికిన్= ఇతనికి; ఇట్లు= ఇలా (చేయుటం); తగునె?= సరిపోతుందా?

తాత్పర్యం: ఈ దుర్యోధనుడు 'తల్లీ భార్యా ఏమైతేనేమి? వేదాలు అసత్యం పలకవు. స్వర్గం తప్పక సిద్ధిస్తుంది.' అని తనపని తాను చేసికొని తన స్వర్గం తాను చూచికొన్నాడు. ఇట్లా చేయటం సమంజసంగా ఉన్నదా!'

వ. అని యనేక భంగుల విలాపంబు సేసి తక్కటితనయుల దెస నాలోకించి విష్ణుదేవునితో నిట్లనియె. 49

ప్రతిపదార్థం: అని= ఇలా చెప్పి; అనేక భంగులన్= రకరకాలుగా; విలాపంబు+చేసి= ఏడ్చి; తక్కటి= తక్కిన; తనయుల దెసన్= కుమారులవైపు; ఆలోకించి= చూచి; విష్ణుదేవునితోన్= కృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నది.

తాత్పర్యం: ఇట్లా అనేక విధాలుగా వాపోయి, ఏడ్చి ఏడ్చి, చివరికి తక్కిన కుమారుల శవాల వైపు చూచి కృష్ణుడితో ఇట్లా అన్నది.

భాస్కర విలసిత వృత్తము:

కౌరవనృపతి తనూజశతంబుం గంటె? పవనసుతు పటుభుజలీలా
ఘోరతఁ దడఁబడ మేదినిమీఁదఁగూలె వికటముఖకరచరణత్వం
బేరికయినఁ గనుఁగొన్న విషాదం బెంతయు మది నొలయఁగఁ బ్రియకాంతల్
చేరి విలపనము దద్దయు నార్తిం జేయఁగ నునికి వనట తిరిఁ బెట్టన్. 50

ప్రతిపదార్థం: కౌరవనృపతి= ధృతరాష్ట్ర మహారాజుయొక్క; తనూజ శతంబున్= నూరుగురు కొడుకులను; కంటె?= చూశావా?; పవనసుతు= భీముని; పటు= బలంతోకూడిన; భుజలీలా ఘోరతన్= భుజముల విలాసంయొక్క భీకరత్వంచేత; తడఁబడన్= ముందువెనుకలై; మేదినిమీఁదన్= నేలమీద; కూలెన్= పడిపోయారు; (వారి); వికట= వికారంపొందిన; ముఖ= ముఖాలు; కరచణత్వంబు= చేతులు, కాళ్ళు కలిగి ఉండటం; ఏరికిన్+అయినన్= ఎవరికైనా; కనుగొన్నన్= చూస్తే; విషాదంబు= విషాదం; ఎంతయున్= ఎంతో (పుడుతుంది); మదిన్+ఒలయఁగన్= (విషాదం) మనుసుల్లో పుట్టగా; ప్రియకాంతల్= ఈ కురువీరకుమారుల భార్యలు; చేరి= వారి శవాలవద్దచేరి; తద్దయున్= మిక్కిలి; ఆర్తిన్= దీనత్వంతో; విలపనము= విలాపం; చేయఁగన్+ఉనికి= చేస్తూ ఉండటం; వనట= దుఃఖాన్ని; తిరిన్+పెట్టన్= పురివెట్టగా (అధికంగా చేయగా).

తాత్పర్యం: కృష్ణా! అదిగో! అక్కడ ధృతరాష్ట్ర మహారాజుగారి నూరుగురు సంతానాన్ని చూడుము. భీముడి బలిష్ఠమైన భుజాల విలాసానికి తలకిందులై నేలమీద కూలారు. వికారం పొందిన వారి ముఖాలు, కాళ్ళు చేతులు చూస్తే ఎవరికైనా దుఃఖం కలుగుతుంది. అట్లాంటిది ఈ కుమారుల భార్యలందరూ వారి శవాలవద్ద చేరి అతిదీనంగా విలపిస్తూ ఉండటం చూస్తూంటే దుఃఖం మరింత అధికమవుతున్నది.

విశేషం: (తిరిఁబెట్టు'= అన్నది జాతీయం. దీనికి గుడ్డను పురిపెట్టి చెవుల్లో ముక్కుల్లో ఎక్కించటమని అర్థం. పురి ఎక్కించటమనీ అర్థం. పురి ఎక్కిస్తే గట్టిదనం ఎక్కువ అవుతుంది. దానితో ఫలితం అధికమవుతుంది. అట్లాగే దుఃఖం రెండింతలయిందనే అర్థంలో తిక్కనగారు అచ్చమైన ఈ గ్రామీణమైన పలుకుబడిని గాంధారినోట పలికించారు.

భాస్కరవిలసిత వృత్తానికి ప్రతిపాదంలోనూ వరుసగా భ, న, జ, య, భ, న, న, స, గ - అనే గణాలు ఉంటాయి 1-13 అక్షరాలకు యతిమైత్రి. ప్రాస నియమం ఉన్నది.

తే. చందనార్ద్రకుట్టిమములఁ జరణతలము । లొందుటకు నేవగించు నయ్యువిదలిపుడు
నెత్తురుల రేవ మెక్కిన నేలఁ బొరలు । చున్న వారేమి సెప్పుదు? నుడుకుపేర్మి. 51

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: చందన+ఆర్ద్ర= శ్రీగంధ కలాపంచేత తడిగా ఉన్న; కుట్టిమములన్= రత్నాలు పొదిగిన చలువరాతి చుట్టులపైన; చరణతలములు= అరికాళ్ళు; ఒందుటకున్= మోపటానికి; ఏవగించు= అసహ్యించుకొనే; ఆ+ఉవిదలు+ఇపుడు= ఆ కురువీరుల భార్యలు ఇపుడు; ఉడుకుపేర్మిన్= విషాదంవలన పుట్టిన వేడితో; నెత్తురుల= రక్తం గడ్డకట్టటంచేత; తేవము+ఎక్కిన= గట్టిపడిన; నేలన్+పొరలుచున్నవారు= నేలమీదపడి పొర్లుతున్నారు; ఏమి+చెప్పుదున్?= ఏమనగలను?

తాత్పర్యం: పూర్వం శ్రీగంధం పూసినందువలన చల్లగా తడిగా ఉన్న చలువరాతి చట్టులపైన కాళ్ళుమోపటానికి అసహ్యించుకొనే కురుకుమారుల భార్యలు విషాదం వలన పుట్టిన నిండు వేడిమిలో రక్తం గడ్డలుకట్టి గట్టిపడిన ఈ యుద్ధభూమిలో పడి పొర్లుతున్నారు. ఏ మనేది ఈ దురదృష్టాన్ని?

క. బాలలుఁ దరుణులు బ్రౌఢలుఁ । దూలెడు వికలాంగకములతో డెందములన్
వాలిన విరహానలముల । పాలై వందురెద రొక్కభంగిన యకటా! 52

ప్రతిపదార్థం: బాలలున్= చిన్న వయసులోనివారు; తరుణులు= యుక్తవయసులోనివారు; ప్రౌఢలు= నడిమి వయసులోని వారు; తూలెడు= తూలిపోతున్న; వికల+అంగకములతోన్= వికారశరీరాలతో; డెందములన్= హృదయాలలో; వాలిన= విజృంభించిన; విరహ+అనలముల= విరహమనే అగ్నుల; పాలై= పాలై; ఒక్కభంగిన్= ఒకే రీతిగా; వందురెదరు= దుఃఖిస్తున్నారు; అకట!= అయ్యో! (ఏం దురవస్థ).

తాత్పర్యం: ఈ కురుకుమారుల భార్యలలో చిన్నవారు, యుక్తవయుసులలోనివారు, నడివయస్సులలో ఉన్నవారు -అందరూ తూలిపోతున్న వికార శరీరాలతో హృదయాలలో విరహాగ్నులు విజృంభించగా, ఒకే రీతిలో ఏడుస్తూ దుఃఖిస్తున్నారు. అయ్యో! ఇదేమి దురవస్థ!

క. బలదర్ప ధైర్యశౌర్యో । జ్జ్వలులగు ధృతరాష్ట్రసుతుల సతులకు ని ట్లా
కులతమెయి వనటపెల్లునఁ । దలరవలసె దిక్కుమాలి దైవముచెయిదిన్. 53

ప్రతిపదార్థం: బల= బలంచేత; దర్ప= గర్వంచేత; ధైర్య= ధైర్యంచేత; శౌర్య= పరాక్రమంచేత; ఉజ్జ్వలులు+అగు= మిక్కిలి ప్రకాశించిన; ధృతరాష్ట్ర సుతుల సతులకున్= కురు కుమారుల భార్యలకు; ఇట్లు= ఈ విధంగా; ఆకులతమెయిన్= వ్యాకులతతో; దిక్కుమాలి= ఏ దిక్కులేకుండా; దైవము చెయిదిన్= ఆ దైవ చేష్టవలన; వనట పెల్లునన్= అధికమైన దుః ఖంలో; తలర వలసెన్= బాధపడవలసి వచ్చింది.

తాత్పర్యం: ఈ కురుకుమారులు బల మున్నవారు. గర్వ మున్నవారు. ధైర్యపరాక్రమాలు కలవారు. మిక్కిలి వైభవంతో ప్రకాశించారు. అట్లాంటి వీరి భార్యలు ఆ దైవం చేసిన పనివలన ఇట్లా మిక్కిలి వ్యాకులత పొంది ఏ దిక్కూ లేని స్థితిలో అతిశయించిన దుఃఖంతో బాధపడవలసి వచ్చింది. దీన్ని ఎట్లా భరించటం?

క. నిజభూషణాతపత్ర । ధ్వజకంకటఖండవేష్టితములైన కురు
వ్రజగాత్రశకలములు వా । రిజనాభ! కనుంగొనంగ రెట్టించె వగల్. 54

ప్రతిపదార్థం: వారిజనాభ!= పద్మనాభా! (కృష్ణా!); నిజ= తమవైన; భూషణ= నగలు; ఆతపత్ర= గొడుగులు; ధ్వజ= టెక్కెములు; కంకట= కవచాలు; (వీటి) ఖండ వేష్టితములైన= ముక్కలతో కూడుకొని ఉన్న; కురువ్రజ= కురుకుమారుల సమూహంయొక్క; గాత్ర శకలములు= శరీర భాగాలు; కనుంగొనంగన్= చూడగా; వగల్= దుఃఖం; రెట్టించెన్= రెండింతలయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కృష్ణా! నగలు, గొడుగులు, ధ్వజాలు, కవచాలు - వీటి ముక్కలతో కలసిపోయిన కురుకుమారుల దేహ భాగాలను చూస్తుంటే నా దుఃఖం ఇబ్బడి అయిపోయింది.

క. జననియుఁ దండ్రియుఁ దొలు బా । మునఁ జేసిన పాపకర్మమునఁగాక సుయో
ధనుఁడు మొదలయిన నూర్వుర । ననఘుఁడు ధర్మజుఁడు నామ మడఁపగఁదగునే. 55

ప్రతిపదార్థం: జననియున్= తల్లీ; తండ్రియున్= తండ్రీ; తొలుబామునన్= పూర్వ జన్మంలో; చేసిన= చేసినటువంటి; పాపకర్మమునన్+కాక= పాపకర్మవలన కాకపోతే; సుయోధనుఁడు మొదలయిన; నూర్వురన్= మహావీరులు నూరుమందినీ; అనఘుఁడు= పుణ్యాత్ముడు; ధర్మజుఁడు= ధర్మరాజు; నామము+అడఁపగన్= పేళ్ళులేకుండా చేయటానికి; తగునే?= సమర్థుడా?

తాత్పర్యం: వాళ్ళ తల్లిదండ్రులు చేసిన పూర్వజన్మ పాపంవలన కాకపోతే దుర్యోధనుడు దుశ్శాసనుడు మొదలైన మహావీరులు నూరుమందిని ఈ పుణ్యాత్ముడు ధర్మరాజు నామరూపాలు లేకుండా చేయగలడా?

విశేషం: ధర్మరాజును 'పుణ్యాత్ముఁడు' అని నొక్కి చెప్పటంలో గాంధారికి ఇంకా ధర్మరాజాదులపై కోపం నశించలేదని స్పష్టం. స్త్రీకి ఉన్న ఈ పుత్రప్రేమవలన శత్రుద్వేషాన్ని 'పుణ్యాత్ముఁడు' అనేమాట నొక్కి చెప్పుచున్నది.

గాంధారి దుశ్శాసనుని కళేబరంబు చూచి పలవించుట (సం. 11-18-19)

సీ. అచ్యుత! వీఁడె మహాభీలభుజుఁడగు । భీమగదాహతి భూమిఁ గూలి
యాతని చేత సర్వాంగంబులందును । గలుగు క్రొన్నెత్తురు కాంక్షఁ ద్రావఁ
బడి మఱి తెగటారి పడియున్నవాఁడు దు । శ్శాసనుఁ డీతండు సభకు ద్రుపద
పుత్రి నీడిచి తెచ్చి పొలువతనమ్మునఁ । బతుల సన్నిధిఁ గురుక్షితివిభునకుఁ

తే. గర్ణునకుఁ జిత్తసంప్రీతి గాఁగ దూల । పుచ్చెఁ బెక్కువిధంబుల నొచ్చి యా మృ
గాక్షి యప్పుడు మారుతి యంతరంగ । మేర్పఁ దలఁపించుదానన యింతపుట్టె. 56

ప్రతిపదార్థం: అచ్యుత!=కృష్ణా!; మహా+ఆభీల+భుజుఁడు+అగు= మహా భయంకరమైన భుజబలం కలిగిన; భీమ= భీముని యొక్క; గదాహతిన్= గదదెబ్బలచేత; భూమిన్+కూలి= నేలమీదపడి; ఆతనిచేతన్= ఆ భీముడిచేత; సర్వాంగంబులందును= అన్ని అవయవాలలోనూ; కలుగు= ఉన్న; క్రొన్నెత్తురు= క్రొత్త నెత్తురు; కాంక్షన్= కోరికతో; త్రావఁబడి= త్రాగబడి; మఱి= ఇంతేకాకుండా; తెగటారి= చచ్చి; పడి+ఉన్నవాఁడు= పడిఉన్నాడు; వీఁడె= ఇతడే; దుశ్శాసనుఁడు; ఈతండు= ఇతడు; సభకున్= ఆనాడు సభలోకి; ద్రుపద పుత్రిన్+ఈడిచి+తెచ్చి= ద్రౌపదిని ఈడ్చుకొని వచ్చి; పొలువతనమ్మునన్= దుర్మార్గంతో; పతుల సన్నిధిన్= ఆమె భర్తలముందు; కురుక్షితి విభునకున్= దుర్యోధనునికి; కర్ణునకున్= కర్ణుడికి; చిత్త సంప్రీతి+కాఁగన్= మనసుకు సంతోషమయ్యేలా; పెక్కు విధంబులన్= చాలా రీతులలో; తూలపుచ్చెన్= అవమానించాడు; ఆ మృగాక్షి= ఆ ద్రౌపది; అప్పుడు= ఆ సమయంలో; నొచ్చి= బాధపడి; మారుతి= వాయుదేవుని కుమారుడైన భీముడి; అంతరంగము+ ఏర్పన్+తలపించుదానన= గుండె మండేలా తన బాధను వ్యక్తీకరించినందువల్ల; ఇంత పుట్టెన్= ఇదంతా జరిగింది; (ఎవరు తప్పించగలరు?)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కృష్ణా! మహాభయంకరమైన భుజబలమున్న భీముడి గద దెబ్బలతో నేలమీద పడి అన్ని అవయవాలలోనూ పొంగిన క్రొత్త వేడి నెత్తురును భీముడు తనివితీరా త్రాగగా ప్రాణాలు కోల్పోయి పడి ఉన్నాడు. ఇదుగో! వీడే దుశ్శాసనుడు. ఇతడు ఆనాడు సభలోకి ద్రౌపదికి ఈడ్చుకొని వచ్చి, దుర్యోధనుడు, కర్ణుడు సంతోషపడేటట్లు ఆమెను చాలా రీతులతో అవమానించాడు. ఆ సమయంలో ఆ భీముడి గుండెలు మండిపోయేలా ద్రౌపది తన బాధను ప్రకటిస్తూ ఏడ్చిన ఏడ్పు ఆ ఘోరానికి కారణం. దానివలననే ఇదంతా జరిగింది. ఎవరు తప్పించగలరు?

క. ఆ సభ నమ్మెయి నీ దు । శ్శాసనుఁ డప్పాండుపుత్రసతిఁ గ్రూరాత్ముం
డై సంకలేక పెద్దయుఁ । గాసిం బెట్టంగ నెఱిఁగి కలఁగినమదితోన్. 57

ప్రతిపదార్థం: ఆ సభన్= ఆ సభలో; ఆ+మెయిన్= ఆ తీరుగా; ఈ దుశ్శాసనుఁడు; ఆ+పాండుపుత్రసతిన్= ద్రౌపదిని; క్రూరాత్ముండు+ఐ= కఠినమైన మనస్సుతో; సంకలేక= ఏ జంకూ లేకుండా; పెద్దయున్= మిక్కిలిగా; గాసిన్+పెట్టంగన్= బాధపెట్టగా; ఎఱిఁగి= పరిచారికలు చెప్పగా; తెలిసికొని; కలఁగిన= బాధపడిన; మదితోన్= మనసుతో.

తాత్పర్యం: ఆ సభలో ఆ తీరుగా ఈ దుశ్శాసనుడు ద్రౌపదిని కఠినచిత్తుడై ఏ జంకూ లేకుండా మిక్కిలిగా బాధపెట్టగా, ఆ విషయాన్ని పరిచారకుల ద్వారా తెలిసికొని బాధపడ్డ మనస్సుతో.

వ. ఏను దుర్యోధనునితో నిట్లంటి. 58

తాత్పర్యం: నేను దుర్యోధనుడితో ఇట్లా అన్నాను.

తరువోజ:

హరిచేత రక్షితయైన పాంచాలి కగునయ్య యిమ్మెయి నత్యంత నీచ
పరిభవదుఃఖంబుపాల్ సేఁత? మీఁదు పరికింపకున్నఁ గీడ్పాటిల్లకున్నె?
యరికంజకుంజరుఁ డగు భీముఁ బల్కులను బరిగోలల నలఁచుమేలె?
వెరవిడి వేవేగ విడువుము గారవింపు మీ వంశపవిత్ర నో పుత్ర! 59

ప్రతిపదార్థం: ఓ పుత్ర!= ఓ కుమారా!; హరిచేతన్= శ్రీకృష్ణుడిచేత; రక్షిత+ఐన= రక్షింపబడిన; పాంచాలికిన్= ద్రౌపదికి; ఈ+మెయిన్= ఈ విధంగా; అత్యంత నీచ= మిక్కిలి నీచంగా; పరిభవ దుఃఖంబుపాల్+చేఁత= అవమానమనే దుఃఖంపాలు చేయటం; అగును+అయ్య?= సరైన పని అవుతుందా?; మీఁదు= తరువాతి జరిగేదానిని; పరికింపకున్నన్= ఆలోచించకుండా ఉంటే; కీడ్+పాటిల్లక+ఉన్నె?= కీడు జరక్కుండా ఉంటుందా?; అరి= శత్రువులనే; కంజ= తామర పూలకు; కుంజరుఁడు+అగు= ఏనుగువంటి వాడయిన; భీమున్= భీముడిని; పల్కులు+అను= మాటలనేటువంటి; బరిగోలలన్= అంకుశాలతో; నలఁచుట= బాధించటం; మేలె?= తగునా?; వెరవు+ఇడి= నీతిని పాటించి (వెరవిఁడి= ఉపాయహీనుడా! అని సంబోధన కూడా కావచ్చు - అపుడు విఁడి అన్నది రూపం); వేవేగ= వెంటనే; విడువుము= ద్రౌపదిని వదలిపెట్టుము; ఈ వంశపవిత్రను= కురువంశ పవిత్రురాలైన ఈ ద్రౌపదిని; గారవింపుము= గౌరవించుము.

తాత్పర్యం: కుమారా! శ్రీకృష్ణుడి రక్షణ ఉన్న ద్రౌపదిని ఇట్లా మిక్కిలి నీచంగా అవమానం పాలుచేయటం సరైనపని అవుతుందా? తరువాత ఏమవుతుందో ఆలోచించకుండా పని చేయవచ్చునా? అట్లా చేస్తే కీడు కలుగకుండా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉంటుందా? శత్రువు లనే తామరపూలకు ఏనుగువంటివాడు భీముడు. అతడిని మాటవలనే అంకుశాలతో పొడిచి బాధించటం మంచిదా! నీతిని పాటించి వెంటనే ద్రౌపదిని వదలిపెట్టుము. కురువంశానికే పవిత్రత తెచ్చిన ఈ సాధ్విని గౌరవించుము.

విశేషం: అలం: రూపకం. ద్రౌపది అగ్నిలోపుట్టింది. కనుక పవిత్రురాలు. రాజసూయయాగంలో పవిత్రస్నానంచేత కూడా పవిత్రురాలు. కనుక అవమానించటం వలన వంశం నశిస్తుందన్న సూచన ఉన్నది.

తరువోజలో ప్రతిపాదానికీ రెండింద్రగణాలూ ఒక సూర్యగణమూ, మరల రెండింద్రగణాలూ ఒక సూర్యగణమూ ఉంటాయి. గణాల మొదటి అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

క. **క్రూరాత్ముఁడు నీచుఁడు గాం। ధార విభునిఁ దొఱఁగు పాండు తనయులఁ బుణ్య**
ప్రారంభులఁగూడి మనుము। కౌరవకుల మెల్ల బ్రదుకఁగాఁ బొగడొందన్.' **60**

ప్రతిపదార్థం: క్రూర+ఆత్ముఁడు= కఠిన చిత్తుడు; నీచుఁడు= నీచగుణాలు కలిగినవాడు; గాంధార విభునిన్= గాంధారరాజు శకునిని; తొఱఁగు= వదలిపెట్టుము; పాండు తనయులన్= పాండుపుత్రులను; పుణ్యప్రారంభులన్= పుణ్యం సంపాదించే కార్యాల విషయంలో పూనిక గలవారు; (అట్లాంటివారిని); కూడి= కలిసికొని; కౌరవకులమెల్లన్= కౌరవ వంశీయులంతా; బ్రదుకఁగాన్= జీవించేలా; పొగడు+ఒందన్= ప్రశంసలు పొందగా; మనుము= నీవు హాయిగా బ్రదుకుము.

తాత్పర్యం: ఈ గాంధారరాజు శకుని కఠినచిత్తుడు. అతినీచగుణాలు కలిగినవాడు. (నా సోదరుడే కావచ్చును గాక - అని అర్థం). 'ఇతడి స్నేహం వదలిపెట్టుము. పాండవులు పుణ్యం సంపాదించే కార్యాల విషయంలో పూనిక గలవారు. అట్లాంటివారి స్నేహం చేయుము. కౌరవవంశీయు లంతా చల్లగా బ్రదుకుతారు. ప్రపంచమంతా నిన్ను స్తుతిస్తుంది. నీవు చల్లగా ఉండుము'.

క. **అని యెన్ని భంగులను జె। ప్పినఁ దా నప్పలుకు లెల్లఁ బెడచెవులం బె**
ట్టె నుదగ్రుఁడు దగుకార్యము। గనునె? వశంబగునె దైవగతి తప్పింపన్? **61**

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; ఎన్ని భంగులను= ఎన్ని రీతులుగా; చెప్పినన్= చెప్పినా; తాను= ఆ దుర్యోధనుడు; ఆ+పలుకులు+ఎల్లన్= ఆ మాటలను అన్నిటినీ; పెడచెవులన్+పెట్టెన్= పెడచెవిని పెట్టాడు (వినలేదు); ఉదగ్రుఁడు= మిక్కిలి కోపమున్నవాడు; తగు కార్యమున్= తగిన పనిని (సముచిత కార్యాన్ని); కనునె?= నిర్ణయించుకోగలడా?; దైవగతి= దైవనిర్ణయం; తప్పింపన్= తప్పించటానికి; వశంబు+అగునె?= వీలు అవుతుందా?

తాత్పర్యం: అని ఈ విధంగా ఎన్ని రీతులుగా చెప్పినా ఆ దుర్యోధనుడు ఆ మాటలను పెడచెవినిపెట్టాడు. కోపిష్ఠి ఏది మంచి? ఏది చెడు? అనే ఆలోచనతో పని చేస్తాడా? అయినా దైవనిర్ణయం తప్పించటం ఎవరికి సాధ్యమవుతుంది.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

తే. **నాఁటిమాట లుల్లంబున నాటియుండ। నొవ్వుతోఁ దటివేచి నేఁ డివ్విధమునఁ**
బటిచె భీముండు నొప్పింపఁబడిన త్రాఁచు। పాము పగసాటి తెగ తార్చుభంగిఁ గృష్ణ! **62**

ప్రతిపదార్థం: కృష్ణ!= కష్ణా!; నాఁటిమాటలు= ఆనాటి పలుకులు; ఉల్లంబునన్= హృదయంలో; నాటి+ఉండన్= నాటుకొని ఉండగా; నొవ్వుతోన్= బాధతో; తఱి+వేచి= సమయం కోసం కాచుకొని ఉండి; నేఁడు= ఈ రోజు; ఈ+విధమునన్= ఈ విధంగా; భీముండు= భీముడు; నొప్పింపఁబడిన= బాధింపబడిన; త్రాఁచుపాము= నాగుపాము; పగ+చాటి= పగను ప్రకటించి (కసిదీరా); తెగటార్చు భంగిన్= చంపేవిధంగా; పఱిచెన్= చంపాడు (చేశాడు).

తాత్పర్యం: కృష్ణా! ఆనాడు సభలో వాళ్ళంతా మాట్లాడిన మాటలు హృదయంలో గాఢంగా నాటుకొనిపోగా ఆ బాధతో సరైన సమయంకొరకు కాచుకొని ఉన్న భీముడు ఈనాటికి దెబ్బతిన్న నాగుపాము కసిదీరా కాటువేసినట్లు ఈ విధంగా కురుకుమారులందరినీ చంపాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **తగుఁ బగ దీర్చుట యిమ్మెఁ। దగ వగునే నెత్తురెత్తి త్రావుట? భీముం**
డు గడున్ ఘోరము సేసెను। మగల కతి క్షుద్రవృత్తమా పొగ డొసఁగున్? **63**

ప్రతిపదార్థం: పగతీర్చుట= పగతీర్చుటం; తగున్= సమంజసమే; ఈ+మెయిన్= ఈ విధంగా; నెత్తురు+ఎత్తి+త్రావుట= నెత్తురు తీసికొని త్రాగటం; తగవు+అగునే?= న్యాయమా?; భీముండు= భీముడు; కడున్= మిక్కిలి; ఘోరము= ఘోరమైనపని; చేసెను= చేశాడు; మగలకున్= వీరులకు; అతి= మిక్కిలి; క్షుద్రవృత్తమా= నీచ పద్ధతా; పొగడు+ఒసఁగున్?= ప్రశంసను తెచ్చేది?

తాత్పర్యం: పగ తీర్చుకొనటం ఎవరికైనా సమంజసమే. కాని, ఈ విధంగా నెత్తురు తీసికొని త్రాగటం న్యాయమైన పని అవుతుందా? ఏమైనా భీముడు చాలా దారుణమైన పనిచేశాడు. వీరులకు ఇట్లాంటి నీచమైన పద్ధతులద్వారానా మంచి పేరు వచ్చేది? (రాదని అర్థం).

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

తరలము:

కరములుం జరణంబులున్ విరి గల్గి సాఁగి వికీర్ణమై
యురము నిర్భరవైకృతంబుగ నుర్విఁ ద్రెళ్ళి సుతుండు గే
సరి నఖంబుల వ్రవ్వఁబడ్డ గజంబు చాడ్పున నుండఁగాఁ
గరుణ మాత్మకు నింత మిక్కిలి గాక యున్నె? జనార్దనా! **64**

ప్రతిపదార్థం: జనార్దనా!= కృష్ణా!; కరములున్= చేతులూ; చరణంబులున్= కాళ్ళూ; విరి గల్గి సాఁగి= విడిపోయి వ్యాపించి; వికీర్ణమై= ముక్కలై (యుద్ధభూమిలో వెదజల్లబడ్డాయి); ఉరము= రొమ్ము; నిర్భర= మిక్కిలి; వైకృతంబుగన్= వికారరూపాన్ని పొంది; ఉర్విన్= నేలమీద; త్రెళ్ళి= పడి; సుతుండు= ఈ దుశ్శాసనుడు; కేసరి నఖంబులన్= సింహం గోళ్ళతో; వ్రవ్వఁబడ్డ= చీల్చబడిన; గజంబు చాడ్పునన్= ఏనుగులాగా; ఉండఁగాన్= కనిపిస్తుండగా; ఆత్మకున్= మనసుకు; కరుణము= దుఃఖం; ఇంత= మరింత; మిక్కిలి+కాక+ఉన్నె?= అధికం కాకుండా ఉంటుందా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కృష్ణా! చేతులు కాళ్ళు విడిపోయి ముక్కలు ముక్కలై యుద్ధభూమిలో వెదజల్లబడ్డాయి. రొమ్ము చీలిపోయి వికారంగా తయారై నేలమీదపడిన ఈ దుశ్శాసనుడిని చూస్తే సింహంగోళ్ళచేత చీల్చబడిన ఏనుగువలె అగుపిస్తున్నాడు. ఇట్లాంటి కొడుకును చూచి మనసులో దుఃఖం మరింత ఎక్కువ కాకుండా ఉంటుందా? చెప్పుము.

విశేషం: అలం: ఉపమ. తరలములో ప్రతిపాదానికీ న, భ, ర, స, జ, జ, గ అనే గణాలుంటాయి. 1-12 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

సీ. **వీఁడె వికర్ణుండు వాఁడి మెఱుంగు మే । ఘంబుల గముల మధ్యంబునందుఁ**
దేజరిల్లెడుమాడ్కి రాజిల్లుచున్నవాఁ । డతిసాంద్రహస్తికాయములలోనఁ
గార్ముకజ్యాకిణకఠినమైనయున్న యి । బ్బాలుని ముంజేయి బాల గృధ్ర
మోపదు కబళించియును జంచుపుటమునఁ । జీరంగఁ జూచితే శౌరి? యితని

తే. **రమణి పొరిఁబొరి గన్నీరు గ్రమ్మఁ జుట్టు । మెలఁగి కాకుల గ్రద్దలఁ దొలఁగ నడుచు**
చున్నయది పాసి యవి వోవకున్న నిట్లు । సూతురే తల్లులెందును సుతుల నకట! **65**

ప్రతిపదార్థం: వీఁడె= వీడే; వికర్ణుండు; వాఁడి మెఱుంగు= ఉజ్జ్వలమైన మెరుపు; మేఘంబుల గముల= మేఘాల గుంపుల; మధ్యంబునందున్= నడుమ; తేజరిల్లెడు మాడ్కిన్= ప్రకాశించు రీతిగా; అతిసాంద్ర= మిక్కిలి బలిష్ఠములైన; హస్తి కాయములలోనన్= ఏనుగుల దేహాలమధ్య; రాజిల్లుచున్నవాఁడు= ప్రకాశిస్తున్నాడు; కార్ముక= ధనుస్సు యొక్క; జ్యా= అల్లెత్రాటిని లాగటంవల్ల పుట్టిన; కిణ= కాయలచేత; కఠినము+ఐ+ఉన్న= గట్టిగా ఉన్న; ఈ బాలుని= ఈ కుమారుడి; ముంజేయిన్= ముంచేతిని; బాలగృధ్రము= పిల్లగద్ద; కబళించియును= ముక్కుతోపట్టుకున్నా; చంచుపుటమునన్= ముక్కుపుటంతో; చీరంగన్= చీల్చడానికి; ఓపదు= దానిచేత కావటంలేదు (అంత పెద్దదని అర్థం); చూచితే శౌరి?= కృష్ణా చూస్తున్నావా?; ఇతని రమణి= ఇతని భార్య; పొరిన్+పొరిన్= మాటిమాటికి (నిరంతరంగా); కన్నీరు క్రమ్మన్= కంట్లో నీరు కమ్ముతుండగా; చుట్టున్+మెలఁగి= చుట్టూ తిరుగుతూ; కాకులన్= కాకులనీ; గ్రద్దలన్= గద్దలనీ; పాసి= దూరంగా; అవి= ఆ కాకులు గద్దలు; పోవకున్నన్= పోకుండా ఉంటే; (వాటిని); తొలఁగన్= పారిపోయేలా; అడుచుచున్న+అది= తరుముతూ ఉంది; ఇట్లు= ఈ విధంగా; తల్లులు; ఎందును= ఎక్కడైనా; సుతులన్= కొడుకులను; చూతురే?= చూశారా?; అక్కట!= అయ్యో!

తాత్పర్యం: కృష్ణా! ఇదిగో వీడే వికర్ణుడు. ఉజ్జ్వలమైన మెరుపు మేఘాలనడుమ తళుక్కున ప్రకాశించినట్లుగా అతి బలిష్ఠములైన ఏనుగుల దేహాల మధ్య వెలుగుతూ ఉన్నాడు. నిరంతరం వింటినారిని లాగటంవలన పుట్టిన కణుపులచేత గట్టిపడిన ఈ కుమారుడి ముంజేతిని పిల్లగద్ద ముక్కుతో కరుచుకొనటానికి యత్నించినా ముక్కుపుటంతో దానిని చీల్చటం ఆ గ్రద్దకు సాధ్యం కాలేదు. చూచావా? కృష్ణా! అదిగో అతడి భార్య నిరంతరంగా ఏడుస్తూ భర్త శవంచుట్టూ తిరుగుతూ, మూగుతున్న కాకులను గద్దలను దూరంగా తరుముతూ ఉన్నది పాపం. ఇట్లా ఏ తల్లులకైనా ఎక్కడైనా తమ కొడుకులను చూచే దౌర్భాగ్యం కలిగిందా! అయ్యో! నేనెంత దురదృష్టవంతురాలిని!

విశేషం: అలం: ఉపమ. అర్థాంతరన్యాసం.

క. **మారుతనందను నుగ్రపు । నారాచము లొడల నాటినం జచ్చియు న**
వ్వీర కుమారుం డుజ్జ్వల । చారుత్వముఁ బాయకున్న చందముఁ గంటే? **66**

ప్రతిపదార్థం: మారుత నందను= వాయు నందనుడైన భీముడియొక్క; ఉగ్రము+నారాచములు= క్రూరమైన బాణాలు; ఒడలన్= ఒంటియందు; నాటినన్= దిగబడగా; చచ్చియున్= చనిపోయికూడా; ఆ+వీర కుమారుండు= ఆ వికర్ణుడు; ఉజ్జ్వల చారుత్వమున్= ప్రకాశంతోడి అందాన్ని; పాయకున్న= వదలకున్న; చందము= తీరును; కంటే?= చూస్తున్నావా?

తాత్పర్యం: కృష్ణా! భీముడు వేసిన క్రూరమైన బాణాలు దేహంలో దిగబడి ప్రాణాలు కోల్పోయికూడా ఈ వీరకుమారుడి దేహంలో కాంతి, మనోహరత్వం తగ్గకున్నాయి. చూస్తున్నావు కదా!

క. అని మొన నెవ్వరికిని మా । ర్కొన రాని ఘనుండు దుర్ముఖుఁడు భీమునిచే
వినిపాతితుఁడై భూరజ । మున బ్రుంగుడు వడ్డవాఁడు మురహర! కంటే? 67

ప్రతిపదార్థం: మురహర!= మురాసురుడిని చంపిన ఓ కృష్ణా!; అనిమొనన్= యుద్ధంలో; ఎవ్వరికిని= ఎవరికీ; మార్కొనన్+రాని= ఎదిరించటానికి వీలులేని; ఘనుండు= బలవంతుడైన; దుర్ముఖుఁడు= దుర్ముఖుడు; భీమునిచేన్= భీముడిచేత; వి+నిపాతితుఁడు+ఐ= కొట్టబడి నేలగూలి; భూరజమునన్= నేలమీది ధూళిలో; బ్రుంగుడు+పడ్డవాఁడు= మునిగిపోయాడు; కంటే?= చూశావా?

తాత్పర్యం: కృష్ణా! ఇదిగో చూడుము! ఈ దుర్ముఖు డున్నాడే - వీడిని యుద్ధంలో ఎవరూ ఎదిరించలేరు. అంతటి బలపరాక్రమశాలి వీడు. అట్లాంటి వీడు భీముడి గద దెబ్బలకు నేలగూలి మట్టిలోని దుమ్ముధూళులతో మునిగిపోయాడు. చూస్తున్నావా!

తే. నక్క తోఁడెలు వీని యాననము సగము । దిన్నయవి యట్టులయ్యును నున్నయొప్ప
దొరసి సప్తమినాఁటిచందురునిఁ బోలె । చూడు భావించి దీపితశూరవంశ! 68

ప్రతిపదార్థం: దీపిత= ప్రకాశించే; శూరవంశ!= శూరుని వంశం కలవాడా! (నీవు పుట్టగా శూరుని వంశం ప్రకాశించిందని అర్థం. శౌరి- అని కృష్ణుడికి మరో పేరు); నక్క; తోఁడెలు; వీని+ఆననమున్= వీడి ముఖాన్ని; సగము+తిన్నయవి= సగం తిన్నాయి; అట్టులు+అయ్యును= అలా అయికూడా; ఉన్న+ఒప్పు= ఉన్నకాంతి; దొరసి= కలిగి; సప్తమినాఁటి= శుద్ధ సప్తమినాడు ప్రకాశించే; చందురునిన్+పోలెన్= చంద్రుడివలె; భావించి చూడు= కాస్త ఆలోచించి చూడుము.

తాత్పర్యం: కృష్ణా! నీవు శూరుడి వంశాన్ని ప్రకాశింపజేశావు. అక్కడ చూడుము. నక్క, తోడేలు వాడి ముఖాన్ని సగం తినివేశాయి. అయినా కూడా ఆ ముఖంలో మిగిలిన కాంతి సప్తమినాటి చంద్రబింబంవలె కాంతులు చిమ్ముతూనే ఉన్నది. బాగా చూడుము.

విశేషం: ఉపమ.

మత్తకోకిల:

శూరసేనుఁడు భీమసేననిషూదితుండయి చుట్టు నం
భోరుహానన లార్తి మూర్తతఁ బొందిన ట్లతిరూక్ష హా
హారవంబులతోడఁ గ్రుమ్మర నల్లవాఁడె వికారితా
కారుఁడై పడియున్నవాఁడు వృకంబుఁ బక్షులు జించినన్. 69

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: శూరసేనుఁడు= శూరసేనుడనే నా కుమారుడు (అదిగో); భీముడిచేత; నిషూదితుండు+అయి= చంపబడి; చుట్టున్= చుట్టూ; అంభోరుహ+ఆననలు= పద్మముఖులైన భార్యలు; ఆర్తి= దీనత్వం; మూర్తతన్+పొందినట్లు= మూర్తిమత్త్వాన్ని పొందినట్లు; అతి+రూక్ష= అతి దారుణమైన; హాహారవంబులతోడన్= హాహాకారాలతో; క్రుమ్మరన్= తిరుగుతుండగా; అల్లవాఁడె= అదుగోవాడే (అక్కడ); వృకంబు= తోడేలు; పక్షులు= కాకులు గద్దలు; చించినన్= చీల్చివేయగా; వికారిత+ ఆకారుఁడు+ఐ= వికారంపొందిన శరీరం కలిగినవాడై; పడి+ఉన్నవాఁడు= పడి ఉన్నాడు.

తాత్పర్యం: కృష్ణా! వాడే నా కొడుకు శూరసేనుడు. భీముడిచేత చంపబడి, చుట్టూ అతని భార్యలు దీనత్వం ఆకారం పొందినట్టు అతి దారుణంగా హాహాకారాలు చేస్తూ విలపిస్తూ తిరుగుతుండగా, తోడేలు, కాకులు గ్రద్దలు చీల్చివేయగా దేహం గుర్తించటానికి వీలులేకుండా మారిపోయి పడి ఉన్నాడు.

విశేషం: మత్తకోకిలలో ప్రతిపాదానికీ ర, స, జ, జ, భ, ర - అనేగణాలుంటాయి. 1-11 యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

సీ. **అంగంబు కోమల మంతరంగంబు చా । తుర్య నిరూఢంబు శౌర్యఘనుఁడు**
వీఁడె గోవింద! వివింశతి యీతండు । సొబగుండు మెలఁతలు సుట్టు నెపుడు
నప్సరోగణ మమరాధిపుఁ గొలిచెడు । చాడ్పునఁ బాయక సమ్మదంబు
చిగురొత్త నుండుదు రగరుకస్తూరికా । చందనాద్యనులేపశాలి యిపుడు

తే. **గ్రద్దలును గాకులును జుట్టుఁ గదిసియుండఁ । దఱచునెత్తుటఁ దోఁగిన తనువుఁ దాను**
నున్నవాఁడు గానాకర్ణనోత్సుకుండు । నక్క లఱచెడు చేరువ నక్కటకట! 70

ప్రతిపదార్థం: గోవింద!= కృష్ణా!; వీఁడె= ఇతడే; వివింశతి= వివింశతి అనే పేరు గల నా మరి ఒక కుమారుడు; అంగంబు కోమలము= ఇతని శరీరము చాలా సుకుమారం; అంతరంగంబు= మనస్సు; చాతుర్యనిరూఢంబు= నేర్పరితనంలో ప్రసిద్ధం; శౌర్యఘనుఁడు= గొప్ప పరాక్రమంచేత గొప్పవాడు; ఈతండు= ఇతడు; సొబగుండు= అందగాడు; చుట్టున్= ఇతడి చుట్టూ; మెలఁతలు= స్త్రీలు; ఎపుడున్= ఎల్లప్పుడూ; అమరాధిపున్= ఇంద్రుడిని అప్సరస్+గణము= అప్సరసల సమూహం; కొలిచెడు చాడ్పునన్= సేవించే తీరుగా; పాయక= ఎప్పుడూ వదలకుండా; సమ్మదంబు= సంతోషం; చిగురొత్తన్= క్రొత్త క్రొత్తగా పుడుతుండగా (నిత్య సంతోషంతో); ఉండుదురు= (ఇతనిచుట్టూ) ఉంటారు; అగరు= అగరు; కస్తూరికా= కస్తూరి; చందనాది= శ్రీగంధం మొదలైన; అనులేపశాలి= అనులేపాలను పూసుకోవటంలో సుసంపన్నుడు; ఇపుడు; గ్రద్దలును= గ్రద్దలూ; కాకులును= కాకులూ; చుట్టున్= చుట్టూ; కదిసి+ఉండన్= మూగి ఉండగా; తఱచు నెత్తుటన్= మిక్కిలిగా రక్తంలో; తోఁగిన= మునిగిపోయిన; తనువున్+తానున్= తనువుతో తాను; ఉన్నవాఁడు= ఉన్నాడు; గాన+ఆకర్ణన= పాటలను వినటంలో; ఉత్సుకుండు= ఆసక్తి కలవాడు; నక్కలు; అఱచెడు= ఊళలువేసే; చేరువన్= చోట; అక్కటకట!= అయ్యయ్యో! (పడిఉన్నాడు).

తాత్పర్యం: కృష్ణా! వీడు నా ఇంకొక కుమారుడు వివింశతి. ఇతడి శరీరం సుకుమారం. మనసు నేర్పరితనంలో ప్రసిద్ధమైనది. గొప్ప పరాక్రమం కలిగినవాడు. ఇంద్రుడి చుట్టూ అప్సరసలు సేవిస్తూ ఉండే విధంగా ఇతడి చుట్టూ ఎల్లప్పుడూ స్త్రీలు వదలకుండా నిత్య సంతోషంతో ఉండేవారు. అగరు, కస్తూరి, చందనం మొదలైన సుగంధద్రవ్యాల పూతలను పూసికొని చాలా వైభవంతో కనిపించేవాడు. ఇప్పుడు అతని చుట్టూ గ్రద్దలు, కాకులు కూచుకొని ఉన్నాయి. రక్తపుమడుగులో మునిగిపోయి ఉన్నాడు. ఇతడికి సంగీతమంటే చాలా ఆసక్తి. ఇపుడు నక్కలు ఊళలువేసే చోట పడి ఉన్నాడు. ఎంత దౌర్భాగ్యమో చూడుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ.

తే. **కనకపుంఖశరావృత గాత్రుఁడైన । దుష్ప్రహుండు చచ్చి యుండియుఁ దోయజాక్ష!**
వికచ నవకర్ణికార సంవేష్టనంబు । గలుగు శైలంబు తెఱఁగునఁ బొలిచెఁ జూడు. **71**

ప్రతిపదార్థం: తోయజాక్ష!= పద్మనయనా కృష్ణా!; కనకపుంఖ= బంగారు పింజలు అమర్చిన; శర+ఆవృత= బాణాలచేత కప్పబడిన; గాత్రుఁడు+ఐన= దేహం కలిగినటువంటి; దుష్ప్రహుఁడు= దుష్ప్రహుడు అనే పేరుగల నా కొడుకు; చచ్చియుండియున్= చనిపోయికూడా; వికచనవ= అప్పుడే వికసించిన; కర్ణికార= కొండగోగు చెట్లయొక్క; సంవేష్టనంబు= చుట్టూ కూడుకొని ఉండటం; కలుగు= కలిగిన; శైలంబు= కొండ; తెఱఁగునన్= రీతిగా; పొలిచెన్= ప్రకాశిస్తున్నాడు; చూడు= చూడుము.

తాత్పర్యం: కృష్ణా! అటు చూడుము. బంగారు పింజలు అమర్చిన బాణాలచేత కప్పబడిన దేహం కలిగి, నేల కొరిగిన దుష్ప్రహుడు చనిపోయికూడా అప్పుడే వికసించిన కొండగోగుచెట్టులు చుట్టూ విస్తరించగా ప్రకాశించే కొండవలె కాంతులు విరజిమ్ముతూ పడి ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

గాంధారి యభిమన్యు కళేబరంబు గనుంగొని ప్రలాపించుట (సం. 11-20-1)

వ. **అని మఱియు నిట్లనియె.** **72**

తాత్పర్యం: అని ఇంకా ఇట్లా అన్నది.

లయవిభాతి:

అరయ నిది పెద్దయని యరుల మొనఁ జిత్తమున । సరకుగొన కుగ్రమగు బరవస మెలర్పం
ద్వరితగతిఁ జొచ్చి కురువరుఁడు దలరం గవిసి । కరితతులుఁ దేరులనికరములుఁ దురంగో
త్కరములును గాల్బలము నెరవులును గీటడఁగ । శరగురుఁడుఁ గర్ణుఁడును గురుసుతుఁడు మద్రే
శ్వరుఁడుఁ గృపుఁడుం బరవ బరఁగి దివిజుల్ వొగడ । ధరఁబడి ముకుంద! మన నరతనయుఁ డొప్పెన్. **73**

ప్రతిపదార్థం: ముకుంద!= కృష్ణా!; మన నరతనయుఁడు= మన అర్జునుని కొడుకు (అభిమన్యుడు); అరయన్= చూడగా; ఇది; పెద్ద+అని= చాలాపెద్ద దని; లెక్కచేయకుండా; ఉగ్రము+అగు= భయంకరమైన; బరవసము= ధైర్యం; ఎలర్పన్= పుట్టగా; త్వరితగతిన్= అతివేగంగా; చొచ్చి= యుద్ధరంగంలో ప్రవేశించి; కురువరుఁడు= దుర్యోధనుడు; తలఁదన్= భయపడేట్టు; కవిసి= ఎదుర్కొని; కరితతులు= ఏనుగుల సమూహాలు; తేరుల నికరములు= రథాల సముదాయాలు; తురంగ+ఉత్కరములు= గుర్రాల గుంపులు; కాల్బలము= సైనికులు; నెరవులును= పరివారమూ; గీటడఁగన్= చావగా; శరగురుఁడు= ద్రోణుడూ; కర్ణుఁడును= కర్ణుడూ; గురుసుతుఁడున్= అశ్వత్థామా; మద్రేశ్వరుఁడున్= శల్యుడూ; కృపుఁడున్= కృపుడూ; పరవన్= బాణాలు ప్రయోగించగా; పరఁగి= ఘోరయుద్ధం చేసి ప్రసిద్ధుడై; దివిజుల్+పొగడన్= దేవతలు స్తుతించగా; ధరన్+పడి= నేలగూలి; ఒప్పెన్= ప్రకాశిస్తున్నాడు.

తాత్పర్యం: కృష్ణా! మన అర్జునుడి కుమారుడి అభిమన్యుడు వీడే. శత్రుసైన్యం అంత పెద్దదని ఏ మాత్రం లెక్కచేయకుండా భయంకరమైన ధైర్యంతో అతివేగంగా పద్మవ్యూహాన్ని ప్రవేశించి దుర్యోధనుడివంటి మహావీరుడు

భయపడేటట్టు ఎదిరించి యుద్ధం చేశాడు. ఏనుగులను, రథాలను, గుర్రాలను, సైనికులను, పరివారాలను నుగ్గునుగ్గ చేశాడు. చివరికి ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ, శల్యుడు, కృపుడు - అందరూచేరి ఘోరంగా బాణాలు ప్రయోగించగా వాటిని ఎదిరించి ప్రసిద్ధుడై దేవతలు ప్రస్తుతిస్తుండగా నేలమీద కూలి ప్రకాశిస్తున్నాడు.

విశేషం: లయవిభాతికి వృత్తలక్షణానికి చూడండి - స్త్రీ. 1-131.

ఆ. పాడి మాలి తన్నుఁ బలువురు పొదివినఁ। బోరి తద్ద డప్పిఁ గూరి నిదుర
పోయెనొకొ సుభద్ర పుత్రుండు! మృతుఁడైనఁ। జెలువ మింత యేల కలుగ నేర్చు? 74

ప్రతిపదార్థం: పాడి= న్యాయం; మాలి= తప్పి; తన్నున్= తనను; పలువురు= చాలమంది; పొదివినన్= చుట్టుముట్టుగా; పోరి= పోరాడి; తద్ద= మిక్కిలి; డప్పిన్= దప్పికతో; కూరి= మునిగి; నిదురపోయెన్+ఒకొ!= నిద్రపోయాడు కాబోలు!; సుభద్ర పుత్రుండు= ఈ అభిమన్యుడు; మృతుఁడు+ఐనన్= చనిపోయి ఉంటే; ఇంత; చెలువము= సౌందర్యం; ఏల= ఎందుకు; కలుగన్+నేర్చున్?= ఉంటుంది?

తాత్పర్యం: అన్యాయంగా తనను అంతమంది చుట్టుముట్టితే వారితో పోరాడి పోరాడి, అలసిపోయి, దప్పికతో గాఢనిద్రలో మునిగిపోయాడు కాని, మన అభిమన్యుడు చావలేదు. చనిపోయి ఉంటే ముఖంలో ఇంత 'కళ' ఎందుకుంటుంది?

విశేషం: అలం: కావ్యలింగం.

సీ. ఉత్తర యిక్కుమారోత్తము నురమున। వ్రాలి మోమునఁ దనవదనకమల
మందంద చేర్చుచున్నది మున్ను గన్నంత। మెలఁగంగనేరక చెలులమాటు
గొను సిగ్గు పెంపున వనట నిట్లయ్యె ని। ప్పడు మాటిమాటికిఁ బొలఁతి ప్రియునిఁ
గనుఁగొని బిగియారఁ గౌఁగిలించుచు శిర। మూరుతలంబున నునిచి పాణి

తే. పల్లవంబున నానన మల్లనల్ల। దొడయుచును నిన్నుఁ జూచుచుఁ దోడుతోడఁ
బొడము పెల్లునఁ గన్నీరు దుడిచికొనుచు। నలఁత పెనువెల్లిఁ దేలెడు నంబుజాక్ష! 75

ప్రతిపదార్థం: అంబుజాక్ష!= కృష్ణా!; ఉత్తర= అభిమన్యుడి భార్య ఉత్తర; ఈ+కుమారోత్తము= అభిమన్యుడి; ఉరమునన్= రొమ్ముమీద; వ్రాలి= వ్రాలి; మోమునన్= ముఖంమీద; తన; వదనకమలమున్= కమలంవంటి ముఖాన్ని; అందందు+అ= మాటి మాటికి (అక్కడక్కడా); చేర్చుచున్నది= ఆనిస్తోంది; మున్ను= ముందు (యుద్ధానికి మునుపు); కన్న+అంతన్= అభిమన్యుడిని చూడగానే; మెలఁగంగన్+నేరక= అతనితో కలిసి వర్తించటానికి ధైర్యంచాలక; సిగ్గుపెంపునన్= అధికమైన సిగ్గుతో; చెలుల మాటు+కొనున్= చెలికత్తెల చాటుకు వెళ్ళిపోయేది; వనటన్= దుఃఖంతో; ఇప్పుడు; ఇట్లు+అయ్యెన్= ఇట్లా అయింది చూడు; పొలఁతి= ఈమె (స్త్రీ); ప్రియునిన్= ప్రియుడిని; కనుఁగొని= చూసి; బిగియారన్= గట్టిగా; కౌఁగిలించుచున్= కౌగిలించుకొంటూ; శిరమున్= తలను; ఊరుతలంబునన్= తొడలమీద; ఉనిచి= ఉంచుకొని; పాణిపల్లవంబునన్= అరచేతులతో; ఆననము= ముఖాన్ని; అల్లనల్లన్= మెల్లమెల్లగా; తొడయుచును= నిమురుచు; నిన్నున్+చూచుచున్= నిన్ను చూస్తూ; తోడుతోడన్= వెంటనే; పొడము పెల్లునన్= పుట్టే ఆధిక్యంతో; కన్నీరు తుడిచికొనుచున్= వచ్చిన కన్నీరును తుడుచుకొంటూ; అలఁత పెనువెల్లిన్= శోక మహాసముద్రంలో; తేలెడున్= కొట్టుకొనిపోతున్నది.

తాత్పర్యం: కృష్ణా! ఉత్తరాదేవి తన భర్త రొమ్ముమీద వాలిపోయి ముఖంమీద ముఖం మాటిమాటికి ఆనిస్తోంది. యుద్ధానికి మునుపు అభిమన్యుడిని చూడగానే చెలికత్తెలచాటుకు సిగ్గుతో పారిపోయేది. మరి ఇప్పటి స్థితిలో అతి దుఃఖంవలన ఇట్లా అయింది. ప్రియుడిని చూచి గట్టిగా కౌగిలించుకొని మోకాళ్ళపై తలను వాల్చి అరచేతులతో మొగాన్ని స్పృశిస్తూ నిన్ను చూడగానే మరింత దుఃఖానికి లోనై కంటినీరు తుడుచుకొంటూ శోకమహా సముద్రంలో మునిగిపోయింది పాపం!

విశేషం: అలం: రూపకం.

వ. **వింటె యవ్వనిత విలాపంబు?** **76**

తాత్పర్యం: ఆ స్త్రీ విలపిస్తున్న తీరు విన్నావా?

సీ. **'భద్రచారిత్ర! సుభద్రను నిర్జర । ప్రతిమానులగు పాండురాజసుతులఁ**
బాసి యెం దరిగితి? పార్థుని పట్టి న। చ్యుతుని యల్లుని సమరోర్విఁ జెనసి
పరిమార్పఁ జాలిరెవ్వరు? పెక్కుభంగుల । మాటలాడఁగ మఱుమాటలేల
యాడవు నాతోడ? నస్త్రగురుండుఁ ద । త్తనయుండుఁ గృపుఁడు రాధాసుతుండుఁ

తే. **బాడిమానసులండ్రు నిబ్బాలు నొకనిఁ । బొదివి రిస్సిరొ! పెక్కండ్రు ప్రోడ లిదియు**
మగఁటిమియె? క్రించుపని కిట్లు దెగినయప్పు । డుల్లములు వారలకు నెట్టులుండె నొక్కొ! **77**

ప్రతిపదార్థం: భద్ర= శ్రేష్ఠమైన; చారిత్ర!= చరిత్రకల ఓ అభిమన్యుడా!; సుభద్రను= మీ తల్లి సుభద్రను; నిర్జర= దేవతలతో; ప్రతిమానులు= సమానులైన; పాండురాజసుతులన్= పాండు కుమారులను; పాసి= వదలి; ఎందున్+అరిగితి(వి)?= ఎక్కడికి వెళ్ళావు?; పార్థుని పట్టిన్= అర్జునుని కుమారుడిని; అచ్యుతుని+అల్లునిన్= కృష్ణుడి అల్లుడిని; సమర+ఉర్విన్= యుద్ధభూమిలో; చెనసి= ఎదిరించి; పరిమార్పన్+చాలిరి+ఎవ్వరు?= చంపగలిగినవారు ఎవరున్నారు?; పెక్కు+భంగులన్= ఎన్నో తీరులలో; మాటలాడఁగన్= మాట్లాడుతున్నానే; మఱుమాటలు+ఏల+ఆడవు+నాతోడన్?= నాతో మారు మాట్లాడకున్నావెందుకు?; అస్త్రగురుండున్= ద్రోణాచార్యుడు; తత్తనయుండున్= అశ్వత్థామ; కృపుఁడున్= కృపాచార్యుడు; రాధాసుతుండున్= కర్ణుడూ; పాడి మానసులు+అండ్రు= న్యాయంగా నడుచుకునే పెద్ద మనుషులంటారు; ఈ+బాలున్+ఒకనిన్+పొదివిరి= ఆ యువకుడిని ఒక్కడిని ముట్టడించారు; పెక్కండ్రు ప్రోడలు= చాలామంది పెద్దవాళ్ళు (కలిసి); ఇస్సిరొ!= ఛీ ఛీ!; ఇదియున్= ఇదికూడా (ఒక); మగఁటిమియె?= పరాక్రమమేనా?; ఇట్లు= ఇట్లా; క్రించు పనికిన్= నీచ కార్యానికి; తెగిన+అప్పుడు= సాహసించినపుడు; వారలకున్= వాళ్ళకు; ఉల్లములు= హృదయాలు; ఎట్టులు+ఉండెన్+ఒక్కొ!= ఎట్లా ఉన్నాయో ఏమో! (ఈ కరకు పని చేయటానికి వాళ్ళ మనసులు ఎట్లా అంగీకరించాయి? అని అర్థం.)

తాత్పర్యం: 'ఉత్తమమైన చరిత్ర కలిగిన ఓ అభిమన్యుడా! మీ తల్లి సుభద్రను, దేవతాసమానులైన పాండవులను వదలి ఎక్కడికి వెళ్ళావు? అర్జునుడి కుమారుడివి. శ్రీకృష్ణుడి అల్లుడివి. నిన్ను ఎదిరించి చంపగలిగినవారు ఎవరున్నారు? ఇన్ని విధాలుగా మాట్లాడుతున్నానే - మారుమాటలాడ వెందుకు? ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు, కర్ణుడు న్యాయ మెరిగిన పెద్దమనుషులంటారే. అట్లాంటి పెద్దలు పలువురు చేరి ఒక చిన్నవాడిని ముట్టడించటమా? ఛీ ఛీ! ఇది కూడా మగతనమేనా? ఇట్లాంటి నీచకార్యానికి పాల్పడటానికి వాళ్ళకు మనస్సులు ఎట్లా వచ్చాయి?

క. పాండవులును బాంచాలురు । దండిమగలు వారు సూడఁ దలఁకక నిన్నున్
భండనమునఁ బడవైవఁగ । గండు గలుగు టద్భుతంబు గాదె తలంపన్! 78

ప్రతిపదార్థం: పాండవులును= పాండుకుమారులు; పాంచాలురు= పాంచాలవీరులు; దండిమగలు= నిండు పరాక్రమవంతులు; వారు+చూడన్= వాళ్ళు చూస్తుండగా; తలఁకక= భయపడక; నిన్నున్= నిన్ను; భండనమునన్= యుద్ధంలో; పడవైవఁగన్= చంపగా; గండు= మగఁటిమి కలవాడు; కలుగుట= ఉండటం; తలంపన్= ఆలోచిస్తే; అద్భుతంబు+కాదె!= ఆశ్చర్యం కాదూ!

తాత్పర్యం: పాండవులు, పాంచాలురు మహాపరాక్రమశాలులు. వాళ్ళు చూస్తుండగా నిన్ను ఏ సంకోచమూ లేకుండా యుద్ధంలో చంపగలిగిన మగటిమి ఉన్నవారు ఉండటం ఆశ్చర్యం కాదూ!

క. తనలేనిచోటఁ బలువురు । నినుఁ జుట్టును ముట్టి యొక్కనింజేరి వధిం
చిన వంచనకు ధనంజయు । మన మెమ్మెయి నురియునొక్కొ! మన్మథమూర్తీ! 79

ప్రతిపదార్థం: మన్మథ= మన్మథుని వంటి; మూర్తీ!= ఆకారం కలవాడా!; తన= తనయొక్క; లేనిచోటన్= లేని స్థలంలో; పలువురు= చాలమంది; నినున్= నిన్ను; చుట్టును= చుట్టుముట్టి; ఒక్కనిన్+చేరి= ఒక్కడిని సమీపించి; వధించిన= చంపిన; వంచనకున్= మోసానికి; ధనంజయు మనము= అర్జునుడి మనస్సు; ఏ+మెయిన్= ఏ విధంగా; ఉరియున్+ఒక్కొ!= దుఃఖిస్తుందో ఏమో!

తాత్పర్యం: మన్మథుడి వంటి మనోహరాకారం కలిగిన నాథా! తానులేని సమయంలో అంతమంది నిన్ను చుట్టుముట్టి ఒక్కడిని చేసి ఘోరంగా చంపిన మోసాన్ని తలచుకొని అర్జునుడి మనస్సు ఏ విధంగా దుఃఖిస్తుందో కదా!

తరలము:

అరుల నెల్లను గెల్చి మేదిని యంతయుంగొని తేజమున్
సిరియుఁ బెంపును గీర్తియున్ విలసిల్లఁగా వినుచుండియుం
బురుషసింహులు పాండుభూవరపుత్త్రు లక్కట! మోదముం
బొరయ నేర్తురె? నిన్నుఁ గోల్పడిపోయి పుష్కరలోచనా! 80

ప్రతిపదార్థం: పుష్కరలోచనా!= పద్మలోచనా! (తామరలవంటి కన్నులు కలవాడా); అరులన్+ఎల్లను= శత్రువులందరినీ; గెల్చి= గెలిచి; మేదిని+అంతయున్+కొని= రాజ్యాన్నంతా సంపాదించుకొని; తేజమున్= కాంతిని; సిరియున్= సంపదను; పెంపును= వైభవాన్ని; కీర్తియున్= మంచిపేరును; విలసిల్లన్‌గాన్= వ్యాపించగా; వినుచుండియున్= ప్రశంసలను వింటూ ఉండి కూడా; పురుష సింహులు= పురుష శ్రేష్ఠులు; పాండుభూవర పుత్రులు= పాండు కుమారులు; నిన్నున్+కోల్పడి+పోయి= నిన్ను పోగొట్టుకొని; అక్కట!= అయ్యో!; మోదమున్= సంతోషాన్ని; పొరయన్+నేర్తురె?= పొందగలరా?

తాత్పర్యం: తామరలవంటి కన్నులు గలవాడా! శత్రువులందరినీ చంపి రాజ్యాన్నంతా సంపాదించుకొని కాంతి, సంపద, వైభవం, కీర్తి - నలుదిశల వ్యాపించగా లోకం మెచ్చుకొంటూ ఉండగా, వింటూ ఉన్నా పాండురాజ కుమారులు నిన్ను పోగొట్టుకొని సంతోషం పొందగలరా! అయ్యో! ఇప్పుడు రాజ్యం వచ్చి లాభ మేమిటి?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: వృత్తలక్షణం - చూడండి. స్త్రీ 2-27.

క. నీ మూర్తియందుఁ బ్రాణము । లేమిఁ దెలిసియుండఁ జంచలింపక జీవం
బేమి కతంబునఁ గలిగియొ । నామేను దొఱంగిపోదు నాథ! యెఱుంగన్. 81

ప్రతిపదార్థం: నాథ!= ప్రియా!; నీ మూర్తియందున్= నీ దేహంలో; ప్రాణము లేమిన్= ప్రాణంలేకపోవటం; తెలిసి+ఉండన్= తెలిసి ఉండికూడా; చంచలింపక= ఏచలనమూలేక; జీవంబు= ప్రాణం; ఏమి కతంబునన్= ఏ కారణం; కలిగియొ= ఉన్నదో; నా మేనున్= నా దేహం నుండి; తొఱంగిపోదు= వెళ్ళిపోదు; ఎఱుంగన్= తెలియదు.

తాత్పర్యం: ప్రియా! నీ దేహంలో ప్రాణం లేదని తెలిసినా కూడా ఏ చలనమూ లేకుండా నా ప్రాణం ఏ కారణంతో నా దేహం నుండి వెళ్ళిపోవటం లేదో నాకు తెలియటం లేదు.

సీ. దేవలోకంబున నీ విప్పుడెవ్వతఁ । దీపారు పలుకులఁ దేర్చి కురులు
వుడుకుచుఁ దగ నన్న పోలె లోలాత్మగాఁ । జేయుచున్నాఁడవు? చెలువు నేర్పు
మెఱయంగ నచ్చర తెఱవల మనములు । గలఁచి యాడుదు గాక యలఁతిఁ బోదె?
యంగనాగోష్ఠి నున్నపుడు నా నడవడి । బుద్ధిఁ దలంతె? ని న్బొందఁ గాంచి

ఆ. యాఱు నెలలు వోయె నంతియ యింతియై । కానిలేదె? తొంటి మేనఁ జేసి
నట్టి మేలు మోహనాకార యభిమన్యు । వీర నిర్వికార! వినుతసార! 82

ప్రతిపదార్థం: అభిమన్యు వీర!= వీరుడైన ఓ అభిమన్యు కుమారా!; నిర్వికార!= ఏ వికారములేనివాడా!; వినుతసార!= ప్రస్తుతింపబడ్డ పరాక్రమం కలవాడా!; దేవలోకంబునన్= స్వర్గంలో; నీవు+ఇపుడు= నీవు ఈ సమయంలో; ఎవ్వతన్= ఏ అప్సరసను; తీపారు పలుకులన్= మధురమైన పలుకులతో; తేర్చి= లాలించి; కురులు+పుడుకుచున్= వెంట్రుకలలో వేళ్ళుపోనిచ్చి; తగన్= తగినట్టుగా; నన్నున్+అ+పోలెన్= నన్నులాగే; లోలాత్మగాన్= సంతసించిన హృదయం కలిగినదానిలాగా; చేయుచున్నాఁడవు?= చేస్తున్నావు?; చెలువు= అందమూ; నేర్పు= జాణతనం; మెఱయంగన్= వెలయగా; అచ్చర తెఱవల మనములు= అప్సరసల మనస్సులు; కలఁచి+ఆడుదు+కాక= క్షోభపెడతావు తప్ప; అలఁతిన్+పోదె?= సులభంగా వారిని వదలిపెడతావా?; అంగనాగోష్ఠిన్+ఉన్నపుడు= స్త్రీలతో కలిసి ఉన్నపుడు; నానడవడి= నేను వర్తించే రీతిని; బుద్ధిన్+తలంతె= మనసులో అనుకొంటావా! నిన్+పొందన్+కాంచి= నీతో సుఖపడి; ఆఱునెలలు+పోయెన్= ఆరు నెలలు గడిచిపోయింది; తొంటిమేనన్= పూర్వజన్మలో; చేసినట్టిమేలు= చేసిన ఉపకారం; అంతియ= అంతో; ఇంతియ= ఇంతో; కానిలేదె?= కాని లేకపోయిందా?; మోహనాకార!= సమ్మోహకమైన శరీరం కలిగిన నాథా! (నన్ను వదిలి ఎట్లా వెళ్ళావు?).

తాత్పర్యం: మహావీరా! అభిమన్యూ! ఏ వికారాలూ లేకుండా నిద్రిస్తున్నావా! ప్రపంచమంతా నీ పరాక్రమం మారు మోగిపోతోంది. నీవు స్వర్గానికి చేరి ఇప్పుడు ఏ అప్సరసను మధురమైన పలుకులతో లాలించి జుట్టులోకి వేళ్ళు జొనిపి నన్ను ఎట్లా సమ్మోహనపరిచావో అట్లాగే ఆమెనూ సుఖింపచేస్తూ ఉండి ఉంటావు. అందమూ నేర్పరితనమూ కల్గిన నీవు అప్సరసల మనస్సులను క్షోభపెట్టుతావు తప్ప అంత సులభంగా వారిని వదిలిపెట్టుతావా? ఆ దివ్యాంగనలతో కలిసి మాట్లాడుతున్నపుడు నేనూ, నా నడవడీ గుర్తుకురావా? నన్ను తలచుకోవా? నీతో సుఖించి ఆరు నెలలు గడిచిపోయింది. ఆ జన్మలో చేసిన మేలు అంతో ఇంతో కూడా నీకు మనసులో మిగలలేదా? ఓ సమ్మోహనకారా! నన్ను వదలి ఎట్లా వెళ్ళావు?'

వ. అను చున్నది యిట్లు పలవింప విరాటనందనం దదీయ జననీప్రముఖ బాంధవస్త్రీ జనంబు లచ్చటువాయం దిగిచి పొగులుచుం గొనిపోయిరి వారలం గనుంగొనుము. 83

ప్రతిపదార్థం: అనుచున్నది= అని అంటున్నది; ఇట్లు= ఈ విధంగా; పలవింపన్= శోకించగా; విరాటనందనన్= ఉత్తరను; తదీయ= ఆమె యొక్క; జననీ ప్రముఖ= తల్లి మొదలైన; బాంధవ స్త్రీజనంబు= బంధు స్త్రీలు; ఆ+చోటు+పాయన్= ఆ చోటునుండి; తిగిచి= పట్టుకొని లేపి; పొగులుచున్= దుఃఖిస్తూ; కొనిపోయిరి= తీసుకువెళ్ళారు; వారలన్= వారిని; కనుంగొనుము= చూడుము.

తాత్పర్యం: అని అంటున్నది. ఈ విధంగా ఆమె శోకిస్తుండగా ఉత్తరను ఆమె తల్లి మొదలైన బంధువులైన స్త్రీలు ఆ చోటినుండి లేపి దుఃఖిస్తూ పట్టుకొని తీసికొనివెళ్ళారు. వారిని చూడుము.

కవిరాజ విరాజితము.

గురుని శరంబులు దాఁకిన మేదినిఁగూలి విరాటుఁడు పేరిన నె
త్తురుల మునింగిన మేనును దానును ధూళి సమీరుఁడు మోము పయిం
బొరిఁబొరిఁ జల్లఁగ నున్కి గనుంగొని పొద్మఁగ నశ్రులు హా యనుచుం
బురపురఁ బొక్కెద రెమ్మెయిఁ జోపినఁ బోవక మూఁగెడుఁ బక్షితతుల్. 84

ప్రతిపదార్థం: గురుని శరంబులు= ద్రోణుడి బాణాలు; తాఁకినన్= నాటుకోగా; మేదినిన్+కూలి= నేలకూలి; విరాటుఁడు= విరాటరాజు; పేరిన= గడ్డకట్టిన; నెత్తురులన్+మునింగినన్= రక్తంలో మునిగిపోగా; సమీరుఁడు= వాయుదేవుడు; ధూళిన్= దుమ్మును; మోముపయిన్= ముఖంమీద; పొరిన్+పొరిన్= మాటిమాటికీ; చల్లఁగన్= చల్లగా; మేనును+తానును= దుమ్ము నిండిన శరీరంతో ఆరాజు; ఉన్కిన్= ఉండటాన్ని; కనుంగొని= చూసి; అశ్రులు= కళ్ళనీరు; పొద్మఁగన్= పెల్లుబికిరాగా; హా+అనుచున్= హా హా కారాలు చేస్తూ; పురపురన్+పొక్కెదరు= కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నారు (ఆ స్త్రీలు); ఎమ్మెయిన్= ఎంత; చోపినన్= తరిమినా; పక్షితతుల్= పక్షి సమూహాలు; పోవక= వెళ్ళిపోకుండా; మూఁగెడున్= ఆ శవంచుట్టూ మూగుతున్నాయి.

తాత్పర్యం: ద్రోణాచార్యుల బాణాలు తగిలి నేలకూలి విరాటరాజు గడ్డకట్టిన నెత్తురులో మునిగిపోగా, వాయుదేవుడు దుమ్మును దోసిళ్ళతో చల్లినట్లు మాటిమాటికీ చల్లుతుండగా, ఆ దుమ్ములో, ధూళితో నిండిన శరీరంలో ఆ రాజు పడి ఉండటం చూచి ఆ స్త్రీలకు కళ్ళల్లో నీరు పెల్లుబికి రాగా హాహాకారాలు చేస్తూ కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నారు. వారు ఎంత తరిమినా పోకుండా కాకులు, గద్దలు, రాబందులు ఆ శవం చుట్టూ మూగుతున్నాయి.

విశేషం: కవిరాజవిరాజితవృత్తంలో ప్రతిపాదంలోనూ వరుసగా న, జ, జ, జ, జ, జ, ల, గ - అనే గణాలు ఉంటాయి. 1-8-14 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

క. అకటకట! యుత్తరుఁడు గొం । డొక కాంభోజుండునుం గడున్ బాలుఁడు వా
లిక కైదువు లాడిన నే । ల కొఁగి యొప్పి రభిమన్యు లక్ష్మణుల క్రియన్. 85

ప్రతిపదార్థం: అకటకట!= అయ్యయ్యో!; ఉత్తరుఁడు= విరాటమహారాజు కుమారుడు ఉత్తరుడు; కడున్+బాలుఁడు= మరీ చిన్నవాడు; కొండొక= ఒకానొక; కాంభోజుండును= కాంభోజయువరాజు; వాలిక= వాడి అయిన; కైదువులు= ఆయుధాలు;

ఆడఁగన్= నాటుకోగా; అభిమన్యు= అభిమన్యుడు; లక్ష్మణుల క్రియన్= లక్ష్మణకుమారుడు - వీరిలాగా; నేలకొఱఁగి= నేల మీదపడి; ఒప్పిరి= ప్రకాశిస్తున్నారు.

తాత్పర్యం: అయ్యయ్యో! ఇక్కడ చూడుము. ఉత్తరకుమారుడు, మరొక చిన్నవాడు కాంభోజయువరాజు. శత్రువులు ప్రయోగించిన వాడి ఆయుధాలకు చిక్కి అభిమన్యు లక్ష్మణ కుమారులవలె నేలకొరగి ఉజ్జ్వలంగా ప్రకాశిస్తున్నారు.

సీ. పాండుపుత్రుల భుజాబలమున కులుకక । యెవ్వీరు ప్రాపున నెదురు నడచె
దుర్యోధనుఁడు గొంతి తొలిచూలి కెవ్వఁడు । హృదయ శల్యంబయి నిదుర సెఱుచు
నట్టి కర్ణుండు మదాంధసింధురము బ । లోద్ధత ద్విరద మహోగ్రవిక్ర
మమున గీటడఁగిన మాడ్కి నర్జును బలు । గడిమిచేఁ దెగటార్పఁబడియె వీని

ఆ. బాహు విలసనమునఁ బడిన మహాయోధ । వరు లనేకు లితఁ డవార్యరోష
భూషితుండు పరుషభాషణశీలుండు । ధైర్యధనుఁడు దానశౌర్యశాలి. 86

ప్రతిపదార్థం: పాండుపుత్రుల= పాండవుల; భుజాబలమునకున్= భుజశక్తికి; ఉలుకక= భయపడక; ఏ+వీరు= ఏ వీరునియొక్క; ప్రాపునన్= అండతో; దుర్యోధనుఁడు: ఎదురు నడచెన్= పాండవులకు వ్యతిరేకంగా ప్రవర్తించాడో; గొంతి= కుంతీదేవి; తొలిచూలికిన్+ఎవ్వఁడు= తొలిబిడ్డ అయిన ధర్మరాజుకు ఎవడు; హృదయశల్యంబు+అయి= గుండెలో పుండులాగా; నిదుర+చెఱుచున్= నిద్రలేకుండా చేశాడో; అట్టి= అటువంటి; కర్ణుండు= కర్ణుడు; మద+అంధ= మదంతో గ్రుడ్డిదయిన; సింధురము= ఏనుగు; బల+ఉద్ధత= బలంతో మిక్కిలి అతిశయించిన; ద్విరద= ఏనుగుయొక్క; మహోగ్రవిక్రమమునన్= మిక్కిలి భయంకరమైన పరాక్రమంచేత; గీటడఁగినమాడ్కిన్= చచ్చిన తీరుగా; అర్జును= అర్జునుడియొక్క; బలు+కడిమిచేన్= మిక్కిలి పరాక్రమంచేత; తెగటార్పఁబడియెన్= చంపబడ్డాడు; వీని= ఈ కర్ణుడి; బాహు విలసనమునన్= బాహువుల విలాసంచేత; పడిన= చచ్చిన; మహాయోధవరులు= మహాయోధశ్రేష్ఠులు; అనేకులు= చాలామంది (ఉన్నారు); ఇతఁడు= ఈ కర్ణుడు; అవార్య= వారించటానికి వీలుకాని; రోష= రోషంతో; భూషితుండు= అలంకరించబడినవాడు; పరుష భాషణశీలుండు= కఠినంగా మాట్లాడేస్వభావం కల్గినవాడు; ధైర్యధనుఁడు= ధైర్యమే సంపదగా కలవాడు; దాన= దానంచేతను; శౌర్య= పరాక్రమంలోనూ; శాలి= ఒప్పేవాడు.

తాత్పర్యం: ఏ వీరుడి అండతో దుర్యోధనుడు పంచపాండవుల బాహు పరాక్రమానికి భయపడక వారికి వ్యతిరేకంగా ప్రవర్తించాడో, కుంతీదేవి పెద్దకొడుకయిన ధర్మరాజుకు ఎవడు గుండెలో గాలమై నిద్రలేకుండా చేశాడో - ఆ కర్ణుడు మదంతో గుడ్డిదయిన ఏనుగు, బలంతో మిక్కిలి అతిశయించిన ఏనుగుయొక్క మిక్కిలి భయంకరమైన పరాక్రమం చేత చచ్చిన రీతిగా అర్జునుడి మహా పరాక్రమంచేత చంపబడ్డాడు. ఈ కర్ణుడి బాహువిలాసంచేత ఎంతో మంది మహాయోధులు మృతిపొందారు. ఈ కర్ణుడికి రోషమే మహాభూషణం. ఇతడు అతి పరుషంగా మాట్లాడే స్వభావం కలిగినవాడు. ధైర్యమే ఇతడి సంపద. దానవీరంలో ఇతడు సుప్రసిద్ధుడు.

వ. విను మవ్వీరోత్తముండు. 87

తాత్పర్యం: ఆ వీర శ్రేష్ఠుడు ఎట్లాంటివాడో చెప్పుతాను వినుము.

క. పిఱుఁదం గురుధరణీపతి । నఱచేతం బ్రాణములు ఘనారాతి బలం
బుఱని తెగువ ముందటఁ బె । న్గొఱలుట చిత్తమునఁ బెట్టికొని విహరించెన్. 88

ప్రతిపదార్థం: పిఱుఁదన్= వెనుక; కురుధరణీపతిన్= కురురాజు దుర్యోధనుడిని; అఱచేతన్= అరచేతిలో; ప్రాణములు= ప్రాణాలను; ముందటన్= ముందు; ఘన+అరాతిబలంబు= గొప్పదైన శత్రుసైన్యం; ఉఱని= లక్ష్యపెట్టని; తెగువన్= సాహసంతో; పెన్= మిక్కిలిగా; కొఱలుట= కోపించటం; చిత్తమునన్= మనసులో; పెట్టికొని= ఉంచుకొని; విహరించెన్= యుద్ధం చేశాడు.

తాత్పర్యం: ఆ కర్ణుడు బాధ్యతతో యుద్ధం చేశాడు. ఇతడి వెనుక ఇతడిని నమ్మి యుద్ధంలోకి దిగిన దుర్యోధనుడున్నాడు. పరశురామాదుల శాపాలవలన తన ప్రాణాలకు ముప్పున్నదని తెలుసును. ముందర శత్రుసైన్యం విజృంభణంతో అతిరోషంతో దూసికొనివస్తున్నది. ఇన్నిటినీ మనసులో ఉంచుకొని యుద్ధంలో వీరవిహారం చేశాడు.

తే. ఇతని చుట్టును గలకల మెసఁగ రోద । నంబు సేయు పత్నీనివహంబులోనఁ
గంటె వృషసేనుతల్లి యగ్గలపుటడలు? మూర్తియైన తెఱంగున నార్తిఁ దూలె. 89

ప్రతిపదార్థం: ఇతని చుట్టును= ఈ కర్ణుడి శవం చుట్టూ; కలకలము+ఎసఁగన్= పెద్దధ్వని పుట్టగా; రోదనంబు+చేయు= ఏడుస్తున్న; పత్నీ నివహంబులోనన్= భార్యల సమూహంలో; వృషసేనుతల్లి= వృషసేనుడితల్లి - కర్ణుడిభార్య; అగ్గలము+అడలు= మిక్కిలి దుఃఖం; మూర్తి+ఐన= ఆకారం దాల్చిన; తెఱంగునన్= రీతిగా; ఆర్తిన్= దుఃఖంతో; తూలెన్= వాలిపోయింది; కంటె= చూస్తున్నావా!

తాత్పర్యం: ఈ కర్ణుడి శవం చుట్టూ చేరి పెద్ద ధ్వనిపుట్టగా పెద్దగా ఏడుస్తున్న అతడి భార్యల గుంపును చూశావా? అందులో దుఃఖమే ఆకారం పొందినట్టుగా అతి దుఃఖంతో నేలమీద వాలిపోతున్న ఆమె వృషసేనుడి అమ్మ. కర్ణుడి ధర్మపత్ని. ఆమెను చూస్తున్నావా?

వ. ఈ రమణీరత్నంబు ధరణీతలంబునం బొరలుచు. 90

ప్రతిపదార్థం: ఈ రమణీరత్నము= ఈ శ్రేష్ఠమైన స్త్రీ; ధరణీతలంబునన్= నేలమీద; పొరలుచున్= పొర్లుతూ.

తాత్పర్యం: ఈ వృషసేనుడి అమ్మ దుఃఖాతిరేకంతో నేలమీద పడి పొర్లుతూ (ఇట్లా అంటున్నది).

తే. పరశురాముని శాపంబు బాణశక్తిఁ । గ్రాఁప బ్రాహ్మణశాపంబు రథము సిక్కు
వఱుప గాండీవధరుచేతి మెఱుఁగుటమ్ము । మన్నిగొనియెనె యో కర్ణ! మగలరాజ! 91

ప్రతిపదార్థం: ఓ కర్ణ!= ఓ మహావీరుడైన కర్ణా!; మగలరాజ!= వీరులలో శ్రేష్ఠుడా!; పరశురాముని శాపంబు= పరశురాముడిచ్చిన శాపం; బాణశక్తిన్= నీ బాణాలశక్తిని; క్రాఁపన్= నాశనం చేయగా; బ్రాహ్మణశాపంబు= బ్రాహ్మణుడిచ్చిన శాపం; రథమున్= రథాన్ని; చిక్కుపఱుపన్= భూమిలో ఇరుక్కుపోయేలా చేయగా; గాండీవధరు చేతి= అర్జునుడి చేతిలోని; మెఱుఁగు+అమ్ము= వాడిబాణం; (నిన్ను); మన్నిగొనియెనె?= చంపివేసిందా? (నాథా!)

తాత్పర్యం: 'ఓ మహావీరుడా! కర్ణా! పరశురాము డిచ్చిన శాపం నీ బాణాలశక్తిని నశింపజేసింది. బ్రాహ్మణు డిచ్చిన శాపం రథచక్రం భూమిలో క్రుంగిపోయేటట్లు చేసింది. చివరకు అర్జునుడి చేతిలోని వాడిబాణం నీ ప్రాణాలు తీసింది. నాథా! ఎంత దారుణ మిది!

వ. అని మఱియుం బలుదెఱంగులం బలవించి యుత్థితయై యాలోకించి. 92

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; మఱియున్= ఇంకా; పలు+తెఱంగులన్= అనేకవిధాలుగా; పలవించి= విలపించి; ఉత్థిత+ఐ= లేచి; ఆలోకించి= తన భర్త దేహాన్ని చూసి.

తాత్పర్యం: ఈ విధంగా ఇంకా అనేక రీతులలో ఆమె విలపించి విలపించి, చివరికి లేచి తన భర్త దేహాన్ని చూచి (తరువాత పద్యంతో అన్వయం.)

తే. **కాకులును గ్రద్దలును దిన్నఁ గడును ద్రెస్సి । యపరపక్షచతుర్దశి యమృతకరుని**
కరణి నొప్పెడు కర్ణుమొగంబుమీఁద । వనిత యందంద మోపెడుఁ దన మొగంబు. **93**

ప్రతిపదార్థం: కాకులును; గ్రద్దలును; తిన్నన్= తినగా; కడును= మిక్కిలి; త్రెస్సి= తెగి చివికిపోయి; అపరపక్ష= కృష్ణపక్ష; చతుర్దశి= చతుర్దశినాటి; అమృతకరుని కరణిన్= చంద్రుడిలాగా; ఒప్పెడు= కనిపిస్తున్న; కర్ణు మొగంబుమీఁదన్= కర్ణుడి ముఖంపైన; వనిత= వృషసేనుడి తల్లి; అందంద= మాటిమాటికి; తన మొగంబున్= తన ముఖాన్ని; మోపెడున్= మోపుతోంది.

తాత్పర్యం: కాకులు, గద్దలు తినవేయగా మిక్కిలిగా తెగి చివికిపోయిన కృష్ణపక్షంలోని చతుర్దశినాటి చంద్రుడివలె కాంతివిహీనంగా కనిపిస్తున్న కర్ణుడి ముఖంపైన తన ముఖం మాటిమాటికి మోపుతూ వృషసేనుడి తల్లి దుఃఖిస్తున్నది.

విశేషం: అలం: ఉపమ.

ఉత్సాహవృత్తము:

వాఁడిమగఁడు నిద్రపోవు వాలుమృగముఁ బోలె నై
వీఁడె బాహ్లికుండు వృష్ణివీర! చూడు చచ్చియుం
బోఁడి దొఱఁగ కున్నయట్టి పొల్పునన్ వెలింగె వె
న్నీఁ డితండు బలము లెన్నియేనిఁ బెల్లు ద్రోచినన్. **94**

ప్రతిపదార్థం: వృష్ణివీర!= వృష్ణికులంలో పుట్టిన, వీరుడైన కృష్ణా!; చూడు= ఇక్కడచూడుము; వీఁడె= ఇతడే; బాహ్లికుండు= బాహ్లికుడు; వాలు మృగమున్+పోలెన్+ఐ= పులిలాగా; వాఁడి మగఁడు= ఈ మహావీరుడు; నిద్రపోవున్= నిద్రపోతున్నాడు; చచ్చియున్= చచ్చికూడా; పోఁడి= అందం; తొఱఁగకున్న+అట్టి+పొల్పునన్= తగ్గిపోని విధంగా; వెలింగెన్= ప్రకాశిస్తున్నాడు; బలములు+ఎన్నియేనిన్= శత్రుబలాలు ఎన్నైనా సరే; పెల్లు+త్రోచినన్= ఎంత ఘోరంగా పోరాడినా; ఇతండు= ఈ బాహ్లికుడు; వెన్ను+ఈఁడు= వెన్నుచూపడు.

తాత్పర్యం: ఓ కృష్ణా! ఇదిగో ఈ బాహ్లికుడు మహావీరుడు నిద్రపోయేపులిలాగా ఉన్నాడు చూడు. చచ్చినా అందం ఏమాత్రం తగ్గని విధంగా వెలుగుతున్నాడు. ఎంతసైన్యం ఎంత బలంగా ఎదిరించినా వెనుకకు తిరిగిపోడు.

విశేషం: అలం: ఉపమ. వృత్తలక్షణానికి చూడండి. స్త్రీ. 1. 48.

తే. **మేనఁ బ్రాణము వాసినమీఁద మొగము । బొఱసి యుండునె? యెందు నిత్తెఱఁగు కాంతి**
తోడఁ? బున్నమనాఁటి చందురుని చంద । మమరెఁ జూడు మిక్కురువృద్ధు నాననంబు. **95**

ప్రతిపదార్థం: మేనన్= దేహంలోనుండి; ప్రాణము; పాసిన= వదలిన; మీఁదన్= తరువాత; ఎందున్= ఎక్కడైనా; మొగము= ముఖం; ఈ+తెఱఁగు కాంతితోడన్= ఈ విధమైన ప్రకాశంతో; పొఱసి+ఉండునె?= కూడి ఉంటుందా?; ఈ+కురువృద్ధ+ ఆననంబు= కురువంశీయులలోని పెద్దలలో ఒకడైన ఇతడి ముఖం; పున్నమనాఁటి= పూర్ణిమనాటి; చందురుని చందము= నిండు చందురుని రీతిగా; అమరెన్= ఒప్పింది; చూడు= చూడుము.

తాత్పర్యం: కృష్ణా! ఆ బాహ్లికుడిని చూడుము. దేహంలో నుండి ప్రాణం వదలిపోయిన తరువాత ఎక్కడైనా ముఖం ఇంత కాంతిమంతంగా ఉండటం చూచామా! కురువృద్ధులలో ఒకడైన ఈ బాహ్లికుడి ముఖం నిండుపున్నమినాటి చంద్రుడి రీతిగా కాంతులు విరజిమ్ముతున్నది.

విశేషం: అలం: ఉపమ.

గాంధారి సైంధవుని కళేబరము చూచి వాపోవుట (సం. 11-22-7)

సీ. **పల్కుతప్పమి నెఱపంగఁ దలంచి యు । త్సాహంబు వాటించి సవ్యసాచి**
దుర్యోధనుండును దొరలు ననేక సై । న్యంబులు నంతంత నడ్డపడఁగ
దెరలిచి వడి మెడద్రెవ్వ నేసినఁ బడి । యున్నాఁడు సైంధవుఁ డుఱక ద్రుపద
తనయఁ గాననమునఁ గొనిచన్ననాఁడ తాఁ । దెగినాఁడు గాఁడె! కౌంతేయు లపుడు

తే. **దయ దలిర్పంగ దుస్సలఁ దలఁచి యలుక । గ్రాఁచి మందలవిడిచిరి గాక దైవ**
కృతము తప్పింప రాకున్కి కతన నిపుడు । వారు విడిచి రిమ్ముద్దియవలని కరుణ. 96

ప్రతిపదార్థం: సవ్యసాచి= అర్జునుడు; పల్కుతప్పమి= మాట తప్పకపోవటాన్ని; నెఱపంగన్+తలంచి= చెల్లించుకోవాలని నిశ్చయించి; ఉత్సాహంబు= ఉత్సాహాన్ని; పాటించి= పూని; దుర్యోధనుండును; దొరలు= అనేక సామంతరాజులు (అనేక శ్రేష్ఠవీరులని కూడా అర్థం); అనేక సైన్యంబులున్= ఎంతో సైన్యం; అంతంతన్= మాటిమాటికి; అడ్డపడఁగన్= అడ్డుపడగా; తెరలిచి= పక్కకునెట్టి; వడిన్= వేగంగా; మెడన్+త్రెవ్వన్+ఏసినన్= మెడ తెగేలాగా బాణం వేయగా; సైంధవుఁడు= సైంధవుడు; ఉఱక= మెదలకుండా; పడి+ఉన్నాఁడు= పడి ఉన్నాడు; ద్రుపదతనయన్= ద్రౌపదిని; కాననమునన్= అడవిలో; కొని చన్ననాఁడు+అ= అపహరించి తీసుకొని వెళ్ళిననాడే; తాన్= తాను; తెగినాఁడుగాఁడె!= చచ్చాడు కాదూ!; కౌంతేయులు= పాండవులు; అపుడు= ఆ సమయంలో; దయ+తలిర్పంగన్= దయపుట్టగా; దుస్సలన్+తలఁచి= దుస్సలను తలచుకొని; అలుక+గ్రాఁచి= కోపం వదలి; మందల విడిచిరిగాక= ప్రాణంతో వదలిపెట్టారు తప్ప!; దైవకృతము= దైవనిర్ణయం; తప్పింపరాక+ఉన్కి+కతనన్= తప్పించటానికి వీలుకానిది కావటం వలన; వారు= ఆ పాండవులు; ఈ+ముద్దియ వలని కరుణన్= ఈ స్త్రీపట్లగల కరుణచేత; విడిచిరి= వదలిపెట్టారు.

తాత్పర్యం: అర్జునుడు తనమాట చెల్లించుకొనాలని నిశ్చయించుకొని ఉత్సాహం పూని దుర్యోధనాది మహావీరులు, గొప్ప సైన్యం మాటిమాటికి తనకు అడ్డుపడుతున్నా ప్రక్కకు నెట్టి వాడిబాణాలు వేయగా మెడతెగి సైంధవుడు కదలక మెదలక పడి ఉన్నాడు. అసలు ఆనాడు ద్రౌపదిని అడవిలో దొంగిలించి తీసికొనివెళ్ళిననాడే తాను చచ్చాడు కదా! ఆ సమయంలో తమ చెల్లెలని దుస్సల ముఖం చూచి వాడిని ప్రాణాలతో పోనిచ్చారు. దైవనిర్ణయం ఎవరూ తప్పించలేరు. అందుకే ఆ పాండవులు కూడా ఈనాడు చెల్లెలిపట్ల దయను విడిచి సైంధవుడిని చంపారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. హృదయమున వగలేనియ ట్టిట్టునట్టుఁ । దిరుగుచున్నది దుస్సల వరుని శిరముఁ
గాన కీ కూఁతు నిమ్మెయిఁ గనుట కంటెఁ । దలఁప నెక్కుడు దుఃఖంబు గలదె కృష్ణ! 97

ప్రతిపదార్థం: కృష్ణ= కృష్ణా!; హృదయమునన్= హృదయంలో; వగలేని+అట్టు= ఏ దుఃఖమూ లేని రీతిగా; ఇట్టున్+అట్టున్= ఇలా అలా; దుస్సల= సైంధవుడి భార్య; వరుని శిరమున్+కానక= తన భర్త శిరస్సు కనిపించక; తిరుగుచున్నది= తిరుగుతోంది; ఈ కూఁతున్= ఈ దుస్సలను; ఈ+మెయిన్= ఈ విధంగా; కనుటకంటెన్= చూడటం కన్నా; తలఁపన్= ఆలోచిస్తే; ఎక్కుడు= అధికమైన; దుఃఖంబు+కలదె?= దుఃఖం ఉంటుందా?

తాత్పర్యం: కృష్ణా! హృదయంలో ఏ దుఃఖమూ లేని దానివలె నా కూతురు దుస్సల సందడిగా అటూ ఇటూ తిరుగుతున్నది. ఎందుకో తెలుసా! తన భర్త శిరస్సు దొరకక. ఇట్లా ఈ కొమార్తెను చూడటం కన్నా అధికమైన దుఃఖం ఏముంటుంది?

వ. నాఁటి రాత్రి యరులు చేసికొనిన ప్రతిజ్ఞ వేగులవారిచేత దుస్సల విని సైంధవునికి బుద్ధి చెప్పిన తెఱంగు లవి వినుము. 98

ప్రతిపదార్థం: నాఁటిరాత్రి= ఆనాటి రాత్రి; అరులు= శత్రువులు; చేసికొనిన= చేసికొన్నటువంటి; ప్రతిజ్ఞన్= ప్రతిజ్ఞను; వేగులవారిచేతన్= గూఢచారులవలన; దుస్సల; విని; సైంధవుడికి; బుద్ధి చెప్పిన= బుద్ధి చెప్పిన; తెఱంగులు+అవి= ఆ రీతులను; వినుము.

తాత్పర్యం: ఆనాటి రాత్రి సైంధవుడిని చంపటానికి శత్రువులు చేసికొన్న ప్రతిజ్ఞలు వేగులవారిచేత విని దుస్సల సైంధవుడికి ఎన్నో రీతులుగా నీతిబోధ చేసింది. ఎట్లాగో వినుము.

సీ. విజయు ప్రతిజ్ఞకుఁ ద్రిజగంబులోపల । నడ్డంబులేదు సు మ్మధికుఁ డంటిఁ
గురురాజు సైన్యంబు బిరుదు నమ్మకు మంటి । గురుఁడు పార్థునకు మార్కొనఁడ యంటి
నరు డాయ నొకనికైనను బుద్ధిగొనదంటి । సమరంబు నీకు నసాధ్యమంటి
ధర్మపుత్రుఁడు నిన్ను దయఁగాచుఁ బొమ్మంటి । నామాట వినఁగదె నాథ యంటి

ఆ. రాజతిలక రాజ రాజకంఠీరవ । రాజరత్న దివసరాజతేజ
రాజరాజ!' యనుచు రాజన్యసైంధవ । రాజుఁ బనవుచుండె నాజిలోన. 99

ప్రతిపదార్థం: రాజతిలక!= రాజశ్రేష్ఠుడా!; విజయు= పార్థుని; ప్రతిజ్ఞకున్= ప్రతిజ్ఞకు; త్రిజగంబులోపలన్= ముల్లోకాలలో; అడ్డంబులేదు= అడ్డంలేదు; సుమ్ము= సుమా!; అధికుఁడు= ఆ అర్జునుడు అందరినీ మించినవాడు; అంటిన్= అన్నాను; నమ్మకుము= నమ్మవద్దు; అంటిన్= అన్నాను; గురుఁడు= ద్రోణుడు; పార్థునకున్= అర్జునుడికి; మార్కొనఁడు= ఎదుర్కోడు; అంటిన్= అన్నాను; రాజరత్న!= రాజులలో శ్రేష్ఠుడా!; నరున్= అర్జునుడిని; డాయన్= సమీపించటానికి; ఒకనికైనను= ఏ ఒక్కడికీ; బుద్ధి+కొనదు+అంటిన్= సాహసం రాదు అన్నాను; సమరంబు= యుద్ధం; నీకున్= నీకు; అసాధ్యము+అంటిన్= అసాధ్యం అన్నాను; దివసరాజతేజ!= సూర్యతేజా!; ధర్మపుత్రుడు= ధర్మరాజు; నిన్నున్= నిన్ను; దయన్+కాచున్+పొమ్ము+అంటిన్= దయతో రక్షిస్తాడు పో అన్నాను; నాథ= ఓ నాథా!; రాజరాజ!= రాజ శ్రేష్ఠుడా!; నామాట= నా మాటలు; వినన్+కదె+అంటిన్= దయచేసి వినుము అన్నాను (ఇట్లా ఆమె అన్న మాటలు గాంధారి తెల్పి); అనుచున్= అని ఈ విధంగా; రాజన్యున్= రాజశ్రేష్ఠుడైన; సైంధవరాజున్= సైంధవుడిని గూర్చి; ఆజిలోనన్= యుద్ధభూమిలో; పనవుచుండెన్= ప్రలాపిస్తూ ఉన్నది.

తాత్పర్యం: 'రాజా! నీవు రాజశ్రేష్ఠుడివి. నా మాటలు వినుము. అర్జునుడి ప్రతిజ్ఞకు మూడులోకాలలోను తిరుగులేదు సుమా! అతడు అందరికన్నా మిన్న. నీవు రాజసింహానివి. దుర్యోధనుడి సైన్యం అంత గొప్పది, ఇంత గొప్పది అని నమ్మి యుద్ధరంగంలోకి దూకవద్దు. ద్రోణుడు ఎప్పటికీ అర్జునుడిని ఎదుర్కొనటానికి ఇష్టపడడు. నీకున్న కాంతి రాజులలో ఎవరి కున్నది? అర్జునుడిని సమీపించటానికి ఎవడూ సాహసించడు. నీవు సూర్యతేజుడివి. ధర్మరాజు నిన్ను తప్పక దయతో కాపాడుతాడు 'ఫో' అన్నాను. నీవు చక్రవర్తివి. నా మాటలు దయచేసి వినుము. అన్నాను' అని ఆ దుస్సల ఆనాడు సైంధవుడితో అన్న మాటలు మళ్ళీ అంటుండగా వింటున్నావు గదా! అట్లా ఆ రాజును గూర్చి ఆ వనిత యుద్ధరంగంలో ప్రలాపిస్తున్నది.

తే. **తోడఁబుట్టువు విధవయై తొలఁగి యునికి । కోర్చి చలమునఁ బతిఁ దెగటార్చి సంత**
సించితిరె? తండ్రులార! మీరంచుఁ బాండు । పుత్రకుల దూఱుచున్నది పొలఁతి వింటె? **100**

ప్రతిపదార్థం: తండ్రులార!= ఓ తండ్రులార; తోడఁబుట్టువు= మీ చెల్లెలు; విధవ+ఐ= భర్తను పోగొట్టుకొనినదై; తొలఁగి= శుభకార్యాలకు అనర్హురాలై; ఉనికికిన్= ఉండటాన్ని; ఓర్చి= భరించి; చలమునన్= పట్టుదలతో; పతిన్= నా భర్తను; తెగటార్చి= చంపి; మీరు సంతసించితిరె?= మీరందరూ సంతోషపడ్డారా?; అంచున్= అంటూ; పాండుపుత్రకులన్= పాండు కుమారులను; పొలఁతి= దుస్సల; దూఱుచున్నది= నిందిస్తున్నది; వింటె?= వింటున్నావా?

తాత్పర్యం: 'ఓ తండ్రులారా! మీ చెల్లెలు భర్తను పోగొట్టుకొని విధవరాలై ఏ శుభకార్యానికీ పనికిరానిదిగా బయటికి నెట్టబడి ఉండటం కూడా సహించి పట్టుదలతో నా భర్తను చంపి మీరు సంతోషపడ్డారా?' అంటూ పాండవులను దుస్సల నిందిస్తున్నది. వింటున్నావా?

ఉత్సాహవృత్తము:

తనయుఁ గాచుపనికిఁబూని ధర్మపుత్ర వాయునం
దనులుఁ గవలుఁ జేయఁ గలుగు దండిమగలు సేనలం
గొని వడిం గడంగ సరకుగొనక నిల్చి యొక్కఁడుం
బెనఁగి యాఁగె సైంధవుండు బిరుదు దక్షుఁడుంగదే! **101**

ప్రతిపదార్థం: తనయున్= కొడుకైన అభిమన్యుడిని; కాచు= కాపాడే; పనికిన్+పూని= పనికోసం పూనుకొని; ధర్మపుత్ర వాయునందనులున్= ధర్మరాజు, భీముడు; కవలున్= నకుల సహదేవులు; చేయన్+కలుగు= సమర్థులైన; దండిమగలు= పరాక్రమవంతులైన వీరులు; సేనలన్+కొని= తమ సైన్యంతో; వడిన్+కడంగన్= వేగంగా ఉద్యమించగా; సైంధవుండు= సైంధవుడు; సరకుగొనక= లెక్క చేయకుండా; నిల్చి= యుద్ధంలో నిలబడి; ఒక్కఁడున్= ఒక్కడే; పెనఁగి+ఆఁగెన్= యుద్ధం చేసి ఆపాడు; బిరుదు దక్షుఁడున్+కదే!= పేరందిన సమర్థుడు కదా!

తాత్పర్యం: అభిమన్యుకుమారుడిని కాపాడే పనికోసం పూనుకొన్న ధర్మరాజు, భీముడు, నకుల సహదేవులు సమర్థులైనవారు. పరాక్రమవంతులు. తమ సైన్యంతో కూడి వేగంగా ఉద్యమించినపుడు సైంధవుడు వాళ్ళను లెక్కచేయకుండా యుద్ధంలో నిలదొక్కుకొని ఒక్కడే పోరాడి వారిని ఆపగలిగాడు. సైంధవుడు మరి తక్కువవాడా! పేరు పొందిన సమర్థుడు కదా!

విశేషం: ఈ పేరు ఏమిటంటే అర్జునుడు లేని పాండవులను ఒక్కపూట జయించగలడన్న వరం ఉండటమే. వృత్తలక్షణానికి చూడండి. స్త్రీ. 1.48.

తే. తప్పు సైంధవుపైఁ బెట్టఁ దగునొ? తగదొ? పార్థు ప్రతినకు నొక్కండ పాత్రమయ్యెఁ
దాన యందఱ నాఁగుట తప్పుగాదె? । యదియ సౌభద్రు మృతి హేతు వగుట లేదె? 102

ప్రతిపదార్థం: తప్పు= తప్పంతా; సైంధవుపైన్= సైంధవుడిమీద; పెట్టన్+తగునొ?+తగదొ?= పెట్టవచ్చునో? రాదో? (పెద్దలు నిశ్చయించాలి); పార్థు ప్రతినకున్= అర్జునుడి ప్రతిజ్ఞకు; ఒక్కండు+అ= సైంధవుడు ఒక్కడే; పాత్రము+అయ్యెన్= పాత్రుడయ్యాడు; తాను+అ= తానే; అందఱన్= అందరినీ; ఆఁగుట= ఆపటం; తప్పుకాదె?= తప్పుకాదె?; అదియ= అదే; సౌభద్రు= అభిమన్యుడి; మృతిహేతువు= మృతికి కారణం; అగుటలేదె?= కావటం లేదా?

తాత్పర్యం: తప్పు సైంధవునిమీద పెట్టవచ్చునో లేదో కాని అర్జునుని ప్రతిజ్ఞకు సైంధవుడు ఒక్కడే గురియైనాడు. (సైంధవుడు) తానొక్కడే అందరునూ (పాండవులనందరినీ) ఆపడం తప్పేకదా? అదియే అభిమన్యుడి మృతికి కారణం కావడం లేదా?

విశేషం: తన అల్లుడు కాబట్టి సైంధవుడి విషయంగా ఇంత మీమాంస చేస్తున్నది గాంధారి. ధర్మరాజాదులను ఆపటంవలన సైంధవుడే అభిమన్యుడి చావుకు కారణమంటారు కొందరు. కాని, అభిమన్యుడు తానొక్కడే దుస్సాహసంతో అంతమంది మేటిమగలను ఎదుర్కొనటం తప్పుగదా! ఆ దుస్సాహసమే అతడి మృతికి హేతువు. అభిమన్యుడు చావటానికి పద్మవ్యూహంలో నుండి బయటికి రావటం తెలియకపోవటం తప్ప సైంధవుడు అడ్డుపడటం కాదని గాంధారి వాదం.

తే. బోరగిలఁ బడ్డవాఁడు గపోలమొకటి । పుడమి మోచినయది మోము పొలుపు సెడదు
వీఁడె చూచితె శల్యుండు? వెడలియున్న జిహ్వ దినియెడు వాయస శ్రేణి కృష్ణ! 103

ప్రతిపదార్థం: కృష్ణ!= కృష్ణా!; బోరగిలపడ్డవాఁడు= బోరగిల పడిఉన్నాడు; కపోలము+ఒకటి= ఒక చెక్కిలి; పుడమిన్= నేలను; మోచిన+అది= ఆని ఉన్నది; మోము= ముఖం; పొలుపు+చెడదు= అందం చెడిపోలేదు; వీఁడె+చూచితె?= వీడిని చూచావా?; శల్యుండు= ఇతడే శల్యుడు; వెడలి+ఉన్న= బయటకు వచ్చిన; జిహ్వన్= నాలుకను; వాయసశ్రేణి= కాకుల గుంపు; తినియెడున్= తింటున్నది.

తాత్పర్యం: కృష్ణా! ఇటుచూడుము. పాపం బోరగిలపడి ఉన్నాడు. ఒక చెక్కిలి నేలమీద ఆని ఉన్నది. ముఖంలో అందం ఏమాత్రమూ చెడిపోలేదు. ఎవరో గుర్తించావా? ఇతడే శల్యుడు. అయ్యో! బయటికి వచ్చిన నాలుకను కాకులు పొడుచుకొని తింటున్నాయి.

క. ఇట్టవునె? మాద్రితోడం । బుట్టె ననక యితని ధర్మ పుత్రునకుఁ గడుం
బెట్టిదుఁడై చంపవలసెఁ । జుట్టపుఁదనమేల రాజ సుతులకుఁ గలుగున్? 104

ప్రతిపదార్థం: ఇట్టు+అవునె?= ఇట్లా చేయటం బాగున్నదా?; మాద్రితోడన్= నకులసహదేవులతల్లి; తన పినతల్లి మాద్రితోపాటు; పుట్టెను+అనక= శల్యుడు పుట్టాడని భావించక; ఇతనిన్= ఈ శల్యుడిని; ధర్మపుత్రునకున్= ధర్మపుత్రుడికి; కడున్= మిక్కిలి; బెట్టిదుఁడై= నిర్దయుడై; చంపన్ వలసెన్= చంపవలసి వచ్చినది; రాజసుతులకున్= రాజకుమారులకు; చుట్టపుఁదనము= చుట్టరికం; ఏల కలుగున్= ఎందుకుంటుంది?

తాత్పర్యం: ఈ విధంగా చేయటం బాగున్నదా? ఈ శల్యుడు తమ తల్లి తోబుట్టువు అని కూడా భావించకుండా నిర్దయగా ధర్మరాజు యుద్ధంలో ఇతడిని చంపివేశాడు. అయినా రాజకుమారులకు బంధుత్వాలు ఎందుకు?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. సెల్లుఁడు యమతనయునితో । నెల్ల గుణంబులను జాల నెనయుదు నని తా
నుల్లమున నిశ్చయించుం । జెల్లంబో! పోరఁ బగఱచే ని ట్లయ్యెన్. 105

ప్రతిపదార్థం: సెల్లుఁడు= ఈ శల్యుడు; తాను; ఎల్లగుణంబులను= అన్నిగుణాలలోను; యమతనయునితోన్= ధర్మరాజుతో; చాలన్= మిక్కిలిగా; ఎనయుదును= పోలుతాను; అని; ఉల్లమునన్= హృదయంలో; నిశ్చయించున్= అనుకొంటాడు; చెల్లంబో= అయ్యో! (అయితే ఏమిటి?); పోరన్= యుద్ధంలో; పగఱచేన్= శత్రువులచేత; ఇట్లు+అయ్యెన్= ఇలా దుర్గతి పాలయ్యాడు.

తాత్పర్యం: ఈ శల్యుడు తాను అన్ని గుణాలలోనూ ధర్మరాజుతో సమానమే అని అనుకొంటూ ఉండేవాడు. అయ్యో! ఏమి లాభం! చివరికి యుద్ధంలో ఈ విధంగా దుర్మరణం పాలయ్యాడు.

వ. అ మ్మహీవిభుండు. 106

తాత్పర్యం: ఆ శల్యమహారాజు.

భుజంగ ప్రయాతము:
కురుక్షోణినాథుండు గోరంగ మైత్రిన్ । ధురం దాల్చి తా నేర్పుతో సారథిత్వం
బరిశ్రేణిసంత్రాసియై పూని కర్ణుం । బరిక్షోభితుం జేసె భాషాస్త్రపంక్తిన్. 107

ప్రతిపదార్థం: కురుక్షోణినాథుండు= దుర్యోధనుడు; మైత్రిన్= స్నేహాన్ని; కోరంగన్= కోరగా; ధురన్+తాల్చి= ఆ బరువును మోసి; తాన్= తాను; నేర్పుతోన్= నైపుణ్యంతో; అరిశ్రేణి= శత్రుసమూహానికి; సంత్రాసి+ఐ= భయం కలిగించేవాడై; సారథిత్వంబు= రథచోదకుని పనిని; పూని= తీసికొని; కర్ణున్= కర్ణుడులాంటి మహావీరుడిని; భాషాస్త్రపంక్తిన్= మాటలనే బాణాల వరుసతో; పరిక్షోభితున్= మిక్కిలి కలతచెందినవాడినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు శల్యుడిని మైత్రి కోరాడు. మిత్రధర్మాన్ని పాటించి, పెట్టిన బాధ్యతను స్వీకరించి ఎంతో నైపుణ్యంతో శత్రుసైన్యం ఇబ్బందిపడే రీతిగా రథసారథి పనిని చేపట్టి కర్ణుడి వంటి మహావీరులను మాటలనే బాణాలతో మిక్కిలి క్షోభచెందేటట్లు చేశా డీ శల్యుడు.

విశేషం: అలం: రూపకం. వృత్తలక్షణానిక చూడండి: ప్రే. 1. 88॥

ఆ. అధిక పంక పతితమై యున్న యాఁబోతుఁ । బొదివియున్న మొదవు కదుపు వోలె
నున్న వారు సూడు మువిదలు దైన్య మా । స్యముల నెలవు కొనఁగ శల్యు బలసి. 108

ప్రతిపదార్థం: అధికపంక= మిక్కిలిగా ఉన్న బురదలో; పతితమై+ఉన్న= పడిఉన్న; ఆఁబోతున్= ఆబోతును; పొదివి+ఉన్న= పొదువుకొని ఉన్న; మొదవు కదుపు= ఆవుల సమూహం; పోలెన్= వలె; ఉవిదలు= అతని భార్యలు; దైన్యము= దీనత్వం; ఆస్యములన్= ముఖాలలో; నెలవు+కొనఁగన్= నిండుకోగా; శల్యున్= శల్యుడిని; బలసి= చుట్టూచేరి; ఉన్నవారు+చూడుము= ఉన్నారు చూడుము.

తాత్పర్యం: కృష్ణా! ఆ శల్యుడిని ఆశ్రయించి అతి దీనంగా ఏడుస్తూ ఉన్న స్త్రీలను చూడుము. ఆబోతు బురదలో కూరుకొనిపోగా చుట్టూ ఆవులు పొదువుకొన్నట్లుగా కనిపించటం లేదూ?

విశేషం: అలం: ఉపమ. శల్యుడు మద్యమన్నా, స్త్రీ అన్నా చాలా ఆసక్తి కలిగిఉండేవాడు. అందుకే అతడి శవంచుట్టూ ఉన్న స్త్రీలను గురించి ప్రత్యేకంగా పోల్చి చెప్పటం.

మత్తకోకిల:

చూచితే భగదత్తు? నీతఁడు శూరతామహిమన్ నరున్
వీచిసన్నిభబాణపంక్తుల వెఱ్ఱిఁ జేసె మహేంద్రుతో
నేచి పోరుబలుండు వోలె సహింప కీతని నిట్లుగాఁ
జూచి తాతనిమీఁది నెయ్యము సొంపునన్ మురమర్దనా! 109

ప్రతిపదార్థం: మురమర్దనా!= మురాసురుడిని చంపిన ఓ కృష్ణా!; భగదత్తున్= భగదత్తుడిని; చూచితే?= చూచావా?; ఈతఁడు= ఇతడు; శూరతామహిమన్= పరాక్రమం యొక్క ఆధిక్యంచేత; మహేంద్రుతోన్= మహేంద్రుడితో; ఏచి= విజృంభించి; పోరు= యుద్ధం చేసిన; బలుండు+పోలెన్= బలుడనే రాక్షసుడివలె (అందుకే ఇంద్రుడికి బలవిరోధి అనిపేరు); నరున్= అర్జునుడిని; వీచి= అలలతో; సన్నిభ= సమానమైన (అంటే అలలవలె ఎడతెరిపి లేని); బాణపంక్తులన్= అమ్ముల వరుసలతో; వెఱ్ఱిన్+చేసెన్= పిచ్చివాడిని చేశాడు; సహింపక= భగదత్తుడి పరాక్రమం చూచి ఓర్వలేక; అతనిమీఁది= అర్జునుడిపై గల; నెయ్యపుసొంపునన్= ప్రేమాధిక్యంచేత; ఈతనిన్= ఈ భగదత్తుడిని; ఇట్లుగాన్+చూచితి(వి)= ఇట్లా మరణం పాలు కావించావు.

తాత్పర్యం: కృష్ణా! ఇతడు భగదత్తుడు. పోల్చుకొన్నావా! మహేంద్రుడిమీద విజృంభించి యుద్ధం చేయగల్గిన బలాసురుడివలె నరుడిమీద ఎడతెరిపి లేకుండా బాణాల వర్షం కురిపించి, అతడిని పిచ్చివాడిని చేశాడు. భగదత్తుడి పరాక్రమం చూచి ఓర్వలేక, అర్జునుడిమీద అభిమానంతో ఈతడిని ఈ విధంగా మరణంపాలు చేశావు.

క. పులుఁగులును మెకంబులునుం । దొలిచి తినిన నెలవుదప్పి తొలఁగియుఁ గంటే?
తల నున్న కనక దామము । పొలుపు దెగం బాయ దీ నృపుం గమలాక్షా! 110

ప్రతిపదార్థం: కమల+అక్షా!= కమలాలవంటి కన్నులు గల కృష్ణా!; పులుఁగులును= కాకులు, గద్దలువంటి పక్షులు; మెకంబులునున్= నక్కలు, తోడేళ్ళువంటి జంతువులు; తొలిచి తినినన్= రంధ్రాలు చేసి విరిచి తినగా; నెలవు+తప్పి= తమతమ స్థానాల నుండి; తొలఁగియున్= జారి ప్రక్కల్లో బడినా; తలన్+ఉన్న= తలలో అలంకరించుకొన్న; కనకదామము పొలుపు= సంపెంగపూల వాసన; ఈ నృపున్= ఈ రాజు దేహాన్ని; తెగన్+పాయదు= కొంచెంకూడా వదలిపెట్టలేదు; కంటే?= చూస్తున్నావా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కృష్ణా! పక్షులు, మృగాలు దేహాన్ని రంధ్రాలు చేసి విరిచి తినటం వలన దేహభాగాలు ఎక్కడివక్కడ వెదజల్లబడ్డాయి. అయినా ఇతడి తలలో అలంకరించుకొన్న సంపెంగపూల వాసన ఈ రాజు శరీరాన్ని కొంచెంకూడా వదలలేదు. చూస్తున్నావా?

గాంధారి శరతల్పగతుం డగు భీష్మునుద్దేశించి శోకించుట (సం. 11-23-14)

సీ. బలశౌర్యములఁ దన పాటిగా నెందును । మానవు నొరుఁ జూపలేని యట్టి
శంతనుపుత్త్రుఁడే శత్రులబాహు ద । ర్పంబున రణభూమిఁ బడియెఁ దన్ను
వాలాయమును గెల్వవచ్చునె? 'చంపి కొం' । డని పాండుసుతులపై నగ్గలంపుఁ
గరుణ మర్మము సెప్పెఁగాక యెమ్మెయి నైన । నతినిష్ఠ యెప్పుడు నతనియందుఁ

ఆ. గలదు గాదె! తండ్రి కార్యంబునకుఁ గాఁగ । రాజ్య ముడిగి పూనె బ్రహ్మచర్య
మితనిఁ జెప్పి చెప్ప నితరుండు పౌరుష । కలిత సంభవుండు గలఁడె కృష్ణ. 111

ప్రతిపదార్థం: కృష్ణ= కృష్ణా!; బలశౌర్యములన్= బలంలోనూ, పరాక్రమంలోనూ, తన పాటిగాన్= తనకు సమానుడుగా; ఎందును= ఎక్కడా; ఒరున్ మానవున్= ఇంకో మానవుడిని; చూపలేనియట్టి= చూపలేనటువంటి; శంతనుపుత్త్రుఁడే= భీష్ముడే; శత్రుల= శత్రువుల; బాహుదర్పంబునన్= బాహుగర్వంచేత; రణభూమిన్+పడియెన్= యుద్ధభూమిలో కూలిపోయాడు; తన్నున్= తనను; వాలాయమును= తప్పక; గెల్వన్‌వచ్చునె?= ఎవరైనా గెలవటానికి శక్యం అవుతుందా?; చంపికొండు+అని= చంపుకోండి అని; పాండుసుతులపైన్= పాండుకుమారులపైన; అగ్గలము+కరుణన్= మిక్కిలి దయతో; మర్మము చెప్పెన్+కాక= తాను చనిపోయే రహస్యాన్ని చెప్పాడు తప్ప (ఎవరు గెలవగలుగుతారు?); ఎమ్మెయిన్+ఐనన్= ఎలాఅయినా; అతినిష్ఠ= గొప్పనిష్ఠ; ఎప్పుడున్= అన్ని కాలాలలోనూ; అతనియందున్= భీష్ముడిలో; కలదు+కాదె!= ఉన్నదేకదా!; తండ్రికార్యంబునకున్= తండ్రిపనికి (కర్తవ్యానికి); కాఁగన్= అనుకూలం అయ్యేట్టుగా; రాజ్యము+ఉడిగి= రాజ్యం వదలుకొని; బ్రహ్మచర్యము= బ్రహ్మచారిగా ఉండిపోవటాన్ని; పూనెన్= అవలంబించాడు; ఇతనిన్+చెప్పి= ఇతడిని పేర్కొని; చెప్పన్= చెప్పటానికి; పౌరుషకలితసంభవుండు= సంపూర్ణ పురుషత్వంతో కూడిన జన్మగలవాడు; ఇతరుండు= మరొకడు; కలఁడె?= ఉన్నాడా? (లేడు).

తాత్పర్యం: కృష్ణా! బలంలోకాని, పరాక్రమంలోకాని తనకు సాటిగా మరొక మానవుడిని చూపటానికి వీలులేని మహావ్యక్తి భీష్ముడే శత్రువుల బాహుదర్పానికి బలై నేలమీద పడ్డాడు. అయినా ఆయనను ఎవరూ తమంతతట తాముగా జయించలేరు కదా! 'నన్ను చంపుకోండి' అని పాండవులమీద ఉన్న అధికమైన దయతో ఆయనే తాను చనిపోయే రహస్యాన్ని వారికి చెప్పాడు తప్ప, ఆయనను ఎవరు గెలువగలరు! ఎట్లా అయితేనేం! ఆయనకున్న దీక్ష ఈనాటిది కాదు కదా! తన తండ్రి కోరికను సానుకూలం చేయటానికి తాను బ్రహ్మచారిగా ఉండిపోయాడు గాదా! రాజ్యం వదలుకోలేదా! (అట్లాగే ఇదికూడ అని తాత్పర్యం). ఈయన పేరు చెప్పి మరోపేరు చెప్పటానికి సంపూర్ణ పురుషత్వంతో కూడిన జన్మగల మరో మహానుభావుడు ఎవ డున్నాడు?

క. కురువంశ మెడల వచ్చినఁ । బరమోపాయమున మగుడఁ బడసెన్ మడిసెం
గురునికరముతోడన యి । ప్పురుషుఁడు పురుషార్థసారభూషణుఁడు గదే! 112

ప్రతిపదార్థం: కురువంశము= కౌరవవంశం; ఎడలవచ్చినన్= విచ్ఛిన్నం కాగా; పరమ+ఉపాయమునన్= తల్లి సత్యవతిద్వారా వ్యాసమహర్షిని రప్పించి అంబికాదులకు సంతానాన్ని కల్గించటం ద్వారా; మగుడన్+పడసెన్= మళ్ళీ కౌరవవంశాన్ని రక్షించుకొన్నాడు;

కురునికరముతోడన్+అ= కురుకుమారుల సమూహంతోనే; మడిసెన్= చనిపోయాడు; ఈ+పురుషుఁడు= ఈ మహాపురుషుడు; పురుషార్థసార= ధర్మార్థకామమోక్షాలనే పురుషార్థాల సారభూతమైన ధర్మానికి; భూషణుఁడు= అలంకారంవంటి వాడు; కదే!= కదా!

తాత్పర్యం: కృష్ణా! కౌరవవంశం ఆగిపోయిన సమయంలో ధార్మికమైన పద్ధతిలో వ్యాసమహర్షిద్వారా మళ్ళీ కౌరవవంశాన్ని సంపాదించుకొన్నవాడూ ఈయనే. చివరివరకు కురుకుమారులతోనే ఉండి వారితోపాటే ప్రాణాలూ వదిలినవాడూ ఈయనే. ఈ మహాపురుషుడు ధర్మ స్వరూపుడు! (పురుషార్థాల పరమార్థాన్ని ఇట్లాంటి మహావ్యక్తుల జీవితం ద్వారానే కదా తెలిసికొనాలి!).

క. దేవుఁడు గా కితఁడు నరుఁడు । నా వచ్చునె? నిష్ఠపెంపునం బ్రాణంబుల్
తా వలసినపుడ విడువం । గా వేడుక నునిచి నాఁడు గాదె తనువునన్! 113

ప్రతిపదార్థం: ఇతఁడు= భీష్మాచార్యుడు; దేవుఁడుగాక= దైవస్వరూపం తప్ప; నరుఁడు+నాన్+వచ్చునె?= మనిషి అనవచ్చునా?; నిష్ఠపెంపునన్= దీక్షయొక్క ఆధిక్యంచేత; ప్రాణంబుల్= ప్రాణాలను; తాన్+వలసినపుడు+అ= తానుకోరుకున్నపుడే; విడువంగాన్= వదలటానికి గాను; వేడుకన్= లీలగా; తనువునన్= శరీరంలో; ఉనిచినాఁడు+కాదె!= ఉంచినాడు కదా!

తాత్పర్యం: కృష్ణా! భీష్ముడు దైవస్వరూపుడు తప్ప సాధారణ మానవుడు కాడు. అందుకే ఆయనకున్న దీక్షతో ప్రాణాలను తాను కోరుకొన్నపుడు వదలటానికై లీలగా తన దేహంలోనే ఉంచాడు కదా!

విశేషం: ముందటి పద్యంలో భీష్ముడి ధర్మనిష్ఠ చెప్పబడింది. భీష్ముడు రాజధర్మాన్ని, పుత్రధర్మాన్ని, పితృధర్మాన్ని- దేనినీ వదలలేదు. 'స్వధర్మే నిధనం శ్రేయః' - అనే గీతోక్తిని సంపూర్ణంగా ఆచరించాడు. అందుకే ఎంత దోష దూషితమైనా కౌరవ పక్షంలోనే జీవితాంతం ఉన్నాడు. అందుకే అతడిలో 'నిష్ఠ' తపస్సుగా మారి దివ్యత్వంగా సిద్ధించింది. దాని రూపమే 'స్వచ్ఛంద మరణం'. ఇది మహాయోగులకు మాత్రమే సిద్ధించే విషయం. భీష్ముడిలోని బ్రహ్మచర్యం - సత్యవ్రతదీక్ష - ధర్మనిష్ఠ - కర్మయోగం - నిష్కామంగా కర్మఫలత్యాగం - అనే అన్ని గుణాలు సాత్త్విక తపస్సు లక్షణాలు కాబట్టి ఆయన పరమశాంతమూర్తిగా తన మరణాన్ని కూడా కోరి తెచ్చుకొన్నాడు. ఆ జీవితంలో మిగిలిపోయింది దేహం ఒకటే. దానిని పుణ్యామార్గం పట్టించటం కొరకు దేహగతంగా చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తంగా అనుభవించిన శిక్ష- అంపశయ్య మీదపడి ఉండటం. ఇదంతా కలిపి చూస్తే ఇతడు మానవమాత్రుడు కాడు అనే గాంధారి వాక్యాలకు పరమార్థం తెలుస్తుంది.

తే. తీవ్ర బాణజాల దీప్తులు పరఁగించి । పాండుతనయ సైన్య బహుళతమము
లీలఁ బదిదినంబు లోలి వినోదించి । యకట! భీష్మభానుఁ డస్తమించె. 114

ప్రతిపదార్థం: తీవ్ర= వాడిఅయిన; బాణజాల= బాణాల సమూహాలనేటటువంటి; దీప్తులు= కిరణాలు; పరఁగించి= వ్యాపింపజేసి; పాండుతనయసైన్య= పాండు కుమారుల సైన్యమనేటటువంటి; బహుళతమమున్= దట్టమైన చీకటిని; లీలన్= వేడుకగా; పది దినంబుల్= పదిరోజులు; ఓలిన్= వరుసగా; వినోదించి= తొలగించి; భీష్మభానుఁడు= భీష్ముడనే సూర్యుడు; అస్తమించెన్= వెళ్ళిపోయాడు; అకట!= అయ్యో!

తాత్పర్యం: వాడి బాణాలనే కిరణాలు వ్యాపింపజేసి పాండవసైన్యమనే చీకటిని ముప్పుతిప్పలు పెట్టి ఆడించి, పదిరోజులు వినోదించి, భీష్ముడనే సూర్యుడు అస్తమించాడు. ఎంత విషాదకరం!

విశేషం: అలం: రూపకం.

క. శరవణమునందుఁ బొలుపుం । బొరసిన గాంగేయుతోడఁ బోల్పఁగ ననువై
శరతల్పంబునఁ దేజో । భరితుఁడు గాంగేయుఁ డొప్పెఁ బంకజనాభా! 115

ప్రతిపదార్థం: పంకజనాభా!= కమలం నాభిలోగల కృష్ణా!; శరవణమునందున్= రెల్లుగడ్డిలో; పొలుపున్= ఒప్పును; పొరసిన= పొందిన; గాంగేయుతోడన్= (గంగకుమారుడితో) కుమారస్వామితో; పోల్పఁగన్= పోల్చడానికి; అనువు+ఐ= వీలుగా; శరతల్పంబునన్= బాణాలతో చేసిన పడకలో; తేజస్+భరితుఁడు= కాంతిమంతుడైన; గాంగేయుఁడు= గంగకుమారుడు (భీష్ముడు); ఒప్పెన్= ప్రకాశిస్తున్నాడు.

తాత్పర్యం: అలనాడు రెల్లుగడ్డిలో ప్రభవించిన కుమారస్వామితో పోల్చదగినవాడై ఈనాడు బాణతల్పంలో తేజోమూర్తి అయిన ఈ భీష్ముడు కాంతులు చిమ్ముతున్నాడు.

విశేషం: అలం: ఉపమ, శ్లేష 'శర' మనే మాటకు బాణమని, రెల్లు అని రెండు అర్థాలున్నాయి. శివపార్వతుల తేజాన్ని అగ్నిదేవుడు గంగలో నిక్షేపించగా పుట్టినవాడు కుమారస్వామి అందుకే 'గాంగేయుడు' అని షణ్ముఖుడికి పేరున్నది. గంగాశంతనుల కుమారుడు భీష్ముడు. కాబట్టి ఇతడూ 'గాంగేయుడే'. మరి ఆయన రెల్లువనంలో పుట్టగా ఈయన 'శరతల్పంలో' (అంపశయ్యపై) ఉన్నాడు. కాబట్టి పోలిక సరిపోయిందని గాంధారి అంటున్నది.

తే. అర్జునుఁడు వెట్టె నితనికి నంపపాన్పు । నకుఁ దగంగ నిశాత బాణముల మూఁట
నలవరించిన తలగడ యస్త్రజనిత । వారిఁ దృప్తునిఁ జేసె నవ్వీరవరుఁడు. 116

ప్రతిపదార్థం: అర్జునుఁడు= పాండవమధ్యముడైన అర్జునుడు; ఇతనికిన్= ఈ మహావీరుడైన భీష్ముడికి; అంపపాన్పునకున్= అంపశయ్యకు; తగంగన్= తగినట్టుగా; నిశాత= వాడియైన; బాణములమూఁటన్= మూడు బాణాలతో; అలవరించిన= ఏర్పరచిన; తలగడ= తలగడను (దిండును); పెట్టెన్; ఆ+వీరవరుఁడు= ఆ అర్జునుడే; అస్త్రజనిత= అస్త్రంతో పుట్టిన; వారిన్= నీటితో; తృప్తునిన్+చేసెన్= దప్పిక తీరినవాడిగా చేశాడు.

తాత్పర్యం: కృష్ణా! ఈ మహావీరుడికి అర్జునుడు అంపశయ్యను ఏర్పరచి, దిండుగా మూడు వాడిబాణాలను సవరించి, బాణంతో నీటిని తెప్పించి ఆ నీటితో ఆ మహావీరుడి దప్పికను పోగొట్టాడు.

క. వీరశయనమున గంగకు । మారుఁడు కల్పక్షయమున మార్తాండుఁడు సం
చార మెడలి ధరఁ బడి యొ । ప్పారెడు చందమున వెలిఁగె నంబురుహాక్షా! 117

ప్రతిపదార్థం: అంబురుహ+అక్షా!= కమలాక్షా (కృష్ణా); వీరశయనమునన్= వీరుడికి తగిన ఈ అంపశయ్యలో; గంగకుమారుఁడు= ఈ భీష్ముడు; కల్పక్షయమునన్= కల్పాంతంలో; మార్తాండుఁడు= సూర్యుడు; సంచారము+ఎడలి= సంచారం చాలించి; ధరన్+పడి= నేలవాలి; ఒప్పారెడు= ప్రకాశించే; చందమునన్= రీతిలో; వెలిఁగెన్= కాంతులు చిమ్ముతున్నాడు.

తాత్పర్యం: కృష్ణా! ఈ అంపశయ్యమీద ఉన్న భీష్ముడు కల్పాంతంలో సూర్యుడు లోకసంచారం మాని, నేలమీద వాలి, విశ్రాంతి తీసికొన్న రీతిగా ప్రకాశిస్తున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. దేవవ్రతుండు గీర్వా । ణావాసంబునకుఁ జనినయట కురునికరం
బేవాని నడిగి తెలియునొ । కో? విశ్రుతధర్మ సంప్రయోగ విధంబుల్. 118

ప్రతిపదార్థం: దేవవ్రతుండు= భీష్ముడు; గీర్వాణ+ఆవాసంబునకున్= దేవతల నివాసానికి - స్వర్గానికి; చనిన+అట= వెళ్ళిపోయాక; కురునికరంబు= కురువంశీయులు; ఏవానిన్= ఎవరిని; అడిగి; విశ్రుత= సాంప్రదాయకమైన; ధర్మ సంప్రయోగవిధంబుల్= ధార్మికంగా ఈ పని ఇట్లా చేయాలి; ఇట్లా చేయకూడదు అనే విధాన్ని గురించి; తెలియును+ఒకో?= తెలిసికొంటుందో ఏమో?

తాత్పర్యం: భీష్ముడు స్వర్గం చేరిన తరువాత కురుకుమారులకు ఇది మంచి, ఇది చెడు, ఇట్లా చేయాలి, ఇట్లా చేయకూడదు అనే ధర్మసూక్ష్మాలను వివరించి, చేయదగిన పనిని బోధించేవారు ఎవరుంటారు? వారు ఎవరిని అడిగి తెలిసికొనాలో ఏమో!

విశేషం: ఇంటిపెద్ద మరణించినపుడు అందరూ బాధపడేది ఈ విషయంలోనే. భారతకథలో భీష్ముడు ఎన్నో సందర్భాలలో దుర్యోధనుడికి, ధర్మరాజుకు, ఇరువురికి ధర్మసూక్ష్మ వివేచన చేసి కర్తవ్యం బోధించాడు. ధర్మరాజాదులు ఆ మాటలు పాటించారు. దుర్యోధనుడు పాటించక మరణం పొందాడు. ఇది గాంధారికి తెలుసు. అందుకే వంశానికి పెద్ద దిక్కు - ఈయన కూడా పోతే వంశాన్ని రక్షించే పురుషుడే ఉండడే! అని ఆమె ఆక్రోశిస్తోంది.

సీ. పగవారి మొన లను పల్లెరులం గాల్చి । మడిసెఁ గుంభజుఁ డనియెడు దవాగ్ని
యెన్ని యస్త్రము లింద్రుఁ డెఱుఁగు నన్నింటను । బరిణతుం డీతండు భార్గవునకు
నెట్లట్ల సువిధేయ మిమ్మహాత్మునకు ధ । నుర్వేద మితనికి సర్వవేద
ములుఁ బరిచితము లియ్యలఘుతేజుని శిక్షఁ । గాదె! పార్థుఁడు కార్ముకమున మేటి

ఆ. యయ్యెఁ? దక్కుకౌరవాన్వయజాతులు । సాత్యకియును ని వ్విశాలబుద్ధి
నాశ్రయించుటను మహాస్త్రవిత్తములైరి । యోధు లింతవార లుర్విఁగలరె? 119

ప్రతిపదార్థం: పగవారి= శత్రువుల; మొనలు+అను= సైన్యమనేటువంటి; పల్లెరులన్+కాల్చి= పల్లేరులను కాల్చి; కుంభజుఁడు= ద్రోణుడు; అనియెడు దవాగ్ని= అనబడేటటువంటి దావాగ్ని; మడిసెన్= సమసినది; ఎన్ని అస్త్రములు= ఎన్ని అస్త్రాలు; ఇంద్రుఁడు+ఎఱుగున్= ఇంద్రుడికి తెలియునో; అన్నింటను= అన్నిటిలోను; ఈతండు= ఇతడు; పరిణతుండు= నిష్ణాతుడు; భార్గవునకున్= పరశురాముడికి; ఎట్లు= ఏవిధంగా; ధనుర్వేదము= ధనుర్విద్య; సువిధేయము= మిక్కిలి విధేయమో; అట్లు= అలాగే; ఈ+మహాత్మునకున్= ఈ మహానుభావుడికికూడా (సువిధేయమే); ఇతనికిన్= ఇతనికి; సర్వవేదములున్= అన్ని వేదాలు; పరిచితములు= పరిచయం లోనివే; ఇయ్యలఘుతేజుని= ఈ గొప్ప తేజస్సు కల్గినవాని; శిక్షన్+కాదె!= శిష్యరికంతోనే కదా!; పార్థుఁడు= అర్జునుడు; కార్ముకమునన్= విలువిద్యలో; మేటి+అయ్యెన్?= సమర్థుడయ్యాడు? (సర్వోత్తముడయ్యాడు); తక్కు= తక్కిన; కౌరవ+అన్వయ+జాతులున్= కురుకుమారులూ; సాత్యకియును= సాత్యకీ; ఈ+విశాలబుద్ధిన్= ఈ గొప్ప విద్యావంతుడిని; ఆశ్రయించుటను= ఆశ్రయించటంచేత; మహాస్త్ర+విత్+తములు+ఐరి= మహాస్త్రాలు తెలిసిన వారిలో శ్రేష్ఠులయ్యారు; ఇంతవారు= ఇంతటి; యోధులు= మహావీరులు; ఉర్విన్= భూమిలో; కలరె?= ఉన్నారా?

తాత్పర్యం: శత్రుసైన్యా లనే పల్లేరులను తుదముట్టించి ద్రోణుడనే దావాగ్ని ఆరిపోయింది. ఇంద్రుడికి ఎన్ని దివ్యాస్త్రాలు తెలియునో అన్నీ తెలిసినవాడు ఈయన. పరశురాముడికి ఎట్లా ధనుర్విద్య వశమయిందో అట్లా వశమైన మహాధనుర్వేత్త ఈ ద్రోణాచార్యుడు. సర్వవేదాలూ తెలిసిన మనీషి, ఈ పుణ్యపురుషుడి శిక్షణలోనే కదా అర్జునుడు మేటి విలుకాడు అయ్యాడు! తక్కిన కురుకుమారులు, సాత్యకి ఈ మహావేత్త దగ్గరకదా ఉత్తమ ధనుర్వేత్తలుగా తయారయ్యారు! ఇంతటి గొప్ప యోధుడు ప్రపంచంలో ఉన్నాడా?

విశేషం: అలం: రూపకం.

క. వివిధ మహాస్త్రంబులు గా । లవశతఁ జెడెఁ గాక శౌర్యలంపటు నియ్యో
ధవరునిఁ బగవారికిఁ జే । ర వశంబగునెట్లు సంగరంబునఁ? గృష్ణా! 120

ప్రతిపదార్థం: కృష్ణా= కృష్ణా!; వివిధ= వివిధాలైన; మహాస్త్రంబులు= గొప్ప గొప్ప అస్త్రాలు; కాలవశతన్= కాలశక్తికి లోబడి; చెడెన్+కాక= వ్యర్థాలు అయ్యాయి తప్ప; శౌర్యలంపటున్= పరాక్రమమే వ్యసనంగా కల్గిన; ఈ+యోధువరునిన్= ఈ వీరశ్రేష్ఠుడిని; సంగరంబునన్= పోరులో; చేరన్= సమీపించటానికి (ఎదిరించటానికి); పగవారికిన్= శత్రువులకైనా; ఎట్లు వశంబు+అగున్= ఎట్లా సాధ్యం?

తాత్పర్యం: కృష్ణా! ద్రోణాచార్యుల వద్దనున్న మహాస్త్రాలు కాలశక్తికి లోబడి వ్యర్థమయ్యాయి తప్ప ఆ మహాయోధుడిని యుద్ధంలో శత్రుసేనలు సమీపించగలవా? అది ఎట్లా సాధ్యం?

తే. గురుని ము న్నిడుకొని కాదె కురుకుమారు । లనికిఁ బిలిచిరి? ధర్మపుత్రాదులయిన
వాలుమగల నట్లంతటివాఁడుఁబగఱు । నఱకివైచినఁ బడియున్న తెఱఁగుఁ గంటె? 121

ప్రతిపదార్థం: గురునిన్= తమ గురువైన ద్రోణాచార్యుడిని; మున్ను+ఇడుకొని+కాదె!= ముందుంచుకునే కదా!; కురుకుమారులు= దుర్యోధనాదులు; ధర్మపుత్ర+ఆదులు+అయిన= ధర్మరాజు మొదలైన; వాలుమగలన్= మహావీరులను; అనికిన్+పిలిచిరి?= యుద్ధానికి రమ్మన్నారు?; అట్లు+అంతటివాఁడు= అట్లాంటివాడు; పగఱు= శత్రువులు; నఱకివైచినన్= నరికివేయగా; పడి+ఉన్న పడిఉన్న; తెఱఁగున్= విధాన్ని; కంటె?= చూశావా?

తాత్పర్యం: అసలు ద్రోణాచార్యులను నమ్మికదా దుర్యోధనాదులు - ధర్మరాజు, భీముడు, అర్జునుడు వంటి మహావీరులను యుద్ధానికి రమ్మని ప్రకటించారు! అట్లాంటి వీరుడు ఈనాడు శత్రువులు నరికివేయగా నేలమీదపడి ఉన్న తీరు చూస్తున్నావా?

తోటకము.

సతతంబును శిష్యులు సద్వినయా । న్వితులై ప్రణమిల్లెడు వీరిపద
ద్వితయంబు గడుంజెడఁ దిన్నవి సూ । చితె నక్కలు? దైవము చెయ్దిఁ గటా! 122

ప్రతిపదార్థం: సతతంబును= నిత్యమూ; శిష్యులు= శిష్యులైన కురుకుమారులు; పాండవులు; సత్+వినయ+అన్వితులై= మంచి వినయంతో కూడినవారై; ప్రణమిల్లెడు= నమస్కరించేటువంటి; వీరి= ఈ ద్రోణాచార్యులవారి; పద ద్వితయంబున్= రెండుకాళ్ళనూ; కడున్+చెడన్= బాగా నశించేలా; నక్కలు; తిన్నవి; కటా= అయ్యో!; దైవము+చెయ్దిన్= దేవుడి చేత; చూచితె= చూచావా?

తాత్పర్యం: ఎల్లప్పుడూ శిష్యులు మంచి వినయంతో నమస్కరించేటువంటి ఈ ద్రోణాచార్యులవారి పాదాలను ముక్కలు చేసి నక్కలు తినివేశాయి. అయ్యో! దైవం ఎంత క్రూరంగా ప్రవర్తించిందో చూచావా? కృష్ణా!

విశేషం: తోటకవృత్తంలో ప్రతిపాదానికి నాలుగు సగణాలుంటాయి. 1-9 అక్షరాలకు యతిమైత్రి - ప్రాసనియమం కలదు.

ఆ. **ద్రుపదతనయుఁ డట్టి! ద్రోణునితలఁ గోయు । వాఁడు విధికి నెట్టివారి నెట్టి**
తెఱఁగు సేయ రాదు? దీనికి నేమను । వార మిది యసంభవంబు గాదె? **123**

ప్రతిపదార్థం: ద్రోణునితలన్= ద్రోణాచార్యులతలను; కోయువాఁడు= ఖండించేవాడు; ద్రుపద తనయుఁడు+అట్టె!= ధృష్టద్యుమ్నుడా! విధికిన్= విధి; ఎట్టివారిన్= ఎలాంటివారిని; ఎట్టి తెఱఁగు= ఏ తీరుగా; చేయన్‌రాదు?= మార్చులేదు?; దీనికిన్= దీనికి; ఏమి+అనువారము?= ఏమనగలము?; ఇది= ఇట్లా కావటం; అసంభవంబు+కాదె!= సంభవమైన విషయంకాదు కదా!

తాత్పర్యం: ఇట్లాంటి మహాయోధుడైన ద్రోణాచార్యుడి తలనరికేవాడు అర్భకుడైన ధృష్టద్యుమ్నుడా! విధివశంగా ఎంతటివారు ఎంతగా అయిపోతారు! విధి చేయని పని ఏమున్నది? ఏమనవచ్చు దీనిని? అయినా ఎట్లా చంపాడు? ఇది అసంభవమే!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

సీ. **కృపునితోఁబుట్టువు కృపి తన భర్త ద్రో । ణాచార్యుపాల దైన్యంబు విపుల**
వేణియు మొగమున వెంట ముసుంగు వ । డంగ రాల్పడిన యెలుంగుతోడఁ
బలవించి పలవించి బహుశిష్యు లయ్యతి । రథవర్యు నస్త్రశస్త్రములు రథము
నవయవంబులును జితాకలనంబు సే । యుచు సామగానసంయుక్తవదను

ఆ. **లగుట సూచి సామ మతికరుణంబుగాఁ దాను బాడఁజొచ్చె మానితాగ్ని**
సొద నమర్చి యవ్విశుద్ధాత్ము నొండొక । యగ్నివోలెఁ బెట్టి రందుఁ గృష్ణ! **124**

ప్రతిపదార్థం: కృష్ణ!= కృష్ణా!; కృపునితోఁబుట్టువు= కృపాచార్యుడి చెల్లెలు; కృపి= తన భర్త ద్రోణాచార్యు(డి); పాలన్= సమీపంలో; దైన్యంబు= దీనత్వం(తో); విపులవేణియున్= విరబోసుకున్న వెంట్రుకలతో; మొగమున వెంటన్= ముఖంమీద; ముసుంగు+పడంగన్= ముసుగు పడగా (ముసుగు వేసికొని); రాల్పడిన= బొంగురుపోయిన; ఎలుంగుతోడన్= కంఠంతో; పలవించి పలవించి= మాటిమాటికి దుఃఖిస్తూ (ఉండగా); బహుశిష్యులు= ద్రోణుడికున్న చాలామంది శిష్యులు; అతిరథవర్యు= అతిరథశ్రేష్ఠుడైన ఆ ద్రోణుడియొక్క; అస్త్రశస్త్రములు+రథమున్+అవయవంబులును= బాణాలను, శస్త్రాలను, దేహభాగాలను; చితాకలనంబు+చేయుచున్= పేర్చి చితిగా పేర్చి; సామగాన సంయుక్తవదనులు+అగుట+చూచి= సామగానం పాడుతున్న నోళ్ళు కలవారు కావటం చూసి; మానితాగ్ని= వైదిక కార్యాలలో మిక్కిలిగా గౌరవింపబడే అగ్నిదేవుడే; అతికరుణంబుగాన్= అతి కరుణతో; సామము= సామవేదాన్ని; తాను+పాడన్+చొచ్చెన్= తానుపాడటం మొదలు పెట్టాడు (అప్పు డందరూ చేరి); సొదను= చితిని; అమర్చి; ఆ+విశుద్ధాత్మున్= ఆ పవిత్రాత్ముడిని; ఒండొక= మరొక; అగ్ని+పోలెన్= అగ్నిలాగా; అందున్= ఆ చితిలో; పెట్టిరి= ఉంచారు.

తాత్పర్యం: కృష్ణా! ద్రోణుడి భార్య, కృపాచార్యుడి చెల్లెలు - కృపి తన భర్తసమీపంలో అతి దీనంగా కూర్చొని విరబోసికొన్న జుట్టుతో తలమీది ముసుగుతో పలవరిస్తూ రోదిస్తున్నది. ద్రోణుల శిష్యులు తక్కినవారు చూచి ఆ మహాయోధుడి అమ్ములు, బాణం, శస్త్రాలు, రథం, అవయవాలు వీటి నన్నిటిని ప్రోగుచేసి, చితి పేర్చి, సామవేదం చదువుతూ ఉండగా సాక్షాత్తు అగ్నిదేవుడే సామం పాడజొచ్చాడు. ఆ విధంగా చితి నేర్పరచి గురువుగారినే మరొక అగ్నివలె ఆ చితిలో చేర్చి దహనానికి సిద్ధం చేశారు.

విశేషం: ఇతరులను ఎవరిని వర్ణించినపుడు కాని ఈ చితి వర్ణన లేదు. ఎందుకంటే ద్రోణుడు బ్రాహ్మణుడు కాబట్టి ధర్మరాజాదులు దహనం చేయటానికి వీలు లేదు; కాబట్టి శిష్యులు చేయటాన్ని వర్ణిస్తున్నాడు. దహనం కూడా జీవికి చేయవలసిన కర్మలలో ఒకటి. అందుకే సామగానం చేశారనటం. అగ్ని స్వయంగా సామం ఆలపించటం ఏమిటి? ద్రోణుడు పవిత్రుడు. అగ్నిస్వరూపుడే. అయోనిజుడు. కాబట్టి దైవస్వరూపుడు. అందుకే అగ్ని స్వయంగా ద్రోణుడి శరీరాన్ని స్వీకరించాడని అర్థం. అందుకే 'మరి ఒక అగ్నివలె' అని స్పష్టం చేయటం.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. **కృపి మున్నుగ శిష్యులు సొద । యపసవ్యము గాఁగఁ దిరిగి యరిగిరి శోకా**
ర్తపు టొడలులతో గంగకు । నపగతశరవిద్య యయ్యె నవని కటకటా! **125**

ప్రతిపదార్థం: కృపి మున్నుగన్= కృపి ముందు నడుస్తుండగా; శిష్యులు= ద్రోణుడి శిష్యులు; సొద= చితికి; అపసవ్యము కాఁగన్= అప్రదక్షిణ మర్గంలో; తిరిగి; శోక+ఆర్తపు+ఒడళులతోన్= శోకంతో, దీనత్వంతో కూడిన శరీరాలతో; గంగకున్= నదికి స్నానాలు చేయటానికి; అరిగిరి= వెళ్ళారు; అవని= భూమి; అపగత= పోగొట్టుకున్న; శరవిద్య+అయ్యెన్= శరవిద్య కలిగింది అయింది; కటకటా!= అయ్యయ్యో!

తాత్పర్యం: కృపి ముందు నడుస్తూండగా శిష్యులు ఆ చితికి అప్రదక్షిణంగా తిరిగి శోకంతో దీనత్వంతో కూడిన శరీరాలతో నదిలో స్నానాలు చేయటానికి వెళ్ళారు. ఈ భూలోకంలో ఇక బాణవిద్య లుప్తమై పోయినట్లే. ఎంత దౌర్భాగ్యం!

విశేషం: భారతకాలంలో స్త్రీలు కూడా చితిచుట్టూ తిరిగేవారన్న విషయం ఈ సందర్భంలో గుర్తించాలి.

ఆ. **సోమదత్త సుతునిఁ జూడుము సాత్యకి । దూష్యభంగి శిరముఁ దునుమ నొఱిగి**
యున్నవాఁడు గ్రద్ద లొలిచి తినంగ నీ । సుకృతపరుని నిట్లు సూడవలసె. **126**

ప్రతిపదార్థం: సోమదత్తసుతునిన్= భూరిశ్రవుని; చూడుము; సాత్యకి; దూష్యభంగిన్= నిందింపదగు రీతిలో; శిరమున్+తునుమన్= కుత్తుకను కోయగా; ఒఱిగి+ఉన్నవాడు= నేలమీద పడి ఉన్నాడు; ఈ సుకృతపరునిన్= ఈ పుణ్యాత్ముడిని; ఇట్లు= ఈ విధంగా; గ్రద్దలు; ఒలిచి తినంగన్= ఒలిచి తింటుండగా; చూడన్ వలసెన్= చూడవలసి వచ్చింది.

తాత్పర్యం: కృష్ణా! చూడుము. అదే సోమదత్తుడి కొడుకు భూరిశ్రవుడి పార్థివశరీరం. సాత్యకి చాలా నీచంగా తల నరికివేయగా అట్లా పడి ఉన్నాడు. గద్దలు ఒంటిని ఒలిచివేసి తింటున్నాయి. ఈ పుణ్యాత్ముడిని ఇట్లా చూడవలసి వచ్చినది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. సోమదత్తుఁడు పుత్రశోకాయత్తుండై యుండి తన్ను సాత్యకి గవిసినప్పుడు తన కొడుకునెడ నతండు సేసిన యధర్మం బుగ్గడించి గర్హించిన విధంబు మృతుండైనను మొగంబునం దోఁచుచున్నది. భూరిశ్రవు తల్లి యది యతనిని వల్లభునిఁ బొరిఁ బొరిం గనుంగొనుచు గద్గదకంఠంబుతో నా సోమదత్తు నుద్దేశించి. 127

ప్రతిపదార్థం: సోమదత్తుఁడు; పుత్రశోక+ఆయత్తుండు+ఐ+ఉండి= కుమారుడి మరణశోకానికి వశుడై ఉండి; తన్నున్= తనను; సాత్యకి; కవిసినప్పుడు= ముట్టడించినప్పుడు; తన కొడుకు+ఎడన్= తన కుమారుడి విషయంలో; అతండు+చేసిన= ఆ సాత్యకి చేసిన; అధర్మంబు= అధర్మయుద్ధం (నీచకార్యం); ఉగ్గడించి= పేర్కొని; గర్హించిన= నిందించిన; విధంబు= తీరు; మృతుండు+ఐనను= ఆ సోమదత్తుడు చనిపోయినా; మొగంబునన్= ముఖంలో; తోఁచుచున్నది= కనిపిస్తున్నది; భూరిశ్రవు తల్లి= సోమదత్తుడి భార్య; అది= ఆమె; అతనిని= ఆ భూరిశ్రవుడిని; వల్లభునిన్= తన భర్తను; పొరిన్+పొరిన్= మాటిమాటికి; కనుంగొనుచున్= చూస్తూ; గద్గద కంఠంబుతోన్= డగ్గుత్తిక పడిన గొంతుతో; ఆ సోమదత్తున్= ఆ సోమదత్తుడిని; ఉద్దేశించి= చూసి.

తాత్పర్యం: ఆ సోమదత్తుడు పుత్రశోకంతో కూడినవాడై తన మీదికి సాత్యకి దూసుకొని వచ్చినప్పుడు తన కుమారుడి విషయంలో అతడు చేసిన నీచకార్యాన్ని పేర్కొని నిందించిన తీరు ఆ సోమదత్తుడు చనిపోయినా అతడి ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నది (అంటే ముఖదర్పణంలో ఆ నరాల బిగింపు, ఆవేశం, క్రోధం, అవమానం అవన్నీ అట్లాగే ప్రతిబింబిస్తున్నాయని అర్థం). అదిగో ఆమె భూరిశ్రవుడి తల్లి. తన కొడుకును, తన భర్తను మార్చి మార్చి చూస్తూ వణకిపోతున్న కంఠంతో భర్తను ఉద్దేశించి ఇట్లా అంటున్నది).

సీ. ఓ రాజ! కల్పక్షయోపమానంబగు । కౌరవజాతి సంక్షయము చూడ
కున్నాఁడ వధిక దానోజ్జ్వలు బహుమహా । ధ్వరకర్త భూరిశ్రవసుఁడు నీదు
గారాబుపట్టి సంక్రందననందను । దుర్విక్రమంబునఁ దునుమఁబడిన
బాహువు సాత్యకి పాపకర్మంబున । సంఛిన్నమైన మస్తకము నై మ

ఆ. హీతలమునఁ బడియె నిప్పుణ్యసంతతి । దిక్కుసూడ వేల? యొక్కమాటు
కొడుకు చుట్టు నేడ్చు కోడండ్ర యలమట । యరయ విట్లు దగునె యధిప! నీకు? 128

ప్రతిపదార్థం: ఓ రాజ!= ఓ సోమదత్త మహారాజా!; కల్పక్షయ+ఉపమానంబగు= కల్పాంతంతో సమానమైన; కౌరవజాతి= కురువంశ; సంక్షయము= నాశనం; చూడక+ఉన్నాఁడవు= చూడకుండా ఉన్నావు (చూడకుండానే వెళ్లిపోయావా! అని అర్థం); అధిక దాన+ఉజ్జ్వలు= మిక్కిలి దానధర్మాలచేత ప్రకాశించేవాడు; బహుమహా+అధ్వరకర్త= గొప్ప యాగాలను చాలా వాటిని చేసినవాడు; నీదు గారాబుపట్టి= నీ ముద్దులకొడుకు; భూరిశ్రవసుఁడు (అంటే పెద్దల దగ్గర బాణ ధర్మసూక్ష్మాలు శాస్త్ర చర్చలు విన్నవాడని అర్థం); సంక్రందననందను= ఇంద్ర కుమారుడైన అర్జునుడి; దుర్విక్రమంబునన్= దుష్టపరాక్రమంతో; తునుమన్+పడిన= ఖండించబడిన; బాహువు= భుజం(కలవాడై); సాత్యకి; పాపకర్మంబునన్= నీచమైన పనివలన; సంఛిన్నమైన= తెగగొట్టబడిన; మస్తకమున్+ఐ= తలగల్గినవాడై; మహీతలమునన్= నేలమీద; పడియెన్= పడ్డాడు; ఈ+పుణ్యసంతతి+దిక్కు= ఈ పుణ్యపురుషుడైన కుమారుడివైపు; ఒక్కమాటు= ఒక్కసారి; చూడవు+ఏల?= చూడకున్నావెందుకు?; కొడుకుచుట్టు= నీ కుమారుడి చుట్టూ; ఏడ్చు= ఏడుస్తున్న; కోడండ్ర+అలమట= కోడళ్ళ దుఃఖం; అరయవు= తెలిసికొని పరామర్శించవు; అధిప!= మహారాజా!; ఇట్లు= ఇలా చేయటం; నీకున్+తగునె?= నీకు తగిన పనేనా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ సోమదత్తమహారాజా! యుగాంతంతో ఉపమింపదగిన కురువంశ నాశనాన్ని చూడలేకుండా వెళ్ళిపోయావా? ఎన్నో దానధర్మాలు చేసినవాడు, ఎన్నో మహాయాగాలు చేసినవాడు, నీ ముద్దులకొడుకు అయిన భూరిశ్రవుడిని చూస్తున్నావా? అర్జునుడు దుర్మార్గంగా విజృంభించి భుజం తెగగొట్టాడు. సాత్యకి అతి నీచంగా తల నరికాడు. అట్లా నీ కొడుకు నేలకూలాడు. నీ కొడుకును ఒక్కసారి ఎందుకు పలకరించవు? నీ కుమారుడి చుట్టూ చేరి ఏడుస్తున్న కోడళ్ళను ఎందుకు పరామర్శించవు? మహాప్రభువైన నీకు ఇది తగినదేనా?

క. **వీ రేవు రొంటి చీరలుఁ। దారును విరిదలలతోడఁ దద్దయు నడలుం**
గూరి పలవించెదరు నిను। సారసికల భీతిరుతుల చందము దోఁపన్. **129**

ప్రతిపదార్థం: వీరు+ఏవురు= నీ కోడళ్ళు ఐదుగురూ; ఒంటిచీరలన్= ఏకవస్త్రలై; తారును= తాము; విరిదలలతోడన్= విరబోసుకున్న వెంట్రుకలతో; తద్దయున్= మిక్కిలిగా; అడలున్+కూరి= దుఃఖంలో మునిగి; సారసికల= ఆడబెగ్గురు పక్షుల; భీతిరుతుల= భయంతో కూడిన అరపుల; చందము= తీరు; తోఁపన్= తోచేటట్లుగా; పలవించెదరు నినున్= నిన్ను గూర్చి ప్రలాపాలు చేస్తూ ఏడుస్తున్నారు;

తాత్పర్యం: నీ కోడళ్ళు ఐదుగురూ ఏకవస్త్రలై, విరబోసుకున్న జుట్లు కలిగినవారై మిక్కిలిగా దుఃఖంలో మునిగిపోయి నిన్ను గురించి విలపిస్తున్నారు. ఆ ఏడుపు ఆడబెగ్గురు పిట్టలు భయంతో అరిచిన తీరుగా ఉన్నది.

విశేషం: అలం: ఉపమ.

ఆ. **ఆలమునకు వెడలునప్పు డిచ్చితి నీదు। పసిఁడి గొడుగు లసిత విభవుఁ**
డగుట కది నికృత్తమై పడి యున్నది। య క్కుమారు రథమునందుఁ జూడు. **130**

ప్రతిపదార్థం: ఆలమునకున్= యుద్ధానికి; వెడలు+అప్పుడు= బయలు దేరినప్పుడు; పసిఁడి గొడుగున్= బంగారు గొడుగును; సుతుఁడు= కుమారుడు; లసిత= వెలుగొందిన; విభవుఁడు= వైభవం కలవాడు (వైభవోపేతుడు కావాలని అర్థం); అగుటకున్= కావాలని; ఇచ్చితి(వి)= ఇచ్చావు; అది= ఆ గొడుగు; నికృత్తమై= విరగగొట్టబడి; పడి+ఉన్నది; ఆ+కుమారు= భూరిశ్రవుని; రథమునందున్+చూడు= రథంలో చూడుము.

తాత్పర్యం: రాజా! నీవు నీ కుమారుడు యుద్ధానికి బయలుదేరుతున్నపుడు వైభవోపేతుడుగా ఉండాలని బంగారు గొడుగును బహుమతిగా ఇచ్చావు. ఆ గొడుగు శత్రు సైన్యంచేత విరుగగొట్టబడి నీ కుమారుడి రథంలో పడి ఉన్నది చూడుము!).

క. **అని పనవుచున్నయది య। వ్వనితను గోడండ్రఁ జూడ వశమే? ఘనుఁ డ**
ర్జునుఁ డిట్టి నీచకర్మం। బున కెట్టులు సొచ్చెనో! కుపురుషుఁడ పోలెన్. **131**

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పనవుచున్న+అది= రోదిస్తున్నది; ఆ+వనితను= ఆమెను; కోడండ్రన్= కోడళ్ళను; చూడన్+వశమే?= చూడటానికి సాధ్యమా?; ఘనుఁడు= మహావీరుడైన; అర్జునుఁడు; కుపురుషుఁడ+పోలెన్= నీచ మానవుడిలాగా; ఇట్టి= ఇట్లాంటి; నీచకర్మంబునకున్= నీచమైన పనికి; ఎట్టులు= ఏ విధంగా; చొచ్చెనో!= సిద్ధపడ్డాడో!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని అంటూ ఆమె ఎన్నో విధాలుగా భర్తను తలచుకొని ఏడుస్తున్నది. ఆమెను ఆమె కోడళ్ళను చూడటానికి శక్యం కావటంలేదు. మహావీరుడైన అర్జునుడే ఇట్లాంటి నీచకార్యానికి ఎట్లా ఒడిగట్టాడు? ఈ పని ఎవరో నీచులు చేయదగింది.

కవిరాజ విరాజితము:

విను మది సాత్యకి చచ్చుట కోర్వక వీరవరుండగు పార్థుఁడు సే
సిన తగవైనను నయ్యె నతం డటు చే నఱుకన్ మునియైన మహా
త్మునిఁ గని యుబ్బుచు సాత్యకి యేమని త్రుంచె శిరంబు? కడంగి జగం
బున నొరు లింత నికృష్టపుఁ గర్మము పొంతను బోదురె? చక్రధరా! 132

ప్రతిపదార్థం: చక్రధరా!= చక్రాన్ని ధరించిన శ్రీకృష్ణా!; అది+విను= ఆ సంఘటన వినుము; సాత్యకి; చచ్చుటకున్+ఓర్వక= చనిపోవటాన్ని సహించలేక; వీరవరుండగు= వీరులలో శ్రేష్ఠుడైన; పార్థుఁడు= అర్జునుడు; చేసిన= చేసినటువంటి; తగవు= న్యాయం; ఐనను+అయ్యెను= అయితే అయినది; అతండు= ఆ అర్జునుడు; అటు= ఆ రీతిగా; చే+నఱుకన్= చేతిని నరికివేయగా; ముని+ఐన= ముని అయినటువంటి; మహాత్మునిన్+కని= మహాత్ముడైన భూరిశ్రవసుని చూచి; ఉబ్బునన్= విజృంభించి; సాత్యకి= సాత్యకి; శిరంబు= తలను; కడంగి= మిక్కిలి ప్రయత్నించి; ఏమని= ఏ ప్రయోజనం కోసం; త్రుంచెన్?= నరికాడు?; జగంబునన్= ఈ ప్రపంచంలో; ఒరులు= ఇతరులు ఎవరైనా సరే; ఇంత= ఇంతటి; నికృష్టపు+కర్మము+పొంతను= నీచమైన పని దగ్గరికైనా; పోదురె?= వెళ్ళుతారా?

తాత్పర్యం: కృష్ణా! అది ఎట్లా జరిగిందో వినుము. సాత్యకి చనిపోవటాన్ని అర్జునుడు భరించలేడు కాబట్టి, అట్లా చేయి నరికి 'న్యాయం' అనుకొన్నా డనుకొందాము. మరి ఆ భూరిశ్రవుడు సాధువే! ఆ మహాత్ముడిని సమీపించి విజృంభించి పూనుకొని ఆయన తలను సాత్యకి నరికి ఏమి సాధించాడు? అసలు జగత్తులో ఎవరైనా ఇంత నీచపుపని దగ్గరకైనా వెళ్తారా? నీవే చెప్పుము!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. కవిరాజవిరాజితంలో ప్రతిపాదానికీ న, జ, జ, జ, జ, జ, స, ర అనే గణాలుంటాయి. 1-14 అక్షరాలకు యతిమైత్రి. ప్రాస నియమం కలదు.

క. ఇక్కురువరు నాండ్రురలో । నొక్కత యతిరమ్యమూర్తి యుత్సంగమునం
దక్కర మిడికొని పనవెడు । నెక్కుడువగ నూని యదె మహీధర! కంటే? 133

ప్రతిపదార్థం: మహీధర!= భూసతిని ధరించినవాడా! (విష్ణురూపుడైన కృష్ణా!); ఈ+కురువరు= ఈ కురుశ్రేష్ఠుడియొక్క; ఆండ్రురలోన్= భార్యలలో; అతిరమ్యమూర్తి= మిక్కిలి సౌందర్యవతి; ఒక్కత= ఒకామె; ఉత్సంగమునన్= తొడమీద; ఆ+కరము= ఆ భుజాన్ని; ఇడుకొని= ఉంచుకొని; ఎక్కుడు వగన్+ఊని= ఎక్కువ దుఃఖాన్ని పొంది; పనవెడున్= శోకిస్తోంది; అదె= అదిగో అక్కడ; కంటే?= చూస్తున్నావా?

తాత్పర్యం: కృష్ణా! ఈ భూరిశ్రవుడి భార్యలలో అందమైన ఒక స్త్రీ అతడి చేతిని తన తొడపై ఉంచుకొని మిక్కిలి శోకంతో కుమిలిపోతూ ఏడుస్తున్నది. అదిగో చూస్తున్నావా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. మెలుపారఁగాఁ బట్టి మొలనూలి మణులు గ । దల్చుచుఁ దిగుచుచుఁ దగులొనర్చుఁ
జనుఁగవ మీఁది కల్లన వచ్చి లలిత వి । మర్దనంబున లజ్జ మరలఁ ద్రోచు
నాభి యూరులు జఘనము మెత్త మెత్తన । యొత్తి ముదంబున నుల్ల మూన్చు
ననయంబుఁ దిన్నని యనువున గనయంబు । ప్రిదులంగ మెలఁపి సొక్కొదవఁ జేయ

ఆ. నిక్కరంబు నెయ్య మెక్కింప నేరంగఁ । దగిలి సంతతంబుఁ దలఁచునట్టి
భంగి మెఱయ గీడువఱుపంగఁ గొనియాడ । వలఁతి నీఱు సేయవలసె దీని. 134

ప్రతిపదార్థం: మెలుపు+ఆరఁగాన్= సౌకుమార్యం నిండగా; పట్టి= పట్టుకొని; మొలనూలి= కటి సూత్రంలోని; మణులు= మణులను; కదల్చుచున్= కదలిస్తూ; తిగుచుచున్= లాగుతూ; తగులు+ఒనర్చు= తమిని పుట్టిస్తుంది (ఈ+కరము= ఈ చేయి); చనుఁగవ మీఁదికిన్= స్తనాలమీదికి; అల్లన= మెల్లగా; వచ్చి= వచ్చి; లలిత విమర్దనంబునన్= నెమ్మదిగా పిసకటం వలన; లజ్జన్= సిగ్గును; మరలన్+త్రోచున్= మరలిపోయేలా చేస్తుంది; నాభి=బొడ్డు; ఊరులు= తొడలు; జఘనము= పిరుదు; మెత్తమెత్తని= సుతిమెత్తగా; ఒత్తి= ఒత్తి; ముదంబునన్= సంతోషంతో; ఉల్లము+ఊన్చు= హృదయాన్ని సంతోషింపచేస్తున్నది (ఊంచు - ఊయలలూపుతుంది); అనయంబున్= ఎప్పుడూ; తిన్నని+అనువునన్= మనోహరమైన రీతిలో; గనయంబు= పోకముడి; ప్రిదులంగన్= ఊడిపోయేలా; మెలఁపి= చేసి; చొక్కు= పారవశ్యం; ఒదవన్+చేయన్= కల్గించటానికి; ఈ+కరంబు= ఈ చేయి; నెయ్యము= ప్రేమను; ఎక్కింప నేరంగన్= అధికం చేయడానికి సమర్థమై; తగిలి= స్పృశించి; సంతతంబున్= ఎల్లప్పుడూ; తలఁచునట్టి భంగిన్= తలుచుకునే రీతిలో; మెఱయన్= ప్రకాశిస్తుండగా; దీనిన్= దీన్ని; కొనియాడవలఁతి= ప్రశంసించదగిన నేర్పరితనం కల్గినది కాగా; కీడు పఱుపంగన్= నాశనం చేయగా; నీఱు+చేయవలసెన్= అగ్నికి ఆహుతి చేసి బూడిద చేయాల్సి వచ్చింది.

తాత్పర్యం: ఆ భూరిశ్రవుని భార్య తన భర్తచేతి గొప్పతనాన్ని గురించి ఇట్లా విలపిస్తున్నది - 'ఈ చేయి సుకుమారంగా కటిసూత్రాన్ని పట్టుకొని అందులోని మణులను కదిలిస్తూ లాగుతూ ఆసక్తిని అధికం చేసేది. స్తనాలమీదికి నెమ్మదిగా వచ్చి సుతారంగా పిసుకుతూ సిగ్గును పోగొట్టేది. బొడ్డును, తొడలను, పిరుదులను మెత్త మెత్తగా ఒత్తుతూ హృదయాన్ని ఊయల లూపేది. ఎప్పుడూ చాలా తిన్నగా పోకముడిని సడలించి నన్ను పారవశ్యం పాలు చేసేది. ఈ చేయి తగిలిన వారికి ఎప్పుడూ ప్రేమ అధికం కావటమే. ఎవరూ ఈ చేతిని మరవలేరు. ఇది ఎప్పుడూ మెచ్చుకోదగిన బంగారు చేయి. అట్లాంటి దీనిని నరికి పారవేయగా ఈనాడు మంటలలో వేసి బూడిద చేయాల్సివస్తున్నది.

విశేషం: ఈ పరిస్థితిలో కూడా ఎంత శృంగారం!

ఆ. ఒరుని తోడఁ బోర హరి సూడ సిగ్గఱి । యేసె విజయుఁ డతని యేటు సభల
న ముకుందుఁ డెట్టు లగ్గించు? నట్టి వి । వ్వచ్చుఁ డేమిభంగి మెచ్చుఁ దన్ను? 135

ప్రతిపదార్థం: ఒరునితోడన్= మరి ఒకడితో; పోరన్= యుద్ధం చేస్తుండగా; హరి+చూడన్= శ్రీకృష్ణుడు చూస్తూండగా; సిగ్గు+అఱి= సిగ్గు వదలి; విజయుఁడు= అర్జునుడు; ఏసెన్= ఈ చేతిని విరగొట్టాడు; అతని+ఏటున్= అట్లా అతడు కొట్టటాన్ని; ఆ+ముకుందుఁడు= ఆ కృష్ణుడు; సభలన్= పదిమంది పెద్దలు చేరి న్యాయం చెప్పేచోట; ఎట్టులు= ఏ విధంగా; అగ్గించున్?= ప్రశంసించగలుగుతాడు?; అట్టి= అలాంటి; వివ్వచ్చుఁడు= అర్జునుడు; ఏమిభంగిన్= ఏ విధంగా; తన్నున్= తన్నుతాను; మెచ్చున్?= పొగడుకోగలడు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మరొకడితో యుద్ధం చేస్తుండగా (సాత్యకితో యుద్ధం చేస్తున్నప్పుడు) శ్రీకృష్ణుడు చూస్తుండగా సిగ్గు విడిచి అర్జునుడు భూరిశ్రవుడి చేయి నరికాడు. పదిమంది పెద్దలు చేరినచోట అర్జునుడు చేసిన ఈ పనిని కృష్ణుడు ఎట్లా మెచ్చుకొంటాడు? అసలు అర్జునుడు బీభత్సుడని కదా పేరు. అతడు మాత్రం తాను చేసిన ఈ పనిని 'ఏం గొప్ప' అని పొగడుకొనగలడు?

వ. అని యిట్లు విలాపంబు చేసి యూరకున్న దిన్నాతిం దక్కటి యెలనాఁగ లేలిన దానిఁ బొదివికొని యున్న వా రాలోకింపుము. 136

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; విలాపంబు+చేసి= ఏడ్చి; ఊరకున్నది= ఊరకే ఉండిపోయింది; ఈ+నాతిన్= ఈ స్త్రీని; తక్కటి= తక్కిన; ఎలనాఁగలు= స్త్రీలు; ఏలినదానిన్+పోలెన్= మహారాణినివలె; పొదివికొని= పొదువుకొని; ఉన్నవారు= ఉన్నారు; ఆలోకింపుము= చూడుము.

తాత్పర్యం: అని ఈ రీతిగా ఏడ్చి ఏడ్చి ఆమె ఊరుకొన్నది. తక్కిన స్త్రీలు ఈమెను పట్టపురాణివలె పొదువుకొని ఉన్నారు. చూడుము.

గాంధారి శకుని కళేబరంబు గాంచి యతని చేఁత లుగ్గడించి శోకించుట (సం. 11-24-21)

సీ. మేనల్లుఁడగు నకులానుజు నేటులఁ । బడియుండి శకునుల పాలువడ్డ
శకునిఁ జూచితె? మురసంహర! యితఁడు మా । యా జాలమునకు నాఁడోజ సకల
మాయలు నీ చేత మడిసె దుర్ద్యూతంబు । నొనరించి రాజ్యంబు గొనియె ధర్మ
తనయునిచే నిప్డు దన చెయ్దు ఫలియించె । ననియను జూదంబునందుఁ బ్రాణ

ఆ. మోటు వడియె నెత్తమాటకు నీతండు । గఱచు టెల్లఁ గురునికాయనాశ
మునకు నయ్యె నీ నృపుఁడ కాఁడె పాండు నం । దనుల తోడివైరమునకుఁ గర్త? 137

ప్రతిపదార్థం: మేనల్లుఁడు+అగు= మేనల్లుడైనటువంటి; నకుల+అనుజున్= సహదేవుని; ఏటులన్= దెబ్బలచేత(బాణపు); పడి+ఉండి= నేలమీదపడి ఉండి; శకునుల= రాబందుల; పాలు+పడ్డ= పాలుపడిన; శకునిన్= నా సోదరుడు శకునిని; చూచితె?= చూశావా?; మురసంహర= కృష్ణా!; ఇతఁడు= ఈ శకుని; మాయాజాలమునకున్= మాయా జాలాలు చేయడంలో; నాఁడు= ఆనాడు; ఓజ= ఉపాధ్యాయుడు; సకలమాయలు= అన్ని మాయలు; నీచేతన్= నీ చేతుల్లో; మడిసెన్= నశించాయి. దుర్ద్యూతంబున్= దుర్మార్గపద్ధతిలో జూదాన్ని; ఒనరించి= ఆడి; ధర్మతనయుచేన్= ధర్మరాజు నుండి; రాజ్యంబున్+కొనియెన్= రాజ్యాన్ని లాగుకొన్నాడు; ఇప్డు= చివరికి, ఈనాడు; తన= తనయొక్క; చెయ్దు= చేత(పాపకర్మ); ఫలియించెన్= ఫలించింది; అని+అను= యుద్ధమనేటువంటి; జూదంబునందున్= జూదంలో; ప్రాణము+ఓటు+పడియెన్= ప్రాణం ఓడిపోయాడు; నెత్తము+ఆటకున్= జూదం ఆడటానికి; ఈతండు= ఇతడు; కఱచుట+ఎల్లన్= చేసిన అభ్యాసమంతా; కురునికాయ నాశమునకున్= కురు సమూహ వినాశానికి; అయ్యెన్= పనికి వచ్చింది; ఈ నృపుఁడ+కాఁడె!= ఈ రాజే కదా!; పాండునందనుల తోడి= పాండు కుమారులతో; వైరమునకున్+కర్త?= శత్రుత్వానికి మూలం?

తాత్పర్యం: స్వయానా తన మేనల్లుడైన సహదేవుడి వాడి బాణాల దెబ్బలకు చిక్కి, ప్రాణాలు పోయి, నేలబడి రాబందులపాలైన సోదరుడు శకునిని చూస్తున్నావా! కృష్ణా! ఈ శకుని ఆ రోజులలో మాయలు పన్నటంలో అందరికీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గురుస్థానంగా ప్రకాశించాడు. కాని అన్ని మాయలూ నీ చేతిలో నశించాయనుకో. ఆనాడు మోసంగా జూదమాడి ధర్మరాజునుండి రాజ్యమంతా లాగుకొన్నాడు. చివరికి ఈనాడు యుద్ధమనే జూదంలో తన ప్రాణాన్నే ఒడ్డి ఓడిపోయాడు. ఈ నాటికి ఇతని పాపకర్మ ఫలించింది. అసలు జూదమాడటానికి ఇతడు చేసిన నిరంతరమైన అభ్యాసం కురువంశ నాశనానికి తప్ప ఎందుకు పనికి వచ్చింది? నిజానికి పాండుకుమారులతో వైరం రావటానికి మూలం కూడా ఇతడే.

విశేషం: ద్వాపరయుగం 'సంశయ' ప్రధానమైనదట. 'శకునం' - అంటే నిశ్చయజ్ఞానం లేకపోవటమే. దుర్యోధనుడికి 'శకుని' మంత్రి కావటంలో రహస్య మిదే. అందుకే జీవితాంతం దుర్యోధనుడిని ధర్మపద్ధతికి వ్యతిరేకంగానే నడిపించాడు. అందుకే పాండవులతో నిరంతరవైరం నడిపినవాడు శకునే. అందుకే గాంధారి ఈమాట అంటున్నది.

క. హిత మొనరించెద నంచున్ । ధృతరాష్ట్ర తనూభవునకుఁ దెక్కలికాఁడై
మృతి యొనరించెం దానును । మృతుఁ డయ్యెను భ్రాతృపుత్ర మిత్ర యుతముగన్. 138

ప్రతిపదార్థం: హితము= మంచిది; ఒనరించెదను+అంచున్= చేస్తాను అంటూ; ధృతరాష్ట్ర తనూభవునకున్= దుర్యోధనుడికి; తెక్కలికాఁడై= మోసగాడై(వంచకుడై); మృతి+ఒనరించెన్= చావుతెచ్చిపెట్టాడు; తానును= తానుకూడా; మృతుఁడు+అయ్యెన్= చనిపోయాడు; భ్రాతృ= సోదరులతో; పుత్ర= కొడుకులతో; మిత్రయుతమునన్= స్నేహితులతో (కలిసి - చనిపోయాడు).

తాత్పర్యం: 'నీకు మంచి చేస్తాను' అంటూ దుర్యోధనుడికి ఈ మోసగాడు చివరకు మరణం తెచ్చిపెట్టాడు. అంతేకాక తానుకూడా సోదరులతో, కొడుకులతో, స్నేహితులతో కలిసి చనిపోయాడు.

మత్తకోకిల:

వార లస్త్రహతాంగులై యనవద్యలోకము గాంచి రీ
వైరకర్తయు నట్లు గాంచెను వారి నల్పవిచారులం
బోరి కెత్తెడునట్లుగాఁ దగఁ బొంది వెఱ్ఱులఁ జేసె నీ
క్రూరుఁ డందును నన్నదమ్ములకున్ విరోధము సేయఁడే? 139

ప్రతిపదార్థం: వారలు= కురుపుత్రులు; అస్త్ర+హత+అంగులు+ఐ= అస్త్రాల చేత నశింపచేయబడిన శరీరాలు గలవారై; అనవద్య= పుణ్య; లోకమున్= లోకాన్ని; కాంచిరి= పొందారు; ఈ+వైరకర్తయున్= ఈ విరోధమూలమైన శకునికూడా; అట్లు+కాంచెను= అట్లాగే దోషరహితమైన స్వర్గాన్ని పొందాడు; వారిన్= వారిని (ఆ కురుకుమారులను); అల్పవిచారులన్= అల్పజ్ఞానులను; పోరికిన్+ఎత్తెడునట్లుగాన్= యుద్ధానికి సిద్ధపడే విధంగా; తగన్+పొంది= తగినట్టుగా వశం చేసుకొని; ఈ క్రూరుఁడు= ఈ కఠినాత్ముడు; వెఱ్ఱులన్+చేసెన్= వెర్రివాడిగా చేశాడు; అందున్= అందులోనూ; అన్నదమ్ములకున్= అన్నదమ్ములకు; విరోధము+చేయఁడే?= విరోధం కల్పించడా?

తాత్పర్యం: ఈ కురుకుమారులు అస్త్రాలచేత నశించిన శరీరాలు కలవారై స్వర్గానికి వెళ్ళిపోయారు. ఈ వైరానికి మూలమైన ఈ శకునికూడా అట్లాగే స్వర్గం పొందాడు. అసలే కౌరవులు అల్పజ్ఞానులు. అల్పబుద్ధులుకూడా. అట్లాంటివారిని వశం చేసికొని వెర్రివారిగా మార్చి యుద్ధానికి సిద్ధపడేటట్లు చేసినవాడు ఈ శకునే. అట్లాంటివాడు అన్నదమ్ముల మధ్య విరోధాన్ని కల్పించడా!

విశేషం: వృత్తలక్షణానికి చూడండి : స్త్రీ. 1. 21.

క. రుచిరాంగదు శస్త్రనిచయు । నిచితాంగకునిం గళింగనృపుఁ గంటి సమి
ద్విచరణ విహరణమున నితఁ । డ చలితధృతి యగుట యెఱుఁగ నయ్యెడుఁ గృష్ణా! 140

ప్రతిపదార్థం: కృష్ణా!= కేశవా!; రుచిర+అంగదున్= కాంతిమంతమైన భుజకీర్తులు గలవాడు; శస్త్రనిచయ= శస్త్ర సమూహంతో; నిచితాంగకునిన్= నిండిన అవయవాలు కల్గిన వాడిని; కళింగనృపున్= కళింగరాజును; కంటిన్= చూచాను; సమిత్= యుద్ధంలో; విచరణ విహరణమునన్= భ్రమించటమనే ఆటలో; ఇతఁడు= ఈ కళింగరాజు; అచలిత= చలించని; ధృతి+అగుట= ధైర్యం కలవాడనటం; ఎఱుఁగన్+అయ్యెడున్= స్పష్టమవుతోంది.

తాత్పర్యం: కృష్ణా! ఇతడే కళింగదేశాధిపతి. అందమైన భుజకీర్తులు కల్గిన ఇతడి దేహం నిండా శస్త్రాలు నాటుకొని ఉన్నాయి. ఈ శస్త్రాల వ్యాప్తిని బట్టి ఇతడు యుద్ధరంగంలో వీరవిహారం చేయడంలో ఏమాత్రం ధైర్యం మొక్కవోనివాడని స్పష్టమవుతున్నది. చూస్తున్నావా!

ఆ. ఇతని చుట్టునున్న యెలనాఁగ లడలునఁ । గూరి వందియును ముకుంద! యొప్ప
వాయకున్నవారు బలితంపువడఁబడ్డ । పుష్పదామకముల పొలుపు దోఁప. 141

ప్రతిపదార్థం: ముకుంద!= కృష్ణా!; ఇతనిచుట్టున్= ఇతనిచుట్టూ; ఉన్న= చేరి ఉన్న; ఎలనాఁగలు= స్త్రీలు; అడలునన్+కూరి= దుఃఖంలో మునిగి; వందియును= వాడిపోయి కూడా; బలితంపు+వడన్+పడ్డ= బలమైన వడదెబ్బతిన్న; పుష్పదామకముల= పూలదండల; పొలుపు+తోఁపన్= విధం తోపగా; ఒప్పు= అందాన్ని; పాయకున్నవారు= పోగొట్టుకోకుండా ఉన్నారు.

తాత్పర్యం: కృష్ణా! ఇతడి చుట్టూ చేరి ఉన్న స్త్రీలు దుఃఖంలో మునిగిపోయి ఏడుస్తూ ఉండటం వలన వాడిపోయినా బలమైన వడదెబ్బ తగిలినా పూలదండలు ఎట్లా తమ సౌందర్యం కోల్పోవో అట్లాగే అందంగా కనిపిస్తున్నారు.

విశేషం: అలం: ఉపమ.

ఉత్సాహవృత్తము:

మానినీ జనంబు సేరి మగధనాథుఁడగు జయ
త్సేను చుట్టు నేడ్వ నధిక దీన నాదములకు నా
మానసంబు సాంద్రకరుణమయతఁ బొందె మోహనం
బైన యిట్టి యేడ్పు లెందు నంబుజాక్ష! వింటిమే? 142

ప్రతిపదార్థం: అంబుజాక్ష!= కమలనయనా (కృష్ణా!); మగధనాథుఁడగు= మగధదేశాధిపతియైన; జయత్సేనుచుట్టున్= జయత్సేనుడి చుట్టూ; మానినీ జనంబు+చేరి= స్త్రీలు చేరి; ఏడ్వన్= ఏడుస్తుండగా; అధిక= అధికమైన; దీన నాదములకున్= ఆర్తితో కూడినవారి ఎలుగులకు; నా మానసంబు= నా మనస్సు; సాంద్ర కరుణమయతన్= దట్టమైన కరుణతో కూడిన లక్షణాన్ని; పొందెన్; మోహనంబు+ఐన= మనస్సును హరించేటువంటి; ఇట్టి+ఏడ్పులు= ఇట్లాంటి ఏడుపులు; ఎందున్= ఎక్కడైనా; వింటిమే?= విన్నామా?

తాత్పర్యం: కృష్ణా! మగధదేశాధిపతి అయిన జయత్సేనుడి చుట్టూ స్త్రీలు చేరి ఏడుస్తుండగా వారి మిక్కుటమైన దీనాలాపాలు విని నా మనసు నిండా దట్టంగా కరుణ వ్యాపించిపోయింది. ఇట్లాంటి మనసును మోహింపజేసే ఏడుపులను ఎక్కడైనా విన్నామా!

విశేషం: పై పద్యంలో గాంధార స్త్రీలలో ఏడ్చినా లావణ్యం కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నదని, మగధస్త్రీలలో ఏడుపులోనూ మనోహరత్వం ఉందని ఇక్కడ చెప్పటం వలన - ఆయా ప్రాంతాలలోని స్త్రీల మానసిక దైహిక వ్యవస్థలలోని తేడాను సూచిస్తున్నట్లు కనిపిస్తున్నది. అందరిదీ ఏడుపే. అందరికీ శోకముంది. కాని వ్యక్తం తీరే వేరు. ఆ తీరులోని ఆకర్షణ కూడా వేరు. అందుకే స్త్రీపర్వమని వ్యాసభగవానుడు సార్థకనామధేయం చేసి ఉండాలి. వృత్తలక్షణానికి చూడండి. స్త్రీ. 1. 48.

సీ. **కోసలనాథుండు భాసురమూర్తి బృ । హద్బలుచుట్టుఁ బ్రియాంగనాజ**
నంబులు సేరి కంపంబుతోడఁ జెమర్చు । కరముల నభిమన్యు కరవిముక్త
శరములఁ బెఱుకుచుఁ బొరి మూర్ఛఁ బొరయుచు । నప్పటికప్పటి కతని ముఖముఁ
దేఱి చూచుచు విధిఁ దిట్టుచు శోకాగ్ని । నుల్లంబు లెరియంగ నున్నవారు

ఆ. **తునిమివైవ నెండఁ దనికినఁ బెద్దయు । వంది చూడ్కి దిగువ వలను కలిమి**
దొఱఁగకున్నయట్టితోయజంబుల చంద । మయ్యెఁ జూడ వీరి యాననములు. **143**

ప్రతిపదార్థం: కోసలనాథుండు= కోసలదేశాధిపతి; భాసురమూర్తి= ప్రకాశించే శరీరంకలవాడు; బృహద్బలు చుట్టున్= బృహద్బలుని చుట్టూ; ప్రియాంగనాజనంబులు= భార్యలగుంపు; చేరి; కంపంబుతోడన్= వణకుతో; చెమర్చుకరములన్= చెమర్చుతున్న చేతులలో; అభిమన్యు= అభిమన్యుని; కర= చేతినుంచి; విముక్త= వదలబడిన; శరములన్+పెఱుకుచున్= బాణాలను తీసివేస్తూ; పొరిన్= మాటిమాటికీ; మూర్ఛన్+పొరయుచున్= మూర్ఛపోతూ; అప్పటికప్పటికిన్= మాటిమాటికీ; అతని ముఖమున్; తేఱిచూచుచున్= బాగా చూస్తూ; విధిన్+తిట్టుచున్= దైవాన్ని తిట్టుకుంటూ; శోకాగ్నిని= శోకాగ్నిలో; ఉల్లంబులు+ఎరియంగన్= హృదయాలు అడలుతుండగా; ఉన్నవారు= ఉన్నారు; వీరి+ఆననములు= వీరి ముఖాలు; తునిమివైవన్= విరిచివేయగా; ఎండన్+తనికినన్= ఎండలో ఎండినాకూడా; పెద్దయున్+వంది= మిక్కిలిగా వాడి; చూడ్కి= చూపునకు; దిగువవలను= దిగువవైపు; కలిమి+తొఱఁగక+ఉన్న= శోభను పోగొట్టుకోకుండా ఉన్న; తోయజంబుల= తామరల; చందమయ్యెన్= తీరుగా ఉన్నాయి.

తాత్పర్యం: కృష్ణా! ఈ కోసలాధిపతి పేరు బృహద్బలుడు. మిక్కిలి ప్రకాశించే శరీరం కలవా డితడు. ఇతడి భార్యలు ఇతడి చుట్టూ చేరి వణకుతూ చెమర్చుతున్న చేతులతో అభిమన్యుడి చేతినుండి వదలబడి బృహద్బలుడి శరీరంలో నాటిన బాణాలను తీసివేస్తూ మాటిమాటికి మూర్ఛపోతున్నారు. మాటిమాటికీ అతడి ముఖాన్ని తనివితీరా చూచికొంటూ దైవాన్ని తిట్టుకుంటూ శోకాగ్నిలో ఎదలు మండగా చింతాక్రాంతులై ఉన్నారు. తామరలను తూళ్ళతో సహా పెరికివేయగా ఎండలో ఎండిపోయినా దిగువవైపు శోభను పోగొట్టుకోకుండా ఉన్న విధంగా వీరి ముఖాలు సొంపుతో ప్రకాశిస్తూనే ఉన్నాయి.

విశేషం: అలం: ఉపమ. వారి దేహాలు తామరతూడులు. అవి ఎండతాకిడికి వాడిపోయాయి. తామరలు పైనకూడా వాడిపోయి ఉండవచ్చును. అట్లాగే తలలమీద ముసుగులు వేసికొన్నవారి శిరోభాగాలు కూడా కాంతి విహీనమయ్యాయి. కాని, ముసుగు లోపలి ముఖాలు మాత్రం తమ సహజకాంతితో ఒప్పి ఉన్నాయి. అది ఈ పోలికలోని స్వారస్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ద్రోణబాణపరిపీడితప్రాణులై పడియున్నవారు ధృష్టద్యుమ్ననందనులు. 144

ప్రతిపదార్థం: ద్రోణ= ద్రోణాచార్యులయొక్క; బాణ= బాణాల చేత; పరిపీడిత= బాగా పీడించబడిన; ప్రాణులు+ఐ= ప్రాణాలు గలవారై; ధృష్టద్యుమ్న నందనులు= ధృష్టద్యుమ్నుడి కొడుకులు; పడి+ఉన్నవారు= పడి ఉన్నారు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడి కొడుకులు ద్రోణాచార్యులు ప్రయోగించిన బాణాల చేత పీడించబడి ప్రాణాలు కోల్పోయి పడి ఉన్నారు.

మత్తకోకిల:

అంగదంబులుఁ గంకణంబులు హారవల్లులు నాదిగా
నంగకంబుల భూషణంబులు హారికాంతి వెలుంగఁ
సంగరాంగణభూమికిం దమచారుభావ మలంక్రియా
సంగతిం గలిగింప నొప్పిరి శౌరి! చూచితె వీరలన్? 145

ప్రతిపదార్థం: శౌరి!= కృష్ణా!; అంగదంబులు= భుజకీర్తులు; కంకణంబులు= కడియాలు; హారవల్లులున్= సన్నటి మణులు గూర్చిన దండలు; ఆదిగాన్= మొదలైనవి - కల్గి; అంగకంబుల= అవయవాలయొక్క; భూషణంబులు= నగలు; హారికాంతిన్= మనోహరమైన కాంతితో; వెలుంగగాన్= ప్రకాశిస్తుండగా; సంగర+అంగణ+భూమికిన్= యుద్ధభూమికి; తమ= తమయొక్క; చారుభావము= అందం; అలంక్రియా సంగతిన్= అలంకారంతో ఒప్పినదిగా; కలిగింపన్= చేయగా; ఒప్పిరి= ప్రకాశిస్తున్నారు; వీరలన్= వీరిని; చూచితె?= చూచావా?

తాత్పర్యం: కృష్ణా! వీరి భుజకీర్తులు, కడియాలు, సన్నటిమణులతో కూర్చిన దండలు, ఆయా అవయవాలలో పొదిగిన నగలు మనోహరమైన కాంతితో ప్రకాశిస్తున్నాయి. ఈ చిన్నవారు సమరభూమికి తమ సౌందర్యాన్ని అలంకారంగా సమర్పించిన రీతిగా వెలుగుతున్నారు. వీళ్ళను చూస్తున్నావా!

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. వృత్తలక్షణం - చూడండి: స్త్రీ. 1.21

నర్కుటము:

త్వరిత రథాశ్వమారుత గతస్ఫురితాకృతియై
శరబహుళార్చిరుద్గమవిశాలతఁ బొల్చు ధను
ర్గురుఁడను చిచ్చుపై శలభకోటిగతింబడి మ్రం
దిరిఁ గనుఁగొంటె యేవురు నుదీర్ణులఁ గేకయులన్? 146

ప్రతిపదార్థం: త్వరిత= వేగిరింపబడిన; రథాశ్వమారుత= రథానికి కట్టిన గుర్రాలు అనబడే వాయువులో; గత= లీనమైన; స్ఫురిత= సంచరిస్తున్న; ఆకృతి+ఐ= ఆకారం కల్గినదీ; శర= బాణాల; బహుళ= ఆధిక్యంతోడి; ఉద్గమ= పొడుచుకొని వస్తున్న; విశాలతన్= వైశాల్యం కల్గిందీ (అయినటువంటి); పొల్చు= ఒప్పు; ధనుః+గురుఁడు= ధనుర్విద్యా గురుడైన ద్రోణాచార్యుడు; అను= అనబడే; చిచ్చుపైన్= మంటపైన; శలభకోటి= మిడతలదండు; గతిన్+పడి= రీతిగాపడి; మ్రందిరి= చచ్చారు; (ఈ); ఏవురన్= అయిదుగురినీ; ఉదీర్ణులన్= ఉద్రిక్తులను; కేకయులన్= కేకయ రాజులను; కనుఁగొంటే?= చూచావా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వేగంగా పోతున్న రథాశ్వాలు అనే గాలి కారణంగా కదులుతున్న ఆకారం కల్గిందీ, బాణాల ఆధిక్యంచేత విస్తరిస్తున్న వైశాల్యం కల్గిందీ అయినటువంటి ధనుర్విద్యాగురువైన ద్రోణాచార్యుడనే మంటపైన మిడతల దండు రీతిగా పడి ఈ ఐదుగురు ఉద్రిక్తులైన కేకయరాజులు మాడి చచ్చారు. చూస్తున్నావా!

విశేషం: అలం: ఉపమ - రూపకానుప్రాణితం. కదులుతున్న అశ్వాలు గల రథంలో ఉండటం వలన ద్రోణుడి ఆకారం నిర్దిష్టంగా తెలియటం లేదు. ఆయన అవిచ్ఛిన్నంగా ప్రయోగిస్తున్న బాణాల పరిధి ఎప్పటికప్పుడు విస్తరిస్తూ ఉండటం వలన ఎటు తిరిగినా ఎటు పరుగెత్తినా ఆ బాణాల దెబ్బలను తప్పించుకొనలేరని అర్థం. అది ద్రోణుడు - అనే ధనుర్విద్యా పండితుడనే 'మంట' అనే మాటకు అర్థం. వృత్తలక్షణానికి చూడండి - స్త్రీ. 1. 113.

క. పంచాననంబుచేతం । బంచత్వముఁ బొందియున్న బంధురకరిఁ బో
లించుటకుం దగి యొప్పెం । బాంచాలుఁడు ద్రోణుకడిమిఁబడి కంసారీ! 147

ప్రతిపదార్థం: కంసారీ!= కంసుడి శత్రువైన కృష్ణా!; పంచాననంబు చేతన్= సింహంచేత; పంచత్వమున్+పొంది ఉన్న= చచ్చి ఉన్న; బంధుర= పెద్దదైన; కరిన్+పోలించుటకున్= ఏనుగుతో పోల్చుటకు; తగి= తగినవాడై; పాంచాలుఁడు= పాంచాలరాజు; ద్రోణు= ద్రోణుని; కడిమిన్= విక్రమానికి; పడి= చిక్కి; ఒప్పెన్= కనిపిస్తున్నాడు.

తాత్పర్యం: కృష్ణా! ద్రోణుడి పరాక్రమానికి చిక్కి చచ్చిపడి ఉన్న పాంచాలరాజు సింహంచేత చచ్చిన పెద్ద ఏనుగువలె కనిపిస్తున్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. ద్రుపదనృపాలుని ధవళా । తపత్రమస్త్రంబులె చోటుఁ దాఁకక జిగియా
రి పొలిచె శారద చంద్రుం । డుపమాపాత్రంబు గాఁగ నుర్వియను దివిన్. 148

ప్రతిపదార్థం: ద్రుపదనృపాలుని= పాంచాలరాజైన ద్రుపద మహారాజుయొక్క; ధవళ= తెల్లనైన; ఆతపత్రము= గొడుగు; అస్త్రంబులు= అస్త్రాలు; ఏ+చోటన్= ఎక్కడా; తాఁకక; జిగి+ఆరి= కాంతులు చిమ్ముతూ; ఉర్వి+అను= భూమి అనేటువంటి; దివిన్= ఆకాశంలో; శారద= శరత్కాలంలోని; చంద్రుండు= చంద్రబింబం; ఉపమాపాత్రంబు+కాగన్= ఉపమకు తగింది కాగా; పొలిచెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: పాంచాలాధిపుడైన ద్రుపదుడి తెల్లనిగొడుగు మాత్రం ఏ అస్త్రాలకూ చిక్కకుండా కాంతులు చిమ్ముతూ భూమి అనే ఆకాశంలో శరత్కాలంలోని చంద్రబింబంవలె ప్రకాశిస్తున్నది. (అంటే శరత్కాలంలో స్వచ్ఛమైన వెన్నెల ఉంటుంది కాబట్టి ఆ గొడుగుకూడా ఏ రంధ్రాలు లేకుండా ప్రకాశిస్తున్నదని అర్థం. దీనిని బట్టి రథాన్ని ద్రుపదుడి సారథి అంత జాగరూకంగా నడిపించాడని అర్థం).

విశేషం: అలం: ఉపమ.

తే. వల్లభులును గోడండ్రు నీ వసుమతీశ్వ । రునకు నగ్నిసంస్కారంబు నొనరఁ జేసి
యుమ్మలికమునఁ దద్దయు వెమ్మునంత । రంగములతోడ నరిగిరి గంగ దెసకు. 149

ప్రతిపదార్థం: వల్లభులును= తక్కినరాజులు (వల్లభలు= భార్యలు); కోడండ్రున్= కోడళ్ళు; ఈ వసుమతీశ్వరునకున్= ఈ రాజుకు; అగ్ని సంస్కారంబున్= దహనకార్యాన్ని; ఒనరన్+చేసి= పూర్తిచేసి; ఉమ్మలికమునన్= దుఃఖంతో; తద్దయున్= మిక్కిలిగా; వెమ్మ= పరితప్తమైన; అంతరంగములతోడన్= హృదయాలతో; గంగ దెసకున్= గంగవైపు; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: మిగిలిన రాజులు, అతడి భార్యలు, కోడళ్ళు ద్రుపదమహారాజుకు దహనకార్యం పూర్తిచేసి దుఃఖాతిశయంతో పరితప్తమైన హృదయాలతో గంగవైపు వెళ్ళుతున్నారు.

క. ద్రోణుఁడు దలరం దలపడి । బాణకళావేది చేదిపతి యుజ్జ్వల త
ద్బాణహతిఁ గూలి సమర । క్షోణి పరిష్కారమగుచు శోభిల్లెఁ గడున్. 150

ప్రతిపదార్థం: ద్రోణుఁడు= ద్రోణాచార్యులవంటి ధనుర్విద్యాశూరులే; తలరన్= వణికిపోయేట్లు; తలపడి= ఎదుర్కొని; బాణకళావేది= బాణవిద్యావేత్త; చేదిపతి= చేదిభూపాలుడు; ఉజ్జ్వల= ప్రకాశించేటటువంటి పదునైన; తద్= ఆ ద్రోణుడి; బాణహతిన్= బాణపుదెబ్బలచేత; కూలి= నేలమీద పడి; సమరక్షోణి= యుద్ధభూమికి; పరిష్కారము+అగుచున్= భూషణంలాగా; కడున్= మిక్కిలిగా; శోభిల్లెన్= ప్రకాశిస్తున్నాడు.

తాత్పర్యం: ద్రోణుడివంటి బాణవిద్యాగురువే కంపించేటట్లు ఎదుర్కొని బాణవిద్యారహస్యవేత్త అయిన చేది భూపాలుడు పదునైన ఆ ద్రోణుడి అస్త్రఘాతాలకు చిక్కి నేలమీద పడి యుద్ధభూమికి ఒక గొప్పభూషణంవలె మిక్కిలి ప్రకాశిస్తున్నాడు.

విశేషం: అలం: రూపకం.

తే. తలయుఁ గాళులు దమయూరుతలములందు । బెట్టికొని వీని భార్యలు బెట్టిదంపు
టడలు తాఁకునఁ గడు బెగడారఁ గూరు । నుల్లములతోడఁ బలవించుచున్నవారు. 151

ప్రతిపదార్థం: వీని భార్యలు= ఈ చేదిరాజు భార్యలు; తలయున్= ఇతడి తలా; కాళులు= కాళ్ళూ; తమ ఊరుతలములందున్= తమ తొడలమీద; పెట్టికొని= పెట్టుకొని; బెట్టిదము+అడలు= తీవ్రమైన శోకముయొక్క; తాఁకునన్= దెబ్బతో; కడున్= మిక్కిలిగా; బెగడు+ఆరన్= బెంగతో కూడి; కూరున్= దుఃఖంలో మునిగిపోయిన; ఉల్లములతోడన్= హృదయాలతో; పలవించుచున్నవారు= ఏదేదో మాట్లాడుతూ ఉన్నారు.

తాత్పర్యం: ఈ రాజు భార్యలు ఇతడి తలను కాళ్ళను తమ తొడలమీద ఉంచుకొని తీవ్రమైన శోకపు దెబ్బతో మిక్కిలిగా నిండిన బెంగతో దుఃఖంలో మునిగిపోయిన హృదయాలతో ఏదేదో పలవరిస్తున్నారు.

క. మానవనాథు లనేకులు । వీని భుజావిక్రమంబు వేఁడిఁ బడిరి నీ
మేనమఱఁది శిశుపాలుని । సూనుం డీ ధృష్టకేతుఁ జూచితె? కృష్ణా! 152

ప్రతిపదార్థం: కృష్ణా!; మానవనాథులు= రాజులు; అనేకులు= చాలమంది; వీని= ఈ చేదిరాజుయొక్క; భుజావిక్రమంబు వేఁడిన్= భుజపరాక్రమమనే మంటలో; పడిరి= పడ్డారు; (ఇతడు); నీ మేనమఱఁది= నీ మేనత్తకొడుకు; శిశుపాలుని సూనుండు= శిశుపాలుడి కుమారుడు; ఈ+ధృష్టకేతున్= ఈ ధృష్టకేతుడిని; చూచితె?= చూశావా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కృష్ణా! ఎంతోమంది రాజులు ఈ చేదిరాజు భుజపరాక్రమమనే వేడితాకుకు చచ్చారు. ఇతడే ధృష్టకేతువు. నీ మేనత్త కుమారుడు శిశుపాలుడి కుమారుడు. గుర్తుపట్టావా?

ఉత్సాహవృత్తము:

అతని నందనుఁడు సుకేతుఁ డల్లవాఁడె ద్రోణ పా
తితుఁడు వీనిఁ జూడగా మదిన్ సుయోధనుండుఁ ద
త్సుతుఁడు దోఁచుచున్నవారు శోకవహ్నితాప మూ
ర్జితము గాఁగ బంధుజనుల చిత్తమెంత గుందునో? 153

ప్రతిపదార్థం: అతని= ఆ ధృష్టకేతుని; నందనుఁడు= కుమారుడు; సుకేతుఁడు; అల్ల+వాఁడె= అదిగోవాడే!; ద్రోణ= ద్రోణాచార్యులచేత; పాతితుఁడు= పడగొట్టబడ్డవారు; వీనిన్+చూడగా= వీడిని చూస్తుంటే; మదిన్= నా మనసులో; సుయోధనుండు= దుర్యోధనుడు; తత్సుతుఁడు= అతడి కొడుకు; తోఁచుచున్నవారు= గుర్తుకు వస్తున్నారు; శోకవహ్నితాపము= శోకమనే మంటవేడిమి; ఊర్జితము+కాఁగన్= ఎక్కువకాగా(వీరినిచూసి); బంధుజనుల చిత్తము= బంధువుల హృదయాలు; ఎంత+కుందునో?= ఎంత దుఃఖిస్తాయో?

తాత్పర్యం: ఆ ధృష్టకేతుడి కుమారుడు సుకేతుడు అడుగో వాడే. ద్రోణాచార్యుడు వాడిని పడగొట్టాడు. వీడిని చూస్తుంటే నాకు దుర్యోధనుడు, అతడి కొడుకు గుర్తుకు వస్తున్నారు. ఇట్లా తండ్రీకొడుకులను ఒకసారి చూచిన బంధువుల హృదయాలలో శోకమనే అగ్ని మరింతమంటలు రేపకుండా ఉంటుందా! వారు ఎంతగా కుందిపోతారో! (నా హృదయమూ అట్లాగే చింతా దుఃఖశోక పరితప్తమై పోయిందని అర్థం.)

విశేషం: అలం: రూపకానుప్రాణితమైన స్మృతి. వృత్తలక్షణం - చూడండి. స్త్రీ. 1. 48

తే. **అల్ల వారె యవంతీశు లధిక బాహు । బలులు విందానువిందులు బహుళభూష**
ణోజ్జ్వలులు పడియున్నవా రుగ్ర వాయు । పతిత కుసుమిత నవసాల భంగి దోఁప.' 154

ప్రతిపదార్థం: అల్ల= అరుగో; వారె= వారే; అవంతీశులు= అవంతీ రాజ్యపాలకులు; అధిక బాహుబలులు= మిక్కిలి బాహుబలం కలవారు; వింద+అనువిందులు= విందుడు, అనువిందుడు; బహుళ= అధికమైన; భూషణ= నగలచేత; ఉజ్జ్వలులు= మిక్కిలిగా ప్రకాశించేవారు; ఉగ్రవాయుపతిత= భయంకరమైన పెనుగాలికి పడిన; కుసుమిత= దండిగా పూలుపూసిన; నవ సాలభంగి= కొత్త సాలవృక్షాలలీల; తోఁపన్= స్ఫురిస్తుండగా; పడి+ఉన్నవారు= పడి ఉన్నారు.

తాత్పర్యం: అరుగో - వారే అవంతీ రాజ్యపాలకులు. మిక్కిలి బాహుబలవంతులు. వీరిని విందుడు, అనువిందుడు అంటారు. దండిగా నగలు ధరించి కాంతులీనుతూ వెలిగేవారు. భయంకరమైన పెనుగాలి తాకిడికి నేలకూలినటువంటి పూలు విరగబూసిన మద్దిచెట్లు గుర్తుకు వస్తున్నాయి - వీళ్ళను చూస్తుంటే'.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. **అని చూపి యిట్లనియె. 155**

తాత్పర్యం: అని ఆ విందానువిందులను చూపించి ఇట్లా అన్నది:

సీ. **'శాంతనవుండు నాచార్యుండుఁ గర్ణుండు । భూరిశ్రవుఁడు గురుపుత్రకుండుఁ**
గృపుఁడు సైంధవుఁడును గృతవర్మయును గురు । రాజు నమానుషరథికవరులుఁ
గలయంగ నెన్నెడు కొలఁదులవారె? వా । రలిగిన జెడుదు రయ్యమరులైన
నట్టి వీరుల బారికగపడియుండియు । నేమియుఁ గారైతి రీవుఁ బాండు

తే. **తనయు లందఱు నీ కూర్మితమ్ముఁడును । మహాద్భుత మ్మిది దలఁప భీష్మాదులైన**
వారి నటె పోర నిర్జింపవచ్చు నెట్టి । పనియు భరమె? దైవమునకుఁ బద్మనాభ! 156

ప్రతిపదార్థం: పద్మనాభ!= పద్మాన్ని నాభిలో ధరించిన ఓ కృష్ణా!; శాంతనవుండున్= భీష్ముడు; ఆచార్యుండున్= ద్రోణుడూ; కర్ణుండున్= కర్ణుడూ; భూరిశ్రవుఁడున్= భూరిశ్రవసుడూ; గురుపుత్రకుండున్= అశ్వత్థామా; కృపుఁడున్= కృపుడూ; సైంధవుఁడును; కృతవర్మయును; కురురాజున్= దుర్యోధనుడూ; అమానుష రథికవరులున్= ఇంకా తక్కిన అతిరథమహారథులు (అమానుష= అసాధారణులైన); కలయంగన్= చూడగా; ఎన్నెడు+కొలఁదులవారె?= లెక్కింపదగిన శక్తులు కలవారా?; వారు; అలిగినన్= కోపగించుకొన్న; ఆ+అమరులైనన్= ఆ దేవతలయినా; చెడుదురు= నశిస్తారు; అట్టివీరుల= అట్లాంటి మహావీరుల; బారికిన్= హింసకు; అగపడి+ఉండియున్= వశమైకూడా; ఈవున్= నీవు; పాండుతనయులందఱున్= పాండుకుమారులు ఐదుగురూ; నీ కూర్మి తమ్ముఁడును= సాత్యకీ; ఏమియున్+కారు+ఐతిరి= ఏమి కాకుండా బయటపడ్డారు; ఇది; తలఁపన్= ఆలోచించగా; మహాద్భుతమ్ము= మహాద్భుతమే; భీష్మాదులైనవారిన్= భీష్మాదిమహావీరులను; పోరన్= యుద్ధంలో; నిర్జింపవచ్చునటె!= జయించడమా!; దైవమునకున్= దేవుడికి; ఎట్టి పనియున్= ఎట్లాంటి పని అయినా; భరమె?= గొప్పదా?

తాత్పర్యం: కృష్ణా! భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, భూరిశ్రవుడు, అశ్వత్థామ, కృపుడు, సైంధవుడు, కృతవర్మ, దుర్యోధనుడు - అసాధారణమైన పరాక్రమమున్న అతిరథ మహారథులు. వీరిలో ఎవ్వరిశక్తినైనా ఇంతే అని చెప్పగలమా? వారు కోపగించుకొంటే దేవతలైనా నశిస్తారు. అట్లాంటి మహావీరుల తాకిడికి ఎదురై కూడా నీవు, పాండవులు, నీ తమ్ముడు సాత్యకి ఏ అపాయమూ లేకుండా బయటపడ్డారు. ఆలోచిస్తే ఇంతకంటే మహాద్భుతం ఏముంటుంది? భీష్మాది మహాయోధులను యుద్ధంలో జయించటమా! నమ్మటానికి వీలులేని విషయమే. అయినా భగవంతుడి చేత కాని పని ఏముంది!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. **దైవంబు దుర్యోధనాదులగు నూర్వురకు నొక్కెత్తున నిట్లగునే?' యని వెండియు. 157**

ప్రతిపదార్థం: దైవంబు= దైవం; దుర్యోధన+ఆదులకు= దుర్యోధనుడు మొదలైన; నూర్వురకున్= నూరుమందికీ; ఒక్క+ఎత్తునన్= ఒక్కరీతిగా; ఇట్లు+అగునే= ఇట్లా అవుతుందా? అని; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: దైవం దుర్యోధనాదులైన నూరుమంది పట్లా ఇట్లా ఒకేరీతిగా అన్యాయం చేస్తుందా?' అని ఇంకా ఇట్లా అంటున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తరువోజ;

కురురాజు మొదలైన కొడుకుల నెల్ల గోల్పోవు టిప్పుడు గోవింద! కలిగె;
నరిగితి సంధి సేయఁగరాకయున్న నటయప్డు నీ చెప్పుటైనది కాదె?
పరమహితంబుగఁ బలికిరి గంగపట్టియు విదురుండు పాటించి పెక్కు
వెరవుల నొత్తిన విననైతి నా వివేకుల చూ పేల వృథ నోవనేర్చు?' 158

ప్రతిపదార్థం: గోవింద!= కృష్ణా!; కురురాజు మొదలైన= దుర్యోధనుడు మొదలైన; కొడుకులన్+ఎల్లన్= కుమారులందర్నీ; కోల్పోవుట= పోగొట్టుకోవటం; ఇప్పుడు= ఈ వేళ; కలిగెన్= సంభవించింది; సంధి+చేయఁగన్= సంధి చేయటానికి; అరిగితి(వి)= వెళ్ళావు; రాకయున్నన్= సంధిచేయలేకపోయిన స్థితి వచ్చినపుడు; అట= ఆ సభలో; అప్డు= ఆ సమయంలో; నీ+చెప్పుట= నీయొక్క చెప్పుట (నీవేం చెప్పావో అది); ఐనది+కాదె!= నిజం అయిందికదా!; గంగపట్టియున్= భీష్ముడూ; విదురుండున్= విదురుడూ; పరమ+హితంబుగన్= గొప్ప మేలునుకోరి; పలిపిరి= బోధించారు; పాటించి= పూనికతో; పెక్కు+వెరవులన్= అనేక ధర్మాలను, రాజనీతులను, ఉపాయాలను; ఒత్తినన్= నొక్కి చెప్పినా; వినన్+ఐతిన్= వినకుండా పోయాను; ఆ+వివేకుల= ఆ వివేకవంతుల; చూపు+ఏల+వృథ+పోవ+నేర్చున్?= దృష్టి ఎందుకు తప్పవుతుంది?

తాత్పర్యం: కృష్ణా! దుర్యోధనుడు మొదలైన కుమారులందరినీ ఈనాడు కోల్పోయాను. నీవు ఆనాడు సంధి చేయటానికి హస్తినకు వచ్చావు. సంధి కుదరదని తెలిసినపుడు నీవు ఏ మాటలు చెప్పావో అవన్నీ నిజమయ్యాయి గదా! భీష్ముడు, విదురుడు అనేక విధాలుగా కురువంశ క్షేమాన్ని కోరి ఎంతగానో బోధించారు. పూనికతో ఎన్నో ధర్మసూక్ష్మాలు, రాజనీతులు, ఉపాయాలు నొక్కి నొక్కి చెప్పారు. అయినా నేను పుత్రవ్యామోహంతో వినకపోయాను. ఆ పుణ్యాత్ముల వివేకంతో కూడిన దూరదృష్టి తప్పవుతుందా?'

విశేషం: వృత్తలక్షణానికి చూడండి. స్త్రీ. 1.43.

వ. అని పలికి పశ్చాత్తాప దుఃఖంబు పెల్లున నొల్లంబోయి తెలిసి చిత్తస్థాయియైన పుత్రశోకం బడరి యలంతి గాని యలంతఁ బెట్ట నూరకుండి యక్కౌరవరాజపత్ని పద్మనాభుదెసఁ గనుంగొని కోపోద్దీపితయై. 159

ప్రతిపదార్థం: అని పలికి= అని ఈ విధంగా పలికి; పశ్చాత్తాప దుఃఖంబు పెల్లునన్= పశ్చాత్తాపం వలన పుట్టిన అత్యధిక దుఃఖంతో; ఒల్లంబోయి= తెలివి పోగొట్టుకొని; తెలిసి= తెలివిరాగా; చిత్తస్థాయి అయిన= చిత్తంలో నాటుకుపోయిన; పుత్రశోకంబు+అడరి= పుత్రులమరణం వలన పుట్టిన దుఃఖం అధికమై; అలంతికాని= స్వల్పంగాని (అత్యధికమైన); అలఁతన్+పెట్టన్= బాధ కల్గించగా; ఊరకుండి= కొంచెంసేపు ఊరకొని; ఆ+కౌరవరాజపత్ని= ఆ ధృతరాష్ట్రరాజు భార్య; పద్మనాభుదెసన్+కనుంగొని = కృష్ణుడివైపు చూచి; కోపోద్దీపితయై= కోపంతో మిక్కిలి మండిపోతూ (ఇలాఅంది).

తాత్పర్యం: అని చెప్పి పశ్చాత్తాపం వలన పుట్టిన దుఃఖాతిశయంతో మూర్ఛపోయి తేరుకొని మనసులో పేరుకొనిపోయిన శోకం అత్యధికమైన బాధను కల్గించగా కొంతసేపు ఊరకుండి ఆ గాంధారి కృష్ణుడిని చూస్తూ కోపంతో మండిపోతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'ధృతరాష్ట్ర పాండుభూపతుల కుమారులు। తమలోన నీసున సమరమునకుఁ
దొడఁగిన నీ వడ్డపడవైతి తగుచాలు। మానిసుల్ గలిగియు మాననీయ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వాక్యుండవయ్యును శక్యసమస్త కా । ర్యుండనఁ బేర్కొనియును నుపేక్ష
చేసితి కురురాజుఁ జెఱుపన తిరిగితి । నిఖిలరాజులఁ దదనీకములను

ఆ. నామ మడఁచి తెల్లభూములుఁ బాడయ్యెఁ । నంతవట్టు ఫలము ననుభవింపు
మేపడంగ నిన్ను శాపానలజ్వాల । దగ్ధమూర్తిఁ జేయుదాన వినుము. 160

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రుడియొక్క; పాండుభూపతులు= పాండురాజు యొక్క; కుమారులు= కొడుకులు; తమలోనన్= తమలోతాము; ఈసునన్= అసూయతో; సమరమునకున్+తొడఁగినన్= యుద్ధానికి సిద్ధపడితే; నీవు+ అడ్డపడవు+ఐతి(వి)= నీవు అడ్డుపడకుండా పోయావు; తగు= న్యాయం తెలిసినవారు; చాలు= సమర్థులైనవారు అయిన; మానుసుల్= పెద్దమనుషులు; కలిగియున్= ఉండికూడా; మాననీయ= గొప్పదైన; వాక్యుండవు+అయ్యును= మాట కలిగినవాడయికూడా; శక్యసమస్తకార్యుండు+అనన్= అన్ని పనులు చేతనయినవాడు అని; పేరు+కొనియును= పేరు పొందికూడా; ఉపేక్ష చేసితి(వి)= ఉపేక్ష చేశావు; కురురాజున్= దుర్యోధనుడిని; చెఱుపన్+అ= చెడపడానికే; తిరిగితి(వి)= రాయబారాలు చేశావు; నిఖిలరాజులన్= రాజులందరినీ; తద్+అనీకములను= వారి సైన్యాలను; నామము+అడఁచితి(వి)= పేరు కూడా లేకుండా చేశావు; ఎల్లభూములున్+పాడయ్యెన్= అన్ని ప్రాంతాలూ నాశనమయ్యాయి; అంత+పట్టు ఫలము= దానికి తగ్గఫలాన్ని; అనుభవింపుము; ఏపు+అడంగన్= నీ వైభవం సర్వనాశనం అయ్యేలా; నిన్నున్= నిన్ను; శాప+అనలజ్వాలన్= శాపమనే నిప్పుమంటలో; దగ్ధమూర్తిన్= కాలినవానిగా; చేయుదానన్= చేస్తాను; వినుము= వినుము.

తాత్పర్యం: 'పాండవ కౌరవులు తమలో తాము అసూయతో యుద్ధానికి సిద్ధపడితే నీవు వారికి అడ్డుపడకుండా పోయావు. న్యాయం తెలిసినవారు, సమర్థులు అయిన భీష్మాదులు ఉండి కూడా, నీవు సకల ధర్మవేత్త మధురభాషి అయి ఉండికూడా, అన్ని పనులు చేతనయినవాడివని పేరుపొందికూడా, నిర్లక్ష్యం చేశావు. దుర్యోధనుడిని నాశనం చేయటానికి నీవు రాయబారాలు చేశావు. రాజులను, వారి సైన్యాలను పేరు లేకుండా చేశావు. అందరూ చచ్చారు. అన్ని ప్రాంతాలూ బీడుభూము లయ్యాయి. చేసినదానికి తగిన ఫలాన్ని అనుభవించుము. నీ వైభవం సర్వనాశన మయ్యేట్లుగా నా శాపాగ్నిలో నిన్ను కాల్చి పారవేస్తాను వినుము.

గాంధారి శ్రీకృష్ణునకు శాపం బిచ్చుట (సం. 11-25-36)

సీ. పూని పాతివ్రత్యపుణ్యఫలంబున । సంపాదితంబైన సారతపము
బలిమి సాధనముగాఁ బలికెద నుత్తమ । జ్ఞాతులఁ దమలోని సంగరమునఁ
బొలియఁజేసితి గాన పొలియుదు రన్యోన్య । ఘాతుకులై భవద్ జ్ఞాతిజనులు
నీవును దప్పక నేఁ డాదిగా ముప్ప । దాఱగు నేఁడైన యద్దినమున

తే. నరయ దిక్కెవ్వరును లేని యగ్గలంపు । గుత్సితంపుఁ దెఱంగునఁ గూలువాఁడ
విట్లు మీ వధూజనములు నేడ్చువారు । పతుల సుతులను బంధులఁ బనవి పనవి.' 161

ప్రతిపదార్థం: పూని= ప్రయత్నించి; పాతివ్రత్య= పతివ్రతగా జీవించటంలో అబ్బిన; పుణ్యఫలంబునన్= పుణ్యానికి ఫలితంగా; సంపాదితంబు+అయిన= సంపాదింపబడిన; సారతపము= గొప్ప తపస్సును; బలిమి= బలమైన; సాధనముగాన్= సాధనంగా (గ్రహించి); పలికెదన్= చెబుతున్నాను; ఉత్తమజ్ఞాతులన్= మంచి దాయాదులను; తమలోని= తమలో తాము చేసుకొన్న;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంగరమునన్= యుద్ధంలో; పొలియన్+చేసితి(వి)+కానన్= చచ్చేలా చేశావు కాబట్టి; భవత్= నీయొక్క; జ్ఞాతి జనులున్= దాయాదులు కూడా; అన్యోన్య= ఒకరినొకరు; ఘాతుకులు+ఐ= కొట్టుకొని; పొలియుదురు= చస్తారు; నీవును= నీవు కూడా; తప్పక= తప్పకుండా; నేఁడాదిగాన్+ముప్పది+ఆఱగు+ఏఁడైన+ఆ+దినమునన్= సరిగా ఈ నాటికి 36 సంవత్సరాలు పూర్తి అయిన రోజున; అరయన్= చూడటానికి; దిక్కు+ఎవ్వరునులేని= దిక్కెవ్వరూ లేనటువంటి; అగ్గలంపున్+కుత్సితంపున్+ తెఱంగునన్= మిక్కిలి క్రూరమైన విధంగా; కూలువాఁడవు= చస్తావు(చావబోతావు); ఇట్లు= ఈవాళ వీళ్ళందరూ ఎట్లా ఏడుస్తున్నారో అట్లు; మీ వధూజనంబులు= మీ యాదవ కాంతలు కూడా; పతులన్= భర్తలను; సుతులను= కొడుకులను; బంధులను= బంధుజనులను; పనవి పనవి= పేరు పేరునా తలచుకొని; ఏడ్చువారు= ఏడుస్తారు.

తాత్పర్యం: ఎంతో దీక్షతో పతివ్రతగా ఇంత సుదీర్ఘజీవితాన్ని గడపిన పుణ్యానికి ఫలంగా అబ్బిన తపశ్శక్తితో చెప్పుతున్నాను. మంచి దాయాదులను తమలోతాము పోరాడుకొని ఒకరినొకరు చంపుకొని నశించేటట్లు చేశావు. నీ దాయాదులు కూడా ఇట్లాగే ఒకరి నొకరు కొట్టుకొని చస్తారు చూడుము! నీవు కూడా సరిగ్గా ఈనాటికి 36 సంవత్సరాలు పూర్తి అయిన రోజున చూడటానికి దిక్కు ఎవరూ లేని రీతిలో అతిక్రూరంగా చావబోతావు. నామాట తప్పదు. ఈవాళ వీళ్ళందరూ ఎట్లా ఏడుస్తున్నారో అట్లాగే మీ యాదవకాంతలు కూడా భర్తలను, కొడుకులను, బంధువులను పేరుపేరునా తలచుకొని కుమిలి కుమిలి ఏడుస్తారు పొమ్ము.'

క. **అని ఘోరంబుగఁ బలికిన। విని విపులమనస్కుఁడైన విష్ణుఁడు చిఱున**
వ్వున నానన మొప్పఁగ న। వ్వనితకు ని ట్లనియె గౌరవస్తుత్యముగన్. **162**

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; ఘోరంబుగన్= కఠినంగా, పలికినన్= పలకగా; విని; విపుల= విశాల; మనస్కుఁడైన= హృదయంగలవాడైన; విష్ణుఁడు= శ్రీకృష్ణుడు; చిఱునవ్వునన్= చిరునవ్వుతో; ఆననము= ముఖం; ఒప్పఁగన్= ప్రకాశింపగా; ఆ+వనితకున్= ఆ గాంధారితో; గౌరవస్తుత్యముగన్= మర్యాదాకరంగానూ, స్తుతింపదగిన రీతిలోనూ; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: ఇట్లా అతి ఘోరంగా ఆమె శాప మివ్వగా విని, విశాల హృదయుడైన శ్రీహరి చిరునవ్వుతో ముఖం విరాజిల్లగా ఆ గాంధారీదేవితో మర్యాదను పాటిస్తూ శత్రువులు కూడా స్తుతించే విధంగా ఇట్లా అన్నాడు:

తే. **'మున్నకాదె యాదవులకు మునివరేణ్య। కలిత దారుణ శాపంబు గలదు నీకు**
నేల చర్వితచర్వణమిట్లు సేయ? దీన నీవేమి త్రవ్వితి? దానిఁ జెపుమ! **163**

ప్రతిపదార్థం: యాదవులకున్= యాదవ సమూహానికి; మునివరేణ్య= మునులలో శ్రేష్ఠులైనవారిచేత; కలిత= చేయబడిన; దారుణ= భయంకరమైన; శాపంబు= శాపం; మున్న= ముందే; కలదుకాదె!= ఉన్నది కదా!; నీకున్= నీకు; ఇట్లు; చర్వితచర్వణము= నమిలినదాన్నే మళ్ళీ నమిలేవిధంగా చెప్పినదాన్నే మళ్ళీ చెప్పటం; చేయన్+ఏల?= చేయడం ఎందుకు?; దీనన్= ఇందువలన; నీవు+ఏమి త్రవ్వితి(వి)?= నీవు కొత్తగా ఏమి చెప్పావు? (త్రవ్వటం - అంటే ఏదో ఒక కొత్త విషయాన్ని కనుక్కోవటమని అర్థం); దానిన్= దాన్ని; చెపుమ!= చెప్పు చూద్దాము.

తాత్పర్యం: 'గాంధారీదేవీ! యాదవులకు మునివరులు ఇచ్చిన ఘోరశాపం ముందే ఉన్నది కదా! మళ్ళీ నీవు దానిని పునరుక్తం చేశావు. దీనివలన నీవు కొత్తగా ఏమి చెప్పావు? దాన్ని చెప్పుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. యదువంశజాతులకుఁ ద । ప్పదు నాశము వారి సురలుఁ బరిమార్పఁగ లే
రది కారణంబు గాఁగఁ దె । గుదు రొండొరుచేత రణము ఘోరత్వమునన్.' 164

ప్రతిపదార్థం: యదువంశ జాతులకున్= యదువంశంలో పుట్టినవారికి; నాశము= నాశనం; తప్పదు; వారిన్= వారిని; సురలున్= దేవతలుకూడా; పరిమార్పగన్+లేరు= చంపజాలరు; అది కారణంబు+కాఁగన్= ఆ కారణంచేత; రణము ఘోరత్వమునన్= ఘోరయుద్ధంలో; ఒండు+ఒరుచేతన్= ఒకరిచేతిలో ఒకరు; తెగుదురు= చస్తారు.

తాత్పర్యం: యాదవులకు నాశనం తప్పదు. వారిని దేవతలు కూడా చంపలేరు. అందుచేత ఘోరయుద్ధంలో ఒకరినొకరు చంపుకొని చస్తారు' - అని కృష్ణుడు ఆ శాపరహస్యాన్ని వివరించాడు.

తే. అనిన పలుకులు విని పాండుతనయు లెదలు । వెఱపు పెంపున గంపింప విహ్వలించి
యాత్మజీవితములదెస నాస లపుడు । వదల విడిచిరి కౌరవవంశవర్య! 165

ప్రతిపదార్థం: కౌరవవంశవర్య!= ఓ జనమేజయ మహారాజా!; (ఈ విధంగా); అనిన పలుకులు= శ్రీకృష్ణు డన్న మాటలు; విని= విన్నవారై; పాండు తనయులు= పాండు కుమారులు; ఎదలు= హృదయాలు; వెఱపు+పెంపునన్= అధికమైన భయంతో; కంపింపన్= వణకగా; విహ్వలించి= మిక్కిలిగా భయపడిపోయి; ఆత్మజీవితముల దెసన్= తమ జీవితాలపట్ల; ఆసలు= ఆశలు; వదల విడిచిరి= వదలిపెట్టారు.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! ఇట్లా కృష్ణుడు అనగానే పాండుకుమారుల గుండెలు అధికమైన భయాందోళనలతో వణకిపోయారు. వారు తమ తమ జీవితాలపట్ల ఆశ సంపూర్ణంగా వదులుకొన్నారు.

విశేషం: పాండువులకు శ్రీకృష్ణుడే ప్రాణం. ప్రాణశక్తి కూడా. ఎప్పుడు ఆయనకే శాపం తప్పనిదవుతున్నదని తెలిసిందో పాండవులు ప్రాణాలపై ఆశలు వదులుకొనటం సహజం కదా!

వ. ఇట్లు పలికిన యచ్యుతుం డద్దేవి నుద్దేశించి 'లేవమ్మా! మృతులైన సకల బంధుమిత్రులకు నగ్నికార్యంబులు సేయింపవలయు'నని వెండియు. 166

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పలికిన= అనిన; అచ్యుతుండు= కృష్ణుడు; ఆ+దేవిన్= ఆ గాంధారిని; ఉద్దేశించి= చూసి; లేవమ్మా!= అమ్మా! ఇంతవరకు శోకించింది చాలు 'లే'; మృతులు+ఐన= చనిపోయిన; సకలబంధు మిత్రులకున్= బంధువులకు, స్నేహితులకు అందరికీ; అగ్నికార్యంబులు= దహనకార్యం; చేయింపవలయున్+అని= చేయించాలి అని; వెండియున్= ఇంకా (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ఈ విధంగా పలికిన శ్రీకృష్ణుడు గాంధారిని చూసి 'అమ్మా! చాలు. ఇంక పైకి లెమ్ము. చనిపోయిన బంధుమిత్రులందరికీ అగ్నికార్యాలు చేయించాలి కదా!' అంటూ ఇంకా ఇట్లా అన్నాడు:

సీ. 'వినుము గాంధారి! నీ తనయుండు చేయు దు । ర్నయము లెఱుంగవె? నాకు నీకు
శాంతనవునకు నాచార్యునకు బాహ్లి । కునకుఁ దండ్రికి మాన్పఁ గొలఁది గాని
దుర్మానమున నట్లు దొడరి యి ట్లయ్యె మీ । యపరాధమున వచ్చినట్టి కీడు
నకు నింత నొవ్వంగ నమఁ బల్కఁ దగునె? యు । మ్మలికంబు ధృతిఁ బట్టి మాన్పు మింకఁ

తే. జేటునకుఁ జావునకు వగఁజెందు జనుల। కినుమడింపదె మానసమున నలంత?
రాచ కూఁతుండ్రు సుతుల సంగ్రామ నిరత। హృదయులగు వారిఁ గాంచఁ గోరుదుర కాదె!' 167

ప్రతిపదార్థం: గాంధారి!= గాంధారీదేవీ!; వినుము; నీ తనయుండు= నీ కుమారుడు; చేయు= చేసే; దుర్నయములు= చెడ్డపనులు; ఎఱుంగవె?= నీకు తెలియవా?; నాకున్= నాకూ; నీకున్= నీకూ; శాంతనవునకున్= భీష్ముడికీ; ఆచార్యునకున్= ద్రోణుడికీ; బాహ్లికునకున్= బాహ్లికుడికీ; తండ్రికిన్= ధృతరాష్ట్రుడికీ; మాన్పన్= మాన్పడానికి; కొలఁదికాని= వీలుకాని; దుర్మానమునన్= దురభిమానంతో; అట్లు= ఆ విధంగా; తొడరి= పనులుచేసి; ఇట్లు+అయ్యెన్= ఈనాడు ఇట్లా అయ్యాడు దుర్యోధనుడు; మీ+అపరాధమునన్= మీ తప్పువలన; వచ్చిన+అట్టి కీడునకున్= వచ్చినటువంటి చేటుకు; ఇంత నొవ్వంగన్= ఇంత నొచ్చేటట్లుగా; ననున్+పల్కన్+తగునె?= నన్ను గురించి మాట్లాడటం న్యాయమా?; ఇంకన్= ఇక; ఉమ్మలికంబున్= శోకాన్ని; ధృతిన్+పట్టి= ధైర్యాన్ని అవలంబించి; మాన్పుము= పోగొట్టుకొమ్ము; చేటునకున్= నాశనానికి; చావునకున్= మరణానికి; వగన్+చెందు= శోకించేటటువంటి; జనులకున్= మానవులకు; మానసమునన్= మనస్సుల్లో; అలంత= బాధ; ఇనుమడింపదె?= రెట్టింపు కాదా?; రాచ కూఁతుండ్రు= రాజుల ఇళ్ళలోని అమ్మాయిలు; సుతులన్= కొడుకులను; సంగ్రామ నిరతహృదయులగు వారిన్= యుద్ధంలో అంకితమైన అంతరంగం కలవారిని; కాంచన్+కోరుదురు+అ కాదె= కనాలని కోరుకుంటారు కదా!

తాత్పర్యం: 'గాంధారీదేవీ! వినుము. నీ కుమారుడు చేసిన దుర్మార్గమైన పనులు నీకు తెలియనివా? దుర్యోధనుడి దురభిమానాన్ని నేను కాని, నీవు కాని, భీష్మద్రోణ బాహ్లికులు కాని, చివరకి ధృతరాష్ట్ర మహారాజు కాని మాన్పలేకపోయాము. ఆ దురభిమానంతో చేసిన పనుల పర్యవసానంగానే అతడికి ఈనాడు ఈ దశ వచ్చింది. మీ తప్పువలన వచ్చిన చేటుకు బాధ్యుడిని నేనని నన్ను నొప్పించేటట్లు ఇట్లా మాట్లాడటం న్యాయమా? ఇకనైనా ధైర్యం అవలంబించి నీ శోకాన్ని దూరం చేసికొమ్ము. కీడుకు, చావుకు ఏ మానవులు శోకిస్తారో వారి దుఃఖం రెండింతలవుతుంది తప్ప ఉపశమించదు. రాజుల కుమార్తెలు యుద్ధంలో అంకితమైన హృదయం కలవారిని కుమారులుగా పొందాలని కోరుకుంటారు కదా!'

విశేషం: గాంధారి క్షత్రియ కులసంజాత కాబట్టి ఆమె అభిలాషకు అనుగుణంగా యుద్ధంలో నిరంతర ఆసక్తి పొందే కుమారులే పుట్టారని తాత్పర్యం.

కూఁతు శబ్దమునకు బహువచనరూపం కూఁతులు. కూఁతుండ్రు అని తిక్కన ప్రయోగించటం విశేషం. ఇక్కడ కూఁతుల అని ఉన్నప్పటికీ ఛందోభంగం ఏర్పడదు.

వ. అని చెవి సూఁడినట్లు పలికిన విని నిరుత్తరయై గాంధారి యూరకుండె నట్టియెడ ధృతరాష్ట్రుండు ధర్మనందనుతో 'నీవు మన మొనలంగల జనులకొలంది యెఱుంగుదు చచ్చినవారి లెక్క దలంతేని నా కెఱిఁగింపు' మని పల్కిన విను మెఱుకపడ్డవా రుత్తమ జనంబులు డెబ్బది యాఱుకోట్లు నిరువది వేలును వ్రుక్కడి మూఁక యిరువది నాలుగువేలు మున్నూట యిరువండ్రుఁ దెగిరని చెప్పిన నమ్మనుజపతి 'వీరిందఱు నేగతికిఁ బోదు?' రనుటయు. 168

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా కృష్ణుడు; చెవి సూఁడినట్లు= చెవి కాలినట్లు (అంటే భరించలేని విధంగా అని అర్థం); పలికినన్= అనగా; విని; నిరుత్తర+ఐ= సమాధానం ఏమీ చెప్పక; గాంధారి; ఊరక+ఉండెన్= మౌనంగా ఉండిపోయింది; అట్టి+ఎడన్= అప్పుడు; ధృతరాష్ట్రుండు; ధర్మనందనునితో; నీవు; మన= కౌరవపాండవుల; మొనలన్= సైన్యాలలో; కల=ఉన్న;

జనులకొలంది= జనుల పరిమితి (జనసంఖ్య); ఎఱుంగుదు(వు)= తెలిసినవాడివి; చచ్చినవారి లెక్క= చనిపోయినవారిలెక్క; తలంతు+ఏని= గుర్తు ఉంటే; నాకున్+ఎఱింగింపుము= నాకు చెప్పు; అని పల్కినన్= అని అడుగగా; వినుము= ధర్మరాజు అంటున్నాడు 'వినుము'; ఎఱుకపడ్డవారు= ప్రసిద్ధులు; ఉత్తమజనంబులు= ఉన్నతవర్గాల మనుష్యులు; డెబ్బదియాఱుకోట్లు నిరువదివేలును= 76 కోట్ల 20 వేలమంది; ప్రముక్కడిమూఁక= ఇతరజనం; ఇరువదినాలుగువేలు మున్నూరు యిరువండ్రున్= 24వేల 320 మంది; తెగిరని చెప్పినన్= చనిపోయారని చెప్పగా; ఆ+మనుజపతి= ఆ రాజు; వీరు+ఇందఱున్= వీరు ఇంతమందీ; ఏగతికిన్= ఏయే గతులకు; పోదురు?+అనుటయున్= వెళ్తారు? అని అడుగగా.

తాత్పర్యం: అని ఈ విధంగా శ్రీకృష్ణుడు మాట్లాడిన మాటలు గాంధారి చెవిని కాల్చాయి. అయినా ఏమీ సమాధానం చెప్పకుండా ఊరకుండిపోయింది. అపుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో 'నీకు మన రెండు సైన్యాలలోని జనుల సంఖ్య తెలుసును. యుద్ధంలో ఎంతమంది చనిపోయారో గుర్తుంటే చెప్పుము' అని అడిగాడు. అప్పుడు ధర్మరాజు 'మహారాజా! వినుము. ప్రసిద్ధులు ఉన్నత వర్గాలవారు 76కోట్ల 20 వేలమంది, ఇతరజనం 24వేల 320 మంది చనిపోయా'రని చెప్పగా ఆ రాజు' అయితే వీరు ఇంతమందీ ఏయే గతులకు వెళ్ళుతారో చెప్పుతావా?' అని అడిగాడు.

తే. **'ఎవ్వ రాత్మదేహములు సమిద్ధమైన । యస్త్రవహ్ని వేలిచిరి వా రమరలోక**
మునకుఁ జని నిర్జరాంగనాజన విలసితుఁ । డైన యమరేంద్రునకుఁ బూజ్యు లగుదు రధిప! **169**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఎవ్వరు= ఏ యోధులైతే; ఆత్మదేహములు= తమ దేహాలను; సమిద్ధమైన= బాగా రగుల్చబడిన; అస్త్రవహ్నిన్= అస్త్రాలచేత పుట్టిన అగ్నిలో; వేలిచిరి= హోమం చేశారో; వారు; అమరలోకమునకున్+చని= స్వర్గానికి వెళ్ళి; నిర్జర+అంగనాజన= అప్సరసలతోడి; విలసితుఁడైన= ప్రకాశించేటువంటి; అమరేంద్రునకున్= ఇంద్రుడికి; పూజ్యులు= పూజింపదగినవారు; అగుదురు= అవుతారు.

తాత్పర్యం: 'రాజా! వినుము. ఏ యోధులు తమ దేహాలను బాగా మండుతున్న అస్త్రాల చేత పుట్టిన అగ్నిలో హోమం చేశారో వారు స్వర్గానికి వెళ్ళి అప్సరసలతో వైభవంగా విరాజిల్లే మహేంద్రుడికి అతిథులై పూజలందుతారు.

క. **తఱచుగ శస్త్రాస్త్రంబులు । నెఱఁకులు దూఱినఁ జలించి నిజధైర్యంబుల్**
మఱచి తెఱలి చచ్చిరి కొం । దఱు గుహ్యకగతికిఁ బోవఁ దగుదురు వారల్. **170**

ప్రతిపదార్థం: తఱచుగన్= మిక్కిలిగా; శస్త్రాస్త్రంబులు= శస్త్రాలు, అస్త్రాలు; నెఱఁకులు= ఆయువుపట్టుల్లో; దూఱినన్= నాటుకోగా; చలించి= భయపడిపోయి; నిజధైర్యంబుల్= తమ ధైర్యాన్ని; మఱచి= విస్మరించి; తెఱలి= బయటపడి; కొందఱు= కొంతమంది యోధులు; చచ్చిరి= చచ్చారు; వారల్= వారు; గుహ్యకగతికిన్= యక్షలోకానికి; పోవన్+తగుదురు= పోవటానికి అర్హులవుతారు.

తాత్పర్యం: అనేక శస్త్రాలు, అస్త్రాలు ఆయువుపట్టులలో నాటుకోగాభయపడిపోయి, తమ ధైర్యాన్ని కోల్పోయి వెన్నుచూపి యుద్ధరంగంనుండి బయటపడి కొంతమంది యోధులు చచ్చారు. వారు యక్షలోకానికి పోవటానికి అర్హులవుతారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: గుహ్యకులు దేవయోనులు. కుబేరుడు వీరి అధిపతి.

క. సమరమున నెత్తెఱంగున । సమసిననుం గీడుతెరువు చన రుత్తమ లో
కమునకుఁ బోదురు జనములు । ప్రముదితులై యండ్రు బుధులు పౌరవముఖ్యా!' 171

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశంలో పుట్టిన శ్రేష్ఠుడైన ధృతరాష్ట్రుడైన మహారాజా!; సమరమునన్= యుద్ధంలో; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; సమసిననున్= చచ్చినా; జనములు= మనుష్యులు; కీడుతెరువు= నరకానికి; చనరు= పోరు; ప్రముదితులు+ఐ= మిక్కిలి సంతోషంతో; ఉత్తమ లోకమునకున్= స్వర్గానికే; పోదురు= వెళతారు (అని); బుధులు= పండితులున అండ్రు= అంటారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! యుద్ధంలో ఎట్లా చనిపోయినా ఆ వ్యక్తులు నరకానికి పోనే పోరు. తప్పకుండా సంతోషంతో స్వర్గానికే వెళ్తారు అని పండితు లంటారు.'

క. అనిన విని ' నాథవంతులు । ననాథులును నైన వీరి కందఱకుఁ గృపా
ధనలోల! చేయఁగా వ । చ్చున కాదే యగ్నికార్యశోభనముఁ దగన్? 172

ప్రతిపదార్థం: అనినన్= ఇలా అనగా; విని= ధృతరాష్ట్రుడు విని (ఇట్లా అన్నాడు); కృపాధనలోల!= దయ అనే సంపదలో (దయాసంపదలో) ఆసక్తి ఉన్న ఓ ధర్మరాజా!; నాథవంతులున్= దిక్కున్నవారు; అనాథులును= దిక్కులేనివారు; ఐన= అయినటువంటి; వీరికందఱకున్= వీరందరికీ; అగ్ని కార్య శోభనమున్= పవిత్రమైన అగ్నికర్మను; తగన్= విధియుక్తంగా; చేయఁగాన్+వచ్చున కాదే!= చేయవచ్చు కదా!

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అనగా విని ధృతరాష్ట్రు డిట్లా అన్నాడు: 'దయామూర్తి అయిన ధర్మరాజా! ఈ చనిపోయిన వారిలో దిక్కున్నవారూ ఉన్నారు. ఏ దిక్కు లేనివారూ ఉన్నారు. అట్లాంటప్పుడు వీరి కందరికీ విధి ప్రకారంగా దహనకర్మ చేయటంలో తప్పేమీ లేదు కదా!'

విశేషం: ఇక్కడ 'దిక్కు' అనే మాటకు మిగిలినవారు అని అర్థం. సాధారణంగా బంధువులలో ఎవరో ఒకరు మిగిలి ఆ దహనకర్మ జరుపుతారు. ఈ మహాయుద్ధంలో దాదాపు అందరూ తుడిచిపెట్టుకుపోయారు కాబట్టి ఈ ధర్మసంకటం వచ్చింది. సమాధానం ధర్మరాజే చెప్తున్నాడు.

వ. అని పలుకుటయు ధర్మనందనుం డిట్లను 'నీ యఖిల జనంబులు నాహితాగ్నుల యట్ల యట్లుంగాక వీరలిందఱ కుదకదహనక్రియాకరణయోగ్యులును లేరు మన మేది కొలఁదిగా నిప్పని సేయుద'మని పలికి తా రజ్ఞాత వాసంబు నిర్వహించి సముచిత ప్రకారంబున విరాటాదులచేతం బరిజ్ఞాతులైన సమయంబున సంగతుండై యది మొదలుగాఁ జెల్లెడు శాంతిక పౌష్టికాది శ్రౌతస్మార్తక్రియాకలాపంబులు నడపుచుం దమయొద్దనున్న ధౌమ్యునాలోకించి విదురుని సంజయునిఁ గనుంగొని 'మీరు భరతకులులకుందక్క ననాథవంతులైన వారలకు విధ్యుక్తంబుగా నగ్నిసంస్కారంబు సేయుం'డని పనిచి యత్తెఱంగునకుం దోడుపడుటకై సూతజనంబులను దత్కాలసమాగతులైన కరిపురజనంబులోనం దగువారి నిరూపించి మున్న తెప్పించిన చందనాగురుఖండ క్షౌమవసన కస్తూరికాకుంకుమఘృతతైలప్రభృతులగు వలయువస్తువు లా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధౌమ్యముఖ్యుల కొప్పించిన వా రయ్యవసరంబునం గూడికొనిన బహుబ్రాహ్మణ సంఘంబులతోఁ జని దుర్యోధన దుశ్శాసనకర్ణశల్యాదులకు నభిమన్యుఘటోత్కచవిరాటధృష్టకేతుప్రముఖులకును దక్కును బే రెఱుకపడు నానాదేశాధీశులకుం బ్రచురకాష్ఠ సంచయంబులను భగ్నరథావయవ ధ్వజ ధనుశ్శరకుంతాదులను సొదలు వేర్పించి పితృమేధ క్రియలు నడపి చిచ్చునం జొనిపి యనాథవంతులైన భూకాంతుల ననేక సహస్ర సంఖ్యులం బ్రోవులుగాఁ బెట్టించి సమగ్రదారుసముదయంబు లమర్చి యగ్ని యిచ్చి రప్పడు ఋగ్యజుః పఠన రవంబులును సామగాన నాదంబులును రమణీరోదన ధ్వనులును రోదసీకుహరంబు నిండె ధూమంబున దిక్కులు పిక్కటిల్లెఁ జేతనభూతంబులకెల్ల విపులవిషాదం బావహిల్లె నవ్విధంబునం దగవు నడిపించి. 173

ప్రతిపదార్థం: అని పలుకుటయున్= అని ధృతరాష్ట్రుడనగా; ధర్మనందనుండు= ధర్మరాజు; ఇట్లు+అనున్= ఇలా అంటాడు; ఈ అఖిలజనంబులున్= ఈ యుద్ధంలో పాల్గొన్న సమస్త జనులూ; ఆహితాగ్నుల+అట్ల= విధిపూర్వకంగా నిత్యమూ ఇంటిలో అగ్నిని స్థాపించుకొని యజ్ఞం చేసే వారివలె (అంటే వీరికి అగ్నికార్యం యుద్ధప్రక్రియలోనే సిద్ధిస్తోందని అర్థం); అట్లున్+కాక= అంతే కాకుండా; వీరలు+ఇందఱకున్= వీరు ఇంతమందికీ; ఉదకదహన క్రియాకరణ యోగ్యులు= జలతర్పణం, దహనం చేయటానికి అర్హత ఉన్నవారు; లేరు; మనము+ఏది= మనం పూనుకొని; కొలఁదిగా= సాధ్యమైనంతవరకు; ఈ+పని+చేయుదము= ఈ పనిచేద్దాము; అని పలికి; తారు= తాము; అజ్ఞాతవాసంబు; నిర్వహించి= చేసి; సముచిత= తగిన; ప్రకారంబునన్= విధంగా; విరాటాదులచేతన్= విరాట రాజు మొదలైనవారిచేత; పరిజ్ఞాతులైన= తెలిసికోబడిన; సమయంబునన్= సందర్భంలో; సంగతుండు+ఐ= కలిసినవాడై; అది మొదలుగాన్= అప్పటినుంచి; చెల్లెడు= జరిగిన; శాంతిక= శాంతి; పౌష్టిక= పుష్టి; ఆది= మొదలైన; శ్రౌత= శ్రుతికి సంబంధించిన; స్మార్త= స్మృతికి సంబంధించిన; క్రియాకలాపంబులు= హోమాది యాజ్ఞిక కార్యాలు; నడపుచున్= నడిపిస్తూ; తమ+ఒద్దన్+ఉన్న= తమ వద్ద ఉన్న; ధౌమ్యున్+ఆలోకించి= ధౌమ్యుడిని చూసి; విదురునిన్= విదురుడిని; సంజయునిన్= సంజయుడిని; కనుంగొని= చూసి; మీరు= మీరిద్దరూ; భరతకులులకున్+తక్కన్= భరతవంశీయులకు తప్ప; అనాథవంతులైన వారలకున్= ఏ దిక్కూ లేకుండా చనిపోయినవారికి; విధి+ఉక్తంబుగాన్= కర్మవిధి ప్రకారంగా; అగ్ని సంస్కారంబు= దహనక్రియను; చేయుండని పనిచి= చేయండి అని పంపి; ఆ+తెఱంగునన్= ఆ విధంగా; తోడుపడుటకై= సహాయంగా ఉండటానికి; సూతజనంబులనున్= సూతజనులను; తత్కాల= ఆ సమయానికి; సమాగతులైన= అక్కడికి వచ్చి ఉన్న; కరిపురజనంబులోనన్= హస్తినాపుర జనులలో; తగువారిన్= తగిన మనుష్యులను; నిరూపించి= ఏర్పరచి; మున్న= ముందుగానే; తెప్పించిన= తెప్పించి సిద్ధంగా ఉంచిన; చందన= శ్రీగంధం; అగురు= అవురుగడ్డి; ఖండ= దర్భ; క్షౌమ వసన= పట్టు బట్టలు; కస్తూరికా= కస్తూరి; కుంకుమ; ఘృత= నెయ్యి; తైల= నూనె; ప్రభృతులు+అగు= మొదలైన; వలయు వస్తువులు= అవసరమైన వస్తువులను; ఆ ధౌమ్యముఖ్యులకున్= ఆ ధౌమ్యాచార్యుడు మొదలైన పెద్దవారికి; ఒప్పించినన్= అప్పగించగా; వారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; కూడికొనిన= అక్కడికి చేరిన; బహు= చాలమంది; బ్రాహ్మణ సంఘంబులతోన్= బ్రాహ్మణ సమూహాలతో; చని= వెళ్ళి; దుర్యోధన; దుశ్శాసన; కర్ణ; శల్య+ఆదులకున్= శల్యుడు మొదలైనవారిన్; అభిమన్యు; ఘటోత్కచ; విరాట; ధృష్టకేతు; ప్రముఖులకును= మొదలైనవారికీ; తక్కు= తప్ప(తక్కిన); పేరు+ఎఱుకపడు= ప్రసిద్ధులైన; నానా దేశ+అధి+ఈశులకున్= నానా రాజులకు; ప్రచుర= దండిగా; కాష్ఠ= కర్రల; సంచయంబులను= మోపులతో; భగ్న= విరిగిన; రథావయవ= రథభాగాలు; ధ్వజ=టెక్కెములు; ధనుః=విండ్లు; శర=అమ్ములు; కుంత+ఆదులను= బల్లెం మొదలైన వాటిచేత; సొదలు+పేర్పించి= చితులు పేర్పించి; పితృమేధ క్రియలు= ప్రేతయజ్ఞ క్రియను (దహన కర్మను); నడపి= నడిపించి; చిచ్చునన్= మంటలో; చొనిపి= ఆ శవాలను చేర్చి; అనాథవంతులైన= ఏ దిక్కూలేక మరణించిన; భూకాంతులన్= రాజులను; అనేక సహస్రసంఖ్యులన్= చాలావేలమందిని (వేనకువేలుమందిని); ప్రోవులుగాన్= రాసులుగా; పెట్టించి= ఒకచోట చేర్పించి; సమగ్ర= పెద్దపెద్ద; దారు సముదయంబులు= దుంగలను, కొయ్యలను; అమర్చి; అగ్ని+ఇచ్చిరి=

నిప్పుపెట్టారు; అప్పుడు; ఋక్+యజుః+పఠన రవంబులును= ఋక్ వేదం; యజుర్వేదం పఠిస్తున్న శబ్దాలు; సామగాన నాదంబులును= సామవేదం పాడుతున్నప్పటి నాదం; రమణీ= స్త్రీల; రోదన ధ్వనులును= ఏడుపులు; రోదసీకుహరంబు= ఆకాశమనే గుహ అంతటా; నిండెన్= నిండిపోయింది; ధూమంబునన్= పొగలో; దిక్కులు= అన్ని దిక్కులు; పిక్కటిల్లెన్= నిండిపోయాయి; చేతన= ప్రాణమున్న; భూతంబులకెల్లన్= జీవరాశికంతటికీ; విపుల= మిక్కిలి; విషాదంబు= శోకంబు; ఆవహిల్లెన్= కల్గింది; ఆ+విధంబునన్= ఆ రీతిగా; తగవున్= ఆ కర్మవిధిని; నడిపించి= నడిపించాక.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగా ధర్మరాజు ఇట్లా అన్నాడు: 'ఈ యుద్ధంలో పాల్గొన్న సమస్త జనులూ అగ్నిని సిద్ధంగా ఉంచుకొన్న యాజ్ఞికులవంటివారే. (యుద్ధమే వారికి యజ్ఞకుండం. అస్త్రాలే అగ్నులు. కాబట్టి వారికి వేరే యజ్ఞం అక్కరలేదని అర్థం). అంతే కాకుండా వీరింతమందికీ జలతర్పణం, దహనం చేయటానికి అర్హత ఉన్నవారు లేరు. మనం పూనుకొని సాధ్యమైనంత వరకు ఈ పనిచేద్దాము' అని అంటూ తాము అజ్ఞాతవాసం చేసి సముచితమైన రీతిలో విరాటమహారాజు మొదలైన వారిచేత తెలిసికొనబడిన సందర్భంలో కలిసినవాడై, అప్పటి నుండి జరిగిన శాంతి పుష్టి హోమాదులను నడిపిస్తూ తమ వెంటనే ఉన్న ధౌమ్యాచార్యులను చూచి, విదుర సంజయులను పిలిచి 'మీరిద్దరూ భరతవంశీయులకు తప్ప తక్కిన ఏ దిక్కూలేకుండా చనిపోయినవారికి కర్మవిధి ప్రకారంగా దహనకర్మను చేయండి' అని చెప్పి పంపించి, ఆ పనిలో వారికి సహకరించటానికి సూతజనులను, ఆ సమయానికి అక్కడికి వచ్చి ఉన్న హస్తినాపుర జనులలో తగినవారిని గుర్తించి, ముందుగానే తెప్పించి సిద్ధంగా ఉంచిన శ్రీగంధం, అగురుగడ్డి, దర్భలు, పట్టు బట్టలు, కస్తూరి, కుంకుమ, నెయ్యి, నూనె మొదలైన వస్తువులను ఆ ధౌమ్యుడు మొదలైన పెద్దలకు అప్పగించాడు. వారు ఆ సమయానికి అక్కడ చేరి ఉన్న బ్రాహ్మణులను తీసికొని వెళ్ళి దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శల్యాదులకు, అభిమన్యు, ఘటోత్కచ, విరాట, ధృష్టకేతు ప్రముఖులకు తప్ప, తక్కిన ప్రసిద్ధులైన నానారాజులకు పెద్ద పెద్ద కర్రల మోపులతోను, విరిగిన ప్రేతయజ్ఞ క్రియ జరిపించి, మంటలో ఆ శవాలను చేర్చి అనాథలుగా మరణించిన రాజులను వేనకువేలమందిని రాసులుగా ఒకచోట చేర్పించి పెద్ద పెద్ద దుంగలను, కొయ్యలను వారిపై అమర్చి నిప్పుపెట్టారు. అపుడు ఒకపక్క ఋగ్వేదం, యజుర్వేదం చదువుతున్న శబ్దాలు, సామవేదం పాడుతున్న నాదం, ఆడవారి ఏడుపులు అన్నీ కలిసి ఆకాశమనే గుహ మారుమోగిపోయింది. పొగతో దిక్కులన్నీ నిండిపోయాయి. ప్రాణాలతో ఉన్న జీవరాసులన్నిటికీ మిక్కిలి శోకం పుట్టింది. ఆ రీతిగా వారు ప్రేతకర్మ విధిని నడిపించారు.

విశేషం: భరతవంశీయులకు పాండవులు ఉత్తర క్రియలు జరిపారు. ధృతరాష్ట్ర సహితంగా ధర్మరాజు సోదరులతో కలిసి ఈ క్రియ నిర్వర్తించాడు.ఇది ప్రేతకర్మలో ధర్మవిధి.

కాని, భారతయుద్ధంలో చనిపోయిన అన్ని లక్షలమందికి ఉత్తరక్రియలు ఎట్లా జరిపారన్న సందేహం వస్తుంది. 'అనాథ ప్రేతలుగా' వారిని పరిగణించి వారికి ఉత్తర క్రియలు ఎవరైనా చేయవచ్చునని వ్యాసుడు పరిష్కారం చూపాడు. విదురుడు, సంజయుడు, ఆ నగరవాసులు, అప్పటికి అక్కడున్న బ్రాహ్మణులు ఈ పనిచేశారట. అందుకే భారతాన్ని 'ధర్మశాస్త్ర' మంటారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కుంతి ధర్మజునకుఁ గర్ణుండు దన కొడుకగుట దెలుపుట (సం. 11-27-1)

సీ. భూవర! కురువంశ పుంగవుం డగు ధర్మ । తనయుండు ధృతరాష్ట్రు వినయ మొప్ప
మున్నిడుకొని యాఁడు మొత్తంబుఁ దోడ్కొని । బంధు జనంబులు బలసి రాఁగ
నరిగి గంగాస్నాన మాచరించి తిలోద । క ప్రదానము సర్వకౌరవులకు
నయ్యాంబికేయుండు నక్కురుభార్యలు । ననుజులుఁ దానును నధిక నిష్ఠఁ

ఆ. చేసి రతనికడకు నా సమయంబున । నడలు నెమ్మనమున నడరి క్రమ్ము
కన్నునీరు మొగము గప్పంగఁ జని కుంతి । యెల్లవారు వినఁగ నిట్టు లనియె 174

ప్రతిపదార్థం: భూవర!= ఓ జనమేజయ మహారాజా!; కురువంశ= కురువంశంలో; పుంగవుండు+అగు= శ్రేష్ఠుడైన; ధర్మతనయుండు= ధర్మరాజు; వినయము+ఒప్పన్= వినయంతో; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్ర మహారాజును; మున్ను+ఇడుకొని= ముందుగా ఉంచుకొని; ఆఁడుమొత్తంబున్+తోడ్కొని= స్త్రీ జనాన్ని పిలుచుకొని; బంధుజనంబులు+బలిసిరాఁగన్= బంధువులందరూ వెంటరాగా; అరిగి= వెళ్ళి; గంగాస్నానమాచరించి= నదిలో స్నానం చేసి; సర్వకౌరవులకున్= కౌరవులందరికీ; ఆ+ఆంబికేయుండు= ఆ ధృతరాష్ట్రుడు; ఆ+కురుభార్యలు= కురుకుమారుల భార్యలు; అనుజులున్= తమ్ములు; తానును= తానూ; నిష్ఠన్= నిష్ఠతో; తిలోదక ప్రదానము+చేసిరి= తిలోదకా లిచ్చారు; అతని కడకున్= ఆ ధర్మరాజు దగ్గరకు; ఆ సమయంబునన్= అప్పుడు; అడలు= దుఃఖిస్తున్న; నెమ్మనమునన్= నిండుమనసుతో; అడరి= అదేపనిగా; క్రమ్మ= క్రమ్ముకొంటున్న; కన్నునీరు= కంటినీరు; మొగము+కప్పంగన్= ముఖంమీద తెరలాగ కప్పుతుండగా; కుంతి= కుంతీదేవి; చని= వెళ్ళి; ఎల్లవారు= అక్కడచేరిన వారంతా; వినఁగన్= వింటుండగా; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! అప్పుడు ధర్మరాజు ధృతరాష్ట్ర మహారాజును ఎంతో వినయవిధేయతలతో ముందుగా ఉంచుకొన్నవాడై (అంటే ధృతరాష్ట్రుడు ముందు నడుస్తుండగా); కౌరవస్త్రీ జన సమూహాన్ని పిలుచుకొని, బంధుజనులంతా వెంట తరలిరాగా నదికి వెళ్ళాడు. అందరూ స్నానాలు చేశారు. యుద్ధంలో మరణించిన కౌరవులందరికీ ధృతరాష్ట్రుడు, కురుకుమారుల భార్యలు, తాను, తన తమ్ములు అత్యధిక శ్రద్ధతో తిలోదకాలు ఇచ్చారు. ఆ సమయంలో ధర్మరాజు దగ్గరకు కుంతీదేవి వచ్చింది. ఆమె మనసంతా దుఃఖంతో నిండిపోయి అదే పనిగా కమ్ముకొని వస్తున్న కంటినీరు మొగంమీద తెరవలె కప్పుకొంటుండగా అందరూ వింటుండగా ఆమె ధర్మరాజుతో ఇట్లా అన్నది:

తరలము.
'వినుము! కౌరవ కోటికిం దన విల్లు పెట్టనికోటగా
నని యొనర్చి, భవద్బలంబుల నన్నిటిన్ మిము నేవురం
దనిపి, యంబరచారులెల్లను దన్ను మెచ్చి నుతింపఁ బా
ర్థునిమహాస్త్రము బల్విడిం దలఁ ద్రుంపఁ గూలిన కర్ణునిన్. 175

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! వినుము; కౌరవకోటికిన్= కౌరవసమూహానికి; తనవిల్లు= తన విల్లు; పెట్టనికోటగాన్= పెట్టనటువంటి కోటలాగ; అని+ఒనర్చి= యుద్ధంచేసి; భవత్+బలంబులన్= నీ సైన్యాన్ని; అన్నిటిన్= అంతటినీ; మిమున్+ఏవురన్= మీ ఐదుగురినీ; తనిపి= తృప్తులయ్యేటట్లు చేసి; అంబర= ఆకాశ; చారులు= గమనం కల్గిన దేవతలందరూ;

తన్నున్ మెచ్చి నుతింపన్= తన్ను ప్రశంసించి ప్రస్తుతిస్తుండగా; పార్థుని= అర్జునుడి; మహాస్త్రము= గొప్ప అస్త్రం; బల్విడిన్= పరాక్రమంతో; తలన్+త్రుంపన్= తలను తుంచగా; కూలిన= చనిపోయిన; కర్ణునిన్= కర్ణుడిని.

తాత్పర్యం: 'ధర్మరాజా! వినుము. కౌరవ సమూహానికి తన విల్లును పెట్టని కోటవలె నిలిపి యుద్ధం చేసి, మీ సైన్యానికీ మీ ఐదుగురికీ యుద్ధక్రీడలో అసామాన్యుడనే తృప్తిని కల్గించి, దేవతలు కూడా తన పరాక్రమాన్ని ప్రశంసిస్తుండగా అర్జునుడి మహాస్త్రం అతివేగంగా తలను తుంచివేయగా నేలకూలిన కర్ణుడిని. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: పద్యలక్షణానికి చూడండి. స్త్రీ. 2. 94.

క. **జనులెల్లను రాధేయుం । డనుటను మీరలును వాని నట్టుల కా నె**
మ్మనమునఁ దలంతు రటుగా । దనఘ! మదీయాత్మజన్ముఁ డాతం డరయన్. **176**

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; జనులు+ఎల్లనున్= జనులంతా; రాధేయుండు+అనుటను= రాధేయుడు అంటూ రావటం వలన; మీరలును= మీరుకూడా; వానిన్= అతడిని; అట్టులకాన్= అలాగే; నెమ్మనమునన్= మనసుల్లో; తలఁతురు= ఊహించారు; అటుగాదు= అది సత్యంకాదు; ఆతండు= ఆ కర్ణుడు; అరయన్= బాగా గుర్తిస్తే; మదీయ= నా; ఆత్మ జన్ముఁడు= కుమారుడే.

తాత్పర్యం: పుణ్యాత్ముడా! జనులంతా అతడిని రాధేయుడు అంటూ రావటం వలన మీరుకూడా రాధ కుమారుడనే ఇంతకాలమూ మీ మనసులలో భావిస్తూ వచ్చారు. కాని, అది సత్యం కాదు. ఆ కర్ణుడు నిజానికి నా కుమారుడేనయ్యా!

ఆ. **మీకు నగ్రజుండు నాకు భాస్కరు దయ । లలితకవచకుండలములతోడఁ**
బుట్టినాఁడు గానఁ బోయంగ వలయుఁ ది । లోదకంబు లమ్మహోన్నతునకు'. **177**

ప్రతిపదార్థం: మీకున్+అగ్రజుండు= మీ ఐదుగురికీ ఆయన అన్నగారు; నాకు; భాస్కరుదయన్= సూర్యుని వరంతో; లలిత= అందమైన; కవచకుండలములతోడన్= కవచకుండలాలతో; పుట్టినాఁడు= పుట్టాడు; కానన్= కాబట్టి; ఆ+ మహోన్నతునకున్= ఆ గొప్పవాడికి; తిలోదకంబులన్= నువ్వులు, నీళ్ళు; పోయంగవలయున్= ప్రదానం వేయాలి (ఇవ్వాలి).

తాత్పర్యం: మీ ఐదుగురికీ ఆయన అన్నగారు. సూర్యుడి వరప్రసాదంగా నాకు సుందరమైన కవచకుండలాలతో పుట్టాడు. అందువలన ఆ మహానుభావుడికి తిలోదకప్రదానం మీరు చేయాలి.'

వ. **అని తదీయ జన్మప్రకారంబును దివాకరుప్రసాద ప్రభావంబును జెప్పుటయు దుస్సహంబు లగు నమ్మాటలు చెవులు సూఁడినట్లయినఁ బాండవులు పరమదుఃఖావేశంబు నొంది రందు భీమాదులు నివ్వెఱపడియుండ ధర్మనందనుండు దల్లడిల్లుచుం దల్లితో నిట్లనియె.** **178**

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; తదీయ= ఆ కర్ణుని; జన్మప్రకారంబునున్= పుట్టిన తీరును; దివాకరు= సూర్యుడి; ప్రసాదప్రభావంబునున్= వరప్రభావాన్ని; చెప్పుటయున్= చెప్పగా; దుస్సహంబులు+అగున్= భరించడానికి; వీలులేని; ఆ+మాటలు= ఆ కుంతీదేవి మాటలు; చెవులు+చూడిఁనట్లు+అయినన్= చెవులు కాల్చినట్టుకాగా(మిక్కిలి బాధించగా); పాండవులు; పరమ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుఃఖ+ఆవేశంబున్+ఒందిరి= మిక్కిలి దుఃఖం పొందారు; అందున్= వారిలో; భీమ+ఆదులు= భీముడు మొదలైనవారు; నివ్వెఱపడి+ఉండన్= ఆశ్చర్యంతో నిశ్చేష్టులై ఉండగా; ధర్మనందనుండు= ధర్మరాజు; తల్లడిల్లుచున్= తల్లడిల్లుతూ; తల్లితోన్= తమ తల్లితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అని చెప్పి కుంతీదేవి ఆ కర్ణుడు పుట్టినతీరునూ, సూర్యుడి దివ్యవర ప్రభావాన్నీ వివరించగా ఆ కుంతీదేవి పలుకులు భరింపరానివై చెవులు కాల్చగా పాండవులు దారుణమైన దుఃఖం పొందారు. వారిలో భీమాదులు ఆశ్చర్యంతో నిశ్చేష్టులైపోగా ధర్మరాజు తల్లడిల్లిపోతూ తమతల్లితో ఇట్లా అన్నాడు:

సీ. **'అనిలజార్జునుల మార్కొని నేర్చె నెవ్వని । యుత్సాహమూఁది సుయోధనుండు,**
వైదేహ పౌండ్రాది వసుధేశులెవ్వని । కడిమి సొంపున కరిగాఁపులైరి,
మనసైన్యకోటి యెవ్వని బాహువీర్య సం । పద కోడి యంతంత నొదుఁగుచుండు,
నద్భుతం బొనరించె నమరుల కెవ్వని । యసమాన వివిధ దివ్యాస్త్ర మహిమ.

తే. **మమ్మునందఱ నెవ్వని మహితశక్తి । యెక్కుడై సంగరంబునఁ జిక్కుపఱిచె,**
నట్టికర్ణునిఁ గొంగున నగ్ని డాఁచి । నట్టు లెమ్మెయి డాఁచితో యమ్మ! చెపుమ. 179

ప్రతిపదార్థం: అనిలజ= వాయుకుమారుడైన భీముడిని; అర్జునులన్= అర్జునులను (అంటే భీమార్జునులను); ఎవ్వని= ఎవ్వడియొక్క; ఉత్సాహము+ఊఁది= ఉత్సాహాన్ని ఆసరాగాకొని; సుయోధనుండు= దుర్యోధనుడు; మార్కొనన్+నేర్చెన్= ఎదిరించటానికి సమర్థుడయ్యాడో; వైదేహ= విదేహరాజు; పౌండ్ర+ఆది+వసుధేశులు= పౌండ్రక మొదలైన రాజులు; ఎవ్వని= ఎవ్వడియొక్క; కడిమి= పరాక్రమం; సొంపునన్= వైభవంచేత; అరిగాఁపులు+ఐరి= పన్ను చెల్లించే సామంతరాజులయ్యారో; మనసైన్యకోటి= మన పాండవసైన్యం; ఎవ్వరి= ఎవ్వడియొక్క; బాహువీర్యసంపదకున్+ఓడి= బాహుబల సంపదముందు ఓడి; అంతంతన్= క్రమంగా; ఒదుఁగుచుండున్= అణిగి ఉంటూ వచ్చిందో; ఎవ్వని= ఎవ్వడియొక్క; అసమాన= నిరుపమానమైన; వివిధ= అనేక; దివ్య+అస్త్రమహిమ= దివ్యాలైన అస్త్రాల వైభవం; అమరులకున్= దేవతలకు కూడా; అద్భుతంబు+ఒనరించెన్= ఆశ్చర్యాన్ని కలిగించిందో; మమ్మున్+అందఱన్= మమ్ములను అందరినీ; ఎవ్వని= ఎవ్వడియొక్క; మహితశక్తి= గొప్పశక్తి; ఎక్కుడు+ఐ= అధికమై; సంగరంబునన్= యుద్ధంలో; చిక్కు+పఱిచెన్= ఇబ్బందిపెట్టిందో; అట్టి= అలాంటి; కర్ణునిన్= మహావీరుడు కర్ణుడిని; కొంగునన్= కొంగులో; అగ్నిడాఁచి+అట్టులు= నిప్పును దాచిపెట్టినట్లు; ఎమ్మెయిన్= ఎలా; డాఁచితో!= దాచిపెట్టావో!; అమ్మ!= అమ్మా!; చెపుమ= చెప్పుము.

తాత్పర్యం: 'భీమార్జునులవంటి అసమానవీరులను ఎవడి ఉత్సాహాన్ని ఆసరాగాకొని దుర్యోధనుడు ఎదుర్కొనటానికి సమర్థుడయ్యాడో, విదేహపౌండ్రాదులైన చిన్న చిన్న రాజులు ఎవడి పరాక్రమ వైభవంచేత కప్పాలు చెల్లించగలిగిన సామంతులయ్యారో, మన పాండవసైన్యం ఎవడి బాహుబలసంపదముందు ఓడి అక్కడి కక్కడ అణగి ఉంటూ వచ్చిందో, ఎవడి నిరుపమానమైన దివ్యాస్త్ర సంపద దేవతలకు కూడా ఆశ్చర్యాన్ని కల్గించిందో, మమ్ములను అందరినీ ఎవడి మహాశక్తి అతిశయించి యుద్ధంలో చికాకు కలిగించిందో - అట్లాంటి కర్ణుడిని కొంగులో నిప్పును దాచిపెట్టినట్టు ఎట్లా దాచిపెట్టావమ్మా! చెప్పుము.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **అర్జునుఁ డొకరుఁడు దక్క ను । పార్జితశౌర్యమున నమ్మహాబాహుని వి**
స్ఫూర్జితరథమున కెదురై । గర్జిల్లఁగ రథికుఁ డెందుఁ గలుగునె జననీ! **180**

ప్రతిపదార్థం: జననీ!= అమ్మా! అర్జునుఁడు ఒకరుఁడు+తక్కన్= అర్జునుడు ఒకడుతప్ప; ఉపార్జిత= సంపాదింపబడిన; శౌర్యమునన్= పరాక్రమంతో; ఆ+మహాబాహుని= ఆ మహావిక్రముడైన కర్ణుడి; విస్ఫూర్జిత= మిక్కిలి ప్రకాశించేటువంటి; రథమునకున్= రథానికి; ఎదురు+ఐ= ఎదురుపడి; గర్జిల్లఁగన్= గర్జించటానికి; రథికుఁడు= రథంమీద ఉండి యుద్ధం చేసే వీరుడు; ఎందున్= ఎక్కడైనా; కలుగునె?= ఉన్నాడా?

తాత్పర్యం: అమ్మా! అర్జునుడు ఒకడు తప్ప సంపాదించిన పరాక్రమంతో ఆ మహావిక్రముడైన కర్ణుడి దివ్యప్రకాశమున్న రథానికి ఎదురుపడి గర్జించగల యోధు డెవడున్నాడు చెప్పుము!

తే. **కర్ణుఁ దొలుచూలుగా నేల కంటి తల్లి? నీదుమంత్రంబు పరమ విషాదకారి**
యయ్యె మాకెల్ల నట్టి మహాబలైక । గణ్యు బ్రుంగుడుపఱుచుట కారణమున. **181**

ప్రతిపదార్థం: కర్ణున్= కర్ణుడిని; తొలుచూలుగాన్= తొలికాన్పుగా; ఏలకంటి తల్లి?= ఎందుకు కన్నావమ్మా?; నీదుమంత్రంబు= నీవు నేర్చుకున్న మంత్రం; మాకున్+ఎల్లన్= మా కందరికీ; అట్టి= అట్లాంటి; మహాబల+ఏక+గణ్యున్= అద్వితీయమైన మహాపరాక్రమవంతుడిని; బ్రుంగుడుపఱుచుట కారణమునన్= చంపటంవలన; పరమవిషాదకారి+అయ్యెన్= గొప్పశోకాన్ని కల్గించినదయినది.

తాత్పర్యం: తొలిచూలుగా కర్ణుడిని ఎందుకు కన్నావమ్మా? అట్లాంటి అద్వితీయ మహాపరాక్రమవంతుడిని చంపటం వలన నీవు నేర్చిన మంత్రం మా అందరికీ గొప్ప శోకాన్నే తెచ్చిపెట్టింది.

తరువోజ:

భానుపుత్రుని చావు బంధులనెల్లఁ బరమసంతాపంబు పాల్పడఁజేసె
మానితబలుఁ డభిమన్యుండు పోర మడిసినప్పుడు నిట్టి మఱకువ నాత్మ
మానదు ద్రౌపదేయుల నాశమునకు నుడుక దివ్విధమున నుల్లంబు ద్రుపద
సూనులు ధృతరాష్ట్రసుతులును ద్రుంగుచొప్పున కిమ్మెయిఁ జొర దడల్ చాల. **182**

ప్రతిపదార్థం: భానుపుత్రుని= సూర్యపుత్రుడైన కర్ణుడి; చావు= మరణం; బంధులన్+ఎల్లన్= బంధువులందరినీ; పరమ= మిక్కిలి; సంతాపంబు= దుఃఖం; పాల్పడన్+చేసెన్= పాల్పడచేసినది; మానిత= ప్రఖ్యాతమైన; బలుఁడు= బలంగలవాడైన; అభిమన్యుండు= అభిమన్యుడు; పోరన్= యుద్ధంలో; మడిసినప్పుడున్= చనిపోయినప్పుడుకూడా; ఇట్టి; మఱకువ= విస్మృతి (నిశ్చేష్టత); ఆత్మము= మనసు; ఆనదు= పొందదు; ద్రౌపదేయుల= ద్రౌపదికుమారులైన ఉపపాండవుల; నాశమునకున్= నాశనానికి కూడా; ఉల్లంబు= హృదయం; ఈ+విధమునన్= ఈ రీతిగా; ఉడుకదు= తపింపలేదు; ద్రుపదసూనులు= ద్రుపదరాజు కొడుకులు; ధృతరాష్ట్ర సుతులును= కురు కుమారులు; త్రుంగు చొప్పునకున్= చనిపోయిన రీతికికూడా; ఈ+మెయిన్= ఈ రీతిగా; చాల+అడల్= మిక్కిలి దుఃఖాన్ని; చొరదు= పొందలేదు.

తాత్పర్యం: అమ్మా! సూర్యకుమారుడైన కర్ణుడి మరణం బంధువులందరినీ మిక్కిలిగా దుఃఖంపాలు చేసింది. ప్రఖ్యాతబలుడు అభిమన్యుడు చనిపోయినప్పుడు కూడా ఇంత విస్మృతిని మనసు పొందలేదు. ఉపపాండవులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గతించినప్పుడు కూడా హృదయ మింత ఉడికిపోలేదు. ద్రుపదుడి కుమారులు, కురుకుమారులు చనిపోయిన తీరుకు కూడా హృదయాలు ఇంతగా దుఃఖాన్ని పొందలేదు. (కర్ణుడి మరణం అంతగా క్రుంగదీసిందని అర్థం).

విశేషం: వృత్తలక్షణానికి చూడుడు - స్త్రీ. 1. 43.

ఆ. అతఁడు మాకు నన్న యని మున్న యెఱుఁగంగఁ । గన్నఁ గురుబలంబుఁ గలఁగఁబడక
మనుదు మట్టులైన మనుజలోకమునకుఁ । గలుగ దడలు మాకుఁ గలుగ దడలు.' 183

ప్రతిపదార్థం: అతఁడు= కర్ణుడు; మాకున్+అన్న+అని= మాకు అన్న అనేటువంటి విషయం; మున్న+అ= ముందే; ఎఱుఁగంగన్+కన్నన్= తెలిసికొని ఉంటే; కురుబలంబు= కురుసైన్యం; కలఁగన్+పడక+మనుదుము= వ్యాకులం చెందకుండా ఎట్లా మెలగాలో అట్లా మెలిగేవాళ్ళం; అట్టులు+ఐనన్= అట్లా అయి ఉంటే; మనుజలోకమునకున్= మానవలోకానికే; అడలు= దుఃఖం; కలుగదు= కల్గేదికాదు; మాకున్= మాకుకూడా; అడలు= దుఃఖం; కలుగదు= ఉండేది కాదు.

తాత్పర్యం: కర్ణుడు మాకు అన్న అనే విషయం ముందుగానే తెలిసి ఉంటే కురుకుమారులు, వారి సైన్యం వ్యాకులం చెందకుండా ఎట్లా మసలుకొనాలో అట్లా మెలిగేవాళ్ళం. అట్లా అయి ఉంటే మానవలోకానికే ఏ దుఃఖమూ కలిగేది కాదు.'

వ. అని విలాపంబు సేసి విషాదశిథిలవర్ణంబులతో గోత్రనామంబు లుగ్గడించుచు నమ్మార్తాండనందనునకుం దిలోకప్రదానంబు సేసెఁ; దదనంతరంబ భీమార్జున నకుల సహదేవులుం జేసి రట్లు కర్ణుండు పాండవాగ్రజుం డగుట యెఱింగి గురువధూజనంబు లార్తనాదంబు లెసంగ నాక్రందించిరి; ధృతరాష్ట్రుండును గాంధారీ కుంతీ పూర్వకంబుగా నతనికి నుదకకర్మం బాచరించె; నయ్యజాతశత్రుండా దినేశపుత్రునివలని సౌభ్రాత్రంబువలనఁ బరిచారికాసమేతంబుగాఁ దద్భార్యల రావించి గారవించి యతనికై యనేక విధ పుణ్యకర్మంబులు భూరిదక్షిణంబులుగాఁ ననుష్ఠించి కృతకృత్యతానందంబు నొంది సకలబంధుసహితంబుగా గంగాసముత్తరణం బాచరించె - నని యిట్లఖిలజనాభినందితుండగు ధర్మనందనుండు గర్ణుం దమయన్న యని యెఱింగిన తెఱంగు వైశంపాయనుండు జనమేజయున కెఱింగించిన నజ్జనపతి 'కురువంశ్యుండగు నయ్యుధిష్ఠిరువర్తనం బటమీఁద నెట్లు సెల్లె?'నని యడుగుటయు. 184

ప్రతిపదార్థం: అని విలాపంబు+చేసి= అని ఏడ్చి; విషాద= శోకం వలన; శిథిల= వణకువల్ల జారిపోతున్న; వర్ణంబులలోన్= అక్షరాలతో; గోత్రనామంబులు= గోత్రంపేరు, పూర్వికుల పేర్లు, చనిపోయినవానిపేర్లు; ఉగ్గడించుచున్= పలుకుతూ; ఆ+మార్తాండనందనునకున్= ఆ సూర్యకుమారుడైన కర్ణుడికి; తిలోదక ప్రదానంబు+చేసెన్= నువ్వులు, నీళ్ళు వదలిపెట్టాడు (తిలతర్పణం చేశాడు); తద్+అనంతరంబ= ఆ తరువాత; భీమ, అర్జున, నకుల, సహదేవులున్= అతడి తమ్ముళ్ళూ; చేసిరి= అట్లాగే చేశారు; కర్ణుండు; పాండవ+అగ్రజుండు+అనుట= పాండవుల అన్న అనే విషయం; ఎఱింగి= తెలిసి; కురువధూజనంబులు= కురుకుమారుల భార్యలు; ఆర్తనాదంబులు+ఎసంగన్= ఆర్తనాదాలు అతిశయించగా; ఆక్రందించిరి= ఏడ్చారు; ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడు కూడా; గాంధారీ, కుంతీ పూర్వకంబుగాన్= గాంధారి; కుంతీదేవులు ముందు చేయగా; అతనికిన్= కర్ణుడికి; ఉదకకర్మంబు= ధర్మోదక ప్రదానం; ఆచరించెన్= చేశాడు; ఆ+అజాతశత్రుండు= ఆ ధర్మరాజు; ఆ+దినేశపుత్రుని వలని= ఆ కర్ణుడిపట్ల ఉన్న; సౌభ్రాత్రంబు వలన్= సోదరభావం వలన; పరిచారికా సమేతంబుగాన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరిచారికలతో సహా; తద్+భార్యలన్+రావించి= అతడి భార్యలను రప్పించి; గారవించి= గౌరవించి; అతనికై= కర్ణుడికోసం; అనేకవిధ= వివిధాలైన; పుణ్యకర్మంబులు= పుణ్యకర్మలను; భూరి దక్షిణంబులుగాన్= అధికమైన దక్షిణలతో; అనుష్ఠించి=చేసి; కృతకృత్యతా+ఆనందంబున్+ఒంది= విధిని పూర్తి చేశానన్న తృప్తిని పొంది; సకల బంధు సహితంబుగాన్= బంధువులందరితో కలిసి; గంగా సముత్తరణంబున్+కావించెన్+అని= గంగానదిని దాటాడని; ఇట్లు= ఈ విధంగా; అఖిలజన= జనులందరిచేత; అభినందితుండు+అగు= మెచ్చుకోబడిన; ధర్మనందనుండు= ధర్మరాజు; కర్ణున్= కర్ణుడిని; తమ అన్నయని= తమ అన్న అని; ఎఱింగిన తెఱంగు= తెలిసికొన్న విధం; వైశంపాయనుండు= వైశంపాయనుడు; జనమేజయునకున్= జనమేజయుడికి; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+జనపతి= జనమేజయుడు; కురువంశ్యుండగు= కురువంశీయుడైన; ఆ+యుధిష్ఠిరు వర్తనంబు= ఆ యుధిష్ఠిరుడి నడవడి; మీఁదన్= తరువాత; ఎట్లు+చెల్లెనని= ఎట్లా జరిగిందని; అడుగుటయున్= అడుగగా.

తాత్పర్యం: అని ఏడ్చి, ధర్మరాజు దుఃఖం వలన వణకుతున్న కంఠంతో జారిపోతున్న అక్షరాలతో గోత్రనామాదులను ఉచ్చరిస్తూ కర్ణుడికి తిలోదకాలు వదలిపెట్టాడు. ఆ తరువాత భీమార్జున నకుల సహదేవులు కూడా అట్లాగే చేశారు. కర్ణుడు పాండవుల అన్న అని తెలిసి కురుకుమారుల భార్యలు ఆర్తనాదాలు చేస్తూ ఏడ్చారు. ధృతరాష్ట్రుడు గాంధారి కుంతీదేవులతో కలిసి ధర్మోదకాలు సమర్పించాడు. ధర్మరాజు ఆ కర్ణుడిపట్ల ఉన్న సోదరభావం వలన పరిచారికలతో సహా అతడి భార్యలను రప్పించి, గౌరవించి, కర్ణుడికోసం అనేక పుణ్యకర్మలను అధికమైన దక్షిణలతో చేసి, విధిని పూర్తి చేశానన్న తృప్తిని పొంది, బంధువులతో కలిసి గంగానదిని దాటాడని - ఈ విధంగా జనులందరి చేత ప్రశంసించబడిన ధర్మరాజు కర్ణుడిని తమ అన్న అని తెలిసికొన్న విధం వైశంపాయనుడు జనమేజయుడికి తెలిపాడు. అప్పుడు జనమేజయుడు వైశంపాయనుడిని 'అయ్యా! ఆ తరువాత ధర్మరాజు ఏమి చేశాడు' అని అడిగాడు.

ఆశ్వాసాంతము

మందాక్రాంతము.

వీణానాద ప్రతిమ నిగమావిర్భవత్సార పుణ్య
శ్రేణీ సంపాదిత విమలతాస్థేమ నిర్లేపచిత్త
త్రాణక్రీడాకలన సతతోత్సాహ వద్దివ్యభావా!
ప్రాణాపానాహరణ నిపుణ ప్రాపణీయానుభావా! 185

ప్రతిపదార్థం: వీణానాద= వల్లకీ ధ్వనులతో; ప్రతిమ= సమానమైన; నిగమ= వేదపాఠం చేయటం వలన; పుట్టేనాదంతో; ఆవిర్భవత్= పుట్టుతున్న; సారపుణ్య= సారభూతమైన పుణ్యుల; శ్రేణీ= వరుసలచేత; సంపాదిత= సమకూర్చబడిన; విమలతా= నైర్మల్యం; స్థేమ= స్థిరత్వం కల్గిన; నిర్లేప= ఆసక్తతలేని; చిత్త= మనస్సుకలవారిని; త్రాణ= రక్షించడమనేటువంటి; క్రీడా= విలాసంతో; కలన= ఒప్పుచున్న; సతత= నిరంతర; ఉత్సాహవత్= ఉత్సాహం కల్గిన; దివ్యభావా!= ప్రకాశించే హృదయం కలవాడా!; ప్రాణ= ప్రాణమూ; అపాన= అపానమూ అనే ప్రాణవృత్తుల; ఆహరణ= కూడికచేత; నిపుణ= నైపుణ్యంతో; ప్రాపణీయ= పొందించబడదగినటువంటి; అనుభావా= ప్రభావం కల్గినవాడా!

తాత్పర్యం: వీణవలె మనోహరమైన వేదనాదాన్ని అర్థభావన చేస్తూ నిరంతరం అభ్యసించే పుణ్యాత్ములకు కలిగేటటువంటి అసంగచిత్త, స్థైర్యాది ఉత్తమగుణాలను నీవే రక్షిస్తావు. ప్రాణాపానాది వాయువృత్తి నిరోధక రూపమైన యోగాభ్యాసంవలన మహాయోగులు నిన్నే పొందుతారు. అట్లాంటి దివ్య ప్రభావం కల్గిన నీకు నమస్కారం.

విశేషం: హరిహరనాథస్వామిని ఇక్కడ యోగస్వరూపుడిగా వర్ణించటాన్ని మనం గమనించవచ్చును. వీణ -శరీరానికి ప్రతీకగా కల్పించబడిన దివ్యవాద్యమని సంగీతజ్ఞులు చెబుతారు. వీణాదండమే మేరుదండం. నాడులే నాదతంత్రులు. కనుక వీణానాద సాధన మహాయోగంగా వివరించబడింది. మహర్షులుకూడా వీణాసాధన చేసేవారని ప్రతీతి. కారణం నాదోపాసనవలన కలిగేది నిర్వికారమైన ప్రశాంత చిత్తం. వేదనాదోపాసనకు కూడా అదే ప్రయోజనం కాబట్టి ఈ పోలిక సమంజసం. నిర్వికారతకు ఫలితమే అసంగచిత్తం. అంటే ఎందులోనూ మునిగిపోనిదని అర్థం. తామరాకుమీద నీటిబొట్టువలె తటస్థంగా ఉండే చిత్తమని అర్థం. స్థేమమంటే స్థిరమని అర్థం. ఉపాసకుడు అసంగధర్మాన్ని అలవరచుకొన్నా సులభంగా లభ్యంకానిది స్థిరత్వం. దానిని కూడా ప్రసాదించేవాడు భగవంతుడు మాత్రమేనని అర్థం. అందుకే భగవద్గీతలో స్వామి 'యోగక్షేమం వహామ్యహం' అని ఆనతి ఇచ్చాడు. యోగమంటే అసంగచిత్త పరిపాకమనే అర్థం. క్షేమమంటే స్థిరమైన అంతరంగమనే పరమార్థం.

ఇక ప్రాణాపానాదుల విషయం స్థానంగా కల్గినది ప్రాణం. గుదస్థానీయమైనది అపానం. ప్రాణాపాన సమాయుక్తుడుగానే భగవంతుడు చతుర్విధాలైన భక్ష్య భోజ్య లేహ్య చోష్యములనే ఆహార పదార్థాలను జీర్ణం చేస్తున్నాడని భగవద్గీత చెబుతున్నది. ప్రాణయామం అంటే ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం - ఇత్యాదిగా ఉన్న ప్రాణవృత్తులను నియమించటం అని అర్థం (నియమించటమంటే నిగ్రహించటమని భావం). యోగమంటే ఈ నిరోధం ద్వారా ఏర్పడేటటువంటి చిత్తవృత్తి సంయమనమని అర్థం. దానిద్వారా కలిగేదే పరమేశ్వరానుగ్రహమని యోగశాస్త్రం చెప్పుతున్నది. యోగతత్త్వోపనిషత్తులవంటి గ్రంథాలలో ఈ ప్రక్రియ వివరించబడింది.

ఇట్లా ప్రాణాపానాదులను సంయమనం చేయటం వలన తొలుత దూరశ్రవణ, దూరదర్శన, దూరగమన, కామరూపత్వ, అదృశ్యకరణి, సువర్ణకరణి - ఇత్యాది కొన్ని సిద్ధులు కలుగుతాయనీ, అల్లాంటి లౌకిక సిద్ధుల విషయంలో అనాసక్తుడై ఎవడు నిరంతర అభ్యసనంతో నిష్ఠను, ఓర్పును అవలంబిస్తాడో ఆ యోగి పరమేశ్వరానుగ్రహం పొందుతాడు. అదే మోక్షం. అందుకే 'నిపుణంగా' (నైపుణ్యంతో అని అర్థం). లౌకకవ్యామోహాదులనుండి బయటపడటానికి నైపుణ్యామవసరం. ఈ అనుగ్రహసిద్ధి సహజంగా వచ్చేది కాదు. బహుప్రయత్న సిద్ధం కాబట్టి 'ప్రాపణీయ' మని తిక్కనగారు సూచిస్తున్నారు.

మందాక్రాంతలో ప్రతి పాదానికీ మ, భ, న, త, త, గ, గ అనే గణాలుంటాయి. 1-11 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం కలదు.

క. త్వంతాహంతా నిరసన! శాంతాంతఃకరణ యోగిజనవిజ్ఞేయా
చింతాసాగరమగ్న । భ్రాంతజనాధ్యేయ! పరమభక్తివిధేయా! 186

ప్రతిపదార్థం: త్వంతా+అహంతా నిరసన!= నీవు, నేను అనే భావాలు లేనివాడా!; శాంత+అంతఃకరణ యోగిజన విజ్ఞేయా!= శాంతమైన అంతఃకరణం కల్గిన ఉత్తమ జ్ఞానయోగుల చేత తెలిసికోదగినవాడా!; చింతాసాగర= చింత అనేటువంటి సముద్రంలో; మగ్న= మునిగి; భ్రాంత= అజ్ఞాన రూప భ్రాంతిని కల్గిన; జన+అధ్యేయ!= జనులకు అధ్యేయుడా! (అట్లాంటి జనులు నిన్ను తెలిసికో లేరని తాత్పర్యం); పరమభక్తి విధేయా!= ఉత్తమ భక్తికి లొంగేటువంటివాడా!

తాత్పర్యం: హరిహరనాథా! నీవు - నేను అనే భావన లేని పరమ శాంత చిత్తవృత్తి గల జ్ఞానయోగులు సమాధిలో నిన్నే తెలిసికొంటారు. సదా సంసార సముద్రంలో మునిగి చింతాభ్రాంతులతో కూడిన జనులు ఎన్నటికీ నిన్ను గుర్తించలేరు. ఉత్తమభక్తి మాత్రమే నిన్ను అందుకొనగలిగిన సులభ సాధనం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ సృష్టిమొదట ఆత్మ మాత్రమే ఉన్నది. దానికి స్వ- పర భేదం లేదు. సృష్టిక్రమంలో పదార్థ మేర్పడి జీవం అందులో బద్ధమైన తరువాత నీ - నా అనే తేడాలు ఏర్పడ్డాయి. లోకంలోని మనుష్యులను ఈ భావనే వేరుచేస్తున్నది. స్త్రీపర్వంలోని కథనంతా మనసులో తలచుకొంటే గాంధారీ ధృతరాష్ట్రులకు ఈ భావన అందరూ చనిపోయిన తరువాతకూడా పోలేదని తెలుస్తుంది. ధర్మరాజు, విదురుడు, కృష్ణుడు మాట్లాడిన మాటలలో ఈ స్వపరభేదం లేదు. అందుకే చిత్తభ్రాంతి, శోకం, గాంధారీ ధృతరాష్ట్రులకు, తక్కిన కురుకుమారుల భార్యలకు, చివరికి పాండవులకుకూడా ఇవి పోలేదు.

కాని, భగవంతుడు పరమశాంతులకు కాని లభ్యం కాడు. అందుకే భీష్మాది జ్ఞానయోగులకు మాత్రమే అతడి తత్త్వం అవగతమైంది. వారికి చింతాభ్రాంతులు లేవు.

ధర్మరాజు, ఇతర పాండవులు, ద్రౌపది కూడా మామూలు మనుష్యులే, కేవలం భక్తితో శ్రీకృష్ణుడిని విశ్వసించారు. జీవితాన్ని కర్మయోగంగా సాధించారు. ఇక రాబోయే పర్వాలలో యజ్ఞయాగాదులచేత పవిత్రులై, శోక భ్రాంతులను పోగొట్టుకొని, సంయమితేంద్రియులై చివరకు మహాప్రస్థానయోగ్యత పొందారు. వారిలో మిగిలిన స్వర్గారోహణ పర్యంతం 'ధర్మం' చేత నడుపబడినవాడు ధర్మరాజు మాత్రమే. ఈ అర్థమంతా 'పరమభక్తి విధేయా!' అనే సంబోధనలో నిక్షిప్తంగా ఉన్నది.

మాలిని

భరిత నియమచేతః పద్మవిజ్ఞాన కేలీ!
పరిమళపరిపాక ప్రౌఢసంపర్కశాలీ!
పరిణతికృతదూష్య ద్భంగి భూతాళిహేలా!
కరణ భృతి జగత్సంస్కర్తృతానందశీలా! **187**

ప్రతిపదార్థం: భరిత నియమ= నియమాలతో కూడిన; చేత; పద్మ= పద్మంవంటి హృదయంయొక్క; విజ్ఞాన= జ్ఞానంలో; కేలీ!= రమించేవాడా!; పరిమళ= సుగంధంలాంటి; పరిపాక= పుణ్యపరిపాకం ఉన్న వారితో; ప్రౌఢ= దృఢమైన; సంపర్కశాలీ!= సంబంధం కలవాడా!; పరిణతి= పరిణామంచేత; కృత= చేయబడ్డ; దూష్యత్= దూషింపదగిన; భంగి= రీతి కల్గిన; భూతాళి= భూతాల; హేలా= విలాసంకలవాడా!; కరణ= చేయటం; భృతి= ధరించటం; అనేటువంటి; జగత్= జగత్తుయొక్క; సంస్కర్తృత+ఆనందశీలా!= ప్రపంచ సంస్కారంతో ఆనందించే స్వభావం కల్గినవాడా!

తాత్పర్యం: హరిహరనాథ ప్రభూ! నీవు ఉత్తమ నియమాలను పాటించే సుచరిత్రుల హృదయపద్మాలలోని మహాజ్ఞానంతో రమిస్తావు. నీవు ఎప్పుడూ సుగంధం వంటి పుణ్యపరిపాకం ఉన్నవారితోనే దృఢమైన సంబంధం ఉంటుంది. నిత్యపరిణామం పొందిఅనేకరకాలుగా విచ్ఛిన్నం పొందే ఈ సర్వసృష్టీ నీ విలాసంలో భాగమే. అందుకే జగత్తును సృష్టించి, పెంచి, సంహరించి ఆనందిస్తూ ఉంటావు.

విశేషం: వైదికజీవితం నియమనిష్ఠలతో కూడింది. శుచిత్వం, తుష్టి, సంతోషం, తపస్సు, ఇంద్రియనిగ్రహం, స్నానం, మౌనం, ఉపవాసం, యజ్ఞం, వేదాధ్యయనం, బ్రహ్మచర్యం, క్రోధరాహిత్యం, గురుభక్తి, దానం - అనే 14 నియమాలను స్మృతి గ్రంథాలు వివరిస్తున్నాయి. ఈ నియమాలచేత హృదయంలో జ్ఞానం పొటమరిస్తుంది. ఇది సాత్త్విక జీవితంలో పుట్టే జ్ఞానం కాబట్టి ఉత్తమజ్ఞానమని భగవంతుడు ఈ జ్ఞానంలో ఆసక్తి కలవాడని మొదటి పాదానికి అర్థం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భగవంతుడు ఎప్పుడూ పుణ్యపరిపాకమున్న ఉత్తమపురుషులలోనే నికటసంబంధం కలిగి ఉంటాడు. భారతకథలో పాండవులతోనే శ్రీకృష్ణుడు జీవితమంతా నడపటంలోని మహార్థ మిదే. చివరకి యుద్ధం పూర్తి అయ్యాక కూడా పాండవులను వెన్నాడి ఉన్నాడు. లేకపోతే భీముడు ధృతరాష్ట్రుడి కౌగిలినుండి తప్పించుకొనేవాడు కాడు. ఆ ఉత్తమపురుషుల స్నేహం 'పరిమళం' వంటిదట. ఆ పరిమళమే మహాభారతంలో మనకు అనుభవమయ్యే శాంతరసానుభవం. ఇది రెండవ పాదానికి అర్థం.

లోకసృష్టి పరిణామంలో దూషణకు పాత్రమవుతుంది. కౌరవుల పక్షంలోని వీరులందరి జీవితాలను స్మరిస్తే పరిణామంలో పంచభూతాత్మక జగత్తు ఎట్లా దిగజారుతుందో తెలుస్తుంది. ఆ భూతాళి యొక్క విలాసం కూడా పరమేశ్వరుడి లీలలో భాగమే. అందుకే భగవద్గీతాకారుడు 'మోసంబులలో ద్యూతము నేనే' అని తన విశ్వవిభూతిని ప్రకటించాడు. ఇది మూడవ పాదానికి అర్థం.

ఇక చివరిపాదం. జగత్తును చేసేవాడు, మోసేవాడు, తీసేవాడు- అన్నీ తానే అని గీతాకారుడు ప్రకటించిన విషయం సుప్రసిద్ధమేకదా! సృష్టి స్థితి లయాలు మూడూ స్వామివారి ఆనందలీల. ప్రతి పనిలోనూ స్వామివారికి ఆనందమే. అందుకే బ్రహ్మసూత్రాలలో 'లోకవత్తు లీలాకైవల్యం' అని బాదరాయణుడు సూత్రించాడు. అందుచేత గాంధారీ ప్రభృతుల శోకరస ప్రవాహంలో కూడా భగవంతుడి లీలా స్రవంతి ఉన్నదని అర్థం. అందుకే తిక్కనగారు అంత రమణీయంగా చిత్రచిత్రగతులలో, వృత్తాలతో స్త్రీ పర్వాన్ని అతిరమణీయంగా రచించారు.

మాలినీవృత్తంలోని ప్రతిచరణంలోనూ వరుసగా న, న, మ, య, య - అనే గణాలుంటాయి, 1-9 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

గద్యము:

ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున స్త్రీపర్వంబునందు సర్వంబును ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఉభయ కవిమిత్రుడు, కొమ్మనామాత్యుడి పుత్రుడు, బుధారాధనవిరాజి, తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలో స్త్రీపర్వంలో ద్వితీయాశ్వాసం సంపూర్ణం. ఇంతటితో స్త్రీపర్వం సమాప్తం.

స్త్రీపర్వంలోని ద్వితీయాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతంలో స్త్రీపర్వం ముగిసింది.

శ్రీమదాంధ్ర మహాభారతము

శల్య పర్వము

గద్య పద్య ప్రథమ పాద సూచి

పద్యము	పుట
అ	
అంతందెలిసి యక్కౌంతేయా	99
అంత ధనంజయ కిమ్మీరా	142
అంత వలన దిమ్మాట	35
అందు దుర్నయంబు	254
అంభోగర్భము సొచ్చి	214
అకుట కులం బకారణ	343
అక్కట యెప్డుఁ బల్వురు	358
అక్కడ సంధికిం జనిన	165
అగపడి కచ్చువెట్టి	235
అగ్నితీర్థమునకు నరిగె	270
అచటినుండి సారస్వత	274
అచటు గదిలి యాతఁడా	274
అచ్చపుభక్తికిన్ మది	131
అచ్చెరువు సంపుటకు	337
అచ్చోటు గదలి హలా	273
అజ్జలములఁ గ్రుంకి	259
అట్టి యయ్యుదపానం	250
అట్టియెడం గంకటాం	125
అట్టియెడ	116
అట్టియెడ	158
అట్టియెడ	268
అట్టియెడ రెండువేలు	188
అట్టియెడ సుడిసి	192
అట్లడలుచు నిట్టూర్పు	182
అట్లుంగాక	145
అట్లు కాక గెలిచి	204
అట్లుం గాక మైత్రేయ	316
అట్లు ఘోరాకారుండై	228
అట్లు దొరుఁగు దారుణ	80
అట్లుద్యోగించి	276
అట్లు ధర్మనందనుం	208
అట్లు నడచుచు సరస్వతీ	247
అట్లు నిశ్వాసంబు నిగుడ	226
అట్లు పాండుభూపా	133
అట్లు మనసైన్యములు	187
అట్లు మీరు సొలరేని	223
అట్లు వడియున్న	321
అడరి ధనంజయాదు	75
అతఁడందఱ బాణంబులు	149
అతఁడడుగంగ శల్య	200
అతఁడు డెబ్బది	107
అతఁడు పంద్రెండు వాలమ్ము	105
అతఁడ పసదన మొసఁగు	206
అతఁడు ప్రదీప్తకోప	117
అతఁడు మేనమామ	46
అతఁడు వెస నవసప్తతి	110
అతఁడు సరస్వతి	250
అతనిఁ గనుంగొని	227
అతనిఁ గాంచితి నత	194
అతని కిట్లనియె	350
అతనికి నెమ్మినిట్లనియె	362
అతనికి భీమసేను	284
అతని ధనువా సుశర్మ	72
అతని వధించుటకై	256
అతని హయములు	82
అతిత్వరిత గమనంబున	285
అత్తెఱం గెఱింగించెద	245
అది గొంత పుడమిఁబడ	181
అది ప్రభాసంబను పేరం	244
అదియును గృతస్నానయు	272
అదియును నిలిచి మార్కొన్న	317
అది యెల్ల నేల చెప్పఁగ	165

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనంతర వర్తనంబు	192
అనఘ! నీవు చెప్పినట్టులు	47
అనఘు నీవు నాకు	38
అనఘ! వశముగాదు	09
అన విని కృష్ణుడిట్టులను	317
అన విని చుట్టు నున్న	35
అన విని యన్నరేశ్వరుఁడు	218
అన విని యెల్లవారు	294
అన విని రాజుదేవులు	348
అన విని శల్యుఁడిట్లనియె	41
అన విని శౌరి యిట్లనియె	303
అనవుడు నగ్గురు	204
అనవుడు నతండు	363
అనవుడు నాతడిట్టులను	313
అనవుడు నాసంయమి	341
అని	195
అని కురువిభుండు	292
అని గదఁ జేకొని	310
అని చెప్పి కృతవర్మ	27
అని చెప్పి పాండునృప	338
అని చెప్పి యప్పుడద్భుత	334
అని చెప్పి యమ్మడువు	196
అని తన కొడుకు	18
అని తలపోసి తన	101
అని దుర్యోధను	11
అని దూఱి దుర్యోధనుం	312
అని ధృతరాష్ట్రనందనుల	340
అని ధృతరాష్ట్రునకు	188
అనిన నిజతపంబు	278
అని నన్ను నాపరివారంబు	141
అని నిర్దేశించిన	281
అనిన విని తలయెత్తి	161
అనిన విని ధర్మతనయుం	321
అనిన విని ధృతరాష్ట్రుండు	312
అనిన విని నీతనయుం	231
అనిన విని పాంచాలురుం	240
అనిన విని భవన్నందనుండు	225
అనిన విని మహాబల	233
అనిన విని యచ్యుతుం	51
అనిన విని యచ్యుతుం	326
అనిన విని యతండు	201
అనిన విని యమ్మునీంద్రు	284
అనిన విని యుధిష్ఠిరుం	47
అనిన విని వృషస్కంధుం	38
అనిన విని సమస్త	40
అనిన విని సవ్యసాచి	174
అని పయిచీర చెఱంగు	347
అని పలికి కరతలంబెత్తి	145
అని పలికి కురుపతిదెస	235
అని పలికి దుర్యోధనాభి	292
అని పలికినఁ బాండవా	216
అని పలికిన నీసుతుండు	43
అని పలికిన పెలుచనవ్వి	309
అని పలికి యత్యంత	18
అని పలికి యుజ్జ్వల	230
అని పలికి సన్నాహంబు	238
అని పలికె నిట్లు సల్లాప	337
అని పెక్కుభంగుల	16
అని ప్రార్థించెననుటయు	340
అని బోధించె నదియునుం	166
అని భూపాలురనెల్ల	288
అని మము నోర్చినం బృథివి	215
అని మఱియు ననేక	323
అని మఱియును	236
అని మఱియును	294
అనిమిష వాహినీ తనయు	352
అనిమిష వాహినీ తనయు	358
అని మోపులు డిగవిడిచి	206
అని యంత నిలువక	343
అని యంత నిలువక	355
అని యుగ్గ్రతముండు శోకా	31
అని యడిగిన నమ్మానవ	351
అని యడిగిన వైశంపాయ	02
అని యనుజ్ఞ ఇచ్చిన	257
అని యారథికవరుల	359
అని యిట్లు పుండరీకా	324
అని యిట్లు సంజయుండు	340
అని యివ్విధంబున నమ్మను	221
అని యూరడిల్లఁ బలికిన	13
అనియె నప్పుడనిల సుతుని	205
అని రట్టియెడ నీకొడుకు	144
అనిలజుఁడుఁ పోలె	353
అనిలజుని యశ్వముల	81
అనిలసుతుం డధర్మమున	313

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనిలసుతుండు పూన్కి	28
అని విలాపంబు సేసిన	405
అని వెండియు	335
అని వెండియు ననేక	253
అని వెండియు నాపతి గురు	211
అని వెండియు నిట్లనియె	345
అని వెండియు నిట్లను జతు	220
అని శంకించియుఁ గొంకు	126
అని సందేహడోలాయమాన	121
అని సంభావించె ననిన విని	321
అని హృదయంబునఁ బ్రార్థించి	131
అనుచుండఁగ నమ్మువ్వురు	263
అనుచుఁ బలుమాఱు	285
అనుచుఁ బురుషోత్తముని	128
అనుచుఁ బోటులఁ దొరుఁగు	228
అనుచు నమ్మౌన యాలో	162
అనుజులఁ దనుజుల	196
అనుజులుఁ దాను శల్యుని	56
అనుటయు	217
అనుటయుఁ బొంగి ధర్మ	226
అనుటయు నచ్యుతుండు	234
అనుటయు నట్లకాక	320
అనుటయు నతఁడిట్లను	286
అనుటయు నమ్మహీ	202
అనుటయు నాతండందఱు	09
అనుటయు నాతఁడిట్టు	39
అనుటయు మాధవుం	342
అనుటయు వాఁడు పాండవ	68
అనుటయు సంజయుం	55
అనుటయు సంజయుం	222
అనుడు నా నృపాలు	209
అనుడు నెదిర్చి నీతనయు	240
అన్నపాటు సూచి యనుజు	74
అన్నరేంద్రు పాణి యల్లన	342
అన్యాయంబునం జంపు	304
అన్వేషించి కానమికి	203
అపుడు శివవరుండు	93
అప్పు డటు లతఁడు	19
అప్పు డద్దిక్కు జనంబులు	143
అప్పు డప్పుడ తలపడినట్టు	300
అప్పుడు	149
అప్పుడు కుంజర బృంహితంబు	295
అప్పుడు గొందఱు బ్రహ్మ	258
అప్పుడు మహోల్కా పాతంబు	307
అప్పుడు రెండు వీళ్ళనతని	152
అప్పుడు శల్యుండు యుధి	109
అప్పు డేను ధృష్టద్యుమ్నుని	171
అభిరామభీమాకారుండై	132
అమరనదీతనయుఁడు	14
అమరనదీతనూభవుఁడు	44
అమరనదీతనూభవుని	174
అమరనదీసుతాదులగు	114
అమరనదీసుతుండు	163
అమరి యున్నాఁడ నాబారి	292
అమరులకు నసురులకు	276
అమవస నమవస	247
అమ్మద్రపతి నేర్పును	129
అమ్మద్రవిభుని ధర్మజు	54
అమ్మనుజేంద్రు ముందటికి	139
అమ్మహనీయసాధనంబున	268
అమ్మహాత్ములు సెప్పిన	166
అమ్మహానది నడిగి	258
అమ్ముఖమున సమరము	118
అమ్మేదినీశ్వరుండేది గతి	09
అయ్యవసరంబున	107
అయ్యిరువాఁగును	64
అరదంబులు నరదంబు	61
అరదము గౌరవేంద్రు	176
అరదము చిత్రసంచరణ	119
అరదము లెక్క ఘోర	225
అరదము సత్వరంబుగ	184
అరయఁగ మేటిపుణ్య	284
అరసి యనాగతం బెఱుగు	59
అరినిరవశేష నిరసన	363
అరులం గీటడఁగించి	142
అరులకు సిరియిచ్చి నను	220
అరులడంగిరి యుధి	173
అర్జునోదగ్ర దవశిఖ	25
అఱిముఱి బాణజాల	42
అల్లదెకంటె పాండు	67
అల్లదెకంటె పూర్ణశశి	161
అవమానంబులు సేసిన	323
అవి వెసఁ ద్రుచి యాతని	183
అవ్విభుండు పెనుఁబ్రాపై	197
అవ్వీరుని వాలంపఱ	120
అశ్రమంబున గెల్వనగు	291

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఆ	
ఆ కృష్ణవర్త్మ దుజ్జ్వల	168
ఆ కౌరవ్య విభుండు వజ్ర	90
ఆజ్ఞపాటించి మది	149
ఆతఁడు గదచేతంగొని	148
ఆ నియమా చరణంబు	275
ఆ నిశిత భల్లములు దన	70
ఆ పాంచాలోత్తము	108
ఆభీలగర్జన శోభిత	288
ఆ మాద్రీసుతుఁ డన్య	96
ఆ రథికవరుని నకులుని	99
ఆ రథికోత్తముండధిక	363
ఆరాధేయ తనూజుఁ డన్య	72
ఆలో ధర్మజు సారథి	126
ఆలోనం గురుధరణి	307
ఆలోనన శినివరుఁడు	150
ఆశ్చర్య కరణకరుణా	189
ఆ శై నేయుండువాలు వెఱికి	193
ఆ సమయంబున	102
ఆ సమయంబున	290
ఆ సమయంబున	298
ఆ సమయంబున మనదెస	157
ఆసీనులైన యెడనగ్గురు	357
ఆ సౌబలుండు శరాసనాంతర	181
ఇ	
ఇంతకు మున్నుసెల్లె	26
ఇంత చెప్పు టనికి నేనోడి	31
ఇందాకవిశ్రమించితి	217
ఇందుఁబుట్టిన జనులెల్లను	280
ఇంద్రతీర్థమునకు నేఁగె	273
ఇచ్చి యతండవ్వయు	276
ఇట రమ్ము నన్నుఁగౌఁగిట	11
ఇటు తగునే సుయోధన	212
ఇట్టిదిక్రూర కర్మమని	239
ఇట్లవష్టంభ విజృంభితుం	85
ఇట్లశ్వత్థామ కృపకృత	363
ఇట్లు కురుబలంబు	54
ఇట్లు కౌరవుల దుర్నయంబు	186
ఇట్లు చలంబున నవ్విభుం	140
ఇట్లు చిత్రసేనుండు వడినం	70
ఇట్లు చేకితానుండు	91
ఇట్లు జంకింపఁబడి	221
ఇట్లు తలపడి మండల	296
ఇట్లుత్సహించి యిత్తీరంబున	279
ఇట్లు దారుణరణ విహరణంబు	168
ఇట్లు దొడంగి	87
ఇట్లు ద్రౌపదేయుండగు	74
ఇట్లు ధైర్యధుర్యోత్సాహం	299
ఇట్లు పాఱిన	184
ఇట్లు పూర్వసంధ్యా	60
ఇట్లు పెనంగుచుండ	100
ఇట్లు పెనంగుచుండి	150
ఇట్లు ప్రీతుండై యాతండు	286
ఇట్లు మథితంబయ్యును	76
ఇట్లు రౌద్రోద్రేకంబున	133
ఇట్లు వచ్చి ధర్మతన	210
ఇట్లు విజృంభించి	13
ఇట్లు వోవునప్పుడు శౌరి	339
ఇట్లు శక్తి బెడిదంపు	134
ఇట్లు శల్యుండు విజృంభించిన	109
ఇట్లు శల్యుండు సమర	122
ఇట్లు శల్యుండు సోదర	137
ఇట్లు సమరోత్సాహ	56
ఇట్లు సవ్యసాచికి	103
ఇట్లు సిద్ధస్వరూప	266
ఇట్లెదిర్చి పేర్చిన యలుక	138
ఇతఁడు గదారణంబు	232
ఇతఁడు వఱిచిన పాటులు	320
ఇతనిని భయదీప్యోజ్వల	173
ఇతని సమయింప నయ్యచ్యు	130
ఇత్తెఱంగున	106
ఇత్తెఱంగున	106
ఇత్తెఱంగున దలపడి	61
ఇత్తెఱంగునఁ బెనంగి	88
ఇత్తెఱంగున నెల్లవారలు	242
ఇది నామాటగాఁ జెప్పు	356
ఇన్నూఱు రథంబులు	175
ఇమ్మడువులోన డాఁగెద	196
ఇరువురును సందు సూడక	89
ఇవ్విధంబున	73
ఇవ్విధంబున	83
ఇవ్విధంబున	129
ఇవ్విధంబున	142
ఇవ్విధంబునం బోరు	66
ఇవ్విధంబునఁ ద్రిగర్త	178
ఇవ్విధంబున దుర్యోధనుం	232
ఇవ్విధంబున దొర యఱిమి	181
ఇవ్విధంబున నమ్మహా	89
ఇవ్విధంబున నొండొరులకు	300
ఇవ్విధంబున మార్కొని	120

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఇవ్విధంబున విజృంభించిన	98
ఇవ్విధంబున విరథుండై	126
ఇవ్విధంబున వృకోదరునకు	237
ఇవ్విధంబున శినివీరుని	110
ఇది శ్రీమదుభయకవిమిత్ర	366
ఈ	
ఈ గెలివేలార్చెద బాహా	228
ఈ పుణ్యక్షేత్రంబున	281
ఈశ్వరుఁడు క్రీడి కస్త్రంబు	336
ఈ రథికులు తను నిమ్మె	206
ఉ	
ఉభయవాహిని సంగరోద్యోగ	243
ఉమయునగ్నియు గంగయు	262
ఉరముననాటిన ఘన	84
ఉరవడి రథికజనంబుల	83
ఉర్వీవలయము వడఁకెను	290
ఉఱికినఁ దేఱిపై కుఱికి	307
ఎ	
ఎక్కడఁ బోవవచ్చు గిరులేని	144
ఎక్కికొండొక తొలంగి	169
ఎత్తి త్రిప్పి యాడి యిలతోడ	149
ఎదిరి పెనగంగఁ జాలక	355
ఎనిమిది యడుగుల కొలఁదిని	88
ఎప్పుడును సంజయుఁడు	201
ఎవ్వరికిఁ గాఁగ రాజ్యంబు	217
ఏ	
ఏకవస్త్ర బాంచాలి నిట్లీడ్చి	308
ఏకాదశాక్షౌహిణీభర్త	199
ఏకాదశాక్షౌహిణీశుఁడై	192
ఏతత్ప్రకారంబు విపరీతం	315
ఏనట్లు సూపిచెప్పితి	229
ఏనింక సమరమొల్ల	218
ఏను దెంపుచేసి యీ యున్న	35
ఏనును గర్ణుఁడు దమ్ములు	13
ఏ నుపదేశించితి నన	337
ఏను మును విన్న యక్కొ	02
ఏమనం గలదు సంజయా	290
ఏమి చెప్పుదు రౌద్రంపు	66
ఏమి విధంబునఁ బొరలియు	219
ఏ రూపులయిన రూపఱ	79
ఏఱికొను మీవు నొకని	230
ఏలనుమాన మేను	204
ఏవురకుండ నొక్కొకటి	344
ఏవురతోడ న ట్టొకఁడ	111
ఐ	
ఐనను నొకపలు కడ్డము	23
ఒ	
ఒండుముఖంబున	201
ఒండొంటిఁ దాఁకి హేతులు	61
ఒండొరులం జుఱుచుఱం	289
ఒండొరులన్ జయించు	58
ఒకఁ డొకఁడ పాండవుల	49
ఒకది క్కుద్ధతిఁ బూన్చి	296
ఒకని నొకనిఁ బదిపది సాయక	81
ఒకరునిఁ జంపితేని సకలోర్వి	232
ఒక్కనాఁ డక్కుమారుం	261
ఒక్కరేయి నీపాల నా యునికి	279
ఒక్కింతసేపు పలుకు	194
ఒక్కొక్క మాఱుబ్బున	88
ఒరు లయినఁ బెక్కు దినముల	46
ఒసంగి యా లుబ్ధకుల	207
ఓ	
ఓఘవతి యనఁ బరగినఁ	339
ఓడివచ్చినాఁడ నుద్ధతి	218
ఓపి ధర్మార్థ కామంబు	316
క	
కంసదాసుని పుత్ర కానవు	325
కట్టియ వైచె నెన్నుదురు	177
కడఁకయు లావునుం గరఁగి	53
కడలుకొనఁ జుట్టుఁ బట్టెడు	358
కడిమింబోయి మహోగ్ర	269
కడు బెట్టిదంబగు గాలిచే	357
కడువడి సత్యసేను తురగం	71
కదిసి పవనజుఁడు	16
కదిసి మీఁదికి లంఘించి	70
కనికొని యధర్మంబైన	306
కని యంతయు నెఱింగించిన	252
కని యశ్వత్థామయుఁ గృపు	118
కని శల్యానుజుఁ డేచి	136
కనుఁగొని దర్పమంథరము	287
కనుఁగొని ధర్మసూతి	94
కనుఁగొని పార్శ్వచరులు	183

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
కనుఁగొని భీముండు	83
కనుఁగొని శిఖండి ముఖ	157
కన్నులు చీకులై నుత	10
కపటంపు జూదంబు	33
కపట ధర్మ కంచుకంబున	355
కమలాకరము లీల	122
కయ్యంపు మాట పుట్టిన	12
కరి హయ రథ బృందం	146
కరుణ జనించి శాత్రవుల	336
కరులఁ ద్రుంచెడు వేళ	112
కరుల గమి వొదివి	62
కర్ణ శకుని దుశ్శాసనుల్	214
కలకల నవ్వుచుఁ బెలుచం	210
కలగొనఁ బాఱుచున్	198
కలయఁగ నెత్తురుల్ దొరఁగ	97
కలవారెల్లను దెగి నీ	29
కవదొనలును గాండీవము	333
కవలలో నొకఁడొండె	231
కవలు తనమీఁద రయమున	94
కవిసినం గని గుణంబు	184
కవిసిన దట్ట కెంపడరు	82
కార్తికేయుం డధీశుఁడుగా	39
కాలోపహత మనస్కుఁడు	344
కావునఁ గొఱంతయును	165
కాళింగాది క్షోణీ	235
కీడు పుట్టునని నీవు	346
కుంజర నికురుంబ	59
కురుకులము పాలియట	319
కురుపతి చూచి చిత్తమున	156

పద్యము	పుట
కురుపతి ధృష్టద్యుమ్నుని	107
కురుపతి పడవాళ్ళం	48
కురుపతి మద్రరాజు	44
కురువిభుఁడు దనదు	116
కురువృత్తాంతం బడిగిన	283
కృతకృత్యుల మైతిమి	331
కృతవర్మయుఁ గృపుఁడును	202
కృతవర్మ సాత్యకి నతి	137
కృతవర్మ నొంచె నెనిమిది	150
కృప కృతవర్మలం గడిమి	108
కృప కృతవర్మాశ్వత్థామ	20
కృపుఁడును ధృష్టద్యుమ్ను	81
కొడుక! తమ్ములు దోడ్పడ	16
కొడుకులు దమ్ములుం గలన	213
కేపావేశంబు నొంది	227
కోపించి యతఁడు దర్పా	98
కౌంతేయుల బారింబడ	195
కౌరవముఖ్యు ధర్మగతి	341
క్షతమునకు ముక్కునం	135
క్షత్రధర్మంబు విడిచిన	213
క్షోణీ రాజ్యార్థము	165

గ

పద్యము	పుట
గంగాతనయుఁడు దెగినను	164
గంగానందనుఁ డాది గాఁగ	199
గంగానందను పోటు మెచ్చక	42
గంగాసుత గురు కర్ణుల	55
గతి బహుతా లసత్ఖుర	51
గదఁ గయ్య మెన్నఁడొకొ	294

పద్యము	పుట
గదతోడన్ గదచుట్టి	297
గద నాచేతికి వచ్చినప్పుడు	233
గద నేర్పెక్కుడు గల్గు దర్ప	322
గదయుఁ దానును రుచిర	227
గదాయుద్ధంబున నాభికి	313
గాంగేయ కుంభజ కర్ణ	239
గాంగేయ గురుకర్ణ కౌరవ	330
గాంగేయుని గుంభజుఁగర్ణుం	46
గాంధార దేశీయులగు	177
గాలిఁ గురుక్షేత్రంబున	281
గుణనినదము రథనేమి	64
గురుకర్ణుల యస్త్రాగ్నుల	334
గురుసుతుఁడు పాండవు	347
గురుసుతుఁడు పెనుబ్రాపు	102
గెలువరె జూదము లెందును	343
గెలుపుము శల్యుని నీవని	126

ఘ

పద్యము	పుట
ఘోరతర ప్రకారమగు	133

చ

పద్యము	పుట
చంచరకావళి ఝుంకృతుల్	50
చండగదా పరస్పర ఘట్ట	295
చక్కటిలేని యాలమున	323
చదివితినెల్ల వేదములు	329
చని ధృతరాష్ట్ర మందిరంబు	05
చనిరని యట్లు ధృత	364
చలమునఁ బోక పెనఁగు	63
చాపాచార్యుఁడు భీష్ముఁడుం	12
చావరు నొవ్వరు పాండవు	10

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
చిఱుతనగవుతో నొండొరు	227
చెడుటకు నోర్వ కీవిటులు	32
చెలంగిన కృపకృతవర్మాశ్వ	36
చెలులం జుట్టలఁద్రోచి	354
చేసి యొండొక భాసిత	95
చొరరాదు మనుజులకు	211
జ	
జగముల నెందునుం	276
జననయన చకోరానందను	05
జననాథ! శల్యుండు సమసె	09
జనమేజయునకు నిట్లను	340
జముచందంబున నేచి	129
జ్యారవము నాదముగ నతి	25
త	
తండ్రియట్ల సకలధాత్రీ	254
తక్కటినలువురు వొదవిన	109
తక్కటివారు నుక్కెక్కి	176
తత్ప్రదేశంబున నున్న	343
తనకై కాదే మదినెల్లను	29
తన దొరలుఁ దాను దారక	268
తన యనుజు లకట	164
తనయుఁడు వడ శకుని	182
తనయులని నందఱుం	10
తనవారుఁ దానుఁ గూడఁగ	218
తనవృద్ధియు మిత్రుని	315
తనుఁ బదునొకఁ డక్షౌహిణు	289
తనువు ఘనాస్త్రశస్త్రముల	204
తన్ని యలుక మలుగక	309
తప్పినయప్డు వ్రేటు దము	297
తమకు బలం బెక్కినతఱి	29
తమ విన్నమాటలన్నియు	207
తమ్ముల నిన్నుఁ గేశవుని	223
తలఁకుట యొప్పునే	184
తలఁదన్ను వాడనను	319
తలఁపఁగ భాగ్యవంతుల	17
తలయదియేల తన్నెద	311
తలసక్క ముడిచికొని	229
తాను సఖ్యంబు సేసి నమ్మించి	259
తురగంబులతోఁ గూడఁగ	333
తురగఖురపుట రథనేమి	208
తురగములు సిడము	185
తులువతనంబునన్	236
తెంపుచేసి మా మీఁద	215
తెప్పిఱి లేచి చూచి	90
తెరలక వారు పైపయి	103
తెల్లని సవరణ మెఱయ	63
తేజోమయంబైన	260
తొడలు విఱిగినేల	350
తోడనె తేరి వాహముల	121
త్రితుఁడనఁగా ద్వితుఁడన	248
త్రిభువనానందకరుండై	270
ద	
దండప్రణామం బాచరించి	256
దంతియుఁ దాను నాజి	164
దానికిం బవమానసూనుండు	314
దానికి నొచ్చిన మనముల	344
దాని విని యమ్మహాసేనుండు	269
దామోదరు తమ్ముండును	27
దివిజ గరుడ ఖచరాదులు	102
దురమున నమ్మెయిఁ గర్ణుడు	02
దురమున నర్జున ప్రకట	19
దుర్బలమగు నమ్మూఁకను	167
దుర్యోధనుండు దిక్కుమాలి	55
దేవత లమృతాంశునితో	246
దేవవ్రతగురుకర్ణుల	355
దేవహితవరుం డగుటం	264
దేవా జనమేజయ ధాత్రీ	01
దేవా యేమి సెప్పుదు	322
దేవా వైశంపాయనుండు	191
దైవ మిట్లు గలచునే	163
దైవమెల్లఁ దలఁప నీవ	253
ద్రుపదతనూజులన్	217
ద్రోణకర్ణ దివ్యాస్త్రముల్	335
ద్రోణుఁడు సూతనందనుఁడు	26
ద్వైపాయనుండును శుకుండు	274
ధనువు తూణీరయుగళంబు	333
ధరణికి నింక నాయకుఁడు	143
ధరణీనాయక పాండు	208
ధర్మనందనుం దలమిగిలిన	123
ధర్మపుత్త్రాదులును సుయో	285
ధర్మసంగరమున ధర్మజుచే	136
ధిక్కారంబులు చరణ	87
ధృష్టద్యుమ్నుం డెదుర్కొనిన	148
ధృతరాష్ట్రుండను ధరణీ	255

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
న	
నకుల సహదేవులును	146
నకులుం డొండొకచాప	110
నకులుఁడు రభసంబున	109
నకులుని చాపదండము	69
నచ్చిన కర్ణు విక్రమమునం	15
ననుఁబదునొకఁ డక్షౌహిణు	352
నను భీష్ము గురుని సూత	326
నరవర యెక్కటెక్కటి	233
నవరుఁ డేము సంగరంబు	197
నరుఁడు ప్రాణభయంబు	216
నరుఁలు మృదు వితఁడనంగా	119
నఱుకఁబడిన యడవి	255
నాకెదుర్రై పినాకియు	293
నాగేంద్రత్వమునకు	250
నాచే నీప్రాణంబులు	220
నాటినం గనలి యమ్మను	93
నా తేరికి నకులుఁడును	115
నిజరథము మీఁది హలమును	314
నినుఁ గాచికొనుము నీవు	30
నినుఁబట్టి పాండుపుత్రుల	39
నిమిషార్ధంబున త్రైలోక్య	337
నిరుత్తరుండై యున్న భవ	229
నిలిచిన సకలజనులు	287
నిలిపి పేర్చిన సమయంబున	77
నిశ్చయం బిట్టిద యగుటం	34
నీకుంజూడ నెట్టివాఁడ	329
నీ కూర్మి పేర్మిం జేసి	32
నీ కెనవచ్చు రాజరమణిన్	345
నీ కొలంది గంటివ	214
నీ తనయుండు సింహ	117
నీ దెస నాదుచిత్తమున	131
నీ నమ్మిన భూరిశ్రవు	15
నీ మాటకు దుర్యోధను	346
నీ యాగి నేను భూనాయకు	219
నీ యెడఁ జంచలమయ్యెను	359
నీ విట చక్కనయి రమ్ము	294
నీ వెట్లు నిశ్చయించి	45
నీ సుతుఁడు సమరవిషయో	290
నెత్తుటఁ దోఁగియు నిగిడి	65
నెరయుకినుకఁ బెన్వెడఁద	132
నెఱిమాలి వీరినీతఁడు	292
నేఁడు మిమ్మందఱ	224
నేలఁగూలి మ్రానువోలె	324
నేలనాలుగు సెఱఁగులు	351
నొంచి మదించి ఖేచర	95
ప	
పగవారి నాశ్రయింపక	354
పటునారాచ చయంబు	148
పటురయమున నాశ్వికు	63
పడసి యొక్కట	248
పడియును గద విడువని	89
పతియిమ్మై సముదీర్ణ	152
పదంపడి యత్యంత	277
పనిచిన నెల్లవారు	48
పనిచెంగాని ధృతరాష్ట్రు	341
పనుపుమనిన హృష్టుండై	362
పయిపయి నెంత లావదలు	360
పరజయము నొంది కట్టుము	236
పరమతపమున నొక	277
పరిజన హీనత దీనత	221
పరిభవకారి యై నకుల	320
పరులచేతఁ గానిపని	322
పరుషపరాక్రమస్ఫురణ	153
పలపలని మూఁకలోఁగాల్	188
పలుకుల వెఱపించెద	292
పలువుర నొక్కఁడు నొక్కని	63
పవనసుతుండు విల్ నఱికి	128
పసులని యార్చుచు మము	309
పాంచాల కుమారాదులు	171
పాంచాలి సేసిన తపంబు	310
పాండవబల మల్పంబై	145
పాండవులట్లు మజ్జనకు	361
పాండవు లట్లు మద్రపతి	110
పాండవుల సైన్యమును	181
పాండురాజసుతుఁడు	306
పాపకర్ములయిన పాండు	355
పులులు దలపడిన యుబ్బును	116
పూనుము చమూపతిత్వము	41
పెనఁకువ యెడ త్రెవ్వక	163
పెనుగడఁత దొడ్డయత్తళ	180
పెనుపును నాకసం బవియు	61
పెనురొంపి లోపలను	77
పొచ్చెము లేని నెయ్యమున	40
పొడుతు నెట్లు పాండు	34
పొదివిన నయ్యుధిష్ఠిరుండు	118

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
పొదివిన యవ్వీరు నారాచం	180
పొమ్ము పునర్దర్శన మయ్యెడు	348
పొరిఁబొరి మోము బాష్ప	04
పొలియించితి నే గుజ్జుం	161
ప్రణతుండై రథసోదయా	132
ప్రణవమయ గరిష్ఠోపాయ	190
ప్రతిన నెఱపుట నృపులకు	316
బ	
బంధునాశకుండు పాపాత్ము	319
బకవిధ్వంసన మాచరించితి	234
బదరి పాచన నామ పరమ	271
బరవస మొప్ప నీవు	236
బరవస మొప్ప మద్రపతి	92
బలభద్రుఁడు సనుదెంచిన	286
బలయుతముగ నడచిన	267
బలవిక్రమ ఘనులగు	27
బలికొడుకు బాణుఁడని	269
బాసటయై భీముఁడు	125
భ	
భండనము సేయు నరు	127
భద్రకరి నెక్కి చామర	139
భయముం బాయఁగఁ ద్రోచి	215
భరితవికసనాంత; పద్మ	365
భీముఁ డాతని మెయి	95
భీముఁడు గురుతనయుడు	153
భీముని సుయోధనుని	303
భుజవీర్యంబున నచ్యుతా	41
భూపతి మించి యా ద్రుపద	169

పద్యము	పుట
భూమిమీఁద నిట్లు బోర	135
భూరిశ్రవుఁ డొక్కనితో	326
భృగుశాపంబునం బ్రాపించు	270
మ	
మండల ప్రచార మహితా	86
మందిరంబు ప్రవేశింపక	22
మదమడఁగి యొక్కరుండును	191
మదమున నిమ్మెయింగదిసి	86
మద్రపతి ధర్మజుని విల్లు	121
మద్రవిభుఁడు ధర్మమారుత	125
మద్రవిభువారి నిమ్మెయి	141
మనకుం గౌరవులకు	336
మన మొకళ్ళొకళ్ళకు	49
మన రాజును దేవులు	353
మనవారి కపుడు భీష్ముని	143
మన సేన విఱిగె నృప	151
మనుజులకు నిట్టి చందము	359
మమ్ము నపహసించిన వారిలో	185
మఱియు ధృష్టద్యుమ్నుండు	06
మఱియు ననేక ప్రకారం	159
మఱియు ననేకు లనేకులం	155
మఱియు నిర్ఘాతపాత	291
మఱియును	79
మఱియును	354
మఱియును మృతులైన	283
మఱియును శిక్షావిశేషం	297
మఱియు నొకండు వింటె	353
మఱియు నొక్క తెఱంగు	230

పద్యము	పుట
మహిత కీర్తి పుష్పమాలిక	238
మాద్రీపుత్రునిచేతఁ గర్ణ	75
మాయలుగల్గు దుష్టులకు	211
మాఱు మానిసి లేకుండ	195
మీకెఱింగించి పోవచ్చితి	243
మీరలేర్పడ వడిఁదల	140
మీరేవురును బరివార	222
మీఱిన యుబ్బున మీఁదికి	52
మునిపతి కృష్ణద్వైపాయ	335
మునిశాపంబును బ్రతినయు	317
మును చనియెఁ బ్రభాసము	245
మును మము గొడ్డువోయి	310
మునుము బయలైన నవి	119
మును లోకము ధర్మపరుం	311
మును విదురుండు సెప్పె	18
మున్ను చెప్పిన వారుగా	12
మూఁడు నారాచముల	156
మూర్తి చతుష్టయంబు	263
మొనసి చనుదెంచు	162
య	
యదుకుల దీపకుండగు	241
ర	
రండిట యొక్క డొక్కడ	229
రథంబులు గజంబులు	162
రయంబున రథంబు	167
రాజులు భక్తిఁ గొల్వగ	33

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
రాజ్యభాగంబు దగ	30
రౌద్రోల్లాసము మూర్తి	299
ల	
లావు గలిగి మొక్కలమ్మున	304
లీలఁ గట్టియతోడఁ గూలంగ	158
లెమ్ము కురునాథ కడఁగుము	203
లేలెమ్ము బిరుదవై	221
వ	
వగవకుండుం డనియే	361
వడముడిఁ దలమిగిలి	176
వనితలకు విప్రులకుం	248
వలసిన యస్త్రశస్త్ర	224
వాఁడితూపులు నకులుమై	74
వాని గద భారమునకు	234
వాయుతనయు ఋశ్య	81
వాయునందనుఁడు గదా	352
వార లలిగియొక్క యమ్మిడి	73
వారి నాలోకించి యుభయ	116
వారు వారణపురంబున	209
వాలి దుశ్శాసనుని ఱొమ్ము	235
వాలి యతండు బాహు	78
వాలి యెలుంగు సూపి	150
వింతకూరలు గుడుపున	225
వితత వీరాగ్రహావేశాది	298
విదురాదులు సెప్పఁగ	324
విధి ప్రతికూలుఁడై	312
వినయంబు తోడమోడ్పు	334
విని క్రీడి యపుడు మారుతి	306
విని వారలతనిఁ దోడ్కొని	247
వినుఁడుపస్పర్శమిందు	249
వినుఁడు మహానుభావు	360
విను జీవముతో నిన్నుం	230
విను దుర్యోధన దుశ్శాసనుల	17
విను పాణిగ్రహణము	278
విను మక్కుమారుఁ డుత్తమ	261
విను మయ్యేఋలలో	66
విను మిరువది యేడమ్ముల	94
వినుము గదారణమున	240
వినుము ధృతరాష్ట్ర నందను	174
వినుము నరేంద్ర యవ్విధ	244
వినుము నరేంద్ర యేను	237
వినుము నరేంద్ర సైనికులు	141
వినుము నీకు గృష్ణునకును	223
వినుము శంఖ తీర్థమునకు	250
వినుము సత్యంబు పల్కెద	362
విను మేను కల్లసారెలు	309
విను మోఘవతీ తీరంబున	350
విపుల విషాద తాపమున	347
విభవంబునుం బ్రతాప	34
విరథుండు నచాపుడు	129
విరథుండున్ వినికృత్త	73
విరథుండై పొలివోని	85
విరథుండై యభిరామ	151
వీడు పాడుగాన విశ్రాంతి	338
వీని నేటికిఁ బట్టితి	193
వెరవున నంగముల్	87
వెరవున లావుఁజీవయు	120
వెరవున లావునుం గలిగి	37
వెరవును లావునుం గలుగు	23
వేగ తాఁకు మైదువేల	158
వేటొక చాపమెత్తి	97
వ్యూహాభావము సూచి	293
శ	
శంకరుఁ డుదితభాస్కర	266
శంకలేక కడఁగి	309
శకుని నందనుఁడును	154
శరగురుఁ డట్టియోధు	14
శరములఁ బొదివిన	154
శల్యుండు బలునారసము	124
శల్యు నెఱుంగుదు శౌర్య	45
శిని మనుమఁడు గవలను	100
శూరుఁడ వంద్రునిన్ మడువు	213
శైనేయుఁ డడరి యుజ్జ్వల	98
శ్రీకరణ నిపుణపద	191
శ్రీగిరిజా సమవాయమహా	01
శ్రుతివాక్యార్థమయ	364
శ్వేతాశ్వ పాటవంబు	24
స	
సంగ విదూరతా కలిత	189
సకలధరణికి నాథుఁడై	290
సత్యకర్ముని తల	178
సదనంబుకుం జని	47

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
సమదగజాధి రూఢుఁడయి	147
సమయంబు నేకరాత్ర	278
సమరము నిష్కారణ	28
సమరము పాడి నీవెఱిఁగి	224
సమరము మిము బోంట్లకు	22
సమరము శమంత పంచక	354
సహదేవుండది శాత	186
సితనీలాదికవర్ణా	365
సుతుఁ డీల్గిన మద్రమహీ	83
సురథుఁగూల్చి యతని	106
సురథుఁడు గురు సుతుపై	106
సురనదీసుతు చావును	54
సురలచ్చెరువును	299
సురలనైన గెలుతు	68
సురసరిదాత్మజుఁడును	18
సూత సుత యిట్లు పగతుర	202
సూతసుతుండుఁజేయ	21
సేనయు నొక్కుమ్మడి	14
స్ఫురిత షడర్ధనేత్రుని	127

హ

పద్యము	పుట
హతశేషులైన పతాకా	198
హరి తలఁపు గూడ	321
హరియును గాదనండు	30
హరియును సాత్యకియు	242
హరి యెఱుఁగని చక్కటి	243
హరి వచనంబు లనత్యత	101
హరుఁడు దనదు వీర్య	260
హరుఁడును గంగయున్	263
హర్షావేశలఘుచారిత్రుం	311
హస్తతల యెత్తి నిలునిలు	75
హిరణ్యకశిపువృత్ర	212
హృషీ కేశు నుద్దేశించి	130

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

సౌప్తికపర్వము

గద్య పద్య ప్రథమ పాద సూచి

పద్యము	పుట
అ	
అంతం బెద్దకాలంబునకు	517
అంతఁ బశ్చిమధరణీధరాగ్ర	371
అందలి వార లెల్లను	369
అకలుషహృదయాభివ్యక్త	524
అక్రమవృత్తి గీడు తెరువై	410
అఖిల దేవతామయాత్ముఁ	411
అగ్గురునందనుండు హరిణా	438
అచటి జనములు పగలింటి	424
అట్టి గర్భంబు నిలుపు	503
అట్టి యెడ	433
అట్టి యెడ	449
అట్టివి యద్దేవదేవుని	522
అట్లు గాంచి యక్కాంతచుట్టు	507
అట్లు చని నిద్రావివశంబైన	403
అట్లు విహరించి హతశేషులైన	445
అట్లైనం బశ్చాత్తాపంబునం	399
అడవి దరమిడి నఱుకంగ	469
అతఁడటు లేపునం జనఁగ	421
అతఁడు బ్రహ్మపాలి కతిరయ	515
అతఁడు మదీయ సఖ్యవరు	395
అతనికి సన్మానము	420
అతని మొగంబుమీఁద	419
అతిశోక క్రోధవేగవ్యథిత	439
అతులతపోమయం బయి	518
అతుల శరంబులట్లు	406
అది యట్లుండె మన	384
అది యాఱని పెనుఁజిచ్చై	479
అదియునుం గాక	381
అదియునుం గాక	396
అద్దేవియు నకులునిచేత	477
అధికనిష్ఠమై బ్రహ్మచర్య	487
అధికబలము గెల్చి	473
అనఘుఁ డభిమన్యుతేజం	504
అన నప్పలుకులు వెడవెడ	456
అన విని కృష్ణద్వైపాయను	501
అనవుడు	419
అనవుడుఁ గృపాచార్యుం	391
అనవుడు నవ్వీరుఁడు	494
అనవుడు నాతఁడిట్టులను	402
అని కలిపికొని పలికి	462
అని చెప్పి	462
అని చెప్పిన వినుచు మున్ను	452
అని చెప్పి మనోగతంబవ	485
అని చెప్పి వినుమట్లు	454
అని తన్నుఁదాన నిందించు	459
అని తలంచి భూతకృత్యం	413
అనినఁ గొండొక తెలివొందు	509
అనిన నమ్మహీకాంతునకు	512
అనిన నమ్మాటలు	462
అనిన యమ్మహీపతి కతం	453
అనిన విని నగుచుఁ గుంభజ	504
అనిన విని యగ్గురుపుత్త్రుదెసం	482
అనిన విని యన్నరపతులు	430
అనిన విని యమ్మునిపతి	499
అని విని యశ్వత్థామ	427
అనిన విని యా జగత్కర్త	516
అనిన విని వారలు ధృష్టద్యుమ్న	452
అనిన విని సవ్యసాచి	496
అని నా మాఱుగా	460
అని పలికి తమ్మునతండు	383
అని పలికి తన మానుషంబు	459
అని పలికి పరమాదరణీయు	504
అని పలికి యశ్వత్థామ	370
అని పలుకుచుఁ బరమేశ్వరు	417
అని పలుమాటలాడి	380
అని పెక్కు భంగుల	410

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అ	
అని ప్రార్థించి	417
అని మఱియును	392
అనిమిష సంఘమెల్లను	519
అని యప్పుడశ్వత్థామోద్దామ	479
అని యమ్మువ్వుర మొగంబులు	463
అని యిట్లు వారి నిశ్చయించి	412
అని యిట్లు వారి నగ్గించి	423
అని యిట్లు శపియించి	506
అనిల సుతుండు శోకమును	484
అని వగలం బొగిలి పాంచాలి	474
అని వెండియు	376
అని వెండియు	389
అని హృదయంబునం	413
అనుచుఁ జయ్యన నస్త్రవిద్యా	497
అనుచుఁ బెలుచ నొంప	427
అనుచు నరిగి	424
అనుటయు నమ్మనుజపతి	480
అనుటయు నమ్మానవపతి	368
అను నీతివాక్యంబులు విందు	378
అప్పుడు	419
అప్పుడు ప్రదీప్తవదనులుఁ	413
అమరులు భక్తిం గ్రతు	521
అమితబలంబు దర్పమును	456
అమృతంబు నింపు కర్ణములకు	461
అమ్మహాదేవుని దివ్యలీలలు	514
అమ్మహీకాంతుండు	384
అరదం బిమ్మెయి నెక్కి	429
అరదములు డిగ్గి వగలం	506
అరవాయి గొనక	376
అరుగుదెంచి యంతంతనవనీ	477
అర్జున యర్జున యిది	493
అఱచినఁ బఱచిన వ్రేళులు	469
అలఁత గదిరి నోరెండఁగ	477
అలఘుతరాత్మ సారుఁడగు	407
అలికిడి మేల్కను నతని	431
అలిగిన పినాకి చందం	390
అలిగి యతండు నితాంతో	408
అలుక మనంబునం గదిరి	397
అలుక యెత్తినవానికి	393
అస్త్రమస్త్రముతో శాంత	496
ఆ	
ఆంగిరసకులజనిత మీ	417
ఆ కలకలమున మేల్కని	430
ఆ కలననట్లు సేసి	446
ఆత్మకోపంబు పుచ్చి	521
ఆ దివ్యాస్త్రంబు నీ కిచ్చెద	486
ఆ దివ్యాస్త్రమునం దుద్యత	493
ఆ దేవుఁడు వారందఱు	520
ఆపదఁ బడి యొక్కఁడు	386
ఆ యోధవరు బారి కగ్గంబు	448
ఆ లోన	520
ఆ సమయంబున	469
ఆ సమయంబున లింగము	517
ఇ	
ఇట్టు లొదిఁగినఁ జావుదప్పునే	492
ఇట్లతని యగ్రభాగంబున	405
ఇట్లు తన కెలంకుల	423
ఇట్లు ద్రుపద పుత్త్రుల	432
ఇట్లు ద్రౌపదీ తనయ పంచకంబు	442
ఇట్లు నకుల సూనుండు సమసిన	441
ఇట్లు నిశ్చయించి యొసకంపు	396
ఇట్లు పడి సాత్యకి ప్రయత్నంబున	476
ఇట్లు ప్రసన్నుండై	521
ఇట్లు రాత్రియగుట	372
ఇట్లు సజ్యంబయిన చాపంబు	429
ఇట్లు సన్నద్ధంబైన యా రథంబు	490
ఇట్లు సహదేవ పూర్వజుం	483
ఇట్లు సృజియించి యవ్విరించి	515
ఇట్లెదుర నిల్చిన భక్తవత్సలుం	418
ఇట్లెసఁగు బహుళ కోలాహలంబున	446
ఇత్తెఱంగునం బాండవాగ్రజుండు	510
ఇత్తెఱంగునఁ గృపాయత్తచిత్తుండై	521
ఇత్తెఱంగున వికృతాననుండై	441
ఇది శ్రీమదుభయ	524
ఇబ్బంగిఁ బీనుంగపెంటలైన	434
ఇమ్మెయి నా రథికవరులు	371
ఇమ్మెయి నీదగు	418
ఇవ్విధంబున	510
ఇవ్విధంబున జిత్రవధంబునకు	440
ఇవ్విధంబున గురుసుతు	423
ఇవ్విధంబున దొరలు దెగినను	443
ఇవ్విధంబున ధర్మతన	439
ఇవ్విధంబున నతనిచేత	426
ఇవ్విధంబున నిద్రావశంబులైన	375
ఇవ్విధంబున యజ్ఞం బపక్రాంతం	519
ఇవ్విధంబున వివిధ	450
ఇవ్విధమునఁ జేరి	416
ఇవ్విధమున సకలహేతులు	408
ఇవ్విహంగము ముపదేశమిచ్చె	375
ఈ	
ఈ చక్రంబు నీక ధరియింపం	489
ఉ	
ఉద్యోగ స్ఫురితుండజయ్య	512
ఉరంబును మెడయును	426

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఉటికి మంటలోన	418
ఉలికి యటువోవుటుడిగి	369
ఎ	
ఎట్టివారలకైన నెఱుఁగంగ	471
ఎత్తినప్పుడు విడియుచో	377
ఎన్నఁబడి జను లెటింగిన	393
ఎవ్వరెంతఁ జేసి రేనియు	379
ఏ	
ఏక నిశ్చయమున	402
ఏనీ యాపదఁ గడచిన	413
ఏను మదస్త్రం బుడుపం	497
ఏ నొక్కనిఁ బాండవ సం	502
ఏ మటుపోక శౌరి మది	462
ఏయ నొల్లక యసురుల	520
ఒ	
ఒండు తలఁపు లుడిగి	403
ఓ	
ఓడిపోయి డప్పినూని	388
ఓరి ధాత్రీసురాధమ	492
క	
కనకప్రస్ఫీత రత్నోత్కర	483
కని పాండవేయ రాగపాత్ర	501
కనిశోకం బాత్మలం దగ్గలముగ	455
కరిహయ నరశవముల	389
కర్ణు మనము పెద్దగాఁ గొని	463
కలయంగ వీడు మేల్కని	437
కలిమికి నొప్పుగాఁగ బలగంబులు	479
కలుగు గురుసుతున కెట్లుం	372
కవ్వడియున్ ముకుందుఁడును	396
కాలను గేలనుం జదిపి	428
కాలాకారతఁ బేర్చి దోర్గసిత	171
కావునఁ గోదండంబు నెక్కుడించి	393
కుడువఁగఁ గట్ట బంధులకు	459
కురుపతికి జయముగోరెడు	453
కురువర నీ మగంటిమియుఁ	458
కూర్చి తొలుత గురునందనునకుం	494
కృపుఁడున్ హార్దిక్యుఁడున్	470
కృష్ణ సన్మానంబును గృతంబయ్యె	420
కెలంకులు గలయం బరికించి	491
కొండొకసేపునకు మూర్ఛ	471
కొన్నిటి కంఠముల్	375
కొన్నిటి పాదముల్ నఱుకుఁ	434
కొన్ని యడుగులు వచ్చి	478
కౌరవనాయక నీదు	459
క్రోధము లోభమున్ భయము	382
క్ష	
క్షత్త్ర ధర్మ మాత్మఁగైకొని	481
క్షరిత శోణిత మగు	404
క్షితిపతి తనయుల్ పోరన్	480
ఖ	
ఖరనారాచ పరంపరా	431
గ	
గురుతనయుఁ డగుటఁ బ్రాణము	508
గురుదెసవంత నాతురతఁ	394
గురుని చావు తెఱఁగు	454
గురుపుత్త్ర శస్త్ర నిహతిం	427
గురుసుతుఁడు క్రోధమయమగు	443
గెలుపు నూఱట నొదవు	389
గోవు బ్రాహ్మణు	409
చ	
చంపెఁ గురువిభు నాకు	498
చతురంగచ్ఛేద కేళీ	438
చప్పరంబు వెడలి చనుదెంచి	429
చరణ యుగళకాంతి	465
చూడామణి గోలుపోవుటంజేసి	509
చేయి నరుఁడు దునుమ	400
జ	
జగమెఱుఁగఁగ దుశ్శీలం	383
జతుగృహ దాహావసరమున	482
జనకుఁడు లేమికిం గడు	474
జనపతి పంపఁ గేశవుఁడు	507
జలధుల్ ఘూర్ణిల్లె	495
త	
తక్కును గల పాంచాలుర	512
తగునని మరణాదులకై	386
తగుపని కుద్యోగించుచుఁ	381
తత్ప్రదేశంబు నవ్వీటిలోనుం	470
తదనంతరంబ యుత్తమౌజుని	431
తన యరదముమీఁదం గల	416
తనువు పులకల ప్రోవుగా	419
తపమును బ్రహ్మచర్యమును	497
తలలన్ హస్తమ్ములం బాదములఁ	445
తానును గాంధారియు	384
తా వెసఁబోవునప్డు	454
తుండంబుల్ నుగ్గు నుగ్గై	433
తెరయును మేలుకట్లుఁ దగు	425
తెఱఁగెట్టిదియో నా మది	417
తెలిపినఁ గనువిచ్చి తన్నుం	425
తెల్లమిగాఁగ నేను శివదేవు	514
తెల్లముగ నీదు చిత్తంబు	420
తొడంగి యనుష్ఠాన ప్రపంచ	518
తొడలు విటిగి నేలఁ	401
త్రావితి దుస్ససేను రుధిరం	508

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ద	
దనుజవ్రాతంబు కాంతాతతి	449
దివిజ దానవ గంధర్వాది	488
దురమునఁ బెంపుఁ జేవయును	457
దుష్పథంబులఁ జొరనీక	398
దేవా వైశంపాయనుండు	367
దేవా వైశంపాయనుండు	467
ధ	
ధరణి నెఱి దప్ప నొఱఁగిన	449
ధరణీచక్రము దిర్దిరం దిరిగెఁ	518
ధర్మము దప్పక నయగతి	381
ధర్మము మాని యూరులు	458
ధర్మాత్ముండగు నారదుం	495
ధృష్టద్యుమ్నుని నిట్లతి	428
ధృష్టద్యుమ్నుని ముట్టి	390
న	
నరవర మన వీడు	468
నా పలుకునట్టి యాగ్రహ	398
నా మనమార దీనిఁగని	509
నిద్రాసక్తునిఁ గొంతమేల్కనిన	433
నినుఁగూడన్ వీఁడె వచ్చెన్	440
నీ చెప్పినది యెల్ల	400
నీతి దొఱంగి కార్యముల	382
నీవును నీ యోధవరులు	463
నేలపయిం బడం దిగిచి	425
న్యాయము దప్పకుండఁగ	460
ప	
పక్షపాతంబున నీ విట్లు	503
పగతు పని సక్కనయ్యెన్	507
పటువేగంబున ముట్టి	422
పరమజ్ఞేయ స్వభావా	464
పరిణామగమ్య నిగమా	465
పరిభవ జాత రోషమునఁ	499
పఱచిన వారికిఁ బగమాలు	391
పలువురు గూడి కౌరవనృపాలకు	401
పలువురు మహాస్త్ర విత్తము	496
పాండవ శిబిరముఁ జొచ్చి	422
పాండవులం బరిమార్చు పని	377
పాండవులం బాంచాలురఁ	390
పాండుతనయులు నాచేతఁ	452
పాండు నందనులకు భ్రాంతె	500
పాండునరేంద్రనందనుల	376
పాండునృపాల నందనుల	453
పీనుఁగై యున్న	429
పుణ్యలోకమునకుఁ బోయిన	460
పుత్త్రులకు బాంధవులకును	477
పురపురఁ బొక్కి యా నృపతి	456
పూనితి నిష్ఠమెయి న్నిను	424
పెనుమంచునఁ జెలువేదిన	478
పేర్చి యప్పరమేశ్వరు	417
ప్రద్యోతితానేక రత్నశోభిత	489
ప్రారంభుల కెల్లఁ బొరు	380
బ	
బలమున శౌర్యసంపద	511
బాణజ్వాలా నితాంతప్రసరణ	472
బ్రహ్మ శిరోనామకం బగు	498
బ్రాహ్మణుఁడ వయ్యు నిట్లు	500
భ	
భావం బేకముఖంబుఁ జేసికొని	411
భీకర విష్ణురూపములు	408
భీమసేను నుద్దేశించి	509
భూతంబుల సృజియించుట	516
భూతంబుల సృజియించుటకుం	517
భూతసంచయసృష్టి	514
భూరమణ గాఢ నిద్రం	479
భ్రుకుటిత వికటఫాల	492
మ	
మందగతిం బ్రవేశించి	425
మతినెప్పుడుఁ దా ధర్మ	397
మతిమంతు లైనవారికి	398
మదమునఁ దేలి యేమఱిన	388
మనమందఱమును ధృత	384
మనము వినఁగ రాజు	395
మనస్వినివైన నీకుపశమ	481
మనుజులపై బ్రహ్మశిరం	485
మఱియు నతండు	433
మఱియును	422
మఱియును	468
మహితశాస్త్రకలిత	409
మిడుఁగుఱుగములు	373
మీరును దెంపు సొంపెసఁగ	423
మీరెఱుంగనియది లేదు	386
మున్నిట్టి తెఱఁగుశోకం	474
మేటి విల్లును దివ్యాస్త్రకోటి	387
మేన భసిత మలఁది	491
మొగ దప్పితిమి రణమున	378
ర	
రక్కసుఁడో మానిసియో	430
రక్త సంసిక్తమైన ధరాతల	455
రథంబులు డిగ్గి	371
రాజుఁ గూల్చి జయముఁ	404
ల	
లావును వెరవును	379
లే దింకం బగ యని	388

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
వ	
వచ్చి యవ్వటవిటపంబు	374
వనజాక్షుఁడు ద్రౌణికి	502
వర దివ్యాస్త్రవిదుండు	392
వాఁడు మొదలుగాఁ బగతుర	388
వాని వెలార్పవలయు	402
వాయుసుతుఁ బనిచి	480
వారలకడ విదురుండునుండు	384
వారల నేర్పడ నాలోకించి	438
వారి నెట్లు నిందింపవు	401
వారి ముఖ మండలములతో	372
వారు చేసిన విధంబు	404
వితత జ్యానాద మాశావితతి	441
విను కృతవర్మ దివ్య శరవేది	392
విను మగస్త్యుఁడు మా తండ్రి	486
విను మా భూతం బిట్టిది	405
వినుము కురుక్షితీశుఁడు	383
వినుము గురుద్రోహికి	427
వినుము ధృతరాష్ట్ర వంశం	508
వినుము సకల పృథివియు	484
విలసితంబగు నమ్మణి	510
వివశత భీతిఁ బొంది కడు	426
వీ డెల్లం దల్లడిల్లన్	468
వీరి పెనుఁ బ్రాపు వడసినఁ	462
వెండియు	481
వెర విట్టి తెఱఁగిది	385
వెఱ పావంతయులేక	416
శ	
శర దంష్ట్రా భీషణంబై	472
శరములఁ దోమరంబులను	442
శాతాస్త్ర స్ఫార వీచి	473
శివుఁడు ప్రసన్నుఁడైన	513
శోకవేగ సంతప్తుఁడై	470
శ్రీమత్కౌస్తుభరత్నో	367
శ్రీ శాశ్వతత్వ కరణ	467
శ్రుతసేనుఁ డప్డు కోప	441
స	
సంజయ కురురాజు సమయునే	370
సంజయునిచేత గురుసుతో	368
సకల జగత్ప్రసిద్ధమగు	488
సకల పాంచాలురు సమసిరి	451
సమయించి మఱి విశ్రమించియు	397
సమయింతుఁ బొదివి	396
సమరప్రకారం బంతయు	422
సరభసంబుగఁ దోమరసమితి	407
సలిపి నారొక్క వటవిటపి	371
సలిల సమీపదేశమున	491
సాయంప్రాతరుపాత	523
సారాచార నిరూఢుఁడైన	394
సీరి యనారతంబుఁ దన	457
సుర నికరానందకరా	523
సుర లాక్రతువుం దారును	520
సుర లొక్క మహాధ్వర	517
స్థాణు నుగ్రుని శివు	412
స్ఫుర దశత్థామ చంచద్భుజ	476
హ	
హరుఁ బరమేశ్వరేశ్వరుఁ	513
హృదయమునం గలంక	406

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

స్త్రీ పర్వము

గద్య పద్య ప్రథమ పాద సూచి

పద్యము	పుట
అ	
అంగంబు కోమల మంతరంగంబు	646
అంగదంబులుఁ గంకణంబులు	677
అందొకండును రణావని	577
అంధులకు నూఁతకోలగా	604
అక టకట యుత్తరుఁడు	652
అగ్గాంధార రాజనందన	622
అచ్చోటు లంటిచూచుచు	609
అచ్యుత వీడెఁ మహాభీల	640
అట్టల కడ యుత్తమాంగ	627
అట్టియెడఁ బురంబున	574
అట్టియెడ	548
అట్లు జనియించి మనుజుండు	545
అడల నేటికి నీచేత	589
అతఁడు మాకు నన్నయని	695
అతని నందనుఁడు సుకేతు	680
అతిదుర్గ మగు నరణ్య	548
అదియునుం గాక	590
అదియునుం గాక	69
అదియునుంగాక విను	603
అది యెట్లంటేని గర్భాధాన	543
అధికపంకపతితమై	660
అనయము లోలతమై	555
అనవుడు ననిలపుత్రుం	602
అనవుడు నిట్లను నన్నర	552
అని ఘోరంబుగ బలికిన	684
అని చూపి యిట్లనియె	680
అని చెప్పిన నవ్విభుండు	566
అని చెప్పి యుంటి నా చెప్పిన	632
అని చెప్పెనప్పుడు	591
అని చెవి సూఁడినట్లు	686
అని తదీయ జన్మ	692
అని దుర్యోధన వల్లభ	635
అనినఁ దదనంతరంబ	576
అనిన పలుకులు విని	685
అనిన భీముండు భీతి	599
అనిన విని నాథవంతులు	688
అనిన విని సర్వలోక నమ	564
అని నీ కొడుకునకుం జెప్పిం	601
అని పనవుచున్న యదియ	670
అని పలికి ధర్మనందను	605
అని పలికి పశ్చాత్తాప	682
అని పలుకుటయు ధర్మ	688
అని పలుకుదు రిట్లు	585
అని పలుకునపుడు దుర్యో	629
అని మఱియుం బలుదెఱంగులం	654
అని మఱియు నిట్లనియె	647
అని మఱియును	555
అని మఱియు ననేక	630
అని మొన నెవ్వరికిని	645
అని యనేక భంగులం	537
అని యనేక భంగుల	638
అని యిట్లు విలాపంబు	673
అని యెన్నిభంగులను	642
అనిలజార్జునుల మార్కొని	693
అని విలాపంబు సేసి	695
అని వెండియు	36
అని వెండియు	46
అనుచున్నది యిట్లు పలవింప	652
అనుటయు	604
అనుటయు నమ్మహాత్ముండట్ల	571
అనుటయు నమ్మహాత్ముండు	594
అనుటయు విదురుం	554
అన్నదమ్ములమైయుండి	601
అన్యజనముల శోణిత	604
అప్పు డాభీషణారణ్యం	549
అప్పుడు కురువీరాగారం	574
అమ్మహీవిభుండు	660
అమ్ములును విండ్లు	620
అరయ జీవలోక మధ్రువ	561
అరయ నిది పెద్దయని	647
అరయ వచ్చినఁ దనమేను	542

పద్యము	పుట
అరి విమర్దియితనికై	633
అరుల నెల్లనుగెల్చి	650
అర్జున భీష్మచాపాచార్య	625
అర్జునుఁడు వెట్టె	664
అర్జునుఁడొకరుఁడు దక్కును	694
అల్లవారె యవంతీశుల	680
అవయవములు రూపఱగ	628
ఆ	
ఆచార్య సుతుఁడుఁ గృపా	576
ఆ చావు సావఁదగు	602
ఆ పగ్గంబులు శీలం	558
ఆరంగూరిన శోకము	572
ఆ రెండు పనులకై యట్లు	604
ఆర్యులు దఱితోఁ దగియెడు	534
ఆలమునకు వెడలు	670
ఆ సభ నమ్మెయి నీదు	641
ఆ సభలోని కట్లు	603
ఆ సమయంబున నప్పాండు	609
ఆహవంబున యందు	632
ఇ	
ఇంకనేమి సేయువాఁడ	560
ఇందఱఁ జంపితినని	584
ఇక్కురువరునాంద్రురలో	671
ఇట్టవునె మాద్రితోడం	659
ఇట్టివి యెల్లనుఁ గను	628
ఇట్లననేల యంటేని	631
ఇట్లనియెదంగాక నాచేతఁ	612
ఇట్లాధృతరాష్ట్ర మహిషి	607
ఇట్లున్న యతనికి	551
ఇట్లు పలికిన యచ్యుతుం	685
ఇట్లు మాత్స్యపాంచాల	583
ఇట్లు మూర్ఛిల్లి కొండొక	629
ఇట్లు మేదినిం బడి	610
ఇతని చుట్టును గలకల	654
ఇతని చుట్టునున్న యెల	675
ఇత్తెఱంగున దశసహస్ర	588
ఇది యంతయు నీచే	627
ఇది యిటులగు టట్లెఱిగి	611
ఇవ్విధంబున నాలింగనంబు	585
ఇది శ్రీ మదుభయ కవిమిత్ర	616
ఇది శ్రీమదుభయ కవిమిత్ర	699
ఈ	
ఈతఁడు రణంబునకు నెత్తి	630
ఈ రమణీ రత్నంబు	654
ఈ రాజు భీమసేను	634
ఈ లోకము నిస్సారం	541
ఈ సుమధ్యమ యిమ్మహీశ్వరు	637
ఉ	
ఉత్తర యిక్కుమారోత్తము	648
ఉల్లంబప్రియమొంద	585
ఎ	
ఎట్లనిన	564
ఎఱకలు విఱిగిన	530
ఎవ్వరాత్మదేహములు	687
ఏ	
ఏడ్వనందఱపైఁ జేతు లిడుచు	608
ఏనసూయాగ్రస్తగాను	598
ఏనిది యంతయు నెఱుగుదు	568
ఏను దుర్యోధనునితో	641
ఏను నతనికి జెప్పితిం	568
ఏము నీ పుత్రుచే నెన్ని యేనీ	590
ఒ	
ఒకయింటనుండి వేఱొక	542
ఒక్కరుని నీవు సంపక	505
ఒరునితోడఁ బోర హరి	672
ఒరుల యున్నతి సయిరింప	565
ఓ	
ఓ రాజ కల్పవృక్షయోప	669
క	
కనకపుంఖ శరావృత	647
కనక బహురత్నమయ	634
కరములుం జరణంబులున్	643
కర్ణుఁ దొలుచూలుగా	694
కలసి శుక్ల శోణితములు	544
కాకులును గ్రద్దలును	655
కావునం గురుకుమారుల	578
కావున	589
కావున నీ దెస నాతనికిన్	569
కావున నేతత్స్వరూపం	552
కావున వారికి వగవం	538
కావున సంసారంబు	547
కుంతీ ప్రముఖంబైన కురు	572
కుత్తుకుల బంటియగు	620
కురుక్షోణి నాథుండు	660
కురురాజు మొదలైన	682
కురువంశ మెడలవచ్చిన	662
కూరు మొనపెట్టి నట్టులు	627

పద్యము	పుట
కూలియుఁ గాంతి యుగుర్పగ	624
కృపి మున్నుగ శిష్యులు	668
కృపుని తోఁబుట్టువు కృపి	667
కొండొక వగపున కేనియు	573
కొడుకుచావుకంటె	635
కొఱత నుఱుకు గాని	534
కోపంబుత్కటమై యారూప	587
కోసలనాథుండు భాసుర	676
కౌరవ నృపతి తనూజ	638
కౌరవసేనా వీరులు	603
క్రూరాత్ముఁడు నీచుఁడు	642
గ	
గరుపాఱఁగ మేను ప్రకంప	548
గురుని మున్నిడుకొని	666
గురుని శరంబులు దాఁకిన	652
గొడుగుల పఱియలు	618
చ	
చందనార్ద్ర కుట్టిమముల	638
చనఁగ నాతఁడు సాత్యకి	582
చరణంబులు దొట్రిల్లం	608
చింతాపరత్వంబున	540
చింతాభరంబున నూరక	528
చూచితే భగదత్తు	661
చూడు మిమ్ముద్దియ సుతు	636
చూడుము ధృతరాష్ట్రు	623
చెలులైనఁ జూడఁ బయ్యెద	573
చెవిని సొగియించు వీణా	625
చేతులు నడుదల సేర్చు	572
జ	
జగతీశ వేదముల్	591
జననియుఁ దండ్రియు	640
జననియు భార్యయు	637
జనులెల్లను రాధేయుం	692
జీవమేటికి రాజ్యమేటికిఁ	606
జున్ను డెప్పరంపుఁ జోటైన	535
జూదమునప్పుడు సర్వ	631
డ	
డెందము తిర్యగ్యోనుల	569
త	
తగుఁబగ దీర్చుట యిమ్మై	643
తత్కాలో ద్దీపితంబైన	600
తన మేలుఁ గీడుఁదా మదిఁ	592
తనయ శోకాతురుండవై	590
తనయుఁ గాచుపనికి	658
తనయు లందఱుఁ బొలియుట	582
తనలేనిచోటఁ బలువురు	650
తన సుతుండును సైన్యంబు	526
తనుజ శోకార్తయైన	576
తపస్స్వాధ్యాయాది	612
తప్పు సైంధవుపైఁ బెట్టఁ	659
తమ తమ తప్పులఁ	566
తమ్ముఁడు శకునియుఁ గర్ణుఁడు	566
తఱచుగ శస్త్రాస్త్రంబులు	687
తలపోసి చూడంగ ధర్మ	599
తలయుఁ గాళులుఁ దమ	679
తాన చుట్టుఁ దగిల్చియగ్ని	536
తీవ్రబాణజాల దీప్తులు	663
తెలిసితి నీమాటల	594
తేరు శరీరము దానికి	555
తొల్లి సృంజయుండు పుత్ర	533
తోడఁబుట్టువు విధవయై	658
త్వంతాహంత నిరసన	697
త్వరితరథాశ్వమారుత	677
ద	
దానంజేసి యిట్లు సకల	567
దానాద్యుత్తమకర్మ విధానం	578
దెసలు గలయంగఁ జూచుచు	549
దేవకృతంబులు ధీరుల	563
దేవతలకుం గృత్యం	563
దేవలోకంబున	651
దేవవ్రతుండు గీర్వాణా	665
దేవా జనమేజయ జగతీ	526
దేవా వైశంపాయనుండు	617
దేవుడుగాకితఁడు నరుఁడు	663
దైవంబు దుఃఖభాజనత్వం	532
దైవంబు దుర్యోధనాదులగు	681
దైవకృతము నా పంపు	570
ద్యూతముగ గెల్వు నెపమున	593
ద్రుపదతనయుఁడట్టె	667
ద్రుపదనృపాలుని	678
ద్రోణబాణపరిపీడిత	677
ద్రోణుఁడు దలరందలపడి	679
ధ	
ధనమంతయుం బొలియ	560
ధరణింగల రాజులకుం	606
ధరణిగజ ఘోటకము	635
ధరణినాథ వినుము	550
ధరణినాయక యట్లు	527
ధరియించెదఁ బ్రాణము	571
ధర్మంబు పరిగ్రహించి	598
ధర్మవేదిత్వ మీ ధరణీ	583
ధృతరాష్ట్ర పాండుభూపతుల	682
ధృతరాష్ట్రుం డిట్టివాఁడు	586

పద్యము	పుట
న	
నక్కతోడేలు వీని	645
నరవర యేర్పడ విను	556
నాఁటిమాట లుల్లంబున	642
నాఁటి రాత్రి యరులు	657
నా కీడు దలఁప నేరక	531
నిను నే నిట్టూర్చెద	611
నిజభూషణాతపత్ర	639
నీకు నితరులట్ల శోకింప	528
నీ పలుకెల్ల నిక్కమ	594
నీ పుత్రులఁ జంపించిన	605
నీ మూర్తియందుఁ బ్రాణము	651
నీ యవినీతియుం గొడుకుల	593
నీ యుల్లంబొక నియతిం	592
నీవుఁ గొడుకుఁ బల్కు	536
నీవు ధర్మభంగి నెఱుఁగ	561
నీ వెఱుంగక యుండఁగా	562
నుఱుమైన కాల్బలంబులు	618
ప	
పంచాననంబు చేతం	678
పండితుల నవి గలంపం	541
పగవారి మొనలను	665
పడియుండి తలదోర్చి	529
పదునెనిమిది యక్షౌహిణులు	529
పదునొకఁ డక్షౌహిణు	635
పరశురాముని శాపంబు	654
పల్కుతప్పమి నెఱపంగ	656
పాండవ శిబిరంబున	579
పాండవుల వలని	567
పాండవులును బాంచాలురు	650
పాండవేయాగ్రజుపై	596
పాండిత్యసంపన్నుండ	539
పాండుపుత్రుల భుజా	653
పాడి మాలి తన్ను బలువురు	648
పిఱుఁదం గురుధరణీ	653
పుత్రి యిట్లగు నమ్మశోకము	610
పులుఁగులును మెకంబు	661
పూని పాతివ్రత్య పుణ్య	683
పెద్దయుఁగాలము వారలఁ	608
పెరు గఁగ నిజాంగములు	587
పెరుఁగుట స్రగ్గఁగ రుచులం	537
పోరనొడలస్త్ర పరిపూత	578
ప్రభువులంతనంత	624
ప్రాణంబులు విడిచియును	626
ప్రియవస్తు వెడలుటయు	540
ప్రేవులు గండలుపెటికి	621
బ	
బలదర్ప ధైర్య శౌర్యా	639
బలమున నీతో దొరయఁగ	589
బలశౌర్యములఁ దన	662
బాలత్వంబున నవివే	545
బాలలుఁ దరుణులు	639
బిరుదుల నైనను బిఱికి	537
బోరగిలఁబడ్డవాఁడు	659
భ	
భద్రచారిత్ర సుభద్రను	649
భరిత నియమచేతః	698
భవదీయ సూనులరి	577
భానుపుత్రుని చావు బంధుల	694
భీమార్జునుల రణ	592
భీముఁడనుమాట విని	586
భూతము లనిత్యములు	561
భూవర కురువంశపుంగవుం	691
మ	
మనమునఁ గృపపుట్టెడు	551
మనసెఱిఁగి హృషీకేశుఁడు	586
మరుత్తనూజుం బొరిమాన్పఁ	589
మఱియుం గొందఱు	584
మానవనాథులనేకులు	679
మానినీజనంబు సేరి	675
మానుషజన్మము మాన్య	559
మారుతనందను నుగ్రపు	644
మీకు నగ్రజుండు నాకు	692
మీరలు బ్రహ్మసభను	563
మునీంద్ర నిర్భాగ్యత ముట్టి	560
ముని శోకానల తాపంబున	571
మున్నకాదె యాదవులకు	684
మున్నెన్నఁడు నెవ్వరికిం	574
మెలుపారఁగాఁ బట్టిమొల	672
మేనఁబ్రాణము వాసిన	655
మేనల్లుఁడగు నకులానుజు	673
య	
యదువంశ జాతులకు	685
యముని యధీనం బిది	557
యౌవనంబును రూపంబు	539
యౌవనమున విషయ	546
ర	
రావుతుల తుండములు	618
రుచిరాంగదు శస్త్ర	675
వ	
వగచిన బోయిన కార్యము	535
వదనమున విన్నఁదనముం	582

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
వనట యనియెడు	570
వనితలు మేలపుమెయి	626
వల్లభులును గోడండ్రు	678
వాఁడిమగఁడు నిద్రపోవు	655
వానిం జంపను గావం	564
వానిఁ దమ యిచ్చు నెందుం	557
వారలస్త్రహతాంగులై	674
వింటె యవ్వనితవిలాపం	649
విజయు ప్రతిజ్ఞకు	657
విడుతురె శూరులు	599
విదురుఁడుఁ దండ్రియు	634
వినీతుండవై ధర్మవేదిత్వ	568
వినునే నిట్టూరార్చెద	611
విను మది సాత్యకి చచ్చుట	671
విను మప్వీరోత్తముండు	653
విను మిటులేటికిం జనిన	597
వినుము కౌరవకోటికిం	691
వినుము గాంధారి!	685
వినుము దీవనకుం జొరక	632
వినుము ధృతరాష్ట్రుఁడను	564
వినుము నారదుండు దీని	567
వినుము మరుత్తనాభవుఁ	579
విను మొకనినేల భవదను	590
విపులవక్షము మీఁద	629
విపులహర్మ్యతలంబులు	574
విపులార్తిఁ గూరి మనుజా	529
వివిధమహాస్త్రంబులు	666
వీఁడె వికర్ణుండు వాఁడి	644
వీణానాద ప్రతిమ నిగమా	696
వీరశయనమున గంగకు	664
వీరేవు రొంటి చీరలుఁ	670
వృద్ధుఁడైన తఱిన్ బలంబు	546
వెడలునెడ గాఢ పీడం	545
వైరిననిఁ జంపుదురు	602

శ

పద్యము	పుట
శరవణమునందుఁ బొలుపుం	664
శాంతనవుండు నాచార్యుం	681
శూరసేనుఁడు భీమసేన	645
శ్రీమత్కీర్తి మదత్యభి	617
శ్రీరమ్యత్వం బారగ	633
శ్రీసాంగత్య విధాయి	525
శ్రుతులును శాస్త్రములు	533

స

పద్యము	పుట
సంధికిఁ గృష్ణుండు సను	531
సకల రథములను నఖిల	579
సతతంబును శిష్యులు	666
సదసదనభిషిక్తా	614
సమరంబు సేసితి మట్లగుట	580
సమరమున నెత్తెఱంగున	688
సాత్యవతేయాది మహా	613
సారచందన హృద్య	625
సూరెలను వంది జను	626
సెల్లుఁడు యమతనయు	660
సోదర సముదయ సహితం	565
సోమదత్తసుతుని	668
సోమదత్తుఁడు పుత్ర	669

హ

పద్యము	పుట
హరిచేత రక్షితయైన	641
హా పుత్రవర్గమిటు	530
హార రుచులున్ హృదయ	619
హిత ముపదేశించితి	554
హిత మొనరించెద	674
హృదయమున వగలేని	657

***

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పీఠిక

[పీఠిక విషయసూచిక:-1. పర్వత్రయం పగకే అంకితం- పు. 2 * 2. పగ యడఁగించు టెంతయు శుభంబు - పు.3 * 3. శల్యపర్వం సహజ యుద్ధపర్వం- పు.7 * 4.ధర్మరాజుకు దైవ సహాయం- పు.9 * 5.శల్యపర్వ నామ సార్థక్యం-పు.13 * 6.సౌప్తికపర్వ కథాసూత్రం- 15 * 7. స్త్రీపర్వం సార్థకనామం- పు.18 * 8.మూడురసాల ముచ్చట-పు.20 * 9. తిక్కన రచనాశిల్పం-పు.25 * (1).సూర్యోదయ వర్ణనం- పు.25 * (2).యుద్ధవర్ణనం- పు.26 * (3).ప్రతిపద సార్థక్యం-పు.27 * (4).మానవ స్వభావవ్యంజకమైన సన్నివేశ చిత్రణం- పు.28 * (5). వస్తుచ్ఛందఃసంవాదం- పు.29 * (6). విలాపవీణానాదాల శ్రుతిమాధుర్యం- పు.29 * 10. ఉపాఖ్యానాలూ, ఉపదేశాలూ- పు.30 * 11.పర్వ పరమార్థం- పు.31 * 12.కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం- పు.-33 * 13.శల్యపర్వ కథాసారం- పు.35 * 14.సౌప్తిక పర్వ కథాసారం- పు.45 * 15.స్త్రీ పర్వ కథాసారం- పు.48.

★ ★ ★

ఉ. 'నీదెస నాదు చిత్తమున నెక్కొనియుండెడు భక్తి భద్రసం
పాదిని గావు టచ్చెరువె? భక్తజనాభిమత ప్రదాన వి
ద్యాదయితత్వ మేర్పడ జయం బొడఁగూర్పుము దేవ! సంశ్రితాం
హోదళనంబు నీకు వ్రత; ముల్లము నా పయి నిల్పు మిత్తఱిన్.' (శల్య. 1. 275)

మహాభారతంలోని యుద్ధషట్కాన్ని రెండు భాగాలుగా విభజించటం సాహిత్య సంప్రదాయం. భీష్మ ద్రోణ కర్ణ పర్వాలు మొదటి భాగం; శల్య సౌప్తిక స్త్రీ పర్వాలు రెండవ భాగం.

"మహాభారతంలో పద్దెనిమిది పర్వాలను ఆదిపంచకం, యుద్ధషట్కం, శాంతిసప్తకం - అని మూడు భాగాలుగా వ్యవహరించే సంప్రదాయం ఒకటుంది. బహుశా ఇది తెలుగుదేశంలో ఏర్పడ్డ సంప్రదాయమే కాబోలు. ఎందుచేతనంటే మహాభారతానికి తెలుగుదేశంలో ఉన్న వ్యాప్తి, ప్రాముఖ్యం మరో ప్రాంతంలో లేదు."

"నన్నయ భావించినట్లు మహాభారత మొక దివ్య వృక్షమైనట్లయితే (ఆది. 1.66) ఆ వృక్షానికి మూలం ఆదిపంచకం; స్కంధం యుద్ధషట్కం; శాఖోపశాఖలు శాంతిసప్తకం - అని వ్యాఖ్యానించవచ్చు. అంటే మహాభారత వృక్షానికి ఆధారం ఆది పంచకం; ఆయువుపట్టు యుద్ధషట్కం; సారం శాంతి సప్తకం. ఆదిపంచకంలోగాని, శాంతిసప్తకంలోగాని పర్వాలపేర్లు వ్యక్తి నామాంకితాలు కావు. స్థల, విషయ, కార్య, తత్త్వాదులను సూచించే పేర్లవి. యుద్ధషట్కంలో భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య పర్వాలు - కౌరవపక్ష సేనానాయక నామాంకితాలు. సౌప్తికపర్వాన్ని వీరనామాంకితంగా చెప్పాలంటే అశ్వత్థామ పర్వంగా చెప్పాలి. కాని, అశ్వత్థామ బ్రాహ్మణోచితం, వీరోచితం కానట్టి అధమాధమ ప్రవర్తనను ప్రదర్శించినందువల్ల అతని పేరును పర్వాంకితం చేయడం అనుచితం. ఇక స్త్రీ పర్వం యుద్ధపంచకానికి ఒక విధమైన సింహావలోకనం. యుద్ధ పరిణామ ఫలమైన శోకం ఇందు మూర్తీభవించింది. విజేతల హృదయాలు నిర్భరమైన నిర్వేదానికి, పశ్చాత్తాపానికి పాల్పడ్డాయి. మానవుని శీలపరీక్షకు, ధర్మనిరతికి, యుక్తా యుక్త విచక్షణకు క్లిష్టపరిస్థితులు ఒక గీటురాయి. అట్టి పరిస్థితుల్లోనే వ్యక్తుల నిజస్వరూపం బయటపడుతుంది. కురుపాండవులకు యుద్ధం అనివార్యంగా పరిణమించినప్పుడు బంధుమిత్రులు, రాజులు, సామంతులు, వీరులు ధర్మాధర్మ నిర్ణయాలు చేసుకొని, లక్ష్యాన్ని నిర్దేశించుకొని కార్యరంగంలోకి ఉరకవలసి వచ్చింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కాబట్టే భారతపాత్రల బాహ్యాభ్యంతర ప్రవృత్తులు యుద్ధషట్కంలోనే ప్రస్ఫుటంగా గోచరిస్తాయి''. (ఆచార్య జి.యన్.రెడ్డి - పీఠిక. ఆం.ప్ర. సాహిత్య అకాడమి ప్రచురణ 'ఆంధ్రమహాభారతము. శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు)

1. పర్వత్రయం పగకే అంకితం:

యుద్ధషట్కం షడ్రస సమాహారం. భీష్మపర్వంలో యుద్ధవీరం, ద్రోణపర్వంలో రౌద్రం, కర్ణపర్వంలో అద్భుతం, శల్యపర్వంలో భయానకం, సౌప్తికపర్వంలో బీభత్సం, స్త్రీ పర్వంలో కరుణ ప్రధానంగా ప్రవర్తిల్లుతాయి. పరుషరసాలూ, పరుషరసజన్య రసాలూ పోషించబడే యుద్ధఘట్టాల విశ్వరూపం ఈ పర్వషట్కం. భీష్మ, ద్రోణ, కర్ణులను సంహరించే వీరుడు అర్జునుడు. అందువలన యుద్ధషట్క ప్రథమభాగంలో అర్జున ప్రతాపం కథను ముందుకు నడిపిస్తుంది. ఆ తరువాతి మూడు పర్వాలలో భీమ పరాక్రమం భయంకరంగా సాగుతుంది. ధార్తరాష్ట్రుల నందరిని చంపే భారం భీముడే వహించాడు. దుష్టచతుష్టయంలో దుశ్శాసన దుర్యోధనులు భీముడి పాల పడ్డారు. కర్ణుడిని అర్జునుడు, శకునిని సహదేవుడు చంపారు. శల్యుడు వస్తుతః పాండవ పక్షపాతి. కాని, దుర్యోధనుడి వ్యూహంలో చిక్కి ధర్మజుడిని వదలి కౌరవపక్షంలో చేరవలసి వచ్చింది. అది ధర్మవిరుద్ధమని తెలిసి కూడా ఇచ్చిన మాట నిలబెట్టుకొనటానికి కర్ణ రథసారథ్యంలో ఆ మహావీరుడి మనస్సును కలతపెట్టి పాండవులకు సహాయం చేశాడు. ఇక మిగిలింది దుర్యోధనుడికి సహాయం చేయటమే. అది అతడి కర్తవ్యంగా మిగిలిన వీరధర్మం. పాండవులకు పరోక్షంగా సహాయం చేసి, ప్రత్యక్షంగా యుద్ధానికి సిద్ధమై కౌరవసేనా నాయకుడుగా వ్యూహాన్ని నడిపిన శల్యుడి సంహారం ధర్మరాజుకు మిగిలింది. ఇతిహాస నాయకుడైన ధర్మరాజు చంపిన శల్యుడి పేరుమీద వెలసిన శల్యపర్వం నామసార్థక్యం కలిగి ఉన్నది. భీష్మాది పర్వాలవలెనే శల్యపతనంతో శల్యపర్వం ముగియాలి. కాని, అతడు మధ్యాహ్నానికే చనిపోయాడు. ఆ తరువాత యుద్ధభారాన్ని దుర్యోధనుడే చేపట్టాడు. చివరిదాకా పోరాడాడు. అతడిచుట్టూ ఉన్న వీరులలో ఉలూక శకునులు కన్నుమూశారు. యుద్ధవీరులు అతడిని వీడి పరుగెత్తారు. పదకొండు అక్షౌహిణుల సైన్యం సమసిపోగా దుర్యోధనుడు ఓడినట్లే అయింది. ఆ తరువాత ద్వైపాయన హ్రదంలో దాగినా పాండవు లాతడిని బయటికి రప్పించి ద్వంద్వయుద్ధం ప్రవర్తిల్లచేశారు. భీమ గదాఘాతానికి దుర్యోధనుడు తొడలు విరిగిపడిపోయాడు. కాని, ఈ పర్వంలో చావలేదు. అశ్వత్థామను సైన్యాధ్యక్షుడిగా అభిషేకించి కథను ముందుకు సాగించాడు కాబట్టి శల్యపర్వంలోని పూర్వభాగంలో శల్యపతనం, ఉత్తరభాగంలో దుర్యోధన పతనం చిత్రించబడటం వలన శల్యపర్వానికి ఒక ప్రత్యేకత కలిగింది. రారాజైన దుర్యోధనుడు సేనాధ్యక్షుడు కాడు. కాని, యుద్ధరంగంలో సేనాధ్యక్షుడు లేకపోతే అతడే ఆ బాధ్యత నిర్వహించాలి. చివరకు ఆతడు చేసింది అదే. సేనాధ్యక్షు లెవ్వరూ రణరంగంనుండి పారిపోయి ప్రాణరక్షణం కొరకు పాట్లుపడలేదు. అట్టి దుర్గతి దుర్యోధనుడికి ఏర్పడింది. చనిపోయే ముందు చనిపోని ఒక మహావీరుడిని - అశ్వత్థామను సైన్యాధ్యక్షుడిగా అభిషేకించటం ఈ పర్వ నిర్వహణంలో విశేషం. ప్రాణం విడువనున్న దుర్యోధనుడు తన పగకు ప్రతినిధిగా నిలువగలిగిన అశ్వత్థామకు శత్రుసంహారం కార్యాన్ని ఒప్పచెప్పటం కురుక్షేత్ర యుద్ధానికి కొసమెరుపు. అయితే ఒక విశేషం. భీష్మాదులు దుర్యోధనుడి ప్రార్థనపై సేనానులయ్యారు. అశ్వత్థామ స్వీయప్రార్థనపై సర్వసేనానిగా రారాజుచేత నియుక్తుడయ్యాడు. సర్వసేనానులు సైన్యాన్ని నడిపారు. అశ్వత్థామ రథిక ద్వయ సహాయంతో రాత్రియుద్ధం చేసి రాక్షసత్వాన్ని ప్రకటించాడు.

తమ్ములూ, కొడుకులూ కూలినప్పుడు కూడా బిగ్గరగా దుఃఖించని దుర్యోధనుడు కర్ణుడు చనిపోయాడని ఎలుగెత్తి విలపించాడు. తాను ఒంటరివాడ నయ్యానని భయపడ్డాడు. ఆ రాత్రి శిబిరంలో ఉంటే పాండవులు వచ్చి తననూ, మిగిలినవారినీ చంపివేస్తారేమో అని భయపడి సరస్వతీనదీతీరం చేరి గుడారాలలో రాత్రి గడిపాడు. భీష్మాది వీరులు పడిపోయినప్పుడు కూడా కర్ణుడు తనకు తోడున్నాడనీ, పాండవులపై విజయాన్ని సాధిస్తాడనీ పేరాశతో ఉండేవాడు. కర్ణుడు పోగానే తన ఆశలన్నీ కుప్పగూలినట్లు ఆవేదనపడ్డాడు. కౌరవ సేనకు బలం కర్ణుడు. అతడు లేని దుర్యోధనుడు తాను బలహీనుడనని భావించాడు. బలంలేని దుర్యోధనుడికి పగయే బలంగా పరిణమించింది. కర్ణుడు అతడిలో పగను రగిల్చి చివరకు పగను మిగిల్చాడు. ఇక మిగిలినవారు అతడి వగను మాన్చటానికి పగను బలపరిచారు. శల్య సౌప్తిక పర్వాలలోని కౌరవవీరులు, సేనానాయకులు ఈ బాటలో నడిచారు. అందువలన శల్య పర్వం నుండి పాత్రలవర్తనాలలో ధర్మచింతకంటె

పగయే ప్రధానపాత్ర నిర్వహించింది.

2. 'పగ యడఁగించు టెంతయు శుభంబు':

ఏనాడో ధర్మరాజు శ్రీకృష్ణుడితో చెప్పిన ఈ పద్య తాత్పర్యం ఇక్కడ ప్రవర్తిల్లుతున్నట్లు ప్రత్యక్షమౌతుంది.

చ. 'పగ యడఁగించు టెంతయు శుభం; బది లెస్స; యడంగునే పగం
బగ?; వగగొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే? కడుం
దెగ మొదలెత్తిపోవఁ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు; నే
మిగతి దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా!'. **(ఉద్యో. 3. 21)**

శల్య సౌప్తిక స్త్రీ పర్వ నిర్మాణానికి ఈ పద్యం ఒక ప్రణాళికవలె భాసించింది. ధర్మరాజు పలికిన పలుకే సత్యమైనట్లు తారసిల్లింది.

కర్ణుడి మరణంతో యుద్ధం ఆగిపోతుందనీ, దుర్యోధనుడు ధర్మరాజుతో సంధికి అంగీకరిస్తాడనీ, దానితో పగ చల్లారుతుందనీ కౌరవస్కంధావారంలో కూడా కొందరు పెద్దలు భావించారు. కృపాచార్యుడు దుర్యోధనుడికి హితబోధ చేశాడు. సమరనీతి నాశ్రయించి తర్కబద్ధంగా మాట్లాడాడు. ముఖ్యంగా ఆయన చెప్పిన మూడంశాల ముచ్చట విలువైనది.

క. 'సమరము నిష్కారణవై । రమునం బాటిల్లె; నెల్లరాజులు, భరతో
త్తములును మడిసిరి; విడు కో । పము; దీర్ఘక్రోధుఁడైన పతి కీ డొందున్'.

క. 'తమకు బలం బెక్కిన తఱి । సముచిత మగు విగ్రహంబు; శత్రుల కుత్సా
హము మీఱినపుడు గర్త । వ్యము సంధి యనంగ విందు మార్యులచేతన్'.

క. 'కలవారెల్లను దెగి నీ । తలన నిలిచెఁ గార్య మధిప! తగ నొడఁబడు మి
ట్టల మగునాత్మ వినాశము । కలుగుట యది విపులపాతకం బండ్రు బుధుల్'. **(శల్య. 1. 55-57)**

పగకు మూలం కోపం; కోపాతిశయంతో తనకు బలాధిక్యం ఉన్నది కదా అని రాజు పగరపై దండెత్తటం సహజం. కాని, శత్రువులది పైచేయై, విజయం విఫలమైనప్పుడు కోపాన్ని తగ్గించుకొని, పగను చల్లార్చుకొని సంధిచేయుటం శ్రేయస్కరం. దుర్యోధనుడికి అండగా నిలిచిన వీరులంతా చనిపోయారు. ఇక ప్రారంభించిన కార్యం అతడివలననే ముగింపు లేనిదిగా ముందు నిలిచింది. కార్యాన్ని కొనసాగిస్తే ఆత్మవినాశమే ఫలితాంశంగా పరిణమిస్తుంది. అది మహాపాప మంటారు పండితులు - అని అరటిపండు ఒలిచినట్లుగా విప్పి చెప్పాడు కృపుడు.

ధర్మదృష్టితో చూస్తే దుర్యోధనుడికి హితం కలిగే ప్రబోధ మిది. కాని, అతడిది ధర్మదృష్టి కాదు. పగసాధించే పంతం. దానికి అనుగుణంగా తనవాదాన్ని వినిపించాడు.

సీ. 'కపటంపు జూదంబు ఘటియించి రాజ్యంబు । గొని ధర్మజుని మది గుందఁజేసి,
సభ కేకవస్త్ర రజస్వల నమ్మెయిఁ । బాంచాలి ముందల పట్టి యీడ్చి,
సంధి సేయఁగఁ బూని శౌరి యేతెంచిన । నవ్విధంబున నప్రియం బొనర్చి,
పలువురు గూడి సౌభద్రు నొక్కని బాలుఁ । గిట్టి యత్తెఱఁగున గీ టడంచి.

తే. 'నేఁడు దుశ్శాసనుని ఱొమ్ము నెత్తు రనిల । సుతుఁడు మదమునఁ ద్రావుట సూచి కొఱఁత
ప్రతిన దీర్చునతం డని భయముఁ బొంది । పొందు గోరిన నది యేల పొసఁగుఁ జెపుమ!'**(శల్య.1. 66)**

ఈ మాటలు దుర్యోధనుడు పశ్చాత్తాపంతో అన్నవి కావు. 'పగ యడఁగించు టెంటయు శుభం; బది లెస్స' అని కృపాచార్యుడు హితవు చెప్పితే, దుర్యోధనుడు 'అడంగునే పగన్ బగ?' అని తన వాదాన్ని సాగించాడు. మోసంతో రాజ్యాన్ని హరించటం రాజనీతి ధర్మ ద్రోహం; పరుల ఇల్లాలిని ఏకవస్త్రను నిండుసభలో అవమానం చేయటం నైతిక ధర్మద్రోహం; సంధి ప్రయత్నాన్ని సాగకుండా చేయటం లోకనీతి ధర్మద్రోహం; అభిమన్యు వధ యుద్ధనియమ ధర్మద్రోహం. ఇన్ని ద్రోహాలనూ దుర్యోధనుడు చేసినట్లు అతడే అంగీకరించాడు. దాని వెనుక స్వార్థపూరిత క్రోధ ప్రేరితమైన పగ ప్రేరకశక్తిగా ప్రజ్వరిల్లింది. ఆతడి పగ పాండవులు తిరిగి ప్రతీకారం చేసే పగను ప్రేరేపించింది. సహనమూర్తులని ప్రశస్తిపొందిన పాండవులు తమ తమ ప్రతిజ్ఞలను తీర్చుకొనటానికే సమరం సాగించారు. దానికి సాక్ష్యాలు ఎన్ని ఉన్నా భీముడు దుశ్శాసనుడిని చంపి, నెత్తురు త్రాగి పగ తీర్చుకొన్న సన్నివేశం నికట దృష్టాంతం. దుర్యోధనుడి పగకూ, పాండవుల పగకూ ప్రతికారరూప సంఘర్షణ ఏర్పడినప్పుడు పగ అణగదు, అభివృద్ధి చెందుతుంది. భీముడు చేసిన రెండు ప్రతిజ్ఞలలో దుశ్శాసన వధ మొదటిది. అది ముగిసింది కాబట్టి త్వరలో దుర్యోధనుడి తొడలు విరుగగొట్టి అతడిని సంహరిస్తా నన్న ప్రతినను చెల్లించుకొంటానని బహిరంగంగా ప్రకటించాడు. కాబట్టి 'అడంగునే పగం బగ?' అని ధర్మరాజు అన్నట్లు దుర్యోధనుడు సంధి కుదరటానికి ధర్మజు నడిగి రాజ్యభాగం తీసికొనవలసిన దైన్యాన్ని అతడు అంగీకరించవలసి వస్తుంది కాబట్టి 'ఒక్కని దయం గను రాజ్యసుఖంబు లేటికిన్?' -అని పేర్కొని యుద్ధమే కర్తవ్య మని నిశ్చయించాడు.

దుర్యోధను డేముహూర్తాన ఈ మాటలన్నాడో కాని, శల్యపర్వమంతా ఈ పద్యం చుట్టే తిరిగింది. 'పగఁ గొన్న మార్కొనక పల్కక యుండఁగవచ్చునే?' అనే తాత్పర్యం పెక్కుచోట్ల ప్రత్యక్షమౌతుంది. ఉదాహరణకు సంధి కంగీకరించక, శల్యాది వీరులు, శకునివంటి బంధువులు, తమ్ములు తనచుట్టూ చచ్చిపడ్డా పంతం వీడకుండా యుద్ధం సాగించటం, అందరినీ చంపించి తానూ చచ్చి పాండవులపై పగ సాధించటమే తన వీర వ్రతంగా ప్రవర్తించటం చూచి కృష్ణార్జునులు దుర్యోధనుడి మూర్ఖత్వానికి విస్తుపోయారు, ఏవగించుకొన్నారు. అర్జును డన్నమాటలు:

చ. 'అమరనదీ సుతుండు వడినప్పుడు వీరలబుద్ధి సంధికా
ర్యమునకుఁ జొచ్చు నింక నని యాత్మఁ దలంచింతి; సమ్మహాత్ముఁడు
న్సముచితవాక్యవృత్తిఁ గురునాయకుఁ దేర్పఁగఁ జూచెఁ; జిత్తదో
షమహిమ నద్దురాత్ముఁడు ప్రశాంతత నొందఁడ యెన్ని భంగులన్.' **(శల్య. 1. 350)**

కర్ణ, దుశ్శాసన, శల్యుల మరణం కన్నారా చూచికూడా పగ మాని ధర్మరాజుకు రాజ్యభాగ మిచ్చే తలపు దుర్యోధనుడికి రాలేదు. కాబట్టి అతడిని చంపి మిగిలిన కథను ముగించటమే కర్తవ్యమని అర్జునుడు భావించాడు. కృష్ణుడు రాయబారిగా నిలిచిన నిండుసభలో విదురుడు చెప్పిన మాటలూ, దుర్యోధనుడు పుట్టినప్పుడు మునులు 'ఈ పాపాత్ముడు నిఖిల క్షత్రియ క్షయహేతు' వని పలికిన తీరూ చెప్పి అతడి వధ అవశ్య కర్తవ్యమని సమర్థించాడు. కృష్ణార్జున సంవాదం వగగొన్న పాండవ పక్షం మాట్లాడుతూ, మార్కొనే ప్రస్థానానికి ప్రతినిధిగా నిలిచింది. పాండవ వీరులందరూ దుర్యోధనుడిని అధిక్షేపించినవారే, అతడిపై, అతడి సైన్యంపై విజృంభించి పగతీర్చుకొనే ప్రయత్నం చేసినవారే. అందుకే ధర్మరాజు అన్నాడు- శత్రువులవలన వగగొన్నవారు తిరగబడక మానరనీ. ప్రతీకారానికి పూనుకొంటే పగవారి అంతు చూచేంతవరకు ఆగరనీ, ఆ స్థితిలో పగసాధింపు చర్యలే ప్రధానమయి క్రూరత్వం చోటుచేసికొంటుందనీ పేర్కొన్నాడు. దుర్యోధనుడిపై పగ సాధించి అతడి అంతం చూడదలచుకొన్న ధర్మరాజాదులు- అతడిని వెన్నాడి, అధిక్షేపించి, దాగి ఉన్న కొలనునుండి బయటకు తెప్పించి, భీముడిని ప్రబోధించి గదాయుద్ధంలో దుర్యోధనుడి తొడలు విరుగగొట్టేటట్లు చేశారు. దుర్యోధనుడు ప్రదర్శించిన క్రౌర్యాన్ని తలదన్నేటట్లు పాండవులు త్రిప్పికొట్టారు. నాభిక్రింద కొట్టటం సమరధర్మమా? తలను కాలితో తన్నటం న్యాయమా? వంటి ప్రశ్నలు వేసినప్పుడు శ్రీకృష్ణాదులు చెప్పిన సమాధానాలలో- పాండవులు ప్రదర్శించిన పగ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుర్యోధనుడు పగతో చేసిన పాపకార్యాలకు ప్రతీకారమే కాని వారు పూనుకొని చేసినవి కావని సమర్థించారు. ప్రతీకారచర్యలను యుద్ధమర్యాదలుగా, ప్రతిజ్ఞాపాలనలుగా వ్యాఖ్యానించారు. బలరామాదులకు నచ్చజెప్పారు. ప్రతిజ్ఞలు చేసినప్పుడు లేని అభ్యంతరాలు వాటిని ప్రవర్తిల్ల చేసేటప్పు డెందుకని ప్రశ్నించారు. కపటవర్తనులను, మాయావులను వారికి తగిన పద్ధతులలో చంపటం యుద్ధధర్మవిరుద్ధం కాదని వాదించారు. దుర్యోధనుడు చివరివరకూ పగసాధించే ధర్మాన్నే పాటించి, తనకు ముప్పువాటిల్లిన సమయంలో పాండవుల పగసాధింపు చర్యలను యుద్ధ ధర్మ విరుద్ధ చర్యలుగా వ్యాఖ్యానించి, తన క్రౌర్యాన్ని కప్పిపుచ్చుకొనటానికి యత్నించాడు. భీమార్జున కృష్ణులు అతడి బండారాన్ని బయటపెట్టి భంగించారు. పగయే యుద్ధంలో ప్రమాణమైతే 'ఏమిగతి తలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు కేశవా!' అన్నమాట సత్యమౌతుంది. పాండవుల పగ - వారికి విజయాన్ని కలిగించింది. కాని, పాండవులు తన తండ్రిని అబద్ధంతో వంచించి చంపిన తీరుకు కోపించి పగసాధించే ప్రతిన పూనిన అశ్వత్థామ, ఆరిపోతున్న దుర్యోధనుడి పగలో ఆజ్యం పోసి మండించి సౌప్తికపర్వంలో పాండవ శిబిరాన్ని శ్మశానంగా మార్చాడు. ఇది దేనిఫలం? పాండవుల ప్రతీకారానికి జరిగిన ప్రతీకారం. చివరకు పాండవులకు ఏమి మిగిలింది? పగవలన వారికి ఏమి లాభించింది? ధర్మరాజుమాట నిజమైంది. శల్యపర్వం పగవలన కౌరవులకు తగిలిన శాపం. సౌప్తిక పర్వం కౌరవుల పగవలన పాండవులకు మిగిలిన ప్రతిఫలం. ఈ రెండింటిలో ధర్మచింత లేదు. శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలలో దీనిమీద ధర్మాధర్మ విచారం ఎంతో సాగుతుంది. పాత్రలు తమలో తాము నిందించుకొన్నారు, అధిక్షేపించుకొన్నారు, సరిపెట్టుకొన్నారు, శాపాలు పెట్టుకొన్నారు. ఇన్ని అయినా చివరకు మిగిలిం దేమిటి? అందరూ కలిసి చనిపోయినవారికి శ్రద్ధాంజలి ఘటించటమే. అందుకే తిక్కనగారి 'పగ యడఁగించు టెంతయు శుభంబు' అనే వాక్యం ఒక 'సామెతపద్యంగా' తెలుగులో మిగిలిపోయింది.

పగలు వగలు సుఖదుఃఖాలవలె ద్వంద్వాలు. అయితే, పగను సాధించి పొందే ఫలాన్ని గురించి దుర్యోధనుడికీ, ధర్మరాజుకూ భిన్న దృక్పథాలు ఉన్నాయి. పగ వగ కలిగిస్తుందని ఇద్దరికీ తెలుసు. కాని, దుర్యోధనుడు దుర్మదాంధుడు, అహంకారి కాబట్టి వగ లేని పగ విజయమని భావించాడు. పాండవులను పగతో వధిస్తే పగవలన వగ కలుగకుండా సుఖించవచ్చునని ప్రయత్నించాడు. ఒకవేళ పగవలన వగయే మిగిలితే బ్రతికి దానిని అనుభవించటం కంటె చచ్చి స్వర్గసుఖాన్ని పొందటం విజయ మనుకొన్నాడు.

చ. 'చదివితి నెల్ల వేదములు, జన్నము లొప్పఁగఁ జేసితిన్, రమా
స్పద మగు వృత్తిఁ బొల్చి నరపాలకు లెల్లను గొల్వఁ గంటి, దు
ర్మదరిపుగాఢపర్వ పరిమర్దన కేళి యొనర్చితిం దగం,
దుది నని మిత్రబాంధవులతోఁ ద్రిదివంబున కేఁగు టొప్పదే?'.

వ. 'నీకుం జూడ నెట్టివాఁడ నైనను నా కేమి? మీరింకఁ బశ్చాత్తాప దుఃఖితు లగుచు నుందురు గాక!'

(శల్య. 2. 329, 330)

అని శ్రీకృష్ణుడితో పలికిన మాటలు అతడి హృదయాన్ని వ్యక్తం చేశాయి. అతడు పగతోనే పురుషార్థ చతుష్టయాన్ని సాధించినట్లు చెప్పుకొన్నాడు. వేదాలు చదివాడు, యజ్ఞాలు చేశాడు, పాండవులను పాండిత్యంలో పుణ్యకార్యాలలో మించాలని యత్నించి ధర్మ పురుషార్థాన్ని సాధించినట్లు భావించాడు. ధనాన్ని సంపాదించే ఉపాయంతో రాజ్యాన్ని హరించి, పరిపాలన సామర్థ్యంతో రాజుల నందరినీ మెప్పించి అర్థపురుషార్థాన్ని సాధించినట్లు తలచాడు. శత్రుమర్దనం చేసి పగసాధించే ప్రయత్నం చేసి కామపురుషార్థాన్ని సాధించా ననుకొన్నాడు. పగతో సాధించిన పురుషార్థాలు ఇహంలో వగనే కలిగిస్తాయని తెలిసి కూడా దానిని అతిక్రమించటానికి యత్నించి విఫలుడయ్యాడు. తనవారందరు నశించారన్న వగ తనను క్రుంగదీయకుండా రణమరణంతో స్వర్గాన్ని సాధిస్తున్నానని ప్రకటించాడు. బ్రతికి పగసాధించలేకపోతే చచ్చి స్వర్గాన్ని పొందటమే వగలేని పగగా అతడు వ్యాఖ్యానించాడు. ఆ ధీమాతోనే ధర్మరాజును శ్మశానంవంటి రాజ్యాన్ని ఏలుకొనుమన్నాడు. కౌరవులు సాధించిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పగవలన కలిగిన వగను జీవితాంతం అనుభవిస్తూ శేషజీవితాన్ని నరకంగా గడుపుమన్నాడు.

ఆ. 'ఓడి వచ్చినాఁడ; నుద్ధతి నా కేల? । యుడుకు మాని నీవ యుర్వి యేలు;
గుజ్జములును నేనుఁగులు లేని బయలు నీ । తలనె కట్టికొనుము ధర్మతనయ!'. **(శల్య. 2. 72)**

అని దుర్యోధను డంటే, ధర్మరాజు ఇట్లా మారు పలికాడు.

సీ. 'నీ యీగి నేను భూనాయకుఁ డగు టొల్ల । రాజకోటికిఁ బరిగ్రహము సనునె?
నిను ననిం దెగటార్చి నేలఁ బాలించెద; । నను నోర్చితేని పెంపును సుఖింపు;
మేమిటివాఁడవై యిచ్చితి పుడమి నీ । కనియెడు మాట యిట్లాడె దిపుడు;
నీవు ధరిత్రి నీ నేర్చినఁ గురుకులం । బునకు ని ట్లాఱడిఁ బోవ నేల?

తే. శాంతి నొందుటకై ధర్మ సంవిభాగ । కరణ మొనరింప వచ్చిన కమలనాభు
వాక్యవృత్తిఁ బాటింపక వాఁడి సూది । మోపినం తైన నుర్వి నీ నోప నంటి.

క. ఏమి విధంబునఁ బొరలియు । భూమి కురునృపాల నీకుఁ బుచ్చుకొనఁగ రా
కీమెయి దైన్యపడితి; నా । కే మార్గము వట్టి యిచ్చె దేర్పడ జెపుమా!

క. అరులకు సిరి యిచ్చెద నను । వెరవిఁడియుం గలఁడె? దీని విడువుము; నాకున్
ధర యిచ్చితేనియును నినుఁ । బొరిగొన కే విడువ; నతిమి పోరుట యొప్పున్.

క. నాచే నీ ప్రాణంబులు । నీచే నా జీవితంబు నిజ మున్నవి; యి
న్నీచత యపకార్యము; రా । జోచితకర్మ కృతనిశ్చయుఁడ వగుము నృపా!' **(శల్య. 2. 74-77)**

ప్రాణాలున్నంతవరకు పగసాధించాలని పూనుకొని, ప్రాణభయంతో కొలనులో దాగికొని, ప్రాణరక్షణకొరకై తనకు ఉద్ధతిలేదని బొంకి, కోపం మాని భూమిని ఏలుకొనుమని ధర్మరాజుకు రాజ్యాధికారాన్ని ఇస్తూ, బలగంలేని శూన్యభూమిని తలకుచుట్టుకొమ్మని కసితో కూడిన ఎగతాళిగా హెచ్చరించి తన మనఃప్రవృత్తిని ప్రకటించుకొన్నాడు రారాజు. రాజ్యాన్ని ఇవ్వదలచిన దుర్యోధనుడు పగ వీడినవాడుగా కనపడ్డా అది పరివర్తనమా? కపటనాటకమా? అనే ప్రశ్నను పగరకు కల్పించాడు. చిత్తశుద్ధి కలవాడైతే పై చివరి వాక్యం పలుకడు. పగతో రాజ్యాన్ని బలహీనపరిచి వగను కలిగించేటట్లు వదలిపెట్టుతానన్న అహంకారం ప్రదర్శించాడు. సంపదతో కూడిన భూమిని సంతృప్తిగా అనుభవించి, సారరహితమైన నేలను వదలి విజయాన్ని సాధించినట్లు వ్యంగ్యంగా వెటకారం చేశాడు దుర్యోధనుడు.

దుర్యోధనుడికి సమాధానం చెప్పిన ధర్మజుడు అతడి పగలోని సెగను గుర్తించి పరిహాసంచేశాడు. దాన మిచ్చినా తాను క్షత్రియుడు గాన తీసికొననని దుర్యోధనుడే స్వయంగా పలికిన మాటను జ్ఞాపకం తెచ్చాడు. తానూ అదే మాటను మాటకు మాటగా అన్నాడు. దుర్యోధనుడిని చంపిగాని రాజ్యం పాలించేది లేదనీ, ధర్మరాజును చంపగలిగితే సుయోధనుడు సుఖించవచ్చుననీ చెప్పాడు. ఒకడు చచ్చి మరొకడికి రాజ్యం చెందేటట్లు చేయటమే కర్తవ్యంగాని బ్రతికి ఉండగా భూమిని పాలించటం చెల్లదని పేర్కొన్నాడు. దుర్యోధనుడికి రాజ్యమిచ్చే అధికారం ఎక్కడ ఉన్న? దని ప్రశ్నించాడు. నిజంగా ఇవ్వగలిగి ఉంటే కురుకులానికి ఇంత కష్టం వచ్చి ఉండేది కాదన్నాడు. శ్రీకృష్ణ డెంత చెప్పినా వినక 'వాడి అయిన సూదిమొన మోపినంత నేలనైనా నేను పాండవులకు ఇవ్వనని' నిండుకొలువులో చెప్పినమాటను జ్ఞాపకం చేశాడు. దుర్యోధనుడు తనకు ఎవరైనా రాజ్యమిచ్చినా స్వీకరించలేని దైన్యస్థితిలో ఉండి ధర్మరాజుకు రాజ్యమిస్తా ననటం విడ్డూరమని ఎగతాళి చేశాడు. శత్రువులకు సిరినిచ్చే వెర్రివాడు లోకంలో ఉన్నాడా? అని అవహేళన చేశాడు. ఒకవేళ దుర్యోధనుడు చివరిక్షణంలో మనసు మార్చుకొని రాజ్యమిచ్చినా, తాను అతడిని చంపక విడువనని స్పష్టంగా ప్రకటించాడు. ఫలితాంశం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇట్లా తేల్చిచెప్పాడు - 'ధర్మజుడి చేతిలో దుర్యోధనుడి ప్రాణాలున్నాయి. సుయోధనుడిచేతిలో ధర్మజుడి జీవితం ఉన్నది. ఎవరో ఒకరు మిగలాలి. 'శత్రువును చంపి రాజ్యం తీసికొనటమే క్షత్రియధర్మం' అన్నాడు.

ఈ మాటలు ధర్మజుడి హృదయానికి వ్యాఖ్యానాలు. అగ్నిశేషం, ఋణశేషం, శత్రుశేషం ఉంచకూడదంటారు. అట్లాగే పరివర్తనం లేని పగను సగంలో వదలకూడదు. దుర్యోధనుడు పగతో పాండవులకు వగ కల్పించి, చివరకు తాను ప్రాణంతో బ్రతికి, సమయం చూచి పగరకు అపకారం చేయాలనీ, రాజ్యాన్ని మరల ఆక్రమించాలనీ భావించాడు. అతడిని వదలిపెట్టితే పగవలన కలిగే వగను నిరంతరం కొనితెచ్చుకొన్నట్లే అవుతుందని ధర్మజుడు భావించాడు. పగ లేని వగయే ఉత్తమం అనుకొన్నాడు. వగ వివేకం వలన తగ్గిపోతుంది కాని, పగ నట్టింట పుట్టలో ఉన్న పామువలె భయం కలిపిస్తుంది- అన్నది ధర్మరాజు అభిప్రాయం. అందువలననే దుర్యోధనుడిని చంపక వదలనన్నాడు. తాను చచ్చి అయినా పగను అంతం చేయాలని తలపెట్టాడు. భావికథ ధర్మజుడి అభిమతానికి అనుగుణంగానే సాగింది. ఎందరు హతులైనా, అనంతదుఃఖం ముంచెత్తినా కాలక్రమంలో పాండవులు శాంతిని పొందారు. సంపూర్ణ రాజ్యసుఖాల ననుభవించారు. 'పగ యడఁగించు టెంతయు శుభంబు - అది లెస్స' అనే వాక్యం పగకు ప్రతినిధిగా నిలిచిన దుర్యోధనుడికి వర్తింపజేసి వ్యాఖ్యానించిన మనీషి ధర్మరాజు. అడగించుటకు అక్కడి అర్థం అణచటం, ఇక్కడి అర్థం అంతమొందించటం!

3. శల్యపర్వం సహజ యుద్ధపర్వం:

భీష్మ, ద్రోణ, కర్ణ పర్వాలలో ఆయా మహావీరుల ప్రతాపాలు క్రమంగా పది, అయిదు, రెండు రోజులు ప్రచండంగా వెలుగొందాయి. అయితే వారి నాయకత్వం సాగినప్పుడు సంఖ్యాబలం అధికంగా ఉండేది. క్రమంగా వీరులూ, చతురంగబలాలూ నేలగూలటంచేత సంఖ్యాబలం తగ్గింది. పెక్కుమంది నడుమ ప్రకాశించటం ఒక విశేషం అయితే పలుచబడిన సైన్యం మధ్య వెలుగొందటం కూడా మరొక విచిత్రం. శల్యవిజృంభణం రెండవ పద్ధతికి చెందింది. అతడు సేనాపతి అయ్యేటప్పటికి ఉభయ పక్షాలలో మిగిలిన సైన్యాలు - కౌరవపక్షంలో 11వేల రథాలు, 10700 ఏనుగులు, 2 లక్షల గుర్రాలు, 3 కోట్ల కాల్బలం; పాండవ పక్షంలో 6వేల రథాలూ, 3వేల ఏనుగులూ, లక్ష గుర్రాలూ, కోటి కాల్బలం. బలాలమోహరింపు తగ్గటంవలన వీరుల విజృంభణాలకు కథలో విస్తృతి కనపడుతుంది. కౌరవసేనాపతులలో ఒక విశేషం ఉన్నది. వారు మరణించేరోజు ఆరే దీపం భగ్గుమంటుందన్నట్లు అప్రతిహతంగా పోరాడి దేవతల మెప్పు పొందుతారు. అవక్రపరాక్రములుగా రణరంగంలో రాణించే ఆ వీరులను పాండవులు సప్రయత్నంగా, సోపాయంగా సంహరించే సాహసం ప్రదర్శిస్తారు. కౌరవవీరులలో పురుషయత్నం పరాకాష్ఠ నందుకొంటే పాండవ వీరులలో దైవానుకూల్యం గల మానవతేజం ప్రజ్వలిస్తుంది. ఈ దృష్టితో చూస్తే శల్యపర్వం ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నది.

మహాభారత యుద్ధసమయంలో కౌరవపాండవులచేత విశేషంగా గౌరవించబడిన వీరుడు శల్యుడు. పాండవులకు మేనమామ కావటంచేత వారి ప్రార్థన మేరకు సైన్యసహాయం చేయటానికి అంగీకరించి అతడు వారి పక్షంలో చేరటానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో దుర్యోధనుడు ప్రచ్ఛన్నంగా ఆయనకు చేయించిన సేవలు అతడిని ముగ్ధుడిని చేశాయి. సేవలు చేయించింది ధర్మరాజని భావించి తెర వెనుక ఉన్న దుర్యోధనుడికి వరాలు గుప్పించాడు. తనది తొందరపాటని గుర్తించి, ధర్మజుడిని దర్శించి, పరిస్థితి వివరించి, సారథ్యంలో కర్ణుడి మనసు కలతపెట్టి పాండవ విజయానికి తోడ్పడేటట్లు రహస్య వాగ్దానమిచ్చాడు. ఈ సంగతి లోకానికి తెలియదు. అత డెవరికీ చెప్పలేదు. ధర్మజుడు బైట పెట్టలేదు. కర్ణుడు నేలకూలిన తరువాత ధర్మజుడి కిచ్చిన వరం ముగిసినట్లయింది. ఆ తరువాత దుర్యోధన పక్షంలో శల్యుడు పూర్తిగా పోరాడే పాత్ర నిర్వహించవలసి వచ్చింది. శల్యుడు గొప్ప ఆత్మాభిమాని, బలశాలి, స్నేహప్రవృత్తి, బంధుప్రీతి కలవాడు. అన్నిటినీ మించి స్తుతిప్రియుడు, అల్పసంతోషి. ఈ బలాబలాలను గుర్తించిన దుర్యోధన ధర్మజులు ఆయనను సమయోచితంగా వాడుకొన్నారు. ఇరువురూ యథోచితంగా లాభపడ్డారు.

కర్ణుడు శల్యసారథ్యాన్ని సమకూర్చుమని దుర్యోధనుడిని అడిగాడు. రారాజే స్వయంగా శల్యుడిని సమీపించి అతడు సత్యవ్రతుడనీ, శాత్రవులను దుర్దశపాలు చేయటంలో ఘనుడనీ, మహాభాగుడనీ కీర్తించి, అర్జునుడిని చంపాలని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉత్సహిస్తున్న కర్ణుడికి రథసారథ్యం చేయుమని వినయవినమ్రుడై ప్రార్థించాడు. శల్యుడికి జాత్యభిమానం, ఆత్మాభిమానం అడ్డం వచ్చాయి. మూర్ధాభిషిక్తుడూ, మహావీరుడూ, క్షత్రియుడూ అయిన తాను సూతపుత్రుడైన కర్ణుడికి సారథ్యం చేయనని భీష్మించుకొన్నాడు. కాని, దుర్యోధనుడు అతడి ఆత్మాభిమానం తృప్తిపడేటట్లు రథికంటె సారథి గొప్పవాడని తెలిపే త్రిపురాసుర సంహార కథను చెప్పి, రథి అయిన కర్ణుడు అర్జునుడికంటె ఘనుడనీ, సారథి అయిన శ్రీకృష్ణుడికంటె శల్యుడు అన్నింట మించినవాడనీ అతిశయంగా ప్రశంసించాడు. దానికి మనసు పొంగి శల్యుడు కర్ణసారథ్యానికి అంగీకరించాడు. అంతటితో ఆగక కర్ణుడిని రణమధ్యంలో తన ఇచ్చవచ్చిన మాటలతో హితవు చెప్పటానికి రారాజువద్ద అనుమతి తీసికొన్నాడు. కర్ణసారథి అన్నదానికంటె పార్థసారథికంటె గొప్పవాడన్న ప్రశంస శల్యుడికి బిరుదుగా తోచింది. ఆ ప్రవృత్తి అతడి చిత్తవృత్తికి పతాక.

కర్ణుడి తరువాత సేనాపతి ఎవ్వరనే ప్రశ్న వచ్చింది కౌరవ స్కంధావారంలో. అశ్వత్థామ శల్యుడి పరాక్రమాన్ని నిరూపించి అతడిని సర్వసైన్యాధ్యక్షుడిగా చేయుమని దుర్యోధనుడికి సలహా ఇచ్చాడు. ఆజి నైపుణ్యం, మహనీయ శౌర్యం, భూరిబలం, సర్వసత్త్వవేదనం. పరాక్రమోద్ధతి, ధైర్యసమగ్రత శల్యుడి సహజ వీరగుణాలని పేర్కొన్నాడు. మేనల్లులైన పాండవులను వదలి కౌరవపక్షంలో చేరిన శల్యుడి కంటె పరమహితుడు మరొకడు ఉండడని చెప్పాడు. కుమారస్వామి సేనాపతి కాగా దేవతలు దైత్యులను సంహరించినట్లు శల్యుడు నాయకుడైతే మనం శత్రువులను జయించగలమని ప్రోత్సహించాడు. దుర్యోధనుడు శల్యుడిని ప్రార్థించాడు. ఆతడు సుముఖుడై తనను గురించి ఇట్లా చెప్పుకొన్నాడు.

మ. ‘భుజవీర్యంబున నచ్యుతార్జునులు నన్ బోలంగలే; రల్క వ
చ్చి జయింపంగఁ గడంగినన్ సురలు నాచే నొత్తు; రే నేచి య
క్కజపుం జేవయు లావుఁ జూపు వడికిం గౌంతేయు లే యోర్తు? రా
ప్రజయున్ నీ ప్రజయుం దలంగఁ జెలఁగం బాటింతు నాటోపమున్.’

చ. ‘అఱిముఱి బాణజాలముల నక్కడి సైనికులం దెరల్చెదన్;
గుఱుకొని నాకు మాఱుకొని కోల్తలఁ జేసిన వీర వర్గమున్
నఱికెదఁ; జూచు ఖేచరగణంబుల కచ్చెరుపా టొనర్చెదన్;
బఱపెదఁ బాండునందనులఁ బాఱక నిల్చిన రూ పడంచెదన్’,

శా. ‘గంగానందను పోటు మెచ్చక, గురుం గాదంచు, రాధాతనూ
జుం గీడాడుచు, నీతఁ డెవ్వఁడొకొ యంచున్ శల్యుఁడే! యిట్టివా
నిం గయ్యంబుల మున్ను గాన మనుచు న్వేభంగులం జూపఱె
ల్లం గీర్తింప ధనుః కళానిపుణ లీలా ఖేలతన్ జూపెదన్’. **(శల్య. 1. 85-87)**

శల్యుడు ధీరోద్ధతుడివలె పలికాడు. భీష్మ ద్రోణులకంటె కర్ణుడూ ఇట్లాగే ప్రగల్భాలు పలికాడు. అయితే శ్రీకృష్ణుడు శల్యుడిని గురించి వేసిన అంచనా మనకు ఆశ్చర్యం కలిగిస్తుంది. అది వ్యాజస్తుతి ఏమో అన్నంత అనుమానం కలిగిస్తుంది. కృష్ణుడు ధర్మరాజుతో అనిన మాట లివి -

సీ. ‘శల్యు నెఱుంగుదు; శౌర్య ధైర్యంబు । లగ్గల మాతనికి; బాహుబల ఘనుండు;
గాంగేయకుంభకర్ణుల మిగిలెడుఁ; । గాఁడేని సముఁ డగుఁ గాని యసదు
గాఁ దలంపఁగ రాదు; కౌరవపతి మాన్యుఁ । జేయుట నధిక విజృంభణంబుఁ
జూపు; భీమునకు నర్జుననకు నెనయంగ । రాదు; సాత్యకి కోర్వరాదు; పార్ష

తే. తునకుఁ దత్సోదరులకు మార్కొని పెనంగి । బ్రదుకురాదు; నీవీట నా బల్లిదునకు
నెదురు రథికునిఁ గాన ననేక హేతి । నిపుణ శార్దూల విక్రమ! నీవు దక్క'. (శల్య. 1.91)

శల్యుడు పాండవ వీరులకంటె అన్నింట మిన్న అయినా ధర్మరాజుతో సరిగాడని శ్రీకృష్ణుడి నిష్కర్ష. ధర్మజుడే శల్యుడిని చంపుతాడని శ్రీకృష్ణుడి నిర్ణయం. 'యుద్ధంలో శల్యుడిని నేను చంపుతా'నని ధర్మజుడు ఉద్యోగపర్వంలో ప్రతిజ్ఞచేశాడు. దానిని శ్రీకృష్ణుడు స్థిరీకరించినట్లయింది. ధర్మరాజుది పురుషయత్నం. శ్రీకృష్ణుడిది దైవానుకూల్యం. స్వల్పమైన నిందకూడా రాకుండా ధర్మరాజుచేత ధర్మబద్ధమైన సహజయుద్ధాన్ని చేయించి విజయాన్ని ప్రసాదించాడు శ్రీకృష్ణుడు. శల్యపర్వ ప్రత్యేకతలలో ఇది ఒకటి.

పదునెనిమిదవనాటి యుద్ధంలో శల్యుడు సర్వతోభద్ర వ్యూహం పన్నాడు. అంతకుముందే పాండవులు త్రిముఖ వ్యూహంతో సిద్ధమై ఉన్నారు. యుద్ధారంభంలో శల్యుడి విజృంభణం కౌరవసేనలకు ఆశ్చర్యం కలిగించింది. పాండవు లతడిచేతిలో ప్రాణాలు కోల్పోవటం తథ్యమనే ఆశలు దుర్యోధనుడి మనసులో పొటమరించాయి. పాండవులు తెగబడి శల్యుడిపై విరుచుకొని పడ్డారు. భీమార్జునులు భయంకరమైన ఎదురుదాడి చేసి సైన్యాన్ని మట్టుపెట్ట నారంభించారు. ధర్మజ, నకుల, సహదేవులు ప్రతివీర సంహారంతో తమ ప్రతాపాలకు వన్నె తెచ్చుకొన్నారు. నకులుడు కర్ణ పుత్రులైన చిత్రసేన, సత్యసేన, సువర్మలను సంహరించాడు. అతడి ధాటికి ఓర్వలేక కౌరవసేనలు వికావికలై పరుగెత్తసాగాయి. శల్యుడు సింహనాదం చేసి, రౌద్రవిక్రమ స్ఫూర్తితో సేనలను పురికొల్పి సమీకరించి విజృంభించాడు. పాండవులు ఒక్కుమ్మడిగా అతడిపై దాడిచేశారు. అయినా శల్యుడు తెగించి విక్రమించి పాండవసేనలపై బాణవర్షం కురిపించాడు. వారు భయపడి ధర్మరాజు రథం వెనుకకు పోయి తలదాచుకొన్నారు. ధర్మరాజు శల్యుడి దాడిని త్రిప్పికొట్టాడు. భీముడు శల్యుడిని ఢీకొని భీకర గదాయుద్ధం చేశాడు. ఇరువురు వీరులూ మత్తేభాలవలె పోరాడి సైనికుల మెప్పులు పొందారు. కొంతసేపటికి ఇరువురూ పరస్పర గదాఘాతాలతో మూర్ఛపోయారు. కృపాచార్యుడు శల్యుడిని రథంమీద ఉంచుకొని దూరంగా తొలగిపోయాడు. భీముడు తేరికొని శల్యుడిని యుద్ధానికి పిలిచాడు. శల్యుడు తేరుకొని గదాదండంతో రథమెక్కి యుద్ధానికి వచ్చాడు. దుర్యోధనుడి ముందున్న సైనికులు అతడిని అనుసరించారు. ధర్మరాజుకు ముందున్న రథికులు చేకితానుడిని ముందుంచుకొని భీముడిని దాటి దుర్యోధనుడిపై తలపడ్డారు. అతడి వజ్రగదాఘాతానికి చేకితానుడు చనిపోయాడు. పాండవసేన మండిపడి కౌరవసేనపై బాణవర్షం కురిపించింది. శల్యుడిపై పాండవులు విజృంభించారు. అతడిపై ధర్మరాజు ముద్గరాన్నీ, సాత్యకి తోమరాన్నీ, భీముడు భల్లాన్నీ, నకులుడు శక్తినీ, సహదేవుడు గదనూ ఒక్కసారిగా ప్రయోగించారు. శల్యుడు వాటిని వమ్ముచేసి అర్చాడు. పటు బాణ ప్రయోగాలతో సాత్యకిని, పాండవులను మూర్ఛపొందించాడు. దానిని చూచి శల్యుడు పాండవులను ఆనాడు చంపుతాడని భావించి దుర్యోధనుడు సంతోషించాడు.

భీమ నకుల సహదేవులు కలిసి శల్యుడిపై విజృంభించారు. ధర్మరాజు శల్యుడి చక్రరక్షకుడైన ద్యుమత్సేనుడి తల నరికాడు. శల్యుడు జూలు పీకిన సింహంవలె కోపించి భీమాదులను బాణాలతో నొప్పించి, నెత్తురు పారేటట్లు చేశాడు. ధర్మరాజును మూర్ఛపొందించాడు. తేరుకొన్న ధర్మరాజుకు శల్యపరాక్రమం భయం కలిగించింది. పౌరుషంతో శల్యుడిని చంపుతానని శపథంచేసిన ధర్మరాజుచేత శ్రీహరిని స్మరింపజేసిన గౌరవం శల్యుడికే దక్కింది. ఒక్కసారితో అది ఆగలేదు. మూడు సార్లు శల్యుడు ధర్మరాజును ముచ్చెమటలు పట్టించాడు. మూర్ఛలో ముంచాడు. శ్రీహరిని స్మరింపజేశాడు. ధర్మజ విజయం దైవాధీన మని నిరూపించాడు.

శల్యుడు ఎంతటి మహావీరుడైనా యుద్ధంలో కొన్నిసార్లు అతడిని కృపాశ్వత్థామలు రక్షించవలసి వచ్చింది. అయినా, ఆయన ప్రదర్శించిన యుద్ధకేళి దేవతలను కూడా మెప్పించింది. పాండవులను ముప్పు తిప్పలు పెట్టింది. దానికి ప్రతిగా భీమార్జున నకుల సహదేవులు అతడిని మూడు చెరువుల నీళ్ళు త్రాగించారు. ఆ భీకర సమరంలో ప్రత్యర్థులైన శల్యధర్మజుల యుద్ధం వీర రసోద్రేకంగా సాగింది. మచ్చుకొక సన్నివేశం - శల్యుడు ధర్మజుడి వక్షఃస్థలంమీద పటుబాణాన్ని నాటాడు. ధర్మజుడు మరొక ఘోరబాణంతో శల్యుడిని కొట్టి మూర్ఛచెందేటట్లు చేశాడు. శల్యుడు తేరికొని కోపంతో

వాడిబాణాన్ని ప్రయోగించగా ధర్మరాజు పసిడి బాణాలతో దానిని విరుగగొట్టాడు. శల్యుడు తొమ్మిది బాణాలను ధర్మజుడి వక్షంమీద నాటాడు. క్రూరభల్లంతో చాపాన్ని విరుగగొట్టాడు. ధర్మజుడు మరొకవిల్లు చేపట్టి యుద్ధం చేశాడు. శల్యుడికి కృపుడూ, ధర్మరాజుకు భీముడూ తోడుగా నిలిచి పోరాడారు. కృపుడూ శల్యుడూ కలిసి ధర్మరాజును విరథుడిని చేశారు. అప్పుడు మరల ధర్మజుడు శ్రీహరిని స్మరించాడు.

4. ధర్మరాజుకు దైవ సహాయం:

ధర్మరాజు శ్రీహరిస్మరణం మూడుసార్లు చేశాడు. అందులో గజేంద్రుడిని తలపింప చేశాడు. 'కలఁడు కలం డనెడి వాఁడు కలఁడో లేఁడో?' అని భయంతో శంకించిన గజరాజువలెనే ధర్మజుడు మొదటిసారి శ్రీహరివచనం నిజమౌతుందో కాదో అని భయాందోళనలను ప్రకటించాడు.

క. 'హరి వచనంబు లసత్యతఁ । బొరయఁగ నేర్చునొకొ! మద్రభూపతి బాహు
స్ఫురణము భీమాది రథిక । వరు లోర్వని యట్లు గాఁగ వ్రాలెడిఁ దోడ్తోన్'. **(శల్య. 1. 205)**

శ్రీకృష్ణుడు చెప్పిన మాటలలో రెండంశా లున్నాయి. ఒకటి - భీమాదులు శల్యుడితో దీటురారు. రెండు - ధర్మజు డొక్కడే శల్యుడిని మించిన యోధుడు. ఇందులో శల్యుడు భీమాదులను యుద్ధంలో మించిన మాట సత్య మౌతున్నట్లు స్పష్టమైనది. మరి ధర్మజుడు కూడా శల్యుడిచేతిలో మూర్ఛపోవటం గమనిస్తే రెండవ మాట నిజమౌతుందో లేదో అనే భయం, ఆందోళనం కలిగింది. పురుషయత్నంలో భగవంతుడిని స్మరింపచేసే ప్రథమదశ భయం. దానివలన విజయం అనిశ్చిత స్థితిలో ఉంటుంది.

అనిశ్చిత స్థితికి మూలం అనుమానం. మూర్ఛలో పడ్డప్పుడు భయాందోళనలు కలిగాయి. ఆపై విరథుడైనప్పుడు శంక అంకురించింది.

క. 'గెలుపుము శల్యుని నీ' వని । పలికి ముకుందుండు నన్నుఁ బనిచిన వాఁ; డ
ప్పలుకులకు నసత్యత్వము । గలుగఁగ నేర్చునొకొ దైవఘటన బలమునన్' **(శల్య. 1. 263)**

అని ధర్మజుడు తలపోశాడు. ఇక్కడ భీమాదుల ప్రసక్తి లేదు. శ్రీకృష్ణుడి ఆశీస్సుల ప్రసక్తి ఉన్నది. శల్యుడిని చంపుతా నని చెప్పిన ధర్మజుడి మాట మానవీయం కాబట్టి అబద్ధం కావచ్చును. కాని, కృష్ణుడిమాట దైవనిర్ణయం కదా! అది అసత్యం కావటానికి వీలు లేదు. అయినా, శల్యుడి పరాక్రమం ధర్మరాజుకు ప్రాణసంకటంగా మారింది. శ్రీకృష్ణుడు ఆశీర్వదించినా ధర్మజుడి జీవితంలో దేవుడు విజయం వ్రాసిపెట్టి ఉండకపోతే అది నిజం కాదేమో! అని శంకించాడు ధర్మరాజు.

శంకను తొలగించగలిగింది విశ్వాసం. ధర్మజుడు దైవంమీద అచంచల విశ్వాసం కలవాడు. కాబట్టి శంకతో ఊగిసలాడుతున్న మనస్సును స్వయంగా కుదుటపరచుకొన్నాడు. 'ఆ జగన్నాథు వచనంబునకు నన్యథాత్వం బేలఁ గలుగు?' (శల్య. 1. 264) నని వెంటనే విశ్వాసభావాన్ని వ్యక్తీకరించాడు. స్థిర నిశ్చయుడైన తరువాత భగవంతుడి నేకాగ్రచిత్తంతో, భక్తి భావంతో, విజయార్థి అయి ప్రార్థించాడు. శరణాగతికి సుముఖు డయ్యాడు. 'అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే । తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్' అన్న భగవంతుడి వాగ్దాన ఫలాన్ని పొందే అర్హతను సంపాదించాడు. ఈ క్రింది రెండు పద్యాలూ అందుకు సాక్ష్యాలు.

చ. 'స్ఫురిత షడర్ధనేత్రునిఁ,ద్రిశూల సముజ్జ్వలు, నిర్గుణున్, గుణా
దర సముపాత్తమూర్తిఁ, గలిత ప్రభవస్థితి సంహృతి క్రియా

నిరతి వివర్తిత త్రిభువనీ మహనీయుని, దైత్యమర్ది, న
ప్పురుషవరుం జతుర్భుజవిభుత్వ మహోన్నతు నా(శ్రయించెదన్'.

తే. 'భండనము సేయు నరు నగ్రభాగమునఁ బ్ర । చండ శూలోగ్ర హస్తుఁడై శత్రుకోటి
గీటడంచుచు నేఁ జూడఁ గేలి సలుపు । దేవు జయసిద్ధికై నన్నుతింతు భక్తి'. **(శల్య. 1. 265 -266)**

వీటిలో మొదటి పద్యం తిక్కనగారే ధర్మజుడి నోట పలికినట్లున్నది. అది హరిహరాద్వైత భావంతో పురుషోత్తముడిని స్తుతించిన పద్యం. రెండవ పద్యం అర్జునుడి ముందుభాగంలో శూలహస్తుడై నడుస్తూ శత్రు సంహార కార్యాన్ని తానే ముందుగా నిర్వహిస్తున్న రుద్రుడి ప్రశంస ఉన్నది. శ్రీకృష్ణుడి నర్చించిన పూజాద్రవ్యాలు ఆ మహాదేవుడి శరీరంమీద తోచినట్లు అర్జునుడు చెప్పగా ధర్మరాజు విన్నాడు కూడా. ఆ మహాదేవుడే అతడి కానాడు శరణ్యు డయ్యాడు. శివుడే విష్ణువని, విష్ణువే శివరూపుడని తెలిసిన ఎరుక ఈ భక్తి భావనకు మూలం. శత్రుసంహారానికి కావలసిన దివ్య లక్షణాలను దైవ చైతన్యంలో జాగృతం చేసి వాటిని తన విజయసిద్ధికై ప్రసన్నం చేసికొనటమే ఈ పరమేశ్వర స్తుతిలోని పరమతాత్పర్యం.

మొదట పరమేశ్వరుడి త్రినేత్రత్వాన్ని స్మరించాడు. మూడవకన్ను తెరిచి శత్రువులను భస్మం చేయమని దాని భావం. ఆ తరువాత త్రిశూలం చేత ప్రకాశించేవాడిని తలచాడు. శూలంతో శత్రుసంహారం చేయుమని భావం. నిర్గుణుడైన పరమాత్మభావనం చేత సర్వాంతర్యామివై సర్వశక్తిమత్త్వాన్ని ప్రకటించుమని కోరాడు. గుణాలను ఆదరించే ఉదాత్తమూర్తిని భావించటంతో భగవంతుడి దయాగుణాదులను అర్థించినట్లు భావం. సృష్టిస్థితిలయాత్మక ప్రవృత్తిచేత భువనాలను పాలించే మహనీయుడిని భావించటంచేత పుట్టిన జీవులను గిట్టించే సంకల్పం గల మహేశ్వరుడే శత్రువులను సంహరించగలడని భావం. రాక్షసమర్దనుం డనటంచేత దుష్టశిక్షణ ప్రవృత్తిని ప్రదర్శించుమని ప్రార్థించాడని భావం. పురుషవరుడనీ, చతుర్భుజుడనీ, విభుత్వ మహోన్నతుడనీ కీర్తించటంవలన ఉత్తమ పురుష స్థితినీ, విష్ణు స్థితినీ (నలుగురు తమ్ముల పరాక్రమ స్ఫూర్తినీ), ప్రభుత్వ ప్రాప్తిచేత కలిగే ఉదాత్త ఔన్నత్యాన్నీ ధర్మజుడు భగవంతుడినుండి కోరుతూ ఆతడిని శరణువేడుతున్నాడని ధ్వని. 'నరుడికి తోడుగా నిలిచి ముందుగా శత్రుసంహారం చేసి అతడి విజయమార్గం ఎట్లా సుగమం చేస్తున్నావో, నాకు కూడా అటువంటి సహాయాన్ని అందించి విజయం చేకూర్చు'మని పరమేశ్వరుడిని కోరాడు. ధర్మజుడు సాత్త్విక సంపన్నుడు కాబట్టి అతడు భగవంతుడిని అర్థించి సంకల్ప సిద్ధి పొందగలడని భారతంలో ఎన్నో చోట్ల నిరూపించబడింది. ఇక్కడ కూడ సకామభక్తిని సాత్త్విక సమాహితశక్తితో ప్రసరించి విజయాన్ని ప్రసాదించుమని పరమేశ్వరుడిని ప్రార్థించాడు. భక్తిపారవశ్యంలో ఉన్న ధర్మరాజు చేసిన బాణప్రయోగం బలహీనంగా తోచగా శల్యుడు విజృంభించి ఆతడిమీద పెల్లుగా బాణ వర్షం కురిపించాడు.

యోగక్షేమం వహిస్తానన్న పరమేశ్వరుడి చైతన్యం జాగృతమైనట్లు స్పష్టంగా తోచింది. భీముడు శల్యుడి విల్లును విరిచాడు. గుర్రాలను, సూతుడిని క్రమంగా కూల్చాడు. శల్యుడి కవచాన్ని నేలపడగొట్టాడు. కవచ హీనుడైన శల్యుడు ఆగ్రహించి, కత్తీ డాలూ తీసికొని రథం దిగి యముడివలె విజృంభించాడు. భీముడు అతడి కత్తిని, డాలునూ విరుగగొట్టాడు. వెంటనే శల్యుడు మరొక కవచాన్ని ధరించి భయంకరమైన గదను చేపట్టి ధర్మరాజుపై ఉద్ధృతంగా దాడిచేశాడు. అప్పుడు సాత్యకి, ధృష్టద్యుమ్న, శిఖండి, ద్రౌపదేయులు, మాద్రేయులు ధర్మరాజుకు బాసటగా నిలిచి శల్యుడిని ఎదుర్కొన్నారు. కాని, అతడు వారిని లెక్కచేయక హుటాహుటి ధర్మరాజుపై సింహంవలె లంఘించాడు. ధర్మజుడు రౌద్రోద్రేకంతో మేనుపెంచి భారమంతా శ్రీకృష్ణుడిపై ఉంచి ఇట్లా మనసులో సంకల్పించాడు.

క. 'ఇతని సమయింప నయ్యు । చ్యుతుఁడు ననుం బనిచె; నాకు నొనరించిన పా
లితఁ' డని తలంచి మొగ ము । గ్రత నొందఁగ శక్తిమీఁదఁ గనుదో యొలయన్'. **(శల్య. 1. 273)**

ధర్మరాజు భావనలో ఒక విశేషం ఉన్నది. అచ్యుతుడు ధర్మరాజును శల్యుడిని చంపుమని పంపాడట! శల్యుడిని తన పాలుగా మిగిల్చాడట! ఈ మాట లెంత సార్థకంగా ఉన్నాయి! ధర్మజుడిలో అహంకారం లేదు; కర్తృత్వ భావన లేదు.

అతడు తనను భగవంతుడి సాధనంగా భావించాడు. అచ్యుతుడే అందరినీ సంహరిస్తూ శల్యుడిని తన పాలుగా మిగిల్చాడట! అంటే- చంపేది ధర్మరాజైనా చంపిస్తున్నది అచ్యుతు డని భావం. మొదట శల్యుడిని చంపుతానని ఎంచుకొన్నది ధర్మజుడే. అది అతడికి అహంకారానికి ఆనవాలు. తరువాత తనకు తన పరాక్రమం మీద అనుమానం కలిగి శల్యసంహారం అచ్యుతుడి దయవలన తనకు సిద్ధించే అవకాశ మని భావించాడు. ఆ తరువాత సంకల్పించినవాడూ, ప్రతిజ్ఞ నిర్వహించేవాడూ, చంపేవాడూ - అన్నీ అచ్యుతుడే అని భావించి ధర్మరాజు తనను నిమిత్తమాత్రుడిగా తలంచాడు. ఇక యోగక్షేమ భారం శ్రీకృష్ణుడిదే అయింది.

ఇక్కడ తిక్కన తీర్చిదిద్దిన సన్నివేశం కడు రమణీయం. ధర్మరాజు ప్రదర్శించింది విష్ణుభక్తి, పొందింది శివశక్తి. ధర్మరాజు వద్ద శక్తి అనే మహాస్త్రం ఉన్నది. అది ప్రాణాంతక సమయంలో ధర్మరాజుకు స్ఫురించింది. ఈ స్ఫురణ నిచ్చినవాడు స్థితికారు డయిన విష్ణువు. అందుకే మనస్సులో మ్రొక్కాడు హృషీకేశుడిని.

ఉ. ‘నీ దెస నాదు చిత్తమున నెక్కొని యుండెడు భక్తి భద్రసం
పాదిని గావు టచ్చెరువె? భక్తజనాభిమత ప్రదాన వి
ద్యాదయితత్వ మేర్పడ జయం బొడఁగూర్పుము దేవ! సంశ్రితాం
హోదళనంబు నీకు వ్రత; ముల్లము నాపయి నిల్పు మిత్తఱిన్’. **(శల్య. 1. 275)**

విష్ణుభక్తుడికి భద్రత కలగటంలో ఆశ్చర్యం లేదు. భక్తాభీష్టం తీర్చటమే భగవంతుడి వ్రతం. కాబట్టి ధర్మరాజును కాపాడాలని భగవంతుడు సంకల్పిస్తే చాలు జయం కరతలామలకం ఔతుందని భావించటం పై పద్య తాత్పర్యం.

ధర్మరాజుకు స్ఫూర్తి నిచ్చింది విష్ణువు. శక్తి నిచ్చింది పరమేశ్వరుడు.

ఉ. ‘అచ్చపు భక్తికిన్ మదిఁ బ్రియంబున నొందిన ఫాలలోచనుం
డిచ్చిన ప్రీతి యోగమును నెక్కుడు భక్తియు నావహిల్లఁగా
నిచ్చలు గంధపుష్పముల నిష్ఠమెయిం బరిశోభితార్చనం
బిచ్చుచుఁ దాను గొల్వ నుతి కెక్కిన యమ్మహనీయ శక్తికిన్’.

మ. ‘ప్రణతుండై రభసోదయాభినవదర్పస్ఫూర్తి శోభిల్లుచు
న్మణిదండద్యుతి మంజరీ స్ఫురణము న్సంశోభిఘంటాపటు
క్వణనంబున్ రిపుసైనిక ప్రకర దృక్కర్ణవ్యథం జేయ భీ
షణరేఖం బగుదానిఁ బుచ్చుకొని చంచన్ముష్టి దృష్ట్యుద్ధతిన్’. **(శల్య. 1.277-278)**

శల్యుడిమీద శక్తిని ప్రయోగించాడు. అది శల్యుడి కవచంలో ప్రవేశించి, రొమ్ము చీల్చి వీపునుండి బయటకు వెలువడి భూమిలో ప్రవేశించింది. ఆ వేటువలన ముక్కులనుండి, చెవులనుండి, కన్నులనుండి నెత్తురు కారుతూ శరీరాన్ని తడిపివేయగా శల్యుడు - ప్రియురాలి ఉరంమీద వాలే ప్రియుడివలె - నేలమీద చేతులు రెండూ చాచి బోరగిలపడి ప్రాణాలు వదిలాడు. ధర్మరాజు చేసిన ధర్మయుద్ధంలో చనిపోయిన శల్యుడు శాస్త్రోక్తంగా సమర్పించిన హవిస్సులను స్వీకరించి చల్లారిన హోమాగ్నివలె భాసించాడు.

శల్యుడి తమ్ముడూ, చుట్టాలూ కలిసి ధర్మరాజును ఎదుర్కొని ప్రాణాలు కోల్పోయారు. కృతవర్మ, కృపాచార్యుడు వీగిపోయారు. శల్యపర్వంలో ధర్మరాజుకు తిరుగులేని విజయం సిద్ధించింది. ఈ పర్వంలో భీమార్జున నకుల సహదేవులు, మిగిలిన వీరులూ చేసిన పోరు స్థాయిభావానికి పోషకంగా నిలిచిన సంచారిభావాల సంపుటివలె రాణించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శల్యు డెవ్వరికీ ఆజన్మశత్రువు కాడు. పగతో ఎవరినైనా చంపుతానని అతడు శపథాలు చేయలేదు. అతడిని చంపటానికి కారణంగా బలమైన విద్రోహచర్య ఏదీ కానబడదు. దుర్యోధనుడు అతడిని అవసరం కొద్దీ వాడుకొన్నాడు. కర్ణసారథ్యం తరువాత శల్యుడు కౌరవసైన్య సారథ్యం నిర్వహించవలసి వస్తుందని ఊహించలేదు. మిగిలినవారిలో పెద్దవాడు, తనపట్ల అభిమానం చూపాడని మాత్రమే దుర్యోధను డాతడికి సైన్యాధ్యక్షపదవి నిచ్చాడు. ఏ కారణంచేతనో కృప, కృతవర్మ, అశ్వత్థామలను సర్వసైన్యాధ్యక్షులుగా అతడు శల్యుడికి ముందుగా వరించలేదు. అది కూడా విధి ప్రేరితమనే భావించాలి. పాండవులు చేసిన శపథాలలో ధర్మజ, నకుల, సహదేవులవి ఇంకా పూర్తికావలసి ఉన్నది. ఆ వరుసలో శల్యుడు, శకుని, ఉలూకుడు చావటానికి మిగిలి ఉన్నారు. అందువలన శల్యుడిని ఎన్నుకొని ఉంటాడు. అతడు యుద్ధం చేసింది సగం దినం. కొన్ని గడియలు మాత్రమే పాండవులను సంహరించే ప్రతాపాన్ని ప్రదర్శించి మెరుపువలె మెరిసి ఆరిపోయాడు. అతడి నాయకత్వంలోనే శల్య, శకునుల పుత్రులు, మిత్రులు అస్తమించారు. భీమ ప్రతిజ్ఞకు బలికావలసి ఉన్న దుర్యోధనుడు ఒంటికంబంవలె నిలిచి ఉన్నాడు. ఇట్లా నిలిచిన దుర్యోధనుడు గెలిచిన రాజా? ఓడిన రాజా? సైన్యాధిపతియా? సైన్యాధిపతిని నియమించే సర్వాధికారియా? పెద్ద ప్రశ్నార్థకంగా మిగిలిన దుర్యోధనుడు శల్య మరణానంతరం శకునిని పిలిచి తరువాతి కార్యక్రమాన్ని గురించి అడిగాడు. శకుని తాను సేనాపతి నౌతానని అనలేదు. మరెవ్వరూ అతడి పేరును ప్రతిపాదించలేదు. శకుని తన పావులు నడిపి 'రాజు పూనుకొని ముందుకు ధైర్యంగా సాగకపోతే సైనికులు మెచ్చుకొంటారా?' అని సలహాచెప్పి దుర్యోధనుడిని ముందుకు త్రోశాడు. సేనాపతి అయితే చావక తప్పదని శకునికి తెలుసు. కాని, చివరి క్షణంలో కూడా మోసంతో విజయాన్ని సాధించి దుర్యోధనుడికి బహూకరించటానికి యత్నించాడు. అశ్వసైన్యంతో పాండవబలాన్ని వెనుకనుండి దాడిచేసి మట్టుపెట్టాలని రహస్యవ్యూహం పన్నాడు. దానిని నకుల సహదేవులతో త్రిప్పికొట్టించి ధర్మరాజు అతడి ప్రాణాలను తీయించాడు. మోసగాడిని మోసంతో కాక మొగంమీద మొత్తి శకునినీ, ఉలూకుడినీ నకుల సహదేవులు చంపారు. శకుని తరువాత చివరకు మిగిలింది కృపాశ్వత్థామ కృతవర్మలు. వారితో యుద్ధభవితవ్యాన్ని గురించి చర్చించకుండానే దుర్యోధనుడు రణరంగం నుండి ఏకాంతంగా నిష్క్రమించి ద్వైపాయన హ్రదంలో దాగికొన్నాడు. మిగిలిన ముగ్గురు రథికులూ దారం తెగిన గాలిపటాలవలె గమ్యంలేని గతితో తిరుగవలసి వచ్చింది. శల్యవధ కౌరవులకు హృదయశల్యంగా పరిణమించింది.

యుద్ధషట్కంలో శల్యపర్వం సాధారణ యుద్ధ ప్రక్రియ సాగిన సహజపర్వం. శల్యవధవరకు ధర్మజుడి విజయాన్ని సూచించే వస్తు ధ్వని రమణీయంగా సాగింది. ఈ పర్వంలో శల్యుడు మహాస్త్ర ప్రయోగం చేయలేదు. ఆ మాటకు వస్తే కౌరవపాండవ వీరులందరూ శస్త్రప్రయోగాలే చేశారు కాని అస్త్రాలు వెలికి తీయనేలేదు. ఇందులో మహేశ్వరదత్తమైన శక్తిని బయటికి తీసి ప్రయోగించినవాడు ధర్మరాజొక్కడే. అందుకే అతడు గెలుపును సాధించి నాయకుడయ్యాడు. ఇందులో శల్యధర్మజులకు ఏ శాపాలూ లేవు. శల్యుడు పొందింది సహజమరణం. ధర్మజుడు సాధించింది సహజ విజయం. అందువలన శల్యపర్వం సహజయుద్ధపర్వం.

5. శల్యపర్వ నామ సార్థక్యం:

శల్యపర్వం వస్తుతః రెండు భాగాలుగా విరిగింది. పూర్వభాగం శల్యనామధేయుడైన సేనాని పేరుతో సార్థకమయింది. ఉత్తర భాగం శల్యశబ్దార్థ ప్రవర్తనంవలన సార్థకమయింది. శల్యమంటే కంటకం (ముల్లు) అనీ, గుండెలో గ్రుచ్చుకొన్న బాణమనీ, బాణపు ముక్క అనీ, ఒకచోట నిలువక చలించేదనీ (శలతీతి శల్యః శల చలనే) అర్థాలు గోచరిస్తాయి. శల్యపతనానంతరం దుర్యోధనుడు రణరంగంలో అనేక విధాల యుద్ధం చేయటానికి యత్నించి, తన వారందరూ తనువులు చాలించగా, రణరంగాన్ని వీడి ద్వైపాయన హ్రదానికి సాగిపోయాడు. ఆ తరువాత భీముడితో గదాయుద్ధం చేయటానికి శమంత పంచక తీరానికి వెళ్ళాడు. అట్లాగే కృప, కృతవర్మ, అశ్వత్థామలు దుర్యోధనుడి అన్వేషణలో తిరగటం, పాండవులు దుర్యోధనుడు దాగి ఉన్న చోటును అన్వేషించటానికి తిరగటం, చారులవలన విని దుర్యోధనుడున్న హ్రదం వద్దకు పోవటం, అక్కడికి తీర్థయాత్రాచణశీలి అయిన బలరాముడు రావటం, దుర్యోధనుడు, పాండవులు, శ్రీకృష్ణ సాత్యకులు శిబిరాలలో వసించకుండ రాత్రివేళ నదీతీరాలకు వెళ్ళి నిద్రించటం, శ్రీకృష్ణుడు నడిరేయి హస్తినాపురానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వెళ్ళిరావటం, యుయుత్సుడు భర్తలను కోల్పోయిన స్త్రీలను హస్తినాపురానికి చేర్చటం మొదలైన సన్నివేశాలన్నీ చలన శీలాన్ని తెలిపే కథాంశాలుగా గోచరిస్తాయి. అందువలన శల్యపర్వనామం స్వభావ వ్యంజకంగా సార్థకమయింది.

శల్యపర్వోత్తర భాగంలోని కథలో ముఖ్యాంశం దుర్యోధనుడి ఊరుభంగం. ఇది కౌరవపాండవుల హృదయాలలో శాశ్వతంగా నాటుకొన్న శల్యం. దుర్యోధనుడు తొడలు విరిగి పడిన నాటినుండి నేటివరకు ఈ అంశంపై ధర్మాధర్మచర్చ చర్చనీయాంశమై సాగుతూ రావణకాష్ఠంవలె ఆరకుండా మండుతూనే ఉన్నది. శల్యమంటే ముల్లు కావచ్చును. బాణమూ కావచ్చును. పాండవులకు కురుసభలో గుచ్చుకొన్న శల్యాలు అనేకం. మాయాద్యూతంలో ధర్మజుడి రాజ్యం హరించటంవలన కలిగిన బాధ ఒక శల్యం. ద్రౌపది నేకవస్త్ర అని కూడా తలంచక నిండుకొలువుకు జుట్టుపట్టి లాగికొని వచ్చి అవమానించటం మరొక శల్యం. ద్రౌపదిని తన తొడపై కూర్చుండుమని దుర్యోధనుడు సైగ చేయటం మరొక శల్యం. ద్రౌపదిని 'బంధకి' అని కర్ణుడు పిలిచి హేళన చేయటం మరొక శల్యం. అభిమన్యుడిని ఒంటరివాడిని చేసి, బాలుడని కూడా భావించకుండా ప్రౌఢవీరులందరూ కలిసి మోసంతో సంహరించటం మొదలైనవి శల్యాలే. బాల్యంనుండి దుర్యోధనుడు పాండవులకు చేసిన అపకారాలన్నీ మాయని గాయాలవలె బాధపెట్టే శల్యాలు. పాండవుల గుండెలలో గుచ్చుకొన్న శల్యాలకు ప్రతిజ్ఞాపాలనలే నివారణోపాయాలు, తగిన ఔషధాలు. ప్రతిజ్ఞలు ధర్మశాస్త్రాలను చూచి చేసేవి కావు. శాపాలూ అంతే. శత్రువులు చేసిన అధర్మ క్రియలకు ప్రతీకార క్రియలే పాండవ ప్రతిజ్ఞలు. వాటిని పగ తీర్చికొన్నట్లుగా తీర్చికొని కృతప్రతిజ్ఞులు కావటమే క్షత్రియులకు కృతార్థత. ఇది క్షత్రియ వీరధర్మం. ప్రతిజ్ఞానిర్వహణంమీద ప్రతివిమర్శ ఎంతవరకు న్యాయం? అనేది శల్యపర్వంలో ప్రారంభమయ్యే చర్చ. యుద్ధధర్మానికీ, ప్రతిజ్ఞానిర్వహణానికీ, లోకధర్మానికీ, ధర్మశాస్త్రానికీ, వేదతాత్పర్యానికీ ముడిబెట్టి ఏకవాక్యత సాధించటం ఎవ్వరికీ సాధ్యం కాదు. వేదవ్యాసుడూ, శ్రీకృష్ణుడూ ఆయా ధర్మాలకు అనుగుణమైన సమన్వయ సూత్రాలను చెప్పి హృదయశల్యాలకు తగిన మందువేయగల వైద్య విద్వాంసులు. వారి మాటలకు ప్రామాణ్యం కలిగించటమే భారత పరమార్థం. వారి తీర్పులను అంగీకరించటమే పరమధర్మం. కాదనటం వ్యక్తి దృక్పథం. ఈ రెండింటినడుమ విశ్వజనీనతను సాధించే యత్నమే ఈ పర్వత్రయ ప్రయత్నం. అందులో శల్యపర్వం శల్యమూల్యాంకన చర్యల చర్చాపర్వం. 'ఊరుభంగం' దానికి కేంద్ర బిందువు.

ధృతరాష్ట్ర దుర్యోధనులది కణిక (శుక్ర)నీతి; ధర్మజ శ్రీకృష్ణాదులది బృహస్పతి నీతి. ఈ ఇరువురికీ సమాన ప్రమాణాలు వాదంలో ఉండటం దుర్లభం. మిత్రులనైనా బంధువులనైనా మోసంచేసి, చంపి రాజ్యాన్ని, ధనాన్ని హరించటం శుక్రనీతి సమర్థిస్తుంది. అందువలన దుర్యోధనుడు తాను పాండవులపట్ల వ్యవహరించిన తీరుగాని, సంధిని కాదనటం కాని, రాజ్యభాగ మివ్వననటం గాని, యుద్ధంలో నిర్దయగా అభిమన్యు ప్రభృతులను చంపటం కాని, అధర్మపద్ధతులు కావు. ధర్మం తనదాకా వచ్చినప్పుడు అతడి ప్రమాణాలు వేరౌతాయి. దుర్యోధనుడు శ్రీకృష్ణుడిని భీమార్జునులను, ధర్మరాజును రణనియమాలను ఉల్లంఘించారని వాదించాడు. అందులో ఊరుభంగం నియమ విరుద్ధమనీ, పాండవులది అధర్మ విజయమనీ విమర్శించాడు. కృష్ణుడిపై మోపిన అభియోగా లివి-

సీ. 'కంసదాసుని పుత్త్ర! కానవు నీ దురా । చారంబుఁ గృపయు లజ్జయును లేక
ప్రేలెదు; నీవు సెప్పినఁ బార్థు చేసిన । నన్న గైకొని గదా సంగరంబు
పాడి దొఱంగి యప్పాపకర్ముఁడు వైచెఁ । గాక; చక్కటి తోడి కయ్య మైన
లీల మిమ్మందఱ నేలపాలుగఁ జేయ । నే; శిఖండి గడంగి యేసె ననఁగ

తే. నర్జునుఁడు శాంతనవుఁ గూల్చునట్లు చేసి; । తస్త్రగురుచాపునకుఁ బాండవాగ్రజన్మ
బొంకు మని పంచి; తరదంబు పుడమిఁ గ్రుంగఁ । గర్ణుఁ జంపించి; తేమనఁ గలదు నిన్ను?'

క. 'భూరిశ్రవుఁ డొక్కనితోఁ । బోరఁగ నేయించి తట్లు; పాడిచీఁకటి నం
హోరహితు సైంధవుని నరు । బారి పఱిచి; తిట్టి నీకుఁ బల్కులు సనునే!'

క. 'నను, భీష్ము, గురుని, సూతసు । తుని భూరిశ్రవు జయద్రథుం జక్కటి ద

ప్పని యనిఁ గోల్పుచ్చుఁగ వ । చ్చునె నీకుం? గపటశూర! సుచరితదూరా!'.**(శల్య. 2. 325 - 327)**

అతడి మాటలకు శ్రీకృష్ణుడు ఇచ్చిన సమాధానంలో రణనియమాలకు సంబంధించినవి కాక ధర్మనీతికి చెందిన అంశాలుండటం గమనార్హం. 'పాండునందనులు పుట్టినంతనుండి నేఁడు దుదిగా నీయెడ ధర్మవిరోధం బాచరింపరు; కురుబలంబునకు గుద్దలి గొని దూర్ద్యూతంబు నీవ తొడరితి; దాన నింతలు వుట్టె; బవనతనయుండు పట్టిన ప్రతిన యెఱుంగవె? గద నూరుభంగంబు సేయుదు నని పలికి పిడికిటం బొడుచునే? యవి యెల్లను వృథాజల్పంబు; లూరకుండు'. (శల్య. 2.328) మని మందలించాడు.

దుర్యోధనుడు శ్రీకృష్ణుడి ధర్మవాదానికి సూటిగా సమాధానం చెప్పలేదు. చెప్పలేడు కూడా. పాండవులపట్ల పగ సాధించటం అతడి కణికనీతి దృష్టిలో ధర్మమే. అందుకే అన్నాడు - 'నేను వేదాలు చదివాను, యజ్ఞాలు చేశాను, సంపదలు గడించి సామంతులు కొలువగా సంతోషించాను. దుర్మదాంధులైన శత్రువులను మర్దించాను. చివరకు మిత్రులతో బంధువులతో కలిసి స్వర్గానికి వెళ్ళుతున్నాను. ఇది ఒప్పదా?' అని అడిగాడు. కృష్ణుడి దృష్టిలో తాను ఎటువంటి వాడైనా, అతడిని యుద్ధనియమాలకు విరుద్ధంగా చంపినందుకు పాండవులు జీవితాంతం పశ్చాత్తాపంతో పరితపిస్తూనే ఉంటారని పలికాడు. అప్పుడు దేవతలు దుర్యోధనుడిమీద పూలవాన కురిపించారు.

దానిని దైవప్రశంసగా గ్రహించి ధర్మజాదులు తాము దుర్యోధనుడినీ, భీష్మాదులనూ చంపింది ధర్మవిరుద్ధమేమో అని దిగులు పడ్డారు. శ్రీకృష్ణుడు వారితో ఇట్లా అన్నాడు.

సీ. 'గాంగేయు గురుకర్ణ కౌరవపతులఁ జ । క్కటియనిఁ బరిమార్పఁ గాన మైతి
మని మీరు వగవకుఁ; డద్ధోర లుగ్రాస్త్ర వేదులు; ప్రస్ఫుట విక్రమమున
నడరి వారల గెల్చు టరిది గావున నేను । బహువిధోపాయముల్ వన్ని యిట్లు
దీర్చితిఁ గాక; యత్తీవ్ర పరాక్రము । లలఁతులఁ బోదురే? యట్లుఁ గాక

తే. వారి విధి యివ్విధమునఁ జావంగఁ జేసె; । దైవఘటనలు దప్పింప మీ వశంబె?
సురలు దనుజులు గెల్చిన చొప్పు లిట్ల; । సంతసపు సమయంబున వంత లేల?' **(శల్య. 2. 331)**

శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు ఉపశమన వాక్యాలుగా తోచినా అత డనుసరించిన ఉపాయాలను దేవతలు దనుజులను వధించటంలో పాటించిన బృహస్పతినీత్యుపాయాలుగా పేర్కొన్నాడు. అది దేవతలు మెచ్చే పద్ధతిగా సూచించాడు. అన్నిటికి మించి వారి వారి విధి వ్రాతలు తప్పించటం ఎవ్వరి తరం కాదు - అని ప్రకటించాడు. ఇంతటితో పాండవులలో ధర్మాధర్మ చర్చ ముగిసినట్లే.

అయితే ఈ చర్యను ముందుకు సాగించింది కౌరవపక్షంవారే. వారిలో బలమైన ప్రతినిధులు ఇద్దరు. ఒక అశ్వత్థామ. అతడికి తోడుగా నిలిచినవారు కృపకృతవర్మలు. రెండు: గాంధారి. ఆమె నంటి ఉన్నవాడు ధృతరాష్ట్రుడు. వీరికి ప్రతివాదులుగా నిలిచినవారు శ్రీకృష్ణుడు, వేదవ్యాసుడు. ముద్దాయిలుగా నిలిచి వినయవాక్యాలతో ఎదుటివారి ఎత్తులను చిత్తుచేసినవారు ధర్మజ భీమాదులు. అశ్వత్థామ మాటలకంటె మిన్నగా పగకు ప్రతిచర్యను నడిపి, పాండవులకు వగకలిగించి, వారి పగ తీర్చే చర్యలవలన తానూ వగచెంది శిరోమణిని పోగొట్టుకొని జీవచ్ఛవంగా నిలిచాడు. గాంధారి శ్రీకృష్ణుడిని శపించి ఆయనచేత నిష్ఠురా లాడించుకొని, పశ్చాత్తాపపడి పాండవులచేత తమకు అపరకర్మలు తప్పని తమ కర్మకు స్వయంకృతాపరాధాలే కారణమని తెలిసి, తెలివితో మౌనం పాటించింది. ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడి వ్యూహంలో చిక్కి ఇనుప భీముడి విగ్రహాన్ని కౌగిలించుకొని, దానిని విరుగగొట్టి తనలోని పగను పైకి ప్రకటించుకొని కుటిలుడుగా అపకీర్తిపాలయ్యాడు. శ్రీకృష్ణుడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మందలింపుతో మారుమాటాడకుండ ఉండిపోయాడు. అనగా, శల్యపర్వంలోని 'ఊరుభంగం' రేపిన దుమారం రెండు పర్వాల నిండా రేగి చివరకు మృతుల కిచ్చిన జలతర్పణాలతో అణగిపోయిందన్నమాట!

నన్నయ శల్యపర్వాన్ని 'నవ్యార్థరమణీయ' మని ప్రశంసించాడు.

ఆ. 'సభల విస్తరిల్లి శల్యాదికములైన । నాల్గు పర్వముల వినంగఁ జాలి
నవమ పర్వమనఁగ నవ్యార్థరమణీయ । మగుచు శల్యపర్వ మతిశయిల్లు'. **(ఆది. 1. 52)**

6. సౌప్తికపర్వ కథాసూత్రం:

సౌప్తికపర్వ కథానాయకుడు అశ్వత్థామ. పగను సాధించటంలో దుర్యోధనుడికి మానసిక ప్రతినిధి. అయితే, వారిద్దరి ప్రతీకారాలలో ప్రాధాన్య వివక్షలు వేరు. భీష్ముడిని చంపటానికి పగతో తపస్సుచేసి పుట్టాడు శిఖండి. ద్రోణుడిని చంపటానికి పగతో ద్రుపదుడు చేసిన యజ్ఞఫలంగా జన్మించాడు ధృష్టద్యుమ్నుడు. దుర్యోధనుడిలోని పగను పెంచి మహాగ్నిగా మార్చిన కర్ణుడు తనశాపాలకు తానే బలి అయ్యాడు. అతడి మృత్యువుకు అర్జునుడు హేతువయ్యాడు. దుర్యోధన దుశ్శాసనుల పగకు గురి అయిన భీముడు వారి చావుకు కారణమయ్యాడు. ఈ వీరుల మరణాలకూ బలమైన కారణాలున్నాయి. కాగా, అశ్వత్థామను ప్రతీకారశక్తిగా మార్చిన సన్నివేశాలు ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని చంపిన తీరు, దానిని వీరధర్మంగా చెప్పుకొంటున్న పాండవుల వైఖరి, దానిని సమర్థించిన శ్రీకృష్ణుడి వైనం.

యజ్ఞకుండంలో నుండి పుట్టిన ధృష్టద్యుమ్నుడు పాండవ సర్వసేనాధ్యక్షుడు అయ్యాడు. అంటే ద్రుపదుడి పగనుండి ద్రోణవధ కొరకే పుట్టిన వీరుడిని పాండవులు తమసేనాపతిగా అంగీకరించారన్నమాట! అతడు పరాక్రమాతిశయంతోనే, తపఃఫలంతోనో, మహాస్త్రసంపదతోనో ద్రోణాచార్యుడిని చంపుతాడని అందరూ ఆశించారు. కాని, నిజానికి ద్రోణుడిని చంపింది శ్రీకృష్ణుడి నీతిచాతుర్యం, ధర్మజుడి వాక్యచాతుర్యం. అశ్వత్థామ హతుడైనాడన్న వార్త ఆయనను యుద్ధవిముఖుడిని చేసింది. బ్రతుకుమీది ఆశను మాన్పింది. యోగంతో ప్రాణాలను త్యజించి జీవన్ముక్తావస్థను సాధించాడు ద్రోణుడు. అట్టి స్థితిలో జుట్టుపట్టి, తలపైకెత్తి, కత్తితో శిరస్సు నరికాడు ధృష్టద్యుమ్నుడు. అర్జునాదులు దానిని వారించినా ధృష్టద్యుమ్నుడు వినలేదు. చచ్చినపామును చంపిన వీరుడయ్యాడు పాండవసేనాపతి. ఆ సంగతి తెలిసిన అశ్వత్థామ అప్పుడే పగతీర్చుకొనటానికి విజృంభించాడు కాని, పాండవు లతని ఆట కట్టించటంతో ఆ ప్రయత్నం మానుకొన్నాడు. లేకపోతే తండ్రి తరువాత కొడుకే సైన్యాధ్యక్షు డయ్యేవాడేమో! కర్ణుడికి అగ్రతాంబూలం ఇవ్వటంతో అశ్వత్థామ వెనుకబడ్డాడు. కర్ణుడి తరువాత కూడా ఆతడే శల్యుడి పేరు చెప్పాడు. శల్యుడి తరువాత దుర్యోధను డెవరి పేరూ చెప్పలేని స్థితిలో ఉండటంచేత తాను చేయదలచుకొన్న ప్రతీకారానికి అవకాశం దొరకలేదు. అందువలన తనంతట తానే కౌరవసేనాపతిగా ఉండటానికి ప్రతిపాదించుకొన్నాడు. అతడు చంపదలచుకొన్న వారివరుసలో మొదటివాడు ధృష్టద్యుమ్నుడు. అతడిని పశువును చంపినట్లు చంపుతానని తన కసినంతా ఒలకపోశాడు. ద్రుపద సంతానంలో పురుషులు మొదట, ఆ తరువాత ఆతడి స్త్రీ సంతానమైన ద్రౌపదికి పుట్టిన సంతానం (ఉపపాండవులు) అతడి లక్ష్యం. ధృష్టద్యుమ్న సేనాపతిత్వాన్ని అంగీకరించిన పాండవులూ, పాండవసైన్యం,. ఏనుగులు, గుర్రాలూ - అందరూ వధార్హులే. యోగనిద్రలో ఉన్న ద్రోణుడిని చంపిన పాండవులందరూ నిద్రలో ఉండగా చంపదగిన వారే. ఇట్లా ఆలోచించిన అశ్వత్థామ అంతఃకరణానికి బహిఃప్రతీక గుడ్లగూబ. రాత్రివేళ సంచరించే ఆ పక్షికి కాకులగుంపును చంపటం ప్రతీకారచర్య కాదు, స్వాభావికచర్య మాత్రమే. పొగవంటి పగచీకటిలో ఉన్న అశ్వత్థామకు కూడా అది సహజ యుద్ధ చర్యగానే స్ఫురించింది. అతడికి తగిన రాజు దుర్యోధనుడు - ఆ క్రింది రాత్రి పాండవులు రాత్రివేళ దాడిచేస్తారేమో అనే భయంతో శిబిరంలో పడుకొనకుండా సరస్వతీ నదీతీరంలో బసచేశాడు. కాని, పాండవులు ఆ దుశ్చర్యకు పాల్పడలేదు. అశ్వత్థామ అటువంటి చర్యకే పూనుకొన్నాడు. దుర్యోధనుడి తొడలు విరుగగొట్టింది భీమసేనుడు కదా! మరి అశ్వత్థామ అతడిపై దండెత్తటానికి మొదట సంకల్పించలే దెందుకు? అసలు రహస్యం అది కాదు. రారాజు అనుమతిస్తే తనపగను సాధించుకొనాలని. దుర్యోధనుడు ప్రేరకుడు కాదు. నిమిత్తమాత్రుడైన కారకుడు. రాత్రి యుద్ధం ధర్మవిరుద్ధమని

కృపాచార్యుడు హితబోధ చేసినా, అతడు పగసాధింపు న్యాయానికే ప్రాధాన్యమిచ్చి, కృప కృతవర్మలను నిరుత్తరులను చేయగలిగాడు. పగతీర్చుకొనటంలో ధర్మచింత లేదనీ, పగతో పుట్టినవారి చావు పగతోనే ముగియటం కాలం ధర్మమనీ అశ్వత్థామ తన ప్రవర్తనతో ప్రతిష్ఠాపనం చేశాడు. ధృష్టద్యుమ్న శిఖండులను తాను చేతులారా చంపి సంతృప్తిని ప్రకటించాడు. ద్రౌపదికి పుట్టిన పాపానికి ఉపపాండవులకు ఉచితమైన శిక్ష వేశానని భావించాడు. ఆ విశేషాలను దుర్యోధనుడికి చెప్పి అతడి చేత భీష్మ ద్రోణ కర్ణాదులు చేయని ఘనకార్యం చేసినట్లు ప్రశంస లందుకొన్నాడు. తన పగకు ఫలంగా తన కేమౌతుం దని మొదట ఊహించలేదు. కాని, పాండవ శిబిరంలో పాండవులూ, శ్రీకృష్ణుడూ, సాత్యకీ కనబడకపోవటంతో పాండవ ప్రతీకారం తనకు అపాయం కలిగిస్తుందని శంకించాడు. చేసిన పాపం ధృతరాష్ట్రుడికి చెప్పి పితౄణాన్నీ ప్రభుఋణాన్నీ తీర్చుకొన్న తృప్తితో, వ్యాసాశ్రమానికి పోయి తాపసిగా వేషం మార్చి తపస్సు చేయటం మొదలుపెట్టాడు.

చమత్కార మేమంటే - దుర్యోధన విరోధి భీముడూ, కర్ణవిరోధి అర్జునుడూ, ద్రోణవధకు కారకుడైన ధర్మరాజూ, కౌరవులకే విరోధి అనిపించుకొనే శ్రీకృష్ణుడూ అతడు తాపసి వేషంలో దాగి ఉన్న తామసిక రూపాన్ని బయటపెట్టారు. ద్రుపదవంశానికి ఆడబడుచైన ద్రౌపది అశ్వత్థామను పరిభవించటానికి పగతోకూడిన పంతంపట్టి భీముడిని ప్రేరేపించి అతడిపైకి ఆగ్రహంతో పంపింది. శ్రీకృష్ణుడు మిగిలినవారి నందరినీ అతడికి తోడుగా తీసికొనివెళ్ళాడు. అనగా ప్రాణాలతో మిగిలిన పాండవ పక్షమంతా కలిసి అశ్వత్థామను అంతం చేయాలని పూనుకొన్నదన్నమాట! పగల ప్రతాపాలు ప్రచండంగా సంఘర్షణకు దిగాయి. కురుక్షేత్ర యుద్ధంలో ఇది చివరి ఘట్టం. అద్భుతానికే అద్భుతం. ఆ అద్భుత పురుషోత్తముడు శ్రీకృష్ణుడు. ఆయన కురుసభలో చేసిన ప్రకటనను అంతవరకు పరోక్షంగాను, ప్రత్యేకించి సౌప్తికపర్వంలో ప్రత్యక్షంగానూ ప్రపంచించి చూపించాడు.

ఉ. ‘సారపు ధర్మమున్ విమల సత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁబారిన దైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుఁ గాని ధర్మ ని
స్తారకమయ్యు సత్యశుభదాయక మయ్యును దైవ ముండెడున్’. **(ఉద్యో. 3.373)**

సర్వకాల సర్వావస్థలయందు నిత్యసత్యంగా నిలిచేది సారవంతమైన ధర్మం. ఆపద్ధర్మాలూ, అవాంతర ధర్మాలూ, అవసరానికి అనువైన అవస్థా ధర్మాలూ సారవంతాలు కావు. సాపేక్షాలు మాత్రమే. ధర్మానికి విజయం కలగటమే సారపుధర్మం. చిత్తశుద్ధితో కూడిన సత్యం విమలసత్యం. ధర్మలక్షితమైన త్రికరణశుద్ధి విమలసత్యం. యుద్ధంలో ధర్మవిజయానికి కృషిచేస్తూ కార్యసాధనకు ఆపద్ధర్మంవంటి దానిని ఆశ్రయించినా చిత్తశుద్ధీ లక్ష్యశుద్ధీ దానిని కలుషితం కాకుండా రక్షిస్తాయి. ఒకవేళ దానికి పాపం, అసత్యం అడ్డుపడి ఆపదలు కలిగిస్తే, ఫలవంతం కాకుండా చేస్తే ఆ సమయంలో ఎవరు ఉపేక్ష చేసినా వారికి చేటు తప్పదు. సమర్థుల ఉపేక్షవలన కార్యం చెడిపోయే అవస్థ ఏర్పడినప్పుడు దైవమే పూనుకొని ధర్మాన్ని రక్షించి, సత్యశుభదాయకమైన ఫలాన్ని అందిస్తాడు. ఈ ప్రకటన అక్షరాలా సత్యమయింది సౌప్తికపర్వంలో.

కౌరవులకు ఎప్పుడూ అపకారం చేయని పాండవుల వర్తనం సారవంతమైన ధర్మం. తమకు న్యాయంగా రావలసిన రాజ్యభాగంకంటె మరొక్కటి అడగకుండా ఉండటం, సంధికి రాయబారం పంపటం, కౌరవుల దుర్నీతికి ఫలంగా మరొకమార్గం లేక యుద్ధం చేయటం విమల సత్యానికి సాక్ష్యాలు. భీష్మపతనం నుండి శల్యపతనం వరకు విజ్ఞులు సంధిచేసికొమ్మని ఎన్నిసార్లు ప్రబోధించినా దుర్యోధనుడు వినక పాపచింతతో పాండవులను చంపి వారిరాజ్యాన్ని శాశ్వతంగా అనుభవించాలని భావించటం మహాపాపం. దీనిని శ్రీకృష్ణుడే పెక్కుసార్లు ప్రస్తావించి దుర్యోధనాదులను నిందించటం ఈ పర్వంలో గమనిస్తాం. ఈ పర్వంలో ధృతరాష్ట్రుడు పెద్ద బొంకు. అతడి మనసులో ఒకటి, మాటలో మరొకటి, చేతలో మరొకటి. అతడు దుర్యోధనుడి దుష్ప్రవర్తనను మాన్పలేక, తాను మారలేక, పరిస్థితులను చక్కదిద్దలేక, ప్రారంభమైన యుద్ధాన్ని ఆపలేక కథను శుభాంతం చేసే శక్తిని కోల్పోయాడు. గాంధారి తన కొడుకును సరిదిద్దుకొనలేక పాపమంతా కృష్ణుడిమీద పెట్టి వాస్తవాన్ని బొంకుగా వక్రీకరించింది. వీరందరికి ప్రతినిధిగా అశ్వత్థామ లోకాన్ని అపాండవం చేయాలని ఆగ్రహించి నరహోమ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శిశుహోమాలు చేశాడు. వీరందరూ సారవు ధర్మాన్నీ, విమల సత్యాన్నీ తమకు తోచిన రీతిలో యథాశక్తి చెడబారేటట్లు చేశారు. శ్రీకృష్ణు డొక్కడే వాటిని సత్యశుభదాయకాలుగా నిర్వహించి, సారవు ధర్మాన్నీ, విమలసత్యాన్నీ సంరక్షించాడు. అందుకే శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడైన సర్వేశ్వరుడని సౌప్తికపర్వం నిర్ద్వంద్వంగా నిరూపించింది.

పాండవ స్కంధావారాన్ని శ్మశానంగా మార్చి, పాండవ ప్రతీకారానికి భయపడి, పాండవులకు పరమపూజ్యుడయిన వ్యాసమహర్షి ఆశ్రమ సమీపంలో నిలిచి, శరీరాన్నంతా బూడిద పూతతో నింపి, పాండవులు గౌరవించే మునివేషంలో తపస్సు చేస్తున్నట్లు నటించాడు అశ్వత్థామ. చేసిన పాపాన్ని, బొంకుతో కప్పిపుచ్చుకొనటానికి యత్నించాడు. పాండవు లాతడి కపట ప్రవృత్తిని సత్యంగా భావించి క్షమిస్తారేమో అని భావించాడు. కాని, భీముడు అతడి బండారాన్ని బైటపెట్టాడు. పరుషంగా మందలించి యుద్ధానికి పిలిచాడు.

తే. ‘ఓరి! ధాత్రీసురాధమ! క్రూరకర్మ! కపట ధార్మిక! యత్యంత కల్మషాభి
యుక్తిఁ బోయినరేయి మహోగ్రవృత్తిఁ । దగిలి; తెంత వేగిరమునఁ దపసి వైతి?’

వ. ‘ఇట్టు లొదిగినఁ జూపు దప్పునే? లేలెమ్ము! తపమ్ము సాలు; రణమ్మునకు రమ్ము’ **(సౌప్తి. 2.59,60)**

భీము డుపయోగించిన సంబుద్ధులు సౌప్తికపర్వంలోని అశ్వత్థామ శీలచిత్రణకు పనికివచ్చే సార్థక విశేషణాలు. వాటిని విన్న అశ్వత్థామ తాను చేసిన మహాపాపాన్ని స్మరించి లోలోన కలత చెందాడు. కాని, పరితాపాన్ని ప్రకటించటానికి సిద్ధపడలేదు. ఆ క్షణంలో కూడా ప్రతీకారాన్నే ఎన్నుకొన్నాడు. అసాధ్యమైన బ్రహ్మశిరోనామక మహాస్త్రాన్ని పైకి తీసి ‘దీనివలన అపాండవమగుగాక!’ అని సంకల్పించి ప్రయోగించాడు. దానికి ప్రతీకారం చేయకపోతే పాండవులు దగ్ధమౌతారు. శ్రీకృష్ణుడు తాను పూనుకొని అర్జునుడిచేత బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని దానిపై ప్రయోగింపచేశాడు. ఉభయాస్త్రాలూ ఉజ్జ్వలంగా సంఘర్షించాయి. లోకాలు తల్లడిల్లాయి.

అప్పుడు నారదుడూ, వ్యాసుడూ కలిసి వచ్చి ఆ వీరుల నడుమ నిలిచి, మానవులమీద ప్రయోగించరాని ఆ అస్త్రాలను ప్రయోగించటం దోషమని ప్రబోధించి, ఉపసంహరించుకొనండని హితవు చెప్పారు. అర్జునుడు గురుభక్తి ప్రకాశించగా పారాశర్యుడి మాట ననుసరించి ఉపసంహరించుకొన్నాడు. ఒకసారి ప్రయోగించి ఉపసంహరించుకొన్నవారికి కీడు కలుగుతుందనే నియమమున్నా వ్యాసుడి కృపవలన అర్జునుడికి ఏ అపాయమూ కలుగలేదు. అశ్వత్థామ ఆత్మనిగ్రహాన్ని కోల్పోవటంచేత అస్త్రాన్ని ఉపసంహరించుకొనలేకపోగా, విచారిస్తూనే ఇట్లా అన్నాడు:

చ. ‘పరిభవజాతరోషమునఁ బ్రాణభయంబునఁ జేసి యిమ్మహా
శరము వివేకవర్జిత విచారుఁడనై యిటు లేసితిన్; మునీ
శ్వర! ఇది పాండుభూపసుతవర్గము నంతటి నేర్చుఁ గాని యె
ప్పరుసున మాన; దివ్విధము పాపమ యేనియు దాని కోర్చితిన్’. **(సౌప్తి. 2. 75)**

అన్నాడు. తపస్సు చేస్తున్నవాడికి పగ పనికిరాదని చెప్పి, పాండవులు అతడి ప్రాణాలు తీయకుండా ఉండాలంటే శిరోమణి నర్పించుమని వ్యాసుడు హితవు చెప్పాడు. శిరోరత్నం ధరించినవారికి నాగభయం, దొంగల భయం, దానవభయం, దేవభయం కలుగవు. ఆకలి, దప్పిక, నిద్ర రోగభయాలు ఉండవు. అట్టి రత్నాన్ని ఇవ్వటానికి మొదట అంగీకరించకపోగా, అతడి అస్త్రం ‘పాండవేయ రాగపాత్ర గర్భమాలకు హాని కలిగించి శాంతి పొందుతుం’దని చెప్పాడు. ‘అపాండవ మౌతుం’దన్న మాటకు ప్రత్యామ్నాయ మిది. అందులో ‘ఒక దాని కాసపడబోకు’ మని వ్యాసుడు కోరాడు. అతడు దానికి అంగీకరించలేదు. అప్పుడు శ్రీకృష్ణుడు అడ్డుతగిలి అభిమన్యుడి తేజం ఉత్తరగర్భంలో పెరుగుతున్నదనీ దానిని రక్షించుమనీ కోరాడు. అది పాండవ పక్షపాతంతో అడుగుతున్న కోరికగా పేర్కొని శ్రీకృష్ణుడి మాటను అశ్వత్థామ తిరస్కరించాడు. దానితో శ్రీకృష్ణుడిలోని దివ్యత్వం జాగృతమై ఆ బిడ్డను తానే రక్షిస్తాననీ’ అతడు వంశకరు డౌతాడనీ ప్రకటించటం జరిగింది. ఆ మాట వెంటనే అమలు జరిగింది. ఉత్తరగర్భం నిలిచింది. ‘అస్త్రాగ్ని దగ్ధుడైన వాడిని రక్షించటం మేలేకదా!’ అని అవహేళన చేశాడు అశ్వత్థామ. సకల గర్భాలపై అస్త్ర ప్రయోగం చేశాడు.

బాలఘాతి అయిన అశ్వత్థామ ఆహారం లేక, సహాయం లేక, దుర్గంధంతో కూడిన రక్తంతో శరీరం కుళ్ళిపోతూండగా మూడువేలేళ్ళు తిరుగుతూ కృపాచార్యుడిచేత విలువిద్య నేర్చిన పరీక్షిత్తునూ, అతడి కొడుకు జనమేజయుడినీ చూడగలడని శ్రీకృష్ణుడు శపించాడు. వేదవ్యాసుడు కూడా ఆ శాపాన్ని ధ్రువీకరించాడు. శిరోమణిని పాండవుల కిప్పించాడు.

తే. బ్రాహ్మణుఁడవయ్యు నిట్లు క్రూరతకు రోయ । కస్మదీయ వాక్యంబుల నాదరంబు
సేయ కీపాపకర్మంబు సేసినాఁడ; । వచ్యుతుఁడు పల్కినట్టుల యగుము నీవు'. **(సౌప్తి. 2.87)**

అశ్వత్థామ వేదవ్యాసుడిని కూడ వదలలేదు. ఆ మహర్షిని మానవుల మధ్య వసించి ఉండేటట్లు ప్రతిశాపం ఇచ్చాడు. అతడి పగకు పారాశరుడైనా పరమాత్ముడైన ఒక్కటే! అపాండవంగా అంతం కావలసిన ధర్మచరితం ఉద్ధరించబడింది. విమలసత్యం బొంకుచేత, పాపంచేత చెడబారకుండా శ్రీకృష్ణుడు కథానిర్వహణం చేసి ధర్మాన్నీ, సత్యాన్నీ, శుభాన్నీ కలిగించి దైవమనిపించుకొన్నాడు. వంశాంకురాన్ని రక్షించి చంద్రవంశాన్ని ఆచంద్రతారార్కం ఉండేటట్లు చేశాడు.

సౌప్తికపర్వంలో సంహారశక్తి అశ్వత్థామ. అతడు మహేశ్వర శక్తి ప్రభావంతో సంహారం చేశాడు. ఇక సంరక్షణ శక్తి శ్రీకృష్ణుడు. భక్త రక్షణ కళాపారీణుడై ప్రకాశించాడు. శివకేశవులు రేయుంబవళ్ళవలె రాణించిన పర్వం సౌప్తికపర్వం.

అందుకే నన్నయ సౌప్తికపర్వం ప్రతిభా పూర్ణమని కీర్తించాడు.

క. 'నుత సౌప్తికాది పర్వ । త్రితయంబునఁ దనరి వసుమతీసురవర స
మ్మతమై సౌప్తికపర్వము । ప్రతిభ వినం బొలుచు దశమపర్వం బనఁగన్'. **(ఆది. 1. 54)**

7. స్త్రీపర్వం సార్థకనామం:

శల్య సౌప్తికపర్వాలవలెనే స్త్రీపర్వం కూడా రెండాశ్వాసాలలో నిర్మించబడింది. ఇందులో ప్రధానపాత్రలు గాంధారీ ధృతరాష్ట్రులు. వీరిద్దరూ పుత్రులనూ, బంధువులనూ, పౌత్రులనూ, మిత్రులనూ కోల్పోయి రెక్కలు తెగిన పక్షులవలె, కొమ్మలు విగిరిన చెట్లవలె మిగిలిపోయారు. ఆ దంపతులు కురుక్షేత్ర యుద్ధానంతరం వ్యవహరించిన తీరు ఈ పర్వంలో ప్రధానవస్తువు. పుత్రుల మరణవార్త ధృతరాష్ట్రుడికి అపారదుఃఖాన్ని కలిగించింది. గాంధారికి దుఃఖాన్ని మించిన కోపాన్ని పెంచింది. వారిరువురిని శాంతింపజేయటం ప్రథమాశ్వాసంలోని వస్తువు. విదురుడూ, కృష్ణద్వైపాయనుడూ ధృతరాష్ట్రుడి దుఃఖాన్ని శమింపచేసే బోధను చేశారు. కృపాచార్యుడూ, వ్యాసుడూ గాంధారి దుఃఖాన్నీ, కోపాన్నీ చల్లార్చటానికి యత్నించారు. శ్రీకృష్ణుడు, ధర్మరాజు, భీముడు మొదలైన పాండవులు నిపుణంగా వ్యవహరించి ఆ దంపతులకు దుఃఖకోపాపశమనం చేసి ప్రశాంత వాతావరణాన్ని కల్పించగలిగారు.

పురుషుడైన ధృతరాష్ట్రుడికంటె స్త్రీ అయిన గాంధారి పాత్ర ఈ పర్వంలో విశిష్టస్థానాన్ని పొందింది. రణరంగంలో అసువులు కోల్పోయిన వీరుల భార్యలందరూ శోకమూర్తులై వారివారి ఆత్మీయుల శవాలను దర్శించి తమ కన్నీటి తర్పణాలను అర్పించటానికి యుద్ధభూమికి బయలుదేరారు. వారందరికీ గాంధారి నాయకురాలుగా ముందు సాగింది. సంతతినంతా కోల్పోయి భర్తతో మిగిలిన హస్తినాపుర మహారాజ్ఞి ఆమె ఒక్కతే. ఆమె శాపానుగ్రహశక్తియుక్తురాలైన పతివ్రత. ఆమె మిగిలిన స్త్రీలను ఓదార్చగలదా? ఆ విషాదానికి కారణం ఎవరని ఆమె వారికి నిరూపించి చెప్పగలుగుతుంది? పాండవులా? కౌరవులా? ధృతరాష్ట్రుడా? చివరకు తానా? లేక జగన్నాటక సూత్రధారి శ్రీకృష్ణుడా? - ఎవరీ విపత్తుకు కారణం? అన్న ప్రశ్న స్త్రీలకందరికీ సంబంధించింది. వారందరి మనోభావాలకు మణిదర్పణమే స్త్రీపర్వం.

పాండవులు ధృతరాష్ట్రుడిని చూచి జాలిపడతారు; గాంధారిని చూచి భయపడతారు. ఆ రాజు పుట్టుగ్రుడ్డి. ఆమె కన్నులకు గంత కట్టుకొన్న ఇల్లాలు. శ్రీకృష్ణుడు కురుసభలో విశ్వరూపాన్ని ప్రదర్శించినప్పుడు దానిని చూడగలగటానికి ధృతరాష్ట్రుడికి దివ్యదృష్టిని ప్రసాదించాడు. ఆ తరువాత దృష్టిని ప్రసాదిస్తానన్నా పరమాత్మదర్శనం చేసిన దృష్టితో లోకాన్ని చూడనని దృష్టిని ఉపసంహరించుమని ధృతరాష్ట్రుడు కోరుకొన్నాడు. యుద్ధారంభంలో వేదవ్యాసుడు రణరంగంలో జరిగే

సన్నివేశాల నన్నింటిని దర్శించగలిగే దివ్యదృష్టి నిస్తానన్నాడు. కాని, కుమారులు ప్రదర్శించే ఆ క్రూరకర్మలను చూడలేనని గ్రుడ్డిరాజు దానిని స్వీకరించలేదు. సంజయుడికి వ్యాసు డా దృష్టి నిచ్చి జరిగిన వృత్తాంతాన్ని రాజుకు వినిపించే సౌకర్యాన్ని కలిగించాడు. దుర్యోధనుడి పతనంతో అతడి దివ్యదృష్టికూడా ఆగిపోయింది. ధృతరాష్ట్రుడు పూర్వంవలెనే గ్రుడ్డిరాజుగానే మిగిలిపోయాడు. ఇతరుల సహాయంతో బ్రతికే ఇబ్బందిలో పడ్డాడు. అయినా, అతడికి ఆత్మజ్ఞానం కలగలేదు.

గాంధారి చరిత్రం స్త్రీపర్వంలో విచిత్రం. ఆమె ఎంత శోకమూర్తియో అంతకంటె మించిన క్రోధమూర్తి. కొడుకులలో ఒక్కడిని కూడా మిగల్చకుండ చంపిన పాండవులంటే ఆమెకు మంట! కడుపుకోతకంటె ఆ మంట అధికంగా బాధకలిగించింది. చనిపోయిన కొడుకులను, మనుమళ్ళను, బంధువులను కన్నారా చూచుకొని కన్నీరు కార్చాలని ఆమె కోరుకొన్నది. వ్యాసు డామె అంతరంగాన్ని గుర్తించి దివ్యదృష్టి నిచ్చాడు. కళ్ళకు గంతలున్నా బయటి ప్రపంచం స్పష్టంగా కనపడసాగింది. ద్వితీయాశ్వాసమంతా ఆమె చేసింది శవాల దర్శనమే. విన్నది - ఆ శవాలపై బడి విలపించే స్త్రీల ఆర్తనాదాలే. ఆమె వాటిని చూచి, విని తానూ స్పందించి శోకించింది. అయితే వాటిని మూగగా అనుభవించటమా? ఎవరికైనా చెప్పుకొనటమా? అన్న ప్రశ్న వచ్చింది. ఇతరులతో పంచుకొన్నప్పుడే బాధ తగ్గుతుంది కాబట్టి శ్రోతగా ఆమె భర్త అయిన ధృతరాష్ట్రుడిని కాక శ్రీకృష్ణుడిని ఎన్నుకొన్నది. ఆయన ఆమె చెప్పినదంతా సాక్షిగా విన్నాడు. చివర కామెకు తోచిన సత్యమేమిటంటే- ఈ కౌరవ వినాశనానికంతా శ్రీకృష్ణుడే మూలకారణమని. దుఃఖంనుండి కోపం విజృంభించింది. అంతఃకలహాలతో యాదవులు నశిస్తారనీ, వారి భార్యలు కౌరవ వనితలవలెనే రోదిస్తారనీ, శ్రీకృష్ణుడు నిస్సహాయుడై చంపబడతాడనీ ఆమె శ్రీకృష్ణుడిని శపించింది. శ్రీకృష్ణ డామెను మందలించి, ఆ సర్వనాశనానికి కారణం ధృతరాష్ట్ర గాంధారుల లోభ గుణమేనని తేల్చి చెప్పి, వారికి పాండవులే దిక్కని చూపించి, దుఃఖ క్రోధాల పొంగును తగ్గించి, బంధువుల పరలోక క్రియలకు పూనుకొనేటట్లు చేశాడు.

మరొక విచిత్ర మేమంటే - స్త్రీపర్వం ముగిసేసరికి కొడుకులను సరిదిద్దుకొనలేక ఒక తల్లి (గాంధారి) నూరుగురు కొడుకులను పోగొట్టుకొన్నది. కన్నెప్రాయంలోనే తాను కన్న పెద్దకొడుకును చివరివరకు ప్రకటించలేక మరొకతల్లి (కుంతి) ఆతడిని స్వార్థానికి బలిచేసింది. ఇద్దరు మహారాజ్ఞులు చేసిన నిర్వాహకమే కురుకులనాశనానికీ, అంతఃపుర వనితల రోదనానికీ, వీరపత్నుల వేదనలకూ మూలకారణమని శ్రీకృష్ణుడు సాక్షిగా ప్రదర్శించే విధిరూప విశ్వదర్శనమే స్త్రీ పర్వం. గ్రుడ్డివారికి కూడా కనపడే దివ్యసత్యం ఇది.

గాంధారివంటి వీరమాతలకు, భానుమతివంటి వీరపత్నులకు శ్రీకృష్ణ డిచ్చిన ఈ శాంతి సందేశం స్త్రీపర్వానికి భరతవాక్యం వంటిది.

సీ. 'వినుము గాంధారి! నీ తనయుండు చేయు । దుర్నయము లెఱుంగవే? నాకు నీకు
శాంతనవునకు నాచార్యునకును బాహ్లి । కునకుఁ దండ్రికి మాన్పఁ గొలఁది గాని
దుర్మానమున నట్లు దొడరి యిట్లయ్యె; మీ । యపరాధమున వచ్చినట్టి కీడు
నకు నింత నొవ్వంగ ననుఁ బల్కఁ దగునె? యు । మ్మలికంబు ధృతిఁ బట్టి మాన్పు మింకఁ;

తే. జేటునకుఁ జావునకు వగఁ జెందు జనుల । కినుమడింపదె మానసమున నలంత?
రాచకూతుండ్రు సుతుల సంగ్రామ నిరత । హృదయు లగువారిఁ గాంచఁ గోరుదుర కాదె'.

(స్త్రీ. 2.167)

8. మూడు రసాల ముచ్చట:

శల్యపర్వంలో భయానక రసం సున్నితంగా పోషించబడింది. భయం కలిగించేవారు మూడు రకాలు. 1. ఆకృతి భీషణులు; 2. క్రియా భీషణులు; 3. మాహాత్మ్య భీషణులు. రాక్షసులు, పిశాచాలు మొదలైనవారు ఆకృతి భీషణులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వీరభద్రుడు, పరశురాముడు మొదలైనవారు క్రియా భీషణులు. శ్రీకృష్ణుడు మొదలైన దివ్యులు మాహాత్మ్య భీషణులు. భయం ఒకటే అయినా హేతువులనుబట్టి మూడు విధాలయింది. భయాన్ని అనుభవించేవారు కూడా త్రిగుణ ప్రధానులుగా ఉంటారు. సహజభయం రజస్తమ ప్రవృత్తులలోనూ, సత్త్వసముత్థమైన భయం సాత్త్వికులలోనూ గోచరిస్తుంది. శల్యపర్వంలో ధర్మజుడు సాత్త్వికుడు; దుర్యోధనుడు రాజసికుడు. వీరిద్దరికి కలిగింది మరణభయమే. భయాలన్నింటిలో మరణభయం గొప్పది. స్థాయిభావంగా అభివృద్ధి చెందగలిగింది. సాత్త్వికుడైన ధర్మరాజు శల్యుడిని సంహరిస్తానని ప్రతిజ్ఞచేసినా శ్రీకృష్ణుడి ఆశీస్సులుంటే తప్ప గెలవటం సాధ్యం కాదనే భయం ఆయనకు లోలోన ఉన్నది. ఇంగితజ్ఞుడైన కృష్ణుడు -

క. 'గాంగేయుని గుంభజుఁ గ । ర్ణుం గడచిత; మింక నుద్ధురుం డగు మద్రే
శుం గూల్పు; మంతతోడఁ దె । గుం గురుపతి పని; జయంబు గొనుము గడంకన్' **(శల్య. 1. 94)**

అని ధర్మరాజును ప్రోత్సహించాడు. యుద్ధంలో శల్యుడు ప్రచండంగా పోరాడినా రెండు మూడుసార్లు మూర్ఛపోయాడు. జయాభిలాషతో పాటు అపజయభయాన్ని కూడా అతడు దుర్యోధనుడికి కలిగించాడు. ధర్మరాజు తన శక్తినంతా వినియోగించి పోరాడినా మూడుసార్లు మూర్ఛపోయి, అపజయం పాలౌతానని భయపడ్డాడు. మూడుసార్లు దైవాన్ని స్మరించిన సన్నివేశం వెనుక గమనించాం. విశేషమేమంటే భయానకరసానికి దైవం కాలుడు, వర్ణం కృష్ణం. ధర్మరాజు చేసిన హరిహరాత్మకమైన స్తుతి భయానక రసాన్ని వ్యంగ్యంగా సూచించింది. ధర్మరాజుకు భయకారకుడు శల్యుడు. అతడు క్రియాభీషణుడు. శల్యుడు ధర్మరాజుపరాక్రమాన్ని చూచి భయపడ్డట్లు లేదు. నాయకుడైన ధర్మజుడే భయభావానికి పాత్రం కావటం రసవిశేషం.

శల్యపతనానంతరం దుర్యోధనుడిపై యుద్ధ భారం పడింది. ఆ పరిస్థితిలో రాజే స్వయంగా యుద్ధంచేసి ఆదర్శవంతుడు కావాలన్న శకుని సూచనతో యుద్ధాన్ని సాహసంతో సాగించాడు. భీముడు గదతో 21వేల మంది వీరులను ఏనుగులనూ అడవిని కూల్చినట్లు మట్టుపెట్టాడు. అర్జునుడు అశ్వాలనూ, రథాలనూ పడగొట్టాడు. ధృష్టద్యుమ్న సాత్యకులు సాల్వుడిని కడతేర్చారు. కృతవర్మ విరథుడయ్యాడు. ఉలూకుడూ, శకునీ అశ్వయుద్ధంలో నకుల సహదేవుల చేతులలో హతులయ్యారు. దుర్యోధనుడి తమ్ముడు సుదర్శనుడు చనిపోయాడు. దుర్యోధనుడు తనచుట్టూ నిలిచిపోరాడేవారు లేక, ఎదుట పాండవులు హర్షోత్సాహాలతో విజృంభించటం చూచి సహించలేక, ఒంటరిగా దొరికితే తనను పాండవులందరూ కలిసి చంపుతారనే భయంతో రణం నుండి తొలగి, రక్షణకొరకు ద్వైపాయనహ్రదంలో దాగుకొన్నాడు. ధర్మజుడు దుర్యోధనుడి భయాన్ని పేర్కొని అధిక్షేపించాడు.

మ. 'భయముం బాయఁగఁ ద్రోచి వీరగుణముం బాటించి సంగ్రామ ని
శ్చయబుద్ధిం దలకొల్పి పౌరుషము మైఁ జా వొండె గెల్పొండెఁ గా
క యధీరత్వము నాకు నీడె? యని వీఁకం బేర్చి వే తాఁకు; మెం
తయుఁ బేరయ్యెడు రమ్ము! లె! మ్మొదిఁగినం దైన్యంబు వచ్చుం జుమీ!' **(శల్య. 2. 61)**

ఇందులో తిక్కన భయభావం వలన కలిగే అనుభవాదులను పేర్కొని వాటిని దాటి యుద్ధవీరాన్ని ప్రకటించుమని ధర్మజుడు ప్రబోధించినట్లు రసవ్యంజకమైన రచన చేశాడు. 'నరుఁడు ప్రాణభయంబుఁ బొరయుట యరుదు' అని దుర్యోధనుడు తన స్థితిని సమర్థించుకొన్నాడు. కొలనునుండి బయటకు వస్తే పాండవులందరు కలిసి ఒక్కుమ్మడిగా పైబడి చంపుతారేమో నన్న భయం అతడిని మొదట పీడించింది. భయం ఆ ఉద్ధతుడిచేత పేదమాటలు మాట్లాడింపజేసింది. మచ్చుకు -

సీ. 'మీ రేవురును బరివార బాంధవ మిత్ర । సహితుల, రఖిలాస్త్ర శస్త్రవంతు
లరు, కరిస్యందన తురగ సమేతుల; । రే నొకరుండ, విహీన సహచ
రత్వంబు విగతాయుధత్వంబు వాహన । హీనత నొందితి; నే విధమున

నని యొనర్పఁగ వచ్చు? నది గాక పోటుల । డస్సితిఁ గడు; మీకు డప్పి లేదు;

తే. వరుసఁ దగ నొక్కఁ డొక్కఁడ వచ్చి పోరు । డిపుడ వెడలి మిమ్మందఱ నెల్ల చెలులఁ
జుట్టముల రూపుమాపెదఁ; జుట్టుముట్టి । పలువు రొక్కనితోఁ బోరఁ బాడి యగునె?'(శల్య. 2. 84)

'పలువురు కూడి ఒక్కడిని చుట్టుముట్టి చంపటం' అనే క్రూరనీతి కౌరవులే అభిమన్యు వధలో ప్రయోగించారు. పాండవులు దాని కెప్పుడు ఎట్లా తిప్పికొట్టి ప్రతీకారం చేస్తారో అని దుర్యోధనుడి హృదయంలో పెనుభూతంవలె భయం బెదిరిస్తూనే ఉన్నది. అతడికి అభయం ఇచ్చే దైవం లేక నేలకూలాడు.

శల్యపర్వంలో నాయక ప్రతినాయకు లిరువురూ భయాభావంచేత ఆవరించబడి వ్యవహరించటం వలన వారి నాశ్రయించిన అంగరసంగా భయానకం భాసించింది.

సౌప్తికపర్వం బీభత్సరస ప్రధానం. ఈ పర్వానికి నాయకుడు అశ్వత్థామ. అర్ధరాత్రివేళ గుడ్లగూబ చెట్టుకొమ్మలపై నిద్రిస్తున్న కాకులను చంపిన దృశ్యాన్ని చూచాడు.

ఉ. 'కొన్నిటి కంఠముల్ నులుపుఁ, గొన్నిటి కాళులు ద్రుంచు, నుగ్రతం
గొన్నిటి పక్షముల్ నఱకుఁ, గొన్నిటి పొట్టలు వ్రచ్చు లీలమైఁ,
గొన్నిటి నప్పళించుకొని కోలెముకల్ నుఱుమాడు; నిట్టుల
య్యన్నిటి నయ్యులూకము రయం బెసఁగన్ వధియించె భూవరా!' (సౌప్తి. 1.18)

ఈ దృశ్యం చూచిన అశ్వత్థామకు జుగుప్స కలగాలి. జుగుప్స సామాన్యంగా వైరాగ్య ప్రేరకం కావచ్చును. లేదా రౌద్రప్రేరకం కావచ్చును. అశ్వత్థామకు రౌద్రోద్రేక హేతువయింది. తానుకూడ పాండవ శిబిరంమీద పడి పగరను దారుణంగా చంపి భయానక బీభత్సాలను సృష్టించాలనే ఉత్సాహం కలిగింది. బీభత్సకారకుడైన అశ్వత్థామకు ఆ రసాధిదేవత అయిన మహాకాలుడైన శివుడు ప్రత్యక్షమయ్యాడు. అతడు అఖిలభూత భయంకరుడు. అతడి రూపం ఉగ్రంగానూ, సుందరంగానూ, ఉజ్జ్వలంగానూ, భీషణంగానూ ఉన్నది. అశ్వత్థామ ప్రయోగించిన ఆయుధాలన్నీ ఆ భూతనాథుడిపట్ల వమ్మయి పోయాయి. చివరికి అశ్వత్థామ ఆత్మోపహార మిచ్చే వీరకృత్యానికి పూనుకొన్నాడు. అతడి తెగువకు మెచ్చి శివుడు తాను నారాయణాత్మకుడైన మహాకాలుడ నని తెలియచెప్పుకొని, పాంచాలురకు కాలం చెల్లిందని పేర్కొని, ఒక మహనీయ ఖడ్గాన్ని ప్రసాదించాడు.

అశ్వత్థామ అసలే రౌద్రరసమూర్తి. దానికి తోడు మహాకాలుడి ఖడ్గంతో భయానక రూపం తాల్చాడు. రౌద్రభయానకాలు జనక రసాలు. వాటివలన కరుణ బీభత్సరసాలు జనిస్తాయి. రౌద్రరసం శత్రుసంహార రూప రౌద్రకర్మగా అశ్వత్థామ నాశ్రయించింది. వీరుల కది భయానకంగా పరిఢవిల్లింది. చూచేవారిలో, వినేవారిలో, ఆ దృశ్యాన్ని చదివేవారిలో అది భయానక రసంగానూ, కరుణ రసంగానూ పరిణమించింది. పీనుగులను తింటూ విచ్చలవిడినాట్యం చేసే పిశాచాలను చూస్తే జుగుప్స కలుగుతుంది. ఒక్కొక్క అవస్థకు ఒక్కొక్క ఉదాహరణం.

1. అశ్వత్థామ చేసిన ధృష్టద్యుమ్న సంహారం అతిభయంకరం. మచ్చుకు -

చ. 'వివశత భీతిఁ బొంది కడు విహ్వలుఁడై తనుఁ జూడ ద్రోణ సం
భవుఁడు వెసన్ శరాసనము వాపి గుణంబు తదీయకంఠముం
దవులఁగఁ జేర్చి వాగురవిధం బొడఁగూర్చి మనంబు విక్రమో
త్సవమున నుబ్బఁగాఁ బశువుఁ జంపెడు చాడ్పునఁ జంపువేడుకన్'. (సౌప్తి. 1. 152)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

2. చూచేవారికి కరుణరస కారకం.

తే. 'పీనుఁగై యున్న పాంచాల సూనుఁ జూచి । రక్షకులును దదీయపురంధ్రులును స
మగ్రశోకాంధకార నిమగ్నచిత్త । వృత్తులై యేడ్చి రెలుఁగులు విన్ను ముట్ట'. **(సౌప్తి. 1. 163)**

3. అశ్వత్థామ సలిపిన సంహార క్రీడలు భయంకరాలే కాక బీభత్స కారకాలు కూడా.

శా. 'కాలాకారతఁ బేర్చి దోర్లసిత ఖడ్గస్ఫార సాంద్రప్రభా
జాలం బొప్పఁగ నిట్లు సొచ్చి లఘుసంచారంబు శోభిల్లఁ బాం
చాల వ్రాతముఁ గ్రీడమైఁ దునిమె రక్షశ్శ్రేణి మాంసంబుఁ గీ
లాలంబుం గబళించి త్రావి మదలీలాలోలతం గ్రాలఁగన్'. **(సౌప్తిక. 1-171)**

4. దానవగణం చేసే రక్తపానాదులు జుగుప్సాకరాలు.

వ. 'ఇవ్విధంబున వివిధ వికారాననంబులు బహుభంగిక కరపాదంబులు గలుగు నపరిమిత క్రవ్యాదులు
గవిసి మేదోమాంస మస్తిష్క మజ్జంబు లానుచుం, జవియైనవానిఁ బుత్రమిత్ర కళాత్రాదుల కొసంగుచు,
నన్యకోటి బెరసినయెడఁ ద్రోద్రోపులాడి, యవియుఁ గైకొనుచుం గీలాల పానంబున మత్తిల్లి నృత్యంబులు
సేయుచు మఱియు ననేక ప్రకారంబుల విహారంబు సలుపుచు నుల్లసిల్లిరి'..... **(సౌప్తి. 1. 202)**

అశ్వత్థామ పగతో నిర్వహించిన రౌద్రకర్మ వలన పాండవులలో కరుణరసం ఉద్భవించింది. కరుణనుండి ద్రౌపదిలో మరల రౌద్ర ముదయించింది. భీముడిలో ఆ రౌద్రం రూపం తాల్చింది. అర్జున శ్రీకృష్ణాదులలో అది అతిశయించింది. అశ్వత్థామపై ఆ క్రోధం విజృంభించింది. పాండవ క్రోధం అశ్వత్థామకు తాపకారకమయింది. అతడి ప్రతీకార వాంఛ పాండవులకు భయంకర శాపంగా పరిణమించింది. శ్రీకృష్ణుడే లేకపోతే కథ అపాండవంగా ముగిసేది. అశ్వత్థామ చివరకు వాసనకొట్టే శరీరంతో, అన్నపానాలు లేక, ఏకాకిగా, మూడువేల ఏళ్ళు తిరుగుతూ ఉండవలసి వచ్చింది. అతడి స్థితిని గమనిస్తే ఆకృతి కట్టిన బీభత్సం వలె భాసించాడు. బీభత్సాన్ని సృష్టించి తానే బీభత్సంగా మారిన అశ్వత్థామ పగవలన పతితుడైన బ్రాహ్మణుడు.

నన్నయ స్త్రీపర్వాన్ని సుకవులు, పండితులు సభలలో మెచ్చుకొంటారనీ, అది 'కృపాయితమై' (కృపాయుతమై) ఉంటుందని పేర్కొన్నాడు. అయితే 'కృప' దయారసమైనా కావాలి, లేదా కరుణరసమైనా కావాలి. స్త్రీపర్వం కరుణరస ప్రధానమని జగద్విదితం.

క. పర్వుచు స్త్రీపర్వాదిక । పర్వంబుల నేనిటం గృపాయితమై స్త్రీ
పర్వంబు పదునొకండగు । పర్వము నా వెలయు సుకవిపండిత సభలన్.' **(ఆది. 1.56)**

తిక్కన స్త్రీపర్వాన్ని కరుణరస సంభరితంగా సంతరించాడు. కరుణానికి స్థాయిభావం శోకం. ఆత్మీయుల మరణం వలన ఏర్పడిన శోకం రసస్థాయికి చేరుతుంది. శోకం ఉత్తమ మధ్యమాధమ పాత్రలలో వేరువేరుగా వ్యక్తమౌతుంది. ఉత్తమ మధ్యములో పరగతం అనీ, ఆత్మగతమనీ రెండేసి విధాలుగా గోచరిస్తుంది. పరులను ఆశ్రయించిన విభావాలచేత శోకం కలగటం పరగతం. స్వాశ్రయా (ఆత్మగతా)లైన విభావాలచేత ఉత్పన్నమయ్యేది ఆత్మగతం. స్త్రీ పురుషులలో శోకం సమానమే అయినా స్త్రీలలో సుస్వరంగా రోదించటం, మోహం చెందటం, పరివేదనం, విలపించటం, ఆయాసపడటం, గుండెలు బాదుకొనటం వంటి చేష్టలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. స్త్రీల వాచకాభినయంలో హాహాకారాలూ, రోదనలూ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆక్రోశాలూ, ప్రలాపాలూ, దీర్ఘభాషణలూ, దూరాహ్వానాలూ, ఆక్రందనలూ ఉంటాయి. గుణ కథనంతో కూడిన రోదనం విలాపం. గద్గదకంఠంతో గుణాఖ్యానంతో కూడిన రోదనం పరిదేవితం. బిగ్గరగా ఏడ్వటం ఆక్రందనం. ఇట్లా కరుణరస పోషణం కావ్యనాటకాలలో ప్రసిద్ధం. విశేష మేమంటే అలంకార శాస్త్రంలో ఎన్నిరకాల శోకాభినయ విశేషా లున్నాయో దాదాపు వాటికన్నిటికీ తిక్కన రచించిన స్త్రీపర్వం సరసోదాహరణ కావ్యంగా ఉండటం అపూర్వం.

స్త్రీపర్వంలో గాంధారి స్వయంగా దుర్యోధన దుశ్శాసనాదులైన కుమారులను, శకునివంటి బంధువులను తానే స్వయంగా దర్శించి, స్పర్శించి దుఃఖించింది. అది స్వాశ్రయ శోకం. కోడళ్ళు, వీరుల భార్యలు ఆయా వీరుల శవాలను చూస్తూ విలపించినవన్నీ తాను విని స్పందించి శ్రీకృష్ణుడికి చెప్పింది. దీనిని పరగత శోకం అనవచ్చును. స్త్రీల రోదనలలో సుస్వర విన్యాసాలు విశేష వృత్తాలలో ధ్వనించాయి. శవాల దీనస్థితి చూస్తే శత్రువుకు కూడా గుండె తరుక్కొనిపోతుంది. రణభూమిని స్వయంగా చూచిన అనుభవమున్న తిక్కన గాంధారి దృష్టితోచూచి వర్ణించినదంతా సహజంగా సమకూరింది. ఇనుమును బంగారం చేసే రసవిద్య తిక్కనది. జుగుప్సాకరమైన శిథిల శవాలపై వారి జీవన స్మృతుల చిత్రాలను చిత్రించి, స్త్రీ విలాపాలతో ఫ్రేములు కట్టి భావుకుల మనఃఫలకాల మీద తగిలించాడు.

మచ్చుకు కొన్ని:

1. గాంధారి దుర్యోధనుడి శవాన్ని చూచి శోకాతిశయంతో మూర్ఛపోయి, కాసేపటికి తెప్పరిల్లి పరిచారికలు తనను తీసికొనిపోగా కుమారుడి దరిచేరింది.

తరల. 'విపుల వక్షముమీఁద నశ్రులు వెల్లిగొల్పుచు వ్రాలి యో
నృపతి కుంజర! కౌరవేశ్వర! నేల నిమ్మెయి నీ యుదా
త్తపు శరీరముఁ బొందఁ బాడియె? తల్లి వచ్చిన భక్తితో
నుపచరింపక లాఁతివై యిటు లూరకుండుట యుక్తమే?' **(స్త్రీ. 2. 27)**

అని విలపించింది. తల్లి వస్తే ఎదురువచ్చి ప్రీతితో మాట్లాడి ఉపచరించే సన్నివేశం రణరంగంలో పడి ఉన్న అతడి శరీరాన్ని చూచినప్పుడు జ్ఞాపకం రావటం సహజం. కరుణరసభరితం. తరలమంటే చంచలం, తరంగితం, కంపితం అని అర్థం. ఏడుమాత్రల ఆవృత్తితో నడిచే తరలం మత్తకోకిలవలె రాగరంజితం. శృంగార కరుణాది రసాలలో సస్వర విన్యాసం దీనిలో బాగా రాణిస్తుంది.

తిక్కన తరలవృత్తాన్ని అయిదు సార్లు స్త్రీ పర్వంలోనే వాడాడు. ఆ అయిదింటినీ స్వాశ్రయశోక వర్ణనలోనే వినియోగించి ప్రధాన స్త్రీ పురుష పాత్రలు ఆత్మీయులైన ప్రముఖులను గురించి విలపించినట్లుగా రచించటం ఛందోరసశిల్పం. ఒక్కొక్క పద్యంలో ఒక్కొక్క శోకభంగిమ. ధృతరాష్ట్రుడు శోకచింతాభారంతో మాటాడలేక స్తంభమనే భావముద్రను వహించి ఉన్న స్థితి 1.4వ పద్యంలో చిత్రించాడు. గాంధారి దుర్యోధనుడిని చూచి విలపించినట్లుగానే దుశ్శాసనుడి శవాన్ని చూచికూడా తరలవృత్తంలో విలపిస్తుంది. దుర్యోధన దుశ్శాసనుల భార్యల విలాపం కంటె తిక్కన గాంధారి శోకానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చాడు. వారు కథలో అనామకలుగా ఉండటం దానికి కారణం కావచ్చును.

గాంధారి తరువాత కర్ణుడిని గూర్చి కుంతి చేసిన విలాపం కూడా తరలవృత్తం కావటం విశేషం (2.174). ఈ రెండింటికంటె తిక్కన మరొక ఔచిత్యాన్ని కూడా పాటించాడు. అభిమన్యుడిని గురించి ఉత్తర విలపించిన తరలవృత్తం (2.79) కరుణరసార్ద్రం. తల్లులు కొడుకులను గూర్చి పలికినవి విలాపాలు కావటం, భార్య భర్తను గురించి పలికినది పరిదేవితం కావటం మరొక విశేషం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

2. సైంధవుడి భార్య దుస్సల గాంధారి కూతురు. ఆమె తన భర్త తల తెగి ఎక్కడ పడ్డదో కనుగొనలేక వెర్రిగా అటూ ఇటూ తిరుగుతున్నదట! దుఃఖాతిశయంలో అది ఒక దుర్భరావస్థ. కరుణ రసాలంబనంగా ఉన్న ఆ కూతురును చూచి గాంధారి స్పందించిన తీరు మనస్సును ద్రవింపచేస్తుంది.

తే. 'హృదయమున వగలేని యట్టిట్టు నట్టుఁ । దిరుగుచున్నది దుస్సల వరుని శిరము
గాన; కీ కూఁతు నిమ్మెయిఁ గనుటకంటె । దలఁప నెక్కుడు దుఃఖంబు గలదె కృష్ణ!' (స్త్రీ. 2.97)

3. తమ్ముడైన శకుని శవాన్ని చూచి గాంధారి బోరున దుఃఖించలేదు. ఆయన తన కొడుకులకు చేసిన కానరాని కీడును స్మరిస్తూ వేడిగా నిట్టూర్చింది.

మత్తకోకిల. 'వార లస్త్రహతాంగులై యనవద్య లోకముఁ గాంచి; రీ
వైరకర్తయు నట్లు గాంచెను; వారి నల్ప విచారులం
బోరి కెత్తెడునట్లుగాఁ దగఁ బొంది వెఱ్ఱులఁ జేసె నీ
క్రూరుఁ; డందును నన్నదమ్ములకున్ విరోధము సేయఁడే!' (స్త్రీ. 2.139)

4. శరతల్పగతుడై ఉత్తరాయణ పుణ్యకాలం కొరకు ప్రాణాలు ఉగ్గబట్టి శయనించి ఉన్న భీష్ముడిని దర్శించి దుఃఖించటానికి మారుగా కంటె భక్తితో నమస్కరించింది గాంధారి. భక్తిగౌరవ ప్రదమైన శోక ప్రదర్శన మది.

క. 'దేవుఁడు గా కితఁడు నరుఁడు । నా వచ్చునె! నిష్ఠ పెంపునం బ్రాణంబుల్
తా వలసినపుడు విడువం । గా వేడుక నునిచినాఁడు గాదె తనువునన్'. (స్త్రీ. 2.118)

5.ద్రోణాచార్యుల శవాన్ని చూచి మర్యాద పూర్వకంగా కంటతడిపెట్టింది గాంధారి. కౌరవుల ఆశల కన్నింటికీ ఆలంబనమైన ద్రోణుడు శిష్యుల నమస్సులందుకొనే పూజ్యపాదుడు. అతడి పాదాలను నక్కలు తిన్న వైఖరిని గమనించి నిట్టూర్చింది.

తోటకము.'సతతంబును శిష్యులు సద్వినయా । న్వితులై ప్రణమిల్లెడు వీరపద
ద్వితయంబు గడుం జెడఁ దిన్నవి సూ । చితె నక్కలు దైవము చెయ్దిఁ గటా!' (స్త్రీ. 2.122)

6.గాంధారి స్త్రీల విలాపాలలో విపంచినాదాలు విన్నది. శోకంలో నుండి రాగమయ శోకా లుద్భవిస్తాయని శ్రీకృష్ణుడికి (శ్రోతకు) వినిపించింది ఉత్సాహవృత్తంలో.

ఉత్సాహ. 'మానినీ జనంబు సేరి మగధనాథుఁ డగు జయ
త్సేను చుట్టు నేడ్వ నధిక దీన నాదములకు నా
మానసంబు సాంద్ర కరుణమయతఁ బొందె; మోహనం
బైన యట్టి యేడ్పు లెందు నంబుజాక్ష! వింటివే!' (స్త్రీ. 2. 143)

కవిత్రయ మహాభారతంలో నన్నయ నాలుగు, ఎఱ్ఱన రెండు, తిక్కన ఏడు ఉత్సాహ వృత్తాలను రచించారు. ముగ్గురిలో ఎక్కువ వ్రాసిన తిక్కన వాటినన్నింటినీ స్త్రీపర్వంలోనే వాడాడు. అందులోనూ ఏడింట నాలుగు గాంధారి నోట పలికించాడు. వరుసగా బాహ్లిక, సైంధవ, జయత్సేన, సుకేతనుల శవాలను చూచి విలపించిన వాక్యాలను వాటిల్లో నినదింపజేశాడు.

పై పద్యాన్ని వ్యాఖ్యానిస్తూ కీ.శే. డా॥ పాటిబండ మాధవశర్మగారు ఇట్లా అన్నారు. "జయత్సేనుడి చుట్టుఁ జేరి విలపించు నాతని భార్యల దీననాదములు వినుచు గాంధారి తన యప్పటి చిత్తవృత్తిని తానే యొక యుత్సాహవృత్తమున

వర్ణించుచున్నది. తిక్కన రససిద్ధాంత గర్భిత మీ పద్యము. ప్రసాదమాధుర్య గుణములకు నిధియైన ఈ పద్యము గాంధారి తత్కాల కరుణరస పారవశ్యమును చక్కగా వ్యక్తము చేయుచున్నది. మోహనములైన జయత్సేన పత్నుల రోదననాదములు గాంధారీ హృదయమునఁ బ్రతిధ్వనించి యామె వాక్యమందలి వర్ణవిన్యాసమునఁ బ్రత్యక్షమై శ్రోతకు పరమాహ్లాదము ప్రసాదించుచున్నవి. ఈ వృత్తమందలి యక్షరములలో సగము వఱకు అనునాసికములు, బిందుపూర్వక సరళములు నగుట గమనించ వచ్చును." (ఆంధ్ర మహాభారతము: ఛందశ్శిల్పము - పుట. 364).

తిక్కన మహాకవిత్వ శిల్ప సౌందర్యంలో శల్యసౌప్తిక స్త్రీపర్వాలు రసోల్లాసాన్ని రాగరంజితంగా రంగరించుకొన్నాయి.

9. తిక్కన రచనా శిల్పం:

తిక్కనది ప్రధానంగా వర్ణనాత్మక ధోరణి, నాటకీయ ఫణితి. జడపదార్థాలలో చైతన్య స్ఫూర్తిని ప్రదర్శించటం, ప్రకృతిని కథాసన్నివేశానికీ, పాత్రల మనః ప్రవృత్తులకూ అనుగుణంగా ప్రకరణోచితంగా వర్ణించటం, బీభత్సాది పరుష రసాలకు రమణీయ స్వభావాన్ని కల్పించి రసాస్వాదన శక్తిని పెంచటం, నిత్యజీవితం నుండి ఉపమాద్యలంకారాలను ఎన్నుకొని వర్ణనలు నిర్మించి ఆంధ్రావళి మోద మొందేటట్లు చిత్రించటం వంటి శిల్ప విశేషాలు ఏ పర్వంలోనైనా సామాన్యంగా గోచరిస్తాయి. ఈ పర్వత్రయంలో ప్రతిఫలించిన కొన్ని శిల్పాలను మచ్చుకు గమనిద్దాం.

(1). సూర్యోదయ వర్ణనం:

శల్యపర్వారంభంలో యుద్ధం ప్రారంభం కాకపూర్వం సూర్యోదయమైనట్లు మూడు పద్యాలలో వర్ణించి ప్రకృతికీ, కాలానికీ, కథకూ ఉన్న సంబంధాన్ని కళాత్మకంగా ఆవిష్కరించిన శిల్పం తిక్కనకు వెన్నతో పెట్టిన విద్య.

ఉ. 'ఒండొరులన్ జయించు మతి నుద్భట లీలలఁ జాల నొప్పి య
ప్పాండవ కౌరవుల్ పెనఁగుభంగిఁ గనుంగొను నొక్కొ యీ
తండు మహాద్రి నెక్కె ననఁ దద్దయుఁ జెన్నగు బింబకాంతి న
ర్కుం డభిరాముఁడై పొడపుఁగొండ పయిన్ వెలుఁగొందెఁ జూడఁగన్'.

చ. 'అరసి యనాగతం బెఱుఁగునట్టి మనంబులు గల్గు పాండు భూ
వరసుత బంధుమిత్ర కురువర్గ సుహృజ్జనకోటు లత్తఱిం
బొరసె నతిప్రమోదమును భూరి విషాదము నాఁగ నంబుజో
త్కరము వికాసమయ్యెఁ, గుముదంబులు మీలన మొందె నెంతయున్'.

సీ. కుంజర నికురుంబకుంభస్థలీ సంగ । సిందూర రుచులతోఁ జెలిమి చేసి,
కేతన వ్రాత సంకీలిత మాణిక్య । రశ్ముల గెడ విహారంబు సలిపి,
సైనిక నికర వక్షఃస్థల పరిలిప్త । కాశ్మీర దీప్తులఁ గౌఁగిలించి,
దండనాథోత్కర చండభావోద్వృత్త । చక్షుః ప్రభలుఁ దారు సరసమాడి,

తే. యంశుజాలంబు లుభయ సైన్యంబులందుఁ । బరఁగి బహువిధ శస్త్రాస్త్ర కిరణతతుల
బెరసి ప్రాగ్భాగలక్ష్మి దీపించి మెఱయ । బాల్యరమణీయుఁ డగు చిత్రభానుఁ డొప్పె'. **(శల్య. 1.114-116)**

కావ్యంలో ఉండే అష్టాదశవర్ణనలలో ఒకటిగా భావిస్తే ఈ సూర్యోదయ వర్ణనం కవి ప్రతిభకు ప్రతీకగా భావించవచ్చును. తాత్పర్యం మూడు ముక్కలలో చెప్పాలంటే - సూర్యుడు తూర్పుకొండమీద ఉదయించాడు. పద్మాలు వికసించాయి, కలువలు ముకుళించాయి. సూర్యకిరణాలు చతురంగబలాలపై పడి ఆయా సైన్యాభరణాలపై ప్రతిఫలించి తూర్పుదిక్కనే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లక్ష్మికి వెలుగు తోరణా లందించాయి. యుద్ధప్రారంభానికి సమయం ఆసన్నమయింది అనే కాల సూచనగా వర్ణనం జరిగింది.

తిక్కన దీనిని అలంకృతం చేశాడు. మొదటి పద్యంలో ఉత్ప్రేక్ష ఉన్నది. జడమైన సూర్యబింబాన్ని అభిరాముడిగా చెప్పి దానియందు చేతనత్వాన్ని ఆరోపించాడు. ఆ రోజు చివరిరోజు కాబోతున్న దన్న కాలసూచనను చేస్తూ ఆ వీరుడు ఉభయసేనల యుద్ధం చూడాలన్న ఆసక్తితో తూర్పుకొండపై కెక్కి విహంగవీక్షణంచేయాలని సంకల్పించాడో అన్నట్లు కనపడుతున్నాడట! సూర్యుడు కాలానికి కాని నారాయణుడికి గాని ప్రతీక కావచ్చును. కాలపురుషుడుగానూ నారాయణుడుగానూ శల్యవధ ధర్మరాజు నిర్వహించి విజయానికి బాటవేస్తాడని నిర్దేశించాడు. ఆ ఫలితాన్ని సూచించే వస్తు నిర్దేశంగా దీనిని అన్వయించవచ్చును. అప్పు డీపద్యం నాటి యుద్ధపర్వానికి నాందీవాక్యమౌతుంది. ఉత్ప్రేక్ష ఊహయే కాబట్టి వేచి చూడవలసిందే - అని భావం.

మొదటి పద్యం 'చూడఁగన్' అనే క్రియతో ముగిసి రెండవ పద్యం 'అరసి' అన్న క్వార్థక క్రియతో మొదలౌతుంది. పైకి చూస్తే అది సూర్యోదయమే. కాని, దాని ప్రభావాన్ని పరిశీలించి చూస్తే మరొక ఉత్ప్రేక్ష భాసిస్తుంది. పాండవ బంధుమిత్రులు, కౌరవబంధుమిత్రులు సూర్యోదయాన్ని చూచి బాగా ఆలోచించి క్రమాలంకారాన్ని ఆశ్రయించి ఒక వర్గం అత్యంతానందాన్ని పొందిందా? మరొక వర్గం భూరివిషాదాన్ని పొందిందా? అని ఊహించగలిగేటట్లుగా పద్మాలు వికసించాయట! కలువలు ముకుళించాయట! ఉభయ పక్షవీరులూ భవిష్యత్కాల ఫలాలను తెలిసికొనగల్గిన మనీషులట! అందువలన ప్రకృతి వివేకాన్నిబట్టి భవిష్యత్తును భావించగలిగారని భావం. అలంకారధ్వనితో పాండవులకు కలుగబోయే విజయం, కౌరవులకు రాబోయే విషాదం రెండవ పద్యంలో ధ్వనించింది.

నాంది మూడు శ్లోకాలలో ఉండటం ఒక పరిపాటి. తెలుగులో తిక్కన ఆ పరిపాటిని పద్యాలలోకి మార్చాడు. మూడవ పద్యంలో కూడా కర్త సూర్యుడే. అయితే అందులో చిత్రభానుడు, చిత్రాః భానవో యస్య సః చిత్రభానుః నానావర్ణాలైన కిరణాలు కలవాడు చిత్రభానుడు. అతడు బాల్య రమణీయుడు. చిన్నవయసులో ఉన్న అందగాడు. ప్రౌఢుడు, ప్రచండుడు కాడు; ఉభయభానుడు. కాబట్టి అతడు క్రీడాప్రియుడు. బాల్యస్నేహితుడు, అతడికి రంగులన్నా రంగుల కాంతులన్నా ఇష్టం. వాటితో తన చేతులు కలిపి ఆడుకొంటాడు. చిత్రభానుడి కరాలు (కిరణాలనే చేతులు) సహజంగా అరుణారుణ కాంతులు కలవి. ఏనుగుల కుంభస్థలాలపై సిందూరం కనపడితే ఆ వర్ణ కాంతులతో ముందుగా స్నేహం చేసికొని తన కిరణాల వన్నెను పెంచుకొన్నాడు. తరువాత టెక్కాలపై కట్టబడిన మాణిక్యాల కాంతితో కలిసి చేతులల్లారుస్తూ విహారం చేశాడు. సైనికుల వక్షఃస్థలాలపై పూసిన కాశ్మీర వర్ణకాంతులను తన చేతులతో కౌగిలించుకొన్నాడు. కోపోద్రిక్తులైన దండనాథుల చూపులలోని ఎర్రని కాంతులతో సరసమాడాడట! చిత్రభానుడి విచిత్రవర్ణ కరాలు (కిరణాలనే చేతులు) శస్త్రాస్త్ర కిరణతతులతో కలిసి ప్రాగ్దిశాలక్ష్మిని మెప్పించి మెరిసిపోయాయట! అంటే సూర్యకిరణాలు సైన్యంమీద పడి కాంతులు ప్రతిఫలించి వెలగటం చేత తూర్పుదిక్కున మరింత ప్రకాశింపచేశాయని భావం. శ్లేషప్రాణిత రూపకం వలన సూర్యకరప్రభావం ధ్వనిమయం అయింది. పాండవవర్గంలోని సైన్యం సంతోషాన్ని పొందుతుందనీ, కౌరవవర్గసైన్యం విషాదం పొందవచ్చుననీ భావికథార్థ సూచన ఏర్పడింది. జడవస్తువుల మీద చైతన్యపాత్రారోపణం చేయటమే కాకుండ, సాలంకృత వర్ణనతో ధ్వనిమయంగా కథావస్తువును సూచించే నాందీ శ్లోకమర్యాదను కూడా తిక్కన పాటించి శిల్పత్రివేణిని కల్పించాడు.

(2). యుద్ధవర్ణనం

తిక్కన యుద్ధవర్ణనలతో భయానక బీభత్స రససన్నివేశాలను సైతం ఆస్వాద మధురంగా మార్చే రామణీయకమంత్రం ప్రయోగించి ఇనుమును బంగారం చేస్తాడు. శల్యపర్వంలో పోరు ఘోరంగా మొదలయింది. అది దొమ్మియుద్ధం. రక్తం ఏరులవలె పారినట్లు, అందులో వీరులు విహారాలు చేసినట్లూ అలంకరించి వర్ణించి భయానక బీభత్సాలలో రమణీయ దృశ్యం కల్పించాడు. ఇది గొప్పకాల్పనిక భావన! భావిప్రబంధ వర్ణనలకు మార్గదర్శి.

సీ. 'నెత్తుటఁ దోఁగియు నిగిడిపోరెడు వీరు । లలరిన నడమోదుగుల విధంబు,
గ్రక్కునఁ దెగిపడి కదలెడు బాహు దం । డములు మహాభుజంగముల పగిది,
యవని రక్తాక్తంబులై యున్న యట్టిబల్ । దలలు గెందామర కొలని పగిది,
దఱచుగా నెఱిదప్ప నొఱగిన గజములు । గులిశ భగ్నాచల కులమునట్లు,

తె. దునిసి తొఱఁగిన జోదుల తొడలు సామ । జముల కరములు నొండొంటి చందములు గ
నుంగొనఁగ వింత లగుటను సంగరాంగ । ణంబు రమణీయమును భీషణంబు నయ్యె'.

తె. 'ఏమి చెప్పుదు రౌద్రంపు టెసకమందుఁ । దఱచు మెదళులు ఱొంపులు నుఱుములైన
యెమ్ముు లిసుకయు సితచామరమ్ముు లంచ । లయ్యె రుధిరంపు టేఱుల కప్పు డధిప!'

క. 'విను మయ్యేఱులలో వా । హనములె యోడలుగఁ జూడ నక్కజ మగు ను
క్కున నుద్దామ విహారం । బొనరించిరి వీరయోధు లుర్వీనాథా!' **(శల్య. 1. 129-131)**

ఇటువంటి వర్ణనలు సందర్భోచితంగా పర్వమంతా పరచి కథను రక్తికట్టించాడు తిక్కన.

(3). ప్రతిపద సార్థక్యం

క. 'పలపలని మూఁకలోఁ గా । ల్నిలువక గుఱ్ఱంబు డిగ్గి నీ కొడుకు గదా
కలితభుజుం డయి యొక్కఁడుఁ । దొలఁగి చనియె; నేమి చెప్పుదుం గురునాథా!' **(శల్య. 1. 401)**

“ఈ పద్యమును గూర్చి యొక రసవంతమైన ఇతిహాసము కలదు. భారతరచనమున వేదవ్యాసునకు గణనాథుడు వలె తిక్కనగారికి గురునాథు డనువాడు లేఖకుడుగా నుండెనట! అతడు తిక్కనగారి వలె కొమ్మనగారి రక్తము పంచుకొని పుట్టిన కుమ్మరియట! గురునాథుని గంటము నిలిచినచో తిక్కనకంఠము నిలువదు అని ఆ యన్నదమ్ములు సమయము చేసికొనిరట! తిక్కనగా రీపద్యము చెప్పుచు 'తొలఁగి చనియె' అన్నచోట వాక్యము ముగిసియు పద్యము ముగియనందున, వ్యర్థ పదములతో పూరింప మనసు రాక, ఏమియు తోచక 'ఏమి చెప్పుదుం గురునాథా!' అని పలికిరట! గురునాథు డామాటను వ్రాసెనట! పద్యము పూర్తికాక గురునాథుని గంటము నిలిచిన దని భ్రమించి తిక్కనగారు తన కంఠము నుత్తరించుకొనబోయిరట! గురునాథు డాయనను వారించి గంటము నిలువకుండనే పద్యము పూర్తి యైనదని చెప్పి పై పద్యము కడముట్ట చదివెనట!. గురునాథుని ఉద్దేశించి తాను పలికిన వాక్యము ధృతరాష్ట్రు నుద్దేశించి సంజయుడు పలికినట్లు పద్యమున చక్కగా అతికినందులకు తిక్కనగారు మిగుల ఆశ్చర్య పడిరట! ఈ ఇతిహాసమున సత్యముమాట యెట్టున్నను సరసత్వము నిండుగా నున్నది. ఈ యైతిహ్యము లేనిచో ఈ చిన్నపద్యము నెవరు గుర్తింతురు? గుర్తింపనిచో ఇందలి సుందర శిల్పమంతయు అడవిగాచిన వెన్నెలయే కదా!

“పదునెనిమిదవనాటి అపరాహ్ణమున కౌరవ పక్ష స్థితి యెట్లున్నదో సంజయుడు ధృతరాష్ట్రునికి జెప్పుచున్నాడు. పదునొకండు అక్షౌహిణుల పరిమితిగల సేనయంతయు నశించినది. మహావీరులు, వీరభటులు, రథగజతురగదళములు నశించినవి. అల్పమైన కాల్బలము మిగిలినది. అప్పుడు దుర్యోధనుడు - పలపలని మూకలో - పలుచగా రణరంగములో కాల్నిలువక - 'కాలు' నిలుచునుగాని 'కాల్' నిలువదు. ప్రాణము లేని లకారము ప్రక్కకు క్రుంగదీయగా ఒరిగిపోవును. కాల్ నిలువక - గుఱ్ఱంబు డిగ్గి - యుద్ధారంభమున అతిరథుడైన దుర్యోధనుడు రథారూఢుడు; రథదళము నశింపగా భద్రగజారూఢుడు; గజదళము నశింపగా భద్రాశ్వరూఢుడు; అదియు నశింపగా అశ్వారూఢుడు. ఆ యశ్వము గుఱ్ఱము - తట్టు దానినుండి దిగినాడు. దిగుటకాదు. గుభాలున ఉరుకుట. డిగి గదాకలితభుజు డయినాడు. అతని బలగమంతయు నశించినది. మిగిలినది గదాబలము, భుజబలము. ఆ రెండింటిని కూడగట్టుకొనినాడు. ఒక్కఁడు - ఒంటరి - సోదరమిత్ర

బంధు వర్గమంతయు నశించినది. తొలఁగిచనియె - పారిపోయెనని చెప్పుటకు సంజయునకు బుద్ధిపుట్టలేదు. ఎంతటి వైభవముతో వెలిగిన రాజరాజు దుర్యోధనుడు ఎంతటి హీనదశకు వచ్చినాడు? దుర్యోధనుని శోచనీయావస్థను వర్ణించుటకు సంజయునికి మాటలు దొరకలేదు. ఏమి చెప్పుదున్ కురునాథా! - అని వాపోయినాడు. నిందయంతయు ధృతరాష్ట్రుని నెత్తిన మోపుచున్నట్లు 'నీ కొడుకు' అన్నాడు. నీ యవివేకము వలన ఇట్టి స్థితికి వచ్చినవాడు. నూర్గురు సోదరులకు మొట్టమొదటివాడయ్యు, అందరు చావగా చిట్టచివరకు మిగిలినవాడు దుర్యోధనుడు. అప్పటి స్థితిలో రాజరాజు కాడు. కేవలం ధృతరాష్ట్రుడి కొడుకు. పద్యమున ప్రతిపదము, అక్షరము పనితనము మెరపించుచున్నది. తిక్కనగారు భారతమును ఆశువుగా చెప్పినారని ఐతిహ్యము చెప్పుచున్నది. తిక్కనగారు ఆశువుగా చెప్పినను ప్రత్యక్షరము శిల్పరమణీయముగా చెప్పిరని ఈ పద్యము చాటుచున్నది.'' (డా॥ పాటిబండ మాధవశర్మ : తిక్కన కవితావైభవము: యువభారతి ప్రచురణ, 1974).

(4). మానవ స్వభావ వ్యంజకమైన సన్నివేశ చిత్రణం:

అశ్వత్థామ రౌద్రోద్రేకంలో ఉన్మాదావస్థను ప్రదర్శించాడు సౌప్తికపర్వంలో. ధృష్టద్యుమ్నుడిని పశువును చంపిన విధంగా చంపితేకాని కోపం పోదనీ, ఉత్తమాస్త్రాలతో చంపననీ కృప, కృతవర్మలతో స్పష్టంగా చెప్పాడు. పాండవ స్కంధావారంలో పాన్పున గాఢనిద్రలో ఉన్న ధృష్టద్యుమ్నుడిని తలపట్టుకొని, పెడమరల దిగిచి,

ఉ. 'నేలపయిం బడం దిగిచి నిష్ఠురభంగి నురఃస్థలంబు మో
కాల నొగిల్చి యేపున మొగం బతిదారుణ ముష్టి నొంచె; ని
ద్రాలసవృత్తి నంగములయందు బలంబును బుద్ధినేర్పునుం
జాలని యవ్విరోధి వివశత్వముఁ బొందఁగఁజేసె ద్రేల్మిడిన్'. **(సౌప్తి. 1.150)**

ఉ. 'కాలను గేలనుం జదిపి గంధకరిం దెగటార్చు సింహముం
బోలుచుఁ బేర్చి యా ద్రుపదభూపసుతున్ సమయించె వేదనన్
ఱోలఁగ, రోఁజఁగాఁ బలుమఱుం బొరలంబడి లాలఁ గ్రక్క న
వ్వాలుమగండు వాక్పరిభవంబుఁ దలంచుచుఁ గ్రౌర్యధుర్యుఁడై'. **(సౌప్తి. 1.158)**

తన తండ్రిని చంపిన ధృష్టద్యుమ్నుడిని నిర్దయగా చంపి, అంతటితో ఆగక, ద్రుపదపుత్రులనూ పాంచాల దేశ వీరులనూ వరుసగా వధించాడు. అతడు సంహరించేటప్పుడు ఆయావీరుల తత్కాలావస్థలను తిక్కన అత్యంత సహజంగా చిత్రించాడు.

శా. 'నిద్రాసక్తునిఁ, గొంత మేల్కనినవానిన్, సుప్రబుద్ధాత్ముఁడై
యుద్రేకంబును శౌర్యసారమును బాహూల్లాసముం జూపఁ జం
చ ద్రేఖం దిరమైనవానిఁ దను నుత్సాహోగ్రతం దాఁకి యు
న్నిద్రస్వైర సముద్ధతిన్ మెఱయువానిం దున్మె నేకాకృతిన్.' **(సౌప్తి. 1. 173)**

అంతటితో ఆగలేదు అతడి క్రౌర్యం. గజతురగాది బలాలను కూడా బలిగొన్నది. ఆనాటి రాత్రి గుడ్లగూబ కాకులను చంపిన ఘోరవైఖరిని తా నప్పుడు ప్రదర్శించాడు.

ఉ. 'కొన్నిటి పాదముల్ నఱకుఁ, గొన్నిటి మోరలు సెక్కు, లీలమైఁ
గొన్నిటి కంఠముల్ దునుముఁ, గొన్నిటి వీఁపులు వ్రచ్చు, నుబ్బునం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గొన్నిటి సర్వగాత్రములు క్రూరవిచేష్టిత విభ్రమంబు దోఁ
ప న్నుఱుమాడుఁ బ్రౌఢబల భాసిత భూరి భుజావిహారుఁడై'. **(సౌప్తి. 1. 176)**

ప్రతీకార కాంక్షతో ధర్మాధర్మాలనూ, ఉచితానుచితాలనూ పాటించక వివేకాన్ని కోల్పోయి ఉన్మాదావస్థలో రక్తపిపాసువుగా మారిన అశ్వత్థామ పాత్ర చిత్రణం అత్యంత సహజం.

(5). వస్తుచ్ఛందఃసంవాదం :

మహాస్రగ్ధర: 'తలలన్ హస్తమ్ములం బాదములఁ దనువులం దత్ప్రదేశంబుఁ గప్పం
దొలఁగించున్ వానిఁ గ్రొన్నెత్తురు వఱపి; హయస్తోమదంతి ప్రతానం
బుల మేదోమాంస ఖండంబుల దనుజ మహాభోజనం బావహించున్;
మలఁగంబాఱున్ జెలంగు న్నలి నెసఁగు జయోన్మత్తుఁడై మానవేంద్రా!'. **(సౌప్తి. 1. 194)**

"ఈ మహాస్రగ్ధరయందు వర్ణింపబడిన యంశము రక్తమును ఘనీభవింప జేయు అశ్వత్థామ సౌప్తిక రౌద్రవిహారము. ఉపపాండవ సంహారఘట్టము. సౌప్తికపర్వము అద్భుత భయానక బీభత్స కరుణ జనకమైన మహారౌద్ర రసమునకు ఆటపట్టు. రుద్రదేవతావిష్టుడైన యశ్వత్థామ ప్రళయ విహారము ఇందలి వస్తువు. ఆ వస్తువును భావించి కవిబ్రహ్మయు రౌద్రరసావిష్టుడై రచన సాగించెనా యనిపించును. ఆ పర్వమందలి స్థాయిచ్ఛందము స్రగ్ధర. అది సర్వేతర వృత్తములను అధఃకరించి సహృదయుని రక్తమును కరడు కట్టించి హృదయ స్పందము మందీభూతము గావించు తమఃప్రధానమైనది. గురుదీర్ఘాక్షర బాహుళ్యము ఈ పర్వమందలి గద్యపద్యము లన్నింటను సులభముగా గుర్తింపవచ్చును. మంద్రము, మందమునైన హృదయస్పంద సంచారము పర్వమందంతటను ప్రళయసమయ మహాతాండవమందలి రుద్రదేవుని గురువిలంబిత పదన్యాసము ననుకరించుచున్నది. ఆఱు మత్తేభములు, ఆఱు శార్దూలములు నాతి దూరాంతరావృత్తము లైన ఇరువది స్రగ్ధరా మహాస్రగ్ధర రౌద్రతాండమునకు దీప్తి కలిగించుచున్నవి. పర్వమును పఠించిన సహృదయునకు ఇందలి 327 పద్యగద్యములను స్రగ్ధరాచ్ఛందమే యావేశించినదా యనిపించును. అశ్వత్థామ హృదయమువలె కవిబ్రహ్మ హృదయముకూడ రౌద్రావేశముచే ఏకాగ్రమై యున్నది. అంతరంగ బహిరంగ క్రియాసంవాదము, వస్తుచ్ఛందః సంవాదము ఈ పర్వమున పరమ రమణీయముగా నున్నవి. (డా. పాటిబండ మాధవశర్మ: ఆంధ్ర మహాభారతము: ఛందఃశిల్పము. పు. 553-554)

(6). విలాపవీణానాదాల శ్రుతి మాధుర్యం :

మందాక్రాంతము:

'వీణా నాద ప్రతిమ నిగమావిర్భవత్సారపుణ్య
శ్రేణీ సంపాదిత విమలతాస్థేమ నిర్లేపచిత్త
త్రాణ క్రీడాకలన సతతోత్సాహవద్దివ్యభావా!
ప్రాణాపానాహరణ నిపుణ ప్రాపణీయానుభావా!' **(స్త్రీ. 2. 185)**

"స్త్రీపర్వమున తా నుపయోగించిన ఛందముల మాధుర్యమును తిక్కనగారు తామే ప్రశంసించుకొనుచున్నారా యనిపించుచున్నది ఈ పద్యము. వీణానాద ప్రతిమము లైన వేదనాదముల లయించి నిర్మలములు, నిర్లిప్తములు నైన చిత్తములను త్రాణము చేయుటకు ఉత్సహించువాడట హరిహరనాథుడు. ఆ స్వామి తన నానావిధ మధురచ్ఛందోమయమైన స్త్రీపర్వము విని తన్ననుగ్రహించు నని తిక్కనగారి యాశయము. స్త్రీపర్వ ద్వితీయాశ్వాసమునందలి స్త్రీల రోదన నాదములు విని స్వామి కరుణార్ద్ర హృదయు డయ్యెనన్న సూచనయు నిందు గలదు. 'మోహనంబైన యిట్టి యేడ్పు లెందు నంబుజాక్ష!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వింటిమే!' అని కురుకాంతల విలాప మాధుర్యమున జొక్కిన గాంధారి శ్రీకృష్ణునితో పలికినది. ఆ మధుర నాదములు తిక్కనగారి చెవులందు మారుమ్రోగుచు ఆయన చిత్తమును కరుణరసమయము గావించుచుండె గాబోలు! ఆయననోట వీణానాద ప్రతిమ మధురమైన మందాక్రాంతావృత్తము వెలువడెను. రౌద్ర రసావిష్టమైన హృదయముతో సౌప్తిక పర్వమున హరిహరనాథుని స్రగ్ధరలో సంబోధించుట యెట్టి యౌచిత్యమో స్త్రీపర్వాంతమున మందాక్రాంతలో సంబోధించుటయు అట్టి యౌచిత్యమే. స్త్రీపర్వమున ప్రథమాశ్వాసము ప్రధానముగా ధృతరాష్ట్ర విలాపమయము. అతని విలాపములందు అంతర్వాహినిగా పాండవ ద్వేషము గలదు. ఓజః ప్రదీప్తమయిన ఆర్ద్రత ఆయన చిత్తవృత్తి లక్షణము. ఆ ఆశ్వాసము చివర తిక్కనగారు హరిహరనాథ ప్రబోధమున ఓజస్వినియైన శిఖరిణీవృత్తమును వాడిరి. ద్వితీయాశ్వాసము అంతయు గాంధారీ విలాపమయము. ఆమె చిత్తము శుద్ధకరుణమయము. మధురమైన ఆర్ద్రత దాని లక్షణము. ఈ యాశ్వాసము చివర తిక్కనగారు మధుర మందరమైన మందాక్రాంతను వాడిరి. పర్వరసానుసారియైన ఛందమును పర్వాంతమున ప్రయోగించుట ఛందోమర్మజ్ఞతకు పరకోటి'. (డా॥ పాటిబండ మాధవశర్మ; తిక్కన కవితావైభవం. యువభారతి ప్రచురణ).

10. ఉపాఖ్యానాలూ, ఉపదేశాలూ :

శల్యపర్వంలో బలరాముడి తీర్థయాత్రాభివర్ణనం, సౌప్తికపర్వంలో శివప్రభావ వర్ణనం అనేవి ఉపాఖ్యానాలుగా లెక్కించదగినవి. ఈ రెండూ కథకు ప్రత్యక్షంగా తోడ్పడి, కథాజీవితానికి బలాన్ని చేకూర్చేవి కావు, అయితే బలరాముడు చేసిన తీర్థయాత్రలలో ప్రభాసతీర్థంనుండి కురుక్షేత్రం వరకూ గల పుణ్యక్షేత్ర తీర్థ మాహాత్మ్యాలను గమనిస్తే కురుక్షేత్రం కూడా మహాపుణ్యక్షేత్రమని స్పష్టమౌతుంది. ఆ క్షేత్రంలో మృతులైనవారు స్వర్గవాసులౌతారని తెలుపబడుతుంది. దుర్యోధనుడు ఆ క్షేత్రంలో శమంత పంచకతీర్థం వద్ద యుద్ధంచేసి మృతుడైనందువలన అతడికి స్వర్గం తథ్యమని అతడితోపాటు అందరూ భావించటానికి దోహదకారి అయింది. బలరాముడు దుర్యోధన భీములకు గదాయుద్ధ గురువు కాబట్టి ఆయన ఎదుట శిష్యుల యుద్ధం జరగటం, ఆయన వారిరువురిలో యుద్ధ నియమాల ననుసరించి పోరు సలిపిన దుర్యోధనుడికి సద్గతి కలగాలనీ, భీముడికి కీర్తి కలగాలనీ ఆశించటం గమనిస్తే గదాయుద్ధంమీద విజ్ఞుల అభిప్రాయాలు ఎట్లా ఉంటాయో తెలుస్తుంది. శ్రీకృష్ణుడు బలరాముడికి ఇచ్చిన సమాధానం కాదనలేని ఒక తీర్పుగా నిలిచింది. కథలో ఊరుభంగ చర్యకు బలరాముడి చర్చ ఒక బలమైన ప్రతిపక్షంగా ఉంటుంది. శ్రీకృష్ణుడు దానికి ప్రతిసమాధానం చెప్పటం వలన పాండవయుద్ధనీతి కథలో బలపడింది. బలరాముడి తీర్థయాత్రా భాగం ప్రక్షిప్తమని కొందరి పండితుల అభిప్రాయం.

అశ్వత్థామకు పరమశివుడి అనుగ్రహం వలన లభించింది దివ్య ఖడ్గం. ఆతడి రౌద్ర విహారానికి గల కారణా లేమిటని ధర్మరాజు శ్రీకృష్ణుడిని అడుగగా గోవిందుడు చెప్పిన శివప్రభావ వృత్తాంతం సౌప్తికపర్వం చివర చెప్పబడి ఉన్నది. శివుడు కరుణిస్తే కలిగే లాభాలను, కోపిస్తే కలిగే నష్టాలను తెలిపే ఈ ఉపాఖ్యానం ధర్మరాజుకు సందేహ నివృత్తిని కలిగించటమే కాక భారత కథలో శివశక్తి నిర్వహించిన పాత్రకు వ్యాఖ్యాన మనిపించింది.

పాండవ పక్షంలో అర్జునుడు మహావీరుడు. అతడు శివుడిని తపస్సుతో మెప్పించి పాశుపతాస్త్రాన్ని సంపాదించాడు. కౌరవ పక్షంలో అశ్వత్థామ రుద్రుడిని ఆత్మోపహారంతో సంతోషపెట్టి దివ్యఖడ్గాన్ని పొందాడు. ఆ పరమశివుడు నారాయణ సంకల్పానికి అనుగుణంగా సంహార కార్యాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నాడు. దీనినిబట్టి శ్రీకృష్ణుడే అర్జునుడికీ అశ్వత్థామకూ శత్రు సంహార శక్తులను సమకూర్చాడన్నమాట! స్థితికారుడి అదుపాజ్ఞలలో లయకారుడు వ్యవహరించటం వలన కాలం తీరినవారు విధి ప్రేరణతోనే కన్ను మూస్తారనే పరమసత్యాన్ని ఈ గాథ ప్రకటిస్తున్నది.

దుర్యోధనుడు తొడలు విరిగి పడిపోవటంతో గాంధారీ ధృతరాష్ట్రులు శోక సముద్రంలో మునిగారు. వారికి దుఃఖ కోపోపశమనం కొరకు హితోక్తులు.

సంజయుడు లౌకిక నీతివాదాన్ని ప్రమాణంగా చేసికొని హితవు చెప్పాడు. దుర్యోధనాదుల దుర్వర్తననూ, ధృతరాష్ట్రుడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లోభగుణాన్నీ విమర్శించి, స్వయంకృతాపరాధం వలన కలిగిన విపత్తుకు అప్పుడు దుఃఖించటం గతజల సేతుబంధనం వంటిదనీ, హాస్యాస్పదమనీ హెచ్చరించాడు.

క. 'ఆర్యులు దఱితోఁ దగియెడు । కార్య మనుష్ఠింతు; రట్టుగా కప్పని మా
త్సర్యమునఁ దిగిచి పట్టి య । నార్యులు దుదిఁ దూర వగతు రాపద యైనన్''

ఆ. 'జున్ను డెప్పరంపుఁ జోటైన తఱి నున్నఁ । జూచి విఱుగఁబడుటఁ జూడ కాత్మఁ
దీపుఁ గోరి యుఱుకు తిండికాఁడును బోలె । నయితి; వగచు టింక ననుచితంబు'.

క. 'వగచినఁ బోయిన శౌర్యము । మగుడునె? వగవంగ లోకమాన్యుం డగునే?
వగ పుణ్యగతికి మూలమె? । వగ పెల్లవిధముల నుడుగవలయు నరేంద్రా!'. **(స్త్రీ. 1. 18-20)**

విదురుడు ధర్మనీతి నాశ్రయించి వైరాగ్య బోధకమైన హితవు చెప్పి దుఃఖోపశమనం చేయ యత్నించాడు. మచ్చుకు కొన్ని మాటలు:

తే. 'యౌవనంబును, రూపంబు, జీవితంబు । ద్రవ్యసంచయములు ననిత్యములు గావె!
వీని హానికి వగ పవివేక మగుటఁ । బండితులు వగఁ గూరరు పౌరవేంద్ర!'

సీ. 'ఒక యింటనుండి వేఱొక యింటి కరిగిన । విధమును, వస్త్రంబు విడిచి యొండు
వస్త్రంబుఁ గట్టిన వడువును నై యుండు । నొడలు దొఱంగి యొండొక్క యొడలు
గైకొంట నృప! విను కడవకు సారెపై । నమర మృత్తిక యిడునపుడు విరియు
టయు, వెరవారఁ బట్టఁగ రాక చెడుటయు, । వాని యెత్తెడు నెడ వ్రయ్యుటయును,

తే. నెత్తి యొకచోట డించిన నెడలుటయును, । నెండి యవియుటయును, నావ మిడినఁ బగిలి
పోవుటయు, వాడుజనులచేఁ బొలియుటయును । గలుగు గతి మేని కెట్లును గలుగుఁ జేటు'.

(స్త్రీ. 1. 27, 34)

వేదవ్యాసుడు ధృతరాష్ట్రుడికి వివేకాన్ని ప్రబోధించాడు. జరిగిన కథకంతటికి కారణ మెవరో గ్రుడ్డిరాజుకు తెలుసు. తెలిసి తెలిసి దుఃఖించటం అవివేకం. విధిప్రేరితులై కౌరవులు అందరూ యుద్ధంలో పాల్గొని కన్నుమూశారు. కాబట్టి

తోదకవృత్తము. 'దేవకృతంబులు ధీరులకైనన్ । భూవర! మాన్పఁగఁ బోలునె యెట్లుం?
గావున శోకము గాఱియ దల్గం । గావలదే తుది గౌరవ మొప్పన్'.

తోదక వృత్తము.'తమ తమ తప్పులఁ దా రెరియంగా । విమలమతీ! యిటు వీరికినై శో
కమున దహింపఁగఁ గాదు మనంబున్; । సముచిత మిత్తఱి శాంతము సుమ్మీ!'(స్త్రీ. 1. 71, 81)

ఇట్లా స్త్రీపర్వంలో శోక మెంత ఉన్నదో దానిని ఉపశమింపజేసే ఉపదేశ మంత ఉన్నది. బంధువినాశ దుఃఖతాపంతో వగకు గురి అయిన మనుష్యులకు బుధులు ఉపదేశ వాక్యాలు అమృత ధారలు!

11. పర్వ పరమార్థం:

మహాభారత కథలోని అంతరార్థాన్ని అధ్యాత్మవిదులు భావించి దర్శించి, తాత్త్విక జ్ఞాన సంపన్నులు కావటం ఇతిహాస పఠన, శ్రవణ, మనన, నిదిధ్యాసల ఫలం. శల్య సౌప్తిక పర్వాలలో పాండవ విజయం చెప్పబడింది. దాని తాత్పర్యాన్ని ఈ విధంగా భావించవచ్చును. అంతరార్థ మహాభారత గ్రంథ రచయిత డా॥ వేదుల సూర్యనారాయణ శర్మగారి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మాటలలో కొన్ని విశేషాలు.

1.''శల్యుని యుద్ధంలో ఉభయ పక్షాల సైన్యాలు చాలావరకు నాశనమయ్యాయి. తామసిక వృత్తిలో చిక్కువడిన అసమగ్ర ద్వైత జ్ఞానమార్గం (శల్యుడు) సమగ్ర సాత్త్విక జ్ఞానంలోని అద్వైత ఋజుమనోవృత్తితో (ధర్మజాదులతో) సంఘర్షణకు తలపడి పోరుసాగిస్తే రెండు వర్గాలలోని వృత్తులూ చాలావరకు ఒకదానితో మరొకటి విజృంభించి నశిస్తాయని ఉభయసైన్యాలూ శల్యుని యుద్ధంలో చాలవరకు నశించాయి అనటానికి అంతరార్థం''.

2.''దుర్యోధనుడు జలస్తంభన విద్యతో ద్వైపాయన హ్రదంలో మునిగి ఉన్నాడు. అంటే ముక్తిని నాశం చేసే దుష్టయుద్ధం సాగించే తమోవృత్తి (దుర్యోధనుడు) అహంకార మమకారాలనే ద్వైపాయన హ్రదంలో మాయావృతుడై జలంలో మునిగి ఉన్నాడని అంతరార్థం''.

3.''ధర్మరాజు హ్రదం గట్టుపైని నిలబడి దుర్యోధనుడిని ఎత్తిపొడుపు మాటలతో దూషించటంతో దుర్యోధనుడు బైటపడ్డాడు. అంటే, అహంకార మమకారాలలో చిక్కుకొన్న అజ్ఞాని తన లోపాలను ఎవరైనా జ్ఞాని బయటపెట్టినప్పుడు దానిని సహించక ఎదురు తిరుగుతాడు. అంటే, సాధకునిలోని అజ్ఞానంలోని అజ్ఞానవృత్తి రహస్యంగా దాగి చిరకాలం ఉండలేదనీ, అది తిరిగి జ్ఞానవృత్తిపై అహంకరించి ఎదుర్కొంటుందనీ అంతరార్థంగా గ్రహించాలి''.

4.''దుర్యోధనునికి భీముడు ఊరుభంగం చేశాడు. ఊరుభంగం అంటే తొడలు విరుగగొట్టటం అని అర్థం. అంతరార్థంలో ఉ+ఉరు= ఊరు ఔతుంది. 'ఉ' అంటే సూక్ష్మదేహమైన తైజసిక ప్రకృతి . తైజసిక ప్రకృతి అనగా త్రిపుటిలోని స్వప్నావస్థలో ఉండే మానసికవృత్తి. భీముడనగా సాధకుడిలోని అభయవృత్తి. భీమునిచేత - అభయవృత్తిచేత, ఉ - తైజసిక మనఃప్రకృతికి, అనగా సూక్ష్మదేహ వాసనా ప్రకృతికి; ఉరు= గొప్పదైన; భంగం= నాశనం చేసిందని అర్థం''

5. ''దుర్యోధనుడు అశ్వత్థామను సర్వసైన్యాధిపతిగా అభిషిక్తుడిని చేశాడు అంటే- ముక్తికి సంబంధించిన సమస్త వృత్తుల నాశనానికై సాధకునిలోని తామసికవృత్తి, తనలోని ప్రకృతి సంబంధ ప్రకాశానికి తనలోని ముక్తి నిరోధక తామసికవృత్తుల పై అధికారం కలిగించిందని అంతరార్థం''.

6. ''అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ - ఈ ముగ్గురు రథికులూ కురుక్షేత్ర యుద్ధంలో చావకుండా మిగిలినవారు. అశ్వత్థామ అంటే ప్రకృతి ప్రకాశం. కృపు డంటే పోషించేవాడు. అనగా వాసనా కృతములైన కర్మలను ప్రోత్సహించే ప్రారబ్ధ కర్మ ప్రవృత్తి అని అర్థం. కృతవర్మ అంటే - చేయబడిన కర్మలకు కవచం వంటివాడని అర్థం - అనగా జీవునిలో వాసనావృత్తి అని భావం. ప్రకృతి ప్రకాశం అనగా మాయ, ప్రారబ్ధకర్మ, సంచితకర్మల యొక్క వాసనలు అనే ఈ మూడూ ఒకదానిని ఒకటి వీడకుండా కలిసి ఉంటాయని అంతరార్థం.''

7. ''న్యగ్రోధ వృక్షం మీద దివాంధం (గుడ్లగూబ) రాత్రివేళ చేసిన పనిని అశ్వత్థామ ఆదర్శంగా తీసికొన్నాడు. అంటే- ప్రకృతి ప్రకాశం తమోవృత్తిలో ఉన్నప్పుడు ముక్తిమార్గాన్ని నిరోధించే అపరాశక్తి యొక్క అజ్ఞానంచేత ఆవరించబడి ఉంటుంది అనే అంతరార్థం చెప్పుకొనాలి''.

8. ''అశ్వత్థామ ఆ రాత్రి పాండవ శిబిరంలో నిద్రిస్తున్న ధృష్టద్యుమ్నుడు, పాంచాలురు, ఉపపాండవులు మొదలైనవారిని అనేకులను చంపాడు. అంటే - అజ్ఞానావృతమయిన మాయాప్రకృతి సాధకునిలోని ముక్తివృత్తికి సంబంధించిన దృఢజ్ఞాన ప్రకాశాన్నీ (ధృష్టద్యుమ్నుడిని), పంచేంద్రియ నిగ్రహవృత్తులనూ (పాంచాలురనూ), మనోవ్యాపారాలను (ఉపపాండవులనూ) సుప్తములై ఉన్నప్పుడు చంపివేసింది. అనగా - కారణదేహంలోని జ్ఞాన వాసనలను పనిచేయకుండా వ్యర్థములైన వానినిగా చేసివేసిందని అంతరార్థంగా గ్రహించాలి.''

9. ''సూర్యోదయం కాగానే పాండవులు అశ్వత్థామను వెదకి పట్టుకొని అతని శిఖలో ఉన్న మణిని లాగుకొని దానిని ధర్మరాజుచేత ధరింపజేశారు. మణి తళతళ మెరిసే లక్షణం కలది. అశ్వత్థామ శిఖలోని మణిని లాగేశారు అంటే- ప్రకృతి యొక్క ప్రకాశాన్ని ప్రకృతినుండి లాగి తీసివేశారు. సాధకుడు జీవన్ముక్తావస్థను చేరుకోవటమంటే అదే. ప్రకృతిలోనే

ఉంటూ, ప్రకృతిని తన గుప్పిటిలో ఉంచుకొని, ప్రకృతికి బద్ధులు కాకుండా, ప్రకృతిని స్వవశం చేసికొని అసంగత్వంతో సాధకుడు జీవించటమే జీవన్ముక్తావస్థ. మణిని ధర్మరాజు ధరించాడు అంటే సాధకుడు స్వధర్మ ప్రవృత్తిలో జీవన్ముక్తావస్థను చేరుకొన్నాడని అర్థం. అశ్వత్థామ యొక్క శిరోమణిని ధరించినవారికి ఆకలిదప్పులు గాని, చోర వ్యాధి శస్త్రబాధలు కాని ఉండవు. అంటే ప్రకృతిశక్తియొక్క గొప్పతనాన్ని అనుభవించినవారికి అనగా అష్టసిద్ధులు లభించినవారికి సర్వబాధానివారక శక్తులూ లభిస్తాయని వాని అంతరార్థంగా గ్రహించాలి.

11. ''కౌరవపక్షంలో అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ అను ముగ్గురు తప్ప, అందరూ హతులయ్యారు. పాండవ పక్షంలో పంచపాండవులు, కృష్ణుడూ, సాత్యకి అను ఏడుగురు తప్ప మిగిలిన వారందరు నిహతులయ్యారు. అంటే సాధకుడిని ముక్తుడిని కాకుండా చేయటానికీ, సాధకునిలోని సాత్త్వికి వృత్తులతో యుద్ధం చేసే తామసిక సంబంధం గల వృత్తులన్నీకూడా సాధనవలన జ్ఞానంలో చిట్టచివరకు విలీనమై పోతాయి. ఒక్క ప్రకృతి మాత్రం విలీనావస్థలో నిలిచి ఉంటుంది. ప్రకృతికి సంబంధించినవే మాయ, జీవుడు, ప్రకృతిని అనుసరించియే ఉంటాయి. ఈ మూడూ కలిసియే ప్రకృతి అని పిలువబడుతుంది. ఆ ప్రకృతిలోని వ్యాపింపజేసే ఇతర తామసిక వృత్తులన్నీ జ్ఞానసాధనలో సాధకునిలో విలీనమై ఉంటాయి. ప్రకృతిమాత్రం అనగా మాయ, జీవుడు, ప్రకృతి నశించవు - అన్నదే అశ్వత్థామాదులు ముప్వురూ యుద్ధంలో చనిపోక బ్రతికి ఉన్నారన్నదానికి అంతరార్థం. అభయవృత్తి, ఋజువృత్తి, ఐహిక విరాగవృత్తి, జ్ఞానప్రకాశవృత్తి అనే నాలుగు వృత్తులూ ధర్మవృత్తిని ఆశ్రయించి ఉండేవే. ఆ ధర్మవృత్తి యమనియమాది అష్టాంగ సాధనవలన కలుగుతుంది. ఆ ధర్మవృత్తి ప్రతిజీవునిలోను గల బ్రహ్మైక్యం పొందాలనే ముక్తి వృత్తి. దానికి నశించటం అనేదే లేదు. ధర్మపదానికి సహజమైనది అని అర్థం. నిర్వృతివృత్తి (కృష్ణుడు) ధర్మవృత్తికి ఎప్పుడూ తోడ్పడుతూనే ఉంటుంది. సాత్యకి అనేది 'సత్యక' శబ్దం నుండి పుట్టింది. 'సత్యం' అనగా పరమాత్మ అని అర్థం. సత్యం, శివం, సుందరం - అనేవి పరమాత్మను చెప్పే పదాలు. కాన, సత్యవృత్తియే సాత్యకి అనే పదానికి అర్థం. ప్రతిజీవికి అంటే సాధకుడికి సహజమైన పరమాత్మభావన అని అర్థం. ప్రతిజీవికి పరమాత్మలో ఐక్యమవ్వాలనే భావన అంతర్గతంగా సహజంగా ఉంటుంది. పాండవపక్షంలో పంచపాండవులు, కృష్ణుడు, సాత్యకి యుద్ధంలో నశించక బ్రతికి ఉన్నారన్న దానిలో సౌప్తికపర్వంలో ముక్తిమార్గం సంపూర్ణతకు చేరుకోవడం అనేది జయప్రదంగా ముగింపు చేయబడింది. వ్యాసుడు తన భారతాన్ని 'జయం' అనే పేరుతో పాండవ విజయంగా సౌప్తికపర్వంతో ముక్తి సాధనాక్రమాన్ని పూర్తిచేశాడు. 'జయం' అంటే పాండవులు కౌరవులను జయించటం అనేది బాహ్యార్థం. తామసిక వృత్తులను సాత్త్వికవృత్తులు ఎదిరించి ముక్తిని సాధించటం అనే సాధనలను జయప్రదంగా ఎట్లు నెరవేర్చాలో చెప్పేది 'జయం' అని అంతరార్థం''.

12. ''స్త్రీపర్వం, శాంతిపర్వం, ఆనుశాసనికపర్వం, ఆశ్రమవాసపర్వం, అశ్వమేధపర్వం - అను అయిందింటిలోనూ అంతరార్థం చెప్పవలసిన కథాభాగాలు లేవు. కథను ఆసక్తికరంగా పూర్తిచేయటానికి సౌతి, వైశంపాయనుడు అను వ్యాసమహర్షి యొక్క శిష్యులు ఆ అయిదు పర్వాలు తాము పెంచారు. వ్యాసుడు వ్రాసిన 8800 శ్లోకాల గ్రంథాన్ని మొత్తం లక్షశ్లోకాలు గల గ్రంథంగా పర్వాలు పెంచి పెద్దది చేసి 'జయ' మనే దానిని మహాభారతంగా వ్యాప్తి చేశారని డా॥ వేదుల సూర్యనారాయణ శర్మగారు అభిప్రాయపడ్డారు. (వివరాలకు చూడండి అంతరార్థ మహాభారతము (1986)

12. కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం

తెలుగులో ఆదికావ్యమైన ఆంధ్రమహాభారతం అవతరించి వెయ్యేళ్ళు కావస్తున్నా, ఇంతవరకు దానికి సమగ్రవ్యాఖ్య వెలువడలేదు. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి అనుగ్రహంతో కవిత్రయ మహాభారతానికి తెలుగులో శిష్టవ్యావహారిక భాషలో సరళవ్యాఖ్య వెలువడటం ఆంధ్రావళి ఆనందించే అపూర్వ సాహిత్యోత్సవం. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారు భారతీయ వైదిక ధర్మప్రచార మహోద్యమాన్ని చేపట్టి మహనీయంగా సాగిస్తున్నారు. అందులో ఈ పంచమవేద వ్యాఖ్యాన ప్రణాళిక ఒక మహత్తర సారస్వత యజ్ఞం. ఏడుకొండలరాయడు మాత్రమే చేపట్టి ధర్మరక్షణ కళా ప్రావీణ్యంతో ఈ బృహత్తర ధర్మకార్యాన్ని ప్రజలకు ప్రసన్నంగా ప్రసాదించగలిగిన పరమదయాళువు. ఆ దేవదేవుడి కృపాకటాక్షంతో పండితులు వ్యాఖ్యానించిన పదునెనిమిది పర్వాల ఈ దివ్య ప్రబంధ మండలిని పరిష్కరించి సర్వాంగసుందరంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రచురించి, సామాన్య జనులకు అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారు చేసికొన్న వెలుగుల పుణ్యం. ఈ పవిత్ర మహత్తర ప్రయత్నానికి శ్రీ తిరుమలేశుడి పక్షాన బాధ్యతవహించి, అభ్యుదయ పరంపరను విజయవంతంగా సమకూరుస్తున్న మాన్యులు, మహనీయులు టి.టి.డి.బోర్డు ఛైర్మన్, సభ్యులు, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, వారి సహకారులూ, సంపాదక సలహామండలుల సభ్యులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, ఎడిటోరియల్ సెల్ సభ్యులూ, పలురకాలుగా ఈ కార్యక్రమంలో తోడ్పడుతున్న అధికారులూ, అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతాభినందనాలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటి. అది రెండు భాగాలుగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపుదిద్దుకొన్నది. విస్తృతమైన అరణ్యపర్వం మూడవసంపుటిగా రెండుభాగాలలో ప్రచురించబడింది. మొదటిభాగం నన్నయ రచించిన ఆరణ్యపర్వభాగం. రెండవభాగం ఎఱ్ఱాప్రెగడ పూరించిన ఆరణ్యపర్వ శేషం. ఈ విధంగా ఆరణ్యపర్వం విభజించబడి ప్రచురించబడటం తెలుగులో ఇదే ప్రథమం. నాల్గవ, అయిదవ, ఆరవ, ఏడవ, ఎనిమిదవ సంపుటాలుగా విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ పర్వాలు వెలువడ్డాయి. ఇప్పటి ఈ తొమ్మిదవ సంపుటి శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాల సమష్టి సంపుటి.

ఈ పర్వాల వ్యాఖ్యానంలో నలుగురు మహాపండితులు పాల్గొన్నారు. శల్యపర్వ ప్రథమాశ్వాసానికి డా॥ పి.వేంకటరాజుగారు, ద్వితీయాశ్వాసానికి శ్రీసింగరాజు సచ్చిదానందంగారు, సౌప్తికపర్వంలోని రెండాశ్వాసాలకూ విద్వన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారు, స్త్రీపర్వం మొత్తానికీ సంగీత సాహిత్యకళావేత్తలు డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానందగారూ వ్యాఖ్యానం వ్రాశారు. శాస్త్ర మర్మజ్ఞులైన వీరు సరళమైన రచన చేశారు. ఈ పర్వాలకు తగిన పీఠికను నేను సంతరించాను. ఇవి ఆంధ్రుల ఆమోదాన్ని పొందుతాయని ఆశిస్తాను.

ఈ సంపుటి ఈ విధంగా రూపొందటానికి తోడ్పడిన మిత్రులు, విద్మన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారికీ, శ్రీ కె.సత్యరామ ప్రసాద్‌గారికీ, శ్రీ జి.రాధాకృష్ణగారికీ, శ్రీమతులు సుశీలా లక్ష్మీ విద్యానాథులకు, డాక్టర్ వి.యస్. లక్ష్మికీ నా కృతజ్ఞతలు.

పరమ కల్యాణ భద్రమూర్తి అయిన శ్రీ పద్మావతీ సహిత శ్రీ వేంకటేశ్వర స్వామివారు వేదవేద్యులు, వేదాంత గమ్యులు, పరతత్త్వరూపులు అయినా భక్తసులభులు, సాహిత్య సంగీత కళాప్రియులు, రసానందమూర్తులు. ఆ స్వామికి ఈ పంచమవేదం అక్షరమైన తోమాలసేవ; వ్యాఖ్యానం సుగంధపరిమళ సేవ; విశేషాంశాలు ఉజ్జ్వలాలంకార సేవ; పీఠిక ఆ విరాణ్మూర్తికి మంగళనీరాజన సేవ. ఈ పర్వం స్వామివారికి సారస్వతమైన అక్షరార్చన!

సత్యశివసుందర రూపులైన స్వామివారి దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యా సంపుటిని వాఙ్మయారాధనలోని భాగంగా పుణ్యపూజకు సుమమంజరిగా సమర్పించుకొంటున్నాను. విశ్వశ్రేయస్సును ప్రసాదించుమని స్వామివారిని వేడుకొంటున్నాను.

హైదరాబాదు
02-10-2004

జి.వి.సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు,
కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శల్యపర్వ కథాసారం

కర్ణుడు నేలగూలిన తరువాత దుర్యోధనుడు మిగిలిన కొద్దిపాటి సైన్యంతో స్కంధావారంలో ప్రవేశించి బంధుమిత్రులతో అనంతర కార్యక్రమాన్ని గురించి యోచించసాగాడు. అప్పుడు కృపాచార్యుడు ఇట్లా అన్నాడు. 'మీ వంటి రాజులు పూర్వం కూడా యుద్ధాలు చేశారు. అది ఉత్తమ ధర్మం కూడా. దానివలన సుగతిని పొందారు. అయినా, నే నొక్కటి చెప్పుతాను వినుము. భీష్మద్రోణ కర్ణాది మహావీరులూ, రాజులూ, బంధుమిత్రులూ, బలగాలూ రణంలో చనిపోయారు. పదిహేడు రోజులు యుద్ధం సాగింది. మనవైపు సైనికులు బాగా తగ్గిపోయారు. అర్జునాది వీరులు తలచుకొంటే ఈ సైన్య మొక లెక్కకాదు. నీ వలన యుద్ధం కలిగింది. ప్రాణహాని జరిగింది. ఇకనైనా యుద్ధం మాని ముందుగా నిన్ను కాపాడుకొమ్ము. ధర్మనందనుడిని చూచి సంధిచేసికొమ్ము. రాజ్యాన్ని ఇరువురూ పంచుకొని ధృతరాష్ట్రుడిని సేవిస్తూ సుఖంగా జీవించండి'- అని హితోపదేశం చేశాడు. అయినా, ఆయన మాటలు దుర్యోధనుడికి రుచించలేదు. పై పెచ్చు -

తే. 'నేఁడు దుశ్శాసనుని ఱొమ్ము నెత్తు రనిల । సుతుఁడు మదుమునఁ ద్రావుట సూచి కొఱఁత
ప్రతిన దీర్చు నతం డని భయముఁ బొంది । పొందుఁ గోరిన నది యేల పొసఁగుఁ జెపుమ!"(శల్య. 1.66)

అని పలికి, యుద్ధం చేయటమే ఉచిత మని పేర్కొని, గెలిస్తే విజయం, ఓడితే స్వర్గం స్వీకరిస్తానని సంధి ప్రతిపాదనను తిరస్కరించాడు. ఒకరి దయవలన కలిగే రాజ్యసుఖాలు తనకు వద్దని మరల యుద్ధానికి సిద్ధమయ్యాడు.

1. శల్యసేనాపతిత్వం:

ఆనాటి రాత్రి శిబిరంలో వసిస్తే పాండవులు దాడి చేస్తారేమోనన్న అనుమానంతో దుర్యోధనాదులందరూ కలిసి సరస్వతీ నదీతీరానికి పోయి కృతస్నానులై అక్కడి పలు కుటీరాలలో రాత్రి గడిపారు. మరునాడు ఉదయాన అశ్వత్థామ సలహామేరకు మద్రభూపతి అయిన శల్యుడిని సర్వసైన్యాధ్యక్షుడిగా రారాజు అభిషేకించాడు. ఆ వార్త విన్న ధర్మరాజు శ్రీకృష్ణుడి ప్రబోధంతో ఉత్సహించి తన మేనమామ అయిన శల్యుడిని మరునాడు సంహరించాలని సంకల్పించి ఆ రాత్రి విశ్రమించాడు.

మరునాడు ఉదయం శల్యుడు సర్వతోభద్రవ్యూహాన్ని పన్నాడు. దాని ముఖస్థానంలో అతడే నిలిచాడు. వలపట శక, యవన సమేతుడై కృపాచార్యుడూ, దాపట త్రిగర్త సమేతుడై కృతవర్మా, వెనుక కాంభోజ సహాయుడై అశ్వత్థామా, నడుమ దుర్యోధనుడూ, అతడి ముందు గజసైన్యంతో శకునీ మోహరించారు. అంతకుముందే పాండవులు త్రిముఖవ్యూహం సిద్ధంచేసికొన్నారు. ఆ మూడు ముఖాలలో వరుసగా ధృష్టద్యుమ్న, శిఖండి, సాత్యకులు నిలిచారు. ధర్మజుడికి రక్షగా భీమార్జునులు అగ్రభాగంలో మోహరించారు. కౌరవులు పాండవులతో తలపడేటప్పుడు ఎట్టి పరిస్థితులలోనూ వారితో ఒక్కొక్కరుగా పోరాడరాదనీ, పలువురు కలిసి ఒక్కుమ్మడిగా యుద్ధం చేయాలనీ నిర్ణయించుకొన్నారు.

పదునెనిమిదవ నాటి యుద్ధం ప్రారంభమయింది. శల్య విజృంభణం కౌరవసేనలకు ఆశ్చర్యం కలిగించింది. అతడు పాండవులను జయించగలడనే పేరాస కలిగించింది. గురుభీష్మ కర్ణులు సాధించలేని కార్యాలను శల్యుడు సాధించగలడనే నమ్మకం కలిగింది. 'శల్యో జేష్యతి పాండవాన్' అనే నానుడి పుట్టింది.

పాండవ పక్షంలో భీమార్జునుల విజృంభణం బలంగా సాగింది. పాండవులు తెగబడి పోరు సల్పారు. కౌరవవీరులు పంతంతో ఎదిరించారు. నకులుడు కర్ణపుత్రులైన చిత్రసేన, సత్యసేన, సుశర్మలను పరాక్రమాన్ని ప్రకటించి వధించాడు. భీమసేనుడు భీకర గదాయుద్ధంలో శల్యుడిని మూర్ఛపోయేటట్లు చేశాడు. కృపాచార్యుడు శల్యుడిని రథంమీద ఉంచుకొని దూరంగా తొలగిపోయాడు. కొంతసేపటికి శల్యుడు తేరుకొని ఎత్తిన గదాదండంతో తన రథాన్ని పిలిచాడు. చుట్టూ ఉన్న సైనికులు ఉప్పొంగి పోవగా దుర్యోధనుడి ముందున్న సైనికులను కలుపుకొని ముందుకు సాగగా, ధర్మరాజు ముందున్న

రథికులు చేకితానుడిని ముందుంచుకొని భీముడిని దాటి దుర్యోధనుడిపై తలపడ్డారు. అతడి వజ్ర గదాఘాతానికి చేకితానుడు చనిపోయాడు. పాండవసైన్యం మండిపడి కౌరవసైన్యంమీద బాణవర్షం కురిపించింది. శల్యుడు ధర్మరాజును, దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడినీ, మూడువేల రథికులతో కూడిన అశ్వత్థామ అర్జునుడిని డీకొన్నారు. పోరు ఘోరంగా సాగింది.

2. శల్యవిజృంభణం:

యుద్ధంలో శల్యుడి ప్రయోగ ప్రతాపం ప్రశంసాపాత్రంగా సాగింది. అతడిపై ధర్మరాజు ముద్గరాన్నీ, సాత్యకి తోమరాన్నీ, భీముడు భల్లాన్నీ, నకులుడు శక్తినీ, సహదేవుడు గదనూ ప్రయోగించగా శల్యుడు బాణాలతో వాటిని వమ్ముచేసి ఆర్చాడు. సాత్యకి రోషంతో విజృంభించగా శల్యుడు అతడిని, పాండవులను మూర్ఛపొందించాడు. దానిని చూచి శల్యుడు పాండవులను ఆనాడు చంపుతాడని దుర్యోధనుడు భావించి సంతోషించాడు.

అంతలో భీమ నకుల సహదేవులు కలిసి విజృంభించి శల్యుడిని ఎదుర్కొన్నారు. ధర్మరాజు శల్యుడి చక్రరక్షకుడైన ద్యుమత్సేనుడి తల నరికాడు. శల్యుడు జూలు పీకిన సింహంవలె కోపించి భీమాదులను బాణాలతో నొప్పించి నెత్తురు పారేటట్లు చేశాడు. దానిని చూచి ధర్మరాజు ఖిన్నుడై తాను శల్యుడిని చంపగలనని శ్రీకృష్ణుడు తనతో అన్నమాటలను జ్ఞాపకం చేసికొన్నాడు. ధైర్యంతో సైన్యాన్ని శల్యుడిపై పురికొలిపాడు. శల్యుడు ధర్మరాజాదులను బాణాలతో కప్పి, వారిని చిమ్మచీకట్లలో ముంచాడు. దేవతలు అతడి ప్రతాపాన్ని ప్రశంసించారు. అర్జునుడు తనను చుట్టుముట్టిన సంశప్తకులను వికలాంగులుగా మార్చాడు. అశ్వత్థామ అర్జునుడిని వాడి బాణాలతో క్రూరంగా కొట్టాడు. అర్జునుడు అడవిని కాల్చే కార్చిచ్చువలె కౌరవసైన్యాన్ని ధ్వంసంచేశాడు. అశ్వత్థామ సురథుడనే పాంచాల కుమారుడిని చంపి అర్జునుడిని ఎదుర్కొన్నాడు. అప్పుడు దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడితో పోరి బాధింపబడ్డాడు. కృప కృతవర్మలు శిఖండి ప్రభృతులతో తలపడగా శల్యుడు ధర్మజ, భీమ, నకుల సహదేవ సాత్యకులతో పోరాడి వారిని నొప్పించాడు. పాండవులు తొలగిపోయారు. సాత్యకి శల్యుడిపై తిరగబడ్డాడు. శల్యుడు విజృంభించాడు. పాండవసేనలు శ్రీకృష్ణార్జునులవైపు పరుగెత్తాయి. అర్జునుడు వారికి అండగా నిలిచి కృప కృతవర్మలను ఎదుర్కొన్నాడు. సహదేవుడు శకునిని, శిఖండి అశ్వత్థామను, భీముడు దుర్యోధనుడిని ఢీకొన్నారు. ధర్మరాజు నకులుడు వెంటరాగా శల్యుడిని ఎదిరించి నిలువరించాడు.

3. శల్యసంహారం:

మధ్యాహ్నమయింది. చండప్రచండుడై శల్యుడు పాండవసైన్యాన్ని నురుమాడటం మొదలుపెట్టాడు. ఇరుపక్షాలవారూ అతడి పరాక్రమాన్ని ప్రశంసించారు. ధర్మరాజు క్రుద్ధుడై శల్యుడిపై దాడికి పూనుకొన్నాడు. తన రథానికి కుడివైపున నకుల సాత్యకులూ, ఎడమవైపున సహదేవ ధృష్టద్యుమ్నులూ, ముందు భీముడూ, వెనుకవైపు అర్జునుడూ నడువగా, శల్యుడిని సంహరిస్తానని శపథం చేసి ముందుకు సాగాడు. ఇద్దరి నడుమ ద్వంద్వయుద్ధం ఘోరంగా జరిగింది. వారిరువురూ పెద్దపులులవలె విజృంభించారు. అంతలో భీముడు దుర్యోధనుడిపై తలపడి అతడిని మూర్ఛలో ముంచాడు. గుర్రాలు రారాజు రథాన్ని దూరంగా లాగికొని పోయాయి. అశ్వత్థామాదులు అర్జునుడిని లెక్కచేయకుండా ధర్మరాజుపై దాడిచేసి చుట్టుముట్టారు. వారిని బాధించి ధర్మజుడు శల్యుడిని ఎదుర్కొన్నాడు. వారిద్దరినీ చూచి, సమబలానికి మెచ్చి ఎవరు విజయాన్ని సాధిస్తారో అని సైనికులు ఆసక్తిని ప్రకటించారు. ధర్మరాజు శల్యుడిపై మూడువందల బాణాలు గుప్పించాడు. గుర్రాలనూ, సారథినీ చంపి, చేయి కదపలేని విధంగా శల్యుడిని బాధించాడు. అశ్వత్థామ శల్యుడిని తన రథంమీద ఉంచి అపాయం నుండి తప్పించాడు. శల్యుడు తేరికొని మరొక రథంమీద ఎక్కి రణరంగంలో ప్రవేశించి తనను ముట్టడించిన పాండవవీరులను త్రోసికొనిపోయి ధర్మరాజుతో తలపడ్డాడు. వారిద్దరి నడుమ బాణయుద్ధం బలంగా సాగింది. ఇద్దరికి వారి వారి వీరులు సాయంగా పోరాడారు. ధర్మరాజు తనలో ఇట్లా అనుకొన్నాడు: 'నీవు శల్యుడిని గెలుపుము - అని దీవించి కృష్ణుడు నన్ను పంపాడు. అతడి మాటలు అబద్ధాలౌతాయా? దైవ ఘటన తప్పించరానిది' - అని శ్రీకృష్ణుడిని స్మరించాడు. ఆతడి ఆశీస్సులు ఫలించేటట్లు ప్రార్థించాడు. శ్రీకృష్ణుడిని రుద్రరూపుడిగా సంభావించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంతలో భీముడు శల్యుడి విల్లును ఖండించాడు. గుర్రాలను చంపాడు. సూతుడి కంఠం నరికాడు. కవచాన్ని నేలపడగొట్టాడు. విరథుడు కవచహీనుడు అయిన శల్యుడు కోపించి కత్తీ డాలూ తీసికొని రథం దిగి యముడివలె విజృంభించాడు. భీముడు అతడి కత్తిని, డాలును ఖండించాడు. శల్యుడు ధర్మరాజుపై దాడిచేశాడు. 'శ్రీకృష్ణుడు ఈ శల్యుడిని సంహరించటానికే నన్ను పంపించాడు. శల్యసంహారం నా వంతు' అని భావించి ధర్మరాజు భయంకరమైన శక్తిని సంధించి భగవానుడిని ప్రార్థించి, రౌద్రోద్రేకంతో త్రిపురాసుర సంహారం చేసే రుద్రుడివలె కోపించి ఆ మహాశక్తిని శల్యుడిపై ప్రయోగించాడు. అది శల్యుడి కవచంలో భేదించి దూరింది. రొమ్ము చీల్చి, వీపునుండి బయటకు వెలువడి భూమిలో ప్రవేశించింది. ఆ గాయంవలన ముక్కులనుండి, చెవులనుండి, కన్నులనుండి నెత్తురు కారుతూ శరీరాన్ని తడిపివేయగా శల్యుడు - ప్రియురాలి ఉరంమీద వాలే ప్రియుడివలె - నేలమీద చేతులు రెండూ చాచి బోరగిల పడి ప్రాణాలు వదిలాడు. ధర్మరాజు చేసిన ధర్మయుద్ధంలో చనిపోయిన శల్యుడు శాస్త్రోక్తంగా వేల్చిన హవిస్సులు స్వీకరించి చల్లారిన హోమాగ్నివలె భాసించాడు. అన్నమరణానికి కోపించి శల్యుడి తమ్ముడు ధర్మరాజును ఎదిరించి అతడిచేతిలో మరణించాడు. శల్యసోదరుల మరణానికి పాండవసైన్యం పొంగిపోయింది.

4. దుర్యోధన యుద్ధ నిర్వాహకం:

కృతవర్మ, కృపాచార్యుడు ధర్మరాజును ఎదుర్కొని వీగిపోయారు. దుర్యోధనుడు భద్రగజాన్ని ఎక్కి యుద్ధరంగంలో విజృంభించాడు. శల్యుడి చుట్టాలు ధర్మరాజును చుట్టుముట్టారు. పాండవులందరూ కలిసి వారిని వధించారు. అప్పుడు దుర్యోధనుడు ఖిన్నుడై శకునిని తగిన ఉపాయాన్ని చెప్పమని కోరాడు. 'రాజు పూనుకొని ముందుకు ధైర్యంగా సాగకపోతే, సైనికులు మెచ్చుకొంటారా?'- అని శకుని హితవు చెప్పాడు. ఆ మాట విని దుర్యోధనుడు సైన్యానికి ధైర్యం చెప్పుతూ రణాన్ని సాగించాడు. పాండవ విజృంభణం దుర్యోధనుడి సైన్యాన్ని కలవరపెట్టింది. నలుదిక్కులా పరుగెత్తేటట్లు చేసింది. సైనికులంతా ధర్మజ విజయం తథ్యమనీ, దుర్యోధనుడి మరణం తప్పదనీ భావించారు. పాండవపక్షంవారు 'ఇంక ధర్మరాజు నాయకుడు' అని కీర్తించారు.

దుర్యోధనుడు ఏనుగు దిగి, రథ మెక్కాడు. పారిపోతున్న బలాలకు ధైర్యం చెప్పి యుద్ధానికి పురికొల్పాడు. 'పాండవ సైన్యం పలచబడింది. కృష్ణార్జునులు దాహంతో అలసిపోయారు. ఇప్పుడు మనం పరాక్రమాన్ని ప్రదర్శించి విజయం సాధిద్దాం' - అని చేయెత్తి పిలుపు నిచ్చాడు. సైనికులు ఉప్పొంగి దుర్యోధనుడి వెంటనడిచి భీముడిని చుట్టుముట్టారు. అతడు గదను చేపట్టి రథం దిగి 21వేల మంది వీరులను అడవిని నరికినట్లు మట్టుపెట్టాడు. రథాలనూ, అశ్వాలనూ అర్జునుడు ధ్వంసం చేశాడు. ధృష్టద్యుమ్న సాత్యకుల చేతిలో సాల్వుడు చనిపోయాడు. కృతవర్మ విరథు డయ్యాడు. కురుసైన్యం చెల్లాచెదరైపోయింది. దుర్యోధనుడు ఒంటరిగా పోరు సాగించాడు. తన కున్న లౌకిక దివ్యశక్తుల నన్నింటినీ కూడగట్టి పరాక్రమాన్ని ప్రదర్శించాడు. పాండవ వీరులపై బాణాలను గుప్పించాడు. శకుని మొదలైనవారు దుర్యోధనుడిని సమీపించి సహాయంచేశారు. శకునికీ ధర్మరాజుకూ ద్వంద్వయుద్ధం సాగింది. శకుని పుత్రుడైన ఉలూకికీ నకులుడికీ; సాత్యకికీ, కృతవర్మకూ; దుర్యోధనుడికీ ధృష్టద్యుమ్నుడికీ గొప్పయుద్ధం జరిగింది. దుర్యోధనుడు ఉపపాండవులను కలతపెట్టాడు. పాండవులు విజృంభించి కౌరవసేనను తరుమగొట్టారు. దుర్యోధనుడు ఒంటరిపోరు సాగించాడు. ధర్మజుడు కృప, కృతవర్మలను విరథులను చేశాడు. దుర్యోధనుడు కోపించి ఏడువందలమంది రథికులను పురికొల్పి ధర్మరాజుపై దాడికి పంపాడు. శిఖండి ప్రముఖులతో కలిసి పాండవులు వారిని సంహరించారు.

శకుని మాయోపాయం పన్ని పాండవ సైన్యాన్ని వెనుకనుండి అశ్వసేనతో దాడిచేశాడు. ధర్మరాజు అశ్వహృదయం తెలిసిన నకుల సహదేవులను అశ్వబలంతో శకునిపై పంపాడు. వారితో ఉపపాండవులను కూడా పంపాడు. వారు కౌరవ బలాలను పెంటకుప్పలుగా మార్చారు. శకుని యుద్ధరంగంనుండి తొలగిపోయాడు. యుద్ధం చేస్తున్న దుర్యోధనుడిని కలిసి పాండవ గజసైన్యాన్ని చంపేయత్నం చేశాడు. వారి ప్రయత్నాన్ని చూచి అర్జునుడు దుర్యోధనుడివైపు రథాన్ని నడిపించుమని కృష్ణుడిని కోరాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'కృష్ణా! యుద్ధం ఆగకుండా పద్దెనిమిది రోజులు సాగింది. సముద్రంవలె ఉన్న కౌరవసైన్యం గోష్పాదమంత అయింది. కౌరవులే మూర్ఖులై ఈ యుద్ధాన్ని ప్రారంభించారు. భీష్ముడు పడినప్పుడైనా వారు యుద్ధం మాని ఉండవలసింది. భీష్ముడు దుర్యోధనుడికి అనునయంగా చెప్పాడు కూడా. ద్రోణాచార్యుడూ, భగదత్తుడూ, సైంధవుడూ, దుశ్శాసనుడూ, కర్ణుడూ, చివరకు శల్యుడూ చనిపోవటం చూచిన తరువాతైనా వారికి వివేకోదయం కాలేదు. ఇప్పటికైనా ధర్మరాజుకు రాజ్యభాగ మిచ్చి ప్రాణం రక్షించుకొనడు. దుర్యోధనుడు నిజంగా మూర్ఖుడివలె ఉన్నాడు' అని అర్జునుడు అన్నాడు. 'కుత్సితుడైన దుర్యోధనుడు ముక్కున ఊపిరి ఉండగా రాజ్యభాగం ఇవ్వడు. అంతేకాక అతడు పుట్టినప్పుడు మునులు 'ఈ పాపాత్ముడు నిఖిల క్షత్రియ క్షయ హేతువు' అని ఆదేశించారు కదా!' అని కృష్ణు డన్నాడు. 'ఆ మునులు చెప్పినట్లుగానే జరిగింది. బ్రతికి ఉన్నవారిని చంపించి తాను చచ్చిగాని ధర్మరాజుకు రాజ్యం వదలడు. ఇది నిశ్చయం. దురహంకారి అయిన దుర్యోధనుడు తన నిస్సహాయతను గమనించి కూడా పంతం వదలటంలేదు. ఇతడిని ఇంక చంపి తీరుతాను' అని అర్జునుడు రథాన్ని ముందుకు సాగించాడు.

5. ద్వైపాయన హ్రదంలో దాగిన దుర్యోధనుడు:

అర్జునుడు సైన్యాన్ని నుగ్గునుగ్గుచేస్తూ పారిపోయేటట్లు చేశాడు. దుర్యోధనుడు వారిని ప్రోత్సహిస్తూ మరల యుద్ధం సాగించాడు. ధృష్టద్యుమ్నుడిని కలతపరచాడు. అతడు దుర్యోధనుడి రథాన్ని కూలగొట్టాడు. రారాజు రథాన్ని దిగి ఉత్తమాశ్వాన్ని అధిరోహించాడు. ఏనుగుల గుంపును అర్జునుడిమీదకు ఉసికొల్పాడు. అర్జునుడు బాణాలతో, భీముడు గదాదండంతో, ధృష్టద్యుమ్నాదులు బాహుబలాలతో కౌరవసేనను కూలగొట్టారు. ఒంటరిగా వ్యూహాన్ని ఆలోచిస్తున్న దుర్యోధనుడిని చంపండి- అని కృష్ణుడు అర్జునుడికి సూచించాడు. అంతలో శకునీ, సుశర్ముడూ అర్జునుడిని ఎదుర్కొన్నారు. దుర్యోధనుడి తమ్ముడు సుదర్శనుడూ రణంలో చనిపోయాడు. ఉలూకుడిని సహదేవుడు చంపాడు. కొడుకు చావుకు కుమిలిపోయిన శకునిని వెంటాడి బల్లెంతో తల నరికి చంపాడు. కౌరవుల కుతంత్రాలకు మూలమైన శకుని మరణించటంవలన పాండవులందరూ సంతోషించారు. దుర్యోధనుడు తన చుట్టూ నిలిచి పోరాడేవారు లేక, ఎదుట పాండవులు హర్షోత్సాహాలతో ఉండటం సహించలేక యుద్ధభూమినుండి తొలగిపోవటానికి నిశ్చయించుకొన్నాడు. గుర్రం దిగి, గద భుజంమీద ధరించి, ఏకాదశాక్షౌహిణీపతి పరివార రహితుడై వెడలి, ద్వైపాయన హ్రదం చేరి, జలస్తంభన విద్యా ప్రభావంతో అందులో దాగుకొన్నాడు.

యుద్ధంలో చావకుండా కృపాశ్వత్థామ కృతవర్మలు మిగిలారు. ఆ సమయంలో ధృష్టద్యుమ్నుడు సంజయుడిని పట్టుకొన్న సాత్యకిని చూచి వారించాడు. అయినా సాత్యకి సంజయుడిని తల నరుక పోగా వ్యాసమహర్షి ప్రత్యక్షమై సంజయుడి వధను వారించాడు. సంజయుడు దుర్యోధనుడిని దర్శించుకొన్నాడు. ప్రాణాలతో ఉన్నావారు ముగ్గురు రథికులే అన్న విషయాన్ని తెలియపరిచాడు. దుర్యోధనుడు నిట్టూర్చి తన తండ్రికి అతడి ద్వారా సందేశాన్ని పంపాడు. 'ధృతరాష్ట్ర మహారాజా! నీ వైపువారంతా చనిపోయారు. పాండవులు, వారి ఆప్తులూ జీవించి ఉన్నారు. దెబ్బలు తిని నేను చావకుండా పాండవులబారి నుండి తప్పించుకొన్నాను. పాండవులు రాజ్యాన్ని తీసికొని నాకు కొంతభాగం ఇస్తామన్నా నాకు ఆ ఎంగిలి కూడు వద్దు. తమ్ములూ, కొడుకులూ, సేవకులూ అందరూ పోయిన తరువాత నేను సంతోషంతో ఉండగలనా? కాబట్టి ఈ మడుగులో కొంతకాలం దాగి, అనుకూల సమయంలో ఎక్కడికైనా పోయి, ఏదో విధంగా నా పగ తీర్చికొంటాను' అని సంజయుడి ద్వారా తన సందేశాన్ని పంపాడు. జలస్తంభన శక్తితో మడుగులోకి దూరి గుప్తంగా దాగి ఉన్నాడు.

కృపాచార్యుడికీ, కృతవర్మకూ సంజయుడు కనపడి జరిగిన సంగతి అంతా తెలియచెప్పాడు. దుర్యోధనుడి దీనస్థితికి వారు చింతించారు. బంధువుల శవాలను చూచి దుఃఖించే స్త్రీల ఆర్తనాదాలు పెరిగాయి. యుయుత్సుడు ధర్మరాజు అనుమతితో వారినందరినీ హస్తినాపురానికి తీసికొనిపోయాడు. పాండవులు దుర్యోధనుడిని అన్వేషిస్తూ కొలనుప్రాంతానికి వచ్చి అక్కడ అతడు కనపడక పోవటంతో తిరిగివెళ్ళాడు.

పాండవులు వెళ్ళగానే కృప కృతవర్మ అశ్వత్థామలు దుర్యోధనుడు దాగి ఉన్న కొలను సమీపించి అతడిని పిలిచారు. అతడు అలసి ఉండటంచేత మరునాడు కలుద్దామని చెప్పాడు. అశ్వత్థామ పౌరుషంతో 'దాగటం పిరికివారి లక్షణం, దాడిచేయటం వీరలక్షణం. నా పగ తీరేటట్లు నేను పాండవులను చంపి నా తండ్రికి సంతోషం కలిగిస్తాను' అని రారాజుతో పలికాడు.

పాండవ గూఢచారులలో ఒకడైన భీముడి బోయవాడు వారి సంభాషణలు విని భీముడికీ, ధర్మరాజుకూ దుర్యోధనుడు దాగి ఉన్న ద్వైపాయన హ్రదం గురించి చెప్పాడు. వా రాసంగతి శ్రీకృష్ణుడికి తెలిపారు. అందరూ కలిసి హ్రదం వద్దకు చేరారు. వారి కోలాహలం విని దుర్యోధనుడి అనుమతితో రథికత్రయం అప్పటికి పోరుమాని రహస్యస్థలంలో ఉండటానికి వెళ్ళారు. సంజయుడు ప్రక్కనున్న పొదలలో దాగి ఉన్నాడు. పాండవులు హర్షోత్సాహాలతో ఆ కొలని వద్దకు వచ్చారు. దుర్యోధనుడి మాయాశక్తిని గుర్తించారు.

6. ధర్మజ దుర్యోధన సంవాదం :

ధర్మ : కృష్ణా! దుర్యోధనుడు మాయావిద్యా శక్తిచేత నీటిలో నిశ్చింతగా దాగి ఉన్నా, దేవేంద్రుడే వచ్చి ఇతడికి సహాయపడినా, నా చేతిలో వీడికి చావు తప్పదు.

శ్రీకృష్ణ : (సన్నని స్వరంతో) మాయావులను మోసంతోనే చంపాలి, రాక్షసులను విష్ణువు, ఇంద్రుడూ తగిన మాయోపాయాలతో చంపలేదా? కాబట్టి దుర్యోధనుడు నీటినుండి బయటకు వచ్చే ఉపాయం ఆలోచించుము.

ధర్మ : (దుర్యోధనుడిని ఉద్దేశించి) సుయోధనా! ఇది నీకు తగిన పనేనా? భూమండలంలో ఇంతటి దురవస్థ ఎక్కడా చూడలేదు. నీ కొరకు లెక్కలేనంత మంది రాజులు, బంధువులు, మిత్రులు, సేనలు నేల కొరిగారు. వారందరి త్యాగాలూ చావులూ వృథా అయ్యేటట్లు నీవు మాత్రం క్షేమంగా ఉందామని నీటిలో దాగావా? ఒకవేళ ఇట్లా దాగుకొన్నా చావు తప్పుతుందా? నీవు మహారాజువు కదా! ఇది వీర ధర్మమా? గొప్పదైన కౌరవశంశంలో పుట్టి ఇటువంటి దైన్యానికి పాలుపడటం వంశగౌరవమా? నిన్ను చూచి శత్రువులు నవ్వరా? రాజధర్మం వదలితే నీకు ఇహపరాలు ఉండవు. ఆనాడు నిండు సభలో నీవు పలికిన మాటలు నీ ప్రాణాలను తప్పక బలిగొంటాయి. ప్రాణం కంటె మానం గొప్పది కదా! నీ తీరు అభిమానానికి అవమానం కలిగిస్తున్నది. నీవు నమ్ముకొన్న కర్ణశకుని దుశ్శాసనుల వలననే నీ కీ అవమానం కలిగింది. ఇంక ఎక్కడికి తప్పించుకొని పోగలవు? మగతనంతో యుద్ధానికి సిద్ధం కమ్ము. యశస్సో, మృత్యువో తేల్చుకొమ్ము. యుద్ధంలో నీవు మమ్మల్ని జయిస్తే భూవలయాన్ని పాలించుము. చనిపోతే స్వర్గసుఖాలు అనుభవిస్తావు.

దుర్యో : ధర్మరాజా! మానవుడు ప్రాణభయం పొందటంలో ఆశ్చర్యం లేదు. నాకు ఇప్పుడు పరివారం లేదు. ఆప్తులూ, స్నేహితులూ లేరు. అస్త్రశస్త్రాలు లేవు. వాహనాదులు లేవు. సాయుధ బలాలూ లేవు. యుద్ధంలో తగిలిన దెబ్బలవలన నేను అలసి ఉన్నాను. అలసట తీరిన తరువాత యుద్ధం చేస్తాను. మీరూ కొంత విశ్రాంతి తీసికొని రండి.

ధర్మ : మేము ఇంతదాకా విశ్రాంతి తీసుకొన్నాము. అలసట తీరింది. నిన్ను వెదకి కనుగొన్నాము. నీకూ దాహం తీరింది. ఇక యుద్ధానికి సిద్ధం కమ్ము.

దుర్యో : ఎవరికొరకు రాజ్యాలనూ భోగాలనూ కోరుకొంటామో ఆ కుమారులూ, తమ్ములూ, బంధువులూ అందరూ పోయారు. ఇక యుద్ధ మెందుకు? ఒకవేళ మీ వారిని చంపి విజయం సాధించినా కర్ణభీష్మద్రోణులు లేని రాజ్యం నాకు సంతోషాన్ని కలిగిస్తుందా? తనవారితో కలిసి భోగించలేని సంపద తనివి తీర్చదు. నీ వారు బ్రతికి ఉన్నారు కాబట్టి నీవే రాజ్యభోగాన్ని అనుభవించుము. గుర్రాలూ, ఏనుగులూ లేని ఈ బీడువంటి రాజ్యాన్ని నీ తలకు చుట్టుకొనుము.

ధర్మ : (నవ్వుతూ) ఎందుకు ఈ ప్రేలాపనలు? నీవారంతా పోయిన తరువాత కూడా శల్యుడిని సేనాపతి చేసికొని మమ్మల్ని గెలిచి రాజ్యాన్ని పాలించాలని ఆశపడలేదా? అయినా, నాకు రాజ్యదానం చేస్తానన్నావు. నీవు ఎవడవు ఇవ్వటానికి? నీ కేమి అధికారం ఉన్నది ఇప్పుడు? శ్రీకృష్ణుడు సంధిచేసికొని భాగమిమ్ము అన్నప్పుడు నీవు ఇవ్వక ఈ దీనస్థితికి వచ్చావు. శత్రువులకు రాజ్యదానం చేసే వెర్రివాడు లోకంలో ఉండడు. కాబట్టి యుద్ధమే నీ

ధర్మం. ఇప్పుడు నీ ప్రాణాలు నా చేతులలో ఉన్నాయి. నా జీవితం నీ చేతిలో ఉన్నది. నీవు లక్కయిల్లు కాల్చావు, పాములతో కరిపించావు. నీళ్ళలో త్రోయించావు. విషం కలిపిన అన్నం పెట్టించావు. ఇట్లా ఎన్ని కపటోపాయాలు చేసినా మేము నశించలేదు. అందువలన ఇక మాయోపాయాలవలన ప్రయోజనం లేదు. ఇంకా దాగి ఉండటం ఎందుకు? బయటపడి యుద్ధం చేయుము.

దుర్యో : (చీకాకుపడి) మీరందరు బంధుమిత్రులతో కూడి ఉన్నారు. నేను ఒంటరివాడిని, నాకు సేనలు లేవు. ఎట్లా యుద్ధం చేయగలను? అంతేకాక దెబ్బలతో అలసి ఉన్నాను. అయినా మీలో ఒక్కొక్కరు వచ్చి పోరాడండి. నేను ప్రాదం వెలువడి వచ్చి మిమ్ములను వరుసగా చంపుతాను. అనేకులు ఒక్కుమ్మడిగా దాడిచేసి ఒక్కడితో యుద్ధం చేయటం న్యాయమా? మీరు ఈ కట్టడికి సమర్థులు కాకపోతే - నేనే మీ అందరినీ మట్టు పెట్టుతాను. భీష్మద్రోణాదుల ఋణం తీర్చుకొంటాను. ఇట్లా అనటం శ్రీకృష్ణుడినీ మిమ్ములనూ చూచి భయపడి కాదు. యుద్ధనీతిని అందరికీ తెలియచెప్పటానికి.

ధర్మ : సుయోధనా! నీ యుద్ధనీతి హర్షించతగిందే. నీ వొక్కడివే మా అందరిని భుజబలంతో చంపుతా నంటున్నావు. అయినా, నేను యుద్ధ ధర్మాన్ని ఎందుకు విడుస్తాను? నీకు కావలసిన అస్త్రశస్త్రాల నిస్తాను. మాలో ఒక్కడే నీతో యుద్ధంచేసి జయిస్తాడు. అతడిని నీవు ఓడించగలిగితే రాజ్యమంతా నీవే తీసికొని పరిపాలించుము.

దుర్యో : నేను గదాయుద్ధం చేస్తాను. నిన్నూ, నీ సోదరులను, వీరులను నా గదతోనే మట్టుపెట్టుతాను.

ధర్మ : సరే! రమ్ము. నేను ఒక్కడనే గదతో అకుంఠిత బలాన్ని ప్రదర్శించి నీ ప్రాణాలు తీస్తాను.

ధర్మరాజు మాటలు విని దుర్యోధనుడు మనసు కలతపడగా పుట్టలోనుండి వెలువడ్డ మహాసర్పంవలె మహాపౌరుషంతో కొలనునుండి బయటకు వెలువడ్డాడు. చూచేవారికి కాలదండం చేతపట్టిన యముడివలె భయం కలిగించాడు. పాండవులందరు కలిసి అతడిని చూచి నవ్వారు. అతడు మండిపడి వారిని యుద్ధంలో చంపుతానని హుంకరించాడు. అయినా, పాండవులందరూ కలిసి తనపై దాడిచేసి చంపుతారేమో అని భయపడి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

దుర్యో : ఒక్కరొక్కరే పోరుకు రండి. మీరు చాలమంది ఉన్నారు. నేను ఒక్కడనే కత్తివేటులతో డస్సి ఉన్నాను.

ధర్మ : ఆనాడు యుద్ధంలో అభిమన్యుడు బాలుడై ఉన్నా, ఒంటరిగా పోరుతున్నా, ప్రౌఢవీరులైన అనేకులు ఒక్కుమ్మడిగా దాడిచేసి ఏ న్యాయంతో చంపారో - ఇప్పుడు కూడా అదే న్యాయం చెల్లుతుందని గ్రహించుము. (ఆ మాట విని నిరుత్తరు డయ్యాడు దుర్యోధనుడు). అది నీకు న్యాయం కావచ్చునేమో కాని నాకు కాదు. నీకు తగిన శిరస్త్రాణాన్నీ, కవచాన్నీ ఇస్తాను. మా అయిదుగురిలో ఒకరిని ఎన్నుకొమ్ము. అతడు నీతో యుద్ధం చేస్తాడు. వాడిని చంపి అఖండరాజ్యాన్నీ ఏలుకొమ్ము. లేదా వాడిచేతిలో చచ్చి వీరస్వర్గం పొందుము. నే నీ కట్టడి చేస్తున్నాను. ఒక్కటి వినుము. నిన్ను ప్రాణాలతో పోనివ్వను. యుద్ధానికి కావలసిన సౌకర్యాలన్నీ కలిగిస్తాను. అన్నదమ్ముల కుండే బంధుత్వానికి దీనివలన ఇబ్బంది ఉండదు.

దుర్యోధనుడు తనకు దగిన సువర్ణ శిరస్త్రాణాన్నీ, కవచాన్నీ ఎన్నుకొన్నాడు. వాటిని ధరించి మేరుపర్వతంవలె మెరసిపోయాడు. పాండవులలో ఎవరైనా గదతో యుద్ధంచేయండి అని ఎలుగెత్తి పిలిచాడు.

శ్రీకృష్ణ : ధర్మరాజా! దుర్యోధనుడు గదాయుద్ధానికి పిలిస్తే పాండవులు వివేకం కోల్పోయి ఒప్పుకొన్నారని లోకం అనుకొంటుంది. శత్రువులపట్ల అతిదయ పనికిరాదు. ఒకడిని చంపితే భూమినంతా తీసికొను మని అనటం నీవు శకుని జూదంలో రాజ్యాన్నంతా ఒక్కసారి పందెం కాచి ఓడినట్లే ఉన్నది. యుద్ధం జూదం కాదు.

భీముడు : శ్రీకృష్ణా! గద నా చేతిలో ఉంటే పదునాల్గు లోకాలను మట్టుపెట్టగలను. దుర్యోధనుడి బడాయిమాటల కేమి? అతడు నాకంట పడి ప్రాణాలతో పోగలడా?

శ్రీకృష్ణ : భీమా! బకుడిని, హిడింబుడిని, జరాసంధుడిని - ఇట్లా బలగర్వితులను ఎందరినో చంపావు. ఇత డొక లెక్కా? (దుర్యోధనుడివైపు క్రీగంటి చూపు ప్రసరిస్తూ) నీవు విజృంభించి దుశ్శాసనుడి రొమ్మును చీల్చి నెత్తురు త్రాగినప్పుడు కళ్ళు ఒప్పగించి చూస్తూ భయంతో ఈ దుర్యోధనుడు నోరు నొక్కుకొన్నాడు. అలనాడు నిండుసభలో ద్రౌపదిని అవమానించినప్పుడు నీవు చేసిన ప్రతిజ్ఞలలో ఒకటి తీర్చుకొన్నావు. ఈ రెండవ ప్రతిజ్ఞను కూడా పౌరుషంతో తీర్చికొమ్ము. ధర్మరాజుకు పట్టం కట్టుము. నీవు గదతో విజృంభించుము. దుర్యోధనుడు హతుడౌతాడు. దానికి నేను బాధ్యుడను. భీమా! మరొక మాట. దుర్యోధనుడు మహాబలవంతుడు బాగా వ్యాయామం చేశాడు. నీవు ప్రయత్న పూర్వకంగా యుద్ధం చేయాలి సుమా! ఇది నా హెచ్చరిక!

భీముడు : (ఉత్సాహంతో ధర్మరాజును ఉద్దేశించి) అగ్రజా! వినుము. అర్జునుడు ఖాండవాన్ని దహించినట్లుగా నేనీ వంశనాశకుడిని చుట్టుముట్టి చంపుతాను. రాజ్యాధికారాన్ని నీకు కట్టపెట్టుతాను. శకుని మాయోపాయం తనకే బెడిసికొట్టిందని కొడుకు మరణవార్త విని ఆ గ్రుడ్డిరాజు దుఃఖిస్తాడు. (అని దుర్యోధనుడికి ఎదురుగా నిలబడి) నీవు చేసేవి క్రూర కర్మలని తలంచకుండా లక్కయింటికి నిప్పుపెట్టించావు. మాయాజూదంలో ధర్మరాజును ఓడించావు. నిండుసభలో ద్రౌపదిని అవమానించావు. వాటన్నిటి ఫలాన్నీ ఇప్పుడు అనుభవిస్తావు. పెక్కుమాట లెందుకు? యుద్ధానికి రమ్ము.

దుర్యో : భీమా! గదాయుద్ధంలో ఇంద్రుడు కూడా నన్ను ఎదుర్కొనలేడు. నీవు ఒక లెక్కా? అయితే నీవు ధర్మం తప్పకుండా యుద్ధం చేసి, ప్రాణాలతో తప్పుకొనుము. చూద్దాం.

భీమ దుర్యోధనుల విజృంభణ చూచి అక్కడ కూడి ఉన్న రాజకుమారులందరూ హర్షించారు. అంతలో బలరాముడు తన శిష్యులైన భీమ దుర్యోధనుల గదాయుద్ధాన్ని చూడాలని తీర్థయాత్రలను ముగించుకొని అక్కడికి వచ్చి సత్కారాలను పొంది ఆసక్తితో యుద్ధ దర్శనోత్సాహాన్ని ప్రకటించాడు.

7. భీమదుర్యోధనుల గదాయుద్ధం:

దుర్యోధనుడి కోరిక ప్రకారం గదాయుద్ధం శమంత పంచక సమీపంలోని కురుక్షేత్ర యుద్ధభూమిలో ప్రవర్తిల్లటానికి నిశ్చయించారు. ధర్మరాజు చూడవచ్చిన రాజులందరినీ క్రమశిక్షణతో వ్యవహరించేటట్లు నిర్దేశించి కూర్చుండబెట్టాడు. భీమ దుర్యోధనులు బలరాముడి ఆశీస్సులను పొంది రంగభూమిలో నిలిచారు. పరస్పరం కొరకొర చూచుకొంటూ యుద్ధోత్సాహాన్ని ప్రకటించారు. మొదట దుర్యోధనుడే భీముడిని యుద్ధానికి పిలిచాడు. అప్పుడు ఎన్నో అపశకునాలు కనపడ్డాయి. భీమ దుర్యోధనులు పరస్పర వీర పరుషవాక్యాలు మాటాడుకొన్నారు. తమ గొప్పలు తాము చెప్పుకొన్నారు. భీముడు ఎత్తినగదతో దుర్యోధనుడిపై దూకాడు. దుర్యోధనుడు ఉత్సాహంతో ఎదుర్కొన్నాడు. గదాయుద్ధం మహా భయంకరంగా సాగింది. అనేక విధాల వ్యూహాలతో పెనగటం సాగించారు. ఒకరివేటులను మరొకరు నేర్పుతో తప్పించుకొన్నారు. రౌద్రోల్లాసంతో కొట్టిన గదల దెబ్బలవలన నెత్తురులు కారగా సంధ్యామేఘాలవలె వారిరువురూ రాణించారు. దేవతలు వారి యుద్ధానికి ఆశ్చర్యపోయారు. వారిద్దరిలో ఎవరు గెలుస్తారో చెప్పలేని సందిగ్ధావస్థలో పడ్డారు. దుర్యోధనుడి దెబ్బలకు భీముడు మూర్ఛపోయాడు. అతడు చనిపోయాడని భ్రమించి దుర్యోధనుడు సింహనాదం చేశాడు. దేవతలు పూలవాన కురిపించారు. భీముడు తేరుకొని అతడిని నేలపై పడవేశాడు.

అప్పుడు అర్జునుడు భీమదుర్యోధనుల బలతారతమ్యాన్ని గురించి శ్రీకృష్ణుడి నడిగాడు. 'గురూపదేశం ఇరువురికీ సమానమే అయినా, భీముడికి శరీరబలం ఎక్కువ. దుర్యోధనుడికి నేర్పరితనం ఎక్కువ. అందువలన నేర్పరి అయిన దుర్యోధనుడి వలన భీముడు దెబ్బలు తినవలసి వచ్చింది. మాయదారిని మాయోపాయంతో మట్టుపెట్టటమే న్యాయ' మని నిర్ణయించి దుర్యోధనుడి తొడలు విరుగగొట్టుతానని భీముడు చేసిన శపథాన్ని అర్జునుడి సైగలతో అతడికి సూచింపచేశాడు కృష్ణుడు. భీముడు దానిని గ్రహించి, ఆ పనిని ప్రాణంమీదకు వచ్చినప్పుడు చేయ నిశ్చయించాడు. భీముడి గదాఘాతాన్ని నేర్పుగా దుర్యోధనుడు తప్పించుకొన్నాడు. అతడు తిరిగి భీమసేనుడిని కొట్టాడు. అతడు సొమ్మసిల్లాడు. దానిని గుర్తించక

దుర్యోధనుడు భీముడిపైకి తిరిగి దూకాడు. భీముడు స్వీయరక్షణార్థం దుర్యోధనుడి తొడలపై గదతో మోదాడు. వజ్రపాతంతో కొండచరియ విరిగి పడినట్లుగా దుర్యోధనుడు తొడలు విరిగి నేలమీద కూలాడు. భీముడు కోపంతో అతడిని చూచి 'ఏకవస్త్ర అయి ఉన్న ద్రౌపదిని ఆ విధంగా నిండు సభకు లాగి అవమానించిన పాపానికి ఫలం అనుభవించు' మని ఎడమకాలితో అతడి తలను గట్టిగా తన్నాడు. అంతటితో అతడికి కసి తీరక మరల అతడి ముఖం చూచి 'బంధుద్రోహీ! ఆనాడు మమ్ములను పశువులని అవహేళన చేస్తూ అరిచావు. ఇప్పుడు మేము క్షత్రధర్మం ప్రకాశించగా మిమ్మల్ని పశువులని పిలుస్తున్నాను. ఇది మాయాద్యూతం కాదు. భుజబలంతో శత్రువుల గర్వాన్ని అణచటం. (అని పలికి ధర్మజ శ్రీకృష్ణాదులవైపు తిరిగి) మమ్ములను గొడ్డువోయిన వారని పరుషంగా నిందించిన కౌరవులను బంధుమిత్ర పరివార సమేతంగా యుద్ధంలో చంపాము. దీనివలన మాకు స్వర్గమైనా, నరకమైనా సమానమే.'

అంటూ భీముడు గదను తీసికొని దుర్యోధనుడి మెడను అదిమిపట్టి అతడి తలను మరల తన్నాడు. ధర్మరాజు వారించి అతడి పొగరుబోతుతనాన్ని అధిక్షేపించాడు. అతడి పనిని లోకం మెచ్చదని గర్హించాడు. ధర్మనీతి వర్తనులైన పాండవులు చేయదగని అనుచిత కార్యమని మందలించాడు. కన్నీరు నిండగా దుర్యోధనుడిని సమీపించి అతడి అధర్మత్వం, అత్యాశ, అవివేకం, గర్వం కారణంగా బంధునాశనం జరిగిందనీ, కౌరవుల భార్యలకు వైధవ్యం ఏర్పడిందనీ దుఃఖించాడు.

గదాయుద్ధంలో బొడ్డుక్రింది భాగంలో మోదకూడదన్న న్యాయాన్ని పాటించనందుకు కోపగించి బలరాముడు భీముడి చర్యను నిందించి దండించబోయాడు. శ్రీకృష్ణుడు అతడిని వారించి రాజులకు ప్రతిజ్ఞ నెరవేర్చటం ఉత్తమ ధర్మమనీ, మైత్రేయ ముని శాపంవలన దుర్యోధనుడి తొడలు విరుగలసి ఉన్నదనీ తెలిపాడు. బలరాముడు దానిని పూర్తిగా అంగీకరించకపోయినా, ధర్మం తప్పకుండ యుద్ధం చేసిన దుర్యోధనుడికి ఉత్తమ లోకాలు కలుగుతాయనీ, భీముడికి కీర్తి కలుగుతుందనీ పలికి వెంటనే రథమెక్కి వెళ్ళిపోయాడు. భీముడు ధర్మరాజును నిస్సంశయంగా రాజ్యభారం వహించుమని కోరాడు. ధర్మరాజు శ్రీకృష్ణుడి దివ్య సంకల్పాన్నీ, భీముడి బల ప్రదర్శననూ కీర్తించాడు. భీమ పరాక్రమాన్ని వీరులందరు ప్రశంసించారు.

8. శ్రీకృష్ణ దుర్యోధనుల సంవాదం:

దుర్యోధనుడి తొడలు విరుగగొట్టటం ధర్మమా అధర్మమా అనే మీమాంసలో చిక్కుకొన్న రాజులనందరినీ ఉద్దేశించి శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు. - 'భీముడు అధర్మ యుద్ధం చేశా డనవద్దు. పతివ్రత అయిన స్త్రీని కనికరం లేకుండా అంతగా అవమానం చేసినా సహించి ధర్మరాజు తన తండ్రిపాలు తనకు ఇమ్మని అడిగాడు. దుర్యోధనుడు ఆ ధర్మాన్ని నిర్వర్తించలేదు. అందువలన సుయోధనుడు మోసగాడు. అతడికి ఆ చావు తగిందే. విదురాదు లెందరో హితవు చెప్పారు. వినలేదు. భీముడి ప్రతినకు లోనైతే అది అధర్మ మౌతుందా? కూకటివేళ్ళతో కూలిన చెట్టువలె భూమిమీద పడి ఉన్న ఈ పాపాత్ముడి విషయంలో ధర్మాధర్మచింత లెందుకు? మీరందరూ రథా లెక్కి బయలుదేరండి' అన్నాడు.

దుర్యో : కంసదాసుడి కొడుకా! కృష్ణా! నీ దురాచారాలు గుర్తించకొనకుండా దయా దాక్షిణ్యాలు మాని మాట్లాడుతున్నావు. నీవు చెప్పగా అర్జునుడు చేసిన సైగను అందుకొని గదాయుద్ధ ధర్మాన్ని తప్పి భీముడు కొట్టాడు. న్యాయ యుద్ధంలో అయితే మిమ్ములనందరిని మట్టి కరిపించేవాడిని. శిఖండిని ముందుపెట్టుకొని అర్జునుడు భీష్ముడిని కూలదోశాడు. ద్రోణుడి వధకొరకు ధర్మరాజు అబద్ధమాడాడు. రథచక్రం భూమిలో కూరుకొనగా కర్ణుడిని పార్థుడు చంపాడు. వీటికి కారణం నీవే. భూరిశ్రవుడినీ, సైంధవుడినీ అర్జునుడిపాలబడేటట్లు చేసింది నీవే. నన్నూ, భీష్ముడినీ, ద్రోణుడినీ, కర్ణుడినీ, భూరిశ్రవస్సైంధవులనూ న్యాయం తప్పని యుద్ధంలో మీరు ఓడించగలరా? మాయదారి కృష్ణుడవు నీవు.

కృష్ణుడు : నీవు భీముడిని బాల్యంలో పాములచేత కరపించావు; అన్నంలో విషంపెట్టావు, నీట ముంచావు, చాలాసార్లు చంపయత్నించావు, పాండవులు నిద్రించే లక్క ఇల్లు తగులబెట్టావు, మాయాద్యూతంలో ధర్మరాజు సంపదలను హరించావు, ద్రౌపదిని నిండు సభలో అవమానించావు, నీ దుర్ణయాలకు అప్పుడే నిన్ను చంపి ఉండవలసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మరాజు ఆ కష్టాలన్నీ సహించి నా చేత సంధియత్నం చేయించాడు. నీవు ఆ యత్నాలను వమ్ము చేశావు. నీ లోభగుణం చేతనే భీష్మద్రోణాదులకు ప్రాణహాని కలిగింది. శిఖండి ధృష్టద్యుమ్నులు కారణజన్ములు. వారివలన భీష్మద్రోణులు పడిపోయారు. యుద్ధంలో అనేకులతో పోరి అలసి ఉన్న సాత్యకిని చంపబోయిన భూరిశ్రవుడిని చంపటం అన్యాయమా? అనేక ప్రౌఢవీరులు కలిసి అభిమన్యుడిని చంపటం న్యాయమా? చెల్లెలైన ద్రౌపదిని చెరపట్టదలచిన సైంధవుడిని చంపటం అధర్మమా? చంపకుండ అర్జునుడు అగ్నిలో ప్రవేశించటం న్యాయమా? ఘోషయాత్రలో నిన్ను గంధర్వులచెర నుండి తప్పించాడు అర్జునుడు. ఉత్తర గోగ్రహణంలో నిన్ను చంపక వదలిపెట్టాడు. కర్ణుడికి బ్రాహ్మణ శాపం వలన కలిగిన ముప్పునకు అర్జునుడు బాధ్యుడా? శల్యుడిని ధర్మరాజు అధర్మంగా చంపాడనలేదు నీవు. పాండవులు ధర్మవర్తనులు. నీవు పుట్టినప్పటినుండి ధర్మాన్ని గొడ్డలితో నరుకుతున్నావు. భీముడు నిన్నుగూర్చి చేసిన ప్రతిజ్ఞ నీకు తెలియదా? తొడలు గదతో మోదుతా నన్నాడు కాని పిడికిలితో పొడుస్తా నన్నాడా? నీవు తగిన జాగ్రత్త వహించవద్దా? వట్టి ప్రగల్భా లెందుకు? మాట్లాడకుము.

దుర్యో : వేదాలన్నీ చదివాను, యజ్ఞాలు చేశాను, సంపదలు గడించి రాజులు కొలువగా సంతోషించాను. దుర్మదాంధులైన శత్రువులను మర్దించాను. చివరకు మిత్రులతో బంధువులతో కలిసి స్వర్గానికి వెళ్ళుతున్నాను. ఇది ఒప్పదా? నీ దృష్టిలో నే నెటువంటి వాడనైనా నా కేమి? మీరంతా పశ్చాత్తాపంతో పరితపిస్తూనే ఉంటారు గాక!

దేవతలు దుర్యోధనుడి మీద పూలవాన కురిపించారు. దేవదుందుభులు మ్రోగాయి. దిక్కులన్నీ సుగంధయుతమైన గాలితో నిండిపోయాయి. భీష్మద్రోణ కర్ణ దుర్యోధనాదులను చంపిన తీరు ధర్మం కాదేమోనని పాండవులు సిగ్గుపడి బిక్కమొగాలు పెట్టారు. శ్రీకృష్ణుడు వారికి ధైర్యం చెప్పి, భీష్మాదుల బల విశేషాలనూ, దైవ నిర్ణయాలనూ తెలియచెప్పి, దేవతలు రాక్షసులను గెలిచే తీరువంటిదని పేర్కొని, సంతోష సమయంలో దుఃఖించవద్దన్నాడు. పాండవుల మనసులు కుదుటపడ్డాయి. పాండవులూ కృష్ణుడూ తమ తమ శంఖాల నూదారు. ధృష్టద్యుమ్నాదులు శిబిరాలకు వెళ్ళి ఆ రాత్రి విశ్రమించారు. మరునాడు హస్తినాపురానికి వెళ్ళాలని సంకల్పించి ధర్మజుడి అనుమతి తీసికొన్నారు. ధర్మరాజాదులు కౌరవ శిబిరానికి వెళ్ళారు.

కృష్ణార్జునుల రథం అక్కడికి చేరింది. శ్రీకృష్ణుడు అర్జునుడిని ఆయుధాలు ప్రక్కనబెట్టి అతడిని ముందుగా రథం దిగుమన్నాడు. ఆపైన ఆయన దిగుతానన్నాడు. గాండీవాన్నీ, తూణీరాల జంటనూ తీసికొని అర్జునుడు రథం దిగాడు. శ్రీకృష్ణుడు పగ్గాలు ముడిచి రథం దిగాడు. ధ్వజంమీద భూతగణం తొలగిపోయింది. తేరు మండిపోయింది. అర్జునుడు ఆశ్చర్యపడి కృష్ణుడిని దానికి కారణమడిగాడు. 'భీష్మద్రోణకర్ణాదులు ప్రయోగించిన బాణాల అగ్నులచేత రథం ఇదివరకే చుట్టబడింది. యుద్ధం అయిపోయింది కాబట్టి ఇప్పుడు దానిని కాలనిచ్చాను' అని గోవిందుడు చెప్పాడు. ధర్మజుడు కోరిన మేరకు పాండవులను రక్షించానని శ్రీకృష్ణుడు ప్రకటించాడు. దివ్యాస్త్రాగ్నులనుండి వారిని రక్షించి అనుగ్రహించినందుకు ధర్మరాజు గోవిందుడికి కృతజ్ఞతలు తెలిపాడు. కృష్ణు డేవైపు ఉంటే ఆ వైపు విజయం తథ్యమని వ్యాసుడి వాక్యాన్ని యుధిష్ఠిరుడు స్మరించాడు. శ్రీకృష్ణుడు అర్జునుడి ప్రతాపాన్ని ప్రశంసించాడు. పాడుపడిన కౌరవశిబిరంలో ఉండటం శ్రేయస్కరం కాదని రత్నరాశులను గ్రహించి శ్రీకృష్ణుడి వెంట ఓఘవతీ తీర్థం చేరి ఆ రాత్రి అక్కడ విశ్రమించారు.

9. శ్రీకృష్ణుడు గాంధారీ ధృతరాష్ట్రులను ఓదార్చటం:

ఆ రాత్రి ధర్మరాజు శ్రీకృష్ణుడిని హస్తినాపురానికి వెళ్ళిరమ్మని ప్రార్థించాడు. భీముడు దుర్యోధనుడిని యుద్ధంలో అధర్మంగా చంపాడని తెలిసి గాంధారి కోపించి పాండవులను శపిస్తుందేమో అన్న భయం కలిగి, ఆమెను శాంతింపజేయగల

మహితాత్ముడు శ్రీకృష్ణుడని భావించి ధర్మజుడు అతడిని పంపాడు. పంపింది ధృతరాష్ట్రుడి వద్దకైనా ప్రయోజనం గాంధారి కోపోపశమనమే.

శ్రీకృష్ణుడు హస్తినాపురికి పోయాడు; గాంధారీ సహితుడై పుత్రశోకంతో తపిస్తున్న ధృతరాష్ట్రుడిని దర్శించాడు. అప్పటికే వ్యాసమహర్షి అక్కడికి వచ్చి ఆ మహారాజును ఓదారుస్తున్నాడు. శ్రీకృష్ణుడు కూడ వ్యాసమహర్షికి నమస్కరించి ధృతరాష్ట్రుడి చేతులను తనచేతిలోకి తీసికొని కన్నీరు పెట్టుకొని, బొంగురుపోయిన గళంతో పలుకుతూ వంశమంతా నిష్కారణంగా నాశనమైనందుకు విచారం వ్యక్తంచేశాడు. తన రాయబారాన్నీ, ద్రౌపది అవమానాన్నీ, పాండవుల అరణ్య అజ్ఞాతవాస కష్టాలనూ, విదురాది బోధలనూ దుర్యోధనాదులు వినక రాజ్యభాగాన్ని పాండవులకు నిరాకరించిన అంశాలనూ పేర్కొన్నాడు. పాండవులు మోసపు మనసులు లేనివారనీ, ఇకపై గాంధారీ ధృతరాష్ట్రుల పరలోక క్రియలు పాండవులే నిర్వహించవలసి ఉంటుందనీ, అందువలన వారి మేలు కోరటం మంచిదని చెప్పి, ధర్మరాజు పొందుతున్న దుఃఖాన్ని గురించి వివరించాడు. గాంధారిని ఉద్దేశించి ఆమెవంటి సాధ్వీమణి లేదని కీర్తించి, ఎన్ని చెప్పినా వినక రాజ్యంలో భాగ మివ్వక దుర్యోధనుడు అవలంబించిన దుర్నీతి ఆ విపత్తుకు కారణమని పేర్కొని, ఆమె కోపంతో చూస్తే మూడు లోకాలు భస్మీపటలం ఔతాయని, కాబట్టి పాండవుల పట్ల వాత్సల్యాన్ని చూపాలని హితవు చెప్పి ఆమెను ఒప్పించాడు. అంతలో శ్రీకృష్ణుడి మనసులో అశ్వత్థామ సమరోత్సాహం గోచరించింది. వెంటనే బయలుదేరి పాండవుల వద్దకు వెళ్ళాడు. వ్యాసుడుకూడా ఉపశమన వాక్యాలు చెప్పి అంతర్ధాన మయ్యాడు.

సంజయుడు దుర్యోధనుడిని సందర్శించాడు. భీమాదులు యుద్ధంలో అనుసరించిన యుద్ధధర్మ విరుద్ధ మార్గాన్ని గురించి చెప్పి, వారికి అపకీర్తి కలుగుతుందని చెప్పి ధృతరాష్ట్రుడికి తెలియపరిచాడు. తొడలు విరిగి పడేంతవరకు ఇతరులకు తలవంచలేదనీ, శమంతపంచక ప్రాంతంలో ప్రాణాలు వదలితే పుణ్యలోకాలు కలుగుతాయనీ, మోసంతో పొందిన రాజ్యాన్ని పాండవులు పొందుతారనీ పేర్కొన్నాడు. ఆ విషయాలను అశ్వత్థామ, కృప, కృతవర్మలకు చెప్పుమని కోరాడు. అతడిని చూడటానికి వచ్చిన జనులు ఆ సంగతిని అశ్వత్థామాదులకు తెలియచెప్పారు.

10. అశ్వత్థామ విజృంభణం:

ఆ రథికత్రయం దుర్యోధనుడి వద్దకు వచ్చి అతడి దీనావస్థను చూచి దుఃఖించింది. అశ్వత్థామ అతడి పూర్వవైభవాన్ని ప్రస్తావించి పలవరించాడు. దుర్యోధనుడు గద్గదకంఠంతో సుఖదుఃఖాలు కావడి కుండల వంటివని పేర్కొని, ఎన్ని ఆపదలు వచ్చినా జంకక ధైర్యంతో యుద్ధంచేసే బంధువులు, స్నేహితులు, కుమారులు, సోదరులు యుద్ధంలో చనిపోగా తా నొక్కడే మిగిలినా వారిని చూచే భాగ్యం కలగటం అదృష్టంగా భావించాడు. విష్ణుమహిమ తెలిసి ఉన్నా నిర్భయంగా పగను సాధించటానికి పూనుకొని జయంకోరి వారు శౌర్యసంపదను ప్రదర్శించి పోరినందుకు హర్షం ప్రకటించి, విధివైపరీత్యానికి విచారించాడు. దుర్యోధనుడి దుఃస్థితిని గమనించిన అశ్వత్థామ రోషోద్రేకంతో ఇట్లా అన్నాడు. 'పాండవులు నా తండ్రిని ఆ విధంగా చంపినప్పుడే నాకు తీవ్రకోపం, తాపం కలిగాయి. ఇప్పుడు రారాజును నిన్ను కూల్చిన విధం నా మనసున మరీ మండిస్తున్నది. పాండవులను నా భయంకరాస్త్రాల వహ్నికి దగ్ధం చేస్తాను. మహారాజా! వినుము ఆ శ్రీకృష్ణుడు చూస్తుండగానే ధృష్టద్యుమ్నాది వీరుల నందరినీ మట్టుపెట్టుతాను. నన్ను ఆజ్ఞాపించుము' అన్నాడు. ఆ మాటలకు దుర్యోధనుడు సంతోషించి, కృపాచార్యులచేత కమండలు జలం తెప్పించి, అశ్వత్థామను సైన్యాధ్యక్షుడిగా అభిషేకించాడు. అతడు సంతోషించి దుర్యోధనుడిని కౌగిలించుకొని సింహనాదం చేసి కృప కృతవర్మలు వెంటరాగా పాండవ స్కంధావారంవైపు ప్రస్థానం సాగించాడు.

సౌప్తికపర్వ కథాసారం

అశ్వత్థామా, కృపాచార్యుడూ, కృతవర్మా పాండవశిబిరం వైపు నడిచారు. అక్కడ విజయోత్సాహం కోలాహలంగా సాగుతూ ఉన్నది. తాము గుర్తించబడతామేమో అనే భయంతో ఆ ముగ్గురూ సమీపారణ్యంలో ఒక మర్రిచెట్టుకింద శరీరాలు వాల్చారు. చీకటి పడింది. కృపుడూ, కృతవర్మా బాగా అలసిపోవటంచేత నిద్రపోయారు. కోపంచేత కాల్చబడిన మనస్సుగల అశ్వత్థామకు మాత్రం నిద్రపట్టలేదు. పాండవులమీద ఎట్లా పగదీర్చుకొనాలా అనే ఆలోచనలో పడి అతడు మర్రిచెట్టుకేసి చూశాడు. దాని కొమ్మలపై ఎన్నో కాకులు నిద్రపోతున్నాయి. అప్పుడు ఒక గ్రుడ్లగూబ అక్కడికి వచ్చి ఆ కాకుల నన్నిటినీ రకరకాలుగా చంపటం అశ్వత్థామ చూచి, అది తనకు కర్తవ్యోపదేశంగా భావించి, తాను కూడా అట్లాగే శత్రువులను ఆ రాత్రే నిద్రపోతే ఉన్న సమయంలో చంపటానికి నిశ్చయించుకొన్నాడు. కృపకృతవర్మను లేపి, తన నిశ్చయం చెప్పి, వాళ్ళ అభిప్రాయం అడిగాడు. కృపాచార్యుడు దానికి సమ్మతించక, ఎన్నో నీతులు చెప్పి, 'గాంధారీ ధృతరాష్ట్రుల దగ్గరకు వెళ్ళి, అక్కడ విదురుడు కూడా ఉంటాడు కాబట్టి, వాళ్ళు ముగ్గురూ ఎట్లా చెప్పితే అట్లా నడుచుకొందాం' అన్నాడు. అశ్వత్థామకు అతడి మాటలు నచ్చలేదు. 'నే నొక్కడినే ఆ కార్యం నిర్వహిస్తా' నని అశ్వత్థామ పట్టుపట్టగా, విధి లేక ఆ ఇద్దరూ అతడిని అనుగమించారు.

11. నడిరేయి నరహోమం:

ఇట్లా వెళ్ళే అశ్వత్థామ స్థిరసంకల్పాన్ని పరీక్షించటానికి ఈశ్వరుడు ఒక భయంకర భూతరూపంలో అతడి మార్గాన్ని నిరోధించాడు. అశ్వత్థామ ఆ పెనుభూతంపై ప్రయోగించిన బాణాలన్నీ వ్యర్థమయ్యాయి. చివరకు తీవ్రస్వభావుడైన ఆ అశ్వత్థామ ఆత్మోపహారానికి సంసిద్ధుడు కాగా శివుడు ప్రత్యక్షమై అతడి కొక మహనీయమైన ఖడ్గాన్ని ప్రసాదించాడు. అశ్వత్థామ సంతోషించి అప్రతిహతమైన ఆ ఖడ్గం సహాయంతో పాండవ సంహారానికి ఉద్యమించాడు. ఆ స్కంధావారం గుట్టుమట్టు అంతకుముందే తెలిసికొన్నవా డవటంచేత ముందుగా తన తండ్రిని చంపిన ధృష్టద్యుమ్నుడి శిబిరం ప్రవేశించి నిద్రిస్త ఉన్నవాడిని తన్ని లేపి, ఆక్రమించి, వింటి అల్లెత్రాడు అతడి కంఠానికి బిగించి ఉరిపోసి చంపాడు. పిశాచోన్మత్తుడైన ఆ వీరుడు క్రమంగా పాంచాలురను అందరినీ, ద్రౌపదేయులనూ, అసంఖ్యాక యోధులనూ నిద్రపోతూ ఉండగా నిర్దయుడై వధించాడు. మేలుకొని పారిపోవటానికి ప్రయత్నించే అభాగ్యులను శిబిరద్వారం దగ్గర ఉన్న కృప కృతవర్మలు అడ్డగించి చంపివేశాడు. పాండవులైదుగురూ, కృష్ణ సాత్యకులూ మాత్రం ఆ శిబిరంలో కనబడనందుకు అశ్వత్థామ విచారించాడు. అతడి రాక్షసావేశానికి, నీచ పరాక్రమానికి విచారిస్తూ కృప కృతవర్మలు తలలు వంచుకొని ఊరకున్నారు.

తరువాత ఆ ముగ్గురు యోధులూ తాము జరిపిన సంహార వృత్తాంతాన్ని వినిపించటానికి దుర్యోధనుడి దగ్గరకు పరుగెత్తారు. అతడు చనిపోవటానికి సిద్ధంగా ఉండి, తీవ్రవేదన పొందుతూ, ఇప్పుడో ఇకనో అన్నట్లుగా ఉన్నాడు. అతడి దీనస్థితిని చూచి వాళ్ళు చాలా బాధపడ్డారు. అశ్వత్థామ దుర్యోధనుడికి ఎంతో కీర్తిని సంపాదించిపెట్టిన అతడి గదాయుద్ధ కౌశలాన్ని ప్రశంసించి, 'నీ కొరకు బాధపడకుము. నీవు పుణ్యలోకానికి పోయినప్పుడు నా తండ్రి అయిన ద్రోణుడిని చూచి ద్రోహి అయిన ధృష్టద్యుమ్నుడిని నీ కొడుకు చంపాడని చెప్పుము' అని విన్నవించాడు. ఉపపాండవ, పాంచాలాదుల మరణం విని దుర్యోధనుడు సంతోషించి, 'భీష్మ ద్రోణులు కాని, కర్ణశల్యులు కాని మీవలె నాకు మేలు చేయలేదు. సుఖంగా ఉండండి, మనకు పునర్దర్శనం స్వర్గ లోకంలో అవుతుంది. వెళ్ళండి' అని పలికి ప్రాణం విడిచిపెట్టాడు. రథికులు ముగ్గురూ దుఃఖంతో అతడికి ప్రదక్షిణం చేసి తిరిగి తిరిగి చూస్తూ రథారూఢులై వెళ్ళిపోయారు.

ఈ వృత్తాంతం అంతటినీ సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పి 'యుద్ధ ప్రకారం అంతా నీకు చెప్పటానికి వ్యాసమునీంద్రుడు నన్ను నియోగించి ఇచ్చిన దివ్యదర్శనత్వం నీ కొడుకుతో పాటు పోయింది. ఇంక నా కా శక్తి లే' దని చెప్పి వెళ్ళిపోయాడు.

12. అశ్వత్థామ శిరోరత్నం:

మర్నాడు సూర్యోదయ సమయంలో ధృష్టద్యుమ్నుడి సారథి పాండవుల వద్దకు వచ్చి రాత్రి జరిగిన దారుణవధ క్రమం అంతా చెప్పాడు. ధర్మరాజాదులు మూర్ఛిల్లి, కొంతసేపటికి తెలిసి, మిక్కిలి విలపించారు. సముద్రమంతా దాటి చిన్న క్రయ్యలో మునిగిపోయినట్లు అయిందని ధర్మరాజు దుఃఖించాడు. అతడు ద్రౌపదికి ఈ దుఃఖవార్తను చెప్పటానికి నకులుడిని పంపాడు. ద్రౌపది ద్రుపద విరాటులు మరణించిన నాటి రాత్రి వారి భార్యలను ఓదార్చటానికి సుభద్రతోనూ, ఉత్తరతోనూ కలిసి మాత్స్య నగరానికి వెళ్ళింది. నకులుడు ఉపప్లావ్యపురానికి వెళ్ళి ద్రౌపదికి ఈ దుఃఖవార్త చెప్పి, ఆమెనీ, ఇతర స్త్రీ జనాన్నీ తీసికొని వచ్చాడు. ఆత్మపుత్ర వినాశనానికి దుఃఖించే ద్రౌపదిని 'క్షత్రియకాంత సంతానం యుద్ధంలో వీర మరణం పొందటం సముచితమే కదా!' అని ధర్మరాజు ఊరడించాడు. 'దుర్మార్గుడైన అశ్వత్థామను చంపవలసిందే. కాని, అతడు అడవికి పోయి ఉంటాడు. అతడిని చంపటం నీ కెట్లా తెలుస్తుంది?' అని ధర్మరాజు అనగా ద్రౌపది 'అశ్వత్థామకు సహజమైన శిరోరత్నాన్ని తెచ్చి చూపితే జీవంతో ఉంటా'నని భీముడిని హెచ్చరించింది. వెంటనే అతడు నకుల సహాయుడై రథం ఎక్కి అశ్వత్థామను అన్వేషించటానికి బయలుదేరాడు. 'అశ్వత్థామ అజేయ పరాక్రముడు. క్రూరుడు, వాడి దగ్గర లోకభయంకరమైన బ్రహ్మశిరో నామకాస్త్రం ఉన్నది. భీముడిని ఒక్కడినీ పంపటం క్షేమకరంకా'దని శ్రీకృష్ణుడు ధర్మరాజుకు చెప్పాడు. అప్పుడు సహదేవసాత్యకులను స్కంధావార రక్షణకై నియోగించి ధర్మరాజూ, శ్రీకృష్ణుడూ, అర్జునుడూ భీముడికి సాయపడటానికి వెళ్ళారు. పలాయితుడైన అశ్వత్థామను వ్యాసుడి ఆశ్రమానికి సమీప ప్రదేశంలో తపస్సు చేస్తుండగా పట్టుకొన్నారు. పాండవవీరులను చూచి అశ్వత్థామ భయక్రోధాలతో బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ఒక గడ్డి పరకయందు ఆవహింపజేసి ప్రయోగించాడు. అది భయంకర జ్వాలలతో పాండవులను ఆక్రమించబోయింది. అర్జునుడు కూడా శ్రీకృష్ణ ప్రేరితుడై ఆత్మరక్షణ కొరకు అదే అస్త్రాన్ని ప్రయోగించాడు. నారద వేదవ్యాసులు ఆ మహాస్త్రాలచేత లోక సంక్షోభం కాకుండా ఎవరి అస్త్రాన్ని వారు ఉపసంహరించుకొనాలని ఆదేశించారు. సత్త్వస్వభావుడూ, గురుభక్తి తత్పరుడూ అయిన అర్జునుడు తన అస్త్రాన్ని ఉపసంహరించుకొన్నాడు. కాని, తామస ప్రవృత్తిగల అశ్వత్థామ అట్లా చేయలేకపోయాడు. 'ఆ మహాస్త్రాన్ని మనుష్య విషయంగా ప్రయోగించే వాడికి అశుభం కలుగుతుంది. ఒకటిచేత ప్రయోగించబడి, అన్యుడి అస్త్రం ఉపశమిస్తే, ఆ దేశానికి పన్నెండేళ్ళు అనావృష్టిదోషం పడుతుంది. కాబట్టి పాండవులనూ, నిన్నూ ఈ దేశాన్నీ రక్షించటానికి చెప్పాము. ఎట్లా అయినా సరే దీనిని ఉపసంహరించుము. నీ శిరోమణిని అర్జునుడికి ఇమ్ము. అప్పుడు ఇతడే కాదు, పాండవులందరూ నీ ప్రాణం తీసినంతగా సంతోషిస్తారు' - అని వ్యాసుడు ఉపదేశించగా, అశ్వత్థామ దానిని పాండవుల కివ్వటానికి నిరాకరించి, వ్యాసుడి కిచ్చి, తన అస్త్రం పాండవేయ గర్భాలకు హాని కలిగింది ఉపశమిస్తుందని చెప్పాడు. వ్యాసుడు అతడితో 'అట్లా చెయ్యి, వేరే దానికి ఆశించకు' అనగానే అశ్వత్థామ తన మాట తప్పని గ్రహించాడు. అశ్వత్థామ పాండవేయగర్భాలనటంలో పాండవ సంతతి గర్భాల నన్నిటినీ ఉద్దేశించగా, వ్యాసుడు పాండవుల భార్యల గర్భాలుగానే 'వేరేదానికి ఆశించకు' అన్నాడు. అది నేను తెలిసినట్లుగా ఎందుకుండాలి?' అని అతడితో పలికి, అన్ని గర్భాలనూ నాశనం చేయటానికి నిశ్చయించుకొన్నాడు. శ్రీకృష్ణుడు తాను ఉత్తరాగర్భస్థుడికి సుదీర్ఘమైన ఆయువు నిస్తానని పలికినా లెక్కచేయక అస్త్రాన్ని ప్రయోగించాడు. కృష్ణుడు అది చూచి అశ్వత్థామతో 'ఉత్తరకు ఒక బ్రాహ్మణుడి వాక్కువలన పరిక్షిత్తు అనే కొడుకు పుట్టుతాడు. వాడు పాండవ వంశోద్ధారకుడు అవుతాడు. నీవు చేసిన పని అంతా వ్యర్థం' అని పలికి కోపంతో 'పిల్లలను చంపిన నీవు ఆహారం లేక, నిస్సహాయుడవై దుర్గంధ భూయిష్ఠమైన రక్తంచేత శరీరం దగ్ధమవుతూ ఉండగా మూడువేల సంవత్సరాలు తిరుగుము. ఆ పరిక్షిత్తుకు జనమేజయుడు పుట్టి గొప్పవాడవుతాడు' అన్నాడు. వ్యాసుడు కూడా 'కృష్ణు డన్నట్లుగానే కమ్ము' అని శపించాడు. అశ్వత్థామ వ్యాసుడిని 'నీవు మనుష్యులలో ఉంటా'వని బదులు శపించి 'నేనూ నీ దగ్గరే ఉంటా'నని పలికి శిరోమణిని పాండవుల కిచ్చి తపోవనానికి వెళ్ళాడు.

గురుపుత్రు డవటంచేత అర్జునుడు అశ్వత్థామను చంపటానికి పూనుకోక, అవమానించి, ఆయుధాలతోపాటు సిగ్గుకూడా విడిచిపెట్టేటట్లు చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మరాజు అశ్వత్థామశిరోమణిని భీముడి కిచ్చి దానిని ద్రౌపది కిమ్మన్నాడు. భీముడు అట్లాగే చేసి 'దుఃఖం మాని ఓర్పు వహించు'మని ఆమె కుపదేశించాడు. ద్రౌపది దానిని ధర్మరాజుకే ఇచ్చింది.

శ్రీకృష్ణుడి అభయ ప్రదానంవలన ఊరడిల్లినా, ఉత్తరాగర్భానికి ఏమి ముప్పు కలుగుతుందో అని అందరూ భయపడజొచ్చారు. అప్పుడు ఉత్తరకు తప్ప పాండవ వంశంలోని స్త్రీలకు చూలులు లేకుండా పోయాయి. ఆ అస్త్రరాజం ఉత్తర గర్భంలోని పిండాన్ని బాధించటం చూచి శ్రీకృష్ణుడు తాను అశ్వత్థామతో సంభాషించేటప్పుడు ఆ అస్త్రం వలన దాని కెటువంటి ప్రమాదం లేకుండా తన మనోవ్యాపార్థం చేతనే చేశాడు. ఆ సంగతి ఎవరికీ తెలియదు.

13. పరమేశ్వర ప్రభావం:

మిక్కిలి బలవంతులైన ద్రౌపదేయులనూ, ధృష్టద్యుమ్నుడినీ, తక్కిన వీరులనూ అశ్వత్థామ ఒక్కడూ ఎట్లా చంపగలిగా డని ధర్మరాజు శ్రీకృష్ణుడిని అడుగగా, ఈశ్వరుడిని ఆశ్రయించటంచేత అశ్వత్థామ అట్లా చేయగలిగాడని చెప్పి శ్రీకృష్ణుడు ధర్మరాజుకు శివుడి దివ్యలీలలు చెప్పాడు.

బ్రహ్మ జగత్తును సృష్టించగోరి పరమేశ్వరుడిని సృష్టి నిర్మాణ సూత్రాన్ని అడుగగా, అతడు బ్రహ్మ కోరికను తీర్చటానికి నీళ్ళలో నిలబడి తపస్సు చేయటం ప్రారంభించాడు. శివుడు ఎంతకూ రాకపోవటంచేత బ్రహ్మ దక్షుడనే వాడిని సృజించి సృష్టిచేయ నియోగించాడు. దక్షుడు భూతసృష్టి చేశాడు. అవి ఆకలిగొని దక్షుడిని భక్షించటానికి మీదపడ్డాయి. రక్షించుమని దక్షుడు బ్రహ్మను వేడుకొన్నాడు. బ్రహ్మ ఓషధులనూ, వృక్షసంపదనూ సృష్టించి వాటికి సమర్పించి, బలహీనులు బలవంతులకు ఆహారం అవుతారని ఆదేశించాడు. భూతాలు సంతోషించి సంతతి రూపంలో వృద్ధి పొందసాగాయి. చాలాకాలం తరువాత శివుడు నీళ్ళలో నుండి వెలుపలికి వచ్చి ప్రాణికోట్లను చూచి కోపంతో తన లింగాన్ని పెరికి నేలమీద పెట్టాడు. 'భూతసృష్టికొరకు నేను నీళ్ళలో ఉండి తపస్సు చేసి అధికుడి నయి వచ్చాను. ఈలోగా ఇంకొకడిచేత సృష్టి జరిగిపోయింది. భూతసృష్టికి పనికిరాని లింగం నా కెందు కని పలికి మాల్యవంతానికి వెళ్ళి మహాతపస్సు చేయనారంభించాడు. దేవతలు శివలింగానికి పూజలు చేశారు. దేవతలు ఒక యజ్ఞం చేస్తూ, రుద్రుడి మహానుభావత ఎరుగకపోవటంచేత అతడికి అందులో భాగం కల్పించలేదు. అది తెలిసి శివుడు ఒక విల్లు సృజించి ఆ యజ్ఞాన్ని ధ్వంసం చేయటానికి రాగా, లోకాలన్నీ వ్యాకులత చెందాయి. సూర్యచంద్రాగ్నులు తమ తేజస్సులు కోల్పోయారు. దేవతలు కలతచెందారు. ఈశ్వరుడు విజృంభించి యజ్ఞాన్ని కొట్టాడు. అది లేడి రూపం ధరించి పారిపోయింది. ఈశ్వరుడు వింటికొనతో సవితచేతులూ, పూషుడిపళ్ళూ, భగుడికళ్ళూ రాలగొట్టాడు. దేవతలు పారిపోయారు. శివుడు వాళ్ళను ఆపి, కొట్టకుండా అవమానించగా, వాళ్ళు వింటిత్రాడు ముక్కలయిపోవుగాక!' అనగానే అది అట్లాగే అయింది. ఆ యజ్ఞమూ, దేవతలూ శరణంటూ శివుడి పాదాల మీద పడ్డారు. ఈశ్వరుడు వాళ్ళను అనుగ్రహించాడు. అతడు తన కోపాన్ని తొలగించి సరస్సులో పడవేసి దేవతలను దయతో చూచాడు. అది అగ్ని రూపం ధరించి ఆ నీళ్ళను ఇంకించింది. శివుడు సవితకు చేతులూ, పూషుడికి పళ్ళూ, భగుడికి కళ్ళూ ఇచ్చి యజ్ఞం ఎప్పటివలె ప్రవర్తించేటట్టు అనుగ్రహించాడు. దేవతలు శివుడికి యజ్ఞభాగం కల్పించారు. శివుడు శాంతించాడు.

'ఈశ్వరుడి లీలలు అట్లాంటివి. అతడు కోపిస్తే లోకాలు అస్వస్థతనూ, ప్రసన్నుడైతే సౌఖ్యాన్నీ పొందుతాయి. అశ్వత్థామ అతడి అనుగ్రహం వలననే అంతటి శక్తిమంతు డయ్యాడు. కాని, స్వశక్తి వలన కాదు. నీవు దీనిని మనస్సులో పెట్టుకొనవద్దు. నీ యుద్ధ విజయానికి కారణమైన నీ దైవమానుష యోగానికి నీవు పరమానందపడుము' అని శ్రీకృష్ణుడు ధర్మరాజును ఓదార్చాడు.

స్త్రీపర్వ కథాసారం

14. ధృతరాష్ట్రుడికి సంజయుడి ప్రబోధం:

కొడుకులు నూరుమంది పాండవుల చేతిలో నశించి పోవటంతో ధృతరాష్ట్రుడు కొమ్మలన్నీ నరికివేసిన మహావృక్షం వలె మోడువడి పోయి భరించలేని దుఃఖంలో మునిగిపోయాడు. సంజయుడు ఆయనకు ధైర్యం చెప్పి, గతించినవారిని గురించి దుఃఖిస్తూ కూర్చునేదానికంటె వారి దహన సంస్కారాల గురించి, బంధువుల కిచ్చే తిలోదకాల గురించీ ఆలోచించుమని హితవు చెప్పాడు. ఆ మాట విని ఆ వృద్ధరాజు గాలితాకిడికి పడిపోయిన పెద్దచెట్టువలె మూర్ఛపోయాడు. కొంతసేపటికి తేరుకొని రెక్కలు తెగిన పక్షివలె, కాంతిని కోల్పోయిన సూర్యుడివలె వెలవెల పోతూ ఆత్మీయులందరూ అంతరించిపోయిన తన బ్రతుకూ ఒక బ్రతుకేనా? అంటూ పెద్దగా విలపించాడు. ఆనాడు కృష్ణుడు రాయబారపు సభలో చెప్పిన హితవూ, భీష్మద్రోణాదులు పలికిన నీతివచనాలూ వినక, పాండవులకు తండ్రిపాలు రాజ్యం ఇవ్వక తనవారి నందరినీ చంపుకొన్నందుకు పరితపించాడు. తన బ్రతుకు వృథా అని వాపోయాడు. తనకు కలిగిన శోకం పూర్వజన్మ పాపఫల మని భావించాడు. తానే స్వయంగా తనవారికి అంత్యక్రియలు చేయలేననీ, దానికీ పాండవులే సమర్థులనీ పేర్కొన్నాడు.

సంజయుడు ధృతరాష్ట్రుడికి అభిమన్యుడి మరణానంతరం వ్యాసుడు ధర్మరాజుకు బోధించిన సృంజయ వృత్తాంతం చెప్పాడు. పుణ్యాత్ములు ఏ సమయంలో ఏం చేయాలో అది చేసి కార్యసాధనలో సఫలీకృతు లౌతారు. పాపాత్ములు అసూయాగ్రస్తులై ఆ పనిని అడ్డుకొని తమ ప్రయత్నం విఫలం కాగా విలపిస్తారు. కౌరవులు చేసిన పనులు పాపాత్ముల చేష్టల వంటివి. గతించింది, నశించింది తిరిగిరాదు. స్వయంగా చుట్టూ మంట పెట్టుకొని అది క్రమ్ముకొంటే తట్టుకొనలేక రోదన చేసినట్లున్నదని ధృతరాష్ట్రుడి దీన స్థితిని పేర్కొని, అతడికి వివేకాన్ని బోధించాడు. దుర్యోధనుడి కఠినవాక్కు లనే గాలికి అర్జున భీముల రోషమనే అగ్ని వ్యాపించి కౌరవాటవిని దహించి వేసిందని తెలియచెప్పాడు. యుద్ధంలో చనిపోయినవారందరూ యజ్ఞాలూ, దానధర్మాలూ, వేదశాస్త్రపఠనాలూ చేసి సంపాదించిన పుణ్యంకంటె ఎక్కువ పుణ్యాన్ని పొంది వీరస్వర్గాన్ని అలంకరిస్తారనీ, వారిని గురించి దుఃఖించ నవసరం లేదనీ ఉపశమన వాక్యాలు పలికాడు. సంసారం అరటిచెట్టువలె నిస్సారమైనదనీ, దానిని గుర్తిస్తే మనస్సు పెనువగలకు గురికాకుండా ఉంటుందనీ, శరీరాన్ని విడిచి ఆత్మలు క్రొత్త శరీరాలను పొందటమే మరణజననాల రహస్యమని తెలిసిన విజ్ఞులు ఆప్తుల మరణానికి ఆర్తి పొందరనీ జీవనతత్త్వాన్ని వివరించి సంసారం బహుళ దుఃఖమయమని తెలిపే ఇతిహాసాన్ని వివరించాడు. శరీరం ఒక రథం. బుద్ధి సారథి. ఇంద్రియాలు గుర్రాలు. బుద్ధి చేసే ఆలోచనలు పగ్గాలు. పుణ్యాత్ములు పగ్గాలను నడవడి అనే ఉపాయంతో నడిపి ఇంద్రియాలనే గుర్రాలను అదుపు చేస్తారు. అటువంటి వారిని జననమరణాదులవలన కలిగే దుఃఖాలు కలతపెట్టలేవు. కాబట్టి ధృతరాష్ట్రుడు ఇంద్రియవశుడు కాక భయాన్ని వదలి, మోక్షం పొందే మార్గాన్ని ఎన్నుకొని, పుత్రపౌత్రాదులకు, దాయాదులకు ఉత్తరక్రియలు చేయటం సముచితమని ప్రబోధించాడు.

15. ధృతరాష్ట్రుడికి వ్యాసమహర్షి ప్రబోధం:

కన్నబిడ్డలకు ఉత్తరక్రియలు చేయాలనే మాట వినేసరికి గుండె మండగా ధృతరాష్ట్రుడు వేదనతో మూర్ఛపోయాడు. ఆ సమయంలో వ్యాసమహర్షి అక్కడికి వచ్చాడు. వృద్ధరాజు తేరుకొని బిడ్డల నందరినీ కోల్పోయిన తన జన్మ నిష్ఫల మనీ, తనకు చావు కూడా రావటం లేదనీ వాపోయాడు. అప్పుడు వ్యాసు డిట్లా అన్నాడు: 'పుట్టిన ప్రతిజీవీ గిట్టకమానదు. ఈ వాస్తవాన్ని తెలిసిన విజ్ఞులు వివేకాన్ని కోల్పోయి పుత్రుల మరణానికి శోకించరు. అంతేకాక కౌరవపాండవుల వైరం నీకు తెలియకుండా కలిగింది కాదు. అంతటికీ నీ కొడుకే మూలం. మిగిలినవారందరూ యుద్ధంలో ఆసక్తి కలవారే. కాబట్టి విదురాది విబుధులు ఎన్నివిధాల చెప్పినా నీవూ, నీ కొడుకూ వినలేదు. దీనికితోడు దేవతల సంకల్పం కూడా దానికి తోడ్పడింది. పూర్వం భూభారాన్ని తొలగించటానికి ధృతరాష్ట్రుడి కొడుకైన దుర్యోధనుడు పుట్టి యుద్ధంలో తన నూరుగురు సోదరులూ, వివిధ దేశ ప్రభువులూ సైనికులూ కురుక్షేత్రంలో చనిపోతారని విష్ణువు చెప్పిన మాటలు వినిపించాడు.

కౌరవులు తాము చేసిన తప్పులతో నశించారు. దానికి విచారపడటం వివేకం కాదని అన్నాడు. ధర్మరాజు తనను అవమానిస్తాడేమో అన్న ధృతరాష్ట్రుడి అనుమానాన్ని వ్యాసుడు తీర్చాడు. పాండవుల వలన ఎప్పుడూ ఎవ్వరికీ ఎటువంటి కీడు జరగలేదు. దుర్యోధనాదులే భూమండలాన్ని మ్రింగారు. పాండవులకు పాండురాజు భాగం దక్కకుండా చేశారు. అందువలననే కౌరవులందరూ కదనరంగంలో కన్నుమూశారు. నారదుడీ సంగతి ధర్మరాజుతో ఎప్పుడో చెప్పాడు. అందుకే అతడు వంశనాశనం కాకుండా హింస ప్రవర్తిల్లకుండా శాంతికాముకుడై సంధియత్నం చేశాడు. నేను కూడా అతడిని ప్రోత్సహించాను. కాని, విధిని ఎవ్వరు తప్పించగలరు? ఇదంతా దేవరహస్యం. నీకు తెలియాలనీ పాండవులపై పగ తగ్గి దయపెరగాలనీ చెప్పాను. ధర్మరాజు సర్వభూత సమభావం కలవాడు. అతడు అజాతశత్రువు. నీవు దుఃఖిస్తూ ఉంటే చూడలేడు. కాబట్టి నీ కొడుకులకంటె ఎక్కువగా అతడిని ఆదరించుము. వారు నీ తమ్ముడి కొడుకులే కదా! నీ శోకాగ్నిని జ్ఞానజలంతో ఆర్పివేయుము'. ఈ ఉపదేశం విని ధృతరాష్ట్రుడు తీవ్ర దుఃఖం నుండి ఉపశమనం పొందాడు. వ్యాసుడు అంతర్ధానమయ్యాడు.

16. యుద్ధభూమికి ధృతరాష్ట్రుడి పయనం:

ధృతరాష్ట్రుడు యుద్ధభూమికి బయలుదేరాడు. శోకభారంతో శరీరం తూలుతూ ఉండగా గాంధారి అతడి వద్దకు వచ్చింది. కుంతీదేవి మొదలైన దేవేరులు, కౌరవుల భార్యలు, పరిచారికలు, తలలపై చేతులు పెట్టుకొని, జుట్టు విరబోసికొని, వనితల ఆకారం పొందిన శోకంవలె, రోదిస్తూ, అతిదీనంగా అక్కడికి తరలివచ్చారు. మిగిలిన మృతవీరుల భార్యలు దుఃఖార్తలై వీథులలోకి వచ్చారు. విదురాదులు వారివారికి ఉచితమైన వాహనాలను అమర్చి ప్రస్థానం సాగించారు. ధృతరాష్ట్రుడి రథం ముందుకు సాగగా ఆ శోకయాత్ర కొనసాగుతున్నది.

అంతలో అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ - ముగ్గురూ రణభూమినుండి తిరిగివస్తూ రథాలు దిగి ధృతరాష్ట్రుడికి నమస్కరించి, దుర్యోధనుడు వీరోచితంగా పోరి వీరస్వర్గం పొందాడనీ, కౌరవసేనలో చనిపోక మిగిలింది తాము ముగ్గురే అనీ నివేదించారు. దుఃఖితురా లైన గాంధారికి దుర్యోధన పరాక్రమాన్నీ, కురువీరుల యుద్ధనైపుణ్యాన్నీ ప్రశంసించి చెప్పి, వారు దానధర్మాలవలన పొందే పుణ్యలోకాల కంటె ఉత్తమలోకాలను పొందారని చెప్పారు. భీముడు ధర్మయుద్ధమార్గాన్ని తప్పి దుర్యోధనుడి తొడలు విరుగగొట్టటంచేత ఆ ముగ్గురూ కోపగించి పాండవ స్కంధావారాన్ని శ్మశానం చేసినట్లు పేర్కొన్నారు. పాండవు లక్కడలేకపోవటంతో వారుప్రాణాలతో బ్రతికిపోయారని అంటూ వారు పగ సాధించటానికై వారిని వెన్నాడి రావటం తథ్యమని చెప్పి, గాంధారి అనుమతి పొంది తప్పించుకొని పోయారు. వారిలో కృపాచార్యుడు హస్తినకు తిరిగివచ్చాడు. కృతవర్మ ద్వారకకు చేరుకొన్నాడు. అశ్వత్థామ వ్యాసమహర్షి ఆశ్రమాన్ని చేరుకొని వెంటనే తపస్సు మొదలుపెట్టాడు. ఆ తరువాత పాండవు లతడిపై దాడి చేసి, శిరోరత్నాన్ని గ్రహించి వెళ్ళి ద్రౌపదికిచ్చిన కథ ఇదివరకే చెప్పబడింది.

ధృతరాష్ట్రుడు సపరివారంగా యుద్ధభూమికి వస్తున్నాడన్న వార్త విని ధర్మరాజు ఆర్ద్రుడై శ్రీకృష్ణుడి అనుమతితో భీమాదులందరూ, ద్రౌపదీ, ఇతర రాణులూ పరివారం అందరూ కలిసి వెంటరాగా శోకమూర్తులై ఆ రాజుకు ఎదురు పోయారు. ధృతరాష్ట్రుడివైపున్న స్త్రీలందరూ ధర్మరాజును చూచి చేతులు పైకెత్తి, హాహాకారాలు చేస్తూ 'తండ్రులను, మామలను, తాతలను, తమ్ములను గురువులను అతిక్రూరంగా చంపిన నిర్దయుడు' అని ఛీత్కారాలు చేశారు. భీష్మద్రోణులను చంపినందుకు అర్జునుడిని నిష్ఠురాలాడారు. చెల్లెలి మగడని కూడా తలంచక సైంధవుడిని చంపినందుకు కొందరు బాధపడ్డారు. 'ఇంతకూ మీరు ఇంతటి యుద్ధం చేసి సంపాదించిన ఈ రాజ్యం ఎవరికొరకు?' అని ఎత్తిపొడిచారు. ధర్మజుడూ, అర్జునుడూ నిశ్శబ్దంగా తలలు వంచి నడిచి ధృతరాష్ట్రుడిని సమీపించారు.

17. ధృతరాష్ట్రుడి కౌగిలి:

ధృతరాష్ట్ర మహారాజును సమీపించి, తన నెరిగించుకొని ధర్మరాజు నమస్కరించాడు. ధృతరాష్ట్రు డతడిని కౌగిలించుకొన్నాడు. అట్లాగే అర్జున, నకుల, సహదేవులను కూడ కౌగిలించుకొన్నాడు. భీముడిపేరు వినేసరికి ఆ గ్రుడ్డిరాజు మొగంలో భయంకరమైన క్రోధం ప్రకోపించింది. ఏదో ఘోరాన్ని తలపెట్టిన రీతి గోచరించింది. త్రికాలజ్ఞుడైన శ్రీకృష్ణుడు

భీముడిని అతడి వద్దకు పంపకుండా అంతకుముందే అమర్చిఉన్న ఒక ఇనుప భీమవిగ్రహాన్ని ధృతరాష్ట్రుడి ముందు ఉంచాడు. అతడు నిజభీముడని భావించి గ్రుడ్డిరాజు తన వేయిఏనుగులబలాన్ని కూడగట్టుకొని కౌగిలించుకొన్నాడు. ఆ కౌగిలి బిగువులో భీముడి ఉక్కు విగ్రహం ముక్కలయింది. రాజురొమ్ము చిట్లింది. ముఖరంధ్రాలన్నింటినుండి రక్తం కారనారంభించింది. అతడు మూర్ఛపోయాడు. ఆ మూర్ఛలో 'ఈనాటికి భీముడిని చంపగలిగాను. నా కొడుకు దుర్యోధనుడికి ఈనాడే మోక్షం కలుగుతుంది' అని పలవరించాడు. మూర్ఛ తేరినతర్వాత తాను లోలోన సంతోషిస్తూనే ఎవ రే మనుకొంటారో అని భీముడి పేరు ఉచ్చరిస్తూ పెద్దగా ఏడవటం మొదలుపెట్టాడు. శ్రీకృష్ణు డా కపటనాటకాన్ని చూచి, నవ్వి, భీముడు బ్రతికి ఉన్నాడని చెప్పి, ధృతరాష్ట్రుడి దుర్బుద్ధిని బైటపెట్టి, 'పాండవులను చంపినా, చనిపోయిన కౌరవులు తిరిగి వస్తారా? ఇప్పటి చర్యవలన చెరగని మచ్చవంటి పాపం చేశా' వని, ఇప్పటికైనా పాండవులను సామరస్యంతో చూచి విజ్ఞతను ప్రకటించుము' అని హెచ్చరించాడు. పలురకాల మందలించాడు. శ్రీకృష్ణుడి మాటలు విని ధృతరాష్ట్రుడు పరితప్తుడై పాండవులను సొంత కొడుకులుగా చూచుకొంటానని మాట ఇచ్చాడు. ధృతరాష్ట్రుడి శరీరాని కంటిన రక్తాన్ని పరిచారకులు కడిగారు. అప్పుడు శ్రీకృష్ణుడు పాండవులనూ, యుయుత్సుడినీ ధృతరాష్ట్రుడి వద్దకు పంపాడు. అతడు వారి నందరినీ కౌగిలించుకొన్నాడు.

18. గాంధారి కోపతాపాలు:

ధృతరాష్ట్రుడి సూచన మేరకు పాండవులు గాంధారిని దర్శించారు. గాంధారి వారిని ఆశీర్వదించటానికి ఇష్టపడకపోగా ధర్మరాజును శపించటానికి సంకల్పించింది. దానిని దివ్యజ్ఞానంతో గమనించిన వ్యాసుడు ప్రత్యక్షమై అతడిని శపించవద్దని వారించాడు. దుర్యోధనుడు యుద్ధానికి బయలుదేరే టప్పుడు తల్లికి నమస్కరించి 'విజయం సిద్ధించేటట్లు దీవించు'మని కోరగా, ఆమె 'ధర్మ మెక్కడ ఉంటుందో విజయ మక్కడ కలుగుతుంది' అని దీవించిన సంగతి జ్ఞాపకం చేసి, ధర్మదీక్షతో యుద్ధంచేసిన పాండవులకు విజయం కలగటం ఆమె ఆశీఃఫలమే అని పలికాడు. అసూయను మాని, మాతృధర్మాన్ని గౌరవించి, పాండవులపై కోపాన్ని వదలి శాంతితో మసలుకొను' మని వ్యాసుడు గాంధారికి హితవు చెప్పాడు. దానికి గాంధారి ఒడబడింది. దుర్యోధనుడి దుర్నీతి వలన కౌరవనాశనం జరిగిందని అంగీకరించింది. కాని, శ్రీకృష్ణుడు చూస్తూ ఉండగా భీముడు గదాయుద్ధంలో దుర్యోధనుడి తొడలు విరుగగొట్టటం అన్యాయమనీ, అదే తన హృదయాన్ని బాధిస్తున్న దనీ అదే కోపకారణ మనీ పేర్కొన్నది. ఆమె కోపాన్ని చూచి భయపడి భీముడు గాంధారితో ఇట్లా అన్నాడు: 'తల్లీ! నేను చేసింది ధర్మమో అధర్మమో నాకు తెలియదు కాని, ప్రాణభయంతో అట్లా చేయవలసి వచ్చింది. దానికి నన్ను క్షమించుము. బలవంతుడూ, నిపుణుడూ అయిన సుయోధనుడిని అట్లా తప్ప మరొక విధంగా ఓడిచటం సాధ్యంకాదు. అయినా, దానిని అట్లా ఉండి ఆలోచించుము. అలనాటి సభలో ధర్మరాజుకు జరిగిన అవమానం ధర్మమేనా? ఏకవస్త్ర అయిన ద్రౌపదిని నిండుసభకు ఈడ్చుకొని వచ్చి, దుర్భాషలాడి, ఆ పవిత్రురాలికి తన తొడలు చూపించి కూర్చొనుమనటం నీకు తెలియదా? అప్పుడు నాకు కలిగిన క్రోధావేశంలో, పరితాపతీవ్రతలో అతడి తొడలు యుద్ధంలో విరుగగొట్టుతా నని శపథం చేశాను. ప్రతిజ్ఞను నెరవేర్చటం ప్రతాపవంతులకు ప్రధాన లక్షణం. అతడి తొడలను ఆ నిండుసభలోనే నుగ్గు నుగ్గు చేసి ఉంటే బాగుండేది. కాని, ధర్మజుడి నియమానుసారం అడవులకు వెళ్ళాం. పడరాని పాట్లు పడ్డాం. చివరకు ధర్మరాజు సంధియత్నం చేశాడు. శ్రీకృష్ణుడిని రాయబారిగా పంపాడు. అప్పుడు ఆయనతో నేను పంపిన సందేశం విన్నావుగా. 'మనం అన్నదమ్ములమై ఉండికూడా, ఇతరులు వేలెత్తి చూపేటట్లు, వైరంతో పరస్పరం యుద్ధం చేయటం తగదు. పెద్దలు చెప్పినట్లుగా విని రాజ్యాన్ని పంచుకొని సుఖంగా అనుభవించటం మంచిది' - అని చెప్పి పంపాను. కాని, దుర్యోధనుడు ఆ మాటలు వినక వైరం పెంచుకొని యుద్ధం చేశాడు. దానివలన ధర్మజుడు రాజ్యాన్ని గ్రహించాడు. నేను ప్రతిజ్ఞలను నెరవేర్చుకొన్నాను. మంచిచెడలు తెలిసినదానిని నీవు విచక్షణతో విచారించుము' - అనగా ఆమె సమాధాన పడింది కాని, దుశ్శాసనుడి రొమ్ము చీల్చి నెత్తురు త్రాగటం అమానుషం కాదా? అని అడిగింది. దానికి భీముడు అలనాటి నిండుసభలో ద్రౌపది అతడు చేసిన అవమానాన్ని పేర్కొని తన ప్రతిజ్ఞను సమర్థించుకొన్నాడు. అంతేకాక, యుద్ధంలో శత్రువులు తనను చుట్టుముట్టి దుశ్శాసనుదికి దూరంగా త్రోసివేయటానికి ప్రయత్నించగా వారిని భయపెట్టటానికి రక్తాన్ని త్రాగినట్లు నటించి పెదవుల దాక చేర్చానే కాని నిజానికి తమ్ముడి రక్తాన్ని త్రాగేటంత క్రూరుడిని కాను' అన్నాడు. దానికి గాంధారి ఇట్లా అన్నది. 'గ్రుడ్డివాళ్ళమైన ఈ

తల్లిదండ్రులకు అసరాగా ఒక కొడుకునైనా మిగల్చకుండా అందరినీ చంపటం న్యాయమా? ఒక్కడు మిగిలితే, మీ రాజ్యానికి అడ్డం వస్తా డనుకొన్నారా? ఏడీ ఆ ధర్మజమహారాజు?' అని కరకుగా పలికింది.

ధర్మరాజు ఆమె మనసు కనిపెట్టి, దగ్గరకు పోయి నమస్కరించాడు. 'నీ కొడుకులను చంపిన పాపాత్ముడను వచ్చాను. కఠినంగా శపించి శిక్షించుము. నేను బ్రతకటానికి అర్హుడిని కాను. నా కీ రాజ్యం వద్దు. ఈ వైభవాలు వద్దు' అని విలపించాడు. గాంధారి మారుమాటాడలేకపోయింది. కరుకుగా వేడి నిట్టూర్పులు విడిచి ఊరకుండిపోయింది. ధర్మరాజు చేతులెత్తి నమస్కరించి ఆశీస్సులు కోరాడు. గాంధారి కళ్ళగంతల సందులోనుండి ధర్మజుడి కాలిగోళ్ళు కనపడగా చూచింది. అవి ఎర్రగా కందిపోయాయి. దానిని చూచి అర్జునుడు శ్రీకృష్ణుడి వెనుకకుపోయి నిలిచాడు. భీమనకుల సహదేవులు ప్రక్కకు జరిగారు. అప్పుడు గాంధారి కోపం వదలి, వాత్సల్యంతో పాండవులను 'కుంతీదేవిని దర్శించుకొనండి' అని చెప్పింది. పాండవులు తేరుకొని కుంతి వద్దకు వెళ్ళారు.

చాలాకాలంగా పాండవులను చూడాలనే కోరికతో అలమటిస్తున్న కుంతీదేవి వారు పడ్డ కష్టాలను, కోల్పోయిన పుత్రపౌత్రులను తలంచుకొని కన్నీరు మున్నీరుగా దుఃఖించింది. పాండవుల నందరినీ చేతులు సాచి దరికి తీసికొని, వారి శరీరాలపై ఆయుధాల దెబ్బలవలన కలిగిన గాయాలను తాకి నిట్టూర్పులు నిగిడించింది. ద్రౌపది ఆమెను సమీపించి, చనిపోయిన అభిమన్యుప్రభృతులను తలచుకొని విలపించింది. అత్తా కోడళ్ళు ఒకరి నొకరు కౌగిలించుకొని భోరున ఏడ్చారు. ఇద్దరూ కలిసి గాంధారి వద్దకు వెళ్ళారు. వారందరూ తమ పుత్రులను కోల్పోయిన దుఃఖాలను కలియబోసికొని ఒకరు నొకరు ఓదార్చుకొన్నారు. విదురాదులు చెప్పిన హితవును విని కుమారులను అదుపులో పెట్టుకొనలేకపోవటం చేతనే ఆ విపత్తు ఏర్పడిందని గాంధారి పేర్కొన్నది. కాలప్రభావాన్ని తప్పించటం శక్యం కాదని అందరూ నిర్వేదాన్ని ప్రకటించారు. పాండవులు గాంధారినీ, ధృతరాష్ట్రుడినీ సముచితంగా ఓదార్చారు.

19. గాంధారి మృతవీరుల సందర్శనం:

వ్యాసమహర్షి గాంధారికి దివ్యదృష్టిని ప్రసాదించాడు. ఆమె కన్నులకు గంత ఉన్నా యుద్ధభూమిలో దగ్గరగా, దూరంగా ఉన్న వస్తువులన్నీ స్పష్టంగా కనపడసాగాయి. యుద్ధభూమిలో ముక్కలు ముక్కలై చిందరవందరగా పడిఉన్న రథాల భాగాలూ, గజాలు, గుర్రాలు, సైనికుల దేహఖండాలూ కుప్పలు కుప్పలుగా పడి ఉన్న దృశ్యాలూ ఆమె దృష్టికి గోచరించాయి. ఆమె హృదయం తరక్కుపోయింది. నెత్తురు మడుగులలో పడిఉన్న వీరుల శవాలు ఆమెకు ఆరాటం కలిగించాయి. శవాల మాంసాలను, నెత్తురును త్రాగుతూ సంతోషంతో గంతులు వేస్తున్న రాక్షసుల గుంపులు మిక్కిలి ఏవగింపును కలిగించాయి. గాంధారి శ్రీకృష్ణుడిని దగ్గరికి పిలిచి దీనంగా ఈ విధంగా చెప్ప నారంభించింది.

'కృష్ణా! ధృతరాష్ట్ర మహారాజు కోడళ్ళను చూడుము. వారు కన్నీరు మున్నీరౌతూ వారి భర్తలనూ, అన్నదమ్ములనూ గుర్తిస్తూ, కాకులు పొడుచుకొని తింటున్న వారి శవాలను చూచి తూలిపోతున్నారు. కర్ణ, శల్య, ద్రోణాదులు అభిమన్యు ముఖ్య కుమారులు చనిపోయినా కాంతుల నీనుతున్నారు. హంసతూలికాతల్పాలుమీద శయనించే ఈ వీరుల శరీరాలను రాపులుగులు, నక్కలు, గ్రద్దలు, కాకులు ఆక్రమించి పొడిచి పొడిచి ఎంగిలిచేశాయి. వినోద వాద్యాలతో, సుగంధద్రవ్యాలతో, హారాలతో విరాజిల్లేవారు నక్కల ఊళలు, రక్తపు పూతలు, గ్రద్దలు తమను క్రమ్మివేస్తున్నా కదలక మెదలక పడి ఉన్నారు. రాజులూ, యుద్ధవీరులూ కాంతు లీనుతూ పడి ఉన్న యుద్ధభూమి గ్రహనక్షత్రాలలో వెలిగిపోతున్న ఆకాశంవలె ఉన్నది చూచావా?

యుద్ధం చేస్తున్నప్పుడు చేతులలో ఉన్న ఆయుధాలతో అట్లాగే పడి ఉన్న వీరులను చూచి రాబందులు దగ్గరకు రావటానికి జంకుతున్నాయి. కొందరి శరీరాలను నక్కలు, కాకులు తినివేయగా వారిని గుర్తించటం కష్టమై పోతున్నది. ముక్కలైన దేహభాగాలను కలిపి తమ తమ వారి ఆకారాలను కూర్చుకొని వనితలు భోరుమని విలపిస్తున్నారు. ఇటువంటి దారుణదృశ్యాలను చూడటానికి బ్రతికి ఉన్న నేను పూర్వజన్మలో ఎంతటి పాపం చేశానో? అని బావురు మన్నది.

ఆమె దుర్యోధనుడి శవాన్ని చూచింది. శోకాతిశయంతో మొదలు నరికిన అరటిచెట్టువలె మూర్ఛపోయింది. కన్నీరు ధారలుగా కారుస్తూ అతడి రొమ్ముమీద వాలిపోయింది. రారాజుగా బ్రతికిన కొడుకు దీనంగా నేలమీద పడి ఉన్నందుకు కుమిలిపోయింది. తల్లి వచ్చినా లేచి నమస్కరించకుండా మౌనంగా పడి ఉన్నందుకు ఆమె వాపోయింది పలు పలువిధాలుగా విలపిస్తున్న గాంధారి శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నది. 'కృష్ణా! నా కొడుకు యుద్ధానికి పోతూ వినయంతో నాకు నమస్కారంచేసి తనకు విజయం కలిగేటట్లు ఆశీర్వదించుమని కోరాడు. నేను 'ధర్మం ఏ పక్షంలో ఉంటే ఆ పక్షానికి విజయం తప్పక సిద్ధిస్తుంది' అని అన్నాను. ఎందుకంటే ఆనాడు జూదమాడుతున్న సమయంలో సభలోనివారంతా ద్రౌపదీ వస్త్రాపహరణాన్నీ, భీముడి ప్రతిజ్ఞలను చూచి భయపడి, 'ఆ అధర్మానికి ఫలంగా కౌరవవంశనాశం, విస్తారసైన్య ధ్వంసం ఔతుంది కాని, ధర్మం అంత సులభంగా నశించదు' అని అన్నారు. నా బుద్ధికి కూడా అదే తోచింది. నా కుమారుడని సత్యం తప్పి మెరమెచ్చు మాటలు పలికితే పెంపు కలుగుతుందా? అంతేకాక మరొకమాటకూడా అన్నాను. 'యుద్ధంలో వెనుదిరిగి వచ్చిన దానికంటె చావు మేలు, యుద్ధవీరుడుగా నీవు పరలోక సౌఖ్యాన్ని పొంది సుఖించుము' అన్నాను. నే నన్నట్లే, నా మాట నిలుపుతున్నట్లే - దుర్యోధనుడు కీర్తి ప్రతిష్ఠలు పొందాడు. నేను ఇతడి పరాక్రమాన్ని తలచి ధైర్యంగా ఉన్నా, ధృతరాష్ట్రుడికి దిక్కు ఎవరూ లేకపోయారే అనే భావం నా గుండెను మండిస్తున్నది. అదే నాకు మిగిలిన దుఃఖం. ఎన్నో భోగాల ననుభవించిన ఈ రారాజు సింహం చంపిన మదపుటేనుగువలె కటికనేలమీద పడి ఉండటం చూడలేకపోతున్నాను. విదురాది విజ్ఞులు ఎందరు ఎన్నివిధాల చెప్పినా ఇతడు వినలేదు. విధి మూడిన బుద్ధికి మంచిమాటలు రుచిస్తాయా? పదకొండు అక్షౌహిణుల సైన్యం వెంటరాగా ప్రకాశించే ఈ రాజు ఒంటరిగా పడి ఉండి రాబందులకు ఆహారం కావటం అబ్బురం కాదా! కొడుకు చావుకంటె నా కోడలు (దుర్యోధనుడి భార్య) భానుమతి శోకం నన్ను కలవర పెట్టుతున్నది. యుద్ధభూమిలో పడి ఉన్న తన భర్తనూ, కొడుకునూ చూస్తూ, దుఃఖాతిశయంతో వారిపైబడి మూర్ఛపోతూ లేస్తూ దీనంగా విలపిస్తున్నది. ఆమెను చూచి శోకాన్ని భరించలేకపోతున్నాను. దుర్యోధనుడు మాత్రం తల్లీ భార్యా ఏమయితేనేం? తాను మాత్రం సర్వం సిద్ధించే మార్గాన్ని ఎన్నుకొని వెళ్ళాడు' అంటూ ఎన్నో విధాల వాపోయింది.

ఆ తరువాత గాంధారి భీముడిచేతిలో మృతులైన తన కొడుకుల నందరినీ చూపించి వారి భార్యల విలాపాలను వినిపించి, పలువిధాల తాను వాపోయింది. కౌరవుల తల్లిదండ్రులు చేసిన పూర్వజన్మ పాపంవలన కాకపోతే దుర్యోధన దుశ్శాసనాదులను పుణ్యాత్ముడైన ధర్మరాజు చంపగలడా?' అని పలికింది.

సింహం తన వాడి అయిన గోళ్ళతో చీల్చి చంపిన మదపుటేనుగువలె పడి ఉన్న దుశ్శాసనుడిని చూపించి, అతడు నిండుసభలో ద్రౌపదికి చేసిన అపచారానికి ఫలితంగా భీమ ప్రతిజ్ఞకు బలి అయ్యాడని పేర్కొన్నది. ద్రౌపదిని అవమానపరచటం అధర్మమని తాను దుర్యోధనుడికి నీతి చెప్పిన మాటలను జ్ఞాపకంచేసికొన్నది. కొడుకులు మాట విననందుకు విచారించింది. కాని, భీముడు దుశ్శాసనుడి శరీరాన్ని విరిచి, ముక్కలను నలుదిక్కులా విసరి అతడి రొమ్ముచీల్చి రక్తాన్ని త్రాగిన దారుణ దృశ్యం అతడికి కీర్తి కలిగిస్తుందా? నాకు దుఃఖం అతిశయింపజేయకుండా ఉంటుందా?' అని వాపోయింది.

వికర్ణుడి శవాన్ని చూచి అతడి చేతికున్న కణుపులను పిల్లగ్రద్దలు చీల్చటానికి వీలుకాకపోతున్న దృశ్యానికి అతడి భార్య దుఃఖిస్తున్న తీరుకు జాలిపడింది. అట్లాగే దుర్ముఖుడు, శూరసేనుడు, వివింశతి మొదలయిన కురుకుమారుల శవాలను చూచి విలపించింది. ఆ తరువాత అభిమన్యుడి శవాన్ని చూచి యుద్ధంలో పద్మవ్యూహ భేదనంలో అతడు ప్రదర్శించిన ప్రతాపాన్ని ప్రశంసించింది. దుర్యోధన, కర్ణ, ద్రోణ, అశ్వత్థామ, శల్యాది మహావీరులతో అతడు మహాయుద్ధం చేసి అలసిపోయి పడుకొన్నట్లుగా అతడి శరీరం ఉన్నదనీ, అతడి ముఖకాంతి అతడు చావలేదేమో అన్న భ్రాంతిని కలిగిస్తున్నదనీ పలవరించింది. సిగ్గుల ముద్దరాలైన ఉత్తర తన భర్త శవంపై బడి దుఃఖిస్తున్న దృశ్యాన్ని చూచి హృదయం ద్రవిస్తున్నదని విలపించింది. 'పెద్దలందరూ కూడి అన్యాయంగా అతడిని చంపిన వ్యూహాన్ని తలపోసి ఆ నీచకార్యాన్ని ఉత్తర నిరసించటం గాంధారి విన్నది. అతడిని, ఉపపాండవులను పోగొట్టుకొన్న పాండవులకు విజయం కలిగి లాభ మేమున్నదని విలపిస్తున్న ఉత్తరను బంధువులు బుజ్జగించి ప్రక్కకు తీసికొని పోతున్న దృశ్యాన్ని కృష్ణుడికి గాంధారి చూపించింది.

అట్లాగే ఉత్తర కుమారుడు, లక్ష్మణ కుమారుడు మొదలయిన వీర కుమారులను, మహాపరాక్రమశాలి కర్ణుడినీ గాంధారి చూచింది. వారి యుద్ధవీరాన్ని ప్రశంసిస్తూ విలపించింది. ఆ తరువాత బాహ్లికుడూ, సైంధవుడూ మొదలయిన మహావీరులను చంపిన అర్జునుడికి జాలికూడా లేదని వాపోయింది. చెల్లెలని కూడా భావించక తనకు పతి వియోగం కలిగించిన అన్నలను నిష్ఠుర మాడుతున్న దుస్సలను చూపించి దుఃఖించింది. చెక్కుచెదరని శల్యుడి శవాన్ని చూచి, దుర్యోధనుడికీ అతడికీ ఉన్న స్నేహాన్ని స్మరించి అతడి భార్యల దుఃఖాన్ని చూచి శోకించింది. భీష్ముడు కురువంశ రక్షణంలో చేసిన సేవలను కీర్తించింది. సూర్యుడి వంటి భీష్ముడు అంపశయ్యపై అస్తమించినట్లున్న ఆ దృశ్యాన్ని చూచి విషాదాన్ని పొందింది. శత్రువు లనే అడవిని దహించి ఆరిపోయిన అగ్నివలె ఉన్న ద్రోణుడి శరీరాన్ని దర్శించింది. ద్రోణుడిని నమ్మి దుర్యోధనుడు యుద్ధానికి దిగిన సన్నివేశాలను స్మరించింది. శిష్యులు నమస్కరించే ఆ గురుదేవుడి పాదాలను నక్కలు పీక్కొని తింటున్న దృశ్యాన్ని చూచి హృదయవిదారకంగా దుఃఖించింది. ద్రోణాచార్యుడి భార్య, కృపాచార్యుడి చెల్లెలు అయిన కృపి పొందే వేదనను చూచి జాలిపడింది. ద్రోణ శిష్యులు గురుశవదహనం చేయటం, అందరూ కలిసి నదిలో స్నానంచేయటం గాంధారి కృష్ణుడికి చూపించి కంటనీరు పెట్టింది.

సాత్యకి నిర్దాక్షిణ్యంగా చంపిన సోమదత్తుడి కొడుకు భూరిశ్రవుడి శవాన్ని చూచింది. సోమదత్తుడి భార్య అటు మగడి శవాన్ని ఇటు కొడుకు శవాన్ని చూచి దుఃఖించే దృశ్యం కరుణరసభరితంగా ఉండగా కృష్ణుడికి చూపించింది.

మాయలకే మామ అనిపించుకొన్న శకుని సహదేవుడి బాణాలకు నేలకూలాడు. అతడి మాయలన్నీ శ్రీకృష్ణుడి దివ్యమాయలతో వమ్మయిపోయాయి. ఆనాడు మోసంతో జూదమాడి ధర్మజుడు రాజ్యమంతా లాగుకొన్నాడు. ఈనాడు యుద్ధమనే జూదంలో తన ప్రాణాన్నే ఒడ్డి ఓడిపోయాడు. ఇతడి పాపకర్మ ఫలించింది. ఇతడి ద్యూత వ్యసనం కురువంశ నాశనానికి తప్ప ఎందుకూ పనికిరాలేదు. ఇతడు చూపించిన అధర్మమార్గమే కౌరవులకు పాండవులతో వైరం తెచ్చి పెట్టింది. దుర్యోధనుడికి మంచి చేస్తానని చెప్పి మోసంచేశాడు. చివరకు సోదరులతో, పుత్రులతో, స్నేహితులతో సహా మరణించేటట్లు చేశాడు. కౌరవులందరితోపాటు శకుని కూడా స్వర్గానికి పోయాడు. అల్పజ్ఞులైన కౌరవులను మోసంచేసి యుద్ధానికి పురికొల్పాడు. ఇతడివలననే సోదరకలహం ఏర్పడింది - అంటూ గాంధారి కృష్ణుడికి చెప్పింది.

ఆ తరువాత శరీరం నిండా శస్త్రాలతో ఉన్న కళింగదేశాధిపతిని చూచి, అనేక స్త్రీలు అతడిపైబడి దుఃఖించటం శ్రీకృష్ణుడికి చూపించింది. అట్లాగే మగధదేశాధిపతి జయత్సేనుడి శవాన్ని పేర్కొని, అతడి వనితల విలాపాన్నీ, తగ్గని లావణ్యాన్నీ చూపించింది. కోసలాధిపతి బృహద్బలుడు, ధృష్టద్యుమ్నుడి కొడుకులు, కేకలరాజులూ, పాంచాల రాజైన ద్రుపదుడు, చేది భూపాలుడు, ధృష్టకేతువు, సుకేతుడు, అవంతి రాజ్యపాలకులైన విందానువిందులు మొదలయిన వీరుల శవాలను, వారి భార్యల శోకాలనూ చూపించింది. వినిపించింది. ఆ తరువాత గాంధారీ కృష్ణుల నడుమ ఇట్లా సంభాషణ సాగింది.

20. గాంధారి శాపం:

గాంధారి : కృష్ణా! భీష్మద్రోణ, కర్ణులు, భూరిశ్రవుడు, అశ్వత్థామ, కృప, సైంధవ, కృతవర్మ, దుర్యోధనాదులవంటి అతిరథమహారథులు విజృంభిస్తే దేవతలు కూడా నశిస్తారు. కాని, వారి నందరినీ ఎదిరించి కూడా నీవూ, పాండవులూ, సాత్యకీ ఏ అపాయం లేకుండా బయటపడ్డారు. ఇంతకంటె అద్భుత మేముంటుంది? ఇది విధివిలాసం. దైవం కౌరవులకు ఇంత అన్యాయం చేస్తుందా? నేను నా కొడుకుల నందరినీ కోల్పోయాను. ఆనాడు నీవు సంధికి వచ్చి నిండుసభలో చెప్పిన మాటలన్నీ ఇప్పుడు నిజమయ్యాయి. భీష్మ విదురాదులు చెప్పిన హితోక్తులను నేను పుత్ర వ్యామోహంతో పాటించలేదు. అందుకే ఈ దుఃస్థితి కలిగింది. (అని మూర్ఛపోయి కొంతవడికి తేరుకొని కృష్ణుడిని చూచి మండిపడుతూ) కృష్ణా! దీనికి నీవే మూలకారణం. నీవు సకల ధర్మవేత్తవు. మధురభాషివి, సర్వకార్య దక్షుడవు అయి కూడా పాండవ కౌరవుల మధ్య యుద్ధం జరుగకుండా చూడక నిర్లక్ష్యం చేశావు. నీ రాయబారం సంధికి కాదు. దుర్యోధనాదులైన రాజులను నామరూపాలు లేకుండా చేయటానికే. ఇప్పుడు అందరూ పోయారు, అన్ని ప్రాంతాలు

బీడులయ్యాయి. దీనికి ఫలితం అనుభవించుము. నేను పతివ్రతాదీక్షతో పొందిన తపఃపుణ్యంతో నిన్ను శపిస్తున్నాను. దాయాదుల నడుమ పోరు కలిగి వారందరు నశించేటట్లు చేసినందువలన నీ దాయాదులు కూడా ఒకరినొకరు కొట్టుకొని చస్తారు. నీవు కూడా సరిగ్గా ఈనాటికి ముప్పైఏళ్ళకు దిక్కులేని చావు పొందుతావు. ఈనాడు కౌరవ వనితలు ఏ విధంగా ఏడుస్తున్నారో యాదవకాంతలు కూడా భర్తలను, కొడుకులను, బంధువులను పేరు పేరునా తలచుకొని కుమిలి కుమిలి ఏడుస్తారు' (అని ఘోరంగా శపించింది).

శ్రీకృష్ణుడు : (చిరునవ్వుతో) గాంధారీదేవి! యాదవులకు మునివరులు ఇచ్చిన ఘోరశాపం ముందే ఉన్నది కదా! మళ్ళీ నీవు దానిని పునరుక్తం చేశావు. దీనివలన నీవు కొత్తగా ఏమి సాధించావు చెప్పుము. యాదవులకు నాశనం తప్పదు. వారిని దేవతలు కూడా చంపలేరు. అందుచేత ఘోరయుద్ధంలో పరస్పరం చంపుకొని చస్తారు. గాంధారీ! ఇక లెమ్ము చనిపోయిన బంధుమిత్రులకు దహన కార్యాలు చేయించాలి కదా! చివరకు ఒకమాట చెప్పుతాను వినుము. నీ కుమారుడు చేసిన దుర్మార్గాలు నీకు తెలియవా? దుర్యోధనుడి దురభిమానాన్ని నేను కాని, నీవు కాని, భీష్మ ద్రోణ బాహ్లికాదులు కాని, చివరకు ధృతరాష్ట్ర మహారాజు కాని మాన్పలేకపోయాము. అతడి దుశ్చర్యల ఫలితమే నేటి ఈ దుఃస్థితి. మీ తప్పువలన కలిగిన కీడుకు నన్ను బాధ్యుడిని చేయటం న్యాయమా? ఇకనైనా నీ శోకాన్ని దూరం చేసికొమ్ము. క్షత్రియవనితలు యుద్ధవీరులనే కొడుకులుగా కోరుకొంటారు. వారికై దుఃఖిస్తే శోకం రెండింతలౌతుంది. కాబట్టి నిగ్రహించుకొమ్ము'.

శ్రీకృష్ణుడి మాటలు గాంధారి చెవులలో నిప్పులు పోశాయి. ఆమె మారుమాటాడలేక ఊరకుండి పోయింది.

ధృతరాష్ట్రుడు : ధర్మరాజా! నీకు మన రెండు వైపుల సైన్యాలలోని జనుల సంఖ్య తెలుసు. యుద్ధంలో ఎంత మంది చనిపోయారో గుర్తుంటే చెప్పుము.

ధర్మరాజు : ప్రసిద్ధులు, ఉత్తములు 76 కోట్ల 20 వేలమంది. ఇతరులు 24 వేల 320 మంది చనిపోయారు.

ధృతరాష్ట్రుడు : వీరందరూ ఏయే గతులు పొందుతారో చెప్పగలవా?

ధర్మరాజు : అస్త్రాల అగ్నిలో ఆహుతి అయిన వీరులు స్వర్గంలో ఇంద్రుడి అతిథులై అప్సరః స్త్రీలతో ఆనందిస్తారు. అస్త్రశస్త్రాలు ఆయువుపట్టులలో తగలటంచేత భయపడి పారిపోయినవారు యక్షలోకం చేరుతారు. ఇక- యుద్ధంలో ఏ విధంగా చనిపోయి స్వర్గానికే పోతారు కాని, నరకానికి పోరు - అని పండితులంటారు.

ధృతరాష్ట్రుడు : ఈ చనిపోయినవారిలో దిక్కున్నవారూ ఉన్నారు. దిక్కులేనివారూ ఉన్నారు. వీరందరికీ విధి ప్రకారం దహన కర్మ చేయవచ్చునా?

ధర్మరాజు : ఈ యుద్ధంలో పాల్గొన్నవారందరూ అగ్నిని సిద్ధంగా ఉంచుకొన్న యాజ్ఞికులవంటివారే. వీరందరికీ తల కొరివి పెట్టి, జలతర్పణాలు వదిలే అర్హత కలవారు లేరు. మనమే పూనుకొని ఆ పని నిర్వహించాలి.

అప్పుడు ధర్మరాజు ధౌమ్యుడినీ, విదుర, సంజయులనూ పిలిచి 'మీరు భరత వంశీయులకు తప్ప మిగిలిన దిక్కులేని వారికందరికి విధి విధానాన్ని అనుసరించి దహనకర్మ చేయించండి' అని తగిన వారిని వారికి తోడుగా నియమించాడు, కావలసిన ద్రవ్యాలు సమకూర్చాడు. వారు ధర్మజుడు చెప్పినట్లు కర్తవ్యం నిర్వహించారు. ఒకవైపు వేద స్వరాలు, మరొకవైపు స్త్రీల శోకనాదాలూ కలిసి ఆకాశమంతా మారుమ్రోగిపోయాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

21. కర్ణుడు రాధేయుడు కాడు కౌంతేయుడు:

ఆ తరువాత ధర్మరాజు ధృతరాష్ట్ర మహారాజును, కౌరవ వనితలను, బంధుజనులను కలుపుకొని గంగకు వెళ్ళి, స్నానాలు చేసి, మృతులకు తిలోదకాలు ఇచ్చాడు. అప్పుడు కుంతీదేవి ధర్మరాజు వద్దకు వచ్చి పొంగివస్తున్న దుఃఖంతో అందరూ వినేటట్లు ఈ విధంగా అన్నది.

కుంతి : ధర్మరాజా! వినుము. కౌరవులకు తన వింటిని పెట్టనికోటగా ఉంచినవాడూ, యుద్ధక్రీడలలో మీ అందరిచేత ప్రశంస లందుకొన్నవాడూ, దేవతలు కీర్తించగా అర్జునుడి మహాస్త్రానికి తల తెగి నేల కొరిగినవాడూ అయిన కర్ణుడు లోకులంతా పిలిచేటట్లు రాధేయుడు కాదు. నా కొడుకు. మీ అయిదుగురికీ అన్న. సూర్యుడి వరప్రసాదంగా నాకు అందమైన కవచకుండలాలతో పుట్టాడు. అందువలన ఆ మహానుభావుడికి తిలోదక ప్రదానం మీరు చేయండి.

ధర్మరాజు : (దుఃఖిస్తూ) కర్ణుడు మహావీరుడు. దుర్యోధనుడు అతడి ఆసరా చూచుకొని అసమాన వీరులైన భీమార్జునులను ఎదుర్కొనటానికి సాహసించాడు. అతడి బలం చూచి విదేహాది రాజులు రారాజుకు సామంతులయ్యారు. అతడి బాహుబలం వలన పాండవ బలం అక్కడి కక్కడ అణగి ఉంటూ వచ్చింది. అతడి దివ్యాస్త్ర సంపదకు దేవతలు కూడా ఆశ్చర్యపడేవారు. అతడి మహాశక్తి మమ్ములను యుద్ధంలో చీకాకు కలిగించింది. అటువంటి ఆ మహాత్ముడి జన్మరహస్యాన్ని కొంగున నిప్పులు దాచిపెట్టినట్లు ఎట్లా ఇన్నాళ్ళు దాచావమ్మా?. ఒక్క అర్జునుడు తప్ప మరెవ్వరూ అతడి రథాన్ని ఎదిరించి నిలువగలిగినవారు లేరు. తొలిచూలుగా కర్ణుడిని ఎందుకు కన్నావమ్మా? అట్లాంటి అద్వితీయ మహాపరాక్రమవంతుడిని చంపటంవలన నీవు నేర్చిన మంత్రం మా అందరికీ మహాశోకాన్ని తెచ్చిపెట్టింది. సూర్యకుమారుడైన కర్ణుడి మరణం బంధువులందరికీ దుఃఖం కలిగించింది. అభిమన్యుడూ, ఉపపాండవులూ, ద్రుపదుడి కుమారులూ, కురుకుమారులూ మరణించినప్పుడు కూడా ఇంతటి దుఃఖం కలుగలేదు. కర్ణుడు మా అన్న అని ముందుగానే తెలిసి ఉంటే కురుకుమారులు, వారి సైన్యం వ్యాకులం చెందకుండా ఎట్లా మసలు కొనాలో అట్లా మసలుకొనేవాళ్ళం, అట్లా అయి ఉంటే మానవ లోకానికి ఏ దుఃఖమూ కలిగేది కాదు.×

అని ధర్మరాజు దుఃఖించాడు. వణకుతున్న చేతులతో కర్ణుడికి తిలోదకాలు ఇచ్చాడు. ఆ తరువాత శోకభారంతో భీమార్జున నకుల సహదేవులు అట్లాగే చేశారు. ధృతరాష్ట్ర గాంధారులూ, కురుకుమారుల భార్యలూ తర్పణాలు వదిలారు. కర్ణుడిపై గల సోదరభావంతో ధర్మరాజు అతడి భార్యలనూ, పరిచారికలనూ పిలిపించి సముచితంగా గౌరవించి, బహుదక్షిణలతో పుణ్యదానాలు చేసి, విధి విధానంగా అపరకర్మలు చేశాడు. తరువాత బంధుజనులతో కలిసి గంగానదిని దాటి వెళ్ళాడు.

జి.వి. సుబ్రహ్మణ్యం

ప్రధాన సంపాదకుడు

శ్రీమదాంధ్ర మహాభారతము

శల్యపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
కృపాచార్యుఁడు దుర్యోధనునకు హితోపదేశంబు చేయుట	9 - 3 - 8	22
దుర్యోధనుఁడు శిబిరంబు విడిచి సరస్వతీతీరంబు చేరుట	9 - 4 - 49	36
దుర్యోధనుఁడు శల్యుని సేనానాయకుంగాఁ జేయుట	9 - 6 - 5	43
కౌరవసైన్యంబు యుద్ధసన్నద్ధంబై వెడలుట	9 - 7 - 10	50
కురుపాండవుల పదునెనిమిదవనాఁటి యుద్ధ ప్రారంభము	9 - 7 - 43	60
కర్ణకొడుకులు చిత్రసేన సత్యసేన సుశర్ములు నకులుని చేతఁ జచ్చుట	9 - 9 - 12	69
శల్య భీమసేనుల గదా యుద్ధము	9 - 10 - 42	83
గదాయుద్ధమున మూర్ఛితుఁడైన శల్యునిఁ గృపుఁడు తొలంగం గొనిపోవుట	9 - 11 - 23	89
ధర్మరాజు శల్యుని బాణంబులచేత మూర్ఛితుం డగుట	9 - 11 - 66	98
సురథుఁడను పాంచాలకుమారుం డశ్వత్థామచేఁ జచ్చుట	9 - 13 - 35	106
శల్యధర్మనందనుల ద్వంద్వయుద్ధము	9 - 15 - 54	116
విరథుఁ డయిన శల్యుని నశ్వత్థామ దనరథములపై నిడుకొని పోవుట	9 - 15 - 65	121
ధర్మరాజు శక్తి ప్రయోగించి శల్యునిం జంపుట	9 - 16 - 50	134
శల్యుచుట్టంబు లొక్కపెట్ట ధర్మరాజుం జుట్టు ముట్టుట	9 - 17 - 3	139
ధృష్టద్యుమ్న సాత్యకులచేత సాళ్వుఁ డేనుంగుతోడఁ బీనుంగై పడుట	9 - 19 - 24	148
శకుని సహదేవు లాశ్విక సహాయులై ఘోరంబుగాఁ బోరుట	9 - 21 - 32	158
దుర్యోధనుమౌర్ఖ్యం బుద్దేశించి కృష్ణార్జునులు సంభాషించుట	9 - 23 - 18	162
దుర్విషహప్రభృతి కురుకుమారులు భీమునిచేఁ జచ్చుట	9 - 24 - 41	171
ఉలూకుఁడు సహదేవుచేత మృతుం డగుట	9 - 26 - 23	181

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్వితీయాశ్వాసము

దుర్యోధనుఁడు ద్వైపాయనం బను మడుఁగున డాఁగియుండుట	9 - 28 - 51	196
కృపకృతవర్మాశ్వత్థామలు దుర్యోధనుం గని సంభాషించుట	9 - 29 - 41	203
ధర్మరాజు మడుఁగున డాఁగియున్న దుర్యోధనుని దూఱనాడుట	9 - 30 - 6	211
దుర్యోధనుఁడు నీరిలోన యుండి ధర్మజున కుత్తరం బిచ్చుట	9 - 30 - 35	216
దుర్యోధనుఁడు గదామండితుండై హ్రదంబు వెడలివచ్చుట	9 - 31 - 45	226
శ్రీకృష్ణుఁడు భీము నగ్గించి దుర్యోధనుతోడి గదాయుద్ధమునకు బనుచుట	9 - 32 - 15	233
భీమదుర్యోధనుల గదాయుద్ధము సూడ బలరాముఁడు వచ్చుట	9 - 33 - 2	241
ప్రభాసతీర్థ ప్రభావ వర్ణనము	9 - 33 - 36	245
మంకణమహాముని మహాత్మ్యాభివర్ణనము	9 - 37 - 1	252
కుమారస్వామి ప్రభావాభివర్ణనము	9 - 43 - 56	260
కుమారస్వామి తారకాసురుం జంపి దేవతలకు ముదంబు సేయుట	9 - 45 - 63	268
ప్రభావతి యను మునికన్యక మహిమాభివర్ణనము	9 - 47 - 2	271
కురుక్షేత్ర ప్రభావాభివర్ణనము	9 - 52 - 4	280
పాండవదుర్యోధనాదులు ద్వైపాయనహ్రదంబు విడిచి పొలికలనికిఁ బోవుట	9 - 54 - 3	286
భీమసేన దుర్యోధనుల గదాయుద్ధము	9 - 56 - 1	295
శ్రీకృష్ణుఁ డర్జుననితో భీమదుర్యోధనుల తారతమ్యంబు చెప్పుట	9 - 57 - 2	303
దుర్యోధనుఁడు భీముగదాదండమునఁ దొడలు విఱిగి పడుట	9 - 57 - 45	307
శ్రీకృష్ణుఁడు బలరామునకుఁ గోపోపశమనంబు చేయుట	9 - 59 - 7	314
తొడలు విఱిగిపడిన దుర్యోధనుఁడు కృష్ణు నాక్షేపించుట	9 - 60 - 27	325
పాండవులు కృష్ణసాత్యకులతోఁ గౌరవశిబిరంబునకుఁ బోవుట	9 - 61 - 3	331
అగ్నిదత్తం బైన యర్జునురథంబు కాలిపోవుట	9 - 61 - 14	333
శ్రీకృష్ణుఁడు గాంధారి నూఱడింపఁ గరిపురంబునకుఁ బోవుట	9 - 61 - 40	341
శ్రీకృష్ణుఁడు కరిపురంబుననుండి పాండవులయొద్దకు వచ్చుట	9 - 62 - 72	348
కృపకృతవర్మాశ్వత్థామలు దుర్యోధనుం జేరి విలపించుట	9 - 64 - 3	357

శ్రీమదాంధ్ర మహాభారతము

సౌప్తికపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
అశ్వత్థామ యులూకంబు కాకంబులఁ జంపుట నాలోకించుట	10 - 1 - 39	374
కృపాచార్యుఁ డశ్వత్థామకు నీతివిశేషంబు లెఱింగించుట	10 - 2 - 1	380
అశ్వత్థామ కృపాచార్యకృతవర్మలతోఁ దన పూన్కి స్థిరీకరించుట	10 - 3 - 1	385
కృపాచార్యుఁడు నిద్రాసక్తులఁ జంపఁ దగదని యశ్వత్థామకు హితవు చెప్పుట	10 - 5 - 1	397
అశ్వత్థామకు శివుఁడు భూతాకృతియై తోఁచుట	10 - 6 - 1	404
అశ్వత్థామ శివున కాత్మోపహారం బొసంగ నిశ్చయించుట	10 - 7 - 4	412
అశ్వత్థామకు శివుఁడు ప్రత్యక్షంబై ఖడ్గం బొసంగుట	10 - 7 - 59	418
అశ్వత్థామ నిద్రాపరవశుం డగు ధృష్టద్యుమ్నుం జంపుట	10 - 8 - 21	428
అశ్వత్థామ కరితురంగంబులపై కుఱికి నఱకుట	10 - 8 - 39	433
అశ్వత్థామ శిఖండిం బొదివి చంపుట	10 - 8 - 66	443
అశ్వత్థామ పాండవశిబిరంబు వెడలి కృపకృతవర్మలఁ గూడికొనుట	10 - 8 - 140	451
అశ్వత్థామాది రథికత్రయంబు దుర్యోధనుం గనుంగొనుట	10 - 9 - 1	455

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్వితీయాశ్వాసము

ధర్మరాజు తన పుత్రు లశ్వత్థామచేఁ జచ్చుట విని పలవించుట	10 - 19 - 9	471
ద్రౌపది యశ్వత్థామం బరిభవింప భీమసేను నియోగించుట	10 - 11 - 21	482
ధర్మజ ధనంజయ కృష్ణు లశ్వత్థామమీఁదికిఁ బోవుట	10 - 13 - 1	489
అశ్వత్థామార్జునుల బ్రహ్మశిరోనామకాస్త్రంబు లొండింటిం దాకుట	10 - 15 - 1	494
శ్రీకృష్ణుఁ డుత్తరగర్భంబు దగ్ధంబు గాకుండఁ జేయ నిశ్చయించుట	10 - 16 - 1	502
భీమసేనుఁ డశ్వత్థామశిరోరత్నంబు ద్రౌపది కిచ్చుట	10 - 16 - 25	507
ధర్మరాజునకుఁ గృష్ణుఁడు శివప్రభావంబు చెప్పుట	10 - 17 - 6	513
రుద్రుఁడు దేవతలు సేయు యజ్ఞంబు సేరుట	10 - 18 - 1	517

శ్రీమదాంధ్ర మహాభారతము

స్త్రీపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
విదురుఁడు ధృతరాష్ట్రునకు దుఃఖోపశమనంబు చేయుట	11 - 12 - 1	537
విదురుఁడు ధృతరాష్ట్రునకు సంసారగహనంబు తెఱం గెఱింగించుట	11 - 5 - 1	548
కృష్ణద్వైపాయనముని ధృతరాష్ట్రునకు దుఃఖోపశమనంబు చేయుట	11 - 8 - 12	560
ధృతరాష్ట్రుఁడు సపరివారంబుగాఁ బొలికలనికిం బోవుట	11 - 9 - 5	572
కృపాచార్యుఁడు గాంధారి నూరార్చిన ప్రకారము	11 - 10 - 5	576
ధర్మరాజు దమ్ములతోడ ధృతరాష్ట్రునొద్దకుఁ బోవుట	11 - 11 - 1	582
ధర్మజుని శపింపఁబూనిన గాంధారిని వ్యాసుఁ డూరార్చుట	11 - 13 - 6	596
భీముఁడు గాంధారికిఁ గోపోపశమంబుగా నుత్తరంబు లిచ్చుట	11 - 14 - 1	599
పాండవులు కుంతీదేవికడకు గాంధారిపంపునం బోవుట	11 - 15 - 9	608

ద్వితీయాశ్వాసము

గాంధారి పొలికలను చూచి కృష్ణునితోఁ జెప్పి దుఃఖించుట	11 - 16 - 18	623
గాంధారి దుర్యోధనుని కళేబరంబు చూచి పలవించుట	11 - 17 - 1	629

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గాంధారి దుశ్శాసనుని కళేబరంబు చూచి పలవించుట	11 - 18 - 19	640
గాంధారి యభిమన్యుకళేబరంబు గనుంగొని ప్రలాపించుట	11 - 20 - 1	647
గాంధారి సైంధవుని కళేబరంబు చూచి వాపోవుట	11 - 22 - 7	656
గాంధారి శరతల్పగతుం డగు భీష్ము నుద్దేశించి శోకించుట	11 - 23 - 14	662
గాంధారి శకునికళేబరము గాంచి యతనిచేఁత లుగ్గడించి శోకించుట	11 - 24 - 21	673
గాంధారి శ్రీకృష్ణునకు శాపం బిచ్చుట	11 - 25 - 36	683
కుంతి ధర్మజునకుఁ గర్ణుండు దనకొడు కగుట దెలుపుట	11 - 27 - 1	691

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

శల్య, సౌప్తిక, స్త్రీ పర్వములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శల్యపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీ గిరిజాసమవాయమ । హాగురు తరశుభగ సంపదాలంబ! సదా
యోగిజన క్షేమ సమీ । హాగర్భిత దివ్యచిత్త! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= లక్ష్మితో; గిరిజా= పార్వతితో; సమవాయ= విడదీయరాని సంబంధం కలిగిన; మహా= మిక్కిలి; గురుతర= గొప్పది అయిన అనగా వర్ణింపశక్యం కాని అనంతమైన; శుభగ= మంగళకరాలగు; సంపద్= ఐశ్వర్యములకు; ఆలంబ= ఆధారమయినవాడా!; సదా= ఎల్లప్పుడు; యోగిజన= బ్రహ్మజ్ఞానులగు మహర్షులయొక్క; క్షేమ= సంరక్షణయందలి; సమీహా= తీవ్రమయిన కోరికతో అనగా ఇచ్ఛాశక్తితో; గర్భిత= నిండిన; దివ్యచిత్త!= ఉత్తమగుణాలు గల హృదయం కలవాడా!; (దయ, కరుణ, ప్రేమ మొదలగు గుణములు; దివ్యములు- అట్టి గుణాలతో నిండిన చిత్తం దివ్యచిత్తం); హరి= విష్ణువు; హర= శివుడు- అనే భేదం లేని అనగా హరిహర అభేదరూపం కలిగిన - పరబ్రహ్మ స్వరూపా! హరిహరనాథా!= (సంబోధనం.)

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీవు లక్ష్మీపార్వతులతోడి విడదీయరాని సంబంధం కలవాడవై (అనగా హరికి లక్ష్మితోను, హరునకు పార్వతితోను విడదీయరాని సంబంధం కలవాడవు), సకల కల్యాణ ప్రదాలైన మహైశ్వర్యాలకు ఆశ్రయుడవు. నీవు ఎల్లప్పుడు బ్రహ్మజ్ఞానులైన యోగిజనుల సంరక్షణనే అపేక్షిస్తావు.

విశేషం: సమవాయము - ఇది తర్కశాస్త్ర పదం. మధువు నుండి మాధుర్యం విడదీయరానిది. అట్లే అగ్నికి ఉష్ణమునకు, వాయువునకు స్పర్శమునకు విడదీయరాని సంబంధం. ఇదియే సమవాయము. ఇందు శ్రీగిరిజలకు సమవాయము. హరిహరులకు సమవాయము. శ్రీహరులకు గిరిజాహరులకు సమవాయము. ఇది హరిహరాద్వైతమును ప్రతిపాదించటంలో తిక్కయజ్వహృదయం.

క. దేవా! జనమేజయ ధా । త్రీవల్లభుఁ డుత్సుకత్వరేఖాసౌమ్య
శ్రీవిలసితుఁడై యిట్లనుఁ । దా వైశంపాయనున కుదాత్త వినీతిన్. 2

ప్రతిపదార్థం: దేవా= హరిహరనాథా!; జనమేజయ= జనమేజయుడను; ధాత్రీ= భూమికి; వల్లభుఁడు= భర్తఅయినవాడు అనగా జనమేజయమహారాజు; ఉత్సుకత్వ= కుతూహలం అను; రేఖా= కాంతివలన; సౌమ్య= ప్రశాంత; శ్రీ= సౌందర్యముతో; విలసితుఁడై= ప్రకాశించుచున్నవాడగుచు; ఉదాత్త= ఉన్నతమైన; వినీతిన్= వినయముతో; తాన్= తనంతతానుగా; వైశంపాయనునకున్= వైశంపాయన మహర్షితో; ఇట్లు= ఈ ముందు చెప్పబోవు విధంగా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! జనమేజయ మహారాజు మిక్కిలి కుతూహలం కలవాడై వినయంతో వైశంపాయన మహర్షితో ఇట్లా అన్నాడు.

విశేషం: సామాన్యంగా పురాణకథలు అన్నీ ఉగ్రశ్రవసుడు అనే సూతుడు శౌనకాది మహర్షులకు సత్రయాగమున చెప్తుతున్నట్లు సాగుతాయి. మహాభారత రచనలో ఆదికవి నన్నయ ఆ మార్గాన్నే అవలంబించారు. కాని తిక్కయజ్వ స్వతంత్రించి 'ఏను

విన్నపంబు సేయు తెఱంగుగా అంతస్సన్నిధిం గలిగించుకొని అమ్మహాకావ్యంబు నర్థంబు సంగతంబు సేసెద' అని తానుగా హరిహరనాథునకు మహాభారత కథను విన్నవిస్తున్నట్లు పదిహేను పర్వములను రచించాడు. కావ్యాన్ని కూడా హరిహరనాథుడికే అంకితమొనర్చి హరిహర అద్వైతమును అవలంబించాడు. ఇది తిక్కయజ్వ విశిష్టత.

జనమేజయుడు పరీక్షిత్తు కుమారుడు. వైశంపాయనుడు వ్యాసభగవానుడి శిష్యుడు. పైల, సుమంత, వైశంపాయన జైమినులు నల్వురు వ్యాసభగవానుడి శిష్యులు. చతుర్వేదాలను, అష్టాదశ పురాణాలను ముల్లోకాలకు వ్యాప్తి చెందించిన మహర్షులు.

క. దురమున నమ్మెయిఁ గర్ణుఁడు । పరిమార్పంబడిన నల్పపరిజనుఁడై య
క్కురుపతి యజయ్యులగున । య్యరులయెడం బిదప నెట్టులయ్యె? మునీంద్రా! 3

ప్రతిపదార్థం: మునీంద్రా!= వైశంపాయన మహామునీ!; పిదపన్= అటు తరువాత; దురమునన్= యుద్ధంలో; ఆ+మెయిన్= ఆ విధంగా-కర్ణుఁడు= సైన్యాధ్యక్షుడైన కర్ణుడు; పరిమార్పంబడినన్= చంపబడగా; ఆ కురుపతి= కౌరవనాథుడైన దుర్యోధనుడు; అల్ప= తక్కువ; పరిజనుఁడై= సేవకులు కలవాడై - అనగా స్వల్పసైన్యము కలవాడై; అజయ్యులగు= జయింపశక్యముకాని; అ+అరులఎడన్= ఆ శత్రువులైన పాండవులతో; ఎట్టులు= ఏ విధంగా; అయ్యెన్?= (యుద్ధం) జరిగినది?

తాత్పర్యం: ఓ వైశంపాయన మహామునీ! (ఆ పదియేడవ రోజు) యుద్ధంలో కౌరవసైన్యాధ్యక్షుడైన కర్ణుడు ఆ విధంగా చంపబడగా, స్వల్పసైన్యం గల దుర్యోధనుడు అజేయులైన పాండవులతో ఏ విధంగా యుద్ధం చేశాడు?

తే. ఏను మును విన్న యక్కౌరవేంద్రపాండు । విభు తనూజుల చరితంబు వేడ్కఁ బెంచెఁ
జెవుల తియ్యంబు దళుకొత్తఁ జెప్పు మనఘ! వారిదైన యనంతర వర్తనంబు. 4

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; వైశంపాయన మహామునీ; ఏను= నేను; మును= ఇంతకుముందు; విన్న= వినినటువంటి; ఆ కౌరవేంద్ర= ఆ కురుపతి అయిన దుర్యోధనుడియొక్క; పాండువిభు= పాండురాజుయొక్క; తనూజుల= కుమారులయిన పాండవులయొక్క; చరితంబు= చరిత్ర; వేడ్కన్= నాలో కుతూహలమును; పెంచెన్= పెంపొందించెను; ఎక్కువచేసెను; వారిదైన= ఆ కౌరవపాండవులయొక్క; అనంతర వర్తనంబు= అటుతరువాత ప్రవర్తనం; చెవుల తియ్యంబు= చెవులకు ఇంపు; తళుకొత్తన్= మిక్కిలి ప్రకాశింపగా; చెప్పుము= వినిపించుము.

తాత్పర్యం: పవిత్రుడైన ఓ వైశంపాయన మహామునీ! నేను మీ వలన ఇంతవరకు వినిన కౌరవపాండవుల చరిత్రం ఇంకనూ వినాలని మిక్కిలి కుతూహలం రేకెత్తెతున్నది. అందువలన వారి అనంతర చరిత్రను చెవుల కింపుగా వినిపించుము.

వ. అని యడిగిన వైశంపాయనుం డమ్మహీనాయకున కి ట్లనియె నట్లు కర్ణుండు దెగిన దుర్యోధనుండు హతావశిష్ట వసుధావరులు పరివేష్టింపఁ గొంచెపు మూఁకలతోడ విడిదలకుం జని సుహృజ్జనంబులు దేర్ప విషాదం బుడిచి సముత్సాహదోహలియై శల్యునిం దనకు సేనాపతిఁ గావించి వేగుటయు బలుపుఁబొలుపును వెలయఁ బొలికలనికి నడచెఁ బాండవేయులును బలంబుతోడం బన్నియేతెంచిన నయ్యిరువాఁగునకు సురాసురసమరంబునుం బోని సంగ్రామం బయ్యె నంత మధ్యాహ్నంబున నమ్మద్రపతి యుధిష్ఠిరు పరాక్రమంబునం దెగియెఁ బదంపడి తనభటులుం జెలులుఁ జుట్టంబులును సమసిన నుక్కుదక్కి

యక్కురువిభుం డనిపని సాలించి వెఱం బొందెడుడెందంబుతో నొక్కరుండునుం దొలంగం బాఱి యొక్క మడుపుసొచ్చి దాఁగి యుండె నట గెలుపునుబ్బునం బొంపిరివోవు పాండవేయు లతం డందునికి యెఱింగి యయ్యెడకు నరిగి నలిరేఁగి చుట్టుముట్టి పిలిచిన వెడలి వడముడి తోడిపెనంకువం బెద్దయుంబ్రొద్దు పెనంగి యాభూనాథుండును బ్రొద్దు సాల వాలినప్పుడు భీముగదాఘాతంబునఁ దొడలు విఱిగి పడియె నంత నిశాసమయంబున నశ్వత్థామ కృపకృతవర్మలు దనకుం దోడుగా ధర్మనందనస్కంధావారంబుఁ బొదివి పాంచాల ప్రభద్రక మాత్స్య ప్రభృతి శేషసైన్యంబుల సమయించె మఱునాఁడు సంజయుండు కురుక్షేత్రంబున నుండి పూర్వాహ్ణంబునఁ గరినగరంబున కరుగుదెంచి. 5

ప్రతిపదార్థం: అని= ఈ విధముగా; అడిగిన= జనమేజయుడు అడుగగా; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; ఆ మహీ= ఆ భూమికి; నాయకునకున్= మహారాజైన జనమేజయునకు; ఇట్లు= ఈ విధముగా; అనియెన్= చెప్పెను; అట్లు= ఆ విధముగ; కర్ణుండు; తెగినన్= యుద్ధమునందు చావగా; దుర్యోధనుండు; హత= చంపబడగా; అవశిష్ట= మిగిలిన; వసుధావరులు= రాజులు; పరివేష్టింపన్= చుట్టుముట్టగా; కొంచెపు= కొద్దిపాటి; మూఁకలతోడన్= సైనికులతో; విడిదలకున్= విడిదిచేయుచోటునకు; చని= వెడలి; సుహృజ్జనంబులు= స్నేహితులు; తేర్పన్= ఓదార్చగా; విషాదంబు= దుఃఖమును; ఉడిచి= పోగొట్టుకొని; సముత్సాహ= మిక్కిలి ఉత్సాహమువలన; దోహలియై= ప్రేరేపింపబడినవాడై; శల్యునిన్; తనకున్= తన పక్షమునకు; సేనాపతిన్= సైన్యాధ్యక్షునిగా; కావించి= చేసి; వేగుటయున్= తెల్లవారుటయు; బలుపు= బలమును; పొలుపును= ఒప్పును; వెలయన్= ప్రకాశింపగా; పొలికలనికిన్= యుద్ధభూమికి; నడచెన్= వెడలెను; పాండవేయులును= పాండురాజుకుమారులైన ధర్మరాజు మొదలగువారు కూడ; బలంబుతోడన్= తమ సైనికబలముతో; పన్ని= వ్యూహరచన చేసి యుద్ధమునకు సిద్ధపడి; ఏతెంచినన్= రాగా; అయిరువాఁగునకున్= రెండుపక్షముల సైన్యమునకు; సుర= దేవతలయొక్క; అసుర= రాక్షసులయొక్క; సమరంబునున్= యుద్ధమును; పోని= పోలిన; సంగ్రామంబు= యుద్ధము; అయ్యెన్; అంతన్= అప్పుడు; మధ్యాహ్నంబునన్; ఆ+మద్రపతి= అట్టి శల్యుడు; యుధిష్ఠిరు పరాక్రమంబునన్= ధర్మరాజుయొక్క శౌర్యమువలన; తెగియెన్= చనిపోయెను; పదంపడి= మరియు ఆ వెనువెంటనే; తన= తనయొక్క; భటులున్= సైనికులును; చెలులున్= స్నేహితులును; చుట్టంబులును= బంధువులును; సమసినన్= చనిపోగా; ఉక్కు= బలము; తక్కి= కోల్పోయి; ఆ+కురువిభుండు= ఆ దుర్యోధనుడు; అనిపని= యుద్ధం చేయుటం; చాలించి= మానివేసి; వెఱన్= భయమును; పొందెడు= పొందినటువంటి; డెందంబుతోన్= హృదయముతో; ఒక్కరుండునున్= ఒక్కడును; తొలంగంబాఱి= తొలగిపోయి (అనగా యుద్ధభూమినుండి వెడలిపోయి); ఒక్క= ఒక; మడువు= లోతైన కొలను; చొచ్చి= ప్రవేశించి; దాఁగి= మరుగుపడి; ఉండెన్; అట= అక్కడ; గెలుపు+ఉబ్బునన్= విజయంయొక్క ఉత్సాహంవలన - అనగా విజయోత్సాహంవలన; పొంపిరివోవు= విజృంభించిన; పాండవేయులు; అతండు= ఆ దుర్యోధనుడు; అందున్= ఆ మడువునందు; ఉనికి= ఉండుట; ఎఱింగి= తెలిసికొని; ఆ+ఎడకున్= ఆ స్థానమునకు; అరిగి= వెడలి; నలిరేఁగి= మిక్కిలిరెచ్చిపోయి - అనగా మిక్కిలి ఉద్రేకం పొంది; చుట్టుముట్టి= ఆ మడువు చుట్టునుమూగి; పిలిచినన్= పిలువగా; వెడలి= బయటకువచ్చి; వడముడితోడి= భీముడితోడి; పెనంకువన్= యుద్ధమున; పెద్దయున్= ఎక్కువ; ప్రొద్దు= కాలం - అనగా ఎక్కువసేపు; పెనంగి= యుద్ధముచేసి; ఆ భూనాథుండును= భూమికి భర్త అయిన ఆ దుర్యోధనుడు; ప్రొద్దు= సూర్యుడు; చాలన్= ఎక్కువగా; వాలినప్పుడు= క్రుంకిన సమయమున; భీము= భీముడియొక్క; గదా= గద అను ఆయుధముయొక్క; ఘాతంబునన్= దెబ్బవలన; తొడలు, విఱిగి= ముక్కలుగా విరిగి; పడియెన్= క్రిందపడిపోయెను; అంతన్= అటు తరువాత; నిశాసమయంబునన్= రాత్రి సమయమునందు; అశ్వత్థామ= ద్రోణుడి కుమారుడైన అశ్వత్థామ; కృప= ద్రోణుని బావమరది అయిన కృపుడును; కృతవర్మ= భోజదేశమునకు అధిపతి అయిన కృతవర్మయు; తనకున్; తోడుగాన్= తోడురాగా; సహాయము రాగా; ధర్మనందన= ధర్మరాజుయొక్క; స్కంధావారంబున్= సైనిక శిబిరంబును; పొదివి= క్రమ్ముకొని; పాంచాల= పాంచాలదేశముయొక్క; ప్రభద్రక= ప్రభద్రకులను క్షత్రియదళము; మాత్స్య= మత్స్య దేశ

క్షత్రియదళము; ప్రభృతి= ఈ మొదలగు; శేష= మిగిలిన; సైన్యంబులన్= సేనలను; సమయించెన్= సంహరించెను; మఱునాఁడు= మరుసటి దినమున; సంజయుండు; కురుక్షేత్రంబుననుండి= కురుక్షేత్రయుద్ధభూమినుండి; పూర్వాహ్ణంబునన్= మధ్యాహ్నానికి ముందు కాలాన; కరినగరంబునకున్= హస్తినాపురమునకు; అరుగుదెంచి= వచ్చి.

తాత్పర్యం: జనమేజయమహారాజు పాండవులు అటుపిమ్మట ఏమి చేశారని అడుగగా వైశంపాయన మహాముని ఈ విధంగా చెప్పాడు; కర్ణుడు చనిపోయిన తరువాత యుద్ధంలో చనిపోగా మిగిలిన రాజశ్రేష్ఠులు తన చుట్టును చేరి ఉండగా కొంచెం సైన్యాన్ని వెంటనిడికొని దుర్యోధనుడు విడిదికి వెళ్ళాడు. అక్కడ స్నేహితులు దుఃఖితుడైన అతడిని ఓదార్చగా దుఃఖాన్ని విడిచి, మరల సమరోత్సాహాన్ని సంతరించుకొని మద్రపతి అయిన శల్యుడిని తనకు సేనాపతిగా చేసికొని తెల్లవారిన వెంటనే సైనికబలమును సమకూర్చుకొని మరల యుద్ధభూమికి వెళ్ళాడు. పాండవులు కూడా తమ సైనికబలంతో వ్యూహరచన కావించుకొని యుద్ధానికి సిద్ధమై రాగా, ఆ ఇరుపక్షాలవారికి దేవరాక్షసుల యుద్ధమును పోలిన యుద్ధం జరిగింది. అంతట మధ్యాహ్నసమయాన ధర్మరాజు మహాపరాక్రమంతో కౌరవసైన్యాధిపతి అయిన శల్యుడిని చంపివేశాడు. అటు తరువాత వెనువెంటనే దుర్యోధనుడి సైనికులు, స్నేహితులు, చుట్టములు, ఆ యుద్ధంలో చనిపోగా సమస్తబలాన్నీ కోల్పోయి దుర్యోధనుడు సమరం చాలించి, భయంతో ఒంటరిగా ఆ యుద్ధభూమినుండి తొలగిపోయి, ఒక లోతైన జలాశయంలో దిగి దాగి ఉన్నాడు. ఇక అక్కడ విజయోత్సాహంతో విజృంభించిన పాండవులు దుర్యోధనుడు మడుగులో దాగి ఉండటాన్ని గమనించి, అక్కడకు వెడలి, ఆ మడువును చుట్టుముట్టి, మహోద్రేకంతో దుర్యోధనుడిని పిలువగా అతడు ఆ మడువునుండి పైకి వచ్చి భీముడితో చాలాసేపు యుద్ధం చేశాడు. అంతట సూర్యాస్తమయ సమయంలో భీముడి గదాఘాతమున తొడలు విరిగి దుర్యోధనుడు నేలకు ఒరిగాడు. అనంతరం రాత్రి సమయంలో కృపకృతవర్మలు తోడు రాగా అశ్వత్థామ ధర్మరాజుయొక్క సైనిక శిబిరంలోనికి ప్రవేశించి, యుద్ధంలో పాండవపక్షాన మిగిలిన పాంచాల ప్రభద్రక మాత్స్య సైనికులను సంహరించాడు. ఆ మరునాటి మధ్యాహ్నానికి ముందుగా సంజయుడు కురుక్షేత్రం నుండి హస్తినాపురానికి వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. **పొరిఁ బొరి మోము బాష్పజలపూరము గ్రమ్మఁగ నూర్ధ్వబాహుఁడై**
చరణయుగంబు దొట్రువడ సంభృతశోకత రాజవీథి నె
వ్వరిఁ గనియైన హా మహితవైభవ హా ధృతరాష్ట్రపుత్ర! హా
కరిపురనాథ! యం చెలుఁగు గద్గదికం దగులంగ నేడ్చుచున్ ॥ **6**

ప్రతిపదార్థం: పొరిన్+పొరిన్= మాటిమాటికి; మోమున్= ముఖమును; బాష్పజల పురము= కన్నీటి వెల్లువ; క్రమ్మఁగన్= ఆవరించగా; ఊర్ధ్వబాహుఁడు+ఐ= పైకి ఎత్తబడిన చేతులు కలవాడై; చరణయుగంబు= రెండు కాళ్ళు; తొట్రుపడన్= తొందరపాటు వలన తడబడగా; సంభృత= మిక్కిలియైన; శోకతన్= దుఃఖముతో; రాజవీథిన్= రాజమార్గమున; ఎవ్వరిన్= ఏ ఒక్కరిని; కని+ఐనన్= చూచినను; హా!= అయ్యో!; మహిత వైభవ= గొప్ప సంపద గల; ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రునియొక్క; పుత్ర!= కుమారా!; హా!= అయ్యో!; కరిపుర= హస్తినాపురమునకు; నాథ!= ప్రభువు అయినవాడా!; అంచున్= అనుచు; ఎలుఁగు= కంఠధ్వని; గద్గదికన్= గాద్గద్యమును - డగ్గుత్తికను; తగులంగన్= పొందగా; ఏడ్చుచున్= దుఃఖిస్తూ.

తాత్పర్యం: ఆ సంజయుడు కురుక్షేత్రంనుండి హస్తినాపురానికి వచ్చి, మాటిమాటికి ముఖం కన్నీటితో నిండిపోగా, చేతులు పైకెత్తి, కాళ్ళు తొట్రుపాటు పడుతుండగా దుఃఖ భారంతో, హస్తినాపుర రాజమార్గంలో ఎవరు కనిపించినా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'హా మహితవైభవా! హా ధృతరాష్ట్రపుత్రా! హా కరిపురనాథా!' అంటూ గద్గదస్వరంతో ఎలుగెత్తి ఏడుస్తూ, (తరువాతి పద్యంతో అన్వయం.)

క. జననయన చకోరానం । దనుఁడగు నృపచంద్రుఁ డనుచితంబయిన విధం
బున నస్తమించె నంచుం । దనుడోలన భరితభూరిదైన్యుం డగుచున్. 7

ప్రతిపదార్థం: జన= ప్రజలయొక్క; నయన= నేత్రములనెడి; చకోర= చకోరపక్షులకు; ఆనందనుఁడు= సంతోషమును కలిగించువాడు; అగు= అయినటువంటి; నృప= రాజు అనెడి; చంద్రుఁడు= చందమామ; అనుచితంబు+అయిన= ఉచితం కాని; విధంబునన్= ప్రకారంగా; అస్తమించెన్= మరణించెను; అంచున్= అనుచు; తను= శరీరంయొక్క; డోలన= ఊగుటచేత; భరిత= నిండిన; భూరి= అధికమైన; దైన్యుండు= దీనత్వం కలవాడు; అగుచున్= ఔతూ.

తాత్పర్యం: చంద్రుడు చకోర పక్షులకు ఆనందాన్ని చేకూర్చేటట్లు ప్రజలనేత్రాలకు ఆనందాన్ని చేకూరుస్తున్న రాజచంద్రు డయిన దుర్యోధనుడు అనుచితంగా మరణించాడు - అంటూ మిక్కిలి దుఃఖభారంతో సంజయుడు దీనుడై (ధృతరాష్ట్ర మందిరాన్ని ప్రవేశించాడు).

విశేషం: 'జన నయన చకోరానందనుఁ డగు నృపచంద్రుఁడు అస్తమించె' - ఇది చక్కని రూపకాలంకారం.

వ. చని ధృతరాష్ట్ర మందిరంబు ప్రవేశించి లోపలికొలువున గాంధారియుం గోడండ్రును విదురుండును మఱియును దగు చుట్టంబులునుం బరివేష్టింపఁ గర్ణులేమికిఁ బ్రేముడించు పలుకులు సెల్ల నుల్లంబు దురపిల్లనున్న యన్నర నాథుం గని డగ్గుత్తికవెట్టుచుఁ దనపేరు సెప్పికొని చేరి పాదప్రణామం బాచరించి యేడ్పు బెరయు నెలుంగుతో నిట్లనియె. 8

ప్రతిపదార్థం: చని= వచ్చి; ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రునియొక్క; మందిరంబు= భవనములోనికి; ప్రవేశించి= చొచ్చి; లోపలికొలువునన్= లోపల ఉన్న సభాస్థానమునందు - అనగా ఆంతరంగిక సభామండపమునందు; గాంధారియున్= గాంధారియు; కోడండ్రును= కోడళ్ళును; విదురుఁడును; మఱియును= ఇంకను; తగుచుట్టంబులునున్= దగ్గరిబంధువులును; పరివేష్టింపన్= చుట్టును మూగి ఉండగా; కర్ణులేమికిన్= కర్ణునియొక్క మరణమునకు; ప్రేముడించు= దుఃఖపూరితములు అయిన; పలుకులు= మాటలు; చెల్లన్= కొనసాగగా; ఉల్లంబు= హృదయము; దురపిల్లన్= తపించుచుండగా; ఉన్న= ఉన్నటువంటి; ఆ నరనాథున్= ఆ ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళి; పాద= పాదములకు; ప్రణామంబు= నమస్కారం; ఆచరించి= చేసి; ఏడ్పు= దుఃఖము; బెరయు= వ్యాపించు; ఎలుంగుతోన్= పెద్దకంఠధ్వనితో - అనగా బోరుబోరున ఏడుస్తూ; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: సంజయుడు వచ్చి ధృతరాష్ట్రుడి మందిరం లోనికి ప్రవేశించాడు. ఆ మందిరంలోపల ఉన్న అంతరంగిక సభామండపంలో, గాంధారియు, కోడళ్ళును, విదురుడును, దగ్గరిచుట్టాలు ఆ ధృతరాష్ట్రుడి చుట్టూ మూగి ఉన్నారు. అప్పుడు ధృతరాష్ట్రుడు కర్ణుడి మరణానికి దుఃఖిస్తూ సంతాపంతో నిండిన హృదయంతో తపిస్తుండగా, ఆ ధృతరాష్ట్రుడిని చూచి, గద్గదస్వరంతో తనపేరు చెప్పుకొని, దగ్గరకు పోయి, పాదాలకు నమస్కరించి సంజయుడు బోరుబోరున ఎలుగెత్తి ఏడుస్తూ, ఈ విధంగా చెప్పాడు.

సీ. 'జననాథ! శల్యుండు సమసె సౌబలుఁడు గీ। టడఁగె నులూకుండు మడిసె సకల
సంశప్తకులుఁ గడచనిరి కాంభోజశ। తానీకములు దెగటాఱె యవన
పార్వతీయమ్లేచ్ఛబలములు ద్రుంగె నల్। దిక్కులమన్నీలుఁ దక్కఁగలుగు
నరనాయకులును జచ్చిరి కుమారులు గల। యందఱుఁ దెగిరి కర్ణాత్మజులును

తే. బొలిసిరయ్య! వృకోదరు పలుకు దప్ప। కుండఁ దద్గదాదండప్రచండనిహతి
రెండు దొడలును విఱిగి ధరిత్రిఁ బెలుచఁ। గూలి రూపఱి రారాజు ధూళి బ్రుంగె. 9

ప్రతిపదార్థం: జననాథ!= ధృతరాష్ట్ర మహారాజా! శల్యుండు= మద్రపతి అయిన శల్యుడు; సమసెను= చనిపోయెను; సౌబలుఁడు= గాంధార రాజు శకుని; గీటడఁగెన్= చచ్చెను; ఉలూకుండు= శకుని పుత్రుడు అయిన ఉలూకుడు; మడిసెన్= మరణించెను; సకల= సమస్తమైన; సంశప్తకులు= త్రిగర్తాధీశ్వరులగు సుశర్మ, సత్యరథుడు, సత్యసేనుడు, సత్యకర్ముడు, మొదలగు వారు; కడచనిరి= చచ్చిరి; కాంభోజ= కాంభోజరాజు సుదక్షిణుడు - అతడిసేనలు; శతానీకములు; తెగటాఱెన్= చచ్చిపోయాయి; యవన= యవనదేశాధీశులయొక్క; పార్వతీయ= పార్వతీయుడను రాజుయొక్క (ఇతడు కుక్షి అను దానవుడి అంశవలన జన్మించాడు.); మ్లేచ్ఛ= మ్లేచ్ఛ దేశాధీశులయొక్క; బలములు= సేనలు; త్రుంగెన్= నేలకూలెను; నల్= నాలుగు; దిక్కుల= దిక్కులనుండి; వచ్చిన; మన్నీలున్= రాజశ్రేష్ఠులును; తక్కు= మిగిలి; కలుగు= ఉన్న; నరనాయకులును= రాజులును; చచ్చిరి= మరణించారు; కుమారులు= రాజపుత్రులు; కల= ఇంకను ఉన్న; అందఱున్= అందరును; తెగిరి= చచ్చారు; కర్ణ= కర్ణునియొక్క; ఆత్మజులును= పుత్రులును; పొలిసిరి= చచ్చిరి; అయ్య!= ఓ పూజ్యుడా - ధృతరాష్ట్ర మహారాజా!; వృకోదరు= భీముని యొక్క (తోడేలు పొట్టవంటి పొట్టకలవాడు కావున భీముడికి వృకోదరుడని పేరు); పలుకు= మాట; తప్పకుండన్= అబద్ధం కాకుండగ; తద్= ఆ; గదాదండ= గదాయుధముయొక్క; ప్రచండ= తీవ్రమైన; నిహతిన్= దెబ్బవలన; రెండు+తొడలును= రెండు తొడలును; విఱిగి= ముక్కలై; ధరిత్రిన్= భూమిపై; పెలుచన్= దబ్బున; కూలి= పడిపోయి; రూపఱి= రూపము చెడి; రారాజు= దుర్యోధనుడు; ధూళిన్= దుమ్ములో; బ్రుంగెన్= పడ్డాడు.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! శల్యుడు, శకుని, శకుని కుమారుడు ఉలూకుడు, సమస్త సంశప్తకులు, కాంభోజరాజులు, శకులు, యవనులు, పార్వతీయులు, మ్లేచ్ఛులు, వారి బలాలు నలు దిక్కులనుండి వచ్చిన రాజులు, రాజపుత్రులు కర్ణుడి కుమారులు అందరూ యుద్ధంలో మరణించారు. ఇక భీముడి ప్రతిజ్ఞ ప్రకారం గదాఘాతం వలన రారాజు దుర్యోధనుడు రెండు తొడలు విరిగి నేలకూలి రూపం చెడి దుమ్ము కొట్టుకొని ఉన్నాడు.

విశేషం: ఈ సీసపద్యంలో తిక్కయజ్వ వాడిన పదమును వాడకుండా - తొమ్మిది శబ్దములను ప్రయోగించాడు. ఈ తొమ్మిది శబ్దములు 'చచ్చుట' అను ఒకే అర్థమును బోధిస్తున్నవి. 1.సమసె. 2.గీటడఁగె. 3.మడిసె. 4.కడచనిరి. 5.తెగటాఱె. 6.త్రుంగె;. 7.చచ్చిరి. 8.తెగిరి. 9.పొలిసిరి. ఒకే అర్థమును బోధించు అనేక శబ్దములను ఒకే పద్యమున ప్రయోగించటం 'శబ్దవైచిత్రి'. ఇక, ఇచ్చట బీభత్సకరుణ రసములు పోషింపబడుతున్నవి. ఈ శబ్దవైచిత్రి తిక్కయజ్వ రసాభ్యుచితబంధమునకు ప్రాణం.

వ. మఱియు ధృష్టద్యుమ్నుండును శిఖండియు నుత్తమౌజుండును యుధామన్యుండును లోనుగాఁ గల పాంచాలురును జేదిమాత్స్య ప్రభద్రక ప్రభృతి బలంబులు లోనుగా నవశిష్టజనంబులును నీమనుమలైన ప్రతివింధ్యాది ద్రౌపదేయులును సకల రథసామజ ఘోటక సుభటసమేతంబుగా మృతిఁ బొందిరిట్లు కౌరవ శిబిరంబును బాండవస్కంధావారంబును విధి వశంబున వనితావశేషంబులయ్యె నిందుఁ గృపకృతవర్ములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నశ్వత్థామయుఁగా ముప్వురును నందుఁ బాండవు లేవురును గృష్ణసాత్యకులుగా నేడ్వురును భవత్సుతుండయిన యుయుత్సుండును శేషించి రివ్విధంబునఁ బదునొకండు నేడక్షౌహిణులు నఖిలక్షోణికి దుర్యోధను నధిపుఁ గావింపనుం జంపనుం బూను కాలంబగుటయు నాలంబున నిశ్శేషత్వంబు నొందె' నని చెప్పటయు నమ్మహీపతి మూర్ఛిల్లె. విదురుండును వివశుండై యొఱగె. గాంధారియుఁ గోడండ్రును జెయ్వేది పుడమింబడిరి; తక్కటిచుట్టంబులు మొగంబులు మొగుడం జిత్రరూపంబుచందం బైరి. సంజయప్రయత్నంబున నందఱుం గ్రమంబునం దేఱి రప్పుడు మేను వడంక న మ్మానవనాథుండు నలు దిక్కులకు మొగంబు ద్రిప్పి విదురునుద్దేశించి 'పుత్రహీనుండ ననాథుండ నగుట యెఱింగితిఁ దమ్ముండ! యిటమీఁద నీవ నాకు గతి యగు' మనుచు మగుడనిగుడు మూర్ఛాతిశయంబునం బరవశుండయిన నతండును నారీజనంబును శీతాంబుసేచనంబులను లలితవ్యజనవీజనంబులను గొండొకసేపునకు సేదదీర్చినం గూర్చుండి యక్కురువిభుండు గుంభనిక్షిప్త భుజంగంబు చందంబున నిశ్వాసంబు నిగుడ్చుచు నూరకున్నం గనుంగొని యక్కాంతాసముదయంబును సంజయుండును రోదనంబు సేసిరి, పదంపడి యవ్విచిత్రవీర్యనందనుండు.

10

ప్రతిపదార్థం: మఱియును= ఇంకను; ధృష్టద్యుమ్నుండును; శిఖండియున్; ఉత్తమౌజుండును= ఉత్తమౌజుడును - (ఇతడు పాంచాలదేశపు యోధుడు); యుధామన్యుండును= యుధామన్యుడును- (ఇతడు పాంచాలదేశపురాజకుమారుడు - ఉత్తమౌజుడును - యుధామన్యుడును యుద్ధమున అర్జునుని రథరక్షకులు); లోనుగాన్= మొదలుగా; కల= ఉన్న; పాంచాలురును= పాంచాలదేశమువారును; చేది= చేదిదేశముయొక్క; మాత్స్య= మత్స్యదేశముయొక్క; ప్రభద్రక= ప్రభద్రకులు; ప్రభృతి= మొదలగు; బలంబులు= సైన్యములు - (చేది దేశపు రాజు శిశుపాలుడు - అతడి పుత్రుడు ధృష్టకేతుడు. ఇతడు ఒక అక్షౌహిణి సేనతో పాండవపక్షముననుండి పోరాడాడు. కురుక్షేత్ర యుద్ధంలో - విరాటుడు ఒక అక్షౌహిణి సైన్యముతో పాండవ పక్షంనుండి యుద్ధం చేశాడు. ఇక ప్రభద్రకులు పాంచాలదేశపు క్షత్రియవీరులు); లోనుగాన్= మొదలుగా; అవశిష్ట= మిగిలిన; జనంబులును= సైనికులును; నీ మనుమలైన; ప్రతివింధ్య= ప్రతివింధ్యుడు; ఆది= మొదలగు; ద్రౌపదేయులును= ద్రౌపదీపుత్రులును- (ద్రౌపదికి పంచపాండవుల వలన జన్మించిన పుత్రులు అయిదుగురు. ఇందు మొదటివాడు ప్రతివింధ్యుడు. ధర్మరాజు వలన ప్రతివింధ్యుడు - భీముడి వలన సుతసోముడు - అర్జునుడి వలన శ్రుతకీర్తి - నకులుడి వలన శతానీకుడు- సహదేవుడి వలన శ్రుతకర్ముడు జన్మించారు); సకల= సమస్తమైన; రథ= రథములు; సామజ= ఏనుగులు; ఘోటక= గుర్రములు; సుభట= వీరసైనికులు; సమేతంబుగాన్= సహితముగ; మృతిన్= మరణమును; పొందిరి; ఇట్లు; కౌరవశిబిరంబును= దుర్యోధనాదులయొక్క విడిదిచేయు శిబిరము; పాండవ స్కంధావారంబును= పాండవులు విడిదిచేయు శిబిరమును; విధివశంబునన్= కాల ప్రభావమున; వనితా= స్త్రీలు మాత్రమే; అవశేషంబులు= మిగిలినవిగా; అయ్యెన్= అయినవి; ఇందున్= ఈ కౌరవపక్షమున; కృపకృతవర్మలున్= కృపుడు, కృతవర్మ; అశ్వత్థామయున్+కాన్= అశ్వత్థామతో కలిపి; ముప్వురునున్= ముగ్గురును; అందున్= ఆ పాండవపక్షమున; పాండవులు= ధర్మరాజాదులు; ఏవురును= అయిదుగురును; భవత్= నీయొక్క; సుతుండు= పుత్రుడు; అయిన= అయినటువంటి; యుయుత్సుండును= యుయుత్సుడనేవాడు; శేషించిరి= మిగిలిరి; ఈ విధంబునన్= ఈ ప్రకారముగ; పదునొకండు= పదకొండును; ఏడక్షౌహిణులును= ఏడు అక్షౌహిణులును; అఖిల= సమస్తమైన; క్షోణికిన్= భూమండలమునకు; దుర్యోధనున్= దుర్యోధనుడిని; అధిపున్= అధిపతిని; కావింపనున్= చేయుటకొరకు; చంపనున్= చంపుటకును; పూను= పూనిక వహించిన; కాలంబు= సమయము; అగుటయున్= వచ్చుటయు; ఆలంబునన్= యుద్ధంలో; నిశ్శేషత్వంబున్= ఒక్కడును మిగులని స్థితిని; ఒందెన్= పొందెను; అని= ఈ విధంగా; చెప్పుటయున్= చెప్పగా; ఆ మహీపతి= ఆ ధృతరాష్ట్రుడు; మూర్ఛిల్లెన్= మూర్ఛను పొందెను; విదురుండును= విదురుడు కూడ; వివశుండై= స్మృతి

కోల్పోయినవాడై; ఒఱగెన్= వాలిపోయెను; గాంధారియున్= గాంధారియు; కోడండ్రును= కోడళ్ళును; చెయ్వు= చేష్ట; ఏది= ఉడిగి; పుడమిన్= భూమిపై; పడిరి; తక్కటి చుట్టంబులు= మిగిలిన బంధువులు; మొగంబులు= ముఖములు; మొగుడన్= ముడుచుకొనిపోగా; చిత్రరూపంబు= చిత్రించిన బొమ్మల రూపము; చందంబు= మాదిరిగా; ఐరి= అయిపోయిరి; సంజయప్రయత్నంబునన్; అందఱున్= అందరు; క్రమంబునన్= ఒకరితరువాత ఒకరు క్రమముగా; తేఱిరి= తేరుకొనిరి; అనగా తెలివిని పొందిరి; అప్పుడు; మేను= శరీరము; వడంకన్= వణకుచుండగా; ఆ మానవనాథుండు= ఆ ధృతరాష్ట్రుడు; నలుదిక్కులకున్= నాలుగు వైపులకును; మొగంబు= ముఖము; త్రిప్పి= త్రిప్పిచూచి; విదురున్; ఉద్దేశించి; పుత్రహీనుండన్= పుత్రులు లేనివాడను; అనాథుండన్= దిక్కులేనివాడను; అగుట= అయితినని; ఎఱింగితిన్= తెలిసికొంటిని; తమ్ముండ!= తమ్ముడా!; ఇటమీఁదన్= ఇటుపైన; నీవ= నీవే; నాకున్; గతి; అగుము; అనుచున్; మగుడన్= మరల; నిగుడు= వ్యాపించు; మూర్ఛాతిశయంబునన్= మూర్ఛయొక్క విజృంభణమువలన; పరవశుండు= స్మృతిని కోల్పోయినవాడు; అయినన్= కాగా; అతండును= ఆ సంజయుడు; నారీజనంబును= స్త్రీజనమును; శీత= చల్లని; అంబు= నీళ్ళచేత; సేచనంబులను= తడుపుటవలనను; లలిత= మెత్తని; వ్యజన= తాటాకు విసనకర్రలతో; వీజనంబులను= విసరుటవలన; కొండొకసేపు= కొంతసేపటికి; సేద= బడలిక; తేర్చినన్= తీరునట్లు చేయగా; కూర్చుండి; ఆ+కురువిభుండు= ధృతరాష్ట్రుడు; కుంభ= కుండయందు; నిక్షిప్త= దాచబడిన; భుజంగంబు= త్రాచుపాము; చందంబునన్= విధముగా; నిశ్వాసంబు= నిట్టూర్పు; నిగుడ్చుచున్= వ్యాపింపజేస్తూ; ఊరకున్నన్= మౌనముగా ఉండగా; కనుంగొని; ఆ+కాంతా= ఆ స్త్రీలయొక్క; సముదయంబును= సమూహమును; సంజయుండును; రోదనంబుచేసిరి= బొబ్బలుపెట్టి ఏడ్చిరి; పదంపడి= ఆ వెనువెంటనే; ఆ= అట్టి; విచిత్రవీర్య= విచిత్రవీర్యునియొక్క; నందనుండు= పుత్రుడు అయిన ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ఉత్తమౌజుడు, యుధామన్యుడు మొదలైన పాంచాలురు, చేది, మాత్స్య, ప్రభద్రకాదుల సైన్యాలు, ఇంకను మిగిలిన బలాలు, నీ మనుమలు ద్రౌపది పుత్రులు, అయిన ప్రతివింధ్యాదులు, సకల రథగజ తురగ పదాతి దళములగు చతురంగబల సమేతంగా యుద్ధంలో మరణించారు. కౌరవ శిబిరంలోను, పాండవ శిబిరంలోను, స్త్రీలు మాత్రం మిగిలారు. కౌరవపక్షంలో కృప కృతవర్మ అశ్వత్థామలు ముగ్గురు మిగిలారు. పాండవ పక్షంలో, పాండవులు అయిదుగురు, కృష్ణుడు, సాత్యకి నీ కొడుకు యుయుత్సుడు మిగిలారు. ఈ సమస్తభూమండలానికి దుర్యోధనుడు అధిపతి కాగలడనే కారణంగా కాలవశాన ఈ కురుక్షేత్ర యుద్ధంలో, కౌరవపక్షంలో పదకొండు అక్షౌహిణులు, పాండవపక్షంలో, ఏడు అక్షౌహిణులు, మొత్తం పద్దెనిమిది అక్షౌహిణులయోధులు పోరాడి నిశ్శేషంగా మరణించారు- అని ఇట్లు సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు మూర్ఛపొందాడు. విదురుడు వివశుడయ్యాడు. గాంధారి, ఆమె కోడళ్ళు చేష్టలుడిగి నేలపై పడిపోయారు. మిగిలిన బంధువులందరూ చలనం లేని చిత్రములయ్యారు. అంతట సంజయుడి ప్రయత్నం వలన మరల వారందరూ తేరుకొన్నారు. అప్పుడు ధృతరాష్ట్రుడు నలువైపుల ముఖం త్రిప్పి విదురుడితో 'నేను పుత్రహీనుడను, దిక్కులేని వాడను అయిపోయాను. ఓ తమ్ముడా! ఇక మీద నీవే నాకు దిక్కు. అని చెప్పి మరల మూర్ఛపోయాడు. అప్పుడు సంజయుడు అచ్చట ఉన్న స్త్రీలు, ఆ ధృతరాష్ట్రుడిపై చల్లని నీళ్ళు చల్లి, విసనకర్రలతో విసరగా, కొంతసేపటికి బడలిక తగ్గగా లేచి కూర్చొని, కుండలో ఉంచిన నాగుపాము బుసలు కొట్టేటట్లు - ఆ ధృతరాష్ట్రుడు నిట్టూర్పులు నిగుడిస్తూ మౌనం వహించి ఉన్నాడు. అట్టి స్థితిలో ఉన్న ధృతరాష్ట్రుడిని చూచి, అచ్చట ఉన్న స్త్రీలు, సంజయుడు, భోరున ఏడ్చారు. ఆ వెనువెంటనే ధృతరాష్ట్రుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. 'కుంభ నిక్షిప్త భుజంగంబు చందంబున నిశ్వాసంబు నిగుడ్చుచు' అను ఈ ఒక్క ఉపమానంతో తిక్కయజ్వ ధృతరాష్ట్రుడికి పాండవులయందు గల క్రోధాన్ని, పుత్రమరణంవలన కలిగిన శోకాన్ని, ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితిని చక్కగ చూపించి, ధృతరాష్ట్రుడి పాత్రను అపూర్వంగా చిత్రించాడు.

ఆ. అనఘ! వశము గాదు మనసు గోడంద్ర మీ । వదినెఁ జుట్టములను సదనములకుఁ
బుచ్చు మనియెఁ బలుకు లచ్చుపాటడఁచు గ । ద్గదిక దైన్య మెసఁగ విదురుతోడ. 11

ప్రతిపదార్థం: పలుకులు= మాటలు; అచ్చుపాటు= స్పష్టత; అడఁచున్= తగ్గించు; గద్గదిక= డగ్గుత్తిక; దైన్యము= దీనత వలన వచ్చిన దుఃఖమును; ఎసఁగన్= ఎక్కువచేయగా - అనగా అతిశయింపచేయగా; విదురుతోడన్= విదురుడితో; అనఘ!= పాపరహితుడా!; మనసు= మనస్సు అనగా ఆలోచనాశక్తి; వశము= అధీనము; కాదు; కోడంండ్రన్= కోడళ్ళను; మీ వదినెన్= నీకు వదినె అయిన గాంధారిని; చుట్టములను= బంధువులను; సదనములకున్; వారి వారి ఇండ్లకు; పుచ్చుము= పంపుము; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: మాటలు తడబాటు వలన స్పష్టత కోల్పోతూ ఉండగా, దుఃఖాతిశయంవలన వణకుతున్న కంఠస్వరంతో ధృతరాష్ట్రుడు విదురుడితో 'నా మనసు నా అధీనంలో లేదు. నీవు మీ వదినె గాంధారిని, కోడండ్రను, బంధువులను వారి వారి ఇండ్లకు పంపు' మన్నాడు.

క. అనుటయు నాతం డందఱ । కును మెలపునఁ జెప్ప వగలఁ గుందుచు నల్ల
ల్లన తమనిలయంబులకును । జనిరి మఱియు నేడ్చుచుండె సంజయుఁ డలఁతన్. 12

ప్రతిపదార్థం: అనుటయున్= ధృతరాష్ట్రుడు విదురునితో ఇట్లు చెప్పగ; ఆతండు= ఆ విదురుడు; అందఱకును= అచ్చట ఉన్న స్త్రీలకందరకును; మెలపునన్= మెల్లగా-ఊరడింపుగా; చెప్పన్= చెప్పగా; వగలన్= భరింపరాని దుఃఖముతో; కుందుచున్= క్రుంగిపోవుచు; అల్లల్లన= మెల్లమెల్లగా; తమ నిలయంబులకును= వారి వారి ఇండ్లకు; చనిరి= వెడలిరి; మఱియును= ఇంకను; సంజయుఁడు; అలఁతన్= బాధతో; ఏడ్చుచుండెన్= దుఃఖిస్తూ ఉండినాడు.

తాత్పర్యం: తన మందిరంలో ఉన్న స్త్రీలను చుట్టాలను గాంధారిని వారి వారి ఇండ్లకు పంపుమని ధృతరాష్ట్రుడు విదురుడితో చెప్పగా విదురుడు వారందరికి ఓదార్పుగా మెల్లగా చెప్పగా వారందరు దుఃఖంతో క్రుంగిపోతూ మెల్లమెల్లగా వారి వారి ఇండ్లకు వెడలిపోయారు. అటు తరువాత కూడా సంజయుడు భరించరాని బాధతో ఏడుస్తూనే ఉండినాడు.

వ. అమ్మేదినీశ్వరుం డేది గతి? యని దుఃఖాతిశయంబునఁ జేతులు విదిర్చి యా సూతనందను దిక్కు మొగంబయి. 13

ప్రతిపదార్థం: ఆ+మేదినీశ్వరుండు= ప్రభువు అయిన ఆ ధృతరాష్ట్రుడు; దుఃఖాతిశయంబునన్= భరింపశక్యము కాని దుఃఖముతో; ఏది= ఏది; గతి?= మార్గము?; అని; చేతులు; విదిర్చి= విదిలించి; ఆ సూతనందను= ఆ సంజయుడి(యొక్క); దిక్కు= వైపు; మొగంబు= ముఖము; అయి= ఉంచినవాడై అనగా సంజయుడి వైపు చూచినవాడై.

తాత్పర్యం: అప్పుడు ధృతరాష్ట్రుడు భరించరాని దుఃఖంతో 'నాకిప్పు డేది గతి' అని చేతులు విదిలిస్తూ సంజయుడి వైపు తిరిగి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'చావరు నొవ్వరు పాండవు । లేవురు నని నీవు చెప్ప ని ప్పలుకులు దుః

ఖావేశకరములై చే । తోవృత్తి దహింపఁ జొచ్చె దుర్భరభంగిన్. 14

ప్రతిపదార్థం: పాండవులు= పాండురాజకుమారులైన ధర్మరాజాదులు; ఏవురున్= అయిదుగురు (ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు); చావరు= మరణించరు; నొవ్వరు= బాధపడరు; అని= ఈ ప్రకారంగా; నీవు; చెప్పన్= చెప్పుచుండగా; ఈ పలుకులు= ఈ మాటలు; దుర్భరభంగిన్= భరింపశక్యంకాని విధంగా; దుఃఖ= దుఃఖమును; ఆవేశకరములు+ఐ= ఆవేశింపచేసినవై - అనగా దుఃఖమును కల్పించినవై; చేతోవృత్తిన్= మనస్సుయొక్క వ్యాపారమును; దహింపన్= మండింప(లేక) తగులబెట్ట; చొచ్చెన్= చేసెను - అనగా బాధింపజేసెను.

తాత్పర్యం: 'పాండవులు అయిదుగురు మరణించలేదు. ఏ విధమయిన బాధనూ పొందలేదు' అని నీవు చెప్పిన మాటలు భరించరాని దుఃఖంతో నా గుండెను మండింపజేస్తున్నాయి.

క. తనయు లని నందఱుం బడి । రనఁగా విని పెక్కు పఱియలై పోవక యి

ట్లునికి యరయ వజ్రమయం । బని తలఁపఁగఁదగు మదీయ మగు హృదయంబున్. 15

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధమునందు; తనయులు= కుమారులు; అందఱున్= అందరును; పడిరి= చనిపోయిరి; అనఁగాన్= అని నీవు చెప్పగా; విని; పెక్కు; పఱియలు= బ్రద్దలు; ఐ= అయి; పోవక= పోకుండ; ఇట్లు= ఈ విధముగ; ఉనికి= ఉండుట; అరయన్= ఆలోచింపగ; మదీయము= నాకు సంబంధించినది; అగు= అయినటువంటి; హృదయంబున్= గుండెను; వజ్రమయంబు= వజ్రమువలె కాఠిన్యముతో కూడినదిగా; అని; తలఁపఁగన్= భావింపగ; తగున్= ఒప్పును.

తాత్పర్యం: నా కుమారులందరూ యుద్ధంలో మరణించారని నీవు చెప్పగా వినికూడా నా హృదయం బ్రద్దలు కాకుండా ఉన్నదంటే అది వజ్రమయమని చెప్పవచ్చును.

ఉ. కన్నులు చీకులై సుతనికాయము బాలవిహారలీలలుం

జెన్నగు ప్రాయమొంది విలసిల్లు తెఱంగును జూడఁ గాన కి

ట్లున్నను బంధుకోటి సమయోచితలాలనఁ బల్కుపల్కులన్

విన్నవి వీనులిప్డు గొఱవిం దముఁ జూఁడినయట్ల పొక్కెడిన్. 16

ప్రతిపదార్థం: సుత= కొడుకులయొక్క; నికాయము= సముదాయము; బాల= పసితనమునందు; విహార= వేడుకగా తిరుగుచు చేయు; లీలలున్= క్రీడలును అనగా ఆటపాటలును; చెన్ను= సుందరము; అగు= అయిన; ప్రాయము= వయసు అనగా యౌవనము; ఒంది= పొంది; విలసిల్లు= ప్రకాశించు; తెఱంగును= విధమును; కన్నులు; చీకులై= గ్రుడ్డివై; చూడన్+కానక= చూచే భాగ్యానికి నోచుకొనక; ఇట్లు= ఈ విధముగా; ఉన్నను= ఉన్నప్పటికీ; బంధుకోటి= చుట్టముల సముదాయము, అనగా చుట్టాలందరు; సమయ= కాలమునకు; ఉచిత= అనుకూలమయిన; లాలనన్= బుజ్జగింపుతో; పల్కు= పలికెడి; పల్కులన్= పలుకులను; విన్నవి= వినినటువంటి; వీనులు= చెవులు; ఇప్డు= ఇప్పుడు; కొఱవిన్= కొఱకచ్చుతో - అనగా కాలుతున్న కర్రతో, తమున్= తమను; (చెవులను) చూఁడిన= కాల్చిన; అట్ల= అట్లే; పొక్కెడిన్= బాధపడుతున్నాయి.

తాత్పర్యం: కన్నులు గ్రుడ్డివై ఉన్నందున కొడుకులు పసితనంలో ఆడిన ఆటలను, వయస్సు వచ్చిన తరువాత ప్రకాశించే యౌవన సౌందర్యాన్ని - చూడలేక పోయినా, బంధుకోటి సమయోచితంగా బుజ్జగించుతూ పలికే

పలుకులను విన్న ఈ చెవులు ఇప్పుడు కొరవితో తమను వాతపెట్టినట్లుగా బాధపడుతున్నాయి. (యుద్ధంలో తనయులందరు చనిపోయారని సంజయుడు చెప్పగా విన్న చెవులు - కొరవితో వాతపెట్టినట్లుగా బొబ్బలెక్కాయని భావం.)

వ. అని దుర్యోధను నుద్దేశించి. 17

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా సంజయుడితో చెప్పి; దుర్యోధనున్= దుర్యోధనుడిని; ఉద్దేశించి= గురించి.

తాత్పర్యం: ఈ విధముగా సంజయుడితో చెప్పి అటు తరువాత దుర్యోధనుడి గురించి. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఇట రమ్ము నన్నుఁ గౌఁగిటఁ జేర్పు కొడుక! మీ । యమ్మ నూరార్ప రావయ్య వృద్ధు
లగు మమ్ము విడుచుట దగునె? యేగతిఁ బోవు । వారము సెప్పుము? కౌరవేంద్ర!
యంధత్వవికలుల నరయక యి ట్లుపే । క్షించితి నామీఁదఁ గృపయుఁ బ్రియము
నెక్కడ వోయె? భూమీశులు గొలువంగ । నుండుదీ వ ట్లొంటి నున్నవాఁడ ।

తే. వధికబల దుర్నివారుండవైన నీకుఁ । బాండుపుత్త్రుల చేత నప్పాటఁ జావు
వచ్చె నిచ్చలు భక్తిమై వచ్చి కొలిచి । గారవింప నింకెవ్వరు గలరు నాకు? 18

ప్రతిపదార్థం: కొడుక!= కుమారా దుర్యోధనా!; ఇట= ఇక్కడకు; రమ్ము= రావయ్యా!; నన్నున్= నన్ను; కౌఁగిటన్= కౌగిలింతలో; చేర్పు= చేర్పుము-అనగా కౌగిలించుకొనుము; మీయమ్మన్= మీ తల్లిని; ఊరార్పన్= ఊరడించుటకు- ఓదార్చుటకు; రావయ్య; వృద్ధులు= ముసలివారము; అగు= అయిన; మమ్మున్; విడుచుట= విడిచిపెట్టుట; తగునె?= ఒప్పునా?; ఏగతిన్= ఏ విధమయిన బ్రతుకు మార్గమున; పోవువారము= పోగలవారము; చెప్పుము= తెలుపుము; కౌరవేంద్ర!= దుర్యోధనా!; అంధత్వ= గ్రుడ్డితనముచే; వికలులన్= అంగవిహీనులమయిన మమ్ములను; అరయక= విచారింపక; ఇట్లు= ఈ ప్రకారముగ; ఉపేక్షించితి(వి)= అశ్రద్ధగ విడిచిపెట్టితివి; నామీఁదన్= నాయందు; కృపయున్= దయయును; ప్రియమున్= ప్రేమయును; ఎక్కడన్= ఎచ్చటకు; పోయెన్?; భూమీశులు= భూమికి ప్రభువులు అయిన మహారాజులు; కొలువంగన్= సేవించుచుండగ; ఉండుదు(వు)= ఉండెడివాడవు; ఈవ= అట్టినీవే; అట్లు= ఆ విధముగ; ఒంటిన్= ఒంటరిగ; ఉన్నవాఁడవు= ఉన్నావు (అనగా మడువు దగ్గర మరణించి ఒంటరిగా పడి ఉన్నావు); అధిక= మిక్కిలి ఎక్కువ అయిన; బల= బలముచే; దుర్నివారుండవు= నిరోధింపశక్యముకాని వాడవు; ఐన= అయినటువంటి; నీకున్= నీకు; పాండుపుత్రులచేతన్= పాండురాజు కుమారులచేత; ఆ+పాటన్= ఆ విధంగా; చావు; వచ్చెన్= సంభవించినది; నిచ్చలున్= ఎల్లప్పుడూ; భక్తిమైన్= భక్తితో; వచ్చి= ఏతెంచి; కొలిచి= సేవించి; గారవింపన్= ఆదరించుటకు; నాకున్; ఇంకన్= ఇటుపైని; ఎవ్వరు= ఎవరు; కలరు?= ఉన్నారు?

తాత్పర్యం: ఓ కుమారా! దుర్యోధనా! ఇటు వచ్చి నన్ను కౌగిలించుకోవయ్యా! మీ తల్లి గాంధారిని ఓదార్చవయ్యా! ముసలివార మయిన మమ్ములను విడిచిపోవటం తగునా? ఏ విధమయిన బ్రతుకు మార్గంలో మేము పోగలం? ఓ కౌరవేంద్రా! దుర్యోధనా! చెప్పుము. గ్రుడ్డితనంచేత అంగవిహీనుల మని కూడ విచారించక, ఇట్లా మమ్ములను అశ్రద్ధగా విడిచిపెట్టావు. నామీద గల దయ, ప్రేమ ఎక్కడికి పోయాయి? మహారాజులచేత సేవ లందుకొను నీ వేనా ఇట్లా ఒంటరివాడవై మడువు దగ్గర మరణించి పడి ఉన్నావు? అత్యధిక బలసంపన్నులకు కూడ నిరోధింప శక్యంకాని

నీకు పాండుపుత్రులచేత ఆ విధమయిన మరణం సంభవించిందా? ఇంక నాకు నిత్యం భక్తితో వచ్చి సేవచేసి ఆదరించేవారెవ్వరు ఉన్నారు?

విశేషం: ఈ సీసమున తిక్కన ధృతరాష్ట్రుడి దుఃఖాతిరేకాన్ని - అలతి అలతి పలుకులతో అత్యంత సుందరంగా, కరుణరస భావాలతో అభివర్ణించాడు. ఇది శోకవివశుడైన ధృతరాష్ట్రుడి భావరూప చిత్రణం.

వ. కయ్యంపుమాట పుట్టినయప్పుడు నీవు నాతోడ. 19

ప్రతిపదార్థం: కయ్యంపుమాట= యుద్ధమునకు సంబంధించిన ప్రసంగం; పుట్టిన+అప్పుడు= వచ్చినప్పుడు; నీవు; నాతోడ=నాతో.

తాత్పర్యం: యుద్ధవిషయం ప్రస్తావించేటప్పుడు నీవు నాతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

శా. 'చాపాచార్యుఁడు భీష్ముఁడుం గృపుఁడు నశ్వత్థామయుం గల్గ నా
కీ పాండుక్షితిపాలపుత్రులెదు రిం దెవ్వాఁడు దృప్యద్భుజా
వ్యాపారుం డనిఁ గర్ణుఁడొక్కరుఁడు మాయం జేయు మద్బాణవి
ద్యాపారీణత గెల్తు నొక్కఁడన యే నయ్యేవురన్ వ్రేల్మిడిన్. 20

ప్రతిపదార్థం: చాపాచార్యుఁడు= ద్రోణుడు, భీష్ముఁడున్= భీష్ముడును; కృపుఁడున్= కృపాచార్యుడును; అశ్వత్థామయున్= ద్రోణపుత్రుడు అశ్వత్థామయును; కల్గన్= ఉండగా; ఈ పాండుక్షితిపాల= ఈ పాండురాజుయొక్క; పుత్రులు= కుమారులు; ఇందున్= వీరిలో; ఏ+వాఁడు= ఎవడు అనగా ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు - ఇందులో ఎవడు; నాకున్; ఎదురు?= ఎదురు నిలువగలవాడు?; దృప్యత్= దర్పించుచున్న; భుజావ్యాపారుండు= యుద్ధము చేయువాడు; కర్ణుఁడు; ఒక్కరుఁడు= ఒక్కడే; అనిన్; యుద్ధమునందు; మాయన్= నాశము అగునట్లు; చేయున్; (అనగా కర్ణుడు ఒక్కడే పాండవులను నాశము చేయును); మద్బాణవిద్యాపారీణతన్= నాయొక్క అస్త్రప్రయోగవిద్యయందలి పరిపూర్ణమయిన నేర్పరితనమువలన; ఏను= నేను; ఒక్కఁడన= ఒక్కడనే; ఆ+ఏవురన్= ఆ అయిదుగురు పాండవులను; వ్రేల్మిడిన్= చిటికెలో; గెల్తున్= గెలువగలను.

తాత్పర్యం: 'భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ ఉండగా ఈ పాండురాజ పుత్రులయిన ధర్మరాజ భీమార్జున నకుల సహదేవులలో ఎవడు నాకు ఈ యుద్ధంలో ఎదురు నిలిచి పోరగలడు? (అనగా పాండవులలో ఒక్కడును నన్ను ఎదురించగలవాడు లేడు.) ఇక భుజదర్పంతో యుద్ధంలో విజృంభించే కర్ణుడు ఒక్కడే ఈ పాండవులను నాశనం చేయగలడు. మరియు నా అస్త్రప్రయోగ విద్యాపారీణతతో నే నొక్కడనే ఆ అయిదుగురు పాండవులను చిటికెలో గెలువగలను.

తే. మున్ను చెప్పినవారు గా కెన్నఁ గలరు। సుమ్ము! బాహ్లిక భగదత్త సోమదత్త
శకుని భూరిశ్రవశ్శలశల్యసింధు। రాజ విందానువిందాది రథికవరులు. 21

ప్రతిపదార్థం: మున్ను= ఇంతకుముందు; చెప్పినవారు= చెప్పబడినవారు (భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, కర్ణులు); కాక= కాకుండా; బాహ్లిక= బాహ్లికుడు; (ఇతడు బాహ్లిక దేశపురాజు. క్రోధవశుడను దైత్యుని అంశవలన జన్మించినవాడు.) భగదత్త= భగదత్తుడు (ఇతడు ప్రాగ్జ్యోతిషపురాధిపతి. భాష్కలుడను అసురుని అంశవలన జన్మించినవాడు. వీనికి సుపర్వుడనుపేరు

కలదు.) సోమదత్త= సోమదత్తుడు (ఇతడు కురువంశ మహారాజు ప్రతీపుని పౌత్రుడు- బాహ్లికుని పుత్రుడు. మహాపరాక్రమవంతుడు. వీనికి బాహ్లిక - బాహ్లీకాత్మజ- కౌరవేయ - కౌరవ్య - కురుపుంగవ - అనుపేర్లు ఉన్నాయి); శకుని= శకుని (ఇతడు గాంధారరాజు సుబలుని కుమారుడు, దుర్యోధనుని మేనమామ. దుష్టచతుష్టయములో ముఖ్యుడు. ద్వాపరుని అంశవలన జన్మించినవాడు. దేవతల శాపము వలన ధర్మవిరోధిగా మిగిలాడు.); భూరిశ్రవస్= భూరిశ్రవుడు; శల= శలుడు (భూరిశ్రవుడు, శలుడు వీరు సోమదత్తుని కుమారులు); శల్య= శల్యుడు (ఇతడు మద్రదేశాధిపతి. మాద్రికి అన్నగారు. నకులసహదేవులకు మేనమామ.); సింధురాజ= సింధుదేశాధీశుడైన సైంధవుడు (వీని అసలుపేరు జయద్రథుడు. దుర్యోధనుని సోదరి దుశ్శల భర్త. వృద్ధక్షత్రునికుమారుడు. వీనికి సైంధవుడు, సౌవీరుడు, సింధుపతి, సింధురాజు, సింధుసౌవీర భర్త - వృద్ధక్షత్రుని కుమారుడు కాబట్టి, వార్ధక్షత్రి - అని పేర్లు గలవు.); విందానువింద= విందుడు- అనువిందుడు (వీరు అవంతీ రాజకుమారులు - వీరిద్దరు చెరొక అక్షౌహిణీ సేనకు అధిపతులు - దుర్యోధనుడి సేనలో గల పదిమంది ప్రధాన అధినాయకులలో వీరు కూడ ముఖ్యులు; ఆది= ఈ మొదలగు; రథికవరులు= రథికశ్రేష్ఠులు; ఎన్న(న్)= లెక్కింప; కలరు= కలవారు; సుమ్మ= సుమా!

తాత్పర్యం: ఇంతకుముందు చెప్పిన వారు కాకుండా బాహ్లికుడు, భగదత్తుడు, సోమదత్తుడు, శకుని, భూరిశ్రవుడు, శలుడు, శల్యుడు, సైంధవుడు, విందుడు, అనువిందుడు మొదలైన రథికశ్రేష్ఠులు లెక్కింప పెక్కురు కలరు సుమా!

విశేషం: వీరు పదిమంది. దుర్యోధనుడి సేన పదునొకండక్షౌహిణులు. ఒక్కొక్క అక్షౌహిణికి ఒక్కొక్కరు అధినాయకులుగా పది అక్షౌహిణులకు ఈ పదిమంది అధినాయకులుగా వ్యవహరించారు. మిగిలిన అక్షౌహిణికి దుర్యోధనుడు అధినాయకుడు.

క. ఏనును గర్ణుఁడు దమ్ములు । నా నలువురు వీరులైన నటు సూడు పృథా
సూనుల నెట్లు జయించెద । నో నమ్ముము నా బలంబును గలితనంబున్.' 22

ప్రతిపదార్థం: ఏనును= నేనును; కర్ణుఁడు= కర్ణుడు; తమ్ములున్= తమ్ములును; ఆ నలువురు= ఆ భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామలు నలుగురు; వీరులు= శూరులు; అయినన్= అయి ఉండగా; పృథాసూనులన్= కుంతియొక్క పుత్రులను; ఎట్లు= ఏ ప్రకారముగ; జయించెదనో= జయింపగలనో; అటుచూడు; నా బలంబును= నా శక్తిని; కలితనంబున్= సామర్థ్యమును; నమ్ముము.

తాత్పర్యం: నేనూ, కర్ణుడూ, తమ్ములూ; భీష్మద్రోణకృపాశ్వత్థామలు నలుగురూ; వీరులమైన మేమందరం కలిసి ఆ కౌంతేయులను ఎట్లా జయిస్తామో చూడుము. నా శక్తిసామర్థ్యాలను విశ్వసింపుము.'

క. అని యూఱడిల్లఁ బలికిన । విని భవదీయానివార్య విక్రమమునఁ బాం
డు నరేంద్రసుతులు దెగుదుర । యని తలఁచితి నీవె తెగితె యవ్వీరులచేన్? 23

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారముగ; ఊఱడిల్లన్= ఓదార్పు పొందునట్లు; పలికినన్= పలుకగా; విని; భవదీయ= నీయొక్క; అనివార్య= నివారింపశక్యముకాని; విక్రమమునన్= పరాక్రమమువలన; పాండు నరేంద్ర= పాండురాజుయొక్క; సుతులు= కుమారులు; తెగుదురు+అ= తప్పకుండ నశిస్తారు; అని; తలఁచితిన్= భావించితిని; ఆవీరులచేన్= వీరులైన ఆ పాండవులచే; నీవె= నీవే; తెగితె?= చచ్చితివా?

తాత్పర్యం: నన్ను ఊరడించటానికి నీవు పలికిన పలుకులు విని నివారించ శక్యంకాని నీ పరాక్రమంతో పాండవులు చంపబడుతారని భావించాను. అట్లాకాక ఆ వీరులచేత నీవే చంపబడ్డావా?

విశేషం: ఈ పద్యంలో ధృతరాష్ట్రుడి అంతఃకరణం చక్కగా ఆవిష్కరించబడింది.

క. **అమరనదీతనయుఁడు సిం । హము గాక నరుండె? పార్థుఁ డట్టి మహాత్మున్**
సమయించెనట్లు జంబుక । సముని శిఖండిఁ గొని విధి కసాధ్యము గలదే! **24**

ప్రతిపదార్థం: అమరనదీ= ఆకాశగంగానదియొక్క; తనయుఁడు= కుమారుడు భీష్ముడు; సింహము= సింహము; కాక= కాక; నరుండె?= మానవుడా? (కాదు అని అర్థం); అట్టి= అటువంటి; మహాత్మున్= గొప్పవాడిని; జంబుక= నక్కతో; సముని= సమానమైనవానిని; శిఖండిన్= శిఖండిని; కొని= తీసికొని; పార్థుడు= అర్జునుడు; (పృథయొక్క కొడుకు కావున పార్థుడు); అట్లు; సమయించెన్= సంహరించెను; విధికిన్= బ్రహ్మకు; అసాధ్యము= చేయలేనిది; కలదే!= కలదా! (లేదని తాత్పర్యము.)

తాత్పర్యం: భీష్ముడు సింహమే కాని నరుడు కాడు. అటువంటి మహాత్ముడిని నక్కవంటి శిఖండిని ముందిడుకొని అర్జునుడు సంహరించాడు. విధికి సాధ్యం కానిది ఏమున్నది?

విశేషం: అలం: రూపకం, ఉపమ, అర్థాంతరన్యాసం. భీష్ముడు - ఉపమేయం; సింహము - ఉపమానం; శిఖండి - ఉపమేయం; జంబుకము - ఉపమానం; పార్థుడు భీష్ముడిని సంహరించటం - విశేషార్థం. విధి కసాధ్యము కలదే!- సామాన్యార్థం. విశేషార్థాన్ని సామానార్థం చేత సమర్థించటం వలన అర్థాంతరన్యాసం.

మూలము: **భీష్మశ్చ నిహతో యత్ర లోకనాథః ప్రతాపవాన్ । శిఖండినం సమాసాద్య మృగేంద్ర ఇవ జంబుకమ్ ॥**

కేవలం ఉపమాలంకారము గల మూలశ్లోకమును కందంలో బిగించి అర్థాంతరన్యాసంతో కూడ అలంకరించి తిక్కయజ్వ స్వతంత్రానువాదాన్ని ప్రకటించాడు.

శిఖండి: ఇతడు ద్రుపదమహారాజు పుత్రుడు. ద్రౌపదికి అన్నగారు. మనస్విని అనే రాణి గర్భమున పుత్రికగా జన్మించాడు. తల్లిదండ్రులు పుత్రోచితసంస్కారములు జరిపించారు. స్థూలకర్ణుడనే యక్షుడి దయవలన పురుషరూపమును ధరించాడు. ముందు స్త్రీగా జన్మించి తరువాత పురుషరూపమును ధరించినందువలన - శిఖండి, శిఖండినీ - అనే పేర్లు కలిగినవి. భీష్ముడు స్త్రీగా పుట్టి పురుషులుగా మారిన శిఖండుల మోములు చూడడు. అది ఆతడి ప్రతిజ్ఞ. అందువలన పార్థుడు భీష్ముడి సలహాను అనుసరించి కురుక్షేత్ర సంగ్రామమున భీష్ముడిని సంహరించటానికి మరొకమార్గంలేక శిఖండిని ముందిడుకొని యుద్ధం చేశాడు. భీష్ముడు అస్త్రసన్న్యాసం చేశాడు. పార్థుడు భీష్ముడిని కూల్చాడు.

చ. **శరగురుఁడట్టి యోధుఁ డటె చచ్చె ననిన్ దొర గాని వానిచే**
వెరవున లావునన్ జనులు వెక్కసమందఁగఁ జేయు సింధుభూ
వరుఁడటె! రిత్తవోయె ననివార్యుల బాహ్లిక సోమదత్తులం
బరు లవలీలఁ జంపిరటె! పల్కుదు నేమని యేను దైవమున్? **25**

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధమునందు; శరగురుఁడు= ద్రోణుడు; అట్టియోధుఁడటె! = సామాన్యయోధుడా! (ఎంతో గొప్ప యోధుడు); దొర= యోధుడు; కానివానిచే= కానటువంటివాడిచే; చచ్చెన్= మరణించెను; వెరవునన్= ఉపాయమునందును; లావునన్= బలంచేతను; జనులు= ప్రజలు; వెక్కసము= దుస్సహత్వము; అందఁగన్= పొందగ; చేయు= చేయగల; సింధుభూవరుఁడు+అటె! = సింధుదేశమునకు రాజు అయిన జయద్రథుడా!; రిత్త= వ్యర్థముగా; పోయెన్= చనిపోయెను; అనివార్యులన్= నివారింప శక్యముకానివారు అయిన; బాహ్లికసోమదత్తులన్= బాహ్లికుడిని సోమదత్తుడిని; పరులు= శత్రువులు; అవలీలన్= చాలా తేలికగా; చంపిరి+అటె!= సంహరించారా!; ఏను= నేను; దైవమున్= దైవమున గూర్చి; ఏమని; పల్కుదును?= చెప్పుదును?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ద్రోణుడు తనకెంతమాత్రము సాటిగాని వాడిచేత యుద్ధంలో మరణించేటంత తక్కువ యోధుడా? జనులు సహింపశక్యం కాని బలం కల జయద్రథుడు వ్యర్థంగా చనిపోయాడు కదా! యుద్ధంలో ఎవ్వరిచేతకూడా నిరోధింపశక్యం కాని బాహ్లిక సోమదత్తులను శత్రువులు అవలీలగా చంపారు కదా! ఇక నేను దైవచేష్టితాన్ని గూర్చి ఏమని చెప్పను? (అంతా విధివిధానమని తాత్పర్యం.)

విశేషం: ద్రోణుడు భరద్వాజ మహర్షి పుత్రుడు. బృహస్పతి అంశతో జన్మించాడు. ఒకరోజు భరద్వాజ మహాముని గంగానదిలో స్నానానికి వెళ్ళాడు. అక్కడ అంతకుముందే గంగలో స్నానం చేస్తున్న ఘృతాచి అనే అప్సరస వస్త్రం కొంచెం తొలగింది. అది చూచిన భరద్వాజుడికి వీర్యస్ఖలన మయింది. మహర్షి ఆ వీర్యాన్ని ద్రోణమున (యజ్ఞకలశం) ఉంచి సంరక్షించగా దాని నుండి ద్రోణుడు జనించాడు. ద్రోణము నుండి పుట్టినందువలనే ద్రోణుడని పేరు వచ్చింది.

ద్రోణుడు సంపూర్ణవేదాధ్యయన సంపన్నుడు. పరశురాముడి వద్ద సమస్త అస్త్రవిద్యలను అభ్యసించాడు. మహర్షి అగ్నివేశుడి ఆశ్రమంలో, ద్రుపదుడితో కలిసి విద్యాభ్యాసం చేశాడు. కౌరవులకు, పాండవులకు శరగురువు. అర్జునుడివంటి మహావీరుడికి ప్రియగురువు. భీష్ముడిచేత ప్రశంసలందిన పరాక్రమం కలవాడు. బ్రహ్మశిరోనామక అస్త్రమును అర్జునుడికి ఉపదేశించినవాడు. ఇంతటి మహాయోధుడు ద్రోణుడు. సామాన్యుడయిన ధృష్టద్యుమ్నుడిచేత సంహరించబడ్డాడా!- అని ధృతరాష్ట్రుడు విలపిస్తూ ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

నిజానికి ద్రోణుడిని ఎవ్వరూ సంహరించలేదు. అశ్వత్థామ మరణించాడని భావించి అస్త్రత్యాగం చేసి యోగమార్గాన బ్రహ్మలోకాన్ని పొందాడు. అనంతరం ధృష్టద్యుమ్నుడు ద్రోణుడి శిరమును ఖండించి తన జన్మకారణానికి సాఫల్యం చేకూర్చుకొన్నాడు.

క. నీ నమ్మిన భూరిశ్రవుఁ । డేనికలా వతఁడు నెందు నెనలేని మగం
డైన భగదత్తుఁడును వ । మ్మైన తెఱంగట్టె! యేమి యందుఁ గుమారా! 26

ప్రతిపదార్థం: కుమారా!= కొడుకా!; నీ నమ్మిన= నీవు నమ్మిన; భూరిశ్రవుఁడు; ఏనిక, లావు, అతడు= ఏనుగంతటి బలం కలవాడు (భూరిశ్రవుడు); ఏనికలావు+అతఁడు= ఏనుగంతటి బలం కలవాడు; ఎందున్= ఎచ్చటను; ఎనలేని= సమానమైనవాడు లేని; మగండు= శూరుడు; ఐన= అయినటువంటి; భగదత్తుఁడును= భగదత్తుడుకూడ; వమ్ము= నాశము; ఐన= అయిన; తెఱంగు= విధము; అట్టె!= ఆశ్చర్యకరం; ఏమి= ఏమని?; అందున్= చెప్పుదును?

తాత్పర్యం: కుమారా! నీవు నమ్మిన భూరిశ్రవుడు ఏనుగు వంటి బలంకలవాడు. ఎచ్చటను తనతో సమానమైనవాడు లేని శూరుడు. అటువంటి భగదత్తుడు మరణించిన విధం ఆశ్చర్యకరం. ఇంక ఏమి చెప్పగలను?

ఉ. నచ్చిన కర్ణు విక్రమమునం బరవీరులయందొకండునుం
జచ్చుట లేదు దుర్దమము శల్యభుజావిభవంబు లోకముల్
మెచ్చినయట్టి దందు నొకమేలు వినంబడ దమ్మహాత్ములన్
మ్రుచ్చులఁ జంపినట్టులు పరుల్ దెగటార్చిరి దైవ మిచ్చినన్. 27

ప్రతిపదార్థం: నచ్చిన= నమ్మిన; కర్ణు= కర్ణునియొక్క; విక్రమమునన్= పరాక్రమమువలన; పర= శత్రువులయొక్క; వీరులయందున్= శూరులయందు; ఒకండునున్= ఒక్కడు కూడ; చచ్చుట= చచ్చినది; లేదు; దుర్దమము= నిగ్రహింపశక్యముకాని;

శల్య= శల్యుడియొక్క; భుజావిభవంబు= భుజసంపద; లోకముల్= జనులు; మెచ్చిన అట్టిది= మెచ్చినటువంటిదే; అందున్= ఆ భుజసంపదయందు; ఒక మేలు= ఒక్క శుభంకూడ; వినంబడదు= వినిపించదు; ఆ మహాత్ములన్= అట్టి గొప్పవారిని; దైవము; ఇచ్చినన్= సహాయమందించినందున; మ్రుచ్చులన్= దొంగలను; చంపినట్టులు= చంపినట్లుగా; పరుల్= శత్రువులు; తెగటార్చిరి= సంహరించిరి.

తాత్పర్యం: నీవు నమ్మిన కర్ణుడి పరాక్రమంవలన శత్రువీరులలో ఒక్కడు కూడా మరణించలేదు. నిగ్రహింప శక్యం కానిది, లోకం మెచ్చినది అయిన శల్యుడి భుజబలపరాక్రమాన్ని గూర్చి ఒక్క శుభవాక్యం కూడా వినబడదు. దైవసహాయం కారణంగా అట్టి మహాత్ములను శత్రువులు దొంగలను చంపినట్లు చంపారు.

విశేషం: 'దైవమిచ్చినన్' అను దానికి - దైవం అనుకూలం కాగా అని భావం. ఒక్క శుభవాక్యం కూడా వినబడదు అంటే శల్యుడు ఒకరినైనా చంపినాడనే వార్త వినలేదు కదా! అని అర్థం.

తే. **కొడుక! తమ్ములు దోడ్పడఁ గడఁగి శత్రు । వరుల గెలిచెద నంటి వొక్కరుఁడు దక్క**
కుండ నీ తమ్ముఁ గుఱ్ఱల నూచముట్టు । గొనియెనే విధి! యేగతిఁ జనుదుఁ జెపుమ! **28**

ప్రతిపదార్థం: కొడుక!= కుమారా దుర్యోధనా; తమ్ములు= తమ్ములు; తోడ్పడన్= సహాయపడగా; శత్రువరులన్= శత్రువులలో శ్రేష్ఠులైనవారిని; కడఁగి= పూని; గెలిచెదను= జయించెదను, అంటివి= అన్నావు; ఒక్కరుఁడు= ఒక్కడుకూడ; తక్కకుండ= మిగలకుండ; నీ తమ్ముఁగుఱ్ఱలన్= పిన్నవారైన నీ తమ్ములను; ఊచముట్టు= నిశ్శేషముగ అనగ ఒక్కడూమిగులకుండ; విధి= దైవము; కొనియెన్+ఏ= తీసికొనిపోయాడా!; (ఆశ్చర్యార్థకము-); ఏగతిన్= ఏ మార్గమున; చనుదున్= పోవుదును; చెపుమ!= తెలుపుమా!

తాత్పర్యం: కుమారా దుర్యోధనా! తమ్ములు సహాయపడగా శత్రువులను జయిస్తానన్నావు. ఇప్పుడు ఒక్కడుకూడా మిగలకుండా చిన్నవాళ్లైన నీ తమ్ములను దైవం తీసికొనిపోయింది. ఇక నేనెటు వెళ్లాలో చెప్పు.

క. **కదిసి పవనజుఁడు బెట్టుగ । గద వ్రేసినఁ దొడలు విఱిగి కయ్యపునేలన్**
మదమఱి పడినప్పుడు నీ । మది నేమని తలఁచితో కుమార! యెఱుంగన్!'. **29**

ప్రతిపదార్థం: కుమార= కొడుకా! కయ్యపునేలన్= యుద్ధభూమియందు; పవనజుఁడు= వాయుపుత్రుడైన భీముడు; కదిసి= కలియబడి; గదన్= గదతో; బెట్టుగన్= గట్టిగ; వ్రేసినన్= కొట్టగా; తొడలు; విఱిగి= ముక్కలయిపోయి; పడినప్పుడు= పడిపోయి ఉన్నప్పుడు; మదము= గర్వము; అఱి= నశించి; నీమదిన్= నీ మనసునందు; ఏమని; తలఁచితో= ఆలోచించితివో; ఎఱుంగన్= తెలియలేకున్నాను.

తాత్పర్యం: కుమారా! దుర్యోధనా! యుద్ధభూమిలో భీముడు నీతో కలియబడి గదతో నిన్ను గట్టిగా కొట్టగా తొడలు విరిగిపడిపోయి ఉన్నప్పుడు గర్వం నశించి నీ మనసులో ఏమని ఆలోచించావో గదా!'

వ. **అని పెక్కు భంగుల విలపించి.** **30**

ప్రతిపదార్థం: అని= అని; పెక్కు= అనేకములైన; భంగులన్= విధాలుగా; విలపించి= శోకించి.

తాత్పర్యం: ఇట్లు ధృతరాష్ట్రుడు అనేక విధాలుగా పేరుపేరునా తలచి తలచి దుఃఖించి.

విశేషం: తొడలు విరిగి పడి ఉన్నప్పుడు దుర్యోధనుడు తలచిన తలపులు (చూడు. శల్య. ద్వి. ఆ. ప. 325, 326, 327, 329) శ్రీకృష్ణుని నిందించినవే. ధృతరాష్ట్రుడు అనేక విధాల పుత్రనాశనానికి విలపిస్తూ 'విధి కసాధ్యము గలదే' పల్కుదు నేమని యేను దైవమున్' 'దైవమిచ్చినన్' 'కొనియెనే విధి' అని శ్రీకృష్ణుడిని ఉద్దేశించే పలికాడు. ఈ పలుకులలో శోకమే కాక క్రోధం కూడా వ్యంగ్యంగా ఉన్నది. సహజంగా శత్రువు తన పుత్రుడిని సంహరించినప్పుడు పుత్రశోకంతోపాటు శత్రువు ఎడల క్రోధం మిక్కుటంగా ఉంటుంది. చంపినవాడికంటె చంపించిన వాడి యెడల క్రోధం మిక్కుటంగా ఉండటం - లోకధర్మం. ఈ ధర్మాన్నే తిక్కయజ్వ ధృతరాష్ట్రుడి విలాపంలో వ్యంగ్యంగా ఆవిష్కరించాడు.

చ. తలఁపఁగ భాగ్యవంతుల కుదాత్తశుభంబగుఁ గాక పుణ్యహీ
నుల కది గల్గనేర్చునె తనూభవు లాఱడిఁ బోయిరింకఁ గా
నలఁ జరియింపఁ బోవుటయ నా కుచితం బటు గాక చండినై
నిలిచితినేని మాటలనె నిచ్చలు భీముఁడు చూఁడుచుండఁడే! 31

ప్రతిపదార్థం: తలఁపంగన్= ఆలోచింపగా; భాగ్యవంతులకున్= అదృష్టవంతులకు; ఉదాత్తశుభంబు= ఉన్నతమైన మంగళము; అగున్= కలుగుతుంది; కాక= అట్లుకాక; పుణ్యహీనులకున్= సుకృతములేనివారికి; అది= అట్టి ఉన్నతమైన శుభము; కల్గన్= కలుగ; నేర్చునె?= వచ్చునా? (అనగా కలుగదు); తనూభవులు= కొడుకులు; ఆఱడిన్ పోయిరి= నశించారు; ఇంకన్= ఇంక; కానలన్= అడవులందు; చరియింపన్= సంచరించుటకు అనగా నివసించుటకు; పోవుటయ= పోవుటయే; నాకున్; ఉచితంబు= తగింది; అటు= అట్లా; కాక= కాకుండా; చండినై= మొండివాడినై; నిలిచితిన్= ఉంటిని; ఏని; నిచ్చలున్= నిత్యము, ఎల్లప్పుడు; మాటలనె= మాటలతోనే; భీముఁడు; చూఁడుచున్= కాల్చుచు; ఉండఁడే!= ఉండడా! (ఉండును అని అర్థము.)

తాత్పర్యం: ఆలోచించి చూడగా అదృష్టవంతులకు మాత్రమే గొప్ప గొప్ప శుభాలు కలుగుతాయి. సుకృతం లేని వారికి శుభం కలుగదు. కొడుకులు నశించిపోయారు. ఇంక ఇటుపైన అడవులందు నివసించి జీవించటమే నాకు తగినది. అట్లుకాక మొండివాడినై ఇక్కడనే ఉన్నట్లయితే భీముడు నిత్యం మాటలతోనే నన్ను కాలుస్తూ ఉంటాడు.

విశేషం: తిక్కయజ్వ సహజకవితాశైలికి ఈ పద్యమును ఉదాహరణంగా గ్రహింపవచ్చును. ఆయన కవిత యందంతటా ఈ శైలియే కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఈ పద్యంలో అయిదు విడివిడి వాక్యాలు ఉన్నాయి. ఏ వాక్యానికావాక్యం వచనంవలె సాగిపోతుంది. గద్యసౌందర్యాన్ని పుణికిపుచ్చుకొన్న పద్యరచన ఇది. గొలుసుకట్టుగా కలిపి పద్యంగా చేయవచ్చును. అట్లా కలిపినప్పుడు అలవోకగా యతిప్రాసలు అతికిపోతాయి. ఇది తిక్కన శైలిలోని పరమరహస్యం. అందువలన అనంతర కవులు నన్నయాదులను అనుసరించినట్లు తిక్కయజ్వను అనుసరించలేకపోయారు. ఒక్క అనంతామాత్యుడు మాత్రం ఆ ప్రయత్నం చేశాడు.

క. విను దుర్యోధన దుశ్శా । సనులఁ బలికి పలికి నిచ్చ చావుగ నప్పా
వని యలఁచుఁ గాన నడవికిఁ । జనుటయ మేలైన తెఱఁగు సంజయ నాకున్!. 32

ప్రతిపదార్థం: సంజయ!; విను= వినుము; దుర్యోధన దుశ్శాసనులన్= దుర్యోధన దుశ్శాసనులను; పలికి పలికి= తిట్టి తిట్టి; నిచ్చ-చావుగన్= నిత్యమరణంగా; ఆ పావని= ఆ భీముడు; అలఁచున్= నన్ను బాధిస్తాడు; కానన్= కావున; నాకున్= నాకు; అడవికిన్= అరణ్యమునకు; చనుటయ= వెడలుటయే; మేలు ఐన తెఱఁగు= మంచిమార్గం.

తాత్పర్యం: సంజయా! వినుము. దుర్యోధన దుశ్శాసనులను నిందించి నిందించి భీముడు నిత్య మరణంగా నన్ను బాధిస్తాడు. కనుక నాకు అడవికి పోవటమే మంచి మార్గం.

వ. అని పలికి యత్యంత దుఃఖదూషితస్వాంతుం డగుచు నమ్మహీకాంతుండు నిట్టూర్పు నిగిడించి యా సూత నందనున కిట్లనియె. 33

ప్రతిపదార్థం: అని; పలికి; అత్యంత= మిక్కిలి; దుఃఖ= శోకముచే; దూషిత= పాడుపడిన; స్వాంతుండు= మనస్సు కలవాడు; అగుచున్; మహీ= భూమికి; కాంతుండు= భర్తయైన ఆ ధృతరాష్ట్రుడు; నిట్టూర్పు= దీర్ఘనిశ్వాసము; నిగిడించి= సాగదీసి; ఆ సూతనందనునకున్= ఆ సంజయుడితో; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్.

తాత్పర్యం: అడవికి పోవటమే మంచిమార్గమని చెప్పి మిక్కిలి దుఃఖంతో పాడైపోయిన మనస్సుకలవాడై, ఆ ధృతరాష్ట్రుడు ఒక దీర్ఘనిశ్వాసం విడిచి ఆ సంజయుడితో ఇట్లా అన్నాడు.

క. 'సురసరిదాత్మజుఁడును శర। గురుఁడును గర్ణుండుఁ దెగుటకుం దలఁకక యె
వ్వరి బాహుబలముగొని యే। మరి కోల్తల సేసి రొక్కొ! మనవా రనికిన్.' 34

ప్రతిపదార్థం: సురసరిత్= దేవగంగానదియొక్క అనగా ఆకాశగంగానదియొక్క; ఆత్మజుఁడును= తనయుడును అనగా భీష్ముడును; శరగురుఁడును= అస్త్రవిద్యకు గురువు అయిన ద్రోణుడును; కర్ణుండున్= కర్ణుడును; తెగుటకున్= మరణించుటకు; తలఁకక= భయపడక; మనవారు= దుర్యోధనాదులైన మనవారు; అనికిన్= యుద్ధమునకు; ఎవ్వరి= ఎవరియొక్క; బాహుబలము= భుజపరాక్రమము; కొని= తీసికొని; ఏమరి= మరచి; కోల్తల= యుద్ధసన్నాహం; చేసిరి; ఒక్కొ!= చేశారో కదా!

తాత్పర్యం: 'భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, మరణించినందులకు భయపడకుండా ఎవడి పరాక్రమాన్ని పరిగణించి మనవారు యుద్ధసన్నాహం చేశారు?'

వ. అని తన కొడుకు చలం బూహించి. 35

ప్రతిపదార్థం: అని= అని; తన= తనయొక్క; కొడుకు= కొడుకైన అనగా దుర్యోధనుడియొక్క; చలంబు= మాత్సర్యము; ఊహించి= గుర్తించి.

తాత్పర్యం: అని ప్రశ్నించి, తన కొడుకు మాత్సర్యాన్ని గుర్తించి.

చ. 'మును విదురుండు సెప్పె నతిమూర్ఖమనోగతి యైన యీ సుయో
ధను చరితంబు గీ డఖిలధాత్రిజనంబులకుం బొనర్చు నా
శన మని దానిఁ గొంద అవిచారులు పాటిగఁ బట్టరైరి నా
కును మది వారికె ట్లటుల కుత్సిత మయ్యె విధాత త్రిప్పునన్. 36

ప్రతిపదార్థం: అతి= మిక్కిలి; మూర్ఖ= తెలివితక్కువ; మనః= మనస్సుయొక్క; గతి= గమనము; ఐన= కలిగిన అనగా పరమమూర్ఖుడైన; ఈ సుయోధను= ఈ దుర్యోధనుడియొక్క; చరితంబు= నడవడిక; కీడు= దోషభూయిష్ఠం; అఖిల= సమస్తమైన; ధాత్రి= భూమండలమందలి; జనంబులకున్= ప్రజలకు; నాశనము= చేటు; పొనర్చున్= కలుగచేస్తుంది; అని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విదురుండు; మును= ముందుగా; చెప్పెన్; దానిన్= దానిని; కొందఱు= కొంతమంది; అవిచారులు= ఆలోచనలేనివారు అనగా తెలివితక్కువవారు; పాటిగన్= ప్రమాణంగా; పట్టరు= గ్రహింపనివారు; ఐరి= అయ్యారు; విధాత= బ్రహ్మయొక్క; త్రిప్పునన్= త్రిప్పుటచేత; నాకును= నాకుకూడ; వారికిన్= ఆ తెలివితక్కువవారికి; ఎట్లు= ఏ విధంగా తోచినదో; అటుల= ఆ విధంగానే; మది= మనస్సు; కుత్సితము= చెడినది; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: 'పరమమూర్ఖుడయిన ఈ దుర్యోధనుడి నడవడి దోష భూయిష్ఠం. అది సమస్త భూమండలప్రజలకు నాశనం కలుగచేస్తుంది - అని ఇంతకుముందే విదురుడు చెప్పాడు. ఆ మాటను కొందరు మందబుద్ధులు ప్రమాణంగా గ్రహించలేదు. బ్రహ్మవ్రాతవలన నాకు కూడా ఆ తెలివిలేనివారికి వలెనే మనస్సు పాడయింది.

క. అప్ప డటు లతఁడు సెప్పఁగఁ । దప్పఁ దలంచిన ఫలంబు దగఁ గుడువక పోఁ
జొప్పడునె సూతనందన! చెప్పు మనికి నెవ్వఁ డమరు సేనాపతియై? 37

ప్రతిపదార్థం: సూతనందన!= సంజయా!; అప్పుడు; అటులు= ఆ విధముగా; అతఁడు= ఆ విదురుడు; చెప్పఁగన్= చెప్పగా; తప్పన్= తప్పుగా; తలంచిన ఫలంబు= ఆలోచించిన ఫలితము; తగన్= తగినట్లుగా; కుడువక= అనుభవింపక; పోన్= పోగొట్ట; చొప్పడునె?= తప్పుతుందా?; అనికిన్= యుద్ధమునకు; ఎవ్వఁడు= ఎవడు; సేనాపతియై= సేనానాయకుడై; అమరున్= ఒప్పునో; చెప్పుము.

తాత్పర్యం: అప్పుడు విదురుడు దుర్యోధనుడి చరితం చెప్పగా దానిని తప్పుగా తలంచిన ఫలితం అనుభవించక తప్పదు కదా! సంజయా! యుద్ధానికి ఎవ్వడు సేనాపతి అయి ఒప్పాడో చెప్పుము.

చ. దురమున నర్జున ప్రకట దోర్విభవంబు నెదుర్పఁ జాలు ను
ద్ధుఁడొకరుండు గల్గెనె విధూతవిరోధిబలుండు శల్యుఁ డె
వ్వరి భుజశక్తిఁ జిక్కెఁ? గురువర్గము సంక్షయమట్లు సెల్ల దు
స్తరబలభాసి భీముని గదంబడియెం గురుముఖ్యుఁ డెమ్మెయిన్? 38

ప్రతిపదార్థం: దురమునన్= యుద్ధమునందు; అర్జున= అర్జునునియొక్క; ప్రకట= ప్రసిద్ధమయిన; దోః= భుజములయొక్క; విభవంబున్= సంపదను - అనగా భుజబల పరాక్రమమును; ఎదుర్పన్= ఎదురింప; చాలు= సరిపడు; ఉద్ధురుఁడు= భరించువాడు అనగా సామర్థ్యముకలవాడు; ఒకరుండు= ఒక్కడైనను; కల్గెనె?= కలిగెనా?, ఉన్నాడా?; విధూత= ఎగురగొట్టబడిన; విరోధి= శత్రువుయొక్క; బలుండు= బలము కలవాడయిన; శల్యుఁడు; ఎవ్వరిభుజశక్తిన్= ఎవరిభుజబలమునకు; చిక్కెన్= దొరకిపోయెను?; కురువర్గము= కౌరవసమూహముయొక్క; సంక్షయము= సర్వనాశము; అట్లు= ఆ విధముగా; చెల్లన్= కొనసాగగా; ఏ మెయిన్= ఏ విధముగా; కురుముఖ్యుడు= కౌరవులలో ప్రధానమైనవాడు అయిన దుర్యోధనుడు; దుస్తర= తరింపశక్యముకాని అనగా అడ్డుకొనజాలని; బల= బలముచే; భాసి= ప్రకాశించు; భీముని; గదన్= గదాయుధమువలన; పడియెన్?= కూలిపోయెను?

తాత్పర్యం: యుద్ధంలో అర్జునుడి భుజబలపరాక్రమాన్ని ఎదురించగల సామర్థ్యం కలవాడు ఒక్కడైనా కలడా?- లేడు. శత్రుబలాలను ఎగురగొట్ట గలిగిన శల్యుడు ఎవరి పరాక్రమానికి దొరికిపోయాడు? కురు సమూహంయొక్క సర్వనాశనం - సంతాపం కలుగచేస్తుండగా, ఏ విధంగా దుర్యోధనుడు భీముడి గదాయుధం వలన కూలిపోయాడు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. కృపకృతవర్మాశ్వత్థామ లెబ్భంగి బ్రతికిరి? ధృష్టద్యుమ్న శిఖండి ప్రముఖ పాంచాలురును జేది మాత్స్య ప్రభద్రక ప్రభృతి బలంబులును నా మనుమలైన ప్రతివింధ్యాది ద్రౌపదేయులును దక్కనుం గలుగు యోధవీరులు నెవ్విధంబున మృతిఁ బొందిరి? పాండవు లేవురును బద్మనాభసాత్యకులును యుయుత్సుండును నెత్తెఱంగునఁ దెగటాఱక తప్పి రింతయుఁ బరిపాటిఁ దేటపడం జెప్పు' మనిన విని సంజయుండు ధృతరాష్ట్రున కిట్లనియె. 39

ప్రతిపదార్థం: కృప కృతవర్మాశ్వత్థామలు= కృపాచార్యులు, కృతవర్మ, అశ్వత్థామ; ఏ+భంగిన్= ఏ విధంగా; బ్రతికిరి?= జీవించి ఉండిరి?; ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నుడును; శిఖండి= శిఖండియును; ప్రముఖ= ముఖ్యులైన; పాంచాలురును= పాంచాలదేశపురాజులును; చేది= చేది దేశముయొక్క; మాత్స్య= మత్స్యదేశముయొక్క రాజులును; ప్రభద్రక= ప్రభద్రకులను; ప్రభృతి= ఈ మొదలగు; బలంబులును= యోధులును; నా మనుమలైన= నాకు మనుమలు అయిన; ప్రతివింధ్యాది= ప్రతివింధ్యుడు మొదలగు; ద్రౌపదేయులును= ద్రౌపది పుత్రులును; (ప్రతివింధ్యుడు, సుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతకర్మ - వీరు ద్రౌపదేయులు - ఉపపాండవులని నామాంతరము); తక్కనున్= ఇంకను మిగిలి; కలుగు= ఉన్నట్టి; యోధవీరులును= శూరులైన యోధులును; ఏవిధంబునన్= ఏ విధముగా; మృతిన్= మరణమును; పొందిరి?; పాండవులు; ఏవురును= అయిదుగురును; పద్మనాభ= శ్రీకృష్ణుడును; సాత్యకులును= సాత్యకియును; యుయుత్సుండును; ఎత్తెఱంగునన్= ఏ ప్రకారంగా; తెగటాఱక= చావక; తప్పిరి?= తప్పుకొనిరి?; ఇంతయున్= ఇదియంతయు; పరిపాటిన్= అనుక్రమంగా; తేటపడన్= తేటతెల్లంగా - స్పష్టంగా; చెప్పుము; అనినన్= అనగా; విని; సంజయుండు; ధృతరాష్ట్రునకు; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: కృప, కృతవర్మ, అశ్వత్థామలు ఎట్లా బ్రతికారు? ధృష్టద్యుమ్న శిఖండి ప్రముఖులైన పాంచాల రాజులు చేదిదేశ, మత్స్య దేశరాజులు, ప్రభద్రకులనే పాంచాలదేశపు క్షత్రియదళాలు, ప్రతివింధ్యుడు మొదలైన ద్రౌపది పుత్రులు, ఇంకను మిగిలిన యోధులు ఏ విధంగా మరణాన్ని పొందారు? పాండవులు అయిదుగురు, శ్రీకృష్ణుడు, సాత్యకి, యుయుత్సుడు, ఏ విధంగా మృత్యువుకు లోబడకుండా తప్పించుకొన్నారు. ఇది అంతా క్రమం తప్పకుండా తేటతెల్లంగా చెప్పుము.' అని ధృతరాష్ట్రుడు అడుగగా విని, సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: మహాభారత యుద్ధంలో కౌరవపక్షాన మృతిపొందకుండా ముగ్గురు మాత్రం మిగిలారు. వారు కృపుడు, కృతవర్మ, అశ్వత్థామలు.

కృపుడు: ఇతడు గౌతమగోత్రుడు. శరద్వంతుడి పుత్రుడు. రుద్రగణ అంశావతారుడు. 'జానపది' అను అప్సరసను చూడడం వల్ల మహర్షి శరద్వంతునికి వీర్యస్ఖలనమయినది. అతడు దానిని రెల్లుగడ్డిపై గిరవాటు వేయగా అది రెండు భాగములయినది. ఒక భాగం కుమారుడుగా, మరొక భాగం కుమార్తెగా జన్మించారు. కుమారుడు కృపుడు. కుమార్తె కృపి. ఈ కృపి ద్రోణాచార్యుడి పత్ని. అశ్వత్థామకు తల్లి. కృపుడు అశ్వత్థామకు మేనమామ. రెల్లుగడ్డిలో పుట్టిన వీరిని వేటకై వచ్చిన శంతనుడు కృపతో పెంచి పోషించాడు. కృపతో పోషించబడినందువలన కృప, కృపి అనే పేర్లు సిద్ధించాయి. కృపుడు ధనుర్వేదంలో పరమాచార్యుడు. అందువలన కృపాచార్యుడుగా కూడా ప్రసిద్ధుడు. 'ఆచార్య, ఆచార్యసత్తమ, భారతాచార్య, బ్రహ్మర్షి, శారద్వత-' మొదలైన పేర్లతో భారతంలో వ్యవహరించబడ్డాడు.

కృతవర్మ: ఇతడు యదుకులవీరుడు. భోజవంశజుడు. హృదికుడి పుత్రుడు. మరుద్గణ అంశావతారుడు. శ్రీకృష్ణుడికి ఇష్టుడు. కౌరవపక్షంలో యుద్ధం చేసిన యదుసేనకు అధినాయకుడు. 'అనార్తవాసి, హార్దిక్య, హృదికసుత, మాధవ, సాత్వత, వార్ష్ణేయ, వృష్ణి, వృష్ణిసింహ', మొదలైన పేర్లతో వ్యవహరించబడ్డాడు.

అశ్వత్థామ: ఇతడు కృపి గర్భమున జన్మించిన ద్రోణాచార్యుడి పుత్రుడు. శివ, యమ, కామ, క్రోధములు సమ్మిళితం అయిన అంశవలన జన్మించినవాడు. ఇతడు పుట్టినవెంటనే పాలకొరకు ఉచ్చైశ్శ్రవము అరచినట్లు గట్టిగా ఏడ్చాడు. పిండి కలిపిన నీళ్ళు ఇయ్యగా, వాటిని పాలు అనుకొని త్రాగి ఏడుపు మానాడు. అందువలన ఆకాశవాణి 'అశ్వత్థామ' అని పేరుపెట్టిందట. 'ఆచార్యనందన, ఆచార్యపుత్ర, ఆచార్యతనయ, ద్రౌణి, గురుపుత్ర, భారతాచార్యపుత్ర' మొదలైన పేర్లు కూడా ఇతనికి ఉన్నాయి.

ఇక పాండవ పక్షంలో మిగిలినవారు - ఐదుగురు పాండవులు, శ్రీకృష్ణుడు, సాత్యకి, యుయుత్సుడు. శ్రీకృష్ణ పాండవులు ప్రసిద్ధులు.

సాత్యకి: ఇతడు వృష్ణి వంశజుడు. 'శిని' కుమారుడైన సత్యకుడి పుత్రుడు. ఇతనికి 'యుయుధానుడు' అనే ప్రసిద్ధనామం కలదు. ఇతడు ఎల్లప్పుడు శ్రీకృష్ణుడితో కలిసి ఉండేవాడు. శ్రీకృష్ణుడికి సోదరసమానుడు. పాండవులకు హితుడు. 'వృష్ణికులభూషణ, సత్యప్రతిజ్ఞ, శత్రుమర్దన' అనునవి ఇతడి బిరుదాలు. సప్తమరుత్తుల అంశవలన జన్మించాడు. శైనేయ, మాధవ, మాధవసింహ, సాత్వత, వృష్ణి మధూద్వహ' మొదలైన నామాలతో మహాభారతంలో వ్యవహరింపబడ్డాడు.

యుయుత్సుడు: ఇతడు 'కరణ' అను వైశ్యపత్నియందు ధృతరాష్ట్రుడికి జన్మించిన పుత్రుడు. ధృతరాష్ట్రుడికి గాంధారీ గర్భమున జన్మించినవాడని శాంతిపర్వమున కలదు. కురుక్షేత్ర యుద్ధం ప్రారంభించటానికి ముందు ధర్మరాజు భీష్మాదులకు నమస్కరించి, 'మా పక్షమున చేరదలచిన రాజులుంటే ఇప్పుడే వచ్చి చేరండి' అని పిలిచాడు. అప్పుడు కౌరవసేనలో ఉన్న ధృతరాష్ట్ర పుత్రుడు యుయుత్సుడు ఒక్కడు మాత్రం వచ్చి పాండవ పక్షంలో చేరాడు. ధృతరాష్ట్రుడి పుత్రులలో యుద్ధంలో మరణించకుండా మిగిలినవాడు ఇతడు ఒక్కడే.

ధృతరాష్ట్రుడి విలాపం: సంజయుడు కురుక్షేత్రము నుండి హస్తినాపురానికి వచ్చి ధృతరాష్ట్రుడి మందిరాన్ని ప్రవేశించి కౌరవుల పరాజయాన్ని, పాండవుల విజయాన్ని, దుర్యోధనాదుల మరణాన్ని, ఇరుపక్షాలలో చావకుండా మిగిలినవారిని గూర్చి ధృతరాష్ట్రుడికి వివరించాడు. అది మొదలు ఇంతవరకు పుత్రపరాజయాన్ని గూర్చి, సర్వసంక్షయాన్ని గూర్చి తలచి తలచి ధృతరాష్ట్రుడు విలపించాడు.

ఈ ధృతరాష్ట్ర విలాపమున తిక్కన చూపిన కవనసౌందర్యం అనితరసాధ్యం. ఈ సన్నివేశమంతా ధృతరాష్ట్రుడి ఏకపాత్రాభినయం. ఒక్క ఆహార్యాభినయం తప్ప వాచికం - ఆంగికం - సాత్త్వికం పుష్కలంగా కలవు. తిక్కన కవిత నాటకీయ శిల్పంతో నిండి ఉన్నదని ఆర్యుల వచనం. ఆ శిల్పసౌందర్యాన్ని శల్యపర్వంలోని ఈ 'ధృతరాష్ట్ర విలాపం' అనే సన్నివేశంలో దర్శించవచ్చును. క్రోధాన్ని శోకంతో కలగలిపి, ప్రేమను ద్వేషంతో మేళవించి ధృతరాష్ట్రుడు పలికిన పలుకులు తిక్కన చేసిన సజీవపాత్ర చిత్రణకు, సాత్త్వికాభినయశిల్పానికి పరమోదాహరణాలు. 'మూర్ఛిల్లుట', 'నలుదిక్కులు మొగము త్రిప్పుట', 'కుంభనిక్షిప్త భుజంగంబు చందంబున నిశ్వాసంబు నిగుడ్చుట', 'చేతులు విదుర్చుట', 'నిట్టూర్పు నిగుడించుట'- ఈ మొదలైన ధృతరాష్ట్రుడి చేష్టలు తిక్కన చిత్రించిన ఆంగికాభినయానికి మచ్చుతునకలు. ఇక 'స్వగతం' గా సాగిన విలాపమంతా వాచికాభినయమే.

ఉ. సూతసుతుండుఁ జేయఁగల శూరులు దర్పసమగ్రభూపతి
వ్రాతముఁ బెక్కుదంతిరథవాజి భటావలులున్ భుజాబల
స్ఫీతులు పాండునందనులచేఁ దెగటారిన నోడి వీటికిన్
నీ తనయుండు హీనరథినీయుతుఁడై యటు లేఁగి నెవ్వగన్. 40

ప్రతిపదార్థం: భుజాబల= భుజబలంచేత; స్ఫీతులు= అధికులు; పాండు= పాండురాజుయొక్క; నందనులచేన్= కొడుకులచే; సూతసుతుండున్= కర్ణుడును; చేయఁగల శూరులు= యుద్ధం చేయగలవీరులు అనగా భీష్మద్రోణాదులు; దర్ప= భుజగర్వముకల;

సమగ్ర= సమస్తమైన; భూపతి= భూమికి భర్తలైన రాజులయొక్క; వ్రాతమున్= సమూహమును; పెక్కు= అనేకములైన; దంతి= ఏనుగులయొక్క; రథ= రథములయొక్క; వాజి= గుర్రములయొక్క; భట= భటులయొక్క; ఆవలులున్= వరుసలును - అనగా రథగజ తురంగ పదాతిదళములును - చతురంగ బలములును; తెగటారినన్= చంపబడగా; ఓడి= అపజయము పొంది; నెవ్వగన్= మిగుల సంతాపముతో; నీ తనయుండు= నీ కుమారుడు దుర్యోధనుడు; హీన= స్వల్పమైన; రథినీ= సైన్యముతో; యుతుడు+ఐ= కూడినవాడై; వీటికిన్= శిబిరమునకు; అటులు= ఆప్రకారముగ; ఏఁగి= వెడలి.

తాత్పర్యం: భుజబల పరాక్రమాలు గల పాండవులచేత కర్ణుడు, భీష్మద్రోణాది మహావీరులు భుజగర్వం గల సమస్త భూపతులు, అనేకములైన రథ గజతురగ పదాతిదళాలు, సంహరించబడగా, ఓడిపోయి నీ కుమారుడు దుర్యోధనుడు కొద్దిసేనలతో మిక్కిలి సంతాపంతో శిబిరానికి వెడలి. (తరువాతి వచనంతో అన్వయం.)

కృపాచార్యుఁడు దుర్యోధనునకు హితోపదేశంబు చేయుట (సం. 9-3-8)

వ. మందిరంబుఁ బ్రవేశింపక యొక్కబయల నిఖిలబంధుమిత్రపరిజనవృతుండై నిలిచె నయ్యవసరంబునఁ
గృపార్ద్రచిత్తుండై కృపాచార్యుం డన్నరేంద్రున కిట్లనియె. 41

ప్రతిపదార్థం: మందిరంబున్= శిబిరములోనికి; ప్రవేశింపక= ప్రవేశించకుండా; ఒక్క; బయలన్= బహిరంగ ప్రదేశమున; నిఖిల= సమస్తమైన; బంధు= చుట్టములతో; మిత్ర= స్నేహితులతో; పరిజన= సేవకులతో; వృతుండై= చుట్టబడినవాడై; నిలిచెన్= ఉండెను; ఆ అవసరంబునన్= ఆ సమయమున; కృపా= దయచే; ఆర్ద్ర= తడిసిన; చిత్తుండు+ఐ= హృదయము కలవాడై; కృపాచార్యుండు; ఆ నరేంద్రునకున్= ఆ దుర్యోధనునకు; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: దుర్యోధనుడు శిబిరంలోనికి ప్రవేశించక, ఒక బహిరంగ ప్రదేశంలో బంధుమిత్ర పరిజనులతో పరివేష్టించబడి ఉన్నాడు. అట్టి సమయంలో దయార్ద్రహృదయుడై కృపాచార్యుడు ఆ దుర్యోధనుడితో ఈ ప్రకారంగా అన్నాడు.

క. 'సమరము మిముబోంట్లకు ను। త్తమ ధర్మం బిదియ తొంటి ధాత్రీశులు కృ
త్యముగఁ గొని యాచరించిరి। తమకు సుగతి గోరి కీర్తితస్ఫురణమెయిన్. 42

ప్రతిపదార్థం: మిముబోంట్లకున్= మీ వంటివారికి; సమరము= యుద్ధము; ఉత్తమ= శ్రేష్ఠమయిన; ధర్మంబు= వేదవిహితకర్తవ్యము; ఇదియ= ఈ యుద్ధధర్మమే (అవధారణార్థము); కృత్యముగన్= చేయదగిన దానినిగా; తొంటి= మునుపటి; ధాత్రి= భూమికి; ఈశులు= ప్రభువులయిన రాజులు; కొని= స్వీకరించి; కీర్తిత= కీర్తింపబడిన; స్ఫురణమెయిన్= ప్రకాశముతో; తమకున్; సుగతి= ఉత్తమగతి; కోరి; ఆచరించిరి= యుద్ధధర్మమును ఆచరించిరి.

తాత్పర్యం: 'మీ వంటి వారికి యుద్ధం వేదవిహిత కర్తవ్యమే. ఈ ధర్మాన్నే పాటించి మునుపటి రాజులు కీర్తిమంతులై ఉత్తమగతిని కోరి యుద్ధధర్మాన్ని ఆచరించారు.

విశేషం: తిక్కన 'సుగతి' పదంయొక్క అభంగశ్లేషతో ఈ కందమున సుందరమైన గీతావాక్యార్థాన్ని బంధించి క్షత్రియ ధర్మమును బోధించాడు. 'హతో వా ప్రాప్స్యసే స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్' (గీత 2 - 37)' 'స్వధర్మమపి చావేక్ష్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

న వికంపితు మర్హసి। ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే' (గీ॥ 2 - 31) వంటి భగవద్గీతలోని శ్లోకాలను ఆయా సందర్భాలకు తగిన విధంగా తిక్కన తన భారతంలో అనువదించినట్లు గ్రహించటాని కిది ఉదాహరణ.

క. ఐనను నొకపలు కడ్డము। గా నొడివెద దానిలెస్సగా విని యది మే
లైనను జేసెదు గాదే। న్మానెద వేర్పడఁగ వినుము మనుజాధీశా! 43

ప్రతిపదార్థం: మనుజ= మానవులకు; అధీశా!= ప్రభువు అయిన దుర్యోధనా!; ఐనను= అయినప్పటికి (మీవంటివారికి యుద్ధం ఉత్తమధర్మం అయినప్పటికిని); ఒక; పలుకు= మాట; అడ్డముగాన్= విరుద్ధంగా (ఆ ఉత్తమధర్మానికి విరుద్ధంగా); నొడివెదన్= చెప్పెదను; దానిన్= దానిని (ఆమాటను); లెస్సగాన్= చక్కగా; విని; అది (ఆ మాట); మేలు= శుభము; ఐనను= అయినచో; చేసెదు= చేయుదువుగాక; కాదేన్= అట్లుకాని ఎడల (శుభంకానిది అయిన ఎడల); మానెదవు= మానెదవు; ఏర్పడఁగన్= స్పష్టంగా; వినుము.

తాత్పర్యం: ఓ దుర్యోధనా! అయినా క్షత్రియధర్మానికి విరుద్ధంగా ఒకమాట చెప్తాను. ఆమాటను చక్కగా విని, అది శుభం అయితే ఆ ప్రకారం చేయుము. కానిచో మానుకొమ్ము. నేను చెప్పేది స్పష్టంగా వినుము.

చ. అమరనదీ తనూభవుఁడు నస్త్రగురుండును కర్ణుఁడుం బరా
క్రమమహనీయు లాహవధురంధరు లట్టిర తక్కుఁ గల్గు భూ
రమణులు బంధుమిత్రులు దురంబున నందఱఁ బాండునందనుల్
సమయఁగఁ జేసి రట్లు భుజశక్తియు దైవబలంబు నెక్కుడై. 44

ప్రతిపదార్థం: అమరనదీ= దేవనదియొక్క (ఆకాశగంగానదియొక్క); తనూభవుఁడున్= తనయుడును (భీష్ముడును); అస్త్ర= అస్త్రవిద్యకు; గురుండును= గురువుఅయినవాడును (ద్రోణుడును); కర్ణుఁడున్= కర్ణుడును; పరాక్రమ= శౌర్యముచేత; మహనీయులు= గొప్పవారు; ఆహవ= యుద్ధముయొక్క; ధురంధరులు= భారమును మోయువారు; (యుద్ధముచేయుటలో ప్రముఖులు); తక్కున్= మిగులు; కల్గు= ఉన్నట్టి; భూ; రమణులు= రాజులు; బంధు= చుట్టములు; మిత్రులు= స్నేహితులు; అట్టిర= అట్టివారే (అవధారణార్థం) అనగా పరాక్రమంలోమహనీయులే, ఆహవ ధురంధరులే అయిఉన్నారు); అందఱన్= ఇట్టివారి నందరినీ; పాండునందనుల్= పాండవులు; భుజశక్తియున్= భుజబలమును; దైవబలంబును= దైవంయొక్క బలమును; ఎక్కుడై= అధికంగా కలవారై; దురంబునన్= యుద్ధంలో; అట్లు= ఆ విధంగా (శిఖండిని అడ్డుపెట్టి భీష్ముడిని; అశ్వత్థామా హతః అని' ద్రోణుడిని; రథం క్రుంగగా కర్ణుడిని) సమయఁగన్= మరణించేటట్లుగా; చేసిరి= చేశారు.

తాత్పర్యం: భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, పరాక్రమంలో చాలా గొప్పవారు. యుద్ధవిద్యలో ప్రముఖులు. మిగిలిన భూపతులు, చుట్టాలు, స్నేహితులు కూడా అంతటి పరాక్రమవంతులే. యుద్ధవిద్యలో వాళ్ళూ ప్రముఖులే. అట్టివారి నందరినీ పాండవులు భుజబలము, దైవబలం, అధికంగా కలవారై చంపగలిగారు.

చ. వెరవును లావునుం గలుగు వీరులు పోరులఁ బడ్డ హీనతం
బొరసితి మస్త్రశస్త్రహతి భూవర చిక్కినవారు నొల్లఁ బో
యిరి విను పాండురాజసుతు లేవురు గంటికి రెప్పచందమై
హరి తముఁ గావఁగా వెలసి రక్షతదేహవిలాససంపదన్. 45

ప్రతిపదార్థం: భూవర!= రాజా దుర్యోధనా!; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధాలయొక్క; శస్త్ర= మంత్రపూతములుకాని ఆయుధములయొక్క; హతిన్= దెబ్బలవలన; వెరవును= ఉపాయమును (అనగా యుద్ధవ్యూహములను); లావునున్= బలమును; కలుగు= కలిగిన, వీరులు= శూరులు; పోరులన్= యుద్ధములందు (ఈ పదియేడు దినముల యుద్ధములందు); పడ్డన్= చనిపోగా; హీనతన్= తక్కువతనమును; పొరసితిమి= పొందితిమి; చిక్కిన= మిగిలిన; వారున్= వారును; ఒల్లఁబోయిరి= మూర్ఛపోయిరి; విను; పాండురాజు= పాండురాజుయొక్క; సుతులు= కొడుకులు; ఏవురు= అయిదుగురు; కంటికిన్; రెప్పచందమై= రెప్పవలె; హరి= శ్రీకృష్ణుడు; తమున్= తమను; కావఁగాన్= రక్షించుచుండగా; అక్షత= దెబ్బలు లేని (అనగా గాయములులేని); దేహ= శరీరములయొక్క; విలాస= సౌందర్యంయొక్క; సంపదన్= ఐశ్వర్యముతో; వెలసిరి= ప్రకాశించిరి.

తాత్పర్యం: దుర్యోధనా! అస్త్రశస్త్రాల దెబ్బలవలన ఉపాయం, బలం కలిగిన వీరులు ఈ పదియేడు దినముల యుద్ధంలో చనిపోగా మనం తక్కువతనమును పొందాము. అనగా బలహీనుల మయ్యాము. ఇక మిగిలిన వారు శస్త్రాస్త్రాల దెబ్బలచేత మూర్ఛిల్లారు. దుర్యోధనా! వినుము. పాండురాజు కొడుకులు అయిదుగురు కంటికి రెప్పవలె శ్రీకృష్ణపరమాత్మ తమను రక్షిస్తూ ఉండగా గాయాలు కూడా లేని దేహవిలాస సంపదలతో ప్రకాశించారు.

క. శ్వేతాశ్వపాటవం బు। ద్ద్యోతితమై మెఱయఁగాఁ జతుర్దంతరుచి
స్ఫీత మగు గజముక్రియ నరుఁ। డాతత కురుసైన్యసరసియందుఁ జరించున్. 46

ప్రతిపదార్థం: నరుడు= అర్జునుడు; శ్వేత= తెల్లని; అశ్వ= గుర్రములయొక్క; పాటవంబు= శక్తి; ఉద్ద్యోతితము= ప్రకాశవంతము; ఐ= అయి; మెఱయఁగాన్= ప్రకాశింపగా; చతుర్దంత= నాలుగు దంతాలయొక్క; రుచి= కాంతితో; స్ఫీతము= గొప్పది; అగు; గజము= ఏనుగు; క్రియన్= వలె; ఆతత= విశాలమయిన; కురుసైన్య= కౌరవసేనయనెడి; సరసియందున్= సరోవరమునందు; చరించున్= సంచరించును.

తాత్పర్యం: తెల్లనిగుర్రాల శక్తి ప్రకాశవంతమై వెలుగుతుండగా అర్జునుడు చతుర్దంతాల కాంతితో వెలుగొందే ఐరావతం అనే ఏనుగువలె విశాలమైన కౌరవసైన్యమనే సరోవరంలో సంచరిస్తాడు. (ఏనుగు సరోవరాన్ని కలచివేసేటట్లు అర్జునుడు కురుసేనను నశింపచేస్తాడని భావం.)

విశేషం: రూపకానుప్రాణిత ఉపమాలంకారంతో ఈ పద్యం అలంకరింపబడింది. కురుసైన్యమనెడి సరసి - రూపకం. కురుసైన్యమునకు సరోవరమునకు అభేదం. (ఉపమాన ఉపమేయములకు అభేదకల్పనం రూపకం) ఇక నరుడు - ఉపమేయం, గజము - ఉపమానం; క్రియన్ - ఉపమావాచకం; చరించున్ - సమానధర్మం. పూర్ణోపమ.

అర్జునుడి రథమునకు గల శ్వేతాశ్వములు నాలుగు. ఇంద్రుడి ఏనుగు ఐరావతమునకు దంతములు నాలుగు. అందువలన చతుర్దంతి అని పేరు. నాలుగు అశ్వములు తెల్లనివి. నాలుగు దంతములు తెల్లనివి. ఐరావతం తెల్లనిది. చతుర్దంత పదప్రయోగంతో అశ్వసంఖ్య, శ్వేతాశ్వపదప్రయోగంతో ఐరావతవర్ణం సూచితాలు. ఇది తిక్కనగారి శ్లేషవ్యంగ్య చమత్కారం. మూలంలో మూడు శ్లోకాలు కలవు. ఆ మూడు శ్లోకాల తాత్పర్యార్థాన్ని తిక్కన ఈ కందంలో రమణీయముగా పొదిగాడు.

'శ్వేతాశ్చ వేగ సంపన్నాః శశికాశ సమప్రభాః । పిబంత ఇవ చాకాశం రథే యుక్తాస్తు వాజినః ॥
గాహమాన మనేకాని మహేంద్రసదృశప్రభమ్ । ధనంజయ మపశ్యామ చతుర్దంష్ట్ర మివ ద్విపమ్ ॥

విక్షోభయంతం సేనాంతే త్రాసయంతం చ పార్థివాన్ । ధనంజయ మపశ్యామ నలినీమివ కుంజరమ్ ॥ (శల్య ॥ప ॥ అధ్యా 4) (శ్లో 20, 23, 24)

క. **జ్యారవము నాదముగ నతి । ఘోరత వైరులను కరటికోటికి రయదు**
ర్వారం బగు నర్జున కం । ఠీరవము శితాస్త్రనఖపటిష్ఠతఁ జూపున్. 47

ప్రతిపదార్థం: వైరులు= శత్రువులు; అను= అనెడి; కరటి= ఏనుగులయొక్క; కోటికిన్= గుంపునకు; జ్యా= వింటినారియొక్క; రవము= ధ్వని; అతిఘోరతన్= మిక్కిలి భయంకరమగు; నాదముగన్= ధ్వనికాగా (అనగా గర్జనముకాగా); రయ= వేగంచేత; దుర్వారంబు= నివారింపశక్యముకానిది; అగు= అయినట్టి; అర్జున= అర్జునుడు అనెడి; కంఠీరవము= సింహము; శిత= వాడియైన (అనగా తీక్షణమైన); అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములనెడి; నఖ= గోళ్ళయొక్క; పటిష్ఠతన్= గట్టితనమును (అనగా పటుత్వమును); చూపున్= చూపించును.

తాత్పర్యం: శత్రువులు అనే ఏనుగుల గుంపునకు వింటినారియొక్క ధ్వని అతిభయంకరమైన ధ్వనికాగా - వేగంచేత, బలంచేత నివారింప శక్యంకాని అర్జునుడు అనే సింహం వాడి అయిన మంత్రాస్త్రా లనెడి గోళ్ళయొక్క పటుత్వాన్ని చూపిస్తుంది.

విశేషం: ఇది రూపకముల మయము. జ్యారవమునకు - సింహగర్జనమునకు; వైరులకు; కరటికోటికి-అర్జుననకు-కంఠీరవమునకు; శితాస్త్రములకు - నఖములకు; అభేదకల్పనముతో తిక్కన దీనిని రచించాడు. 'రయ' శబ్ద ప్రయోగం అర్థ గాంభీర్య చమత్కార జనకం. రయము= వేగము; రయము= బలము అని రెండర్థములు. ఇచ్చట ఈ రెండర్థములూ సాభిప్రాయములు. అర్జునుడు యుద్ధవిద్యలో వేగమునందు-బలమునందు అనితరసాధ్యుడు. అట్లే సింహం ఏనుగులవేటలో వేగమునందు - బలము నందు అనితరసాధ్యం. సింహగర్జనం ఏనుగులకు అతి భయంకరమైనది. అర్జునుడి జ్యారవము - శత్రువులకు అతిభయంకరమైనది. సింహనఖములు అతిపటుతరములు; అర్జునుని అస్త్రములు మహామంత్రపూతములు. సింహము గర్జించి ఏనుగుల గుంపును చెదరగొట్టి, నఖములతో కుంభస్థలములను చీల్చుతుంది. (సింహగర్జనను స్వప్నంలో విన్నను ఏనుగు మరణిస్తుందని లోకవ్యవహారం.) అర్జునకంఠీరవ పదప్రయోగంతో తిక్కన అర్జునుడి అద్భుత పరాక్రమ పరోక్షచిత్రణం- ఈ కందమున సుందరంగా తీర్చాడు. 'త్రాసయంతం తథా యోధాన్ ధనుర్ఘోషేణ పాండవమ్ । భూయ ఏనమపశ్యామ సింహం మృగగణానివ' ॥ ఇది దీనికి మూలం. (శల్య ॥ అధ్యా-4, శ్లో-25)

తే. **అర్జునోదగ్ర దవశిఖ హరిమహాని । లంబు ప్రేరేప వైరిబలప్రకీర్ణ**
గహనదహనవిహార ముగ్రముగఁ జలుపఁ । దేఱి చూడను రాకున్కి దెల్ల మధిప! 48

ప్రతిపదార్థం: అధిప!= దుర్యోధనా!; అర్జున= అర్జునుడు అనెడి; ఉదగ్ర= భయంకరమయిన; దవశిఖ= దవాగ్ని జ్వాల (అనగా అడవులను కాల్చు అగ్ని)); హరి= శ్రీకృష్ణుడు అనెడి; మహా= గొప్ప; అనిలంబు= వాయువు; ప్రేరేపన్= ప్రేరేపించగా (అనగా రెచ్చగొట్టగా); వైరి= శత్రువులయొక్క; బల= సైన్యమనెడి; ప్రకీర్ణ= వ్యాపించిన; గహన= అడవియొక్క; దహన= అగ్నియొక్క; విహారము; ఉగ్రముగన్= భయంకరముగ; చలుపన్= చేయగా; తేఱి= తేరిపార; చూడను= చూచుటకు కూడ; రాకున్కి= వీలుకాదనుట; తెల్లము= స్పష్టము.

తాత్పర్యం: అర్జునుడు అనే భయంకరమయిన దవాగ్నిజ్వాల - శ్రీకృష్ణుడు అనే మహావాయువు ప్రేరేపించగా శత్రుసైన్య మనెడి వ్యాపించిన అటవీదహన విహారాన్ని శత్రువులకు తేరిపార చూడటానికి కూడా వీలుకాదనడం స్పష్టం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: రూపకం. అర్జునుడు దవాగ్నిజ్వాల; అర్జున దవాగ్నిజ్వాల శత్రుసైన్యమనే గహనాన్ని దహనవిహారం చేస్తున్నది. ఆ విహారాన్ని తేరిచూడ శక్యంగాదు. - శ్రీకృష్ణుడు - మహానిలము; శత్రుసైన్యము - గహనం (అరణ్యము); ఈ ఉపమాన ఉపమేయములకు అభేదము.

ఉ. ద్రోణుఁడు సూతనందనుఁడు ద్రోణ తనూజుఁడు నేను శల్యుడుం
ద్రాణపరాయణత్వమున దర్పము సూపఁగఁ నీవుఁ దమ్ములున్
బాణపరంపరల్ గురియ ఫల్గునుఁ డందఱ మీఱి సైంధవ
ప్రాణము నాఁచికోలు నరపాల! తలంపఁగ మర్త్యకృత్యమే! 49

ప్రతిపదార్థం: ద్రోణుఁడు; సూతనందనుఁడున్= కర్ణుడు; ద్రోణ తనూజుఁడున్= ద్రోణుడి కుమారుడు అశ్వత్థామ; నేను= నేనును(కృపాచార్యుడు); శల్యుఁడున్= శల్యుఁడును; త్రాణపరాయణత్వమునన్= (సైంధవుడిని) రక్షించటంలో గల ఆసక్తితో; దర్పము= గర్వం; చూపఁగ= చూపించగ; నీవున్= నీవును (దుర్యోధనుడవు అయిన నీవును); తమ్ములున్= తమ్ములును (దుశ్శాసనాదులును); త్రాణ= రక్షించుటయందలి; పరాయణత్వమునన్= ఆసక్తితో; బాణ= బాణములయొక్క; పరంపరల్= వరుసలు (అనగా ఒక దాని తరువాత ఒకటిగా); కురియన్= కురిపించగా; ఫల్గునుఁడు= అర్జునుడు; అందఱన్= మనలనందరను; మీఱి= మించిపోయి; సైంధవప్రాణము= సైంధవుని యొక్క ప్రాణము; నాఁచికోలు= అపహరణం; నరపాల!= నరులను పాలించు దుర్యోధనా!; తలంపఁగన్= ఆలోచింపగ; మర్త్య= మానవులకు సాధ్యమయిన; కృత్యమే!= కార్యమా! (కాదు అని అర్థం)

తాత్పర్యం: ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ, నేను, శల్యుడు, నీవు నీ తమ్ములు సైంధవుడి రక్షణ అందలి అనురక్తితో బాణపరంపరలు కురిపిస్తున్నా ఒక్క అర్జునుడు మనలనందరిని మించిపోయి సైంధవుడి ప్రాణం అపహరించాడు. దుర్యోధనా! ఆలోచించి చూడగా అది మానవసాధ్యమయిన కార్యమా? కాదుసుమా!

ఉ. ఇంతకుమున్ను సెల్లెఁ బదియేడుదినంబుల సంగరం బతి
శ్రాంతతఁ గుంది రిందుఁ గలసైనికు లద్దెసఁ గల్గుయోధు లా
క్రాంత విరోధిదర్పుఁడు పురందరనందను బల్మికల్మి ని
శ్చింతత నుల్లసిల్లెదరు చెక్కు చెమర్పక కౌరవేశ్వరా! 50

ప్రతిపదార్థం: కౌరవ= కౌరవులకు; ఈశ్వరా!= ప్రభువు అయిన దుర్యోధనా!; ఇంతకుమున్ను= ఇంతకుముందు; పదియేడు; దినంబుల= రోజుల; సంగరంబు= యుద్ధము; చెల్లెన్= సాగింది; ఇందున్= ఇందు(కౌరవపక్షమున); కల= ఉన్నట్టి; సైనికులు= సేనలు; అతి= మిక్కిలి; శ్రాంతతన్= అలసిపోవుట వలన; కుందిరి= కృంగిపోయిరి(బలహీనులు అయిపోయారు); ఆ+దెసన్= ఆ దిక్కునందు(ఆ పాండవపక్షమున); కల్గు= ఉన్నట్టి; యోధులు= యుద్ధవీరులు; ఆక్రాంత= ఆక్రమించబడిన; విరోధి= శత్రువులయొక్క; దర్పుఁడు= గర్వముకలవాడు అయిన; పురందర= ఇంద్రునియొక్క; నందను= కుమారునియొక్క (అర్జునునియొక్క); బల్మికల్మిన్= శత్రువులను జయించగల శక్తి సంపదవలన; చెక్కుచెమర్పక= కొంచెం కూడా అలసటలేకుండగా (చెక్కిలి చెమటపట్టకుండా - అనగా అశ్రమంగా); నిశ్చింతతన్= ఏ విధమయిన విచారములేకుండగా; ఉల్లసిల్లెదరు= సంతోషంతో ఒప్పారుతారు.

తాత్పర్యం: దుర్యోధనా! ఇంతకుముందు పదియేడు దినాల యుద్ధం అయిపోయింది. మన సైనికులు అలసి సొలసి క్రుంగిపోయి ఉన్నారు. ఆ వైపు పాండవ పక్ష యోధులు శత్రుదర్పాన్ని నిర్మూలించే ఇంద్రతనయుడైన అర్జునుడి బలం కలిగి ఉన్నందున చెక్కు చెమర్పకుండా ఏ విధమయిన విచారం లేకుండా అమితానందం కలిగి ఉన్నారు.

క. బలవిక్రమ ఘనులగు దొర । లిలిగిన మనసేన మేదినీశ్వర! విను క
న్నులు సెడినట్లున్నది యీ । కొలఁదిం బొరిగొనుట నరునకున్ సుకరమగున్॥' 51

ప్రతిపదార్థం: మేదినీ= భూమికి; ఈశ్వర!= ప్రభువు అయిన దుర్యోధనా!; విను; బల= బలమునందు; విక్రమ= పరాక్రమమునందు; ఘనులు= గొప్పవారు; అగు= అయినట్టి; దొరలు= ప్రభువులు (అనగా సైన్యాధ్యక్షులయిన భీష్మ, ద్రోణ, కర్ణులు); ఇలిగినన్= మరణించగా; మనసేన= మనయొక్క సైన్యము; కన్నులు= నేత్రములు; చెడినట్లు= చెడిపోయినట్లు (గ్రుడ్డిది అయినట్లు) ఉన్నది= ఉన్నది. (అనగా సేనను నడిపించు సేనాపతులు లేక మనసేన గ్రుడ్డిదానివలె ఉన్నదని తాత్పర్యం); ఈకొలఁదిన్= ఈ తక్కువసేనను; పొరిగొనుట= చంపుట; నరునకున్= అర్జునునకు; సుకరము= సులభము; అగున్= అగును.

తాత్పర్యం: ఓ దుర్యోధనా! వినుము. బలపరాక్రమవంతులైన భీష్మ, ద్రోణ, కర్ణులు మరణించిన తరువాత మనసేన సేనాపతులు లేక గ్రుడ్డిది అయినట్లున్నది. అర్జునుడికి ఈ తక్కువసేనను సంహరించటం మిక్కిలి సులభం సుమా!'

వ. అని చెప్పి కృతవర్మ శల్య గురుపుత్రులను దన్ను నెన్ని. 52

ప్రతిపదార్థం: అని; చెప్పి; కృతవర్మ; శల్య; గురుపుత్రులను= అశ్వత్థామలను; తన్నున్= తనను; ఎన్ని= పరిగణించి (అనగా ఎంపికచేసి.

తాత్పర్యం: కృపాచార్యుడు ఈ విధంగా కౌరవపాండవపక్ష బలాబలాలను గూర్చి దుర్యోధనుడికి చెప్పి, కృతవర్మ, శల్య, అశ్వత్థామలనూ- తననూ ఎంపిక చేసి.

క. దామోదరు తమ్ముండును । భీముఁడు నిరుగెలఁకులందుఁ బేర్చి తఱుమ ను
ద్దామగతి నడరు కవ్వడి । కే మిందఱుఁ దలఁప నొక్క యెత్తుకుమారా! 53

ప్రతిపదార్థం: కుమారా!= దుర్యోధనా!; తలఁపన్= ఆలోచించగా; దామోదరు= శ్రీకృష్ణునియొక్క; తమ్ముండును= తమ్ముడు అయిన సాత్యకియును; భీముఁడును= భీముడును; ఇరు= రెండు; కెలఁకులందున్= ప్రక్కలయందును; పేర్చి= విజృంభించి; తఱుమన్= వెంబడించి పరుగెత్తించగా; ఉద్దామ= అడ్డులేని; గతిన్= గమనముతో; అడరు= విజృంభించి బాణములు ప్రయోగించు; కవ్వడికిన్= అర్జునునకు; ఏము= మేము; ఇందఱున్= ఇంతమందిమి (అనగా ఈ కృతవర్మ, శల్యుడు, అశ్వత్థామ, నేనుకూడా); ఒక్క; ఎత్తు= సమానము. (మేమందరము ఒక్క అర్జునుడితో సమానమని తాత్పర్యం.)

తాత్పర్యం: కుమారా! శ్రీకృష్ణుడి తమ్ముడు సాత్యకి, భీముడు, అర్జునుడి రథానికి రెండుప్రక్కల నుండి విజృంభించి వెంటాడి తరుముతుండగా అడ్డులేని విధంగా బాణాలు ప్రయోగించే అర్జునుడు ఒక ఎత్తు, మేమందరం ఒక ఎత్తు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: తిక్కన ఒక్క అర్జునుడి పౌరుష పరాక్రమాలనే ఈ సన్నివేశంలో 46వ పద్యం మొదలు 53వ పద్యం వరకు ఏడు పద్యాలలో బహుభంగుల సాలంకారంగా అభివర్ణించాడు. వ్యాసభగవానులు ఈ సందర్భంలో భీముడి సింహనాదాన్నీ, శ్రీకృష్ణుడి పాంచజన్యనిస్వనాన్నీ, అర్జునుడి గాండీవ నిర్ఘోషాన్నీ కలగలిపి ఒక్క శ్లోకంలో ప్రణవనాదాన్ని వినిపించాడు.

చ. అనిలసుతుండు పూన్కి బలుపారఁగఁ గొండొక దీర్చె నేపు నొం
దిన భుజసంపదం గొఱఁత దీర్పఁగ నింకఁ గడంగకుండునే?
మనకు నజాతశత్రుని సమంచితమార్దవ మూఁది సంధి సే
య నుచితమైన కాలమిది యాగ్రహముం జొరనీకు చిత్తమున్. 54

ప్రతిపదార్థం: అనిలసుతుండు= వాయువు కొడుకైన భీముడు; పూన్కి= పూనిక-ఉద్యమము; బలుపు= బలము; ఆరఁగన్= ఒప్పుగా; కొండొక= కొంచెము; తీర్చెన్= చక్కదిద్దెను; ఏపును= ఆధిక్యమును; ఒందిన= పొందిన; భుజసంపదన్= భుజబలముతో; కొఱఁత= మిగిలినలోటు; తీర్పఁగన్= చక్కబరుచుటకు; ఇంకన్= ఇంక; కడంగక= ప్రయత్నింపకుండగ; ఉండునే?= ఉండునా? (ఉండడు అని భావం.); మనకున్= మనకు; అజాతశత్రుని= ధర్మరాజుయొక్క; సమంచిత= ఒప్పిన; మార్దవము= మృదుత్వము; ఊఁది= లేపి; సంధి; చేయను= చేసికొనుటకు; ఇది; ఉచితము= తగినది; ఐన= అయినటువంటి; కాలము= సమయము; చిత్తమున్= మనసునందు; ఆగ్రహమున్= కోపమును; చొరనీకు= ప్రవేశించనీయకుము - పాండవులయెడల మనసునందు ఆగ్రహమును చొరనీయకుము.

తాత్పర్యం: భీముడు తన ఉద్యమాన్ని కొంచెం నెరవేర్చాడు. ఇంకా తన అధికమైన భుజబల సంపదతో మిగిలిన లోటును చక్కబరచటానికి ప్రయత్నించకుండా ఉండడు. అందువలన ఒప్పిన ధర్మరాజుయొక్క మార్దవ లక్షణాన్ని వినియోగించుకొని, సంధి చేసికోవటాని కిది మంచి సమయం. ఇట్లా చెప్పుతున్నందులకు నా యెడల నీ మనసులో కోపం ప్రవేశించనీయకుము. పాండవుల విషయంలో కూడా నీ మనసులో ఆగ్రహమును ప్రవేశించనీయకుము.

విశేషం: 'నాడు ద్రౌపది వస్త్రాపహరణ సమయంలో కౌరవసభలో భీముడు రెండు శపథాలు చేశాడు. ఒకటి దుశ్శాసనుడి వక్షఃస్థలమును చీల్చి చంపటం. దానిని చక్కదిద్దాడు. అనగా నెరవేర్చాడు. ఇక రెండవది దుర్యోధనుడి తొడలు విరుగగొట్టి చంపటం. దానిని చక్కబరచవలసి ఉన్నది. ఆ శపథమును ఏపుమీఱిన తన భుజబలంతో నెరవేర్చకుండా ఉండడు. భీముడు నీ తొడలు విరుగగొట్టి తప్పకుండా చంపగలడు. అందువలన ధర్మజుడిని ఆశ్రయించి సంధి చేసికొనుము', ఇది ఈ పద్యంలోని భావం.

క. సమరము నిష్కారణవై। రమునం బాటిల్లె నెల్ల రాజులు భరతో।
త్తములును మడిసిరి విడు కో। పము; దీర్ఘ క్రోధుఁడైనపతి కీడొందున్. 55

ప్రతిపదార్థం: సమరము= యుద్ధము; నిష్కారణ= కారణములేని; వైరమునన్= శత్రుత్వము వలన; పాటిల్లెన్= కలిగెను; ఎల్లరాజులున్= అందరు రాజులు; భరత= భరతవంశమునందలి; ఉత్తములును= శ్రేష్ఠులును; మడిసిరి= మరణించిరి; కోపము; విడు= విడిచిపెట్టుము; దీర్ఘక్రోధుఁ డైనపతి; ఎడతెగని కోపం కలిగినవాడు; అయినట్టి; రాజు; కీడు= నాశనము; ఒందున్= పొందును.

తాత్పర్యం: ఈ యుద్ధం కారణంలేని శత్రుత్వంవలన కలిగింది. సమస్త రాజులు, భరతవంశంలోని శ్రేష్ఠులు మరణించారు. అందువలన ఇక కోపం విడిచిపెట్టుము. దీర్ఘక్రోధుడైన రాజు నాశనమౌతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తమకు బలం బెక్కినతఱి । సముచితమగు విగ్రహంబు శత్రుల కుత్సా
హము మీఱినపుడు గర్త । వ్యము సంధి యనంగ విందు మార్యులచేతన్. 56

ప్రతిపదార్థం: తమకున్; బలంబు; ఎక్కిన తఱిన్= అధికముగా ఉన్న సమయమున; విగ్రహంబు= యుద్ధము; సముచితము= తగినది; అగున్; శత్రులకున్= విరోధులకు; ఉత్సాహము; మీఱినపుడు= అతిశయించినపుడు; సంధి= యుద్ధవిరమణకు తగిన ఒప్పందము; కర్తవ్యము= తప్పకచేయతగినది; అనంగన్= అని; ఆర్యులచేతన్= పూజ్యులైన పెద్దలచేత; విందుము= వినుచుందుము.

తాత్పర్యం: తమకు శక్తిసామర్థ్యాలు అధికంగా ఉన్నప్పుడు యుద్ధం తగినది. శత్రువులకు ఉత్సాహం అధికంగా ఉన్నప్పుడు సంధి చేసికొనటం కర్తవ్యం. ఈ న్యాయం పూజ్యులైన పెద్దలచే చెప్పబడగా వింటాము. కావున, సంధి చేసికొనటం ఉచితం కదా!

విశేషం: 'హీయమానేన వై సంధిః పర్యేష్టవ్యం సమేన వా విగ్రహో వర్ధమానేన మతి రేషా బృహస్పతేః' (మూలం)

క. కలవారెల్లను దెగి నీ । తలన నిలిచెఁ గార్య మధిప! తగ నొడఁబడు మి
ట్టలమగు నాత్మవినాశము । కలుగుట యది విపులపాతకం బంద్రు బుధుల్. 57

ప్రతిపదార్థం: అధిప!= ప్రభువా! దుర్యోధనా!; కలవారు= ఉన్నవారు; ఎల్లను= అందరును; తెగి= మరణించగా; నీతలన= నీయందే; కార్యము= సంధికార్యం; నిలిచెన్= శేషించి ఉన్నది; తగన్= ఒప్పుగా; ఒడఁబడుము= సంధికి సమ్మతించుము; ఇట్టలము= అధికము; అగు= అయినట్టి; ఆత్మవినాశము= తనయొక్క వినాశము; కలుగుట= కలిగినందువలన; బుధుల్= పండితులు (అనగా ధర్మజ్ఞానము కలవారు); అది; విపుల= మిక్కిలి; పాతకంబు= పాపము; అంద్రు= అంటారు.

తాత్పర్యం: ఓ దుర్యోధనా! నీ పక్షాన ఉన్నవారందరు మరణించారు. అందువలన కర్తవ్యం నీ పక్షాన శేషించి ఉన్నది. కావున సంధికి సమ్మతించుము. అధికమయిన ఆత్మవినాశం మహాపాతకమని ధర్మజ్ఞానులయిన బుధులు చెప్పుతూ ఉంటారు.

క. తనకై కాదే! మదినె । ల్లను గోరుట వినుము దాఁ బ్రళయమొందెన యే
నిని వారని యుద్యోగం । బునకు ఫలంబేమి? రాజపుంగవ! చెపుమా! 58

ప్రతిపదార్థం: రాజపుంగవ!= రాజులలో శ్రేష్ఠుడవు అయిన దుర్యోధనా!; మదిన్= మనసునందు; ఎల్లను= సమస్తమును (అనగా సమస్త రాజ్యసంపదను); కోరుట= కోరుకొనుట; తనకై= తన కొరకు; కాదే!= కాదా! - (తన కొరకే అని తాత్పర్యము); వినుము; తాన్= తాను (మదిలో సమస్త రాజ్యమును కోరుకొను తానే); ప్రళయము= గొప్ప నాశము; ఒందెనయేనిని= పొందినచో; వారని= ఆగని; ఉద్యోగంబునకున్= యుద్ధ ప్రయత్నమునకు; ఫలంబు= ప్రయోజనము; ఏమి?= ఏమి ఉన్నది?; చెపుమా!;

తాత్పర్యం: ఓ దుర్యోధనా! మదిలో సమస్త రాజ్యసంపదను తన కొరకే కోరుకొనేవాడు తానే నాశనం పొందినపుడు ఈ యుద్ధప్రయత్నంవలన ప్రయోజనం ఏమున్నది చెప్పుము? (ఆత్మవినాశనం వలన ప్రయోజనమేమీ లేదు. అందువలన సంధియే అవశ్యకర్తవ్య మనటం తాత్పర్యం.)

విశేషం: 'దుర్యోధనా! పాండవులకు దాయభాగం దక్కకుండా సమస్త రాజ్యసంపదను నీవే పొందవలె నని ఈ యుద్ధాన్ని ప్రారంభించావు. ఇపుడు నీవే వినాశం పొందినట్లయితే, ఇక ఈ యుద్ధంవలన నీకు ప్రయోజన మేమి? ఏమీ లేదు. అందువలన యుద్ధాన్ని విరమించి సంధికి ఒడంబడుము.' ఇది కృపాచార్యుడి హితోపదేశ సారాంశం.

క. నినుఁ గాచికొనుము నీ వు । న్నను సర్వము గల్గు ధర్మనందనునిఁ దగం
గను మతఁడు రాజునని తన । మనమున నెక్కించుకొనఁడు మదగర్వంబుల్. 59

ప్రతిపదార్థం: నినున్= నిన్ను; కాచికొనుము= రక్షించుకొనుము; నీవు; ఉన్నను= ఉన్నచో (అనగా బ్రతికి ఉన్నచో); సర్వము+ అ= సమస్తమును; కల్గును= లభించును; ధర్మనందనునిన్= ధర్మరాజును; తగన్= ఒప్పుగా; కనుము= చూడుము; అతఁడు; రాజను= నేను రాజును; అని; తన= తనయొక్క; మనమునన్= మనసునందు; మదగర్వంబుల్= మదమును, గర్వమును; ఎక్కించుకొనఁడు= ప్రవేశింపనీయడు.

తాత్పర్యం: నిన్ను రక్షించుకొనుము. నీవు జీవించి ఉంటే నీకు సర్వసంపదలు కలుగుతాయి. ధర్మజుడిని మంచిగా చూడుము. అతడు 'నేను రా'జను మద గర్వాలతో నిండిన భావాలను తన మనసునందు ప్రవేశించనీయడు. అందువలన యుద్ధాన్ని విరమించి సంధి చేసికొనుము.

విశేషం: 'అతడు రాజునని తన మనమున నెక్కించుకొనడు మదగర్వంబుల్' - ధర్మజుడు నీవలె 'నేనే రాజును' అనే మదగర్వాలు తన మనస్సులో ఎక్కించుకొనడు- అనే తాత్పర్యార్థంతో కృపుడు దుర్యోధనుడికి బుద్ధి చెప్పటం గ్రహించవచ్చును.

తే. రాజ్యభాగంబు దగ ధృతరాష్ట్రునకును । నీకు నన్నదమ్ములకు నా నృపతి యొసఁగు
నాతఁ డెపుడు శుశ్రూష సేయంగఁ గోరు । గురుజనములకుఁ గావునఁ గూడుటొప్పు. 60

ప్రతిపదార్థం: ఆ నృపతి= ఆ ధర్మరాజు; రాజ్యభాగంబు= సామ్రాజ్యమందలి వంతు; తగన్= ఒప్పుగా; ధృతరాష్ట్రునకును; నీకును; అన్నదమ్ములకును; ఒసఁగున్= ఇచ్చును; ఆతఁడు; ఎపుడున్= ఎల్లపుడు; గురుజనములకున్= పెద్దలకు (అనగా గాంధారీ ధృతరాష్ట్రులకు); శుశ్రూష= సేవ; చేయంగన్= చేయటానికి; కోరున్= కోరుచుండును; కావునన్= అందువలన; కూడుట= సంధిచేసికొని వారితో కలిసియుండుట; ఒప్పు= ధర్మము (న్యాయసమ్మతము).

తాత్పర్యం: ఆ ధర్మరాజు రాజ్యభాగాన్ని ధృతరాష్ట్రుడికి, నీకు, తోడబుట్టువులకు తప్పక ఇస్తాడు. ఆ ధర్మరాజు ఎల్లప్పుడూ పెద్దలకు సేవ చేయాలనే ఉత్సాహం చూపుతూ ఉంటాడు. అందువలన సంధి చేసికొనుట న్యాయసమ్మతం.

విశేషం: ఈ పద్యం ధర్మరాజు స్వభావాన్ని తెలుపుతుంది. ధర్మరాజు రాజ్యభాగం తమ్ములకు ఇస్తాడన్న సందర్భంలో తమ్ములంటే భీమార్జున నకుల సహదేవులు.

చ. హరియును గా దనండు గరుణాన్వితులై తగ నమ్మహాత్ము లె
ప్పరుసునఁ గార్యనిశ్చయము పల్కినఁ గీచకవైరియుం బురం
దరతనయుండునుం గవలు దానికి మార్పులుకంగ నెమ్మెయిం
జొర రగు సంధియెట్లు ననసూయత నూల్కొని చేయు మిత్తఱిన్. 61

ప్రతిపదార్థం: హరియును= శ్రీకృష్ణుడును; కాదు; అనండు; ఆ మహాత్ములు; ఆ గొప్పవారు (అనగా పూజ్యులు అయిన ఆ శ్రీకృష్ణధర్మజులు); కరుణా= దయతో; అన్వితులై= కూడినవారై; ఏ+పరుసునన్= ఏ విధంగా; కార్య నిశ్చయము= సంధి కార్యంయొక్క నిర్ణయం; తగన్= ఒప్పునట్లుగా; పల్కినన్= చెప్పినా; కీచకవైరియున్= కీచకునకు శత్రువు అయిన భీముడును; పురందర= మహేంద్రునియొక్క; తనయుండునున్= కుమారుడైన అర్జునుడును; కవలు= కవలపిల్లలైన నకుల సహదేవులును; దానికిన్; మాఱు= మరొకవిధంగా; పలుకంగన్= చెప్పుటకు; ఏ+మెయిన్= ఏ విధముగాను; చొరరు= ప్రవేశించరు, ఒప్పుకొనరు; ఎట్లును= ఏ ప్రకారముగ నైనను; సంధి; అగున్= జరుగును; ఇత్తఱిన్= ఈ సమయమున; అనసూయతన్= అసూయ లేకుండా; నూల్కొని= ఒప్పుకొని; చేయుము= సంధి ప్రయత్నము చేయుము.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు కూడా సంధిని కాదనుడు. ఆ మహాత్ములైన శ్రీకృష్ణ ధర్మజులు ఏ విధంగా కార్య నిశ్చయం చేస్తారో దానికి విరుద్ధంగా భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు అడ్డుచెప్పరు. అందువలన ఈ సమయంలో అసూయ మాని సంధి ప్రయత్నం చేయుము. సంధి జరిగి తీరుతుంది.

విశేషం: కీచకుడు మత్స్యదేశాధీశుడైన. విరాటమహారాజునకు సేనాపతి. మహారాణి అయిన సుదేష్ణకు అన్నగారు. మహాబలశాలి. సూతరాజు కేకయుడి యొక్క పెద్ద భార్య మాలవిక గర్భమున, ఈ కీచకుడు, ఇతడి సోదరులు ఉపకీచకులు జన్మించారు. అజ్ఞాతవాసంలో ద్రౌపది సుదేష్ణ ఒద్ద సైరంధ్రిగా ఉన్నపుడు కీచకుడు ద్రౌపదిని మోహించి బలాత్కరించాడు. అది కారణంగా భీముడు కీచకుడిని, ఉపకీచకులను సంహరించాడు. అందువలన భీమునికి కీచకవైరి నామం సిద్ధించింది. ఈ నామం భీముడి బలపరాక్రమాలను ప్రకటిస్తున్నది. కాలేయుడనే మహాదైత్యుడి బాణముయొక్క అంశవలన కీచకుడు జన్మించాడు.

ఆ. ఇంత చెప్పు టనికి నేనోడి ప్రాణ ర । క్షణము సేసికొనుట గాదు నీకుఁ
బథ్యమనియుఁ దఱిమి పల్కితి విను విన । వేని నొచ్చి తలఁచె దిట్టులగుట. 62

ప్రతిపదార్థం: ఇంత= ఇదియంతయు; చెప్పుట; (అనగా ఇంతవరకు సంధికై నీకు హితము చెప్పుట); అనికిన్= యుద్ధమునకు; ఏను; ఓడి= భయపడి; ప్రాణరక్షణము= ప్రాణముయొక్క రక్షణము - కాపాడుటకు; చేసికొనుట= చేసికొనుటకు; కాదు (అనగా ప్రాణమును కాపాడుకొనుటకు కాదు); నీకున్= నీకును; పథ్యము= హితము; అనియున్= కలుగునని కూడ; తఱిమి= మఱిమఱి - వెంటపడి; పల్కితి= చెప్పితిని; విను; (ప్రార్థనార్థకము); వినవు= వినిపించుకొనవు; ఏనిన్= అట్లయితే; ఇట్టులు= ఈ ప్రకారముగ; అగుట= అయినందులకు; నొచ్చి= బాధపడి; తలఁచెదు= చింతిస్తావు, పశ్చాత్తాపపడతావు.

తాత్పర్యం: ఇంతవరకూ నీకు ఈ విధంగా చెప్పటానికి కారణం నేను యుద్ధానికి భయపడి కాని, నా ప్రాణాన్ని రక్షించుకొనటానికి కాని కాదు. నీకు హితం శుభం కలుగాలని చెప్పాను. నా మాట వినుము. నా ఉపదేశం విననిచో, అయ్యో! ఇట్లయినదే అని ఆవల చింతిస్తావు.

వ. అని యగ్గౌతముండు శోకాయత్తచిత్తుం డగుచుం దనకు హితోపదేశంబు సేసిన విని దుర్యోధనుండు వేఁడి నిట్టూర్పు నిగిడించి యొక్కింత సేపు చింతాక్రాంతుండై యూరకుండి వ్రాల్చిన కనుదోయి విచ్చి యవ్విప్రవరు మొగంబు సూచి యిట్లనియె. 63

ప్రతిపదార్థం: అని; ఆ+గౌతముండు= ఆ కృపాచార్యుడు; శోక= దుఃఖమునకు; ఆయత్త= అధీనము అయిన; చిత్తుండు= మనసు కలవాడు; అగుచున్= అగుచు; తనకున్; హిత= క్షేమమును కలుగచేయు; ఉపదేశంబు= బోధ; చేసినన్= చేయగా;

విని; దుర్యోధనుండు; వేఁడినిట్టూర్పు; నిగిడించి= విడిచి; ఒక్కింతసేపు= కొంచెం సమయం; చింతాక్రాంతుండై= విచారం కలిగినవాడై; ఊరకుండి= మౌనంగా ఉండి; వ్రాల్చిన= వాలియున్న; కనుదోయి= రెండు కన్నులను; విచ్చి= తెరచి; ఆ విప్రవరు మొగంబు= ఆ బ్రాహ్మణ శ్రేష్ఠునియొక్క ముఖము (ఆ కృపాచార్యుని ముఖము); చూచి; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ కృపాచార్యుడు దుఃఖంతో నిండిన మనసు కలవాడై తనకు క్షేమకరమైన బోధ చేయగా విని, ఆ దుర్యోధనుడు వేడి నిట్టూర్పును విడుస్తూ కొంచెం సేపు విచారించి, వ్రాల్చిన కన్నులను తెరచి, ఆ కృపాచార్యుడి ముఖం చూచి ఇలా అన్నాడు.

విశేషం: ఈ వచనమున తిక్కనగారు ప్రయోగించిన 'విప్రవరుమొగంబు' అను పదము సాభిప్రాయం. 'విప్ర' శబ్దం బ్రాహ్మణ సామాన్యవాచకం కాదు. 'విప్రః వేదాధ్యయన సంపన్నః' అని ఆర్యోక్తి. విప్రుడు వేదాధ్యయన సంపన్నుడైన బ్రాహ్మణుడని ఆర్య వచనం. కృపాచార్యులు విప్రవరుడు. అథర్వవేదాధ్యయనంలో వరిష్ఠుడు. అథర్వవేదమునకు ఉపవేదము అయిన ధనుర్వేదవిద్యలో పారం ముట్టినవాడు.

కృపాచార్యులవారి తండ్రి శరద్వంతుడు, ధనుర్వేదవిద్యయందు పారంగతుడు. కృపుడు తండ్రి ఒద్ద ధనుర్వేదాన్ని అభ్యసించాడు. ద్రోణాచార్యుడు మాత్రం ఈ విద్యను పరశురాముడి యొద్ద అభ్యసించాడు. తిక్కన కృపాచార్యుడిని 'విప్రవరు' డనుట కిది తాత్పర్యం. మూలంలో ఈ సందర్భమునందు - వ్యాసభగవానులు ఈ పదాన్ని ప్రయోగించలేదు.

చ. 'చెడుటకు నోర్వ కీ విటులు చెప్పితి నాకు హితంబు నెయ్య మె
క్కుడు గలయట్టి చుట్టమునకున్ నయశిక్ష దగుం గదా! భరం
పడి బవరంబులం బెనఁగు భంగిని గార్యము దెల్పఁ జాలిన
ప్పుడు నిను రక్షణార్థివని భూసురసత్తమ యే నెఱుంగుదున్!. 64

ప్రతిపదార్థం: భూసురసత్తమ!= బ్రాహ్మణులలో శ్రేష్ఠుడవైనవాడా!; చెడుటకున్= చెడిపోవుటకు; ఓర్వక= సహింపక; ఈవు= నీవు; ఇట్టులు= ఈ ప్రకారముగా; నాకున్; హితంబును= క్షేమమును గూర్చి; చెప్పితి(వి); నెయ్యము= స్నేహము; ఎక్కుడు= ఎక్కువగా; కలయట్టి= కలిగినట్టి; చుట్టమునకున్= బంధువునకు; నయశిక్ష= నీతిబోధ; తగున్= ఒప్పును; కదా!; భరంపడి= విజృంభించి; బవరంబులన్= యుద్ధములందు; పెనఁగు భంగిని= పోట్లాడునప్పుడు; కార్యము= చేయవలసిన పని; తెల్పన్+ చాలినప్పుడు= తెలియచేయవలసి వచ్చినప్పుడు; నినున్= నిన్ను; రక్షణార్థివి= రక్షణము కోరువాడవు; అని; ఏను; ఎఱుంగుదున్.

తాత్పర్యం: 'నేను చెడిపోవటం సహించలేక నీవు ఈ ప్రకారంగా నా క్షేమాన్ని గూర్చి చెప్పావు, స్నేహం ఎక్కువగా గల చుట్టానికి నీతిబోధ చేయటం ఒప్పును కదా! యుద్ధాలలో విజృంభించి పోట్లాడుకొనేటప్పుడు చేయతగిన పనిని తెలియచేయవలసి వచ్చినప్పుడు నిన్ను నా రక్షణం కోరేవాడవని - ఓ బ్రాహ్మణోత్తమా! నేను ఎరుగుదును.

వ. నీ కూర్మి పేర్మిం జేసి దొలఁగింపం జూచి సంధి కర్తవ్యంబని పలికితివి గాని యప్పలుకులు నాకు రుచియింప వెట్లంటేని. 65

ప్రతిపదార్థం: నీ కూర్మి= నీయొక్క స్నేహముయొక్క; పేర్మిన్= ఆధిక్యము; చేసి= చేత; తొలఁగింపన్= యుద్ధమునుండి తప్పింప; చూచి= తలచి; సంధి; కర్తవ్యంబు= చేయతగినపని; అని; పలికితివి= చెప్పితివి; కాని; ఆ పలుకులు= ఆ మాటలు; నాకున్; రుచియింపవు= ఇష్టము కావు; ఎట్లు= ఏ ప్రకారంగా; అంటి(వి)+ఏని= అంటావా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నీకు నాయందు గల స్నేహం, గౌరవంవలన నన్ను ఈ యుద్ధంనుండి తొలగించదలచి సంధికార్యం ఆచరణీయమని చెప్పావు. కాని ఆ మాటలు నాకు రుచించవు - ఎందువలననంటావేమో!

సీ. **కపటంపు జూదంబు ఘటియించి రాజ్యంబు । గొని ధర్మజుని మది గుందఁ జేసి**
సభ కేకవస్త్ర రజస్వల నమ్మెయిఁ । బాంచాలి ముందల పట్టి యీడ్చి
సంధిసేయఁగఁ బూని శౌరి యేతెంచిన । నవ్విధంబున నప్రియం బొనర్చి
పలువురు గూడి సౌభద్రు నొక్కని బాలుఁ । గిట్టి యత్తెఱఁగున గీటడంచి

తే. **నేఁడు దుశ్శాసనుని ఱొమ్ము, నెత్తు రనిల । సుతుఁడు మదమునఁ ద్రావుట సూచి కొఱఁత**
ప్రతిన దీర్చు నతండని భయముఁ బొంది । పొందు గోరిన నదియేల పొసగుఁ జెపుమ? **66**

ప్రతిపదార్థం: కపటంపు జూదము= మాయాద్యూతము; ఘటియించి= కల్పించి; రాజ్యంబు; కొని= తీసికొని; ధర్మజుని= ధర్మరాజుయొక్క; మది= మనసు; కుందన్= క్రుంగిపోవునట్లు చేసి; సభకున్= కౌరవసభకు; ఏకవస్త్రన్= ఏకవస్త్రను; రజస్వలన్; పాంచాలిన్; ఆ+మెయిన్= ఆ విధంగా; ముందల= ముందుతలను(జుట్టును); పట్టి= పట్టుకొని; ఈడ్చి; (లాగి); సంధి; చేయఁగన్= చేయుటకు; పూని= పూనిక వహించి(ప్రయత్నించి); శౌరి= శ్రీకృష్ణుడు; ఏతెంచినన్= రాగా; ఆ విధంబునన్= ఆ విధముగా; అప్రియంబు= అనిష్టము; ఒనర్చి= చేసి; పలువురు= అనేకులు; కూడి= కలిసి (అనగా ద్రోణ, కర్ణ, శల్య, కృప, కృతవర్మ, అశ్వత్థామాదులు అనేకులు); బాలున్= పసివానిని; సౌభద్రున్= సుభద్ర కుమారుడయిన అభిమన్యుని; ఒక్కనిన్; కిట్టి= సమీపించి; ఆ తెఱఁగునన్= ఆ విధముగ; గీటడంచి= చంపి; నేఁడు= ఈనాడు; దుశ్శాసనుని= దుశ్శాసనునియొక్క; ఱొమ్ము= వక్షఃస్థలంయొక్క; నెత్తురు= రక్తము; అనిలసుతుఁడు= వాయువు యొక్క సుతుడు, భీముడు; మదమునన్= గర్వముతో; త్రావుట; చూచి; కొఱఁత= మిగిలిపోయిన; ప్రతిన= శపథము; అతండు= ఆ భీముడు; తీర్చును= నెరవేర్చగలడు; అని; భయమున్= భీతిని; పొంది; పొందు= సంధిని; కోరినన్= అభ్యర్థించినట్లయిన; అది= ఆ సంధి; ఏల= ఎందులకు; పొసఁగున్= కుదురుతుంది; చెపుమ?= చెప్పుము?

తాత్పర్యం: మాయాజూదాన్ని కల్పించి, రాజ్యాన్ని అపహరించి ధర్మరాజు మనసు క్రుంగదీసి, నిండు కౌరవసభలో ఏకవస్త్ర, రజస్వల అయిన ద్రౌపదిని జుట్టుపట్టి ఈడ్చి, సంధి చేయటానికి వచ్చిన శ్రీకృష్ణుడికి అనిష్టం కలిగించి, ద్రోణ, కర్ణ, శల్య, కృతవర్మ, అశ్వత్థామ మొదలైన అనేకులు కూడి బాలు డయిన అభిమన్యుడిని ఒంటరివాడిని చేసి చంపించి, దుశ్శాసనుడి వక్షఃస్థలం చీల్చి భీముడు గర్వంతో నెత్తురు త్రాగటం ఈనాడు ప్రత్యక్షంగా చూచి, నీ తొడలు విరుగగొట్టి చంపుతా’ నని మిగిలిపోయిన రెండవ శపథం భీముడు నెరవేర్చగలడని భయపడి సంధికై పాండవులను అర్థిస్తే - అది ఏవిధంగా పొసగుతుంది? ఒప్పుతుంది? చెప్పుము.

ఉ. **రాజులు భక్తిఁ గొల్వఁగ ధరావలయం బఖిలంబు దర్పవి**
భ్రాజిత వృత్తి నేలి యనురక్తులఁ బ్రోచుచు శత్రుకోటికి
న్దేజము దప్పఁ జేయుచు నతిప్రమదంబున నున్న నాకు నిం
కాజియె కాక యొక్కని దయం గను రాజ్యసుఖంబు లేటికిన్? **67**

ప్రతిపదార్థం: రాజులు; భక్తిన్= భక్తితో; కొల్వఁగన్= సేవించుచుండగ; ధరావలయంబు= భూమండలము; అఖిలంబున్= సమస్తమును; దర్ప= గర్వముతో; విభ్రాజిత= ప్రకాశించుచున్న; వృత్తిన్= ప్రవర్తనతో; ఏలి= పరిపాలించి; అనురక్తులన్=

అనురాగముకలవారిని (అనగా నాయందు అనురాగము కలవారిని - నేను అనురాగముతో చూచువారిని); ప్రోచుచున్= రక్షిస్తూ; శత్రుకోటికిన్= విరోధి సముదాయమునకు; తేజము= ప్రకాశము(లేక) శక్తి; తప్పన్= తక్కువగా; చేయుచున్= చేస్తూ; అతిప్రమదంబునన్= మిక్కిలి సంతోషంతో; ఉన్న= ఉన్నటువంటి; నాకున్= నాకు; ఇంకన్; ఆజియె= యుద్ధమే; కాక; ఒక్కని= ఒకానొకడి (ఒక అల్పుడి); దయన్= దయవలన; కను= పొందెడి; రాజ్యసుఖంబులు= రాజ్యంవలన లభించు భోగములు; ఏటికిన్?= ఎందులకు?

తాత్పర్యం: రాజులందరు భక్తితో సేవిస్తుండగా ఈ సమస్త భూమండలాన్నీ గర్వంతో వెలిగే నడవడితో పరిపాలిస్తూ నాకు అనురక్తులయిన వారిని, నాయందు అనురాగం కలవారిని పోషిస్తూ శత్రుసమూహాలను శక్తిహీనులను చేస్తూ, అత్యంత సంతోషంతో ఉండే నాకు ఇంక యుద్ధమే అవశ్యకర్తవ్యం కాని, ఒకానొకడి దయవలన లభించే రాజ్యభోగాలు ఎందుకు?

విశేషం: 'ఒక్కని దయం గను రాజ్యసుఖంబు లేటికిన్' - ఈ ఒక్క మాటతో మహాకవి తిక్కన దుర్యోధనుడి హృదయాన్ని ఆవిష్కరించాడు. దుర్యోధనుడి మాటలన్నీ అతడెంతటి అభిమానధనుడో పట్టిచూపుతాయి.

వ. నిశ్చయం బిట్టిద యగుటం జేసి. 68

ప్రతిపదార్థం: నిశ్చయంబు= నిర్ణయము; ఇట్టిద= ఇదియే; అగుటంజేసి= అయినందువలన;

తాత్పర్యం: యుద్ధం చేయటమే నా నిర్ణయం అయినందువలన.

ఆ. పొడుతు నెట్లు పాండుపుత్రులతోఁ గయ్య । మేను నీవు దీనికియ్యకొనుము
పలుకు వినమి గాఁగఁ దలఁపకు ముచితంబు । తెఱఁగు ధీరజనుల కెఱుఁగరాదె? 69

ప్రతిపదార్థం: పాండు పుత్రులతోన్= పాండురాజుకుమారులతో; ఏను= నేను; కయ్యము= యుద్ధము; ఎట్లున్= ఎట్లయినను; పొడుతును= పోట్లాడుదును, చేస్తాను; దీనికి= ఈ నిర్ణయమునకు; నీవు; ఇయ్యకొనుము= అంగీకరింపుము; పలుకు= నీవు చెప్పినమాట; వినమి కాఁగన్= వినకపోవటంగా; తలఁపకుము= భావించకుము; ఉచితంబు= సరి అయిన; తెఱఁగు= మార్గం; ధీరజనులకున్= ధైర్యవంతులయిన మనుజులకు; ఎఱుఁగరాదె?= తెలియాలికదా?

తాత్పర్యం: నా నిర్ణయం పాండుపుత్రులతో యుద్ధం. నీవు దీనికి అంగీకరించాలి. నేను నీ మాట విననందులకు అన్యవిధంగా తలపవద్దు. సరి అయిన మార్గం ధైర్యవంతులైన మనుజులకు తెలియవలయును కదా!

చ. విభవమునుం బ్రతాపమును విశ్రుతకీర్తియు మాయ ధర్మపు
త్రభటసమానవృత్తమున దైన్యమునొందుట కోర్వరాదు వీ
తభయతఁ బోరఁ బేర్కొని యుదాత్తపదంబున కేఁగి భీష్మ కుం
భ భవ జయద్రథాదు లగు బంధులమిత్రులఁ గూడు టొ ప్పగున్. 70

ప్రతిపదార్థం: విభవమునున్= సమస్త సంపదయును; ప్రతాపమును= పరాక్రమమును; విశ్రుతకీర్తియున్= ప్రసిద్ధమయిన యశస్సును; మాయ= నశించిపోయేవే; ధర్మపుత్ర= యమధర్మరాజు పుత్రుడయిన ధర్మరాజుయొక్క; భట= యోధులతో; సమాన= సరితూగగలగునట్లు; వృత్తమునన్= ప్రవర్తించుటయందు; దైన్యమును= దీనత్వమును (దిక్కులేనితనమును);

ఒందుటకున్= పొందుటకు; ఓర్వన్= సహింప; రాదు; వీత= పోయిన; భయతన్= భీతితో; పోరన్= యుద్ధంలో; పేర్కొని= పిలిచి; ఉదాత్త= గొప్పదియైన; పదంబునకున్= స్థానమునకు - అనగా స్వర్గమునకు; ఏఁగి= వెళ్ళి; భీష్మ; కుంభభవ= ద్రోణుడు; జయద్రథ= సైంధవుడు; ఆదులగు= మొదలగు; బంధులన్= చుట్టములను; మిత్రులన్= స్నేహితులను; కూడుట= కలియుట; ఒప్పు= ఒప్పిదము (మంచిది); అగున్= అగును.

తాత్పర్యం: నా వైభవం, నా పరాక్రమం, నా ప్రసిద్ధమయిన కీర్తి, నిత్యం కావు, స్థిరం కావు. ధర్మపుత్రుడి యోధులతో సరితూగేటట్లు ప్రవర్తించటం దీనత్వాన్ని పొందటం సహించరానిది. అందువలన భీతిని విడిచి యుద్ధం చేయటం, స్వర్గానికి వెళ్ళి భీష్మ ద్రోణ జయద్రథాదులగు చుట్టాలను, స్నేహితులను కలియటం మంచిది అవుతుంది.

వ. అంత వలవ దిమ్మాట మగపాడి కాడితిం గాని. 71

ప్రతిపదార్థం: అంత= అంతవరకు; వలవదు= వలదు; ఈ+మాట= ఈ పలుకు; మగపాడికిన్= పురుష ధర్మము తెలియుటకు; ఆడితిన్= పలికితిని; కాని= అంతియ కాని.

తాత్పర్యం: అంతవరకు వద్దు. ఈ మాట (స్వర్గానికివెళ్ళి, భీష్మద్రోణాదులను కలియటం మంచిది అనే మాట) పురుష ధర్మం తెలియటానికి చెప్పాను కాని. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ఏను దెంపుచేసి యీ యున్నరథిక జ । నంబుతోడఁ గడఁగి నడవ బెట్టు
దఱిమి పాండురాజతనయుల మర్దింతు । ననఘ! నీవు మెచ్చునట్లు గాఁగ!' 72

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన కృపాచార్యా!; ఏను; తెంపు చేసి= సాహసం చేసి; ఈ ఉన్న= ఇక్కడ ఉన్నట్టి; రథికజనంబుతోడన్= రథ మధిరోహించి యుద్ధం చేయగల యోధులతో; కడఁగి= పూని; నడవన్= నడువగా (యుద్ధమునకు వెళ్ళగా); బెట్టు= బెడిదంగా-బాగా; తఱిమి; పారద్రోలి; పాండురాజు తనయులన్= పాండురాజు యొక్క కుమారులను; నీవు; మెచ్చునట్లు కాఁగన్= నీవు మెచ్చుకొనేవిధంగా; మర్దింతున్= చంపుతాను.

తాత్పర్యం: ఓ కృపాచార్యా! నేను సాహసం చేసి ఇక్కడ ఉన్నట్టి మహాయోధులైన రథికజనంతో యుద్ధానికి వెళ్ళి, నీవు మెచ్చుకొనేటట్లు ఆ పాండవులను తరిమి కొట్టి చంపుతాను.'

చ. అన విని చుట్టు నున్న నృపులందఱు సంతస మంది యన్నరేం
ద్రుని వినుతించి యోటమికి రోయుట నొందిన చింతవంత యె
ల్లను దిగఁ ద్రోచి నెమ్మనములన్ రణకౌతుక మావహిల్లు నా
ననములు దోఁప దర్పవచనంబుల సేనకు నుబ్బొనర్చుచున్. 73

ప్రతిపదార్థం: అనన్= అని చెప్పగా; విని; చుట్టును; ఉన్న= ఉన్నట్టి; నృపులు= రాజులు; అందఱున్; సంతసము; అంది= పొంది; ఆ+నరేంద్రుని= ఆ దుర్యోధనుని; వినుతించి= పొగడి; ఓటమికిన్= ఓడిపోయినందులకు; రోయుటన్= నిందలు పాలగుటాన్ని; ఒందిన= పొందిన; చింతన్, వంతన్= విచారాన్నీ, దుఃఖాన్నీ; ఎల్లను= అంతయును; దిగన్+ద్రోచి= వదలిపెట్టి; నెమ్మనములన్= (నెఱ+మనములన్)= నిండుహృదయాలలో; రణ= యుద్ధమునందలి; కౌతుకము= కుతూహలము; ఆవహిల్లు= కలుగునట్టి; ఆననములు= ముఖములు; తోఁపన్= కనబడగా; దర్ప= గర్వముతో కూడిన; వచనంబులన్= పలుకులతో; సేనకున్= సైన్యమునకు; ఉబ్బు= ఉత్సాహము; ఒనర్చుచున్= కలిగించుచు.

తాత్పర్యం: 'ఈ రథిక జనంతో వెడలి యుద్ధంలో పాండురాజు తనయులను సంహరిస్తానని దుర్యోధనుడు చెప్పగా విని, చుట్టు గుమిగూడి ఉన్న రాజులందరు సంతోషం పొంది, దుర్యోధనుడిని పొగడి, ఓటమివలన కలిగిన నిందను పొందినందువలన ఏర్పడిన సమస్త దుఃఖాన్ని, బాధను విడిచిపెట్టి నిండు మనసులలో యుద్ధ కుతూహలం కలిగినట్టి ముఖాలు గోచరించగా గర్వంతో కూడిన పలుకులతో సైన్యానికి ఉత్సాహం కలిగిస్తూ. (తరువాతి, వచనంతో అన్వయం.)

దుర్యోధనుఁడు శిబిరంబు విడిచి సరస్వతీతీరంబు చేరుట (సం. 9-4-49)

వ. చెలంగిన కృపకృతవర్మాశ్వత్థామ శకుని శల్యులు గార్యంబు విచారించి కౌరవేశ్వరు నాలోకించి 'మనమీరాత్రి శిబిరంబున నిద్రించుట యొప్పదెట్లనినఁ గర్ణుందెగటార్చుటం జేసి పేర్చినయుబ్బునఁ బాండవులు పైకొని పరాక్రమింప నప్పళింపఁ గలుగుఁ బో యని తలంచెదము. వినుము వంచనఁ దొలంగియుండి మనకుం గల చతురంగంబుల నాయితంబు సేసికొని పెనఁకువం బన్ని వారికి వెఱఁగగునట్టి బెట్టిదంపుటురవడిం గదిసి రణంబు సేయుద మట్లైన జయంబు గొనవచ్చు' నని చెప్పిన నవ్వసుమతీపతి ప్రీతుండై యది లెస్స వెర వట్ల చేయుదమని సముచితభంగిం దగువారల కెఱింగించి కదలి యచటికి రెండామడ యగు సరస్వతిపొంతం బయలికి బలంబులం గొని చని సకలజనవాహనసహితంబుగా నమ్మహానదియం దిచ్ఛానురూపస్నానపానంబు లాచరించి వలయు తెఱంగున వెనుక నడతెంచిన వివిధాహారంబులం దుష్టిఁ బొంది యిష్టాలాపంబులు సెల్లుచుండ నున్న సమయంబున ము న్నాకర్ణంబు నడపిన దొరలును జిత్రసేనాది భవత్కుమారులును గర్ణుకొడుకు సత్యసేనుండును లోనైన యాప్తజనంబు లమ్మనుజనాథున కి ట్లనిరి. **74**

ప్రతిపదార్థం: చెలంగినన్= (రాజులు) విజృంభించగా; కృప= కృపుడు; కృతవర్మ; అశ్వత్థామ; శకుని; శల్యులు - ఈ అయిదుగురు; కార్యంబున్= చేయవలసి పనిని; విచారించి= బాగుగ ఆలోచించి; కౌరవేశ్వరున్= దుర్యోధనుడిని; ఆలోకించి= చూచి; మనము; ఈ రాత్రి; శిబిరంబునన్= శిబిరమునందు (సైన్యముండుచోటు); నిద్రించుట; ఒప్పదు= మంచిదికాదు; ఎట్లు; అనినన్; కర్ణున్= కర్ణుని; తెగటార్చుటన్= సంహరించటం చేత; పేర్చిన= విజృంభించిన; ఉబ్బునన్= సంతోషముతో; పాండవులు; పైకొని= మీదపడి; పరాక్రమింపన్= పరాక్రమము చూపుటకు; అప్పళింపన్= ప్రయత్నము; కలుగున్ పో= జరుగవచ్చునో; అని; తలంచెదము; వినుము; వంచనన్= మోసమునుండి; తొలంగి= తప్పించుకొని; ఉండి; మనకున్= మనకు; కల= ఉన్నట్టి; చతురంగంబులన్= చతురంగ బలములను (అనగా రథబలము- గజబలము- తురంగబలము - పదాతిబలము. ఈ నాలుగు సైన్యములందు గల బలములు.) ఆయితంబు= సిద్ధము; చేసికొని; పెనఁకువన్= యుద్ధమునకు; పన్ని= వ్యూహరచనచేసి; వారికిన్= వారికి అనగా పాండవులకు; వెఱఁగు= ఆశ్చర్యం; అగునట్టి= కలిగించునట్టి; బెట్టిదంపు= ఉద్ధతమగు; ఉరవడిన్= వేగముతో; కదిసి= ఢీకొని; రణంబు= యుద్ధం; చేయుదము; అట్లు= ఆ ప్రకారముగా; ఐన= అయిన ఎడల(అనగా చేసినచో); జయంబు= విజయము; కొనవచ్చున్= పొందవచ్చును; అని; చెప్పినన్; ఆ వసుమతీ పతి= భూమికి భర్త అయిన ఆ దుర్యోధనుడు; ప్రీతుండై= సంతోషించినవాడై; అది= ఆ పద్ధతి; లెస్స= ఆమోదయోగ్యమయిన; వెరవు= ఉపాయము; అట్ల= ఆ ప్రకారముగానే (నిర్ధారణార్థకము); చేయుదము; అని; చెప్పి; సముచితభంగిన్= తగినవిధముగా; తగు= అర్హమైన; వారలకున్; ఎఱింగించి= తెలియజేసి; కదలి= బయలుదేరి; అచటికిన్; రెండు; ఆమడ= ఆమడ దూరము; అగు= కలుగు; సరస్వతి పొంతన్= సరస్వతీ నదీతీరముయొక్క సమీపమున; బయలికిన్= బహిరంగప్రదేశమునకు; బలంబులన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సేనలను; కొని= తీసికొని; చని= వెళ్ళి; సకల జనవాహన సహితంబుగాన్; సకల= సమస్తమయిన; జన= జనులతో; వాహన= వాహనముల; సహితంబుగాన్= కూడినవాడై; ఆ+మహానదియందు= ఆ గొప్పనదియందు (అనగా ఆ పవిత్రమయిన నదియందు); ఇచ్ఛా= ఇష్టమునకు; అనురూప= అనుగుణమయిన; స్నాన, పానంబులు= స్నానపానములు; ఆచరించి= చేసి; వలయు= కావలసిన; తెఱంగునన్= విధంగా; వెనుకన్= తన వెంట; నడతెంచిన= తమతోపాటు తీసికొనివచ్చిన; వివిధ= పలు రకములయిన; ఆహారంబులన్= తినుబండారాలను; తుష్టిన్= సంతప్తితో; పొంది; ఇష్ట= ప్రియమయిన; ఆలాపంబులు= సంభాషణములు; చెల్లుచుండన్= కొనసాగుచుండగా; ఉన్న; సమయంబునన్= కాలమున; మున్ను= ఇంతకుముందు; ఆ కర్జంబు= ఆ పని; నడిపిన= చేసిన; దొరలును= యోధవరులును అనగా కృప కృతవర్మాశ్వత్థామ శకుని శల్యులు; చిత్రసేన= చిత్రసేనుడు; ఆది= మొదలగు; భవత్= నీయొక్క కుమారులును= కొడుకులును; కర్ణుకొడుకు= కర్ణుని కుమారుడు; సత్యసేనుండును; లోనైన= ఈ మొదలైన; ఆప్తజనంబులు= సన్నిహితులైన మనుజులు (అనగా బంధువులు); ఆ+మనుజ నాథునకున్= మనుజులకు ప్రభువు అయిన దుర్యోధనునకు; ఇట్లు= ఈ ప్రకారముగా; అనిరి= చెప్పిరి.

తాత్పర్యం: విజృంభించిన కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ, శకుని, శల్యులు అటు తరువాత చేయవలసిన పనిగురించి బాగుగా ఆలోచించి, ఆ దుర్యోధనుడిని చూచి 'మనం ఈ రాత్రి శిబిరంలో నిద్రించటం మంచిది కాదు. ఎందువలనంటే కర్ణుడిని సంహరించటం వలన కలిగిన సంతోషంతో పాండవులు మీదపడి ఆక్రమించటానికి ప్రయత్నించవచ్చు నేమో అని ఆలోచిస్తున్నాము. అందువలన వినుము. మోసమునుండి తప్పించుకొని ఉండి మనకు గల చతురంగ బలాలను సిద్ధం చేసికొని, యుద్ధవ్యూహాన్ని రచించి, ఆ పాండవులకు ఆశ్చర్యం కలిగేటట్లు ఉద్ధతమైన వేగంతో ఢీకొని యుద్ధం చేద్దాము. అట్లా చేస్తే విజయం గైకొనవచ్చును-' అని చెప్పగా, ఆ దుర్యోధనుడు సంతోషించినవాడై 'అది ఆమోదయోగ్యమయిన ఉపాయం. అట్లే చేద్దాము.' అని చెప్పి, తగిన విధంగా అర్హమయిన వారికి తెలియచేసి బయలుదేరి అక్కడికి రెండామడల దూరంలో ఉన్న సరస్వతీనది సమీపంలో బహిరంగ ప్రదేశానికి సేనలను తీసికొని వెళ్ళి సమస్త జనులతో, వాహనాలతో కూడుకొనినవాడై ఆ మహానదిలో ఇష్టానుసారంగా స్నానపానాదులు కావించి, కావలసిన విధంగా తమవెంట తెచ్చిన పలురకాలయిన ఆహారాలను భుజించి సంతృప్తిని చెంది, ప్రియమైన సరససల్లాపాలు కొనసాగిస్తూ ఉండగా, అట్టి సమయంలో ఇంతకుముందు చెప్పిన యోధవరులు (కృపాచార్య కృతవర్మాశ్వత్థామ శకుని శల్యులు, చిత్రసేనాదు లయిన నీ కుమారులు, కర్ణుడి కుమారుడు సత్యసేనుడు మొదలయిన ఇష్టజనులు) ఆ దుర్యోధనుడితో ఈ ప్రకారంగా చెప్పారు.

విశేషం: చిత్రసేనుడు: ఇతడు ధృతరాష్ట్రుడి నూర్గురు పుత్రులలో ఒకడు. ఇతడికి సత్యసంధుడనే మరొక పేరు ఉన్నది. ధృతరాష్ట్రుడి వందమంది పుత్రులలో సత్యసేను డనే పేరుగల పుత్రుడు కూడ ఉన్నాడు. అతడుకూడా ధృతరాష్ట్రుడి పుత్రులలో గల పదకొండుమంది మహారథులలో ఒక మహారథి. అందువలన ధృతరాష్ట్రపుత్రుడు సత్యసేనుడికి, కర్ణుడి పుత్రుడు సత్యసేనుడికి భేదం తెలియటానికి 'కర్ణుకొడుకు సత్యసేనుండు' అని ప్రత్యేకంగా చెప్పబడిందని గ్రహించాలి.

చ. **'వెరవును లావునుం గలిగి విక్రమసంపద సొంపు మీఱి భూ**
వర భవదీయమైన బలవర్గము నొద్దన మేర్ప వీఁకమైఁ
బురికొలుపంగ నిర్భయతఁ బోరెడు నట్లుగఁ దాను ముందరై
తిరముగఁ జేయఁ జాలు నొకధీరు నొనర్పుము సైన్యనాథుఁగన్.' **75**

ప్రతిపదార్థం: భూవర!= రాజులలో శ్రేష్ఠుడవైన దుర్యోధనా!; వెరవును= ఉపాయమును; లావునున్= బలమును; కలిగి= కలిగి ఉండి; విక్రమ= పరాక్రమముయొక్క; సంపదన్= ఐశ్వర్యంయొక్క; సొంపు= సమృద్ధిని; మీఱి= అతిక్రమించి; భవదీయము= నీకు సంబంధించినది; ఐన= అయినటువంటి; బలవర్గమును= సైన్యసమూహమును; ఒడ్డనము= వ్యూహముగ; ఏర్పన్= ఏర్పరచగల; వీఁకమైన్= పరాక్రమముతో; పురికొలుపంగన్= ఉద్రేకము పుట్టించగల; నిర్భయతన్= భయము లేకుండగ; పోరాడునట్లుగన్= యుద్ధముచేయునట్లుగ; తాను= తానే; ముందరై= ముందుగా ఉండి (అగ్రభాగమున ఉండి); తిరముగన్= స్థిరముగ; చేయన్= యుద్ధము చేయుటకు; చాలు= సమర్థుడై; ఒక; ధీరున్= ధైర్యశాలిని; సైన్యనాథుఁగన్= సేనకు అధిపతినిగ; ఒనర్పుము= చేయుము.

తాత్పర్యం: 'రాజశ్రేష్ఠుడవైన దుర్యోధనా! ఉపాయబలం కలిగి ఉండి, పరాక్రమ సంపద సమృద్ధిగా ఉండి, నీ సైన్య సమూహంతో వ్యూహాన్ని ఏర్పరచి, పరాక్రమంతో ఉద్రేకాన్ని పుట్టించి, నిర్భయంగా యుద్ధం చేయటానికి సమర్థుడైన ఒక ధైర్యశాలిని సైన్యాధిపతిగా చేయుము.'

వ. అనిన విని వృషస్కంధుండును పీనదీర్ఘభుజార్గళుండును భర్గవరలబ్ధజన్ముండును దివ్యాస్త్రవేదియు నవ్యాహతవిక్రమోద్దాముండును నగు నశ్వత్థామ నాలోకించి యాదరభరితుండగుచు నాధరణీవరుండతని కిట్లనియె. 76

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని; వృష= ఎద్దుమూపువంటి; స్కంధుండును= భుజముల మధ్యభాగం కలవాడును; పీన= ఉబ్బిన (లేక) బలిసిన; దీర్ఘ= పొడవైన; భుజా+అర్గళుండును= గడియమ్రాకులవంటి భుజములుకలవాడును (పూర్వము తలుపులకు పెట్టుకొను గెడ - గట్టిగా లావుగా - పొడవుగా ఉండెడిది. దానికి గడియమ్రాను అనిపేరు. దీనినే అర్గళమందురు.); భర్గ= శివునియొక్క; వర= వరము వలన; లబ్ధ= పొందిన; జన్ముండును= పుట్టుక కలవాడును; దివ్య= దేవతలకు సంబంధించిన; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములను గూర్చి; వేదియును= తెలిసినవాడును; అవ్యాహత= అడ్డులేని విధంగా; విక్రమ= పరాక్రమంచేత; ఉద్దాముండును= గొప్పవాడును; అగు= అయినటువంటి; అశ్వత్థామను; ఆలోకించి= చూచి; ఆదర= గౌరవభావముతో; భరితుండు= నిండిన హృదయము కలవాడు; అగుచున్= అగుచు; ఆ ధరణీ వరుండు= భూమికి భర్త అయిన ఆ దుర్యోధనుడు; అతనికిన్= అతడికి - అనగా ఆ అశ్వత్థామతో; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: వృషము మూపు వంటి మూపుకలవాడూ, ఉబ్బుగా ఎత్తుగా పొడవుగా గడియమ్రానువంటి భుజాలు కలవాడూ, శివుడివరం వలన పుట్టినవాడూ, దివ్యాస్త్రాలను తెలిసినవాడూ, అడ్డులేని పరాక్రమంతో భయంకరుడు - అయిన అశ్వత్థామను దుర్యోధనుడు చూచి ఆదరపూర్వకంగా ఇలా అన్నాడు.

ఆ. 'అనఘ! నీవు నాకు నాచార్యునట్లు । నేడుగడయుఁ గాన హితము సెప్పఁ
దగు బలాధినాథుఁడుగఁ జేయ నర్హుని । నెల్ల వినఁగ నిశ్చయింప వలయు.' 77

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! అనగా పూజ్యుడా!; నీవు; నాకున్; ఆచార్య= ద్రోణాచార్యుని; అట్టులన్= ఆ విధముగ; ఏడుగడయున్= రక్షకుడవు; కానన్= కావున; హితము= క్షేమము(లేక)శుభము; చెప్పన్= చెప్పుటకు; తగున్= తగినవాడవు; బల= సైన్యమునకు; అధినాథుడుగన్= అధిపతిగ; చేయన్= చేయుటకు; అర్హునిన్= యోగ్యతకలవాణ్ణి; ఎల్లన్= అందరు; వినఁగన్= వినునట్లుగ; నిశ్చయింపన్= నిర్ణయించగా; వలయున్= వలయును. (అనగా నిర్ణయించుము.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఓ పూజ్యుడా! నీవు నాకు ద్రోణాచార్యులవంటి రక్షకుడవు. నాకు క్షేమాన్ని, శుభాన్ని చెప్పటానికి తగినవాడవు. అందువలన సైన్యాధిపతిగా యోగ్యత కలవాడిని అందరు వినేటట్లు నిర్ణయించుము.

చ. **అనుటయు నాతఁడిట్టులను 'సజ్జనపాలున కాజి నైపుణం**
బున మహనీయశౌర్యమును భూరిబలంబును సర్వసత్త్వవే
దనముఁ బరాక్రమోద్ధతియు ధైర్యసమగ్రతయుం గలండు శ
ల్యుని రథినీపతిత్వమహిమోజ్జ్వలుఁ జేయుము కౌరవేశ్వరా! **78**

ప్రతిపదార్థం: అనుటయున్= ఇట్లు చెప్పగా; ఆ జన పాలునకున్= రాజైన ఆ దుర్యోధనునకు; ఆతఁడు= ఆ అశ్వత్థామ; ఇట్టులు= ఈ ప్రకారముగా; అనున్= అనెను; కౌరవేశ్వరా!; ఆజిన్= యుద్ధమునందు; నైపుణంబును= నేర్పరితనమును; మహనీయ= మిక్కిలి గొప్పది అయిన - అనగా శ్రేష్ఠమయిన; శౌర్యమును= పరాక్రమమును; భూరి= అధికమయిన; బలంబును= శక్తియును; సర్వసత్త్వ వేదనమును= సమస్తమైన సేనాబలాలకు బాధ కలిగించటమూ; పరాక్రమ= పరాక్రమమునందు; ఉద్ధతియున్= దర్పమును; ధైర్య= ధీరత్వమునందు; సమగ్రతయున్= సంపూర్ణత్వమును; కలండు= కలిగియున్నట్టి; శల్యుని; రథినీ= సైన్యమునకు; పతిత్వ= అధిపతిత్వముయొక్క; మహిమ= గొప్పతనముచే; ఉజ్జ్వలున్= ప్రకాశవంతుని; చేయుము.

తాత్పర్యం: దుర్యోధనుడు సేనాపతిత్వానికి అర్హుడిని నిర్ణయించుమని అశ్వత్థామను కోరగా, అశ్వత్థామ ఆ దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు: 'ఓ కౌరవేశ్వరా! దుర్యోధనా! యుద్ధవిద్యయందు నేర్పరితనం కలవాడు, శ్రేష్ఠమైన శౌర్యపరాక్రమాలు కలవాడు, ఎవరెవరి శక్తి ఏ పాటిదో తెలిసి సేనాబలాలను బాధించగలవాడు, పరాక్రమ దర్పం, సంపూర్ణమయిన ధైర్యం కలవాడు అయిన శల్యుడిని సైన్యాధిపతిగా అభిషిక్తుడిని చేయుము.

క. **నినుఁబట్టి పాండుపుత్రులఁ । దన మేనల్లురఁ దొఱంగె ధరణీశ్వర! యీ**
తనిఁగడచిన పరమహితులు । మనకుఁ గలరె? యితఁడు లోకమాన్యుఁడు గాఁడే? **79**

ప్రతిపదార్థం: ధరణీశ్వర!= భూమికి ప్రభువు అయిన దుర్యోధనా!; నినున్= నిన్ను; పట్టి= చేకొని; (నినున్ పట్టి= నీగురించి); తన మేనల్లురన్= చెల్లెలి కుమారులైన; పాండుపుత్రులన్= పాండురాజు కుమారులయిన నకుల సహదేవులను; తొఱంగెన్= విడిచిపెట్టాడు; ఈతనిన్= ఈతనిని అనగా శల్యుని; కడచిన= మించిన; పరమహితులు= మిక్కిలి మేలు కోరేవారు; మనకున్= మనకు; కలరె?= ఉన్నారా?; ఇతఁడు= ఈ శల్యుడు; లోక= లోకముచేత అనగా ప్రజలచేత; మాన్యుఁడు= పూజింపదగినవాడు; కాఁడే?= కాడా?; (పూజింపదగినవాడని తాత్పర్యము.)

తాత్పర్యం: ఓ దుర్యోధనా! నీ వలన ఇతడు తన మేనల్లురు అయిన పాండవులను వదలి వచ్చాడు. ఇంతకు మించిన గొప్పవారు కాని, మన హితం కోరేవారు కాని మనకు లేరు. ఈ శల్యుడు లోకపూజ్యుడు సుమా!

తే. **కార్తికేయుం డధీశుఁడుగా నమర్త్యు । లెలమిఁ బురికొని దైత్యుల గెలుచుకరణి**
మద్రవిభుఁ డగ్రణిగఁ నేచి మనము నడచి । కడిఁది పగఱ జయింతము కౌరవేంద్ర!' **80**

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= కౌరవులకు ప్రభువు అయిన దుర్యోధనా!; కార్తికేయుండు= కుమారస్వామి; అధీశుఁడుగాన్= అధిపతిగా (దేవసేనకు అధిపతిగ); అమర్త్యులు= దేవతలు; (మృత్యువు కలవారు మర్త్యులు - మృత్యువులేని వారు అమర్త్యులు); ఎలమిన్= సంతోషముతో; పురికొని= ఉద్రేకించి; దైత్యులన్= రాక్షసులను; గెలుచు= జయించు; కరణిన్=

విధముగా; మద్రవిభుఁడు= మద్రదేశ ప్రభువు అయిన శల్యుడు; అగ్రణిగన్= అధిపతిగ - (లేక) ప్రధానుడుగా (లేక) ముఖ్యుడిగా; ఏచి= విజృంభించి; మనము; నడచి= యుద్ధమునకు వెళ్ళి; కడిఁది పగఱన్= జయింపనలవికాని శత్రువులను; జయింతము= జయించగలము.

తాత్పర్యం: ఓ దుర్యోధనా! కుమారస్వామి సేనాధిపతిగా దేవతలు ఉద్రేకించి రాక్షసులను జయించిన విధంగా మద్రదేశపు ప్రభువు అయిన శల్యుడిని సేనాధిపతిగా చేసి విజృంభించి యుద్ధంలో శత్రువులను జయించగలము.

విశేషం: అలం: ఉపమ. కార్తికేయుడు: సప్తర్షిమండలానికి ఎదురుగా మధ్యాకాశంలో మనకు ఆరు నక్షత్రాల గుంపు కనిపిస్తుంది. జానపదులు వాటిని పిల్లలకోడి చుక్కలంటారు. జ్యోతిశ్శాస్త్రంలో వాటిని కృత్తికలు అంటారు. ఆధునిక పదార్థ విజ్ఞనశాస్త్రజ్ఞులు - వాటిని - కోట్లాది అగ్ని నక్షత్రాల మండలం అంటారు. సప్తమహర్షుల పత్నులలో ఒక్క వసిష్ఠపత్ని అరుంధతి తప్ప మిగిలిన మహర్షిపత్నులందరిని భర్తలు శపించగా వీరికి పరమశివుడు నక్షత్రమండలంలో స్థానం కల్పించాడనీ, వీరే ఆరు నక్షత్రాలుగా వెలుగుతున్నారనీ అంటారు పౌరాణికులు. ఈ కృత్తికలను తల్లులుగా స్వీకరించి నందున కుమారస్వామికి కార్తికేయు డనే పేరు వచ్చింది.

వ. అనిన విని సమస్త జనపతులును 'జయ జయ' శబ్దంబులతో శల్యం బరివేష్టించి సంగరోత్సాహంబునం బొంగిరి. కురునాథుండును గద్దియ డిగి సవినయంబున నమ్మద్రవిభున కభిముఖుండై యిట్లనియె. 81

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; సమస్త= సమస్తమయిన; జనపతులును= రాజులును; జయ జయ= 'జయ జయ'అను; శబ్దంబులతోన్= ధ్వనులతో; శల్యున్= శల్యుడిని; పరివేష్టించి= చుట్టునుమూగి; సంగర= సంగ్రామమునందలి; ఉత్సాహంబునన్= ప్రయత్నముతో; పొంగిరి= సంతోషించిరి; కురునాథుండును= దుర్యోధనుడును; గద్దియ= ఆసనము; డిగి= దిగి; సవినయంబునన్= వినయసహితముగా అనగా వినమ్రత కలిగినవాడగుచు; ఆ+మద్రవిభునకున్= మద్రదేశ ప్రభువు అయిన ఆ శల్యుడికి; అభిముఖుండై= ఎదురు మొగము కలవాడై; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: మద్రవిభుడిని సేనాపతిగా చేస్తే శత్రువులను జయించగలమని అశ్వత్థామ చెప్పగా విని, రాజులందరు జయజయధ్వానాలతో శల్యుడిని చుట్టుముట్టి యుద్ధోత్సాహంతో పొంగిపోయారు. దుర్యోధనుడు కూడా గద్దె దిగి శల్యుడికి అభిముఖంగా నిలబడి వినమ్రతతో ఈ ప్రకారంగా పలికాడు.

ఉ. పొచ్చెము లేని నెయ్యమునఁ బూని విపద్దశనొందకుండఁగా
నెచ్చెలిఁగావఁ జూచు మహనీయున కిట్టిద కాల మిప్పు డీ
వచ్చుపడంగ నీ భుజబలాతిశయంబున నద్భుతంపు గె
ల్పిచ్చి కృతార్థుఁ జేయు నను నే నినుఁ జెందియుఁ దూలఁ బోదునే? 82

ప్రతిపదార్థం: పొచ్చెము= కపటము; లేని= లేనట్టి; నెయ్యమునన్= స్నేహము వలన; పూని= ఉద్యమించి (లేక) ప్రయత్నించి; విపద్= ఆపదతో కూడిన; దశన్= అవస్థను; ఒందకుండఁగాన్= పొందకుండగ; నెఱ+చెలిన్= నెచ్చెలిన్= మంచి మిత్రుని; కావన్= రక్షింప; చూచు= చూచెడి; మహనీయునకున్= గొప్పవానికి; ఇట్టిది+అ= ఇటువంటిదే (అవధారణార్థము); కాలము= సమయము; ఇప్పుడు; (ఈ సమయమున); ఈవు= నీవు; నీ భుజబలాతిశయంబునన్; నీ= నీయొక్క; భుజ= భుజములయొక్క; బల= పరాక్రమముయొక్క; అతిశయంబునన్= విజృంభణంతో; అచ్చుపడంగన్= స్పష్టపడేటట్లుగా; అద్భుతంపు=

ఆశ్చర్యకరమయిన; గెల్పు= విజయము; ఇచ్చి= సమకూర్చి; ననున్= నన్ను; కృతార్థున్= కృతకృత్యుని; చేయు= చేయము; నినున్= నిన్ను; ఏన్= నేను; చెందియున్= పొందియుండి కూడ; తూలఁబోదునే?= నశిస్తానా?

తాత్పర్యం: కపటం లేని స్నేహం కారణంగా ఉద్యమించి ఆపద పొందకుండ నెచ్చెలిని కాపాడే మహనీయుడికి ఇదే మంచి సమయం. ఇప్పుడు నీ భుజబలంతో విజృంభించి ఆశ్చర్యకరమయిన విజయాన్ని సమకూర్చి నన్ను కృతార్థుడిని చేయగల నిన్ను నేను పొంది ఉండి కూడా నష్టపోతానా?

క. పూనుము చమూపతిత్వము । నా నమ్మినవారు నేను నరవర బలసం
తానంబుతోడఁ బరిజన । మై నడచెద మాక్రమింపు మరివర్గంబున్.' **83**

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; చమూ= సైన్యమునకు; పతిత్వము= అధిపతిత్వమును; పూనుము= వహింపుము; నా నమ్మినవారు= నన్ను నమ్ముకొని ఉన్నవారు; నేను; నరవర= రాజశ్రేష్ఠులయొక్క; బల= సైన్యములయొక్క; సంతానంబుతోడన్= సమూహముల తోడను; పరిజనమై= సేవకులమై; నడచెదము= యుద్ధమునకు వెడలెదము; అరి= శత్రువులయొక్క; వర్గంబున్= సమూహమును; ఆక్రమింపుము= జయించుము.

తాత్పర్యం: శల్య మహారాజా! సైన్యాధిపత్యం వహించుము. నేనూ, నన్ను నమ్మినవారు నీ సేవకులమై నీ వెంట నడుస్తాము. అందరము కలిసి యుద్ధానికి రాగలము. శత్రుసమూహాన్ని జయించుము.'

చ. అన విని శల్యుఁ డిట్లనియె 'నమ్మనుజేంద్రును కిప్పు డింత ప్రా
ర్థన మొనరింప నేల? వసుధావర! యే నినుఁ జేరి నప్డ నా
ధనమును బ్రాణమున్ బలవితానము నీకు సమర్పణంబు సే
సినయవి గావె? నీ పనుపు సేసెదఁ గౌరవసేనఁ గాచెదన్. **84**

ప్రతిపదార్థం: అనన్= అనగా; విని; శల్యుఁడు; ఇట్లు= ఈ విధంగా; మనుజ= మానవులకు; ఇంద్రునకున్= ప్రభువు అయిన ఆ దుర్యోధనుడికి; అనియెన్= చెప్పెను; ఇప్పుడు; ఇంత; ప్రార్థనము= వేడుకొనటం; ఒనరింపన్= చేయగ; ఏల?; వసుధావర!= భూమికి భర్తఅయిన దుర్యోధనా!; ఏన్= నేను; నినున్= నిన్ను; చేరినప్డు+అ= కూడినప్పుడే; నా= నాయొక్క; ధనమును= సంపదయును; ప్రాణమును; బలవితానమున్= సైన్య సమూహమును అనగా నా సర్వస్వమును; నీకున్; సమర్పణంబు= నీ పరము; చేసినయవి= చేయబడినవి; కావె?= కావా?; నీ పనుపు= నీవు నియోగించిన పనిని; చేసెదన్= చేయుదును; కౌరవసేనన్= కురుసైన్యమును; కాచెదన్= రక్షించెదను.

తాత్పర్యం: అని చెప్పగా విని, శల్యుడు ఆ మనుజేంద్రుడయిన దుర్యోధనుడితో ఈ విధంగా అన్నాడు. 'ఇంత ప్రార్థన మెందుకు? నేను నీ పక్షంలో చేరినప్పుడే నా ధనాన్నీ ప్రాణాన్నీ - సైన్యసమూహాన్నీ, నా సర్వస్వాన్నీ నీకు సమర్పించాను. నీవు నియోగించిన పనిని చేస్తాను. కురుసైన్యమును రక్షిస్తాను.

మ. భుజవీర్యంబున నచ్యుతార్జునులు నన్ బోలంగ లే రల్క వ
చ్చి జయింపంగఁ గడంగినన్ సురలు నాచే నొత్తు రే నేచి య
క్కజపుంజేవయు లావు జూపువడికిం గౌంతేయులే యోర్తు రా
ప్రజయున్ నీ ప్రజయుం దలంగఁ జెలఁగం బాటింతు నాటోపమున్. **85**

ప్రతిపదార్థం: భుజవీర్యంబునన్= భుజబలపరాక్రమమునందు; అచ్యుత+అర్జునులు= అచ్యుతార్జునులు= శ్రీకృష్ణార్జునులు; నన్= నన్ను; పోలంగన్= సరిపోవగ; లేరు; అల్క= కోపము; వచ్చి; జయింపఁగన్= గెలుచుటకు; కడంగినన్= పూనుకొనినచో; సురలు= దేవతలు; నాచేన్= నాచేత; నొత్తురు= బాధచెందగలరు; ఏన్= నేను; ఏచి= విజృంభించి; అక్కజపున్= ఆశ్చర్యకరమయిన; చేవయున్= ధైర్యమును; లావున్= బలమును; చూపు= చూపించెడి; వడికిన్= వేగమునకు; కౌంతేయులే(లా)= కుంతీకుమారులా; ఓర్తురు= సహిస్తారు లేదా ఓడిస్తారు?; ఆ ప్రజయున్= ఆ ప్రజలును; నీ ప్రజయున్= నీ ప్రజలును; తలంగన్= తొలగిపోవునట్లుగ; చెలఁగన్= సంతోషించునట్లుగా; ఆటోపమున్= విజృంభణమును; పాటింతున్= ఆచరించి చూపిస్తాను.

తాత్పర్యం: భుజ బల పరాక్రమంలో శ్రీకృష్ణార్జునులు నాతో సరి సమానులుకారు. నేను కోపం వచ్చి జయించటానికి పూనుకుంటే దేవతలు కూడా నాచేత బాధింపబడుతారు. నేను విజృంభించి ఆశ్చర్యకరమయిన ధైర్యసాహస శౌర్యాలు చూపితే ఆ కౌంతేయులా సహించువారు? కావున పాండవసేనలు పారిపోయేటట్లుగా, కౌరవసేనలు సంతోషించేటట్లుగా, నా గర్వాన్ని, ప్రతాపాన్ని చూపిస్తాను.

విశేషం: ఆ ప్రజయున్ తలంగన్. ఈ ప్రజయున్ చెలంగన్ - అని క్రమాన్వయం. దేవతలు సహితం నాచే బాధింపబడతారంటే, ఇంక ఆ పాండవులా సహించగలవారు? లేదా ఓడించగలవారు? ఓడు= ఓడిపోవు, ఓడుచు= ఓరుచు= ఓడించు; ఓరుచు+దురు= ఓర్తురు; ఓడిస్తారు; ఓర్చు= సహించు - ఓర్చుదురు= ఓర్తురు= సహిస్తారు.

చ. **అఱిముఱి బాణజాలముల నక్కడి సైనికులం దెరల్చెదన్**
గుఱుకొని నాకు మాఱుకొని కోల్తలఁ జేసిన వీరవర్గమున్
నఱికెదఁ జూచు ఖేచరగణంబుల కచ్చెరుపా టొనర్చెదన్
బఱపెదఁ బాండునందనులఁ బాఱక నిల్చిన రూ పడంచెదన్. **86**

ప్రతిపదార్థం: అఱిముఱి= త్వరత్వరగా; బాణ= అమ్ములయొక్క; జాలములన్= వరుసలతో; అక్కడి= ఆ చోటునందున్న; సైనికులన్= సేనలను; తెరల్చెదన్= తొలగించెదను; కుఱుకొని= యత్నించి; నాకున్; మాఱుకొని= ఎదుర్కొని; కోల్తలన్= ఎదుట నిలిచి యుద్ధమును; చేసిన; వీర= శూరులయొక్క; వర్గమున్= సమూహమును; నఱికెదన్= ఖండించెదను; చూచు= చూచుచుండెడి; ఖే= ఆకాశమున; చర= సంచరించెడి దేవతలయొక్క; గణంబులకున్= గుంపులకు; అచ్చెరుపాటు= ఆశ్చర్యము; ఒనర్చెదన్= కలిగిస్తాను; పాండునందనులన్= పాండురాజు కుమారులను; పఱపెదన్= పాఱిపోవునట్లు చేసెదను; పాఱక= పాఱిపోకుండ; నిల్చినన్= నిలిచి ఉన్నచో; రూపు= రూపమును; అడంచెదన్= నశింపచేసెదను.

తాత్పర్యం: యుద్ధభూమియందలి సైనికులను తొందర తొందరగా బాణాల వరుసలను ప్రయోగించి తొలగిస్తాను. నాకు దగ్గరపడి నన్ను ఎదుర్కొని ఎదుట నిలిచి యుద్ధం చేసే వీర వర్గాన్ని ఖండిస్తాను. దివినుండి చూచే దేవ గణాలు ఆశ్చర్యపడేటట్లు చేస్తాను. పాండుకుమారులను పారద్రోలుతాను. పారిపోకుండా నిలిచి ఉంటే సంహరిస్తాను.

శా. **గంగానందను పోటు మెచ్చక గురుం గాదంచు రాధాతనూ**
జుం గీడాడుచు నీతఁ డెవ్వఁ డొకో యంచున్ శల్యుఁడే! యిట్టి వా
నిం గయ్యంబుల మున్నుగాన మనుచు న్వేభంగులం జూప టె
ల్లం గీర్తింప ధనుఃకళానిపుణలీలాఖేలతన్ జూపెదన్. **87**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: గంగానందును= భీష్ముని; పోటు= యుద్ధము; మెచ్చక; గురున్= ద్రోణుని; కాదు; అంచున్= అనుచు; రాధా= రాధయొక్క; తనూజున్= కుమారుడైన కర్ణుని (కన్నతల్లికుంతి - పెంచిన తల్లి రాధ - కర్ణుడు రాధేయుడు గానే ప్రసిద్ధుడు); కీడు= తక్కువ; ఆడుచున్= చేయుచు; ఈతఁడు; ఎవ్వఁడు; ఒకొ!; అంచున్= అనుచు; శల్యుఁడే!= శల్యుడా!; ఇట్టి వానిన్= ఇటువంటివానిని; మున్ను= ఇంతకుమునుపు; కయ్యంబులన్= యుద్ధములందు; కానము= చూడము; అనుచున్= అనుచు; వేభంగులన్= వేయి విధములుగా; చూపఱు= చూచువారు; ఎల్లన్= అందరును; కీర్తింపన్= పొగడుచుండగా; ధనుః= ధనుస్సుయొక్క; కళా= విద్యయందలి; నిపుణ= నేర్పరితనమును; లీలా= వినోదము కలిగించు; ఖేలతన్= క్రీడగా; చూపెదన్= చూపించెదను.

తాత్పర్యం: భీష్ముడి యుద్ధాన్ని మెచ్చుకొనక, ద్రోణుడిని కాదని, కర్ణుడిని తక్కువచేస్తూ యుద్ధం చేసే ఈతడు ఎవ్వడు? శల్యుడేనా? అని ఆశ్చర్యం చెందుతూ ఇంతకు ముందెన్నడూ ఏ యుద్ధంలోనూ - ఇట్టి వాడిని చూడలేదంటూ, వేయివిధాలుగా చూచేవారందరూ కీర్తించేటట్లు నా విలువిద్యా నైపుణ్యాన్ని వినోదక్రీడగా చూపిస్తాను.

విశేషం: ఈ సందర్భంలో మూడు పద్యాలలో (85,86,87) తిక్కన శల్యుడి ప్రతాపమును వర్ణించాడు. ఆ వర్ణన వలన శల్యుడు ఆత్మప్రతాపస్తుతి పరాయణుడయిన ఉద్ధతుడుగా కనిపిస్తాడు. ఉదాత్తుడుగా కనిపిస్తాడు. మూలమున వ్యాసభగవానులు శల్యుని ఉదాత్తుడుగా చిత్రించాడు. "అద్య చాహం రణే సర్వాన్ పాంచాలాన్సహ పాండవైః । నిహనిష్యామి వా రాజన్! స్వర్గం యాస్యామి వా హతః" - ఇది వ్యాసుడు చేసిన శల్యుడి ధీరోదాత్త లక్షణం. (శల్య. అధ్యా-7)

దుర్యోధనుఁడు శల్యుని సేనానాయకుంగాఁ జేయుట (సం. 9-6-5)

వ. అని పలికిన నీ సుతుండు ప్రీతుండై కనకకలశంబుల సరస్వతీజలంబులు దెప్పించి శాస్త్రోక్తప్రకారంబునఁ దగురాజులుం దానును సేనామధ్యంబున భద్రవిధానోపేతంబుగా నమ్మద్రవిభు నభిషేకించి బలాధిపత్యపట్టబంధంబు నిర్వర్తించిన శంఖభేరీప్రముఖమంగళతూర్యరవంబులు సెలంగ సైనిక సింహనాదంబు లుల్లసిల్ల నప్పడా శల్యునుద్దేశించి దీవనలం బొగడ్తల నఖిల జనంబులును ముఖరులయి రిట్లు సంతసిల్లి సపరివారంబుగాఁ గురుభూమీశ్వరుండు విశ్రామంబు నొందె. నట్టియెడ మున్న సమరజయంబునం బ్రమోదభరితుండగుచు నిజశిబిరంబునకుం జనిన పాండవాగ్రజుండు బంధుమిత్రపరిజనంబులఁ దమతమ విడిదలకుం బోవం బనుపక యుచితప్రదేశంబునఁ బేరోలగంబుండి మనవారివలనివిశేషంబు లరయఁ జారులం బనిచినవాఁడై వారలు మగిడి వచ్చునంతకు నే మేని వినోదంబులం బ్రొద్దువుచ్చి యక్కడి యుత్సాహంబు తెలంగంతయు విని యచ్యుతునాననం బాలోకించి యిట్లనియె: 88

ప్రతిపదార్థం: (సంజయుడు ధృతరాష్ట్రునకు ఇట్లు చెప్పెను) అని= ఈ విధముగా శల్యుడు; పలికినన్= చెప్పిన తరువాత; నీ సుతుండు= నీ కుమారుడయిన దుర్యోధనుడు; ప్రీతుండై= సంతోషించినవాడై; కనక= బంగారముతో చేసిన; కలశంబులన్= చెంబులతో (జలపాత్రలతో); సరస్వతీ జలంబులు= సరస్వతీ నదియొక్క నీళ్ళు; తెప్పించి; శాస్త్ర= ధర్మశాస్త్రములందు; ఉక్త= చెప్పిన; ప్రకారంబునన్= విధముగా; తగు= యోగ్యతగల; రాజులున్= రాజులును; తానును; సేనామధ్యంబునన్= సేనయొక్క మధ్యభాగమున; భద్ర= శుభకరమగు; విధాన= వేద విహితమగు పద్ధతిలో; ఉపేతంబుగాన్= కూడినదిగా; ఆ మద్రవిభున్= ఆ మద్రదేశపు ప్రభువు అయిన శల్యుడిని; అభిషేకించి; బల= సైన్యమునకు; ఆధిపత్య; పట్ట= పట్టం; బంధంబు= కట్టుటను;

నిర్వర్తించినన్= నిర్వర్తించగా; శంఖ= శంఖములు; భేరీ= భేరులు; ప్రముఖ= మొదలగు వాద్యాలయొక్క; మంగళ= శుభప్రదములయిన; తూర్య= వాద్యములయొక్క; రవంబులు= ధ్వనులు; చెలంగన్= మ్రోయగా; సైనిక= సైనికులయొక్క; సింహనాదంబులు= సింహగర్జనలు; ఉల్లసిల్లన్= విజృంభించగా; అప్పుడు; ఆ శల్యున్= ఆ సేనాధిపతిఅయిన శల్యుని; ఉద్దేశించి= గురించి; దీవనలన్= ఆశీస్సులతో; పొగడ్తలన్= స్తుతులతో; అఖిలజనంబులును= సమస్తమయిన ప్రజలును; ముఖరులు= శబ్దం చేసిన వారు; అయిరి; ఇట్లు= ఈ ప్రకారముగా; సంతసిల్లి= సంతోషించి; సపరివారంబుగాన్= అనుచరులతో కూడిన వాడగుచు; కురుభూమీశ్వరుడు= కురురాజయిన దుర్యోధనుడు; విశ్రామంబును= విశ్రాంతిని; ఒందెన్= పొందెను; అట్టి+ఎడన్= ఆసయమంలో; మున్ను= అంతకుముందు; సమర= సంగ్రామమందలి; జయంబునన్= విజయమువలన; ప్రమోదభరితుండు= ఆనందం నిండిన హృదయం కలవాడు; అగుచున్; నిజ= తనయొక్క; శిబిరంబునకున్= విడిదికి; చనినన్= వెడలగా; పాండవాగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; బంధుమిత్ర= చుట్టములను, స్నేహితులను; పరిజనంబులన్= సేవకులను; తమ తమ= వారి వారి; విడిదలకున్= శిబిరములకు; పోవన్= పోవుటకు; పనుపక= నియోగించక; ఉచిత= తగిన; ప్రదేశంబునన్= చోటునందు; పేరు+ఓలగంబు= పెద్దకొలువు; ఉండి; మనవారివలని= మనవారియొక్క; విశేషంబులు= తెలిసికొనదగిన విశిష్ట విషయములు; అరయన్= విచారించి తెలిసికొనుటకు; చారులన్= గూఢచారులను; పనిచినవాఁడై= పంపించినవాడై; వారలు; మగిడి= తిరిగి; వచ్చునంతకున్= వచ్చువరకు; ఏమి+ఏని= ఏమైనను; వినోదంబులన్= వేడుకల వలన; ప్రొద్దు+పుచ్చి= కాలముగడపి; అక్కడి; ఉత్సాహంబు= ప్రయత్నము యొక్క; తెఱంగు= విధము; అంతయున్; విని; అచ్యుతున్= శ్రీకృష్ణుడియొక్క; ఆననంబు= ముఖము; ఆలోకించి= చూచి; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా చెప్పాడు. 'శల్యుడు తన ప్రతాపాన్ని, బల పరాక్రమాలను గూర్చి చెప్పిన తరువాత నీ కుమారుడు దుర్యోధనుడు సంతోషించి, బంగారు చెంబులతో సరస్వతీ నదీ జలాలు తెప్పించి శాస్త్రోక్తంగా యోగ్యులయిన రాజులును, తానును సేనామధ్యంలో శుభప్రదమైన వేదవిహిత విధానంతో ఆ మద్ర దేశాధిపతి శల్యుడిని అభిషేకించి, సైన్యాధిపత్యానికి చిహ్నమయిన పట్టబంధాన్ని తొడిగి అభిషేకం నిర్వర్తించగా మంగళవాద్యధ్వనులు మిన్నుముట్టగా సైనికులు ఆనందోత్సాహాలతో సింహనాదాలు చేయగా, ఆ సమయంలో సేనాధిపతి అయిన శల్యుడిని ఉద్దేశించి ఆశీస్సులతో, స్తుతులతో జనులందరు రణగొణ ధ్వనులు చేశారు. ఈ విధంగా సంతోషం పొంది, అనుచరులతో కూడి దుర్యోధనుడు విశ్రాంతిని పొందాడు. ఆ సమయంలో అంతకుముందు సంగ్రామ విజయంవలన ఆనంద భరిత హృదయుడయిన ధర్మరాజు తన విడిదికి వెడలి బంధుమిత్ర పరిజనులను తమ తమ శిబిరాలకు పంపించకుండా, తగిన ప్రదేశంలో పెద్ద కొలువు తీర్చి కౌరవ శిబిరంలో జరుగుతున్న ప్రయత్నాలను విచారించి తెలిసికొనుటకు గూఢచారులను పంపించి, వారు తిరిగి వచ్చేవరకు వేడుకలతో కాలం గడిపి, ఆ కౌరవ శిబిరంలోని ప్రయత్నాన్నంతా విని శ్రీకృష్ణుడి ముఖాన్ని చూచి ఈ ప్రకారంగా అన్నాడు.

చ. **'కురుపతి మద్రరాజుఁ దనకున్ బలముఖ్యునిఁగా నొనర్చి సం**
గరమున కుత్సహించె నధికప్రమదంబున వారిసేనయుం
దిరమయి పేర్చియున్నయది దీనికి నెయ్యది సేయువార? మీ
వరయుము కార్యవృత్తి హృదయంబునఁ బాండవరక్షణోత్సుకా. 89

ప్రతిపదార్థం: పాండవ= పాండవులను; రక్షణ= కాపాడుట యందు; ఉత్సుకా!= ఉత్కంఠం కలిగినవాడా! - శ్రీకృష్ణా!; కురుపతి= దుర్యోధనుడు; మద్రరాజున్= శల్యుడిని; తనకున్; బల= సేనకు; ముఖ్యునిఁగాన్= అధిపతిగా; ఒనర్చి= చేసి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంగరమునకున్= యుద్ధమునకు; ఉత్సహించెన్= ప్రయత్నము చేయుచుండెను; వారి= వారియొక్క; సేనయున్= సైన్యము కూడ; అధికప్రమదంబునన్= మిక్కిలి సంతోషముతో; తిరుమయి= స్థిరమయినదిగ; పేర్చి= విజృంభించి; ఉన్నయది= ఉన్నది; కార్య= చేయదగిన; వృత్తిన్= పనిని; ఎయ్యది= ఏది; చేయువారము?= చేయగలవారము?; ఈవు= నీవు; హృదయంబునన్= మనసులో; అరయుము= విచారింపుము.

తాత్పర్యం: 'పాండవ రక్షణమునందే ఉత్కంఠ కలిగిన శ్రీకృష్ణా! కురుపతి మద్రపతి శల్యుడిని తనకు సేనాధిపతిగా చేసి, యుద్ధానికి సిద్ధమయ్యాడు. దీనికి ఏమి చేయగలవారం? నీవు చేయదగిన పనిని మనసునందు ఆలోచించుకో

వ. నీ వెట్లు నిశ్చయించి పలికె దట్ల సేయుదు' ననిన నమ్మహీకాంతునకు మురాంతకుం డి ట్లనియె: 90

ప్రతిపదార్థం: నీవు; ఎట్లు= ఏ ప్రకారముగా; నిశ్చయించి= నిర్ణయించి; పలికెదు(వు)= చెప్పుదువో; అట్ల; చేయుదున్; అనినన్= అని చెప్పగా; ఆ మహీ= భూమికి; కాంతునకున్= భర్తఅయిన ఆ ధర్మరాజుకు; మురాంతకుండు= శ్రీకృష్ణుడు; (మురుడు అను రాక్షసుడిని సంహరించినందువలన శ్రీకృష్ణునకు మురాంతకుడని పేరు.); ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: నీవు ఏ ప్రకారంగా నిర్ణయించి చెప్పితే అట్లే చేస్తాను' అని చెప్పిన ధర్మరాజుతో శ్రీకృష్ణు డిట్లా అన్నాడు.

సీ. శల్యు నెఱుంగుదు శౌర్యధైర్యంబు । లగ్గల మాతనికి బాహుబలఘనుండు
గాంగేయకుంభజకర్ణుల మిగిలెడుఁ । గాదేని సముఁడగుఁ గాని యసదు
గాఁ దలంపఁగరాదు కౌరవపతి మాన్యుఁ, । జేయుట నధికవిజృంభణంబుఁ
జూప భీమునకు నర్జుననకు నెనయంగ । రాదు సాత్యకి కోర్వరాదు పార్ష

తే. తునకుఁ దత్సోదరులకు మార్కొని పెనంగి । బ్రదుక రాదు నీవీట నా బల్లిదునకు
నెదురు రథికునిఁగాన ననేక హేతి । నిపుణశార్దూలవిక్రమ! నీవు దక్క. 91

ప్రతిపదార్థం: శల్యున్= శల్యుని; ఎఱుంగుదున్= ఎరుగుదును; ఆతనికిన్= శల్యుడికి; శౌర్యము= పరాక్రమము; ధైర్యంబులు= ధీరత్వములు; అగ్గలము= అధికము; బాహు= భుజములయొక్క; బల= బలమునందు; ఘనుండు= గొప్పవాడు; గాంగేయ= భీష్మ; కుంభజ= ద్రోణ; కర్ణులన్= కర్ణులను; మిగిలెడున్= మించిపోవును(అనగా అతిశయించును.); కాదేని= అట్లు కాని ఎడల; సముఁడగున్= వారికి సమానుడగును; కాని= అంతేకాని; అసదుగాన్= అల్పునిగా; తలంపఁగన్= భావింప; రాదు; కౌరవపతి= కౌరవులకు ప్రభువు అయిన దుర్యోధనుడు; మాన్యున్= గౌరవింపదగినవాడినిగా (అనగా సైన్యాధిపతిగా); చేయుటన్= చేసినందువలన; అధిక= మిక్కిలి; విజృంభణంబున్= అతిశయంబును; చూపున్= చూపించును; భీమునకును; అర్జుననకును; ఎనయంగన్+రాదు=ఎదురించరాదు; సాత్యకికిన్; ఓర్వరాదు= సహింపరాదు; పార్షతునకున్= ధృష్టద్యుమ్నుడికి; తత్సోదరులకున్= అతని సోదరులకును; మార్కొని= ఎదుర్కొని; పెనంగి= యుద్ధముచేసి; బ్రదుకరాదు= జీవించి యుండుటకు వీలు కాదు; అనేక= వివిధములయిన; హేతి= ఆయుధాలు ప్రయోగించుట యందు; నిపుణ= నైపుణ్యము గల అనగా నేర్పరితనంగల; శార్దూల= పెద్దపులి వంటి; విక్రమ!= పరాక్రమం కలవాడా! నీవు; తక్కన్= తప్ప; ఆ బల్లిదునకున్= అధికబలవంతుడయిన ఆ శల్యునకు; ఎదురు; రథకునిన్= సమానుడైన రథమధిరోహించి యుద్ధము చేయగల యోధుడిని; కానను= చూడను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శల్యుడిని ఎరుగుదును. ఆ శల్యుడికి పరాక్రమధైర్యాలు అధికం. భుజబలంలో కూడా గొప్పవాడు. భీష్మ, ద్రోణ, కర్ణులను మించినవాడు. లేకుంటే వారితో సమానుడు. అంతేకాని అల్పుడు కాడు. అదీకాక దుర్యోధనుడు ఆతడిని సైన్యాధిపతిగా చేశాడు. అందువలన అతడు యుద్ధంలో అధిక విజృంభణాన్ని ప్రదర్శిస్తాడు. భీముడు కాని, అర్జునుడు కాని, సాత్యకి కాని, ధృష్టద్యుమ్నుడు గాని ఆతడి సోదరులు కాని ఆతడిని ఎదుర్కొనజాలరు. ఎదుర్కొంటే బ్రదుకజాలరు. వివిధాయుధ ప్రయోగ నైపుణ్యం కలిగి, పెద్దపులి వంటి పరాక్రమం కల ఓ ధర్మరాజా! నీవు తప్ప అధికబలవంతుడయిన ఆ శల్యుడిని ఎదుర్కొని యుద్ధం చేయగల రథికుడు మరొకడు మన సేనలో కనపడటం లేదు.

క. ఒరులయినఁ బెక్కు దినములఁ । బొరిగొను నీ బలము నెల్లఁ బొరివోవ నతం
దరిభంజన! నీ వైనం । బరమోత్సాహమున నెల్లి పడవై తతనిన్. 92

ప్రతిపదార్థం: అరిభంజన!= శత్రుసంహారకుడవైన ధర్మజా!; అతండు= ఆ శల్యుడు; ఒరులు= ఇతరులు (అనగా నీవు తప్ప ఇతరులు); అయినన్= అయినచో; పెక్కు= అనేక; దినములన్= రోజులలో; నీ బలమున్= నీయొక్క సైన్యమును; ఎల్లన్= సమస్తమును; పొరిపోవన్= నాశమగునట్లు; పొరిగొనున్= చంపివేయును; అతనిన్= ఆ శల్యుడిని; నీవు; అయినన్= అయినచో; పరమ= ఉత్కృష్టమయిన; ఉత్సాహమునన్= ప్రయత్నముతో; ఎల్లి= రేపు; పడవైతు(వు)= పడగొట్టుదువు (అనగా చంపగలవు).

తాత్పర్యం: ఆ శల్యుడు నీవు తప్ప ఇతరులయితే పెక్కు దినాలలో నీ సమస్త సైన్యాన్ని నాశనమయ్యేటట్లు చేస్తాడు. శత్రువులను అణచగల ఓ ధర్మరాజా! నీవు అయితే పరమోత్సాహంతో ఆ శల్యుడిని రేపే సంహరించగలవు.

ఆ. అతఁడు మేనమామ యను కృప దక్కుము । రాజధర్మమును బురస్కరించి
యతుల విక్రమక్రియా పాటవంబున । నవ్విరోధినామ మడఁపవలయు. 93

ప్రతిపదార్థం: అతఁడు= ఆ శల్యుడు; మేనమామ; అను= అనెడి; కృపన్= దయను; తక్కుము= విడిచిపెట్టుము; రాజధర్మమును= రాజులయొక్క ధర్మమును; పురస్కరించి= ముందిడుకొని (రాజధర్మమునకు ప్రాముఖ్యమిచ్చి); అతుల= సాటిలేని; విక్రమ= పరాక్రమముయొక్క; క్రియా= అభ్యాసమువలన లభించిన; పాటవంబునన్= శక్తివలన; ఆ విరోధి= ఆ శత్రువుయొక్క; నామము= ప్రసిద్ధి; అడఁపవలయున్= నాశము చేయవలయును.

తాత్పర్యం: ఆ శల్యుడు నీ మేనమామ అనే దయను విడిచిపెట్టుము. రాజధర్మానికి ప్రాముఖ్య మిచ్చి, సాటిలేని పరాక్రమంతో ఆ శత్రువు పేరు లేకుండా చేయాలి.

క. గాంగేయునిఁ గుంభజుఁ గ । ర్ణుం గడచితి మింక నుద్ధురుండగు మద్రే
శుం గూల్పు మంతతోడఁ దె । గుం గురుపతి పని జయంబు గొనుము కడంకన్. 94

ప్రతిపదార్థం: గాంగేయునిన్= భీష్ముని; కుంభజున్= ద్రోణుని; కర్ణున్= కర్ణుని; కడచితిమి= దాటితిమి; ఇంకన్= ఇంక; ఉద్ధరుండు= బరువైనవాడు అనగా బలాఢ్యుడు; అగు; మద్రేశున్= శల్యుని; కూల్పుము= పడగొట్టుము (సంహరించుము); అంతతోడన్= అంతటితో; కురుపతి= దుర్యోధనునియొక్క; పని; తెగున్= పరిసమాప్తము అగును; కడంకన్= ప్రయత్నంతో; జయంబున్= విజయమును; కొనుము= కైకొనుము - దక్కించుకొనుము.

తాత్పర్యం: భీష్ముడిని, ద్రోణుడిని, కర్ణుడిని దాటాము. ఇంక బలాఢ్యుడు మద్రదేశాధీశుడైన శల్యుడిని కూల్చుము. అంతటితో కురుపతి పని పూర్తవుతుంది. ప్రయత్నించి విజయాన్ని గైకొనుము.

వ. అనిన విని యుధిష్ఠిరుం డతని కిట్లనియె. 95

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అతనికిన్= శ్రీకృష్ణుడికి; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ఇట్లు చెప్పిన తరువాత మరల ధర్మరాజు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'అనఘ! నీవు చెప్పినట్టులు సేసెద; । మున్ను పలికినాఁడ నన్నరేంద్రు
కడిమి నాకుఁ బాలుగాఁ బూని యుద్యోగ । వేళయందు నెల్ల వినుచునుండ. 96

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితా! - శ్రీకృష్ణా!; నీవు; చెప్పినట్టులు= చెప్పినవిధముగా; చేసెదన్; మున్ను= ఇంతకు ముందు; ఉద్యోగవేళయందున్= సంజయుని రాయబారపు సమయమున; ఎల్లన్= అందరును; వినుచున్= వినుచును; ఉండన్= ఉండగా; ఆ+నర+ఇంద్రు కడిమి= ఆ శల్యుడి శౌర్యం; నాకున్= నాకు; పాలుగాన్= వంతుగా; పూని= పూనిక వహించి; పలికినాఁడన్= చెప్పినాడను.

తాత్పర్యం: 'పూజ్యుడా శ్రీ కృష్ణా! నీవు చెప్పిన విధంగానే తప్పక చేస్తాను. ముందు సంజయుడి రాయబార సమయంలో అందరూ వింటూండగా ఆ శల్యుడు యుద్ధంలో నా వంతుగా ప్రతిజ్ఞ చేసి పలికాను. అందువలన నీవు చెప్పినట్లుగానే చేస్తాను.

విశేషం: మహాభారత యుద్ధమునకు పూర్వం రెండురాయబారాలు జరిగాయి. ఒకటి సంజయుడి రాయబారం. రెండవది శ్రీకృష్ణుడి రాయబారం. సంజయుడు కౌరవుల తరపున రాయబారం నడిపాడు. శ్రీకృష్ణుడు పాండవుల తరపున రాయబారం నడిపాడు. సంజయుడు ధర్మరాజు నిశ్చయాన్ని దుర్యోధనుడికి చెప్పే సందర్భంలో యుద్ధంలో శల్యుడిని తన వంతుగా గెలుస్తానని ధర్మరాజు అన్నట్లు చెప్పాడు. 'కృతపుణ్యుఁడు సుశ్లోకుఁడు ధర్మతనూజుఁడు లోకోత్తురు శల్యుఁదా గెలుచువాఁడధిపా' (చూడుడు. ఉద్యోగపర్వము. ద్వి. 229, 230, 231)

వ. సదనంబునకుం జని సుఖనిద్ర సేయు మని పలికి పద్మనాభునిఁ దమ తమ్ములను ధృష్టద్యుమ్న శిఖండిసాత్యకి ప్రముఖులను దక్కటి పరిజనంబులను నిజమందిరంబులకుం బోవం బనిచి వీతశల్యంబైన మాతంగంబు చందంబున శయ్యాతలంబు సేరె బలం బంతయు నత్యంత సంతుష్టంబై విశ్రాంతి నొందె నారాత్రి యే నిట వచ్చి నీకుఁ గర్ణువృత్తాంతంబు సెప్పి నీవు వనుప మగిడి చని తెలతెల వేగునప్పుడు కౌరవసేనాసన్నివేశంబు సేరితి నా సమయంబున. 97

ప్రతిపదార్థం: (ధర్మరాజు) పద్మనాభునిన్= శ్రీకృష్ణుని; సదనంబునకున్= మందిరమునకు; చని= వెళ్ళి; సుఖనిద్ర= గాఢనిద్ర (అనగా సుషుప్తియందు గల నిద్రాస్థితి); చేయుము; అని; పలికి; తన తమ్ములను; ధృష్టద్యుమ్న; శిఖండి; సాత్యకి; ప్రముఖులను; తక్కటి= మిగిలిన; పరిజనంబులను= సేవకులను; నిజమందిరంబులకున్= తమయొక్క భవనములకు; పోవన్= పోవునట్లుగా; పనిచి= పంపించి; వీత= పోయిన; శల్యంబు= బాణము; ఐన= కలిగిన; మాతంగంబు= ఏనుగు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చందంబునన్= వలె; శయ్యాతలంబు= శయనించుటకు తగిన స్థలము; చేరెను; బలంబు= సైన్యము; అంతయున్= సమస్తమును; అత్యంత= మిక్కిలి; సంతుష్టంబు+ఐ= సంతృప్తి పొందినదియై; విశ్రాంతిన్= విశ్రాంతిని; ఒందెన్= పొందెను (ఇక సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లు చెప్పుచున్నాడు); ఆ రాత్రి; ఏన్= నేను; ఇటన్= ఇక్కడకు; వచ్చి; నీకున్; కర్ణు= కర్ణునియొక్క; వృత్తాంతంబు= సమాచారము; చెప్పి; నీవు; పనుపన్= పంపించగా; మగిడి= తిరిగి; చని= వెళ్ళి; తెలతెల= తెల్లతెల్లగా వెలుతురు; వేగునప్పుడు= ఉదయించునప్పుడు (అనగా తెల్లవారుచుండగా); కౌరవ= కౌరవులయొక్క; సేనా= సైన్యముయొక్క; సన్నివేశంబు= శిబిరము; చేరితిన్= చేరితిని; ఆ సమయంబునన్= ఆ సమయమునందు.

తాత్పర్యం: ధర్మరాజు శ్రీకృష్ణుడిని మందిరానికి వెళ్ళి 'సుఖనిద్ర' చేయుమని పంపించి, తన తమ్ము లైన భీమార్జున నకుల సహదేవులను, ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకి ప్రముఖులను, మిగిలిన సేవకులను, తమ తమ గృహాలకు పంపించి, తీసివేయబడిన బాణం కల ఏనుగువలె ధర్మరాజు శయనమందిరం చేరాడు. సైన్యమంతయును మిక్కిలి సంతృప్తి పొంది విశ్రాంతి పొందింది. ఇంక సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా చెప్తున్నాడు: ఆ రాత్రి అనగా పదిహేడవ రోజు యుద్ధం ముగిసి కర్ణుడు కూలిన రాత్రి నేను ఇక్కడకు వచ్చి కర్ణుడి యుద్ధం, సంహారం మొదలైన సమాచారమంతా చెప్పి నీవు పంపగా తిరిగి వెళ్ళి తెలతెలవారుతుండగా కౌరవ శిబిరం చేరాను. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

క. కురుపతి పడవాళ్ళం దగు । దొరలకడకు సత్వరముగ దురమునకు భటో
త్కరము ననువు సేయుటకై । బరవసము దలిర్పఁ బనిచెఁ బార్థివముఖ్యా! 98

ప్రతిపదార్థం: పార్థివ= రాజులలో; ముఖ్యా!= ప్రముఖుడవు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; కురుపతి= దుర్యోధనుడు; పడవాళ్ళన్= సేనాధిపతులను; తగు= తగిన - అనగా దళపతులు కా తగిన; దొరలకడకున్= రాజులవద్దకు; దురమునకున్= యుద్ధమునకు; భట= భటులయొక్క; ఉత్కరమున్= సమూహమును; సత్వరముగన్= మిక్కిలి వేగముగా; అనువు= సిద్ధము; చేయుటకై; బరవసము= ధైర్యము; తలిర్పన్= చిగురించునట్లుగా; పనిచెన్= పంపించెను.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! దుర్యోధనుడు యుద్ధానికి భట సమూహాన్ని వేగంగా సిద్ధం చేయటానికి ధైర్యం అతిశయించేటట్లుగా దళపతులు కాదగిన రాజులకడకు సేనాధిపతులను పంపించాడు.

వ. పనిచిన నెల్లవారు నుల్లంబుల నుత్సాహంబు లుల్లసిల్లఁ దమతమ చతురంగంబులకు సవరణలు సంఘటింపం దొడంగినఁ దూర్యంబులు సెలంగ నొండొరులఁ బిలుచునెలుంగులు నింగిముట్ట రథనేమిగజపద తురంగఖురపుటభటచరణ సంఘట్టితంబగు ధరణీతలం బద్రువ బహుళంబగు నులివు చంద్రోదయ సమయఘూర్ణమానంబగు మహార్ణవంబు నినదంబు ననుకరించె; న ట్లాయితంబై శల్యశకుని కృతవర్మాశ్వత్థామలును దక్కునుం గల యోధవరులును నొక్కెడ ననుజసహితుండై యున్న మనుజపతి సన్నిధిఁ గూడి యతండు వినఁ దమలో నిట్లనిరి. 99

ప్రతిపదార్థం: పనిచినన్= పంపగా; ఎల్లవారున్= అందరును; ఉల్లంబులన్= మనస్సులందు; ఉత్సాహంబులు= యుద్ధప్రయత్నములు; ఉల్లసిల్లన్= ప్రకాశింపగా; తమతమ= వారి వారి; చుతరంగంబులకున్= చతురంగ బలములకు అనగా

రథ, గజ, తురగ, పదాతి దళములకు; సవరణలు= అలంకరణలు; సంఘటింపన్= సమకూర్చుటకు; తొడంగినన్= ప్రారంభించగా; తూర్యంబులు= వాద్య ధ్వనులు (అనగా యుద్ధసన్నాహ సూచకములగు వాద్యధ్వనులు); చెలంగన్= మ్రోగగా; ఒండొరులన్= ఒకరినొకరును (అనగా పరస్పరము); పిలుచు నెలుంగులు= పిలిచెడి కంఠధ్వనులు; నింగిముట్టన్= ఆకాశము ముట్టుకొనగా (అనగా వ్యాపించగా); రథనేమి= రథచక్రముల అంచులచేత; గజ= ఏనుగులయొక్క; పద= పాదములచేత; తురంగ= గుర్రాలయొక్క; ఖురపుట= దొప్పలవంటి గిట్టలచేత; భటచరణ= భటులయొక్క పాదములచేత; సంఘట్టితంబు= గట్టిగా త్రొక్కబడినది; అగు= అయిన; ధరణీ= భూమియొక్క; తలంబు= స్థలము (అనగా భూభాగము); అద్రువన్= అదరగా(అనగా చలింపగా); బహుళంబు= అధికము; అగు= అయినట్టి; ఉలివు= మ్రోత; చంద్ర= పున్నమ చందమామ; ఉదయ= ఉదయించు; సమయమునన్= కాలమున; ఘూర్ణమానంబు= సుళ్ళు తిరుగబడుచు శబ్దించునది; అగు= అయినట్టి; మహార్ణవంబు= మహాసముద్రముయొక్క; నినదంబును= ధ్వనిని; అనుకరించెన్= అనుకరించెను; అట్లు= ఆ ప్రకారముగా; ఆయితంబై= సంసిద్ధమై; శల్య= శల్యుడు; శకుని; కృతవర్మ; అశ్వత్థామలు; తక్కునున్= ఇంకను మిగిలి; కల= ఉన్నట్టి; యోధవరులునున్= శ్రేష్ఠులైన యోధులును; ఒక్కెడన్= ఒక చోట; అనుజ= తమ్ములతో; సహితుండై= కూడియున్నవాడై; ఉన్న= ఉన్నట్టి; మనుజ= మానవులకు; పతి= ప్రభువు అయిన; దుర్యోధనుడి; సన్నిధిన్= అతిసమీపమున; కూడి= కలిసి; అతండు= ఆ దుర్యోధనుడు; వినన్= వినునట్లుగా; తమలోన్= తమలోతాము; ఇట్లు= ఈ ప్రకారముగ; అనిరి= అనుకొన్నారు.

తాత్పర్యం: అట్లు పంపించగా అందరూ మనసులందు రణోత్సాహాలు ఉప్పొంగగా వారి వారి రథగజతురంగ పదాతులనెడి చతురంగ బలాలకు అలంకరణాలు సమకూర్చుకొనటం ప్రారంభించగా యుద్ధ సన్నద్ధసూచకాలైన తూర్యధ్వనులు మ్రోగాయి. సైనికులు ఒకరినొకరు పిలుచుకొనే అరుపులు నింగిని తాకాయి. చతురంగబలాలతో రథచక్రాల అంచులచేత, ఏనుగుల పాదాలచేత, గుర్రాల గిట్టలచేత భటుల చరణఘాతాలచేత, సంఘట్టితమైన భూభాగం చలించిపోయింది. ఆ సమయంలో ఉద్భవించిన అధికమయిన ఆ మ్రోత చంద్రోదయ సమయాన సుళ్లు తిరుగుతూ ఉప్పొంగే మహాసముద్రం చేసే ధ్వనిని అనుకరించింది. ఆ ప్రకారంగా యుద్ధ సన్నద్ధులైన శల్య శకుని కృతవర్మాశ్వత్థామలు, మిగిలిన యోధవరులు ఒకచోట తమ్ములతో కూడి ఉన్న సుయోధనుడి సన్నిధిలో కలిసి, ఆ సుయోధనుడు వినేటట్లుగా తమలో తాము ఈ ప్రకారంగా చెప్పుకొన్నారు.

క. ఒకఁ డొకఁడ పాండవులఁ దాఁ। కక సైన్యోపేతగాఢగతి నందఱు నొ
క్కొక తలగాఁ దలపడి వా। రి కడంక యుడుపఁగవలయుఁ గ్రీడయ పోలెన్. 100

ప్రతిపదార్థం: ఒకఁడు; ఒకఁడ= ఒక్కడే; పాండవులన్; తాఁకక= ఎదుర్కొనక; సైన్య= సేనతో; ఉపేత= కూడుకొని; గాఢ= గట్టి అయిన; గతిన్= పద్ధతితో(అనగా దృఢమైన వ్యూహంతో); అందఱున్= అందరును; ఒక్కొక్కతలగాన్= ఒక్కుమ్మడిగా; తలపడి= ఎదుర్కొని; వారి= వారియొక్క; కడంక= ప్రయత్నము; క్రీడయ= ఆట; పోలెన్= వలె; ఉడుపఁగన్= తొలగింపగ(లేక) పోగొట్టగ; వలయును.

తాత్పర్యం: ఒక్కొక్కడే పాండవులను ఎదుర్కొనక, సేనతోకూడి దృఢమైన వ్యూహంతో అందరూ కలిసి ఒక్కుమ్మడిగా ఒక్కొక్కడిపై తలపడి ఆ పాండవుల ప్రయత్నాన్ని ఒక క్రీడవలె ఉడిగించాలి.

వ. మన మొకళ్ళొకళ్ళకుఁ బ్రాపగుచు నేపారి పోరినం జుల్కన గెల్పు గొనవచ్చు నిత్తెఱంగు మనకు సమయంబు సుండీ! యట్లుగాక యొంటి పెనంగెడివాఁడును బెనఁగెడివానిఁ గని కూడుకొనని వాఁడును బంచవిధ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాపంబుల నొందఁగలవాఁడని యొండొరులకుం జెప్పికొని కదలి యుద్దామసామర్థ్యంబున నమ్మద్రపతి ముంగలియై నడవం జనునప్పుడు. 101

ప్రతిపదార్థం: మనము; ఒకళ్ళొకళ్ళకున్= ఒకరు మరొయొకరికి; ప్రాపు= ఆశ్రయం; అగుచున్; ఏపారి= విజృంభించి; పోరినన్= పోరాటము సల్పినచో; గెల్పు= విజయము; చుల్కనన్= తేలికగా; కొనవచ్చున్= కైకొనవచ్చును; ఈ+తెఱంగు= ఈ ప్రకారంగా; మనకున్; సమయంబు= ఒప్పందము (అనగా శపథము); సుండీ!= సుమండీ!; అట్లు= ఆ ప్రకారంగా; కాక; ఒంటి= ఒంటరిగ; పెనంగెడివాఁడును= పోరాడెడివాడును; పెనఁగెడివానిని= పోరాడేవాడిని; కని= చూచి; కూడుకొననివాఁడును= వానికి సహకరించనివాడును; పంచవిధ= అయిదు విధాలైన; పాపంబులన్= పాతకములను; ఒందన్ కలవాఁడు= పొందగలడు; అని; ఒండొరులకున్= ఒకరికొకరికి (అనగా పరస్పరము); చెప్పికొని= అనుకొని; కదలి= బయలుదేరి; ఉద్దామ= భయంకర= అధిక; సామర్థ్యంబునన్= యోగ్యతవలన (అనగా శక్తివలన); ఆ+మద్రపతి= ఆ మద్రదేశాధిపతి శల్యుడు; ముంగలియై= ముందున్నవాడై; నడవన్= నడుచుచుండగా; చనునప్పుడు= వెడలుచున్నప్పుడు.

తాత్పర్యం: 'మనం ఒకరికొకరం రక్షకులమై విజృంభించి పోరాడితే జయం సులభంగా సంపాదించవచ్చును. ఇది మనకు శపథం. ఈ శపథం ప్రకారం కాకుండా ఒంటరిగా పోరాడెడివాడు, వాడిని చూచి అతడితో కలిసి పోరాటం చేయనివాడు, పంచమహాపాతకాలను పొందగలడు' అని పరస్పరం ఒట్టుపెట్టుకొని బయలుదేరి అధికమైనశక్తి కల శల్యుడు ముందు నడుస్తూ ఉండగా. (తరువాతి పద్యంలో అన్వయం.)

విశేషం: ఈ వచనమున ఉస్మానియా ప్రతియందు తప్పు పాఠం ఉన్నది. అది అచ్చుతప్పు అనటానికి వీలుకాదు. మంచిపాఠమును పాఠాంతరంగా చూపి - తప్పు పాఠమును ప్రమాణంగా గ్రహించారు. (3) కూడుకొనిన - తప్పుడు పాఠము. (3) కూడుకొనని - పాఠాంతరము - ఇదే అసలు పాఠము. ఈ వచనమున 'కూడుకొనని' అనే పాఠమునే గ్రహించితిని. ఇట్లు చెప్పుటకు మూలమే ప్రమాణము.

'న న ఏకేన యోద్ధవ్యం కథంచిదపి పాండవైః ॥8॥
యో హ్యేకః పాండవైర్యుధ్యే ద్యోవాయుద్ధ్యంత ముత్సృజేత్ ।
స పంచభిర్భవేద్యుక్తః పాతకైశ్చోపపాతకైః ॥9॥
అన్యోన్యం పరిరక్షద్భిర్యోద్ధవ్యం సహితైశ్చ హ ।
ఏవం తే సమయం కృత్వా సర్వే తత్ర మహారథాః ॥10॥
మద్రరాజం పురస్కృత్య తూర్ణ మభ్యద్రవన్ పరాన్ । ॥11॥ (శల్య. అ-8; 8,9,10,11,)

పంచమహాపాతకములు:

1. స్వర్ణస్తేయం 2. సురాపానం 3. బ్రహ్మహత్య 4. గురుపత్నీగమనం, 5. శిశుహత్య.

కౌరవసైన్యంబు యుద్ధసన్నద్ధం బై వెడలుట (సం. 9-7-10)

సీ. **చంచరీకావళి ఝుంకృతుల్ గల్పించు । కర్ణఝుళంఝుళాకలనములును**
ధరణీపరాగసంతానంబుఁ గబళించు । కరశీకరచ్ఛటాస్ఫురణములును
ఘంటికాటంకృతికాంతి సంభావించు । నిర్భరబృంహితనిస్వనములు
నంబరభాగంబు నల్పంబు గావించు । నున్నతగాత్రసముద్ధతులును

తే. **జారు భీషణరేఖలు భూరిమద భ । రాభిరామ యానంబులు నాహవోచి**
తోగ్ర కల్పనాభంగులు నుల్లసిల్లఁ । గరులు ధాత్రీతలంబు గ్రక్కదల నడచె. **102**

ప్రతిపదార్థం: చంచరీక= తుమ్మెదల; ఆవళి= సమూహంయొక్క; ఝుంకృతుల్= ఝుంకారములు; కల్పించు; కర్ణ= చెవులయందలి; ఝళం ఝళా= ఝళం ఝళం అను; ఆ కలనములును= ధ్వనులును (అనగా ఏనుగుల చెవులకు వ్రేలాడ గట్టిన చిరు మువ్వల ఝళం ఝళారావములును); ధరణీ= భూమియొక్క; పరాగ= ధూళియొక్క; సంతానంబు= సముదాయము; కబళించు= మ్రింగెడి; కర= తొండములనుండి వచ్చు; శీకర= నీటి తుంపరలయొక్క; ఛటా= సమూహములను; స్ఫురణములను= తలంపులను(శీకరము అనగా సామాన్యార్థము - తుంపర విశేషార్థము - ఏనుగు తొండమునుండి వచ్చుమదము - కరశీకరము అనినను, శీకరము అనినను ఏనుగుతొండమునుండి వచ్చు మదమనియే అర్థము. సామాన్య విశేషార్థములను గ్రహించుటకు తిక్కయజ్వ 'కరశీకర' ప్రయోగము చేసెను. అందువలన ఏనుగుల తొండములనుంచి వచ్చు మదముయొక్క తుంపరలు - అను అర్థమును గ్రహింపవలసి యున్నది.) ఘంటికా= ఘంటలయొక్క; టంకృతి= టంకారధ్వనులయొక్క; కాంతి= సౌందర్యము; సంభావించు= గౌరవించు; నిర్భర= ప్రగాఢమయిన; బృంహిత= ఏనుగుల ఘీంకారములయొక్క; నిస్వనములును= ధ్వనులును; అంబర= ఆకాశముయొక్క; భాగంబు; అల్పంబు= తక్కువ; కావించు= చేసే; ఉన్నత= ఎత్తైన; గాత్ర= దేహములయొక్క; సముద్ధతులును= ఔన్నత్యములును; చారు= సుందరమయిన; భీషణ= భయంకరమయిన; రేఖలు= వరుసలు; భూరి= అధికమైన; మద= మదముయొక్క; భర= భారమువలన; అభిరామ= మనోహరమయిన; యానంబులును= నడకలును; ఆహవ= యుద్ధమునకు; ఉచిత= యోగ్యమయిన; ఉగ్ర= భయంకరమయిన; కల్పనా= రచింపబడిన (అనగా ఏర్పాటు చేయబడిన); భంగులున్= రీతులును; ఉల్లసిల్లన్= ప్రకాశింపగా; ధాత్రి= భూమియొక్క; తలంబు= స్థలము (అనగా భూభాగము లేక భూమండలము) క్రక్కదలన్= కంపించగా; కరులు= ఏనుగులు; నడచెన్= నడచెను.

తాత్పర్యం: (చతురంగబలములలో గజదళం ముఖ్యమైనది. సేనలు యుద్ధభూమికి నడచేటప్పుడు అగ్రభాగంలో గజదళం నడవటం ఆచారం. అందువలన ముందుగా గజదళం వర్ణించబడుతున్నది.) ఏనుగుల చెవులయొక్క చిరుమువ్వల నుండి వచ్చే ఝళం ఝళ ధ్వనులు తుమ్మెదల గుంపులు చేసే ఝుంకారాలను తలపిస్తున్నాయి. ఏనుగుల తొండాలనుండి పుట్టిన మదంయొక్క తుంపరలు భూమినుండి పుట్టిన ధూళి సముదాయాన్ని మ్రింగుతున్నట్లు తోస్తున్నవి. ఏనుగుల కంఠాలలో వ్రేలాడే ఘంటలయొక్క టంకార ధ్వనులు ప్రగాఢమయిన ఘీంకారధ్వనులను పోలి ఉన్నాయి. ఎత్తైన ఏనుగులయొక్క దేహాల ఔన్నత్యాలు ఆకాశభాగాన్ని అల్పం చేస్తున్నవి. సుందరాలు, భయంకరాలు అయిన మదభారం కల ఏనుగుల వరుసలయొక్క మదభారంవలని మందగమనాలు మనోహరాలౌతున్నవి. ఈ విధంగా యుద్ధానికి తగిన భయంకర మయిన ఏనుగుల వరుసలు ప్రకాశించగా భూభాగం కంపించేటట్లు గజదళం యుద్ధభూమికి నడచింది.

చ. **గతిబహుతాలసత్ఖురవిఘట్టితమేదిని జీవితేశ క**
ల్పిత నఖరేఖలం జెలువు పెంపు వహించు పురంధ్రిఁ బోల ను
ద్ధతముఖబంధురాంగలలితంబులు నూర్జితకింకిణీఝుణ
త్కృతి పటుహేషలుం దగ నుదీర్ణములై నడచెం దురంగముల్. **103**

ప్రతిపదార్థం: గతి= గమనములయొక్క; బహుతా= అనేకత్వముచే; లసత్= ప్రకాశించుచున్న; ఖుర= గిట్టలతో; విఘట్టిత= తొక్కబడిన(లేక)కొట్టబడిన; మేదిని= భూమి; జీవిత+ఈశ= ప్రాణమునకు అనగా బ్రతుకునకు ప్రభువు అయిన భర్తచేత అనగా ప్రాణప్రియునిచేత; కల్పిత= చేయబడిన; నఖ= గోళ్ళయొక్క; రేఖలన్= గీతలవలన (అనగా నఖక్షతములవలన); చెలువు= అందముయొక్క; పెంపు= వృద్ధిని; వహించు= ధరించు; పురంధ్రిన్= గృహిణిని; పోలన్= పోలునట్లుగా; ఉద్ధత= ఉన్నతమయిన; ముఖ= ముఖములతో; బంధుర= సుందరముగా వంగిన; అంగ= అవయవములయొక్క; లలితంబులును= సౌకుమార్యములు కలిగినట్టియు - (ముఖములు ఎత్తుగా ఉండి, మెడ, నడుము సుందరముగా వంగిఉండి - సుకుమారముగా ఉన్న ఉత్తమజాతి అశ్వములను తురంగములందురు); ఊర్జిత= అధికమైన; కింకిణీ= చిరుగంటలయొక్క (అనగా గుర్రములకాళ్లకు కట్టిన గజ్జెలయొక్క); ఝణత్కృతి= ఝణం ఝణ ధ్వనులు; పటు= చురుకుతనమును చూపుటకు సమర్థమయిన; హేషలున్= సకిలింపులు కలిగినట్టియు అగు; తురంగముల్= గుర్రాలు; తగన్= ఒప్పుగా; ఉదీర్ణములై= గొప్పవియై; నడచెన్= (యుద్ధభూమికి) నడచెను.

తాత్పర్యం: (ఇది చతురంగబలములలో తురంగదళ వర్ణనం.) యుద్ధభూమికి వెడలుతున్న తురంగాలు తాళ లయాన్వితముగా నడుస్తున్నాయి. ఆ తురంగాల గిట్టలతో తొక్కబడిన భూమి ప్రాణప్రియుడి నఖక్షతాలవలన అతిశయించిన సౌందర్యం కల గృహిణిని పోలి ఉన్నది. (ఉత్తమజాతి తురగాల నడకలు తాళలయాన్వితంగా ఉండటం లోకప్రసిద్ధం). ఉన్నతాలయిన ముఖాలతో సుందరంగా వంగిన మెడ, నడిమి భాగాలతో సుకుమారాలయిన అవయవాలతో ఆ తురంగా లొప్పుతున్నవి. (గుర్రాల కాళ్ళకు గజ్జెలు కట్టటం, ఏనుగుల మెడలకు ఘంటలు కట్టటం సంప్రదాయం, సౌందర్య పోషకం.) దృఢమయిన ఆ చిరుగంటల ఝణంఝణ ధ్వనులు, చురుకుతనాన్ని చూపటానికి సమర్థమయిన సకిలింపులు కల ఆ తురంగాలు ఒప్పుగా గొప్పగా యుద్ధభూమికి నడచాయి.

విశేషం: ఇది శ్లేషానుప్రాణిత ఉపమ. బహుతాల+సత్ఖుర - బహుతా+లసత్ఖుర - అని పదచ్ఛేదము. అందువలన ఖండశ్లేష. ఉత్ప్రేక్ష అనగా ఊహ. ఉపమాన ధర్మసంబంధంతో ఉపమేయాన్ని ఉపమానంగా ఊహించి చెప్పుట ఉత్ప్రేక్ష. ఇచ్చట - ఉపమేయం మేదిని. ఉపమానం పురంధ్రి. ఖుర విఘట్టితమునకు నఖరేఖలకు ధర్మసంబంధం. పోల(న్) - వాచకం.

సీ. **మీఱిన యుబ్బున మీఁదికిఁ గాళులు । సాఁచు రథ్యంబుల చటులతయును**
లలిఁ బెండ్లికినిఁ బోవు చెలువున విలసిల్లు । సూతజనంబు విస్ఫూర్జితంబు
జతనంబు మేలిమిఁ జారుఘోరములగు । నవయవంబుల విభవాతిశయము
బిరుదుల నుద్భటస్ఫురణంబులై క్రాలు । కేతనంబుల సముద్ద్యోతితంబు

తే. **సొంపు మిగులంగ జోదుల యంపపొదుల । దీప్తులును లేఁత నవ్వుల దీధితులును**
హారిరశ్ములుఁ గీడ్వెర నగుచు వెలుఁగఁ । దేరు లరిగె నుద్దామతఁ గౌరవేంద్ర! **104**

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= కౌరవులకు ప్రభువుఅయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; మీఱిన= అతిశయించిన; ఉబ్బునన్= ఆనందముతో; మీఁదికిన్= పైకి; కాళులు= కాళ్లు; చాఁచు= చాచెడి; రథ్యంబుల= గుర్రములయొక్క; చటులతయును= చంచలత్వమును; లలిన్= ఉత్సాహంతో; పెండ్లికినిన్= పెండ్లికొరకు; పోవు= వెడలునట్లుగా; చెలువునన్= సొంపుతో; విలసిల్లు= ప్రకాశించు; సూతజనంబు= సూతజనులయొక్క (అనగా రథములను తోలు జనులయొక్క) (గుర్రములను మేపుచు - రథములను తోలుచూ జీవించువారు సూతులు. వీరు సారథులుగా కూడ ఉండవచ్చును. కాని సారథులందరు సూతులు మాత్రముకారు. పార్థసారథి శ్రీకృష్ణుడు సూతుడు కాడు. కర్ణసారథి శల్యుడు సూతుడుకాడు.) విస్ఫూర్జితంబు= అరుపులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బొబ్బలతో, చప్పట్లతో నిండిన శబ్దముతో మిక్కిలి ప్రకాశవంతమగు; జతనంబుమేలిమిన్- జతనంబు= ప్రయత్నముయొక్క- మేలిమిన్= ఆధిక్యము వలన (అనగా అధిక ప్రయత్నముతో చేయబడిన); చారు= సుందరములు; ఘోరములు= భయంకరములు; అగు= అయినట్టి; అవయవంబుల= అంగములయొక్క (అనగా రథాంగములయొక్క) విభవ= సంపద అనగా శక్తియొక్క; అతిశయము= ఆధిక్యమును; బిరుదులన్= బిరుదులవలన (అనగా - అథిరథుడు - మహారథుడు - రథుడు - అర్ధరథుడు - మొదలగు శౌర్య చిహ్నములగు బిరుదులవలన); ఉద్భట= అధికమయిన; స్ఫురణంబులై= తలపులు తోచునట్లు; క్రాలు= ఒప్పు; కేతనంబుల= జెండాయొక్క (రథములమీద వారి వారి శౌర్యచిహ్నములు సూచించుటకు కట్టబడిన టెక్కెములు); సముద్యోతితంబు= గొప్ప ప్రకాశము కలిగినదియును; సొంపు= సౌందర్యము; మిగులంగన్= అతిశయింపగా; జోదుల= యోధులయొక్క; అంపపొదుల= తూణీరములయొక్క; దీప్తులును= కాంతులును; లేఁత నవ్వుల దీధితులును= చిరునవ్వుల యొక్క కాంతులును (అనగా పరిహాసమును సూచించు చిరునవ్వులు); హారి రశ్మలున్- హారి= మనోజ్ఞములైన; రశ్మలున్= పగ్గములును (అనగా కళ్ళెములు); కీడ్పెరన్= శత్రువులకు కీడు; సూచించేది; అగుచున్= సూచించునది అగుచు; వెలుఁగన్= ప్రకాశింపగా - ఉద్దామతన్= అడ్డులేని విధముగా; తేరులు= రథములు (అనగా రథ దళము); అరిగెన్= వెడలెను.

తాత్పర్యం: (ఇది చతురంగ బలములలో రథ దళముయొక్క వర్ణనం.) ఓ ధృతరాష్ట్ర మహారాజా! అతిశయించిన ఆనందంతో కాళ్ళు పైకి చాచే చంచలత్వం, - ఉత్సాహంతో పెండ్లికి పోయేటట్లుగా సొంపుతో సూతజనులు చేసే శబ్దాలు-అధిక ప్రయత్నంతో చేయబడిన - భయద సుందరమైన రథాంగాల వైభవాతిశయం, శౌర్యచిహ్నాలగు బిరుదముల వలన అధికస్ఫూర్తితో ఒప్పు జెండాల అధిక ప్రకాశం, సౌందర్యం అతిశయింప యోధులయొక్క అమ్ముల పొదుల కాంతులు, చిరునవ్వుల కాంతులు మనోజ్ఞాలయిన కళ్ళాలు కలిగి ఇతరులయిన శత్రుపక్షాన్ని తక్కువచేస్తూ అశుభసూచక మవుతూ ప్రకాశించగా అడ్డులేని విధంగా రథాలు యుద్ధభూమికి వెడలాయి.

విశేషం: అలం: స్వభావోక్తి. చైతన్య చిత్రణంలో తిక్కయజ్వ సిద్ధహస్తులు. ఈ సీసపద్యంలో దూరమునుండి దర్శించేటప్పుడు కనిపించే దృశ్యరూప చైతన్య చిత్రణం చేయబడినది. అందువలన ముందుగా ఉత్సాహంతో కాళ్ళు పైకెత్తు రథ్యముల చంచలత్వం, ఆ తరువాత రథ్యములను తోలు సూతజనుల సొగసులు, అటు పిమ్మట రథాంగముల వైభవం, అనంతరం రథాలపై నుండు టెక్కెముల రెపరెపలు, యోధుల తూణీరాలు, లేతనవ్వులు, కళ్ళెములు కాంతులు - ఇది క్రమ దృశ్యరూప చిత్రణం.

చ. కడఁకయు లావునుం గరఁగి గట్టిగఁ గూర్చి యొనర్చినట్టి పే
రొడళులఁ దాల్మియుం గడిమియుం గలయం బరికించి యందు నే
ర్పిడుకొని గాఢభంగి రచియించిన చందము నెమ్మనంబులం
గడుఁ జెలువొంద నుబ్బి వడిఁ గాల్బలమేఁగెఁ గరం బుదగ్రతన్. 105

ప్రతిపదార్థం: కడఁకయున్= ప్రయత్నమును; లావునున్= బలమును; కరఁగి= కరగించి; గట్టిగన్= కఠినముగ; కూర్చి= కలిపి; ఒనర్చునట్టి= తయారుచేసినట్టి; పేరొడళులన్= పెద్ద దేహములను; తాల్మియున్= ఓర్పును; కడిమియున్= పరాక్రమమును; కలయన్= కలిసిపోవునట్లుగా; పరికించి= వీక్షించి; అందున్= అందులో; నేర్పు= నేర్పరితనమును; ఇడుకొని= ఉంచుకొని (అందులో సామర్థ్యము కలవారిని ఉంచుకొని); గాఢ= తీక్ష్ణమయిన; భంగిన్= విభాగముగా; రచియించిన= సేనను రూపొందించిన; చందమున్= విధానంతో; నెమ్మనంబులన్= నిండైన మనస్సులందు; కడున్= మిక్కిలి; చెలువు= సౌందర్యం; ఒందన్= పొందగా; ఉబ్బి= సంతోషంతో పొంగిపోయి; కరంబు= మిక్కిలి; ఉదగ్రతన్= భయంకరంగా; వడిన్= వేగంగా - కాల్బలము= పదాతిదళము; ఏఁగెన్= వెడలెను.

తాత్పర్యం: (ఇది చతురంగ బలాలలో పదాతివర్ణనం) ప్రయత్నం, బలం కలగలిపి కరిగించి గట్టిగా పోతపోసినట్టి పెద్ద పెద్ద దేహాలు గల వాళ్లలో ఓర్పు, పరాక్రమం కలగలిపి బాగుగా పరీక్షించి అందులో నేర్పరితనం కలవారిని మాత్రమే పరిగణించి అధిక విభాగంగా సేనను రూపొందించిన విధానంతో నిండు మనసులందు మిక్కిలి సౌందర్యం పొందగా, సంతోషంతో పొంగిపోయి మిక్కిలి భయంకరంగా వేగంగా కాల్బలం యుద్ధభూమికి వెడలింది.

విశేషం: యుద్ధ సన్నద్ధమయి వెడలే ఈ చతురంగ బలవర్ణనం మూలంలో లేదు. అందువలన ఇది తిక్కయజ్వ కవనరామణీయకానికి, స్వీయకల్పనకు, స్వతంత్ర భావనాపటిమకు నిదర్శనం. ఉత్తమ కవనానికి వర్ణన, చిత్రణములు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు. ఈ వర్ణన చిత్రణములే నిశ్చేతన పదార్థాలకు చేతనత్వం పరికల్పించును. స్థావరాలను జంగమాలుగా రూపొందించును. మహాకవుల బుద్ధిశక్తికి రెండు ముఖ్య లక్షణములుండును. ఒకటి ఊహ. రెండు భావన. ఊహకల్పనము వర్ణనం. సత్యభావన చిత్రణం. కవిబ్రహ్మ తిక్కయజ్వ సత్యాత్మిక భావన ఈ చతురంగ బల చిత్రణమున సాక్షాత్కరించింది. 'రూపచిత్రణం, భావ చిత్రణం - చైతన్యచిత్రణం' అని చిత్రణం మూడు విధాలు. వర్ణ్య వస్తువునందలి - రూప, భావ, చేతనత్వములు కుసుమించి, వికసించి ఫలిస్తే కావ్యశరీరానికి ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది.

వ. ఇట్లు కురుబలంబు సమరతలంబు చేరం బోవునంతం బాండవబలంబును జనుదెంచె ననిన విని యాంబికేయుండు సంజయున కిట్లనియె. 106

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; కురుబలంబు= కౌరవసైన్యము; సమరతలంబు= యుద్ధభూమి; చేరన్= చేరుటకు; పోవన్= పోవుచుండగా; అంతన్= ఆ సమయమున; పాండవబలంబును= పాండవులయొక్క సైన్యమును; చనుదెంచెన్= వచ్చెను; అనినన్= అని చెప్పగా; విని; ఆంబికేయుండు= అంబిక కుమారుడైన ధృతరాష్ట్రుడు; సంజయునకున్; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: ఈ ప్రకారంగా కౌరవసైన్యం యుద్ధభూమి చేరేటంతలో పాండవ సైన్యం కూడా యుద్ధభూమి చేరిన దని విని ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

తే. 'సురనదీ సుతుచావును గురుని చావుఁ । గర్ణుచావును వినిన నా కర్ణములకు
శల్యుచావు, దుర్యోధనుచావుఁ జెప్పి, । యధికతరముగ సంతోష మావహింపు. 107

ప్రతిపదార్థం: సురనదీ= ఆకాశగంగానదియొక్క; సుతు= కుమారుడైన భీష్మునియొక్క; చావును= మరణమును; గురుని= ద్రోణునియొక్క; చావున్= మరణమును; కర్ణుచావును; కర్ణునియొక్క మరణమును; వినిన= ఆలకించిన; నా కర్ణములకున్= నా చెవులకు; శల్యుచావున్= శల్యుడి యొక్క మరణమును; దుర్యోధను= దుర్యోధనునియొక్క; చావున్= మరణమును; చెప్పి= వినిపించి; అధికతరగముగన్= మిక్కిలి ఎక్కువగ; సంతోషము; ఆవహింపుము= కలుగచేయుము.

తాత్పర్యం: 'భీష్మ ద్రోణ కర్ణుల మరణములను ఆలకించిన నా చెవులకు శల్య దుర్యోధనుల మరణాలను కూడా వినిపించి అనుభవశక్యంకాని సంతోషమును కలుగచేయుము. (ఇది ధృతరాష్ట్రుడి దుఃఖాతిశయ స్థితిని సూచిస్తున్నది.)

క. అమ్మద్రవిభుని ధర్మజుఁ । డెమ్మెయిఁ బరిమార్చెఁ గౌరవేంద్రుని భీముం
డెమ్మెయి గీటడఁచె రణం । బెమ్మెయిఁ బరిపాటిఁ జెల్లె? నేర్పడఁ జెపుమా!' 108

ప్రతిపదార్థం: ఆ+మద్రవిభుని= ఆ మద్రదేశ ప్రభువు అయిన శల్యుడిని; ధర్మజుండు= ధర్మరాజు; ఏ+మెయిన్= ఏ విధంగా; పరిమార్చెన్= సంహరించాడు; కౌరవేంద్రుని= కౌరవులకు ప్రభువు అయిన దుర్యోధనుడిని; భీముండు; ఏ+మెయిన్= ఏ విధంగా; గీటడఁచెన్= చంపెను; రణంబు= యుద్ధం; ఏ+మెయిన్= ఏ విధంగా; చెల్లెన్?= జరిగెను?; పరిపాటిన్= క్రమముగా; ఏర్పడన్= తేటతెల్లంగా; చెపుమా!= చెప్పుము.

తాత్పర్యం: మద్రదేశ ప్రభువు అయిన శల్యుడిని ధర్మరాజు ఏ విధంగా సంహరించాడు? దుర్యోధనుడిని భీముడు ఎట్లు చంపాడు? యుద్ధం ఏ విధంగా జరిగింది? ఇది అంతా క్రమంగా తేటతెల్లంగా చెప్పుము.'

వ. అనుటయు సంజయుం డమ్మనుజపతి కిట్లను 'వగచుకొలంది కడచనియె; ధీరుండవై వార్త లవధరింపుము. 109

ప్రతిపదార్థం: అనుటయున్= (ధృతరాష్ట్రుడు) ఇట్లు అడుగగా; సంజయుండు; ఆ+మనుజపతికిన్= మానవులకు ప్రభువు అయిన ఆ ధృతరాష్ట్రుడికి; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; వగచు కొలంది= దుఃఖంయొక్క మితి; కడచనియెన్= దాటింది (అనగా ఇప్పటికే దుఃఖం అనుభవించగల మితి దాటిపోయింది కాబట్టి); ధీరుండవు+ఐ= ధైర్యంకలవాడవై; వార్తలు (నేను చెప్పే); వృత్తాంతాలు; అవధరింపుము= ఏకాగ్రతతో శ్రద్ధగా వినుము.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఇట్లా అడుగగా సంజయుడు ఆ ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: దుఃఖాన్ని అనుభవించగల మితి దాటింది. ఇక ధీరుడవై నేను చెప్పే వృత్తాంతాలు, యుద్ధవిషయాలు శ్రద్ధగా వినుము.

క. గంగాసుతగురుకర్ణుల । సంగరమునఁ బాండుసుతులు సంపుట గన్నా
రం గనియు నీ తనయు లా । సం గూరిరి వారిఁ జంపు శల్యుం డనుచున్. 110

ప్రతిపదార్థం: సంగరమునన్= యుద్ధమునందు; పాండుసుతులు= పాండురాజ కుమారులు; గంగాసుత= గంగాదేవి పుత్రుడు అయిన భీష్ముడిని; గురు= ద్రోణుడిని; కర్ణులన్= కర్ణులను; చంపుట= సంహరించుట; కన్నారన్= ప్రత్యక్షముగా; నీ తనయులు= నీకొడుకులు; కనియున్= చూచియు; శల్యుండు; వారిన్= వారిని (ఆ పాండవులను); చంపున్= చంపును; అనుచున్= అనుచు; ఆసన్= ఆశను; కూరిరి= పొందిరి.

తాత్పర్యం: యుద్ధంలో పాండవులు భీష్మద్రోణ కర్ణులను సంహరించటం ప్రత్యక్షంగా చూచి కూడా నీ కొడుకులు శల్యుడు ఆ పాండవులను చంపుతాడనే పేరాశ పొందారు.

వ. దుర్యోధనుండు దిక్కుమాలి యుండియు నడియాసం జేసి తన్ను సంపన్నునిం గాఁ దలంచుచు. 111

ప్రతిపదార్థం: దుర్యోధనుండు; దిక్కుమాలి= దిక్కులేక (అనగా ఏ మార్గములేక); ఉండియున్= ఉన్నవాడయ్యును; అడి+ఆసన్+చేసి= వ్యర్థమైన ఆశవలన; తన్నున్= తనను; సంపన్నునిన్= సంపదకలిగిన వాడు; కాన్= అగునట్లుగా; తలంచుచున్= ఆలోచించుచూ.

తాత్పర్యం: దుర్యోధనుడు దిక్కుమాలినవాడై ఉండికూడా పేరాశ వలన తనను తాను సకలైశ్వర్యములు కలవాడినిగా తలుస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **అనుజులుఁ దాను శల్యునిఁ బ్రియాతిశయంబునఁ జేరఁ బోవ నా**
యన మును కర్ణుఁ డర్జున శరాహతిఁ గూలిన నుబ్బి భీముఁ డా
ర్చిన నడలొంది తల్లడిలు చిత్తము లూఱట నొంద వారలం
గనుఁగొని పల్కులన్ శ్రుతిసుఖం బొనరించె నుదగ్రమూర్తియై. 112

ప్రతిపదార్థం: అనుజులున్= తమ్ములును; తాను(దుర్యోధనుడు); ప్రియ= ప్రేమయొక్క; అతిశయంబునన్= ఆధిక్యంవలన; శల్యునిన్= శల్యుడిని; చేరన్= సమీపమునకు; పోవన్= వెళ్లగా; ఆయన= ఆ శల్యుడు; మును= ఇంతకుముందు; అర్జున= అర్జునునియొక్క; శర= తీక్ష్ణమయిన బాణములయొక్క; ఆహతిన్= దెబ్బలవలన; కర్ణుడు; కూలినన్= పడిపోగా; భీముడు; ఉబ్బి= సంతోషముతో పొంగి; ఆర్చినన్= పెద్దగొంతుతో అరవగా; అడలు= భయము (లేక) దుఃఖము; ఒంది= పొంది; తల్లడిలు= చలించిపోయిన; చిత్తములు= మనస్సులు; ఊఱటన్= ఉపశమనం; ఒందన్= పొందునట్లుగా; వారలన్= వారిని (దుర్యోధనాదులను); ఉదగ్ర= భయంకరమయిన; మూర్తియై= రూపంకలవాడై (శల్యుడు); కనుఁగొని= చూచి; పల్కులన్= మాటలతో; శ్రుతిసుఖంబు= చెవులకు ఇంపుకలిగేటట్లు; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: తమ్ములు, తాను అధిక ప్రేమతో శల్యుడి చెంతకు చేరగా ఆ శల్యుడు అంతకుముందు అర్జునుడి బాణాల దెబ్బలకు కర్ణుడు కూలగా భీముడు సంతోషంతో పొంగి అరిచిన ఆర్పులకు భయపడి చలించిపోయిన మనసులకు ఉపశమనం కలిగేటట్లు - ఆ దుర్యోధనాదులను చూచి భయంకర రూపం కలవాడై మాటలతో వారి చెవులకింపు కలిగించాడు.

వ. **ఇట్లు సమరోత్సాహ సమగ్రుండయిన మద్రపతి సర్వతోభద్ర వ్యూహంబు పన్నించె నందు ముఖంబున మద్రపతి గర్ణపుత్ర ప్రముఖ పరివృతుండై తాను నిలిచె. వలపట శకయవనసమేతుండై కృపాచార్యుండును దాఁపటఁ ద్రిగర్తసహితుండై కృతవర్మయు వెనుకఁ గాంభోజసహాయుండై యశ్వత్థామయు నడుమఁ గురువీర పరిరక్షితుండయి కౌరవేశ్వరుండును నతని ముందటఁ గరిఘటాగ్ర భాగవర్తియై బహుళ చతురంగంబులతోడ శకునియు నిలుచునట్లుగా నొనర్చి పేర్చి యురవణించె. నంతక మున్న పాండవులు మూఁడు మొగంబులుగా మోహరించిరి. ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకు లగ్రేసరులుగా భీమార్జును లగ్రజునగ్ర భాగంబున శోభిల్లి సీతారూప విద్యోతితంబైన శల్యుకేతనంబు సూచి త్రోచి నడచి' రనిన విని ధృతరాష్ట్రుం డప్పటికి మనకుఁ బాండవులకుం గల సేనాంగంబుల కొలంది యెఱింగింపు' మనవుడు సంజయుం డా జనపతికిట్లను మనకుఁ బదునొకండు వేలు రథంబులును బదివేలు నేడు నూఱు గజంబులును రెండు లక్షలు హయంబులును మూఁడు కోట్లు పదాతులును వారికి నాఱువేలు రథంబులును మూఁడువే లేనుంగులును లక్ష గుఱ్ఱంబులును కోటి కాల్బలంబులును గలిగియుండె నయ్యొడ్డనంబు లొండొంటి గెలుచు నగ్గలిక డగ్గరియె నట్టియెడ.** 113

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; సమర= యుద్ధమునందలి; ఉత్సాహ= ప్రయత్నముతో; సమగ్రుండు= సంపూర్ణుడు; అయిన; మద్ర= మద్రదేశమునకు; పతి= అధిపతి (భర్త) అయిన శల్యుడు; సర్వతోభద్ర= సర్వతోభద్రము అను పేరుగల; వ్యూహంబు= యుద్ధ తంత్రరచనము; పన్నించెన్= సిద్ధము చేసెను; (మహాభారత యుద్ధమున భీష్ముడు - గరుడ వ్యూహమును ద్రోణుడు పద్మవ్యూహము చక్రవ్యూహము చక్రశకట వ్యూహములను; కర్ణుడు-మకర వ్యూహమును; శల్యుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సర్వతోభద్రవ్యూహమును రచించిరి. అర్జునుని ప్రతిజ్ఞనుండి జయద్రథుని రక్షించుటకు ద్రోణుడు చక్రశకట వ్యూహమును రచించెను. సర్వతోభద్రము అను ఒక యోగముద్ర కలదు. దీనికి వరుణుడు అధిదైవము. విష్ణు రథమునకు సర్వతోభద్రమని పేరు.); అందున్= అందు; (ఆ సర్వతోభద్రవ్యూహమునందు); ముఖంబునన్= ముఖస్థానమున; మద్రపతి= మద్రదేశమునకు భర్త అయిన శల్యుడు; ప్రముఖ= గొప్పవారైన; కర్ణపుత్ర= కర్ణుడియొక్క పుత్రులతో; పరివృతుండై= చుట్టబడినవాడై; తాను (శల్యుడు); నిలిచెన్= ఉండెను; వలపటన్= కుడివైపున; శక= శకులతో; యవన= యవనులతో; సమేతుండై= కూడియున్నవాడయి; కృపాచార్యుండును; దాఁపటన్= ఎడమవైపున; త్రిగర్త= త్రిగర్త దేశవీరులతో; సహితుండై= కూడియున్నవాడై; కృతవర్మయున్= కృతవర్మయును; వెనుకన్= వెనుకవైపున; కాంభోజసహాయుండై= కాంభోజవీరులు తోడుగాఉన్నవాడై; అశ్వత్థామయున్; నడుమన్= మధ్యభాగమున-కురువీర= కౌరవవీరులచేత; పరిరక్షితుండు+అయి= కాపాడబడువాడై; కౌరవ= కౌరవులకు; ఈశ్వరుండును= ప్రభువు అయిన దుర్యోధనుండును; అతనిముందటన్= ఆ దుర్యోధనుడిముందు; కరి= ఏనుగుల; ఘటా= సమూహంయొక్క; అగ్రభాగ= ముందుభాగమున; వర్తియై= ఉన్నవాడై; బహుల= విశాలమైన; చతురంగంబులతోడన్= చతురంగబలంబులతోడ; శకునియున్; నిలుచునట్లుగాన్= ఉండునట్లుగా; ఒనర్చి= చేసి; పేర్చి= చతరంగబలములు ఒకదాని తరువాత ఒకటి వరుసగా ఉంచి; ఉరవణించెన్= విజృంభించెను; అంతకమున్న= అంతకంటె ముందుగా; పాండవులు; మూఁడు మొగంబులుగాన్= మూఁడు ముఖములుగా (త్రిముఖ వ్యూహముతో); మోహరించిరి= వ్యూహమును పన్నిరి; ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకులు= ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకియును; అగ్రేసరులుగాన్= ముందు ఉన్నవారు కాగా (మూడు ముఖములయొక్క ముందుభాగమున ముప్వరును యథాక్రమముగా ఉండగా); భీమార్జునులు= భీముడును, అర్జునుడును; అగ్రజు= అన్న అయిన ధర్మరాజుయొక్క= అగ్రభాగంబునన్= ముందుభాగమునందు; శోభిల్లి= ప్రకాశించి; సీతా= పసుపు రంగుకల (లేక చిత్రవిచిత్ర వర్ణములు కల); రూప= ఆకారముతో; విద్యోతితంబైన= ప్రకాశించుచున్న; శల్య= శల్యునియొక్క; కేతనంబు= రథముపై ఉన్నటెక్కెము (జెండా); చూచి; త్రోచి= వేగిరపడి; నడచిరి= యుద్ధమునకు వెడలిరి; అనినన్= (సంజయుడు) ఇట్లు చెప్పగా; విని; ధృతరాష్ట్రుండు; అప్పటికిన్= ఆ సమయమునకు; మనకున్= మనకు (అనగా కౌరవపక్షమునకు); పాండవులకున్; కల= ఉన్నట్టి; సేనా= సైన్యముయొక్క; అంగంబుల= విభాగములయొక్క (అనగా చతురంగంబులయొక్క); కొలంది= పరిమితి; ఎఱింగింపుము= తెలియచేయుము; అనవుడున్= (ధృతరాష్ట్రుడు) ఇట్లు అడిగినవెంటనే; సంజయుండు; ఆ జనపతికిన్= ఆ ధృతరాష్ట్రునికి; ఇట్లు= ఈ విధముగా; అనున్= చెప్పెను; మనకున్= మనకు (కౌరవపక్షమునకు); పదునొకండువేలు= పదకొండు వేలు; రథంబులును; పదివేలు; ఏడునూఱు= ఏడువందలు; గజంబులును= ఏనుగులును; రెండులక్షలు; హయంబులును= గుర్రములును; మూడుకోట్లు; పదాతులును= కాల్బలమును; వారికిన్ (అనగా పాండవులకు); ఆఱువేలు; రథంబులును; మూడువేలు; ఏనుంగులును; లక్ష గుఱ్ఱంబులును; కోటి; కాల్బలంబులును; కలిగి; ఉండెన్; అ+ఒడ్డనంబులు= ఆ సేనావ్యూహంబులు; ఒండొటిన్= ఒకదానితో ఒకటి క్రమముగా; గెలుచు= గెలిచే; అగ్గలికన్= ఉత్సాహంతో; డగ్గఱియెన్= దగ్గరపడియెను (సమీపమునకు చేరెను); అట్టియెడన్= అటువంటి సమయంలో.

తాత్పర్యం: ఈ ప్రకారంగా యుద్ధ సన్నద్ధుడయిన శల్యుడు సర్వతోభద్ర వ్యూహం సిద్ధం చేశాడు. ఆ సర్వతోభద్ర వ్యూహమునందు ముఖస్థానంలో కర్ణపుత్రులతో చుట్టబడినవాడై శల్యుడు నిలిచాడు. కుడివైపు శకయవన సమేతుడై కృపాచార్యుడున్నాడు. ఎడమవైపు త్రిగర్త వీరులతో కూడి కృతవర్మ ఉన్నాడు. వెనుకవైపు కాంభోజులు తోడుగా అశ్వత్థామ నిలిచాడు. నడుమభాగంలో కురువీరులతో దుర్యోధనుడు ఉన్నాడు. ఆ దుర్యోధనుడికి ముందు గజసమూహం ఉన్నది. దానికి అగ్రభాగంలో చతురంగబలాలతో శకుని నిలిచాడు. ఈ విధంగా సర్వతోభద్రవ్యూహాన్ని సిద్ధపరచి, ఒకటి తరువాత ఒకటి వరుసగా ఉంచి, వేగిరపాటుతో శల్యుడు సమరోత్సాహ సమగ్రుడయ్యాడు. అంతకంటె ముందుగానే పాండవులు మూడు ముఖాలుగా వ్యూహాన్ని సిద్ధపరిచారు. అనగా త్రిముఖ వ్యూహాన్ని పన్నారు. ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకులు ముగ్గురు మూడు ముఖాల సేనలకు అగ్రభాగంలో నిలిచారు. భీమార్జునులు

అగ్రజుడయిన ధర్మరాజునకు ముందుభాగాన నిలిచి ప్రకాశించారు. అప్పుడు పసుపురంగుతో ప్రకాశిస్తున్న శల్యుడి కేతనం చూచి పాండవులు వేగంగా యుద్ధానికి నడిచారు. సంజయుడు ఇట్లా చెప్పగా విని ధృతరాష్ట్రుడు: 'మనకును, పాండవులకు ఆ యుద్ధ సమయంలో కల చతురంగ బలముల పరిమితిని వివరించుము' అన్నాడు. ఇట్లు ధృతరాష్ట్రుడు అడిగిన వెంటనే సంజయుడు ధృతరాష్ట్రుడి కిట్లా చెప్పాడు. 'మనకు అనగా కౌరవపక్షానికి, పదకొండు వేలు రథాలు, పదివేల ఏడువందల ఏనుగులు, రెండు లక్షల గుర్రాలు, మూడు కోట్లు కాల్బలం, పాండవులకు ఆరువేలు రథాలు, మూడువేలు ఏనుగులు, లక్ష గుర్రాలు, కోటి కాల్బలం ఉన్నది. ఇట్లుండగా ఆ సేనా వ్యూహాలు ఒకదానితో ఒకటి గెలిచే ఉత్సాహంతో సమీపించాయి. అటువంటి సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: మహాభారతముననుసరించి త్రిగర్తమను జనపదము కలదు. అచ్చట నివసించు రాజుపేరు త్రిగర్తుడు. త్రిగర్తరాజు 'సురథుడు' అనువాడు కలడు. అతడు ఏనుగుతో సహా నకులుడిచే చంపబడెను (ద్రోణపర్వము). త్రిగర్తరాజు 'సుశర్మ' ప్రసిద్ధుడు. ఇతడు దక్షిణ గోగ్రహణము నిర్వహించెను. అందు భీముడిచే ఓడింపబడినాడు. ఇక ఒక త్రిగర్తరాజునకు అయిదుగురు సోదరులు కలరు. అందు 'సత్యరథుడు' ముఖ్యుడు. త్రిగర్తదేశ నామముతో వ్యవహరింపబడు వీరులైన రాజులు అనేకులు కురుక్షేత్ర సంగ్రామమున కౌరవపక్షమున ఉండి పోరాడిరి. ఈ సర్వతోభద్ర వ్యూహమున - కృతవర్మతో ఉన్న త్రిగర్తుల పేర్లు చెప్పుటకు వలనుపడదు. 'సుశర్మ' కాని 'సత్యరథుడు' కాని కావచ్చును. మూలమున 'త్రిగర్తైః' అని ఉన్నందువలన త్రిగర్త దేశముయొక్క వీరులు అని చెప్పుట ఉచితము. కాంభోజదేశమనగా-ప్రస్తుత 'కాబోలి' ముఖ్య పట్టణముగా గల ఆఫ్ఘనిస్తాన్. మహాభారత కాలమున ఆ దేశమును పాలించురాజు సుదక్షిణుడు. అతడు మహారథుడు. ఈ సుదక్షిణుని అర్జునుడు సంహరించినట్లు ద్రోణపర్వమున కలదు. అందువలన సుదక్షిణుని తండ్రి సైన్యసమేతముగా ఇచ్చట అశ్వత్థామకు తోడుగా ఉండి ఉండవచ్చును. మూలమున 'కాంబోజైః' అని ఉన్నందువలన కాంబోజవీరులు అని చెప్పుట ఉచితము. 'కాంబోజ' - 'కాంభోజ' - ఇందు 'కాంబోజ' శుద్ధరూపము.

ఉ. ఒండొరులన్ జయించుమతి నుద్భటలీలలఁ జాల నొప్పి య
ప్పాండవ కౌరవుల్ పెనఁగు భంగిఁ గనుంగొను వేడ్క నొక్కొ? యీ
తండు మహాద్రి నెక్కె ననఁ దద్దయుఁ జెన్నగు బింబకాంతి న
ర్కుం డభిరాముఁడై పొడుపు గొండపయిన్ వెలుఁగొందెఁ జూడఁగన్. 114

ప్రతిపదార్థం: ఒండొరులన్= ఒకరినొకరు (పరస్పరము); జయించు= గెలుచు; మతిన్= తలంపుతో; ఉద్భట= అధికమయిన; లీలలన్= చేష్టలతో (అనగా సంగ్రామ క్రీడలతో); చాలన్= మిక్కిలి; ఒప్పి= ప్రకాశించి; ఆ+పాండవకౌరవుల్= ఆ పాండవులు, కౌరవులు, పెనఁగు= యుద్ధముచేయు; భంగిన్= విధానమును; కనుంగొను= చూచెడి; వేడ్కన్= కుతూహలముతో; ఈతండు= ఈతడు (ఈ సూర్యుడు); మహా+అద్రిన్= ఉదయపర్వతమును; ఎక్కెన్= ఎక్కెను; ఒక్కొ?; అనన్= అనునట్లుగా; తద్దయున్= మిక్కిలి; చెన్ను+అగు= ఎర్రని; బింబకాంతిన్= బింబముయొక్క ప్రకాశంతో; అర్కుండు= సూర్యుడు; చూడఁగన్= చూడగా; అభిరాముడై= మనోహరుడై; పొడుపు= తూరుపు; కొండపయిన్= కొండమీద; వెలుఁగు+ఒందెన్= ప్రకాశించెను.

తాత్పర్యం: ఒకరినొకరు పరస్పరం జయించే తలంపుతో ఆ పాండవ కౌరవులు యుద్ధనీతిని పాటించి యుద్ధాన్ని చేసే విధానాన్ని చూచే కుతూహలంతో సూర్యుడు మేరుపర్వతాన్ని అధిరోహించాడా? అనునట్లు మిక్కిలి ఎర్రని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బింబకాంతితో సూర్యుడు మనోజ్ఞుడై తూర్పు దిక్కున ప్రకాశించాడు. (సూర్యోదయ మయిందని తాత్పర్యం. ఇది సూర్యోదయ వర్ణనం.)

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

చ. అరసి యనాగతం బెఱుఁగునట్టి మనంబులు గల్గు పాండుభూ
వరసుతబంధుమిత్రకురువర్గ సుహృజ్జనకోటు లత్తఱిం
బొరసె నతిప్రమోదమును భూరివిషాదమునాఁగ నంబుజో
త్కరము వికాసమయ్యెఁ గుముదంబులు మీలన మొందె నెంతయున్. 115

ప్రతిపదార్థం: అరసి= ఆలోచించి; అనాగతంబు= జరుగబోవునది (భవిష్యము); ఎఱుఁగునట్టి= తెలియునట్టి; మనంబులు= మనస్సులు; కల్గు= కలిగిన; పాండుభూవర= పాండురాజుయొక్క; సుత= కుమారుల; బంధు= చుట్టముల; మిత్ర= స్నేహితులయొక్క; కోటులు= సమూహములు; కురువర్గ= కౌరవ విభాగముయొక్క; సుహృద్+జన= స్నేహితులయొక్క; కోటులు= సమూహములు; ఆ+తఱిన్= ఆ సమయమునందు; అతిప్రమోదమును; మిక్కిలి ఆనందమును; భూరి= అధికమయిన; విషాదమున్= దుఃఖమును; పొరసెన్= పొందెను; నాఁగన్= అన్నట్లు; అంబుజ= పద్మములయొక్క; ఉత్కరము= సముదాయముయొక్క; వికాసము= వికసనము; అయ్యెన్= ఐనది; కుముదంబులు= కలువలు; ఎంతయున్= మిక్కిలి; మీలనము+ఒందెన్= ముడుచుకొన్నాయి.

తాత్పర్యం: ఆలోచించి జరుగబోయేది తెలియునట్టి మనస్సులు కలిగిన పాండవులు, వారి బంధుమిత్ర సముదాయం అత్యంతానందాన్ని, అట్లే జరుగబోయేది తెలియునట్టి మనస్సులు కలిగి కురువర్గంవారి సుహృజ్జన సముదాయం అధిక దుఃఖమును పొందెనా! అనునట్లుగా ఆ సూర్యోదయ సమయంలో తామరలు వికసించాయి. కలువలు ముకుళించాయి.

విశేషం: అలం: క్రమాలంకార అనుప్రాణితం - ఉత్ప్రేక్షాలంకారం. ఇది సూర్యోదయ వర్ణనం. సూర్యోదయసమయాన తామరలు వికసించటం - కలువలు ముకుళించటం, చంద్రోదయ సమయాన కలువలు వికసించటం, తామరలు ముకుళించటం ప్రకృతి ధర్మం. తామర వికాసం ఆనందానికి, కుముదం ముకుళించటం దుఃఖానికి ప్రతీకలుగా పాండవపక్షం విజయానందం కౌరవపక్షం అపజయ దుఃఖం పొందేటట్లుగా క్రమంగా ఉత్ప్రేక్షించబడ్డాయి.

సీ. కుంజరనికురుంబకుంభస్థలీసంగ । సిందూరరుచులతోఁ జెలిమి చేసి
కేతనవ్రాతసంకీలితమాణిక్య । రశ్ముల గెడ విహారంబు సలిపి
సైనికనికరవక్షఃస్థలపరిలిప్త । కాశ్మీర దీప్తులఁ గౌఁగిలించి
దండనాథోత్కరచండభావోద్వృత్త । చక్షుఃప్రభలుఁ దారు సరసమాడి

తే. యంశుజాలంబు లుభయసైన్యంబులందుఁ । బరఁగి బహువిధశస్త్రాస్త్రకిరణతతుల
బెరసి పరభాగలక్ష్మి దీపించి మెఱయ । బాల్యరమణీయుఁడగు చిత్రభానుఁ డొప్పె. 116

ప్రతిపదార్థం: కుంజర= ఏనుగులయొక్క; నికురుంబ= సమూహముయొక్క; కుంభస్థలీ= కుంభస్థలములందు; సంగ= కూడి ఉన్న; సిందూర= సిందూరముయొక్క; రుచులతోన్= కాంతులతో; చెలిమిన్= స్నేహమును; చేసి; కేతన= జెండాలయొక్క;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్రాత= సమూహమునందు; సంకీలిత= పొదుగబడిన; మాణిక్య= కెంపులయొక్క; రశ్మలన్= కాంతులతో; గెడ= జతకూడి (స్నేహముచేసి); విహారంబు; సలిపి= చేసి; సైనిక= సేనలయొక్క; నికర= సమూహములయొక్క; వక్షఃస్థల= ఉరఃస్థలములందు; పరిలిప్త= బాగుగా పూయబడిన; కాశ్మీర= కుంకుమపువ్వుల; దీప్తులన్= కాంతులను; కౌఁగిలించి; దండనాథ= సైన్యాధిపతులయొక్క; ఉత్కర= సమూహములయొక్క; చండ= రోషపూరితమయిన; భావ+ఉద్వృత్త= భావములతో వృద్ధిపొందిన; చక్షుః= నేత్రములయొక్క; ప్రభలున్= కాంతులును; తారున్= తామును; సరసము= శృంగార సంభాషణము; ఆడి= చేసి; అంశు= కిరణములయొక్క; జాలంబులు= సమూహములు; ఉభయ= రెండుపక్షముల; సైన్యములందున్= సేనలయందును; పరఁగి= వ్యాపించి; బహువిధ= పలురకములయిన; శస్త్ర= సామాన్య ఆయుధములయొక్క; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములయొక్క; కిరణ= కాంతులయొక్క; తతులన్= సమూహాలతో; బెరసి= కలిసి; పరభాగ= తూర్పుదిక్కుయొక్క; లక్ష్మి= సౌందర్యము; దీపించి= ప్రజ్వలించి; మెరయన్= ప్రకాశించేటట్లుగా; బాల్య= పసితనంచేత; రమణీయుఁడు= సౌందర్యము కలవాడు(శోభకలవాడు); అగు= అయినట్టి; చిత్రభానుఁడు= బాలసూర్యుడు (ఉదయసూర్యుడు); ఒప్పెన్= ప్రకాశించెను.

తాత్పర్యం: ఉదయసూర్యుడి కిరణాలు ఏనుగుల గుంపులయొక్క కుంభస్థలాల అందలి సిందూరకాంతులతో చెలిమి చేసి, జెండా కొయ్యల సమూహాలందు పొదుగబడిన కెంపుల కాంతులతో జతగూడి విహారం సలిపి, సేనా సమూహాల ఉరఃస్థలాలందు పూయబడిన కుంకుమపువ్వుల కాంతులను కౌగిలించి, సైన్యాధిపతుల సమూహాలయొక్క రోషపూరిత భావాలతో వర్ధిల్లిన నేత్రకాంతులతో కదిసి సరసమాడి, ఉదయసూర్యుడి కిరణసమూహాలతో కలిసి, తూర్పుదిక్కుయొక్క సౌందర్యం ప్రజ్వలించి ప్రకాశించేటట్లుగా పసితనపు శోభతో ఉదయసూర్యుడు ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఇదికూడా సూర్యోదయ వర్ణనమే. ఈ వర్ణనలో తిక్కన శబ్దవైచిత్రిని ప్రదర్శించారు. ఒకే అర్థం ఇచ్చే పలు శబ్దాలను ప్రయోగించటం శబ్దవైచిత్రి. వర్ణనలందు శబ్దవైచిత్రిని, చిత్రణలందు అర్థవైచిత్రిని ప్రదర్శించటం తిక్కనకు అలవాటు. ఈ సీసపద్యంలో సమూహం అనడానికి నికురంబ, వ్రాత, నికర, ఉత్కర, జాలంబులు -తతులు, అని ఆరు శబ్దాలను ప్రయోగించాడు. అట్లే కాంతులు అనే అర్థానికి రుచులు, రశ్మలు, దీప్తులు, ప్రభలు, కిరణములు- అని అయిదు శబ్దాలు ప్రయోగించాడు. ఇంకను - లేత ఎరుపు రంగు అర్థానికి - సిందూరము - మాణిక్యము - కాశ్మీరము- అని మూడు శబ్దాలు ప్రయోగించాడు. ఈ సూర్యోదయవర్ణనం అమూలకం. అనేక వర్ణభాసురమైన బాలభానుని కాంతులు కుంజర-కేతన-సైనిక-దండనాథుల వివిధాంశములతో కూడి ఉన్నట్లు వర్ణింపబడెను. చెలిమిచేయుట, విహరించుట, కౌగిలించుట, సరసమాడుట అనునవి ఆ రెంటి సమ్మేళనమును సూచించు సరసశబ్దములు, సామ్యార్థవాచకాలు. ఈ వర్ణన తిక్కన వర్ణనానైపుణ్యానికి గీటురాయి.

కురుపాండవుల పదునెనిమిదవనాఁటి యుద్ధప్రారంభము (సం. 9-7-43)

వ. ఇట్లు పూర్వసంధ్యాసమయంబునఁ దార్కొని భేరీప్రముఖ తూర్య నిస్వనంబులు నింగి వొంగం జెలంగ.

117

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; పూర్వసంధ్యా= ఉదయసంధ్యయొక్క; సమయంబునన్= కాలమున; తార్కొని= ఎదుర్కొని; భేరీ= భేరీ అను వాద్య విశేషము; ప్రముఖ= మున్నగు; తూర్య= తూర్యములను వాద్య విశేషములయొక్క (తూతూ బూరాలని జానపదుల వ్యవహారము); నిస్వనంబులు= ధ్వనులు; నింగి= ఆకాశము; పొంగన్= పొంగునట్లుగా; చెలంగన్= మ్రోయగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ ప్రకారంగా ఉదయకాలంలో కురుపాండవులు వారి సైన్యాలు ఒకరినొకరు ఎదుర్కొని భేరీ తూర్యధ్వనులు ఆకాశం మారుమ్రోగేటట్లు వినిపిస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఒండొంటిఁ దాఁకి హేతులు । మండఁగఁ దచ్చూర్ణతతులు మహి రాలఁగ ను
ద్దండతఁ గలయం బెరసెను । రెండు మొనలుఁ గ్రూరతరపరిస్ఫురణములై. 118

ప్రతిపదార్థం: ఒండొంటిన్= ఒకదానితో ఒకటి; తాఁకి= తగిలి; హేతులు= పొడవైన కత్తులు; మండఁగన్= మండగా; తద్+ చూర్ణ= ఆ పొడులయొక్క; తతులు= సమూహములు; మహిన్= భూమియందు; రాలఁగన్= పడగా; కలయన్= అంతట; ఉద్దండతన్= అధికముగా; రెండుమొనలున్= రెండు పక్షాల సైన్యాలును; క్రూరతర= మిక్కిలి భయంకరముగా; పరిస్ఫురణంబులై= తలపించునవియై; బెరసెను= కలియబడెను.

తాత్పర్యం: కత్తులు ఒకదానితో మరియొకటి తగిలి మంటలు లేవగా పొడి అయిపోయిన ఆ ఆయుధాల పోగులు భూమిపై రాలగా భయంకరంగా ఆ కురు పాండవసేనా వ్యూహములు కలియబడ్డాయి.

వ. ఇత్తెఱంగునఁ దలపడి. 119

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ ప్రకారముగా; తలపడి= కలియబడి.

తాత్పర్యం: ఈ ప్రకారంగా కురుపాండసేనలు కలియబడి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అరదంబు లరదంబులఁ । గరులు గరుల హరులు హరులఁ గాల్వురు మఱి గా
ల్వురఁ దాఁకి పెనఁగెఁ గడు భీ । కర భంగులు మెచ్చు దేర గగనచరులకున్. 120

ప్రతిపదార్థం: అరదంబులన్= రథములతో; అరదంబులును= రథములును; కరులన్= ఏనుగులతో; కరులున్= ఏనుగులును; హరులన్= గుర్రములతో; హరులున్= గుర్రములు; మఱి= ఇంకను; కాల్వురన్= కాల్బలముతో; కాల్వురున్= కాల్బలము; తాఁకి= ఎదుర్కొని; కడున్= మిక్కిలి; భీకర= భయంకరమయిన; భంగులు= పద్ధతులు; గగన= ఆకాశమునందు; చరులకున్= సంచరించువారికి (అనగా సిద్ధ సాధ్యగరుడగంధర్వ యక్షకిన్నర కింపురుషాది దేవయోనులకు); మెచ్చుదేరన్= మెప్పుకలిగేటట్లు; పెనఁగెన్= పోరాడెను.

తాత్పర్యం: రథాలు రథాలతో, ఏనుగులు ఏనుగులతో, గుర్రాలు గుర్రాలతో, కాల్బలం కాల్బలంతో ఎదుర్కొని మిక్కిలి భయంకరమైన యుద్ధ రీతులతో గగన సంచారు లయిన దేవయోనులకు మెప్పు కలిగేటట్లు పోరాడాయి. (అనగా చతురంగ దళాలు ఒకదానితో ఒకటి భయంకరంగా పోరాడాయి అని తాత్పర్యం.)

చ. పెనుపును నాకసం బవియ బృంహితముల్ దము నుగ్రగర్జిత
స్వనములతోడి మేఘముల చందముగా నొనరింప మీఁది యో
ధనికర మేయు సాయకవితానము భీషణవృష్టి గా రయం
బునఁ బయికొన్న యేనుఁగుల పోరునఁ దేరులు దేలె నెత్తుటన్. 121

ప్రతిపదార్థం: పెనుపును= ఎంతోగొప్పగా; ఆకసంబు= ఆకాశము; అవియు= బ్రద్దలయ్యే; బృంహితముల్= ఘీంకారములు; తమున్= తమను (ఆ ఏనుగులను); ఉగ్ర= భయంకరములయిన; గర్జిత= ఉరుముచున్న ఉరుములయొక్క; స్వనములతోడి= ధ్వనులతోకూడియున్న; మేఘముల= మబ్బులయొక్క; చందము= విధము; గాన్= అగునట్లుగా; ఒనరింపన్= చేయగా; మీఁది= మీదను ఉన్న; యోధ= వీరులయొక్క; నికరము= సమూహము; ఏయు= ప్రయోగించు; సాయక= బాణములయొక్క; వితానము= సమూహము; భీషణ= భయంకరమయిన; వృష్టి= వర్షము; గాన్= అగునట్లుగా; రయంబునన్= వేగముగా; పయికొన్న= మార్కొనిన; ఏనుఁగులపోరునన్= ఏనుగులయొక్క పోరాటమునందు; నెత్తుటన్= రక్తమునందు; తేరులు= రథములు; తేలెన్= తేలెను.

తాత్పర్యం: ఆకాశాన్ని బ్రద్దలు చేసే గొప్ప ఘీంకృతులు తమను ఉరుములతో కూడిన మేఘాలుగా చేయగా, మీదనున్న యోధులు వేసే బాణాల సమూహం భయంకరమైన వర్షంగా మారి - వేగంగా మార్కొనిన ఏనుగుల పోరులో రథాలు రక్తంలో తేలాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఔన్నత్య ధర్మమున ఆకాశంతో, బృంహిత ధర్మమున మేఘాలతో సాయకవితాన ప్రయోగ ధర్మమున వృష్టితో ఉత్ప్రేక్షించి తిక్కయజ్వ చంపకమాలతో ఉత్ప్రేక్షమాలికలల్లాడు. నెత్తుట తేరులు తేలుట అతిశయోక్తి. బ్రహ్మర్షి వ్యాస భగవానుడిని కవిబ్రహ్మ ఈ గజసంగ్రామ వర్ణనంలో అతిశయించి, మూలానికి మెరుగులు పెట్టాడు.

మూలం:

'గజానాం భీమరూపాణాం ద్రవతాం నిఃస్వనో మహాన్ ।
అశ్రూయత యథాకాలే జలదానాం నభస్తలే ॥
నాగైరభ్యాహతాః కేచిత్ సరథా రథినోఽ పతన్ ।
వ్యద్రవన్త రణే వీరా ద్రావ్యమాణా మదోత్కటైః ॥ (శల్య- 9 - 3, 4.)

తే. **కరులగమి పొదివి రథముల్ గాలుకొనఁగ । నీక మరలిన ఘోటకానీకములను**
బిరుదుమగల మొత్తములను బిండిపీఁచు । సేయు బలితంపునేర్పు లచ్చెరువుఁ బెనుఁ ప. 122

ప్రతిపదార్థం: కరుల= ఏనుగులయొక్క; గమి= గుంపు; పొదివి= చుట్టుముట్టి; రథముల్= రథాలు; కాలుకొనఁగన్= కాలుపెట్టడానికి; ఈక= ఇయ్యక (అనగా కాలునిలుపుటకు అవకాశమీయక); మరలిన= తిరిగిపోయిన; ఘోటక= గుర్రములయొక్క; అనీకములను= సేనలను; బిరుదు= శౌర్యచిహ్నములుగల; మగల= వీరులయొక్క; మొత్తములను= సమూహములను (అనగా అతిరథ మహారథ రథ అర్ధరథులను); పిండిపీఁచుసేయు= పిండి, పీచు చేయుచున్న (ఇది తెలుగు జాతీయ ప్రయోగము); బలితంపు= బలిష్ఠములయిన; నేర్పులు= చేష్టలు(నేర్పరితనములు); అచ్చెరువున్= ఆశ్చర్యమును; పెనుఁపెన్= పెంపు చేయగా.

తాత్పర్యం: ఆ యుద్ధమునందు ఏనుగులగుంపు రథాలను చుట్టుముట్టి కాలు నిలుపటానికి అవకాశమీయనందువలన మరలిపోయిన ఆ రథాలను లాగే గుర్రాలను, ఆ రథాలను అధిరోహించిన అతిరథ మహారథ అర్ధరథ మొదలైన బిరుదులు గల వీరుల సమూహాలను పిండి, పీచు చేస్తున్న ఆ ఏనుగులయొక్క బలిష్ఠమయిన చేష్టలు ఆశ్చర్యాన్ని అధికం చేస్తుండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఇది తిక్కయజ్వ కవిత యందలి చైతన్య చిత్రణ సౌందర్యం. (మూలము 121 పద్య విశేషంలో ఇవ్వబడింది.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పటురయమున నాశ్వికు లొ । క్కటఁ బెక్కం డ్రెక్కి రథనికరములు ఝుడితి
త్రుటితాకృతులుగ విహరిం । చుట యెక్కుడు వేడ్కసేయ సురగణమునకున్. 123

ప్రతిపదార్థం: పటు= తీవ్రమయిన; రయమునన్= వేగమున; ఆశ్వికులు= గుఱ్ఱములను ఎక్కి యుద్ధము చేయువారు; ఒక్కటన్= ఒక్కసారిగా (ఏకకాలమున); పెక్కండ్రు= పలువురు; రథ= రథములయొక్క; నికరములు= సమూహములు; ఎక్కి; ఝుడితి= అతిశీఘ్రముగ (వెనువెంటనే); త్రుటిత= ముక్కలు ముక్కలుగా చేయబడిన; ఆకృతులుగన్= ఆకారాలు కలుగునట్లుగ; విహరించుట= వేడుకతో సంచరించుట; సుర= దేవతలయొక్క; గణములకు(న్)= సమూహములకు; ఎక్కుడు= మిక్కిలి; వేడ్క= వేడుక; చేయన్= చేయుచుండగా.

తాత్పర్యం: అతి శీఘ్రంగా పలువురు ఆశ్వికులు ఒక్కసారిగా రథాలను ఎక్కి వెనువెంటనే ముక్కలు ముక్కలుగా త్రుంచిన ఆకారాలు అయ్యేటట్లు చేయడం దేవతా సమూహాలకు మిక్కిలి సంతోషం కలిగిస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. పలువుర నొక్కఁడు నొక్కనిఁ । బలువురుఁ దెగటార్చుటయును బలుదెఱఁగుల మూఁ
కలు పలుదెఱఁగులఁ దలఁపడి । పొలియించుట పొలియుటయును బోరి నుగ్రముగన్. 124

ప్రతిపదార్థం: ఒక్కఁడున్= ఒక్కడు; పలువురన్= అనేకులను; ఒక్కనిన్= ఒక్కనిని; పలువురున్= అనేకులును; తెగటార్చుటయును= చంపుటయును; పలుతెఱఁగుల= అనేక విధములయిన; మూఁకలు= సమూహములు (అనగా సేనా సమూహములు); పలు తెఱఁగుల= అనేక విధములుగ; తలఁపడి= కలియబడి(పోరాడి); పొలియించుట= చంపుట; పొలియుటయును= చచ్చుటయును; పొరిన్= మిక్కిలి; ఉగ్రముగన్= భయంకరం కాగా.

తాత్పర్యం: ఒక్కడు పలువురను, పలువురు ఒక్కడిని చంపుతూ అనేకములయిన సేనల సమూహాలు అనేక విధాలుగా పోరాడి చంపటం, చావటం కలిగి మిక్కిలి భయంకరం కాగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. చలమునఁ బోక పెనఁగు కా । ల్బలముపయిఁ దురగములును నిభంబులును రథం
బులుఁ గూడి కవిసి యింతిం । తలు దునియలు సేఁత యనుచిత క్రౌర్యముగాన్. 125

ప్రతిపదార్థం: చలమునన్= మాత్సర్యముతో; పోక= వెడలిపోకుండగ; పెనఁగు= యుద్ధము చేయు; కాల్బలముపయిన్= పదాతిదళముమీద; తురగములునున్= గుఱ్ఱపు దళమును; ఇభంబులును= ఏనుగులును(అనగా గజదళమును); రథంబులున్= రథములును; కూడి= కలిసి; కవిసి= కలియబడి; ఇంతింతలు= చిన్న చిన్న; తునియలు= ముక్కలు; చేఁత= చేయుట (అనగా అశ్వదళము గజదళము రథములు కలిసి ఒక్కుమ్మడిగా పదాతిదళముపై పడి చిన్న చిన్న ముక్కలుగా చేయుట); అనుచిత= ఉచితము కానిది అగు (అనగా యుద్ధనీతికి తగనిది అగు); క్రౌర్యముగాన్= క్రూరత్వంగా.

తాత్పర్యం: ఒకరిపై ఒకరు మాత్సర్యంతో యుద్ధం చేసే పదాతి దళంపై రథగజ తురంగ దళాలు ఒక్కుమ్మడిగా కలియబడి చిన్న చిన్న ముక్కలుగా ఆ పదాతి దళాన్ని చేయటం - యుద్ధనీతికి ఉచితం కాని క్రూరత్వంగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తెల్లని సవరణ మెఱయ స । ముల్లసితములగు తురంగముల మొత్తము చం
చల్లలిత పక్షములు శో । భిల్లుగతుల నొప్పనంచపిండుం బోలన్. 126

ప్రతిపదార్థం: తెల్లని; నవరణ= అలంకారము (వాహనములకు చేసే అలంకారలు - అనగా జీనులు మొదలగునవి, గుర్రాలకు తగిలించే తెల్లని చామరాలు); మెఱయన్= ప్రకాశింపగా; సముల్లసితములు= మిక్కిలి ప్రకాశవంతములు; అగు= అయినట్టి; తురంగముల= గుర్రములయొక్క; మొత్తము= సముదాయము; చంచత్= చలించుచున్నవియు; లలిత= అందమైనవి అగు; పక్షములు= రెక్కలు; శోభిల్లు= ప్రకాశించు; గతులన్= గమనములతో; ఒప్పు= ఒప్పే; అంచ= హంసలయొక్క; పిండున్= గుంపును; పోలన్= పోలగా.

తాత్పర్యం: తెల్లని చామరాలు ప్రకాశించగా - మిక్కిలి ప్రకాశవంతాలైన గుర్రాల సముదాయం చంచలాలు మనోహరాలు అయిన రెక్కలు ప్రకాశించే గమనాలతో ఒప్పే హంసల గుంపును పోలగా.

విశేషం: అలం: ఉపమ. తెల్లని చామరాలతో ప్రకాశించే గుర్రాల గమనాలు చంచలాలు సుకుమారాలు అయిన హంసల గుంపుల గమనాలను పోలి ఉన్నాయి. తురంగాల మొత్తము ఉపమేయం. అంచపిండు ఉపమానం; పోలన్ ఉపమవాచకం. తెలుపు సమానధర్మం. పూర్ణోపమ.

వ. అయ్యిరువాఁగును పోరాడునప్పుడు. 127

ప్రతిపదార్థం: ఆ+ఇరువాఁగుఁను= ఆ రెండుపక్షముల సైన్యములును; పోరాడునప్పుడు= యుద్ధము చేయు సమయమున.

తాత్పర్యం: ఆ రెండు పక్షముల సైన్యాలును అనగా కురుపాండవ సైన్యాలు యుద్ధం చేసే సమయంలో.

విశేషం: 121, 122, 123, 124, 125, 126 పద్యాలన్నీ అసంపూర్ణ వాక్యాలే, అవి అన్నీ 'పోరాడు' అనుక్రియతో అన్వయిస్తున్నాయి.

క. గుణనినదము రథనేమి । క్వణనంబుం దురగఖురరవముఁ గరిఘంటా
రణనమును హేతి సంఘ । ర్షణనాదముఁ దూర్యఘోష సంపదఁ గడచెన్. 128

ప్రతిపదార్థం: గుణ= వింటినారి యొక్క; నినదమున్= ధ్వనియును (విల్లునకు కట్టు అల్లెత్రాడునకు నారి అనిపేరు. అమ్ములు ప్రయోగించునప్పుడు ఈ నారినుండి వచ్చు మ్రోతలు.) రథ= రథములయొక్క; నేమి= చక్రముల కడకమ్ములయొక్క; కణ్వనంబున్= ధ్వనియును (రథములు వెళ్లునప్పుడు చక్రములకడకమ్ములు భూమిని తాకునప్పుడు వచ్చు ధ్వనులు); తురగ= గుర్రములయొక్క; ఖుర= గిట్టలయొక్క; రవమున్= ధ్వనియును; కరి= ఏనుగులయొక్క; ఘంటా= ఘంటలయొక్క (కంఠములందు వ్రేలాడుచున్న ఘంటలయొక్క); రణనమును= ధ్వనియును; హేతి= కత్తులు మొదలయిన ఆయుధములయొక్క; సంఘర్షణ= ఒకదానికొకటి ఒరిసికొనుట వలన పుట్టిన; నాదమున్= ధ్వనియును; తూర్య= తూర్యములయొక్క; ఘోష= ధ్వనియొక్క; సంపదన్= వైభవమును; కడచెన్= మించిపోయెను.

తాత్పర్యం: ఆ రెండు సైన్యాలు యుద్ధం చేసే సమయంలో అల్లెత్రాడుల ధ్వనులు, రథచక్రాల కడకమ్మల ధ్వనులు, గుర్రాల గిట్టల చప్పుళ్ళు, ఏనుగుల కంఠాలలో వ్రేలాడే ఘంటల మ్రోతలు, కత్తులు మొదలయిన ఆయుధాలు ఒకదాని కొకటి ఒరిసికొనటంవలన పుట్టిన ధ్వనులు, మొత్తం ఈ అయిదు ధ్వనులు మిళితమయి తూర్యధ్వనుల వైభవాన్ని మించిపోయింది.

విశేషం: ఇందు తిక్కన శబ్ద చిత్రణవైచిత్ర్యమును దర్శింపవచ్చును. నినదము, క్వణనము, రవము, రణనము, నాదము, ఘోషము. ఈ కందమునందలి ఈ ఆరు శబ్దములూ - ధ్వన్యర్థకములే కాక ధ్వన్యనుకరణములు. (ఒక్క అర్థాన్ని బోధించటానికి) ఏకార్థ బోధకాలైన వివిధ శబ్దాల ప్రయోగం శబ్దవైచిత్రి.

ఇప్పట్టున వ్యాసభగవానుని వర్ణనం కూడా రమణీయంగా ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'వాజినాం ఖురశబ్దేన రథనేమి స్వనేన చ । పత్తీనాం చాపి శబ్దేన నాగానాం బృంహితేన చ॥
వాదిత్రాణాం చ ఘోషేణ శంఖానాం నినదేన చ । అభవన్నాదితా భూమిః నిర్హ్రాతైరివ భారత ॥
ధనుషాం కూజమానానాం శస్త్రౌఘానాం చ దీప్యతాం । కవచానాం ప్రభాభిశ్చ న ప్రాజ్ఞాయత కించన ॥ (శల్య9-14,15,16)

సీ. **నెత్తుటం దోఁగియు నిగిడి పోరెడు వీరు । లలరిన నడ మోదుగులవిధంబు**
గ్రక్కునఁ దెగిపడి కదలెడు బాహు దం । డములు మహాభుజంగములభంగి
యవని రక్తాక్తంబులై యున్న యట్టిబల్ । దలలు గెందామరకొలని పగిది
దఱచుగా నెఱి దప్ప నొఱగిన గజములు । గులిశభగ్నాచలకులమునట్లు

తే. **దునిసి తొఱఁగిన జోదులతొడలు సామ । జములకరములు నొండొంటి చందములు గ**
నుంగొనఁగ వింతలగుటను సంగరాంగ । ణంబు రమణీయమును భీషణంబు నయ్యె. **129**

ప్రతిపదార్థం: నెత్తుటన్= రక్తమునందు; తోఁగియున్= తడిసియు లేక మునిగియు; నిగిడి= విజృంభించి; పోరెడు= పోరాటము సల్పెడు; వీరులు= శూరులు (పరాక్రమవంతులు); అలరిన= (పూలు) వికసించిన; నడ= నడచు; మోదుగుల= మోదుగ వృక్షములయొక్క; విధంబు= విధమును; గ్రక్కునన్= వేగముగ; తెగిపడి= తెగిపోయి; కదలెడు= చలించెడు; బాహుదండములు= దండములవంటి భుజములు, మహా= గొప్పవి అగు; భుజంగముల= నాగుపాములయొక్క; భంగి= విధమును; అవని= భూమియందలి; రక్త= రక్తంతో; అక్తంబులై= కలిసినవియై; ఉన్న; అట్టి; బల్= గొప్ప; తలలు= శిరములు; కెందామర= ఎర్రతామరలయొక్క; కొలని= సరస్సు; పగిది= విధమును; తఱచుగాన్= ఎక్కువగా; నెఱి= అందము; తప్పన్= తప్పిపోగా (తరిగిపోగా); ఒఱగిన= నేలవ్రాలిన; గజములు= ఏనుగులు; కులిశ= వజ్రాయుధముచే; భగ్న= విరుగగొట్టబడిన; అచల= పర్వతములయొక్క; కులము= సముదాయము; అట్లు= రీతి; తునిసి= ఖండింపబడి; తొరఁగిన= విడివడిపోయిన; జోదుల= యోధులయొక్క; తొడలు; సామజముల= ఏనుగులయొక్క; కరములున్= తొండములును; ఒండొంటి= ఒకదానికొకటి; చందములు= విధములు; కనుంగొనఁగన్= కనిపించగ (తొడలు తొండములుగ తొండములు తొడలుగ కనిపించగ); వింతలు= ఆశ్చర్యజనకములు; అగుటను= అగుటచేత; సంగర= యుద్ధము చేయు; అంగణంబు= ముంగిలి (అనగా యుద్ధము చేయు ప్రదేశము - అనగా యుద్ధభూమి); రమణీయమును= సుందరమయినదియును; భీషణంబును= భయానకమయినదియును; అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: రక్తంతో తడిసి యుద్ధం చేస్తున్న వీరులు - వికసించిన పూలతో నడుస్తున్న మోదుగుచెట్లుగాను, వేగమున తెగిపోయి కదలాడుతున్న దుడ్డుక్రరలవంటి భుజాలు గొప్ప గొప్ప నాగుపాములుగాను, భూమిపై రక్తసిక్తములై పడి ఉన్న తలలు ఎర్రతామరల కొలనుగాను; అందం తరిగి కూలిపోయిన ఏనుగులు వజ్రాయుధంచేత విరుగగొట్టబడిన పర్వాతాల సముదాయాన్నీ, ఖండించబడి విడిపడిపోయిన యోధుల తొడలు ఏనుగుల తొండాలు ఒకదానికొకటి అనిపించగా ఆశ్చర్యజనకంగా ఆ యుద్ధభూమి సుందరమూ, భయానకమూ అయింది.

విశేషం: ఇది యుద్ధభూమి స్వరూప చిత్రణం. ఉపమల మాలిక. శృంగార, భయానక, అద్భుతరసభావాలతో నిండిన సీస మిది. ఈ సీసంలోని ప్రతిపాదంయొక్క మొదటిభాగం భయానకం. రెండవ భాగం శృంగారం. ఇచట శృంగార మంటే సౌందర్యం. ప్రతి పాదం ఒక ఉపమ. భయానకమును శృంగారంతో ఉపమించటం ఇందలి విచిత్ర చిత్రణం. బీభత్సరస భావాలు కూడా ఇందు పుష్కలంగా ఉన్నాయి. కాని తిక్కయజ్వ 'రమణీయమును, భీషణంబును, వింతలగుటను' అనే ప్రయోగాలతో శృంగార, భయానక, అద్భుత రసభావాలను మాత్రం సూచించాడు.

తే. **ఏమి చెప్పుదు రౌద్రంపు టెసకమందుఁ। దఱచు మెదళులు ఱొంపులు నుఱుములైన**
యెమ్ము లిసుకయు సితచామరమ్ము లంచ। లయ్యె రుధిరంపు టేరుల కప్పుడధిప! **130**

ప్రతిపదార్థం: అధిప!= ప్రభువు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అందున్= ఆ యుద్ధభూమియందు జరుగు; రౌద్రంపు= క్రోధముయొక్క; ఎసకము= విజృంభణము; ఏమి; చెప్పుదున్; తఱచు= అధికమయిన; మెదళులు= మస్తిష్కములు; ఱొంపులు= బురదలు; నుఱుములు= పొడులు(చూర్ణములు); ఐన= అయినటువంటి; ఎమ్ములు= ఎముకలు; ఇసుకయున్; సిత= తెల్లని; చామరమ్ములు= వింజామరములు; అప్పుడు= ఆ సమయమున; రుధిరంపు= రక్తముయొక్క; ఏరులకున్= నదులకు; అంచలు= హంసలు; అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ యుద్ధభూమిలోని క్రోధ విజృంభణాన్ని గూర్చి ఏమి చెప్పను? అది వర్ణించటానికి శక్యం కానిది. ఆ యుద్ధసమయంలో మెదడులు బురదలుగా, చూర్ణాలయిన ఎముకలు ఇసుకగా తెల్లని చామరాలు ఆ రక్తపుటేరులలో హంసలుగా అయ్యాయి.

విశేషం: అలం: రూపకం. ఉపమాన ఉపమేయములకు అభేద కల్పనం రూపకం. సమరాంగణం ఉపమేయం. ఏరులు ఉపమానం. ఈ రెంటికి అభేదం కల్పించటంవలన ఇది రూపకం. అట్లే నదులందు బురద ఇసుక, నీరు; ఆ నీటియందు మస్తిష్కములు బురదలుగా, చూర్ణములయిన ఎముకలు ఇసుకగా, రక్తం జలంగా - తెల్లని చామరాలు హంసలుగా ఉపమేయ ఉపమానములకు క్రమంగా అభేదకల్పనంవల్ల ఇది రూపకమాలిక అయింది. ఇట్లు అలంకార మాలిక అల్లటం తిక్కన సహజకవితాలక్షణం.

క. **విను మయ్యేఱులలో వా। హనములె యోడలుగఁ జూడ నక్కజమగు ను**
క్కున నుద్దామ విహారం। బొనరించిరి వీరయోధు లుర్వీనాథా! **131**

ప్రతిపదార్థం: ఉర్వీ= భూమికి; నాథా! ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; వినుము; ఆ+ఏఱులలోన్= ఆ రక్తపు నదులలో; వాహనములె= ఎక్కదగిన రథాదులే; ఓడలుగన్; చూడన్= చూడగ; అక్కజము= ఆశ్చర్యము; అగు= అయినట్టి; ఉక్కునన్= శౌర్యముతో; వీర= పరాక్రమము కలిగిన; యోధులు= యుద్ధము చేయు సైనికులు; ఉద్దామ= అడ్డులేని విధముగ; విహారంబు= సంచారము; ఒనరించిరి= చేసిరి.

తాత్పర్యం: (సంజయుడు చెప్పుతున్నాడు) ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆలకించుము. ఆ రక్తపు నదులలో వాహనాలు ఓడలు కాగా, అధికమయిన శౌర్యంతో వీరులయిన యోధులు అబ్బురపరిచే సాహసంతో అడ్డులేని విధంగా సంచారం చేశారు. వీర విహారం చేశారు.

వ. **ఇవ్విధంబునం బోరు ఘోరంబై చెల్లుచుండ నుల్లసిత విక్రమవిజృంభితులగు భీమపార్థులు నలిరేఁగి నారాచప్రముఖ నానావిశిఖంబుల మనమొనఁ గనుపుగొట్టిన నది బెగడొంది మగిడిన నమ్మేటి మగలుబ్బి పాంచ్రదేవదత్తంబుల నొత్తుటయు ధృష్టద్యుమ్నుండును శిఖండియుం గౌంతేయాగ్రజు మున్నిడికొని తఱుమఁ దోడన కవలును గడంగి రట్టాటోపదీపితులైన పాండవే యుల యురవడికి నోటఱి నీబలంబు హాహాకారంబులతోఁ బలుదెసలఁ బఱవందొడంగినం గనుంగొని శల్యుండు సారథి కిట్లనియె.** **132**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారముగ; పోరు= యుద్ధము; ఘోరంబు= భయంకరము; ఐ= అయినట్టిదియై; చెల్లుచున్= కొనసాగుచు; ఉండన్; ఉల్లసిత= ప్రకాశించుచున్న; విక్రమ= పరాక్రమముతో; విజృంభితులు= చెలరేగినవారు; అగు= అయినట్టి; భీమ పార్థులు= భీముడును అర్జునుడును; నలి రేఁగి= విజృంభించి; నారాచ= వాడి అయిన ఇనుప బాణములు; ప్రముఖ= మొదలైన; నానా= పలురకములగు; విశిఖంబులన్= తీక్ష్ణములయిన బాణములతో; మన= మనయొక్క; మొనన్= సేనావ్యూహమును; కనుపు= ఒకముక్కను (అనగా ఒక భాగమును లేక ఒక పర్వమును); కొట్టినన్ విడగొట్టగా; అది= ఆ సేనావిభాగము; బెగడు= భయము; ఒంది= పొంది; మగిడినన్= మరలిపోవుచుండగా; ఆ+మేటి మగలు= గొప్పవారయిన ఆ వీరులు; ఉబ్బి= పొంగి; పౌండ్ర= పౌండ్రమను పేరుగల శంఖమును; దేవదత్తంబులన్= దేవదత్తమను పేరుగల శంఖమును; ఒత్తుటయున్= ఊదుటయు (పూరించుటయు); ధృష్టద్యుమ్నుండును; శిఖండియున్; కౌంతేయ= కుంతీపుత్రులలో; అగ్రజున్= పెద్దవాడు అయిన ధర్మరాజును; మున్ను= ముందు; ఇడుకొని= ఉంచుకొని; తఱుమన్= పారద్రోలగా; తోడన= ఆ వెంబడి; కవలును= కవలపిల్లలు అయిన నకులసహదేవులును; కడంగిరి= పూనిక వహించిరి; అట్లు= ఆ ప్రకారముగ; ఆటోప= సంభ్రమము వలన (అతి వేగముగా యుద్ధము చేయుటవలన); దీపితులు= ప్రకాశింపచేయబడినవారు; ఐన= అయినట్టి; పాండవేయుల= పాండురాజు కుమారులయిన పాండవులయొక్క; ఉరవడికిన్= విజృంభణమునకు; ఓటటి= బలహీనమయి; నీ బలంబు= నీయొక్క సైన్యము; హాహాకారంబులతోన్= దుఃఖమును, బాధను తెలుపు హాహా అను అరుపులతో; పలు= అనేకములగు; దెసలన్= దిక్కులకు; పఱవన్= పారిపోవుటకు; తొడంగినన్= ప్రారంభించగా; కనుంగొని= చూచి; శల్యుండు; సారథికిన్; ఇట్లు= ఈ విధముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఈ ప్రకారంగా యుద్ధం భయంకరంగా కొనసాగుతుండగా ప్రకాశమాన పరాక్రమంతో విజృంభించే భీమార్జునులు అతిశయించి, వాడి అయిన ఇనుపబాణాలు మొదలైన ముఖ్యములైన బాణాలతో మన సేనావ్యూహంలోని ఒక భాగాన్ని విడగొట్టగా, ఆ సేనా విభాగం భయపడి పారిపోతుండగా మహావీరు లయిన ఆ భీమార్జునులు పొంగిపోయి పౌండ్ర దేవదత్తాలను పూరించారు. అంతట ధృష్టద్యుమ్నుడు, శిఖండి ధర్మరాజును ముందుంచుకొని తరుమగా ఆ వెంబడి నకుల సహదేవులునూ పూనిక వహించారు. ఆ ప్రకారంగా ప్రకాశమానులైన పాండవుల శీఘ్రసంగ్రామానికి బలహీనమయిన నీ సైన్యం హాహాకారలతో పలు దెసలకు పారిపోవటం ప్రారంభించగా చూచి శల్యుడు సారథితో ఇట్లా అన్నాడు:.

విశేషం: భీముడి శంఖంపేరు పౌండ్రం. అర్జునుడి శంఖం పేరు దేవదత్తం. ఈ దేవదత్తం దివ్యశంఖం. మయుడు ఈ దేవదత్తాన్ని బిందుసరోవరంనుండి తెచ్చి అర్జునుడికి ఇచ్చాడు. ఈ మయుడే భీముడికి గదను ఇచ్చాడు. ఈ మయుడే పాండవులకు మయసభను నిర్మించి ఇచ్చాడు.

ఉ. **'అల్లదె కంటె? పాండుతనయాగ్రణితేరు సితాశ్వయుక్తమై**
తెల్లని యెల్లి నొప్పినది తీవ్రత మార్కొని యానృపాలు శో
భిల్లుట మాన్పఁగా వలయు భీషణభంగి రథంబు వోవ ని
మ్మెల్లజనంబు నా కడిమి యేర్పడ నేఁ డెఱుఁగంగఁ జేసెదన్. **133**

ప్రతిపదార్థం: సిత= తెల్లని; అశ్వ= గుఱ్ఱములతో; యుక్తమై= కూడినదియై; పాండు= పాండురాజుయొక్క; తనయ= కుమారులలో; అగ్రణి= పెద్దవాడయిన ధర్మరాజుయొక్క; తేరు= రథము; తెల్లని; ఎల్లిన్= గొడుగుతో; ఒప్పినది= అందముగా ఉన్నది; అల్లదె= అదిగో అక్కడ ప్రత్యేకముగా ఉన్నది; కంటె?= చూచితివా?; తీవ్రతన్= తీవ్రముగా(భీకరముగా); మార్కొని=

ఎదుర్కొని; ఆ నృపాలు= ఆ రాజు(ఆ ధర్మరాజు); శోభిల్లుట= ప్రకాశించుట (విజృంభించుట); మాన్పఁగాన్= పోగొట్టగా; వలయున్= చేయవలయును; భీషణ= భయంకరమయిన; భంగిన్= విధముగా; రథంబు; పోనిమ్ము; నేఁడు; ఎల్ల= సమస్తమయిన; జనంబున్= ప్రజలు; నా; కడిమి= పరాక్రమము; ఎఱుంగగన్= తెలిసికొనునట్లుగా; ఏర్పడన్= తేటపడగా; చేసెదన్= చేసెదను.

తాత్పర్యం: 'తెల్లని గుర్రాలతో కూడి, తెల్లని గొడుగుతో అందంగా ప్రకాశిస్తున్న ఆ ధర్మరాజురథం అదిగో అక్కడ ఉన్నది. చూచావా? తీవ్రంగా ఎదుర్కొని ఆ ధర్మరాజు విజృంభణాన్ని పోగొట్టాలి. కాబట్టి, భయంకర రీతిలో రథాన్ని అటు పోనిమ్ము. నేడు నా పరాక్రమం సమస్త ప్రజలు తెలిసికొనేటట్లు తేటపడచేస్తాను.

తే. సురల నైన గెలుతు దురమున విను నాకుఁ । బాండుపుత్త్రు లెదురె భండనమున?
నేర్పు బలుపుఁ జూపి నిన్ను మెప్పింతు నా । చేతిబరువు సూడు సూతవర్య! 134

ప్రతిపదార్థం: సూత= సూతులలో; వర్య!= ఉత్తముడవు అయిన ఓ సారథీ!; విను; దురమునన్= యుద్ధమునందు; సురలను= దేవతలను; ఐనన్= అయినను; గెలుతున్= జయింతును; భండనమునన్= యుద్ధంలో; నాకున్= నాకు; పాండుపుత్రులు= పాండురాజు కుమారులు; ఎదురె?= ఎదురు నిలువగలవారే?; నా= నాయొక్క; చేతి= చేతియొక్క; బరువున్= భారమును; చూడు= చూడుము; భండనమునన్= యుద్ధమున; నేర్పు; బలుపున్= బలమును; చూపి; నిన్ను; మెప్పింతున్= మెప్పింతును.

తాత్పర్యం: ఓ సారథీ! ఆలకింపుము. యుద్ధంలో దేవతల నైనను జయిస్తాను. యుద్ధంలో నాకు ఈ పాండవులు ఎదురు నిలువలేరు. నా చేతిభారం చూడుము. ఈ యుద్ధంలో నా నైపుణ్యాం, బలం ప్రదర్శించి నిన్ను మెప్పిస్తాను.

విశేషం: ఈ పద్యం అమూలకం. 133వ పద్యానికి మూలం.

'ఉవాచ సారథిం తూర్ణం చోదయాశ్వాన్మహాజవాన్ ।
ఏష తిష్ఠతి వై రాజా పాండుపుత్రో యుధిష్ఠిరః ।
ఛత్రేణ ధ్రియమాణేవ పాండురేణ విరాజతా ॥
అత్ర మాం ప్రాపయ క్షిప్రం పశ్య మే సారథే బలమ్ ।
న సమర్థో హి మే పార్థః స్థాతు మద్య పురోయుధి ॥ (శల్య. అధ్యా. 10)

తిక్కయజ్వ స్వేచ్ఛానువాద సౌందర్యాన్ని గ్రహించటంకొరకు అచ్చటచ్చట మూలమును చూపటం జరుగుతున్నది.

వ. అనుటయు వాఁడు పాండవబలంబుల కెదురుగా నరదంబు సముచితరయంబున నడప నమ్మద్రపతి సముద్ర సముద్రేకంబు చందంబైన యా సైన్యంబు సరభసత్వంబు చెలియలికట్టయుంబోలి యుడుపుట యచ్చెరువై యుండె నట్లు శౌర్యధైర్యంబుల నుల్లసిల్లు శల్యుం జూచి మనమూఁకలును మగుడ నిగిడిన సంగ్రామంబు భీమంబయ్యె నందు నకులుండును గర్ణపుత్త్రుండగు చిత్రసేనుండును దలపడి యొండొరువులకుఁ గృతాస్త్రత్వంబును సమరవిశారదత్వంబును జూపుచుం బెనంగునెడ నా సూతపౌత్త్రుండు. 135

ప్రతిపదార్థం: అనుటయున్= చెప్పుటయు; వాఁడు= సారథి; పాండవ= పాండవులయొక్క; బలంబులకున్= సేనలకు; ఎదురుగాన్= ఎదురుగా; అరదంబు= రథము; సముచిత= తగిన; రయంబునన్= వేగమున; నడపన్= నడపగా; ఆ+మద్రపతి= మద్రదేశమునకు ప్రభువు అయిన ఆ శల్యుడు; సముద్ర= సముద్రముయొక్క; సముద్రేకంబు= ఉప్పొంగు(విజృంభించు);

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చందంబు= విధము; ఐనన్= కాగా; ఆ సైన్యంబు= ఆ సేనలు (ఆ పాండవసేనలు); సరభసత్వంబు= వేగిరపాటుతనము; చెలియలి కట్టయున్= సముద్రపు గట్టును; పోలి= వలె; ఉడుపుట= ఆపుట; అచ్చెరువై= ఆశ్చర్యకరమై; ఉండెన్= ఉండెను; అట్లు= ఆ ప్రకారముగా; శౌర్య= పరాక్రమము; ధైర్యంబులన్= ధీరత్వములతో; ఉల్లసిల్లు= ప్రకాశించు; శల్యున్; చూచి; మనమూఁకలును= మనయొక్క సేనలును; మగుడన్= మరల; నిగిడినన్= నిక్కగా(విజృంభించగా); సంగ్రామంబు= యుద్ధము; భీమంబు= భయానకము; అయ్యెన్= అయ్యెను; అందున్= ఆ యుద్ధమునందు; నకులుండును; కర్ణపుత్రుండగు= కర్ణుని కుమారుడగు; చిత్రసేనుండును; తలపడి= కలియపడి; ఒండొరువులకున్= ఒకరికొకరికి (పరస్పరం); కృతాస్త్రత్వంబును= సమర్థమైన అస్త్రప్రయోగము కలిగియుండుటను; సమర= యుద్ధముచేయుటయందు; విశారదత్వంబును= పాండిత్యము కలిగియుండుటను; చూపుచున్= చూపించుచు; పెనంగు= పోరాటమును; ఎడన్= సలుపు సమయమున (పోరాడే స్థానంలో); ఆ సూత= ఆ సూతునియొక్క; పౌత్రుండు= మనుమడు (కర్ణుడిని పెంచిన తండ్రి సూతుడు - అందువలన కర్ణుడి కొడుకు సూతుడికి మనుమడు).

తాత్పర్యం: శల్యుడు ఇట్లా సారథితో చెప్పగా, సారథి పాండవ బలాలకు ఎదురుగా రథాన్ని తగిన వేగంతో నడపగా ఆ శల్యుడు ఉప్పొంగే సముద్రాన్ని చెలియలికట్ట ఆపిన విధంగా పాండవసేనలయొక్క వేగిరపాటును ఆపటం ఆశ్చర్యకరమై ఉండింది. ఆ ప్రకారంగా పరాక్రమ ధీరత్వాలు ప్రకాశించే శల్యుడిని చూచి, కురు సైన్యాలు మరల విజృంభించగా, యుద్ధం భయానకమైనది. ఆ యుద్ధంలో నకులుడు, కర్ణుడి కుమారుడయిన చిత్రసేనుడును కలియబడి ఒకరినొకరు పరస్పరం అస్త్రప్రయోగ సామర్థ్యంతో యుద్ధం చేయటంలో పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ పోరాడేటప్పుడు ఆ సూతుడి మనుమడయిన చిత్రసేనుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

కర్ణకొడుకులు చిత్రసేన సత్యసేన సుశర్ములు నకులునిచేతఁ జచ్చుట (సం. 9-9-12)

చ. **నకులుని చాపదండము ఘనప్రదరంబునఁ దున్మి, భాస్వరాం**
బకములు మూఁడు దీవ్రగతి ఫాలతలంబున నాటి త్రుంచె ఘో
టకములఁ గేతనం బిలఁ బడన్ విదళించి వధించె సూతు ఖే
టకమును ఖడ్గముం గొని కడఁగఁ బయిం బరఁగించె భల్లముల్. **136**

ప్రతిపదార్థం: నకులుని= నకులునియొక్క; చాపదండము= వింటికర్రను; ఘన= గొప్పదిఅయిన; ప్రదరంబునన్= బాణముతో; తున్మి= ఖండించి; మూఁడు; భాస్వర= ప్రకాశమానములగు; అంబకములు= బాణములు; తీవ్రతన్= మిక్కిలి వేగంగా; ఫాల= లలాటము యొక్క; భాగంబునన్= ప్రదేశమునందు; నాటి= గ్రుచ్చి; ఘోటకములన్= గుర్రములను; కేతనంబు= జెండాకొయ్య; ఇలన్ పడన్= భూమిపై పడునట్లు; విదళించి= ఖండించి; త్రుంచెన్= చంపెను; సూతు= సారథిని; వధించెన్= సంహరించెను; ఖడ్గమున్= కత్తిని; ఖేటకమును= డాలును; కొని= తీసికొని; కడంగన్= ప్రయత్నం చేయగా; భల్లముల్= బల్లెములు; పయిన్= ఆ నకులుడిపై; పరఁగించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: ఆ సూతపౌత్రుడు చిత్రసేనుడు నకులుడి వింటి కర్రను గొప్పదైన బాణంతో ఖండించి, మూడు ప్రకాశమానాలైన బాణాలు నకులుడి లలాటంపై గ్రుచ్చి, గుర్రాలను జెండా కొయ్యను భూమిపై పడేటట్లు ఖండించాడు. సారథిని ఖండించి, సంహరించాడు. (నకులుడు) కత్తిని డాలును గైకొని దాడికి పూనుకొనగా చిత్రసేనుడు అతనిపై బల్లాలు ప్రయోగించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఆ నిశితభల్లములు దన । మేనికి రాకుండఁ బలుక మెఱయ జడియుచున్
వే నిగిడి కదిసె మాద్రీ । సూనుం డా సూతసూతిసూను నరదమున్. 137

ప్రతిపదార్థం: ఆ; నిశిత= వాడి అయిన; భల్లములు= బల్లెములు; తన; మేనికిన్= దేహమునకు; రాకుండన్= తగులకుండగ; పలుక= డాలు; మెఱయన్= ప్రకాశింపగ; జడియుచున్= త్రిప్పుతూ; వే= వేగమున; నిగిడి= విజృంభించి; మాద్రీ= మాద్రియొక్క (పాండురాజు రెండవపత్ని); సూనుండు= కుమారుడు(నకులుడు); ఆ; సూత= సూతునియొక్క; సూతి= కుమారునియొక్క (కర్ణుడియొక్క); సూనుని= కుమారుని (చిత్రసేనుని); అరదమున్= రథమును; కదిసెన్= చేరెను.

తాత్పర్యం: చిత్రసేనుడు విసిరిన ఆ వాడిఅయిన బల్లెములు తన దేహానికి తగులకుండగనే (తన దేహం దగ్గరకు రాకుండగనే) డాలును త్రిప్పుతూ వేగంగా విజృంభించి నకులుడు చిత్రసేనుడి రథాన్ని సమీపించాడు.

తే. కదిసి మీఁదికి లంఘించి మదమెలర్ప । గళముఁ దునిమిన నమ్మస్తకంబు డొల్లెఁ
గర్ణపూరకిరీటసంకలిత వివిధ । రత్నరోచులు మెఱయ ధరాతలమున. 138

ప్రతిపదార్థం: కదిసి= చేరి (చిత్రసేనుని రథముచేరి); మీఁదికిన్= పైకి(రథముపైకి); లంఘించి= దూకి; మదము= గర్వము; ఎలర్పన్= అతిశయింపగ; గళము= కంఠము(కుత్తుక); తునిమినన్= ఖండించగా; ఆ+మస్తకంబు= ఆ శిరస్సు; కర్ణపూర కిరీట= చెవికమ్మ, మకుటములయందు; సంకలిత= కూడియున్న (పొదిగియున్న); వివిధ= పలురకములయిన; రత్న= మాణిక్యములయొక్క; రోచులు= కాంతులు; మెఱయన్= ప్రకాశింపగ; ధరా= భూమియొక్క; తలమునన్= స్థలమున; డొల్లెన్= దొర్లెను.

తాత్పర్యం: నకులుడు చిత్రసేనుడి రథంపైకి దూకి, గర్వం అతిశయించగా కుత్తుకను ఖండించగా ఆ తల కర్ణకుండలాలలో, కిరీటంలో పొదిగిన పలురకాలయిన మాణిక్య కాంతులు ప్రకాశిస్తూ ఉండగా భూమిపై పడి దొర్లింది.

విశేషం: మహాభారతంలో చిత్రసేనులు లెక్కకు మిక్కిలి ఉన్నారు. ధృతరాష్ట్రుడి పుత్రులు పదకొండుమంది మహారథులలో చిత్రసేను డొకడు ఉన్నాడు. పరీక్షిత్తు మహారాజుయొక్క మూడవపుత్రుడు చిత్రసేను డొకడు ఉన్నాడు. జరాసంధుని మంత్రి నీతిశాస్త్ర విశారదుడు చిత్రసేను డొకడు ఉన్నాడు. అభిసార దేశపురాజు చిత్రసేను డొకడు ఉన్నాడు. త్రిగర్తరాజు సుశర్మ అన్నగారు చిత్రసేను డొకడు ఉన్నాడు. పాంచాల యోధుడు చిత్రసేను డొకడు ఉన్నాడు. నాగరాజు చిత్రసేను డొకడు ఉన్నాడు. గంధర్వరాజు చిత్రసేను డొకడు ఉన్నాడు.

వ. ఇట్లు చిత్రసేనుండు పడినం గనుంగొని కౌంతేయసైనికు లార్చినం బేర్చిన శోకరోషంబుల మనంబుల ముప్పిరిగొన వాని సోదరులు సత్యసేనుండును - సుశర్ముండును నప్పాండుపుత్రుపైఁ గవిసిన నతండు వేతొక్క-తేరెక్కి బలు విల్లెత్తి దండధర ప్రచండమూర్తియై మార్కొనిన నబ్బిరుదుమగ లయ్యరదంబు భల్లంబుల నఱకం దొడంగిన నుఱక చిఱునవ్వు నవ్వి. 139

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; చిత్రసేనుండు; పడినన్= పడిపోయిన(చనిపోయిన); కనుంగొని= చూచి; కౌంతేయ= కుంతీపుత్రులయొక్క(పాండవులయొక్క); సైనికులు; ఆర్చినన్= అరవగా; పేర్చిన= అతిశయించిన; శోకం= దుఃఖము; రోషంబులు= క్రోధములు; మనంబులన్= మనస్సులందు; మూడు+పిరి= మూడు పేటలుగా; కొని= చుట్టుకొని; వాని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సోదరులు; సత్యసేనుండు; సుశర్ముండునున్; ఆ+పాండుపుత్రునిపైన్= ఆ పాండురాజు కుమారుడిపై(నకులుడిపై); కవిసినన్= ఉరకగా; ఆతండు= ఆ నకులుడు; వేఱొక్క= ఇంకొక; తేరు= రథము; ఎక్కి; బలు= బలముగల; విల్లు= ధనువు; ఎత్తి= తీసికొని; దండధర= యమునివలె; ప్రచండ= తీవ్రమయిన (భయంకరమయిన); మూర్తి+ఐ= ఆకారము కలవాడై; మార్కొనినన్= ఎదుర్కొనగా; ఆ+బిరుదు= ఆ మహారథులు అయిన; మగలు= వీరులు (సత్యసేన - సుశర్మలు); ఆ+అరదంబు= ఆ రథమును; భల్లంబులన్= బల్లెములతో; నఱకన్= ఖండించుటకు; తొడంగినన్= ప్రారంభించగా; ఉఱక= లెక్కచేయక; చిఱునవ్వు; నవ్వి.

తాత్పర్యం: ఈ ప్రకారంగా చిత్రసేనుడు పడిపోగా చూచి పాండవుల సైనికులు అరవగా, దుఃఖం, క్రోధం ముప్పిరిగొనగా చిత్రసేనుడి సోదరులయిన సత్యసేన, సుశర్మలు ఆ నకులుడిపై కలియబడగా, నకులుడు ఇంకొక రథం ఎక్కి బలమయిన ధనువు గైకొని యముడివలె భయంకరమయిన ఆకారం కలవాడయి ఎదుర్కొనగా, మహారథులయిన ఆ వీరులు నకులుడి రథాన్ని బల్లెములతో ఖండించటానికి ప్రారంభించగా నకులుడు దానిని లెక్కచేయక ఒక చిన్న నవ్వు నవ్వి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: మూలంలో కర్ణుడి కొడుకు 'సుశర్మ' డనేవాడు లేడు. 'సుషేణు'డు ఉన్నాడు. సుశర్ముడు త్రిగర్త దేశాధీశుడు. దక్షిణ గోగ్రహణంలో కౌరవసైన్యానికి ఇతడు నాయకుడు. ఆ యుద్ధంలో విరాటుడికి బందీ కాగా ధర్మరాజు కృపవలన విడిపించబడ్డాడు. ఈ శల్యపర్వమునందే ఈ 'సుశర్మ'ను అర్జునుడు సంహరించాడు.

> **'సుశర్మాణం సమాసాద్య బిభేద హృదయం రణే ।**
> **స గతాసు ర్మహారాజ పపాత ధరణీతలే ॥ (శల్య 27-46)**

ఇక మహాభారతంలో 'సుషేణ' నామధేయులు చాలమంది ఉన్నారు. ధృతరాష్ట్రుడి నూరుమంది పుత్రులలో ఒక 'సుషేణుడు' ఉన్నాడు. ధృతరాష్ట్రుడనే నాగరాజు పుత్రుడు ఒక 'సుషేణుడు' ఉన్నాడు. పురువంశీయ పరీక్షిత్తుడి పుత్రుడు ఒక 'సుషేణుడు' ఉన్నాడు. జమదగ్ని పుత్రుడు ఒక 'సుషేణుడు' ఉన్నాడు. వానరరాజు వాలి మామగారు ఒక 'సుషేణుడు' ఉన్నాడు.

చ. కడువడి సత్యసేను తురగంబులఁ గూల్చి శరాసనంబుఁ జ
క్కడిచిన నొండుతేరికి రయంబు మెయిం జని యన్యచాప మె
క్కిడుటయు నక్కుమారు నిశితేషుయుగంబున నొంచి నొంచెఁ గ
వ్వడియనుజన్ముఁ డుగ్రుఁ డయి వాని సహోదరు రెండు తూపులన్. 140

ప్రతిపదార్థం: కడు= మిక్కిలి; వడిన్= వేగంగా; సత్యసేను; తురగంబులన్= గుర్రములను; కూల్చి= చంపి; శరాసనంబున్= వింటిని; చక్కడిచినన్= ఖండించగా; ఒండు= ఇంకొక; తేరికిన్= రథమునకు; రయంబుమెయిన్= మిక్కిలివేగముగా; చని= వెళ్ళి; అన్య= మరియొక; చాపము= విల్లు; ఎక్కిడుటయున్= ఎక్కుపెట్టుటయు; ఆ+కుమారు= ఆ కుమారుని; నిశిత= వాడియైన; ఇషు= బాణములయొక్క; యుగంబునన్= రెండింటితో; నొంచి= నొప్పించి; కవ్వడి= అర్జునునియొక్క; (ఏకకాలమున రెండు చేతులతో బాణములు ప్రయోగించగల వాడు కావున అర్జునునకు కవ్వడి అనిపేరు. సవ్యసాచి అని అర్థము); అనుజన్ముండు= తమ్ముడు(నకులుడు); ఉగ్రుఁడయి= భయంకరుడయి; వాని(సత్యసేనుని); సహోదరునిన్= సోదరుని; రెండుతూపులన్= రెండు బాణములతో; నొంచెన్= నొప్పించెను.

తాత్పర్యం: నకులుడు చిన్ననవ్వు నవ్వి, మిక్కిలి వేగంగా సత్యసేనుడి గుర్రాలను కూల్చి వింటిని ఖండించగా సత్యసేనుడు ఇంకొక రథం కొరకు వేగంగా వెళ్ళి మరియొక వింటిని ఎక్కుపెట్టగా అర్జునుడి తమ్ముడైన నకులుడు ఆ కుమారుడిని వాడి అయిన రెండు బాణాలతో నొప్పించి, భయంకరుడైన అతడి సోదరుడిని రెండు బాణాలతో నొప్పించాడు.

తే. అతని ధను వా సుశర్ముఁ డుద్ధతి దలిర్పఁ । ద్రుంచుటయు నొండువింట బల్దూపు లొడలఁ
బఱపి వాని సిడంబున నఱికి సత్య । సేను విలు ద్రుంచె నా పాండుసూనుఁ డధిప! 141

ప్రతిపదార్థం: అధిప! ధృతరాష్ట్ర మహారాజా!; అతని; ధనువు= విల్లు; ఆ సుశర్ముడు; ఉద్ధతి= గర్వము; తలిర్పన్= అతిశయింపగా; త్రుంచుటయున్= ఖండించుటయు; ఆ పాండు సూనుఁడు= ఆ పాండురాజు కుమారుడు(నకులుడు); ఒండు= మరియొక; వింటన్= ధనువుతో; బల్= బలమయిన; తూపులు= బాణములు; ఒడలన్= దేహమునందు; పఱపి= ప్రయోగించి; వాని; సిడంబును= టెక్కెమును; నఱికి; సత్యసేను విలు= సత్యసేనునియొక్క ధనువు; త్రుంచెన్= ఖండించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ నకులుడి ధనువును ఆ సుశర్ముడు గర్వం అతిశయించగా ఖండించటంతో నకులుడు మరియొక వింటితో బలమైన బాణాలు ప్రయోగించి, ఆ సుశర్ముడి రథకేతనాన్ని ఖండించి సత్యసేనుడి విల్లును కూడా నరికాడు.

విశేషం: వావిళ్ళవారి ప్రతిలోనూ, ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ప్రతిలోనూ సుశర్ముడి 'శిరమ్మును నఱికి' అని ఉన్నది. కాని, 148వ పద్యంలో సుశర్మ శిరస్సును నకులుడు తునిమినట్లు 'అవ్విరోధి శిరము దునిమె' అని ఉన్నది. కర్ణుడి కొడుకులలో మూడవవాడైన సుశర్మ 148వ పద్యంలో చంపబడినట్లున్నది కాబట్టి ఈ పద్యంలో 'శిరంబును' అనటానికి మారుగా ఉస్మానియావారి భారత పాద దీపికలో 'సిడంబు' అనే పాఠాంతరం పరిగ్రాహ్యమైతే ఆ విరోధం తొలగుతుంది కాబట్టి 'సిడంబు' అనే పాఠాంతరాన్ని గ్రహించటమైనది.

శా. ఆ రాధేయతనూజుఁ డన్యధను వుగ్రాకారుఁడై యెత్తి దు
ర్వారప్రక్రియ నేసె నావిశిఖముల్ వారించి యాతం డతి
క్రూరస్ఫారశరత్రయం బతని వక్షోభిత్తిఁ గీలించి వే
నారాచంబులు రెండు దమ్మునిమెయిన్ నాటెం గడున్ బెట్టుగన్. 142

ప్రతిపదార్థం: ఆ; రాధేయ= రాధకుమారుడయిన కర్ణునియొక్క; తనూజుఁడు= కుమారుడు(సత్యసేనుడు); ఉగ్ర= భయంకరమయిన; ఆకారుఁడై; అన్య= మరియొక్క; ధనువు= విల్లు; ఎత్తి= ఎక్కుపెట్టి; దుర్వార= వారింపశక్యముకాని; ప్రక్రియన్= విధముగా; ఏసెన్= ప్రయోగించెను; ఆ విశిఖముల్= ఆ బాణములు; వారించి= నివారించి(ఆపి); ఆతండు; అతి= మిక్కిలి; క్రూర= భయంకరమయిన; స్ఫార= గొప్పవి అయిన(అధికశక్తిమంతమయిన); శర= బాణములు; త్రయంబు= మూడు(మూడు బాణములు); అతని= అతనియొక్క (ఆ సత్యసేనునియొక్క); వక్షస్‌భిత్తిన్= గోడవలె దృఢమైన రొమ్మున; కీలించి= నాటించి; వే= వేగంగా; రెండు; నారాచంబులు= వాడి అయిన ఇనుప బాణాలు; తమ్ముని= తమ్ముడియొక్క (సత్యసేనుని తమ్ముడయిన సుశర్మునియొక్క); మెయిన్= శరీరమును; కడున్= మిక్కిలి; బెట్టుగన్= గట్టిగా; నాటెన్= గ్రుచ్చెను.

తాత్పర్యం: ఆ సత్యసేనుడు భయంకరాకారుడై ఇంకొకవిల్లు ఎక్కుపెట్టి వారింపశక్యంకాని విధంగా బాణాలను ప్రయోగించాడు. ఆ బాణాలను నివారించి నకులుడు మిక్కిలి భయంకరం, అధిక శక్తిమంతం అయిన మూడు బాణాలు ఆ సత్యసేనుడి వక్షఃస్థలంలో నాటించి, వేగంగా రెండు బాణాలు సత్యసేనుడి తమ్ముడు సుశర్ముడి శరీరంలోనికి మిక్కిలి గట్టిగా గ్రుచ్చాడు.

క. వా రలిగి యొక్కయుమ్మడి । సారథిఁ దెగటార్చి యార్చి చాపము దునియం
దేరు వికలముగ మేను వి । దారితముగ నేసి రత్యుదగ్రస్ఫురణన్. 143

ప్రతిపదార్థం: వారు(ఆ సత్యసేన సుశర్ములు); అలిగి= కోపించి; ఒక్క+ఉమ్మడి= ఒక్కటిగా ఇద్దరును ఏకమై; సారథిన్= సారథిని; తెగటార్చి= చంపి; ఆర్చి= అరచి; చాపము= విల్లు; తునియన్= ఖండించగా; తేరు= రథము; వికలముగన్= ముక్కలుగ; మేను= దేహము; విదారితముగన్= చీలిపోవునట్లుగా; అతి+ఉదగ్ర= మిక్కిలి భయంకరమయిన; స్ఫురణన్= విజృంభణతో; ఏసిరి= కొట్టిరి.

తాత్పర్యం: కర్ణపుత్రులైన సత్యసేన సుశర్ములు కోపించి ఒక్కుమ్మడిగా సారథిని చంపి అరచి విల్లు ఖండించగా రథం ముక్కలయ్యేటట్లుగా దేహం చీలిపోయేటట్లుగా మిక్కిలి భయంకరమయిన విజృంభణంతో కొట్టారు.

వ. ఇవ్విధంబున. 144

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా సత్యసేన సుశర్ములు నకులుడిని కొట్టగా.

మ. విరథుండున్ వినికృత్తచాపుఁడు శరావిద్ధుండునై మేదినీ
వర నీపుత్రుఁడు చంచదుగ్రతర జిహ్వాం బైన చండాహి నాఁ
గర మాభీలతఁ బొల్చుశక్తిఁ గొని యల్కన్ సత్వరుండయ్యె సు
స్థిరసంరంభత సత్యసేనుఁ బడవైచెం జూప అగ్గింపఁగన్. 145

ప్రతిపదార్థం: మేదినీ= భూమికి; వర!= భర్తవయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; విరథుండున్= రథములేనివాడును; వినికృత్త= విరుగగొట్టబడిన; చాపుఁడున్= ధనువు కలవాడును; శర= బాణములతో; ఆ విద్ధుండును= చీల్చబడినవాడును; ఐ= ఉన్నవాడై; నీ పుత్రుడు= నీయొక్క కుమారుడు(నకులుడు); చంచత్= చలించుచున్న; ఉగ్రతర= మిక్కిలి భయంకరమయిన; జిహ్వాంబు+ఐన= నాలుక గల; చండ= తీవ్ర; అహి= పాము; నాన్= అనునట్లుగా; కరము= మిక్కిలి; ఆభీలతన్= భయంకరముగా; పొల్చు= ఒప్పు; శక్తిన్= శక్తి అను ఆయుధమును; కొని= తీసికొని; అల్కన్= కోపంతో; సత్వరుండు= మిక్కిలివేగిరపాటు కలవాడు; అయ్యెన్; సుస్థిర= మిక్కిలి నిలకడకల; సంరంభతన్= గర్వంతో; చూపఱు= చూచువారు; అగ్గింపఁగన్= పొగడేటట్లుగ; సత్యసేనున్= సత్యసేనుని; పడవైచెన్= పడగొట్టెను (చంపెను.)

తాత్పర్యం: (సంజయుడు చెప్పుతున్నాడు) ఓ ధృతరాష్ట్ర మహారాజా! రథం లేని వాడు, విరుగగొట్టబడిన విల్లు కలవాడు, బాణాలతో శరీరం చీల్చబడినవాడు అయిన నీ పుత్రుడు నకులుడు చలిస్తున్న భయంకరమైన నాలుక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కలిగిన మిక్కిలి క్రూరమైన పామూ అన్నట్లు భయంకరమైన 'శక్తి' అనే ఆయుధాన్ని తీసికొని కోపంతో వేగిరపాటు కలవాడై నిలకడ కలిగిన గర్వంతో చూచేవాళ్ళు పొగడేటట్లుగా సత్యసేనుడిని సంహరించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

ఆ. అన్నపాటు సూచి యనుజుఁ డుల్లంబున । నడలు కనలుఁ గదుర నంపవానఁ
గప్పె నకులు నంతఁ గాంచి భీముకుమారుఁ । డెయిదె నతనియరద మెక్కె నతఁడు. 146

ప్రతిపదార్థం: అన్న; పాటు= పడుట; చూచి; అనుజుఁడు= తమ్ముడు (సుశర్ముడు లేక సుషేణుడు); ఉల్లంబునన్= హృదయమునందు; అడలు= శోకము; కనలున్= కోపమును; కదురన్= అతిశయింపగా; అంప= బాణములయొక్క; వానన్= వర్షంతో; నకులున్; కప్పెన్= కప్పెను; అంతన్= అంతలో; కాంచి= చూచి; భీము= భీమునియొక్క; కుమారుడు(భీమునివలన ద్రౌపదియందు పుట్టినపుత్రుడు శ్రుతసోముడు); ఎయిదెన్= దగ్గరకు చేరాడు. అతఁడు= నకులుడు; అతని= అతనియొక్క (భీమపుత్రుడియొక్క); అరదము= రథము; ఎక్కెన్= ఎక్కెను.

తాత్పర్యం: అన్న సత్యసేనుడు పడిపోవటం చూచి తమ్ముడు సుశర్ముడు (సుషేణుడు) హృదయంలో శోకం, కోపం అతిశయించగా నకులుడిపై బాణవర్షం కురిపించాడు. అంతలో నకులుడిని చూచి భీముడిపుత్రుడు శ్రుతసోముడు దగ్గరకు చేరాడు. నకులుడు శ్రుతసోముడి రథం అధిరోహించాడు.

వ. ఇట్లు ద్రౌపదేయుండగు శ్రుతసోముని యరదంబెక్కి బలువిల్లుగొని యక్కుమారుండును దోడుపడ నా సుశర్ముని బటుశరపరంపరలం బొదివినఁ బొలివోక యతండు. 147

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; ద్రౌపదేయుఁడు= ద్రౌపది పుత్రుడు అగునట్టి; శ్రుతసోముని= శ్రుతసోమునియొక్క; అరదంబు= రథము; ఎక్కి; బలు= బలమయిన; విల్లున్= ధనువు; కొని= తీసికొని; ఆ+కుమారుండును; ఆ పుత్రుడును (శ్రుతసోముడును); తోడుపడన్= సహాయపడగా; ఆ సుశర్ముని; (సుషేణుని); పటు= తీవ్రమయిన; శర= బాణములయొక్క; పరంపరలన్= వరుసలతో (ఒకదానితరువాత ఒకటిగా); పొదివినన్= క్రమ్ముకొనగా; పొలివోక= వెనుదీయక; అతండు (అనగా ఆ సుశర్ముడు లేక సుషేణుడు).

తాత్పర్యం: ఈ ప్రకారంగా ద్రౌపది కుమారుడైన శ్రుతసోముడి రథం ఎక్కి బలమయిన ధనువును తీసికొని ఆ శ్రుతసోముడు సహాయపడగా ఆ సుశర్ముడి (ఆ సుషేణుడి) తీవ్రమయిన బాణాల వరుసలతో కొట్టాడు. అయినా, వెనుదీయకుండా ఆ సుశర్ముడు (ఆ సుషేణుడు). (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. వాఁడి తూపులు నకులుమై మూఁడు నాఁటి । యిరువదింటఁ దత్పుత్రుని యురము నొంప
నర్ధచంద్రబాణాహతి నవ్విరోధి । శిరము దునిమె నప్పాండుభూవరసుతుండు. 148

ప్రతిపదార్థం: వాఁడి తూపులు= వాడి అయిన బాణములు, నకులు= నకులునియొక్క; మైన్= దేహమందు; మూఁడు; నాఁటి= గ్రుచ్చి; ఇరువదింటన్= ఇరువది బాణములతో; తద్= ఆ; పుత్రుని= ద్రౌపదేయుని(శ్రుతసోముని); ఉరమున్= వక్షఃస్థలమును; నొంపన్= బాధింపగా; ఆ+పాండు భూవర= ఆ పాండురాజుయొక్క; సుతుండు= కుమారుడు(నకులుడు); అర్ధచంద్ర= అర్ధచంద్రుడియొక్క ఆకృతిగల; బాణ= బాణంయొక్క; ఆహతిన్= దెబ్బతో; ఆ+విరోధి= ఆ శత్రువుయొక్క (సుశర్ముడియొక్క లేక సుషేణుని యొక్క) శిరము= తలను; తునిమెన్= ఖండించెను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వాడి అయిన బాణాలు నకులుడి దేహంలో మూడు గ్రుచ్చి ఇరువది బాణాలతో శ్రుతసోముడి వక్షఃస్థలాన్ని బాధించగా, ఆ నకులుడు అర్ధచంద్రాకృతిగల బాణంయొక్క దెబ్బతో శత్రువు అయిన ఆ సుశర్ముడి (సుషేణుని) తలను ఖండించాడు.

శా. మాద్రీపుత్రునిచేతఁ గర్ణసుతు లీమాడ్కిం బడం జూచి వీ
రోద్రేకం బెడలంగ నీ సుతుబలం బొక్కుమ్మడిన్ విచ్చిన
న్మద్రాధీశుఁడు సింహనాదము రణన్మౌర్వీసముల్లాసమున్
రౌద్రప్రక్రమసూచకంబులుగ సంరంభస్ఫురన్మూర్తియై. 149

ప్రతిపదార్థం: మాద్రీపుత్రునిచేతన్= మాద్రీపుత్రుడు అయిన నకులుడిచేత; కర్ణసుతులు= కర్ణునియొక్క కుమారులు (చిత్రసేన - సత్యసేన - సుశర్ములు (సుషేణులు); ఈ మాడ్కిన్= ఈ విధంగా; పడన్= కూలిపోవుటను; చూచి; వీర= శూరులయొక్క; ఉద్రేకంబు= విజృంభణము; ఎడలంగన్= పోగా; నీ= నీయొక్క(ధృతరాష్ట్రునియొక్క); సుతు= కుమారునియొక్క= (దుర్యోధనునియొక్క); బలంబు= సైన్యము; ఒక్కుమ్మడిన్= ఒక్కసారిగ; విచ్చినన్= విడివడిపోగా (చెల్లాచెదరుకాగా); మద్రాధీశుఁడు= మద్రదేశమునకు అధిపతి అయిన శల్యుడు; సింహనాదమున్= సింహగర్జనమును; రణత్= ధ్వనిచేయు; మౌర్వీ= వింటినారియొక్క (అల్లెత్రాడుయొక్క); సముల్లాసమున్= ప్రకాశమును; రౌద్ర= క్రోధముయొక్క; ప్రక్రమ= ప్రారంభమునకు; సూచకంబులుగన్= తెలియచేయు గుర్తులుగా; సంరంభ= ఆటోపంతో; స్ఫురత్= ప్రకాశించు; మూర్తి; రూపము; ఐ= కలవాడై.

తాత్పర్యం: నకులుడిచేత కర్ణుడికుమారులు ఈ ప్రకారంగా కూలిపోవటం చూచి, శూరుల విజృంభణం వికలం కాగా నీ కుమారుడైన దుర్యోధనుడి సైన్యం ఒక్కసారిగా విడివడి చెల్లాచెదురుకాగా మద్రదేశాధిపతి శల్యుడు సింహగర్జనను, మౌర్వీనాదాన్ని క్రోధసూచకాలుగా ప్రకాశించే రూపం కలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. హస్తతల మెత్తి నిలునిలుమని యదల్పఁ । బోకతిరిగి యమ్మూఁకలు పోరి కమరెఁ
బాండవేయుల మొనలు నుద్దండవృత్తి । నురవడించిన సంగర ముగ్రమయ్యె. 150

ప్రతిపదార్థం: హస్తతలము= అరచేతిని; ఎత్తి; నిలునిలుము= ఆగుము ఆగుము; అని; అదల్పన్= అదలించగా; ఆ+ మూఁకలు= ఆ సైన్యములు; పోక= వెడలిపోక; పోరికిన్= యుద్ధమునకు; అమరెన్= సిద్ధమయ్యెను; పాండవేయుల= పాండవులయొక్క; మొనలున్= సేనలును; ఉద్దండ= అధికమయిన; వృత్తిన్= వ్యాపారంతో (ఉత్సాహంతో); ఉరవడించినన్= వేగిరపాటు పడగా; సంగరము= యుద్ధము; ఉగ్రము= భయంకరము; అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: శల్యుడు చేతిని ఎత్తి, ఆగుమాగు మని అదలించగా ఆ కౌరవసైన్యం వెడలిపోక మరల యుద్ధానికి సిద్ధమైనది. పాండవసేనలు కూడా అధికోత్సాహంతో వేగిరపాటు పడగా యుద్ధం భయంకరం అయింది.

చ. అడరి ధనంజయాదులగు నక్కడి వీరులు విక్రమింప ని
క్కడ భవదీయనందనముఖప్రభవోద్భట యోధవర్గము
ల్వడిఁ దఱుమంగ నప్పుడు బలద్వయమున్ విశిఖాగ్ని పేర్చి యె
క్కుడయిన భీతి నొందె రణఘోరత భూవర! యేమి సెప్పదున్? 151

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అడరి= విజృంభించి; ధనంజయ= అర్జునుడు; ఆదులు= మొదలు; అగు= అగునట్టి; అక్కడి= ఆ పాండవపక్షమందలి; వీరులు= శూరులు; విక్రమింపన్= పరాక్రమమును చూపగా; ఇక్కడన్= ఈ కౌరవపక్షమునందలి; భవదీయ= నీయొక్క; నందన= కుమారుడు (దుర్యోధనుడు); ముఖ= మున్నగు; ప్రభవ= పుట్టుకచేత; ఉద్భట= భయంకరులైన; యోధ= వీరులయొక్క; వర్గముల్= సమూహాలు; వడిన్= వేగముగా; తఱుమంగన్= తరుమగా (వెంటపడి పరుగెత్తునట్లు చేయగా); అప్పుడు= ఆ సమయమున; బల= సైన్యములు; ద్వయమున్= రెండును; విశిఖాగ్ని= బాణాలయొక్క అగ్ని; పేర్చి= విజృంభించి; ఎక్కుడు+అయిన= అధికమయిన; భీతిన్= భయమును; ఒందెన్= పొందెను; భూవర!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; రణ= రణముయొక్క; ఘోరతన్= భయంకరత్వమును గూర్చి; ఏమి; చెప్పుదున్?= చెప్పగలను? (అత్యంత భయంకరమయిన యుద్ధమున గూర్చి చెప్పటం సాధ్యంకాదు.)

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! విజృంభించి అర్జునుడు మొదలయిన పాండవపక్షంలోని వీరులు పరాక్రమించగా ఈ కౌరవ పక్షంలోని నీ కుమారుడు దుర్యోధనుడు మున్నగు పరాక్రమవంతులు, శ్రేష్ఠులు అయిన యోధ సమూహాలు వేగంగా వెంటపడి తరుమగా ఆ సమయంలో రెండు సైన్యాలూ బాణాల వలన పుట్టిన అగ్ని విజృంభించి అధికమయిన భయాన్ని పొందాయి. ఆ భయంకర యుద్ధాన్ని గూర్చి ఏమి చెప్పగలను? (ఆ యుద్ధం వర్ణింప శక్యం కానిది.)

వ. ఇట్లు మథితంబయ్యును బౌరుషంబు పెంపున నిరువాఁగును వేగంబు గుందక వింత చందంబునం బేర్చుక్రందు గగనచరులకుఁ గన్నులపండువుగా బృంహితధ్వనులను ఘంటానినదంబులను నేమినిస్వనంబులను గేతుకింకిణీక్వణనంబులను రింఖారవంబులను హేషాఘోషంబులను భుజస్ఫాలనంబులను సింహనాదంబులను దిక్తటభేదనం బొనర్ప నద్భుతోత్సాహంబున నాహవక్రీడ సలుపుచుండఁ బుండరీకాక్ష రక్షితులగు పాండుపుత్రుల బలశౌర్యసంపదల సొంపునం బెంపాదవు ధృష్టద్యుమ్న శిఖండిసాత్యకి ప్రముఖులైన దండిమగలు గూడికొని తఱుమ దారుణనైపుణంబున బాహాటోపంబు సూపినఁ గార్చిచ్చు గవిసినం గలంగు మృగకులంబు కైవడిం గౌరవసైన్యంబు దైన్యంబు నొందిన. 152

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; మథితంబు= మథించబడింది; అయ్యును= అయినప్పటికిని; పౌరుషంబు= పరాక్రమముయొక్క; పెంపునన్= ఆధిక్యమువలన; ఇరు= రెండు; వాఁగును= పక్షములసైన్యములును; వేగంబు= వేగిరపాటు; కుందక= తగ్గిపోకుండగ; వింత= విచిత్రమయిన; చందంబునన్= విధముగా; పేర్చు= విజృంభించు; క్రందు= సందడి; గగన= ఆకాశమునందు; చరులకున్= సంచరించువారికి (యక్షగంధర్వ కిన్నర కింపురుషాదులకు); కన్నుల= నేత్రములకు(చూపులకు); పండువుగాన్= వేడుకకాగా; బృంహిత= ఏనుగులు చేయు ఘీంకారపు; ధ్వనులను= శబ్దములచేతను; ఘంటా= ఘంటలయొక్క; నినదంబులను= ధ్వనులచేతను (ఏనుగుల మెడలకు వ్రేలాడగట్టిన ఘంటల ధ్వనులచేతను); నేమి= రథ చక్రముల కమ్ములయొక్క; నిస్వనంబులను= శబ్దములచేతను; కేతు= జెండాకొయ్యలయొక్క; కింకిణీ= చిరుమువ్వలయొక్క; క్వణనంబులను= ధ్వనులచేతను; రింఖా= గుర్రాల గిట్టలయొక్క; రవంబులను= శబ్దములచేతను; హేషా= గుర్రాల సకిలింతలయొక్క; ఘోషంబులను= ధ్వనులచేతను; భుజా= భుజములయొక్క; స్ఫాలనంబులను= చరుపుల వలన పుట్టిన శబ్దముల చేతను; సింహనాదంబులను= సింహ గర్జనములచేతను (యుద్ధభూమియందు వీరులు చేయు బొబ్బలు); దిక్= దిక్కులయొక్క; తట= ఆకాశపుటంచులను; భేదనంబు= బ్రద్దలగునట్లు (చిల్లులుపడునట్లు); ఒనర్పన్= చేయగా; అద్భుత= ఆశ్చర్యకరమగు; ఉత్సాహంబునన్= ప్రయత్నముతో; ఆహవ= యుద్ధమనెడి; క్రీడన్= ఆటను; సలుపుచుండన్= చేయుచుండగా; పుండరీక+అక్ష= తెల్లతామరలవంటి నేత్రములు కలవాడు అగు శ్రీకృష్ణుడిచేత; రక్షితులు= కాపాడబడుచుండువారు; అగు= అయినట్టి; పాండుపుత్రుల= పాండురాజు కుమారులయొక్క; బల= బలము; శౌర్య= పరాక్రమములయొక్క; సంపదల=

ఐశ్వర్యములయొక్క; సొంపునన్= సమృద్ధివలన; పెంపు= వృద్ధి; ఒదవు= పొందు; ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నుడును; శిఖండి; సాత్యకి; ప్రముఖులు= ముఖ్యులు; ఐన; దండి= ప్రతాపవంతులయిన; మగలు= వీరులు; కూడికొని= కలిసికొని; తఱుమన్= వెంటపడి పరుగెత్తునట్లు చేయగా; దారుణ= భయంకరమయిన; నైపుణంబునన్= కౌశలముతో; బాహా= భుజములయొక్క; ఆటోపంబు= గర్వము; చూపినన్= చూపగా (ప్రదర్శింపగా); కార్చిచ్చు= దవానలము (అడవులను కాల్చు అగ్ని); కవిసినన్= వ్యాపించగా; కలంగు= కలతపడు (వ్యాకులమగు); మృగ= లేళ్ళయొక్క; కులంబు= గుంపు; క్రైవడిన్= వలె; కౌరవసైన్యంబు= కౌరవులయొక్క సైన్యము; దైన్యంబున్= దీనత్వమును; ఒందినన్= పొందగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా అల్లకల్లోలం అయినప్పటికీ అధిక పరాక్రమంతో రెండు పక్షాల సైన్యాలు వేగిరపాటు తగ్గకుండా మరియొక విధంగా విజృంభించిన ఆ విచిత్ర యుద్ధం ఆకాశసంచారులయిన యక్ష, గంధర్వ, కిన్నర, కింపురుషాదులకు కన్నులపండువు కాగా, ఏనుగుల ఘీంకార ధ్వనులతో, ఏనుగుల కంఠాలకు వ్రేలాడుతున్న ఘంటానాదాలతో, రథచక్రాల కమ్ముల తాకిడివలన పుట్టిన ధ్వనులతో, జెండాకొయ్యలయందు వ్రేలాడే చిరుమువ్వల నాదాలతో, గుర్రాల గిట్టల చప్పుళ్ళతో, గుర్రాల సకిలింతల ధ్వనులతో, భుజాల చరుపులవలన పుట్టిన ధ్వనులతో వీరులు చేసే సింహగర్జనలతో దిక్కుల అంచులు చిల్లులు పడగా ఆశ్చర్యకరమయిన ప్రయత్నంతో యుద్ధక్రీడ చేస్తూ ఉండగా శ్రీకృష్ణుడిచేత పరిరక్షించబడుతున్న పాండవుల బలపరాక్రమాల సమృద్ధివలన వర్ధిల్లే ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకి మున్నగు ప్రతాపవంతులగు వీరులు ఒక్కటిగా కలిసికొని తరుమగా భయంకరమైన కౌశలంతో భుజగర్వం చూపగా కార్చిచ్చు వ్యాపించినప్పుడు వ్యాకులమయిన లేళ్ళ గుంపువలె కౌరవసైన్యం దీనత్వం పొందగా.

విశేషం: ఈ వచనంలో చిన్న ఉపమ కలదు. 'కార్చిచ్చు వ్యాపించగా వ్యాకులమయిన లేళ్ళ గుంపు వలె కౌరవసైన్యం దీనత్వం పొందింది.' తిక్కన ఈ వచనంలో ఆహవక్రీడలో నాదవిన్యాసం చేశాడు. ఘీంకారనాదము, ఘంటానాదము, నేమినాదము, కింకిణీ నాదము, రింఖానాదము, హేషానాదము, స్ఫాలననాదము, సింహనాదము, హాసవిన్యాస, నాద విన్యాసములు తిక్కయజ్వ కవనక్రీడలు.

క. పెనురొంపి లోపలను బ్రుం । గిన ధేనువు నెత్తుపోలికిని శల్యుం డ
మ్మొనఁ దనభుజబలమునఁ గలఁ । గని యట్టుగ నిలిపె శౌర్యగర్వము మెఱయన్. 153

ప్రతిపదార్థం: పెను= పెద్ద; రొంపి= బురద; లోపలను; బ్రుంగిన= మునిగిపోయిన; ధేనువును= గోవును; ఎత్తు= పైకి తీయు; పోలికిని; శల్యుండు; ఆ+మొనన్= ఆ కురుసైన్యమును; తన= తనయొక్క; భుజబలమునన్= భుజబలముతో; శౌర్య= పరాక్రమము; గర్వము; మెఱయన్= ప్రకాశింపగా; కలఁగని= కలతచెందని; అట్టుగ; నిలిపెను.

తాత్పర్యం: పెద్ద బురదలో మునిగిపోయిన గోవును పైకి తీసే విధంగా శల్యుడు ఆ కురుసైన్యాన్ని తన భుజబలంతో పరాక్రమం, గర్వం ప్రకాశించగా కలతచెందనట్లుగా నిలిపాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. నిలిపి పేర్చిన సమయంబున మన దిక్కున నుల్కాపాత ప్రముఖంబులగు దుర్నిమిత్తంబులు వొడమిన నీ కొడుకులు గూడుకొని చేయం గలసైనికులం గూర్చికొని తిరంబయి పెనంగి రట్లు పెనంగునెడఁ గడంగి తలకడచి మిగిలి మద్రపతి మార్గణాసారంబు వరఁగించుచుఁబాండవాగ్రజు నగ్రభాగంబున నున్న భీమసేన

సాత్యకి ధృష్టద్యుమ్న శిఖండి ద్రౌపదేయమాద్రేయులఁ దాఁకి పదిపదిప్రదరంబుల నొప్పించి కదిసి యన్నరపతికిని బదితూపుల వేఁడిమి సూపి మలసినఁ బాంచాలప్రభద్రకబలంబు లా జెట్టిబిరుదు చుట్టుముట్టిన. 154

ప్రతిపదార్థం: నిలిపి(సేనలను నిలిపి); పేర్చిన= విజృంభించిన; సమయంబునన్; మనదిక్కునన్= మనవైపున(కౌరవుల పక్షమున); ఉల్కాపాత= ఆకాశమునుండి వెలుగుచుపడునట్టి చుక్కలవంటి పదార్థములు పడిపోవుట; ప్రముఖములు= మున్నగు; దుర్నిమిత్తంబులు= దుష్టశకునములు; పొడమినన్= పుట్టిన(పొడచూపగా); నీ కొడుకులు= నీయొక్క (ధృతరాష్ట్రుడియొక్క) కుమారులు; కూడుకొని= కలిసికొని; చేయంగల= చేయగల (బాగుగా యుద్ధం చేయగల); సైనికులన్= సేనలను; కూర్చికొని= సమీకరించుకొని (పోగుచేసికొని); తిరంబు= స్థిరము; అయి; పెనంగిరి= పోరాడిరి; అట్లు; పెనంగు= యుద్ధముచేయు; ఎడన్= సమయమున; కడంగి= ప్రయత్నించి; తల కడచి= సేనాగ్రమునుండి (వ్యూహమునుండి) అతిక్రమించి; మిగిలి= ఉద్రేకించి; మద్రపతి= శల్యుడు; మార్గణ= బాణములయొక్క; ఆసారంబు= వర్షము; పరఁగించుచున్= ప్రయోగించుచు (బాణవర్షము కురిపించుచు); పాండవ= పాండవులలో; అగ్రజున్= పెద్దవాడయిన ధర్మరాజునకు; అగ్రభాగంబునన్= ముందుభాగమున; ఉన్న; భీమసేన= భీమసేనుడిని; సాత్యకి= సాత్యకిని; ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నుడిని; శిఖండి= శిఖండిని; ద్రౌపదేయ= ద్రౌపది పుత్రులను; మాద్రేయులన్= మాద్రిపుత్రులను (నకుల సహదేవులను); తాఁకి= ఎదుర్కొని; పదిపది= పది పది చొప్పున; ప్రదరంబులన్= బాణములతో; వేఁడిమి= ప్రతాపము; చూపి= చూపించి; మలసినన్= విజృంభించుచుండగా; పాంచాల= పాంచాల దేశముయొక్క; ప్రభద్రక= ప్రభద్రకులను క్షత్రియులయొక్క; బలంబులు= సైనికదళములు; ఆ జెట్టి= శూరశ్రేష్ఠుడయిన ఆ శల్యుని; బిరుదు= శౌర్యచిహ్నమును (మహారథుడను శౌర్య చిహ్నముగల రథమును); చుట్టుముట్టినన్= చుట్టుముట్టగా.

తాత్పర్యం: శల్యుడు చెదరిపోతున్న సేనలను నిలిపి, విజృంభించే సమయంలో మనవైపున ఉల్కాపాతాలు మొదలయిన దుష్టశకునాలు పొడచూపగా నీకుమారులు కలిసికొని యుద్ధం చేయటానికి సమర్థులయిన సేనలను సమకూర్చుకొని స్థిరంగా పోరాడారు. ఆ ప్రకారంగా యుద్ధం చేసే సమయంలో ఆ వ్యూహాన్ని అతిక్రమించి, ఉద్రేకించి మద్రపతి శల్యుడు బాణవర్షం కురిపిస్తూ ధర్మరాజునకు ముందు నిలిచిన భీమసేన సాత్యకి ధృష్టద్యుమ్న శిఖండి ద్రౌపదేయ మాద్రేయులను ఎదుర్కొని, పది పది చొప్పున బాణాలతో బాధించి, ధర్మరాజు దగ్గరకు చేరి పదిబాణాలతో ప్రతాపం చూపించి విజృంభిస్తుండగా పాంచాల దేశపు క్షత్రియులయిన ప్రభద్రక దళములు ఆ శల్యుడిని చుట్టుముట్టగా.

విశేషం: వ్యాసభగవానులు మూలమున మహారథ శబ్దం ప్రయోగించిన చోట తిక్కన బిరుదు శబ్దం ప్రయోగించిన కారణంగా బిరుదు శబ్దానికి మహారథుడనే అర్థం చెప్పటం జరుగుతున్నది. సామాన్యంగా అతిరథ - మహారథ - రథ - అర్ధరథులందరికి బిరుదు శబ్ద ప్రయోగం తిక్కన తెనుగు శబ్ద ప్రయోగంపై గల మక్కువను సూచిస్తున్నది.

ఉ. వాలి యతండు బాహువిభవం బలరించినఁ బేర్చి రౌద్రతం
గూలుగజంబులుం గెడయు గుఱ్ఱపుతండముఁ ద్రెళ్ళు తేరులుం
గీలెడలించినట్ల పడుకేతువితానము నుగ్గునూచమై
రాలు పదాతి వర్గములు రక్తపుటేఱులుఁ బ్రేవుప్రోవులున్. 155

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అతండు (ఆశల్యుడు); వాలి= విజృంభించి; బాహు= భుజములయొక్క; విభవంబు= సంపద; అలరించినన్= ప్రకాశింపజేయగా; రౌద్రతన్= క్రోధముతో; పేర్చి= విజృంభించి; కూలు= కూలిపోయిన(చనిపోయిన); గజంబులున్= ఏనుగులును; కెడయు= చనిపోయిన; గుఱ్ఱపు= గుఱ్ఱములయొక్క; తండమున్= గుంపులను; త్రెళ్ళు= విరిగిపడిపోయిన; తేరులున్= రథములును; కీలు= ఇరుసు; ఎడలించినట్లు+అ= తొలగించినట్లుగా; పడు= పడిపోవుచున్న; కేతు= జెండాకొయ్యలయొక్క; వితానమున్= సమూహమును; నుగ్గనూచమై= ఖండఖండములై (పిండిపిండియై); రాలు= క్రిందపడిపోయిన; పదాతివర్గములున్= కాల్బలములును; రక్తపుటేఱులున్= నెత్తుటి నదులను; ప్రేవు= పేగులయొక్క; ప్రోవులున్= పోగులును.

తాత్పర్యం: ప్రభద్రక దళాలు చుట్టుముట్టగా శల్యుడు విజృంభించి భుజసంపద ప్రకాశింపజేయగా క్రోధంతో అతిశయించి కూలిపోయిన ఏనుగులు, చనిపోయిన గుఱ్ఱాల గుంపులు, విరిగిపడిపోయిన రథములు, ఇరుసులు తొలగిపడిపోయిన జెండా కొయ్యల సమూహం, ఖండఖండాలై పిండిపిండిగా రాలిపోయిన కాల్బలం, నెత్తురు ప్రవాహాలు, పేగుల పోగులు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'నుగ్గనూచమై' ఇది తెలుగుజాతీయం. సందర్భాన్ని అనుసరించి 'ఖండఖండములై' అనే అర్థం వ్రాయబడింది. తిక్కయజ్వ యుద్ధ పర్వాలలో తరచుగా ఈ జాతీయాన్ని ప్రయోగించాడు. బహుజనపల్లి సీతారామాచార్యులవారు శబ్దరత్నాకరంలో ఇట్లా వ్రాశారు. "నుగ్గనూచ" అని ఒకానొక నిఘంటువునందు ఏకపరముగా వ్రాయబడి యున్నది. అట్లు చెప్పినచో 'నూచ' శబ్దము ప్రత్యేకముగాను ప్రయోగించబడుచున్నది. కనుక 'నుగ్గనూచ' శబ్దములు రెండు చేరినప్పుడు 'మిక్కిలిపొడి' యని అర్థము చెప్పవచ్చును." దీనికి పై ఉదాహరణమునందు 'దుమ్ము ధూళిగా" అని చెప్పి ఉండటమే ప్రమాణంగా గ్రహించవలెను. పై ఉదాహరణలు 'కొన్నిటి హస్తముల్ చదియఁ గొన్నిటిఁ గొమ్ములు దుమ్ము ధూళిగాఁ గొన్నిటి గుంభముల్ వగులఁ గొన్నిటిగాళులు 'నుగ్గనూచగా' - (భీష్మ -2 ఆశ్వా) రూ ॥ నూచము.' అరదంబులు పొడిపొడియై హరులగములు 'నుగ్గనూచమై' (భీష్మ -2 ఆశ్వా) - ఇది శబ్దరత్నాకరవ్యవహారం.

ఇంతకు ఇది 'నూచ' శబ్దమా 'ఊచ' శబ్దమా? లోకవ్యవహారంలో 'ఊచకోత' ఖండ ఖండములుగా ముక్క ముక్కలుగా నరకుట అనే అర్థం ప్రచురంగా ఉన్నది. అట్లే 'నుగ్గనూచమై' అను తెలుగుజాతీయ ప్రయోగానికి, ఖండ ఖండాలుగా, ముక్కలు ముక్కలుగా, పొడి పొడిగా, పిండి పిండిగా' అని సందర్భాన్ని అనుసరించి అర్థం చెప్పటం యుక్తం.

వ. మఱియును. 156

ప్రతిపదార్థం: మఱియును= ఇంకను.

క. ఏ రూపులయిన రూపఱ । ఘోరాశనులట్ల శల్యు క్రూరాస్త్రంబుల్
కౌరవులు వొంగఁ బాండుకు । మారులసేనపయిఁ దొరఁగె మనుజాధీశా! 157

ప్రతిపదార్థం: మనుజ= మానవులకు; అధీశా!= ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; ఏ రూపులు= ఏ ఆకారములు; అయినన్= అయినప్పటికిని; రూపు+అఱన్= అంగ విహీనులగునట్లు; శల్యు= శల్యునియొక్క; క్రూర= భయంకరములయిన; అస్త్రంబుల్= బాణములు; ఘోర+అశనులు+అట్లన్= భయంకరమైన పిడుగులవలె; పాండుకుమారుల= పాండురాజు పుత్రులయొక్క; సేనపయిన్= సైన్యముమీద; కౌరవులు; పొంగన్= సంతోషించునట్లు; తొరిగెన్= పడెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఏ ఆకారాలు కలిగిఉన్నప్పటికీ అంగవిహీనములయ్యేటట్లు శల్యుడి భయంకరములైన బాణాలు భయంకరములైన పిడుగులు పడుతున్నట్లు పాండవుల సేనపై కౌరవులైన దుర్యోధనాదులు సంతోషించేటట్లుగా పడ్డాయి.

వ. అట్లు దొరుఁగు దారుణమార్గణాసారంబున వెగడుపడి యాబలంబు పాండవాగ్రజు వెనుక కొదిఁగిన నమ్మహీపతి పురికొలిపికొని శల్యు మార్కొని నిశితవిశిఖవర్షంబునం బొదివిన నమ్మద్రవిభుండు గ్రూరనారాచం బతనిమేనుచ్చివో నేయ నా ధర్మనందనునకుఁ దలకడచి యేడమ్ముల నవ్వడముడియు సహదేవుం డయిదు తూపులను నకులుండు నవశరంబులను బ్రతివింధ్యాదిద్రౌపదేయులు బహుబాణపరంపరలను నవ్వీరు నేయ నప్పుడు కృపాచార్యుండును గృతవర్మయు శకునియుఁ దత్సుతుం డులూకుండును నీ కొడుకులుం గవిసిరి. గురుపుత్రుండు మందహాసంబుతో నమందగతి వచ్చి వారిఁ గూడికొనియె. నక్కడి సైనికులును రభసంబున నా రథికవరులఁ దాఁకి రట్టియెడ. 158

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారముగా; తొరుఁగు= పడుచున్న; దారుణ= భయంకరమయిన; మార్గణ= బాణములయొక్క; ఆసారంబునన్= వర్షమువలన; వెగడుపడి= భయపడి; ఆ బలంబు= ఆ సైన్యము (పాండవుల సేనలు); పాండవ= పాండవులలో; అగ్రజు= పెద్దవాడు అయిన ధర్మరాజుయొక్క; వెనుకకున్= వెనుకభాగమునకు; ఒదిఁగినన్= తొలగగా; మహీ= భూమికి; పతి= ప్రభువు అయిన ధర్మరాజు; పురికొలిపికొని (అనగా మరల సేనలలో ఉత్సాహము కలుగునట్లు హెచ్చరించుకొని); శల్యు= శల్యుని; మార్కొని= ఎదుర్కొని; నిశిత= వాడిఅయిన; విశిఖ= బాణములయొక్క; వర్షంబునన్= వానవలన; పొదివినన్= క్రమ్ముకొనగా; ఆ+మద్రవిభుండు= శల్యుడు; క్రూర= భయంకరమయిన (తీక్ష్ణమయిన); నారాచంబు= ఇనుపబాణము; అతని మేను= అతనియొక్క దేహము; ఉచ్చిపోన్= చీల్చుకొని పోవునట్లు; ఏయన్= ప్రయోగించగా; ఆ ధర్మనందనునకున్= ఆ ధర్మరాజునకు; తల= ముందు భాగమును; కడచి= దాటివచ్చి (సేనావ్యూహమునుండి ధర్మరాజుముందునకు వచ్చి); ఏడు+అమ్ములన్= ఏడు బాణములతో; ఆ+వడముడియున్= భీముడును; సహదేవుండు; అయిదుతూపులను= అయిదు బాణములతో; నకులుండు; నవశరంబులను= తొమ్మిది బాణములతో; ప్రతివింధ్యాది= ప్రతివింధ్యుడు మొదలగు; ద్రౌపదేయులు= ద్రౌపది పుత్రులు; బహు= అనేకాలయిన; బాణ= బాణాలయొక్క; పరంపరలనున్= వరుసలతోడను; ఆ+వీరున్= వీరుడయిన ఆ శల్యుడిని; ఏయన్= కొట్టగా; అప్పుడు= ఆ సమయమున; కృపాచార్యుండును; కృతవర్మయున్; శకునియున్; తద్= ఆ శకునియొక్క; సుతుండు= కుమారుడు; ఉలూకుండును; నీ కొడుకులున్= నీ పుత్రులయిన దుర్యోధనాదులును; కవిసిరి= కలియబడిరి; గురు= ద్రోణుడియొక్క; పుత్రుండు= కుమారుడు(అశ్వత్థామ); మందహాసంబుతోన్= చిరునవ్వుతో; అమందగతిన్= శీఘ్రగమనముతో; వచ్చి; వారిన్ (దుర్యోధనాదులను); కూడికొనియెన్= కలిసికొనియెను; అక్కడి; సైనికులును= సేనలును; రభసంబునన్= ఉత్సాహముతో; ఆరథికవరులన్= ఆ రథిక శ్రేష్ఠులను; తాఁకిరి= ఎదుర్కొనిరి; అట్టియెడన్= ఆ సమయమున.

తాత్పర్యం: ఆ ప్రకారంగా పడుతున్న భయంకరమైన బాణవర్షానికి తడబాటు పడిపోయి ఆ పాండవసేనలు ధర్మరాజు వెనుకకు తొలగగా ఆ ధర్మరాజు సేనలను పురికొలిపికొని శల్యుడిని ఎదుర్కొని, వాడి అయిన బాణవర్షంతో క్రమ్ముకోగా ఆ శల్యుడు భయంకరమైన ఇనుపబాణం ఆ ధర్మరాజు దేహం చీల్చుకొనిపోయేటట్లుగా ప్రయోగించగా, సేనావ్యూహంనుండి తప్పుకొని ఆ ధర్మరాజు ముందునకు వచ్చి ఏడు బాణాలతో భీముడు, సహదేవుడు అయిదు బాణాలతో, నకులుడు తొమ్మిది బాణాలతో, ప్రతివింధ్యాది ద్రౌపది పుత్రులు అనేక బాణాల వరుసలతో, ఆ వీరుడయిన శల్యుడిని కొట్టగా ఆ సమయంలో కృపాచార్యుడు, కృతవర్మ, శకుని అతడి పుత్రుడు ఉలూకుడు, దుర్యోధనాదులు పాండవులతో కలియబడ్డారు. గురుపుత్రుడు అశ్వత్థామ చిరునవ్వుతో శీఘ్రగమనంతో వచ్చి దుర్యోధనాదులను కలిసికొన్నాడు. అచ్చట ఉన్న సైన్యాలు ఉత్సాహంతో ఆ రథిక శ్రేష్ఠులను ఎదుర్కొన్నాయి. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కృపుఁడును ధృష్టద్యుమ్నుఁడు । నుపమాతీతాతిఘోరయుద్ధంబున బా
హుపటుత్వమ్ములు సూపి ర । ధిప! యొండొరులకు సమత్వదీప్తాకృతులై. 159

ప్రతిపదార్థం: అధిప!= ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; కృపుఁడును= కృపాచార్యుడును; ధృష్టద్యుమ్నుఁడును; ఉపమా= పోలికకు; అతీత= అతిక్రమించిన; అతి= మిక్కిలి; ఘోర= భయంకరమయిన; యుద్ధమునన్= సంగ్రామమునందు; సమత్వ= సమానభావంచేత; దీప్త= ప్రకాశవంతమయిన; ఆకృతులై= ఆకారములు కలవారై (రూపములు కలవారై); ఒండొరులకున్= ఒకరికొకరు; బాహు= భుజములయొక్క; పటుత్వమ్ములు= సామర్థ్యములు; చూపిరి= ప్రదర్శించిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ సమయంలో కృపాచార్యుడు, ధృష్టద్యుమ్నుడు పోలిక చెప్పటానికి వీలుకాని మిక్కిలి భయంకరమైన యుద్ధంలో సమానమైన ప్రకాశవంతమైన రూపాలు కలవారై పరస్పరం తమ తమ భుజబల సామర్థ్యాలు ప్రదర్శించుకొన్నారు.

క. ఒకని నొకనిఁ బదిపది సా । యకముల నొప్పించె వీరులగు పాండుకుమా
రకు లేవుర నంతట ద్రో । ణ కుమారుఁడు మోము చిఱుతనగవున నొప్పన్. 160

ప్రతిపదార్థం: అంతటన్= అటు తరువాత; ద్రోణకుమారుఁడు= అశ్వత్థామ; మోము= ముఖము; చిఱుతనగవునన్= చిరునవ్వుతో; ఒప్పన్= ప్రకాశింపగా; వీరులు= పరాక్రమవంతులు; అగు= అయినట్టి; పాండుకుమారకులు= పాండు రాజుయొక్క పుత్రులు; ఏవురన్= అయిదుగురను; ఒకనిన్= ఒక్కొక్కరిని; పదిపది= పదేసి; సాయకములన్= బాణములతో; నొప్పించెన్= బాధించెను.

తాత్పర్యం: అటు తరువాత అశ్వత్థామ ముఖం చిరునవ్వుతో ప్రకాశించగా పరాక్రమవంతులైన పాండుపుత్రులు ఐదుగురనూ ఒక్కొక్కడిని పదేసి బాణాలతో బాధించాడు.

ఆ. వాయుతనయు ఋశ్యవర్ణాశ్వముల మద్ర । పతి ధరిత్రిఁ గూల్చె నతఁడు దేరు
డిగ్గి నిజగదాపటిష్ఠతఁ జూపెఁ గౌ । రవ్య సైన్యమునకు రాజముఖ్య! 161

ప్రతిపదార్థం: రాజముఖ్య!= రాజులలో శ్రేష్ఠుడవు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; మద్రపతి= మద్రదేశమునకు ప్రభువు అయిన శల్యుడు; వాయు= వాయుదేవునియొక్క; తనయు= పుత్రుడు అయిన భీమునియొక్క; ఋశ్యవర్ణ= గిట్టలకు పై భాగమున తెలుపురంగు కాళ్ళుకలిగిన; అశ్వములన్= గుఱ్ఱములను; ధరిత్రిన్= భూమిపై; కూల్చెన్= పడగొట్టెను; అతఁడు= అతడు (అనగా భీముడు); తేరు= రథము; డిగ్గి= దిగి; కౌరవ్య= కౌరవులకు సంబంధించిన; సైన్యమునకున్= సేనకు; నిజ= తనయొక్క; గదా= గద అనెడి ఆయుధముయొక్క; పటిష్ఠతన్= శక్తిని(గట్టితనమును); చూపెన్= చూపించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శల్యుడు భీముడి గుఱ్ఱాలను నేలపై కూల్చాడు. భీముడు రథం దిగి కౌరవసైన్యానికి తన గదాయుధం యొక్క శక్తిని చూపించాడు.

క. అనిలజుని యశ్వములఁ గూ । ల్చిన యప్పుడు శల్యునిం గలితనము మెఱయం
దన యంపవెల్లిచే ముం । చె నకులుతమ్ముండు నీదుసేన దలంకన్. 162

ప్రతిపదార్థం: అనిలజుని= వాయుపుత్రుడయిన భీమునియొక్క; అశ్వములన్= గుఱ్ఱములను; కూల్చిన= పడగొట్టిన (చంపిన); అప్పుడు= ఆ సమయమున; నకులు= నకులునియొక్క; తమ్ముండు= సహదేవుడు; నీదు= నీయొక్క; సేన= సైన్యము (కురుసైన్యము); తలంకన్= చలించునట్లుగా; కలితనము= సామర్థ్యము; మెఱయన్= ప్రకాశింపగా; శల్యునిన్= శల్యుని; తన= తనయొక్క; అంప= బాణములయొక్క; వెల్లిచేన్= ప్రవాహంలో; ముంచెన్= ముంచివేసెను. (కప్పివేసెను).

తాత్పర్యం: భీముడి గుర్రాలను శల్యుడు చంపిన సమయంలో సహదేవుడు కౌరవసైన్యం చలించేటట్లుగా తన సామర్థ్యం ప్రకాశించగా శల్యుడిని తన బాణప్రవాహంలో ముంచెత్తాడు.

తే. **అతని హయములు నమ్మద్రపతి శరములఁ । బడిన నప్పాండవునిఁ దలకడచి బలము**
పొదివె నయ్యోధముఖ్యుఁ దత్పుత్రుఁ డపుడు । గదిసె నా సహదేవుపైఁ గడిమి మెఱయ. **163**

ప్రతిపదార్థం: ఆ+మద్రపతి= ఆ మద్రదేశాధిపతి అయిన శల్యుని యొక్క; శరములన్= బాణములచే; అతని= అతనియొక్క (సహదేవునియొక్క); హయములున్= గుర్రములును; పడినన్= కూలిపోగా(చనిపోగా); ఆ పాండవునిన్= ఆ పాండు కుమారుడైన సహదేవుడిని; తలకడచి= దాటివచ్చి; బలము= పాండవసైన్యం; ఆ+యోధముఖ్యున్= ఆ వీరశ్రేష్ఠుడైన శల్యుడిని; పొదివెన్= క్రమ్ముకొన్నాడు; తద్= ఆ శల్యుడియొక్క; పుత్రుఁడు= కుమారుడు (రుక్మాంగదుడు); అపుడు= ఆ సమయమున; ఆ+యోధముఖ్యున్= ఆ వీరశ్రేష్ఠుడయిన; సహదేవునిపైన్= సహదేవుడి మీద; కడిమి= పరాక్రమము; మెఱయన్= ప్రకాశింపగా; కదిసెన్= కలియబడెను.

తాత్పర్యం: శల్యుడి బాణాలచేత ఆ సహదేవుడి గుర్రాలు మరణించగా సహదేవుడిని దాటివచ్చి ఆ వీరశ్రేష్ఠుడయిన శల్యుడిపై పాండవసైన్యం క్రమ్ముకొన్నది. ఆ సమయంలో శల్యుడి కుమారుడు (రుక్మాంగదుడు) పరాక్రమం ప్రకాశించగా సహదేవుడిపై కలియబడ్డాడు.

చ. **కవిసిన దట్టకెంపడరు కన్నులతోడఁ గృపాణపాణియై**
యవనికి దాఁటి యాతనిశరావలిఁ ద్రుంచుచుఁ గిట్టి తేరిపై
కి వడిఁ జలంబుమై నరిగి కేళియపోలె శిరంబు ద్రుంచి పో
యె వెసఁ బొగడ్తకెక్క ధరణీశ్వర! యొండురథంబు మీఁదికిన్. **164**

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= భూమికి ప్రభువు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; కవిసినన్= కలియబడగా; దట్టకెంపు= దట్టమయిన ఎరుపు; అడరు= అతిశయించు; కన్నులతోడన్= నేత్రములతో; కృపాణ= కత్తి; పాణి= హస్తమునందు కలవాడు; ఐ= అయి(సహదేవుడు); అవనికిన్= భూమిమీదికి; దాఁటి= దూకి(రథముపై నుండి భూమిమీదకు దూకి); ఆతని= ఆతనియొక్క (ఆ శల్యుడి కుమారుడియొక్క); శర= బాణములయొక్క; ఆవలిన్= సమూహమును (లేక) వరుసను; త్రుంచుచున్= ఖండించుచు; కిట్టి= సమీపించి; తేరిపైకిన్= రథముమీదకు (శల్యపుత్రుడి రథము మీదకు); వడిన్= వేగముగా; చలంబుమైన్= మాత్సర్యముతో; అరిగి= వెడలి; కేళియపోలెన్= క్రీడవలె; శిరంబు= తల; త్రుంచి= ఖండించి; పొగడ్తకున్= స్తుతించుటకు; ఎక్కన్= తగినవాడు అగుచు, ప్రశంసనీయంగా; ఒండు= మరియొక; రథంబుమీఁదికిన్= రథముపైకి; వెసన్= వేగముగా; పోయెన్= వెడలిపోయెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శల్యుడి పుత్రుడు సహదేవుడితో కలియబడగా దట్టంగా ఎర్రబడిన కన్నులతో కత్తిచేతపట్టి రథంనుండి భూమిపైకి దూకి శల్యపుత్రుడియొక్క బాణపరంపరలను ఖండిస్తూ సమీపించి,

శల్యపుత్రుడి రథంమీదకు వేగంగా మాత్సర్యంతో వెడలి క్రీడవలె అతడి తల ఖండించి స్తుతింప తగినవాడవుతూ ఇంకొక రథంపైకి వేగంగా వెడలిపోయాడు.

వ. ఇవ్విధంబున. 165

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా.

క. సుతుఁ డీల్గిన మద్రమహీ । పతి శోకక్రోధవేగభరితాత్మకుఁడై
శితశరపంపరల ను । ద్ధతిఁ బాండవసైనికుల మదం బడఁగించెన్. 166

ప్రతిపదార్థం: సుతుఁడు= కుమారుడు; ఈల్గినన్= మరణించగా; మద్రమహీపతి= మద్రదేశమునకు అధిపతి అయిన శల్యుడు; శోక= దుఃఖముయొక్క; క్రోధ= కోపముయొక్క; వేగ= వేగముచే; భరిత= నిండిన; ఆత్మకుఁడై= మనస్సుకలవాడై; శిత= వాడి అయిన; శర= బాణములయొక్క; పరంపరలన్= వరుసలతో; ఉద్ధతిన్= గర్వముతో; పాండవ= పాండవులయొక్క; సైనికుల= సైనికులయొక్క; మదంబు= గర్వము; అడఁగించెన్= తగ్గించెను.

తాత్పర్యం: తన పుత్రుడు మరణించగా, మద్రపతి శల్యుడు దుఃఖంతోను, కోపంతోను నిండిన మనస్సు కలవాడై, వాడి అయిన బాణపరంపరతో గర్వాన్ని కనపరుస్తూ ఆ పాండవ సైనికుల గర్వాన్ని అణచాడు.

విశేషం: శల్యుడి పుత్రుడిని సహదేవుడు సంహరించాడు. శల్యుడికి ఇద్దరు పుత్రులు ఉన్నారు. ఒకడు రుక్మాంగదుడు. రెండవవాడు రుక్మరథుడు. రుక్మరథుడిని అభిమన్యుడు సంహరించినట్లు ద్రోణపర్వంలో ఉన్నది. అందువలన సహదేవుడు ఇచ్చట రుక్మాంగదుడిని సంహరించినట్లుగా గ్రహించాలి. ఈ సందర్భంలో మూలంలో వ్యాసుడు కాని, అనువాదంలో తిక్కన కాని, శల్యపుత్రుడి పేరు ప్రస్తావించలేదు.

శల్యభీమసేనుల గదాయుద్ధము (సం. 9-10-42)

క. ఉరవడి రథికజనంబులఁ । దెరలిచి యేపారు తనదుతేరు మెఱయ ను
ద్ధురగతిఁ గౌంతేయాగ్రజు । నరదమునకుఁ గవిసె వాలురమ్ములు నిగుడన్. 167

ప్రతిపదార్థం: ఉరవడిన్= విజృంభణంతో; రథిక= రథికులయిన; జనంబులన్= మనుజులను (అనగా సైనికులను); తెరలిచి= తొలగించి; ఏపారు= అతిశయించు; తనదు= తనయొక్క; తేరు= రథము; మెఱయన్= ప్రకాశింపగా; ఉద్ధుర= గర్వముతో కూడిన; గతిన్= గమనముతో; కౌంతేయ= కుంతీపుత్రులతో; అగ్రజు= పెద్దవాడయిన ధర్మరాజుయొక్క; అరదమునకున్= రథమునకు; వాలు+అమ్ములు= క్రూరమయిన బాణములు; నిగుడన్= వ్యాపించగా; కవిసెన్= ఉరికాడు.

తాత్పర్యం: మిక్కిలి వేగంగా రథికులైన సేనలను తొలగించి శల్యుడు తన రథం ప్రకాశించగా స్థిరమైన గమనంతో ధర్మజుడి రథంమీదికి క్రూరమయిన బాణాలు వ్యాపించగా ఉరికాడు.

సీ. కనుఁగొని భీముండు గన్నుల నిప్పులు । రాల శుండాలకీలాలరంజి
తంబును రిపుసైన్యదైన్యప్రదంబును । నాత్మీయవాహినీహర్షకరము

నై శతధారా మహాభుజగ క్షమా । ధరశృంగసమత నుదగ్ర మగుచు
నెనిమిది యంచుల నెసఁగు మెఱుంగుల । దారుణంబగు గదాదండ ముగ్ర

తే. రేఖ సారించి రౌద్ర ముద్రేక మందఁ । గదిసి మద్రాధిపుని తురంగములఁ జదియ
మోఁదె నాతండు దోమరమునఁ దదీయ । విపులవక్షంబు భేదించె నృపవరేణ్య! 168

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజులలో శ్రేష్ఠుడవయిన ధృతరాష్ట్ర మహారాజా!; భీముండు; కనుఁగొని= చూచి; కన్నులన్= కన్నులనుండి; నిప్పులు= అగ్నికణములు; రాలన్= పడుచుండగా; శుండాల= ఏనుగులయొక్క; కీలాల= నెత్తురుతో (తడిసి); రంజితంబును= ఎర్రనైనదియు; రిపు= శత్రువులయొక్క; సైన్య= సేనకు; దైన్య= దీనస్థితిని; ప్రదంబున్= కలుగచేయునదియును; ఆత్మీయ= తమయొక్క; వాహినీ= సైన్యమునకు; హర్షకరమును+అయి= సంతోషమును కలుగచేయునదియును అయి; శతధారా= వజ్రాయుధముయొక్కయు; మహాభుజగ= గొప్పపాముయొక్కయు; క్షమాధర శృంగ= పర్వత శిఖరము యొక్కయు; సమతన్= సమత్వముచేత; ఉదగ్రము= భయంకరమయినది; అగుచున్= అగుచును; ఎనిమిది; అంచులన్= అంచులతో; మెఱుంగులన్= కాంతులతో; ఎసఁగు= అతిశయించు; దారుణంబు= భయంకరము; అగు; గదాదండము= దండము వంటి గదాయుధముయొక్క (దండము అనగా దుడ్డుకర్ర); ఉగ్రరేఖన్= భయంకరమయిన విధంగా; సారించి= దాచి; రౌద్రము= కోపం; ఉద్రేకము= ఆవేశం; అందన్= పొందుచు; కదిసి= దగ్గరకుచేరి; మద్ర= మద్రదేశమునకు; అధిపుని= ప్రభువు అయిన శల్యుడియొక్క; తురంగములన్= గుర్రములను; చదియన్= చితుక; మోఁదెన్= కొట్టెను; ఆతండు= అతడు అనగా శల్యుడు; తోమరమునన్= తోమరమనే ఆయుధంతో; తదీయ= ఆ భీముడియొక్క; విపుల= విశాలమయిన; వక్షంబు= ఉరఃస్థలము; భేదించెన్= బ్రద్దలుకొట్టెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీముడి కన్నులనుండి అగ్ని కణాలు పడుతుండగా చూచి, ఏనుగుల రక్తంతో తడిసి ఎర్రనైనది, శత్రుసేనలకు దైన్యాన్ని కలిగించేది, తమ సేనలకు సంతోషం కలిగించేది, వజ్రాయుధంతోనూ, మహాసర్పంతోనూ, పర్వత శిఖరంతోనూ సమానమైనది, అతి భయంకరమైనది, ఎనిమిది అంచులతో (ధారలతో) వాటి కాంతులతో అతిశయించేదీ, భయంకరమైనది అయిన గదాదండం భయంకరంగా ఎత్తి, కోపం ఆవేశం పొంది దగ్గరకు చేరి శల్యుడి గుర్రాలను చితుకకొట్టాడు. ఆ శల్యుడు తోమరంతో ఆ భీముడి విశాలమైన వక్షఃస్థలాన్ని బ్రద్దలు చేశాడు.

విశేషం: ఈ సీసంలో భీముడి గదాస్వరూపం వర్ణించబడింది. ఆరు విశేషణాలతో గదయొక్క ఉగ్రరూపమును తిక్కన వర్ణించాడు. మూలంలో ఇంతటి వర్ణన లేదు.

క. ఉరమున నాటిన ఘనతో । మరమును డాచేతఁ బెఱికి మారుతి మద్రే
శ్వరుసూతుఁ వైచె దానన । ధరణిని బోరగిలఁబడ నుదగ్ర స్ఫురణన్. 169

ప్రతిపదార్థం: మారుతి= భీముడు; ఉరమునన్= గుండెపై; నాటిన= గ్రుచ్చుకొన్న; ఘన తోమరమున్= గొప్పదైన ఆ తోమరాన్ని; డాచేతన్= ఎడమచేతితో; పెఱికి= పైకి లాగి; దానన్+అ= దానితోనే; ఉదగ్ర స్ఫురణన్= అతిశయించిన స్ఫూర్తితో; మద్ర+ఈశ్వర సూతున్= శల్యుడి సారథిని; ధరణిని= నేలపై; బోరగిలన్+పడన్= బోరగిలేటట్లు (వీపుపైకి ముఖంక్రిందికి అయ్యేటట్లు) పడగా; వైచెన్= వేశాడు.

తాత్పర్యం: భీముడు తన వక్షఃస్థలం మీద నాటిన ఆ పెద్ద తోమరాన్ని ఎడమచేతితో పైకి లాగి బిగువైన పట్టుతో శల్యుని సారథి నేలపై బోరగిల పడేటట్లు దానితోనే త్రిప్పికొట్టాడు.

మ. **విరథుండై పోలివోని దర్పమున నవ్వీరుండు ఘోరంపు ము**
ద్గరముం గేల సమర్చి తేరు డిగి దుర్దాంతాకృతిన్ వజ్ర భా
సురశక్రుండును దండచండ యముఁడున్ శూలోగ్ర ఫాలాక్షుఁడున్
సరి సేయందగువారు గాఁగఁ బొలిచెన్ సంస్తుత్యసంరంభతన్. **170**

ప్రతిపదార్థం: ఆ+వీరుండు= పరాక్రమవంతుడైన ఆ శల్యుడు; విరథుండు+ఐ= రథములేనివాడై; పోలి+పోని= తరిగిపోని; దర్పమునన్= గర్వంతో; ఘోరంపు= భయంకరమైన; ముద్గరమున్= ముద్గరమును పేరుగల ఆయుధమును; కేలన్= చేతితో; అమర్చి= పట్టుకొని; తేరు= రథము; డిగి= దిగి; దుర్దాంత= నిగ్రహింపశక్యముకాని; ఆకృతిన్= ఆకారముతో; వజ్ర= వజ్రాయుధంతో; భాసుర= ప్రకాశించే; శక్రుండును= ఇంద్రుడును; దండ= దండముతో; చండ= భయంకరుడయిన; యముఁడున్= యముడును; శూల= త్రిశూలంతో; ఉగ్ర= భయంకరుడయిన; ఫాల= నుదుటియందు; అక్షుఁడున్= నేత్రముకలవాడయిన రుద్రుడును; సరి= సమానము; చేయన్= చేయుటకు; తగువారు; కాఁగన్= అగునట్లుగా; సంస్తుత్య= స్తుతింపదగిన; సంరంభతన్= సంభ్రమంతో; పొలిచెన్= ఒప్పెను.

తాత్పర్యం: పరాక్రమవంతుడైన శల్యుడు రథంలేనివాడై, విరిగిపోయిన రథం కలవాడై తరిగిపోని గర్వంతో భయంకరమైన ముద్గరమనే ఆయుధాన్ని చేతబట్టుకొని రథం దిగి నిగ్రహింప శక్యంకాని ఆకారంతో వజ్రాయుధంతో ప్రకాశించే ఇంద్రుడు, దండంతో భయంకరుడయిన యముడు, త్రిశూలంతో భయంకరుడైన రుద్రుడు సమానులయ్యేటట్లు స్తుతింపదగిన గర్వంతో ఒప్పారాడు.

విశేషం: ఇట శల్యుడి వర్ణనం దీపకముతో దీప్తించినది. ప్రకృతాప్రకృతమయిన ధర్మసామ్యం వల ఔపమ్యం స్ఫురించినచో దీపకము. ముద్గరము చేత బట్టిన శల్యుడు - ప్రకృతము. వజ్రము ధరించిన ఇంద్రుడు, దండము ధరించిన యముడు, త్రిశూలము ధరించిన రుద్రుడు అప్రకృతములు. 'సరిసేయందగువారు' అనుటలో ధర్మసామ్యము వలన ఔపమ్యం స్ఫురించింది కావున దీపకము. ముద్గరధారియైన శల్యుడు వజ్రధారియైన ఇంద్రుడితో, దండధారియైన యముడితో, శూలధారియైన రుద్రుడితో పోల్చబడుతున్నాడు కాబట్టి - ఇది ఉపమేయమే అని కొందరి అభిప్రాయం.

వ. **ఇ ట్లవష్టంభ విజృంభితుండైన యాసేనాధిపతిం జూచి యేచి భీముఁ డుద్దామరభసంబున నతనికి సమ్ముఖంబుగా నడరినఁ బణవాది వాదిత్ర నిర్భరనినదంబులు సెలంగె, నప్పు డయ్యిరువాఁగు నిరువుర నేనికపోరు చూచు విధంబునఁ గనుఁగొనుచు గదారణంబునకు శల్యుండు దక్క మారుతి మార్కొనఁ జాలు మేటిమగలు నివ్వడముడి వెలిగా నిమ్మద్రపతిమీఁదఁ గవియునట్టిజెట్టి బిరుదులుం గలరే? యనుచు నచ్చెరువొందుచుండ.** **171**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; అవష్టంభ= గర్వముతో; విజృంభితుండు= అతిశయించినవాడ; ఐన= అయినట్టి; ఆ సేనాధిపతిన్= ఆ సైన్యాధ్యక్షుని (అనగా శల్యుడిని); చూచి; ఏచి= విజృంభించి; భీముఁడు; ఉద్దామ= భయంకరమైన; రభసంబునన్= వేగముతో; అతనికి; సమ్ముఖంబుగాన్= ఎదురుగా; అడరినన్= విజృంభించగా; పణవము= తప్పెట; ఆది=

మొదలగు; వాదిత్ర= తతము - ఆనర్ధము - సుషిరము - ఘనము - అను చతుర్విధ వాద్య విశేషముల యొక్క; నిర్భర= గాఢమయిన; నినదంబులు= ధ్వనులు; చెలంగెన్= మ్రోసెను; అప్పుడు; ఆ+ఇరువా(గును= ఆ రెండు సైన్యములును; ఇరువురను= ఇద్దరిని (శల్యభీమసేనులిద్దరిని); ఏనిక= ఏనుగులయొక్క; పోరు= పోరాటము; చూచు; విధంబునన్= విధముగా; కను(గొనుచున్= చూచుచున్నవారగుచు; గదారణంబునకున్= గదాయుద్ధమునకు; శల్యుండు; తక్కన్= తప్ప; మారుతిన్= భీముడిని; మార్కొనన్+చాలు= ఎదుర్కొనటానికి సరిపడే; మేటిమగలున్= గొప్పవారైన వీరులు; ఈ+వడముడి= ఈ భీముడు; వెలిగాన్= కాకుండా; ఈ+మద్రపతిమీ(దన్= మద్రదేశాధీశుడైన ఈ శల్యుడిపై; కవియు+అట్టి= పోరాడేటటువంటి; జెట్టి బిరుదులున్= మల్లురైన మహారథులు; కలరే?= ఉన్నారా?; అనుచున్; అచ్చెరువు+ఒందుచుండన్= ఆశ్చర్య పడుతుండగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా గర్వంతో విజృంభించే కురుసేనాధిపతి అయిన శల్యుడిని చూచి భీముడు అమితమైన కోపంతో అతడికి ఎదురుగా విజృంభించగా, తప్పెటలు మొదలగు వాదిత్రములయొక్క గాఢమయిన ధ్వనులు చెలరేగాయి. ఆ సమయంలో ఆ రెండు సైన్యాలు ఆ ఇద్దరి పోరాటాన్ని రెండు ఏనుగుల పోరాటం చూచేటట్లు చూస్తూ, గదాయుద్ధానికి శల్యుడు తప్ప భీముడిని ఎదుర్కొనటానికి సరిపడే గొప్పవారైన వీరులు కాని, ఈ భీముడు కాకుండా శల్యుడితో పోరాడునట్టి మల్లురయిన మహారథులు కాని లేరు అనుకొంటూ ఆశ్చర్యం పొందుతుండగా.

విశేషం: అలం: ఉపమ.

ఆ. **మండలప్రచార మహితాకృతులు గర్జ । నలుగ(బొలిచి మాఱు మలసి ఱంకె**
లెస(గ(బోరి కమరి యేపారు వృషభయు । గంబునట్లు వారు గవిసి రధిప! **172**

ప్రతిపదార్థం: అధిప!= ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; మండల= వలయాకారంగా; ప్రచార= తిరుగుతున్న; మహిత+ఆకృతులు= గొప్ప ఆకారములు కలవారు (గదాయుద్ధంలో కాని, మల్లయుద్ధంలో కాని గదలు తిప్పుతూ యోధులిద్దరూ వలయాకారముగ తిరగటాన్ని 'మండల ప్రచారం' అంటారు. 'మండలావర్త మార్గేషు గదావిహరణేషు చ' మూలము); మాఱు= ఎదురు; మలసి= తిరిగి; ఱంకెలు= రంకెలు (ఆబోతుల అరుపులు); గర్జనలుగన్= సింహగర్జనలుగా; పొలిచి= విలసిల్లి; ఎస(గన్= విజృంభించగా; పోరికిన్= పోరాటమునకు; అమరి= సిద్ధమయిన; ఏపారు= విజృంభించు; వృషభయుగంబున్= రెండు ఆబోతులు; అట్లు= విధంగా; వారు= వారు (ఆ భీముడు, శల్యుడు); 'తౌ వృషావివ'; కవిసిరి= కలియబడిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! వలయాకారంగా తిరుగుతూ గదలు త్రిప్పుతూ సింహగర్జనలు చేస్తూ ఎదురు తిరిగి రంకెలు పెట్టుతూ పోరాటానికి సిద్ధమైన రెండు ఆబోతుల విధంగా గొప్పవైన ఆకారాలతో ఆ భీముడూ శల్యుడూ కలియబడ్డారు.

విశేషం: అలం: ఉపమ.

చ. **మదమున నిమ్మెయిం గదిసి మద్రవిభుండును భీమసేను(డున్**
గదలమెఱుంగు లాకసము గ్రమ్మ(గ నుద్భటభంగి(ద్రిప్పి బె
ట్టిదముగ వ్రేయ నిప్పలు వడిం దొర(గించె సమగ్రవిస్మయ
ప్రదరవభంగులై యవి పరస్పరఘోరవిఘట్టనంబునన్. **173**

ప్రతిపదార్థం: మద్ర= మద్రదేశానికి; విభుండును= ప్రభువు అయిన శల్యుడును; భీమసేనుఁడున్= భీమసేనుడును; ఈ+మెయిన్= ఈ ప్రకారంగా; మదమునన్= గర్వంతో; కదిసి= కలియబడి; గదల= గదలయొక్క; మెఱుంగులు= మెరుపులు; ఆకసమున్= ఆకాశాన్ని; క్రమ్మఁగన్= కప్పికొనేటట్లుగా; ఉద్భట= మిక్కిలి అధికమయిన; భంగిన్= విధంగా; త్రిప్పి= గిరగిర త్రిప్పి; బెట్టిదముగన్= గట్టిగా; వ్రేయన్= విసరగా; అవి; పరస్పర= ఒకదానితో ఒకటి; ఘోర= భయంకరమయిన; విఘట్టనంబునన్= తాకిడివలన; సమగ్ర= సంపూర్ణమయిన; విస్మయప్రద= ఆశ్చర్యమును కలుగచేయు; రవ= నాదాలయొక్క; భంగులై= అంతరాళాలు కలవిఅయి; నిప్పులు= అగ్నికణాలు; వడిన్= వేగంగా; తొరఁగించెను= కురిసెను. ('అంగారవర్షం ముముచే దద్భుతమివాభవత్' - మూలం).

తాత్పర్యం: శల్యుడు భీమసేనుడు ఈ ప్రకారంగా గర్వంతో కలియబడి గదల కాంతులు ఆకాశాన్ని కప్పివేసేటట్లు అధికమైన వేగంగా గిరగిర త్రిప్పిగట్టిగా విసరగా ఆ గదలు రెండూ ఒకదానితో ఒకటి భయంకరంగా కొట్టుకొనగా, సంపూర్ణమైన, ఆశ్చర్యమైన ధ్వనులు గలవయి నిండిపోగా అవి అగ్నికణాలను వేగంగా కురిపించాయి.

వ. ఇట్లు దొడంగి. 174

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; తొడంగి= ప్రారంభించి.

తాత్పర్యం: భీముడు, శల్యుడు ఈ ప్రకారంగా గదాయుద్ధాన్ని ప్రారంభించి.

క. ధిక్కారంబులు చరణద । భక్కారంబులును మెఱయ బలువు వెరవు పే
రుక్కును నెక్కుడు వేగము । నక్కజములుగా నుదీర్ణులై పోరునెడన్. 175

ప్రతిపదార్థం: ధిక్కారంబులు= తిరస్కారములు (అనగా ఒకరిపై ఒకరు చేయు నిందలు); చరణ= పాదములయొక్క; దభక్కారంబులును= దభక్కు అనే ధ్వనులును; మెఱయన్= ప్రకాశింపగ; బలువు= ఎక్కువ; వెరవు= ఉపాయము; పేరు= ఎక్కువ; ఉక్కునున్= బలమును; ఎక్కుడు= ఎక్కువ; వేగమును; అక్కజములుగాన్= అధికముగా; ఉదీర్ణులై= పెరిగినవారై (పైకి ఎగిరినవారై); పోరు+ఎడన్= పోరాటం చేయుచుండగా.

తాత్పర్యం: ధిక్కారములు, దభక్కారములు (ఒకరి పాదాలను మరొకరు తొక్కడం వలన కలిగిన చప్పుళ్లు) అతిశయించగా ఉపాయం, బలం, వేగం - ఈ మూడును అధికంగా కలవారై గదాయుద్ధం చేస్తుండగా.

విశేషం: ఏకార్థ బోధకములగు' బలువు - పేరు - ఎక్కుడు - అక్కజములు' ప్రయోగించి తిక్కన శబ్ద వైచిత్రిని కనబరచాడు. 'ఉపాయము - బలము - వేగము' ఈ మూడును యుద్ధవీరులకు ఉండవలసిన ముఖ్య లక్షణములు.

దభక్కారము= పాదముల తాకిడిచేత కలిగే ధ్వన్యనుకరణ శబ్దం.

చ. వెరవున నంగముల్ నుసులవ్రేటులు వమ్ముగఁ దాఁకినప్డు ది
క్కరి రదన ప్రహారములఁ గంపము నొందకయుండు మేదినీ
ధరములఁ బోల్పఁ బట్టగు నుదగ్రపుమూర్తుల కిద్దఱందు ని
ష్ఠుర రభసంబు శౌర్యము పటుత్వము ద్రాసునఁ బెట్టిన ట్లగున్. 176

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అంగముల్= అవయవములు; నుసుల= లాఘవపు; వ్రేటులు= దెబ్బలు; వమ్ముగన్= వ్యర్థమయ్యేటట్లు; తాఁకినప్డు= ఒకరితో ఒకరు ఢీకొన్నప్పుడు; దిక్కరి= దిగ్గజములయొక్క; రదన= దంతములయొక్క; ప్రహారములన్= దెబ్బలవలన; కంపమున్= చలనమును; ఒందక= పొందక; ఉండు; మేదినీ= భూమిని; ధరములన్= మోయునట్టి-పర్వతములను; ఉదగ్రపు= భయంకరమయిన; మూర్తులకున్= ఆకారములు కలిగినవారికి; పోల్పన్= పోల్చటానికి; పట్టు+అగున్= తగినదై ఉన్నది; ఇద్దఱందున్= ఇద్దరిలోనూ; నిష్ఠుర= పరుషమయిన; రభసంబు= ఆవేశము; శౌర్యము= పరాక్రమము; పటుత్వమున్= చాతుర్యమును; త్రాసునన్= తక్కెడయందు; పెట్టిన+అట్లు+అగున్= ఉంచినట్లు అగును.

తాత్పర్యం: భీముడు, శల్యుడు ఉపాయంతో ఒకరితో ఒకరు ఢీకొన్నారు. దెబ్బలు తప్పించుకొనే విధంగా నేర్పుగా అవయవాలను కదిలించగా ఆ దెబ్బలు వ్యర్థంకాగా, దిగ్గజాల దంతముల దెబ్బలకు చలించకుండా ఉండునట్టి పర్వతాలతో పోల్చటానికి అనువుగా ఆ భయంకరాకారులు భాసించారు. ఆ ఇద్దరిలోనూ గల పరుషమయిన ఆవేశం, శౌర్యం, చాతుర్యం - మూడింటినీ తక్కెడయందు ఉంచినట్లవుతుంది.

వ. ఒక్కొక్కమాఱు ఱుబ్బున. **177**

ప్రతిపదార్థం: ఒక్కొక్కమాఱు= ఒక్కొక్కసారి; ఉబ్బునన్= సంతోషంతో.

తాత్పర్యం: ఆ భీముడూ, శల్యుడూ, ఆ గదాయుద్ధంలో ఒక్కొక్కసారి సంతోషంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఎనిమిది యడుగుల కొలఁదిని । వెనువెనుకకుఁ బోయి నిగిడి వేగంబునఁ గి
ట్టిన తగళులకైవడిఁ దాఁ । కు నగంబుల భంగిదోఁచుఁ గురుకులముఖ్యా! **178**

ప్రతిపదార్థం: కురుకుల= కురుకులమునకు; ముఖ్యా!= ముఖ్యుడవు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఎనిమిది; అడుగుల; కొలఁదిని= పరిమితివరకును; వెనుకకున్+వెనుకకున్= బాగా వెనుకకు; పోయి; నిగిడి= తిరిగి విజృంభించి; వేగంబునన్= వేగముగా; కిట్టిన= సమీపించిన; తగళుల= గొర్రెపొట్టేళ్ళ; కైవడిన్= వలెను; తాఁకు= ఒకదాని నొక్కటి ఢీకొనే; నగంబుల= పర్వతముల; భంగిన్= విధముగా; తోఁచున్= తోచును.

తాత్పర్యం: కురుకులంలో శ్రేష్ఠుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ భీముడు, శల్యుడు ఎనిమిదేసి అడుగులు వెనుకకు పోయి తిరిగి విజృంభించి వేగంగా సమీపించిన గొర్రె పొట్టేళ్ళ వలె ఒకదానితో ఒకటి ఢీకొనే పర్వతాల వలెను తోచారు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇత్తెఱంగునం బెనంగి నెత్తుట జొత్తిల్లినయంగంబులు పుష్పిత కింశుకంబులఁబోలఁబరిశ్రమంబు నొందియుఁ బొలివోవని దర్పంబున. **179**

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధముగా; పెనంగి= పెనగులాడి(పోరాడి); నెత్తుటన్= రక్తంతో; జొత్తిల్లిన= ఎట్టబడిన; అంగంబులు= అవయవములు; పుష్పిత= పుష్పించిన; కింశుకంబులన్= మోదుగుపూలను; పోలన్= పోలగా; పరిశ్రమంబున్= మిక్కిలి అలసటను; ఒందియున్= పొందియు; పొలిపోవని= చెడిపోని(తగ్గని); దర్పంబునన్= గర్వంతో;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా పోరాడి, రక్తంతో తడిసి ఎఱ్ఱబడిన అవయవాలు పుష్పించిన మోదుగచెట్లను పోలగా, మిక్కిలి అలసట పొందినా తగ్గని గర్వంతో.

విశేషం: అలం: ఉపమ. 'తౌ గదాభిహతైర్గాత్రైః క్షణేన రుధిరోక్షితౌ । ప్రేక్షణీయతరా వాస్తాం పుష్పితావివ కింశుకౌ॥ (శల్య- 12-15. మూలం.)

గదాయుద్ధమున మూర్ఛితుఁడైన శల్యునిఁ గృపుడు తొలంగం గొనిపోవుట (సం. 9-11-23)

క. ఇరువురును సందు సూడక । వెర వెడలిన యాగ్రహముల వ్రేసిన గద లొం
డొరుల మెడలకెలఁకుల బ । ల్నరములు దాఁకుటయు వా రిలం బడి రధిపా! 180

ప్రతిపదార్థం: అధిపా!= ప్రభువు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఇరువురును= ఇద్దరును (భీముడును-శల్యుడును); సందు= ఎడము; చూడక= చూడకుండా; వెరవు= ఉపాయము; ఎడలిన= పోయిన; ఆగ్రహములన్= పట్టుదలలతో; వ్రేసిన= కొట్టిన; గదలు; ఒండొరుల= ఒకరొకరి; మెడల; మెడలయొక్క; కెలఁకులన్= ప్రక్కలనున్న; బల్= దృఢములయిన; నరములు; తాఁకుటయున్= తగులుటయు; వారు (ఆ భీమశల్యులు); ఇలన్= నేలపై; పడిరి= పడిపోయిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ భీముడూ, శల్యుడూ, ఇద్దరూ ఎడం లేకుండా ఉపాయం విచ్ఛిన్నమయిన కోపాలతో కొట్టుకోగా, గదలు ఒండొరుల మెడల ప్రక్కలనున్న గట్టి నరాలకు తగలగా వారు నేలపై పడ్డారు.

వ. ఇవ్విధంబున నమ్మహావీరులు మూర్ఛిల్లుటయు నుభయసైన్యజనంబులును హాహాకారముఖరులై రట్టియెడఁ
గృపాచార్యుండు శల్యుకడకుఁ దన రథంబు రయంబునం బఱపించి. 181

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; ఆ+మహావీరులు= ఆ గొప్ప పరాక్రమవంతులు (భీముడును, శల్యుడును); మూర్ఛిల్లుటయును= మూర్ఛపోవుటయును; ఉభయ= రెండుపక్షములయొక్క; సైన్య= సేనలకు సంబంధించిన; జనంబులును= మనుజులును; హాహాకార= హాహాకారములనెడి; ముఖరులు= ధ్వనులు చేయుచున్నవారలు; ఐరి= అయిరి; అట్టియెడన్= ఆ సమయమున; కృపాచార్యుండు; శల్యు= శల్యుని; కడకున్= దగ్గరకు; తన రథము; రయంబునన్= వేగముగా; పఱపించి= తోలించి.

తాత్పర్యం: ఈ ప్రకారంగా ఆ మహావీరులు మూర్ఛిల్లగా కురుపాండవ సైన్యాలు రెండూ హాహాకారాలు చేశాయి. ఆ సమయంలో కృపాచార్యుడు శల్యుడి దగ్గరకు తన రథాన్ని వేగంగా తోలించి.

క. పడియును గద విడువని య । క్కడిఁదిమగని గ్రుచ్చి యెత్తి గారవమున నం
దిడి తొలఁగం గొనిపోయెను । వడముడి దెప్పటియె నంత వసుధాధీశా! 182

ప్రతిపదార్థం: వసుధా= భూమికి; అధీశా!= ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; పడియును= పడిపోయినను; గదన్= గదను; విడువని= విడిచిపెట్టని; ఆ+కడిఁది= ఆ అధికశక్తిగల; మగనిన్= వీరుడిని (ఆ శల్యుడిని); క్రుచ్చి; ఎత్తి; గారవమునన్= గౌరవభావముతో; అందు+ఇడి= రథమునందు పెట్టుకొని; తొలఁగన్= తొలగించి; కొనిపోయెను= తీసికొనిపోయెను; అంతన్= అటు తరువాత; వడముడి= భీముడు; తెప్పటియెన్= తెప్పిరిల్లెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! పడిపోయినా గదను విడిచిపెట్టని ఆ మహావీరుడయిన శల్యుడిని కృపాచార్యుడు గ్రుచ్చి ఎత్తి, గౌరవభావంతో ఆ రథంమీద ఉంచుకొని అక్కడినుండి తొలగించి తీసికొనిపోయాడు. అటు తరువాత భీముడు మూర్ఛనుండి తెప్పరిల్లాడు.

వ. తెప్పిఱి లేచి చూచి సేద దేఱని యమ్మద్రపతిం బేరుకొని యుద్దండగదాదండమండితంబైన కరంబునం బిలిచె నయ్యుద్ధతి సహింపఁజాలక సింహనాదంబుతోడఁ దూర్యస్వనంబులు సెలంగఁ గురుభూవరు ముందరి సైనికులు రభసంబుగా నతఁడునుఁ గూడికొని తఱుమఁ గవిసినం గౌంతేయాగ్రజునగ్రభాగంబున రథికులు చేకితానపురస్సరులై యార్పులు నింగిముట్ట నయ్యనిలతనయుఁ దలకడచి వారిం దలపడి పెనంగి రప్పుడు. 183

ప్రతిపదార్థం: (భీముడు) తెప్పిఱి= తెప్పరిల్లి (మూర్ఛనుండి తేరుకొని); లేచి; చూచి; సేద= అలసటనుండి; తేఱని= తేరుకొనని; ఆ; మద్ర= మద్రదేశమునకు; పతిన్= ప్రభువు అయిన శల్యుడిని; పేరుకొని= పేరుపెట్టి; ఉద్దండ= మిక్కిలి పొడవైన; గదా దండ మండితంబు= దండమువంటి గదచే నలంకరింపబడినది; ఐన= అయినట్టి; కరంబునన్= చేతితో; పిలిచెన్= పిలిచెను; ఆ+ఉద్ధతిన్= గర్వమును; సహింపన్= ఓర్పు వహింప; చాలక= లేక; సింహనాదంబుతోడన్= సింహగర్జనముతో కూడ; తూర్య= తూర్యములను వాద్యములయొక్క (తూతూబూరాలయొక్క); స్వనంబులు= ధ్వనులు; చెలంగన్= మ్రోయగా; కురుభూవరు= కురురాజునకు (దుర్యోధనునకు); ముందరి= ముందుగా ఉన్న; సైనికులు= సేనలు; రభసంబుగాన్= ఆవేశంతో; అతఁడునున్= అతడును (దుర్యోధనుడును); కూడికొని= కలిసికొని; తఱుమన్= తరుముటకు; కవిసినన్= ఎదుర్కొనగా (కలియబడగా); కౌంతేయ= కుంతీపుత్రులలో; అగ్రజు= పెద్దవాడైన ధర్మరాజునకు; అగ్ర= ముందు; భాగంబునన్= ప్రదేశమున; రథికులు= రథముపై నుండి యుద్ధము చేయు యోధులు; చేకితాన= చేకితానుడు; పురస్సరులై= ముందుకలిగినవారై; ఆర్పులు= సింహనాదాలు; నింగి= ఆకాశమును; ముట్టన్= ముట్టుకొనగా; ఆ+అనిల= వాయువుయొక్క; తనయున్= కుమారుడైన భీముడిని; తలకడచి= దాటి; వారిన్= వారిని (కురుసైనికులను); తలపడి= కలియబడి; పెనంగిరి= పోరాడిరి; అప్పుడు.

తాత్పర్యం: భీముడు మూర్ఛనుండి తెప్పరిల్లి, లేచి చూచి, అలసట నుండి తేరుకొనని ఆ శల్యుడిని పేరుపెట్టి పొడవైన దండంవంటి గదతో అలంకృతమైన హస్తంతో పిలిచాడు. భీముడి ఆ గర్వాన్ని సహించలేక సింహగర్జనలతో కూడిన తూర్యధ్వనులు వ్యాపించగా దుర్యోధనుడు ఆవేశంతో తన సేనతో ఎదుర్కొనగా ధర్మరాజునకు అగ్రభాగంలో ఉన్న రథికులైన యోధులూ, చేకితానుడు ముందుండగా సింహనాదాలు ఆకాశాన్ని ముట్టగా ఆ భీముడిని దాటి కురుసైనికులతో కలియబడి పోరాడారు. ఆ సమయంలో.

విశేషం: చేకితానుడు - ఇతడు పాండవపక్షంనుండి యుద్ధం చేసిన వృష్ణి వంశజుడయిన యాదవుడు. ఇతడు మహారథుడు. ఇతడికి సాత్వతుడు - వార్ష్ణేయుడు అనే పేర్లు కూడా ఉన్నాయి.

శా. ఆ కౌరవ్యవిభుండు వజ్రకఠినంబై యొప్పుప్రాసంబు దీ
ప్తాకారోజ్జ్వలవృత్తి నెత్తి నిజసైన్యం బుబ్బునం గ్రాలఁ గే
లీకల్పంబుగ మింట జంట మెఱుఁగు ల్నిండం బ్రదీప్తక్రమ
శ్రీకాంతుండగు చేకితానుఁ బడవైచెం జూప అగ్గింపఁగన్. 184

ప్రతిపదార్థం: ఆ; కౌరవ్య= కురువంశమునకు సంబంధించిన; విభుండు= ప్రభువు- దుర్యోధనుడు; వజ్ర= వజ్రమువలె; కఠినంబు= గట్టిది; ఐ= అయి; ఒప్పు= ఒప్పునట్టి; ప్రాసంబున్= ఈటెను; దీప్త= ప్రజ్వలించిన; ఆకార= రూపముతో; ఉజ్జ్వల= ప్రకాశమానమగు; వృత్తిన్= వ్యాపారముతో; ఎత్తి= పైకి ఎత్తి; నిజ= తనయొక్క; సైన్యంబు= సేన; ఉబ్బునన్= సంతోషంతో; క్రాలన్= ఒప్పగా; కేళీ= క్రీడయొక్క; కల్పంబుగన్= విధమున; మింటన్= ఆకాశమునందు; జంటమెఱుఁగుల్= రెండు మెరుపులు (రెండు కాంతులు); నిండన్= నిండునట్లుగ; చూపఱు= చూచువారు; అగ్గింపఁగన్= పొగడునట్లుగా; ప్రదీప్త= మిక్కిలి ప్రకాశించిన; క్రమశ్రీ= గతుల సంపదచే; కాంతుఁడు= మనోహరుడు; అగు= అయినట్టి; చేకితానున్= చేకితానుని; పడవైచెన్= వధించెను.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు వజ్రంవలె కఠినమైన ఈటెను ప్రజ్వలించేటట్లు ప్రకాశించే విధంగా పైకి ఎత్తి, తన సేన సంతోషంతో సంభ్రమం చెందగా క్రీడాగతిని అనుసరించి ఆకాశంలో రెండు మెరుపులు నిండగా మిక్కిలి ప్రకాశంతో ఆక్రమిస్తున్న ప్రతాపవంతుడైన చేకితానుడిని చూచేవారు పొగడేటట్లుగా వధించాడు.

విశేషం: జంటమెఱుఁగుల్ - రెండు మెరుగులు - ఒకకాంతి దుర్యోధనుడి ప్రాసమునకు సంబంధించినది. రెండవది చేకితానుడి క్రమమునకు సంబంధించినది' - అతడు కూడ 'ప్రదీప్తక్రమశ్రీకాంతుఁడు' కదా! తిక్కన ఈ పద్యంలో 'మింటజంట మెఱుగుల్నిండం' అని వర్ణించాడు. సామాన్యంగా దుర్యోధనుడు - చేకితానుడు - మింటకెగసి తాకినపుడు గల స్థితిని - తిక్కనగారు ఇట్లు ఊహించి ఉత్ప్రేక్షించియుండవచ్చును. ఇంకను - ఆయనకు గల అనుభవాన్ని బట్టి కూడా ఇట్లు సూచించి యుండవచ్చును. ఈ వర్ణనం అమూలకం. మూలంలో వ్యాసభగవానుడు ఒక చిన్న అనుష్టుప్పులో - దుర్యోధనుడు చేకితానుని వధించుటను చెప్పాడు. తిక్కయజ్వ పెద్ద శార్దూలంతో దాని అభివర్ణించాడు.

వ. ఇట్లు చేకితానుండు వీతాసుండైనం గని కౌంతేయులు గోపాటోపంబున సైన్యోపేతగతిం గడంగి కౌరవసైన్యంబుపైఁ బటుబాణంబులు గురియుచు నడరిన శల్యుండు ధర్మపుత్రుని దుర్యోధనుండు ధృష్టద్యుమ్ను నమ్మహీపతిపనుప నశ్వత్థామత్రిగర్తులు మూఁడు వేల రథంబులవారు వివ్వచ్చుని మహోత్సాహంబున మార్కొనిరి. తక్కటి యోధులు సేనయు నవ్విరోధి వరూథిని గలయం బెరయుటయు నక్కజంబయ్యె నప్పుడు పెంధూళి యెగసి చూడ్కులు నిగుడకున్నను సైనికుల సింహనాదంబులు సెలంగం జేయుటయు బిరుదులు ప్రకటించుటయు బోధకంబుగాఁ బోరిన బోరనఁ దొరఁగుఁ శోణితం బారేణువు నడంచినఁ బ్రియం బంది యిరువాఁగును 'శ్రేయుండు పొడవుం' డను నెలుంగులు నింగి ముట్టఁ బెనంగు నట్టియెడ. 185

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధముగా; చేకితానుండు; వీత= పోయిన; అసుండు= ప్రాణములుకలవాడు; ఐనన్= కాగా; కని= చూచి; కౌంతేయులు= కుంతీకుమారులు(పాండవులు); కోప= క్రోధముయొక్క; ఆటోపంబునన్= విజృంభణంతో; సైన్య= సేనతో; ఉపేత= కూడిన; గతిన్= గమనముతో; కడంగి= పూని (ప్రయత్నించి); కౌరవ= కౌరవులయొక్క; సైన్యంబుపైన్= సేనపై; పటు= వాడిఅయిన; బాణంబులు= అమ్ములు; కురియుచున్= ప్రయోగించుచు; అడరినన్= అతిశయించగా; శల్యుండు; ధర్మపుత్రుని= ధర్మరాజును; దుర్యోధనుండు; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; ఆ+మహీపతి= దుర్యోధనుడు; పనుపన్= నియోగించగా; అశ్వత్థామ; త్రిగర్తులు= త్రిగర్తదేశాధీశుడైన సుశర్మ మొదలగువారు; మూఁడువేల రథంబులవారు= మూఁడువేలు రథములు కలవారు; వివ్వచ్చున్= అర్జునుని; మహా= గొప్ప; ఉత్సాహంబునన్= ప్రయత్నంతో; మార్కొనిరి= ఎదుర్కొనిరి; తక్కటి= మిగిలిన; యోధులు= వీరులు; సేనయున్= సైన్యమును; ఆ+విరోధి= ఆ శత్రువులయొక్క;

వరూథినిన్= సైన్యముతో; కలయన్= కలియబడుటకు; బెరయుటయున్= చేరుటయు; అక్కజంబు= ఆశ్చర్యం; అయ్యెన్; అప్పుడు= ఆ సమయమున; పెంధూళి= పెద్దదుమ్ము; ఎగసి= పైకిలేచి; చూడ్కులు= చూపులు; నిగుడక= వ్యాపించకుండా (కనిపించకుండా); ఉన్నను= ఉండగా; సైనికుల; సింహనాదంబులు= సింహగర్జనలు; చెలంగన్= శబ్దాలేర్పడేటట్లు; చేయుటయున్= చేయుటవలను; బిరుదులు= పౌరుషచిహ్నములయిన అతిరథమహారథ మొదలగు బిరుదులు; ప్రకటించుటయున్= ప్రకటించుటవలనను; బోధకంబుగాన్= తెలియబడునట్లుగా; పోరినన్= పోరాడగా; బోరనన్= వేగముగా; తొరఁగు= ప్రవహించు; శోణితంబు= రక్తము; ఆ రేణువున్= ఆ దుమ్మును; అడంచినన్= అణగద్రొక్కగా; ప్రియంబు సంతోషము; అంది= పొంది; ఇరువాఁగును= రెండు సేనలును; వ్రేయుండు= కొట్టుడు; పొడువుండు= పొడువుడు; అను= అనునట్టి; ఎలుంగులు= అరుపులు(శబ్దములు); నింగిన్= ఆకాశమును; ముట్టన్= అంటుకొనునట్లు; పెనంగు= యుద్ధము చేయుచున్న; అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా చేకితానుడు మరణించగా చూచి పాండవులు మిక్కిలి కోపంతో సేనతో కూడి కౌరవసైన్యంపై వాడి అయిన బాణాలు ప్రయోగిస్తూ విజృంభించగా, శల్యుడు ధర్మరాజును, దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడిని, దుర్యోధనుడి పనుపున అశ్వత్థామ త్రిగర్తులు మూడువేల రథాలతో అర్జునుడిని ఎదుర్కొన్నారు. మిగిలిన యోధులు, సేనలు ఆ శత్రుసేనతో అనగా పాండవసేనతో కలియబడగా యుద్ధం ఆశ్చర్యకరమైనది. ఆ సమయంలో పెద్ద దుమ్ము పైకి లేచి చూపులకు ఏమీ కనిపించకుండా ఉండగా సైనికులు చేసే సింహగర్జనలవలన పుట్టిన శబ్దాలు, అతిరథమహారథాదిబిరుదాలు ప్రకటించటంవలన పుట్టిన శబ్దాలు తెలియబడేటట్లుగా పోరాడుతుండగా బోరున ప్రవహించే రక్తం ఆ దుమ్మును అణచివేసింది. అప్పుడు సంతోషం పొంది రెండు సేనలూ 'కొట్టండి పొడవండి' అని చేసే అరుపులు ఆకాశాన్ని అంటుకొనేటట్లు యుద్ధం చేస్తున్న సమయంలో.

విశేషం: పెంధూళి - పెను+ధూళి - పెన్+ధూళి - పెంధూళి.

చ. **బరవస మొప్ప మద్రపతి పాండవముఖ్యునిమీఁదఁ గాండముల్**
గురిసిన నాన్నృపాలుఁడు నకుంఠితుఁడై పదునాల్గు తూపుల
న్నరపతి మేనఁ గ్రుచ్చి యెలనవ్వున నొప్పిన నమ్మహీశు పే
రురమున నాటె నారథికుఁ డొక్క సముజ్జ్వలబాణ మేడ్తెఱన్. **186**

ప్రతిపదార్థం: మద్ర= మద్రదేశమునకు; పతి= అధిపతి అయిన శల్యుడు; బరవసము= ధీరత్వము; ఒప్పన్= ప్రకాశింపగా; పాండవ= పాండవులలో; ముఖ్యుని= ముఖ్యుడయిన (అనగా ప్రథముడు అయిన) ధర్మజుని; మీఁదన్= పైన; కాండముల్= బాణములు; కురిసినన్= ప్రయోగించగా; ఆ నృపాలుఁడున్= ఆ ధర్మరాజు కూడా; అకుంఠితుఁడై= మొక్కవోనివాడై - కుంటువడనివాడై; పదునాల్గు తూపులు= పదినాలుగు బాణములు; ఆ; నరపతి= నరులకు ప్రభువు అయిన ఆ శల్యుడి; మేనన్= దేహమునందు; క్రుచ్చి; ఎలనవ్వునన్= చిరునవ్వుతో; ఒప్పినన్= ప్రకాశింపగా; ఆ రథికుఁడు= ఆ శల్యుడు; ఒక్క; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశవంతమయిన; బాణమున్= బాణమును; ఏడ్తెఱన్= పరాక్రమముతో; ఆ; మహీ= భూమికి; ఈశు= ప్రభువు అయిన ఆ ధర్మరాజుయొక్క; పేరు= విశాలమయిన; ఉరమునన్= వక్షఃస్థలమునందు; నాటెన్= క్రుచ్చెను.

తాత్పర్యం: మద్రపతి శల్యుడు మిక్కిలి ధైర్యంతో పాండవ ప్రథముడైన ధర్మరాజుమీద బాణాలు వర్షించగా ఆ ధర్మరాజు కూడా మొక్కవోని ధైర్యం కలవాడై పదునాలుగు బాణాలు ఆ శల్యుడి దేహమునందు గ్రుచ్చి ఒక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చిరునవ్వు నవ్వగా, శల్యుడు ఒక మిక్కిలి ప్రకాశవంతమైన బాణాన్ని పరాక్రమం అతిశయించగా ఆ ధర్మరాజు విశాలమయిన వక్షఃస్థలంపై నాటాడు.

వ. నాటినం గనలి యమ్మనుజేంద్రుండు చంద్రసేనుం డను తదీయచక్రరక్షకుం దునిమి నవనారాచంబులు సారథిమేన నిగిడించె. 187

ప్రతిపదార్థం: నాటినన్= గ్రుచ్చుగా; ఆ+మనుజేంద్రుండు= ఆ ధర్మరాజు; కనలి= కోపించి; చంద్రసేనుండు; అను; తదీయ= ఆ శల్యుడి రథంయొక్క; చక్ర= చక్రములను; రక్షకున్= రక్షించువానిని; తునిమి= ఖండించి; నవ= తొమ్మిది; నారాచంబులు= తీక్షణములయిన బాణములు; సారథి= రథమునడుపువాని; మేనన్= శరీరమునందు; నిగిడించెన్= వ్యాపింపచేసెను (అనగా గ్రుచ్చుకొనేటట్లు చేసెను.)

తాత్పర్యం: శల్యుడు ధర్మరాజు యొక్క పేరురంపై వాడి అయిన బాణాన్ని గ్రుచ్చగా - ఆ ధర్మరాజు మిక్కిలి కోపించి, చంద్రసేను డనే శల్యుడి రథచక్రరక్షకుడిని ఖండించి, తొమ్మిది బాణాలు శల్యుడి రథసారథి శరీరంలో గ్రుచ్చాడు.

విశేషం: మహాభారతంలో ఇద్దరు చంద్రసేనులు ఉన్నారు. ఒక చంద్రసేనుడు సముద్రసేనుడి కొడుకు. ఇతడు పాండవపక్షాన యుద్ధం చేసిన మహారథి. ఇతడిని అశ్వత్థామ సంహరించాడు. ఇక రెండవ చంద్రసేనుడు కౌరవపక్షంలోని యోధుడు. ఇతడు శల్యుడి రథచక్ర రక్షకుడు. ఇతడినే ధర్మరాజు ఖండించాడు. ఈ సందర్భంలో ధర్మరాజు ద్రుమసేనుడనే శల్యుడి మరియొక చక్రరక్షకుడిని కూడా సంహరించినట్లు మూలంలో ఉన్నది. 'ద్రుమసేనం చతుఃషష్ట్యా నిజఘాన మహారథః చక్రరక్షే హతే శల్యః పాండవేన మహాత్మనా' ॥ ఈ ద్రుమసేనుడు గవిష్ఠుడనే దైత్యుడి అంశవలన జన్మించిన క్షత్రియుడు. ఈ వచనంలో తిక్కనార్యుడు సారథిని తొమ్మిది బాణాలతో కొట్టినట్లు వ్రాశాడు. ఆ విషయం మూలంలో కనపడదు.

ఆ. అపుడు శినివరుండు ననిలపుత్త్రుఁడుఁ జేది । బలము శల్యుఁ దీవ్రభంగిఁ బొదువ
నాతఁ డా ధనంజయాగ్రణిఁ బటుతర । పంచమార్గణముల నొంచె నధిప! 188

ప్రతిపదార్థం: అధిప!= ప్రభువు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అపుడు; శినివరుండును= సాత్యకియును; అనిల= వాయువుయొక్క; పుత్త్రుఁడును= కుమారుడయిన భీముడును; చేది= చేది దేశముయొక్క; బలమున్= సైన్యమును; శల్యున్= శల్యుడిని; తీవ్ర= అధికమయిన; భంగిన్= విధముగా; పొదువన్= ఎదుర్కొనగా; ఆతఁడు= ఆశల్యుడు; ఆ; ధనంజయ= అర్జునుని కంటె; అగ్రణినిన్= పెద్దవానిని అనగా భీముని; పటుతర= మిక్కిలి కఠినమైన; పంచ= అయిదు; మార్గణములన్= బాణములతో; నొంచెన్= నొప్పించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ సమయంలో అనగా ధర్మరాజు శల్యుడి చక్రరక్షకులను, సారథిని ఖండించిన తరువాత - సాత్యకి, భీముడు, చేది సేన ఆ శల్యుడిని తీవ్రంగా ఎదుర్కొనగా ఆ శల్యుడు భీముడిని మిక్కిలి కఠినమయిన అయిదు బాణాలతో నొప్పించాడు.

విశేషం: పద్యంలో 'చేదిబలము' అని ప్రయోగింపబడింది. చేదిదేశపురాజు శిశుపాలుడు. అతడి పుత్రుడు ధృష్టకేతుడు. అతడు ఒక అక్షౌహిణి సేనతో పాండవపక్షం వైపు యుద్ధం చేశాడు. ఇక శినివరుడు అనగా సాత్యకి, వృష్ణి వంశమునందలి 'శిని'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యొక్క కుమారుడు సత్యకుడు. సత్యకుడి పుత్రుడు సాత్యకి. ఇతడు సప్తమరుత్తుల అంశతో జన్మించాడు. మహాభారతంలో సాత్యకికి అనేక నామాలు ఉన్నాయి. అందు కొన్ని - ఆనర్త, శైనేయ, శినిపౌత్ర, శినిపుత్ర, శినిప్రవర, శినిప్రవీర, శినిపుంగవ, శినివీర, శినివృషభ, దాశార్హ, మాధవ, మాధవసింహ, యుయుధాన, మొదలైనవి.

క. విను మిరువదియేడమ్ముల । శినిమనుమని యు బ్బడంచెఁ జేదిరథికులం
దునిమెం దీవ్రశరోత్కర । మున నిరువది యేవురన్ సముద్భటభంగిన్. 189

ప్రతిపదార్థం: వినుము; ఇరువదియేడు; అమ్ములన్= బాణములతో; శినిమనుమని= సాత్యకియొక్క; ఉబ్బు= ఆధిక్యమును; అడంచెన్= అణచెను(తగ్గించెను); తీవ్ర= మిక్కిలి వాడి అయిన; శర= బాణములయొక్క; ఉత్కరమునన్= సమూహముతో; సముద్భట= శ్రేష్ఠముయిన; భంగిన్= విధముగా; ఇరువది; ఏవురన్= అయిదుగురు; చేది= చేది దేశముయొక్క; రథికులన్= వీరులను; తునిమెన్= ఖండించెను (సంహరించెను).

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆలకించుము. శల్యుడు ఇరువది ఏడు బాణాలతో సాత్యకియొక్క ఆధిక్యాన్ని తగ్గించాడు. తరువాత మిక్కిలి వాడి అయిన బాణాలతో శ్రేష్ఠమైన విధంగా ఇరువది అయిదుమంది చేది వీరులను సంహరించాడు.

క. కవలు తనమీఁద రయమునఁ । గవిసిన నిశితతరసాయకములను మౌర్వీ
రవము సెలంగఁగ వారల । యవయవముల నినిచె నతఁ డహంకృతి మెఱయన్. 190

ప్రతిపదార్థం: అతఁడు (అనగా శల్యుడు); అహంకృతి= అహంకారము (అనగా గర్వము) మెఱయన్= ప్రకాశింపగా; కవలు= నకులసహదేవులు; తనమీఁదన్; రయమునన్= వేగముగా; కవిసినన్= కలియబడగా; మౌర్వీ= వింటినారియొక్క; రవము= ధ్వని; చెలంగఁగన్= మ్రోయగా; నిశితతర= మిక్కిలి వాడి అయిన; సాయకములను= బాణములను; వారల= వారియొక్క; అవయవములన్= అంగములందు; నినిచెన్= నింపెను.

తాత్పర్యం: నకుల సహదేవులు తనపై వేగంగా కలియబడగా, ఆ శల్యుడు ప్రకాశిస్తున్న గర్వంతో, వింటినారియొక్క ధ్వని మిక్కుటమయ్యే విధంగా వాడి అయిన బాణాలతో ఆ నకుల సహదేవుల అంగాలను నింపివేశాడు.

చ. కనుఁగొని ధర్మసూతి భుజ గర్వమెలర్పఁగ బెట్టు గిట్టి శ
ల్యుని మెయిఁ దీవ్రమార్గణసముత్కరముం బరఁగించి కేతువుం
దునిమిన నాతఁ డా పతికిఁ దూపుల వేఁడిమి సూపి వాయుసూ
నునిఁ గవలన్ శినిప్రవరు నొంచె వడిం బదియేసి యమ్ములన్. 191

ప్రతిపదార్థం: ధర్మసూతి= యమధర్మరాజు పుత్రుడయిన ధర్మరాజు; కనుఁగొని= చూచి; భుజగర్వము= బాహువులయొక్క పొగరు; ఎలర్పఁగన్= అతిశయించగా; బెట్టు= అత్యంతము; కిట్టి= సమీపించి; శల్యుని= శల్యునియొక్క; మెయిన్= దేహమునందు; తీవ్ర= తీక్షణమయిన; మార్గణ= బాణములయొక్క; సముత్కరమున్= సమూహమును; పరఁగించి= ప్రయోగించి; కేతువున్= జెండాకొయ్యను; తునిమినన్= ఖండించగా; ఆతఁడు; ఆ పతికిన్= ఆ ప్రభువు అయిన ధర్మరాజునకు; తూపులవేఁడిమి= బాణములయొక్క తాపము; చూపి; వడిన్= వేగముగా; పదియేసి= పది చొప్పున; అమ్ములన్= బాణములను; వాయు సూనునిన్= భీముడిని; కవలన్= నకులసహదేవులను; శినిప్రవరున్= సాత్యకిని; నొంచెన్= నొప్పించెను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మరాజు శల్యుడిని చూచి బాహుగర్వం అతిశయించగా సమీపించి, శల్యుడి దేహంలో తీక్షణమైన బాణసముదాయాన్ని ప్రయోగించి జెండాకొయ్యను ఖండించాడు. అప్పుడు ఆ శల్యుడు ధర్మరాజునకు వాడి బాణాల తాపాన్ని చూపించి, వేగంగా పదేసి బాణాలతో భీముడిని, నకుల సహదేవులను, సాత్యకిని నొప్పించాడు.

ఉ. నొంచి మదించి ఖేచరమనోహరుఁడై వడి ధర్మపుత్రు స్రు
క్కించి మహోగ్రబాణపరికీలితదేహునిఁ జేసె దానఁ గో
పించి శితాస్త్రముల్ గవలు భీముఁడు సాత్యకియుం గడంక గు
ప్పించిన వానిఁ ద్రుంచి శరపీడితదేహులఁ జేసె వారలన్. 192

ప్రతిపదార్థం: నొంచి= నొప్పించి; మదించి= గర్వించి; ఖే= ఆకాశమునందు; చర= సంచరించు దేవయోనులయొక్క; మనః+హరుఁడు+ఐ= మనస్సులను హరించినవాడై (దేవగంధర్వ యక్ష కిన్నరసిద్ధసాధ్యాదులకు ఆనందమును కలిగించువాడై); వడిన్= వేగముగా; ధర్మపుత్రున్= ధర్మరాజును; స్రుక్కించి= మూర్ఛనొందించి; మహా= గొప్ప; ఉగ్ర= భయంకరమయిన; బాణ= బాణములతో; పరికీలిత= బాగుగా నాటబడిన; దేహునిన్= శరీరముకల వానినిగా; చేసెన్= చేసెను; దానన్= అందువలన; కవలు= నకుల సహదేవులు; భీముఁడు; సాత్యకియున్= సాత్యకియును; కోపించి= కోపమును పొంది; శిత= వాడిఅయిన; అస్త్రముల్= బాణములు; కడంకన్= ప్రయత్నముతో; గుప్పించినన్= కురిపించగా; వానిన్= ఆ బాణములను; త్రుంచి= ఖండించి; వారలన్= వారిని (అనగా నకుల సహదేవులను; భీముని- సాత్యకిని); శరపీడిత= బాణములచే బాధింపబడిన; దేహులన్= శరీరములు కలవారినిగా; చేసెన్= చేసెను.

తాత్పర్యం: శల్యుడు భీముడిని, నకుల సహదేవులను, సాత్యకిని నొప్పించి, గర్వించి, దేవగంధర్వాది ఆకాశ సంచారులకు ఆనందాన్ని కలిగిస్తూ, వేగంగా ధర్మజుడిని మూర్ఛనొందించి భయంకరములయిన బాణాలతో అతడి శరీరంలో గ్రుచ్చాడు. ఇట్లా ధర్మజుడు బంధించబడగా నకుల సహదేవులు, భీముడు, సాత్యకి, మిక్కిలి కోపించి వాడి అయిన బాణాలను శల్యుడిపై కురిపించగా, శల్యుడు వాటిని ఖండించి ఆ నకుల సహదేవులను, భీముడిని, సాత్యకిని, శరపీడిత దేహులుగా చేశాడు.

వ. చేసి యొండొక భాసితధ్వజం బెత్తించి మెఱసిన. 193

ప్రతిపదార్థం: చేసి; ఒండొక= ఇంకొక; భాసిత= ప్రకాశవంతమయిన; ధ్వజంబు= జెండాకొయ్యను; ఎత్తించి= నిలబెట్టి; మెఱసినన్= ప్రకాశింపగా.

తాత్పర్యం: ఆ నకుల సహదేవులను, భీముడిని, సాత్యకిని శరపీడిత దేహులను చేసి, ఇంకొక ప్రకాశవంతమయిన జెండా కొయ్యను నిలబెట్టి, ఆ శల్యుడు ప్రకాశించగా.

సీ. భీముఁ డాతని మెయి బెడిదంపు నారసం । బడరించి వెండియు నట్టి వేడు
వఱపె సాత్యకి శతబాణంబు లతనిపై । బెట్టేసె మాద్రి తొల్పట్టి యైదు
తీవ్రాస్త్రముల సహదేవుండు పదునాలు । గమ్ముల నవ్వీరు నంగకములఁ
బరఁగించి రమ్మద్రపతి భీమసేనాదు । లైన యన్నలువుర నతిరయమున

తే. వరుస డెబ్బదిమూఁటను నిరువదేను। వాఁడి తూపుల నేనింట మూఁడు మార్గ
ణములఁ బీడితులుగఁ జేసి నఱకె భల్ల। నిహతి సహదేవుచాపంబు నృపవరేణ్య! 194

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజులలో శ్రేష్ఠుడవు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; భీముఁడు; ఆతని= ఆ శల్యుని; మెయిన్= శరీరమునందు; బెడిదంపు= భయంకరమగు; నారసంబు= బాణము; అదరించి= ప్రయోగించి; వెండియున్= మరియు; అట్టివి; ఏడు; పఱపెన్= ప్రయోగించెను; సాత్యకి; శత= నూరు; బాణంబులు; అతనిపైన్= ఆ శల్యుడిపై; బెట్టు= గట్టిగా; ఏసెన్= ప్రయోగించెను; మాద్రి= మాద్రియొక్క; తొల్పట్టి= మొదటిబిడ్డ(నకులుడు); ఐదు; తీవ్ర= మిక్కిలి వాడి అయిన; అస్త్రములన్= బాణాలను; సహదేవుండు; పదునాలుగు; అమ్ములన్= బాణాలను; ఆ+వీరున్= పరాక్రమవంతుడయిన శల్యుడి; అంగకములన్= అవయవములందు; పఱఁగించిరి= ప్రయోగించిరి; ఆ+మద్రపతి= శల్యుడు; భీమసేన; ఆదులు= మొదలగువారు; ఐన= అయినటువంటి; ఆ+నలువురన్= నలువురను; అతి= మిక్కిలి; రయమునన్= వేగముగా; వరుసన్= క్రమముగా; డెబ్బది; మూఁటను= మూడు బాణములతో; ఇరువది; ఏను= అయిదు; వాఁడి= వాడిఅయిన; తూపులను= బాణములతోను; ఏనింటన్= అయిదింటితో; మూఁడు మార్గణములన్= మూడు బాణములతో (సహదేవుని); పీడితులుగన్= బాధింపబడునట్టి వారుగ; చేసి; భల్ల= బల్లెముయొక్క; నిహతిన్= దెబ్బతో; సహదేవు= సహదేవునియొక్క; చాపంబున్= వింటిని; నఱకెన్= ఖండించెను.

తాత్పర్యం: రాజ శ్రేష్ఠుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీముడు శల్యుని దేహంలో భయంకరమైన బాణాన్ని ప్రయోగించి ఇంకా అటువంటి ఏడు బాణాలు మరల శల్యుడిపై ప్రయోగించాడు. సాత్యకి శల్యుడిపై నూరు బాణాలు ప్రయోగించాడు. నకులుడు అయిదు వాడి అయిన బాణాలు, సహదేవుడు పదునాలుగు బాణాలు ఆ శల్యుడి అవయవాలపై ప్రయోగించారు. అంతట ఆ శల్యుడు భీముడు, సాత్యకి, నకులుడు, సహదేవుడు ఆ నలువురను వరుసగా డెబ్బదిమూడు, ఇరువది అయిదు, అయిదు, మూడు బాణాలతో కొట్టి బల్లెంతో సహదేవుడి వింటిని ఖండించాడు.

శా. ఆ మాద్రీసుతుఁ డన్యచాపధరుఁడై యత్యుగ్రబాణంబులన్
మామా! యెక్కడఁ బోయె? దంచు వెస నమ్మద్రేశు నేయంగ ను
ద్దామోదగ్రత భీమసాత్యకులు శాతప్రస్ఫురన్మార్గణ
స్తోమంబుల్ గురియంగ ధర్మసుఁతుడుం దూపుల్ మెయిం గ్రువ్వఁగన్. 195

ప్రతిపదార్థం: ఆ; మాద్రీ= మాద్రియొక్క; సుతుఁడు= కుమారుడు (అనగా సహదేవుడు); అన్య= మరియొక; చాప= వింటిని; ధరుఁడై= ధరించినవాడై; అతి= మిక్కిలి; ఉగ్ర= భయంకరమయిన; బాణంబులన్= బాణములతో; మామా!; ఎక్కడన్= ఎక్కడకు; పోయెదు?= పోయెదవు?; అంచున్= అనుచు; వెసన్= వేగముగా; ఆ; మద్రేశున్= శల్యుడిని; ఏయంగన్= కొట్టగా; భీమసాత్యకులు= భీముడును, సాత్యకియును; ఉద్దామ= అడ్డులేని విధముగా; ఉదగ్రతన్= భయంకరత్వముతో; శాత= వాడి అయిన; ప్రస్ఫురత్= ప్రకాశించుచున్న; మార్గణ= బాణములయొక్క; స్తోమంబుల్= సమూహములు; కురియంగన్= కురిపించగా; ధర్మసుతుఁడున్= ధర్మరాజుకూడా; తూపుల్= బాణములు; మెయిన్= దేహమునందు (శల్యుడి దేహమునందు); క్రువ్వఁగన్= కురిపించగా (నాటగా).

తాత్పర్యం: సహదేవుడు మరియొక వింటిని ధరించి, మిక్కిలి భయంకరమయిన బాణాలతో 'మామా! ఎక్కడకు పోతావు?' అంటూ వేగంగా ఆ శల్యుడిని కొట్టగా భీమసాత్యకులు కూడా అడ్డులేని విధంగా భయంకరంగా వాడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అయిన, ప్రకాశవంతమయిన బాణసమూహాలను కురిపించగా ధర్మజుడు కూడా ఆ శల్యుడి దేహమునందు బాణాలు నాటగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. కలయఁగ నెత్తురుల్ దొరఁగ గైరిక నిర్ఝరజాలరంజితా
చలమును బోలి పొల్పెసఁగి శల్యుఁడు వారల నస్త్రపంచకం
బుల వెస నొంచి త్రుంచెఁ గురుభూవర! ధర్మజు చాప మమ్ముతో
బలమును శౌర్యమున్ సురలు ప్రస్తుతి సేయ మహోగ్రమూర్తియై. 196

ప్రతిపదార్థం: కురుభూవర!= కురు వంశ మహారాజు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; కలయఁగన్= అంతట; శల్యుఁడు; నెత్తురుల్= రక్తములు; తొరఁగన్= స్రవించుచుండగ; గైరిక= గైరికాది ధాతువులతోడి; నిర్ఝర= సెలయేరులయొక్క; జాల= సమూహములతో; రంజిత= ఎఱ్ఱనైన; అచలమును= పర్వతమును; పోలి; పొల్పు= ఒప్పుగా; ఎసఁగి= విజృంభించి; వారలన్= వారిని; అస్త్ర= మంత్రపూతములయిన బాణములయొక్క; పంచకంబులన్= అయిదింటితో; వెసన్= వేగముగా; నొంచి= నొప్పించి; బలమును; శౌర్యమున్= పరాక్రమమును; సురలు= దేవతలు; ప్రస్తుతి= మెచ్చుకోలు; చేయన్= చేయునట్లుగా; మహా= మిక్కిలి; ఉగ్ర= భయంకరమయిన; మూర్తియై= ఆకారముకలవాడై; ధర్మజు= ధర్మరాజుయొక్క; చాపము= విల్లు; అమ్ముతోన్= బాణంతో; త్రుంచెన్= ఖండించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అప్పుడు శల్యుడు రక్తప్రవాహాలు దేహంనుండి స్రవిస్తుండగా గైరికాది ధాతువులతో నిండిన సెలయేరుల సమూహాలతో ఎఱ్ఱగా ఉన్న పర్వతంవలె ప్రకాశిస్తూ విజృంభించి, ధర్మరాజు, భీముడు, సాత్యకి, నకుల సహదేవులు అయిదుగురిని ఒక్కొక్కరిని అయిదేసి మంత్రపూతాలయిన బాణాలతో నొప్పించి, తన బలాన్ని పరాక్రమాన్ని దేవతలు ప్రస్తుతి చేసేటట్లు భయంకరాకారం కలవాడై, ఒక్క బాణంతో ధర్మరాజు వింటిని అమ్ముతో కూడ ఖండించాడు.

విశేషం: అలం: ఉపమ. శల్యుడు ఉపమేయము. గైరిక నిర్ఝరజాల రంజితాచలము - ఉపమానము; పోలి - ఉపమావాచకం. ఎఱుపు - సమానధర్మం. పూర్ణోపమ. ఈ ఉపమకు మూలం. 'సుస్రావ రుధిరం గాత్రై గైరికం పర్వతో యథా!' (శల్య - 13-24)

ఉ. వేఱొక చాపమెత్తి పృథివీవర! ధర్మతనూజుఁ డింతతోఁ
దీఱఁగఁ జేయుదుం బగ యతిప్రకటంబుగ నంచు సూతుమైఁ
దూఱఁ దురంగమాంగములు దూఁటులు వోవఁగ శల్యునెమ్ములన్
గీఱ సిడంబు గాఁడఁ బరఁగించె సముజ్జ్వలచండకాండముల్. 197

ప్రతిపదార్థం: పృథివీ= భూమికి; వర!= భర్తఅయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ధర్మ= యమధర్మరాజుయొక్క; తనూజుఁడు= కుమారుడు అనగా ధర్మరాజు; వేఱొక= మరియొక; చాపము= విల్లు; ఎత్తి= పట్టుకొని; అతి= మిక్కిలి; ప్రకటంబుగన్= వెల్లడియగునట్లుగా; పగ= విరోధము; ఇంతతోన్= ఇంతటితో; తీఱఁగన్= ముగిసిపోవునట్లుగ; చేయుదున్= చేస్తాను; అంచున్= అనుచు; సూతు= సూతునియొక్క; మైన్= దేహమునందు; తూఱన్= చొచ్చుకొనిపోవునట్లుగ; తురంగ= గుఱ్ఱములయొక్క; అంగములు= అవయవములు; తూఁటులు= చిల్లులు; పోవఁగన్= పడునట్లుగా; శల్యు= శల్యునియొక్క; ఎమ్ములన్= ఎముకలను; గీఱన్= భేదించునట్లుగ; సిడంబున్= ధ్వజమును(జెండాకొయ్యను); కాఁడన్= నశించునట్లుగ; సముజ్జ్వల= ప్రకాశవంతమయిన; చండ= క్రూరమయిన; కాండముల్= బాణములు; పరఁగించెన్= ప్రయోగించెను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధర్మరాజు మరియొక విల్లు పట్టుకొని 'ఇంతటితో విరోధం (యుద్ధం) ముగిసిపోవునట్లుగా చేయగలను' అంటూ సూతుడి దేహం చొచ్చుకొని పోయేటట్లుగా, గుఱ్ఱాల అవయవాలు చిల్లులు పడేటట్లుగా, శల్యుడి ఎముకలు భేదించేటట్లుగా, జెండాకొయ్య విరిగేటట్లుగా ప్రకాశవంతమైన, క్రూరమైన బాణాలు ప్రయోగించాడు.

వ. ఇవ్విధంబున విజృంభించిన. 198

ప్రతిపదార్థం: ఇవ్విధంబునన్= ఈ ప్రకారముగ; విజృంభించినన్= అతిశయించగా.

తాత్పర్యం: ధర్మరాజు ఈ ప్రకారంగా అతిశయించి యుద్ధం చేస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ధర్మరాజు శల్యునిబాణంబులచేత మూర్ఛితుం డగుట (సం. 9-11-66)

క. కోపించి యతఁడు దర్పా। టోపం బుగ్రముగ దశపటుప్రదరము లా
భూపాలు మేనఁ జొనిపిన। భూపాలక! యాతఁడొల్లఁ బోవుటయు వెసన్. 199

ప్రతిపదార్థం: భూ= భూమికి; పాలక!= పరిపాలకుడవు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అతఁడు= అనగా ఆ శల్యుడు; కోపించి; దర్ప= గర్వముయొక్క; ఆటోపంబు= ఆడంబరము; ఉగ్రముగన్= భయంకరము అగునట్లుగా; దశ= పది; పటు= కఠినమయిన; ప్రదరములు= బాణములు; ఆ; భూపాలు= రాజైన ధర్మరాజుయొక్క; మేనన్= శరీరమునందు; చొనిపినన్= చొప్పించగా; ఆతఁడు= ఆ ధర్మరాజు; ఒల్లఁబోవుటయున్= మూర్ఛపోవుటయు; వెసన్= వేగముగా.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ శల్యుడు కోపించి గర్వపు ఆడంబరం భయంకర మయ్యేటట్లుగా పది కఠినమయిన బాణాలు ఆ ధర్మరాజు శరీరంలో నాటగా ఆ ధర్మరాజు మూర్ఛపోయాడు. ఆ వెంటనే వేగంగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. శైనేయుఁ డడరి యుజ్జ్వల। నానావిశిఖముల మద్రనరపతిఁ బొదువం
దా నలిగి విల్లు దునియలు। గా నొక భల్లమున నేసె గర్వోద్ధతుఁడై. 200

ప్రతిపదార్థం: శైనేయుఁడు= శినియొక్క మనుమడు అయిన సాత్యకి; అడరి= విజృంభించి; ఉజ్జ్వల= ప్రకాశవంతమయిన; నానా= అనేక విధములయిన; విశిఖములన్= వాడి అయిన మొనలు గల బాణాలతో; మద్ర= మద్రదేశముయొక్క; నరపతిన్= నరులకు భర్త అయిన శల్యుని; పొదువన్= కప్పివేయగా; తాన్= తాను(అనగా శల్యుడు); అలిగి= కోపించి; గర్వ= గర్వముతో; ఉద్ధతుఁడై= గర్వించినవాడై; విల్లు= ధనువు(సాత్యకి విల్లు); తునియలు+కాన్= చిన్న చిన్న ముక్కలగునట్లుగా; ఒక భల్లమునన్= ఒక బల్లెముతో; ఏసెన్= కొట్టెను.

తాత్పర్యం: శల్యుడి బాణాల వలన ధర్మరాజు మూర్ఛిల్లగా, ఆ వెంటనే సాత్యకి విజృంభించి ప్రకాశవంతమైన అనేక విధాలైన బాణాలతో ఆ శల్యుడిని కప్పివేయగా, శల్యుడు కోపించి పొగరుతో గర్వించినవాడై సాత్యకి ధనువును చిన్న చిన్న ముక్కలయ్యేటట్లుగా ఒక బల్లెంతో కొట్టాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఆ రథికవరుని నకులుని । మారుతి సహదేవు మూఁడు మార్గణముల నే
పారఁగ బలుపారఁగ రయ । మారఁగ నొప్పించె నమ్మహాభుజుఁడధిపా! 201

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఆ; మహా= గొప్ప; భుజుఁడు= బాహువులు కలవాడు అయిన శల్యుడు; ఆ; రథిక= యోధులలో; వరునిన్= శ్రేష్ఠుడయిన వానిని; నకులుడిని; మారుతిన్= భీముడిని; సహదేవున్= సహదేవుడిని; మూఁడు మార్గణములన్= మూడేసి బాణములతో; ఏపు+ఆరఁగన్= పెంపు అనగా ఆధిక్యము అతిశయించునట్లుగా; బలుపు+ఆరఁగన్= బలం అతిశయించునట్లుగా; రయము+ఆరఁగన్= వేగము అతిశయించునట్లుగా; నొప్పించెన్= నొవ్వచేసెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ మహాభుజ బలపరాక్రమవంతుడైన శల్యుడు యోధశ్రేష్ఠులైన సాత్యకిని, నకులుడిని, భీముడిని, సహదేవుడిని, మూడేసి బాణాలతో తన ఆధిక్యం, బలం, వేగం అతిశయించేటట్లుగా బాధించాడు.

విశేషం: ఈ పద్యంలో 'మూఁడు మార్గణములన్' అని ఉన్నది. మూడు బాణములని అర్థం. సాత్యకిని, భీముడిని, నకులుడిని, సహదేవుడిని మూడు బాణములతో బాధించాడని తాత్పర్యం. మూలాన్ని పరిశీలించగా - ఒక్కొక్కరిని మూడేసి బాణములతో కొట్టినట్లు ఉన్నది.

వ. అంతం దెలిసి యక్కౌంతేయాగ్రజుండు మద్రపతిని ముద్గరంబున నేయ నవ్విరోధిపై సాత్యకి దోమరంబును వృకోదరుండు భల్లంబును నకులుండు శక్తియు సహదేవుండు గదయును బ్రయోగించిన నయ్యోధవరుండు వాని నన్నింటిని మింట మెఱుంగు లడర వెడఁద యమ్ములు పరఁగించి త్రుంచి యార్చినం బేర్చిన రోషంబున నా కృష్ణానుజుండు సారథి మూఁడు వాఁడితూపుల నవ్విరోధి రెండు బాణంబుల బెట్టేసినఁ గ్రోధదీప్తుండై యా శల్యుఁడు ప్రచండకాండంబుల నయ్యేవురను స్రుక్కించిన జూచి నీ పుత్త్రుం డతనిచేతఁ బాండుపుత్త్రులు పొలియుదు రని తలంచె నట్లు భాసమానుండైన సేనాపతిం గని భీమసేనుండు సహింపక తెంపున బెట్టు గిట్టిన. 202

ప్రతిపదార్థం: అంతన్= అంతలో; ఆ; కౌంతేయ= కుంతీపుత్రులలో; అగ్రజుండు= పెద్దవాడు అయిన ధర్మరాజు; తెలిసి= మూర్ఛనుండి తేరుకొని; మద్రపతిని= మద్రదేశమునకు అధిపతి అయిన శల్యుడిని; ముద్గరంబునన్= ముద్గరముతో (అనగా ఇనుపగదతో); ఏయన్= కొట్టగా; ఆ+విరోధిపైన్= శత్రువుపై(అనగా శల్యునిమీద); సాత్యకి; తోమరంబును= తోమరము అనే ఆయుధాన్ని; వృక+ఉదరుండు= భీముఁడు (తోడేలు ఉదరమువంటి ఉదరముకలవాడు కావున భీముడికి వృకోదరుడని పేరు); భల్లంబును= బల్లెమును; నకులుడు; శక్తియును= శక్తి అనే ఆయుధాన్ని; సహదేవుండు; గదయును= గదను; ప్రయోగించినన్= ప్రయోగించగా; ఆ; యోధ= యుద్ధవీరులలో; వరుండు= శ్రేష్ఠుడు అయిన శల్యుడు; వానిన్= వానిని; ఆ ఆయుధములను; అన్నింటిని; మింటన్= ఆకాశమునందు; మెఱుంగులు= మెఱుపులు; అడరన్= వ్యాపించునట్లుగా; వెడఁద= విశాలమయిన (పొడవు అయిన); అమ్ములు= బాణములు; పరఁగించి= ప్రయోగించి; త్రుంచి= ముక్కలు చేసి; ఆర్చినన్= పెద్దబొబ్బ పెట్టగా (గట్టిగా అరవగా); పేర్చిన= అతిశయించిన; రోషంబునన్= కోపముతో; ఆ; కృష్ణ= శ్రీకృష్ణునకు; అనుజుండు= తమ్ముడు అయిన సాత్యకి; సారథిన్= సారథిని(శల్యుడి సారథిని); మూఁడు; వాఁడి= వాడిఅయిన; తూపులన్= బాణములతో; ఆ; విరోధిన్= శత్రువును (అనగా శల్యుడిని); రెండు; బాణంబులన్= బాణములతో; బెట్టు= గట్టిగా; ఏసినన్= కొట్టగా; ఆ శల్యుఁడు; క్రోధ= కోపముతో; దీప్తుండై= ప్రజ్వలించుచున్నవాడై; ప్రచండ= భయంకరములయిన; కాండంబులన్= బాణములతో; ఆ; ఏవురను= అయిదుగురను; స్రుక్కించినన్= బాధించగా; చూచి; నీపుత్రుండు= నీయొక్క కుమారుడు(అనగా దుర్యోధనుడు);

అతనిచేతన్; పాండుపుత్రులు= పాండురాజు కుమారులు; పొలియుదురు= చత్తురు; అని; తలంచెను= ఆలోచించెను; అట్లు= ఆ ప్రకారంగా; భాసమానుండైన= ప్రకాశమానుడయిన; సేనాపతిన్= సైన్యాధ్యక్షుని(శల్యుని); కని= చూచి; భీమసేనుండు; సహింపక= ఓర్పువహింపక; తెంపునన్= సాహసముతో; బెట్టు= మిక్కిలి దగ్గరకు; కిట్టినన్= సమీపించగా.

తాత్పర్యం: అంతలో ధర్మరాజు మూర్ఛనుండి తేరుకొని శల్యుడిని ముద్గరంతో కొట్టాడు. ఆ సమయంలో ఆ శల్యుడిపై సాత్యకి తోమరాన్ని, భీముడు బల్లెమును, నకులుడు శక్తిని, సహదేవుడు గదను ప్రయోగించారు. వీరశ్రేష్ఠుడయిన ఆ శల్యుడు ఆ ఆయుధాలన్నింటినీ ఆకాశంలో మెరుపులు వ్యాపించేటట్లు పెద్ద పెద్ద బాణాలు ప్రయోగించి చిన్న చిన్నముక్కలుగా చేసి పెడబొబ్బ పెట్టాడు. దానితో అతిశయించిన కోపంతో సాత్యకి శల్యుడి సారథిని మూడు వాడి అయిన బాణాలతో, శల్యుడిని రెండు బాణాలతో గట్టిగా కొట్టాడు. అంతట ఆ శల్యుడు క్రోధంతో ప్రజ్వలించినవాడై, భయంకరాలయిన బాణాలతో అయిదుగురిని బాధించాడు. అది చూచి నీ పుత్రుడు దుర్యోధనుడు ఆ శల్యుడిచేత పాండు పుత్రులు చస్తారని తలంచాడు. ఆ ప్రకారంగా ప్రకాశమానుడైన శల్యుడిని చూచి భీమసేనుడు సహించ జాలక సాహసంతో ఆ శల్యుడి సమీపానికి రాగా.

క. శిని మనుమఁడు గవలును దో । డన యురవడి నడరి పొదువుటయు నగ్గలికం
బెనఁగె నతం డా నలువుర । కనలుఁ గడంకయును సరకు గాఁ గొన కధిపా! **203**

ప్రతిపదార్థం: అధిపా!= ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; శిని= శినియొక్క; మనుమఁడు(అనగా సాత్యకి); తోడన= వెంటనే; కవలును= నకులసహదేవులును; విజృంభణంతో= మిక్కిలివేగముగా; పొదువుటయును= క్రమ్ముకొనుటయును; అడరి= విజృంభించి; అగ్గలికన్= ఉత్సాహముతో; పెనఁగెన్= పోరాడెను; అతండు; ఆ నలువుర= ఆ నలుగురియొక్క; కనలున్= కోపమును; కడంకయును= యుద్ధముచేయు పోకడలను, సరకుగాన్+కొనక= లక్ష్యము చేయకుండా; పెనఁగెన్= పోరాడెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సాత్యకి ఆ వెంటనే మిక్కిలి వేగంగా నకుల సహదేవులను కలిసికొని విజృంభించి, ఉత్సాహంతో శల్యుడితో పోరాడాడు. ఆ శల్యుడు ఆ నలువురి కోపాన్ని, యుద్ధప్రయత్నాన్ని లక్ష్యపెట్టకుండా పోరాడాడు.

వ. ఇట్లు పెనంగుచుండఁ బాండవాగ్రజుండు మున్ను దనచేతఁ జచ్చిన చంద్రసేనుతోడివాని ద్యుమత్సేనుఁ దల ద్రెవ్వ నేసిన జక్రరక్షకహీనుం డయ్యును బొలివోవని కనలున శల్యుండు సటలు వెఱికినం గోపించు సింగంబుచందంబై సమీరణసుతాదులగు జోదుల నలువురయంగంబులఁ దురంగనికరశరీర సారథినికాయసహితంబుగా బహువిధవిశిఖంబులు వఱఁగించి నెత్తురులు దొరఁగించినం గని యా ధర్మనందనుండు విషాదంబు నొంది నిజాంతర్గతంబున. **204**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; పెనంగుచుండన్= పోరాడుచుండగా; పాండవ= పాండురాజు కుమారులలో; అగ్రజుండు= పెద్దవాడయిన ధర్మరాజు; మున్ను= అంతకుముందు; తనచేతన్= తనచేత; చచ్చిన= చచ్చిపోయిన; చంద్రసేనుతోడివానిన్= చంద్రసేనునితోడివాడైన; ద్యుమత్సేనున్= ద్యుమత్సేనునియొక్క; తల= శిరస్సు; ద్రెవ్వన్= తెగిపోవునట్లుగా; ఏసినన్= కొట్టగా; చక్రరక్షక= రథ చక్రములను రక్షించువాడు; హీనుండు= లేనివాడు; అయ్యును= అయినను; పొలివోవని= చెడిపోవని; కనలునన్= కోపముతో; శల్యుండు; సటలు= జూలు; పెఱికినన్= పీకినందువలన; కోపించు= కోపించే; సింగంబు=

సింహము; చందంబు= వలె; ఐ= అయినటువంటి వాడయి; సమీరణ= వాయువుయొక్క; సుత= పుత్రుడు భీముడు; ఆదులగు= మొదలగు; జోదులు= యోధులగు; నలువుర= నలువురియొక్క; అంగంబులన్= అవయవములను; తురంగ= గుర్రాలయొక్క; నికర= సమూహముయొక్క; శరీర= దేహములు; సారథి= సారథులయొక్క; నికాయ= సమూహముల; సహితంబుగాన్= సమేతముగా; బహువిధ= అనేకవిధములయిన; విశిఖంబులు= వాడియైన బాణాలు; పరఁగించి= ప్రయోగించి; నెత్తురులు= రక్తములు; తొరఁగించినన్= ప్రవహించునట్లు చేయగా; కని= చూచి; ఆ; ధర్మ= యమధర్మరాజుయొక్క; నందనుండు= కుమారుడు అనగా ధర్మరాజు; విషాదంబున్= దుఃఖమును; ఒంది= పొంది; నిజ= తనయొక్క; అంతర్గతంబునన్= అంతఃకరణమునందు (మనస్సునందు).

తాత్పర్యం: ఈ ప్రకారంగా పోరాడుతుండగా ధర్మరాజు అంతకుముందు తనచేత చంపబడిన చంద్రసేనుడితో పాటు శల్యుడికి చక్ర రక్షకుడుగా ఉన్న ద్యుమత్సేనుడి తల నరికాడు. అటు తరువాత చక్రరక్షకుడు లేనివాడైనా శల్యుడు తరుగని కోపంతో జూలు పీకినందుకు కోపించే సింహంవలె భీముడు మొదలైన యోధులైన నలుగురి అవయవాలను, గుర్రపు సమూహాలయొక్క శరీరాలను, సారథుల సమూహాలను అనేక విధాలయిన వాడి బాణాలు ప్రయోగించి రక్తాలు ప్రవహించేటట్లు చేయగా చూచి ధర్మరాజు దుఃఖించి తనలోతాను.

విశేషం: ఈ సందర్భంలో తిక్కన ధర్మజుడు ద్యుమత్సేనుడనే శల్యుడి చక్రరక్షకుడిని సంహరించినట్లు అభివర్ణించాడు. మూలంలో ఈ సందర్భంలో కాని, మరియొక చోటకాని 'ద్యుమత్సేనుడు' అనే చక్రరరక్షకుడు ఉన్నట్లు కానరాదు. వ్యాసమహాభారతంలో ఒక 'ద్యుమత్సేనుడు' సావిత్రి భర్త అయిన సత్యవంతుడి తండ్రి. మరియొక 'ద్యుమత్సేనుడు' ఉన్నాడు. అతడు పర్వతరాజు. అతడు యుద్ధమునకు సంబంధించిన వాడు కాడు. శల్యుడి చక్రరక్షకుడుగా యుద్ధంలో పాల్గొన్న 'ద్యుమత్సేనుడు' అనే వాడు వ్యాస మహాభారతంలో కానరాడు. ఇది పండితులు పరిశీలించవలసిన విషయం.

క. 'హరి వచనంబు లసత్యతఁ । బొరయఁగ నేర్చునొకొ! మద్రభూపతి బాహు
స్ఫురణము భీమాదిరథిక । వరు లోర్వని యట్లుగాఁగ వ్రాలెడిఁ దోడ్తోన్.' 205

ప్రతిపదార్థం: హరి= శ్రీకృష్ణునియొక్క; వచనంబులు= పలుకులు; అసత్యతన్= నిజము కానితనమును; పొరయఁగన్= పొందగ; నేర్చున్= అగును; ఒకొ!= ఏమో!; మద్రభూపతి= మద్రదేశాధిపతి అయిన శల్యుడియొక్క; బాహు= భుజములయొక్క; స్ఫురణము= విజృంభణము(ప్రకాశము); భీమ= భీముడు; ఆది= మొదలగు; రథికవరులు= శ్రేష్ఠులయిన యోధులు; ఓర్వని= భరింపరానిది; అట్లుగాఁగన్= అగునట్టిదిగా; తోడ్తోన్= వడివడిగా; వ్రాలెడిన్= మీరిపోవుచున్నది (అధికమగుచున్నది).

తాత్పర్యం: ధర్మరాజు తనలోతాను ఇట్లా చింతించాడు. 'శ్రీకృష్ణుడి మాటలు కల్లలు కావు కదా! శల్యుడి భుజవిజృంభణం భీముడు మొదలైన యోధశ్రేష్ఠులు భరించరానిదిగా తీవ్రం అవుతున్నది.'

వ. అని తలపోసి తన బలంబునకుఁ జేయి వీచినఁ దోయధివీచివితానవిలాసంబుచందంబునఁ జతురంగబలంబులు శల్యునిపైఁ గవిసిన నా ధైర్య ధౌరేయుండు మందరనగంబులీలఁ గైకొని వారలం గలంచి పాంచాలపుత్ర ప్రభృతియోధప్రకరంబులను బాండవాగ్రజునిం బరమ సాంద్రతీవ్రశరాంధకారంబునఁ గప్పి సింహనాదంబు చేసిన. 206

ప్రతిపదార్థం: అని= ఈ విధముగా; తలపోసి= చింతించి; తన బలంబునకున్= తనయొక్క సేనకు; చేయి; వీచినన్= ఊపగా; తోయధి= సముద్రముయొక్క; వీచి= కెరటములయొక్క; వితాన= సమూహములయొక్క; విలాసంబు= సౌందర్యము

(శృంగారము); చందంబునన్= విధముగా; చతురంగంబులు= నాలుగు రథాది యుద్ధాంగాలు; శల్యునిపైన్= శల్యుడిమీద; కవిసినన్= కలియబడగా; ఆ; ధైర్య= ధీరత్వముయొక్క; ధౌరేయుండు= భారమును మోయువాడు అయిన శల్యుడు (అనగా మిక్కిలి ధైర్యముకల శల్యుడు); మందర= మందరమనుపేరుగల; నగంబు= పర్వతముయొక్క; లీలన్= విలాసమును; కైకొని= గ్రహించి; వారలన్= వారిని; కలంచి= కలతచెందించి; పాంచాలపుత్ర= ధృష్టద్యుమ్నుడు; ప్రభృతి= మొదలగు; యోధ= వీరులయొక్క; ప్రకరంబులను= సమూహములను; పాండవాగ్రజునిన్= ధర్మరాజును; పరమ= మిక్కిలి; సాంద్ర= దట్టమయిన; తీవ్ర= వాడి అయిన; శర= బాణములవలని; అంధకారంబునన్= చిమ్మచీకటితో; కప్పి= కప్పివేసి; సింహనాదము= సింహగర్జనము; చేసినన్= చేయగా.

తాత్పర్యం: అని ధర్మరాజు తనలోతాను చింతించి, వెనువెంటనే తన సేనలకు చేయి ఊపగా సముద్రతరంగ సమూహాలవలె చతురంగబలాలు శల్యుడిమీద కలియబడగా సాహసవంతుడు అయిన ఆ శల్యుడు మందరపర్వతం పాల సముద్రాన్ని కలచినట్లు ఆ చతురంగ బలాలను కలచి, ధృష్టద్యుమ్నుడు మొదలైన వీరులను, ధర్మరాజును మిక్కిలి దట్టమయిన వాడి అయిన బాణాల వలన నిండిన చిమ్మచీకటితో కప్పివేసి సింహగర్జనం చేయగా.

విశేషం: అలం: ఉపమ. రూపకం.

క. **దివిజగరుడఖచరాదులు । వివిధవచనరచన లెసఁగ వినుతించిరి శా**
త్రవ భీకరుఁడగు నమ్మద్రవిభుని రణవిహరణములు ధరణీనాథా! 207

ప్రతిపదార్థం: ధరణీనాథా!= ధృతరాష్ట్ర మహారాజా!; శాత్రవ= శత్రువులకు; భీకరుఁడగు= భయంకరుడయిన; ఆ; మద్ర= మద్రదేశమునకు; విభుని= ప్రభువు అయిన శల్యునియొక్క; రణ= యుద్ధమునందలి; విహరణములు= విహారములు; దివిజ= దేవతలు; గరుడ= గరుడులు; ఖ= ఆకాశమునందు; చర= సంచరించు దేవయోనులు; ఆదులు= మొదలగువారు; వివిధ= అనేకవిధములయిన; వచన= వచనములతో కూడిన; రచన= రచనా విన్యాసములు; ఎసఁగన్= ఒప్పగా; వినుతించిరి= స్తుతించిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శత్రుభయంకరుడైన శల్యుడి యుద్ధ విహారాలు దేవతలు, గరుడ గంధర్వయక్షకిన్నరకింపురుష సిద్ధసాధ్యులు మొదలైనవారు వివిధ ప్రక్రియలతో కూడిన వచన రచనా విన్యాసాలతో స్తుతించారు.

వ. **ఆ సమయంబున. 208**

తాత్పర్యం: అప్పుడు

తే. **గురుసుతుఁడు పెనుబ్రాపుగా నరునిఁ బొదివి । యధిప! సంశప్తకులు వివిధా స్త్రతతులఁ**
గప్పి రతఁ డందఱను జండకాండవిదళి । తాంగులుగఁ జేసె దోర్లీల యతిశయిల్ల. 209

ప్రతిపదార్థం: అధిప!= ప్రభువు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; గురు= ద్రోణాచార్యునకు; సుతుఁడు= పుత్రుడు అయిన అశ్వత్థామ; పెను= పెద్ద; ప్రాపుగాన్= సహాయకుడిగా; సంశప్తకులు(త్రిగర్తాధీశులయిన సుశర్మ మొదలగువారు); నరునిన్= అర్జునుడిని; పొదివి= క్రమ్ముకొని(చుట్టుముట్టి); వివిధ= అనేకవిధములయిన, అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములయొక్క; తతులన్= సమూహములతో; కప్పిరి= కప్పివేసిరి; అతఁడు; అందఱను; దోః= భుజములయొక్క; లీల=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విలాసము; అతిశయిల్లన్= విజృంభించగా; చండ= భయంకరమయిన; కాండ= బాణములతో; విదళిత= చీల్చబడిన; అంగులుగన్= అవయవములు కలవారినిగా; చేసెన్;

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అశ్వత్థామను ఆశ్రయించి అతడి సాయంతో సంశప్తకులు అర్జునుడిని చుట్టుముట్టి అనేక విధాలయిన ఆయుధాలతో కప్పివేశారు. ఆ అర్జునుడు వారినందరిని భుజబలం విజృంభించగా విలాసంగా భయంకరమైన బాణాలతో ఆ సంశప్తకులను చీల్చబడిన అవయవాలు కలవారినిగా చేశాడు.

విశేషం: త్రిగర్త దేశాధీశుడు సుశర్మ మహాబల పరాక్రమవంతుడు. ఈ త్రిగర్తసేనలు సంశప్తకులు. ద్రోణపర్వంలో అర్జునుడు ఈ సంశప్తకులను సహస్రాధికంగా సంహరించినట్లు ఉన్నది. సుశర్మ తమ్ముడు సత్యరథుడు అనేవాడు ఉన్నాడు. సత్యరథుడు తన అయిదుగురు సోదరులతో కలిసి - 'అర్జునుడిని సంహరించగలము' లేనిచో మరణించగల'మని ప్రతిజ్ఞ చేశాడు. ఈ ప్రతిజ్ఞ కారణంగా త్రిగర్త దేశాధీశులకు, వారిసేనలకు సంశప్తకులనే పేరు వచ్చింది. ఈ సందర్భంలో మూలంలో వ్యాసభగవానుడు త్రిగర్తులనియే ప్రయోగించాడు. తిక్కన మాత్రం సంశప్తకులని ప్రయోగించాడు. మూలంలో ఇలా ఉంది.

> **'అర్జునో ద్రౌణినా విద్ధో యుద్ధే బహుభిరాయసైః ।**
> **తస్య చానుచరైః శూరై స్త్రిగర్తానాం మహారథైః ॥ (శల్య - 14-1)**

చ. **తెరలక వారు పైపయి నుదీర్ణసముద్ధతిఁ గ్రమ్మి వాజులన్**
హరిని సిడంబుపైఁ గదియ నాతఁడు సేడ్పడ బాణవర్షముం
గురిసిరి కౌరవేంద్రుమొనకుం బ్రమదంబగు ఘోరభంగి న
ప్పరుషపరాక్రమస్ఫురణ పార్థివసత్తమ! కాన మెయ్యెడన్. **210**

ప్రతిపదార్థం: వారు (అనగా అశ్వత్థామయు ఆ సంశప్తకులును); తెరలక= తొలగిపోవకుండగా; ఉదీర్ణ= పెల్లుబికిన; సముద్ధతిన్= దర్పముతో; క్రమ్మి= క్రమ్ముకొని; వాజులన్= గుర్రములను; హరిని= శ్రీకృష్ణుడిని (అర్జునుడిని రథసారథి); సిడంబుపైన్= ధ్వజముపైని; పైపయిన్= మీదమీద; కదియున్= సమీపించగా; ఆతఁడు (అనగా అర్జునుడు); చేడ్పడన్= బాధపడునట్లుగా; కౌరవేంద్రు= దుర్యోధనునియొక్క; మొనకున్= సేనకు; ప్రమదంబు= ఆనందము; అగు= కలిగించునట్టి; ఘోర= భయంకరమయిన; భంగిన్= విధముగా; బాణ= బాణములయొక్క; వర్షమున్= వర్షమును; కురిసిరి= కురిపించిరి; పార్థివ= రాజులలో; సత్తమ!= ఉత్తముడవు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఆ; పరుష= నిష్ఠురమయిన (క్రూరమైన); పరాక్రమ= వీరత్వముయొక్క; స్ఫురణ= ప్రకాశము; ఎయ్యెడన్= ఎక్కడా; కానము= చూడము.

తాత్పర్యం: అశ్వత్థామ, సంశప్తకులు, యుద్ధభూమినుండి తొలగిపోకుండా పెల్లుబికిన దర్పంతో క్రమ్ముకొని పార్థుడి గుర్రాలపై సారథి అయిన శ్రీకృష్ణుడిపై, ధ్వజంపైబడి మీదమీదకు సమీపించి, అర్జునుడు బాధపడేటట్లుగా, దుర్యోధనుడిసేన ఆనందపడేటట్లుగా భయంకరంగా బాణవర్షాన్ని కురిపించారు. ఓ ధృతరాష్ట్ర మహారాజా! అట్టి క్రూరమైన పరాక్రమప్రకాశం ఎక్కడా చూడం.

వ. **ఇట్లు సవ్యసాచికిఁ జేయార్ప రాకుండ దర్పంబు సూపిన నా భూవరకుమారవర్యుండు వీరాగ్రహావేశంబున విజృంభించి భల్లార్ధచంద్రక్షురికాముఖనారాచప్రముఖవిశిఖపరంపరలు వరఁగింప నవి యా సైనికుల రథ్యంబులం గూల్చియుఁ గేతనంబులు ద్రుంచియు బాణంబులు నఱకియు బాణాసనంబులు విఱిచియు**

సూతుల గీటడంచియు నరదంబులఁ జెక్కియు మైమఱువులు పొళ్లుసేసియుఁ జామరంబులు దునిమియు నాతపత్రంబులు రూపుమాపియు నెత్తురు లురలించియుఁ గండలు దొరఁగించియు నెమ్ములు వగిలించియుఁ గాళ్ళు ద్రుంచియుఁ జేతులు దునిమియు వ్రయ్యలుగా వక్షంబులు సీఱియు మర్మంబులఁ జొచ్చియు మకుటంబులు డుల్చియుఁ దలలు రాల్చియుఁ బ్రాణంబులు పీల్చియు రౌద్రం బావహించిన లయకాలరుద్రుని సంక్రీడనంబు చందంబు దోఁచెనప్పుడు రథికవరసహస్ర ద్వితయంబు దెగటారె నవ్వాఁడిమగండు పేరడవి దహించు దావపావకుని చందంబున వెలింగెఁ దదీయతేజోమహిమ సహింపక యుద్దామగతి నశ్వత్థామ గదిసి యక్కవ్వడిం దొడరి దురం బొనర్చె నందు. 211

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; సవ్యసాచికిన్= అర్జునుడికి; చేయార్పరాకుండన్= చేతులకు విశ్రాంతి లేకుండగ; దర్పంబు= గర్వము; చూపినన్= ప్రదర్శింపగ; ఆ; భూ= భూమికి; వర= భర్త అయిన పాండురాజుయొక్క; కుమార= కుమారులలో అనగా పుత్రులలో; వర్యుఁడు= శ్రేష్ఠుడు అయిన అర్జునుడు; వీర= శౌర్యము; ఆగ్రహ= కోపము-వీనియొక్క; ఆవేశంబునన్= ప్రవేశంవలన; విజృంభించి= అతిశయించి; భల్ల= బల్లెములు; అర్ధచంద్రక్షురికా= అర్ధచంద్రాకారము గల బాణముల; ముఖ= ముఖముగల; నారాచ= ఇనుపబాణములు; ప్రముఖ= మున్నగు; విశిఖ= బాణములయొక్క; పరంపరలు= వరుసలు; పరఁగింపన్= ప్రయోగించగా; అవి; ఆ సైనికుల= ఆ సేనలయొక్క; రథ్యంబులన్= రథములు లాగెడి గుర్రములను; కూల్చియున్= కూల్చియు; కేతనంబులు= జెండాకొయ్యలు; త్రుంచియున్= ముక్కలు చేసియు; బాణంబులు; నఱకియున్= ఖండించియు; బాణాసనంబులు= ధనుస్సులు; విఱిచియున్= ఖండించియు; సూతులన్= సూతులను; గీటడంచియున్= చంపియును; అరదంబులన్= రథములను; చెక్కియున్= ముక్కలుచేసియు; మైమఱుపులు= కవచములు; పొళ్ళు= పొడిపొడిగా అనగి పిండి పిండిగా; చేసియున్= చేసియు; చామరంబులు= వింజామరములు; తునిమియున్= ఖండించియు; ఆతపత్రంబులు= గొడుగులు; రూపుమాపియున్= నాశనము చేసియు, రూపం లేకుండా చేసియు; నెత్తురులు= రక్తములు; ఉరలించియున్= కార్పించియు; కండలు= మాంసపుముద్దలు (శరీరభాగములు); తొరిఁగించియున్= స్రవింపచేసియు; ఎమ్ములు= ఎముకలు; పగిలించియున్= చిట్లించియు, పగులునట్లు చేసియు; కాళ్ళు; త్రుంచియున్= ఖండించియు; చేతులు; తునిమియున్= ఖండించియు; వ్రయ్యలుగాన్= ముక్కలుగా; వక్షంబులు= వక్షఃస్థలములు(గుండెలు); చీఱియున్= చీల్చియు; మర్మంబులన్= రహస్యస్థలములను (అనగా మర్మావయవములను); చొచ్చియున్= ప్రవేశించియు; మకుటంబులు= కిరీటములు; డుల్చియున్= పడగొట్టియు; తలలు= శిరములు; రాల్చియున్= నేలకూలునట్లు చేసియు; ప్రాణంబులు; పీల్చియున్= పీల్చియు; రౌద్రంబు= క్రోధము; ఆవహించిన= ఆవేశించినట్టి; లయకాల= ప్రళయకాలమునందలి; రుద్రుని= శివునియొక్క; సంక్రీడనంబు= ఆట; చందంబు= విధముగా; తోఁచెన్= తోచెను; అప్పుడు= ఆ సమయమున; రథికవర= రథికశ్రేష్ఠుల; సహస్రద్వితయంబు= రెండువేలు; తెగటారెన్= సంహరింపబడెను; ఆ; వాఁడిమగండు= శూరుడు; పేరు= విశాలమయిన; అడవి= అరణ్యము; దహించు= కాల్చు; దావపావకుని=కార్చిచ్చు; చందంబునన్= విధముగా; వెలింగెన్= ప్రకాశించెను; తదీయ= ఆ అర్జునుడి; తేజస్= పరాక్రమప్రకాశముయొక్క; మహిమన్= గొప్పతనమును; సహింపక= ఓర్వజాలక (భరింపజాలక); ఉద్దామ= భయంకరమైన; గతిన్= విధమున; అశ్వత్థామ; కదిసి= సమీపించి; ఆ; కవ్వడిన్= అర్జునుని; తొడరి= ఎదిరించి; దురంబు= యుద్ధము; ఒనర్చెన్= చేసెను; అందున్= ఆ యుద్ధంలో.

తాత్పర్యం: ఈ ప్రకారంగా అర్జునుడికి విశ్రాంతి లేకుండా అశ్వత్థామ, సంశప్తకులు తమ దర్పం చూపగా ఆ అర్జునుడు శౌర్యక్రోధముల వలన ఒడలు తెలియకుండా విజృంభించి బల్లెములు, అర్ధచంద్రాకారం గల ఇనుపబాణాలు, ఇంకను వాడి అయిన అనేక విధాలైన బాణాల వరుసలు ప్రయోగించాడు. ఆ ఆయుధాలు ఆ కౌరవసేనల యొక్క

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గుర్రాలను కూల్చి, జెండా కొయ్యలను ముక్కలు చేసి, బాణాలను ఖండించి, ధనుస్సులను విరుగగొట్టి, సూతులను చంపి, రథాలను ముక్కలు చెక్కలు చేసి, కవచాలను పిండిపిండిగా చేసి, వింజామరలను ఖండించి, గొడుగులు ఆకారం లేకుండా చేసి, రక్తములు చెక్కలు చేసి, కండలు స్రవింపచేసి, ఎముకలు పగులగొట్టి, తలలు నేలకూల్చి, ప్రాణాలు పీల్చి, క్రోధం ఆవహించిన ప్రళయకాల రుద్రుడి క్రీడ విధంగా తోపింపజేశాడు. ఆ సమయంలో రెండువేల రథికశ్రేష్ఠులు సంహరించబడ్డారు. అప్పుడు ఆ శూరుడయిన అర్జునుడు మహారణ్యాన్ని కాల్చే దావాగ్ని విధంగా ప్రకాశించాడు. ఆ సమయంలో ఆ అర్జునుడి పరాక్రమాన్ని భరింపజాలక అడ్డులేని గమనంతో అశ్వత్థామ ఆ అర్జునుడిని సమీపించి, ఎదిరించి యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. అతఁడు పండ్రెండు వాలమ్ము లాబీభత్సు । మెయిఁ, గ్రుచ్చి కృష్ణుని మేనియందుఁ
బది వాఁడితూపులు వఱపిన మదిలోన । నగ్గించి యవ్వీరుఁ డలఁతినగవు
తోడ రథ్యముల సూతునిఁ గూల్చి యాతని । తనువున నెఱ తెగగొనక నాటె
మూఁడు మార్గణములు ముసలంబు పరిఘంబు । నాతఁడు నిగిడింప నదియు నదియు

తే. నన్నరుఁడు దోడుతోడ నైదాఱునిశిత । కాండములఁ ద్రుంచి పటుసాయకత్రయంబు
సొనిపె నవ్విప్రు మేన మార్కొనియె నపుడు । గడఁగి యప్పార్థు సంశప్తకవ్రజంబు. 212

ప్రతిపదార్థం: అతఁడు(అశ్వత్థామ); పండ్రెండు; వాలమ్ములు= బాణములు; ఆ; బీభత్సు= అర్జునుడియొక్క; మెయిన్= దేహమునందు; క్రుచ్చి; కృష్ణుని; మేనియందున్= దేహమునందు; పది; వాడి; తూపులు= బాణములు; పఱపినన్= ప్రయోగించగా; ఆ; వీరుఁడు= శూరుడు అయిన అర్జునుడు; మదిలోనన్= మనసులో; అగ్గించి= స్తుతించి; అలఁతి= చిన్న; నగవుతోడన్= నవ్వుతో(చిరునవ్వుతో); రథ్యములన్= గుర్రములను; సూతునిన్= సూతుని; కూల్చి= చంపి; ఆతని= ఆ అశ్వత్థామయొక్క; తనువునన్= దేహమునందు; నెఱన్ తెగగొనక= పూర్తిగా ఎక్కుపెట్టక; మూఁడుమార్గణములు= మూడుబాణములు; నాటెన్= గ్రుచ్చెను; ఆతఁడు= ఆ అశ్వత్థామ; ముసలంబు= ముసలము అను ఆయుధమును (ఉక్కుగుండు అగ్రమున కలిగిన బాణము); పరిఘంబు= పరిఘ అను ఆయుధము; నిగిడింపన్= ప్రయోగించగా; ఆ+నరుఁడు= అ అర్జునుడు; తోడుతోడను= వెంటవెంటనే; ఐదు= అయిదు; నిశిత= వాడియైన; కాండములన్= బాణములతో; అదియును= ఆ ముసలమును; ఆఱు; నిశిత= వాడిఅయిన; కాండములన్= బాణములతో; అదియును= ఆ పరిఘమును కూడ; త్రుంచి= ఖండించి; పటు= అత్యంత శక్తిమంతమయిన; సాయక= బాణముల; త్రయంబు= మూడు; ఆ; విప్రు= బ్రాహ్మణునియొక్క అనగా అశ్వత్థామయొక్క; మేనన్= దేహమునందు; చొనిపెన్= చొప్పించెను; అపుడు; సంశప్తక= సంశప్తకులయొక్క; వ్రజంబు= సమూహము; కడఁగి= పూనిక వహించి(ప్రయత్నించి); ఆ+పార్థున్= ఆ అర్జునుడిని; మార్కొనియెన్= ఎదుర్కొనెను.

తాత్పర్యం: అర్జునుడికి అశ్వత్థామకు జరుగుతున్న ఆ యుద్ధంలో - అశ్వత్థామ పన్నెండు బాణాలను అర్జునుడి దేహంలో గ్రుచ్చాడు. శ్రీకృష్ణుడి దేహమునందు పది వాడి అయిన బాణాలు ప్రయోగించాడు. అప్పుడు అర్జునుడు మనస్సులో అశ్వత్థామను స్తుతించి చిరునవ్వుతో గుర్రాలను, సూతుడిని చంపి అశ్వత్థామ దేహమునందు జీవస్థానం చెడకుండా మూడు బాణాలు గ్రుచ్చాడు. అప్పుడు అశ్వత్థామ ముసలం, పరిఘం ప్రయోగించగా అర్జునుడు వెంటవెంటనే అయిదు వాడి అయిన బాణాలతో ముసలమును, ఆరు వాడి అయిన బాణాలతో పరిఘమును ఖండించి, శక్తిమంతమయిన మూడు బాణాలు అశ్వత్థామ దేహంలో చొప్పించాడు. ఆ సమయంలో సంశప్తక సమూహం అర్జునుడిని ఎదుర్కొన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ సీసపద్యమున మూడవపాదంలో ఉస్మానియా ప్రతిలో 'నెఱతెగగొనక' పాఠమును స్థిరం చేశారు. నెఱ - నిండు -నెఱి= అందము - ఈ రెండు శబ్దములు ప్రసిద్ధములు. ఇవి కళలు. ఇందొకటి చిన్నయసూరిమతము. మరియొకటి బహుజనపల్లి మతము. ఇక 'నెఱవు' ద్రుతప్రకృతికమయిన శబ్దం కలదు. దానికి ప్రాణము లేక ప్రాణస్థానము - జీవము లేక జీవస్థానం - ఆయువు లేక ఆయుఃస్థానమని అర్థాలు. ఇదియు శకటరేఫ శబ్దం. ద్రుతప్రకృతికమునకు తకారము పరుషము పరుమగుచో అది 'ద'కారము సరళంగా మారుతుంది. అప్పుడు 'నెఱఁ దెగగొనక' అని ఉండాలి. అట్లుగాక 'నెఱతెగగొనక' పాఠమును గ్రహిస్తే అర్థం పొసగదు. అందువలన 'నెఱఁదెగగొనక' అనుపాఠాన్ని గ్రహించటం ఉచితం. ఇది ఒక తెనుఁగు జాతీయ ప్రయోగం. ఇక 'నైదాఱు' పాఠముకంటె' - 'నాఱునైదు' పాఠం మూలానుగుణం. 'త మంతక మివ క్రుద్ధం పరిఘం ప్రేక్ష్య పాండవః । అర్జునస్త్వరితో జఘ్నే పంచభిః సాయకోత్తమైః ॥' (శల్య. 14-33)

వ. ఇత్తెఱంగున. **213**

తాత్పర్యం: ఈ విధంగా.

సురథుఁడను పాంచాలకుమారుం డశ్వత్థామచేఁ జచ్చుట (సం. 9-13-35)

క. సురథుఁడు గురుసుతుపైఁ దన । యరదము వఱపించి యేయ నప్పాంచాలో
త్తరు నొక నారసమునకును । నెర సేసె నతండు గినుక యెసకం బెసఁగన్. **214**

ప్రతిపదార్థం: సురథుఁడు; గురుసుతు పైన్= అశ్వత్థామపై; తన= తనయొక్క; అరదము= రథము; వఱపించి= తోలించి; ఏయన్= కొట్టగా; ఆ; పాంచాల= పాంచాలదేశపు వీరులలో; ఉత్తరున్= ఉత్కృష్టుని; అతండు= అశ్వత్థామ; కినుక= కోపముయొక్క; ఎసకంబు= విజృంభణము; ఎసఁగన్= అతిశయించగా; ఒక నారసమునకున్= ఒక వాడి అయిన బాణమునకు; ఎర= బలి; చేసెను.

తాత్పర్యం: సురథు డనేవాడు అశ్వత్థామపై తన రథం తోలించి కొట్టగా అశ్వత్థామ కోపోద్రేకంతో ఆ పాంచాల వీరుడిని ఒక వాడి అయిన బాణానికి బలిచేశాడు.

వ. ఇత్తెఱంగున. **215**

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ ప్రకారంగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా అశ్వత్థామ సురథుడు యుద్ధం చేస్తూ ఉండగా.

ఆ. సురథుఁ గూల్చి యతనియరదంబు పైకి ను । ద్ధురత నరిగి గురుసుతుండు చండ
కాండసమితి నిగుడ గాండీవిఁ దాఁకి సం । శప్తకులకు సంతసం బొనర్చె. **216**

ప్రతిపదార్థం: గురుసుతుండు= అశ్వత్థామ; సురథున్= సురథుని; కూల్చి= చంపి; అతని= సురథునియొక్క; అరదంబుపైకిన్= రథముమీదకు; ఉద్ధురతన్= భారాతిశయంతో; అరిగి= వెడలి; చండ= భయంకరమయిన; కాండ= బాణములయొక్క; సమితి= సమూహము; నిగుడన్= వ్యాపించునట్లుగా; గాండీవిన్= అర్జునుని; తాఁకి= ఎదుర్కొని; సంశప్తకులకున్= సంశప్తకులకు; సంతసంబు= సంతోషము; ఒనర్చెన్= కలుగచేసెను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అశ్వత్థామ సురథుడిని చంపి, ఆ సురథుడి రథంపైకి వెడలి, భయంకరమైన బాణ సమూహాన్ని వ్యాపింపజేసి, గాండీవిని ఎదుర్కొని సంశప్తకులకు సంతోషాన్ని కలుగజేశాడు.

విశేషం: మహాభారతంలో సురథులనే పేరుగలవారు అనేకులు ఉన్నారు. ఆదిపర్వంలో క్రోధవశ సంజ్ఞకల దైత్యుడి అంశతోపుట్టిన సురథుడనే ఒక రాజు ఉన్నాడు. సభాపర్వంలో సూర్యపుత్రుడు యముడిని ఉపాసించే సురథుడనే రాజు కూడా ఉన్నాడు. వనపర్వంలో శిబిదేశపు రాజకుమారుడు కోటికాస్యుడి తండ్రి సురథుడనేవాడు ఉన్నాడు. ఇదిగాక వనపర్వంలో - జయద్రథుడి అనుచరుడు త్రిగర్తదేశపురాజు సురథుడనే వాడు ఉన్నాడు. అతడు ద్రౌపదిని జయద్రథుడు అపహరించే సమయంలో నకులుడితో పోరాడి చనిపోయాడు. ద్రోణపర్వంలో సురథుడనే సంశప్తక వీరుడు ఉన్నాడు. అతడు అర్జునుడితో యుద్ధం చేశాడు. మరియు ద్రోణపర్వంలోనే ద్రుపదుడి పుత్రుడు సురథుడు ఉన్నాడు. అతడిని అశ్వత్థామ సంహరించాడు. అశ్వమేధ పర్వంలో దుశ్శల గర్భమున జయద్రథుడి వలన జన్మించిన సురథుడనే జయద్రథుడి పుత్రుడు కూడా ఉన్నాడు. ఇక ఈ శల్యపర్వంలో అశ్వత్థామ సంహరించిన సురథుడు - పాండవపక్షాన యుద్ధం చేస్తున్న ఒక మహారథి అయిన పాంచాల రాజకుమారుడు.

వ. అయ్యవసరంబున 217

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయాన.

తాత్పర్యం: అశ్వత్థామ సురథుని చంపి అర్జునుడిని ఎదుర్కొనే సమయంలో.

క. కురుపతి ధృష్టద్యుమ్నుని । యురవడిఁ దగ నిలువరించి యుద్ధతి మెఱయన్
శరపంచకమున నొంచెను । బరఁగించెను మఱియు సప్తబాణము లొడలన్. 218

ప్రతిపదార్థం: కురుపతి= దుర్యోధనుడు; ధృష్టద్యుమ్నుని= ధృష్టద్యుమ్నుడియొక్క; ఉరవడిన్= విజృంభణమును; తగన్= ఒప్పుగా; నిలువరించి= ఆపుచేసి; ఉద్ధతి= గర్వం; మెఱయన్= ప్రకాశింపగా; శర= బాణములయొక్క; పంచకమునన్= అయిదింటితో; నొంచెను= బాధించెను; మఱియున్= ఇంకను; సప్త= ఏడు; బాణములు; ఒడలన్= దేహమునందు; పరఁగించెను= ప్రయోగించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడి వేగాన్ని ఒప్పుగా నిలుపుచేసి గర్వంతో ప్రకాశిస్తూ అయిదు బాణాలతో ధృష్టద్యుమ్నుడిని బాధించాడు. ఇంకా ఏడు బాణాలు దేహంలో ప్రయోగించాడు.

విశేషం: ఉస్మానియా ప్రతి ప్రకారం 'సప్తబాణము' అనే మాటకు బదులుగా 'నవతి బాణము' అని ఉన్నది. అయితే - 'ద్రోణహన్తార ముగ్రేషు - పునర్వ్యాధ సప్తభిః' అని మూలం. అందువలన 'సప్త' పాఠమే ఒప్పుగా గ్రహించవలెను.

తే. అతఁడు డెబ్బది యమ్ముల నతని నొంప । నన్నరేంద్రుండుఁ జేడ్పడ ననుజసమితి
బలయుతంబుగ నడరి యబ్బలియు మీఁదఁ । గురిసి రస్త్రశస్త్రంబులు నరవరేణ్య! 219

ప్రతిపదార్థం: అతఁడు= అతడు (ధృష్టద్యుమ్నుడు); డెబ్బది; అమ్ములన్= బాణములతో; అతనిన్= ఆ దుర్యోధనుని; నొంపన్= బాధించగా; ఆ+నరేంద్రుండు= దుర్యోధనుడు; చేడ్పడన్= బాధపడగా; నర= నరులలో; వరేణ్య!= శ్రేష్ఠుడవు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అనుజ= తమ్ముయొక్క; సమితి= సమూహము; బలయుతంబుగన్= సైన్యసమేతముగా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అడరి= విజృంభించి; ఆ; బలియుమీఁదన్= మిక్కిలి బలముకల ధృష్టద్యుమ్నుడి మీద; అస్త్ర= మంత్రపూతములయిన బాణములు; శస్త్ర= ఆయుధాలు; కురిసిరి= కురిపించిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ ధృష్టద్యుమ్నుడు డెబ్బదిబాణాలతో దుర్యోధనుడిని బాధించగా అతడి తమ్ములందరూ సైన్యసమేతులై మహా బలిష్ఠుడయిన ధృష్టద్యుమ్నుడిపై విజృంభించి అస్త్రశస్త్రాలను కురిపించారు.

క. ఆ పాంచాలోత్తముఁ డు । ద్దీపిత కోపుఁడయి వారిఁ దీవ్రతరశరా
టోపంబునఁ గలఁచె రయం । బేపారఁగ నాత్మసేన కేడ్తెఱ మెఱయన్. 220

ప్రతిపదార్థం: ఆ పాంచాలోత్తముఁడు= ఆ ధృష్టద్యుమ్నుడు; ఉద్దీపిత= ప్రజ్వలించిన; కోపుఁడయి= కోపము కలవాడయి; రయంబు= వేగము; ఏపారంగన్= అతిశయించగా; ఆత్మ= తనయొక్క; సేనకున్; ఏడ్తెఱ= పరాక్రమము; మెఱయన్= ప్రకాశించునట్లుగ; వారిన్= వారిని(అనగా సైన్య సమేతులయిన దుర్యోధనుడి తమ్ములను); తీవ్రతర= మిక్కిలి తీక్షణమయిన; శర= బాణములయొక్క; ఆటోపంబునన్= వేగిరపాటుతో; కలఁచెన్= కలతచెందించెను.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ప్రజ్వలించిన కోపం కలవాడై వేగం అతిశయించగా తన సైన్యానికి పరాక్రమం ప్రకాశించేటట్లుగా సైన్యసమేతులయిన దుర్యోధనుడి తమ్ములను మిక్కిలి తీక్షణములయిన బాణాలతో కలత చెందించాడు.

చ. కృప కృతవర్మలం గడిమిఁ గిట్టి శిఖండిప్రభద్రకుల్ మహో
గ్రపువడి దోడ్పడంగ భుజగర్వము సూపిన నా బలాఢ్యులుం
గుపితమనస్కులై బలుపుఁ గోల్తలఁ బేర్చినలావు చేవ క
య్యపువెర వేపు దాల్మి సరి నచ్చెరుపాటున ముంచెఁ జూపఱన్. 221

ప్రతిపదార్థం: శిఖండి; ప్రభద్రకుల్= పాంచాల క్షత్రియవీరులైన ప్రభద్రకులు; కృపకృతవర్మలన్= కృపుడు, కృతవర్మలను; కడిమిన్= మిక్కిలి పరాక్రమముతో; కిట్టి= సమీపించి; మహా= గొప్ప; ఉగ్రపు భయంకరమయిన; వడి= వేగము; తోడ్పడంగన్= సహాయపడగా; భుజగర్వము= బాహువులయొక్క దర్పము; చూపినన్= చూపించగా; ఆ; బలాఢ్యులు= బలవంతులు; కుపిత= కోపముతో కూడిన; మనస్కులు= మనస్సులు కలవారు; ఐ= అయి; బలుపున్= బలమైన; కోల్తలన్= యుద్ధ ప్రయత్నంతో; పేర్చినన్= విజృంభించగా; లావు= బలము; చేవ= ధైర్యము; కయ్యపు= యుద్ధమునకు సంబంధించిన; వెరవు= ఉపాయము; అతిశయము; తాల్మి= క్షమ; సరిన్= సమానముగా; చూపఱన్= చూచువారిని; అచ్చెరుపాటునన్= ఆశ్చర్యమునందు; ముంచెన్= ముంచెను.

తాత్పర్యం: శిఖండి ప్రభద్రకులు కృపకృతవర్మలను మిక్కిలి పరాక్రమంతో సమీపించి మహాభయంకరమైన వేగంతో బాహువుల దర్పం చూపించగా ఆ బలవంతులయిన ఆ కృపకృతవర్మలు కోపించిన మనస్సులు కలవారై బలంతో ఎదుట నిలిచి యుద్ధం చేయటానికి విజృంభించగా ఆ ఇరుపక్షాలయొక్క బలం, ధైర్యం, యుద్ధోపాయం, అతిశయం, క్షమ మొదలైన గుణాలు అన్నీ సమానంగా ఉన్నాయి. అట్టి సమానత్వం చూచువారిని ఆశ్చర్యంతో ముంచింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'శిఖండీ కృతవర్మాణం గౌతమం చ మహారథమ్ । ప్రభద్రకైః సమాయుక్తో యోధయామాస ధన్వినౌ (శల్య - 15, 7) ఇది పై పద్యమునకు మూలం, దీనిని తిక్కన స్వీయ ఊహాపోహలతో అలతి అలతి అచ్చతెలుగు పద సంయోజనతో తన కవితా ప్రాభవాన్ని చంపకంగా సంతరించాడు.

వ. అప్పుడు శల్యుండు యుధిష్ఠిరభీమసేననకులసహదేవసాత్యకులపైఁ బటుబాణంబులు గుప్పించి నొప్పించిన. 222

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయమున; శల్యుండు; యుధిష్ఠిర= ధర్మరాజు; భీమసేన= భీముడు; నకుల సహదేవ; సాత్యకులపైన్= సాత్యకులమీద; పటు= శక్తిమంతములైన; బాణంబులు; కుప్పించి= కురిపించి; నొప్పించినన్; బాధించగా.

తాత్పర్యం: ఆ సమయంలో అనగా కృపకృతవర్మలు శిఖండి ప్రభద్రకులు పోరాడే సమయంలో శల్యుడు ధర్మజ భీమసేన నకుల సహదేవ సాత్యకులమీద శక్తిమంతములైన బాణాలు కురిపించి బాధించగా.

క. నకులుఁడు రభసంబున సా । యకదశక మతని యురంబునందుఁ జొనుప స
భ్రుకుటి యగుచు నయ్యల్లునిఁ । ద్రికాండముల నొంచి యతఁడు దీపించె నృపా! 223

ప్రతిపదార్థం: నృపా!= ధృతరాష్ట్ర మహారాజా!; నకులుఁడు; రభసంబునన్= శీఘ్రముగ; సాయక= బాణములు; దశకము= పది; అతని= ఆ శల్యుడి; ఉరమునందున్= వక్షఃస్థలమునందు; చొనుపన్= చొప్పించగ; సభ్రుకుటి= బొమముడి సహితుడు; అగుచున్= అగుచు; ఆ+అల్లునిన్= మేనల్లుడైన నకులుని; త్రికాండములన్= మూడు బాణములతో; నొంచి= నొప్పించి; అతఁడు= ఆ శల్యుఁడు; దీపించెన్= ప్రకాశించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నకులుడు శీఘ్రంగా పదిబాణాలు ఆ శల్యుడి వక్షఃస్థలంపై చొప్పించగా బొమముడి బొగించి మేనల్లుడైన నకులుడిని మూడు బాణాలతో నొప్పించి ఆ శల్యుడు ప్రకాశించాడు.

క. తక్కటినలువురు వొదివిన । నొక్కొకనిశరీరమున మహోగ్రాస్త్రంబుల్
పెక్కులు వెసఁ బఱపి మదం । బెక్కి నకులుధనువు దునిమె నిషుసహితముగన్. 224

ప్రతిపదార్థం: తక్కటి= మిగిలిన; నలువురు; పొదివినన్= క్రమ్ముకొనగ(చుట్టుముట్టగ); మహా= గొప్ప; ఉగ్ర= భయంకరమయిన; అస్త్రంబుల్= బాణములు; పెక్కులు= అనేకములు; ఒక్కొక్కని; శరీరమునన్; వెసన్= వేగముగా; పఱపి= ప్రయోగించి; మదంబు= గర్వము; ఎక్కి= పొంది; నకులు ధనువున్= నకులుడి యొక్క వింటిని; ఇషు= బాణముల; సహితంబుగన్= సమేతంగా; తునిమెన్= ఖండించెను.

తాత్పర్యం: నకులుడు కాక మిగిలిన నలుగురు శల్యుడిని చుట్టుముట్టగా మహాభయంకరాస్త్రాలు అనేకాలు ఒక్కొక్కడి దేహంలో వేగంగా ప్రయోగించి, గర్వం పొంది బాణసమేతంగా నకులుడి ధనువును ఖండించాడు.

వ. ఇట్లు శల్యుండు విజృంభించినఁ గోపించి. 225

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; శల్యుండు; విజృంభించినన్= అతిశయించగా; కోపించి= కోపం పొంది.

తాత్పర్యం: ఈ ప్రకారంగా శల్యుడు ధర్మజ భీమసేన సహదేవ సాత్యకి నకులులపై విజృంభించగా నకులుడు కోపించి. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. నకులుం డొండొక చాప మెత్తి పటుబాణశ్రేణిఁ బర్పింపఁ గీ
చకవిధ్వంసి నిగిడ్చె షష్టిశరముల్ శైనేయుఁ డుద్దీప్త సా
యకముల్ దొమ్మిది యేయ ధర్మసుతుఁ డీరైదమ్ము లమ్మద్రనా
యకుపై నన్నియుఁ బిన్నతమ్ముఁడును దోడై నాట నాటెం గడున్. 226

ప్రతిపదార్థం: నకులుండు; ఒండొక= మరియొక; చాపము= విల్లు; ఎత్తి= గ్రహించి; పటు= సమర్థమయిన; బాణ= బాణములయొక్క; శ్రేణిన్= వరుసను; పర్పింపన్= ప్రయోగించగా; కీచకవిధ్వంసి= భీముడు; షష్టిశరముల్= అరువది బాణములు; నిగిడ్చెన్= వ్యాపింపచేసెను; శైనేయుఁడు= సాత్యకి; ఉద్దీప్త= ప్రజ్వలించు; సాయకముల్= బాణములు; తొమ్మిది; ఏయన్= ప్రయోగించగా; ధర్మసుతుఁడు= ధర్మరాజు; ఈరైదమ్ములు= పదిబాణములు; ఆ; మద్రనాయకుపైన్= శల్యుడిపై; అన్నియున్= అన్నియును; పిన్న= చిన్న; తమ్ముఁడును; తోడై= సహాయకుడై; నాటన్= గ్రుచ్చుగా; కడున్= మిక్కిలి; నాటెన్= క్రుచ్చెను.

తాత్పర్యం: నకులుడు మరియొక విల్లు గ్రహించి సమర్థమైన బాణాల వరుసలను ప్రయోగించగా, భీముడు అరువది బాణాలు వ్యాపింపచేయగా, సాత్యకి ప్రజ్వలించే బాణాలు తొమ్మిది ప్రయోగించగా, ధర్మరాజు పదిబాణాలు, చిన్న తమ్ముడు సహదేవుడు పదిబాణాలు ఆ శల్యుడిపై నాటారు.

తే. అతఁడు వెస నవసప్తతి శితశిలీము । ఖముల సాత్యకి నొంచి మార్గణముతోడ
ధనువు ద్రుంచి రథ్యమ్ముల ధరణిఁ గూల్చి । పదిపదుల్ బలుఁదూపులు వఱపె మేన. 227

ప్రతిపదార్థం: అతఁడు= అతడు (శల్యుడు); వెసన్= శీఘ్రముగ; నవసప్తతి= డెబ్బది తొమ్మిది; శిత= వాడి అయిన; శిలీముఖములన్= బాణములతో; సాత్యకిన్= సాత్యకిని; నొంచి= నొప్పించి; మార్గణముతోడన్= ఒక బాణముతో; ధనువు= విల్లు; త్రుంచి= ఖండించి; రథ్యమ్ములన్= గుర్రములను; ధరణిన్= భూమియందు; కూల్చి; పదిపదుల్= నూరు; బలు+తూపులు= బలమైన బాణములు; మేనన్= శరీరమునందు; పఱపెన్= ప్రయోగించెను.

తాత్పర్యం: శల్యుడు శీఘ్రంగా డెబ్బదితొమ్మిది వాడి బాణాలతో సాత్యకిని నొప్పించి, ఒక బాణంతో విల్లు ఖండించి, గుర్రాలను నేలకూల్చి, నూరుబలమైన బాణాలు ఆ సాత్యకి శరీరంపైన ప్రయోగించాడు.

క. ఇవ్విధమున శినివీరుని । క్రొవ్వు చెఱిచి పాండుపుత్రకుల బాణంబుల్
నివ్వటిలనీక నలువుర । నవ్వీరుఁడు నొవ్వ నేసె నద్భుతభంగిన్. 228

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ ప్రకారముగ; శినివీరుని= సాత్యకియొక్క; క్రొవ్వు; చెఱిచి= పోగొట్టి; పాండు= పాండురాజుయొక్క; పుత్రకుల= కుమారులయొక్క; బాణంబుల్; నివ్వటిలనీక= వ్యాపించనీయక; ఆ+వీరుఁడు= శూరుడు అయిన ఆ శల్యుడు; అద్భుత= ఆశ్చర్యకరమయిన; భంగిన్= విధముగ; నలువురను; నొవ్వన్ ఏసెన్= బాధపడునట్లు కొట్టెను.

తాత్పర్యం: ఈ ప్రకారంగా సాత్యకియొక్క క్రొవ్వు పోగొట్టి, పాండుపుత్రుల బాణాలు వ్యాపించనీయకుండా శూరుడయిన ఆ శల్యుడు ఆశ్చర్యకరమైన విధంగా ఆ నలువురను (ధర్మజ భీమ నకుల సహదేవులను) బాధించాడు.

ఉ. పాండవు లట్లు మద్రపతి బాణములం దెరలంగఁ జూచి తా
నొండొక తేరికిం జని సముద్ధతి సాత్యకి దాఁకె నాతనిం

జండతరప్రచారణవిశారదుఁడై వెస వారు గూడి యు
ద్దండత సూపి రక్కజపుదర్ప మెలర్పఁ బెనంగె నాతఁడున్. 229

ప్రతిపదార్థం: మద్రపతి= శల్యుడియొక్క; బాణములన్= బాణములవలన; పాండవులు; అట్లు= ఆ ప్రకారముగ; తెరలంగన్= తొలగిపోగా; చూచి; సాత్యకి; తాను; ఒండొక= మరియొక; తేరికిన్= రథముమీదకు; చని= వెడలి; చండతర= మిక్కిలి భయంకరమయిన; ప్రచారణ= సంచారమునందు; విశారదుఁడై= మహాపండితుడై; సముద్ధతి(న్)= మిక్కిలి దర్పముతో; ఆతని(న్)= ఆ శల్యుడిని; తాఁకెన్= ఎదిరించెను; వెసన్= శీఘ్రముగా; వారు= పాండవులు; కూడి= కలిసి; ఉద్దండత= ఆధిక్యము; చూపిరి; ఆతఁడున్= ఆ శల్యుడును; అక్కజపు= అధికమయిన (ఆశ్చర్యకరమయిన); దర్పము= గర్వము; ఎలర్పన్= అతిశయించగా; పెనంగెన్= పోరాడెను.

తాత్పర్యం: ఆ శల్యుడి యొక్క బాణాలవలన పాండవులు తొలగిపోవటం చూచి సాత్యకి మరొక రథమెక్కి భయంకర ప్రచారణ విశారదుడై గర్వంతో ఆ శల్యుడిని ఎదిరించాడు. వెంటనే పాండవులు కూడా కలిసి తమ ఆధిక్యం చూపారు. ఆ శల్యుడు అధికమైన గర్వం అతిశయించగా పోరాడాడు.

ఉ. **ఏవురతోడ న ట్లొకఁడ యేచి పెనంగుటఁ గౌరవేంద్రయో**
ధావళి చూచి కూడికొని యారథికోత్తముగాఢ విక్రమ
శ్రీవిలసిల్ల నంపపెనుఁజీఁకటి యాకసమెల్లఁ గప్పఁగాఁ
జేవయు లావుఁ జూపుటయుఁ జేడ్పడి రా ప్రతివీరులందఱున్. 230

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారముగ; ఒకఁడ= ఒక్కడే, ఏవురతోడన్= అయిదుగురితో; ఏచి= విజృంభించి; పెనంగుటన్= యుద్ధముచేయుటను; కౌరవ= కౌరవులకు; ఇంద్ర= ప్రభువు అయిన దుర్యోధనునియొక్క; యోధ= వీరులయొక్క; ఆవళి= సమూహము; చూచి; కూడికొని= కలిసికొని; ఆ; రథిక= రథికులలో; ఉత్తము= గొప్పవాడయిన శల్యుడియొక్క; గాఢ= అధికమయిన; విక్రమ= పరాక్రమముయొక్క; శ్రీ= శోభ; విలసిల్లన్= ప్రకాశింపగా; అంప= బాణములనెడి; పెను= పెద్ద; చీఁకటి; ఆకసము; ఎల్లన్= అంతటను; కప్పఁగాన్= కప్పివేయగా; చేవయున్= ధైర్యమును; లావున్= బలమును; చూపుటయున్= చూపించగా; ఆ ప్రతివీరులు= ఎదుటిపక్షపువీరులు; అందఱున్= అందరును; చేడ్పడిరి= బాధపడిరి.

తాత్పర్యం: ఆ ప్రకారంగా ఒక్క శల్యుడు అయిదుగురు పాండవులతో విజృంభించి యుద్ధం చేయటాన్ని దుర్యోధనుడి యోధసమూహం చూచి కలిసికొని, రథికశ్రేష్ఠుడు అయిన శల్యుడి అధికమైన పరాక్రమ శోభ ప్రకాశించగా బాణాల పెనుచీకటి ఆకాశమంతా కప్పివేయగా ధైర్యాన్ని, బలాన్ని చూపించగా, ఆ ప్రతివీరులయిన పాండవులు అందరూ బాధపడ్డారు.

వ. **సేనయు నొక్కుమ్మడి నద్దిక్కు దఱిమినం గని కృష్ణార్జునులు నిజసైన్యంబు సమస్తంబు నేకముఖంబు సేసి మార్కొని రా సమయంబునఁ గిరీటి కృపకృతవర్మలను సహదేవుండు సౌబలుని ద్రౌపదేయులు గొందఱు రాజులను శిఖండి యశ్వత్థామను భీమసేనుండు సుయోధనునిఁ దాఁకఁ బాండవాగ్రజుండు దనకు నకులుండు బాసటగా శల్యు నిలువరించెఁ దక్కును గల యోధులుం దక్కటిసైనికులుం దలపడి క్రమంబున నెల్ల బలంబులును గలయం బెరసె నిట్లు నూల్కొని యంతకంతకు రణంబు సమ్మర్దదారుణం బయ్యె నత్తఱి**

నమ్మద్రపతి రౌద్రంబు రూపుదాల్చిన తెఱంగునం బొంగి పాంచాలయాదవాది రథికవరులకును బాండు కుమారులకును వారింపఁ గొలఁదిగాక రథ చిత్రగతుల మెఱయ నెక్కడఁ జూచినం దానయై నానావిధవిశిఖ వితానంబుల(నింపి) నంబర భాగంబు సంపిహితంబు సేసిన మధ్యందినగతం బయ్యును మార్తాండబింబంబు దోఁపక యుండె నట్టియెడ. 231

ప్రతిపదార్థం: సేనయున్= సైన్యమును; ఒక్కుమ్మడిన్= ఒక్కటిగా; ఆ+దిక్కు= ఆ వైపు; తఱిమినన్= వెంబడించి పరుగెత్తగా; కృష్ణార్జునులు; నిజ= తమయొక్క; సైన్యంబు= సేన; సమస్తంబును= అంతయును; ఏకముఖంబు= ఒక్కటిగా ఐక్యము; చేసి= కావించి; మార్కొనిరి= ఎదుర్కొనిరి; ఆ సమయంబునన్= ఆ సమయమునందు; కిరీటి= అర్జునుడు; కృపకృతవర్మలను= కృప కృతవర్మలను; సహదేవుండు; సౌబలునిన్= శకునిని; ద్రౌపదేయులు= ద్రౌపదిపుత్రులు; కొందఱు రాజులను; శిఖండి; అశ్వత్థామను; భీమసేనుండు; సుయోధనునిన్= దుర్యోధనుని; తాఁకన్= ఎదుర్కొనగ; పాండవ= పాండవులలో; అగ్రజుండు= పెద్దవాడయిన ధర్మరాజు; తనకున్; నకులుండు; బాసటగా= సహాయముగా; శల్యున్= శల్యుడిని; నిలువరించెన్= కదలకుండా నిలిపెను(ఆపెను); తక్కునుంగల= మిగిలిన; యోధులున్= వీరులును; తక్కటి= మిగిలిన; సైనికులున్= సైనికులును; తలపడి= కలియబడి; క్రమంబునన్= వరుసగా; ఎల్లబలంబులును= సమస్త సైన్యములును; కలయన్= కూడునట్లు (కలసిపోవునట్లు); బెరసెన్= వ్యాపించెను; ఇట్లు; నాల్కొని= కుదురుకొని; అంతకున్+అంతకున్= క్రమక్రమముగా; రణంబు= యుద్ధము; సమ్మర్ద= బాగుగా మర్దించునట్లుగా; దారుణంబు= భయంకరము; అయ్యెన్= అయ్యెను; ఆ+తఱిన్= ఆ సమయమున; ఆ+మద్రపతి= ఆ శల్యుడు; రౌద్రంబు= క్రోధము; రూపు= ఆకారము; తాల్చిన= ధరించిన; తెఱంగునన్= విధముగా; పొంగి= ఉత్సహించి(గర్వముతో ఉబ్బి); పాంచాల; ధృష్టద్యుమ్న; యాదవ= సాత్యకి; ఆది= మొదలగు; రథిక= యోధులలో; వరులకును= శ్రేష్ఠులకును; పాండుకుమారులకును= పాండురాజు పుత్రులకును; వారింపన్= నివారించుటకు; కొలఁది= శక్యము; గాక= కాకుండా; రథ= రథముయొక్క; చిత్ర= చిత్ర విచిత్ర; గతులన్= గమనములతో; మెఱయన్= ప్రకాశించగా; ఎక్కడన్= ఏచోటు; చూచినన్= చూచినా; తానయై= తానే ఐ; నానావిధ= అనేక విధములయిన; విశిఖ= బాణముల; వితానంబులన్= సమూహములతో; అంబరభాగంబు= ఆకాశభాగము; సంపిహితంబు= బాగుగా కప్పబడినదిగా; చేసినన్= చేయుగా; మధ్యందిన= మధ్యాహ్న సమయమును; గతంబు= పొందినది; అయ్యును= అయినప్పటికిని; మార్తాండబింబంబు= సూర్యబింబము; తోఁపక= కనబడకుండా; ఉండెను; అట్టిఎడన్= ఆ సమయమున.

తాత్పర్యం: సైన్యమంతా ఒక్కటిగా ఆ వైపు తరుమగా చూచి, కృష్ణార్జునులు తమ సైన్యం అంతా ఒక్కటిగా చేసి ఎదుర్కొన్నారు. ఆ సమయంలో అర్జునుడు, కృపకృతవర్మలను, సహదేవుడు శకునిని, ద్రౌపది పుత్రులు కొందరు రాజులను, శిఖండి అశ్వత్థామను, భీమసేనుడు సుయోధనుడిని ఎదుర్కొనగా, ధర్మరాజు తనకు నకులుడు సహాయకుడుగా శల్యుడిని నిలువరించాడు. మిగిలిన వీరులూ, మిగిలిన సైనికులూ కలియబడి క్రమంగా సమస్త సైన్యాలు అంతటా వ్యాపించాయి. ఈ ప్రకారంగా కుదురుకొని క్రమక్రమంగా యుద్ధం భయంకరమయింది. ఆ సమయంలో శల్యుడు క్రోధం ఆకారం ధరించిన విధంగా గర్వంతో పొంగి ధృష్టద్యుమ్నుడు, సాత్యకి మొదలైన యోధశ్రేష్ఠులకు పాండవులకు నివారింప శక్యంగాక రథంయొక్క చిత్ర గమనాలతో ప్రకాశించగా, ఏ చోట చూచినా తానే అయి అనేక విధాలయిన బాణాల సమూహాలతో ఆకాశభాగం నింపి వేయగా, మధ్యాహ్న సమయం అయింది. అయినప్పటికీ మార్తాండబింబం కనబడకుండా పోయింది. అట్టి సమయంలో.

సీ. కరులఁ ద్రుంచెడువేళ గిరులఁ దున్మాడు సం । క్రందను కైవడిఁ గానవచ్చు

నరదముల్ దెరలించునప్పుడు పఱమొగుల్ । విరియించుబలుగాడ్పు విధము మెఱయు

హయములఁ జెండాడ నరుగు చోట్లను లేళ్ళ । గమిఁ గిట్టు కోల్పులికరణి యొలయు
భటులకు నరుగుచోఁ బసలేని పెనుఁ గాన । దరికొనుచిచ్చుచందంబు గలుగు

తే. గసిమసంగిన యంతకుకరణి యంత్య । కాలరుద్రుని దర్ప మకాండ మృత్యు
ముఖము నుగ్రభావము దోఁచు మొనయు వీర । సమితిఁ దెగటార్చు నప్పు డా శల్యునందు. 232

ప్రతిపదార్థం: కరులన్= ఏనుగులను; త్రుంచెడు= ఖండించే; వేళన్= సమయంలో; గిరులన్= పర్వతములను; తునుము+ఆడు= ఖండించు; సంక్రందను= మహేంద్రుని; కైవడిన్= వలె; కానవచ్చున్= కనిపించును; అరదముల్= రథములు; తెరలించునప్పుడు= తొలగించునప్పుడు; పఱ= గొప్ప; మొగుల్= మేఘములు; విరియించు= చెదరగొట్టు; బలు= బలమయిన; గాడ్పు= గాలి; విధము; మెఱయున్= ప్రకాశించును; హయములన్= గుర్రములను; చెండాడన్= ఖండించుటకు; అరుగు= వెడలు; చోట్లను= చోటులందు(స్థలములను); లేళ్ళగమిన్= లేళ్ళయొక్క; గుంపును; కిట్టు= సమీపించు; కోల్పులి= పెద్దపులి; కరణి= విధము; ఒలయున్= పొందును; భటులకున్= భటులకొరకు; అరుగుచోన్= వెడలు నప్పుడు; పస= సారము; లేని; పెనున్= పెద్ద; కానన్= అడవిని; దరికొను= కాల్చు; చిచ్చు= అగ్ని; చందంబున్= విధము; కలుగున్= కలుగును; కసిమసంగిన= విజృంభించిన; అంతకుకరణి= యముని వలె; అంత్యకాల= ప్రళయకాల; రుద్రుని= రుద్రునియొక్క; దర్పము= గర్వము; అకాండ= ఆకస్మిక; మృత్యు= మృత్యువుయొక్క; ముఖము= ముఖముయొక్క; ఉగ్ర= భయంకరమయిన; భావము= భావము; మొనయు= మార్కొనునట్టి; వీర= యోధులయొక్క; సమితిన్= సమూహమును; తెగటార్చునప్పుడు= చంపు సమయమున; ఆ శల్యునందున్= ఆ శల్యునియందు; తోఁచున్= స్ఫురించును.

తాత్పర్యం: ఏనుగులను ఖండించే సమయంలో పర్వతాలను ఖండించే మహేంద్రుడివలె కనిపించాడు. రథాలు తొలగించేటప్పుడు మేఘాలు చెదరగొట్టే బలమయిన గాలి విధంగా ప్రకాశించాడు. గుర్రాలను ఖండించటానికి వెడలేచోట్లలో లేళ్ళగుంపును సమీపించే పెద్దపులివలె వ్యాపించాడు. భటుల కొరకు వెడలేటప్పుడు సారంలేని పెద్ద అడవిని కాల్చే అగ్నివలె అయ్యాడు. విజృంభించిన యముడివలె ప్రళయకాల రుద్రుడి దర్పం ఆకస్మిక మృత్యుముఖం, భయంకరమైన భావం ఎదిరించే యోధసమూహాన్ని చంపేటప్పుడు ఆ శల్యుడి యందు ఉదయించాయి.

విశేషం: అలం: ఉపమ. రూపకం. ఈ సీసపద్యంలో తిక్కన శల్యుడి అతిలోక భయంకర పరాక్రమాన్ని వర్ణించాడు. మొదటిపాదంలో ఇంద్రుడితో ఉపమించాడు. రెండవపాదంలో గాడ్పుతో ఉపమించాడు. మూడవపాదంలో పెద్దపులితో ఉపమించాడు. నాలుగవపాదంలో అగ్నితో ఉపమించాడు. ఎత్తుగీతలో యముడితో, రుద్రుడితో ఉపమించాడు. ఇట్లా ఉపమాలంకార మాలికను శల్యుడికి కంఠహార మొనర్చాడు. అట్లే కరులకు గిరులకు అరదములకు పఱమొగులులకు హయములకు లేళ్ళకు భటులకు కాననమునకు అభేదం పరికల్పించి రూపకమర్యాద పాటించాడు. ఈ సీసపద్యవర్ణన అమూలకం. ఇది తిక్కన స్వీయ కవితావైభవానికి ఉదాహరణం.

వ. ఇట్లు విజృంభించి యత్యద్భుత విక్రమంబున నుల్లసిల్లు నమ్మద్రమహీపతి నుభయసైన్యంబులజనంబులు ప్రశంసించి రంత కంతకు నగ్గలంబగు నగ్గలికఁ జెలంగి యతండు భల్లాదికాండపరంపరలు పటురయంబునఁ బరఁగించు పరమాభీలభంగికి నోహటించి ధర్మజుమోహరంబు దెరలి మరలి పఱవం దొడంగిన నన్నర వరుం డదల్చి కరతలం బెత్తి నిలునిలు మని నివారింప నిలువ దయ్యె. నయ్యుధిష్ఠిరుండు పౌరుషంబు పెంపునఁ దెంపు సేసి యా శల్యునిఁ దాఁకి దర్పంబు సూపినం జూచి మగుడ నిగిడి సేన పోరికిం బురికొనియె నప్పుడు పాండవాగ్రజుండు దమ్ములను దొరలను దనపాలికిఁ బిలువం బంచి వారలతో నిట్లనియె. 233

ప్రతిపదార్థం: ఇట్లు; విజృంభించి; అతి= మిక్కిలి; అద్భుత= ఆశ్చర్యకరమయిన; విక్రమంబునన్= పరాక్రమంతో; ఉల్లసిల్లన్= ప్రకాశింపగా; ఆ; మద్రమహీ= మద్రభూమికి; పతిన్= భర్తఅయిన శల్యుడిని; ఉభయ= ఇరుపక్షములయొక్క; సైన్యంబులు= సేనలయొక్క; జనంబులు= జనులు; ప్రశంసించిరి= మెచ్చుకొనిరి(స్తుతించిరి); అంతకంతకున్= క్రమక్రమముగా; అగ్గలంబు= అధికము; అగు; అగ్గలికన్= శౌర్యముతో; చెలంగి= ఉత్సాహముపొంది, అతండు= ఆ శల్యుడు; భల్ల= బల్లెము; ఆది= మొదలగు; కాండ= బాణములయొక్క; పరంపరలు= వరుసలు; పటు= సమర్థమయిన(మిక్కిలి); రయంబునన్= వేగముగా; పరఁగించు= ప్రవర్తించు; పరమ= అత్యంతమైన; ఆభీల= భయంకరమయిన; భంగికిన్= విధమునకు; ఓహటించి= వెనుదీసి; ధర్మజు= ధర్మరాజుయొక్క; మోహరంబు= సేనావ్యూహము; తెరలి= తొలగి; మరలి= వెనుతిరిగి; పఱవన్= పరుగుపెట్టుటకు; తొడంగినన్= ప్రారంభించగా; ఆ; నర= నరులలో; వరుండు= శ్రేష్ఠుడయిన ధర్మరాజు; అదల్చి= అదలించి (గద్దించి); కరతలంబు= హస్తతలము(చేయి); ఎత్తి= పైకెత్తి; నిలుము+నిలుము= ఆగుము ఆగుము; అని; నివారింపన్= నిరోధించగా (అడ్డగించగా); నిలువదు= ఆగనిది; అయ్యెన్= అయ్యెను; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; పెంపునన్= ఆధిక్యమువలన; తెంపు= సాహసము; చేసి; ఆ శల్యునిన్; తాఁకి= ఎదిరించి; దర్పంబు= గర్వము; చూపినన్= చూపించగా; చూచి; మగుడన్= మరల; నిగిడి= విజృంభించి; సేన= సైన్యము; పోరికిన్= పోరాటమునకు; పురికొనియెన్= క్రమ్ముకొనెను; అప్పుడు; పాండవ+ అగ్రజుండు= ధర్మరాజు; తమ్ములను; దొరలను= రాజులను; తన; పాలికిన్= దగ్గరకు; పిలువన్= పిలువగా; పంచి; వారలతోన్= వారలతో; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: ఈ ప్రకారంగా శల్యుడు విజృంభించి మిక్కిలి ఆశ్చర్యకరమైన పరాక్రమంతో ప్రకాశించగా ఆ శల్యుడిని ఇరుపక్షాల సైనికులు మెచ్చుకొన్నారు. అంతట క్రమక్రమంగా అధికమైన శౌర్యంతో ఉత్సహించి శల్యుడు బల్లెం మొదలైన బాణాల వరుసలు మిక్కిలి వేగంగా ప్రవర్తించే అత్యంత భయంకరమైన విధానికి వెనుదీసి ధర్మరాజు సేన తొలగి మరలి వెనుతిరిగి పరుగిడటానికి ప్రారంభించగా వారిని అదలించి చేయిపైకెత్తి, నిలునిలుడని అడ్డగించగా ఆ సైన్యం ఆగనిది అయింది. ఆ ధర్మరాజు పరాక్రమంతో సాహసించి ఆ శల్యుడిని ఎదిరించి గర్వం చూపగా మరల విజృంభించి సైన్యం పోరాటానికి క్రమ్ముకొన్నది. అప్పుడు ధర్మరాజు తమ్ములను రాజులను తన దగ్గరకు పిలిపించి వారలతో ఇట్లా అన్నాడు:

చ. అమరనదీసుతాదులగు నక్కడివీరుల మీర లందఱుం
గ్రమమునఁ బిల్కుమార్చి భుజగర్వము సూపితి రేను శత్రుసై
న్యమథనకల్యు శల్యుఁ దెగటార్చెద నాకిది కృత్య మీసము
ద్యమ మనివార్యమై నెగడునట్టి తెఱంగు వినుండు చెప్పెదన్. 234

ప్రతిపదార్థం: అమరనదీ= దేవనదిఅయిన గంగానదియొక్క; సుత= కుమారుడగు భీష్ముడు; ఆదులగు= మొదలగు; అక్కడి= ఆ చోటునందలి అనగా(కౌరవ పక్షమునందలి); వీరులన్= శూరులను; మీరలు= మీరు; అందఱున్= అందరును; క్రమమునన్= వరుసగా; పిల్కుమార్చి= చంపి; భుజగర్వము= భుజములయొక్క దర్పము; చూపితిరి= చూపితిరి; ఏను= నేను; శత్రు= విరోధులయొక్క; సైన్య= సైన్యమును; మథన= మథించుటయందు; కల్యున్= నేర్పరి అయిన; శల్యున్= శల్యుని; తెగటార్చెదన్= చంపెదను; నాకు; ఇది; కృత్యము= చేయదగిన కార్యము; ఈ సముద్యమము= ఈ గొప్ప ప్రయత్నము; అనివార్యమై= నివారింపశక్యము కానిదియై(అడ్డులేనిదియై); నెగడునట్టి= వర్ధిల్లునట్టి; తెఱంగు= మార్గము(క్రమము); చెప్పెదన్= చెప్పెదను; వినుండు= వినుడు.

తాత్పర్యం: 'భీష్మద్రోణకర్ణాది శూరులను మీరు అందరూ వరుసగా చంపి భుజగర్వం చూపారు. నేను విరోధి సైన్యాన్ని మథించటంలో నేర్పరి అయిన శల్యుడిని చంపుతాను. నాకు ఇది చేయదగిన కార్యం. ఈ ప్రయత్నం నివారించ శక్యం కానిది అయి నెరవేరే మార్గం చెపుతాను వినండి.

వ. 'నా తేరికి నకులుఁడును సాత్యకియు వలపటను సహదేవుండును ధృష్టద్యుమ్నుండును డాపటను గావలియై రావలయు వెనుకం గదిసి వివ్వచ్చుండును ముందటి కెలన మొనసి వడముడియును నడచునది యింత యేమిటి కనవలదు నన్నొండె నతం డతని నొండె నేను సమయించుట యవశ్యంబును గలుగం జూచితి నిట్లు తెంపుచేసి యమ్మద్రపతి మార్కొను నాకు దుర్దమప్రయత్నంబు కర్తవ్యంబు. కృపకృతవర్మాశ్వత్థామ సౌబల సుయోధనుల య్యోధముఖ్యు రక్షింపం జేయు పరాక్రమంబునకు మీరు ప్రతివిక్రమం బాచరించుచుండ నుదీర్ణంబగు మదీయబాహుపాటవంబున నమ్మేటిమగని గీటడఁగించువాఁడ' నని పలికిన నారథికవరులును దక్కునుగలవార లమ్మానవపతి పూనికి నగ్గించి యతని రథంబు సవిశేషకల్పితంబు గావించి యతండు సెప్పినతెఱంగున సన్నద్ధులై సముద్ధతిం దేజరిల్లుటయుఁ దత్సైన్యం బుత్సాహదీప్తంబై కడంగినఁ గరిఘంటారవంబులును రథనేమినిస్వనంబులును దురంగకింకిణీక్వణనంబులును సుభట సింహనాదంబులును నిస్సాణాదితూర్యనినదంబులును బెరసి యంబరంబు పిక్కటిల్లఁ జేసె. నివ్విధంబున యుధిష్ఠిరుం డుద్ధటుండై యురవడించిన. 235

ప్రతిపదార్థం: నా తేరికిన్= నా యొక్క రథమునకు; నకులుఁడును; సాత్యకియు; వలపటను= కుడివైపున; సహదేవుండును; ధృష్టద్యుమ్నుండును; డాపటను= ఎడమవైపున; కావలియై= రక్షకులై; రావలయున్= రావయును; వెనుకన్= వెనుకవైపు; కదిసి= దగ్గరగా ఉండి; వివ్వచ్చుండును= అర్జునుడును; ముందటికెలనన్= ముందువైపున; మొనసి= పూని; వడముడియును= భీముడును; నడచునది= నడువవలయును; ఇంత= ఇదియంతయు; ఏమిటికిన్= ఎందులకు; అనవలదు= అనరాదు; అతండు= శల్యుడు; నన్నొండెన్= నన్నో; అతనిన్= శల్యుడిని; నేను ఒండెన్= నేనో; సమయించుట= సంహరించుట; అవశ్యంబును= తప్పకుండా; కలుగన్= అగునట్లుగా; చూచితిని; ఇట్లు; తెంపు= సాహసము; చేసి; ఆ+మద్రపతిన్= ఆ శల్యుడిని; మార్కొను= ఎదుర్కొను; నాకున్; దుర్దమ= అణపశక్యంకాని; ప్రయత్నంబు= మిక్కిలి యత్నము; కర్తవ్యంబు= చేయదగినది; కృప= కృపుడును; కృతవర్మ= కృతవర్మయును; అశ్వత్థామ= అశ్వత్థామయును; సౌబల= శకునియు; సుయోధనులు= దుర్యోధనుడును; ఆ+యోధముఖ్యున్= ఆ యోధ వీరులలో ప్రముఖుడయినవానిని (శల్యుడిని); రక్షింపన్= కాపాడుటకు; చేయు= చేసెడి; పరాక్రమంబునకున్= పౌరుష సామర్థ్యమునకు; మీరు; ప్రతి= సరిఅయిన; విక్రమంబు= పరాక్రమము; ఆచరించుచుండన్= ఆచరించుచుండగా; ఉదీర్ణంబు= పెరిగినది; అగు= అయినట్టి; మదీయ= నా యొక్క; బాహు= భుజములయొక్క; పాటవంబునన్= శక్తివలన (సామర్థ్యమువలన); ఆ; మేటి= గొప్ప; మగని= వీరుని; గీటఁడగించు= నశింపచేయు; వాఁడన్= వాడను; అని; పలికినన్= పలుకగా; ఆ రథికవరులును= ఆ యోధ శ్రేష్ఠులును; తక్కును= ఇంకను; కల= ఉన్నట్టి; వారలున్= వారును; ఆ+మానవపతి= ఆ ధర్మరాజుయొక్క; పూనికిన్= ప్రయత్నము; అగ్గించి= స్తుతించి; అతని రథంబున్= ఆ ధర్మజుడి రథాన్ని; సవిశేష= అతిశయముతో; కల్పితంబు= నిర్మాణము; (నిర్మితము); కావించి= చేసి; అతండు; చెప్పిన; తెఱంగునన్= ప్రకారంగా; సన్నద్ధులై= సంసిద్ధులై; సముద్ధతిన్= మిక్కిలి గర్వముతో; తేజరిల్లుటయున్= ప్రకాశించుటయు; తద్+సైన్యంబు= ఆ సైన్యము; ఉత్సాహ= ప్రయత్నమువలన; దీప్తంబై= ప్రకాశించుచున్నది అగుచు; కడంగినన్= యత్నించగా; కరి= ఏనుగులయొక్క; ఘంటా= గంటలయొక్క; రవంబులును= ధ్వనులును; రథ= రథములయొక్క; నేమి= కమ్ముల యొక్క; నిస్వనంబులును= ధ్వనులును; తురంగ= గుర్రముల యొక్క; కింకిణీ= చిరుగంటలయొక్క(మువ్వల

యొక్క); క్వణనంబులును= ధ్వనులును; సుభట= మంచి భటులయొక్క; సింహనాదంబులును= సింహగర్జనలవలన పుట్టిన ధ్వనులును; నిస్సాణ= డప్పులు; ఆది= మొదలగు; తూర్య= బూరాలయొక్క; నినదంబులున్= ధ్వనులును; బెరసి= వ్యాపించి; అంబరంబు= ఆకాశము; పిక్కటిల్లన్= ధ్వనించునట్లు; చేసెను; ఈ+విధంబున= ఈ ప్రకారముగ; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఉద్భటుండై= అధికుడై; ఉరవడించినన్= వేగిరపడగా.

తాత్పర్యం: 'నా రథానికి నకులుడు, సాత్యకి కుడివైపున సహదేవుడు, ధృష్టద్యుమ్నుడు ఎడమవైపున, రక్షకులై రావయును. వెనుకవైపు దగ్గరగా ఉండి అర్జునుడు, ముందు భీముడు నడువవలెను. ఇది అంతా ఎందులకు అని అడుగవద్దు. శల్యుడు నన్నో, శల్యుడిని నేనో సంహరించటం తప్పకుండా జరుగవలెనని చూచాను. ఈ ప్రకారంగా సాహసం చేసి ఆ శల్యుడిని ఎదుర్కొనే నాకు కఠినతరమైన యత్నం చేయతగింది. కృప కృతవర్మ అశ్వత్థామ శకుని దుర్యోధనులు ఆ శల్యుడిని కాపాడటానికి చేసే పురుషయత్నానికి మీరు దానికి మారుగా పరాక్రమం చూపాలి. అధికమైన నా బాహుబలంవలన ఆ మహావీరుడిని సంహరించగలవాడను.' ధర్మరాజు ఈ విధంగా పలుకగా ఆ యోధ శ్రేష్ఠులు ఇంకను మిగిలినవారు ఆ ధర్మరాజు ప్రయత్నాన్ని మెచ్చి, అతడి రథాన్ని చక్కగా సన్నద్ధం చేసి, ఆ ధర్మరాజు చెప్పిన విధంగా యుద్ధానికి సంసిద్ధులై మిక్కిలి గర్వంతో ప్రకాశించగా ఆ సైన్యం ఉత్సాహంతో ప్రజ్వలించి యుద్ధం చేయటానికి ప్రయత్నించగా గజసైన్యంయొక్క గంటల ధ్వనులు, రథముల నేమి ధ్వనులు, గుర్రాల చిరుగంట మ్రోతలు, భటుల సింహగర్జనలనుండి వెడలిన ధ్వనులు, డప్పులు మొదలైన వాద్యాల ధ్వనులు వ్యాపించి ఆకాశం నిండిపోయాయి. ఈ ప్రకారంగా ధర్మరాజు అధికుడై తొందర పడుతుండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

శల్య ధర్మనందనుల ద్వంద్వయుద్ధము (సం.9-15-54)

క. కురువిభుఁడు దనదు మొనలకు । బరవస మొప్పంగ మద్రపతి మును శౌర్యో
ద్ధురుఁడయి కడఁగ నడరి య । వ్వరూథినిం దాఁకె ధరణి వడవడ వడఁకన్. 236

ప్రతిపదార్థం: కురువిభుఁడు= దుర్యోధనుఁడు; తనదు= తనయొక్క; మొనలకున్= సేనలకు; బరవసము= ధైర్యము; ఒప్పంగన్= ఒప్పునట్లు చేయగా; మద్రపతి= శల్యుడు; మును= ముందుగా; శౌర్య= పరాక్రమంతో; ఉద్ధురుఁడు+అయి= గర్వం కలవాడై; కడఁగన్= పూనిక వహించగా; అడరి= చెలరేగి; ధరణి= భూమి= వడవడ= గడగడ; వడఁకన్= కంపించగా; ఆ; వరూథినిన్= పాండవ సైన్యమును; తాఁకెన్= ఎదుర్కొనెను.

తాత్పర్యం: దుర్యోధనుడు తన సేనలకు ధైర్యం కలిగించగా శల్యుడు పరాక్రమంతో గర్వసహితుడై పూనిక వహించి, అతిశయించి భూమి గడగడ కంపించేటట్లు ఆ పాండవసైన్యాన్ని ఎదుర్కొన్నాడు.

వ. అట్టియెడ. 237

తాత్పర్యం: ఆ సమయంలో.

తే. పులులు దలపడిన యుబ్బును । బలుపును దోఁపంగ మద్రపతిధర్మసుతుల్
తలపడి యొండొరువులపై । నలఘుప్రదరములు వఱపి రథికరయమునన్. 238

ప్రతిపదార్థం: పులులు= పెద్ద పులులు; తలపడిన= కలియబడిన; ఉబ్బును= సంతోషమును; బలుపును= బలమును; తోఁపంగన్= తోచగా(అనిపించగా); మద్రపతి= శల్యుడు; ధర్మసుతుల్= యమధర్మరాజుయొక్క పుత్రుడు అయిన ధర్మరాజు; ఒండొరులపైన్= ఒకరిమీద ఒకరు; తలపడి= కలియబడి; అలఘు= తేలికకాని; ప్రదరములు= బాణములు; అధిక= మిక్కిలి; రయమునన్= వేగముగా; పఱపిరి= ప్రయోగించిరి.

తాత్పర్యం: పెద్దపులులు కలియబడిన సంతోషం, ఉత్సాహం బలం తోచేటట్లు శల్యధర్మరాజులు కలియబడి ఒకరిపై ఒకరు మిక్కిలి వేగంగా బలమైన బాణాలు ప్రయోగించారు.

వ. వారి నాలోకించి యుభయసైన్యంబులు విజృంభించి సంరంభంబునం గలయం బెరసినఁ గ్రందుకయ్యం బయ్యె నందు. 239

ప్రతిపదార్థం: వారిన్= ఆ శల్య ధర్మరాజులను; ఆలోకించి= చూచి; ఉభయ= రెండు; సైన్యంబులు= సేనలు; విజృంభించి= అతిశయించి; సంరంభంబునన్= వేగిరపాటుతో; కలయన్= కలియబడి; బెరసినన్= వ్యాపించగా; క్రందుకయ్యంబు= దొమ్మియుద్ధము; అయ్యెన్; అందున్= ఆ యుద్ధంలో.

తాత్పర్యం: ఆ శల్య ధర్మరాజుల యుద్ధాన్ని చూచి రెండు సైన్యాలు విజృంభించి వేగిరపాటుతో కలియబడి వ్యాప్తి చెందగా దొమ్మియుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో.

ఉ. నీ తనయుండు సింహకమనీయతరం బగు భీమునుల్లస
త్కేతన మర్ధచంద్రశరతీవ్రహతిన్ మణికింకిణీనినా
దాతిశయంబుతోడఁ బడునట్లుగ నేసి శరాసనంబు బల్
వాతిశరంబునం దునిమె వారివరూథిని యేపడంగఁగన్. 240

ప్రతిపదార్థం: నీ; తనయుండు= కుమారుఁడు; సింహ= సింహముచేత; కమనీయతరంబు= మిక్కిలి సుందరము; అగు= అయినట్టి; భీముని; ఉల్లసత్= ప్రకాశించుచున్న; కేతనము= టెక్కెము (జెండాకొయ్య); అర్ధచంద్ర= అర్ధచంద్రుడియొక్క ఆకారముగల; శర= బాణముయొక్క; తీవ్ర= గట్టి; హతిన్= దెబ్బతో; మణులయొక్క; కింకిణీ= మువ్వలయొక్క; నినాద= ధ్వనులయొక్క; అతిశయంబుతోడన్= విజృంభణముతో; పడునట్లు= పడిపోవునట్లు; ఏసి= కొట్టి; శరాసనంబు= విల్లు; బల్= బలమయిన; వాతి= వెడద (వాయి= నోరు; వాతి= నోరుగల); శరంబునన్= బాణముతో; వారి; వరూథిని= సేనయొక్క; ఏపు= పెంపు; అడంగఁగన్= అణగిపోవునట్లుగా; తునిమెన్= ఖండించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీయొక్క పుత్రుడు దుర్యోధనుడు సింహసౌందర్యం గల భీముడి ప్రకాశవంతమైన జెండాకొయ్య అర్ధచంద్రాకృతి గల బాణంతో మణుల మువ్వల ధ్వనులతో కూడి పడిపోయేటట్లు కొట్టి, బలమయిన వెడద బాణంతో ఆ పాండవుల సేనల పెంపు నశించేటట్లు భీముడి విల్లును ఖండించాడు.

చ. అతఁడు ప్రదీప్తకోపముఖుఁడై పటుశక్తి నురంబు వైచినం
బతి యరదంబుపైఁ బడియె బల్వగుమూర్ఛమునింగి యప్పు డా
యతధను వెత్తి సూతుతల యక్కురుఘస్మరుఁ డేసె డొల్ల వే
గ తొలఁగ నీడ్చెఁ దేరు దురగంబులు మూఁక గలంగి సొం పఱన్. 241

ప్రతిపదార్థం: అతఁడు= భీముడు; ప్రదీప్త= ప్రజ్వలించిన; కోప= క్రోధముగల; ముఖుఁడై= ముఖముగలవాడై; పటు= కఠినమయిన; శక్తిన్= శక్తి అను ఆయుధముతో; ఉరంబు= వక్షఃస్థలము; వైచినన్= కొట్టగా; బల్వు= బలమయిన; అగు= అయినట్టి; మూర్ఛ= మూర్ఛయందు; మునింగి= మునిగిపోయి; పతి= దుర్యోధనుఁడు; అరదంబు పైన్= రథముపై; పడియెన్= పడిపోయెను; అప్పుడు= ఆ సమయమున; ఆ+కురు ఘస్మరుఁడు= కౌరవ సంహారకుడైన భీముడు; ఆయత= పొడవు అయిన; ధనువు= విల్లు; ఎత్తి= పట్టుకొని; సూతుతల= సూతుని యొక్క తల; డొల్లన్= దొర్లునట్లు; ఏసెన్= కొట్టెను; తేరు= రథము; తురగంబులు= గుర్రములు; తొలఁగన్= తొలఁగునట్లు; వేగ= వేగముగ; మూఁక= సైన్యము (కురుసైన్యము); కలంగి= కలతచెంది; సొంపు= సంతోషము; అఱన్= నశించునట్లుగా; ఈడ్చెన్= ఈడ్చెను.

తాత్పర్యం: భీముడు ప్రజ్వలిస్తున్న క్రోధంగల ముఖం కలవాడై సమర్థమైన శక్తితో వక్షఃస్థలాన్ని కొట్టగా దుర్యోధనుడు మూర్ఛలో మునిగిపోయి రథంపై పడిపోయాడు. ఆ సమయంలో కురు సంహారకుడైన భీముడు ఒక పెద్ద విల్లు పట్టుకొని సూతుడి శిరస్సు నేల దొర్లేటట్లు కొట్టాడు. తరువాత వేగంగా కురుసైన్యం కలతచెంది సంతోషం నశించేటట్లుగా రథాన్ని గుర్రాలు దూరంగా తొలగేటట్లు లాగుకొని పోయాయి.

క. కని యశ్వత్థామయుఁ గృపుఁ । డును గృతవర్మ్ముఁడును నెక్కుడు బరవసమునన్
మరసేనకుఁ దలమిగిలిన । మనుజేశ్వర! కవిసెఁ గ్రీడి మద మెలరారన్. 242

ప్రతిపదార్థం: మనుజ= మానవులకు; ఈశ్వర!= పాలకుడవు అయిన ధృతరాష్ట్ర మహారాజ!; అశ్వత్థామయును; కృపుఁడును; కృతవర్మ్ముఁడును; ఎక్కుడు= మిక్కిలి; బరవసమునన్= ధైర్యముతో; మనసేనకున్= మనసైన్యమునకు; తలమిగిలిన= ముందు మిగులగా; క్రీడి= అర్జునుడు; మదము= గర్వము; ఎలరారన్= అతిశయించగా; కవిసెన్= కలియబడెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అశ్వత్థామ కృప కృతవర్మలు మిక్కిలి ధైర్యంతో మన సైన్యానికి ముందుగా రాగా అర్జునుడు గర్వంతో విజృంభించి కలియబడ్డాడు.

క. అమ్ముఖమున సమరము రౌ । ద్రమ్ము పెనిచె మద్రవిభునిఁ దలకడచి యనీ
కమ్ము బహులాస్త్రశస్త్ర చ । యమ్ముల ధర్మజునిఁ బొదివె నత్యుగ్రమునన్. 243

ప్రతిపదార్థం: ఆ+ముఖమునన్= సేనాగ్రభాగమున; సమరము= యుద్ధము; రౌద్రమ్ము= క్రోధము; పెనిచెన్= పెంచెను; అనీకమ్ము= సైన్యము; మద్ర= మద్రదేశముయొక్క; విభునిన్= ప్రభువు అయిన శల్యుడిని; తలకడచి= అతిక్రమించి; బహుల= అనేకములయిన; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములయొక్క; శస్త్ర= సామాన్య ఆయుధములయొక్క; చయమ్ములన్= సమూహములతో; అతి= మిక్కిలి; ఉగ్రముగన్= భయంకరంగా; ధర్మజునిన్= ధర్మరాజును; పొదివెన్= క్రమ్ముకొనెను.

తాత్పర్యం: ఆ సేనాగ్రభాగంలో యుద్ధం క్రోధాన్ని పెంచింది. అశ్వత్థామాదులతో కూడిన సైన్యం శల్యుడిని దాటి వెడలి, అనేకాలయిన అస్త్రశస్త్రసమూహాలతో మహాభయంకరంగా ధర్మరాజును చుట్టుముట్టింది.

వ. పొదివిన నయ్యుధిష్ఠిరుండు. 244

ప్రతిపదార్థం: పొదివినన్= చుట్టుముట్టగా; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు.

తాత్పర్యం: చుట్టుముట్టగా ఆ ధర్మరాజు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. అరదము చిత్రసంచరణ మక్కజమై విలసిల్లఁ దేరులుం
గరులును ఘోటకంబులును గాల్బలముం దనచేతఁ గూలఁగాఁ
బొరలఁగ మేదినిం దునియ ప్రోవులుగా రుధిరంపురొంపి బ్రుం
గ రణవిహారముం జలిపెఁ గౌరవనాథ! యనేకభంగులన్. 245

ప్రతిపదార్థం: కౌరవనాథ!= ధృతరాష్ట్ర మహారాజా!; అరదము= రథము; చిత్ర= వివిధములగు; సంచరణము= సంచారము; అక్కజమై= ఆశ్చర్యకరమై; విలసిల్లన్= ప్రకాశింపగా; తేరులున్= రథములును; కరులును= ఏనుగులును; ఘోటకంబులును= గుర్రాలును; కాల్బలమున్= పదాతిదళమును; తనచేతన్= తనచేత; కూలఁగాన్= చావగా; మేదినిన్= భూమిపై; తునియ= ముక్కలయొక్క; ప్రోవులుగాన్= ప్రోగులుగా; పొరలఁగన్= దొర్లగా; రుధిరంపు= రక్తముయొక్క; రొంపిన్= బురదయందు; బ్రుంగన్= మునుగగా; అనేక= పలు; భంగులన్= విధములుగా; రణ= యుద్ధమునందు; విహారమున్= విహారమును; చలిపెన్= చేసెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ ధర్మరాజు తన రథం వివిధ గతుల సంచారంతో అధికంగా ప్రకాశించగా రథాలు, ఏనుగులు, గుర్రాలు, పదాతిదళము తనచేత చంపబడగా భూమిపై ముక్కలు ప్రోవులుగా పొర్లగా రక్తం బురదలో మునుగగా పలువిధాలుగా యుద్ధంలో వేడుకగా తిరిగాడు.

క. నరులు మృదు వితఁ డనంగాఁ । బరఁగు యుధిష్ఠిరుఁడు శత్రుబలముల కతి ని
ష్ఠురుఁ డయ్యె నపుడు సుర ల । చ్చెరువందిరి చూచి ద్రోణు శిక్షఁ బొగడుచున్. 246

ప్రతిపదార్థం: నరులు= మనుజులు; ఇతఁడు(అనగా ధర్మరాజు); మృదువు= మెత్తనివాడు; అనంగాన్= అనగా; పరఁగు= ఒప్పు; యుధిష్ఠిరుఁడు= ధర్మరాజు; శత్రుబలములకున్= విరోధిసేనలకు; అతి= మిక్కిలి; నిష్ఠురుఁడు= కఠినుడు; అయ్యెను; అపుడు= ఆ సమయమున; సురలు= దేవతలు; చూచి; ద్రోణు= ద్రోణునియొక్క; శిక్షన్= శిక్షణమును; పొగడుచున్= పొగడుచు(స్తుతించుచు); అచ్చెరువు= ఆశ్చర్యము; అందిరి= పొందిరి.

తాత్పర్యం: మనుజులు 'ఈతడు మృదుహృదయు' డని అనగా ఒప్పే ధర్మరాజు విరోధిబలాలకు మిక్కిలి కఠిన హృదయుడయ్యాడు. ఆ సమయంలో దేవతలు చూచి ద్రోణుడి శిక్షణను పొగడుతూ ఆశ్చర్యం పొందారు.

క. మునుము బయలైన నలిఁ బే । ర్చినయమ్మనుజేంద్రుమీఁద శితవిశిఖము లే
పున నిగిడించుచు శల్యుఁడు । దనరు భుజాబలముతోడఁ దటిమెం బెలుచన్. 247

ప్రతిపదార్థం: మునుము= ముందుభాగం; బయలు= శూన్యము; ఐనన్= అయినను; నలిన్= ఉత్సాహంతో; పేర్చిన= విజృంభించిన; ఆ; మనుజ+ఇంద్రుమీఁదన్= ప్రభువైన ధర్మరాజుమీద; శల్యుఁడు; ఏపునన్= ఆధిక్యముతో; శిత= వాడి అయిన; విశిఖములు= బాణములు; నిగిడించుచున్= ప్రయోగించుచు; తనరు= ఒప్పు; భుజా= భుజములయొక్క; బలముతోడన్= బలముతో; పెలుచన్= అతిశయముతో; తటిమెన్.

తాత్పర్యం: ముందుభాగం బయలుగా ఉన్నా అత్యంతం విజృంభించిన ఆ ధర్మరాజుమీద శల్యుడు వాడి అయిన బాణాలు ఆధిక్యంతో ప్రయోగిస్తూ భుజబలంతో అతిశయంగా తరిమాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అవ్వీరుని వాలంపఱ । క్రొవ్వు నడఁచి తనదునంపకోల లడరఁగా
నవ్వసుధాధిపుఁ డల్లని । నవ్వొలయఁగ మాఱుకొనె ఘృణారహితుండై. 248

ప్రతిపదార్థం: ఆ+వీరుని; వాలు= వాడి అయిన; అంపఱ= బాణసమూహము; క్రొవ్వును; అడఁచి= అణచి; తనదు= తనయొక్క; అంపకోలలు= బాణములు; అడరఁగాన్= విజృంభించగా; ఆ; వసుధా+అధిపుఁడు= ప్రభువు అయిన ధర్మరాజు; అల్లని= మెల్లని; నవ్వు; ఒలయఁగన్= వ్యాపించగ; ఘృణా= దయా; రహితుండై= లేనివాడయి; మాఱుకొనెన్= ఎదుర్కొనెను.

తాత్పర్యం: శూరుడయిన ఆ ధర్మరాజు క్రొవ్వును అణచి శల్యుడు తన బాణాలతో విజృంభించగా, ఆ ధర్మరాజు మెల్లని నవ్వు ఒలికించి, దయలేనివాడై ఎదుర్కొన్నాడు.

వ. ఇవ్విధంబున మార్కొని ధర్మజమద్రపతులు నిజశంఖంబులు పూరించిరి. భేరీప్రముఖతూర్యస్వనంబులు నింగి పొంగారఁ జెలఁగె నయ్యిరువురు నొండొరులపైఁ జండకాండపరంపరలు పరఁగించి తనువుల నెత్తురు లురలించి పూచిన బూరువుల పొలుపు దాల్చి రట్టి యెడఁ గనుంగొను జనంబులు. 249

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారముగ; మార్కొని= ఎదుర్కొని; ధర్మజమద్రపతులు= ధర్మరాజు శల్యులు; నిజ= తమ తమ; శంఖంబులు; పూరించిరి= ఊదిరి; భేరీ= దుందుభి; తూర్య= తూతూబూరాలయొక్క; స్వనంబులు= ధ్వనులు; నింగి= ఆకాశము; పొంగారన్= పొంగిపోవునట్లు; చెలఁగెన్= మ్రోసెను; ఆ; ఇరువురును= ఇద్దరును; ఒండొరులపైన్= ఒకరిపై ఒకరు; చండ= భయంకరమయిన; కాండ= బాణములయొక్క; పరంపరలు= వరుసలు; పరఁగించి= ప్రయోగించి; తనువులన్= దేహములందలి; నెత్తురులు= రక్తములు; ఉరలించి= ప్రవహింపజేసి; పూచిన; బూరువుల= బూరుగుచెట్లు యొక్క; పొలుపు= ఒప్పు(సౌందర్యము); తాల్చిరి= ధరించిరి; అట్టియెడన్= ఆ సమయంబున; కనుంగొను= చూచు; జనంబులు= జనులు.

తాత్పర్యం: ఈ విధంగా ఎదుర్కొని ధర్మరాజశల్యులు తమ తమ శంఖాలు ఊదారు. ముఖ్యములయిన దుందుభి తూర్యాల ధ్వనులు ఆకాశం పొంగిపోయేటట్లు ఒప్పాయి. ఆ ఇద్దరు ఒకరి పై ఒకరు భయంకరాలైన బాణాల వరుసలు ప్రయోగించి శరీరాలలో రక్తాలు స్రవించగా పూచిన బూరుగు చెట్ల సౌందర్యం పొందారు. ఆ సమయంలో చూచే జనులు.

విశేషం: అలం: ఉపమ. 'ఉద్భిన్నరుధిరౌ శూరౌ మద్రరాజ యుధిష్ఠిరౌ । పుష్పితౌ శుశుభాతే వై వసంతే కింశుకౌ యథా' (శల్య. 16-57). కింశుక మనగా మోదుగ చెట్టు.

చ. వెరవును లావుఁ జేవయును వీరల కారయ నొక్క రూప దు
స్తరభుజశక్తి ధర్మజుఁడు శల్యుని రూపడఁగించి యివ్వసుం
ధర గొను నొక్కొ? నేఁడితనిఁ దా సమయించి సమస్తమేదినీ
శ్వరుఁడుగఁ జేయ నోపునొకొ శల్యుఁడు గౌరవరాజనందనున్? 250

ప్రతిపదార్థం: వెరవును= ఉపాయమును; లావున్= బలమును; చేవయును= ధైర్యమును; ఆరయన్= ఆలోచించగా; వీరలకున్= వీరికి; ఒక్కరూపు+అ= ఒక్కవిధమే; దుస్తర= దాటశక్యముకాని; భుజ= భుజములయొక్క; శక్తిన్= సామర్థ్యముతో; ధర్మజుఁడు; శల్యుని; రూపు= ఆకృతిని; అడఁగించి= నశింపజేసి (రూపుమాపి); ఈ; వసుంధర= భూమి; కొనును= గ్రహించును; ఒక్కొ= ఏమో?; నేఁడు= ఈ దినము; ఇతనిన్= ఈ ధర్మరాజును; తాన్= తాను; సమయించి= సంహరించి; సమస్త= సర్వ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మేదినీ= భూమికి; ఈశ్వరుండుగన్= రాజుగ; కౌరవరాజు= ధృతరాష్ట్రునియొక్క; నందనున్= కుమారుఁడు అయిన దుర్యోధనుని; శల్యుఁడు; చేయన్= చేయుటకు; ఓపున్= చాలును; ఒక్కొ?= ఏమో?

తాత్పర్యం: ఉపాయమును, బలమును, ధైర్యమును - ఆలోచించగా వీరికి సమానం. దాటశక్యంకాని భుజశక్తితో ధర్మరాజు శల్యుడిని రూపుమాపి ఈ భూమిని పరిగ్రహిస్తాడేమో! అట్లుకాక శల్యుడు ఈ దినం ఈ ధర్మరాజును సంహరించి దుర్యోధనుడిని ఈ సమస్త భూమండలానికి రాజుగా చేస్తాడేమో? (ఇట్లా శల్యుడు ధర్మరాజు ఒకరిని మించి ఒకరు యుద్ధం చేస్తున్నారనటం తాత్పర్యం.)

వ. అని సందేహడోలాయమానమానసులై; రప్పుడు. 251

ప్రతిపదార్థం: అని= ఈ విధముగా తలచి; సందేహ= సందేహంతో డోలాయమాన= ఊగిసలాడు; మానసులు= మనస్సులు కలవారు; ఐరి= అయ్యారు; అప్పుడు= ఆ సమయమున.

తాత్పర్యం: అప్పుడు సంశయంతో ధర్మరాజశల్యుల యుద్ధాన్ని చూస్తున్న జనులు ఊయలవలె ఊగిసలాడే మనస్సులు కలవారు అయ్యారు. ఆసమయంలో.

తే. మద్రపతి ధర్మజుని విల్లు రౌద్రమెసఁగఁ । ద్రుంచి నూఱమ్ములేసి యుద్ధురతఁ బేర్చె
నతఁడు వేఱొక్క ధను వెత్తి యతని ధనువుఁ । దునిమి వెస నేసె మున్నూఱు తూపు లధిప! 252

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; మద్రపతి= శల్యుడు; రౌద్రము= క్రోధము; ఎసఁగన్= విజృంభించగా; ధర్మజుని= ధర్మరాజుయొక్క; విల్లు= ధనువు; నూఱు; అమ్ములు= బాణములు; ఏసి= ప్రయోగించి; త్రుంచి= ఖండించి; ఉద్ధురతన్= ఆధిక్యముతో; పేర్చెన్= విజృంభించెను; అతఁడు= అతడు(అనగా ఆ ధర్మరాజు); వేఱొక్క= మరియొక; ధనువు= విల్లు; ఎత్తి= పట్టుకొని; అతని= శల్యుడి; ధనువున్= వింటిని; తునిమి= ఖండించి; వెసన్= శీఘ్రముగా; మున్నూఱు= మూడువందలు; తూపులు= బాణములు; ఏసెన్= ప్రయోగించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శల్యుడు క్రోధం విజృంభించగా ధర్మజుడి ధనువును నూరు బాణాలు ప్రయోగించి ఖండించి, ఆధిక్యంతో విజృంభించాడు. ధర్మరాజు మరియొక విల్లు పట్టుకొని, శల్యుడి ధనువును ఖండించి, శీఘ్రంగా మూడువందల బాణాలు ప్రయోగించాడు.

విరథుఁడయిన శల్యుని నశ్వత్థామ దన రథముపై నిడుకొని పోవుట (సం. 9-15-65)

ఉ. తోడనె తేరి వాహములఁ ద్రుంచి మదంబున సూతుప్రాణముల్
క్రీడయ పోలెఁ బుచ్చికొని కేతువుఁ గూల్చిన సేన విచ్చెఁ జే
యాడకయున్న శల్యుని రయంబున నాత్మరథస్థుఁ జేసి పె
న్గీడునఁ బొందకుండఁ దొలఁగించెను ద్రోణసుతుండు భూవరా! 253

ప్రతిపదార్థం: భూవరా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; తోడనె= వెంటనే; తేరి= రథముయొక్క; వాహములన్= గుర్రములను; త్రుంచి= ఖండించి; మదంబునన్= గర్వముతో; సూతు= సూతుడియొక్క; ప్రాణముల్; క్రీడ+అ= ఆట; పోలెన్= వలెను;

పుచ్చుకొని= తీసికొని; కేతువున్= జెండాకొయ్యను; కూల్చినన్= రాల్చగా; సేన= సైన్యము; విచ్చెన్= విడిపోయెను; చేయి; ఆడక= కదలక; ఉన్న= ఉన్నట్టి; శల్యునిన్; రయంబునన్= వేగముగా; ద్రోణ= ద్రోణునియొక్క; సుతుండు= పుత్రుడు అయిన అశ్వత్థామ; ఆత్మ= తనయొక్క; రథస్థున్= రథమునందున్నవానినిగా; చేసి; పెన్+కీడునన్= పెద్ద అశుభమును; పొందకుండన్= పొందకుండగా; తొలఁగించెను= తప్పించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధర్మరాజు శల్యుడిపై మూడువందల బాణాలు ప్రయోగించి, ఆ వెంటనే రథంయొక్క గుర్రాలను ఖండించి, గర్వంతో సూతుడి ప్రాణాలు ఆటవిధంగా తీసికొని, జెండాకొయ్యను పడగొట్టగా సైన్యం చెల్లాచెదరైంది. అప్పుడు చేయి కదపలేని స్థితిలో ఉన్న శల్యుడిని అశ్వత్థామ వేగంగా తన రథంపై ఉంచాడు. ఆ విధంగా శల్యుడిని పెద్ద కష్టంనుండి తప్పించాడు.

వ. ఇట్లు శల్యుండు సమరవైకల్యంబు నొందుటయు ధర్మనందనుం డార్చి పేర్చి తద్బలంబుఁ దఱిమె నంత నమ్మద్రపతి యొండు రథంబు గల్పించుకొని కడంగి యా కౌంతేయాగ్రజుపైఁ గంకపత్త్రంబులు నిగిడించుచు నిగిడినం గని యద్దెసఁ జేయఁ గల సైనికోత్తములు సరభసంబున నయ్యోధవరు నెదుర్కొని రప్పు డతఁడు సాత్యకిఁ బదిసాయకంబులను భీమసేననకులసహదేవుల శరత్రయంబులను స్రుక్కించి యెక్కుడు మదంబునం బొదలిన యంగంబులతో నలిరేఁగి మఱియు నప్పడు పొగడం దగియుండె నాకర్ణింపుము. 254

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; శల్యుండు; సమర= యుద్ధమునుండి; వైకల్యంబును= వికలత్వమును; ఒందుటయున్= పొందుటయు; ధర్మనందనుండు= ధర్మరాజు; ఆర్చి= పెడబొబ్బపెట్టి; పేర్చి= విజృంభించి; తద్బలంబున్= ఆ సైన్యమును; తఱిమెను= పారద్రోలెను; అంతన్= ఆ సమయమున; ఆ+మద్రపతి= ఆ శల్యుడు; ఒండు= ఇంకొక; రథంబు= రథము; కల్పించుకొని= సమకూర్చుకొని; కడంగి= యత్నించి(పూనిక వహించి); ఆ+కౌంతేయ+అగ్రజుపైన్= కుంతీపుత్రులలో పెద్దవాడయిన ధర్మరాజుపై; కంకపత్త్రంబులు= బాణములు; నిగిడించుచున్= ప్రయోగించుచు; నిగిడినన్= విజృంభించగా; కని= చూచి; ఆ+దెసన్= ఆ వైపున; చేయఁగల= యుద్ధము చేయగల; సైనిక= సైనికులలో; ఉత్తములు= శ్రేష్ఠులు; సరభసంబునన్= వేగముగా; ఆ; యోధ= వీరులలో; వరున్= శ్రేష్ఠుడయిన శల్యుడిని; ఎదుర్కొనిరి; అప్పుడు; అతఁడు= ఆ శల్యుడు; సాత్యకిన్; పదిసాయకంబులను= పదిబాణములతోడను; భీమసేన నకుల సహదేవులన్= భీమసేన, నకుల, సహదేవులను; శరత్రయంబులను= మూడేసి బాణములతోను; స్రుక్కించి= బాధించి; ఎక్కుడు= మిక్కిలి; మదంబునన్= గర్వముతో; పొదలిన= పెరిగిన; అంగంబులతోన్= అవయవములతో; నలిరేఁగి= విజృంభించి; మఱియును; అప్పుడు; పొగడన్= పొగడుటకు; తగి= తగినట్లుగా; ఉండెను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: వినుము భూవరా! ఈ ప్రకారంగా శల్యుడు యుద్ధంనుండి తొలగగా ధర్మరాజు పెడబొబ్బపెట్టి విజృంభించి ఆ కౌరవసైన్యాన్ని పారద్రోలాడు. ఆ సమయంలో శల్యుడు ఇంకొక రథాన్ని సమకూర్చుకొని ఆ ధర్మరాజుపై బాణాలు ప్రయోగిస్తూ విజృంభించగా చూచి ఆ పాండవపక్షంలోని యుద్ధం చేయగల వీరశ్రేష్ఠులు వేగంగా ఆ శల్యుడిని ఎదుర్కొన్నాడు. అప్పుడు ఆ శల్యుడు సాత్యకిని పదిబాణాలతోను, భీమసేన నకుల సహదేవులను-ఒక్కొక్కరిని మూడేసి బాణాలతోను బాధించి మిక్కిలి గర్వంతో పెరిగిన అవయవాలతో విజృంభించి తగినట్లుగా ఉన్నాడు.

సీ. కమలాకరములీలఁ గలఁచి యాడెడు గంధ । దంతావళము సముద్దండతయును
దరమిడి మృగసముత్కరము ఘోరంబుగా । వధియించు కంఠీరవంబు నేపు

నీరసారణ్యంబు నిర్భరాటోపతఁ । గాల్చు దావాగ్ని యుగ్రక్రమంబు
ప్రకటవిక్రాంతిఁ బురత్రయంబును సమ । యించు ఫాలాక్షుని యేడ్తెఱయును

తే. బోల్పఁ బట్టులయ్యె భుజగర్వశౌర్య ప్ర । తాపదుర్దమప్రకోపములకు
మద్రవిభుఁడు గోలుమసఁగి శాత్రవసైన్య । హననకేళి సలుపు నవసరమున. 255

ప్రతిపదార్థం: కమల= పద్మములకు; ఆకరము= గని అయినట్టిది (అనగా కమలములు కలిగిన సరోవరము); లీలన్= విలాసముగా; కలఁచి; ఆడెడు; గంధ= మదించిన; దంతావళము= ఏనుగుయొక్క; సమ్+ఉద్దండతయును= భయంకరత్వమును; తరమిడి= వరుసపెట్టి; మృగ= లేళ్ళయొక్క; సముత్కరమున్= సమూహమును; ఘోరంబుగాన్= భయంకరముగా; వధియించు= చంపు; కంఠీరవంబున్= సింహముయొక్క; ఏపు= విజృంభణము; నీరస= రసములేని(ఎండిపోయిన); అరణ్యంబు= అడవి; నిర్భర= సంపూర్ణమయిన(దట్టమయిన); ఆటోపతన్= ఆడంబరముతో; కాల్చు; దావాగ్ని= దావాగ్నియొక్క; ఉగ్రక్రమంబు= భయంకరమయిన విధానము; ప్రకట= స్పష్టమయిన; విక్రాంతిన్= పరాక్రమముతో; పురత్రయంబును= త్రిపురములను; సమయించు= సంహరించు; ఫాల+అక్షుని= శివుని; ఏడ్తెఱయును= అతిశయమును; మద్రవిభుఁడు= శల్యుడు; కోలుమసఁగి= మిక్కిలి విజృంభించి; శాత్రవ= విరోధి, సైన్య= సేనలయొక్క; హనన= చంపుట అనెడి; కేళి= క్రీడ(ఆటను); చలుపున్= చేయు(ఆడు); అవసరమునన్= సమయమున; భుజగర్వ= భుజగర్వము; శౌర్య= శౌర్యము; ప్రతాప= ప్రతాపము; దుర్దమ+ ప్రకోపములకున్= అణచశక్యముకాని; మిక్కిలి క్రోధములకు; పోల్పన్= వాటితో పోల్చుటకు; పట్టులు= స్థానములు; అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: విలాసంగా సరోవరాన్ని కలచి ఆడే మదపుటేనుగు విజృంభణమును - వరుసపెట్టి లేళ్ళ సమూహాన్ని భయంకరంగా చంపు సింహంయొక్క విజృంభణమును, ఎండిపోయిన అడవిని గాఢంగా కాల్చే దవాగ్ని విధానమును, స్పష్టమయిన పరాక్రమంతో త్రిపురాలను సంహరించే రుద్రుడి విజృంభణమును పోలి, శల్యుడు మిక్కిలి విజృంభించి విరోధి సైన్యముల చంపెడి ఆట ఆడే సమయంలో శల్యుడి భుజదర్పానికి మదపుటేనుగు ఉద్దండతయు, శల్యుడి పరాక్రమానికి సింహముయొక్క విజృంభణం, శల్యుడి ప్రతాపానికి దావాగ్ని ఉగ్రత్వము, శల్యుడి దుర్దమ ప్రకోపానికి (అడ్డగించలేని రౌద్రమునకు) రుద్రుడి అతిశయం పోల్చటానికి ఆధారస్థానాలు అయ్యాయి.

విశేషం: ఈ సీసపద్యమునందలి శల్యుడి భుజగర్వ శౌర్య ప్రతాపదుర్దమ ప్రకోపముల వర్ణన, చిత్రణ, కల్పనలు తిక్కన స్వీయ కవితా విజృంభణములు. ఈ ఉపమానములు - అమూలకములు. ముఖ్యంగా ఈ సీసంలో అనంతార్థ గాంభీర్యము, ఉపమాలంకారమాలికాలంకృత సౌందర్యములు విరిశాయి. రౌద్రబీభత్సరసభావాలు ఇందు పరిపుష్టములు. తిక్కన అచ్చ తెనుఁగు పదప్రయోగాని కిది ఆటపట్టు కాదు. ఉభయ కావ్యప్రౌఢి కిది ఉదాహరణము.

వ. ధర్మనందనుం దలమిగిలిన చతురంగంబుల నివ్విధంబున వినిహతంబులు సేసి యమ్మహీపతిపైఁ గవిసినం గని కవలును శైనేయుండును భీమసేనుండును దోడ నడవ నతం డమ్మేటిమగని మార్కొని పటుమార్గణంబు లురంబున నించి నొంచె నప్పుడు కురువిభుండు వనుప మనసైనికులు దలమిగిలి శల్యునికిఁ బ్రాపయి యప్పవనతనయప్రభృతులతోడఁ బెనంగి రతం డాపాండవాగ్రజుమేనఁ జండకాండసప్తకంబు నినిచిన నజ్జననాథుండు నవనిశితనారాచంబు లవ్వీరు నంగంబుల నాటించె. నిట్లు దలపడి కోలుపులుల పోలికఁ బేరేనుంగుల తెఱంగున బలుసింగంబులు చందంబునం బోరి యొండొరుల నొప్పించి రప్పుడు. 256

ప్రతిపదార్థం: ధర్మనందనున్= ధర్మరాజును; తల మిగిలిన= మించిన; చతుః= నాలుగు; అంగంబులన్= రథాద్యంగములను; ఈ+విధంబునన్= ఈ ప్రకారముగా; వినిహతంబులు= చంపబడినవి(గా); చేసి; ఆ+మహీపతిపైన్= ఆ ధర్మరాజుమీద; కవిసినన్= కలియబడగా; కని= చూచి; కవలును= నకుల సహదేవులును; శైనేయుండును= సాత్యకియును; భీమసేనుండును; తోడన్= కూడి; నడువన్= నడువగా; అతండు= ఆ ధర్మరాజు; ఆ+మేటి= శ్రేష్ఠుడయిన; మగనిన్= వీరుని; మార్కొని= ఎదుర్కొని; పటు= కఠినమయిన; మార్గణంబులు= బాణములు; ఉరంబునన్= వక్షఃస్థలమునందు; నించి= నిండించి; నొంచెన్= బాధించెను; అప్పుడు; కురువిభుండు= దుర్యోధనుడు; పనుపన్= పంపించగా; మన; సైనికులు; తలమిగిలి= అతిక్రమించి; శల్యునికిన్= శల్యుడికి; ప్రాపయి= తోడై; ఆ; పవన తనయ= వాయుపుత్రుడు అయిన భీముడు; ప్రభృతులతోడన్= మొదలగువారితో; పెనంగిరి= పోరాడిరి; అతండు= ఆ శల్యుడు; ఆ; పాండవ= పాండవులలో; అగ్రజు= పెద్దవాడయిన ధర్మజుని; మేనన్= దేహమునందు; చండ= భయంకరమయిన; కాండ= బాణములయొక్క; సప్తకంబు= ఏడు; నినిచినన్= గ్రుచ్చగా; ఆ; జననాథుండు= ప్రభువు ధర్మరాజు; నవ= నూతనమయిన; నిశిత= వాడి అయిన; నారాచంబులు= బాణములు; ఆ+వీరున్= ఆ వీరునియొక్క; అంగంబులన్= అవయవములందు; నాటించెను= గ్రుచ్చెను; ఇట్లు= ఈ ప్రకారముగ; తలపడి= కలియబడి; కోలుపులుల పోలికన్= పెద్ద పులులవలె; పేరు= పెద్ద; ఏనుగుల= ఏనుగులయొక్క; తెఱంగునన్= విధమున; బలు= బలమయిన; సింగంబుల= సింహములయొక్క; చందంబునన్= విధముగ; పోరి= పోరాడి; ఒండొరులన్= ఒకరినొకరు; నొప్పించిరి= బాధించిరి; అప్పుడు= ఆ సమయమున.

తాత్పర్యం: ధర్మరాజును దాటి పోయిన చతురంగబలాలను ఈ విధంగా పడగొట్టి బాధించి చంపి, ఆ శల్యుడు ధర్మరాజుపై కలియబడగా చూచి నకులసహదేవులు, సాత్యకి, భీముడు కలిసి నడువగా ధర్మరాజు ఆ మహావీరుడయిన శల్యుడిని ఎదుర్కొని కఠినమయిన బాణాలు వక్షఃస్థలమునందు గ్రుచ్చి బాధించాడు. ఆ సమయంలో దుర్యోధనుడు పంపగా మన సైనికులు ముందుకు వెడలి శల్యుడికి దగ్గరపడి భీముడు మొదలైన వారితో పోరాడారు. ఆ శల్యుడు ధర్మరాజు దేహంలో ఏడు భయంకరములైన బాణాలు గ్రుచ్చగా ధర్మరాజు తొమ్మిది వాడి అయిన బాణాలు ఆ వీరుడైన శల్యుడి అవయవాలలో నాటాడు. ఈ ప్రకారంగా కలియబడి శల్యధర్మజులు పెద్దపులుల వలె మదించిన ఏనుగుల విధంగాను, బలమయిన సింహాల మాదిరి పోరాడి ఒకరినొకరు బాధించుకొన్నారు. ఆ సమయంలో.

సీ. **శల్యుండు బలునారసము పాండవాగ్రజు । నురమున నాట నత్యుగ్రదీప్త**
ఘోరనారాచ మా కుంతీసుతుం డేయ । నతఁడు మూర్ఛిల్లిన నలరె నధిపుఁ
డమ్మద్రపతి తేఱి యలుకఁ గెంపారెడు । కనుఁగవతోఁ జండకాండ మొకట
నయ్యుధిష్ఠిరు నొంప నాతండు పసిఁడి మై । మఱు వాఱుతూపుల నఱికి వైచి

తే. **వాలురమ్ములు దొమ్మిది వక్షమున ని । గుడ్ప నయ్యోధవరుఁ డతిక్రూరభల్ల**
యుగళఖండితచాపుఁ జేయుడును నొండు । ధనువు గొని యవ్విభుండు దత్తనువు నించె. **257**

ప్రతిపదార్థం: శల్యుండు; బలు= బలమయిన; నారసము= బాణము; పాండవ= పాండవులలో; అగ్రజున్= పెద్దవాడయిన ధర్మరాజుయొక్క; ఉరమునన్= వక్షఃస్థలమున; నాటన్= గ్రుచ్చగా; అతి= మిక్కిలి; ఉగ్ర= భయంకరమయిన; దీప్త= ప్రజ్వలించు; ఘోర= కఠినమయిన(తీవ్రమయిన); నారాచము= బాణము; ఆ; కుంతీ సుతుండు= ధర్మరాజు; ఏయన్= ప్రయోగించగా; అతఁడు= ఆ శల్యుడు; మూర్ఛిల్లినన్= మూర్ఛపొందగా; అధిపుఁడు= అధిపతి అయిన ధర్మరాజు; అలరెన్= సంతోషించెను; ఆ+మద్రపతి= ఆ శల్యుడు; తేఱి= తేఱుకొని(మూర్ఛనుండి మేలుకొని); అలుకన్= కోపముతో; కెంపారెడు= ఎఱ్ఱబడిన; కనుఁగవతోన్= కన్నుదోయితో; చండ= భయంకరమయిన; కాండము= బాణము; ఒకటన్= ఒక్క; దానితో; ఆ+ యుధిష్ఠిరున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ ధర్మరాజును; నొంపన్= నొప్పచేయగా; ఆతండు= ధర్మరాజు(శల్యుని); పసిఁడి= బంగారుపు; మైమఱువు= కవచము; ఆఱు; తూపులన్= బాణములతో; నఱికివైచి= ఖండించివేసి; వాలురమ్ములు= వాడి బాణములు; తొమ్మిది; వక్షమునన్= రొమ్ముపై; నిగుడ్పన్= నాటగా; ఆ; యోధ= వీరులలో; వరుఁడు= శ్రేష్ఠుడు అనగా శల్యుడు; అతి= మిక్కిలి; క్రూర= భయంకరమయిన; భల్ల= బల్లెములయొక్క; యుగళ= రెంటితో; ఖండిత= ఖండించబడిన; చాపున్= ధనువు కలవానినిగా; చేయుడునున్= చేయగా; ఒండు= మరియొక; ధనువు= విల్లు; కొని= తీసికొని; ఆ+విభుండు= ప్రభువు అయిన ధర్మరాజు; తద్= ఆ శల్యుని; తనువు= దేహము; నించెన్= నింపెను.

తాత్పర్యం: శల్యుడు బలమైన బాణాన్ని ధర్మరాజు వక్షఃస్థలంలో గ్రుచ్చగా మిక్కిలి భయంకరమై ప్రజ్వలించే కఠినమయిన బాణాన్ని ధర్మరాజు ప్రయోగించగా దానితో శల్యుడు మూర్ఛిల్లగా ధర్మరాజు సంతోషించాడు. శల్యుడు మూర్ఛనుండి తేరుకొని, కోపంతో ఎర్రబడ్డ కనులతో భయంకరమైన బాణం ఒకదానితో ఆ ధర్మరాజును నొప్పచేయగా, ధర్మరాజు శల్యుడి బంగారపు కవచాన్ని ఆరుబాణాలతో ఖండించివేసి, వాడి బాణాలు తొమ్మిది రొమ్మున నాటగా, ఆ యోధశ్రేష్ఠుడైన శల్యుడు మిక్కిలి క్రూరమైన రెండు బల్లెములతో ధర్మరాజు ధనువును ఖండించాడు. అప్పుడు ధర్మరాజు మరియొక విల్లు తీసికొని ఆ శల్యుడి దేహాన్ని బాణాలతో నింపాడు.

**క.	బాసటయై భీముఁడు పె । ల్లేసెను మద్రపతి నాతఁ డిరువురతోడం**
**జేసెం గయ్యము గృపును । ద్భాసిత విక్రమముతోడుపాటు గలుగఁగన్.	258**

ప్రతిపదార్థం: భీముఁడు; బాసటయై= తోడై(సహాయుడై); మద్రపతిన్= శల్యుని; పెల్లు= గట్టిగా; ఏసెను= కొట్టెను; ఆతఁడు= ఆ శల్యుడు; కృపు= కృపుడియొక్క; ఉద్భాసిత= మిక్కిలి ప్రకాశవంతమయిన; విక్రమము= పరాక్రమము; తోడుపాటు= సహాయపడుట; కలుగఁగన్= కలుగగా; ఇరువురతోడన్= ఇద్దరితో (ధర్మజ భీమసేనులతో); కయ్యము= యుద్ధము; చేసెన్= చేసెను.

తాత్పర్యం: భీముడు తోడుగా శల్యుడిని గట్టిగా కొట్టాడు. శల్యుడు కృపుడి ప్రకాశవంతమయిన పరాక్రమం తోడు కాగా ఆ ఇద్దరితో యుద్ధం చేశాడు.

**వ.	అట్టియెడం గంకటాంతరంబు ధరియించి కడంగి.	259**

ప్రతిపదార్థం: అట్టి ఎడన్= ఆ సమయంలో; కంకట+అంతరంబు= మరొక కవచాన్ని; ధరియించి= ధరించి; కడంగి= పూనుకొని.

తాత్పర్యం: ఆ సమయంలో మరొక కవచాన్ని ధరించి పూనుకొని.

**ఆ.	మద్రవిభుఁడు ధర్మమారుతసుతుల మై । మఱువు లుఱక నఱికి మార్గణములు**
**దొమ్మిదింట రెంటఁ దూఁటులు సేసె దో । ర్దండములు ప్రదీప్తదర్పుఁ డగుచు.	260**

ప్రతిపదార్థం: మద్రవిభుఁడు= మద్రదేశ ప్రభువు అయిన శల్యుడు; ప్రదీప్త= బాగుగా ప్రజ్వలించుచున్న; దర్పుఁడు= గర్వము కలవాడు; అగుచున్= అగుచు; ధర్మమారుతసుతుల= ధర్మరాజు భీమసేనులయొక్క; మైమఱువులు= కవచములు; ఉఱక= సులభముగా; నఱికి= ఖండించి; మార్గణములు= బాణములు; తొమ్మిదింటన్= తొమ్మిదింటితో; రెంటన్= రెండింటితో; దోః+దండములు= దండములవంటి భుజములు; తూఁటులు= రంధ్రములు; చేసెన్= చేసెను.

తాత్పర్యం: శల్యుడు బాగా ప్రజ్వలిస్తున్న గర్వంతో ధర్మరాజభీమసేనుల కవచాలను తొమ్మిది బాణాలతో ఖండించి, రెండు బాణాలతో దండములవంటి భుజాలను తూట్లు పొడిచాడు.

క. ఆలో ధర్మజు సారథిఁ। గూలఁగఁ గృపుఁ డేయ మద్రకుంజరుఁడు భుజా
లీల మెఱయంగ హయము। ల్నాలుగు నొకవ్రేల్మిడిని నిలం బడవైచెన్. 261

ప్రతిపదార్థం: ఆలోన్= అంతలో; ధర్మజు= ధర్మరాజుయొక్క; సారథిన్= సారథిని(రథమునడుపువానిని); కూలఁగన్= చనిపోవునట్లు; కృపుఁడు; ఏయన్= కొట్టగా; మద్రకుంజరుఁడు= శ్రేష్ఠుడయిన మద్రదేశపురాజు - శల్యుఁడు; భుజాలీల= భుజములయొక్క విలాసము; మెఱయంగన్= ప్రకాశింపగా; హయములు= గుర్రములు; నాలుగును= నాల్గింటిని; ఒకవ్రేల్మిడిని= ఒక చిటికెలో; ఇలన్= నేలపై; పడవైచెన్= పడవేశాడు.

తాత్పర్యం: అంతలో ధర్మరాజుసారథిని కూలిపోయేటట్లు కృపుడు కొట్టగా, మద్రశ్రేష్ఠుడయిన శల్యుడు భుజవిలాసం ఒప్పగా నాలుగు గుర్రాలను ఒక్క చిటికెలో నేలపై పడవేశాడు.

వ. ఇవ్విధంబున విరథుండై యమ్మహీకాంతుం డంతర్గతంబున. 262

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారముగ; విరథుండై= రథములేనివాడై; ఆ+మహీకాంతుండు= ఆ ధర్మరాజు; అంతర్గతంబునన్= మనస్సునందు.

తాత్పర్యం: ఈ ప్రకారంగా రథం లేనివాడై ధర్మరాజు మనస్సులో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. గెలువుము శల్యుని నీ వని। పలికి ముకుందుండు నన్నుఁ బనిచినవాఁ డ
ప్పలుకులకు నసత్యత్వము। గలుగఁగ నేర్చు నొకొ! దైవఘటనబలమునన్. 263

ప్రతిపదార్థం: నీవు; శల్యుని; గెలువుము; అని; పలికి; ముకుందుండు= శ్రీకృష్ణుడు; నన్నున్; పనిచిన= పంపించిన; వాఁడు; దైవఘటన= దైవప్రయత్నముయొక్క; బలమునన్= శక్తివలన; ఆ+పలుకులు= ఆ మాటలకు; అసత్యత్వము= అయథార్థత్వము; కలుగఁగనేర్చున్+ఒకొ!= కలుగగలదా?(సంభవించగలదా?)

తాత్పర్యం: 'నీవు శల్యుడిని జయింపుము' అని చెప్పి శ్రీకృష్ణుడు నన్ను పంపాడు. దైవయత్నం వలన ఆ మాటలకు అయథార్థత్వం కలుగదుకదా!'

వ. అని శంకించియుఁ గొంకుపోవక యజ్జగన్నాథు వచనంబునకు నన్యథాత్వం బేల గలుగునని యద్దేవునిం దలంచి యామాట యమోఘంబు గావలయునని ప్రార్థించి వెండియు. 264

ప్రతిపదార్థం: అని; శంకించియున్= సందేహించియు; కొంకు= భయము; పోవక= పొందక; ఆ; జగత్= ప్రపంచమునకు; నాథు= ప్రభువు అయిన శ్రీకృష్ణునియొక్క; వచనంబునకున్= మాటకు; అన్యథాత్వంబు= వేరొక్కవిధము; ఏల?= ఎందులకు?; కలుగును; అని; ఆ+దేవునిన్= ఆ భగవంతుడయిన శ్రీకృష్ణుడిని; తలంచి= స్మరించి; ఆ మాట; అమోఘంబు= సఫలము (వ్యర్థము కానిది); కావలయును; అని; ప్రార్థించి; వెండియున్= మరియు.

తాత్పర్యం: అని సందేహించి, భయపడక శ్రీకృష్ణుడియొక్క మాటకు భిన్నముగా ఎందులకు జరుగుతుంది? అని ఆ దేవుడిని స్మరించి ఆ మాట వ్యర్థం కానిది కావలయునని ప్రార్థించి మరియు. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. 'స్ఫురితషడర్ధనేత్రునిఁ ద్రిశూలసముజ్జ్వలు నిర్గుణున్ గుణా
దర సముపాత్తమూర్తిఁ గలితప్రభవస్థితిసంహృతిక్రియా
నిరతివివర్తితత్రిభువనీమహనీయుని దైత్యమర్ది న
ప్పురుషవరుం జతుర్భుజు విభుత్వమహోన్నతు నాశ్రయించెదన్. 265

ప్రతిపదార్థం: స్ఫురిత= భాసించిన(తోచిన); షడర్ధ= మూడు; నేత్రునిన్= నేత్రములు కలవానిని; త్రిశూల= త్రిశూలముతో; సముజ్జ్వలున్= బాగుగా ప్రకాశించువానిని; నిర్గుణున్= నిర్గుణుని(త్రిగుణరహితుడిని); గుణ= సత్త్వ, రజస్, తమస్ అను త్రిగుణములతో; ఆదర= ఆదరముతో; సముపాత్త= పొందబడిన; మూర్తిన్= రూపము(ఆకారములు) కలవానిని; కలిత= పొందబడిన; ప్రభవ= ఉద్భవము(పుట్టుక); స్థితి(ఉండుట); సంహృతి= సంహారము(నాశము) అనెడి; క్రియా= చేష్టయందలి; నిరతి= ఆసక్తితో; వివర్తిత= త్రిప్పబడిన; త్రిభువనీ= మూడులోకములకు సంబంధించిన; మహనీయునిన్= మహాత్ముని; దైత్య= రాక్షసులను; మర్దిన్= నాశము చేయువానిని; ఆ; పురుష; వరున్= శ్రేష్ఠుని; చతుర్భుజున్= నాలుగు భుజములు కలవానిని; విభుత్వ= వ్యాపకత్వమున, సర్వపరిపాలకత్వమున; మహా+ఉన్నతున్= గొప్ప అభ్యుదయము కలవానిని; ఆశ్రయించెదన్= శరణువేడెదను.

తాత్పర్యం: 'త్రినేత్రుడిని, త్రిశూలుడిని త్రిగుణరహితుడిని త్రిగుణాత్మకుడిని త్రిమూర్తిని, సృష్టి స్థితి లయములు, చేష్టా, ఆసక్తి, పరివర్తనములు భూః భువః సువః అను త్రిభువనములు, ఈ త్రితయములలో మహాత్ముడిని రాక్షససంహారకుడిని పరమపురుషుడిని చతుర్భుజుడిని సర్వవ్యాపకత్వం, సర్వపాలకత్వం మొదలైన వాటియందు గొప్ప అభ్యుదయం కలవాడిని పరమాత్మను శరణు వేడెదను.

విశేషం: ఇది హరిహర స్వరూప వర్ణనం, ప్రార్థనం. తిక్కన హృదయంలో భాసించిన స్వరూపమిది. షడర్ధనేత్రుడు - త్రిశూల సముజ్జ్వలుడు నిర్గుణుడు - గుణాదర సముపాత్తమూర్తి - కలిత ప్రభవ స్థితి సంహృతి క్రియా నిరతి త్రిభువనీమహనీయుడు. ఇంతవరకు సదాశివ స్వరూపము. దైత్యమర్దనుడు - చతుర్భుజుడు - విభుత్వ మహోన్నతుడు పురుషవరుడు - ఇంతవరకు మహా విష్ణు స్వరూపము - వెరసి తిక్కన ఉపాసనా రూపమయిన హరిహరమూర్తి చిత్రణము.

ఇక ముఖ్యముగా ఉస్మానియా ప్రతియందు ఈ పద్యమునందలి మూడవపాదము 'నిరతి వివర్తితి త్రిభువన మహనీయుని దైత్య మర్ది' అని కలదు. ఇందు ఇట్లున్నచో గణయతులు తప్పినవి. అందువలన 'త్రిభువనీ' పాఠముగా సరిచేయబడినది. వావిళ్ళ ప్రతియందు 'త్రిభువనీ' అనియే కలదు.

తే. భండనము సేయు నరునగ్రభాగమునఁ బ్ర। చండ శూలోగ్రహస్తుఁడై శత్రుకోటి
గీటడంచుచు నేఁ జూడఁ గేలి సలుపు। దేవు జయసిద్ధికై సన్నుతింతు భక్తి.' 266

ప్రతిపదార్థం: ఏన్= నేను; చూడన్= చూడగా; భండనము= యుద్ధము; చేయు; నరున్= అర్జునుడియొక్క; అగ్రభాగమునన్= ముందు భాగమునందు; ప్రచండ= మిక్కిలి భయంకరమయిన; శూల= శూలముతో; ఉగ్ర= భయంకరమయిన; హస్తుడై= (పాణి) చేయికలవాడై; శత్రు= విరోధి; కోటిన్= సముదాయమును; గీటడంచుచున్= చంపుచు; కేలి= క్రీడ(ఆట); చలుపు= చేయు; దేవున్= ఆది దేవుని; భక్తిన్= భక్తితో; జయ= విజయము; సిద్ధికై= సిద్ధించుటకై(సమకూరుటకై); సన్నుతింతున్= స్తుతించెదను.

తాత్పర్యం: నేను చూడగా యుద్ధం చేస్తున్న అర్జునుడి ముందుభాగంలో మిక్కిలి భయంకరమైన శూలంతో భయంకరమయిన హస్తం కలవాడై విరోధి సముదాయాన్ని చంపుతూ క్రీడ సలిపే దేవుడిని భక్తితో జయం సమకూరటానికి స్తుతిస్తాను.'

విశేషం: పై రెండు పద్యాలు నిజానికి రుద్రస్తుతి. జయసిద్ధికి రుద్రస్తుతి చేయటం సంప్రదాయం. మహాభారత యుద్ధంలో రుద్రవిజృంభణం సైన్యసంహారం పరోక్షంగా కలదు. ఈ పద్యంలో 'నరునగ్రభాగమున' అను పాఠము సరి అయినది. ఇక ధర్మరాజు చేసిన ఈ స్తుతి మూలమున దాక్షిణాత్య ప్రతిలో కాని (నీలకంఠీయము) ఉత్తరాది ప్రతిలోకాని (గీతాప్రెస్) లేదు. ఇది కేవలం తిక్కయజ్వ కల్పనం. ఇందు తిక్కన హరిహరస్తుతి ఒనర్చాడు.

వ. అనుచుఁ బురుషోత్తమునిఁ జిత్తమున నిలిపి యున్నతంబైన పూర్వకాయంబుతో మందప్రకారంబున మార్గణంబు లమ్మద్రపతి దెస నిగిడింప నతఁ డవి బెండువడుటగాఁ దలంచి తఱిమి యఱిముఱి శరంబులు గురియుటయు నప్పడు. 267

ప్రతిపదార్థం: అనుచున్= ఇట్లు అనుచు; పురుషోత్తమునిన్= పురుషోత్తముడయిన నారాయణుని; చిత్తమునన్= చిత్తమునందు; నిలిపి= నిశ్చలముగా ధ్యానించి; ఉన్నతంబైన= ఎత్తైన; పూర్వకాయంబుతోన్= కటిప్రదేశమునకు పై భాగమున ఉన్నదేహముతో; మంద= మెల్లని; ప్రకారంబుగన్= విధంగా; మార్గణంబులు= బాణములు; ఆ+మద్రపతి= శల్యుని; దెసన్= దిక్కు; నిగిడింపన్= ప్రయోగించగా; అతఁడు= ఆ శల్యుడు; అవి= బాణములు; బెండువడుట= బలహీనపడుట; కాన్= అగునట్లుగా; తలంచి= భావించి; తఱిమి= వెంబడించి - పరుగెత్తించి; అఱిముఱిన్= సంభ్రమముతో; శరంబులు= బాణములు; కురియుటయున్= కురిపించుటయు(ప్రయోగించుటయు); అప్పుడు= ఆ సమయమున.

తాత్పర్యం: ఇట్లా ధర్మరాజు రుద్రుడిని ప్రార్థిస్తూ ఆ పురుషోత్తముడిని మనస్సులో నిశ్చలంగా ధ్యానించి ఎత్తైన పూర్వకాయంతో మెల్లగా బాణాలు ఆ శల్యుడి వైపు ప్రయోగించగా శల్యుడు ఆ బాణాలు నిస్సారములైనవిగా భావించి, తరిమి, సంభ్రమంతో బాణాలు ప్రయోగించే సమయంలో.

చ. పవనసుతుండు విల్నఱికి బాణయుగంబున మేనునొంచి శా
త్రవులు దలంక నారథికురథ్యములన్ ధరఁ గూల్చి సూతు కం
ఠవిదళనం బొనర్చి ప్రకటస్ఫురణంబునఁ గంటకంబు భ
ల్ల వితతి ఘోరసంహతి నిలం బడనేసె రయం బెలర్పఁగన్. 268

ప్రతిపదార్థం: పవన= వాయువుయొక్క; సుతుండు= పుత్రుడు అయిన భీముడు; విల్= విల్లు; నఱికి= ఖండించి; బాణ= బాణములయొక్క; యుగంబునన్= రెండింటితో; మేను= శరీరము; నొంచి= నొప్పించి; శాత్రవులు= విరోధులు; తలంకన్= భయపడగా; ఆ రథికు= ఆ శల్యుడియొక్క; రథ్యములన్= రథములాగు గుఱ్ఱములను; ధరన్= నేలపై; కూల్చి= పడవైచి; సూతు= సూతిడియొక్క; కంఠ= కంఠముయొక్క; విదళనంబు= ఖండించుట; ఒనర్చి= చేసి; ప్రకట= స్పష్టమయిన; స్ఫురణంబునన్= ప్రకాశంతో; కంటకంబున్= కవచమును; భల్ల= బల్లెములయొక్క; వితతిన్= సమూహముతో; ఘోర= భయంకరమయిన; సంహతిన్= దెబ్బతో; రయంబు= వేగము; ఎలర్పఁగన్= అతిశయించునట్లుగ; ఇలన్= నేలపై; పడవేసెన్= పడగొట్టెను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పవనసుతుడైన భీముడు శల్యుడి విల్లు ఖండించి, రెండు బాణాలతో శరీరాన్ని నొప్పించి విరోధులు భయపడేటట్లు ఆ శల్యుడి గుర్రాలను నేలకూల్చి, సూతుడి కంఠం ఖండించివేసి, స్పష్టమయిన ప్రకాశంతో కవచమును బల్లెముల సమూహంతో భయంకరంగా వేగిరపాటుతో నేలపై పడగొట్టాడు.

వ. ఇవ్విధంబున. 269

తాత్పర్యం: ఈ ప్రకారంగా.

క. విరథుండు నచాపుఁడు వ। ర్మరహితగాత్రుండు నైన మద్రవిభుఁడు భా
సురఖడ్గచర్మశోభిత। కరుఁడై తేరుడిగి కన్నుఁగవఁ గెంపారన్. 270

ప్రతిపదార్థం: విరథుండున్= రథములేనివాడును; అచాపుఁడున్= ధనువులేనివాడును; వర్మ= కవచము; రహిత= లేని; గాత్రుండును= దేహముకలవాడును; ఐన= అయినట్టి; మద్రవిభుఁడు= శల్యుడు; భాసుర= ప్రకాశవంతమయిన; ఖడ్గ; చర్మ= డాలుతో; శోభిత= సుందరమయిన; కరుఁడై= చేయి కలవాడై; కన్నుఁగవన్= రెండు కన్నులును; కెంపారన్= ఎర్రబడగా; తేరు= రథము; డిగి= దిగి.

తాత్పర్యం: రథం లేనివాడు, ధనువు లేనివాడు, కవచం లేనివాడు అయినట్టి శల్యుడు ప్రకాశవంతమైన కత్తిడాలులతో సుందరమైన చేతులు కలవాడై రెండు కన్నులు ఎర్రబడగా రథం దిగి.

మ. జముచందంబున నేచి ధర్మసుతుపై సంరంభదుర్దాంతద
ర్పమునన్ వే కలియంగఁ జండబలదుర్వారుండు భీముండు ద్రుం
చె మదంబారఁగ వాలునున్ బలకయున్ శీఘ్రుత్వ సందీప్తుఁడై
తమది క్కార్పులుఁ దూర్యనాదములు నత్యంతంబు శోభిల్లఁగన్. 271

ప్రతిపదార్థం: జము= యమునియొక్క; చందంబునన్= విధముగా; ఏచి= విజృంభించి; సంరంభ= వేగిరపాటుతో; దుర్దాంత= అణగద్రొక్క శక్యముకాని; దర్పమునన్= గర్వముతో; ధర్మసుతుపైన్= ధర్మరాజుమీద; వే కలియంగన్= వేగముగా కలియబడగా; చండ= తీవ్రమయిన; బల= బలమువలన; దుర్వారుండు= వారింపశక్యముకాని వాడయిన; భీముండు; మదంబు= గర్వము; ఆరఁగన్= విజృంభించగా; తమదిక్కు= తమవైపు; ఆర్పులున్= బొబ్బలును (అరుపులును); తూర్య= వాద్యాల యొక్క; నాదములును= ధ్వనులును; అత్యంతంబు= మిక్కిలి; శోభిల్లఁగన్= ప్రకాశించుచుండగా; శీఘ్రుత్వ= వేగిరపాటుతో; సందీప్తుఁడై= ప్రజ్వలించుచున్నవాడై; వాలునున్= కత్తిని; పలకయున్= డాలును; ద్రుంచెన్= ఖండించెను.

తాత్పర్యం: శల్యుడు యముడివలె విజృంభించి వేగిరపాటుతో అణపశక్యంకాని గర్వంతో ధర్మరాజు మీద వేగంగా కలియబడగా, భయంకరమైన బలంవలన అడ్డగించరాని శక్తిగల భీముడు గర్వం అతిశయించగా తమవైపు బొబ్బలు, తూర్యధ్వనులు మిక్కిలి ప్రకాశిస్తూ ఉండగా వేగిరపాటుతో ప్రజ్వలిస్తున్నవాడై, కత్తిని, డాలును ఖండించాడు.

వ. అమ్మద్రపతి నేర్పును జేవయుం గల పరిజనంబులు చేర్పఁ గంకటగదాదండంబులు ధరియించి యుధిష్ఠిరుమీఁద నరువడి నడరె నప్పు డప్పాండవాగ్రజునకు బాసటయై సాత్యకిధృష్టద్యుమ్న శిఖండి ద్రౌపదేయమాద్రేయు లేయు సాయకంబులు సరకుగొనక గదం జిత్రంబుగా జడియుచు వడముడి

విక్రమంబునఁ దవులంబడక నిగిడె నశ్వసూత రహితంబగు రథంబుపై నున్న యన్నరేంద్రుండు తన దెసకు సింహచంక్రమణత్వసుందరుండై వచ్చు నవ్వీరు నాలోకించి నక్రోధంబైన యవష్టంభంబున నుద్దీపితుండై.

272

ప్రతిపదార్థం: ఆ+మద్రపతి= ఆ శల్యుడు; నేర్పును= ఉపాయమును; చేవయున్= ధైర్యమును; కల= కలిగిన; పరిజనంబులు= అనుచరులు; చేర్పన్= సమకూర్చగా; కంకట= కవచము; గదా దండంబులు= గదాయుధం; ధరియించి= ధరించి; యుధిష్ఠిరుమీఁదన్= ధర్మరాజుపై; ఉరవడిన్= అతివేగముగా; అడరెను= విజృంభించెను; అప్పుడు; ఆ+పాండవ+అగ్రజునకున్= ఆ పాండవులలో పెద్దవాడైన ధర్మరాజునకు; బాసటయై= సహాయకులై; సాత్యకి; ధృష్టద్యుమ్నుఁడు; శిఖండి; ద్రౌపదేయ= ద్రౌపదిపుత్రులు; మాద్రేయులు= మాద్రిపుత్రులు అయిన నకుల సహదేవులు; ఏయు= ప్రయోగించు; సాయకంబులు= బాణములు; సరకుగొనక= లెక్కచేయక; గదన్= గదను; చిత్రంబుగాన్= ఆశ్చర్యకరముగా; జడియుచున్= త్రిప్పుచున్న; వడముడి= భీముడి; విక్రమంబునన్= పరాక్రమంచే; తవులంబడక= చిక్కుపడక; నిగిడెను= విజృంభించెను; అశ్వ= గుర్రములు; సూత= సూతుడు; రహితంబు= లేనిది; అగు= అయినట్టి; రథంబుపైన్= రథముమీద; ఉన్న= ఉన్నట్టి; ఆ+నర+ఇంద్రుండు= జనులకు ప్రభువు అయిన ఆ శల్యుఁడు; తన= తనయొక్క; దెసకున్= దిక్కునకు; సింహముయొక్క; చంక్రమణత్వ= లంఘనముతో; సుందరుండై= చూడముచ్చటగా; వచ్చు= వచ్చుచున్న; ఆ+వీరున్= ఆ పరాక్రమవంతుని; ఆలోకించి= చూచి; సక్రోధంబైన= కోపముతో కూడిన; అవష్టంభంబునన్= గర్వముతో; ఉద్దీపితుండై= ప్రకాశించుచున్నవాడై.

తాత్పర్యం: శల్యుడు ఉపాయం ధైర్యం కలిగిన అనుచరులు సమకూర్చిన కవచం గదా దండాలు ధరించి ధర్మరాజు మీద మిక్కిలి వేగంగా విజృంభించాడు. ఆ సమయంలో ధర్మరాజుకు సహాయులై సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ద్రౌపది పుత్రులు, నకుల సహదేవులు ప్రయోగించే బాణాలు లెక్కచేయక, గదను ఆశ్చర్యజనకంగా త్రిప్పుతున్న భీముడి పరాక్రమానికి చిక్కుపడకుండా శల్యుడు విజృంభించాడు. గుర్రాలూ సూతుడూ లేని రథం మీద ఉన్నట్టి శల్యుడు తనవైపు (ధర్మరాజువైపు) సింహంవలె లంఘిస్తూ చూడముచ్చటగా వస్తున్న మహా పరాక్రమవంతుడైన శల్యుడిని చూచి, రౌద్రంతో కూడిన గర్వంతో ధర్మరాజు ప్రకాశిస్తున్నవాడై.

క. 'ఇతని సమయింప నయ్య । చ్యుతుఁడు ననుం బనిచె నాకు నొనరించిన పా
లితఁ' డని తలంచి మొగ ము । గ్రత నొందఁగ శక్తిమీఁదఁ గనుదో యొలయన్. **273**

ప్రతిపదార్థం: ఆ; అచ్యుతుఁడు= శ్రీకృష్ణుడు; ఇతనిన్= ఈ శల్యుడిని; సమయింపన్= సంహరించుటకు; ననున్= నన్ను; పనిచెన్= పంపించెను; నాకున్= నాకు; ఒనరించిన= చేసిన; పాలు= భాగము; ఇతఁడు= ఈ శల్యుఁడు; అని; తలంచి= భావించి; మొగము= ముఖము; ఉగ్రతన్= భీకరముగ; ఒందఁగన్= పొందగ; శక్తిమీఁదన్= శక్తి అను ఆయుధముమీద; కనుదోయి= రెండుకన్నులు; ఒలయన్= వ్యాపించగా.

తాత్పర్యం: 'ఆ శ్రీకృష్ణుడు ఈ శల్యుడిని సంహరించటానికి నన్ను పంపించాడు. నావంతు ఈ శల్యుడు' అని భావించి ముఖం భయంకరంకాగా శక్తి అనే ఆయుధంమీద కన్నులు వ్యాపించగా.

వ. హృషీకేశు నుద్దేశించి. **274**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: హృషీకేశున్= శ్రీకృష్ణుడిని; ఉద్దేశించి= గురించి.

తాత్పర్యం: ధర్మరాజు శక్తిమీద కన్నులు వ్యాపింపజేసి శ్రీకృష్ణుడిని గురించి ఇట్లా ప్రార్థించాడు.

ఉ. 'నీదెస నాదుచిత్తమున నెక్కొని యుండెడి భక్తి భద్రసం
పాదిని గావు టచ్చెరువె! భక్తజనాభిమతప్రదానవి
ద్యాదయితత్వమేర్పడ జయం బొడఁగూర్పుము దేవ! సంశ్రితాం
హోదళనంబు నీకు వ్రత ముల్లము నాపయి నిల్పు మిత్తటిన్.' 275

ప్రతిపదార్థం: నీదెసన్= నీవైపు; నాదు= నాయొక్క; చిత్తమునన్= నిశ్చలమయిన మనస్సునందు; నెక్కొని= నెలకొని; ఉండెడి; భక్తి= భక్తి; భద్ర= శుభమును; సంపాదిని= సంపాదించునది; కావుట= అగుట; అచ్చెరువె!= ఆశ్చర్యమా!; భక్తజన= భక్తులైన జనులయొక్క; అభిమత= ఇష్టముయొక్క; ప్రదాన= ఇచ్చుటయను; విద్యా= విద్యయందు; దయితత్వము= ప్రియత్వము; ఏర్పడన్= బయల్పడునట్లుగా; జయంబు= గెలుపు; ఒడఁగూర్పుము= సిద్ధించునట్లు చేయుము; దేవ!; సంశ్రిత= ఆశ్రయింపబడిన వారియొక్క; అంహోదళనంబు= పాపములను ఖండించుట; నీకున్; వ్రతము= నియమము(దీక్ష); ఈ+తటిన్= ఈ సమయమున; ఉల్లము= హృదయము; నాపైన్= నామీద; నిల్పుము= ఉంచుము.

తాత్పర్యం: 'నా చిత్తంలో నెలకొని ఉన్న నీమీది భక్తి శుభాన్ని కలిగించటంలో ఆశ్చర్య మేమున్నది? భక్తుల ఇష్టాన్ని ఈడేర్చటంలో నీకు గల ప్రియత్వం బయల్పడేటట్లు నాకు గెలుపు సిద్ధింపజేయుము. ఓ భగవంతుడా! ఆశ్రితుల పాపాలను ఖండించటం వ్రతంగా గల నీవు ఈ సమయంలో నీ హృదయాన్ని నాపై ఉంచుము. నన్ను అనుగ్రహించుము!'

వ. అని హృదయంబునఁ బ్రార్థించి యప్పార్థివోత్తముండు. 276

ప్రతిపదార్థం: అని; హృదయంబునన్= మనస్సునందు; ప్రార్థించి; ఆ; పార్థివ= రాజులలో; ఉత్తముండు= శ్రేష్ఠుడు అయిన ధర్మరాజు.

తాత్పర్యం: అని మనస్సునందు శ్రీకృష్ణుడిని రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు ప్రార్థించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. అచ్చపు భక్తికిన్ మదిఁ బ్రియంబున నొందిన ఫాలలోచనుం
డిచ్చిన ప్రీతియోగమును నెక్కుడు భక్తియు నావహిల్లఁగా
నిచ్చలు గంధపుష్పములు నిష్ఠమెయిం బరిశోభితార్చనం
బిచ్చుచుఁ దాను గొల్వ నుతి కెక్కిన యమ్మహనీయశక్తికిన్. 277

ప్రతిపదార్థం: అచ్చపు-భక్తికిన్= తన స్వచ్ఛమైన భక్తికి; మదిన్= మనస్సునందు; ప్రియంబునన్+ఒందిన= సంతోషించిన; ఫాలలోచనుండు= ఫాలాక్షుడు(శివుడు); ప్రీతి-యోగమును= సంతోషపుయుక్తి; ఎక్కుడు భక్తియున్= అధికభక్తియును; ఆవహిల్లఁగాన్= కలుగగా; నిచ్చలున్= ఎల్లప్పుడును; గంధ-పుష్పములన్= గంధంతోను; పూలతోను; నిష్ఠమెయిన్= నియమంతో; పరిశోభిత+అర్చనంబు= ప్రకాశించే పూజ; ఇచ్చుచున్; తాను(ధర్మరాజు); కొల్వన్= సేవించగా; నుతికిన్+ఎక్కిన= పొగడ్తకెక్కిన; ఆ+మహనీయ - శక్తికిన్= ఆ గొప్ప శక్త్యాయుధమునకు.

తాత్పర్యం: మనస్సునందు ప్రేమవలన కలిగిన స్వచ్ఛమైన భక్తికి శివుడు సంతోషంతో ప్రసాదించిన స్తుతింపతగిన గొప్ప శక్తి అనే ఆయుధానికి ధ్యానం, మిక్కిలి భక్తి కలుగగా, నిత్యం గంధ పుష్పములతో మిక్కిలి శ్రద్ధతో ప్రకాశవంతమైన పూజ చేస్తూ సేవించగా.

మ. ప్రణతుండై రభసోదయాభినవదర్పస్ఫూర్తి శోభిల్లుచు
న్మణిదండద్యుతిమంజరీస్ఫురణము న్సంశోభిఘంటాపటు
క్వణనంబున్ రిపుసైనికప్రకరదృక్కర్ణవ్యథం జేయ భీ
షణరేఖంబగు దానిఁ బుచ్చుకొని చంచన్ముష్టిదృష్ట్యుద్ధతిన్. 278

ప్రతిపదార్థం: ప్రణతుండై= నమస్కరించినవాడై; రభస= తీవ్రమయిన కోపమువలన; ఉదయ= పుట్టిన; అభినవ= కొంగ్రొత్త; దర్ప= గర్వముయొక్క; స్ఫూర్తిన్= తోచుటవలన; శోభిల్లుచున్= ప్రకాశించుచు; మణిదండ= రత్నములు పొదిగిన దండముయొక్క; ద్యుతి= కాంతుల; మంజరీ= గుత్తుల; స్ఫురణమున్= ప్రకాశమును; సంశోభి= మిక్కిలి; ప్రకాశించుచున్న; ఘంటా= గంటలయొక్క; పటు=బలమైన; క్వణనంబున్= ధ్వనియును; రిపు= శత్రువుల; సైనిక= సేనలయొక్క; ప్రకర= సమూహముయొక్క; దృక్= కన్నులకు; కర్ణ= చెవులకు; వ్యథన్= బాధను; చేయన్= కలిగించగా; భీషణ= భయంకరమగు; రేఖంబు= రూపము; అగు; దానిన్= ఆ శక్తిని; పుచ్చుకొని= తీసికొని; చంచత్= చలించుచున్న; ముష్టి= పిడికిలి; దృష్టి= చూపులయొక్క; ఉద్ధతిన్= గర్వముతో.

తాత్పర్యం: ధర్మరాజు శక్తికి నమస్కరించినవాడై, తీవ్రమైన కోపంవలన పుట్టిన క్రొంగ్రొత్త గర్వపు స్ఫూర్తితో ప్రకాశిస్తూ రత్నాలు పొదిగిన దండముయొక్క కాంతుల పూలగుత్తుల ప్రకాశాన్ని మిక్కిలి వెలుగొందుతున్న గంటల గొప్ప ధ్వని, శత్రుసైనికుల సమూహాల కన్నులకు కాంతియు చెవులకు ధ్వనియు బాధను కలిగించగా - భయంకరమైన ఆ శక్తిని తీసికొని చలిస్తున్న పిడికిలితో చూపులలోని గర్వంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. అభిరామభీమాకారుండై. 279

ప్రతిపదార్థం: అభిరామ= మనోహరమైన; భీమ= భయంకరమైన; ఆకారుండు+ఐ= ఆకారం కలవాడై.

తాత్పర్యం: ధర్మరాజు మనోజ్ఞమయిన, భయంకరమైన రూపం కలవాడై.

తే. నెరయుకినుకఁ బెన్వెడఁదయై నిప్పు లురులు । కన్నుఁగవ శల్యుఁ జూచిన నున్నయునికి
నతఁడు నీఱు గాకుండుట యరిది యయ్యె । మాకుఁ జూడంగ నప్పుడు మనుజనాథ! 280

ప్రతిపదార్థం: నెరయు= నిండైన; కినుకన్= కోపముతో; పెను= పెద్దగా; వెడఁద ఐ= విశాలమై; నిప్పులు; ఉరులు= రాలు; కన్నుఁగవన్= రెండు కన్నులతో; శల్యున్= శల్యుని; చూచినన్= చూడగా; ఉన్న ఉనికిన్= ఉన్నట్లుండగనే; అతఁడు= ఆ శల్యుడు; నీఱు= నివురు(మసి); కాకుండుట= కాకపోవుట; మనుజనాథ!= మానవులకు ప్రభువైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; మాకున్= మాకు; చూడంగన్= చూడగా; అరిది= ఆశ్చర్యము; అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: నిండైన కోపంతో పెద్దగా విశాలమైన నిప్పులు రాలే కన్నులతో ధర్మరాజు శల్యుడిని చూడగా ఉన్నవాడున్నట్లే ఆ శల్యుడు నివురు (బూడిద) కాకపోవటం - ఓ ధృతరాష్ట్ర మహారాజా! చూడగా మాకు ఆశ్చర్యమైనది. (ధర్మరాజు చూపులకు శల్యుడు నుసికాకపోవటం చూచేవారికి ఆశ్చర్యమైంది.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ తేటగీతియందు 'శల్యుఁడు' 'మనుజనాథ!' అనే పదములు తప్ప మిగిలిన వన్నియు అచ్చతెనుఁగు పదాలు. మూలం ఉన్నది ఉన్నట్లుగా అనువదించబడినది. మూలము:

'నిరీక్షితోవై నరదేవరాజ్ఞా । పుతాత్మనా నిర్వృతకల్మషేణ ।
ఆభూ న్నయదభ్రసమ్మసా న్మద్రరాజ । స్తదద్భుతం మే ప్రతిభాతి రాజన్ ॥ (9-16-39)

ఇక ఈ సందర్భంలో ధర్మజుడు 'ఫాలలోచనుడిచ్చిన ప్రీతియోగమును - నెక్కుడు భక్తియు నావహిల్లగా శక్తికి నమస్కరించి' నట్లు తిక్కయజ్వ వర్ణించాడు. (277వ పద్యం) ఇది అమూలకం. ప్రీతియోగమంటే సంతోషయుక్తి (కూడిక).

వ. ఇట్లు రౌద్రోద్రేకంబునఁ బురత్రయ దాహదోహలియగు శూలాయుధు లీల దోఁప దుర్నిరీక్షుండై. 281

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; రౌద్ర= క్రోధముయొక్క; ఉద్రేకంబునన్= పెరుగుదలవలన; పురత్రయ= త్రిపురములను; దాహ= కాల్చుటయందు; దోహలి= ఉత్సాహము కలవాడు; అగు= అయినట్టి; శూల= త్రిశూలము; ఆయుధు= ఆయుధముగా కలిగిన; శివుని; లీలన్= విధముగ; తోఁపన్= తోచగా; దుర్నిరీక్షుండై= చూడ శక్యము కానివాడై.

తాత్పర్యం: ఈ ప్రకారంగా ధర్మరాజు మిక్కుటమైన క్రోధం వలన త్రిపురాలను దహించే శివుడి విధంగా చూడశక్యం కానివాడై.

విశేషం: అలం: ఉపమ.

ఉ. ఘోరతర ప్రకారమగు కుంచితబాహువిలాస మొప్ప వి
స్తారము వింతయౌనురము సారతరంబుగఁ జూచి వజ్రధా
రారుచి సన్నిభప్రచురరశ్మలు పర్వఁగ బిట్టువైచె న
ద్దారుణశక్తి నవ్విభుఁ డుదాత్తసమిత్కృతికల్యు శల్యునిన్. 282

ప్రతిపదార్థం: ఘోరతర= మిక్కిలి భయంకరమగు; ప్రకారము= పద్ధతి; అగు= కలిగినట్టి; కుంచిత= వంచబడిన; బాహు= భుజములయొక్క; విలాసము= ఒయ్యారము; ఒప్పన్= ప్రకాశింపగా; విస్తారము= విరివి అయిన; వింతయౌ= విస్మయకరమగు; ఉరము= వక్షఃస్థలము; ఒప్పన్= ప్రకాశింపగా; ఆ+విభుండు= ప్రభువు అయిన ధర్మరాజు; ఉదాత్త= ఉన్నతమయిన; సమిత్కృతి= యుద్ధము చేయుటయందు; కల్యున్= నేర్పుకలవాడయిన; శల్యునిన్= శల్యుని; చూచి; వజ్ర= వజ్రాయుధముయొక్క; ధారా= వాడియొక్క; రుచి= కాంతితో; సన్నిభ= సమానమయిన; ప్రచుర= విస్తారమయిన; రశ్మలు= కాంతులు(కిరణములు); పర్వఁగన్= వ్యాపించగా; ఆ+దారుణశక్తిన్= శక్తి అను భయంకరాయుధమును; సారతరంబుగన్= మిక్కిలి బలముగా; బిట్టు= శీఘ్రముగా(వేగంగా); వైచెన్= విసిరెను.

తాత్పర్యం: మిక్కిలి భయంకరమైన పద్ధతి కలిగినట్టి పంచబడిన భుజాల ఒయ్యారం ప్రకాశించగా, విరివి అయిన విస్మయకరమయిన వక్షఃస్థలం ప్రకాశించగా ఆ ధర్మరాజు గొప్పయుద్ధం చేయటంలో నేర్పరి అయిన శల్యుడిని చూచి, వజ్రాయుధపు అంచుల కాంతితో సమానమైన, విస్తారమైన కాంతులు వ్యాపించగా ఆ భయంకరమైన శక్తి అనే ఆయుధాన్ని విసిరాడు.

తే. అట్లు పాండుభూపాలకు నగ్రసుతుఁడు । మద్రనాథుని వైచిన రౌద్రమెసఁగ
గంకటముదూఱి వక్షంబు గడచి వెన్ను । వెడలిచని యమ్మహాశక్తి పుడమిఁ జొచ్చె. 283

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారముగా; పాండుభూపాలకు= పాండురాజుయొక్క; అగ్రసుతుఁడు= పెద్దకొడుకు అయిన ధర్మరాజు; మద్రనాథునిన్= మద్రదేశ ప్రభువైన శల్యుడిని; రౌద్రము= క్రోధము; ఎసఁగన్= విజృంభించగా; వైచినన్= కొట్టగా; ఆ+మహాశక్తి= ఆ గొప్ప శక్తి అను ఆయుధము; కంకటము= కవచము; తూఱి= ప్రవేశించి; వక్షంబు= ఱొమ్ము; కడచి= దాటి; వెన్ను= వీపు; వెడలిచని= బయటకు వచ్చి; పుడమిన్= భూమిలో; చొచ్చెన్= ప్రవేశించెను.

తాత్పర్యం: ఆ ప్రకారంగా ధర్మరాజు క్రోధం విజృంభించగా శల్యుడివైపు ఆ మహాశక్తి ఆయుధాన్ని విసరగా అది ఆ శల్యుడి కవచంలో ప్రవేశించి రొమ్ము చీల్చి, వీపునుండి బయటకు వచ్చి భూమిలో ప్రవేశించింది.

విశేషం: ఈ పద్యానికి మూలం: 'సా తస్య మర్మాణి విదార్య శుభ్ర మురో విశాలం చ తథైవ భిత్త్వా। విదేశ గాం తోయమివా ప్రసక్తా యశోవిశాలం నృపతే ర్దహన్తీ॥ (శల్య - 17-50)

వ్యాసభగవానుడు మూలంలో శక్తి ఆయుధాన్ని అద్భుతంగా వర్ణించాడు. దానిని ఇచటచూపటం న్యాయం. తిక్కన సంక్షేపంలో ఇది మరుగునపడినది.

తతస్తు శక్తిం రుచిరోగ్రదండాం మణిప్రలేకోజ్వలితాం ప్రదీప్తామ్ ।
చిక్షేప వేగాత్సు భృశం మహాత్మా మద్రాధిపాయ ప్రవరః కురూణామ్ ॥ (40)

దీప్తా మథైనాం ప్రహితాం బలేన సవిస్ఫులింగాం సహసా పతంతీమ్ ।
ప్రైక్షంత సర్వే కురవః సమేతా దివోయుగాంతే మహతీమివోల్కామ్ ॥ (41)

తాం కాలరాత్రీమివ పాశహస్తాం యమస్య ధాత్రీమివ చోగ్రరూపామ్ ।
స బ్రహ్మదండ ప్రతిమా మమోఘాం ససర్జ యత్తోయుధి ధర్మరాజః ॥ (42)

గన్ధ స్రగగ్య్రాసనపాస భోజనైరభ్యర్చితాం పాండుసుతైః ప్రయత్నాత్ ।
సాంవర్తకాగ్ని ప్రతిమాం జ్వలన్తీం కృత్యా మథర్వాంగిరసీమి వోగ్రామ్ ॥ (43)

ఈశానహేతోః ప్రతినిర్మితాం తాం త్వష్టా రిపూణామసుదేహభక్ష్యామ్ ।
భూమ్యన్తరిక్షాది జలాశయాని ప్రసహ్య భూతాని నిహన్తు మీశామ్ ॥ (44)

ఘంటాపతాకాం మణివజ్రభాజం వైడూర్య చిత్రాం తపనీయదండామ్ ।
త్వష్టా ప్రయత్నా న్నియమేన క్లుప్తాం బ్రహ్మద్విషా మంతరకరీమమోఘామ్ ॥ (45)

బలప్రయత్నా దధిరూఢవేగాం మన్త్రైశ్చ ఘోరై రభిమంత్ర్య యత్నాత్ ।
ససర్జ మార్గేణ చ తాం పరేణ వధాయ మద్రాధిపతేస్తదానీమ్ ॥ (46) (9-16-46)

తిక్కన అనువాదంలో ఈ వర్ణనంలేదు. ఔచిత్యాన్ని సహృదయులైన విజ్ఞులు గ్రహింతురుగాక!

ధర్మరాజు శక్తి ప్రయోగించి శల్యునిం జంపుట (సం. 9-16-50)

వ. ఇట్లు శక్తి బెడిదంపుటు రవడి నుచ్చిపోయిన. 284

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; శక్తి= శక్తి అను ఆయుధము; బెడిదంపు= భయంకరమగు; ఉరవడిన్= మిక్కిలి వేగముగా; ఉచ్చిపోయినన్= దూసికొని వెడలిపోగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ ప్రకారంగా శక్తి అనే ఆయుధం భయంకరమైన వేగంతో శల్యుడిని కొట్టి వెడలిపోగా.

చ. క్షతమున ముక్కునం జెవులఁ గన్నుల నొల్కెడు రక్త మంగ మా
ప్లుతముగఁ జేయఁగా నతఁడు బోరగిలంబడియెన్ ధరం గర
ద్వితయము సాఁచి ధర్మజునిదిక్కు శిరంబుగ వజ్రదారుణా
హతిఁ బడు భూరిభూధరమహత్తరశృంగముభంగి భూవరా! 285

ప్రతిపదార్థం: భూవరా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; క్షతమునన్= గాయమువలన; ముక్కునన్= ముక్కునుండి; చెవులన్= చెవులనుండి; కన్నులన్= కన్నులనుండి; ఒల్కెడు= ఒలికెడు; రక్తము; అంగము= శరీరము; ఆప్లుతముగన్= తడిసినదిగా; చేయఁగాన్= చేయగా; అతఁడు= ఆ శల్యుడు; ధరన్= భూమిపై; బోరగిలన్= రొమ్ము భూమిపై ఆనునట్లు; పడియెన్= పడిపోయెను; కరద్వితయము= రెండుచేతులు; చాఁచి= సాగిలపడి; వజ్ర= వజ్రాయుధపు; దారుణ= భయంకరమయిన; ఆహతిన్= దెబ్బవలన; పడు= పడిపోయిన(కూలిన); భూరి= పెద్దది అయిన; భూధర= పర్వతముయొక్క; మహత్తర= మిక్కిలి గొప్పది అయిన; శృంగము= శిఖరము; భంగిన్= విధముగ; ధర్మజునిదిక్కు= ధర్మరాజువైపు; శిరంబుగన్= తల కలవాడుగా; ధరన్= భూమిపై; పడియెన్= పడిపోయెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! గాయం వలన ముక్కునుండి చెవులనుండి కన్నులనుండి ఒలికే నెత్తురు శరీరాన్ని తడిపివేయగా, ఆ శల్యుడు భూమిపై బోరగిలపడిపోయాడు. చేతులరెండూ చాచి, సాగిలబడి వజ్రాయుధం యొక్క భయంకరమైన దెబ్బవలన పడిపోయిన మిక్కిలి పెద్దదైన పర్వత శిఖరం విధంగా ధర్మరాజువైపు తల కలవాడుగా భూమిపై పడిపోయాడు.

విశేషం: అలం: ఉపమ. శల్యుఁడు-ఉపమేయం; పర్వతశిఖరం-ఉపమానం; భంగి(న్) - ఉపమావాచకం. పడిపోవుట - సమానధర్మం. పూర్ణోపమ. ఇక మూలంలో స్కందుడు కొట్టిన క్రౌంచపర్వతమువలె శల్యుడు అయినట్లు కూడా వ్యాసుడు వర్ణించాడు. తిక్కన ఇంద్రుడి వజ్రాయుధం వలన కూలిన పర్వతశిఖరంతో పోల్చి వర్ణించాడు.

ఆ. భూమిమీఁద నిట్లు బోరగిలంబడి । మద్రనాథుఁ డొప్పె మానవేంద్ర!
లేమయురమునందు లీలమై వ్రాలిన । ప్రాణనాథుఁ బోల్పఁ బట్టు గాఁగ. 286

ప్రతిపదార్థం: మానవ= మనుజులకు; ఇంద్ర!= ప్రభువు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఇట్లు= ఈ ప్రకారముగ; భూమిమీఁదన్= నేలమీద; బోరగిలన్+పడి= రొమ్ము భూమిపై ఆనునట్లుగా పడి; మద్రనాథుఁడు= శల్యుఁడు; లేమ= యౌవనవతి అయిన మగువయొక్క; ఉరమునందున్= వక్షఃస్థలముమీద; లీలమైన్= విలాసంతో; వ్రాలిన= ఒరిగిన; ప్రాణనాథున్= ప్రియుని(భర్తను); పోల్పన్= పోల్చుటకు; పట్టు= స్థానము; కాఁగన్= అగునట్లుగా; ఒప్పెన్= ప్రకాశించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఈ ప్రకారంగా నేలమీద బోరగిలపడి శల్యుడు యౌవనవతి అయిన మగువ వక్షఃస్థలంమీద విలాసంతో ఒరిగిన ప్రియుడితో పోల్చటానికి తగినట్లుగా ప్రకాశించాడు.

విశేషం: రాజుకు భూనాథుడని పేరు. శల్యుడు రాజు, భూపాలుడు. భూమి స్త్రీ రూపిణి. అందువలన ఈ పద్యంలోని శల్య వర్ణనం సముచితం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. ధర్మసంగరమున ధర్మజుచేఁ జచ్చి। పొలిచెఁ జూడ మద్రభూవిభుండు
విధియుతంబు గాఁగ వేలిచి విడిచిన। నాఱి యున్నయగ్ని ననుకరించి. 287

ప్రతిపదార్థం: మద్రభూవిభుండు= మద్రదేశ ప్రభువైన శల్యుడు; ధర్మసంగరమునన్= ధర్మయుద్ధమునందు; ధర్మజునిచేన్= ధర్మరాజుచేత; చచ్చి= మరణించి; విధియుతంబు గాఁగన్= వేద విధి విధానముతో కూడి; వేలిచి= హోమాగ్నియందు నేయి మొదలగు వానిని స్వాహాకారముతో సమర్పించి; విడిచినన్= వదలిపెట్టగా; ఆఱి= ఆరిపోయి; ఉన్న= ఉన్నట్టి; అగ్నిన్= హోమాగ్నిని; అనుకరించి; చూఁడన్= చూడగా; పొలిచెన్= ఒప్పెను.

తాత్పర్యం: శల్యుడు ధర్మయుద్ధంలో ధర్మరాజు వలన మరణించి, వేదవిధివిధానసహితంగా హోమాగ్నిలో స్వాహాకారంతో సమర్పించి విడిచిన ఘృతాదివస్తు సముదాయం హుతమై ఉపశమించి ఉన్నట్టి అగ్నిని అనుకరించి సాక్షాత్కరించాడు.

విశేషం: శల్యుడి పవిత్రమూర్తిమత్త్వం, ధర్మస్వరూపం, వ్యక్తిత్వసత్యం - ఈ ఒక్క ఆటవెలది యందు సాక్షాత్కరించబడ్డాయి. భీష్ముడు ఎంతటి పరాక్రమవంతుడో, ధర్మస్వరూపుడో, శల్యుడూ అంతటివాడే. రెండు ధర్మాలకు పరస్పరసంఘర్షణమే శల్య ధర్మరాజుల యుద్ధంలోని అంతరార్థం. ధర్మరాజుచేత మరణించటమే శల్యుడి ఉత్తమత్వానికి నిదర్శనం. హిరణ్యకశిపుని పుత్రుడు ప్రహ్లాదుడు; ప్రహ్లాదుడి తమ్ముడు సంహ్లాదుడు. ఈ సంహ్లాదుడి అంశావతారం శల్యుడు. అసలు మహాభారతంలోని పాత్రలన్నీ అంశావతారాలే.

'ప్రియయా కాన్తయా కాన్తః పతమానమివోరసి ।
చిరం భుక్త్వా వసుమతీం ప్రియాం కాన్తా మివ ప్రభుః ॥
సర్వైరంగైః సమాశ్లిష్య ప్రసుప్త ఇవ సోఽభవత్ ।
ధర్మ్యే ధర్మాత్మనా యుద్ధే విహతో ధర్మసూనునా ।
సమ్యక్ హుత ఇవ స్విష్టః ప్రశాంతోఽగ్నిరివాధ్వరే ॥ (శల్య. 16-54, 55, 56)

ఇవి పై రెండు ఆటవెలదులకు మూలాలు. ఎంతటి రమణీయ ఉపమాలంకారాలు!

మ. కని శల్యానుజుఁ డేచి ధర్మసుతు నుగ్రస్ఫూర్తి శోభిల్లఁ దాఁ
కిన నా భూపతి చిత్రచాపధరుఁడై కేళీసమప్రక్రియన్
ధనువుం గేతువుఁ ద్రుంచి తోడన సముద్యద్దీప్తభల్లాహతిం
దునిమెం గుండలకాంతమైన శిరమున్ దుర్దాంతదర్పంబునన్. 288

ప్రతిపదార్థం: శల్య= శల్యుడియొక్క; అనుజుఁడు= తమ్ముడు; కని= చూచి; ఉగ్ర= భయంకరమయిన; స్ఫూర్తి= స్ఫురణము; శోభిల్లన్= ప్రకాశింపగా; ధర్మసుతున్= ధర్మరాజును; ఏచి= విజృంభించి; తాఁకినన్= ఎదుర్కొనగ; ఆ భూపతి= ఆ ధర్మరాజు; చిత్ర= ఆశ్చర్యజనకమయిన; చాప= ధనువును; ధరుఁడై= ధరించినవాడై; కేళీ= క్రీడతో; సమ= సమానమయిన; ప్రక్రియన్= విధముతో; ధనువున్= వింటిని; కేతువున్= టెక్కెమును; త్రుంచి= ఖండించి; తోడన= వెంటనే; సముద్యత్= సంసిద్ధతతో; దీప్త= ప్రజ్వలించుచున్న; భల్ల= బల్లెముయొక్క; ఆహతిన్= దెబ్బతో; దుర్దాంత= సహింపశక్యంకాని; దర్పంబునన్= గర్వముతో; కుండల= కర్ణకుండలములవలన; కాంతము= ప్రకాశవంతము; ఐన= అయినట్టి; శిరమున్= తలను; తునిమెన్= ఖండించెను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శల్యుడి తమ్ముడు శల్యుడి మరణాన్ని చూచి భయంకరాకారుడై ప్రకాశిస్తూ, విజృంభించి ధర్మరాజును ఎదుర్కొనగా ధర్మరాజు ఆశ్చర్యజనకమైన వింటిని ధరించి, ఆటాడినట్లుగా శల్యుడి తమ్ముడి వింటిని టెక్కెమును ఖండించి, ఆ వెంటనే సంసిద్ధతతో ప్రకాశిస్తున్న బల్లెంయొక్క దెబ్బతో సహింపశక్యం కాని గర్వంతో కర్ణకుండలాలతో కాంతిమంతమైన తలను ఖండించాడు.

విశేషం: శల్యుడి తమ్ముడనియే కాని పేరులేదు- అగస్త్యభ్రాతవలె. ఇట్టివారు పురాణాలలో చాలామంది ఉన్నారు.

వ. ఇట్లు శల్యుండు సోదర సహితంబుగాఁ బడినఁ బాండవసైన్యంబు జనంబులు వృత్రవధం బొనరించు పాకశాసనుఁ బ్రశంసించు బృందారకుల చందంబున నగ్గించి రమ్మొగ్గరంబునం దూర్యనినదంబులు సింహనాదంబులుఁ జెలంగఁ గలంగి కురుసేన విఱిగి పఱచినం బోనీక పొడువుం డనుచు సాత్యకి వెనుకొనుటయుఁ గనుంగొని కృతవర్ముండు మార్కొనియె. నయ్యాదవసింహులరణంబు దారుణంబయ్యె నందు. 289

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; శల్యుండు; సోదరసహితంబుగాన్= తమ్ముడితోకూడ; పడినన్= మరణించగా; పాండవ= పాండవులయొక్క; సైన్యంబు= సైన్యముయొక్క; జనంబులు= సైనికులు; వృత్ర= వృత్రాసురునియొక్క; వధన్= సంహారమును; పొనరించు= చేయు; పాకశాసనున్= ఇంద్రుని; ప్రశంసించు= పొగడు; బృందారకుల= దేవతల; చందంబునన్= విధముగా; అగ్గించిరి= పొగడిరి(స్తుతించిరి); ఆ; మొగ్గరంబునన్= సేనావ్యూహమునందు; తూర్య= తూర్యములయొక్క; నినదంబులు= ధ్వనులు; సింహనాదంబులున్= సింహగర్జనములును; చెలంగన్= గోల చేయగా; కలంగి= కలతచెంది; కురుసేన= కౌరవులసైన్యము; విఱిగి= ఓడిపోయి; పఱచినన్= పాఱిపోవుచుండగా; పోనీక= పోనీయక; పొడవుండు= పోట్లాడుడు; అనుచున్= అనుచు; సాత్యకి; వెనుకొనుటయున్= వెంటాడుటయును; కనుంగొని= చూచి; కృతవర్ముండు; మార్కొనియెన్= ఎదుర్కొనియెను; ఆ; యాదవసింహుల= యాదవశ్రేష్ఠులైన-సాత్యకి కృతవర్మలయొక్క; రణంబు= యుద్ధము; దారుణంబు= భయంకరము; అయ్యెను; అందున్= ఆ యుద్ధమునందు.

తాత్పర్యం: ఈ ప్రకారంగా శల్యుడు తమ్ముడితో కూడా మరణించగా పాండవుల సైన్యంలోని సైనికులు వృత్రాసురుడిని సంహరించిన మహేంద్రుడిని పొగడే దేవతల విధంగా పొగిడారు. అప్పుడు ఆ సేనావ్యూహంలో తూర్యధ్వనులు, సింహగర్జనలు శబ్దించగా కలతచెంది కురుసేన ఓడిపోయి పారిపోతూ ఉండగా 'పోట్లాడండి' అంటూ సాత్యకి వెంటాడటాన్ని చూచి కృతవర్మ ఎదుర్కొన్నాడు. ఆ యాదవశ్రేష్ఠులయొక్క యుద్ధం భయంకరమైనది. ఆ యుద్ధంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

సీ. కృతవర్మ సాత్యకి నతిశితశరదశ । కమున నొంచి తురంగముల యుబ్బు
నుడిపి విల్దునుముటయును నొండువింట న । బ్బలియుఁ డాతని మేనఁ బదిమెఱుంగు
టమ్ములు వఱపి రథ్యమ్ముల నరదంబు । సూతుని నతికినఁ జూచి కృపుఁడు
దనతేరిపైఁ బెట్టుకొని తొలఁగించె న । వ్వీరుపోరికి మూఁక వెఱచి పఱచెఁ

తే. గడఁగి వెనుకొన్న పాండవోత్కరము నొకఁడ । నిలువరించె నుద్దండుఁడై నీతనూజుఁ
డంత వేఱొక్కతే రెక్కి యరుగుదెంచి । తాఁకె హార్దిక్యుఁ డరిసేన తల్లడిల్ల. 290

ప్రతిపదార్థం: కృతవర్మ; సాత్యకిన్; అతి= మిక్కిలి; శిత= వాడిఅయిన; శర= బాణములయొక్క; దశకమునన్= పదింటితో; నొంచి= నొప్పించి; తురంగముల= గుర్రములయొక్క; ఉబ్బున్= పొంగు; ఉడిపి= పోగొట్టి; విల్= విల్లు(ధనువు); తునుముటయున్= ఖండించుటయును; ఒండు= మరియొక; వింటన్= ధనువుతో; ఆ+బలియుఁడు= ఆ బలవంతుడు(సాత్యకి); ఆతని= ఆ కృతవర్మయొక్క; మేనన్= శరీరమునందు; పది; మెఱుంగు= ప్రకాశవంతమయిన; అమ్ములు= బాణములు; పఱపి= ప్రయోగించి; రథ్యమ్ములన్= గుర్రాలను; అరదంబున్= రథమును; సూతునిన్= సూతుని; నఱికినన్= ఖండించగా; చూచి; కృపుఁడు; తన; తేరిపైన్= రథముమీద; పెట్టుకొని= ఉంచుకొని; తొలఁగించెను= తప్పించెను; ఆ; వీరు= వీరుడయిన సాత్యకియొక్క; పోరికిన్= యుద్ధమునకు; మూఁక= సైన్యము; వెఱచి= భయపడి; పఱచెన్= పాఱిపోయెను; కడఁగి= పూనికవహించి; వెనుకొన్న= వెంటాడిన; పాండవ= పాండవులయొక్క; ఉత్కరమున్= సమూహమును; నీతనూజుఁడు= నీయొక్క కొడుకు (దుర్యోధనుఁడు); ఒకఁడు+అ= ఒక్కడే; ఉద్దండుఁడై= అధికుడై; నిలువరించెను= ఆపెను; అంతన్= అంతలో; వేఱొక్క= ఇంకొక; తేరు= రథము; ఎక్కి; హార్దిక్యుఁడు= కృతవర్మ; అరుగుదెంచి= వచ్చి; అరిసేన= శత్రుసేన; తల్లడిల్లన్= తొట్రుపాటు పడగా(చలింపగా); తాఁకెన్= ఎదిరించెను.

తాత్పర్యం: కృతవర్మ సాత్యకిని మిక్కిలి వాడి అయిన పదిబాణాలతో నొప్పించి, గుర్రాల పొంగు పోగొట్టి, ధనువును ఖండించాడు. బలవంతుడైన సాత్యకి మరియొక ధనువుతో ఆ కృతవర్మ శరీరమునందు ప్రకాశవంతమయిన పదిబాణాలు ప్రయోగించి గుర్రాలను రథాన్ని, సూతుడిని ఖండించాడు. అది చూచి కృపుడు, కృతవర్మను తన రథంపై పెట్టుకొని అచ్చటనుండి తప్పించాడు. వీరుడైన ఆ సాత్యకి చేసే యుద్ధానికి సైన్యం భయపడి పారిపోయింది. వెంటాడుతున్న పాండవసైన్యసమూహాన్ని దుర్యోధనుడు ఒక్కడే నిలువరించాడు. అంతలో ఇంకొక రథం ఎక్కి కృతవర్మ వచ్చి శత్రుసేన తొట్రుపాటు పడేటట్లు ఎదిరించాడు.

వ. ఇ ట్లెదిర్చి పేర్చినయలుకఁ బాండవాగ్రజుండు గృతవర్మని ఘోటకంబులను గీటడఁగించినఁ గురునందనుం డా హృదికనందనుని నిజస్యందనంబున నిడుకొని యవ్వలికిం గొనిపోయె నప్పుడు కృపాచార్యుండు గదిసిన నయ్యుధిష్ఠిరుం డాఱమ్ము లెమ్ములం గీలింప నతండు పదాఱుతూపుల నాభూపాలునిఁ దదీయ తురంగంబుల నేసె నా సమయంబున. 291

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; ఎదిర్చి= ఎదిరించి; పేర్చిన= అధికమైన; అలుకన్= కోపముతో; పాండవ= పాండవులలో; అగ్రజుండు= పెద్దవాడు అయిన ధర్మరాజు; కృతవర్మని= కృతవర్మయొక్క; ఘోటకంబులను= గుర్రములను; గీటడఁగించినన్= చంపగా; గురునందనుండు= అశ్వత్థామ; హృదికనందనుని= హృదికునియొక్క పుత్రుడయిన కృతవర్మను; నిజ= తనయొక్క; స్యందనంబునన్= రథమునందు; ఇడుకొని= ఉంచుకొని; అవ్వలికిన్= ఆవలకు; కొనిపోయెన్= తీసికొని పోయెను; అప్పుడు; కృపాచార్యుండు; కదిసినన్= కలియబడగా; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; ఆఱు= ఆరు; అమ్ములు= బాణములు; ఎమ్ములన్= ఎముకలను; కీలింపన్= తగిలించగా; అతండు= కృపాచార్యుఁడు; పదాఱు= పదియు ఆరు(పదహారు); తూపులన్= బాణములతో; ఆ భూపాలునిన్= ఆ ధర్మరాజును; తదీయ= ఆతడి; తురంగంబులన్= గుర్రములను; ఏసెను= కొట్టెను; ఆ సమయంబున.

తాత్పర్యం: ఈ ప్రకారంగా ఎదిరించి అతిశయించిన కోపంతో ధర్మరాజు కృతవర్మ గుర్రాలను చంపాడు. అశ్వత్థామ కృతవర్మను తన రథమునం దుంచుకొని ఆవలకు తీసికొని పోయాడు. ఆ సమయంలో కృపాచార్యుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కలియబడగా ధర్మరాజు ఆరుబాణాలతో ఎముకలను కొట్టాడు. అంతట కృపాచార్యుడు పదహారు బాణాలతో ధర్మజుడిని, ఆతడి గుర్రాలను కొట్టాడు. ఆ సమయంలో.

తే. భద్రకరి నెక్కి చామర ప్రకరవీజ । నములు ధవళాతపత్రవిభ్రమసమృద్ధి
యతిశయిల్ల సైన్యోత్సాహ మావహిల్లఁ । బొలిచె నెంతయు భవదీయపుత్త్రుఁ డధిప! 292

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; భవదీయ= మీయొక్క; పుత్త్రుఁడు= కుమారుఁడు అయిన దుర్యోధనుఁడు; భద్రకరిన్= భద్రగజమును(శుభమును కలుగచేయు ఏనుగు భద్రగజము); ఎక్కి; చామర= వింజామరలయొక్క; ప్రకర= సమూహములయొక్క; వీజనములు= విసరుటలు; ధవళ= తెల్లని; ఆతపత్ర= గొడుగులయొక్క; విభ్రమ= విలాసముయొక్క; సమృద్ధి= అధికమయిన సంపద; అతిశయిల్లన్= ఆధిక్యమునందగా; సైన్య= సైన్యముయొక్క; ఉత్సాహము= ప్రయత్నము; ఆవహిల్లన్= కలుగగా; ఎంతయున్= మిక్కిలి; పొలిచెను= ఒప్పెను. (ప్రకాశించెను)

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ పుత్రుడు దుర్యోధనుడు భద్రగజాన్ని ఎక్కి వింజామరల సమూహాలు వీస్తుండగా, తెల్లని గొడుగుల విలాససంపద విలసిల్లగా సైన్యంయొక్క ప్రయత్నం కలుగగా మిక్కిలి ప్రకాశించాడు.

శల్యుచుట్టంబు లొక్కపెట్ట ధర్మరాజుం జుట్టుముట్టుట (సం. 9-17-3)

ఉ. అమ్మనుజేంద్రు ముందటికి నార్పులతోఁ జనుదెంచి శల్యుచు
ట్టమ్ములు సత్వరమ్ముగఁ గడంగి యనేకులు వీరయోధు లు
గ్రమ్ముగ వీఁకఁ దేరులు పొగడ్తకు నెక్కఁగ దీప్తమైన కో
పమ్మున నేచి పాండవులపై నడరం గని పేరెలుంగునన్. 293

ప్రతిపదార్థం: శల్యుచుట్టమ్ములు= శల్యుడి యొక్క చుట్టములు; అనేకులు; వీర= శూరులయిన; యోధులు= పరాక్రమవంతులు; సత్వరమ్ముగన్= వేగముగా; కడంగి= ప్రయత్నించి; ఆ+మనుజేంద్రు= ఆ ధర్మరాజు; ముందటికిన్= ముందునకు; ఆర్పులతోన్= అరుపులతో; చనుదెంచి= వచ్చి; సత్వరమ్ముగన్= శీఘ్రంగా; కడంగి= పూని; అనేకులు= పెక్కులు; వీరయోధులు; ఉగ్రమ్ముగన్= భయంకరంగా; వీఁకన్= పరాక్రమంతో; తేరులు= రథాలు; పొగడ్తకున్= స్తుతికి; ఎక్కఁగన్; దీప్తమైన= ప్రకాశవంతమయిన; కోపమ్మునన్= కోపముతో; ఏచి= విజృంభించి; పాండవులపైన్= పాండవులమీద; అడరన్= విజృంభించుట; కని= చూచి; పేరు= పెద్ద; ఎలుంగునన్= కంఠధ్వనితో.

తాత్పర్యం: శల్యుడి చుట్టాలు పరాక్రమవంతులైన యోధులు అనేకులు వేగంగా ప్రయత్నించి ఆ ధర్మరాజు ముందుకు పెడబొబ్బలు పెట్టుతూ వచ్చి చుట్టుముట్టగా పరాక్రమంతో కోపంతో విజృంభించి పాండవులమీద విజృంభించటాన్ని చూచి పెద్ద కంఠధ్వనితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఈ పద్యమునకు మూలం చిన్న అనుష్టుప్పు.

'శల్యేఽథ నిహతే రాజన్ మద్రరాజ పదానుగాః ।
రథాః సప్తశతా వీరా నిర్యయు ర్మహతో బలాత్ ॥ (9-17-1)

వ. అన్నరనాథుండు. 294

ప్రతిపదార్థం: ఆ+నరనాథుండు= ఆ దుర్యోధనుడు.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు.

తే. **మీర లేర్పడ వడిఁ దలమిగిలి చనఁగ। వలదు నామ్రోల బలుపారి నిలువుఁడనియె**
వారు నిలువక పాండవబలము చేవ। దఱుగఁ జొచ్చి యుధిష్ఠిరుఁ దాఁకి రధిప! **295**

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజ!; మీరలు= మీరు; ఏర్పడన్= తేటపడునట్లు; వడిన్= వేగముగా; తలమిగిలి= ముందుకు; చనఁగన్= వెడలగ; వలదు; నామ్రోలన్= నా ఎదుట; బలుపు+ఆరి= బలము కలిగి; నిలువుఁడు; అనియెన్= అనియెను; వారు నిలువక; పాండవబలము= పాండవుల సైన్యముయొక్క; చేవ= ధైర్యము; తఱుగన్= తగ్గిపోవునట్లు; చొచ్చి= ప్రవేశించి; యుధిష్ఠిరున్= ధర్మరాజును; తాఁకిరి= ఎదుర్కొనిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! 'మీరు వేగముగా ముందుకు వెడల వద్దు. నా ఎదుట బలంగా నిలవండి.' అని దుర్యోధనుడు శల్యుడి చుట్టాలను వారించినా వారు నిలువక పాండవబలముయొక్క ధైర్యం తరిగిపోవునట్లు ప్రవేశించి ధర్మరాజును ఎదుర్కొన్నారు.

వ. **ఇట్లు చలంబున నవ్విభుం దలపడి వివిధాస్త్రంబులు గుప్పించి నొప్పించినఁ గవ్వడియును వడముడియుఁ గవలును ద్రౌపదికొడుకు లేవురును గోవిందుతమ్ముండును ధృష్టద్యుమ్నుండును శిఖండియును జండరయంబున నుద్దండచతురంగ సమేతులై యా రథికులఁ బొదువుటయును వారలు వీరోద్రేకంబున సైన్యసాగరంబున నున్మదమకరప్రకరంబులవిధంబున విహరించి రట్లు పాండవసేనాసంక్షోభసంపాదులగు నాజోదుల యాటోపం బాలోకించి గాంధారపతి గాంధారేయు నాలోకించి.** **296**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగ; చలంబునన్= మాత్సర్యముతో; ఆ; విభున్= ప్రభువు అయిన ధర్మరాజును; తలపడి= ఎదుర్కొని; వివిధాస్త్రంబులు= నానావిధములయిన ఆయుధములు; కుప్పించి= ఒక్కసారిగా ప్రయోగించి; నొప్పించినన్= బాధించగా; కవ్వడియును= అర్జునుడును; వడముడియున్= భీముడును; కవలును= నకుల సహదేవులును; ద్రౌపదికొడుకులు= ద్రౌపదియొక్క పుత్రులు; ఏవురును= అయిదుగురును; గోవిందు= శ్రీకృష్ణుడియొక్క; తమ్ముండును= తమ్ముడు అయిన సాత్యకియును; ధృష్టద్యుమ్నుండును; శిఖండియును; చండ= తీవ్రమయిన; రయంబునన్= వేగముతో; ఉద్దండ= అధికమయిన; చతురంగ= చతురంగ సైన్యములతో; సమేతులై= కూడినవారై; ఆ రథికులన్= రథముపై నుండి యుద్ధము చేయు ఆ యోధులను; పొదువుటయును= క్రమ్ముకొనుటయును; వారలు= వారు; వీర= పరాక్రమముయొక్క; ఉద్రేకంబునన్= అధికమయిన ఆవేశమువలన; సైన్య= సేనలు అనెడి; సాగరంబునన్= సముద్రమునందు; ఉన్మద= మదించిన; మకర= మొసళ్ళయొక్క; ప్రకరంబుల= సమూహములయొక్క; విధంబునన్= ప్రకారముగా; విహరించిరి= వేడుకగా తిరిగిరి; అట్లు; పాండవ= పాండవులయొక్క; సేనా= సేనలకు; సంక్షోభ= అలజడిని; సంపాదులు= కలిగించినవారు; అగు= అయినట్టి; ఆ జోదుల= ఆ యోధులయొక్క; ఆటోపంబు= ఆడంబరము; ఆలోకించి= చూచి; గాంధార= గాంధారదేశమునకు; పతి= భర్త(అనగా గాంధారరాజు శకుని); గాంధారేయున్= గాంధారిపుత్రుడైన దుర్యోధనుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఈ ప్రకారంగా మాత్సర్యంలో ఆ ధర్మరాజును చుట్టుముట్టి నానావిధాలయిన ఆయుధాలు ఒక్కసారిగా ప్రయోగించి బాధించగా అర్జునుడు, భీముడు, నకుల సహదేవులు, ద్రౌపదికొడుకులైన ఉపపాండవులు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, శిఖండియును తీవ్రమైన వేగంతో అధికమైన చతురంగబలాలతో కూడి ఆ యోధులను చుట్టుముట్టారు.

ఆ శల్యుడి చుట్టములు పరాక్రమావేశపరులై సేన అనే సముద్రంలో మదించిన మొసళ్ళయొక్క గుంపుల విధంగా వేడుకగా తిరిగారు. ఆ ప్రకారంగా పాండవసైన్యాల అలజడిని సంపాదించినట్టి ఆ మద్రదేశయోధుల ఆడంబరాన్ని చూచి శకుని దుర్యోధనుడితో.

విశేషం: అలం: ఉపమ. రూపకానుప్రాణితం.

తే. 'మద్రవిభువారి నిమ్మెయి మార్తు రాఁగి । కొనఁగ మనకు నుపేక్షింపఁ జనునె?' యనుడు
నతఁడు 'నామాట వినక వా రరిగి రేమి । సేయువారము? చెప్పు మౌచిత్య మనియె' 297

ప్రతిపదార్థం: మద్రవిభు= మద్రదేశపు అయిన శల్యునికి సంబంధించిన; వారిన్= వారిని; ఇమ్మెయిన్= ఈ విధముగా; మార్తురు= చంపుదురు; మనకున్= మనకు; ఆగికొనగన్= అడ్డగించుటకు; ఉపేక్షింపన్= అశ్రద్ధచేయగా; చనునె?= చెల్లునా? (తగునా?); అనుడున్= శకుని ఇట్లు అనగా; అతఁడు= ఆ దుర్యోధనుఁడు; నామాట; వినక= వినకుండా; వారు; అరిగిరి= వెడలిరి; ఏమి చేయువారము?= చేయగలము?; ఔచిత్యము= ఉచితమార్గము; చెప్పుము; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'శల్యుడికి సంబంధించిన వారిని పాండవులు ఈవిధంగా చంపుతారు. ఆ పాండవులను అడ్డగించటానికి మనకు అశ్రద్ధ చేయతగునా?' శకుని ఇట్లా చెప్పగా దుర్యోధనుడు ఇట్లా అన్నాడు. 'ఆ శల్యుడి అనుచరులు నామాట వినకుండ వెళ్ళారు. ఏమి చేయగలం? ఉచితమయిన మార్గం చెప్పుము'. అన్నాడు.

వ. అని నన్ను నాపరివారంబును రక్షింపను దగవెఱింగింపను నర్హుండ వీవకాదె?' యనుమాట లాడిన నతండు ప్రీతుండై బలపరిపాలనంబును గర్జంబు సెప్పుటయును దనపనిగా మనంబునంబూని యవి దోఁచునట్టి యుచితవచనంబుల నవ్వసుమతీపతికిఁ బ్రియం బాపాదించి. 298

ప్రతిపదార్థం: అని; నన్నున్; నాపరివారంబును= నాయొక్క పరిజనమును; రక్షింపను= రక్షించుకొనుటకు; తగవు= న్యాయము (మార్గము); ఎఱింగింపను= తెలియచెప్పుటకు; ఈవ= నీవే; అర్హుండవు= తగినవాడవు; కాదె?= కాదా?; అను= అనెడి; మాటలు= పలుకులు; ఆడినన్= పలికిన; అతండు= ఆ శకుని; ప్రీతుండై= సంతోషించినవాడై; బల= సైన్యముయొక్క; పరిపాలనంబును= నిలుపుటను(కాపాడుటను); కర్జంబు= కార్యము; చెప్పుటయును= చెప్పుటకూడా; తనపనిగాన్= తనయొక్క పనిగా(కార్యముగా); మనంబునన్= మనస్సునందు; పూని= తలచి; అవి; తోఁచునట్టి= తోచునట్టి; ఉచిత వచనంబులన్= న్యాయమయిన మాటలతో; ఆ+వసుమతీ పతికిన్= రాజు దుర్యోధనుడికి; ప్రియంబు= సంతోషము; ఆపాదించి= కలిగించి.

తాత్పర్యం: దుర్యోధనుడు శకునితో ఇట్లా అని, 'నన్ను నా పరిజనాన్ని రక్షించుకొనటానికి తగిన మార్గాన్ని న్యాయాన్ని తెలియచెప్పటానికి నీవే సమర్థుడవుకదా!' అనగా - ఆ శకుని సంతోషించినవాడై తన పనిగా మనస్సునందు తలచి, ఉచితవచనాలతో ఆ దుర్యోధనుడికి సంతోషం కలిగించి.

చ. 'వినుము నరేంద్ర! సైనికులు విక్రమలీల నరాతిసేన సా
చ్చినఁ బతి గావకున్న నుపజీవులు మెత్తురె? యన్నఁ 'గాతుఁ గా'
కని బహుతూర్యనాదములు నార్పులునుం జెలఁగంగఁ ద్రోచి య
జ్జనపతి వీఁకమై నడరె సైన్యయుతంబుగ సత్వరంబుగన్. 299

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= ప్రభువు అయిన (అనగా రాజు అయిన దుర్యోధనా!); వినుము; సైనికులు; విక్రమ= పరాక్రమముయొక్క; లీలన్= విలాసముతో; అరాతి= శత్రువులయొక్క; సేన= సైన్యము; చొచ్చినన్= ప్రవేశించగా; పతి= అధిపతి; కావకున్నను= రక్షించకున్నచో; ఉపజీవులు= రాజుపై ఆధారపడి జీవించువారు; మెత్తురె?= మెచ్చుకొందురా?; అన్నన్= అనగా; కాతున్= రక్షింతును గాక అని; బహు= పలు; తూర్యనాదములును= తూర్య ధ్వనులును; ఆర్పులునున్= అరుపులును; చెలఁగంగన్= ధ్వనించగా; త్రోచి= లెక్కజేయక; ఆ+జనపతి= ఆ దుర్యోధనుడు; సత్వరంబుగన్= మిక్కిలి వేగముగా; సైన్యయుతంబుగన్= సేనా సమేతముగా; వీఁకమైన్= పరాక్రమముతో; అడరెన్= అతిశయించెను.

తాత్పర్యం: 'ఓ దుర్యోధన మహారాజా! ఆలకించుము. సేనలు పరాక్రమవిలాసంతో శత్రుసైన్యమునందు ప్రవేశించినప్పుడు వారి అధిపతి రక్షించకపోతే వారిపై ఆధారపడి జీవించేవారు మెచ్చుకొంటారా?' అని శకుని అనగా 'వారిని రక్షిస్తాను-' అని పలు తూర్యధ్వనులు, సైనికుల అరుపులు వ్యాపించగా, వాటిని దుర్యోధనుడు లెక్కచేయక మిక్కిలి వేగంగా సేనాసమేతంగా పరాక్రమంతో విజృంభించాడు.

క. అంత ధనంజయ కిమ్మీ । రాంతకముఖ యోధవర మహాస్త్రప్రకరం
బంతకుకడ కనిచెఁ బరి । శ్రాంతంబగు మద్రనాథు రథిక చయంబున్. 300

ప్రతిపదార్థం: అంతన్= అంతలో; ధనంజయ= అర్జునుడు; కిమ్మీరాంతక= భీముడు; ముఖ= మున్నగు; యోధవర= శ్రేష్ఠులయిన యోధులయొక్క; మహా= గొప్ప; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములయొక్క; ప్రకరంబు= సమూహం; పరిశ్రాంతంబు= మిక్కిలి అలసిపోయింది; అగు= అయినట్టి; మద్రనాథు= శల్యుడియొక్క; రథిక= రథికయోధులయొక్క; చయంబున్= సమూహమును; అంతకుకడకున్= యమునియొద్దకు; అనిచెన్= పంపించెను.

తాత్పర్యం: అంతలో దుర్యోధనుడు సేనాసమేతుడై విజృంభించగా అర్జునుడు, భీముడు మొదలైన యోధ శ్రేష్ఠుల గొప్ప గొప్ప అస్త్ర సమూహాలు అలసిపోయిన ఆ శల్యుడి రథిక సమూహాలను యముడి మందిరానికి పంపాయి (సంహరించాయి).

వ. ఇవ్విధంబున. 301

తాత్పర్యం: ఈ ప్రకారంగా.

మ. అరులం గీటడఁగించి పాండుసుతు సైన్యం బుబ్బి పైఁ గ్రమ్మినం
గురుభూనాయకుసేన నొచ్చి కలయం గూలన్ ధరన్ గుంపులై
తిరుగం బాఱఁగఁ జొచ్చె విచ్చె మరలన్ దిగ్భ్రాంతి వాటిల్ల స
త్వరతన్ నల్గడఁ బాఱె నవ్విభుఁడు గర్వం బేది వెల్వెల్లఁగన్. 302

ప్రతిపదార్థం: అరులన్= శత్రువులను; గీటడఁగించి= చంపి; పాండుసుతు= ధర్మరాజుయొక్క; సైన్యంబు= సేన; ఉబ్బి= సంతోషించి; పైన్+క్రమ్మినన్= మీదపడి వ్యాపించగా(చుట్టుముట్టగా); కురుభూనాయకు= దుర్యోధనుడియొక్క; సేన= సైన్యము; నొచ్చి= బాధచెంది; గుంపులై= ప్రోగులై; ధరన్= భూమిపై; కూలన్= కూలిపోగా; కలయన్= అంతటా; తిరుగన్= వెనుతిరిగి; పాఱఁగన్= పాఱిపోవను; చొచ్చెన్= ప్రయత్నించెను; మరలన్= తిరిగి; దిగ్భ్రాంతి= ఆశ్చర్యకరమయిన భ్రమ; వాటిల్లన్= కలుగగా; విచ్చెన్= విడివడిపోయెను; ఆ+విభుఁడు= ప్రభువు అయిన ఆ దుర్యోధనుఁడు; గర్వంబు= దర్పంబు; ఏది= నశించి; వెల్వెల్లఁగన్= వెలవెలపోవగా; సత్వర= మిక్కిలివేగిరపాటుతో కూడిన; గతిన్= గమనముతో; నల్గడన్= నాలుగుదిక్కులకు; పాఱెను= పారిపోయెను.

తాత్పర్యం: ధర్మరాజు సైన్యం శత్రువులను చంపి సంతోషించి మీదపడగా దుర్యోధనుడి సైన్యం బాధచెంది ప్రోగులై నేలపై కూలి, వెనుతిరిగి పారిపోవటానికి ప్రారంభించింది. మరల ఆశ్చర్యకరమైన భ్రమ కలుగగా విడిపోయింది. ఆ దుర్యోధనుడు దర్పం నశించి వెలవెలపోగా మిక్కిలి వేగిరపాటుతో కూడిన గమనంతో నలుదిక్కులకు పారిపోయింది.

క. మనవారి కపుడు భీష్ముని । చనుటయుఁ గోదండగురుని సమయుటయును గ
ర్ణుని పొలియుటయును గ్రొత్తై । మనమున వెనుఁబాటు గదిరె మనుజాధీశా! 303

ప్రతిపదార్థం: మనుజాధీశా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అపుడు= ఆ సమయమున; మనవారికిన్= మన సైన్యమునకు; భీష్మని= భీష్మునియొక్క; చనుటయును= పోవుటయును; కోదండగురుని= ద్రోణుని; సమయుటయును= చనిపోవుటయును; కర్ణుని; పొలియుటయును= చనిపోవుటయును; క్రొత్తై; మనస్సునందు; వెనుఁబాటు= విషాదము; కదిలె(న్)= కలిగెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ సమయంలో మన సైన్యానికి భీష్ముడి, ద్రోణుడి, కర్ణుడి మరణాలు క్రొత్తగా మనస్సులలో విషాదం కలిగించాయి.

విశేషం: మూలము: 'భీష్మే ద్రోణే చ నిహతే సూతపుత్రే చ భారత । యద్దుఃఖం తవ యోధానాం భయం చాసీ ద్విశాంపతే' (9-18-5)

వ. అప్పు డద్దిక్కు జనంబులు. 304

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఆ+దిక్కు= ఆ వైపు; జనంబులు= జనులు.

తాత్పర్యం: ఆ సమయంలో పాండవపక్షంలోని జనులు.

చ. ధరణికి నింక నాయకుఁడు ధర్మతనూజుఁడు నేఁ డవశ్యముం
గురుపతి గూలు నెవ్వగలకుం గుదురయ్యెడు నాంబికేయుఁ డు
ద్ధురు లగు పాండునందనుల దుర్దమభంగి యెఱింగి ధర్మత
త్పరులకు గెల్పు బ్రాఁతె? హరిభక్తులఁ బొందవె భూరిసంపదల్? 305

ప్రతిపదార్థం: ఉద్ధురులు= బలవంతులు; అగు= అయినట్టి; పాండునందనులు= పాండవులయొక్క; దుర్దమ= సహింపశక్యముకాని; భంగి= విధము; యెఱింగి= తెలిసికొని; ఇంకన్; ధరణికిన్= భూమికి; నాయకుఁడు= ప్రభువు(రాజు); ధర్మతనూజుఁడు= ధర్మరాజు; నేఁడు= ఈనాడు; అవశ్యమున్= తప్పకుండ; కురుపతి= దుర్యోధనుఁడు; కూలున్= మరణించును; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుఁడు; నెవ్వగలకున్= ఆపదలకు; కుదురు= అనుకూలుడు; అయ్యెడున్= అగును; ధర్మ= ధర్మమునందు; తత్పరులకున్= లగ్నమయిన మనస్సుకలవారికి; గెల్పు= విజయము; బ్రాఁతె?= దుర్లభమా?; హరి= విష్ణు; భక్తులన్; భూరి= గొప్ప; సంపదలు= ఐశ్వర్యములు; పొందవె?= ప్రాప్తించవా? (ప్రాప్తించునని అర్థము.)

తాత్పర్యం: బలవంతులైన పాండవుల సహింపశక్యంకాని విధం తెలిసికొని పాండవపక్షంలోని జనులు ఇంక ఈ భూమికి రాజు ధర్మరాజు; ఈనాడు దుర్యోధనుడు తప్పకుండ మరణిస్తాడు. ధృతరాష్ట్రుడు ఆపదల పాలౌతాడు. ధర్మమునందు మనస్సు లగ్నమైనవారికి జయం దుర్లభం కాదు. విష్ణుభక్తులకు అనంత ఐశ్వర్యాలు కలుగుతాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. సామాన్య విషయం విశేష విషయంతో కాని, విశేష విషయం సామాన్య విషయంతోకాని సమర్థిస్తే అర్థాంతరన్యాసం. సామాన్యంతో - విశేషం - విశేషంతో సమర్థించినా అర్థాంతర న్యాసమే. ఇక్కడ రెండు సామాన్య విషయాలు ఉన్నాయి. 'ధర్మతత్పరులకు గెల్పు బ్రాఁతె' 'హరిభక్తులఁ బొందవె భూరిసంపదల్' ఈ రెండు సామాన్య విషయాలతో - 'ఇంక ధరణికి నాయకుఁడు ధర్మతనూజుఁడు' అనే విశేష విషయం సమర్థించబడింది. ధర్మతత్పరత, హరిభక్తి- ఈ రెండూ పాండవులకు - అందునా ధర్మరాజునకు ఎక్కువగా ఉన్నాయి.

వ. అని రట్టియెడ నీ కొడుకు నిజసారథిం జూచి 'మనబలం బాహవంబున కోహటించి పాఱెడు నిత్తఱి నేను బరవసంబు సేసినఁ గాని నిలువ దవ్విధంబునకు రథం బనువై యుండఁ జేసి చేరఁ దె' మ్మనిన వాఁ డట్ల చేయ నతం డేనుంగు డిగ్గి రథంబెక్కి యెక్కుడు మగఁటిమిం బొంగునంగంబులతో సైనికుల కడ్డంబు సని యెలుం గెత్తి. 306

ప్రతిపదార్థం: అనిరి; అట్టియెడన్= ఆ సమయమున; నీ కొడుకు; నిజ= తనయొక్క; సారథిన్; చూచి; మనబలంబు= మనయొక్క సైన్యము; ఆహవంబునకున్= యుద్ధమునకు; ఓహటించి= వెనుదీసి; పాఱెడున్= పారిపోవుచుండెను; ఈ+తఱిన్= ఈ సమయమున; నేను; బరవసంబు= ధైర్యము; చేసినన్= కలుగచేసిన; కాని; నిలువదు= నిలిచి ఉండదు; ఆ+విధంబునకున్= ఆ ప్రకారముగా చేయుటకు; రథంబు; అనువై= అనుకూలమై; ఉండన్= ఉండుటను; చేసి; చేరన్= చేరుటకు; తెమ్ము= తీసికొనిరమ్ము; అనినన్= అనగా; వాఁడు; అట్ల= ఆ విధముగానే; చేయన్= చేయగా; అతండు= అతఁడు(దుర్యోధనుఁడు); ఏనుంగు= ఏనుగు; డిగ్గి= దిగి; రథంబు; ఎక్కి; ఎక్కుడు= అధికమయిన; మగఁటిమిన్= పౌరుషమువలన; పొంగు= ఉబ్బు; అంగంబులతోన్= అవయవములతో; సైనికులకున్= సేనలకు; అడ్డంబు= అడ్డముగ; చని= వెడలి; ఎలుంగు= పెద్దకంఠధ్వని; ఎత్తి.

తాత్పర్యం: 'ఇంక ధర్మరాజు నాయకుడు' అని పాండవ పక్ష జనులు అన్నారు. ఆ సమయంలో నీ పుత్రుడు దుర్యోధనుడు తనసారథిని చూచి 'మన సైన్యం యుద్ధానికి వెనుదీసి పారిపోతున్నది. ఈ సమయంలో నేను ధైర్యం కలిగిస్తే కాని నిలిచి ఉండదు. ఆ ప్రకారంగా చేయటానికి రథం అనుకూలమయినది. తెమ్ము' అని అనగా సారథి ఆ విధంగా చేయగా దుర్యోధనుడు ఏనుగు దిగి రథా న్నెక్కి అధికమైన పౌరుషం వలన ఉబ్బిన అవయవాలతో సైనికులకు అడ్డంగా వెడలి పెద్దకంఠధ్వనితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. 'ఎక్కడఁ బోవ వచ్చు? గిరులేనియుఁ గాననభూము లైనఁ దో
నెక్కియుఁ జొచ్చియుం బగతు రేడ్తెఱఁ గిట్టి చలంబునం దలల్
ద్రొక్కక తక్క రట్లయిన దుర్గతి వాటిలుఁ బోక నిల్చి పే
రుక్కునఁ బోరినన్ సుగతి యొండెను సంపద యొండెఁ జొప్పడున్. 307

ప్రతిపదార్థం: ఎక్కడన్= ఎక్కడకు; పోవన్= పోవను; వచ్చున్?= వచ్చును?; గిరులు= పర్వతములు; ఏనియున్= అయినా; కానన= అరణ్య; భూములు; అయినన్; తోన్= తోడనే; ఎక్కియున్= ఎక్కియును; చొచ్చియున్= ప్రవేశించియును; పగతురు= శత్రువులు; ఏడ్తెఱన్= పరాక్రమముతో; కిట్టి= సమీపించి; చలంబునన్= మాత్సర్యముతో; తలల్= శిరములు; త్రొక్కక= త్రొక్కకుండ; తక్కరు= విడువరు; అట్లు= ఆ ప్రకారముగ; అయినన్= అయినచో; దుర్గతి= నరకము; పాటిలున్= కలుగును; పోక= పారిపోకుండా; నిల్చి= నిలిచి; పేరు= పెద్ద; ఉక్కునన్= శౌర్యముతో; పోరినన్= పోరాడినచో; సుగతి= స్వర్గము; ఒండెను= కానీ(ఐనా); సంపద; ఒండెన్= కానీ (ఐనా); చొప్పడున్= కలుగును.

తాత్పర్యం: 'ఎక్కడకు పోవచ్చును? పర్వతా లైనా, అరణ్యా లయినా వెంటనే ఎక్కి, చొచ్చి కూడా శత్రువులు పరాక్రమంతో సమీపించి మాత్సర్యంతో తలలు త్రొక్కకుండా విడువరు. ఆ ప్రకారంగా జరిగితే నరకం కలుగుతుంది. అట్లా పారిపోకుండా నిలిచి గొప్ప పరాక్రమంతో పోరాడితే స్వర్గం అయినా, సంపద అయినా కలుగుతుంది. (పోరాడి మరణిస్తే స్వర్గం - జయిస్తే సంపద కలుగుతాయని తాత్పర్యం.)

వ. అట్లుం గాక. 308

ప్రతిపదార్థం: అట్లున్= ఆ విధంగా; కాక= కాకుండ.

తాత్పర్యం: ఆ విధంగా కాక.

క. పాండవబల మల్పంబై । యుండం గృష్ణుఁడు ధనంజయుండును దప్పిం
బెండువడఁగఁ గని మనకును । గం డడఁగఁగ నేల? గెలుపు గైకొన వచ్చున్.' 309

ప్రతిపదార్థం: పాండవబలము= పాండవులయొక్క సైన్యము; అల్పంబు= తక్కువ(స్వల్పము); ఐ= అయి; ఉండన్= ఉండగా; కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; ధనంజయుండును= అర్జునుడును; దప్పిన్= దాహముతో; బెండువడఁగన్= బలహీనతనొందగా; కని; మనకును= మనకును; గండడఁగఁగన్= పరాక్రమహీనులగుట; ఏల?= ఎందులకు?; గెలుపు= జయము; కైకొనవచ్చున్= పొందవచ్చును.

తాత్పర్యం: పాండవుల సైన్యం తక్కువగా ఉండగా, శ్రీకృష్ణుడు అర్జునుడు దాహంతో బలహీనత పొందగా, మనం పరాక్రమహీనుల మవటం ఎందులకు? గెలుపు పొందవచ్చును.'

వ. అని పలికి కరతలం బెత్తి నిలునిలుమనిన నీబలం బతని నగ్గించుచు మరలె. నమ్మేటిమగండు ముంగలి యయి నిలిచి పొంగారం గవియు కౌంతేయసేనాసముద్రంబునకుఁ జెలియలికట్ట యయ్యె. నయ్యవసరంబునందు మునుకొని వడిం దఱుము వడముడిం బొదివి మనపదాతిప్రకరంబు దర్పంబున నార్పులు బొబ్బలుం జెలంగ బహువిధాస్త్రశస్త్రంబులు వరఁగించినం బెరిఁగిన మదాతిరేకంబున గదాదండంబు ధరియించి ఘోరాకారుం డగుచుఁ దేరు డిగ్గి పేరడవిఁ గూల్చు పెనుగాలి కైవడి నతం డేకవింశతి సహస్రసంఖ్యసుభటుల నేలపాలు సేసె నప్పుడు. 310

ప్రతిపదార్థం: అని; పలికి; కరతలంబు= చేయి; ఎత్తి= పైకి ఎత్తి; నిలునిలుము= ఆగుము ఆగుము; అనినన్= అనగా; నీబలంబు= నీయొక్క సైన్యము; అతనిన్= అతనిని; అగ్గించుచున్= పొగడుచు; మరలెను; ఆ+మేటి మగండు= ఆ గొప్పవీరుడు; ముంగలి= ముందు; అయి= ఉన్నవాడయి; నిలిచి; పొంగారన్= ఉవ్వెత్తున పొంగుచు; కవియు= కలియబడు; కౌంతేయ= కుంతీకుమారులయొక్క; సేనా= సైన్యమనెడి; సముద్రంబునకున్= సముద్రమునకు; చెలియలికట్ట= గట్టు; అయ్యెను; ఆ+అవసరంబునందున్= ఆ సమయమునందు; మునుకొని= ముందుపడి; వడిన్= వేగముగా; తఱుము= వెంటపడి పరుగుపెట్టించు; వడముడిన్= భీముని; పొదివి= చుట్టుముట్టి; మన; పదాతి= కాల్బలముయొక్క; ప్రకరంబు= సమూహము; దర్పంబునన్= గర్వముతో; ఆర్పులు= అరుపులు; బొబ్బలున్= పెద్ద పెద్ద అరుపులు; చెలంగన్= మ్రోయగా; బహువిధ= నానావిధములయిన; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములు; శస్త్రంబులు= సామాన్య ఆయుధములు; వరఁగించినన్= ప్రయోగించగా; పెరిఁగిన; మద= గర్వముయొక్క; అతిరేకంబునన్= ఉద్రేకమువలన; గదాదండంబున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గదను; ధరియించి= పట్టుకొని; ఘోర= భయంకరమయిన; ఆకారుండు= రూపముకలవాడు; అగుచున్= అగుచు; తేరు= రథము; డిగ్గి= దిగి; పేరడవిన్= పెద్ద అరణ్యమును; కూల్చు= పడగొట్టు; పెను= పెద్ద; గాలి; కైవడిన్= విధముగా; అతండు= అతఁడు(భీముడు); ఏకవింశతి= ఇరువదియొక్క; సహస్రసంఖ్య= వేలసంఖ్యగల; సుభటులన్= మంచి వీరులను; నేలపాలు= భూమిపాలు; చేసెను; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: 'గెలుపు పొందవచ్చును' అని చెప్పి దుర్యోధనుడు ముంజేయి పైకెత్తి నిలునిలు మని ఆపగా, కౌరవసైన్యం దుర్యోధనుడిని పొగడుతూ మరలింది. గొప్పవీరు డయిన దుర్యోధనుడు ముందు నిలిచి, ఉవ్వెత్తున పొంగుతూ కలియబడే పాండవసైన్యసముద్రానికి చెలియలికట్ట అయ్యాడు. ఆ సమయంలో ముందుపడి వేగంగా వెంటపడి తరుముతూ పరుగుపెట్టించే భీముడిని చుట్టుముట్టి కౌరవుల కాల్బలం గర్వంతో అరుపులు బొబ్బలతో నానావిధ అస్త్రశస్త్రాలను ప్రయోగించగా, పెరిగిన గర్వముయొక్క ఉద్రేకంవలన భీముడు గదను పట్టుకొని భయంకరమయిన ఆకారం కలవాడై రథం దిగి పెద్ద అడవిని పడగొట్టే పెద్దగాలివలె ఇరువది ఒక్కవేలమంది వీరులను సంహరించాడు. ఆ సమయంలో.

విశేషం: అలం: రూపకం, ఉపమ.

క. **కరిహయరథబృందం బు । ద్ధురత నడరెఁ బాండునృపసుతుల మూఁకలపై**
నరుఁ డబ్బలంబునకు ని । ష్ఠురగాండివ ముక్తశరపటుత్వము సూపెన్. **311**

ప్రతిపదార్థం: పాండునృప= పాండురాజుయొక్క; సుతుల= కుమారులయొక్క; మూఁకలపైన్= సేనలమీద; కరి= ఏనుగులయొక్క; హయ= గుర్రములయొక్క; రథ= రథములయొక్క; బృందంబు= సమూహము; ఉద్ధురతన్= బలంగా; అడరెన్= విజృంభించెను; నరుఁడు= అర్జునుఁడు; ఆ+బలంబునకున్= ఆ సైన్యమునకు; నిష్ఠుర= తీక్షణమయిన; గాండివ= గాండీవమునుండి; ముక్త= విడిచిపెట్టిన; శర= బాణములయొక్క; పటుత్వము= కాఠిన్యము; చూపెన్= చూపెను.

తాత్పర్యం: ఆ సమయంలో పాండవుల సేనలమీద ఏనుగుల, గుర్రాల, రథ సమూహాలు ఒక్కుమ్మడిగా వ్యాపించాయి. అర్జునుడు ఆ సమయంలో ఆ కౌరవబలానికి తీక్షణమయిన గాండీవంనుండి విడిచిపెట్టబడిన బాణాలయొక్క కాఠిన్యం చూపించాడు.

క. **నకులసహదేవులును సా । త్యకియును రభసమున వాలురమ్ములు నిగుడన్**
శకునిపయిఁ గవిసి రతఁడును । బ్రకటస్ఫురణంబునం దిరంబై పోరెన్. **312**

ప్రతిపదార్థం: నకులసహదేవులును; సాత్యకియును; రభసమునన్= శీఘ్రముగా; వాలు= వాడియైన; అమ్ములు= బాణములు; నిగుడన్= వ్యాపింపచేయుచు; శకునిపయిన్= శకునిపై; కవిసిరి= కలియబడిరి; అతఁడును= ఆ శకునియును; ప్రకట= స్పష్టముగా; స్ఫురణంబునన్= తోచునట్లుగా; తిరంబై= స్థిరముగా ఉండి; పోరెన్= పోరాడెను.

తాత్పర్యం: నకుల సహదేవులు, సాత్యకి శీఘ్రంగా వాడి బాణాలు వ్యాపింపజేస్తూ శకునిపై కలియబడ్డారు. ఆ శకుని కూడా స్థిరంగా ఉండి పోరాడాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. సమదగజాధిరూఢుఁ డయి సాల్వుఁడు పాండవసేనఁ జొచ్చి ఘో
టములఁ గలంచుచున్ గజఘటల్ విరియించుచుఁ గాల్బలంబుఁ జి
త్రముగ వధించుచున్ రథకదంబములన్ సమయించుచున్ మహో
గ్రముగఁ జరించువిస్ఫురణఁ గన్గొని కోపసముద్భటాకృతిన్. 313

ప్రతిపదార్థం: సమద= మదముతో కూడిన; గజ= ఏనుగుపై; అధిరూఢుఁడు= అధిరోహించినవాడు; అయి= అయినట్టి; సాల్వుఁడు; పాండవసేనన్= పాండవులయొక్క; సైన్యమును; చొచ్చి= ప్రవేశించి; ఘోటములన్= గుర్రములను; కలంచుచున్= కలతపెట్టుచు; గజ= ఏనుగులయొక్క; ఘటల్= గుంపులూ; విరియించుచున్= విడివడునట్లు చేయుచు; కాల్బలంబున్= పదాతిదళమును; చిత్రముగన్= ఆశ్చర్యకరముగా; వధించుచున్= చంపుచు; రథ= రథములయొక్క; కదంబములన్= గుంపులను; సమయించుచున్= నశింపచేయుచు; మహా= గొప్ప; ఉగ్రముగన్= భయంకరముగ; చరించు= సంచరించు; విస్ఫురణన్= కాంతిని; కన్గొని= చూచి; కోప= కోపముయొక్క; సముద్భట= మిక్కిలి ఆధిక్యం కలిగిన; ఆకృతిన్= ఆకారముతో.

తాత్పర్యం: మదించిన ఏనుగుపై అధిరోహించినవాడై సాల్వుడు పాండవసైన్యంలో ప్రవేశించి గుర్రాలను కలతపెట్టుతూ, ఏనుగుల గుంపులను విడగొట్టుతూ పదాతిదళమును ఆశ్చర్యకరంగా చంపుతూ, రథాల గుంపులను నశింపజేస్తూ కోపంవలన మిక్కిలి కాంతిమంతమైన ఆకారంతో మహాభయంకరంగా తిరుగాడే ఉద్ధతిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: వ్యాసమహాభారతంలో 'సాల్వుడు' అనువాడు లేడు. 'శాల్వుడు' ఉన్నాడు. మూలము 'సన్నివృత్తే బలౌఘే తు 'శాల్వో' మ్లేచ్ఛగణాధిపః । అభ్యవర్తత సంక్రుద్ధః పాండూనాం సుమహద్బలమ్' (శల్య-20-1). ఈ పద్యంలో 'సాల్వుడు' అని యతిస్థానంలో ప్రయోగింపబడినది. 'శ' వర్ణ - 'స' వర్ణములకు అభేదం. 'శాల్వుఁడు' అని ఉండుటయే ఉత్తమ పాఠం. వ్యాసభారతమున 'శాల్వ' నామకులు కాశీరాజపుత్రి 'అంబ'ను ప్రేమించిన క్షత్రియపుత్రుడు శాల్వుడు ఒకడు. ఇక వ్యుషితాశ్వుని పత్ని భద్ర. ఆమె మృతుడైన పతి శవంతో శయనించగా ముృవ్వురు 'శాల్వురు', నల్వురు 'మద్రులు' ఉద్భవించారు. ఈ శాల్వదేశపు రాజే ద్యుమత్సేనుడు. సత్యవంతుడి తండ్రి. మద్రదేశపు రాజు అశ్వపతి. సావిత్రి తండ్రి. సావిత్రీసత్యవంతుల వివాహకథ - సత్యవంతుడి మృత్యుంజయత్వం లోకప్రసిద్ధమే కదా! ఇది పాతకాలపు కథ. అశ్వపతి పాలించిన మద్రదేశానికి రాజు ఈ శల్యుడు. ఇతడు ఈ కురుక్షేత్రయుద్ధ కాలంవాడు. ఇక పాండవపక్షంలో 'శాల్వుడు' అనే యోధుడు ఒకడు ఉన్నాడు. ప్రస్తుతం ఈ పద్యము నందలి 'శాల్వుడు' మ్లేచ్ఛ గణాధిపతి. మహాముష్కరుడు. ఈ మ్లేచ్ఛశాల్వుని గజమునకు గొప్ప చరిత్ర ఉన్నది. ఇది పర్వతంవలె ఉంటుంది. మదధారలతో నిత్యం ప్రకాశిస్తూ ఉంటుంది. ఇంద్రుడి గజం ఐరావతంలో సమానమయిన శక్తి కలది. (ఏనుగులలో అనేకజాతులు కలవు. అందు 'మహాభద్ర' అనే పేరుగల కులమునందు పుట్టినది ఈ గజము. ఈ కులమునందలి ఏనుగులకు భద్రగజములని పేరు. చక్రవర్తులు ఈ భద్రగజాలను అధిరోహిస్తారు. సామాన్య గజములు భద్రగజములు కావు.) ఈ మ్లేచ్ఛ గణాధిపతి (శాల్వుడు) గజశాస్త్రంలో నిష్ణాతుడు. నకులుడు అశ్వవిద్యయందు నిష్ణాతుడు. శాల్వుడు తన ఏనుగును ధృష్టద్యుమ్నుడిపైకి తోలాడు. ధృష్టద్యుమ్నుడు ఈ మదగజాన్ని సంహరించాడు. సాత్యకి శాల్వుడిని సంహరించాడు. 'ఆస్థాయ సుమహానాగమ్ ప్రభిన్నం పర్వతోపమమ్ । దృప్తమైరావత ప్రఖ్యమమిత్ర గణమర్దనమ్॥' యో నౌ మహాన్ భద్రకుల ప్రసూతః । సుపూజితో ధార్తరాష్ట్రేణ నిత్యమ్ । సుకల్పితః శాస్త్ర వినిశ్చయజ్ఞైః సదోపవాహ్యః సమరేషు రాజన్॥ (9-19-2,3).' ఆకాశము - ప్రకృతి; ఆకసము వికృతి - అయినట్లు 'శాల్వుఁడు' తెలుఁగున 'సాల్వుఁడు' వికృతి రూపము కావచ్చును.

ధృష్టద్యుమ్నసాత్యకులచేత సాళ్వుఁ డేనుంగుతోడఁ బీనుంగై పడుట (సం. 9-19-24)

వ. ధృష్టద్యుమ్నుం డెదుర్కొనిన నతనిఁ ద్రొక్కించువాఁడై యవ్వీరుండు వారణపతిఁ గొల్పిన నతండు. 314

ప్రతిపదార్థం: (సాల్వుని చూచి); ధృష్టద్యుమ్నుండు; ఎదుర్కొనినన్= ఎదుర్కొనగా; అతనిన్= ఆ ధృష్టద్యుమ్నుడిని; త్రొక్కించువాఁడై= త్రొక్కించుటకు పూనికొనినవాడై; ఆ+వీరుండు= పరాక్రమవంతుడు అయిన సాల్వుడు; వారణపతిన్= గజరాజును; కొల్పినన్= పురికొల్పగా; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ఎదుర్కొనగా ఆ ధృష్టద్యుమ్నుడిని త్రొక్కించేవాడై ఆ సాల్వుడు గజరాజును పురికొల్పగా ధృష్టద్యుమ్నుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. పటునారాచచయంబు కుంభయుగళీభాగంబునన్ బెట్టు నా
టుటయుం గ్రొవ్వఱి పాఱె నగ్గజము సాటోపంబుగాఁ గ్రమ్మఱిం
చుటకున్ సాల్వుని మెచ్చెఁ గన్గొను జనస్తోమంబు కోపోద్గమో
ద్భటవేగంబున వచ్చి పట్టె నది యాపాంచాలు తే రుగ్రమై. 315

ప్రతిపదార్థం: పటు= కఠినమయిన; నారాచ= బాణములయొక్క; చయంబు= సమూహము; కుంభ= కుంభస్థలమునందలి; యుగళీ= రెండింటియొక్క; భాగంబునన్= ప్రదేశమునందు; బెట్టు= గట్టిగా; నాటుటయున్= గ్రుచ్చుటతో; ఆ+గజము= ఆ ఏనుగు; క్రొవ్వు= మదము; అఱి= తరిగి; పాఱెన్= పారిపోయెను; సాటోపంబుగాన్= ఆడంబరముతోకూడా; క్రమ్మఱించుటకున్= మరలించుటకు; కన్గొను= చూచుచున్న; జన= జనులయొక్క; స్తోమంబు= సముదాయము; సాల్వుని; మెచ్చెన్= పొగిడెను; అది= ఆ ఏనుగు; ఉగ్రమై= భయంకరమై; కోప= క్రోధమువలన; ఉద్గమ= ఉబికిన; ఉద్భట= శ్రేష్ఠమయిన; వేగంబునన్= వేగముతో; వచ్చి; ఆ; పాంచాలు= ధృష్టద్యుమ్నుడియొక్క; తేరు= రథము; పట్టెన్= పట్టుకొనెను.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు కఠినమైన బాణ సమూహంతో ఆ మదగజంయొక్క కుంభస్థలాల జంటను గట్టిగా గ్రుచ్చగా ఆ ఏనుగు మదం తరిగి పారిపోయింది. మరల సాల్వుడు ఆడంబరంతో మరలించినందులకు అక్కడ చూస్తున్న జనసముదాయం సాల్వుడిని పొగడింది. ఆ ఏనుగు భయంకరమై, క్రోధంవలన ఉబికిన శ్రేష్ఠమైన వేగంతో వచ్చి ఆ ధృష్టద్యుమ్నుడి రథాన్ని పట్టుకొన్నది.

క. ఆతఁడు గద చేతం గొని । భీతి గదురుమనముతోడఁ బృథ్వికి దాఁటన్
సుతాశ్వసమేతంబుగ । నా తే రయ్యేనుఁ గెత్తె నాకసమునకున్. 316

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ ధృష్టద్యుమ్నుడు; గద; చేతన్= చేతితో; కొని= తీసికొని; భీతి= భయము; కదురు= కలుగు; మనముతోడన్= మనసుతో; పృథ్వికిన్= భూమిపైకి; దాఁటన్= దూకగా; సూత= సూతుడు; అశ్వ= గుర్రములు; సమేతంబుగన్= సహితముగ; ఆ తేరు= ఆ రథము; ఆకసమునకున్= ఆకాశమునకు; ఆ+ఏనుఁగు= ఆ ఏనుగు; ఎత్తెను= లేవనెత్తెను.

తాత్పర్యం: ఆ ధృష్టద్యుమ్నుడు గద చేత తీసికొని భయం కలిగిన మనసుతో భూమిపైకి దూకగా రథాన్ని తోలే సూతుడితో గుర్రాలతో సహా ఆ రథాన్ని ఆకాశానికి ఆ ఏనుగు ఎత్తివేసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. ఎత్తి త్రిప్పి యాడి యిలతోడ వ్రేసి పా । దములఁ జదుపఁ జూచి దారుణాస్త్ర
తతులు నిగుడఁ బవనతనయ శిఖండి సా । త్యకులు సాల్వుఁ దాఁకి రతిరయమున. 317

ప్రతిపదార్థం: ఎత్తి; త్రిప్పి= గిరగిర త్రిప్పి; ఆడి= ఆడుకొని; ఇలతోడన్= నేలపై; వ్రేసి= కొట్టి; పాదములన్= పాదములతో; చదుపన్= నలుపగా; చూచి; పవన+తనయ= భీముడు; శిఖండి; సాత్యకులు; అతి= మిక్కిలి; రయమునన్= వేగముగా; దారుణ= భయంకరమయిన; అస్త్ర= బాణములయొక్క; తతులు= సమూహములు; నిగుడన్= వ్యాపించునట్లు; సాల్వున్= సాల్వుని; తాఁకిరి= ఎదుర్కొనిరి.

తాత్పర్యం: ఆ రథాన్ని పైకి ఎత్తి త్రిప్పి ఆడుకొని నేలపై కొట్టి, పాదాలతో నలుపగా చూచి భీముడు, శిఖండి సాత్యకి మిక్కిలి వేగంగా భయంకరమైన బాణసమూహాలు వ్యాపించేటట్లు సాల్వుడిని ఎదుర్కొన్నారు.

క. అతఁ డందఱ బాణంబులు । వితథంబులు సేసి యస్త్రవిద్యాపారీ
ణత సూపె నవ్విధం బ । ద్భుతము నినిచె గగనచరతతులచిత్తములన్. 318

ప్రతిపదార్థం: అతఁడు= ఆ సాల్వుడు; అందఱ బాణంబులు= అందరియొక్క బాణములు; వితథంబులు= వ్యర్థములు; చేసి; అస్త్రవిద్యా= బాణవిద్యయందలి; పారీణత= పారము ముట్టుట; చూపెన్= చూపెను; ఆ+విధంబు= ఆ విధానము; గగనచర= దేవతలయొక్క; తతులు= గుంపులయొక్క; చిత్తములన్= మనస్సులను; అద్భుతమును= ఆశ్చర్యమును; నినిచెన్= నింపెను.

తాత్పర్యం: ఆ సాల్వుడు అందరి బాణాలనూ వమ్ము చేసి, అస్త్రవిద్యయందలి సంపూర్ణమైన నేర్పరితనాన్ని చూపాడు. ఆ విధానం దేవతల గుంపుల చిత్తములను ఆశ్చర్యంతో నింపినది.

వ. అప్పుడు. 319

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

తే. ఆజ్ఞ పాటించి మదివెఱ యుజ్జగించి । రయము మెఱయ నప్పాంచాలరాజసుతుఁడు
గదిసి యెగసి కుంభస్థలి గదఁ బగుల్పఁ । గొండ గూలిన ట్లక్కరి గూలె నధిప! 320

ప్రతిపదార్థం: అధిప!= అధిపతి అనగా రాజు అయిన ధృతరాష్ట్ర మహారాజా!; ఆజ్ఞ!= సమయం; పాటించి= ఆదరించి; మది= మనస్సునందు; వెఱ= భయము; ఉజ్జగించి= విడిచి; రయము= వేగము; మెఱయన్= ప్రకాశింపగా; ఆ; పాంచాల రాజసుతుఁడు= ధృష్టద్యుమ్నుడు; కదిసి= సమీపించి; ఎగసి= ఎగిరి; గదన్= గదతో; కుంభస్థలి= కుంభస్థలము; పగుల్పన్= పగులగొట్టగా; ఆ+కరి= ఆ ఏనుగు; కొండ= పర్వతము; కూలినట్లు; పడిపోయినట్లు; కూలెను= పడిపోయెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సమయాన్ని పాటించి మనస్సునందు భయాన్ని తొలగించి, వేగం ప్రకాశించగా ధృష్టద్యుమ్నుడు సమీపించి, ఎగిరి, గదతో కుంభస్థలము పగులగొట్టగా, ఆ ఏనుగు పర్వతం పడిపోయినట్లు పడిపోయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ. ఏనుగు ఉపమేయం; పర్వతం ఉపమానం; కూలుట - సమానధర్మం; అట్లు - వాచకం. అందుచేత సంపూర్ణోపమ.

క. ఆలోనన శినివరుఁడు వి। శాలాస్యప్రదరనిహతి సాల్వునిశిర మా
భీలముగఁ ద్రుంప నాతఁడు। గూలిన మనమూఁక విచ్చెఁ గురువంశనిధీ! 321

ప్రతిపదార్థం: కురువంశనిధీ!= కురువంశమునకు నిధి అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఆలోనన= అంతలోనే; శినివరుఁడు= సాత్యకి; విశాల= విశాలమయిన; ఆస్య= ముఖముకల; ప్రదర= బాణముయొక్క; నిహతిన్= దెబ్బవలన; సాల్వుని; శిరము= తల; ఆభీలముగన్= భయంకరముగ; త్రుంపన్= ఖండించగా; అతఁడు= ఆ సాల్వుడు; కూలినన్= చనిపోగా; మన= మనయొక్క; మూఁక= సైన్యము; విచ్చెన్= విడిపోయెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అంతలోనే సాత్యకి విశాలమైన ముఖం కలిగిన బాణంయొక్క దెబ్బతో సాల్వుడి తలను భయంకరంగా ఖండించగా ఆ సాల్వుడు చనిపోయాడు. మనసైన్యం విడిపోయింది.

ఉ. వాలి యెలుంగు సూపి కృతవర్ముఁడు సైన్యము నిల్వరించి యు
న్మీలిత విక్రముం డగుడు మేమెయి నాతనిఁ దాఁకె నస్త్ర వి
ద్యాలసితుండు సాత్యకి యుదగ్రత వారలు పోర వారి దో
ర్లీలలు సూచి రోటువడి రెండు బలంబులు యోధవీరులున్. 322

ప్రతిపదార్థం: వాలి= అతిశయించి(విజృంభించి); ఎలుంగు= పెద్ద కంఠనాదము; చూపి= చూపించి(చేసి); కృతవర్ముఁడు= కృతవర్మ; సైన్యమున్= సేనను; నిల్వరించి= నిలిపి(ఆపి); ఉన్మీలిత= వికసించిన; విక్రముండు= పరాక్రమముకలవాడు; అగుడున్= కాగా; మేమెయిన్= అనాయాసముగ; అస్త్రవిద్యా= బాణవిద్యయందు; లసితుండు= ప్రకాశించువాడు అయిన; సాత్యకి; ఆతనిన్= ఆ కృతవర్మను; తాఁకెన్= ఎదుర్కొనెను; ఉదగ్రతన్= భయంకరముగా; వారలు= వారు; పోరన్= పోరుచుండగా; రెండు= ఇరుపక్షముల; బలంబుల= సైన్యములయొక్క; యోధవీరులున్= యుద్ధమునందు నేర్పుగల - శూరులును; వారి= వారియొక్క; దోః= భుజములయొక్క; లీలలు= విలాసములు; ఓటుపడి= భయపడి; చూచిరి.

తాత్పర్యం: కృతవర్మ విజృంభించి పెద్ద బొబ్బపెట్టి సేనను ఆపుచేసి, వికసించిన పరాక్రమం ప్రదర్శిస్తూ ఉండగా, బాణవిద్యలో ప్రకాశించే సాత్యకి అనాయాసంగా ఆ కృతవర్మను ఎదుర్కొన్నాడు. వారిరువురూ భయంకరంగా యుద్ధం చేస్తుండగా రెండు పక్షాల సైన్యాలలో పరాక్రమవంతులయిన యోధులు ఆ కృతవర్మ సాత్యకుల భుజబల పరాక్రమ విలాసాలను భయపడి చూచారు.

వ. ఇట్లు పెనంగు చుండి. 323

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; పెనంగుచున్= పోరాడుతూ; ఉండి.

తాత్పర్యం: ఈ ప్రకారంగా కృతవర్మ సాత్యకులు పోరాడుతూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. కృతవర్ము నొంచె నెనిమిది। శితశరముల శినివరుండు శినివరుచాపం
బతఁడు దునిమె బలువిలుగొని। యతని హయంబులను సూతు నాతఁడు గూల్చెన్. 324

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: శినివరుండు= సాత్యకి; ఎనిమిది; శిత= వాడిఅయిన; శరములన్= బాణములతో; కృతవర్మన్= కృతవర్మని; నొంచెన్= నొప్పించెను; అతఁడు= అతడు (కృతవర్మ); శినివరు= సాత్యకియొక్క; చాపంబు= ధనువును; తునిమెన్= ఖండించెను; అతఁడు= సాత్యకి; బలు= బలమయిన; విలు= ధనువు; కొని= తీసికొని; అతని= ఆ కృతవర్మయొక్క; హయంబులను= గుఱ్ఱములను; సూతున్= రథము నడుపువానిని; కూల్చెన్= చంపెను.

తాత్పర్యం: సాత్యకి ఎనిమిది వాడి అయిన బాణాలతో కృతవర్మను నొప్పించాడు. కృతవర్మ సాత్యకి వింటిని ఖండించాడు. సాత్యకి బలమైన మరియొక విల్లు తీసికొని కృతవర్మ గుఱ్ఱాలను, సూతుడిని చంపాడు.

మ. విరథుండై యభిరామశూలమున నవ్వీరుండు శైనేయు వై
చె రయం బార నతండు భల్లమునఁ ద్రుంచెం బెక్కు తుండంబు లై
తొరుఁగం జూచి విషాదియై నిజరథ స్థుం జేసి తద్బాణగో
చరతాదుర్దశ కా వృథోద్యముఁ గృపాచార్యుండు దప్పించినన్. 325

ప్రతిపదార్థం: ఆ+వీరుండు= ఆ శూరుఁడు అయిన కృతవర్మ; విరథుండై= రథములేనివాడయి; అభిరామ= మనోహరమయిన; శూలమునన్= శూలము అను ఆయుధముతో; శైనేయున్= సాత్యకిని; వైచెన్= కొట్టెను; అతండు= సాత్యకి; రయంబు+ఆరన్= మిక్కిలి వేగముగా; భల్లమునన్= బల్లెముతో; త్రుంచెన్= ఖండించెను; పెక్కు= అనేకములగు; తుండంబులై= ఖండములై (ముక్కలై); తొరుఁగన్= పడిపోవుటను; చూచి; కృపాచార్యుండు; విషాదియై= దుఃఖము కలవాడై; నిజ= తనయొక్క; రథస్థున్= రథమునందుండునట్లు; చేసి; తద్= ఆ; బాణ= బాణములకు; గోచరతా= లక్ష్యం కావడమనే; దుర్దశకున్= చెడ్డ అవస్థకు; ఆ; వృథా= వ్యర్థమయిన; ఉద్యమున్= ప్రయత్నము కలవాడయిన కృతవర్మను; తప్పించినన్= తప్పించగా.

తాత్పర్యం: శూరుడయిన ఆ కృతవర్మ రథంలేనివాడై మనోహరమైన బల్లెంతో ఆ శూలాన్ని ఖండించాడు. అది అనేకములయిన ముక్కలై పడిపోయింది. కృపాచార్యుడు అది చూచి జాలిపొంది, తన రథమునందుండేటట్లు చేసి, సాత్యకి ప్రయోగించే ఆ బాణాలకు లక్ష్యమైన చెడ్డదశనుండి - ఆ వ్యర్థ ప్రయత్నం కలవాడయిన కృతవర్మను తప్పించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మన సేన విఱిగె నృప నీ । తనయుం డొక్కరుఁడు నత్యుదగ్రతఁ గుంతీ
తనయుల నద్దెసఁ గల యో । ధని కాయముఁ బొదివె బాణధారలఁ బెలుచన్. 326

ప్రతిపదార్థం: నృప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; మన; సేన; విఱిగెన్= చెల్లాచెదరైపోయెను; నీ తనయుండు= నీయొక్క పుత్రుడు(దుర్యోధనుడు); ఒక్కరుఁడున్= ఒక్కడే; అతి= మిక్కిలి; ఉదగ్రతన్= భయంకరముగా; కుంతీతనయులన్= కుంతీపుత్రులను; ఆ+దెసన్= ఆ వైపు; కల= ఉన్నట్టి; యోధ= వీరులయొక్క; నికాయమున్= సముదాయమును; బాణధారలన్= బాణములయొక్క ధారలతో; పెలుచన్= ఆగ్రహముతో; పొదివెన్= కలియబడెను (క్రమ్ముకొనెను).

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! మన కురుసైన్యం చెల్లాచెదరైపోయింది. నీ పుత్రుడు దుర్యోధనుడు ఒక్కడే మిగిలి పాండవులను, ఆ పాండవపక్షాన కల వీరసముదాయాన్ని బాణసమూహాలతో ఆగ్రహంతో భయంకరంగా క్రమ్ముకొన్నాడు.

మ. పతి యిమ్మై సముదీర్ణవిక్రమకళాపారీణుఁడై విద్విష
చ్చతురంగంబులయందు నొక్కటియు విస్ఫారోల్లసన్మార్గణ
హతికిం దప్పక యుండునట్లుగ సమగ్రాశ్చర్యసంపాదకో
ద్ధతబాహావిభవంబు సూపె సురబృందస్తోత్రపాత్రోద్ధతిన్. 327

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధముగా; పతి= రాజు దుర్యోధనుడు; సముదీర్ణ= బాగుగా పెరిగిన; విక్రమ= పరాక్రమముయొక్క; కళా= కళయందు; పారీణుఁడై= పారము ముట్టినవాడయి; విద్విషత్= శత్రువులయొక్క; చతురంగంబులయందున్= నాలుగు సేనాంగములయందును; ఒక్కటియున్= ఒక్కటికూడా; విస్ఫార= అధికమైన; ఉల్లసత్= ప్రకాశించుచున్న; మార్గణ= బాణములయొక్క; ఆహతికిన్= దెబ్బకు; తప్పక= తప్పించుకొనకుండగా; ఉండునట్లుగన్= ఉండునట్లుగా; సమగ్ర= సంపూర్ణముగా; ఆశ్చర్య= అద్భుతమును; సంపాదక= గడించునట్టి; ఉద్ధత= మదించిన; బాహా= భుజములయొక్క; విభవంబు= వైభవం; సుర= దేవతలయొక్క; బృంద= సమూహముయొక్క; స్తోత్ర= స్తుతులకు; పాత్ర= యోగ్యమయిన; ఉద్ధతిన్= గర్వమును; చూపెన్= చూపించెను.

తాత్పర్యం: ఈ విధంగా దుర్యోధనుడు అపారమైన పరాక్రమంతో శత్రువుల చతురంగబలాలలో ఒక్కటికూడా అధికంగా ప్రకాశిస్తున్న బాణాల దెబ్బకు తప్పించుకొనకుండా ఉండేటట్లుగా దేవతాసమూహాలయొక్క స్తుతులతో యోగ్యమైన గర్వంతో అద్భుతమైన, అధికమైన భుజబలసంపదను సంపూర్ణంగా చూపించాడు.

వ. అప్పుడు రెండు వీళ్ళ నతని పాటిమేటిమగలు లేరనుబుద్ధి నాకుం బొడమెఁ బదంబపడి పాండవులును జేయఁగల వారలును నవ్వీరుం బొదివిన నతం డందఱ కన్ని రూపులై ధర్మసుతుని శతశరంబులను భీమసేను డెబ్బది సాయకంబులను సహదేవుని నైదింటను నకులు నఱువదినాల్గింటను ధృష్టద్యుమ్నుని సప్త మార్గణంబులను ద్రౌపదేయుల నైదైదు తూపులను సాత్యకి మూఁడు కాండంబుల నొప్పించి సహదేవుధనువు దునిమిన నక్కుమారుండు వేఱొక్క విలు గొని చలంబున నక్కురువిభుం గదిసినఁ దక్కటి రథికులుం గూడికొని యొక్కొక్కరుండు పె క్కమ్ములు పైఁ గురియఁ గేలిచందంబున వాని నన్నింటి వారించుచుఁ దత్తనువుల శోణితంబు పూరించుచు నాజెట్టి జోదు బెట్టిదుండై పెనంగ మన యోధులుం బురికొని యద్దొరల మార్కొనిరి. మన సైన్యంబు దైన్యంబు విడిచి మరలి వారిబలంబులఁ దలపడియె నట్టియెడ. 328

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయమున; రెండు; వీళ్ళను= దండులందును; అతనిపాటి= అతనివంటి; మేటి= గొప్ప; మగలు= వీరులు; లేరను= లేరు అను; బుద్ధి= తలపు; నాకున్= నాకు; పొడమెన్= కలిగెను; పదంపడి= వెనువెంటనే; పాండవులును; చేయఁగలవారలునున్= యుద్ధము చేయగలవారలును; ఆ+వీరున్= ఆ వీరుని; పొదివినన్= క్రమ్ముకొనగా; అతండు= అతడు(దుర్యోధనుడు); అందఱకున్= అందరకు; అన్ని; రూపులై= ఆకారములై; ధర్మసుతునిన్= ధర్మరాజును; శత= నూరు; శరంబులను= బాణముతోను; భీమసేనున్= భీమసేనుని; డెబ్బది; సాయకంబులను= బాణములతోను; సహదేవునిన్= సహదేవుని; ఐదింటను= అయిదు బాణములతోను; నకులున్= నకులుని; అఱువది నాల్గింటను= అరవైనాలుగు బాణాలతోను; ధృష్టద్యుమ్నుని= ధృష్టద్యుమ్నుని; సప్త= ఏడు; మార్గణంబులను= బాణములతోను; ద్రౌపదేయులన్= ద్రౌపదిపుత్రులను; అయిదైదు= ఐదేసి; తూపులను= బాణములతోను; సాత్యకిన్= సాత్యకిని; మూఁడు; కాండంబులన్= బాణములతోను; నొప్పించి= బాధించి; సహదేవుధనువు= సహదేవునియొక్క విల్లు; తునిమినన్= ఖండించగా; ఆ+కుమారుండు= ఆ కుమారుడు అనగా సహదేవుడు; వేఱొక్క= మరియొక; విలు= విల్లు(ధనువు); కొని= తీసికొని; చలంబునన్= మాత్సర్యముతో;

ఆ+కురువిభున్= ఆ కురురాజును (దుర్యోధనుని); కదిసినన్= దగ్గరకురాగా; తక్కటి= మిగిలిన; రథికులున్= రథముపై నుండి యుద్ధము చేయు వీరులును; కూడికొని= కలిసికొని; ఒక్కొక్కరుండు= ఒక్కొక్కడు; పెక్కు= అనేకములయిన; అమ్ములు= బాణములు; పైన్= మీద; కురియన్= కురిపించగా; కేలి= క్రీడ; చందంబునన్= విధముగా; వానిని; అన్నింటిని; వారించుచున్= అడ్డుకొనుచు; తద్= ఆ; తనువులన్= శరీరములందు; శోణితంబు= రక్తము; పూరించుచున్= నింపుచు; ఆ; జెట్టి= మల్లుడు అయిన; జోదు= యోధుడు; బెట్టిదుండై= గర్వితుడై; పెనంగన్= యుద్ధము చేయుచుండగా; మన= మనయొక్క; యోధులున్= వీరులును; పురికొని= క్రమ్ముకొని; ఆ+దొరలన్= ఆ యోధ శ్రేష్ఠులను; మార్కొనిరి= ఎదుర్కొనిరి; మన సైన్యంబు= మనయొక్క సేన; దైన్యంబు= దీనత్వము; విడిచి= వదలి; మరలి= తిరిగి; వారి= వారియొక్క; బలంబులన్= సేనలతో; తలపడియెన్= పోరాడెను; అట్టియెడన్= ఆ సమయమున.

తాత్పర్యం: ఆ సమయంలో ఇరుపక్షాలలోనూ అతడివంటి గొప్ప వీరులు లేరనే తలపు నాకు కలిగింది. వెనువెంటనే పాండవులు, ఆ పక్షమున యుద్ధం చేయగల వీరులు ఆ వీరుడిని (దుర్యోధనుడిని) క్రమ్ముకొనగా అతడు (దుర్యోధనుడు) అందరకును అన్ని ఆకారాలు కలవాడై, ధర్మరాజును నూరు బాణాలతోను భీమసేనుడిని డెబ్బది బాణాలతోను, సహదేవుడిని అయిదు బాణాలతోను, నకులుడిని అరువది నాలుగు బాణాలతోను ధృష్టద్యుమ్నుడిని ఏడు బాణాలతోను, ద్రౌపది పుత్రులను ఐదేసి బాణాలతోను, సాత్యకిని మూడు బాణాలతోను, నొప్పించి సహదేవుడి విల్లు ఖండించగా సహదేవుడు మరియొక విల్లు తీసికొని మాత్సర్యంతో ఆ కురురాజు (దుర్యోధనుడి) దగ్గరకు రాగా మిగిలిన రథికులను కలిసికొని ఒక్కొక్కడు అనేకములయిన బాణాలు ఆ దుర్యోధనుడిపై కురిపించగా క్రీడవలె వాటిని అన్నింటినీ అడ్డుకొంటూ ఆ శరీరములయందు రక్తం నింపుతూ మల్లుడైన ఆ యోధుడు (దుర్యోధనుడు) గర్వితుడై యుద్ధం చేస్తూ ఉండగా మన వీరులు క్రమ్ముకొని ఆ యోధశ్రేష్ఠులను (పాండవవీరులను) ఎదుర్కొన్నారు. మనసేన దీనత్వం విడిచి తిరుగబడి వారి(పాండవులయొక్క) సేనలతో పోరాడింది. ఆ సమయంలో.

క. భీముఁడు గురుతనయుఁడు ను । ద్దామ భుజావీర్యశౌర్యధైర్యములు జన
స్తోమము లగ్గింపఁగ సం । గ్రామ మొనర్చిరి నితాంతగాఢస్ఫూర్తిన్. 329

ప్రతిపదార్థం: భీముఁడున్= భీముడును; గురు= ద్రోణునియొక్క; తనయుఁడును= పుత్రుడును (అశ్వత్థామయును); ఉద్దామ= అధికమైన; భుజా= భుజములయొక్క; వీర్య= పరాక్రమము; శౌర్య= పరాక్రమము (శూరత్వము); ధైర్యము= ధీరత్వములు; జన= జనులయొక్క; స్తోమములు= సమూహములు; అగ్గింపఁగన్= స్తుతించుచుండగ; నితాంత= అత్యంతము (మిక్కిలి); గాఢ= అధికమైన; స్ఫూర్తిన్= ఉత్సాహంతో; సంగ్రామము= యుద్ధము; ఒనర్చి= చేసిరి.

తాత్పర్యం: భీముడు, అశ్వత్థామ అడ్డులేని తమ భుజబల పరాక్రమధైర్యాలను ప్రజాసమూహాలు మెచ్చుకొంటూ ఉండగా అత్యంతం అధికమైన ప్రకాశంతో యుద్ధం చేశారు.

చ. పరుషపరాక్రమస్ఫురణఁ బాండవముఖ్యుని వాజులం జతు
శ్శరహతిఁ గూల్చె సౌబలుఁడు సత్వరుఁడై సహదేవుఁ డమ్మహీ
శ్వరుఁ దనతేరిమీఁద నిడి సంగరమధ్యముఁ బాపె నాతఁ డొం
డరదముమీఁదికిం జని రయంబున నయ్యరిఁ దాఁకె నుద్ధతిన్. 330

ప్రతిపదార్థం: పరుష= కఠినమైన; పరాక్రమ= పరాక్రమముయొక్క; స్ఫురణన్= ప్రకాశంతో; పాండవ= పాండవులలో; ముఖ్యుని= ముఖ్యుడైన ధర్మజునియొక్క; వాజులన్= గుర్రములను; సౌబలుఁడు= శకుని; చతుః= నాలుగు; శర= బాణములయొక్క; హతిన్= దెబ్బతో; కూల్చెన్= చంపెను; సహదేవుఁడు= సహదేవుడు; సత్వరుఁడై= వేగిరపాటు కలవాడయి; ఆ= ఆ; మహీ+ఈశ్వరున్= ధర్మజుని; తన= తనయొక్క; తేరిమీఁదను= రథముపైని; ఇడి= ఉంచి; సంగర= యుద్ధముయొక్క; మధ్యము+పాపె= మధ్యనున్నవానిని; పాపెన్= తొలగించెను; ఆతఁడు= అతడు (ఆ ధర్మరాజు); ఒండు= మరియొక; అరదము= రథము; మీఁదికిన్= పైకి; చని= వెడలి; రయంబునన్= వేగముగా; ఆ+అరిన్= ఆ శత్రువును; ఉద్ధతిన్= గర్వముతో; తాఁకెను= ఎదుర్కొనెను.

తాత్పర్యం: శకుని కఠినమైన పరాక్రమవిక్రమంతో ధర్మజుడి గుర్రాలను నాలుగు బాణాలతో కొట్టి చంపాడు. సహదేవుడు వెంటనే వేగిరపాటుతో ధర్మరాజును తన రథంపైన ఉంచి, యుద్ధంయొక్క నడుమ భాగంనుండి తొలగించాడు. ధర్మరాజు ఇంకొక రథం మీదకు వెడలి, వేగంగా ఆ శత్రువును (శకునిని) ఎదుర్కొన్నాడు.

క. శరములఁ బొదివిన నాతఁడు । దిరమై యేయంగ రణము దివిజగరుడ ఖే
చరసిద్ధప్రకరాద్భుత । కరప్రకారమున నొప్పెఁ గౌరవనాథా! 331

ప్రతిపదార్థం: కౌరవనాథా!= కౌరవులకు ప్రభువైన ఓ ధృతరాష్ట్రమహారాజా!; శరములన్= బాణములతో; పొదివినన్= క్రమ్ముకొనగా; ఆతఁడు= ఆ శకుని; తిరమై= స్థిరముగా ఉండి; ఏయంగన్= బాణములు ప్రయోగించగా; రణము= యుద్ధము (శకుని ధర్మరాజుల యుద్ధము); దివిజ= దేవతలకు; గరుడ= గరుడులకు; ఖే= ఆకాశమున; చర= సంచరించు; సిద్ధ= సిద్ధులయొక్క; ప్రకర= సమూహములకు; అద్భుతకర= ఆశ్చర్యకరములైన; ప్రకారమునన్= విధముగ; ఒప్పెన్= ప్రకాశించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధర్మరాజు శకునిని బాణాలతో క్రమ్ముకొనగా ఆ శకుని కూడా స్థిరంగా ఉండి బాణాలు ప్రయోగించగా వారి యుద్ధం దేవతలు, గరుడులు, ఆకాశసంచారులైన సిద్ధగణాలు ఆశ్చర్యం పొందేటట్లుగా ప్రకాశించింది.

సీ. శకుని నందనుఁడును నకులుండు నొండొరు । లకుఁ జండ బాహుబలంబు సూపి
రతుల శౌర్యమున సాత్యకికృతవర్ములు । పోరిరి విలుద్రుంచి కౌరవేంద్రుఁ
డేసె ధృష్టద్యుమ్ను నేచి యొండొకవింట । నతని నాతఁడు నొంప నక్కజంపుఁ
గయ్య మయ్యిరువుర కయ్యెఁ ద్రౌపదిపుత్రు । లేవురు పతిఁ గిట్టి యింద్రియములు

తే. బాలిశునిఁ జిక్కువఱిచినపగిదిఁ దలరఁ । జేయ నతఁ డీడఁబోవక సాయకములు
పెక్కు రయమున నిగిడించి యక్కుమార । వితతిఁ గలఁపఁ దత్సంగర మతిశయిల్లె. 332

ప్రతిపదార్థం: శకుని= శకునియొక్క; నందనుఁడును= పుత్రుడును; నకులుండును= నకులుడును; ఒండొరులకున్= వారికి ఒకరు; చండ= భయంకరమైన; బాహు= భుజములయొక్క; బలంబు= బలము (శక్తి); చూపిరి; అతుల= సాటిలేని; శౌర్యమునన్= పరాక్రమముతో; సాత్యకి; కృతవర్మలు; పోరిరి= పోరాడిరి; విలు= ధనువు; త్రుంచి= ఖండించి; కౌరవ+ఇంద్రుఁడు= కౌరవులకు ప్రభువైన దుర్యోధనుడు; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుని; ఏసెన్= కొట్టెను; ఆతఁడు= ఆ ధృష్టద్యుమ్నుడు; ఒండొక= మరియొక; వింటన్= వింటితో (ధనువుతో); అతనిన్= ఆ దుర్యోధనుడిని; ఏచి= అతిశయించి; నొంపన్= నొప్పచేయగా (బాధించగా); ఆ+ఇరువురకున్= ఆ ఇద్దరకు; అక్కజంపు= ఆశ్చర్యకరమగు (అధికమగు); కయ్యము=

యుద్ధము; అయ్యెన్= అయ్యెను; ద్రౌపదిపుత్రులు= ద్రౌపదియొక్క పుత్రులు; ఏవురు= అయిదుగురు; పతిన్= రాజును (దుర్యోధనుని); కిట్టి= సమీపించి; ఇంద్రియములు= ఇంద్రియములు (త్వక్కు - చక్షువు - శ్రోత్రము - జిహ్వ - ఘ్రాణములు జ్ఞానేంద్రియములు అయిదు. వాక్కు - పాణి - పాదము - పాయువు - ఉపస్థలు - కర్మేంద్రియములు అయిదు - ద్రౌపది పుత్రులు అయిదుగురు); బాలిశునిన్= మూర్ఖుని (అజ్ఞానిని); చిక్కు= సంకటము; పఱచిన= పడచేసిన(పెట్టినట్లుగా); పగిదిన్= విధముగ; తలరన్= చలింప; చేయన్= చేయగా; అతఁడు= అతడు (దుర్యోధనుడు); ఈడఁబోవక= వెనుదీయక; పెక్కు= అనేకములైన; సాయకములు= బాణములు; రయమునన్= వేగముగా; నిగిడించి= ప్రయోగించి; ఆ+కుమార= ఆ ద్రౌపదికుమారులయొక్క; వితతిన్= సమూహమును; కలఁపన్= బాధించగా; తత్సంగరము= ఆ యుద్ధము; అతిశయిల్లెన్= విజృంభించెను.

తాత్పర్యం: శకుని పుత్రుడు ఉలూకుడు, నకులుడు ఒకరికొకరు భయంకరమైన భుజబలాన్ని చూపెట్టుకొన్నారు. సాటిలేని పరాక్రమంతో సాత్యకి కృతవర్మలు పోరాడారు. దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడిని ధనువు ఖండించి కొట్టాడు. ఆ ధృష్టద్యుమ్నుడు మరియొక వింటితో అతిశయించి ఆ దుర్యోధనుడిని బాధించాడు. ఆ ఇద్దరకు ఆశ్చర్యకరమైన గొప్పయుద్ధం జరిగింది. ద్రౌపదిపుత్రులు అయిదుగురూ దుర్యోధనుడిని సమీపించి, ఇంద్రియాలు అజ్ఞాని అయిన మూర్ఖుడిని సంకటపరచినట్లు చలింపజేశారు. ఆ దుర్యోధనుడు వెనుదీయక అనేకములైన బాణాలు వేగంగా ప్రయోగించి, ద్రౌపదికుమారసమూహాన్ని కలత చెందించాడు. ఇట్లా ఆ యుద్ధం అతిశయించింది.

విశేషం: ఈ పద్యమున తిక్కన "ఉపమా కాళిదాసస్య" అనే ఆర్యోక్తి స్ఫురించేటట్లు ఒక చక్కని చిక్కని ఉపమాలంకారాన్ని ప్రయోగించాడు. 'ద్రౌపది పుత్రులేవురు పతిఁ గిట్టి యింద్రియములు బాలిశునిఁ జిక్కు వఱచిన పగిది' - జ్ఞానేంద్రియాలు అయిదు కర్మేంద్రియాలు అయిదు. జ్ఞాని ఇంద్రియ విషయాలకు అతీతంగా ఉంటాడు. అజ్ఞాని ఇంద్రియాలకు వశుడై సంసార సంకటములం దుంటాడు. అట్లే ద్రౌపది పుత్రులైదుగురకు దుర్యోధనుడు వశుడయ్యాడని తాత్పర్యం. ద్రౌపది పుత్రులు ఉపమేయం; ఇంద్రియములు ఉపమానం; చిక్కుపరచుట - సమానధర్మం; పగిది - ఉపమావాచకం. దుర్యోధనుడు ఉపమేయం; బాలిశుడు ఉపమానం; చిక్కుపరచుట - సమానధర్మం; పగిది - ఉపమావాచకం. ఇది ఉపమాసంశ్లిష్టం.

పంచపాండవులు పంచమహాభూతాలకు ప్రతీకలు. యమ,వాయు,ఇంద్ర,అశ్వినులు - పంచమహాభూతాలకు అధిష్ఠానదేవతలు - శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు - వాటి గుణములు లేక తన్మాత్రలు. కుంతి ప్రకృతి. యాజ్ఞసేని ద్రౌపది శక్తి. పంచభూతములైన పంచపాండవులకు శక్తియందు జన్మించిన ఉపపాండవులు - పంచేంద్రియములకు ప్రతీకలు. ఇంతటి భావార్థాన్ని - ఈ ఉపమాలంకారంతో స్ఫురింపచేయటం తిక్కన విశిష్టత.

వ. మఱియు ననేకు లనేకులం బొదివి పోరాడ నంతకంతకుఁ బేర్చిన యగ్గలిక మొగ్గరంబులు రెండునుం గలయం బెరసినం బేర్చిన పెంధూళి భానుబింబంబు గప్పె నప్పుడు దొరుఁగు నరతురంగమాతంగరుధిరధారల నడంగిన నధికంబైన సంగరంబునకుం గడంగిన కౌంతేయుల యురవడికి నోహటించి మన మోహరంబు దొరలు మరలిన మరలనీక నీ కొడుకు పురికొలుపుకొని తఱిమినం గనలి ధర్మసుతుండు. 333

ప్రతిపదార్థం: మఱియును= ఇంకను; అనేకులు= పలువురు; అనేకులన్= పలువురను; పొదివి= క్రమ్మి; పోరాడన్= యుద్ధముచేయుచుండగా; అంతకంతకున్= అంతకంతకును; పేర్చిన= అతిశయించిన; అగ్గలికన్= శౌర్యముతో; మొగ్గరంబులు= సేనావ్యూహములు; రెండునున్= రెండును; కలయన్= కలియబడి; బెరసినన్= వ్యాపించగా; పేర్చిన= అతిశయించిన; పెంధూళి= పెద్దదుమ్ము; భానుబింబంబు= సూర్యబింబమును; కప్పె= కప్పెను; అప్పుడు= ఆ సమయమున; తొరుఁగు=

ప్రవించు; నర= మనుజులయొక్క; తురంగ= గుఱ్ఱములయొక్క; మాతంగ= ఏనుగులయొక్క; రుధిర= రక్త; ధారలన్= ధారలచేత; అడంగినను= అణగారిపోగా; అధికంబైన= ఎక్కువైన; సంగరంబునకున్= యుద్ధమునకు; కడంగిన= ప్రయత్నించిన (పూనిక వహించిన); కౌంతేయుల= కుంతీపుత్రులయొక్క; ఉరవడికిన్= మిక్కిలి వేగమునకు; ఓహటించి= వెనుదీసి; మన= మనయొక్క; మోహరంబు= సేనావ్యూహమునందలి; దొరలు= రాజులైన వీరులు; మరలినన్= తిరిగిపోవుచుండగా; నీ కొడుకు= నీ యొక్క కొడుకు (దుర్యోధనుడు); మరలనీక= తిరిగిపోకుండ; పురికొలుపుకొని= క్రమ్ముకొని (ఉత్సాహము కల్పించి); తఱిమినన్= తరుమగా; కనలి= కోపించి; ధర్మసుతుండు= ధర్మరాజు.

తాత్పర్యం: ఇంకా పలువురు పలువురను క్రమ్మి పోరాడగా అంతకంతకూ అతిశయించిన శౌర్యంతో సేనావ్యూహాలు రెండును కలియబడి వ్యాపించగా, అతిశయించిన పెద్దదుమ్ము సూర్యబింబాన్ని కప్పివేసింది. ఆ సమయాన స్రవించే నరులయొక్క, గుఱ్ఱాలయొక్క, ఏనుగులయొక్క రక్తధారలచేత దుమ్ము అణగారిపోగా, అధికమైన యుద్ధానికి పూనిక వహించిన పాండవుల వేగానికి వెనుదీసి కౌరవసేనా వ్యూహంలోని వీరులు తిరిగి పోతుండగా దుర్యోధనుడు తిరిగిపోకుండా పురికొల్పి తరుమగా, కోపించి ధర్మరాజు (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **మూఁడు నారాచములఁ గృపు వాఁడి చెఱిచి । వాలి కృతవర్మహయముల నాలుగింటఁ**
గూల్పఁ దనతేరిపై నిడి గురుసుతుండు । దొలఁగుఁ గొంపోయె నవ్విరథుని నృపాల! **334**

ప్రతిపదార్థం: నృపాల!= ధృతరాష్ట్ర మహారాజా!; (ధర్మరాజు); మూఁడు= మూడు; నారాచములన్= బాణములతో; కృపు వాఁడి= కృపునియొక్క శౌర్యము; చెఱిచి= పోగొట్టి; వాలి= అతిశయించి; కృతవర్మ= కృతవర్మయొక్క; హయములన్= గుఱ్ఱములను; నాలుగింటన్= నాలుగింటితో (నాలుగు బాణములతో); కూల్పన్= చంపగా; గురుసుతుండు= అశ్వత్థామ; తనతేరిపైన్= తనయొక్క రథముమీద; ఇడి= ఉంచి; తొలఁగన్= తొలగునట్లు; ఆ+విరథుని= ఆ రథములేనివానిని (కృతవర్మను); కొంపోయెను= తీసికొనిపోయెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధర్మరాజు మూడు బాణాలతో కృపాచార్యుడి శౌర్యం పోగొట్టి అతిశయించి కృతవర్మ గుఱ్ఱాలను నాలుగు బాణాలతో చంపగా అశ్వత్థామ రథంలేని కృతవర్మను తన రథంమీద ఉంచి తొలగించటానికి తీసికొనిపోయాడు.

చ. **కురుపతి చూచి చిత్తమునఁ గోపము పెంపెసలార నేడు నూ**
ఱరదము లాతనిం బొదువునట్లుగఁ బంచిన నొక్క పెట్ట బం
ధురతర వారివాహములు తోయజబాంధవుఁ గప్పుచాడ్పు దోఁ
ప రయముమైఁ గడంగి యవి పైకొని యవ్విభుతోఁ బెనంగఁగన్. **335**

ప్రతిపదార్థం: కురుపతి= కౌరవులకు ప్రభువైన దుర్యోధనుడు; చూచి; చిత్తమునన్= మనసునందు; కోపము= క్రోధము; పెంపు= ఆధిక్యము; ఎసలారన్= అతిశయించగా; ఏడు; నూఱు= వందలు; అరదములు= రథములు; ఆతనిన్= ఆ ధర్మరాజును; పొదువునట్లుగన్= క్రమ్ముకొనునట్లుగా; పంచినన్= పంపించగ; ఒక్కపెట్టన్= ఒక్కసారిగా; బంధురతర= మిక్కిలి దట్టమైన; వారివాహములు= మేఘములు; తోయజ= పద్మములకు; బాంధవున్= చుట్టమైన సూర్యుని; కప్పు= కప్పివేయు; చాడ్పు= విధము; తోఁపన్= తోచగా (అనిపించగా); రయముమైన్= వేగంతో; కడంగి= ప్రయత్నించి; అవి= అవి (ఆ ఏడు వందల రథములు); పైకొని= కలియబడి-మీదపడి; ఆ+విభుతోన్= ఆ ప్రభువైన ధర్మరాజుతో; పెనంగఁగన్= యుద్ధంచేయగా.

తాత్పర్యం: ధర్మరాజు కృపుడిని, కృతవర్మను విరథులను చేయటం దుర్యోధనుడు చూచి, మనసులో కోపం వృద్ధిపొందగా ఏడు వందల రథాలు ఆ ధర్మరాజును క్రమ్ముకొనేటట్లుగా పంపించాడు. దట్టమైన మేఘాలు ఒక్కసారిగా సూర్యుడిని కప్పివేసినట్లుగా ఆ ఏడువందల రథాలు వేగంగా ఆ ధర్మరాజుతో కలియబడి యుద్ధంచేస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. ధర్మరాజు - ఉపమేయము; సూర్యుడు - ఉపమానం; కప్పివేయుట - ధర్మము; విధము - వాచకం. అట్లే ఏడు వందల రథములు ఉపమేయం; వారి వాహనాలు ఉపమానం; - కప్పివేయటం ధర్మం; విధం-వాచకం. ధర్మవాచకములు రెండు ఉపమేయ ఉపమానాలు సమానం కావున ఇది ఉపమా సంశ్లిష్టము. ఇట్టి విశిష్ట అలంకార ప్రయోగం తిక్కయజ్వ ప్రత్యేకత.

క. కనుఁగొని శికండిముఖయో । ధనికాయం బడరి యా రథప్రకరంబున్
సునిశితశరప్రకరములఁ । దనుమాడెన్ రౌద్రరసము దొలుకాడంగన్. 336

ప్రతిపదార్థం: శిఖండి= శిఖండి; ముఖ= మున్నగు; యోధ= యుద్ధవీరుల; నికాయంబు= సమూహము; కనుఁగొని= చూచి; అడరి= అతిశయించి (త్వరపడి); ఆ రథప్రకరంబున్= ఆ రథములయొక్క సమూహమును; రౌద్రరసము; తొలుకాడంగన్= తొణికిసలాడునట్లుగా; సునిశిత= బాగుగా వాడియైన; శర= బాణములయొక్క; ప్రకరములన్= సమూహములతో; తునుమాడెన్= ఖండించెను.

తాత్పర్యం: శిఖండి ప్రముఖయుద్ధవీరుల సమూహాన్ని చూచి, అతిశయించి, ఆ రథాల సమూహాన్ని రౌద్రరసం తొణికిసలాడేటట్లుగా వాడి అయిన బాణసమూహాలతో ఖండించాడు.

వ. ఆ సమయంబున మనదెస నుల్కాపాతశర్కరావర్షాదులగు నుత్పాతంబులు గలిగె వానికి శంకింపక శకుని గడంగి యోధవరులతో 'మీరు కోల్తల సేయుం డేను బెడముట్టునఁ దాఁకి ధర్మనందనాదులను సమయించెద' నంచు సముద్ధతిం గదిసె, నప్పుడు మద్రేశబలపురస్సరంబైన యమ్మోహరంబు రభసంబునం దటిమి పాండవసేనా సంరంభంబున కోర్వక తిరిగిన నా సుబలసూనుండు ప్రబలతురంగ దశ సహస్రంబులతో వేగంబు మెఱయ వైరిసేనవెనుకఁ గిట్టి 'యేను గలుగ మీకు భయం బేల?' యని యక్కౌరవసైనికులం బేరుకొని యదల్చి యార్చిన నా కౌంతేయవాహిని కలంగినఁ గని ధర్మనందనుండు సహదేవు నాలోకించి. 337

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అప్పుడు; మనదెసను= మనవైపు; ఉల్కా= ఆకాశమునుండి పడుచున్నటులు భాసించు తారవంటి వెలుగు; పాత= పడుట; శర్కరా= చక్కెరయొక్క; వర్షాదులు= వర్షములు మొదలగునవి; అగు= ఐన; ఉత్పాతంబులు= అపశకునములు; కలిగెన్= పుట్టెను; వానికిన్= ఆ అపశకునములకు; శంకింపక= సందేహింపక; శకుని; కడంగి= ప్రయత్నించి (పూనిక వహించి); యోధవరులతోన్= యోధశ్రేష్ఠులతో; మీరు; కోల్తలసేయుండు= ఎదుటనిలిచి యుద్ధము చేయుడు; ఏను= నేను; పెడముట్టునన్= వెనుకనుండి ముట్టడించి; తాఁకి= ఎదుర్కొని; ధర్మనందన= ధర్మరాజు; ఆదులను= మొదలగువారిని; సమయించెదను= సంహరించెదను; అంచున్= అనుచు; సముద్ధతిన్= మిక్కిలి దర్పముతో; కదిసెన్= కలియబడెను; అప్పుడు= ఆ సమయమున; మద్రేశ= శల్యుని; బల= సైన్యము; పురస్సరంబైన= ముందు నడుచుచున్నట్టిదైన; ఆ+మోహరంబు= ఆ సేనావ్యూహము; రభసంబునన్= సాహసముతో; తటిమి= కలియబడి; పాండవ= పాండవులయొక్క; సేనా= సైన్యముయొక్క;

సంరంభంబునకున్= వేగిరపాటునకు; ఓర్వక= భరింపజాలక; తిరిగినన్= మరలిపోవుచుండగా; ఆ సుబలసూనుండు= ఆ శకుని (సుబలునియొక్క కుమారుడు); ప్రబల= మిక్కిలి బలమైన; తురంగ= గుర్రములయొక్క; దశసహస్రంబుతోన్= పదివేలతో; వేగంబు= వేగము; మెఱయన్= ప్రకాశింపంగా; వైరి= శత్రువులయొక్క; సేన= సైన్యమునకు; వెనుకన్= వెనుకభాగము; కిట్టి= సమీపించి; ఏను= నేను; కలుగన్= ఉండగా; మీకున్; భయంబు= భయము; ఏల?= ఎందులకు? అని; ఆ+కౌరవ= ఆ కౌరవులయొక్క; సైనికులన్= సేనలను; పేరుకొని= పేరుపెట్టి పిలిచి; అదల్చి= అదలించి; ఆర్చినన్= పెద్ద బొబ్బపెట్టగా (అరవగా); ఆ కౌంతేయవాహిని= ఆ కుంతీపుత్రులయొక్క సేన; కలంగినన్= కలత చెందగా; ధర్మనందనుండు= ధర్మరాజు; సహదేవున్= సహదేవుని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అప్పుడు మనవైపు ఉల్కలు చక్కెరవర్షాలు మొదలైన అపశకునాలు కలిగాయి. ఆ అపశకునాలకు సందేహించక, శకుని పూనిక వహించి యోధశ్రేష్ఠులతో 'మీరు యుద్ధంచేయండి; నేను వెనుకనుండి ముట్టడించి ఎదుర్కొని ఆ ధర్మరాజు మొదలైన వారిని సంహరిస్తాను.' అంటూ మిక్కిలి గర్వంతో కలియబడ్డాడు. ఆ సమయంలో శల్యుడి సైన్యం ముందు పోతుండగా ఆ సేనావ్యూహం సాహసంతో కలియబడి పాండవ సేనల వేగిరపాటునకు భరింపజాలక మరలిపోవుతుండగా శకుని మిక్కిలి బలమైన పదివేల గుర్రాలతో వేగం ఒప్పగా శత్రుసేన వెనుక భాగాన్ని సమీపించి, 'నేను ఉండగా మీకు భయం ఎందుకు?' అని ఆ కౌరవసైనికులను పేరు పెట్టి పిలిచి, అదలించి, పెద్దబొబ్బపెట్టగా ఆ పాండవుల సేన కలతచెందింది. అప్పుడు ధర్మరాజు సహదేవుడిని చూచి.

శకుని సహదేవు లాశ్వికసహాయులై ఘోరంబుగాఁ బోరుట (సం. 9-21-32)

ఆ. 'వేగ తాఁకు మైదువేల గుఱ్ఱంబులు । ద్రౌపదీతనూజతతియు నీవు
శకుని ననుడు నతఁడు సంరంభజృంభియై । యట్ల చేయ ఘోరమయ్యెఁ బోరు. 338

ప్రతిపదార్థం: ఐదువేల గుఱ్ఱంబులు= ఐదువేల గుర్రములు; ద్రౌపదీ= ద్రౌపదియొక్క; తనూజ= పుత్రులయొక్క; తతియున్= సమూహమును (అనగా ఉపపాండవులును); నీవు; శకునిన్= శకునిని; వేగ= వేగముగ; తాఁకుము= ఎదుర్కొనుము; అనుడున్= ఇట్లు అనగానే; అతఁడు= అతడు; సంరంభ= త్వరగా; జృంభియై= విజృంభించినవాడై; అట్ల= ఆ విధముగానే (అవధారణార్థము); చేయన్= చేయగా; పోరు= యుద్ధము; ఘోరము= భయంకరము; అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: ధర్మరాజు సహదేవుడిని చూచి 'ఐదువేల గుర్రాలతో ద్రౌపదిపుత్రులు, నీవు శకునిని వేగంగా ఎదుర్కొనండి.' అని చెప్పగా సహదేవుడు త్వరగా విజృంభించినవాడై ఆ విధంగానే చేయగా యుద్ధం భయంకరమైనది.

వ. అట్టి యెడ. 339

తాత్పర్యం: ఆ సమయంలో.

సీ. లీలఁ గట్టియతోడఁ గూలంగవైచియు । డొంకెనపోటులఁ బొంక మడఁచి
పడఁ ద్రోచియును వాలఁ గడికండములుగ వ్రే । సియుఁ గతారంబులఁ జీరి చెఱచి
గీటడంగించియు గిట్టి యొండొరుఁ బట్టి । కొని మల్లుచందంబు ననికిఁ జొచ్చి
నేలకు వంచియుఁ గేలిమై గళముపై । నెక్కియుఁ బెక్కండ్రు రొక్క మొగిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. యెక్కుటయు సహించి యుక్కునఁ బెనఁగియు । నుఱక వివిధగతుల నుబ్బి చెలంగి
బొమ్మలాడినట్లు పోరి యా రావుతు । లధిప! నెరయ మెఱసి రందు నిందు. 340

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; లీలన్= విలాసముగా; కట్టియతోడన్= కర్రతో (దండము); కూలంగన్= కూలిపోవునట్లుగ (చనిపోవునట్లుగ); వైచియున్= విసిరియు; డొంకెన= వంకరల ఈటె; పోటులన్= పొడుపులతో(పొడుచుకొనుట); పొంకము= పొందిక; అడఁచి= అణచి; పడఁద్రోచియును= క్రిందపడునట్లు చేసియు; వాలన్= కత్తితో; కడికండములుగన్= ఖండ ఖండములుగ; వ్రేసియున్= నరికియు; కతారంబులన్= పెద్ద పెద్ద ఖడ్గములతో; చీరి= చీల్చి; చెఱచి= పోగొట్టి; గీటడంగించియున్= చంపియు; కిట్టి= సమీపించి; ఒండొరున్= ఒకరినొకరు; పట్టికొని; మల్లుచందంబున్= మల్లునివిధముగ(జెట్టి); అనికిన్= యుద్ధమునకు; చొచ్చి= తలపడి; నేలకున్= భూమికి; వంచియున్= వంగదీసియు; కేళిమైన్= క్రీడతో; గళముపైన్= కంఠముపై; ఎక్కియున్= ఎక్కియు; పెక్కండ్రురు= పలువురు; ఒక్కమొగిన= ఒక్కసారి మొత్తముగా; ఎక్కుటయున్= మీదపడుటయును; సహించి= ఓర్పువహించి; ఉక్కునన్= శౌర్యముతో; పెనఁగియును= యుద్ధముచేసియు; ఉఱక= లక్ష్యపెట్టక; వివిధ= అనేక విధములైన; గతులన్= గమనములతో; ఉబ్బి= సంతోషించి; చెలఁగి= ఉత్సహించి; బొమ్మలు; ఆడినట్లు= ఆడినట్లు; పోరి= యుద్ధముచేసి; ఆ రావుతులు= ఆ రౌతులు (గుర్రములనెక్కి పోరాడువారు); నెరయన్= వ్యాపించగా; అందున్= అచ్చట; ఇందున్= ఇచ్చట; మెఱసిరి= ప్రకాశించిరి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సహదేవుడు, ద్రౌపదికుమారులు అయిదువేల గుర్రాలతో శకునితో యుద్ధంచేసే సమయంలో క్రీడగా దుడ్డుకర్రతో చనిపోయేటట్లు విసిరి, వంకరల ఈటె పోటులతో పొంకం అణచి క్రింద పడద్రోచి, కత్తితో ఖండఖండాలుగా నరికి, పెద్ద పెద్ద ఖడ్గాలతో చీల్చి చెండాడి చంపి, సమీపించి ఒకరినొకరు పట్టుకొని మల్లవీరుల విధంగా యుద్ధానికి తలపడి నేలపైకి వంగదీసి, ఆటాడినట్లు మెడలపైకి ఎక్కి, పలువురు మొత్తంగా మీదపడి, ఓర్పుతో శౌర్యంతో యుద్ధంచేసి, ఒకరిపై ఒకరు దుమికి వివిధ గమనాలతో సంతోషించి, ఉత్సహించి, బొమ్మలాడినట్లు ఆ రౌతులు అంతటా వ్యాపించి వెలిగారు.

విశేషం: ఇది తురంగ సైన్యం చేసిన యుద్ధంయొక్కవర్ణనం. గుర్రాలపై నుండి యుద్ధం చేసేవారు రౌతులు. ఇది రథాలపైనుండి అస్త్రశస్త్ర ప్రయోగాలతో చేసే యుద్ధవర్ణనంకాదు. చతురంగ బలాల యుద్ధాలు నానావిధాలుగా ఉంటాయి. ఆ యుద్ధరీతు లన్నింటిని వ్యాసభగవానుడు మూలమున యుద్ధపర్వములందు అత్యద్భుతంగా వర్ణించాడు. తిక్కన కూడా యుద్ధవర్ణనలు బాగుగా చేశాడనీ అందుకు ఆయన అనుభవం తోడైనదనీ కొందరు విశ్వసిస్తారు.

ఇక ఈ పద్యంలో వర్ణించిన యుద్ధం కర్రలతో, కత్తులతో, ఈటెలతో, కాళ్ళతో, చేతులతో చేసిన "దొమ్మి" అనబడే యుద్ధం. దీనిని బొమ్మలాడినట్లుగా తిక్కన ఉత్ప్రేక్షించాడు.

వ. మఱియు ననేక ప్రకారంబుల భండనంబుసేసిరి. పదంపడి యమ్మాద్రీకుమారుని వీరోద్రేకంబునకు నోహటించి గాంధారీసోదరుం డాఱువేల తురంగంబులతోడం దిరిగె నతండును ద్విసహస్రహయశేషసేనాసమేతుండై యన్న కడకరిగె. నా సౌబలుండును జుట్టి వచ్చి ధృష్టద్యుమ్నుని మొనపైఁ బడిన నతండు సైన్యసముద్దండ సంరంభం బెసంగ విక్రమాటోపంబు సూపినయపుడు పంచసహస్రత్రిశతహయంబులు వడిన రౌద్రంబు రూపు దాల్చిన ట్లాయుధఖండనాస్థిభంజనశబ్దశ్రవణంబునను రక్తమాంసమేదోస్థిమస్తిష్క మజ్జాసమ్మేళన దారుణరణతలదర్శనంబునను దదీయ విస్రగంధాఘ్రాణంబునను యోధులు వీతచేతస్కులైరి. తెగినతల

యొకచేతను నెత్తుట జొత్తిల్లిన కరవాలం బొకకరంబునను బట్టుకొని యట్టలాడినట్లు పెనంగి యా శకుని హతావశిష్టంబులైన సప్తశతాశ్వంబులతోడఁ దొలంగి యచ్చటి జనంబులతోఁ 'గురుపతి యెచ్చట నున్నవాఁ డనిన వార లతని కిట్లనిరి. 341

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; అనేక= నానా; ప్రకారంబులన్= విధములుగా; భండనంబు= యుద్ధము; చేసిరి= చేసిరి; పదంపడి= వెనువెంటనే; ఆ+మాద్రీ= ఆ మాద్రియొక్క; కుమారుని= పుత్రుని అనగా సహదేవునియొక్క; వీర= పరాక్రమముయొక్క; ఉద్రేకంబునకున్= విజృంభణమునకు; తిరిగెన్= వెనుదిరిగెను; ఓహటించి= వెనుదీసి; గాంధారీ= గాంధారియొక్క; సోదరుండు= సహోదరుడయిన శకుని; ఆఱువేల తురంగంబులతోడన్= ఆరువేల గుర్రాలతో; అతండును= అతడును (సహదేవుడును); ద్వి= రెండు; సహస్ర= వేల; హయ= గుర్రములు; శేష= మిగిలిన; సేనా= సైన్యముతో; సమేతుండై= సహితుడై (కూడినవాడై); అన్నకడకున్= అన్నదగ్గరకు; అరిగెన్= వెడలెను; ఆ సౌబలుండును= ఆ శకునియు; చుట్టివచ్చి= తిరిగివచ్చి; ధృష్టద్యుమ్నుని; మొనపైన్= సేనపై; పడినన్= పడగా; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; సైన్య= సేనతోకూడ; సముద్దండ= అధికమైన; సంరంభంబు= వేగిరపాటు; ఎసంగన్= అతిశయించగ; విక్రమ= పరాక్రమముయొక్క; ఆటోపంబు= ఆడంబరము; చూపిన+అపుడు= చూపిన సమయమున; పంచ= ఐదు; సహస్ర= వేలు; త్రిశత= మూడు వందలు; హయంబులు= గుర్రములు (అయిదువేల మూడువందల గుర్రములు); పడినన్= పడిపోగా (చనిపోగా); రౌద్రంబు= క్రోధము; రూపు= ఆకృతి; తాల్చినట్లు= ధరించినట్లు; ఆయుధ= ఆయుధములయొక్క; ఖండన= విరుచుట; అస్థి= ఎముకలయొక్క; భంజన= పగులగొట్టుట; శబ్ద= శబ్దములయొక్క (ధ్వనులయొక్క) శ్రవణంబునను= వినుటవలనను; మాంస= మాంసముయొక్క; మస్తిష్క= మెదడుయొక్క (మేదస్సుకు-మస్తిష్కమునకు కొంచెము భేదముకలదు. మెదడునందలి రెండ భాగములివి); మజ్జా= మజ్జాయొక్క (ఎముకలలో ఉన్న మూలుగు మజ్జ అనబడును); సమ్మేళన= వీటి కలయిక వలన; దారుణ= భయంకరమైన; రణ= యుద్ధముయొక్క; తల= భూమియొక్క (యుద్ధభూమియొక్క); దర్శనంబునను= చూచుటవలనను; తదీయ= ఆ యుద్ధమునందలి మాంసాదులయొక్క; విస్రగంధ= కుళ్లినకంపు; ఆఘ్రాణంబునను= పీల్చుటవలనను; యోధులు= యుద్ధముచేయుచున్న వీరులు; వీత= పోయిన; చేతస్కులు= మనస్సుకలవారు; ఐరి= అయ్యిరి; తెగిన= ఖండింపబడిన; తల= శిరము; ఒకచేతను= ఒకచేతితోను; నెత్తుటన్= రక్తంతో; జొత్తిల్లిన= ఎర్రబారిన; కరవాలంబు= కత్తి; ఒక కరంబునను= ఒక చేతితోడను; పట్టుకొని; అట్టలు+ఆడినట్లు= తలలు తెగిన శరీరములు ఆడినట్టుగా; పెనంగి= యుద్ధముచేసి; ఆ శకుని; హత= చంపబడగా; అవశిష్టంబులైన= మిగిలిపోయిన; సప్త= ఏడు; శత= వందలు; అశ్వంబులతోడన్= గుర్రములతో; తొలంగి= తప్పించుకొని; అచ్చటి= ఆ యుద్ధభూమియందలి; జనంబులతోన్= ప్రజలతో; కురుపతి= దుర్యోధనుడు; ఎచ్చట= ఎక్కడ; ఉన్నవాఁడు?= ఉన్నవాడు?; అనినన్= అనగా; వారలు= వారు; అతనికిన్= ఆ శకునికి; ఇట్లు= ఈ విధముగా; అనిరి= చెప్పిరి.

తాత్పర్యం: ఇంకా నానా విధాలుగా యుద్ధం చేశారు. వెనువెంటనే సహదేవుడి పరాక్రమ విజృంభణకు వెనుదీసి, శకుని ఆరువేల గుర్రాలతో తిరుగబడ్డాడు. సహదేవుడుకూడా రెండువేల గుర్రాలు మిగిలిన సైన్యంతో కూడి అన్న దగ్గరకు వెళ్ళాడు. శకుని తిరిగి వచ్చి ధృష్టద్యుమ్నుడి సేనపై పడగా ఆ ధృష్టద్యుమ్నుడు సేనతో కూడా అధికమయిన వేగిరపాటుతో అతిశయించి, పరాక్రమపు ఆడంబరాన్ని ప్రదర్శించగా ఆ సమయంలో అయిదువేల మూడువందల గుర్రాలు చనిపోయాయి. అప్పుడు రౌద్రం ఆకృతి ధరించినట్లు ఆయుధాలు విరిగిపోవటంవలనను, ఎముకలు, మస్తిష్కము మజ్జలు బాగా కలిసి పోయినందువలన భయంకరమైన యుద్ధభూమిని చూపటం వలనను, ఆ మాంసమజ్జాదులయొక్క కుళ్ళినకంపు పీల్చుటవలనను యోధుల చైతన్యం నశించింది. ఖండించబడిన తలను ఒకచేతితోను, రక్తంతో ఎర్రబారిన కత్తి ఒక చేతితోను పట్టుకొని, తలతెగిన శరీరములు ఆడినట్లు యుద్ధంచేసి,

చావగా మిగిలిన ఏడువందల గుర్రాలతో ఆ శకుని తప్పించుకొని యుద్ధభూమినుండి తొలగి, అచ్చట ఉన్న ప్రజలతో 'దుర్యోధనుడు ఎక్కడ ఉన్నా?'డ ని అడుగగా వారు ఆ శకునికి ఈ విధంగా చెప్పారు.

ఉ. అల్లదె కంటె? పూర్ణశశియట్లు కడుం జెలువొందెఁ జూడఁ బే
రెల్లి రథప్రతాన మదె యేపున సంగరకేళిఁ జాల శో
భిల్లెడు నయ్యెడన్ రిపువిభీషణవిక్రమణప్రకారగా
ఢోల్లసనుండు భూపతి మహోన్నతి నొప్పెడుఁ బొమ్ము చెచ్చెరన్. 342

ప్రతిపదార్థం: అల్లదె= అల్లదిగొ; కంటె?= చూచితివా?; పూర్ణ= నిండు; శశి= చందమామ; అట్లు= అన్నట్లుగా; పేరు= పెద్ద; ఎల్లి= గొడుగు; చూడన్= చూడగా; కడున్= మిక్కిలి; చెలువు= సౌందర్యము; ఒందెన్= పొందెను; అదె= అదియే; రథ= రథములయొక్క; ప్రతానము= సమూహము; ఏపునన్= విజృంభణముతో; సంగర= యుద్ధమనెడి; కేళిన్= ఆటయందు; చాలన్= మిక్కిలి; శోభిల్లెడున్= ప్రకాశించెను; ఆ+ఎడన్= ఆచ్చోట; రిపు= శత్రువులకు; విభీషణ= భయంకరమైన; విక్రమణ= పరాక్రమముయొక్క; ప్రకార= విధముచే; గాఢ= దట్టమయిన; ఉల్లసనుండు= ఉల్లాసము కలవాడు (ఆనందము కలవాడు); భూపతి= భూభర్త అయిన దుర్యోధనుడు; మహా= గొప్ప; ఉన్నతిన్= ఆధిక్యముతో; ఒప్పెడున్= ప్రకాశించుచున్నాడు; చెచ్చెరన్= వెంటనే (శీఘ్రముగా); పొమ్ము= వెడలుము.

తాత్పర్యం: 'అదిగో చూచావా? నిండు పున్నమిచందమామ అన్నట్లుగా ఆ పెద్ద గొడుగు మిక్కిలి సౌందర్యంతో ప్రకాశించేది. అదే- రథముల వరుస. విజృంభణంతో యుద్ధక్రీడయందు మిక్కిలి ప్రకాశించింది. ఆ చోటనే శత్రువులతో భయంకరంగా పరాక్రమించటంలో దట్టమయిన ఆనందం కలవాడైన దుర్యోధనుడు గొప్ప ఆధిక్యంతో వెలుగుతున్నాడు. వేగంగా పొమ్ము.

వ. అనిన విని తల యెత్తి చూచి తత్ప్రదేశంబున కరిగి యద్ధరణీశుం గని యతని కిట్లనియె. 343

ప్రతిపదార్థం: అనినన్= అనగా (చెప్పగా); విని= విని; తల= శిరము; ఎత్తి= పైకి ఎత్తి; చూచి; తద్= ఆ; ప్రదేశంబునకున్= చోటునకు; అరిగి= వెడలి; ఆ= ఆ; ధరణీ= భూమికి; ఈశున్= ప్రభువు అయిన దుర్యోధనుని; కని= చూచి; అతనికిన్= అనితో; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియె= చెప్పెను (పలికెను).

తాత్పర్యం: ప్రజలు చెప్పగా శకుని విని తల పైకెత్తి చూచి, అక్కడికి వెడలి ఆ దుర్యోధనుడిని చూచి అతడితో ఈ ప్రకారంగా అన్నాడు.

క. 'పొలియించితి నే గుఱ్ఱం । బులఁ దేరుల కుఱికి యింక భూరిరయమునన్
బొలియింపవలయుఁ బ్రాణం । బులు డాఁచిన వశమె పాండుపుత్రుల గెలువన్. 344

ప్రతిపదార్థం: ఏన్= నేను; తేరులకున్= రథములపైకి; ఉఱికి= దుమికి; గుఱ్ఱంబులన్= గుర్రములను; పొలియించితిన్= చంపితిని; ఇంకన్= ఇంక; భూరి= మిక్కిలి; రయమునన్= వేగముగా; పొలియింపవలయున్= చంపవలయును (పాండు పుత్రులను); ప్రాణంబులు; డాఁచినన్= దాచుకొనినచో; పాండుపుత్రులన్= పాండురాజు కుమారులను (పాండవులను); గెలువన్= జయించుట; వశమె?= తరమా?

తాత్పర్యం: 'నేను రథాలపైకి దుమికి గుర్రాలను చంపాను. ఇంకా మిక్కిలి వేగంగా పాండుపుత్రులను చంపాలి. ప్రాణాలు దాచుకొంటే పాండవులను జయించటం సాధ్యం కాదు.

వ. రథంబులు గజంబులు దెగినం గాని కాలుబలంబుల సమయించుట పని గా' దనిన నమ్మాటకు సైనికులు సంతసం బంది బరవసంబు సేయ నమ్మహీనాయకుండు సముత్సాహదోహలియై తతిమిన మనమూఁకలు కడంక యెలర్ప దర్పస్ఫురితంబులగుచు నురవణించినం గని గాండీవి గోవిందున కిట్లనియె. 345

ప్రతిపదార్థం: రథంబులు= రథములు; గజంబులు= ఏనుగులు; తెగినన్+కాని= చస్తే కాని; కాలుబలంబులన్= పదాతి దళములను; సమయించుట= సంహరించుట; పనికాదు= సాధ్యముకాదు; అనినన్= అని చెప్పగా; ఆ+మాటకున్= ఆ పలుకునకు; సైనికులు= భటులు; సంతసంబు= సంతోషము; అంది= పొంది; బరవసంబు= ధైర్యము; చేయన్= చేయగా; ఆ= ఆ; మహీనాయకుండు= రాజు అయిన దుర్యోధనుడు; సముత్సాహ= మిక్కిలి ప్రయత్నంతో; దోహలియై= అతిశయించినవాడయి (మిక్కిలి ఉత్సాహము కలవాడై); తతిమినన్= వెంటపడిపోవునట్లు చేయగా; మనమూఁకలు= మన సైన్యములు; కడంక= ప్రయత్నము; ఎలర్పన్= అతిశయింపగా; దర్ప= గర్వముతో; స్ఫురితంబులు= ప్రకాశములు కలవారు; అగుచున్= అగుచును; ఉరవణించినన్= వేగిరపాటు పొందగా; కని= చూచి; గాండీవి= అర్జునుడు (గాండీవము కలవాడు గాండీవి); గోవిందునకున్= శ్రీకృష్ణునకు; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్.

తాత్పర్యం: రథాలు ఏనుగులు నాశనమయితే కాని పదాతిదళాలను సంహరించటం సాధ్యం కాదు.' అని శకుని చెప్పగా ఆ మాటకు సైనికులు సంతోషం పొంది ధైర్యం చేయగా దుర్యోధనుడు మిక్కిలి అతిశయించిన ఉత్సాహంతో వెన్నంటి పారిపోయేటట్లు తరుముతుండగా మన సైన్యాలు ప్రయత్న మతిశయించగా గర్వంతో ప్రకాశిస్తూ వేగిరపాటుచూపగా చూచి, అర్జునుడు, శ్రీకృష్ణుడితో ఈ ప్రకారంగా అన్నాడు:

క. 'మొనసి చనుదెంచు దుర్యో । ధనసేనాసముదయంబుఁ దతియ నురవడిం
జననిమ్ము మన రథము నా । సునిశితబాణముల సమయఁ జూచెద దీనిన్.' 346

ప్రతిపదార్థం: మొనసి= పూనికవహించి; చనుదెంచు= వచ్చుచున్న; దుర్యోధన= దుర్యోధనునియొక్క; సేనాసముదయంబున్= సేనా సమూహమును; తతియన్= సమీపించునట్లు; మనరథమున్= మనయొక్క రథము; ఉరవడిన్= విజృంభణంతో; చననిమ్మ= వెడలనిమ్ము; దీనిన్= ఈ దుర్యోధనసేనా సమూహమును; నా= నాయొక్క; సునిశిత= మిక్కిలి వాడి అయిన; బాణములన్= బాణములతో; సమయన్= నశించునట్లు; చూచెదన్= చూచెదను (నశించునట్లు చేసెదనని భావం).

తాత్పర్యం: 'పూనికతో వస్తున్న, దుర్యోధనుడి సేనాసమూహాన్ని సమీపించేటట్లు మన రథం మిక్కిలి వేగంగా ముందుకుపోనిమ్ము. ఈ దుర్యోధన సేనాసమూహాన్ని వాడి అయిన బాణాలతో నశించేటట్లు చేస్తాను.'

దుర్యోధను మౌర్ఖ్యం బుద్దేశించి కృష్ణార్జునులు సంభాషించుట (సం. 9-23-18)

వ. అనుచు నమ్మొన యాలోకించి నిరూపించి. 347

ప్రతిపదార్థం: అనుచున్= ఇట్లు చెప్పుచు; ఆ+మొన= ఆ సైన్యం; ఆలోకించి= చూచి; నిరూపించి= నిరూపణచేసి (అనగా వేరు వేరుగా స్పష్టంగా పరిగణించి).

తాత్పర్యం: అర్జునుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అంటూ ఆ సైన్యాన్ని చూచి నిరూపణచేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. పెనఁకువ యెడ త్రెవ్వక పదు । నెనిమిదిదివసములు సెల్లె బెనఁగంగా
వనధిం బోలెడు కురుబల । మనఘా! కనుఁగొనఁగ గొప్పదాకృతి యయ్యెన్. 348

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడవు అయిన ఓ శ్రీకృష్ణా! (సంబోధనము); పెనఁకువ= యుద్ధము; ఎడత్రెవ్వక= ఎడతెగకుండగ (ఆగకుండగ); పదునెనిమిది= పద్దెనిమిది; దివసములు= దినములు; చెల్లెన్= కడచెను; ఏన్= నేను; పెనఁగంగాన్= యుద్ధంచేయగా; వనధిన్= సముద్రమును; పోలెడు= పోలునట్టి; కురుబలము= కౌరవసైన్యము; కనుఁగొనఁగన్= చూడగా; గోష్పద= గోవుపాదమంతటి; ఆకృతి= ఆకారముకలది (మిక్కిలి చిన్నది అనుటకు గోష్పదమందురు); అయ్యెన్= అయ్యెను.

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! యుద్ధం ఎడతెగకుండా పద్దెనిమిది దినాలు గడిచాయి. నేను యుద్ధం చేసినందువలన సముద్రమంతటి కౌరవ సైన్యం చూడగా గోవుపాదమంత చిన్నది అయింది.

ఆ. దైవ మిట్లు గలఁచునే వీరి మదిమది । నుండి ఘోరమైన యుద్ధమునకుఁ
దొడఁగ వలయునట్టి తొడరువు కావించి । కొనిరి చీఁకురాజుకొడుకు లేచి. 349

ప్రతిపదార్థం: చీఁకురాజు= గ్రుడ్డిరాజు (ధృతరాష్ట్రుడు); కొడుకులు= పుత్రులు; ఏచి= విజృంభించి; మదిమదినుండి= హాయిగానుండి; ఘోరమయిన= భయంకరమయిన; యుద్ధమునకున్; తొడఁగవలయు= ప్రారంభించవలయును; అట్టి; తొడరువు= యత్నము; కావించికొనిరి= చేసికొనిరి; వీరి= వీరియొక్క (కౌరవులయొక్క); మది= మనస్సు; ఇట్లు= ఈ ప్రకారమగు; దైవము= దైవము; కలఁచునే!= కలత చెందించెను గదా!

తాత్పర్యం: గ్రుడ్డిరాజు కొడుకులయిన కౌరవులు విజృంభించి హాయిగా ఉండి భయంకరమయిన యుద్ధాన్ని ప్రారంభించవలెననే యత్నం చేసికొన్నారు. వీరియొక్క మనస్సును ఈ ప్రకారంగా దైవం కలతచెందించింది కదా!

చ. అమరనదీసుతుండు పడినప్పుడు వీరలబుద్ధి సంధికా
ర్యమునకుఁ జొచ్చునింక నని యాత్మఁ దలంచితి నమ్మహాత్ముఁడు
న్సముచిత వాక్యవృత్తిఁ గురునాయకుఁ దేర్పఁగఁ జూచెఁ జిత్త దో
షమహిమ నద్దురాత్ముఁడు ప్రశాంతత నొందఁడ యెన్నిభంగులన్. 350

ప్రతిపదార్థం: అమరనదీ= ఆకాశగంగానదియొక్క; సుతుండు= కుమారుఁడు అనగా భీష్ముడు; పడినప్పుడు= పడిపోయినప్పుడు; ఇంకను; వీరల= ఈ కౌరవులయొక్క; బుద్ధి; సంధికార్యమునకున్= పొందునకు (యుద్ధములేకుండ సంధి చేసికొనుటకు); చొచ్చును= చొరబడును (అంగీకరించును); అని; ఆత్మన్= నాలో; తలంచితిని= అనుకొంటివి; ఆ+మహాత్ముఁడున్= ఆ గొప్ప ఆత్మకలవాడయిన భీష్ముడును; సముచిత= మిక్కిలి ఉపయోగకరమయిన (యోగ్యమయిన); వాక్యవృత్తిన్= మాటలయొక్క పొందికతో; కురునాయకున్= దుర్యోధనుని; తేర్పఁగన్= ప్రసన్నుని చేయుటకు; చూచెన్= చూచెను; ఆ+దురాత్ముఁడు= ఆ చెడ్డమనస్సు కలవాడు; ఎన్ని= భంగులన్= విధములుగానైనను; ప్రశాంతతను= మిక్కిలిశాంతిని; ఒందఁడు+అ= పొందడు గదా!

తాత్పర్యం: భీష్ముడు యుద్ధభూమియందు పడిపోయినప్పుడైనా ఈ కౌరవుల బుద్ధి సంధిచేసికొనటానికి చొరబడుతుందని అనుకొన్నాను. మహాత్ముడయిన ఆ భీష్ముడు కూడా యోగ్యమైన మాటలతో ఆ దుర్యోధనుడిని ప్రసన్నుడిని చేయటానికి చూచాడు. అయినా ఆ దుష్టబుద్ధి కల దుర్యోధనుడు ఎన్ని విధాలుగా చెప్పినా శాంతమనస్కుడు కాడాయెను.

క. గంగాతనయుఁడు దెగినను । సంగరమున కుత్సహింపఁజనునే తమకున్?
వెంగలు లని యప్పుడు దెలి । యంగా నెఱిఁగితి సుయోధనాదులఁ గృష్ణా! 351

ప్రతిపదార్థం: కృష్ణా!; గంగాతనయుఁడు= గంగాదేవి పుత్రుడయిన భీష్ముడు; తెగినను= చచ్చినప్పటికిని; సంగరమునకున్= యుద్ధమునకు; ఉత్సహింపన్= ప్రయత్నింపగా; తమకున్= దుర్యోధనాదులకు; చనునే?= ఒప్పునా? (ఒప్పదు); అప్పుడు= ఆ సమయమున; సుయోధనాదులన్= దుర్యోధనుడు మొదలగువారిని; వెంగలులు= వెర్రివాళ్ళు; అని; తెలియంగాన్= స్పష్టముగా; ఎఱిఁగితిన్= తెలిసికొంటిని.

తాత్పర్యం: శ్రీకృష్ణా!= భీష్ముడు పతనమైన తరువాత కూడా యుద్ధానికి ప్రయత్నించటం దుర్యోధనాదులకు తగదు. అప్పుడే దుర్యోధనాదులు మూఢులని స్పష్టంగా తెలిసికొన్నాను.

ఉ. దంతియుఁ దాను నాజి భగదత్తుఁడు గూలఁగఁ జూచి సింధుభూ
కాంతుని చావు దెల్లముగఁ గన్గొని యాతనిఁ గావఁ బూని య
ట్లంతలు రాజు లెల్ల సమయం గని ద్రోణునిపాటు గాంచి యా
వంతయు నాత్మలోనఁ దెలియండు సుయోధనుఁ డెంత మూర్ఖుఁడో! 352

ప్రతిపదార్థం: ఆజిన్= యుద్ధమునందు; భగదత్తుఁడు; తానున్= తానును; దంతియున్= ఏనుగును; కూలఁగన్= చనిపోగా; చూచి; సింధుభూకాంతుని= సింధుదేశపు రాజు అయిన జయద్రథుని; చావు= మరణము; తెల్లముగన్= స్పష్టంగా; కన్గొని= చూచి; ఆతనిన్= ఆతనిని అనగా ఆ జయద్రథుని; కావన్= రక్షించుటకు; పూని= ప్రయత్నంచేసి; అట్లు= ఆ ప్రకారంగా; అంతలు= గొప్పవారయిన; రాజులు; ఎల్లన్= సమస్తమైనవారును; సమయన్= చనిపోగా; కని= చూచి; ద్రోణుని= ద్రోణాచార్యుని; పాటు= మరణము; కాంచి= చూచి; ఆవంతయున్= కొంచెముకూడా; ఆత్మలోనన్= మనసులోపల; తెలియండు= తెలిసికొనడు; సుయోధనుఁడు= దుర్యోధనుడు; ఎంత= ఎంతటి; మూర్ఖుఁడో!= వివేకహీనుడో కదా!

తాత్పర్యం: భగదత్తుడు, అతని ఏనుగు చనిపోవటం స్వయంగా చూచి, సింధుదేశపురాజు జయద్రథుడి చావు తెల్లంగా చూచి, ఆ సైంధవుడిని రక్షించటానికి ప్రయత్నించిన గొప్ప గొప్ప రాజులందరు చనిపోగా చూచి, నా శపథం చూచి, ద్రోణాచార్యుడి మరణం చూచి - కొంచెంకూడా మనసులో తెలిసికొనడు. దుర్యోధనుడు ఎంతటి వివేకహీనుడో కదా!

క. తన యనుజు లకట! దుశ్శా । సనుఁడును లోనైనవారు సమసిన చందం
బును బంధుసహితముగఁ గ । ర్ణుని గీటడఁచిన విధంబునుం జూడఁ డొకొ! 353

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; తన= తనయొక్క; అనుజులు= తమ్ములు; దుశ్శాసనుఁడును= దుశ్శాసనుడును; లోనైనవారు= మొదలగువారు; సమసిన= మరణించిన; చందంబును= విధమును; బంధుసహితముగన్= చుట్టములతోకూడా; కర్ణుని= కర్ణునియొక్క; గీటడఁచిన= చంపిన; విధంబునున్= విధానమునుకూడ; చూడఁడు= చూడడు (గ్రహించడు) ఒకొ!= కదా!

తాత్పర్యం: దుశ్శాసనుడు మొదలైన తన తమ్ములు మరణించిన విధాన్ని, చుట్టాలతో కూడా కర్ణుడిని చంపిన విధాన్ని గ్రహించడు కదా!

క. అది యెల్ల నేల చెప్పఁగఁ? । దుది శల్యునిపాటు గనియుఁ దోఁపఁ డితఁడు బ
ల్లిదుఁ డని ధర్మజు దెసఁ దలఁ । పిది కురుపతి బుద్ధికొలఁది యేటికి వగవన్? 354

ప్రతిపదార్థం: అది; ఎల్లన్= అది అంతయూ; చెప్పఁగన్= చెప్పుట; ఏల?= ఎందుకు?; తుది= చివర; శల్యుని= శల్యునియొక్క; పాటు= పతనం - చావు; కనియున్= చూచియును; ఇతడు= ఈ ధర్మరాజు; తోఁపడు= భావించడు; ధర్మజుదెసన్= ధర్మరాజు పట్ల; బల్లిదుఁడు= బలం గలవాడు; అని; కురుపతి= కౌరవులకు భర్త అయిన దుర్యోధనునియొక్క; బుద్ధి= బుద్ధియొక్క (జ్ఞానముయొక్క); కొలఁది= పరిమితి; ఇది; అని; ఇతఁడు= ఇతడు; తలఁపు+ఇది= ఆ దుర్యోధనుని అంచనా ఇదే! వగవన్= విచారించుట; ఏటికిన్?= ఎందులకు?

తాత్పర్యం: అదంతా అనుకోవడం ఎందుకు? చిట్ట చివర శల్యుని చావు చూచి కూడా ధర్మరాజు బలమైన వాడని గ్రహించడం లేదు. ధర్మరాజును గూర్చి దుర్యోధనుడి అంచనా, ఆలోచన ఇంతే. అతడి బుద్ధి బలం అంతే. దీనికి విచారించడం ఎందుకు?

క. క్షోణీరాజ్యార్ధము దన । ప్రాణము గలుగంగనీఁడు రారాజు జగ
త్త్రాణపరాయణకరణ ధు । రీణుండగు పాండుసుతగరిష్ఠున కెట్లున్. 355

ప్రతిపదార్థం: ఎట్లున్= ఏ విధముగాను; జగత్= ప్రపంచమును; త్రాణ= కాపాడుటయందు; పరాయణ= అనురక్తి అనెడి; కరణ= కార్యమునందు; ధురీణుండు= భారమును మోయువాడు; అగు= అయినట్టి; పాండు= పాండురాజుయొక్క; సుత= పుత్రులలో; గరిష్ఠునకున్= మిక్కిలి గొప్పవాడయిన ధర్మరాజునకు; రారాజు= దుర్యోధనుడు; తన ప్రాణము= తనయొక్క ప్రాణము; కలుగంగన్= ఉండగా; క్షోణీ= భూమియొక్క; రాజ్య= సామ్రాజ్యముయొక్క; అర్ధము= సగభాగము; ఈఁడు= ఈయడు.

తాత్పర్యం: ఏ విధంగానైనా ప్రపంచాన్ని కాపాడటంలో అనురక్తి గలవాడైన ధర్మరాజుకు ఈ దుర్యోధనుడు తన ప్రాణం ఉన్నంతవరకు రాజ్యభాగం ఈయడు.

వ. కావునఁ గొఱంతయును దీర్పవలసియున్న' దనిన విష్ణుండు జిష్ణున కిట్లనియె. 356

ప్రతిపదార్థం: కావునన్= అందువలన; కొఱంతయును= మిగిలిన కొంచెముకూడ; తీర్పవలసియున్నది= పూర్తిచేయవలసియున్నది; అనినన్= ఇట్లు చెప్పగా; విష్ణుండు= శ్రీకృష్ణుడు; జిష్ణునకున్= అర్జునునకు; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: అందువలన మిగిలి ఉన్న కొంచెం కూడ పూర్తి చేయవలసి ఉన్నది' అని అర్జునుడు అనగా అతడితో శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు:

ఉ. 'అక్కడ సంధికిం జనినయప్పుడు నవ్విదురుండు కృష్ణ! నీ
విక్కడ కేల వచ్చితి? విహీనవివేకుఁడు దుర్మదాంధ్యముం

దక్కునె? సంగరంబ యుచితం బగుకృత్యముగాక యిమ్మెయి
న్ముక్కున నూర్పుగల్గఁ గుజనుండు సుయోధనుఁ డుర్వి యిచ్చునే?' 357

ప్రతిపదార్థం: సంధికిన్= సంధికి; చనిన= వెడలిన; అప్పుడు= ఆ సమయమున; అక్కడన్= అచ్చట; ఆ+విదురుండు= ఆ విదురుడు; కృష్ణ!= ఓ కృష్ణా!; నీవు; ఇక్కడకున్= ఇచ్చటకు; ఏల= ఎందులకు; వచ్చితి?= వచ్చితివి?; విహీన= లేని (పోయిన); వివేకుఁడు= యుక్తా యుక్త జ్ఞానము కలవాడు (దుర్యోధనుడు); దుర్మద= దుష్టమయిన గర్వముతో కూడిన; ఆంధ్యమున్= గ్రుడ్డితనమును; తక్కునే?= విడిచిపెట్టునా?; సంగరంబ= యుద్ధమే; ఉచితంబగున్= యోగ్యమయిన (ఉపయోగకరమయిన); కృత్యము= చేయదగిన పని; కాక= అట్లుకాక; ఈ+మెయిన్= ఈ విధముగా; కుజనుండు= కుత్సితబుద్ధిగల మనుజాడు అయిన; సుయోధనుఁడు= దుర్యోధనుడు; ముక్కునన్= ముక్కునందు; ఊర్పుగల్గన్= ఊపిరి ఉండగా (ప్రాణమున్నంతవరకు); ఉర్వి= భూమి (రాజ్యము); ఇచ్చునే?= ఇచ్చునా? (ఈయడు).

తాత్పర్యం: 'నేను సంధికి పోయినప్పుడు ఆ విదురుడు 'కృష్ణా! నీ విక్కడికి ఎందుకు వచ్చావు? యుక్తాయుక్త జ్ఞానం లేని దుర్యోధనుడు దుష్టమైన గర్వంతో కూడిన గర్వాన్ని విడిచిపెట్టడు. యుద్ధమే చేయదగిన పని. అట్లా కాకుండా, ఈ విధంగా సంధి జరిగితే కుత్సితుడైన దుర్యోధనుడు ముక్కున ఊపిరి ఉన్నంతవరకు రాజ్యం ఈయడు.'

వ. అని బోధించె నదియునుంగాక దుర్యోధనుండు జనియించినప్పుడు మును 'లిప్పాపాత్ముండు నిఖిల క్షత్రియక్షయ హేతు!' వగునని యాదేశించిరిగాదే' యనిన నర్జునుం డతని కిట్లనియె. 358

ప్రతిపదార్థం: అని; బోధించెను= చెప్పెను; అదియునుంగాక= అదియేకాకుండా; దుర్యోధనుడు; జనియించినప్పుడు= పుట్టినప్పుడు; మునులు= మునీశ్వరులు (ఋషులు); ఈ+పాపాత్ముండు= పాపబుద్ధికలవాడు; నిఖిల= సమస్తమయిన; క్షత్రియ= రాజులయొక్క; క్షయ= నాశనమునకు; హేతువు= కారణభూతుడు; అగునని; ఆదేశించిరి= ఆజ్ఞాపించిరి; కాదే!= కదా!; అనినన్= అనిచెప్పగా; అర్జునుండు= అర్జునుడు; అతనికిన్= శ్రీకృష్ణునికి; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను (ఋషివాక్యము ఆజ్ఞవంటిది)

తాత్పర్యం: విదురుడు ఆ విధంగా నాకు బోధించాడు. అంతేకాక దుర్యోధనుడు పుట్టినప్పుడు మునులు 'ఈ పాపాత్ముడు సమస్త రాజులయొక్క నాశనానికి కారణభూతుడు కాగలడని ఆజ్ఞాపించారు కదా!' అని శ్రీకృష్ణుడు చెప్పగా అర్జునుడు ఆ శ్రీకృష్ణుడితో ఈ ప్రకారంగా అన్నాడు.

తే. 'అమ్మహాత్ములు సెప్పినయట్ల యయ్యె । నున్నవారలఁ బొలియించి తన్ను విడిచి
కాని విడువండు ధృతరాష్ట్రసూనుఁ డుర్వి । ధర్మసూనున కిది నిశ్చితంబు గృష్ణ! 359

ప్రతిపదార్థం: ఆ+మహాత్ములు= ఆ గొప్ప మనస్సుకల మునులు; చెప్పిన= పలికిన; అట్ల= అట్లే; అయ్యెను; ఉన్నవారలన్= బ్రతికి ఉన్న వారలను; పొలియించి= చంపి; తన్నున్= తనను; విడిచికాని= చంపుకొని కాని; ధృతరాష్ట్ర సూనుఁడు= ధృతరాష్ట్రుని కుమారుడయిన దుర్యోధనుడు; ధర్మసూనునకున్= ధర్మరాజునకు; ఉర్వి= భూమి; విడువండు= విడిచిపెట్టడు; కృష్ణ!= ఓ కృష్ణా!; ఇది; నిశ్చితంబు= నిశ్చయింపబడినది.

తాత్పర్యం: 'ఆ మహాత్ములయిన మునులు చెప్పినట్లుగానే జరిగింది. బ్రతికి ఉన్న వారిని చంపించి, తాను చచ్చికాని దుర్యోధనుడు ధర్మరాజుకు రాజ్యం వదలడు. ఓ కృష్ణా! ఇది నిశ్చయం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. దుర్బలమగు నమ్మూఁకను । దోర్బల మెసఁగంగ నిపుడ త్రుంచెద నా దు
ర్నిర్బంధపరుఁడు దనదగు । దౌర్బల్యము గనుచు మదము దక్కి కనుఁగొనన్. 360

ప్రతిపదార్థం: ఆ; దుర్నిర్బంధపరుడు= మొండివాడు (దుర్యోధనుడు); తనదగు= తనదైన; దౌర్బల్యము= దుర్బలత్వము; కనుచున్= పొందుచు; మదము= గర్వము; తక్కి= విడిచి; కనుఁగొనన్= చూచుచుండగా; దుర్బలమగు= బలహీనమైనట్టి; ఆ+మూఁకను= ఆ సైన్యమును; దోర్బలము= భుజబలము; ఎసఁగంగన్= అతిశయించునట్లుగ; ఇపుడు+అ= ఇపుడే (ఈ క్షణమునందే); త్రుంచెదన్= ఖండించెదను.

తాత్పర్యం: ఆ దుష్టశత్రువు దుర్యోధనుడు తనదైన నిస్సహాయతను చూస్తూ, గర్వం పోగొట్టుకొనే విధంగా బలంలేని ఆ సైన్యమును భుజబలం అతిశయించేటట్లుగా ఈ క్షణమే ఖండిస్తాను.

వ. రయంబున రథంబు గడపు' మనుడు నుత్తుంగమాతంగమహీరుహశోభితంబును సాంద్రస్యందన గుల్మగహనంబును బహుళహయకక్షాకీర్ణంబును సముద్భట సుభట లతాలసితంబును నైన సుయోధను సేనా కాననంబునందు మాధవమహావాయువు ధనంజయదారుణానలంబు దరికొల్పిన. 361

ప్రతిపదార్థం: రయంబునన్= వేగంగా; రథంబు= రథము; కడపుము= త్రోలుము; అనుడును= అనగానే; ఉత్తుంగ= మిక్కిలి ఎత్తైన; మాతంగ= ఏనుగులనే; మహీరుహ= వృక్షములతో; శోభితంబును= సుందరమయినదియును; సాంద్ర= దట్టమయిన; స్యందన= రథములనెడి; గుల్మ= పొదరిండ్లతో; గహనంబును= చొరశక్యము కానిదియును; బహుళ= అనేకములయిన; హయ= గుఱ్ఱములనెడి; కక్షా= గడ్డిపొదలతో; ఆకీర్ణంబును= వ్యాప్తమయినదియును; సముద్భట= శ్రేష్ఠమయిన; సుభట= మంచి భటులు అనెడి; లతా= లతలతో; లసితంబును= ప్రకాశించుచున్నదియును; ఐన= అయినట్టి; సుయోధను= దుర్యోధనునియొక్క; సేనా= సైన్యమనెడి; కాననంబునందున్= అరణ్యమునందు; మాధవ= శ్రీకృష్ణుడనెడి; మహా= గొప్ప; వాయువు= గాలి; ధనంజయ= అర్జునుడనెడి; దారుణ= భయంకరమయిన; అనలంబున్= అగ్ని; దరికొల్పినన్= రగుల్గొలుపు తుండగా.

తాత్పర్యం: వేగంగా రథం తోలుము' అని అర్జునుడు మిక్కిలి ఎత్తైన ఏనుగు లనే మహావృక్షాలతో సుందరమయినది, దట్టమయిన రథాలనే పొదరిండ్లతో చొరశక్యం కానిది, అనేకములయిన గుఱ్ఱాలనెడి గడ్డిపొదలతో నిండిపోయినది. శ్రేష్ఠు లయిన భటు లనెడి లతలతో ప్రకాశిస్తున్నది - అయిన దుర్యోధనుడి సైన్యమనే అరణ్యాన్ని శ్రీకృష్ణు డనెడి పెనుగాలి అర్జునుడనెడి భయంకరమయిన అగ్ని రగుల్గొలుపుతుండగా రాజుకొనేటట్లు చేయగా (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'బాణోచ్ఛిష్ట మిదం జగత్' అనే ఆర్యోక్తి అన్వర్థమయ్యేటట్లు ఆంధ్రకవులు కూడా వచనరచనలందు విరోధాభాసలు, రూపకములు, ఉత్ప్రేక్షలు, అతిశయోక్తులు, స్వభావోక్తులతో కాదంబరి వచనరచనాశైలిని అనుకరించి, అనుసరించటానికి ప్రయత్నిస్తారు. అట్టిదాని కిది చిన్న ఉదాహరణ. దుర్యోధనుడి సేనారణ్యం ఒక రూపకం. చతురంగ బలములు రూపకాలు. మాధవమహావాయువు, ధనంజాయాగ్నులు - ఈ రూపకమాలికకు సూత్రములు. ఇట్లా ఈ వచనం ఒక చక్కని రూపకమాలిక. చతురంగ బలాలతో - ఏనుగులు వృక్షములుగా - రథములు పొదరిండ్లుగా, గుఱ్ఱములు గడ్డిపొదలుగా, భటులు లతలుగా- ఉపమాన ఉపమేయములకు అభేదాన్ని కల్పించి - దుర్యోధనుడి సైన్యమును ఒక మహారణ్యంగా, మాధవుడిని మహావాయువుగా, అర్జునుడిని అగ్నిగా అభేదాన్ని కల్పించి, ఒక మహారూపకాలంకారంగా తిక్కన వర్ణించాడు.

ధనంజయ శబ్దానికి అర్జును డనేకాక అగ్ని అనే అర్థం కూడా ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఆ కృష్ణవర్త్ముఁ డుజ్జ్వల । భీకరశరజిహ్వ లడరఁ బేర్చిన నధిక
వ్యాకులత నొందె రోదసి । నాకౌకస్సమితి మెచ్చునం బొదలంగన్. 362

ప్రతిపదార్థం: ఆ కృష్ణవర్త్ముఁడు= ఆ అగ్ని (అర్జునుడనెడి ఆ అగ్ని); ఉజ్జ్వల= బాగుగా ప్రకాశించుచున్న; భీకర= భయంకరమయిన; శర= బాణములనెడి; జిహ్వలు= నాలుకలనెడి జ్వాలలు; అడరన్= వ్యాపింపగా; పేర్చినన్= విజృంభించగా; నాకౌకః= దేవతలయొక్క; సమితి= సమూహము; మెచ్చునన్= పొగడ్తలతో; పొదలంగన్= వర్ధిల్లగా; రోదసి= ఆకాశము; అధిక= మిక్కిలి; వ్యాకులతను= కలతను; ఒందెన్= పొందెను.

తాత్పర్యం: ఆ అర్జును డనే అగ్ని బాగా ప్రకాశిస్తున్న భయంకరమైన బాణాలనెడి జ్వాలలు వ్యాపిస్తూ విజృంభించగా దేవతాసమూహం పొగడ్తలతో ఒప్పగా ఆకాశం మిక్కిలి కలతచెందింది.

వ. ఇట్లు దారుణరణవిహరణంబు సలిపి సవ్యసాచి యా సైన్యంబు నిపతితత విఘటిత భ్రాంత పలాయితంబు సేసినఁ దెరలక నిలిచి కురుపతి కరతలంబెత్తి నిలు నిలుమని యెలుంగు సూపిన నది మగుడఁ బురికొని నిగిడి నేమినినద ఘంటాక్వణనకింకిణీ నిక్వాణంబులు సెలంగఁ బాండవబలంబుఁ దాఁకిన ధృష్టద్యుమ్న శిఖండి శతానీకు లయ్యనీకంబు ననేకవిధసాయక నికాయంబులం గప్పి రప్పుడు ధృష్టద్యుమ్ను నరదంబు చక్కటికి సంరంభంబున. 363

ప్రతిపదార్థం: ఇట్లు; దారుణ= భయంకరమయిన; రణ= యుద్ధముయొక్క; విహారణంబు= విహారము; సలిపి= చేసి; సవ్యసాచి= అర్జునుడు; ఆ సైన్యంబు= ఆసేన (కురుసైన్యము); నిపతిత= పడగొట్టబడి; విఘటిత= విడగొట్టబడి; భ్రాంత= భ్రమింపజేయబడి; పలాయితంబు= పారిపోవునట్లు; చేసినన్= చేయగా; తెరలక= తొలగిపోక; నిలిచి; కురుపతి= కౌరవులకు భర్త అయిన దుర్యోధనుడు; కరతలంబు= చేయి; ఎత్తి= పైకి ఎత్తి; నిలునిలుము; అని; ఎలుంగు= పెద్దకంఠధ్వని (పెద్ద అరుపు); చూపినన్= చూపగా (పెద్ద కేకవేయగా); అది= ఆ సైన్యము; మగుడన్= మరల; పురికొని= క్రమ్ముకొని; నిగిడి= విజృంభించి; నేమి= (రథచక్రముల) కమ్ములయొక్క; నినద= ధ్వనులు; ఘంటా= (ఏనుగుల) గంటలయొక్క; క్వణన= ధ్వనులు; కింకిణీ= మువ్వలయొక్క (గుఱ్ఱములకు కట్టిన మువ్వలు); నిక్వాణంబులు= ధ్వనులు; చెలంగన్= మ్రోయగా; పాండవబలంబున్= పాండవుల సైన్యమును; తాఁకినన్= ఎదుర్కొనగా; ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నుడు; శిఖండి= శిఖండియు; శతానీకులు= శతానీకుడును; ఆ; అనీకంబున్= సైన్యమును; అనేక విధ= పలువిధములైన; సాయక= బాణములయొక్క; నికాయంబులన్= సమూహములతో; కప్పిరి= కప్పివేసిరి; అప్పుడు= ఆ సమయమున; ధృష్టద్యుమ్నుని; అరదంబు= రథముయొక్క; చక్కటికిన్= దిక్కునకు; సంరంభంబునన్= వేగిరపాటుతో.

తాత్పర్యం: ఈ ప్రకారంగా భయంకరమైన యుద్ధవిహారం చేసి అర్జునుడు కురుసేన పడగొట్టబడి విడగొట్టబడి, భ్రమింపజేయబడి, పారిపోయేటట్లు చేయగా తొలగిపోక నిలిచి దుర్యోధనుడు చేయి పైకి ఎత్తి నిలునిలుమని పెద్దకంఠధ్వని చేయగా, ఆ సైన్యం మరల తిరిగి క్రమ్ముకొని విజృంభించి రథచక్రాల కమ్ముల ధ్వనులు, ఏనుగుల ఘంటానాదాలు, గుఱ్ఱాలకు కట్టిన మువ్వల ధ్వనులు మ్రోయగా పాండవసైన్యాన్ని ఎదుర్కొనగా ధృష్టద్యుమ్నుడు, శిఖండిశతానీకులు ఆ కురుసైన్యాన్ని పలువిధాలయిన బాణాల సమూహాలతో కప్పివేశారు. ఆ సమయంలో ధృష్టద్యుమ్నుడి రథం దిక్కునకు వేగిరపాటుతో. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: నకులుడి వలన ద్రౌపదికి జన్మించిన పుత్రుడు శతానీకుడు. ఇతడు విశ్వేదేవుల అంశవలన జన్మించాడు. కురువంశంలో శతానీకుడనే మహాత్ముడు - రాజర్షి ఉండేవాడు. నకులుడు ఆ రాజర్షిపేరును తనపుత్రుడికి పెట్టాడు. ఇతడికి మహాభారతంలో - నకులదాయాద - నకులసుత - నకులాత్మజ - నాకులి - అనే పేర్లు ఉన్నాయి.

ఉ. భూపతి మించి యా ద్రుపదభూపతనూజునురంబు నిర్భరా
టోపత యుల్లసిల్లఁగఁ బటుప్రదరంబుల నొంప నాతఁ డు
ద్దీపితకోపుఁడై హరులు ద్రెళ్ళఁగ సారథి డొల్ల నేయఁ గా
నే పటీ తేరు డిగ్గి యతఁడెక్కె హయోత్తముఁ గౌరవేశ్వరా! 364

ప్రతిపదార్థం: కౌరవేశ్వరా!= కౌరవులకు ప్రభువు అయిన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; భూపతి= భూమికి భర్త అయిన దుర్యోధనుడు; మించి= అతిశయించి; ఆ ద్రుపదభూప= ఆ ద్రుపదమహారాజుయొక్క; తనూజు= పుత్రునియొక్క; ఉరంబున్= వక్షఃస్థలమును (అనగా ధృష్టద్యుమ్నుడి వక్షఃస్థలమును); నిర్భర= ప్రగాఢమయిన; ఆటోపము= ఆడంబరము; ఉల్లసిలఁగన్= ప్రకాశింపగా; పటు= కఠినమయిన; ప్రదరంబులన్= బాణములతో; నొంపన్= నొవ్వచేయగా; ఆతఁడు= అతడు (ధృష్టద్యుమ్నుడు); ఉద్దీపిత= ప్రజ్వలించిన; కోపుఁడై= కోపము కలవాడై; హరులు= గుఱ్ఱములు; త్రెళ్ళఁగన్= కూలిపోగా (పడిపోగా); సారథి; డొల్లన్= క్రిందపడునట్లుగా; ఏయఁగాన్= కొట్టగా; అతఁడు= ఆ దుర్యోధనుడు; ఏపు= పెంపు; అటీ= నశించి; తేరు= రథము; డిగ్గి= దిగి; హయ+ఉత్తమున్= ఉత్తమాశ్వమును; ఎక్కెన్= అధిరోహించెను (ఎక్కెను).

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! దుర్యోధనుడు అతిశయించి ధృష్టద్యుమ్నుడి వక్షఃస్థలాన్ని ప్రగాఢమయిన సంభ్రమంతో కఠినమయిన బాణాలతో నొవ్వచేశాడు. ఆ ధృష్టద్యుమ్నుడు ప్రజ్వలించిన కోపం కలవాడై గుఱ్ఱాలు కూలిపోయేటట్లు సారథి పడిపోయేటట్లు కొట్టగా దుర్యోధనుడు పెంపు నశించి, రథం దిగి ఉత్తమాశ్వాన్ని అధిరోహించాడు.

వ. ఎక్కి కొండొక తొలంగి మాతంగ ఘటలం బురికొల్పిన నవి పురందరనందను నరదంబుఁ బొదివిన నవ్వీరుండు ఘోరనారాచధారల నవ్వారణంబులపైఁ గురియం గని గదాహస్తుండై యరదంబు డిగ్గి యనిలపుత్రుండు గవిసినఁ దుండంబు లవిసియు దంతంబులు దునిసియుఁ గుభంబులు వగిలియుఁ బ్రక్కలు చదిసియు వెన్నులు విటిగియు నగ్గజంబు లొఱలుచు నెత్తురులు గ్రక్కుచుఁ దెరలుచు సుడివడుచుండ వెండియుం బైపై నురవణించు కరులం గనుంగొని ధర్మజనకులసహదేవులును ధృష్టద్యుమ్నాదియోధులు నద్దిక్కు తటిమి రట్టియెడ నశ్వత్థామకృతవర్మకృపాచార్యులు దుర్యోధనుఁ దేరిగములలోనంగానక కలనం బడియెనో? యని యనుమానించుచు నచ్చటి మానవపతులం 'గురుపతి యెచ్చట నున్నవాఁ?'డని యడిగినఁ గొందఱు శకునిదెసఁ దొలంగె ననఁ దక్కటి వా 'రతని వెదక నేల బ్రదికియుండె నేనియుఁ గనికొందము పాండవులమీఁద నుటికి పొడుతము గాక' యనిన విని యట్ల చేయ నారథికత్రయంబును దదనీకంబును వెడలి సౌబలుఁడున్న చక్కటికిం జనియె నిట్లు దిక్కుమాలిన యమ్మొన చుట్టుముట్టి. 365

ప్రతిపదార్థం: ఎక్కి= అధిరోహించి (దుర్యోధనుడు ఒక ఉత్తమాశ్వము ఎక్కి); కొండొక= ఇంకొక చోటునకు; తొలంగి= తొలగి; మాతంగ= ఏనుగులయొక్క; ఘటలన్= సమూహములను (ఏనుగుల గుంపునకు ఘటా అని పేరు); పురికొల్పినన్= క్రమ్ముకొనునట్లు చేయగా; అవి= అవి (ఆ ఏనుగులు); పురందర= ఇంద్రునియొక్క; నందనుని= పుత్రుడయిన అర్జునునియొక్క;

అరదంబున్= రథమును; పొదివినన్= క్రమ్ముకొనగా; ఆ+వీరుండు= ఆ శూరుడు (పరాక్రమ వంతుడయిన అర్జునుడు); ఘోర= భయంకరమయిన; నారాచ= బాణములయొక్క; ధారలన్= జడులను; ఆ+వారణంబులపైన్= ఆ ఏనుగులమీద; కురియన్= కురిపించగా; కని= చూచి; గదా= గద; హస్తుండై= చేతియందుకలవాడై; అరదంబు= రథము; డిగ్గి= దిగి; అనిలపుత్రుండు= భీముడు; కవిసినన్= కలియబడగా; తుండంబులు= తొండములు; అవిసియున్= పగిలిపోయి; దంతంబులు= దంతములు; తునిసియున్= తునాతునకలు అయిపోయియు (ముక్కలు అయిపోయి); కుంభంబులు= కుంభస్థలములు; పగిలియున్= పగిలిపోయి; ప్రక్కలు= ప్రక్కభాగములు; చదిసియున్= నలిగిపోయి; వెన్నులు= వీపులు; విఱిగియున్= విరిగిపోయి; ఆ+గజంబులు= ఆ ఏనుగులు; ఒఱలుచున్= అరచుచు(బాధతో); నెత్తురులు= రక్తములు; క్రక్కుచున్= క్రక్కుచును; తెరలుచున్= బయలువెడలుచు; సుడి+పడుచుండన్= చుట్టుకొని పోవుచుండగా; వెండియున్= మరియును; పైపైన్= మీద మీదకు; ఉరవణించు= విజృంభించుచున్న; కరులన్= ఏనుగులను; కనుంగొని= చూచి; ధర్మజ నకుల సహదేవులును= ధర్మరాజు నకులుడు సహదేవుడును; ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నుడు; ఆది= మొదలగు; యోధులును= వీరులును; ఆ+దిక్కు= ఆ వైపు; తఱిమిరి= పరుగెత్తిరి; అట్టియెడన్= ఆ సమయమున; అశ్వత్థామ కృతవర్మ కృపాచార్యులు= అశ్వత్థామయు, కృతవర్మయు, కృపాచార్యుడును; దుర్యోధనున్= దుర్యోధనుడిని; తేరి= రథములయొక్క; గములలోనన్= సమూహములలోపల; కానక= చూడజాలక; కలనన్= యుద్ధమునందు; పడియెనో?= పడిపోయెనా? (చనిపోయెనా ఏమి); అని; అనుమానించుచున్= సందేహించుచు; అచ్చటి= అక్కడ ఉన్న; మానవపతులన్= మహారాజులను; కురుపతి= దుర్యోధనుడు; ఎచ్చటన్= ఎక్కడ; ఉన్నవాఁడు?= ఉన్నాడు?; అని; అడిగినన్= అడుగగా; కొందఱు= కొంతమంది; శకునిదెసన్= శకుని ఉన్నవైపు; తొలంగెను= వెడలెను; అనన్= అనిచెప్పగా; తక్కటివారు= మిగిలినవారు; అతనిన్= ఆ దుర్యోధనుడిని; వెదకను= వెదకుట; ఏల?= ఎందుకు?; బ్రదికి= జీవించి; ఉండెనేనియున్= ఉన్నట్లయితే; కనికొందము= చూచికొందము; పాండవులమీఁదను= పాండవులపై; ఉఱికి= దూకి; పొడుతము= పోట్లాడదాము; కాక; అనినన్= ఇట్లు చెప్పగా; విని; అట్ల= ఆ విధముగానే; చేయన్= చేయుటకు; ఆ+రథిక= ఆ రథికులు అయిన (యోధులు అయిన); త్రయంబును= ముప్పురును (అశ్వత్థామ కృతవర్మ కృపాచార్యులు); తద్+ఆనీకంబును= ఆ సైన్యమును; వెడలి= వెళ్ళి; సౌబలుఁడు= శకుని; ఉన్న= ఉన్నట్టి; చక్కటికిన్= దిక్కునకు; చనియెన్= వెడలింది; ఇట్లు= ఈ ప్రకారముగా; దిక్కుమాలిన= నాథుడులేని; ఆ+మొన= ఆ సేన; చుట్టుముట్టి= క్రమ్ముకొని.

తాత్పర్యం: దుర్యోధనుడు ఒక ఉత్తమాశ్వాన్ని అధిరోహించి ఇంకొక చోటునకు తొలగి ఏనుగుల గుంపులను క్రమ్ముకొనేటట్లు చేయగా అవి అర్జునుడి రథాన్ని చుట్టుముట్టాయి. అప్పుడు వీరుడయిన ఆ అర్జునుడు భయంకరములైన బాణాల వరుసలను ఆ ఏనుగులమీద కురిపించాడు. అది చూచి గదను చేత ధరించి రథం దిగి భీముడు ఏనుగులపై కలియబడగా, తొండములు పగిలి, దంతములు ముక్కలైపోయి, కుంభస్థలాలు బ్రద్దలైపోయి, ప్రక్కభాగాలు నలిగిపోయి, వీపులు విరిగిపోయి, ఆ ఏనుగులు ఘీంకరిస్తూ రక్తములు క్రక్కుతూ, బయలువెడలుతూ చుట్టుకొనిపోతూ ఉన్నాయి. మరియు మీదమీదకు వేగిరపాటుతో పడుతున్న ఏనుగులను చూచి ధర్మరాజ నకుల సహదేవులును ధృష్టద్యుమ్నుడు మొదలైన యోధులును ఆ వైపునకు పరుగెత్తారు. ఆ సమయంలో అశ్వత్థామ కృతవర్మ కృపాచార్యులు దుర్యోధనుడి రథముల సమూహాల లోపల చూడజాలక యుద్ధంలో చనిపోయాడేమో? అని సందేహిస్తూ అచ్చట ఉన్న రాజులను 'దుర్యోధనుడు ఎక్కడ ఉన్నాడు?' అని అడిగారు. ఇట్లా అడుగగా కొందరు రాజులు 'శకుని ఉన్నవైపు వెళ్ళాడు' అని చెప్పారు. మిగిలినవారు 'దుర్యోధనుడిని వెదకటం ఎందులకు? జీవించి ఉండెనా - తెలిసి కొందము. లేనియెడల పాండవులమీదపడి పోట్లాడుదాము'. అని చెప్పగా విని ఆ విధంగానే చేయటానికి ఆ యోధులు ముప్పురూ ఆ సైన్యంతో శకుని ఉన్నట్టి దిక్కుకు వెళ్ళారు. ఈ ప్రకారంగా దిక్కుమాలిన ఆ సేనను చుట్టిముట్టి (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుర్విషహప్రభృతి కురుకుమారులు భీమునిచేఁ జచ్చుట (సం. 9-24-41)

క. పాంచాలకుమారాదు లు। దంచిత భుజబలము మెఱయ నమ్ములవెల్లిన్
ముంచిరి నిజకరిహరి రథ। సంచయసంరంభ మెసఁగ జగతీనాథా! 366

ప్రతిపదార్థం: జగతీనాథా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; పాంచాలకుమారాదులు= పాంచాలదేశపురాజు అయిన ద్రుపదుని కుమారుడు అయిన ధృష్టద్యుమ్నుడు మొదలగువారు; ఉదంచిత= విజృంభించిన; భుజబలము= బాహుబలము; మెఱయన్= ప్రకాశించగా; అమ్ములు= బాణములయొక్క; వెల్లిన్= ప్రవాహంతో; నిజ= తమయొక్క; కరి= ఏనుగులయొక్క; హరి= గుఱ్ఱములయొక్క; రథ= రథములయొక్క; సంచయ= సముదాయముయొక్క; సంరంభము= వేగిరపాటు; ఎసఁగన్= అతిశయించగా; ముంచిరి;

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధృష్టద్యుమ్నుడు మొదలైనవారు విజృంభించి బాహుబలం ప్రకాశించగా తమ ఏనుగుల, గుఱ్ఱాల, రథాల సముదాయపు వేగిరపాటు అతిశయించగా బాణాల పరంపరతో కౌరవసేనను ముంచారు.

వ. అప్పు డేను ధృష్టద్యుమ్నునిబారి కొక భంగిఁ దొలంగఁ దప్పియు నద్దెస నుద్దామగతి చతుశ్శతస్యందనములతో నడరు సాత్యకిచేతఁ బట్టువడితి; నట్టియెడ వడముడి కుంజర ప్రకరభంజనవిహరణపారీణతం బేర్చి యార్చినం జూచి నీ కొడుకులు దుర్విషహ దుష్ప్రదర్శన ప్రముఖులు శితశిఖంబులు గురియుచుం గవిసి యబ్బలుమగనిం బొదివిన నతండు రథం బెక్కియెక్కుడుమదంబున భల్లనారాచాదిబాణంబులఁబ్రాణంబులు గొనినం గనుంగొని హతశేషంబైన భవదీయబలంబు గ్రోధశోకావేశంబున నవ్వీరుఁ జుట్టుముట్టిన నాజెట్టిజోదు పంచశత రథంబులును దంతిశతసప్తకంబును దురంగాష్టశతంబును బదాతిదశసహస్రంబును దనసాయక సముదయంబుల వేగంబున సమయునట్లుగా సంక్రీడనంబు సూపినం దక్కటివారు దేఱిచూడనుం జాల కంతంత నిలువ భవత్కుమారమారణం బప్రతిహతంబై చెల్లుటకు నుల్లంబు వికసిల్లె. శిష్టైకసోదరుండైన సుయోధనునిఁ దెగినవానిఁన కాఁ గొని తన్ను నప్పుడు కృతార్థునింగాఁ దలంచుచు మల్లచఱచినం గించిదవశిష్టంబైన యాకౌరవసైన్యంబు వెగడంది విచ్చవడియె. నయ్యవసరంబున గుబ్బపుఁ దండంబులతో సుదర్శనుండు దాను నున్న సుయోధను నాలోకించి గోపాలదేవుండు దేవేంద్రపుత్రున కిట్లనియె. 367

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయమున; ఏను= నేను; ధృష్టద్యుమ్ని= ధృష్టద్యుమ్నుడి; బారికిన్= అధీనమునుండి; ఒక భంగిన్= ఏదో ఒక విధముగా; తొలంగన్= తొలగ; తప్పియున్= తప్పుకొనియు (ప్రక్కకు తప్పుకొని); ఆ+దెసను= ఆ దిక్కునకు; ఉద్దామ= అడ్డులేని; గతి= గమనముకలవాడై; చతుశ్శత= నాలుగువందల; స్యందనములతోన్= రథములతో; అడరు= అతిశయించు; సాత్యకిచేతన్= సాత్యకిచేత; పట్టుపడితిని (అ థాపశ్యం సాత్యకిం త ముపాయాంతం మహారథమ్। రథైశ్చతుశ్శతైర్వీరోమామభ్యద్ర తదాహవే॥ 9-24-48- మూలం); అట్టియెడన్= ఆ సమయంలో; వడముడి= భీముడు; కుంజర= ఏనుగులయొక్క; ప్రకర= సమూహమును; భంజన= భగ్నముచేయు (నాశముచేయు); విహరణ= విహారమునందు; పారీణతన్= పారము ముట్టుటవలన; పేర్చి= విజృంభించి; ఆర్చినన్= పెద్ద బొబ్బపెట్టగా; చూచిన; నీ కొడుకులు= నీ పుత్రులు; దుర్విషహ= దుర్విషహుడు; దుష్ప్రదర్శన= దుష్ప్రదర్శనుడు; ప్రముఖులు= మొదలగు ముఖ్యమయినవారు; శిత= వాడియైన; విశిఖంబులు= బాణములు; కురియుచున్= ప్రయోగించుచు; కవిసి= కలియబడి; ఆ+బలు= ఆ బలమయిన; మగనిన్= వీరుని (భీముడిని); పొదివినన్= ఎదుర్కొనగా; అతండు; రథంబు; ఎక్కి= అధిరోహించి; ఎక్కుడు= మిక్కిలి;

మదంబునన్= గర్వముతో; భల్ల= బల్లెములు; నారాచ= నారాచములు(ఇనుపబాణాలు); ఆది= మొదలగు; బాణంబులన్= బాణములతో; ప్రాణంబులు= ప్రాణములు; కొనినన్= తీసికొనగా; కనుంగొని= చూచి; హత= చంపబడగా; శేషంబైన= మిగిలిన; భవదీయ= నీయొక్క; బలంబు= సేన; క్రోధ= కోపముయొక్క; శోక= దుఃఖముయొక్క; ఆవేశంబునన్= తీవ్రతవలన; ఆ+వీరున్= ఆ పరాక్రమవంతుని (భీముని); చుట్టుముట్టినన్= క్రమ్ముకొనగా; ఆ జెట్టి= ఆ మల్లుడయిన; జోదు= యోధుడు (భీముడు); పంచ= అయిదు; శత= వందల; రథంబులును= రథములును; దంతి= ఏనుగులయొక్క; శతసప్తకంబును= ఏడువందలును; తురంగ= గుర్రములయొక్క; అష్టశతంబును= ఎనిమిది వందలును; పదాతి= కాల్బలములయొక్క; దశసహస్రంబును= పదివేలును; తన= తనయొక్క; సాయక= బాణములయొక్క; సముదయంబులన్= సమూహములతో; వేగంబునన్= శీఘ్రముగా; సమయునట్లుగాన్= సంహరింపబడునట్లుగా; సంక్రీడనంబు= గొప్పక్రీడను; చూపినన్= చూపించగా; తక్కటి= మిగిలిన; వారు; తేఱిచూడనున్= తేరిపారచూచుటకు కూడా; చాలక= లేక (శక్తిలేక); అంతంతన్= అక్కడక్కడ; నిలువన్= నిలబడగా; భవత్= మీయొక్క; కుమార= పుత్రులయొక్క; మారణంబు= వినాశనము; అప్రతిహతంబై= అడ్డులేనిదియై; చెల్లుటకున్= అయిపోవుటకు; ఉల్లంబు= హృదయము; వికసిల్లెన్= వికసించినది; శిష్ట+ఏక= మిగిలిన ఒక్క; సోదరుండైన= సోదరుడు కలవాడైన (తమ్ముడు కలవాడు అయిన - ఆ తమ్ముడి పేరు సుదర్శనుడు); సుయోధనునిన్= దుర్యోధనుని; తెగినవానినకాన్= ఖండింపబడిన వానినిగానే; కొని= అనుకొని (తలచి); తన్నున్= తనను; అప్పుడు= ఆ సమయమున; కృత+అర్థునిఁగాన్= ధన్యునిగా (నెరవేరిన పని కలవానినిగా, చేయబడిన ప్రయోజనము అనగా ఫలితము కలవానినిగా); తలంచుచున్= ఆలోచించుచు; మల్లచఱచినన్= భుజాస్ఫాలనముచేయగా (కుస్తీపట్టునప్పుడు మల్లవీరులు భుజములను కాని తొడలనుకాని చఱచుకొందురు); కించిత్= కొంచెము; అవశిష్టంబైన= మిగిలిన; ఆ కౌరవసైన్యంబు= ఆ కౌరవులయొక్క సైన్యము; వెగడంది= తడబాటుపొంది; ఱిచ్చ+పడియెన్= చేష్టలుడిగెను (నిశ్చేష్టమయ్యెను); ఆ+అవసరంబునన్= ఆ సమయమున; గుఱ్ఱపున్= గుర్రములయొక్క; తండంబులతోన్= సముదాయములతో; సుదర్శనుండు= సుదర్శనుడు; తానును; ఉన్న; సుయోధనున్= దుర్యోధనుడిని; ఆలోకించి= చూచి; గోపాలదేవుండు= శ్రీకృష్ణుడు; దేవేంద్రపుత్రునకున్= అర్జునునకు; ఇట్లు= ఈ ప్రకారముగ; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: ఆ సమయంలో నేను ధృష్టద్యుమ్నుడి పట్టునుండి ఏదో ఒక విధంగా ప్రక్కకు తప్పుకొని, ఆ దిక్కునకు అడ్డులేని గమనం కలవాడై నాలుగు వందల రథాలతో అతిశయించే సాత్యకిచేత పట్టుపడ్డాను. ఆ సమయంలో భీముడు ఏనుగులయొక్క సమూహాలను నాశనంచేసే అపారవిహారంతో విజృంభించి పెద్దబొబ్బపెట్టగా చూచి నీ కొడుకులు దుర్విషహ దుష్ప్రదర్శన ప్రముఖులు వాడిబాణాలు ప్రయోగిస్తూ కలియబడి ఆ బలైన వీరుడిని ఎదుర్కొనగా, అతడు రథం ఎక్కి మిక్కిలి గర్వంతో బల్లెములు నారాచములు మొదలైన ఆయుధాలతో వారి ప్రాణాలు తీశాడు. అది చూచి చావగా మిగిలిన నీ సేనలు కోపదుఃఖాల తీవ్రతవలన ఆ పరాక్రమవంతుడైన భీముడిని చుట్టుముట్టాయి. అప్పుడు ఆ మల్లుడైన యోధుడు - భీముడు అయిదువందల రథాలను, ఏడువందల ఏనుగులను, ఎనిమిది వందల గుర్రాలను, పదివేల కాల్బలాలను తన బాణపరంపరత వేగంగా సంహరింపబడేటట్లుగా క్రీడించి చూపించగా మిగిలినవారు తేరిపారచూడటానికి కూడా అర్హతలేక అక్కడక్కడ నిలబడగా నీ పుత్రుల వినాశం అడ్డులేకుండా అయిపోయినందులకు హృదయం వికసించినది. ఇక ఒక్క సోదరుడు మిగిలినవాడైన దుర్యోధనుడిని ఖండింపబడిన వాడినిగా భావించి తననుతాను ధన్యుడిగా ఆలోచిస్తూ భుజాస్ఫాలనం చేయగా, కొంచెం మిగిలిన ఆ కౌరవసైన్యం తడబాటు పొంది చేష్ట లుడిగినది. ఆ సమయంలో గుర్రాల గుంపులతో సుదర్శనుడు తానును ఉన్నట్టి దుర్యోధనుడిని చూచి శ్రీకృష్ణుడు అర్జునుడితో ఈ ప్రకారంగా అన్నాడు.

విశేషం: మూలమును అనుసరించి ఈ సన్నివేశంలో భీముడు సంహరించిన ధృతరాష్ట్ర పుత్రులు : 1). దుర్మర్షణుడు; 2). శ్రుతాంతుడు; 3). జైత్రుడు; 4). భూరిబలుడు; 5). రవి; 6). జయత్సేనుడు; 7). సుజాతుడు; 8). దుర్విషహుడు; 9). దుర్విమోచనుడు; 10). అరిహుడు; 11). దుష్ప్రధర్షుడు; 12). శ్రుతపర్వుడు; 13). మహాబాహుడు; 14). సుదర్శనుడు. వీరుకాక దుర్విరోచనుడు, దుష్కర్ణుడు, దుష్టరాజయుడు, దుష్ప్రధర్షణుడు అనే ధృతరాష్ట్రపుత్రులు ద్రోణపర్వంలో భీముడిచేత సంహరింపబడినట్లు ఉన్నది.

సీ. **'అరు లడంగిరి యుధిష్ఠిరుఁ డాది యగు భవ। ద్భ్రాతలు నీ పరిపాలనమున**
నుల్లసిల్లిరి సంజయుని బాడుదల వట్టి। కొని వచ్చి సాత్యకి వినుతి కెక్కె
నెలమి ధృష్టద్యుమ్నుఁ డెంతయు నొప్పె ని। ప్పడ కూడి తఱుము మీప్రోవుగట్టి
నిలిచిన హయములం బొలియింపవలయు నిం। దున్నాఁడు చూచితె? యొడ్డు చక్కఁ

తే. **గా నమర్చుచుఁ జూడ్కులు గలయదెసల। బొరి నిగుడ్చుచు ధృతరాష్ట్రపుత్త్రుఁ డల్ల**
వాఁడె! తెల్లనిగొడుగుతో వాఁడి దక్కి। నివురు గప్పిన నొప్పఱు నిప్పువోలె. **368**

ప్రతిపదార్థం: అరులు= శత్రువులు; అడంగిరి= నశించారు; యుధిష్ఠిరుఁడు= ధర్మరాజు; ఆదియగు= మొదలు అగు; భవత్= నీ యొక్క; భ్రాతలు= సోదరులు; నీ పరిపాలనమునన్= నీయొక్క సంరక్షణమున; ఉల్లసిల్లిరి= వికసించిరి (ప్రకాశించిరి); సంజయుని; బాడుదల= అవమానించి; పట్టికొనివచ్చి; సాత్యకి; వినుతికిన్= మెప్పునకు; ఎక్కెన్= పొందెను; ఎలమిన్= సంతోషముతో; ధృష్టద్యుమ్నుఁడు; ఎంతయున్= మిక్కిలి; ఒప్పెన్= ప్రకాశించెను; ఇప్పుడు+అ= ఈ సమయముననే; కూడి= కలిసికొని; తఱుము= వెంటపడి పరిగెత్తునట్లు చేయు; మీప్రోవు= మీగుంపు (ప్రోగు); కట్టి= నిర్మించి (మీరు గుంపుగూడి); నిలిచిన; హయములన్= గుర్రములను; పొలియింప వలయున్= చంపవలయును; ఇందున్+ఉన్న+వాఁడు= ఇచ్చట ఉన్నాడు; చూచితె?= చూచితివా?; ఒడ్డు= సేనావ్యూహము; చక్కఁగాన్= చక్కగా; అమర్చుచున్= అమరజేయుచు (సర్దుబాటుచేయుచు); చూడ్కులు= చూపులు; కలయన్= అంతట; దెసలన్= దిక్కులను; పొరి= మిక్కిలి; నిగుడ్చుచున్= వ్యాపింపచేయుచు; ధృతరాష్ట్రపుత్రుఁడు= దుర్యోధనుడు; అల్లవాఁడె!= అదిగో అక్కడివాడే!; తెల్లని; గొడుగుతో; వాఁడి= వికాసము; దక్కి= పోయి; నివురు= నుసి; కప్పిన; ఒప్పు= అందము; అఱు= నశించు; నిప్పు+పోలెన్= అగ్నివలె; వాఁడి= వికాసము; దక్కి= పోయి; అల్లవాఁడె!= అదిగోవాడే!.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అర్జునుడితో చెప్పుతున్నాడు. 'శత్రువులు తగ్గిపోయారు. ధర్మరాజు మొదలగు నీ సోదరులు నీ సంరక్షణంలో ప్రకాశించారు. సంజయుడిని అవమానించి పట్టుకొని వచ్చి సాత్యకి మెప్పుపొందాడు. సంతోషంతో ధృష్టద్యుమ్నుడు మిక్కిలి ప్రకాశించాడు. ఈ సమయంలోనే కలిసికొని తరుమునట్లు మీరు గుంపుగా కూడి గుర్రాలను చంపవలయును. ఇదిగో ఒక్కడు ఉన్నాడు చూచితివా? సేనావ్యూహాన్ని చక్కగా అమర్చుతూ చూపులు అంతటా వ్యాపింపజేస్తూ దుర్యోధనుడు తెల్లని గొడుగుతో వికాసంపోయి అందం నశించి నివురుకప్పిన నిప్పువలె ఉన్నాడు చూచావా?

విశేషం: అలం: ఉపమ. పద్యములను గద్యములుగా రచించటం, అందులో అలతి అలతి పదవాక్యములతో సంవాదచారిమను ప్రదర్శించటం తిక్కనకు గల కవితా మార్మికత. 'నివురు గప్పిన నిప్పువోలె' - ఉపమ.

క. **ఇతనిని భవదీయోజ్జ్వల। శితనారాచప్రసారశిఖిప్రభలో**
ద్ధతి గతజీవితుఁ జేయుము। గృతకృత్యుఁడ వగదు జగము గీర్తింపంగన్. **369**

ప్రతిపదార్థం: ఇతనిని= ఈ దుర్యోధనుడిని; భవదీయ= నీయొక్క; ఉజ్జ్వల= మిక్కిలి ప్రకాశవంతమయిన; శిత= వాడి అయిన; నారాచ= బాణములయొక్క; ప్రసార= వ్యాపించుటవలన; శీఘ్రం= వేగముగా; ఆభీల= భయంకరమయిన; ఉద్ధతిన్= గర్వముతో; గత= పోయిన; జీవితున్= జీవము కలవాడినిగా; జగము= ప్రపంచము; కీర్తింపంగన్= పొగడునట్లుగా; చేయుము; కృతకృత్యుఁడవు= ధన్యుడవు; అగుదు(వు).

తాత్పర్యం: ఈ దుర్యోధనుడిని నీయొక్క ప్రకాశవంతమైన వాడి అయిన బాణాల వ్యాప్తితో శీఘ్రంగా భయంకరమయిన గర్వంతో ప్రపంచం కీర్తించేటట్లు సంహరించుము. ధన్యుడవు ఔతావు.

క. వినుము ధృతరాష్ట్రనందను । లనిలతనయుచేతఁ బొలిసి రందఱు నిం కొ
క్కనుజుండు నితండును ని । ల్చిన వా రయ్యిరువు రిపుడు చెల్లెద రెట్లున్'. **370**

ప్రతిపదార్థం: వినుము ఆలకింపుము; ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రునియొక్క; నందనులు= పుత్రులు; అందఱున్= అందరును; అనిల= వాయువుయొక్క; తనయుచేతన్= పుత్రుడిచేతను (భీమునిచేతను); పొలిసిరి= చచ్చిరి; ఇంకొక్క= ఇంక ఒక్క; అనుజుండు= తమ్ముడును; ఇతండును= ఈ దుర్యోధనుడును; నిల్చినవారు= నిలిచి ఉన్నారు (బతికి ఉన్నారు); ఎట్లున్= ఏ విధంగా అయినను; ఆ+ఇరువురు= ఆ ఇద్దరును; ఇపుడు= ఇప్పుడు; చెల్లెదరు= చత్తురు.

తాత్పర్యం: అర్జునా! ఆలకించుము. ధృతరాష్ట్ర పుత్రులందరు భీముడిచేత చచ్చారు. ఇంక ఒక తమ్ముడు, దుర్యోధనుడు మిగిలి ఉన్నారు. ఏ విధంగా అయినా ఆ ఇద్దరూ ఇప్పుడు చస్తారు'.

వ. అనిన విని సవ్యసాచి సవినయంబుగా నయ్యంబుజాక్షు వీక్షించి. **371**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; సవ్యసాచి= అర్జునుడు; సవినయంబుగాన్= వినయంతో; ఆ+అంబుజ+అక్షున్= ఆ శ్రీకృష్ణుడిని; వీక్షించి= చూచి.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు చెప్పగా ఆలకించి, అర్జునుడు వినయంగా ఆ కృష్ణుడిని చూచి (తరువాతి పద్యంతో అన్వయం).

చ. అమరనదీతనూభవుని నస్త్రకళాగురుఁ గర్ణునిన్ మహా
సమరమునం దనేక బలసంఘములన్ బలవన్నృపాలవ
ర్గములను మద్రరాజుఁ దుదిగాఁ దెగటార్చె భవత్ప్రసాదది
వ్యమహిమ యింక నల్పతరవైరి సమూహము దాని కడ్డమే? **372**

ప్రతిపదార్థం: అమరనదీ= దేవనది అయిన ఆకాశగంగానదియొక్క; తనూభవునిన్= పుత్రుని అనగా భీష్ముని; అస్త్రకళా= అస్త్రవిద్యాకళకు; గురున్= గురువు అయిన ద్రోణుని; కర్ణునిన్= కర్ణుని; అనేక= పలు; బల= బలవంతులయిన సైన్యం; సంఘములన్= సమూహములను; బలవత్= బలవంతులయిన; నృపాల= రాజులయొక్క; వర్గములను= సముదాయములను; తుదిగాన్= చివరగా; మద్రరాజు= శల్యుడు; మహాసమరమునందున్= గొప్ప యుద్ధమునందు; భవత్= మీ యొక్క; ప్రసాద= అనుగ్రహము యొక్క; దివ్య= దైవీయమయిన; మహిమ (ఈశ్వర సంబంధి శక్తి); తెగటార్చెన్= చంపెను; ఇంకన్= ఇంక; అల్పతర= మిక్కిలి స్వల్పమయిన; వైరి= శత్రువులయొక్క; సమూహము= సముదాయము; దానికిన్= సంహారమునకు (దుర్యోధనుని, అతని తమ్ముని సంహరించుటకు); అడ్డమే?= అడ్డము అగునా? (కాదని భావం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: భీష్ముడిని, ద్రోణుడిని, కర్ణుడిని పలుసేనాసమూహములను బలవంతులయిన రాజులయొక్క సముదాయాలను, చిట్టచివరగా శల్యుడిని ఈ గొప్ప యుద్ధంలో మీ అనుగ్రహ మహిమ చంపింది. ఇంక మిక్కిలి స్వల్పమైన శత్రుసమూహం అనుజుడితో కూడా దుర్యోధనుడిని సంహరించటానికి అడ్డం కాదు.

వ. ఇన్నూఱు రథంబులు నూఱేనుంగులు రెండువేల కాలుమానిసియు సౌబలునితోడి యేనూఱుగుఱ్ఱంబులు నింతియ కాదె యీసేన! యిది కృపాశ్వత్థామకృతవర్మలు గలసి నిలుప నిలిచినయది యేను దఱి యఱుముట కలిగెనే నింతపట్టును బరిమార్చెద నిమ్మూఁక పడియును బాఱియుం దనచుట్టు బయలైన సుయోధనుం డెట్లయ్యెడివో యటు సూడుము. మార్కొనియెనేని మదీయ మార్గణాగ్నికి నాహుతి సేసి కపటద్యూతంబున నపహృతంబులైన సకలధనంబులు నలుఁగుమొన మరల్చినవాఁడనై పాండవాగ్రజుని చింతవంత యంతయుఁ బుచ్చివైచెద. నేఁ డెల్లపనులు సక్కనయ్యెడుఁ. గరిపురపురంధ్రీజనులు తమపతులుఁ బుత్రులుం బొలియుట విని పాండవు లుద్దండ బాహువీర్యశౌర్య సమగ్రులని యెఱింగెదరుగాక!' యనుటయు నన్నరుమాటకు మెచ్చుచు నతండు. 373

ప్రతిపదార్థం: ఇన్నూఱు= రెండువందలు; రథంబులు= రథములు; నూఱు= వంద; ఏనుంగులు= ఏనుగులు; రెండువేల కాలుమానిసియున్= రెండువేల పదాతి దళమును; సౌబలుని= శకుని; తోడి; ఏనూఱు= అయిదువందలు; గుఱ్ఱంబులు= గుర్రములును; ఇంతియ= ఇంతే; కాదె!= కదా!; ఈసేన= ఈ సైన్యము (ఈ కౌరవ సైన్యము ఇంత అల్పమే కదా అని భావం); ఇది; కృప= కృపుడు; అశ్వత్థామ= అశ్వత్థామ; కృతవర్మలు= కృతవర్మలు; కలిసి; నిలుపన్= నిలుపగా; నిలిచినయది= నిలబడినట్టిది; ఏను= నేను; తఱి= సమీపించి; అఱుముట= ఆక్రమించుట; కలిగెనేని= కలిగినట్లు అయితే; ఇంతపట్టును= ఇది అంతయును; పరిమార్చెదను= సంహరించెదను; ఈ+మూఁక= ఈ సైన్యము; పడియును= చనిపోయియును; పాఱియున్= పాఱిపోయియును; తనచుట్టు= తనచుట్టును; బయలైన= శూన్యమయిన (ఖాళీ అయిన); సుయోధనుండు= దుర్యోధనుడు; ఎట్లు= ఏ విధముగా; అయ్యెడినో= అయినాడో; అటు= ఆ వైపు; చూడుము= తిలకించుము (చూడుము); మార్కొనియెనేని= ఎదుర్కొనినట్లయిన; మదీయ= నాయొక్క; మార్గణ= బాణములనెడి; అగ్నికిన్= అగ్నికి; ఆహుతి= వ్రేల్చుట; చేసి; కపట= మాయా; ద్యూతంబునన్= జూదమువలన; అపహృతంబులైన= అపహరింపబడినట్టి; సకల ధనంబులు= సమస్త సంపదలును; అలుఁగు= బాణములయొక్క; మొన= చివరిభాగముతో; (అలుఁగున్= బాణములతో; మొనన్= సేనావ్యూహమును); మరల్చినవాఁడనై= మరలించినవాడవై; పాండవాగ్రజుని= ధర్మరాజుయొక్క; చింతవంత= సంతాపముతో కూడిన విచారము; అంతయున్= అంతయును; పుచ్చివైచెదన్= పోగొట్టెదను; నేఁడు= నేడు; ఎల్లపనులు= అన్ని కార్యములు; చక్కన= బాగుగా; అయ్యెడున్= అగును; కరిపుర= హస్తినాపురము నందలి; పురంధ్రీజనులు= స్త్రీలు; తమపతులున్= తమయొక్క భర్తలును; పుత్రులున్= కుమారులును; పొలియుట= మరణించుట; విని= ఆలకించి; పాండవులు= పాండవులు (పాండురాజు పుత్రులు); ఉద్దండ= అడ్డులేని; బాహు= భుజబలములయొక్క; వీర్య= పరాక్రమము; శౌర్య= శూరత్వములందు; సమగ్రులు= సమృద్ధికలవారు; అని; ఎఱింగెదరుగాక!= తెలిసికొందురుగాక!; అనుటయును= ఇట్లు చెప్పుటయును; ఆ+నరు= ఆ అర్జునుడి; మాటకున్= పలుకునకు; మెచ్చుచున్= కొనియాడుచు; అతండు= ఆ కృష్ణుడు.

తాత్పర్యం: రెండువందల రథాలు, వంద ఏనుగులు, రెండువేల కాల్బలం శకునితో అయిదు వందల గుర్రాలు- ఇంతే కదా ఈ కౌరవసైన్యం. ఇది కృప కృతవర్మ అశ్వత్థామలు కలిసి నిలుపగా నిలబడినట్టిది. నేను సమీపించి ఆక్రమించటం కలిగినట్లయితే ఈ సైన్యాన్నంతా సంహరిస్తాను. ఈ సైన్యం చనిపోయి పారిపోయి తనచుట్టును శూన్యమైన సుయోధనుడు ఏ విధంగా ఉన్నాడో! అటు చూడుము. ఎదిరించినట్లయితే నా బాణాగ్నితో ఆహుతి చేసి

మాయాద్యూతంతో అపహరించబడిన సమస్తసంపదలను నా బాణాగ్రహంతో సేనా వ్యూహాన్ని మరలించిన వాడనై ధర్మరాజుయొక్క సంతాప విచారాలను అంతా పోగొట్టుతాను. నేడు అన్ని కార్యాలు బాగా అవుతాయి. హస్తినాపురమునందలి స్త్రీలు తమయొక్క భర్తలును, పుత్రులును మరణించటం ఆలకించి, పాండవులు అడ్డులేని భుజబల పరాక్రమశౌర్య సమృద్ధులు అని తెలిసికొంటారు గాక!' అని చెప్పగా ఆ అర్జునుడి పలుకులను కొనియాడుతూ శ్రీకృష్ణుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. అరదము గౌరవేంద్రుదెసకై నడపంగఁ గెలంకులం గడం
గిరి నకులానుజన్ముఁడును గీచకవైరియుఁ గౌరవేశ్వరుం
బొరిగొన నుత్సహించి వడి భూవర! వారి కెదిర్చె సౌబలుం
డరిబలముం దదీయ రథికావలియున్ వినుతింప నుగ్రుఁడై. 374

ప్రతిపదార్థం: భూవర!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అరదము= రథము; కౌరవేంద్రు= దుర్యోధనునియొక్క; దెసకై= దిక్కునకై; నడపంగన్= నడిపించగా; కెలంకులన్= ప్రక్కలను (రెండు వైపులను); నకుల= నకులునియొక్క; అనుజన్ముఁడును= తమ్ముడును (సహదేవుడును) (అనుసరించి పుట్టినవాడు అనుజన్ముడు); కీచకవైరియున్= భీముడును (కీచకుడికి శత్రువు); కౌరవ+ఈశ్వరున్= దుర్యోధనుని; పొరిగొనన్= చంపుటకు; ఉత్సహించి= ప్రయత్నించి; వడిన్= వేగముగా; కడంగిరి= పూనుకొనిరి; సౌబలుండు= శకుని (సుబలుని కుమారుడు); వడిన్= వేగముగా (ఉభయత్ర అన్వయము); అరి= శత్రువులయొక్క; బలమున్= సైన్యమును; తదీయ= అతనియొక్క; రథిక= రథికులయొక్క (మహాయోథుల); ఆవలియున్= సమూహమును; వినుతింపన్= స్తుతించునట్లు; ఉగ్రుఁడై= మిక్కిలి కోపము కలవాడై; వారికిన్= వారికి; ఎదిర్చెన్= ఎదిరించెను (ఎదురునిలిచెను);

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శ్రీకృష్ణుడు రథాన్ని దుర్యోధనుడివైపు నడిపించగా రెండు ప్రక్కలను సహదేవుడూ భీముడూ దుర్యోధనుడిని చంపటానికి ప్రయత్నించి, వేగంగా పూనుకొన్నారు. శత్రుసైన్యం, వాళ్ళ రథిక సమూహమూ ప్రశంసిస్తూండగా, శకుని మిక్కిలి కోపించినవాడై వారికి ఎదురు నిలిచాడు.

వ. తక్కటివారు నుక్కెక్కి పురికొని రా శకునియు సుశర్ముండును సవ్యసాచిని సుదర్శనుండు సమీరనందనుని నీయగ్రనందనుండు సహదేవునిం దలపడి రట్టియెడ. 375

ప్రతిపదార్థం: తక్కటివారున్= మిగిలినవారును; ఉక్కు= బలము; ఎక్కి= అతిశయించి; పురికొనిరాన్= విజృంభించిరాగా; శకునియున్= శకునియు; సుశర్మండును= సుశర్ముడును; సవ్యసాచిని= అర్జునుడిని; సుదర్శనుండు= సుదర్శనుడు (దుర్యోధనుని తమ్ముడు); సమీర= వాయువుయొక్క; నందనునిన్= పుత్రుడు భీముడిని; నీ= నీయొక్క; అగ్రనందనుండు= మొదటి పుత్రుడయిన దుర్యోధనుడు; సహదేవునిన్= సహదేవుడిని; తలపడిరి= ఎదుర్కొనిరి; అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: మిగిలినవారు బలం పుంజుకొని విజృంభించి రాగా శకుని, సుశర్ముడు అర్జునుడిని ఎదుర్కొన్నారు. దుర్యోధనుడి తమ్ముడు సుదర్శనుడు భీముడిని ఎదిరించాడు. దుర్యోధనుడు సహదేవుడిని ఎదుర్కొన్నాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వడముడిఁ దలమిగిలి రయం । బడరఁగ సహదేవుఁ డత్యుదగ్రత మెఱయం
దొడరి భవత్సుతు మార్కొని । నిడుదవెడఁదతూపులేసి నెఱిఁ దూలించెన్. 376

ప్రతిపదార్థం: వడముడిన్= భీముడిని; తలమిగిలి= ముందునకువచ్చి; రయంబు= వేగం; అడఁరగన్= అతిశయించగా; సహదేవుఁడు; అతి= మిక్కిలి; ఉదగ్రతన్= భయంకరముగా; మెఱయన్= ప్రకాశింపగా; తొడరి= పూనిక వహించి; భవత్= నీయొక్క; సుతున్= పుత్రుని (దుర్యోధనుని); మార్కొని= ఎదుర్కొని; నిడుద= పొడవైన; వెడఁద= వెడల్పైన; తూపులు= బాణములు; ఏసి= ప్రయోగించి; నెఱిన్= మిక్కిలి; తూలించెన్= ఎగురగొట్టెను (చలింపచేసెను).

తాత్పర్యం: భీముడిని దాటుకుని వచ్చి వేగం అతిశయించగా సహదేవుడు మిక్కిలి భయంకరంగా ప్రకాశిస్తూ పూనిక వహించి నీ పుత్రుడైన దుర్యోధనుని ఎదుర్కొని పొడవైన, వెడల్పయిన బాణాలు ప్రయోగించి మిక్కిలి చలింపజేశాడు.

ఉ. **కట్టియ వైచె నెన్నుదురు గాఁడ భవత్తనయుండు మాద్రి లేఁ**
బట్టి నతండు సోలియును బాహిరపోవక తేరి యా విభుం
గిట్టి నిశాతబాణచయకీలితదేహునిఁ జేసె రావుతుల్
కట్టుపకాసులై నరునిఁ గప్పిరి శక్తులఁ దోమరంబులన్. **377**

ప్రతిపదార్థం: భవత్= నీయొక్క; తనయుండు= పుత్రుడు (దుర్యోధనుడు); మాద్రి= మాద్రియొక్క; లేఁబట్టిన్= చిన్నకొడుకును (సహదేవుని); నెన్నుదురు= ఫాలభాగము; కాఁడన్= రంధ్రము పడునట్లు; కట్టియ= దండమును (దుడ్డుకర్రను); వైచెన్= వేసెను (విసిరెను); అతండు= ఆ సహదేవుడు; సోలియును= సొమ్మసిల్లిపోయినా; బాహిరపోవక= మూర్ఛిల్లక; తేరి= తెలివిపొంది; ఆ విభున్= ఆ ప్రభువు అయిన దుర్యోధనుని; కిట్టి= సమీపించి; నిశాత= మిక్కిలి వాడి అయిన; బాణచయ= బాణసమూహములతో; కీలిత= గుచ్చబడిన; దేహునిన్= దేహము కలవానిగా; చేసెన్= చేసెను; రావుతుల్= రౌతులు; కట్టుపకాసులై= అచలులై; శక్తులన్= శక్తులనే ఆయుధములతోను; తోమరంబులన్= తోమరములు అనే ఆయుధములతోను; నరునిన్= అర్జునుడిని; కప్పిరి= కప్పివేసిరి.

తాత్పర్యం: దుర్యోధనుడు సహదేవుడి ఫాలభాగం చిల్లులుపడేటట్లు దండం విసిరాడు. ఆ సహదేవుడు సొమ్మసిల్లి మూర్ఛిల్లక, తెలివిపొంది ఆ దుర్యోధనుడిని మిక్కిలి వాడియైన బాణ సమూహాలతో బంధించబడిన దేహం కలవాడినిగా చేశాడు. రౌతులు రణశూరులై శక్తులను తోమరాలను ప్రయోగించి అర్జునుడిని కప్పివేశారు.

వ. **గాంధారదేశీయు లగు నాశ్వికులట్లు పొదివిన నొదవినకినుకఁ గ్రూరభల్లంబుల శిరంబులు ధరం దొరఁగించినఁ ద్రిగర్తస్యందనసందోహం బడరి గోవిందపురందరపుత్రులపైఁ బటుప్రదరపరంపరలు వరఁగించి విజృంభించిన నవ్విజయుండు.** **378**

ప్రతిపదార్థం: గాంధారదేశీయులగున్= గాంధారదేశమునకు సంబంధించిన; ఆశ్వికులు= రౌతులు; అట్లు= ఆ ప్రకారముగా; పొదివినన్= క్రమ్ముకొనిన; ఒదవిన= కలిగిన; కినుకన్= కోపముతో; క్రూర= భయంకరమయిన; భల్లంబులన్= బల్లెములతో; శిరంబులు= తలలు; ధరన్= భూమిపై; తొరఁగించినన్= పడునట్లు చేయగా; త్రిగర్త= త్రిగర్తదేశముయొక్క; స్యందన= రథములయొక్క; సందోహంబు= సమూహము; అడరి= విజృంభించి; గోవింద= శ్రీకృష్ణ; పురందర పుత్రులపైన్= అర్జునులపై; పటు= కఠినమయిన; ప్రదర= బాణములయొక్క; పరంపరలు= వరుసలు; పరఁగించి= ప్రయోగించి; విజృంభించినన్= విజృంభించగా; ఆ+విజయుండు= ఆ అర్జునుడు.

తాత్పర్యం: గాంధారదేశపు రౌతులు క్రమ్ముకొనగా కలిగిన కోపంతో అర్జునుడు భయంకరమైన బల్లెములతో తలలు నేలపై పడి దొర్లేటట్లు చేయగా త్రిగర్తదేశపు రథాల సమూహం విజృంభించి శ్రీకృష్ణార్జునులపై కఠినమైన బాణాల వరుసలు ప్రయోగించి విజృంభించగా ఆ అర్జునుడు. (తరువాతి పద్యంతో అన్వయము).

సీ. సత్యకర్మునితల చారుకుండల పరి । స్ఫురితత్వ మొందుచు ధరణి డొల్ల
నేసి మృగంబుపై కెరఁగుసింగమపోలెఁ । గిట్టి సత్యేషుని గీ టడంచి
బహుదినసంచితప్రకటకోపానల । జ్వాలలు సాకారలీలఁ బర్వు
తెఱంగున నరుణదృగ్దీప్తిజాలంబు సు । శర్మపై నిగిడించి సాయకత్ర

తే. యం బొడల నాటుటయుఁ దద్రథంబు లొక్క । పెట్టఁ గవిసిన నన్నిటిఁ బిలుకుమార్చి
రథ్యములఁ గూల్చి యతనియురంబు ఘోర । భల్లమున వ్రచ్చి నిర్జితప్రాణుఁ జేసె. 379

ప్రతిపదార్థం: సత్యకర్మని తల; చారు= సుందరమయిన; కుండల= చెవికుండలములయొక్క; పరిస్ఫురితత్వము= అత్యంత ప్రకాశకత్వము; ఒందుచున్= పొందుచు; ధరణిన్= నేలపై; డొల్లన్= దొర్లునట్లుగ; ఏసి= ప్రయోగించి (కొట్టి); మృగంబుపైకిన్= లేడిపైకి; ఎరఁగు= దూకు; సింగమపోలెన్= సింహమువలె; కిట్టి= సమీపించి; సత్యేషుని; గీటడంచి= చంపి; బహుదిన= అనేకదినాలు; సంచిత= కూడబెట్టిన; ప్రకట= స్పష్టమయిన; కోప= కోపమనెడి; అనల= అగ్నియొక్క; జ్వాలలు= శిఖలు; సాకార లీలన్= ఆకారముతో కూడినరీతిగా; పర్వు= వ్యాపించు; తెఱఁగునన్= విధముగా; అరుణ= ఎర్రని; దృక్= చూపులయొక్క; దీప్తి= కాంతియొక్క; జాలంబు= సమూహము; సుశర్మపైన్= సుశర్ముడిపై; నిగిడించి= వ్యాపింపజేసి (ప్రసరింపచేసి); సాయక= బాణములయొక్క; త్రయంబు= మూడు (మూడు బాణములు); ఒడలన్= దేహమునందు; నాటుటయున్= క్రుచ్చుటయును; తద్= ఆ; రథంబులు; ఒక్కపెట్టన్= ఒక్కుమ్మడిగా; కవిసినన్= వ్యాపించగా; అన్నిటిన్= అన్నిటిని; పిలుకుమార్చి= నాశనం చేసి; రథ్యములన్= గుర్రములను; కూల్చి= చంపి; అతని= ఆ సుశర్మయొక్క; ఉరంబు= వక్షఃస్థలము; ఘోర= భయంకరమయిన; భల్లమునన్= బల్లెముతో; వ్రచ్చి= చీల్చి; నిర్జిత= జయింపబడిన; ప్రాణున్= ప్రాణము కలవానినిగా; చేసెన్= చేసెను.

తాత్పర్యం: అర్జునుడు సత్యకర్ముడి తలను సుందరమైన చెవికుండలాలు బాగా మెరుస్తూ నేలపై దొర్లేటట్లు కొట్టాడు. లేడిపై పడిన సింహంవలె సమీపించి సత్యేషుని చంపాడు. అనేక దినాలు కూడబెట్టిన కోపాగ్నిజ్వాలలు ఆకృతిపొంది విలాసంగా వ్యాపించే విధంగా ఎర్రని దృక్కుల కాంతుల సమూహం సుశర్ముడిపై ప్రసరింపజేసి మూడు బాణాలు ఆతడి దేహంలో గ్రుచ్చాడు. ఆ సుశర్ముడి రథాలు ఒక్కుమ్మడిగా మీదపడగా వాటి నన్నింటినీ నాశనం చేశాడు. సుశర్మయొక్క వక్షఃస్థలమును భయంకరమయిన బల్లెంతో చీల్చి, అతడి ప్రాణాలను తీశాడు.

విశేషం: అలం: ఉపమ. ఈ పద్యంలో అర్జునుడు సత్యకర్ముడిని, సత్యేషుడిని, సుశర్ముడిని సంహరించాడు. వీరు సంశప్తకులు. ఇందలి సుశర్మ త్రిగర్త దేశాధీశుడు. అతడి తమ్ములు సత్యకర్మ, సత్యేషులు. వీరు అర్జునుడిని సంహరింపగలమని ప్రతిజ్ఞచేశారు. 'మృగంబుపైకెరఁగు సింగమ పోలెన్'- ఉపమ.

వ. ఇవ్విధంబునఁ ద్రిగర్తపతిం బ్రేతపతిపాలి కనిచి మనదెస జనంబులు ఖేదంబుం దమవారు మోదంబు నొంద నతని నందనుల నేడ్వుర నెనమండ్ర ముప్పదుండ్ర మూఁడు మూఁడు గోలలం దలలు నఱికెఁ. దత్సైన్యశేషంబు బారిసమరె. భీమసేనుబారింబడిన సుదర్శనుండు దదీయశరజాలంబున నదర్శనగతుండై పదంపడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తచ్ఛరవిఖండితకంఠుండైనఁ గోపంబు దీపింప వగమిగుల నక్కుమారుమూఁక యమ్మారుతసుతుఁ జుట్టు ముట్టిన నతండు బెట్టిదంబులగు తూపుల నది రూపడంగు నట్లేపున విహరింపఁ గనుంగొని సహింపక మహీపతిముందటిబలంబు బరవసంబునం గవిసిన నక్కౌంతేయసైన్యంబున సరభసంబున నెదిర్చి పేర్చిన సమయంబున సౌబలుండును సహదేవుం దాఁకినం దత్సుతుం డులూకుండు బాసటయై యడరె. వడముడియుఁ బిన్నతమ్మునికి బాసటయయ్యె. నా శకుని మాద్రీతనయునిఁ బ్రదీప్తభల్ల త్రయంబున నొప్పించి పదినారాచంబు లతని మేన గుప్పించినం గోపించుచు నయ్యిరువురు సాయకనికాయంబు నిగిడించిన నా గాంధారరాజు మొగ్గరంబునఁ గత్తళంబులు గరవాలంబులు పల్యాణంబులు మోరలు గంఠంబులు చరణంబులు గరంబులు శిరంబులు దునియలై తొరఁగిన ధాత్రి చిత్రాకారంబైయుండె. నిట్లు దన తురగ సముదయంబు సమయుటయుఁ జలం బెడపక నీ మఱంది యన్నకులానుజుం గిట్టి. 380

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారముగా; త్రిగర్తపతిన్= త్రిగర్తదేశపు రాజు అయిన సుశర్మను; ప్రేతపతి= యమునియొక్క; పాలికి= వద్దకు; అనిచి= పంపి; మనదెస= మనవైపు; జనంబులు= జనులు; ఖేదంబున్= దుఃఖమును; తమవారు= పాండవపక్షమువారు; మోదంబును= ఆనందమును; ఒందన్= పొందునట్లు; అతని= ఆ సుశర్ముడి; నందనులన్= పుత్రులను; ఏడ్వురన్= ఏడుగురను; ఎనమండ్రన్= ఎనిమిది మందిని; ముప్పదుండ్రన్= ముప్పదిమందిని; మూఁడు మూఁడు= మూఁడేసి చొప్పున; కోలలన్= బాణములతో; తలలు= శిరములు; నఱికెన్= ఖండించెను; తద్= ఆ; సైన్యశేషంబు= మిగిలిన సైన్యము; బారిసమరెన్= నశించెను; భీమసేను= భీమునియొక్క; బారిన్= అధీనమునందు; పడిన; సుదర్శనుండు; తదీయ= ఆ భీమునియొక్క; శర= బాణములయొక్క; జాలంబునన్= సమూహము (వరుస) వలన; అదర్శనగతుండై= కనిపించకుండా పోయినవాడై (కప్పబడినవాడై); పదంపడి= వెనువెంటనే; తద్+శర= ఆ బాణములచే; విఖండిత= ఖండింపబడిన; కంఠుండు= కంఠముకలవాడు; ఐనన్= కాగా; కోపంబు= క్రోధము; దీపింపన్= ప్రజ్జ్వలింపగా; వగ= దుఃఖము; మిగులన్= ఎక్కువకాగా; ఆ+కుమారు= ఆ కుమారునియొక్క (సుదర్శనునియొక్క); మూఁక= సైన్యము; ఆ+మారుత సుతున్= ఆ వాయుపుత్రుడయిన భీముని; చుట్టుముట్టినన్= చుట్టుముట్టగా (క్రమ్ముకొనగా); అతండు= ఆ భీముడు; బెట్టిదంబులగు= మిక్కిలి క్రూరములగు; తూపులన్= బాణములతో; అది= ఆ మూఁక(సేన); రూపు+అడంగునట్లు= నశించునట్లు; ఏపునన్= విజృంభణమున; విహరింపన్= విలాసముగా తిరుగుచుండగా; కనుంగొని= చూచి; సహింపక= ఓర్వక; మహీపతి= దుర్యోధనునియొక్క; ముందటి= అగ్రభాగమున ఉన్న(ముందున్న); బలంబు= సైన్యము; బరవసంబునన్= ధైర్యముతో; కవిసినన్= కలియబడగా; ఆ+కౌంతేయ= ఆ కుంతీపుత్రులయొక్క; సైన్యంబును= సైన్యము కూడా; సరభసంబునన్= మిక్కిలి వేగిరపాటుతో; (కోపముతో); ఎదిర్చి= ఎదిరించి; పేర్చిన= విజృంభించిన; సమయమునన్= సమయమునందు; సౌబలుండును= శకునియును; సహదేవున్= సహదేవుని; తాఁకినన్= ఎదుర్కొనగా; తత్సుతుండు= ఆతడి పుత్రుడు(శకుని పుత్రుడు); ఉలూకుండు; బాసటయై= సహాయకుడై; అడరెన్= విజృంభించెను; వడముడియున్= భీముడును; పిన్నతమ్మునికిన్= చిన్నతమ్ముడయిన సహదేవునికి; బాసట= సహాయకుడు; అయ్యెన్= అయ్యెను; ఆ శకుని; మాద్రీతనయునిన్= మాద్రి పుత్రుడయిన సహదేవుని; ప్రదీప్త= మిక్కిలి ప్రజ్జ్వలించిన; భల్ల= బల్లెములయొక్క; త్రయంబునన్= మూడింటితో; నొప్పించి= బాధించి; పది నారాచంబులు= పది వాడియైన బాణములు; అతని మేనన్= ఆ సహదేవుని దేహమునందు; కుప్పించినన్= కురిపించగా (ప్రయోగించగా); కోపించుచున్= కోపించుచు; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరును; సాయక= బాణములయొక్క; నికాయంబున్= సమూహమును; నిగిడించినన్= వ్యాపింపచేయగా (ఒకరిపై ఒకరు ప్రయోగించగా); ఆ గాంధారరాజు= ఆ శకుని; మొగ్గరంబునన్= ఆ వ్యూహమునందు; కత్తళంబులు= కవచములు; కరవాలంబులు= కత్తులు; పల్యాణంబులు= జీనులు; మోరలు= ముఖములు (ఇచ్చట గుర్రముల ముఖములు); కంఠంబులు; చరణంబులు= పాదములు (కాళ్ళు); కరంబులు= చేతులు; శిరంబులు= తలలు; తునియలై= ముక్కలై; తొరఁగినన్= రాలగా; ధాత్రి= భూమి(యుద్ధభూమి);

చిత్ర= బొమ్మలయొక్క; ఆకారంబై= ఆకృతి కలదియై; (చిత్ర= ఆశ్చర్యకరమయిన; ఆకారంబై= ఆకృతికలదియై); ఉండెను; ఇట్లు= ఈ ప్రకారముగా; తన= తనయొక్క; తురగ= గుర్రములయొక్క; సముదయంబు= సమూహము; సమయుటయున్= చచ్చుటయు; చలంబు= మత్సరము; ఎడపక= ఎడబాయక (వదలక); నీ మఱంది= నీ బావమరది అయిన శకుని; ఆ+నకుల+అనుజున్= ఆ సహదేవుని; కిట్టి= సమీపించి.

తాత్పర్యం: ఆ ప్రకారంగా త్రిగర్తదేశాధిపతి సుశర్మను యముని వద్దకు పంపి, మనవైపు జనులు దుఃఖాన్ని పాండవపక్షంవారు ఆనందాన్ని పొందేటట్లు ఆ సుశర్ముడి పుత్రులను ఏడుగురను, ఎనిమిదిమందిని, ముప్పదిమందిని - క్రమంగా మూడు మూడు బాణాలతో తలలు ఖండించాడు. మిగిలిన సైన్యం పారిపోయి నశించినది. భీముడి అధీనంలో పడిన సుదర్శనుడు ఆ భీముడి బాణసమూహాలవలన కప్పబడి వెనువెంటనే ఆ బాణాలచేత ఖండింపబడిన కంఠం కలవాడయ్యాడు. అప్పుడు క్రోధం ప్రజ్వలించగా దుఃఖం ఎక్కువకాగా ఆ సుదర్శనుడి సైన్యం భీముడిని చుట్టుముట్టగా భీముడు మిక్కిలి క్రూరములైన బాణాలతో ఆ మూక నశించేటట్లు విజృంభించాడు. విలాసంతో తిరుగగా చూచి ఓర్వక దుర్యోధనుడి ముందున్న సైన్యం ధైర్యంతో కలియబడింది. ఆ పాండవులసైన్యం కూడా వేగిరపాటుతో ఎదిరించి విజృంభించింది. శకుని సహదేవుడిని ప్రజ్వలిస్తున్న మూడు బల్లెములతో బాధించి పదిబాణాలు అతడి దేహంలో ప్రయోగించాడు. వారు పరస్పరం కోపిస్తూ ఆ ఇద్దరూ బాణాల సమూహాన్ని వ్యాపింపచేయగా, శకుని సేనావ్యూహమునందు కవచములు కత్తులు జీనులు గుర్రముల ముఖములు కంఠములు కాళ్ళు చేతులు తలలు ముక్కలై పడ్డాయి. అప్పుడు యుద్ధభూమి చిత్రించిన బొమ్మ ఆకారాన్ని పొంది ఉన్నది. ఈ ప్రకారంగా తన గుర్రాల సముదాయం సంహరించబడటంతో మాత్సర్యం విడువక నీ బావమరది శకుని ఆ సహదేవుడిని సమీపించి.

క. పెనుగడఁత దొడ్డ యత్తళ । మున వైచిన నతఁడు మూర్ఛమునిఁగి రథము మీఁ
దన పడినఁ గనలి యప్పా । వని పొదివెను గౌరవేంద్రవాహినిఁ గడఁకన్. 381

ప్రతిపదార్థం: పెను= పెద్ద; కడఁతన్= కణత భాగాన్ని; దొడ్డ= గొప్ప; అత్తళమునన్= ఈటెతో; వైచినన్= కొట్టగా; అతఁడు= ఆ సహదేవుడు; మూర్ఛమునిఁగి= మూర్ఛలోమునిగి; రథము మీఁదను= రథము మీదనే; పడినన్= పడగా; ఆ+పావని= ఆ భీముడు (పవనుని పుత్రుఁడు పావని); కనలి= కోపించి; కడఁకన్= పూనికతో; కౌరవేంద్ర= దుర్యోధనుని; వాహినిన్= సేనను; పొదివెను= క్రమ్మెను.

తాత్పర్యం: శకుని ఆ సహదేవుడి పెద్దకణతను గొప్ప ఈటెతో కొట్టగా సహదేవుడు మూర్ఛలో మునిగి రథంపై పడిపోగా, భీముడు కోపించి పూనికతో దుర్యోధనుడిని సేనను ఆక్రమించాడు.

వ. పొదివిన యవ్వీరునారాచంబుల తాఁకున. 382

ప్రతిపదార్థం: పొదివిన= క్రమ్ముకొనిన; ఆ+వీరు= ఆ వీరునియొక్క (భీమునియొక్క); నారాచంబుల= బాణములయొక్క; తాఁకునన్= యుద్ధంలో.

తాత్పర్యం: దుర్యోధనుడి సేనను క్రమ్ముకొని పరాక్రమవంతుడైన భీముడి బాణాలయొక్క యుద్ధంలో (తరువాతి పద్యంతో అన్వయం).

క. అది గొంత పుడమిఁ బడ ను। న్నది పాఱినఁ గని యదల్చి యవనీశుఁడు బె
ట్టిదముగ నెలుఁగు సూపెను। మద మారఁగ నబ్బలంబు మగుడు విధమునన్. 383

ప్రతిపదార్థం: అది= ఆ దుర్యోధనుని సేన; కొంత; పుడమిన్= భూమిమీద; పడన్= పడగా(చావగా); ఉన్నది= మిగిలియున్నది; పాఱినన్= పరుగెత్తి పారిపోగా; కని= చూచి; అదల్చి= అదలించి; అవనీ+ఈశుఁడు= రాజు (దుర్యోధనుడు); మదము= గర్వము; ఆరఁగన్= కలుగగా; ఆ+బలంబు= ఆ సైన్యము; మగుడు= మరలు; విధమునన్= విధముగా; బెట్టిదముగన్= కఠినముగ; ఎలుఁగున్= కంఠస్వరము; చూపెను (కేకపెట్టెను).

తాత్పర్యం: ఆ దుర్యోధనుడి సైన్యం కొంత చావగా మిగిలిన ఉన్న సేన పారిపోతూ ఉండగా చూచి, అదలించి దుర్యోధనుడు గర్వంతో ఆ సైన్యం మరలేటట్లుగా గట్టిగా ఒక కేక పెట్టాడు.

వ. ఇవ్విధంబున దొర యఱిమి తఱిమి యమ్మొన కుత్సాహంబుగాఁ జటులవాహంబగు రథంబెక్కి శకునిఁ గూడుకొని కవిసిన. 384

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారముగ; దొర= రాజు; అఱిమి= ఆక్రమించి; తఱిమి; ఆ+మొనకున్= ఆ సేనకు; ఉత్సాహంబుగాన్= ఉత్సాహం కలిగేటట్లుగా; చటుల= చలించే; వాహంబు= గుర్రము; అగు= కలుగు; రథంబు= రథము; ఎక్కి= అధిరోహించి; శకునిన్= శకునిని; కూడుకొని= కలిసికొని; కవిసినన్= వ్యాపించగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా దుర్యోధనుడు ఆక్రమించి తరిమి ఆ సేనకు ఉత్సాహం కలిగేటట్లు చేసి, చలించే గుర్రాలు కల రథం అధిరోహించి శకునిని కలిసికొని వ్యాపించగా.

తే. పాండవుల సైన్యమును సముద్దండ లీల। మాఱుకొనె నంతలో మూర్ఛదేఱి నకులు
తమ్ముఁ డమ్మామపైఁ బదియమ్ము లొక్క। పెట్టఁ గ్రుచ్చి యాతనివిలు బెట్టు ద్రుంచె. 385

ప్రతిపదార్థం: పాండవుల సైన్యమును= పాండవులయొక్క సైన్యముకూడా; సముద్దండలీలన్= భయంకరంగా; మాఱుకొనెను= ఎదుర్కొనెను; అంతలోన్= ఆ సమయంలో; మూర్ఛదేఱి= మూర్ఛనుండి తేరుకొని; నకులు తమ్ముఁడు= నకులుని తమ్ముడయిన సహదేవుడు; ఆ+మామపైన్= ఆ మామ అయిన శకునిపై; పది; అమ్ములు= బాణములు; ఒక్కపెట్టన్= ఒక్కసారిగా; క్రుచ్చి; ఆతని= ఆ శకుని; విలు= విల్లు; బెట్టు= గట్టిగా; త్రుంచెన్= ఖండించెను.

తాత్పర్యం: పాండవుల సైన్యం కూడా భయంకర లీలతో ఎదుర్కొన్నది. అంతలో మూర్ఛ నుండి తేరుకున్న సహదేవుడు ఆ శకునిపై పది బాణాలు ఒక్కసారిగా గుచ్చి ఆ శకుని విల్లు గట్టిగా ఖండించాడు.

ఉలూకుఁడు సహదేవుచేత మృతుం డగుట (సం. 9-26-23)

సీ. ఆ సౌబలుండు శరాసనాంతరదీప్తుఁ। డగుటయు నకులుఁడు ననిలసుతుఁడు
దాఁకిన వారి నతండు పెక్కమ్ముల। నొప్పింప నతని తనూజుఁ డనిల
సుతసహదేవుల సునిశితశరవర్ష। మునఁ గప్ప నయ్యులూకుని ననేక
సాయకంబుల నొంచి శకునిమైఁ నఱువది। యమ్ములు నాటించి యనుచరులను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. బెగడు పఱిచె నా భీముండు బె ట్టులూకుఁ । డదరి యన్నకులానుజు నంపవెల్లి
ముంప నతఁడేచి పటుభల్లమున శిరంబు । ద్రుంచె నన్నలయెదలు సంతోష మొంద. 386

ప్రతిపదార్థం: ఆ సౌబలుండు= ఆ శకుని; శరాసన+అంతర= మరియొక ధనువుతో; దీప్తుఁడు= ప్రకాశించువాడు; అగుటయున్; నకులుఁడు; అనిల= వాయువుయొక్క; సుతుఁడు= పుత్రుడు (భీముడు); తాఁకినన్= ఎదుర్కొనగా; వారిన్= వారిని; అతండు= ఆ శకుని; పెక్కు= అనేకములయిన; అమ్ములన్= బాణములతో; నొప్పింపన్= బాధించగా; అతని= ఆ శకునియొక్క; తనూజుఁడు= పుత్రుడైన ఉలూకుడు; అనిలసుత సహదేవులన్= భీముని సహదేవుని; సునిశిత= బాగుగా వాడియైన; శర= బాణాలయొక్క; వర్షమునన్= కురియించినందువలన; కప్పన్= కప్పివేయగా; ఆ+ఉలూకుని= ఆ ఉలూకుని; అనేక= పలు; సాయకంబులన్= బాణములతో; నొంచి= నొప్పించి; శకునిమైన్= శకుని దేహమునందు; అఱువది= అరవై; అమ్ములు= బాణములు; నాటించి= గ్రుచ్చి; అనుచరులను= అనుసరించి ఉన్న యోధులను; ఆ భీముండు; బెగడ పఱిచెను= భయముపొందునట్లు చేసెను; ఉలూకుడు; బెట్టు= గట్టిగా; అదరి= విజృంభించి; ఆ+నకుల+అనుజున్= ఆ నకులునియొక్క తమ్ముని (అనగా సహదేవుని); అంపవెల్లిన్= బాణాల ప్రవాహంలో; ముంపన్= ముంచగా; అతఁడు= ఆ సహదేవుడు; ఏచి= విజృంభించి; పటు= కఠినమైన; భల్లమునన్= బల్లెముతో; అన్నలయెదలు= అన్నలయొక్క మనస్సులు; సంతోషము= ఆనందము; ఒందన్= పొందునట్లుగా; శిరంబు= తల; త్రుంచెన్= ఖండించెను.

తాత్పర్యం: ఆ శకుని మరియొక ధనువుతో చెలరేగుతూ నకులుడు భీముడు ఎదుర్కొనగా వారిని పెక్కుబాణాలతో నొప్పించాడు. శకుని పుత్రుడు ఉలూకుడు భీమసహదేవులను బాగా వాడి అయిన బాణాలను కురిపించి కప్పివేయగా ఉలూకుడిని అనేక బాణాలతో నొప్పించి శకుని దేహంలో అరువది బాణాలు గ్రుచ్చి భీముడు శకుని అనుచరులను భయం పొందేటట్లు చేశాడు. ఉలూకుడు గట్టిగా విజృంభించి సహదేవుడిని అమ్ముల వెల్లువలో ముంచాడు. సహదేవుడు విజృంభించి కఠినమైన బల్లెముతో అన్నల మనసులు ఆనందం పొందేటట్లుగా ఉలూకుడి తలను ఖండించాడు.

విశేషం: ఉలూకుడు శకుని పుత్రుడు. మహాపరాక్రమవంతుడు. ఇతడు శాంతిప్రియుడు. 'శాకుని, కైతవ, సౌబలసుత, కైతవ్య' అని ఇతడికి పేర్లు. సంస్కృత మహాభారతంలో ఉలూకదూతాగమన పర్వమనే ఒక అవాంతర పర్వం ఉద్యోగపర్వంలో ఉన్నది.

క. తనయుఁడు పడ శకుని కనుం । గొని శోకం బాత్మ నారఁగూరఁగ నశ్రుల్
కనుఁగొనలయందు నినిచె । న్మనుజేశ్వర! విదురు భాషణంబులు దలఁచెన్. 387

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= మానవులకు ప్రభువైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; తనయుండు= కుమారుడు; పడన్= కూలగా; శకుని; కనుంగొని= చూచి; శోకంబు= దుఃఖము; ఆత్మను= మనస్సును; ఆరఁగూరఁగన్= నిండుగా పొందగా; అశ్రుల్= బాష్పములు; కనుఁగొనలయందున్= కన్నుల చివరి భాగములయందు; నినిచెన్= నింపెను; విదురు= విదురునియొక్క; భాషణంబులు= పలుకులు; తలఁచెన్= స్మరించెను.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! పుత్రుడైన ఉలూకుడు కూలిపోగా శకుని చూచి, దుఃఖంతో మనస్సు నిండగా బాష్పాలను కనుల చివరి భాగాలలో నింపి, ఆనాడు విదురుడు చెప్పిన మాటలను స్మరించాడు.

వ. అ ట్లడలుచు నిట్టూర్పు నిగుడ సహదేవుపై నదరి మూఁడు నారాచంబుల నిగిడించిన. 388

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారంగా; అడలుచున్= దుఃఖించుచు; నిట్టూర్పు= నిశ్వాసము; నిగుడన్= వ్యాపించగా; సహదేవుపైన్= సహదేవునిమీద; అడరి= విజృంభించి; మూఁడు; నారాచంబులు= బాణములు; నిగిడించినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: ఆ ప్రకారంగా శకుని దుఃఖిస్తూ నిశ్వాసం వ్యాపించగా సహదేవుడిపై విజృంభించి, మూడు బాణాలు ప్రయోగించగా.

చ. అవి వెసఁ ద్రుంచి యాతనిశరాసనముం దునుమాడె నక్కుమా
ర వరుఁ డతం డనిందితపరాక్రముఁడై పటుఖడ్గయష్టిదీ
ప్తవిపులముద్గరంబున విభాసితశక్తిని వైవఁ దోడుతో
నవియు ననేకబాణముల నాన్నృపసూనుఁడు నుగ్గుసేసినన్. 389

ప్రతిపదార్థం: అవి= అవి (ఆ మూడు బాణములు); వెసన్= శీఘ్రముగా; త్రుంచి= ఖండించి; ఆతని= అతనియొక్క (శకుని); శరాసనమున్= ధనువును; ఆ+కుమార వరుఁడు= ఆ కుమార శ్రేష్ఠుడైన సహదేవుడు; తునుమాడెన్= ఖండించెను; అతండు= ఆ శకుని; అనిందిత= నిందింప బడని; పరాక్రముఁడై= పరాక్రమముకలవాడై; పటు= కఠినమైన; ఖడ్గ= కత్తిని; యష్టి= దుడ్డుకర్రను; దీప్త= ప్రజ్వలించుచున్న; విపుల= విశాలమైన; ముద్గరంబును= ఇనుపగదను; విభాసిత= మిక్కిలి ప్రకాశవంతమైన; శక్తినిన్= శక్తి అను ఆయుధమును; వైవన్= ప్రయోగించగా; తోడుతోన్= వెనువెంటనే; ఆ నృపసూనుఁడు= రాజపుత్రుడైన ఆ సహదేవుడు; అవియును= వానినికూడా; అనేకబాణములన్= పలువిధములయిన బాణములతో; నుగ్గు= పిండి; చేసినన్= చేయగా.

తాత్పర్యం: ఆ మూడు బాణాలను శీఘ్రంగా ఖండించి సహదేవుడు శకునియొక్క ధనువును కూడా ఖండించాడు. శకుని గొప్ప పరాక్రమం కలవాడై వాడిగల పెద్ద కత్తిని, కర్రను, ఇనుపగదను, మిక్కిలి కాంతిమంతమైన శక్తిని ప్రయోగించగా ఆ వెనువెంటనే ఆ సహదేవుడు అనేక బాణాలతో వాటిని కూడా పిండి చేశాడు. అట్లా చేయగా.

విశేషం: 'పటు ఖడ్గయష్టి దీప్త విపుల ముద్గరంబును' అనే పాఠము మూలానుగుణం. ఇందు ఉస్మానియా ప్రతిలో 'ముద్గరంబున' అని కలదు. అందువలన 'ముద్గరంబును' అని అర్థం వ్రాయబడింది. 'ప్రగృహ్య మహతీం గదామ్' (సం.9-27-36) మూలం. (శల్య. 28-38).

క. కనుఁగొని పార్శ్వచరులు వి। చ్చిన శకునియుఁ బాఱె నుల్లసిల్లిరి కుంతీ
తనయులు దదీయసేనా। జను లార్చిరి కురువిభుఁడు విషాదము నొందెన్. 390

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; పార్శ్వచరులు= ప్రక్కలందుండు యోధులు (అనగా రక్షకులు - చక్ర రక్షకులు); విచ్చినన్= విడివడిపోగా; శకునియున్= శకునికూడా; పాఱెన్= పారిపోయెను; కుంతీతనయులు= కుంతీ పుత్రులైన పాండవులు; ఉల్లసిల్లిరి= సంతోషించిరి; తదీయ= ఆ పాండవులయొక్క; సేనాజనులు= సేనా నాయకులు; ఆర్చిరి= అరిచిరి; కురువిభుఁడు= దుర్యోధనుడు; విషాదమును= దుఃఖమును; ఒందెన్= పొందెను.

తాత్పర్యం: చూచి, రథరక్షకులైన యోధులు విడివడిపోగా శకుని కూడా పారిపోయాడు. కుంతీపుత్రులు సంతోషించారు. వారి సేనానాయకులు బొబ్బరించారు. దుర్యోధనుడు దుఃఖించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు పాఱిన. 391

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; పాఱినన్= పారిపోగా.

తాత్పర్యం: ఈ ప్రకారంగా పార్శ్వరక్షకులు పారిపోగా.

చ. అరదము సత్వరంబుగ శరావళి పెల్లుగఁ బర్వఁ బాండవా
వరజుఁడు పోవనీక పొదువన్ వడిఁ బింగలివారు పోరికిం
బురికొని త్రోచినన్ సుబలపుత్త్రుఁడు దత్తురగవ్రజంబుతో
బరవసమొప్పఁగా నతనిపైఁ గవిసెం గృతనిశ్చయాత్ముఁడై. 392

ప్రతిపదార్థం: సత్వరంబుగన్= మిక్కిలివేగముగ; అరదము= రథము; పెల్లుగన్= ఎక్కువగా; శర= బాణములయొక్క; ఆవళిన్= సమూహమును; పర్వన్= వ్యాపించగా; పాండవ+అవరజుఁడు= సహదేవుడు; పోవనీక= పోనీయక; పొదువన్= క్రమ్ముకొనగా; వడిన్= వేగముగా; పింగలివారు= వెనుకటివారు; పోరికిన్= యుద్ధమునకు; పురికొని= విజృంభించి; త్రోచినన్= కలియబడగా; సుబలపుత్త్రుఁడు= శకుని; కృత= చేయబడిన; నిశ్చయ= నిర్ణయముకల; ఆత్ముఁడై= మనసు కలవాడై; తద్= ఆ; తురగ= గుర్రములయొక్క; వ్రజంబుతోన్= సమూహముతో; బరవసము= ధైర్యము; ఒప్పఁగాన్= ప్రకాశింపగా; అతనిపైన్= ఆ సహదేవునిపై; కవిసెన్= కలియబడెను.

తాత్పర్యం: మిక్కిలివేగంతో రథం సాగుతూంటే, బాణాల సమూహం చుట్టుముట్టుతూంటే పాండవులలో చిన్నవాడైన సహదేవుడు పోనీయక క్రమ్ముకొన్నాడు. అప్పుడు వెనుకటివారు యుద్ధానికి విజృంభించి కలియబడగా శకుని నిశ్చయం కలిగిన మనస్సుకలవాడై ఆ గుర్రాల సమూహాలతో (తురంగసైన్యంతో) ధైర్యం వెల్లివిరియగా ఆ సహదేవుడిపై కలియబడ్డాడు.

వ. కవిసినం గని గుణంబు సారించి శరాసారం బడరించి యా సహదేవుం డిట్లనియె. 393

ప్రతిపదార్థం: కవిసినన్= కలియబడగా; కని= చూచి; గుణంబు= నారి; సారించి= సాగదీసి; శరాసారంబు= బాణవర్షం; అడరించి= కలిగించి; ఆ సహదేవుండు; ఇట్లు= ఈ ప్రకారముగా; అనియెన్= అని పలికెను.

తాత్పర్యం: శకుని కలియబడగా చూచి, నారి సారించి, బాణాలు ప్రయోగించి, ఆ సహదేవుడు ఈ ప్రకారంగా అన్నాడు.

చ. 'తలఁకుట యొప్పునే నృపతి ధర్మము నూఁది యెదిర్చి యేమెయిన్
నిలుచుట యొప్పఁగాక మహనీయుల ధర్మతనూభవాదులం
బలికితి వీవు జూదపునెపంబునఁ దత్ఫలమందె దిప్పు మా
చలము బలంబు నేర్పడియెఁ జచ్చిరి మీ యవివేకు లందఱున్. 394

ప్రతిపదార్థం: నృపతిధర్మము= రాజధర్మమును; ఊఁది= విడిచి; తలఁకుట= భయపడుట; ఒప్పునే?= సమ్మతమగునా? (కాదు); ఏమెయిన్= ఏవిధముగానైనను; నిలుచుట= నిలబడుట (ధైర్యముగా ఉండుట); ఒప్పఁగాక= సమ్మతమగుగాక;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈవు= నీవు; జూదపు= జూదముయొక్క; నెపంబునన్= మిషతో; మహనీయులన్= మిక్కిలి గొప్పవారయిన; ధర్మతనూభవ+ ఆదులన్= ధర్మరాజు మొదలగు వారిని; పలికితివి= పలికితివి(తిట్టితివి); ఇప్డు= ఇప్పుడు (ఈ సమయమున); తత్ఫలము= ఆ ఫలితము; అందెదు= పొందగలవు; మీ= మీయొక్క; అవివేకులు= మూర్ఖులు; అందఱున్= అందరును; చచ్చిరి= మరణించారు; మా చలము= మా యొక్క కోపమును; బలమున్= బలమును; ఏర్పడియెన్= తేటపడెను.

తాత్పర్యం: 'రాజధర్మం విడిచి భయపడటం సమ్మతమగునా? ఏ విధంగానైనా నిలవటం ధైర్యంగా ఉండటమే ఉచితం. నీవు జూదం మిషతో మహాత్ములైన ధర్మరాజు మొదలైనవారిని తిట్టావు. ఈ సమయంలో ఆ ఫలితాన్ని పొందుము. నీ మూర్ఖులందరును మరణించారు. మా కోపం బలం ఇప్పుడు తేటతెల్లమయ్యాయి.

వ. మమ్ము నపహసించిన వారిలోఁ గురుకులదాహకుం డొక్కరుండ తక్కె నద్దురాత్ముండు సూచుచుండ భవదీయ శిరంబుఁదాలఫలంబు లగుడంబునం బడవైచు పగిదిఁ బటుభల్లంబున డొల్ల నేసెద మామా! పాఱక నిలువుమీ!' యని యట్లు బహుభంగులఁ బలికి యతం డేయు సాయకంబుల వారించి దశమార్గణంబులు మేనఁ జొనిపి. 395

ప్రతిపదార్థం: మమ్మున్= మమ్ములను; అపహసించినవారిలోన్= అవహేళన చేసినవారిలో (అనగా మమ్ములను అకారణంగా నిందించి అవమానం చేసిన వారిలో); కురుకుల= కురువంశమునకు; దాహకుండు= అగ్నివంటివాడు (అనగా కురువంశమును తగులబెట్టినవాడు); ఒక్కరుండ= ఒక్కడే; తక్కెను= మిగిలెను; ఆ+దురాత్ముండు= ఆ దుష్టబుద్ధికలవాడు; చూచుచుండన్= చూచుచుండగా; భవదీయ= నీ యొక్క; శిరంబున్= తలను; తాలఫలంబు= తాటిపండు; లగుడంబునన్= కఱ్ఱతో; పడవైచు= పడగొట్టు; పగిదిన్= విధముగా; పటు= కఠినమయిన; భల్లంబునన్= బల్లెముతో; డొల్లన్= నేల దొర్లునట్లు; ఏసెదన్= కొట్టెదను; మామా!= ఓ మామా!; పాఱక= పారిపోకుండ; నిలువుమీ!= నిలుచుండుమీ!; అని; అట్లు= ఆ ప్రకారంగా; బహుభంగులన్= పలువిధములుగా; పలికి; అతండు= ఆశకుని; ఏయు= ప్రయోగించు; సాయకంబులు= బాణములు; వారించి= నివారించి (అడ్డుకొని); దశ= పది; మార్గణంబులు= బాణములు; మేనన్= దేహమునందు; చొనిపి= గ్రుచ్చి.

తాత్పర్యం: ఓ మామా! మమ్మ అకారణంగా అవహేళనచేసిన వారిలో కురువంశమును తగులబెట్టినవాడయిన దుర్యోధనుడు ఒక్కడే మిగిలాడు. ఆ దుర్మార్గుడు చూస్తుండగా నీ తలను తాడిపండు కఱ్ఱతో పడగొట్టే విధంగా కఠినమైన బల్లెంతో నేలపడి దొర్లేటట్లు కొట్టుతాను. ఓ మామా! పారిపోకుండా నిలువుము' అని ఆ ప్రకారంగా పలు విధములుగా పలికి ఆ శకుని ప్రయోగించే బాణాలు అడ్డుకొని పది బాణాలు ఆ శకుని దేహమునందు గ్రుచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తురగములు సిడము గొడుగును। శరాసనముఁ దునిమి యార్వ సాహసమున ని
ష్ఠుర శక్తిఁ బూన్చె నాతని। యురః స్థలము వైవ శకుని యుర్వీనాథా! 396

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; తురగములు= గుఱ్ఱములు; సిడము= ధ్వజము; గొడుగును; శరాసనమున్= ధనువును; తునిమి= ఖండించి; ఆర్వన్= అరవగా; శకుని; సాహసమునన్= తెగువతో; నిష్ఠుర= కఠినమైన; శక్తిన్= శక్తి అను ఆయుధమును; ఆతని= ఆ సహదేవుని; ఉరఃస్థలము= వక్షఃస్థలము; వైవన్= వైచుటకు (కొట్టుటకు); పూన్చెను= ప్రయోగించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సహదేవుడు శకుని గుఱ్ఱాలు, ధ్వజం, గొడుగు ధనువు ఖండించి పెద్దగా అరవగా శకుని తెగువతో కఠినమైన శక్తి అనే ఆయుధాన్ని ఆ సహదేవుడి వక్షఃస్థలాన్ని కొట్టటానికి ధరించాడు.

మ. సహదేవుం డది శాతభల్లమున నుత్సాహోగ్రుఁడై త్రుంచి దు
స్సహభల్లద్వితయంబునం గరయుగస్వైరచ్ఛిదాకేళి స
ల్పి హసద్వక్త్ర విలాస మొప్పెసఁగ నాభీలద్యుతిస్ఫారభ
ల్లహతిం గంఠము ద్రుంప మస్తకము డొల్లన్ డొల్లె మేనున్ మహిన్. 397

ప్రతిపదార్థం: సహదేవుండు= సహదేవుడు; ఉత్సాహ= ప్రయత్నముతో; ఉగ్రుఁడై= క్రోధంతో భయంకరమైన ఆకారము కలవాడై; శాత= వాడియైన (తీక్షణమైన); భల్లమునన్= బల్లెముతో; అది= ఆ శక్తిని; త్రుంచి= ఖండించి; దుస్సహ= భరింపశక్యము కాని; భల్ల= బల్లెములయొక్క; ద్వితయంబునన్= రెండింటితో; కరయుగ= రెండుచేతులతో; స్వైర= స్వేచ్ఛగా; ఛిదా= ఛేదించుటయనెడి; కేళిన్= క్రీడ; సల్పి= సలిపి; హసత్= నవ్వుచున్న; వక్త్ర= మోముయొక్క; విలాసము= లీల; ఒప్పెసఁగన్= ఒప్పునట్లుగా; ఆభీల= భయంకరమైన; ద్యుతి= కాంతితో; స్ఫార= గొప్పదైన; భల్ల= బల్లెములయొక్క; హతిన్= దెబ్బతో; కంఠము= గళము(గొంతు); త్రుంపన్= ఖండించగా; మస్తకము= శిరము; డొల్లన్= దొర్లగా; మహిన్= భూమిపై; మేనున్= దేహముకూడా; డొల్లెన్= దొర్లెను.

తాత్పర్యం: సహదేవుడు క్రోధంతో భయంకరమైన ఆకారం కలవాడై ప్రయత్నంతో తీక్షణమైన బల్లెంతో శకుని ప్రయోగించిన శక్తిని ఖండించి, భరింపశక్యం కాని రెండు బల్లెములతో రెండు చేతులతో స్వేచ్ఛగా ఛేదించే క్రీడ సలిపి నవ్వుముఖం విలాసంగా ప్రకాశించగా భయంకరమైన కాంతితో చలిస్తున్న బల్లెంయొక్క దెబ్బతో (శకుని) కంఠాన్ని ఖండించగా తల, మొండెం భూమిపై పడి దొర్లాయి.

వ. **ఇట్లు కౌరవులదుర్నయంబునకు మూలంబగు శకునిఁ దెగటార్చి పేర్చియార్చిన యనుజన్ము నాలోకించి ధర్మతనయ ప్రముఖులు పరమ ప్రమోదభరితాంతఃకరణులై నిజశంఖంబులు పూరింప శౌరియుఁ బాంచజన్యరావంబున రోదసి నింప సుయోధను సేన చెదరక బెదరక నిలిచి యా సౌబలు సైన్యంబు సహదేవునిపై ననేకాస్త్ర శస్త్రంబులు గురియుచుఁ గవిసినం గవ్వడియు వడముడియు నవి యన్నియు మోఘంబు లగునట్లు చేసి యమ్మూఁక బలువడనేసి యుల్లాసభాసితు లైనం గని జనపతి శోకాక్రాంతమతియై హతశేషులైన నిజ సైనికులం బురికొల్పిన వారలు రక్షకరహితులయ్యును దెంపు పెంపున శంకింపక యాసవ్యసాచిం బొదివి తదస్త్రశిఖాసందోహంబున ప్రుందిపోయి రక్కురురాజు దనచుట్టును బయలగుటఁ గలయం జూచి కట్టెదురఁ జెలంగు నా కౌంతేయులం గనుంగొని తొలంగిపోవం దలంచె ననుటయు నాంబికేయుండు సంజయు దిక్కు మొగంబై.** 398

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారముగా; కౌరవుల= కౌరవులయొక్క; దుర్నయంబునకున్= దుర్నీతికి; మూలంబు= కారణము; అగు= అయినట్టి; శకునిన్= శకునిని; తెగటార్చి= చంపి; పేర్చి= అతిశయించి; ఆర్చినన్= అరచిన; అనుజన్మున్= తమ్ముడైన సహదేవుని (అనుసరించి జన్మించినవాడు అనుజన్ముడు); ఆలోకించి= చూచి; ధర్మతనయ ప్రముఖులు= ధర్మరాజు మొదలగు వారు; పరమ= అత్యంత; ప్రమోద= ఆనందముతో; భరిత= నిండిన; అంతఃకరణులై= మనసు కలవారై (మనోబుద్ధి చిత్తాహంకారములు అంతఃకరణ చతుష్టయము); నిజ= తమయొక్క; శంఖంబులు= శంఖములు; పూరింపన్= పూరించగా; శౌరియున్= శ్రీకృష్ణుడును; పాంచజన్య= పాంచజన్యమను పేరుగల శంఖముయొక్క; రావంబునన్= ధ్వనితో; రోదసి= భూమ్యాకాశమధ్యప్రదేశము; నింపన్= నిండిపోవునట్లు చేయగా; సుయోధను= దుర్యోధనునియొక్క; సేన= సైన్యము;

చెదరక= కలతచెందక; బెదరక= భయపడక; నిలిచి= నిలిచి; ఆ సౌబలు= ఆ శకునియొక్క; సైన్యంబు= సేన; సహదేవునిపైన్; అనేక= పలు; అస్త్ర= మంత్రపూతములయిన ఆయుధములు; శస్త్రంబులు= సామాన్య ఆయుధములు; కురియుచున్= కురిపించుచు; కవిసినన్= కలియబడగా; కవ్వడియున్= అర్జునుడును; వడముడియున్= భీముడును; అవియన్నియున్= ఆ అస్త్రశస్త్రములన్నియును; మోఘంబులు= నిరుపయోగములు; అగునట్లు; చేసి; ఆ+మూఁక= ఆ సేన; బలువడనేసి= బలము తగ్గించి; ఉల్లాస= సంతోషముతో; భాసితులైనన్= ప్రకాశవంతులు కాగా; కని= చూచి; జనపతి= దుర్యోధనుడు (జనులకు పతి అనగా రాజు); శోక= దుఃఖముతో; ఆక్రాంత= ఆక్రమింపబడిన; మతియై= బుద్ధికలవాడై; హతశేషులైన= చంపబడగా మిగిలినట్టి; నిజ= తనయొక్క; సైనికులన్= సేనలను; పురికొల్పినన్= క్రమ్ముకొనునట్లు చేయగా; వారలు= వారు; రక్షక= రక్షించువారు; రహితులయ్యును= లేనివారు అయ్యును; తెంపు= ధైర్యముయొక్క; పెంపునన్= ఆధిక్యమువలన; శంకింపక= అనుమానింపక; ఆ సవ్యసాచిన్= ఆ అర్జునుడిని; పొదివి= క్రమ్ముకొని; తద్= ఆ; అస్త్ర= బాణములయొక్క; శిఖా= అగ్రభాగములయొక్క; సందోహంబునన్= సమూహములవలన; మ్రందిపోయిరి= మరణించారు; ఆ+కురురాజు= దుర్యోధనుడు; తనచుట్టును; బయలు= శూన్యము; అగుటన్; కలయంజూచి= అంతటా చూచి; కట్టెదురన్= ఎట్టఎదురుగ; చెలంగు= సంతోషించు; ఆ+కౌంతేయులన్= ఆ కుంతీపుత్రులైన పాండవులను; కనుంగొని= చూచి; తొలంగిపోవన్= తప్పుకొనిపోవుటకు; తలఁచెన్= ఆలోచించెను; అనుటయున్= అని చెప్పుటయు; ఆంబికేయుండు= అంబిక పుత్రుడైన ధృతరాష్ట్రుడు; సంజయుదిక్కు= సంజయునివైపు; మొగంబై= ముఖము కలవాడై.

తాత్పర్యం: ఈ ప్రకారంగా కౌరవుల చెడ్డ ప్రవర్తనకు కారణమైన శకునిని చంపి అతిశయించి, అరిచిన తమ్ముడు సహదేవుడిని చూచి ధర్మరాజు మొదలైన ప్రముఖులు అత్యంత ఆనందంతో నిండిన హృదయం కలవారై తమయొక్క శంఖాలు పూరింపగా శ్రీకృష్ణుడు కూడా పాంచజన్యమనే శంఖంయొక్క ధ్వనితో ఆకాశం నింపగా, దుర్యోధనుడియొక్క సైన్యం కలత చెందక భయపడక నిలిచి ఉన్నది. ఆ శకుని సైన్యం సహదేవుడిపై అనేక అస్త్రశస్త్రములు కురిపిస్తూ కలియబడింది. అప్పుడు అర్జునుడూ భీముడూ ఆ అస్త్రశస్త్రాలన్నింటిని నిరుపయోగములయ్యేటట్లు చేసి, ఆ సేన బలం తగ్గించి, సంతోషంతో వెలిగారు. అది చూచి దుర్యోధనుడు దుఃఖంతో నిండిన బుద్ధికలవాడై - చావగా మిగిలిన తనసేనను క్రమ్ముకొనునట్లు చేయగా వారు రక్షించేవాళ్ళు లేకపోయినా అధికమైన ధైర్యంతో అనుమానించక ఆ అర్జునుడిని క్రమ్ముకొని అతడి బాణాలనే మంటలలో మసి అయిపోయారు. ఆ దుర్యోధనుడు తన చుట్టూ శూన్యం కావటం చూచి, ఎట్ట ఎదుట సంతోషంతో ఉన్న పాండవులను చూచి యుద్ధభూమినుండి తొలగిపోవటానికి తలచాడు. ఇట్లా చెప్పగా ధృతరాష్ట్రుడు సంజయుడివైపు తిరిగి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అట్లు మన సైన్యములు దెగటారినపుడు । కుంతి కొడుకులలో బలమెంత గలిగె?
నకట! నాకొడు కెట్టివాఁడయ్యెఁ జెపుము! । యనుడు నతఁ డిట్టు లనియె నమ్మనుజపతికి. 399

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారముగా; మనసైన్యములు= మన సేనలు; తెగటారినపుడు= చంపబడినప్పుడు; కుంతికొడుకులలోన్= కుంతియొక్క పుత్రులలో; బలము= సైన్యము; ఎంత; కలిగెన్?= ఉన్నది?; అకట!= అయ్యో!; నా కొడుకు= నా పుత్రుడు; ఎట్టివాఁడు= ఎటువంటివాడు; అయ్యెన్= అయ్యెను(ఏమయ్యెను); చెపుము!= చెప్పుము!; అనుడున్= అనగా; ఆ+మనుజపతికిన్= ఆ రాజునకు అనగా ధృతరాష్ట్రునకు; అతఁడు= ఆ సంజయుడు; ఇట్టులు= ఈ ప్రకారముగా; అనియెన్= చెప్పెను.

తాత్పర్యం: 'ఆ ప్రకారంగా మనసైన్యాలు చంపబడినపుడు కుంతి కొడుకులకు సైన్య మెంత మిగిలింది? అయ్యో! నా కొడుకు ఏమయ్యాడు? చెప్పుము.' - అనగా ఆ ధృతరాష్ట్రుడికి సంజయుడు ఇట్లా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్టి యెడ రెండు వేలు రథంబు లేడునూఱు గజంబు లైదువేలు గుఱ్ఱంబులు పదివేలు కాలుమానిసియుఁ దానును ధృష్టద్యుమ్నుండును సంగరాంగణంబున మెఱసి యుండె. 400

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయమున; రెండువేలు రథంబులు= రెండువేలు రథములు; ఏడునూఱు గజంబులు= ఏడువందలు ఏనుగులు; ఐదువేలు; గుఱ్ఱంబులు= గుఱ్ఱములు; పదివేలు; కాలుమానిసియున్= కాల్బలమును; తానును= తానును (దుర్యోధనుడును); ధృష్టద్యుమ్నుండును= ధృష్టద్యుమ్నుడును; సంగర+అంగణంబునన్= యుద్ధభూమియందు; మెఱసి= ప్రకాశించి; ఉండెన్= ఉండెను.

తాత్పర్యం: ఆ సమయమున రెండువేలు రథములు, ఏడువందలు ఏనుగులు, అయిదు వందల గుఱ్రాలు, పదివేల కాల్బలంతో ధృష్టద్యుమ్నుడు యుద్ధభూమియందు ప్రకాశించి ఉన్నాడు. దుర్యోధనుడు ఏకాకిగా మిగిలాడు.

విశేషం: "రథానాం ద్వేసహస్రేతు సప్తనాగశతాని చ । పంచచాశ్వ సహస్రాణి పత్తీనాం చ శతం శతాః॥
ఏత చ్చేష మభూ ద్రాజన్ పాండవానాం మహద్బలమ్ । పరిగృహ్యా హి యద్యుద్ధే ధృష్టద్యుమ్నో వ్యవస్థితః।
ఏకాకీ భరతశ్రేష్ఠ తతో దుర్యోధనో నృపః ॥ (సం. 9-28-21,22,23)

క. పలపలని మూఁకలోఁ గాల్ । నిలువక గుఱ్ఱంబు డిగ్గి నీ కొడుకు గదా
కలిత భుజుండై యొక్కఁడుఁ । దొలఁగి చనియె నేమి చెప్పుదుం గురునాథా! 401

ప్రతిపదార్థం: కురునాథా! ధృతరాష్ట్రమహారాజా!; పలపలనిమూఁకలోన్= తఱిగిపోయిన సైన్యమునందు; కాల్‌నిలువక= ఉండలేక; గుఱ్ఱంబు= గుఱ్ఱము; డిగ్గి= దిగి; నీ కొడుకు= నీ కొడుకు (దుర్యోధనుడు); గదా= గదతో; కలిత= కూడిన; భుజుండై= బాహువులు కలవాడై; ఒక్కఁడున్= ఒక్కడును(ఏకాకిగా); తొలఁగి= తొలగి (యుద్ధభూమినుండి తప్పుకొని); చనియెన్= వెడలిపోయెను; ఏమి= ఏమి; చెప్పుదున్= చెప్పగలను.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! తగ్గిపోయిన సైన్యంలో ఉండలేక గుఱ్రం దిగి నీ కొడుకు దుర్యోధనుడు గద భుజమున ధరించి ఒక్కడే యుద్ధభూమినుండి తొలగి వెడలిపోయాడు. ఇంక ఏమి చెప్పగలను?'

వ. అని ధృతరాష్ట్రునకు సంజయుండు దుర్యోధను పలాయనం బెఱింగించె నని చెప్పిన విని యటమీఁది వృత్తాంతం బె ట్లయ్యె నని యడుగుటయును. 402

ప్రతిపదార్థం: అని= అని; ధృతరాష్ట్రునకు; సంజయుండు= సంజయుడు; దుర్యోధను= దుర్యోధనుడియొక్క; పలాయనంబు= పారిపోవుట; ఎఱింగించెను= తెలియజేసెను; అని; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; అటమీఁది= తరువాత; వృత్తాంతంబు= చరిత్రము; ఎట్లు= ఏ విధముగా; అయ్యెను= అయినది (జరిగెను); అని; అడుగుటయును= అడుగగా (జనమేజయుడు వైశంపాయనుని అడుగుటయును).

తాత్పర్యం: అని ఈ విధంగా ధృతరాష్ట్రుడికి సంజయుడు దుర్యోధనుడు పారిపోవుటం తెలియజేశాడు - అని చెప్పగా విని, అటు తరువాత చరిత్రం ఏ విధంగా జరిగిందని (జనమేజయుడు వైశంపాయనుని) అడుగగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆశ్వాసాంతము

ఉ. సంగవిదూరతాకలిత! శాంతరసస్ఫుటరోహ దిద్ధబో
ధాంగ! సమాశ్రితాపదుదయ జ్వలన ప్రశమప్రవర్తకా
పాంగమరీచిరూప వితతామృత వీచి విహార! వాసవో
త్సంగతలోపలాల్య పద! సంసృతివారణ! దైత్యదారణా. 403

ప్రతిపదార్థం: సంగవిదూరతాకలిత!= దేనితోను సంబంధంలేని వాడా!; (పరమేశ్వరుడు ఆకాశంవలె అవయవరహితుడగుటచేత దేనితోడను సక్తిలేనివాడు, కావుననే శ్రుతి పరమేశ్వరుడిని గూర్చి చెప్పుతూ "అసంగో హ్యయం పురుషః'' (బృ. 4-3-15. చూ.40 ప) అని వర్ణించింది); శాంతరస= ప్రశాంతి రూపమైన శాంతరసమునందు; స్ఫుట= స్పష్టంగా; రోహత్= మొలుస్తున్న; ఇద్ధ= స్పష్టంగా ప్రకాశించే; బోధ= జ్ఞానమే; అంగ!= శరీరంగా కలవాడా!; సమాశ్రిత= ఆశ్రితులైన భక్తులయొక్క; ఆపద్+ఉదయ= విపత్తులు కలగటం అనెడి; జ్వలన= అగ్నిని; ప్రశమ= ఆర్పుటకు; ప్రవర్తక= ప్రవర్తింపజేయు; అపాంగ= క్రేగంటి ప్రసారంయొక్క; మరీచిరూప= కిరణరూపమగు; వితత= విస్తారమగు; అమృతవీచి= సుధాతరంగములందు; విహార!= విహరించేవాడా!; వాసవ= దేవేంద్రుడియొక్క; ఉత్సంగతల= ఊరు ప్రదేశంలో; ఉపలాల్య= లాలింపదగిన; పద!= చరణములు కలవాడా!; సంసృతివారణ!= సంసారమును అనగా తత్కృత బాధలను నివారించేవాడా!; దైత్యదారణా!= రక్కసులను చీల్చేవాడా!; (అనగా ధర్మవ్యవస్థా భంజకులను నశింపజేసేవాడనుట.)

తాత్పర్యం: నీవు నిరవయవుడవు అగుటచేత నీకు దేనితోనూ సంబంధంలేదు. శాంతరసంవలన కలిగే జ్ఞానమే నీ వాస్తవ రూపం. నీవు ఆశ్రితులయందు అమృతమయ కటాక్షాలను బరపి, వారి ఆపదలను పోగొట్టుట యం దాసక్తుడవు. కావుననే సురేంద్రుడు సైతము తన తొడలపై నీ పాదముల నుంచుకొని సంవాహనం చేస్తుంటాడు. నీవు దైత్యులను చీల్చి చెండాడుతావు. భక్తుల సంసారబాధలను నివారిస్తుంటావు.

క. ఆశ్చర్య కరణ కరుణా! । నిశ్చల శుచిహృదయ భావనీయ విహరణా!
పశ్చిమనాడీ సరణ! పు । రశ్చరణధ్యేయ! భక్తరమణ విధేయా! 404

ప్రతిపదార్థం: ఆశ్చర్యకరణ కరుణా!= అచ్చెరువును కలుగజేసే దయకలవాడా!; (సామాన్య దేవతల కరుణారసం పరిమితమై ఉండగా హరిహరనాథుని దయ నిరవధికమగుటచేత ఆశ్చర్యజనకమని భావం. ఇట్టి యపార కరుణారసామృతమునే తిక్కయజ్వ తనకు స్వప్న ప్రత్యక్షం గావించిన హరిహరస్వామిని వర్ణిస్తూ "కరుణా రసము పొంగి తొరఁగెడు చాడ్పున శశిరేఖ మమృతంబు జాలువార''. (విరా. 1-12) అని వర్ణించాడు.) నిశ్చలశుచి హృదయ భావనీయ విహరణా! - నిశ్చల= చలింపనట్టియు; (నివాతదేశగత దీపకళికవోలె ఇతర చిత్తవృత్తులచేత ఆక్రమింపబడక ఏక రూపంతో ఉండి); శుచిహృదయ= నిర్మల చిత్తంచేత; భావనీయ= ఊహింపదగిన; విహరణా!= విహారం కలవాడా!; (పరమేశ్వరుడి లీలావిహారాలన్నీ నిర్మలము నిశ్చలము అగు హృదయం కలవారలకే అవగతములు అగునని భావం); పశ్చిమనాడీ సరణ!= సుషుమ్నా నాడిద్వారా ప్రసరించేవాడా!; (గుదస్థానగతమైన మూలాధార చక్రమునందలి చైతన్యాత్మకమై పరమేశ్వరరూపమగు కుండలినీశక్తి సుషుమ్నాద్వారమున మూలాధారాది షట్చక్రములను భేదించి బ్రహ్మరంధ్రమునందుట యోగశాస్త్ర ప్రసిద్ధం. కావున పరమేశ్వరుడు పశ్చిమ నాడీ సరణుఁ డనబడుతున్నాడు); పురశ్చరణధ్యేయ!= పురశ్చరణంచేత ధ్యానింపదగినవాడా!; (పురశ్చరణమునందు సంపూర్ణానుగ్రహం కొరకు పరమేశ్వరుడు ధ్యానింపదగినవాడని భావం); భక్తరమణవిధేయా!= భక్తులను ఆనందపరుస్తూ విధేయుడైనవాడా!

తాత్పర్యం: నీవు ఆపదలనందిన వారియెడ కనపరిచే దయను గమనిస్తే ఆశ్చర్యమౌతుంది. నీ విహారాలన్నీ అచంచలమైన హృదయంతో భావించదగినవే. యోగుల శరీరములయందు నీవు సుషుమ్నానాడీ మార్గాన

సంచరిస్తుంటావు. నీ అనుగ్రహమును సంపాదించటానికై ఉపాసకులు తమ మంత్ర పురశ్చరణంలో నిన్ను ధ్యానిస్తారు. అట్టి వారిని నీ వెల్లప్పుడు సంతోషపరుస్తూ వారికి విధేయుడవై ఉంటావు.

విశేషం: పైన నిరూపించబడిన ఉపాసనా ప్రక్రియలో నిమగ్నులైన భక్తులు పరమేశ్వర ధ్యానామృతప్రాదంలో నిమగ్నులౌతూ మహానందం పొందుతుండటంచేత పరమేశ్వరుడు భక్తుల నానందింపజేస్తాడు. అట్లే భక్తుల అభీష్టములను నెరవేర్చటంచేత భక్తులకు విధేయుడు ఔతున్నాడని భావం.

మాలిని: ప్రణవమయ గరిష్ఠోపాయ సంవేద్యభూమా!

భణన మనన దూరస్ఫార విస్తార సీమా!

గుణవిభవ నిరాసా కుంఠితోల్లాస ధామా!

గణన రహితలీలా! కల్ప నిత్యాభిరామా! **405**

ప్రతిపదార్థం: ప్రణవమయ= ప్రణవరూపమగు (ఓంకార రూపమగు); గరిష్ఠ+ఉపాయ= ఉత్తమోపాయంచేత; సంవేద్య= తెలియదగిన; భూమా!= భూమత్వం కలవాఁడా!; (మంత్రం దేవతా వాచకం. అది దేవతా స్వరూపమును తెలిసికొనుటకు సాధనము. అట్టి సాధనములలో "ప్రణవము'' అని. ఇట్టి ప్రణవోపాసనమువలన దెలియదగిన తత్త్వం భూమభావం. కావున ఇట్టి భూమరూపుడగు పరమేశ్వరుడిని ప్రణవోపాసకులు మాత్రం తెలియగలరని భావం); భణన= పలుకుటకు; మనన= తలంచుటకు; దూర= అందని; స్ఫార= తేజంయొక్క; విస్తార= అతిశయమునకు; సీమా!= అవధి అగువాడా; (పరమేశ్వరుడి తేజోవిస్తారము వాఙ్మానసములకందని భావం. లేదా "స్ఫార విస్తార సీమ'' అనగా అభివృద్ధి విస్తారమునకు స్థానమైనవాడు. బ్రహ్మ బృహద్రూపు డగుటచేత ఆతడు సర్వబృహత్త్వమునకు స్థానమని భావం); గుణ= సత్త్వ రజస్తమో గుణాలయొక్క; విభవ= అతిశయమును; నిరాస= నిరసించునట్టి; అకుంఠిత= వ్యర్థంకాని(మొక్కవోని); ఉల్లాస= ఆనందమునకు; ధామా!= స్థానమైనవాడా!; (అనగా త్రిగుణాత్మకమైన ప్రకృతియొక్క వికారమునకు అతీతమైన ఉత్తమానంద స్వరూపుడగుట); గణన రహితలీలా!= లెక్కలేనన్ని విలాసములు గలవాడా!; (పరమేశ్వరుడి విశ్వసృష్టి స్థితి సంహార రూపములగు విలాసములు గణనాతీతములని భావం); కల్పనిత్యాభిరామా!= కల్పసమయమున గూడ నశించని మనోహరత్వం కలవాడా! (కల్పమనగా రెండు వేల దైవయుగాల సమయమని అర్థం. అది ఒక బ్రహ్మదినం. ప్రళయ సమయం. ఇట్టి సమయంలో విశ్వమంతయు నశించినను పరమేశ్వరుడు నిత్యానందస్వరూపు డని భావం.)

తాత్పర్యం: నీ సర్వాతిశయ రూపం (భూమరూపము) శబ్దమునకు మూలకారణమైన ప్రణవముచేతనే తెలియవలెను. నీ తేజోవిశేషముయొక్క పరిమితి చెప్పుటకుగాని తలచుటకుగాని శక్యం కానిది. నీవు త్రిగుణాతీతుడవగుటచేత నీ ఆనందం స్థిరమైనది. నీ విలాసములు లెక్కకు మించినవి. యుగాంతమున సర్వప్రపంచం నశించినను నీ సౌందర్యం మాత్రం నశింపక స్థిరంగా ఉంటుంది.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీమదాంధ్ర మహాభారతంబున శల్యపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము

తాత్పర్యం: ఇది మంగళకరమైనదీ, సంస్కృతాంధ్రోభయ కవులకు మిత్రుడైనవాడూ, కొమ్మనామాత్యపుత్రుడూ, పండితులచేత ఆరాధించబడేవాడూ (పండితులను ఎల్లప్పుడూ సేవించేవాడూ) అయిన తిక్కన సోమయాజిచేత రచించబడినదీ అయిన శుభప్రదమైన ఆంధ్రమహాభారతంలోని శల్యపర్వంలో మొదటి ఆశ్వాసం.

శల్యపర్వంలోని ప్రథమాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శల్యపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీ కరణ నిపుణ పదప । ద్మా! కేవల సత్త్వసద్మ! మాయావ్యవధూ
తైకాయనగమ్యా! మధు । రాకృతి సర్వత్రరమ్య! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీకరణనిపుణ= సిరిని కల్గించటంలో నైపుణ్యంకల; పదపద్మా!= పాదపద్మాలు కలవాడా!; కేవల= కేవలం; సత్త్వసద్మ= సత్త్వ గుణానికి నిలయమైనవాడా!; మాయావ్యవధూతి+ఏకాయన గమ్యా!= మాయాగుణాన్ని నిరాకరించే ఒకే ఒక మార్గంచేత పొంద తగినవాడా!; మధుర+ఆకృతి= ఆనందస్వరూపంచేత; సర్వత్ర రమ్య!= అన్నిట అందమయిన వాడా!; హరిహరనాథా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీ పాద పద్మాలు భక్తులకు అనంతమయిన సంపదల నిస్తాయి. నీవు సత్త్వ నిలయుడవు. మాయచేత నిండిన ప్రపంచాన్ని నిరాకరించటంచేతనే నీవు తెలియదగినవాడవు; ఆనందరూపమైన ఆకారంచేత అంతటా అందమైనవాడవు.

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు నిజపుత్త్రుండు పరాజయంబు నొందుట యాక
ర్ణించి యాంబికేయుండు. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; నిజపుత్రుండు= తన కుమారుడు(దుర్యోధనుడు); పరాజయంబున్+ఒందుటన్= ఓడిపోవటాన్ని; ఆకర్ణించి= విని; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వైశంపాయనుండు జనమేజయుడితో ఈ విధంగా అన్నాడు: తన కుమారుడి ఓటమిని విని ధృతరాష్ట్రుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'మద మడఁగి యొక్కరుండును । గద చేకొని రాజరాజు కాల్నడ నెట వో
మదిఁ దలఁచి తొలఁగెనొకొ! యా । పద లిట్టివి కలవె మనుజపతులకు నెందున్? 3

ప్రతిపదార్థం: మదము+అడఁగి= గర్వం అణగిపోయి; ఒక్కరుండును= ఒక్కడే; గద చేకొని= గదను చేతబట్టి; రాజరాజు= దుర్యోధనుడు; కాల్నడన్= కాలినడకతో; ఎట+పోన్= ఏ దిక్కునకు పోవగా; మదిన్= మనసులో; తలఁచి= తలచుకొని; తొలఁగెనొకొ!= యుద్ధభూమినుండి తొలగివెళ్ళాడో?; ఎందున్= ఎక్కడగాని; మనుజపతులకున్= రాజులకు; ఇట్టి ఆపదలు= ఇటువంటి కష్టాలు; కలవె?= ఉన్నవా?

తాత్పర్యం: 'గర్వ మడగిన వాడై ఒకడే గదను చేతబట్టి దుర్యోధనుడు కాలి నడకను ఎటు వెళ్ళాడో? ఎక్కడైనా రాజులకు ఇట్టి బాధలు కలగటం ఉన్నదా? (లేదని భావం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. విశేషాంశాన్ని సామాన్యాంశం సమర్థిస్తున్నది.

వ. అనంతర వర్తనంబు తెఱం గెఱింగింపు 'మనుటయు నజ్జననాథునకు సంజయుం డిట్లనియె. 4

ప్రతిపదార్థం: అనంతర వర్తనంబు= తరువాత జరిగిన నడవడి; తెఱంగు= పద్ధతి; ఎఱింగింపుము+అనుటయున్= తెలుపుము అనగా; ఆ+జననాథునకున్= ఆ రాజుకు(ధృతరాష్ట్రుడికి); సంజయుండు+ఇట్లు+అనియెన్= సంజయు డీవిధంగా చెప్పాడు.

తాత్పర్యం: (సుశర్మను ఓడించిన తరువాతి) యుద్ధ వృత్తాంతాన్ని వివరించు'మని అడుగగా సంజయుడు ధృతరాష్ట్రుడితో ఈ విధంగా పలికాడు:

సీ. 'ఏకాదశాక్షౌహిణీశుఁ డై పెంపునఁ । బొంపిరివోవు నప్పుడమితేఁడు
వెనుక నొక్కరుఁడును జన లేక యేకాకి । యై పోయె నచటికి ననతిదూర
మై యుత్తరము ముట్టినట్టితూర్పున నొక్క । మడు వున్న, దానిలో నడఁగియుండు
వాఁడుగా నట్టు లవ్వలనికిఁ జని చని, । విదురువాక్యంబులు మదిఁ దలంచి

ఆ. 'యధికమతి నృపాలుననుజుండు సెప్పె న । ట్లకట! దానిఁ గొనన' యనుచు శోక
తప్తచిత్తుఁ డయ్యెఁ; దైవ మెవ్వరి నెట్లు । చేయఁ జాల? దేమి సెప్పఁ గలదు? 5

ప్రతిపదార్థం: ఏకాదశ+అక్షౌహిణీశుఁడు+ఐ= పదునొకండక్షౌహిణుల సేనకు నాయకుడై; పెంపునన్= గొప్పతనంతో; పొంపిరి+పోవు+ఆ+పుడమితేడు= అతిశయించే ఆ రాజు; (దుర్యోధనుడు); వెనుకన్= తన వెన్నంటి; ఒక్కరుఁడునున్+చనన్ లేక= వెళ్ళటానికి ఒక్కడు కూడా లేక; ఏకాకి ఐ= ఒంటరివాడయి, పోయెన్= వెళ్ళాడు; అచటికిన్= ఆ చోటునకు; అనతిదూరము+ఐ= కొద్దిదూరంగా; ఉత్తరము ముట్టినట్టి తూర్పునన్= ఈశాన్యభాగాన; ఒక్కమడువు+ఉన్నన్= ఒకనీటిమడుగు ఉండగా; దానిలోన్ అడఁగి+ఉండువాఁడుకాన్= ఆ మడువులో దాగికొనిఉండేవాడై; అట్టులు+ఆ+వలనికిన్= ఆ విధంగా ఆ దిక్కునకు; చనిచని= పోయి పోయి; విదురు+వాక్యంబులు= విదురుడి పలుకులు; మదిన్+తలంచి= మనసులో తలచుకొని; అధికమతి= మిక్కిలి తెలివైనవాడగు; నృపాలు+అనుజుండు+చెప్పెన్= రాజుగారి తమ్ముడు(ధృతరాష్ట్రుడి తమ్ముడైన విదురుడు) చెప్పాడు; అకట!= అయ్యో!; దానిన్= దానిని; కొనన్+అ= గ్రహించలేదు, స్వీకరించనేలేదు; అనుచున్= అంటూ; శోకతప్తచిత్తుఁడు+ అయ్యెన్= దుఃఖంతో బాధింపబడ్డ మనసుకలవాడైనాడు; దైవము= విధి; ఎవ్వరిన్+ఎట్లు= ఎవ్వరిని ఎట్లు; చేయన్+చాలదు!= చేయలేదు?; ఏమి చెప్పన్+కలదు?= ఏం చెప్పను?

తాత్పర్యం: 'పదకొండక్షౌహిణుల సైన్యానికి అధిపతిగా గొప్పదనంతో విలసిల్లే ఆ రాజు తన వెంట ఒకడు కూడా వచ్చేవాడు లేక ఏకాకిగా ఆ యుద్ధభూమినుండి వెళ్ళాడు. ఆ చోటికి దగ్గరగా ఈశాన్య భాగాన ఒక్క(నీటి) మడువు ఉన్నది. ఆ వైపునకు వెళ్ళి ఆ మడుగులో దాగికొని, విదురుడి మాటలు మనసులో తలచుకొంటూ 'అయ్యో! నేను ఆమాటలను మన్నించలేకపోయాను' అంటూ దుఃఖాతిశయంతో విచారించాడు. విధి ఎవరిని ఏమి చేస్తుందో ఏమి చెప్పగలం?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. విశేషాంశం సామాన్యాంశంచేత సమర్థింపబడుతున్నది.

వ. అట్టియెడ సుడిసి చిక్కిన మూఁకలు వీఁకమై నెదిర్చినం బొదివి నిరవశేషంబుగా సమయించి కృష్ణసారథికంబును ధవళహయంబును గపీంద్రకేతనంబును నగు నుజ్జ్వలస్యందనంబున నప్పురందరనందనుండు

బంధుమిత్రాభినందితుండై యొప్పె; నప్పుడు పొలికలన నీ బలం బఖిలంబును బెనుగాలిం బడిన పేరడవిపగిదిం గానంబడుచుండె; నందుఁ గృపాశ్వత్థామకృతవర్మలు ముప్పురు బ్రదికి పోయి; రాసమయంబున ధృష్టద్యుమ్నుండు నన్నుఁ గనుంగొని నగుచు సాత్యకి నుద్దేశించి. 6

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; సుడిసి చిక్కిన మూఁకలు= అలసి క్షీణించిన సేనలు; వీఁకమైన్= ఉత్సాహంతో; ఎదిర్చినన్= ఎదుర్కొనగా; పొదివి= క్రమ్ముకొని; నిరవశేషంబుగాన్= నిశ్శేషంగా; సమయించి= చంపి; కృష్ణసారథికంబును= కృష్ణుడు సారథిగా కలదియు; ధవళహయంబును= తెల్లని గుర్రాలు కలదియు; కపి+ఇంద్ర కేతనంబును= హనుమద్ధ్వజం కలదియు; అగు= అయిన; ఉజ్జ్వల స్యందనంబునన్= ప్రకాశిస్తున్న తేరిమీద; ఆ+పురందరనందనుండు= ఆ ఇంద్రపుత్రుడయిన అర్జునుడు; బంధుమిత్ర+అభినందితుండు+ఐ= బంధువులు, స్నేహితుల చేత పొగడబడినవాడై; ఒప్పెన్= ఒప్పిఉన్నాడు; అప్పుడు= ఆ సమయంలో; పొలికలనన్= యుద్ధరంగంలో; నీ బలంబు+అఖిలంబును= నీ సేన అంతా; పెనుగాలిన్+పడిన= పెద్దగాలి తాకిడికి పడిపోయిన; పేరడవి పగిదిన్= పెద్ద అడవి మాదిరిగా; కానంబడుచుండెన్= కనపడుతూ ఉన్నది; అందున్= ఆ సేనలో; కృపాశ్వత్థామ కృతవర్మలు; ముప్పురు బ్రదికిపోయిరి= ముగ్గురు మాత్రం బ్రదికి బయటపడ్డారు; ఆ సమయంబునన్= అట్టివేళలో; ధృష్టద్యుమ్నుండు; నన్నున్+కనుంగొని= ధృష్టద్యుమ్నుడు నన్ను గుర్తించి; నగుచున్= నవ్వుతూ; సాత్యకిన్+ఉద్దేశించి= సాత్యకితో.

తాత్పర్యం: ఆ సమయంలో ఓడి క్షీణించిన సేనలు పౌరుషంతో ఎదిరించగా, వారిని చుట్టుముట్టి ఒక్కరుకూడా మిగలకుండా చంపి, కృష్ణుడు రథం నడుపుతూ ఉండగా, తెల్లనిగుర్రాలూ, కపిధ్వజమూ శోభించే ప్రకాశవంతమైన రథంలో బంధుమిత్రాదులు అభినందిస్తూ ఉండగా అర్జునుడు రాణించాడు. అప్పుడు యుద్ధభూమిలో నీ సైన్యం పెద్దగాలికి నేలకొరిగిన పెద్ద అడవివలె కనబడింది. అందులో కృపుడు, అశ్వత్థామ, కృతవర్మ - ఈ ముగ్గురుమాత్రమే బ్రతికిపోయారు. ఆ సమయంలో ధృష్టద్యుమ్నుడు నన్ను చూచి నవ్వుతూ సాత్యకితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. **'వీని నేటికిఁ బట్టితి? వీఁడు బ్రదికి। యిచట వర్తించి మనకు నెగ్గేమి సేయు?**
నప్రయోజన మిది; విడు' మనిన 'నేల। వీడుతు నీ ద్రోహితల దెగ నడుతు' ననుచు. 7

ప్రతిపదార్థం: వీనిన్+ఏటికిన్ పట్టితి(వి)?= (ఈ సంజయుడిని) ఇతడిని ఎందుకు పట్టుకొన్నావు?; వీఁడు బ్రతికి= వీడు ప్రాణాలతో ఉండి; ఇచటన్+వర్తించి= ఇక్కడ తిరుగుతూ; మనకున్; ఎగ్గు+ఏమి+చేయున్?= కీ డేమి చేయగలడు?; అప్రయోజనము+ఇది= ఈ పట్టుకొనటం నిరుపయోగం; విడుము+అనినన్= వదలుము అనగా; ఏల విడుతున్?= ఎందుకు వదలుతాను?; ఈ ద్రోహి తలన్= ఈ దుర్మార్గుడి తలను; తెగన్+అడుతున్= నరుకుతాను; అనుచున్= అంటూ.

తాత్పర్యం: 'వీడి నెందుకు పట్టుకొన్నావు? ఇతడివలన మన కేమీ కీడు కలుగుతుంది? ఇది నిష్ప్రయోజనమయిన పని' అనగా అతడు నవ్వుతూ 'వీడిని వదలటం ఎందుకు? తల తెగనరుకుతాను. 'వీడు ద్రోహి' అని అంటూ.

వ. **ఆ శైనేయుండు వాలు వెఱికి వ్రేయం జూచునంతఁ గృష్ణద్వైపాయనుండు సన్నిధిచేసి, యతని వారించి, 'సంజయుం జంపుట యనుచితంబు; ముందల విడువు'మని యానతిచ్చిన నతండును వినతుండై' యట్ల కాక యని పలికి నన్ను విడిచెఁ; గృష్ణద్వైపాయనుండు మదీయాననం బాలోకించి 'బ్రదికిపోయి తెక్కడకైనం**

బొ మ్మనుటయు' నమ్మునీంద్రు వీడ్కొంటి; నంత నతఁ డంతర్ధానంబు సేసె; నేను దత్ప్రదేశంబు వాసి నీసుతుండు సనిన చక్కటికిఁ గ్రోశమాత్రంబు వోయి ద్వైపాయనం బనం బ్రసిద్ధం బైన యమ్మడువు సమీపంబున. 8

ప్రతిపదార్థం: ఆ శైనేయుండు= ఆ సాత్యకి; వాలు+పెటికి= కత్తి దూసి; వ్రేయన్+చూచునంతన్= దెబ్బకొట్టటానికి ప్రయత్నించేటంతలో; కృష్ణద్వైపాయనుండు సన్నిధి చేసి= వ్యాసుడు ప్రత్యక్షమై; అతనిన్+వారించి= సాత్యకిని అడ్డుకొని; సంజయున్+చంపుట అనుచితంబు= సంజయుడిని చంపటం న్యాయం కాదు; ముందల= ముందుతల (తలయొక్క ముందుభాగం); విడువుము+అని= వదలుమని; ఆనతి+ఇచ్చినన్= ఉత్తరువు చేయగా; వినతుండు+ఐ= అణకువతో; అట్ల కాక!= అట్లాగుననే!; అని పల్కి= చెప్పి; నన్నున్ విడిచెన్= నన్ను వదలాడు; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; మదీయ+ఆననంబు+ఆలోకించి= నా మొగమును చూచి; బ్రదికిపోయితి(వి)= బ్రతికిబయటపడ్డావు; ఎక్కడకైనన్+పొమ్ము+అనుటయున్= ఎక్కడికైనా వెళ్లమని చెప్పగా; ఆ+మునీంద్రున్= వ్యాసమునీశ్వరుడిని; వీడ్కొంటిన్= వదలివెళ్ళాను; అంతన్= ఆ తరువాత; అతఁడు= వ్యాసుడు; అంతర్ధానంబు+చేసెన్= అంతర్ధానమైనాడు; ఏను తత్ప్రదేశంబు పాసి= నేనా చోటు వదలి; నీ సుతుండు చనిన చక్కటికిన్= నీ కుమారుడు వెళ్ళిన దిక్కునకు; క్రోశమాత్రంబు+పోయి= క్రోసు దూరం వెళ్ళి; ద్వైపాయనంబు+అనన్+ప్రసిద్ధంబు+ఐన= ద్వైపాయనమని ప్రఖ్యాతినొందిన; ఆ+మడువు సమీపంబునన్= ఆ కొలను దగ్గర.

తాత్పర్యం: ఆ సాత్యకి కత్తి తీసి నన్ను చంపటానికి పూనుకొన్నంతలో వ్యాసుడు ప్రత్యక్షమై వారించి సంజయుడిని చంపటం ఉచితం కాదన్నాడు. ఆతడి యాజ్ఞను ఆమోదించి సాత్యకి నన్ను వదలివేశాడు. అపుడు వ్యాసుడు నా మొగం చూచి 'బ్రతికిపోయావు. ఎక్కడికైనా వెళ్ళిపొ'మ్మన్నాడు. అపుడు మునిని వీడ్కొన్నాను. వ్యాసుడు అంతర్ధానమయ్యాడు. నేను దుర్యోధనుడు పోయిన దిక్కున నడిచి అక్కడకు క్రోసు దూరంలో ఉన్న ద్వైపాయనమనే కొలను వద్దకు చేరాను.

తే. **అతనిఁ గాంచితి; నతఁ డశ్రు లడర నడలు । చూడ్కి నామోము చక్కఁగాఁ జూడ కోర**
వోవఁ జూచుచు దీనతఁ బొందియునికి । గని మనంబున శోకంబు గదుర నేను. 9

ప్రతిపదార్థం: ఏను= నేను; అతనిన్+కాంచితిని= ఆ దుర్యోధనుడిని చూచాను; అతఁడు+అశ్రులు+అడరన్= అతడు కన్నీళ్ళు కారగా; అడలుచూడ్కిన్= భయముతోడి చూపుతో; నామోము= నా మొగమును; చక్కఁగాన్= నేరుగా; చూడక= చూడకుండా; ఓర+పోవన్+చూచుచున్= ఓరగా చూస్తూ; దీనతన్+పొంది= దైన్యంపొంది; ఉనికి= ఉండటం; నేను; కని= చూచి; మనంబునన్= నా మనసులో; శోకంబు+కదురన్= దుఃఖం కలుగగా.

తాత్పర్యం: దుర్యోధనుడిని చూచాను. అతడు కన్నీరొలుకగా నా మొగం చూడలేక ప్రక్కచూపులుచూస్తూ దీనత్వంతో ఉండటాన్ని గమనించి అతడి స్థితికి మనసులో దుఃఖం కలుగగా, నేను (తరువాతి వచనంతో అన్వయం).

వ. **ఒక్కింతసేపు పలుకు వెలువరింపఁ జాలక యూరకుండి, యెట్టకేల కెలుంగు దెచ్చుకొని పారాశర్యప్రసాదంబున బ్రదికినతెఱంగు సెప్పిన, నమ్మహీకాంతుండును గొంత ప్రొద్దు నిశ్చేష్టితుండై యుండి, పదంపడి నాదెసఁ జూచి 'మనదెస బ్రదికిన వారు గలరే?' యనినఁ గృపాచార్యాదిరథికత్రయంబును బేరుకొని 'వారలు బ్రతికిపోయిరి; తక్కొరుండును బ్రదుకుట లేదని యెఱింగించిన, నిట్టూర్పు నిగిడించుచు నామూఁపుపైఁ జే యిడి యన్నర నాథుండు నన్ను నీకడ కనుపం దలంచి నాతో ని ట్లనియె. 10**

ప్రతిపదార్థం: ఒక్కింతసేపు= క్షణమాత్రకాలం; పలుకు వెలువరింపన్+చాలక= మాటపెగులక; ఊరకుండి= ఊరకొని; ఎట్టకేలకున్= చివరకు; ఎలుంగు+తెచ్చుకొని= గొంతుపెగల్చుకొని; పారాశర్య ప్రసాదంబునన్= వ్యాసుని దయతో; బ్రదికిన తెఱంగున్= బ్రదికిన విధమును; చెప్పినన్= చెప్పగా; ఆ+మహీకాంతుండును= రాజుగు ఆ దుర్యోధనుడును; కొంతప్రొద్దు= కొద్దిసేపు; నిశ్చేష్టితుండు+ఐ ఉండి= కదలిక లేనివాడై; నాదెసన్+చూచి= నాదిక్కునకు చూచి(సంజయుడి వైపు చూచి); మన దెసన్= మనవైపున; బ్రదికినవారు= బ్రతికిఉన్నవారు; కలరే?= ఉన్నారా?; అనినన్= అనగా; కృపాచార్య+ఆది రథికత్రయంబును= కృపాచార్యుడు మొదలయిన రథికులను ముగ్గురిని; పేరుకొని= చెప్పి; వారలు బ్రతికిపోయిరి= వారు బ్రతికిఉన్నారు; తక్కు+ ఒరుండును= వేరెవ్వరుడును; బ్రదుకుట లేదు+అని= జీవించలేదని; ఎఱింగించినన్= తెలుపగా; నిట్టూర్పు నిగుడించుచున్= నిట్టూర్పు వదలుచూ; నామూఁపుపైన్+చేయి+ఇడి= నా మూపున చేయి పెట్టి; ఆ+నరనాథుండు= ఆ రాజు (దుర్యోధనుడు); నన్నున్= (సంజయుడిని) నన్ను; నీకడకున్+అనుపన్+తలంచి= పంపాలని యోచించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కొంచెం సేపు మాట్లాడలేకుండా ఊరకుండి, తుదకు గొంతు పెగుల్చుకొని, వ్యాసుడి దయతో నేను బ్రతికిన విధాన్ని చెప్పగా, దుర్యోధనుడు కొంత సేపు కదలిక లేక ఉండిపోయాడు. పిమ్మట నా వైపు చూచి 'మన వారిలో బ్రతికి ఉన్నావా రున్నారా?' అని అడుగగా 'కృపాచార్యాది రథికులు ముగ్గురూ బ్రతికిపోయారు. ఇంకెవడూ లేడు' అని తెలుపగా, నిట్టూర్పుతో నా వీపుమీద చేయిపెట్టి ఆ రాజైన దుర్యోధనుడు నన్ను నీ వద్దకు పంపనెంచి నాతో ఇట్లా అన్నాడు:

తే. **'మాఱుమానిసి లేకుండ మడిసి రెల్ల । వారు నీ దెసఁ; బాండుభూవరతనూజు**
లాప్తులుం దాము నున్న వా; । రాహవమునఁ । బడక తొలఁగితిఁ బోటులఁ బడియు నేను'. 11

ప్రతిపదార్థం: మాఱుమానిసి లేకుండన్= మరొక్కమనిషి కూడా లేకుండ; ఈ దెసన్= ఈవైపున; ఎల్లవారున్ మడిసిరి= అందరూ చనిపోయారు; పాండు భూవర తనూజులు= పాండవులును; తాము= తామును; ఆప్తులు= ఆత్మీయులును; ఆహవమునన్+పడక= యుద్ధంలో పడిపోకుండా; ఉన్నవారు= బ్రతికి ఉన్నారు; ఏను= నేను; పోటులన్+పడియున్= దెబ్బలు తినినా (చావకుండా); తొలఁగితిన్= తప్పించుకొన్నాను.

తాత్పర్యం: 'మరొక్క మనిషి లేకుండా ఈ వైపు వారంతా చనిపోయారు. పాండవులును వారి కాప్తులయినవారును జీవించి ఉన్నారు. దెబ్బలు తినినా నేను చావకుండా యుద్ధంలో తప్పించుకొన్నాను.'

వ. **అని. 12**

తాత్పర్యం: అని చెప్పి.

క. **'కౌంతేయులబారిం బడ; । నింతియ సిరి చాలు; రాజ్య మెల్లను దారై**
పొంత ననుఁ బెట్టుకొని యొక । కొంత యొసఁగిరేని నట్టికూ డేమిటికిన్? 13

ప్రతిపదార్థం: కౌంతేయుల బారిన్+పడను= పాండవులచే చిక్కక తప్పించుకొన్నాను; ఇంతియ= ఇంతమాత్రపు!; సిరి చాలు= సంపద చాలును; రాజ్యము+ఎల్లను= రాజ్యమంతటిని; తారై= తాముగా; పొంతన్+నను= నన్ను దగ్గర; పెట్టుకొని= ఉంచుకొని; ఒక కొంత= ఒకింత; ఒసఁగిరేనిన్= ఇస్తే; అట్టికూడు= అటువంటి తిండి; ఏమిటికిన్?= (నాకు) ఎందుకు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'పాండవుల బారిన పడకుండా నేను తప్పించుకొన్నాను. ఈ మాత్రపు సిరి నాకు చాలును. రాజ్యాన్ని పూర్తిగా తామే కైకొని, నన్ను దగ్గర పెట్టుకొని, ఒకింత నాకు ఇచ్చినా, అటువంటి నికృష్టపుకూడు నాకెందుకు?

క. అనుజులఁ దనుజుల మత్పరి । జనులను సమయించి వారు సమరోల్లాసం
బున మెఱయఁ జూడ నేర్తునె? । జననాథున కింతవట్టు సంజయ! చెపుమా! 14

ప్రతిపదార్థం: సంజయ!= ఓ సంజయుడా!; అనుజులన్= తోబుట్టులను; తనుజులన్= కుమారులను; మత్+పరిజనులను= నా సేవకులను; సమయించి= చంపి; వారు= పాండవులు; సమర+ఉల్లాసంబునన్= యుద్ధోత్సాహంతోడి ఆనందంతో; మెఱయన్= ప్రకాశింపగా, చూడన్+నేర్తునె?= చూడగలనా?; జననాథునకున్= రాజునకు (ధృతరాష్ట్రుడికి); ఇంతపట్టు= ఇంతమాత్రం; చెపుమా!= చెప్పుము!

తాత్పర్యం: సంజయా! తోబుట్టువులను, కుమారులను, సేవకులను అందరినీ యుద్ధంలో చంపి, పాండవులు విజయోత్సాహంతో వెలుగుతూ ఉండగా చూచి సహించగలనా? ధృతరాష్ట్రుడికీ సంగతిని చెప్పుము.

దుర్యోధనుఁడు ద్వైపాయనంబను మడుఁగున డాఁగియుండుట (సం. 9-28-51)

క. ఇమ్మడువులోన డాఁగెద; । నిమ్ముల నెచ్చటికినైన నేఁగెదఁ; దగు వృ
త్తమ్మునఁ దొలఁగి నిలిచి మఱి । యెమ్మెయినేనియును దీర్తు నేఁ బగయ సుమీ!' 15

ప్రతిపదార్థం: ఈ+మడువులోనన్= ఈ మడుగులోపల; డాఁగెదన్= దాగి ఉంటాను; ఇమ్ములన్= అనుకూలమైనపుడు; ఎచ్చటికినైనన్= ఎక్కడికైనా; ఏఁగెదన్= వెళ్ళుతాను; తగువృత్తమ్మునన్= తగినప్రవర్తనతో; తొలఁగి= తప్పుకొని; నిలిచి= నిలిచి ఉండి; మఱి= ఆ మీదట; ఏ+మెయిన్+ఏనియునున్= ఏరీతిగానైనా; ఏన్= నేను; పగయ= పగనే; తీర్తున్= తీర్చుకొంటాను; సుమీ!= సుమా!

తాత్పర్యం: ఈ మడుగులో దాగి, అనుకూలమైన సమయంలో ఎక్కడకయినా పోయి, వేచి అదను చూచి, ఏ విధంగానైనా నా పగ తీర్చుకొంటాను సుమా!'

వ. అని చెప్పి యమ్మడువు సొచ్చి మాయావిశేషంబున జలంబులు శరీరంబు సోఁకకుండ సంస్తంభనంబు సేసికొని యుండె; నంత రథ్యంబులు పరిశ్రాంతినొంది తూఁగాడ నస్త్రశస్త్రాదిక్షతంబు లగు నవయవంబులతోడ రాజదర్శన విషణ్ణులగుచుఁ గృపకృతవర్మాశ్వత్థామ లచ్చట మెలంగి దబ్బాటుగా నన్నుం గని 'సంజయా! బ్రదికితే?' యని పలికి 'కురుపతి ప్రాణంబులం గలఁడే?' యని యడిగిన నజ్జననాథుఁ డొక్కండును బాఱుతెంచి నీరిలో డాఁగియున్న తెఱం గెఱింగించి యా ప్రదంబు సూపి యే మిరువురము నొండొరులతో నాడినమాటలు దేటపడం జెప్పిన వార లత్యంత విషాదంబు నొంది. 16

ప్రతిపదార్థం: అని చెప్పి= ఆ విధంగా చెప్పి; ఆ+మడువు+చొచ్చి= ఆ కొలనులోనికి దిగి; మాయావిశేషంబునన్= మాయాశక్తివలన; జలంబులు శరీరంబు సోకక+ఉండన్= నీరు దేహం తగులకుండా ఉండేటట్లు; సంస్తంభనంబు= కదలని స్థితిని; చేసికొనిఉండెన్= ఏర్పరచుకొని ఉన్నాడు; అంతన్= ఆ మీదట; రథ్యంబులు= గుఱ్ఱాలు; పరిశ్రాంతిన్+ఒంది= అలసి; తూఁగాడన్= ఊగిసలాడగా; అస్త్రశస్త్ర+ఆదిక్షతంబులు+అగు= అస్త్రశస్త్రాదుల దెబ్బలవలన అయిన గాయాలు కల; అవయవంబులతోడన్= అంగాలతో;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాజదర్శన విషణ్ణులు+అగుచున్= దుర్యోధనుడిని చూడటంకొరకు విచారపడుతూ; కృపకృతవర్మ+అశ్వత్థామలు= కృప కృతవర్మ అశ్వత్థామ లనువారు; అచ్చటన్+మెలంగి= అక్కడ తిరుగుచూ; దబ్బాటుగాన్+నన్నున్+కని= ఆకస్మికంగా నన్ను చూచి; సంజయా! బ్రదికితే? అని పలికి= సంజయా! బ్రతికి ఉన్నావా? అని అడిగి; కురుపతి= దుర్యోధనుడు; ప్రాణంబులన్+ కలఁడే?= ప్రాణాలతో ఉన్నాడా?; అని అడిగినన్= అని అడుగగా; ఆ+జననాథుండు+ఒక్కండును= ఆ రాజు ఒంటరిగా; పాఱుతెంచి= పరుగెత్తివచ్చి; నీరిలో డాఁగిఉన్న తెఱంగు+ఎఱింగించి= నీటిలో దాగిఉన్న విధం తెలిపి; ఆ హ్రదంబు+చూపి= ఆ నీటిలో మడుగు చూపించి; ఏము+ఇరువురము= మేమిద్దరము; (సంజయదుర్యోధనులు); ఒండొరులతోన్= ఒకరితో మరొకరు; ఆడిన మాటలు= మాట్లాడినమాటలు; తేటపడన్+చెప్పినన్= సుస్పష్టంగా చెప్పగా; వారలు= కృతవర్మ అశ్వత్థామలు; అత్యంత= మిక్కిలి; విషాదంబున్+ఒంది= దుఃఖపడి.

తాత్పర్యం: సంజయుడి కా విధంగా చెప్పి దుర్యోధనుడు తన మాయాశక్తితో ఆ కొలనులోనికి వెళ్ళి తన శరీరానికి నీళ్ళు తగులకుండా సంస్తంభన విద్యతో ఉన్నాడు. ఆ మీదట అలసిన గుర్రాలతో ఒంటికి తగిలిన దెబ్బలతో దొరను చూడటానికై దుఃఖపడుతున్నవారైన కృప కృతవర్మ అశ్వత్థామలు అక్కడ తిరుగుతూ అకస్మాత్తుగా నన్ను చూచి 'సంజయా! బ్రతికే ఉన్నావా? కురురాజు ప్రాణాలతో ఉన్నాడా?' అని అడిగితే ఆ రాజు ఒకడు మాత్రమే పరుగెత్తివచ్చి ఈ నీటిలో దాగిఉన్న విధానాన్ని తెలిపి, ఆ కొలనును చూపి మేమిద్దరం మాట్లాడుకొన్న మాటలు స్పష్టంగా చెప్పగా, కృప కృతవర్మ అశ్వత్థామలు చాలా దుఃఖించి.

చ. **'నరవరుఁ డేము సంగరమునం బడకున్కి యెఱుంగఁ డక్కటా!**
బరవస మేది వచ్చెఁ బిదపన్ వినియున్ మముఁ గూర్చికోలు దు
స్తర మనుబుద్ధి నిప్పటికి శత్రుల కన్మొఱఁగం దలంచి యీ
వెరవున డాఁగె; సర్వపృథివీపతి దుర్దశ నిట్లు పొందునే? **17**

ప్రతిపదార్థం: అక్కటా!= అయ్యో!; నరవరుఁడు= రాజగు దుర్యోధనుడు; ఏము= మేము; సంగరమునన్+పడక+ఉన్కి= యుద్ధంలో చావకుండటం; ఎఱుంగఁడు= తెలియడు; బరవసము+ఏది= ధైర్యం నశించి; వచ్చెన్; పిదపన్= ఆ పిమ్మట; వినియున్= విని కూడా; మమున్+కూర్చికోలు= మమ్ము కలిపికొనటం; దుస్తరము= సాధ్యంకాదు; అను బుద్ధిన్= అనే ఆలోచనతో; ఇప్పటికిన్= ఇంతసేపటికి; శత్రుల= పగవారి; కన్మొఱఁగన్+తలంచి= కనుగప్పదలచుకొని; ఈ వెరవునన్= ఈ ఉపాయంతో; డాఁగెన్= దాగికొన్నాడు; సర్వపృథివీపతి= సమస్త భూమండలాధీశుడు(దుర్యోధనుడు); ఇట్లు= ఈ విధంగా; దుర్దశన్= కష్టదుఃస్థితిని; పొందునే?= అనుభవించునా?

తాత్పర్యం: రారాజు దుర్యోధనుడికి మేము యుద్ధరంగంలో చావకపోవటం తెలియదు; ధైర్యాన్ని పోగొట్టుకొన్నాడు. అయ్యో! పిమ్మట మేము జీవించి ఉన్నామని విని కూడా మమ్ము కలియటం అసాధ్యం అనే ఊహతో శత్రువుల కనుగప్పి ఉపాయంతో ఈ కొలనులో దాగాడు. సమస్తభూమండలాధీశుడు ఇట్టి కష్టాన్ని పొందటమా?'

వ. **అవ్విభుండు పెనుఁబ్రాపై నిలిచిన నేము పగతురతోడం బెనంగంజాలుదు మను సమయంబున విజయవిజృంభితు లగు పాండవులు సబలంబుగా నచ్చేరువ నడతెంచిన నా రథికులు దా రచ్చోట నిలుచుట కార్యంబు గా దని తలంచి ననుఁ గృపాచార్యు రథంబు మీఁద నిడికొని మనశిబిరంబున కరిగి; రందు.** **18**

ప్రతిపదార్థం: ఆ+విభుండు= ఆ రాజు; పెనుప్రాపు+ఐ నిలిచినన్= పెద్ద అండగా ఉన్నట్లయితే; ఏము= మేము (ముగ్గురం); పగతుర తోడన్= శత్రువులతో; పెనంగన్+చాలుదుము= యుద్ధం చేయగలుగుదుము; అను సమయంబునన్= అనే కాలంలో; విజయ విజృంభితులు= విజయం పొందటంచేత ఉప్పొంగుతున్నవారు; అగు= అయిన; పాండవులు; సబలంబుగాన్= సైన్యంతో; ఆ+చేరువన్+నడతెంచినన్= ఆ సమీపానికిరాగా; ఆ రథికులు= ఆ రథవీరులు; తారు= తాము; ఆ+చోటన్= ఆ స్థలంలో; నిలుచుట= ఉండటం; కార్యము కాదు+అని= తగదని; తలంచి= భావించి; ననున్= నన్ను (సంజయుడిని); కృపాచార్యు రథంబుమీఁదన్= కృపాచార్యుడి తేరిమీద; ఇడుకొని= పెట్టుకొని; మన శిబిరంబునకున్= మన గుడారానికి; అరిగిరి= వెళ్ళారు; అందున్= అక్కడ (ఆ శిబిరంలో).

తాత్పర్యం: ఆ రాజు పెద్ద దిక్కుగా ఉన్నట్లయితే విరోధులతో యుద్ధం చేయగలము' అని మేము చెపుతున్న సమయాన విజయగర్వంతో పేట్రేగిన పాండవులు సైన్యంతో ఆ సమీపానికి రాగా వారు తా మక్కడ ఉండటం తగినది కాదని తలచి నన్ను కృపాచార్యుడి రథంమీద పెట్టుకొని, మన గుడారానికి వెళ్ళారు. అక్కడ. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. కలగొనఁ బాఱుచున్ సతులు గన్నుల నశ్రుజలంబు లొల్క వీఁ
పులపయి పెన్నెఱుల్ విరియఁ బొడ్మఁగ లాలలు రోదనధ్వనుల్
సెలఁగఁగ మోములుం దలలుఁ జేతులుఁ గెంపుగ మోఁదికొంచు భ
ర్తల సహజన్ములన్ సుతులఁ దండ్రులఁ బేర్కొని యార్తి నొందుచున్. 19

ప్రతిపదార్థం: కలగొనన్= కలతనంది; పాఱుచున్= పరుగెత్తుతూ; సతులు= స్త్రీలు; కన్నులన్+అశ్రుజలంబులు+ఒల్కన్= కళ్ళలో దుఃఖబాష్పాలు చిందగా; వీఁపులపయిన్= వీపులమీద; పెన్నెఱుల్= పెద్దవెంట్రుకలు(అనగా కురులు); విరియన్= విడిపోగా; లాలలు పొడ్మఁగన్= పెదవులనుండి చొంగ పుట్టగా; (ఏడ్చినపుడు సామాన్యంగా కలిగే చేష్ట); రోదనధ్వనుల్= ఏడ్పుల శబ్దాలు; చెలఁగఁగన్= మ్రోయగా; మోములున్+తలలు+చేతులు+కెంపుగన్+మోఁదికొంచున్= ముఖాలు, తలలు, చేతులు, ఎర్రగా అయ్యేటట్లు కొట్టుకొంటూ; భర్తలన్= మగలను; సహజన్ములన్= తోబుట్టువులను; సుతులన్= కుమారులను; తండ్రులన్= కన్నతండ్రులను; పేర్కొని= పిలుస్తూ; ఆర్తిన్+ఒందుచున్= పెద్దగా దుఃఖిస్తూ.

తాత్పర్యం: స్త్రీలు కలతచెంది పరుగెత్తుతూ, కనులనుండి చిందే దుఃఖాశ్రువులతోను, వీపులపై విరిసి వ్రేలాడే తలవెంద్రుకలతోను, నోటినుండి కారే చొంగతోను, ఏడ్పువలన కలిగే శబ్దంతో మొగాలు, తలలు, చేతులు ఎరుపెక్కగా మోదుకొంటూ, మగలను, తోబుట్టువులను, కుమారులను, తండ్రులను పేర్కొంటూ రోదిస్తూ. (తరువాతిపద్యంతో అన్వయం).

వ. హతశేషు లైన పతాకాతపత్రచామరభృదాది జనంబులవలన సకలజనసంక్షయంబు వినుచు నేలంబడి పొరలుచు లేచుచునికి యత్యంతకరుణంబై యుండె; నప్పుడు మాన్యవనితాజనంబులకావలివారునుం గడంగి వారలం దగిన వాహనంబులపై నిడికొని యిక్కడకు వచ్చిరి; తక్కినభీతజనంబులు పలుదెసలం బాఱె; రట్టియెడ నీ కొడుకు యుయుత్సుండు శోకసంతప్తచిత్తుండై. 20

ప్రతిపదార్థం: హతశేషులు+అయిన= చావగా మిగిలిన; పతాకా+ఆతపత్ర+చామరభృత్+ఆది+జనంబులవలనన్= జెండాలను, గొడుగులను, చామరాలను మోసేవారు మొదలైనవారివలన; సకల జనసంక్షయంబు వినుచున్= జనులందరిచావును వింటూ;

నేలన్+పడి= భూమిమీద పడి; పొరలుచున్ లేచుచున్+ఉనికి= పొర్లుతూ లేస్తూ ఉండటం; అత్యంతకరుణంబు+ఐ ఉండెన్= మిక్కిలి జాలిగొలిపేదిగా ఉండింది; అప్పుడు; మాన్య వనితాజనంబుల కావలివారును= గౌరవం కల స్త్రీ జనానికి ఉన్న రక్షకులున్నూ; కడంగి= పూని; వారలన్+తగిన వాహనంబులపైన్ ఇడికొని= వారందరిని తగిన వాహనాలమీద పెట్టుకొని; ఇక్కడకున్ వచ్చిరి; తక్కిన= మిగిలిన; భీతజనంబులున్= భయపడిన వారు; పలుదెసలన్+పాఱిరి= అనేక దిక్కులకు పరుగెత్తారు; అట్టిఎడన్= ఆ సమయంలో; నీ కొడుకు యుయుత్సుండు= నీ కుమారుడు - యుయుత్సుడనేవాడు; శోకసంతప్త చిత్తుండు+ఐ= దుఃఖంతో వేగిన మనసుతో.

తాత్పర్యం: చనిపోగా మిగిలిన వారు ధ్వజాలను, గొడుగులను, చామరాలను చేతపట్టుకొని వచ్చిన మనుష్యుల మూలాన సమస్త జననాశనాన్ని వింటూ భూమిమీద పొర్లుతూ లేస్తూ ఉండటం మిక్కిలి శోచనీయంగా ఉండింది. గౌరవంగల స్త్రీలను వారి సేవకులు తగిన వాహనాలతో ప్రయత్నపూర్వకంగా తీసికొని ఇక్కడకు వచ్చారు. భయపడిన జనం నానాదిక్కులకు పరుగులు తీశారు. అప్పుడు నీ కుమారుడు యుయుత్సుడు దుఃఖంతో మండే మనస్సుతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

శా. **'గంగానందనుఁ డాదిగాఁగఁ గురుసంఘం బెల్ల సంగ్రామధా**
త్రిం గూలెం; బతియొక్కరుండు పటు కౌంతేయప్రతాపంబు పే
ర్మిం గీడ్పాటున కోర్చి పాఱె; విధి నామేఁ బ్రాణముల్ నిల్పె; నా
కుం గాంతాజనులం దగంగఁ బురికిం గొంచేఁగు టర్హం బగున్. **21**

ప్రతిపదార్థం: గంగానందనుఁడు+ఆదికాఁగన్= భీష్ముడు మొదలుగా; కురుసంఘంబు+ఎల్లన్= కౌరవవర్గమంతా; సంగ్రామధాత్రిన్= యుద్ధభూమిలో; కూలెన్= కూలిపోయింది; పతి ఒక్కరుండు= రాజొక్కడు మాత్రం; పటుకౌంతేయ ప్రతాపంబు పేర్మిన్= తీవ్రమైన పాండవుల శౌర్యాధిక్యానికి; కీడ్పాటునకున్+ఓర్చి= కష్టానికి తట్టుకొని; పాఱెన్= పరుగెత్తాడు; విధి= దైవం; నా మేన్+ప్రాణముల్ నిల్పెన్= నా శరీరంలో ప్రాణాలను నిల్పింది; నాకున్; కాంతాజనులన్= ఆడువారిని; తగంగన్= తగినట్లుగా; పురికిన్+కొంచున్= ఊరికి పిలుచుకొని; ఏఁగుట= వెళ్ళటం; అర్హంబు+అగున్= యోగ్యమైనపని ఔతుంది.

తాత్పర్యం: భీష్ముడు మొదలుగా కౌరవులందరూ యుద్ధభూమిలో నశించారు. రా జొక్కడే (దుర్యోధనుడొక్కడే) తీవ్రమయిన పాండవుల ధాటికి ఓర్చి పరుగులు తీశాడు. దైవం నా ప్రాణాన్ని నిల్పింది. ఈ ఆడువారిని హస్తినాపురికి పిలిచికొనిపోవటం ఉచితమైన పని.

వ. **ఏకాదశాక్షౌహిణీ భర్త మన్నించు మానవతులు గాసి యగుదురే?' యని మనంబునం దలపోసి రథంబు డిగి యత్తెఱంగు శౌరికి నజాతశత్రునకు నెఱింగించిన నప్పాండవాగ్రజుండు పరమకృపాపరుండు గావునఁ బ్రీతుం డై శౌరియాననం బాలోకించి 'యది మేల కాదె?' యని పలికి, యతం డనుమతి సేయ నవ్వైశ్యాపుత్రుఁ బరిరంభణంబు సేసి 'లెస్స తలంపు తలంచి' తని సంభావించి వీడుకొలిపిన, నతండు రథారూఢుం డై రథ్యంబులఁ ద్వరితగతి నడపి భూపతి ప్రేయసీజనంబుల కధ్యక్షు లగువృద్ధకంచుకులం గలసి వారును దానును వారల నుచితప్రకారంబులఁ దేర్చి పురంబు ప్రవేశించునప్పుడెదుర విదురుం గాంచి.** **22**

ప్రతిపదార్థం: ఏకాదశ= పదకొండు; అక్షౌహిణీభర్త= అక్షౌహిణులసేనకు నాయకుడు; మన్నించు= గౌరవించే; మానవతులు= స్త్రీలు; గాసి అగుదురే?= కష్టాలపాలగుదురే?; అని మనంబునన్+తలపోసి= అని మనసులో తలచి; రథంబుడిగి= తేరు దిగి; ఆ+తెఱంగు శౌరికిన్= ఆ విధమును శ్రీకృష్ణుడికీ; అజాతశత్రునకున్= ధర్మరాజునకూ; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; పరమ కృపాపరుండు+కావునన్= మిక్కిలి దయగలవాడు కావటంచేత; ప్రీతుండై= సంతోషించినవాడై; శౌరి= శ్రీకృష్ణుడి; ఆననంబు+ఆలోకించి= మొగాన్ని చూచి; అది మేలు+అ కాదె= అది మంచిదే కదా!; అని పలికి= అనిచెప్పి; అతండు+అనుమతి+చేయన్= అతడు అంగీకరించగా; ఆ వైశ్యాపుత్రున్= ఆ వైశ్యాకుమారుడిని; పరిరంభణంబు+చేసి= కౌగిలించుకొని; లెస్స తలంపు తలంచితి(వి)= మేలగు యోచన చేశావు; అని సంభావించి= అని ఆదరించి; వీడుకొల్పినన్= పంపగా; అతండు= ఆ యుయుత్సుడు; రథారూఢుండు+ఐ= తేరునెక్కిన వాడై; రథ్యంబులన్+త్వరితగతిన్= గుర్రాలను వేగంగా తోలి; భూపతి ప్రేయసీ జనంబులకున్= రాజస్త్రీలకు; అధ్యక్షులు+అగు= అధికారులయిన; వృద్ధకంచుకులన్+కలిసి= ముసలికంచుకులను కలిసికొని; వారును+తానును= తామంతా; వారలన్; ఉచిత ప్రకారంబులన్+తేర్చి= సముచితంగా ఓదార్చి; పురంబు ప్రవేశించునప్పుడు; హస్తినాపట్టణం లోనికి వెళ్ళేటప్పుడు; ఎదురన్+విదురున్+కాంచి= ఎదురుగా విదురుడిని చూచి.

తాత్పర్యం: 'పదునొకండక్షౌహిణుల సేనలకు నాయకుడు ఆదరించే స్త్రీలు ఇంత కష్టానికి గురి అయ్యారే! అని మనసులో తలపోసి తేరు దిగి, శ్రీకృష్ణుడికి ధర్మరాజుకు తెలియచేయగా ధర్మరాజు దయతో ప్రీతిగా శ్రీకృష్ణుడి ముఖాన్ని చూచి 'అది మంచిదే కదా!' అని చెప్పి, ఆయన అనుమతితో ఆ వైశ్యాకుమారుడిని కౌగలించుకొని మంచి యోచన చేశావని, అతడిని ఆదరించి పంపాడు. అట్లా పంపగా యుయుత్సుడు రథారూఢుడై త్వరితగతిని రాజాంతఃపురకాంతలను రక్షించే అధికారులయిన వృద్ధకంచుకులను కలసి, వారితోపాటు తానుకూడా ఆ స్త్రీలను తగువిధంగా ఓదార్చి, హస్తినాపురంలో ప్రవేశించేటప్పుడు విదురుడు ఎదురుగా రాగా చూచినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. **అతఁ డడుగంగ శల్యసుబలాత్మజులుం బలమంతయున్ రణ**
క్షితిఁ బడు టేర్పడం బలికి, చెప్పెఁ దురంగము డిగ్గి మేదినీ
పతి యొకరుండు పాఱుటయుఁ బాండవముఖ్యుఁడు ప్రీతిఁ బంపఁగా
నతివల నిల్లు సేర్చుటకు నై యిట రాకయు మానవేశ్వరా! **23**

ప్రతిపదార్థం: మానవేశ్వరా!= ఓ రాజా! ధృతరాష్ట్రా!; అతఁడు+అడుగంగన్= ఆ విదురుడుఅడుగగా; శల్యసుబలాత్మజులున్= శల్యుడును; గాంధార రాజకుమారుడును (శకుని); బలము+అంతయున్= సేన మొత్తము; రణరక్షితిన్= యుద్ధభూమిలో; పడుట= పడిపోవటం(చనిపోవటం); ఏర్పడన్+పలికి= స్పష్టంగా చెప్పి; తురంగము డిగ్గి= గుర్రంనుండి దిగి; మేదినీపతి= రాజు(దుర్యోధనుడు); ఒకరుండు పాఱుటయున్= ఒకడే పారిపోవటం; పాండవముఖ్యుఁడు= ధర్మరాజు; ప్రీతిన్+పంపఁగాన్= ప్రేమతో పంపగా; అతివలన్= స్త్రీలను; ఇల్లు చేర్చుటకునై= ఇంటికి చేర్చటానికై; ఇటు రాకయున్= ఇట్లా రావటం; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఓ రాజా! విదురు డడుగగా శల్యుడు, గాంధారరాజు కుమారుడు శకునీ, సేనమొత్తం యుద్ధభూమిలో చనిపోవటం స్పష్టంగా చెప్పి, దుర్యోధనుడు గుర్రంనుండి దిగి ఒంటరిగా పరుగెత్తటం, ధర్మరాజు ప్రేమతో పంపగా అంతపురస్త్రీలను వారి ఇళ్ళకు చేర్చటానికి ఇక్కడకు (హస్తినకు రావటం) (యుయుత్సుడు చెప్పాడు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని యతండు శోకవ్యాకులుం డగుచు నవ్వైశ్యాపుత్త్రుం బొగడి కాలోచితకృత్యం బాచరించి 'లెస్సచేసి' తని పలికి మఱియు నిట్లనియె. 24

ప్రతిపదార్థం: అనిన్+విని అతండు= విదురుడు; శోకవ్యాకులుండు+అగుచున్= దుఃఖంతో చీకాకు పడుతూ; ఆ+వైశ్యాపుత్త్రున్+ పొగడి= ఆ వైశ్యకుమారుడైన యుయుత్సుడిని పొగడి; కాలోచితకృత్యంబు+ఆచరించి;= ఆ సమయానికి తగిన పనులు చేసి; లెస్స చేసితి+అని పలికి= మంచిపని చేశావని మాటాడి; మఱియున్= ఇంకను; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అని చెప్పగా విని విదురుడు దుఃఖంతో కలతచెందాడు. యుయుత్సుడిని పొగడాడు. కాలోచిత కృత్యాలను చేసి, 'నీవు మంచిపని చేశా'వని పలికి, ఇంకను ఈ విధంగా అన్నాడు.

తే. 'ఎప్పుడును సంజయుఁడు వచ్చి యెఱుఁగఁ జెప్పుఁ । బతికి సమరవిశేషంబు లతఁడు నేఁటి
తెఱఁగు చెప్పెడిఁ గాక యేతెంచి మున్న । మనము వినిపింపఁ గాఁ దగ దనఘ! దీని. 25

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా! ఎప్పుడును; సంజయుఁడు; వచ్చి; పతికిన్= రాజుకు, ధృతరాష్ట్రుడికి; ఎఱుఁగన్+ చెప్పున్= తెలియచేస్తాడు; అతఁడు; నేఁటి తెఱంగున్= ఈనాటి పరిస్థితిని; పతికిన్= రాజునకు; సమర= యుద్ధమునందలి; విశేషంబులు= వివరములను; చెప్పెడిన్+కాక= చెప్పుగాక; మున్న ఏతెంచి= ముందుగా వచ్చి; మనము; దీనిన్= ఈ వార్తను; వినిపింపఁగాన్= చెప్పగా; తగదు= తగదు.

తాత్పర్యం: 'సంజయుడు వచ్చి యుద్ధంలో జరిగిన అన్ని విషయాలను రాజునకు తెలుపుతాడు. ఈ దినం జరిగిన దానిని కూడ ఆతడే చెప్పుగాక! ముందుగా వచ్చి మనం తెలుపరాదు' అని ఇంకా ఇట్లా అన్నాడు.

వ. 'ఒండు ముఖంబున నివ్వార్త నగరు సొరకుండునట్లుగా సంవిధానంబు సేయవలయు; నీవు దుర్యోధను ప్రియాజనంబులను దద్రక్షకులను దోడ్కొని భవదీయమందిరంబునకుం జనుము; తక్కటివారి నంతంత నడఁకువతో నిలువ నియమింపవలయు' నని పలికి తానును యుయుత్సుండును సావధానప్రయత్నంబున నవ్విధానంబు సంఘటించి, నీ తమ్ముండు పెద్దమొగసాలం జాలుమానుసులం గావలివెట్టి, యభ్యంతరంబు ప్రవేశించి యుండె; నక్కడఁ గౌరవసేనాసన్నివేశం బత్యంతవిరళజనం బయ్యెఁ; మున్ను మాతంగతురంగసుభట బృంహిత హేషిత భాషణంబులవలన శబ్దాంతరంబు కర్ణగోచరంబు గానియట్టి యా శిబిరంబు నిశ్శబ్దం బయి యుండె ననిన విని యాంబికేయుం డిట్లనియె. 26

ప్రతిపదార్థం: ఒండు ముఖంబునన్= వేరొకరివలన; ఈ+వార్త నగరు చొరకుండునట్లుగాన్= ఈ మాట అంతఃపురానికి చేరకుండేటట్లు; సంవిధానంబు= కట్టడి; చేయవలయున్= చేయాలి; నీవు; దుర్యోధను; ప్రియాజనంబులను= ప్రియురాండ్రను; తద్+రక్షకులను= వారి కావలివారిని; తోడ్కొని= తీసికొని; భవదీయ= నీయొక్క; మందిరంబునకున్= ఇంటికి; చనుము= వెళ్ళుము; తక్కటివారిన్= మిగిలినవారిని; అంతంతన్= అక్కడక్కడ; అడఁకువతోన్= వినయంతో; నిలువన్= నిలచేటట్లు; నియమింపవలయున్= ఏర్పాటుచేయాలి; అని పలికి= అని చెప్పి; తానును; యుయుత్సుండును; సావధాన ప్రయత్నంబునన్= శ్రద్ధతో కూడిన ప్రయత్నంతో; ఆ+విధానంబున్= ఆ పద్ధతిని; సంఘటించి= చేసి; నీ తమ్ముండు= నీ తమ్ముడు; పెద్దమొగసాలన్= పెద్దవాకిలికి; చాలు మానుసులన్= సమర్థులైన మనుష్యులను; కావలి పెట్టి= కాపలా నిలిపి; అభ్యంతరంబున్= అంతఃపురాన్ని; ప్రవేశించి= చేరి; ఉండెన్= ఉన్నాడు; అక్కడన్= యుద్ధభూమిలో; కౌరవసేన= కురుసేనయొక్క; సన్నివేశంబు=

శిబిరం; అత్యంత= మిక్కిలి; విరళజనంబు+అయ్యెన్= పలుచబడిన మనుష్యులున్నదిగా ఐనది; మున్ను= అదివరలో; మాతంగ= ఏనుగుల; తురంగ= గుర్రాల; సుభట= శిక్షితులైన సేనలయొక్క; బృంహిత= ఘీంకారాలతోను; హేషిత= సకిలింతలతోను; శబ్ద+అంతరంబు= వేరే శబ్దం; కర్ణగోచరంబు+కాని అట్టి= చెవికి వినబడని; ఆ శిబిరంబు= ఆ సైనికుల గుడారం; నిశ్శబ్దంబు+అయి ఉండెన్= అలజడి లేకుండా ఉన్నట్టిది అయింది; అనినన్ విని= అనగా విని; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: వేరొకరిద్వారా ఈ వార్త నగరికి చేరకుండా ఉండేటట్లు కట్టడి చేయాలి. నీవు దుర్యోధనుడి అంతఃపురకాంతలను, వారి కావలివారిని పిలుచుకొని నీ ఇంటికి పొమ్ము. మిగిలినవారిని అక్కడక్కడ అడకువతో ఉండేటట్లు ఏర్పాట్లు చేయుము.' అని చెప్పి, తానూ యుయుత్సుడూ తగిన ప్రయత్నంతో ఆ పనిని నిర్వహించి నీ తమ్ముడైన విదురుడు తగినవారిని పెద్దవాకిలికి కాపుగా పెట్టి అంతఃపురం చేరాడు. ఇక యుద్ధరంగంలో కౌరవసైనికులు పలుచబడ్డాడు. ఒకనాడు మదపుటేనుగుల ఘీంకారాలు, గుర్రాల సకిలింతలు, పదాతి సైనికుల వీరస్వరాలతో శిబిరం ఎంతో సందడిగా ఉండి, వేరే చప్పుళ్ళను వినటానికి సాధ్యపడేది కాదు. అట్టి గుడారం ఇప్పుడు నిశ్శబ్దంగా ఉన్నది' అని చెప్పగా ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు:

క. **'సూతసుత! యిట్లు పగతుర। చేత మనబలంబు రాజసింహులు బంధు**
వ్రాతమ్మును సమసినఁ దుది। నే తెఱఁగున నడచితిరి? నరేంద్రుఁడు మీరున్?' **27**

ప్రతిపదార్థం: సూతసుత!= ఓ సంజయా!; ఇట్లు= ఈ మాదిరిగా; పగతుర చేతన్= విరోధులవలన; మన బలంబు= మన సేనలు; రాజసింహులు= రాజ శ్రేష్ఠులూ; బంధువ్రాతమ్మును= బాంధవుల సమూహమూ; సమసినన్= నాశనంకాగా; తుదిన్= చివరకు; నరేంద్రుఁడు= రాజును(దుర్యోధనుడు); మీరున్= మీరందరును; ఏ తెఱఁగునన్= ఏ విధంగా; నడచితిరి?= ప్రవర్తించారు?

తాత్పర్యం: 'ఓ సంజయా! ఈ విధంగా వైరులచేత మన సేనలు, రాజులు, బంధు సమూహం నాశనమయిన పిమ్మట మన రాజూ, మీరూ ఏం చేశారు?'

వ. **అనుటయు నమ్మహీకాంతునకు సంజయుం డిట్లనియె 'నంత నయ్యెడకుఁ గౌంతేయులు సైన్యంబును దారును సుయోధనాన్వేషణపరు లయి రయంబున నరుగుదెంచు కలకలంబు వీతెంచిన.** **28**

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+మహీకాంతునకున్= ఆ రాజునకు(ధృతరాష్ట్రుడికి); సంజయుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అంతన్= అంతలో; ఆ+ఎడకున్= ఆ చోటికి; కౌంతేయులు= పాండవులు; సైన్యంబును= సేనయు; తారును= తామును; సుయోధన+అన్వేషణపరులు+అయి= దుర్యోధనుడిని వెదకువారై; రయంబునన్= వేగంగా; అరుగుదెంచు= వచ్చే; కలకలంబు= కోలాహలం; వీతెంచినన్= వినరాగా.

తాత్పర్యం: అపుడు సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లాఅన్నాడు: 'అంతలో పాండవులు ససైన్యంగా కలకలారావంతో సుయోధనుడిని వెదకుతూ ఆ చోటికి రాగా (తరువాతి పద్యంతో అన్వయం).

క. **కృతవర్మయుఁ గృపుఁడును గురు। సుతుఁడును గనుఁగొనుచు నొండుచోటికిఁ జని; ర**
ట్లతిరభసంబునఁ గుంతీ। సుతు లచటికి వచ్చి నీదుసుతుఁ బలుగడలన్. **29**

ప్రతిపదార్థం: కృతవర్మయున్ కృపుఁడును= కృతవర్మ, కృపాచార్యుడు; గురుసుతుఁడును= అశ్వత్థామయు; కనుఁగొనుచున్= వెదకుతూ; ఒండు చోటికిన్= వేరొక దిక్కునకు; చనిరి= వెళ్ళారు; అట్లు= ఆ విధంగా; అతిరభసంబునన్= మిక్కిలి తొందరగా; కుంతీసుతులు= కుంతి కుమారులు (పాండవులు); అచటికిన్= ఆ చోటుకు; వచ్చి; నీదు సుతున్= నీ కుమారుడిని; పలుగడలన్= అనేక దిక్కులలో.

తాత్పర్యం: కృతవర్మా, కృపుడూ, అశ్వత్థామా వారిని గమనించి మరొకచోటికి పోయారు. మిక్కిలి తొందరగా పాండవులు ఆ చోటికి వచ్చి నీ కుమారుడి కొరకు అనేక దిక్కులలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. అన్వేషించి కానమికి విషాదంబు నొందుచు మరలి చనిరి; చనునప్పు డజాతశత్రుండు నీ పుత్రునగరిలోని జనంబులఁ గృపతోడం గనుంగొని 'వెఱవకుండుఁ' డని పలికి చనియె; నట్లు వారు నిజశిబిరంబునకుం జనుటయు, మనయోధవరులు నేను మనంబున నడలు గదుర నమ్మడువుకడకుం బోయితిమి; కృపాదు లగు ముచ్చురు దమరాక యెఱింగించి యమ్మనుజపతి కి ట్లనిరి. 30

ప్రతిపదార్థం: అన్వేషించి= వెదకి; కానమికిన్= కనపడనందుకు; విషాదంబున్+ఒందుచున్= చింతిస్తూ; మరలి చనిరి= తిరిగి వెళ్ళారు; చనునప్పుడు= వెళ్ళేటప్పుడు; అజాతశత్రుండు= ధర్మరాజు; నీ పుత్రునగరిలోని జనంబులన్= నీకుమారుడి శిబిరంలోని జనులను; కృపతోడన్+కనుంగొని= దయతో జూచి; వెఱవక+ఉండుఁడు+అని పలికి+చనియెన్= భయపడవద్దని చెప్పి వెళ్ళాడు; అట్లు వారు= ఆ విధంగా పాండవులు; నిజ శిబిరంబునకున్+చనుటయున్= తమ గుడారాలకు వెళ్ళగా; మన యోధవరులున్ నేనున్= మన వీరులూ నేనూ; మనంబునన్= మనసులో; అడలు+కదురన్= భయం కలుగగా; ఆ+మడువు కడకున్+పోయితిమి= ఆ కొలని వద్దకు (దుర్యోధనుడున్న ద్వైపాయన హ్రదం వద్దకు) పోయాము; కృపాదులగు= కృపుడు మొదలైన; ముచ్చురు; ఆ+మనుజపతికిన్= రాజయిన ఆ దుర్యోధనుడికి; తమరాక= తాము రావటం; ఎఱింగించి= తెలిపి; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు:

తాత్పర్యం: (పాండవులు) వెదకి, కనబడనందులకు చింతిస్తూ తిరిగి వెళ్ళారు. పోయేటప్పుడు ధర్మరాజు నీ కుమారుడి శిబిరంలోని జనులను దయతో చూచి, 'భయపడకండి' అని వెళ్ళాడు. వారు వెళ్ళిన పిమ్మట మనసులో భయం కలుగగా మన వీరులతో కలసి నేను ఆ కొలను దగ్గరకు వెళ్ళాను. కృపాదులైన ముగ్గురూ రారాజునకు మా రాకను తెలిపి, పిమ్మట ఈ విధంగా అన్నారు:

కృపకృతవర్మాశ్వత్థామలు దుర్యోధనుం గని సంభాషించుట (సం.9-29-41)

క. 'లెమ్ము కురునాథ! కడఁగుము । మమ్ముం గొని పాండుపుత్రమథనమునకు; సై
న్య మ్మదియును నీచేతఁ గృ । శ మ్మయ్యెడుఁ జుమ్ము! వలదు శంకింపంగన్. 31

ప్రతిపదార్థం: లెమ్ము కురునాథ!= కురురాజా! లేవయ్యా; మమ్మున్+కొని= మా ముగ్గురిని తీసికొని; పాండుపుత్ర= పాండురాజ కుమారుల; మథనమునకున్= సంహారానికి; కడఁగుము= పూనుకొమ్ము; సైన్యమ్ము+అదియును= ఆ సేనకూడా; నీచేతన్= నీవలన; కృశమ్ము+అయ్యెడున్+చుమ్ము!= బలహీన పడగలదు సుమా!; శంకింపంగన్= అనుమానించగా; వలదు= వద్దు.

తాత్పర్యం: 'కురురాజా! లెమ్ము. మా ముగ్గురి అండతో పూనుకొని పాండవ సంహారానికి నడుము బిగించుము. నిస్సందేహంగా నీచేత పాండవ సైన్యం క్షీణిస్తుంది. వెనుకాడవద్దు.

వ. అట్లు కాక గెలిచి భూమి యేలుట యొండెఁ జచ్చినాకలోకసుఖం బనుభవించుట యొండెం గాని నీయట్టివాని కిట్టితెఱంగు కర్తవ్యంబుగా' దని పలికిన విని యవ్విభుండు వారల కి ట్లనియె. 32

ప్రతిపదార్థం: అట్లు కాక= ఆ విధంగా కాకుండా (పాండవులను జయించక); గెలిచి= జయించి; భూమి ఏలుట= రాజ్యాన్ని పాలించుటో; ఒండె= లేదా; చచ్చి; నాకలోక సుఖంబు+అనుభవించుట+ఒండెన్= స్వర్గసుఖాలను అనుభవించటమో; కాని; నీ+అట్టివానికిన్= నీ వంటివాడికి; ఇట్టి తెఱంగు= ఈ విధంగా ఉండటం(దొంగచాటుగా ఉండటం); కర్తవ్యంబు కాదు= చేయదగిన పనికాదు; అని= అంటూ; పలికినన్= మాటాడగా; విని; ఆ+విభుండు(దుర్యోధనుడు); వారలకున్= వారితో (కృపాదులతో); ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అంతే కాక గెలిచి భూమిని పాలించటం గాని, చనిపోయి స్వర్గలోక సుఖాన్ని అనుభవించటంగాని తగుతుంది. కాని నీవంటి వాని కిటువంటి తీరు తగదు' అని చెప్పగా విని ఆ రాజు వారితో ఇట్లా అన్నాడు:

చ. 'తనువు ఘనాస్త్రశస్త్రములతాఁకున నొప్పిని డప్పి పుట్టె నా
మనము వశంబు గా కెడలె మాటల చందము సూడ మీరు డ
స్సినయటు లున్నవార లనుజీవులు లేరు తొలంగి నేఁటి మా
త్ర నిలువుఁ డెల్లి పైకొని యరాతుల గెల్తము లావు వచ్చినన్. 33

ప్రతిపదార్థం: తనువు= ఒడలు; ఘన+అస్త్రశస్త్రముల= పెను బాణముల, కత్తుల; తాఁకునన్= దెబ్బలతో; (కల్గిన) నొప్పిని= బాధవలన; డప్పి+పుట్టెన్= దాహం కలుగుతున్నది; నా మనంబు= నా మనస్సు; వశంబుకాక+ఎడలెన్= సాధ్యం కాకుండా వికలమయింది; మాటల చందము= మాటల పద్ధతి; చూడన్= చూడగా; మీరు డస్సినఅటులు+ఉన్నవారలు= మీరుఅలసినట్లున్నారు; అనుజీవులు లేరు= సేవకులు లేరు; తొలంగి= తప్పుకొని; నేటిమాత్రన్= ఈ దినం మాత్రము; నిలువుఁడు= ఆగండి; ఎల్లి= రేపు; లావు వచ్చినన్= బలం వస్తే; పైకొని= మీదై; అరాతులన్= వైరులను; గెల్తము= జయిద్దాం.

తాత్పర్యం: 'నా శరీరానికి బాణాలయొక్క, కత్తులయొక్క దెబ్బలమూలంగా కల్గిన నొప్పి వలన దాహంగా ఉన్నది. నా మనసు వశం తప్పుతున్నది. మీరూ అలసినట్లున్నారు. సేవకులు కూడా లేరు. అందుచేత ఈరోజు ఆగండి. శక్తి వస్తే రేపు విజృంభించి వైరులను జయిద్దాం.'

వ. అనవుడు నగ్గురునందనుండు. 34

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆ+గురునందనుండు= ఆ గురుకుమారుడైన అశ్వత్థామ.

తాత్పర్యం: అనగా విని అశ్వత్థామ.

ఉ. 'ఏ లనుమాన? మేను సమయించెద వైరము నేఁటితోడఁ; బాం
చాలుర నెల్లఁ దీవ్రశరజాలములం బొలియించి కాని భూ

పాలక! పుచ్చఁ గత్తళము; పాటిగఁ బట్టుము నాదుమాట; లి
య్యాలితనంబు వాపెదఁ; బ్రియం బొనరించెద నీకుఁ దండ్రికిన్.' 35

ప్రతిపదార్థం: భూపాలక!= ఓ రాజా!; ఏల+అనుమానము?= సందేహ మెందుకు?; వైరము= శత్రుత్వం; నేటితోడన్= ఈ దినంతో; ఏను సమయించెదన్= నేను మాపుతాను; పాంచాలురన్+ఎల్లన్= పాంచాల దేశంవారినందరినీ; తీవ్రశరజాలములన్= వాడిఅయిన బాణాల సమూహాలతో; పొలియించి= సంహరించి; కాని; కత్తళము= కవచం; పుచ్చన్= విడిచిపెట్టను; నాదుమాటలు= నా మాటలు; పాటిగన్= ప్రమాణంగా; పట్టుము; ఈ+ఆలితనంబున్+పాపెదన్= దైన్యాన్ని తొలగిస్తాను; నీకున్; తండ్రికిన్= తండ్రియయిన ధృతరాష్ట్రుడికి; ప్రియంబు+ఒనరించెదన్= ప్రీతి కలిగిస్తాను.

తాత్పర్యం: 'నీ కనుమానం దేనికి? ఈ దినంతో వైరం లేకుండేటట్లు వాడిబాణాలతో పాంచాలురందరినీ చంపి కానీ కవచాన్ని విడువను. ప్రమాణంగా నా మాటను నమ్ముము. ఈ దైన్యాన్ని ముగిస్తాను. నీకూ, తండ్రిగారికి సంతోషం కల్గిస్తాను.' (అని అన్నాడు).

వ. అనియెె; నపుడనిల సుతుని వేఁట కాఱులు మాంసభారంబులతోడఁ బరిశ్రాంతులై జలపానార్థం బమ్మడువునకు వచ్చి; రంతకుమున్ను ధర్మనందనుం డొక్కబోయం బొడఁగని 'దుర్యోధనుండు దొలఁగెం జెట్టుచేమల నడంగి యుండునో? మీరు మెలంగు నెడల నరయవలయు' ననిన వాఁడును వృకోదరుని మృగయులలోనివాఁ డగుటఁ దమవారికి నెదురు వోయి యమ్మాట తెఱం గెఱిఁగించుటం జేసి యప్పని మనంబులం దున్నట్టి యాబోయ లట్లు కెలన నేమరి సల్లాపంబులు సేయుచున్న యన్నరనాథుని యారథికవరుల వచనంబులు విని పూర్వాభ్యాసంబువలన నయ్యుక్తి ప్రత్యుక్తుల పరిపాటి దేటపడిన నన్నీటిలో నీకొడుకు డాఁగి యుంట నిశ్చయించి తమలో మెల్లన నిట్లనిరి. 36

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అప్పుడు= ఆ సమయమున; అనిలసుతుని= భీముడియొక్క; వేఁటకాఱులు= బోయలు; మాంసభారంబులతోడన్= మాంసముయొక్క బరువువలన; పరిశ్రాంతులు+ఐ= అలసినవారై; జలపాన+అర్థంబు= నీరు త్రాగటంకొరకు; ఆ+మడువునకున్ వచ్చిరి= ఆ కొలనుకు వచ్చారు; అంతకు మున్ను= అంతకంటె ముందుగా; ధర్మనందనుండు+ఒక్కబోయన్+పొడఁగని= ధర్మరాజు ఒక బోయవాడిని చూచి; దుర్యోధనుండు తొలఁగెన్= దుర్యోధనుడు తప్పుకొన్నాడు; చెట్టుచేమలన్+అడంగి ఉండునో?= చెట్టు చేమలందు దాగి ఉంటాడేమో!; మీరు మెలంగు+ఎడలన్= మీరు తిరిగేటటువంటి చోటులతో; అరయవలయున్= గుర్తించాలి; అనినన్= అనగా; వాఁడును= ఆ బోయవాడు కూడా; వృకోదరుని= భీముడియొక్క; మృగయులలోని వాఁడు+అగుటన్= బోయలలోని వాడైనందున; తమవారికిన్= తనతోడివారికి; ఎదురు పోయి= ఎదు రేగి; ఆ+మాట తెఱంగు+ఎఱింగిచుటన్+చేసి= తెలియజేయటంవలన; ఆ+పని; మనంబులందున్+ఉన్నట్టి= మనసులలో ఉన్న; ఆ బోయలు= ఆ బోయవారు; అట్లు= ఆ విధంగా; కెలనన్= ప్రక్కలయందు; ఏమరి= ఏమరుపాటుగా; సల్లాపంబులు చేయుచున్నన్= స్వేచ్ఛగా మాటాడుకొంటూ ఉండగా; ఆ+నరనాథుని= ఆ దుర్యోధనుడి; ఆ రథికవరుల= ఆ వీరుల (కృప, కృతవర్మ, అశ్వత్థామల); వచనంబులు విని= మాటలు విని; పూర్వ+అభ్యాసంబువలనన్= వెనుకటి అనుభవంతో; (ఆ+ఉక్తి) ప్రత్యుక్తుల పరిపాటిన్= ఆ పరస్పర సంభాషణల పద్ధతి; తేటపడినన్= స్పష్టపడగా(తెలియగా); ఆ+నీటిలోన్= ఆ నీటిలో; నీ కొడుకు డాఁగియుండుట= నీ కుమారుడు దాగుకొని యుండటం; నిశ్చయించి= నిర్ణయించి; తమలోన్; మెల్లనన్= నెమ్మదిగా(రహస్యంగా); ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: భీముడి బోయవారు మాంసభారంతో అలసి ఆ మడుగు దగ్గరకు నీరు త్రాగేందుకు వచ్చారు. ధర్మజు డంతకు ముందు ఒక బోయవాడిని చూచి, 'దుర్యోధనుడు తప్పించుకొన్నాడు. చెట్లు చేమలలో దాగి ఉండవచ్చును. మీరు తిరిగేటప్పుడు గుర్తించండి' అని చెప్పగా వాడు కూడా భీముడి బోయలలో ఒకడు కావటంచేత మిగిలినవారికి ఎదురుగా పోయి, ఆ విషయం తెలియజేసినందున ఆ పని మనసులలో మెదలుతుండగా, ప్రక్కనే ఏమరుపాటుగా మాట్లాడుతున్న ఆ రాజుకూ, వీరులకూ సాగిన ఉక్తిప్రత్యుక్తులక్రమం విని, ఆ నీటిలో నీ కుమారుడు దాగి ఉండటాన్ని నిశ్చయించుకొని తమలో మెల్లగా ఈ విధంగా అనుకొన్నారు.

క. **'ఈ రథికులు తను నిమ్మెయిఁ । బోరికిఁ దఱుమంగఁ దాను బురికొన కిచటం**
గౌరవపతి డాఁగినగతి । బోరనఁ జని చెప్పవలయు భూనాథునకున్. **37**

ప్రతిపదార్థం: ఈ రథికులు= ఈ వీరులు; తనున్+ఈ+మెయిన్+పోరికిన్+తఱుమంగన్= వీరు ఈ విధంగా తనను యుద్ధానికి రెచ్చగొట్టగా; తాను; పురికొనక= ఉద్వేగ మందకుండా; ఇచటన్= ఈ చోట; కౌరవపతి= కౌరవరాజు దుర్యోధనుడు; డాఁగినగతి= దాగిన విధం; బోరనన్+చని= వేగంగా వెళ్ళి; భూనాథునకున్= ధర్మరాజుకు; చెప్పవలయున్= చెప్పవలసి ఉన్నది.

తాత్పర్యం: 'సేనానులు తనను ఆ విధంగా యుద్ధానికై తరుమగా ఉద్వేగపడకుండా దుర్యోధనుడు ఇక్కడ దాగికొని ఉన్న వైనం వేగంగా వెళ్ళి ధర్మజుడికి తెలియజేయాలి.

తే. **అతఁడు పసదన మొసఁగు మారుత తనయుని । మున్ను గని మెచ్చు వడయుద; మన్నరేంద్రు**
నతఁడ కాన్పించు మనల; రయమునఁ బోవ । వలయు; మాంసభారంబులు వలదు లెండు. **38**

ప్రతిపదార్థం: అతఁడు= ధర్మరాజు; పసదనము+ఒసఁగున్= బహుమతి ఇస్తాడు; మారుత తనయునిన్= భీముడిని; మున్ను+కని= ముందుగా చూచి; మెచ్చు+పడయుదము= మెప్పుపొందుదాం; మనలను; ఆ+నరేంద్రున్+అతఁడు+అ కాన్పించున్= ఆ ధర్మరాజును అతడే కనపడేటట్లు చేస్తాడు; రయమునన్= వేగంగా; పోవవలయున్= పోవాలి; మాంసభారంబులు (వేటలోని)= మాంసాల బరువులు; వలదు= అక్కరలేదు; లెండు= లేవండి.

తాత్పర్యం: ధర్మరాజు మనకు బహుమతి నిస్తాడు. భీముడిని ముందుగా చూచి అతడి ఆదరాన్ని పొందుదాము. మనకు ఆ ధర్మరాజును ఆతడే చూపగలడు. ఈ మాంసాల బరువులు వదలి వేగంగా పోదాం లేవండి.'

వ. **అని మోపులు డిగవిడిచి వెసం బాఱి; రయ్యవసరంబునఁ బాండునందనులు నీ నందను వెదక ననేక చారులం బొలికలని కెలంకులకం బుచ్చి, యాతండు తను కగపడమికిఁ జింతాక్రాంతు లై యుండ నాబోయలు భీమునిపణిహారులఁ ద్రోచికొనుచుం దన్మందిరంబు దఱియం జొచ్చి, యతనిం గాంచి, యమ్మడువున నమ్మహీపతి డాఁగి యునికి యెఱింగించి.** **39**

ప్రతిపదార్థం: అని= అంటూ; మోపులు డిగవిడిచి= బరువులు క్రింద దింపి; వెసన్+పాఱిరి= త్వరగా వెళ్ళారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; పాండు నందనులు= పాండురాజకుమారులు; నీ నందను వెదకన్= నీ కుమారుడిని వెదకటానికి; అనేక చారులన్= వేగులవారిని చాలమందిని; పొలికలని కెలంకులకున్+పుచ్చి= యుద్ధభూమి ప్రక్కలకు పంపి; ఆతండు తమకున్+అగపడమికిన్= ఆతడు తమకు కనపడనందులకు; చింతాక్రాంతులు+ఐ+ఉండన్= చింతతో ఉండగా;

ఆ బోయలు= ఆ బోయవారు; భీముని పణిహారులన్ త్రోచికొనుచున్= భీముడి సేవకులను త్రోసికొంటూ; తద్+మందిరంబును+ తఱియన్+చొచ్చి= ఆతని భవనం చేరబోయి; అతనిన్+కాంచి= ఆ భీముడిని చూచి; ఆ+మడువునన్= ఆ కొలనులో; ఆ+ మహీపతి= ఆ రాజు; డాఁగిఉనికి= దాగిఉండటం; ఎఱింగించి= తెలిపి.

తాత్పర్యం: ఆ బోయలు తమవీపులమీది బరువులను క్రిందకు దింపి త్వరగా వెళ్ళారు. అప్పటికే పాండవులు నీకొడుకును వెదకటానికి పట్టణానికి పలువురు గూఢచారులను పంపారు. వారికి నీ కొడుకు కనపడలేదని తెలిసి, పాండువులు నీ కుమారుడు ఉన్నచోటు తెలియనందున చింతిస్తూ ఉన్నారు. అపు డా బోయలు భీముడి సేవకులను ప్రక్కకు త్రోసికొంటూ వెళ్ళి నగరులోనికి వెళ్ళిచూచి, ఆ దుర్యోధను డా కొలనులో ఉండటం తెలిపి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తమవిన్నమాట లన్నియుఁ। గ్రమమునఁ జెప్పిన నతండు గడుఁ బ్రియమున న
ర్థము లొసఁగె వారికి ననే। కములు వహింపంగఁ గొలఁది గాకుండంగన్. 40

ప్రతిపదార్థం: తమ విన్న మాటలన్నియున్= తాము విన్నట్టి మాటలన్నీ (కృపాదులతో దుర్యోధనుడు మాటాడిన మాటలు); క్రమమునన్ చెప్పినన్= వరుసగా చెప్పగా; అతండు= ఆ భీముడు; కడున్= మిక్కిలి; ప్రియమునన్= ప్రీతితో; వారికిన్= ఆ బోయలకు; అనేకములు= చాలా; వహింపఁగన్= మోయగా; కొలదిగాకుండంగన్= సాధ్యం కానట్లుగా; అర్థములు= ధనములు; ఒసఁగెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: బోయలు తాము విన్న మాటలన్నీ భీముడికి వరుస తప్పకుండా చెప్పారు. అందు కాతడు మెచ్చి, వారు మోయలేనన్ని బరువైన బహుమతులను ఇచ్చాడు.

వ. ఒసంగి యా లుబ్ధకుల నగ్రజుఁ గానిపించి 'దేవా! దుర్యోధనుండు ద్వైపాయనహ్రదంబున నొక్కక్షుద్రవిద్యంజేసి జలంబులు నిజశరీరంబు సోఁకకుండునట్లుగాఁ జేసికొని డాఁగియున్నవాఁడు; వీ రెఱింగి వచ్చి'రని యతనికి విన్నవించి, యా సుయోధనగురునందనాదుల సల్లాపంబు లెఱిఁగించిన, నతండు పరమహర్షంబున నా బోయలకు బహువిధంబు లగు పసదనంబు లిచ్చి తక్కిన తమ్ములకును గృష్ణునకుఁ జెప్పికొని వారును సకలబంధు మిత్రపరిజనంబులును దోడన చనుదేర నుద్దామగమనంబున. 41

ప్రతిపదార్థం: ఒసంగి= ఇచ్చి; ఆ లుబ్ధకులన్= ఆ బోయలను; అగ్రజున్+కానిపించి= తన అన్నఅగు ధర్మరాజునకు చూపి; దేవా!= స్వామి!; దుర్యోధనుండు; ద్వైపాయనహ్రదంబునన్= ద్వైపాయనమనే కొలనులో; ఒక్కక్షుద్రవిద్యన్+చేసి= ఒకానొకనీచమైన విద్యవలన; జలంబులు= నీళ్ళు; నిజశరీరంబు సోకకుండునట్లుగాన్= తన ఒడలికి తాకకుండే విధంగా; చేసికొని; డాఁగి= దాగికొని; ఉన్నవాఁడు; వీరు+ఎఱింగి వచ్చిరి= వీరు తెలిసికొని వచ్చారు; అని= అంటూ; అతనికిన్ విన్నవించి; ఆ సుయోధన గురునందనాదుల సల్లాపంబులు= ఆ దుర్యోధనాశ్వత్థామాదుల మాటలు; ఎఱింగించినన్= తెలుపగా; అతండు= ధర్మజుడు; పరమ హర్షంబునన్= మిక్కిలి ఆనందంతో; ఆ బోయలకు; బహువిధంబులు+అగు= అనేక రకాలయిన; పసదనంబులు+ఇచ్చి= బహుమానాలు ఇచ్చి; తక్కిన తమ్ములకును= మిగిలిన తమ్ములకును (అర్జున; నకుల, సహదేవులకు); కృష్ణునకునన్+చెప్పికొని= కృష్ణుడికి కూడ తెలియచేసి; వారును= వారందరూ; సకల బంధుమిత్ర పరిజనంబులును= బంధువులూ, స్నేహితులూ, సేవకులూ - అందరును; తోడన చనుదేరన్= వెంట బయలుదేరగా; ఉద్దామ గమనంబునన్= త్వరితమైన నడకతో.

తాత్పర్యం: (ఆ బోయలకు బహుమానములిచ్చి) ఆ కిరాతకులను ధర్మజుడికి చూపి, 'దేవా! దుర్యోధనుడు ద్వైపాయన హ్రదంలో దాగి ఉన్నాడు. ఒకానొక క్షుద్రవిద్య కారణంగా అతడి శరీరానికి నీరు తగలకుండా ఉన్నాడు. ఈ సంగతి నీకు తెలపటానికి వీరు వచ్చారు' అని అనగా ఆతడు వారు చెప్పిన వార్తను విని సంతోషించి, వారిని సత్కరించి, తక్కిన తమ్ములకు కృష్ణుడికి ఆ విషయాన్ని చెప్పి సమస్త బంధుమిత్రులతో వేగంగా వెళ్ళుతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **తురగ ఖురపుటరథనేమికరిపదాతి । ఘట్టనంబుల నేల గ్రక్కదల శంఖ**
పణవనిస్సాణ కాహళ రణన మెల్ల । దెసలఁ బరఁగంగ వచ్చె నద్దెసకునధిప! **42**

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; తురగఖురపుట= గుర్రాల డిప్పల వంటి గిట్టల; రథనేమి= రథచక్రాల పట్టాల; కరి= ఏనుగుల; పదాతి ఘట్టనంబులన్= కాల్బలాల తాకిడి వలనను; నేల; గ్రక్కదలన్= మిక్కిలిగా కదలగా; శంఖ= శంఖముల; పణవ= తప్పెటల; నిస్సాణ= నిస్సాణముల (చర్మవాద్యాల); కాహళ= కాహళములనే వాద్యాల; రణనము= చప్పుడు; ఎల్లదెసలన్= అన్ని దిక్కులా; పరఁగంగన్= వ్యాపించగా; ఆ+దెసకున్= ఆ వైపునకు; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: చతురంగ బలాల ఒత్తిడికి భూమి అదరుతూ ఉండగా, ఆ సమయంలో వివిధ వాద్యాల ధ్వనులు అన్ని దిక్కులా వ్యాపిస్తూ ఉండగా ధర్మరాజు ఆ వైపు వచ్చాడు.

వ. **అట్లు ధర్మనందనుం డేతెంచు కలకలం బాలకించి యంతకమున్న రణోత్సాహంబునకై రాజు నిర్బంధించు చున్న యగ్గురుపుత్రకృతవర్మ లతనితో నిట్లనిరి.** **43**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; ధర్మనందనుండు= ధర్మరాజు; ఏతెంచు= వస్తున్న; కలకలంబు+ఆలకించి= శబ్దమును విని; అంతకున్ మున్న= అంతకంటె ముందుగా; రణోత్సాహంబునకై= యుద్ధంమీది ఆసక్తితో; రాజున్= దుర్యోధనుడిని; నిర్బంధించుచున్న= తొందర చేస్తున్న; ఆ+గురుపుత్ర= అశ్వత్థామ; కృపకృతవర్మలు= కృపుడును, కృతవర్మయు; అతనితోన్ ఇట్లు+అనిరి= ఆ దుర్యోధనుడితో ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: ధర్మరాజు వస్తున్న కోలాహలాన్ని విని అంతకుముందు దుర్యోధనుడిని యుద్ధోత్సాహంతో నిర్బంధిస్తున్న అశ్వత్థామ కృప కృతవర్మలు ఇట్లా అన్నారు.

మ. **'ధరణీనాయక! పాండుపుత్రులు సముద్దామోద్ధతిన్ వీరె వ**
చ్చిరి వీరిన్ వడిఁ గిట్టి తాఁకుదమొ? నీచిత్తంబు పోరాటకుం
జొరదే నిప్పటికిం దొలంగి చని యెచ్చోనైన నేముండి చె
చ్చెర రూపించినవేళఁ జెప్పినెడకుం జేరంగ నేతెంతుమో?' **44**

ప్రతిపదార్థం: ధరణీనాయక!= ఓ రాజా!; పాండుపుత్రులు= పాండురాజు కుమారులు; సముద్దామ+ఉద్ధతిన్= నిరంకుశమైన పొగరుతో; వీరె వచ్చిరి= ఇదిగో ఇప్పుడే వచ్చారు; వీరిన్= ఈ పాండవులను; వడిన్= త్వరగా; కిట్టి తాఁకుదమొ?= సమీపించి యుద్ధం చేద్దామా?; నీ చిత్తంబు= నీ మనస్సు; పోరాటకున్+చొరదేన్= యుద్ధాని కిష్టపడకుంటే; ఇప్పటికిన్+తొలంగి చని= ఇప్పటికి తొలగిపోయి; ఏ+చో(ట)నైనన్= ఎక్కడనైనా; ఏము+ఉండి= మేముండి; చెచ్చెరన్= త్వరగా; రూపించినవేళన్= నిర్ణయించిన సమయానికి; చెప్పిన+ఎడకున్= నిర్ణయించిన చోటికి; చేరంగన్= చేరగా; ఏతెంతుమో?= వచ్చెదమా?

తాత్పర్యం: 'ఓ రాజా! పాండవులు పెరిగిన దర్పంతో అడ్డులేని ఆటోపంతో వచ్చారు. వారిని ఎదుర్కొని యుద్ధం చేద్దామా? లేక ఇప్పటికి తొలగిపోయి, ఎక్కడైనా దాగి, అదను చూచి నిర్ణయించిన చోటికి చేరుదామా?'

ఆ. అనుడు నా నృపాలుఁ డయ్యోధవరులతో । 'నిప్పు డనికి నుత్సహింప కెచటి
కేనిఁ దొలఁగిపోయి యిచటికి మగుడంగ । రండు పగలు సనిన రాత్రి యగుడు. 45

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; ఆ నృపాలుఁడు= ఆ రాజు(దుర్యోధనుడు); ఆ+యోధవరులతోన్= ఆ సైనికముఖ్యులతో; ఇప్పుడు+అనికిన్= ఇపుడు యుద్ధానికి; ఉత్సహింపక= ఉత్సాహం చూపక; ఎచటకిన్+ఏనిన్= ఎక్కడికైనా; తొలఁగిపోయి= తప్పించుకొనిపోయి; పగలు+చనినన్= పగలుపోగా(వెలుతురుపోగా); రాత్రియగుడున్= రాత్రికాగా; మగుడంగన్= మరల; ఇచటికిన్ రండు= ఇక్కడకు రండి.

తాత్పర్యం: (వారిమాటకు) ఆ దుర్యోధనుడు ఆ సేనా ముఖ్యులతో (అశ్వత్థామ, కృపకృతవర్మలతో) 'ఇపుడు యుద్ధాసక్తిని చూపకుండా ఎక్కడికైనా వెళ్ళి, పగలు గడచి రాత్రి వచ్చినప్పుడు మరల రండి' అని అన్నాడు.

వ. వారు వారణపురంబున కనివారణఁ బోయెదరు; వోవుదురు గాక యిచ్చేరువఁ బోయిరేనియు ని మ్మడువున నాయునికి యెఱుంగలే; రట్లు గాక యెఱింగిరేనియు నన్నుఁ జేరరాదు; మదీయ విద్యా విశేషసంస్తంభితాంభో దుర్గంబున నిర్భయుండ నై యుండెదఁ బొం' డనినం బొగులు మనంబులతోడ నా రథికజనంబులు వోవం బతి జలంబులు శిలాసదృశంబులుగాఁ బరిస్తంభించె; నేనును బాండుసూనుల చారు లెల్లకడల మెలంగుటం జేసి రాజు నప్పుడు వెలువరించుట కర్జంబు గా దనియు నతనితోయస్తంభవైదగ్ధ్యం బెఱుంగుట నొలసిన యూఱటను ముందటియట్ల వారలతోడం జని చని చిత్తంబు గలంగినం జాలక యరదంబు డిగ్గి యచ్చట నొక్కయెడ నొదిఁగి నిలిచెద నని వారలకుం జెప్పి యమ్మడువు నఱుత నొక్కపఱపు గలపాదయీఱమిం దూఱి పొంచియుండితి; వారలు దూరంబు సని యొక్క విపులవటంబు పొంత విశ్రాంతి నొంది నీనందను వలనికిం జనిన హృదయంబులతోఁ దదీయకార్యచింతాభరంబు పట్టుకొనఁ దదనుబంధ సంభాషణంబులు సేయు చుండి రక్కడ. 46

ప్రతిపదార్థం: వారు= ఆ పాండువులు; వారణపురంబునకున్= హస్తిపట్టణానికి; అనివారణన్= తప్పనిసరిగా; పోయెదరు= వెళ్ళెదరు; పోవుదురుగాక!= పోతారుకాక!(పోతే పోయారు); ఈ+చేరువన్= ఈప్రక్కగా; పోయిరి+ఏనియున్= పోయినను; ఈ+మడువునన్= ఈ కొలనులో; నా+ఉనికి= నేనుండుట; ఎఱుంగలేరు= తెలియలేరు; అట్లుగాక ఎఱింగిరేనియున్= ఆ విధంగా కాకుండా తెలిసినట్లయినా; నన్నున్+చేర రాదు= నా దగ్గరకు వచ్చుటకు వీలుకాదు; మదీయ= నాయొక్క; విద్యావిశేష= విద్యాధిక్యముచే; సంస్తంభిత+అంభోదుర్గంబునన్= స్తంభింపజేయబడిన ఈ జలదుర్గంలో; నిర్భయుండను+ఐ ఉండెదన్= భయం లేకుండా ఉంటాను; పొండు= మీరు వెళ్ళండి; అనినన్= అనగా; పొగులు మనంబులతోన్= కుమిలే మనసులతో; ఆ రథికజనంబులు= ఆ వీరులు; పోవన్= వెళ్ళగా; పతి= రాజు(దుర్యోధనుడు); జలంబులు= నీటిని; శిలాసదృశంబులుగాన్= రాళ్ళవలె; పరిస్తంభించెన్= స్తంభింపజేశాడు; ఏనును= నేనును(సంజయుడు); పాండుసూనుల చారులు= పాండవుల వేగులు; ఎల్ల+ఎడలన్= అంతటనూ; మెలంగుటన్+చేసి= తిరగటంవలన; రాజును= దుర్యోధనుడిని; అప్పుడు; వెలువరించుట= బయలు చేయటం; కర్జంబుకాదు+అనియున్= సరిఅయిన పని కాదనియు; అతని తోయ స్తంభవైదగ్ధ్యంబు+ ఎఱుంగుటన్= వాని జలస్తంభన విద్యా నైపుణ్యాన్ని తెలిసిఉండటంవలన; ఒలసిన ఊఱటను= కలిగిన ఓర్మిచే; ముందటి+అట్లు=

వెనుకటి మాదిరిగానే; వారలతోడన్+చని చని= వారి వెంట వెళ్ళి వెళ్ళి; చిత్తంబు+కలంగినన్= మనసు కలతపడగా; చాలక= శక్తిలేక; డిగ్గి= దిగి; అచ్చటన్; ఒక్క+ఎడన్= ఒక చోట; ఒదిఁగి నిలిచెదన్= దాగి ఉంటాను; అని; వారలకున్+చెప్పి= వారికి చెప్పి; ఆ+మడువు+అఱుతన్= ఆ కొలను సమీపాన; ఒక్కపఱపుకల= బాగా విస్తరించిన; పొద+ఈఱుమిన్+దూరి= పొద జొంపంలో దూరి; పొంచి+ఉండితిన్= పొంచి ఉన్నాను; వారలు దూరంబు+చని= వారు దూరంగా వెళ్ళి; ఒక్క; విపుల= విస్తారమైన; వటంబు పొంతన్= మఱ్ఱిచెట్టు సమీపాన; విశ్రాంతిన్+ఒంది= అలసట తీర్చుకొని; నీనందనువలనికిన్+చనిన= నీ కుమారుని ప్రక్కకు ప్రసరించిన; హృదయంబులతోన్= మనసులతో; తదీయ కార్య చింతాభరంబు= అతడి వైపు వెళ్ళిన ఆలోచనల బరువును; పట్టుకొనన్= పట్టుకోగా; తదనుబంధ సంభాషణంబులు చేయుచుండిరి= దానికి సంబంధించిన మాటలు మాట్లాడుతూ ఉన్నారు.

తాత్పర్యం: 'ఆ పాండవులు తప్పకుండా హస్తినకు వెళ్ళితే వెళ్ళుతారు. ఈ ప్రక్కకు వచ్చినప్పటికిని ఈ కొలనులో నేను ఉండటం తెలిసికోలేరు. ఒకవేళ తెలిసికొన్నా నన్ను చేరలేరు. నా విద్యా వైదుష్యంతో స్తంభింపజేయబడిన ఈ జలదుర్గంలో నిర్భయంగా ఉండగలను. పొండి' అనగా ఆ రథికులు దిగులు గుండెలతో వెళ్ళారు. దుర్యోధనుడు జలాలను శిలలతో పోలే విధంగా స్తంభనవిద్యను పాటించి జలంలో ప్రవేశించాడు. పాండవుల గూఢచారులు నలుమూలలా తిరుగుతుండటంచేత అతడిని బయలు వెలువడేటట్లు చేయటం తగినపనికాదని భావించి, అతడి జలస్తంభన విద్యాపాండిత్యం తెలిసి ఉండటంచేత నేను ఊరట చెందాను. ముందటివలెనే రథికత్రయంతో కలిసి కొంతదూరం వెళ్ళాను. కాని, నా మనసు కలతపడటంతో నిలువలేక రథందిగి, అక్కడే ఒకచోట ఒదిగి ఉంటా' నని చెప్పి ఆ సరోవర సమీపంలోని ఒక పొదలో దాగి పొంచి ఉన్నాను. వారు దూరంగా వెళ్ళి, ఒక మఱ్ఱిచెట్టు క్రింద విశ్రాంతి తీసికొని బరువైన గుండెలతో నీ కుమారుడి పనికి సంబంధించిన మాటలు మాట్లాడుతున్నారు. ఇక ఇక్కడ. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. కలకల నవ్వుచుఁ బెలుచం । బలుకుచుఁ దమకెలఁకులందుఁ బాంచాలకుమా
రులు సనుదేరఁగఁ బాండుసు । తులు వచ్చిరి సంతసంబుతో మడువునకున్. 47

ప్రతిపదార్థం: కలకలనవ్వుచున్= గలగల నవ్వుతూ; పెలుచన్+పలుకుచున్= పెద్దగా మాట్లాడుతూ; తమ కెలఁకులందున్= తమ ప్రక్కలలో; పాంచాలకుమారులు చనుదేరఁగన్= పాంచాలరాజు కుమారులు రాగా; పాండుసుతులు= పాండురాజు కుమారులు; సంతసంబుతోన్, మడువునకున్+వచ్చిరి= ఆనందంతో కొలను దగ్గరకు వచ్చారు.

తాత్పర్యం: పాంచాలరాజు కుమారులు తమతో వస్తూ గలగల నవ్వుతూ, ఉచ్చైఃస్వరంతో మాట్లాడుతూ రాగా పాండురాజు కుమారులు సంతోషంతో ఆ కొలనువద్దకు వచ్చారు.

వ. ఇట్లు వచ్చి ధర్మతనయుండు భవత్తనయమాయాస్తంభితం బైన యాజలాశయంబు నిరూపించి తత్ప్రకారం బెఱింగించి యచ్యుతునితో నల్లన ని ట్లనియె. 48

ప్రతిపదార్థం: ఇట్లు వచ్చి= పై విధంగా వచ్చి; ధర్మతనయుండు= ధర్మరాజు; భవత్+తనయ= నీ కుమారుడి; మాయా స్తంభితంబు+ఐన= మాయచేత కట్టివేయబడిన; ఆ జలాశయంబున్= ఆ మడుగును; నిరూపించి= చూచి; తద్+ప్రకారంబు+ ఎఱింగించి= అదిఉన్న విధమును తెలిపి; అచ్యుతునితోన్= శ్రీకృష్ణుడితో; అల్లనన్= మెల్లగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఆ విధంగా వచ్చి ధర్మరాజు నీకుమారుడు మాయచేత స్తంభించేటట్లు చేసిన ఆ నీటిమడుగును చూచి, అది ఉండే తీరు చెప్పి, నెమ్మదిగా శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు:

క. 'చొరరాదు మనుజులకు నె । వ్వరికిని నిజ్జలము కౌరవక్షితిపతి ని
ర్భరమాయా సంరక్షా । భరితం బై; కాన వీతభయుఁ డాతండున్.' 49

ప్రతిపదార్థం: మనుజులకున్= మానవులకు; ఎవ్వరికిని; ఈ+జలము= ఈ నీరు; కౌరవక్షితిపతి= కౌరవరాజు(దుర్యోధనుడు); నిర్భర మాయాసంరక్షాభరితంబు+ఐ= అధికమగు మాయచేత కాపాడబడుతున్నదై(ఉండటంచేత); చొరరాదు= ప్రవేశింపసాధ్యం కాదు; కాన= కనుక; ఆతండున్= ఆతడు; వీతభయుఁడు= భయము లేనివాడు.

తాత్పర్యం: 'మానవులు ఎవరూ చొరరాని ఈ నీరు దుర్యోధనుడి పెనుమాయచేత కాపాడబడుతున్నది. కనుక ఆతడు భయం లేకుండా ఇందున్నాడు.

ధర్మరాజు మడుగున డాఁగియున్న దుర్యోధనుని దూఱనాడుట (సం. 9-30-6)

క. అని వెండియు నాపతి గురు । జననాథుగుఱించి పలుకు 'శక్రుఁడు దోడై
చనుదెంచె నేని పోవ । చ్చునె నాచేఁ దప్పి యిందుఁ జొచ్చినఁ దనకున్?' 50

ప్రతిపదార్థం: అని వెండియున్+ఆ పతి= అని మరల ఆ రాజు(ధర్మరాజు); కురుజననాథుగుఱించి= దుర్యోధనుడిని గూర్చి; పలుకున్= చెప్తున్నాడు; ఇందు చొచ్చినన్= ఈ మడుగులో దాగినను; తనకున్= దుర్యోధనుడికి; శక్రుఁడు= ఇంద్రుడు; తోడై చనుదెంచెను+ఏని= ఇంద్రుడు తోడుగా వచ్చినప్పటికిని; నాచేన్+తప్పి= నానుండి తప్పించుకొని; పోవచ్చునె?= పోనగునా?;

తాత్పర్యం: అంటూ ధర్మరాజు దుర్యోధనుడిని గూర్చి ఇట్లా అన్నాడు. 'మడుగులో దాగికొన్నా, దేవేంద్రుడు సహాయపడినా ఇతడు నా నుండి తప్పించుకొనటం సాధ్యం కాదు'

వ. అనిన విని యచ్యుతుం డతనికి నల్పస్వరంబున నిట్లనియె. 51

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విన్నవాడై; అచ్యుతుండు+అతనికిన్= శ్రీకృష్ణుడు ఆతడితో(ధర్మజుడితో); అల్పస్వరంబునన్= మెల్లని గొంతుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అనగా విన్న శ్రీకృష్ణు డా ధర్మజుడితో మెల్లని గొంతుతో ఇట్లా అన్నాడు:

ఉ. 'మాయలు గల్గు దుష్టులకు మాయపుభంగులె మందు గాక ని
ర్మాయత నుల్లసిల్లెడు పరాక్రమ లీలలు గొల్చు నెట్లు? దై
తేయులు దొల్లి మాయల నతిప్రబలాత్మకు లైనఁ దద్వధో
పాయములన్ జయింపరె నృపాలక! విష్ణుఁడు నింద్రుఁడుం దగన్. 52

ప్రతిపదార్థం: నృపాలక!= ఓ రాజా!; మాయలు కల్గు దుష్టులకున్= మోసాలుచేసే దుర్మార్గులకు; మాయపు భంగులె= మోసపు విధానాలే; మందు= ప్రతిక్రియ; కాక= అట్లు కాక; నిర్మాయతన్+ఉల్లసిల్లెడు= మోసం లేకుండా ప్రకాశించే;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరాక్రమలీలలు= శత్రువులను జయించే విధాలు; ఎట్లు గొల్చున్?= ఏ విధంగా తగుతాయి?; తొల్లి= పూర్వం; దైతేయులు= రాక్షసులు; మాయలన్= మోసాలతో; అతిప్రబల+ఆత్మకులైనన్= మిక్కిలి బలవంతులు కాగా; విష్ణుడు ఇంద్రుడున్+తగన్= విష్ణుడూ ఇంద్రుడూ తగు విధంగా; తద్+వధ+ఉపాయములన్= వారిని చంపే ఉపాయాలతో; జయింపరె?= జయించరా?

తాత్పర్యం: మాయాత్మకులైన దుర్మార్గులకు మోసపు పద్ధతులే మందు. మాయతో కాకుండా విరోధులను జయించటం ఏ విధంగా సాధ్యం అవుతుంది? మిక్కిలి బలవంతులైన దైత్యులను విష్ణుడు, ఇంద్రుడు మాయోపాయాలతో జయించలేదా?

వ. హిరణ్యకశిపు వృత్రవధ ప్రకారంబు వినమె? రావణుండు హోమాదిమాయాక్రియావిఘాతంబునఁ గాదె రాముచేత నిర్జింపంబడె? నరకాసుర నేను బరిమార్చిన తెఱం గెఱుంగవే? వీఁడగపడునట్టి విధంబు సూచికొ' మ్మనిన విని యప్పాండవాగ్రజుండు జలాంతర్గతుం డై యున్న భవన్నందను నుద్దేశించి యిట్లనియె. 53

ప్రతిపదార్థం: హిరణ్యకశిపు= హిరణ్యకశిపుడియొక్క; వృత్రవధ= వృత్రాసురుడిని చంపిన; ప్రకారంబులు= పద్ధతులు; వినమె?= వినలేదా? రావణుండు? హోమ+ఆది= హోమము మొదలయిన; మాయాక్రియా= మోసపు చేష్టల; విఘాతంబులనన్+ కాదె?= అడ్డంకులవలన కాదా?; రాముచేతన్= శ్రీరాముడిచేత; నిర్జింపంబడియెన్?= సంహరింపబడ్డాడు?; నరకాసురునిన్; నేను; పరిమార్చిన= చంపిన; తెఱంగు= విధం; ఎఱుంగవే?= తెలియవా?; వీఁడు= దుర్యోధనుడు; అగపడునట్టి= కనపడే; విధంబు= పద్ధతి; చూచికొమ్ము= ఏర్పరచుకొనుము(వెదకుము); అనినన్= అనగా; విని= విన్నవాడై; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ పాండవులలో పెద్దవాడు(ధర్మరాజు); జలాంతర్గతుండై యున్న= నీటిలో ఉన్న; భవత్+నందనున్= నీ కుమారుడిని; ఉద్దేశించి= లక్షించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: 'హిరణ్యకశిపు వృత్రాసురులను చంపిన విధం వినలేదా? రావణాసురుడు కావించిన హోమాది మాయల విఘాతంవలన కదా శ్రీరాముడిచేత హతమార్చబడ్డాడు? నేను నరకాసురుడిని చంపిన పద్ధతి నీకు తెలియదా? (కనుక) దుర్యోధనుడు దొరకే పద్ధతిని ఎన్నుకొనుము' అనగా ధర్మరాజు నీటిలో ఉన్న నీ కుమారుడిని పేర్కొని ఇట్లా అన్నాడు:

చ. 'ఇటు తగునే సుయోధన! మహీవలయంబున నిట్టిదైన్య మె
చ్చట వినఁ జూడఁ గల్గెనె? యసంఖ్యులు రాజులు నీకుఁ గాఁగఁ జ
చ్చుటయును బంధుమిత్రులు విశుద్ధచరిత్రులు పోర నట్లు త్రుం
గుటయును జూచి; తేమిటికిఁ గ్రుంకితి నీళ్లను? జావు దప్పనే? 54

ప్రతిపదార్థం: సుయోధన!= ఓ దుర్యోధనా!; ఇటు తగునే?= ఇట్లుండవచ్చునా?; మహీవలయంబునన్= భూగోళంలో; ఇట్టి దైన్యము= ఇటువంటి దీనావస్థ; ఎచ్చటన్= ఏ చోటా; వినన్+చూడన్+కల్గెనె!= వినలేదు, చూడలేదు కదా!; అసంఖ్యులు= లెక్కపెట్టలేనంతమంది; రాజులు; నీకున్+కాఁగన్= నీ కొరకు; చచ్చుటయును= చనిపోవటమూ; బంధుమిత్రులు= బంధువులు, స్నేహితులు; విశుద్ధచరిత్రులు= మంచి పేరున్నవారు; పోరన్= యుద్ధంలో; అట్లు త్రుంగుటయును= ఆ విధంగా చనిపోవటమూ; చూచితి(వి)= చూచావు; ఏమిటికిన్= ఎందుకై; నీళ్లను= నీటిలో; క్రుంకితి(వి)?= మునిగావు?; చావు= చనిపోవటం; తప్పునే?= తప్పిపోతుందా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'దుర్యోధనా! లోకంలో ఇట్టి నీచమైన స్థితి నీకు తగునా? నీకై అనేకులు రాజులు చనిపోవటం, లెక్కపెట్టరానంతమంది బంధుమిత్రులు చనిపోవటం చూచావు. నీళ్ళలో ఎందుకు మునిగి దాగి ఉన్నావు? అంతమాత్రాన చావు తప్పుతుందా?

ఉ. శూరుఁడ వండ్రు నిన్ మడువు సొచ్చుట శౌర్యముచొప్పె? మాన మే
యూరికిఁ బోయె? నాజి నృపు లోడుదురే? నృపుఁ డున్న మాత్రయే?
కౌరవవంశజాతుఁడవు గష్టపుఁ జచ్చుట దెచ్చుకొంటి; నీ
పేరును బెంపు మాలి యరిబృందము నవ్వఁగ నిట్లు సేయుదే? 55

ప్రతిపదార్థం: శూరుడవు+అంద్రు నిన్= నిన్ను శౌర్యంకలవాడ వంటారు; మడువు చొచ్చుట= నీటిమడుగులో దూరటం; శౌర్యము చొప్పె?= పరాక్రమ ధర్మమా?; మానము+ఏ ఊరికిన్+పోయెన్?= నీ అభిమానం ఏ ఊరికి పోయింది?; (నీ అభిమానం చచ్చిందా?); ఆజిన్= యుద్ధంలో; నృపులు= రాజులు; ఓడుదురే?= వెనుకంజవేయుదురా?; నృపుఁ డన్న మాత్రయే?= నీకు కేవలం రాజమాత్రుడవా? (సామాన్యరాజువా?); కౌరవవంశజాతుఁడవు= కురువంశంలో పుట్టావు; కష్టపున్+చచ్చుట= నీచంగా చావటం; తెచ్చుకొంటి(వి)= తెచ్చుకొన్నావు; నీ పేరును పెంపు మాలి= నీ కీర్తి గొప్పతనం పోగా; అరిబృందము= వైరి సమూహం; నవ్వఁగన్= ఎగతాళి చేసి నవ్వగా; ఇట్లు చేయుదే?= ఈ విధంగా చేస్తావా?

తాత్పర్యం: దుర్యోధనా! నిన్ను శూరు డంటారు. నీ వీ కొలనులో దూరటం వీరధర్మమా? నీ అభిమానం ఏ ఊరికి పోయింది? యుద్ధంలో రాజులు వెనుకంజ వేస్తారా? నీవు సాధారణమైన రాజువా! కౌరవవంశంలో పుట్టావు. నీచమైన చావును తెచ్చుకొన్నావు. నీ కీర్తినీ, గొప్పతనాన్నీ వదలి శత్రుసమూహం నవ్వేటట్లు ఈ విధంగా చేస్తావా?

తే. క్షత్త్రధర్మంబు విడిచినఁ గలదె యిహము । బరముఁ? బేరోలగంబునఁ బలుకుపలుకు
లెల్ల మఱచితె? విను మవి పొల్లు లైనఁ । గష్టపాటు గా కుసు ఱేల గావ వచ్చు? 56

ప్రతిపదార్థం: క్షత్త్రధర్మంబు= రాజుధర్మం; విడిచినన్= వదలితే; ఇహమున్ పరమున్ కలదె?= ఈ లోకములో గాని, ఊర్ధ్వలోకంలో గాని సుఖం ఉన్నదా?; పేరు+ఓలగంబునన్= పెద్దసభలో; పలుకు పలుకులు+ఎల్లన్= (ప్రేలిన ప్రేలాపనలు) మాటాడినమాటలన్నీ; మఱచితె?= మరచావా?; అవి= ఆ పలుకులు; పొల్లులు+ఐనన్= వ్యర్థములయితే; కష్టపాటు+కాక= కష్టంకలుగుతుందే కాని; ఉసుఱు= ప్రాణం; ఏల= ఎందుకు; కావన్+వచ్చున్= రక్షిస్తాయి? (రక్షించవనుట.)

తాత్పర్యం: రాజధర్మం వదిలితే ఇహపరా లుంటాయా? పెద్దసభలో ప్రేలిన ప్రేలాపనలు మరచావా? వినుము. వ్యర్థమైన కష్టమే కాక ఆ మాటలు ప్రాణాలను ఏ విధంగా కాపాడుకొనవచ్చును?

చ. కొడుకులు దమ్ములుం గలన ఘోరపుఁ జావులు సావఁ జూచి యె
ట్లొడఁబడె నీదుబుద్ధి యొడ లోముట కై? నిను రాజరాజ! యి
మ్ముడువున కీర్తి తెచ్చె విధి; మానము ప్రాణముకంటెఁ జాల నె
క్కు డగుట సెప్పఁగా వినవొకో? కడునీచతఁ బొంది తక్కటా! 57

ప్రతిపదార్థం: రాజరాజ!= రారాజా!; కొడుకులు తమ్ములున్= కుమారులు, తమ్ముళ్ళు; కలనన్= యుద్ధంలో; ఘోరపు చావులు చావన్+చూచి= భయంకరమయిన చావులు చావగా చూచి; నీదు బుద్ధి= నీ తెలివి; ఒడలు+ఓముటకై= శరీరాన్ని

కాపాడుకొనుటకై; ఎట్లు+ఒడఁబడెన్?= ఏ విధంగా ఒప్పుకొన్నది?; విధి= దైవం; నినున్= నిన్ను; ఈ+ మడువునకున్+ ఈడ్చితెచ్చెన్= ఈ కొలనిలోనికి ఈడ్చుకొని తెచ్చింది; మానము= అభిమానం; ప్రాణముకంటెన్= ప్రాణంకన్నా; చాలన్= మిక్కిలి; ఎక్కుడు+అగుట= ఎక్కువ కావటం; చెప్పఁగాన్= (లోకంలో) చెప్పుకోగా?; వినవు+ఒకో?= వినలేదా?; అక్కటా!= అయ్యో!; కడున్= మిక్కిలి; నీచతన్= నికృష్టతను; (దైన్యమును); పొందితి(వి)= పొందావు.

తాత్పర్యం: కుమారులు, తమ్ములు యుద్ధంలో భయంకరంగా చనిపోగా చూచిన నీ బుద్ధి శరీరాన్ని కాపాడుకొనటం కొరకు ఎట్లా ఒప్పుకొన్నది? రారాజా! దైవం ని న్నీ మడుగున కీడ్చి తెచ్చింది. అభిమానం ప్రాణంకంటే గొప్ప అని అనటం వినలేదా? మిక్కిలి నీచత్వాన్ని పొందావు.

శా. అంభోగర్భము సొచ్చి పాండుసుతబాహాగర్వ దుర్వారసం
రంభం బోర్వక డాఁగి యుండె నట రారా జిస్సిరో! చచ్చుచో
గాంభీర్యంబును ధైర్యమున్ విడిచి దోర్గర్వంబు బెండయ్యెనే?
శుంభన్మానము దూలెఁగా కని జనస్తోమంబు నిందింపదే? 58

ప్రతిపదార్థం: రారాజు= దుర్యోధనుడు; పాండుసుత= పాండురాజ కుమారుల; బాహాగర్వ= భుజాల దర్పంయొక్క; సంరంభంబు+ఓర్వక= విజృంభణాన్ని సహించలేక; అంభస్+గర్భము+చొచ్చి= నీటిలోపలకు ప్రవేశించి; డాఁగిఉండెను+అట= దాగిఉన్నాడట; ఇస్సిరో!= ఛీ!; చచ్చుచోన్= చనిపోయేటపుడు; గాంభీర్యంబును ధైర్యమున్ విడిచి= గంభీరతను, ధైర్యమును వదలి; దోర్గర్వంబు= భుజాబలము; బెండు+అయ్యెనే?= నిస్సారమైపోయిందా?; శుంభత్+మానము= వికాసవంతమయిన అభిమానం; తూలెన్+కాక= పోయింది కదా; అని= అంటూ; జనస్తోమంబు= ప్రజల సమూహం; నిందింపదే?= దూషించదా?

తాత్పర్యం: రారాజు పాండురాజ కుమారుల భుజబల విజృంభణానికి తట్టుకొనలేక మడుగులో దాగినాడట! - అని ప్రజలు ఛీకొట్టరా! చచ్చేటపుడు భుజబలదర్పం కూడా తొలగిపోయిందా! వికాసంతో ఉండవలసిన అభిమానం నశించింది కాబోలు! అని అంటూ సమస్త జనులూ నిన్ను దూషించరా?

తే. కర్ణశకునిదుశ్శాసనుల్ ఘనులు గాఁగఁ। దలఁచి వారలఁ గొని మమ్ము గెలుచువాఁడ
వై మనంబున శంకింప కట్లు కీడు। చేసి తా తూఁపు దప్పిన గాసి యైతి. 59

ప్రతిపదార్థం: కర్ణ= కర్ణుడు; శకుని; దుశ్శాసనుల్= దుశ్శాసనుడు; ఘనులు కాఁగన్+తలఁచి= గొప్పవాళ్ళుగా తలచుకొని; వారలన్= వారలను; కొని= చేకొని; మమ్మున్ గెలుచు= మమ్ములను గెలువదలచిన; వాఁడవు+ఐ= వాడవయి; మనంబునన్= మనసులో; శంకింపక= అనుమానించక; అట్లు= ఆ విధంగా; కీడుచేసితి(వి)= ఆ విధంగా బాధపెట్టావు; ఆ తూఁపు తప్పినన్= ఆ పూనిక తప్పిపోగా; గాసి ఐతి(వి)= కష్టపడ్డావు.

తాత్పర్యం: కర్ణ శకుని దుశ్శాసనులను గొప్పవారిగా నమ్మి వారి సహాయంతో ఎట్టి అనుమానమూ లేకుండా మమ్మల్ని గెలుద్దామని ఆ విధమైన కీడును చేశావు. ఆ పూనిక తప్పగా కష్టపడుతున్నావు.

వ. నీ కొలంది గంటి; మగపడితి; వింక నెందుఁ బోవచ్చు?' నని మఱియు ని ట్లనియె. 60

ప్రతిపదార్థం: నీ కొలందిన్+కంటిమి= నీ శక్తి గమనించాము; అగపడితివి= కనిపించావు; ఇంకన్ ఎందున్+పోవచ్చున్= ఇక ఎక్కడకు పోగలవు?; అని మఱియున్= అని ఇంకనూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: (దుర్యోధనా)! ఇప్పటి నీ శక్తి చూచాము. మాకు దొరికావు. ఇక ఎక్కడకు పోగలవు?' అని ఇంకా ఈ విధంగా అన్నాడు:

మ. 'భయముం బాయఁగఁ ద్రోచి వీరగుణముం బాటించి సంగ్రామని
శ్చయబుద్ధిం దలకొల్పి పౌరుషముమైఁ జా వొండె గెల్పొండెఁ గా
క యధీరత్వము నాకు నీడె యని వీఁకం బేర్చి వే తాఁకు మెం
తయుఁ బే రయ్యెడు; రమ్ము లె; మ్మొదిఁగినన్ దైన్యమ్ము వచ్చుంజుమీ!' 61

ప్రతిపదార్థం: భయమున్+పాయఁగన్+త్రోచి= భయాన్ని పోద్రోలి; వీరగుణమున్+పాటించి= వీరత్వమును చూపించి; సంగ్రామ నిశ్చయ బుద్ధిన్+తలకొల్పి= యుద్ధం మీద స్థిరమయిన మనసు నిల్పి; పౌరుషముమైన్= మగతనంతో; చావు+ఒండెన్, గెల్పు+ఒండెన్= చావో బ్రతుకో ఏదో ఒక్కటియే; కాక= తప్ప; (అని); అధీరత్వము= ధైర్యం లేకుండటం; నాకున్ ఈడె అని= నాకు తగునా? అనుకొంటూ; వీఁకన్+పేర్చి= ధైర్యంతో విజృంభించి; వేతాఁకుము= వెంటనే ఎదుర్కొనుము; ఎంతయున్+ పేరు+అయ్యెడున్= ఎంతయినా పేరు వస్తుంది (కీర్తి వస్తుంది); రమ్ము= రా; లెమ్ము= లే; ఒదిఁగినన్= దాగుకొంటే; దైన్యమ్ము= దీనత్వము; వచ్చున్+చుమీ= వస్తుంది సుమా!

తాత్పర్యం: భయాన్ని వీడి, వీరత్వంతో స్థిరమైన మనసుతో యుద్ధానికి సిద్ధమై మగతనంతో చావో జయమో ఏదో ఒకటి అని నిశ్చయించి, ధైర్యమును వదలటం నాకు తగునా? అనుకొంటూ విజంభించి వెంటనే ఎదుర్కొనుము. నీకు పేరు ప్రతిష్ఠలు కలుగుతాయి. రమ్ము, లెమ్ము! దాగుకొంటే దీనత వస్తుంది సుమా!'

చ. అని మము నోర్చినం బృథివి యంతయు నేలఁగ వచ్చు; నీవు చ
చ్చిన సురసద్మ సౌఖ్యములు చేకుఱు; రెండుదెఱంగులందు నొ
ప్పనియది లేదు డాఁగ నగుబాటును బ్రాణము చేటుఁ దెచ్చుకోల్
విను! మము నీ వెదుర్పఁ దగు వేయువిధంబులఁ జాటి చెప్పెదన్. 62

ప్రతిపదార్థం: అనిన్+మమున్+ఓర్చినన్= యుద్ధంలో మమ్ము ఓడిస్తే; నీవు; పృథివి+అంతయున్= భూమినంతటినీ; ఏలఁగవచ్చున్= పాలించవచ్చును; చచ్చినన్= చనిపోతే; సురసద్మసౌఖ్యములు= స్వర్గసుఖాలు; చేకుఱున్= కలుగుతాయి; రెండు తెఱంగులందున్= ఈ రెండు పద్ధతులలో; ఒప్పని+అది లేదు= సరికానిది లేదు; డాఁగన్= దాగికొనగా; నగుబాటును= అవమానమును; ప్రాణము చేటు తెచ్చుకోల్= ప్రాణనష్టమును తెచ్చుకొనటమును; మమున్+నీవు+ఎదుర్పన్+తగున్= మమ్ము నీవు యుద్ధంలో ఎదుర్కొనటం తగిన పని; వేయు విధంబులన్= వేయివిధాలుగా; చాటిచెప్పెదన్= చాటింపువేసినట్లు చెప్పుతున్నాను; విను= వినుము.

తాత్పర్యం: నీవు యుద్ధంలో మమ్ము ఓడించినట్లయితే భూమండలమంతా పరిపాలింపవచ్చును. లేదా చనిపోతే స్వర్గలోకసుఖాలు పొందవచ్చును. ఈ రెండు పద్ధతులూ సరిఅయినవే. దాగుకొంటే అవమానం, ప్రాణాల పైకి తెచ్చుకొనటం ఔతుంది. నీవు మమ్ము యుద్ధంలో ఎదుర్కొనటం యుక్తం. నా మాట వినుము. వేయి విధాలుగా చాటింపు వేసినట్లు చెపుతూ ఉన్నాను.

వ. తెంపు చేసి మామీఁద నుఱుకుట నీకు ధాత నిర్మించిన పరమధర్మంబు; పురుషుండ వైతేని దీని ననుష్ఠింపు' మనిన విని యవ్వసుమతీశునకు సుయోధనుం డి ట్లనియె. 63

ప్రతిపదార్థం: తెంపు చేసిన మా మీఁదన్+ఉఱుకుట= మా పైకి సాహసంతో దూకడము; ధాత= బ్రహ్మ; నీకు నిర్మించిన= నీకు ఏర్పరచిన; పరమధర్మంబు= శ్రేష్ఠమయిన ధర్మం; పురుషుండవు+ఐతి(వి)+ఏని= మగవాడవైనట్లయితే; దీనిన్+ అనుష్ఠింపుము= దీనికి ఆచరింపుము; అనినన్ విని= అనగా విని; ఆ+వసుమతీశునకున్= ఆ రాజుతో(ధర్మరాజుతో); సుయోధనుండు+ఇట్లనియెన్= దుర్యోధను డీ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సాహసంతో మా మీదికి యుద్ధానికి దూకటమే బ్రహ్మ నీకు నిర్ణయించిన ధర్మం. దీనిని ఆచరించుము. మగటిమి కలవాడ వయితే దీనిని చేయుము.' అని ధర్మరాజు అనగా దుర్యోధనుడు ఈ విధంగా అన్నాడు.

దుర్యోధనుఁడు నీరిలోన యుండి ధర్మజున కుత్తరం బిచ్చుట (సం. 9-30-35)

సీ. 'నరుఁడు ప్రాణభయంబుఁ బొరయుట యరు దయ్య! వినుము తెల్లంబుగా మనుజనాథ!
రథవాహసారథిరహితుండ నగుటను । బాణాదిహేతిసంపదలు లేమిఁ
బరివారశూన్యత వాటిల్లుటను బంధు । మిత్రసహాయులు మిడి యడంగఁ
జచ్చుటయును బోట్ల నొచ్చి మేనును డప్పి । గూరి చిత్తంబును బోరి కెలయ

తే. కునికిఁ జేసియుఁ దొలఁగితి నొదిఁగి సేద । దేర్చుకొని రణమునకు నుదీర్ణవృత్తి
వచ్చువాఁడను నీవు మీవారు విశ్ర । మింపుఁ డంతకు మఱి రండు సొంపు సూప.' 64

ప్రతిపదార్థం: మనుజనాథ!= ఓ రాజా!; నరుఁడు= మానవుడు; ప్రాణభయంబున్+పొరయుట= ప్రాణభయాన్ని పొందటం; అరుదు+అయ్య!= ఆశ్చర్యమా!; తెల్లంబుగాన్= స్పష్టంగా; వినుము; రథవాహ= తేరు, గుఱ్ఱాలు; సారథి= సారథి; రహితుండను+ అగుటయున్= లేనివాడను అగుటవలనను; బాణ+ఆది హేతి సంపదలు లేమిన్= బాణాలు, ఆయుధాలు మొదలైన యుద్ధసాధనాలు లేనందునను; పరివారశూన్యత+పాటిల్లుటను= సేవకులు లేకుండటంచేత; మిత్ర, సహాయులు= స్నేహితులు, సహాయకారులు; మిడి+అడంగన్+చచ్చుటన్= గర్వం అణగి చనిపోవటం చేతను; పోట్లన్+నొచ్చి= దెబ్బలచేత నొవ్వబడి; మేనును= ఒడలును; డప్పికూరి= దాహం కాగా; చిత్తంబును= మనసును; పోరికిన్+ఎలయక+ఉనికిన్= యుద్ధానికి సిద్ధం కాకుండటంచేతను; తొలఁగితిన్= తప్పుకొన్నాను; ఒదిఁగి= తొలగి; సేదన్+తీర్చుకొని= అలుపు తీర్చుకొని; రణమునకున్= యుద్ధానికి; ఉదీర్ణవృత్తిన్= గొప్పగా; వచ్చువాఁడను= రాగలను; అంతకున్= అంతదాక; నీవున్+మీవారున్= నీవూ నీ మనుష్యులూ; విశ్రమింపుఁడు= విశ్రాంతి తీసికొనండి; సొంపు చూపన్= మీతీరు చూపటానికి; మఱిరండు= ఆ పైన రండి.

తాత్పర్యం: 'ఓ రాజా! మానవుడు ప్రాణభయం చెందటం ఆశ్చర్యమా? స్పష్టంగా వినుము. రథాలు, గుఱ్ఱాలు, సారథులు లేనివాడను, అస్త్రశస్త్రాలూ లేనివాడను, సేవకులు, స్నేహితులూ, సాయపడేవాళ్ళూ గర్వమణగిచనిపోవడం వలనా దెబ్బల వలన కలిగిన బాధచేతనూ, యుద్ధానికి తలపడలేకున్నాను. అందువలన తప్పుకొన్నాను. ఒక్కింత అలసట తీర్చుకొని గొప్పగా యుద్ధానికై తలపడతాను. మీవారూ మీరూ కొంత విశ్రాంతి తీసికొని తిరిగి మీ నైపుణ్యం చూపటానికి రండు.'

వ. అని పలికినఁ బాండవాగ్రజుండు. 65

ప్రతిపదార్థం: అని పలికినన్= అని మాటలాడగా; పాండవాగ్రజుండు= ధర్మరాజు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని మాటలాడగా ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఇందాఁక విశ్రమించితి; । మిందు నినుం దడవి కంటి; మిప్పు డిచట నీ
కుం దేఱె డప్పి; కురుపతి । నందన! ర మ్మింక రణమునకు నాయిత మై.' 66

ప్రతిపదార్థం: కురుపతినందన!= కురురాజకుమారా!; ఇందాఁకన్= ఇంతవరకును; విశ్రమించితిమి= విశ్రాంతి తీసికొన్నాము; ఇందున్= ఇక్కడ; నినున్= నిన్ను; తడవి కంటిమి= వెదకి చూచాము; ఇప్పుడు+ఇచటన్= ఇపు డిక్కడ; నీకున్= నీకు; దప్పి తేఱెన్= అలసట తీరింది; ఆయితము+ఐ= సిద్ధమై; ఇంకన్+రణమునకున్+రమ్ము= ఇక యుద్ధానికి రమ్ము.

తాత్పర్యం: 'ఓ కురురాజ కుమారా! ఇంతదాక అలుపుదీరా విశ్రమించాము. వెదకి ఇక్కడ నిన్ను చూచాము. నీకూ ఇప్పటికి అలసట తీరింది. ఇక యుద్ధానికి సన్నద్ధమై రమ్ము.'

వ. అనుటయు. 67

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే.

తాత్పర్యం: ధర్మరాజు ఇట్లు అనగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'ఎవ్వరికిఁ గాఁగ రాజ్యంబు నెల్లభోగ । ములును గోరుదు రక్కుమారులును నాదు
తమ్ములును లేరు; తురగరథ ద్విపప్ర । హీన యయ్యె నీ క్షోణీయు; నేల పెనఁగ? 68

ప్రతిపదార్థం: ఎవ్వరికిన్+కాఁగన్= ఎవరి కొరకుగా; రాజ్యంబున్= రాజ్యమును; ఎల్లభోగంబులును= అన్ని సుఖాలూ; కోరుదురు= కోరుకొంటారో; ఆ+కుమారులును= ఆ కొడుకులున్నూ; నాదు తమ్ములును లేరు= నా తమ్ముళ్ళూ లేరు; ఈ క్షోణియున్= ఈ నేలకూడా; తురగ రథ ద్విప ప్రహీనము+అయ్యెన్= గుర్రాలూ, తేర్లూ, ఏనుగులూ నశించింది అయినది; పెనఁగన్+ఏల?= పెనుగులాట దేనికి?

తాత్పర్యం: 'ఎవరికొరకై రాజ్యాన్ని ఆశిస్తానో, ఎవరికొరకై భోగాలన్నిటినీ కోరుకొంటానో ఆ కుమారులూ నా తమ్ముళ్ళూ లేరు. ఈ భూమికూడా చతురంగ బలహీనమయినది. ఇంకెందుకు యుద్ధం చేయటం?

చ. ద్రుపదతనూజులన్ గెలిచి దోర్బలసంపద నుల్లసిల్లి మి
మ్మపజితదర్పహీను లగునట్లుగఁ జేసి సమస్తభూపతి
త్వపదము గంటినేనియు వృథారభసం బది యింపు గాదు క
ర్ణుపడుట భీష్ములేమిని గురుండు మృతుం డగుటన్ ధరాధిపా! 69

ప్రతిపదార్థం: ధరాధిపా!= ఓ రాజా!; ద్రుపద తనూజులన్= ద్రుపదుని కుమారులను; గెలిచి= జయించి; దోర్బలసంపదన్= భుజబలైశ్వర్యంతో; ఉల్లసిల్లి= సంతసించి; మిమ్మున్= మిమ్మల్ని; (పాండవులను) అపజిత దర్పహీనులు+అగునట్లుగన్+చేసి= జయింపబడని దర్పం లేనివారు అయ్యేటట్టు చేసి - దుర్దమ దర్పహీనులగునట్లు చేసి; సమస్త భూపతిత్వపదము= భూసామ్రాజ్యాధిపత్య పదవిని; కంటిన్+ఏనియున్= పొందినప్పటికినీ; వృథా= వ్యర్థమగు; రభసంబు= ఆర్భాటం; కర్ణు పడుటన్= కర్ణుడు చనిపోవటం చేతా; గురుండు= ద్రోణుడు; మృతుండు+అగుటన్= చనిపోవటంచేతా; అది ఇంపుగాదు= అది(నా) ఇష్టం కాదు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ద్రుపదుడి కుమారులను గెలిచి భుజబల సంపదతో సంతోషంగా మీ అందరనూ దుర్దమ గర్వహీనులనుగా చేసి రాజ్యాధిపత్యము నందినప్పటికీ ఈ వృథార్భాటం కర్ణభీష్మద్రోణులు గతించటం వలన నాకు ప్రీతిని కలిగించదు.

క. తనవారుఁ దానుఁ గూడఁగ । ననుభవసుఖ మందఁ డేని యది రాజ్యమె రా
జునకు? భవత్పరిజనములు । ననుజన్ములు బ్రదికి; రేలు మఖిలధరిత్రిన్. 70

ప్రతిపదార్థం: తనవారున్ తానున్ కూడఁగన్= తనవారును తానును కలిసి; అనుభవ సుఖము+అందఁడు+ఏని= అనుభవించదగిన సౌఖ్యం పొందనిచో; రాజునకున్= రాజైన వాడికి; అది రాజ్యమె?= ఆ రాజ్య మొక రాజ్యమా?; నీ సేవకులు; అనుజన్ములు= తోబుట్టువులు; బ్రదికిరి= బ్రతికిఉన్నారు; అఖిల ధరిత్రిన్ ఏలుము= ప్రపంచమంతటిని ఏలుకొమ్ము.

తాత్పర్యం: తన వారితో కలిసి అనుభవించదగు సుఖమే సుఖం. కాని, అది లేనిచో రాజునకు అది రాజ్యమూ కాదు. ఆ సుఖము సుఖమూ కాదు. నీ సోదరులు, సేవకులూ అందరూ బ్రతికే ఉన్నారు. ప్రపంచాన్నంతటినీ నీవే ఏలుకొమ్ము.

క. ఏ నింక సమర మొల్ల మ । హీనాయక! నీక యుర్వి నిచ్చితి శాంతిం
గానకుఁ జని వల్కలపరి । ధానుఁడ నై తప మొనర్చెదను మునుల కడన్. 71

ప్రతిపదార్థం: మహీనాయక!= ఓ రాజా!; ఏన్+ఇంకన్ సమరము+ఒల్లన్= నే నింక యుద్ధమున కిష్టపడను; నీకున్+అ= నీకే; ఉర్విన్+ఇచ్చితిన్; భూమిని(రాజ్యమును) ఇచ్చివేసినాను; శాంతిన్+కానకున్+చని= శాంతితో; అడవికి వెళ్ళి; వల్కలపరిధానుఁడను+ఐ= నార చీరలే బట్టలుగా కలవాడవై; మునులకడన్= తాపసుల వద్ద; తపము+ఒనర్చెదను= తపస్సు చేస్తాను.

తాత్పర్యం: నా కింక యుద్ధం వద్దు. ఓ రాజా! ఈ భూమిని నీ కిచ్చాను. శాంతంగా అడవులకు వెళ్ళి మునుల సన్నిధిని నారచీరలు కట్టుకొని తపస్సు చేసికొంటాను.

ఆ. ఓడి వచ్చినాఁడ నుద్ధతి నా కేల? । యుడుకు మాని నీవ యుర్వి యేలు
గుఱ్ఱములును నేనుఁగులు లేని బయలు నీ । తలనె కట్టికొనుము ధర్మతనయ!' 72

ప్రతిపదార్థం: ధర్మతనయ!= ధర్మరాజా!; ఓడి వచ్చినాఁడన్= ఓడిపోయివచ్చాను; ఉద్ధతి= గర్వం; నాకున్+ఏల?= నా కెందుకు?; ఉడుకు మాని= తాపం వదలి; నీవ+ఉర్వి+ఏలు= నీవే భూమిని పాలించుకొమ్ము; గుఱ్ఱములును+ఏనుఁగులున్ లేని బయలు= గుఱ్ఱాలు, ఏనుగులు లేని బీడును; నీ తలనె కట్టికొనుము= నీ నెత్తినే కట్టుకొనుము.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఓడిపోయి వచ్చినాను. నా కెందుకయ్యా గర్వం? ఈ భూమిని నీవే పాలించుకొమ్ము. గుఱ్ఱాలు, ఏనుగులు లేని ఈ బీడును నీ నెత్తిపైననే కట్టుకొమ్ము'.

చ. అన విని యన్నరేశ్వరుఁడు హాసముతో నతనిం గుఱించి యి
ట్లనుఁ 'దనుజానుజన్మసుహృదాప్త సహాయుల సన్నఁ గాదె శ
ల్యునిఁ గొని మమ్ము గెల్చి సకలోర్వియు నేలుట కుత్సహించి తీ
పనవుట లేల? మాను మిది; పాటిగఁ బట్టుము లెమ్ము పోరికిన్. 73

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనన్+విని= అనగా విన్నవాడై; ఆ+నరేశ్వరుఁడు= ఆ ధర్మరాజు; హాసముతోన్= నవ్వుతో; అతనిన్+గుఱించి= ఆ దుర్యోధనుడి గూర్చి; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటున్నాడు; తనుజ+అనుజన్మ+సుహృద్+ఆప్తసహాయులు= కుమారులు, సోదరులు, స్నేహితులు, ఆత్మీయులు, సహాయకులు; చన్నన్+కాదె?= పోయిన తరువాతనే కదా!; శల్యునిన్+కైకొని= శల్యుడిని తీసికొని; మమ్మున్ గెల్చి= మమ్ము జయించి; సకల+ఉర్వియున్= భూమండలమంతయు; ఏలుటకున్= పాలించటానికి; ఉత్సహించితి(వి)= ఆసపడ్డావు; ఈ పనవుటలు= ఈ ప్రేలుటలు; ఏల?= ఎందుకు?; మానుము= మానుకొనుము; ఇది పాటిగన్+పట్టుము= దీనిని ధర్మంగా ఎంచుము; పోరికిన్= యుద్ధానికి; లెమ్ము= లే.

తాత్పర్యం: ధర్మరాజు దుర్యోధనుడితో నవ్వుతూ ఇట్లా అన్నాడు: 'కుమారులు, తమ్ములు, ఆప్తజనాలు, సహాయంగా వచ్చేవారూ గతించిన తరువాతనే కదా శల్యుడిని తీసికొనివచ్చి మమ్ము గెల్చి భూమండలమంతా పాలించవలెనని ఆశపడ్డావు. ఈ ప్రేలాపన లెందుకు గాని ధర్మం ఎంచి యుద్ధానికి లెమ్ము.

సీ. **నీ యీగి నేను భూనాయకుఁ డగు టొల్ల । రాజకోటికిఁ బరిగ్రహము సనునె?**
నిను ననిం దెగటార్చి నేలఁ బాలించెద । నను నోర్చితేని పెంపున సుఖింపు
మేమిటి వాఁడవై యిచ్చితి పుడమి నీ । కనియెడు మాట యిట్లాడె దిపుడు
నీవు ధరిత్రి యీ నేర్చినఁ గురుకులం । బునకు నిట్లాఅడిఁ బోవ నేల?

తే. **శాంతి నొందుటకై ధర్మసం విభాగ । కరణ మొనరింపవచ్చినకమలనాభు**
వాక్యవృత్తిఁ బాటింపక వాఁడి సూది । మోపి నంతైన నుర్వి యీనోప నంటి. **74**

ప్రతిపదార్థం: నీ ఈగిన్= నీ దానాన్ని; ఏను= నేను; భూనాయకుఁడు+అగుటన్+ఒల్లన్= రాజగుటకు ఇష్టపడను; రాజకోటికిన్= రాజులకు; పరిగ్రహము= దానం తీసికొనటం; చనునె?= తగునా?; నినున్= నిన్ను; అనిన్= యుద్ధంలో; తెగటార్చి= నాశనం చేసి; నేలన్= భూమిని; పాలించెదన్= పరిపాలన చేస్తాను; ననున్+ఓర్చితి(వి)+ఏని= నన్ను ఓడించినట్లయితే; పెంపునన్= గొప్పగా; సుఖింపుము= సుఖించు; ఏమిటివాఁడవు+ఐ= ఏమంత గొప్పవాడవై; పుడమిన్= భూమిని (రాజ్యాన్ని); ఇచ్చితి(వి)?= ఇచ్చావు?; ఈక= ఇవ్వకుండా; అనియెడుమాట= అనే మాట; ఇపుడు= ఈ సమయంలో (అన్నీ కోలుపోయిన ఈ సమయంలో); ఇట్లు= ఈ రీతిగా; ఆడెదు= అంటున్నావు; నీవు ధరిత్రిన్+ఈన్+నేర్చినన్= నీవు భూమిని ఈయగల్గిన వాడవే అయితే; కురుకులంబునకున్= కురువంశం కొరకు; ఇట్లు+ఆఅడిన్+పోవ నేల?= ఈ విధంగా నిందాపాత్రమై పో నేల?; శాంతిన్+ఒందుటకై= శాంతిని పొందటానికి గాను; ధర్మసంవిభాగ కరణము= న్యాయంగా భాగమును పరిష్కరించటం; ఒనరింపన్= చేయుటకు; వచ్చిన= వచ్చినటువంటి; కమలనాభువాక్యవృత్తిన్= శ్రీకృష్ణుడిమాట తీరును; పాటింపక= నడవకుండా; వాఁడిసూదిన్= వాడి అయిన సూదిని; మోపినంతైనన్= ఆన్చినంతకూడ; ఉర్విన్= భూమిని; ఈన్+ఓపనంటి(వి)= ఈయలేనన్నావు.

తాత్పర్యం: నీ ఈ దానములో రాజగుటకు నేను అంగీకరించను. యుద్ధంలో చంపి భూమిని పాలిస్తాను. నన్ను ఓడించినట్లయితే గొప్పగా సంతోషించుము. నీ వెవడ వని భూదానం ఇచ్చావు? ఈ సమయంలో ఇట్లా మాట్లాడుతున్నావేమిటి? నీవే భూమిని ఈయగల్గితే కురువంశం ఇట్లా నిందాపాత్రం కానేల? ధర్మపద్ధతిలో భాగ పరిష్కారానికై వచ్చి మాట్లాడిన శ్రీకృష్ణుడి మాటలు లెక్కచేయకుండా వాడి సూది మొన మోపినంత భూమిని కూడ ఈయనన్నావు.

క. **ఏమి విధంబునఁ బోరలియు । భూమి కురున్నపాల! నీకుఁ బుచ్చుకొనఁగ రా**
కీమెయి దైన్యపడితి? నా । కేమార్గము వట్టి యిచ్చె దేర్పడఁ జెపుమా! **75**

ప్రతిపదార్థం: కురునృపాల!= కౌరవరాజా!; ఏమి+విధంబునన్= ఏ ప్రకారంగా; పొరలియున్= పొరలినప్పటికీ - శ్రమించినప్పటికీ; నీకు భూమిన్!= నీకు భూమిని; పుచ్చుకొనఁగ రాక= తీసికొన వీలుపడక; ఈ మెయిన్= ఈ విధంగా; దైన్యపడితి?= నీచస్థితికి వచ్చావు?; నా కే మార్గము పట్టి ఇచ్చెదు?= నాకు ఏ విధంగా ఇస్తావు?; ఏర్పడన్+చెపుమా!= స్పష్టంగా చెప్పుము!

తాత్పర్యం: కౌరవరాజా! ఏ విధంగానూ - ఎంత పొరలినా - ఎంత శ్రమించినా; భూమిని తీసికొనటానికి నీకు వీలుపడక ఇంత నీచస్థితికి దిగజారావు? ఏ విధంగా దీనిని నాకిస్తావో స్పష్టంగా చెప్పుము.'

క. అరులకు సిరి యిచ్చితి నను । వెరవి డియుం గలఁడె? దీని విడువుము నాకున్
ధర యిచ్చి తేనియును నినుఁ । బొరిగొన కే విడువ నతిమి పోరుట యొప్పున్. 76

ప్రతిపదార్థం: అరులకున్= వైరులకు; సిరి ఇచ్చితిన్+అను= సంపద నిస్తాననే; వెరవిఁడియున్+కలఁడె?= ఉపాయహీను డున్నాడా?; దీనిన్ విడువుము= ఈ ప్రయత్నం మానుకొమ్ము; నాకున్ ధరఇచ్చితి(వి)+ఏనియును= నాకు నీవు భూమి నిచ్చినప్పటికిని; నినున్= నిన్ను; పొరిగొనక= చంపకుండా; ఏన్ విడువన్= నేను వదలను; అతిమిన్= ఆక్రమించి(క్రమ్ముకొని); పోరుట= యుద్ధం చేయటం; ఒప్పున్= తగును.

తాత్పర్యం: వైరులకు సంపద నిస్తాననే వెర్రివా డుంటాడా? ఈ ప్రయత్నాన్ని మానుకొనుము. నాకు ఒకవేళ ఈ భూమిని ఇచ్చినా నిన్ను చంపక వదలను. కనుక విక్రమించి యుద్ధం చేయటమే తగును.

క. నాచే నీ ప్రాణంబులు । నీచే నా జీవితంబు నిజ మున్నవి యి
న్నీచత యవకార్యము రా । జోచితకర్మకృత నిశ్చయుఁడ వగుము నృపా!' 77

ప్రతిపదార్థం: నృపా= రాజా!; నాచేన్ నీ ప్రాణంబులు= నీ ప్రాణాలు నాచేతను; నీచే నా జీవితంబు= నా ప్రాణం నీచేతను; ఉన్నవి= ఉన్నాయి; నిజము= అది సత్యం; ఈ+నీచతన్= ఈ నైచ్యం; అవకార్యము= చేయగూడని పని; రాజ+ఉచితకర్మ= విధి నిర్ణయించిన రాజులు చేయవలసిన పనియందు; కృతనిశ్చయుఁడవు+అగుము= నిశ్చయించుకొన్నవాడవుకమ్ము.

తాత్పర్యం: నీ ప్రాణాలు నాచేతిలోనూ నా ప్రాణాలు నీచేతిలోనూ ఉన్నాయి. ఇది నిజం. నీ ఈ నైచ్యం తగనిది, రాజులకు తగిన కర్మఅయిన యుద్ధానికి దృఢనిశ్చయుడవు కమ్ము.'

వ. అని వెండియు నిట్లను 'జతుగృహంబు దహించితి, పాములం గఱపించితి, నీటం ద్రోయించితి, విషాన్నంబు వెట్టించితి; వెన్ని కపటోపాయంబులు సేసినను నీచేతఁ జెడక యునికి యెఱుంగవే? యింక నట్ల య మ్మాయలం బ్రయోజనంబు లేదు. 78

ప్రతిపదార్థం: అని వెండియున్+ఇట్లు+అనున్= అని మరియు ఈవిధంగా అన్నాడు; జతుగృహంబు దహించితి(వి)= లక్కయింటిని కాల్చావు; పాములన్+కఱపించితి(వి)= పాములచేత కరపించావు; నీటన్+త్రోయించితి(వి)= నీటిలో త్రోయించావు; విషాన్నంబు పెట్టించితి(వి)= విషం కలిపిన అన్నమును పెట్టించావు; ఎన్ని కపట+ఉపాయంబులు చేసినను= ఎన్ని విధాలయిన కుట్రలు చేసినను; నీచేతన్+చెడక+ఉనికి= నీవలన నాశనం కాకుండటం; ఎఱుంగవే?= నీవు ఎరుగవా?; ఇంకన్+అట్లు+అ= ముందు కూడా అట్లే; ఆ+మాయలన్+ప్రయోజనంబు లేదు= ఆ మోసాలవలన లాభంలేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: (ధర్మరాజు ఇంకా ఇట్లా అన్నాడు) లక్క ఇల్లు కాల్పించావు. పాములతో కరిపించావు. నీళ్ళలో త్రోయించావు, విషం కలిపిన అన్నం పెట్టించావు. ఎన్ని కుట్రలు చేసినప్పటికీ నీవలన మేము నాశనం కాకుండా ఉండగలగటం నీకు తెలియదా? ముందుకూడా అట్లే ఆ విధమైన మోసాలవలన ప్రయోజనం లేదు.

క. లే లెమ్ము! బిరుద వై ర । మ్మాలమునకు; నీవు నెఱుఁగ దవ్విధము కడున్
మే లొండు తెరవు లే; దిం । కేల యొదిఁగి కష్టపడ? నరేశ్వర! చెపుమా! 79

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= ఓ రాజా!; లే లెమ్ము= త్వరగా లే; బిరుదువు+ఐ= వీరుడవయి; ఆలమునకున్= యుద్ధానికి; రమ్ము= రా; నీవున్; ఎఱుఁగుదు(వు); ఆ+విధము= ఆ రీతి-యుద్ధానికి సిద్ధపడటం; కడున్= మిక్కిలి; మేలు= మంచిది; ఒండు= వేరొక; తెరువులేదు= మార్గములేదు; ఇంక= ఇక; ఒదిగి= తొలగి; కష్టపడున్ ఏల?= కష్టపడుట ఎందుకు? చెపుమా.

తాత్పర్యం: ఓ రాజా! లేచిరావయ్యా! యుద్ధానికి రమ్ము! నీకు ఇంతకంటె మేలైన మార్గం వేరే లేదు. ఆ సంగతి నీకూ తెలుసు. ఇంకనూ దాగికొని బాధపడట మెందుకు?'

వ. అని యివ్విధంబున నమ్మనుజేంద్రుండు మఱియుం బలుకఁ బెఱవారు నట్ల పలికి' రనిన విని
ధృతరాష్ట్రుండు. 80

ప్రతిపదార్థం: అని ఈ+విధంబునన్= అని ఈ ప్రకారంగా; ఆ+మనుజ+ఇంద్రుండు= ఆ ధర్మరాజు; మఱియున్= ఇంకను; పలుకన్= మాటాడగా; పెఱవారును= ఇతరులు కూడా; అట్లు+అ పలికిరి= అదే విధంగా మాటాడారు; అనినన్ విని= అని (సంజయుడు) చెప్పగా విన్నవాడై; ధృతరాష్ట్రుండు.

తాత్పర్యం: అని ఈ విధంగా ధర్మరాజు, మిగిలిన వారూ మాట్లాడారు.' అని సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'ఇట్లు జంకింపఁబడి మఱి యేమి సేసె । నాతనూజుండు? మున్ను నెన్నఁడును జంకఁ
బడినవాఁడు గాఁ డక్కట! పుడమి నాల్గు । సెఱఁగులును వెఱఁ దన పంపు సేయ బ్రదికె. 81

ప్రతిపదార్థం: నా తనూజుండు= నా కుమారుడు; ఇట్లు జంకింపఁబడి= ఈ విధంగా బెదరించబడి; మఱిఏమి+చేసెన్?= ఇంకేమి చేశాడు?; మున్ను= పూర్వం; ఎన్నఁడును= ఎప్పుడు కూడా; జంకబడినవాఁడు= బెదరించబడినవాడు; కాఁడు= కాదు; అక్కట!= అయ్యో!; పుడమి నాల్గు చెఱుగులును= భూమి నాల్గు దిక్కులూ; వెఱన్= భయంతో; తన పంపు+చేయన్ బ్రదికెన్= తన ఉత్తరువు పాటింపగా బ్రతికాడు.

తాత్పర్యం: 'ఈ విధంగా బెదరించబడ్డ నా కుమారుడు ఇం కేమి చేశాడు? ఇదివరలో ఎపుడూ కూడా భయపెట్టబడినవాడు కాడు. నాల్గుదిక్కులూ తా నంటే భయపడుతూ తన ఆజ్ఞను పాటించే విధంగా బ్రతికినవాడు. అయ్యో!

క. పరిజనహీనత దీనతఁ । బొరసినయెడ ముట్టుకొని రిపుప్రకరము ని
ష్ఠురవాక్యమ్ముల నమ్మెయిఁ । బరితాపము సేయ నేమిభంగి నిలిచెనో?' 82

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పరిజనహీనతన్= సేవకులు లేమిని; దీనతన్= దైన్యమును; పొరసిన+ఎడన్= కలిగినపుడు; ముట్టుకొని= తాకి; రిపుప్రకరము= వైరిసమూహం; ఆ+మెయిన్= ఆ విధంగా; నిష్ఠురవాక్యమ్ములన్= కఠినమైన మాటలతో; పరితాపము+చేయన్= బాధించగా; ఏమి భంగిన్ నిలిచెనో?= ఏ విధంగా (బ్రతికి) ఉన్నాడో!.

తాత్పర్యం: సేవకులు లేకుండా దీనంగా ఉండగా వైరిసేన క్రమ్ముకొని, ఆ విధంగా నిష్ఠురమైన మాటలతో బాధించగా (దెప్పుడు మాటలతో తూలనాడగా) ఏ విధంగా ఉండగలిగాడో?'

వ. అనుటయు సంజయుం డమ్మనుజపతి కిట్లనియె 'నట్లు ధర్మతనయుండును దమ్ములుఁ గొడుకులును ద్రుపదపుత్రులును బొదువుకొని పలుకు పరుసని పలుకులకుఁ జిత్తం బుత్తలపడ నాననంబు పల్లటిల్లఁ గరంబులు విదిర్చి దురం బొనర్చువాఁడై యప్పాండవాగ్రజున కిట్లనియె. 83

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; సంజయుండు; ఆ+మనుజపతికిన్+ఇట్లు+అనియెన్= సంజయు డా రాజుతో (ధృతరాష్ట్రుడితో) ఈ విధంగా అన్నాడు; అట్లు= ఆ విధంగా; ధర్మతనయుండును+తమ్ములున్+కొడుకులును= ధర్మరాజును, వానితమ్ములును, కుమారులును; ద్రుపదపుత్రులును= ద్రుపదరాజు కుమారులును; పొదువుకొని= చుట్టూ క్రమ్ముకొని; పలుకు పరుసని పలుకులకున్= మాట్లాడే పరుషవాక్యాలకు; చిత్తంబు+ఉత్తలపడన్= మనసు చీకాకుపడగా; ఆననంబు పల్లటిల్లన్= మొగం చిన్నపోగా; కరంబులు విదిర్చి= చేతులు విదలించుకొని; దురంబు+ఒనర్చువాఁడు+ఐ= యుద్ధం చేసేవాడై; ఆ+పాండవ+అగ్రజునకున్+ఇట్లు+అనియెన్= ఆ పాండవుల అన్న అయిన ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రుడితో ఈ విధంగా అన్నాడు: ధర్మరాజు, అతడి తమ్ములు, ద్రుపద పుత్రులు చుట్టుకొని మాట్లాడే పరుషపు మాటలకు మనసు చీకాకుపడగా, మొగం చిన్నపోగా, చేతులు విదలించుకొని, యుద్ధం చేసేవాడుగా ఆ ధర్మరాజుతో (దుర్యోధనుడు) ఈ విధంగా అన్నాడు:

సీ. 'మీ రేవురును బరివార బాంధవమిత్ర । సహితుల, రఖిలాస్త్రశస్త్రవంతు
లరు, కరిస్యందనతురగసమేతులు; । రే నొకరుండ, విహీనసహచ
రత్వంబు విగతాయుధత్వంబు వాహన । హీనత నొందితి; నే విధమున
నని యొనర్పఁగ వచ్చు? నది గాక పోటుల । డస్సితిఁ గడు; మీకు డప్పి లేదు;

తే. వరుసఁ దగ నొక్కఁ డొక్కఁడ వచ్చి పోరుఁ; । డిపుడ వెడలి మిమ్మందఱ నెల్ల చెలులఁ
జుట్టముల రూపుమాపెదఁ; జుట్టుముట్టి । పలువు రొక్కనితోఁ బోరఁ బాడి యగునె? 84

ప్రతిపదార్థం: మీరు+ఏవురును= మీ అయిదుగురూ; పరివార= సేనా పరివారంతో; బాంధవమిత్రసహితులరు= బంధువులతో, స్నేహితులతో కలిసి ఉన్నవారు; అఖిల+అస్త్రశస్త్రవంతులరు= అన్ని అస్త్రశస్త్రాలను కలిగినవారు కూడాను; కరిస్యందన తురంగ సమేతులరు= ఏనుగులు, తేరులు, గుర్రాలతో కూడి ఉన్నవారు; ఏను+ఒకరుండన్= నే నొక్కడనే; విహీనసహచరత్వంబు= తోడులేనితనం; విగత+ఆయుధత్వంబు= (యుద్ధానికి కావలసినన్ని) ఆయుధాలు లేనితనం = వాహనహీనత= వాహనాలు లేకుండటం; ఒందితిన్= పొందాను; ఏ విధముగన్+అని+ఒనర్పగవచ్చున్?= ఎట్లా యుద్ధం చేయాలి?; అది గాక= అంతే కాదు; పోటులన్= దెబ్బలవలన; కడున్ డస్సితిన్= మిక్కిలి అలసిపోయాను; మీకున్ డప్పి లేదు= మీకు శ్రమ(కూడా) లేదు; వరుసన్= క్రమంగా; ఒక్కడు+ఒక్కండు+ఆ వచ్చి= ఒకడొకడే వచ్చి; పోరుఁడు= యుద్ధం చేయండి; ఇపుడు+అ+వెడలి=

ఇపుడే (ఈ కొలను నుండి వెలువడి) వచ్చి; మిమ్మున్+అందఱన్= మీ అందరినీ; ఎల్ల చెలులన్= స్నేహితులందరినీ; చుట్టములన్= బంధువులను; రూపుమాపెదన్= చంపుతాను; పలువురు= అనేకులు; చుట్టుముట్టి= క్రమ్ముకొని; ఒక్కనితోన్+ పోరన్= ఒక్కడితో యుద్ధం చేయటం; పాడి అగునె?= ధర్మమా?

తాత్పర్యం: మీ ఐదుగురును సేనలతో బంధువులతో ఉన్నవారు, అఖిలాస్త్ర శస్త్రాలతో ఉన్నవారు, ఏనుగులు, రథాలు, గుర్రాలు కలిగినవారు, నేనా ఒక్కడను, సహచరులు, ఆయుధాలు, వాహనాలు లేనివాడిని. నేను ఏ విధంగా మీతో యుద్ధం చేయగలను? అంతేకాక దెబ్బలవలన అలసి ఉన్నాను. మీరు ఏ శ్రమా లేనివారు. ఏ విధంగా ఒక్కడనే మీతో యుద్ధం చేయటం? క్రమంగా ఒకరొక్కరే వచ్చి పోట్లాడండి. ఇపుడే వెలికి వచ్చి మీ అందరితో పోట్లాడి సమిత్రబాంధవంగా చంపుతాను. పెక్కుమంది ఒక్కడితో యుద్ధం చేయటం న్యాయమా?

వ. అట్లు మీరు సాలరేని. 85

ప్రతిపదార్థం: అట్లు మీరు+చాలరేని= ఆ విధంగా మీరు సమర్థులు కాకుంటే.

తాత్పర్యం: దానికి మీకు సామర్థ్యం లేకపోతే. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. తమ్ముల నిన్నుఁ గేశవునితమ్ముని ద్రౌపదియన్నదమ్ములం
గ్రమ్మన గీ టడంచెద నొకండన యే నిదె వచ్చి బాహుద
ర్పమ్మున నిర్లవారమును భానుఁడు దోఁచి సముజ్జ్వలాత్మతే
జమ్మున రూపుమాపు క్రియ; సజ్జత నిల్వుము సుస్థిరుండవై. 86

ప్రతిపదార్థం: తమ్ములన్ నిన్నున్= నిన్నూ నీ తమ్ములను; కేశవుని తమ్మునిన్= సాత్యకినీ; ద్రౌపది అన్నదమ్ములన్= ద్రౌపది అన్ననూ, తమ్ములనూ; గ్రమ్మనన్= వెంటనే; గీటడంచెదన్= నాశనం చేస్తాను(రూపుమాపుతాను); ఏను+ఒకండను+అ= నేనొక్కడనే; ఇదె వచ్చి= ఇదుగో వచ్చినవాడనై; బాహుదర్పమ్మునన్= భుజబలంతో; ఇర్లవారమును= చీకట్ల సమూహాన్ని; భానుఁడు+తోఁచి= సూర్యుడు ఉదయించి; సముజ్జ్వలాత్మతేజమ్మునన్= మిక్కిలి వెలిగేతనకాంతితో; రూపుమాపుక్రియన్= అణగార్చేటట్లు (సూర్యుడు తన వెలుగుతో చీకటిని పోగొట్టినట్లుగా); సుస్థిరుండవై నిల్వుము= సంసిద్ధతతో గట్టిగా నిలబడుము.

తాత్పర్యం: నేనొక్కడనే నిన్నూ, నీ తమ్ములనూ, సాత్యకినీ, ద్రౌపది అన్నదమ్ములనూ రూపుమాపుతాను. ఇదిగో వచ్చి భుజబలంతో సూర్యుడు ఉదయించి నిండైన వెలుగుతో చీకట్ల సముదాయాన్ని రూపుమాపినట్లుగా చంపుతాను. సంసిద్ధతతో, దృఢంగా నిలుపుము.

తే. వినుము నీకుఁ గృష్ణునకును వెఱచి కాదు। ముంద రేనట్టు లాడుట యెందుఁ జెల్లు
సమరధర్మంబు తెఱఁగు దెల్లముగ నెల్ల। వారలకుఁ దెల్పుటకుఁ గాని వసుమతీశ! 87

ప్రతిపదార్థం: వసుమతీశ!= ఓ రాజా!; వినుము; ముందర= ఇంతకు మునుపు; ఏన్+అట్టులు+ఆడుట= నేనావిధంగా మాట్లాడటం; ఎందున్= ఎక్కడనైనా; చెల్లు= సరిపోవునట్టి; సమరధర్మంబు తెఱఁగున్= యుద్ధన్యాయం; ఎల్లవారలకున్= అందరకూ; తెల్లముగన్= స్పష్టంగా; తెల్పుటకున్+కాని= తెలియటానికే గాని; నీకున్ కృష్ణునకును వెఱచి కాదు= నీకూ కృష్ణుడికీ భయపడికాదు.

తాత్పర్యం: ఓ రాజా! వినుము. నీకూ శ్రీకృష్ణుడికీ భయపడికాదు. యుద్ధ నీతిని అందరకూ తెలియచేయటానికే ఇంతవరకు నే నా విధంగా మాట్లాడాను.

వ. నేఁడు మిమ్మందఱ సమయించి భీష్మద్రోణకర్ణభగదత్తబాహ్లికజయద్రథశకునిశల్యాదు లగు బంధుమిత్ర సహాయుల ఋణంబు దీర్చెద' నని పలికినం బాండవాగ్రజుం డి ట్లనియె. 88

ప్రతిపదార్థం: నేఁడు= ఈ దినం; మిమ్ము+అందఱన్ సమయించి= మీ అందరిని చంపి; భీష్మద్రోణకర్ణ భగదత్త బాహ్లిక జయద్రథ శకుని శల్య+ఆదులగు= భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, భగదత్తుడు, బాహ్లికుడు, సైంధవుడు, శకుని, శల్యుడు మొదలైన; బంధుమిత్ర సహాయుల ఋణంబు+తీర్చెదన్= బంధువుల, మిత్రుల, సహాయుల ఋణం తీరుస్తాను; అని పలికినన్= అని మాట్లాడగా; పాండవ+అగ్రజుండు+ఇట్లు+అనియెన్= ధర్మరాజు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ రోజు మీ అందరిని చంపి, భీష్మ ద్రోణ కర్ణ భగదత్త బాహ్లిక జయద్రథ శకుని శల్యాదులయిన బంధుమిత్రుల, సహాయుల ఋణం తీర్చుకొంటాను' అని మాట్లాడిన దుర్యోధనుడితో ధర్మరాజు ఈ విధంగా అన్నాడు:

చ. 'సమరము పాడి నీ వెఱిఁగి శత్రుల గెల్వఁగ నుత్సహించు టొ
ప్పు మనుజనాథ! యొక్కఁడును బూని మహాద్భుతబాహుసంపదన్
మము వడిఁ దాఁకెదం బిలుకు మార్చెద నంట యుదాత్త మైనధై
ర్యమహిమ గాదె! యి ట్లనిన యంతన యే నటు లేల చేసెదన్? 89

ప్రతిపదార్థం: మనుజనాథా!= ఓ రాజా!; సమరము పాడి= యుద్ధనీతి; నీవు+ఎఱిఁగి= నీవు తెలిసికొని; శత్రులన్+గెల్వఁగన్= వైరులను గెలవటానికి; ఉత్సహించుట+ఒప్పున్= ఆసక్తి చూపటం తగును; ఒక్కఁడును పూని= ఒక్కడే ప్రయత్నంతో; మహాద్భుత బాహుసంపదన్= గొప్పగా అబ్బురమును గల్గించే భుజబలంతో; మము వడిన్+తాఁకెదన్= మమ్ము - త్వరగా ఎదిరిస్తాను; పిలుకుమార్చెదన్+అంట= చంపెదననటం; ఉదాత్తమైన ధైర్యమహిమ+కాదె!= గొప్ప ధైర్యశక్తి కదా!; ఇట్లు+అనిన అంతనన్= ఈ విధంగా అన్నమాత్రాన; ఏన్+అటుల+ఏల చేసెదన్?= నే నా విధంగా ఎందుకు చేస్తాను?

తాత్పర్యం: ఓ రాజా!, యుద్ధధర్మాన్ని తెలిసి వైరులను గెలువటానికి నీవు ఆసక్తి చూపటం తగిఉన్నది. నీ వొక్కడివే భుజబలంతో మా అందర నెదుర్కొని చంపెద నంటున్నావు. అది మిక్కిలి గొప్పదే. అంతమాత్రాన నే నా విధంగా ఎందుకు చేస్తాను.

చ. వలసిన యస్త్రశస్త్రములు వాహనముం గొను; మొక్కరుండ నిన్
గలన జయించువాఁ; డతనిగర్వము నీ వడఁగించితేని యీ
యిల సకలంబు గైకొని వహింపుము రాజ్యవిభూతి; వాఁడు నిన్
దలపడి పోరుఁ జుట్టలును దక్కటివారలు నిల్చి చూడఁగన్.' 90

ప్రతిపదార్థం: వలసిన= అవసరమైన; అస్త్ర, శస్త్రములు= మంత్రసహిత బాణాలూ, మంత్రరహితబాణాలూ; వాహనమున్= వాహనాన్నీ; కొనుము= తీసికొమ్ము; నిన్= నిన్ను; ఒక్కరుండు+అ= ఒకడే; కలనన్= యుద్ధంలో; జయించువాఁడు=

జయిస్తాడు; అతని గర్వమున్= ఆతడి పొగరును; ఈవు= నీవు; అడఁగించితి(వి)+ఏని= అణచినట్లయితే; ఈ+ఇల సకలంబు= ఈ భూమి (రాజ్యం) మొత్తం; కైకొని= తీసికొని; రాజ్యవిభూతి= ప్రభుత్వ వైభవం; వహింపుము= పొందుము; వాఁడు= (నీతో ఎదురొడ్డిపోరే) వాడు; చుట్టలును= బంధువులూ; తక్కటివారలున్= మిగిలినవారూ; నిల్చి= నిలబడి; చూడఁగన్= చూస్తూ ఉండగా; నిన్= నిన్ను; తలపడి= ఎదుర్కొని; పోరున్= యుద్ధంచేస్తాడు.

తాత్పర్యం: దుర్యోధనా! నీకు అవసరమైన అస్త్రశస్త్రాలను వాహనాన్నీ తీసికొమ్ము. యుద్ధంలో నిన్ను మా పక్షంనుండి ఒక్కడే ఎదిరిస్తాడు. అతడి గర్వాన్ని నీవు అణచగలిగితే ఈ రాజ్యాన్నంత నీవే గ్రహించి దాని వైభవాన్ని అనుభవించుము. అతడు ఇక్కడి చుట్టాలూ, మిగిలినవారు నిలబడి చూస్తూ ఉండగా నిన్ను ఎదిరించి యుద్ధం చేస్తాడు.

వ. అనిన విని భవన్నందనుండు ధర్మనందనున కి ట్లనియె. 91

ప్రతిపదార్థం: అనినన్= ఇట్లా అనగా; విని; భవత్+నందనుండు= నీ కొడుకు; ధర్మనందనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధర్మరాజు ఇట్లు సమాధానం ఈయగా, దానికి నీ కొడుకు ఈ విధంగా ప్రత్యుత్తర మిచ్చాడు.

చ. 'అరదము లెక్కి ఘోరవివిధాస్త్రచయంబుల మున్ను పోరమే?
నరవర! క్రొత్తచందము రణంబు కరంబు ప్రియంబు సేయు; ని
ష్ఠురగదలం బదాతు లయి శూరతయున్ మహనీయధీరతా
స్ఫురణమునుం బొగడ్త వడఁ బోరుట మే లని నిశ్చయించితిన్. 92

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; అరదములు+ఎక్కి= తేరులమీది కెక్కి; ఘోర= భయంకరమయిన; వివిధ+అస్త్రచయంబులన్= అనేకములయిన అస్త్రములతో; పోరమే?= యుద్ధం చేయలేదా?; క్రొత్తచందము రణంబు= క్రొత్తపద్ధతి యుద్ధం; ప్రియంబు+ చేయున్= ప్రీతికొల్పుతుంది; నిష్ఠుర= కఠినమయిన; గదలన్+పదాతులు+అయి= గదలతో కాల్బంటులై; శూరతయున్= శౌర్యమును; మహనీయ= గొప్పది అయిన; ధీరతాస్ఫురణమునున్= ధైర్యస్ఫూర్తి; పొగడ్త+పడన్= కీర్తనీయం కాగా; పోరుట; మేలు+అని నిశ్చయించితిన్= మంచి దని నిర్ణయించుకొన్నారు.

తాత్పర్యం: 'రథాలమీద' అనేకాస్త్ర శస్త్రాలతో ఇదివరలో భయంకరంగా యుద్ధం చేశాం కదా! ఓ రాజా! ఇప్పుడు క్రొత్త రకమయిన యుద్ధం నాకు సంతోషదాయకం. భయంకరమయిన గదను చేతబూని కాల్బలంవలె నేలపై నిలిచి, మగటిమి, శౌర్యమూ తెలియగా, గొప్పగా యుద్ధం చేయటం మంచి దని నిశ్చయించాను.

తే. వింతకూరలు గుడుపున వేడ్క సేయు । భంగి సంగ్రామమున నూత్నభంగు లెడఁదఁ
గౌతుకము సేయుఁ గావున గద ధరించి । నిను సహోదరులను యోధులను జయింతు.' 93

ప్రతిపదార్థం: వింత కూరలు= అబ్బురమయిన కూరలు; కుడుపునన్= తినుటకు; వేడ్కచేయు= ఆసగొలుపు; భంగిన్= రీతిలో; సంగ్రామమునన్= యుద్ధంలో; నూత్నభంగులు= క్రొత్తపద్ధతులు తెలియగా; ఎడఁదన్= మనసులో; కౌతుకంబు చేయున్= ఆసగొల్పుతాయి; కావునన్= కనుక; గద ధరించి= గదను పూని; నిను సహోదరులను యోధులను జయింతున్= నిన్నూ, తోబుట్టువులనూ, వీరులనూ జయిస్తాను.

తాత్పర్యం: భోజనంలో క్రొత్తకూరలు ఆసక్తి గొలిపే విధంగా యుద్ధంలో క్రొత్త పద్ధతులు హృదయానికి ఉల్లాసం కలిగిస్తాయి. కాబట్టి గదతో నిన్నూ, నీ సోదరులనూ, వీరులనూ జయిస్తాను.'

చ. అనుటయుఁ బొంగి ధర్మసుతుఁ డాతనితో 'గద నొక్కరుండ నేఁ
గొనియెద నీదుప్రాణము లకుంఠితబాహువిలాసభాసి నై'
యనవుడుఁ బుట్ట లోపలి మహాభుజగేంద్రుఁడు రోఁజునట్టు రోఁ
జె నధిప! య వ్విభుండు దనచిత్తము నప్పలుకుల్ గలంచినన్. 94

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అనుటయున్= (దుర్యోధనుడు అట్లా అనగా)అనగా; పొంగి= ఉప్పొంగి; ధర్మసుతుఁడు= ధర్మరాజు; ఆతనితోన్= దుర్యోధనుడితో; గదన్= గదతో; ఒక్కరుండన్= ఒకడినే; అకుంఠిత బాహు విలాసభాసినై= కుంటుపోని భుజశక్తితో ప్రకాశిస్తూ; నీదుప్రాణములు+కొనియెదన్= నీ ప్రాణాలు తీస్తాను; అనవుడున్= అనగా; తన చిత్తమును= తన మనసును; ఆ+పలుకుల్= ఆ ధర్మరాజు మాటలు; కలంచినన్= కలతచెందించగా; ఆ+ విభుఁడు= ఆ దుర్యోధనుడు; పుట్టలోపలి= పుట్టలోఉన్న; మహాభుజగ+ఇంద్రుఁడు= పెనుబాము; రోఁజునట్లు= బుసకొట్టేటట్లుగా; రోఁజెన్= బుసకొట్టాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అనగా ధర్మరాజు ఉప్పొంగి దుర్యోధనునితో గదతో నేనొక్కడనే మొక్కవోని భుజశక్తితో ప్రకాశిస్తూ నీ ప్రాణాలు తీస్తాననగా ఆ మాటలు తన చిత్తాన్ని కలత చెందించగా ఆ దుర్యోధనుడు పుట్టలోని పెనుపాము రోజినట్లుగా రోజినాడు.

విశేషం: అలం: ఉపమ.

దుర్యోధనుఁడు గదామండితుం డై హ్రదంబు వెడలివచ్చుట (సం. 9-31-45)

వ. అట్లు నిశ్వాసంబు నిగుడ నొడలు పొంగఁ బటుకశాఘాతంబునం గెరలు శూకలాశ్వంబుచందంబునఁ గెరలి జలస్తంభం బుడిపికొని మడువు సంక్షోభింప నపహసిత శైలసారోదారంబును గనకపట్టికామండితంబును నైన; గదాదండంబు విపులాంసపీఠంబున నమర్చుకొని వెడలె నట్లు సంరంభవిజృంభితుండై. 95

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; నిశ్వాసంబు= నిట్టూర్పు; నిగుడన్= రాగా; ఒడలు పొంగన్= శరీరం ఉప్పొంగగా; పటుకశాఘాతంబునన్= కటువైన చబుకు దెబ్బతో; కెరలు శూకల+అశ్వంబు చందంబునన్= విజృంభించే పొగరుబోతు గుర్రంవలె; కెరలి= విజృంభించి; జలస్తంభంబు+ఉడిపికొని= నీటిలో ఉన్న(కట్టును) వదలుకొని; మడువు= ఆ నీటిమడుగు; సంక్షోభింపన్= అల్లకల్లోలం కాగా; అపహసిత శైలసార+ఉదారంబును= కొండను పరిహసించే గొప్పదనం కలదియు; కనకపట్టికామండితంబును= బంగారపు పట్టికతో అందమైనదియును; అయిన= అయినట్టి; గదాదండంబు= పొడవగు కాడతో ఉన్న గద; విపుల+అంసపీఠంబునన్= విశాలమయిన భుజంమీద; అమర్చుకొని వెడలెన్= పెట్టుకొని వెడలివచ్చాడు; అట్లు= ఆ విధంగా; సంరంభవిజృంభితుండు+ఐ= అట్టహాసంతో దూకుతున్నవాడై.

తాత్పర్యం: ఆ విధంగా నిట్టూర్పులు వదలుతూ రాగా, ఒడ లుప్పొంగగా, చబుకుదెబ్బయొక్క తీవ్రతతో విజృంభించే పొగరుబోతు గుర్రంమాదిరిగా విజృంభించి, జలస్తంభనస్థితిని వదలివేసి ఆ నీటి మడుగు అల్లకల్లోలం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కాగా, కొండ కాఠిన్యాన్ని ఎగతాళి చేసే గొప్పదనం కలదీ, బంగారుపట్టీతో పొడవుగా ఉన్నదీ అయిన గదాదండాన్ని విస్తృతమైన తన భుజపీఠం మీద పెట్టుకొని దుర్యోధనుడు వెడలివచ్చాడు. ఆ విధంగా అట్టహాసంతో దూకుతున్నవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

తే. గదయుఁ దానును రుచిరశృంగమునఁ బొల్చు। పర్వతము గ్రేణి సేయు నీపట్టిఁ జూచి
కాలదండంబు చేకొని లీలఁ దోఁచు। జమునిఁగా మదిఁ దలఁచిరి జనము లెల్ల. 96

ప్రతిపదార్థం: గదయున్+తానును= తానూ గదయు; రుచిర శృంగరమునన్+పొల్చు= అందమైన శిఖరంతో ఒప్పునట్టి; పర్వతమున్+క్రేణిచేయు= కొండను పరిహాసం చేసే; నీ పట్టిన్+చూచి= నీ కుమారుడిని చూచి; కాలదండంబు చేకొని= కాలదండాన్ని పట్టుకొని; లీలన్+తోఁచు= అలవోకగా కనుపించే; జమునిన్+కాన్= యముడిగా; జనములు+ఎల్లన్= మనుజులంతా; తలఁచిరి= మనసులో భావించారు.

తాత్పర్యం: గదతోపాటు తాను అందమైన శిఖరంతో వెలిగే పర్వతాన్ని పరిహసించే నీ కొడుకును చూచి, జనులందరూ అతడిని కాలదండంతో అవలీలగా తిరిగే యముడిగా భావించారు.

విశేషం: అలం: విషమం. భ్రాంతి (ఉపమేయానికి ఉపమానంకంటె ఆధిక్యం చెప్పబడినందువల్ల అలంకారం విషమం.)

వ. అతనిఁ గనుంగొని పాంచాలురును బాండవులును. 97

ప్రతిపదార్థం: అతనిన్+కనుంగొని= అతడిని చూచి; పాంచాలురును; పాండవులును.

తాత్పర్యం: అతడిని చూచి పాంచాలురూ, పాండవులూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. చిఱుతనగవుతో నొండొరు చేతు లప్ప। ళించి నిర్భరసంతోషలీల నొప్పి;
రమ్మహీనాథుఁ డయ్యపహాస మెఱిఁగి। బొమలు ముడివడఁ గనుఁగవఁ బొడమఁ గెంపు. 98

ప్రతిపదార్థం: చిఱుతనగవుతోన్= చిరునవ్వుతో; ఒండొరుచేతులు= ఒకరొకరి చేతులు; అప్పళించి= చప్పట్లు చరచి; నిర్భర సంతోషలీలన్+ఒప్పిరి= అధికమైన సంతసంతో ఒప్పారు; ఆ+మహీనాథుఁడు= ఆ రాజగు దుర్యోధనుడు; ఆ+అపహాసము+ఎఱిఁగి= ఆ పరిహాసాన్ని తెలిసికొని; బొమలు ముడివడన్= కనుబొమలు సుళ్ళు తిరుగగా; కనుఁగవన్= కనుదోయిలో; కెంపు పొడమన్= కోపం కలుగగా;

తాత్పర్యం: (పాంచాల పాండవులు) చిర్నగవుతో ఒకరొకరు చేతులు చరచి విపరీతమైన సంతోషంతో ఒప్పిఉన్నారు. ఆ దుర్యోధను డా పరిహాసం గ్రహించి కనుబొమలు ముడిపడగా రెండు కన్నులలోను ఎఱ్ఱజీర కలుగగా. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. కోపావేశంబు నొంది యుద్వృత్తతారకంబుల వారల నెల్ల నాలోకించి. 99

ప్రతిపదార్థం: కోప+ఆవేశంబున్+ఒంది= కోపంతో ఉద్వేగపడి; ఉద్వృత్త తారకంబులన్= పైకెత్తబడిన కనుగ్రుడ్లతో; వారలన్+ ఎల్లన్= వారందరినీ; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: కోపోద్వేగంతో పైకెత్తబడిన కనుగ్రుడ్లతో వారందరిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **'ఈ గెలి వే లార్చెద బా । హాగర్వము మెఱయ మిమ్ము నందఱను మహీ**
భాగమునఁ గూల్చి నెఱపెద । నాగద బలు పెట్టు లైన నగుఁ డందాఁకన్. 100

ప్రతిపదార్థం: ఈ గెలివి= ఈ సంతోషం; ఏల?= ఎందుకు?; బాహాగర్వము మెఱయన్= భుజబలం ప్రకాశించగా; అతిశయించగా; మిమ్మున్+అందఱను= మీ అందరినీ; మహీభాగమునన్+కూల్చి= భూమిమీద పడగొట్టి; ఆర్చెదన్= అరుస్తాను; ఎట్టులైనన్= ఏమయినప్పటికిని; నా గద= నా గదయొక్క; బలుపున్= బలమును; నెఱపెదన్= ప్రదర్శిస్తాను; అందాఁకన్= అంతదాక; నగుఁడు= నవ్వండి.

తాత్పర్యం: 'ఈ సంతోషం ఎందుకు? నా భుజబలం మెరయగా మీ అందరినీ భూమిమీద పడగొట్టి నా గద యొక్క బలాన్ని ప్రదర్శింపజేస్తాను. అంతవరకు మాత్రమే మీరంతా నవ్వండి.'

తే. **అనుచుఁ బోటులఁ దొరుఁగు రక్తాంబుధార । లంగమెల్లను గప్పిన నప్పు డొప్పె**
గావిసెలయేఱు లెల్లెడఁ గలయఁ బర్వఁ । బోలుచు కులపర్వతంబు చాడ్పున నతండు. 101

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; పోటులన్= దెబ్బలనుండి; తొరుఁగు= కారుతున్న; రక్త+అంబుధారలు= నెత్తురుచారికలు; అంగము+ఎల్లను కప్పినన్= ఒడలంతా కప్పగా; అప్పుడు= ఆ సమయంలో; కావిసెలయేఱులు= ఎర్రనికొండవాగులు; ఎల్లెడన్ కలయన్+పర్వన్= అన్ని దిక్కులందును (అంతటను) వ్యాపించగా; పొలుచు= ఒప్పు; కులపర్వతంబు చాడ్పునన్= కులపర్వతంవలె; అతండు ఒప్పెన్= ఆ దుర్యోధనుడు భాసించాడు.

తాత్పర్యం: అంటూ దెబ్బల నుండి జాలువారే నెత్తురు చారికలు ఎర్రని కొండవాగులవలె అన్నిదిక్కులకు వ్యాపించగా, కులపర్వతంవలె అతడు ఒప్పారాడు.

విశేషం: అలం: ఉపమ. పర్వతోపమ వలన దుర్యోధనుడి ధైర్యస్థైర్యాలు తెలుస్తున్నాయి.

వ. **అట్లు ఘోరాకారుండై నిలిచి నీ కొడుకు పాండురాజుకొడుకులు బంధుమిత్త్రపరివారసమేతంబుగా నడరి యొక్క పెట్ట తన్నుం బొదువుదు రని శంకించి పాండవాగ్రజుదెసఁ గనుంగొని. 102**

ప్రతిపదార్థం: అట్లు ఘోర+ఆకారుండు+ఐ నిలిచి= ఆ విధంగా భయంకరమూర్తిగా నిలిచి; నీ కొడుకు= నీ కుమారుడు; పాండురాజు కొడుకులు= పాండు కుమారులు; బంధుమిత్ర పరివారసమేతంబుగాన్= బంధువులతోను, స్నేహితులతోను, సేవకులతోను కలసి; అడరి= విజృంభించి; ఒక్కపెట్టన్= ఒక్కుమ్మడిగా; తన్నున్+పొదువుదురు+అని శంకించి= తనను క్రమ్ముకొంటారని అనుమానించి; పాండవ+అగ్రజు+దెసన్+కనుంగొని= ధర్మరాజు దిక్కుచూచి.

తాత్పర్యం: ఆ విధంగా భయంకరాకారుడై నిలిచిన నీ కుమారుడు పాండవులూ, వారి బంధుమిత్రులూ, సేవకులూ, విజృంభించి ఒక్కుమ్మడిగా తనను క్రమ్ముకొంటారని అనుమానించి, ధర్మజుడి దెస చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'రండిట యొక్కఁ డొక్కఁడ దురం బొనరింపఁగ; మీరు పల్వు రొ
క్కండను నేను; హేతిహతకాయత డస్సినవాఁడ' నన్న నా
తం 'డభిమన్యు బాలుని నధర్మతఁ బ్రౌఢు లనేకయోధు లొ
క్కండన కెట్లు చంపి? రటు గాఁ గొను మిబ్బవరంబు'నావుడున్. 103

ప్రతిపదార్థం: రండు+ఇట= ఇటురండి; ఒక్కఁడు+ఒక్కఁడ= ఒకడొక్కడే; దురంబు+ఒనరింపఁగన్= యుద్ధం చేయటానికి; మీరు పల్వురు= మీరు చాలామంది; ఒక్కండను నేను= నే నొక్కడనే; హేతిహత కాయతన్= కత్తిదెబ్బలు కల దేహంతో; డస్సినవాఁడన్= అలసినవాడను; అన్నన్= అనగా; ఆతండు= ఆ ధర్మరాజు; బాలునిన్= పసివాడిని; అభిమన్యున్= అభిమన్యుడిని; అధర్మతన్= అన్యాయంగా; ప్రౌఢులు= నేర్పరులు; అనేకయోధులు= చాలామంది వీరులు; ఒక్కండు+అనక= ఒక్కడేఅని తలచకుండా; ఎట్లు చంపిరి?= ఏ విధంగా చంపారు; ఈ+బవరంబున్= ఈ యుద్ధంలో కూడ; అటుగాన్= ఆ విధంగానే; కొనుము= తీసికొనుము.

తాత్పర్యం: దుర్యోధనుడు ధర్మరాజుతో 'ఒకరొక్కరే యుద్ధానికి ఇటు రండి. మీ రనేకులు నే నొక్కడనే. కత్తివ్రేటులతో చాలా అలసిపోయాను.' అనగా ధర్మరాజు అభిమన్యుని 'పసివాడని ఎంచకుండా ప్రౌఢులైన మీ రనేకులు యోధవరులు ఏ విధంగా చంపారు? ఇపు డీ యుద్ధం కూడా అటులే అనుకొనుము' అని అనగా.

వ. నిరుత్తరుం డై యున్న భవత్తనయున కా ధర్మతనయుం డిట్లనియె. 104

ప్రతిపదార్థం: నిరుత్తరుండు+ఐ+ఉన్న= బదులు చెప్ప జాలకఉన్న; భవత్+తనయునకున్= నీ కుమారుడితో; ఆ ధర్మతనయుండు+ఇట్లు+అనియెన్= ఆ ధర్మరాజు ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: మారు పలుకలేక నిలిచిఉన్న నీ కొడుకుతో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. 'ఏ నట్లు సూపి చెప్పితిఁ । గాని యది రణంబుపాడి గామి యెఱుఁగుదున్;
రా నీను నీదుపయి మ । త్సైనికులను వెఱవ కాయితము గమ్ము నృపా! 105

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; ఏను+అట్లు చూపి చెప్పితిన్కాని= నేనా విధంగా ఎత్తి చూపి చెప్పాను గాని; రణంబుపాడి= యుద్ధధర్మం; అది కామి= అది కాకపోవటం; ఎఱుఁగుదున్= తెలిసినవాడను; మత్+సైనికులను= నా సేనలను; నీదుపయిన్= నీ మీదకు; రానీను= రానియ్యను; వెఱవక= భయపడక; ఆయితము+కమ్ము= సిద్ధపడుము.

తాత్పర్యం: 'నే నా విధంగా ఎత్తి చూపాను. కానీ యుద్ధధర్మం అది కాదని నాకు తెలుసు. నా సేనను నీమీదకు రానీయను. భయపడకుండా సిద్ధం కమ్ము.

క. తల సక్క ముడిచికొని ద్రిం । డలవడ బంధించి పోరి కమరి నిలువు; నీ
వలచిన యట్టివ యిచ్చెద । నలఘుశిరస్త్రాణ కంకటాదులు నెమ్మిన్. 106

ప్రతిపదార్థం: తల+చక్కముడిచికొని= తలను బాగా కట్టుకొని(జుట్టును ముడివేసికొని); ద్రిండు+అలవడన్ బంధించి= తల వెనుక (మెత్తదనమునకై) దిండొక దానిని కట్టుకొని; పోరికిన్= యుద్ధానికి; అమరి నిలువు= బాగా నిలబడుము; నీ వలచిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యట్టివ= నీవు ఇష్టపడినవాటినే; అలఘు= పెద్దవి అయిన; శిరస్త్రాణ కంకట+ఆదులు నెమ్మిన్= తలకును ఒంటికినీ రక్షలైన కవచాదులను; నెమ్మిన్= ప్రీతితో; ఇచ్చెదన్= ఇస్తాను;

తాత్పర్యం: తల జడను బాగా కట్టుకొని, తలక్రింద దిండును కట్టుకొని యుద్ధానికి వచ్చి నిలువుము. నీకు నచ్చిన వాటిని తలకు ఒంటికి సరిపడే కవచాలను ఇస్తాను.

వ. మఱియు నొక్క తెఱంగు నీమనంబున మెచ్చును నచ్చెరువును నెలకొనం బలికెద; నాకర్ణింపుము. 107

ప్రతిపదార్థం: మఱియున్+ఒక్క తెఱంగు= ఇంకొక విధం; నీ మనంబునన్= నీ మనసుతో; మెచ్చును+అచ్చెరువును; మెప్పు. ఆశ్చర్యమూ; నెలకొనన్= కుదురుకొనే విధంగా; పలికెదన్= మాటాడుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇంకొక విధం నీ మనసులో మెప్పు, ఆశ్చర్యం కుదిరేటట్లుగా మాటాడుతాను. వినుము.

తే. ఏఱికొను మీవు నొకని మాయేవురందు; । వాఁడు నీతోడ గదఁ బోరువాఁడు; వానిఁ
జంపి మహి యేలు; వానిచేఁ జచ్చి త్రిదివ । సౌఖ్య మొందుము; చేసితి సమయ మేను.' 108

ప్రతిపదార్థం: మా ఏవురు+అందున్+ఒకనిన్= మా అయిదురుగురితో ఒకడినిని; ఈవున్+ఏఱికొనుము= నీవు ఎంచుకొనుము; వాఁడు= అతడు; నీతోడన్= నీతో; గదన్+పోరుఁవాడు= గదతో యుద్ధం చేయగలడు; వానిన్= ఆతడిని; చంపి= నాశనంచేసి; మహి+ఏలు(ము)= భూమిని పాలించుము(లేదా); వానిచేన్+చచ్చి= ఆతడిచేతలో చనిపోయి; త్రిదివసౌఖ్యము= స్వర్గసౌఖ్యమును; ఒందుము= పొందుము; ఏను+సమయము+చేసితిన్= నేను ప్రమాణం చేస్తున్నాను.

తాత్పర్యం: మా ఐదుగురిలో ఒకడిని ఎన్నుకొనుము. వాడు నీతో యుద్ధం చేస్తాడు. వాడిని చంపి మొత్తం రాజ్యాన్ని ఏలుకొనుము. (లేదా) వాడివలన చచ్చి దేవలోకసుఖాన్ని పొందుము. నే నీ ప్రతిజ్ఞ చేస్తున్నాను.'

వ. అని పలికి యుజ్జ్వల వివిధవర్మంబు లాతని ముందటం బెట్టించి. 109

ప్రతిపదార్థం: అని పలికి= అని మాటాడి; ఉజ్జ్వల= కాంతిమంతాలైన; వివిధ వర్మంబులు= నానా విధాలయిన కవచాలను; వానిముందటన్+పెట్టించి= ఆ దుర్యోధనుడి ముందుంచి.

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా మాట్లాడి, కాంతిమంతాలయిన అనేక కవచాలను అతడి ముందు పెట్టించి.

క. 'విను జీవముతో నిన్నుం । జననిచ్చుట యొండు దక్క సమరంబున గో
రినయది నీ కొసఁగెద; నిం । తన చెడియెనె యకట! యన్నదమ్ముల కూర్ములే?' 110

ప్రతిపదార్థం: విను; నిన్నున్= నిన్ను; జీవముతోన్= ప్రాణాలతో; చనన్+ఇచ్చుట= పోనీయటం; ఒండు= ఒకటి; తక్కన్= తప్ప; సమరంబునన్= యుద్ధంలో; కోరిన+అది= కోరుకొన్నది; నీకున్+ఒసఁగెదన్= నీ కిస్తాను; అన్నదమ్ముల కూర్ముల్= అన్నదమ్ములకుండే అభిమానాలు; అకట!= అయ్యో!; ఇంతన చెడియెనె?= ఈ మాత్రానికే చెడిపోయాయా?

తాత్పర్యం: 'వినుము. నిన్ను ప్రాణాలతో పోనీయటం తప్ప (ఈ) యుద్ధంలో నీ కోరినవన్నీ ఇస్తాను. ఇంతమాత్రాన అన్నదమ్ముల కున్న బంధుత్వం నశించినదా?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని నీతనయుం 'డిట్లు కాక నీవు నా కలిగెదవే?' యని కనకచిత్రితంబులగు శిరస్త్రాణకంకటంబులు గైకొని ధరియించి కాంచనాచలంబు ననుకరించుచు గద చేత నమర్చి పాండవాగ్రజుం గనుంగొని.111

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విన్నవాడై; నీతనయుండు= నీకుమారుడు; ఇట్లు+అ కాక= ఇంతే కాక; నీవు నాకున్+అలిగెదవే?= నా మీద నీవు కోపగిస్తావా?; అని= అంటూ; కనక చిత్రితంబులు+అగు= బంగారు తొడిగిన; శిరస్త్రాణ కంకటంబులు కైకొని= తలకు, ఒడలికి కవచాలు తీసికొని; ధరియించి= వేసికొని; కాంచనాచలంబున్= మేరుపర్వతమును (బంగారు కొండను); అనుకరించుచున్= పోలి; గద చేతన్+అమర్చి= గదను చేతబట్టుకొని; పాండవాగ్రజున్+కనుంగొని= ధర్మరాజును చూచి.

తాత్పర్యం: అంతట నీ కుమారుడు 'అటులే! నీవు నాపై కోపగిస్తావా?' (కోపగించవు అని తెలుసు) అని బంగారుమయమయిన కవచాలను తలకూ శరీరానికీ వేసికొని మేరుపర్వతమును తలపిస్తూ గద చేతబూని ధర్మజుడిని చూచి.

సీ. 'కవలలో నొకఁ డొండె, గాండివి యొండె, వృ। కోదరుఁ డొండె, నీ వొండెఁ జేత
గద గొని యెక్కటికయ్యంబునకుఁ బూని। యేర్పడ నిలిచిన, నీ క్షణంబ
సమయంగఁ జూచెద; గ్రమమున మీ రెల్ల। నొకఁ డొక్కఁ డేతేరఁ బ్రకటబాహు
దర్పంబు వొగడొంద ధరఁ గూల ద్రేయుచు। వచ్చెద; మఱియు నీవారిలోన

తే. నలిగి యెవఁడు దాఁకిన నట్ల నాదు। గదకు నెరసేసి పేర్చెదఁ; గడు గదార
ణంబు నాతోడఁ జేయ మన్మథహరుండు। గడఁగ లేఁడు; మీ కెందుఁ బోఁ గలదు నేఁడు?' 112

ప్రతిపదార్థం: కవలలోన్+ఒకఁడు= నకుల సహదేవులలో ఒకడు; ఒండెన్= లేదా; గాండివి= అర్జునుడు; ఒండెన్= లేదా; వృకోదరుఁడు= భీముడు; ఒండెన్= లేదా; నీవు+ఒండెన్= నీవైనా కాని; చేతన్గదన్+కొని= గదను తీసికొని; ఎక్కటికయ్యంబునకున్= ఒక్కడుగా యుద్ధానికి; పూని= సన్నద్ధమై; ఏర్పడన్+నిలిచినన్= స్పష్టంగా నిలిచినట్లయితే; ఈ క్షణంబు+అ= ఇప్పుడే; సమయంగన్+చూచెదన్= చచ్చునట్లు చూస్తాను; క్రమమునన్= వరుసగా; మీరు+ఎల్లన్= మీరంతా; ఒకఁడు+ఒక్కఁడు+ఏతేరన్= ఒక్కొక్కడుగా రాగా; ప్రకట బాహుదర్పంబు= స్పష్టమయిన భుజబలం; పొగడు+ఒందన్= కీర్తనీయం కాగా; ధరన్= భూమిపై; కూలద్రేయుచున్ వచ్చెదన్= పడద్రోస్తూ వస్తాను; మఱియున్= ఇంకను; నీవారిలోనన్= నీ మనుష్యులలో; అలిగి= కోపంతో; ఎవ్వఁడు తాఁకినన్= ఎవ డెదుర్కొనప్పటికినీ; ఎర+చేసి= ఆ విధంగానే గదకు ఆహారం చేసి; కడున్= మిక్కిలి; పేర్చెదన్= అతిశయిస్తాను; గదారణంబున్= గదాయుద్ధాన్ని; నాతోడన్= నాతో; చేయన్= చేయగా; మన్మథహరుండు= ఈశ్వరుడు; కడఁగన్ లేఁడు= పూనుకొనలేడు; నేఁడు= ఈనాడు; మీకున్+ఎందున్ పోన్+కలదు?= మీ రెక్కడికి బోగలరు?

తాత్పర్యం: 'నకుల సహదేవులం దొకడు గానీ, అర్జునుడు కానీ, భీముడు కానీ, లేక నీవో - ఈ క్షణమే గద చేబూని ద్వంద్వయుద్ధానికి సిద్ధమైతే మీ చావును చూస్తాను. మీరంతా ఒక డొక్కడుగా వచ్చినట్లయితే నా భుజబలగర్వంతో భూమిమీద పడగొట్టుతాను. అంతేకాదు. నీ వాళ్ళలో ఎవరు వచ్చినా నా గదకు ఆహారంగా చేస్తాను. నాతో గదాయుద్ధానికి ఈశ్వరుడు కూడా సాహసించడు. ఇక మీరు నే డెక్కడికి పోగలరు?'

విశేషం: అలం: కావ్యార్థాపత్తి.

వ. ఇవ్విధంబున దుర్యోధనుం డుద్ధతుం డై మఱియుం బెద్ద యెలుంగునఁ బలుకుచుండ నతండు వినకుండఁ బద్మనాభుండు పాండవాగ్రజున కిట్లనియె. 113

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; దుర్యోధనుండు+ఉద్ధతుండు+ఐ= దుర్యోధనుడు గర్వించినవాడై; మఱియున్+ పెద్దఎలుంగునన్= ఇంకాపెద్దగొంతుతో; పలుకుచుండన్= మాట్లాడుతూ ఉండగా; అతండు= దుర్యోధనుడు; వినకుండన్= వినకుండే విధంగా; పద్మనాభుండు= శ్రీకృష్ణుడు; పాండవ+అగ్రజునకున్+ఇట్లనియెన్= ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధను డీవిధంగా గర్వించి మాట్లాడుతూ మరింత పెద్ద గొంతుతో పలుకసాగాడు. అతడికి వినబడనట్లుగా శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు:

చ. 'ఇతఁడు గదారణంబునకు నీ కొలఁదిన్ నినుఁ బిల్చినన్ మరు
త్పతిసుతుఁ గోరినం జిఱుతతమ్ములలో నొకనిన్ వరించినన్
మతిసెడిరొక్కొవీర? లనుమాటకుఁ బాత్రము గామె? సాహసం
బుతఱియె? మేదినీశ! యిది బుద్ధి దొఱంగి తనుగ్రహంబునన్. 114

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ దుర్యోధనుడు; గదారణంబునకున్= గదాయుద్ధానికి; కొలఁదిన్= ఇంతగా; నినున్ పిల్చినన్= నిన్ను పిలచినప్పటికిని; మరుత్పతిసుతున్+కోరినన్= దేవరాజసూను డయిన అర్జునుడిని ఆహ్వానించినప్పటికినీ; చిఱుత తమ్ములలోన్+ఒకనిన్= చిన్న తమ్ములైన నకుల సహదేవులలో ఒకడిని; వరించినన్= కోరినప్పటికినీ; వీరలు= ఈ పాండవులు; మతి+చెడిరి+ఒక్కొ?= మతి పోగొట్టుకొన్నారా?; అనుమాటకున్= అనే మాటకు; పాత్రను కామె?= పాత్రమగుదుము కదా!; సాహసంబు తఱియె?= సాహసించటానికి సమయమా?; మేదినీశ!= ఓ రాజా!(ధర్మజా!); ఇది= ఇట్టి చేష్ట; అనుగ్రహంబునన్= దయవలన; బుద్ధి తొఱంగితి(వి)= తెలివిని విడిచిపెట్టావు.

తాత్పర్యం: 'ఈ దుర్యోధనుడు గదాయుద్ధానికి ఇంతగా నిన్ను, అర్జునుడూ, నకులుడూ, సహదేవుడూ, వీరిలో ఒకరిని పిలిస్తే బుద్ధి చెడి పాండవులు దీని కొప్పుకొన్నారనే మాట వస్తుంది కదా! ఎక్కువదయ చూపటంలో తెలివిని విడిచావు.

చ. ఒకరునిఁ జంపితేని సకలోర్వియుఁ గైకొను మంట నీవు మున్
శకునికి మాయజూదమున సంపద లెల్లఁ ద్రయోదశాబ్దభో
గ్యకృతి నమర్చి యొడ్డి నటు లైనది పందెపుఁగయ్య మయ్యె శ
త్రుకులము నెల్ల దుఃఖపడి త్రుంచుట దాఁ దుదిఁ బందెమాడనే? 115

ప్రతిపదార్థం: ఒకరునిన్= ఒక్కడిని; చంపితి(వి)+ఏని= చంపినట్లయితే; సకల+ఉర్వియున్+కైకొనుము+అంట= భూమినంతను తీసికొనుమనటం; నీవు; మున్= ఇదివరకు; శకునికిన్; మాయజూదమునన్= మోసపూరిత మయిన జూదంలో; సంపదలు+ఎల్లన్= ఐశ్వర్యమంతటినీ; త్రయోదశ+అబ్ద= పదమూడేండ్లు; భోగ్యకృతిన్+అమర్చి= అనుభవించుకొనే పద్ధతిని సిద్ధం చేసి; ఒడ్డినటులు+ ఐనది= పందముగా పెట్టినట్టైనది; పందెపున్+కయ్యము+అయ్యెన్= పందెమునకై యుద్ధమయింది; శత్రుకులమున్+ఎల్లన్= వైరికులమునంతటినీ; దుఃఖపడి త్రుంచుట= కష్టపడి చంపుట; తాన్= అది; తుదిన్= తుదకు; పందెము+ఆడనే?= పందె మాడటానికా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ ధర్మజా! ఒకడిని చంపితే భూమినంతనూ తీసికొనుమని చెప్పటం - ఇదివరకు నీవు మాయాజూదంలో శకునికి సంపదనంతనూ పదమూడేండ్లు అనుభవించటానికి సమర్పించినట్లు ఐనది. పందెపు జగడంగా తయారయింది. కష్టపడి వైరులను సంహరించటం - తుదకు పందెమాడటానికా?

చ. నరవర! యెక్క టెక్కటి పెనంగఁగ భీముని నైనఁ బన్పఁ గా
దరయఁగ భీముకంటె గదయందలి కౌశల మెక్కు డీ మహీ
శ్వరునకు; భీముమేన బలసంపద మిక్కిలి; దానఁ బోవునే?
వెరవునఁ గోలుపోదె భుజవీర్యము? పోరుల నెందుఁ జూడమే?' 116

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; ఎక్కటి+ఎక్కటి పెనంగన్= ఒకరితో ఒక్కరే యుద్ధం చేయగా; భీమునిన్+ఐనన్= భీముడిని కూడా; పన్పన్+కాదు= పంపకూడదు; అరయఁగన్= పరిశీలించగా; ఈ మహీశ్వరునకున్= ఈ రాజునకు; భీముకంటెన్= భీముడికన్నను; గదయందలి కౌశలము+ఎక్కుడు= గదావిద్యయందలి నేర్పరితనం ఎక్కువ; భీముమేనన్= భీముడి శరీరంలో; బలసంపద మిక్కిలి= బలసంపద ఎక్కువ; దానన్+పోవునే?= అంతమాత్రాన సరిపోతుందా!; వెరవునన్= ఉపాయంతో; భుజవీర్యము= భుజబలం; కోలుపోదె= ఓడిపోదా?; పోరులన్+ఎందున్+చూడమే?= యుద్ధాలనెక్కడైనా చూడమా?

తాత్పర్యం: ఓ రాజా! ఒక్కరొక్కరుగా యుద్ధం చేయటానికి భీముడిని కూడా పంపరాదు. ఎందుకంటే ఈ మహారాజుకు గదావిద్యయందు నేర్పు ఎక్కువ. భీముడికి శరీరబల మెక్కువ. అంతమాత్రాన సరిపోతుందా? ఉపాయానికి ముందు భుజబలం వీగిపోవటం మనం యుద్ధాలలో చూస్తున్నాము కదా!'

వ. అనిన విని మహాబలనందనుండు వసుదేవనందనున కిట్లనియె. 117

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విని; మహాబలనందనుండు= భీమసేనుడు; వసుదేవనందనునకున్+ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని భీముడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

శ్రీకృష్ణుఁడు భీము నగ్గించి దుర్యోధనుతోడి గదాయుద్ధమునకుఁ బనుచుట (సం. 9-32-15)

మ. 'గద నా చేతికి వచ్చినప్పుడు మహోగ్రక్రీడమై లోకము
ల్పదునాల్గున్ సమయింతుఁ బో మ్మను సముల్లాసంబు న న్నొందు; దు
ర్మదసంరంభ వికత్థనుం డయిన కౌరవ్యాధముం డెట్లు నా
కెదు రై ప్రాణముతోడఁ బోవు? నృపు నిట్లే లొత్తె దీమాత్రకున్? 118

ప్రతిపదార్థం: గద నాచేతికిన్ వచ్చిన+అప్పుడు= నా చేతిలో గద ఉన్నపుడు (అనగా ధరించినపుడు); మహా+ఉగ్రక్రీడమైన్= మిక్కిలి భయంకరమైన ఆటతో; లోకముల్ పదునాల్గున్= పదునాల్గు లోకాలను; సమయింతున్+పొమ్ము= నిశ్చయంగా సంహరిస్తాను పోవయ్యా! (అని పరిహాసంగా); అను సముల్లాసంబు= అనే ఉత్సాహం; నన్నున్+ఒందున్= నాకు కలుగుతుంది; దుర్మదసంరంభ= దురహంకారంతో; వికత్థనుండు+అయిన= ఆత్మస్తుతి పరుడయిన; కౌరవ్య+అధముండు= కౌరవులలో నీచుడు; ఎట్లు= ఏ విధంగా; ఎదురై= ఎదుర్కొని; ప్రాణముతోడన్+పోవున్= బ్రతికిపోతాడు?; ఈ మాత్రకున్= ఇంత మాత్రానికే; నృపున్= ధర్మరాజును; ఇట్లు= ఈ విధంగా; ఏల+ఒత్తెదు?= ఎందుకు నిష్ఠురంగా మాటాడుతావు?

తాత్పర్యం: నా చేతిలో గద ఉండగా పదునాల్గులోకాలు ఎదురయినా ఆటవలె భయంకరంగా నిశ్చయంగా సంహరిస్తాను. దురహంకారంతో ఆత్మస్తుతి నున్న నీచ దుర్యోధనుడు నాకంట బడి ప్రాణాలతో పోగలడా? ఎందుకయ్యా ఇంతమాత్రానికే ధర్మరాజును నీవు వ్యర్థంగా మాట్లాడుతావు?

విశేషం: పొమ్ము - నిశ్చయార్థకం.

తే. వాని గద భారమునకు నొవ్వకయు నాదు । పటుగదాదండ ముద్దండ బాహుదర్ప
లీల విలసిల్ల వ్రేయుదు నేలఁ గూల । సంతసముతోడి మెచ్చు పుట్టింతు నీకు.' 119

ప్రతిపదార్థం: వాని గదభారమునకున్= ఆ దుర్యోధనుడి గదయొక్క బరువుకు; నొవ్వకయున్= బాధపడకుండా; నాదు పటుగదాదండము; ఉద్దండబాహుదర్పలీలన్= భయంకరభుజబలక్రీడతో; విలసిల్లి= ఒప్పి; నేలన్+కూలవ్రేయుదున్= భూమిమీద పడద్రోసెదను; నీకున్; సంతసముతోడి= ఆనందంతో కూడిన; మెచ్చు= మెప్పు; పుట్టింతున్= కలిగిస్తాను.

తాత్పర్యం: (ఓ కృష్ణా!) ఆ దుర్యోధనుడి గదాభారానికి బాధపడకుండా భయంకర మైన నా భుజబలక్రీడతో ఒప్పి, అతడిని నేలగూలవేస్తాను. నీకు సంతోషంతో కూడిన మెప్పును కల్గిస్తాను.'

వ. అనుటయు నచ్యుతుండు ప్రియం బెసంగ నాకిమ్మీరమర్దను మొగంబునఁ జూడ్కి నిలిపి. 120

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; ప్రియంబు+ఎసంగన్= ప్రీతి కలుగగా; ఆ కిమ్మీరమర్దను మొగంబునన్= కిమ్మీరు డనే రాక్షసుడిని చంపిన ఆ భీముడి ముఖంపై; చూడ్కినిలిపి= చూపు నిలిపి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ప్రేమాతిశయంగా కిమ్మీరుడిని చంపిన భీముడి మొగమున ప్రీతి కలుగగా చూచినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. 'బకవిధ్వంసన మాచరించితి; హిడింబప్రాణముల్ గొంటి కీ
చకనిర్మూలనకేలి సల్పితి జరాసంధాంగక స్వైర భం
జకలీలన్ విలసిల్లి తీ వవి మనుష్యస్ఫూర్తి మాత్రంబులే?
యొక మర్త్యుం డెదు రెట్లు నీకు? మది నే నూహింప కి ట్లాడితిన్. 121

ప్రతిపదార్థం: ఈవు= నీవు; బక విధ్వంసనము+ఆచరించితి(వి)= బకు డనే వానిని సంహరించావు; హిడింబ ప్రాణముల్+ కొంటి(వి)= హిడింబాసురుడి ప్రాణాలను తీశావు; కీచక నిర్మూలన కేలి+చల్పితి(వి)= కీచకులను మొత్తంగా నాశం చేశావు; జరాసంధ= జరాసంధుడి; అంగకస్వైర భంజకలీలన్ విలసిల్లితి(వి)= శరీరాంగాలను స్వైరంగా విరిచే ఆటలో ప్రకాశించావు; అవి= ఆయా పనులు; మనుష్యస్ఫూర్తి= మానవుడి ప్రజ్ఞ; మాత్రంబులే?= అంతమాత్రమేనా?; నీకున్; ఒక మర్త్యుండు= ఒకానొక మానవుడు; ఎదురు+ఎట్లు?= ఎదురై ఏ విధంగా ఉండగలడు?; మదిలోన్= మనసులో; ఊహింపక= యోచన సేయకుండ; ఇట్లు+ఆడితిన్= ఈ విధంగా అన్నాను.

తాత్పర్యం: 'బకుడిని నాశం చేశావు. హిడింబాసురుడిని సంహరించావు. జరాసంధుడిని శరీరభాగాలు స్వేచ్ఛగా విరిచి జయించావు. సామాన్య మానవుడు చేయగలిగిన పను లేనా ఇవి! మనుష్యులలో ఒకడు నీకు సాటియా? యోచించక ఇట్లా అన్నాను.

క. **కాళింగాదిక్షోణీ । పాలుర నున్మదమహాద్విపప్రకరములన్**
నేల నిడి కాలఁ జమరితి । వాలిన కురునృపకుమార వర్గంబులతోన్.' 122

ప్రతిపదార్థం: కాళింగ+ఆది క్షోణీపాలురన్= కాళింగుడు మొదలైన రాజులను; ఉన్మద మహాద్విప ప్రకరములన్= మిక్కిలి మత్తిల్లిన ఏనుగుల సమూహములను; నేలన్+ఇడి= భూమిపైన ఉంచి(పడద్రోసి); వాలిన= అతిశయించిన; కురునృప కుమారవర్గంబులతోన్= కురు రాజకుమార సమూహాలతో; కాలన్+చమరితి(వి)= కాలితో నలగగొట్టావు.

తాత్పర్యం: కాళింగాది రాజులను, కురురాజ కుమారులను మత్తిల్లిన ఏనుగుల గుంపును నేలద్రోసి కాలితో నలియద్రొక్కావు.

వ. **అని పలికి కురుపతిదెసఁ గటాక్షవీక్షణంబు నిగుడ వెండియు.** 123

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; కురుపతిదెసన్= దుర్యోధనుడి దిక్కునకు; కటాక్షవీక్షణంబు= కడకంటి చూపులు; నిగుడన్= వ్యాపించగా; వెండియున్= మరల.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు పలికి, దుర్యోధనుడివైపు కడగంటి చూపు సారించి, మరల భీముడితో ఇట్లా అన్నాడు.

తే. **'వాలి దుశ్శాసనుని ఱొమ్ము వ్రయ్యఁ జీరి । నీవు నెత్తురు ద్రావంగ నిన్ను నతఁడు**
సూచుచుండియు వెఱసొచ్చి స్రుక్కెఁగాక । కవియఁజాలెనె నీపయిఁ బవనతనయ? 124

ప్రతిపదార్థం: పవనతనయ!= ఓ వాయుపుత్రా! (భీమసేనా!); వాలి= విజృంభించి; దుశ్శాసనుని ఱొమ్ము= దుశ్శాసనుడి రొమ్మును; వ్రయ్యన్+చీరి= పగిలేటట్లు చీల్చి; నీవు నెత్తురు త్రావంగన్= నీవు నెత్తురు త్రాగగా; అతఁడు= ఆ దుర్యోధనుడు; నిన్నున్= నిన్ను; చూచుచుండియున్= చూస్తున్నప్పటికినీ; వెఱన్+చొచ్చి= భయపడి; స్రుక్కెన్+కాక= (భయంతో) అణగినాడుగాని; నీ పయిన్+కవయన్+చాలెనె?= నీ మీదకు క్రమ్ముకొన గల్గాడా?

తాత్పర్యం: '(నీవు) విజృంభించి దుశ్శాసనుడి రొమ్మును చీల్చి అతడి నెత్తురును త్రాగినపుడు చూస్తూ ఉన్నప్పటికినీ భయంతో అణగి, ముడుచుకొని ఉన్నాడు. కాని నీమీదకు ఈ దుర్యోధనుడు దాడి చేయగలిగాడా?

చ. **అగపడి కచ్చువెట్టి యితఁ డాడినమాటల కిప్డు బల్లిదుం**
డుగఁ గొని యేను బల్వురుఁ గడు న్వడి నీతనిఁ జంపకుండ నే
మిగ సమయంబు సేసి తిది మేలొకొ? యంటి నృపాలుతోడ నీ
మగఁటిమి చందముల్ దలఁచి మారుతనందన! యూఱడిల్లితిన్. 125

ప్రతిపదార్థం: మారుతనందన!= వాయునందనా!; అగపడి= వశపడి; కచ్చు+పెట్టి= గర్వంతో; ఇతఁడు+ఆడిన మాటలకున్= ఇతడు మాట్లాడిన మాటలకు; ఇప్డు= ఈ సమయంలో; బల్లిదుండుగన్+కొని= బలవంతుడుగా లెక్కచేసి; ఏను; పల్వురున్= చాలమంది; కడున్+వడిన్= మిక్కిలి వేగంగా; వీనిన్+చంపకుండన్= చంపకుండ ఉండేటట్లు; ఏమిగ+సమయంబు+చేసితి(వి)?= ఏమని ప్రతిజ్ఞ చేశావు?; ఇది మేలు+ఒకొ?= ఇది మంచిదేనా అని?; నృపాలు తోడన్= ధర్మరాజుతో; అంటిన్; నీ మగఁటిమి చందముల్= నీ బలముయొక్క విధములు; తలఁచి= తలచుకొని; ఊఱడిల్లితిన్= ఊరటచెందాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: భీమసేనా! గర్వంతో ఈ దుర్యోధనుడు ఆడిన మాటలకు అతడిని బలవంతుడిగా పరిగణించి, ధర్మరాజుతో 'అందరూ వెంటనే వేగంగా వీడిని చంపకుండా ఏమని ప్రతిజ్ఞ చేశావు?' అన్నాను. అయితే, నీ శౌర్యాన్ని జ్ఞాపకం చేసికొని ఊరట చెందాను.

చ. తులువతనంబునన్ సభకు ద్రోపది ముందల వట్టి యీడ్చి య
ట్లలఁపఁగఁ జూచి నీవు దగ నాడిన రెండు దెఱంగులందుఁ బెం
పొలయఁగ దుస్ససేనుపని యొక్కటి దీర్చితి; తీర్పు మింక బా
హుల కసివోవ వీనిపనియుం ద్వరితక్రమవిక్రమంబునన్. 126

ప్రతిపదార్థం: తులువతనంబునన్= తుంటరితనంతో; సభకున్= సభలోనికి; ద్రోపదిన్= ద్రౌపదిని; ముందల(ముందు+తల)+ పట్టి= జుట్టుపట్టుకొని; ఈడ్చి= లాగి; అట్లు= ఆ మాదిరిగా; అలఁపఁగన్= బాధించగా; చూచి= చూచిన; నీవు (ఓ భీమసేనా నీవు); తగన్= తగినట్లు; ఆడిన రెండు తెఱంగుల+అందున్= చెప్పిన రెండు విధాలలో; పెంపు+ఒలయఁగన్= గొప్పదనం తెలియగా; దుస్ససేను పని+ఒక్కటి= దుశ్శాసనుడి పని ఒక్కటి - మొదటిదానిని; తీర్చితి(వి)= తీర్చుకొన్నావు(సంహరించావు); ఇంకన్= ఇక పోగా; బాహుల కసి+పోవన్= భుజాల కసి తీరేటట్లుగా; వీని పనియున్= ఈ దుర్యోధనుడి పనినికూడా(అనగా చంపటం); త్వరితక్రమ విక్రమంబునన్= తొందరగా క్రమవిజృంభణంతో; తీర్పుము= నెరవేర్చుము.

తాత్పర్యం: తుంటరితనంతో సభలో ద్రౌపది ముందరి జుట్టును పట్టుకొని లాగి, ఆ విధంగా బాధించగా చూచిన నీవు చేసిన ప్రతిజ్ఞలలో రెండింటిలో మొదటిదానిని దుశ్శాసనుడిని చంపి తీర్చుకొన్నావు. ఇక పోగా భుజాల తీట తీరేటట్లుగా ఈ దుర్యోధనుడి పనిని కూడా తీర్చుము (చంపుము), విజృంభించుము, త్వరపడుము.

తే. పరజయము నొంది కట్టుము పట్ట మఖిల । ధరణి రాజ్యంబునకు ధర్మతనయుఁ బ్రీతి
బంధులకు నెల్లఁ గన్నులపండు వగుచు । నీవుఁ దమ్ములు సుఖవృత్తి నెలవుకొనుఁడు!' 127

ప్రతిపదార్థం: పరజయమున్+ఒంది= శత్రుజయముపొంది; అఖిల ధరణిరాజ్యంబునకున్= సమస్త భూసామ్రాజ్యానికి; ప్రీతిన్= ప్రియంతో; ధర్మతనయున్= ధర్మరాజుకు; పట్టము కట్టుము= పట్టాభిషేకం చేయుము; నీవు+తమ్ములు= నీవూ, నీ తమ్ములూ; ఎల్ల బంధువులకున్= బంధువులందరికి; కన్నులపండువు+అగుచున్= కన్నులపండుగగా; సుఖవృత్తిన్+నెలవు కొనుఁడు= సుఖంగా ఉండండి.

తాత్పర్యం: శత్రుజయాన్ని సాధించి, సమస్త భూమండలానికీ ధర్మరాజును ప్రభువుగా పట్టాభిషేకం చేయుము. బంధువులకు కన్నులపండువుగా నీవూ, నీ తమ్ములూ సుఖంగా ఉండండి.'

వ. అని మఱియును. 128

ప్రతిపదార్థం: అని మఱియున్= అని ఇంకను.

తాత్పర్యం: అని ఇంకను. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. 'బరవస మొప్ప నీవు గదపండువు సేయఁ దలంచి తాఁకినం
గురుపతి నిర్జితుం డగుటకుం బవనాత్మజ! యేను బూఁట; పో

టరితన మెల్లఁ జూపుము; కడంగుము నీ' వని యేలిమాటమై

నరవర! ధర్మసూనుఁడు వినన్ విజయం బొసఁగెన్ మఱందికిన్. 129

ప్రతిపదార్థం: నరవర!= రాజా! ధృతరాష్ట్రా!; పవన+ఆత్మజ!= వాయునందనా!; బరవసము+ఒప్పన్= ధైర్యముఒప్పగా; నీవు గదపండువు చేయన్+తలంచి తాఁకినన్= గదకు పండువు చేయనెంచి తాకినట్లయితే; కురుపతి= కురురాజు; నిర్జితుండు+ అగుటకున్= ఓడిపోవటానికి; ఏను+పూఁట= నేను బాధ్యత వహిస్తాను; పోటరితనము= (నీ)వీరత్వమును; ఎల్లన్+చూపుము=అంతటినీ ప్రదర్శించుము; నీవు; కడంగుము= పూనుకొనుము; అని= అంటూ; ధర్మసూనుఁడు+వినన్= ధర్మరాజు వినేటట్లు; ఏలిమాటన్= కృత్రిమంగా; మఱందికిన్= మేనమరదికి(భీముడికి); విజయం బొసఁగెన్= జయమునిచ్చాడు.

తాత్పర్యం: ఓ రాజా! ధైర్యంతో నీవు గదకు పండుగు చేయ నెంచి తలపడితే దుర్యోధనుడు హతుడవుతాడు. భీమసేనా! అందుకు నేను బాధ్యుడను. నీ పరాక్రమాన్ని పూర్తిగా ప్రదర్శించుము. పూనుకో - అని పరిహాసంగా ధర్మరాజు వినేటట్లుగా భీముడికి కృత్రిమంగా విజయం చేకూరేటట్లుగా (కృష్ణుడు) పలికాడు.

వ. ఇవ్విధంబున వృకోదరునకు మనోజయప్రదంబు లగు మాట లాడి 'దుర్యోధనుండు దండిమగండు; శ్రమంబునుం జాలఁగలఁడు; నీ వతిప్రయత్నంబునుఁ బెనంగవలయుఁ జుమ్మీ!' యని పలికె; నప్పుడు సాత్యకి యా సమీరనందను నగ్గించెఁ, బాంచాలురుఁ దక్కునుంగలుగు ధరణీశులు నబ్బలుమగనిఁ బ్రశంసించి; రతం డగ్రజునాననం బాలోకించి. 130

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; వృకోదరునకున్= భీముడికి; జయప్రదంబులు+అగు మాటలు+ఆడి= జయాన్ని కలిగించే మాటలు చెప్పి; దుర్యోధనుండు; దండిమగండు= పెద్దవీరుడు; శ్రమంబునున్+చాలన్+కలఁడు= సాధనబాగా చేశాడు; ప్రయత్నంబునన్= నీవు మిక్కిలి ప్రయత్నంతో; పెనంగవలయున్+చుమ్మీ!= పోట్లాడవలెను సుమా!; అని పలికెన్= అని మాటాడాడు; అప్పుడు= ఆ సమయంలో; సాత్యకి; సమీరనందనున్= భీముడిని; అగ్గించెన్= పొగడాడు; పాంచాలురు= పాంచాల దేశంవారును; తక్కునున్+కలుగు= మిగిలిన; ధరణీశులున్= రాజులును; ఆ+బలుమగనిన్= బలవంతు డయిన ఆ వీరుడిని; ప్రశంసించిరి= పొగడారు; అతండు+అగ్రజుని+ఆననంబు+ఆలోకించి= అతడు తన అన్న అయిన ధర్మజుడి మొగాన్ని చూచి.

తాత్పర్యం: (శ్రీకృష్ణుడు) ఈ విధంగా భీముడికి జయం కలిగేటట్లు మాట్లాడి, 'దుర్యోధనుడు పెద్దవీరుడు; గదాయుద్ధ సాధన బాగా చేసినవాడు. నీవు మిక్కిలి ప్రయత్నంతో పోట్లాడవలెను' అన్నాడు. సాత్యకి, పాంచాల కుమారులూ, మిగిలిన వారూ బలవంతుడైన భీమసేనుడిని పొగడారు. ఆతడు అన్నగారి మొగం చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'వినుము నరేంద్ర! యేను బలవిక్రమముల్ వొగడొంద నిక్కుల

ఘ్నునిపయి నామనంబు నతికోపము; పార్థుఁడు ఖాండవంబునం

దనలముపర్వఁ జేసినటు లగ్గలికన్ నిగిడించెదన్; గదం

గొనియెదఁ బ్రాణముల్; మహి యకుంఠితశాస్తిగ నేలు మంతయున్. 131

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= ఓ రాజా!(ధర్మజా); వినుము; ఏను; బలవిక్రమముల్ పొగడు+ఒందన్= బలశౌర్యాలు కీర్తికెక్కగా; ఈ+కులఘ్నునిపయిన్= ఈ కులనాశకుడిమీద; నామనంబు+అతికోపము= నా మనసుయొక్క మిక్కిలి కోపం; పార్థుఁడు=

అర్జునుడు; ఖాండవంబునందున్= ఖాండవవనంలో; అనలము పర్వన్+చేసినటులు= అగ్నిని వ్యాపింపచేసిన విధంగా; అగ్గలికన్= అతిశయంగా; నిగిడించెదన్= వ్యాపింపచేస్తాను; గదన్= గదతో; ప్రాణముల్ కొనియెదన్= (వీని) ప్రాణాలను తీస్తాను; అకుంఠిత శాస్తిగన్= కుంటువోవని ఆజ్ఞతో; మహి= భూమి; అంతయున్+ఏలుము= మొత్తమును పరిపాలింపుము.

తాత్పర్యం: 'ఓ రాజా! వినుము. నేను బలశౌర్యాలు కీర్తించబడగా ఈ కులకంటకుడిపై నున్న నా మనసులోని కోపాన్ని అర్జునుడు ఖాండవవనంలో వ్యాపింపజేసిన అగ్నివలె మిక్కిలి వ్యాపింపజేస్తాను. గదతో వాడి ప్రాణాలు తీస్తాను. అడ్డులేని అధికారంతో శాసకుడవుగా రాజ్యాన్ని పాలించుము.

విశేషం: అలంకారం: ఉపమ.

ఆ. మహితకీర్తి పుష్పమాలికఁ బూన్చెద । నిన్నుఁ జీకురాజు నేఁడు వనరుఁ
గాక! శకుని బుద్ధికతమునఁ దమ కింత । పుట్టె నని తనూజుపొలియు టెఱిఁగి.' 132

ప్రతిపదార్థం: మహితకీర్తి= గొప్పదైన కీర్తి అనెడి; పుష్పమాలికన్= పూలమాలను; నిన్నున్; పూన్చెదన్= ధరింపజేస్తాను; శకునిబుద్ధి కతమునన్= శకుని తెలివి కారణంగా; తమకున్+ఇంత పుట్టెను+అని= తమకు చివర కీవిధంగా చేటు కలిగిందని; తనూజు పొలియుట+ఎఱిఁగి= కుమారుడు చనిపోవటం తెలిసి; చీఁకురాజు= అంధుడయిన రాజు (ధృతరాష్ట్రుడు); వనరుఁగాక!= దుఃఖించునుగాక!

తాత్పర్యం: ధర్మరాజా! గొప్పకీర్తి అనే పూలమాలను నీకు ధరింపజేస్తాను. శకుని ఉపదేశంవలన తమకిటువంటి చేటు వాటిల్లినదని కొడుకు చావు విని అంధరాజు నేడు దుఃఖించుగాక!

వ. అని పలికి సన్నాహంబు శోభిల్లుచుండ గదాదండంబుఁ గేల నమర్చి వృత్రున కభిముఖుం డగు వాసవుండునుం బోలె దుర్యోధనుదిక్కు మొగంబై నిర్వ్యూహం బైన శుండాలంబు చందంబున నున్న యన్నరపతిఁ గనుంగొని తమయన్నయుఁ దమ్ములు నెమ్మనంబుల సంతసిల్లఁ దానును సమరోల్లాసభాసితుం డగుచు నతని కిట్లనియె. 133

ప్రతిపదార్థం: అని పలికి= అని మాటాడి; సన్నాహంబు శోభిల్లుచుండన్= ప్రయత్నం ప్రకాశిస్తూ ఉండగా; గదాదండంబున్= దండంవంటి గదను; కేలన్+అమర్చి= చేత పట్టుకొని; వృత్రునకున్+అభిముఖుండు+అగు వాసవుండున్+పోలెన్= వృత్రాసురుడి కెదురయిన ఇంద్రుడివలె; దుర్యోధను దిక్కు మొగంబు+ఐ= దుర్యోధనుడి ప్రక్కకు తిరిగినవాడై; నిర్వ్యూహంబు+ఐన శుండాలంబు చందంబునన్= కట్టువీడిన మదపుటేనుగువలె; ఉన్న ఆ+నరపతిన్+కనుంగొని= ఆ రాజును (దుర్యోధనుడిని) చూచి; తమ అన్నయున్+తమ్ములున్= తమ అన్నగారయిన ధర్మజుడును, తమ్ములైన అర్జున నకుల సహదేవులును; నెమ్మనంబులన్ సంతసిల్లన్= నిండు మనసులతో సంతోషించగా; తానును= భీమసేనుడు; సమర+ఉల్లాసభాసితుండు+ అగుచున్= యుద్ధోత్సాహంతో ప్రకాశిస్తూ; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ దుర్యోధనుడితో ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఆ విధంగా మాటాడి, తన ప్రయత్నం శోభించగా గదను చేత ధరించి వృత్రాసురుడి ఎదురుగా వెళ్ళిన ఇంద్రుడివలె దుర్యోధనుడివైపు మొగం కలవాడై కట్టువిప్పబడిన మదపుటేనుగువలె ఉన్న ఆ రాజును చూచి, తన అన్నగారూ, తమ్ములూ మనసునిండుగా సంతోషించగా భీమసేనుడు యుద్ధోత్సాహంతో వెలుగుతున్నవాడై ఆ దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. 'ఇట్టిది క్రూరకర్మ మని యించుక కొంకక లక్కయింటఁ జి
చ్చొట్టితి మాయజూదమున నుత్తము ధర్మజుఁ దూలఁ బుచ్చి తా
చుట్టలుఁ బెద్దలుం జెలులుఁ జూడఁగ ద్రోవది భంగపెట్టి తి
ట్టట్టన కింకఁ దత్ఫలము లన్నిటి నొందుము చేరి తగ్గ మై. 134

ప్రతిపదార్థం: ఇట్టిది క్రూరకర్మము+అని= ఈ పని క్రూరమైన పని అంటూ; ఇంచుక కొంకక= ఒకింతకూడా సందేహించకుండా; లక్కయింటన్+చిచ్చు+ఒట్టితి= లక్కయింటికి నిప్పుపెట్టావు; మాయజూదమునన్= మోసపు జూదంలో; ధర్మజు+తూలన్+పుచ్చితి(వి)= ధర్మరాజును ఓడించావు; ఆ చుట్టలు= ఆ బాంధవులు; పెద్దలున్= పెద్దవారూ; చెలులున్ చూడఁగన్= స్నేహితులు చూస్తూ ఉండగా; ద్రోవదిన్= ద్రౌపదిని; ఇట్టు అట్టు+అనన్= ఇటు అటు అనకుండా(జంకకుండా); భంగపెట్టితి(వి)= అవమానించావు; ఇంకన్ తద్+ఫలములు= ఆ పనులవలన కలిగే ఫలితాలు; అన్నిటిన్+ఒందుము= మొత్తాన్ని అనుభవించుము; అగ్గమై= వశమై; చేరితి(వి)= దగ్గరకు వచ్చావు.

తాత్పర్యం: 'ఈ పని క్రూరమైన నీచకర్మ అని తలచకుండా లక్క ఇంటికి నిప్పు పెట్టావు. మాయాజూదంలో ధర్మరాజును ఓడించావు. చుట్టాలు, పెద్దలు, స్నేహితులు చూస్తూ ఉండగా జంకకుండా ద్రౌపదిని అవమానం పాలు చేశావు. వీటికన్నింటికిని మొత్తంగా ఫలితాన్ని అనుభవించుము. నా చేతికి చిక్కావు.

సీ. గాంగేయకుంభజ కర్ణశల్యాదులు । నీకుఁగాఁ బెనఁగి యనేకబంధు
మిత్రులు మడిసిరి ధాత్రీపతులఁ దోడు । దెచ్చితి పలువురఁ జచ్చి రంత
వట్టువారును దోడఁబుట్టువు లెల్లను । గూలి; రంతటికిని మూల మైన
శకుని గీటడఁగె; నిం కొకరుఁడ వీ వున్న । వాఁడవు; విను! నిన్ను నేఁడు నాదు

తే. గదకు నెర సేసి లోకంబు కల్మషంబు । లేను బాపెద; నీరజ్జు లేల? నాకుఁ
జక్కనై రమ్ము మద్భుజాస్తంభశుంభ । దుగ్రకేళికిఁ బాత్రమై యోట దక్కి'. 135

ప్రతిపదార్థం: గాంగేయ= భీష్ముడు; కుంభజ= ద్రోణుడు; కర్ణ= కర్ణుడు; శల్య+ఆదులు= శల్యుడు మొదలయినవారు; నీకున్+కాన్+పెనంగి= నీ కొరకై యుద్ధంచేసి; అనేక బంధుమిత్రులు= ఎందరో బంధువులు స్నేహితులు; మడిసిరి= చనిపోయినారు; ధాత్రీపతుల+పలువురన్+తోడుతెచ్చితి(వి)= ఎందరినో రాజులను సహాయంగా తీసికొనివచ్చావు; అంత+పట్టువారును= అంతమట్టుకు వారంతా; చచ్చిరి= చనిపోయారు; తోడఁబుట్టువులు+ఎల్లను= నీ తోబుట్టిన వారంతా; కూలిరి= చనిపోయారు; అంతటికిని= ఈ మొత్తానికి; మూలము+ఐన= కారణమైన; శకుని; గీటడఁగెన్= నశించాడు; ఇంకన్+ఒకరుఁడవు= ఇంక ఒక్కడవు; ఈవు+ఉన్నవాఁడవు= నీవున్నావు; విను= వినుము; నిన్నున్ నేఁడు నాదుగదకున్+ఎర చేసి= ఈ దినం నిన్ను నాగద కాహారంగా వేసి; లోకంబు= లోకాలయొక్క; కల్మషంబులు= పాపాలు; ఏను+పాపెదన్= నేను తొలగిస్తాను; ఈ రజ్జులు+ఏల?= ఈ పనికిరాని మాట లెందుకు?; నాకున్+చక్కనై= నా కెదురుగా; మద్భుజాస్తంభ= కంబాలవంటి నా భుజాల; శుంభత్+ఉగ్రకేళి= గర్వంతో భయంకరమయిన క్రీడకు; పాత్రము+ఐ= ఆధారమై; ఓట+తక్కి= జంకు మాని; రమ్ము.

తాత్పర్యం: నీకొరకై భీష్మద్రోణ కర్ణశల్యాదులు, అనేకులు బంధుమిత్రులు మరణించారు. రాజులను తోడు తెచ్చుకొన్నావు. వారు కూడా చచ్చారు. తోబుట్టువు లందరూ నశించారు. దీనికంతటికిని మూలంగా ఉండిన శకుని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చనిపోయాడు. ఇంక నీ వొక్కడ వున్నావు. వినుము. నిన్ను నేడు నా గదకు ఆహారంగా చేసి లోకంలోని పాపాన్నంతా నేను పోగొట్టుతాను. నీ ఈ పనికిరాని మాట లెందుకు? అనుమానించకుండా నా కెదురుగా రమ్ము. నా భుజదర్పభయంకర క్రీడకు పాత్రమైనావు.'

చ. అనుడు నెదిర్చి నీతనయుఁ డాతని కిట్లను 'నేల రిత్త గ
ర్జనములు? గానవే పటు భుజాకలితోగ్రగదా సముద్భటున్
నను? నిటు రమ్ము! సూపుము రణంబున నీదుబలంబుఁ జేవయున్;
మన మిటు చేరి నిల్చి వెడ మాటల నాడుచు నుక్కి యొప్పునే? 136

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; ఎదిర్చి= ఎదుర్కొని; నీ తనయుఁడు= నీ కుమారుడు; ఆతనికిన్+ఇట్లు+అనున్= ఆ భీముడితో ఈ విధంగా అన్నాడు; ఏల రిత్త గర్జనములు?= వ్యర్థమైన గర్జింపులెందుకు?; పటు= తీవ్రమయిన; భుజాకలిత= చేతియందున్న; ఉగ్రగదాసముద్భటున్= భయంకరమయిన గదతో ఎత్తివచ్చినవాడిని; ననున్= నన్ను; కానవే?= చూడవా?; ఇటు రమ్ము= ఈ దిక్కునకు రమ్ము; రణంబునన్= యుద్ధంలో; నీదు బలంబు= నీ శక్తి; చేవయున్= నేర్పును; చూపుము; మనము+ఇటు చేరి నిల్చి= మన మీవిధంగా చేరి; వెడమాటలన్+ఆడుచున్+ఉన్కి= పనికిరాని మాటలను మాట్లాడటం; ఒప్పునే?= తగునా?

తాత్పర్యం: అనగా విని, నీ కుమారుడు భీముడితో ఇట్లా అన్నాడు: 'ఈ వ్యర్థమైన గర్జన లెందుకు? కఠినమైన నా భుజదండంతో భయంకరమైన గద నెత్తి వచ్చిన నన్ను చూడలేదా? ఇటు రమ్ము. యుద్ధంలో నీ బలాన్నీ చేవనూ చూపుము. మనం ఈ విధంగా నిలిచి పనికిరాని మాటలు మాట్లాడటం తగునా?

క. వినుము గదారణమున ననుఁ । జెనయఁగ వాసవున కైనఁ జెల్లదు; నీ వీ
యనిఁ బాడి దప్ప కుండఁగ । బెనఁగుము ప్రాణంబుతోడఁ బ్రిదిలెదు భీమా!' 137

ప్రతిపదార్థం: భీమా!; వినుము; గదారణమునన్= గదాయుద్ధంలో; ననున్+చెనయఁగన్= నన్ను+ఎదుర్కొవటానికి; వాసవునకున్+ఐనన్= ఇంద్రుడికైనా; చెల్లదు= సాధ్యం కాదు; నీవు+ఈ+అనిన్= నీ వీ యుద్ధంలో; పాడితప్పకుండఁగన్= ధర్మపద్ధతిని తప్పకుండా; పెనఁగుము= యుద్ధం చేయుము; ప్రాణములతోడన్+ప్రిదిలెదు(వు)= ప్రాణాలతో ఊడిపోతావు (చనిపోతావు).

తాత్పర్యం: ఓ భీమా! వినుము. గదాయుద్ధంలో నన్ను ఎదుర్కొనటానికి ఇంద్రుడికైనా సాధ్యం కాదు. నీ వీ యుద్ధంలో ధర్మం తప్పకుండా యుద్ధం చేయుము. ప్రాణాలతో తప్పుకొనలేవు.'

వ. అనిన విని పాంచాలురుం దక్కిన జనపాలురుం బ్రశంసించి మత్తమాతంగంబుఁ దాలశబ్దంబుల నుబ్బం జేయునోజ రారాజుఁ బ్రహర్షంబు నొందించిరి; గజబృంహితంబులు హయహేషితంబులును జెలంగె నాయుధంబు లెక్కుడు మెఱుంగులఁ బొలిచెఁ; దదనంతరంబ యెల్లవారును నెడగలుగఁ గూర్చుండి రమ్మహావీరులు దలపడువారై వీరోద్రేకంబునం జేసి యతిలోకం బగు నవష్టంభంబున విజృంభించి యొండొరుల నవలోకించి రట్టియెడ. 138

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విని; పాంచాలురున్+తక్కిన జనపాలురున్+ప్రశంసించి= పాంచాల దేశీయులూ, మిగిలిన రాజులూ పొగడి; మత్తమాతంగంబున్= మదపుటేనుగును; తాల శబ్దంబులన్+ఉబ్బన్+చేయున్+ఓజన్= తాళాల

చప్పుళ్ళతో ఉత్సాహం కలిగించే విధంగా; రారాజున్= దుర్యోధనుడిని; ప్రహర్షంబున్+ఒందించిరి= సంతోషం కలిగేటట్లు చేశారు; గజ బృంహితంబులు= ఏనుగుల ఘీంకారాలు; హయహేషితంబులును= గుర్రాల సకిలింతలూ; చెలంగెన్= మ్రోగాయి; ఆయుధంబులు= యుద్ధానికి వాడే అస్త్రశస్త్రాలు; ఎక్కుడు మెఱుంగులన్+పొలిచెన్= మిక్కిలి వెలుగులతో ఒప్పినవి (బాగా పదనుపెట్టటంవలన); తదనంతరంబ= ఆ మీదట; ఎల్లవారును= అందరును; ఎడ+కలుగన్+కూర్చుండిరి= విడిగా దూరముండేటట్లు కూర్చున్నారు; ఆ+మహావీరులు= ఆ గొప్ప యోధులు; తలపడువారు+ఐ= ఎదుర్కొనేవారుగా; వీర+ఉద్రేకంబునన్+చేసి= వీరోద్రేకాలతో; అతిలోకంబు+అగు= లోకాతీతమైన; అవష్టంభంబునన్= గర్వంతో; విజృంభించి= రేగి; ఒండొరులన్+అవలోకించిరి= ఒకరినొకరు చూచుకొన్నారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: దుర్యోధనుడు అట్లా అనగా పాంచాలురు, మిగిలిన రాజులు అతడిని పొగడినారు. మదపుటేనుగును శబ్దాలతో ఉబ్బించే విధంగా చేశారు. ఏనుగులు ఘీంకారాలతోను, గుర్రాలు సకిలింతలతోను ఒప్పాయి. ఆయుధాలు బాగా మెరిశాయి. ఆ తరువాత అందరూ ఎడంగా కూర్చున్నారు. ఆ గొప్ప వీరులు వీరోద్రేకాలతో గర్వంతో విజృంభించి ఒకరి నొకరు చూచుకొన్నారు. ఆ సమయంలో.

భీమదుర్యోధనుల గదాయుద్ధము సూడ బలరాముఁడు వచ్చుట (సం. 9-33-2)

సీ. యదుకుల దీపకుం డగు రాముఁ డవ్వార్త । యంతకమును విని యక్కుమారు
లాత్మశిష్యులు గాన నాహవ మీక్షింపఁ । దీవ్రయానమున నేతెంచి దృష్టి
గోచరుం డగుటయుఁ, గురునాథ! తగ నెల్ల । వారు నెదుర్కొని గారవమునఁ
బ్రణమిల్లిన నతండు ప్రత్యభివందన । మాచరింపంగ ధర్మాత్మజుండు

తే. సమ్మదంబునఁ బరిరంభణమ్ము సేసె; । నరుఁడుఁ గవలును ద్రౌపదీనందనులును
వందనం బొనరించిరి; వారి నాతఁ । డర్హభంగి భాషణముల నాదరించె. 139

ప్రతిపదార్థం: కురునాథ!= ఓ కురురాజా, ధృతరాష్ట్రా!; యదుకుల దీపకుండు+అగు రాముఁడు= యాదవవంశాన్ని వెలుగజేసే బలరాముడు; ఆ+వార్తన్= ఆ భీమ దుర్యోధనుల గదాయుద్ధ వార్తను; అంతక మును విని= అంతకుముందే విని; ఆ+కుమారులు= ఆ రాజకుమారులు; ఆత్మ శిష్యులుకానన్= తన శిష్యులు కనుక; ఆహవము+ఈక్షింపన్= యుద్ధాన్ని చూడటానికై; తీవ్రయానమునన్= వేగమైన ప్రయాణంతో; ఏతెంచి= వచ్చి; దృష్టిగోచరుండు+అగుటయున్= కనబడగా; ఎల్లవారున్+ఎదుర్కొని= అందరును ఎదురేగి; గారవమునన్+ప్రణమిల్లినన్= గౌరవంతో నమస్కరించగా; అతఁడు= ఆ బలరాముడు; ప్రత్యభినందనము+ఆచరింపఁగన్= ఎదురు నమస్కారం చేయగా; ధర్మాత్మజుండు= ధర్మరాజు; సమ్మదంబునన్= సంతోషంతో; పరిరంభణంబు చేసెన్= కౌగిలించుకొన్నాడు; నరుఁడున్= అర్జునుడు; కవలును= నకుల సహదేవులూ; ద్రౌపదీనందనులును= ఉపపాండవులూ; వందనంబు+ఒనరించిరి= నమస్కారం చేశారు; అతఁడు= ఆ బలరాముడూ; వారిన్= ఆ అందరిని; అర్హభాషణములన్= ఉచితమైన మాటలతో; ఆదరించెన్= గౌరవించాడు.

తాత్పర్యం: యాదవకుల ప్రదీపకుడైన బలరాము డా వార్తను అంతకుముందే విని, ఆ కుమారులు తనకు శిష్యులు కావటంచేత వారి యుద్ధం చూడటానికి వేగమైన పయనంచేసి వచ్చాడు. ఆతడు కనబడగానే అందరూ ఎదురేగి గౌరవంతో నమస్కారం చేశారు. బదులుగా అతడును నమస్కరించాడు. ధర్మరా జాతడిని కౌగలించుకొన్నాడు. అర్జున నకుల సహదేవులు, ఉపపాండవులు నమస్కరించారు. వారందరినీ తగిన విధంగా ఆ బలరాముడు ఆదరించాడు.

క. **హరియును సాత్యకియు వినయ । భరితాంతఃకరణు లగుచుఁ బ్రణతు లయిన న**
య్యిరువురను గ్రుచ్చి బెరయం । బరిరంభణ మాచరించెఁ బరమప్రీతిన్. 140

ప్రతిపదార్థం: హరియును= శ్రీకృష్ణుడునూ; సాత్యకియున్; వినయభరిత+అంతఃకరణులు+అగుచున్= అణకువతో నిండిన మనసు కలవారై; ప్రణతులు+అయినన్= నమస్కరించగా; ఆ+ఇరువురను గ్రుచ్చి= ఆ యిర్వురినీ గట్టిగా; బెరయన్= కూడేటట్లుగా; పరిరంభణము= కౌగిలింత; పరమప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; ఆచరించెన్= చేశాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణసాత్యకులు వినయముతో నిండిన మనసుతో నమస్కారం చేయగా వారినిరువురిని గ్రుచ్చి కౌగిలించుకొన్నాడు.

వ. **ఇత్తెఱంగున నెల్లవారలు నాబలదేవునిఁ గాంచి కుశలప్రశ్నంబు సేసి; రయ్యాదవపుంగవుండు సదుత్తరం బిచ్చి 'యేను బోయి పెక్కుదినంబు లయ్యె' నని యుగ్గడించి, 'మిమ్మునిందఱను జూచుటకును నాశిష్యులగదా యుద్ధం బనుసంధించుటకును వచ్చితి' ననియె; నమ్మరుత్సుతుండును భవత్సుతుండును గదలు సేతులన యుండ నతనిఁ జేరి భక్తిం బ్రణామంబు లాచరించిన నతం డాదరించె; నంతఁ గౌంతేయాగ్రజుండు రౌహిణేయుతో 'నన్నదమ్ముల యిరువుర యెక్కటిపోరు సూడు'మని పలికి వా రట్లు ద్వంద్వయుద్ధంబునకు సన్నద్ధులైన తెఱం గెఱింగించిన, నతండు 'లెస్సకాక!' యని యనుమతి సేసె-నని సంజయుండు ధృతరాష్ట్రునకు రామునాగమనంబు సెప్పె ననిన విని, తదీయప్రవర్తన శ్రవణకుతూహలాయత్తచిత్తుం డైన జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె. 141**

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఎల్లవారలున్= అందరూ; ఆ బలదేవునిన్+కాంచి= ఆ బలరాముడిని చూచి; కుశలప్రశ్నంబు చేసిరి= క్షేమ సమాచారాలను అడిగారు; ఆ+యాదవ పుంగవుండు= ఆ యాదవులలో శ్రేష్ఠుడు; సత్+ఉత్తరంబు+ ఇచ్చి= మంచి బదులిచ్చి; ఏనున్+పోయి పెక్కుదినంబులయ్యెన్= నేను వెళ్ళి చాలా రోజులయింది; అని ఉగ్గడించి= అని చెప్పి; మిమ్మలన్+ఇందఱున్+చూచుటకును= మిమ్మందరిని చూడటానికి; నా శిష్యుల గదాయుద్ధంబు; అనుసంధించుటకును= కూర్చుటకుగాను; వచ్చితిన్+అనియెన్= వచ్చాను అన్నాడు; ఆ+మరుత్సుతుండును= ఆ వాయునందనుడూ; భవత్సుతుండును= నీ కుమారుడూ; గదలు చేతులన ఉండన్= గదలు చేతులలోనే ఉండగా; అతనిన్+చేరి= ఆయనను సమీపించి; భక్తిన్+ ప్రణామంబులు+ఆచరించినన్= భక్తితో నమస్కారాలు చేయగా; అతండు+ఆదరించెన్= ఆతడు ప్రీతిగా మన్నించాడు; అంతన్+కౌంతేయ+అగ్రజుండు= అంతట కుంతి కుమారులలో పెద్దవాడైన ధర్మరాజు; రౌహిణేయుతోన్= రోహిణీకుమారుడయిన బలరాముడితో; అన్నదమ్ములు+ఇరువుర= అన్నదమ్ములిద్దరి; ఎక్కటిపోరు చూడుము+అని= ఒక్కరినొక్కరే ఎదుర్కొని చేసే యుద్ధాన్ని చూడుమని; పలికి= మాటాడి; వారు+అట్లు ద్వంద్వ యుద్ధంబునకున్= వా రా విధంగా ద్వంద్వ యుద్ధానికి; సన్నద్ధులు+ఐన తెఱంగు= సిద్ధమైన తీరు; ఎఱింగించినన్= తెలియచేయగా; అతండు= ఆ బలరాముడు; లెస్స కాక!= మేలు గాక!; అని= అంటూ; అనుమతి+చేసెన్= అంగీకారం తెలిపాడు; అని= అంటూ; సంజయుండు ధృతరాష్ట్రునకు; రాము+ ఆగమనంబు చెప్పెన్+అనినన్ విని= బలరాముడి రాకను చెప్పాడు - అనగా విని; తదీయ= వారియొక్క; ప్రవర్తన= నడవడిని గూర్చి; శ్రవణకుతూహల+ఆయత్త చిత్తుండు+ఐన= వినుట కాసక్తి నిండిన మనసున్న వాడైన; జనమేజయుండు= జనమేజయ చక్రవర్తి; వైశంపాయనునకున్+ఇట్లు+అనియెన్= వైశంపాయనమునితో ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఈ విధంగా వారంతా ఆ బలరాముడిని చూచి, అతడి క్షేమాలను గురించి అడిగారు. ఆ యాదవ ముఖ్యుడును బదులిచ్చి 'నేను పోయి చాలా నాళ్ళయింది. మిమ్మింతమందిని చూడటానికీ నా శిష్యుల గదాయుద్ధాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కూర్చటానికీ వచ్చాను'- అన్నాడు. ఆ వాయునందనుడు, నీ కుమారుడు, గదలతోనే అతడికి దగ్గరగా పోయి నమస్కారం చేశారు. ఆతడు వారిని ప్రీతిగా చూచాడు. అపుడు ధర్మరాజు బలరాముడితో అన్నదమ్ముల ద్వంద్వయుద్ధాన్ని చూడవలసిందిగా చెప్పి, వా రా ద్వంద్వ యుద్ధానికి సిద్ధమైన తీరు తెలుపగా అతడు మంచిదని అనుమతిచ్చాడు. అని ధృతరాష్ట్రుడితో సంజయుడు బలరాముడి రాకను గురించిన విశేషం తెలియజెప్పగా విని జనమేజయుడు ఆ యుద్ధ విశేషాలను వినటానికి ఆసక్తి చూపుతూ వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు.

తే. **ఉభయవాహిని సంగరోద్యోగసమయ । మున హలాయుధుఁ డేతెంచి మురహరుండు**
పాండురాజసూనులయెడఁ బక్షపాతి । యని విరాటాదిబంధులు వినఁగఁ బలికి. 142

ప్రతిపదార్థం: ఉభయవాహిని= ఇరువాగుల సేన; సంగర+ఉద్యోగసమయమునన్= యుద్ధానికి ప్రయత్నించే వేళలో; హలాయుధుఁడు= బలరాముడు; ఏతెంచి= వచ్చి; మురహరుండు= మురాసురుడిని చంపిన శ్రీకృష్ణుడు; పాండురాజ సూనుల+ఎడన్= పాండురాజు కుమారులమీద; పక్షపాతి అని= అభిమాని అని; విరాట+ఆది= విరాటుడు మొదలయిన; బంధులు= బంధువులు; వినఁగన్+పలికి= వినేటట్లుచెప్పి.

తాత్పర్యం: ఇరువైపు సేనలూ యుద్ధ ప్రయత్నంలో ఉండగా బలరాము డక్కడకు వచ్చి విరాటాది బంధువులంతా వినేటట్లుగా శ్రీకృష్ణుడు పాండవ పక్షపాతి అని చెప్పి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **హరి యెఱుఁగని చక్కటియును । బురుషార్థము నా కెఱుంగఁ బోలునె? యీ ని**
ష్ఠురత వినఁ జూడఁ జాలక । సరస్వతీతీర్థమునకుఁ జనియెడు బుద్ధిన్. 143

ప్రతిపదార్థం: హరి= శ్రీకృష్ణుడు; ఎఱుఁగని= తెలియని; చక్కటియును= మార్గమూ; పురుషార్థము= పురుషార్థమూ; నాకున్+ఎఱుంగన్+పోలునె?= నాకు తెలియనగునా?; ఈ నిష్ఠురతన్= ఈ కష్టపు పని; వినన్+చూడన్+చాలక= విన లేక, కన లేక; సరస్వతీ తీర్థమునకున్; చనియెడు బుద్ధిన్= వెళ్ళవలననే మనసుతో.

తాత్పర్యం: శ్రీకృష్ణుడికి తెలియని మార్గమూ పురుషార్థమూ నే నెఱుగగలనా? ఈ కష్టమైన విషయాన్ని నేను వినలేను, చూడ లేను - అని సరస్వతీ తీర్థమునకు పోవలెనని మనసుతో. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. **మీ కెఱింగించి పో వచ్చితిఁ బోయి వచ్చెద' నని వాసుదేవ ధర్మజు లొడఁబడి యనుపఁ జనియె నని వింటి బలదేవుండు తీర్థయాత్ర నిర్వర్తించిన తెఱంగును భీమసుయోధనుల గదాయుద్ధంబు చెల్లినభంగియు నతని కాలోన నచటి కేఁగుదేర సమకూరిన విధంబును వివరించి చెప్పు' మనిన జనమేజయునకు వైశంపాయనుం డి ట్లనియె. 144**

ప్రతిపదార్థం: మీకున్+ఎఱింగించిపోన్= మీకు తెలిపిపోవటానికి; వచ్చితిన్= వచ్చాను; పోయివచ్చెదను= వెళ్ళివస్తాను; అని; వాసుదేవ ధర్మజులు= శ్రీకృష్ణుడును, ధర్మరాజును; ఒడఁబడి= ఇష్టపడి; అనుపన్+చనియెన్= పంపగా వెళ్ళాడు; అని వింటిన్= అని విన్నాను; బలదేవుండు= బలరాముడు; తీర్థయాత్ర= తీర్థయాత్రను; నిర్వర్తించిన తెఱంగును= సాగించిన విధమును; భీమసుయోధనుల గదాయుద్ధంబు; చెల్లిన భంగియున్= సాగిన విధమును; అతనికిన్= ఆ బలరాముడికి; ఆలోనన్= అంతలోనే; ఏఁగుదేరన్ సమకూరిన విధంబును= రావటానికి ఏర్పడిన విధమును; వివరించి= విస్తారంగా; చెప్పుము; అనినన్= అనగా; జనమేజయునకున్= జనమేజయుడితో; వైశంపాయనుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: (బలరాముడు) మీకు చెప్పి పోవటానికై వచ్చాను. పోయి వస్తాను-' అనగా శ్రీకృష్ణధర్మజులు ఒప్పికొని పంపగా వెళ్ళా డని విన్నాను. బలరాముడు సాగించిన తీర్థయాత్రా విధానాన్నీ, భీమదుర్యోధనులు సాగించిన గదాయుద్ధాన్నీ, బలరాము డంతలోనే అక్కడకు వచ్చిన పద్ధతిని, సవిస్తరంగా చెప్పవలసింది' అని జనమేజయుడు అడుగగా, వైశంపాయనుడు ఇట్లా అన్నాడు.

సీ. 'వినుము నరేంద్ర! యవ్విధమునఁ జని యమ్మ । హాత్ముండు గోసువర్ణాదు లైన
దానార్హబహుపదార్థంబులు దన యగ్ని । హోత్రంబు దెచ్చుట కుచితజనులఁ
బుచ్చె ననేక విప్రుల నాప్తసచివుల । వలయు రథ ద్విపాశ్వములగముల
రావించెఁ దండులప్రముఖభోజన సాధన । ములు సంపన్నహృద్యములు గాఁగఁ

ఆ. దేరఁ బనిచె నిట్లు తీర్థయాత్రాసంవి । ధాన మాచరించి మాననీయ
మగు సరస్వతీమహాంభోధిసంగమ । స్థానమునకుఁ జనియె సవినయముగ. 145

ప్రతిపదార్థం: నరేంద్ర!= ఓ జనమేజయ చక్రవర్తీ!; వినుము; ఆ+విధమునన్+చని= ఆ మాదిరిగా వెళ్ళి; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడు(బలరాముడు); గో సువర్ణాదులు+ఐన= పశువులు, సువర్ణములు ఐన; నానార్హబహు పదార్థంబులు= తగిన వస్తువు లనేకములను; తన+అగ్నిహోత్రంబున్= తన అగ్నిహోత్రమును (గార్హపత్యాగ్నిని); తెచ్చుటకున్= తీసికొని వచ్చుటకు; ఉచిత జనులన్+పుచ్చెన్= తగిన మనుష్యులను పంపాడు; అనేకవిప్రులన్= బ్రాహ్మణులను చాలమందిని; ఆప్తసచివులన్= ఆత్మీయు లయిన మంత్రులను; వలయు రథద్విప+అశ్వముల గములన్= అవసరమైన తేరులను, ఏనుగులను, గుర్రాలను, రావించెన్= రప్పించాడు; తండుల ప్రముఖ= బియ్యం మొదలైన అవసరమయిన; భోజన సాధనములు= ఆహారవస్తువులు; సంపన్నహృద్యములు+కాఁగన్= సమృద్ధములును, మనోహరములును అగునట్లు; తేరన్+పనిచెన్= తీసికొని రా పంపాడు; ఇట్లు తీర్థయాత్రా సంవిధానము+ఆచరించి= ఈవిధంగా తీర్థాలను సేవించి; మాననీయము+అగు= ప్రశస్తమయి నట్టి; సరస్వతీమహాంభోధిసంగమస్థానమునకున్= సరస్వతీ తీర్థం సముద్రంలో కలిసే చోటునకు; సవినయముగన్+చనియెన్= సవినయంగా వెళ్ళాడు.

తాత్పర్యం: 'ఓ రాజేంద్రా! ఆ మాదిరిగా వెళ్ళిన మహనీయుడైన, బలరాముడు సమస్త సంపదలతోను, అవసరమైన సంభారాలతోను తాను చేయవలసిన అగ్నికార్యాలకు అనువైన అగ్నిహోత్రాన్ని తీసికొని రావటానికి అర్హులయిన వారిని పంపాడు. అనేకులు బ్రాహ్మణులను, ఆప్తులయిన మంత్రులను అవసరమైన రథాలు ఏనుగులను, గుర్రాలను రావించుకొన్నాడు. భోజనానికి కావలసిన మంచి బియ్యాన్ని, ఇతర భోజన పదార్థాలను చక్కగా అమరేటట్లు ఆజ్ఞ ఇచ్చాడు. ఈ విధంగా యాత్రను ఏర్పాటు గావించుకొని, పవిత్రమయిన సరస్వతీనది సముద్రంలో కలిసేచోటునకు అడకువతో వెళ్ళాడు.

వ. అది ప్రభాసం బనుపేరం బరఁగు న ట్లందులకుఁ జని తీర్థసేవనం బనుష్ఠించి యంతనుండియుఁ బథిశ్రాంతిప్రయాణంబుల సరస్వతి చేరువ నడచి తదీయ సకలతీర్థంబు లాడుచు నన్నపానంబుల నాసనశయనయానంబులను ధేనుకనకరత్నాంబరాభరణాదిద్రవ్యంబులను విప్రుల నతిప్రీతులఁ జేయుచు, బాలవృద్ధవనితావికలాంగదుర్బలప్రాయులఁ బరిశ్రాంతు లైనయెడలఁ దడిమికొని యథేష్ట ప్రకారంబుల శరీరస్థితి నడిపింపఁ దగువారిని నియోగించి మఱియు ననేకధర్మంబు లాచరించుచుఁ గురుక్షేత్రంబునకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వచ్చె' ననుటయు జనమేజయుం డా తీర్థవిశేషంబులు వివరించి చెప్పు మనుడు వైశంపాయనుం డిట్లనియె. 146

ప్రతిపదార్థం: అది= ఆ సంగమస్థానం; ప్రభాసంబునుపేరన్+బరఁగున్= ప్రభాసమనే పేరుతో ఒప్పుతుంది; అట్లు+అందులకున్+ చని; తీర్థసేవనంబు+అనుష్ఠించి= తీర్థస్నానాదులనుచేసి; అంతనుండియున్= అక్కడినుండి; పథిశ్రాంతి ప్రయాణంబులన్= నడకవలన కలుగు శ్రమతో ప్రయాణములతో; సరస్వతి చేరువన్+నడచి= సరస్వతికి దగ్గరగా నడచి; తదీయ= దాని సంబంధమగు; సకలతీర్థంబులు+ఆడుచున్= అన్ని తీర్థాలలో స్నానంచేస్తూ; అన్నపానంబులన్+ఆసన+శయన+యానంబులను= అన్నపానాలను, ఆసనాలను, పడకలను, ప్రయాణాలను; ధేను= ఆవులను; కనక= బంగారు; రత్న+అంబర+ఆభరణ+ఆది ద్రవ్యంబులను= నవరత్నములతోనూ, వస్త్రములతోను, నగలతోను కూడిన సంపదలను(ఇచ్చుటవలన); విప్రులను= బ్రాహ్మణులను; అతి ప్రీతులన్+చేయుచు= మిక్కిలిగా తృప్తిపరుస్తూ; బాల= పసివారు; వృద్ధ= ముదుసలులు; వనితా= స్త్రీలు; వికల+అంగ= అంగవైకల్యం కల; దుర్బలప్రాయులన్= బలహీనులైనవారిని; పరిశ్రాంతులు+అయిన ఎడలన్= అలసినట్లయితే; తడిమికొని= నిమురుకొంటూ; యథేష్టప్రకారంబులన్= వారి ఇష్టానుసారంగా; శరీరస్థితి= ఆరోగ్యానికి తగినట్లు; నడపింపన్+ తగువారిన్= నడిపించతగ్గవారిని; నియోగించి; ఆజ్ఞాపించి; మఱియున్= ఇంకను; అనేక= చాలా; ధర్మంబులు= ధర్మాలు; ఆచరించుచున్= చేస్తూ; కురుక్షేత్రంబునకున్= కురుక్షేత్రానికి; వచ్చెన్= వచ్చాడు; అనుటయున్= అనగా; జనమేజయుండు; ఆ తీర్థ= ఆ తీర్థముయొక్క; విశేషంబులు= గొప్పదనాలు; వివరించి; చెప్పుము+అనుడున్= చెప్పుమనగా; వైశంపాయనుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఆ సంగమస్థానానికి ప్రభాసతీర్థ మని పేరు. ఆ తీర్థమును ఆరాధించి, అక్కడినుండి మార్గాయాసంతో కూడిన పయనాలతో సరస్వతికి సమీపంగా నడచి, అందున్న అన్ని తీర్థాలలో మునుగుతూ, ఆహారశయనాదులకు ఏర్పాట్లు చేసి, గోవులను సంపదను పట్టువస్త్రాలనూ, నగలనూ బ్రాహ్మణుల కొసగి వారిని సంతోషపరిచి, పసివారినీ, ముదుసలివారినీ, స్త్రీలనూ అంగవైకల్యం గలవారినీ బలహీనులైన వారిని అలసినచోటులలో ఆదుకొనేవారిని ఏర్పాటు చేసి, ఇంకను అనేక ధర్మాలు చేస్తూ కురుక్షేత్రానికి వచ్చాడు - అని అనగా జనమేజయుడు తీర్థ విశేషాలను వివరించు మనగా వైశంపాయను డీ విధంగా చెప్పాడు:

క. మును చనియెఁ బ్రభాసమునకు। నని చెప్పితి నతని నది మహత్తరతీర్థ
మ్ము నరేంద్ర! యందుఁ జంద్రుఁడు। దన యక్ష్మం దీర్చుకొని గతవ్యథుఁ డయ్యెన్. 147

ప్రతిపదార్థం: నరేంద్ర!= ఓ రాజా!; అతనిన్; మును చనియెన్+ప్రభాసమునకున్+అని చెప్పితిన్= ఇదివరకు ప్రభాస తీర్థమునకు వెళ్ళాడని చెప్పాను; అది; మహత్తర= గొప్ప; తీర్థమ్ము= తీర్థం; అందున్= ఆ తీర్థంలో; చంద్రుఁడు; తన; యక్ష్మన్+తీర్చుకొని= క్షయవ్యాధిని; తీర్చుకొని= పోగొట్టుకొని; గత= పోయిన; వ్యథుడు+అయ్యెన్= బాధగలవాడయ్యాడు.

తాత్పర్యం: ఆతడు ప్రభాసతీర్థానికి ముందుగా వెళ్ళాడని చెప్పాను. అది మిక్కిలి మహిమ(శక్తి) కల తీర్థం. ఓ రాజా! చంద్రు డాతీర్థంలో మునిగి తన క్షయవ్యాధిని పోగొట్టుకొన్నాడు.

ప్రభాసతీర్థ ప్రభావవర్ణనము (సం. 9-33-36)

వ. అత్తెఱం గెఱింగించెద దక్షకన్యకల నశ్విన్యాదు లగు సప్తవింశతి సంఖ్యలఁ జంద్రుండు వివాహం బయ్యె నందు రోహిణి రూపాతిశయవతి యగుటం జేసి తదాసక్తుండైనఁ దక్కటివారు వగ నొంది తండ్రికడకుం

జని చంద్రుని యన్యాయం బెఱింగించిన, నా ప్రజాపతి చంద్రునితో నుగ్గడించి 'యది చాల నధర్మం బింక నిట్లు సేసి తేని శపింతుఁ జుమ్మీ! సముఁడవై వర్తింపు' మనుటయు నమ్మాట దెస ననాదరంబు సేసి యతండు వెండియుఁ దొంటియట్ల వర్తించిన నెఱింగి యమ్మహాత్ముండు కోపించి యక్షుఁదెవులు గొనుమని శాపం బిచ్చిన, నయ్యోషధినాథుండు నానాఁటికిఁ గృశుం డయ్యె న ట్లాతెవులుచేత నతండు పోఁడిమి మాలిన నోషధులు పసచెడియె; దానఁ బ్రజలు డయ్యం జొచ్చి; రది చంద్రకార్శ్యహేతుకం బగుట యనుసంధించి. 148

ప్రతిపదార్థం: ఆ+తెఱంగు= ఆ విధాన్ని(తీర్థమహత్త్యమును); ఎఱింగించెదన్= తెలుపుతాను; దక్షకన్యకలన్= దక్షుడికూతులైన; అశ్విని+ఆదులు+అగు= అశ్విని మొదలైనవారిని; సప్తవింశతి సంఖ్యలన్= ఇరవై ఏడుమందిని; చంద్రుఁడు వివాహంబయ్యెన్= చంద్రుడు పెండ్లాడాడు; అందున్= వారిలో; రోహిణి= రోహిణిఅనునాపె; రూపాతిశయవతి+అగుటన్+చేసి= మిక్కిలి అందగత్తె అయినందున; తద్+ఆసక్తుండు+ఐనన్= ఆమె అందు ప్రీతికలవాడు కాగా; తక్కటివారు= మిగిలినవారు; వగన్+ఒంది= దుఃఖపడి; తండ్రికడకున్+చని= తమ తండ్రి వద్దకు వెళ్ళి; చంద్రుని అన్యాయంబు+ఎఱింగించినన్= చంద్రుడి అధర్మమును తెలుపగా; ఆ ప్రజాపతి= ఆ దక్షప్రజాపతి; చంద్రునితోన్+ఉగ్గడించి= చంద్రుడితో మాటాడి; అది చాలన్+అధర్మంబు= అది మిక్కిలి అన్యాయం; ఇంకన్+ఇట్లు+చేసితి(వి)+ఏని= ఇంకా ఇట్లాగే చేశావంటే; శపింతున్+చుమ్మీ!= శాపమిస్తాను సుమా!; సముఁడవు+ఐ= సమానుడవుగా; వర్తింపుము= నడచుకొనుము; అనుటయున్= అని చెప్పటమూ; ఆ+మాటదెసన్= ఆ మాటకు; అనాదరంబు+చేసి= లెక్కచేయక; అతండు= చంద్రుడు; వెండియున్= మరల; తొంటి+అట్లు+అ= వెనుకటిమాదిరిగనే; వర్తించినన్+ఎఱింగి= నడచుకొనగా తెలిసికొని; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడైన దక్షుడు; కోపించి; అక్షుఁదెవులు+ కొనుమని= కృశించే జబ్బును(క్షయను) పొందుమని; శాపంబు+ఇచ్చినన్= శాపం ఇవ్వగా; ఆ+ఓషధినాథుండు= ఆ చంద్రుడు; నానాఁటికిన్+కృశుండు+అయ్యెన్= దినదినానికి క్షీణించాడు; అట్లు+ఆ తెవులుచేతన్= ఆ విధంగా ఆ జబ్బుతో; అతడు పోఁడిమి మాలినన్= వాడు ఒప్పులేనివాడు కాగా; ఓషధులు; పసచెడియన్= బలహీనము అయినవి; దానన్+ప్రజలు= అందుచేత ప్రజలు; డయ్యన్+చొచ్చిరి= అలసట కలవారైరి; అది; చంద్రకార్శ్య= చంద్రుడు కృశించిన; హేతుకంబు+అగుటన్= కారణం కావటంతో; అనుసంధించి= కూర్చి.

తాత్పర్యం: ఆ వివరాన్ని తెలియజేస్తాను. దక్షుడి కూతులు ఇరువదిఏడుగురను (అశ్విని మొదలైనవారిని) చంద్రుడు పెండ్లాడాడు. వారిలో చాలా అందగత్తెఅయిన రోహిణియందు అభిమానం ఎక్కువగా కలిగి ప్రవర్తించగా, మిగిలిన వారు మనస్తాపంతో తండ్రి వద్దకు వెళ్ళి, చంద్రుడు చేసే అన్యాయాన్ని చెప్పారు. ఆ దక్షప్రజాపతి చంద్రుడితో అది చాలా అన్యాయ మనీ ఇకముందా విధంగా చేస్తే శపిస్తాననీ అన్నాడు. ఆ మాటను లెక్కచేయకుండా చంద్రుడు వెనకటివలెనే ప్రవర్తించసాగాడు. ఆ విషయాన్ని తెలిసికొన్న దక్షుడు కోపించి అతడిని క్షయవ్యాధిచేత బాధనందు మని శపించాడు. దానితో ఓషధీపతి అయిన చంద్రుడు దినదినానికీ కృశించి పోయాడు. ఆ రోగంవలన ఆతడు కళావిహీనుడుకాగా ఓషధులు కూడా బలహీనాలయ్యాయి. అందుచేత ప్రజలు అలసిపోజొచ్చారు. అది చంద్రుడు కృశించిన కారణంగా జరిగిందని గ్రహించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. దేవత లమృతాంశునితో । 'నీ వేటికిఁ గృశుఁడ వైతి? నిక్కము చెపుమా!'
నావుడుఁ దనతెఱఁ గేర్పడఁ । గా వారికి నతఁడు సెప్పెఁ గౌరవముఖ్యా.!' 149

ప్రతిపదార్థం: కౌరవముఖ్యా!= కురువంశంలో ప్రధానుడైనవాడా! జనమేజయా!; దేవతలు+అమృత+అంశునితోన్= దేవతలు చంద్రుడితో; నీవు+ఏటికిన్ కృశుఁడవు+ఐతి(వి)?= నీవెందుకై కృశించిపోయావో; నిక్కము చెపుమా!= నిజం చెప్పుము;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నావుడున్= అనగా; తన తెఱఁగు+ఏర్పడఁగాన్= తన స్థితి స్పష్టంగా తెలియగా; అతఁడు= చంద్రుడు; వారికిన్+చెప్పెన్= ఆ దేవతలకు చెప్పాడు.

తాత్పర్యం: ఓ కౌరవరాజా! జనమేజయా! దేవతలు చంద్రుడిని 'నీవు ఇట్లా క్షీణించిపోవటానికి కారణ మేమిటో నిజంగా చెప్పుము.' అని అడుగగా, అతడు వాళ్ళకు ఆ వివరమంతా చెప్పాడు.

క. విని వార లతనిఁ దోడ్కొని । చని ప్రార్థించుటయుఁ దగఁ బ్రసన్నుం డై యి
ట్లను దక్షుఁ 'డఖిల భార్యా । జనులయెడన్ నడవవలయు శశి సమవృత్తిన్. 150

ప్రతిపదార్థం: విని= అది విన్నవారై; వారలు= ఆ దేవతలు; అతనిన్+తోడ్కొని= ఆ చంద్రుడి తీసికొని; చని= వెళ్ళి; ప్రార్థించుటయున్= ప్రార్థించగా; తగన్+ప్రసన్నుండు+ఐ= తగునట్లుగా దయగలవాడై; దక్షుఁడు+ఇట్లనున్= దక్షు డీ విధంగా అన్నాడు; అఖిల భార్యాజనులఎడన్= భార్యలందరి విషయంలోను; శశి= చంద్రుడు; సమవృత్తిన్= సమానమైన ప్రవర్తనంతో; నడవవలయున్= నడచుకొనవలెను.

తాత్పర్యం: దేవతలు విని, చంద్రుడిని తోడుకొనిపోయి దక్షుడిని ప్రార్థించగా ఆదరంతో ఆతడు 'భార్యలందరి విషయంలోనూ చంద్రుడు సమానమైన అభిమానంతో నడచుకొనవలయు'నని చెప్పాడు.

వ. అట్లు నడచుచు సరస్వతీజలనిధిసంగమకలితం బైన తీర్థంబుజలంబుల నిమగ్నుం డై వృద్ధిఁ బొందు; వరుసన పదియేను పదియేనుదినంబులు సంక్షయంబును బ్రవర్ధనంబు నొందం గలవాఁ' డని చెప్పి వెండియు. 151

ప్రతిపదార్థం: అట్లు నడచుచున్= ఆ విధంగా నడుస్తూ; సరస్వతీ జలనిధి సంగమకలితంబు+ఐన= సరస్వతీ తీర్థమూ సముద్రమూ కలసిన తీర్థముల నీళ్ళలో; నిమగ్నుండు+ఐ= స్నానంచేసి (మునిగి); వృద్ధిన్+పొందున్= వృద్ధిపొందుతాడు; వరుసన= క్రమంగా; పది ఏను+పది ఏను దినంబులు= పదిహేను దినాల చొప్పున; సంక్షయంబును= తగ్గుటయున్నూ; ప్రవర్ధనంబున్ ఒందన్= పెరుగుటయున్నూ; ఒందన్+కలవాఁడు; అని చెప్పి వెండియున్= అని చెప్పి ఆ మీదట.

తాత్పర్యం: ఆ విధంగా నడుస్తూ సరస్వతీ నది సముద్రంలో కలిసేచోట కల పవిత్రతీర్థములలో మునిగి వృద్ధిని పొందే పద్ధతిలో పదిహేను దినాలు తగ్గుతూ పెరుగుతూ ఉండగలడు' అని చెప్పి ఇంకను. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'అమవస సమవస నా తీ । ర్థమునఁ గృతస్నానుఁ డై సుధాకరుఁడు ప్రవృ
ద్ధి మహితతనుఁ డగు' నని యతఁ । డమరుల వీడ్కొల్పి యా మృగాంకునితోడన్. 152

ప్రతిపదార్థం: అమవస+అమవసన్= ప్రతి అమావాస్య నాడూ; సుధాకరుఁడు= చంద్రుడు; ఆ తీర్థమునన్= ఆ తీర్థంలో; కృతస్నానుండు+ఐ= స్నానమాడి; ప్రవృద్ధి మహితతనుఁడు+అగును+అని= (ఆరోగ్యం) పెరిగిశక్తిమంతమయిన శరీరంకలవాడౌతా డని; అఁతడు+అమరులన్ వీడ్కొని= ఆ దక్షుడు దేవతలను పంపించి; ఆ మృగాంకునితోడన్= ఆ చంద్రుడితో.

తాత్పర్యం: 'అమావాస్యకు, అమావాస్యకు, చంద్రు డా తీర్థంలో స్నానమాడి ప్రవర్థమానమయ్యే శక్తిగల శరీరంకలవా డవుతాడు' అని దేవతలను పంపివేసి, ఆ దక్షుడు చంద్రుడితో ఈ విధంగా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. 'వనితలకు విప్రులకు నవమానంబు సేయకుమీ!' యని పలికి వీడ్కొలిపె నట్లు శాపమోక్షంబు గని చంద్రుం డాతీర్థంబునకుఁ జని తదీయ జలస్నానంబున నాప్యాయితశరీరుండై లోక ప్రభాసుం డయ్యెఁ; నదికారణంబుగా నాతీర్థంబు ప్రభాసం బనుపేరం బ్రసిద్ధి నొందె; నందుండి యా రోహిణీ నందనుం డరిగి చమసోద్భేదనం బను తీర్థంబున నొకరాత్రి వసియించి, యుదపానంబునకుం బోయె; దానివిశేషం బాకర్ణింపుము. 153

ప్రతిపదార్థం: వనితలకున్= స్త్రీలకును; విప్రులకున్= బ్రాహ్మణులకును; అవమానంబు+చేయకుమీ!= అవమానం చేయవద్దు సుమా!; అని పలికి వీడ్కొలిపెన్= అని చెప్పి పంపాడు; అట్లు శాపమోక్షంబున్+కని= ఆ విధంగా శాపమునుండి విమోచనం పొందే తెరవు చూచి; చంద్రుండు+ఆ తీర్థంబునకున్ చని= చంద్రు డా తీర్థానికి వెళ్ళి; తదీయ జలస్నానంబునన్= ఆ నీటిలో స్నానం చేయటంచేత; ఆప్యాయిత శరీరుండు+ఐ= సుఖమయమైన శరీరంకలవాడు అయి; లోక ప్రభాసుండు+అయ్యెన్= లోకాన్ని కాంతిమంతం చేసినవా డయ్యాడు; అది కారణంబుగాన్= ఆ కారణంవలన; ఆ తీర్థంబు= ఆ సంగమ తీర్థం; ప్రభాసంబు+అను పేరన్+ప్రసిద్ధిన్+అందెన్= (ఆ తీర్థం) ప్రభాసమనే పేరుతో కీర్తిపొందినది; అందుండి= అక్కడినుండి; ఆ రోహిణీ నందనుండు+అరిగి= రోహిణి కుమారుడైన బలరాముడు వెళ్ళి; చమసోద్భేదనంబు+అను తీర్థంబునన్= చమసోద్భేదన మనే పేరున్న ఆ తీర్థంలో; (యాగ సమయంలో అందరును తీసికొనే ఒక విధమయిన రసం పుట్టే చోటు); ఒక రాత్రి వసియించి= ఒక్కరాత్రి మాత్రం ఉండి; ఉదపానంబునకున్+పోయెన్= ఉదపానమనే బావికిపోయాడు; దాని విశేషంబులు= దాని గొప్పదనమును; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: 'స్త్రీలను, బ్రాహ్మణులను అవమానింపవద్దు.' అని వీడ్కొలిపాడు. ఆ విధంగా శాపం తొలగిపోయే విధాన్ని తెలిసి చంద్రు డా తీర్థానికి పోయి ఆ నీటిలో స్నానం చేసి చక్కని శరీరంతో లోకాన వెలిగాడు. ఆ కారణంచేత ఆ తీర్థం ప్రభాసమని కీర్తి నందింది. అక్కడనుండి బలరాముడు చమసోద్భేదనతీర్థంలో ఒక రాత్రి ఉండి స్నానమాడి ఉదపానమనే బావిని సేవించటానికి వెళ్ళాడు. ఆ కథ వినుము.

క. త్రితుఁ డనఁగా ద్వితుఁ డన నే। కతుఁ డనగఁ దపస్విసుతులు గల; రా విప్ర
త్రితయము భూపాలురకును। గ్రతుదీక్ష లొనర్చి ధేనుగణముం బడసెన్. 154

ప్రతిపదార్థం: త్రితుఁడు+అనఁగాన్= త్రితుడనే పేరు కలవాడు; ద్వితుఁడు+అనన్= ద్వితుడనేవాడు; ఏకతుఁడు+అనఁగన్= ఏకతు డనేవాడును; తపస్వి సుతులు= మునికుమారులు; కలరు= ఉన్నారు; ఆ విప్రత్రితయము= ఆ ముగ్గురు బ్రాహ్మణులును; భూపాలురకును= రాజులకు; క్రతుదీక్షలు+ఒనర్చి= యజ్ఞదీక్ష లిచ్చి; ధేనుగణమున్+పడసెన్= ఆవులను పొందారు.

తాత్పర్యం: త్రితుడు, ద్వితుడు, ఏకతుడు అనే మునికుమారు లుండేవారు. వారు రాజులకు యజ్ఞదీక్షలనిచ్చి ఆవులను పొందారు.

వ. పడసి యొక్కట నేతెంచునెడ నయ్యేకతద్వితులు నిజభ్రాత యగు త్రితుని వంచించి తా రాగోవులఁ దోలంగ నడిచికొని పోవువారుగాఁ బాపబుద్ధి కుత్సహించి; రాసమయంబునఁ దెరువున నొక్కవృకం బున్నఁ దద్భయంబునం దొలంగం బోయి ప్రమాదంబున ద్రితుండు నూతం బడిన నయ్యిరువురు నతని నుపేక్షించి ధేనువులం గొనిపోయి; రమ్మునికుమారుండు నిర్జలం బైన యయ్యుదపానంబున నుండి సోమపానంబు సేసినం గాని యీ దురితంబు వాయ దని తలంచి యజ్ఞసాధనంబునకుఁ బ్రతివిధులు

సంకల్పరూపంబున సంపాదించికొని క్రతువొనరించిన దేవతలు సన్నిధిసేసి హవిర్భాగంబులు గైకొనిరి. సరస్వతీజలంబు తత్కూపంబున నుద్గతంబై యా సవనపతి నుద్ధరించె; నయ్యమరులు వరం బడుగు మనిన నమ్మహాద్విజుండు. 155

ప్రతిపదార్థం: పడసి యొక్కన్ ఏతెంచునెడన్= ఆ విధంగా పొంది ఒక్కడూ వచ్చే సమయంలో; ఆ+ఏకతద్వితులు= ఆ యేకత ద్వితు లనేవారు; నిజభ్రాతఅగు= తమ సోదరుడయిన; త్రితుని= త్రితు డనే వాడిని; వంచించి= మోసంచేసి; తారు= తాము; ఆ గోవులన్= ఆ పశువులను; తొలంగన్+అడిచికొనిపోవువారుగాన్= తప్పించి తోలుకొని పోయే వారై; పాపబుద్ధికిన్= మోసపు చేష్టకు; ఉత్సహించిరి= ఆసపడ్డారు; ఆ సమయంబునన్= ఆ వేళలో; తెరువునన్= బాటలో; ఒక్క వృకంబు+ఉన్నన్= ఒక తోడేలుండగా; తద్+భయంబునన్+తొలంగన్+పోయి= దానివలన భయంతో తప్పుకొనబోయి; ప్రమాదంబునన్= ప్రమాదవశాన; త్రితుండు= త్రితుడనేవాడు; నూతన్+పడినన్= బావిలో పడగా; అతనిన్+ఉపేక్షించి= వాడిని లెక్కసేయకుండా; ధేనువులన్+కొనిపోయిరి= ఆవులను తీసికొనిపోయారు; ఆ+మునికుమారుండు= ఆ తపసి కుమారుడు; నిర్జలంబు+అయిన ఆ+ఉదపానంబునుండి= నీరులేని ఆ బావినుండి; సోమపానంబు+చేసినఁగాని= సోమరసాన్ని త్రాగితేగాని; ఈ దురితంబు= ఈ పాపం; పాయదు+అని తలంచి= పోదని భావించి; యజ్ఞసాధనంబునకున్+ప్రతినిధులు= యజ్ఞాన్ని సాగించటానికి మారువిధానాలు; సంకల్పరూపంబునన్ సంపాదించుకొని= సంకల్పమాత్రాన సంపాదించుకొని; క్రతువు+ఒనరించినన్= యజ్ఞం చేయగా; దేవతలు సన్నిధి+చేసి= దేవతలు ప్రత్యక్షమై; హవిర్భాగంబులు గైకొనిరి= యజ్ఞహవిస్సులో భాగాలను తీసికొన్నారు; సరస్వతీ జలంబు= సరస్వతీ తీర్థంలోని నీరు; తద్+కూపంబునన్+ఉద్గతంబు+ఐ= ఆ బావిలో పుట్టుకొని వచ్చి; ఆ సవనపతిన్= ఆ యజ్ఞపతిని; ఉద్ధరించెన్= గట్టెక్కించింది; ఆ+అమరులు; వరంబు+అడుగుము+అనినన్= ఆ దేవతలు వరమడుగు మనగా; ఆ+మహాద్విజుండు= ఆ గొప్ప బ్రాహ్మణుడు.

తాత్పర్యం: ఆవులను పొంది, ఒకడూ వస్తుండగా తోడబుట్టినవారయిన ఏకద్వితులు త్రితుని మోసగించి అతడి ఆవులను అపహరించి దాటుకొని పోయేవారయి పాపపుచేష్టకు ఆసక్తి చూపారు. ఆ సమయంలో దారిలో ఒక పెద్ద తోడేలుండగా భయపడి తప్పుకోబోయి ప్రమాదవశాత్తు త్రితుడు బావిలో పడగా ఆ ఇరువురూ అతడిని లెక్క చేయక ఆవులను తోలుకొనిపోయారు. ఆ తాపసబాలుడు నీరు లేని ఆ బావినుండి సోమపానం చేస్తేగాని ఈ పాపం పోదని తలచి యజ్ఞం చేయటానికి ప్రతినిధులను సంకల్పరూపంగా సంపాదించుకొని యజ్ఞం చేయగా దేవతలు ప్రత్యక్షమై హవిర్భాగాలు తీసికొన్నారు. సరస్వతీ జలం ఆ బావినుండి పుట్టి ఆ యజ్ఞపతిని కాపాడింది. ఆ దేవతలు వరమును దేనినైనా కోరుకొమ్మనగా, ఆ బ్రాహ్మణోత్తముడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'వినుఁ డుపస్పర్శ మిందుఁ జేసిన యతండు । వడయువాఁడు మహిత సోమపానఫలము
వరము నా కిది' యనుటయు వార లట్టు । లవుట సంప్రీతి మై నిచ్చి దివికిఁ జనిరి. 156

ప్రతిపదార్థం: వినుఁడు= (మీరంతా) వినండి; ఇందున్= ఈ తీర్థంలో; ఉప స్పర్శ చేసిన+అతండు= స్నానం (ఆచమనం) చేసినవాడు; మహిత= మహత్త్వంకల; సోమపానఫలము= సోమరసాన్ని త్రాగిన ఫలితాన్ని; పడయువాఁడు= పొందగలడు; ఇది నాకున్ వరము= ఇదియే నాకు (ఈయదగిన) వరం; అనుటయున్= అనగా; వారలు+అట్టులు+అవుట= వా రావిధంగా కావటాన్ని (వరమును); సంప్రీతిమైన్+ఇచ్చి= సంతోషంతో ఇచ్చి; దివికిన్+చనిరి= స్వర్గానికి వెళ్ళారు.

తాత్పర్యం: ఈ తీర్థంలో స్నానం చేసినవాడు సోమరసాన్ని త్రాగిన ఫలితం పొందినవాడు కావాలి. ఇది నేను కోరే వరం.' అనగా, వారు అట్లే అగుగాక!' అని వర మిచ్చి సంతోషంతో దేవలోకానికి వెళ్ళారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్టి యయ్యుదపానంబును సేవించి వినశనంబునకుఁ జనియెఁ; దత్తీర్థంబు హీనజాతులకుఁ బొడసూపక నశించుఁ గావున వినశనం బనం బరఁగె; మఱియు భూమికంబునకుఁ బోయె; నది యప్సరోగీతనృత్య విహారభూమి యగుట భూమికం బనఁ బ్రసిద్ధం బయ్యెఁ; బదంపడి గంధర్వతీర్థంబునకు నేఁగె; నది విశ్వావసుప్రభృతిగంధర్వతపస్సిద్ధిస్థానం; బందుండి గర్గస్రోతంబునకుఁ జనియె; నందు గర్గుండు సన్మునిసేవితుండై చిరకాలంబు వసించె; నచ్చోటు గదలి యా బలభద్రుండు. 157

ప్రతిపదార్థం: అట్టి= అంతమహిమ కల; ఆ+ఉదపానంబును సేవించి= ఆ నీటిని త్రాగుటచేత సేవించి(నవాడై); వినశనంబునకున్+చనియెన్= వినశనమనే తీర్థమున్న చోటికి వెళ్ళాడు; తద్+తీర్థంబు= ఆ తీర్థం; హీనజాతులకున్+పొడసూపక= నీచజాతులకు కానరాక; నశించున్+కావునన్= నశించిపోతుంది కనుక; వినశనంబు+అనన్+పరఁగెన్= వినశనము అనే పేరుతో ఒప్పింది; మఱియున్= ఇంకనూ; భూమికంబునకున్+పోయెన్= భూమికతీర్థానికి వెళ్ళాడు; అది= ఆచోటు; అప్సరో గీతనృత్య విహారభూమి= దేవతావేశ్యలు సంగీత నాట్యాలతో తిరిగేచోటు; అగుటన్= అగుటవలన; భూమికంబు+అనన్= భూమికమనే పేరుతో; ప్రసిద్ధంబు+అయ్యెన్= ప్రఖ్యాతి నందింది; పదంపడి= ఆ మీదట; గంధర్వ తీర్థంబునకున్+ఏఁగెన్= గంధర్వమనే తీర్థానికి వెళ్ళాడు; అది= ఆ చోటు; విశ్వావసుప్రభృతి= విశ్వావసుడు మొదలైన; గంధర్వ తపస్సిద్ధి కలిగినచోటు; అందుండి గర్గస్రోతంబునకున్+చనియెన్= గర్గస్రోతమనే పేరున్న చోటికి వెళ్ళాడు; అందున్= ఆ చోటు; గర్గుండు= గర్గమహాముని; సత్+మునిసేవితుండు+ఐ= మంచిమునులచేత సేవించబడుతూ; చిరకాలంబు= చాలకాలం; వసించెన్= కాపురమున్నాడు; ఆ+చోటున్+కదలి= ఆచోటు దాటి; ఆ బలభద్రుండు= ఆ బలరాముడు.

తాత్పర్యం: అటువంటి తీర్థాన్ని సేవించి, వినశనానికి వెళ్ళాడు. ఆ తీర్థం తక్కువ జాతివారికి కానరాకుండా నశిస్తుంది గనుక వినశనమని పిలువబడింది. ఇంకను భూమికమనే తీర్థానికి కూడ వెళ్ళాడు. అది అప్సరసలు సంగీత గీతనృత్యాలతో విహారం చేసే చోటు. ఆ తరువాత గంధర్వ తీర్థానికి వెళ్ళాడు. ఆ చోటు విశ్వావసుడు మొదలైన గంధర్వులు తపస్సిద్ధి పొందినట్టిది. అక్కడనుండి గర్గస్రోతమునకు వెళ్ళాడు. అది గర్గుడు సన్మునులచేత సేవించబడి చాలకాలం నివాసం చేసిన చోటు. అటనుండి బలరాముడు కదలి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. వినుము శంఖతీర్థమునకు నైసర్గిక । మునకు నాగధన్వమునకు వరుసఁ
జనియె; నాగధన్వ మనునది వాసుకి । స్థాన మచటఁ దొల్లి సకల సురులు. 158

ప్రతిపదార్థం: వినుము; శంఖతీర్థమునకున్; నైసర్గికమునకున్= నైసర్గికము అనే తీర్థానికీ; నాగధన్వమునకున్ వరుసన్+చనియెన్= నాగధన్వమనే చోటునకూ వరుసగా వెళ్ళాడు; నాగధన్వము+అనునది= నాగధన్వమనే పేరున్నది; వాసుకిస్థానము= (నాగేంద్రుడగు) వాసుకి ఉన్నచోటు; అచటన్; తొల్లి= అంతకు పూర్వం; సకలసురులు= దేవతలందరును.

తాత్పర్యం: శంఖతీర్థమునకూ, నైసర్గికానికీ, నాగధన్వానికీ వరుసగా వెళ్ళాడు. ఆ నాగధన్వం వాసుకికి నివాసస్థానం కావడంచేత, ఇంతకు మునుపు దేవతలందరూ అక్కడ. (తరువాతి వచనంతో అన్వయం).

వ. నాగేంద్రత్వమునకు వాసుకి నభిషేకించి; రందుండి యా నీలాంబరుండు నైమిశంబున కరిగె; నయ్యెడం దొల్లి సరస్వతి యనునేఱు దూరం బై యుండ నైమిశారణ్యవాసు లగుమునులు క్రతువు సేయం దొడంగిన; నాసరస్వతి వారల సంభావించుటకు మలంగి పాఱినకతంబునం దటసమీపం బయ్యెఁ; నవ్విశేషంబు విని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విస్మితుం డగుచు నాహలాయుధం డా తీర్థంబుఁ గొనియాడి, సప్తసారస్వతంబునకుం బోయె నచ్చట మంకణుండును మహాముని వసించుఁ దొల్లి నలినభవుసత్రంబున నైమిశారణ్యమునుల యాగంబున గయుని క్రతువున నుద్దాలకునధ్వరంబున వసిష్ఠుసప్తతంతువున గురునిసవనంబున వెండియు నొకమఱి యాపరమేష్ఠి యజ్ఞంబున హిమవత్పుష్కరాదు లైన తత్ప్రదేశంబులకు సుప్రభయుఁ గనకాక్షియు విశాలయు సురతన్వయు నోఘమాలయు సువేణియు విమలోదకయు నునునామంబుల నారీవేషయుక్తయై సరస్వతి చని యజమానసకల దేవముని సంభావన వడసె నట్టి సప్తాకారంబుల నాసంయమియాశ్రమంబునఁ బ్రవర్తించుట నది సప్తసారస్వతం బనం బరఁగె; నమ్మంకణుని చరితంబులు మఱియునుం గల వాశ్చర్యకరంబులు వినుము. 159

ప్రతిపదార్థం: నాగ+ఇంద్రత్వమునకున్= పాములకు రాజుగా; వాసుకిన్+అభిషేకించిరి= వాసుకిని అభిషేకం చేశారు; అందుండి= అక్కడనుండి; ఆ నీలాంబరుండు= నీలంరంగు గల వస్త్రాన్ని ధరించినవాడైన బలరాముడు; నైమిశంబునకున్+అరిగెన్= నైమిశ మనే పేరున్న వనానికి వెళ్ళాడు; ఆ+ఎడన్+తొల్లి సరస్వతి అను+ఏఱు= ఆ చోట పూర్వం సరస్వతిఅనే పేరున్న ఏరు; దూరంబు+ఐ+ఉండన్= చాలదూరంగా ఉండగా; నైమిశారణ్యావాసులు+అగు మునులు= నైమిశారణ్యంలో కాపురముండే తాపసులు; క్రతువు చేయన్+తొడంగినన్= యజ్ఞం చేయటాన్ని మొదలుపెట్టగా; ఆ సరస్వతి వారల సంభావించుటకున్= ఆ సరస్వతీనది వారి నాదరించటానికి; మలంగి= తిరిగి; పాఱిన+కతంబునన్= ప్రవహించిన కారణంగా; తటసమీపంబు+అయ్యెన్= తీరానికి దగ్గరైనది; ఆ+విశేషంబు విని= ఆ గొప్పను విన్నవాడై; విస్మితుండు+అగుచున్= ఆశ్చర్యంపొందుతూ; ఆ హలాయుధుండు= నాగలి ఆయుధంగా కల ఆ బలరాముడు; ఆ తీర్థంబున్+కొనియాడి= ఆ తీర్థాన్ని కీర్తించి; సప్తసరాస్వతంబునకున్+పోయెన్= సప్తసారస్వతమనే తీర్థానికి పోయాడు; అచ్చటన్= ఆ చోట; మంకణుండు+అను మహాముని వసించున్= మంకణముని ఉన్నాడు; తొల్లి= పూర్వం; నవినభవుసత్రంబునన్= బ్రహ్మయజ్ఞంలో; నైమిశారణ్యమునుల యాగంబునన్= నైమిశారణ్యంలో ఉన్న మునులు చేసి యాగంలో; గయుని క్రతువునన్= గయుడు చేసిన యజ్ఞంలో; ఉద్దాలకుని అధ్వరంబునన్= ఉద్దాలకుడి యాగంలో; వసిష్ఠుసప్తతంతువునన్= వసిష్ఠుడి యాగంలో; గయుని క్రతువునన్= గయుడు చేసిన యజ్ఞంలో; ఉద్దాలకుని అధ్వరంబునన్= ఉద్దాలకుడి యాగంలో; వసిష్ఠుసప్తతంతువునన్= వసిష్ఠుడి యాగంలో; గురుని సవనంబునన్= గురుడి యాగంలో; వెండియున్+ఒకమఱి= ఇంకొకమారు; ఆ+పరమేష్ఠి యజ్ఞంబునన్= బ్రహ్మకావించే ఆ యజ్ఞంలో; హిమవత్+పుష్కరాదులు+ఐన= హిమవంతము, పుష్కరం మొదలైన; తద్+ప్రదేశంబులకున్= ఆ చోటులకు; సుప్రభయు; కనకాక్షియు; విశాలయు; సురతన్వయు; ఓఘమాలయు; సువేణియు; విమలోదకయు; అను నామంబులన్= అనే పేర్లతో; నారీవేషయుక్త+ఐ= స్త్రీకి ఆమోదయోగ్యమయ్యే వేషంతో; సరస్వతి చని= సరస్వతి(నది) వెళ్ళి; యజమాన= యజ్ఞకర్తయొక్కయు, సకల దేవముని, సంభావన పడసెన్= అందరు దేవతలయొక్క, మునులయొక్క, మర్యాదలను పొందింది; అట్టిసప్త+ఆకారంబులన్= ఆ విధంగా ఏడు రూపాలతో; ఆ సంయమి ఆశ్రయంబునన్+ప్రర్తించుటన్= ఆ తాపసి ఆశ్రమంలో తిరగటంవలన; అది= ఆ నది; సప్తసారస్వతంబు+అనన్+పరఁగెన్= సప్త సారస్వతముగా ఒప్పిఉన్నది; ఆ+మంకణుని చరితంబులు మఱియునున్ కలవు= ఆ మంకణముని గాథలు ఇంకా ఉన్నవి; ఆశ్చర్యకరంబులు= అబ్బురమును కలిగించేవి; వినుము.

తాత్పర్యం: పాములకు రాజైనట్లు వాసుకిని అభిషేకించారు. అక్కడినుండి ఆ నీలాంబరుడు (బలరాముడు) నైమిశానికి వెళ్ళాడు. మునుపు సరస్వతి అనే నది దూరంగా ఉండగా నైమిశారణ్యంలో ఉండే తాపసులు యజ్ఞం చేయటం మొదలు పెట్టగానే ఆ సరస్వతి వారిని గౌరవించటానికై తిరిగి పారిన కారణాన అది తటసమీపమైనది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ ప్రత్యేకతను విని ఆశ్చర్యపడి, బలరాముడు ఆ తీర్థాన్ని పొగడి సప్తసారస్వతానికి వెళ్ళాడు. ఆ చోట మంకణుడనే గొప్ప తపస్వి పూర్వముండేవాడు. పూర్వం బ్రహ్మచేసిన యాగంలో, నైమిశంలోని మునులయాగంలో, గయుడి యజ్ఞంలో, ఉద్దాలకుడి యజ్ఞంలో, వసిష్ఠుడి సప్తతంతువులో, గురుడి యాగంలో, ఇంకా ఒకమారు బ్రహ్మయజ్ఞంలో, హిమవంతం, పుష్కరం మొదలైన చోటులలోను, సుప్రభ, కనకాక్షి, విశాల, సురతన్వ, ఓఘమాల, సువేణి, విమలోదక-అనే పేర్లతో స్త్రీవేషంలో సరస్వతి వెళ్ళి, యజ్ఞకర్తలవలననూ, సమస్తదేవతలవలననూ, మునులవలననూ గౌరవం పొందింది. ఆ విధంగా ఏడు రూపాలతో ఆ తపస్వి ఆశ్రమంలో తిరగటంచేత సప్తసారస్వతమని ఒప్పింది. ఆ మంకణుని గాథలు ఆశ్చర్యాన్ని కల్గించేవి ఇంకనూ ఉన్నవి. వినుము.

మంకణమహాముని మాహాత్మ్యాభివర్ణనము (సం. 9-37-1)

సీ. అతఁడు సరస్వతి నవగాహనము సేయు । చుండి యా చేరువ నోర్తు తడుపు
గట్టక నీళ్ళాడఁగాఁ జూడఁ దనదు శు । క్లము నిర్గమించిన ఘటసురక్షి
తము సేయ సప్తభేదము లొంది యది సత్పు । రుషు లైరి వారు మరుద్గణంబు
నకు సంజననకారణం బైరి; విను మొక్క । నాఁ డ త్తపస్వి వ్రేల్నాటి దర్భ

ఆ. గంటిఁ గూరయసరు గాఱిన నర్తించె । నతఁడు తపముసిద్ధి కాత్మఁ బొంగి
జగము లెల్లఁ దాన సంక్షోభ మొందె; ని । ర్జరులు భీతిఁ జనిరి శంభుఁ గాన. 160

ప్రతిపదార్థం: అతఁడు= ఆ మంకణుడు; సరస్వతిన్+అవగాహనమున్+చేయుచుండి= సరస్వతీ నదిలో స్నానంచేస్తూ ఉండగా; ఆ చేరువన్= ఆ సమీపంలో; ఓర్తు= ఒకర్తె; తడుపు+కట్టక= వస్త్రం కట్టుకొనకుండా; నీళ్ళాడఁగాన్= స్నానమాడగా; చూడన్= చూడగా(చూడటంవలన); తనదు శుక్లము= తనవీర్యం; నిర్గమించినన్= వెలువడగా; ఘటసురక్షితము+చేయన్= కుండలో భద్రంచేయగా; సప్తభేదములు+ఒంది= ఏడు భాగాలుగా అయి; సత్పురుషులు+ఐరి= పుణ్యవంతులైనారు; వారు= ఆ ఏడ్గురును; మరుద్గణంబులకున్= దేవతలకు; సంజననకారణంబు+ఐరి= పుట్టుకకు కారణమైనారు; వినుము= ఇంకను వినుము; ఒక్కనాఁడు= ఒకానొక దినాన; ఆ తపస్వి= ఆ మునియొక్క; వ్రేల్+నాటి= వ్రేలియందు గ్రుచ్చుకొని; దర్భగంటిన్= దర్భచేత ఏర్పడిన ఆ గాయంనుండి; కూర+అసరు= శాకరసం; కాఱినన్= స్రవించగా; అతఁడు= ఆ ముని; తపము సిద్ధికి= తపస్సిద్ధికి; ఆత్మన్+పొంగి= మనసులో సంతసించి; నర్తించెన్= నాట్యమాడాడు; జగములు+ఎల్లన్= అన్ని లోకాలు; దానన్+సంక్షోభము+ ఒందెన్= దానివలన అల్లకల్లోలమయ్యాయి; నిర్జరులు= దేవతలు; భీతిన్= భయంతో; శంభున్+కానన్+చనిరి= పరమేశ్వరుడిని చూడటానికి పోయారు.

తాత్పర్యం: ఆ మంకణుడు సరస్వతీనదిలో స్నానం చేస్తుండగా సమీపంలో ఒకతె గుడ్డ కట్టుకొనకుండా స్నానం చేయటం చూడగా తననుండి వీర్యం వెలువడింది. దానిని కుండలో భద్రం చేయగా అది ఏడు భాగాలై సత్పురుషులయ్యారు. దేవతలపుట్టుకకు వారే కారణ మయ్యారు. అందువలన ప్రపంచ మంతా అల్లకల్లోలమైనది. దేవతలు భయంతో శివుడిని చూడటానికి వెళ్ళారు.

వ. కని యంతయు నెఱింగించిన నద్దేవోత్తముం డాభూదేవోత్తముపాలి కరిగి 'యిది యెంతటి విశేషంబు? దపంబు లిట్టివే? నర్తించుట మాను' మని పలికి తన యంగుటంబు వ్రేలం గీఱిన నందు భస్మంబు గాఱిన నాసంయమి సిగ్గువడి దండప్రణామంబు సేసి. 161

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కని= చూచి; అంతయున్= మొత్తం; ఎఱింగించినన్= మొత్తం తెలుపగా; ఆ+దేవ+ఉత్తముండు= ఆ దేవతలలో ఉత్తముడు(శ్రేష్ఠుడు); ఆ భూదేవ+ఉత్తము పాలికిన్+అరిగి= ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుని వద్దకు వెళ్ళి; ఇది ఎంతటి విశేషంబు!= ఇది ఏమంత గొప్ప విషయం!; తపంబులు+ఇట్టివే?= తపస్సులంటే ఇవేనా?; నర్తించుట మానుము+అని పలికి= నాట్యం చేయటం నిలుపు మని చెప్పి; తన అంగుటంబున్ వ్రేలన్+గీఱినన్= తన బొటనవ్రేలిని వ్రేలితో గీరగా; అందున్ భస్మంబు+ కాఱినన్= దానినుండి బూడిద కారగా; ఆ సంయమి సిగ్గుపడి= ఆ తాపసి సిగ్గుపడి; దండప్రణామంబు+చేసి= దండమువలె నేలపైబడి నమస్కారం చేసి.

తాత్పర్యం: (శంభుడిని) చూచి అంతా తెలుపగా ఆ దేవోత్తముడు ఆ బ్రాహ్మణోత్తముడి వద్దకు వెళ్ళి, 'ఇది ఏమంత శ్రేష్ఠమైనది! తపస్సు లిటువంటివా? నాట్యం చేయటం నిలిపివేయుము -' అని చెప్పి తన బొటనవ్రేలిని వ్రేలితో గీరగా - అందుండి భస్మం కారింది. దానికి ఆ తపస్వి సిగ్గుపడి సాష్టాంగ నమస్కారం చేశాడు.

ఆ. 'దైవ మెల్లఁ దలఁప నీవ సమస్తజ । గంబులకును, నేడుగడయు నీవ;
కర్మఫలదుఁడవును గర్మప్రదుండవు । నీవ కరుణ నన్నుఁ గావు మభవ!' 162

ప్రతిపదార్థం: అభవ!= పుట్టుక లేనివాడా! ఈశ్వరా!; ఎల్లన్ తలఁపన్= అంతా తలచగా; దైవము; సమస్త జగంబులకును నీవు+అ= అన్ని లోకాలకును నీవే; ఏడుగడయున్+నీవు+అ= రక్షకుడవు కూడా నీవే; కర్మఫలదుఁడవును+కర్మప్రదుండవును= చేసే పనులకు ఫలితమును, చేయవలసిన పనిని చేయించువాడవును; ఈవ= నీవే; నన్నున్+కరుణన్= నన్ను దయతో; కావుము= కాపాడుము.

తాత్పర్యం: 'అంతా తలపోయగా నీవే దైవం. ఆధారం కూడా నీవే. పనులను చేయించే వాడవు, చేసినదానికి ఫలితాన్ని ఇచ్చేవాడవూ నీవే. దయతో నన్ను కాపాడుము.'

వ. అని వెండియు ననేక ప్రకారంబులం బ్రశంసించినం బ్రసన్నుండై పశుపతి యతనికిఁ దపఃప్రభావం బక్షీణంబు గా వరం బిచ్చి చనియె; నమ్మహామును నృత్యంబు మానిన జగంబుల సంక్షోభంబు శాంతం బయ్యెఁ; నట్టి యమ్మహాత్మునినివాసం బైన సప్తసారస్వతంబున నుండి యాసీరి యౌశనంబునకుం బోయె; వినుము! తొల్లి రఘురామునిచేతఁ జచ్చిన మహోదరుం డను నసుర తలపునుక యొక్క తపస్వికాలఁ దగిలి పుచ్చ రాకున్న నతండు వేదనం బొందుచుండం గని యార్యులు 'నౌశనం బనుతీర్థంబు శక్రుండు దపంబుసేసినచో టందుఁ బొమ్ము; నీదురితంబు వాయు' ననిన మహోదరనామధేయుండగు నాసంయమి యచ్చటికిం జనినఁ గపాలంబు ముక్తం బయ్యెఁ; దానంజేసి యది కపాలమోచనం బనం బరఁగు; నచ్చోటు గదలి పృథూదకంబున కరిగెఁ; దదీయ విశేషంబు వినుము! గాధి యను మహారాజు కొడుకు విశ్వామిత్రుం డనునతండు. 163

ప్రతిపదార్థం: అని= అంటూ; వెండియున్= ఇంకను; అనేక ప్రకారంబులన్= నానావిధాలుగా; ప్రశంసించినన్= కీర్తించగా; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహపరుడై; పశుపతి= పరమశివుడు; అతనికిన్= ఆ మునికి; తపః ప్రభావంబు= తపశ్శక్తి; అక్షీణంబు+కాన్= నాశనం కాకుండా; వరంబు+ఇచ్చి చనియెన్= వరమొసగి వెళ్ళాడు; ఆ+మహాముని= ఆ గొప్ప తపసి; నృత్యంబు= నాట్యమును; మానినన్= మానివేయగా; జగంబుల సంక్షోభంబు= లోకాలలో అలజడి; శాంతంబు అయ్యెన్= శాంతించింది; అట్టి ఆ+మహాత్ముని నివాసం బైన; సప్త సారస్వతంబున నుండి= సప్తసారస్వతమునుండి; ఆ సీరి= ఆ బలరాముడు; ఔశనంబునకున్+ పోయెన్= ఔశనమనే తీర్థమునకు వెళ్ళాడు; వినుము; తొల్లి= ఇదివరలో; రఘురామునిచేతన్= రఘురాముడిచేత; చచ్చిన=

చనిపోయిన; మహోదరుండు+అను అసుర= మహోదరుడనే రాకాసి; తలపునుక= తలపుర్రె; ఒక్కతపస్వి కాలన్+తగిలి= ఒక తాపసి కాలికి తగిలి; పుచ్చ రాకున్నన్= తీసివేయగాకుండగా; అతండు వేదనన్+పొందుచుండన్+కని= ఆతడు బాధపడుతూ ఉండగా చూచి; ఆర్యులు= పూజ్యులు; సరస్వతిని= సరస్వతీ తీర్థమున; ఔశనం బను తీర్థంబు= ఔశన తీర్థం; శక్రుండు= ఇంద్రుఁడు; తపంబు సేసిన చోటు; అందున్+పొమ్ము= ఆ చోటునకు పోవలసినది; నీ దురితంబు+పాయున్+అనినన్= నీ పాపాలు పోతాయనగా; అచ్చటికిన్+చనినన్= ఆ చోటునకు పోగా; కపాలంబు ముక్తంబు+అయ్యెన్= కపాలం వదలివేసింది; దానన్+చేసి= అందువలన; అది కపాలమోచనంబు+అనన్+పరఁగున్= దానికి కపాలమోచనమని పేరు వచ్చింది; ఆ+చోటు వదలి= ఆ స్థానాన్ని వదలి; పృథూదకంబునకున్+చనియెన్= పృథూదక తీర్థానికి వెళ్ళాడు; తదీయ విశేషంబు వినుము= దానికి సంబంధించిన విశేషం వినుము; గాధిఅను మహారాజు కొడుకు= గాధిరాజు కుమారుడు; విశ్వామిత్రుండు+అను+అతండు= విశ్వామిత్రు డనేవాడు.

తాత్పర్యం: అని ఇంకను అనేక విధాలుగా కీర్తించగా ప్రత్యక్షమై పరమశివుడు అతడికి తపశ్శక్తి నశించకుండా వరమిచ్చి వెళ్ళాడు. ఆ తాపసి నాట్యాన్ని మానివేయగా ప్రపంచంలోని అలజడి శాంతించింది. అటువంటి ఆ మహనీయుడికి ఉనికిపట్టయిన ఏడు సరస్వతీ తీర్థాలనుండి ఆ బలరాముడు ఔశనమునకు పోయాడు. ఆ విషయాన్ని వినుము. పూర్వం రఘురాముడిచేత చనిపోయిన మహోదరుడనే రాక్షసుడి తల పుర్రె ఒక తపస్వి కాలికి తగిలి దానిని తొలగించటానికి సాధ్యంకాక అతడు బాధపడుతుండగా చూచిన పెద్దలు 'ఔశనతీర్థంలో ఇంద్రుడు తపం చేసినచోటునకు పొమ్ము. నీ పాపములు తొలగిపోతాయి' అనగా ఆ ముని ఆ చోటునకు పోగా పుర్రెఎముక వదలింది. అందుచేత అది కపాల మోచన మని పిలువబడుతున్నది. బలరాముడు ఆచోటును వదలి పృథూదక తీర్థానికి వెళ్ళాడు. దాని గొప్పతనాన్ని వినుము. గాధి అనే మహారాజు కుమారుడు విశ్వామిత్రు డనేవాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. తండ్రి యట్ల సకలధాత్రీశుఁ డై యుండి । దనుజమథనమునకు దండు వెడలి
యరుగునెడ వసిష్ఠునాశ్రమంబున పొంత । విడియఁ బరిజనములు వినయ మెడలి. 164

ప్రతిపదార్థం: తండ్రి+అట్లు+అ= తండ్రి మాదిరి; సకలధాత్రీశుఁడు ఐ ఉండి= సమస్త భూమికిని రాజైఉండి; దనుజమథనమునకున్= దానవులను చంపటానికి; దండు వెడలి= సేనతో వెళ్ళి; అరుగు+ఎడన్= వెళ్ళేటప్పుడు; వసిష్ఠు+ ఆశ్రమంబున పొంతన్= వసిష్ఠుడి ఆశ్రమానికి దగ్గర; విడియన్= నిలువగా(విడిసిఉండగా); పరిజనములు= సేవకులు; వినయము+ఎడలి= పరివారం అడకువ లేక.

తాత్పర్యం: సమస్త భూలోకనాథు డైన తన తండ్రివలెనే దానవులను చంపటానికి సేనతో వెళ్ళేటపుడు వసిష్ఠుడి ఆశ్రమంప్రక్క విడిసిన సేనలు క్రమం తప్పి. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అందు దుర్నయంబు లాచరించిన నమ్మునిని కోపించి నిజహోమధేనువు నాలోకించి 'నీ బలంబు పనుపు' మనిన నది దనమాహాత్మ్యంబున నచట నావహిల్లిన ఘోరాకారు లగు వీరులఁ బనుప వార లారాజు వరూథిని మడియించిన శేషించిన జనంబులు పలుగడలం పాఱి; రట్లు దురవస్థం బొందు నాసేనం జూచి యగ్గాధినందనుం డెల్ల శక్తులకంటెఁ దపశ్శక్తి యెక్కుడగుట యెఱింగి యాపృథూదకంబునఁ దపంబు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సేయుచుండ దానికి దేవపతి విఘ్నంబు సేయ, మఱియు నియమ నిష్ఠుండై బ్రహ్మచేత బ్రాహ్మణ్యంబును బడసె నత్తీర్థంబునుండి యాబలభద్రుండు బకాశ్రమంబున కరిగె; నయ్యెడఁ బకుండను మునీంద్రుండు తొల్లి. 165

ప్రతిపదార్థం: అందు దుర్నయంబులు+ఆచరించినన్= ఆ ఆశ్రమం దగ్గర నీతిమాలిన పనులు చేయగా; ఆ+ముని= ఆ వసిష్ఠుడు; కోపించి; నిజ= తన; హోమధేనువును; ఆలోకించి= చూచి; నీ బలంబున్; నీ శక్తిని; పనుపుము+అనినన్= ఆజ్ఞాపించుము; అనగా; అది= ఆ ఆవు; తన మాహాత్మ్యంబునన్= తన శక్తితో; అచటన్+ఆవహిల్లిన= అక్కడ కానవచ్చిన; ఘోర+ఆకారులు+అగు= భయంకరు లయిన; వీరులన్+పనుపన్= వీరులను పంపగా; వారలు= ఆ వీరులు; ఆ రాజు వరూథినిన్= ఆ రాజుసేనను; మడియించినన్= చంపగా; శేషించిన జనంబులు= మిగిలిన వారు; పలుగడలన్+పాఱిరి= అనేక దిక్కులకు పరుగుతీశారు; అట్లు దురవస్థన్+చెందు ఆసేనన్+చూచి= ఆ విధంగా కష్టపడే ఆ సేనను చూచి; ఆ+గాధినందనుండు= ఆ గాధిరాజకుమారుడు; ఎల్లశక్తులకంటెన్= అన్ని బలాలకంటే; తపశ్శక్తి= తపోబలం; ఎక్కుడు+అగుటన్= గొప్పది కావటం; ఎఱింగి= తెలిసికొని; ఆ పృథూదకంబునన్+తపంబు చేయుచుండన్= ఆ పృథూదక తీర్థంలో తపస్సు చేస్తూ ఉండగా; దానికిన్= ఆ తపస్సునకు; దేవపతి= ఇంద్రుడు; విఘ్నంబు+చేయన్= అడ్డంకులు కల్గించగా; మఱియున్ నియమనిష్ఠుండు+ఐ= నియమంతో ఇంకా పట్టుదల కలవాడై; బ్రహ్మచేత బ్రాహ్మణ్యంబును పడసెన్= బ్రహ్మదేవుడి వలన బ్రాహ్మణ్యమును పొందాడు; ఆ+తీర్థంబున నుండి= ఆ తీర్థం వద్దనుండి; బలరాముండు; బక+ఆశ్రమంబునకున్+అరిగెన్= బకాశ్రమానికి వెళ్ళాడు; ఆ+ఎడన్= ఆ చోట; బకుండు+అను ముని+ఇంద్రుండు= బకు డనే తాపసి; తొల్లి= పూర్వం.

తాత్పర్యం: ఆ వసిష్ఠుడి ఆశ్రమంలో చెడ్డపనులను చేసిన ఆ తాపసి కోపించి తమ యజ్ఞధేనువును పిలిచి 'నీ శక్తిని చూపు' మన్నాడు. ఆ ఆవు భయంకరాకారులయిన వీరులను పంపగా వా రా రాజు సేనను చంపగా మిగిలినవారు పలుదిక్కులకు పరుగెత్తారు. ఆ విధంగా దురవస్థ నందిన తన సేనను జూచి ఆ గాధికుమారుడు అన్ని బలాలకంటె తపోబలమే గొప్పదని తెలిసికొని ఆ పృథూదక తీర్థంలో తపస్సు చేశాడు. ఆ తపస్సునకు దేవరాజయిన ఇంద్రుడు అడ్డంకులు కలిగించాడు. ఇంకను బ్రహ్మనుగూర్చి నియమంతో పట్టుదలగా ఆతడు తపస్సుచేసి బ్రహ్మత్వమును పొందాడు. అట్టి తీర్థంనుండి బలరాముడు బకుడి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ చోట బకుడనే తాపసి తొల్లిటి కాలంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ధృతరాష్ట్రుం డను ధరణీ । పతి దన్ను నధఃకరించి పలికినఁ గోపా
న్వితుఁడై హోమ మొనర్చెను । ఘృతనరమాంసముల నతనికిం గీ డొదవన్. 166

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు+అను ధరణీపతి= ధృతరాష్ట్రు డనే పేరు గల రాజు; తన్నున్+అధఃకరించి పలికినన్= తనను(బకుడిని) తిరస్కరించి మాటాడగా; కోప+అన్వితుడై= కోపం కలవాడై; ఘృత నరమాంసములన్= నేతితోను, మానవమాంసంతోను; అతనికిన్+కీడు+ఒదవన్= ఆ ధృతరాష్ట్రుడికి కీడు కలిగేటందుకు; హోమము+ఒనర్చెను= హోమం చేశాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రు డనే రాజు బకుడిని తిరస్కరించాడు. దానికి కోపంతో అతనికి హాని కలగటానికి ఆ ముని నేతితోను, నరమాంసంతోను హోమంచేశాడు.

ఆ. నఱుకఁ బడిన యడవి తెఱఁగున నతని రా । ష్ట్రంబు సకల జంతు సముదయములు
మడియ విన్ననయ్యు నడలి యా భూపతి । యత్తపస్విపాలి కరుగుదెంచి. 167

ప్రతిపదార్థం: నఱుకఁబడిన= నరికివేయబడ్డ; అడవి; తెఱఁగునన్= మాదిరిగా; అతని; రాష్ట్రంబు= దేశంలోని; సకల జంతు సముదయములు= ప్రాణికోటి అంతయు; మడియన్= నశించగా; విన్నన+అయ్యున్= చిన్నబోయి వైవర్ణ్యం చెంది; అడలి= భయపడి; ఆ+తపస్వి= ఆ ముని; పాలికిన్= వద్దకు; ఆ భూపతి= ఆ ధృతరాష్ట్రరాజు; అరుగుదెంచి= వచ్చి.

తాత్పర్యం: నరికివేసిన అడవివలె ప్రాణికోటి అంతా నశించగా అతని దేశం చిన్నపోగా ఆ రాజు భయపడి ఆ తాపసివద్దకు వచ్చి (తరువాతి వచనంతో అన్వయం).

వ. **దండప్రణామం బాచరించి పెక్కుభంగులఁ దేలించి మున్ను ధేను నిమిత్తం బగుదుర్భాషణంబుల నింత పుట్టుటం జేసి యాసంయమికి ననేక ధేనువుల నొసంగి దురితోపశాంతి యొనర్చె; నట్టి బకాశ్రమంబున నుండి రేవతీరమణుండు యయాతంబునకుం బోయె నందు యయాతి యజ్ఞంబున భోజనసమయంబున ఘృతదుగ్ధాదులయందు విప్రుం డెయ్యది గోరిన నది యెల్ల సరస్వతి సంపూర్ణ మనోరథంబు గా నొసంగుచు వచ్చె; నయ్యెడఁ గదలి వసిష్ఠావగాహంబునకు వచ్చెఁ; దత్ప్రదేశంబు దొల్లి విశ్వామిత్రునాశ్రమం; బతండు వసిష్ఠునెడఁ దపోవిషయమత్సరంబునఁ గుపితుండై.** **168**

ప్రతిపదార్థం: దండప్రణామంబు+ఆచరించి= దండం వలె సాష్టాంగంగా నమస్కారం చేసి; పెక్కుభంగుల తేలించి= అనేక విధాలుగా సంతోషపరిచి; మున్ను= అదివరకు; ధేనునిమిత్తంబు+అగు= ఆవు కారణంగా కల్గిన; దుర్భాషణంబులన్= చెడ్డమాటలవలన; ఇంత+పుట్టుటన్+చేసి= ఇంత(కష్టం) కలగటంచేత; ఆ సంయమికిన్= ఆ తాపసికి; అనేక ధేనువులన్+ఒసంగి= ఎన్నో ఆవుల నిచ్చి; దురిత+ఉపశాంతి+ఒనర్చెన్= పాపమునకు శాంతి కల్గించినాడు; అట్టి బక+ఆశ్రమంబుననుండి= అటువంటి శక్తికల బకుడి తపోవనమునుండి; రేవతీరమణుండు= రేవతి ప్రియుడయిన బలరాముడు; యయాతంబునకున్+పోయెన్= యయాతమనే చోటికి వెళ్ళాడు; అందున్= ఆ చోట; యయాతియజ్ఞంబునన్= యయాతి చేస్తున్న యాగంలో; భోజన సమయంబునన్= అన్నం తినేటప్పుడు; ఘృతదుగ్ధాదులయందున్= నేతిలోను, పాలలోను (ఈ మొదలయినవానిలో); ఏ+అది కోరినన్= దేని నాశిస్తే; అది ఎల్లన్= వాటినంతను; సరస్వతి సంపూర్ణమనోరథంబుగాన్+ఒసంగుచున్= సరస్వతీ తీర్థం నిండుగా కోరికలు తీరేటట్లు ఇస్తూ; వచ్చెన్= వచ్చినది; ఆ+ఎడన్+కదలి= ఆ చోటునుండి బయలుదేరి; వసిష్ఠ+అవగాహంబునకున్ వచ్చెన్= వసిష్ఠతీర్థానికి వచ్చాడు; తద్+ప్రదేశంబు= ఆ చోటు; తొల్లి విశ్వామిత్రుఆశ్రమంబు= వెనుక విశ్వామిత్ర మహర్షి తపోవనం; అతండు= ఆ విశ్వామిత్రుడు; వసిష్ఠున్+ఎడన్= వసిష్ఠుడి మీద; తపోవిషయమత్సరంబునన్+కుపితుండు+ఐ= తపస్సునకు సంబంధించిన అసూయతో కోపం కలవాడై.

తాత్పర్యం: (ధృతరాష్ట్రరాజు బకుడికి నమస్కారం చేశాడు). సాష్టాంగ నమస్కారం చేసి అనేక విధాలుగా సంతృప్తి పరచి, గతంలో ఆవు కారణంగా (కష్టాలను తలచుకొని) దుర్భాషణముల వలన కలిగిన దానిని తలచుకొని ఆ తాపసికి ఎన్నో ఆవుల నిచ్చి పాపమును పోగొట్టుకొన్నాడు. అటువంటి బకాశ్రమం నుండి యయాతమనే చోటుకు బలరాముడు వెళ్ళాడు. అక్కడ యయాతి చేసే యజ్ఞంలో భోజన వేళలో నేతులు, పాలు బ్రాహ్మణుడు ఏది కోరిన దానినంతా సరస్వతి నిండయిన మనస్తృప్తితో ఇస్తూ వచ్చింది. ఆ చోటు వదలి వసిష్ఠ తీర్థానికి వెళ్ళాడు. మును పది విశ్వామిత్రుడి ఆశ్రమం. ఆ విశ్వామిత్రుడు తపోవిషయంగా వసిష్ఠుని యెడ అసూయతో కోపించినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **అతని వధించుటకై సరస్వతి మదిఁ । దలఁచిన నానది తత్‌క్షణంబ**
సౌమ్యవేషంబునఁ జనుదెంచి నిభృత యై । పని యేమి? యనిన నమ్ముని వసిష్ఠుఁ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గొనిరమ్ము నాకడ కని పంచెఁ; బంచిన । వార లిద్దఱ తపోవైభవంబు
నకు భయమందుచు నరనాథ యరిగి వ । సిష్ఠున కప్పని సెప్పెఁ దెలియ

తే. నాతఁ డవ్వాహినికి నిట్టు లనియె 'నన్ను । నీవు గొనిపోక తక్కిన నీకు శాప
మిచ్చు నగ్గాధిసుతుఁడు దదిచ్ఛ సలుపు । మించు కేనియుఁ గొంకక యెప్పడైన. 169

ప్రతిపదార్థం: అతనిన్ వధించుటకై= ఆ వసిష్ఠుడిని చంపటానికి; మదిన్+తలంచినన్= (విశ్వామిత్రుడు) మనసులో తలచుకొనగా; ఆ నది= ఆ సరస్వతి; తత్క్షణంబ= వెంటనే; సౌమ్యవేషంబునన్+చనుదెంచి= శాంతమగు వేషంతో వచ్చి; నిభృత+ఐ= అడకువ కలదిగా; పని+ఏమి+అనినన్= తాను చేయవలసిన కార్యమేమి అని అడుగగా; ఆ+ముని= ఆ విశ్వామిత్రముని; వసిష్ఠున్+కొని నాకడకున్ రమ్ము= వసిష్ఠుడిని నా వద్దకు తీసికొనిరమ్ము; అని పంచెన్= అన్న ఆజ్ఞతో పంపాడు; పంచినన్= (అట్లు) పంపగా; వారల+ఇద్దఱ తపోవైభవంబునకున్+భయమందుచు= ఆ ఇద్దరి (వసిష్ఠ విశ్వామిత్రుల) తపశ్శక్తికి భయపడుతూ; నరనాథ!= ఓ రజా!; అరిగి= వెళ్ళి; వసిష్ఠునకున్+ఆ+పని తెలియన్ చెప్పెన్= వసిష్ఠునకా కార్యమును చెప్పింది; ఆతఁడు+ఆ+వాహినికిన్+ ఇట్టులు+అనియెన్= ఆ వసిష్ఠు డానదితో ఈ విధంగా అన్నాడు; నన్నున్; నీవు; కొనిపోక తక్కినన్= పిలిచికొని పోకపోతే; నీకున్; ఆ+గాధిసుతుండు= ఆ గాధికొడుకు; శాపము+ఇచ్చున్= శాపమిస్తాడు; ఇంచుక+ఏనియున్+కొంకక= కొంచెంకూడా సందేహించకుండా; ఎప్పుడైనన్= ఏ సమయంలో నైనా; తదిచ్ఛ సలుపుము= ఆ గాధేయుడి కోర్కెను నెరవేర్చుము.

తాత్పర్యం: వసిష్ఠుడిని చంపటానికై విశ్వామిత్రుడు తన మనసులో తలచుకొన్నాడు. ఆ సరస్వతీనదిని తలచుకొనగా వెంటనే శాంతమూర్తిగా వినయంతో వచ్చి (ఆ విశ్వామిత్రుడిని) తాను చేయనగు పని ఏమో అడిగింది. దాని కాతడు వెంటనే వసిష్ఠుడిని తన వద్దకు పిలిచికొని రమ్మన్నాడు. ఆ ఉత్తరువు విని ఆ నది ఇర్వురి తపశ్శక్తికి భయపడింది. ఓ రాజా! ఆ నది వెళ్ళి వసిష్ఠున కా విషయం చెప్పింది. వసిష్ఠు డా నదీమతల్లితో ఇట్లా అన్నాడు: 'నన్ను నీవు పిలుచుకొనిపోకపోతే నీ కా విశ్వామిత్రుడు శాపమిస్తాడు. వాని కోరిక ప్రకారం ఏ మాత్రం సందేహించకుండా ఆ పనిని చేయుము.'

వ. అని యనుజ్ఞ యిచ్చిన సరస్వతి యత్తపస్వి తనచేరువ నొకప్పుడు జపయుక్తుండై యుండం గూలాపహరణంబు సేసి వఱుత నమ్మహాత్ముం గొనిపోయిన, నతం డాంగిరసమంత్రముల నత్తరంగిణిం బ్రణుతించె; నదియు సంప్రీత యగుచు నమ్ముని విశ్వామిత్రునకు సన్నిహితుం జేసిన, నతని నగ్గాధిసూనుండు వధియింప సాధనం బన్వేషించు నాలోన వంచించి యా ప్రవాహం బవ్వసిష్ఠుఁ దొలంగించినఁ గోపించి విశ్వామిత్రుండు 'శోణిత వాహిని వగు' మని శపించిన నొక్కసంవత్సరం బత్తటిని దైత్యసేవితయై యుండె; నత్తీర్థంబునకుఁ గొందఱు మును లేతెంచి యా దురవస్థ నాలోకించి. 170

ప్రతిపదార్థం: అని= అంటూ; అనుజ్ఞ ఇచ్చినన్= ఆమోదమును తెలియజేయగా (ఇష్టంతో ఆమోదమును తెలుపగా); సరస్వతి= ఆ సరస్వతీ నది; ఆ+తపస్వి= ఆ ముని; తన చేరువన్= తన సమీపంలో; ఒకప్పుడు= ఒకనాడు; జపయుక్తుండు+ఐ ఉండన్= జపంచేసికొంటూ ఉండగా; కూలాపహరణంబు+చేసి= ఆ గట్టును తెంచి; అఱుతన్= మెడపై; ఆ+మహాత్మున్+ కొనిపోయినన్= ఆ తాపసిని తీసికొనిపోగా; అతండు+ఆంగిరసమంత్రంబులన్= ఆ వసిష్ఠుడు ఆంగిరసమంత్రాలతో; ఆ+తరంగిణిన్= ఆ నదిని; ప్రస్తుతించెన్= ప్రార్థించాడు; అదియున్= ఆ నదియు; సంప్రీతఅగుచున్= సంతోషమందుచు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ+మునిన్= ఆ తాపసి అయిన వసిష్ఠుడిని; విశ్వామిత్రునకున్ సన్నిహితున్+చేసినన్= విశ్వామిత్రుడికి దగ్గరచేయగా; అతనిని= ఆ వసిష్ఠుడిని; ఆ+గాధిసూనుండు= ఆ విశ్వామిత్రుడు; వధియించు సాధనంబు= చంపుట కవసరమైన ఆయుధాన్ని; అన్వేషించున్+ఆలోనన్= వెదికేటంతలోగా; వంచించి= మోసంచేసి; ఆ ప్రవాహంబు= ఆ నది; ఆ+వసిష్ఠున్+తొలఁగించినన్= ఆ వసిష్ఠుడిని తప్పించగా; కోపించి విశ్వామిత్రుండు= విశ్వామిత్రుడు కోపం చేసికొని; శోణితవాహిని వగుము+అని= నెత్రుటేరువు కమ్మని; శపించినన్= శాపమీయగా; ఒక్క సంవత్సరంబు+అత్తటిని= ఒక ఏడాదిపాటు ఆనది; దైత్యసేవితయై ఉండెన్= రాకాసులతో సేవించబడుతూ ఉండంది; ఆ తీర్థంబునకున్= ఆ తీర్థానికి; కొందఱు మునులు= తాపసులు కొంతమంది; ఏతెంచి= వచ్చి; ఆ దురవస్థన్= ఆ కష్టమైన స్థితిని; ఆలోకించి= చూచినవారై.

తాత్పర్యం: అని చెబుతూ ఉత్తరువులీయగా సరస్వతీనది తన సమీపంలో ఆ తపసి ఒకానొకనాడు జపం చేస్తూ ఉండగా ఆ గట్టును కోసి భుజంమీద మహనీయుడిని తీసికొనిపోగా వసిష్ఠుడు అంగీరస మంత్ర జపములను జపిస్తూ ఆ నదీమతల్లిని పొగడాడు. అందుచే ఆ నది అతడిని విశ్వామిత్రుడికి దగ్గర చేయగా ఆ విశ్వామిత్రుడు అతడిని చంపటానికై మార్గాలను వెదకుతుండగా వంచనతో ఆ ఏరు వసిష్ఠుడిని తప్పించింది. విశ్వామిత్రు డా ఏరును నెత్రుటేరుగా కమ్మని శపించాడు. ఒక్క సంవత్సరం పాటు ఆ ఏరు రాక్షసులచేత సేవించబడింది. ఆ తీర్థానికి కొంతమంది తాపసులు వచ్చి ఆ కష్టదశను చూచి(నారు). (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **అమ్మహానది నడిగి వా రత్తెఱంగు । దెలిసి నిజయత్నబలమునఁ దీర్పఁ దీఱె**
నట్టిదురవస్థ; వారలు నాత్మఁ బ్రీతి । యూనఁ జలిపిరి పావనస్నానవిధులు. **171**

ప్రతిపదార్థం: వారలు= ఆ తాపసులు; ఆ+మహానదిన్+అడిగి= ఆ గొప్ప నదిని విచారించి తెలిసికొని; నిజయత్నబలమునన్= తమ ప్రయత్నబలంతో; తీర్పన్= ఆ బలంతో తొలగించగా; అట్టి దురవస్థ= ఆ కష్టం; తీఱెన్= తొలగింది; ఆత్మన్+ప్రీతి+ ఊనన్= మనస్సు సంతసించగా; పావనస్నానవిధులు= పవిత్రమయిన స్నానాదికార్యాలు; చలిపిరి= చేశారు.

తాత్పర్యం: ఆ తాపసులంతా ఆ మహానదిని అడిగి విషయమంతా తెలిసికొని, తమ ప్రయత్న బలంతో ఆ కష్టదశను తొలగించారు. మనసుకు సంతోషం కలుగగా పవిత్రమయిన స్నానాది కార్యాలు చేశారు.

వ. **అప్పుడు గొందఱు బ్రహ్మరాక్షసు లమ్మునులకుఁ బ్రణమిల్లి తమచేసిన విప్రద్వేషగురుజనావమానదుష్టాన్న భక్షణాదులగు పాతకంబులు వేఱవేఱ యుపన్యసించి 'యే మియ్యెడ వసియించి యున్నవారము; మాకు నిష్కృతి యనుగ్రహింపవలయు' ననుటయు వార లాపనికి సరస్వతిం బ్రార్థించిన నమ్మహానది యరుణానదివలన నట్టితెఱం గగు టెఱుంగుం గావున నిగూఢంబుగా నరుణం దనలోనికిఁ దెచ్చి 'దీన మజ్జనంబు సేయుఁ' డని యనుమతి సేసిన.** **172**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కొందఱు= కొంతమంది; బ్రహ్మరాక్షసులు= బొమ్మరాకాసులు; ఆ+మునులకున్= ఆ తపస్వులకు; ప్రణమిల్లి= నమస్కారంచేసి; తమ= తాము; చేసిన= కావించిన; విప్రద్వేష= బ్రాహ్మణులయందు విరోధం; గురుజన+అవమాన= గురువులను అవమానం చేయటం; దుష్ట+అన్న భక్షణ+ఆదులు+అగు= చెడుభోజనాలు చేయటం మొదలైన; పాతకంబులు= పాపాలను; వేఱవేఱ ఉపన్యసించి= ప్రత్యేకంగా తెలిపి (వివరించి); ఏము+ఈ+ఎడన్వసియించి ఉన్నవారము= మే మిక్కడ నివాసమున్నాము; మాకున్; నిష్కృతి= ప్రాయశ్చిత్తం; అనుగ్రహింపవలయున్= దయచేయవలెను; అనుటయున్; వారలు= ఆ తపసులు; ఆ పనికిన్= ఆ కోరిక తీర్చటానికి; సరస్వతిన్+ప్రార్థించినన్= సరస్వతిని వేడుకోగా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ+మహానది= ఆ గొప్పఏరు; అరుణానదివలనన్= అరుణానదిమూలాన; అట్టి తెఱంగు+అగుటన్= ఆ విధంగా కావటాన్ని; ఎఱుంగున్+కావునన్= తెలిసికొన్నది గనుక; నిగూఢంబుగాన్= రహస్యంగా; అరుణన్= అరుణానదిని; తనలోనికిన్+తెచ్చి= తనలోనికి తీసికొనివచ్చి; దీనన్= ఈ నదిలో; మజ్జనంబు+చేయుఁడు= స్నానమాడండి; అని= అంటూ; అనుమతి+చేసినన్= ఉత్తరువీయగా.

తాత్పర్యం: కొంతమంది బ్రహ్మరాక్షసులు అపు డా మునులకు నమస్కారం చేసి తాము అదివరకు కావించిన బ్రాహ్మణ దూషణ గురు జనావమాన దుష్టాన్న భోజనాది పాతకాలను తెలిపి, 'మే మీ చోట నివసిస్తున్నాము. మా దోషాలు తొలగిపోయేటట్లను గ్రహించవలయును'. అని వేడుకొనగా ఆ తాపసు లా కోరికను తీర్చుటకై సరస్వతిని ప్రార్థించారు. అంత సరస్వతీనది అరుణానది మూలంగా ఆ విధంగా కావటం తనకు ముందే తెలియటం వలన రహస్యంగా అరుణానదిని తనలోనికి తీసికొనివచ్చి 'ఈ నదిలో మునుగండి' అని ఉత్తరువు చేయగా (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. అజ్జలములఁ గ్రుంకి యాబ్రహ్మరాక్షసుల్ । తనువు లచట విడిచి ధర్మపరుల
గతికిఁ బోయి; రట్టు లతిగూఢ మై యున్న । యరుణ తెఱఁ గెఱింగి యమరపతియు. 173

ప్రతిపదార్థం: ఆ+జలములన్+క్రుంకి= ఆ ఏటి నీటిలో మునిగి; ఆ బ్రహ్మరాక్షసుల్= ఆ బొమ్మరాకాసులు; తనువులు+అచటన్+విడిచి= శరీరాల నక్కడ వదలివేసి; ధర్మపరులగతికిన్+పోయిరి= ధర్మాత్ములు పోయే ఉత్తమస్థితికి వెళ్ళారు; అట్టులు= ఆ విధంగా; అతి గూఢమైఉన్న= మిక్కిలి రహస్యంగా ఉండే; అరుణ తెఱఁగు+ఎఱింగి= అరుణానది విధానము తెలిసికొని; అమరపతియున్= దేవేంద్రుడుకూడ.

తాత్పర్యం: ఆ నీటిలో మునిగి ఆ బ్రహ్మరాక్షసులు తమ శరీరాల నక్కడ వదలి, ధర్మాత్ములు పోయే గతికి వెళ్ళారు. ఆ విధంగా అతిరహస్యంగా ఉండే ఆ అరుణానది విషయం తెలిసికొని దేవేంద్రుడు కూడా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. తాను సఖ్యంబు సేసి నమ్మించి నముచిఁ జంపిన పాపంబు తదీయస్నానంబునం బాపికొనియె; నట్టి పుణ్యస్థానంబుననుండి యత్తాలధ్వజుండు సోమతీర్థంబునకుం జనియె; నది సోముండు రాజసూయంబు చేసినచోఁ; టయ్యెడ ననిమిషులు షణ్ముఖునకు నిర్జరసేనాధిపత్యంబునకు నభిషేకంబు సేసి; రతండు తారకాదులైన యసురులం దెగటార్చె నతని జననాదివృత్తాంతంబు కౌరవవంశజాతుండ వగు నీకు వినఁదగుఁ జెప్పెద నాకర్ణింపుము. 174

ప్రతిపదార్థం: తాను; సఖ్యంబు చేసి= స్నేహం చేసి; నమ్మించి= నమ్మకం చూపి; నముచిన్= నముచి అనే రాక్షసుడిని; చంపిన= హతమార్చిన; పాపంబు= దోషం; తదీయ స్నానంబునన్+పాపికొనియెన్= ఆ నదిలో స్నానం చేయటంవలన పోగొట్టుకొన్నాడు; అట్టి పుణ్యస్థానంబునుండి= అటువంటి పవిత్రమయిన చోటునుండి; ఆ తాలధ్వజుండు= ఆ బలరాముడు; సోమతీర్థంబునకున్= సోమతీర్థమునకు; చనియెన్= వెళ్ళాడు; అది; సోముండు= చంద్రుడు; రాజసూయంబు చేసిన చోటు= రాజసూయమనే యాగం చేసిన చోటు; ఆ+ఎడన్= ఆ చోట; అనిమిషులు= దేవతలు; షణ్ముఖునకున్= ఆరుమొగాల దేవర అయిన సుబ్రహ్మణ్యస్వామికి; నిర్జర సేనాధిపత్యంబునకున్= దేవసేనాపతిత్వమునకు; అభిషేకంబు+చేసిరి= పట్టాభిషేకం చేశారు; అతండు= ఆ షణ్ముఖుడు; తారక+ఆదులయిన అసురులన్+తెగటార్చెన్= తారకుడు మొదలయిన రాక్షసులను

హతమార్చాడు; అతని జనన+ఆదివృత్తాంతము= అతని పుట్టుక మొదలయిన విషయాలు; కౌరవవంశ జాతుండవు+అగు= కురువంశంలో పుట్టినవాడయిన నీకు; వినన్+తగున్= వినటం ఉచితం; చెప్పెదన్= చెప్పుతున్నాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: స్నేహం చేసి తాను నమ్మకాన్ని కలిగించి నముచిని చంపిన పాపం ఆ నదిలో స్నానం చేసినందున తొలగించుకొన్నాడు ఇంద్రుడు. అటువంటి పుణ్యభూమి నుండి ఆ బలరాముడు సోమతీర్థానికి పోయాడు. ఆ తీర్థం చంద్రుడు రాజసూయం చేసినట్టి చోటు. అచటనే దేవతలు ఆరు మొగాల స్వామి సుబ్రహ్మణ్యుడికి దేవసేనాపతిగా పట్టం కట్టారు. ఆతడు తారకాది అసురులను తెగటార్చాడు. కౌరవవంశంలో పుట్టిన జనమేజయా! నీ వా కథ వినవలయును. చెప్పుతాను - వినుము.

కుమారస్వామి ప్రభావాభివర్ణనము (సం. 9-43-56)

ఆ. **'హరుఁడు దనదువీర్య మగ్నియం దిడిన వ । హింపఁజాల కజున కెఱుఁగఁ జెప్పి**
యతఁడు వనుప దాని నగ్ని గంగాగర్భ । భూతముగ నొనర్చె భూపవర్య! 175

ప్రతిపదార్థం: భూపవర్య!= ఓ రాజశ్రేష్ఠా! (జనమేజయా!); హరుఁడు= పరమశివుడు; తనదువీర్యము= తన వీర్యమును; అగ్నియందు+ఇడినన్= అగ్నిలో ఉంచగా; వహింపన్+చాలక= (ఆ శక్తిని) భరించలేక; అజునకున్= స్రష్టకు(బ్రహ్మకు); ఎఱుఁగన్+చెప్పి= తెలియచేసి; అతఁడు= బ్రహ్మ; పనుపన్= (పంపగా); ఆజ్ఞాపించగా; దానిని= ఆ శక్తిని; గంగాగర్భభూతముగన్= గంగ కడుపున ఉండేటట్లుగా; ఒనర్చెన్= చేసెను.

తాత్పర్యం: పరమశివుడు తన వీర్యాన్ని అగ్నిలో నిక్షేపించగా, ఆ శక్తిని భరింపలేక ఆ అగ్ని సృష్టికర్త అయిన బ్రహ్మకు తెలుపగా, ఆ బ్రహ్మ దానిని గంగానదీ గర్భంలో దాచుమని చెప్పగా అట్లే చేశాడు. (అని జనమేజయుడికి వైశంపాయనుడు చెప్పాడు).

వ. **తేజోమయం బైన యాగర్భంబు గంగ హిమవన్నగంబుమీఁద సముత్సృష్టంబు సేసినఁ గనకమయం బైనశరస్తంబంబున నగ్నిసన్నిభుం డగుకుమారుండై యొప్పె; నయ్యెడ మెలంగుకృత్తిక లక్కుమారుం గని పుత్రార్థినులై యందఱు నొక్కపెట్ట 'వీఁడు మాకొడు' కని పలుకుచుఁ గరతలంబుల నెత్త, నప్పు డయ్యార్వుఱ చన్నులుం జేపిన నద్దారకుండు చంద్రనిభంబు లైన యాననంబు లాఱు దాల్చి సప్తమాతృస్తన్యపానం బాచరించిన విస్మయప్రమోదభరిత లై వార లాశిశువు నెప్పటియెడన యునిచి; ర ట్లయ్యగ్నిభవుండు గాంగేయుండును శరజన్ముండును గార్తికేయుండును నయ్యెఁ; నయ్యెడకు బృహస్పతి యేతెంచి జాతకర్మాద్యనుష్ఠానంబుల నిర్వర్తించి పోయెఁ; దత్ప్రదేశంబు దన మహానుభావంబున జాతరూప మయంబై యుండు.** 176

ప్రతిపదార్థం: తేజోమయంబు+ఐన ఆ గర్భంబు= కాంతిమంతమైన ఆ గర్భం; హిమవత్+నగంబుమీఁదన్= మంచుకొండపైన; సముత్సృష్టంబు+చేసినన్= విడచిపెట్టగా; కనకమయంబు+ఐన= బంగారుమయమయిన; శరస్తంబంబునన్= రెల్లుగడ్డిలో; అగ్ని సన్నిభుండు+అగు= అగ్నితో సమానుడైన; కుమారుండు+ఐ= పుత్రుడుగా; ఒప్పెన్= ఉన్నాడు; ఆ+ఎడన్= ఆ చోటులో, మెలంగు= తిరుగాడుతున్న; కృత్తికలు= కృత్తిక దేవతలు(కన్యలు); ఆ+కుమారున్+కని= ఆ కుమారుడిని చూచి; అందఱున్

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పుత్ర+అర్థినులై= కుమారుడిని ఆశించినవారై; వీఁడు మాకొడుకని పలుకుచున్= ఈ పిల్లవాడు మా కుమారుడని చెప్పుతూ; కరతలంబులన్+ఎత్తన్= చేతులలోని కెత్తుకొనగా; అప్పుడు+ఆయార్వుర చన్నులున్+చేపినన్= ఆ సమయాన ఆ ఆరుగురి చన్నులూ పాలు చేపగా; ఆ+దారకుండు= ఆ పిల్లవాడు; చంద్రనిభంబులైన= చంద్రుడితో సమానమైన; ఆననంబులు+ఆఱు+తాల్చి= మొగాలు ఆరింటిని పొంది; సప్తమాతృస్తన్య పానంబు+ఆచరించినన్= ఆ ఏడుగురి తల్లులు చన్నుబాలు త్రాగగా; వార లా శిశువును= వా రా బిడ్డను; ఎప్పటి ఎడన= ఎపుడూ ఉన్న చోటునందే; ఉనిచిరి= ఉంచారు; అట్లు+ఆ+అగ్నిభవుండు= ఆ విధంగా ఆ అగ్నినుండి పుట్టినవాడు; గాంగేయుండును= గంగకొడుకునూ; శరజన్ముండును= రెల్లునందు పుట్టినవాడునూ; కార్తికేయుండును= కృత్తికల కుమారుడును; అయ్యెన్= అయ్యాడు; ఆ+ఎడకున్= ఆ చోటునకు; బృహస్పతి వచ్చి= జాతకర్మాది+అనుష్ఠానంబులన్= జాతకర్మ మొదలయిన ఆచార విధులను; నిర్వర్తించిపోయెన్= జరిపి వెళ్ళాడు; తద్+ప్రదేశంబు= ఆ చోటు; తన మహానుభావంబునన్= తన మహాశక్తి మూలాన; జాతరూపమయంబు+ఐ+ఉండున్= బంగారుమయమై ఉంటుంది.

తాత్పర్యం: కాంతిమంతుడైన ఆ బిడ్డను గంగ హిమాలయం మీద నిలుపగా బంగారు మయమైన రెల్లు దర్భలలో అగ్నితో తుల్యుడయిన కొడుకుగా ఉన్నాడు. ఆ చోట తిరిగే కృత్తిక లా బాలుడిని చూచి కుమారుడికై ఒక్కమారే వీడు నా కుమారుడు 'నా కుమారు' డని చేతులలోని కెత్తుకొన్నారు. అపు డా ఆరుగురికీ చన్నులు చేపినవి. ఆ పసివాడు చంద్రుడితో సమానమైన ఆరుమొగాలతో ఆ మాతల స్తన్యాన్ని త్రాగాడు. వా రాశ్చర్యమానసలై సంతోషంతో ఆ బిడ్డను యథాస్థానంలో వదలారు. అందుచేత ఆతడు అగ్నిభవుడుగాను, గాంగేయుడుగాను శరజన్ముడుగాను, కార్తికేయుడుగాను అయ్యాడు. అచ్చటికి బృహస్పతి వచ్చి అతడికి జాతకర్మాది ఆచారాలను జరిపి వెళ్ళాడు. ఆ మహానుభావుడి శక్తిచేత ఆ చోటు బంగారు మయమై ఉంటుంది.

విశేషం: 'సప్తమాతృస్తన్యపానంబాచరించిన' అనేదానికి 'అయ్యారుగుర మాతృస్తన్య, సమస్త మాతృస్తన్యపానంబులు అనే పాఠాంతరాలున్నాయి.

క. **విను మక్కుమారుఁ డుత్తమ । మనఁ దగియెడుతపము దనవిహారముగా వ**
ర్ధన మొందె ధాత్రి ధాత్రిగ । ధనురాగమమును శ్రుతులును దనుఁ గొలువంగన్. **177**

ప్రతిపదార్థం: వినుము; ఆ+కుమారుఁడు= ఆ కుమారస్వామి; ఉత్తమము= శ్రేష్ఠం; అనన్= అనగా; తగియెడు= తగిన; తపము; తన విహారము+కాన్= తాను తిరుగుచోటుగా; ధాత్రి= భూమి; ధాత్రిగన్= దాదిగా; ధనున్+ఆగమమును= ధనుర్వేదమును; శ్రుతులును= వేదాలును; తనున్+కొలువంగన్= తనను సేవించగా; వర్ధనము+అందెన్= వృద్ధిపొందాడు.

తాత్పర్యం: ఆ కుమారుడు ఉత్తమమైన తపస్సు విహారంగా భూమి దాదిగా ధనుర్వేదాది వేదాలు తనను సేవించగా వృద్ధి పొందాడు. వినుము.

వ. **ఒక్కనాఁ డక్కుమారుం జూచువేడుక శివుండు శైలకన్యకయుం దానుఁ బ్రకృష్టబలపరాక్రమంబులు నానాప్రకారవదనశరీరంబులు గలుగు ప్రమథ గణంబు గొలువ నయ్యెడకుఁ జనుదెంచె; నప్పుడు బ్రహ్మవిష్ణులును నింద్రాదిదిక్పాలురును రుద్రాదిత్యమరుద్వసుప్రభృతి సకలసురులును గరుడగంధర్వకిన్నరకింపురుష సిద్ధవిద్యాధరయక్షాది దివ్యులును మునులును మఱియుఁ బితృదేవతలును ననుచరసమేతులై యేతెంచిరి;**

మూర్తిమంతంబు లై యోషధిసరిత్సముద్రపర్వతంబులు నరుదెంచె; నిట్లు నిజదర్శనకౌతుకంబున వచ్చిన యమ్మహాసమూహంబున కభిముఖుండై యోగబలాన్వితుం డగు నబ్బాలుండు రా నన్నీలగ్రీవుండు నిరీక్షించి యంతర్గతంబున. 178

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు+ఆ కుమారున్= ఒకానొక దినాన ఆ కుమారుడిని; చూచువేడుకన్= చూడాలి అనే కోరికతో; శివుండు= పరమశివుడు; శైలకన్యయున్+తానున్= పార్వతియు తానును; ప్రకృష్ట బలపరాక్రమంబులు= ఉత్కృష్టమయిన బలశౌర్యాలు; నానా ప్రకారవదన శరీరంబులు= అనేక విధాలయిన ముఖములు శరీరములును; కలుగు= కలిగిన; ప్రమథగణంబు+కొలువన్= ప్రమథగణాలు సేవించగా; ఆ+ఎడకున్+చనుదెంచెన్= ఆచోటునకు వచ్చాడు; అప్పుడు= ఆ సమయాన; బ్రహ్మవిష్ణులును= బ్రహ్మయు, విష్ణువును; ఇంద్ర+ఆది దిక్పాలురును= ఇంద్రుడు మొదలయిన దిక్పతులును; రుద్ర+ఆదిత్య+మరుత్+వసుప్రభృతి+సకలసురులును= ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, సప్తమరుత్తులు, అష్టవసువులు, మొదలయిన దేవతలందరును; గరుడ, గంధర్వ, కిన్నర, కింపురుష, సిద్ధ, విద్యాధర, యక్షాది దివ్యులును= గరుడులు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు, సిద్ధులు, విద్యాధరులు, యక్షులు, మొదలైన దివ్యగణాలును; మునులను= తాపసులును; మఱియున్; పితృదేవతలును= ఇంకను పితృదేవతలును(వీరందరును); అనుచర సమేతులు+ఐ ఏతెంచిరి= పరివారంతో కూడి వచ్చారు; మూర్తిమంతంబులై= ఆకారాలతో; ఓషధి= ఓషధులును; సరిత్+సముద్ర+పర్వతంబులు= నదులు, సప్త సముద్రాలు, పర్వతాలు; అరుదెంచెన్= వచ్చాయి; ఇట్లు= ఈ విధంగా; నిజదర్శనకౌతుకంబునన్= తన్ను చూచే ఉత్సాహంతో; వచ్చినన్= రాగా; ఆ+మహా సమూహంబునకున్= ఆ గొప్ప సమూహానికి; అభిముఖుండు+ఐ= ఎదురై; యోగబలాన్వితుండు+అగు= యోగశక్తితో కూడినవాడైన; ఆ+బాలుండు= ఆ బాలకుడు; రాన్= రాగా; ఆ+నీలగ్రీవుండు= ఆ నీలకంఠుడు; నిరీక్షించి= ఎదురుచూచి; అంతర్గతంబునన్= మనసులో.

తాత్పర్యం: ఒకనాడు కుమారుడిని చూచే ఆసక్తితో పరమేశ్వరుడు పార్వతితో విశేషమైన బలాన్నీ, శక్తినీ అనేక విధాలయిన శరీరాలు కలిగిన ప్రమథగణాలు సేవించగా ఆ చోటునకు వచ్చాడు. అపుడు బ్రహ్మ విష్ణులు, ఇంద్రాది దిక్పాలురు, ఏకాదశరుద్ర ద్వాదశాదిత్య సప్తమరుత్తులు, అష్టవసువులు మొదలయిన సమస్త దేవతలును, గరుడ గంధర్వ కిన్నర కింపురుష సిద్ధ విద్యాధర యక్షాది దివ్యులును, తాపసులును, ఇంకను పితృదేవతలును వారి పరివారంలో కూడివచ్చారు. ఓషధులు నదులు సప్త సముద్రాలు సప్తకులపర్వతాలు మూర్తిమంతములై వచ్చాయి. ఈ విధంగా తనను చూడగా ఆసక్తులైన వచ్చిన ఆ గొప్ప సమూహానికి ఎదురేగి యోగబలంతో కూడుకొన్న ఆ పసివాడు రాగా ఆ నీలకంఠుడు తేరిపార చూచి, మనసులో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **'ఉమయు నగ్నియు గంగయు నుండ నన్ను । గారవంబున నధికునిఁగాఁ దలంచి**
చక్క నాపాలి కేతెంచునొక్కొ! వీఁడు । సంభృతస్నేహ భక్తివిస్రంభుఁ డగుచు.' 179

ప్రతిపదార్థం: ఉమయున్= పార్వతియును; అగ్నియున్= అగ్నిదేవుడును; గంగయున్= గంగాదేవియును; ఉండన్= ఉండగా; నన్నున్ గారవంబునన్= నన్ను ఆదరంతో; అధికునిగాన్+తలంచి= గొప్పవానిగా భావించుకొని; చక్కన్= నేరుగా; నా పాలికిన్+ఏతెంచు నొక్కొ వీఁడు?= ఈతడు నా దగ్గరకు వచ్చునా?; సంభృత= నిండిన; స్నేహ= స్నేహం, భక్తి అనువాటితో విశ్వాసంగలవాడు అవుతూ; విస్రంభుఁడు+అగుచున్= నమ్మకం కలవాడై.

తాత్పర్యం: 'పార్వతి, అగ్ని, గంగ, మొదలైనవారుండగా గౌరవంతో నన్ను గొప్పగా తలచుకొని ఇతడు స్నేహంతోను, భక్తితోను నా దగ్గరకు వస్తాడా?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అనుచుండఁగ నమ్మువ్వురు । తనతన చిత్తమున నట్ల తలఁపఁగ నది యె
ల్లను దివ్యబోధమునఁ గని । కొని య బ్బాలుండు యోగకుశలత వెలయన్. 180

ప్రతిపదార్థం: అనుచుండఁగన్= అంటూ ఉండగా; ఆ+మువ్వురు= ఆ ముగ్గురును(పార్వతి, అగ్ని, గంగలు) తన తన చిత్తమునన్= తమ తమ మనస్సులలో; అట్ల తలఁపఁగన్= ఆ విధంగానే తలచుకొనగా; అది ఎల్లను= దానినంతా; దివ్యబోధమునన్; కనికొని= చూచినవాడై; ఆ+బాలుండు= ఆ పసివాడు; యోగ కుశలత వెలయన్= యోగమునందలి నేర్పుతో ప్రకాశించగా.

తాత్పర్యం: అంటూ ఆ ముగ్గురూ తమ తమ మనసులలో అదే విధంగా తలచుకొన్నారు. దానినంతా దివ్యజ్ఞానంతో తెలిసికొని, ఆ బాలుడు యోగశక్తి ప్రకాశించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. మూర్తిచతుష్టయంబు దాల్చి యన్నలువుర యొద్దకు నేకకాలంబునం జనినం గని యెల్లవారు నద్భుతమగ్నమానసు లై; రక్కుమారుండు పదంపడి యొక్కరుం డై పొలిచి నిలిచె; నప్పుడు. 181

ప్రతిపదార్థం: మూర్తిచతుష్టయంబు+తాల్చి= నాలుగు ఆకారాలను పొందినవాడై; ఆ+నలువుర ఒద్దకున్= ఆ నలుగురి దగ్గరకు; (ఉమాగ్ని గంగా పరమశివుల కడకు); ఏకకాలంబునన్+చనినన్= ఒక్కసారిగానే వెళ్ళగా; కని= చూచి; ఎల్లవారున్= అందరూ; అద్భుత మగ్న మానసులు+ఐరి= ఆశ్చర్యంలో మునుగునట్టి మనసులు కలవారయ్యారు; ఆ+కుమారుండు= ఆ కుమారస్వామి; పదంపడి= ఆ మీదట; ఒక్కరుండు+ఐ పొలిచి= ఒకడుగా ఒప్పి; నిలిచెన్= నిలిచాడు; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆతడు నాలుగు ఆకారాలతో ఆ నలుగురి ఒద్దకు వెళ్ళాడు. ఒకేమారు ఆతడు వెళ్ళగా చూచిన వారందరూ అబ్బురపడ్డారు. మరల ఆ కుమారస్వామి ఒకడుగా కానవచ్చి నిలిచాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. హరుఁడును గంగయున్ శిఖియు నంబికయుం బ్రణిపాతపూర్వని
ర్భర వినయంబుతోడఁ దగఁ బద్మజుఁ జేరి 'మహాత్మ! యిక్కుమా
రు రుచిరమూర్తికిన్ గుణగురుత్వవిభూతికి నీడు గాఁగ ని
మ్మరసి యుదాత్త మైనపద' మన్న నతండు ప్రియం బెలర్పఁగన్. 182

ప్రతిపదార్థం: హరుఁడును= ఈశ్వరుడునూ; గంగయున్= గంగాదేవియునూ; శిఖియున్= అగ్నియునూ; అంబికయున్= పార్వతియునూ; ప్రణిపాతపూర్వ నిర్భర వినయంబుతోడన్= నమస్కారపూర్వకంగా మిక్కిలి అణకువతో; తగన్= తగువిధంగా; పద్మజున్+చేరి= బ్రహ్మవద్దకు వెళ్ళి; మహాత్మ!= ఓ మహనీయుడా!; ఈ+కుమారు= ఈ కుమారుడియొక్క; రుచిరమూర్తికిన్= తేజోమయమూర్తికి; గుణగురుత్వవిభూతికిన్= గొప్ప గుణసంపదకు; ఈడుకాఁగన్= సాటిగా; అరసి= చూచి; ఉదాత్తము+ఐన పదము= గొప్ప స్థానమును; ఇమ్ము= ఒసగుము; అన్నన్= అనగా; అతండు= ఆ బ్రహ్మ; ప్రియంబు+ఎలర్పఁగన్= ప్రీతి కలుగగా.

తాత్పర్యం: పరమశివుడు, పార్వతి, గంగ, అగ్ని సంతోషంతోను, వినయంతోను, తగు విధంగా బ్రహ్మవద్దకు వెళ్ళి, 'మహనీయుడా! ఈ బాలుడి తేజోమయమూర్తికి గుణసంపదకూ తగిన గొప్ప పదవిని ఆలోచించి ఈయవలసినది' అని అడిగారు. అందులకు బ్రహ్మ ప్రీతితో. (తరువాతి వచనంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. దేవహితపరుం డగుటం జేసి చిత్తంబునఁ దలపోసి 'వీఁడు దేవసేనకుం బతి యగుంగాక!' యని నిశ్చయించి వారల వీక్షించి యవ్విధ మెల్లవారును వినం దెలియఁ బలికి శక్రవరుణాదు లగుమేటి వేల్పుల నబ్బాలునకుం జూపి 'వీరు నీకు రక్షణీయు' లని యప్పగించె; నయ్యమరవరు లక్కుమారు నభిషేకంబు సేయుద మని వారిజాసనుం బురస్కరించుకొని యెల్లవారును దోడన యరుగుదేర సరస్వతీసమీపంబునకుం జని సకలరత్నమయం బైన దివ్యపీఠంబు హిమవంతుండు వెట్ట నం దా భూతపతిపుత్త్రు నునిచి బృహస్పతి హోమకార్యంబు నిర్వర్తింప నీశానవిష్ణు విధికౌశికులు లోనుగా నమర ముఖ్యు లభిషేకద్రవ్యంబులు సారస్వతజలపూర్ణ మణికనక కలశంబులు ధరియించి గంధర్వాప్సరోగణంబులు సంగీతమంగళం బాచరింప మహామునిప్రకర పుణ్యాహఘోషంబులు సెలంగ నుమా శ్రీసరస్వతీశచీప్రముఖ లైన పుణ్యాంగనలు దీవనలతో సేస లొలుక నభిషేకించి సమ్మోదంబున సేనాధిపత్యంబునకుం బట్టంబు గట్టిరి; తొల్లి తత్ప్రదేశంబున దేవతలు జలాధిపత్యంబునకు వరుణు నభిషిక్తుం జేసి; రవ్వరుణాభిషేకంబుకంటెఁ గుమారాభిషేకం బొప్పె; న ప్పావకసంభవునకుఁ గామదమన కమలభవశార్ఙ్గి శతమఖ ప్రముఖు లగు సకల ప్రభువులు దమతమయనుచరులయందు రూపగుణబలపరాక్రమాధికు లైన వారి నేఱి భీమఘంటాకర్ణ సంక్రమ దండధర సహితు లగు ననేకవీరుల నొసంగి వారల బెరసి వర్తించుటకుఁ దగిన సేనాంగసముదయంబు నమ్మహితాత్మునకు మూలబలంబుగా నొనర్చి; రబ్బలంబులఁ జిత్రాభరణ వర్మాయుధధరులును వివిధ ప్రకారాకారులు నగు గజకర్ణ నికుంభ కుముదాదు లైన సైనికులు మెఱసి యుల్లసిల్లి; రమ్మూఁకలతో శత్రుభయంకరంబు లగుచు మాతృకాగణంబులు ప్రభాసినీ విశాలాక్షీ పాలితాపురస్సరంబులై పొలిచె నట్టియెడ. 183

ప్రతిపదార్థం: దేవహిత పరుండు+అగుటన్+చేసి= దేవతలకు మేలు చేసేవాడు కావటంవలన; చిత్తంబునన్+తలపోసి= మనసులో తలచుకొని; వీఁడు= ఈ బాలుడు; దేవసేనకున్+పతి+అగున్+కాక!= దేవతల సేనకు నాయకు డగుగాక!; అని నిశ్చయించి= అంటూ నిర్ణయించి; వారలన్ వీక్షించి= ఆ పరమశివుడు మొదలయిన వారిని చూచి; ఆ+విధము= ఆ పద్ధతిని (ఆ బాలుడు దేవసేనానాయకుడయ్యే విధమును); ఎల్లవారును= అందరును; వినన్= వినగా; తెలియన్+పలికి= స్పష్టంగా తెలిసేటట్లుగా చెప్పి; శక్రవరుణ+ఆదులు+అగు మేటి వేల్పులన్= ఇంద్రుడు, వరుణుడు మొదలయిన గొప్ప దేవతలను; ఆ+బాలునకున్+చూపి= ఆ పిల్లవాడికి చూపించి; వీరు నీకు రక్షణీయులు= వీరంతా నీకు కాపాడదగినవారు; అని అప్పగించెన్= అని ఒప్పచెప్పాడు; ఆ+అమరవరులు= ఆ దేవతాశ్రేష్ఠులు; ఆ+కుమారున్= ఆ బాలుడిని; అభిషేకంబు చేయుదము+అని= (సేనానిగా) పట్టం కట్టుదామని; వారిజాసనున్ పురస్కరించుకొని= బ్రహ్మను ముందుంచుకొని; ఎల్లవారును= అందరును; అరుగుదేరన్= బయలుదేరి రాగా; సరస్వతీ సమీపంబునకున్+చని= సరస్వతీ తీర్థం దగ్గరకు వెళ్ళి; సకల రత్నమయంబు+ఐన= అన్ని రత్నాలతో నిండిన; దివ్యపీఠంబు= ఉత్కృష్టమైన పీఠమును; హిమవంతుడు పెట్టన్= హిమవంతుడు ఏర్పాటు చేయగా; అందున్+ఆభూతపతి పుత్రునిన్= అక్కడ నా ప్రమథనాథుడి కుమారుడిని; ఉనిచి= నిలిపి; బృహస్పతి= దేవగురువు; హోమకార్యంబు నిర్వర్తింపన్= హోమాదికాలైన పనులు చేయగా; ఈశాన విష్ణు విధి కౌశికులు లోనుగాన్= పరమశివుడు, విష్ణువు, బ్రహ్మ, కౌశిక మహర్షి మొదలుగా(త్రిమూర్తులందరును); అమరముఖ్యులు= దేవతలతో తలమానికము లయినవారు; అభిషేక ద్రవ్యంబులు= సేనాని పట్టాభిషేకాని కవసరమయిన వస్తువులు; సారస్వత జల= సరస్వతీ నదినీటితో; పూర్ణ= నిండిన; మణికనక కలశంబులు= రత్నాలు తాపిన బంగారు కుండలు; ధరియించి= చేతబట్టుకొని; గంధర్వఅప్సరోగణంబులు= గంధర్వులు, అప్సరసలు; సంగీత మంగళంబు+ఆచరింపన్= సంగీతంతో మంగళాదులు చేయగా;

మహాముని ప్రకర పుణ్యాహ ఘోషంబులు చెలంగన్= గొప్ప తాపసి సమూహాలు కావించే పుణ్యాహవాచన వేద ఘోషములు మ్రోయగా; ఉమా+శ్రీ+సరస్వతీ+శచీప్రముఖ= పార్వతి, లక్ష్మి, సరస్వతి, శచి మొదలయిన; పుణ్యాంగనలు= ముత్తైదువలు; సేసలు+ఒలుకన్+అభిషేకించి= సేస బ్రాలతో స్నానంచేయించి; సమ్మోదంబునన్= సంతోషంతో; సేనాధిపత్యంబునకున్+పట్టంబు కట్టి= సేనానాయకత్వానికి పట్టంకట్టి; తొల్లి= వెనుకటి కాలంలో; తద్+ప్రదేశంబునన్= ఆ చోట; దేవతలు; జల+అధిపత్యంబునకున్= నీటిమీది అధికారానికి; వరుణున్+అభిషిక్తున్+చేసిరి= వరుణుడిని అధిపతిగా చేశారు; ఆ+వరుణ+అభిషేకంబుకంటెన్= ఆ వరుణుడికి జరిగిన అభిషేకంకంటె; కుమార+అభిషేకంబు+ఒప్పెన్= ఆ బాలకుడి అభిషేకం ఒప్పారింది; ఆ+పావకసంభవునకున్= ఆ యగ్నినుండి పుట్టినవాడికి; కామదమన= మన్మథుడి పొగ రణచిన శివుడు; కమలభవ= బ్రహ్మ; శార్ఙ్గి= విష్ణువు; శతమఖ ప్రముఖులు+అగు= దేవేంద్రుడు మొదలైన; సకల ప్రభువులు= అధిపతులందరూ; తమ తమ అనుచరులయందున్= తమ తమ సేవకులలో; రూపగుణ బలపరాక్రమ+అధికులు+ఐన వారిని= ఆకృతిలోను, గుణంలోను బలంలోను వైరులను+ఆక్రమించుకొనటంలోను గొప్పవారైన వారిని; ఏఱి= లెక్కించి; భీమ= భయంకరమైన; ఘంటాకర్ణ= ఘంటాకర్ణుడనేవాడును; సంక్రమ= సంక్రముడు; దండధరసహితులు+అగు; అనేక వీరులన్+ఒసంగి= ఎందరో బలశాలుల నిచ్చి; వారలన్+బెరసి= వారితో కలసి; వర్తించుటకున్= తిరగటానికి; తగిన సేనా+అంగ సముదయంబున్= తగినట్టి సేనా సమూహాన్ని; ఆ+మహితాత్మునకున్ మూలబలంబుగాన్+ఒనర్చినన్= ఆ శక్తిమంతుడికి ఆధారమయ్యే సేనగా చేయగా; ఆ+బలంబులన్= ఆ సేనలో; చిత్ర+ఆభరణ+వర్మ+ఆయుధధరులును= రకరకాలైన ఆభరణాలను, కవచాలను, ఆయుధాలను ధరించినవాళ్ళూ; వివిధ ప్రకార+ఆకారులున్+అగు= అనేక విధాలయిన శరీరాలున్నవారు ఐన; గజకర్ణ= గజకర్ణుడు; నికుంభ= నికుంభుడు; కుముద+ఆదులు+ఐన= కుముదుడు మొదలయిన; సైనికులు= భటులు; మెఱసి= విజృంభించి; ఉల్లసిల్లిరి= సంతోషించారు; ఆ+మూఁకలతోన్= ఆ సేనలతో; శత్రుభయంకరంబులు+అగుచున్= వైరులకు భయాన్ని కలిగిస్తూ; మాతృకాగణంబులు= సప్తమాతృకలూ, ప్రమథగణాలూ, ప్రభాసినీ విశాలాక్షీ పాలికాపురస్సరంబులు+ఐ= ప్రభాసినియు, విశాలాక్షియు పాలిక ముందున్నవారై; పొలిచెన్= ఒప్పింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: (బ్రహ్మ) ఆ బాలుడు దేవతలకు ప్రియుడనే విషయాన్ని తెలిసికొని, 'ఈతడు దేవసేనాపతిఅగు గాక!' అని నిర్ణయించాడు. అక్కడివారినంతా కలయజూచాడు. వారందరు తెలిసికొనేటట్లు ఆ విషయాన్ని చెప్పాడు. ఇంద్రుడు వరుణుడు మొదలయిన ప్రధానులైన దేవరాజులను ఆ బాలుడికి చూపి 'వీరంతా నీకు రక్షకులు' అని ఒప్పచెప్పి ఆ కుమారస్వామికి అభిషేకం చేద్దామని తలచి, బ్రహ్మను ముందుంచుకొని అందరూ కూడిరాగా సరస్వతీ తీర్థం దగ్గరకు వెళ్ళాడు. అన్ని రత్నాలను నింపిన దివ్యపీఠాన్ని పర్వతరాజైన హిమవంతుడు పెట్టగా దానిమీద ఆ భూతనాథుడి కుమారుడిని నిలిపి, బృహస్పతి హోమాదికాలు చేయగా ఈశానుడు విష్ణుడు బ్రహ్మ, కౌశికులు మొదలైన దేవ ప్రముఖులు అభిషేక వస్తువులను సరస్వతి నీటితో నింపిన బంగారు మయమైన రత్నాలు తాపిన గిండీలను మోసికొంటూ గంధర్వాప్సరోగణాలు సంగీతంలో మంగళాశీస్సులు పలుకగా మహాముని సమూహాలు పుణ్యాహవేదఘోషలతోను, పార్వతి, లక్ష్మి, సరస్వతి, శచి మొదలైన ముత్తయిదువలు అక్షతలతో స్నానం చేయించి సంతోషంతో సేనానాయకత్వానికి పట్టాభిషేకం చేసి ఆధిపత్యాన్ని ఒసగారు. మును పాచోట దేవతలు జలాధిపతిగా వరుణుడిని అభిషేకించారు. ఆ వరుణాభిషేకం కంటె కుమారాభిషేకం ఒప్పింది. ఆ అగ్నిదేవసంభవుడికి పరమశివుడు, బ్రహ్మ, విష్ణువు మొదలైన ప్రభువులందరూ తమతమ సేవకులందలి రూపాధిక్యాన్నీ, బలాధిక్యాన్నీ, పరాక్రమాధిక్యాన్నీ కలవారిని ఎన్నుకొని భీమ ఘంటాకర్ణ సంక్రమ దండధర సహితు లయిన ఎందరో వీరుల నొసగి వారితో కలసి తిరగటానికి తగినటువంటి సేనాంగాల సమూహాన్నీ ఆ శక్తిమూర్తికి మూలబలంగా ఇచ్చారు. ఆ సేనలు చిత్రాభరణవర్మాయుధధారులుగా అనేక ప్రకారాకారు లైన గజకర్ణ నికుంభకుముదాదులైన సైనికులు ఒప్పారు. ఆ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సేనతో వైరిభయంకరు లైన సప్త మాతృకాగణాలు ప్రభాసినీ విశాలాక్షీ పాలికాపురస్సరంగా నిలచాయి. అటువంటి సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. **శంకరుఁ డుదిత భాస్కరనిభధ్వజమును, । వాసవుఁ డసురవిధ్వంసకరణ**
పరిణతశక్తియు, హరి బలవర్ధని । యగు వనమాలయు, నగజ యెపుడు
మాయని వెలిపట్టుదోయిని, గంగ యు । జ్జ్వల సుధామయకమండలువు, గురుఁడు
దీప్తదండము, వైనతేయుండు మహితమ । యూరంబు, వరుణుం డుదార రూప

తే. **మైన తామ్రచూడంబును, నర్థవిభుఁడు । దర్పితచ్ఛాగమును, శతదళభవుండు**
లసితకృష్ణాజినంబును నసమసమర । జయము నొసఁగిరి ప్రీతి నా షణ్ముఖునకు. **184**

ప్రతిపదార్థం: శంకరుఁడు= ఈశ్వరుడు; ఉదిత= ఉదయించే; భాస్కర నిభ ధ్వజమును= సూర్యుడితో సమానమైన పతాకాన్నీ; వాసవుఁడు= ఇంద్రుడు; అసుర, విధ్వంసకరణ, పరిణత శక్తియున్= రాక్షసులను నాశనం చేయడంలో పక్వత పొందిన శక్తిని; హరి= విష్ణువు; బలవర్ధని+అగు= శక్తిని పెంచగలుగు; వనమాలయున్= వనమాలను; అగజ= పార్వతి; మాయని= మాసిపోని; వెలిపట్టుదోయిని= తెల్లపట్టు జతను; గంగ= గంగాదేవి; ఉజ్జ్వల= వెలుగుతున్న; సుధామయ= అమృతమయమైన; కమండలువు= కమండలాన్నీ; గురుఁడు= బృహస్పతి; దీప్తదండమున్= ప్రకాశించే దండాన్నీ; వైనతేయుండు= గరుత్మంతుడు; మహిత మయూరంబున్= మహిమ కల నెమలిని; వరుణుండు; ఉదారరూపము+ఐన= గొప్పరూపంకల; తామ్రచూడంబును= కోడిపుంజును; అర్థవిభుఁడు= కుబేరుడు; దర్పిత+ఛాగమును= పొగరుబోతు మేకను; శతదళభవుండు= బ్రహ్మ; లసిత= సొగసైన; కృష్ణాజినంబును= ఇర్రితోలును; సమరజయమును= యుద్ధంలో సాటిలేని గెలుపును; ఆ షణ్ముఖునకున్= ఆ ఆరుమొగాల వాడికి; ప్రీతిన్= ప్రేమతో; ఒసఁగిరి= ఇచ్చారు.

తాత్పర్యం: పరమేశ్వరుడు ఉదయభానుడికి సమానమైన కాంతిని, ఇంద్రుడు రాక్షసులను నాశనం చేయగల పరిపక్వమయిన శక్తిని, విష్ణుడు బలమును పెంచే వనమాలను, పార్వతి ఏవేళలోనూ నాశనం కాని తెల్లపట్టు వస్త్రాల జతను, గంగాదేవి ప్రకాశవంతమయినదీ, అమృతంతో నిండినదీ ఐన కమండలాన్నీ, బృహస్పతి వెలుగు దండాన్నీ, గరుడుడు మహిమగల నెమలిని, వరుణుడు ఉదారరూపమైన కుక్కుటమునూ, కుబేరుడు పొగరుబోతు మేకను, స్రష్ట అందమైన జింకతోలును సాటిలేని యుద్ధవిజయాన్నీ ఆ షణ్ముఖుడికి ప్రేమతో ఇచ్చారు.

వ. **ఇట్లు సిద్ధస్వరూపదీపితుం డైన యతని నాపోవక చూచుచు శంకరుండు 'వీని కీ విభవంబునకు ననాయాసంబున నమరవిరోధి నాశంబు గావించుటకు వలయు' నని తలంచి భూతమయం బగు మహాసైన్యంబు సమర్పించె; నప్పు డింద్రాదిబృందారకులు నిజబలసందోహంబులతో నాబర్హివాహనుఁ బరివేష్టించిరి; శంఖభేరీపణవగోముఖ ప్రముఖతూర్యంబులు దిక్కులు పిక్కటిల్లఁ జెలంగె; నట్లు మహతి యగు దేవసేనకుఁ బతియై యమ్మహాసేనుండు సురముఖ్యులఁ జూచి 'మీ కెవ్వరి నేనియుం జంపను జెఱుపను వలసియున్నది యట్టిబల్లిదంపుఁ బగఱం బరిమార్చెద' నని వరం బిచ్చిన వారలు బహుప్రమోదంబు నొందిరి; సేన యార్చినఁ ద్రిలోకంబులు నాదమయంబు లయ్యె; నవ్విధంబున విశాఖుని నుత్తమపదస్థునిఁ గావించి విరించి వైకుంఠ శ్రీకంఠులు నిజేచ్ఛఁ జనిరి; పదంపడి యగ్గుహుండు దేవతలు తారకాసురునివలన నలంగి యునికి యెఱింగి.** **185**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సిద్ధస్వరూప దీపితుండు+ఐన= స్వభావసిద్ధంగా ప్రకాశించే ఆకృతికలవాడైన; అతనిన్= ఆ ఆరుమొగాలవాడిని; ఆపోవక= తృప్తినందకుండా; చూచుచున్= చూస్తూ; శంకరుండు= పరమేశ్వరుడు; వీనికిన్+ఈ విభవంబునకున్= ఈ బాలకుడికి ఈ ఐశ్వర్యం; అనాయాసంబునన్= సుఖంగా; అమర విరోధినాశంబుకావించుటకున్= దేవతల శత్రువులను చంపటానికి; వలయునని తలంచి= అవసరమని భావించి; భూతమయంబు+అగు= ప్రమథ గణాలతో నిండిన; మహాసైన్యంబును= పెను సేనను; సమర్పించెన్= ఇచ్చాడు; అప్పుడు= ఆ సమయంలో; ఇంద్ర+ఆది బృందారకులు= ఇంద్రుడు మొదలైన దేవతలు; నిజ బల సందోహంబులతోన్= తమ సేనాసమూహాలతో; ఆ బర్హివాహనున్+పరివేష్టించిరి= ఆ నెమలి వాహనంగా కలవాడిని - కుమారస్వామిని చుట్టుకొనినారు; శంఖ= శంఖం; భేరీ= నగారాలు; పణవ= ఉడుక; గోముఖ ప్రముఖ తూర్యంబులు= ఆవు మొగంవంటి తూర్య నాదవాద్యాలు; దిక్కులు పిక్కటిల్లన్+చెలంగెన్= దిక్కులు నిండగా మ్రోగాయి; అట్లు= ఆ విధంగా; మహతి+అగు= గొప్పదైన; దేవసేనకున్= సురసేనకు; పతి+ఐ= నాయకుడై; ఆ+మహాసేనుండు= ఆ కుమారస్వామి; సురముఖ్యులన్+చూచి= దేవతలలో ముఖ్యులయిన వారిని చూచినవాడై; మీకున్; ఎవ్వరిని+ఏనియున్= ఎవరినైనా; చంపన్+చెఱుపనున్ వలసిఉన్నది= చంపటం, పాడుచేయటం కావలసిఉన్నది; అట్టి= అటువంటి; బల్లిదంపు+పగఱన్= బలవంతు లైన శత్రువులను; పరిమార్చెదను అని వరంబు+ఇచ్చినన్= చంపెద నని వరము నొసగగా; వారలు= ఆ దేవతలు; బహుప్రమోదంబున్+ఒందిరి= మిక్కిలి సంతోషించారు; సేన= సైన్యం; ఆర్చినన్= సింహనాదం చేయగా; త్రిలోకంబులు= ముల్లోకాలు; నాదమయంబులు+అయ్యెన్= శబ్దాలతో నిండింది; ఆ+విధంబునన్= ఆ ప్రకారంగా; విశాఖునిన్= ఆరుమొగాల వాడిని (విశాఖా నక్షత్రంలో పుట్టినవాడిని); ఉత్తమపదస్థునిన్+కావించి= గొప్ప పదవిలో నిలిపి; విరించి= బ్రహ్మ; వైకుంఠ= విష్ణుడు; శ్రీకంఠులు= గరళకంఠుడును; నిజ+ఇచ్ఛన్+చనిరి= తమ కిష్టమయిన చోటులకు వెళ్ళారు; పదంపడి= ఆ మీదట; ఆ+గుహుండు= ఆ సుబ్రహ్మణ్యుడును; దేవతలు= దేవతలును; తారక+అసురని వలనన్= తారకుడనే రాక్షసుడి మూలాన; నలంగి+ఉనికి= బాధపడి ఉండటం; ఎఱింగి= తెలిసికొని.

తాత్పర్యం: ఈ విధంగా నిజరూపంతో వెలుగుతున్న వాడిని వదలకుండా చూచిన శివుడు 'ఈతడికి ఈ వైభవంతో సుఖంగా శ్రమలేకుండా రాక్షసవినాశం చేయటానికి సాధ్య మవుతుంది.' అని యోచించి ప్రమథగణాలతో నిండిన మహాసేనను ఇచ్చాడు. అపుడు ఇంద్రుడు మొదలైన దేవతలు తమ బలాలతో నెమలివాహనంగా కలిగిన కుమారస్వామి చుట్టూ చేరారు. శంఖం, భేరి, పణవం, గోముఖం మొదలైన తూర్య శబ్దాలు దిక్కులనిండా వ్యాపించాయి. అటువంటి శక్తిమంతమైన సురసైన్యానికి నాయకుడుగా ఆ మహాసేనుడు దేవతలను చూచి 'మీ రెవరినైనా చంపటంగాని, నాశనం చేయటంగానీ చేయవలసి ఉన్నదా? అటువంటి బలవంతు లైన శత్రువులను నాశనం చేస్తాను.' అని మాట ఇచ్చాడు. వా రంతా చాలా ఆనందించారు. సేన చేసిన సింహనాదానికి ముల్లోకాలు నాదమయము లయ్యాయి. ఆ విధంగా విశాఖుడిని ఉన్నత స్థానంలో నిలిపి బ్రహ్మ విష్ణు శివులు తమకు నచ్చిన చోటులకు వెళ్ళారు. ఆపై షణ్ముఖుడు దేవతలు తారకుడివలన బాధపడటం తెలిసికొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **బలయుతముగ నడచిన న । బ్బలియుండు ననేకదైత్యబలములతో న**
గ్గలిక నెదురు నడచెను ద । ద్బలయుగమున కక్కజంపు భండన మయ్యెన్. **186**

ప్రతిపదార్థం: బలయుతముగన్ నడచినన్= సేనలతో నడువగా; ఆ+బలియుండు= ఆ బలవంతుడు(తారకుడు); అనేక దైత్యబలములతోన్= అనేక రాక్షసబలాలతో; అగ్గలికన్= శౌర్యంతో; ఎదురు నడచెను= ఎదురువెళ్ళాడు; తద్+బలయుగమునకు= ఆ ఇరుసేనలకు; అక్కజంపు భండనము+అయ్యెన్= ఆశ్చర్యమును కల్గించే యుద్ధమైనది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: బలయుతుడై ఆ కుమారస్వామి నడవగా - ఆ బలవంతు డైన తారకుడు పలువురు రాక్షస సైనికులతో శౌర్యంతో ఎదురువెళ్ళాడు. ఆ సేనలు రెంటికి ఆశ్చర్యం కల్గించే యుద్ధం జరిగింది.

కుమారస్వామి తారకాసురుం జంపి దేవతలకు ముదంబు సేయుట (సం. 9-45-63)

వ. అట్టియెడ. 187

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయాన.

తాత్పర్యం: ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తనదొరలుఁ దాను దారక । దనుజేంద్రుఁడు గార్తికేయుఁ దాఁకిన నమృతా
శన గణ సమ్మదసంపా । దనుఁ డగుచును శక్తి యతఁడు ధరియించె నృపా! 188

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; తన దొరలున్+తానున్= తాను, తన రాజులును; తారక దనుజేంద్రుఁడు= తారకు డనే రాక్షసరాజు; కార్తికేయున్+తాఁకినన్= షణ్ముఖుడిని ఎదుర్కొనగా; అమృత+అశన గణ= దేవసమూహములకు; సమ్మదసంపాదనుఁడు+ అగుచును= సంతోషాన్ని కలిగించేవాడగుతూ; అతఁడు= షణ్ముఖుడు; శక్తి ధరియించెన్= శక్త్యాయుధాన్ని ధరించాడు.

తాత్పర్యం: తారకాసురుడు తన రాజులతో కుమారస్వామిని ఎదుర్కొన్నాడు. అమృతాహారులయిన దేవతలకు సంతోషంగా నా ఆరుమొగాలదేవుడు శక్త్యాయుధాన్ని పూనాడు.

వ. అమ్మహనీయసాధనంబున ననేకకోటిశక్తు లుద్భవించి నానాదానవప్రకరంబుల బడలువడం జేసి, యుల్కాసహస్రంబుల పిడుగులతండంబుల మ్రోఁతచందంబున విరావం బావహిల్ల నది ప్రయోగించి యమ్మహాత్ముండు మహిషత్రిపాదభృతోదరు లను దనుజసేనాపతులం బొలియింప నిలింపసైన్యంబులు సంరంభంబున దైత్యబలంబులం దెగటార్చె; నక్కుమారుండు ప్రయోగింప నాశక్తి పగతురం బిలుకుమార్చి క్రమ్మఱఁ గరతలంబునకు వచ్చు చుండె; నత్తారకుం డట్లు దమవారు సమసిన సక్రోధుండై యగ్గుహునిఁ గిట్టి బెట్టిదం బగు నతని శక్త్యస్త్రంబులతాఁకునం బడియె; నిట్లు జయంబు సేకొని యక్కార్తికేయుండు వెలింగె; విబుధులు ప్రమోదంబు నొందిరి; పదంపడి. 189

ప్రతిపదార్థం: ఆ+మహనీయ సాధనంబునన్= ఆ మహత్త్వంగల ఆయుధంతో; అనేక కోటిశక్తులు+ఉద్భవించి= ఎన్నోకోట్ల ప్రాణులు (శక్తిమంతమైనవి) పుట్టి; నానాదానవ ప్రకరంబులన్= అనేక రాక్షస సమూహాలను; బడలు+పడన్+చేసి= అలసిపోయేటట్లు కావించి; ఉల్కా సహస్రంబులు+పిడుగుల+తండంబుల+మ్రోఁతచందంబునన్= అగ్ని గోళాలను పిడుగులగుంపుల శబ్దంమాదిరిగా; విరావంబు+ఆవహిల్లన్= గొప్ప శబ్దం క్రమ్ముకోగా; అది ప్రయోగించి= ఆ శక్తిని ప్రయోగించి; ఆ+మహాత్ముండు= ఆ శక్తిమంతుడైన కుమారస్వామి; మహిష+త్రిపాదభృత+ఉదరులు= మహిషుడు, త్రిపాదభృతోదరుడు; అను= అనే పేరున్న; దనుజసేనాపతులన్+పొలియింపన్= రాక్షస సేనా నాయకులను చంపగా; నిలింప సైన్యంబులు= దేవసేనలు; సంరంభంబునన్= ఉత్సాహంతో; దైత్యబలంబులన్+తెగటార్చెన్= రాక్షససేనలను నాశం చేశాయి; ఆ+కుమారుండు ప్రయోగింపన్= ఆ కుమారస్వామి వేయగా; ఆ శక్తి= ఆ శక్త్యాయుధము; పగతురన్+పిలుకుమార్చి= విరోధులను చంపి; క్రమ్మఱన్= మరల; కరతలంబునకున్= చేతిలోనికి; వచ్చుచుండెన్= వస్తూ ఉండినది; ఆ+తారకుండు= ఆ తారకాసురుడు; అట్లు= ఆ విధంగా; తమవారు= తన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వైపు ఉన్నవారు; సమసినన్= చనిపోగా; ఆ+గుహునిన్+కిట్టి= ఆ కుమారస్వామిని సమీపించి; బెట్టిదంబు+అగు+అతని= బలముగలదయిన అతడి; శక్త్యస్త్రంబుల తాఁకునన్+పడియెన్= శక్త్యాయుధాల దెబ్బకు చనిపోయాడు; ఇట్లు జయంబు+చేకొని= ఈ విధంగా విజయాన్ని పొంది; ఆ కార్తికేయుండు= ఆ కుమారస్వామి; వెలింగెన్= ప్రకాశించాడు; విబుధులు= దేవతలు; ప్రమోదంబున్+ఒందిరి= సంతోషించారు; పదంపడి= ఆ మీదట.

తాత్పర్యం: భయంకరమైన మహత్త్వశక్తిగల ఆ అస్త్రం నుండి అనేక కోట్ల శక్తులు పుట్టి, నానా రాక్షస సమూహాలను అలయజేశాయి. ఆ శక్తినుండి అనేకాగ్నిగోళాల పిడుగుల గుంపుమ్రోత క్రమ్ముకోగా అది ఎందరో దానవసేనానాయకులను హతమార్చింది. దేవసేనలు ఉత్సాహంతో రాక్షససేనలను తెగటార్చాయి. ఆ బాలుడు శక్త్యాయుధాన్ని వేయగా అది శత్రువులను రూపుమాపి, తిరిగి అతడి చేతిలోనికి వస్తూ ఉన్నది. ఆ విధంగా తనవారు చావగా తారకుడు కోపంతో ఆ గుహుడిని తాకి, బలయుతమైన అతడి శక్త్యాయుధపు దెబ్బకు పడిపోయాడు. ఆ కార్తికేయుడు విజయంతో వెలిగాడు. దేవతలంతా ఆనందించారు. ఆ మీదట. (తరువాతి పద్యంతో అన్వయం).

క. బలికొడుకు బాణుఁ డనియెడు । బలవదసురవల్లభుండు బాధించు నను
ర్త్యులఁ గ్రౌంచపర్వతాశ్రయ । బలిష్ఠుఁ డయి జగము లెల్ల భయముం బొందన్. 190

ప్రతిపదార్థం: బలి కొడుకు= బలిచక్రవర్తి కుమారుడు; బాణుఁడు+అనియెడు బలవత్+అసురవల్లభుండు= బాణు డనే పేరున్న బలవంతుడైన రాక్షసరాజు; క్రౌంచపర్వతాశ్రయ బలిష్ఠుఁడయి= క్రౌంచపర్వతం స్థావరంగా బలవంతుడై; జగములు+ఎల్లన్ భయము+అందన్= లోకాలంతా భయమందగా; అమర్త్యులన్= దేవతలను; బాధించున్= కష్టపెట్టుతాడు.

తాత్పర్యం: బలిచక్రవర్తి కుమారుడు బాణుడనే పేరు కలవాడు బలవంతుడైన రాక్షసరాజు. క్రౌంచపర్వతం తన ఉనికిగా చేసికొని, లోకభయంకరుడుగా దేవతలను బాధపెట్టుతూ ఉన్నాడు.

వ. దానిని విని యమ్మహాసేనుండు. 191

ప్రతిపదార్థం: దానిన్+విని= ఆ విషయమును విని; ఆ+మహాసేనుండు= ఆ కుమారస్వామి.

తాత్పర్యం: ఆ వృత్తాంతాన్ని వినిన కుమారస్వామి. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. కడిమిం బోయి మహోగ్రశక్తినిహతిం గ్రౌంచంబు భేదించి యె
క్కుడు గర్వంబున వచ్చి మార్కొనిన రక్షోనాథుఁ దత్సైన్యముం
గడు వేగంబున రూపుమాపి మునిసంఘంబుల్ ప్రశంసింపఁ బె
ల్లడరన్ నిర్జరదుందుభిధ్వనులు పుష్పాసార మొప్పారఁగన్. 192

ప్రతిపదార్థం: కడిమిన్+పోయి= పరాక్రమంతో వెళ్ళి; మహోగ్రశక్తి నిహతిన్+క్రౌంచంబున్+భేదించి= మహాభయంకరమైన శక్త్యాయుధపు దెబ్బతో క్రౌంచపర్వతాన్ని చీల్చి; ఎక్కుడు గర్వంబునన్ వచ్చి= మిక్కిలి అహంకారంతో వచ్చి; మార్కొనినన్= ఎదుర్కొనగా; రక్షస్+నాథున్= రాక్షసరాజును(బాణుని); తద్+సైన్యమున్= వాని సేనను; కడు వేగంబునన్+రూపుమాపి= మిక్కిలి తొందరగా నాశనంచేసి; మునిసంఘంబుల్= తాపసిసమూహాలు; ప్రశంసింపన్= పొగడగా; నిర్జర= దేవతల; దుందుభిధ్వనులు= భేరీ శబ్దాలు; పెల్లు+అడరన్= మిక్కిలి వ్యాపించగా; పుష్ప+ఆసారము+ఒప్పారఁగన్= పూలవాన శోభించగా (కురియగా).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాక్షసరాజు (బాణుడు) పరాక్రమంతో పోయి భయంకరమైన శక్తిగల కత్తివేటుతో క్రౌంచపర్వతాన్ని చీల్చాడు. ఎక్కువ గర్వంతో వచ్చిన ఆ రాక్షస రాజును, వాడి సేనను మునులందరూ తనను పొగడగా, దేవదుందుభులు ఎక్కువగా మ్రోగగా, పూలవాన కురియగా మిగుల వేగంగా కుమారస్వామి నాశనం చేసి - (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. త్రిభువనానందకరుం డై విజయవిభవాతిశయంబున నొప్పెఁ; ని ట్లఖిలలోక సంభావనీయం బగు షణ్ముఖచరితంబు లాకర్ణించి కృతార్థుండ వైతి; కౌరవాన్వయపావన! యాబలదేవువృత్తాంతంబు కొంఱంత విను; మఱం దత్తీర్థంబునఁ బ్రతిష్ఠితుండైన కుమారునకుఁ బ్రదక్షిణప్రణామంబు లాచరించి యందలిపెద్దలు కుమరాభిషేకంబు సెప్పఁ జెవులపండువు సేసి. 193

ప్రతిపదార్థం: కౌరవ+అన్వయపావన!= కురువంశంలో పవిత్రుడైనవాడా! జనమేజయా!; త్రిభువన+ఆనందకరుండు+ఐ= ముల్లోకాలకు సంతోషం కల్గించినవాడై; విజయవిభవ+అతిశయంబునన్= గెలుపువలని వైభవంయొక్క ఆధిక్యంతో; ఒప్పెన్= ఒప్పి ఉన్నాడు; ఇట్లు+అఖిలలోక సంభావనీయంబు+అగు= ఈ విధంగా అన్ని లోకాలలోను పొగడదగినదైన; షణ్ముఖచరితంబులు+ఆకర్ణించి= ఆరు మొగాల వాడి కథలు విని; కృతార్థుండవు+ఐతి(వి)= ధన్యుడవైనావు; ఆ బలదేవు వృత్తాంతంబు కొంఱంత వినుము= ఆ బలరాముడి గాథను మిగిలిన దానిని వినుము; అతండు= ఆ బలరాముడు; ఆ+ తీర్థంబునన్= ఆ సరస్వతీ తీర్థంలో; ప్రతిష్ఠితుండు+ఐన= నిలుపబడినవాడయిన; కుమారునకున్= కుమారస్వామికి; ప్రదక్షిణ ప్రణామంబులు+ఆచరించి= ప్రదక్షిణనమస్కారాలు చేసి; అందలి పెద్దలు= అక్కడున్న పెద్దవారు; కుమార+అభిషేకంబు+ చెప్పన్= కుమారస్వామి పట్టాభిషేకాన్ని గూర్చి చెప్పగా; చెవులపండువు+చేసి= ఇంపుగా విని.

తాత్పర్యం: ఈ విధంగా ముల్లోకాలకు సంతోషం కల్గించిన వాడై విజయైశ్వర్యంతో ఉన్నాడు. సమస్త లోకాలూ గౌరవించవలసిన ఆ ఆరుమొగాల వాడి గాథలు విని ధన్యుడవైనావు. ఓ కురువంశపావనా! ఆ బలరాముడి కథను మిగిలిన దానిని వినుము. ఆత డా తీర్థంలో నిలుపబడిన కుమారస్వామికి ప్రదక్షిణపూర్వక నమస్కారాలను చేసి అక్కడి పెద్దలయినవారు కుమారస్వామి పట్టాభిషేకాదులను గూర్చి చెప్పగా చెవులకు ఇంపుగా విని.

ఆ. అగ్నితీర్థమునకు నరిగె; నయ్యెడఁ దొల్లి । యగ్ని డాఁగియున్న నమరు లచటి
కేఁగుదెంచి కాంచి; రిద్ధశమీగర్భ । లీనుఁ డైన యతని మానవేంద్ర! 194

ప్రతిపదార్థం: మానవేంద్ర!= ఓ రాజా!; అగ్నితీర్థమునకున్= అగ్నితీర్థానికి; అరిగెన్= వెళ్ళాడు; తొల్లి= పూర్వం; అగ్ని= అగ్నిదేవుడు; డాఁగిఉన్నన్= దాగికొని ఉండగా; అమరులు= దేవతలు; అచటికిన్+ఏఁగుదెంచి= ఆ చోటికి వచ్చి; ఇద్ధశమీ గర్భలీనుఁడు+ఐన= ప్రకాశిస్తున్న జమ్మికడుపున అణగి ఉన్న; అతనిన్= ఆ అగ్నిని; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: అగ్నితీర్థం చాలా పవిత్రమైనదని విని బలరాముడు అక్కడకు వెళ్ళాడు. పూర్వం అగ్నిదేవుడు అందులో దిగి ఉండగా, దేవతలందరునూ అక్కడకు వచ్చారు. ప్రకాశిస్తున్న జమ్మిచెట్టు కడుపులో లీనమైన అతడిని చూచారు.

వ. భృగుశాపంబునం బ్రాపించు సర్వభక్షకత్వంబునకుఁ జాకల తొలంగిన యగ్నిదేవు నట్లు గని బ్రహ్మాదిదేవత లమ్మునివచనం బమోఘంబు గావున నీవు సర్వభక్షణుం డయ్యు మాలో నగ్రపూజ్యుండ వని యొడంబఱిచి నిజస్థానంబునకుం జనునప్పు డత్తీర్థంబు పరమపావనం బని తజ్జలంబులఁ గృతస్నాను లైరి; యందుండి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యాసీరి కౌబేర తీర్థంబునకుం జనియె; నది కుబేరుండు తపంబు సేసి ధనాధిపత్యంబు మొదలైనవరంబులు వడసినచోఁ; టయ్యెడఁ గదలి యతండు. 195

ప్రతిపదార్థం: భృగుడిశాపంబునన్= భృగుమహర్షి శాపంచేత; ప్రాపించు= సిద్ధించు; సర్వభక్షకత్వంబునకున్= అన్నిటినీ తినే దానికి; చాలక= సరిపోక (చాలకుండా); తొలంగిన+అగ్నిదేవునట్లు కని= తప్పుకొన్న అగ్నిదేవుడిని ఈ విధంగా ఉండగా చూచి; బ్రహ్మఆదిదేవతలు= బ్రహ్మమొదలయిన దేవతలందరూ; ఆ+మునివచనంబు+అమోఘంబు+కావునన్= ఆ తాపసి మాటలు వ్యర్థంకానివి కనుక; నీవు సర్వభక్షణుండు+అయ్యున్= అన్నిటినీ తినేవాడవైనప్పటికిని; మాలోన్= మాలో; అగ్రపూజ్యుండవు= తొలుత పూజించతగినవాడవు; అని= అంటూ; ఒడంబఱిచి= ఒప్పించి; నిజస్థానంబునకున్= తన చోటికి; చనునప్పుడు= వెళ్ళేటప్పుడు; ఆ తీర్థంబు పరమపావనంబు+అని= ఆ తీర్థం చాలా పవిత్రమైనదంటూ; తద్+జలంబులన్= ఆ నీటిలో; కృతస్నానులు+ఐరి= స్నానం చేశారు; అందుండి= అక్కడినుండి; ఆ సీరి= ఆ బలరాముడు; కౌబేర తీర్థంబునకున్+చనియెన్= కుబేరతీర్థానికి వెళ్ళాడు; అది= ఆచోటు; కుబేరుండు+తపంబుచేసి= కుబేరుడు తపస్సు చేసి; ధన+ఆధిపత్యంబున్= ధనంమీద అధిపతిత్వాన్ని; పడసినచోటు= (వరంగా) పొందినచోటు; ఆ+ఎడన్+కదలి= ఆచోటునుండి కదలి; ఆతండు.

తాత్పర్యం: భృగుడిశాపం వలన కలిగే సర్వభక్షకత్వమునకు ఓర్వని దాగి ఉన్న అగ్నిదేవుడిని చూచి బ్రహ్మాది దేవతలు 'ఆ మునిమాటలు అమోఘమయినందువలన నీవు అన్నింటిని తినేవాడవైనా మాలో తొలుత పూజించదగినవాడవు' అని ఒప్పించి తమ తమ చోటులకు వెళ్ళారు. తమ చోటులకు వెళ్ళేటపుడు ఆ తీర్థం పరమపవిత్రమయినదని అంటూ ఆ నీటిలో స్నానమాడారు. బలరాము డక్కడినుండి కుబేరతీర్థానికి వెళ్ళాడు. అది కుబేరుడు తపస్సు చేసినందున ఐశ్వర్యాధిపత్యం మొదలయిన వరాలు పొందినచోటు. ఆ చోటునుండి అతడు ముందుకు సాగాడు.

ప్రభావతి యను మునికన్యక మహిమాభివర్ణనము (సం. 9-47-2)

సీ. బదరిపాచన నామ పరమతీర్థమునకుఁ । జనియె; భరద్వాజతనయ తొల్లి
యచటఁ బ్రభావతి యనునది యింద్రుండు । పతి గాఁగఁ గోరి తపంబు సేయ
నతఁడు వసిష్ఠునాకృతి దాల్చి వచ్చిన । నయ్యింతి యర్ఘ్యపాద్యాదు లిచ్చి
భక్తితోఁ జేరి 'మత్పాణి శక్రున కిచ్చు । దాన; నపూనిక మానఁ గాని

తే. వలయుపనిఁ బంపుఁ' డన్న నవ్వొలయ నమ్ము । హోత్మ్యుఁ 'డది యట్ల యగుఁ గాని యతివ! వీనిఁ
బక్వములు సేయు' మని కొన్ని బదరిఫలము । లా నితంబినిచే నిచ్చి యవుల నుండ. 196

ప్రతిపదార్థం: బదరిపాచన నామ పరమతీర్థమునకున్+చనియెన్= బదరి పాచనమనే శ్రేష్ఠమైన తీర్థానికి వెళ్ళాడు; తొల్లి= పూర్వం; అచటన్= ఆ చోటులో; భరద్వాజ తనయ= భరద్వాజుడి కొమార్తె; ప్రభావతి+అనునది= ప్రభావతి అనే ఆమె; ఇంద్రుండు+పతి+కాఁగన్+కోరి= ఇంద్రుడిని భర్తగా కోరి; తపంబు+చేయన్= తపస్సు చేయగా; అతఁడు= ఆ ఇంద్రుడు; వసిష్ఠ+ఆకృతి తాల్చి వచ్చినన్= వసిష్ఠుడి వేషంలో రాగా; ఆ+ఇంతి= ఆ స్త్రీ (భరద్వాజుడి కూతురు); అర్ఘ్యపాద్య+ఆదులు+ఇచ్చి= అర్ఘ్యం పాద్యం మొదలైన సంప్రదాయబద్ధమైన స్వాగతములిచ్చి; భక్తితోన్+చేరి= భక్తితో దగ్గరకు వెళ్ళి; మత్పాణి= నా చేతిని; శక్రునకున్+ఇచ్చుదానన్= ఇంద్రుడికిస్తాను; ఆ+పూనిక మానన్= ఆ ప్రయత్నం వదలను; కాని= కావైతే; వలయుపనిన్= అవసరమైన పనిని; పంపుఁడు= ఆనతివ్వండి; అన్నన్= అనగా; నవ్వు+ఒలయన్= నవ్వు జనించగా; ఆ+

మహాత్ముఁడు= ఆ మహనీయుడు; అది అట్ల+అగున్+కాని= ఆ పని అట్లే అవుతుంది కాని; అతివ!= ఓ స్త్రీ!; వీని పక్వములు చేయుము+అని= వీటిని పరిపాకం చెందే విధంగా చేయుము అని; కొన్ని బదరిఫలములు= కొన్ని రేగుపండ్లు; ఆ నితంబిని చేన్+ఇచ్చి= ఆ స్త్రీ చేతి కిచ్చి; అవులన్+ఉండన్= దూరంగా ఉండగా.

తాత్పర్యం: బదరిపాచనం అనే పవిత్రమయిన తీర్థానికి వెళ్ళాడు. అది పావన తీర్థ మనీ పూర్వ మచట భరద్వాజుడి కూతురు ప్రభావతి అనే పేరుగలఆమె ఇంద్రుడిని భర్తగా కోరి తపస్సు చేయగా ఇంద్రుడు వసిష్ఠుడి వేషంతో వచ్చాడు. ఆ స్త్రీ అర్ఘ్యపాద్యాదు లిచ్చింది. భక్తితో ఆతడి వద్దకు వెళ్ళి 'నా చేతిని ఇంద్రుడికే ఇస్తాను, ఆ ప్రయత్నం మానుకోను. అయితే మీకు కావలసిన పనికి నన్ను వినియోగించుకొనండి'. అన్నది. అది విని, ఇంద్రుడు 'అట్లే కానిమ్ము' అని ఆమె చేతికి కొన్ని రేగుపండ్లు ఇచ్చి వాటిని పక్వమయ్యేటట్లు చేయుమని అడిగి దూరంగా ఉన్నాడు.

వ. అదియును గృతస్నానయుఁ గలితధౌతపరిధానయు నై ప్రాయి నగ్ని రాజఁబెట్టి యాఫలంబులు జలంబులతోడఁ గూడ నెక్కించి వండుచుండ నవి పాకంబునకు రాకయుండ వెండియుఁ దన సవరించిన కాష్ఠంబులు గ్రమంబున నిడి యనలంబు ప్రబలంబు సేయఁ గాష్ఠంబులు సమసెఁ గాని యారేఁగుఁబం డ్లురియవయ్యెఁ; గాష్ఠంబులు గలయెడకుం బోయి తెచ్చునంత కగ్ని యాఱెనేని దుష్పాకం బగు నని యా మగువ తనకా లింధనంబుగా నిడి పాకంబు సేయఁ గనుంగొని పాకశాసనుం డచ్చెరువొంది ప్రత్యక్షంబై 'శుభాంగి! నీదు నిష్ఠాతిశయంబునకు మెచ్చితి. భవదభిమతం బిచ్చితిని. తనువు విడిచి త్రిదివమ్మునకు రమ్ము. సర్వపాపహరం బైన యీ తీర్థంబు లోకత్రయప్రఖ్యాతం బయ్యెడు' మనియె. నమ్మహాభాగయు నాసుమనోవిభునకు మనోరమ యై వెలసె; నట్టి బదరిపాచనంబుననుండి. 197

ప్రతిపదార్థం: అదియును= ఆ భరద్వాజుడి కూతురును; కృతస్నానయున్= స్నానంచేసినదియు; కలితధౌతపరివిధానయున్+ఐ= ఉతికిన(మడుగు)చీరను కట్టుకొన్నదై; ప్రాయిన్+అగ్ని రాజన్+పెట్టి= పొయ్యిలో నిప్పును ముట్టించి మండజేసి; ఆ ఫలంబులు= ఆ రేగుపండ్లు; జలంబులతోడన్= నీటితోకూడా; ఎక్కించి= పొయ్యిమీద కెక్కించి; వండుచుండన్= వంట చేస్తూఉండగా (ఉడికిస్తుండగా); అవి పాకంబునకున్ రాకఉండన్= ఆ పండ్లు పరిపక్వమైన స్థితికి రాకుండా ఉండగా; వెండియున్= ఇంకను; తన సవరించిన కాష్ఠంబులు= తాను సరిచేసిన కట్టెలు; క్రమంబునన్= వరుసగా; ఇడి= (పొయ్యిలో) ఉంచి; అనలంబున్= నిప్పును; ప్రబలంబుచేయన్= ఎక్కువ మండేటట్లు చేయగా; కాష్ఠంబులు= కట్టెలు; సమసెన్+కాని= అయిపోయాయి కాని; ఆ రేగుపండ్లు+ఉరియవు+అవయ్యెన్= ఆ రేగుపండ్లు ఉడకలేదు; కాష్ఠంబులు+కల+ఎడకున్+పోయి= కట్టె లున్నచోటికి పోయి; తెచ్చునంతకున్= తెచ్చేసరికి; అగ్ని ఆఱెను+ఏని= నిప్పు చల్లారిపోతే; దుష్పాకంబు+అగును+అని= చెడిన వంటఔతుందని; ఆ మగువ= ఆ స్త్రీ; తనకాలు+ఇంధనంబుగాన్+ఇడి= తనకాలినే కట్టెగా చేసిపెట్టి; పాకంబు+చేయన్= వంట చేయగా; కనుంగొని= చూచి; పాకశాసనుండు+అచ్చెరువు+ఒంది= ఇంద్రు డబ్బురపడి; ప్రత్యక్షంబు+ఐ= కనబడి; శుభాంగి!= ఓ సుందరీ!; నీదునిష్ఠాతిశయంబునకున్ మెచ్చితి= నీ పట్టుదలకూ నియమానికీ మెచ్చుకొన్నాను; తనువు విడిచి= ఈ (మానవ) శరీరాన్ని వదలి త్రిదివంబునకున్+రమ్ము= స్వర్గానికి రమ్ము; సర్వపాపహరంబు+ఐ= అన్ని పాపాలను పోగొట్టునదై; ఈ తీర్థంబు= ఈ పవిత్రమయిన తీర్థం; లోకత్రయ ప్రఖ్యాతంబు+అయ్యెడున్= ముల్లోకాలలో ప్రసిద్ధినందుతుంది; అనియెన్= అన్నాడు; ఆ+మహాభాగయున్= ఆ మహానుభావురాలు కూడా; ఆ సుమనోవిభునకున్= ఆ దేవరాజునకు; మనోరమ ఐ= భార్యయై; వెలసెన్= ఒప్పింది; అట్టి బదరిపాచనంబుననుండి= అటువంటి బదరి పాచన పవిత్రతీర్థం నుండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ భరద్వాజుడి కూతురు స్నానమాడి మడుగు వస్త్రాలను కట్టుకొని పొయ్యిలో నిప్పును రాజజేసి పండ్లను నీటితో కూడా పొయ్యిమీద కెక్కించి వండుతూ ఉండగా, అవి ఉడికి పాకానికి రాకుండినవి. ఇంకనూ తాను చక్కజేసిన కట్టెలను వరుసగా పెట్టి, నిప్పును ప్రబలం చేయగా కట్టె లైపోయినవి. కాని ఆ రేగుపండ్లు ఉడకలేదు. 'కట్టెలుండే చోటికి పోయి తెచ్చేలోపల నిప్పు ఆరిపోతే వంట చెడిపోతుంది.' అని ఆ స్త్రీ తన కాలినే వంటకట్టెగా పెట్టి వంట చేయటాన్ని చూచిన ఇంద్రుడు అబ్బురపడి ప్రత్యక్షమై 'సుందరీ! నీ నిష్ఠాతిశయానికి సంతోషించాను. నీకోర్కెను తీరుస్తున్నాను. ఈ శరీరాన్ని వదలి దేవలోకానికి రమ్ము. పాపాలనంతా తొలగించే ఈ తీర్థం ముల్లోకాలలో కీర్తింపబడుతుంది.' అని అన్నాడు. ఆమెకూడా ఆ దేవరాజునకు భార్యగా ఒప్పారింది. అటువంటి బదరిపాచనం నుండి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. **ఇంద్రతీర్థమునకు నేఁగె నా బలభద్రుఁ । డచట నూఱుక్రతువు లాచరించి**
యనిమిషేశ్వరుండు గనియె శతక్రతుఁ । డనుప్రసిద్ధితోడ నతులపదము. **198**

ప్రతిపదార్థం: ఆ బలభద్రుఁడు= ఆ బలరాముడు; ఇంద్రతీర్థమునకున్+ఏఁగెన్= ఇంద్రతీర్థానికి వెళ్ళాడు; అచటన్= ఆ తీర్థంలో; నూఱు క్రతువులు+ఆచరించి= నూరు యజ్ఞాలు చేసి; అనిమిష+ఈశ్వరుండు= దేవరాజు; శతక్రతుఁడు= నూరుయాగాలు చేసినవాడు; అను ప్రసిద్ధితోడన్= అనే కీర్తితో; అతులపదము= సాటిలేని స్థానాన్ని; కనియెన్= పొందాడు.

తాత్పర్యం: ఆ తరువాత బలరాముడు ఇంద్రతీర్థానికి వెళ్ళాడు. ఆ తీర్థంలో ఇంద్రుడు నూరుయాగాలు చేసి శతక్రతుడనే కీర్తితోపాటు సాటిలేని పదవిని పొందాడు.

వ. **అచ్చోటు గదలి హలాయుధుండు రామతీర్థంబునకుం బోయెఁ; బలుమాఱు రాజుల నెల్లను బొరిగొని పరశురాముం డతృప్తుండై ప్రాయశ్చిత్తంబుగా నయ్యెడఁ గశ్యపు నుపదర్శనంబున రాజసూయంబులు నశ్వమేధంబులు వాజపేయంబులు ననేకంబు లొనర్చి యమ్మునీంద్రునకు దక్షిణ సమస్తక్షోణియు నొసంగె; నందుండి యయ్యేకకుండలుండు యామునంబునకుం జనియె; నది వరుణుండు రాజసూయంబులు సేసినప; ట్టయ్యధ్వరంబు నవసానంబున దేవాసురులకు సకలభూతసంక్షయకరం బగు చున్న సంగరంబు ప్రవర్తించె.** **199**

ప్రతిపదార్థం: ఆ+చేటున్+కదలి= ఆ చోటునుండి వెడలిపోయి; హలాయుధుండు= బలరాముడు; రామతీర్థంబునకున్+పోయెన్= రామతీర్థానికి వెళ్ళాడు; పలుమారు రాజులన్+ఎల్లను పొరిగొని= పలుమార్లు రాజులనంతా హతమార్చి; పరశురాముండు+అతృప్తుండు+ఐ= పరశురాముడు సంతోషపడకుండా; ప్రాయశ్చిత్తంబుగాన్= చేసిన తప్పునకు శిక్షగా; ఆ+ఎడన్= ఆచోటులో; కశ్యపు+ఉపదర్శనంబునన్= కశ్యపుడి పర్యవేక్షణలో; రాజసూయంబులు= రాజసూయ యాగాలు; అశ్వమేధంబులు= అశ్వమేధయాగాలు; వాజపేయంబులు= వాజపేయ యాగాలు; అనేకంబులు+ఒనర్చెన్= చాలా చేశాడు; ఆ+మునీంద్రునకున్= ఆ ఋషీంద్రుడికి; దక్షిణ= దక్షిణగా; సమస్త క్షోణియున్= భూమినంతను; ఒసంగెన్= ఇచ్చాడు; అందుండి= అక్కడనుండి; ఆ+ఏకకుండలుండు= ఒకకుండలం గలవాడైన అతడు; యామునంబునకున్+చనియెన్= యామునతీర్థమునకు వెళ్ళాడు; అది వరుణుండు రాజసూయంబు చేసినపట్టు= ఆ చోటు వరుణుండు రాజసూయ యాగం చేసిన చోటు; ఆ+అధ్వరంబు+ అవసానంబునన్= ఆ యాగాంతమున; దేవ+అసురులకున్= దేవతలకు, రాక్షసులకును; సకల భూతసంక్షయకరంబు= సమస్త ప్రాణులకు నాశకరమైనది; అగుచున్న= జరుగుతున్న; సంగరంబు ప్రవర్తించెన్= యుద్ధం సాగినది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: బలరాము డా చోటునుండి కదలి రామతీర్థానికి వెళ్ళాడు. పరశురాముడు పెక్కుమార్లు రాజులను చంపికూడా తృప్తి పొందక ప్రాయశ్చిత్తంగా కశ్యపుడి పర్యవేక్షణలో రాజసూయ, అశ్వమేధ, వాజపేయాది యాగాలు చేసి, సమస్తభూమిని ఆ మునీంద్రుడికి దక్షిణగా ఇచ్చాడు. ఆ చోటునుండి ఏకకుండలుడైన బలరాముడు యామున తీర్థమునకు వెళ్ళాడు. అది వరుణుడు రాజసూయ యాగం చేసిన చోటు. ఆ యజ్ఞం ముగిసేసమయంలో దేవతలకు- రాక్షసులకు సమస్త ప్రపంచనాశంకరమయిన యుద్ధం నడచింది.

ఆ. అచటు గదలి యాతఁ డాదిత్యతీర్థసం । సేవనమున కరిగె ధీవిశాల!
యందుఁ గ్రతు వొనర్చి యాదిత్యుఁ డుజ్జ్వల । జ్యోతిషాధిపత్యశోభి యయ్యె. 200

ప్రతిపదార్థం: ధీవిశాల!= మంచిబుద్ధిమంతుడా!; అచటుకదలి+ఆతఁడు= ఆ బలరాము డా చోటునుండి బయలుదేరి; ఆదిత్య తీర్థ సంసేవనమునకున్+అరిగెన్= ఆదిత్య తీర్థాన్ని సేవించటానికి వెళ్ళాడు; అందున్+క్రతువు+ఒనర్చి= అక్కడ యాగం చేసి; ఆదిత్యుఁడు= సూర్యుడు; ఉజ్జ్వల= ప్రకాశవంతమైన; జ్యోతిషాధిపత్య శోభి+అయ్యెన్= గ్రహాధిపత్యంచేత ప్రకాశించాడు.

తాత్పర్యం: బలరాము డాచోటునుండి వెళ్ళి సూర్యతీర్థాన్ని సేవించటానికి వెళ్ళాడు. సూర్యు డా చోట యాగం చేసి, ప్రకాశమానమైన గ్రహాధిపత్యాన్ని పొందాడు.

వ. ద్వైపాయనుండును శుకుండును గృష్ణుండును జైమినియు దేవల జైగీషవ్యాదు లగు నైష్ఠికు లనేకు లయ్యెడ నద్భుతయోగసిద్ధిం బొందిరి. 201

ప్రతిపదార్థం: ద్వైపాయనుండును= వ్యాసుడునూ; శుకుండును= శుకమహర్షియున్నూ; కృష్ణుండును= శ్రీకృష్ణుడునూ; జైమినియున్= జైమినిమునియునూ; మఱియును= ఇంకను; దేవల= దేవల ఋషియునూ; జైగీషవ్యాదులు+అగు= జైగీషవ్యుడూ మొదలైన; నైష్ఠికులు+అనేకులు= నిష్ఠగలవారు చాలమంది; ఆ+ఎడన్= ఆచోట(సూర్యతీర్థంలో); అద్భుతయోగస్థితిన్+పొందిరి= ఆశ్చర్యకరయోగ సిద్ధిని పొందారు.

తాత్పర్యం: వ్యాసుడూ, శుకుడూ, కృష్ణుడూ, జైమినీ, ఇంకా దేవలుడు, జైగీషవ్యుడు మొదలగు నిష్ఠాపరు లనేకులు అచ్చట అద్భుతమైన యోగసిద్ధిని పొందారు.

తే. అచటినుండి సారస్వత మను వసిష్ఠ । తీర్థమున కేఁగె నా బలదేవుఁ డధిప
యందుఁ దొల్లి నిష్ఠాతిశయంబుమై ద । ధీచి యనుముని నియమంబు లాచరించె. 202

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; అచటినుండి= ఆ సూర్యతీర్థంనుండి, సారస్వతము+అను= సారస్వతం అనేపేరుగల; వసిష్ఠతీర్థమునకున్= వసిష్ఠతీర్థానికి; ఆ బలదేవుఁడు= ఆ బలరాముడు; ఏగెన్= వెళ్ళాడు; అందున్= ఆ తీర్థంలో; నిష్ఠా+అతిశయంబుమైన్= మిక్కిలి శ్రద్ధతో; దధీచి అను ముని= దధీచి అనే పేరుగల ముని; నియమంబులు+ఆచరించెన్= నియమాలను పాటించాడు.

తాత్పర్యం: ఆ ఆదిత్య తీర్థంనుండి బలరాముడు సారస్వతమనే వసిష్ఠ తీర్థానికి వెళ్ళాడు. పూర్వ మా చోట దధీచి అనే ముని మిక్కిలి నియమంతో తపస్సు చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఆ నియమాచరణంబునకు నింద్రుండు శంకించి తద్విఘ్నకరణంబునకు నలంబుస యనునప్సరోవనితం బుత్తెంచినఁ దదీయదర్శనంబున నమ్ముని వీర్యంబు స్ఖలించిన దాని సరస్వతి గర్భంబుగా ధరియించి పుత్త్రుం గాంచి తపస్విజనగోష్ఠి నున్న యత్తపోధనుకడకుఁ దెచ్చి 'వీఁడు నీకొడుకు; భవత్తేజంబు వృథ వోనీక యేను వహించి కాంచితి; వీనిం గైకొను' మనిన నతండు వాని నెత్తికొని యాలింగనంబును మూర్ధఘ్రాణంబును జేసి యాసరిద్వర నాలోకించి 'నీవు బ్రహ్మసరస్సున జనియించితి; పుణ్యనదులయందు మేటి' వని సంస్తుతించి 'నీజలంబులం దర్పణంబు సేసిన విశ్వేదేవతలుఁ బితరులు గంధర్వులుఁ దృప్తులౌదు' రని యనుగ్రహించి 'యిక్కుమారుండు నీ పేర సారస్వతుం డనం బరఁగుఁ బదంపడి పండ్రెండేం డ్లనావృష్టి యైన నయ్యాపదఁ బొంద కుండఁ బెక్కండ్రు మునుల రక్షించి వేదాధ్యయనంబులు సేయించు' నని చెప్పి యొప్పగించిన సరస్వతి ప్రీత యై తనయుం గొని చనియె; నా కాలంబున. 203

ప్రతిపదార్థం: ఆ నియమ+ఆచరణంబునకున్= ఆ నియమాన్ని ఆచరించటానికి; ఇంద్రుండు శంకించి= ఇంద్రుడు అను మానించి; తద్+విఘ్నకరణంబునకున్= ఆ దధీచి నియమానికి అడ్డు తగలటానికి; అలంబుస+అను+అప్సరస్+వనితన్+ పుత్తెంచినన్= అలంబుస అనే అప్సరసను పంపగా; తదీయ దర్శనంబునన్= ఆమెను చూడటంచేత; ఆ+మునివీర్యంబు= ఆ దధీచి మునియొక్క వీర్యం; స్ఖలించినన్= జారగా; దానిన్= ఆ వీర్యమును; సరస్వతి గర్భంబుగాన్ ధరియించి= సరస్వతి తన కడుపులో మోసి; పుత్రున్+కాంచి= కొడుకును కని; తపస్విజన గోష్ఠిన్+ఉన్న= మునిజనుల గోష్ఠిలోనున్న; ఆ+ తపోధనుకడకున్+తెచ్చి= ఆ తాపసివద్దకు తీసికొనివచ్చి; వీఁడు నీ కొడుకు= వీడు నీ కుమారుడు; భవత్+తేజంబు వృథ పోనీక= నీ శక్తిని వ్యర్థం కానీయక; ఏను వహించి= నేను మోసి; కాంచితిన్= కన్నాను; కైకొనుము+అనినన్= తీసికొను మనగా; అతండు= ఆ దధీచి; వానిన్= ఆ బాలుడిని ఎత్తికొని; ఆలింగనంబును= కౌగిలిని; మూర్ధఘ్రాణంబును= శిరస్సు నాఘ్రాణించుట; చేసి= చేసినవాడై; ఆ సరిద్వరన్+ఆలోకించి= శ్రేష్ఠమైన ఆ నదిని చూచి; నీవు బ్రహ్మ సరస్సున జనియించితి(వి)= నీవు బ్రహ్మతీర్థంలో పుట్టావు; పుణ్యనదులఅందున్= పవిత్రమైన నదులలో; మేటివి= గొప్పదానవు; అని సంస్తుతించి= అంటూ పొగడి; నీ జలంబులన్+తర్పణంబు చేసినన్= నీనీటిలో (పితరులకు) తర్పణం చేస్తే; విశ్వేదేవతలు; పితరులు= పితృదేవతలు; గంధర్వులు= గంధర్వులు; తృప్తులు+ఔదురు= సంతుష్టు లవుదురు; అని అనుగ్రహించి= అంటూ దయజూపి; ఈ+కుమారుండు= ఈ బాలుడు; నీపేర సారస్వతుండు+అనన్+పరఁగున్= నీ పేరుమీద ఈ పసివాడు సారస్వతుడని పిలువబడతాడు; పదంపడి= ఆ మీదట; పండ్రెండు+ఏండ్లు= పన్నెండు సంవత్సరాలు; అనావృష్టి+ఐనన్= వానలు లేకుండిన; ఆ+ఆపద+పొందకుండన్= ఆ ప్రమాదం వలని కష్టమును అనుభవించకుండా; పెక్కండ్రు మునులన్ రక్షించి= చాలామంది తాపసులను కాపాడి; వేదాధ్యయనంబులు= వేదమును చదవటం; చేయించును+అని చెప్పి= చేయిస్తాడని చెప్పి; ఒప్పగించినన్= అప్పజెప్పగా; సరస్వతి ప్రీత+ఐ= సరస్వతి సంతోషించి; తనయున్+కొని చనియెన్= తన కుమారుడిని తీసికొని వెళ్ళింది; ఆ కాలంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ దధీచి తపో నియమానికి దేవరాజు సంశయించి దానికి అడ్డు వేయటానికై అలంబుస అనే అప్సరః కాంతను పంపాడు. ఆమెను చూడటంతో ఆ మునికి వీర్యం జారింది. దానిని సరస్వతీనది తన కడుపున దాచి, కుమారుడిని కని ఆ తపోధనుడి వద్దకు తీసికొనివచ్చి, తాపసుల గోష్ఠిలోనున్న దధీచితో 'వీడు నీ కొడుకు; - నీ వీర్యాన్ని వ్యర్థం కానీయక నేను ధరించి కన్నాను. వీడిని తీసికొనుము' అన్నది. ఆత డా కుమారుడిని ఎత్తుకొని కౌగిలించుకొని, ప్రేమతో శిరస్సు ముద్దుపెట్టుకొని, ఆ నదీమతల్లిని చూచి 'నీవు బ్రహ్మ సరస్సున పుట్టావు. పవిత్రమైన నదులలో మేటివి' అని మెచ్చి, నీ జలాలతో తర్పణం వదలితే దేవతలు, పితృదేవతులు, విశ్వేదేవతలు,

గంధర్వులు తృప్తిపొందుతారు' అని దయచూపి, 'ఈ బాలుడు నీ పేరున సారస్వతు డనబడతాడు. ముందు పంద్రేండ్లు వానలు లేక కాటకం వస్తే ఆ ప్రమాదంనుండి అనేకులు మునులను కాపాడి వేదవిద్య నేర్పుతాడు' అని చెప్పి ఒప్పగించగా సరస్వతి సంతోషించి, కుమారుడితో వెళ్ళింది. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అమరులకు నసురులకుఁ గల । హము గలిగిన బలవిరోధి యాయుధనికురుం
బము సవరించు మహోద్యో । గమునఁ బ్రవర్తించె వీరకౌతుక మలరన్. 204

ప్రతిపదార్థం: అమరులకున్+అసురులకున్= దేవతలకు రాక్షసులకును; కలహము కలిగినన్= జగడం రాగా; బలవిరోధి= ఇంద్రుడు; ఆయుధ నికురుంబమున్= అస్త్రసమూహాన్ని; సవరించు= చక్కచేసే; మహా+ఉద్యోగమునన్= గొప్ప ప్రయత్నంలో; వీరకౌతుకము+అలరన్= వీరోత్సాహాలు ఒప్పగా; ప్రవర్తించెన్= నడచుకొన్నాడు.

తాత్పర్యం: దేవాసురులకు యుద్ధం రాగా ఇంద్రుడు అస్త్రసమూహాన్ని సవరించే పెనుప్రయత్నంలో వీరోత్సాహాలతో ప్రకాశించాడు.

వ. అ ట్లుద్యోగించి. 205

ప్రతిపదార్థం: అట్లు+ఉద్యోగించి= ఆ విధంగా ప్రయత్నం చేసి.

తాత్పర్యం: ఆ విధంగా ప్రయత్నించి.

చ. జగముల నెందునుం బడయఁ జాల కతండు దధీచియస్థులం
దగియెడునాయుధంబు లగుఁ దత్పరతం జని వేఁడ నాతఁ డి
చ్చు గురుతరాక్షయోజ్జ్వలయశోనిరతుం డని పంపఁగా నిలిం
పగణము వోయి వేఁడిన నృపాలక! యిచ్చె నతండు ప్రీతితోన్. 206

ప్రతిపదార్థం: నృపాలక!= ఓ రాజా! (జనమేజయా!); అతండు= ఆ ఇంద్రుడు; జగములన్+ఎందునున్+పడయన్+చాలక= లోకాలలో ఎక్కడను పొందలేక; దధీచి అస్థులన్= దధీచి ఎముకలలో; తగియెడు నాయుధంబులు+అగున్= తగిన (యుద్ధసాధనాలు) ఆయుధాలు కాగలవు; తత్పరతన్= ఆసక్తితో(పట్టుదలతో); చని వేఁడన్= వెళ్ళి ప్రార్థించగా; ఆతఁడు+ ఇచ్చున్= ఆతడు+ఈయగలడు; (దధీచి ఈయగలడు); గురుతర= గొప్పదయిన; అక్షయ= నాశనంకాని; ఉజ్జ్వల= ప్రకాశించే; యశోనిరతుండు= కీర్తిమంతుడు; అని= అంటూ; పంపఁగాన్= పంపించగా; నిలింపగణము= దేవతల సమూహాలు; పోయి వేఁడినన్= దగ్గరకు పోయి ప్రార్థించగా; అతండు= ఆ దధీచి; ప్రీతితోన్+ఇచ్చెన్= సంతోషంతో ఇచ్చాడు.

తాత్పర్యం: ఇంద్రుడు ప్రపంచంలో ఎక్కడా పొందలేనివైన దధీచి ఎముకలు ఆయుధాలు కాగల వని పట్టుదలతో వెళ్ళి ప్రార్థించగా 'దధీచి ఈయగలడు. అతడు విస్తారమూ, ప్రకాశవంతమూ నాశంకానిదీ అయిన కీర్తి కలవా' డని పంపగా దేవతలు పోయి వేడుకొనగా ప్రీతితో దధీచి ఇచ్చాడు. ఓ రాజా! (వినుము). (అని జనమేజయుడికి వైశంపాయనముని చెప్పాడు.)

వ. ఇచ్చి యతం డవ్యయలోకంబున కరిగె; నమరవరుండును దదస్థుల వజ్రాయుధంబు నొనర్చి పేర్చె; నంత నాసారస్వతుండు ద్వాదశవార్షికం బగుననావృష్టి దురితంబునఁ దన్నుఁ జేరి పిన్న యనక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విద్యావిశేషకలితంబైన గౌరవంబున శిష్యత్వంబు భజియించిన యఱువదివేవురు మునుల సరస్వతీప్రభావజనితం బగు నన్నంబున రక్షించుచు వేదంబుఁ జదివించె; నా సారస్వతతీర్థంబున నుండి యాసంకర్షణుండు వృద్ధకన్యాశ్రమంబు నకుం బోయె నయ్యెడ గర్గవంశవర్యుం డగు ఖని యను తపోధనుండు. 207

ప్రతిపదార్థం: ఇచ్చి+అతండు+అవ్యయ లోకంబునకున్+అరిగెన్= ఆ ఎముకల నిచ్చి ఆయన నాశనం లేనట్టి లోకానికి వెళ్ళాడు; అమరవరుండును= దేవరాజును; తద్+అస్థులన్ వజ్రాయుధంబు+ఒనర్చి= ఆ ఎముకలతో వజ్రాయుధం చేసి; పేర్చెన్= విజృంభించాడు; అంతన్+ఆ సారస్వతుండు= ఆ మీదట ఆ సరస్వతీ తనయుడు; ద్వాదశ వార్షికంబు+అగు= పండ్రెండేండ్లు సాగిన; అనావృష్టి దురితంబునన్= వానలేనట్టి కష్టంతో; తన్నున్+చేరి= తన వద్దకు వచ్చి; పిన్న+అనక= పసివాడనకుండా; విద్యావిశేష కలితంబు+ఐన= చదువరితనంతో కూడుకొన్న; గౌరవంబునన్= మర్యాదతో; శిష్యత్వంబు= శిష్యత్వంతో, భజియించినన్= పూజించగా; అఱువది+వేవురు మునుల= అరవైవేలమంది తాపసులను; సరస్వతీ ప్రభావజనితంబు+అగు= సరస్వతీ తీర్థప్రభావం వలన కలిగిన; అన్నంబునన్ రక్షించుచున్= భోజనంతో కాపాడుతూ; వేదంబున్+చదివించెన్= వేదాధ్యయనం చేయించాడు; ఆ సారస్వత తీర్థంబున నుండి; ఆ సంకర్షణుండు= ఆ బలరాముడు; వృద్ధకన్యా+ఆశ్రమంబునకున్+పోయెన్= వృద్ధకన్యయొక్క తపోవనానికి వెళ్ళాడు; ఆ+ఎడన్= అక్కడ; గర్గవంశవర్యుండు+అగు= గర్గమహాముని వంశంలో శ్రేష్ఠుడైన; 'ఖని' అను తపోధనుండు= ఖనిఅని పేరుండే తాపసి.

తాత్పర్యం: దధీచి తన ఎముకలను ఇచ్చి, నాశనం లేని లోకాలకు వెళ్ళిపోయాడు. ఆ ఎముకలతో ఇంద్రుడు వజ్రాయుధాన్ని తయారు చేసికొని విజృంభించాడు. అటు పిమ్మట సారస్వతుడు పన్నెండేళ్ళపాటు సాగిన అనావృష్టి కారణంగా తాను చిన్నవాడైనా విద్యావంతుడు కావటం వలన తన శిష్యత్వాన్ని స్వీకరించిన అరవై వేలమంది మునులను సరస్వతీనదీ ప్రభావం వలన లభించిన అన్నంతో కాపాడుతూ వేదాధ్యయనం చేయించాడు. అట్టి సారస్వత తీర్థం నుండి బలరాముడు వృద్ధకన్యాశ్రమానికి వెళ్ళాడు. అక్కడ గర్గవంశంలో ఉత్తముడైన 'ఖని' అనే ఋషి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. పరమతపమున నొకకన్యఁ బడసి పెంచి । దివమునకు నేఁగె; నది తపస్థిరతఁ బూని
పతి వరింపంగ నొల్లక బ్రహ్మచర్య । మున వెలింగి య య్యాశ్రమమున వసించె. 208

ప్రతిపదార్థం: పరమతపమునన్= గొప్పతపస్సుతో; ఒక కన్యకన్+పడసి= ఒక కూతును పొంది; పెంచి; దివమునకున్+ఏఁగెన్= స్వర్గానికి వెళ్ళాడు; అది= ఆ కన్య; తపఃస్థిరతన్+పూని= స్థిరమైన తపస్సుచేసి; పతిన్+వరింపంగన్+ఒల్లక= భర్తను వరించటానికి ఇష్టపడక; బ్రహ్మచర్యమునన్ వెలింగి= బ్రహ్మచర్య నిష్ఠతో ప్రకాశించి; ఆ+ఆశ్రమమునన్ వసించెన్= ఆ ఆశ్రమంలో ఉండింది.

తాత్పర్యం: ఖని అనే పరమతాపసి తపశ్శక్తితో ఒక కూతురిని పొంది పెంచి స్వర్గానికి వెళ్ళాడు. ఆ కన్య స్థిరమైన తపస్సునకు పూనుకొని, భర్తను వరించటానికి ఇష్టపడకుండా బ్రహ్మచర్యాశ్రమంలో ప్రకాశిస్తూ ఆ ఆశ్రమంలో ఉండిపోయింది.

వ. పదంపడి యత్యంతవృద్ధ యై పరలోకగమనంబు గోరె; నప్పుడు యదృచ్ఛాసన్నిహితుం డైన నారదుం డక్కన్యక కిట్లనియె. 209

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పదంపడి= ఆ మీదట; అత్యంత వృద్ధ ఐ= మిక్కిలి ముదుసలిఅయి; పరలోక గమనంబు+కోరెన్= పరలోకానికి పోవాలని కోరింది; అప్పుడు= ఆ సమయంలో; యదృచ్ఛా సన్నిహితుండు+ఐన నారదుండు= తలవని తలంపుగా దగ్గరకు వచ్చి నారదుడు; ఆ+కన్యకకున్= ఆ (వృద్ధ) కన్యకతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ మీదట చాలముదుసలిఅయిన ఆ కన్యకకు పరలోకానికి వెళ్ళవలెననే ఆస కలిగింది. అపుడు తలవని తలంపుగా అక్కడికి వచ్చిన నారదుడు ఆకన్యతో ఈ విధంగా అన్నాడు.

క. 'విను! పాణిగ్రహణము సే । యనివనితకుఁ బుణ్యలోక మప్రాప్యము గా
వున నే యుపాయమున నై । నను దగియెడు వరు వరింపు నలినదళాక్షీ!'. 210

ప్రతిపదార్థం: నలినదళ+అక్షీ!= ఓ పద్మాలరేకులవంటి కన్నులు కలదానా!; విను= వినుము; పాణిగ్రహణము చేయని వనితకున్= పెండ్లిచేసికొనని స్త్రీకి; పుణ్యలోకము= పవిత్రమగు లోకం; అప్రాప్యము= కలుగదు; కావునన్= అందుచేత; ఏ+ ఉపాయమునన్+ఐనను= ఏదైనా ఉపాయంతో; తగియెడు= (నీకు) తగిన; వరున్+వరింపు(ము)= భర్తను ఎన్నుకొనుము.

తాత్పర్యం: 'ఓ పద్మదళాక్షీ! వినుము. వివాహం కాని స్త్రీకి పుణ్యలోకాలు కలుగవు. కనుక ఏదేని ఉపాయంతో నీకు తగిన భర్తను ఎన్నుకొనుము.'

ఆ. అనిన నిజతపంబు నర్ధంబు లంచంబు । గాఁగ నిచ్చి యదియు గాలవాత్మ
జుని వరించె; నతఁడు సుదతితో సమయంబు । పలికికొనియె ధరణిపాలవర్య! 211

ప్రతిపదార్థం: ధరణిపాలవర్య!= రాజశ్రేష్ఠుడా!; అనినన్= అనగా; నిజతపంబు= తన తపస్సుయొక్క; అర్ధంబు= సగభాగం; లంచంబుకాగన్+ఇచ్చి= లంచంగా ఇచ్చి; అదియున్= ఆ ఖని కూతురు; గాలవ+ఆత్మజునిన్ వరించెన్= గాలవుడి కుమారుడిని వివాహమాడింది; అతఁడు= ఆ గాలవుడి కుమారుడు; సుదతితోన్= ఆ స్త్రీతో; సమయంబు పలికికొనియెన్= కట్టడి చేసికొన్నాడు.

తాత్పర్యం: తన తపస్సుతో సగం లంచంగా ఇచ్చి ఆ వృద్ధకన్యక గాలవుడి కుమారుడిని వివాహమాడింది అతడుకూడ ఆమెతో ఒక కట్టడి చేసికొన్నాడు.

వ. సమయంబు నేకరాత్ర సహవాస సమ్మతికలితం; బట్లు పాణిగ్రహణ సంస్కారవతి యై యావృద్ధకన్యక దైవయోగంబున నారాత్రి మనోహరయౌవనయుఁ బరమానులేపమాల్యాంబరభూషణాభిరామయు నయ్యె; నమ్మునియుఁ బ్రీతుండై యన్నాతిసంగతి నన్నిసి గడపెఁ; బ్రభాతంబున నన్నితంబిని యతని కిట్లనియె.
212

ప్రతిపదార్థం: సమయంబు= (ఆతడు చేసికొన్న ఒడంబడిక) ప్రమాణం; ఏకరాత్ర సహవాస సమ్మతి కలితంబు= ఒకరాత్రి కలిసిఉండటం అనే ఒప్పుదలతో కూడింది (అనగా ఒకరాత్రి మాత్రమే ఆ వృద్ధకన్యకు భర్తగా వ్యవహరించేందుకు); అట్లు= ఆ ప్రకారం; పాణిగ్రహణ సంస్కారవతి ఐ= వివాహ సంస్కారం కలదియై; ఆ వృద్ధకన్యక= ఆ ముదుసలి కన్యక; దైవయోగంబునన్= దైవానుగ్రహంచేత; ఆ రాత్రి= ఆ రాత్రి సమయాన; మనోహర యౌవనయున్= సుందర యౌవనము; పరమ+అనులేపన+మాల్య+అంబర+భూషణ+అభిరామయున్= ఉత్తమ సుగంధ ద్రవ్యాలతోను, పూమాలలతోను, వస్త్రాలతోను,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నగలతోను, చాలా అందగత్తెగాను; అయ్యెను= అయింది; ఆ+మునియున్+ప్రీతుండు+ఐ= ఆ తపసికూడా సంతోషించినవాడై; ఆ+నాతి సంగతిన్= ఆ స్త్రీ సాంగత్యంతో; ఆ నిసిన్+గడపెన్= ఆ రాత్రి గడపాడు; ప్రభాతంబునన్= ఉదయాన; ఆ+నితంబిని= ఆ స్త్రీ; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆతడితో ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆ ముని చేసిన కట్టడి - ఒక్కరాత్రి మాత్రం ఆమెతో కలిసి ఉండటం. ఆ విధంగా వివాహసంస్కారవతి అయిన ఆ ముదుసలికన్నె దైవానుగ్రహంతో ఆ రాత్రి మనసును ఆకర్షించే వయసుకత్తెగా, సాటిలేని సుగంధవస్తువులతోను, వస్త్రాలతోను, నగలతోను చాలా అందగత్తెగా ఐనది. ఆ ముని కూడా ప్రీతినందినవాడై ఆ ఇంతితో కలిసి సంతోషంగా ఆ రాత్రిని గడిపాడు. ఉదయాన ఆమె ఆతడితో ఇట్లా అన్నది.

తే. **'ఒక్క రేయి నీపాల నాయునికి గాఁగఁ। బలికికొన్నార; మది సెల్లె నలఘుచరిత!**
పోయి వచ్చెద' నని దివంబునకుఁ బోవ। నుత్సహించె నమ్మునిని మది నుమ్మలింప. **213**

ప్రతిపదార్థం: అలఘుచరిత!= ఓ గొప్ప నడవడిక కలవాడా!; ఒక్కరేయి= ఒకరాత్రి (మాత్రం); నీపాలన్= నీతో; నాఉనికి+ కాఁగన్= నేనుఉండేటట్లుగా; పలికి కొన్నారము= మాటాడుకొన్నాం; అది చెల్లెన్= అది అయిపోయింది; పోయివచ్చెదన్= వెళ్లివస్తాను; అని; ఆ తపసి; మదిన్+ఉమ్మలింపన్= దుఃఖపడగా; దివంబునకున్+పోవన్= స్వర్గానికి పోవటానికి; ఉత్సహించెన్= ఆసక్తిని చూపింది.

తాత్పర్యం: 'ఒకరాత్రి మాత్రం నీతో కలిసి ఉండటానికి ప్రమాణం చేసికొన్నాము. అది గడచిపోయింది. ఓ పుణ్యాత్ముడా! నేను పోయి వస్తాను.' అని స్వర్గానికి వెళ్ళటానికి ఆసక్తిని చూపింది. ఆ తపసి మనసున చాలా బాధపడ్డాడు.

వ. **ఇట్లుత్సహించి 'యితీరంబున దేవఋషిపితృతర్పణపరుండై యొక్కనాఁడుపవసించినవాఁడు పంచాశద్వత్సర పరిపూరణీయం బగు నైష్ఠిక బ్రహ్మచర్య ఫలంబు వడయువాఁ'డని పలికి తనువువిడిచి దివంబున కరిగెఁ; గురువంశోత్తమా! యయ్యెడ నారేవతీపతి శల్యుండు రణంబునఁ బాండవులచేత నిహతుం డగుట విని, వగచుచు నచ్చటికిఁ జేరువ యగు శమంతపంచకంబునకుం జని, యందులమునులఁ గురుక్షేత్రవిశేషంబు లడిగిన. వార లతనికి నది ప్రజాపతి యుత్తరవేది యనియును, సమస్తదేవతలు నందు వరిష్ఠంబు లడిగిన, వార లతనికి నది ప్రజాపతి యుత్తరవేది యనియును, సమస్తదేవతలు నందు వరిష్ఠంబు లగుసత్రంబు లాచరించి రనియును, దానిఁగురుం డనురాజు దున్నుటం జేసి దానికిఁ గురుక్షేత్రం బనునామంబు గలిగె ననియు నెఱింగించిన, న య్యేకకుండలుం 'డాభూమీశ్వరుఁ డేమి ప్రయోజనంబునకు దున్నె?' ననుటయు, నాతపోధను లి ట్లనిరి.** **214**

ప్రతిపదార్థం: కురువంశ+ఉత్తమా!= కురువంశంలో ఉత్తముడైన వాడా! (జనమేజయా!); ఇట్లు+ఉత్సహించి= ఈ విధంగా ఆసక్తిని చూపి; ఈ+తీరంబునన్= ఈ గట్టువద్ద; దేవఋషి పితృ తర్పణ పరుండు+ఐ= దేవతలకును, ఋషులకును, పితరులకును, తృప్తి చేసేవాడుగా; ఒక్కనాడు ఉపవసించువాఁడు= ఒక దినం ఉపవాసం ఉండేవాడు; పంచాశద్వత్సర పరిపూరణీయుండగు నైష్ఠిక బ్రహ్మచర్య ఫలంబు పడయు వాఁడు+అని= ఏబది వత్సరాల నియమంతో గడపిన బ్రహ్మచర్య వ్రతఫలితాన్ని పొందగలవాడని; పలికి= చెప్పి; తనువు విడిచి= శరీరాన్ని వదలి; దివంబునకున్+అరిగెన్= స్వర్గానికి వెళ్లింది;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ+ఎడన్+ఆరేయి నిలిచి= ఆ చోట ఆ రాత్రి ఉండి; శల్యుండు= శల్యుడు; రణంబునన్= యుద్ధంలో; పాండవులచేతన్= పాండవులచే; నిహతుండు+అగుట= చంపబడటం; విని= విన్నవాడయి; వగచుచున్= దుఃఖిస్తూ; అచ్చటికిన్+చేరువ+అగు= ఆ చోటుకు దగ్గరైన; శమంతపంచకంబునకున్+చని= శమంతపంచకమనే చోటికి వెళ్ళి; అందు మునులన్= అక్కడి తాపసులను; కురుక్షేత్ర విశేషంబులు+అడిగినన్= కురుక్షేత్రంలోని విశేషాలను గూర్చి అడుగగా; వారలు+అతనికిన్= వారు ఆ బలరాముడికి; అది= ఆ తీర్థమున్నచోటు; ప్రజాపతి= స్రష్టకు; ఉత్తరవేది= ఉత్తరమున ఉండే యజ్ఞాదులు చేసికొనటానికై యున్నట్టి తిన్నె; అనియును= అనిచెప్పి; సమస్తదేవతలు= దేవతలందరూ; అందున్= ఆ చోట; వరిష్ఠంబు+అగు= శ్రేష్ఠమైన; వ్రతంబులు+ఆచరించిరి+అనియున్= నోములు కావించినారనీ; దానిన్= ఆ చోటును (తిన్నెను); కురుండు+అనురాజు దున్నుటన్‌చేసి= కురుడనే రాజు దున్నినందువలన; దానికి; కురుక్షేత్రంబు+అను నామంబు కలిగెన్= కురుక్షేత్రమని పేరు కలిగింది; అనియున్ ఎఱింగించినన్= అని చెప్పగా; ఆ+ఏకకుండలుండు= ఆ బలరాముడు; ఆ భూమి+ఈశ్వరుఁడు= ఆ కురురాజు; ఏమిప్రయోజనంబునకున్= ఏ ఫలానికై; దున్నెన్?= దున్నాడు?; అనుటయున్= అని అడుగగా; ఆ తపోధనులు= ఆ తాపసులు; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధమైన ఆసక్తితో ఈ తీరంలో దేవతలను, ఋషులను, పితరులను తృప్తిపరచేవాడుగా ఒకరోజు ఉపవాసం చేసినవాడు ఏబది సంవత్సరాలు నియమంతో గడిపిన బ్రహ్మచర్య వ్రతఫలాన్ని పొందగలడు.' అని చెప్పి ఆ వృద్ధకన్య తన శరీరాన్ని వదలి స్వర్గానికి వెళ్లింది. కురువంశీయులలో ఉత్తముడైనవాడా! అక్కడ బలరాముడు శల్యుడు యుద్ధంలో పాండవులచేత చంపబడటాన్ని విని దుఃఖిస్తూ ఆ చోటునకు దగ్గరగా ఉన్న శమంతపంచకతీర్థానికి వెళ్ళి అక్కడ ఉన్న మునులను కురుక్షేత్ర విశేషాలు అడిగినాడు. దానికి వారు 'అది బ్రహ్మకు ఉత్తరదిక్కున నున్న యజ్ఞవేది' అనీ, ఎందరో దేవతలు అందు శ్రేష్ఠములైన యజ్ఞాలను చేశారనీ తెలిపారు. ఆ చోటును కురు డనే రాజు దున్నుట మూలంగా దానికి కురుక్షేత్రమనే పేరు వచ్చింది' అని కూడా చెప్పారు. 'ఆ రాజు ఏ ఫలాన్ని ఆశించి దానిని దున్నాడు?' అని బలరాముడు అడుగగా వాళ్ళు ఈ విధంగా అన్నారు.

కురుక్షేత్ర ప్రభావాభివర్ణనము (సం. 9-52-4)

సీ. **'ఇందుఁ బుట్టినజను లెల్లను దుదిఁ ద్రిది । వంబున కరుగంగవలయు నని మ**
నంబునఁ గోరి యన్నరపతి దున్నంగ, । నింద్రుఁడు సనుదెంచి యేల యిచట
దునియెద? వనిన నమ్మనుజాధిపతి తన । కోర్కి సెప్పిన, గేలిగొనుచుఁ జనియెఁ;
బలుమఱు నద్దేవపతి వచ్చి వెండియు । నుల్లసమాడుచు నుండు నతని

ఆ. **నతఁడు నిష్ఠఁ గుంద కనిశంబు దున్నంగ । వరముఁ బ్రీతి నొసఁగువాఁడు గాఁగ**
నమరు లెఱుఁగ నిశ్చయము సేసి యాశక్రుఁ । డచటి కేగుదెంచి యతనితోడ. **215**

ప్రతిపదార్థం: ఇందున్+పుట్టిన జనులు+ఎల్లను= ఒక్కడ పుట్టిన మానవులంతా; తుదిన్= చివరకు; త్రిదివంబునకున్+అరుగంగన్+వలయును+అని= దేవలోకానికి వెళ్ళాలి అని; మనంబునన్= మనసులో ఆశించి; ఆ+నరపతి= ఆ కురురాజు; దున్నంగన్= భూమిని దున్నగా; ఇంద్రుఁడు చనుదెంచి= ఇంద్రుడు వచ్చి; ఏల ఇచటన్ దునియెదవు+అనినన్= ఇక్కడ ఎందుకు నేలను దున్నుతున్నావని అడుగగా; ఆ+మనుజ+అధిపతి తన కోర్కి చెప్పినన్= ఆ రాజు తన ఆశయాన్ని చెప్పగా; గేలిగొనుచున్+చనియెన్= పరిహసిస్తూ వెళ్ళాడు; ఆ+దేవపతి= దేవరాజు; పలుమఱున్ వచ్చి= పెక్కుమారులు వచ్చి; వెండియున్+ఉల్లసము+ఆడుచున్+ఉండున్= ఇంకా పరిహాసం చేస్తూనే ఉన్నాడు; అతనిన్= ఆ రాజును; అతఁడు నిష్ఠన్+కుందక= ఆ రాజు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నియమం తప్పకుండా; దున్నంగన్= భూమిని దున్నగా; వరమున్ బ్రీతినొసఁగువాఁడుగాన్= ప్రీతితో వరం ఇచ్చేవాడుగా; అమరులు+ఎఱుఁగన్= దేవతలకు తెలియగా; నిశ్చయం చేసి= నిర్ణయించి; ఆ శక్రుఁడు+అచటికిన్+ఏగుదెంచి= ఆ ఇంద్రు డక్కడకు వచ్చి; అతనితోడన్= ఆ రాజుతో (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ఈ క్షేత్రంలో పుట్టిన వారంతా తుదకు స్వర్గానికే వెళ్లవలె నని మనసులో తలచి, ఆ రాజు భూమిని దున్నుతుండగా ఇంద్రుడు వచ్చి భూమి దున్నే కారణ మడిగాడు. దానికి ఆ రాజు తన మనసులోని కోరికను చెప్పగా ఎగతాళి చేస్తూ వెళ్ళాడు. అనేక పర్యాయాలు ఆ దేవరాజు వచ్చి మరల మరల దానిని ఎగతాళిచేశాడు. ఐనా, ఆ రాజు తన నిష్ఠను వదలక దున్నుతూ ఉండగా, దేవతలకు తెలిసేవిధంగా వరాన్ని ఈయదలచి, ఇంద్రుడు ఆచోటికి వచ్చి ఆతడితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. ఈ పుణ్యక్షేత్రంబున నిరాహారులై దేహంబు విడిచిన వారలకు నిందు సమరంబు సేసి సమ్యక్ప్రకారంబున మృతిఁ బొందిన సమస్తజంతువులకును సురలోకప్రాప్తి గలిగెడు' మని పల్కి నిజస్థానంబునకుం జనియె; నట్లు చను చుండి యాశతమఖుఁడు సంభావనాతిశయంబున. 216

ప్రతిపదార్థం: ఈ పుణ్యక్షేత్రంబునన్= ఈ పవిత్ర క్షేత్రంలో; నిరాహారులు+ఐ= భోజనాన్ని మానిన వారుగా; దేహంబును విడిచిన వారలకున్= శరీరత్యాగం చేసిన వారికినీ; ఇందు సమరంబు చేసి= ఇక్కడ యుద్ధం చేసి; సమ్యక్+ప్రకారంబునన్= సరియగు విధానంతో; మృతిన్+పొందిన= చనిపోయిన; సమస్త జంతువులకును= అన్ని ప్రాణులకున్నూ; సురలోక ప్రాప్తి కలిగెడున్= స్వర్గలోకం కలుగుతుంది; అని పల్కి= అంటూ చెప్పి; నిజస్థానంబునకున్+చనియెన్= తన చోటగు దేవలోకానికి వెళ్ళాడు; అట్లు చనుచుండి ఆ శతమఖుఁడు= ఆ విధంగా వెళ్లుతూ ఆ ఇంద్రుడు; సంభావనా+అతిశయంబునన్= గౌరవాతిశయంతో.

తాత్పర్యం: ఈ పవిత్రక్షేత్రంలో ఉపవాసంచేస్తూ దేహత్యాగం చేసినవారికీ, ఇక్కడ యుద్ధంచేసి సముచితమైన పద్ధతిలో చనిపోయిన సమస్త ప్రాణులకూ, స్వర్గలోక ప్రాప్తికలుగుతుంది.' అని చెప్పి దేవలోకానికి వెళ్ళాడు. ఆ విధంగా వెళ్ళుతూ ఆ ఇంద్రుడు గౌరవాతిశయంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'గాలిఁ గురుక్షేత్రంబున । ధూలి తనువుఁ జెంది నరుని దుష్కర్మములం
దోలి యతనికి ధరిత్రిం । దూలి మధురలీలమై నతులగతి యొసఁగున్. 217

ప్రతిపదార్థం: కురుక్షేత్రంబునన్= కురుక్షేత్రంలో; గాలిన్= వాయువుచేత; ధూలి= దుమ్ము; తనువున్+చెంది= ఒడలిని తాకి; నరుని= మానవుని; దుష్కర్మములన్+తోలి= చెడుపాపాలను తొలగించి; అతనికిన్= ఆ మానవుడికి; ధరిత్రిన్= భూమియందు; తూలి= తొలగి; మధురలీలమైన్= తీయని ఆటగా; అతులగతి ఒసఁగున్= సాటిలేని గతి - ఉత్తమగతి నిస్తుంది.

తాత్పర్యం: 'కురుక్షేత్రంలో మానవుడి శరీరాన్ని గాలి, దుమ్ము తాకి పాపాలను తొలగించి, భూమిని విడిచిపోయిన పిమ్మట ఉత్తమగతిని కలిగిస్తుంది.

వ. అని నిర్దేశించినఁ గురున్నపాలుండును గృతకృత్యుండై సంతోషించె' నని చెప్పుటయు, నా ప్రలంబవైరి ప్రమోదభరితుం డగుచు మెలంగి యశ్వత్థమధూకామ్రబిల్వాదిభూరుహోప శోభితం బైన నిజపూర్వాశ్రమంబుఁ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గనుంగొని 'యిది యెవ్వరియాశ్రమం?' బని యడిగిన నమ్మును 'లియ్యెడఁ దొల్లి విష్ణుదేవుండు దపంబు సేసినచోటు; మఱియు శాండిల్యప్రభృతు లిందు యోగసిద్ధిం బొంది' రనిన విని యయ్యాశ్రమంబుఁ గొనియాడి తత్ప్రదేశంబున బహిఃపరివారంబు నెల్ల వీడుకొల్పి యొక్కపుణ్యాచలం బెక్కి దానితటంబున సమస్థలంబున మునిజనసహితంబుగ నాసీనుం డయ్యెఁ; నాసమయంబున నిచ్చటికి జటామండలకలితుండును గుశచీరచ్ఛాయా సుందరుండును గలహప్రియుండును నగు నారదుండు హేమదండంబును మణికమండలువును గచ్ఛపవీణయుం బొలుపు మెఱయ నేతెంచిన, నెల్లవారలుం బ్రత్యుత్థానప్రణామంబు లాచరించి సుఖోపవిష్టుం జేసి పరివేష్టించి; రా దేవమునిం గొల్చియుండి య బ్బలదేవుండు. 218

ప్రతిపదార్థం: అని నిర్దేశించినన్= అని ఆజ్ఞాపించగా; కురునృపాలుండును= కురురాజును; కృతకృత్యుండు+ఐ= చేయదగినపని చేసినవాడై; సంతోషించెన్= సంతోషించాడు; అని చెప్పుటయున్= అంటూ చెప్పగా; ఆ ప్రలంబవైరి= ఆ ప్రలంబుడి శత్రువు (బలరాముడు); ప్రమోదభరితుండు+అగుచున్= సంతోషంచేత నిండినవాడై; మెలంగి= నడచుకొని; అశ్వత్థ= రావి; మధూక= ఇప్ప; ఆమ్ర= మామిడి; బిల్వ= మారేడు; ఆది= మొదలయిన; భూరహ= చెట్లతో; ఉపశోభితంబు+ఐన= అందంగా ఉన్న; నిజపూర్వ+ఆశ్రమంబున్+కనుంగొని= తన వెనుకటి ఆశ్రమాన్ని చూచి; ఇది ఎవ్వరి+ఆశ్రమంబు+అని+అడిగినన్= ఇది ఎవ్వరి ఆశ్రమ మని అడుగగా; ఆ+మునులు= ఆ తపస్వులు; ఈ+ఎడన్= ఈ చోట; తొల్లి విష్ణుదేవుండు= పూర్వం విష్ణుదేవుడు; తపంబు చేసిన చోటు= తపస్సు చేసిన చోటు; మఱియున్= ఇంకను; శాండిల్య ప్రభృతులు= శాండిల్యుడు మొదలయినవారు; ఇందున్= ఈ చోట; యోగసిద్ధిన్+పొందిరి+అనినన్= యోగసిద్ధి పొందారనిన; విని; ఆ+ఆశ్రమంబున్+ కొనియాడి= ఆ తపోవనాన్ని పొగడి; తత్ప్రదేశంబునన్= ఆచోటున; బహిఃపరివారంబును+ఎల్లన్ వీడుకొల్పి= వెలుపల ఉండదగిన సేవకులకు వీడ్కోలు+ఇచ్చి; ఒక్కపుణ్య+అచలంబు+ఎక్కి= ఒక పవిత్రమైన కొండనెక్కి; దాని తటంబునన్= దాని చరియపై; సమస్థలంబునన్= సమమైన నేలపై; మునిజన సహితంబుగా ఆసీనుండు+అయ్యెన్= మునులతో కూడి కూర్చున్నాడు; ఆ సమయంబునన్ ఇచ్చటికిన్= ఆ వేళలో ఈచోటునకు; జటామండల కలితుండును= జటామండలంతో కూడినవాడూ; కుశచీరచ్ఛాయా సుందరుండును= దర్భలు, నారచీరలచే రేఖా సుందరుడైనవాడూ; కలహప్రియుండును= జగడాలకు ఆనందించేవాడూ; అగు; నారదుండు; హేమదండంబును= బంగారు యోగ దండాన్నీ; మణికమండలువును= మణులు తాపిన కమండలాన్నీ; కచ్ఛపవీణయున్= కచ్ఛపమనే పేరుగల వీణయు; పొలుపు మెఱయన్= అందం అతిశయించగా; ఏతెంచినన్= రాగా; ఎల్లవారును= అందరును; ప్రత్యుత్థాన= ఎదురేగి; ప్రణామంబులు= నమస్కారాలు; ఆచరించి= చేసి; సుఖంగా కూర్చుండబెట్టి; పరివేష్టించిరి= చుట్టూ కూడారు; ఆ దేవమునిన్+కొల్చిఉండి= ఆ దేవతాపసిని సేవించి; ఆ+బలదేవుండు= ఆ బలరాముడు.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించగా కురురాజు తాను ధన్యుడైనట్లుగా సంతోషించాడు - అని చెప్పగా బలరాముడు సంతోషంతో తిరిగి చెప్పగా ఇప్ప, మామిడి, మారేడు మొదలయిన చెట్లతో అందంగా ఉన్న తన వెనుకటి ఆశ్రమాన్ని గుర్తించి 'ఇది ఎవ్వరి తపోవనవం' అని అడుగగా ఆ తాపసులు 'ఈ చోట ముందు విష్ణుదేవుడు తపస్సు చేశాడు. ఇంకను శాండిల్యుడు మొదలయినవారు ఈ చోట యోగసిద్ధిని పొందారు'. అనగా విని ఆ తపోవనమును పొగడి ఆ చోట తన సేనను నిల్పి, ఒక పవిత్రమైన కొండమీదకు ఎక్కి, దాని చరియవద్ద చదునైన చోట మునిజనులతో కూడి కూర్చున్నాడు. ఆ సమయాన అక్కడకు జడలకొప్పుతో కూడినవాడూ, నారచీరల చాయగలిగిన అందగాడూ జగడాలపై ఇష్టం కలవాడూ ఐన నారదుడు బంగారు యోగదండమూ, రత్నాలు పొదిగిన కమండలమూ, 'కచ్ఛపి'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనే తన వీణా అందగించగా అందరూ లేచి ఎదురేగి నమస్కరించి, కూర్చుండజేసి తామూ చుట్టూ కూర్చున్నారు. ఆ దేవఋషిని సేవించి ఆ బలరాముడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కురువృత్తాంతం బడిగినఁ । గరమేర్పడఁ జెప్పె నతఁడు గాంగేయుండున్
గురుఁడును గర్ణుఁడు శల్యుఁడు । వరుస ననిం దెగుట కౌరవక్షితినాథా! 219

ప్రతిపదార్థం: కౌరవ క్షితినాథా!= ఓ కురురాజా!; కురువృత్తాంతంబున్= కౌరవుల కథను; అడిగినన్= అడుగగా; కరము= మిక్కిలి; ఏర్పడన్= స్పష్టం కాగా; అతఁడు= ఆ ముని; గాంగేయుండున్= భీష్ముడున్నూ; గురుఁడును= ద్రోణుడున్నూ; కర్ణుఁడు= కర్ణుడునూ; శల్యుఁడు= శల్యుడున్నూ; వరుసన్= క్రమంగా; అనిన్+తెగుటన్= యుద్ధంలో చనిపోవటాన్ని; ఏర్పడన్+ చెప్పెన్= స్పష్టంగా చెప్పాడు.

తాత్పర్యం: ఓ కురురాజా! బలరాముడు కురువీరుల వృత్తాంతాన్ని అడుగగా, ఆ తాపసి భీష్మద్రోణ కర్ణ శల్యాదులు వరుసగా పడిపోవటాన్ని స్పష్టంగా చెప్పాడు.

వ. మఱియును మృతు లైన నృపకుమారాది యోధవరులం జెప్పి పదునెనిమిది దివసంబులఁ జెల్లిన సంగరంబు తెఱంగును, సంక్షేమరూపంబునఁ దెలియఁబలికి, దుర్యోధనసైన్యం బంతయు సమయుటయు, నందుఁ గృపాశ్వత్థామ కృతవర్మలు బ్రదికిపోవుటయు నన్నరపాలుఁ డోడి పాఱి ద్వైపాయన హ్రదంబు సొచ్చి జలంబుల సంస్తంభించి డాఁగుటయు, నది పాండవు లెఱింగి సపరివారంబుగాఁ జనుదెంచి యమ్మడువుఁ జుట్టుముట్టి బెట్టిదంపు మాట లాడుటయు, దానం గనలి యమ్మనుజవరుండు మడువు వెడలి వచ్చుటయు నెఱింగించి బిరుదు మగ లగు పగతురు పెక్కండ్రు పొదివికొనియుండం గురుపతియు నుక్కు దక్కక యున్నవాఁ; డద్దండితనంబుఁ జూచిన మెత్తు వీ వని యుగ్గడించి. 220

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; మృతులు+ఐన= చనిపోయిన; నృపకుమార+ఆది యోధవరులన్= రాజకుమారులు మొదలైన యుద్ధవీరులను; చెప్పి= పేర్కొని చెప్పి; పదునెనిమిది దివసంబులు= పద్దెనిమిది దినాలు; చెల్లిన సంగరంబు తెఱంగును= జరిగిన యుద్ధ విధానాన్ని; సంక్షేప రూపంబునన్= సంగ్రహంగా; తెలియన్+పలికి= తెలిసేటట్లు చెప్పి; దుర్యోధన సైన్యంబు+అంతయున్ సమయుటయున్= దుర్యోధనుడి సేన అంతా నాశనం కావటం; అందున్= దానిలో; కృప+అశ్వత్థామ కృతవర్మలు= కృపుడు, అశ్వత్థామ, కృతవర్మ అనేవారు; బ్రదికిపోవుటయున్= జీవించి ఉండటమున్నూ; ఆ+నరపాలుఁడు= ఆ రాజైన దుర్యోధనుడు; ఓడిపాఱి= ఓటమినంది పరుగెత్తి; ద్వైపాయనహ్రదంబు+చొచ్చి= ద్వైపాయన మనే నీటి మడుగులోనికి వెళ్ళి; జలంబుల స్తంభించి= నీటిని కదలకుండా చేసి; డాఁగుటయున్= దాగిఉండటమునూ; అది; పాండవులు; ఎఱింగి= తెలిసికొని; సపరివారంబుగాన్= సేవకులతో; చనుదెంచి= అక్కడకువచ్చి; ఆ+మడువున్ చుట్టుముట్టి= ఆ నీటిమడుగు చుట్టును దండుతో ముట్టడించి; బెట్టిదంపు మాటలు+ఆడుటయున్= నిష్ఠురమైన మాటలు పలుకుటయూ; దానన్+కనలి= ఆ మాటలకు కోపించి; ఆ+మనుజవరుండు= ఆ రాజగు దుర్యోధనుడు; మడువు వెడలి వచ్చుటయున్= ఆ మడుగునుండి బయటకూ రావటమునూ; ఎఱింగించి= తెలిపి; బిరుదుమగలు+అగు పగతురు= బలవంతులయిన విరోధులు; పెక్కండ్రు పొదివికొని+ఉండన్= చాలామంది చుట్టుకొని ఉండగా; కురుపతియున్ ఉక్కుదక్కక= కురురాజయిన దుర్యోధనుడును దర్పం వదలకుండా; ఉన్నవాఁడు= ఉన్నాడు; ఆ+దండితనంబున్ చూచినన్= ఆ దర్పమును చూస్తే; ఈవు= నీవును; మెత్తువు+అ= మెచ్చుకొందువంటూ; ఉగ్గడించి= చెప్పి.

తాత్పర్యం: ఇంకా చనిపోయిన రాజకుమారు లయిన వీరులను గూర్చి చెప్పి, పదునెనిమిది నాళ్ళ యుద్ధాన్ని సంగ్రహంగా తెలిపి దుర్యోధనుడి సేన అంతా నశించటం, వారిలో కృపాశ్వత్థామ కృతవర్మలు మాత్రం బ్రదికి ఉండటం, ఆ రాజు ఓడి పారిపోయి ద్వైపాయనమనే నీటి మడుగులో దూరి దాగికొని ఉండటం, దానిని పాండవులు తెలిసికొని సేనతో వెళ్ళి ఆ మడుగును చుట్టుముట్టి, నిష్ఠురంగా మాటాడినందున ఆ అభిమానధనుడు (రాజు) కోపించి నీటి మడుగునుండి వెలికిరావటం తెలిపి, పేరున్న వీరులయిన శత్రువులు చాలామంది క్రమ్ముకొని ఉండగా కురురాజు దర్పాన్ని వదలక శోభించాడు. ఆ గొప్పతనాన్ని చూస్తే నీవు మెచ్చుకొంటావు' అని చెప్పి.

వ. **అతనికి భీమసేనునకు నాహవ మయ్యెడు నొంటిమై మహా**
ద్భుతబలశౌర్య ధైర్యములఁ బొల్చు భవత్ప్రియశిష్యులన్ సుశి
క్షితులఁ గనుంగొనం దలఁపు చిత్తమునన్ మొలతెంచునేనిఁ బో
మ్మతుల గదాకృతోజ్జ్వల విహార ముదారనిరూఢి నొప్పెడున్. **221**

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ దుర్యోధనుడికీ; భీమసేనునకున్= భీమునకును; ఒంటిమైన్= ఒక్కడితో(ఎక్కటి); ఆహవము+ అయ్యెడున్= యుద్ధమవుతుంది; మహా+అద్భుత+బల+శౌర్య+ధైర్యములన్= ఆశ్చర్యకరాలైన బలపరాక్రమధైర్యాలతో; పొల్చు= ఒప్పే; భవత్+ప్రియశిష్యులన్= నీకు ప్రీతిగొల్పే శిష్యులను; సుశిక్షితులన్= చక్కని శిక్షణ గల వారిని; కనుంగొనన్+ తలఁపు= చూడవలెననే కోరిక; చిత్తమునన్ మొలతెంచునేనిన్= మనసులో తలెత్తితే పొమ్ము= వెళ్ళుము; అతుల= సాటిలేని; గదాకృత+ఉజ్జ్వల విహారము= గదలతో చేసే చక్కనైన విహారం; ఉదారనిరూఢిన్= గొప్ప ప్రసిద్ధితో; ఒప్పెడున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: దుర్యోధనుడికీ భీమసేనుడికీ ఎక్కటి యుద్ధం జరుగుతుంది. భుజబలశౌర్యాలతోను మంచి శిక్షణతోను ఉన్న నీ శిష్యులను చూడవలెననే కోరిక మనసులో తలెత్తితే పొమ్ము. గదలవలన కలిగే సాటిలేని సొగసైన ఆ విహారం గొప్పగా ఉంటుంది.'

వ. **అనిన విని యమ్మునీంద్రునిం దక్కటిమునులను వీడ్కొని యచలంబు డిగ్గి యభ్యంతరపరిజనంబుల నిజపురంబున కనిచి, యన్నీలాంబరుం దరదంబు సమీపంబునకుఁ జని సరస్వతి నాలోకించి.** **222**

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విన్నవాడై; ఆ+మునీంద్రునిన్, ఆ తాపసిని; తక్కటి మునులను వీడ్కొని= మిగిలిన తాపసులను వదలి; అచలంబు డిగ్గి= ఆ కొండను దిగి; అభ్యంతర పరిజనంబులన్= అంతఃపుర సేవకులను; నిజపురంబునకున్ అనిచి= తన ఊరికి పంపినవాడై; ఆ+నీల+అంబరుండు= ఆ బలరాముడు; అరదంబు సమీపంబునకున్+చని= తేరు వద్దకు వెళ్ళి; సరస్వతిన్ ఆలోకించి= సరస్వతీ తీర్థాన్ని చూచి.

తాత్పర్యం: ఆ ముని అట్లా చెప్పగా విన్నవాడై బలరాముడు ఆ మునిని, తక్కిన మునులను వదలి, ఆ కొండను దిగి అంతఃపుర స్త్రీలను, సేవకులను తన ఊరికి పంపి, తన తేరు వద్దకు వెళ్ళి, సరస్వతిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **అరయఁగ మేటి పుణ్యనదులందు సరస్వతి సౌఖ్యసంపదల్**
నరులకుఁ గల్గు నిజ్జగమునం బరలోకమునందు నీసరి
ద్వర నొకనాఁడు సేరినను వాసవముఖ్య సమస్తదేవతా
వరులును నిందు మేల్ వడయవత్తురు సంస్కృతి సాలు సిద్ధికిన్. **223**

ప్రతిపదార్థం: అరయఁగన్= చూడగా; మేటి పుణ్యనదులందున్= పవిత్రమైన నదులలో శ్రేష్ఠమైన; సరస్వతి= సరస్వతీనది; ఈ+జగమునన్= ఈ లోకంలో; నరులకున్= మనుజులకు; సౌఖ్య సంపదల్ కల్గున్= సుఖం సంపదలు కలుగుతాయి; పరలోకమునందున్= చనిపోయిన తరువాత స్వర్గలోకాదులలో; ఈ సరిద్వరన్= ఈ నదీమతల్లిని; ఒకనాఁడు చేరినను= ఒక దినం చేరినప్పటికినీ (అనగా ఒక మారు సేవించినను); వాసవముఖ్య సమస్త దేవతావరులును= ఇంద్రాది దేవతా శ్రేష్ఠులంతా; ఇందున్= ఈ నదిలో; మేల్+పడయవత్తురు= మంచి జరగటానికి వస్తారు; సిద్ధికిన్= తపస్సిద్ధికి; సంస్మృతి+చాలున్= మనసుతో తలచుకొనటమే చాలును.

తాత్పర్యం: పరిశీలించగా ఉత్తమమైన నదులలో సరస్వతి మేటి. ఈ లోకంలో మానవులకు సుఖసంపదలు కలిగేదానికీ చనిపోయిన తరువాత స్వర్గలోక సిద్ధికీ ఉత్తమమైన ఈ నదిని చేరితే చాలును. ఇంద్రాది దేవముఖ్యులు కూడా ఈచోట సౌఖ్యం పొందటానికై వస్తారు. మనసులో తలచుకొన్నమాత్రం చేతనే సిద్ధి కలుగుతుంది.

తే. **అనుచుఁ బలుమాఱు చూచుచు నధికభక్తి । మోడ్పుఁగేలు శిరంబును మోపికొనుచుఁ**
బుణ్యతమనిజమూర్తి విస్ఫూర్తి మెఱయ । నమ్మురారాతిపూర్వజుఁ డరద మెక్కి. 224

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; పలుమాఱు చూచుచున్= పెక్కుమార్లు చూస్తూ; అధిక భక్తిన్= మిక్కిలి భక్తితో; మోడ్పు+కేలు= జోడించిన చేతులు; శిరంబునన్ మోపికొనుచున్= తలపై పెట్టుకొంటూ; పుణ్యతమ= ఉత్తమ పుణ్యములు; నిజమూర్తి విస్ఫూర్తి మెఱయన్= తమ ప్రకాశంతో వెలుగగా; ఆ+ముర+అరాతి+పూర్వజుఁడు= ఆ మురారికి అన్న అయిన బలరాముడు; అరదము+ఎక్కి= తేరు ఎక్కి.

తాత్పర్యం: ఆ విధంగా చెప్తుతూ పలుపర్యాయాలు చూస్తూ మిక్కిలి భక్తితో నమస్కారం చేసి, చేతులను తలమీద పెట్టుకొని పుణ్యాతిశయంచేత తనమూర్తి శక్తి ఎక్కువకాగా ఆ బలరాముడు తన రథం ఎక్కి. (తరువాతి గద్యంతో అన్వయం).

వ. **అతిత్వరితగమనంబున ద్వైపాయనహ్రదంబునకుఁ జనుదెంచె; నయ్యెడ. 225**

ప్రతిపదార్థం: అది త్వరితగమనంబునన్= మిక్కిలి వేగంగా ప్రయాణం చేసి; ద్వైపాయన హ్రదంబునకున్= ద్వైపాయన మనే మడుగున్న చోటునకు; చనుదెంచెన్= ఏతెంచాడు; ఆ+ఎడన్= ఆ చోట.

తాత్పర్యం: మిక్కిలి వేగంగా బయలుదేరి ప్రయాణం చేసి, ద్వైపాయనమనే మడుగున్న చోటికి బలరాముడు వచ్చి, అక్కడ.

తే. **ధర్మపుత్రాదులును సుయోధనుఁడు నతని । గన్న తెఱఁ గాంబికేయుండు విన్న తెఱఁగు**
నధిప! మును చెప్పినాఁడ; న ట్లన్నరేంద్ర । కుంజరుఁడు విని యిట్లను సంజయునకు. 226

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; జనమేజయా!; ధర్మపుత్ర+ఆదులును= ధర్మరాజు మొదలైనవారునూ; సుయోధనుండున్= దుర్యోధనుడునూ; అతనిన్+కన్న తెఱఁగు= అతనిని చూచిన విధం; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుండు; విన్నతెఱఁగు= విన్నపద్ధతి; మును చెప్పినాఁడన్= ఇదివరకే చెప్పాను; అట్లు= ఆ విధంగా; ఆ+నరేంద్రకుంజరుఁడు= ఆ రాజశ్రేష్ఠుడు (ధృతరాష్ట్రుడు) విని= విన్నవాడై; సంజయునకున్= సంజయుడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఓ జనమేజయరాజా! ధర్మరాజు మొదలైన వారూ సుయోధనుడూ ఆ బలరాముడిని చూచిన విధాన్ని ఇదివరకే చెప్పాను. ఆ విధంగా ఆ రాజశ్రేష్ఠుడు(ధృతరాష్ట్రుడు) విని సంజయుడితో ఇట్లా అన్నాడు:

పాండవ దుర్యోధనులు ద్వైపాయనహ్రదంబు విడిచి పొలికలనికిఁ బోవుట (సం. 9-54-3)

క. 'బలభద్రుఁడు సనుదెంచిన । నలఘుగదాస్ఫురిత భుజసహాయత్వసము
జ్జ్వలుఁ డగు మత్పుత్రునకుం । దెలివి మిగులకున్నె? రణముతెఱఁ గె ట్లయ్యెన్?' 227

ప్రతిపదార్థం: బలభద్రుఁడు; చనుదెంచినన్= (ద్వైపాయనమునకు) రాగా; అలఘుగదా స్ఫురిత= పెద్ద గద నుండి వెలువడుచున్న; భుజసహాయత్వ సముజ్జ్వలుఁడు+అగు= భుజబలంతో వెలుగుతున్నవాడైన; మత్+పుత్రునకున్+తెలివిమిగులక+ఉన్నె?= నా కుమారుడైన దుర్యోధనుడికి ప్రజ్ఞ ఎక్కువ కాకుంటుందా?; రణము తెఱఁగు+ఎట్లు+అయ్యెన్= యుద్ధపద్ధతి ఏవిధంగా సాగింది?

తాత్పర్యం: 'బలరాముడిని చూడగానే సాటిలేని భుజబల సహాయంతో ప్రకాశించే గదాధరుడైన నా కుమారుడి తెలివి ఎక్కువౌతుంది కదా! అయితే యుద్ధ మెట్లా సాగింది?'

క. అనుటయు నతఁ డిట్లను న । జ్జనపతికి హలాయుధుండు సనుదెంచి నె
మ్మనము దెలివొందె మూఁపులు । దనరె మొగం బలరె నీదుతనయున కధిపా! 228

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; అతఁడు= ఆ సంజయుడు; ఆ+జనపతికిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజుకు; ఇట్లు+అనున్= ఇలా అన్నారు; అధిపా!= ఓ రాజా!; హల+ఆయుధుండు చనుదెంచినన్= బలరాముడు రాగా; నీదు తనయునకున్= నీ కుమారుడికి; నెమ్మనము తెలివి+ఒందెన్= మనసు వికసించింది; మూఁపులు+తనరెన్= భుజాలు విజృంభించినవి; మొగంబు+అలరెన్= ముఖం సంతోషంతో వెలిగింది (వికసించింది).

తాత్పర్యం: అనగా సంజయుడు ధృతరాష్ట్రుడితో 'ఓ రాజా! బలరాముడు రాగానే నీ కుమారుడికి మనస్సు వికసించింది. భుజాలు అదిరినవి. మొగం సంతోషంతో నిండింది.

వ. ఇట్లు ప్రీతుం డై యాతండు ధర్మనందనుం జూచి 'శమంతపంచకంబు ప్రజాపతియుత్తరవేది యనఁ బ్రసిద్ధం బైన పుణ్యస్థలం; బయ్యెడం బ్రధనంబున నిధనంబు నొందినవారికి సద్గతి యగుట ధ్రువం బని విందు; మిప్పటి పొలికలనికిం బోవుద' మనిన నతం డాద్వైపాయనహ్రదం బాసీమలోనిది గామి యెఱుంగుం గావున నమ్మాట కియ్యకొని తదభిముఖుం డైపోవ నాదుర్యోధనుండును గదాకలనంబున నంసపీఠంబు పొలుపార మత్తగజేంద్రయానంబున నమరప్రస్తూయమానుం డగుచుఁ జన శంఖభేరీప్రముఖతూర్య స్వనంబులు సెలంగె; నిట్లు పాండవపరివృతుండై యచటికి నీ కొడుకు నడచి యమర్ష సముజ్జ్వలుం డై. 229

ప్రతిపదార్థం: ఇట్లు ప్రీతుండు+ఐ= ఈ విధంగా సంతోషపడి; ఆతండు; ధర్మనందనున్+చూచి= ధర్మరాజును చూచి; శమంతపంచకంబు= శమంతపంచక మనే చోటు; ప్రజాపతి= బ్రహ్మకు; ఉత్తరవేది= ఉత్తరదిక్కునందలి యజ్ఞవేది; అనన్+ప్రసిద్ధంబు= అనగా ప్రఖ్యాతమైనది; ఐన పుణ్యస్థలంబు= అయినట్టి పవిత్రమైన చోటు; ఆ+ఎడన్+ప్రధనంబునన్= ఆ చోట

యుద్ధంలో; నిధనంబును+ఒందినవారికిన్= మరణించినవారికి; సద్గతిఅగుట= మంచిగతి కలుగుట (పుణ్యం కల్గటం); ధ్రువంబు+అని విందుము= నిశ్చయ మని వింటాము; ఇప్పటిపోలికలనికిన్+పోవుదము+అనినన్= మామూలుగా యుద్ధం చేసే చోటికిపోదాము అనగా; అతండు+ఆ ద్వైపాయనహ్రదంబు= ఆత డా ద్వైపాయనమనే మడుగు; ఆ సీమలోనిది+కామి ఎఱుంగున్+కావునన్= ఆ ప్రాంతంలోనికి కాకుండటం తెలియును గనుక; ఆ+మాటకున్+ఇయ్యకొని= ఆ మాటకు కట్టుపడి; తదభిముఖుండు+ఐ పోవన్= దానివైపునకు వెళ్ళగా; ఆ దుర్యోధనుండును= ఆ దుర్యోధనుడు; గదాకలనంబునన్= గదతో కూడుటచేత; అంసపీఠంబు పొలుపు+ఆరన్= భుజపీఠం అందగించగా; మత్తగజేంద్రయానంబునన్= మదపుటేనుగు నడకతో; అమరప్రస్తూయమానుండు+అగుచున్= దేవతల పొగడ్తల నందుతూ; చనన్= వెళ్ళగా; శంఖ భేరీ ప్రముఖ తూర్యస్వనంబులు= శంఖాలు నగారాలు మొదలైన కొమ్ముబూరల శబ్దాలు; చెలంగెన్= మ్రోగాయి; ఇట్లు= ఈ విధంగా; పాండవ పరివృతుండు+ఐ= పాండవులచేత చుట్టుకొనబడిన వాడై; అచటికిన్= ఆ చోటునకు; నీ కొడుకు నడచి= నీ కుమారుడు వెళ్ళి; అమర్ష సముజ్జ్వలుండు+ఐ= కోపంతో వెలిగినవాడై.

తాత్పర్యం: ఈ విధంగా సంతోషించి దుర్యోధనుడు ధర్మరాజుతో 'శమంతపంచకం బ్రహ్మకు ఉత్తరదిక్కున యజ్ఞవేదిక అని ప్రఖ్యాతిగల పుణ్యభూమి. ఆ చోటులో యుద్ధంలో చనిపోయిన వారికి సద్గతి కలుగుట నిశ్చయం అని విన్నాము. ఎప్పుడూ యుద్ధం చేస్తున్న చోటికి వెళ్ళుదాము.' అనగా నాత డా ద్వైపాయనమనే మడుగు ఆ ప్రాంతంలోనిది కాదు గనుక ఆ మాటకు ఒప్పుకొన్నాడు. ఆ దిక్కునకు పోగా దుర్యోధనుడు గదతో కూడిన భుజబలం ఒప్పుతుండగా మదపుటేనుగు నడకతో యుద్ధానికి సిద్ధమగుతూ దేవతలు పొగడుతుండగా శంఖభేరీ కాహళాది వాద్యాల శబ్దాలు ఒప్పారాయి. ఈ ప్రకారంగా పాండవులు చుట్టుకొనగా ఆ స్థలానికి నీ కుమారుడు వచ్చి, గర్వంతో ప్రకాశిస్తూ - (తరువాతి పద్యంతో అన్వయం).

క. నిలిచిన సకలజనులు నెడ । గవిసి బలసి నిలిచి రపుడు గదయుఁ బసిఁడి క
త్తళము మెఱయ నతనియెదురఁ । జెలువొందె బకారి హేమశిఖరియుఁ బోలెన్. 230

ప్రతిపదార్థం: నిలిచినన్= నిలువగా; సకలజనులు= జనులంతా; అపుడు= ఆ సమయంలో; ఎడ గవిసి= ఆ ప్రక్కకు చేరిపోయి; బలసి నిలిచిరి= గుమిగూడి నిలిచారు; అపుడు= ఆ సమయంలో; గదయున్= గదయూ; పసిఁడి కత్తళము మెఱయన్= బంగారు కవచం ప్రకాశించగా; అతని+ఎదురన్= ఆ దుర్యోధనుడికి ఎదురుగా; బక+అరి= బకుడనే రాక్షసుడికి శత్రువు (భీమసేనుడు); హేమశిఖరియున్+పోలెన్= బంగారు కొండవలె, మేరుశైలం మాదిరి; చెలువు+ఒందెన్= అందగించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు నిలువగా జనులందరునూ ఒకదిక్కుగా కలిసి నిలిచారు. అపుడు గద, బంగారు కవచం మెరయగా భీమసేనుడు బంగారు శైలంవలె దుర్యోధనుడి కెదురుగా సొగసుగా నిలిచాడు.

విశేషం: అలం: ఉపమ.

చ. కనుఁగొని దర్పమంథరము గా నతఁ డిట్లనుఁ బాండవాగ్రజ
న్మునకు 'పడిం బెనంగఁగ ననుం బవనాత్మజుఁ జూచు వేడ్క ని
జ్జనతతి యంతకంత కిటు సందడిగాఁ దనయిచ్చఁ గ్రమ్ముదెం
చునొ? యుపవేశనిశ్చలతఁ జూచిన మే లఖిల ప్రియంబుగన్.' 231

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; దర్పమంథరముగాన్= గర్వం తక్కువ అగునట్లుగా; పాండవ+అగ్రజన్మునకున్= ధర్మరాజుతో; అతఁడు+ఇట్లనున్= ఆ దుర్యోధనుడు+ఇట్లంటున్నాడు; వడిన్+పెనంగఁగన్= త్వరగా యుద్ధం చేయటానికై; చనున్= తగును; పవన+ఆత్మజున్ చూచువేడ్కన్= భీమసేనుడిని చూచే ఆసక్తితో; ఈ+జనతతి= ఈ జన సమూహం; అంతకంతకున్+ఇటు సందడిగాన్= అంతకంతకూ ఈ విధమైన సందడి కాగా; తన+ఇచ్చన్+క్రమ్ముదెంచునొ?= స్వేచ్ఛగా క్రమ్ముకొనునో; అఖిల ప్రియంబుగన్= అందరికినీ మేలగునట్లుగా; ఉపవేశనిశ్చలతన్= సందడి లేకుండా నిశ్చలంగా మార్చుండేటట్లు; చూచినన్= చూచినట్లయితే; మేలు= మంచిది.

తాత్పర్యం: దుర్యోధనుడు పొగరుబోతుతనం తగ్గగా ధర్మరాజును చూచి, ఇట్లా అన్నాడు- 'త్వరలో యుద్ధం చేయటానికి వస్తున్న నన్నూ భీముడిని చూచే వినోదంతో ఈ జనసమూహం స్వేచ్ఛగా మూగుతారేమో? వాళ్ళు కదలకుండా కూర్చుండి మా యుద్ధాన్ని చూస్తే అందరికీ మేలు.'

వ. అని భూపాలుర నెల్ల నాలోకించినం బాంచాలాదు లగు నయ్యందఱను ధర్మనందనుండు గూర్చుండ నియోగించి, బలదేవ వాసుదేవ సహితంబుగఁ దాను నాసీనుం డయ్యె; నమ్మహీనాథమండలంబున సితప్రభుం డైన యన్నీలాంబరుండు తారకామధ్యవర్తియై మెఱయుమృగాంకు ననుకరించె; నట్టియెడ భీమసేనుండును దుర్యోధనుండును. 232

ప్రతిపదార్థం: అని భూపాలురన్+ఎల్లన్+ఆలోకించినన్= అంటూ రాజులనందరినీ బాగా చూడగా; పాంచాల+ఆదులైన+ అందఱును= పాంచాలాది దేశాల రాజులైన వారందరినీ; ధర్మనందనుండు= ధర్మరాజు; కూర్చుండన్ నియోగించి= కూర్చుండుడని ఉత్తరువుచేసి; బలదేవ, వాసుదేవ సహితంబుగాన్= బలరాముడితోను, శ్రీకృష్ణుడితోను కలిసి; తానున్+ఆసీనుండు+అయ్యెన్= తానూ కూర్చున్నాడు; ఆ+మహీనాథమండలంబునన్= ఆ రాజులోకంలో; సితప్రభుండు+ఐ= తెల్లనికాంతి కలవాడై; ఆ+నీల+అంబరుండు= నీలవస్త్రధారిఅయిన ఆ బలరాముడు; తారకామధ్యవర్తి+ఐ= నక్షత్రాల నడుమనున్నవాడైన; మెఱయు మృగాంకున్+అనుకరించెన్= ప్రకాశించే చంద్రుడిని అనుకరించాడు(చంద్రుడివలె ఉన్నాడు); అట్టి+ఎడన్= ఆ సమయంలో; భీమసేనుండును; దుర్యోధనుండును.

తాత్పర్యం: (దుర్యోధనుడు) రాజుల నందరినీ చూస్తూ ఉండగా పాంచాలం మొదలైన దేశాల రాజులనందరినీ కూర్చుండుడని ధర్మజు డాజ్ఞాపించాడు. బలరాముడితోనూ శ్రీకృష్ణుడితోనూ తానూ కూర్చున్నాడు. అపుడు బలరాముడు తెల్లనిమేనిరంగుతో నక్షత్రాల నడుమ వెలిగే చంద్రుడివలె వెలిగాడు. ఆ సమయంలో భీమసేనుడు, దుర్యోధనుడు (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

సీ. ఆభీల గర్జన శోభితదేహు లై । యుద్భటవృషములయొప్పుఁ దాల్చి,
రోష మహావిషభీషణవదను లై । చండోరగంబుల చంద మొంది
మదసముజ్జృంభితమండితాకారు లై । భద్రద్విపంబుల పగిదిఁ బొల్చి,
చారుగదాశృంగ సందీప్త మూర్తు లై । మహితపర్వతములమాడ్కి మెఱసి,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. వాసుదేవయుగము వరుణద్వయంబు వై । శ్రవణయుగ్మకంబు రామయమము
వోలె దర్శనీయలీల వహించి యం । భోధియుగళ మనఁగఁ బొంగు మిగిలి. 233

ప్రతిపదార్థం: ఆభీల= భయంకరమైన; గర్జన= సింహగర్జనలతో; శోభితదేహులు+ఐ= సుందరశరీరులుఅయి; ఉద్భటవృషముల+ ఒప్పున్+తాల్చి= ఏపైన గిత్తల హొయల నంది; రోష= కోపంతో; మహావిషభీషణ వదనులు+ఐ= పెద్ద విషంతో; మిక్కిలి భయమును కలిగించే ముఖాలతో; చండ+ఉరగంబుల చందము+ఒంది= భయంకరాలయిన పెనుబాములవలె ఉండి; మద= గర్వంతో; సముజ్జృంభిత= మిక్కిలి పేట్రేగినందున; మండిత+ఆకారులై= అలంకరించబడిన శరీరాలు కలవారై; భద్రద్విపంబుల పగిదిన్ పొల్చి= మదపుటేనుగువలె ఒప్పి; చారు గదా శృంగ సందీప్త మూర్తులు+ఐ= గొప్పగదలనే శిఖరాలతో ప్రకాశిస్తున్న ఆకారాలు కలవారై; మహిత పర్వతముల మాడ్కిన్= గొప్ప పర్వతాలవలె; మెఱసి; వాసుదేవయుగము= ఇద్దరు వాసుదేవులు; వరుణద్వయంబు= ఇద్దరు వరుణులు; వైశ్రవణయుగ్మకంబు= కుబేరులజంట; రామయమము= ఇద్దరు శ్రీరామచంద్రులు; పోలెన్= వలె; దర్శనీయలీలన్ వహించి= చూడదగిన సొంపుకలిగి; అంబోధి= సముద్రముల; యుగళము+అనఁగన్= జంటయో అనగా; పొంగు= పొంగు(దర్పం); మిగిలి= మించి.

తాత్పర్యం: భయంకర గర్జనలతో కూడిన అందమైన శరీరాలు కలిగి, మదించిన ఎద్దుల అందంతో ఒప్పి, కోపమనే విషంతోఉన్న ముఖాలతో భయంకరమైన పాముల పద్ధతిని కలిగి, మదంతో వికసించే ఆకారాలు మదించిన ఏనుగుల మాదిరి ఉండి అందమైన గదల కొమ్ములతో ప్రకాశిస్తూ పెనుగొండలవలె ఇర్వురు వాసుదేవులవలె, వరుణులిద్దరివలె, కుబేరద్వయంవలె, శ్రీరాములిర్వురవలె అందంగా కనుపిస్తూ, దర్పాతిశయంతో రెండు సముద్రాలవలె పొంగారి - (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. ఒండొరులం జుఱచుఱం జూచుచుఁ, బరస్పరహృదయ విదారణంబు లగు దారుణభాషణంబు లెసఁగ శుంభదవష్టంభంబునం బొలిచి నిలిచి; రనిన విని యాంబికేయుండు. 234

ప్రతిపదార్థం: ఒండొరులన్ చుఱచుఱన్+చూచుచున్= ఒకరిని మరొకరు కోపంతో చూస్తూ; పరస్పర హృదయ విదారణంబులు+అగు దారుణ భాషణంబులు+ఎసఁగన్= ఒకరొక్కరి గుండెలు పగిలేటట్లు తీవ్రపదజాలంతో కూడిన మాటలు ఎక్కువగా మాటాడుతూ; శుంభత్+అవష్టంభంబునన్+పొలిచి= పెనుగర్వంతో ఒప్పి; నిలిచిరి= నిలిచారు; అనినన్= అనగా; విని; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: ఒకరినొకరు కొరకొర చూస్తూ, ఒకరిగుండెలు చీలేటట్లు మఱొక్కరు తీవ్రపదాలతో మాటాడుతూ పెనుగర్వంతో నిలిచారు. అనగా విని ధృతరాష్ట్రుడు - (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'తనుఁ బదునొకఁ డక్షౌహిణు । లనూనవిభవమునఁ గొలువ నఖిలనృపులుఁ బం
చినపని సేయ నెగడునా । తనయుం డేకాకియుం బదాతియు నయ్యెన్. 235

ప్రతిపదార్థం: తనున్+పదునొకఁడు+అక్షౌహిణులు= తనను పదకొండక్షౌహిని సేనలు; అనూన= సాటిలేని; విభవమునన్+ కొలువన్= ఐశ్వర్యంతో సేవించగా; అఖిలనృపులున్= రాజులందఱును; పంచిన పని చేయన్= చెప్పినపని చేయగా; నెగడు= ఒప్పారే; నా తనయుండు= నా కుమారుడు; ఏకాకియున్= ఒక్కడును; పదాతియున్+అయ్యెన్= కాలిబంటు అయ్యాడు.

తాత్పర్యం: పదకొండక్షౌహిణుల సేనలు సాటిలేనట్లుగా వైభవంగా సేవించగా రాజులంతా తన ఆజ్ఞను శిరసావహించగా ఉండే నా కుమారుడు ఏకాకీ పదాతీ అయ్యాడు.

తే. సకల ధరణికి నాథుఁడై సంపదలకు । నెల్ల భాజన మగు కౌరవేంద్రుఁ డనద
తనము దోఁపంగ గదఁ జేతఁ గొని వినిశ్చ । యమునఁ బోరికి నమరెనే? యక్క టకట! 236

ప్రతిపదార్థం: సకల ధరణికిన్ నాథుఁడు+ఐ= భూమికిన్+అంతకును రాజు+ఐ; సంపదలకున్+ఎల్లన్= ఐశ్వర్యాలంతటికీ; భాజనము+అగు= స్థానమైన; కౌరవేంద్రుఁడు= కౌరవరాజు(దుర్యోధనుడు); అనదతనము తోఁపంగన్= దిక్కులేని విధం కానరాగా; గద చేతన్+కొని= చేతిలో గదను పట్టుకొని; వినిశ్చయమునన్= నిశ్చయం లేకుండా; అక్కట+అకట!= అయ్యయ్యో!; పోరికిన్= యుద్ధానికి; అమరెనే?= సిద్ధమైనాడా?

తాత్పర్యం: సమస్తభూమికిని రాజుగా సంపదలకు తావలమైన కౌరవరాజు దుర్యోధనుడు దిక్కు లేని అనాథ మాదిరిగా గదచేత పట్టుకొని విగతనిశ్చయుడై పాదచారిగా యుద్ధానికి సిద్ధమైనాడా? అయ్యయ్యో!

వ. ఏ మనం గలదు సంజయా! దైవంబ నేర్చుం గాక!' యని పనవి యూర కుండె; నట్లున్న యమ్మానవపతికి సూతసూనుం డి ట్లనియె. 237

ప్రతిపదార్థం: సంజయా!= ఓ సంజయుడా!; ఏమనన్+కలదు= చెప్పటానికేమున్నది?; దైవంబు నేర్చున్+కాక= దేవుడికే తెలియును; అని= అంటూ; పనవి= దుఃఖించి; ఊరకుండెన్= మిన్నకున్నాడు; అట్లు+ఉన్న= ఆ విధంగా మాట్లాడకున్న; ఆ+మానవపతికిన్= ఆ రాజైన ధృతరాష్ట్రుడికి; సూతసూనుండు+ఇట్లు+అనియెన్= సూతుడి కుమార డయిన సంజయుడు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సంజయా! 'ఏమనగలను? అంతా దైవానికే ఎరుక.' అని అంటూ దుఃఖిస్తూ ఊరకున్నాడు. అట్లున్న ఆ ధృతరాష్ట్ర మహారాజుతో సంజయుడు ఈ విధంగా అన్నాడు:

క. 'నీసుతుఁడు సమర విషయో । ల్లాసంబున నంగకంబులం బొం గారం
గా సుస్వరమున నాకుం । తీసూనునిఁ బిలిచె నుద్ధతిన్ రణమునకున్.' 238

ప్రతిపదార్థం: నీ సుతుఁడు= నీకొడుకు; సమరవిషయ+ఉల్లాసంబునన్= యుద్ధానికి సంబంధించిన ఉత్సాహంతో; అంగకంబులన్= శరీరావయవాలలో; పొంగు+ఆరంగాన్= గర్వం అతిశయించగా; సుస్వరమునన్= గంభీరస్వరంతో; ఆ కుంతీసూనునిన్= కుంతీకుమారుడైన భీమసేనుడిని; రణమునకున్= యుద్ధానికి; ఉద్ధతిన్= గర్వంతో; పిలిచెన్= పిలిచాడు.

తాత్పర్యం: యుద్ధం మీది ఉత్సాహంతో నీ కొడుకు శరీరం ఉప్పొంగగా స్పష్టమైన కంఠంతో భీమసేనుడిని యుద్ధానికి పిలిచాడు.

వ. ఆ సమయంబున. 239

ప్రతిపదార్థం: ఆ సమయంలో.

తాత్పర్యం: అప్పుడు.

క. ఉర్వీవలయము వడఁకెను, । బర్వము గాకయును రాహు భానునిఁ బట్టెం,
బర్వతము లురిలె, వఱిఁకులు । సర్వదిశల నఱిచె, నభము శర్కర గురిసెన్. 240

ప్రతిపదార్థం: ఉర్వీవలయము= భూగోళం; వడఁకెను= వణకింది; పర్వము= అమావాస్యాపర్వదినం; కాకయును= కాకుండగనే; రాహు భానునిన్ పట్టెన్= రాహువు సూర్యుడిని పట్టుకొన్నాడు; (సూర్యగ్రహణం అమావాస్య పర్వదినాన జరుగుతుంది); పర్వతములు+ఉరిలెన్= సప్తకులపర్వతాలు దొర్లినవి; వఱుశులు= నక్కలు; సర్వదిశలన్+అఱచెన్= అన్ని దిక్కులలోను అరచాయి; నభము= ఆకాశం; శర్కరన్+కురిసెన్= ఇసుక వాన కురిసింది (ఇవి అన్నీ అపశకునాలే).

తాత్పర్యం: భూగోళం వణకింది, అమావాస్యా పర్వదినం కాకుండగనే సూర్యుడిని రాహువు పట్టుకొన్నాడు. కొండలు దొర్లాయి. నక్క లన్ని దిక్కులలో అరచాయి. ఆకాశంనుండి ఇసుక వాన కురిసింది.

వ. మఱియు నిర్ఘాతపాతప్రభృతి మహోత్పాతంబులు గలిగె; వాని నెల్ల ననుసంధించి గంధవహనందనుండు గాంధారీనందనుం జూపి ధర్మనందనున కిట్లనియె. 241

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; నిర్ఘాతపాత= పిడుగులు రాలుట; ప్రభృతి= మొదలయిన; మహా+ఉత్పాతంబులు కలిగెన్= అపశకునాలు కలిగాయి; వానిన్+ఎల్లన్= ఆ అన్నింటినీ; అనుసంధించి= కలిపికొని; గంధవహనందనుండు= వాయుసూనుడైన భీమసేనడు; గాంధారీనందనున్+చూచి= గాంధారి కొడుకైన దుర్యోధనుడిని చూచి; ధర్మనందనునకున్ ఇట్లు+అనియెన్= ధర్మరాజుతో ఈవిధంగా అన్నాడు:

తాత్పర్యం: ఇంకనూ పిడుగులు రాలటం మొదలైన అపశకునాలు కలిగాయి. వాటి నన్నిటినీ సమన్వయించి భీమసేనుడు దుర్యోధనుడిని చూపిస్తూ ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు:

సీ. 'అశ్రమంబున గెల్వ నగు నాకుఁ జూపఱు । గొనియాడఁ బోరాడి కూల్చి తొడలు
పొడిసేసి యిన్నీచుఁ బొలియింతు మద్గదా । దండసముద్దండతావిభూతి
యవధరింపుము; వీని యాయువు దెగటాఱె; । నిక్కులపాంసను నిట్టు లేను
గదిసియుఁ గ్రమ్మఱఁ గరిపురంబునకుఁ బో । నిత్తునే? ధృతరాష్ట్రుఁ డింక వగలఁ

ఆ. బొగులువాఁడు గాక! పోఁడిమితో నుండు । వాఁడె? వీఁడు మనల వాలి పఱుపఁ
దొల్లి పడినపాటు లెల్ల వెలారింతు । నధిప! నీమనమున హర్ష మెసఁగ.' 242

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ధర్మజా!); అశ్రమంబునన్= అనాయాసంగా; నాకున్+గెల్వన్+అగు= జయించగలను; చూపఱు కొనియాడన్= చూచేవారు పొగడగా; పోరాడి కూల్చి= యుద్ధంచేసి పడగొట్టి; తొడలు= తొడలను; పొడి+చేసి= నుగ్గునుగ్గుగా చేసి; ఈ+నీచున్= ఈ దుష్టుడిని; పొలియింతున్= చంపుతాను; మత్+గదాదండ= నాగదయొక్క; సముద్దండతావిభూతి= మిక్కిలి గొప్పదైన శక్తిని; అవధరింపుము= చూడుము; వీని= ఇతడియొక్క; ఆయువు+తెగటాఱెన్= ఆయుస్సు నశించింది; ఈ+కులపాంసనున్= వంశానికి చెడు పేరు తెచ్చిన వీడిని; ఇట్టులు+ఏను+కదిసియున్= ఈ విధంగా నేను తలపడి; క్రమ్మఱన్= మరల; కరిపురంబునకున్+పోనిత్తునే?= హస్తినాపురికి పోనిస్తావా?; ధృతరాష్ట్రుఁడు+ఇంకన్ వలగన్+పొగులువాఁడుగాక= ఇంక ధృతరాష్ట్రుడు దుఃఖాలతో కుమిలిపోగలడు; పోఁడిమితోన్+ఉండువాడె?= సౌఖ్యంతో ఉండగలడా?; నీ మనమునన్ హర్షము ఎసఁగన్= నీ మనసునకు సంతోషం కలుగగా; వీఁడు= ఇతడు; మనలన్= మనలనందరను; వాలి= విజృంభించి; పఱుపన్= కష్టపెట్టగా; తొల్లిపడిన పాటులు+ఎల్లన్= మునుపు పడిన కష్టాలనన్నింటినీ; వెలారింతున్= పోగొట్టుతాను.

తాత్పర్యం: 'చూచేవారు పొగడగా అనాయాసంగా పోరాడి పడగొట్టి తొడలు పొడిచేసి ఈ నీచుడిని హతమారుస్తాను. నా గదాదండం యొక్క ఆధిక్యాన్ని చూడుము. వీడి యాయువు నశించింది. ఈ కులనాశకుని దగ్గరకు చేరిన నేను

ఈ విధంగా మరల ఇతడిని హస్తినాపురికి పోనిస్తానా? ధృతరాష్ట్రుడింక దుఃఖంతో కుములకుండా సంతోషంగా ఉండగలడా? వీడు మనలను అల్లరిపాలు చేయగా మనం పడిన కష్టాలన్నిటినీ ఓ రాజా! నీ మనసునకు సంతోషం కలిగేటట్లు పోగొట్టుతాను.'

వ. అని పలికి దుర్యోధనాభిముఖుం డై. 243

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పుచూ; దుర్యోధన+అభిముఖుండై= దుర్యోధనునకు ఎదురై.

తాత్పర్యం: అని దుర్యోధనుడికి ఎదురై నిలిచి - (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నెఱి మాలి వీరి నీతఁడు । పఱిచినపాటులకుఁ దగినఫల మగు నని 'యి
త్తెఱఁగునకు నియ్యకొని చూ । పఱుపొగడఁగ నిన్ను నిపుడ పడవైచుటకున్. 244

ప్రతిపదార్థం: నెఱి మాలి= నీతి మాలి; వీరిన్= ఈ అందరను; ఈతఁడు= వీడు; పఱిచిన పాటులకున్= పెట్టిన కష్టాలకు; తగిన ఫలము+అగున్+అని= సరియైన ఫలితం అవుతుందని; ఈ+తెఱఁగునకున్= ఈ పద్ధతికి; ఇయ్యకొని= ఒప్పుకొని; చూపఱు+పొగడఁగన్= చూచే వారు కీర్తించగా; నిన్నున్; ఇపుడు+అ= ఇప్పుడే; పడవైచుటకున్= పడగొట్టటానికి.

తాత్పర్యం: 'నీతిమాలి వీరి నందరినీ ఈ దుష్టుడు పెట్టిన కష్టాలకు తగినవిధంగా బుద్ధిచెప్పుతాను.' అంటూ, 'దుర్యోధనా! అందరూ పొగడుతూ ఉండగా నిన్ను ఇప్పుడే పడగొట్టటానికి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. అమరి యున్నాఁడ; నాబారి కగ్గ మైతి; । పడుదుగా కింక; నీకు నెక్కడకుఁ బోవ
వచ్చు?' ననవుడు నిది 'యేల పెచ్చు పెరిఁగి । యాల మెడసేసి యనిలజ! ప్రేలె దిట్లు?' 245

ప్రతిపదార్థం: అమరి+ఉన్నాఁడన్= సిద్ధంగా ఉన్నాను; నాబారికిన్+అగ్గము+ఐతి(వి)= నా హింసకు చిక్కావు; పడుదు(వు)+ కాక= చస్తావు గాక; ఇంకన్ నీకున్+ఎక్కడకున్+పోవన్ వచ్చున్?= ఇక నీవే దిక్కుకు పోగలవు?; అనవుడున్= అనగా; అనిలజ!= ఓ భీమా!; ఇది ఏల?; పెచ్చుపెరిఁగి= పేట్రేగి; ఆలము+ఎడన్+చేసి= యుద్ధం మాని; ఇట్లు ప్రేలెదు?= ఈ విధంగా వాగుతున్నావు?

తాత్పర్యం: నేను సిద్ధంగా ఉన్నాను. నా చేతికి చిక్కావు. ఇంక నీవెక్కడకు పోగలవు? నీకేది దిక్కు?' అని భీముడు అనగా, 'ఓ భీమసేనా! ఎందుకు పేట్రేగి ప్రేలుతున్నావు? యుద్ధానికి ఆలస్యం చేస్తున్నావు?'

వ. అని కురువిభుండు వెండియు నిట్లనియె. 246

ప్రతిపదార్థం: అని= అంటూ; కురువిభుండు= దుర్యోధనుడు; వెండియున్= ఇంకను; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అంటూ దుర్యోధనుడు ఇంకా ఈ విధంగా పలికాడు.

క. 'పలుకుల వెఱపించెద వా । కొలఁదియె? దుర్యోధనుం డకుంఠితబాహా
బలుఁ; డిదె యవలీల నినుం । బొలియించెడిఁ; బలుకు లుడిగి పోరాడు ధృతిన్. 247

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పలుకులన్= మాటలతో; వెఱపించెదవు= భయపెట్టుతున్నావు; ఆ కొలఁదియె?= అంతేనా?; దుర్యోధనుండు; అకుంఠిత బాహాబలుఁడు= మొక్కవోని భుజబలండున్నవాడు; ఇదె= ఇపుడే; అవలీలన్= అనాయాసంగా; నినున్+పొలియించెడిన్= నిన్ను చంపుతున్నాడు; పలుకులు+ఉడిగి= మాటలు మాని; ధృతిన్= ధైర్యంతో; పోరాడు(ము)= యుద్ధం చేయుము.

తాత్పర్యం: 'మాటలతో బెదిరిస్తున్నావు. అంతమాత్రమేనా? కుంటుపడని భుజబలంతో దుర్యోధను డిదే అనాయాసంగా నిన్ను చంపగలడు. మాటలు మాని ధైర్యంగా యుద్ధం చేయుము.

శా. వ్యూహాభావము సూచి నన్నసదుగా నూహించెదో భీమ! మ
ద్బాహాచండిమసారదుర్దమగదాదండంబు దృప్యద్భవ
ద్దేహోల్లాసము నెట్లు దీనదశకుం దే నోర్చునో చూడుమీ!
యాహా పుట్టెడు లాఁతి చూపఱకు; హాహా పుట్టు మీ వారికిన్. 248

ప్రతిపదార్థం: భీమ!= ఓ భీమసేనా!; వ్యూహ+అభావము+చూచి= సైన్యంలేకుండాన్ని చూచి; నన్నున్+అసదుగాన్+ఊహించెదో?= నన్ను బలహీనుడిగా భావిస్తున్నావా?; మత్+బాహా చండిమసార= నా భుజబలంయొక్క శక్తి; దుర్దమ= అణచరాని; గదాదండంబు= గదాయుధం; దృప్యత్= గర్వించిన (బలంచేత); భవద్దేహ+ఉల్లాసమున్= ఒడలి ఉత్సాహాన్ని; ఎట్లు దీనదశకున్+తేన్+ఓపునో= ఏ విధంగా శోచనీయమైన స్థితికి తెస్తుందో; చూడుమీ!= చూడుమా!; లాఁతి చూపఱకున్= ఇతరులైన చూపరులకు; ఆహా పుట్టెడున్= ఆశ్చర్యం కలుగుతుంది; మీవారికిన్= మీవారందరికీ; హాహా పుట్టున్= దుఃఖం కలుగుతుంది.

తాత్పర్యం: నాకు సేనా సమూహం లేకుండటాన్ని చూచి నన్ను బలహీనుడవనుకొన్నావా? భీమసేనా! నా భుజబలసారమైన గదాదండం జయించరానిది. గర్వంతో నిండిన ఉత్సాహంతో కూడిన నీ శరీరాన్ని ఏ విధంగా దీనస్థితికి తెస్తుందో చూడుము. అది చూచే ఇతరులకు ఆశ్చర్యం కలుగుతుంది. మీవారందరికీ దుఃఖం కలుగుతుంది.

ఉ. నా కెదురై పినాకియుఁ బినాకము పట్టక యుద్ధతిన్ గదా
భీకరవృత్తి చూపుటకుఁ బేర్చిన నెక్కుడు పేర్చి చీరికిం
గైకొన కే పడంచి భుజగర్వసమున్నతి నిర్వహింతు; నీ
కే కడ డాఁగ వచ్చు? గద నే నని సేయుటకుం గడంగినన్.' 249

ప్రతిపదార్థం: గదన్= గదతో; ఏను= నేను; అని+చేయుటకున్+కడంగినన్= యుద్ధం చేయటానికి మొదలుపెట్టితే; నాకున్+ఎదురై= నన్నెదుర్కొని; పినాకియున్= ఈశ్వరుడుకూడా; పినాకము+పట్టక= పినాకమనే వింటిని పట్టుకోకుండా; ఉద్ధతిన్= గర్వంతో; గదా భీకరవృత్తిన్= భయంకరమైన గదయొక్క చేష్టను; చూపుటకున్= ప్రదర్శించుటకు; పేర్చినన్= విజృంభించగా; ఎక్కుడు పేర్చి= మిక్కిలి విజృంభించి; చీరికిన్+కైకొనక= లెక్కచేయకుండా; ఏపు+అడంచి= పొగరును పోకార్చి; భుజగర్వసమున్నతి నిర్వహింతున్= భుజములయొక్క గర్వాధిక్యాన్ని ప్రదర్శిస్తాను; (ఇపుడు) నీకున్+ఏకడన్+డాఁగన్+వచ్చున్= నీవు ఎక్కడ దాగటానికి సాధ్యమౌతుంది?

తాత్పర్యం: నేను గదతో యుద్ధం చేయటం మొదలుపెట్టితే ఈశ్వరుడు కూడా తన ధనుస్సయిన పినాకమును పట్టుకోకుండా భయంకరమైన గదాయుద్ధానికి విజృంభిస్తే, నేను అంతకంటె ఎక్కువ విజృంభించి లెక్క చేయకుండా శత్రువు పొగరును పోకార్చి భుజబలగర్వాధిక్యమును నడుపుతాను. నీ వెక్కడ దాగగలవు?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: అతిశయోక్తి, కావ్యార్థాపత్తి.

వ. అని మఱియును. **250**

ప్రతిపదార్థం: అని మఱియును= అంటూ ఇంకను.

తాత్పర్యం: అంటూ ఇంకా.

క. 'గదఁగయ్య మెన్నఁడొకొ చే । యుదు భీమునితోడ? ననుచు నుల్లంబునఁ గో
రుదు నెపుడు; నిప్పడు నా । కది యొదవెన్ విధికృతిం; గృతార్థుఁడ నైతిన్. **251**

ప్రతిపదార్థం: భీముతోడన్= భీముడితో; గదన్= గదతో; కయ్యము= యుద్ధం; ఎన్నఁడొకో?= ఏ దినమో?; చేయుదున్= చేసెదను; అనుచున్= అంటూ; ఉల్లంబునన్= మనసులో; ఎప్పుడున్= అన్నివేళలా; కోరుదున్= కోరుకొంటాను; విధికృతిన్= బ్రహ్మ పనివలన; ఇప్పుడు నాకున్+అది+ఒదవెన్= ఈ సమయాన నాకది సిద్ధించింది; కృతార్థుఁడన్+ఐతిన్= ధన్యుడనయ్యాను.

తాత్పర్యం: గద చేతబట్టి భీమసేనుడితో యుద్ధ మెపుడు చేస్తానా? - అని నా మనసులో ఎప్పుడూ కోరుకొంటాను. విధివశాన ఇపుడు నా కది సిద్ధించింది. ధన్యుడనయ్యాను.

వ. నీ విట చక్కనయి రమ్ము.' **252**

ప్రతిపదార్థం: నీ విట చక్కనయి రమ్ము= నీవు+ఈ కడకు సరిగా రమ్ము.

తాత్పర్యం: నీవు ఇక్కడకు సిద్ధంగా రమ్ము.'

చ. అన విని యెల్లవారు భవదాత్మజు మెచ్చి నుతించి; రయ్యశో
ధనుఁ డరివీరు లట్లు ప్రథితంబుగఁ దన్ బొగడం బ్రమోది యై
వినుచుఁ బ్రవర్ధితం బయిన వీరగుణంబున నుల్లసిల్లె నా
తనిపయి భీముఁ డుద్యతగదాస్ఫురణన్ నడచెన్ నరేశ్వరా! **253**

ప్రతిపదార్థం: నరేశ్వరా!= ఓ రాజా!; అనన్ విని= అనగా విన్నవారై; ఎల్లవారున్= అందరునూ; భవదాత్మజున్= నీ కుమారుడైన దుర్యోధనుడిని; మెచ్చి= మెచ్చుకొని; నుతించిరి= కీర్తించారు; ఆ+యశోధనుఁడు= ఆ కీర్తిసంపన్నుడు; అరివీరులు= శత్రువీరులు; అట్లు= ఆ విధంగా; ప్రథితంబుగన్+తన్+పొగడన్= ప్రఖ్యాతిగా తనను పొగడగా; ప్రమోది ఐ= సంతోషం కలవాడై; వినుచున్= వింటూ; ప్రవర్ధితంబు+అయిన= పెరిగిన; వీరగుణంబునన్= శౌర్యంతో; ఉల్లసిల్లెన్= సంతోషించాడు; ఆతని పయిన్= ఆతడి మీదకు; భీముఁడు= భీమసేనుడు; ఉద్యతగదాస్ఫురణన్= పైకెత్తిన గదయొక్క స్ఫూర్తితో; నడచెన్= తలపడటానికి నడచాడు.

తాత్పర్యం: (దుర్యోధనుడు యుద్ధానికి సిద్ధమై రమ్ము) అనగా విని అందరూ అతడిని మెచ్చుకొని పొగిడారు. ధృతరాష్ట్రమహారాజా! ఆ కీర్తిసంపన్నుడు (దుర్యోధనుడు) శత్రువీరులు ఆవిధంగా ప్రఖ్యాతిగా తనను పొగడగా ఆనందించి వింటూ వీరత్వపు పెంపుతో ఉల్లసిల్లినాడు. ఆతనిపై భీమసేనుడు గద పైకెత్తి నడచినాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అప్పుడు కుంజరబృంహితంబులును హయహేషలునుం జెలంగె; నిట్లు తన మీఁద నడచు వడముడిం జూచి నీకొడు కదల్చుచు గదాసముల్లాసంబు భాసమానంబుగ వీఁక నెదుర్కొని తాఁకిన. 254

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయాన; కుంజరబృంహితంబులును= ఏనుగుల ఘీంకారశబ్దాలున్నూ; హయహేషలును= గుర్రాల సకిలింతలున్నూ; చెలంగెన్= ఒప్పినవి; ఇట్లు= ఈ విధంగా; తనమీఁదన్ నడచు= తనపైకి దూకుతున్న; వడముడిన్+ చూచి= భీమసేనుడిని చూచి; నీ కొడుకు= నీ కుమారుడు; అదల్చుచున్= బెదరిస్తూ; గదాసముల్లాసంబు= గదతో కూడిన సంతోషం; భాసమానంబుగన్= ప్రకాశించగా; వీఁకన్+ఎదుర్కొని తాఁకినన్= పరాక్రమంతో ఎదుర్కొని తాకగా.

తాత్పర్యం: ఆ సమయాన ఏనుగుల ఘీంకారాలూ, గుర్రాల సకిలింతలూ ధ్వనించాయి. ఈ ప్రకారంగా తనమీదకు దూకుతున్న భీమసేనుడిని చూచి, నీ కుమారుడు బెదరిస్తూ గదతో కూడిన సంతోషపు వెలుగుతో పరాక్రమంతో ఎదుర్కొని తాకగా. (తరువాతి పద్యంతో అన్వయం).

భీమసేన దుర్యోధనుల గదాయుద్ధము (సం. 9-56-1)

సీ. చండగదాపరస్పర ఘట్టనంబుల । మింటఁ బె ల్లడరెడుమంటగములఁ
బరమఘోరము లగు పదతాడనంబుల । నొలయు వసుంధరాచలనములను
నుద్భటక్రోధ సముద్రేకములఁ జూడ్కు । లం దుల్లసిల్లెడు నరుణరుచుల
దారుణధ్వను లగుతర్జనలీలలఁ । బరఁగుపర్వత గుహాప్రతిరవముల

తే. ననిమిషుల దృష్టు లిఱుమిట్లు గొనఁగ భుజగ । పతియుఁ గూర్మంబు సంకటపడఁగఁ దరణి
కిరణములు వెల్కఁ బాఱ దిక్కరులు బెదర । నొప్పె నత్తొలితాకు మహోగ్ర మగుచు. 255

ప్రతిపదార్థం: చండగదా= భయంకరమైన గదల; ఘట్టనంబులన్= రాపిడులతో; మింటన్= ఆకాశాన; పెల్లు+అడరెడు= మిక్కిలి ఎక్కువైన; మంట గములన్= మంటల గుంపులచేతను; పరమ ఘోరములు+అగు= మిక్కిలి భయంకరాలు+అయిన; పదతాడనంబులన్= కాళ్ళతో కొట్టటంవలన; ఒలయు వసుంధరాచలనములను= భూకంపములచేతను; ఉద్భటక్రోధ సముద్రేకములన్= ఎక్కువైన కోపంతో కూడి ఉద్రేకాలతో; చూడ్కులందున్= చూపులలో; ఉల్లసిల్లెడు= ఒప్పే; అరుణరుచులన్= ఎర్రని కాంతులచేతను; దారుణధ్వనులు+అగు= భయంకరమైన శబ్దములుగల; తర్జనలీలలన్= బెదరింపులతో; పరఁగు= వ్యాపించిన; పర్వతగుహా ప్రతిరవములన్= కొండగుహల ప్రతిధ్వనులచేతను; అనిమిషుల దృష్టులు= రెప్పపాటులేని దేవతల చూపులు; మిఱుమిట్లు+కొనఁగన్= చెదరిపోగా; భుజగపతియున్= ఆదిశేషుడును; కూర్మంబున్= ఆదికూర్మమును (భూమిని మోయునటువంటి తాబేలు); సంకట పడఁగన్= కష్టపడగా (కలతనందగా); తరణి కిరణములు= సూర్యకిరణాలు; వెల్కన్+పారన్= (వెలుక+పాఱు) వెలవెలబోగా; దిక్కరులు బెదరన్= దిగ్గజాలు బెదిరిపోగా; ఆ+తొలితాఁకు= ఆ తొలిసారి ఎదుర్కొనటం (తొలిదెబ్బ); మహా+ఉగ్రము+అగుచున్= మిక్కిలి భయంకరంగా; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: భయంకరమైన గదలయొక్క తాకిడులతో, ఆకసంలో ఎక్కువగా మండే మంటల గుంపుచేత, మిక్కిలి ఘోరమైన కాలితాకిడికి భూకంపంతోను, ఎక్కువైన కోపం యొక్క ఉద్రేకాలతో ఎర్రని కంటి కాంతులచేతను, భయంకరమైన శబ్దాలు కలిగిన బెదరింపులతో ప్రతిధ్వను లిచ్చే కొండ గుహలచేతను, రెప్పపాటులేని దేవతల చూపులు బెదరిపోయేటట్లుగాను, భూభారం వహిస్తున్న ఆదిశేషుడు, తాబేలు కష్టపడేటట్లుగాను సూర్యకిరణాలు వెలవెలపోయేటట్లుగాను, దిగ్గజాలు భయపడగా, ఆ తొలితాకు భయంకరంగా ఒప్పింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అతిశయోక్తి.

వ. ఇట్లు తలపడి మండలప్రచార వివిధ ప్రకారంబులం బుడమికిం జిత్రగదాసారణ బహుభంగుల నింగికిం గ్రొత్త యొ ప్పొలయం దమలావును వేగంబును నేర్పును దర్పంబును జూపఱకు వెఱఁగుఁ బుట్టింప నంతకంతకు నెక్కుడగు మదంబులం బొదలెడు బాహుదండంబుల బలనైపుణంబు లగ్గింపం బేర్చు బీరంబుల నొండొరుల సంరంభంబుల సరకుగొనక యక్కురుపాండవపుంగవులు జంభవాసవులచందంబునం బెనంగినం బలుదెఱంగు లైన గదా ప్రహతులం దునియలుఁ బఱియలుఁ దుముళ్ళునై సీసకంబులు కత్తళంబులు ధరాతలంబునం దొఱంగె; నట్టియెడ. 256

ప్రతిపదార్థం: ఇట్లు తలపడి= ఈ విధముగా ఎదుర్కొని; మండల ప్రచార వివిధ ప్రకారంబులన్= వలయాకారంగా విధాలుగా తిరుగుతూ; పుడమికిన్= భూమికి; చిత్ర+గదా+ఆసారణ+బహుభంగులన్= గదను త్రిప్పటంలో అనేకవిధాల చిత్రమైన పద్ధతిలో; నింగికిన్ క్రొత్త ఒప్పు+ఒలయన్= ఆకసానికి క్రొత్తసొగసు రాగా; తమ లావును వేగంబును= తమ తమ బలము, త్వర; నేర్పును దర్పంబును= ప్రజ్ఞయు, గర్వంబును; చూపఱకున్ వెఱఁగు+పుట్టింపన్= చూచేవారికి ఆశ్చర్యం కలిగించగా; అంతకున్+అంతకున్; ఎక్కుడు+అగు మదంబులన్ పొదలెడు= ఎక్కువైన గర్వాలతో ఒప్పిన; బాహుదండంబుల= దండములవంటి భుజాలయొక్క; బలనైపుణంబులు+అగ్గింపన్= బలం, నేర్పరితనం మెచ్చుకొనగా; పేర్చు= విజృంభించే; బీరంబులన్= ప్రగల్భాలతో ఒండొరుల సంరంభంబులన్= ఒకళ్ళొకళ్ళు గొప్పను లెక్కచేయక; ఆ+కురుపాండవ పుంగవులు= ఆ కురువంశ పాండవశ్రేష్ఠులు; జంభవాసవుల చందంబునన్= జంభాసుర ఇంద్రులవలె; పెనంగినన్= పోట్లాడగా; పలు తెఱంగులు+ఐన= అనేక విధాలైన; గదాప్రహతులన్= గదల దెబ్బలచేత; తునియలున్= ముక్కలుగను; పఱియలున్= బద్దలుగను; తుముళ్ళును+ఐ= చిన్నముక్కలుగను మారి; సీసకంబులు= కిరీటాలు; కత్తళంబులు= కవచాలు; ధరాతలంబునన్= భూమిపైన; తొఱంగెన్= దొర్లాయి; అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా ఎదుర్కొని, చక్రాకారంగా పలురకాలుగా విచిత్రంగా గదలను త్రిప్పుతూ, భూమికి ఆకాశానికి ఒక క్రొత్త సొగసు ఒప్పేటట్లుగా తమ బలాన్ని వేగాన్ని తెలివిని గర్వాన్ని చూచేవారికి ఆశ్చర్యం కలిగేటట్లుగా అప్పటప్పటికి ఎక్కువైన అహంకారంతో ఒప్పిన భుజబలం యొక్క నేర్పరితనాన్ని పొగడగా విజృంభించి, వీరత్వంతో ఒకరు మరియొకరి ఉత్సాహాన్ని లెక్కచేయక, ఆ కౌరవ పాండవశ్రేష్ఠులు జంభేంద్రుల వలె పోట్లాడగా పలు రకాలైన గదల దెబ్బలచేత ముక్కలు ముక్కలైన కిరీటాలు, కవచాలు భూమిమీద దొర్లాయి. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. ఒకది క్కుద్ధతిఁ బూన్చి యొండుదెస వ్రేయున్ మేను వంచించి వ్రేఁ
తకుఁ దప్పన్ వడివ్రేయు నొడ్డనమునం దప్పించి వేగంబు గుం
దక నొప్పించుఁ జలం బెలర్పఁగ గదాదండంబు దూలించుఁ బాం
డుకుమారుం డుఱ కట్లు కౌరవవిభుండుం గేలి సల్పుం దగన్. 257

ప్రతిపదార్థం: ఒక దిక్కు+ఉద్ధతిన్+పూన్చి= ఒక వంక గర్వంతో చూపి; ఒండు దెసన్ వ్రేయున్= ఇంకో దిక్కునకు విసరును; మేను వంచించి= ఒడలను తప్పించి; వ్రేఁతకున్= వేసిన దెబ్బకు; తప్పన్= తప్పిపోగా; వడిన్ వ్రేయున్= శీఘ్రంగా దెబ్బకొట్టును; ఒడ్డనమునన్ తప్పించి= వ్యూహం నుండి తప్పించి; వేగంబు+కుందక= తొందర తగ్గకుండా; నొప్పించున్= బాధపెట్టుతాడు;

చలంబు= మాత్సర్యం; ఎలర్పఁగన్= తెలియగా; గదాదండంబున్= గదను; తూలించున్= ఆడించును; పాండు కుమారుండు= భీమసేనుడు; ఉఱక= లక్ష్యపెట్టక; అట్లు= అదే ప్రకారంగా; కౌరవవిభుండున్= దుర్యోధనుడుకూడ; తగన్= తగినట్లుగా; కేళిసల్పున్= యుద్ధక్రీడను చేశాడు.

తాత్పర్యం: ఒక ప్రక్కకు చూపి మరొక ప్రక్కకు వేస్తూ శరీరాన్ని తప్పించి దెబ్బ తప్పగా శీఘ్రంగా వేస్తూ వ్యూహం నుండి తప్పించి త్వరతగ్గకుండా బాధిస్తూ, మత్సరం అతిశయించగా గదాదండాన్ని ఆడిస్తూ భీమసేనుడు అట్లా దూకగా, దుర్యోధనుడు కూడా తగినట్లుగా యుద్ధం చేశాడు.

విశేషం: అలం: స్వభావోక్తి.

వ. మఱియును శిక్షావిశేషంబులు వెలయ నుల్లసిల్లి. 258

ప్రతిపదార్థం: మఱియును= ఇంకను; శిక్షావిశేషంబులు= తమ తమ అభ్యాసాల యొక్క గొప్ప; వెలయన్= ప్రఖ్యాతంకాగా; ఉల్లసిల్లి= విజృంభించి.

తాత్పర్యం: ఇంకా ఇరువురూ తమ తమ విద్యాభ్యాసాలు ప్రకాశించగా విజృంభించి.

మ. గదతోడన్ గద చుట్టి రాఁ దిగుచుచున్ గం డొప్ప లంఘించి మా
ఱు దెసల్ గైకొనుచుం గడంగి పలుమాఱుం దాఁకుచుం బాయుచుం
బదబాహాకటిమధ్యవక్షముల సంభావ్యత్వరాచిత్రితో
న్మదనానాగతరేఖలన్ మెఱయ భీమత్వత్సుతుల్ దీప్తు లై. 259

ప్రతిపదార్థం: గదతోడన్ గద చుట్టిరాన్= గదతో గద తిరిగి రాగా (అనగా త్రిప్పెడు గదతో మరియొకని గదకూడ త్రిప్పుచు); తిగుచుచున్= లాగుతూ; గండు+ఒప్పన్= మగటిమి అతిశయించగా; లంఘించి= దూకి; మాఱుదెసన్ కైకొనుచున్= దిక్కులు మారుస్తూ; కడంగి= ప్రయత్న పూర్వకంగా; పలుమాఱున్= అనేక పర్యాయాలు; తాఁకుచున్ పాయుచున్= తగులుతూ దూరమౌతూ; పద= పాదాలు; బాహా= చేతులను; కటిమధ్య= నడుముభాగాన; వక్షములన్= గుండెలలోను; సంభావ్యత్వరా= కలిగే సంభ్రమంతో; చిత్రిత= బొమ్మవలె; ఉన్మద= దర్పంయొక్క; నానాగత రేఖలన్= అనేక విధాలైన గుర్తులతో; మెఱయ= ప్రకాశించే; భీమ= భీమసేనుడును; త్వత్+సుతుల్= నీ కుమారుడును; దీప్తులై= వెలుగుతూ.

తాత్పర్యం: గదతో గద చుట్టుకొని రాగా లాగుతూ, మగటిమి అతిశయించగా దూకుతూ, ప్రక్కదిక్కులు చూస్తూ, ప్రయత్నంతో అనేక పర్యాయాలు ఒకరిని మరొకరు తాకుతూ, దూరంగా పోతూ, పడగా భుజాలను, నడుము మధ్యభాగాన గుండెపైన వేగిరపాటుతో కూడిన బొమ్మ గీసినట్లు అనేక రకాలైన చేష్టలతో, దర్పంతో మెరిసే భీమసేనుడూ, నీ కుమారుడూ ప్రకాశించినవారై - (తరువాతి పద్యంతో న్వయం.)

విశేషం: అలం: స్వభావోక్తి. ఇక్కడ 'మెఱయు' క్రియకాదు. ధాతుజ విశేషణం.

ఉ. తప్పినయప్పు వ్రేటు దముఁ దాఁకినయప్పు డనేక భంగులై
యొప్పులు బల్పులున్ మెఱయ నుల్లములన్ సకలాంగకంబులం

గప్పఁ దలిర్చు కోపములఁ గ్రమ్మెడు రక్తములన్ సురవ్రజం

బప్పటి కప్డు వింత యగునచ్చెరు వొందఁగఁ బోరి రేపునన్. 260

ప్రతిపదార్థం: తప్పినఅప్డు= తమ గురి తప్పినప్పుడు; వ్రేటు= దెబ్బ; తమున్+తాఁకిన అప్డు= తమను తాకినప్పుడు; అనేక భంగులు+ఐ= నానావిధాలుగా; ఒప్పులు బల్పులున్= ఒప్పుట అధిక్యాలూ; ఉల్లములన్= మనసులలో; మెఱయన్= ప్రకాశించగా; సకల+అంగకంబులన్ కప్పన్= శరీరాలలోని అన్ని భాగాలను క్రమ్ముకోగా; తలిర్చు కోపములన్= కానవచ్చే కోపాలతోను; క్రమ్మెడు రక్తములన్= క్రమ్ముకున్న నెత్తుటితోను; అప్పటికప్పుడు= వెనువెంటనే; సురవ్రజము= దేవతాసమూహం; వింత అగు= వింత అయిన; అచ్చెరువు+ఒందఁగన్= ఆశ్చర్యాన్ని పొందగా; ఏపునన్ పోరిరి= పరాక్రమంతో పోట్లాడినారు.

తాత్పర్యం: తమ గురిపెట్టిన దెబ్బ తప్పినప్పుడు ఆ దెబ్బ తమను తాకినప్పుడు అనేకవిధాలయిన ఒప్పు, బలుపు వికసించగా మనస్సులను, శరీరంలోని భాగాలన్నీ కప్పుకొనగా చిగిర్చిన కోపాలవలన క్రమ్ముకొనే నెత్తుటిని చూచి దేవతా సమూహాలు ఆశ్చర్యంతో అప్పటికప్పుడు వింతగా చూస్తుండగా పౌరుషంతో యుద్ధం చేశారు.

విశేషం: అలం: స్వభావోక్తి.

వ. ఆ సమయంబున. 261

తాత్పర్యం: అప్పుడు.

సీ. వితతవీరాగ్రహావేశాదిదర్పిత । చిత్తులై యొండొరు నొత్తరించు

నుగ్రమహోద్ధతి నుద్భటాటోపతీ । వ్రములగు సమరవిభ్రమము లంగ

సంగతంబులు గాఁగ జయవాంఛనాత్మర । క్షణములవలని నైపుణము లెడలు

టయు, ననర్గళ నిరూఢప్రహారంబులం । దంద బెట్టిరువురయందు సూడు

తే. పడఁగఁ దాఁకిన శోణిత ప్రసరణంబు । నిరతిశయ మైన వెడ సోలి నిలిచి గదలు

వామకరముల నూఁదియు వారు మగుడఁ । బోరి కెలయుట నిర్భరాద్భుతము సేసె. 262

ప్రతిపదార్థం: వితత= విస్తారమైన; వీర= వీరత్వమును; ఆగ్రహ+ఆవేశ= కోపం, ఉద్వేగం; ఆది= మొదలైన దానిచేత; దర్పిత చిత్తులు+ఐ= గర్వంతో కూడిన మనస్సు కలవారై; ఒండొరున్= ఒకరికొకరు; ఒత్తరించున్= అతిశయించును(ఆక్రమించును); ఉగ్రమహా+ఉద్ధతిన్= భయంకరమైన దర్పంతో; ఉద్భట ఆటోప తీవ్రములు+అగు= గర్వముయొక్క ఆర్భాటంచేత తీవ్రములైన; సమరవిభ్రమములు= యుద్ధపు చేష్టలు; అంగసంగతంబులు కాఁగన్= శరీరంతో కూడి ఉండగా; జయవాంఛన్= జయంపై కోరికతో; ఆత్మరక్షణముల వలని= తనసుతాను కాపాడుకొనే; నైపుణములు= నేర్పరితనాలు; ఎడలుటయున్= పోవటమును; అనర్గళ= అడ్డులేని; నిరూఢ ప్రహారంబులు= గట్టిదెబ్బలు; అందంద= అక్కడక్కడ; ఇరువుర అందున్= భీమదుర్యోధను లిద్దరియందును; బెట్టు= మిక్కిలి; సూడుపడఁగన్= గాయమయ్యేటట్లు; తాఁకినన్= తగులగా; శోణిత-ప్రసవణంబు= రక్తస్రావం; నిరతిశయము+ఐనన్= ఎక్కువకాగా; వెడ= ఇంచుక; సోలి= మూర్ఛిల్లి; నిలిచి= ఆగి; గదలు= చేలియందలి గదాయుధాలు; వామకరములన్+ఊఁదియున్= ఎడమచేతులతో నొక్కిపట్టియు; వారు; మగుడన్+పోరికిన్+ఎలయుట= మరల యుద్ధమునకు ప్రయత్నించుట; నిర్భర+అద్భుతము చేసెన్= ఎక్కు వైన ఆశ్చర్యాన్ని కలిగించింది.

తాత్పర్యం: విస్తారమైన వీరత్వంతో కోపావేశాలతో మదించిన మనస్సులతో ఒకరినొకరు తప్పించుకొంటూ భయంకరమయిన గర్వాధిక్యం, ఆర్భాటపు ఆధిక్యం కలిగిన యుద్ధపు వికారాలు శరీరంతో కలసిపోగా జయవాంఛతో తమను కాపాడుకొనే నేర్పరితనం సడలిపోగా సాటిలేని గదలయొక్క దెబ్బలవలన అక్కడక్కడ ఇద్దరి శరీరాలలో గాయాలు తగులగా ఆ గాయాలనుండి కారే నెత్తురు వలన ఇంచుక సొమ్మసిల్లి నిలిచి గదలను ఎడమచేతితో ఊదుకొని కూడా మరల వారు యుద్ధానికి ప్రయత్నించటం మిక్కిలి అద్భుతంగా కానవచ్చింది.

విశేషం: అలం: స్వభావోక్తి.

వ. **ఇట్లు ధైర్యధుర్యోత్సాహంబులం బొదలి.** **263**

తాత్పర్యం: ఈ విధంగా ధైర్యంతోడి ఉత్సాహంతో ఒప్పి.

శా. **రౌద్రోల్లాసము మూర్తి సంకలన ఘోరంబై పొరిం బేర్చె నా**
నుద్రిక్తం బగునూత్నరక్తమున మగ్నోన్మగ్నతం బొల్చి త
ర్జద్రూపోగ్రగదాయుగంబు విసరత్సంధ్యాంబుదద్వంద్వభా
స్వద్రేఖాలలితంబు చెన్నువడసెన్ వారిద్దఱుం బోరఁగన్. **264**

ప్రతిపదార్థం: వారు+ఇద్దఱున్= భీమదుర్యోధను లిరువురూ; పోరఁగన్= యుద్ధం చేస్తూ ఉండగా; రౌద్ర+ఉల్లాసము= కోపముయొక్క ఉత్సాహం; మూర్తి సంకలన ఘోరంబు+ఐ= ఆకారంతో కూడుకొనియుండుటచేత భయంకరమై; పొరిన్ పేర్చెన్+నాన్= మిక్కిలి అతిశయించినదా అన్నట్లు; ఉద్రిక్తంబు+అగు= ఉద్రేకంతో కూడిన; నూత్నరక్తమునన్= క్రొత్తనెత్తుటిలో; మగ్న+ఉన్మగ్నతన్+పొల్చి= మునిగి తేలటంతో ఒప్పి; తర్జత్+రూప= భయపెట్టుచున్న ఆకారంచేత; ఉగ్రగదాయుగంబు= భయంకరమైన గదల జంట; విసరత్= విశేషంగా కదలుతున్న; సంధ్యా+అంబుద= సంధ్యాకాల మేఘాల; ద్వంద్వ= జంటయొక్క; భాస్వత్+రేఖా - లలితంబు= ప్రకాశిస్తున్న విలాసంచేత మనోహరమయినది; చెన్ను+పడసెన్= అందం పొందింది.

తాత్పర్యం: ఆకృతి వహించిన రౌద్రంయొక్క ఉత్సాహం రూపందాల్చటంచే భయంకరంగా యుద్ధంలో విజృంభించినదా? అన్నట్లు వెలికి వచ్చే క్రొత్తనెత్తుటిలో మునిగి తేలటంతో ఒప్పి బెదరించుచున్న తగిన భయంకరమైన గదల జంట సంధ్యాకాలంలో వ్యాపించిన మేఘాల జతయొక్క ప్రకాశించే రేఖలచేత వారిద్దరు పోట్లాడగా అందాన్ని సంతరించుకొన్నది.

విశేషం: ఉత్ప్రేక్ష, ఉపమ.

క. **సుర లచ్చెరువును మెచ్చును । బిరికొనుచిత్తములతోడఁ బెద్దయుఁ బ్రొ ద్ద**
య్యిరువుర గెలుపోటమి తెలిఁ । గరసి నిరూపింపనేరరైరి నరేంద్రా! **265**

ప్రతిపదార్థం: నరేంద్రా!= ఓ రాజా!; సురలు= దేవతలు; అచ్చెరువును= ఆశ్చర్యమూ; మెచ్చును= మెప్పుకోలూ; పిరికొను చిత్తములతోడన్= పెనవేసుకొన్న మనస్సులతో; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; ఆ+ఇరువుర గెలుపు, ఓటమి తెలిఁగు+అరసి= ఆ ఇద్దరి యొక్క జయాపజయాల విధమును గుర్తించి; నిరూపింపనేరరైరి= చెప్పలేకపోయారు.

తాత్పర్యం: ఓ రాజా! దేవతలు ఆశ్చర్యాన్ని, మెప్పును పెనవేసుకొన్న మనస్సులతో చాలాసేపు వారిద్దరి జయాపజయాలను చూచి ఇదమిత్థమని నిర్ణయించలేకపోయారు.

తే. **అప్పు డప్పుడ తలపడినట్టు లప్ప। దేచి విలసిల్లు మేనుల యెఱ్ఱచెలువు**
గలయఁ బూచిన నడ మ్రోదువులఁ దలంపఁ। బట్టుగా నొప్పె నధిప! నీపట్టిదోయి. **266**

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; అప్పుడప్పుడ తలపడినట్టులు= అపుడపుడే ఎదురుకొన్నట్లుగా; అప్పుడు= ఆ సమయాన; ఏచి= విజృంభించి; విలసిల్లుమేనుల= ప్రకాశించే శరీరాలయొక్క; ఎఱ్ఱచెలువు= ఎఱ్ఱని అందం; కలయన్+పూచిన= అంతటా విరబూచిన; నడమ్రోదువులన్+తలంపన్= నడచే మోదుగుచెట్లతోడి పోలికను తలపించటానికి స్థానంగా; పట్టు కాన్; నీ పట్టిదోయి= నీ కుమారద్వయం; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: ఓ రాజా! అపుడపుడే ఎదురయినట్లుగా ఆ సమయంలో విజృంభించి ప్రకాశించే ఒడళ్ళు ఎఱ్ఱగా అందంగా విరబూచిన నడయాడు మోదుగుచెట్లను తలపించేటట్లు ఒప్పాయి. నీ కొడుకులు ఇద్దరూ అట్లా వెలిగారు.

విశేషం: అలం: స్మృతి.

వ. **ఇవ్విధంబున నొండొరులకు వట్రపడక యమ్మేటిమగలు సాటోపసంరంభంబులం బెనంగి; రందు గాంధారీనందనుండు వలపలించి చుట్టుకొని రా నది సరకుసేయక బకవైరి దాపలించి తిరిగినం బెరిఁగిన యీరసంబున నుల్లసితుం డై యాభూవల్లభుం డతనిబరియెముక లగల వ్రేసిన, నవ్వీరుం డక్కొరవపతి కరంబుతో నగ్గద బీఱువోవ వ్రేయం బాయక మగుడం బూన్చి సారించినం దోరంపు మెఱుంగు లెసంగం జెలంగుశబ్దంబులు నింగి ముట్ట బెట్టిదంబుగఁ దా వెరవునం దిరిగి యద్ధరణీశుండు శిరస్తాడనంబు సేసెఁ, జేసినం గౌంతేయుండు గంపింపమి యక్కజం బై యుండె; నంత నగ్గలం బగునలుక నవ్వడముడి పుడమి ఱేనివెడఁద యురం బుపలక్షించి లాఘవఘోరంబుగ గదాదండంబు ద్రిప్పి వైన, నాతం డది మేనినుసులునం దప్పింప నది యిల చలింపం బడిన నన్నుసులు తెఱపిన యురికి యద్భుతవేగుం డగు నావాయుపుత్రుండు గద పుచ్చుకొని తిరుగుసందున దుర్యోధనుండు తదీయ వక్షఃస్థలంబు దారుణప్రహారంబున నొప్పించిన నతండు పాండవపాంచాలుర చిత్తంబులు దూలసోలియు, నాలోనన తెలివొంది బలవిక్రమంబులు మెఱయ నమ్మేదినీపతి పార్శ్వభాగంబు బెట్టడిచిన మ్రోఁకరిలంబడియును వీఁక చెడక యెగసి యజ్జగతీపతి తన్ను నగుచు నార్చుపగతురు సిగ్గువడ నగ్గలికసొంపు పొంపిరివోవఁ బవనతనయుఫాలకర్ణ మధ్యప్రదేశంబు పటుప్రహతిం బగిల్చిన నొల్లంబోయి శీఘ్రంబునం దేరి యమ్మహాబలనందనుండు గండతలంబునం దొరుఁగునెత్తు రనుమదంబున మత్తకరి ననుకరించుచుఁ దుండంబు చందంబునం జెలు వొందుగద యల్లార్చి పేర్చి వ్రేటుగొనిన మెడకెలను దాఁకి నీకొడుకు మహాపవనపతితం బగు సాలంబు పోలికిం గూలినం గని ధర్మ పుత్రప్రముఖులు ప్రమోదంబు నొందిరి; గ్రక్కున లేచి కాలాకారుం డై ధాత్రీనాథుఁడు చిత్రభ్రమణంబుల వెగడుపఱిచి పలువ్రేటుల నొప్పించినం గిమ్మీరవైరి వసుధం ద్రెళ్ళుటయు నది సావుగాఁ గొని**

యక్కురుసింహుండు సింహనాదంబు సేయ నవ్వాయుసుతుండు సావమి యెఱింగి యాభూపతి పెనంగుభంగియుఁ గనుంగొని మెచ్చి సురప్రకరంబులు పుష్పవర్షంబు గురియం బరులకుం భయం బొలసె; నంతం దెలిసి భీమసేనుం డుద్వృత్తలోచనుం డై వీరావష్టంభంబునం బొలిచె; నప్పుడు సాత్యకి ధృష్టద్యుమ్న నకులసహదేవు లే లేమి? యని సుయోధను సంగ్రామంబునకుం బిలిచిన విని యా వృకోదరుండు వారల వల దని వారించి విగతఖేదుం డగుచు నాకేశుండు నముచిం దాఁకిన తెఱంగున రారాజుం దలపడి బహుచిత్రగతులం జరింపం జూచి సవ్యసాచి జనార్దనున కి ట్లనియె. 267

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; ఒండొరులకున్+వశ్రపడక= ఒకరికొకరు వశపడకుండా; ఆ+మేటిమగలు= ఆగొప్పవీరులు; సాటోప సంరంభంబులన్+పెనంగిరి= ఆర్భాటంతో తొందరతో యుద్ధం చేశారు; అందున్+గాంధారీ నందనుండు= వారిలో దుర్యోధనుడు; వలపలించి= కుడివైపు నుండి; చుట్టుకొనిరాన్= తిరిగిరాగా; అది సరకు చేయక= దానిని లెక్కపెట్టకుండా; బకవైరి= భీమసేనుండు; దాపలించి= ఎడమవైపునుండి; తిరిగినన్= తిరిగిరాగా; పెరిఁగిన ఈరసంబునన్= ఎక్కువైన కోపంతో; ఉల్లసితుండు+ఐ= ఉత్సాహిఅయి; ఆ భూవల్లభుండు= ఆ దుర్యోధనుడు; అతని బరిఎముకలు= ఆ భీముడి ప్రక్క ఎముకలు; అగలన్+వ్రేసినన్= విరిగేటట్లు కొట్టగా; ఆ+వీరుండు= ఆ భీముడు; ఆ+కౌరవపతి= ఆ దుర్యోధనుడి; కరంబుతోన్= చేతితో; ఆ+గద బీఱు+పోవన్+వ్రేయన్+పాయక= ఆ గద వ్యర్థమయ్యేటట్లు కొట్టినను, విడువక; మగుడన్+పూన్చి= మరల ప్రయత్నించి; సారించినన్= విసరగా; తోరంపు మెఱుంగులు= దట్టమయిన నిప్పురవ్వలు; ఎసంగన్+చెలంగు శబ్దంబులు= ఎక్కువగా మ్రోసే శబ్దాలు; నింగి ముట్టన్= ఆకాశమంటి తాకగా; బెట్టిదంబుగన్= గట్టిగా; తాన్+వెరవునన్+తిరిగి= తాను ఉపాయంతో మరలి; ఆ+ధరణీశుండు= ఆ దుర్యోధనుడు; శిరస్తాడనంబు+చేసెన్= తలతో కొట్టెను; చేసినన్= చేయగా; కౌంతేయుండు= భీమసేనుడు; కంపింపమి+అక్కజంబు+ఐ+ఉండెన్= భయంతో వణకకుండటం ఆశ్చర్యంగా ఉండినది; అంతన్= ఆ మీద; అగ్గలంబు+అగు+అలుకన్= ఎక్కువైన కోపంతో; ఆ+వడముడి= ఆ భీమసేనుడు; పుడమిఱేని= రాజైన దుర్యోధనుడి; వెడఁదఉరంబు+ఉపలక్షించి= విశాలమైన ఎదురురొమ్మును గురిచూచి; లాఘవ ఘోరంబుగన్= తేలికగా భయమును కలిగిచేటట్లుగా; గదాదండంబు త్రిప్పి వైవన్= గదను గిరగిర త్రిప్పికొట్టగా; ఆతండు= దుర్యోధనుడు; అది= ఆ దెబ్బను; మేనిన్+నుసులునన్+తప్పింపన్= శరీరాన్ని లాఘవంతో తప్పించగా; అది= ఆ గద; ఇల చలింపన్+పడినన్= భూమి కదలగా క్రింద పడగా; ఆ నుసులు తెఱపిన= ఆ లాఘవపు అవకాశంలో; ఉఱికి= దూకి; అద్భుత వేగుండు+అగు= ఆశ్చర్యము కల్గించే త్వర కలవాడైన; ఆ+వాయుపుత్రుండు= ఆ భీముడు; గద పుచ్చుకొని= గదను తీసికొని; తిరుగు సందునన్= తిరిగే వ్యవధిలో; దుర్యోధనుండు తదీయ వక్షస్+స్థలంబున్= దుర్యోధను డా భీముడి గుండెలను; దారుణ ప్రహారంబునన్= భయంకరమైన దెబ్బతో; నొప్పించినన్= బాధించగా; అతండు= ఆ భీముడు; పాండవ పాంచాలుర చిత్తంబులు= పాండవులయు, పాంచాలురయు, మనసులు; తూలన్= తూలిపోగా; సోలియున్= సొమ్మసిల్లినప్పటికినీ; ఆలోనన= అంతలోనే; తెలివి+ఒంది= ప్రజ్ఞ తెలిసి; బలవిక్రమంబులు మెఱయన్= బలమును, శౌర్యమును ప్రకాశించగా; ఆ+మేదినీపతి= ఆ దుర్యోధనుడి; పార్శ్వభాగంబున్= ప్రక్కలను; బెట్టు+అడిచినన్= మిక్కిలిగా కొట్టగా; మ్రోఁకరిలన్+పడియున్= బోరగిల క్రిందబడినను; వీఁక చెడక= పరాక్రమం చెదరకుండా; ఎగసి= మీదకు ఎగిరి; ఆ+జగతీపతి= ఆ రాజు; తన్ను నగుచున్+ఆర్చుపగతురు= తన్ను జూచి పరిహసిస్తూ గర్జనం చేసే శత్రువులు; సిగ్గుపడన్= సిగ్గుతో తలవంచగా; అగ్గలిక సొంపు= దూకుడుపాటి యొక్క సొగసు; పొంపిరి పోవన్= నశించగా; పవనతనయు ఫాల కర్ణ మధ్య ప్రదేశంబు= భీమసేనుడి వెన్నుదురు, చెవులయొక్క నడిమిభాగం; పటు ప్రహతిన్+పగిల్చినన్= పెనుదెబ్బతో పగిలేటట్లు కొట్టగా; ఒల్లన్+పోయి= మూర్ఛిల్లి; శీఘ్రంబునన్+తేఱి= త్వరగా తేరుకొని; ఆ+మహాబలనందనుండు= ఆ వాయుదేవకుమారుడైన భీముడు; గండతలంబునన్+తొరుఁగు నెత్తురు= చెంపలనుండి జాలువారే నెత్తురు; అను మదంబునన్= అనే మదధారతో; మత్తకరి ననుకరించుచున్= మదపుటేనుగును అనుకరిస్తూ; తుండంబు చందంబునన్= తొండంవలె; చెలువొందు= సొగసైన; గదఅల్లార్చి=

గదను ఆడించి; పేర్చి= విజృంభించి; వ్రేటుకొనినన్= దెబ్బవేయగా; మెడకెలనున్ తాఁకి= మెడ ప్రక్క తగిలి; నీకొడుకు= నీ కుమారుడు; మహాపవనపతితంబు+అగు= పెనుగాలికి క్రిందపడిన; సాలంబు పోలికిన్+కూలినన్= మద్దిచెట్టువలె పడిపోగా; కని= చూచి; ధర్మపుత్రప్రముఖులు= ధర్మరాజు మొదలైన వారు; ప్రమోదంబున్+ఒందిరి= సంతోషించారు; గ్రక్కునన్ లేచి= శీఘ్రంగా లేచి; కాల+ఆకారుండు+ఐ= యముడివలె; ధాత్రీనాథుఁడు= దుర్యోధనుడు; చిత్రభ్రమణంబులన్= చిత్రంగా తిరగటం వలన; వెగడుపఱిచి= భయం కలిగించి; పటువ్రేటులన్ నొప్పించినన్= పెక్కు దెబ్బలతో బాధించగా; కిమ్మీరవైరి= కిమ్మీరునకు శత్రువైన భీముడు; వసుధన్+త్రెళ్ళుటయున్= భూమిమీద పడగా; అది చావుగాన్+కొని= అది చావటంగా భావించి; ఆ+కురుసింహుండు= ఆ దుర్యోధనుడు; సింహనాదంబు చేయన్= సింహగర్జనం చేయగా; ఆ+వాయుసుతుండు= ఆ భీముడు; చావమి ఎఱింగి= చనిపోకుండటం తెలిసికొని; ఆ భూపతి= ఆ రాజు; పెనంగు భంగియున్= పెనగులాడేవిధాన్ని; తెలిసికొని= తెలిసికొన్నవారై; మెచ్చి= మెచ్చుకొని; సురప్రకరంబు= దేవతల సమూహాలు; పుష్పవర్షంబు కురియన్= పూలవాన కురిపించగా; పరులకున్ భయంబు+ఒలసెన్= ఇతరులకు భయము కలిగింది; అంతన్+తెలిసి= అంతలో ప్రజ్ఞ వచ్చినవాడై; భీమసేనుండు= భీముడు; ఉద్వృత్తలోచనుండు+ఐ= వెలికి ఉబ్బిన కన్నులు కలవాడై; వీర+అవష్టంభంబునన్+పొలిచెన్= వీరాహంకారంతో వెలిగాడు; అప్పుడు= ఆ సమయంలో; సాత్యకి ధృష్టద్యుమ్న నకుల సహదేవులు= సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, నకులుడు, సహదేవుడును; ఏమి+అని= ఏమిరా అంటూ; సుయోధను సంగ్రామంబునకున్ పిలిచినన్= దుర్యోధనుడిని యుద్ధానికి పిలువగా; విని= విన్నవాడై; ఆ వృకోదరుండు= ఆ భీముడు; వారలన్+వలదు+అని వారించి= వద్దని వారిని అడ్డుకొని; విగత ఖేదుండు+అగుచున్= కష్టంలేనివాడై; నాకేశుండు= ఇంద్రుడు; నముచిన్+తాఁకిన తెఱంగునన్= నముచిఅనే రాక్షసుడిని ఎదుర్కొన్నట్లుగా; రారాజున్+తలపడి= దుర్యోధనుడిని ఎదుర్కొని; బహుచిత్ర గతులన్+చరింపన్= అనేక విధాలుగా తిరుగగా; చూచి= చూచినవాడై; సవ్యసాచి= అర్జునుడు; జనార్దనునకున్+ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఒకరికొకరు తీసిపోకుండా ఆ మొనగాళ్ళు ఈ విధంగా ఆటోపసంరంభాలతో పోట్లాడారు. వారిలో దుర్యోధనుడు కుడివైపునకు చుట్టుకొని రాగా దానిని లెక్కించకుండా భీముడు ఎడమవైపునకు తిరుగగా ఈర్ష్యతో ఉత్సాహం కలవాడై ఆ రాజు వాని ప్రక్క ఎముకలను విరిగేటట్టుకొట్టాడు. అందుకా వీరుడైన భీముడు ఆ దుర్యోధనుడిని ఆ దెబ్బను వృథా చేశాడు. వదలకుండా మరల పూనికతో విసరివేయగా కలిగిన దట్టమైన శబ్దాలు ఆకాశన్నంటాయి. అందు భీముడేమాత్రం జంకలేదు. అది అందరికీ ఆశ్చర్యంగా తోచింది. అంతట ఎక్కువ కోపంతో ఆ భీముడు రాజుయొక్క విశాలమైన వక్షఃస్థలాన్ని గురిగా చేసి భయంకరమైన గదాదండాన్ని త్రిప్పి కొట్టగా అతడు దానిని శరీరాన్ని త్రిప్పటంవలన తప్పించుకొన్నాడు. అది భూమిని గడగడలాడించింది. ఆ స్వల్ప వ్యవధానంలో మిక్కిలి వేగంగా భీముడు గదతో తిరిగే సమయాన దుర్యోధనుడు వాడిగుండెను దారుణ మయిన దెబ్బతో బాధించాడు. అందు కాతడు పాంచాల పాండవుల మనస్సులు తూలిపోగా సోలికూడా, అంతలోనే ప్రజ్ఞ దెలిసి బలపరాక్రమములు వికసించగా నా దుర్యోధనుడి ప్రక్కలలో తీవ్రమైన దెబ్బ కొట్టగా బోర్లపడికూడా ధైర్యం చెడకుండా రారాజు, తనను అపహసించే శత్రువులు సిగ్గుపడగా సొగసు నశించగా, భీమసేనుడి నుదురు చెవి మధ్య భాగాన్ని తీవ్రమైన దెబ్బతో పగులకొట్టగా మూర్ఛిల్లాడు. అయినా వెంటనే తేరికొని ఆ భీముడు చెంపలమీద జాల్వారే నెత్తురనే మదజలంతో కూడిన మదపుటేనుగును అనుకరిస్తూ, తొండంవలె అందంగా ఒప్పారే పెద్ద గదను త్రిప్పుతూ విజృంభించాడు. అది అప్పటికే దెబ్బతిన్న మెడ ప్రక్కభాగాన్ని తాకగా, నీ కొడుకు పెనుగాలికి క్రిందపడిన మద్దిచెట్టువలె కూలిపోయాడు. అది చూచి ధర్మరాజు మొదలైనవారు సంతోషించారు. అపుడు వెంటనే లేచి యముడివలె రారాజు విచిత్ర గతులతో బెదిరించి పెక్కు దెబ్బలతో బాధించగా భీముడు భూమిమీద పడగా,

దానిని చావుగా తలచి ఆ దుర్యోధనుడు సింహనాదం చేశాడు. భీముడు చావకుండా ఉండటం గ్రహించి, దుర్యోధనుడు యుద్ధం చేసిన విధాన్ని చూచి మెచ్చి దేవతా సమూహాలు పూలవాన కురిపించగా శత్రువులకు భయం కలిగింది. అంత ఒళ్ళు తెలిసి భీముడు పైకి సుళ్ళు తిరుగుతున్న చూపులతో వీరత్వం ఉట్టిపడగా ఒప్పారాడు. ఆ సమయంలో సాత్యకి ధృష్టద్యుమ్న నకుల సహదేవులు ఏమి! ఏమి! అని దుర్యోధనుడిని యుద్ధానికి పిలువగా విని భీముడు వారలను వలదని వారిస్తూ దుఃఖంలేనివాడయి, ఇంద్రుడు నముచిని ఎదుర్కొన్న విధంగా రారాజుతో తలపడి వివిధగతులలతో పోరుతూ ఉండగా చూచి అర్జునుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: స్వభావోక్తి, ఉపమ.

శ్రీకృష్ణుఁ డర్జునునితో భీమదుర్యోధనుల తారతమ్యంబు చెప్పుట (సం. 9-57-2)

క. 'భీముని సుయోధనుని సం । గ్రామంబు తెఱంగుఁ జూడఁ గా నెవ్వరి యం
దేమే నధికతఁ దోఁచెడి? । నీమది నున్నట్లు చెప్పు నీరజనాభా!' 268

ప్రతిపదార్థం: నీరజనాభా!= పద్మనాభుడా! (శ్రీకృష్ణా!); భీముని సుయోధనుని= భీముడియొక్క, సుయోధనుడియొక్క; సంగ్రామంబు తెఱంగున్+చూడఁగాన్= యుద్ధగతిని చూడగా; ఎవ్వరి అందున్+ఏమేని+అధికత+తోఁచెడిన్?= ఎవ్వరిలో ఏ గొప్పతనం తోస్తున్నది?; నీమదిన్+ఉన్నట్లు= నీ మనస్సులో ఉన్నవిధంగా; చెప్పు= చెప్పుము.

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! భీమదుర్యోధనుల యుద్ధగతిని చూస్తే ఎవరిలో ఏయే గొప్పతనం కానవస్తున్నదో నీ మనసులో ఉన్నదున్నట్లు చెప్పుము.'

చ. అన విని శౌరి యిట్లనియె నర్జునుతోడ 'గురూపదేశ సం
జనితసమన్వయంబు సదృశంబ తలంపఁగ నిద్దఱందుఁ; బా
వని మెయి లావు పెద్ద; కురువల్లభుఁ డారయఁ గౌశలంబు పెం
పున నధికుండు తత్పరతఁ బూని శ్రమం బధికంబు సేయుటన్. 269

ప్రతిపదార్థం: అనన్ అని= ఆ విధంగా అర్జును డనగా విన్నవాడై; శౌరి ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణు డిట్లా అన్నాడు: అర్జునుతోడన్= అర్జునుడితో; గురూపదేశ సంజనిత సమన్వయంబు= గురువు నేర్పటంవలన కలిగిన సమన్వయశక్తి; తలంపఁగన్= యోచించిచూడగా; ఇద్దరు+అందున్= ఇరువురిలో; సదృశంబు+అ= సమానమే; పావని మెయిలావు పెద్ద= భీమసేనుని శరీరబలం గొప్పది; ఆరయన్= చూడగా; కురువల్లభుఁడు= దుర్యోధనుడు; తత్పరతన్= పట్టుదలతో; పూని= ప్రయత్నంతో; శ్రమంబు= గదాయుధానికి చెందిన విద్యాపరిశ్రమం; అధికంబు+చేయుటన్= ఎక్కువగా చేసినందున; కౌశలంబు పెంపునన్= నేర్పరితనంలోని ఆధిక్యంచేత; అధికుండు= మిన్న.

తాత్పర్యం: అర్జునుడి ప్రశ్నకు శ్రీకృష్ణు డీవిధంగా బదులు చెప్పాడు: 'గురూపదేశం ఇరువురికీ సమానమే. యోచనచేయగా ఇరువురిలో భీముడికి బలంగల శరీర మున్నది. పరిశ్రమ, పట్టుదల కారణంగా దుర్యోధనుడు నేర్పరితనంలో భీముడికంటె అధికుడు.

ఆ. లావు గలిగి మొక్కలమ్మునఁ గీచకా। రాతి సొచ్చి ధార్తరాష్ట్రు వెరవు
వలన నొచ్చుచున్నవాఁడు గావున ధర్మ। సంగరమున నరిది జయము గొనుట. 270

ప్రతిపదార్థం: లావుకలిగి= బలం కలిగి; మొక్కలమ్మునన్= మొరకుగా (మూర్ఖంగా); కీచక+అరాతి= భీముడు; చొచ్చి= దూరి; ధార్తరాష్ట్రు వెరవువలనన్= దుర్యోధనుడి నేర్పరితనంవలన; నొచ్చుచున్నవాఁడు= బాధపడుతున్నాడు; కావునన్= అందువలన; ధర్మసంగరమునన్= ధర్మయుద్ధంలో; జయమున్+కొనుట= (భీముడు)జయంపొందటం; అరిది= అరుదు.

తాత్పర్యం: శారీరకమైన బలమున్నది కనుక భీముడు మూర్ఖపు పట్టుతో దూరి, నేర్పూ ఉపాయమూ కల దుర్యోధనుడి దెబ్బకు నొచ్చుకొంటున్నాడు. కాబట్టి ధర్మయుద్ధంలో అతడు జయం పొందటం అరుదు.

వ. అన్యాయంబునం జంపువాఁ డింతియ మాయలు గల పగఱ మాయాప్రకారంబులం బరిమార్చుటయ తగు; నింద్రునివృత్ర వధ వ్యాపారంబు వినమె? జూదంబునప్పు డనిలసుతుండు సుయోధనుతొడలు విఱుగ నడుచువాఁడ నని ప్రతిన వట్టినవాఁ; డది యట్లుండె; గదా యుద్ధంబు నాభికి దిగువ యైన శరీరభాగంబు నొప్పించుట ధర్మంబుగా దది యొండుమైఁ గండడఁచి మఱి పరిభవరూపంబుగ నూరుభంగంబు సేసి ప్రతిజ్ఞ నెఱపువాఁ; డిది తలంపునం బెట్టక పెనంగె నేని ధర్మనందనునకు దైన్యంబు దెచ్చు; నట్లగుటఁ బూనికి పేర నూరులు భంజించి వధియించుట తప్ప నొం డుపాయంబు లేదు; ధర్మనందనునివలన మనకు భయం బావహిల్లె; నెట్లనిన భీష్మద్రోణప్రముఖబలవదరాతులం బొలియించుటం జేసి జయంబును యశంబునుం జేకుఱి యున్న యెడ నవి సందిగ్ధంబు లైనయట్లు గా నొకని జయించి సామ్రాజ్యంబు గొనుమని దుర్యోధనుతోడం బలికి, యతనితోడం గదాసమరంబునకు భీమసేనుం జొనిపె; నింత నిర్బుద్ధి యగునె? హతబంధుమిత్ర పరివారుండై రాజ్యంబునం దాస విడిచి మడువు సొచ్చినవాని వెదకి వెలార్చి యెక్కటికయ్యంబునకుఁ బిలుతురే? పదుమూఁడు వత్సరంబులు మత్సరాధికుం డగునగ్గాంధారేయుండు భీము జయించుటకయి గదాపరిశ్రమం బాచరించె; నూర్ధ్వతిర్యగ్గతి సముల్లాసంబున మెఱయు చున్నవాఁ; డీభీమునకుం బెద్దకాలం బేని శ్రమంబు లే దిమ్మహాభాగుండు ధర్మంబు దొఱంగియైన నిక్కులపాంసనునిం బిలుకుమార్పకున్న నింక నించుక సేపునకుఁ దాన తెగుఁ; దెగిన, మీకు నెల్ల నిప్పాపాత్ముండు రా జగుట కోర్వవచ్చునే?' యనుటయు. 271

ప్రతిపదార్థం: అన్యాయంబునన్+చంపువాఁడు= మోసంతో చంపేవాడు; ఇంతియ మాయలు కల పగఱన్= ఇంతే మోసాలున్న వైరులను; మాయాప్రకారంబులన్= మోసపు పద్ధతుల్లోనే; పరిమార్చుటయ తగున్= చంపుటే తగును; ఇంద్రుని వృత్రవధ వ్యాపారంబు వినమె?= ఇంద్రుడు వృత్రాసురుడిని చంపిన పద్ధతి వినలేదా?; జూదంబు+అప్పుడు+అనిలసుతుండు= జూదమాడిన సమయాన భీముడు; సుయోధను తొడలు విఱుగన్+అడుచువాఁడను+అని= దుర్యోధనుడి తొడలు విరుగగొట్టువాడనని; ప్రతిన పట్టినవాఁడు= శపథం చేశాడు; అది అట్లుండెన్= దానిని ఆవిధంగా ఉండనిమ్ము; గదాయుద్ధంబు, నాభికిన్, దిగువఐన= గదాయుద్ధం బొడ్డుకు క్రిందనున్న; శరీర భాగంబు నొప్పించుట; అది; దానిని; ధర్మంబు+కాదు= ఒడలి భాగాన్ని కొట్టటం న్యాయం కాదు; ఒండుమైన్= వేరొకమార్గాన; గండు+అడఁచి= పొగరు నశింపచేసి; మఱి పరిభవరూపంబుగాన్ ఊరుభంగంబు+చేసి= అవమాన సూచకంగా తొడలు విరిచి; ప్రతిజ్ఞ నెఱపువాఁడు= మాటను నిలుపుకొనగలడు; ఇది తలంపునన్ పెట్టక= ఇది మనసులో జ్ఞాపకం పెట్టుకొనకుండా; పెనంగెనేనిన్= యుద్ధం చేస్తే; ధర్మనందనునకున్+దైన్యంబు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తెచ్చున్= ధర్మరాజునకు దుఃఖం తెస్తాడు; అట్లు+అగుటన్= అందుచేత; పూనిక పేరన్= ప్రతిజ్ఞఅనే మిషతో; ఊరులు భంజించి= తొడలు విరిచి; వధియించుట తప్పన్= చంపటం తప్ప; ఒండు+ఉపాయంబు లేదు= వేరే మార్గంలేదు; ధర్మనందనుని వలనన్= ధర్మజుడి మూలాన; మనకున్; భయంబు+ఆవహిల్లెన్= భయం ఏర్పడింది; ఎట్లు+అనినన్= ఏ విధంగానంటే; భీష్మద్రోణ ప్రముఖ= భీష్ముడు, ద్రోణుడు, మొదలైన; బలవత్+అరాతులన్+పొలియించుటన్+చేసి= బలం కల వైరులను చంపటంవలన; జయంబును, యశంబును= విజయాన్నీ, కీర్తినీ; చేకుఱి+ఉన్న ఎడన్= పొందిన సమయంలో; అవి సందిగ్ధంబులు+ఐన అట్లుగాన్= అవి అనుమానింపదగిన విధంగా; ఒకనిన్ జయించి= ఒక్కడిని గెలిచి; సామ్రాజ్యంబు కొనుము+అని= రాజ్యాన్ని పొందుమని; దుర్యోధనుతోడన్+పలికి= దుర్యోధనుడితో మాట్లాడి; అతడితోడన్ గదాసమరంబునకున్= వాడితో గదాయుద్ధానికి; భీమసేనున్+పొనిపెన్= భీముడిని పంపాడు; ఇంత నిర్బుద్ధి+అగునె?= ఇంతబుద్ధి లేనివాడౌతాడా?; హతబంధుమిత్రు పరివారుండు+ఐ= చనిపోయిన బంధుగులు, స్నేహితులు సేవకులు కలిగినవాడై; రాజ్యంబు+ఆస+విడిచి= రాజ్యాపేక్ష లేకుండా; మడువు+చొచ్చినవానిన్= నీటిమడుగులో దాగినవాడిని; వెదకి వెలార్చి= వెదకి బయటకు లాగి; ఎక్కటికయ్యంబునకున్+పిలుతురే?= ఒకరితో ఒక్కరే చేసే యుద్ధానికి పిలుస్తారా?; పదుమూఁడు వత్సరంబులు= పదమూడేండ్లు; మత్సర+అధికుండు+అగు= అసూయాగ్రస్తుడయిన; ఆ+గాంధారేయుండు= ఆ గాంధారీనందనుడు; భీమున్+జయించుటకయి= భీమసేనుడిని జయించటం కొరకు; గదాపరిశ్రమంబు+ఆచరించెన్= గదాపరిశ్రమ చేశాడు; ఊర్ధ్వ తిర్యగ్గతి సముల్లాసంబునన్= పైకి, అడ్డంగాను వెళ్ళే ఉత్సాహంతో; మెఱయుచున్నవాఁడు= ప్రకాశిస్తున్నాడు; ఈ భీమునకున్ పెద్దకాలంబేని= ఈ భీముడికి చాలకాలంగా; శ్రమంబు లేదు= గదాపరిశ్రమ లేదు; ఈ+మహాభాగుండు= ఈ పుణ్యాత్ముడు; ధర్మంబు+తొఱంగి= ధర్మాన్ని వదలి; ఐనన్= అయినప్పటికినీ; ఈ+కులపాంసనునిన్= ఈ వంశనాశకుడిని; పిలుకుమార్పకున్నన్= చంపకుంటే; ఇంక ఇంచుకసేపునకున్= ఇంక కొంతసేపటికి; తాను+అ+తెగున్= తానే చనిపోతాడు; తెగినన్= చావగా; మీకున్= మీ అందరికీ; ఈ+పాప+ఆత్ముండు= ఈ పాపి; రాజు+అగుటకున్= రాజు కావటానికి; ఓర్వన్ వచ్చునే?= సహించవచ్చునా?; అనుటయున్= అనగానే.

తాత్పర్యం: మోసంతో చంపేవాడు అంతే మోసమున్న వైరులను మోసపువిధానంతోనే చంపటం తగి ఉంటుంది. ఇంద్రుడు వృత్రుడిని చంపిన పద్ధతి వినలేదా? జూద మాడినప్పుడు వాయునందనుడు దుర్యోధనుడి తొడలు విరుగగొట్టువాడ నని శపథం చేశాడు. దానిని అట్లా ఉండనిమ్ము. గదాయుద్ధంలో బొడ్డుకు క్రిందిభాగంలో నొప్పించటం ధర్మం కాదు. కాబట్టి వేరొక మార్గాన్ని అవలంబించాలి. అవమానం చేసినట్లుగా తొడలను విరిచి, ప్రతిజ్ఞను నెరవేర్చుకొనవచ్చును. దీనిని మనసులో పెట్టుకొనకుండా యుద్ధం చేస్తే ధర్మరాజునకు దుఃఖం తెచ్చిపెట్టినట్లువుతుంది. అందువలన ప్రతిజ్ఞ పేరుతో తొడలు విరిచి చంపటంతప్ప వేరే ఉపాయం లేదు. ధర్మరాజు మూలాన మనకు భయం కల్గుతూ ఉన్నది. ఏమంటే భీష్మద్రోణాది శత్రువులను చంపించటంవలన జయాన్ని, కీర్తినీ పొందికూడా, అవి రెండూ సందేహాస్పదాలు అయ్యేట్లుగా ఒక్కడిని జయించి సామ్రాజ్యాన్నంతనూ తీసికొమ్మని దుర్యోధనుడితో చెప్పి వాడితో గదాయుద్ధం చేయటానికి భీమసేనుడిని నియమించాడు. ఇంత బుద్ధిహీను డయ్యాడా? బంధుమిత్రులందరూ నశించగా రాజ్యంమీది ఆస వదలి మడుగులో దూరిన వాడిని వెదకి వెలికిలాగి ద్వంద్వ యుద్ధానికి పిలువదగనా? పదుమూడు సంవత్సరాలు అసూయతో నిండిన ఆ దుర్యోధనుడు భీముడిని జయించటం కొరకే గదాపరిశ్రమ చేశాడు. పైకి, అడ్డంగానూ తిరుగుతూ సంతోషంతో ప్రకాశిస్తున్నాడు. ఈ భీముడికి చాలాకాలంనుండి గదా పరిశ్రమ లేదు. ఈ ధర్మాత్ముడు ధర్మమును అతిక్రమించి అయినా ఈ కులనాశకుడిని చంపకపోతే ఇంకొంత సేపటికి తానే హతుడౌతాడు. ఇతడు చనిపోతే ఈ పాపి మీకు రాజు అయ్యే దురవస్థను ఓర్వవచ్చునా? మీ కిది ఇష్టమా?' - అనగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. విని క్రీడి యపుడు మారుత । తనయుఁడు దనుఁ జూడ నూరుతలము కరతలం
బున నప్పళించె; నతఁడును । గనికొనియెను సన్న యగుటఁ గౌరవముఖ్యా! 272

ప్రతిపదార్థం: కౌరవముఖ్యా!= కురుశ్రేష్ఠుడా!; క్రీడి= అర్జునుడు; విని; అపుడు= ఆ సమయాన; మారుతతనయుఁడు= భీమసేనుడు; తనున్+చూడన్= తనవైపు చూడగా; ఊరుతలము= తొడలపైభాగం; కరతలంబునన్+అప్పళించెన్= చేతితో చరిచాడు; అతఁడును= ఆ భీముడు; కని= చూచి; సన్న= సైగ; అగుటన్= కావటంచేత; కొనియెను= గ్రహించాడు.

తాత్పర్యం: కౌరవశ్రేష్ఠా! ఆ సమయంలో భీముడు తనవైపు చూసినపుడు అర్జునుడు తొడలు చేతితో చరిచాడు. ఆ సైగను భీముడు చూచి గ్రహించాడు.

వ. కనికొని 'యధర్మం బైన నూరుభంగంబు సేయు మని కృష్ణానుమతి జిష్ణుండు పనిచె; నాకు నొండుమెయి నెట్లునుం బగతు పాటు లేక తక్కెనే నవ్విధం బాచరింతుఁ గాక! యని మనంబున నిశ్చయించి, వివిధగతులఁ జరియింపం గురుపతియు బాహుచిత్ర ప్రచారంబుల నుల్లసిల్లఁ దత్సంగ్రామం బామిషార్థిగరుడ ద్వయసమరంబు చందంబున దర్శనీయం బై యుండె; నట్టియెడ. 273

ప్రతిపదార్థం: కనుకొని= చూచి గుర్తించి(సైగను గుర్తించి); అధర్మంబు+ఐనన్= అన్యాయమైనా; ఊరుభంగంబు+చేయుము+అని= తొడలు విరుగగొట్టుమని; కృష్ణ+అనుమతిన్= కృష్ణుడి ఆమోదంతో; జిష్ణుండు= అర్జునుడు; పనిచెన్= ఆజ్ఞాపించాడు; నాకున్ ఒండుమెయిన్= నాకు ఇంకొక్క విధంగా; ఎట్లునున్= ఏ విధంగానూ; పగతుపాటు లేక తక్కెనేని= శత్రువు పడటం జరగకపోతే; ఆ+విధంబు= ఆ పద్ధతినే; ఆచరింతున్+కాక!= అనుసరిస్తాను గాక!; అని మనంబునన్ నిశ్చయించి= అని మనసులో నిర్ణయించుకొని; వివిధ గతులన్= అనేక పద్ధతులలో; చరియింపన్= తిరుగగా; కురుపతియున్= దుర్యోధనుడును; బాహుచిత్రప్రచారంబులన్= చేతుల వింత తిరుగుళ్ళతో; ఉల్లసిల్లన్= ఉత్సహించగా; తద్+సంగ్రామంబు= ఆ యుద్ధం; ఆమిష+అర్థి= మాంసానికై ఆసపడే; గరుడద్వయ సమరంబు చందంబునన్= రెండు గరుత్మంతుల యుద్ధంవలె; దర్శనీయంబు+ఐ ఉండెన్= చూడదగి ఉండింది; అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: చూచి గుర్తించి, 'అన్యాయమైనా తొడలు విరుగగొట్టుమన్న శ్రీకృష్ణుడి అనుమతిని అర్జునుడు తెలుపగా నాకు వేరొక దారిలో శత్రువును పడగొట్టే వీలుకాకుంటే ఆ పద్ధతినే అనుసరిస్తాను.' అని భీముడు మనసులో నిశ్చయించుకొని అనేక విధాలుగా తిరుగుతుండగా దుర్యోధనుడును చేతుల చిత్రగతులలో తిరుగుతున్నాడు ఆ యుద్ధం చూచేవారికి ఇరువురు గరుత్మంతులు మాంసంకొరకు సాగించే పోరాటంవలె అబ్బురంగా తోచింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

ఆ. పాండురాజసుతుఁడు పటుతరోల్లాసి యై । వైచుటయును ధరణివల్లభుండు
తొలఁగ దాఁటె రయము దలకొని గదఁ బుచ్చి । కొనియె నాబకాంతకుండు నుఱికి. 274

ప్రతిపదార్థం: పాండురాజ సుతుఁడు= పాండురాజ కుమారుడైన భీమసేనుడు; పటుతర= దృఢమైన; ఉల్లాసి+ఐ= ఉత్సాహిగా; వైచుటయును= వేయగా; ధరణివల్లభుండు= రాజయిన దుర్యోధనుడు; తొలఁగదాఁటెన్= తప్పించుకొన్నాడు; ఆ బకాంతకుండు= బకాసురుడిని చంపినవాడైన ఆ భీముడు; ఉఱికి= దూకి; రయము తలకొని= వేగం పుంజుకొని; గదన్+పుచ్చికొనియెన్= గదను తీసికొన్నాడు.

తాత్పర్యం: పాండురాజకుమారుడైన భీముడు ఉత్సాహంతో గట్టిగా దెబ్బ వేయగా దుర్యోధనుడు తప్పించుకొన్నాడు. ఆ బకాంతకుడు దూకి వేగంగా గదను తీసికొన్నాడు.

దుర్యోధనుఁడు భీముగదాదండమునఁ దొడలు విఱిగి పడుట (సం. 9-57-45)

క. ఆలోనం గురుధరణీ। పాలుఁ డడరి వ్రేయుటయును బవనసుతునిమై
సోలె; నది గానఁ డాపతి। కేలీవిభ్రమము దోఁపఁ గ్రేళ్ళుఱికె నృపా! 275

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; ఆలోనన్= అంతలోనే; కురుధరణీపాలుఁడు= కురురాజు దుర్యోధనుడు; అడరి వ్రేయుటయును= విజృంభించి కొట్టగా; పవనసుతునిమై= భీముడి ఒడలు; సోలెన్= సొమ్మసిల్లింది; ఆ పతి= ఆ రాజు; అది కానఁడు= దానిని చూడలేదు; కేళీ విభ్రమము తోఁపన్= యుద్ధక్రీడ యొక్క వికాసం తెలియగా; క్రేళ్ళు ఉఱికెన్= ఎగిరి దూకాడు.

తాత్పర్యం: దుర్యోధను డంతలోనే వేగంగా కొట్టగా భీముడి ఒడలు సొమ్మసిల్లింది. రాజు దానిని గమనించలేదు. యుద్ధక్రీడా విలాసంతో ఎగిరి దూకాడు.

చ. ఉఱికినఁ దేఱి పై కుఱికి యుగ్రత భీముఁడు వ్రేయ నవ్విభుం
డుఱక మహాద్భుతస్ఫురణ నూర్ధ్వ పరిభ్రమణంబు సేసినం
దెఱపి యతండు గాంచి సముదీర్ణరయంబున వైచెఁ బెన్దొడల్
విఱిగి నగాగ్ర ముద్భటపవిప్రహతిం బడుచాడ్పునం బడన్. 276

ప్రతిపదార్థం: ఉఱికినన్= దూకగా; ఉగ్రతన్= భయంకరంగా; భీముఁడు= భీమసేనుడు; తేఱి= తేరికొని; పైకిన్+ఉఱికి= పైకిదూకి; వ్రేయన్= కొట్టగా; ఆ+విభుండు= ఆదుర్యోధనుడు; ఉఱక= లెక్కచేయక; మహా+అద్భుతస్ఫురణన్= మిగుల ఆశ్చర్యాన్ని కలిగిస్తూ; ఊర్ధ్వపరిభ్రమణంబుచేసినన్= పైన దిరుగగా; తెఱపి+అతండు+కాంచి= ఆ భీముడు సందు చూచి; నగ+అగ్రము= కొండకమ్ము; ఉద్భట= భయంకరమైన; పవి= వజ్రముయొక్క; ప్రహతిన్= దెబ్బకు; పడు చాడ్పునన్= పడునట్లుగా; పెన్+తొడల్= పెద్దవయిన తొడలు; విఱిగి పడన్= విరిగి క్రింద పడేటట్లుగా; సముదీర్ణరయంబునన్= మిక్కిలి వేగంతో; వైచెన్= కొట్టాడు.

తాత్పర్యం: (దుర్యోధనుడు) దూకగా భీమసేనుడు (మూర్ఛనుండి) తేరికొని మీదికి దూకి భయంకరంగా కొట్టగా ఆ దుర్యోధనుడు లెక్కచేయకుండా మిగులఅబ్బురాన్ని కలిగిస్తూ పై ఎగిరి తిరుగుతూ ఉండగా భీముడు సందు చూచి భయంకరమైన వజ్రపుదెబ్బతో విరిగిపడే కొండ కొన కొమ్ము మాదిరిగా పెద్దవైన తొడలు విరిగి కూలేట్లుగా మిక్కిలి వేగంగా కొట్టాడు.

విశేషం: అలం: స్వభావోక్తి, ఉపమ.

వ. అప్పుడు మహోల్కాపాతంబులును బాంసుమాంస రక్త వర్షంబులును వికృతంబు లగు కరితురగబృంహిత హేషాఘోషంబులును మఱియు ననేకోత్పాతంబులును గలిగిన నట్లు కౌరవపతి వడుటకు నుబ్బునం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బొదలిన పాంచాలురుం బాండవులు నుద్విగ్నచిత్తులైరి; వియత్తలం బంతయు నొక్కమ్రోఁతగా నగ్గదాయుద్ధ విశేషంబు లగ్గించుచు సురగరుడఖచరాదులు నిజస్థానంబులకుం జని; రిట్లు తనగదతాఁకునఁ దొడలు విఱిగి సింగంబుచేతం గూలిన గంధశుండాలంబు చందంబునం బడియున్న నీ కొడుకుం జేరం జని భీమసేనుండు. 277

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; మహా+ఉల్కా+పాతంబులును= పెద్దతోక చుక్కలు కింద రాలటం; పాంసుమాంస రక్త వర్షంబులును= దుమ్ము, మాంసం, రక్తం - వీటి వర్షాలు; వికృతంబులు+అగు= వికారమైన; కరితురగ= ఏనుగులయొక్క, గుర్రాలయొక్క; బృంహిత= ఘీంకారాల; హేషా= సకిలింతల; ఘోషంబులును= శబ్దాలు; మఱియున్= ఇంకను; అనేక ఉత్పాతంబులును= ఎన్నో ప్రళయ చిహ్నాలును; కలిగినన్= కలుగగా; అట్లు= ఆ ప్రకారంగా; కౌరవపతిపడుటకున్= దుర్యోధనుడు క్రింద కూలటానికి; ఉబ్బునన్= సంతసంతో; పొదలిన= ఒప్పిన; పాంచాలురున్= పాంచాలురూ; పాండవులును; ఉద్విగ్నచిత్తులైరి= ఉద్వేగంతోడి మనస్సులు గలవారైరి; వియత్+తలంబు+అంతయున్= ఆకాశమంతా; ఒక్కమ్రోఁతగాన్= ఒకే శబ్దంగా; ఆ+గదాయుద్ధ విశేషంబులు= ఆ గదాయుద్ధం యొక్క విశేషాలను; అగ్గించుచున్= పొగడుతూ; సురగరుడ ఖచరాదులు= దేవతలు గరుడులు గగనచరులు మొదలైనవారు; నిజస్థానంబులకున్+చనిరి= తమ తమ చోట్లకు వెళ్ళారు; ఇట్లు= ఈ ప్రకారంగా; తన గదతాఁకునన్= తన గద దెబ్బచేత; తొడలు విఱిగి= ఊరుభంగమై; సింగంబు చేతన్ కూలిన= సింహముచేత క్రిందపడ్డ; గంధశుండాలంబు= మదపుటేనుగు; చందంబునన్= వలె; పడి ఉన్న= క్రిందపడి ఉన్న; నీ కొడుకున్+చేరన్+చని= నీ కొడుకు దగ్గరకు చేరి; భీమసేనుండు= భీముడు.

తాత్పర్యం: ఆ సమయంలో పెద్ద తోకచుక్కలు నేలకు రాలాయి. దుమ్ము, మాంసఖండాలు నెత్తురు వానలుగా కురిశాయి. ఏనుగుల, గుర్రాల ఘీంకారాలు, సకిలింతల శబ్దాలే కాక అనేకములైన దుశ్శకునాలు కలిగాయి. ఆ విధంగా దుర్యోధనుడు పడినందులకు సంతోషం పొందిన పాంచాలురు, పాండవులు ఉద్విగ్నమనస్కులైనారు. ఆకాశంలో తిరుగులాడే దేవతలు, గరుడులు మొదలైనవారు ఆ గదాయుద్ధాన్ని కీర్తిస్తూ తమ తమ చోట్లకు వెళ్ళారు. ఈ విధంగా గదదెబ్బతో తొడలు విరిగి సింహంచేత కూల్చబడిన మదపుటేనుగువలె పడి ఉన్న నీ కుమారుడిని చేరి భీమసేనుడు.

విశేషం: అలం: ఉపమ.

తే. 'ఏకవస్త్రఁ బాంచాలి నట్లీడ్చి తేరఁ । బనిచి సభలోనఁ బఱిచిన పాపఫలము
ననుభవింపుము దుష్టాత్మ!' యనుచు వామచరణమున బెట్టిదము గాఁగ శిరము దన్నె. 278

ప్రతిపదార్థం: దుష్టాత్మ!= నీచమైన మనస్సు కలవాడా!; ఏకవస్త్రన్= ఒకే కట్టుగుడ్డ కల(ముట్టైన)దానిని; పాంచాలిన్= ద్రౌపదిని; అట్లు= ఆ విధంగా(కొప్పు పట్టి లాగి); ఈడ్చి తేరన్+పనిచి= లాగికొని తీసికొనిరావటానికి ఉత్తరువు చేసి; సభలోనన్= సభలో; పఱిచిన= అవమానం చేసిన; పాపఫలమున్= పాపముయొక్క ఫలితాన్ని; అనుభవింపుము= పొందుము; అనుచున్= అని అంటూ; వామచరణమునన్= ఎడమకాలితో; శిరమున్= తలను; బెట్టిదముకాఁగన్ తన్నెన్= గట్టిగా తన్నాడు.

తాత్పర్యం: 'నీచాత్ముడా! ఏకవస్త్ర(ముట్టైన) అయిన ద్రౌపదిని ఆ విధంగా లాగి తీసికొని వచ్చి, సభలో అవమానం చేసిన పాపానికి తగిన ఫలం అనుభవించుము' అంటూ తన ఎడమ పాదంతో అతడి తలను (భీముడు) గట్టిగా తన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. తన్ని యలుక మలుగక యతని యాననం బాలోకించి. 279

ప్రతిపదార్థం: తన్ని; అలుక మలుగక= కోపం తగ్గక; అతని ఆననంబు= ఆ దుర్యోధనుడి ముఖం; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: తన్ని ఇంకా కోపం తగ్గక, ఆ దుర్యోధనుడి ముఖంవైపు చూచి.

క. 'పసు లని యార్చుచు మము ను । ల్లస మాడిన ధర్మహీనులను నృపధర్మం
బెసఁగఁగ నే మిదె యిప్పుడు । పసు లని యార్చెదము మగుడ బంధుద్రోహీ! 280

ప్రతిపదార్థం: బంధుద్రోహీ!= బంధువులకు ద్రోహం తలపెట్టేవాడా!; పసులు+అని= పశువులారా! అని; ఆర్చుచున్= అరుస్తూ; మమున్= మమ్మ; ఉల్లసము+ఆడిన= ఎగతాళి చేసిన; ధర్మహీనులను= ధర్మం లేనివారిని; నృపధర్మంబు+ ఎసఁగఁగన్= రాజధర్మం అతిశయించగా; ఏము= మేము; ఇదె= ఇప్పుడే; మగుడన్= మరలా; పసులని ఆర్చెదము= పశువులని పిలుస్తాము.

తాత్పర్యం: 'ఓ బంధుద్రోహీ! పశువులని అరుస్తూ మమ్మ పరిహసించిన నీతిమాలినవారిని రాజధర్మం అతిశయించగా- ఇదిగో! ఇప్పుడు మేము మరల 'పశువులారా!' అని మిమ్ములను పిలుస్తూ అరుస్తాము.

క. విను మేను కల్లసారెలు । గొని కపటపు నెత్త మాడుకుశలతఁ గా దొ
ప్పనివారు నేపడంచుట । ఘనబాహు స్వైరకేళిఁ గాని దురాత్మా!' 281

ప్రతిపదార్థం: దురాత్మా!= దుర్మార్గుడా!; వినుము= నా మాట వినుము; ఏను= నేను; కల్లసారెలు+కొని= మోసపు పాచికలను తీసికొని; కపటపు= మోసపు; నెత్తము= జూదము; ఆడు ఆడునటువంటి; కుశలతన్+కాదు= నేర్పుతో కాదు; ఒప్పనివారు= ఇష్టంలేని వారిని(శత్రువులను); ఘనబాహు స్వైరకేళిన్= గొప్ప భుజబలంతో కూడిన యుద్ధక్రీడతో; ఏపు+అడంచుట+కాని= గర్వాన్ని అణచటమే (కాని).

తాత్పర్యం: ఓ దుష్టుడా! వినుము. ఇది గొప్పదైన బాహుక్రీడతో శత్రువుల గర్వాన్ని అణచటమేగాని, మోసపుసారెలతో కపటపు జూదంలోని నేర్పరితనంతో కాదు.'

వ. అని పలికి పెలుచ నవ్వి ధర్మనందనగోవిందపాంచాలప్రకరపార్థసాత్యకినకులసహదేవుల నాలోకించి. 282

ప్రతిపదార్థం: అని పలికి= అని మాటాడి; పెలుచన్ నవ్వి= పెద్దగా నవ్వి; ధర్మనందన= ధర్మరాజును; గోవింద= శ్రీకృష్ణుడిని; పాంచాల ప్రకర= పాంచాలుర సమూహమును; పార్థ= అర్జునుడిని; సాత్యకి= సాత్యకిని; నకుల సహదేవులను= నకులుడిని, సహదేవుడిని (వీరందరిని); ఆలోకించి= కలియచూచి.

తాత్పర్యం: ఆ విధంగా మాటాడి పెద్దగా నవ్వి ధర్మజ, శ్రీకృష్ణ, పాంచాలురను, అర్జున, సాత్యకి, నకుల సహదేవులను చూచి.

ఆ. 'శంక లేక కడఁగి సభ కట్లు పాంచాలి । నంటరానిదాని నొంటిచీర
తోన యున్న సాధ్వి వేనలి వట్టి యీ । డ్వించినతనిఁ జూడుఁ డంచుఁ బొదలి. 283

ప్రతిపదార్థం: శంక లేక= అనుమానం లేకుండా; కడఁగి= పూనుకొని; సభకున్= రాజసభకు; అట్లు= ఆ విధంగా; పాంచాలిన్= ద్రౌపదిన్; అంటరానిదానిన్= తాకరాని దానిని; ఒంటిచీరతోన్+అ ఉన్న= ఏకవస్త్ర అయి ఉన్న; సాధ్విన్= పతివ్రతను; వేనలి+పట్టి+ఈడ్పించిన= కొప్పు పట్టి లాగించిన; అతనిన్= అతడిని; చూడుఁడు= చూడండి; అంచున్= అంటూ; పొదలి= ఒప్పి.

తాత్పర్యం: 'సందేహించకుండా సభలోకి కావాలనే ఆ విధంగా ద్రౌపదిని తాకరాని దానిని, ఏకవస్త్రను, పతివ్రతను కొప్పుబట్టి లాగించిన వాడిని చూడండి' అని ఉప్పొంగి.

వ. 'పాంచాలి సేసినతపంబు పెంపున నీశోభనంబు సమకూఱె' ననిన విని వారు ప్రమోదంబు నొంద మిక్కిలి సంతసంబునం దేలి యక్కురుఘస్మరుండు నర్తించుచెన్ను దోఁపఁ జెలంగి. 284

ప్రతిపదార్థం: పాంచాలి= ద్రౌపది; చేసిన తపంబు పెంపునన్= కావించిన తపసు యొక్క గొప్పతనంతో; ఈ శోభనంబు= ఈ మంగళం; సమకూరెన్= సిద్ధించింది; అనినన్= అనగా; విని= విన్న వారు; ప్రమోదంబునన్+ఒందన్= సంతోషించగా; మిక్కిలి సంతసంబునన్ తేలి= చాల సంతోషంతో తేలియాడి; ఆ+కురు ఘస్మరుండు= ఆ కౌరవులను చంపినవాడు - భీముడు; నర్తించు= నాట్యం చేసే; చెన్ను= సొగసు; తోఁపన్= తోచేటట్లు; చెలంగి= ఆర్చి.

తాత్పర్యం: 'పాంచాలి తపఃఫలితంగా ఈ శుభం జరిగింది.' అని భీముడు అనగా దానిని విన్న అందరూ సంతోషించి, కౌరవులను చంపిన భీముడు నాట్యంచేసే విధం తోచగా ఆర్చి -

చ. 'మును మము గొడ్డువోయి రని ముష్కరతం జెడనాడినట్టి దు
ర్జనుల ననిం గడంగి ధృతరాష్ట్రతనూజుల బంధువర్గమి
త్రనికరసైన్యకోటిసహితంబుగ గీటడఁగింపఁ గంటి; మిం
క నమరలోక మైన నరకం బయినన్ సరి మాకు నారయన్.' 285

ప్రతిపదార్థం: మును= ఇదివరకు; మమున్= మమ్ము; గొడ్డువోయిరని= వ్యర్థులని, పౌరుషహీనులయ్యారని; ముష్కరతన్= మూర్ఖత్వంతో; చెడన్+ఆడి నట్టి= దూషించినటువంటి (తిట్టినటువంటి); దుర్జనులన్= దుష్టులను; ధృతరాష్ట్ర తనూజులన్= ధృతరాష్ట్రుడి కుమారులను; బంధువర్గ= బంధువుల సమూహంతోను; మిత్ర నికర= స్నేహితులతోను కూడుకొన్న; సైన్యకోటి సహితంబుగాన్= పెక్కు సైన్యాలతో సహా; కడంగి= పూని; అనిన్= యుద్ధంలో; గీటడఁగింపన్= చంపటాన్ని; కంటిమి= చూడగలిగాము; ఇంకన్= ఇక; అమరలోకము+ఐనన్= స్వర్గమైనా; నరకంబు+ఐనన్= నరకలోకమైనా; ఆరయన్= చూడగా; మాకున్ సరి= మాకు సమానమే!

తాత్పర్యం: 'ఇదివరకు మమ్మ వ్యర్థజీవు లని, పౌరుషహీనులని మూర్ఖతతో తిట్టినటువంటి దుర్మార్గులను, ధృతరాష్ట్రుడి కుమారులను బంధుమిత్రసైన్య సమూహంతో యుద్ధరంగంతో పనిబట్టి నాశం చేయగా చూడగలిగాము. ఇక మాకు స్వర్గమైనా నరకమైనా - ఒకటే!

క. అని గదఁ జేకొని నృప! నీ । తనయునిమెడ వట్టి యదిమి తల గ్రమ్మఱఁ ద
న్నినఁ గని మును దన్నుట నె । మ్మన మెరియ తదగ్రజుం డమర్షముతోడన్. 286

ప్రతిపదార్థం: నృప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అని గదన్+చేకొని= అంటూ గద తీసికొని; నీ తనయుని మెడన్= నీ కుమారుడి మెడను; పట్టి అదిమి= పట్టుకొని నొక్కి; తలన్= తలను; క్రమ్మఱన్= మరలా; తన్నినన్= తన్నగా; కని= చూచి; మును తన్నుట= ఇదివరకు తన్నటమే; నెమ్మనము= మనస్సు; ఎరియన్= మండించగా; తదగ్రజుండు= వాని అన్న అయిన ధర్మరాజు; అమర్షముతోడన్= కోపంతో.

తాత్పర్యం: ఓ రాజా! ఆ విధంగా గదను చేతిలోనికి తీసికొని నీ కుమారుడి మెడను అదిమిపెట్టి తలను మరల తన్నగా దానిని చూచి, ఇదివరకు తన్నినందులకే మనస్సులో మండుతున్న ధర్మజుడు కోపంతో - (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. హర్షావేశలఘు చారిత్రుం డగు నమ్మారుతపుత్రున కి ట్లనియె. 287

ప్రతిపదార్థం: హర్ష+ఆవేశ= సంతోషం వలన కలిగిన ఆవేశంవలన; లఘుచారిత్రుండు+అగు= అల్ప నడవడిక గల; ఆ+మారుత పుత్రునకున్= ఆ భీమసేనుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సంతోషావేశంతో అల్పమైన ప్రవర్తనం ప్రదర్శించిన ఆ భీమసేనుడితో (ధర్మజుడు) ఇట్లా అన్నాడు:

చ. 'తల యది యేల తన్నెద? వధర్మము నొందుట కాత్మ రోయఁగా
వలవదె? రాజ రా జనుజవర్గముఁ దక్కినబంధుకోటియుం
గలపరివారముం దెగిన గౌరవ మేదకఁ బోరి సంగర
స్థలమునఁ బడ్డ నీతులువచందముచేఁత జనంబు మెచ్చునే? 288

ప్రతిపదార్థం: తల+అది+ఏలతన్నెదవు?= తలను ఎందుకు తన్నుతున్నావు?; అధర్మమున్+ఒందుటకున్= ధర్మాన్ని అతిక్రమించటానికి; ఆత్మన్ రోయఁగా వలవదె?= మనస్సులో అసహ్యించుకొనవలదా?; రాజరాజు= దుర్యోధనుడు; అనుజవర్గమున్= తమ్ములూ; తక్కిన బంధుకోటియున్= మిగిలిన బంధు సమూహమూ; కల పరివారమున్= ఉన్న సేన అంతా; తెగినన్= నశించిపోగా; గౌరవము+ఏదక= మర్యాదను వదలక; పోరి= యుద్ధం చేసి; సంగర స్థలమునన్ పడ్డన్= యుద్ధరంగంలో పడిపోగా; ఈ తులువ చందముచేఁత= పొగరుబోతు తనపు చేష్ట; జనంబు= జనం; మెచ్చునే?= మెచ్చుకొంటుందా?

తాత్పర్యం: 'ఈ తలను తన్నటమెందుకు? ఇది అధర్మం. ఇటువంటి చేష్ట మనసా అసహ్యించుకొన తగినది; పోగా, సోదరులు, బంధువులు గల సైన్యం నశించినా మర్యాద వదలక రారాజు దుర్యోధనుడు సమరంలో పాల్గొని రణక్షేత్రంలో పడ్డాడు. ఇటువంటి వేళ ఈ పొగరుపోతు చేతను జనులు మెచ్చుకొంటారా?

క. మును లోకము ధర్మపరుం। డనఁ బరఁగినవాఁడ విట్టు లనుచితకృత్యం
బునకుఁ జనఁ దగునె దీనం। గనియెడుఫల మేమి? దూష్యగర్వం బేలా?' 289

ప్రతిపదార్థం: మును లోకము= ఇదివరకు లోకం; ధర్మపరుండు+అనన్= ధర్మాత్ముడన; పరఁగినవాఁడవు= పేరు కలిగినవాడవు; ఇట్టులు= ఈ విధంగా; అనుచిత కృత్యంబునకున్= ఉచితముకాని పనికి; చనన్+తగునే?= పూనుకోవచ్చునా?; దీనన్= ఇందువల్ల; కనియెడు ఫలమేమి?= పొందే ఫలితమేమి?; దూష్య గర్వంబేలా?= నిందింపదగిన పొగరుబోతుతనం ఎందులకు?

తాత్పర్యం: ఇదివరలో లోకంలో ధర్మపు నడవడిక కలవాడవనే పేరు పొందావు. ఈ విధమైన అన్యాయమైన పనికి పూనుకొనవచ్చునా? దీనివలన పొందే ఫలితమేమి? నిందనీయమైన అహంకార మెందుకు?'

వ. అని దూఱి దుర్యోధనుం జూచి బాష్పాకులలోచనుం డై. 290

ప్రతిపదార్థం: అని దూఱి= అని నిందించి; దుర్యోధనున్+చూచి= దుర్యోధనుడి దిక్కు చూచి; బాష్ప+ఆకుల+లోచనుండు+ఐ= కన్నీటితో కలతనొందిన చూపు కలవాడై.

తాత్పర్యం: ఈవిధంగా నిందించి, కన్నీటితో నిండిన దృష్టితో దుర్యోధనుడిని చూచి.

సీ. 'విధి ప్రతికూలుఁ డై వేరంబు పుట్టించి । మాకు నీవును మేము నీకు నలిగి
యితరేతరద్రోహమతిఁ దెగి యింతలు । సేయుట గావించె; నీ యధర్మ
పరతయు లోభంబు బాల్యంబు మదమును । నిన్ను నింతకుఁ దెచ్చె; నీకతమున
నాకు బాంధవ కులనాశంబు వాటిల్లె; । ధృతరాష్ట్ర కోడండ్రు తీవ్రశోక

తే. కారి యయినవైధవ్యంబు కారణముగ । నన్ను నిందింతు' రనువచనములు మొదలు
గాఁగ బహు విలాపంబులఁ గరుణ మావ । హిల్ల దురపిల్లె నుల్లంబు దల్లడిల్ల.' 291

ప్రతిపదార్థం: విధి= దైవం; ప్రతికూలుఁడు+ఐ= ఎదురుతిరిగి; వేరంబు= శత్రుత్వమును; పుట్టించి= కలిగించి; మాకున్ నీవును= మా యెడ నీవును; మేము నీకున్= మేము నీయందును; అలిగి= కోపించి; ఇతరేతర ద్రోహమతిన్= పరస్పర ద్రోహబుద్ధి; తెగి= తెగించి; ఇంతలు చేయుట= ఇంతపని చేయటం(అనగా యుద్ధం మొదలైనవి); కావించెన్= చేశాడు; నీ అధర్మపరతయున్= నీ యొక్క అధర్మాసక్తి; లోభంబు= అత్యాశ; బాల్యంబు= చిన్నతనం; మదమును= గర్వమును; నిన్నున్ ఇంతకున్+తెచ్చెన్= నిన్నీ స్థితికి తీసికొని వచ్చింది; నీ కతమునన్= నీ కారణంగా; నాకున్; బాంధవ కులనాశంబు+పాటిల్లెన్= బంధువంశనాశం కలిగింది; ధృతరాష్ట్ర కోడండ్రు= ధృతరాష్ట్రుడి కోడళ్ళు; తీవ్రశోకకారి+ఐన= పెనుదుఃఖాన్ని కలిగించేది అయిన; వైధవ్యంబు కారణముగన్= భర్తృహీనత్వం కారణంగా - అనగా వైధవ్యావస్థవలన; నన్నున్; నిందింతురు; అను వచనములు మొదలు కాఁగన్= అనే పలుకులు మొదలుగా; బహువిలాపంబులన్= పలు ఏడ్పులతో; కరుణము ఆవహిల్లన్= కరుణరసం కలుగగా; ఉల్లంబు తల్లడిల్లన్= మనసు కలతపడగా; దురపిల్లెన్= దుఃఖపడినాడు.

తాత్పర్యం: 'దైవం వ్యతిరేకించి శత్రుత్వాన్ని కలిగించి మాపై నీవును, నీపై మేమును కోపించి పరస్పరం ద్రోహబుద్ధితో విడిపోయేటట్లు చేసి ఇంత పనిచేయించాడు. నీ అధర్మం, అత్యాశ, పసితనం, గర్వం, ని న్నీస్థితికి తెచ్చాయి. నీ కారణంగా నాకు బంధువంశనాశమైనది. ధృతరాష్ట్రుడి కోడళ్ళు తీవ్ర దుఃఖానికి లోనయ్యే వైధవ్యం కారణంగా నన్ను దూషిస్తారు' అనే పలుకులు మొదలుగా అనేక విధములయిన దుఃఖపుమాటలతో కరుణరసం నిండుకొనగా మనసు తల్లడిల్లగా ధర్మరాజు దుఃఖించాడు.

వ. అనిన విని ధృతరాష్ట్రుండు సంజయున కి ట్లనియె. 292

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విని; ధృతరాష్ట్రుండు; సంజయునకున్+ఇట్లు+అనియెన్= సంజయుడితో ఈ విధంగా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అనగా విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఈ విధంగా అన్నాడు:

చ. 'అనిలసుతుం డధర్మమున నమ్మెయిఁ గౌరవమేదినీశ్వరుం
దనయెదురన్ వధింపఁగ గదాసమరాఖిలధర్మవేది నాఁ
జనిన హలాయుధుండు గని సంజయ! యే మని పల్కె? నంత వాఁ
డనుజులకున్ మఱందులకు నట్టియెడ న్మొగమోడ నేర్చునే? 293

ప్రతిపదార్థం: సంజయా!= ఓ సంజయుడా!; అనిలసుతుండు= భీముడు; ఆ+మెయిన్= ఆ ప్రకారంగా; అధర్మమునన్= అన్యాయంగా; కౌరవమేదినీ+ఈశ్వరున్= కురువంశ రాజయిన దుర్యోధనుడిని; తన ఎదురన్= తన ముందు (తనకంటికి ఎదురుగా); వధింపఁగన్= చంపగా; గదాసమర= గదాయుద్ధంలోని; అఖిల ధర్మవేది= అన్ని ధర్మాలను తెలిసినవాడు; నాన్= అనగా; చనిన= ఒప్పిన; హల+ఆయుధుండు= బలరాముడు; కని= చూచి; ఏమని పల్కెన్?= ఏమని మాటాడాడు?; అంతవాఁడు= ఆ గొప్పవాడు; అనుజులకున్= తమ్ములకు; మఱందులకున్= బావమరదులకు; అట్టి ఎడన్= ఆ సమయంలో; మొగమోడ నేర్చునే?= మొగమును తప్పించ కలిగి ఉంటాడా?

తాత్పర్యం: 'సంజయా! ఆ విధంగా భీమసేనుడు అధర్మంగా దుర్యోధనుడిని తన కట్టెదుట చంపగా గదాయుద్ధపు సమస్త ధర్మాలు తెలిసినవా డని ప్రసిద్ధిని గడించిన బలరాముడు చూచి ఏమని మాట్లాడాడు? అంత గొప్పవాడు తోబుట్టువుల యెడ, మేనమరదుల పట్ల మొగమాటం వహిస్తాడా?'

చ. అనవుడు నాతఁ డిట్టు లను నమ్మనుజేంద్రున కప్డు రోహిణీ
తనయుఁడు కోపవేగమునఁ దామ్రముఖుం డయి లేచి బాహు లె
త్తి 'నృపతులార! చూచితిరె తెల్లముగా బకవైరివిక్రమం
బున తెఱఁ? గిట్టివాని మనభూములఁ గంటిమె యెన్నఁ డేనియున్? 294

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆతఁడు= ఆ సంజయుడు; అప్డు= ఆ సమయంలో; ఆ+మనుజేంద్రునకున్= ఆ రాజుతో; ఇట్టులు+అనున్= ఈ ప్రకారంగా అన్నాడు; రోహిణీతనయుఁడు= బలరాముడు; కోపవేగమునన్= కోపపు తొందరపాటుతో; తామ్రముఖుండు+ఐ లేచి= ఎర్రనైన ముఖంతో లేచి; బాహులు+ఎత్తి= చేతులు పైకెత్తి; నృపతులార!= ఓ రాజులారా!; తెల్లముగాన్= స్పష్టంగా; చూచితిరె?= చూచారా!; బకవైరి విక్రమంబున తెఱఁగు= బకాసురుని చంపినవాడి యొక్క శౌర్యపు పద్ధతి; ఎన్నఁడేనియున్= ఎప్పుడైనా; మన భూములన్= మనదేశాలలో; ఇట్టివానిన్+కంటిమె?= ఇటువంటి వాడిని చూచామా?

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: 'ఆ సమయంలో రోహిణికుమారుడు కోపాతిశయంతో ముఖం ఎర్రబడగా లేచి, చేతులు పైకెత్తి, చుట్టూ ఉన్న రాజులలో 'బకవిధ్వంసియొక్క పరాక్రమ పద్ధతిని స్పష్టంగా చూచారా? మన దేశంలో ఎప్పుడైనా ఇటువంటి వారిని చూచామా?

వ. గదాయుద్ధంబున నాభికి దిగువ యగుశరీరభాగంబు నొప్పించుట ధర్మంబుగా దను శాస్త్రోక్తి వినమె? వీఁడు విచ్చలవిడిఁ దెంపు సేసె' నని పలుకు నమ్మహాత్ముని మనంబున రోషానలంబు సముత్థితం బగుటయు నప్పుడు. 295

ప్రతిపదార్థం: గదా యుద్ధంబునన్= గదతో చేసే పోరాటంతో; నాభికిన్ దిగువ అగు శరీరభాగంబున్= బొడ్డునకు క్రిందిదైన శరీరభాగమును; నొప్పించుట= బాధించటం; ధర్మంబు+కాదు= న్యాయం కాదు; అను శాస్త్ర+ఉక్తి= అన్న నీతిశాస్త్రపు మాట; వినమే?= వినలేదా!; వీఁడు= ఈ భీమసేనుడు; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా; తెంపు+చేసెన్= సాహసం చేశాడు; అని= అంటూ; పలుకు= మాటాడుతున్న; ఆ+మహాత్ముని= ఆ గొప్పవాడి; మనంబునన్= మనస్సులో; రోష+అనలంబు= రోషాగ్ని; సముత్థితంబు+అగుటయున్= బాగా రేగగా; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: గదాయుద్ధంలో బొడ్డుకు దిగువభాగంలో బాధించటం న్యాయంకాదు- అనే యుద్ధనీతిశాస్త్ర ధర్మాన్ని వినలేదా! ఈ భీముడు విచ్చలవిడిగా తెగించాడు.' అని అంటున్న ఆ మహాత్ముడి (బలరాముడి) మనస్సులో రోషాగ్ని ప్రజ్వలించగా అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **నిజరథము మీఁది హలమును । భుజశిఖరమునం దమర్చి భూమి యద్రువ వా**
యుజుదెసకు నడచె నుద్భట । గజరిపుచంక్రమణ రేఖ గతియం దొలయన్. **296**

ప్రతిపదార్థం: నిజరథము మీఁది= తన తేరుమీది; హలమును= నాగలిని; భుజశిఖరమునందు+అమర్చి= భుజం మీద నిలుపుకొని; భూమి+అద్రువన్= భూమి వణకగా; వాయుజు దెసకున్= భీముడి దిక్కునకు; ఉద్భట= భయంకరమైన; గజరిపు= సింగముయొక్క; చంక్రమణరేఖ= తిరిగే పద్ధతి; గతి అందున్= నడకలో; ఒలయన్= కానరాగా; నడచెన్= మీదకు నడచాడు.

తాత్పర్యం: (బలరాముడు) తన రథంమీద ఉన్న నాగలిని భుజంపైన పెట్టుకొని, భూమి వణకగా, భయంకరమైన సింహం తిరిగే పద్ధతి నడకలో కానరాగా భీముడి వైపునకు నడచాడు.

శ్రీకృష్ణుఁడు బలరామునకుఁ గోపోపశమనంబు చేయుట (సం. 9-59-7)

వ. **దానికిం బవమానసూనుండు సోదరభుజబలనిజబలంబు లేకముఖత్వంబున నెప్పడుం గలుగు మనోబలంబు వలనం జలింప కుండె; నట్టియెడ వేగంబ వినయవినతుం డగుచు నచ్యుతుం డడ్డంబు సొచ్చి దీర్ఘవృత్తపీనంబు లగుబాహువుల హలాయుధుఁ బట్టి కైలాసశైలంబు గదిసిన యంజనమహీధరంబుమాడ్కి నొప్పి యనూనస్వరంబున నతని కిట్లనియె.** **297**

ప్రతిపదార్థం: దానికిన్= ఆ చేష్టకు; పవమాన సూనుండు= భీమసేనుడు; సోదర భుజబల నిజబలంబులు= తన తోబుట్టువుల యొక్క భుజశక్తి, తనశక్తి; ఏకముఖత్వంబునన్= ఒక్కటిగా; ఎప్పుడున్ కలుగు= ఎల్లవేళలా కలుగుతున్న; మనోబలంబువలనన్+ చలింపకుండెన్= మానసిక స్థైర్యం వలన కదలకుండా ఉన్నాడు; అట్టిఎడన్= ఆ వేళ; వేగంబ= శీఘ్రంగా; వినతుండు+అగుచున్= అణకువతో వంగినవాడౌతూ; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; అడ్డంబు+చొచ్చి= అడ్డం వచ్చి; దీర్ఘవృత్త పీనంబులు+అగు బాహువులన్= పొడవైన, గుండ్రనైన బలసిన చేతులతో; హలాయుధున్ పట్టి= బలరాముడిని పట్టుకొని; కైలాసశైలంబున్ కదిసిన= కైలాస పర్వతాన్ని సమీపించిన; అంజన మహీధరంబు మాడ్కిన్= కాటుకకొండవలె; ఒప్పి= తగిఉండి; అనూన స్వరంబునన్= పెద్దగొంతుతో; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ బలరాముడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ బలరాముడి పద్ధతికి భీమసేనుడు తనయొక్క, తన తోబుట్టువుల యొక్క శక్తి ఒక్కటై నిలకడతోడి మనఃస్థైర్యంతో స్థిరంగా ఉన్నాడు. అటువంటి సమయంలో త్వరగా వినయంతో కూడినవాడై శ్రీకృష్ణుడు అడ్డంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పోయి, పొడవైన, గుండ్రనైన, బలిసిన తన చేతులతో బలరాముడిని పట్టుకొని కైలాసపర్వతాన్ని కాటుకకొండ పట్టుకొన్నట్లుగా ఒప్పి, పెద్దగొంతుతో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉపమ. బలరాముడు తెలుపు. అందుచేత అతడికి తెల్లని కైలాసంతో పోలిక, కృష్ణుడు నలుపు. అందుకే అతనికి కాటుకకొండతో పోలిక.

క. తనవృద్ధియు మిత్రునివ । ర్ధనమును దత్సఖసమృద్ధి ప్రబలుటయును శ
త్రునిదెస నిన్నియుఁ జెడుటయు । నను షడ్విధములను దన్ను నతిశుభ మొందున్. 298

ప్రతిపదార్థం: తన వృద్ధియున్= తన ఎదుగుదల; మిత్రుని వర్ధనమును= స్నేహితుడి ఎదుగుదలయును; తద్+సఖ సమృద్ధి= ఆ స్నేహితుల సమృద్ధి; ప్రబలుటయున్= పెరుగుటయు; శత్రుని దెసన్= వైరియెడ; ఇన్నియున్+చెడుటయున్= పైని చెప్పిన వన్నీ నశించి పోవుటయు; అను= అన్నటువంటి; షడ్విధములను= ఆరు పద్ధతుల చేతను; తన్నున్= తన యెడ; అతిశుభము+ ఒందున్= మిక్కిలి మేలు కలిగిస్తుంది.

తాత్పర్యం: తాను పెంపుచెందటం, తన మిత్రుడు పెరగటం, ఆ స్నేహితులు దండిగా ప్రబలటం, శత్రువు విషయంలో ఇన్నీ చెడిపోవటం అనే ఆరువిధాలు తనకు మిక్కిలి మేలు కలిగిస్తాయి.

విశేషం: తన పెంపూ, తన మిత్రుని పెంపూ, తన మిత్రుల సమృద్ధి అధికం కావటం - అనేవి తన విషయంలోనూ, ఇవన్నీ శత్రువు విషయంలో చెడిపోవటమూ - అంటే - తనకు పెంపు లేమి, తన మిత్రునకు పెంపు లేమి, తనకు మిత్రుల సమృద్ధి అధికం కాకపోవటం - అనే ఈ ఆరు విధాలూ తనకు శుభం కలిగిస్తాయి.

వ. ఏతత్ప్రకారంబు విపరీతం బగుట యొప్పు; దట్లు గావున మిత్రునకుం గీడు వాటిల్లి నెడ నేర్పు గలుగునేని మైత్రిపరుం డయిన పౌరుషశాలి యది శమింపం జేయు సత్యపరాక్రము లగు పాండవులు మనకుఁ బరమ మిత్రులు; విశేషించి మన మేనత్తకొడుకు, లనీతిపరులచేతం బరిభవింపంబడినవారు గావున వీరల కభ్యుదయంబు గలిగించుట నీకుం గర్తవ్యంబు. 299

ప్రతిపదార్థం: ఏతద్+ప్రకారంబు= ఈ పద్ధతి; విపరీతంబు+అగుట ఒప్పదు= వ్యతిరేకం కావటం తగదు; అట్లు కావునన్= అందుచేత; మిత్రులకున్ కీడు వాటిల్లిన+ఎడన్= స్నేహితులకు కష్టం కలిగినప్పుడు; నేర్పు కలిగెనేని= చేతనైతే; మైత్రి పరుండు+ఐన పౌరషశాలి= స్నేహశీలిఅయిన శక్తి కలవాడు; అది= ఆ కీడును; శమింపన్ చేయు= అణగచేస్తాడు; సత్యపరాక్రములు+అగు పాండవులు= సత్యమైన, వీరం కల పాండవులు; మనకున్+పరమమిత్రులు= మనకు మిక్కిలి స్నేహితులు; విశేషించి= మీదు మిక్కిలి; మన మేనత్త కొడుకులు= మన మేనత్త కుమారులు; అనీతిపరుల చేతన్= నీతిలేని వారి వలన; పరిభవింపఁబడినవారు= అవమానానికి లోనయినవారు; కావునన్= అందువలన; వీరలకున్= ఈ పాండవులకు; అభ్యుదయంబు కలిగించుట= మేలు చేకూర్చటం; నీకున్+కర్తవ్యంబు= నీకు చేయదగిన పని.

తాత్పర్యం: పై నీతి విపరీతం కావటం తగదు. అందుచేత మిత్రుడికి కష్టం కలిగినప్పుడు ప్రజ్ఞ కలిగిన, స్నేహపరుడైన, బలవంతుడు దానిని ఆదుకొంటాడు. సత్యపరాక్రములైన పాండవులు మనకు మిక్కిలి స్నేహితులు. మీదుమిక్కిలి మన మేనత్త కొడుకులు కూడా. నీతిలేనివారిచేత అవమానానికి లోనయినవారు. కనుక వీరికి అభ్యుదయం కలిగించటం నీకు చేయవలసిన పని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అంటే పైన చెప్పిన షడ్విధశుభకరములలోను, రెండవది (మిత్రుని వర్ధనం) మూడవది (సఖసమృద్ధి ప్రబలటం) మనం చేయాలి. అప్పుడు మనకు అతిశుభం కలుగుతుంది.

తే. **ప్రతిన నెఱపుట నృపులకుఁ బరమధర్మ । మగుట మనమునఁ జర్చింపు; మనిలసుతుఁడు**
గద సుయోధను తొడలు భగ్నములు సేయు । వాఁడు గా సభఁ బూనినవాఁడు గాఁడె? 300

ప్రతిపదార్థం: ప్రతిన నెఱపుట= శపథాన్ని నెరవేర్చటం; నృపులకున్= రాజులకు; పరమ ధర్మము+అగుటన్= ఉత్తమ న్యాయంకావటం; మనమునన్+చర్చింపుము= మనస్సులో తలచుకొనుము; అనిలసుతుఁడు= భీమసేనుడు; గదన్= గదతో; సుయోధనుతొడలు= దుర్యోధనుడి తొడలను; భగ్నములు చేయువాఁడుగాన్= విరుగగొట్టేవాడుగా; సభన్= సభలో; పూనినవాఁడు కాఁడె?= ప్రతిజ్ఞ చేసినవాడు కాడా?

తాత్పర్యం: రాజులకు ప్రతిజ్ఞ నెరవేర్చటం ఉత్కృష్టధర్మం అనే విషయాన్ని మనస్సులో యోచించుము. వాయు తనయుడైన భీముడు గదతో దుర్యోధనుడి తొడలను విరుగగొట్టుతానని సభలో ప్రతిజ్ఞచేశాడు కదా!

వ. **అట్లుంగాక మైత్రేయమహాముని శాపంబున దుర్యోధనుతొడలు భీమసేనుగదాఘాతంబున భగ్నంబులు గాఁ గలయవి యై యుండె; నిప్పు డట్లయ్యెం గావున దీన దోషంబు దోఁపదు; క్రోధం బుపసంహరింపుము; కుంతీనందనుల యభివృద్ధి మనకు సమృద్ధిఁ జేయు' ననిన నతనికి హలాయుధుం డి ట్లనియె. 301**

ప్రతిపదార్థం: అట్లున్ కాక= అంతే కాకుండా; మైత్రేయ మహాముని= మైత్రేయ మహర్షి; శాపంబునన్= ఇచ్చిన శాపం కారణంగా; దుర్యోధను తొడలు= దుర్యోధనుడి తొడలు; భీమసేను= భీముడియొక్క; గదాఘాతంబునన్= గద దెబ్బచేత; భగ్నంబులు+కాన్+కలవిఐ+ఉండెన్= విరిగిపోయేవయి ఉండినవి; ఇప్పుడు+అట్లు+అయ్యెన్= ఇప్పుడు ఆ ప్రకారంగా అయినది; కావునన్= అందువలన; దీనన్= ఈ చేష్టయందు; దోషంబు తోఁపదు= తప్పు కనిపించదు; క్రోధంబు+ఉపసంహరింపుము= కోపాన్ని వదలుము; కుంతీ నందనుల+అభివృద్ధి= కుంతి కుమారులయొక్క పెంపు; మనకున్ సమృద్ధి+చేయున్= మనకు మేలు చేస్తుంది; అనినన్= అనగా; అతనికిన్; హలాయుధుండు+ఇట్లు+అనియెన్= బలరాముడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీముడి శపథం మాత్రమే కాదు. మైత్రేయ మహాముని శాపం కారణంగా కూడా భీముడి గదయొక్క తాకిడికి దుర్యోధనుడి తొడలు విరుగవలసి ఉన్నది. ఇప్పు డది జరిగింది. దీనిలో దోషం లేదు. నీ కోపాన్ని అణగించుకొమ్ము. కుంతికుమారులయొక్క క్షేమం మనకు మంచిని కలిగిస్తుంది' అన్నటువంటి శ్రీకృష్ణుడితో బలరాము డిట్లా అన్నాడు:

తే. **'ఓపి ధర్మార్థ కామంబు లొకటి నొకటి । నాశ మొందింప కుండంగ నడపవలయుఁ**
గాక! ధర్మంబు సెడ నర్థకామములను । గోరు పురుషుండు నిందకుఁ గుదురుగాఁడె? 302

ప్రతిపదార్థం: ఓపి= చాలి; ధర్మార్థ కామంబులు+ఒకటిన్+ఒకటి= ధర్మార్థ కామాలు ఒకదాని నొకటి; నాశము+ఒందింపకుండన్ నడపవలయున్= నాశం చేయకుండా నడచుకొనవలయును; కాక= ఆ విధంగా కాకుండా; ధర్మంబు+చెడన్= ధర్మం నశించిపోయేటట్లు; అర్థకామములను కోరు పురుషుండు= సంపదలను, కామములను ఆశించే పురుషుడు; నిందకున్ కుదురు+కాఁడె?= అపకీర్తికి చోటుకదా!

తాత్పర్యం: 'ధర్మార్థ కామాలు క్రమంగా ఒకదానినొకటి నాశనం చేయకుండా నడచుకొనవలసి ఉన్నది. అట్లుకాక ధర్మం చెడిపోయేటట్లు అర్థాన్నీ, కామాన్నీ కోరే మానవుడు అపకీర్తికి ఆలవాలం కాడా?

క. మునిశాపంబును బ్రతినయు । నని చెప్పితి; గలుగుఁ గాక!' యని విను ధర్మం
బున వానిన్ నెఱపక యి । ట్లనిలసుతుఁడు గలఁచెఁ గాదె యన్నెఱి యెల్లన్.' 303

ప్రతిపదార్థం: మునిశాపంబును= ముని ఇచ్చిన శాపమూ; ప్రతినయున్= ప్రతిజ్ఞయూ; అని చెప్పితి(వి)= అని చెప్పావు; కలుగున్+కాక!= అవి ఉండవచ్చు గాక; విను= వినుము; అనిన్= యుద్ధంలో; ధర్మంబునన్ వానిన్ నెఱపక= ధర్మంతో ఆ పనులు చేయకుండా; ఇట్లు= ఈ విధంగా; ఆ+నెఱి+ఎల్లన్= ఆ ధర్మము నంతటిని; అనిలసుతుఁడు= భీమసేనుడు; కలఁచెన్+కాదె!= చెడిపెను కదా!

తాత్పర్యం: మునీశ్వరుడి శాపం, భీముడి ప్రతిజ్ఞ - అని చెప్పావు. కావచ్చును. కాని, ధర్మవిరుద్ధంగా వ్యవహరించి యుద్ధంలో ఈ విధంగా భీమసేనుడు న్యాయాన్నంతటిని చీకాకు పరచాడు కదా! అర్థకామాలకోసం భీముడు యుద్ధధర్మాన్ని బలి చేశాడు కదా!'

చ. అన విని కృష్ణుఁ డిట్టు లను 'నాతనికిన్ నిను నిజ్జగంబు ధ
ర్మనిరతమానసుండు మధురత్వనిరూఢుఁడు దోషదూరుఁ డం
చనిశము సంస్తుతించును మహాత్మ! యడంపుము క్రోధ; మీతఁడుం
దనదు ప్రతిజ్ఞ కై రిపు గదాహతుఁ జేసె; నధర్మ మే లగున్? 304

ప్రతిపదార్థం: అనిన్+విని= అనగా వినినవాడై; ఆతనికిన్= ఆ బలరాముడితో; కృష్ణుఁడు+ఇట్టులు+అనున్= శ్రీకృష్ణుడు ఈ విధంగా చెప్పాడు; మహాత్మ!= ఓ మహనీయుడా!; నినున్= నిన్ను; ఈ+జగంబు= ఈ లోకం; ధర్మనిరతమానసుండు= ధర్మమునం దాసక్తితోడి మనసున్నవాడు; మధురత్వ నిరూఢుఁడు= తీయదనమగు నడవడియందు పట్టున్నవాడు; దోషదూరుఁడు= దోషం లేనివాడు; అంచున్= అంటూ; అనిశమున్= ఎల్లప్పుడూ; సంస్తుతించును= కీర్తిస్తుంది; క్రోధము= కోపం; అడంపుము= మానుకొనుము; ఈతఁడును= ఈ భీముడు కూడా; తనదు ప్రతిజ్ఞకై= తను చేసిన శపథానికి గాను; రిపున్= వైరిని; గదాహతున్+చేసెన్= గదతో పడగొట్టాడు; అధర్మము+ఏల+అగున్= (అది) న్యాయాతిక్రమణం ఎందు కవుతుంది?

తాత్పర్యం: బలరాము డట్లా అనగా విన్న శ్రీకృష్ణుడు ఆతడితో నిట్లా అన్నాడు: 'లోకం నిన్ను ధర్మతత్పరుడుగా తీయని మనసున్నవాడుగా ఎపుడూ కీర్తిస్తుంటుంది. ఓ మహాత్మా! కోపాన్ని మానుకొనుము. ఈ భీముడు తన ప్రతిజ్ఞను నెరవేర్చటానికి శత్రువును గదాహతుడిగా చేశాడు. ఇది ప్రతిజ్ఞానిర్వహణమే కాని ఏ విధంగా అధర్మమౌతుంది?

వ. అదియును నిలిచి మార్కొన్న యప్పుడును నడచు నెడను గాదు; పొడ వెగసి పై కుఱికినఁ దన్నుం గాచికొనుటయుం బ్రతిన నెఱపుటయును గారణముగా దొరకొనిన నాభికి దిగువ గదా! యని యుడిగి చావ వచ్చునే? గద నూరుభంగంబు సేయుదు ననుభీమసేను పూనికి పదుమూఁడు వత్సరంబులేని వేఁచిన యది యక్కులపాంసనుం డేల తలంపకుండె? మఱచెనేనిం జెడుఁగాక! మనకేమి? కలియుగంబు చేరువ యాసన్నం బయ్యెఁ; నివ్విధంబులు ధర్మంబు లై చెల్లకుండునే? యట్లుంగాక పుట్టినంతనుండియుం

గపటంబున నపకారంబులు సేయుచున్న వీనిఁ గపటప్రకారంబునఁ బడవైచుట ధర్మహాని యై తోఁపదు; వీఁడు పాండవ యాదవ వంశవర్ధనుం డగు సుభద్రానందనుం దెగటార్చిన తెఱం గెఱుంగమే?' యనిన నా బలదేవుండు బలు మొగంబుతో 'నిట్టి చెనఁట గెలుపు గెలిచిన భీముండు వొగడు వడయుం గాక! రణధర్మంబు దప్పక పెనంగినట్టి ధర్మాత్ముం డైన దుర్యోధనున కుత్తమలోకం బయ్యెడు' మనుచు నతనికిం జెప్పి రథాధిరూఢుం డై పాండవేయపాంచాలయదుప్రవరులు చిన్నంబోవ నిజపురంబున కరిగెఁ; దదనంతరంబ వాసుదేవుండు ధర్మపుత్త్రు నాలోకించు నెడ నతండు దీనాననంబుతోడ మానసంబు విషాదంబు నొంద నూరకున్న, నారాయణుం డతని కిట్లనియె. 305

ప్రతిపదార్థం: అదియును= అదికూడా - నాభి దిగువ కొట్టటం కూడ; నిలిచి మార్కొన్న అప్పుడు= నిలిచి ఎదుర్కొన్నప్పుడు; నడచున్= జరుగుతుంది; ఎడను కాదు= వేఱయినపుడు కాదు; పొడవు+ఎగసి= పైకి దూకి; పైకి+ఉఱికినన్= మీదకు దూకితే; తన్నున్+కాచికొనుటయున్= తనను కాపాడుకొనటం; ప్రతిన నెఱపుటయును కారణముగాన్= ప్రతిజ్ఞా పాలన చేయుటయు కారణంగా; దొరకొనినన్= పూనుకొన్నచో; నాభికిన్ దిగువన్+కదా!+అని= బొడ్డునకు క్రింది భాగాన కదా! అనుకొంటూ; చావవచ్చునే?= చావనగునా?; గదన్= గదతో; ఊరుభంగంబు చేయుదున్= తొడలను విరుగగొట్టుతాను; అను భీమసేను పూనికి= అన్న భీముడి ప్రతిన; పదుమూఁడు వత్సరంబులు+ఏని వేఁచిన+అది= పదమూడు సంవత్సరాలు కాచుకొన్నది; ఆ+ కులపాంసనుండు= ఆ వంశ నాశకుడు; ఏల= ఎందుకు; తలంపకుండెన్?= తలచుకోకుండా ఉన్నాడు?; మఱచెనేనిన్+ చెడుఁగాక!= మరచిపోతే నాశమగుగాక!; మనకేల?= మనకున్+ఎందుకు?; కలియుగంబుచొరవ= కలియుగ ప్రవేశం; ఆసన్నంబు+అయ్యెన్= దాపయింది; ఈ+విధంబులు= ఈ నడకలు; ధర్మంబులు+ఐ= ధర్మాలుగా; చెల్లకుండునే= నడవకుంటాయా; అట్లున్+కాక= అంతే కాకుండా; పుట్టినంత నుండియున్= జన్మించిన నాటినుండీ; కపటంబునన్= మోసంతో; అపకారంబులు చేయుచున్న వీనిన్= కష్టాలు కలిగిస్తూ ఉన్న వీడికి; కపటప్రకారంబునన్= మోసపు పద్ధతిలో; పడవైచుట= చంపుట; ధర్మహాని+ఐ తోఁపదు= నీతి తప్పుటగా తోచదు; వీఁడు= ఈ దుర్యోధనుడు; పాండవ యాదవ వంశవర్ధనుండు+అగు= పాండవులయు యాదవులయు కులవర్ధనుడైన; సుభద్రా నందనున్ తెగటార్చిన్ తెఱంగు= సుభద్రకుమారుడైన అభిమన్యుడిని చంపిన విధం; ఎఱుంగమే?= తెలియమా?; అనినన్= అనగా; ఆ బలదేవుండు= ఆ బలరాముడు; బలుమొగంబుతోన్= గండుముఖంతో; ఇట్టి చెనఁటి గెలుపు= ఇటువంటి కుత్సితపు గెలుపును; గెలిచిన= గెలిచినట్టి; భీముడు పొగడు+పడయున్+కాక!= భీమసేనుడు కీర్తిపొందుతాడు గాక!; రణధర్మంబు తప్పక= యుద్ధనీతిని వదలక; పెనంగిన+అట్టి= యుద్ధం చేసిన; ధర్మాత్ముండు+ఐన= నీతిపరుడైన; దుర్యోధనునకున్+ఉత్తమ లోకంబు+అయ్యెడున్= పుణ్యలోకం దుర్యోధనుడికి కలుగుతుంది కాక!; అనుచున్= అంటూ; అతనికిన్+చెప్పి= శ్రీకృష్ణుడితో చెప్పి; రథ+అధిరూఢుండు+ ఐ= తేరెక్కినవాడయి; పాండవేయ పాంచాల యదు ప్రవరులు= పాండవులు పాంచాలురు; యాదవముఖ్యులు; చిన్నన్+పోవన్= సిగ్గుపడగా; నిజపురంబునకున్+అరిగెన్= తన ఊరికి వెళ్ళాడు; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; ధర్మపుత్త్రు నాలోకించు+ఎడన్= ధర్మరాజును చూడగా; అతండు= ధర్మరాజు; దీన+ ఆననంబుతోడన్= విషణ్ణమైన మొగంతో; మానసంబు విషాదంబున్+ ఒందన్= మనసు దుఃఖపడగా; ఊరకున్నన్= మిన్నకుండగా; నారాయణుండు+అతనికిన్+ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణు డీవిధంగా అన్నాడు.

తాత్పర్యం: నిలిచి ఎదుర్కొన్నపుడూ నడచేటప్పుడూ కాకుండా పైకెగసి దూకినపుడు ఆత్మరక్షణకై ప్రతిజ్ఞను నెరవేర్చటం కారణంగా పూనుకొని బొడ్డునకు క్రిందకదా అని ఊరకొని చావవచ్చునా? గదతో తొడలు విరుగగొట్టుతా నన్న భీమసేనుడి ప్రయత్నం పదుమూడు సంవత్సరాలు కాచుకొని ఉండగా ఆ కులనాశకుడు దానిని తలచుకొనకుండా మరచితే నాశనమగుగాక! మన కెందుకు? కలియుగం ప్రవేశించే సమయం సిద్ధమైంది. ఇట్లాంటివి ధర్మబద్ధ మయి చెల్లకుండా ఉంటాయా? అంతే కాదు పుట్టిననాటినుండీ మోసమే నడవడి అయిన ఈతడిని పడవేయటం ధర్మహానిగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తోచదు. వీడు పాండవ యాదవవంశ దీపకుడైన సుభద్రాతనయుడిని చంపిన పద్ధతి మనకు తెలియదా?' అని అనగా విని, బలరాముడు గండుమొగంతో 'ఈ విధమైన కపటపు గెలుపును గెలిచిన భీముడు ప్రశంసలు పొందుతాడుకాక! యుద్ధధర్మమును అతిక్రమించక యుద్ధం చేసిన ధర్మపరుడైన దుర్యోధనుడికి పుణ్యలోకాలు కలుగుతాయి.' అంటూ కృష్ణుడికి చెప్పి, తేరెక్కి పాండవులు, పాంచాలురు, యాదవులు చిన్నబోవగా తన ఊరికి బలరాముడు వెళ్ళాడు. పిమ్మట శ్రీకృష్ణుడు ధర్మజుడిని చూడగా అతడు దైన్యాన్ని ప్రకటించే మనసుతో దుఃఖపడుతుండగా అతడితో శ్రీకృష్ణు డీ విధంగా అన్నాడు:

ఆ. 'బంధునాశకుండు పాపాత్ముఁ డీసుయో । ధనుఁడు వీని సమరధరణిఁ గూల్చి
శిరము దన్నె భీముఁ; డరయంగ నది యధ । ర్మంబె? నీకు నేల మఱుఁగఁ జెపుమ! 306

ప్రతిపదార్థం: బంధునాశకుండు= బంధువులను నశింపజేసినవాడు; పాపాత్ముఁడు= పాపాలు చేసినవాడు; ఈ సుయోధనుఁడు= ఈ దుర్యోధనుడు; వీనిన్= ఈతనిని; సమరధరణిన్+కూల్చి= యుద్ధభూమిలో చంపి; భీముఁడు= భీముడు; శిరము తన్నెన్= తలను తన్నాడు; అది= ఆ పని; అరయంగన్= చూడగా; అధర్మంబె?= అన్యాయమా?; నీకున్ మఱుఁగన్?= నీవు శోకించటం?; ఏల= ఎందుకు?; చెపుమ!= చెప్పుము.

తాత్పర్యం: 'బంధునాశనానికి కారకుడూ, పాపకర్ముడూ అయిన ఈ సుయోధనుడిని యుద్ధభూమిలో పడగొట్టి భీముడు తలను తన్నాడు, అది అధర్మమా? దీనికి నీవు విచారించటమెందుకు? చెప్పుము.

వ. తలఁ దన్నువాఁడ నను ప్రతిజ్ఞయుఁ గీచకారాతికిం గలదు గాదె?' యనిన విని కుంతీనందనుండు దేవకీనందనున కిట్లనియె. 307

ప్రతిపదార్థం: తలన్+తన్నువాఁడను+అను ప్రతిజ్ఞయున్= తలను తన్నుతాననే శపథంకూడా; కీచక+అరాతికిన్+కలదు కాదె!= కీచక వైరిఅయిన భీముడికి ఉన్నదికదా!; అనినన్ విని= అనగా విని; కుంతీనందనుండు= కుంతి కుమారుడైన ధర్మజుడు; దేవకీ నందనునకున్= దేవకీ కుమారుడైన శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: తలను తన్నుతానని కూడా కీచకవైరి భీముడు శపథం చేసి ఉన్నాడు కదా!' అను మాటను విన్న ధర్మజుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

క. 'కురుకులము పొలియుటకు మది । యెఱియంగా నున్న నాకు నితఁ డీరాజున్
శిర ముఱక తన్ని యిమ్మెయిఁ । బరిభవ మొందింప వగపు పాటిలకున్నే? 308

ప్రతిపదార్థం: కురు కులము పొలియుటకున్= కురువంశం నశించటానికి; మది= మనసు; ఎఱియంగాన్= పరితపించగా; ఉన్ననాకున్= ఉన్నట్టినాకు; ఇతఁడు= ఈ భీముడు; ఈ రాజున్= ఈ దుర్యోధనుడిని; శిరమున్= తలను; ఉఱక తన్ని= ఊఱకతన్ని; ఈ+మెయిన్= ఈవిధంగా; పరిభవము+ఒందింపన్= అవమానించగా; వగపు పాటిలక+ఉన్నే?= దుఃఖం కలుగక ఉంటుందా!

తాత్పర్యం: 'కురుకులం నాశనమయినందుకు అసలే మనసు పరితాపం పడుతున్న నాకు భీముడు ఈ రాజును ఈ విధంగా తలను తన్ని అవమానించటం వలన దుఃఖం కలుగకుండా ఉంటుందా?

తే. ఇతఁడు వఱచిన పాటులు హృదయకీలి । తంబు లై భీమసేనుండు తగవు మాలె
నేమి సేయంగవచ్చుఁ? బోనిమ్ము పుణ్య । పాపచింత యిం కేటికిఁ బద్మనాభ!' 309

ప్రతిపదార్థం: పద్మనాభ!= శ్రీకృష్ణా!; ఇతఁడు= ఈ దుర్యోధనుడు; పఱచిన పాటులు= పెట్టిన కష్టాలు; హృదయ కీలితంబులు+ ఐ= గుండె మంటలుకాగా; భీమసేనుడు; తగవు మాలెన్= ధర్మాన్ని వదలాడు; ఏమి+చేయంగ వచ్చున్?= ఏమి చేయగలం?; పోనిమ్ము; పుణ్యపాపచింత= పుణ్యమో పాపమో దానిని గూర్చి తలచుకొనటం; ఇంకన్+ఏటికిన్= ఇంక ఎందుకు?

తాత్పర్యం: ఈ దుర్యోధనుడు పెట్టిన కష్టాలు గుండెను మండింపగా భీముడు సమతాధర్మాన్ని వదలాడు. ఏమి చేయగలం? పోతే పోనిమ్ము. ఓ పద్మనాభా! పుణ్యాపాపాలను గూర్చిన తలపు ఇం కెందుకు?'

వ. అనుటయు 'నట్ల కాక దీని నింత గొనియాడ నేల?' యని యతండు భీమసేనపక్షపాతంబున నతనిచింత గీటునం బుచ్చె; వివ్వచ్చుండు నెఱయం బ్రియం బందని డెందంబుతోఁ గీడు మే లాడక యూరకుండె; నమ్మారుతి మోదం బెసఁగ మోడ్పుఁగేలు ఫాలతలంబున మోపికొనుచు నుత్ఫుల్లంబు లగు లోచనంబుల నొప్పి నిజాగ్రజుం జేరం జని యి ట్లనియె. 310

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; అట్ల+కాక= అంతేకాని; దీనినిన్= ఈ పనిని; ఇంత+కొనియాడన్+ఏల?= ఇంతగా తర్కించటం ఎందుకు?; అని అతండు= అంటూ శ్రీకృష్ణుడు; భీమసేన పక్షపాతంబునన్= భీముడిమీద అభిమానంతో; అతని చింత= ఆ ధర్మజుడి చింతను; గీటునంబుచ్చెన్= తొలగించాడు; వివ్వచ్చుండు= అర్జునుడు; నెఱయన్+ప్రియంబు+ అందని డెందంబుతోన్= నిండుగా సంతసించని మనసుతో; కీడు మేలు+ఆడక= మంచి చెడులను పలుకకుండా; ఊరక+ ఉండెన్= ఊరకుండిపోయాడు; ఆ+మారుతి= ఆ భీముడు; మోదంబు= సంతోషం; ఎసఁగన్= ఎక్కువకాగా; మోడ్పు+కేలు= చేతులుజోడించి; ఫాలతలంబునన్ మోపికొనుచున్= నెన్నుదుటికి తాకించుకొంటూ; ఉత్ఫుల్లంబులు+అగు= వికసించిన; లోచనంబులన్= కన్నులతో; ఒప్పి= తగిఉండి; నిజ+అగ్రజున్+చేరన్+చని= తన అన్నవద్దకు వెళ్ళి.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అనగా శ్రీకృష్ణుడు 'దీనిని గూర్చి ఇంతగా మాట్లాడటం ఎందుకు? అని భీముడి పక్షం వహించి, ధర్మజుడికి కలిగిన చింతను తొలగించాడు. అర్జునుడు నిండైన ప్రీతి కలుగని మనసుతో మంచి చెడులను చెప్పక ఊరకున్నాడు. భీమసేనుడు సంతోషంతో రెండు చేతులును జోడించి నమస్కరిస్తూ వికసితనేత్రుడై తన అన్న వద్దకు చేరి, ఈ విధంగా అన్నాడు:

చ. 'పరిభవకారి యైన కులపాంసనుఁ డాహవభూమిఁ గూలెఁ ద
త్పరమతి వైరముం బెనిచి పాపవినిశ్చయ కారకత్వని
ష్ఠురు లగు దుస్ససేనుఁడును సూతసుతుండును సౌబలుండుఁ ద్రుం
గి రితనికంటె మున్ను; మహికిం బతి వీవ! భరింపు మున్నతిన్.' 311

ప్రతిపదార్థం: పరిభవకారిఐన కులపాంసనుఁడు= అవమాన కారకు డైన కుల నాశకుడు; ఆహవ భూమిన్+కూలెన్= యుద్ధరంగంలో చనిపోయాడు; తత్పరమతిన్= తదేకమైన మనస్సుతో; వైరమున్ పెనిచి= శత్రుత్వాన్ని పెంచి; పాప వినిశ్చయ కారకత్వ నిష్ఠురులు+అగు= పాపపు పనిచేయించటంలో పట్టుదల కలవారైన; దుస్ససేనుఁడును= దుశ్శాసనుడూ; సూతసుతుండును= కర్ణుడూ; సౌబలుండు= శకునీ; ఇతనికంటెన్ మున్ను= ఈ దుర్యోధనుడి కన్న ముందుగా; త్రుంగిరి= చనిపోయారు; మహికిన్+పతివి+ఈవ= భూమికి రాజువు నీవే. ఉన్నతిన్ భరింపుము= ఔన్నత్యాన్ని భరించుము.

తాత్పర్యం: అవమానాలకు కారణమైన వాడు, కులనాశకుడు యుద్ధరంగంలో చనిపోయాడు. పట్టుదలతో శత్రుత్వాన్ని పెంచి పాపకార్యాలు చేయించటంలో, కఠినమైన మనసు గల దుశ్శాసన, కర్ణ శకునులు ఇతడికంటె ముందుగా చనిపోయారు. భూమికి రాజువు నీవే. అన్ని విధాలా ఔన్నత్యంతో ఈ రాజ్యభారాన్ని వహించుము.' (అని అన్నతో భీము డన్నాడు).

వ. అనిన విని ధర్మతనయుం డతని కిట్లనియె. 312

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విన్నవాడైన; ధర్మతనయుండు= ధర్మరాజు; అతనికిన్= ఆ భీముడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీముడితో ఇట్లా అన్నాడు:

క. హరితలఁపు గూడఁ గురుపతిఁ । బరిమార్చితి, ప్రతినతోడఁ బగ దీర్చితి; నీ
కరయంగ దైవబలవి । స్ఫురిత భుజాబలము లింత చొప్పడి యున్నే! 313

ప్రతిపదార్థం: హరితలఁపు+కూడన్= శ్రీకృష్ణుడి భావం కూడిరాగా; కురుపతిన్+పరిమార్చితి(వి)= దుర్యోధనుడిని చంపావు; ప్రతినతోడన్= శపథంతో; పగదీర్చితి(వి)= వైరమును తీర్చుకొన్నావు; నీకున్+అరయఁగన్= నీకు చూడగా; దైవబల= దైవబలంచేత విస్ఫురితభుజాబలము= ప్రకాశించే భుజబలం; ఇంత చొప్పడి+ఉన్నే?= ఇంతగా సమకూరిందా?

తాత్పర్యం: 'శ్రీకృష్ణుడి తలపు సాయం కాగా, నీ వైరం, ప్రతిజ్ఞా తీరేటట్లుగా చేశావు. చూడగా నీకు దైవబలంతోడయిన భుజబలంగా ఇంత సమకూరిందా?

వ. అని సంభావించె' ననిన విని యాంబికేయుండు సంజయు నుద్దేశించి. 314

ప్రతిపదార్థం: అని సంభావించెన్= అని గౌరవించాడు; అనినన్= అనగా; విని= విన్నవాడై; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; సంజయున్+ఉద్దేశించి= సంజయుడితో (ఇట్లా మాట్లాడాడు).

తాత్పర్యం: అని గౌరవించాడు అనగా విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో - (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. 'అట్లు వడియున్న యక్కౌరవాధినాథుఁ । జూచి పాండుతనూజులు సోమకులును
నేమి సేసిరి? నా కది యెఱుఁగఁ జెప్పు' । మనుడు నతఁ డిట్టు లనియె నమ్మనుజపతికి. 315

ప్రతిపదార్థం: అట్లు పడి ఉన్న= ఆ విధంగా (తొడలు విరిగి) పడిఉన్న; ఆ+కౌరవాధినాథున్+చూచి= కురురాజ నాయకుడైన దుర్యోధనుడిని చూచి; పాండుతనూజులు= పాండు రాజకుమారులైన పాండవులు; సోమకులును= సోమకాదులును; ఏమి చేసిరి?= ఏమిచేశారు; నాకున్+అది+ఎఱుఁగన్ చెప్పుము+అనుడున్= నాకది తెలియచేయుమనగా; ఆ+మనుజ పతికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఆతఁడు+ఇట్టులు+అనియెన్= ఆ సంజయుడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'యుద్ధ రంగంతో తొడలు విరిగిపడి ఉన్న కురురాజును జూచి పాండవులును పాంచాలురు ఏమి చేశారు? నాకు తెలియజేయుము.' అని ధృతరాష్ట్రుడు అడుగగా సంజయుడు అతడితో ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. 'దేవా! యేమి సెప్పుదుఁ? బాండవులును బాంచాలురునుం దక్కటి భూపతులునుం గృష్ణసహితంబుగా నుబ్బునం బొంగి చీరలు వీచువారును విండులు విసరువారును గుణధ్వని సేయువారును శంఖంబు లొత్తువారును భేరీపణవాదులు మ్రోగించువారును బెలుచ నార్చువారును నయి పేర్చినం బృథివికి వ్రేఁగగు నట్లుండె నిత్తెఱంగునం జెలంగి మారుతిసూరెలం జేరి యిట్లనిరి. 316

ప్రతిపదార్థం: దేవా! ఏమి చెప్పుదున్?= ప్రభూ! ఏమనగలను?; పాండవులును; పాంచాలురున్+తక్కటి భూపతులునున్= పాండవ, పాంచాలురు మాత్రమే కాక మిగిలిన రాజులు కూడా; కృష్ణసహితంబుగాన్= కృష్ణుడితోకూడా; ఉబ్బునన్+పొంగి= సంతోషంతో ఉప్పొంగి; చీరలు వీచువారును= బట్టలను ఊపేవాళ్ళు; విండులు విసరువారును= ధనుస్సులను ఆడించేవాళ్ళు; గుణ ధ్వనిసేయువారును= అల్లెత్రాటిని మీటేవాళ్ళు; శంఖంబులు+ఒత్తువారును= శంఖధ్వానం చేసేవాళ్ళు; భేరీపణవ+ఆదులు= నగారాలును, కొమ్ములు మొదలైనవాటిని; మ్రోగించువారును= శబ్దం చేసేవారూ; పెలుచన్+ఆర్చువారును= పెద్దగా అరచేవారూ; అయి= అగుచు; పేర్చినన్= విజృంభించగా; పృథివికిన్= భూమికి; వ్రేఁగు+అగునట్లు+ఉండెన్= భారం కలిగే విధంగా ఉండింది; ఈ+తెఱంగునన్+చెలంగి= ఈ విధంగా ఒప్పారి; మారుతి= భీముడి; సూరెలన్+చేరి ఇట్లు+అనిరి= ప్రక్కలలో చేరి ఈ విధంగా అన్నారు:

తాత్పర్యం: 'ఓ రాజా! ఏమని చెప్పగలను? పాండవ, పాంచాల, తదితర దేశాధిపతులును శ్రీకృష్ణుడితో కలిసి సంతసంతో ఉప్పొంగి గుడ్డలు విసరుచున్నవారూ, ధనుష్టంకారాలు చేసేవారూ, శంఖాలు పూరించే వారూ, భేరీభాంకృతుల ధ్వనింపజేసేవారూ, పెద్దగా అరిచేవారూ అయి, విజృంభించి, భూమి అదరేటట్లుగా పై విధంగా తిరిగి భీముడి ప్రక్క చేరి ఇట్లా అన్నారు.

మ. 'గదనే ర్పెక్కుడు గల్గు దర్పఘనుఁ డీ కౌరవ్యరాజన్యుఁ డు
న్మదలీలం బయి నట్లు బె ట్టుటికిన న్వంచించి పో కిట్లుసే
యుదె? నీవాటునఁ బెన్దొడల్ విఱిగి వీఁ డుర్విం బడెన్ మాకు నొ
ప్ప దలిర్పం బులకాంకురంబు లెసఁగం బో విప్పడుం జూడుమీ! 317

ప్రతిపదార్థం: గద నేర్పు= గదను త్రిప్పటంలో ప్రజ్ఞ; ఎక్కుడుకల్గు= ఎక్కువగా గల; దర్పఘనుఁడు= గర్వంచేత ఘనుడైన; ఈ కౌరవరాజన్యుఁడు= ఈ కౌరవరాజ శ్రేష్ఠుడు; ఉన్మదలీలన్= మిక్కిలి అహంకారపు చేష్టతో; అట్లు= ఆ విధంగా; బెట్టు+ఉటికినన్= మిక్కిలి దూకగా; వంచించిపోక= మోసంతో తప్పించుకొనకుండా; ఇట్లు చేయుదె?= ఈ విధంగా చేసితివా? (బాగా చేశావనుట); నీ పాటునన్= నీ దెబ్బకు; పెన్+తొడల్ విరిగి= పెద్దతొడలు విరిగి; ఈతడు+ఉర్విన్+పడెన్= ఇతడు(దుర్యోధనుడు) భూమిమీద పడ్డాడు; మాకున్= మాకందరికీ; ఒప్పు+తలిర్పన్= సొగసు వికసించగా; పులక+అంకురంబులు= గగుర్పాటు మొలకలు; ఎసఁగన్= ఒప్పారగా; ఇప్పుడున్= ఇప్పుడుకూడా; పోవు= పోకుండా ఉన్నాయి; చూడుమీ!= చూడుము.

తాత్పర్యం: 'ఈ దుర్యోధనుడు గదాయుద్ధంలో ఎక్కువ నేర్పుగల గర్వాధికుడు. వీడు గర్వంతో ఆ విధంగా మీదకు దూకగా మోసంతో తప్పించుకొనకుండా ఇట్లా చేశావు గదా! నీదెబ్బకు వీడు తొడలు విరిగి నేలకూలాడు. మాకందరికీ ఒప్పుగా కలిగిన గగుర్పాటు ఇప్పటికీ తగ్గలేదు. నీవే చూడుము.

ఆ. పరులచేతఁ గాని పని యైనవృత్ర వ । ధంబుఁ బోని యరివధంబు నిర్వ
హించియున్న నిన్ను నే మింద్రుఁ గొనియాడు । నమరులట్ల పొగడెదము సెలంగి. 318

ప్రతిపదార్థం: పరులచేతన్= ఇతరులవలన; కానిపనిఐన; వృత్రవధంబున్= వృత్రాసుర సంహారం; పోని= పోలిన; అరివధంబు= వైరి చావును; నిర్వహించి ఉన్న నిన్నున్= కొనసాగించి యున్న నిన్ను; ఏము= మేము; ఇంద్రున్+కొనియాడు= ఇంద్రుడిని పొగడే; అమరులు+అట్లు+అ= దేవతలవలె; చెలంగి= ఒప్పి; పొగడెదము= కీర్తిస్తాము.

తాత్పర్యం: ఇతరులకు సాధ్యం కానిపని వృత్రాసురవధ. దానిని పోలిన శత్రుసంహారాన్ని సాగించిన నిన్ను ఇంద్రుడిని దేవతలు పొగడినట్లుగా పొగడుతాము.

విశేషం: అలం: ఉపమ.

క. అవమానంబులు సేసిన । యవినీతుల దుస్ససేనుఁ డాదిగఁ గలవా
రి వధించి యడుగు పగతుని । యవుదల నిడి; తింతవార లవనిం గలరే?' 319

ప్రతిపదార్థం: అవమానంబులు చేసిన= అవమానాలు కావించినట్టి; అవినీతులన్= దుర్మార్గులను; దుస్ససేనుఁడు+ఆదిగన్+ కలవారిన్+వధించి= దుశ్శాసనుడు మొదలైన వారిని చంపి; అడుగు= పాదము; అవుదలన్+ఇడితి(వి)= నెత్తిమీద పెట్టావు; ఇంతవారలు= ఇంతటివారు; అవనిన్+కలరే?= భూమిలో ఉన్నారా?

తాత్పర్యం: అవమానాలు చేసిన నీతిమాలిన దుశ్శాసనాదులను చంపి, నీ పాదమును శత్రువు నడినెత్తిమీద పెట్టావు. ఇంతటి వారు భూమిలో ఉన్నారా?'

వ. అని మఱియు ననేకప్రకారంబుల బ్రశంసించిరి; భీముచేసిన గదాసమర ధర్మవిరోధంబు లాఁతి రాజులమనంబుల నుండునో? యని శంకించి కృష్ణుం డెల్లరాజులం గలయం గనుంగొని యిట్లనియె. 320

ప్రతిపదార్థం: అని మఱియున్+అనేక ప్రకారంబులన్+ప్రశంసించిరి= అని ఇంకను అనేక విధాలుగా పొగడారు; భీము చేసిన= భీముడు కావించిన; గదాసమర= గదాయుద్ధంలో; ధర్మవిరోధంబు= ధర్మాతిక్రమణం; లాఁతిరాజుల మనంబులన్+ఉండునో అని= ఇతర రాజుల మనసులలో ఉంటుందేమోఅని; శంకించి= అనుమానపడి; కృష్ణుండు+ఎల్లరాజులన్+కలయన్+కనుంగొని= కృష్ణుడు రాజు లందరిని బాగా చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అంటూ ఇంకా అనేక విధాల పొగడారు. భీముడు కావించిన గదా యుద్ధ ధర్మాతిక్రమణం ఇతర రాజుల మనసులో ఇంకా ఉంటుందేమో అని వారిని తేరిపార చూచి శ్రీకృష్ణు డిట్లా అన్నాడు:

చ. 'చక్కటి లేని యాలమునఁ జంపె ననన్ వల; దీదురాత్మకుం
డక్కటికంబు లేక సతి నంతలు సేసిననుం గృపారతిం
దక్కక తండ్రిపా లడిగె ధర్మజుఁ; డన్నెతి సేయఁ డయ్యెఁ; వీఁ
డుక్కివుఁ; డిట్టి చావునకు యుక్తుఁ డగుం దలపోసి చూడఁగన్. 321

ప్రతిపదార్థం: చక్కటి లేని ఆలమునన్= ధర్మంలేని యుద్ధంలో; ఈ దురాత్మకున్= ఈ దుర్మార్గుడిని; చంపెన్+అనన్ వలదు= చంపాడని అనవద్దు; అక్కటికంబు లేక= కనికరంలేకుండా; సతిన్+అంతలు చేసినన్= పతివ్రతయైన భార్యను అంత అవమానం చేసినప్పటికిని; కృపారతిన్+తక్కక= దయాసక్తిని వదలకుండా; ధర్మజుఁడు+తండ్రిపాలు+అడిగెన్= తండ్రిభాగమును ధర్మరాజు కోరినాడు; ఆ+నెఱిన్= ఆ ధర్మమును; చేయఁడు+అయ్యెన్= చేసినాడు కాడు; వీఁడు= ఈ దుర్యోధనుడు; ఉక్కివుఁడు= మూర్ఖుడు; తలపోసి= యోచించి; చూడఁగన్= పరిశీలించగా; ఇట్టి చావునకున్= ఈ విధమైనచావునకు; యుక్తుఁడు+అగున్= తగినవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ధర్మం కాని యుద్ధంతో ఈ దుర్మార్గుడిని ఇట్లా చంపా డనవద్దు. కనికరం లేకుండా స్త్రీని పతివ్రతను అంతగా అవమానం చేసినప్పటికినీ, దయతో తమతండ్రిపాలిమ్మని ధర్మజుడు కోరాడు. ఆ ధర్మాన్నీ వీడు నిర్వర్తించలేదు. ఈ దుర్యోధనుడు మోసగాడు. యోచించి చూడగా ఇటువంటి చావుకు వీడు తగినవాడే.

క. విదురాదులు సెప్పఁగ ను। న్మదుఁ డై యీఁడయ్యెఁ దగినమాత్రయు భూసం
పద వీఁడు పాండవుల కిది। యది యగునె బకారి ప్రతిన కగ్గం బైనన్. 322

ప్రతిపదార్థం: విదుర+ఆదులు చెప్పఁగన్; ఉన్మదుఁడు+ఐ= గర్వితుడై; తగిన మాత్రయు భూ సంపదన్= తగినంత భూమిని; పాండవులకున్= పాండవులకు; వీఁడు= ఈ దుర్యోధనుడు; ఈఁడు+అయ్యెన్= ఇచ్చినవాడుకాదు; బకారిప్రతినకున్= బకవైరి శపథానికి; అగ్గంబు+ఐనన్= లోనైతే; ఇది+అది+అగునె= ఏమౌతుంది?

తాత్పర్యం: విదురాదు లెందరో చెప్పారు. అయినా ఉన్మాదిఅయి తగినంత మాత్రపు భూమిని కూడా ఇతడు పాండవుల కీయలేదు. బకవైరి ప్రతిజ్ఞకు లొంగిపోతే ఇది అది (ఇది= ఇట్లా చంపటం, అది= అధర్మం) అవుతుందా?

విశేషం: అలం: ఉపమ.

ఆ. నేలఁ గూలి మ్రాను వోలె నిట్లున్నయి। ప్పాపకర్ము గుఱిచి పాడితెఱఁగు
తేటపడఁగ మాటలాట దానేల ? మీ ! రెక్కుఁ డరదముల మహీశులారా ! 323

ప్రతిపదార్థం: మహీశులార= ఓ రాజులార!; నేలన్+కూలి= భూమిమీదపడి; మ్రానువోలెన్ ఇట్లు+ఉన్న= వృక్షం మాదిరి ఇట్లా ఉన్నటువంటి; ఈ పాపకర్మున్ గుఱిచి= ఈ దుష్ట చరితుడిని గూర్చి; పాడి తెఱఁగు= ధర్మపద్ధతి; తేట+పడఁగన్= స్పష్టంగాతెలియగా; తాను= ఈ దుర్యోధనుడు; మాటలు+ఆట= మాటాడటం; ఏల?= ఎందుకు? మీరు; అరదములన్= తేరులను; ఎక్కుఁడు= ఎక్కండి.

తాత్పర్యం: ఓ రాజులారా! కరాకటి వ్రేళ్ళతో పెల్లగిలబడిన మ్రానువలె భూమిమీద పడిఉన్న ఈ పాపాత్ముడినిగూర్చి ధర్మ పద్ధతి విషయమై మాటలాడనేల? మీరందరును మీమీ రథముల నెక్కండి! (ఈ విషయమై చర్చ అవసరమన్నాడు).

విశేషం: అలం: ఉపమ.

వ. అని యిట్లు పుండరీకాక్షుండు దన్ను నాక్షేపించుట యాకర్ణించి కౌరవేశ్వరుండు గోపాయత్తచిత్తుండై పిఱుందు మోవ లేచి చేతుల భూతలం బూఁదికొని బొమముడితోడి చూడ్కి యతనిపయిం బఱపె, నప్పు డపరభాగంబు విఱుగ వ్రేటు వడి యలిగి తల యెత్తి చూచు మహానాగంబు చందంబు దోఁచె; నట్లు ప్రాణాంతకరణం బైన వేదనాభరంబు దలంపక కూర్చుండి మున్నాకృష్ణుండు జిష్ణుతోడ సంభాషించుటయు, నతం డూరుతలంబుఁ గరపుటంబున నప్పళించుటయు వెడవెడ గనుటం జేసి భీమువాటునం దొడలు విఱిగి పడినప్ప డప్పటి బుడిబుడిమాటలు నా సన్నయు దీనికిం గాకేమి? యని యూహించి, చేయునది లేక యవుడు గఱచుచున్న వాఁ డగుట నగ్గోపాలదేవునితో ని ట్లనియె. 324

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ ప్రకారం; పుండరీకాక్షుండు= శ్రీకృష్ణుడు; తన్నున్+ఆక్షేపించుటయున్= తనను తిరస్కారభావంతో మాట్లాడగా; ఆకర్ణించి= విని; కౌరవ+ఈశ్వరుండు= దుర్యోధనుడు; కోప+ఆయత్తుండు+ఐ= కోపముపొందినవాడై; పిఱుందు మోవన్‌లేచి= పిఱుదులమీద తన బరువును ఊని పైకి లేచి; చేతుల భూతలంబు+ ఊఁదికొని= చేతులను భూమిమీద ఊనుకొని; బొమముడితోడి చూడ్కి= బొమముడితో (కోపంతో) చూపును; అతనిపయిన్+ పఱపెన్= శ్రీకృష్ణుడిమీద ప్రసరింపజేశాడు; అప్పుడు= ఆ సమయంలో; అపరభాగంబు= క్రింది భాగం; విఱుగన్= విరిగిపోగా;

వ్రేటువడి= దెబ్బ తగిలి; తలఎత్తి= తల మీదికెత్తి; చూచు= చూస్తున్న; మహానాగంబు చందంబు తోఁచెన్= పెద్దపాము విధంగా కనబడ్డాడు; అట్లు= ఆ విధంగా; ప్రాణాంతకరణంబు= ప్రాణం పోయే విధంగా; అయిన= అయినట్టి; వేదనాభరంబుతలంపక= బాధను యోచించకుండా; కూర్చుండి= కూర్చున్నవాడై; మున్ను+ఆకృష్ణుండు= ముందుగా శ్రీకృష్ణుడు; జిష్ణుతోడన్ సంభాషించుటయున్= అర్జునుడితో మాటాడటమున్నూ; అతండు= అర్జునుడు; ఊరుతలంబున్= తొడలున్నచోటును; కరపుటంబునన్= ముంజేతితో; అప్పళించుటయున్= చరచుటయున్నూ; వెడవెడన్= ఇంచించుక; కనుటయున్+చేసి= చూచుటవలన; భీమువాటునన్= భీముడిదెబ్బకు; తొడలు విరిగిపడినప్పుడు= తొడలు విరిగిపోయి పడినపుడు; అప్పటి బుడిబుడిమాటలు= ఆ వేళ మాటాడిన తొట్రుపాటుతో కూడిన మాటలను; ఆ సన్నయున్= ఆ సైగయున్; దీనికిన్+కాకేమి అని+ఊహించి= ఇందుకొరకే గదా అని నమ్మి; చేయునది లేక= చేయగల్గింది లేకుండా; అపుడు గఱచుచున్న వాఁడు+ అగుటన్= (కోపంతో) పెదవి కొరుకుతూ ఉండటంవలన; ఆ గోపాలదేవుతోన్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: శ్వేతపద్మాలవంటి కన్నులుగల శ్రీకృష్ణుడు తనను ఆవిధంగా ఆక్షేపించటాన్ని విన్న దుర్యోధనుడు కోపం నిండిన మనసుతో చేతులను నేలనూదుకొని పిరుదులను మోయగా లేచి, తన చూపులను ఆతడిమీదకు వ్యాపింపజేశాడు. అపు డాతడు దెబ్బతిని కోపంతో పడగను పైకెత్తి చూచే మహానాగేంద్రుడివలె కానవచ్చాడు. ఆ విధంగా ప్రాణా లూడబీకుతున్న బాధను కూడా లెక్కచేయకుండా కూర్చుండి, ఇదివరకు శ్రీకృష్ణుడు అర్జునుడితో గుసగుసలాడగా అర్జునుడు తొడలను చేతులతో చరచటాన్ని కొంతకొంత చూడటంవలన భీముడి దెబ్బకు తొడలు విరిగిపడిన విధానం, అపు డాతడిని గేలితనపు మాటలను, సైగను - దీనికి గదా అని తలచుకొని చేయగలిగింది లేకపోవటంతో, (కోపంతో) పెదవి నొక్కుతూ శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

తొడలు విఱిగి పడిన దుర్యోధనుఁడు కృష్ణు నాక్షేపించుట (సం. 9-60-27)

సీ. 'కంసదాసునిపుత్ర! కానవు నీ దురా। చారంబుఁ, గృపయు లజ్జయును లేక
ప్రేలెదు; నీవు సెప్పినఁ బార్థు చేసిన । సన్న గై కొని గదాసంగరంబు
పాడి దొఱంగి యిప్పాపకర్ముఁడు వైచెఁ । గాక; చక్కటి తోడికయ్య మైన
లీల మిమ్మందఱ నేలపాలుగఁ జేయ । నే? శిఖండి గడంగి యేసె ననఁగ

తే. నర్జునుఁడు శాంతనవుఁ గూల్చునట్లు చేసి; । తస్త్రగురుచావునకుఁ బాండవాగ్రజన్ము
బొంకు మని పంచి; తరదంబు పుడమిఁ గ్రుంగఁ । గర్ణుఁ జంపించి; తే మనఁ గలదు నిన్ను? 325

ప్రతిపదార్థం: కంసదాసుని పుత్ర!= కంసుడికి బానిసఅయిన వసుదేవుడి కుమారా!; నీ దురాచారంబు కానవు= నీ చెడ్డ ఆచారాన్ని గుర్తించవు; కృపయున్ లజ్జయును లేక ప్రేలెదు= దయ, సిగ్గూ లేకుండా ప్రేలుచున్నావు; నీవు చెప్పినన్= నీవు చెప్పగా; పార్థు చేసిన సన్నన్= అర్జునుడు చేసిన సైగ; కైకొని= స్వీకరించి(తీసికొని); గదా సంగరంబు పాడి= గదా యుద్ధ ధర్మమును; తొఱంగి= వదలి; ఈ+పాపకర్ముఁడు= ఈ పాపాత్ముడు; వైచెన్+కాక= కొట్టాడు కాని; చక్కటి= సరిఅయిన; తోడి కయ్యము+ఐనన్= ఎదురుగా సమానమైన యుద్ధమైతే; లీలన్= ఆటగా; మిమ్మున్+అందఱన్= మీ అందరినీ; నేలపాలుగన్+చేయనే?= మట్టి కరిపించనా?; శిఖండి కడంగి ఏసెన్+అనంగన్= శిఖండి పూనుకొని బాణాలు వేసినట్లు; అర్జునుడు శాంతనవున్+కూల్చునట్లు= భీష్ముడిని అర్జునుడు పడగొట్టేటట్లు; చేసితి(వి)= చేశావు; అస్త్రగురు చావునకున్= ధనురాచార్యుడి చావుకై; పాండవ+అగ్రజన్మున్= పాండవ జ్యేష్ఠుడైన ధర్మరాజును; బొంకుము+అని పంచితి(వి)= అబద్ధమాడేటట్లు చేశావు; అరదంబు= తేరు; పుడమిన్= భూమిలో; క్రుంగన్= క్రుంగిపోగా; కర్ణున్+చంపించి(వి)= కర్ణుడిని చంపించావు; నిన్ను ఏమనన్+కలదు?= నిన్నేమనగలను?

తాత్పర్యం: 'ఓ కంసదాసుని కుమారుడా! నీ తప్పుడు చేష్టను గుర్తించవు. కరుణ, దయ లేకుండా వాగుతున్నావు. నీవు చెప్పగా అర్జునుడు చేసిన సైగ నందుకొని గదాయుద్ధధర్మాన్ని తప్పి ఈ పాపాత్ముడు కొట్టాడు కాని న్యాయమైన పోరాటంతో మీ అందరనూ మట్టి కరపించకుండేవాడినా? శిఖండి పూనుకొని వేశాడన్నట్లుగా అర్జునుడు భీష్ముడిని పడగొట్టేటట్లు చేశావు. ధనురాచార్యుడి చావుకై ధర్మజుడిని అబద్ధమాడుమని ఉత్తర్వుచేశావు. రథం భూమిలో కూరుకొనగా కర్ణుడిని చంపించావు. ని న్నేమనవచ్చును?

క. **భూరిశ్రవుఁ డొక్కనితోఁ । బోరఁగ నేయించి తట్లు; పాడిచీఁకటి నం**
హోరహితు సైంధవుని నరు । బారిపఱిచి; తిట్టి నీకుఁ బల్కులు సనునే? **326**

ప్రతిపదార్థం: భూరిశ్రవుఁడు+ఒక్కనితోన్= భూరిశ్రవుడు వేరొక్కడితో; పోరగన్+ఏయించితి= పోరాడేటట్లు చేయించావు; అట్లు= ఆ విధంగా; పాడిచీఁకటి= అసుర సంధ్యలో; పోరగన్ అంహోరహితున్= పాపాలు లేనివాడిని; సైంధవుని= సైంధవుడనే వాడిని; నరుబారి పఱిచితి(వి)= అర్జునుడికి చిక్కేటట్లు చేశావు; ఇట్టి నీకున్= ఇటువంటి నీకు; పల్కులు= మాటలు; చనునే?= తగునా?

తాత్పర్యం: భూరిశ్రవుడొకడితో పోరాడేటప్పుడు (బాణం) వేయించావు. ఆ విధంగా పాడిచీకటిలో పుణ్యాత్ముడైన సైంధవుడిని అర్జునుని బారినపడేటట్లుగా చేశావు. ఇట్టి నీవు మాట్లాడడం తగి యున్నదా?

క. **నను భీష్ము గురుని సూతసు । తుని భూరిశ్రవు జయద్రథుం జక్కటి ద**
ప్పనియనిఁ గోల్పుచ్చఁగ వ । చ్చునె నీకుం గపటశూర! సుచరితదూరా!' **327**

ప్రతిపదార్థం: కపటశూర!= మోసపువీరుడా!; సుచరితదూరా!= సత్ప్రవర్తనలేనివాడా!; నన్నున్= నన్ను; భీష్మున్= భీష్ముడిని; గురునిన్= గురువైన ద్రోణుడిని; సూతసుతునిన్= కర్ణుడిని; భూరిశ్రవున్= భూరిశ్రవుడిని; జయద్రథున్= సైంధవుడిని; చక్కటితప్పని= న్యాయం దప్పిపోని; అనిన్= యుద్ధంలో; నీకున్; కోల్పుచ్చఁగన్+వచ్చునే?= ఓడించనగునా?

తాత్పర్యం: మోసపూరితుడ వైన పాపాత్ముడైన కృష్ణా! నీకు నన్ను, భీష్ముడిని, గురువైన ద్రోణుడిని, కర్ణుడిని, భూరిశ్రవుడినీ, సైంధవుడినీ న్యాయం తప్పని యుద్ధంలో ఓడించటం సాధ్యమైన పనియేనా?'

వ. **అనిన విని యచ్యుతుం డతని నవలోకించి 'నీవు భీముని బాలునిఁ బాములం గఱపించియు విషం బిడియు నీటం ద్రోచియుం బలుమాఱుం జంప దెగితివి; గొంతియుఁ గొడుకు లేవురును నిద్రించుసమయంబున జతు గృహంబు దహించితివి; ధర్మోత్తరచరిత్రుం డగు నజాతశత్రుసంపదలఁ గపటద్యూతంబున నపహరించి; తంత దనివిం బోక యాజ్ఞసేని నేకవస్త్ర రజస్వలం గొలువులోపల భంగపెట్టి తాప్రొద్ద నిన్ను నిట్టి దురవస్థకుం దేరం దగి యుండ నట్లు పోయి సమయంబు నడపి నీచేసిన సకల దుష్కృతంబులు సహించిన యిప్పాండవాగ్రజుండు వనుప నేను బుడమిపా లడుగ వచ్చిన నీ నేరవైతి; నీ నేరమి నిట్లైతి; భవదీయం బగులోభంబునం బాపనిశ్చయంబున మదంబున శాంతచిత్తు లగుశాంతనవద్రోణులకుం బ్రాణహాని వాటిల్లె; వినుము! ద్రుపదుని తపోయజ్ఞ ప్రభావంబుల నదియ పనిగా జనియించిన శిఖండిధృష్టద్యుమ్ను లాభీష్మ గురులమరణంబులకుఁ గారణంబులు గాక తక్కుదురే? పెక్కండ్రతోడం బోరి దస్సినసాత్యకిం జంపువాఁ డైన**

భూరిశ్రవుం జంప కుందుమే? యనేకప్రాఢ యోధు లొక్కరుని బాలు సౌభద్రుం బొదివి చంపినం బూనినపూన్కి నిఖిలోపాయంబుల నెఱపక పుణ్యాత్మయైన పాంచాలి నరణ్యంబునం బరిభవించిన పాపాత్ముని సైంధవుని బ్రదికిపో విడిచి యర్జునుం డగ్నిం బ్రవేశించునే? యి న్నీతిపరుల చరిత్రంబులు నిర్మలంబులు; ఘోషయాత్ర నిన్ను గంధర్వులు పట్టుకొని పోవునప్పుడు నీ వారెల్లం బాఱిన నర్జునుండు నిన్ను విడిపించుట యెఱుంగవే? గాంగేయకుంభజకర్ణాశ్వత్థామ కృపు లుద్దామ సమగ్రసైన్యంబులతోడ నడవ నీవు విరటుని గోవులం బట్టికొని పోవు చోట మీరందఱుఁ దనసమ్మోహనాస్త్రంబున మూర్ఛితులైన సమయంబున నర్జునుండు నిన్నుం గాచుట యెఱుంగ రాదె? నీ వాపాదించిన పాపంబుల కెల్ల మూలం బైన కర్ణునరదంబు ధరణిం గ్రుంగినఁ గవ్వడి వాని నేయ కేల కాచికొని యుండు? నుండె నేనియు భూసుర శాపంబున నట్లైనరథంబునకు విష్కృతి గలుగునే? కావున నన్నీచు సమయించుట సముచితంబు; యుధిష్ఠిరుండు శల్యుం దెగటార్చిన తెఱం గొప్పనొప్ప దని యుగ్గడింపక మేలు సేసితి; పాండునందనులు పుట్టినంతటినుండి నేఁడు దుదిగా నీయెడ ధర్మవిరోధం బాచరింపరు; కురుకులంబునకు గుద్దలి గొని దుర్ద్యూతంబు నీవు తొడరితి; దాన నింతలు వుట్టెఁ; బవనుపట్టి పట్టినప్రతిన యెఱుంగవె? గద నూరుభంగంబు సేయుదు నని పలికి పిడికిటం బొడుచునే?' యవి 'యెల్లను వృథాజల్పంబు లూరకుండు' మనుటయు నజ్జననాథుండు జనార్దనున కి ట్లనియె. 328

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విని; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; అతనిన్+అలోకించి= అతడిని(దుర్యోధనుడిని) చూచి; నీవు భీముని బాలుని= నీవు పసివాడయిన భీముని; పాములన్+కరపించియున్= పాములచేత కరపించి; విషంబు+ఇడియున్= విషమును పెట్టియు; నీటన్+త్రోచియున్= నీళ్ళలో త్రోసియు; పలుమాఱున్= అనేకమార్లు; చంపన్+తెగితివి= చంపటానికి సాహసించావు; గొంతియున్= కుంతి; కుమారులు+ఏవురును= అయిదుగురు కుమారులును; నిద్రించు సమయంబునన్= నిదురించేటపుడు; జతుగృహంబు= లక్కయింటిని; దహించితి(వి)= కాల్చావు; ధర్మోత్తర చరిత్రుండు+అగు= ఉత్తమ ధర్మచరిత్ర కలవాడయిన; అజాతశత్రు సంపదలన్= వైరులులేని వాడైన ధర్మరాజు ఐశ్వర్యమును; కపట ద్యూతంబునన్= మోసపు జూదంతో; అపహరించితి(వి)= కొల్లగొన్నావు; అంత తనివిన్+పోక= అంతటితో తృప్తినందకుండా; యాజ్ఞసేనిని= ద్రౌపదిని; ఏకవస్త్రన్= ఒకే చీరగలదానిని; రజస్వలన్= ఋతుస్నాతను; కొలువులోపల భంగపెట్టితి(వి)= సభలో అవమానం చేశావు; ఆ ప్రొద్దు= ఆ దినమే; నిన్నున్+ఇట్టి దురవస్థకున్= నిన్నీ భంగపాటగు స్థితికి; తేరన్+తగిఉండన్= తీసికొని రా తగిఉండగా; అట్లు పోయి= ఆ విధంగా(అడవులకు) పోయి; సమయంబు నడిపి= ప్రతిజ్ఞ జరుపుకొని; నీ చేసిన సకల దుష్కృతంబులు సహించినన్= నీవు కావించిన పాపాలు ఓర్చుకోగా; ఈ+పాండవ+అగ్రజుండు= ఈ ధర్మరాజు; పనుపన్= పంపగా; ఏను పుడమిపాలు+అడుగన్ వచ్చినన్= నేను భూమిలో భాగం అడుగరాగా; ఈనేరవైతి= ఈయలేకపోయావు; నీ నేరమిన్= నీ ఎరుక లేక పోవుటచేత; ఇట్లు+అయితి(వి)= ఈ విధంగా అయావు; భవదీయంబు+అగు లోభంబునన్= నీయొక్క లోభగుణంవలన; పాపనిశ్చయంబునన్= పాపచింత కారణంచేత; మదంబునన్= గర్వంతో; శాంతచిత్తులు+అగు= శాంత మనస్కులయిన; శాంతనవ= భీష్మ; ద్రోణులకున్= ద్రోణులకును; ప్రాణహాని+పాటిల్లెన్= ప్రాణమునకు ప్రమాదం కలిగింది; ద్రుపదుడి తపోయజ్ఞ ప్రభావంబులన్= ద్రుపదునియొక్క తపస్సు, యజ్ఞముల శక్తులచేత; అదియ పనిగా జనియించిన= ఆ కారణంగా పుట్టిన; శిఖండి ధృష్టద్యుమ్నులు= శిఖండియు ధృష్టద్యుమ్నుడును; ఆ భీష్మగురుల మరణంబులకున్= ఆ భీష్మద్రోణుల చావులకు; కారణంబులు+కాక= నిమిత్తం కాకుండా; తక్కుదురే?= తప్పుకొనగలరా?; పెక్కండ్ర తోడన్+పోరి= చాలమందితో యుద్ధంచేసి; డస్సిన= అలసిన; సాత్యకిన్= సాత్యకిని; చంపువాఁడు+ఐన= చంపపూనుకొన్న; భూరిశ్రవున్+ చంపకుందుమే?= భూరిశ్రవుడిని చంపక ఊరుకొందుమా?; అనేకప్రాఢయోధులు= మిక్కిలి అనుభవమున్న ప్రాఢులైన

వీరులు; ఒక్కరునిన్= ఒకడిని; బాలున్= పసివాడిని; సౌభద్రున్+ పొదివి= సుభద్రాతనయుడిని (అభిమన్యుడిని) క్రమ్ముకొని; చంపినన్+పూనిన పూన్కిన్= చంపగా చేసిన ప్రతినను; నిఖిల+ ఉపాయంబులు నెఱపక= అన్ని ఉపాయాలనూ ఉపయోగించకుండా; పుణ్య+ఆత్మఐన పాంచాలిని= పవిత్రమూర్తిఅయిన ద్రౌపదిని; అరణ్యంబునన్= అడవిలో; పరిభవించిన= అవమానించిన; పాపాత్మునిన్= దుష్టుడిని; సైంధవుడిని బ్రదికిపోన్+విడిచి= సైంధవుని బ్రదికిపోనిచ్చి; అర్జునుండు+అగ్నిన్+ప్రవేశించునే?= అర్జును డగ్నిలో దూకునా?; ఈ+నీతిపరుల చరిత్రంబులు= ఈ+నీతిమంతుల చరిత్రలు; నిర్మలంబులు= స్వచ్ఛమైనవి; ఘోషయాత్రన్= ఆవులకొరకు వెళ్లిన యాత్రలో; నిన్నున్ గంధర్వులు పట్టుకొనిపోవునప్పుడు= నిన్ను గంధర్వులు నిర్బంధించి పట్టుకొనిపోయేటపుడు; నీవారు+ఎల్లన్+పాఱినన్= నీ వారంతా పరుగెత్తిపోగా; అర్జునుండు; నిన్నున్ విడిపించుట ఎఱుఁగవే?= నిన్ను తప్పించటం తెలియదా?; గాంగేయ కుంభజ కర్ణాశ్వత్థామ కృపులు= భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ, కృపాచార్యుడును; ఉద్దామ సమగ్ర సైన్యంబులతోడన్= గొప్ప సన్నద్ధం అయిన సేనలతో; నడవన్= (దండు) వెడలగా; నీవు విరటుని గోవులన్+పట్టుకొనిపోవుచోటన్= నీవు విరటుని ఆలమందను పట్టుకొని పోయేటపుడు; మీరు+అందఱున్= మీరందరును; తన సమ్మోహన+అస్త్రమునన్= తన సమ్మోహనాస్త్రంచేత; మూర్ఛితులు+ఐన సమయంబునన్= మూర్ఛపోయిన సమయాన; అర్జునుఁడు నిన్నున్+కాచుట= నిన్ను కాపాడటం; ఎఱుంగరాదె?= తెలియదా?; నీవు+ఆపాదించిన పాపంబులకున్+ఎల్లన్= నీవు వారిమీద మోపిన పాపాలకంతటికి; మూలంబు+ ఐన= ఆధారమైన; కర్ణు+అరదంబు= కర్ణుడితేరు; ధరణిన్+క్రుంగినన్= భూమిలో దిగబడగా; కవ్వడి వానిన్+ఏయక= సవ్యసాచి వాడిని కొట్టక; ఏల కాచికొనిఉండున్?= ఎందులకు వేచి ఉంటాడు? ఉండెన్+ఏనియున్= ఉన్నప్పటికిని; భూసురశాపంబునన్= బ్రాహ్మణుడి శాపంవలన; అట్లయిన రథంబునకున్= ఆ విధంగా తన తేరునకు; నిష్కృతి కల్గునే?= ప్రాశ్చిత్తం కల్గుతుందా?; కావునన్= కనుక; ఆ+నీచున్+సమయించుట సముచితంబు= ఆ నీచుడిని చంపటం న్యాయం; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; శల్యున్+తెగటార్చిన తెఱంగు= శల్యుడిని చంపిన విధం; ఒప్పున్+ఒప్పదు+అని= తగును-తగదని చెప్పకుండా; మేలుచేసితి= మంచిపని చేశావు; పాండునందనులు= పాండురాజకుమారులు; పుట్టినప్పటినుండి= పుట్టిననాటినుండి; నేఁడు తుది= ఈనాటిదాకా; నీ+ఎడన్= నీ విషయంగా; ధర్మవిరోధంబు= ధర్మానికి వ్యతిరేకంగా (అన్యాయంగా); ఆచరింపరు= చేయరు; కురుకులంబునకున్= కురువంశానికి; గుద్దలికొని= గునపం తీసికొని (కుళ్ళగించుటకు); దుర్ద్యూతంబు= మోసపు జూదానికి; నీవు+అ+తొడరితి(వి)= నీవే పూనుకొన్నావు; దానన్+ఇంతలు+పుట్టెన్= అందుచేత ఇంత జరిగింది; పవన తనయుండు= భీమసేనుడు; పట్టిన= పూనిన; ప్రతిన= శపథమును; ఎఱుంగవే?= తెలియవా?; గదన్= గదతో; ఊరుభంగంబున్+చేయుదును+అని= తొడలు విఱుగగొట్టుతానని; పలికి= చెప్పి; పిడికిటన్+ పొడుచునే?= పిడికిలితో పోటు పొడుస్తాడా?; అవి+ఎల్లను= అవి అంతా; వృథాజల్పంబులు= వ్యర్థమైన మాటలు; ఊరకుండుము= మాట్లాడకుండా ఉండుము; అనుటయున్= అనగా; ఆ+జననాథుండు= ఆ రాజు(దుర్యోధనుడు); జనార్దనునకున్+ఇట్లు+ అనియెన్= శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు దుర్యోధనుడిని చూచి, 'పసివాడయిన భీముడిని పాములచే కరిపించావు. విషాన్నమును పెట్టించావు. నీళ్ళలో త్రోయించావు. అనేక విధాల తెగించావు. కుంతి కుమారులైదుగురితో కలసి నిదురించేటపుడు లక్క ఇంటిని కాల్పించావు. ఉత్తమ ధర్మప్రవర్తనం కలవాడయినవాడూ అజాతశత్రువూ ఐన ధర్మజుడి సంపదను మోసపు జూదంలో కొల్లగొన్నావు. ఏకవస్త్రయు ఋతుస్నాతయుఅయిన ద్రౌపదిని నిండు సభలో అవమానము చేశావు. ఆనాడే నిన్నీ భంగపాటునకు తేవలసి ఉండింది. కాని, ఆ విధంగా (అరణ్య, అజ్ఞాత వాసాలకు) పోయి ప్రతిజ్ఞను నిలుపుకొని, ధర్మజుడు పంపగా భూభాగాన్ని అడగటానికి నేను రాగా ఇచ్చావు కావు. నీకు జ్ఞానం లేకుండటంచేత ఇట్లయిపోయావు. నీ లోభగుణం, పాపం, మదం, అహంకారం, శాంతమనస్కులైన భీష్మద్రోణులకు ప్రాణహాని కలిగించాయి; ద్రుపదుడి తపస్సు, యజ్ఞాలు కారణంగా జన్మించిన శిఖండి ధృష్టద్యుమ్నులు, ఆ

భీష్మగురుల చావులకు నిమిత్తం కాకుండా తప్పుతుందా? చాలామందితో యుద్ధం చేసి అలసిన సాత్యకిని చంపటానికై పూనుకొన్న భూరిశ్రవుడిని చంపకుంటామా? మిక్కిలి పసివాడైన అభిమన్యుడిని ప్రౌఢులు చుట్టుకొని చంపగా చేసిన శపథాన్ని అన్ని ఉపాయాలతో నెరవేర్చుకుంటారా? పతివ్రతఅయిన ద్రౌపదిని అడవిలో అవమానించిన దుర్మార్గుడు - సైంధవుడిని బ్రదికిపోనీయవచ్చునా? పోనిచ్చి అర్జునుడు అగ్గిలో దూకుతాడా? ఈ నీతిమంతుల జీవితాలు స్వచ్ఛములైనవి. ఘోషయాత్రలో గంధర్వులు నిన్ను పట్టుకొని పోగా నీ వారంతా పరుగెత్తారు. అప్పుడు అర్జునుడు నిన్ను విడిపించటం ఎరుగవా? భీష్మద్రోణ కర్ణ, అశ్వత్థామ కృపులు గొప్పసేనతో వెళ్ళగా నీవు విరాటరాజు పశువులను పట్టినపుడు మీరంతా తన సమ్మోహనాస్త్రంవలన మూర్ఛితులు కాగా అర్జునుడు నిన్ను కాపాడటం జ్ఞాపకంలేదా? నీవు కావించిన పాపాలకంతా మూలమైన కర్ణుడి తేరు భూమిలో క్రుంగినపుడు సవ్యసాచి వాడిని చంపకుండా ఎందుకు కాచుకొని ఉండాలి? ఉండెనుపో. బ్రాహ్మణుడి శాపంవలన అట్లా క్రుంగిన తేరునకు విముక్తి ఉంటుందా? కాబట్టి ఆ నీచుని చంపటం న్యాయమే. ధర్మజుడు శల్యుడిని చంపటంలోని ఒప్పుతప్పులను పేర్కొనకుండా వదలిపెట్టి మంచిపనినే చేశావు. పాండవులు పుట్టిన నాటినుండీ నీయెడ ధర్మాతిక్రమణం చేయలేదు. కురువంశాన్ని గునపం తీసికొని కుళ్ళగించిన తీరును నీవు మోసపు జూదానికి పూనుకొన్నావు. అందుచేతనే ఇంత జరిగింది. భీముడు పట్టిన శపథం తెలియదా? గదతో తొడలు విరుగగొట్టుతానని శపథం చేసినవాడు పిడికిలితో పొడుస్తాడా?అని, నీవన్నీ వ్యర్థవాదాలు. ఊరుకొనుము.' అనగా దుర్యోధనుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

చ. **'చదివితి నెల్ల వేదములు, జన్నము లొప్పఁగ జేసితిన్, రమా**
స్పద మగువృత్తిఁ బొల్చి నరపాలకు లెల్లను గొల్వఁ గంటి, దు
ర్మదరిపు గాఢగర్వపరిమర్దన కేళి యొనర్చితిం, దగం
దుది నని మిత్రబాంధవులతోఁ ద్రిదివంబున కేఁగు టొప్పదే? **329**

ప్రతిపదార్థం: ఎల్ల వేదములు= వేదాలన్నీ; చదివితిన్= చదివాను; జన్నముల్= యజ్ఞాలను; ఒప్పఁగన్+చేసితిన్= తగినట్లుగా చేశాను (ధర్మవిధంగా); రమా+ఆస్పదమగు వృత్తిన్+పొల్చి= సందకు తావైన నడవడితో ఒప్పి; నరపాలకులు+ఎల్లన్= రాజులందరూ (సామంతరాజు లంతా); కొల్వన్= సేవించగా; కంటిన్= చూడగలిగాను; దుర్మద రిపు= దురహంకారు లయిన శత్రువులయొక్క; గర్వమర్దనకేళి ఒనర్చితిన్= పొగరును నాశనం చేశాను; తగన్= తగినట్లుగా (పొగడ్తకు తగినట్లు); తుదిన్= చివర; అనిన్= యుద్ధంలో; మిత్రబాంధవులతోన్= బంధువులతోను, స్నేహితులతోను; త్రిదివంబునకున్= స్వర్గానికి; ఏఁగుట+ఒప్పదే?= వెళ్ళటం తగదా!

తాత్పర్యం: 'అన్ని వేదాలను చదివాను. యజ్ఞాలు విధిప్రకారం చేశాను. సంపదకు తావలమైన నడవడితో బ్రతికాను. రాజులెందరో సేవించగా చూచాను. దురహంకారగర్వంతో ఉన్న రాజులను యుద్ధంలో జయించాను. తుదకు స్నేహితులతోను, బంధువులతోను కలసి స్వర్గానికి వెళ్ళటం ఒప్పదా?

వ. **నీకుం జూడ నెట్టివాఁడ నైనను నా కేమి? మీరింకఁ బశ్చాత్తాపదుఃఖితు లగుచు నుందురు గాక' యనియె; నప్పు డతనిపైఁ బుష్పవర్షంబులు గురిసె, దేవదుందుభులు మొరసె; దిశలు దెలివొందెం; మృదుసమీరణంబు సుగంధి యై వీతెంచె; నంతయు ననుసంధించి యక్కొంతేయులు దారు ధర్మంబు దొఱంగి గాంగేయద్రోణ**

కర్ణశల్యదుర్యోధనాదుల వధించుట యత్తఱిం గ్రొత్తయై తోఁచినఁ, జిత్తంబుల వగయు లజ్జయు మిగులం బొడమి మొగంబులఁ దోఁప విన్ననై యున్నం జూచి వెన్నుండు తత్సమీపంబునకుం జని వారలతో నిట్లనియె. **330**

ప్రతిపదార్థం: నీకున్+చూడన్+ఎట్టి వాఁడన్+ఐనను= చూడగా నీ కెటువంటి వాడయినప్పటికినీ; నా కేమి?; మీరింక పశ్చాత్తాప దుఃఖితులగుచున్+ఉందురుగాక= మీ రికమీద పశ్చాత్తాపంతో దుఃఖపడుతూ ఉంటారుగాక; అనియెన్= అన్నాడు; అప్పుడు+అతనిపైన్ పుష్పవర్షంబులు గురిసెన్= అపు డా దుర్యోధనుడి మీద పూలవాన కురిసింది; దేవ దుందుభులు మొరసెన్= దేవతల దుందుభిధ్వానాలు మ్రోగాయి; దిశలు తెలివొందెన్= దిక్కులు తెల్లబడ్డాయి; మృదు సమీరంబు= చల్లని గాలి; సుగంధిఐ వీచెన్= సువాసనలతో వీచింది; అంతయు ననుసంధించి= అన్నిటిని కలిపి; ఆ+కౌంతేయులు= ఆ కుంతీ తనయులు (పాండవులు); తారు= తాము; ధర్మంబుతొఱంగి= ధర్మాన్ని వదలి; గాంగేయ ద్రోణ కర్ణ శల్య దుర్యోధనాదులన్ వధించుట= భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, దుర్యోధనాదులను చంపటం; ఆ+తఱిన్+క్రొత్తఐ తోఁచినన్= ఆ సమయాన క్రొత్తగా కానరాగా; చిత్తంబులన్= మనసులలో; వగయున్= దుఃఖమూ; లజ్జయున్= సిగ్గూ; మిగులన్+పొడమి= మిక్కిలిగా కలిగి; మొగంబులన్+తోఁపన్= ముఖాలలో కానరాగా; విన్ననై+ఉన్నన్+చూచి= దైన్యంతో ఉండగా చూచి; వెన్నుండు= శ్రీకృష్ణుడు; తద్+సమీపంబునకున్+చని= వారి దగ్గరకు వెళ్ళి; వారలతోన్+ఇట్లు+అనియెన్= వారితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: నీ దృష్టిలో నేనెటువంటివాడ నైనా కావచ్చును. అయితే నా కేమి? మీ రంతా పశ్చాత్తాప దుఃఖంతో ఉంటారుగాక!' అన్నాడు. అపు డా దుర్యోధనునిమీద పూలవాన కురిసింది. దేవదుందుభులు మ్రోగాయి. దిక్కులన్నీ తెల్లబడ్డాయి. చల్లని గాలి సువాసనలతో వీచింది. వీటినంతా కలుపుకొని కుంతి కుమారులైన పాండవులు తాము ధర్మాతిక్రమణం చేసి భీష్మ ద్రోణ కర్ణ శల్య దుర్యోధనాదులను చంపిన తీరు క్రొత్తగా తోచగా మనసులలోని సిగ్గు, వగపు మొగాలలో తోచి విన్నబోగా శ్రీకృష్ణుడు వారితో ఇట్లా అన్నాడు.

సీ. **'గాంగేయ గురు కర్ణ కౌరవపతులఁ జ । క్కటి యనిఁ బరిమార్పఁ గాన మైతి**
మని మీరు వగవకుఁ; డద్దొర లుగ్రాస్త్ర । వేదులు, ప్రస్ఫుటవిక్రమమున
నడరి వారల గెల్చు టరిది గావున నేను । బహువిధోపాయముల్ వన్ని యిట్లు
దీర్చితిఁ గాక, యత్తీవ్రపరాక్రము । లలఁతులఁ బోదురే? యట్లుఁ గాక

తే. **వారి విధి యివ్విధమునఁ జావంగఁ జేసె । దైవఘటనలు దప్పింప మీవశంబె?**
సురలు దనుజులు గెల్చిన చొప్పు లిట్లు; । సంతసపు సమయంబున వంత లేల? **331**

ప్రతిపదార్థం: గాంగేయ గురు కర్ణ కౌరవపతులన్= భీష్మ ద్రోణ కర్ణ దుర్యోధనులను; చక్కటి అనిన్= ధర్మయుద్ధంలో; పరిమార్పన్= చంపగా; కానము+ఐతిమి= చూడలేకపోయాము; అని= అనుకొని; మీరు వగవకుఁడు= మీరు దుఃఖపడవద్దు; ఆ+దొరలు= ఆ రాజులు; ఉగ్ర+అస్త్రవేదులు= భయంకరమైన అస్త్ర రహస్యాలు తెలిసినవారు; ప్రస్ఫుట విక్రమమునన్= స్పష్టమైన శౌర్యంతో; అడరి= అతిశయించి; వారలన్ గెల్చుట= అటువంటివారిని జయించటం; అరిది= ఆశ్చర్యం; కావునన్= కనుక; ఏను= నేను; బహువిధ+ఉపాయముల్+పన్ని= నానా ఉపాయాలను యుద్ధ సన్నద్ధంగా చేసి; ఇట్లు తీర్చితిన్+కాక= ఈ విధంగా చేయగలిగాను కాని; ఆ+తీవ్ర పరాక్రములు= ఆ భయంకర వీరులు; అలఁతులన్+పోదురే= తేలికగా చనిపోతారా?; అట్లున్+కాక= అంతేకాకుండా; వారిన్; విధి= బ్రహ్మ; ఈ+విధమునన్= ఈ ప్రకారంగా; చావంగన్+చేసెన్= చచ్చేటట్లుగా చేశాడు; దైవఘటనలు= విధి నిర్ణయాలను; తప్పింపన్= తప్పిపోజేయగా; మీ వశంబె?= మీకు సాధ్యమా; సురలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దనుజులన్= దేవతలు రాక్షసులను; గెల్చినచొప్పున్= జయించిన విధానాలు; ఇట్లు+అ= ఇట్టివే; సంతసపు సమయంబునన్= ఆనందించేవేళలో; వంతలు+ఏల?= దుఃఖం ఎందుకు?

తాత్పర్యం: 'భీష్మ ద్రోణ కర్ణ దుర్యోధనులను సవ్యమైన రణకౌశలంతో చంపలేకపోయామని మీరు దుఃఖించవద్దు. వారందరును భయంకరమైన అస్త్రరహస్యాలు తెలిసినవారు. ప్రస్ఫుటమైన శౌర్యంతో వారిని గెలవటం అసాధ్యం. కనుక అనేక ఉపాయాలతో ఈ విధంగా వారిని చంపించాను. లేకుంటే ఆ తీవ్ర పరాక్రమాలు కల ఆ వీరులు సులభంగా పోతారా? అంతే కాదు. వారిని విధి ఈ విధంగా చచ్చేటట్లు చేసినది. దైవనిర్ణయాన్ని తప్పించటం మీకు సాధ్యమా! దేవతలు రాక్షసులను గెల్చిన తీరిటువంటిదే? ఈ సంతోష సమయంలో దుఃఖ మెందుకు?

పాండవులు ధృష్టసాత్యకులతోఁ గౌరవశిబిరమునకుం బోవుట (సం. 9-61-3)

వ. **కృతకృత్యుల మైతిమి; ప్రొద్దునుం జాల వ్రాలె; సేనయు సైనికవరులును విశ్రమింపవలయుఁ; బోదము లెం' డనినఁ బాండవులు దెలివొందఁ బాంచాలురునుం దక్కిన భూపాలురునుం బ్రమోదంబు నొంది; రప్పుడు కృష్ణుండు పాంచజన్యంబు పూరించిన నర్జునుండు దేవదత్తంబును, యుధిష్ఠిరుం డనంతవిజయంబును భీమసేనుండు పౌండ్రంబును, నకులసహదేవులు సుఘోషమణిపుష్పకంబులును బూరించిరి. సకలరథికోత్తములును దమతమ శంఖంబు లొత్తిరి. భేరీపణవాదితూర్యంబులు మ్రోసె. నా సముత్థితనినాదంబులు నింగి నిండె; నిఖిలజనంబులుం బాండవేయులం బొగడునులివు దిక్కుల దీటుకొనియె; ని ట్లుబ్బునం జెలంగుచు వార లందఱు నచ్చోటు గదలిరి; కౌంతేయులుఁ గౌరవ శిబిరంబునకుం జనిన సాత్యకి యనుగమనంబు సేసె; ధృష్టద్యుమ్నప్రముఖు లైన ద్రుపదజ్ఞాతులును ద్రౌపదేయులునుం దక్కినధరణీశులును దమవిడిదలలం గాని విశ్రమంబునకు వెరవుగా దని తలంచి తా రందుఁ బోయి నాఁటి రాత్రి నిలిచి రేపకడ గరిపుర ప్రయాణంబున కొదవం జనుదెంచువారుగా విన్నవించి ధర్మతనయు ననుమతి వడసి సైన్య సమేతంబుగాఁ బోయి రట్లు వార లటు వోవ నప్పాండునందనులు సని సంగీత ప్రవర్తక సంఘంబులు విరిసి చనిన రిత్తయై యున్న రంగస్థలంబుచందంబునం బాదరియున్న యాశిబిరంబుఁ బ్రవేశించి, నీనందను నగరు సొచ్చిన, నచ్చట నున్న పరిచారికులును దత్సహవాసులును మణికనకాది వస్తుసంచయాధ్యక్షులును నయ్యుధిష్ఠిరుంగాంచి యాదరణంబు వడసి; రక్కుంతీ నందనులు రథంబులు డిగ్గునవసరంబున వాసుదేవుండు వాసవి నాలోకించి.** **332**

ప్రతిపదార్థం: కృతకృత్యులము+ఐతిమి= ధన్యుల మైనాము; ప్రొద్దునున్ చాలవ్రాలెన్= ప్రొద్దుకూడా చాలా అయింది. సేనయున్, సైనికవరులును= బలములు, సేనానులును; విశ్రమింపవలయున్= విశ్రాంతిని పొందాలి; పోదము లెండు= పోదాము రండి; అనినన్= అనగా; పాండవులు; తెలివి+ఒందన్= ప్రసన్నులుకాగా; తక్కిన భూపాలురునున్= మిగిలినరాజులు; ప్రమోదంబున్+ ఒందిరి= సంతోషించారు; అప్పుడు; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; పాంచజన్యంబున్+పూరించినన్= పాంచజన్యాన్ని ఊదగా; అర్జునుండు= అర్జునుడును; దేవదత్తంబును= తనశంఖమైన దేవదత్తమును; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; అనంత విజయంబును= అనంత విజయమనే పేరున్న శంఖాన్ని; భీమసేనుండు పౌండ్రంబును= భీముడు పౌండ్రమనే దానిని; నకుల సహదేవులు సుఘోషమణిపుష్పకంబులును= నకులుడు, సహదేవుడు సుఘోషము, మణిపుష్పకము అనే వాటిని; పూరించిరి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఊదారు; సకల రథిక+ఉత్తములును= అందరు సేనా నాయకులును; తమ తమ శంఖంబులు+ఒత్తిరి= తమ తమ శంఖాలను పూరించారు; భేరీపణవ+ఆది తూర్యంబులు మ్రోసెన్= నగారాలు, ఉడుకలు మ్రోగాయి; ఆ సముద్ధత నినాదంబులు= ఆ ఎక్కువయిన శబ్దాలు; నింగి నిండెన్= ఆకాశం దాకా నిండినవి; నిఖిల జనంబులున్= జనులంతా; పాండవేయులన్+పొగడు+ఉలివు= పాండవులను కీర్తించే శబ్దం; దిక్కుల దీటుకొనియెన్= దిక్కులదాకా తగిలింది; ఇట్లు+ఉబ్బునన్+చెలంగుచున్= ఈ విధంగా సంతోషంతో ఒప్పుతూ; వారలు+అందఱున్+అచ్చోటు కదలిరి= వారంతా ఆ చోటునుండి వెళ్ళారు; కౌంతేయులు= కుంతి కుమారులు; కౌరవ శిబిరంబునకున్+చనినన్= కౌరవుల గుడారాలకు వెళ్ళగా; సాత్యకి అనుగమనంబు చేసెన్= సాత్యకి తోడుగా వెళ్ళాడు; ధృష్టద్యుమ్న ప్రముఖులు+ఐన= ధృష్టద్యుమ్నాది ముఖ్యులును; ద్రుపదజ్ఞాతులును= ద్రుపదుడి దాయాదులును; ద్రౌపదేయులును= ఉపపాండవులును; తక్కిన ధరణీ+ఈశులు= మిగిలిన రాజులును; తమ విడిదలలన్+కాని= తమ విడిదులలో తప్ప; విశ్రమంబునకున్ వెరవుగాదని తలంచి= విశ్రాంతి పొందుటకు తగదని భావించి; తారు+అందున్+పోయి= తాము+ఆ+చోటికి వెళ్ళి; నాటి రాత్రి నిలిచి= ఆ రాత్రికి ఉండి; రేపకడ= తెల్లవారగా; కరిపురప్రయాణంబునకున్= హస్తినాపురికి ప్రయాణం కావటానికి; ఒదవన్+చనుదెంచువారుగాన్= తగునట్లు వచ్చువారుగా; విన్నవించి= చెప్పి; ధర్మతనయు+అనుమతి పడసి= ధర్మరాజు అనుజ్ఞ పొంది; సైన్యసమేతంబుగాన్+పోయిరి= సేనలతో కూడా వెళ్ళారు; వారలు+అటుపోవన్= సేనా సమూహంతో వారావిధంగా వెళ్ళగానే; ఆ+పాండునందనులు చని= ఆ పాండు కుమారులు వెళ్ళి; సంగీత ప్రవర్తక సంఘంబులు= సంగీతం ప్రచారం చేసే సమాజాలు; విరిసి చనినన్= వెళ్ళిపోగా; రిత్తఐ ఉన్న= శూన్యమైపోయిన; రంగస్థలంబు చందంబునన్= నాటక రంగభూమి మాదిరిగా; పాడు+అటి+ఉన్న= బీడువారిన; ఆ శిబిరంబున్+ప్రవేశించి= ఆ గుడారంలోనికి పోయి; నీ నందను నగరున్+చొచ్చిన= నీ కుమారుడి (దుర్యోధనుడి) మేడలోనికి వెళ్ళగా; అచ్చటన+ఉన్న పరిచారకులును= అక్కడ ఉండిన సేవకులును; తత్సహవాసులును= వారి స్నేహితులును; మణికనక+ఆది వస్తు సంచయ+అధ్యక్షులును= మణులకు బంగారానికిని అధికారులయిన వారును; ఆ+యుధిష్ఠిరున్+కాంచి= ఆ ధర్మజుడిని చూచి; ఆదరణంబు పడసిరి= ప్రేమను పొందినవారయ్యారు; ఆ+కుంతీనందనులు= ఆ పాండవులు; రథంబులు డిగ్గు+అవసరంబునన్= తేరులనుండి దిగే సమయంలో; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; వాసవిన్= అర్జునుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: చేయవలసిన పనిని చేశాము. ధన్యులము. సాయంకాలమైనది. సేనతో సేనానులు కూడా విశ్రాంతి పొందవలసిఉన్నది. పోదాము. లేవండి'- అనగా పాండవులు ప్రసన్నులైనారు. పాంచాలురూ మిగిలిన రాజులూ సంతోషించారు. అపుడు కృష్ణుడు తన శంఖం పాంచజన్యమును ఊదాడు. అర్జునుడు దేవదత్తాన్నీ, ధర్మజుడు అనంతవిజయాన్నీ, భీముడు పౌండ్రాన్నీ, నకులుడు సుఘోషాన్నీ, సహదేవుడు మణిపుష్పకాన్నీ పూరించారు. సేనానాయకు లందరూ తమ తమ శంఖాలను పూరించారు. నగారాలు, తూర్యములు మ్రోగాయి. పైకెగసిన శబ్దాలు ఆకసందాకా నిండింది. జనులంతా పాండవులను పొగడే ప్రశంసలు దిక్కులను తాకాయి. ఈ సంతోషంతో వారంతా ఆ చోటనుండి వెళ్ళారు. కుంతి కుమారులు కౌరవుల గుడారాలకు వెళ్ళగా, సాత్యకి వారి ననుసరించాడు. ధృష్టద్యుమ్నుడు మొదలైన ద్రుపదుడి దాయాదులూ, ఉపపాండవులూ, తక్కిన రాజులును తమ విడిదులకు వెళ్ళి విశ్రాంతి పొందటం మంచిదనుకొని తా మా రాత్రి అక్కడ నిలిచి మరునాటి ఉదయాన హస్తినాపురానికి ప్రయాణమునకు తగినట్లుగా వస్తామని మనవి చేసి, ధర్మరాజు అనుమతి తీసికొని, సైన్యంతో వెళ్ళారు. వా రా విధంగా పోగా, సంగీతాన్ని అందించే బృందాలు వెళ్ళిపోగా చిన్నపోయినట్లు కనుపించే రంగస్థలం వలె వెలవెలపోయే ఆ గుడారం లోనికి పాండవులు పోయి, నీ కుమారు డుండే నగరులోనికి పోగా, ఆ చోటినుండే సేవకులు, వారి అనుయాయులు, మణి కనకాది సమూహాలకు అధికారులు, ఆ యుధిష్ఠిరుడిని చూచి ఆదరణ పొందారు. ఆ కుంతీకుమారులు తేరులు దిగే సమయంలో శ్రీకృష్ణుడు అర్జునుడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

క. 'కవదొనలును గాండీవము । నవల నిడం బనుపు; ముంద రరదము డిగు; మే
న విదప డిగియెద; శుభకర । మవు నవ్విధ; మట్లు సేయు' మనుడు నతండున్. 333

ప్రతిపదార్థం: కవదొనలును= అమ్ములపొదుల జతయూ; గాండీవమున్= గాండీవమనే అర్జునుని విల్లునూ; అవలన్= దూరంగా; ఇడన్+పనుపుము= పెట్టుటకై పంపుము; ముందర రథమున్= ముందుగా తేరునుండి; దిగుము; ఏన= నేనే; పిదపన్ డిగియెదన్= ఆ తరువాత దిగుతాను; ఈ+విధము= ఈ పద్ధతి; శుభకరము+అగున్= మేలు ఔతుంది; అట్లు చేయుము= ఆ విధంగా చేయవలసింది; అనుడున్= అనగా; అతండున్= అర్జునుడు కూడా.

తాత్పర్యం: 'గాండీవమును ధనుస్సును అమ్ముల పొదుల జంటను ఆవల పెట్టేటట్లు చేయుము. నీవు ముందుగా తేరునుండి దిగుము. నేను తరువాత దిగుతాను. అది క్షేమకరం.' అనగా అర్జునుడు కూడా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ధనువు తూణీరయుగళంబుఁ గొనుచు రథము । డిగుడు, శౌరి పగ్గంబుల నొగల ముడిచి
డిగియెఁ; గేతనకపియు భూతగణయుతము । గాఁ దొలంగె; నత్తేరు తత్క్షణమ మండె. 334

ప్రతిపదార్థం: ధనువున్= వింటిని; తూణీరయుగళంబున్= అమ్ములపొది జంటను; కొనుచున్= తీసికొని; రథము డిగుడున్= తేరినుండి దిగగానే; శౌరి= కృష్ణుడు; పగ్గంబులన్= గుఱ్ఱాల పగ్గాలను; నొగలన్= తొట్టెలో; ముడిచి= చుట్టి; దిగియెన్= దిగాడు; కేతన కపియున్= జెండా మీది హనుమంతుడుకూడా; భూతగణయుతముగాన్= భూతముల సమూహంతో; తొలంగెన్= తప్పుకొన్నాడు; తద్+క్షణము+అ= వెంటనే; ఆ+తేరు= ఆ రథం; మండెన్= మండిపోయింది.

తాత్పర్యం: వింటిని, తూణీరాల జంటను తీసికొని (అర్జునుడు) రథం దిగాడు. శ్రీకృష్ణుడు పగ్గాలను తొట్టెలో ముడిచిపెట్టి క్రిందికి దిగాడు. ధ్వజం మీది ఆంజనేయుడు భూతగణంతో తొలగిపోయాడు. వెంటనే ఆ తేరు మండిపోయింది.

అగ్నిదత్తం బైన యర్జును రథంబు కాలిపోవుట (సం. 9-61-14)

క. తురగంబులతోఁ గూడఁగ । నరదము సకలంబు నుజ్జ్వలానలశిఖలన్
సురసురఁ బోయినఁ గని య । న్నరుఁ డచ్చెరువంది కృష్ణునకు నభిముఖుఁ డై. 335

ప్రతిపదార్థం: తురగములతోన్+కూడఁగన్= గుఱ్ఱాలతో కూడా; అరదము సకలంబున్= తేరు మొత్తంగా; ఉజ్జ్వల+అనలశిఖలన్= ప్రకాశించే కాంతి గల నిప్పు మంటలతో; సురసురన్+పోయినన్+కని= సురసుర శబ్దంతో మండగా చూచి; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; అచ్చెరువు+అంది= ఆశ్చర్యపడి; కృష్ణునకున్+అభిముఖుఁడు+ఐ= కృష్ణుడికెదురుగా (నిలిచి).

తాత్పర్యం: గుఱ్ఱాలతో కూడిన తేరు మొత్తంగా తీవ్రాగ్నిజ్వాలలతో చురచుర శబ్దం చేస్తూ మండిపోగా చూచిన అర్జునుడు అబ్బురంగా శ్రీకృష్ణుడికి ఎదురుగా (తిరిగి). (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. వినయంబుతోడ మోడ్పుఁగేలు ఫాలతలంబునఁ గదియించి వినతుండై 'దేవా! యిట్టి యాశ్చర్యంబుం గలదె? యీ రథంబు దగ్ధం బగుటకుఁ గారణం బేమి? నాకు వినందగునేని యానతి' మ్మనిన మురారాతి యతని కిట్లనియె. 336

ప్రతిపదార్థం: వినయంబుతోడన్= అణకువతో; మోడ్పు+కేలు ఫాలతంబునన్+కదియించి= జోడించిన చేయి నెన్నుదుటికి చేర్చి; వినతుండు+ఐ= నమస్కారం చేసినవాడై; దేవా!= ఓ స్వామీ!; ఇట్టి ఆశ్చర్యంబు+కలదె?= ఇటువంటి వింత ఉన్నదా?; ఈ రథంబు దగ్ధంబు+అగుటకున్+కారణంబు+ఏమి?= ఈ తేరు కాలిపోవటానికి కల కారణమేమి?; నాకు వినన్+తగునేని= నేను వినదగినదయితే; ఆనతి ఇమ్ము+అనినన్= తెలియజేయుము అనగా; ముర+అరాతి= శ్రీకృష్ణుడు; అతనికిన్+ఇట్లు+ అనియెన్= అర్జునుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అణకువతో నమస్కరించి వినమ్రుడై 'ఇది చాలా వింతగా ఉన్నది. ఈ తేరు కాలిపోవటానికి కారణ మేమి? నేను వినదగినదయితే సెలవీయండి.' అనగా శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు.

క. 'గురుకర్ణుల యస్త్రాగ్నుల । నెరిసినయది మున్ను; దీని నిటు గాకుండం
భరపడి రక్షించితి; సం । గరము దెగినఁ దొలఁగి యిపుడు గాల విడిచితిన్.' 337

ప్రతిపదార్థం: గురు కర్ణుల అస్త్ర+అగ్నులన్+ఎరిసిన అది= ద్రోణుడియొక్క కర్ణుడియొక్క బాణాగ్నులచే మండినది; మున్ను= ముందుగానే; దీనిన్= ఈ తేరును; ఇటు కాకుండన్= ఈ విధంగా నుసి కాకుండా; భరపడి రక్షించితిన్= వహించి కాపాడాను; సంగరము తెగినన్= యుద్ధం పూర్తికాగా; తొలఁగి= తప్పుకొని; ఇపుడు= ఈ సమయంలో; కాలన్= కాలిపోగా; విడిచితిన్= వదలాను.

తాత్పర్యం: 'ఈ రథం ద్రోణుడి, కర్ణుడి బాణాగ్నులచేత ఇదివరకే మండింది. ఇది మండకుండా నేను ఇట్లు రక్షించాను. యుద్ధం ముగిసింది. కనుక దీనిని ఈ విధంగా కాలటానికి వదలిపెట్టాను.'

వ. అని చెప్పి యప్పు డద్భుతరసమగ్నులగుచున్న తక్కటి పాండవులం గనుంగొని యలరుమొగంబున నలంతినవ్వు కాంతి దళుకొత్తఁ గౌంతేయాగ్రజుం గౌఁగిలించికొని 'యే నుపప్లావ్యంబునకు వచ్చి నినుఁ గనిన నీవు నాకు మధుపర్కం బిచ్చి వివ్వచ్చుఁ జూపి 'వీఁడు నీకు రక్షణీయుండు సుమీ!' యని యప్పగించి; తేనును నియ్యకొంటి; నట్ల నాసఖుండును సురక్షితుండై వీరక్షయకరం బగుమహాసంగరంబు భవద్భీమనకుల సహదేవసహితంబుగ నిస్తరించి జయంబు గైకొనియె; నిటమీఁదం జేయ వలయు కార్యంబులు నడపు' మనవుడు నతం డచ్యుతున కిట్లనియె. 338

ప్రతిపదార్థం: అని చెప్పి= ఆ విధంగా చెప్పి; అప్పుడు= ఆ సమయంలో; అద్భుతరసమగ్నులు= అద్భుతరసంలో మునుగుతూ ఉండే; తక్కటి పాండవులన్+కనుంగొని= మిగిలిన పాండవులను చూచి; అలరు మొగంబునన్+అలంతినవ్వుకాంతి+తళుకు+ ఒత్తన్= వికసించిన మొగంలో చిరునగవు కాంతి మెరయగా; కౌంతేయ+అగ్రజున్= ధర్మరాజును; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; ఏను+ఉపప్లావ్యంబునకున్ వచ్చి= నేను ఉపప్లావ్యానికి వచ్చి; నిన్నున్+కనినన్= నిన్ను చూడగా; నీవు నాకున్ మధుపర్కంబు+ఇచ్చి= నీవు నాకు కొత్తబట్టలు ఇచ్చి; వివ్వచ్చున్+చూపి= అర్జునుడిని చూపించి; వీఁడు నీకు రక్షణీయుండు సుమీ! అని= వీడు నీవు కాపాడవలసినవాడు సుమా! అని; అప్పగించితి(వి)= అప్పగించావు; ఏనును+ఇయ్యకొంటిన్=

నేనుకూడా ఒప్పుకొన్నాను; అట్ల= ఆ విధంగా; నా సఖుండును= నా నేస్తమును; సురక్షితుండు+ఐ= చక్కగా కాపాడబడి; వీర క్షయకరంబు+అగు= వీర నాశకమైన; మహా సంగరంబున్= గొప్పదైన యుద్ధాన్ని; భవద్భీమ నకుల సహదేవ సహితంబుగాన్= నీ భీమ నకుల సహదేవులతోసహా; నిస్తరించి= దాటి; జయంబు+కైకొనియెన్= జయము పొందాడు; ఇటమీఁదన్+చేయవలయు కార్యంబులు= ఇక మీద చేయవలసిన పనులను; నడపుము= సాగించుము; అనవుడున్= అనగా; అతండు= ఆ ధర్మరాజు; అచ్యుతునకున్+ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ఆ విధంగా చెప్పి, అద్భుతరసంలో మునిగిన మిగిలిన పాండవులను చూచి, వికసించిన తన మొగంలో చిరునగవు కాంతి మెరయగా, ధర్మజుడిని కౌగిలించుకొని ఇట్లా అన్నాడు. 'నేను ఉపప్లావ్యపురానికి వచ్చి నిన్ను చూచినపుడు నాకు వస్త్రాలను ఇచ్చి అర్జునుడిని చూపి 'వీడు నీవు తప్పక కాపాడవలసిన వాడు సుమా!' అని అప్పగించావు. నేను కూడా ఒప్పుకొన్నాను. ఆ విధంగా నా నేస్తమూ రక్షించబడ్డాడు. వీరనాశకమైన మహాయుద్ధాన్ని ఈ భీమ నకుల సహదేవులతో కలసి విస్తరించాడు. జయమును పొందాడు. ఇక పై చేయవలసిన పనులను నీవు నడపుము.' అనగా ఆతడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తే. 'ద్రోణకర్ణ దివ్యాస్త్రముల్ క్రూరభంగిఁ । గవియునప్పుడు మము నీవు గావకున్న
బ్రదుకు టెంతద? వ్వధిక శుభంబులకు భ । వత్ప్రసాదంబు గని కాదె వాసుదేవ! 339

ప్రతిపదార్థం: వాసుదేవ!= శ్రీకృష్ణా!; ద్రోణ కర్ణ దివ్య+అస్త్రముల్= ద్రోణుడి, కర్ణుడి, దివ్యాస్త్రాలు; క్రూరభంగిన్= భయంకరంగా; కవియునప్పుడు= క్రమ్ముకొనేటప్పుడు; మమున్ నీవు కావకున్నన్= మమ్ము నీవు కాపాడకుంటే; బ్రతుకుట+ఎంత దవ్వు?= బ్రతుకెంత దూరమో; అధికశుభంబులకున్= మిక్కిలి మేళ్ళకు; భవత్ప్రసాదంబు గని కాదె= నీ యనుగ్రహం గని వంటిది కదా!

తాత్పర్యం: 'ఓ వాసుదేవా! ద్రోణ కర్ణుల, దివ్యాస్త్రాలు భయంకరంగా మమ్ము కమ్ముకొన్నపుడు నీవు కాపాడకపోతే మా జీవితాలు ఎంత దూరంలో ఉండేవో! నీ అనుగ్రహమనే నిధి ఉండబట్టి కదా మిక్కిలి మేలునందగలిగాము!'

వ. అని వెండియు. 340

ప్రతిపదార్థం: అని వెండియున్= అంటూ ఇంకనూ.

తాత్పర్యం: అంటూ ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'మునిపతి కృష్ణద్వైపా । యనుఁడు ప్రబోధించె నన్ను 'నచ్యుతుఁ డే ది
క్కున నుండు నెమ్మి నా ది । క్కునకు జయము గల్గు' నని యకుంఠితకరుణన్. 341

ప్రతిపదార్థం: మునిపతి= ముని నాయకుడు; కృష్ణద్వైపాయనుఁడు= వ్యాసుడు; అచ్యుతుఁడు+ఏ+దిక్కునన్+ఉండున్= శ్రీకృష్ణు డేవైపున ఉంటాడో; ఆ దిక్కునకున్= ఆ వైపునకు; నెమ్మిన్= ప్రీతితో; జయము= విజయం; అకుంఠిత కరుణన్= కుంటువోని దయతో; కల్గున్+అని= కలుగుతుందని; నన్నున్ ప్రబోధించెన్= నాకు తెలియచేశాడు.

తాత్పర్యం: 'మునినాయకుడైన వ్యాసుడు నన్ను హెచ్చరించాడు. శ్రీకృష్ణు డేవై పుంటాడో జయ మాదిక్కునకే కలుగుతుం' దని విశేషమైన కరుణతో చెప్పాడు.'

వ. అనుటయు మాధవుం దమ్మనుజేంద్రున కిట్లనియె. **342**

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; మాధవుండు= శ్రీకృష్ణుడు; ఆ+మనుజ+ఇంద్రునకున్+ఇట్లు+అనియెన్= ఆ రాజేంద్రుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మజుడు అట్లా అనగా శ్రీకృష్ణుడు ఆ రాజేంద్రుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'మనకుం గౌరవులకుఁ బదు । నెనిమిది యక్షౌహిణులు మహీశ్వర! కల; వ
ప్పెనుమొన లన్నిటిలో న । ర్జునునకుఁ బాటి యని యొక్కరునిఁ బేర్కొనుమా! **343**

ప్రతిపదార్థం: మహీశ్వర!= ఓ రాజా!; మనకున్ కౌరవులకున్= మనకూ కౌరవులకును; పదునెనిమిది యక్షౌహిణులు కలవు= పద్దెనిమిది అక్షౌహిణులున్నాయి(సేనలు); ఆ+పెను మొనలు+అన్నిటిలోన్= ఆ పెద్ద సైన్యమంతలోను; అర్జుననకున్ పాటి అని= అర్జునుడిని సమానుడని; ఒక్కరునిన్= ఒకడిని; పేర్కొనుమా!= పేర్కొనుము.

తాత్పర్యం: 'మనకూ కౌరవులకూ కలసి పద్ధెనిమిది అక్షౌహిణుల సేన ఉన్నది. అంతటి పెద్ద సేనలో అర్జునుడికి సమానంగా ఒక్కడిని పేర్కొనగలవా?

తే. ఈశ్వరుఁడు క్రీడి కస్త్రంబు లిచ్చుచోట । 'మత్సముండవు గ' మ్మని వత్సలత్వ
గౌరవంబునఁ బల్కెఁ; నిక్కముగ నంత । వాఁడు గాఁడె నీతమ్ముఁడు వసుమతీశ! **344**

ప్రతిపదార్థం: వసుమతీ!+ఈశ!= ఓ రాజా!; ఈశ్వరుఁడు= పరమశివుడు; క్రీడికిన్= అర్జునుడికి; అస్త్రంబులు+ఇచ్చుచోటన్= అస్త్రాలిచ్చేటప్పుడు; మత్సముండవు కమ్ము= నాతో సమానుడవు కమ్ము; అని= అంటూ; వత్సలత్వ గౌరవంబునన్= వాత్సల్యాధిక్యంతో; పల్కెన్= అన్నాడు; నీ తమ్ముఁడు= నీ సోదరుడగు అర్జునుడు; నిక్కముగన్= నిజంగా; అంతవాఁడు కాఁడె?= అంతటివాడే కదా!

తాత్పర్యం: పరమశివుడు అస్త్రాలను ఇచ్చినపుడు అర్జునుడితో 'నాతో సమానుడవు నీవు కావాలి' అని అధిక వాత్సల్యంతో చెప్పాడు. ఓ రాజా! నీ తమ్ముడయిన అర్జునుడు అంతటివాడే కదా!

చ. కరుణ జనించి శాత్రవుల గాండివి సంపఁగ నొల్లఁడయ్యెఁ; నేఁ
బరువడిఁ దెల్పి యైక్యపరిభావ నిరూఢము గాఁగఁ జేసినం
దిర మయి పోరికిం గృతమతిన్ మఱి చొచ్చి సరిత్సుతాదులన్
వెరవున గీటడంచెఁ దనవిక్రమ మెందుఁ బ్రసిద్ధి కెక్కఁగన్. **345**

ప్రతిపదార్థం: గాండివి= అర్జునుడు; కరుణ జనించి= దయ గలిగి; శాత్రవులన్= వైరులను; చంపఁగన్= చంపగా; ఒల్లఁడు+అయ్యెన్= ఇష్టపడలేదు; ఏన్= నేను; పరువడిన్= క్రమంగా; తెల్పి= బోధించి; ఐక్యపరిభావ నిరూఢము కాఁగన్= కలిసి ఉండటాన్ని తిరస్కరించే విధంగా; చేసినన్= చేయగా - అనగా గీతోపదేశంచేత - రణోన్ముఖుడిని చేయగా; తిరము+అయి= స్థిరంగా ఉండి; పోరికిన్= యుద్ధానికి; కృతమతిన్= నిశ్చయంతో; మఱి చొచ్చి= ఆ మీద ప్రయత్నించి; సరిత్సుత+ఆదులన్= గాంగేయాదులను; వెరవునన్= ఉపాయంతో; తన విక్రమము= తన శౌర్యం; ఎందున్= ఎక్కడకూడా; ప్రసిద్ధికెక్కఁగన్= కీర్తినందగా; గీటు అడంచెన్= చంపాడు.

తాత్పర్యం: అర్జునుడు దయగలిగి శత్రువులను చంపటానికి ఇష్టపడలేదు. ఆ మీద నేను క్రమంగా కలిసి ఉనికిని తిరస్కరించే విధంగా గీతోపదేశం చేసి రణోన్ముఖుడిని చేయగా - దాని వలన తన శౌర్యం ప్రసిద్ధిచెందగా కృతనిశ్చయుడై యుద్ధానికి పూనుకొన్నాడు. భీష్మాదులను చంపాడు.

క. అచ్చెరువు సంపుటకుఁ దన । యిచ్చఁ జొరక కేలి సలిపె నిన్నాళ్ళును వి
వ్వచ్చుఁడు; హిత మేఁ జెప్పినఁ । బొచ్చెము లే కంతరంగమున నిల్వెఁ దగన్. 346

ప్రతిపదార్థం: అచ్చెరువు= ఆశ్చర్యంగా; చంపుటకున్= చంపటానికి; తన ఇచ్చన్+చొరక= తన ఇష్టంతో పూనుకొనక; ఇన్నాళ్ళును= ఇన్ని దినాలూ; కేళి సలిపెన్= యుద్ధం చేశాడు; వివ్వచ్చుఁడు= బీభత్సుడు (అర్జునునకు); హితము+ఏన్+చెప్పినన్= నేను మంచి చెప్పగా(గీతను ఉపదేశించగా); పొచ్చెము లేక= అనుమానం లేకుండా; అంతరంగమునన్= మనసులో; తగన్+ నిల్వెన్= తప్పకుండా నిల్చుకొన్నాడు.

తాత్పర్యం: తన మనసులో శత్రువులను చంపటానికి ఇష్టపడకుండానే ఇన్నాళ్ళూ ఆశ్చర్యంగా యుద్ధక్రీడ సాగించాడు. అర్జునుడికి నేను హితాన్ని చెప్పగా సందేహించకుండా మనసులో నిలుపుకొన్నాడు.

క. ఏ నుపదేశించితి ననఁ । గా నొక పెం పెంచినాఁడు గాని తలంపన్
మానవనాథ! సురేశ్వర । సూనుఁడు నాయట్టివాఁడ చు మ్మేపనికిన్. 347

ప్రతిపదార్థం: మానవనాథ!= ఓ ధర్మరాజా!; ఏను+ఉపదేశించితిన్= నేను ఉపదేశం చేశాను; అనఁగాన్; ఒకపెంపు+ ఎంచినాఁడుగాని= ఒక గొప్పగా అనుకొన్నాడు గాని; తలంపన్= యోచన చేయగా; సురేశ్వర సూనుఁడు= ఇంద్రతనయుడైన అర్జునుడు; ఏ పనికిన్= ఏ పనికైనా; నా+అట్టివాఁడు+అ+చుమ్ము!= నా వంటివాడే సుమా!

తాత్పర్యం: ఓ రాజా! నేను ఉపదేశం చేశానని గౌరవంగా భావించాడు కాని యోచన చేసి చూడగా ఇంద్రవర జన్మడయిన అర్జునుడు కూడా ఏ పని చేయటానికైనా నా అంతటివాడే సుమా!

క. నిమిషార్ధంబున త్రైలో । క్యమును సురాఘరయుతంబు గా నోర్చుం గో
పము పొడమినఁ గవ్వడి క । య్యమునం గురుబలము గెలుచు టరుదే తలఁపన్?' 348

ప్రతిపదార్థం: కోపము పొడమినన్= కోపం కలిగితే; కవ్వడి= అర్జునుడు; కయ్యమునన్= యుద్ధంలో; నిమిష+అర్ధంబునన్= అరనిముసంలో; త్రైలోక్యమును= ముల్లోకాలను; సుర+అసురయుతంబుగాన్= దేవాసురులతో సహా; ఓర్చున్= ఓడిస్తాడు; కురుబలము గెలుచుట= కౌరవసేనను గెలవటం; తలఁపన్ అరుదే?= యోచిస్తే ఆశ్చర్యమా?

తాత్పర్యం: కోపం వస్తే అర్జునుడు అరనిముసంలో ముల్లోకాలను ఓడించగలడు. కాగా యుద్ధంలో కౌరవసేనను ఓడించటంలో అబ్బుర మేమున్నది?'

విశేషం: అలం: కావ్యార్థపత్తి.

వ. అని పలికె; నిట్లు సల్లాపసౌఖ్యం బనుభవించి వాహనమోచనం బాచరించిరి; తదనంతరంబ కౌంతేయులు గమనీయాభరణంబులుం గనకరాసులును రత్నసంచయంబులు మొదలుగా మహనీయవస్తు విస్తారంబునం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బ్రస్తుతిపాత్రంబైన నీపుత్రు భాండాగారంబుఁ జేకొని, నాఁడు పోలికలనికిం బోవక యున్న రథరథ్యమాతంగ తురంగంబులం జూచికొని దాసదాసీకుబ్జవామనగణంబులం గైకొని, యధిక ప్రమదసమద చేష్టితంబుల నుల్లసిల్లిరి; కొండొకసేపునకు శౌరి వారలతో నిట్లనియె. 349

ప్రతిపదార్థం: అని పలికెన్= అంటూ మాటలాడాడు; ఇట్లు= ఈ విధంగా; సల్లాపసౌఖ్యంబు+అనుభవించి= సంభాషణ సంతోషాన్ని పొంది; వాహన మోచనంబు+ఆచరించిరి= తమ తమ వాహనములను విడిచారు; తదనంతరంబు+అ= ఆ మీదట; కౌంతేయులు= పాండవులు; కమనీయ+ఆభరణంబులున్= అందమైన నగలును; కనకరాసులును= బంగారు కుప్పలును; రత్నసంచయంబులు= నవరత్న సమూహాలు; మొదలుగాన్= మొదలైన వాటితో; మహనీయవస్తు= గొప్పవస్తువులయొక్క; విస్తారంబునన్= సమృద్ధితో; ప్రస్తుతి పాత్రంబు+ఐన= పొగడదగిన; నీ పుత్రు భాండాగారంబున్ చేకొని= నీ కుమారుడి బొక్కసాన్ని తీసికొని; నాఁడు పోలికలనికిన్+పోవక ఉన్న= ఆనాడు యుద్ధానికి వెళ్ళకుండా ఉన్నట్టి; రథ= తేరులను; రథ్య= గుర్రాలను; మాతంగ= ఏనుగులను; తురంగంబులన్= గుర్రాలను; చూచికొని= చూచుకొంటూ; దాసదాసీ= సేవకులను సేవకురాండ్రను; కుబ్జవామన గణంబులన్= పొట్టివారి గుంపులను; కైకొని= తీసికొని; అధిక ప్రమద చేష్టితంబులన్= మిక్కిలి ఆనందకారణమైన చేష్టలతో; ఉల్లసిల్లిరి= సంతషించారు; కొండొక సేపునకున్= కొంతసేపటికి; శౌరి= కృష్ణుడు; వారలతోన్+ఇట్లు+అనియెన్= వారితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు పాండవులతో తీయని మాటలాడి ఆనందాన్ని పొందాడు. పాండవులు వాహనాలను వదలి బంగారు, రత్నాల రాసులు మొదలయిన గొప్ప సంపదతో నిండి కీర్తిపాత్రమైన నీ కుమారుడి బొక్కసాన్ని కైవసం చేసికొన్నారు. యుద్ధరంగానికి పోకుండా ఉన్న తేరులను, గుర్రాలను, మదపుటేనుగులను చూచికొంటూ దాసదాసీలను, పొట్టివారి సమూహాన్ని తీసికొని మిక్కిలి ఉల్లాసంతో ఉండగా శ్రీకృష్ణుడు వారితో ఇట్లా అన్నాడు.

ఆ. 'వీడు పాడు గాన విశ్రాంతి కియ్యెడ । మనము మసలవలదు; మంగళార్థ
ముగ శుచిప్రదేశమున కేఁగి యచ్చోట । నుచితవర్తనముల నుండవలయు.' 350

ప్రతిపదార్థం: వీడు= స్కంధావారం; పాడుకానన్= పాడుపడింది కనుక (నాశమైనది కనుక); విశ్రాంతికిన్= విశ్రాంతికై; ఈ+ఎడన్= ఈ చోట; మనము మసలవలదు= మనం నిలువ వద్దు; మంగళ+అర్థముగన్= క్షేమానికై; శుచి ప్రదేశమునకున్+ఏఁగి= స్వచ్ఛమైన(నిర్మలమైన) చోటునకు వెళ్ళి; ఆ+చోటన్= ఆ స్థలంలో; ఉచితవర్తనములన్= తగిన నడవడులతో; ఉండవలయున్= ఉండాలి.

తాత్పర్యం: 'ఈ సైనిక శిబిరం పాడుపడింది కనుక మన మిక్కడ విశ్రాంతికై ఉండటం సరికాదు. మంగళకరంగా ఉండటానికి వేరొక నిర్మలమైన చోటికి వెళ్ళి అక్కడ తగిన తీరులో ఉందాము.'

క. అని చెప్పి పాండు నృపనం । దనులం దన తమ్మునిన్ ముదం బెసఁగఁగఁ దో
డ్కొని పోయెను వసుదేవుని । తనయుఁడు శిబిరంబు వెడలి ధరణీనాథా! 351

ప్రతిపదార్థం: ధరణీనాథా!= ఓ రాజా!; అని చెప్పి= అని చెపుతూ; పాండు నృపనందనులన్= పాండు రాజు కుమారులను; తమ్మునిన్= సాత్యకినీ; ముదంబు+ఎసఁగఁగన్= సంతోషం కలుగగా; వసుదేవుని తనయుఁడు= శ్రీకృష్ణుడు; శిబిరంబు వెడలి; తోడ్కొనిపోయెను= పిలిచికొనిపోయినాడు.

తాత్పర్యం: ఓ రాజా - ధృతరాష్ట్రా! వాసుదేవుడు ఆ విధంగా చెపుతూ పాండురాజు కుమారులనూ, సాత్యకినీ దుర్యోధనుడి శిబిరమునుండి సంతోషాతిశయంతో తోడ్కొని పోయాడు.

వ. ఇట్లు వోవునప్పుడు శౌరిసారథి యైన దారకుండు మున్నెప్పుడును విడిదలం దమతేరు నశ్వంబులనుం బరికించి యుండెడువాఁడు బోయలు నీకొడుకు మడువున డాఁగినయునికి చెప్పిన నయ్యెడకు వచ్చు కౌంతేయులతో వీడెల్ల నొక్కతలగా వెడలివేడుకఁ జూడం జనుదేరఁ, దాను నయ్యరదంబున శైబ్యసుగ్రీవ మేఘ పుష్పవలాహకంబులం బూన్చికొని వచ్చుటం జేసి తా నప్పుడు కౌరవ శిబిరంబునకుఁ దోడన యరుగుదెంచెం గావున నొదవి సుకల్పితస్యందనుం డై యుద్దామోదరుదృష్టిపథంబు నిల్చె; ధర్మనందనుండును దమ్ములును సాత్యకియును సముచితవాహనంబులు దెప్పించుకొని యారోహణంబు సేయ నన్నారాయణుండు నిజరథారూఢుం డై యత్తెఱఁగునం బోయి. 352

ప్రతిపదార్థం: ఇట్లు+పోవునప్పుడు= ఈ విధంగా వెళ్ళేటప్పుడు; శౌరిసారథిఐన దారకుండు= శ్రీకృష్ణుడి సారథి అయిన దారకుడనే వాడు; మున్ను+ఎప్పుడును= అంతకుముందు+ఏనాడును; విడిదలన్= విడిది ఉండే చోటులలో; తమతేరు నశ్వంబులనున్+పరికించి= తమతేరి గుర్రాలను తేరిచూచి; ఉండెడువాఁడు= ఉండేవాడు; బోయలు= సేవకులు; నీ కొడుకు మడువునన్ డాఁగిన+ఉనికిన్= నీ కుమారుడు మడుగులో దాగుకొని ఉండటం చెప్పగా; ఆ+ఎడకున్= ఆ చోటికి; వచ్చు= వస్తూ ఉన్న; కౌంతేయులతోన్= పాండవులతో; వీడెల్లన్= ఊరంతటినీ; ఒక్కతలగాన్ వెడలి= ఒక్కటిగా వచ్చి; వేడుక చూడన్+చనుదేరన్= వినోదాన్ని చూడటానికై రాగా; తాను ఆ+అరదంబునన్= (శ్రీకృష్ణుడు) తానే ఆ తేరు మీద; శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకంబులన్ పూన్చికొని వచ్చుటన్+చేసి= ఈ పేర్లుగల గుర్రాలను సిద్ధంచేసి తీసికొనివచ్చుటవలన; తాను+అప్పుడు= తా నా సమయంలో; కౌరవ శిబిరంబునకున్ తోడన+ అరుగుదెంచెన్+కావునన్= కౌరవుల శిబిరానికి వెంటనే వచ్చాడు కనుక; ఒదవి= తగినట్లుగా; సుకల్పిత స్యందనుండు+ఐ= చక్కగా చేసిన తేరు గలవాడుగా; ఆ+దామోదరు దృష్టిపథంబున్+నిల్చెన్= ఆ శ్రీకృష్ణుని దృష్టిలో పడ్డాడు; ధర్మనందనుండును= ధర్మరాజు; తమ్ములును= అతడి సోదరులూ; సాత్యకియును= సాత్యకియు; సముచిత వాహనంబులు తెప్పించుకొని= తగిన వాహనాలను తెప్పించుకొని; ఆరోహణంబు చేయన్= ఎక్కగా; ఆ+నారాయణుండు= ఆ శ్రీకృష్ణుడు; నిజ రథారూఢుండు+ఐ= తన తేరెక్కిన వాడై; ఆ+ తెఱఁగునన్+పోయి= ఆ విధంగా వెళ్ళి.

తాత్పర్యం: .... నీ కొడుకు మడుగులో దాగి వుండడాన్ని చెప్పగా ఆ చోటుకు వచ్చు పాండవులతో శిబిరంలోని వారందరూ ఆ వేడుక చూడటానికి బయలుదేరగా తాను (దారుకుడు) ఆ రథానికి శైబ్య సుగ్రీవ మేఘ పుష్ప వలాహకములను పూన్చికొని ఉత్సాహంతో వచ్చినాడు కాబట్టి తాను కూడా వారితో పాటు కౌరవ శిబిరానికి వచ్చినందున తగినట్లుగా తీర్చిదిద్దిన రథంతో దామోదరుడు చూపునకు ఎదురుగా నిలిపాడు. ధర్మరాజు, తమ్ములు, సాత్యకి, తగిన వాహనాలు తెప్పించుకొని ఎక్కగా ఆ నారాయణుడు తన తేరెక్కి ఆ విధంగా వెళ్ళి.

తే. ఓఘవతి యనఁ బరఁగిన యొక్క పుణ్య । తటిని చేరువఁ గల్గిన దానితీర
భూమియం దర్వ మగుతలమున వసించి । రమ్మహాత్ములు చిత్తంబు లలర నధిప!' 353

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; ఓఘవతి అనన్+పరఁగిన= ఓఘవతి అనే పేరుతో ఉన్నట్టి; ఒక్కపుణ్యతటిని= ఒక పవిత్ర నదియొక్క; చేరువన్ గల్గిన= దగ్గరున్న దాని; తీర భూమి అందున్= దాని గట్టునందు; అర్హము+అగు తలమునన్=

అర్హమైన నేలపై; చిత్తంబులు+అలరన్= మనసు సంతోషంతో చిగుర్చగా; ఆ+మహాత్ములు= ఆ మహనీయులు; వసించిరి= ఉన్నారు.

తాత్పర్యం: ఓ మహారాజా! వారంతా సంతోష మనస్కులై ఓఘవతి అనే పేరున్న పుణ్యనదీతీరంలో ఉచితమైన స్థలంలో ఉన్నారు.'

వ. అని యిట్లు సంజయుండు ధృతరాష్ట్రునకుఁ బాండవుల విజయంబు తెలంగుఁ జెప్పె నని వైశం పాయనుండు. 354

ప్రతిపదార్థం: అని ఇట్లు సంజయుండు; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రుడితో; పాండవుల విజయంబు తెలంగున్+చెప్పెన్= పాండవులు గెలిచిన తీరును చెప్పాడు; అని వైశంపాయనుండు.

తాత్పర్యం: ఈవిధంగా సంజయుడు ధృతరాష్ట్రుడితో పాండవుల విజయాన్ని వర్ణించా డని వైశంపాయనుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. జనమేజయునకు నిట్లను । విను మప్పుడు ధర్మసుతుఁడు విష్ణుని వదనం
బునఁ జూడ్కి నిలిపి, 'కరిపుర । మునకుం బోవలయు నీకుఁ బురుషార్థనిధీ!' 355

ప్రతిపదార్థం: జనమేజయునకున్= జనమేజయ చక్రవర్తితో; ఇట్లనున్= ఈ విధంగా అన్నాడు; వినుము; అప్పుడు= ఆ సమయంలో; ధర్మసుతుఁడు= ధర్మరాజు; విష్ణుని వదనంబునన్= శ్రీకృష్ణుడి ముఖంమీద; చూడ్కి నిలిపి= చూపు నిలిపి; పురుషార్థనిధీ!= శ్రీకృష్ణా!; నీకున్= నీవు; కరిపురమునకున్+పోవలయున్= హస్తినాపురికి పోవలసి ఉన్నది.

తాత్పర్యం: వైశంపాయనుడు జనమేజయ చక్రవర్తితో ఈ విధంగా అన్నాడు. ధర్మజుడు శ్రీకృష్ణుడిని చూస్తూ 'పురుషార్థాలకు నిధివైన కృష్ణా! ఇప్పుడు నీవు హస్తినాపురికి వెళ్ళాలి.'

వ. అని ప్రార్థించె; ననుటయు నమ్మనుజపతి యమ్మహీసురవరున కిట్లనియె. 356

ప్రతిపదార్థం: అని ప్రార్థించెన్= అని ప్రార్థించాడు; అనుటయున్= అనగా; ఆ+మనుజపతి= ఆ జనమేజయరాజు; ఆ+మహీసురవరునకున్+ఇట్లు+అనియెన్= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడితో (వైశంపాయనుడితో); ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని ప్రార్థించా డని చెప్పగా, జనమేజయుడు వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు:

చ. 'అని ధృతరాష్ట్ర నందనుల నందఱ గీ టడఁగించి వేఁడి యా
యనకడ కచ్యుతుం బనుపునంతటి కార్య విశేషమేమి గ
ల్గెనొ? మునినాథ! యాన్నృపతికిన్ మది నాకు వినంగ వేడ్క వు
ట్టినయది యత్తెఱంగు ప్రకటింపు పరిస్ఫుటవాక్యసంపదన్.' 357

ప్రతిపదార్థం: మునినాథ!= ఓ వైశంపాయన మునీశ్వరా!; అనిన్= యుద్ధంలో; ధృతరాష్ట్ర నందనులన్= ధృతరాష్ట్రుడి కుమారులను; అందఱన్= అందరినీ; గీటడఁగించి= రూపుమాపి (సంహరించి); వేఁడి= కోరి; ఆయనకడకున్= ఆ ధృతరాష్ట్రుడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వద్దకు; అచ్యుతున్+పనుపునంతటి= శ్రీకృష్ణుడిని పంపవలసినంత; కార్యవిశేషము= గొప్ప పని; ఆ+నృపతికిన్= ఆ ధర్మరాజునకు; ఏమి కల్గెనో?= ఏమి కలిగిందో?; నాకున్ వినంగన్= నేను వినవలెననే; వేడ్క= ఆసక్తి; మదిన్= మనసులో; పుట్టిన అది= కలిగింది; పరిస్ఫుట వాక్య సంపదన్= నిండైన స్పష్టమైన; వాక్యసంపదతో; ప్రకటింపు(ము)= తెలియజేయుము.

తాత్పర్యం: 'ఓ వైశంపాయన మునీశ్వరా! యుద్ధంలో ధృతరాష్ట్రుడి కుమారులను అందరిని చంపి, అతడివద్దకు శ్రీకృష్ణుడిని వేడుకొని పంపవలసినంతటి ప్రత్యేకమైనపని ధర్మరాజునకు ఏమి కలిగింది? నా మనసులో దానిని తెలిసికొనవలెననే కోరిక కలిగింది. ఆ వైనాన్ని చక్కటి మాటలున్న వాక్యాలలో స్పష్టంగా తెలుపవలసినది.'

వ. అనవుడు నాసంయమి యిట్లనియె. 358

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆ సంయమి= ఆ తాపసియైన వైశంపాయనుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా ఆ వైశంపాయనుడు ఇట్లా అన్నాడు:

ఉ. 'కౌరవముఖ్యు ధర్మగతి గాని తెఱంగునఁ గ్రీడి పంపఁగా
మారుతి గూల్చె నట్లగుట మాన్యచరిత్రుఁడు ధర్మసూతి గాం
ధారి శపించు దీని విని త మ్మని యాత్మఁ దలంచి యిమ్మెయిం
గూరినభీతి నవ్వనితకుం దగుభంగి శమం బొనర్పఁగన్. 359

ప్రతిపదార్థం: కౌరవముఖ్యున్= దుర్యోధనుడిని; ధర్మగతిగాని తెఱంగునన్= ధర్మపద్ధతి కాని విధంగా; క్రీడి పంపఁగాన్= అర్జునుడు పంపగా (తెలియజేయగా); మారుతి కూల్చెన్= భీముడు పడవేసినాడు; అట్లు+అగుటన్= ఆ విధంగా అయినందున; మాన్యచరిత్రుఁడు= పూజనీయమైన శీలం కలవాడైన; ధర్మసూతి= ధర్మరాజు; గాంధారి; దీనిన్ విని= ఈ వార్తను విని; తమ్మున్; శపించున్= శపిస్తుంది; అని; ఆత్మన్+తలంచి= మదిలో తలచి; ఈ+మెయిన్+కూరిన భీతిన్= ఈ విధంగా కలిగిన భయంతో; ఆ+వనితకున్= ఆ స్త్రీకి (గాంధారికి); తగు భంగిన్= తగినట్లుగా; శమంబు+ఒనర్పఁగన్= శాంతిని కలిగించటానికి.

తాత్పర్యం: కౌరవులలో ముఖ్యుడయిన దుర్యోధనుడిని యుద్ధరంగంలో అర్జునుడి సైగతో భీముడు అధర్మంగా పడగొట్టాడని విన్నందువలన గాంధారి తమ్ము శపిస్తుందని పవిత్రచరిత్రుడైన ధర్మరాజు మనసులో భయపడి ఆమెను ఏ విధంగానైనా శాంతింపజేయటానికి. (తరువాతి వచనంతో అన్వయం).

శ్రీకృష్ణుఁడు గాంధారి నూఱడింపఁ గరిపురంబునకుఁ బోవుట (సం. 9-61-40)

వ. పనిచెం గాని ధృతరాష్ట్రు నుద్దేశించి కా; దట యచ్చ్యుతుం డరిగి యప్పటి కుచితం బగువిధంబునఁ గార్యంబు నడపె; నాకర్ణింపు; మట్లు దన్నుఁ బ్రార్థించిన నప్పురుషోత్తముండు పనితెఱం గడిగి, పాండవాగ్రజుండు సెప్ప విని, రథారూఢుం డై యతిరయంబునఁ గరినగరంబున కరిగి, మొగసాల నిలిచి, యాంబికేయునకుఁ దనరాక యెఱిఁగించి పుచ్చి, తగం జొచ్చి యంతక మున్న గాంధారీద్వితీయుండై కొడుకులదెస వగలం బొగులుచున్న యమ్మహీకాంతునివలని కారుణ్యంబున నతనికడకుం జనుదెంచి యున్న

కృష్ణద్వైపాయనమహామునిం గని వినయసంభ్రమంబులు దలకొనఁ దత్పాదంబులకుఁ బ్రణమిల్లి యక్కురురాజునకు గాంధారరాజనందనకు నమస్కరించి, కులపతిసన్నిధి యగుట నిలాతలంబునం గూర్చున్న యజ్జననాథు సమీపంబున నాసీనుండై. 360

ప్రతిపదార్థం: పనిచెన్+కాని= (ధర్మజుడు) పంపాడుగాని; ధృతరాష్ట్రున్+ఉద్దేశించి కాదు= ధృతరాష్ట్రుడిగురించి కాదు; అట= పిమ్మట; అచ్యుతుండు+అరిగి= శ్రీకృష్ణుడు వెళ్ళి; అప్పటికిన్= ఆ సమయానికి; ఉచితంబు+అగు విధంబునన్= తగినట్లుగా; కార్యంబు నడపెన్= పనిని సాగించాడు; ఆకర్ణింపుము= వినుము; అట్లు తన్నున్ ప్రార్థించినన్= ఆ విధంగా తనను ప్రార్థన చేయగా; ఆ+పురుషోత్తముండు= ఆ శ్రీకృష్ణుడు; పనితెఱఁగు+అడిగి= చేయవలసిన పని పద్ధతిని అడిగి; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; చెప్పన్ విని= చెప్పగా విన్నవాడై; రథ+ఆరూఢుండు+ఐ= తెరెక్కినవాడై; అతిరయంబునన్= మిక్కిలి వేగంగా; కరినగరంబునకున్+అరిగి= హస్తినాపురికి వెళ్ళి; మొగసాలన్ నిలిచి= తలవాకిటిలో నిలిచి; ఆంబికేయునకున్= ధృతరాష్ట్రుడికి; తన రాక ఎఱిఁగించి పుచ్చి= తాను వచ్చుటను తెలియజేసి; తగన్+చొచ్చి= తగిన విధంగా లోనికి వెళ్ళి; అంతకమున్న+అ= అంతకంటె ముందుగానే; గాంధారీ ద్వితీయుండు+ఐ= గాంధారితో కూడి ఉన్నవాడై; కొడుకులదెసన్= తన కుమారుల విషయంలో; వగలన్+పొగలుచున్న= దుఃఖంతో కుములుతూ ఉండే; ఆ+మహీకాంతుని వలని= ఆ రాజు దెసకు; కారుణ్యంబునన్= దయతో; అతని కడకున్+చనుదెంచి ఉన్న= అతని యొద్దకు (ధృతరాష్ట్రుడి వద్దకు) వచ్చి ఉన్నట్టి; కృష్ణద్వైపాయన మహామునిన్+కని= వ్యాసమహామునిని చూచి; వినయ సంభ్రమంబులు తలకొనన్= అణకువ, ఆశ్చర్యం కలుగగా; తద్+పాదంబులకున్+ప్రణమిల్లి= ఆయన కాళ్ళకు నమస్కరించి; ఆ+కురురాజునకున్= ఆ కురువంశ రాజునకు; గాంధార రాజ నందనకున్= గాంధారీదేవికి; నమస్కరించి; కులపతి సన్నిధి+అగుటన్= తమ ఇంటి పెద్దయైన వ్యాసుడు సమీపస్థుడు అగుటచే; ఇలాతలంబునన్= నేలపై; కూర్చున్న; ఆ+జననాథు= ఆ రాజుకు; సమీపంబునన్= దగ్గరలో; ఆసీనుండు+ఐ= కూర్చుండి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడిని పంపాడు గాని, అది ధృతరాష్ట్రుడిని మనసులో పెట్టుకొనికాదు. దానికి కృష్ణుడు తగినవిధమైన కార్యాన్ని జరిపాడు-అని జనమేజయుడికి వైశంపాయనుడు చెప్పాడు. ధర్మరాజు ప్రార్థించగా శ్రీకృష్ణుడు తాను చేయవలసిన పని ఏమో చెప్పుమని అడిగాడు. తన రథంపై చాలవేగంగా హస్తినకు వెళ్ళి వీథివాకిట నిలిచి ధృతరాష్ట్రుడికి తాను వచ్చిన విషయం తెలియజేశాడు. తగు విధంగా లోనికి వెళ్ళాడు. గాంధారితో కలసి కుమారులను తలచుకొని దుఃఖిస్తూ ఉన్న ఆ మహారాజుమీద దయతో ఆయన వద్దకు వచ్చి ఉన్న వ్యాసమహర్షిని చూచి, వినయంతో కూడిన తొట్రుపాటుతో ఆయన పాదాలకు నమస్కరించాడు. ఆ ధృతరాష్ట్ర గాంధారీదేవులకు నమస్కారంచేసి, కులాధిపతి వ్యాసుడు ప్రత్యక్షమైనందున భూమి మీద కూర్చొని ఉన్న ఆ రాజునకు (ధృతరాష్ట్రుడికి) దగ్గరగా కూర్చున్నారు.

ఆ. అన్నరేంద్రు పాణి యల్లన తనకరా । బ్జమునఁ గీలుకొల్పి బహుళబాష్ప
కలితవదనుఁ డగుచు గళమున నెలుఁ గురి । యాడ వగచి యమ్మురాంతకుండు. 361

ప్రతిపదార్థం: ఆ+నర+ఇంద్రు పాణిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజుచేతిని; అల్లనన్= నెమ్మదిగా; తనకర+అబ్జములన్= తన హస్తపద్మాలతో; కీలు+కొల్పి= ఉంచి; బహుళబాష్పకలిత వదనుఁడు+అగుచున్= మిగుల కన్నీటితో కూడిన మొగం కలవాడై; గళమునన్= కంఠంతో; ఎలుఁగు= శబ్దం; ఉరి ఆడన్= ఊగిసలాడగా - డగ్గుత్తిక పడగా; వగచి= దుఃఖపడి; ఆ+మురఅంతకుండు= ఆ శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రరాజు చేతులను నెమ్మదిగా తన చేతులలోనికి తీసికొని, మిక్కిలి కన్నీళ్ళతో గొంతు బొంగురుపోగా, శ్రీకృష్ణుడు దుఃఖించి.

వ. తత్ప్రదేశంబున నున్న కనకకలశజలంబుల ముఖప్రక్షాళనంబు సేసి యెలుంగు నూలుకొనం జేసి యిట్లనియె. 362

ప్రతిపదార్థం: తద్+ప్రదేశంబునన్+ఉన్న= ఆ చోటులో ఉన్నట్టి; కనక కలశ జలంబులన్= బంగారుపాత్రలోని నీటితో; ముఖప్రక్షాళనంబు+చేసి= మొగం కడిగికొని; ఎలుంగున్= మాటను; నూలుకొనన్+చేసి= బాగా సరి చేసికొని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ ప్రక్కనే ఉన్న బంగారుచెంబులోని నీటితో మొగం కడిగికొని, గొంతు సరి చేసికొని, ఇట్లా అన్నాడు.

చ. అకట! కులం బకారణము యంతయు నాశము నొందె; నిట్టిదా
నికిఁ జొర నొల్ల రైరి మహనీయచరిత్రులు నాఁడు పాండవు;
ల్సకలము నీ వెఱుంగుదు చలంబును నీసును దక్కి నన్ను సం
ధికి నిట రా నొనర్చుట మదిం దలపోయు మదెట్టిశాంతియో!' 363

ప్రతిపదార్థం: అకట!= అయ్యో! కులంబు= వంశం; అంతయున్= మొత్తంగా; అకారణము+అ= నిష్కారణంగా; నాశమున్+ ఒందెన్= నాశమయింది; ఇట్టిదానికిన్= ఇటువంటి స్థితికి; మహనీయ చరిత్రులు= ఉదార గుణశీలురైన పాండవులు; చొరన్+ ఒల్లరు+ఐరి= పూనుకొనినవారు కారు; సకలము= మొత్తం; నీవు+ఎఱుంగుదు(వు)= నీకు తెలియును; చలంబునున్= పట్టుదలయు; ఈసును= అసూయయు; తక్కి= వదలి; నన్నున్; సంధికిన్+ఇట+రాన్+ఒనర్చుటన్= సంధికై ఇక్కడకు వచ్చేటట్లు చేయటం; నీవు మదిన్ తలపోయుము= నీవు మనసులో జ్ఞాపకానికి తెచ్చుకొనుము (ఊహించుము); అది+ఎట్టి శాంతియో!= అది ఏ ఎంతటి శాంతియో (నీకు అర్థం కాగలదు).

తాత్పర్యం: 'అయ్యో! మీ వంశమంతా నిష్కారణంగా నాశమైంది. ఇటువంటి స్థితికి ఏ మాత్రమూ ఇష్టపడకుండా మహనీయ చరిత్ర కల పాండవు లానాడు నన్ను రాయబారం పంపారు. ఆ సంగతి అంతా నీకు తెలుసు. పట్టుదల, అసూయ వదలి నీ వద్దకు సంధికై నేను వచ్చేటట్లు చేశారు. ఆ శాంతి ఎంతటిదో నీవు మనసులో తలపోయుము. (అని శ్రీకృష్ణుడు అన్నాడు).

వ. అని యంత నిలువక. 364

ప్రతిపదార్థం: అని+అంతన్ నిలువకన్= అంటూ, అంత మాత్రంతో నిలువకుండా.

తాత్పర్యం: అంటూ, అంతమాత్రంతో ఆగకుండా.

క. 'గెలువరె జూదము లెందును? । గలదే తలఁబట్టి పుణ్యకాంతఁ గొలువులో
పలి కీడ్చి తెచ్చి వలువల । నొలుచుట? యే మనఁగవచ్చు నుర్వీనాథా! 365

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= ఓ రాజా!; జూదములు; ఎందును= ఎక్కడా; గెలువరె?= జూదాలు ఆడి గెలువరా?; పుణ్యకాంతన్= పవిత్రమయిన స్త్రీని; తలన్+పట్టి= జుట్టు పట్టుకొని; కొలువులోపలికిన్+ఈడ్చి తెచ్చి= సభలోనికి లాగి తీసికొనివచ్చి; వలువలన్+ఒలుచుట= కట్టుగుడ్డలను విప్పటం; కలదే= ఉన్నదా?; ఏమి+అనఁగవచ్చున్= ఏమనవచ్చును?

తాత్పర్యం: 'ఓ రాజా! జూదా లాడి గెలువరా! ఎక్కడనైనా పవిత్రకాంతలను తలపట్టి ఈడ్చి లాగికొని వచ్చి కట్టుగుడ్డలను ఊడదీయటం ఉన్నదా? దీనిని ఏమనవచ్చును?

క. **దానికి నొచ్చినమనముల । తో నడవికిఁ బోయి బహుళదుఃఖంబుల న**
ట్లూని విరాటుపురిం బడఁ । గానియిడుమ పడియు వారు గనలర? కంటే. **366**

ప్రతిపదార్థం: దానికిన్= ఆ పనికి; నొచ్చిన మనములతోన్= నొప్పి కలిగిన మనస్సులతో; అడవికిన్+పోయి= అరణ్యానికి పోయి; బహుళదుఃఖంబులన్= అనేక దుఃఖాలను; అట్లు+ఊని= ఆ ప్రకారం వహించి; విరాటుపురిన్= విరటుడి నగరంలో; పడన్+కాని+ఇడుమ పడియున్= పడరాని పాట్లు పడికూడా; వారు= ఆ పాండవులు; కనలర?= కోపించనే లేదు; కంటే?= గమనించావా?

తాత్పర్యం: ఆ పనికి మనసులో బాధ కలిగి అడవులకు పోయి అనేక దుఃఖాలననుభవించి ఆ విధంగా విరటుడి నగరంలో పడరాని పాట్లు పడిన ఆ పాండవులు కోపించనే లేదు. చూచావా?

ఉ. **ఏవుర కుండ నొక్కొకటి యిమ్మని యూళులు వేఁడి కాన రై**
రే వలన దన్న నీ కొడుకు లెమ్మెయి మానర లోభ గర్వముల్;
నీవును నట్ల కాక మహనీయమతుల్ విదురాదిబాంధవుల్
వేవురు సెప్పరే? యధిప! వింటె తగం బలు కొక్కఁ డేనియున్? **367**

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; ఏవురకున్= అయిదుగురుకిని; ఉండన్= ఉండటానికి; ఒక్కొకటి ఇమ్మని= ఒక్కొకదానిని ఇమ్మని; ఊళులు= ఊర్లను; వేఁడి= అర్థించి; కానరైరి= పొందలేకపోయారు; నీ కొడుకులు= నీ కుమారులు; ఏన్+వలదు+అన్నన్= నేను వద్దనినను; లోభగర్వముల్= పిసినారితననాన్నీ, అహంకారాన్నీ; ఏ+మెయిన్= ఏ విధంగాను; మానరు+అ= వదలనే లేదు; నీవును= నీవు కూడా; అట్లుకాక= అంతే; మహనీయమతుల్= గొప్పమనసున్నవారు; విదురాది బాంధవుల్= విదురుడు మొదలయిన బంధువులు; వేవురు చెప్పరే?= వేయిమంది చెప్పలేదా?; తగన్= తగిన విధంగా; పలుకు+ఒక్కఁడు+ఏనియున్= ఒక్కమాటనయినా; వింటె?= విన్నావా?

తాత్పర్యం: ఓ రాజా! అయిదుగురికి ఉండటానికై, తలకొక ఊరిమ్మని అర్థించి పొందలేకపోయారు. నేను వద్దన్నా నీ కొడుకులు అహంకారాలను ఏ విధంగానూ మానలేదు. నీవు కూడా అంతే. మహనీయులైన విదురాది బంధువులు అనేకులు చెప్పలేదా? ఒక మాటనైనా తగిన విధంగా విన్నావా?

క. **కాలోపహత మనస్కుఁడు । మేలు తెరువు వట్టు నెట్లు? మెయికొని యది యిం**
కేల తలపోయ? నుడుపం । జాలుదురే నరులు దైవసంపాదితముల్?' **368**

ప్రతిపదార్థం: కాల+ఉపహత మనస్కుఁడు= కాలవైపరీత్యంవలన దెబ్బతిన్న మనసు కలవాడు; మెయికొని= ఇష్టంతో; మేలు తెరువు= మంచిమార్గం; ఎట్లు+పట్టున్?= ఏ విధంగా అనుసరిస్తాడు?; అది= దానిని; ఇంకేల తలపోయన్?= ఇక యోచించటం ఎందుకు?; నరులు= మనుష్యులు; దైవ సంపాదితముల్= దైవప్రాప్తాలను; ఉడుపన్+చాలుదురే?= ఆపగలరా?

తాత్పర్యం: కాలవైపరీత్యంవలన మనుష్యుడు మంచిమార్గాన్ని ఏ విధంగా ఇష్టంతో అనుసరించగలడు? ఇక దానినిగూర్చి ఆలోచించటం దేనికి? విధి నిర్ణయాన్ని మానవులు ఆపగలరా?'

వ. అని వెండియు నిట్లనియెఁ 'బాండవులు గల్మషాయత్త చిత్తులు గామియు, మీరు నెఱిలేమియు విచారింపుము; మేను మ్రొక్కి వేఁడికొనియెద; వారలదెసఁ గోపంబు లేకుండవలయు; నట్లుం గాక నీకును గాంధారికిని వలయు పరలోకక్రియాకలాపంబులు వారయంద నిలిచెం గావున వారికి శుభంబు గోరుట లెస్స! మీ చిత్తంబు నొప్పించితి నని యెప్పాట దురపిల్లెడునో ధర్మజుతెఱం గెఱింగెదు గాక' యని పల్కి గాంధారరాజనందన నుద్దేశించి. 369

ప్రతిపదార్థం: అని వెండియున్+ఇట్లు+అనియెన్= అంటూ ఇంకా ఈ విధంగా అన్నాడు; పాండవులు కల్మష+ఆయత్త చిత్తులు కామియున్= పాండవులు పాపంతో నిండుకొన్న మనసుకలవారు కాకుండుటయును; మీరు నెఱి లేమియున్= మీరు ధర్మం లేకుండుటయును; విచారింపుము= యోచింపుము; ఏను మ్రొక్కివేఁడికొనియెదన్= నేను ప్రార్థించి వేడుకొంటాను; వారల దెసన్= వారిమీద (పాండవుల మీద); కోపంబు లేకుండ వలయున్= కోపం లేకుండా ఉండవలెను; అట్లున్+కాక= అంతేకాక; నీకును గాంధారికిని= నీకూ గాంధారికినీ; వలయు= అవసరమైన; పరలోక క్రియా కలాపంబులు= పరలోక కార్యక్రమాలు; వారియందున్+అ నిలిచెన్= వారి మీదనే ఉన్నవి; కావున వారికిన్ శుభంబు కోరుట లెస్స!= మేలు!; మీ చిత్తంబు నొప్పించితిని+అని= మీ మనసుకు కష్టం కలిగించానని; ఏ+పాట దుఱపిల్లెడునో= ఎంతగా దుఃఖిస్తాడో; ధర్మజుతెఱంగు= ధర్మజుడి మనసు; ఎఱింగెదు(వు)+కాక= తెలిసికొనగలవు గాక; అని పల్కి= అంటూ మాట్లాడి; గాంధార రాజనందనన్+ఉద్దేశించి= గాంధారీదేవిని ఉద్దేశించి.

తాత్పర్యం: ఇంకా ఈ విధంగా కృష్ణుడు అన్నాడు. 'పాండవులు కపటచింతన లేనివారూ, మీరు న్యాయపరులు కాకపోవుటా ఆలోచించుము. వారి మీద కోపం లేకుండా ఉండాలని నేను ప్రార్థనాపూర్వకంగా వేడుకొంటున్నాను. అంతేకాకుండా నీకూ గాంధారీదేవికిని పరలోక క్రియలు చేయవలసిన బాధ్యత వారిమీద ఉన్నది. కాబట్టి వారికి మేలు కోరుకొనుము. అది మంచిది. మీ మనసునకు కష్టం కలిగించినా నని ధర్మరాజు ఎంతగా దుఃఖిస్తున్నాడో తెలియగలవు.' అని, గాంధారి నుద్దేశించి - (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. 'నీ కెన వచ్చు రాజరమణిన్ ధరనెందును గంటిమే? నృపా
నీకము వించు నుండ సుతునిం దగు పల్కుల నంత యొత్తుదే?
నా కది సిక్కెఁ జిత్తమున నాఁటి ప్రియం బగుచుండ నిప్పుడున్
లోకవిరుద్ధ వృత్తి చపలుం డితఁ డి మ్మెఱుఁగండ యేమియున్. 370

ప్రతిపదార్థం: నీకున్+ఎనవచ్చు= నీకు సమానమైన; రాజరమణిన్= రాజకాంతను; ధరన్+ఎందునున్+కంటిమే?= భూమిలో ఎక్కడనైనా చూచామా?; నృప+అనీకము వించున్+ఉండన్= రాజ సమూహం వింటూ ఉండగా; సుతునిన్= నీ కొడుకును (దుర్యోధనుడిని); అంత+ఒత్తుదే?= అంత బలవంతం చేస్తావా?; నాకున్+అది= నాకు ఈ నడవడి; చిత్తమునన్= మనసులో;

చిక్కెన్= తగిలింది; ఇప్పుడున్= ఈదినం కూడా; చిత్తమునన్ నాటి= మనసులో హత్తుకొని; ప్రియంబు+అగుచుండున్= ప్రీతిని కలిగిస్తూ ఉన్నది; ఇతఁడు= దుర్యోధనుడు; లోక విరుద్ధవృత్తి= లోకానికి వ్యతిరేకమైన నడవడిచేత; చపలుండు= చంచల మనస్కుడు; ఇమ్ము= మేలు; ఏమియున్ ఎఱుఁగండు+అ= తన కేది మేలో ఎంతమాత్రమూ తెలియనే తెలియడు.

తాత్పర్యం: నీకు సరి అయిన రాజకాంతను లోకంలో ఎక్కడను చూడలేము. లేకపోతే రాజులందరూ వింటూ ఉండగా కుమారుడిని అంతగా ఒత్తిడిచేస్తావా? ఇప్పటికినీ అది (అనగా నీ నడవడి) నా మనసులో హత్తుకొని ఉన్నది, ప్రీతిని కలిగిస్తూ ఉన్నది. కాని, ఆ చపలప్రవృత్తి కల ఆ దుర్యోధనుడు ఏ మాత్రమూ తనకేది మేలో తెలియనే తెలియనివా డయ్యాడు.

క. నీమాటకు దుర్యోధనుఁ। డామెయిఁ దాఁ ద్రుళ్ళిపడక యవుఁ గా కని నాఁ
డే మేనిఁ గొంత యక్కట! భూమి యొసఁగెనేని యింత పుట్టదు సుమ్మీ! 371

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; నీ మాటకున్= నీ మాట ప్రకారం; దుర్యోధనుఁడు+ఆమెయిన్= దుర్యోధనుడు ఆ విధంగా; త్రుళ్ళిపడక= గర్వించకుండా; అవున్+కాకని= సరే అని; నాఁడు= ఆ దినం; ఏమి+ఏని= ఏదో; కొంత= కొంచెమైనా; భూమిని= భూభాగాన్ని; ఒసఁగెన్+ఏని= ఇచ్చి ఉన్నట్లయితే; ఇంత+పుట్టదు సుమ్మీ!= ఇంత జరిగి ఉండదు సుమా!

తాత్పర్యం: దుర్యోధనుడు ఆ దినం గర్వాన్ని వీడి, నీ మాటకు సరే అని కొంత భూమిని ఇచ్చిఉంటే ఇంత దూరం వచ్చి ఉండేది కాదు.

వ. కీడు వుట్టునని నీవు సెప్పితి; చెప్పిన మాటయుం దలకూడెఁ; బాండవులవలనం దప్పు లే దని యెఱుంగుదు గాదె! వారల కలుగ కుండునది; నీ వలిగి చూచినం ద్రిలోకంబులు భస్మీభూతంబు లగునట్టి తపఃప్రభావంబునం బ్రసిద్ధవు గావున నిన్నుం బ్రార్థించెద' నని పల్కిన నద్దేవి 'యది యంతయు నీ చెప్పినట్టిద' యని వెండియు. 372

ప్రతిపదార్థం: కీడు+పుట్టునని నీవు చెప్పితి(వి)= చెడు కలుగుతుందని నీవు చెప్పావు; నీవు చెప్పిన మాటయున్= నీ మాటకూడా; తలకూడెన్= సిద్ధించింది; పాండవులవలనన్+తప్పు లేదు+అని ఎఱుంగుదు(వు)= పాండవులయందు తప్పులేదని నీకు తెలియును కదా!; వారలకున్+అలుగకుండునది= వారి మీద కోపించకుండా ఉండుము; నీవు+అలిగిచూచినన్= నీవు కోపంతో చూచినట్లయితే; త్రిలోకంబులు= ముల్లోకాలు; భస్మీభూతంబులు+అగును= బూడిద అవుతాయి; అట్టి తపః ప్రభావంబునన్= అటువంటి తపశ్శక్తిచే; ప్రసిద్ధవు= పేరున్నదానవు; కావునన్= అందుచేత; నిన్నున్+ప్రార్థించెదన్= నీకు ప్రార్థన చేస్తున్నాను; అని పల్కినన్= అని చెప్పగా; ఆ+దేవి= ఆ గాంధారీదేవి; అది అంతయున్= ఆ చరిత్ర అంతా; నీ చెప్పినట్టిది+అ= నీవు చెప్పిన విధమైనదే; అని వెండియున్= అని ఇంకను.

తాత్పర్యం: కీడు కలుగుతుందని నీవు చెప్పావు. ఆ మాట సిద్ధించింది. పాండవులపట్ల ఏ తప్పూ లేదు అనే విషయం నీకూ తెలియును. వారిని కోపగించవద్దని నిన్ను వేడుకొంటున్నాను. నీవు కోపంతో చూస్తే మూడు లోకాలూ బూడిద అవుతాయి. నీ తపశ్శక్తి అంతటిది. కాబట్టి నిన్ను ప్రార్థిస్తున్నాను' అనగా ఆ గాంధారీదేవి 'అంతా నీవు చెప్పిన విధంగానే జరిగింది' అని ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'విపులవిషాదతాపమున వేదన నొందు మదీయ బుద్ధి కుం
దపగత మయ్యె నీదువచనామృతసేచనఁ జేసి యిట్టిచో
నపరిమిత ప్రభావ! విను మంధుఁడు దీనుఁడు వృద్ధు నైన యీ
నృపు నరయంగఁ బాండవులు నీవును యుక్తులు గారె! యెమ్మెయిన్.' 373

ప్రతిపదార్థం: అపరిమిత ప్రభావ!= కొలువ సాధ్యం కాని శక్తి కలవాడా!; విపుల విషాద తాపమునన్= మిక్కిలి దుఃఖంవలని వేడిమివలన; వేదనన్+ఒందు= బాధపడుతున్న; మదీయబుద్ధి= నా బుద్ధి (మనసులోని); కుందు= దుఃఖం; నీదు వచన+అమృత సేచన చేసి= నీ మాటలనే అమృతపు తడుపుచేత; అపగతము+అయ్యెన్= తొలగిపోయింది; ఇట్టిచోన్= ఈ సమయంలో; వినుము= నా మాటను వినుము; అంధుఁడు= గ్రుడ్డివాడు; దీనుఁడు= దీనస్థితిలో ఉన్నవాడు; వృద్ధు= ముసలివాడూ; ఐన= అయినట్టి; ఈ నృపున్= ఈ రాజును; అరయంగన్= రక్షించటానికి; పాండవులు నీవును= నీవును పాండవులు కూడా; ఏ+ మెయిన్= ఎటుచూచినను; యుక్తులు కారె!= తగినవారు కాదా!

తాత్పర్యం: 'విస్తారమైన దుఃఖాగ్నిచేత బాధపడుతున్న నాకు నీ వచనామృతం వలన దుఃఖం తొలగింది. అపరిమిత ప్రభావా! ఈ సమయంలో గ్రుడ్డివాడు, ముదుసలి, దీనావస్థలో ఉన్నవాడు ఐన ఈ రాజును పాండవులూ నీవూ రక్షించటానికి ఏ విధంగా చూచినా తగినవారు కారా?'

వ. అని పయిచీరచెఱంగు మొగంబున నదిమికొని యేడ్చినఁ గృష్ణుండు వివిధ వాక్యంబుల నద్దేవిం దేర్చి ధృతరాష్ట్రునకు మనస్తాపోపశమనంబుగాఁ బలికె; నట్టియెడ నశ్వత్థామ యుత్సాహం బమ్మహాత్మునకు హృదయగోచరం బగుటయు, దిగ్గన లేచి పారాశర్యు చరణంబులకు వినతుం డై యవ్విభునకుం బ్రణమిల్లి యతనితో నిట్లనియె. 374

ప్రతిపదార్థం: అని= అంటూ; పయిచీరచెఱంగు మొగంబునన్+అదిమికొని= మీది చీరకొంగును మొగమున ఒత్తుకొని; ఏడ్చినన్= దుఃఖపడగా; కృష్ణుండు= శ్రీకృష్ణుఁడు; వివిధవాక్యంబులన్= అనేక విధాలయిన మాటలతో; ఆ+దేవిని= ఆ గాంధారీదేవిని; తేర్చి= ఓదార్చి; ధృతరాష్ట్రునకున్ మనస్తాప+ఉపశనంబుగాన్+పల్కెన్= ధృతరాష్ట్రుడికి మనసు చల్లనఅయ్యేటట్లుగా మాటాడాడు; అట్టి యెడన్= అటువంటి సమయంలో; అశ్వత్థామ ఉత్సాహంబు= అశ్వత్థామ యొక్క ఉత్సాహం; ఆ+ మహాత్మునకున్= ఆ శ్రీకృష్ణుడికి; హృదయ గోచరంబు+అగుటయున్= మనసునకు తోచగా; దిగ్గన లేచి= ఉన్నపళంగా లేచి; పారాశర్యుచరణంబులకున్ వినతుండు+ఐ= వ్యాసుడి పాదాలకు నమస్కారం చేసిన వాడై; ఆ+విభునకున్+ప్రణమిల్లి= ఆ ధృతరాష్ట్రుడికి నమస్కారం చేసి; అతనితోన్ ఇట్లు+అనియెన్= అతడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: గాంధారి తన పైటకొంగును ముఖమున ఒత్తుకొని దుఃఖపడగా శ్రీకృష్ణుడు నానావిధ ఉపశమన వాక్యాలతో ఆమెను ఓదార్చాడు. ధృతరాష్ట్రుడికి మనస్తాపం పోయేటట్లు మాటాడాడు. ఆ సమయంలో అతడికి అశ్వత్థామ సమరోత్సాహం గోచరించింది. అంత దిగ్గన లేచి వ్యాసుడికి ధృతరాష్ట్రుడికి నమస్కరించి ధృతరాష్ట్రుడితో ఈ విధంగా అన్నాడు:

క. 'గురుసుతుఁడు పాండవులకుం । గర మల్గును; వారిఁ బొదువఁగా నతఁ డీ ప్రా
ద్దురవడిఁ గదియును; బోయెద । దురపిల్లకుమయ్య మది విధూతకళంకా! 375

ప్రతిపదార్థం: విధూతకళంకా!= పాపం లేనివాడా!; గురుసుతుఁడు= అశ్వత్థామ; పాండవులకున్+కరము+అల్గును= పాండవుల మీద మిక్కిలి కోపిస్తాడు; వారిన్+పొదువన్+కాన్= వారిని కమ్ముకొనగా; అతఁడు= ఆ అశ్వత్థామ; ఈ ప్రొద్దు+ఉరవడి= ఈ దినం త్వరగా; కదియును= దగ్గరచేరును; పోయెదన్= వెళ్ళుతాను; మదిన్= మనసులో; దురసిల్లకుము+అయ్య= దుఃఖపడవద్దు.

తాత్పర్యం: అశ్వత్థామ పాండవులమీద మిక్కిలి కోపిస్తాడు. వారిని కమ్ముకొనటానికై అతడు త్వరగా వారి వద్దకు చేరుతాడు. నేను వెళ్ళివస్తాను. పాపరహితుడా! మనసులో దుఃఖపడవద్దు.'

చ. అన విని రాజు దేవులు మురారికి నిట్లని 'రెంతయున్ రయం
బునఁ జనుమయ్య! పాండునృపపుత్రుల నెమ్మెయి నైనఁ గాచికోల్
వినుతి గదయ్య నీకు! నిను వేయి విధంబుల నాశ్రయించు టె
ల్లను ఫల మొందఁ జేయఁగఁ దలంచుట పెంపు సుమయ్య కేశవా! 376

ప్రతిపదార్థం: అనన్+విని= అని కృష్ణుడు అనగా విన్నవారై; రాజు, దేవులు= ధృతరాష్ట్రుడును, గాంధారియు; ముర+అరికిన్+ఇట్లు+అనిరి= శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నారు; కేశవా!= కృష్ణా!; ఎంతయున్ రయమునన్= ఎంతో వేగంగా; చనుము+అయ్య!= వెళ్ళవయ్యా!; పాండు నృప పుత్రులను= పాండురాజ కుమారులను; ఏ+మెయిన్+ఐనన్= ఏ విధంగానయినా; కాచికోల్= కాపాడుకోవటం; నీకున్+వినుతి కదయ్య!= నీకు కీర్తింపదగినది కదయ్యా! (ధర్మం కదా!); నినున్= నిన్ను; వేయివిధంబులన్= ఎన్నో విధాలుగా; ఆశ్రయించుట= ఆశ్రయించటం; ఎల్లను= అంతా; ఫలమున్+ఒందన్+చేయఁగన్+తలంచుట= ఫలితాన్ని పొందేటట్లు చేయటాన్ని తలచుకోవటం; పెంపు సుమయ్య!= గౌరవమే కదయ్యా!

తాత్పర్యం: అని కృష్ణు డనగా గాంధారీధృతరాష్ట్రులు అతడితో ఇట్లా అన్నారు. 'శీఘ్రంగా వెళ్ళవయ్యా! కేశవా! పాండురాజ కుమారులను కాపాడటం నీకు న్యాయం కదా! నిన్ను వారు వేయి విధాలుగా ఆశ్రయించటాన్ని సఫలం చేయదలచటం నీకు పెంపు గదా!

శ్రీకృష్ణుండు కరిపురంబుననుండి పాండవులయొద్దకు వచ్చుట (సం. 9-62-72)

వ. పొమ్ము పునర్దర్శనమయ్యెడు' మని వీడ్కొల్పిన వాసుదేవుండు వెడలెం; దదనంతరంబ వేదవ్యాసమునీశ్వరుండు వారలతో 'మీకు శోకోపశమనంబుగ నిప్పుడు శౌరి సెప్పిన వచనంబు లాదరణీయంబులు సుండీ!' యని యుపదేశించి వెండియు వలయు వాక్యంబుల వారికి నాశ్వాసంబు గావించి యంతర్ధానంబు సేసె; నిత్తెఱంగున గోవిందుండు కృతకృత్యుండై వెలువడి యరదం బెక్కియతి త్వరితగతి నోఘవతీతీరంబున కరిగి, పాండవులం గని, తాను ధృతరాష్ట్ర సన్నిధి గాంధారిం గనుటయు, వారలకు 'దుర్యోధనుండు దెగియె' నని నెట్టనం జెప్పక బెరసుంబల్కులుగా నయ్యాంబికేయుని యుపేక్షనుం గొడుకుల కీడునం దత్కులంబునకు సంక్షయంబు వాటిల్లుట యుగ్గడించుటయు, నాసందునఁ బాండవుల వలనఁ బాపంబు లేమి దెల్పుటయును, నారాజును దేవులును వారిం గోపింపకుండం బ్రార్థించుటయు నుపచారవచనంబుల చందంబున వార లా వృద్ధులకు నిస్తారకు లని పటుకుటయు, విశేషించి గాంధారికి నుచితభాషణంబుల నత్యంతోపశాంతి గలిగించుటయు, నప్పలుకు లన్నింటను దుది నయ్యిరువురు దయచేసినది సామాన్యంబున ననుష్ఠించిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యాపత్సమయ సమాగమంబుగాఁ గొనినమాత్రయ కాని యొండెఱుంగక యునికియు, నగ్గాంధారరాజనందన దనకు మగని నప్పగించుటయు నెఱింగించి, యంతక మున్న వచ్చి యావిచిత్రవీర్యపుత్త్రుకడం బారాశర్యుం డున్న వాఁ డమ్మహాత్ముం డే నిట వచ్చిన పిదప నాదంపతులకు నాయొనర్చిన యుపదేశంబు దృఢం బగునట్టి మాట లాడనోపు ననియు, నతని యునికి యట్లుగాఁ దన పోయినపని సఫలం బగుటయుఁ, బాండునందనులకుఁ దెలియఁ జెప్పె నని వైశంపాయనుండు జనమేజయున కి ట్లనియె. 377

ప్రతిపదార్థం: పొమ్ము= వెళ్ళుము; పునః+దర్శనము+అయ్యెడున్= మరల కానవత్తువు గాక; అని వీడ్కొల్పినన్= అని పంపగా; వాసుదేవుండు వెడలెన్= శ్రీకృష్ణుడు వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= ఆ మీదట; వేదవ్యాస మునీశ్వరుండు= వేదవ్యాస ఋషి; వారలతోన్= ఆ గాంధారీ ధృతరాష్ట్రులతో; మీకున్ శోక+ఉపశమనంబుగన్= మీకు దుఃఖంలేకుండేటట్లు; ఇప్పుడు= ఈ సమయంలో; శౌరి చెప్పిన వచనంబులు= శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు; ఆదరణీయంబులు= గౌరవించదగినవి; సుండు+ఈ!= సుమండీ!; అని ఉపదేశించి= అని తెలియజేసి; వెండియున్= ఇంకను; వలయు వాక్యంబులన్= అవసరమైన మాటలతో; వారికిన్ ఆశ్వాసంబు కావించి= వారికి ఓదార్పు కలిగించి; అంతర్ధానంబు చేసెన్= అంతర్ధానమయ్యాడు; ఈ+ తెఱంగునన్ గోవిందుఁడు= ఈ విధంగా శ్రీకృష్ణుడు; కృతకృత్యుండు+ఐ= చేయదగు పనిచేసిన వాడుగా; వెలువడి= బయటకు వచ్చి; అరదంబు+ఎక్కి= తేరెక్కి; అతి త్వరితగతిన్= మిక్కిలి వేగంగా; ఓఘవతీ తీరంబునకున్+అరిగి= ఓఘవతీ నది గట్టునకు చేరి; పాండవులన్+కని= పాండవులను చూచి; తాను ధృతరాష్ట్రు సన్నిధిన్ గాంధారిన్+కనుటయున్= తాను ధృతరాష్ట్రుడి వద్ద గాంధారిని చూచిన విధాన్నీ; వారలకున్= ఆ ఇద్దరకును; దుర్యోధనుండు తెగియెన్+అని= దుర్యోధనుడు చనిపోయాడని; నెట్టన చెప్పక= వెంటనే తెలుపకుండా; బెరసు+పల్కులుగాన్= క్రూరమైన మాటలుగా; ఆ+ఆంబికేయుని= ఆ ధృతరాష్ట్రుడి; ఉపేక్షను= అశ్రద్ధను; కొడుకుల కీడును= కొడుకుల పాపమును; తద్+కులంబునకున్= వారి వంశానికి; సంక్షయంబు పాటిల్లుట= నాశం కలగటం; ఉగ్గడించుటయున్= చెప్పటమూ; ఆ సందునన్= ఆ సందర్భంలో; పాండవులవలనన్= పాండవుల దెస; పాపంబు లేమిన్= తప్పులేకుండటం; తెల్పుటయును= తెలియజేయటం; ఆ రాజును దేవులును= ఆ గాంధారీ ధృతరాష్ట్రులు; వారిన్+కోపింపకుండ ప్రార్థించుటయున్= పాండవులమీద కోపపడకుండా ప్రార్థన చేయటం; ఉపచార వచనంబుల చందంబుగన్= ఓదార్పు మాటల మాదిరిగా; వారలు= పాండవులు; ఆ వృద్ధులకున్= ఆ ముదుసలివారికి; నిస్తారకులని పలుకుటయున్= తరింపజేసే వారని చెప్పటమూ; విశేషించి= ఎక్కువగా; గాంధారికిన్= గాంధారీదేవికి; ఉచిత భాషణంబులన్= తగిన మాటలతో; అత్యంత+ఉపశాంతి కలిగించుటయున్= మిక్కిలి ఓదార్పు చేకూర్చుటయును; ఆ+పలుకులు+ అన్నింటను= ఈ మాటలన్నిటిలోను; తుదిని= కడకు; ఆ+ఇరువురు= ఆ ఇద్దరును (గాంధారీ ధృతరాష్ట్రులు); తన చేసినది= తాను కావించినది; సామాన్యంబునన్= సాధారణంగా; అనుష్ఠించిన= ఆచరించినట్టి; ఆపద్+సమయ సమాగమంబుగాన్= కష్టకాలంలో కలవడంగా; కొనిన మాత్రయ కాని= గ్రహించడమే కాని; ఒండు+ఎఱుంగక ఉనికియున్= వేరే తెలియకుండటమునూ; ఆ+గాంధారరాజనందన= ఆ గాంధారీదేవి; తనకున్ మగనిన్+అప్పగించుటయున్= శ్రీకృష్ణుడికి భర్తను (ధృతరాష్ట్రుని) ఒప్పగించటం; ఎఱింగించి= తెలియచేసి; అంతక మున్ను వచ్చి= అంతకంటే ముందుగానే వచ్చి; ఆ విచిత్రవీర్య పుత్రుకడన్= ఆ ధృతరాష్ట్రుడి వద్ద; పారాశర్యుండు ఉన్నవాఁడు= వ్యాసుడు ఉన్నాడు; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడు; ఏన్+ఇటన్ వచ్చిన పిదపన్= నేనీ దిక్కునకు వచ్చిన తరువాత; ఆ దంపతులకున్= ఆ భార్యా భర్తలకు (గాంధారీ ధృతరాష్ట్రులకు); నా ఒనర్చిన ఉపదేశంబు= నేను చేసిన ఉపదేశం; దృఢంబు+అగునట్టి= నిశ్చయమైనటువంటి; మాటలాడన్+ఓపును+అనియున్= మాటలాడి ఉంటాడని; అతని+ఉనికి= ఆయన ఉండుట; అట్లుగాన్= ఆ విధంగా కావడంవల్ల; తనపోయిన పని= తాను వెళ్ళిన పని; సఫలంబగుటయున్= సిద్ధినందుటయును; పాండునందనులకున్= పాండవులకు; తెలియన్+చెప్పెనని= తెలిపాడని; వైశంపాయనుండు= వైశంపాయన ముని; జనమేజయునకున్= జనమేజయ చక్రవర్తితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: గాంధారీ ధృతరాష్ట్రులు 'వెళ్ళిరమ్ము. మరలా చూద్దాముగాక!' అని శ్రీకృష్ణుడికి వీడ్కోలిచ్చారు. ఆయన కూడా వెళ్ళాడు. ఆ తరువాత వేదవ్యాస మునీశ్వరుడు గాంధారీ ధృతరాష్ట్రులతో 'మీకు దుఃఖశాంతికై కృష్ణు డీ సమయంలో చెప్పినమాటలు ఆచరించటం గౌరవించటం తగును' అని ఉపదేశించాడు. ఇంకా అవసరమైన మాటలను వారిని ఓదార్చటానికై చెప్పి తానంతర్ధానమయ్యాడు. శ్రీకృష్ణుడు తాను వచ్చిన పనిని ఈ విధంగా చేసి, ఆ మీదట తన తేరుమీద వేగంగా ఓఘవతీ తీరానికి వెళ్ళి, పాండవులను చూచి, తాను ధృతరాష్ట్రుని సమక్షంలో గాంధారిని చూచిన విధమునూ, దుర్యోధనుడి చావును, వెంటనే వారికి తాను తెలుపకుండా కఠినమైన మాటలతో ధృతరాష్ట్రుడి అశ్రద్ధనూ, కొడుకుల తప్పు వల్ల జరిగిన కులనాశమునూ చెప్పటం, ఆ విషయంలో పాండవులు దోషం చేయలేదని చెప్పి ఆ ఇరువురునూ పాండవులను కోపగించరాదని ప్రార్థించటమూ, ఉపచారవచనాలవలె పాండవులు, ఆ వృద్ధుల్ని తరింపజేసే వారని పల్కడమూ, విశేషించి గాంధారీ దేవికి తగుమాటలతో మిక్కిలి ఉపశాంతి కల్గించడమూ, ఆ మాటల చివరని ఆ ఇరువురు తాను చేసినది ఆపత్సమయ సమాగమంగా భావించడమేగానీ మరొకటి తెలియకుండయు వేరేమీయూ కాదని ఆ గాంధారీదేవి తనకు ధృతరాష్ట్రుడిని అప్పగించిన తీరును తెలియజేశాడు. తనకన్న ముందుగా వ్యాసుడు, ధృతరాష్ట్రుడి వద్ద నున్న విషయమునూ, తానిట్లువచ్చిన తరువాత ఆ మహర్షి ఆ వృద్ధదంపతులకు తాను కావించిన ఉపదేశాన్ని వివరించి ఉంటాడనీ చెప్పి, తాను సఫలీకృతుడైనట్లు పాండవులకు తెలిపాడు - అని వైశంపాయనుడు జనమేజయుడితో చెప్పాడు.

క. విను మోఘవతీతీరం । బున కమ్మెయిఁ బాండురాజపుత్త్రులు ప్రీతిం
జనిన తెఱఁగు సంజయుచే । విని ధృతరాష్ట్రుండు శోకవిహ్వాలుఁ డగుచున్. 378

ప్రతిపదార్థం: వినుము; ఓఘవతీ తీరంబునకున్= ఓఘవతీ తీర్థం దరికి; ఆ+మెయిన్= ఆ విధంగా; పాండురాజ పుత్రులు= పాండవులు; ప్రీతిన్+చనిన తెఱఁగు= ప్రీతితో వెళ్ళిన విధమును; సంజయుచేన్+విని= సంజయుడివలన విని; ధృతరాష్ట్రుండు; శోకవిహ్వాలుఁడు+అగుచున్= దుఃఖంతో స్వాధీనం తప్పినవాడై.

తాత్పర్యం: నేను చెప్పేది వినుము. పాండురాజకుమారులు ఆ విధంగా ఓఘవతీ తీరానికి వెళ్ళిన విధమును సంజయుడివలన విని ధృతరాష్ట్రుడు స్వాధీనం తప్పినవాడై మిక్కిలి దుఃఖంతో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అతని కిట్లనియె. 379

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ సంజయుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు సంజయుడిని ఈ విధంగా అడిగాడు.

ఆ. 'తొడలు విఱిగి నేలఁబడియుండఁ దలదన్ని । నట్టి భీమసేనుఁ డగ్రజుండు
ననుజచయముఁ దాను నరిగినపిమ్మట! నెట్టు లయ్యె నమ్మహీశ్వరుండు?' 380

ప్రతిపదార్థం: తొడలు విఱిగి= తొడలు విరిగిపోయి; నేలన్+పడిఉండన్= భూమిమీద పడిఉండగా; తలన్+తన్నినట్టి భీమసేనుఁడు= తలను తన్నిన భీముడు; అగ్రజుండున్= అన్నగారైన ధర్మరాజు; అనుజచయమున్= తమ్ముల సమూహమును; తానున్= తానుకూడా; అరిగిన పిమ్మటన్= వెళ్ళిన తరువాత; ఆ+మహీశ్వరుండు= ఆ దుర్యోధనుడు; ఎట్టులు+అయ్యెన్?= ఏమైనాడు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'తొడలు విరిగి నేలమీద పడినవాని తలను తన్నిన భీముడు, అన్నగారితోనూ తమ్ములతోనూ కలసి వెళ్ళిన మీదట ఆ దుర్యోధనుడు ఏమైనాడు?'

వ. అని యడిగిన నమ్మానవపతికి నాసూతనూనుం డిట్లను 'నేను బొదలో నుండి, యుధిష్ఠిరుండు యుద్ధ సమయంబు నిశ్చయించిన నీ కొడుకు పొలికలనికి నడచునప్పుడు వెడలి, పాండవపరిజనంబులం గలసి వారు నన్నుఁ డాసినదృష్టిం గనుంగొన నక్కురపతికిం బొడసూపక చని, గదారణం బనుసంధించి యునికింజేసి యక్కౌంతేయు లరిగినయనంతరంబ యమ్మహీకాంతునికడకుం బొగులుచుఁ బోయితిఁ; బోయిన నతండు ధూళి పొదివిన వదనంబుపై నెఱసిన వెండ్రుకలు వాయంద్రోచికొని, నా మొగంబుఁ జూచి, ధర్మనందను నిందించుచు నవుడు గఱచి కన్నీరు గ్రమ్మ నిట్టూర్పు నిగిడించి. 381

ప్రతిపదార్థం: అని అడిగినన్ ఆ+మానవపతికిన్= (తొడలు విరిగి నేలమీద పడిన దుర్యోధను డేమైనాడని అడిగిన ఆ ధృతరాష్ట్రుడికి) ఆ విధంగా అడుగగా ఆ రాజునకు; ఆ సూతసూనుండు+ఇట్లనున్= ఆ సంజయుడు ఈ విధంగా అన్నాడు; నేను పొదలోన్+ఉండి= నేను పొదలో దాగి ఉండి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; యుద్ధసమయంబున్= యుద్ధానికి వేళను; నిశ్చయించినన్= నిర్ణయించగా; నీ కొడుకు= నీ కుమారుడు; పొలికలనికిన్= యుద్ధభూమికి; నడచునప్పుడు= వెడలేటప్పుడు; వెడలి= బయల్పడి వెళ్ళి; పాండవ పరిజనంబులన్+కలసి= పాండవుల సేవకులను కలిసికొని; వారు నన్ను డాసిన దృష్టి కనుంగొనన్= వారు నన్ను సమీపించగా గమనించి; ఆ+కురుపతికిన్+పొడసూపక= ఆ దుర్యోధనుడికి కానరాకుండా; చని= వెళ్ళి; గదారణంబు+అనుసంధించి ఉనికిన్+చేసి= గదా యుద్ధమును పరిశీలించియున్నందువల్ల; ఆ+కౌంతేయులు= ఆ కుంతీ తనయులు; అరిగిన+అనంతరంబు+అ= వెళ్ళిన తరువాత; ఆ+మహీకాంతుని కడకున్= ఆ రాజువద్దకు; పొగులుచున్= పరితపిస్తూ; పోయితిన్= వెళ్ళాను; పోయినన్= పోగా; అతండు= ఆ రాజు; ధూళి పొదివిన వదనంబుపైన్= దుమ్ము క్రమ్మిన ముఖాన; నెఱసిన= వ్యాపించిన (చిందర వందరగా పడిఉన్న); వెండ్రుకలు= వెంట్రుకలను; పాయన్+త్రోచికొని= తొలగద్రోచికొని; నా మొగంబు చూచి= నా ముఖం చూచి; ధర్మనందనున్ నిందించుచున్= ధర్మరాజును దూషిస్తూ; అవుడుకఱచి= క్రింది పెదవిని తొక్కిపట్టి; కన్నీరు క్రమ్మన్ నిట్టూర్చి= కన్నీరు క్రమ్ముకోగా నిట్టూర్పు వదలి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు అడిగిన దానికి సంజయుడు సమాధానంగా ఇట్లా చెప్పాడు. 'నేను పొదలో దాగికొనిఉండి ధర్మరాజు యుద్ధసమయాన్ని నిశ్చయించటం వలన నీ కుమారుడు కదనరంగానికి వెళ్ళేటప్పుడు పాండవుల సేవకులను కలిసి వాళ్ళు నా దగ్గరకు రావటాన్ని గుర్తించి, ఆ సుయోధనుడికి కానరాకుండా వెళ్ళి గదాయుద్ధాన్ని పరిశీలించి యున్నందువల్ల కుంతీతనయులు వెళ్ళిన తదుపరి వెళ్ళాను. అతడు దుమ్ముకమ్ముకొన్న ముఖం మీద చిందరవందరగా పడిఉన్న వెంట్రుకలను తొలగించుకొని నా ముఖం చూచి కన్నీళ్ళతో ధర్మరాజును దూషిస్తూ పెదవి కరచిపట్టి నిట్టూర్పు వదలి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. 'నేల నాలుగు చెఱఁగులు నేలి భీష్మ। గురుకృపాదులపైఁ గార్యభరము నిల్పి
యున్న వానికి దుది నిట్టు లుండవలసెఁ। గాల సంప్రాప్త మేరికిఁ గడప వచ్చు? 382

ప్రతిపదార్థం: నేల నాలుగు చెఱఁగులున్+ఏలి= నేల నాలుగు దిక్కులను పాలించి; భీష్మగురు కృపాదులపైన్= భీష్మ ద్రోణ కృపులమీద; కార్య భరము నిల్పి= పనిచేసే బాధ్యతను నిలిపి; ఉన్న వానికిన్= ఉన్నటువంటి ఆతనికి; తుదిన్+ఇట్టులుండవలసెన్= చివరకు ఈ విధంగా ఉండవలసి వచ్చింది; కాలసంప్రాప్తము= విధిని; ఏరికిన్ గడపవచ్చున్?= ఎవరికి దాటటానికి సాధ్యం?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నాలుగు దిక్కులకూ వ్యాపించిన రాజ్యాన్ని పాలించి, భీష్మద్రోణకృపాదులకు కార్య భారాన్ని అప్పజెప్పి ఉన్న వాడికి చివరకు ఇట్టి అవస్థ కలిగింది. విధి ఇట్లున్నది. దైవనిర్ణయాన్ని అతిక్రమించటం ఎవరికి సాధ్యం?

విశేషం: అర్థాంతరన్యాసం. విశేషాంశాన్ని సామాన్యాంశం సమర్థిస్తున్నది.

క. ననుఁ బదునొకఁ డక్షౌహిణు । లనూనవిభవమునఁ గొల్వ నఖిల నృపులు పం
చిన పని సేసి మెలఁగి; ర । ట్లునికి గనిన నీవ యిట్టు లునికియుఁ గంటే? 383

ప్రతిపదార్థం: పదునొకఁడు+అక్షౌహిణులు= పదకొండ క్షౌహిణీ సేన; ననున్= నన్ను; అనూనవిభవమునన్= గొప్ప వైభవముతో; కొల్వన్= సేవించగా; అఖిల నృపులు= రాజులందరును; పంచిన పనిచేసి= చెప్పిన పనిని చేసి; మెలఁగిరి= తిరిగారు; అట్లు+ ఉనికిన్+కనినన్= ఆ విధంగా ఉండటాన్ని చూచిన; నీవ= నీవే; ఇట్టులు+ఉనికియున్+కంటే?= ఇట్లా ఉండటాన్ని చూచావా?

తాత్పర్యం: పదకొండు అక్షౌహిణులసేన ఎంతో వైభవంగా కొల్వగా సాటిలేని వైభవంతో రాజులందరూ సేవించగా ఆ విధంగా ఉన్న నన్ను చూచావు. ఇపుడు ఈ విధంగా ఉండటాన్ని చూస్తున్నావా?

ఆ. వాయునందనుఁడు గదాయుద్ధధర్మంబు । నుజ్జగించి నింద కోర్చి యిట్లు
సేసె నిత్తెఱంగు సెప్పుమీ! సంజయ! । మనకు నిపుడు గల్గుజనుల కెల్ల. 384

ప్రతిపదార్థం: సంజయ!= ఓ సంజయుడా!; వాయునందనుఁడు= భీమసేనుడు; గదా యుద్ధ ధర్మంబున్= గదా యుద్ధపు నియమాన్ని; ఉజ్జగించి= తప్పిపోయి; నిందకున్+ఓర్చి= లోకనిందను భరించటానికి సిద్ధపడి; ఈ+తెఱంగు= ఈ విధాన్ని; మనకున్ ఇపుడు కల్గు జనులకున్+ఎల్లన్= మన కిపు డున్న మనుజుల కందరికీ; చెప్పుమీ= చెపుమా.

తాత్పర్యం: ఓ సంజయా! భీముడు గదాయుద్ధ నియమాల నతిక్రమించి ఈ విధంగా చేశాడనీ, లోక నిందను భరించటానికి సిద్ధమైనాడనీ మిగిలి ఉన్న మన వారికందరకూ చెప్పుము.

చ. అనిమిషవాహినీతనయు నస్త్రకళాగురు సోమదత్తిఁ గ
ర్ణుని రణధర్మహీనతకు రోయక చంపినభంగులున్ మరు
త్తనయుఁడు నేఁడు సేసిన విధంబును లోకులు పాండురాజనం
దనతతిఁ బ్రువ్వఁ దిట్టరె? వృథావిజయం బిది యెంత యొప్పెడున్? 385

ప్రతిపదార్థం: అనిమిష వాహినీ తనయున్= దివ్య నదిఅయిన గంగా తనయుడైన భీష్ముడిని; అస్త్రకళా గురున్= ధనురాచార్యుడిని (ద్రోణుడిని); సోమదత్తిన్= భూరిశ్రవుడిని; కర్ణునిన్; రణ ధర్మహీనతకున్= యుద్ధ ధర్మమును తప్పటానికి; రోయక= అసహ్యపడక; చంపిన భంగులున్= చంపిన పద్ధతులును; మరుత్+తనయుఁడు= వాయునందనుడైన భీముడు; నేఁడు చేసిన విధంబును= ఈ దినం కావించిన పద్ధతిని; లోకులు= లోకమందరి వారు; పాండురాజనందనతతిన్= పాండుకుమారుల సమూహాన్ని; ప్రువ్వన్= పురుగులు పడగా (నాశమందగా); తిట్టరె!= నిందించరా; వృథావిజయంబు= వ్యర్థమైన విజయం; ఇది= ఈ పొందినది; ఎంత ఒప్పెడున్?= ఎంత తగి ఉన్నది?

తాత్పర్యం: భీష్మద్రోణ భూరిశ్రవ కర్ణులను యుద్ధధర్మాన్ని పాటించకుండా నీచంగా చంపిన తీరును, ఈరోజు వాయునందనుడు కావించిన పద్ధతిని లోకులంతా పాండవులను పురుగులు పడగా తిట్టరా? ఈ వృథా విజయం- - ఏ మాత్రం తగి ఉన్నది?

క. అనిలజుఁడు పోలెఁ గపటపు । టనువునఁ బగవారి నోర్చి హర్షంబునఁ దే
లునె? తూలపోనిమగఁటిమి । దనకుఁ గలుగునట్టి కీర్తి తత్పరుఁ డెందున్. 386

ప్రతిపదార్థం: తూలపోని= చలించని; మగఁటిమి= పరాక్రమం; తనకున్; కలుగునట్టి; కీర్తితత్పరుఁడు= కీర్తి కావాలనుకొనేవాడు; ఎందున్= ఎక్కడైనా; అనిలజుఁడు+పోలెన్= భీముడివలె; కపటపు+అనువునన్= మోసపు పద్ధతిలో; పగవారిన్= శత్రువులను; ఓర్చి= ఓడించి; హర్షంబునన్= సంతోషంతో; తేలునె?= తేలిపోతాడా?

తాత్పర్యం: వాయుతనయు డైన భీముడివలె మోసంతో విరోధుల నోడించినవాడు సంతోషంతో తేలియాడగలడా? తూలిపోని మగతనం కలవాడు కీర్తి కాముకుడైన వాడు ఎక్కడనైనా అట్లా ఉంటాడా?

చ. మఱియు నొకండు వింటె? పవమాన తనూజుని చెయ్దిఁ బెన్దొడల్
విఱిగి ధరిత్రిఁ బడ్డయెడ వేగమె వచ్చి శిరంబుఁ దన్నె నే
డ్తెఱ గలయప్పు శత్రు నవధీరితుఁ జేయుట యొప్పుఁ గాక యే
పఱినఁ బరాభవించిన జనావళి నవ్వదె? నొవ్వదే మదిన్? 387

ప్రతిపదార్థం: మఱియున్+ఒకండు= ఇంకొక్కటి; వింటె?= విన్నావా?; పవమానతనూజుని చెయ్దిన్= భీముడి పనిచేత; పెన్+తొడల్ విఱిగి= పెద్ద తొడలు విరిగిపోయి; ధరిత్రిన్+పడ్డయెడన్= భూమిమీదపడినప్పుడు; వేగమె వచ్చి= త్వరగా వచ్చి; శిరంబున్+తన్నెన్= తలను తన్నాడు; ఏడ్తెఱ+కల యప్పు= ఆధిక్యం కలిగినపుడు; శత్రున్= వైరిని; అవధీరితున్+చేయుట= తిరస్కరించటం; ఒప్పున్+కాక= తగునుగాక; ఏపు+అఱినన్= ఆధిక్యం నశించగా; పరాభవించినన్= అవమానం కావిస్తే; జనావళి నవ్వదె?= జనసమూహం నవ్వదా?; మదిన్ నొవ్వదే?= మనసులో నొచ్చుకోదా?

తాత్పర్యం: ఇంకను భీముడి చేష్ట మరొకదానిని విన్నావా? తొడలు విరిగిపడి ఉన్నపుడు శీఘ్రంగా వచ్చి నా తలను తన్నాడు. ఆధిక్యమున్నపుడు తిరస్కారభావంతో చూడవచ్చును. అంతవరకు తగును గాని ఆధిక్యం నశించిన సమయంలో అవమానిస్తే జనసమూహం నవ్వదా? మనసులో నొచ్చుకోదా?

క. మనరాజును దేవులు భం । డనము తగవు నేర్పరించుటకు నేర్తురు; భీ
ముని చేసినయది సంజయ! । వినిపింపుము వారలకు సవిస్తారముగన్. 388

ప్రతిపదార్థం: సంజయా!; మనరాజును+దేవులు= ధృతరాష్ట్రుడు, రాణులు; భండనము తగవు= యుద్ధ ధర్మమును; ఏర్పరించుటకున్= వివరించటానికి; నేర్తురు= తెలిసి ఉన్నారు; భీముడి చేసిన+అది= భీముడు కావించిన దానిని; వారలకున్= వాళ్ళకు; సవిస్తారముగన్= వివరంగా; వినిపింపుము= తెలుపుము.

తాత్పర్యం: ఓ సంజయా! మన రాజును, రాణులును యుద్ధధర్మమును విశ్లేషించటం తెలిసినవారు. భీముడు చేసిన పనిని వారలకు విస్తారంగా వివరించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియును. **389**

ప్రతిపదార్థం: మరియును= ఇంకను.

తాత్పర్యం: ఇంకా.

మ. చెలులం జుట్టలఁ బ్రోచి యర్థిజనులన్ శ్రీమంతులన్ జేసి, వి
ప్రుల భవ్యస్థితి మన్చి యాగములు పేరుం బెంపు శోభిల్ల ని
ట్టలపుం ద్యాగము దానమున్ నడపి నిష్ఠం బెక్కు సెల్లించి యు
జ్జ్వలతేజంబున నిద్ధభూతి భుజగర్వస్ఫూర్తిఁ బొల్పారితిన్. **390**

ప్రతిపదార్థం: చెలులన్+చుట్టలన్+ప్రోచి= స్నేహితులను బంధువులను రక్షించి; అర్థిజనులన్= ఆశ్రయించిన వారిని; శ్రీమంతులన్+చేసి= ఐశ్వర్యవంతులను కావించి; విప్రులన్= బ్రాహ్మణులను; భవ్యస్థితిన్= యోగ్యమైన స్థితిలో; మన్చి= కాపాడి; పేరున్+పెంపు శోభిల్లన్= కీర్తి గొప్పతనం ప్రకాశించగా; యాగములు; ఇట్టలపున్+త్యాగము+దానమున్ నడపి= మిక్కిలి త్యాగంతో దానాలు చేసి; నిష్ఠన్+పెక్కు+చెల్లించి= నియమంతో చాలా వాటిని చేసి; ఉజ్జ్వలతేజంబునన్= మిక్కిలి ప్రకాశంతో; ఇద్ధభూతిన్= గొప్ప సంపదతో; భుజగర్వస్ఫూర్తిన్= భుజబలంతో; పొల్పు+ఆరితిన్= ఒప్పి ఉన్నాను.

తాత్పర్యం: స్నేహితులను బంధువులను రక్షించి, ఆశ్రయించినవాళ్ళను శ్రీమంతులనుగా చేశాను. బ్రాహ్మణులను క్షేమంగా ఉండగా కాపాడాను. కీర్తి ప్రతిష్ఠలు పెరుగగా యాగాలు చేశాను. మిక్కిలి ప్రకాశవంతమైన తేజస్సుతో సాటిలేని సంపదతో భుజబలంతో స్థిరంగా వెలిగాను.

క. పగవారి నాశ్రయింపక । మగఁటిమియును బ్రాభవంబు మానము నెందుం
బొగడొంద నుల్లసిల్లితిఁ । దెగునంతకు లక్ష్మితోఁ బ్రదీప్తుఁడ నైతిన్. **391**

ప్రతిపదార్థం: పగవారిన్+ఆశ్రయింపక= వైరులను ఆశ్రయించక; మగఁటిమియును= వీరత్వమును; ప్రాభవంబున్= గొప్పదనమును; మానమున్= అభిమానమును; ఎందున్+పొగడొందన్= ఎక్కడ కూడా కీర్తింపబడగా; ఉల్లసిల్లితిన్= ఆనందంగా ఉన్నాను; తెగు+అంతకున్= క్రిందపడిపోవుదాకా; లక్ష్మితోన్= సంపదతో; ప్రదీప్తుడను+ఐతిన్= ప్రకాశించాను.

తాత్పర్యం: క్రిందపడేదాకా శత్రువులను ఆశ్రయించకుండా వీరత్వంతో గొప్ప అభిమానంతో అంతటా పొగడబడుతూ సంతోషంతో వెలిగాను.

క. సమరము శమంతపంచక । సమీపమున ధర్మవృత్తిఁ జలుపఁగ నత్యు
త్తమ లోకము సమకూఱెను; । విమలాత్ముఁడ నైతి; నొండు వేయును నేలా? **392**

ప్రతిపదార్థం: శమంత పంచక సమీపమునన్= శమంత పంచకం దగ్గర; సమరమున్= యుద్ధంలో; ధర్మవృత్తిన్+చలుపఁగన్= న్యాయంగా చేయగా; అత్యుత్తమ లోకము= మిగుల పవిత్రమైన లోకము; సమకూఱెను= సిద్ధించింది; విమల+ఆత్ముఁడన్+ఐతిన్= నిర్మలమనస్కుడ నైనాను; ఒండు= వేరు; వేయున్+ఏలా?= వేయి మాటలెందుకు?

తాత్పర్యం: శమంతపంచకం దగ్గర యుద్ధం ధర్మంగా చేయగా పుణ్యలోకాలు ప్రాప్తించాయి. నిర్మల మనస్కుడ నైనాను. వేయి మాట లెందుకు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఎదిరి పెనగంగఁ జాలక నిదురవోవ । నొంచు తెఱఁగున, విషము వెట్టించు పగిది,
నింటఁ జిచ్చిడు చాడ్పున, నిట్లు సేసి । పడయుదురుగాక రాజ్య మప్పాండుసుతులు!' 393

ప్రతిపదార్థం: ఆ+పాండుసుతులు= ఆ పాండురాజు కొడుకులు; ఎదిరి పెనగంగన్+చాలక= ఎదుర్కొని యుద్ధం చేయలేక; నిదుర+పోవన్= నిదుర పోతుండగా; నొంచు తెఱఁగునన్= బాధించే విధంగా; విషము పెట్టించు పగిదిన్= విషం పెట్టించిన విధంగా; ఇంటన్+చిచ్చిడు చాడ్పునన్= ఇంటికి అగ్గిపెట్టిన విధంగా; ఇట్లు చేసిన= ఈ విధంగా చేసి (మోసంగా కొట్టి); రాజ్యము= రాజ్యమును; పడయుదురుగాక!= పొందుదురు గాక!

తాత్పర్యం: ఆ పాండురాజు కొడుకులు ఎదుర్కొని పోరాడలేక నిద్రించేవాడిని బాధించిన విధంగాను, విషప్రయోగం చేసినట్లూ - ఇంటికి అగ్గిపెట్టినట్లుగాను, ఈ విధంగా (మోసంతో) రాజ్యాన్ని పొందుదురుగాక!'

వ. అని యంత నిలువక. 394

ప్రతిపదార్థం: అని= అంటూ; అంతన్ నిలువక= అంతటితో ఆగకుండా.

తాత్పర్యం: అంటూ అంతటితో ఆగకుండా - (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. 'పాపకర్ము లయినపాండుతనూజులు । సమరధర్మ మెడలి జయము గొనుట
గురుసుతునకుఁ గృపునకుం గృతవర్మ కు । దేట పఱుపు నాదుమాట గాఁగ. 395

ప్రతిపదార్థం: పాపకర్ములు+అయిన= పాపాత్ములయిన; పాండు తనూజులు= పాండురాజు కుమారులు; సమరధర్మము+ఎడలి= యుద్ధ నీతిని అతిక్రమించి; జయము+కొనుట= గెలవటాన్ని; గురుసుతునకున్= అశ్వత్థామకు; కృపునకున్= కృపాచార్యుడికి; కృతవర్మకున్= కృతవర్మకును; నాదుమాట కాఁగన్= నా మాటగా; తేట+పఱుపు(ము)= స్పష్టంగా చెప్పుము.

తాత్పర్యం: 'పాపాత్ము లయిన పాండురాజు కుమారులు యుద్ధ ధర్మాన్ని అతిక్రమించి జయమందిన పద్ధతిని అశ్వత్థామ, కృప, కృతవర్మలకు స్పష్టంగా నా మాటగా తెలియజేయుము.

క. దేవవ్రతగురుకర్ణుల । దేవసములఁ బాడి దొఱఁగి తెగటార్చుటయున్
నీవు దలఁపించి వారల । తో వెండియు నిట్టు లనుము దుర్జనదూరా! 396

ప్రతిపదార్థం: దుర్జనదూరా!= చెడ్డవారికి దూరంగా ఉండేవాడా!; దేవవ్రత= భీష్మ; గురు= ద్రోణాచార్య; కర్ణులన్= కర్ణులను; దేవసములన్= దేవతాసములను; పాడిన్+తొఱఁగి= ధర్మం తప్పి; తెగటార్చుటయున్= చంపటాన్నీ; నీవు తలఁపించి= నీవు జ్ఞాపకం చేసి; వారలతోన్= అశ్వత్థామ, కృప, కృతవర్మలతో; వెండియున్= ఇంకను; ఇట్టులు+అనుము= ఈ విధంగా చెప్పుము.

తాత్పర్యం: పాపదూరుడా! దేవసమాను లయిన భీష్మ ద్రోణ కర్ణులను ధర్మాతిక్రమణం చేసి చంపటాన్ని నీవు (వారికి) జ్ఞాపకం చేసి, అశ్వత్థామ, కృప, కృతవర్మలతో ఇంకా ఇట్లా చెప్పుము.

ఆ. కపటధర్మకంచుకంబున వెలసిరి । గాని సత్యపురుషకారపరులు
గారు పాండుసుతులు; వారల నమ్మంగఁ । గాదు సేత గుండెకాయ యుడిన. 397

ప్రతిపదార్థం: పాండుసుతులు= పాండురాజ కుమారులు; కపట= మోసమయిన; ధర్మకంచుకంబునన్ వెలసిరికాని= ధర్మమనే కవచంతో (ముసుగుతో) ఉన్నారు కానీ; సత్యపురుషకారపరులుకారు= సత్యమైన మగటిమి కలవారు కారు; గుండెకాయ= గుండెకాయను (మనసును); చేతన్= చేతిలో; ఇడినన్= పెట్టినప్పటికిని; వారలన్ నమ్మంగన్ కాదు= వారలను నమ్మరాదు.

తాత్పర్యం: పాండురాజు కుమారులు సత్య ప్రయత్నపరులుకారు. మోసపు ధర్మమనే కవచంతో బ్రతికారు. అరచేతిలో గుండెకాయను తీసి పెట్టినప్పటికినీ వారిని నమ్మరాదు.

వ. ఇది నామాట గాఁ జెప్పు' మని పలికె నప్పు డచ్చేరువపల్లెలవారు దన్నుం జూడ వచ్చిన నజ్జనంబులఁ గలయం గనుంగొని గాంగేయుండును గుంభసంభవుండును మొదలైన బంధుమిత్రులను లక్ష్మణుండు లోనుఁగాఁ గల కుమారులను బేరుకొని వారు మున్న సనుటం జెప్పి, వారు సనినలోకంబ తనకుఁ బాటిల్లుట యుగ్గడించి, తన దేవులును దుస్సలయు నాదిగాఁ గల యబలలు దాసు లేనిపిమ్మటఁ బొందుదురవస్థలు వాక్రుచ్చి పనవిన విని వారలు గన్నీరొలుక నుమ్మలికంబు గూరునుల్లంబులతోఁ జని; రందుఁ గొంద అశ్వత్థామ ప్రముఖరథికత్రయం బయ్యెడ మెలంగుట యెఱింగి వారలకు రాజరాజువార్త సెప్పిన వారలు సత్వరంబున నచ్చటి కరుదెంచి యరదంబు డిగ్గి. 398

ప్రతిపదార్థం: ఇది= ఈ విషయం; నా మాటగాన్+చెప్పుము= నేను చెప్పినట్లుగా తెలుపుము; అని పలికెన్= అని చెప్పాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+చేరువ= ఆ సమీపంలోఉన్న; పల్లెవారు= జానపదులు; తన్నున్+చూడవచ్చినన్= తనను (దుర్యోధనుడిని) చూడరాగా; ఆ+జనంబులన్+కలయన్+కనుంగొని= ఆ జనులను బాగుగా చూచి; గాంగేయుండును= భీష్ముడును; కుంభ సంభవుండును= ద్రోణుండును; మొదలైన బంధుమిత్రులును; లక్ష్మణుండు లోనుగాగల కుమారులను= లక్ష్మణుడు మొదలైన కుమారులను; పేరుకొని= పేర్కొని; వారు మున్ను చనుటన్+చెప్పి= వా రంతకు ముందుగానే చనిపోవటాన్ని తెల్పి; వారు చనిన లోకంబు+ఆ= వారువెళ్ళిన లోకమే; తనకున్+పాటిల్లుట ఉగ్గడించి= తనకూ సిద్ధించుటను చెప్పి; తన దేవులును, దుస్సలయున్ ఆదిగాన్+కల ఆబలలు= తనరాణులు, తోడబుట్టువగు దుస్సల మొదలైన ఆడవారు; తాను లేని పిమ్మటన్= తానులేకున్న తరువాత; పొందు దురవస్థలు= అనుభవించే కష్టాలను; వాక్రుచ్చి= చెప్పి; పనవినన్ విని= దుఃఖించగా విన్నవారై; వారలు= ఆ జానపదులు; కన్నీరు+ఒలుకన్= కళ్ళలో నీరు చిందగా; ఉమ్మలికంబు కూరు+ ఉల్లంబులతోన్= దుఃఖంనిండిని మనసులతో; చనిరి= వెళ్ళారు; అందున్= వారిలో; కొందఱు= కొంతమంది; అశ్వత్థామ ప్రముఖ= అశ్వత్థామ మొదలైన ముఖ్యులయిన; రథికత్రయంబు= సేనానులు ముగ్గురు; ఆ+ఎడన్+మెలంగుటన్= ఆ ప్రాంతంలో తిరుగుతూ ఉండటం; ఎఱింగి= తెలిసి; వారలకున్= ఆ రథిక త్రయానికి; రాజరాజు= దుర్యోధనుడి; వార్త= విషయం; చెప్పినన్= చెప్పగా; వారలు= ఆ రథికులు; సత్వరంబునన్= వేగంగా; అచ్చటికిన్+అరుగుదెంచి= ఆ చోటునకు వచ్చి; అరదంబులు డిగ్గి= తేరులు దిగి.

తాత్పర్యం: (దుర్యోధనుడు సంజయుడితో) 'ఈ చెప్పేది నా మాటలుగా చెప్పుము' అన్నాడు. ఆ సమయాన అక్కడకు దగ్గరగా ఉండే జనపదాలలోని వారంతా తనను చూడడానికై రాగా వారినంతా తేరిపారచూచి, భీష్మద్రోణాది ముఖ్యులైన బంధుమిత్రులను, లక్ష్మణుడు మొదలయిన కుమారులను తలచుకొని వారంతా ముందుగా చనిపోవటాన్ని తెలిపి, వారు పోయిన లోకాలు తనకు కూడా సిద్ధిస్తాయని చెప్పి, తన రాణులు, దుస్సల మొదలయిని స్త్రీలు. తాను లేని తరువాత పొందే కష్టాలను తెలిపి దుఃఖించగా వారు కన్నీటితో కుములుతున్న మనసులతో వెళ్ళారు. వారిలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కొంతమంది అశ్వత్థామ మొదలయిన ముఖ్య సేనానులు ముగ్గురూ ఆ ప్రాంతంలో తిరగటాన్ని విని, వారి కా రాజరాజు స్థితిని తెలుపగా వా రతివేగంగా ఆ చోటికి వచ్చి తమ రథాలు దిగి.

కృప కృతవర్మాశ్వత్థామలు దుర్యోధనుం జేరి విలపించుట (సం. 9-64-3)

సీ. **కడుబెట్టిదం బగు గాలిచేఁ గూలిన । మహనీయసాలభూరుహము పోల్కిఁ,**
బ్రబలకిరాతమార్గణములఁ ద్రెళ్ళిన । రాజితవన్యవారణము మాడ్కిఁ,
గల్పాంత వాయుసఖస్ఫురణంబున । నివిరి పోయిన మహార్ణవము కరణిఁ,
గాలపర్యయమునఁ దూలి మేదినిమీఁదఁ । బడిన పూర్ణేందు బింబంబు పగిది.

తే. **దుఃస్థుఁ డై యుండియును నొప్పు దొరుఁగకున్న । యన్న రేశ్వరుఁ గనుఁగొని యడలు నెడల**
తోడ మేనులు దూలఁగఁ దొట్రుపడుచుఁ । జేరి యాతని చుట్టు వాసీను లైరి. **399**

ప్రతిపదార్థం: కడు బెట్టిదంబగు గాలిచేన్= మిక్కిలి భయంకరమైన గాలి మూలంగా; కూలిన= పడిపోయిన; మహనీయ= గొప్పదైన; సాలభూరుహము పోల్కిన్= మద్ది చెట్టుమాదిరిగను; ప్రబల= బలవంతులైన; కిరాతమార్గణములన్= బోయవారి బాణములవలన; త్రెళ్ళిన= పడిన; రాజిత= అందమైన; వన్యవారణము మాడ్కిన్= అడవి ఏనుగువలెను; కల్పాంత= ప్రళయకాలమునందలి; వాయుసఖ= అగ్ని యొక్క; స్ఫురణమునన్= విజృంభణంతో; ఇవిరిపోయిన= ఎండిపోయినవంటి; మహార్ణవము కరణిన్= పెను సంద్రము మాదిరిగను; కాలపర్యయమునన్= కాలం మారటంచేత; తూలి= తూలిపోయి; మేదినిమీఁదన్+పడిన= భూమి మీదపడిపోయిన; పూర్ణ+ఇందు బింబంబు పగిదిన్= నిండు చందురుడి మాదిరిగను; దుఃస్థుడైఉండియును= దుఃఖంలో ఉన్నవాడై కూడా; ఒప్పు= సొగసు(శోభ); తొరుఁగకున్న= తొలగిపోకుండా ఉన్నట్టి; ఆ+నరేశ్వరున్+కనుఁగొని= ఆ రాజరాజును చూచి; అడలు= బాధనొందు; ఎడల తోడన్= గుండెలతో; మేనులు= శరీరాలు; తూలఁగన్= తూలిపోగా; తొట్రుపడుచున్= తడబడుతూ; చేరి= ఆ చోటు చేరి; అతని చుట్టున్= అతడి చుట్టూరా; ఆసీనులు+ఐరి= కూర్చున్నారు.

తాత్పర్యం: మిక్కిలి పెనుగాలికి కూలి పడిపోయిన మద్దిచెట్టువలెను, బలవంతులయిన బోయల బాణాల దెబ్బలకు పడిపోయిన అడవి ఏనుగు వలెను, ప్రళయకాలంలోని అగ్నివలన ఎండిపోయిన పెనుసంద్రంవలెను, కాలం తలక్రిందులు కావటంచేత తూలిపోయి భూమిమీద పడిన నిండు చందురుడివలెను, దుఃఖితుడై కూడా శోభ తొలగకుండా ఉన్న ఆ రాజరాజును చూచి దుఃఖంతో అదురుతున్నట్టి గుండెలతో కూడి, తూలిపోయే శరీరాలు వణకుతుండగా ఆ దుర్యోధనుడి చుట్టూ కూర్చున్నారు.

విశేషం: అలం: మాలోపమ.

వ. **ఆసీనులైన యెడ నగ్గురుసుతుండు.** **400**

ప్రతిపదార్థం: ఆసీనులైన ఎడన్= కూర్చున్న సమయంలో; ఆ+గురుసుతుండు= ఆ అశ్వత్థామ.

తాత్పర్యం: ఆ కృపకృతవర్మాశ్వత్థామలు కూర్చోగా, వారిలో అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. 'అక్కట! యెప్డుఁ బల్వురు ధరాధిపతుల్ గొలువంగ నుండు నీ
వొక్కరుఁ డున్నవాఁడవు; మహోన్నతపీఠ మలంకరించు నిన్
దెక్కలిఁ దాఁకి ధాత యిలఁ ద్రెళ్ళెడునట్లుగఁ జేసె; నీబలం
బెక్కడఁ బోయె? సైన్యపతు లేరొకొ యిక్కడ రారు? భూవరా! 401

ప్రతిపదార్థం: భూవరా!= ఓ రాజా!; అక్కట!= అయ్యో!; ఎప్డున్= అన్ని సమయాలలోనూ; పల్వురు= చాలామంది; ధరాధిపతుల్= రాజులు; కొలువంగన్= సేవించగా; ఉండు నీవు= ఉండే నీవు; ఒక్కరుడు+ఉన్న వాఁడవు= ఒక్కడవే ఉన్నావు; మహా+ఉన్నత పీఠము+అలంకరించు= మిక్కిలి ఎత్తైన గద్దెపై అందంగా కూర్చుంటూ ఉండే; నిన్= నిన్ను; తెక్కలి తాఁకి= మోసంగా ఎదుర్కొని; ధాత= విధి; ఇలన్= భూమిమీద; త్రెళ్ళెడునట్లుగన్+చేసెన్= పడేటట్లుగా చేశాడు; నీ బలంబు+ఎక్కడన్+పోయెన్?= నీ శక్తి ఎటు పోయింది?; ఇక్కడన్= ఈ చోటికి; సైన్యపతులు= సేనా నాయకులు; ఏల+రారు+ఒకొ?= ఎందుకు రావటం లేదు?

తాత్పర్యం: 'ఓ రాజా! అన్ని సమయాలలోనూ పెక్కురాజులు సేవించగా ఉండే నీవు, ఇప్పుడు ఒక్కడవే ఉన్నావు. మహోన్నతమైన గద్దెను అలంకరిచే నిన్ను విధి మోసంగా తాకి భూమిపై పడేటట్లుగా చేశాడు. నీబలం అంతా ఎక్కడకు పోయింది? సేనాపతులు రారేమి?

తే. కడలుకొనఁ జుట్టుఁ బట్టెడు గొడుగు లెవ్వి? । యెసక మెసఁగంగ సీవురు లేల పట్ట
రంగమున? నాననంబున నవని ధూళి । గదిరె; జలక మే లాడవు కౌరవేంద్ర? 402

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కురురాజా!; కడలుకొనన్= అతిశయంగా; చుట్టును= నీ చుట్టూ; పట్టెడు= పట్టుకొనే; గొడుగులు+ఏవి?= గొడుగులు ఏవి?; ఎనకమెసఁగంగన్= మిక్కిలిగా (అతిశయంగా); సీవురులు= వింజామరలు; ఏల పట్టరు?= ఎందుకు పట్టుకోరు?; అంగమునన్= ఒంటిమీద; ఆననంబునన్= ముఖాన; అవనిధూళి= భూమిమీద దుమ్ము; కదిరెన్?= ఉన్నది; జలకము= స్నానం; ఏల+ఆడవు?= ఎందుకు చేయవు?

తాత్పర్యం: ఓ కౌరవేంద్రా! ఎల్లవేళలా నీ చుట్టూ పట్టుకొనే గొడుగు లేవి? అతిశయ మైన వింజామరలను ఎందుకు పట్టుకోరు? ఒడలిమీద, ముఖాన దుమ్ము ఉన్న దేమి? స్నాన మెందుకు చేయవు?

చ. అనిమిషవాహినీ తనయుఁ డస్త్ర గురుండును నీకు నెప్పుడుం
గనువెలుఁ గై చరింతురు వికర్ణుఁడు దుస్ససేనుఁడున్;
నిను నొకయప్డుఁ బాయ రవినీతు లొకో నృప! వార లెల్ల నె
మ్మనమున శంక లేక యొకమాటును నిక్కడఁ జేర రెవ్వరున్. 403

ప్రతిపదార్థం: నృప!= ఓ రాజా!; అనిమిష వాహినీ తనయుఁడు= గాంగేయుడు (దేవనది తనయుడు); అస్త్రగురుండును= ధనురాచార్యుడును; ఎప్పుడున్= అన్ని సమయాలలో; నీకున్ కనువెలుఁగై చరింతురు= ఎల్లవేళలా నీకు కంటివెలుగుగా తిరిగేవారు; వికర్ణుఁడు, దుస్ససేనుఁడున్= వికర్ణ, దుశ్శాసనులు; నినున్= నిన్ను; ఒకయప్డున్+పాయరు= ఒక్క పర్యాయంకూడా వదలివెళ్ళరు; వారలు+ఎల్లన్ అవినీతులొకో?= వారు దుర్నీతులా?; నెమ్మనమునన్ శంకలేక= మనసులో అనుమానించకుండా (చెప్పుము); ఒకమాటును= ఒక మారుకూడా; ఇక్కడన్= ఈ చోట; చేరరు= చేరినారు కారు.

తాత్పర్యం: భీష్మ ద్రోణులు అన్ని వేళలలోనూ నీకు కంటికి వెలుగుగా తిరిగేవారు. వికర్ణ, దుశ్శాసనులు నిన్నెపుడూ వదలి ఉండరు. వారంతా నీతి బాహ్యులా? ఓ రాజా! వారు ఎవరు కానీ ఇక్కడ ఒక పర్యాయం కూడా చేరకున్నారే! నీ మనసులో అనుమానం లేకుండా (వారిని గూర్చి) చెప్పుము.

క. నీయెడఁ జంచల యయ్యెను । శ్రీ యెవ్వరి నచలవృత్తిఁ జెందెడు విధి య
ట్లై యున్నవారి నిట్టులు । సేయఁడె? యే నింక నేమి సేయుదు నధిపా! 404

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా!; నీ+ఎడన్= నీయందు; శ్రీ= లక్ష్మి; చంచల+అయ్యెను= అస్థిరయైనది; అచలవృత్తిన్= స్థిరంగా; ఎవ్వరిన్= ఎవరి యెడ; చెందెడున్= చేరునో; విధి= దైవం; అట్లైఉన్న వారి నిట్టులు= ఆ విధంగా ఉన్న వారినీ విధంగా (అనగా ఐశ్వర్యవంతులను విధి ఈ విధంగా); చేయఁడె?; ఏను+ఇంకన్+ఏమి చేయుదున్?= నే నింక ఏమి చేయగలను?

తాత్పర్యం: నీపట్ల లక్ష్మి అస్థిరయైనది. మరెవ్వరి వద్ద స్థిరపడబోతున్నదో? విధి సంపదగలవారిని లేనివారినిగా చేయదా? ఓ రాజా! నే నింక ఏమి చేయగలను?'

తే. అని విలాపంబు సేసిన విని విభుండు । గన్నుఁగవ నశ్రు లురలంగఁ గరపుటములఁ
దుడిచికొనుచు డగ్గుత్తి దొడరు నెలుఁగు । నెట్టకేలకు నూల్కొల్పి యిట్టు లనియె. 405

ప్రతిపదార్థం: అని విలాపంబు చేసినన్= అని దుఃఖించగా; విని= విన్నవాడై; విభుండు= రాజయిన దుర్యోధనుడు; కన్నుఁగవన్= రెండుకళ్ళలో; అశ్రులు+ఉరులంగన్= నీరు దొర్లగా; కరపుటములన్= దొప్పలవంటి చేతులతో; తుడిచికొనుచున్= తుడిచివేసికొంటూ; డగ్గుత్తిన్= బొంగురుపోయిన గొంతు; తొడరు= కలుగు; ఎలుఁగున్= కంఠస్వరాన్ని; ఎట్టకేలకున్= తుదకు; నూల్కొల్పి= సరిచేసి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అశ్వత్థామ ఆ విధంగా దుఃఖించగా, రాజు కన్నీళ్ళు దొర్లుతుండగా చేతులతో తుడిచికొంటూ గద్గదికమైన కంఠస్వరాన్ని సరిచేసికొని ఇట్లా అన్నాడు.

క. 'మనుజులకు నిట్టిచందము । ముని ధాత సృజించినది; ప్రమోదము ఖేదం
బున వచ్చును బర్యాయం । బున; దీని నెఱుంగవలదె పురుషుం డనఘా!;' 406

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్మా!; మనుజులకున్= మానవులకు; ఇట్టి చందము= ఈ స్థితి; మును= ఇదివరకే; ధాత సృజించినది= విధి (బ్రహ్మ) కల్పించిఉన్నదే; ప్రమోదము= సంతోషం; ఖేదంబును= దుఃఖమూ; పర్యాయంబునన్= ఒకదాని వెంట నొకటి; వచ్చును= కలుగుతాయి; పురుషుండు= మానవుడు; దీనిన్ ఎఱుంగ వలదె?= దీనిని తెలియవద్దా?

తాత్పర్యం: పుణ్యాత్మా! ఈ స్థితిని మానవులకు విధాత ఇదివరకే నిర్ణయించాడు. సుఖ దుఃఖాలు పర్యాయంగా కలుగుతాయి. దీనిని మానవుడు తెలిసికొనవద్దా?'

వ. అని యారథికవరుల నాలోకించి. 407

ప్రతిపదార్థం: అని= అంటూ; ఆ రథిక వరులన్= ఆ సైనిక శ్రేష్ఠులను; ఆలోకించి= చూచి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దుర్యోధనుడు ఈ విధంగా పలికి, ఆ ముగ్గురినీ చూచి.

సీ. 'పయిపయి నెంత లాపదలు వచ్చిన నైన । నుత్సాహ మెడలక యుద్ధ మరులు
సేడ్పడునట్లుగాఁ జేసెడి బంధులు । మిత్రులు సోదరుల్ పుత్రులట్లు
బలసమేతంబు భండనంబునఁ ద్రుంగ । నొక్కఁడు నిల్చుట యొప్పు నెట్లు?
మద్బాహువీర్యంబు మహిత ధైర్యంబును । దలమున్కలైన సధర్మవృత్తి

తే. సంగరంబు సేయఁ జాలక శత్రు లిట్లు । నొంప సద్గతి వడయుట సొంపు గాదె
యదియుఁ గాక విద్విషులచే నాజిఁ బడక । యుండ మిముఁ గాంచునమ్మేలు నొదవె నాకు. 408

ప్రతిపదార్థం: పయిపయిన్= ఒక దానిమీద ఇంకొకటిగా; ఎంతలు+ఆపదలు= ఎంతటి కష్టాలు; వచ్చినన్= వచ్చినను; ఐనన్= అయినప్పటికిని; ఉత్సాహము= ధైర్యం; ఎడలక= సడలిపోకుండా; యుద్ధము= యుద్ధమును; అరులు= వైరులు; చేడ్పడునట్లుగాన్= నాశమయ్యేటట్లుగా; చేసెడి బంధులు మిత్రులు, సోదరుల్, పుత్రులు= చేసే బంధువులు, స్నేహితులు, తోబుట్టువులు, కుమారులును; అట్లు= ఆ విధంగా; బలసమేతంబుగాన్= సేనతో కూడా; భండనంబునన్= యుద్ధంలో; త్రుంగన్= నశించగా; ఒక్కఁడు నిల్చుట= ఒకడు మాత్రము నిలిచి యుండటం; ఎట్లు= ఏ విధంగా; ఒప్పున్= తగును?; మత్+బాహువీర్యంబున్= నా భుజబలమూ; మహిత ధైర్యంబును= మహిమగల శక్తీ; తలమున్కలు+ఐనన్= అధికంగా కాగా; సధర్మవృత్తిన్= న్యాయంగా; సంగరము చేయన్+చాలక= యుద్ధం చేయలేక; శత్రులు+ఇట్లు నొంపన్= వైరులు ఈ విధంగా బాధించగా; సద్గతి పడయుట= పుణ్యగతనిని పొందటం; సొంపు+కాదె= సొగసుకదా!; అదియున్+కాక= అంతేకాక; విద్విషుల చేన్= వైరులవలన; అనిన్= యుద్ధంలో; పడకఉండెన్= పడిపోకుండా ఉండగా; మిమ్మున్+కాంచు= మిమ్ములను చూచే; ఆ+మేలు= ఆ అదృష్టం; నాకున్+ఒదవెన్= నాకు కలిగింది.

తాత్పర్యం: ఒక దానిమీద మరొకటిగా ఎంతటి ఆపదలు వచ్చినా ధైర్యం వదలకుండా యుద్ధం చేసి శత్రువులను హతమార్చే బంధువులు, స్నేహితులు, కుమారులు, సోదరులు, సైన్యంతో కూడా ఆ విధంగా యుద్ధంలో చనిపోగా ఒక్కడు మాత్రం బ్రతికి ఉండటం ఒప్పునా? నా భుజబలం, ధైర్యం తలమున్కలైనాయి. ధర్మబద్ధంగా శత్రువులు యుద్ధం చేయలేక ఈ విధంగా బాధించగా పుణ్యగతిని పొందటం సొగసు కదా! కానీ, శత్రువులచేత యుద్ధరంగంలో చనిపోకుండా ఉన్న మిమ్ములను చూచే అదృష్టం నాకు దక్కింది.

చ. వినుఁడు మహానుభావుఁ డగు విష్ణు నెఱింగి యెఱింగి యే మిముం
గొని వెఱ పేది కాదె పగకుం దలకొంట; జయంబు గోరి మీ
రును బలశౌర్య సంపదనురూపముగాఁ బొగడొందు భంగులం
బెనఁగితి; రేమి సేయుదురు బెట్టిదుఁ డై విధి తప్పఁ జూచినన్? 409

ప్రతిపదార్థం: వినుఁడు= మీరు వినండి; మహానుభావుడుగ విష్ణున్= గొప్పవాడైన విష్ణుమూర్తిని; ఎఱింగి ఎఱింగి= తెలిసి తెలిసి; ఏన్= నేను; మిమున్+కొని= మిమ్ము స్వీకరించి; వెఱపు+ఏదికాదె= భయములేకుండా కదా; జయంబున్+కోరి= విజయమును ఆశించి; పగకున్+తలకొంటిన్= వైరానికి పూనుకొన్నాను; మీరును= మీరుకూడా; బలశౌర్యసంపదనురూపముగా= శక్తీ, వీరత్వమూ అనే సంపదకు తగినట్లుగా; పొగడొందుభంగులన్= పొగడ్తలు పొందే విధంగా; పెనఁగితిరి= యుద్ధం చేశారు (అయినను); విధి= దైవం; బెట్టిదుఁడు+ఐ= క్రూరుడై; తప్పన్+చూచినన్= వేరుగా తలంచితే; ఏమి చేయుదురు?= ఏమి చేయగలరు?

తాత్పర్యం: మహానుభావుడైన విష్ణుమూర్తిని తెలిసితెలిసీ మిమ్ముగొని భయమును వదలి జయం ఆశించి పూనుకొన్నాను. మీరు కూడా బలశౌర్య సంపదలకు తగినట్లుగా కీర్తనీయంగా యుద్ధం చేశారు. అయినా దుర్విధి బలవంతుడై వేరుగా చూచినపుడు మీ రేమి చేయగలరు?

వ. వగవ కుండుం' డని యేఁ బొదలోనం బొంచి యున్నది మొదలుగ గదాయుద్ధంబు పాడి విడిచి వడముడి పుడమిఱేనిం బడవైచి తలదన్నుట తుదిగా నైన వృత్తాంతం బెల్ల నప్పు డారథికవరులకుఁ దేటపడం బలికిన విని పాండవుల దెస నీసును రోసంబు నెత్తి గురునందనుం డరుణాననుం డగుచు నవుడు గఱచి కలినాక్షరకలితంబు గా నక్కౌరవేశ్వరున కి ట్లనియె. 410

ప్రతిపదార్థం: వగవక+ఉండుండు= దుఃఖించకుండా ఉండండి; అని= అంటూ; పొదలోనన్+పొంచి ఉన్నది మొదలుగన్= పొదలోపల దాగికొని ఉండటం మొదలుగా; గదాయుద్ధంబుపాడిన్= గదాయుద్ధ ధర్మమును; విడిచి= వదలి; వడముడి= భీమసేనుడు; పుడమి+ఱేనిన్+పడవైచి= రాజునునేలపై పడద్రోసి; తలన్+తన్నుట తుదిగాన్+ఐన= తలను దన్నటం వరకు అంతటినీ; అప్పుడు+ఆ రథికవరులకున్= ఆ సమయాన ఆ సేనా నాయక శ్రేష్ఠులకు; తేటపడన్+పలికినన్= తెలిసేటట్లు చెప్పగా; విని= విన్నవారై; పాండవులదెసన్= పాండవుల మీద; ఈసును= ఈర్ష్యయు; రోసంబున్+ఎత్తి= కోపం కలిగి; గురునందనుండు+అరుణ+ఆననుండు+అగుచున్= అశ్వత్థామ ఎర్రనైన ముఖం కలవాడౌతూ; ఔడుగఱచి= పెదవిని నొక్కిపట్టుకొని; కఠినాక్షర కలితంబుగాన్= తీవ్రమైన మాటలతో కూడినవిగా; ఆ+కౌరవేశ్వరునకున్+ఇట్లనియెన్= ఆ కౌరవరాజయిన దుర్యోధనుడితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుఃఖపడవద్దు' - అని సంజయుడు పొదలో దాగికొని ఉన్నప్పటినుండి గదాయుద్ధంలో న్యాయం వదలి భీముడు దుర్యోధనుడిని క్రిందపడదోసి తలను తన్నుట తుదిగా సాగిన విషయాన్నంతటినీ ఆ రథిక శ్రేష్ఠులకు స్పష్టంగా తెలిసేటట్లుగా చెప్పగా విని పాండవుల ఎడ అసూయ, కోపం కలిగి అశ్వత్థామ ముఖం జేగురు రంగు కలది కాగా క్రిందిపెదవిని నొక్కి కరచిపట్టికొని తీక్షణమగు మాటలతో ఆ కౌరవరాజుతో ఇట్లా అన్నాడు.

ఉ. 'పాండవ లట్లు మజ్జనకుఁ బాపవిధిఁ దెగఁ జూచినప్పుడుం
జండతర ప్రకోపము నసహ్యపు శోకము నిట్లు చిత్త మొం
డొండఁ గలంప నే నిపుడ యొక్కఁడుఁ దక్కక యుండ వారి ను
ద్దండ మదస్త్రవహ్నిఁ బరిదగ్ధులఁ జేయక యెట్టు లుండుదున్? 411

ప్రతిపదార్థం: పాండవులు+అట్లు= పాండవులు ఆ విధంగా; మత్+జనకున్= నా తండ్రిఅయిన ద్రోణుడిని; పాపవిధిన్= చెడుమార్గంతో; తెగన్+చూచినప్పుడున్= చనిపోయేటట్లుగా చేసినప్పుడును; చండతరప్రకోపమున్= తీవ్రమైన కోపమును; అసహ్యపు శోకము= భరించరాని దుఃఖమును; ఇట్లు= ఈ విధంగా; చిత్తమున్= మనసును; ఒండొండన్= ఒకటొకటిగా; కలంపన్= చీకాకు పరచగా; నేను= నేను; ఇపుడు= ఇప్పుడే; ఒక్కడున్ తక్కక ఉండన్= ఒకడు కూడా మిగుల కుండా; వారిన్= పాండవులను; ఉద్దండ= భయంకరమైన; మదస్త్రవహ్నిన్= నా బాణాగ్నిచేత; పరిదగ్ధులన్+చేయక= బాగా కాల్చకుండా; ఎట్టులు+ఉండుదున్= ఏ విధంగా ఉండగలను.

తాత్పర్యం: 'పాండవులు ఆ విధంగా నా తండ్రిని దుర్మార్గంగా చంపినప్పుడుకూడా, తీవ్రమైన కోపాన్ని, భరించరాని దుఃఖాన్ని ఒకటొకటిగా ఈ విధంగా మనసును కలత పెట్టవు. ఇప్పుడే ఒక్కడు కూడా మిగులకుండా వారిని (పాండవులను) భయంకరమైన నా బాణాగ్నిచేత పూర్తిగా దహించక ఏ విధంగా ఉండగలను?

తే. వినుము సత్యంబు వల్కెద మనుజనాథ! । యడరి యందఱఁ బాంచాలు రాదిగాఁగఁ
గలుగు బాంధవమిత్ర సంఘములతోడఁ । గూడ నేఁ డిదె కృష్ణుండు సూడఁ ద్రుంతు. 412

ప్రతిపదార్థం: మనుజనాథ!= ఓ రాజా!; సత్యంబు పల్కెదన్ వినుము= నిజమే చెపుతున్నాను వినుము; అడరి= అతిశయించి; పాంచాలురు+ఆదిగాఁగన్= పాంచాలురు మొదలుగా; అందఱన్= అందరినీ; కలుగు= ఉన్నట్టి; బాంధవ మిత్ర సంఘంబు తోడన్= బంధు మిత్ర సమూహంతో; కూడన్= కలియగా; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; చూడన్= చూస్తుండగా; నేఁడు= ఈ దినం; ఇదె= ఇదిగో; త్రుంతున్= చంపుతాను.

తాత్పర్యం: ఓ రాజా! నేను నిజమే చెప్పుతున్నాను వినుము. విజృంభించి పాంచాలురు మొదలుగా ఉన్నట్టి బంధుమిత్ర సమూహమును శ్రీకృష్ణుడు చూస్తూండగా ఇదిగో నేడు హతమారుస్తాను.

వ. పనుపు' మనిన హృష్టుండై యజ్జనపతి గృపాచార్యుం గనుంగొని యొక్క కలశంబున జలంబు నినిచికొని రమ్మనుటయు, నమ్మహీసురవరుండు దమ్ముం జూడ వచ్చి యచ్చట నున్న సమీపాశ్రమమునికుమారులం బ్రార్థించి యొక్కకలశంబు దెప్పించి దానిం దోయపూర్ణంబుఁ గావించి తెచ్చిన. 413

ప్రతిపదార్థం: పనుపుము= ఆజ్ఞాపింపుము; అనినన్= అనగా; హృష్టుండు+ఐ= సంతోషమంది; ఆ+జనపతి= ఆ రాజైన దుర్యోధనుడు; కృపాచార్యున్+కనుంగొని= కృపాచార్యుడిని చూచి; ఒక్క కలశంబునన్= ఒకపాత్రలో; జలంబున్= నీటిని; నినిచికొని= నింపుకొని; రమ్మనుటయు= రావలసినదని కోరగా; ఆ+మహీసూరవరుండు= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు; తమ్మున్+ చూడవచ్చి= తమను చూడటానికై వచ్చిన; అచ్చటన్+ఉన్న= ఆ చోటులోనుండే; సమీప= దగ్గరి; ఆశ్రమ ముని కుమారులన్+ ప్రార్థించి= తపోవనంలోని ఋషికుమారులను ప్రార్థించి; ఒక్కకలశంబు తెప్పించి= ఒక పాత్రను తెప్పించుకొని; దానిన్+ తోయపూర్ణంబు కావించి తెచ్చినన్= దానిని నీటితో నింపి తీసుకొనిరాగా.

తాత్పర్యం: (అశ్వత్థామ) ఆజ్ఞాపింపు' మనగా ఆ రాజు సంతోషించి కృపాచార్యుడితో ఒక చెంబునిండా నీరు తెప్పించు మన్నాడు. ఆ బ్రాహ్మణుడు తమను చూడవచ్చిన - అక్కడకు సమీపాన ఉన్న మున్యాశ్రమంలోని మునికుమారులను ప్రార్థించి ఒక కలశాన్ని తెప్పించి దాని నిండా నీరు తీసికొని రాగా.

చ. అతనికి నెమ్మి నిట్లనియె నమ్మనుజేంద్రుఁడు 'నీవు వేగ మం
చితముగ ద్రోణపుత్రు నభిషిక్తునిఁ జేయుము ప్రీతి మచ్చమూ
పతియఁగ భూసురుండు నృపపంపునఁ గయ్యముసేఁత లోకవి
శ్రుత మగుధర్మ మట్లగుటఁ జూవె యొనర్చెద నవ్విశేషమున్.' 414

ప్రతిపదార్థం: ఆ+మనుజ+ఇంద్రుఁడు= ఆ రాజు దుర్యోధనుడు; ఆతనికిన్= ఆ కృపుడితో; నెమ్మిన్= ప్రీతితో; ఇట్లు+అనియెన్; నీవు; వేగము= శీఘ్రంగా; అంచితముగన్= ఒప్పుగా; ద్రోణపుత్రున్= అశ్వత్థామను; ప్రీతిన్= ఇష్టంతో; మత్+చమూపతియున్+ కాన్= నా సేనాపతిగా; అభిషిక్తునిన్= అభిషేకించబడినవాడినిగా; చేయుము; భూసురుండు= బ్రాహ్మణుడు; నృపు పంపునన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ రాజాజ్ఞతో; కయ్యము+చేఁత= యుద్ధం చేయటం; లోకవిశ్రుతము+అగు ధర్మము= జగత్ప్రసిద్ధమైన ధర్మం; అట్లు+అగుటన్+ చూవె= అందుచేతనే సుమా!; ఆ విశేషమున్= బ్రాహ్మణుడిని సేనాపతిని అభిషేకించటం అనే విశేషాన్ని; ఒనర్చెదన్= చేస్తాను.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు కృపునితో ఇట్లా అన్నాడు: 'వెంటనే నీవు ద్రోణుడి కుమారుడిని నాసేనా నాయకుడుగా ప్రీతితో అభిషేకించుము. బ్రాహ్మణుడు రాజాజ్ఞమెయి యుద్ధం చేయటం లోకప్రఖ్యాతమైన ధర్మం. అందువలన ఆ విశేషమైన పనిని చేస్తాను.

వ. అనవుడు నతండు సంప్రీతుం డై యగ్గురునందనునకు సేనాధిపత్యాభిషేకం బాచరించిన. 415

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; అతండు సంప్రీతుండు+ఐ= అతడు ఆనందించి; ఆ+గురునందనునకున్= అశ్వత్థామకు; సేనాధిపత్య+అభిషేకంబున్+ఆచరించినన్= సేనాధిపతిగా అభిషేకం చేయగా.

తాత్పర్యం: అనగా విని కృపుడు సంతోషించి అశ్వత్థామను సేనాధిపతిగా అభిషేకించగా.

ఉ. ఆ రథికోత్తముం డధికహర్షముఁ బొందుచు నమ్మహీశ్వరున్
గారవ మొప్పఁ గ్రుచ్చి యిఱిగౌఁగిటఁ జేర్చి యుదాత్తసింహనా
దారవ ముల్లసిల్లఁగఁ బ్రియంబుమెయిం గృప యాదవోత్తముల్
సేరి కెలంకులం జనఁగఁ జెచ్చెర నేఁగె నుదగ్రమూర్తి యై. 416

ప్రతిపదార్థం: ఆ రథిక+ఉత్తముండు= ఆ సేనానాయక శ్రేష్ఠుడు - అశ్వత్థామ; అధిక హర్షమున్+పొందుచున్= మిక్కిలి సంతోషిస్తూ; ఆ+మహీశ్వరున్= ఆ దుర్యోధనుడిని; గారవము+ఒప్పన్= గౌరవం తగునట్లుగా; క్రుచ్చి ఇఱికౌఁగింటన్+చేర్చి= గట్టిగా హత్తుకొని కౌగిలో చేర్చుకొని; ఉదాత్త= పెద్ద; సింహనాదా రవము= సింహగర్జనం; ఉల్లసిల్లఁగన్= ఒప్పగా; ప్రియంబుమెయిన్= ప్రీతితో; కృప= కృపుడును; యాదవ+ఉత్తముల్= యాదవ ముఖ్యులు; చేరి= కూడి; కెలంకులన్+చనఁగన్= ప్రక్కల వెళ్ళగా; ఉదగ్రమూర్తిఐ= భయంకర మూర్తిగా; చెచ్చెరన్+ఏఁగెన్= వెంటనే వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ సేనాని చాలా సంతోషంతో ఆ రాజును గౌరవంతో బిగియార కౌగిలించుకొని గొప్పదైన సింహనాదం ఒప్పగా ప్రీతితో కృపుడూ, యాదవ ప్రముఖులూ ప్రక్కలలో చేరి నడవగా భయంకరమూర్తి అయి వెంటనే వెళ్ళాడు.

వ. ఇ ట్లశ్వత్థామ కృప కృతవర్మలును మహోద్యోగంబున. 417

ప్రతిపదార్థం: ఇట్లు+అశ్వత్థామ, కృప కృతవర్మలును= ఈ విధంగా అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ; మహా+ఉద్యోగంబునన్= పెను ప్రయత్నంతో.

తాత్పర్యం: ఈ విధంగా అశ్వత్థామా, కృపుడూ, కృతవర్మా గొప్పదైన ప్రయత్నంతో - (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అరినిరవశేషనిరసన । పరమానంద ప్రచరిత పాండవ పుత్త్రో
త్కర బాంధవనికర పరి । స్ఫురణాఢ్య తదీయశిబిరమున కభిముఖు లై. 418

ప్రతిపదార్థం: అరి నిరవశేష నిరసన= శత్రువుల నిశ్శేష నిరసనం (నాశనం) చేత; పరమ+ఆనంద ప్రచరిత= గొప్ప సంతోషం కలిగి ఉన్న; పాండవ - పుత్ర+ఉత్కర= పాండవుల కుమారుల సమూహముయొక్కయు; బాంధవ - నికర= చుట్టాల సమూహం యొక్కయు; పరిస్ఫురణ= విజృంభణంచేత; ఆఢ్య= సంపన్నమైన; తదీయ= వారిదైన; శిబిరమునకున్= గుడారమునకు; అభిముఖులు+ఐ= ఉన్ముఖులై.

తాత్పర్యం: శత్రువులను నిశ్శేషంగా కూల్చటంవలని పరమానందం కల పాండవపుత్ర సమూహంయొక్కయు, చుట్టాల సమూహంయొక్కయు విజృంభణంచేత సంపన్నమైన పాండవశిబిరమునకు ఉన్ముఖులై.

వ. చని రని యిట్లు ధృతరాష్ట్రునకు సంజయుం డశ్వత్థామోత్సాహంబు తెఱం గెఱింగించె నని వైశంపాయనుండు
సెప్పిన విని జనమేజయుం డట మీఁది వృత్తాంతం బెఱింగింపు మని యడుగుటయు. 419

ప్రతిపదార్థం: చనిరి= వెళ్ళారు; అనిఇట్లు= అని ఆ విధంగా; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రుడితో; సంజయుండు= సంజయుడు; అశ్వత్థామ= అశ్వత్థామయొక్క; ఉత్సాహంబు= వేడుకయొక్క; తెఱంగు= విధమును; ఎఱింగించెన్= తెలిపాడు; అని వైశంపాయనుండు చెప్పినన్= అని వైశంపాయన ముని చెప్పగా; విని= విన్నవాడై; జనమేజయుండు= జనమేజయ చక్రవర్తి; అటుమీఁది వృత్తాంతంబు= ఆపై సమాచారాన్ని; ఎఱింగింపుము+అని= తెలియజేయుమని; అడుగుటయున్= అడుగగా.

తాత్పర్యం: ఆ రథికత్రయం అట్లా వెళ్ళారని సంజయుడు ధృతరాష్ట్రుడికి ఈ రీతిగా అశ్వత్థామ ఉత్సాహాన్ని తెలిపాడు అని వైశంపాయనుడు చెప్పగా ఆ తరువాతి సమాచారాన్ని తెలియజేయుమని జనమేజయుడు అడిగాడు.

ఆశ్వాసాంతము

మ. శ్రుతివాక్యార్థమయ ప్రభావ! మునిసంస్తుత్యానుభావా! శచీ
పతిముఖ్యానిమిషాభివాద్య నిరసద్భావైకవేద్యా! మహో
న్నత హేతుత్వవిరాజమానచరణా! నమ్రాపదుత్తారణా!
సతతోన్నిద్ర విధైకభక్తసులభా! సంవిత్ప్రభావల్లభా! 420

ప్రతిపదార్థం: శ్రుతివాక్య+అర్థ మయ ప్రభావ!= వేదార్థరూపమైన శక్తి కలవాడా! (వేదవాక్యాల కున్న అర్థమే రూపెత్తినవాడా!); మునిసంస్తుత్య+అనుభావా!= మునులచేత ప్రార్థించదగిన ప్రభావం కలవాడా!; శచీపతి ముఖ్య= ఇంద్రుడు మొదలైన; అనిమిష= దేవతలచేత; అభివాద్య= నమస్కరించదగినవాడా!; నిరసద్భావ+ఏకవేద్యా!= ఇది కాదు. ఇది కాదు అనునట్టి రూపాన్ని భావంచేతనే తెలియదగినవాడా!; మహా+ఉన్నత= మిక్కిలి గొప్పదైన; హేతుత్వ= కారణమవటంచేత; విరాజమాన= వెలుగుతున్నట్టి; చరణా!= పాదాలుకలవాడా!; నమ్ర+ఆపదుత్తారణా!= విధేయులయిన భక్తులను ఆపదలనుండి దాటించేవాడా!; సతత= ఎల్లప్పుడూ; ఉన్నిద్రవిధా+ఏక= అన్ని సమయాలలో ప్రజ్ఞావంతులై ప్రమాదాలకు లోనుకాకుండా ఒక్కటి ఐన; భక్త సులభా!= భక్తులకు వశ్యుడా!; సంవిత్ప్రభావల్లభా!= జ్ఞానచైతన్య శక్తికి వల్లభుడా!

తాత్పర్యం: వేదాలలోని వాక్యార్థాల శక్తి స్వరూపుడవు. ఋషులంతా నీ మహత్త్వాన్ని పొగడుతున్నారు. ఇంద్రాదిదేవతలంతా నీకు నమస్కరిస్తున్నారు. నీవు ఇదికాదిది కాదనేతత్త్వం (నేతి నేతివాదం) వలన తెలియదగిన వాడవు. నీ పాదాలు అత్యున్నతమైన హేతువులుగా ప్రకాశిస్తాయి. నీవు వినమ్రులయిన వారి ఆపదలను తొలగిస్తావు. నిన్ను మరువని భక్తులకు నీవు సులభుడవు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ప్రతిపాదంలోనూ అంత్యానుప్రాసాలంకారం. నిరసద్భావైకవేద్యా - దీనికి వా. ప్రతిలో పాఠాంతరమున్నది. అది - నిరహంభావైక వేద్యా= అహంభావశూన్యు లైనవారిచేతనే తెలియదగినవాడా - అహంకారశూన్యులకు మాత్రమే తెలియదగినవాడా!

క. సిత నీలాదిక వర్ణా! హితవై కృత దూర! మానసేజ్యాధారా
శతదళభవసత్యవతీ। సుతాదిబుధ మతిలతా ప్రసూనాకారా! 421

ప్రతిపదార్థం: సిత నీల+ఆదిక వర్ణా!= తెల్లని, నల్లని మొదలైన రంగులు కలవాడా! (శివుడు తెల్లని వర్ణం కలవాడు, విష్ణువు నల్లని కలువవంటి రంగు కలవాడు); హితవైకృతదూర!= ఆప్తులయిన తాపసులకు వికారమైన రూపాలకు దూరమైనవాడా! (భక్తులకు స్వస్వరూపంలో కానవచ్చేవాడా!); మానస+ఇజ్యాధారా!= మనసునందు కావించే యజ్ఞానికి ఆధారమైనవాడా! (అంతస్సున మానసిక యజ్ఞానికి ఆధారమైనవాడని); శతదళ భవ= బ్రహ్మకును (పద్మం నుండి పుట్టినవాడు బ్రహ్మ); సత్యవతీసుత= సత్యవతి కుమారుడైన వ్యాసుడు; ఆది= మొదలయిన; బుధ= పండితులయొక్క (తాపసులయొక్క); మతిలతా= బుద్ధిఅనే తీగకు; ప్రసూన+ఆకారా!= పూవువంటివాడా! (తపస్వుల బుద్ధి అనే తీగలకు వికసించే పూవును పోలినవాడా).

తాత్పర్యం: (పరబ్రహ్మతత్త్వమును వర్ణించటం) తెల్లని నల్లని రంగులు కలవాడా! ఆత్మీయులైన ఋషులకు యథార్థంగా దర్శనమిచ్చేవాడా! మహనీయులయిన యోగులు తమ మనసులలో చేసే యజ్ఞానికి ఆధారమైనవాడా! స్రష్ట అయిన బ్రహ్మకు, వేదవ్యాసుడికి, ఇతరపండితులకు గల బుద్ధి అనే తీగకు పూవువంటివాడా!

విశేషం: అలం: రూపకం, అంత్యానుప్రాసం.

మాలిని.

భరిత వికసనాంతః పద్మనిశ్రేణికాసం
చరణ పరిణతత్వశ్లాఘనీయ క్రమోద్య
న్మరుదుపగమలీలా మథ్యమానేందు బింబ
క్షరదమృత వికారోత్సారణానంద రూపా! 422

ప్రతిపదార్థం: భరిత= నిండైన; వికసన= వికాసంకల; అంతః పద్మ= శరీరంలోని పద్మాల (షట్చక్రాల) ఆకారం కల; నిశ్రేణికా= (వరుసలు) నిచ్చెనవంటి దానిమీద; సంచరణ= సంచరించటం మూలాన సిద్ధించినట్టి; పరిణతత్వ= పరిపాకం వలన; శ్లాఘనీయ= పొగడదగినట్టి; క్రమ+ఉద్యత్+మరుత్+ఉపగమ+లీలా= వరుసగా పైకి లేచే ప్రాణవాయువునకు పొందిక అయిన క్రీడచేత; మథ్యమాన= త్రచ్చుటమూలాన (మథింపబడుచున్న); ఇందుబింబ= చంద్రబింబంనుండి; క్షరత్= జాలువారుచున్న; అమృతవికార= అమృతాకారంతో; ఉత్సారణ+ఆనంద రూపా!= కదలుతున్న ఆనందస్వరూపా!

తాత్పర్యం: పరమేశ్వరా! యోగీశ్వరులు తమ యోగాభ్యాసం మూలంగా సునిశిత పరిశీలనంతో తమ శక్తిని మూలాధారాది స్థానాలతో నిచ్చెన ఎక్కినట్లు అధిరోహించి, వరుసగా వికసింపజేసి, దానినుండి జాలువారే అమృతాన్ని అనుభవించి ఆనందసాగరంలో మునుగజేసే నిత్యానందరూపా!

విశేషం: ఈ పద్యంలో తిక్కనగారికి గల యోగశాస్త్ర పరిచయాన్ని పాఠకులు గుర్తించవలసి ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కనసోమయాజి ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున శల్యపర్వంబునందు సర్వంబును ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది మంగళకరమై సంస్కృతాంధ్రోభయకవులకు మిత్రుడైనవాడూ, కొమ్మనామాత్యుడి కుమారుడూ, పండితుల ప్రశంసలచేత ప్రకాశించేవాడూ (పండితులను సేవించటంలో రాణించేవాడూ) అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శ్రీమహాభారతంలోని శల్యపర్వం మొత్తం ముగిసిన రెండవ అశ్వాసం.

శల్యపర్వంలో రెండవ ఆశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్రమహాభారతంలో శల్యపర్వం ముగిసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

సౌప్తికపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీమ త్కౌస్తుభ రత్నో । ద్దామారణ రశ్మి భూతి ధవళ మరీచి

స్తోమ పరభాగ రమ్య మ । హా మహిత స్ఫురిత వక్ష! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీమత్= శోభావంతమైన; కౌస్తుభ రత్న= కౌస్తుభ మనే పేరుగల మణి యొక్క; ఉద్దామ= మిక్కిలి; అరుణ= ఎర్రనైన; రశ్మి= కాంతుల యొక్కయు; భూతి= బూది (విభూతి) యొక్క; ధవళ= తెల్లనైన; మరీచి= కాంతుల యొక్కయు; స్తోమ= సమూహము యొక్క; పరభాగ= అతిశయంచేత; రమ్య= అందమైన; మహత్ (మహా)= మిక్కిలి; మహిత= గొప్పదియు; స్ఫురిత= ప్రకాశించినదియు అగు; వక్ష!= రొమ్ముగలవాడా!; హరిహరనాథా!= హరిహరనాథు డనే పేరుగల దైవమా!

తాత్పర్యం: శోభావంతమైన కౌస్తుభమణి చిమ్మే ఎర్రటి కాంతుల అతిశయంవలన, శరీరానికి పూసుకొన్న విభూతి చిమ్మే తెల్లటి కాంతుల అతిశయం వలన అందమై మిక్కిలి గొప్పదీ, ప్రకాశించేదీ అయిన వక్షఃస్థలం గల ఓ హరిహరనాథా!

విశేషం: అలం: యథాసంఖ్యం. ఈ పద్యంలో హరి స్వరూపం, హరస్వరూపం- ఈ రెండూ ఏకమైన హరిహరనాథుడి మూర్తిని కవి వర్ణిస్తున్నాడు. హరి తన వక్షస్థలంపై కౌస్తుభమణిని ధరిస్తాడు. హరుడు తన వక్షఃస్థలానికి విభూతి పూసుకొంటాడు. కౌస్తుభం ఎర్రటి కాంతులను, విభూతి తెల్లటి కాంతులనూ చిమ్ముటవలన హరిహరనాథుడి వక్షఃస్థలం అందంగా ప్రకాశిస్తోంది అని భావం.

లక్ష్మీనివాసం కావడం చేతను, సర్వమంగళా స్వరూపం అగుటవల్లనూ హరిహరనాథుని ఉరఃస్థలం సంపదకూ, వైరాగ్యానికీ ఉపలక్షణం అయింది. అందువలన హరిహరనాథస్వామి భౌతిక ఆధ్యాత్మిక ఆనందాలను ప్రసాదించేవాడని ధ్వని.

కౌస్తుభమణి అరుణరశ్ములు హరికీ, భూతి ధవళమరీచులు హరుడికీ చెందటం వలన ఈ పద్యంలోని అలంకారం యథాసంఖ్యం.

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కి ట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు= ఆ పేరు గల వ్యాస శిష్యుడు; జనమేజయునకున్= పరీక్షిన్మహారాజు పుత్రుడైన జనమేజయుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వ్యాస శిష్యుడైన వైశంపాయనమహర్షి జనమేజయ మహారాజుతో ఈ విధంగా అన్నాడు.

విశేషం: దేవా! అనేది కృతికర్త అయిన తిక్కన కృతిపతి అయిన హరిహరనాథుడిని సంబోధించిన పదం. వైశంపాయనుడు వ్యాసుడి శిష్యుడు. ముని. జనమేజయుడు ఉత్తరాభిమన్యుల కుమారుడయిన పరీక్షిత్తు కొడుకు. వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పినట్లు తిక్కన హరిహరనాథుడితో భారత కథ చెప్తున్నాడు.

తే. సంజయునిచేత గురుసుతోత్సాహ మట్లు । వినిన ధృతరాష్ట్రుఁ డిట్లను; 'వీరవర్యుఁ
డనఁగఁజాలు నశ్వత్థామయును, సహాయ । రథికులును విక్రమించిన క్రమము సె పుమ!' 3

ప్రతిపదార్థం: సంజయుని చేతన్= సంజయుడి ద్వారా; గురుసుత+ఉత్సాహము= గురుడైన ద్రోణాచార్యుడి కుమారుడైన అశ్వత్థామ యొక్క యుద్ధోత్సాహం; అట్లు= ఆ విధంగా; వినిన= విన్నవాడైన; ధృతరాష్ట్రుఁడు; ఇట్లు; అనున్= ఈ విధంగా అన్నాడు; వీరవర్యుఁడు= వీరులలో శ్రేష్ఠుడు; అనఁగన్+చాలు= అనదగిన; అశ్వత్థామయును; సహాయ రథికులును= అతడికి తోడుపడే రథికులూ (కృపాచార్య కృతవర్మలూ); విక్రమించిన క్రమము= పరాక్రమించిన విధం; చెపుము!= చెప్పుమా!

తాత్పర్యం: సంజయుడి ద్వారా అశ్వత్థామ పొందిన శత్రుసంహారోత్సాహాన్ని ఆ రీతిగా విన్న ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు. 'సంజయా! వీరశ్రేష్ఠు డనదగిన అశ్వత్థామా, అతడికి తోడుపడే రథికులూ ఎట్లా పరాక్రమించారో చెప్పుము.'

విశేషం: గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రుడికి ఎప్పటికప్పుడు యుద్ధ విశేషాలు చెపుతూ ఉండడానికి వ్యాసుడు సంజయుడిని నియమించాడు. అందువలన యుద్ధ వార్తలు అతడు ఎప్పటికప్పుడు ధృతరాష్ట్రుడికి నివేదిస్తూ ఉంటాడు.

వ. అనుటయు నమ్మానవపతి కా సూతసేనుం డి ట్లను; 'నవ్విధంబునఁ గురుపతి యశ్వత్థామ కభిషేకంబు సేయిం చిన నా కృపాచార్యుండును గృతవర్మయు గురుపుత్రు నుత్సాహంబున కుపోద్బలకం బగు నుద్యోగంబునం బొదలి; రమ్మువ్వురు మహీపాలుండు పాండవులం బరిమార్చుటకుం బనిచిన నట్లు పూని దక్షిణంబు ముట్టి పడమట నున్న పాండవ శిబిరంబున కభిముఖు లై చని; రత్తెఱంగున నవ్వీటి కెలని కనతి దూరంబుగాఁ జని యా రథికవరు లాలించి. 4

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధృతరాష్ట్ర డనగా; ఆ+మానవపతికిన్= ఆ రాజుకు (ధృతరాష్ట్రుడికి); ఆ సూతసూనుండు= ఆ సూతపుత్రుడైన సంజయుడు; ఇట్లు+అనున్= ఇట్లా చెపుతున్నాడు; ఆ+విధంబునన్= ఆ రీతిగా; కురుపతి= కౌరవ రాజయిన దుర్యోధనుడు; అశ్వత్థామకున్; అభిషేకంబు= సేనాధిపత్యాభిషేకం; చేయించినన్= చేయించగా; ఆ కృపాచార్యుండును; కృతవర్మయున్; గురు పుత్రు+ఉత్సాహంబునకున్= ద్రోణుడి కొడుకైన అశ్వత్థామ యొక్క ఉత్సాహానికి; ఉపోద్బలకంబు+అగు= ప్రోత్సాహకరమైన; ఉద్యోగంబునన్= ప్రయత్నంలో; పొదలిరి= ప్రవర్తిల్లారు; ఆ+ముప్వురున్= అశ్వత్థామ; కృపాచార్యుడు; కృతవర్మ అనే ఆ ముగ్గురూ; మహీపాలుండు= రాజు (దుర్యోధనుడు); పాండవులన్; పరిమార్చుటకున్= చంపడానికి; పనిచినన్= పంపగా; అట్లు; పూని= కడగి; దక్షిణంబున్= దక్షిణ దిక్కును; ముట్టి= ఆక్రమించి; పడమటన్= పడమటి దిక్కునందు; ఉన్న; పాండవ శిబిరంబునకున్= పాండవుల విడిదికి; అభిముఖులు+ఐ= ఎదురు ముఖాలు కలవారయి; చనిరి= వెళ్ళారు; ఆ+తెఱంగునన్= ఆ విధంగా; ఆ+వీటి కెలనికిన్= ఆ విడిది ప్రక్కకు; న+అతి దూరంబుగాన్= దగ్గరగా; చని= పోయి; ఆ రథికవరులు= ఆ రథికశ్రేష్ఠులు; ఆలించి= విని.

తాత్పర్యం: అని అనగా ఆ ధృతరాష్ట్ర మహారాజుతో సంజయుడు ఇట్లా అన్నాడు. 'ఆ విధంగా దుర్యోధనుడు అశ్వత్థామకు సేనాధిపత్యాభిషేకం చేయించగా ఆ కృపాచార్యుడూ, కృతవర్మా, అశ్వత్థామయొక్క శత్రు సంహారోత్సాహానికి ప్రోత్సాహకరమైన పనియందు ప్రవర్తిల్లారు. ఆ ముగ్గురూ-దుర్యోధనుడు తమను పాండవులను చంపటానికి పంపగా, ఆ రీతిగా పూని, దక్షిణ దిక్కుకు వెళ్ళి, ఆ తర్వాత పడమటగా ఉన్న పాండవుల శిబిరం వైపు వెళ్ళారు. ఆ విధంగా ఆ శిబిరానికి దగ్గరగా పోయి, ఆ రథిక శ్రేష్ఠులు విని.

వ. **అందలి వార లెల్లను జయంబునఁ బొంగుచుఁ బేరెలుంగు లం**
దంద చెలంగఁగాఁ బలుక నార్వఁగ నొత్తిలి నవ్వ నాకసం
బందినయట్టి మ్రోఁత విని యక్కడ వోవఁగ నుల్కి రప్డు ద
మ్ముం దడవన్ వడిన్ వెడలు మూఁకలు మ్రోయుటగాఁ దలంచుచున్. **5**

ప్రతిపదార్థం: అందలివారలు= ఆ శిబిరంలో ఉన్నవాళ్ళు; ఎల్లనున్= అందరూ; జయంబునన్= గెలుపుతో; పొంగుచున్= ఉబ్బుతూ; పేరు+ఎలుంగులు= పెద్ద కంఠస్వరాలు; అందంద= అక్కడక్కడా; చెలంగఁగాన్= మ్రోయగా; పలుకన్= మాటలాడగా; అర్వఁగన్= అరవగా; ఒత్తిలి= బిగ్గరగా; నవ్వన్= నవ్వగా; ఆకసంబు+అందిన= ఆకాశాన్ని తాకిన; అట్టి= అటువంటి; మ్రోఁతన్= ధ్వనిని; విని; అప్డు= అప్పుడు; తమ్మున్= తమను; తడవన్= పట్టుకొనడానికి; వడిన్= వేగంగా; వెడలు= బయలుదేరునట్టి; మూఁకలు= సేనలు; మ్రోయుటగాన్= ధ్వని చేయటంగా; తలంచుచున్= భావిస్తూ; అక్కడ+పోవఁగన్= అక్కడికి వెళ్ళడానికి; ఉల్కిరి= భయపడ్డారు.

తాత్పర్యం: ఆ శిబిరంలో ఉన్నవాళ్ళందరూ జయోత్సాహంతో పొంగిపోతూ పెద్ద పెద్ద కంఠస్వరాలు మ్రోగుతుండగా, అరుపులూ, అట్టహాసాలూ చేశారు. మిన్నుముట్టే ఆ ధ్వనిని విని అప్పుడు తమను వెదకటానికి వేగంగా వెళ్ళే సేనలు చేసే ధ్వనిగా భావించి, ఆ ముగ్గురు వీరులూ అక్కడికి వెళ్ళటానికి భయపడ్డారు.

విశేషం: తప్పుపని చేసేవాడు ఎవ డేమి చేసినా తనను కనిపెడుతున్నాడని తన నీడ చూచికొని తనే భయపడుతుంటాడు. అట్లాగే అశ్వత్థామాదులు పాండవ శిబిరంలో సైన్యం జయానందంతో పెట్టే కేకలూ, నవ్వే నవ్వులూ విని అవన్నీ తమను పట్టుకొనటానికి వాళ్ళు చేసే శబ్దాలు అని భ్రమించి అక్కడికి పోవటానికి భయపడ్డారని భావం.

వ. **ఉలికి యట వోవు టుడిగి యెచ్చటి కేనియుం దొలంగి నిలిచి మఱి కర్జంబుఁ జూచికొనువారై యా రథికవరులు మగిడి తూర్పుదెస కొంతదవ్వరిగి'రనిన నమ్మాటలు వెడవెడ వినుచుం దనకుం బాటిల్లిన దురవస్థ చింతించుచు నాంబికేయుం డి ట్లనియె.** **6**

ప్రతిపదార్థం: ఉలికి= భయపడి; అట+పోవుట+ఉడిగి= అక్కడికి పోవటానికి భయపడి; ఎచ్చటికిన్+ఏనియున్+తొలంగి= ఎక్కడికో తప్పుకొని నిలిచి; మఱి= పిమ్మట; కర్జంబున్= పనిని; చూచికొనువారు+ఐ= ఆలోచించుకొనేవారై; ఆ రథికవరులు= ఆ రథిక శ్రేష్ఠులు (కృపాశ్వత్థామ కృతవర్మలు); మగిడి= వెనుదిరిగి; తూర్పుదెస= తూర్పు దిక్కుగా; కొంత దవ్వు+అరిగిరి= కొంతదూరం వెళ్ళారు; అనినన్= అని సంజయుడు చెప్పగా; ఆ+మాటలు; వెడవెడ వినుచున్= నిరుత్సాహంతో వింటూ; తనకున్; పాటిల్లిన= సంభవించిన; దురవస్థ= దుస్థితిని గురించి; చింతించుచున్= విచారిస్తూ; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు (అంబిక కొడుకు); ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఆ వీరులు భయంతో అక్కడికి పోవటం మాని ఎక్కడికో తప్పుకొని నిలిచి, తరువాత తాము చేయవలసిన పనిని గూర్చి ఆలోచించుకొంటూ తిరిగి తూర్పు దిక్కుగా కొంతదూరం వెళ్లారు' అని సంజయుడు చెప్పే మాటలను ఆసక్తి లేకుండా వింటూ, తనకు సంభవించిన దుస్థితిని గూర్చి తలచుకొంటూ ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ధృతరాష్ట్రుడికి తమ వీరులు ఓడిపోతున్నారనే మాటలు రుచించవు. అందుచేతనే సంజయుడి మాటలను అనాసక్తితో వినటం జరిగింది.

వ. 'సంజయ! కురురాజు సమయునే యిట్లు భీమునిచేత? బలశౌర్యముల నజయ్యుఁ
డని నమ్మియుండితిఁ; దనయులు నూర్వురు మడియుట నినియు నా మనము పెక్కు
పఱియలై పోవనిభంగిఁ జూడఁగ ఱాత నొనరించినదిగాఁగ నోపు. నింక
నడియరితనమున నప్పాండవుల నాశ్రయింపఁగఁజాల; నే నెక్కడేనిఁ

ఆ. బోదుఁ గాక; యట్టి భూపాలు తండ్రినై, । ప్రాభవమునఁ బేర్చి పరమ దైన్య
వృత్తి కోర్వఁదగునె? విన వశమే మాట । లా మరుత్తనూజుఁ డాడ నాకు? 7

ప్రతిపదార్థం: సంజయ!= ఓ సంజయా!. కురురాజు= దుర్యోధనుడు; ఇట్లు= ఈ విధంగా; భీమునిచేతన్= భీమునిచేతిలో; సమయునే?= చనిపోతాడా?; బల శౌర్యములన్= బలపరాక్రమాల విషయంలో; అజయ్యుఁడు+అని= జయించరానివాడని; నమ్మి+ఉండితిన్= నమ్మి ఉంటిని; తనయులు= కొడుకులు; నూర్వురున్= నూరుమందీ; మడియుట= చావటం; వినియున్= విని కూడా; నా మనసు= నా మనస్సు; పెక్కు పఱియలు+ఐ= పోవని భంగిన్= ముక్కలయిపోవని విధం; చూడఁగన్= చూస్తే; ఱాతన్= రాతితో; ఒనరించినది కాఁగన్ ఓవున్= చేసినదై వుండాలి; ఇంకన్= ఇకపై; అడియరితనమునన్= దాస్యంతో; ఆ+పాండవులన్= ఆశ్రయింపఁగన్+చాలన్= ఆశ్రయించలేను; నేను; ఎక్కడ+ఏనిన్= ఎక్కడికైనా; పోదున్+కాక= పోతాను కాని; అట్టి భూపాలు తండ్రిన్+ఐ= అటువంటి మహారాజుకు తండ్రినై; ప్రాభవమునన్= దొరతనంతో; పేర్చి= అతిశయించి; పరమ దైన్య వృత్తికిన్= మిక్కిలి దీనమైన పరిస్థితికి; ఓర్వన్+తగునె?= సహించగలనా?; ఆ మరుత్+తనూజుఁడు= ఆ భీముడు (వాయువు కొడుకు); మాటలు+ఆడన్= నిందించగా; నాకున్; వినన్+వశమే?= వినటానికి సాధ్యమా?

తాత్పర్యం: 'ఓయి సంజయా! దుర్యోధనుడు ఈ విధంగా భీముడిచేత దెబ్బతిని చనిపోతాడా? అతడు బలపరాక్రమాలలో ఇతరులకు జయించరానివాడని నమ్మి ఉన్నాను. నూరుగురు కొడుకుల చావు విని కూడా నా మనస్సు ముక్కలు ముక్కలై పోకపోవటం చూస్తే అది రాతితో నిర్మించబడి ఉండాలి. ఇకమీద దాస్యభావంతో ఆ పాండవులను ఆశ్రయించలేను. నేను అటువంటి మహారాజుకు తండ్రినై దొరతనంతో వెలిగి పరమ దైన్యంతో ప్రవర్తించగలనా? ఆ భీముడు పలికిన నిందావాక్యాలు నేను వినగలనా?

విశేషం: ధృతరాష్ట్రుడి పలుకులలో, దుర్యోధనుడిమీద అతడికిగల ప్రేమా, భీముడిపై గల ద్వేషమూ స్పష్టపడతాయి.

వ. అని పలికి 'యశ్వత్థామ ప్రభృతు లేమిసేసి?' రనుటయు నజ్జనపతికి సంజయుం డిట్లనియె. 8

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని; పలికి; అశ్వత్థామ ప్రభృతులు= అశ్వత్థామ మొదలైన వారు; ఏమి+చేసిరి; అనుటయున్; ఆ+జనపతికిన్= ఆ రాజుకు (ధృతరాష్ట్రుడికి); సంజయుండు; ఇట్లు; అనియెన్= సంజయుడు ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని పలికి ధృతరాష్ట్రుడు 'అశ్వత్థామ మొదలైన వీరులు తరవాత ఏం చేశా?' రని అడుగగా అతడితో సంజయుడు ఇట్లా అన్నాడు.

క. ఇమ్మెయి నా రథికవరులు । గ్రమ్మఱి చని యడవి సొచ్చి కని రొక మడు; వం
దిమ్ముల సూతజనులు ర । థ్యమ్ముల నీళ్ళకును దిగువ నప్పుడు దారున్. 9

ప్రతిపదార్థం: ఆ రథిక వరులు= ఆ రథిక శ్రేష్ఠులు; ఈ+మెయిన్= ఈ రీతిగా; క్రమ్మఱి= మరలి; చని= పోయి; అడవి+చొచ్చి= అడవిలో ప్రవేశించి; ఒక మడువున్= ఒక మడుగును; కనిరి= చూశారు; అందున్= ఆ మడుగులో; ఇమ్ములన్= ప్రీతితో; సూత జనులు= రథంతోలేవాళ్ళు; రథ్యమ్ములన్= గుర్రాలను; నీళ్ళకును= నీళ్ళకోసం; తిగువన్= విడువగా; అప్పుడు; తారున్= తామును (అశ్వత్థామాదులునూ).

తాత్పర్యం: ఆ అశ్వత్థామాది రథికశ్రేష్ఠులు ఈ రీతిగా మరలిపోయి అడవిలో ప్రవేశించి, ఒక మడుగును చూశారు. రథచోదకులు గుర్రాలను నీళ్ళ కోసం విడిచిపెట్టగా అప్పుడు తామును. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. రథంబులు డిగ్గి యంబుపానంబు సేసి యామ్రోఁతదెస నాలించుచుండిరి. 10

ప్రతిపదార్థం: రథంబులు; డిగ్గి= దిగి; అంబు పానంబు+చేసి= నీళ్ళు త్రాగి; ఆ మ్రోఁత దెసన్= ఆ ధ్వని వైపు; ఆలించు చున్+ఉండిరి= వింటూ ఉన్నారు.

తాత్పర్యం: (అశ్వత్థామాదులు) రథాలు దిగి, నీళ్ళు త్రాగి, ఆ చప్పుడు వచ్చే దిశవైపు చెవులొగ్గి వింటున్నారు.

తే. అంతఁ బశ్చిమ ధరణీధరాగ్ర పశ్చి । మంబునకుఁ బోయె మార్తాండమండలంబు;
సాంధ్యసమయ కృత్యంబులు సలిపి రపుడు । రథికవర్యులు ముప్పురు రాజముఖ్య! 11

ప్రతిపదార్థం: రాజముఖ్య!= ఓ రాజశ్రేష్ఠుడా!; ధృతరాష్ట్రా!; అంతన్= తరువాత; మార్తాండ మండలంబు= సూర్యబింబం; పశ్చిమ ధరణీధర+అగ్ర పశ్చిమంబునకున్= పడమటి కొండ కొనవెనుకకు; పోయెన్; అపుడు; రథికవర్యులు ముప్పురున్= రథిక శ్రేష్ఠులు ముగ్గురూ (కృపాశ్వత్థామ కృతవర్మలు); సాంధ్యసమయ కృత్యంబులు= సాయంకాల సంధ్యాసమయోచితాలైన పనులు - సంధ్యావందనాదులు; సలిపిరి= చేశారు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అంత సూర్యాస్తమయం అయింది. అప్పుడు ఆ రథికశ్రేష్ఠులైన కృపాశ్వత్థామ కృతవర్మలు ముగ్గురూ సాయంకాల సంధ్యావందనాది కార్యక్రమాలు నిర్వర్తించారు.

వ. సలిపి నా రొక్క వటవిటపి సమీపంబున నాసీను లై; రా సమయంబున. 12

ప్రతిపదార్థం: సలిపి= చేసి; వారు; ఒక్క వట - విటపి - సమీపంబునన్= ఒక మఱ్ఱిచెట్టు దగ్గర; ఆసీనులు+ఐరి= కూర్చొన్నారు; ఆ సమయంబునన్= అప్పుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ విధంగా చేసి వాళ్ళు ఒక మర్రిచెట్టు దగ్గర ఆసీనులయ్యారు. అప్పుడు (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. వారిముఖమండలములతో వారిజములు । మొగిడె; శోకతమంబుతో నిగిడెఁ దిమిర
పటలి; బహు విచారములతోఁ బరఁగఁ బొల్చె । భూత బేతాళ గణములు భూపవర్య! 13

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజశ్రేష్ఠుడవైన ధృతరాష్ట్రా!; వారి ముఖ మండలములతోన్= ఆ ముగ్గురి ముఖబింబాలతోపాటు; వారిజములు= పద్మాలు; మొగిడెన్= ముడుచుకొన్నాయి!; శోకతమంబుతోన్= దుఃఖాంధకారంతోపాటు; తిమిర పటలి= చీకట్ల సమూహం; నిగిడెన్= వ్యాపించింది; బహు విచారములతోన్= (వారికి కలిగిన) పెక్కు ఆలోచనలతోపాటు; భూత బేతాళ గణములు= దయ్యాల, పిశాచాల గుంపులు; పరఁగన్= ఒప్పుగా; పొల్చెన్= ఒప్పాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! ఆ సమయంలో ఆ ముగ్గురి ముఖబింబాలతో పాటు పద్మాలు ముడుచుకొన్నాయి. దుఃఖాంధకారంతోపాటు చీకట్లు వ్యాపించాయి. అనేక ఆలోచనలతోపాటు భూతాలు, పిశాచాలు ఒప్పాయి.

విశేషం: అలం: సహోక్తి. కర్తవ్యం బోధపడక ఆ ముగ్గురి ముఖాలూ ముడుచుకొన్నాయి. సాయంసమయం కాబట్టి తామరపువ్వులు ముకుళించాయి. వాళ్ళ ముఖాలు పద్మాలవలె ఉన్నాయన్నమాట. ఏం చేయాలో తోచక వాళ్ళు దుఃఖించారు. చీకట్లు అలముకొన్నాయి. వాళ్ళ దుఃఖం చీకటివలె ఉందన్నమాట. వాళ్ళ మనస్సులలో ఎన్నో ఆలోచనలున్నాయి. భూతాలూ పిశాచాలూ విజృంభించాయి. వాళ్ళ ఆలోచనలు భూతపిశాచాలవలె ఉన్నాయన్నమాట. ఈ విధంగా ఉపమేయోపమానాలకి సహ భావం ఉంది. కాబట్టి ఇందులోని అలంకారం సహోక్తి. ఇట్లా కథతో ప్రకృతిని జోడించి వర్ణించటం బాగు.

క. కలుగు గురుసుతున కెట్లుం । బని చూడ నమరగణ మధికకుతూ
హలమున వచ్చెనొ యనఁ జు । క్కలు దోఁచెన్ గగనవీథిఁ గౌరవనాథా!. 14

ప్రతిపదార్థం: కౌరవనాథా!= కురువంశ రాజా! ధృతరాష్ట్రా!; గురు సుతునకున్= ద్రోణకుమారుడైన అశ్వత్థామకు; ఎట్టున్= ఏ విధంగా అయినా తప్పక; కలహంబు= యుద్ధం; కలుగున్= జరుగుతుంది అని; అమరగణము= దేవతల సమూహం; అధిక కుతూహలమునన్= మిక్కిలి ఆసక్తితో; చూడన్= చూడటానికి; వచ్చెనొ= వచ్చిందా?; అనన్= అన్నట్లు; చుక్కలు= నక్షత్రాలు; గగన వీథిన్= ఆకాశప్రదేశంలో; తోఁచెన్= కనబడ్డాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! 'అశ్వత్థామకు ఎట్లాగూ యుద్ధం సిద్ధిస్తుంది' అని దేవతల సమూహం మిక్కిలి వేడుకతో చూడాలని వచ్చిందా - అన్నట్లుగా ఆకాశంలో నక్షత్రాలు కనబడ్డాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, ఇందులో ఉపమేయమైన దేవతలను ఉపమానమైన చుక్కలుగా కవి సంభావించాడు కాబట్టి అలంకారం ఉత్ప్రేక్ష. ఇక్కడ కూడా కవి ప్రకృతిని కథతో మేళవించి వర్ణించటం చూడవచ్చు.

వ. ఇట్లు రాత్రి యగుట దివాచరంబు లైన జంతువు లుపశాంత వర్తనంబు లయ్యె; రాత్రించరంబు లైనవి సంచరింపం దొడంగె; నప్పుడమ్ముఫ్వురు నెవ్వగలఁ గూరిన మనంబులతోఁ గురుబలం బకారణంబ పొలియుట

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యుగ్గడించి తత్సంబంధకలితంబులైన భాషణంబులు సెల్లుచుండనుండి డప్పి గూరి కొండొకసేపునకు మహీ తలంబున మేనులు వైచి వందురుచుండి; రందుఁ గృపకృతవర్ములు నిద్రవొందిరి; గురునందనుండు క్రోధా తిశయంబునం జేసి నిదురవోవక వటవిటపంబు గలయం గనుంగొనువాఁడు తదీయశాఖోపశాఖల నానా కాకంబులు నిలీనంబులై నిద్రించుచుండ నాలోకించె; నయ్యవసరంబున. **15**

ప్రతిపదార్థం: ఇట్లు రాత్రి అగుటన్= ఈ విధంగా రాత్రికావటంతో; దివాచరంబులు+ఐన జంతువులు= పగలు సంచరించే ప్రాణులు; ఉపశాంత వర్తనంబులు+అయ్యేన్= ఉడిగిన వ్యాపారాలు గలవి అయినాయి. రాత్రి చరంబులు+ఐనవి= రాత్రి సంచరించేవి; సంచరింపన్+తొడంగెన్= తిరగనారంభించాయి; అప్పుడు ఆ+ముప్వురున్ నెవ్వగలన్ (నెఱ+వగలన్)= మిక్కిలి చింతలతో; కూరిన= నిండిన; మనంబులన్= మనస్సులతో; కురు బలంబు= కురుసేన; ఆకారణంబు+అ= నిష్కారణంగానే; పొలియుట= చావటం; ఉగ్గడించి= చెప్పి; తద్+సంబంధ కలితంబులు+ఐన భాషణంబులు= ఆ సంబంధంతో కూడుకొన్న మాటలు; చెల్లుచున్+ ఉండన్+ఉండి= సాగుతుండగా ఉండి; డప్పి= శ్రమ; కూరి= చెంది; కొండొక సేపునకున్= కొంతసేపటికి; మహీతలంబునన్= నేలమీద; మేనులు= శరీరాలు; వైచి= వేసి; వందురుచున్+ఉండిరి= విచారిస్తూ ఉండినారు; అందున్= వారిలో; కృప కృత వర్ములు= కృపాచార్యుడూ; కృతవర్మా; నిద్ర+పొందిరి= నిద్రపోయారు; గురు నందనుండు= గురుసుతుడు (అశ్వత్థామ); క్రోధ+అతిశయంబునన్+చేసి= కోపాధిక్యంచేత; నిదుర+పోవక= నిద్రించక; వట విటపంబున్= మర్రిచెట్టును; కలయన్= అంతటా; కనుంగొనువాఁడు=చూచేవాడు; తదీయ శాఖా+ఉపశాఖలన్= దాని శాఖలందును ఉపశాఖలందును; నానాకాకంబులు= పెక్కు కాకులు; నిలీనంబులు+ఐ= దాగినవయి; నిద్రించుచున్+ఉండన్= నిద్రిస్తూ ఉండగా; ఆలోకించెన్= చూశాడు; ఆ+ అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఇట్లా రాత్రి అవటంచేత పగలు సంచరించే ప్రాణులు సంచరించటం మానివేశాయి. రాత్రి తిరిగేవి తిరుగనారంభించాయి. అప్పుడు ఆ ముగ్గురూ దుఃఖాక్రాంత మనస్కులై కౌరవసేన నిష్కారణంగా చావటానికి సంబంధించిన మాటలు మాట్లాడుకొంటూ ఉండి, శ్రమచెంది, కొంతసేపటికి నేలమీద మేనులు వాల్చి దుఃఖిస్తూ ఉండిపోయారు. వాళ్ళలో కృపాచార్యుడూ, కృతవర్ముడూ నిద్రించారు. కాని, అశ్వత్థామ కోపాతిశయంచేత నిద్రపోక మర్రిచెట్టు అంతటా చూస్తూ దాని శాఖోపశాఖలలో దాగి నిద్రిస్తూ ఉన్న ఎన్నో కాకులను చూచాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: కృపకృతవర్ములకంటె అశ్వత్థామకు బాధ అధికం. ఎందుచేత నంటే అతడి తండ్రిని ధృష్టద్యుమ్నుడు అన్యాయంగా చంపాడు. పైగా తా నిప్పుడు సేనాధిపతి. అందుచేత బాధ్యతకూడా ఉన్నది. ఆ కారణంగా కృప కృతవర్ములు హాయిగా నిద్రపోయారు. కాని అశ్వత్థామకు మాత్రం నిద్రపట్టలేదు.

సీ. **మిడుఁగుఱుగములు గ్రమ్మినయట్లు నిగిడెడు రోచులు గల మిడిగ్రుడ్లుదనర**
మెఱుఁగారు కెంజాయ మెఱసిన యెఱకల మోపున నెసఁగు పెన్ ముోంతతోడఁ
గాకుల భీషణాకారత వేళ్ళతో లీలమై నెగసిన శైలమనఁగఁ;
గర ముగ్రమగు మొగ మిరుదెస మురియించి యామిషంబుల యిక్క లరసికొనుచు;

తే. **నచటి బయలెల్లఁ దానయై యక్కజంపుఁ । జందమును, ఘోరమైన నిస్వనముఁ, జండ**
గతియు భూతవితానభీకరముగా ను । లూక మొక్కటి వచ్చె భూలోకనాథ! **16**

ప్రతిపదార్థం: భూలోకనాథ!= రాజా! ధృతరాష్ట్రా!; మిగుఁగులు గములు= అగ్నికణాల సమూహాలు; క్రమ్మిన+అట్లు= వ్యాపించిన విధంగా; నిగిడెడు= వెలువడే; రోచులు= కాంతులు; కల= ఉన్న; మిడిగ్రుడ్లు; తనరన్= ఒప్పుగా; మెఱుగారు (మెఱుఁగు+ఆరు)= మిక్కిలి ప్రకాశించే; కెంజాయన్ (కెంపు+చాయన్)= ఎర్రటి కాంతిచేత; మెఱసిన= మెరిసినట్టి; ఎఱకల= ఈకల యొక్క; మోపునన్= సమూహంచేత; ఎసఁగు= కలిగే; పెన్ మ్రోఁతతోడన్= పెద్దధ్వనితో; కాళుల= కాళ్ళయొక్క; భీషణ+ఆకారతన్= భయంకర స్వరూపంచేత; వేళ్ళతోన్= మూలములతో; లీలమైన్= అలవోకగా; ఎగసిన= ఎగిరిన; శైలము= కొండ; అనఁగన్= అనగా; కరము= మిక్కిలి; ఉగ్రము+అగు= భయంకరమైన; మొగము= ముఖం; ఇరుదెసన్= రెండువైపులకు; మురియించి= త్రిప్పి; ఆమిషంబుల+ఇక్కలు= మాంసములుండే చోట్లు; అరసి కొనుచున్= చూచుకొంటూ; అచటి బయలు+ ఎల్లన్= అక్కడి బహిఃప్రదేశమంతా; తాను+ఆ+ఐ= తానే అయి; అక్కజంపు+చందమును= ఆశ్చర్యకర రూపమూ; ఘోరము+ ఐన= భయంకరమైన; నిస్వనమున్= ధ్వనీ; చండ గతియున్= తీవ్రమైన గమనమూ; భూత వితాన భీకరము+కాన్= ప్రాణికోటికి వెరపు కలిగించేది కాగా; ఉలూకము+ఒక్కటి= ఒక గ్రుడ్లగూబ; వచ్చెన్= వచ్చింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అగ్నికణాల సమూహం వ్యాపించినట్లు వెలువడే కాంతులుగల మిట్టగ్రుడ్లు ఒప్పుగాను, మిక్కిలి ప్రకాశించే ఎర్రటికాంతితో మెరిసిపోయే ఈకల సమూహంచేత కలిగే పెద్దధ్వనితోనూ, కాళ్ళ భయంకరాకారంతో సమూలంగా అలవోకగా ఎగిరిన కొండ మాదిరిగానూ, మిక్కిలి భయంకరమైనముఖం రెండువైపులకూ త్రిప్పి, మాంసఖండాలు పడి ఉన్న ప్రదేశాలను అన్వేషిస్తూ అక్కడి బయలంతా తనే అయి, ఆశ్చర్యకరమైన రూపమూ, భయంకరమైన ధ్వనీ, తీవ్రమైన గమనమూ ప్రాణికోటికి వెరపూ పుట్టించగా ఒక గ్రుడ్లగూబ వచ్చింది.

విశేషం: అలం: స్వభావోక్తి. కవి గ్రుడ్లగూబని స్వభావసిద్ధంగా వర్ణించాడు. కాబట్టి ఇందులోని అలంకారం స్వభావోక్తి. 'కాళుల..శైల మనఁగ' అనేచోట అలంకారం సంబంధాతిశయోక్తి. ఆకారాన్ని కన్నులకు కట్టినట్లు వర్ణించటం తిక్కన ప్రత్యేకత.

అశ్వత్థామ యులూకంబు కాకంబులఁ జంపుట నాలోకించుట (సం.10-1-39)

వ. **వచ్చి యన్వటవిటపంబు నూఁది యక్కాకంబుల నాలోకించి యంగంబుల యుద్భటత్వం బుడిసికొని గమనంబు తిన్నఁదనంబు దలకొనఁ జొచ్చి వాని నాక్రమించి.** **17**

ప్రతిపదార్థం: వచ్చి; ఆ+వట విటపంబున్= ఆ మర్రిచెట్టుకొమ్మని; ఊఁది= ఆధారంగా చేసికొని; ఆ+కాకంబులన్= ఆ కాకులను; ఆలోకించి= చూచి; అంగంబుల= అవయవాలయొక్క; ఉద్భటత్వంబు= ఆధిక్యాన్ని; ఉడిపికొని= తగ్గించుకొని; గమనంబు= నడక; తిన్నఁదనంబు= మెల్లనితనం; తలకొనన్= ఒప్పుగా; చొచ్చి= ప్రవేశించి; వానిన్= ఆ కాకుల్ని; ఆక్రమించి= చుట్టుకొని.

తాత్పర్యం: ఆ విధంగా గుడ్లగూబ వచ్చి ఆ చెట్టుకొమ్మను ఆధారంగా చేసికొని ఆ కాకులను చూచి తన అవయవాల అధిక్యాన్ని తగ్గించుకొని, మెల్లగా నడుస్తూ ప్రవేశించి వాటిని చుట్టుకొని (ఆక్రమించుకొని). (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: గుడ్లగూబ అవయవాలు విరివిగా ఉంటే కాకులు ఎగిరిపోతాయి. కాబట్టి అది వాటిని ముడుచుకుంది. అట్లాగే గమనం ప్రచండంగా ఉంటే కాకులు పసిగట్టి ఎగిరిపోతాయి కాబట్టి అది మెలకువతో మెల్లగా నడిచి వచ్చి వాటిని పట్టుకున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. కొన్నిటి కంఠముల్ నులుపుఁ, గొన్నిటి కాళులు ద్రుంచు నుగ్రతం
గొన్నిటి పక్షముల్ నఱకుఁ గొన్నిటి పొట్టలు వ్రచ్చు లీలమైఁ.
గొన్నిటి నప్పళించుకొని కోలెముకల్ నుఱుమాడు, నిట్టు ల
య్యన్నిటి నయ్యులూకము రయం బెసఁగన్ వధియించె భూవరా! 18

ప్రతిపదార్థం: భూవరా!= రాజా! ధృతరాష్ట్రా!; కొన్నిటి కంఠముల్= కొన్ని కాకుల పీకలు; నులుపున్= పిసుకుతుంది; కొన్నిటి కాళులు= కాళ్ళు; ఉగ్రతన్= భయంకరత్వంతో; త్రుంచున్= విరగ్గొడుతుంది; పక్షముల్= రెక్కలు; నఱకున్= నరుకుతుంది; లీలమైన్= విలాసంగా; కొన్నిటి; పొట్టలు; వ్రచ్చున్= చీల్చుతుంది; అప్పళించుకొని= అదిమిపట్టుకొని; కోలెముకల్ (కోల+ఎముకల్)= వెన్నెముకలు; నుఱుమాడున్= పొడిచేస్తుంది; ఇట్టులు= ఈ విధంగా; ఆ+అన్నిటిన్= ఆ కాకులను అన్నింటినీ; ఆ+ఉలూకము= ఆ గ్రుడ్లగూబ; రయంబు= వేగం; ఎసఁగన్= అతిశయించగా; వధియించెన్= చంపింది.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! కొన్ని కాకుల పీకలు నులిమీ, కొన్నింటి కాళ్ళు భయంకరంగా విరుగకొట్టీ, కొన్నింటి రెక్కలు నరికీ, కొన్నిటి పొట్టలు అలవోకగా చీల్చీ, కొన్నిటిని అదిమి పట్టుకొని వెన్నెముకలు పొడిచిచేసీ -ఈ విధంగా ఆ గ్రుడ్లగూబ ఆ కాకులను అన్నింటినీ అతివేగంగా చంపింది.

వ. ఇవ్విధంబున నిద్రావివశంబు లైన యవ్వాయసంబుల వివిధంబులగు వధంబుల గీటడఁగించి యా కౌశి
కంబు శత్రువులం బొదివి సమయించిన మేటి మగని మాడ్కి మోదంబు నొందినం గని యగ్గురునందనుం
డాచందం బొనర్చుటకు డెందంబున నుత్సాహంబు వొడమి పొంగి తనలోన. 18

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; నిద్రా వివశంబులు+ఐన= నిద్రకు స్వాధీనమైన; నిద్రపోతూ ఉన్న; ఆ+వాయసంబులన్= ఆ కాకులను; వివిధంబులు+అగు వధంబులన్= రకరకాల చంపటాలతో; గీటడఁగించి= నాశనంచేసి (చంపి); ఆ+కౌశికంబు= ఆ గ్రుడ్లగూబ; శత్రువులన్= విరోధులను; పొదివి= ఆక్రమించి; సమయించిన= చంపిన; మేటి మగని మాడ్కిన్= గొప్ప శూరునివలె; మోదంబున్= సంతోషం; ఒందినన్= పొందగా; కని= చూచి; ఆ+గురు నందనుండు= ఆ గురు సుతుడు (అశ్వత్థామ); ఆ+చందంబు= ఆ విధంగా; ఒనర్చుటకున్= చేయటానికి; డెందంబునన్= హృదయంలో; ఉత్సాహంబు= వేడుక; పొడమి= పుట్టి; పొంగి= ఉత్సహించి; తనలోనన్= తనలో.

తాత్పర్యం: ఆ గ్రుడ్లగూబ ఈ విధంగా నిద్రపోతూ ఉన్న ఆ కాకులను రకరకాలుగా చంపి విరోధులను ఆక్రమించి చంపిన గొప్పవీరుడివలె సంతోషించటం చూచి, ఆ అశ్వత్థామ తాను కూడా ఆ రీతిగా చేయటానికి మనస్సులో వేడుకపడి ఉత్సాహంతో తనలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ. 'ఆ కౌశికంబు...మోదంబు నొందినన్' ఇందులోని అలంకారం పూర్ణోపమ. నిద్రపోతూ ఉన్న కాకులను చంపిన గ్రుడ్లగూబను శత్రువులను చంపిన మేటి వీరుడితో పోల్చటంవలన, మేటివీరుడైన తనుకూడా తన శత్రువులను నిద్రపోతూండగా చంపాలనే కర్తవ్యాన్ని అశ్వత్థామ తెలిసికొన్నాడు కాబట్టి ఈ అలంకారాని కిక్కడ ఎంతో ఔచిత్యం ఉన్నది.

తే. 'ఇవ్విహంగమ ముపదేశ మిచ్చె నాకు । నిద్రవోవంగ శత్రుల నిగ్రహింతు;
నింత లెస్సగునే! ముంద రేమి తెఱఁగు । గాననైతిని నా పూను కార్యమునకు.' 20

ప్రతిపదార్థం: ఈ+విహంగమము= ఈ పక్షి; నాకున్; ఉపదేశము+ఇచ్చెన్= ఉపదేశించింది; శత్రులన్= విరోధుల్ని; నిద్ర+పోవంగన్= నిద్రపోతూ ఉండగా; నిగ్రహింతున్= చంపుతాను; ఇంత లెస్స+అగునే!= ఇంత మంచిదౌనా!; నా పూను కార్యమునకున్= నేను పూనుకొన్న పనికి; ముందరం= మొదట్లో; ఏమి తెఱఁగు= ఏ విధమూ; కానన్+ఐతిని= కానలేకపోయాను.

తాత్పర్యం: 'ఈ పక్షి నాకు కర్తవ్యాన్ని ఉపదేశించింది. శత్రువులను నిద్రపోతూ ఉండగా చంపుతాను. ఈ ఆలోచన ఎంత బాగున్నది! నేను చేపట్టిన పనికి ఇంతకు ముందు ఏం చేయాలో తెలిసింది కాదు.'

వ. అని వెండియు. 21

ప్రతిపదార్థం: అని; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని ఇంకా.

ఉ. పాండునరేంద్రనందనుల బాంధవ పుత్త్రయుతంబుగాఁగ ను
ద్దండత నే వధింతు నని దర్పమెలర్పఁగఁ గౌరవాధినా
థుండు వినంగఁ బల్కితిని; దుర్దమ దోర్బలు లమ్మహాత్మకుల్
గండున బెట్టు పైఁ బడుట కార్యము గాదు తలంచి చూడఁగన్. 22

ప్రతిపదార్థం: పాండు నర+ఇంద్ర నందనులన్= పాండురాజుకొడుకులైన పాండవులను; బాంధవ పుత్ర యుతంబు కాఁగన్= బంధు పుత్రసహితంగా; ఉద్దండతన్= తెగువతో; ఏన్= నేను; వధింతున్+అని= చంపుతానని; దర్పము= గర్వం; ఎలర్పఁగన్= అతిశయించగా; కౌరవ+అధినాథుండు= కురుపతి దుర్యోధనుడు; వినంగన్= వినేటట్లు; పల్కితివి= అన్నాను; ఆ+మహాత్మకుల్= ఆ మహాత్ములైన; పాండవులు; దుర్దమ దోర్బలులు= అణచరాని భుజబలం గలవాళ్ళు; తలంచి చూడఁగన్= ఆలోచించగా; గండు నన్= గర్వంతో; బెట్టు= గట్టిగా; పైన్+పడుట= మీదపడటం; కార్యము+కాదు= చేయవలసినది కాదు (ప్రయోజనంలేదు).

తాత్పర్యం: 'పాండవులను సబంధుపుత్త్రంగా చంపుతానని నేను తెగించి గర్వాతిశయంతో దుర్యోధనుడితో అన్నాను. ఆ మహాత్ములు అణచరాని భుజబల సంపన్నులు. ఆలోచించగా గర్వంతో గట్టిగా వాళ్ళమీద పడటం మంచిదికాదు.'

క. అరవాయి గొనక బెట్టుగఁ। బరిగొని యక్కడిఁది మగలపై నడరుట యు
ద్ధురగతి నగ్నిజ్వాలో। త్కరముపయిన్ మిడుత యుఱుకు కరణియ కాదే? 23

ప్రతిపదార్థం: అరవాయి కొనక= సందేహించకుండా; బెట్టుగన్= శీఘ్రంగా; పరిగొని= చుట్టుముట్టి; ఆ+కడిఁది మగలపైన్= ఆ మహావీరులపై; అడరుట= విజృంభించటం; ఉద్ధుర గతిన్= తటాలున; అగ్ని జ్వాలా+ఉత్కరము; పయిన్= అగ్నిజ్వాలల సమూహం మీద; మిడుత; ఉఱుకు కరణి+అ+కాదే?= ఉరికే విధమేకదా?

తాత్పర్యం: 'సందేహించకుండా శీఘ్రమే చుట్టుముట్టి ఆ మహావీరులమీద విజృంభించటం తటాలున అగ్నిజ్వాలలలో మిడుత ఉరకటం లాంటిదే కదా!'

విశేషం: అలం: నిదర్శన 'అక్కడిఁది మగలపై...కరణియ' ఉపమాన వాక్యార్థానికీ ఉపమేయ వాక్యార్థానికీ అభేదం చెప్పటంచేత ఇందులోని అలంకారం నిదర్శన. ఇచ్చట అగ్నిజ్వాలలు పాండవులు, మిడుత అశ్వత్థామ-అనే ధ్వని కన్పడుతూ ఉన్నది.

వ. పాండవులం బరిమార్చుపని నేఁడ చేయక మఱిచేసిన నారాజు నిర్గత ప్రాణుండైన నాకెలసం బెవ్వరికెక్కడుఁ? జక్కటితోడి బవరంబున నబ్బలుమగల గెలువరాదని యిట్లురియాడు నా చిత్తంబు చింతాపరంపర వాయ నీ పక్షి విచేష్టితంబు లోచనగోచరంబయ్యెఁ బగతురఁ దెగటార్చునెడ నన్యాయంబనక యుపాయం బెయ్యది దొరకొనిన దాన నుత్సహింపవలయుట శాస్త్రసిద్ధంబ కాదే? యెట్లనిన. 24

ప్రతిపదార్థం: పాండవులన్; పరిమార్చు పని= చంపే పని; నేఁడు+అ= ఈ రోజే; చేయక= చేయకుండా; మఱి= తరువాత; చేసినన్= చేస్తే; ఆ రాజు= దుర్యోధనుడు; నిర్గత ప్రాణుండు+ఐనన్= చచ్చిపోతే; నా కెలసంబు= నేను చేసినపని; ఎవ్వరికిన్= ఎవరికి; ఎక్కెడున్?= నచ్చుతుంది?; చక్కటి తోడి బవరంబునన్= ధర్మయుద్ధంతో; ఆ+బలు మగలన్= ఆ మహావీరులను; గెలువన్+ రాదు+అని= గెలవటం అశక్యమని; ఇట్లు= ఈ రీతిగా; ఉరియాడు= తటపటాయించే; నా చిత్తంబు= నా మనస్సు లోని; చింతా పరంపర= ఆలోచనల వరుస; పాయన్= పోయేటట్లు; ఈ పక్షి విచేష్టితంబు= ఈ పక్షియొక్క చేష్ట; లోచన గోచరంబు+అయ్యెన్= కనబడింది; పగతురన్= శత్రువుల్ని; తెగటార్చు+ఎడన్= చంపేటప్పుడు; అన్యాయంబు+అనక= అధర్మం అనకుండా; ఉపాయంబు+ఏ+అది= ఏ ఉపాయం; దొరకొనినన్= లభిస్తే; దానన్= దానిలో; ఉత్సహింపన్+వలయుట= ఉత్సాహం చూపాలనటం (ప్రయత్నించటం); శాస్త్ర సిద్ధంబు+అ= శాస్త్రంచేత సిద్ధించేది; కాదే?= కాదా?; ఎట్లు+అనినన్= ఎట్లా అంటే.

తాత్పర్యం: పాండవులను నేడు చంపక, తరువాత ఎప్పుడో చంపితే ఈ లోగా దుర్యోధనుడు కన్నుమూస్తే నేను చేసినపనిని ఎవరు మెచ్చుకొంటారు? ధర్మయుద్ధంలో ఆ మహావీరులను చంపటం అశక్యం అని ఇట్లా కళవళపడే నా మనస్సులోని చింత పోయేటట్లు ఈ పక్షి చేష్ట నా కంటపడింది. శత్రువులను చంపేటప్పుడు అధర్మం అనకుండా లభించిన ఉపాయంతో ఉత్సహించాలనటం శాస్త్రసమ్మతమే కాదా! ఎట్లా అంటే. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఉస్మానియా యూనివర్శిటీ వారి ప్రతులలోని...'గోచరం బయ్యె' ననే పాఠంకంటె, తె.వి. ప్రతిలోని '...గోచరం బయ్యెననే పాఠం మేలనిపించింది.

తే. ఎత్తినప్పుడు, విడియుచో, నిఱుకటంపుఁ । దెరువునందు, నడవు సెడి తిరుగఁబడిన
యట్టియెడ, నిద్రవోయెడు నవసరమున । శాత్రవుల బెట్టు పైఁబడి చంపవలయు. 25

ప్రతిపదార్థం: ఎత్తినప్పుడున్ (ఎత్తిన+అప్పుడున్)= దండెత్తినప్పుడూ; విడియుచోన్= విడిదిచేసినప్పుడూ; ఇఱుకటంపుఁ; దెరువునందున్ (ఇఱుకటము+తెరువు)= ఇరుకైన దారిలోనూ; నడపుసెడి= నడక నశించి; తిరుగఁబడిన+అట్టి+ఎడన్= తిరగ బడినప్పుడూ; నిద్ర+ పోయెడు+అవసరమునన్= నిద్రించేటప్పుడూ; శాత్రవులన్= విరోధులను; బెట్టు= క్రూరంగా; పైఁబడి= మీదపడి; చంపవలయున్;

తాత్పర్యం: దండెత్తినప్పుడూ, విడిది చేసినప్పుడూ, ఇరుకైన దారిలోనూ, గతిలేక తిరగబడినప్పుడూ, నిద్రించేటప్పుడూ శత్రువులను క్రూరంగా మీదపడి చంపాలి.

వ. అను నీతివాక్యంబులు విందు; నంగీకృతక్షత్రధర్మ్ముం డగు వానికి నిట్టివి కర్తవ్యంబు; లట్లుఁగాక పాండవేయులు పితామహగురులైన భీష్మద్రోణులఁ దెగటార్చునెడం జక్కటిగల తెఱంగున సంగరంబు చేసిరె? యంగరాజును, రారాజును బరిమార్చిన భంగులఁ దలంపంగూడునె? కావునఁ గల్మషోపాయులగు కౌంతేయుల నిద్రా సమయంబున గొబ్బున నిగ్రహించుట నీతియ కాని నింద్యంబుగా' దని నిశ్చయించె; నట్లు క్రూరవ్యవసాయుం డగు నగ్గురుసుతుండు దన మామను, గృతవర్మను మేలుకొల్పి యిట్టి సమయంబున నిద్రించితిమని లజ్జించు చున్న యా రథికవరులతో నిట్లనియె. 26

ప్రతిపదార్థం: అను నీతి వాక్యంబులు= అనే నీతివాక్యాలు; విందున్= వింటాను; అంగీకృత క్షత్రధర్మ్ముండు+అగు+వానికిన్= క్షత్రియ ధర్మాన్ని అవలంబించిన వాడికి; ఇట్టివి= ఇటువంటివి; కర్తవ్యంబులు= చేయదగ్గవి; అట్లుఁగాక= అదీగాక; పాండవేయులు= పాండవులు; పితామహగురులు+ఐన= తాతా, గురువూ అయిన; భీష్మ ద్రోణులన్= భీష్ముడినీ, ద్రోణుడినీ; తెగటార్చు+ఎడన్= చంపేటప్పుడు; చక్కటి+కల-తెఱంగునన్= న్యాయమైన విధంగా; సంగరంబు= యుద్ధం; చేసిరె?= చేశారా?; అంగరాజును= కర్ణుడిని; రారాజును= దుర్యోధనుడినీ; పరిమార్చిన భంగులన్= చంపిన పద్ధతులను; తలంపన్+కూడునె?= అనుకోవచ్చా?; కావునన్= కాబట్టి; కల్మష+ఉపాయులు+అగు కౌంతేయులన్= దుష్టమైన ఉపాయాలు గల పాండవులను; నిద్రాసమయంబునన్= నిద్రించే సమయంలో; గొబ్బునన్= వెంటనే; నిగ్రహించుట= చంపటం; నీతి+అ= నీతే కాని; నింద్యంబు= నిందింపదగింది; కాదు+అని= కాదని; నిశ్చయించెన్= నిర్ణయించుకొన్నాడు; అట్లు క్రూర వ్యవసాయుండు+అగు= క్రూరమైన ప్రయత్నం గలవాడైన; ఆ+గురుసుతుండు= ఆ గురుపుత్రుడైన అశ్వత్థామ; తన మామను= తన మేనమామ అయిన కృపాచార్యుడిని; కృతవర్మను; మేలుకొల్పి= లేపి; ఇట్టి సమయంబునన్= ఇటువంటి క్లిష్టసమయంలో; నిద్రించితిమి+అని= నిద్రపోయామని; లజ్జించుచున్+ఉన్న= సిగ్గు పడుతూ ఉన్న; ఆ రథికవరులతోన్= ఆ రథికోత్తములతో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: ఏ పద్ధతిని అనుసరించి అయినా శత్రువులను చంపవచ్చును- అనే నీతివాక్యాలు విన్నాను. క్షత్రియధర్మం అవలంబించినవాడికి ఇట్లాంటి పనులు చేయదగినవి. అదీకాక పాండవులు తాత అయిన భీష్ముడిని, గురువైన ద్రోణుడినీ చంపేటప్పుడు న్యాయమార్గంలో యుద్ధం చేశారా? కర్ణుడినీ, దుర్యోధనుడినీ చంపిన రీతులని మనసులోనైనా అనుకొనవచ్చునా? కాబట్టి దుష్టమైన ఉపాయాలు గల పాండవులను నిద్రించేటప్పుడు ఆకస్మికంగా చంపటం నీతే కాని నిందించదగింది కాదని నిర్ణయించుకొన్నాడు. ఆ విధంగా క్రూరమైన ప్రయత్నాన్ని తలపెట్టిన ఆ అశ్వత్థామ తన మేనమామ అయిన కృపాచార్యుడినీ, కృతవర్మనూ మేలుకొలిపి, ఇటువంటి క్లిష్టసమయంలో నిద్రపోయామని సిగ్గుపడుతూ ఉన్న ఆ రథికశ్రేష్ఠులతో ఇట్లా అన్నాడు:

విశేషం: శిఖండిని ముందుపెట్టుకొని భీష్ముడినీ, అస్త్రత్యాగం చేసిన ద్రోణుడిని చంపటంలో పాండవులు న్యాయాన్ని వదలిపెట్టారని ధ్వని.

సీ. 'మొగ దప్పితిమి రణమున మన మకట! ము । వ్వురము; రారాజు నొక్కరునిఁ బాండు
తనయులు దమవారుఁ దారును బెక్కండ్రు । గూడి చుట్టును ముట్టి గుల్లపఱచి;
రేకాదశాక్షౌహిణీశ్వరుఁ డట్లొంటి । మెయిఁ జిక్కి పోరుచుండియును బాడి
దప్పం; దవ్విభుని నధర్మ విక్రమమునఁ । బాపాత్మకుండగు బకవిరోధి

ఆ. **గూల్చె; నంతఁ బోక కురుదేశ రాజ్యాభి । షిక్తమైన యతని శిరము దన్నెఁ;**
బరిభవంబు నొంచెఁ బ్రాణాంతకరవేద । నాతిశయముకంటె నన్నరేంద్రు. **27**

ప్రతిపదార్థం: అకట! అయ్యో!; మనము ముప్పురమున్= మనం ముగ్గురమూ; రణమునన్= యుద్ధంలో; మొగదప్పితిమి= మొగంతప్పించాము; రారాజున్+ఒక్కరునిన్= దుర్యోధనుడిని ఒక్కడినీ; పాండు తనయులు= పాండురాజు కొడుకులు; తమవారున్= తమవాళ్ళూ; తారును= తామూ; పెక్కండ్రు= అనేకులు; కూడి= కలిసి; చుట్టును ముట్టి= చుట్టుముట్టి; గుల్లపటిచిరి= అవమానిం చారు; ఏకాదశాక్షౌహిణీశ్వరుఁడు= పదకొండు అక్షౌహిణులకు ప్రభువైన దుర్యోధనుడు; అట్లు= ఆ విధంగా అతిదీనంగా; ఒంటిమెయిన్= ఒంటరివాడయి; చిక్కి= నిలిచి; పోరుచున్+ఉండియును= యుద్ధం చేస్తూ ఉన్నప్పటికీ; పాడి= ధర్మం; తప్పఁడు; ఆ+విభునిన్= ఆ రాజును; అధర్మ విక్రమమునన్= అన్యాయమైన పరాక్రమంతో; పాపాత్మకుండు+అగు= దుర్మార్గుడైన; బక విరోధి= బకాసురుడి శత్రువైన భీముడు; కూల్చెన్= పడగొట్టాడు; అంతన్+పోక= అంతటితో ఊరుకోక; కురు దేశరాజ్య+ అభిషిక్తము+ఐన= కురుదేశ రాజ్యమందు అభిషేకించబడిన; అతని శిరమున్= అతడి తలను; తన్నెన్= తన్నివాడు; ఆ+ నర+ఇంద్రున్= ఆ రాజును (దుర్యోధనుడిని); ప్రాణ+అంతకర వేదనా+అతిశయముకంటెన్= ప్రాణంతీసే బాధాధిక్యం కన్నా; పరిభవంబు= అవమానము; నొంచెన్= బాధించింది.

తాత్పర్యం: 'అయ్యో! మనం ముగ్గురం యుద్ధంలో దుర్యోధనుడిదగ్గర లేకుండా మొగం తప్పించాము. రాజరాజును ఒక్కడినీ పాండవులు తమ వాళ్ళూ తామూ అనేకులు కలిసి చుట్టుముట్టి అవమానించారు. పదకొండు అక్షౌహిణుల బలానికి ప్రభువైన ఆ రాజరాజు ఆ విధంగా ఒంటరివాడై నిలిచి పోరుతున్నప్పటికీ ధర్మం తప్పడు. అట్లాంటి వాడిని దుర్మార్గుడైన భీముడు అధర్మపరాక్రమం చూపి కూల్చాడు. అంతటితో ఊరుకొనక కురుదేశ రాజ్యాభిషిక్తమైన అతడి శిరస్సును తన్నాడు. ఆ రాజును ప్రాణం తీసే బాధాధిక్యం కంటె. అవమానం అధికంగా బాధించింది.

విశేషం: దుర్యోధనుడు ఎంతటి అభిమానవంతుడో అశ్వత్థామ మాటలవలన తెలుస్తుంది.

క. **లావును వెరవును గలుగు మ । హా వీరు లనేకు లట్టు లన్నిదినము లా**
'భూవిభునకై పెనఁగి జయ । మీ వలఁతులు గాకపోయి రే మనవచ్చున్? **28**

ప్రతిపదార్థం: లావును= బలమూ; వెరవును= ఉపాయమూ; కలుగు= కల; మహత్+వీరులు= గొప్ప వీరులు; అనేకులు= పెక్కుమంది; అట్టులు= ఆ రీతిగా; అన్ని దినములు= అన్నిరోజులు; ఆ భూవిభునకున్+ఐ= ఆ రాజుకోసం; పెనఁగి= యుద్ధంచేసి; జయము= గెలుపు; ఈన్= ఇవ్వటానికి; వలఁతులు= సమర్థులు; కాకపోయిరి; ఏమి+అనన్+వచ్చున్?= ఏమనాలి?

తాత్పర్యం: బలమూ, ఉపాయమూ ఉన్న మహావీరులు అనేకులు ఆ విధంగా అన్ని రోజులు ఆ రాజుకోసం పోరాడి అతడిని గెలిపించలేకపోయారు. ఏమనాలి?

ఆ. **ఎవ్వరెంతఁ జేసిరేనియు విధియొండు । దలఁప నా ఫలంబు దలఁగ కేల**
యుండు? నిట్లు గాఁగ నున్నది గా; కేమి । యెసకమెసఁగు కౌరవేంద్రు మనుపు?' **29**

ప్రతిపదార్థం: ఎవ్వరు; ఎంతన్= ఎంతటిసాయం; చేసిరి+ఏనియున్= చేసినప్పటికీ; విధి= దైవం; ఒండు= ఇంకొకటి; తలఁపన్= తలిస్తే; ఆ ఫలంబు= ఆ ఫలం; తలఁగక+ఏల+ఉండున్= తొలగకుండా ఎట్లా ఉంటుంది?; ఇట్లు+కాఁగన్+ఉన్నది+కాక= ఇలా కావాలని ఉన్నదికాక; కౌరవ+ఇంద్రు మనుపు= దుర్యోధనుడి రక్షణ; ఏమి+ఎసకము+ఎసఁగున్= ఏమి ఒప్పుతుంది?

తాత్పర్యం: ఎవరెంత చేసినప్పటికీ దైవం వేరుగా తలిస్తే, ఫలం ఎట్లా దక్కుతుంది? దుర్యోధనుడి రక్షణ ఇట్లా కావలసి ఉండగా, ఏమి ఒప్పుతుంది?

వ. అని పలుమాటలాడి 'మీ మది కలంగకున్నదేని యీ మహావ్యసనంబునకుఁ గర్తవ్యం బెద్ది చెప్పవలయు' నని నఁ గృపాచార్యుండు ధనురాచార్యనందను మొగంబు గనుంగొని 'నీవు చెప్పఁదలఁచిన యంత వట్టు నుం జెప్పి కార్యం బడిగితేని నాకుఁ దోఁచిన దానిం జెప్పెద విను' మని యిట్లనియె. 30

ప్రతిపదార్థం: అని పలు మాటలు+ఆడి= పెక్కు పలుకులు పలికి; మీ మది= మీ మనస్సు; కలంగక+ఉన్నది+ఏనిన్= చేయదగినదేది; చెప్పవలయున్= చెప్పాలి; అనినన్= అనగా; కృపాచార్యుండు; ధనురాచార్య నందను మొగంబు= ద్రోణుడి కొడుకైన అశ్వత్థామ ముఖం; కనుంగొని= చూచి; నీవు చెప్పన్+తలఁచిన= అంత+పట్టునున్= చెప్పాలనుకున్నదంతా; చెప్పి; కార్యంబు= చేయవలసిన దానిని; అడిగితి(వి)+ఏనిన్= అడిగినట్లయితే; నాకున్ తోఁచిన దానిన్= చెప్పెదన్ వినుము; అని ఇట్లు అనియెన్.

తాత్పర్యం: అని పెక్కు పలుకులు పలికి 'మీ మనస్సు కలతచెందక పోతే, ఈ మహాకష్టానికి ఏం చెయ్యాలో చెప్పాలి' అనగా, కృపాచార్యుడు అశ్వత్థామ ముఖం చూచి 'నీవు చెప్పాలనుకున్నదంతా చెప్పి ఏం చేయాలో అడిగితే నాకు తోచింది నేను చెపుతాను. వినుము' అని ఇట్లా అన్నాడు:

కృపాచార్యుఁ డశ్వత్థామకు నీతివిశేషంబు లెఱింగించుట (సం.10-2-1)

సీ. 'ప్రారంభములకెల్లఁ బౌరుషమ్మును దైవ । మును సాధనమ్ములు వినుము వాని
లోన నొక్కటి చేతఁ గానేర వనఘ! త । త్ఫల సిద్ధు; లెట్లన్నఁ. దఱచు వాన
కారు పొలంబునఁ గల్గె నేనియుఁ గొల్చు । గావింప నేర్చునే? కల విధమున
వల నేర్పడఁగ దున్నఁ బొలములో నైన వ । ర్షంబు లేకున్న ధాన్యంబు లగునె?

ఆ. కాఁపు లావు వెరవు గల్గి కర్శనము సే । యంగ, వృష్టి దగినయట్లు గలుగ
ఫలము గల్గు; నట్లు పౌరుషంబునకు దై । వంబు తోడుపాటు వలయు నెందు. 31

ప్రతిపదార్థం: అనఘ= పాపరహితుడా!= ప్రారంభములకున్+ఎల్లన్= ప్రయత్నాలకన్నిటికీ; పౌరుషమ్మును= పురుషకారమూ; దైవమును= దైవమూ; సాధనమ్ములు= సాధనాలు; వినుము; వానిలోనన్= వాటిలో; ఒక్కటిచేతన్= ఒకదానిచేత; తద్+ఫల సిద్ధులు= ఆ ఫలం సిద్ధించటాలు; కాన్+నేరవు= కాజాలవు; ఎట్లు+అన్నన్= ఎట్లా అంటే; తఱచు= అధికంగా; వానకారు= వర్షం; పొలంబునన్= పొలంలో; కల్గెన్+ఏనియున్= కలిగినప్పటికీ; కల విధమునన్= ఎలాగయినా; కొల్చు= ధాన్యం; కావింపన్+నేర్చునే= చేయగలదా?; వలను= నేర్పు; ఏర్పడఁగన్= స్పష్టపడేటట్లు; దున్నన్= దున్నివా; పొలములోన్; ఐన వర్షంబు= కావలసిన వాన; లేక+ఉన్నన్= లేకపోతే; ధాన్యంబులు అగునె?= ధాన్యం పండునా?; కాఁపు= రైతు; లావు= శక్తీ; వెరవు= ఉపాయమూ; కల్గి= కలిగి; కర్శనము+చేయంగన్= దున్నితే; వృష్టి= వర్షం; తగిన+అట్లు= తగినవిధంగా; కలుగన్= కలిగితే; ఫలము కల్గున్= ఫలితం కలుగుతుంది; అట్లు= ఆ విధంగా; ఎందున్= ఏ విషయంలోనైనా; పౌరుషంబునకున్= పురుషప్రయత్నానికి; దైవంబు= దైవంయొక్క; తోడుపాటు= సహాయం; వలయున్= అవసరం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'పాపరహితుడవైన అశ్వత్థామా! అన్ని ప్రయత్నాలకూ పురుషకారమూ, దైవమూ సాధనాలు, వినుము. ఆ రెండింటిలో ఒక దానిచేతనే ఫలసిద్ధి కాజాలదు. ఎట్లా అంటే తరచుగా పొలంలో వానలు కురిసినప్పటికీ రైతు ఏ విధంగానూ ధాన్యం పండించగలడా? నేర్పుతో దున్నినా పొలంలో వర్షం తగినంత కురిస్తేనే ఫలం లభిస్తుంది. అట్లా ఎక్కడైనా పురుషప్రయత్నానికి దైవం తోడుపడాలి.'

విశేషం: దైవ ముండి పురుషకారం లేకపోయినా పురుషకార ముండి దైవం లేకపోయినా కార్యం సిద్ధించదు. ఏ కార్యమైనా సిద్ధించాలంటే దైవం పౌరుషం - ఈ రెండూ ఉండాల్సిందే. దైవ పౌరుషాల్లో ఏ ఒక్కదానివలన కార్యసిద్ధి జరుగదు. రెండూ ఉండాలనే సామాన్యాంశం కర్షకుడి కృషీ వానా అనే విశేషాంశంచేత సమర్థింప బడింది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

వ. 'అదియునుం గాక.' 32

తాత్పర్యం: 'అదీ గాక.'

క. 'తగుపని కుద్యోగించుచుఁ, । దగ వెఱిఁగెడు హితుల కనుమతంబుగఁ జేయన్
జగతీ సురవర! కార్యము । లగు; వారికిఁ గలుగు విధి సహాయత్వంబున్.' 33

ప్రతిపదార్థం: జగతీసురవర!= బ్రాహ్మణోత్తమా! అశ్వత్థామా!; తగు పనికిన్= తగినపనికి; ఉద్యోగించుచున్= ప్రయత్నంచేస్తూ; తగవు+ఎఱిఁగెడు హితులకున్= ధర్మవేత్తలైన శ్రేయోభిలాషులకు; అనుమతంబుగన్= సమ్మతంగా; చేయన్= చేస్తే; కార్యములు= పనులు; అగున్= అవుతాయి; వారికిన్; విధి సహాయత్వంబున్= దైవం తోడుపాటు కూడా; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: 'బ్రాహ్మణోత్తమా! అశ్వత్థామా! తగిన పనికి ప్రయత్నిస్తూ ధర్మం తెలిసిన శ్రేయోభిలాషులకు సమ్మతంగా చేసినట్లయితే పనులు నెరవేరుతాయి. వాళ్ళకు దైవం కూడ తోడుపడుతుంది.'

క. 'ధర్మము దప్పక నయగతిఁ । గర్మాచరణంబు నడపఁగా ఫలసిద్ధిన్
నిర్మలయశ మగుఁ; దప్పినఁ, । బేర్మి సెడదె నింద రా నభేద్యోత్సాహా!' 34

ప్రతిపదార్థం: అభేద్య+ఉత్సాహా!= చెక్కు చెదరని ఉత్సాహం కలవాడా - అశ్వత్థామా!; ధర్మం= న్యాయం; తప్పక= తప్ప కుండా; నయ గతిన్= నీతిమార్గాన; కర్మాచరణంబున్= కార్యనిర్వహణం; నడపఁగాన్= జరిపినట్లయితే; ఫలసిద్దిన్= ఫలసిద్ధీ; నిర్మల యశము= స్వచ్ఛమైన కీర్తీ; అగున్ తప్పినన్= అలా కాకుంటే; నిందరాన్= అపకీర్తి కలుగగా; పేర్మి= గౌరవం; చెడదె?= నశించదా? (చెడుతుందని భావం).

తాత్పర్యం: చెక్కు చెదరని ఉత్సాహం గల అశ్వత్థామా! ధర్మం తప్పకుండా నీతితో పని చేసినట్లయితే ఫలసిద్ధీ, సత్కీర్తీ లభిస్తాయి. అట్లా కాకుంటే అపకీర్తి కలుగుతుంది. గౌరవమూ నశిస్తుంది.

విశేషం: 'నీ ఉత్సాహం అభేద్యమే కాని దానిని ధర్మయుక్తమైన పనియెడ చూపించుము. లేకపోతే అపకీర్తి కలిగి గౌరవం నశిస్తుం' దని అశ్వత్థామకు కృపాచార్యుడి హెచ్చరిక. 'దప్పదు పేర్మి సెడదె నిందరా దభేద్యోత్సాహ' అనే ఉస్మానియా యూనివర్శిటీ ప్రతి పాఠముకంటే, నా..తె.వి. ప్రతులలలోని దప్పినఁ బేర్మి సెడదె నిందరా నభేద్యోత్సాహ' అనే పాఠమే మేలనిపించింది.

ఉ. 'నీతి దొఱంగి కార్యముల నెట్టన యాగ్రహవృత్తిఁ జేసినం
బ్రీతిగ సిద్ధిఁ బొందినను భీతియుఁ గుత్సయుఁ బుట్టు; భూజను
ల్వేతురు; చేటు చేఁతలు ఫలింపక తక్కిన, మున్న వచ్చు న
త్యాతురతాస్పదంబు లగు నాపద; లిద్ధ వివేకవైభవా!' 35

ప్రతిపదార్థం: ఇద్ధ వివేక వైభవా!= మంచి వివేకసంపద గలవాడా! అశ్వత్థామా!; నీతి; తొఱంగి= విడిచి; కార్యములన్= పనులను; నెట్టన= అనాలోచితంగా; ఆగ్రహ వృత్తిన్= పట్టుదలతో; చేసినన్= చేస్తే; ప్రీతిగన్= సంతోషం కలిగేటట్లు; సిద్ధిన్+పొందినను= ఫలించినప్పటికీ; భీతియున్= భయమూ; కుత్సయున్= నిందా; పుట్టున్; భూ జనుల్= ప్రజలు; వేతురు= బాధిస్తారు; చేటు చేఁతలు= దుష్కార్యాలు; ఫలింపక తక్కినన్= ఫలించకపోతే; అత్యాతురతాస్పదంబులు+అగు= అధికమైన బాధకు చోటుఅయిన; ఆపదలు; మిక్కిలి బాధ కలిగించే కష్టాలు; మున్ను+అ= ముందుగానే వచ్చున్= కలుగుతాయి.

తాత్పర్యం: 'మంచి వివేక సంపదగల అశ్వత్థామా! నీతిమాలిన పనులు అనాలోచితంగా వట్టి పట్టుదలతో చేస్తే, సంతోషం కలిగేటట్లు ఒకవేళ అవి సిద్ధించినా, భయమూ, నిందా కలుగుతాయి. ప్రజలు బాధిస్తారు. ఆ దుష్కార్యాలు నెరవేరకపోతే మిక్కిలి బాధలకు చోటయిన ఆపదలు ముందు సంభవిస్తాయి.'

విశేషం: 'ఇద్ధ వివేకవైభవా! అని అశ్వత్థామని సంబోధించడంలో మంచి వివేకంగల నీవు ఈ సమయంలో పట్టుదలే ప్రధానంగా అనాలోచితంగా పాడుపని చేస్తే దుష్ఫలితాలు అనుభవిస్తావు. అందుచేత వివేకంతో ప్రవర్తించు' మని అతడికి కృపాచార్యుడి ఉపదేశం'....నాపద సిద్ధ వివేక వైభవా' అనే ఉ.యూ.ప్రతులలోని పాఠంకంటె. తె.వి.ప్రతిలోని..నాపద లిద్ధవివేక వైభవా అనే పాఠమే మేలనిపించింది.

ఉ. 'క్రోధము, లోభమున్, భయముఁ గూరిన చిత్తముతోడ దుష్క్రియా
సాధనవృత్తి దుర్జనుఁడు సజ్జను లాఁగఁగఁ జేయు కార్యముల్
బాధలఁ బెట్టకున్నె? సిరి పాయఁగఁ జేయకయున్నె వానిఁ? దీ
వ్రాధి నితాంత దుఃఖ హృదయత్వము దేరకయున్నె వానికిన్?' 36

ప్రతిపదార్థం: క్రోధమున్= కోపమూ; లోభమున్= దురాశా; భయమున్= భయమూ; కూరిన= నిండిన; చిత్తముతోడన్= మనస్సుతో; దుర్జనుఁడు= చెడ్డవాఁడు; సత్+జనులు= మంచివాళ్ళు; అఁగఁగన్= వద్దంటూండగా; దుష్క్రియా సాధన వృత్తిన్= పాడు పనిని సాధించే ప్రవర్తనతో; చేయు కార్యముల్= చేసే పనులు; బాధలన్+పెట్టక+ఉన్నె?= బాధించకుండా ఉంటాయా?; వానిన్= ఆ దుర్మార్గుడిని; సిరి= సంపద; పాయఁగన్+చేయక+ఉన్నె?= కోల్పోయేటట్లు చేయకుండా ఉంటాయా?; వానికిన్= వాడికి; తీవ్ర+అది నితాంత దుఃఖ హృదయత్వము= అధికమైన మనోవ్యాధిచేత మిక్కిలి దుఃఖంతో కూడిన హృదయం; తేరక+ఉన్నె?= తేకుండా ఉంటుందా? కలిగించకుండా ఉంటుందా?

తాత్పర్యం: కోపమూ, దురాశా, భయమూ నిండిన మనస్సుతో దుర్మార్గుడు మంచివాళ్ళు వద్దని వారిస్తున్నా, పాడుపనిని సాధించాలనే అభిప్రాయంతో చేసే పనులు బాధించకుండా ఉంటాయా? ఆ దుర్మార్గుడు సిరిని కోల్పోయేటట్లు చేయకుండా ఉంటాయా? వాడికి తీవ్రమైన మనోవ్యాధితో మిక్కిలి దుఃఖితమైన మనస్సును కలిగించకుండా ఉంటాయా? (తప్పక అట్లా చేస్తాయని భావం).

చ. వినుము కురుక్షితీశుఁడు వివేక విదూరుఁడు క్రోధలోభముల్
మనమునఁ బేర్చినన్ దురభిమానమునన్ హితులెంత చెప్పిన
న్వినక బహుప్రకారముల నిందకు నోర్చి పరాభవించె స
జ్జనులగు పాండుపుత్రుల; నసత్పథవృత్తికిఁ జేటు దప్పునే?' 37

ప్రతిపదార్థం: వినుము; కురుక్షితి+ఈశుఁడు= కురురాజు దుర్యోధనుడు; వివేక విదూరుఁడు= వివేకానికి మిక్కిలి దూరమైన వాడు; క్రోధ లోభముల్= కోపమూ, దురాశా; మనమునన్= మనస్సులో; పేర్చినన్= అతిశయించగా; దురభిమానమునన్= దుర్గర్వంతో; హితులు= శ్రేయోభిలాషులు; ఎంత చెప్పినన్= ఎంత చెప్పినా; వినక; బహు ప్రకారములన్= అనేకవిధాల; నిందకున్; ఓర్చి= సహించి; సత్+జనులు+అగు= మంచివాళ్ళైన; పాండుపుత్రులన్= పాండవులను; పరాభవించెన్= అవమానించాడు; అసత్+ పథవృత్తికిన్= దుర్మార్గంతో నడిచేవాడికి; చేటు= నాశం; తప్పునే?= తప్పుతుందా?

తాత్పర్యం: 'అశ్వత్థామా! వినుము. దుర్యోధనుడు అవివేకి. కోపమూ, దురాశా మనస్సులో అతిశయించగా దుర్గర్వంతో శ్రేయోభిలాషు లెంత చెప్పినా వినిపించుకొనక అనేక విధాల నిందలు పడి, ఉత్తములైన పాండవులను పరాభవించాడు. దుర్మార్గంలో నడిచేవాడికి నాశం తప్పుతుందా?' (తప్పదని భావం).

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. దుర్యోధనుడు దుర్మార్గుడై పాండవులను పరాభవించి నశించాడనే విశేషాంశం దుర్మార్గుడికి చేటు తప్పదనే సామాన్యాంశం చేత సమర్థించబడింది కాబట్టి ఇక్కడ అలంకారం అర్థాంతరన్యాసం.

వ. అని పలికి తమ్మునతండు 'మీ మది గలఁగకయున్నదేనిఁ గర్తవ్యంబుఁ జెప్పవలయు' నని యడిగినమాట లుగ్గడించి 38

ప్రతిపదార్థం: అని పలికి; అతండు= అశ్వత్థామ; మీ మది= మీ మనస్సు; కలఁగక+ఉన్నది+ఏనిన్= కలతచెందకున్నట్లయితే; కర్తవ్యంబున్= చేయదగినదానిని; చెప్పన్+వలయున్= చెప్పాలి అని; తమ్మున్= తమను; అడిగిన మాటలు; ఉగ్గడించి= పలికి.

తాత్పర్యం: అని పలికి, అశ్వత్థామ 'మీ మనస్సు కలత చెందకున్నట్లయితే చేయదగినదానిని చెప్పా'లని తమను అడిగిన మాటలు గుర్తుచేసి.

క. 'జగ మెఱుఁగఁగ దుశ్శీలుం। డగు భూనాథుండు వోయినట్టులె పోఁగాఁ
దెగడుం జేటుఁ గలిగి వగ। మిగులను మది గలఁగదే యమిత్రధ్వంసీ!' 39

ప్రతిపదార్థం: అమిత్ర ధ్వంసీ!= శత్రునాశకుడా - అశ్వత్థామా!; జగము= లోకం; ఎఱుఁగఁగన్= ఎరిగేలాగా; దుశ్శీలుండు= దుష్టస్వభావుడు; అగు; భూనాథుండు= రాజు; పోయిన+అట్టులు+ఎ+పోఁగాన్= నశించినట్లే నశించగా; తెగడున్= నిందా; చేటున్= కీడూ; కలిగి; వగ= దుఃఖం; మిగులను= అతిశయించగా; మది= మనస్సు; కలఁగదే?= కలతచెందదా?

తాత్పర్యం: 'శత్రునాశంకరుడవైన అశ్వత్థామా! లోక ప్రసిద్ధంగా దుష్టస్వభావుడైన రాజు పోయినట్లే పోగా, నిందా, కీడూ కలిగి దుఃఖం అతిశయిస్తే మనస్సు కలతచెందదా? (తప్పక కలత చెందుతుందని భావం.)

వ. 'అది యట్లుండె మన కిప్పు డిది కర్తవ్యం బని నిశ్చయింప మన మేమి నేర్తుము? తగవు తెఱంగెఱింగిం చెద నాకర్ణింపుము.' 40

ప్రతిపదార్థం: అది; అట్లు+ఉండెన్; మనకున్= మనకు; ఇప్పుడు; ఇది; కర్తవ్యంబు= చేయదగినది అని; నిశ్చయింపన్= నిర్ణయించటానికి; మనము; ఏమి; నేర్తుము?= ఎరుగుదుము?; తగవు తెఱంగు= ధర్మప్రకారం; ఎఱింగించెదన్= తెలుపుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అది అట్లా ఉండనిమ్ము. ఇప్పుడు ఇదీ కర్తవ్యం అని మనం ఏమి నిర్ణయించగలం? ధర్మ ప్రకారం చెపుతాను వినుము.

క. 'మన మందఱమును ధృతరా । ష్టుని కడకుం బోయి కార్యసూత్ర మతనిచే
వినవలయు; నాతఁ డెయ్యది । గని పలికిన నదియ మనకుఁ గర్తవ్య మగున్.' 41

ప్రతిపదార్థం: మనము; అందఱమును; ధృతరాష్ట్రుని కడకున్= ధృతరాష్ట్రుడి దగ్గరకు; పోయి= వెళ్ళి; అతనిచేన్= అతడినుంచి; కార్యసూత్రము= కర్తవ్యం యొక్క క్రమం; వినన్+వలయున్= వినాలి; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; ఎయ్యది= ఏది; కని= చూచి; పలికినన్= చెపితే; అది+అ= అదే; మనకున్= మనకు; కర్తవ్యము+అగున్= చేయదగినది అవుతుంది.

తాత్పర్యం: 'మనం అందరం ధృతరాష్ట్రుడి దగ్గరకు పోయి అతడివలన కర్తవ్యం వినాలి. అతడు ఆలోచించి ఏమి చెపితే అదే మనకు కర్తవ్యం అవుతుంది.'

వ. అమ్మహీకాంతుండు. 42

ప్రతిపదార్థం: ఆ+మహీ కాంతుండు= ఆ రాజు - ధృతరాష్ట్రుడు

తాత్పర్యం: అని పలికి, అశ్వత్థామ 'మీ మనస్సు కలత చెందకున్నట్లయితే చేయదగినదానిని చెప్పా'లని తమను ఆ ధృతరాష్ట్రుడు అడిగిన మాటలు గుర్తుచేసి.

క. తానును గాంధారియు నె । ద్దానిం గార్యంబు గాఁగఁ దలఁచి పనిచినన్
దానికిఁ గా దన వలవదు; । పూని యనుష్ఠింత; మదియ పొగ డొందించున్. 43

ప్రతిపదార్థం: తానును= ఆ ధృతరాష్ట్రుడూ; గాంధారియున్= అతడి భార్య గాంధారీ; ఏ+దానిన్= దేనిని; కార్యంబు+కాఁగన్= కర్తవ్యంగా; తలఁచి= ఎంచి; పనిచినన్= ఆజ్ఞాపించినా; దానికిన్; కాదు+అనన్+వలవదు= కాదనవద్దు; పూని= ప్రయత్నించి; అనుష్ఠింతము= చేద్దాం; అది+అ= అదే; పొగడు= కీర్తి; ఒందించున్= పొందేటట్లు చేస్తుంది.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రుడూ, అతడి భార్య గాంధారీ ఏది కర్తవ్యమని చూచి ఆనతిస్తే దానిని కాదనకుండా పూనికతో ఆచరిద్దాము. అదే మనకు కీర్తి కలిగిస్తుంది.

వ. వారలకడ విదురుండు నుండు నమ్మువ్వురు విచారించి చెప్పిన కార్యంబునకు నిందగలుగ; దట్లుంగాకయెట్లు పొరలినను దైవోపహతంబు లగు కార్యంబులు సిద్ధిఁ బొందునె? యడిచిపడవలవదు. విచారించి కొంద' మనవుడు శోక దందహ్యమానమానసుం డగుచు నగ్గురపుత్రుండు కృతవర్మను నతని నాలోకించి. 44

ప్రతిపదార్థం: వారల కడన్= ఆ గాంధారీ ధృతరాష్ట్రులదగ్గర; విదురుండున్= విదురుడుకూడా; ఉండున్= ఉంటాడు; ఆ+ మువ్వురున్= ఆ ముగ్గురు-గాంధారీ ధృతరాష్ట్ర విదురులు; విచారించి= ఆలోచించి; చెప్పిన కార్యంబునకున్= చెప్పిన కర్తవ్యానికి; నింద కలుగదు; అట్లున్+కాక= అదీకాక; ఎట్లు= ఎట్లా; పొదలినను= దొర్లినా (శ్రమపడ్డా); దైవ+ఉపహతంబులు= దైవంచేత కొట్టబడినవి అగు; కార్యంబులు= పనులు; సిద్ధిన్+పొందునె?= ఫలిస్తాయా?; అడిచిపడన్+వలవదు= తొందరపడవద్దు; విచారించికొందము= ఆలోచించుకుందాము; అనవుడున్= అనగానే; శోక దందహ్యమాన మానసుండు= దుఃఖంచేత దహింపబడుతూ ఉన్న మనస్సు గలవాడు; అగుచున్= అవుతూ; ఆ+గురు పుత్రుండు= ఆ అశ్వత్థామ; కృతవర్మను= కృతవర్మనూ; అతనిన్= కృపాచార్యుడినీ; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: 'ఆ గాంధారీ ధృతరాష్ట్రుల దగ్గర విదురుడు కూడా ఉంటాడు. ఆ ముగ్గురూ ఆలోచించి చెప్పిన పనికి నింద ఉండదు. అదీగాక ఎంత శ్రమించినా దైవదూషితాలైన కార్యాలు ఫలిస్తాయా? తొందరపడవద్దు. ఆలోచించుకుందాము.' అనగానే దుఃఖంచేత దహించబడుతూన్న మనస్సుగల అశ్వత్థామ కృతవర్మనీ, కృపాచార్యుడినీ చూచి

అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలతోఁ దనపూన్కి స్థిరీకరించుట (సం.10-3-1)

సీ. **వెరవిట్టి తెఱఁగిది వెంగలితనమని, । యెల్లవాఁడును దన యెఱిఁగినట్టి**
తెఱఁగున నిజకార్య దృష్టియ కయికొను । నొరుల నేర్పులు పట్టనొల్లఁ; డాత్మ
బుద్ధియ మే లని పొగడు; నన్యుల చిత్త । వృత్తుల నిందించు; వివిధగతులఁ
జెందెడు నాత్మీయ చేతః ప్రవర్తన । మరయఁడు; దాన బాల్యమున దలఁచు

ఆ. **తలఁపు గీడుచేసి, యెలప్రాయమున నొండు । తలఁపునందుఁ బట్టుకొలుపుఁ బ్రీతి;**
ముదిమి వచ్చినతఱి నదియును విడిచి య । న్యంబు లైన నేర్పు లాచరించు. **45**

ప్రతిపదార్థం: వెరవు= నేర్పు; ఇట్టి తెఱఁగు= ఈ విధమైనది; ఇది; వెంగలితనము= వెర్రితనము అని; ఎల్లవాఁడును= ప్రతీవాడూ; తన+ఎఱిఁగిన+అట్టి= తనకు తెలిసినట్టి; తెఱఁగునన్= విధంగా; నిజ కార్యదృష్టి+అ= తన పనియందు చూపే; కయికొనున్= స్వీకరిస్తాడు; ఒరుల నేర్పులు= ఇతరుల నేర్పులు; పట్టన్= స్వీకరించటానికి; ఒల్లఁడు= ఇష్టపడడు; ఆత్మబుద్ధి+అ= తన తలపే; మేలు+అని= మంచిదని; పొగడున్= పొగడుకుంటాడు; అన్యుల= ఇతరుల; చిత్తవృత్తులన్= మనోభిప్రాయాలను; నిందించున్= తిట్టుతాడు, ఒప్పుకోడు; వివిధగతులన్+చెందెడు= అనేకవిధాలుగా ఉండే; ఆత్మీయ చేతన్+ ప్రవర్తనము= తన చిత్తవృత్తిని; అరయఁడు= చూడడు; తాను+అ= తనే; బాల్యమునన్= చిన్నతనంలో; తలఁచు తలఁపు= చేసే ఆలోచనను; కీడుచేసి= తిరస్కరించి; ఎల ప్రాయమునన్= యౌవనంలో; ఒండు తలఁపు+అందున్= ఇంకో అభిప్రాయంపై; ప్రీతిన్= ఇష్టాన్ని; పట్టుకొలుపున్= నిలుపుతాడు; ముదిమి= ముసలితనం; వచ్చిన; తఱిన్= వచ్చినప్పుడు; అదియును= ఆ అభిప్రాయాన్ని; కూడా; విడిచి; అన్యంబులు+ఐన= వేరైన; నేర్పులు; ఆచరించున్= చేస్తాడు.

తాత్పర్యం: నేర్పు ఈ విధమైనది. ఇది వెర్రితనం అని ప్రతీవాడూ తనకు తెలిసిన విధంగా తన పనియందలి చూపే మంచిదని భావిస్తాడు. ఇతరుల నేర్పులను అంగీకరించడు. తన తలపే మంచిదని పొగడుకొంటాడు. ఇతరుల మనోభిప్రాయాలను నిందిస్తాడు. తన ఆలోచనలు నిలకడగా ఉండక రకరకాలుగా ఉండటం గమనించడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తమ చిన్నతనంలో ఏర్పరచుకొన్న అభిప్రాయాలను తిరస్కరించి, యౌవనం వచ్చాక వేరే అభిప్రాయంపై మక్కువ చూపుతాడు. ముసలితనం వచ్చినప్పుడు అదికూడా విడిచిపెట్టి వేరే నేర్పులను ఆచరిస్తాడు.

విశేషం: 'నా పరిస్థితిని నా చూపుతో అర్థం చేసికొని నా అభిప్రాయాలను మన్నించు' మని అశ్వత్థామ కృపాచార్యుడిని సాధారణీకరించి వేడుకొనటం గమనార్హం.

క. ఆపదఁ బడి యొక్కఁడు స । ద్వ్యాపారము గాఁగఁ జూచి దాని నడవు; శ్రీ
ప్రాపించిన నరుఁ డొండొక । చూపున వర్తించు నది విశుద్ధపదముగన్. 45

ప్రతిపదార్థం: నరుఁడు= మనుష్యుడు; ఆపదన్= ఆపదలో; పడి= చిక్కుకొని; ఒక్కఁడు= ఒక్కటి- ఒక పనిని; సద్వ్యాపారము+కాఁగన్+చూచి= మంచి పనిగా భావించి; దానిన్= ఆ పనిని; నడపున్= ఆచరిస్తాడు; శ్రీ= సంపద; ప్రాపించినన్= కలిగితే; ఒండొక= వేరొక; చూపునన్= దృష్టితో; అది= ఆ చూపు; విశుద్ధ పదముగన్= మిక్కిలి పవిత్రమైనదిగా అత్యుత్తమమైనదిగా వర్తించున్= ప్రవర్తిస్తాడు.

తాత్పర్యం: మానవుడు ఆపదలో ఉన్నప్పుడు ఒకపని మంచిదని భావించి దానిని ఆచరిస్తాడు. సంపద వచ్చినప్పుడు వేరే చూపుతో అది ప్రశస్తమని భావించి ప్రవర్తిస్తాడు.

విశేషం: 'యుద్ధంలో తండ్రిని అన్యాయంగా కోల్పోయి నేను ఆపదలో ఉన్నాను. నా చూపు ఒక విధంగా ఉంటుంది. అది మంచిదని నా అభిప్రాయం. నీ కట్లాంటి ఆపదలేదు. కాబట్టి నీ చూపు వేరుగా ఉంటుంది. అదే మంచిదని నీ అభిప్రాయం. నా పరిస్థితిని బట్టి నా చూపును అర్థం చేసికొనుము' అని అశ్వత్థామ కృపుడిని వేడుకొంటున్నాడు.

క. తగునని మరణాదులకై । తెగువదెసన్ మానవుండు దృఢనిశ్చయతం
దగిలినయది పరమహితం । బుగ వదలక నడుపు నన్యబుద్ధులు గొనమిన్. 47

ప్రతిపదార్థం: మానవుండు= మనుష్యుడు; మరణ+ఆదులకై= చావూ మొదలైన వాటికి; తెగువదెసన్= సాహసంవైపు; తగున్+అని= తగినదని; దృఢనిశ్చయతన్= గట్టి నిర్ణయంతో; తగిలిన+అది= ఇష్టపడినది; పరమ హితంబునన్= మిక్కిలి మేలయినదని; వదలక= విడువక; అన్యబుద్ధులు= ఇతరుల తలంపులు; కొనమిన్= స్వీకరించిక పోవడం; నడుపున్= చేస్తాడు (అన్యబుద్ధులను స్వీకరించడు).

తాత్పర్యం: మనుష్యుడు మరణాదులకు కూడా తెగించి ఒక పని మంచిదని దృఢనిశ్చయంతో ఇష్టపడి, దానిని మిక్కిలి మేలయినదని వదలక, ఇతరుల తలంపులను తోసి పుచ్చుతాడు.

వ. 'మీ రెఱుంగనియది లేదు. నాకుం దోఁచిన కర్జంబు మన కందఱకును శోకనాశంబగునట్టిది, దాని వినుండు చెప్పెదఁ బ్రజాపతి ప్రజల సృజించి విప్రునకు దమంబును, క్షత్రియునకుఁ దేజంబును, వైశ్యునకు దక్షత్వంబును, శూద్రునకుఁ ద్రివర్ణానుకూలతయు వలయు గుణంబులుగా విధించెం గావున శాంతుండు గాని విప్రుండును, దేజస్విగాని రాజును, దక్షుండుగాని వైశ్యుండును, ద్రివర్ణానుకూలుండుగాని శూద్రుండును నిందం బడుదు; రదియట్లుండె; నేనును విప్రకులంబునందు జన పూజితం బైన వంశంబునందు జనియించిభాగ్యహీనతవలన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాజోచిత ధర్మం బనుష్ఠించితి, నడుమ నా నిష్ఠ వదలి విప్రధర్మంబు మహనీయంబైన, నది యాచరించు వాడనగుట నా మదికిం జూడమేలై యుండ దదియుంగాక. 48

ప్రతిపదార్థం: మీరు; ఎఱుంగని+అది= తెలియనిది లేదు; నాకున్= నాకు; తోచిన కర్జంబు= తోచిన కార్యం; మనకున్= అందఱకును; శోకనాశంబు+అగు+అట్టిది= శోకాన్ని పోగొట్టేది; దానిన్; వినుండు; చెప్పెదన్; ప్రజాపతి= బ్రహ్మ; ప్రజలన్= ప్రజలను; సృజించి= పుట్టించి; విప్రునకున్= బ్రాహ్మణుడికి; దమంబును= ఇంద్రియ నిగ్రహమూ; క్షత్రియునకున్= రాజుకు తేజంబును; వైశ్యునకున్= కోమటికి; దక్షత్వంబును; సామర్థ్యమూ; శూద్రునకున్; త్రివర్ణ+అనుకూలతయున్= మూడు వర్ణాల వారికీ అనుకూలంగా ఉండటమూ; వలయు గుణంబులు+కాన్= కావలసిన గుణాలుగా; విధించెన్= ఏర్పరిచాడు; కావునన్; శాంతుండు+కాని= శాంతగుణంలేని; విప్రుండును= బ్రాహ్మణుడూ; తేజస్వి+కాని రాజును= తేజస్వంతుడు కాని రాజూ; దక్షుండు+కాని వైశ్యుండును= సమర్థుడుకాని కోమటీ; త్రివర్ణ+అనుకూలుండు+కాని శూద్రుండును= మూడు వర్ణాల వారికీ అనుకూలుండు కాని శూద్రుడూ; నిందన్+పడుదురు= నింద్యులవుతారు; అది+అట్లు+ఉండెన్= అది అట్లా ఉండగా; ఏనును= నేనుకూడా; విప్ర కులంబు+అందున్= బ్రహ్మణకులంలో; జనపూజితంబు+ఐన= జనులు పూజించే; వంశంబు+ అందున్= వంశంలో; జనియించి= పుట్టి; భాగ్య హీనతవలనన్= దౌర్భాగ్యవశంచేత; రాజు+ఉచిత ధర్మంబు= క్షత్రియుడికి ఉచితమైన ధర్మం; అనుష్ఠించితిన్= ఆచరించాను; నడుమన్= మధ్యలో; ఆ నిష్ఠ= ఆ బ్రాహ్మణాచారాన్ని వదలి; విప్రధర్మంబు= బ్రాహ్మణధర్మం; మహనీయంబు+ఐనన్= గొప్పది కదా అని; అది ఆచరించువాఁడన్+అగుట= అనుష్ఠించే వాడిని కావటం; నా మదికిన్+చూడన్= నా మనస్సుకి చూస్తే; మేలు+ఐ+ఉండదు= బాగా ఉండదు; అదియున్+కాక= అదీగాక.

తాత్పర్యం: మీకు తెలియనిది లేదు. నాకు తోచినకార్యం మన కందరికీ శోకం పోగొట్టేది. దానిని వినండి, చెపుతాను. బ్రహ్మ ప్రజలను సృష్టించి బ్రాహ్మణుడికి ఇంద్రియనిగ్రహమూ, క్షత్రియుడికి తేజస్సూ, కోమటికి దక్షతా, శూద్రుడికి త్రివర్ణానుకూలతా ఉండవలసిన గుణాలుగా నిర్ణయించాడు. కాబట్టి, శాంతగుణం లేని బ్రాహ్మణుడూ, తేజస్వంతుడు కాని క్షత్రియుడూ, దక్షతలేని కోమటీ, త్రివర్ణానుకూలత లేని శూద్రుడూ నింద్యులవుతారు. అది అట్లా ఉండనిమ్ము. నేను కూడా జనులు పూజించే బ్రాహ్మణ వంశంలో పుట్టి నా దౌర్భాగ్యవశంచేత క్షత్రియోచిత ధర్మం ఆచరించాను. మధ్యలో ఆ ఆచారం వదలి, బ్రాహ్మణధర్మం మహనీయమైనది కదా! అని మళ్ళీ దానిని ఆచరించటం నాకు నచ్చదు. అదీగాక. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **'మేటి విల్లును దివ్యాస్త్ర కోటియును ధ । రించి మెఱయంగ నాజి వధించెఁ దండ్రి**
నొకఁడు; వాఁడును రూపుతో నుండు నట్టె । యెట్లు తలయెత్తి మెలఁగుదు నేను జెపుఁడ?' 49

ప్రతిపదార్థం: మేటి విల్లును= గొప్ప ధనుస్సునూ; దివ్య+అస్త్ర కోటియును= దివ్యాలైన అస్త్రాల సమూహాన్నీ, ధరించి= తాల్చి; మెఱయంగన్= ప్రకాశిస్తూ ఉండగా; తండ్రిన్= నా తండ్రియైన ద్రోణుడిని ఒకడు; ఆజిన్= యుద్ధంలో; వధించెన్= చంపాడు; వాడును; రూపుతోన్= రూపంతో; సజీవుడై; ఉండున్+అట్టె!= ఉన్నాడట!; నేను; ఎట్లు; తల+ఎత్తి= తలెత్తుకుని సిగ్గుతో; తలవంచుకోకుండా; మెలఁగుదున్= ఉంటాను; చెపుఁడ?= చెప్పండి?

తాత్పర్యం: గొప్ప విల్లూ, దివ్యాస్త్రాలూ ధరించి మెరిసిపోతూ ఉండగా నా తండ్రిని యుద్ధంలో ఒకడు చంపాడు. వా డింకా సజీవుడై ఉన్నాడు. నేను సిగ్గుతో తలవంచుకొనకుండా ఎట్లా తలెత్తుకొని తిరుగుతానో మీరే చెప్పండి.

విశేషం: అశ్వత్థామ తన తండ్రిని చంపిన ధృష్టద్యుమ్నుడి పేరు ఉచ్చరించటానికి కూడా అసహ్యించుకొంటున్నాడు. అందుచేతనే అతడి పేరు చెప్పకుండా 'ఒకడు' అని మాత్రం అన్నాడు.

క. వాఁడు మొదలుగాఁ బగతుర । వాఁడి గలుగు తూపుగముల వలన మెఱసి యే
నేఁడు వధింతును; నెవ్వగ । వేఁడిమిఁ బడఁజాల కొక్క వెరవుఁ దలఁచితిన్. 50

ప్రతిపదార్థం: వాఁడు= ఆ పితృహంత అయిన దుర్మార్గుడు ధృష్టద్యుమ్నుడు; మొదలు+కాన్= మొదలుకొని; పగతురన్= శత్రువులను; వాఁడి= పదును; కలుగు; తూపుగముల= బాణ సమూహాల; వలన; మెఱసి= ప్రకాశించి; ఏన్= నేను; నేఁడు= ఈ వేళ; వధింతును= చంపుతాను; నెఱ+వగ= నిండు దుఃఖంయొక్క; వేఁడిమిన్; పడన్+చాలక= భరించలేక; ఒక్క వెరవు= ఒక ఉపాయం; తలఁచితిన్= ఆలోచించాను.

తాత్పర్యం: ఆ దుర్మార్గుడైన ధృష్టద్యుమ్నుడు మొదలుగా శత్రువులను పదునుగల అస్త్రాల సముదాయంతో నేర్పు ప్రకటించి నేను ఈ వేళ వధిస్తాను. దుఃఖాగ్నితాపం భరించలేక ఒక ఉపాయం ఆలోచించాను.

క. లే దింకం బగ యని ధను । రాదుల దెస వాహనముల యందును సంత్య
క్తాదరులై పగతురు నేఁ । డాదమఱచి నిద్రవోదు; రని తఱి పాడునన్. 51

ప్రతిపదార్థం: పగతురు= శత్రువులు; ఇంకన్; పగ= వైరం; లేదు అని; ధనురాదుల దెసన్= విల్లులు మొదలైన వాని విషయంలోనూ; వాహనముల+అందును= వాహనాల విషయంలోనూ; సంత్యక్త+అదరులై= విడిచి పెట్టబడిన జాగ్రత్త కలవారయి; నేఁడు= ఈ నాడు; ఆదమఱచి= ఏమరుపాటు గలిగి; నిద్ర+పోదురు= నిద్రపోతున్నారు; అది; పాడునన్= చంపటానికి; తఱి= సమయం.

తాత్పర్యం: శత్రువులు ఇంక పగ లేదని విల్లులు మొదలైన వాటి విషయంలోనూ, వాహనాల విషయంలోనూ జాగ్రత్తపడకుండా ఈనాడు ఏమరుపాటుతో నిద్రపోతున్నారు. చంపటానికి ఇది తరుణం.

ఆ. ఓడిపోయి దప్పినూని గట్టును చెట్టుఁ । జేరి యొదిఁగి యున్నవారిఁ గాఁగ
మనలఁ దలఁతు రరులు; మనముల నావంత । శంకలేదు; సంతసంబు ఘనము. 52

ప్రతిపదార్థం: ఓడిపోయి; డప్పిన్+ఊని= దప్పిచెంది; గట్టును+చెట్టున్= గట్టూ చెట్టూ; చేరి; ఒదిఁగి+ఉన్నవారిన్+కాఁగన్= దాగియున్న వాళ్ళనుగా; అరులు= శత్రువులు; మనలన్= మనలను; తలఁతురు= భావిస్తారు; అవ+అంత= అవగింజంతైనా-కొంచెంకూడా; శంక= అనుమానం లేదు; సంతసంబు= సంతోషం; ఘనము= అధికం.

తాత్పర్యం: యుద్ధంలో ఓడిపోయి, దప్పిచెంది గట్టూచెట్టూ పట్టి దాగుకొని ఉన్నామని మనలను శత్రువులు భావిస్తారు. వాళ్ళకి ఆవంతైనా అనుమానం లేదు. పైగా సంతోషం అధికం.

చ. మదమునఁ దేలి యేనుఁగుల మార్తుర దాడిగఁ బోయి బెట్టు ము
ట్టెద; శరజాల సత్వర పటిష్ఠతఁ బల్వురఁ ద్రుంతుఁ; గొందఱం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జదువుదు నుల్లసత్పరిఘసంహననంబునఁ; గొన్ని కంఠముల్
చిదుముదు నేల రక్తపరిషిక్తముగాఁ గరవాల ధారలన్. 53

ప్రతిపదార్థం: (నేను-కర్త); మదమునన్= గర్వంతో; తేలి= ఆనందించి; ఏమఱిన మార్తురన్= పరాకుపడియున్న శత్రువులను; దాడిగన్+పోయి= దండెత్తిపోయి; బెట్టు= శీఘ్రంగా; ముట్టెదన్= తాకుతాను; శరజాల సత్వర పటిష్ఠతన్= బాణ సమూహంయొక్క వేగంతో కూడిన అమిత పటుత్వంతో; పల్వురన్= అనేకులను; త్రుంతున్= ఖండిస్తాను; కొందఱన్= కొంతమందిని; ఉల్ల సత్+పరిఘ సంహననంబునన్= ప్రకాశించే శూలాయుధాల సముదాయంతో; చదుపుదున్= చంపుతాను; కొన్ని కంఠముల్= కొన్ని పీకలు; నేల= భూమి; రక్త పరిషిక్తము+కాన్= రక్తంతో తడిసింది కాగా; కరవాల ధారలన్= కత్తుల అంచులతో; చిదుము దున్= కోస్తాను.

తాత్పర్యం: జయగర్వంతో తేలిపోతూ పరాకుగా ఉన్న శత్రువులపైకి నేను దండెత్తిపోయి శీఘ్రంగా తాకుతాను. బాణాల సత్వరమైన పటుత్వంతో అనేకులను ఖండిస్తాను. కొందరిని ప్రకాశించే ఇనుపగుదియల సమూహంతో చంపుతాను. నేల రక్తంతో తడిసేటట్లుగా కొన్ని పీకలను కత్తులతో కోస్తాను.

తే. గెలుపు నూఱట నొదవు నగ్గలపు నిద్రఁ । బీనుఁగులుఁ బోలె నున్న యా బిరుదుమగలఁ
జంపి పీనుంగుఁబెంట గావింపవలయు । శిబిర మెల్లను భూతముల్ సెలఁగుచుండ. 54

ప్రతిపదార్థం: గెలుపు+ఊఱటన్= జయంవల్ల కలిగిన ఓదార్పుతో; ఒదవు= పుట్టే; అగ్గలపు నిద్రన్= అధికమైన నిద్రతో; పీనుఁగులున్+పోలెన్= శవాలలా; ఉన్న; ఆ బిరుదు మగలన్= ఆ శక్తివంతులైన; వీరులను; చంపి; శిబిరము+ఎల్లను= విడిది అంతా; భూతముల్= పిశాచాలు; చెలఁగుచున్+ఉండన్= విజృంభిస్తూండగా; పీనుంగు పెంట= పీనుగుల పెంట; కావింపన్+ వలయున్= చేయాలి;

తాత్పర్యం: జయంవలన కలిగిన ఓదార్పుతో పుట్టే అధికమైన నిద్రపొంది శవాలవలె ఉన్న సమర్థులైన వీరులను చంపి విడిది మొత్తం పిశాచాలు విజృంభించేటట్లు పీనుగులపెంట చేయాలి.

వ. అని వెండియు. 55

ప్రతిపదార్థం: అని; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని పలికి మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కరి హయ నర శవముల భ । గ్న రథంబుల నెరసి ద్రుపదనందనగాత్రో
త్కరము పడియుండఁ జూడక । పరిభవతాపోపశాంతి వడయఁగ నగునే? 56

ప్రతిపదార్థం: కరి హయ నర శవములన్= ఏనుగుల, గుర్రాల, మనుష్యుల పీనుగులతోనూ; భగ్న రథంబులన్= విరిగి పోయిన రథాలతోనూ; నెరసి= నిండి; ద్రుపద నందన గాత్ర+ఉత్కరము= ద్రుపదుడి కొడుకైన ధృష్టద్యుమ్నుడి అవయవాల సమూహం; పడి+ఉండన్= పడి ఉండగా; చూడక= చూడకపోతే; పరిభవ తాప+ఉపశాంతి= అవమానం వల్ల కలిగే తాపం యొక్క ఉపశమనం; పడయఁగన్+అగునే?= పొందటానికి శక్యమా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఏనుగుల, గుర్రాల, మనుష్యుల పీనుగులోనూ, విరిగిన రథాలతోనూ నిండి ధృష్టద్యుమ్నుడి అవయవాల సమూహం పడి ఉండటం చూడకపోతే అవమానాగ్ని తాపం చల్లారుతుందా? (చల్లారదని భావం).

శా. **ధృష్టద్యుమ్నుని ముట్టి పట్టుదు; మరోద్రేకం బడంగింతు; ను**
త్కృష్టాస్త్రంబులఁ జంప; నల్క పశుభంగిం జంపినం గాని పో;
దిష్టావాప్తి యనంగ నా కిదియె కాదే యిప్డు? కౌంతేయులన్
గష్టస్వైరవిధాభియోగమృతులం గావింతు నుగ్రాకృతిన్. **57**

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్ననిన్= ధృష్టద్యుమ్నుడిని; ముట్టి= తాకి; పట్టుదున్= పట్టుకుంటాను; మద+ఉద్రేకంబు= గర్వాతిశయం; అడంగింతున్= అణచివస్తాను; ఉత్కృష్టాస్త్రంబులన్= గొప్పవైన బాణాలతో; చంపన్= చంపను; అల్క= (నాకు వాడిమీద ఉన్న) కోపం; పశుభంగిన్= పశువులా; చంపినన్+కాని= చంపితేకాని; పోదు= నశించదు; ఇప్డు= ఇప్పుడు; ఇష్ట+అవాప్తి= కోరిక ఫలించటం; అనంగన్= అంటే; నాకున్= ఇదియె= ఇదే; కాదే?= కాదా?; కౌంతేయులన్= కుంతీ పుత్రులను - పాండవులను; ఉగ్ర+ఆకృతిన్= భయంకరాకారంతో; కష్టస్వైర విధా+అభియోగ మృతులన్= క్రూరమూ, స్వేచ్ఛతో గూడినదీ అగు ప్రకారం గల ముట్టడి వలన చచ్చినవారినిగా; కావింతున్= చేస్తాను.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడిని తాకి పట్టుకుంటాను. వాడి గర్వాతిశయం అణచివేస్తాను. వాడిని గొప్ప అస్త్రాలతో చంపను. పశువును చంపినట్లు చంపితే కాని వాడిపై నాకున్న కోపం చల్లారదు. ఇప్పుడు నా కోరిక నెరవేరటం అంటే ఇదే కదా! పాండవులను భయంకరాకారంతో క్రూరంగానూ, ఇష్టం వచ్చినట్లుగానూ ముట్టడించి చంపుతాను.

క. **అలిగిన పినాకి చందం। బలవడ శిబిరంబుఁ జొచ్చి యందఱఁ బగఱం**
బొలియించెద; శుద్ధుఁడఁ గా వలదే జనకునకు నాదు వల నేర్పడఁగన్? **58**

ప్రతిపదార్థం: (నేను-కర్త); అలిగిన పినాకి చందంబు= కోపించిన ఈశ్వరుడి విధం; అలవడన్= ఒప్పగా; శిబిరంబున్= విడిదిని; చొచ్చి= ప్రవేశించి; అందఱన్+పగఱన్= శత్రువుల నందరిని; పొలియించెదన్= చంపుతాను; జనకునకున్= తండ్రికి; నాదు వలను= నా సామర్థ్యం; ఏర్పడఁగన్= స్పష్టపడగా; శుద్ధుఁడన్= పవిత్రుడిని - పితృణ విముక్తుడిని; కావలదే= కావద్దా?

తాత్పర్యం: నేను కోపించిన పినాకపాణిలాగా శత్రువుల శిబిరంలో ప్రవేశించి పగవారి నందరినీ చంపుతాను. తండ్రికి నా శక్తిని స్పష్టపరిచి పితృణ విముక్తుడినయి పవిత్రుడిని కావద్దా? (కావాలని భావం).

క. **పాండవులం। బాంచాలురఁ। జండ భుజా విభవ మెసఁగ సమయించి కృతా**
ర్థుండ నయి పెంపుఁ దేజము। గండును; దక్కొండు లేదు కార్యము దలఁపన్. **59**

ప్రతిపదార్థం: (నేను-కర్త); పాండవులన్= పాండవులను; పాంచాలురన్= పాంచాల దేశీయులను - ధృష్టద్యుమ్నాదులనూ; చండ భుజా విభవము= తీవ్రమైన భుజబల సంపద; ఎసఁగన్= అతిశయించగా; సమయించి= చంపి; కృత+అర్థుండన్+అయి= కృతకృత్యుడినయి; పెంపున్= గొప్పతనమూ; తేజము= తేజస్సూ; గండును= పౌరుషమును - పొందుతాను; తలఁపన్= ఆలోచించగా; తక్కు+ఒండు= ఇంకొక; కార్యము= పని; లేదు.

తాత్పర్యం: నేను పాండవులనూ, పాంచాలురనూ తీవ్ర భుజబల సంపద అతిశయించగా చంపి కృతకృత్యుడనయి గొప్పతనమూ, తేజస్సూ పొందుతాను. ఆలోచించగా ఇంతకంటె వేరే పని లేదు.

వ. అనవుడుఁ గృపాచార్యుం డి ట్లనియె. 60

ప్రతిపదార్థం: అనవుడున్= అని అశ్వత్థామ అనగానే; కృపాచార్యుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని అశ్వత్థామ అనగానే కృపాచార్యు డిట్లా అన్నాడు:

సీ. పఱిచిన వారికిఁ బగమాఱు పఱుపంగ । నుత్సహించుట కడు నొప్పగాదె?
దైవయోగంబునఁ దగిన యుద్యోగంబు । నీ మానసంబున నెలవుకొనియె;
మాకు నీ పూన్కి సమ్మత; మేము దీనికి । నీ తోడివారము; నీవు డస్సి
యున్నవాఁడవు నిద్రయును లేకయున్నది; । నెడఁగురు పడియె దీ యడవిలోన

ఆ. నెమ్మి డప్పిదేఱ నిద్రించి వేగినఁ । దెలివితోడ నత్యుదీర్ణవృత్తిఁ
గరఁగి యేము దోడ నడతేర నడరిన, । నరిగణంబు గెలుతు వశ్రమమున. 61

ప్రతిపదార్థం: పఱిచిన వారికిన్= బాధించినవాళ్ళకు; పగన్= వైరంతో; మాఱు పఱుపంగన్= ప్రత్యపకారం చేయటానికి; ఉత్సహించుట= వేడుకపడటం; కడున్= మిక్కిలి; ఒప్పు; కాదె?= కాదా?; దైవ యోగంబునన్= దైవవశాత్తు; తగిన ఉద్యోగంబు= తగిన కార్యం; నీ మానసంబునన్= నీ మనస్సులో; నెలవుకొనియెన్= చోటు చేసుకుంది; మాకున్; నీ పూన్కి= నీ ప్రయత్నం; సమ్మతము= ఇష్టం; ఏము= మేము; దీనికిన్; నీతోడివారము= నీతోపాటు ఉండేవాళ్ళం; నీవు; డస్సి+ఉన్నవాఁడవు= అలసిపోయి ఉన్నావు; నిద్రయును= నిద్రకూడా; లేక+ఉన్నది= లేకుండా పోయింది; ఈ+అడవితోనన్; వెడఁగురు పడియెదు= జడత్వం పొందుతావు; నెమ్మిన్= సుఖంగా; డప్పి+తేఱన్= దప్పితీరేటట్లు; నిద్రించి; వేగినన్= తెల్లవారగానే; తెలివితోడన్= మెలకువతో; అతి+ఉదీర్ణ వృత్తిన్= మిక్కిలి ఉద్రేకంతో కూడిన ప్రవర్తనతో; కడఁగి= పూని; ఏము= మేమిద్దరం; తోడన్= కూడా; నడతేరన్= రాగా; అడరినన్= విజృంభిస్తే; అరిగణంబున్= శత్రుసమూహాన్ని; ఆశ్రమమునన్= అనాయాసంగా; గెలుతువు.

తాత్పర్యం: బాధించినవాళ్ళకు పగతో ప్రత్యపకారం చేయటానికి ఉత్సాహపడటం ఎంతో మంచిదికదా! అదృష్ట వశాత్తూ తగినకార్యం నీ మనస్సులో చోటు చేసికొన్నది మాకు నీ ప్రయత్నం సమ్మతమే. మేము దీనికి నీతోపాటు ఉంటాము. నీవు అలసిపోయి ఉన్నావు. నిద్రకూడా పోని నీవు ఈ అడవిలో జడత్వం పొందుతావు. (బద్ధకంగా ఉంటావు). అలసట తీరేటట్లు సుఖంగా పండుకొని తెల్లవారగానే మెలకువతో మంచి ఉద్రేకం పొంది, పూని, మేమిద్దరం నీవెంట రాగా విజృంభించుము. అప్పుడు నీవు శత్రు సమూహాన్ని అనాయాసంగా గెలుస్తావు.

విశేషం: శబ్దరత్నాకరంలో 'వెడఁగురుపడు' శబ్దానికి 'జడత్వమునొందు' అని అర్థం ఇవ్వబడింది. సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'వెడఁగురుపడు' ఉన్నది కాని 'వెడగరవడు' లేదు. 'వెడఁగురువడు' అనేదానికి జడత్వము నొందు, కాంతిహీనమగు - అనే అర్థాలు ఇచ్చి దీనినే ఉదాహరణగా ఇచ్చారు. అందుచేత దీనినే స్వీకరించడమయినది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. వరదివ్యాస్త్రవిదుండు బాహుఘనుఁ డశ్వత్థామ పైఁ బోన, ను
ద్ధురలీలం గృతవర్మయుం గృపుఁడు నుద్యోగస్ఫురన్మూర్తులై
వెరవుం జేనయుఁ జూపి తో నడవ, దోర్వీర్యోద్ధతిన్ మార్కొనన్
నరయోధావళి గాదు దేవతతికి న్రా దెమ్మెయిం జూడఁగన్. 62

ప్రతిపదార్థం: వర దివ్య+అస్త్ర విదుండు= శ్రేష్ఠములూ, దివ్యములూ అయిన అస్త్రాలు తెలిసినవాడు; బాహు ఘనుఁడు= భుజబలంలో గొప్పవాడూ (అయిన); అశ్వత్థామ; పైన్+పోవన్= దండెత్తిపోగా; ఉద్ధురలీలన్= సమర్థంగా; కృతవర్మయున్-కృపుఁడున్= కృతవర్మా, కృపాచార్యుడూ, ఉద్యోగ స్ఫురత్+మూర్తులు+ఐ= కార్యాచరణంలో ప్రకాశిస్తూన్న ఆకారాలు కలవారై; వెరవున్= ఉపాయమూ; చేవయున్= సామర్థ్యమూ; చూపి; తోన్+నడవన్= కూడా నడవగా; దోర్వీర్య+ఉద్ధతిన్= భుజపరాక్రమాతిశయంతో; మార్కొనన్= ఎదుర్కొనటానికి; ఏ+మెయిన్= ఏ విధంగా; చూడఁగన్= చూసినా; నరయోధ+అవళి కాదు= మానవ వీరుల సమూహం కాదు; దేతతికిన్= దేవతల సమూహానికి కూడా; రాదు= శక్యంకాదు.

తాత్పర్యం: వరదివ్యాస్త్రవేత్తా, భుజబలఘనుడూ అయిన అశ్వత్థామ దండెత్తిపోతే, కృతవర్మా, కృపాచార్యుడూ సమర్థంగా కార్యాచరణంలో ప్రకాశిస్తూన్న ఆకారాలతో కూడా నడవగా, భుజపరాక్రమాతిశయంతో ఎదుర్కొనటానికి ఏవిధంగా చూచినా మానవవీరులకే కాదు దేవతలకు కూడా శక్యం కాదు.

వ. అని మఱియును. 63

తాత్పర్యం: అని ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'విను కృతవర్మ దివ్యశరవేది బలాఢ్యుడు శౌర్యశాలి, యే
మను సమరోద్యమంబునకు నూల్కొనఁజాలుట నీ వెఱుంగు, 'ది
ట్లని గణతింపరాదు గురునట్టిఁడ యీతఁ' డనంగవచ్చు ని
న్ననఘచరిత్ర! యిట్టి రథికావలి వైరుల నెట్లుఁ జేయదే!' 64

ప్రతిపదార్థం: అనఘ చరిత్ర!= పాపరహితమైన చరిత్రగలవాడా! అశ్వత్థామా!; విను; కృతవర్మ; దివ్య శర వేది= దివ్యాస్త్ర విదుడు; బల+ఆఢ్యుఁడు= బలసంపన్నుడు; శౌర్యశాలి= పరాక్రమ సంపన్నుడు; ఏనును= నేను కూడా; సమర+ఉద్యమంబునకున్= యుద్ధకార్యానికి; నూల్కొనన్+చాలుట= పూనుకోగలగడం; నీవు+ఎఱుంగుదు(వు)= నీ వెరుగుదువు; నిన్నున్; ఈతఁడు= ఈ అశ్వత్థామ; ఇట్లు+అని= ఇలాంటివాడిని; గణుతింపన్ రాదు= పరిగణించరాదు; గురునట్టిఁడ= ద్రోణుడంతటివాడే; అనంగన్+వచ్చున్= అనవచ్చు; ఇట్టి; రథిక+అవలి= ఇటువంటి రథికుల సమూహం; వైరులన్= శత్రువులను; ఎట్లున్+చేయదే= ఏమయినా చేయదా?

తాత్పర్యం: 'పాపరహితుడవైన అశ్వత్థామా! వినుము. కృతవర్మ దివ్యాస్త్రవిదుడూ, బలాఢ్యుడూ, శౌర్య సంపన్నుడూ. నేను కూడా యుద్ధం ఎట్లా చేస్తానో నీకు తెలుసు. ఇక నీవు 'నిన్ను ఇట్లాంటివాడూ అట్లాంటివాడూ అవటానికి వీల్లేదు. సాక్షాత్తు ద్రోణుడంతటివాడే' అని చెప్పవచ్చు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. **'కావునఁ గోదండంబుఁ నెక్కుడించి, కంకటం బూడ్చి, నిద్రింపు మేము నిద్రాగమనంబున జడులమై యున్న వారము; ప్రభాతం బగుటయు నెల్లవారలకు నుల్లంబు దెలివొందు; నప్పుడు గడంగి యోధులం బొదినిపేరు వాడి పొలియింతము; మనము పాంచాల సహితంబుగాఁ బాండవులం దెగటార్చుటయొండె, వారి చేతం దెగుట యొండె నయ్యెడుం గాక, రిత్త మరలుదుమే?' యనిన మామకు నశ్వత్థామ యిట్లనియె. 65**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; కోదండంబు నెక్కుడించి (కోదండంబు+ఎక్కు డించి)= వింటిని నారిలేకుండా చేసి; కంకటంబు= ఊడ్చి= కవచం తీసివేసి; నిద్రింపుము= నిద్రపొమ్ము; ఏమున్= మేముకూడా; నిద్ర+ఆగమనంబునన్= నిద్ర రావటంచేత; జడులము+ఐ+ఉన్నవారము= బద్ధకంగా ఉన్నాము; ప్రభాతంబు+అగుటయున్= తెల్లారగానే; ఎల్లవారలకున్= అందరికీ; ఉల్లంబు= మనస్సు; తెలివొందున్= నిర్మలంగా ఉంటుంది; అప్పుడు; కడంగి= పూని; యోధులన్= వీరులను; పొదివి= ఆక్రమించి; పేరువాడి= పేర్కొని-బాహాటంగా; పొలియింతము= చంపుదాము; మనము; పాంచాల; సహితంబుగాన్= పాంచాలురతో కూడా; పాండవులన్= పాండవులను; తెగటార్చుట+ఒండెన్= చంపడమో; వారిచేతన్; తెగుట+ఒండెన్= చావటమో; అయ్యెడున్+కాక= అగుగాక; రిత్త మరలుదుమే?= ఊరికే తిరిగి వస్తామా?; అనినన్= మామకున్= కృపాచార్యుడికి; అశ్వత్థామ; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'కాబట్టి, నీవు వింటినుండి నారి తొలగించి, కవచం తీసివేసి నిద్రపొమ్ము, మేముకూడా నిద్రచేత బద్ధకంగా ఉన్నాము. తెల్లవారగానే అందరికీ మనస్సు నిర్మలంగా ఉంటుంది. అప్పుడు యుద్ధానికి పూని వీరులను ఆక్రమించి బాహాటంగా చంపుదాము. మనం పాంచాలసహితంగా పాండవులను చంపటమో, లేక వాళ్ళచేత చావటమో చేస్తాము గాని ఊరికే తిరిగివస్తామా?' అన్న మామతో అశ్వత్థామ ఇట్లా అన్నాడు;

తే. **'అలుక యెత్తినవానికి, నర్థచింత । కునకు, నాతురునకుఁ, గామ గోచరాత్ము**
నికిని వచ్చునే, విను నిద్ర? నీవు నెఱుఁగు । దెఱిఁగియుండి యి ట్లేడిటికి నేఁప నన్ను?' 66

ప్రతిపదార్థం: విను; అలుక+ఎత్తినవానికిన్= కోపం అతిశయించినవాడికీ; అర్థచింతకునకున్= డబ్బును గూర్చి ఆలోచించేవాడికీ; ఆతురునకున్= వ్యాధిగ్రస్తుడికీ; కామ గోచర+ఆత్మునికిని= కామం ఆవేశించిన మనస్సు గలవాడికీ; నిద్ర వచ్చునే?; నీవున్+ఎఱుఁగుదు= నువ్వూ ఎరుగుదువు; ఎఱిఁగి+ఉండి= ఎరిగికూడా; నన్నున్; ఇట్లు= ఈవిధంగా; ఏఁపన్= బాధించటం; ఏటికిన్= ఎందుకు?

తాత్పర్యం: 'వినుము కోపం అతిశయించినవాడికీ, డబ్బును గూర్చి ఆలోచించేవాడికీ, వ్యాధిగ్రస్తుడికీ, కామోద్రిక్తుడికీ నిద్రవస్తుందా? నీవూ ఎరుగుదువు. ఎరిగికూడా నన్ను ఇట్లా బాధించటం ఎందుకు?

క. **ఎన్నఁబడి జనులెఱిఁగిన । యిన్నాలుగు తెఱఁగులందు నెయ్యదియైనన్**
గన్ను మొగుడ నీదటె నా । కిన్నియుఁ గలుగంగ నిద్రయేటికి వచ్చున్? 67

ప్రతిపదార్థం: ఎన్నఁబడి= గణించబడి; జనులు+ఎఱింగిన= మనుష్యులెరిగిన; ఈ+నాలుగు తెఱగుల+అందున్= ఈ నాలుగు విధాలైన కారణాలలోనూ; ఏ+అది+ఐనన్= ఏ ఒక్కటైనా; కన్ను మొగుడనీదు+అటె= కన్నుమూతపడనీయదట. నిద్రపట్టనీయదట; నాకున్= నాకు; ఇన్నియున్= ఈ నాలుగూ; కలుగంగన్= ఉండగా; నిద్ర; ఏటికిన్= ఎందుకు; వచ్చున్?= వస్తుంది?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మనుష్యు లెరిగిన ఈ నాలుగు విధాలైన కారణాలలోనూ ఏ ఒక్కటైనా నిద్రపోవనీదంటే, ఇవన్నీ ఉన్న నాకు నిద్ర ఎట్లా పడుతుంది? (పట్టదని భావం.)

విశేషం: అలం: కావ్యార్థాపత్తి తన కా నాలుగూ ఎట్లా ఉన్నాయో అశ్వత్థామ తరువాతి పద్యంలో వివరిస్తున్నాడు. వాటిలో ఏ ఒక్కటి ఉన్నా నిద్రపట్టదంటే ఇంక ఆ నాలుగూ ఉన్నప్పుడు నిద్రపట్టదని వేరే చెప్పాలా? - అనటంచేత ఇక్కడ అలంకారం కావ్యార్థాపత్తి.

చ. 'గురుదెసవంత నాతురతఁ గూరెద, వైరిఁ దలంచి కోప సం
భరితుఁడ నయ్యెదన్, సమర భంగి నిరూపణచింత నొందెదం,
గురుపతికిం బ్రియం బెసఁగఁ గోరుట నుత్తలపాటు సెందెదం
బురుషనరేణ్య! యే నిదురవోవఁగ నెమ్మెయి నేర్తుఁ జెప్పుమా.' 68

ప్రతిపదార్థం: పురుష నరేణ్య!= మనుష్యులలో శ్రేష్ఠుడా! - కృపాచార్యా!; గురుదెస వంతన్= తండ్రి విషయమైన దుఃఖంవలన; ఆతురతన్= పీడతో; కూరెదన్= క్రుంగి ఉన్నాను; వైరిన్= శత్రువుని; తలంచి= స్మరించి; కోప సంభరితుఁడన్+అయ్యెదన్= కోపంతో నిండినవాడిని అయి ఉన్నాను; సమరభంగి నిరూపణ చింతన్= యుద్ధప్రకారం నిర్ణయించే చింతను; ఒందెదన్= పొంది ఉన్నాను; కురుపతికిన్= దుర్యోధనుడికి; ప్రియంబు+ఎసఁగన్= సంతోషం అతిశయించటానికి; కోరుటన్= కోరటంచేత; ఉత్తలపాటు+చెందెదన్= కలతచెంది ఉన్నాను; ఏన్= నేను; నిదుర+పోవఁగన్= నిద్రించటానికి; ఏ+మెయిన్= ఏ విధంగా; నేర్తున్= సమర్థుడిని అవుతాను; చెప్పుమా.

తాత్పర్యం: పురుషశ్రేష్ఠుడవైన ఓ కృపాచార్యా!. నాకు నిద్రపట్టకపోవటానికి గల కారణాలు నాలుగూ ఉన్నాయి. ఎట్లా అంటే - తండ్రి అన్యాయంగా చచ్చిపోయాడే అని ఆతురతతో క్రుంగి ఉన్నాను. శత్రువును తలచుకొని కోపంతో నిండి ఉన్నాను. ఎట్లాంటి యుద్ధం చేసి శత్రువులపై కసి తీర్చుకోవాలా - అనే చింత కలిగి ఉన్నాను. దుర్యోధనుడికి సంతోషాతిశయం కూర్చాలనే కోరిక అధికమయి కలతచెంది ఉన్నాను. ఇట్లా నాలుగూ కలిగి ఉన్న నే నెట్లా నిద్రపోగలనో నీవే చెప్పుము.

శా. 'సారాచారనిరూఢుఁ డైన ధనురాచార్యున్ వధింపంగఁ గ
న్నారం జూచితి నీవుఁ; దత్పరిభవం బట్లుండెఁ; భగ్నోరుఁడై
రారా జెంతయు దీనవృత్తిఁ జెవులారం బల్కఁగా విన్న యే
నీ రే యూరక నిద్రవోదునటె! యిట్లే లంటి, వీరోత్తమా? 69

ప్రతిపదార్థం: వీర+ఉత్తమా!= వీరశ్రేష్ఠుడా కృపాచార్యా!; సారాచార నిరూఢుఁడు+ఐన= శ్రేష్ఠమైన ప్రవర్తనంచేత ప్రసిద్ధి వహించినవాడైన; ధనురాచార్యున్= ధనుర్విద్యాగురువైన ద్రోణుడిని; వధింపంగన్= చంపగా; ఈవున్= నీవుకూడా; కన్ను+అరన్= ప్రత్యక్షంగా; చూచితి= చూశావు; తత్+పరిభవంబు= ఆ పరాభవం; అట్లు+ఉండెన్= అట్లా ఉండనిమ్ము; రారాజు= దుర్యోధనుడు; భగ్న+ ఊరుఁడు+ఐ= విరిగిన తొడలు గలవాడయి; ఎంతయున్= ఎంతో; దీనవృత్తిన్= దీనంగా; చెవులు+అరన్= చెవులారా; పల్కఁగాన్= పలకగా; విన్న= విన్నట్టి; ఏను= నేను; ఈ రే= ఈ రాత్రి; ఊరక= ఉపేక్షాభావంతో; నిద్రపోదునటె!= నిద్రపోతానా?; ఇట్లు+ఏల+అంటి(ఎ)?= ఇట్లా ఎందుకన్నావు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'వీరశ్రేష్ఠుడవైన కృపాచార్యా!; సదాచార సంపన్నతలో ప్రసిద్ధి వహించిన ధనుర్విద్యాగురుడిని ద్రోణుడిని చంపటం నీవుకూడా కళ్ళారా చూశావు. ఆ పరాభవం మాట ట్లా ఉండనిమ్ము. రాజరాజు తొడలు విరిగి ఎంతో దీనంగా పలికిన పలుకులు చెవులారా విన్న నేను ఈ రాత్రి ఉపేక్షాభావంతో నిద్రపోతానా? ఇట్లా ఎందుకంటావు?'

విశేషం: 'వీరోత్తమా!' అని కృపాచార్యుడిని సంబోధించటంలో 'ఇట్లా అనటం వీరుడి లక్షణమా! నీవు కేవలవీరుడివి కావు. వీరోత్తముడివే. నువ్విట్లా అనటం భావ్యమా!? అనే ఎత్తిపొడుపు ధ్వనిస్తుంది.

ఆ. 'మనము వినఁగ రాజు పనవిన భంగి కే। క్రూరచిత్తుఁడైన గుందకున్నె?
కరుణ లేకయున్న పురుషున కేనిఁ గ। న్నీరు దొరుఁగకుండునే, మహాత్మ?' 70

ప్రతిపదార్థం: మహాత్మ!= మహానుభావా, కృపాచార్యా!; మనము; వినఁగన్= వింటూండగా; రాజు= దుర్యోధనుడు; పనవిన భంగికిన్= దుఃఖించిన రీతికి; ఏ క్రూరచిత్తుఁడు+ఐనన్= ఏ కఠినాత్ముడైనా; కుందక+ఉన్నె?= బాధపడకుండా ఉంటాడా?; కరుణ= దయ; లేక+ఉన్న= లేనట్టి; పురుషునకున్+ఏనిన్= పురుషుడికైనా; కన్నీరు తొరుఁగక+ఉండునే= కారకుండా ఉంటుందా?

తాత్పర్యం: మహానుభావా కృపాచార్యా! మనం వింటూండగా దుర్యోధనుడు దుఃఖించిన రీతికి ఎటువంటి కఠినాత్ముడైనా బాధపడకుండా ఉంటాడా? ఎంత నిర్దయుడైన పురుషుడైనా కన్నీరు కార్చకుండా ఉంటాడా?

విశేషం: 'దుర్యోధనుడి దీనాలాపాలు విన్న మనం అంత క్రూరచిత్తులం, నిర్దయులం కామే! బాధపడకుండా, కన్నీరుపెట్టకుండా ఉండగలమా?' అని అశ్వత్థామ కృపుడిని రెచ్చగొడుతున్నాడు.

చ. అతఁడు మదీయ సఖ్యవరుఁ, డక్కట! యేఁ గసుగందకుండ నా
క్షితిపతి యిమ్మెయిం బరులచేతఁ బరాభవ మొందె; దానిఁ జూ
చితి; మును లోకు లవ్విభుని చేటును, బాండుతనూజకోటి యు
న్నతియును జెప్పవింటి; నది నా మది సూడెఁడు; నిద్రవచ్చునే? 71

ప్రతిపదార్థం: అతఁడు= ఆ దుర్యోధనుడు; మదీయ సఖ్యవరుఁడు= నా మిత్రులలో శ్రేష్ఠుడు; అక్కట!= అయ్యో!; ఏన్= నేను; కసుగందక+ఉండన్= చెక్కుచెదరకుండా ఉంటూండగా; ఆ క్షితిపతి= ఆ రాజు; ఈ+మెయిన్= ఈ విధంగా; పరుల చేతన్= శత్రువులచేత; పరాభవము= అవమానము; ఒందెన్= పొందాడు; దానిన్= ఆ ఘోరాన్ని; చూచితిన్= చూశాను; మును= ఇదివరకు; లోకంబు= జనం; ఆ+విభుని చేటును= ఆ రాజు చేడ్పాటూ; పాండు తనూజ కోటి= పాండురాజు కొడుకుల యొక్క; ఉన్నతియును= ఔన్నత్యమూ; చెప్పన్= చెప్పగా; వింటిన్= విన్నాను; అది; నామదిన్= నా మనస్సును; సూడెడున్= దహిస్తోంది; నిద్రవచ్చునే?= నిద్రపడుతుందా? (పట్టదని భావం.)

తాత్పర్యం: 'ఆ దుర్యోధనుడు నాకు మంచి చెలికాడు. అయ్యో! నేను నిక్షేపంవలె ఏ అపాయమూ లేకుండా ఉంటూండగా, ఆ రాజు ఈ విధంగా శత్రువులచేత అవమానం పొందాడు. ఆ ఘోరాన్ని నేను చూచాను. ఇదివరకు లోకులు ఆ రాజు చేడ్పాటూ, పాండవుల ఔన్నత్యమూ చెప్పగా విన్నాను. అది నా మనస్సును దహించివేస్తున్నది. నాకు నిద్ర ఎట్లా పడుతుంది?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అశ్వత్థామ మాటలలో అతడి ప్రభుభక్తి పరాయణతా, మిత్రప్రేమా స్పష్టపడుతున్నాయి.

వ. అదియునుం గాక. 72

తాత్పర్యం: అదీకాక.

ఉ. కవ్వడియున్ ముకుందుఁడును గావలిగా భయమేదియున్న వీ
డెవ్వరికైన ముట్టుకొని యే నని పేర్చి జయింపవచ్చునే?
యెవ్విధి నైననుం బగఱ యే పడఁగించుట పౌరుషంబ; యే
నొవ్వక గెల్తు రాత్రిమెయి నూల్కొని తాఁకితినేని మాతురా! 73

ప్రతిపదార్థం: మాతులా= మామా! కృపాచార్యా!; కవ్వడియున్= అర్జునుడూ; ముకుందుఁడును= కృష్ణుడూ; కావలిగాన్= కాపుగా; భయము+ఏది+ఉన్న వీడు= భయం లేకున్న శిబిరం; ఎవ్వరికిన్+ఐనన్= ఎవరికైనా; ముట్టుకొని= మార్కొని; ఏను+అని= నేనని; పేర్చి= విజృంభించి; జయింపన్+వచ్చునే= గెలువతరమా?; ఏ+విధిన్+ఐననున్= ఏ రీతిగానైనా; పగఱ= శత్రువులయొక్క; ఏపు= విజృంభణ; అడఁగించుట= అణచటం; పౌరుషంబు+అ= మగతనమే; ఏన్= నేను; రాత్రి మెయిన్= రాత్రియందు; నూల్కొని= పురికొని; తాఁకితిన్+ఏనిన్= తలపడితే!; నొవ్వక= అశ్రమంగా; గెల్తున్= జయిస్తాను.

తాత్పర్యం: 'మామా! అర్జునుడూ, కృష్ణుడూ రక్షకు లవటంచేత భయమనేది లేకుండా ఉన్న శిబిరంపై దండెత్తి నేనని విజృంభించి ఎవడైనా గెలువగలడా? ఎట్లా అయినా శత్రువుల విజృంభణం అణచటం మగతనం. నేను రాత్రివేళ పురికొని తలపడితే అశ్రమంగా గెలుస్తాను.'

ఆ. ఇట్లు నిశ్చయించి యెసకంపుఁ గడఁకతో । నున్నవాఁడ; నిట్టి నన్ను మాన్ప
రామి యెఱుఁగ కంటి; రారాజు మన్నన । వమ్ము చేసి మరలవచ్చు నెట్లు? 74

ప్రతిపదార్థం: ఇట్లు; నిశ్చయించి= నిర్ణయించుకుని; ఎసకంపున్+కడఁకతోన్= అధికమైన ప్రయత్నంతో; ఉన్నవాఁడన్= ఉన్నాను; ఇట్టి నన్నున్= ఇట్లాంటి నన్ను; మాన్పన్+రామి= విరమింపజేయలేకపోవటం; ఎఱుఁగక= తెలియక; అంటి(వి)= అన్నావు; రారాజు మన్నన= దుర్యోధనుడి ఆదరం; వమ్ముచేసి= వ్యర్థం చేసి; మరలన్+వచ్చున్+ఎట్లు= తిరిగిపోవటం ఎట్లాసాధ్యం?

తాత్పర్యం: ఇట్లా నిర్ణయించుకొని పెద్ద ప్రయత్నంతో ఉన్నాను. ఇట్లాంటి నన్ను వారించలేనని తెలియక అట్లా అన్నావు. దుర్యోధనుడు చూపిన ఆదరం వ్యర్థం చేసి తిరిగిపోవటం ఎట్లా సాధ్యం?

క. సమయింతుం బొదివి సొప్తిక । సమయంబున నెల్లభంగిఁ జతురంగసమే
తముగాఁగఁ బాండునృపసుత । సముదయమును ద్రుపదభూపసంతానంబున్. 75

ప్రతిపదార్థం: పాండు నృప సుత సముదయమును= పాండురాజు కొడుకుల సమూహాన్నీ; ద్రుపద భూప సంతానంబున్= ద్రుపద రాజు సంతతినీ; చతురంగ సమేతము+కాఁగన్= రథగజ తురగ పదాతు లనే నాలుగువిధాలైన బలాలతో కూడా; ఎల్లభంగిన్= సర్వవిధాలా; సొప్తిక సమయంబునన్= నిద్రించేవేళ; పొదివి= చుట్టుముట్టి; సమయింతున్= చంపుతాను.

తాత్పర్యం: పాండవులనూ, ద్రుపదరాజు సంతతినీ చతురంగ బలాలతో కూడా సర్వవిధాలా నిద్రాసమయంలో చుట్టుముట్టి చంపుతాను.

వ. సమయించి మఱి విశ్రమించియు నిద్రించియు సుఖించెద; నీవు నిద్ర పేరు సెప్పి యుద్యోగంబు మాన్పి మర ల్పఁ జూచెద; విది తగ వగునే?' యనిన గురునందనునకు గౌతముం డిట్లనియె: 76

ప్రతిపదార్థం: నమయించి= చంపి; మఱి= మరీ; విశ్రమించియున్= విశ్రమించీ; నిద్రించియున్= నిద్రించీ; సుఖించెదన్= సుఖపడతాను; నీవు; నిద్రపేరు+చెప్పి= నిద్ర అంటూ; ఉద్యోగంబు= పూనిక; మాన్పి= విరమింపజేసి; మరల్పన్+చూచెదవు= మరలించాలని చూస్తున్నావు; ఇది; తగవు= న్యాయం; అగునే?= అవుతుందా?; అనినన్= అని అశ్వత్థామ అనగా; గురునందనునకున్= గురు పుత్రుడైన అశ్వత్థామకు; గౌతముండు= కృపాచార్యుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'చంపి మరీ విశ్రమించీ, నిద్రించీ సుఖిస్తాను. నీవు నిద్ర నిద్ర అంటూ ఆ పూనికను మాన్పి నన్ను మరలించాలని చూస్తున్నావు. ఇది నీకు న్యాయమా?' అనిన అశ్వత్థామతో కృపాచార్యు డిట్లా అన్నాడు.

కృపాచార్యుఁడు నిద్రాసక్తులఁ జంపఁదగదని యశ్వత్థామకు హితవు చెప్పుట (సం.10-5-1)

చ. అలుక మనంబునం గదిరినాతఁడు దాను నెఱుంగఁ డొడ్లచేఁ
దెలియఁడు కార్యతంత్రములు; ధీమహితుండగువాని కైనను
జెలులును జుట్టలుం దగిలి చెప్పఁగఁ జొప్పడుఁగాక తక్కు ని
ర్మలమగు నీతితంత్రము దిరం బయి చిత్తమునందు నిల్చునే? 77

ప్రతిపదార్థం: కార్య తంత్రములు= కార్యాచరణవిధానాలు; అలుక= కోపం; మనంబునన్= మనసులో; కదిరిన+అతఁడు= అతిశయించినవాడు; తానునన్+ఎఱుంగఁడు= తనూ ఎరుగడు; ఒడ్లచేన్= ఇతరులచేతనూ; తెలియఁడు= తెలిసికోడు; ధీ-మహితుండు+అగు= బుద్ధిచేత గొప్పవాడైన; వానికిన్+ఐననున్= వాడికైనా; తక్కు= ఇతరమైన; నిర్మలము+అగు= స్వచ్ఛమైన; నీతి తంత్రము= నీతికార్య విధానం; చెలులును= మిత్రులూ; చుట్టలున్= చుట్టాలూ; తగిలి - చెప్పఁగన్= వెంటబడిచెపితే; చొప్పడున్+కాక= తెలుస్తుంది కాని; తిరంబు+అయి= నిలకడ కలిగి; చిత్తము+అందున్= మనసుతో; నిల్చునే= నిలుస్తుందా?

తాత్పర్యం: కార్యాచరణ పద్ధతులు కోపావిష్ట మనస్కుడు తనూ ఎరగడు, ఇతరులు చెప్పినా తెలిసికొనలేడు. మంచి బుద్ధిమంతుడికి కూడా తక్కిన నీతికార్య విధానం మిత్రులూ, చుట్టాలూ వెంటబడి చెపితే తెలుస్తుంది కాని మనసులో సుస్థిరంగా నాటుకొనదు.

విశేషం: 'నీ మనస్సు కోపంతో నిండి ఉన్నది కాబట్టి కర్తవ్యం నీకు తోచదు. నావంటివాడు చెప్పినా తెలియదు. నీవంటి బుద్ధిమంతుడికి హితులమైన మేము చెపితే నీతితంత్రం తెలుస్తుంది కాని అది మనసు కోపోద్రిక్తమైనపుడు స్థిరంగా ఉండదు. అందుచేత నీవు కోపం విడిచిపెట్టాలి' అని కృపాచార్యుడు అశ్వత్థామకు బోధించ ప్రయత్నిస్తున్నాడు.

క. మతి నెప్పుడుఁ దా ధర్మ । స్థితి నూహించుచును, హితులు సెప్పెడి వెర వు
ద్ధతి దక్కి యాచరించుచు । జితేంద్రియత గలిగి నడవఁ జెందు శుభంబుల్. 78

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తాన్= తాను; ఎప్పుడున్= ఎప్పుడూ; మతిన్= మనసులో; ధర్మస్థితిన్= ధర్మంయొక్క ఉనికిని; ఊహించుచును= భావిస్తూ; హితులు= మిత్రులు; చెప్పెడి వెరవు= చెప్పే ఉపాయం; ఉద్ధతి+తక్కి= గర్వం విడిచిపెట్టి; ఆచరించుచున్= చేస్తూ; జిత+ఇంద్రియత కలిగి= ఇంద్రియజయం కలిగి; నడవన్= నడుచుకుంటే; శుభంబుల్= మేళ్ళు; చెందున్= కలుగుతాయి.

తాత్పర్యం: ఎప్పుడూ మనస్సులో ధర్మస్థితిని భావిస్తూ మిత్రులు చెప్పే ఉపాయాన్ని గర్వం విడిచిపెట్టి ఆచరిస్తూ, ఇంద్రియాలను జయించి నడుచుకొంటే మేలు కలుగుతుంది.

విశేషం: 'నీకు మేలు కలగాలంటే నీవు ధర్మాన్నే భావించాలి. కోపం విడిచి నేను చెప్పే మంచిని ఆచరించాలి. జితేంద్రియుడవు కావాలి అని అశ్వత్థామకు కృపుడి బోధ.

తే. **దుష్పథంబులఁ జొరనీక తొలఁగఁ దివుతు । రాప్త జనములు దగ వశ్యు లయినవార**
లందుఁ బుణ్యంబు దొలఁగని యతఁడు దొలఁగు; । దొలఁగ నేరఁడు భాగ్యంబు దొలఁగువాఁడు. **79**

ప్రతిపదార్థం: ఆప్తజనములు= ఇష్టజనులు; తగన్= తగినవిధంగా; దుష్పథంబులన్= అపమార్గాలలో; చొరనీక= ప్రవేశించనీయకుండా; తొలఁగన్+తివుతురు= తొలగేటట్లు నెట్టుతారు; వశ్యులు+అయిన-వారల+అందున్= తమకు వశులైన వాళ్ళలో; పుణ్యంబు; తొలఁగని+అతఁడు= తొలగనివాడు; తొలఁగున్= ఆ మార్గం నుంచి తొలగుతాడు; భాగ్యంబు+తొలఁగువాఁడు= నిర్భాగ్యుడు; తొలఁగన్+నేరఁడు= తొలగలేదు, అపమార్గంలోనే నడుస్తాడు.

తాత్పర్యం: ఆప్తులైన వాళ్ళు తగినవిధంగా తమ మిత్రులను అపమార్గం పట్టిపోకుండా ఇవతలకి లాగుతారు. కాని, ఆ వశులైన వాళ్ళలో పుణ్యాత్ముడు దుర్మార్గం నుంచి తొలగుతాడు. నిర్భాగ్యుడు తొలగలేడు.

క. **మతిమంతు లైనవారికి । హితులగు వెరవుగలవార లెఱిఁగింతురు దు**
స్థితి గాకుండఁగఁ గార్యము । గతి యొత్తియుఁ దప్ప లిడియుఁ గడవఁ బలికియున్. **80**

ప్రతిపదార్థం: మతిమంతులు+ఐన వారికిన్= బుద్ధిమంతులైన వాళ్ళకు; హితులు+అగు వెరవు+కలవారలు= మిత్రులైన ఉపాయశాలులు; దుస్థితి; కాక+ఉండఁగన్= కాకుండా; కార్యము గతి= కార్యపద్ధతి; ఒత్తియున్= పీడించే; తప్పులు+ఇడియున్= అపరాధం మోపి; కడవన్+పలికియున్= తొలగిపోయేటట్లు మాటలు అనీ; ఎఱిఁగింతురు= బోధిస్తారు.

తాత్పర్యం: మిత్రులైన ఉపాయశాలులు బుద్ధిమంతులైన వాళ్ళకు చెడిపోకుండా కార్యపద్ధతిని పీడించీ, అపరాధం మోపీ, తొలగిపోయేటట్లు మాటలను అనీ బోధిస్తారు.

క. **నా పలుకునట్టి యాగ్రహ । దీపితుఁ డగు టుడిగి మదికిఁ దిన్నఁదనము నీ**
వాపాదింపుము చలమును, । గోపముఁ గ్రౌర్యంబు విడువు గుణరత్ననిధీ! **81**

ప్రతిపదార్థం: గుణ రత్న విధీ!= రత్నాలవంటి గుణాలకు - సద్గుణాలకు నిధానమైనవాడా! అశ్వత్థామా!; నా పలుకు+పట్టి= నా మాట విని; ఆగ్రహ దీపితుఁడు+అగుట= కోపంతో మండిపడేవాడు అవటం; ఉడిగి= మాని - కోపోద్రేకం విడిచిపెట్టి; మదికిన్= మనస్సుకి; నీవు; తిన్నఁదనము= బుజుత్వం - నిర్వక్రత; ఆపాదింపుము= కలిగించుము; చలమును= పట్టుదలా; కోపమున్= కోపమూ; క్రౌర్యంబున్= క్రూరత్వమూ; విడువు(ము)= విడిచిపెట్టుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సద్గుణనిధీ - అశ్వత్థామా!; నా మాట విని, కోపోద్రేకం విడిచిపెట్టి, నీ మనస్సుకు తిన్నదనాన్ని కలిగించుము. పట్టుదలా, కోపమూ క్రూరత్వమూ విడిచిపెట్టుము.

వ. 'అట్లైనం బశ్చాత్తాపంబునం బడవు, నిద్రించినవానిని, నాయుధంబులు విడిచినవానిని, వాహన వైకల్యంబు నొందినవానిని, శరణుసొచ్చినవానిని, దలవీడినవానిని వధియించుట ధర్మంబుగా; దీ సమయంబున సమస్త సైన్యంబును, బాండవ పాంచాలురు నిద్రవోవుదురు. నిదుర సావునట్టిదికాదె? పీనుంగులుం బోలెఁ బడి యున్న వారిం బొడిచి పాపంబు గట్టుకొని నరకంబునఁ బడుట మేలె? మహాస్త్రవిదులగు రథికముఖ్యుల యందు మేటి యనంబరఁగి యింతకు మున్నేమిటం గల్మషంబు లేని నీయట్టివాని కిట్టి దుష్కర్మంబు గర్తవ్యం బగునె? యిది మడుఁగుఁ జీరయందు మసి దాఁకినట్లయ్యెడు. సూర్యసంకాశుండవగు నీవు సూర్యోదయ సమయంబునఁ బ్రకాశప్రకారం బైన పరాక్రమంబున కుపక్రమింపు' మనవుడు నశ్వత్థామ గృపాచార్యున కిట్లనియె; 82

ప్రతిపదార్థం: అట్లు+ఐనన్= అట్లా అయ్యే పక్షంలో; పశ్చాత్తాపంబునన్+పడవు= అను తాపంలో పడవు - తరువాత దుఃఖించాల్సిన పని నీకుండదు; నిద్రించినవానిని= నిద్రపోతున్నవాడినీ; ఆయుధంబులు విడిచినవానిని= నిరాయుధుడైన వాడినీ; వాహన వైకల్యంబున్+ఒందినవానిని= వాహనం విరిగిపోయిన వాడినీ; శరణ+చొచ్చినవానిని= శరణన్నవాడిని; తలవీడిన వాడిని= జుట్టుము వీడిన వాడినీ; వధియించుట= చంపటం; ధర్మంబు కాదు= న్యాయం కాదు; ఈ సమయంబునన్= ఇప్పుడు; సమస్త సైన్యంబును= సైన్యం అంతా; పాండవ పాంచాలురున్= పాండవులూ, పాంచాలదేశీయులూ; నిద్ర+పోవుదురు= నిద్రిస్తూ ఉంటారు; నిదుర= నిద్ర; చావు+అట్టిది కాదె?= చావులాంటిదే కాదా?; పీనుంగులున్+పోలెన్= శవాలవలె; పడి+ఉన్నవారిన్= పడి ఉన్నవాళ్ళను; పొడిచి= వధించి; పాపంబు+కట్టుకొని= పాపం మూటకట్టుకొని; నరకంబునన్+పడుటమేలె?= నరకంలో పడటం మంచిదా?; మహాస్త్రవిదులు= గొప్ప అస్త్రాలు తెలిసినవాళ్ళు; అగు; రథిక ముఖ్యుల+అందున్= రథికశ్రేష్ఠులలో; మేటి= గొప్పవాడు; అనన్+పరఁగి= అనేటట్టు ఒప్పి; ఇంతకున్+మున్ను= ఇంతకుముందు; ఏమిటన్= ఏ విషయంలోనూ కల్మషంబు= కళంకం; లేని; నీ+అట్టివానికిన్= నీలాంటి వాడికి; ఇట్టి దుష్కర్మంబు= ఇటువంటి పాడుపని; కర్తవ్యంబు+అగునె= చేయదగిందా?; ఇది; మడుఁగు+చీర+అందున్= పరిశుద్ధమైన వస్త్రంపై; మసి= మరక; తాఁకిన+అట్లు+అయ్యెడున్= అంటుకున్నట్లు అవుతుంది; సూర్య సంకాశుండవు+అగు నీవు= సూర్యుడితో సమానుడవైన నీవు; సూర్య+ఉదయ సమయంబునన్= సూర్యుడు ఉదయించేవేళ; ప్రకాశ ప్రకారంబు+ఐన= ప్రకాశించే విధంగల; పరాక్రమంబునకున్= పరాక్రమానికి; ఉపక్రమింపుము= ఆరంభించుము; అనవుడున్= అనగానే; అశ్వత్థామ, కృపాచార్యునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు;

తాత్పర్యం: 'ఆ పక్షంలో నీకు తరువాత విచారించవలసిన పని ఉండదు. నిద్రించినవాడినీ, నిరాయుధుడైన వాడినీ, వాహనం విరిగిపోయిన వాడినీ, శరణన్నవాడినీ, జుట్టుముడివీడిన వాడినీ వధించటం ధర్మంకాదు. ఇప్పుడు సైన్యం అంతా, పాండవులూ, పాంచాలురూ నిద్రపోతూంటారు. నిద్ర చావువంటిదే కాదా! శవాలవలె పడి ఉన్నవాళ్ళను చంపి పాపం మూటకట్టుకొని నరకంలో పడటం మంచిదా? అస్త్రవిద్యాపారంగతులైన రథికశ్రేష్ఠులలో గొప్పవాడు అని పేరుపొంది ఇంతవరకూ ఏ విషయంలోనూ కళంకంలేని నీవంటివాడికి ఇటువంటి పాడుపని చేయదగినదా? ఇది పరిశుద్ధమైన వస్త్రంమీద మరక ఏర్పడినట్లు ఉంటుంది. సూర్యుడితో సమానుడైన నీవు సూర్యోదయ సమయంలో ప్రకాశించే విధంగా పరాక్రమించటానికి ఆరంభించుము.' అనగానే అశ్వత్థామ కృపాచార్యుడితో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: లుప్తోపమ. 'ఇదే మడఁగు జీరయందు మది దాఁకినట్లయ్యెడు' - ఇందులో ఇది ఉపమేయం మడుఁగుఁ జీరయందు - దాఁకుట' ఉపమానం 'అట్లు' ఉపమావాచకం. సామాన్యధర్మం లోపించింది. కాబట్టి ఇక్కడ అలంకారం లుప్తోపమ.

సీ. 'నీ చెప్పినది యెల్ల నిజము; శాసింపంగఁ । దగువాఁడవై హితం బగు తెఱంగు
నా కెఱింగించితి; నీ కేను జెప్పెద । నేర్పడ వినుమయ్య యెల్ల నృపులు
గనుఁగొనుచుండ మజ్జనకుని సన్న్యస్త । శస్త్రుని నట్లు పాంచాల రాజ
సుతుఁడు ధృష్టద్యుమ్నుఁ డతి పాతకం బని । కొంకక తల పట్టుకొని వధించె;

ఆ. భీష్ము నా శిఖండి పేరఁ గృత్రిమ సమ । రమున నర్జునుండు సమయఁజూచె;
నరద ముర్విఁ గ్రుంగి యనువు దప్పిన డిగ్గి । యెత్తుచుండఁ గర్ణు నేసె నరుఁడు.' 83

ప్రతిపదార్థం: నీ చెప్పిన+అది+ఎల్లన్= నువ్వు చెప్పినదంతా; నిజము; శాసింపంగన్+తగు వాఁడవు+ఐ= ఆజ్ఞాపించదగిన వాడవయి; హితంబు+అగు తెఱంగు= మేలయినరీతి; నాకున్; ఎఱింగించితి వి= తెలిపావు; నీకున్; ఏన్; చెప్పెదన్; ఏర్పడన్= స్పష్టంగా; వినుమయ్య= వినుము; ఎల్ల నృపులున్= రాజులందరూ; కనుఁగొనుచున్+ఉండన్= చూస్తూండగా; మత్+జనకునిన్= నా తండ్రిని (ద్రోణుడిని); సన్న్యస్త - శస్త్రునిన్= సన్న్యసించిన శస్త్రాలు గలవాడిని - శస్త్రాలు విడిచిపెట్టినవాడిని; అట్లు= ఆ విధంగా; పాంచాల రాజ సుతుఁడు= పాంచాల రాజయిన ద్రుపదుడి కొడుకు; ధృష్టద్యుమ్నుఁడు; అతి పాతకంబు+అని= మిక్కిలి పాపం అని; కొంకక= సందేహించకుండా; తలపట్టుకొని; వధించెన్= చంపాడు; అర్జునుండు; భీష్మున్; ఆ శిఖండి పేరన్= ఆ శిఖండి మిషతో; కృత్రిమ సమరమునన్= మోసపు యుద్ధంలో; సమయన్+చూచెన్= చంపాడు; అరదము= రథం; ఉర్విన్= భూమిలో; క్రుంగి= దిగబడి; అనువు+తప్పినన్= వీలు తప్పితే; డిగ్గి= దిగి; ఎత్తుచున్+ఉండన్= ఎత్తుతూ ఉండగా; నరుఁడు= అర్జునుడు; కర్ణున్= కర్ణుడిని; ఏసెన్= చంపాడు.

తాత్పర్యం: 'నీవు చెప్పినదంతా నిజం. ఆజ్ఞాపించదగినవాడవై నాకు హితం ఉపదేశించావు. నీకు నేను చెపుతాను సావధానంగా వినుము. రాజులందరూ చూస్తూండగా నా తండ్రిని - అస్త్రసన్న్యాసం చేసినవాడిని ఆ విధంగా ద్రుపదుడి కొడుకు ధృష్టద్యుమ్నుడు మహాపాపం అని సందేహించక తలపట్టుకొని చంపాడు. అర్జునుడు భీష్ముడిని ఆ శిఖండి వంకతో మోసపు యుద్ధంలో చంపాడు. రథం భూమిలో కూరుకుపోయి వీలు తప్పితే దిగి దానిని ఎత్తుతూండగా అర్జునుడు కర్ణుడిని చంపాడు.

ఆ. చేయి నరుఁడు దునుమఁ బ్రాయోపవేశ ప్ర । వృత్తిమైఁ బ్రశాంత చిత్తుఁడైన
పుణ్యపురుషు నట్టి భూరిశ్రవునిఁ గృష్ణు । ననుజుఁ డట్లు సంపె నాగ్రహమున. 84

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; చేయి; తునుమన్= ఖండించగా; ప్రాయోపవేశ ప్రవృత్తిమైన్= ఆమరణ నిరాహారదీక్షతో; ప్రశాంత చిత్తుఁడు+ఐన= మిక్కిలి శాంతంగల మనస్సుగలవాడైన; పుణ్యపురుషున్= పుణ్యాత్ముడిని; అట్టి= అటువంటి; భూరిశ్రవునిన్; కృష్ణు+అనుజుఁడు= కృష్ణుడి తమ్ముడు - సాత్యకి; ఆగ్రహమునన్= కోపంతో; అట్లు= ఆ విధంగా; చంపెన్= చంపాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అర్జునుడు చేయి నరకగా, ఆమరణ నిరాహారదీక్షపూని ప్రశాంత మనస్సుతో ఉన్న పుణ్యాత్ముడు భూరిశ్రవుడిని కృష్ణుడి తమ్ముడు సాత్యకి కోపంతో ఆ రీతిగా చంపాడు.

చ. పలువురు గూడి కౌరవనృపాలకు నొక్కరుఁ జుట్టుముట్టి వి
చ్చలవిడిఁ బాపకర్మ మనుశంక యొకించుకయేని లేక యూ
రులు గద నుగ్గుసేయఁగ మరుత్సుతునిం బురికొల్పి; రిన్ని భం
గుల మును వారె కాదె చెడఁగ్రొచ్చిరి సంగరధర్మసేతువున్? 85

ప్రతిపదార్థం: పలువురు+కూడి= అనేకులు కూడి; కౌరవనృపాలకున్+ఒక్కరున్= కురురాజైన దుర్యోధనుడిని ఒక్కడినీ; చుట్టుముట్టి= ముట్టడించి; విచ్చలవిడిన్= నిరాటంకంగా; పాపకర్మము= దుష్కృత్యం; అను శంక= అనే సంశయం; ఒకించుకయేనిన్= కొంచెంకూడా; లేక; గదన్= గదతో; ఊరులు= తొడలు; నుగ్గు+చేయఁగన్= విరుగగొట్టడానికి; మరుత్సుతునిన్= వాయుపుత్రుడిని - భీముడిని; పురికొల్పిరి= ప్రేరేపించారు; ఇన్ని భంగులన్= ఇన్నివిధాలుగా; మును= పూర్వం; సంగరధర్మ సేతువున్= యుద్ధధర్మం అనే వంతెనను; వారెకాదె!= వారేకదా!; చెడఁగ్రొచ్చిరి= పాడుచేశారు.

తాత్పర్యం: 'అనేకులు కలిసి దుర్యోధనుడిని ఒక్కడినీ ముట్టడించి నిరాటంకంగా దుష్కృత్య మనే సంశయం కొంచెంకూడా లేకుండా గదతో తొడలు విరుగగొట్టు మని భీముడిని ప్రేరేపించారు. ఇన్నివిధాలుగా ముందు వాళ్ళే కదా యుద్ధధర్మం అనే వంతెనను పాడుచేసింది.

విశేషం: అలం: రూపకం. 'సంగరధర్మ సేతువున్' అనేచోట సంగరధర్మం అనే సేతువుని అని ఉపమేయోపమానాలకి అభేదం చెప్పబడటం చేత అలంకారం రూపకం.

వ. వారి నెట్లు నిందింపవు! మమ్ము నెట్లు వారించెద? వాలింపుము. 86

ప్రతిపదార్థం: వారిన్= ఆ పాండవుల్ని; ఎట్లు నిందింపవు?= తిట్టవెందుచేత?; మమ్మున్; ఎట్లు; వారించెదవు?= అడ్డగిస్తున్నావు; ఆలింపుము= వినుము.

తాత్పర్యం: వాళ్ళని నిందించవేమి? మమ్మల్ని అడ్డగిస్తావేమి? వినుము.

అ. 'తొడలు విఱిగి నేలఁ బడియుండి ననుఁ గని । మానవేంద్రుఁ డట్లు దీనవృత్తి
నాడెఁ గొన్ని మాట; లవి యంతరంగంబు । నందుఁ జిక్కి కినుక యలఁత సేసె.' 87

ప్రతిపదార్థం: తొడలు; విఱిగి; నేలన్= నేలమీద; పడి+ఉండి; మానవేంద్రుఁడు= నరపతి - దుర్యోధనుడు; ననున్+కని= నన్ను చూచి; అట్లు= ఆ రీతిగా; దీనవృత్తిన్= విచారంతో; కొన్ని మాటలు; అడెన్= పలికాడు; అవి= ఆ మాటలు; అంతరంగంబునందున్= నా మనస్సులో; చిక్కి= నాటుకొని; కినుక= కోపం; అలఁత= బాధ; చేసెన్= కలిగించాయి.

తాత్పర్యం: 'తొడలు విరిగి నేలమీద పడి ఉండి నన్ను చూచి దుర్యోధనుడు ఆ రీతిగా విచారంతో కొన్ని మాటలు పలికాడు. అవి నా మనస్సులో నాటుకొని కోపం తెప్పించి బాధను కలిగించాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. వాని వెలార్పవలయు; మజ్జనక హనన సంతుష్టుండగు ధృష్టద్యుమ్నుండు లోనైన యప్పాపాత్ములఁ బాపంబు తెరువున రూపుమాపెద; దీనంజేసి కీటజన్మంబు పాటిల్లినను మేల కాని యీ కడంక మాననేర; నన్ను వారింప నెవ్వరి వశంబగు?' నని దిగ్గనలేచి యగ్గురుతనయుండు రథంబెక్కినం గనుంగొని యగ్గౌతముం డును గృతవర్ముండు. 88

ప్రతిపదార్థం: వానిన్= వాటిని; వెలార్పవలయున్= బయలుపరచాలి; మత్+జనక హనన= నా తండ్రిని చంపటంచేత; సంతుష్టుండు+అగు= సంతుష్టుడయిన; ధృష్టద్యుమ్నుండు; లోను+ఐన= మొదలైన; ఆ+పాప+ఆత్ములన్= ఆ దురాత్ములను; పాపంబు తెరువునన్= అధర్మమార్గంలో; రూపుమాపెదన్= చంపుతాను; దీనన్+చేసి= ఇందువల్ల; కీట జన్మంబు= పురుగు పుట్టుక; పాటిల్లినన్= కలిగినా; మేలు+అ= మంచిదే; కాని; ఈ కడంకన్= ఈ ప్రయత్నం; మానన్+నేరన్= మానలేను; నన్నున్= నన్ను; వారింపన్= అడ్డగించటానికి; ఎవ్వరి వశంబు+అగున్?+అని= ఎవరి తరమౌతుందని; దిగ్గనన్+లేచి= తటాలున లేచి; ఆ+గురు తనయుండు= ఆ గురుపుత్రుడు అశ్వత్థామ; రథంబు; ఎక్కినన్= ఎక్కగా; కనుంగొని= చూచి; ఆ+గౌతముండును= ఆ కృపాచార్యుడూ; కృతవర్మండున్= కృతవర్మా-

తాత్పర్యం: 'ఆ మాటలను బయలుపరచాలి. నా తండ్రిని చంపి సంతోషించే ధృష్టద్యుమ్నుడూ మొదలైన ఆ దురాత్ములను అధర్మమార్గంలో చంపుతాను. దానివలన నాకు పురుగు పుట్టువు కలిగినా మంచిదే కాని ఈ ప్రయత్నం మానలేను. నన్ను ఆపడం ఎవరితరం? అని తటాలున లేచి అశ్వత్థామ రథం ఎక్కటం చూసి కృపాచార్యుడూ, కృతవర్మా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ధృష్టద్యుమ్నాదులు 'పాపాత్ములు' కావున వాళ్ళను 'పాపంబు తెరువు' ననే రూపుమాపుతానని అశ్వత్థామ సమర్థన. అశ్వత్థామ మాటలలో అతడి దృఢనిశ్చయత్వం తెలుస్తుంది.

ఆ. 'ఏక నిశ్చయమున నిట యేఁగుదెంచితి । మనఘ! నీవు నేము నధిపు పనికి;
నిట్టి మమ్ము వేఱు పెట్టి యెక్కటి కార్య । మాచరించువాఁడ వగుట దగునె?' 89

ప్రతిపదార్థం: అనఘ= పాపంలేనివాడా! అశ్వత్థామా!; నీవున్+ఏమున్= నీవూ, మేమూ; అధిపు పనికిన్= రాజు పనిమీద; ఏక నిశ్చయమునన్= ఒకే నిర్ణయంతో; ఇట ఏఁగుదెంచితిమి= ఇక్కడికి వచ్చాము; ఇట్టి మమ్మున్= ఇటువంటి మమ్ములను; వేఱుపెట్టి= వేరుచేసి; ఎక్కటి= నీవు ఒక్కడివే; కార్యము= పని; ఆచరించువాఁడవు+అగుట= చేసేవాడివవటం; తగునె?= ఉచితమా?

తాత్పర్యం: 'పాపరహితుడవైన అశ్వత్థామా! నీవూ, మేమూ రాజు పనిమీద ఇక్కడికి ఏకాభిప్రాయంతో వచ్చాము. ఇటువంటి మమ్మల్ని వేరుచేసి నీవు ఒక్కడివే పనిచేయటం తగునా?'

చ. అనవుడు నాతఁడిట్టులను నమ్మహితాత్ముల కే నవశ్యముం
జని ద్రుపదాత్మజుం బొదివి చంపెద దుర్గతిఁబోవుచావుగా
ఘనభుజశక్తి శౌర్యము నకంపిత ధైర్యమునున్ వెలుంగ; మీ
రును దెలివొంది కూడికొన రూఢికి నెక్కుద మెల్ల భంగులన్.' 90

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; అతఁడు= అశ్వత్థామ; ఆ+మహిత+ఆత్ములకున్= ఆ మహాశయులతో - కృపకృతవర్మలతో; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అంటాడు; ఏను= నేను; అవశ్యమున్= తప్పకుండా; చని= వెళ్ళి; ద్రుపద+ఆత్మజున్= ద్రుపద పుత్రుడైన ధృష్టద్యుమ్నుడిని; పొదివి= ఆక్రమించి; ఘన భుజశక్తి= గొప్ప భుజబలమూ; శౌర్యమున్= పరాక్రమమూ; అకంపిత ధైర్యమునున్= చలించని ధైర్యమూ; వెలుంగగన్= ప్రకాశించగా; దుర్గతిన్+పోవు చావు+కాన్= దుర్గతికి పోయే చావుగా; చంపెదన్= చంపుతాను; మీరును= మీరుకూడా; తెలివొంది= తెలివికలిగి; కూడికొనన్= నాతో కలిస్తే; ఎల్ల భంగులన్= అన్ని విధాలా; రూఢికిన్+ఎక్కుదము= ప్రసిద్ధి కెక్కుతాం.

తాత్పర్యం: కృపకృతవర్మ లట్లా అనగానే అశ్వత్థామ ఆ మహాశయులతో ఇట్లా అన్నాడు: 'నేను తప్పకుండా వెళ్ళి ధృష్టద్యుమ్నుడిని చుట్టుముట్టి, గొప్ప భుజబలమూ, పరాక్రమమూ, చలించని ధైర్యమూ ప్రకాశించగా, వాడు దుర్గతికి పోయే చావు చచ్చేటట్లు చంపుతాను. మీరుకూడా తెలివికలిగి నాతో కలిస్తే అన్నివిధాలా ప్రసిద్ధికెక్కుతాం.'

విశేషం: ఆ పనిలో వాళ్ళు తనతో కలవటం తెలివీ, కలవకపోవటం అజ్ఞానమూ అని అశ్వత్థామ అంటున్నాడు. 'మీరు తెలివిగా నాతో కలిస్తే కలవండి. మీరు కలవకపోయినా నేనొక్కడినే నా పరాక్రమం చూపి వాడిని దుర్మరణం పాలు చేస్తా' నని అశ్వత్థామ తన నిశ్చితాభిప్రాయం చెపుతున్నాడు.

ఆ. 'ఒండు తలఁపు లుడిగి రం' డని పోవ, నా । రథికవరులు గడఁగి రథము లెక్కి
మొనసి చనిరి వారు ముప్పురు నగ్నిత్ర । యంబుఁ బోలి యొప్పి యప్ప డధిప! 91

ప్రతిపదార్థం: ఒండు తలఁపులు= వేరే ఆలోచనలు; ఉడిగి= మాని; రండు; అని; పోవన్= అశ్వత్థామ వెళ్ళగా; అధిప!= ఓ రాజా! ధృతరాష్ట్రా! అప్పుడు; ఆ రథికవరులు= ఆ రథిక శ్రేష్ఠులిద్దరూ; కడఁగి= పూని; రథములు+ఎక్కి; మొనసి= సంసిద్ధులై; వారు ముప్పురున్= వాళ్ళు ముగ్గురూ; అగ్ని త్రయంబున్= మూడగ్నులను పోలి; ఒప్పి; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: 'వేరే ఆలోచనలు మాని నాతో రండి' అని అశ్వత్థామ పోతూ ఉంటే ధృతరాష్ట్రా! అప్పుడు ఆ రథిక శ్రేష్ఠులిద్దరూ పూని, రథాలెక్కి సంసిద్ధులై, ముగ్గురూ త్రేతాగ్నులవలె ఒప్పి వెళ్ళారు.

విశేషం: అలం: ఉపమ. అశ్వత్థామా, కృపుడూ, కృతవర్మా - ఈ ముగ్గురూ మూడగ్నులతో పోల్చబడ్డారు కాబట్టి ఇక్కడ అలంకారం ఉపమ. అగ్నిత్రయం - గార్హపత్యం, దక్షిణాగ్ని, ఆహవనీయం.

వ. అట్లు చని నిద్రావివశం బైన పాండవ శిబిరంబు డగ్గఱి' రనిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 92

ప్రతిపదార్థం: అట్లు; చని= వెళ్ళి; నిద్రా వివశంబు+ఐన= నిద్రతో ఒళ్ళు తెలియనిదైన; పాండవ శిబిరంబున్= పాండవుల బిడారాన్ని; డగ్గఱిరి= సమీపించిరి; అనినన్= అని సంజయుడు చెప్పగా; విని; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఆ రీతిగా వెళ్ళి, నిద్రతో ఒళ్ళు తెలియక పడి ఉన్న పాండవుల సేనను సమీపించారు' అని సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు:

ఆ. 'రాజుఁ గూల్చి జయముఁ దేజంబుఁ బొందిన । యత్యుదగ్ర విభవు లైన యరుల
శిబిర మాక్రమింపఁ జిత్తంబులందుఁ దెం । పొదవి ముువ్వురట్లు గదియు టరిది! 93

ప్రతిపదార్థం: రాజున్= రాజును - దుర్యోధనుడిని; కూల్చి= పడగొట్టి; జయమున్= గెలుపూ; తేజంబున్= తేజస్సూ; పొందిన; అతి+ఉదగ్ర విభవులు+ఐన= మిక్కిలి గొప్ప వైభవం; కలవారైన; అరుల= శత్రువులయొక్క; శిబిరము= బిడారం - స్కంధావారం; ఆక్రమింపన్= ముట్టడించటానికి; చిత్తంబుల+అందున్= మనస్సులలో; తెంపు= సాహసం; ఒదవి= కలిగి; ముువ్వురు; అట్లు; కదియుట= సమీపించటం; అరిది!= ఆశ్చర్యం!

తాత్పర్యం: 'దుర్యోధనుడిని పడగొట్టి గెలుపూ, తేజస్సూ పొందిన మహావైభవోపేతులైన శత్రువుల స్కంధావారాన్ని ఆక్రమించటానికి మనస్సులలో సాహసం కలిగి ముగ్గురూ అట్లా సమీపించటం ఆశ్చర్యకరం.

విశేషం: తన వాళ్ళు శత్రువులపై పరాక్రమించారంటే ధృతరాష్ట్రుడికి చాలా సంతోషం.

వ. వారు చేసిన విధంబు వివరింపు' మనిన నా సూతసుతుండు విచిత్రవీర్యనందనున కి ట్లనియె. 'నట్ల శిబిర ద్వార ప్రదేశంబునకు నడచి సహాయులం గడచి యశ్వత్థామ యుద్దామరభసంబునఁ జన నుత్సహించె, నట్టియెడ. 94

ప్రతిపదార్థం: వారు చేసిన విధంబు వివరింపుము; అనినన్= ఆ సూతసుతుండు= అసూతపుత్రుడు సంజయుడు; విచిత్రవీర్య నందనునకున్= విచిత్రవీర్యుడి కొడుకైన ధృతరాష్ట్రుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అట్లు; శిబిర ద్వార ప్రదేశంబునకున్= శిబిర ద్వార దేశానికి; నడచి; సహాయులన్= తోడుగా వచ్చిన వాళ్ళని - కృపకృతవర్మలను; కడచి= అతిక్రమించి; అశ్వత్థామ; ఉద్దామ రభసంబునన్= అధికమైన కోపావేశంతో; చనన్= పోవటానికి; ఉత్సహించెన్= యత్నించాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: వాళ్ళు ఏం చేశారో వివరంగా చెప్పుము' అంటే, ఆ సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: 'అట్లా శిబిర ద్వారం దగ్గరికి నడచి తనకు తోడుగా వచ్చిన కృపకృతవర్మలను అతిక్రమించి అశ్వత్థామ మిక్కిలి కోపావేశంతో పోవాలని యత్నించాడు. ఆ సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం).

అశ్వత్థామకు శివుఁడు భూతాకృతియై తోఁచుట (సం. 10-6-1)

సీ. క్షరితశోణితమగు శార్దూల చర్మంబు । పరిధానకరణి విభాసితముగ;
నురగాత్మకములైన యుపవీతములు హార । ములు నంగదంబులు పొలుపుమిగుల;
వివృతవిశాలాస్యవివరంబు నిశిత దం । ష్ట్రానికరంబు ఘోరంబు గాఁగ;
భాసుర కాంతి వికాసంబు లగు లోచ । నంబులు బహుసహస్రంబు లొప్ప;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. నుగ్రమును సుందరంబును నుజ్జ్వలంబు । నై మహాకార మద్భుత మావహింప
భూత మొక్కటి భీషణ స్ఫురణ మెసక । మెసఁగ నగ్గురుపుత్రు కట్టెదుర నిలిచె. 95

ప్రతిపదార్థం: క్షరిత శోణితము+అగు= కారిన రక్తం కలదైన; శార్దూల చర్మంబు= పులితోలు; పరిధాన కరణిన్= వస్త్రం లాగా; విభాసితముగన్= ప్రకాశించగాను; ఉరగాత్మకములైన= పాములే అయిన; ఉపవీతములున్= జందెములూ; హారములున్= ముత్యాపేరులూ; అంగదంబులు= భుజకీర్తులూ; పొలుపు మిగులన్= ప్రకాశించగాను; వివృత విశాల+అస్య వివరంబు= తెరవబడ్డ పెద్ద ముఖరంధ్రమూ; నిశిత దంష్ట్రా నికరంబు= వాడి కోరల సమూహమూ; ఘోరంబు+కాఁగన్= భయంకరంగా ఉండగాను; భాసుర కాంతి వికాసంబులు= ప్రకాశించే కాంతుల మెరుపులు గలవి; అగు; లోచనంబులు= కళ్ళు; బహు సహస్రంబులు= పెక్కువేలు; ఒప్పన్= ఒప్పగాను; ఉగ్రమును= భయంకరమూ; సుందరంబును= అందమైనదీ; ఉజ్జ్వలంబున్+ఐ= ప్రకాశించేదీ అయి; మహాకారము= పెద్దరూపం; అద్భుతము= ఆశ్చర్యం; ఆవహింపన్= కలిగించగాను; భూతము+ఒక్కటి= ఒక భూతం; భీషణ స్ఫురణము= భయంకరస్ఫూర్తి; ఎసకము+ఎసఁగన్= కలిగేటట్లు; ఆ+గురుపుత్రు= ఆ అశ్వత్థామ; కడు+ఎదురన్= ఎట్టయెదుట; నిలిచెన్.

తాత్పర్యం: రక్తం కారే పులితోలు వస్త్రంవలె ప్రకాశిస్తూండగా; పాములు జందెములుగా, ముత్యాలపేరులుగా, భుజకీర్తులుగా ఒప్పుతూ ఉండగా; తెరచుకొన్న పెద్ద నోటి రంధ్రమూ, అందులోని వాడికోరల సమూహమూ భయంకరం కాగా, ప్రకాశించే కాంతులతో మెరిసే వేలకొద్దీ కళ్ళు ఒప్పగా, భయంకరమూ, సుందరమూ ప్రకాశించేదీ అయి పెద్ద రూపం ఆశ్చర్యం కలిగిస్తూ ఉండగా ఒక భూతం వెరపు కలిగించేటట్లు ఆ అశ్వత్థామ ఎట్టఎదుట ప్రత్యక్షమైనది.

క. విను మా భూతం బిట్టిది । యని కలరూ పేర్పటింప నమరులకు వశం
బె? నరేంద్ర! తదాకృతి గనుఁ । గొనినన్ భేదిల్లవలయుఁ గొండకు నైనన్ 96

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= రాజా!; ధృతరాష్ట్రా!; వినుము; ఆ భూతంబు; ఇట్టిది= ఇటువంటిది; అని; కలరూపు= యథార్థం; ఏర్పటింపన్= నిరూపించటానికి; అమరులకున్= దేవతలకైనా; వశంబు+ఎ?= తరమా?; తద్+ఆకృతి= దాని ఆకారం; కనుంగొనినన్= చూస్తే; కొండకున్+ఐనన్= కొండకైనా; భేదిల్లన్ వలయున్= బ్రద్దలవాల్సిందే.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! వినుము. ఆ భూతం ఇటువంటిదని యథార్థ్యం నిర్ణయించటానికి దేవతలకు కూడా తరంకాదు. దాని ఆకారం చూస్తే కొండ అయినా బ్రద్దలవాల్సినదే.

విశేషం: 'అమరులకు వశంబె' - అమరులకు కూడా తరం కాదన్నప్పుడు మర్త్యులమాట. వేరే చెప్పాలా? అని ధ్వనించటం చేత కావ్యార్థాపత్త్యలంకార ధ్వని. అలాగే 'కొండకు నైనన్ భేదిల్లవలయున్' అనటంచేత స్థిరస్వరూపమైన కొండే భేదిల్లితే చరస్వరూపాలైన మనుష్యులమాట వేరే చెప్పనక్కరలేదని ధ్వనించటం వలన అక్కడకూడా కావ్యార్థాపత్త్యలంకార ధ్వని.

వ. ఇ ట్లతని యగ్రభాగంబున నావిర్భూతం బైన యమ్మహాభూతంబు నాస్యకుహరంబున, నాసికా వివరంబులఁ, జెవులఁ, గన్నుల, నన్నింట మంటలు వెడలి మింట నడరఁ దదీయతనుతేజోమరీచిసంఘంబుల శంఖ చక్రగదాహస్తులై హృషీకేశు లనేకులు వెడలి; రి ట్లఖిలభూతభయంకరంబగు నమ్మహాభూతంబు నాలోకించి యవ్వీరవరుండు. 97

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్లు; అతని; అగ్రభాగంబునన్= ఎదుట; అవిర్భూతంబు+ఐన= పుట్టిన; ఆ+మహత్ భూతంబు+అస్య కుహరంబునన్= ఆ మహాభూతంయొక్క గుహవంటి నొటిలోనూ; నాసికా వివరంబులన్= ముక్కు రంధ్రాలలోనూ; చెవులన్; కన్నులన్; అన్నింటన్= మంటలు; వెడలి; మింటన్= ఆకాశంలో; అడరన్= విజృంభించగా; తదీయ తను తేజస్+మరీచి సంగంబులన్= దానిదైన శరీరకాంతి కిరణాల సమూహాల్లోంచి; శంఖ చక్ర గదా హస్తులు+ఐ= శంఖం, చక్రం, గద, చేతుల్లో గలవారై; హృషీకేశులు= విష్ణులు; అనేకులు= పెక్కుమంది; వెడలిరి; ఇట్లు= ఈ విధంగా; అఖిల భూత భయంకరంబు+అగు= ఎల్ల ప్రాణులకు వెరపు కలిగించే దయిన; ఆ+మహా+భూతంబున్= ఆ మహాభూతాన్ని; ఆలోకించి= చూచి; ఆ+వీరవరుండు= ఆ వీరశ్రేష్ఠుడు - అశ్వత్థామ.

తాత్పర్యం: ఈ రీతిగా అతడి యెదుట పుట్టిన ఆ మహాభూతం గుహలాంటి నోట్లోనూ, ముక్కు రంధ్రాల్లోనూ, చెవుల్లోనూ, కన్నులలోనూ - అన్నిటిలోనూ మంటలు వెలువడి ఆకాశంలో విజృంభించగా, దాని శరీరకాంతి కిరణాల్లోనుండి శంఖం, చక్రం, గదా, ధరించిన విష్ణువు లనేకులు వెలువడ్డారు. ఇట్లా సర్వప్రాణులకూ వెరపు పుట్టించే ఆ మహాభూతాన్ని చూసి ఆ వీరశ్రేష్ఠుడైన అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **హృదయమునం గలంక యొకయించుక యేనియు లేక వీర సం**
పద యలరంగ భల్లముఖ బాణతతుల్ నిగిడింపఁ బెద్దగా
వదనము విచ్చి భూత మనివార్య విధంబునఁ ద్రావె బాడబం
బుదధిజలంబు ద్రాగెడు మహోగ్ర సముద్ధతి వాని నన్నిటిన్. **96**

ప్రతిపదార్థం: హృదయమునన్= మనస్సులో; కలంక= జంకు; ఒక+ఇంచుక+ఏమనియున్= కొంచెంకూడా; లేక; వీర సంపద= పరాక్రమ సంపద; అలరంగన్= ఒప్పేటట్లు; భల్లముఖ బాణతతుల్= భల్లమూ మొదలైన బాణాల సమూహాలు; నిగిడింపన్= ప్రయోగించగా; భూతము; పెద్దగాన్; వదనమున్= నోటిని; విచ్చి= తెరచి; బాడబంబు= బడబాగ్ని; ఉదధి జలంబు= సముద్రపునీరు; త్రాగెడు= త్రాగే; మహోగ్ర సముద్ధతిన్= మిక్కలి భయంకరమైన ఆటోపంతో; వానిన్+అన్నిటిన్= ఆ బాణాలనన్నింటినీ; అనివార్య విధంబునన్= నివారించరాని రీతిగా; త్రావెన్= త్రాగింది.

తాత్పర్యం: మనసులో ఏ మాత్రమూ బెదురులేకుండా పరాక్రమ సంపద ఒప్పేటట్లు భల్లమూ మొదలైన బాణ సమూహాలు ప్రయోగించగా, భూతం నోరు పెద్దది చేసి, బడబాగ్ని సముద్రపునీటిని అతి భయంకరంగా త్రాగే టట్లు, వాటి నన్నిటినీ నివారించరాని విధంగా మ్రింగింది.

విశేషం: అలం: ఉపమ. 'బాడబం..వానినన్నిటిన్' భూతము త్రావె' అనటంలో అలంకారం ఉపమ. అశ్వత్థామ భల్లాలను ఉదధి జలంతో పోల్చటం వలన వాటి అసంఖ్యాకత్వమూ, భూతాన్ని బాడబంతో పోల్చటం వలన దాని అనివార్యతా, భీషణత్వమూ తెలుస్తాయి.

చ. **అతుల శరంబు లట్లు వృథయైనఁ గనుంగొని ద్రౌణి రశ్మి మం**
డిత మహనీయశక్తి నిగిడించిన భూతముఁ దాఁకి యంత్యకా
లతిమిరవైరి మండల విలగ్న మహోల్కయుఁ బోలెఁ బిన్న పి
న్న తునియలై యడంగె నరనాథ! యతండు విషాద మందఁగన్. **99**

ప్రతిపదార్థం: నరనాథ!= రాజు! ధృతరాష్ట్రా!; అట్లు= ఆ రీతిగా; అతుల శరంబులు= సాటిలేని బాణాలు; వృథ+ఐనన్= వ్యర్థం కాగా; ద్రౌణి= అశ్వత్థామ; కనుంగొని= చూసి; రశ్మి మండిత మహనీయ శక్తిన్= కిరణాలచేత అలంకరించబడిన గొప్ప శక్త్యాయుధాన్ని; నిగిడించినన్= ప్రయోగించగా; (అది); భూతమున్; తాఁకి; అంత్యకాల= ప్రళయసమయపు; తిమిరవైరి= చీఁకట్ల శత్రువు అగు సూర్యుడియొక్క; మండల= బింబానికి; విలగ్న= గురిపెట్టబడిన; మహోల్కయున్+పోలెన్= గొప్ప ఉల్కవలె; అతండు= అశ్వత్తామ; విషాదము+అందఁగన్= విచారం పొందగా; పిన్న పిన్న తునియలు+ఐ= చిన్న చిన్న ముక్కలై; అడంగెన్= నశించింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! ఆ రీతిగా సాటిలేని బాణాలు వ్యర్థం కాగా అశ్వత్థామ చూచి కాంతులతో ప్రకాశించే గొప్ప శక్త్యాయుధాన్ని ప్రయోగించాడు. అది భూతాన్ని తాకి ప్రళయ కాలపు సూర్యబింబాన్ని తాకిన గొప్ప ఉల్కవలె చిన్న చిన్న ముక్కలై నశించింది. దానికి అశ్వత్థామ చింతించాడు.

విశేషం: అలం: ఉపమ. భూతం ప్రళయకాల సూర్యబింబంతోనూ, అశ్వత్థామ శక్తి చిన్న ఉల్కతోనూ పోల్చబడటంచేత ఇక్కడ అలంకారం ఉపమ. దీనివలన భూతం భయంకరత్వమూ, శక్తి అల్పత్వమూ స్పష్టమవుతున్నాయి.

చ. అలఘుతరాత్మసారుఁడగు నగ్గురుపుత్త్రుఁడు ఘోరఖడ్గమున్
బిలగతసర్పముం దిగిచి భీషణరేఖ నటించుభంగి న
గ్గలపు రయంబునం బెటికి గాఢవిముక్తము గాఁగ వైచినం
బొలుపఱి పోయె దూదిక్రియ భూతశరీరసమాగమంబునన్. 100

ప్రతిపదార్థం: అలఘుతర+ఆత్మసారుఁడు+అగు= మిక్కిలి ఎక్కువ మనోబలంగలవాడైన; ఆ+గురుపుత్త్రుఁడు= ఆ అశ్వత్థామ; ఘోర ఖడ్గమున్= భయంకరమైన కత్తిని; బిలగత సర్పమున్= కన్నంలోని పాము అయినదానిని; తిగిచి= (ఒరలోంచి) లాగి; భీషణ రేఖ= భయంకరత్వం; నటించు భంగిన్= తోచే విధంగా; అగ్గలము+రయంబునన్= అమితవేగంతో; పెటికి= విసిరి; గాఢవిముక్తము+కాఁగన్= పూర్తిగా విడుపబడినదిగా, వైచినన్= ప్రయోగించగా, భూత శరీర సమాగమంబునన్= భూతం శరీరంతో కలవటంచేత; దూదిక్రియన్= దూదివలె; పొలుపు+అఱి పోయెన్= నశించినది.

తాత్పర్యం: గొప్ప మనోబలం కల ఆ అశ్వత్థామ కన్నంలోనుండి పాము వలె ఒరలోనుంచి భయంకరమైన ఖడ్గాన్ని లాగి, వెరపు తోచే విధంగా అమితవేగంతో గట్టిగా విసరగా, అది భూతం శరీరాన్ని తాకి దూదివలె కాలి నశించింది.

విశేషం: అలం: రూపకం. ఉపమ. 'ఘోరఖడ్గమున్ బిలగత సర్పమున్'-అనేచోట ఉపమేయోపమానాలకి అభేదం చెప్పబడినది కాబట్టి, అలంకారం రూపకం. 'దూదిక్రియ' అనేచోట ఉపమేయోపమానాలకి మంచి సాదృశ్యం చెప్పబడింది కాబట్టి అలంకారం ఉపమ.

తే. సరభసంబుగఁ దోమర సమితిఁ జక్ర। వితతిఁ బరఁగించి పేర్చె నవ్వీరవర్యుఁ;
డదియు నదియును దోడ్తోడ నల్ల నగుచు। మ్రింగె నమ్మహాభూతంబు మేదినీశ! 101

ప్రతిపదార్థం: మేదినీశ!= రాజా! ధృతరాష్ట్రా!; ఆ+వీరవర్యుఁడు= ఆ వీరశ్రేష్ఠుడు అశ్వత్థామ; సరభసంబుగన్= కోపావేశంతో; తోమర సమితిన్= ఇనుపగుదియల సమూహాన్నీ; చక్ర వితతిన్= చక్రాయుధాల సమూహాన్నీ; పరఁగించి= ప్రయోగించి; పేర్చెన్= అతిశయించాడు; ఆ+మహాభూతంబు= ఆ గొప్ప భూతం; అల్లన్= మెల్లగా; నగుచున్= నవ్వుతూ; తోడ్తోడన్= వెంటనే; అదియున్+అదియును= దానినీ, దానినీ మ్రింగెన్.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! ఆ వీరోత్తముడైన అశ్వత్థామ కోపావేశంతో తోమర సమూహాన్నీ చక్ర సమూహాన్నీ ప్రయోగించి విజృంభించాడు. ఆ మహాభూతం చిరునవ్వుతో వెంటనే దానినీ దానినీ మ్రింగివేసింది.

క. అలిగి యతండు నితాంతో । జ్జ్వల గద వైచుటయు నదియు సత్వరలీలన్
జలచర మామిషముంగొను । పొలుపు నెఱయ మెఱయ మ్రింగె భూతం బధిపా! 102

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! ధృతరాష్ట్రా!; అతండు= అశ్వత్థామ; అలిగి= కోపించి; నితాంత+ఉజ్జ్వల గదన్= మిక్కిలి ప్రకాశించే గదను; వైచుటయున్= ప్రయోగించగా; భూతంబు; సత్వర లీలన్= వెంటనే; జలచరము= చేప; అమిషమున్= మాంసాన్ని; కొను= గ్రహించే, పొలుపు= విధం; నెఱయన్= బాగుగా; మెఱయన్= ప్రకాశించగా; అదియున్ మ్రింగెన్= దానిని కూడా మ్రింగింది.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! అశ్వత్థామ కోపంతో మిక్కిలి ప్రకాశించే గదను ప్రయోగించగా, భూతం వెంటనే దానిని కూడా చేప మాంసాన్ని గ్రహించే విధంగా మ్రింగింది.

విశేషం: అలం: ఉపమ. 'జలచర మామిషముం గొను పొలుపు నెఱయ మెఱయ - నదియు మ్రింగె భూతంబు' - ఉపమేయోపమానాలకి మంచి సాదృశ్యం చెప్పబడింది కాబట్టి అలంకారం ఉపమ.

ఆ. ఇవ్విధమున సకల హేతులు వమ్మయి । పోవ నతివిషణ్ణబుద్ధి యగుచు
నట్టు నిట్టుఁ జూచు నతనికి బహు జనా । ర్దనులు దోఁచి రంబరమున నెల్ల. 103

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ రీతిగా; సకల హేతులున్= అన్ని ఆయుధాలూ; వమ్ము+అయి పోవన్= వ్యర్థమయిపోగా; అతి విషణ్ణ బుద్ధి= మిక్కిలి విచారంతో కూడిన మనస్సు కలవాడు; అగుచున్= అవుతూ; అట్టున్+ఇట్టున్= అటూ ఇటూ; చూచు+అతనికిన్= చూచే అశ్వత్థామకు; అంబరమునన్+ఎల్లన్= ఆకాశంలో అంతటా; బహు జనార్దనులు= ఎందరో విష్ణువులు; తోఁచిరి= కనబడ్డారు.

తాత్పర్యం: ఈ విధంగా ఆయుధాలన్నీ వ్యర్థమయిపోగా మనస్సులో మిక్కిలి బాధపడుతూ అటూ ఇటూ చూచే అశ్వత్థామకు ఆకాశంలో అంతటా ఎంతోమంది విష్ణువులు కనబడ్డారు.

ఉ. భీకర విష్ణురూపములు పెక్కిటు లొక్కటఁ దోఁపఁ దీవ్రతా
పాకులమానసుండగుచు నగ్గురుసూనుఁడు 'దుర్మదంబునన్
జేకొననైతి నట్లు కృపు చెప్పిన సత్యహితోపదేశముల్;
నా కిది పెద్దయే?' యని మనంబున నిట్లని వల్కె వెండియున్. 104

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భీకర విష్ణు రూపములు= భయంకర విష్ణుమూర్తులు; పెక్కు= అనేకం; ఇటులు= ఈ విధంగా; ఒక్కటన్= ఒక్కుమ్మడిగా; తోఁపన్= కనబడగా; ఆ+గురు సూనుఁడు= ఆ అశ్వత్థామ; తీవ్ర తాప+ఆకుల మానసుండు+అగుచున్= అధికమైన దుఃఖంచేత కలిగిన మనస్సు కలవాడు అవుతూ; అట్లు= ఆ రీతిగా; కృపు చెప్పిన= కృపుడు చెప్పిన; సత్య హిత+ఉపదేశముల్= సత్యాలూ; శ్రేయస్కరాలూ అయిన హితోపదేశాలు; దుర్మదంబునన్= పాడుగర్వంతో; చేకొనన్+ఐతిన్= వినిపించుకొలేదు; నాకున్; ఇది= ఈ దురవస్థ; పెద్దయే= ఎక్కువా?; అని; వెండియున్= మళ్ళీ; మనంబునన్= మనస్సులో; ఇట్లు+అని+పల్కెన్= ఇట్లా తలపోశాడు.

తాత్పర్యం: భయంకర విష్ణుమూర్తులు ఈ విధంగా ఒక్కుమ్మడిగా కనబడగా అశ్వత్థామ అధిక దుఃఖంచేత మనస్సు కలిగినవాడై 'ఆ విధంగా కృపుడు చెప్పిన సత్యాలూ, శ్రేయస్కరాలూ అయిన హితోపదేశాలు దుర్గర్వంతో వినిపించుకొనలేదు. నాకీ శాస్తి ఎక్కువేమీ కాదు' అని మనస్సులో మళ్ళీ ఇట్లా తలపోశాడు.

విశేషం: 'చేతులు కాలాక ఆకులు పట్టుకొనటం వలె ఉన్నది' అశ్వత్థామ పశ్చాత్తాపం.

ఆ. 'మహిత శాస్త్ర కలిత మార్గంబు విడిచి ని । జేచ్ఛఁ బగఱ గెలువ నెవ్వఁ డరుగు
వాని నయ్యధర్మవర్తన క్రౌర్యమ । యెవ్విధమునఁ జెఱుచు నింత నిజము.' 105

ప్రతిపదార్థం: ఎవ్వఁడు; మహిత శాస్త్ర కలిత మార్గంబున్= గొప్పదైన శాస్త్రోక్త పద్ధతిని; విడిచి; నిజేచ్ఛన్= తన ఇష్టప్రకారం; పగఱన్= శత్రువులను; గెలువన్= జయించటానికి; అరుగున్= వెడతాడో; వానిన్= వాడిని; ఏ+విధమునన్= ఏ విధంగానైనా సరే; ఆ+అధర్మ వర్తన+క్రౌర్యము= ఆ ధర్మరహిత ప్రవర్తనతోడి క్రూరత్వమే; చెఱుచున్= నశింపజేస్తుంది; ఇంత నిజము= ఇది నిజం.

తాత్పర్యం: శాస్త్ర విహిత పద్ధతిని విడిచిపెట్టి తన ఇష్టం వచ్చినట్లు శత్రువులను జయించటానికి పూనుకొనే వాడిని, ఎట్లాగయినా సరే ఆ ధర్మేతరమైన క్రూరప్రవర్తనే నశింపజేస్తుంది ఇది నిజం.

సీ. గోవు, బ్రాహ్మణు, బాలకుని, వృద్ధు, నంధుని, । సఖుఁ, దోడఁబుట్టువు, జడుఁ బ్రమత్తు,
మత్తుని, గురుని, నున్మత్తుని, సుప్తుని, । నంగన, భీతుని నస్త్రశస్త్ర
నిహతి నొప్పించుట విహితంబు గాదని । యార్యులు సెప్పుదు; రట్టి ధర్మ
మార్గంబు దొఱఁగి దుర్మంత్రంబుమైఁ బగ । యడఁగింపఁ గడఁగిన నసురవృత్తిఁ

ఆ. జేట గాక కార్యసిద్ధి గా నేర్చునే? పెద్ద యెత్తికొనిన భీతి మగుడఁ
బడుట కష్టసరణి; బలిమి దయ్యముతోడఁ । జెల్ల; దింక నేమి సేయువాఁడ? 106

ప్రతిపదార్థం: గోవున్= ఆవునూ; బ్రాహ్మణున్; బాలకునిన్= బాలుడినీ; వృద్ధున్= ముసలివాడినీ; అంధునిన్= గ్రుడ్డివాడినీ; సఖున్= చెలికాడినీ; తోడఁబుట్టువున్= సోదరుడినీ; జడున్= మందుడినీ; ప్రమత్తున్= ఏమరుపాటుగా ఉన్నవాడినీ; మత్తునిన్= మైకంలో ఉన్నవాడినీ; గురునిన్= ఉపాధ్యాయుడినీ; ఉన్మత్తునిన్= పిచ్చివాడినీ; సుప్తునిన్= నిద్రించినవాడినీ; అంగనన్= స్త్రీనీ; భీతునిన్= భయపడినవాడినీ; అస్త్ర శస్త్ర నిహతిన్= అస్త్రాల శస్త్రాల దెబ్బచేత; నొప్పించుట= బాధించటం; విహితంబు= చేయదగినది; కాదని; ఆర్యులు= పూజ్యులు; చెప్పుదురు; అట్టి ధర్మమార్గంబు= అటువంటి ధర్మమార్గం; తొఱఁగి= విడిచి;

దుర్మంత్రంబుమైన్= దురాలోచనతో; అసురవృత్తిన్= రాక్షస ప్రవృత్తితో; పగ= వైరం; అడఁగింపన్= నశింపచేయటానికి; కడఁగినన్= ప్రయత్నిస్తే; చేటు+ఆ+కాక= కీడేగాని; కార్యసిద్ధి; కాన్+నేర్చునే= కాగలదా?; పెద్ద ఎత్తికొనిన భీతిన్= మిక్కిలి అతిశయించిన భయంతో; మగుడఁ బడుట= మరలటం; కష్ట సరణి= కష్టమార్గం; బలిమి= శౌర్యం; దయ్యముతోడన్= దైవంతో; భూతంతో; చెల్లదు= పనికిరాదు; ఇంకన్+ఏమి చేయువాఁడన్= ఇంకేమి చేస్తాను?

తాత్పర్యం: ఆవునూ, బ్రాహ్మణుడినీ, బాలుడినీ, ముసలివాడినీ, గ్రుడ్డివాడినీ, చెలికాడినీ, సోదరుడినీ, మందుడినీ, ఏమరినవాడినీ, మైకంలో ఉన్నవాడినీ, గురుడినీ, పిచ్చివాడినీ, నిద్రపోతూన్నవాడినీ, ఆడదానినీ, భయపడినవాడినీ, అస్త్రశస్త్రాలతో కొట్టి బాధించటం చేయదగింది కాదని పెద్దలంటారు. అటువంటి ధర్మమార్గం విడిచిపెట్టి దురాలోచనతో రాక్షస ప్రవృత్తితో వైరం అణచటానికి ప్రయత్నిస్తే కీడే కాని కార్యం నెరవేరుతుందా? మిక్కిలి అతిశయించిన భయంతో మరలగలగటం కష్టం. బలం దైవం ముందు (భూతం ముందు) పనికిరాదు. ఇంకేమి చేయటం?

ఉ. అక్రమవృత్తి గీడుతెరువై ఫలియింపద; ద్రోణసూతి దు
ర్విక్రమనింద కర్హుఁడె? సవిస్మయ మైనమనంబు భూతవృ
త్తిక్రమవేదిగాదు; గణుతింపఁగ నేమియొ యిమ్మహాద్భుత
ప్రక్రియ కాదికారణము? పాపనిరూఢుఁడు నీతిఁగాంచునే? 107

ప్రతిపదార్థం: అక్రమవృత్తి= అధర్మప్రవర్తన; కీడు తెరువు+ఐ= చేటుకు మార్గమై; ఫలియింపదు!అ= ఫలించనే ఫలించదు; ద్రోణసూతి= ద్రోణుడికొడుకు; దుర్విక్రమ నిందకున్= దుష్టపరాక్రముడు అనే నిందకు; అర్హుఁడు+ఎ?= తగినవాడా?; సవిస్మయము+ఐన మనంబు= గర్వంతో కూడుకున్న మనస్సు; భూతవృత్తి క్రమ వేది+కాదు= భూతం ప్రవర్తన క్రమం తెలిసికొనేది కాదు; గణుతింపఁగన్= ఎంచగా; ఈ+మహత్(మహా)+అద్భుత ప్రక్రియకున్= ఈ మహాశ్చర్యకరమైన కార్య విధానానికి; ఆదికారణము= మూలకారణం; ఏమియొ?= ఏమిటో?; పాప నిరూఢుఁడు= పాపంలో ప్రసిద్ధుడు; నీతిన్= కార్యపద్ధతిని; కాంచునే= తెలిసికొంటాడా?

తాత్పర్యం: అధర్మ ప్రవర్తన చేటుకి మార్గమై ఎప్పటికీ ఫలించదు. ద్రోణుడి కొడుకునైన నేను దుష్టపరాక్రముడనే నింద కర్హుడినా? గర్వితమైన మనస్సు భూతం ప్రవర్తన క్రమం తెలిసికొనలేదు. ఎంచగా మహాశ్చర్యాన్ని కలిగించే ఈ కార్యవిధానానికి మూలకారణ మేమిటో? పాపకార్యాలలో ప్రసిద్ధుడైనవాడు కార్యపద్ధతిని తెలిసికొనగలడా?'

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. అశ్వత్థామ పశ్చాత్తాపం చూడదగ్గది. నీవు పశ్చాత్తాపపడవలసి వస్తుందని కృపుడు చెప్పనే చెప్పాడు. 'పాప నిరూఢుడు నీతిఁగాంచునే?' అనే సామాన్యాంశంచేత 'అశ్వత్థామ పాపకార్యం మూలంగా భూతం ప్రవర్తనకి కారణమేమిటో తెలుసుకోలేకపోతున్నా' డనే విశేషాంశం సమర్థించబడుతున్నది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

వ. అని పెక్కు భంగుల వగచి పల్లటిల్లిన చిత్తంబుఁ బట్టుకొల్పి యిట్లని నిశ్చయించె. 108

ప్రతిపదార్థం: అని; పెక్కు భంగులన్= అనేకవిధాల; వగచి= చింతించి; పల్లటిల్లిన చిత్తంబున్= చెదరిన మనస్సును; పట్టుకొల్పి= కుదుటపరుచుకుని; ఇట్లు+అని; నిశ్చయించెన్= నిర్ణయించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని అనేకవిధాల చింతించి, చెదరిన మనస్సును కుదుటపరచుకొని ఇట్లా నిర్ణయించాడు.

వ. భావం బేకముఖంబుఁ జేసికొని యావద్ధ్వాంతభానున్, మహా
దేవుం, బర్వత కన్యకాప్రియు, దయార్ద్రీభూత చేతస్కు లో
కావిర్భావ వివర్ధనా లయకృతి వ్యాపార పారంగతున్.
దేవేంద్ర ప్రముఖామరార్చితుని భక్తి ప్రాఢతం గొల్చెదన్. 109

ప్రతిపదార్థం: భావంబు= మనస్సు; ఏకముఖంబున్= ఒకటే ఉద్దేశం; గలదానినిగా చేసికొని; ఆపద్+ధ్వాంతభానున్= ఆపదలనే చీకట్లకు సూర్యుడైనవాడూ, పర్వతకన్యకా ప్రియున్= హిమవత్పర్వత పుత్రిక అయిన పార్వతికి భర్త అయినవాడూ; దయా+అర్ద్రీభూత చేతస్కున్= దయారసంచేత తడిసినదిగా అయిన మనస్సుగలవాడూ; లోక= లోకాలయొక్క; అవిర్భావ= పుట్టుకా; వివర్ధనా= పోషణా; లయ కృతి= నాశంకరణం; (అనే); వ్యాపార= పనులందు; పారంగతున్= ఆవలి ఒడ్డును పొందినవాడూ, ఆరితేరినవాడూ; దేవ+ఇంద్ర= దేవేంద్రుడు; ప్రముఖ= మొదలైన; అమర= దేవతలచేత; అర్చితునిన్= పూజింపబడినవాడూ (అయిన); మహాదేవున్= పరమేశ్వరుడిని; భక్తిప్రౌఢతన్= భక్త్యతిశయంతో; కొల్చెదన్= సేవిస్తాను.

తాత్పర్యం: నేను నా మనస్సును కేంద్రీకరించుకొని ఆపదలనే చీకట్లకు సూర్యుడైనవాడూ, పార్వతీపతీ, దయారసంచేత తడిసిన మనస్సుకలవాడూ, లోకాలను పుట్టించటం, పోషించటం, నశింపజేయటం అనే పనులలో ఆరితేరినవాడూ, దేవేంద్రాది దేవతలచేత పూజింపబడేవాడూ అయిన మహాదేవుడిని అధికభక్తితో సేవిస్తాను.

విశేషం: అలం: రూపకం. భావం బేకముఖంబుఁ జేసికొని - చంచలమైన మనస్సుని ఏకాగ్రం చేసికొని. అపద్ధ్వాంత భానున్ - ఆపదలకీ - చీకట్లకీ; మహాదేవుడికీ - భానుడికీ అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం.

ఆ. అఖిల దేవతామయాత్ముఁ డద్దేవుఁ; డ । ట్లగుట నిఖిలదైవికాపదుదయ
నిరసనం బొనర్చు; నియతి నప్పరమేశుఁ । గొలిచి, యుపుడ కీడు దొలఁగఁ ద్రోతు.' 110

ప్రతిపదార్థం: ఆ+దేవుడు= ఆ పరమేశ్వరుడు; అఖిల దేవతా మయ+ఆత్ముఁడు= ఎల్ల దేవతలతోనూ నిండిన స్వరూపం గలవాడు; అట్లు+అగుటన్= అందుచేత; నిఖిల దైవిక+ఆపద్+ఉదయ నిరసనంబు= దైవికంగా వచ్చే అన్ని ఆపదల తొలగింపు; ఒనర్చున్= చేస్తాడు; నియతిన్= నియమంతో; ఆ+పరమ+ఈశున్= ఆ పరమేశ్వరుడిని; కొలిచి= సేవించి; ఇపుడు+అ= ఇప్పుడే; కీడు= ఆపద; తొలగన్+త్రోతున్= పోగొట్టుకుంటాను.

తాత్పర్యం: ఆ దేవుడు సర్వదేవతామయ స్వరూపుడు. అందుచేత అతడు దైవికంగా వచ్చే అన్ని ఆపదలనూ తొలగిస్తాడు. నేను ఆ పరమేశ్వరుడిని నియమంతో సేవించి ఇప్పుడే ఆపద పోగొట్టుకొంటాను.'

విశేషం: ఆధ్యాత్మికాలూ, ఆధిదైవికాలూ, ఆధిభౌతికాలూ అని ఆపదలు మూడు రకాలు. వీటినే తాపత్రయం అంటారు. ఆధ్యాత్మికాలంటే మనశ్శరీరాదుల వలన కలిగేవి. శోకమోహ జ్వరాది దుఃఖాలు. ఆధిదైవికాలంటే అగ్నీ, వాయువూ మొదలైన దేవతల వలన కలిగేవి. ఆధిభౌతికాలంటే వ్యాఘ్ర సర్పాది ప్రాణుల వలన కలిగేవి. ఇక్కడ అశ్వత్థామకు కలిగిన ఆపద ఏమిటో అంతుపట్టని ఒక భూతం వలన కలిగింది కాబట్టి ఆధిదైవికం. దానిని తొలగించుకొనాలంటే - అఖిల దేవతామయాత్ముడైన పరమేశ్వరుడే శరణ్యం. అందుచేతనే అతడినే కొలుస్తానంటున్నాడు అశ్వత్థామ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని యిట్లు నిశ్చయించి నియతుండై రథంబు డిగ్గి ధరణీతలంబునం గూర్చుండి భావంబున భూతనాథు నెల కొలిపి యక్కుంభజసంభవుండు. 111

ప్రతిపదార్థం: అని; ఇట్లు; నిశ్చయించి; నియతుండు+ఐ= నియమం గలవాడై; రథంబున్; డిగ్గి= దిగి; ధరణీతలంబునన్= నేలమీద; కూర్చుండి; భావంబునన్= హృదయంలో; భూతనాథున్= ఈశ్వరుడిని; నెలకొలిపి= స్థాపించి; ఆ+కుంభజ సంభవుండు= ఆ ద్రోణ పుత్రుడు - అశ్వత్థామ.

తాత్పర్యం: అని ఈ రీతిగా నిర్ణయించి నియమవంతుడై రథం దిగి నేలపై కూర్చొని హృదయంలో ఈశ్వరుడిని స్థాపించికొని ఆ అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

అశ్వత్థామ శివున కాత్మోపహారం బొసంగ నిశ్చయించుట (సం. 10-7-4)

సీ. 'స్థాణు, నుగ్రుని, శివు, శర్వు, నీశానుని, । భద్రప్రదుని, శంభు, రుద్రు, గిరిశు,
నవ్యయు, శ్రీకంఠు, హరుఁ, బరమేశ్వరుఁ, । బురహరు, నజుని, శంకరుఁ, ద్రినేత్రు,
బహురూపు, విశ్వరూపత్వసంవ్యాప్తుని. । నంబికా హృదయేశు, నమరవంద్యు,
గణనాథు, విభు, శూలఖట్వాంగధరు, జటా । మండలాలంకృతమౌళి, నభవు

ఆ. నాశ్రయించి యతని కాత్మోపహార మ । ర్పించువాఁడఁ గాక పెక్కు తలఁపు
లేల నాకు నమ్మహేశ్వరేశ్వరుఁ డెట్టి । గతి యొనర్చె నది సుఖంబ కాదె?' 112

ప్రతిపదార్థం: స్థాణున్; ఉగ్రునిన్; శివున్; శర్వున్; ఈశానునిన్; భద్రప్రదునిన్= శుభాలు ఇచ్చేవాడిని; శంభున్; రుద్రున్; గిరిశున్= కొండమీద పరుండేవాడివి - ఈశ్వరుడిని; అవ్యయున్= నాశనం లేనివాడివి; శ్రీకంఠున్= విషకంఠుడిని; హరున్; పరమేశ్వరున్; పురహరున్= పురత్రయాన్ని హరించినవాడిని; అజునిన్= పుట్టుకలేనివాడిని; శంకరున్= శుభాలు కలిగించేవాడిని; త్రినేత్రున్= ముక్కంటిని; బహురూపున్= అనేకరూపాలు గలవాడిని; విశ్వరూపత్వ సంవ్యాప్తునిన్= విశ్వరూపంతో బాగా వ్యాపించిన వాడిని; అంబికా హృదయ+ఈశున్= పార్వతీ హృదయాధినాథుడిని; అమరవంద్యున్= దేవతలచేత నమస్కరించదగిన వాడిని; గణనాథున్= ప్రమథాధిపతిని; విభున్= ప్రభుని; శూలఖట్వాంగ ధరున్= త్రిశూలమూ; ఖట్వాంగమనే ఆయుధమూ ధరించేవాడినీ; జటామండల+అలంకృత మౌళిన్= జడల గుంపుచేత అలంకరించబడిన శిరస్సుగలవాడిని; అభవున్= పుట్టుక లేనివాడిని; ఆశ్రయించి; అతనికిన్; ఆత్మ+ఉపహారము= ఆత్మబలిదానం; అర్పించువాఁడన్+కాక= ఇచ్చే వాడినికాని - ఇస్తాను కాని; పెక్కు తలఁపులు+ఏల?= అనేకాలోచనలు ఎందుకూ?; నాకున్; ఆ+మహేశ్వర+ఈశ్వరుఁడు= ఆ పరమేశ్వరుడు; ఎట్టి గతిన్= ఏగతి; ఒనర్చెన్= చేశాడో; అది, సుఖంబు+అ+కాదె!= మేలేకదా!

తాత్పర్యం: 'స్థాణుడినీ, ఉగ్రుడినీ, శివుడినీ, శర్వుడినీ, ఈశానుడినీ, శుభప్రదుడినీ, శంభుడినీ, రుద్రుడినీ, గిరిశుడినీ, అవ్యయుడినీ, శ్రీకంఠుడినీ, హరుడినీ, పరమేశ్వరుడినీ, పురహరుడినీ, అజుడినీ, శంకరుడినీ, త్రినేత్రుడినీ, బహురూపుడినీ, విశ్వరూపంతో అంతా వ్యాపించినవాడినీ, పార్వతీ హృదయేశ్వరుడినీ, అమరవంద్యుడినీ, ప్రమథాధిపతినీ, విభుడినీ, శూలమూ ఖట్వాంగమూ ధరించేవాడినీ, జటామండల విభూషిత శిరస్కుడినీ, అభవుడినీ ఆశ్రయించి అతడికి నేను ఆత్మబలిదానం ఇస్తాను. పలు ఆలోచన లెందుకూ? నాకు ఆ పరమేశ్వరుడు ఏ గతి నిర్ణయిస్తే అదే సుఖం కాదా!'

వ. అని తలంచి భూతకృత్యం బైన పరాక్రమ ప్రతిబంధ రూపం బుగ్గడించి. 113

ప్రతిపదార్థం: అని; తలంచి; భూతకృత్యంబు+ఐన= భూతం చేసే పనిఅయిన; పరాక్రమ ప్రతిబంధ రూపంబు= పరాక్రమానికి ఆటంకం అయినది; ఉగ్గడించి= చెప్పి.

తాత్పర్యం: అని తలచి తన పరాక్రమానికి ఆటంకం కలిగించే భూతం పనిని చెప్పి (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఏ నీ యాపదఁ గడచిన । నానా భూతోపహార నవ్యార్చన నీ
శానునిఁ బ్రీతుం జేసెదఁ । బూని ప్రమథగణము నన్నుఁ బొగడునటులుగన్.' 114

ప్రతిపదార్థం: ఏను= నేను; ఈ+ఆపదన్; కడచినన్= దాటితే; ప్రమథ గణము= ప్రమథుల సమూహం; నన్నున్= పొగడునటులుగన్= పొగిడేటట్లు; పూని= ప్రయత్నించి; నానా భూత+ఉపహార - నవ్య+అర్చనన్= అనేక ప్రాణుల బలిదానం అనే కొత్త పూజచేత; ఈశానునిన్= శివుడిని ప్రీతున్+చేసెదన్= తృప్తి పరుస్తాను.

తాత్పర్యం: 'నేను ఈ ఆపదనుంచి గట్టెక్కితే ప్రమథగణాలు నన్ను పొగిడేటట్లు పూని, అనేక ప్రాణుల బలిదానం కొత్త రకమైన పూజతో ఈశ్వరుడిని తృప్తిపరుస్తాను.

చ. అని హృదయంబునం బలుకు నమ్మహనీయచరిత్రు ముందటం
గనకపువేది దోఁచె నధికద్యుతిజాలము లుల్లసిల్ల; నం
దనలము విస్ఫురత్పటుశిఖావలి నొప్పి వెలింగె; దానికి
న్మనము దలిర్ప; నిశ్చయమునం దెలివొందె నతండు నెంతయున్. 115

ప్రతిపదార్థం: అని; హృదయంబునన్= మనస్సులో; పలుకు; ఆ+మహనీయ చరిత్రు= ఆ గొప్ప చరిత్ర గలవాడియొక్క- అశ్వత్థామయొక్క; ముందటన్= ఎదుట; అధికద్యుతి జాలములు= పెక్కుకాంతుల సమూహాలు; ఉల్లసిల్లన్= ప్రకాశించగా; కనకము+వేది= బంగారపుటరుగు; తోఁచెన్= కనబడింది; అందున్= ఆ వేదిమీద; ఆనలము= అగ్ని; విస్ఫురత్+పటు శిఖా+ఆవలిన్= ప్రకాశించే తీక్షణమైన జ్వాలల వరుసతో; ఒప్పి; వెలింగెన్; దానికిన్; అతండు= అశ్వత్థామ; మనము; తలిర్పన్= పల్లవించగా - సంతోషించగా; నిశ్చయమునన్= నిర్ణయంతో; ఎంతయున్= మిక్కిలి; తెలివి+ఒందెన్= ప్రకాశించేడు.

తాత్పర్యం: అని మనస్సులో తలచే ఆ మహనీయ చరిత్రుడైన అశ్వత్థామకు ఎదుట పలుకాంతుల సమూహంతో ఒప్పే బంగారు అరుగు కనబడింది. దానిమీద ప్రకాశించే తీక్షణ జ్వాలలతో ఒప్పి అగ్ని వెలిగింది. దానికి మనస్సు పల్లవించగా అతడు నిర్ణయంతో ఎంతో ప్రకాశించాడు.

వ. అప్పుడు ప్రదీప్తవదనులుఁ, బ్రజ్వలిత నేత్రులు, నేకపాదులుఁ, గరితురంగ సింహసూకరానన సమాన ముఖు లును, దీవ్ర దంష్ట్రాకరాళాస్యులును మఱియు ననేక ప్రకారంబులగు వక్త్రంబులం బొలుచువారును, వక్రాం గులు, దీర్ఘదేహులు, హ్రస్వశరీరులు, నతి స్థూలకాయులుఁ, గృశమూర్తులుఁ, బింగళగాత్రులు, నీలతనులు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మఱి నా నావర్ణంబులు గలుగువారును, బంచశిఖులును, జటాధారులును, గిరీటధరులును, మఱియు బహుభంగి కంబులైన మౌళితలంబులం బొలుపొందువారును లోనుగా వివిధ విశేష వికృతస్వరూపులగు నసంఖ్యాత ప్రమథులు చిత్రాంబర మాల్యాంగరాగంబులు, రత్నకనకమయ భుజగాస్థిమాలా భూషణం బులును, ధనుస్తూణ కృపాణ ముసల ముద్గర పరశు భిండివాల శూల ప్రభృతి స్ఫార ప్రహరణంబులు మెఱయ మృదంగ పణవ డమరు ఘంటా గోముఖాది తూర్యంబులు మొరయ విస్ఫుర ద్ధ్వజ పతాకాకుంచికలు శోభిల్లఁ బాడుచు, నాడుచు, నార్చుచు, బొబ్బలిడుచు, నవుడుగఱచుచుఁ, ద్రుళ్ళుచు, గురువులువాఱుచుఁ, గరటి బృంహితంబులుఁ, గంఠీరవగర్జితంబులు, శంఖరవంబులు, భేరీధ్వనులుంబోని యెలుంగులు సెలంగ,బెట్టి దంబులగు పలుదెఱంగుల పలుకు లెసంగ, బ్రహ్మద్వేషు లగువారి మాంసరుధిరంబులఁ బూర్ణంబు లగు కపాలంబులు గరతలంబులం గొని యాభీలంబు లగు భక్షణపానంబు లాచరించుచు, సోమపాన శమదమ తపోబ్రహ్మచర్య ప్రముఖంబు లగు తమ విశిష్టకర్మంబులకు భవుండు విస్మయంబు నొందుంగాని యష్ట గుణంబగు నైశ్వర్యంబు నొందియుఁదారువిస్మితులుగాని యట్టిమహానుభావు లద్దేవునకు గౌరికి గజముఖ షణ్ముఖులకంటె నర్మిలికిం బట్టగు భవ్యులు దివ్యజనస్తవ్య బఁయ్యస్త్ర గురుతనూభవు తెంపెఱుంగుటకు సౌప్తిక వ్యాపార ఘోరత్వంబుఁ గనుంగొని వినోదించుటకు వచ్చి యతని చిత్తంబునకు బెదరు పుట్టించువారై భీషణా కారంబుల నుల్లసిల్లిన నాధైర్యధుర్యుండు. **116**

ప్రతిపదార్థం: అప్పుడు; ప్రదీప్త వదనులున్= మిక్కిలి ప్రకాశించే ముఖాలు కలవారూ; ప్రజ్వలిత నేత్రులున్= మిక్కిలి మండే కళ్ళు కలవారూ; ఏకపాదులున్= ఒకే పాదం కలవారూ; కరి తురంగ సింహ సూకర+ఆనన సమానముఖులును= ఏనుగు, గుర్రం, సింహం, పంది వీటి ముఖాలవంటి ముఖాలు కలవారూ; తీవ్ర దంష్ట్రా కరాళ+ఆస్యులును= తీక్షణములైన కోరలచే భయంకరాలైన ముఖాలు కలవారూ; మఱియున్; అనేక ప్రకారంబులు+అగు= బహువిధాలైన; వక్త్రంబులన్= ముఖాలతో; పొలుచువారును= ఒప్పేవారూ; వక్ర+అంగులు= వంకర మైన శరీరాలు కలవారూ; దీర్ఘ దేహులున్= పొడవైన శరీరాలు కలవారూ; హ్రస్వ శరీరులున్= పొట్టి శరీరాలు కలవారూ; అతిస్థూలకాయులున్= మిక్కిలి లావైన శరీరాలు కలవారూ; కృశమూర్తులున్= సన్నటి శరీరాలు కలవారూ; పింగళ గాత్రులున్= గోరోచనపు వర్ణం కల శరీరాలు కలవారూ; నీల తనులున్= నల్లటి శరీరాలు కలవారూ; మఱి= ఇంకా; నానా వర్ణంబులు+కలుగువారును= పెక్కు రంగులు కలవారూ; పంచ శిఖులును= అయిదు సిగలు కలవారూ; జటాధారులును= జడలు ధరించినవారూ; కిరీట ధరులును= కిరీటాలు ధరించినవారూ; మఱియున్= ఇంకనూ; బహు భంగికంబులు+ఐన= అనేకవిధాలయిన; మౌళి తలంబులన్= శిరః ప్రదేశాలతో; పొలుపు+ ఒందువారును= ఒప్పేవారూ; లోనుగాన్= మున్నుగా; వివిధ విశేష వికృత స్వరూపులు= రకరకాల మిక్కిలి వికృతాలైన స్వరూపాలు కలవారూ; అగు; అసంఖ్యాత ప్రమథులు= లెక్కలేనంతమంది ప్రమథులు; చిత్ర-అంబర మాల్య+అంగరాగంబులు= రంగు రంగుల వస్త్రాలూ, దండలూ, మైపూతలూ, రత్న కనకమయ భుజ+అస్థి మాలా భూషణంబులును= మణులతోటీ, బంగారంతోటీ చేయబడ్డ అలంకారాలూ, సర్పాలంకారాలూ, ఎముకల దండల అలంకారాలూ, ధనుస్తూణ కృపాణ ముసల ముద్గర పరశు భిండివాల శూల ప్రభృతి స్ఫార ప్రహరణంబులున్= విండ్లూ, అమ్ములపొదలూ, ఖడ్గాలూ, ముసలాలూ, ముద్గరాలూ, గండ్రగొడ్డళ్ళూ, భిండివాలాలూ, శూలాలూ మొదలైన ఎన్నో ఆయుధాలు; మెఱయన్= ప్రకాశించగా; మృదంగ పణవ డమరు ఘంటా గోముఖ+అది - తూర్యంబులున్= మద్దెల, పణవం, డమరువు, గంట, గోముఖం మొదలైన వాద్యాలు; మొరయన్= ధ్వనించగ; విస్ఫురత్+ధ్వజ పతాకా కుంచికలు= ప్రకాశించే జెండాకర్రలూ, జెండాలూ, గుంజలూ, శోభిల్లన్= ఒప్పగా; పాడుచున్= పాటలు పాడుతూ; ఆడుచున్= ఆటలాడుతూ; ఆర్చుచున్= అరుస్తూ; బొబ్బలు+ఇడుచున్= కేకలు పెడుతూ; అవుడు+కఱచుచున్= పెదవులు కొరుక్కుంటూ; త్రుళ్ళుచున్= ఎగిరిపడుతూ; గురువులు+పాఱుచున్= పరుగెత్తుతూ;

కరటి బృంహితంబులున్= ఏనుగు ఘీంకారాలనూ; కంఠీరవ గర్జితంబులున్= సింహగర్జనలనూ; శంఖ రవంబులున్= శంఖ ధ్వనులనూ; భేరీ ధ్వనులున్= భేరీ ధ్వనులనూ; పోని= పోలిన; ఎలుంగులు= కంఠస్వరాలు; చెలంగన్= మ్రోయగా; బెట్టిదంబులు+అగు= పలు+తెఱంగుల పలుకులు= పరుషాలైన అనేక విధాల మాటలు; ఎసంగన్= అతిశయించగా; బ్రహ్మ ద్వేషులు+అగు వారి= బ్రాహ్మణద్వేషం కలవారియొక్క; మాంస రుధిరంబులన్= మాంసాలతోనూ, రక్తాలతోనూ; పూర్ణంబులు+అగు= నిండినవైన; కపాలంబులు= పుర్రెలను; కరతలంబులన్= చేతులతో; కొని; అభీలంబులు+అగు= భయంకరాలైన; భక్షణ పానంబులు= తినటం, త్రాగటం; ఆచరించుచున్= చేస్తూ; సోమపాన శమ దమ తపస్(ః)+బ్రహ్మచర్య ప్రముఖంబులు+అగు= సోమరసం త్రాగటం శాంతం, ఇంద్రియనిగ్రహం, తపస్సు, బ్రహ్మచర్యం మొదలైనవైన తమ విశిష్ట కర్మంబులకున్= తమ ఉత్తమ కర్మలకు; భవుండు= ఈశ్వరుఁడు, విస్మయంబున్+ఒందున్+కాని= ఆశ్చర్యపడతాడు కాని; అష్టగుణంబు+అగు+ఐశ్వర్యంబున్= అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం వశిత్వం అనే ఎనిమిది విధాలైన విభూతిని; ఒందియున్= పొందికూడా; తారు= తాము; విస్మితులు= గర్వితులు; కాని+అట్టి మహానుభావులు= కానట్టి మహాత్ములు; ఆ+దేవునకున్= ఆ శివుడికీ; గౌరికిన్= పార్వతికీ; గజముఖ షణ్ముఖులకంటెన్= వినాయక కుమారస్వాములకన్నా; అర్మిలికిన్= ప్రేమకి; పట్టు+అగు= స్థానమైన; భవ్యులు= యోగ్యులు; దివ్య జన స్తవ్యులు= దేవతలచేత స్తుతించదగినవారు; ఆ+అస్త్ర గురుతనూభవు తెంపు= ఆ అశ్వత్థామ సాహసకార్యం; ఎఱుంగుటకున్= తెలిసికోవటానికి; సౌప్తిక వ్యాపార ఘోరత్వంబున్= నిద్రించే శత్రువులను చంపే పనియొక్క దారుణాన్ని; కనుంగొని= చూచి; వినోదించుటకున్= ఆనందించటానికీ; వచ్చి; అతని చిత్తంబునకున్= అతడి మనస్సుకి; బెదరు= భయం; పుట్టించువారు+ఐ= కలిగించేవారై; భీషణ+ఆకారంబులన్= భయంకర రూపాలతో; ఉల్లసిల్లినన్= ఒప్పగా; ఆ ధైర్యధుర్యుండు= ఆ ధైర్యభారం వహించేవాడు- మహాధీరుడు ఆ అశ్వత్థామ.

తాత్పర్యం: అప్పుడు ప్రకాశించే ముఖాలూ, మండే కళ్ళూ కలవారూ, ఒకే పాదం కలవారూ, ఏనుగు, గుర్రం, సింహం, పంది ముఖాలవారూ, వాడికోరలతో భయంకరాలైన ముఖాలు కలవారూ, ఇంకా బహువిధాలైన ముఖాలతో ఒప్పేవారూ, వంకర, పొడుగు, పొట్టి శరీరాలు కలవారూ, మిక్కిలి లావుపాటివారూ, సన్నటివారూ, గోరోచనం రంగువారూ, నల్లటివారూ, ఇంకా నానావర్ణాలవారూ, అయిదు సిగలు కలవారూ, జడలు ధరించినవారూ, కిరీటాలు ధరించినవారూ, ఇంకా పలురకాలైనా శిరస్సులతో ఒప్పేవారూ - ఈ రీతిగా రకరకాల మిక్కిలి వికృత స్వరూపాలు కలవారూ అయిన లెక్కలేనంతమంది ప్రమథులు రంగురంగుల వస్త్రాలూ, దండలూ, మైపూతలూ, మణిమయాలంకారాలూ, సువర్ణాలంకారాలూ, సర్పాలంకారాలూ, ఎముకల దండల అలంకారాలూ ధరించి, విండ్లూ, అరసపోదులూ, ఖడ్గాలూ, ముసలాయుధాలూ, ముద్గరాలూ, గండ్రగొడ్డళ్ళూ, భిండివాలాలూ, శూలాలూ మొదలైన ఎన్నో ఆయుధాలు ప్రకాశించగా, మద్దెల, పణవం, డమరవు, గంట, గోముఖం మొదలైన వాద్యాలు ధ్వనించగా, ప్రకాశించే ధ్వజాలూ, పతాకలూ, గుంజలూ ఒప్పగా, పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ, అరుస్తూ, కేకలు పెడుతూ, పెదవులు కొరుక్కొంటూ, ఎగిరిపడుతూ, పరుగెత్తుతూ, ఏనుగుఘీంకారాలనూ, సింహగర్జనలనూ, శంఖధ్వనులనూ, భేరీనాదాలనూ పోలిన కంఠస్వరాలు మ్రోయగా, అనేక విధాల పరుషవాక్కులు అతిశయించగా, బ్రాహ్మణద్వేషుల మాంసరక్తాలతో నిండిన పుర్రెలను చేతులతో పట్టుకొని భయంకరంగా తింటూ, త్రాగుతూ, సోమపానం, శమదమాలూ, తపస్సు, బ్రహ్మచర్యం మొదలైన తమ మంచిపనులకు ఈశ్వరుడు ఆశ్చర్యపడతాడు కాని, అణిమాద్యష్ట విధవిభూతులనూ పొందికూడా గర్వించని మహాత్ములు, ఆ శివుడికీ, పార్వతికీ వినాయక కుమారస్వాముల కంటే కూడా ప్రేమాస్పదులై యోగ్యులూ, దేవతలచేత స్తుతింపదగినవారూ ఆ అశ్వత్థామ సాహసకార్యం తెలిసికొనటానికీ, నిద్రించే శత్రువులను సంహరించే దారుణాన్ని చూచి ఆనందించటానికీ వచ్చి,అతడి మనస్సుకు భయం పుట్టించాలని భయంకర స్వరూపాలతో ఒప్పగా, మహాధీరుడైన ఆ అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: కరటి బృంహితంబులఁ గంఠీరవ గర్జితంబులు శంఖరవంబులు భేరీధ్వనులుం బోని యెలుంగులు.. 'అలంకారం మాలోపమ.

మ. వెఱ పావంతయులేక వారిఁ గలయన్ వీక్షించి నమ్మోమునం
జిఱునవ్వున్, మదిఁ దెంపుసొంపు వెలయం, జెల్వంబురెట్టింప, నం
దఱుఁ గీర్తింప, రథంబుమీఁది ఘనకోదండంబు చేనంది, చి
చ్చుఱుకం జేరె నుదాత్తభంగి మహనీయోత్సాహ సందీప్తుఁడై. 117

ప్రతిపదార్థం: వెఱవు= భయం; అవ+అంతయున్= కొంచెంకూడా; లేక; వారిన్= ఆ ప్రమథుల్ని; కలయన్= బాగుగా; వీక్షించి= చూచి; నెఱ+మోమునన్= నిండుముఖంలో; చిఱునవ్వున్= చిరునవ్వూ; మదిన్= మనస్సులో; తెంపు సొంపున్= సాహసపు విధమూ; వెలయన్= స్పష్టపడగా; చెల్వంబు= అందం; రెట్టింపన్= ఇనుమడించగా; అందఱున్= అందరూ; కీర్తింపన్= పొగడగా; రథంబుమీఁది= రథంమీద ఉన్న; ఘనకోదడంబు= గొప్ప విల్లు; చేన్+అంది= చేతితో పుచ్చుకొని; మహనీయ= అధికమైన; ఉత్సాహ= వేడుకచేత; సందీప్తుఁడు+ఐ= మిక్కిలి ప్రకాశించినవాడై; ఉదాత్తభంగిన్= ఒప్పైన విధంగా; చిచ్చు+ఉఱుకన్= అగ్గిలో ఉరకటానికి; చేరెన్= సమీపించాడు.

తాత్పర్యం: కొంచెంకూడా భయంలేకుండా ఆ ప్రమథులను బాగా చూచి, ముఖంలో చిరునవ్వూ, మనస్సులో సాహసంచేసే విధమూ స్పష్టపడగా, అందం ఇనుమడించగా, అందరూ పొగడుతూండగా, రథంమీదున్న గొప్పవిల్లు చేతితో పుచ్చుకొని మంచి ఉత్సాహంతో ఒప్పైన రీతిలో అగ్గిలో ఉరకటానికి సమీపించాడు.

ఆ. ఇవ్విధమునఁ జేరి యవ్వేది లోపల । భాసమానుఁడైన పావకుండు
దేహమొక్క యాహుతిగఁ జేయుటకుఁ దగు । నంత లేకయునికి నతఁడు సూచి. 118

ప్రతిపదార్థం: అతఁడు= అశ్వత్థామ; ఈ+విధమునన్= ఈ విధంగా; చేరి= సమీపించి; ఆ+వేదిలోపలన్= ఆ అరుగులోపల; భాసమానుఁడు+ఐన= ప్రకాశిస్తూన్న; పావకుండు= అగ్నిదేవుడు; దేహము= శరీరం; ఒక్క+ఆహుతిగన్= ఒకే వేలిమిగా; చేయుటకున్; తగు+అంత= చాలినంత; లేక+ఉనికిన్= లేకపోవటం చూచి.

తాత్పర్యం: అశ్వత్థామ ఈ విధంగా వేదిని సమీపించి, దానిలోపల వెలిగే అగ్ని తన దేహాన్ని ఒక్క వేలిమిగా చేయటానికి చాలినంత లేకపోవటం చూచి.

క. తన యరదముమీఁదం గల । ధనుర్వితానము, లసత్ప్రదర జాలములం
గొనివచ్చి వేదియం దిం । ధనములుగాఁ జేర్చి తెంపు దలకొనుమదితోన్. 119

ప్రతిపదార్థం: తన+అరదము మీఁదన్= తనరథంమీద; కల= ఉన్న; ధనుస్(:)+వితానమున్= విండ్ల సమూహాన్ని; లసత్+ప్రదర-జాలములన్= ప్రకాశిస్తూన్న బాణాల సమూహాలనూ; కొనివచ్చి; వేదియందున్= తిన్నెమీద; ఇంధనములు+కాన్= కట్టెలుగా; పేర్చి= అమర్చి; తెంపు= సాహసం; తలకొను మదితోన్= అతిశయించే మనస్సుతో.

తాత్పర్యం: తన రథంమీద ఉన్న విండ్ల సమూహాన్నీ, మెరిసే బాణ సమూహాలనూ తీసికొనివచ్చి వేదిమీద కట్టెలుగా పేర్చి, సాహసం అతిశయించే తలంపుతో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. పేర్చి యప్పరమేశ్వరు నుద్దేశించి. 120

ప్రతిపదార్థం: పేర్చి= విజృంభించి; ఆ+పరమేశ్వరున్= ఆ పరమేశ్వరుడిని; ఉద్దేశించి= గురించి.

తాత్పర్యం: విజృంభించి, ఆ పరమేశ్వరుడిని గురించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'తెఱఁ గెట్టిదియో నా మది । నెఱుఁగ మదాత్మోపహార మిచ్చెద నీకుం
గఱకంఠ! వరము నాకుఁ బ । గఱఁ బరిమార్పంగ శక్తి గలుగుటయ చుమీ!;' 121

ప్రతిపదార్థం: కఱకంఠ= గరళకంఠా! - ఈశ్వరా!; తెఱఁగు= విధం; ఎట్టిదియో= ఏదో; నా మదిన్= నా మనస్సులో; ఎఱుఁగన్= ఎరుగను; నీకున్; మత్+ఆత్మ+ఉపహారము= నా ఆత్మబలిదానం; ఇచ్చెదన్; నాకున్; పగఱన్= శత్రువులను; పరిమార్పంగన్= చదవటానికి; శక్తి= సామర్థ్యం; కలుగుట+అ= కలగటమే; వరము= వరం; చుమీ= సుమీ!

తాత్పర్యం: 'పరమేశ్వరా! ఏమి చేయాలో నా మనస్సుకు తట్టటం లేదు. నీకు నేను ఆత్మబలిదానం చేస్తాను. నాకు శత్రువులను చంపే శక్తి కలగటమే వరం సుమా!'

వ. అని ప్రార్థించి. 122

తాత్పర్యం: అని కోరి.

క. 'ఆంగిరస కుల జనిత మీ । యంగము శిఖియందు దీని నాహుతిగాఁ జే
యం గంటి భవద్భక్తి సు । సంగతిమతితోఁ గృతార్థజన్ముఁడ నైతిన్.' 123

ప్రతిపదార్థం: ఈ+అంగము= ఈ శరీరం; ఆంగిరస కుల జనితము= అంగిరసుని వంశంలో పుట్టినది; దీనిన్; భవత్+భక్తి సుసంగత మతితోన్= నీయందలి భక్తితో కూడిన మనస్సుతో; శిఖియందున్= అగ్నిలో; ఆహుతి+కాన్= హోమంగా; చేయన్+కంటిన్= చేయగలిగాను; కృతార్థ జన్ముఁడన్+ఐతిన్= ధన్యమైన పుట్టుక గలవాడిని అయ్యాను.

తాత్పర్యం: 'ఈ నా శరీరం అంగిరసుడి వంశంలో పుట్టింది. దీనిని నీ అందలి భక్తితో కూడిన మనస్సుతో అగ్నిలో హోమం చేసే అదృష్టాన్ని పొందాను. నా పుట్టుక ధన్యమైనది.'

క. అని పలుకుచుఁ బరమేశ్వరు । మనమున నిడి యూర్ధ్వ బాహు మహితాకారుం
డును ఘనసమాధి యగుచున్ । విను మిఱికెను గురుసుతుండు వేదికపైకిన్. 124

ప్రతిపదార్థం: వినుము= వినుము (ధృతరాష్ట్రా)!; అని; పలుకుచున్= అంటూ; పరమేశ్వరున్; మనమునన్+ఇడి= మనస్సులో పెట్టుకొని; గురుసుతుండు= అశ్వత్థామ; ఊర్ధ్వ బాహుమహిత+ఆకారుండును= చేతులు పైకెత్తిన గొప్ప రూపం కలవాడూ; ఘనసమాధి= గొప్పధ్యానం కలవాడూ; అగుచున్; వేదికపైకిన్= వేదికమీదికి; ఉఱికెను.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! వినుము. ఈ విధంగా అంటూ అశ్వత్థామ పరమేశ్వరుడిని మనసులో నిలుపుకొని పైకి చేతులుగల గొప్ప ఆకారమూ, గొప్పధ్యానమూ కలవాడవుతూ వేదికమీదికి ఉరికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. ఉఱికి మంటలోన నుల్లంబు తెలివొక । యింతయేనిఁ గుంద కిద్ధమూర్తిఁ
దేజరిల్ల నున్న ధీరవర్యునకుఁ బ్ర । త్యక్షమయ్యె శివుఁడు దయదలిర్ప. 125

ప్రతిపదార్థం: మంటలోనన్; ఉఱికి; ఉల్లంబు తెలివి= మనోవికాసం; ఒక+ఇంత+ఏనిన్= కొంచెమైనా; కుందక= తగ్గక; ఇద్ధమూర్తిన్= కాంతిమంతమైన రూపంతో; తేజరిల్లన్+ఉన్న= ప్రకాశిస్తూన్న; ధీరవర్యునకున్= ధైర్యవంతులలో శ్రేష్ఠుడైన అశ్వత్థామకు; శివుఁడు; దయ తలిర్పన్= దయ అతిశయించగా; ప్రత్యక్షము+అయ్యెన్= సాక్షాత్కరించాడు.

తాత్పర్యం: మంటలో ఉరికి, తెలివి కొంచెమైనా తగ్గక, కాంతిమంతమైన ఆకారంతో ప్రకాశిస్తూన్న ధీరశ్రేష్ఠుడైన అశ్వత్థామకు శివుడు దయాతిశయంతో సాక్షాత్కరించాడు.

అశ్వత్థామకు శివుఁడు ప్రత్యక్షంబై ఖడ్గం బొసంగుట (సం. 10-7-59)

వ. ఇ ట్లెదుర నిల్చిన భక్తవత్సలుం డగు భవానీవిభుండు దరహసిత ముఖుండగుచు దివ్యావలోకనామృతంబు వెల్లిగొల్పిన నవ్వేదియందుఁ గమలాకరంబులో నున్న చందంబునఁ బ్రమోదంబు నొందియున్నయన్నరోత్తము నకు నారాయణప్రియుం డిట్లనియె. 126

ప్రతిపదార్థం: ఇట్లు; ఎదురన్= ముందర; నిల్చిన; భక్తవత్సలుండు+అగు= భక్తులపై ప్రేమకలవాడైన; భవానీవిభుండు= పార్వతీపతి; దరహసిత ముఖుండు+అగుచున్= చిరునవ్వుమొగం కలవాడు అవుతూ; దివ్య+అవలోకన+అమృతంబున్= దివ్యమైన దృష్టి అనే అమృతాన్ని; వెల్లి+కొల్పినన్= ప్రవహింపచేయగా; ఆ+వేది+అందున్= ఆ అరుగుమీద; కమలాకరంబులోన్= సరస్సులో; ఉన్న చందంబునన్= ఉన్న విధంగా; ప్రమోదంబున్= సంతోషాన్ని; ఒంది+ఉన్న= పొంది ఉన్నట్టి; ఆ+ నర+ ఉత్తమునకున్= ఆ మానవశ్రేష్ఠుడైన అశ్వత్థామకు; నారాయణ ప్రియుండు= విష్ణుప్రియుడైన శివుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా ప్రత్యక్షమైన భక్తవత్సలుడు పరమేశ్వరుడు చిరునవ్వుతో దివ్యదృష్టి అనే అమృతం ప్రవహించేటట్లు చేయగా, ఆ అరుగుమీద సరస్సులో ఉన్నవిధంగా సంతోషంతో ఉన్న ఆ మానవశ్రేష్ఠుడైన అశ్వత్థామతో విష్ణుసఖుడైన ఈశ్వరుడు ఈ రీతిగా అన్నాడు:

విశేషం: అలం: రూపకం, ఉత్ప్రేక్ష. దివ్యావలోకనామృతంబు - దివ్యావలోకనం అనే అమృతం - ఉపమేయోపమానాలకి అభేదం చెప్పబడింది కాబట్టి అలంకారం రూపకం. అవ్వేదియందుఁ గమలాకరంబులో నున్న చందంబున - కమలాకరంలో ఉన్నట్లు సంభావించబడుతున్నాడు కాబట్టి అలంకారం ఉత్ప్రేక్ష. నారాయణ ప్రియుడు - విష్ణుప్రియుడు శివుడు. శివప్రియుడు విష్ణుడు.

క. 'ఇమ్మెయి నీ దగు సత్క । ర్మమ్ము విశేషమునఁ జేసి మానస మత్యం
తమ్ము ప్రియమందె నీకు వ । రమ్మొసఁగఁగ వచ్చితిన్ ధరాసురవర్యా!' 127

ప్రతిపదార్థం: ధరా-సురవర్యా= బ్రాహ్మణశ్రేష్ఠుడా - అశ్వత్థామా!; ఈ+మెయిన్= ఈ విధంగా; నీది+అగు= నీదయిన; సత్+కర్మమ్ము విశేషమునన్+చేసి= మంచి పనియొక్క విశేషంచేత; మానసము= (నా) మనస్సు; అత్యంతమ్ము= మిక్కిలి; ప్రియము+అందెన్= సంతోషించినది; నీకున్= వరమ్ము; ఒసఁగఁగన్= ఇవ్వటానికి; వచ్చితిన్= వచ్చితిని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'బ్రాహ్మణోత్తమా అశ్వత్థామా! ఈ రీతిగా నీ సత్కార్య విశిష్టతచేత నా మనస్సు ఎంతో సంతోషించింది. నీకు వరం ఇవ్వటానికి వచ్చాను.'

వ. అనవుడు. 128

తాత్పర్యం: శివుడు ఈ రీతిగా అనగానే.

తే. తనువు పులకల ప్రోవుగా, మనము గాఢ । సంభృతానందముగ శరాచార్యసుతుఁడు
వితత సంభ్రముఁడై వేది వెడలి సాఁగి । మ్రొక్కి లేచి ఫాలంబున మొగిచెఁ గేలు. 129

ప్రతిపదార్థం: శర+ఆచార్య సుతుఁడు= అస్త్రగురుడైన ద్రోణుడి కొడుకు - అశ్వత్థామ; తనువు= శరీరం; పులకల ప్రోవు+కాన్= గగుర్పాటుల రాశి కాగా; మనము= మనస్సు; గాఢ - సంభృత+ఆనందము+కన్= అధికంగా కలిగిన సంతోషం కలదికాగా; వితత- సంభ్రముఁడు!== ఎక్కువ వేగిరపాటు కలవాడై; వేదిన్+వెడలి= అరుగునుంచి లేచి; సాఁగి-మ్రొక్కి= సాష్టాంగ నమస్కారం చేసి; లేచి; ఫాలంబునన్= నుదుటిమీద; కేలు మొగిచెన్= నమస్కరించాడు.

తాత్పర్యం: అశ్వత్థామ మేను పులకలతో నిండగా, మనస్సు అధికానందం కలది కాగా, మిక్కిలి వేగిరపాటుతో వేదిమీదనుండి వచ్చి, సాష్టాంగపడి లేచి, నుదుటిమీద కేలుమోడ్చాడు.

వ. అప్పుడు. 130

తాత్పర్యం: ఆ సమయంలో.

చ. అతని మొగంబుమీఁద నొలయన్ మధురంబగు చూడ్కి పార్వతీ
పతి మృదురీతి నిట్టు లను; 'భవ్యములైన తపంబు, సత్యము,
స్మృతియును, శౌచముం గలిగి నిశ్చలభక్తి నొనర్చుఁ గృష్ణుఁ డ
ప్రతిమసపర్య నాకు; ననురక్తుఁడ నేనును నమ్మురారికిన్.' 131

ప్రతిపదార్థం: అతని మొగంబు మీఁదన్= ఆ అశ్వత్థామ ముఖంమీద; మధురంబు+అగు చూడ్కి= ఇంపయిన చూపు; ఒలయన్= వ్యాపించగా; పార్వతీపతి= పార్వతిభర్త - పరమేశ్వరుడు; మృదురీతిన్= మెత్తగా; ఇట్టులు+అనున్= ఇట్లా అంటాడు; భవ్యములు+ఐన= యోగ్యాలైన; తపంబున్; సత్యమున్; ధృతియును= యజ్ఞమూ; శౌచమున్= పవిత్రతా; కలిగి; కృష్ణుఁడు; నాకున్; అప్రతిమ-సపర్యన్= సాటిలేని పూజ; నిశ్చలభక్తిన్= అచంచలమైన భక్తితో; ఒనర్చున్= చేస్తాడు; నేనును; ఆ+మురారికిన్= ఆ కృష్ణుడికి; అనురక్తుఁడన్= ఇష్టుడను.

తాత్పర్యం: ఆ అశ్వత్థామ ముఖంమీద తన ఇంపయిన చూపు వ్యాపించగా పరమేశ్వరుడు మృదువుగా ఇట్లా అన్నాడు: 'యోగ్యములైన తపస్సూ, సత్యమూ, యజ్ఞమూ, పవిత్రతా కలిగి కృష్ణుడు నాకు అచంచలమైన భక్తితో సాటిలేని పూజ చేస్తాడు. నేనుకూడా ఆ కృష్ణుడికి ఇష్టుడను.

విశేషం: ఈ పద్యంలో 'నిశ్చల భక్తి యొనర్చుఁ గృష్ణుఁ డప్రతిమ సపర్య నాకు' అనే పాఠంకంటె, 'నిశ్చలభక్తి నొనర్చుఁ గృష్ణుఁ డప్రతిమ సపర్య నాకు' అనే పాఠం ఉంటే అన్వయం సుగమంగా ఉంటుంది అనిపించింది. కాని, ఆ పాఠం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎందులోనూ కనబడలేదు. అయినా - పెద్దమార్పేమీ కాదుగదా అని స్వతంత్రించి ఆ విధంగా మార్చటం జరిగింది. సహృదయులు అర్థం చేసికొనగలరు. 'ధృతియును' అనే పదానికి తపస్సత్యశౌచాలతో దీటుగా ఉంటుందని ప్రకరణోచితంగా 'యజ్ఞ' మని అర్థం చెప్పబడింది. యజ్ఞమనే అర్థంకూడా నిఘంటువులలో ఇవ్వబడింది.

క. అతనికి సన్మానము సే । యు తలంపున భూతరూప యుక్తుఁడనై వ
చ్చితి నినుఁ బాంచాలురపై । నతి స్ఫురణఁ బోవనీక యడ్డం బైతిన్. 132

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ కృష్ణుడికి; సన్మానము+చేయు తలంపునన్= గౌరవం చేసే ఉద్దేశంతో; భూత రూప యుక్తుఁడన్+ఐ= భూతాకారంతో కూడినవాడినయి; వచ్చితిన్; నినున్; పాంచాలురపైన్= పాంచాలురమీదికి; అతి స్ఫురణన్= మిక్కిలి విజృంభణంతో; పోవనీక= పోనీకుండా; అడ్డంబు+ఐతిన్= అడ్డగించాను.

తాత్పర్యం: ఆ కృష్ణుడికి గౌరవం చేద్దామనే ఉద్దేశంతో భూతాకారం తాల్చి వచ్చాను. నిన్ను పాంచాలురమీదికి మిక్కిలి విజృంభణంతో దండెత్తకుండా అడ్డగించాను.

తే. తెల్లముగ నీదు చిత్తంబు తెఱఁ గెఱుంగ । వలసి నే ని ట్లనేకమాయలు పొనర్చి,
యస్త్రశస్త్ర నిరాసంబు నాచరించి, । కేలి సలిపితి వేయును నేల చెపుమ.' 133

ప్రతిపదార్థం: నీదు చిత్తంబు - తెఱఁగు= నీ మనఃప్రకారం; తెల్లముగన్= స్పష్టంగా; ఎఱుంగన్ - వలసి= తెలుసుకోవాలని; నేను; ఇట్లు; అనేకమాయలు= ఎన్నోమాయలు; పొనర్చి= చేసి; అస్త్ర శస్త్ర నిరాసంబున్= అస్త్రాల శస్త్రాల ఖండనం; ఆచరించి= చేసి; కేలి-సలిపితిన్= క్రీడించాను; వేయునున్+ఏల-చెపుమ= వేయి మాటలెందుకు చెప్పుము.

తాత్పర్యం: నీ మనోభిప్రాయం స్పష్టంగా తెలిసికొనాలని నేను ఇట్లా అనేక మాయలు పన్ని, నీ అస్త్రాలనూ, శస్త్రాలనూ ఖండించి క్రీడించాను. వేయుమాట లెందుకు చెప్పుము.

వ. 'కృష్ణ సన్మానంబును గృతంబయ్యెఁ; బాంచాలురకుఁ గాలంబు డగ్గఱియె; నేఁడు దెగుదురు; నీవు నా యనుగ్రహంబు వడసి' తని యొక్క మహనీయఖడ్గం బవ్విప్రు ని చేతి కిచ్చుచు నతండెఱుంగకుండఁ దేజోరూపంబున నతని తనువున నావేశించె; నిట్లు రుద్రుండొలసిన యగ్గురునందనుండమంద హర్షమయమూర్తియై యతులప్రభనొప్పె; మున్ను భూతంబుచేత నపహృతంబులైన యస్త్రశస్త్రంబులును, బిదప వేదియం బిడిన యాయుధంబులు నమ్మహావీరుని తేరిపైఁ బూర్వ ప్రకారంబున నుండె; నప్పుడు ప్రమథగణంబు లదృష్టాకారంబులై యమ్మహాత్మునిఁ బరమాత్ముఁ గొలుచుచందంబునబలసి రా రథారూఢుండై పాండవ శిబిరంబునకు నాతండు నడవఁ దోడన కృపకృతవర్ములు నడచి'; రనిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 134

ప్రతిపదార్థం: కృష్ణ సన్మానంబును= కృష్ణుని సమ్మానమూ; కృతంబు+అయ్యెన్= చేయబడినది; పాంచాలురకున్; కాలంబు డగ్గఱియెన్= పోగాలం సమీపించింది; నేఁడు= ఈవేళ; తెగుదురు= చస్తారు; నీవు; నా+అనుగ్రహంబు+పడసితి(వి)= నా అనుగ్రహం పొందావు; అని; ఒక్క; మహనీయ ఖడ్గంబు= గొప్ప ఖడ్గం; ఆ+విప్రుని చేతికిన్= ఆ బ్రాహ్మణుడి చేతికి;

ఇచ్చుచున్; అతఁడు; ఎఱుఁగక+ఉండఁన్= తెలియకుండా; తేజస్(;)+ రూపంబునన్= తేజోరూపంలో; అతని తనువునన్= అతడి శరీరంలో; ఆవేశించెన్= ప్రవేశించాడు; ఇట్లు; రుద్రుండు+ఒలసిన+ఆ+గురునందనుండు= రుద్రుడు ఆవేశించిన ఆ అశ్వత్థామ; అమంద హర్షమయమూర్తి+ఐ= అధికమైన సంతోషంతో నిండిన ఆకారం కలవాడై; అతుల ప్రభన్= సాటిలేని కాంతితో; ఒప్పెన్; మున్ను= ఇంతకుముందు; భూతంబుచేతన్= అపహృతంబులు+ఐన= అపహరించబడ్డ; అస్త్ర శస్త్రంబులును= అస్త్రాలూ, శస్త్రాలూ; పిదపన్= తరువాత; వేదియందున్; ఇడిన= పెట్టిన; ఆయుధంబులున్= ఆ+మహావీరుని తేరిపైన్= ఆ గొప్పవీరుడైన అశ్వత్థామయొక్క రథంమీద; పూర్వ ప్రకారంబునన్= మునుపటివలె; ఉండెన్; అప్పుడు; ప్రమథ-గణంబులు; అదృష్ట+ఆకారంబులై= కనబడని ఆకారాలు కలవారై; ఆ+మహాత్ముని= ఆ మహనీయుడిని- అశ్వత్థామను; పరమాత్మున్= దేవుడిని; కొలుచు చందంబునన్= కొలిచేవిధంగా; బలసి-రాన్= పరివేష్టించి రాగా; రథారూఢుండై= రథం ఎక్కినవాడై; పాండవ శిబిరంబునకున్= పాండవుల బిడారానికి; అతండు= అశ్వత్థామ; నడవన్= నడుస్తూండగా; తోడన్+ఆ= వెంట; కృప కృతవర్మలు= కృపుడూ, కృతవర్మా; నడచిరి; అనినన్; విని; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'కృష్ణుడి సమ్మానంకూడా జరిగింది. పాంచాలురకు పోగాలం దాపురించినది. ఈవేళ చస్తారు. నువ్వు నా అనుగ్రహం పొందావు' అని ఒక గొప్ప ఖడ్గాన్ని ఆ బ్రాహ్మణుడి చేతి కిస్తూ, అతడికి తెలియకుండా తేజోరూపంలో అతడి శరీరంలో ప్రవేశించాడు. ఇట్లా రుద్రు డావేశించిన ఆ అశ్వత్థామ చాలా సంతోషించి, సాటిలేని కాంతితో వెలుగొందాడు. పూర్వం భూతంచేత అపహరించబడ్డ అస్త్రశస్త్రాలూ, తరువాత వేదిమీద పెట్టిన ఆయుధాలూ ఆ మహావీరుడి రథంమీద ఇదివరకువలె ఉన్నాయి. అప్పుడు ప్రమథగణాలు కనిపించని ఆకారాలతో ఆ మహాత్ముడిని పరమాత్ముడిని కొలిచేటట్లు పరివేష్టించి వస్తూండగా, రథం ఎక్కి పాండవుల శిబిరానికి అతడు నడుస్తూంటే కూడా కృపుడూ, కృతవర్మా నడిచారు' అని చెప్పగా విని ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

చ. అతఁ డటు లేవునం జనఁగ నా కృపుఁడుం గృతవర్మయున్ 'మహో
న్నత వరలాభ గర్విత మనస్కుఁడు ద్రోణసుతుండు వోవఁగా,
నితని క్రియన్ బలోద్ధతి సహిష్ణుత గల్గునె యొడ్ల? కంచు సం
భృత భయ చిత్తవృత్తులయి పెంపఱఁ బోరు గదా పిఱిందికిన్?' 135

ప్రతిపదార్థం: అతఁడు= అశ్వత్థామ; అటులు= ఆ విధంగా; ఏపునన్= విజృంభణతో; చనఁగన్= వెళ్ళగా; మహత్+ఉన్నత= మిక్కిలి గొప్పదైన; వర= వరంయొక్క; లాభ= ప్రాప్తిచేత; గర్విత= గర్వించిన; మనస్కుఁడు= మనస్సు కలవాఁడు(అయిన); ద్రోణసుతుండు= అశ్వత్థామ; పోవఁగాన్= పోతోంటే; ఇతని క్రియన్= ఇతడిలాగ; ఒడ్లకున్= ఇతరులకు; బల+ఉద్ధతి= బలగర్వమూ; సహిష్ణుత= ఓర్పూ; కల్గునె?= ఉంటాయా?; అంచున్= అని; కృపుఁడున్+కృతవర్మయున్= కృపుడూ, కృతవర్మా; సంభృత భయ చిత్తవృత్తులు+అయి= భయంతో నిండిన మనోవ్యాపారాలు గలవారై; పెంపు+అఱన్= గొప్పతనం నశించగా; పిఱిందికిన్= వెనక్కి; పోరు+కదా= వెళ్ళరుకదా!

తాత్పర్యం: అశ్వత్థామ ఆ విధంగా విజృంభించి వెళ్ళగా, 'మిక్కిలి గొప్పవరం లభించటంచేత గర్వించిన మనస్సుకల అశ్వత్థామ పోతోంటే, ఇతడివలె ఇతరులకు బలగర్వమూ, ఓర్మి ఉంటాయా?' అని భయం నిండిన మనస్సులు కలవారై, తమ గొప్పతనం నశించేటట్లు కృపుడూ, కృతవర్మా వెనుకకు వెళ్ళిపోరు గదా!'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియును. 136

తాత్పర్యం: ఇంకనూ.

వ. పటువేగంబున ముట్టి ద్రోణసుతుఁ డప్పాంచాలలోకంబుఁ ద
క్కటి భూపాలుర, ద్రౌపదీతనయ వర్గంబున్ భూజాఖేలనో
ద్భట ఖడ్గోల్లసనంబు పాల్పఱిచి తద్ధాత్రీతలం బెల్ల నె
త్తుట జొత్తిల్లఁగఁ జేసెనే రిపుచమూ దుర్వార ఘోరాకృతిన్? 137

ప్రతిపదార్థం: ద్రోణ సుతుఁడు= అశ్వత్థామ; రిపు= శత్రువులయొక్క; చమూ= సేనలకు; దుర్వార= వారించడానికి శక్యంకాని; ఘోర+ఆకృతిన్= భయంకరాకారంతో; పటు వేగంబునన్= తీవ్రమైన వేగంతో; ముట్టి= తాకి; ఆ+పాంచాల లోకంబున్= ఆ పాంచాలుర సమూహాన్నీ; తక్కటి= మిగిలిన; భూపాలురన్= రాజులనూ; ద్రౌపదీ తనయ వర్గంబున్= ద్రౌపది కొడుకుల సమూహాన్నీ; భుజా= బాహువులయొక్క; ఖేలన= కదలికచేత; ఉద్భట= ఉగ్రమైన; ఖడ్గ= కత్తియొక్క; ఉల్లసనంబు= ప్రకాశానికి; పాల్పఱిచి= ఆధీనమయ్యేటట్లు చేసి; తద్+ధాత్రీ తలంబు+ఎల్లన్= ఆ భూప్రదేశమంతా; నెత్తుటన్= రక్తంతో; జొత్తిల్లఁగన్+చేసెనే?= ఎఱ్ఱబడేటట్లు చేశాడా?

తాత్పర్యం: 'అశ్వత్థామ శత్రుసేనలకు వారించశక్యం కాని భయంకరాకారంతో తీవ్రవేగంతో ముట్టడించి ఆ పాంచాలుర సమూహాన్నీ, తక్కిన రాజులనూ, ఉపపాండవులనూ బాహువుల కదలికచేత ఉగ్రమైన ఖడ్గపు ప్రకాశానికి ఆధీనమయ్యేటట్లు చేసి, ఆ భూభాగమంతా రక్తంతో ఎఱ్ఱబడేటట్లు చేశాడా?'

విశేషం: అశ్వత్థామ పాండవపక్ష వీరులను ఎట్లా చంపాడో తెలిసికొనటానికి ధృతరాష్ట్రుడి అత్యాసక్తి గమనించదగ్గది. అతడు దానిని ధర్మంగా చేశాడా?, అధర్మంగా చేశాడా? అనేది అతడికి అనవసరం.

క. పాండవ శిబిరముఁ జొచ్చి య । ఖండిత పౌరుషము వెలయఁగాఁ గలశజపు
త్రుం డది యంతయు మత్పు । త్రుం డరిగెడి తెరువునం దరుగఁజేసెఁ గదే? 138

ప్రతిపదార్థం: కలశజ పుత్రుండు= కంభజుడి (ద్రోణుడి) కొడుకు అశ్వత్థామ; పాండవ శిబిరమున్= పాండవుల స్కంధావారం; చొచ్చి= ప్రవేశించి; అఖండిత పౌరుషము= మొక్కవోని పరాక్రమం; వెలయఁగాన్= ఒప్పేటట్లు; అది+అంతయున్= ఆ మారణహోమం అంతా; మత్+పుత్రుండు= నా కొడుకు దుర్యోధనుడు; అరిగెడి తెరువునందున్= వెళ్ళేదారిలో - అనుకున్న రీతిలో; అరుగన్+చేసెన్+కదే= వెళ్ళేటట్లు చేశాడు కదా!

తాత్పర్యం: అశ్వత్థామ పాండవుల స్కంధావారం ప్రవేశించి అకుంఠిత పరాక్రమం ఒప్పేవిధంగా ఆ మారణహోమం అంతా నా కొడుకు అరిగే మార్గంలోనే - అనుకున్నట్లుగానే జరిగేటట్లు చేశాడు కదా!

వ. సమరప్రకారం బంతయు సవిస్తరంబుగా నెఱిఁగింపు మనుటయు నతం డి ట్లనియె. 139

ప్రతిపదార్థం: సమర ప్రకారంబు+అంతయున్= యుద్ధం తీరు అంతా; సవిస్తరంబుగాన్= వివరంగా; ఎఱిఁగింపుము+ అనుటయున్= చెప్పమనగా; అతండు= ఆ సంజయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: యుద్ధం జరిగిన తీరంతా వివరంగా చెప్పు' మనగా సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

తే. **ఇవ్విధంబున గురురుసుతుఁ డేపు మిగిలి । చనఁగఁ గృపుఁడును గృతవర్మయును దలిర్చు**
కడఁక నతనితో నడచిరి గాని వారి । వలన నించుకయును నరవాయి లేదు. 140

ప్రతిపదార్థం: గురు సుతుఁడు= అశ్వత్థామ; ఈ+విధంబునన్= ఈ విధంగా; ఏపు మిగిలి= విజృంభణం అతిశయించి; చనఁగన్= వెళ్ళగా; కృపుఁడును, కృతవర్మయును; తలిర్చు కడఁకన్= చిగిర్చిన పూనికతోన్= ఆ అశ్వత్థామతో; నడచిరి+కాని= నడిచారు కాని; వారి వలనన్= వాళ్ళ విషయంలో; ఇంచుకయును= కొంచెంకూడా; అరవాయి లేదు= వెనుకతీత లేదు.

తాత్పర్యం: అశ్వత్థామ ఈ విధంగా అతిశయించిన విజృంభణంతో వెళ్ళగా కృపుడూ, కృతవర్మా చివురించిన పూనికతో అతడి వెంట నడిచారు కాని, వారి విషయంలో ఏమాత్రం వెనుకపాటులేదు.

వ. **ఇట్లు తన కెలంకుల నడచు నవ్వీరుల నాలోకించి యాచార్యసుతుఁడు సంతోషించి. 141**

ప్రతిపదార్థం: ఇట్లు; తన కెలంకులన్= తన ప్రక్కల; నడచు= నడిచే; ఆ+వీరులన్= ఆ వీరులను-కృపకృతవర్ములను; ఆలోకించి= చూచి; ఆచార్యసుతుఁడు= గురుపుత్రుడు - అశ్వత్థామ; సంతోషించి.

తాత్పర్యం: ఈ విధంగా తన కిరుప్రక్కలా నడిచే ఆ వీరులను చూసి అశ్వత్థామ సంతోషించి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. **'మీరును దెంపుసొం పెసఁగ మిక్కిలి బీరము లావు చూపఁగాఁ**
గోరి కడంగి పైఁబడుటకుం దగి యుండదు వీడు మీ బలో
దారత ప్రాపునం జని యుదగ్ర భుజావిభవంబు పెంపు సొం
పారఁగ నవ్విరోధి నిచయంబు సమస్తము నేన త్రుంచెదన్.' 142

ప్రతిపదార్థం: మీరును= మీరుకూడా; తెంపు సొంపు+ఎసఁగన్= సాహసపు తీరు అతిశయించగా; మిక్కిలి; బీరమున్= పరాక్రమమూ; లావు= బలము; చూపఁగాన్+కోరి= చూపించగోరి; కడంగి= పూని; పైన్+పడుటకున్= మీద పడటానికి; వీడు= శిబిరం; తగి+ఉండదు= తగినట్టుగా ఉండదు; మీ బల+ఉదారత ప్రాపునన్= మీ పరాక్రమాతిశయం అండగా; చని= వెళ్ళి; ఉదగ్ర బుజా విభవంబు పెంపు సొంపు+అరఁగన్= తీవ్రమైన బాహుబల సంపదయొక్క అధిక్యం అందగించగా; ఆ+విరోధి నిచయంబున్= ఆ శత్రువర్గాన్ని; సమస్తమున్= సర్వాన్నీ; నేను+అ= నేనొక్కడినే; త్రుంచెదన్= ఖండిస్తాను.

తాత్పర్యం: మీరు కూడా సాహసాతిశయంతో మిక్కిలి పరాక్రమం, బలం చూపించగోరి పూని మీద పడటానికి శత్రుశిబిరం తగినట్లుగా ఉండదు. మీ బలాధిక్యం అండగా వెళ్ళి, నా తీవ్రమయిన బాహుబల సంపద చూపి, ఆ శత్రుసమూహం సర్వం నే నొక్కడినే ఖండిస్తాను.

వ. **అని యిట్లు వారి నగ్గించి వాకిట నిలిపి మహనీయ బాణ బాణాసనంబులు వహించి సుప్రసుప్త సకల జనంబైన యా శిబిరంబుఁ జొచ్చి తాను మున్న గతాగతజనంబులవలనఁ బ్రసంగాధీనతం జేసి యవ్విడిదల తెఱంగు లిట్టిట్టివి వారి సన్నివేశంబు లిచ్చటిచ్చట నని సాభిజ్ఞానంబుగా వినియునికి కతంబున నరసికొనిపోవ**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నేర్చి తొలుత ధృష్టద్యుమ్ను సదనంబునకు నరిగి బాణబాణాసన సహితంబై యున్న రథంబు డిగి రుద్రు నుద్దేశించి మానసంబున. 143

ప్రతిపదార్థం: అని; ఇట్లు; వారిన్; అగ్గించి= కొనియాడి; వాకిటన్= ద్వారం దగ్గర; నిలిపి; బాణ బాణాసనంబులు= అమ్ములూ, విండ్లూ; వహించి= తాల్చి; సుప్రసుప్త సకల జనంబు+ఐన= బాగా నిద్రపోయిన ఎల్లజనులు కలిగిన; ఆ శిబిరంబున్+చొచ్చి= ఆ శిబిరంలో ప్రవేశించి; తాను; మున్ను+అ= ముందే; గత+అగత - జనంబులవలనన్= పోయి వచ్చే జనాలవలన; ప్రసంగాధీనతన్+చేసి= సంభాషణవశంచేత; ఆ+విడిదిల తెఱంగులు= ఆ శిబిరం వైనాలు; ఇట్టి+ఇట్టి+అని= ఇట్లాటినిట్లాటివి; వారి సన్నివేశంబులు= వారి విడిదలలు; ఇచ్చటన్+ఇచ్చటన్+అని= ఇక్కడ ఇక్కడ అని; సాభిజ్ఞానంబుగాన్= గుర్తుండే విధంగా; విని+ఉనికి కతంబునన్= విని ఉండటంచేత; అరసికొనిపోవన్+చేర్చి= చూచికొనిపోగలిగి; తొలుతన్= మొదట; ధృష్టద్యుమ్ను-సదనంబునకున్= ధృష్టద్యుమ్నుడి శిబిరానికి; అరిగి= వెళ్ళి; బాణ బాణ+అసన సహితంబు+ఐ+ఉన్న= అమ్ములతోనూ, విండ్లతోనూ కూడియున్న; రథంబున్+డిగి= రథం దిగి; రుద్రున్+ఉద్దేశించి= శివుడిని గురించి; మానసంబునన్= మనస్సులో.

తాత్పర్యం: అని ఇట్లా వారిని కొనియాడి వాకిట్లో నిలిపి, గొప్పవైన అమ్ములూ, విండ్లూ పుచ్చుకొని, బాగా నిద్రపోతూ ఉన్న జనులుగల శిబిరంలో ప్రవేశించి, తను ఇంతకుముందే వచ్చేపోయే జనులవలన సంభాషణవశంచేత ఆ శిబిరం వైనాలు ఇట్లాంటి విట్లాంటివి, వాళ్ళ విడిదలలు ఇక్కడిక్కడ అని గుర్తులతో విని ఉండటంచేత చూచికొని పోగలిగి, మొదట ధృష్టద్యుమ్నుడి శిబిరానికి వెళ్ళి, బాణాలూ, విండ్లూ కల రథం దిగి రుద్రుడిని గురించి మనస్సులో, (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పూనితి నిష్ఠమెయి న్నిను । నానా భూతోపహార నవ్యార్చన నీ
కే నొనరించెద; నది యీ । శానా! కైకొనుము; సుప్రసన్నుఁడ వగుమీ.' 144

ప్రతిపదార్థం: ఈశానా!= ఈశ్వరా!; నినున్= నిన్ను; నిష్ఠమెయిన్= నిష్ఠతో; పూనితిన్= తలచాను; నీకున్; ఏను= నేను; నానా భూత+ఉపహార నవ్య+అర్చనన్= అనేక ప్రాణుల బలిదానమనే క్రొత్త పూజను; ఒనరించెదన్= చేస్తాను; అది= ఆ పూజ; కైకొనుము= స్వీకరించు; సుప్రసన్నుఁడవు+అగుమీ= మిక్కిలి దయగలవాడవు కమ్ము.

తాత్పర్యం: 'ఈశ్వరా! నిన్ను నేను నిష్ఠతో ధ్యానించాను. నీకు అనేక ప్రాణుల బలిదాన మనే పూజ చేస్తాను. అది స్వీకరించి నన్ను దయచూడుము.'

వ. అనుచు నరిగి 145

తాత్పర్యం: అంటూ వెళ్ళి.

తే. అచటి జనములు పగలింటి యాహవమున । శ్రమముఁ బొందియు, నిశ్శేషశత్రు నాశ
నమున నూఱటఁ జేసియు నమితనిద్ర । నొంది యత్యంతవివశులై యుండ నతఁడు. 146

ప్రతిపదార్థం: అచటి జనములు= అక్కడి జనులు; పగలింటి - ఆహవమునన్= పగటి యుద్ధంచేత; శ్రమమున్+పొందియున్= అలసిపోయీ; నిశ్శేష శత్రు నాశనమునన్= సంపూర్ణ శత్రునాశనంచేత; ఊఱటన్+చేసియున్= ఊరటచెందీ; అమిత నిద్రన్= గాఢనిద్రను; ఒంది= పొంది; అత్యంత వివశులు+ఐ= మిక్కిలి ఒళ్ళు తెలియనివారై; ఉండన్= ఉండగా; అతఁడు= అశ్వత్థామ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అక్కడి జనులు పగలు చేసిన యుద్ధం వలన అలసిపోయీ, సంపూర్ణంగా శత్రునాశనం అయింది గదా అని ఊరట చెందీ, బాగా నిద్రపట్టి ఒళ్ళు తెలియని స్థితిలో ఉండగా అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. మందగతిం బ్రవేశించి యన్వేషించి. 147

ప్రతిపదార్థం: మందగతిన్= మందగమనంతో; ప్రవేశించి; అన్వేషించి= వెదకి.

తాత్పర్యం: మెల్లగా ప్రవేశించి వెదకి.

చ. తెరయును, మేలుకట్లుఁ, దగు దీవియలుం జెలు వొంద మేటిచ
ప్పరమునఁ జాల హృద్యమగు పాన్పున నూఱడి నిద్రపోవు న
గ్గురువధికారిఁ గాంచి మదిఁ గ్రోధము మోదము సందడింప సు
స్థిరతఁ బదప్రహారమునఁ దెల్పెఁ దృణీకరణాభిరాముఁడై. 148

ప్రతిపదార్థం: తెరయును= తెరా; మేలుకట్లున్= చాందినీలూ; తగు దీవియలున్= తగిన దీపాలూ; చెలువు+ఒందన్= ఒప్పగా; మేటి చప్పరమునన్= పెద్ద గుడారంలో; చాలన్+హృద్యము+అగు పాన్పునన్= మిక్కిలి హృదయానందకరమైన శయ్యమీద; ఊఱడి= ఊరటచెంది; నిద్ర+పోవు= నిద్రపోతూన్న; ఆ+గురు వధకారిన్= ఆ గురుహంతయైన - ధృష్టద్యుమ్నుడిని; కాంచి= చూచి(అతఁడు); మదిన్= మనస్సులో; క్రోధమున్= కోపమూ; మోదమున్= సంతోషమూ; సందడింపన్= అతిశయించగా; సుస్థిరతన్= మంచి నిలకడతో, మంచి ధైర్యంతో; తృణీకరణ+అభిరాముఁడు+ఐ= అలక్ష్యం చేయడం చేత మనోహరుడై; పదప్రహారమునన్= కాలి దెబ్బతో - తన్నుతో; తెల్పెన్= లేపాడు.

తాత్పర్యం: తెరా, చాందినీలూ, తగిన దీపాలూ ఒప్పుతుండగా పెద్ద గుడారంలో మిక్కిలి హృదయానందకరమైన పాన్పుమీద నిశ్చింతగా నిద్రపోతూన్న ఆ గురుహంతను-ధృష్టద్యుమ్నుడిని చూచి మనస్సులో కోపమూ, సంతోషమూ అతిశయించగా మంచి ధైర్యంతో, లెక్కచేయని భావంతో అందగించి, కాలితో తన్ని లేపాడు.

వ. తెలిపినఁ గనువిచ్చి తన్నుం జూచి యెఱింగియుఁ గలంగక రణదుర్మదుండైన యా ద్రుపదనందనుఁడు దిగ్గన లేచినం దనచేతివిల్లు విడిచి యతని తలఁబట్టుకొని పెడమఱలఁ దిగిచి యబ్బలియుండు. 149

ప్రతిపదార్థం: తెలిపినన్= లేపగా; - కనువిచ్చి= కళ్ళు తెరిచి; తన్నున్+చూచి= తనని (అశ్వత్థామని) చూసి; ఎఱింగియున్= తెలిసికూడా; కలంగక= కలతచెందక; రణ దుర్మదుండు+ఐన= యుద్ధగర్వితుడైన; ఆ ద్రుపదనందనుఁడు= ఆ ద్రుపదపుత్రుడు - ధృష్టద్యుమ్నుడు; దిగ్గనన్= గబుక్కున; లేచినన్= లేవగా; ఆ+బలియుండు= ఆ బలశాలి - అశ్వత్థామ; తన చేతి విల్లు విడిచి; అతని తలన్; పట్టుకొని; పెడమఱలన్+తిగిచి= వెనుకకు త్రిప్పి.

తాత్పర్యం: లేపితే కళ్ళు తెరిచి తనను చూసి ఫలానా అని తెలిసికూడా కలతచెందక యుద్ధగర్వితుడైన ఆ ధృష్టద్యుమ్నుడు తటాలున లేచాడు. అప్పుడు బలశాలియైన ఆ అశ్వత్థామ తన చేతివిల్లు పడవేసి అతడి తల పట్టుకుని వెనుకకు మెలిపెట్టి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. నేలపయిం బడం దిగిచి నిష్ఠురభంగి నురఃస్థలంబు మో
కాల నొగిల్చి యేపున మొగం బతిదారుణ ముష్టి నొంచె ని

ద్రాలసవృత్తి నంగములయందు బలంబును బుద్ధి నేర్పునుం
జాలని యవ్విరోధి వివశత్వముఁ బొందఁగఁ జేసె వ్రేల్మిడిన్. 150

ప్రతిపదార్థం: నేలపయిన్; పడన్+తిగిచి= పడేటట్లు లాగి; నిష్ఠుర భంగిన్= మోటతనంగా; ఉరస్+స్థలంబున్= వక్షఃస్థలాన్ని; మోకాలన్= (తన) మోకాలితో; నొగిల్చి= బాధించి; ఏపునన్= విజృంభణంతో; అతి దారుణ ముష్టిన్= మిక్కిలి క్రూరమైన పిడికిలితో; నొంచెన్= బాధించాడు; నిద్రా+అలస వృత్తిన్= నిద్రమైకంలో ఉండటంచేత; అంగములయందున్= అవయవాలలో; బలంబును; బుద్ధి-నేర్పునున్= బుద్ధిపటుత్వమూ; చాలని; ఆ+విరోధిన్= ఆ శత్రువును - ధృష్టద్యుమ్నుడిని; వ్రేల్మిడిన్= చిటికలో; వివశత్వమున్= ఒళ్ళు తెలియనితనం; పొందఁగన్+చేసెన్= పొందించాడు.

తాత్పర్యం: నేలమీద పడేటట్లు లాగి మోటతనంగా అతడి వక్షఃస్థలాన్ని తన మోకాలితో పొడిచి, విజృంభణంతో మిక్కిలి క్రూరమైన పిడికిలితో పొడిచి బాధించాడు. నిద్రమత్తులో ఉండటంచేత అవయవాల పటుత్వమూ, బుద్ధిబలమూ చాలని ఆ శత్రువును - ధృష్టద్యుమ్నుడిని ఒక చిటికలో స్పృహతప్పేటట్లు చేశాడు.

వ. ఇవ్విధంబున నతనిచేత ధృష్టద్యుమ్నుండు. 151

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; అతని చేతన్= అశ్వత్థామచేత; ధృష్టద్యుమ్నుండు.

తాత్పర్యం: ఈ రీతిగా అశ్వత్థామచేత ధృష్టద్యుమ్నుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. వివశత భీతిఁ బొంది కడు విహ్వలుఁడై తనుఁ జూడ ద్రోణసం
భవుఁడు వెసన్ శరాసనము వాపి గుణంబు తదీయకంఠముం
దవులఁగఁ జేర్చి వాగురవిధం బొడఁగూర్చి మనంబు విక్రమో
త్సవమున నుబ్బఁగాఁ బశువుఁ జంపెడు చాడ్పునఁ జంపు వేడుకన్. 152

ప్రతిపదార్థం: వివశతన్= ఒళ్ళు తెలియనితనంతో; భీతిన్+పొంది= భయపడి; కడున్= మిక్కిలి; విహ్వలుఁడు+ఐ= అధైర్యపడినవాడై; తనున్+చూడన్= తనను చూడగా; ద్రోణ సంభవుఁడు= ద్రోణుడి కొడుకు - అశ్వత్థామ; వెసన్= శీఘ్రంగా; గుణంబు= అల్లెత్రాడు; శరాసనము+పాపి= వింటినుంచి ఊడదీసి; తదీయ కంఠమున్= వాడి పీకెకు; తవులఁగన్+చేర్చి= తగిలించి; వాగుర- విధంబు+ఒడఁగూర్చి= ఉరిత్రాడులా చేసి; మనంబు= (తన) మనస్సు; విక్రమోత్సవమునన్= పరాక్రమపు వేడుకతో; ఉబ్బఁగాన్= పొంగగా; పశువున్; చంపెడు - చాడ్పునన్= చంపే విధంగా; చంపు వేడుకన్= చంపేకోరికతో.

తాత్పర్యం: ఒళ్ళు తెలియనితనంతో భయపడి మిక్కిలి అధైర్యపడిన వాడై తనను చూడగా, అశ్వత్థామ శీఘ్రంగా అల్లెత్రాడును వింటినుండి ఊడదీసి వాడి కంఠానికి బిగించి ఉరిత్రాడువలె చేసి మనస్సు పరాక్రమపు వేడుకతో పొంగగా పశువును చంపేవిధంగా చంపే కోరికతో. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. ఉరంబును మెడయును నిరుగాలం ద్రొక్కినఁ ద్రోచియు దైన్యంబు దోఁప గోళ్ళ గీఱియు నిస్తరింపలేక యెలుంగు వెడలకున్న నెట్టకేలకు మాట వెడవెడ యెఱుంగవచ్చు తెఱంగునఁ బాంచాలవరుం డమ్మహీసుర వరున కిట్లనియె. 153

ప్రతిపదార్థం: ఉరంబును= రొమ్మూ; మెడయును= మెడా; ఇరుకాలన్= రెండు కాళ్ళతో; త్రొక్కినన్= త్రొక్కగా; త్రోచియున్= (వాడు) గెంటీ; దైన్యంబు+తోఁపన్= దీనత్వం తోచేటట్టు; గోళ్ళన్= గోళ్ళతో; గీఱియున్= రక్కీ; నిస్తరింపన్+లేక= నెట్టలేక; ఎలుంగు= కంఠస్వరం; వెడలక+ఉన్నన్= పెగలకుంటే; ఎట్టకేలకున్= చివరకి; మాట; వెడవెడ= కొద్దికొద్దిగా; ఎఱుంగన్+వచ్చు= తెలుంగునన్= తెలిసేటట్టు; పాంచాలవరుండు= పాంచాలరాజు - ధృష్టద్యుమ్నుడు; ఆ+మహీసుర వరునకున్= ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడికి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: రొమ్మూ, మెడా రెండు కాళ్ళతో త్రొక్కగా, వాడు గెంటీ, దైన్యంతో గోళ్ళతో గీరీ నెట్టలేక, కంఠస్వరం పైకి రాకుంటే, చివరకు మాట కొంచెం తెలిసేటట్లు ధృష్టద్యుమ్నుడు ఆ బ్రాహ్మణోత్తముడితో ఈ విధంగా అన్నాడు.

క. 'గురుపుత్ర! శస్త్ర నిహతిం । బొరిపుచ్చుము; తడయ నేల? పుణ్యగతికిఁ జె
చ్చెరఁ బోవునట్లు సేయుట । పరికింపఁగ మేలకాదె పగతురకైనన్?' 154

ప్రతిపదార్థం: గురుపుత్ర= అశ్వత్థామా!; శస్త్ర నిహతిన్= శస్త్రముల దెబ్బచే; పొరిపుచ్చుము= చంపుము; తడయన్+ఏల?= ఆలస్యం ఎందుకూ?; పరికింపఁగన్= చూడగా; పగతురకున్+ఐనన్= శత్రువులకైనా; పుణ్య గతికిన్= ఉత్తమగతికి; చెచ్చెరన్= శీఘ్రంగా; పోవు+అట్లు= పోయేటట్టు; చేయుట; మేలు+అ+కాదె!= మంచిదే కదా!

తాత్పర్యం: 'అశ్వత్థామా! శస్త్రంతో కొట్టి చంపుము. ఆలస్యం ఎందుకూ? విచారించగా శత్రువులకైనా ఉత్తమగతికి వెంటనే పోయేటట్లు చేయటం మంచిదేకదా!'

వ. అనిన విని యశ్వత్థామ యతని మొగంబు చూచి. 155

ప్రతిపదార్థం: అనినన్; విని; అశ్వత్థామ; అతని మొగంబు= అతడి ముఖం; చూచి.

తాత్పర్యం: అనగా విని అశ్వత్థామ అతడి ముఖం చూచి.

క. 'వినుము గురుద్రోహికిఁ గ । ల్గునె యుత్తమ గతి? నితాంత కుత్సితభంగిం
దునిమితివి నీవు గురు; నే । నను దుర్విధకరణమున నినుం దెగఁ జూతున్.' 156

ప్రతిపదార్థం: వినుము; గురుద్రోహికిన్= గురువుకు ద్రోహం చేసిన వాడికి- గురుహంతకు; ఉత్తమగతి= సద్గతి; కల్గునె?= కలుగుతుందా?; నీవు; గురున్; నితాంత కుత్సిత భంగిన్= అత్యంతం నింద్యమైన పద్ధతిలో; తునిమితివి= చంపావు; నేనును; నినున్; దుర్విధ కరణమునన్= దుర్మార్గపు చేతతో; తెగన్+చూతున్= చంపజూస్తాను.

తాత్పర్యం: 'వినుము. గురువుకు ద్రోహం చేసినవాడికి సద్గతి లభిస్తుందా? నీవు గురువును అత్యంత నింద్యమైన మార్గంలో చంపావు. నేను కూడా నిన్ను దుర్మార్గంగానే చంపజూస్తాను.'

విశేషం: అలం: అర్థాంతరన్యాసం; ఇందులో 'గురుద్రోహికిఁ గల్గునె యుత్తమగతి?' అనే సామాన్యాంశం, 'నితాంత కుత్సిత భంగిం దునిమితివి నీవు గురు' అని విశేషాంశంచేత సమర్థించబడుతున్నది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

ఆ. అనుచుఁ బెలుచ నొంప నచ్చటి జనములు । గలఁగి యపుడు మేలుకాంచి చూచి
భయము దోఁపఁ గడిఁది బలుగాముగాఁ దమ । యుల్లములఁ దలంచి యొదిఁగియుండ. 157

ప్రతిపదార్థం: అనుచున్; పెలుచన్= అధికంగా; నొంపన్= బాధించగా; అచ్చటి జనములు= అక్కడున్న జనులు; కలఁగి= కలత చెంది; అపుడు; మేలుకాంచి= నిద్రలేచి; చూచి; భయము+తోఁపన్= భయం కలుగగా; కడిఁది - బలు - గాముగాన్= క్రూరుడైన గొప్ప పిశాచంగా; తమ+ఉల్లములన్= తమ మనస్సులలో; తలంచి; ఒదిఁగి+ఉండన్= తప్పుకుని ఉండగా.

తాత్పర్యం: అంటూ మిక్కిలి బాధించగా అక్కడి జనులు కలతచెంది అప్పుడు మేలుకొని చూచి, భయంతో క్రూరుడైన మేటి రాక్షసుడని మనస్సులలో భావించి తొలగగా.

అశ్వత్థామ నిద్రాపరవశుండగు ధృష్టద్యుమ్నుం జంపుట (సం. 10-8-21)

ఉ. కాలను గేలనుం జదిపి గంధకరిం దెగటార్చు సింహముం
బోలుచుఁ బేర్చి యాద్రుపద భూపసుతున్ సమయించె వేదనన్
ఱోలఁగ రోఁజఁగాఁ బలుమఱుం బొరలంబడి లాలగ్రక్కన
వ్వాలుమగండు ప్రాక్పరిభవంబుఁ దలంచుచుఁ గ్రౌర్యధుర్యుఁడై. 158

ప్రతిపదార్థం: ఆ+వాలు మగండు= ఆ గొప్పవీరుడు - అశ్వత్థామ; గంధకరిన్= మదగజాన్ని; తెగటార్చు= చంపే; సింహమున్+ పోలుచున్= సింహాన్ని పోలుతూ; పేర్చి= విజృంభించి; ప్రాక్పరిభవంబున్= పూర్వపు పరాభవాన్ని; తలంచుచున్= తలచుకుంటూ; క్రౌర్యధుర్యుఁడు+ఐ= క్రూరత్వపు భారం వహించినవాడయి- అధికకోపం గలవాడై; వేదనన్= బాధతో; ఱోలఁగన్= బాధతో అరుస్తూండగా; రోఁజంగాన్= ఆయాసపడుతూండగా; పలుమఱున్= చాలాసార్లు; పొరలంబడి= దొర్లి; లాల గ్రక్కన్= చొంగ కార్చగా; ఆ ద్రుపద భూపసుతున్= ఆ ద్రుపదరాజు కొడుకును - ధృష్టద్యుమ్నుడిని; కాలను+కేలనున్= కాలుతోనూ, చేతితోనూ, చదిపి= చితుకగొట్టి; సమయించెన్= చంపాడు.

తాత్పర్యం: ఆ వీరశ్రేష్ఠుడైన అశ్వత్థామ మదగజాన్ని చంపే సింహాన్ని పోలుతూ, విజృంభించి, పూర్వపు పరాభవాన్ని తలచుకొంటూ, అధిక కోపంతో ఆ ధృష్టద్యుమ్నుడిని బాధతో అరుస్తూ అతడు ఆయాసపడుతూండగా, మాటిమాటికి దొర్లి చొంగ కార్చగా, కాలుతోనూ, చేతితోనూ చితకగొట్టి చంపాడు.

విశేషం: అలం: ఉపమ. 'గంధకరిం దెగటార్చు సింహముం బోలుచు' - అశ్వత్థామను సింహంతోనూ, ధృష్టద్యుమ్నుడిని గంధకరితోనూ పోల్చి ఉపమేయోపమానాలకు రమణీయమైన సాదృశ్యం చెప్పబడింది కాబట్టి, ఇక్కడ అలంకారం ఉపమ. తెగటార్చటం సామాన్యధర్మం. పోలుచున్ - ఉపమావాచకం. నాలుగంశాలూ ఉన్నాయి కనుక ఇది పూర్ణోపమ.

క. ధృష్టద్యుమ్నుని నిట్లతి । కష్టవిధిప్రాప్తమరణుఁ గావించి మహా
వష్టంభోజ్జ్వలుఁడును సం । హృష్టాత్ముఁడు నగుచు వింట నిడియె గుణంబున్. 159

ప్రతిపదార్థం: ఇట్లు; ధృష్టద్యుమ్నునిన్; అతి కష్ట విధి ప్రాప్త మరణున్= మిక్కిలి బాధాకరమైన విధానంచేత పొందబడిన చావు గలవాడిని; కావించి= చేసి; మహా+అవష్టంభ+ఉజ్జ్వలుఁడును= గొప్ప గర్వంతో ప్రకాశించేవాడునూ; సంహృష్ట+ఆత్ముఁడున్= సంతోషించిన మనస్సు గలవాడునూ; అగుచున్; గుణంబున్= అల్లెత్రాటిని; వింటన్= వింటియందు; ఇడియెన్= అమర్చాడు.

తాత్పర్యం: ఈ విధంగా ధృష్టద్యుమ్నుడిని మిక్కిలి బాధాకరమైన విధానంచేత చంపి, ఎంతో గర్వంతో ప్రకాశిస్తూ, మనస్సులో సంతోషిస్తూ అల్లెత్రాడు వింటికి అమర్చాడు.

వ. ఇట్లు సజ్యం బయిన చాపంబు ముష్టి నమర్చి యాచార్యనందనుండు. 160

ప్రతిపదార్థం: ఇట్లు; సజ్యంబు+అయిన= అల్లెత్రాటితో కూడుకొన్న; చాపంబున్= వింటిని; ముష్టిన్= పిడికిట్లో; అమర్చి= ఉంచి; ఆచార్య నందనుండు= గురుపుత్రుడు - అశ్వత్థామ.

తాత్పర్యం: ఈ విధంగా అల్లెత్రాడు బిగించిన వింటిని పిడికిలితో పట్టుకొని అశ్వత్థామ.

ఆ. చప్పరంబు వెడలి చనుదెంచి యల్లని । నగవు నెఱయ సూతు మొగమునందుఁ
జూడ్కి వొలయ రత్నసుందరం బగు నిజ । స్యందనంబు పైకిఁ జనియె నధిప! 161

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్రా!; చప్పరంబున్= గుడారంలోనుండి; వెడలి; చనుదెంచి= వచ్చి; అల్లని నగవు= చిరునవ్వు; నెఱయన్= వెలయగా; సూతు-మొగమునందున్= సారథిముఖంపై; చూడ్కి= చూపు; పొలయన్= ప్రసరించగా; రత్న సుందరంబు+ అగు= మణులచేత అందమైన; నిజ స్యందనంబు పైకిన్= తనదైన రథంమీదికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రా! గుడారంలోనుండి బయటికి వచ్చి చిరునవ్వు నవ్వుతూ, సారథి ముఖంవైపు చూస్తూ, మణులచేత మనోహరమైన తన రథం మీదికి వెళ్ళాడు.

మ. అదరం బిమ్మెయి నెక్కి యుబ్బి, శిబిరం బాప్రొద్ద నిశ్శేషతం
బొరయం జేయుకుతూహలంబు మది నుప్పొంగన్, లసన్నేమి ని
ష్ఠుర నాదంబు ప్రమోదముం బెనుప రక్షోభూతచిత్తంబులం
బరవీరావలి యిండ్ల కందవ లెడం బాటించుచుం బోయినన్. 162

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; అదరంబు= రథం; ఎక్కి; ఉబ్బి= సంతోషించి; ఆ ప్రొద్దు= ఆ వేళే; శిబిరంబు= స్కంధావారం; నిశ్శేషతన్= మిగలకపోవటం; పొరయన్+చేయు= పొందించే, కుతూహలంబు= వేడుక; మదిన్= మనస్సులో; ఉప్పొంగన్= అధికం కాగా; లసత్+నేమి నిష్ఠురనాదంబు= ప్రకాశించే రథచక్రాల పట్టాలయొక్క పరుషమైన ధ్వని; రక్షోభూత చిత్తంబులన్= రాక్షసుల, పిశాచాల మనసుల్లో; ప్రమోదమున్= సంతోషాన్ని; పెనుపన్= వృద్ధి పొందించగా; పరవీర+ఆవలి= శత్రువీరుల వరుసయొక్క; ఇండ్ల కందువలు= ఇళ్ళ జాడలు; ఎడన్= హృదయంలో; పాటించుచున్= తెలిసికొంటూ; పోయినన్= పోగా.

తాత్పర్యం: ఈ విధంగా రథ మెక్కి సంతోషించి, ఆవేళే శిబిరం మొత్తం తుడిచిపెట్టేయాలనే కోరిక ఎక్కువకాగా, రథచక్రాల పట్టాల పరుషధ్వని రాక్షసుల, పిశాచాల మనసులలో సంతోషాన్ని వృద్ధి పొందించగా, శత్రువీరుల ఇళ్ళ జాడలు మనస్సులో గుర్తు చేసికొంటూ వెళ్ళగా.

తే. పీనుఁగై యున్న పాంచాలసూనుఁ జూచి । రక్షకులును, దదీయ పురంధ్రులును స
మగ్ర శోకాంధకార నిమగ్నచిత్త । వృత్తులై యేడ్చి రెలుఁగులు మిన్నుముట్ట. 163

ప్రతిపదార్థం: పీనుఁగు+ఐ= శవమై; ఉన్న; పాంచాల సూనున్= పాంచాల రాజు కొడుకును - ధృష్టద్యుమ్నుడిని; చూచి; రక్షకులును= కాపలావాళ్ళూ; తదీయ పురంధ్రులును= వారి ఆడవాళ్ళూ; సమగ్ర= సంపూర్ణమైన; శోక+అంధకార= దుఃఖ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనే చీకటిలో; నిమగ్న= మునిగిన; చిత్త వృత్తులు+ఐ= మనస్సుల వర్తనం కలవారై; ఎలుంగులు= కంఠధ్వనులు; మిన్ను ముట్టన్= ఆకాశాన్ని అంటగా; ఏడ్చిరి.

తాత్పర్యం: శవమై పోయిన ధృష్టద్యుమ్నుడిని చూచి కాపలాదారులూ, వారి ఆడువారూ సంపూర్ణ దుఃఖాంధకారంలో మునిగిపోయిన మనస్సులు కలిగి, కంఠధ్వనులు మిన్నుముట్టేటట్టు ఏడ్చారు.

క. ఆ కలకలమున మేల్కని । యా కెలఁకుల యిండ్ల రాజు లది యే మనుచున్
వే కదియం గని యా జను । లాకులరవ మెసఁగ నిట్టు లనిరి నరేంద్రా! 164

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ధృతరాష్ట్ర మహారాజా!; ఆ కలకలమునన్= ఆ పెద్దమ్రోఁతచేత; మేల్కని= మేలుకొని; ఆ కెలఁకుల ఇండ్ల రాజులు= ఆ ప్రక్క ఇళ్ళల్లోని రాజులు; అది; ఏమి; అనుచున్; వే= శీఘ్రంగా; కదియన్= సమీపించగా; కని= చూచి; ఆ జనులు; ఆకులరవము= కలగిన ధ్వని; ఎసఁగన్= అతిశయించగా; ఇట్టులు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: రాజా! ధృతరాష్ట్రా! ఆ పెనుమ్రోతకు మేలుకొని ఆ ప్రక్క ఇళ్ళల్లోని రాజులు అదేమిటంటూ వడివడిగా సమీపించగా చూచి అక్కడి జనులు రోదనధ్వని అతిశయించగా ఈ విధంగా అన్నారు.

క. 'రక్కసుఁడో, మానిసియో । నిక్క మెఱుంగము; వధించె నృపసూనుని వీఁ
డొక్కరుఁ డుదగ్రుఁడై, రథ । మెక్కి యరిగెడున్; దురాత్ము నెయిదుఁడు కడఁకన్.' 165

ప్రతిపదార్థం: రక్కసుఁడో= రాక్షసుడో; మానిసియో= మనుష్యుడో; నిక్కము+ఎఱుంగము= నిజం ఎరగం; వీఁడు+ఒక్కరుఁడు= వీడొక్కడూ; ఉద్రగుఁడు+ఐ= భయంకరుడై; నృప సూనునిన్= రాజపుత్త్రుడిని-ధృష్టద్యుమ్నుడిని; వధించెన్= చంపాడు; రథము+ఎక్కి; అరిగెడున్= వెళ్ళిపోతున్నాడు; దురాత్మున్= దుర్మార్గుడిని; కడఁకన్= పూనికతో; ఎయిదుఁడు= వెంబడించండి.

తాత్పర్యం: 'రాక్షసుడో, మనుష్యుడో మాకు నిజం తెలవదు. వీడు ఒక్కడూ భయంకరుడై ధృష్టద్యుమ్నుడిని చంపాడు. రథం ఎక్కి పోతున్నాడు. దుర్మార్గుడిని ప్రయత్నంతో వెంబడించండి.'

వ. అనిన విని యన్నరపతులు తల లెత్తి చూచి 'పోనీక పొదువుం' డనుచు సపరివారంబుగా నడరి యశ్వత్థామం బొదివిన నుద్దామప్రకారంబునం దిరిగి మూఁపులు పెరుఁగ గొనయంబు సారించి. 166

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ+నరపతులు= ఆ రాజులు; తలలు+ఎత్తి; చూచి; పోనీక పొదువుండు= వెళ్ళకుండా పట్టుకొనండి; అనుచున్= అంటూ; సపరివారంబుగాన్= పరివార సహితంగా; అడరి= విజృంభించి; అశ్వత్థామన్= అశ్వత్థామను; పొదివినన్= పట్టుకోగా; ఉద్దామ ప్రకారంబునన్= భయంకరమైన రీతిలో; తిరిగి= మరలి; మూఁపులు= భుజాలు; పెరుఁగన్= పొంగగా; గొనయంబు= వింటిత్రాడు; సారించి= లాగి.

తాత్పర్యం: అనగా విని ఆ రాజులు తలలు పైకెత్తి చూచి 'వెళ్ళకుండా పట్టుకోండి' అంటూ పరివార సమేతంగా విజృంభించి అశ్వత్థామని పట్టుకోగా అతడు భయంకరమైన విధంగా మరలి భుజాలు పొంగగా వింటినారి సారించి (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. ఖరనారాచపరంపరా విహరణ క్రౌర్యంబునన్ శాత ని
ష్ఠుర భల్ల ప్రవిసారదారుణతర క్షోణీశులం, దద్భటో
త్కరముం గేలియవోలె గీటడఁచె దోర్గర్వం బఖర్వంబుగా
వెరవుం జేవయు భూతముల్ వొగడ నవ్వీరుండు ధీరోద్ధతిన్. 167

ప్రతిపదార్థం: ఆ+వీరుండు= ఆ వీరుడైన అశ్వత్థామ; ధీర+ఉద్ధతిన్= గంభీరమైన గర్వంతో; ఖర= వాడియైన; నారాచ= బాణాలయొక్క; పరంపరా= వరుసయొక్క; విహరణ= తొలగించటంలోని; క్రౌర్యంబునన్= క్రూరత్వంతో; దోస్(ః)+గర్వంబు= భుజబలగర్వం; అఖర్వంబు+కాన్= అతిశయించగా; వెరవున్= ఉపాయమూ; చేవయున్= బలమూ; భూతముల్= పిశాచాలు; పొగడన్= కొనియాడగా; శాత= వాడిపీ; నిష్ఠుర= పరుషమైనవీ(అయిన); భల్ల= అస్త్రాలయొక్క; ప్రవిసార= విశేష ప్రసారంచేత; దారుణతర= మిక్కిలి భయంకరులైన; క్షోణీ+ఈశులన్= భూపతులనూ; తద్+భట+ఉత్కరమున్= వాళ్ళ వీరుల సమూహాన్నీ; కేలి+అ+పోలెన్= ఆటే అనేటట్టు; గీటఁడచెన్= చంపాడు.

తాత్పర్యం: ఆ వీరుడైన అశ్వత్థామ ధీరోద్ధతుడై వాడిబాణాల పరంపరను నివారించే క్రూరత్వంతో, తన భుజబలం అతిశయించగా, తన ఉపాయాన్నీ, చేవనూ పిశాచాలు కొనియాడగా, వాడిపీ పరుషమైనవీ అయిన బాణాలను విశేషంగా ప్రయోగించే అతిభయంకరులైన రాజులనూ, వాళ్ళ భటసమూహాన్నీ చంపాడు.

విశేషం: అశ్వత్థామకు శత్రురాజులను చంపటం ఒక ఆట - వినోదం. భూతాలు పొగడటం, శత్రువులను చంపి అతడు తమకు విందు చేస్తాడు గదా అని. ధీరోద్ధతిన్ - అశ్వత్థామ ధీరోద్ధతుడే కాని ధీరోదాత్తుడు కాడని సూచన.

వ. తదనంతరంబ యుత్తమౌజునిలోఁగిలి చొచ్చికృపాణపాణియై యరదంబు డిగ్గి యరసికొని యతని యభ్యంతర మందిరంబుఁ బ్రవేశించి. 168

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తరువాతనే; ఉత్తమౌజుని= ఉత్తమౌజుడియొక్క; లోఁగిలి+చొచ్చి= ఇంట్లో (శిబిరం) ప్రవేశించి; కృపాణపాణి+ఐ= చేతితో కత్తి పుచ్చుకొని; అదరంబున్+డిగ్గి= రథం దిగి; అరసికొని= చూచికొని; అతని; అభ్యంతర మందిరంబున్= అంతఃపురగృహం; ప్రవేశించి.

తాత్పర్యం: ఆ వెంటనే ఉత్తమౌజుడి గుడారంలో ప్రవేశించి కత్తి పుచ్చుకొని రథం దిగి చూచికొని అతడి అంతః పుర గృహంలోకి వెళ్ళి.

సీ. అలికిడి మేల్కనునతని ధృష్టద్యుమ్నుఁ । బట్టిన క్రియఁ దలపట్టి యీడ్చి
యాతనిఁ జంపిన యట్టులు పశుమర । ణాతి కౌతుకమున నవనిఁ బెట్టి
చంప, నచ్చేరువఁ జప్పరంబున శయ । నించు యుధామన్యుఁ డెఱిఁగి కడఁగి
చనుదెంచి రాక్షసుఁడని తలంచియుఁ గొంకు । పెట్టక పెనుగద బెట్టు వ్రేయ

ఆ. వ్రేటువడి చలింప కాటోపదీపితుఁ । డగుచు గురుతనూజుఁ డక్కుమారు
నగ్రజన్ముంబోలె నుగ్రత వధియించెఁ । గాని ఖడ్గలీల గలుగదయ్యె. 169

ప్రతిపదార్థం: అలికిడిన్= చప్పుడుచేత; మేల్కను+అతనిన్= మేలుకొనే అతడిని - ఉత్తమౌజుడిని; ధృష్టద్యుమ్నున్; పట్టిన క్రియన్= పట్టిన విధంగా; తలపట్టి+ఈడ్చి= తలపట్టుకొని ఈడ్చి; ఆతనిన్= ధృష్టద్యుమ్నుడిని; చంపిన+అట్టులు= చంపిన

విధంగా; పశుమరణ+అతి కౌతుకమునన్= పశువుచావుపై గల గొప్ప వేడుకతో; అవనిన్= నేలమీద; పెట్టి; చంపన్= చంపగా; ఆ+చేరువన్= ఆ సమీపంలో; చప్పరంబునన్= గుడారంలో; శయనించు= పండుకొన్న; యుధామన్యుఁడు; ఎఱిఁగి= తెలిసి; కడఁగి= పూని; చనుదెంచి= వచ్చి; రాక్షసుఁడు+అని; తలంచియున్= భావించీ; కొంకు పెట్టక= సంకోచించక; పెను గదన్= పెద్ద గదతో; బెట్టు వ్రేయన్= గట్టిగా కొట్టగా; వ్రేటు+పడి= దెబ్బతిని; చలింపక= కదలక; ఆటోప దీపితుఁడు= విజృంభణంచేత ప్రకాశించినవాడు; అగుచున్= అవుతూ; గురు తనూజుఁడు= గురు పుత్త్రుడు అశ్వత్థామ; ఆ+కుమారున్= ఆ కుమారుడిని, యుధామన్యుడిని; అగ్రజన్మున్+పోలెన్= అన్న అయిన ఉత్తమౌజుడివలె; ఉగ్రతన్= భయంకరంగా; వధియించెన్= చంపాడు; కాని; ఖడ్గలీల= ఖడ్గవినోదం; కలుగదు+అయ్యెన్= కలగలేదు.

తాత్పర్యం: అలికిడికి మేలుకొన్న ఆ ఉత్తమౌజుడిని ధృష్టద్యుమ్నుడిని పట్టుకున్నట్లుగానే తలపట్టి ఈడ్చి, అతడిని చంపిన విధంగానే బలిపశువువలె చంపాలనే అత్యాసక్తితో నేలమీద పడవైచి చంపగా, అక్కడే గుడారంలో పరున్న యుధామన్యుడు తెలిసి పూని వచ్చి రాక్షసుడని భావించీ, సంకోచించక పెద్ద గదతో గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బ తినినా అశ్వత్థామ చలించక విజృంభణంతో ప్రకాశిస్తూ, ఆ కుమారుడిని యుధామన్యుడిని - అన్న అయిన ఉత్తమౌజుడివలె క్రూరంగా చంపాడు. కాని, అతడికి ఖడ్గవినోదం కలగలేదు.

వ. ఇట్లు ద్రుపదపుత్త్రుల నొక్కుమ్మడి నిరువుర గీటడంచి యబ్బలుమగండు. 170

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ద్రుపద పుత్త్రులన్= ద్రుపదుడి కొడుకులను; ఒక్క+ఉమ్మడిన్= ఒక్కమాటుగా; ఇరువురన్= ఇద్దరినీ; గీటు+అడంచి= చంపి; ఆ+బలు+మగండు= ఆ మహావీరుడు.

తాత్పర్యం: ఈ విధంగా ద్రుపదుడి కొడుకులను ఇద్దరినీ చంపి ఆ మహా వీరుడైన అశ్వత్థామ. (తరువాతి పద్యంతో అన్వయం).

శా. కాలాకారతఁ బేర్చి దోర్లసిత ఖడ్గస్ఫారసాంద్రప్రభా
జాలం బొప్పఁగ నిట్లు సొచ్చి లఘుసంచారంబు శోభిల్లఁ బాం
చాల వ్రాతముఁ గ్రీడమైఁ దునిమె రక్షశ్శ్రేణి మాంసంబుఁ గీ
లాలంబుం గబళించి త్రావి మదలీలాలోలతం గ్రాలఁగన్. 171

ప్రతిపదార్థం: కాల+ఆకారతన్= యముడి రూపం వంటి రూపంతో; పేర్చి= విజృంభించి; దోస్(ః)+లలిత= బాహువునందు ప్రకాశించే; ఖడ్గ= కత్తియొక్క; స్ఫార= అధికమూ; సాంద్ర= దట్టమూ (అయిన); ప్రభా= కాంతులయొక్క; జాలంబు= సమూహం; ఒప్పఁగన్; ఇట్లు= ఈ విధంగా; చొచ్చి= ప్రవేశించి; లఘు సంచారంబు= వడిగల సంచారం; శోభిల్లన్= ఒప్పగా; రక్షస్+శ్రేణి= రాక్షసుల సమూహం; మాంసంబున్; కీలాలంబున్= నెత్తురూ; కబళించి= తిని; త్రావి= త్రాగి; మదలీలా లోలతన్= గర్వంయొక్క విలాసంపైగల అత్యాసక్తితో; క్రాలఁగన్= ప్రవర్తిల్లగా; పాంచాల వ్రాతమున్= పాంచాలుర సమూహాన్ని; క్రీడమైన్= లీలతో; తునిమెన్= చంపాడు.

తాత్పర్యం: యముడి రీతిగా విజృంభించి, చేతిలోని కత్తియొక్క మిక్కిలి దట్టమైన కాంతుల సమూహం ఒప్పగా, ఈ విధంగా ప్రవేశించి, వడిగా సంచరిస్తూ, రాక్షసుల సమూహం మాంసం తినీ, రక్తం త్రాగీ, గర్వంతో ప్రవర్తిల్లగా (అశ్వత్థామ) పాంచాల వీరుల సమూహాన్ని లీలగా చంపాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'కాలాకారతన్' - ఇక్కడ ఆకార శబ్దాన్ని ఇవార్థకంగా భావించవచ్చును. అప్పుడు అలంకారం ఉపమ. 'మాంసంబుఁ గబళించి, కీలాలంబుం ద్రావి' అని క్రమాన్వయం.

వ. అట్టియెడ. 172

తాత్పర్యం: అట్టి+ఎడన్= అటువంటి సమయంలో.

శా. నిద్రాసక్తునిఁ, గొంత మేల్కనిన వానిన్, సుప్రబుద్ధాత్ముఁడై
యుద్రేకంబును శౌర్యసారమును బాహూల్లాసముం జూపఁ జం
చద్రేఖం దిరమైనవానిఁ దను నుత్సాహోగ్రతం దాఁకి యు
న్నిద్రస్వైర సముద్ధతిన్ మెఱయువానిం దున్మె నేకాకృతిన్. 173

ప్రతిపదార్థం: నిద్రా+సక్తునిన్= నిద్రావశుడినీ; కొంత మేల్కనినవానిన్= కొంచెం మేలుకున్నవాడినీ; సుప్రబుద్ధ+ఆత్ముఁడు+ఐ= బాగా మెలకువ వచ్చినవాడై; ఉద్రేకంబును= ఆవేశమూ; శౌర్య సారమును= పరాక్రమోన్నతీ; బాహు+ఉల్లాసమున్= భుజబల ప్రకాశాన్నీ; చూపన్= చూపించటానికి; చంచత్+రేఖన్= చలిస్తూన్న విలాసంతో; తిరము+ఐన వానిన్= నిలకడగల వాడినీ; తనున్= తనని; ఉత్సాహ+ఉగ్రతన్= ఉత్సాహాతిశయంతో; తాఁకి= ఎదిరించి; ఉన్నిద్ర స్వైర సముద్ధతిన్= జాగరూకమూ; స్వేచ్ఛగలదీ(అగు) విజృంభణంతో; మెఱయు వానిన్= ప్రకాశించేవాడినీ; ఏక+ఆకృతిన్= ఒక్కడూ; తున్మెన్= వధించాడు.

తాత్పర్యం: నిద్రావశుడినీ, కొంచెం మేలుకొన్నవాడినీ, బాగా మేలుకొని ఆవేశంతో శౌర్యోన్నతినీ, భుజబల ప్రకాశాన్నీ చూపాలని ఉబలాటపడుతూన్నవాడినీ, తనను అత్యుత్సాహంతో తాకి జాగరూకతతో ఇష్టం వచ్చినట్లు విజృంభించేవాడినీ అశ్వత్థామ ఒక్కడూ వధించాడు.

వ. మఱియు నతండు. 174

తాత్పర్యం: ఇంకా ఆ అశ్వత్థామ.

అశ్వత్థామ కరితురంగంబులపై కుఱికి నఱకుట (సం. 10-8-39)

స్రగ్ధర. తుండంబుల్ నుగ్గునుగ్గై తొరఁగఁగఁ జులుకం ద్రుంచుఁ, గుంభస్థలంబు
ల్ఖండించున్ మౌక్తికంబు ల్గలయఁగఁ జెదరం, గాయముల్ ప్రేవుఁబ్రోవుల్
చండంబుల్ సాంద్రరక్త స్రవమున బెరయన్ జాల్పడన్, వ్రేయు నిమ్మై
శుండాలశ్రేణి మాయించుచు, వెలిఁగి, హయస్తోమశాలాగతుండై. 175

ప్రతిపదార్థం: తుండంబుల్= తొండాలు; నుగ్గునుగ్గు+ఐ= ముక్కలు ముక్కలై; తొరుఁగఁగన్= రాలగా; చులుకన్= సులభంగా; త్రుంచున్= ఖండిస్తాడు; మౌక్తికంబులు= ముత్యాలు; కలయఁగన్= అంతటా; చెదరన్= ఇటూ అటూ పడగా; కుంభ స్థలంబుల్; ఖండించున్= త్రుంచుతాడు; కాయముల్= శరీరాలు; ప్రేవుఁబ్రోవుల్= పేగుల రాశులు; చండంబుల్= తీవ్రమైనవి-భయంకరమైనవి; సాంద్ర రక్త స్రవమునన్= దట్టమైన రక్తప్రవాహంతో; బెరయన్= కూడుకోగా; జాలు+పడన్= ప్రవహించగా; వ్రేయున్= కొడతాడు; ఈ+మైన్= ఈ విధంగా; శుండాల శ్రేణిన్= ఏనుగుల వరసను; మాయించుచున్= చంపుతూ; వెలిఁగి= ప్రకాశించి; హయస్తోమ శాలా గతుండు+ఐ= గుర్రాల సమూహం ఉండే శాలలోకి వెళ్ళిన వాడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తొండాలు ముక్కలు ముక్కలై రాలేటట్టు అనాయాసంగా ఖండించాడు. ముత్యాలు అంతటా చెదరిపడేటట్టు కుంభస్థలాలు పగలగొట్టాడు. శరీరాలూ, ప్రేగుల పోగులూ భయంకరాలై దట్టమైన రక్తప్రవాహంతో కూడి పారేటట్లు కొట్టాడు. ఈ రీతిగా ఏనుగుల గుంపును చంపుతూ ఒప్పి గుర్రాలశాలకు వెళ్ళి.

విశేషం: స్రగ్ధరలో నాలుగు పాదాలుంటాయి. ఒక్కొక్కపాదంలో మ,భ,ర,న,య,య,య అనే గణాలుంటాయి. 1-8-15 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉంటుంది.

ఉ. **కొన్నిటి పాదముల్ నఱుకుఁ; గొన్నిటి మోరలు సెక్కు లీలమైఁ**
గొన్నిటి కంఠముల్ దునుముఁ; గొన్నిటి వీఁపులు వ్రచ్చు నుబ్బునం
గొన్నిటి సర్వగాత్రములు క్రూరవిచేష్టితవిక్రమంబు దోఁ
ప న్నుఱుమాడుఁ బ్రౌఢబలభాసితభూరిభుజావిహారుఁడై. **176**

ప్రతిపదార్థం: ప్రౌఢ= గొప్పదైన; బల= బలంచేత; భాసిత= ప్రకాశించిన; భూరి= అధికమైన; భుజా= బాహువులయొక్క; విహారుఁడు+ఐ= క్రీడగలవాడయి; కొన్నిటి పాదముల్= కొన్ని గుర్రాల కాళ్ళు; నఱుకున్= తెగగొట్టాడు; కొన్నిటి మోరలు= కొన్నింటి ముట్టెలు; లీలమైన్= విలాసంగా-అవలీలగా; చెక్కున్= చెక్కాడు; ఉబ్బునన్= సంతోషంతో; కొన్నిటి కంఠముల్= కొన్నిటి పీకలు; తునుమున్= ఖండించాడు; కొన్నిటి వీఁపులు; వ్రచ్చున్= చీరాడు; క్రూర విచేష్టిత విక్రమంబు= భయంకరపు పనులు చేసే పరాక్రమం; తోఁపన్= తోచేటట్లు; కొన్నిటి సర్వ గాత్రములు= కొన్నిటి అన్ని అవయవాలూ; నుఱుమాడున్= ముక్కలు చేశాడు.

తాత్పర్యం: (అశ్వత్థామ) గొప్పబలంతో ప్రకాశించే అధికబాహుబలంతో క్రీడిస్తూ కొన్ని గుర్రాల కాళ్ళు తెగగొట్టాడు. కొన్నింటి ముట్టెలు అనాయాసంగా చెక్కాడు. కొన్నిటి పీకలు సంతోషంతో ఖండించాడు. కొన్నిటి వీపులు చీరాడు. భయంకర పరాక్రమం తోచేటట్లు కొన్నిటి అవయవాలన్నీ ముక్కలు చేశాడు.

విశేషం: ఇందులోని నఱుకు, చెక్కు, తునుము, వ్రచ్చు, నుఱుమాడు అనే తద్ధర్మార్థక క్రియలన్నీ భూతార్థకాలని గ్రహించాలి. 'నఱుకున్= నరికెను, నరికాడు' - ఇత్యాదిగా గ్రహించాలి.

వ. **ఇబ్భంగిఁ బీనుంగుపెంటలైన పాంచాలుర విడిదల వెడలి విజయోద్దాముండగు నశ్వత్థామ చల్లడము, దట్టి మొదలయిన పరికరంబులు పాటించియున్న గనపలోఁగిళ్ళకుం జని, తొలుత దొరలం దునుముచుఁ, బరిజన మాతంగ తురంగ మండలముల ముట్టి, విదళన వినోదంబులు సలుపుచు, నొక్కొక్కయెడ మార్తురు మేల్కని పన్ని మార్కొనిన, మారి మసంగినట్లు, మృత్యుదేవత గెరలిన చాడ్పున, జముండు నలిరేఁగిన కరణిఁ, గనుపుగొట్టి, కాలుకాలం బెనంగిన పీనుంగులను, గనక రత్నవలయంబులఁ జెలువందు చేతులను, దునిసిపడిన కరికరంబులతో సరసమాడు చెలువునం జలనంబు నొందు చరణంబులను, నావులించు తలలను, వేదండ దంత ఖండంబులను, ఘోటక ముఖలేశంబులను, రథావయవ శకలంబులను, మడువులు గట్టు నెత్తురులను, గుప్పలు గొను కండలను, బెనంగొను ప్రేవులను, బెనుతిట్టలగు నెమ్ములను, మూర్తిమంతంబు లయినట్టి యద్భుతంబునకు, భయానకంబునకు, బీభత్సంబునకు, నన్నేల నెలవగునట్లుగాఁ**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జేయుచుఁ, జెలంగి చెలంగి మలంగి మలంగి తన కరవాల లీలలు భూతబేతాళంబులకుఁ బ్రీతిఁ బెనుపఁ జతురంగంబులం బాఱినను, బీఱువోయినను మరలినను, దెరలినను, గలంగినను, దొలంగినను, దఱిమినను, నఱిమినను, గిట్టినను, ముట్టినను, దాను వానిం బొదివి పొలియించుచు, బలువిడియు, నుబ్బును, వెరవును, బరుసఁదనంబు, నొక్కచందంబునఁజెల్ల నందొక్కటినైనను దక్కనీక యంతకంతకు నెక్కుడగు కోపంబున నాటోపంబు దీపింప, వాదరఁ జిక్కిన యెముకతునుకలు గోఱదౌడల కైవడి గలిగి రుధిరానులేపనంబున నాభీలంబగు నసిపట్టిక ఘోరాకారయైన రాక్షసి పగతుర గీటడంగించుటకుఁ దనకుఁ దోడువచ్చిన తెఱంగున మెఱయఁ జేదిసైన్య సన్నివేశంబు లోనుగాఁగల బలుచోట్లఁ గమలాకరంబు సొచ్చిన ఘనలులాయంబు రేఖయుఁ, గేలివనంబుఁ దఱిసిన మత్తశుండాలంబు పోల్కియును, గాంతారంబు దరికొను దావపావకు విధంబును దోఁప విహరించుచు, వలయుతఱి రథం బెక్కుచుఁ, బాదచారియై విక్రమించుచు, వెరవు దొరకొననప్పుడు నగ్గలికమై బెరయఁ బెనంగి రక్తంబున సిక్తంబైన శరీరంబు దారుణ ప్రకారంబున నుల్లసిల్లఁ, దన్ను సకల జనులు దానవుండని తలంపఁ, బెంపారు భీషణోద్ధతిఁ బ్రవర్తిల్లు పరాక్రమక్రీడ నతిశయిల్లి, రాజమందిరంబు సొర నప్పళించుచుఁ, దద్ద్వారంబున కభిముఖుండై యరిగె నట్టియెడ. 177

ప్రతిపదార్థం: ఈ+భంగిన్= ఈ విధంగా; పీనుంగు పెంటలు+ఐన; పాంచాలుర విడిదలన్= పాంచాలురున్న శిబిరం; వెడలి; విజయ+ఉద్దాముండు+అగు= గెలుపుచేత భయంకరుడైన అశ్వత్థామ; చల్లడము= లోపలిలాగు; దట్టి= కాసెకోక; మొదలు+అయిన పరికరంబులు= మున్నగు నడికట్లు; పాటించి= ధరించి; ఉన్న గనప లోఁగిళ్ళకున్= మిగిలిన పెద్ద ఇళ్ళలోనికి; చని= వెళ్ళి; తొలుతన్= మొదట; దొరలన్= ప్రభువులను; తునుముచున్= చంపుతూ; పరిజన మాతంగ తురంగ మండలంబులన్= బలగాన్నీ, ఏనుగుల గుర్రాల సమూహాలనూ; ముట్టి= తాకి; విదళన వినోదంబులు= ముక్కలు చేసే వేడుకలు; సలుపుచున్= చేస్తూ; ఒక్కొక్క+ఎడన్= ఒక్కోసారి; మార్తురు= శత్రువులు; మేల్కని= మేలుకొని; పన్ని= తలపడి; మార్కొనినన్= ఎదిరిస్తే; మారి మసంగిన+అట్లు= మిక్కిలి విజృంభించిన విధంగా; మృత్యుదేవత; కెరలిన చాడ్పునన్= చెలరేగిన రీతిని; జముండు= యముడు; నలిరేఁగిన కరణిన్= విజృంభించిన తీరుగా; కనుపు+కొట్టి= సంహరించి; కాలు కాలన్+పెనంగిన పీనుంగులను= కాలు కాలితో పెనవేసికొన్న శవాలతోనూ; కనక రత్న వలయంబులన్= మణులు పొదిగిన బంగారపు మురుగులతో; చెలువు+ అందు చేతులను= ఒప్పే చేతులతోనూ; తునిసిపడిన= ముక్కలైపడ్డ; కరి కరంబులతోన్= ఏనుగులతొండాలతో; సరసము+ఆడు చెలువునన్= హాస్యమాడే రీతిగా; చలనంబున్+ఒందు చరణంబులను= కదలాడే కాళ్ళతోనూ; ఆవులించు తలలను= ఆవలించే తలలతోనూ; వేదండ దంత ఖండంబులను= ఏనుగుల దంతాల ముక్కలతోనూ; ఘోటక ముఖ లేశంబులను= గుర్రాల ముఖాల ముక్కలతోనూ; రథ+అవయవ శకలంబులను= రథాల భాగాల ముక్కలతోనూ; మడువులు+కట్టు నెత్తురులను= ప్రవాహాలైన రక్తాలతోనూ; కుప్పలు+కొను కండలను= రాశులైన కండలతోనూ; పెనంగొను ప్రేవులను= ఒకదానితో ఒకటి పెనవేసికొన్న ప్రేగులతోనూ; పెనుతిట్టలు+అగు ఎమ్ములను= పెద్ద గుట్టలైన ఎముకలతోనూ; మూర్తిమంతంబులు+ అయిన+అట్టి= రూపుదాల్చినట్టి; అద్భుతంబునకున్= అద్భుతరసానికీ; భయానకంబునకున్= భయానక రసానికీ; బీభత్సంబునకున్= బీభత్సరసానికీ; ఆ+నేల= ఆ ప్రదేశం; నెలవు+అగు+అట్లు+కాన్= స్థానం అయ్యేటట్లుగా; చేయుచున్= చేస్తూ; చెలంగి చెలంగి= మిక్కిలి విజృంభించి; మలంగి మలంగి= తిరిగి తిరిగీ; తన కరవాల లీలలు= తన ఖడ్గవిలాసాలు; భూత బేతాళంబులకున్= దయ్యాలకూ పిశాచాలకూ; ప్రీతి= సంతోషం; పెనుపన్= పెంచగా; చతుర్(ః)+ అంగంబులన్= రథాలూ, ఏనుగులూ, గుర్రాలూ, కాల్బంటులూ అనే నాలుగు విధాల సేనలనూ; పాఱినను= పారిపోయినా; బీఱు+పోయినను=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వెనుదీసినా; మరలినను= మరలిపోయినా; తెరలినను= జంకినా; కలంగినను= భయపడినా; తొలంగినను; తఱిమినను= కవిసినా; అఱిమినను= ఎదుర్కొనినా; కిట్టినను= సమీపించినా; ముట్టినను= తాకినా; తాను; వానిన్= ఆ బలాలను; పొదివి= ఆక్రమించి; పొలియించుచున్= చంపుతూ; బలువిడియున్= పరాక్రమమూ; ఉబ్బును= గర్వమూ; వెరవును= ఉపాయమూ; పరుసందనంబున్= కాఠిన్యమూ; ఒక్క చందంబునన్= ఒక్కలా; చెల్లన్= సాగగా; అందున్= ఆ బలాలలో; పొదివి= ఆక్ర మించి; పొలియించుచున్= చంపుతూ; బలువిడియున్= పరాక్రమమూ; ఉబ్బును= గర్వమూ; వెరవును= ఉపాయమూ; పరుసం దనంబున్= కాఠిన్యమూ; ఒక్క చందంబునన్= ఒక్కలా; చెల్లన్= సాగగా; అందున్= ఆ బలాలలో; ఒక్కటిన్+ఐనను= ఏఒక్క దానినీకూడా; తక్కనీక= మిగలనివ్వక; అంతకంతకున్= క్రమ క్రమంగా; ఎక్కుడు+అగు= అధికమయ్యే; కోపంబునన్= కోపంతో; ఆటోపంబు= గర్వం; దీపింపన్= ప్రకాశించగా; వాదరన్= కత్తి అంచున; చిక్కిన= తగులుకున్న ఎముక; తునుకలు= (ఎముకల) ముక్కలు; కోఱ దౌడల కైవడి= కోరలు గల దౌడల విధం; కలిగి; రుధిర+ అనులేపనంబునన్= నెత్తురు పూతచే; ఆభీలంబు+అగు= భయంకరమైన; అసిపట్టిక= కత్తి; ఘోర+ఆకార+ఐన+రాక్షసి= భయంకరరూపంగల రాక్షసి; పగతురన్= శత్రువులను; గీటడంగించుటకున్= చంపటానికి; తనకున్; తోడువచ్చిన తెఱంగునన్= సాయపడటానికి వచ్చినట్లుగా; మెఱయన్= ప్రకాశించగా; చేది సైన్య సన్నివేశంబు లోనుగాన్ కల= చేదిదేశపు సైన్యం గుడారం మొదలుగా గల; పలుచోట్లన్= అనేక ప్రదేశాలలో; కమలాకరంబు= సరస్సు; చొచ్చిన= ప్రవేశించిన; ఘన లులాయంబు రేఖయున్= పెద్ద దున్నపోతు విధమూ; కేలివనంబున్= ఉద్యానవనాన్ని; తఱిసిన= ప్రవేశించిన; మత్తశుండాలంబు+పోల్కియును= మదించిన ఏనుగు విధమూ; కాంతారంబున్= అడవిని; దరికొను= కాల్చే; దావ పావకు విధంబును= కార్చిచ్చు విధమూ; తోఁపన్= స్ఫురించగా; విహరించుచున్= సంచరిస్తూ; వలయు తఱిన్= అవసరమయినప్పుడు; రథం+ఎక్కుచున్= రథం ఎక్కుతూ; పాదచారి+ఐ= నడుస్తూ; విక్రమించుచున్= పరాక్రమిస్తూ; వెరవు దొరకొనన్= ఉపాయం లభించగా, వీలు చిక్కగా; అప్పుడు= ఆ సమయంలో; అగ్గలికమైన్= విజృంభణంతో; బెరయన్= ఒప్పి; పెనంగి= యుద్ధంచేసి; పగతుర రక్తంబునన్= శత్రువుల నెత్తుటితో; సిక్తంబు+ఐన= తడిసిన; శరీరంబు; దారుణ ప్రకారంబునన్= భయంకరమైన రీతిగా; ఉల్లసిల్లన్= ప్రకాశించగా; తన్నున్= తనను; సకల జనులున్= అందరూ; దానవుండు+అని= రాక్షసుడని; తలంపన్= భావించగా; పెంపారు= అతిశయించే; భీషణ+ఉద్ధతి= భయంకరమైన గర్వంతో; ప్రవర్తిల్లు= ఉండు, సాగు; పరాక్రమ క్రీడన్= విక్రమ లీలతో; అతిశయిల్లి= మించి; రాజమందిరంబు= రాజభవనం; చొరన్= ప్రవేశించటానికి; అప్పళించుచున్= ఉత్సహిస్తూ; తద్+ద్వారంబునకున్= దాని ద్వారానికి; అభిముఖుండు+ఐ= ఎదురై; అరిగెన్= వెళ్ళాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా పీనుగుపెంట అయిన పాంచాల వీరుల శిబిరంలోనుండి వచ్చి జయ గర్వితుడైన అశ్వత్థామ చల్లడమూ, కాసెకోకా ధరించి మిగిలిన పెద్ద శిబిరాలలోకి వెళ్ళి మొదట ప్రభువులను చంపి, తరువాత పరిజనులనూ ఏనుగుల, గుర్రాల సమూహాలనూ తాకి ముక్కలుగా చేస్తూ, ఒక్కోసారి శత్రువులు మేలుకొని తలపడితే మిక్కిలి విజృంభించి మృత్యుదేవత చెలరేగిన విధంగా, యముడు విజృంభించిన రీతిగా వాళ్ళను సంహరించి, కాలు కాలితో పెనువేసుకున్న శవాలతోనూ, ముక్కలై పడిన ఏనుగు తొండాలతో సరసమాడే రీతిగా కదలాడే కాళ్ళతోనూ, ఆవులించే తలలతోనూ, ఏనుగుదంతాల ముక్కలతోనూ, గుర్రాల ముఖాల శకలాలతోనూ, రథభాగాల ముక్కలతోనూ, మడుగులు కట్టే నెత్తురుతోనూ, రాశులైన కండలతోనూ, ఒండొంటితో పెనవేసికొనిపోయిన ప్రేగులతోనూ, పెద్ద గుట్టలయిన ఎముకలతోనూ, రూపుతాల్చిన అద్భుత భయానక బీభత్స రసాలకు ఆ ప్రదేశం స్థానమయ్యేటట్లు చేస్తూ, మిక్కిలి విజృంభించీ, తిరిగి తిరిగీ, తన ఖడ్గ విలాసాలు భూతబేతాళాలకు ప్రీతి పెంచుతూండగా, చతురంగబలాలను, పారిపోయినా, వెనుదీసినా, మరలిపోయినా, జంకినా, కలగినా, తొలగినా, కవిసినా, మార్కొన్నా, సమీపించినా, తాకినా, ఆక్రమించి చంపుతూ, పరాక్రమమూ, గర్వమూ, ఉపాయమూ, కాఠిన్యమూ

ఒక్కటై సాగగా, ఆ బలాలలో ఏ ఒక్క దానినీ మిగలనివ్వక, పోను పోను ఎక్కువయ్యే కోపంతో ప్రకాశించగా, అంచుకు అంటుకొన్న ఎముకల ముక్కలు కోరల దౌడలలో ఉండి, నెత్తురు పూతచే భయంకరమైన కత్తి శత్రువులను చంపటంలో తనకు తోడు పడటానికి వచ్చిన భయంకరాకార అయిన రాక్షసివలె ప్రకాశించగా, చేదిసైన్యం ఉన్న గుడారం మొదలుకొని పెక్కుచోట్ల సరస్సులో ప్రవేశించిన పెనుదున్నపోతువలె, ఉద్యానవనం ప్రవేశించిన మత్తేభం వలె, అడవిని కాల్చే కార్చిచ్చువలె విహరిస్తూ, అవసరమయినప్పుడు రథం ఎక్కి, నడిచీ, పరాక్రమిస్తూ, వీలు చిక్కినప్పుడు విజృంభిస్తూ యుద్ధం చేసి శత్రువులనెత్తురుతో తడిసిన శరీరం భయంకరంగా ప్రకాశించగా, తనను అందరూ రాక్షసుడని భావించగా, అతిశయించే భయంకరౌద్ధత్యంతో సాగే విక్రమక్రీడతో మించి, రాజభవనం ప్రవేశించటానికి ఉత్సహిస్తూ, దాని ద్వారంవైపు వెళ్ళాడు. ఆ సమయంలో.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, ఉపమ, భ్రాంతిమంతం. 'మృత్యు దేవత గెరలిన చాడ్పున', 'జముండు నలిరేఁగిన కరణి'- అలంకారాలు ఉత్ప్రేక్షలు. 'తునిసి పడిన కరి కరంబులతో సరసమాడు చెలువునం జలనంబు నొందు చరణంబులను' - అలంకారం ఉత్ప్రేక్ష. 'వాదరఁ జిక్కిన యెముక తునుకలు గోఱదౌడలకైవడి గలిగి'- అలంకారం ఉపమ. 'అసిపట్టిక ఘోరాకారయైన రాక్షసి పగతుర గీటడంగించుటకుఁ దనకుఁ దోడు వచ్చిన తెఱంగున మెఱయ' - అలంకారం ఉత్ప్రేక్ష. 'కమలాకరంబు సొచ్చిన ఘన లులాయంబు రేఖయుఁ, గేలివనంబుఁ దఱిసిన మత్త శుండాలంబు పోల్కియును, గాంతారంబు దరికొను దావపావకు విధంబును దోఁప'- మూడూ మూడు ఉపమలు. 'తన్ను సకల జనులు దానవుండని తలంప' అలంకారం భ్రాంతిమంతం.

సీ. **కలయంగ వీడుమేల్కని యమ్మహావీరుఁ । డొక్కడ మెలఁగుటయు, నతండు**
దొలుత ధృష్టద్యుమ్నుఁ ద్రుంచి తద్బంధు సం । తతి గీటడఁచి యోధదంతితురగ
చయముల నెల్లను సమయంగఁ జూచుచు । రాకయుఁ, గర్ణ పరంపరావ
గతమున సన్నాహగాఢమై యెక్కడె । క్కడయని కడఁగి శిఖండి ద్రౌప

తే. **దేయులును దానుఁ బన్ని యుద్వృత్త శౌర్య । మాన తుంగ ప్రభద్రక మాత్స్య తతులు**
తోడ బలువిడిఁ దఱుమంగ ద్రోణ తనయు । ముట్టి శస్త్రాస్త్రచయముల ముంచుటయును. 178

ప్రతిపదార్థం: వీడు= శిబిరం; కలయంగన్= అంతటా; మేల్కని= మేలుకుని; ఆ+మహావీరుఁడు= ఆ గొప్పవీరుడు - అశ్వత్థామ; ఒక్కఁడు+అ= ఒక్కడే; మెలఁగుటయున్= సంచరించటమూ; అతండు; తొలుతన్= మొదట; ధృష్టద్యుమ్నున్; త్రుంచి= చంపి; తద్+బంధు సంతతిన్= ఆతడి చుట్టాలసమూహాన్ని; గీటు+అడఁచి= చంపి; యోధ దంతి తురగ చయములన్+ఎల్లను= వీరుల, ఏనుగుల, గుర్రాల-సమూహాలన్నిటినీ; సమయంగన్+చూచుచున్ రాకయున్= చంపుతూ రావటమూ; కర్ణ పరంపరా+అవగతమునన్= వినికి వరుసచే తెలియటంచేత; సన్నాహగాఢము+ఐ= యుద్ధ ప్రయత్నంలో మునిగినదయి; ఎక్కడ+ఎక్కడ+అని; కడఁగి= పూని; శిఖండి; ద్రౌపదేయులును= ద్రౌపది కొడుకులూ; తానున్; పన్ని= వ్యూహంగా ఏర్పడి; ఉద్వృత్త శౌర్యమాన తుంగ ప్రభద్రక మాత్స్యతతులు= అధికమైన పరాక్రమంచేతా, పౌరుషంచేతా, ఉగ్రులైన ప్రభద్రకుల, మాత్స్యుల సమూహాలు; తోడన్= కూడా; బలువిడిన్= పరాక్రమంతో; తఱుమంగన్= తరమగా; ద్రోణ తనయున్= అశ్వత్థామను; ముట్టి= తాకి; శస్త్ర+అస్త్ర చయములన్= శస్త్రాల, అస్త్రాల సమూహాలతో; ముంచుటయును= ముంచగా.

తాత్పర్యం: శిబిరం అంతా మేలుకొని, ఆ మహావీరుడైన అశ్వత్థామ ఒక్కడే సంచరించటమూ, అతడు మొదట ధృష్టద్యుమ్నుడిని చంపి, అతడి చుట్టాలను చంపి, వీరులనూ, ఏనుగులనూ, గుర్రాలనూ చంపుతూ రావటమూ, ఆనోటా ఆనోటా విని యుద్ధ ప్రయత్నంలో మునిగి, ఎక్కడెక్కడని పూని, శిఖండీ, ఉప పాండవులూ వ్యూహంగా ఏర్పడి, అధిక పరాక్రమం చేతా, పౌరుషంచేతా ఉగ్రులైన ప్రభద్రకులూ, మాత్స్యులూ తమతో కూడ వచ్చి పరాక్రమంతో తరమగా, అశ్వత్థామను తాకి శస్త్రాలతోనూ, అస్త్రాలతోనూ ముంచగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: శిఖండి పూర్వజన్మలో అంబ. ఈమె భీష్మడి మీది కోపంతో అతడిపై పగ తీర్చుకొనాలని ఈశ్వరుడిని గురించి తపస్సుచేసి వరం పొంది మరుజన్మలో ద్రుపదుడికి కూతురై పుట్టింది. ఆ తరువాత శిఖండిగా రూపాంతరం చెందింది. స్త్రీతోనూ పూర్వం స్త్రీరూపం గలవారితోనూ షండుడితోను తాను యుద్ధం చేయనని నియమం. అది తెలిసి అర్జునుడు శిఖండిని ముందు పెట్టుకొని భీష్మడితో యుద్ధానికి రాగా భీష్మడు అస్త్రసన్న్యాసం చేస్తాడు. అర్జునుడు అప్పుడు భీష్మడిని జయిస్తాడు.

వ. వారల నేర్పడ నాలోకించి. 179

ప్రతిపదార్థం: వారలన్= శిఖండి మొదలుగా గల శత్రువీరులను; ఏర్పడన్= బాగా; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: (అశ్వత్థామ) శిఖండి మొదలైన వాళ్ళను బాగా చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. అగ్గురునందనుండు హరిణావలిఁ గాంచి కుభృత్తటంబు వే
డిగ్గు మృగేంద్రు చాడ్పునఁ గడిందిమగంటిమి యుల్లసిల్లఁగా
డిగ్గి రథంబు చోద్యపువడిం గలయన్ బెరసెం గరంబులం
దగ్గల మైన ఖేటకము నద్భుతఖడ్గముఁ దేజరిల్లఁగన్. 180

ప్రతిపదార్థం: ఆ+గురు నందనుండు= ఆ గురుపుత్త్రుడు-అశ్వత్థామ; హరిణ+ఆవలిన్= లేళ్ళవరసను; కాంచి= చూచి; కుభృత్+తటంబున్= పర్వత ప్రదేశంనుండి; వే= శీఘ్రంగా; డిగ్గు= దిగే, మృగ+ఇంద్రు-చాడ్పునన్= సింహంలా; కడింది-మగంటిమి= గొప్పపరాక్రమం; ఉల్లసిల్లఁగాన్= ప్రకాశించగా; రథంబున్+డిగ్గి= రథందిగి; కరంబులందున్= చేతులలో; అగ్గలము+ఐన= అతిశయించిన; ఖేటకమున్= డాలూ; అద్భుత ఖడ్గమున్= ఆశ్చర్యకరమైన కత్తీ; తేజరిల్లఁగన్= ప్రకాశించగా; చోద్యము+వడిన్= వింతయైన వేగంతో; కలయన్= అంతటా; బెరసెన్= కవిశాడు.

తాత్పర్యం: ఆ అశ్వత్థామ లేళ్ళను చూచి కొండపైనుండి గబగబా దిగే సింహంవలె, గొప్ప పరాక్రమం ఒప్పగా, రథం దిగి, చేతులలో మంచి డాలూ, ఆశ్చర్యకరమైన కత్తీ ప్రకాశించగా మహావేగంతో అంతటా వ్యాపించాడు.

విశేషం: అలం: ఉపమ.'కుభృత్తటంబు వే డిగ్గు మృగేంద్రుచాడ్పున'- అలంకారం ఉపమ. దీనివలన శత్రువుల అల్పత్వమూ, అశ్వత్థామ ఘనతా తెలుస్తాయి.

మహాస్రగ్ధర.

చతురంగచ్ఛేద కేళీ సరభస కలనాశ్చర్య ధౌరేయ నానా
గతులం ద న్నెల్లవారుం గడిఁది యసుర నాఁగా నతిక్రూర చేష్టో

ద్ధతి యొప్పం జొచ్చి సైన్యాస్త్రముల నతని యస్త్రంబులం ద్రుంచి వీఁకం
బ్రతివింధ్యుం గిట్టి రెండై పడఁగఁ దునిమెఁ దద్భాసమానాంగయష్టిన్. 181

ప్రతిపదార్థం: చతుః+అంగ+ఛేద= రథ గజ తురగ పదాతులనే నాలుగు రకాల సైన్యాన్నీ ఖండించటం (అనే); కేళీ= క్రీడలో; సరభస కలనా= వేగంతో కూడుకున్న; ఆశ్చర్య ధౌరేయ= ఆశ్చర్యభారం వహించిన-మిక్కిలి ఆశ్చర్యకరమైన; నానాగతులన్= అనేకవిధాలచేత; తన్నున్= తనను; ఎల్లవారున్= అందరూ; కడిఁది+అసుర నాఁగాన్= క్రూర రాక్షసుడనగా; అతి క్రూర చేష్టా+ఉద్ధతి= మిక్కిలి క్రూరములైన పనుల తీవ్రత; ఒప్పన్= ఒప్పగా; చొచ్చి= ప్రవేశించి; సైన్య+అస్త్రములన్= (శత్రు) సైన్యపు అస్త్రాలను; అతని+అస్త్రంబులన్= ప్రతివింధ్యుడి అస్త్రాలతో; త్రుంచి= ఖండించి; వీఁకన్= పరాక్రమంతో; ప్రతివింధ్యున్= ప్రతివింధ్యుడనేవాడిని - ధర్మరాజు కొడుకును; కిట్టి= సమీపించి; తద్+భాసమాన+అంగయష్టిన్= అతడి ప్రకాశిస్తూ ఉన్న కర్రవంటి శరీరాన్ని; రెండు+ఐ= పడఁగన్= రెండు ముక్కలై పడేటట్లు; తునిమెన్= ఖండించాడు.

తాత్పర్యం: చతురంగబలాలనూ ఛేదించటం అనే ఆటలో వేగంతో కూడుకొన్న మహాశ్చర్యకరాలైన పెక్కు విధాలవలన తనను అందరూ మహారాక్షసు డని భావించగా, మిక్కిలి క్రూరములైన చేష్టల తీవ్రత ఒప్పగా ప్రవేశించి శత్రుసేనల అస్త్రాలను తన అస్త్రాలతో ఖండించి, పరాక్రమంతో ప్రతివింధ్యుడిని సమీపించి, వాడి మెరిసే దేహయష్టిని రెండు ముక్కలై పడేటట్లు ఖండించాడు.

విశేషం: మహాస్రగ్ధరలో నాలుగు పాదాలుంటాయి. ఒక్కొక్క పాదంలో స,త,త,న,స,ర,ర,గ అనే గణాలుంటాయి. 1-9-16 అక్షరాలకు యతిమైత్రి. ప్రాస నియమం ఉంటుంది.

వ. ఇవ్విధంబున ధర్మతనయనందనుని నడుము దెగనడిచి యార్చి పేర్చిన. 182

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ధర్మతనయ-నందనుని= ధర్మరాజు కొడుకుయొక్క; ప్రతివింధ్యుడియొక్క నడుము; తెగన్+అడిచి= తెగగొట్టి; ఆర్చి= అరచి; పేర్చినన్= విజృంభించగా;

తాత్పర్యం: ఈ రీతిగా ప్రతివింధ్యుడి నడుము తెగగొట్టి అరచి విజృంభించగా.

మహాస్రగ్ధర.

అతిశోక క్రోధవేగవ్యథిత హృదయుఁడై యశ్వసాదిత్వ వీరో
ద్ధతిఁ బ్రౌఢస్ఫూర్తి సెల్వొందఁగ సబళముఁ దద్గాత్రముఁ జొన్పఁ బూఁచె
న్శ్రుతసోముం; డల్లఁ బట్టె న్గురుసుతుఁ డదియున్; స్రుక్కు చెన్నార, నల్క
న్ధృతఖడ్గుండైనఁ, జేయు న్శిరముఁ దురగము న్వ్రేల్మిడిం ద్రుంచి వైచెన్. 183

ప్రతిపదార్థం: శ్రుతసోముండు= భీముడి కొడుకైన శ్రుతసోముడు; అతి= మిక్కిలి; శోక= దుఃఖంయొక్క; క్రోధ= కోపంయొక్క; వేగ= ఉద్రేకంచేత; వ్యథిత= బాధపడిన; హృదయుఁడు+ఐ= హృదయం గలవాడై; అశ్వ సాదిత్వ వీర+ఉద్ధతిన్= గుర్రపురౌతైన వీరుడియొక్క ఔద్ధత్యంతో; ప్రౌఢస్ఫూర్తి= గొప్ప ప్రకాశం; చెల్వు+ఒందఁగన్= అందగించగా; సబళమున్= సబళ మనే ఆయుధాన్ని; తద్+గాత్రమున్= అతడి (అశ్వత్థామయొక్క) శరీరాన్ని; చొన్పన్(చొనుపన్)= గ్రుచ్చుకొనేటట్లు; పూఁచెన్= ప్రయోగించాడు; గురుసుతుఁడు= అశ్వత్థామ; అదియున్= దానినికూడా; అల్లన్= మెల్లగా; పట్టెన్= పట్టుకున్నాడు; స్రుక్కు=

దుఃఖం; చెన్ను+ఆరన్= ఒప్పుగా, కలుగగా; అల్కన్= కోపంతో; ధృతఖడ్గుండు+ఐనన్= (శ్రుతసోముడు) కత్తి పట్టుకున్నవాడు కాగా; చే+ఉన్= చేతినీ; శిరమున్= తలనూ; తురగమున్= గుర్రాన్నీ; వ్రేల్మిడిన్= చిటికెలో; త్రుంచివైచెన్= (అశ్వత్థామ) నరికివేశాడు.

తాత్పర్యం: భీముడి కుమారుడైన శ్రుతసోముడు అమిత శోక క్రోధముల ఉద్రేకంచేత హృదయం వ్యథ చెందగా గుర్రాన్ని అధిరోహించిన వీరుడి ఔద్ధత్యంతో, గొప్ప స్ఫూర్తి అందగించగా, సబళం అనే ఆయుధాన్ని అశ్వత్థామ శరీరానికి గ్రుచ్చుకొనేటట్టు ప్రయోగించాడు. అశ్వత్థామ దానిని మెల్లగా పట్టుకోవటంతో అతడు దుఃఖించి కోపంతో ఖడ్గం ధరించాడు. అప్పుడు అశ్వత్థామ అతడి చేతినీ, శిరస్సునూ, గుర్రాన్నీ ఒక్క చిటికెలో నరికివేశాడు.

విశేషం: తెలుగులో భీముడి కొడుకు పేరు 'శ్రుతసోము' డని ఉండగా, సంస్కృత భారత ప్రతులలో 'సుతసోము' డని ఉన్నది.

వ. ఇవ్విధంబునఁ జిత్రవధంబునకు గోచరుండైన కీచకాంతకతనయుం గనుంగొని. 184

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; చిత్రవధంబునకున్+గోచరుండు+ఐన= చిత్రవధకు గురి అయిన; కీచక+అంతక తనయున్= కీచకుడిని చంపిన భీముడి కొడుకుని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: ఈ రీతిగా చిత్రవధకు గురి అయిన భీమపుత్రుడిని- శ్రుతసోముడిని చూచి. (తరువాత పద్యంతో అన్వయం).

మహాస్రగ్ధర

'నినుఁగూడన్ వీఁడె వచ్చెన్ నృపుఁ' డనుచు శతానీకుఁ డాభీల చక్రం
బున నశ్వత్థామ వక్షంబునను రుధిరముం బొంగఁగాఁ జేయ నప్పా
టున నీడంబోక బల్వేటున నిలఁ బడ నాటోపముం జూపి యంతం
దనివో కా దుర్జయుం డాతని శిరమును దద్గాత్రముం బాపె లీలన్. 185

ప్రతిపదార్థం: నినున్+కూడన్= నిన్ను కలియటానికి-నీతో పోరాడటానికి; నృపుఁడు= రాజు; వీఁడె; వచ్చెన్= ఇదే వచ్చాడు; అనుచున్= అంటూ; శతానీకుఁడు= నకులుడి కొడుకైన శతానీకు డనేవాడు; ఆభీల చక్రంబునన్= భయంకరమైన చక్రాయుధంతో; అశ్వత్థామ వక్షంబునను= అశ్వత్థామయొక్క రొమ్మునుండి; రుధిరమున్= రక్తాన్ని; పొంగఁగాన్+చేయన్= పొంగేటట్టు చేయగా; ఆ దుర్జయుండు= గెలవశక్యంకాని ఆ అశ్వత్థామ; ఆ+పాటునన్= ఆ కష్టంచేత; ఈడంబోక= వెనుదీయక; బల్+వేటునన్= పెద్దదెబ్బతో; ఇలన్= నేలమీద; పడన్= పడేటట్లు; ఆటోపమున్= విజృంభణం; చూపి; అంతన్= దానితో; తనివి+పోక= తృప్తిపడక; లీలన్= సులభంగా; ఆతని శిరమును= ఆ శతానీకుడి తలను; తద్+గాత్రమున్= అతడి శరీరం నుండి; పాపెన్= తొలగించాడు.

తాత్పర్యం: 'నీతో పోరాడటానికి రాజు ఇదే వచ్చా'డంటూ నకులుడి పుత్రుడైన శతానీకుడు భయంకరమైన చక్రాయుధంతో అశ్వత్థామ రొమ్మునుండి రక్తం పొంగేటట్లు చేశాడు. గెలువశక్యం కాని అశ్వత్థామ ఆ దెబ్బకు వెనుదీయక, గట్టిదెబ్బతో వాడు నేలపై పడేటట్లు విజృంభించి, దానితో తృప్తి పడక, వాడి శిరస్సును శరీరం నుంచి అవలీలగా వేరుచేశాడు.

వ. ఇట్లు నకుల సూనుఁడు సమసిన. 186

ప్రతిపదార్థం: ఇట్లు; నకుల సూనుఁడు= నకులుడి కొడుకు-శతానీకుడు; సమసినన్= చావగా.

తాత్పర్యం: ఇట్లా నకులుడి కొడుకైన శతానీకుడు చావగా.

మహాస్రగ్ధర.

శ్రుతసేనుం డప్డు గోపస్ఫురదరుణమరీచుల్ దలిర్పంగఁ జక్షు
ర్ద్వితయంబుం గెంపునం బొందిన చెలువము సందీప్త ఘోరంబుగా బె
ట్టతనిం జంచద్గదన్ వ్రేయఁగ నుఱక తదాస్యచ్ఛిదాస్ఫారకేళీ
చతురుండై యక్కుమారున్ జముకడ కనిచెం జండదోర్దర్ప మొప్పన్. 187

ప్రతిపదార్థం: అప్డు= అప్పుడు; శ్రుతసేనుండు= సహదేవుడి కొడుకైన శ్రుతసేనుడు; కోపస్ఫురత్+అరుణ మరీచుల్= కోపంతో ప్రకాశించే ఎర్రటికాంతులు; తలిర్పంగన్= కన్పట్టగా; చక్షుస్(ః)+ద్వితయంబున్= రెండుకళ్ళూ; కెంపునన్+పొందిన చెలువము= ఎర్రబడ్డ అందం; సందీప్త ఘోరంబు+కాన్= వెలుగొంది భయంకరం కాగా; అతనిన్= అశ్వత్థామను; బెట్టు= గట్టిగా; చంచత్+గదన్= చలిస్తూన్న గదతో; వ్రేయఁగన్= కొట్టగా; ఉఱక= (అశ్వత్థామ) లెక్కచేయక; తద్= ఆ శ్రుతసేనుడియొక్క; ఆస్య= ముఖంయొక్క; ఛిదా= నరకడం అనే; స్ఫార= అధికమైన; కేళీ= క్రీడయందు; చతురుండు+ఐ= నేర్పుగలవాడయి; ఆ+కుమారున్= ఆ బాలుడిని; చండ దోస్(ః)+దర్పము= తీవ్రమైన భుజగర్వం; ఒప్పన్= ఒప్పగా; జము కడకున్+అనిచెన్= యముడి దగ్గరకు పంపాడు - చంపాడు.

తాత్పర్యం: అప్పుడు సహదేవుడి కొడుకైన శ్రుతసేనుడు కోపంతో నేత్రద్వయం ఎర్రబడి భయంకరం కాగా, అశ్వత్థామను గదను తిప్పుతూ గట్టిగా కొట్టాడు. అశ్వత్థామ లక్ష్యపెట్టక వాడి ముఖ ఖండన క్రీడలో నేర్పుగలవాడయి ఆ కుమారుడిని భుజపరాక్రమగర్వం ఒప్పగా యమసదనానికి పంపాడు.

విశేషం: సహదేవుడి కొడుకు తెలుగులో శ్రుతసేను డని ఉండగా, సంస్కృత భారతంలో శ్రుతకర్ముడని ఉన్నది.

వ. ఇత్తెఱంగున వికృతాననుండై పడి మృతుండైన సహదేవ సుతుం జూచి రోషంబునం బేర్చి. 188

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; వికృత+ఆననుండు+ఐ= విరూపమైన ముఖం గలవాడయి; పడి; మృతుండు+ఐన= చచ్చిన; సహదేవ సుతున్= సహదేవుడి కొడుకును- శ్రుతసేనుడిని; చూచి; రోషంబునన్= కోపంతో; పేర్చి= విజృంభించి.

తాత్పర్యం: ఈ విధంగా వికృతమైన ముఖంతో పడి చచ్చిన సహదేవుడి కొడుకును - శ్రుతసేనుడిని చూచి కోపంతో విజృంభించి.

మహాస్రగ్ధర.

వితతజ్యానాద మాశావితతి నినిచి దోర్వీర్యమేపార బాణ
ప్రతితం దన్నుంప, వీఁకం బలుక జడియుచున్ బల్విడిం బేర్చి చంచ

ద్గతిఁ గ్రీడం దంతి హేలాదళనరతమృగేంద్ర స్ఫురన్మూర్తి దోఁపన్
శ్రుతకీర్తిం గిట్టి కంఠత్రుటనవిలసనారూఢి నవ్విప్రుఁ డొప్పెన్. 189

ప్రతిపదార్థం: (శ్రుతకీర్తి-కర్త) వితత జ్యా నాదము= అధికమైన వింటినారిధ్వని; ఆశా వితతిన్= దిక్కుల సమూహంలో; నినిచి= నింపించి; దోస్(ః)+వీర్యము= భుజపరాక్రమం; ఏపారన్= అతిశయించగా; బాణ ప్రతతిన్= బాణాల సమూహంతో; తన్+ముంపన్= తనని ముంచగా; ఆ+విప్రుఁడు= ఆ బ్రాహ్మణుడు - అశ్వత్థామ; వీఁకన్= ఉత్సాహంతో; పలుకన్= డాలును; జడియుచున్= తిప్పుతూ; బలు+విడిన్= పరాక్రమంతో; పేర్చి= విజృంభించి; చంచత్+గతిన్= కదులుతూన్న గమనంతో; క్రీడన్= ఆటతో; దంతి= ఏనుగుయొక్క; హేలా= అనాయాసపు; దళన= చీల్చుటయందు; రత= ఆసక్తమయిన; మృగ+ఇంద్ర= సింహంయొక్క; స్ఫురత్+మూర్తి= ప్రకాశిస్తున్న ఆకారం; తోఁపన్= తోచేటట్టు; శ్రుతకీర్తిన్= అర్జునుడి కొడుకైన శ్రుతకీర్తిని; కిట్టి= సమీపించి; కంఠ= కంఠంయొక్క; త్రుటన= ఖండనంయొక్క; విలసన= ప్రకాశంయొక్క; ఆరూఢిన్= గొప్పతనంతో; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: అర్జునుడి కొడుకైన శ్రుతకీర్తి అధికమైన వింటినారిధ్వనిని దిక్కులందు నింపించి, భుజపరాక్రమం అతిశయించగా బాణ సమూహంతో అశ్వత్థామను ముంచగా, ఆ బ్రాహ్మణుడు ఉత్సాహంతో డాలు తిప్పుతూ, పరాక్రమంతో విజృంభించి, ఆటతో, ఏనుగును చీల్చటంలో ఆసక్తికరమైన సింహంవలె శ్రుతకీర్తిని సమీపించి కంఠం ఖండించాడు.

విశేషం: అలం: ఉపమ. 'దంతి హేలా దళన రత మృగేంద్ర స్ఫురన్మూర్తి దోఁపన్' - అలంకారం ఉపమ.

ఈ దారుణ మహామారణ క్రియాభివర్ణనంలో పాండవ సుత పంచకహనన క్రియాబీభత్సాన్ని 'మహాస్రగ్ధర' లలోనే వర్ణించివుండడం ఒక విశేషం.

వ. ఇట్లు ద్రౌపదీ తనయ పంచకంబు పంచత్వంబు నొందినఁ గ్రోధాతిరేకంబునఁ బ్రభద్రకులును, శాంతనవాంతకుండును ధృష్టద్యుమ్నాంతకుఁ జుట్టుముట్టి. 190

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ద్రౌపదీ తనయ పంచకంబు= ద్రౌపది కొడుకు లైదుగురూ; పంచత్వంబున్+ఒందినన్= చావగా; క్రోధ+అతిరేకంబునన్= కోపాతిశయంతో; ప్రభద్రకులును; శాంతనవ+అంతకుండును= భీష్ముడిని అంతమొందించిన శిఖండీ; ధృష్టద్యుమ్న+అంతకున్= ధృష్టద్యుమ్నుడిని సంహరించిన అశ్వత్థామను; చుట్టుముట్టి= ముట్టడించి.

తాత్పర్యం: ఈ విధంగా ద్రౌపదికొడుకులు అయిదుగురూ చావగా, కోపాతిశయంతో ప్రభద్రకులూ, శిఖండీ అశ్వత్థామను ముట్టడించి.

చ. శరములఁ దోమరంబులను జక్రములన్ వెసఁ గప్పి బెట్టు ము
ద్గర కరవాల కుంతముఖ దారుణ హేతుల నొంప, నాతఁ డు
ద్ధుర గతులం బ్రభద్రకులఁ ద్రుంచుచుఁ గేళి యొనర్పఁగా, శిఖం
డి రుచిర మార్గణంబు భ్రుకుటిస్థలి నొంచె సముద్భటోన్నతిన్. 191

ప్రతిపదార్థం: శరములన్= బాణాలతోనూ; తోమరంబులను= చిల్లకోలలతోనూ; చక్రములన్= చక్రాయుధాలతోనూ; వెసన్= శీఘ్రంగా; కప్పి; బెట్టు= మిక్కిలి ఎక్కువగా; ముద్గర కరవాల కుంత ముఖ దారుణ హేతులన్= ముద్గరాలూ, కత్తులూ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బల్లెములూ మొదలైన భయంకరాయుధాలతో; నొంపన్= బాధించగా; ఆతఁడు= అశ్వత్థామ; ఉద్ధుర గతులన్= తీవ్రములైన ప్రకారాలతో; ప్రభద్రకులన్; త్రుంచుచున్= వధిస్తూ; కేళి= క్రీడ; ఒనర్పఁగాన్= చేయగా; శిఖండి రుచిర మార్గణంబు= శిఖండియొక్క మనోహరమైన బాణం; సముద్భట+ఉన్నతిన్= అతిశయమైన ఉన్నతితో; భ్రుకుటి స్థలిన్= బొమముడి ప్రదేశాన్ని; నొంచెన్= బాధించింది.

తాత్పర్యం: బాణాలతోనూ, తోమరాలతోనూ, చక్రాలతోనూ శీఘ్రంగా కప్పి, మిక్కిలి ఎక్కువగా ముద్గరాలూ, కత్తులూ, కుంతాలూ మొదలైన భయంకరాయుధాలతో బాధించారు. అశ్వత్థామ తీవ్ర ప్రకారాలతో ప్రభద్రకులను ఖండిస్తూ విహరించాడు. శిఖండి తన మనోహరమైన బాణంతో అతడి బొమముడి స్థలాన్ని మిక్కిలి గట్టిగా కొట్టి బాదించాడు.

అశ్వత్థామ శిఖండిం బొదివి చంపుట (సం. 10-8-66)

క. **గురుసుతుఁడు క్రోధమయమగు । బరవసమున నప్పు డా ద్రుపదనందను మే**
నిరువఱియ గాఁగ నేసెను । శిరము నుదగ్రతఁ గృపాణశిక్ష మెఱయఁగన్. **192**

ప్రతిపదార్థం: గురుసుతుఁడు= అశ్వత్థామ; క్రోధ మయము+అగు= కోపంతో నిండిన; బరవసమునన్= ఉత్సాహంతో; అప్పుడు; ఆ-ద్రుపద నందను మేను= ఆ ద్రుపద పుత్రుడైన శిఖండియొక్క శరీరం; ఇరు+పఱియ కాఁగన్= రెండు ముక్కలయ్యేటట్టు; శిరమున్= తలను; ఉదగ్రతన్= భయంకరంగా; కృపాణ శిక్ష= ఖడ్గవిద్య; మెఱయఁగన్= ప్రకాశించగా; ఏసెను= నరికాడు.

తాత్పర్యం: అశ్వత్థామ కోపంతో నిండిన ఉత్సాహంతో అప్పుడు ఆ శిఖండి శరీరం రెండు ముక్కలయ్యేటట్టు అతడి తలను భయంకరంగా ఖడ్గవిద్య ప్రకాశించే విధంగా నరికాడు.

వ. **ఇవ్విధంబున దొరలు దెగినను బాంచాల ప్రభద్రక మత్స్యసైన్య శేషంబులు వోక పెనంగిన నతండు మాతంగ వితాన విదళనం బప్పడు సలిపిన కంఠీరవంబు తనమీఁద హరిణకులంబు గవిసిన నెట్టిదగు నట్టివాఁడగుచుఁ బేర్చి యార్చె; నత్తెఱంగు తుములంబునఁ బొడగానమిఁ బాండునందనులు కృష్ణసాత్యకులును నా శిబిరమున లేకయునికి యెఱింగె; నప్పుడు గనుంగొను జనంబులకు నితం డశ్వత్థామ యనుబుద్ధి వొడమె; నది యెట్లనినఁ గురుపాండవులు భండనంబుఁ జేయందొడంగినయది మొదలుగా రాత్రులచ్చటి జనులు నీలతనువును, రక్తాస్యనయనయు, రక్తాంబరధరయు, రక్తమాల్యానులేపనయు నగు లేమ యొక్కతి దమవీటివారు నిద్రపోవుచుండఁ దలలు వీడ మేనులు వికృతంబులై వ్రేలం బాశంబులఁ గరితురగ సహితంబుగా బంధించి ఘోరసంరంభంబునం దెచ్చి తెచ్చి యశ్వత్థామ యగ్రభాగంబునం బెట్ట నుగ్ర భావంబున నతండు దునుముచు నార్చు చునికిఁ గలలు గాంతు; రట్లగుటం జేసి నిద్రాసక్తులం జంపుటయు నవ్విధంబునార్పును నేర్పడ ననుసంధించి యక్కలల ఫలంబు గాకేమి యని తలంచి చొచ్చి పోటునకు నయ్యరాతి రాత్రిమై వచ్చుట నిశ్చయించి యశ్వత్థామగా నెఱింగి; రవ్వీరుండు మెఱుంగు మెఱచినట్లు వివిధగతులఁ జరించినం జెండాడినం జూచియు నీడంబోక రణక్రీడ సల్పిన, నబ్బలుమగండు సముద్దండ బాహుదండవిలాసుండై.** **193**

ప్రతిపదార్థం: ఇవ్విధంబునన్; దొరలు= రాజులు (నాయకులు); తెగినను= చచ్చినా; పాంచాల ప్రభద్రక= పాంచాలురయొక్కయు; ప్రభద్రకుల యొక్కయు; మత్స్య= మాత్స్యులయొక్కయు; సైన్య శేషంబులు= సేనలలో మిగుళ్ళు; పోక పెనంగినన్= పోవకుండా పోరితే; అతండు= అశ్వత్థామ; మాతంగ వితాన విదళనంబు= ఏనుగుల గుంపుల ఖండనం; అప్పుడు; సలిపిన= చేసిన; కంఠీరవంబు= సింహం; తన మీఁదన్; హరిణ కులంబు= లేళ్ళ సమూహం; కవిసినన్= పడితే; ఎట్టి+అది+అగున్= ఎటువంటిది అవుతుందో; అట్టి-వాఁడు+అగుచున్= అటువంటివాడు అవుతూ; పేర్చి= విజృంభించి; ఆర్చెన్= అరిచాడు; ఆ+తెఱంగు తుములంబునన్= ఆ విధమైన దొమ్మియుద్ధంలో; పొడగానమిన్= కనబడకపోవటంచేత; పాండు నందనులు= పాండవులూ; కృష్ణ సాత్యకులును= కృష్ణుడూ, సాత్యకీ; ఆ శిబిరమునన్= ఆ విడిదలలో; లేక+ఉనికి= లేకపోవటం; ఎఱింగెన్= తెలిసికొన్నాడు; అప్పుడు; కనుంగొను జనంబులకున్= చూసే జనులకు; ఇతండు; అశ్వత్థామ; అను బుద్ధి= అనే తలంపు; పొడమెన్= పుట్టింది; అది ఎట్టు+అనినన్= అది ఎట్లా అంటే; కురు పాండవులు= కౌరవులూ, పాండవులూ; భండనంబున్= యుద్ధం; చేయన్+తొడంగిన+అది= మొదలుగాన్= చేయటం ప్రారంభించినది మొదలుకొని; రాత్రులు= రాత్రివేళలలో; అచ్చటి= జనులు; నీల తనువును= నల్లటి శరీరంగలదీ; రక్త+ఆస్య నయనయున్= ఎర్రటి ముఖమూ, కళ్ళూ కలదీ; రక్త+అంబర ధరయున్= ఎర్రటి బట్టలు ధరించినదీ; రక్తమాల్య+అనులేపనయున్= ఎర్రటి దండలూ, పూతలూ కలదీ అగు; లేమ ఒక్కతి= స్త్రీ ఒక్కర్తె; తమ వీటి వారు= తమ ప్రదేశంలో ఉన్నవాళ్ళు; నిద్రపోవుచున్+ఉండన్= నిద్రపోతూండగా; తలలు వీడన్= శిరోజాలు విడిపోగా; మేనులు= శరీరాలు; వికృతంబులు+ఐ వ్రేలన్= విరూపాలయి వ్రేలాడుతూ ఉండగా; పాశంబులన్= త్రాళ్ళతో; కరి తురగ సహితంబుగాన్= ఏనుగులతోనూ, గుర్రాలతోనూ; బంధించి= కట్టి; ఘోర సంరంభంబునన్= భయంకరమైన ఆటోపంతో; తెచ్చి తెచ్చి= తెగతెచ్చి; అశ్వత్థామ+అగ్ర భాగంబునన్= అశ్వత్థామ ఎదుట; పెట్టన్= పెట్టగా; అతండు= అతడు; ఉగ్రభావంబునన్= కోపంతో; తునుముచున్= ముక్కలు చేస్తూ; ఆర్చుచున్+ఉనికిన్= అరుస్తూండటం; కలలు+కాంతురు= కలలుకంటారు; ('కాంతురు' అనే ఈ తద్ధర్మక్రియ భూతార్థకమే- 'కాంచారు' అని అర్థం); అట్లు+అగుటన్+చేసి= అందుచేత; నిద్రాసక్తులన్= నిద్రపోతూన్నవాళ్ళను; చంపుటయున్= చంపటమూ; ఆ+విధంబు+ఆర్పును= ఆ రీతి అరుపూ; ఏర్పడన్= స్పష్టంగా; అనుసంధించి= సమన్వయించుకొని; ఆ+కలల ఫలంబు కాకేమి= ఆ కలలఫలమే అని; తలంచి; చొచ్చి= ప్రవేశించి; పోటునకున్= యుద్ధానికి; ఆ+అరాతి= ఆ శత్రువు; రాత్రిమైన్= రాత్రివేళ; వచ్చుట= రావటం; నిశ్చయించి; అశ్వత్థామన్+కాన్= అశ్వత్థామనుగా; ఎఱింగిరి= తెలిసికొన్నారు; ఆ+వీరుండు= ఆ శూరుడు (అశ్వత్థామ); మెఱుంగు= మెరుపు; మెఱచిన+అట్లు= మెరిసిన విధంగా; వివిధ గతులన్= రకరకాలుగా; చరించినన్= ప్రవర్తించినా; చెండాడినన్= వధించినా; చూచియున్= చూచికూడా; ఈడంబోక= వెనుదీయక; రణక్రీడ= యుద్ధం; సల్పినన్= చేయగా; ఆ+బలు మగండు= ఆ మహావీరుడు (అశ్వత్థామ); సముద్దండ బాహుదండ విలాసుండు+ఐ= మిక్కిలి అధికమైన భుజాదండాల లీల కలవాడై.

తాత్పర్యం: ఈ విధంగా నాయకులు చచ్చినా, పాంచాల ప్రభద్రక మత్స్య సేనలలో మిగిలినవాళ్ళు పోక పోరితే, అతడు ఏనుగుల గుంపు నప్పుడు చంపిన సింహం తనమీదికి లేళ్ళగుంపు ఉరికితే ఎట్లా అవుతుందో అట్లా అవుతూ విజృంభించి అరిచాడు. ఆ రీతి దొమ్మియుద్ధంలో కనబడకపోవటంచేత పాండవులూ, కృష్ణార్జునులూ ఆ శిబిరంలో లేరని తెలిసికొన్నాడు. అప్పుడు చూచే జనాలకు ఇతడు అశ్వత్థామ అనే తలంపు కలిగింది. అది ఎట్లా అంటే, కౌరవులూ, పాండవులూ యుద్ధం చేయటానికి ప్రారంభించింది మొదలుకొని రాత్రివేళలలో అక్కడివాళ్ళు నల్లటి శరీరమూ, ఎర్రటిముఖమూ, కళ్ళూ, ఎర్రటి వస్త్రమూ, ఎర్రటి దండలూ, పూతా కల స్త్రీ ఒకతె తమ ప్రదేశంలో నిద్రపోతూన్నవాళ్ళను జుట్టువిడిపోయి, శరీరాలు విరూపాలయి వేలాడగా త్రాళ్ళతో ఏనుగులతోనూ, గుర్రాలతోనూ సహా బంధించి భయంకరాటోపంతో తెచ్చి తెచ్చి అశ్వత్థామ ఎదుట పెట్టగా కోపంతో అతడు ఖండిస్తూ అరుస్తూ ఉన్నట్లు కలలు కన్నారు. అందుచేత నిద్రిస్తూన్న వాళ్ళను చంపటం, ఆ విధంగా అరవటం బాగా సమన్వయించుకొని

అది అంతా ఆ కలల ఫలమే అని నిశ్చయించి, యుద్ధానికి ఆ శత్రువు రాత్రివేళ రావటం నిశ్చయించి అశ్వత్థామ అని గుర్తించారు. ఆ వీరుడైన అశ్వత్థామ మెరుపు మెరిసినట్లు రకరకాలుగా ప్రవర్తించటం, వధించటం చూచికూడా వెనుదీయక యుద్ధం చేయగా, ఆ మహావీరుడు గొప్ప భుజబలం కలవాడై.

విశేషం: అలం: ఉపమ. 'అతండు మాతంగ వితాన విదళనం బప్పుడు సలిపిన కంఠీరవంబు తన మీఁద హరిణకులంబు గవిసిన నెట్టిదగు నట్టివాఁ డగుచు' అలంకారం ఉపమ.

మహాస్రగ్ధర.

తలలన్ హస్తమ్ములం బాదములఁ దనువులం దత్ప్రదేశంబు గప్పం;
దొలఁగించున్ వానిఁ గ్రొన్నెత్తురు వఱపి, హయస్తోమదంతిప్రతానం
బుల మేదోమాంస ఖండంబుల దనుజమహాభోజనం బావహించు,
న్మలఁగం బాఱుం, జెలంగు, న్నలి నెసఁగు, జయోన్మత్తుఁడై మానవేంద్రా! 194

ప్రతిపదార్థం: మానవ+ఇంద్రా!= ఓ రాజా! ధృతరాష్ట్రా!; (పూర్వవచనంలోని 'అబ్బలుమగండు'-కర్త); జయోన్మత్తుఁడు+ఐ= గెలుపుచేత మిక్కిలి గర్వించినవాడై; తద్+ప్రదేశంబు= ఆ చోటిని; తలలన్= తలలతోనూ; హస్తమ్ములన్= చేతులతోనూ; పాదములన్= కాళ్ళతోనూ; తనువులన్= శరీరాలతోనూ; కప్పున్= కప్పాడు; క్రొత్త+నెత్తురు= క్రొత్తరక్తం; పఱపి= పారించి; వానిన్= ఆ తలలూ మొదలైన వాటిని; తొలఁగించున్= కొట్టుకుపోయేటట్లు చేశాడు; హయ-స్తోమ= గుర్రాల సమూహంయొక్క; దంతి ప్రతానంబుల= ఏనుగుల సమూహంయొక్క; మేదస్(ః)+మాంసఖండంబులన్= మెదడుతోనూ, మాంసపు ముక్కలతోనూ; దనుజ మహత్(మహా)+భోజనంబు= రాక్షసుల గొప్ప ఆహారం; ఆవహించున్= కల్పించాడు; మలఁగన్+పాఱున్= సంచరించాడు; చెలంగున్= సింహనాదం చేశాడు; నలిన్= ఉత్సాహంతో; ఎసఁగున్= అతిశయించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! ఆ అశ్వత్థామ విజయగర్వంతో ఆ యుద్ధరంగాన్ని తలలతోనూ, చేతులతోనూ, కాళ్ళతోనూ, శరీరాలతోనూ కప్పివేశాడు. క్రొత్త నెత్తురు పారించి వాటిని కొట్టుకుపోయేటట్టు చేశాడు. గుర్రాల, ఏనుగుల గుంపుల మేదస్సులతోనూ, మాంసపు ముక్కలతోనూ రాక్షసులకు గొప్ప ఆహారం కల్పించాడు. అతడు తిరిగాడు, సింహనాదం చేశాడు. ఉత్సాహంతో అతిశయించాడు.

విశేషం: ఇందులోని సమాపక క్రియలన్నీ తద్ధర్మార్థకాలయినా, భూతార్థస్ఫోరకాలు.

తే. అట్లు విహరించి హతశేషులైన జనులు । పాఱఁ గనుఁగొని రథమెక్కి పటురయమున
వారి వెనుకొని మెఱుఁగు వాలారు తూపు । గములు వరఁగించి యందఱ సమయఁజూచి. 195

ప్రతిపదార్థం: (పూర్వవచనంలోని 'అబ్బలుమగండు'-కర్త); అట్లు= ఆ రీతిగా; విహరించి= క్రీడించి; హతశేషులు+ఐన జనులు= చావగా మిగిలిన జనులు; పాఱన్+కనుఁగొని= పారిపోవటం చూచి; రథము+ఎక్కి; పటు రయమునన్= తీవ్రవేగంతో; వారిన్= ఆ పారిపోతూన్నవాళ్ళను; వెనుకొని= వెంటాడి; మెఱుఁగు వాలారు తూపు గములు= ప్రకాశించే వాడి బాణాల సమూహాలు; పరఁగించి= ప్రయోగించి; అందఱన్= అందరనీ; సమయన్+చూచి= చచ్చేటట్టు చూచి.

తాత్పర్యం: అశ్వత్థామ ఆ రీతిగా క్రీడించి, చావగా మిగిలిన జనులు పారిపోతూ ఉంటే చూచి రథం ఎక్కి, తీవ్రవేగంతో వాళ్ళను వెంబడించి, ప్రకాశించే వాడి బాణాల సమూహం ప్రయోగించి, అందరినీ చంపి. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'ఆ కలన నట్లు సేసి మ । హాకుల జనతతులు గాఁగ నన్యస్థలులున్
భీకరరథగతుల నుద । గ్రాకృతియై మెఱసి యమ్ము లడరింపంగన్. 196

ప్రతిపదార్థం: (193 వచనంలోని 'అబ్బలుమగండు' - కర్త); ఆ కలనన్= ఆ ప్రదేశంలో; అట్లు+చేసి= ఆ విధంగా చేసి; అన్యస్థలులున్= ఇతర ప్రదేశాలు కూడా; మహా+ఆకుల జన తతులు+కాఁగన్= మిక్కిలి కలతచెందిన మనుష్యుల గుంపులు కలిగినవి కాగా; భీకర రథగతులన్= భయంకరమైన రథ గమనాలతో; ఉదగ్ర+ఆకృతి+ఐ= భయంకరాకారుడై; మెఱసి= ప్రకాశించి; అమ్ములు= బాణాలు; అడరింపంగన్= ప్రయోగించగా.

తాత్పర్యం: అశ్వత్థామ ఆ ప్రదేశంలో ఆ విధంగా చేసి, ఇతర స్థలాలు కూడా కలత చెందిన జనులు కలవి అవుతూఉండగా, భయంకర రథగమనాలతో, భయంకరాకారుడై ప్రకాశించి బాణాలు ప్రయోగించగా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఇట్లెసఁగు బహుళకోలాహలంబున హయంబులు నిభంబులుఁగట్లు దెంచుకొని కలయంబాఱెఁ; బాఱుటయు గోడిగలకై దంతపాతకలహంబులం గెరలుగుండ్లక్రందునను, నొండొంటి మదగంధంబులు సహింపక మార్కొని పోరాడు సామజంబుల సమ్మర్దంబునను, గాళ్ళు దునిసియుఁ, జేతులు నలసియు, నురంబు లవిసియు, వెన్నులు విఱిగియుఁ, బ్రక్కలు నొగిలియుఁ, దలలు పగిలియుఁ, జాఁపకట్టువడి చదిసియుఁ, గ్రంతలనిఱకటంపుఁ జోట్ల మానవకోట్లు పీనుంగు తిట్టలగుచుండఁ బలకయు వాలునుం గొని యవ్వాలుమగండు వేడుకం దేరుడిగ్గి యగ్గజంబులను ఘోటకంబులను బొదివి పాటవాటోపం బొప్పవిపాటన వినోదంబు సలిపె; నప్పుడు గొందఱు నెఱయ మేల్కనని భ్రమను, భయంబునను బాదంబులు గుదివడఁబాఱలేక నెలవెడలిన యెలుంగుల నస్తవ్యస్తపుమాటలాడఁ, గొందఱు జనకసహోదరాదులగు బంధువులఁ బేరుపేరం బిలుచుచుం దిరిగి కనుదిరిగి తమవారు గానివారల చెట్టలు వట్టుకొని చనఁ, గొందఱు కైదువులు గొని కదిసి నిదురకన్నులం బొదువు చెలులను జుట్టంబులను బగఱ యని సమయింపఁ, గొందఱెదురుగాఁ జనుదెంచినవా 'రిదియేమి?' యని యడుగ, 'నశ్వత్థామసొచ్చిపొడుచుచున్నవాఁ'డనిన, 'వాసుదేవార్జునులు శిబిరంబున లేమి నప్పాపాత్ముక కిట్లు సేయవచ్చెంగాక వారున్నఁదన్ను గాసిసేయరే?' యని పలుకఁ, గొందఱు 'బీభత్సుం డిట్టి పరాక్రమంబు సేసినం జూచి మనంబున రోయకుండునే? యతండెన్నఁ డేనియు వాహన వికలుఁడైనవానిని, చేత నాయుధంబులు లేని వానిని, దలవీడిన వానిని, వెఱచినవానిని, వెఱఁగుపడినవానిని, నిద్రించువానిని నొంచునే?' యని యర్జును నగ్గింప, నయ్యందఱ నగ్గురునందనుండు గురుతరంబయిన కురురాజు పరిభవంబు నప్పటప్పటికిఁ దలంపఁ బెంపారు దారుణ క్రూరత్వంబునఁ గోలుమసంగి, యించుక యరవాయిఁగొనక, చెండియుం, ద్రుంచియుం, జించియుఁ, దుంగమడుఁగుఁ జొచ్చిన మాతంగంబు పగిది బడలువడం జేసె; నా సమయంబున. 197

ప్రతిపదార్థం: ఇట్లు+ఎసఁగు= ఈ విధంగా అతిశయించే; బహుళ కోలాహలంబునన్= అధికమైన కలకలంతో; హయంబులున్= గుర్రాలూ; ఇభంబులున్= ఏనుగులూ; కట్లు తెంచుకొని= బంధనాలు తెంపుకొని; కలయన్+పాఱెన్= అన్నివైపులకూ పరుగెత్తాయి; పాఱుటయున్= పరుగెత్తగా; గోడిగలకై= ఆడగుర్రాలకోసం; దంత పాత కలహంబులన్= పళ్ళూడే పోట్లాటలలో; కెరలు= ఎగిరిపడే; గుండ్ల= రాళ్ళవలని; క్రందునను= ఉపద్రవంచేతా; ఒండొంటి మద గంధంబులు= పరస్పర మదవాసనలు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సహింపక= ఓర్వక; మార్కొని= ఎదుర్కొని; పోరాడు= కలహించే; సామజంబుల= ఏనుగుల; సమ్మర్దంబునను= త్రొక్కుళ్ళచేతా; కాళ్ళు; తునిసియున్= ముక్కలయీ; చేతులు; నలిసియున్= విరిగీ; ఉరంబులు= రొమ్ములు; అవిసియున్= బ్రద్దలయీ; వెన్నులు= వెన్నుపూసలు; విఱిగియున్= విరిగీ; ప్రక్కలు; నొగిలియున్= నలిగీ; తలలు; పగిలియున్= పగిలీ; చాఁపకట్టు+పడి= నేలమట్టంగా పడి; చదిసియున్= చచ్చీ; క్రంతలన్= సందులలో; ఇఱుకటము+చోట్లన్= ఇరుకు ప్రదేశాలలో; మానవకోట్లు= మనుష్యుల సమూహాలు; పీనుంగు తిట్టలు+అగుచున్+ఉండన్= పీనుగుల ప్రోగులు అవుతూండగా; పలకయున్= డాలూ; వాలునున్= కత్తీ; కొని= పుచ్చుకొని; ఆ+వాలు మగండు= ఆ శూరుడు(అశ్వత్థామ); వేడుకన్= సంతోషంతో; తేరు= రథం; డిగ్గి= దిగి; ఆ+గజంబులను= ఆ ఏనుగులను; ఘోటకంబులను= గుర్రాలను; పొదివి= చుట్టుకొని; పాటవ+ఆటోపంబు= నేర్పుయొక్క అతిశయం; ఒప్పన్= ఒప్పగా; విపాటన వినోదంబు= ఖండించే వేడుక; సలిపెన్= చేశాడు; అప్పుడు; కొందఱు; నెఱయన్= పూర్తిగా; మేల్కనని= మేలుకొనని; భ్రమను= భ్రాంతి చేతనూ; భయంబునను= భయంతోనూ; పాదంబులు= కాళ్ళు; గుదివడిన్= కట్టుపడిగా; పాఱన్+లేక= పరుగెత్తలేక; నెలవు+ఎడలిన+ఎలుంగులన్= పట్టుతప్పిన స్వరాలతో; అస్తవ్యస్తపు మాటలు ఆడన్= తారుమారు మాటలు మాటాడగా; కొందఱు; జనక సహోదర+ఆదులు+అగు= తండ్రి, సోదరుడు మొదలైన; బంధువులన్= చుట్టాలను; పేరపేరున్= పేరుపేరు వరుసను; పిలుచుచున్= పిలుస్తూ; తిరిగి= సంచరించి; కనుదిరిగి= కళ్ళు తిరిగి; తమవారు+కానివారల= తమ బంధువులు కాని వాళ్ళయొక్క; చెట్టలు+పట్టుకొని చనన్= చేతులు పట్టుకొని వెళ్ళగా; కొందఱు; కైదువులు+కొని= కత్తులు పుచ్చుకొని; కదిసి= సమీపించి; నిదుర కన్నులన్= నిద్రకళ్ళతో; పొదువు= చుట్టూఉన్న; చెలులను= మిత్రులనూ; చుట్టంబులను= చుట్టాలను; పగఱ+అని= శత్రువులని; సమయింపన్= చంపగా; కొందఱు; ఎదురుగాన్+చనుదెంచి వారు= ఎదురుగా వచ్చినవాళ్ళు; ఇది+ఏమి+అని+అడుగన్= ఇదే మిటని అడుగగా; అశ్వత్థామ; చొచ్చి= ప్రవేశించి; పొడుచుచున్+ఉన్నవాఁడు+అనినన్= చంపుతున్నాడని చెప్పగా; వాసుదేవార్జునులు= కృష్ణుడూ, అర్జునుడూ; శిబిరంబునన్= విడిదలలో; లేమిన్= లేకపోవటంచతే; ఆ+పాప+ఆత్మునకున్= ఆ దుర్మార్గుడికి; ఇట్లు= ఈ రీతిగా; చేయన్+వచ్చెన్+కాక= చేయడం సాధ్యమయింది కాని; వారు+ఉన్నన్= ఆ కృష్ణార్జునులు ఉంటే; తన్నున్= తనను; గాసి+చేయరే= నాశనం చేయరా; అని పలుకన్= అని పలుకగా; కొందఱు; బీభత్సుండు= అర్జునుడు; ఇట్టి పరాక్రమంబు చేసినన్= ఇటువంటి దుష్టమైన పరాక్రమం చేస్తే; చూచి; మనంబునన్= మనస్సులో; రోయక+ఉండునే= అసహ్యించుకోకుండా ఉంటాడా?; అతండు= అర్జునుడు; ఎన్నఁడు+ఏనియున్= ఎప్పుడైనా; వాహన వికలుఁడు+ఐన వానిని= భగ్న రథుడినీ; చేతన్= చేతిలో; ఆయుధంబులు లేని వానిని= ఆయుధాలు లేనివాడినీ; తలవీడినవానిని= జుట్టు ముడివీడిన వాడినీ; వెఱచిన వానిని= భయపడినవాడినీ; వెఱఁగు పడిన వానిని= నిశ్చేష్టుడైన వాడినీ; నిద్రించువానిని= నిద్రపోతూన్న వాడినీ; నొంచునే?= బాధిస్తాడా?; అని; అర్జునున్; అగ్గింపన్= పొగడగా; ఆ+అందఱన్= వాళ్ళందరినీ; ఆ+గురు నందనుండు= ఆ గురుపుత్రుడు అశ్వత్థామ; గురుతరంబు+అయిన= మిక్కిలి గొప్పదైన; కురురాజు పరిభవంబు= దుర్యోధనుడి పరాభవం; అప్పటప్పటికిన్= మాటిమాటికి; తలంపన్= స్మరించగా; పెంపు+ఆరు= ఎక్కువయ్యే; దారుణ క్రూరత్వంబునన్= భయంకరమైన క్రౌర్యంతో; కోలుమసంగి= విజృంభించి; ఇంచుక+అరవాయి+కొనక= కొంచెమైనా సందే హించక; వెండియున్= మళ్ళీ; త్రుంచియున్= ఖండించీ; చించియున్= నరికీ; తుంగ మడుగున్= తుంగగడ్డి అలమిన మడుగును; చొచ్చిన= ప్రవేశించిన; మాతంగంబు పగిదిన్= ఏనుగువలె; బడలు+పడన్+చేసెన్= అలయించాడు; ఆ సమయంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా అతిశయించే అధికమైన కలకలంలో గుర్రాలూ, ఏనుగులూ కట్లు తెంచుకొని అన్నివైపులకూ పరుగెత్తాయి. ఆడగుర్రాలకొరకు పళ్ళూడిపోయే పోట్లాటలలో ఎగిరిపడే రాళ్ళవలన కలిగే ఉపద్రవంచేతా, ఒకదాని మదవాసన ఇంకోదానికి సరిపడక ఒకదాని నొకటి ఎదుర్కొని పరుగెత్తే ఏనుగుల త్రొక్కిళ్ళచేతా కాళ్ళు ముక్కలయీ, చేతులు విరిగీ, రొమ్ములు బ్రద్దలయీ, వెన్నులు విరిగీ, ప్రక్కలు నలిగీ, తలలు పగిలీ నేలమట్టంగా పడి చచ్చీ, సందులలోనూ, ఇరుకుప్రదేశాలలోనూ మనుష్యుల సమూహాలు పీనుగులు గుట్టలుగుట్టలవుతూ ఉండగా, ఆ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శూరుడు డాలూ, కత్తీ పట్టుకొని సంతోషంతో రథం దిగి ఆ ఏనుగులనూ, గుర్రాలనూ చుట్టుముట్టి నేర్పు అతిశయించగా ఖండించి వినోదించాడు. అప్పుడు కొందరు పూర్తిగా మెలకువరాక భ్రాంతిచేతా, భయంతోనూ, కాళ్ళు కట్టుపడి పరుగెత్తలేక పట్టుతప్పిన స్వరాలతో తారుమారు మాటలు పలికారు. కొందరు తండ్రి, సోదరుడు మొదలైన చుట్టాలను పేరు పేరు వరసన పిలుస్తూ సంచరించి కళ్ళుతిరిగి తమ బంధువులు కానివాళ్ళ చేతులు పట్టుకొని వెళ్ళారు. కొందరు కత్తులు పుచ్చుకొని సమీపించి నిద్రకళ్ళతో చుట్టూ ఉన్న మిత్రులనూ, చుట్టాలనూ శత్రువు లనుకొని చంపారు. కొందరు ఎదురుగా వచ్చినవాళ్ళు ఇదేమి టని అడుగగా, అశ్వత్థామ వచ్చి చంపుతున్నా డని చెప్పగా, కృష్ణార్జునులిద్దరూ శిబిరంలో లేకపోవటంచేత ఆ దుర్మార్గుడు ఈ విధంగా చేయగలిగాడు కాని, వాళ్ళే ఉంటే అతడిని నాశనం చేసేవారుకారా అని అన్నారు. కొందరు ఇట్లాంటి దుష్పరాక్రమం చూపితే అర్జునుడు అసహ్యించుకొనకుండా ఉంటాడా? అతడెప్పుడైనా భగ్నరథుడినీ, నిరాయుధుడినీ, ముక్తకేశుడినీ, భీతుడినీ, నిశ్చేష్టుడినీ, నిద్రితుడినీ బాధిస్తాడా? అని అర్జునుడిని పొగిడారు. వాళ్ళందరినీ ఆ గురుపుత్రుడు - గురుతరమైన దుర్యోధనుడి పరాభవం మాటిమాటికి గుర్తుకు రాగా, ఎక్కువయ్యే భయంకర క్రౌర్యంతో విజృంభించి కొంచెమైనా సందేహించక మళ్ళీ త్రుంచీ చించీ తుంగగడ్డి అలుముకొన్న మడుగును ప్రవేశించిన ఏనుగువలె అలయించాడు. ఆ సమయంలో.

విశేషం: అలం: ఉపమ. 'తుంగ మడుగుఁ జొచ్చిన మాతంగంబు పగిది బడలువడం జేసె.' - అలంకారం ఉపమ.

సీ. **ఆ యోధవరు బారి కగ్గంబు గాక ద । వ్వుల భీతిఁ దలల చీరలును వీడఁ**
బాదంబులట దొట్రువడఁ బాఱి కొందఱు । మానవాధీశులు సైనికులును
విడిదల వాకిట వెడలుచోఁ గృప కృత । వర్మలఁగని వఱువట్లు వట్టు
పెదవులు దడుపుచు 'సదయతఁ గావరే' । యనుచు మ్రొక్కఁగ నమ్మహాత్ము లపుడు

తే. **రాక్షసావేశ సంభృత క్రౌర్యులగుట । నధిప! యాత్మీయ మానుషహాని దలఁప**
లేక వారలఁ బొదివి యనేకభల్ల । దారితులఁ జేసి రందఱఁ దరతరంబ. **198**

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! ధృతరాష్ట్రా!; కొందఱు-మానవ+అధి+ఈశులున్= కొంతమంది రాజులూ; సైనికులును= సైనికులూ; ఆ యోధవరు బారికిన్= ఆ వీరశ్రేష్ఠుడి హింసకు; అగ్గంబు+కాక= లోనుకాక; దవ్వులన్= దూరంగా; భీతిన్= భయంతో; తలల చీరలును వీడన్= తలపాగాలు ఊడిపోగా; పాదంబులు= కాళ్ళు; అట= అక్కడ; తొట్రు+పడన్= తడబడగా; పాఱి= పరుగెత్తి; విడిదల వాకిటన్+వెడలుచోన్= శిబిరం వెలుపలికి వెళ్ళేటప్పుడు; కృపకృతవర్మలన్+కని= కృపుడినీ; కృతవర్మడినీ చూచి; వఱువట్లు+పట్టు= మిక్కిలి యెండిపోయిన; పెదవులు; తడుపుచున్= తడిచేసికొంటూ; సదయతన్= దయతో; కావరే= రక్షించరా, అనుచున్; మ్రొక్కఁగన్= నమస్కరించగా; ఆ+మహాత్ములు= ఆ మహనీయులు-కృపకృతవర్మలు; అపుడు; రాక్షస+ఆవేశ-సంభృత క్రౌర్యులు+అగుటన్= రాక్షసుల ఆవేశంతో కూడుకొన్న క్రూరత్వం గలవారవటంచేత; ఆత్మీయ మానుష హాని= తమ మనుష్యుల నాశనం; తలఁపన్+లేక= ఓర్చుకోలేక; వారలన్= వాళ్ళని; పొదివి= చుట్టుముట్టి; అందఱన్= అందరినీ; తరతరంబు+అ= క్రమక్రమంగా; అనేక భల్ల దారితులన్= పెక్కు బాణాలచేత చీల్చబడినవారిని; చేసిరి.

తాత్పర్యం: ఓ రాజా! ధృతరాష్ట్రా! కొంతమంది రాజులూ, సైనికులూ ఆ అశ్వత్థామ చేసిన హింసకు లోనుగాక దూరంగా భయంతో తలపాగాలు వీడీ, కాళ్ళు తడబడీ పరుగెత్తి, శిబిరంలో నుండి బయటికి వచ్చే కృపకృతవర్మలను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చూచి, మిక్కిలి ఎండిపోయే పెదవులను తడుపుకొంటూ 'దయతో రక్షించరా' అంటూ మ్రొక్కితే, ఆ మహాత్ములు అప్పుడు రాక్షసావేశక్రూరులై తమ పక్షీయుల నాశనం ఓర్వలేక చుట్టుముట్టి అందరినీ క్రమక్రమంగా పెక్కు బాణాలతో చీల్చివేశారు.

క. ధరణి నెఱిదప్ప నొఱగిన । కరిహయనరచయము లొఱలఁగాఁ గరుణము భూ
వర! యొరసె శిబిరమునఁ దన । కరయఁగఁ జేరుగడ లేమి నది వృథ యయ్యెన్. **199**

ప్రతిపదార్థం: భూవర!= రాజా! ధృతరాష్ట్రా!; ధరణిన్= నేలమీద; నెఱి+తప్పన్= ఒప్పు తప్పేటట్టు; ఒఱగిన= వ్రాలిన; కరిహయ నర చయములు= ఏనుగుల, గుర్రాల, మనుష్యుల గుంపులు; ఒఱలఁగాన్= అరవగా; శిబిరమునన్= విడిదలలో; కరుణము= కరుణరసం; ఒరసెన్= వ్యాపించింది; అరయఁగన్= చూడఁగా; తనకున్; చేరుగడ= ఆశ్రయం; లేమిన్= లేకపోవటంచేత; అది= ఆ కరుణ రసం; వృథ+అయ్యెన్= వ్యర్థమయింది.

తాత్పర్యం: ఓ రాజా! ధృతరాష్ట్రా! నేలమీద ఒప్పు తప్పి వ్రాలిన ఏనుగుల, గుర్రాల, మనుష్యుల గుంపులు అరవగా శిబిరంలో కరుణరసం వ్యాపించింది. చూడగా తనకు ఆలంబనం లేకపోవటంచేత ఆ కరుణరసం వ్యర్థమయిపోయింది.

విశేషం: కరుణరసం శిబిరంలో వ్యాపించింది కాని దానికి ఆలంబన విభావం లేకపోవటం చేత - అంటే శిబిరం శూన్యం అవటంచేత అది వ్యర్థమయిపోయింది.

వ. అట్టియెడ. **200**

తాత్పర్యం: అటువంటి సమయంలో.

మహాస్రగ్ధర.

దనుజవ్రాతంబు కాంతాతతియును బ్రజలుం దారు; నానా విధోగ్ర
ధ్వను లాకాశావకీర్ణత్వ మహిమఁ బొరయం, దంష్ట్ర లత్యంత ఘోర
త్వనిరూఢిం బొంద నార్చుం; దఱచుగ నగు; నుత్తారసల్లాపముల్ సే
యు; నలిం గ్రందారఁ బైపై నురవడిఁ గవియున్ హుంకృతాభీలభంగిన్. **201**

ప్రతిపదార్థం: దనుజ వ్రాతంబు= రాక్షసుల సమూహం; కాంతా తతియును= భార్యల సమూహమూ; ప్రజలున్= బిడ్డలూ; తారున్= సంచరించింది; నానా విధ= పెక్కుభంగులైన; ఉగ్ర= భయంకరాలయిన; ధ్వనులు; ఆకాశ= ఆకాశంలో; అవకీర్ణత్వ= వ్యాప్తియొక్క; మహిమన్= గొప్పతనం; పొరయన్= పొందేటట్లూ; దంష్ట్రలు= కోరలు; అత్యంత ఘోరత్వ నిరూఢిన్= మిక్కిలి భయంకరత్వ ప్రసిద్ధిని; పొందన్= పొందేటట్లూ; ఆర్చున్= అరిచింది; తఱచుగన్= మాటిమాటికి; నగున్= నవ్వింది; ఉత్తార సల్లాపముల్= మిక్కుటమైన ధ్వనిగల సంభాషణలు; చేయున్= చేసింది; నలిన్= ఉత్సాహంతో; హుంకృత+ఆభీల భంగిన్= హుంకారంయొక్క భయంకర ప్రకారంతో; క్రందారన్= అతిదారుణమైన ధ్వని నిండగా; పైపైన్= మిక్కిలి; ఉరవడిన్= విజృంభణతో; కవియున్= ఉరికింది.

తాత్పర్యం: రాక్షస సమూహం తన భార్యలతో బిడ్డలతో సంచరించింది. అనేక విధాలయిన భయంకర ధ్వనులు ఆకాశంలో వ్యాపించేటట్లూ, కోరలు మిక్కిలి భయంకరంగా కనిపించేటట్లూ అరిచింది. మాటిమాటికి నవ్వింది. మిక్కుటమైన ధ్వనితో సంభాషించింది. ఉత్సాహంతో అతిదారుణధ్వనితో భయంకరంగా హుంకరిస్తూ మిక్కిలి విజృంభణంతో ఉరికింది.

విశేషం: ఇందులోని సమాపకక్రియలన్నీ తద్ధర్మార్థకాలయినా, అవి అన్నీ భూతార్థ స్ఫోరకాలు.

వ. ఇవ్విధంబున వివిధ వికారాననంబులు బహుళ భంగిక కరపాదంబులు గలుగు నపరిమిత క్రవ్యాదులు గవిసి మేదో మాంస మస్తిష్క మజ్జంబు లానుచుం జవియైన వానిం బుత్ర మిత్ర కళత్రాదుల కొసంగుచు నన్యకోటి బెరసిన యెడఁ ద్రోద్రోపు లాడి యవియుఁ గైకొనుచుం గీలాల పానంబున మత్తిల్లి నృత్యంబులు సేయుచు మఱియు ననేకప్రకారంబుల విహారంబు సలుపుచు నుల్లసిల్లిరి. పదంపడి యఱపీనుఁగు లొఱలుటయును దానవగణంబు కలకలంబును డిందువడియె నప్పుడు జగంబులు గొని కాలిన కాలాగ్నియుం బోలెఁ బాండవ శిబిరంబు నిరవశేషంబుగా సమయించి శమియించి చాపాచార్య నందనుండు మే నెత్తుట జొత్తిల్లి మోహాంధ్యంబుతోఁ గలసి యునికింజేసి సాంద్రతర రక్తసిక్తంబు లైన బాహుఖడ్గంబు లేక ద్రవ్యంబు చందంబు నొంద మరలి తాను బ్రవేశించు తఱి నెట్లుండె నట్ల నిశ్శబ్దం బైన యవ్విడిదల వెడలు చుండఁ దెలతెలవేగె; నిట్లు ప్రతిన నెఱపి కృపకృతవర్మల పాలికిం జనుదెంచి వారలతో నిట్లనియె. 202

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; వివిధ వికార ఆననంబులు= రకరకాలుగా వికృతాలైన ముఖాలు; బహుళ భంగిక కర పాదంబులు= పెక్కు విధాలైన చేతులు, కాళ్ళు; కలుగు; అపరిమిత క్రవ్యాదులు= అసంఖ్యాక రాక్షసులు; కవిసి= వ్యాపించి; మేదస్(ః)+మాంస మస్తిష్క మజ్జంబులు= మేదస్సూ, మాంసమూ, మస్తిష్కమూ, మజ్జా; ఆనుచున్= తింటూ; చవి+ఐన వానిన్= రుచిగలవాటిని; పుత్ర మిత్ర కళత్ర+ఆదులకున్= కొడుకులూ, స్నేహితులూ, భార్యలూ మొదలైన వారికి; ఒసంగుచున్= ఇస్తూ; అన్య కోటి= ఇతరుల సమూహం; బెరసిన+ఎడన్= కూడినప్పుడు; త్రోద్రోపులు+ఆడి= ఒకదాని నింకొకటి త్రోసుకుని; అవియున్= అవికూడా; కైకొనుచున్= తీసికొంటూ; కీలాల పానంబునన్= రక్తం త్రాగటంచేత; మత్తిల్లి= మదించి; నృత్యంబులు+చేయుచున్= నృత్యాలు చేస్తూ; మఱియున్= ఇంకా; అనేక ప్రకారంబులన్= పలు విధాల; విహారంబు సలుపుచున్= విహరిస్తూ; ఉల్లసిల్లిరి= సంతోషించారు; పదంపడి= పిమ్మట; అఱపీనుఁగులు= ప్రాణావశిష్టులైన ప్రాణులు; ఒఱలుటయును= మూలగగా; దానవ గణంబు కలకలంబును= రాక్షసుల గుంపు సందడీ; డిందు+పడియెన్= అణగింది; అప్పుడు; జగంబులు+కొని కాలిన కాల+అగ్నియున్+పోలెన్= లోకాలను ముట్టి కాలిన ప్రళయాగ్నిలాగా; పాండవ శిబిరంబున్= పాండువుల విడిదలను; నిరవశేషంబు+కాన్= పూర్తిగా; సమయించి= చంపి; శమియించి= శాంతించి; చాప+ఆచార్య నందనుండు= ధనుర్గురు పుత్రుడు - అశ్వత్థామ; మే= శరీరం; నెత్తుటన్= రక్తంతో; జొత్తిల్లి= ఎర్రబడి; మోహ+ఆంధ్యంబుతోన్= మోహం అనే చీకటితో; కలిసి+ఉనికిన్+చేసి= కలిసియుండటంచేత; సాంద్రతర రక్తసిక్తంబులు+ఐన= మిక్కిలి ఎక్కువైన రక్తంతో తడిసిన వైన; బాహు ఖడ్గంబులు= చేయీ, కత్తీ; ఏకద్రవ్యంబు చందంబున్+ఒందన్= ఒక్క వస్తువులాగే ఉండగా; మరలి= తిరిగి; తాను; ప్రవేశించు+తఱిన్= ప్రవేశించునప్పుడు; ఎట్లు+ఉండెన్= ఎట్లా ఉందో; అట్లు+అ= అట్లే; నిశ్శబ్దంబు+ఐన= చప్పుడు లేని; ఆ+విడిదలన్= ఆ శిబిరంలోనుండి; వెడలుచున్+ఉండన్= బయటికి వస్తూంటే; తెలతెల వేగెన్= తెల్లవారింది; ఇట్లు; ప్రతిన= శపథం; నెఱపి= నెరవేర్చి; కృప కృతవర్మల పాలికిన్= కృపాచార్య కృతవర్మల దగ్గరకు; చనుదెంచి= వచ్చి; వారలతోన్= వారితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఈ విధంగా రకరకాలుగా వికృతాలైన ముఖాలూ, పెక్కురీతులైన చేతులూ కాళ్ళూ కలిగిన పెక్కుమంది రాక్షసులు గుమిగూడి మేదస్సూ, మాంసమూ, మస్తిష్కమూ, మజ్జా భుజిస్తూ రుచిగా ఉన్నవాటిని కొడుకులకూ, స్నేహితులకూ, భార్యలకూ ఇస్తూ, పరాయివాళ్ళు చేరితే గెంటివేసి వాటిని కూడా తీసికొంటూ, రక్తం త్రాగటంచేత మదించి నాట్యాలు చేస్తూ, ఇంకా అనేక విధాలుగా విహరిస్తూ ఒప్పారు. తరువాత ప్రాణావశిష్టులైన ప్రాణులు

మూల్గగా రాక్షస సమూహం సందడికూడా తగ్గింది. అప్పుడు లోకాలను తగులబెట్టే ప్రళయాగ్నివలె పాండవ శిబిరంలోని వాళ్ళను యావన్మందినీ చంపి శాంతించి అశ్వత్థామ శరీరం రక్తంతో ఎర్రబడి మోహపుచీకటితో కలిసి ఉండటంచేత అధిక రక్తంతో తడిసిన చేయీ కత్తీ ఒకే వస్తువువలె కనబడగా, మళ్ళీ తను ప్రవేశించినప్పుడు ఎట్లా ఉందో అలాగే నిశ్శబ్దంగా ఉన్న ఆ శిబిరంలోనుండి బయటకు వస్తూంటే తెల్లవారింది. ఇట్లా శపథం నెరవేర్చి కృపకృతవర్మల దగ్గరికి వచ్చి వాళ్ళతో ఇట్లా అన్నాడు:

విశేషం: మోహాంధ్యము - మోహమనే ఆంధ్యం - రూపకం. 'జగంబులు గొని కాలిన కాలాగ్నియుంబోలె' - అలంకారం ఉత్ప్రేక్ష.

అశ్వత్థామ పాండవ శిబిరంబు వెడలి కృపకృతవర్మలఁ గూడికొనుట (సం. 10-8-140)

సీ. **'సకల పాంచాలురు సమసిరి పాంచాలి। కొడుకు లందఱు జముకడకుఁ జనిరి;**
చేది మాత్స్య ప్రభద్రాది బలంబులు। నిరవశేషంబుగా నేలఁ గలిసె;
మాటలు పెక్కేల? మానిసి గుఱ్ఱ మే। నుం గను పేరెల్లఁ ద్రుంగెఁ బాండు
భూవరనందను లేవురుఁ గృష్ణుఁడు। సాత్యకియును నెందుఁ జనిరొ కాని

తే. **తండ్రియును నేలినాతఁడు దైన్యపడిన। దాని కరులపై వచ్చి యీశాను వరము**
గాంచి మీరలు పెనుఁబ్రాపు గాఁగ వీడు। దఱియుటకు నెంతదగునంత పఱుపఁగంటి.' **203**

ప్రతిపదార్థం: సకల పాంచాలురున్= పాంచాలు రందరూ; సమసిరి= చచ్చారు; పాంచాలి కొడుకులు+అందఱున్= ద్రౌపది కొడుకు లందరూ; జముకడకున్= యముడి దగ్గరకు; చనిరి= వెళ్ళారు, చచ్చిపోయారు; చేది మాత్స్య ప్రభద్ర+ఆది బలంబులు= చేది బలాలూ, మాత్స్యబలాలూ, ప్రభద్రకుల బలాలూ మొదలైనవి; నిరవశేషంబుగాన్= ఏమీ మిగలకుండా; నేలన్+కలిసెన్= నశించాయి; మాటలు పెక్కు+ఏల?= ఇన్ని మాటలెందుకు?; మానిసి= మనుష్యుడు; గుఱ్ఱము; ఏనుంగు+అను పేరు+ఎల్లన్= ఏనుగు అనే మాట సర్వం; త్రుంగెన్= నశించింది; పాండు భూవర నందనులు+ఏవురున్= పాండురాజు కొడుకు లైదుగురూ; కృష్ణుఁడున్; సాత్యకియును; ఎందున్+చనిరొ కాని= ఎక్కడికి వెళ్ళారో కాని; తండ్రియును= నా తండ్రియైన ద్రోణుడూ; ఏలిన+ఆతఁడున్= రాజైన దుర్యోధనుడూ; దైన్యపడిన దానికిన్= దీనత్వం పొందిన దానికి; అరులపైన్= శత్రువులపైకి; వచ్చి; ఈశాను వరము= ఈశ్వరుడి వరం; కాంచి= పొంది; మీరలు= మీరిద్దరూ; పెను+ప్రాపు+కాఁగన్= పెద్ద అండకాగా; వీడు= శిబిరం; తఱియుటకున్= సమీపించటానికి; ఎంత+తగున్= ఎంత తగుతుందో; అంత= అంతా; పఱుపన్+కంటిన్= బాధించగలిగాను.

తాత్పర్యం: 'పాంచాలు రందరూ చచ్చారు. ద్రౌపది కొడుకులు అందరూ నశించారు. చేది మాత్స్య ప్రభద్రకాదుల సేనలు ఏమీ మిగలకుండా నశించాయి. ఇన్ని మాటలెందుకు? మనుష్యుడు, గుర్రం, ఏనుగు అనే మాటలేకుండా పోయింది. పాండవు లైదుగురూ, కృష్ణుడూ, సాత్యకీ ఎక్కడకు వెళ్ళారో కాని, నా తండ్రీ, నా ప్రభువూ దైన్యం పొందినందుకు శత్రువులపై దండెత్తి వచ్చి, ఈశ్వరుడి వరం పొంది, మీరు పెద్ద అండకాగా, నేను శిబిరం ప్రవేశించటానికి ఎంత తగుతుందో అంతా చేసి బాధించాను.'

వ. అని చెప్పిన వినుచు మున్ను రాక్షసావేశంబునం జేసి నీచపరాక్రమంబు లాచరించి తదనంతరంబ తెలిసి యా రథికవరులు వగం బొగులుచున్నవారు గావున నగ్గురునందన నగ్గింపం దలంపక యూరకుండి తమ మనోవికృతి యతం డెఱుంగకమున్న తలలు వంచుకొని తగు తెఱంగునఁ బొగడిన నతండు. 204

ప్రతిపదార్థం: అని; చెప్పినన్; వినుచున్; మున్ను= మొదట; రాక్షస+ఆవేశంబునన్+చేసి= రాక్షసు డావేశించటం చేత; నీచ పరాక్రమంబులు= తుచ్ఛ పరాక్రమాలు; ఆచరించి= చేసి; తద్+అనంతరంబు+అ= ఆ పిమ్మటనే; తెలిసి= గ్రహించి; ఆ రథికవరులు= ఆ రథికశ్రేష్ఠులైన కృపకృతవర్మలు; వగన్= పశ్చాత్తాపంతో; పొగులుచున్+ఉన్నవారు+కావునన్= బాధపడుతున్నారు కాబట్టి; ఆ+గురునందనున్= ఆ గురుపుత్రుడిని-అశ్వత్థామను; అగ్గింపన్+తలంపక= పొగడనెంచక; ఊరక+ఉండి; తమ మనస్(ః)+వికృతి= తమ మనస్సులోని మార్పు; అతండు; ఎఱుంగక మున్ను+అ= తెలిసికోవటానికి ముందే; తలలు వంచుకొని; తగు తెఱంగునన్= తగిన విధంగా; పొగడినన్= పొగడగా; అతండు= అశ్వత్థామ.

తాత్పర్యం: అని చెప్పగా వింటూ మొదట రాక్షసు డావేశించటం చేత తుచ్ఛంగా పరాక్రమించి, ఆ వెంటనే గ్రహించికొని ఆ రథిక శ్రేష్ఠులైన కృపకృతవర్మలు పశ్చాత్తాపంతో తపిస్తున్నారు కాబట్టి ఆ గురుపుత్రుడిని పొగడటానికి ఇచ్ఛగించక ఊరుకొని తమ మనస్సు మార్పు అతడు గ్రహించటానికి ముందే తలలు వంచుకుని సముచిత రీతిని పొగడితే, అతడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'పాండుతనయులు నాచేతఁ బట్టువడుట । తెగుట గలిగిన ననుఁ గొంత పొగడఁ దగును;
జలముమై రిత్తవాండ్రను జంపు టరయ । మీరు గొనియాడు నంతటి పౌరుషంబె?' 205

ప్రతిపదార్థం: పాండు తనయులు= పాండురాజు కొడుకులు- పాండవులు; నాచేతన్; పట్టువడుట= చిక్కటం; తెగుట= చావటం; కలిగినను= సంభవిస్తే; ననున్= నన్ను; కొంత; పొగడన్+తగును= పొగడటం మంచిది; చలముమైన్= పట్టుదలతో; రిత్తవాండ్రను= పనికిమాలినవాళ్ళను- అల్పులను; చంపుట; అరయన్= చూడగా; మీరు; కొనియాడు+అంతటి= పొగిడేటంత; పౌరుషంబు+ఎ?= పౌరుషమా? (కాదనుట).

తాత్పర్యం: 'పాండవులు నా చేత చిక్కటం, చావటం సంభవిస్తే నన్ను ఏదో కొంత పొగడటం మంచిది. పట్టుపట్టి పనికిమాలిన వాళ్ళను చంపటం 'మీరు పొగిడేటంతటి పౌరుషమా?'

వ. అనిన విని వారలు 'ధృష్టద్యుమ్న ప్రముఖ పాంచాలురను బ్రతివింధ్యాది ద్రౌపదేయులను బేరుకొని వారివారి బలంబులను మాత్స్యానీకప్రభృతి సైన్యంబులను నొక్కరూపేనియుఁ ద్రిక్కకుండ నొక్కరుండవ రెండు జాములలో నేలం గలిపితి; కరం బచ్చెరువుగాదె!' యని యతనిం గౌఁగిలించుకొని రనుటయు సంజయునకు ధృతరాష్ట్రుం డిట్లనియె: 206

ప్రతిపదార్థం: అనినన్; విని; వారలు; ధృష్టద్యుమ్న ప్రముఖ పాంచాలురను= ధృష్టద్యుమ్నుడు మొదలైన పాంచాలురనూ; ప్రతివింధ్య+ఆది-ద్రౌపదేయులను= ప్రతివింధ్యుడూ మొదలైన ద్రౌపదీకుమారులనూ; పేరుకొని= పేర్కొని; వారి వారి బలంబులను= వారి వారి సేనలనూ; మాత్స్య+అనీక ప్రభృతి సైన్యంబులను= మాత్స్య సైన్యం మొదలైన సైన్యాలనూ; ఒక్కరూపు+ఏనియున్+త్రిక్కక+ఉండన్= ఒక్క మనిషికూడా మిగలకుండా; ఒక్కరుండవు+అ= ఒక్కడివే; రెండు జాములలో; నేలన్+కలిపితి(వి)= నశింపజేశావు; కరంబు= మిక్కిలి; అచ్చెరువు+కాదె?= ఆశ్చర్యం కాదా?; అని; అతనిన్= అతడిని; కౌఁగిలించుకొనిరి; అనుటయున్; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని వాళ్ళు 'ధృష్టద్యుమ్నాది పాంచాలురనూ, ప్రతివింధ్యాది ద్రౌపదీ కుమారులనూ పేర్కొని వారి వారి సేనలనూ మాత్స్యసైన్యం మొదలైన సైన్యాలనూ ఒక్కడు కూడా మిగలకుండా ఒక్కడవే రెండు జాములలో రూపుమాపావు. ఇది అత్యంతం ఆశ్చర్యకరం కాదా?' అని అతడిని కౌగలించుకొన్నారు. అని చెప్పగా ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇలా అన్నాడు:

క. 'కురుపతికి జయము గోరెడు । గురుపుత్త్రుఁడు మున్న యేలొకో యిటు తఱికిం
జొరక యెడ మడిసినను మఱి । వెరవుం జేవయును జూప వేడుక వడియెన్.' 207

ప్రతిపదార్థం: కురుపతికిన్= కురురాజునకు- దుర్యోధనుడికి; జయము; కోరెడు; గురుపుత్త్రుఁడు= అశ్వత్థామ; మున్న= ముందే; ఏల+ఒకో= ఎందుచేత; ఇటు= ఈ రీతిగా; తఱికిన్+చొరవ= సమయానికి పూనుకోక; ఎడ మడిసినను= అదను తప్పగా; మఱి= తరువాత; వెరవున్= ఉపాయమూ; చేవయును= బలమూ; చూపన్= ప్రదర్శించటానికి; వేడుక పడియెన్= ఉత్సహించాడు.

తాత్పర్యం: 'దుర్యోధనుడికి జయం కోరే అశ్వత్థామ ముందే ఎందుకో ఈ రీతిగా సమయానికి పూనుకోక, సమయం మించిన తరువాత ఉపాయమూ, బలమూ ప్రదర్శించటానికి ఉత్సహించాడు.'

వ. అనిన యమ్మహీపతి కతం డిట్లనియె. 208

ప్రతిపదార్థం: అనిన+ఆ+మహీపతికిన్= అని పలికిన ఆ ధృతరాష్ట్రుడికి; అతండు= సంజయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: అట్లా అడిగిన ఆ ధృతరాష్ట్రుడితో సంజయు డిట్లా అన్నాడు:

ఉ. 'పాండు నృపాలనందనుల బాహుబలంబున కోడి యాతఁడు
ద్దండతఁ గుంది యుండి వసుధావరునూరులు నుగ్గుసేసి భీ
ముండు దదుత్తమాంగము సముద్ధతిఁ దన్నిన దాన శోకముం
జండతర ప్రకోపము నసహ్యపు వేదన సేయ నత్తఱిన్. 209

ప్రతిపదార్థం: ఆతఁడు= అశ్వత్థామ; పాండు నృపాల నందనుల= పాండురాజు కొడుకులయొక్క; బాహు బలంబునకున్= భుజపరాక్రమానికి; ఓడి= భయపడి; ఉద్దండతన్= అధికంగా; కుంది+ఉండి= బాధపడి ఉండి; భీముండు; వసుధావరు+ఊరులు= రాజు (దుర్యోధనుడి) తొడలు; నుగ్గు+చేసి= విరుగగొట్టి; తద్+ఉత్తమాంగమున్= అతడి శిరస్సును; సముద్ధతిన్= మిక్కిలి గర్వంతో; తన్నినన్= తన్నితే; దానన్= ఆ కారణంచేత; శోకమున్= దుఃఖమూ; చండతర ప్రకోపమున్= మిక్కిలి తీవ్రమైన కోపమూ; అసహ్యము+వేదన= దుస్సహమైన బాధ; చేయన్= చేయగా; ఆ+తఱిని= అప్పుడు.

తాత్పర్యం: 'అశ్వత్థామ పాండవుల భుజపరాక్రమానికి వెరచి అధికంగా బాధపడుతూ ఉండి, భీముడు దుర్యోధనుడి తొడలు విరుగగొట్టి అతడి శిరస్సును తన్నిన కారణంచేత, దుఃఖమూ, తీవ్రమైన కోపమూ దుస్సహమైన వేదనా కలుగగా, అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. గురుని చావు తెలుఁగు క్రొత్తయై మనమున । నావహిల్లుటయు మహోగ్రహమున
బాసయిచ్చి రాజు పనుపును బడసి యు । దగ్రవృత్తి నరిగి యట్లు సేసె. 210

ప్రతిపదార్థం: (పూర్వపద్యంలోని 'ఆతఁడు' కర్త) గురుని చావు తెలుఁగు= తండ్రి మరణవిధం; క్రొత్త+ఐ= అపూర్వమై; మనమునన్= మనస్సులో; ఆవహిల్లుటయున్= ఉండగా; మహా+ఆగ్రహమునన్= మిక్కిలి కోపంతో; బాస+ఇచ్చి= శపథంచేసి; రాజు పనుపును= దుర్యోధనుడి ఆనతిని; పడసి= పొంది; ఉదగ్ర వృత్తిన్= భయంకరవ్యాపారంతో; అరిగి= వెళ్ళి; అట్లు+చేసెన్= ఆ విధంగా చేశాడు.

తాత్పర్యం: తండ్రి చచ్చిన విధం అపూర్వమై మనస్సులో నాటగా మహాక్రోధంతో శపథం చేసి, రాజానుమతిని పొంది, భయంకరోద్యోగంతో వెళ్ళి ఆ రీతిగా చేశాడు.

ఉ. తా వెసఁ బోవునప్డు బలదర్ప సమగ్రులు పాండుపుత్రు ల
చ్చో వసియింపకున్కిఁ దనచూచిన కార్య మతం డొనర్చె; దే
వావలికైన నత్తెఱఁగు నాక్రమలీలలు సెల్ల నేర్చునే?
భూవర! వారలున్న విధిపోకలఁ బోవుట గాక యంతయున్.' 211

ప్రతిపదార్థం: తాన్= తాను(అశ్వత్థామ); వెసన్= శీఘ్రంగా; పోవు+అప్డు= వెళ్ళినపుడు; బల దర్ప సమగ్రులు= పరాక్రమ గర్వంతో నిండినవారు(అగు); పాండుపుత్రులు= పాండురాజు కొడుకులు; ఆ+చోటన్= ఆ ప్రదేశంలో; వసియింపక+ఉన్కిన్= ఉండకపోవటంచేత; అతండు= అశ్వత్థామ; తన చూచిన కార్యము= తను అనుకున్న పని; ఒనర్చెన్= చేశాడు; భూవర!= ఓ రాజా! ధృతరాష్ట్రా!; వారలు+ఉన్నన్= పాండవులు ఆ సమయంలో అక్కడ ఉన్నట్లయితే; ఆ+తెఱఁగు+ఆక్రమ లీలలు= ఆ విధమైన ఆక్రమణపు తీరులు; దేవావలికైనన్= దేవతల సమూహానికైనా; చెల్లన్+నేర్చునే= సాగగలిగేవా?; అంతయున్= అంతా; విధి పోకలన్= దైవగతులలో; పోవుట+కాక= పోవుటమే కదా!

తాత్పర్యం: అశ్వత్థామ శీఘ్రంగా వెళ్ళినప్పుడు పరాక్రమగర్వంతో నిండిన పాండవులు అక్కడ లేకపోవటంచేత అశ్వత్థామ తాననుకొన్న పని చేశాడు. ధృతరాష్ట్రా! దైవగతి ననుసరించి అంతా నడవటం తప్ప, పాండవులు అక్కడే ఉన్నట్లయితే అశ్వత్థామ చేసిన ఆ విధమైన ఆక్రమణపు తీరులు దేవతల సమూహానికి కూడా సాగగలిగేవా?

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. విధి నిర్ణయంవలన అంతా అట్లా జరిగింది కాని పాండవులు అక్కడే ఉన్నట్లయితే అశ్వత్థామ చేసిన ఆక్రమణలు దేవతలు కూడా చేయగలిగేవారు కారని భావం. దేవతలకు కూడా సాధ్యం కాదంటే, అశ్వత్థామ మాట వేరే చెప్పాలా? అనటంచేత అలంకారం కావ్యార్థాపత్తి.

వ. అని చెప్పి విను మట్లు కృపకృతవర్మలచేత సంభావితుండై కుంభసంభవసంభవుండు వారలతో మనమిఁక 'మనుజపతి కడకుఁ దడయక పోవలయుఁ బుణ్యంబున మనము వోపునంతకుం బ్రాణంబులు గలిగి యుండెనేని యిత్తెఱం గెఱింగింత' మనుటయు వార లట్లకాక యని యచ్చోటు గదలి యమ్మువ్వురును భూవల్లభసల్లాప కుతూహలంబున రయంబునం జనుదెంచి. 212

ప్రతిపదార్థం: అని చెప్పి; వినుము; అట్లు; కృప కృతవర్మల చేతన్; సంభావితుండు+ఐ= ఆదరింపబడినవాడయి; కుంభసంభవ సంభవుండు= ద్రోణుడి కొడుకు-అశ్వత్థామ; వారలతోన్= ఆ కృపకృతవర్మలతో; మనము; ఇఁకన్; మనుజపతి కడకున్=రాజు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(దుర్యోధనుడి) దగ్గరకు; తడయక= ఆలస్యం చేయకుండా; పోవలయున్= వెళ్ళాలి; పుణ్యంబునన్= అదృష్టం వలన; మనము; పోవు+అంతకున్= వెళ్ళేటప్పటికి; ప్రాణంబులు+కలిగి+ఉండెన్+ఏని= బ్రదికి ఉన్నట్లయితే; ఈ+తెఱంగు= ఈ విధం; ఎఱింగింతము= చెపుదాము; అనుటయున్= అనగా; వారలు; అట్లు+అ కాక= అట్లాగే అని; ఆ+చోటు= ఆ ప్రదేశం; కదలి; ఆ+మువ్వురును= ఆ ముగ్గురూ; భూ వల్లభ సల్లాప కుతూహలంబునన్= రాజుతో సంభాషించే కోరికతో; రయంబునన్= వేగంగా; చనుదెంచి= వచ్చి.

తాత్పర్యం: అని చెప్పి, ధృతరాష్ట్రా! వినుము. ఆ రీతిగా కృప కృతవర్మల చేత ఆదరించబడినవాడయి అశ్వత్థామ వాళ్ళతో 'ఇంక మనం దుర్యోధనుడి దగ్గరికి వెంటనే వెళ్ళాలి. అదృష్టవశంచేత మనం వెళ్ళే సరికి అతడు బ్రదికి ఉంటే, జరిగినదంతా చెపుదాము' అనగా, వాళ్ళు అట్లే అన్నారు. ఆ ముగ్గురూ అక్కడినుండి బయలుదేరి రాజుతో మాట్లాడాలనే కోరికతో వేగంగా వచ్చి.

అశ్వత్థామాది రథికత్రయంబు దుర్యోధనుం గనుంగొనుట (సం. 10-9-1)

తే. **రక్త సంసిక్తమైన ధరాతలమున । నార్తిఁ బొరలుచు నూర్పు లందంద సంద**
డింప జీవంబు వెడల నుంకింపఁ జేష్ట । లొయ్యనొయ్యన యడఁగంగ నున్న యధిపు. **213**

ప్రతిపదార్థం: రక్త సంసిక్తము+ఐన= రక్తంతో బాగా తడిసిన; ధరాతలమునన్= నేలమీద; ఆర్తిన్= బాధతో; పొరలుచున్= అటూ ఇటూ దొర్లుతూ; ఊర్పులు= శ్వాసలు; అందంద= మిక్కిలి; సందడింపన్= అధికంకాగా; జీవంబు= ప్రాణంబు; వెడలన్+ఉంకింపన్= పోవటానికి సిద్ధమవగా; చేష్టలు; ఒయ్యనొయ్యన= క్రమక్రమంగా; అడఁగంగన్= ఉడుగగా; ఉన్న+అధిపున్= ఉన్న రాజును- దుర్యోధనుడిని.

తాత్పర్యం: నెత్తుటితో తడిసిన నేలమీద బాధతో అటూ ఇటూ దొర్లుతూ, మిక్కిలి ఆయాసపడుతూ, ప్రాణం పోవటానికి సిద్ధపడి, క్రమక్రమంగా చేష్టలుడిగిన దుర్యోధనుడిని. (తరువాత పద్యంతో అన్వయం).

మహాస్రగ్ధర.

కని శోకం బాత్మలం దగ్గలముగ రథముల్ గ్రక్కునన్ డిగ్గి, భూమిన్
ధనువుల్ వోవైచి, భాష్పోద్గమము వొదువు వక్త్రంబులన్ విప్రలాపం
బును దైన్యం బావహిల్లం బొరలుచుఁ బొరి నా భూవిభున్ శాంతదృష్టిం
గనుఁగొంచుం జేరి, కే లంగముపయి నిడుచుం గౌఁగిటం జేర్చుకొంచున్. **214**

ప్రతిపదార్థం: కని= చూచి; శోకంబు= దుఃఖం; ఆత్మలందున్= మనస్సులలో; అగ్గలముగన్= అధికంకాగా; రథముల్; గ్రక్కునన్= శీఘ్రంగా; డిగ్గి= దిగి; భూమిన్= నేలమీద; ధనువుల్= విల్లులు; పోన్+వైచి= పడవేసి; బాష్ప+ఉద్గమము= కన్నీటిపొంగు; పొదువు వక్త్రంబులన్= ఆక్రమించే ముఖాలలో; విప్రలాపంబును= ప్రేలాపనా; దైన్యంబు= విచారం; ఆవహిల్లన్= కలుగగా; పొరలుచున్= ఉంటూ; పొరిన్= మాటికి; ఆ భూవిభున్= ఆ రాజును-దుర్యోధనుడిని; శాంతదృష్టిన్= శాంతమైన చూపుతో; కనుఁగొంచున్= చూస్తూ; చేరి= సమీపించి; కేలు= చేయి; అంగముపయిన్= అతడు శరీరంమీద; ఇడుచున్= పెడుతూ; కౌఁగిటన్+చేర్చుకొంచున్= కౌగిలించుకుంటూ.

తాత్పర్యం: చూచి మనస్సులలో దుఃఖం అధికంకాగా, వెంటనే దిగి నేలమీద విల్లులు పడవైచి, కన్నీళ్ళు క్రమ్మే వదనాలలో ప్రేలాపనా, దుఃఖమూ కలుగగా, మాటి మాటికి ఆ రాజును శాంతదృష్టితో చూస్తూ, చేరి, చేయి అతడి శరీరంమీద ఉంచుతూ, కౌగిలించుకొంటూ. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. పురపురఁ బొక్కి యా నృపతిపుంగవు చుట్టును నుండి 'యక్కటా!
ధరణి సమస్తమున్ భవదుదారమహాజ్ఞకు లోను సేసి యి
ప్పరుసున నీవు దీనతకు భాజనమైతి; విధాత కెందు దు
ష్కర మగు కార్యముం గలదె? కౌరవనాయక! మ మ్మెఱుంగుదే?' 215

ప్రతిపదార్థం: పురపురన్+పొక్కి= పురపుర ఏడ్చి; ఆ నృపతి పుంగవు చుట్టునున్+ఉండి= ఆ రాజశ్రేష్ఠుడి చుట్టూ ఉండి; అక్కటా!= అయ్యో!; ధరణిన్+సమస్తమున్= భూమినంతనూ; భవత్+ఉదార మహా+ఆజ్ఞకున్= నీ తిరుగులేని ఆజ్ఞకు; లోను+చేసి= వశంచేసి; ఈ+పరుసునన్= ఈ రీతిగా; నీవు; దీనతకున్= దైన్యానికి; భాజనము+ఐతి(వి)= పాత్రుడవయ్యావు; విధాతకున్= బ్రహ్మకు; ఎందున్= ఎక్కడైనా; దుష్కరము+అగు= చేయరాని; కార్యమున్= పని అంటూ; కలదె?= ఉందా?; కౌరవనాయక!= కురురాజా!; మమ్మున్+ఎఱుంగుదే?= మేమెవరమో తెలుసా?

తాత్పర్యం: పురపురా ఏడ్చి ఆ రాజోత్తముడి చుట్టూ ఉండి 'అయ్యో! భూమినంతనూ నీ తిరుగులేని ఆనకు వశం చేసి ఈ విధంగా నీవు దైన్యం పొందావు. బ్రహ్మకు చేయరాని పనంటూ ఎక్కడైనా ఉన్నదా? కురురాజా! మమ్ములను గుర్తుపట్టావా?'

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'విధాత కెందు దుష్కరమగు కార్యముం గలదె?' అనే సామాన్యంచేత విశేషం సమర్థించబడినది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

క. అన నప్పలుకులు వెడ వెడ । విని యా విభుఁ డల్లఁ గన్ను విచ్చిన వదనం
బునఁ జూడ్కి నిలిపి కలశజ । తనయుం డి ట్లనియె గద్గదగళుం డగుచున్. 216

ప్రతిపదార్థం: అనన్= అనగా; ఆ+పలుకులు= ఆ మాటలు; వెడవెడ విని= అశ్రద్ధగా; విని; విభుఁడు= రాజు-దుర్యోధనుడు; అల్లన్= మెల్లగా; కన్ను విచ్చినన్= కళ్ళు తెరువగా; కలశజ తనయుండు= కుంభజుడి కొడుకు- అశ్వత్థామ; వదనంబునన్= (అతడి) ముఖంపై; చూడ్కిన్= చూపును; నిలిపి; గద్గద గళుండు+అగుచున్= డగ్గుత్తిక పడిన కంఠంగలవాడు అవుతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా ఆ మాటలు అశ్రద్ధగా విని దుర్యోధనుడు మెల్లగా కళ్ళు తెరవగా, ఆ అశ్వత్థామ అతడి ముఖంమీద చూపు నిలిపి డగ్గుత్తికపడ్డ స్వరంతో ఇట్లా అన్నాడు:

చ. 'అమితబలంబు దర్పమును నద్భుత ధీరతయున్ గదాపరి
శ్రమముఁ బొగడ్త కెక్కు నినుఁ జక్క నెదుర్చుట గాక పోర రం
ధ్రముగని యొక్కఁ డుద్ధతి గదం దెగటార్చుట గల్లెనట్టె యిం
క మగల కెట్టివారలకుఁ గల్గ దపాయము దైవ మల్గినన్? 217

ప్రతిపదార్థం: అమిత బలంబున్= అపార పరాక్రమమూ; దర్పమును= గర్వమూ; అద్భుత ధీరతయున్= ఆశ్చర్యకరధైర్యమూ; గదా పరిశ్రమమున్= గదా విద్యాభ్యాసమూ; పొగడ్తకున్+ఎక్కు నినున్= ప్రశంసనీయుడవైన నిన్ను; చక్కన్= చక్కగా; ఎదుర్చుట+కాక= ఎదిరించకుండా; పోరన్= యుద్ధంలో; రంధ్రము+కని= సందు కనిపెట్టి; ఒక్కఁడు; ఉద్ధతిన్= ఔద్ధత్యంతో;

గదన్= గదతో; తెగటార్చుట= వధించటం; కల్గెన్+అట్టె= సంభవించిందట; దైవము= విధి; అల్గినన్= ఆగ్రహిస్తే; ఇంకన్; మగలకున్+ఎట్టి వారలకున్= ఎటువంటి శూరులకైనా; అపాయము= హాని; కల్గదు?= సంభవించదు?

తాత్పర్యం: 'అపార పరాక్రమమూ, అహంకారమూ, ఆశ్చర్యకర ధైర్యమూ, గదాయుద్ధాభ్యాసమూ ప్రశంసనీయాలై ఉన్న నిన్ను చక్కగా యుద్ధంలో ఎదిరించాలే కాని యుద్ధంలో అవకాశం గమనించి, ఒకానొకడు ఔద్ధత్యంతో గద పుచ్చుకొని కొట్టటం సంభవించిందట! దైవానుగ్రహం లేకపోతే, ఇంక ఎంతటి శూరులయితే మాత్రం అపాయం సంభవించకుండా ఉంటుందా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. భీముడు సందు కనిపెట్టి తొడలు విరగ్గొట్టి దుర్యోధనుడిని నేల కూలుస్తాడు. దుర్యోధనుడు నేలకూలటం దైవం ఆగ్రహించటంవల్లనే కాని, పరాక్రమలోపంవలన కాదని అశ్వత్థామ ప్రశంస. ఇందులో సామాన్యాంశంచేత విశేషాంశం సమర్థించబడింది కాబట్టి అలంకారం అర్థాంతరన్యాసం.

చ. దురమునఁ బెంపుఁ జేవయును దుర్దమలీల వెలుంగుచుండ సు
స్థిరత శమంతపంచక విశిష్ట తలంబునఁ బోరి సద్గతిన్
బొరసెదు; నీకునై వగపు పుట్టదు; బంధులు, రాజు, దేవులుం
దిరియుదు రింక; వారి దగు దీనత కోర్వక యుమ్మలించెదన్. 218

ప్రతిపదార్థం: దురమునన్= యుద్ధంలో; పెంపున్= గొప్పతనమూ; చేవయును= బలమూ; దుర్దమలీలన్= అణచరాని విధంగా; వెలుంగుచున్+ఉండన్= ప్రకాశిస్తూండగా; సుస్థిరతన్= నిలకడతో; శమంతపంచక విశిష్ట తలంబునన్= శమంతపంచకం అనే ప్రత్యేకస్థలంలో; పోరి= యుద్ధంచేసి; సత్+గతిన్= ఉత్తమ గతిని; పొరసెదు= పొందుతావు; నీకున్+ఐ= నీ విషయంలో; వగపు పుట్టదు= విచారం కలుగదు; ఇంకన్= ఇకమీద; బంధులున్= చుట్టాలు; రాజున్= రాజూ (ధృతరాష్ట్రుడూ); దేవులున్= రాణులూ; తిరియుదురు= యాచకులవుతారు; వారిదగు (వారిది+అగు)= వారిదైన; దీనతకున్= దైన్యానికి; ఓర్వక= సహించక; ఉమ్మలించెదన్= విచారిస్తున్నాను.

తాత్పర్యం: యుద్ధంలో పెంపూ, చేవా అణచరాని విధంగా ఒప్పుతూండగా సుస్థిరత్వంతో శమంతపంచకమనే ప్రత్యేక స్థలంలో యుద్ధంచేసిన నీవు ఉత్తమగతిని పొందుతావు. నీకొరకు విచారించను. బంధువులూ, రాజూ, రాణులూ ఇంక బిచ్చమెత్తుకొంటారు. నేను వారి దైన్యానికి ఓర్చుకొనలేక విచారిస్తున్నాను.

విశేషం: శమంత పంచకం - పరశురాముడు వైరి రాజులను సంహరించి, ఆ రక్తాన్ని అయిదు మడుగులుగా చేసి పితృతర్పణం చేశాడు. తత్సమీప ప్రదేశానికి శమంతపంచకం అనిపేరు. అక్కడే కురుపాండవులు యుద్ధం చేయటం వలన దానికి కురుక్షేత్రం అనికూడా పేరు. 'ఉమ్మలించెదన్' అనే తద్ధర్మార్థక రూపం వర్తమానార్థకం. 'ఉమ్మలించుచున్నాను' అని అర్థం.

ఉ. సీరి యనారతంబుఁ దన శిష్యులలోపల నెల్ల నిన్ను దు
ర్వార పరాక్రమాఢ్యుఁడని వర్ణన సేయుట గేలిచేసి యా
మారుతికిన్ జయం బొసఁగె మాల విధాతృఁడు; వాని గెల్పుకో
లేరికి సమ్మతంబగునె యిట్టిది? దీనను బెంపు గల్గునే? 219

ప్రతిపదార్థం: సీరి= బలరాముడు; అనారతంబున్= ఎల్లప్పుడూ; తన శిష్యులలోపలన్+ఎల్లన్= తన శిష్యులందరిలోనూ; నిన్నున్; దుర్వార పరాక్రమ+ఆఢ్యుఁడు+అని= అవార్య పరాక్రమ సంపన్నుడని; వర్ణన+చేయుటన్= పొగడటాన్ని; గేలిచేసి= పరిహరించి; మాల విధాతృఁడు= చండాలపు బ్రహ్మ; ఆ-మారుతికిన్= ఆ భీముడికి; జయంబు+ఒసఁగెన్= గెలుపు చేకూర్చాడు; వాని-గెల్పుకోలు= ఆ భీముడి గెలుపు; ఇట్టిది= ఇటువంటిది; ఏరికిన్= ఎవరికైనా; సమ్మతంబు+అగునె?= అంగీకారం అవుతుందా?; దీనను= దీనిచేత; పెంపు+కల్గునే?= గొప్పతనం కలుగుతుందా?

తాత్పర్యం: బలరాము డెప్పుడూ నిన్ను తన శిష్యులందరిలోనూ అవార్య పరాక్రమ సంపన్నుడవని పొగడటాన్ని పరిహసించి మాలదైవం ఆ భీముడికి గెలుపు చేకూర్చాడు. అతడి ఇటువంటి గెలుపు ఎవరికైనా అంగీకారం అవుతుందా? దీనివలన అతడికి గొప్పతనం కలుగుతుందా?

చ. **కురువర! నీ మగంటిమియుఁ గోల్తలయున్ బలముం జలంబు దు**
స్తరగతిఁ బేర్చి భీమునకుఁ జావక పోవఁగరాని యట్టిదై
నరు బెదరించి కేశవు మనంబు గలంచి యధర్మవృత్తికిం
జొరుఁడని పంచె; దీని దివిజుల్ గని; రిం కిటవేయు నేటికిన్? **220**

ప్రతిపదార్థం: కురువర!= కురుపతీ-దుర్యోధనా!; నీ మగంటిమియున్= నీ పరాక్రమమూ; కోల్తలయున్= యుద్ధమూ; బలమున్= బలమూ; చలంబున్= పట్టుదలా; దుస్తర గతిన్= దాటశక్యంకాని విధంగా; పేర్చి= విజృంభించి; భీమునకున్; చావకపోవఁగన్-రాని+అట్టిది+ఐ= చావు అనివార్యం అన్నటువంటి దయి; నరున్= అర్జునుడిని; బెదరించి= భయపెట్టి; కేశవు మనంబు= కృష్ణుడి మనస్సు; కలంచి= కలతచెందేటట్టు చేసి; అధర్మ వృత్తికిన్= అన్యాయ ప్రవర్తనకు; చొరుఁడు+అని= పూనుకొనండి అని; పంచెన్= నియోగించింది; దీనిన్; దివిజుల్= దేవతలు; కనిరి= చూశారు; ఇంకన్; ఇటన్= ఈ విషయంలో; వేయున్+ఏటికిన్= వేయి మాటలెందుకు?

తాత్పర్యం: దుర్యోధనా! నీ పరాక్రమమూ, యుద్ధనైపుణ్యమూ, బలమూ, పట్టుదలా దాట శక్యంకాని విధంగా విజృంభించి భీముడికి చావుతప్పదు అన్నటువంటివై, అర్జునుడిని భయపెట్టి, కృష్ణుడి మనస్సును కలత చెందించి, అన్యాయ ప్రవృత్తికి పూనుకొనేటట్లు చేశాయి. ఇదంతా దేవతలు కనిపెట్టారు. ఇంక ఈ విషయంలో వేయి మాట లెందుకు?

ఉ. **ధర్మము మాని యూరులు గదం బొడి సేసినయంతఁ బోక దు**
ష్కర్ముఁడు వాయుజుం డెడమకాల శిరంబటు దన్నెఁ జూచి యా
ధర్మసుతుండు శాస్తిఁ దగ దానికిఁ జేయఁడ; యాతఁడెప్డు నం
తర్మదదుష్టుఁ; డీ గెలుపు దైన్యము సేయదె? కీర్తి మాయదే? **221**

ప్రతిపదార్థం: దుష్కర్ముఁడు= చెడ్డపనులు చేసేవాడైన; వాయుజుండు= భీముడు; ధర్మము మాని= ధర్మం విడిచి; ఊరులు= తొడలు; గదన్= గదతో; పొడి+చేసిన+అంతన్+పోక= నుగ్గుచేసి, అంతటితో ఊరుకోక; ఎడమకాలన్= ఎడమకాలితో; శిరంబు= తల; అటు= ఆ రీతిగా; తన్నెన్= తన్నాడు; ఆ ధర్మసుతుండు= ఆ ధర్మరాజు; చూచి; దానికిన్; శాస్తిన్= శిక్షను; తగన్= తగినవిధంగా; చేయఁడు+అ= చేయనేలేదు; ఆతఁడు= ఆ ధర్మరాజు; ఎప్డున్= ఎప్పుడూ; అంతర్మదదుష్టుఁడు= లోపల గర్వం గల దుర్జనుడు; ఈ గెలుపు= ఇటుంటి జయం; దైన్యము+చేయదె?= నైచ్యం కలిగించదా?; కీర్తి మాయదే= కీర్తి నశించదా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దుర్మార్గుడైన భీముడు ధర్మం తప్పి నీ తొడలు గదతో విరుగగొట్టి అంతతో ఊరుకోక ఎడమకాలితో నీ శిరస్సు ఆ విధంగా తన్నాడు. ఆ ధర్మరాజు అది చూచి కూడా దానికి తగిన శాస్తి చేయనే లేదు. అత డెప్పుడూ పైకి కనిపించని గర్వంగల దుర్జనుడు. ఈ గెలుపు అతడికి నైచ్యం కలిగించదా? దానివలన కీర్తి నశించదా?

క. కౌరవనాయక! నీదు గ । దారణ గౌరవము సకల ధరణీజన చే
తోరంజనమై నిర్మల । సారయశోధనము నీకు సంపాదించెన్.' 222

ప్రతిపదార్థం: కౌరవనాయక!= కురురాజా! దుర్యోధనా!; నీదు గదా రణ గౌరవము= నీ గదాయుద్ధ మహత్త్వం; సకల ధరణీ జన చేతస్(ః)+రంజనము+ఐ= ఎల్ల భూజనుల మనస్సులకీ ఆనందాన్ని కలిగించేదయి; నీకున్; నిర్మలసార యశస్(ః)+ ధనమున్= పవిత్రమూ, శ్రేష్ఠమూ అయిన కీర్తిధనాన్ని; సంపాదించెన్= సంపాదించిపెట్టింది.

తాత్పర్యం: దుర్యోధనా! నీ గదాయుద్ధ మహత్త్వం ఎల్ల జనుల మనస్సుల ఆనందం కలిగించేదయి నీకు నిర్మలమూ, సారవంతమూ అయిన కీర్తిధనాన్ని సంపాదించిపెట్టింది'.

వ. అని పలికి తన మానుషంబు తెఱం గూహించి. 223

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; తన మానుషంబు తెఱంగు= తన గౌరవపురీతి; ఊహించి= తలచి.

తాత్పర్యం: అని పలికి తన గౌరవం సంగతి తలచి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'కుడువఁగఁ గట్ట, బంధులకుఁ గోటి విధంబులఁ బెట్ట, జన్నము
ల్నడుప, ననేక ధర్మవిధులం బొగ డొందఁగఁ జాలునట్టి యె
క్కుడు సిరి యిచ్చి పేర్మి నొక కొండగ మన్చిన నీవు సావఁగా
నొడ లిటు లోమితిం; గురుకులోత్తమ ! యేనొక సేవకుండనే?' 224

ప్రతిపదార్థం: కుడువఁగన్= తినటానికీ; కట్టన్= ధరించటానికీ; బంధులకున్= చుట్టాలకు; కోటి విధంబులన్= అనేక రీతులుగా; పెట్టన్= పెట్టటానికీ; జన్నముల్= యజ్ఞాలు; నడుపన్= చేయించటానికీ; అనేక ధర్మవిధులన్= పెక్కు ధర్మకార్యాలలో; పొగడు+ఒందఁగన్= పేరు పొందటానికీ; చాలును+అట్టి= సరిపడేటటువంటి; ఎక్కుడు సిరి+ఇచ్చి= అధికమైన సంపదనిచ్చి; పేర్మిన్= ప్రేమతో; ఒక కొండగన్= ఒక కొండలా; మన్చిన నీవు= పోషించిన నువ్వు; చావఁగాన్= చచ్చిపోగా; ఇటులు= ఈ ఇధంగా; ఒడలు+ఓమితిన్= శరీరం తాల్చాను-బ్రదికి ఉన్నాను; కురు-కుల+ఉత్తమ!= కురువంశ శ్రేష్ఠుడా-దుర్యోధనా!; ఏను= నేను; ఒక సేవకుండనే= ఒక ఉత్తమ సేవకుడనా?

తాత్పర్యం: 'తినటానికీ, కట్టుకొనటానికీ, బంధువులకు అనేక విధాల పెట్టటానికీ, యజ్ఞాలు చేయించటానికీ, పెక్కు ధర్మకార్యాలలో పేరు గాంచటానికీ సరిపడేటంత అధికమైన సంపద నిచ్చి ప్రేమతో ఒక కొండవలె నన్ను సాకిన నీవు చచ్చిపోతూ ఉంటే నే నిట్లా బ్రదికి ఉన్నాను. కురువంశశ్రేష్ఠా! నేనూ ఒక సేవకుడనా?'

వ. అని తన్నుఁ దాన నిందించుకొనుచు మఱియు. 225

ప్రతిపదార్థం: అని; తన్నున్+తాను+అ= తనని తనే; నిందించుకొనుచున్= తిట్టుకుంటూ; మఱియున్= ఇంకా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని తనను తాను నిందించుకొంటూ, ఇంకా (ఇట్లా అన్నాడు).

ఉ. 'న్యాయము దప్పకుండఁగ రణం బొనరించి దివంబు గైకొనం
బోయెద; వందు రాఁదగిన పుణ్యము సేయుటలేదు గాని, మా
చేయు మనంబునుం దనియఁ జెండఁగఁ బడ్డ విరోధివర్గమున్
నీయెడ కిం పొనర్పఁగ గణింపఁగ భాగ్యము గల్గె భూవరా! 226

ప్రతిపదార్థం: భూవరా!= రాజా! దుర్యోధనా!; న్యాయము= ధర్మం; తప్పక+ఉండఁగన్= తప్పకుండా; రణంబు= యుద్ధం; ఒనరించి= చేసి; దివంబు= స్వర్గం; కైకొనన్+పోయెదవు= పొందబోతున్నావు; అందున్= అక్కడికి; రాన్+తగిన= నిన్ను అనుసరించి వచ్చే; పుణ్యము= సుకృతము; చేయుట లేదు= మేము చేసింది లేదు; కాని; మా చేయున్= మా చెయ్యీ, మనంబునున్= మనస్సూ; తనియన్- తృప్తిపడేటట్లు; చెండఁగన్+పడ్డ= ఖండించబడిన; విరోధివర్గమున్= శత్రుసమూహాన్ని; నీ+ఎడకున్= నీ హృదయానికి; ఇంపు+ఒనర్పఁగన్= ఆనందం కలిగేటట్టు; గణింపఁగన్+భాగ్యము+కల్గెన్= లెక్కపెట్టే అదృష్టం కలిగింది.

తాత్పర్యం: 'దుర్యోధనా! నీవు ధర్మం తప్పకుండా యుద్ధంచేసి (వీర)స్వర్గం అలంకరింపబోతున్నావు. అక్కడ రాదగిన పుణ్యం నీతో మేము చేయాలి కాని, మా చెయ్యీ, మనస్సూ తృప్తి పడేటట్టు దొరికిన శత్రువులను మట్టుబెట్టి; నీ మనస్సుకు ఆనందం కలిగేటట్లు లెక్కపెట్టే అదృష్టం మాకు కలిగింది. దొరికిన శత్రువులను చంపి నీ మనస్సుకు ఆనందం కలిగించే అదృష్టం మాకు దక్కింది.

విశేషం: ఉస్మానియా ప్రతిలోని 'చెందగఁబడ్డ' అనే పాఠం కంటె వావిళ్ళప్రతిలోని 'చెండగఁబడ్డ' పాఠం సమంజసమని గ్రహించబడింది.

ఆ. పుణ్యలోకమునకుఁ బోయినయప్పుడు । ద్రోణుఁ గాంచి నీకు ద్రోహియైన
జనవినింద్య చరితుఁ జంపె దృష్టద్యుమ్ను । నీ తనూజుఁ డనుము తొలుత. 227

ప్రతిపదార్థం: పుణ్య లోకమునకున్= పుణ్యలోకానికి - స్వర్గానికి; పోయిన+అప్పుడు= నువ్వు వెళ్ళినప్పుడు; ద్రోణున్= ద్రోణుడిని; కాంచి= చూచి; తొలుతన్= మొదట; అనఘ!= ఓ పాపరహితుడా!; నీకున్; ద్రోహి+ఐన= ద్రోహం చేసిన; జన వినింద్య చరితున్= జనులచేత విశేషంగా నిందింపదగిన నడవడిగల వాడిని; దృష్టద్యుమ్నున్= దృష్టద్యుమ్నుడిని; నీ తనూజుఁడు= నీ కుమారుడైన అశ్వత్థామ; చంపెన్+అనుము= చంపాడని చెప్పుము.

తాత్పర్యం: నీవు పుణ్యలోకానికి పోయినప్పుడు ద్రోణుడిని చూచి మొదట 'ఓ పాపరహితుడా! నీకు ద్రోహం చేసిన దుశ్చరితుడిని-దృష్టద్యుమ్నుడిని నీ కొడుకు చంపా'డని చెప్పుము.

వ. అని నా మాఱుగా నమస్కరించి కౌఁగిలించుకొనుము. మఱియు వలయు సల్లాపంబులు సేయుము. బాహ్లిక సోమదత్తభూరిశ్రవస్సైంధవప్రముఖ భవదీయ బాంధవజనంబులతో నా చేసిన కుశలప్రశ్నంబుగా సంభావింపు మది యట్లుండె రేయింటి తెఱం గెఱింగించెద. 228

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని; నా మాఱుగాన్= నాకు బదులుగా; నమస్కరించి; కౌఁగిలించుకొనుము; మఱియున్; వలయు సల్లాపంబులు= చేయవలసిన సంభాషణలు; చేయుము; బాహ్లిక సోమదత్త - భూరిశ్రవస్+సైంధవ-ప్రముఖ-భవదీయ- బాంధవ-జనంబులతోన్= బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవసుడూ, సైంధవుడూ మొదలైన నీ చుట్టాలను; నా చేసిన కుశల ప్రశ్నంబుగా= నేను క్షేమం అడిగినట్టుగా; సంభావింపుము= మన్నించుము; అది+అట్లు+ఉండెన్= అది అలా ఉండనీ; రేయింటి-తెఱంగు= రాత్రి జరిగిన విధం; ఎఱింగించెదన్= చెపుతాను.

తాత్పర్యం: అని నాకు బదులుగా నమస్కరించి కౌగిలించుకొమ్ము. ఇంకా చేయవలసిన సంభాషణలు చేయుము. బాహ్లికుడూ, సోమదత్తుడూ, భూరిశ్రవుడూ, సైంధవుడూ మొదలైన నీ చుట్టాలను నేను క్షేమం అడిగినట్లు చెప్పి మన్నించుము. అది అట్లా ఉండనిమ్ము. రాత్రి జరిగిన విధం చెప్పుతాను. వినుము.

విశేషం: బాహ్లికుడు - ప్రతీపుడి కొడుకు. శంతనుడి సోదరుడు. సోమదత్తుడి తండ్రి. సోమదత్తుడు- బాహ్లికుడి కొడుకు. భూరిశ్రవుడు - సోమదత్తుడు కొడుకు. సైంధవుడు - దుర్యోధనుడి బావ. దుస్సల భర్త. వీళ్ళందరూ దుర్యోధనుడి పక్షాన పాండవులతో యుద్ధం చేసిన వీరులు.

సీ. అమృతంబు నింపు కర్ణములకు నొసఁగెడు । మాట లాకర్ణింపు మనుజనాథ!
శాత్రవ శిబిరంబు సౌప్తికవేళఁ బ్ర । వేశించి నీచుఁ గిల్బిషమయాత్ముఁ
దొలుత ధృష్టద్యుమ్నుఁ ద్రుంచితిఁ బశుమర । ణంబుగాఁ దదనంతరంబ కవిసి
వాని బంధులనెల్ల వరుస గీటడఁగించి । ద్రౌపదీసుతుల నందఱను బొదివి

తే. మిడుక మిడుకంగఁ జంపి యప్పుడమి యెల్లఁ । దునియ పెంటగఁ గరివాజిమనుజతతుల
నెల్ల నఱికితిఁ బాండవు లేవురును ము । రారియును సాత్యకియును నా బారిఁ బడరు'. 229

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా! దుర్యోధనా!; కర్ణములకున్= చెవులకు; అమృతంబు నింపు= అమృత సమృద్ధి; ఒసఁగెడు= ఇచ్చేటి; మాటలు; ఆకర్ణింపు(ము)= విను; సౌప్తికవేళన్= నిద్రించే సమయంలో; శాత్రవ శిబిరంబున్= శత్రువుల శిబిరాన్ని; ప్రవేశించి= చొచ్చి; నీచున్ కిల్బిషమయ+ఆత్మున్ - ధృష్టద్యుమ్నున్= తుచ్ఛుడూ, పాపాత్ముడూ అయిన ధృష్టద్యుమ్నుడిని; తొలుతన్= మొదట; పశుమరణంబు+కాన్= పశువును చంపేటట్లు; త్రుంచితిన్= వధించాను; తద్+ అనంతరంబు+అ= ఆ వెంటనే; కవిసి= పైబడి; వాని బంధులన్+ఎల్లన్= వాడి చుట్టాల నందరినీ; వరుసన్= వరుసగా; గీటడఁగించి= చంపి; ద్రౌపదీసుతులన్+అందఱను= ద్రౌపది కొడుకుల నందరినీ; పొదివి= మార్కొని; మిడుక మిడుకంగన్= త్రుళ్ళిపడుతూండగా; చంపి; ఆ+పుడమి+ఎల్లన్= ఆ యుద్ధభూమి అంతా; తునియ పెంటగన్= పెంట తుక్కుతో నిండినదిగా; కరి వాజి మనుజ తతులన్+ఎల్లన్= ఏనుగుల, గుర్రాల, మనుష్యుల సమూహాలన్నిటినీ; నఱికితిన్= నరికాను; పాండవులు+ఏవురును= పాండవులయిదుగురూ; మురారియును= కృష్ణుడూ; సాత్యకియునూ= సాత్యకీ; నా బారిన్+పడరు= నా హింసకు లోనుకారు.

తాత్పర్యం: రాజా! దుర్యోధనా! నీ చెవులకు అమృతసమృద్ధిని సమకూర్చే మాటలు చెపుతాను వినుము. నిద్రించే సమయంలో నేను శత్రువుల శిబిరం ప్రవేశించి, తుచ్ఛుడూ, పాపాత్ముడూ అయిన ధృష్టద్యుమ్నుడిని మొదట పశువును వధించేటట్టు వధించాను. ఆ వెంటనే, పైబడి వాడి చుట్టాల నందరినీ వరుసగా చంపి, ద్రౌపది కుమారుల నందరినీ మార్కొని, త్రుళ్ళిపడుతూండగా చంపి, ఆ యుద్ధభూమి అంతా పెంట తుక్కుతో నిండేటట్లు ఏనుగుల, గుర్రాల, మనుష్యుల సమూహాలనన్నిటినీ నరికాను. పాండవులయిదుగురూ, కృష్ణుడూ, సాత్యకీ నా హింసకు లోను కాలేదు'.

వ. అని చెప్పి **230**

తాత్పర్యం: అని పలికి.

ఉ. 'ఏ మటు పోక శౌరి మది నేర్పడ మున్ గని డాఁగురించెనో
యేమిటి కెందుఁ బోయిరొ నరేంద్ర! యెఱుంగము ధర్మదూష్య సం
గ్రామ విధంబులం జయము గల్గియు వారికి దక్కదయ్యె వా
రేమయి రేమి మా కెలస మెక్కె నెఱుంగుము మమ్ము ముప్వురన్. **231**

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= రాజా! దుర్యోధనా!; ఏము+అటు+పోక= మేము అటు వెళ్ళటం; శౌరి= కృష్ణుడు; మదిన్= మనస్సులో; ఏర్పడన్= స్పష్టంగా; మున్= ముందుగా; కని= కనిపెట్టి; డాఁగురించెనో= దాచాడో; ఏమిటికిన్= ఎందుకోసం; ఎందున్+పోయిరొ= ఎక్కడికి వెళ్ళారో; ఎఱుంగము= మేమెరుగం; ధర్మ దూష్య సంగ్రామ విధంబులన్= ధర్మబాహ్యాలైన యుద్ధ విధానం వలన; జయము+కల్గియున్= జయం లభించినప్పటికీ; వారికిన్; దక్కదు+అయ్యెన్= లభించనట్టే అయింది; వారు+ఏమి+అయిరి+ఏమి= వాళ్ళు ఏమయితే నేమి?; మా కెలసము+ఎక్కెన్= మాకు కావలసినపని నెరవేరింది; మమ్మున్+ ముప్వురన్= మా ముగ్గురినీ; ఎఱుంగుము= తెలిసికొమ్ము.

తాత్పర్యం: 'రాజా! దుర్యోధనా! మేము అట్లా వెళ్ళటం కృష్ణుడు ముందుగానే బాగా ఊహించి దాచిపెట్టాడో! వాళ్ళు ఎందుకోసం ఎక్కడికి వెళ్ళారో మాకు తెలియదు. ధర్మబాహ్యమైన యుద్ధవిధానాల వలన వాళ్ళకు జయం లభించినా లభించనట్లే. వాళ్ళు ఏమయితేనేమి? మా అభీష్టం నెరవేరింది. మా ముగ్గురినీ తెలిసికొమ్ము.'

వ. అని కలిపికొని పలికి కృపకృతవర్మల వలనుం జూచి. **232**

ప్రతిపదార్థం: అని; కలిపికొని= వాళ్ళను కూడా కలుపుకొని; పలికి; కృపకృతవర్మల వలనున్+చూచి= కృపకృతవర్మలవైపు చూచి.

తాత్పర్యం: అని వాళ్ళను కూడా కలుపుకొని పలికి, కృపకృతవర్మలవైపు చూచి.

క. 'వీరి పెనుఁబ్రాపు వడసినఁ । గౌరవకులనాథ! యేన కా దరయంగాఁ
జీరికిఁ బోవని వారును । వైరుల సమయంగఁ జేయ వలఁతుల కారే?' **233**

ప్రతిపదార్థం: కౌరవ కులనాథ!= కురువంశపతీ! దుర్యోధనా!; వీరి పెనుఁబ్రాపు+పడసినన్= ఈ కృపకృతవర్మల పెద్ద తోడ్పాటు పొందితే; ఏను+అ+కాదు= నేనేకాదు; అరయంగాన్= చూడగా; చీరికిన్+పోవని వారును= ఎందుకూ పనికిరానివాళ్ళు కూడా; వైరులన్= శత్రువులను; సమయంగన్+చేయన్= చంపటానికి; వలఁతులు+అ+కారే= సమర్థులే కారా?

తాత్పర్యం: 'దుర్యోధనా! ఈ కృపకృతవర్మల గొప్ప తోడ్పాటు లభిస్తే నేనే కాదు, చూడగా ఎందుకూ పనికిరాని వాళ్ళు కూడా శత్రువులను చంపటానికి సమర్థులు కారా?'

వ. అనిన నమ్మాటలు మనఃప్రియంబులై నాలుకకు లావిచ్చిన నా భూవరుం డమ్మహీసురవరున కిట్లనియె. **234**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+మాటలు= ఆ పలుకులు; మనస్(ః)+ప్రియంబులు+ఐ= మనస్సుకు సంతోషం కలిగించేవయి; నాలుకకున్; లావు+ఇచ్చినన్= శక్తినివ్వగా; ఆ-భూ-వరుండు= ఆ రాజు-దుర్యోధనుడు; ఆ+మహీసురవరునకున్= ఆబ్రాహ్మణశ్రేష్ఠుడికి- అశ్వత్థామకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా, ఆ మాటలు మనస్సుకు ఆనందం కలిగించి నాలుకకు శక్తి నివ్వగా దుర్యోధనుడు అశ్వత్థామతో ఇట్లా అన్నాడు;

క. 'నీవును నీ యోధవరులు । నావైరులఁ బఱిచినంత యాచార్యుండున్,
దేవవ్రతుండుఁ బఱిచిరె? । భావింపఁగ దుష్కరంపుఁ బని యిది యనఘా! 235

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! అశ్వత్థామా!; నీవును; ఈ యోధవరులున్= ఈ వీరశ్రేష్ఠులూ - కృపాచార్య కృతవర్మలూ; ఆ వైరులన్= ఆ శత్రువులను; పఱచిన+అంత= బాధించినంతగా; ఆచార్యుండున్= గురుడూ-ద్రోణుడూ; దేవవ్రతుండున్= భీష్ముడూ; పఱిచిరె?= బాధించారా?; భావింపఁగన్= తలచగా; ఇది; దుష్కరంపుఁబని= కష్టసాధ్యమైన పని.

తాత్పర్యం: 'పాపరహితుడైన అశ్వత్థామా! నీవు, ఈ వీరశ్రేష్ఠులైన కృపకృతవర్మలూ ఆ శత్రువులను బాధించినంతగా, ద్రోణాచార్యుడూ భీష్ముడూ బాధించారా? ఆలోచించగా ఇది చాలా కష్టసాధ్యమైన పని.

ఆ. కర్ణు మనము పెద్దగాఁ గొనియాడుదు; । మతనికంటె శల్యుఁ డధికుఁడందు;
రతఁడు నతఁడు నిట్టి యాక్రమంబున నాకుఁ । బ్రియము సేయఁ జూచిరే మహాత్మ!' 236

ప్రతిపదార్థం: మహాత్మ!= మహానుభావా! అశ్వత్థామా!; మనము; కర్ణున్= కర్ణుడిని; పెద్దగాన్= అధికంగా; కొనియాడుదుము= పొగడుతాము; శల్యుఁడు; అతనికంటెన్= కర్ణుడికన్నా; అధికుఁడు+అందురు= గట్టివాడంటారు; అతఁడున్+అతఁడున్= ఆ కర్ణుడూ; ఆ శల్యుడూ; ఇట్టి ఆక్రమంబునన్= ఇటువంటి ఆక్రమణంలో; నాకున్; ప్రియము+చేయన్+చూచిరే= ప్రీతి కలిగించనెంచారా?

తాత్పర్యం: మహాత్మా! అశ్వత్థామా! మనం కర్ణుడిని చాలా గొప్పవాడని ప్రశంసిస్తాము. శల్యుడు అతడికన్నా గట్టివాడని అంటాము. కాని, అతడూ అతడూ ఇటువంటి ఆక్రమణంలో నాకు ప్రీతిని కలిగించనెంచారా?'

వ. అని యమ్ముువ్వుర మొగంబులు గలయం గనుంగొని 'మీరు కృతకృత్యులరు. సుఖులరై యుండుఁడు, పునర్దర్శనంబు త్రిదివంబున నయ్యెడుఁగాక. వగలు మాని పొం' డని పల్కి ప్రాణంబులు విడిచిన, వారలవ్వసుమతీ పతిఁ గౌఁగిలించుకొని వలగొని వచ్చి మరలి మరలి చూచుచు నరదంబు లెక్కియరిగి; రంత నుదయగిరి శిఖరంబునకు ఖరకరుండు వచ్చె, నేను నిత్తెఱంగు నీకెఱింగింపవచ్చితి; నాహవప్రకారం బంతయు నీకు వినిపించుటకు నాఁడు మునీశ్వరుండు నన్నుఁబనిచి యొసంగిన దివ్యదర్శనత్వంబు నీ కొడుకు తోడిదయయ్యె' నని యిట్లు సంజయుండు ధృతరాష్ట్రునకు నశ్వత్థామాది రథికత్రయ వ్యాపార కథనపూర్వకంబుగా దుర్యోధను లోకాంతరగమనంబు సెప్పె; ననిన విని 'యటమీఁదఁ బాండునందను లెవ్విధంబునం బ్రవర్తించి?' రని యడుగుటయు. 237

ప్రతిపదార్థం: అని; ఆ+ముువ్వురమొగంబులు= ఆ ముగ్గురి ముఖాలూ; కలయన్+కనుంగొని= బాగుగా చూచి; మీరు; కృతకృత్యులరు= పని నెరవేర్చినవారు; సుఖులరు+ఐ ఉండుఁడు= సుఖంగా ఉండండి; పునర్+దర్శనంబు= మళ్ళీచూడడం; త్రిదివంబునన్+అయ్యెడున్+కాక= స్వర్గంలో అగుగాక!; వగలుమాని= దుఃఖం విడిచి; పొండు; అని; పలికి; ప్రాణంబులు విడిచినన్; వారలు, ఆ+వసుమతీ పతిన్= ఆ రాజును; కౌఁగిలించుకొని; వలగొని వచ్చి= ప్రదక్షిణంచేసి; మరలి మరలి చూచు

చున్= తిరిగి తిరిగి చూస్తూ; అరదంబులు+ఎక్కి= రథాలెక్కి; అరిగిరి= వెళ్ళారు; అంతన్= తరువాత; ఖరకరుండు= సూర్యుడు; ఉదయగిరి శిఖరంబునకున్= తూర్పుకొండ శిఖరానికి; వచ్చెన్; ఏనున్= నేనూ; ఈ+తెఱంగు= ఈ విధం; నీకున్; ఎఱింగింపన్+వచ్చితిన్= చెప్పటానికి వచ్చాను; ఆహవ ప్రకారంబు+అంతయున్= యుద్ధ విధానం అంతా; నీకున్; వినిపించుటకున్; నాఁడు= అప్పుడు; ముని+ఈశ్వరుండు= మునిశ్రేష్ఠుడైన వ్యాసుడు; నన్నున్; పనిచి= ఆజ్ఞాపించి; ఒసంగిన= ఇచ్చిన; దివ్యదర్శనత్వంబు= దివ్యదర్శనం; నీ కొడుకుతోడిది+అ= నీ కుమారుడితోపాటిదే అయింది; అని; ఇట్లు= ఈ విధంగా; సంజయుండు= సంజయుడు; ధృతరాష్ట్రునకున్; అశ్వత్థామ+ఆది రథిక త్రయ వ్యాపార కథన పూర్వకంబుగాన్= అశ్వత్థామ మొదలగు ముగ్గురు వీరుల పని తీరు చెప్పటం మొదలుకొని; దుర్యోధను= దుర్యోధనుడియొక్క; లోక+అంతర గమనంబు= అన్యలోకానికి పోవటం; చెప్పెన్; అనినన్; విని; అటమీఁదన్= ఆ తరువాత; పాండు నందనులు= పాండవులు; ఏ+విధంబునన్= ఎట్లా; ప్రవర్తించిరి+అని+అడుగుటయున్= ప్రవర్తించారని అడుగగా.

తాత్పర్యం: అని ఆ ముగ్గురి ముఖాలు బాగా చూచి, 'మీరు కృతార్థులు. సుఖంగా ఉండండి. మళ్ళీ స్వర్గంలో కలిసికొందాం. దుఃఖించక పొండి' అని పలికి ప్రాణాలు విడిచాడు. వాళ్ళు ఆ రాజును కౌగిలించుకొని, అతడికి ప్రదక్షిణం చేసి, మళ్ళీ మళ్ళీ చూస్తూ రథా లెక్కి వెళ్ళారు. అంత సూర్యోదయం అయింది. నేనూ ఈ వృత్తాంతం నీకు చెప్పాలని వచ్చాను. యుద్ధక్రమం అంతా నీకు వినిపించటానికి అప్పుడు వ్యాసమునీంద్రుడు నన్నాదేశించి ఇచ్చిన దివ్యదర్శనం నీ కుమారుడితోపాటిదే అయింది' అని ఇట్లా సంజయుడు ధృతరాష్ట్రుడికి అశ్వత్థామాది రథికులు ముగ్గురూ చేసిన పని చెప్పటం మొదలుకొని దుర్యోధనుడు లోకాంతరం వెళ్ళటం దాకా చెప్పాడు. అని చెప్పగా విని తరువాత పాండవులు ఎట్లా ప్రవర్తించారని వైశంపాయనుడిని జనమేజయుడు అడుగగా (ద్వితీయాశ్వాసంలోని వచనంతో అన్వయం).

విశేషం: ధృతరాష్ట్రుడు భారతయుద్ధ విశేషాలు తెలిసికొనగోరితే, వ్యాసుడు సంజయుడికి ఒక దివ్యశక్తిని అనుగ్రహించాడు. ఆ శక్తివలన సంజయుడు యుద్ధభూమిలో బాణాలు తగలక, ఎవ్వరిచేతా చూడబడక, తను ప్రతివారి సంభాషణా వినగలిగాడు. అతడు అట్లా తెలిసికొంటూ ధృతరాష్ట్రుడికి ఎప్పటికప్పుడు యుద్ధ విశేషాలు చెప్పుతూ వచ్చాడు. ఆ శక్తి దుర్యోధనమరణంతో నశించింది.

ఆశ్వాసాంతము

మహాస్రగ్ధర.

పరమజ్ఞేయ స్వభావా! భవభయ హరణ ప్రౌఢనామానుభావా!
కరఖేలచ్చక్రశూలా! కలుషహృదయ సాంగత్య వైముఖ్యశీలా!
కరుణాయత్తాంతరంగా! కమలభవ మనఃకంజసంవాస భృంగా!
దురిత ధ్వాంత ప్రదీపా తుల నిరసన సంస్తుత్య నిర్భాసరూపా! 238

ప్రతిపదార్థం: పరమజ్ఞేయ స్వభావా!= మిక్కిలి తెలిసికొనదగిన స్వభావం కలవాడా!; భవ= సంసారమువలని; భయ= భీతి యొక్క; హరణ= పోగొట్టడంలో; ప్రౌఢ= నేర్పుగల; నామ= పేరుయొక్క; అనుభావా!= ప్రభావం కలవాడా!; కర= చేతిలో; ఖేలత్= ఆడుతున్న; చక్ర= సుదర్శన చక్రమూ; శూలా= త్రిశూలమూ కలవాడా!; కలుష= దుష్టమైన; హృదయ= హృదయం కలవారితోడి; సాంగత్య= కూటమికి; వైముఖ్య= విముఖత్వం కల; శీలా!= స్వభావం కలవాడా!; కరుణా+ఆయత్త+అంతరంగా!= దయకు అధీనమైన మనస్సుకలవాడా!; కమలభవ= బ్రహ్మయొక్క; మనస్(ః)+కంజ= మనస్సు అనే పద్మంలో; సంవాస=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నివాసంకల; భృంగా!= తుమ్మెద అయినవాడా!; దురిత= పాపం అనే; ధ్వాంత= చీకటికి; ప్రదీప= గొప్పదనం యొక్క; అతుల= సాటిలేని; నిరసన= తిరస్కారంచేత; సంస్తుత్య= మిక్కిలి పొగడదగిన; నిర్భాస రూపా!= అతిశయమైన కాంతితోడి ఆకారం కలవాడా!; (ఇవన్నీ హరిహరనాథుడికి విశేషణాలు).

తాత్పర్యం: మిక్కిలి తెలిసికొనదగిన స్వభావం కలవాడా! సంసారభీతిని పోగొట్టటంలో నిపుణమైన నామ ప్రభావం కలవాడా! చేతిలో క్రీడిస్తున్న చక్ర శూలాలు గలవాడా! దుష్టుల తోడి సాంగత్యానికి విముఖమైన శీలం కలవాడా! దయాధీనమైన మనస్సు కలవాడా! బ్రహ్మ మనఃపద్మంలో నివసించే తుమ్మెద అయినవాడా! పాపాంధకార ప్రదీపాన్ని సాటిలేని విధంగా తిరస్కరించే పొగడబడిన కాంత్యతిశయం కల రూపం కలవాడా! హరిహరనాథా!

విశేషం: పరమ.....స్వభావా= హరిహరనాథుడికి స్వభావం కంటె తెలిసికొనదగినది ఇంకొకటి లేదు. భవ......భావా= అతడి నామ మహిమ సంసారభయాన్ని పోగొట్టడంలో గొప్పది. కర....శూలా= ఆ దేవుడు హరిహరనాథుడు కాబట్టి హరిచేతిలో చక్రమూ, హరుడిచేతిలో త్రిశూలమూ ఉన్నాయి. కలుష......శీలా= అతడి శీలం దుర్జనసాంగత్యానికి విముఖమైనది. కరుణా.... రంగా= అతడి అంతరంగం దయాధీనమైనది. కమలభవ.....భృంగా= అతడు బ్రహ్మ మనఃపద్మంలో ఉండే తుమ్మెద. దురిత.....రూపా= అతడి రూపం పాపాంధకారాన్ని పారద్రోలే ప్రదీపాన్ని సాటిలేని విధంగా తిరస్కరించే సంస్తుత్యమైన కాంత్యతిశయం కలది. 'కమల భవ మనఃకంజ సంవాసభృంగా' - అలంకారం రూపకం, 'దురితధ్వాంత.......' అలంకారం రూపకం.

క. పరిణామగమ్య! నిగమా । పర నిష్ఠా సంపదచల భావన రమ్యా!
నిరుపమ సౌందర్య! తప । శ్చరణ నిరత హృదయ కమల సముదిత సూర్యా! 239

ప్రతిపదార్థం: పరిణామ గమ్య= విశ్వరూప పరిణతిచేతనే తెలియదగినవాడా!; నిగమ= వేదములయందలి; అపర= ఉత్తరభాగము అనగా ఉపనిషద్భాగమునందలి; నిష్ఠా= యోగనిష్ఠ అనే; సంపద్= సంపదచేత; అచలభావన= నిశ్చలధ్యానంచేత; రమ్యా!= అందమైనవాడా!; నిరుపమ సౌందర్య!= సాటిలేని శోభకలవాడా!; తపస్+చరణ= తపస్సు నాచరించటంలో; నిరత= మిక్కిలి ఆసక్తమైన; హృదయ కమల= హృదయమనే పద్మానికి; సముదిత= స్ఫుటంగా ఉదయించిన; సూర్యా!= సూర్యుడైనవాడా!;

తాత్పర్యం: విశ్వరూప పరిణతిచేతనే తెలియదగినవాడా! వేదముల ఉత్తరభాగములైన ఉపనిషద్భాగములందలి యోగనిష్ఠ అనే సంపద తోడి నిశ్చలధ్యానంచేత రమ్యమైనవాడా! నిరుపమాన సౌందర్యం గలవాడా! తపస్సు నాచరించటంలో ఆసక్తమైన హృదయకమలానికి లెస్సగా ఉదయించిన సూర్యుడైనవాడా! హరిహరనాథా!

విశేషం: 'తపశ్చరణ సూర్యా!' తపస్సునాచరించేవారి హృదయపద్మాలను వికసింపజేసేవాడా- అలంకారం రూపకం.

మాలిని.

చరణ యుగళకాంతి స్ఫారలీలా! నిరూఢా
దర సుఖమయయుక్తా! ధర్మ శీలానురక్తా!
సుర సముదయ రక్షా! సువ్రతా సంగ హేలా
కర మహిమ కటాక్షా! గాఢ సర్వానుపేక్షా! 240

ప్రతిపదార్థం: చరణ యుగళ= పాదద్వంద్వం యొక్క; కాంతి= శోభచే; స్ఫార= విపులమగు; లీలా!= విలాసం కలవాడా!; (సర్వవ్యాపకుడైన పరమేశ్వరుడి పాదద్వంద్వచ్ఛాయ విశ్వమంతటా వ్యాపించి వెలుగుతోంది అని భావం); నిరూఢ= స్థిరమూ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనగా శాశ్వతమూ; అదర= భయరహితమూ; అయిన; సుఖమయ= ఆనందరూపములతో; యుక్తా!= కూడినవాడా!; (నిరూఢ+ఆదర అని విభజిస్తే; గొప్ప ఆదరం వలన కలిగే సుఖం అని చెప్పవచ్చు); ధర్మశీల= ధర్మస్వభావం కలవాళ్ళపై, పుణ్యపురుషులపై; అనురక్తా!= అనురాగం కలవాడా!; సుర= దేవతలయొక్క; సముదయ= సమూహంయొక్క; రక్షా!= రక్షణకలవాడా! -దేవతలను రక్షించేవాడా!; సువ్రత= ఉత్తమ సంకల్పంలో; ఆసంగ= ఆసక్తిగల సాధుపురుషులకు; హేలాకర= ఆనందం కలిగించే; మహిమ కటాక్షా!= గొప్పశక్తికల క్రీగంటి చూపుకలవాడా! (పరమేశ్వరుడి కటాక్షప్రసారం సువ్రతాసక్తులగు సాధుపురుషుల కానందం కలగజేస్తుందని భావం); గాఢ సర్వ+అనుపేక్షా!= సమస్త జగద్వ్యాపారమునందూ అతిశయమైన అనుపేక్షాభావం(శ్రద్ధ) కలవాడా!

తాత్పర్యం: పాదద్వంద్వకాంతిచేత విశ్వాన్నంతనూ ప్రకాశింపజేసేవాడా! శాశ్వతమూ, భయరహితమూ అయిన గొప్ప ఆదరంతో కూడిన ఆనంద రూపాలతో కూడినవాడా! ధర్మస్వభావం కలవారియెడ అనురాగం కలవాడా! దేవతా సమూహాన్ని రక్షించేవాడా! ఉత్తమవ్రతాలలో ఆసక్తిగల సాధుపురుషులకు ఆనందం కలిగించే క్రీగంటి చూపు కలవాడా! సమస్త జగద్వ్యాపారములందునూ అతిశయమైన శ్రద్ధకలవాడా! హరిహరనాథా!

విశేషం: మాలినికి నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలోనూ న,న,మ,య,య అనే గణాలుంటాయి. 1-9 అక్షరాలకు యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున సౌప్తిక పర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది; శ్రీమత్+ఉభయకవిమిత్ర= శ్రీమంతుడైన ఉభయకవిమిత్ర బిరుదం కలవాడూ; కొమ్మన+అమాత్య పుత్ర= కొమ్మనమంత్రి కుమారుడూ; బుధ+ఆరాధన విరాజి= పండితుల-దేవతల-పూజచే ప్రకాశించేవాడూ (అయిన); తిక్కన సోమయాజి= తిక్కన అనేపేరుగల సోమయాజిచేత; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీమహాభారతంబునన్= శ్రీమహాభారతంలో; సౌప్తిక పర్వంబునందున్= సౌప్తికమనే పేరుగల పర్వంలో; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసము.

తాత్పర్యం: ఇది శ్రీమంతుడైన ఉభయకవిమిత్ర బిరుదం కలవాడూ, కొమ్మనమంత్రి కుమారుడూ, పండితుల పూజలచేత ప్రకాశించేవాడూ, (దేవతలను, పండితులను పూజించటం వలన రాణించేవాడూ), అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శ్రీ మహాభారతంలోని సౌప్తికపర్వంలో మొదటి ఆశ్వాసం.

సౌప్తికపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 12

శాంతిపర్వము

(మొదటిభాగం 1,2,3 ఆశ్వాసములు)

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డా|| జి.వి. సుబ్రహ్మణ్యం

డా|| యస్. గంగప్ప

డా|| దావులూరి కృష్ణకుమారి

ప్రధాన సంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Shanti parvamu of Tikkana Somayaji
Vol. XII.
Part-1 (1,2,3 Cantos)

Commentary by
Dr. G.V.Subrahmanyam - 1st Canto
Dr. S. Gangappa - 2nd Canto
Dr. Davuluri Krishna kumari - 3rd Canto

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Publications Series No.611
First Edition : 2005
First Re-print : 2006

Second Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by

Sri. M.G. Gopal, I.A.S.

Executive Officer,

T.T.Devasthanams,

Tirupati - 517 507

D.T.P. Type Setting

Editor-In-Chief Office

T.T.D., Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వైయస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా అధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నందూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారి సేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,

దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

కవిత్రయ ఆంధ్రమహాభారతంలో శాంతిపర్వం ఒక ప్రముఖ పర్వం. మహాభారత యుద్ధం సమాప్తి అయిన తర్వాత పాండవులు తమకు మిగిలిన దానిని, తాము గెలిచిన దానిని బేరీజువేసుకొనే ఘట్టం. దుర్యోధనుడు తన దుర్గుణసహితంగా, అంతమొందిన తరువాత గెలిచింది ధర్మమే అయినా అంత గొప్పగా, ఆకర్షణీయంగా కనపడకపోయింది. అందువల్లనే ధర్మజునికి వైరాగ్యం ముంచుకొచ్చింది. దాన్ని తొలగించి రాజ్యపరిపాలనా రంగంలో ఆయన ఆసక్తి కనపరిచేటట్టు సహోదరులు నచ్చజెప్పడమేగాక, కృష్ణుడు, వ్యాసుడు మార్గదర్శనం చేయడం అనేవి ఒక ఎత్తు అయితే ఆ తరువాత భీష్ముడు దీర్ఘంగా ఉపదేశించే రాజధర్మం, ఆపద్ధర్మం, మోక్షధర్మాలు, ధర్మజునికి శేషజీవిత మార్గదర్శక సూత్రాలు మరోఎత్తు అయినాయి. అవే పాఠకులకు ధర్మప్రబోధాలయినాయి. భీష్ముడిలాంటి భక్తుడు, నీతిశాస్త్రకోవిదుడు, తత్త్వం తెలిసినవాడు, కురువృద్ధుడై సమాజాన్ని చూసినవాడు, ఇక్కడ ధర్మసూక్ష్మాలను చెప్పడం అవశ్య మాచరణీయంగా కనబడుతుంది.

శాంతిపర్వంలో ధర్మ వివరణం, ధర్మనిరూపణలకు, ఆలంబనంగా వేరువేరు ఉపకథలు వస్తాయి. వీటినన్నింటిని సంగ్రహంగాను, స్వారస్యంగాను తొలిసారిగా తెలుగులో తెలియపరచిన మహాకవి తిక్కన.

ఆరు ఆశ్వాసాల శాంతిపర్వానికి ఆరుగురు విద్వాంసులు వ్యాఖ్యానాన్ని సమకూర్చారు. డా॥ యస్. గంగప్ప, డా॥ దావులూరి కృష్ణకుమారి, డా॥ ఆకురాతి పున్నారావు, డా॥ బేతవోలు రామబ్రహ్మం. ఈ నలుగురు మహాభారత ఘట్టాలను విద్యార్థులకు బోధించి పేరుపొందినవారు. మహాభారతానికి ప్రధాన సంపాదకులు డా॥ జి.వి.సుబ్రహ్మణ్యంగారు, ఎడిటోరియల్ సెల్ సభ్యులు శ్రీ సముద్రాల లక్ష్మణయ్యగారు. వీరిరువురు కూడ శాంతిపర్వానికి వ్యాఖ్యానాన్ని రచించారు. అందువల్ల శాంతిపర్వానికి న్యాయము, వ్యాఖ్యానానికి గుణాధిక్యము కలిగింది. వీరికి దేవస్థానం పక్షాన కృతజ్ఞతలు.

శాంతిపర్వాన్ని రెండు సంపుటాలుగా ప్రచురిస్తున్నాము. మొదటి మూడు ఆశ్వాసాల్ని ఒక సంపుటంగాను, తర్వాతి మూడు ఆశ్వాసాల్ని రెండవ సంపుటంగాను ముద్రించి పాఠకమహాశయుల ముందు ఉంచుతున్నాం. ఇది శాంతిపర్వంలో మొదటి సంపుటం.

ఇక మిగిలిన పర్వషట్కం కూడ త్వరలో వెలువరించేందుకు కృషి జరుగుతున్నది. ఎప్పటిలాగా ఈ పుస్తకాలను శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రసాదంగా ప్రీతితో చదువరులు స్వీకరిస్తారని భావిస్తున్నాము.

కార్యనిర్వహణాధికారి
తి.తి. దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమస్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాది కార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు:

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు రాజరాజనరేంద్రుని కోరిక ననుసరించి ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 - 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) అనే పుస్తకాలను 'నన్నయ వ్యాస పీఠము' అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జూలై, 11వ తేదీన హైదరాబాదు బాలాజీభవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం:

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్యపర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధకములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అరసున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసియున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్ల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముగ్గురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల ''వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది. ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిగమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగా పర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది. ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జూలై 3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన:

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డిగారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి. ఓరియంటల్ కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి ''తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ నివేదిక సారాంశం:

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యవంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥ కె. సర్వోత్తమరావు	**శ్రీ డి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥ రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంత ప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం:

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిని అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు'

'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జూలై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీ డి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు:

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీ స్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలోని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం:

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్ల కొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పండ్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులుబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి. విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి".

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిని పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాస్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదకమండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంపాదకమండలి సభ్యులు

డా॥ నందూరి రామకృష్ణమాచార్యులు
శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
డా॥ కె.జె. కృష్ణమూర్తి
డా॥ కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే.
డా॥ బిరుదురాజు రామరాజు
అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్, తి.తి.దే.
డా॥ ఎం. కులశేఖరరావు
ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి, తి.తి.దే.
డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ఆఫీస్' లో పై రెండు మండలులలోని సభ్యులయొక్క సంయుక్తసమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటాలన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆయా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్త పాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ప్రథమ సంపుటం-ఆదిపర్వం (రెండుభాగాలు), ద్వితీయ సంపుటం-సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి. సుబ్బారావుగారి తరువాత కార్యనిర్వహణాధికారి అయిన డా॥ పి.కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారు వచ్చిన తత్క్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణను గురించి ఆసక్తితో గమనిస్తూ అన్ని విధాల సహకరించి ఆది, సభాపర్వాల విడుదలకు ఏర్పాటుచేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాల నిర్ణయంతో పని జరగాలని త్వరపరచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ ప్రణాళిక వ్యాఖ్యా సహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. అప్పట్లో తీవ్రతరం అయిన ప్రయత్నంతో గోదావరి పుష్కరాల సమయానికి ఆరణ్యపర్వం (2భాగాలు), విరాటపర్వం విడుదల అయ్యాయి. తర్వాత శ్రీ అజేయ కల్లంగారు కార్యనిర్వహణాధికారిగా విచ్చేసిన వెనువెంటనే ఈ మహాభారత వ్యాఖ్యాన సహిత ప్రచురణ ప్రణాళికను మరింత వేగిరపరచి కృష్ణాపుష్కరాల లోపల యుద్ధపంచకాన్ని విడుదల చేయాలనీ, 2004 సంవత్సరం చివరకు మిగిలిన పర్వాష్టకము వెలుగు చూడాలనీ నిర్ణయించడం జరిగింది. 2004 కృష్ణాపుష్కరాలసమయంలో ఉద్యోగ, భీష్మ, ద్రోణపర్వాలు వెలువడ్డాయి. కర్ణపర్వం ఒక సంపుటంగాను, తరువాతి పర్వాలైన శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు మూడింటిని కలిపి ఒకే సంపుటంగా ముద్రించుటకు సిద్ధం చేయడం జరిగింది. మిగిలిన పర్వాలన్నిటిని వీలైనంత తొందరగా విడుదల చేయడానికి సర్వయత్నాలు సాగుతున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారత' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తృమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. లోగడ తి.తి. దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వున్న శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహానికి కృతజ్ఞతాభివందనాలు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ.ఎ.పి.వి.ఎన్. శర్మ ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. తి.తి.దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి సాహిత్యప్రియులూ ఐన శ్రీ ఎన్. ముక్తేశ్వరరావు, ఐ.ఏ.ఎస్., గారు మరింత ప్రోత్సాహం ఇచ్చి ప్రాజెక్టు పనిని వేగవంతం చేస్తున్నారు. వారికి వందనములు.

సంబంధిత విభాగాధిపతిగా, సలహామండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన డా॥పి. రంగారావు, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి-వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయ సహకారాలందించిన తదితర అధికారిగణానికి నమస్సులు. ఈ ప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధానపాత్ర వహించిన-వ్యాఖ్యాతలు, పై ఉభయమండలుల (సంపాదకమండలి, సలహామండలి) విద్యావేత్తలకు, ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారికి - నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి.దేవస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడంలో వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్ కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానిక పండితవర్యుల ఉప సంఘం (ఎడిటోరియల్ సెల్) నిర్మాణానికి సిఫారసు చేస్తే దేవస్థానం ఆ మేరకు **పండితవరేణ్యులు డా॥ కె. సర్వోత్తమరావు, శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీ ముదివర్తి కొండమాచార్యులు** గారలతో ఎడిటోరియల్‌సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈ సెల్ ఉపకారం అద్వితీయమైనది, మరువరానిది. వర్క్‌షాపువలె నిర్వహింపబడుతున్న కవిత్రయ మహాభారత యజ్ఞంలో వీరు పాలుపంచుకుంటున్నారు. ఆ కారణంగానే తక్కిన పర్వాలను త్వరితంగా గుణాత్మకంగా వెలువరించగలుగుతున్నాం.

"సప్తగిరి" సంపాదకులుగా, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి అమరులయ్యేవరకూ ప్రముఖ పాత్ర వహించిన కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె. రాధారమణ, డాక్టర్ అల్లాడి సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి.ఎన్. శ్రీనివాసన్ గారలకు, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పాఠకులకు తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయాధికారి శ్రీ ఐ. పార్వతీశ్వరరావుగారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ ఎన్.ఎస్. రామమూర్తి

కన్వీనర్

సంపాదకుడు - సప్తగిరి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి

అధ్యక్షులు

శ్రీ ఎ.పి.వి.ఎన్.శర్మ ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకుడు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం

సంపాదకమండలి సభ్యులు

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆచార్య ఎం. బుద్ధన్న

డా॥ పి. రంగారావు, పౌరసంబంధాధికారి
(ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ మేడసాని మోహన్, డైరెక్టర్
అన్నమాచార్య ప్రాజెక్టు, (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద, కార్యదర్శి
ధర్మప్రచారపరిషత్తు (ఎక్స్ అఫిషియో సభ్యులు)

కన్వీనర్

డా॥ ఎన్.ఎస్.రామమూర్తి,

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా. 1,2
4. డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్న శాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	అను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	అను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	అను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది.	–	ఆదిపర్వం
సభా.	–	సభాపర్వం
ఆర.	–	ఆరణ్యపర్వం
విరా.	–	విరాటపర్వం
ఉద్యో.	–	ఉద్యోగపర్వం
భీష్మ.	–	భీష్మపర్వం
ద్రోణ.	–	ద్రోణపర్వం
కర్ణ.	–	కర్ణపర్వం
శల్య.	–	శల్యపర్వం
సౌప్తి.	–	సౌప్తికపర్వం
స్త్రీ.	–	స్త్రీ పర్వం
శాంతి.	–	శాంతిపర్వం
ఆను.	–	ఆనుశాసనికపర్వం
అశ్వ.	–	అశ్వమేధపర్వం
ఆశ్ర.	–	ఆశ్రమవాసపర్వం
మౌస.	–	మౌసలపర్వం
మహా.	–	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	–	స్వర్గారోహణపర్వం
సం.	–	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	–	సంస్కృత మహాభారతము
అను.	–	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	–	ప్రధాన సంపాదకుడు

క.	–	కందపద్యం
వ.	–	వచనం
ఆ.	–	ఆటవెలది
తే.	–	తేటగీతి
సీ.	–	సీసం
ఉ.	–	ఉత్పలమాల
చ.	–	చంపకమాల
మ.	–	మత్తేభ విక్రీడితం
శా.	–	శార్దూల విక్రీడితం
ఆశ్వా.	–	ఆశ్వాసం
క్రీ.శ.	–	క్రీస్తుశకం
య.	–	యగణం
మ.	–	మగణం
త.	–	తగణం
ర.	–	రగణం
జ.	–	జగణం
భ.	–	భగణం
న.	–	నగణం
స.	–	సగణం
ల.	–	లఘువు
గ.	–	గురువు
అలం.	–	అలంకారం
సం.	–	సంవత్సరం
మొ.	–	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శాంతిపర్వ కథాసారం

(మొదటి భాగం)

1. ధర్మజ విషాదం:

మహాభారత యుద్ధం ముగిసిన తరువాత పాండవులు గంగానదీతీరంలో విడిదిచేసి, యుద్ధంలో చనిపోయిన వారికి ధర్మోదకాలు విడిచి, అశౌచం తీరేంత వరకు ఒక నెలపాటు అక్కడ ఉన్నారు. యుద్ధంలో ధర్మవిజయాన్ని సాధించిన ధర్మరాజును అభినందించి ఆశీర్వదించటానికి నారదాది మహర్షులు శిష్యులతో సహా అక్కడికి వచ్చారు. మునులందరి పక్షాన నారదుడు పాండవుల యోగక్షేమాల నడిగి, అన్నదమ్ములందరు కలిసి యుద్ధం చేసినందుకూ, రణరంగంలో పంతాలూ మాత్సర్యాలు పెరిగినా ధర్మమార్గం తప్పనందుకూ, ఆ ధర్మనిష్ఠవలన ధర్మరాజాదులు పొందిన మానసికవేదనకూ మెచ్చుకొన్నారు. ధర్మరాజు వారికి వినయంగా సమాధానం చెప్పాడు. 'మా విజయానికి శ్రీకృష్ణదేవుడి కృపాదృష్టీ, బ్రాహ్మణుల అనుగ్రహం, భీమాదుల బాహుబలం ప్రధానకారణాలు. రాజ్యమంతా మాకు దక్కినా జ్ఞాతులనందరినీ చంపినందుకూ, అభిమన్యుడూ, పాంచాలీసుత పంచకం మాకు దక్కనందుకూ, కుంతీదేవి మొదటిబిడ్డ అయిన కర్ణుడిని చంపుకొని జలతర్పణాలు ఇవ్వవలసి వచ్చినందుకూ నా మనస్సు నిప్పులలో పొరలినట్లున్నది' అని వాపోయాడు. కర్ణవధకు విశేషించి విలపించాడు. కర్ణుడి జన్మవృత్తాంతాన్ని కుంతి మొదట్లో దాచినందుకూ, ఆపైన కర్ణుడు తనకు తెలిసినా బయటపెట్టనందుకూ, దానివలన పాండవులు అతడు కౌంతేయుడని తెలియలేనందుకూ అంతటి విపత్తు కలిగిందని విచారించాడు. కర్ణుడి మాటలూ చేష్టలూ కోపం కలిగించినా ఆతడి పట్ల ధర్మరాజుకు కోపం రాని జన్మాంతర సౌహృదాన్ని స్మరించి ధర్మజుడు విలపించాడు. పూర్వస్మృతులతో దుఃఖిస్తూ కర్ణుడితో కూడి ఉన్నట్లయితే పాండవులు దేవగణాలను కూడ జయించి ఉండేవారని పలవించాడు.

నారద మహర్షి కర్ణుడి వృత్తాంతం సంగ్రహంగా చెప్పి

చ. 'వినుము నరేంద్ర! విప్రుఁ డలివెన్, జమదగ్ని సుతుండు శాప మి
చ్చె, నమరభర్త వంచనము సేసె, వరం బని కోరి కుంతి మా
న్చె నలుక, భీష్ముఁ డర్ధరథుఁజేసి యడంచెఁ, గలంచె మద్రరా
జనుచిత మాడి, శౌరి విధియయ్యెఁ, నరుం డనిఁ జంపెఁ గర్ణునిన్' **(శాంతి. 1. 35)**

అని ముగించాడు. ఆ మాటలు విని ధర్మరాజు శోకవ్యాకులు డయ్యాడు. అప్పుడు కుంతి ధర్మరాజును సమీపించి 'ఆనాడు కర్ణుడికి అతడి జన్మరహస్యం చెప్పగా. సూర్యుడు కూడా అది నిజమని పలికాడు. అయినా, అతడు మా మాట వినక దుర్యోధనుడిని ఆశ్రయించి నీ పక్షం రావటానికి నిరాకరించాడు! అటువంటి కర్ణుడికొరకు నీ వెందుకు మనోవేదన పొందుతా'వని ఓదార్చింది. కుంతి వర్తనకు వెగడు చెందిన ధర్మరాజు 'ఆడవారి నోళ్ళలో రహస్యాలు దాగకుండా ఉండేటట్లు' శపించాడు. కర్ణుడితోపాటు చనిపోయిన బంధుమిత్రులు జ్ఞాపకం రాగా ధర్మజుడు శోకతీవ్రతతో తూలిపడబోయాడు.

2. ధర్మజ వైరాగ్యం:

బంధుక్షయం చేసిన తనకు రాజ్యస్వీకారం సమ్మతం కాదనీ, వనానికిపోయి, భిక్షతో జీవిస్తూ, బంధువధవలన కలిగిన పాపాన్ని పోగొట్టుకొనాలనే భావంతో అర్జునుడి మొగంచూచి ఇట్లా అన్నాడు. 'అర్జునా! మనకెందు కీ రాజ్యం? మరొక జనస్థానానికి వెళ్ళి బిచ్చమెత్తుకొని బ్రదుకుదాం. అది మనకు సుఖకరం. జ్ఞాతులను చంపటం ఆత్మవధతో సమానం. అహింస, సత్యం, ఓర్పు, అనసూయ వంటి గుణాలు వనవాసులకు ఉత్తమమైనవి. కుక్కలు మాంసఖండం కొరకు ఎగబడి కొట్టాడుకొన్నట్లు మన రాజులు

రాజ్యంకొరకు యుద్ధం చేసి వంశాన్నంతా నాశనం చేసికొని హేయంగా వ్యవహరించారు. దీనివలన కలిగిన దుఃఖం ముల్లోకాల నేలే ప్రభుత్వం స్వీకరించినా నాకు సంతోషాన్ని కలిగించదు. ధృతరాష్ట్రుడిచేత వారించబడని దుర్యోధనుడు కులనాశనకారకు డయ్యాడు. అతడిని చంపటం వలన కోపం మాత్రం చల్లారింది; కాని, శోకం దుర్భరంగా మారింది. అందువలన నేను రాజ్యత్యాగం చేసి పరిశుద్ధుడ నౌతాను. మీరు రాజ్యం స్వీకరించి వర్ణాశ్రమ ధర్మాలను రక్షించండి. నేను తపోవనానికి పోయి మునిజనగణంతో సుఖంగా ఉంటాను' అని అన్నాడు.

ధర్మజుడి మాటలకు అర్జునుడు విస్తుపోయాడు. 'ఘోరయుద్ధం చేసి రాజ్యాన్ని గడించింది బిచ్చమెత్తుకొనటానికా? నీ కటువంటి సంకల్పమే ఉంటే ఇంతమందిని ఎందుకు చంపావు? దీనచర్య క్షత్రియులకు తగదు. వనాలకుపోతే అందరూ నవ్వుతారు. సంపదలేనివాడు నడపీనుగువంటివాడుగా పరిగణించబడుతాడు. కాబట్టి ధనసంపాదన, బంధుమిత్రులను సంతోషపెట్టటం రాజుల కర్తవ్యం. సగోత్రీకులైన దానవులు చావటంవలననే కదా దేవతలు అభివృద్ధి చెందారు. క్షత్రియులు బల పరాక్రమాలతో రాజ్యాలను గెలుచుకొని, సంపదలు గడించి, పర్జన్యాదులను యజ్ఞాలతో సంతోషపెట్టి స్వర్గాదిలోకాలను పొందుతారని వేదాలు కూడా చెప్పాయి. దిలీపాది చక్రవర్తులు నడచిన బాట అదే. ఆ బాటలోనే నీవు కూడా నడువుము. పాపాలన్నీ పోయేటట్లు అశ్వమేధయాగం చేసి అవభృథ స్నానంతో పవిత్రుడవు కమ్ము' అన్నాడు.

ధర్మరాజు : (కొంతసేపు మౌనంగా ఉండి) నీరసమైన సంసారసుఖాలను వదలి అడవికి పోయి, మునుల బోధలు విని, ద్వంద్వాతీత ప్రవృత్తిని సాధించి, భిక్షపై జీవిస్తూ ఉంటాను. అట్లాకాక కర్మమార్గంలో కూరుకుంటే మోక్షసుఖానికి దూరమై పోతాను.

భీముడు : ధర్మజా! నీ కిప్పుడు కలిగిన దుఃఖాలచేత రాజధర్మాలమీద అసూయ కలిగింది కాని, ఈ అనాసక్తి మొదటినుండి ఉంటే రాజులందరూ ప్రాణాలతో బ్రతికి ఉండేవారు. అస్త్ర జీవులమైన మేమంతా గర్వోన్నతిని వదలి బిచ్చమెత్తుకొనే దీన పద్ధతిలో ప్రవేశించి ఉండేవాళ్ళం. అంత యుద్ధంచేసి ఈ విధంగా అడవికి పోతే అందరూ అవహేళన చేస్తారు. మా అసమర్థతను ఎగతాళిచేస్తారు. ప్రజలు దుఃఖిస్తారు. ధర్మరాజా! కర్మరాహిత్యమే మోక్షదాయకమైతే, కొండలు, చెట్లు ముక్తిని పొందగలిగి ఉండేవే. అడవిలో ఉండటమే మోక్షకారి కాదు. విధ్యుక్త కర్మలను ఆచరించాలి. బ్రహ్మార్పణభావంతో సాగించాలి. ఆత్మతత్త్వజ్ఞాన సాధనకు పూనుకొంటే కర్మరాహిత్యం తనంతటతాను కలుగుతుంది. కాబట్టి కర్మరాహిత్యం మోక్షకారకం కాదు.

అర్జునుడు : ఒక ఇతిహాసం వినుము. బ్రాహ్మణ బ్రహ్మచారులు ఇదివరలో కులాచారాలను వదలి అడవులకు వెళ్ళారు. ఇంద్రుడు జాలిపడి పక్షిరూపంలో వారికి గోచరించి, కర్మలు మానకూడదనీ, బ్రహ్మార్పణభావంతో చేసే సత్కర్మలు బ్రహ్మానందాన్ని కలిగిస్తాయనీ' బోధించాడు. వా రామాటలు విని ఇండ్లకు తిరిగివెళ్ళి గృహస్థధర్మాలు నిర్వహించారు. ఇది అందరికీ వర్తిస్తుంది. కాబట్టి నీవు రాజ్యాన్ని పాలించుము. ప్రీతితో యజ్ఞాలు నిర్వహించుము.

నకులుడు : యజ్ఞాది కర్మలు మానివేయటం అసంగ మనిపించుకొనదు. గృహస్థధర్మం మిగిలిన ఆశ్రమధర్మాల కంటె గొప్పది. హింసవలన పాపం కలుగుతుందనే అనుమానం వద్దు. శత్రువులను చంపకుండా ఏ రాజు రాజ్యాన్ని పాలించాడు? వాడికి పాపం కలిగిందా? వారు ఉత్తమ గతులు పొందారు కదా! అట్లా నీవు కూడా వ్యవహరించుము. ప్రజారక్షణ చేయకపోవటమే రాజుకు మహా పాపం. ఆ ధర్మాన్ని వదలి అడవికిపోవటం ఉత్తమ క్షత్రియ లక్షణం కాదు.

సహదేవుడు : ధర్మరాజా! శరీర సుఖం జీవితానికి ప్రథమాధారం. అరణ్యానికి వెళ్ళినా శరీరపోషణం తప్పదు. అయినప్పుడు అడవికి పోవటం దేనికి? మన్వాదులు ఈ సత్యం తెలిసి రాజ్యం చేశారు. నీవూ ఆ మార్గాన నడువుము. నీవే మాకు తల్లివి, తండ్రివి, గురుడవు, దైవానివి కాబట్టి నా ప్రార్థన మన్నించుము. రాజ్యాన్ని పాలించుము.

ధర్మరాజు : (తమ్ముల మాటలు విని మౌనంగా ఉండిపోయాడు)

ద్రౌపది : ధర్మరాజా! అరణ్యవాసాజ్ఞాతవాసాలలో అనేక కష్టాలు అనుభవించి, ఘోరయుద్ధంచేసి, రాజ్యాన్ని పొంది ఇప్పుడు సుఖాన్ని కోరుతున్న నీ తమ్ములకు ఊరట కల్పించుము. ఈ తరుణంలో రాజ్యత్యాగం చేస్తాననటం అధర్మం, అన్యాయం, రాజు దిక్పాలకాంశ సంభూతుడు. అగ్ని ఒకరినే కాలుస్తుంది. రాజాగ్ని వంశాన్నే దహిస్తుంది. కౌరవులు నిన్ను అవమానించి సర్వనాశనమయ్యారు. బ్రహ్మ రాజునందు దండనీతిని ప్రతిష్ఠించాడు. రాజు అపరాధాలను బట్టి శిక్షలు విధిస్తాడు. ఆనాడు కౌరవ సభలో నా చీరలాలిచి జుట్టుపట్టి లాగిన దుశ్శాసనుడిని, తొడచూపిన దుర్యోధనుడిని, నిందించిన కర్ణుడిని సముచితంగా చంపి దండనీతిని నీవు ప్రదర్శించావు. విషంపెట్టిన వాడినీ, ఇల్లు తగులబెట్టినవాడినీ, రాజకీయతంత్ర రహస్యాలను బయటపెట్టినవాడినీ, పరసతులను హరించేవాడినీ చంపటం రాజధర్మం. ఆ పని నీవు చేశావు. నావలె కష్టాలే పడిన వనిత లెక్కడైనా ఉన్నారా? ఇటువంటి నేను ఎన్ని కష్టాలు వచ్చినా నీ గృహస్థధర్మాన్ని రక్షిస్తూనే ఉన్నాను. కౌరవులు వారిపాపం పండి వారు నశించారు. వారి చావుకు వారే కారకులు కాగా నీకు పాపం ఎట్లా కలుగుతుంది? కాబట్టి, నీ విచారం మాని రాజ్యపాలన చేపట్టుము. విశ్వశ్రేయస్సు కొరకు అనేక యజ్ఞాలు చేయుము.

అర్జునుడు : పాలకుడు సమర్థుడై దండనీతిని పాటించకపోతే సన్న్యాసులు కూడా అక్రమాలు చేయటం మొదలు పెట్టుతారు. దేశం అరాజక మౌతుంది. దండనీతి నాశ్రయించిన వాడికి హింస చేయక తప్పదు. ఆహార పానీయాలలో ఎన్నో సూక్ష్మజీవులను లోకులు హింసిస్తున్నారు. కాబట్టి యోగ్యమైన హింస అహింసగానే పరగణించబడుతుంది. యజ్ఞాలలోని జంతుబలులు హింసలు కావు. యుద్ధంలో శత్రువీరులను చంపటం హింస కాదు. మన తండ్రి పాండురాజు పాలించిన ఈ రాజ్యాన్ని నీవు ఆశించటంలో తప్పేముంది? నీ వీ రాజ్యాన్ని గ్రహించటం ధర్మమో, అధర్మమో ఆ దేవు డెరుగును. నీవు మాత్రం ఈ ప్రయత్నాన్ని మానుకొమ్ము.

భీముడు : (కోపంతో) ధర్మనిర్ణయంలో నీ అంతటి వాడు మరొకడు లేడు. చేజిక్కిన సామ్రాజ్యాన్ని జారవిడుచుకొంటే అందరూ నిన్ను పిరికివా డంటారు. మమ్ములను ఛీకొట్టుతారు. కౌరవులవలన పడిన కష్టాలు తీరేటట్లుగా విజయాన్ని సాధించి రాజ్యాన్ని పొందావు. దీనిని వదలటం నింద్యం. కాబట్టి మేమందరం నీ చెప్పిన పనులు చేస్తూ ఉండగా దుర్మార్గులను శిక్షిస్తూ, సన్మార్గులను రక్షిస్తూ యాగాలు నిర్వహిస్తూ రాజ్యాన్ని పాలిస్తూ కురువంశకులోత్తముడిగా ప్రకాశించుము.

ధర్మరాజు : భీమా! రాజ్యపాలనం దుఃఖహేతువని పెద్దలంటారు. దానివలన చేప ఎరను తగులుకొన్నట్లే అనిపిస్తుంది. రాజ్యపాలన తరువాత రాజుకు నరకం ధ్రువం. నరుడు చేసిన కర్మలను బట్టి బంధాలలో ఇరుక్కొంటాడు. వికారాలను వదలితే ముక్తసంగు డౌతాడు. మిథిలానగరం తగులబడుతున్నా విషాదం పొందని జనకమహారాజు చరిత్ర తెలుసుకదా! జ్ఞాని సంసారమగ్నులైనవారిని కొండమీద ఉన్నవాడు నేలమీద తిరిగేవారిని వలె చూస్తాడు.

అర్జునుడు : ధర్మరాజా! నీవు చెప్పిన జనకమహారాజు కూడా రాజ్యపాలన వదలి భిక్షావృత్తి స్వీకరించాలని అనుకొన్నప్పుడు అతడి భార్యచేసిన హితబోధ గమనించదగింది. రాజు వనానికిపోయి బిచ్చమెత్తుకొంటూ ఉంటే, ఇంటిపట్టున అతిథిపూజలు ఏమి కావాలి? అన్నదానం ఏమి కావాలి? అన్ని ధర్మాలలో అన్నదానం శ్రేష్ఠం. గృహస్థాశ్రమ ధర్మం దప్పిగొన్న వారికి చలిపందిరివంటిది. ఆకొన్నవారికి పండ్లు కాసిన చెట్టువంటిది. కాబట్టి గృహస్థధర్మాన్ని వదలి పోవటం ధర్మవిరుద్ధం. అడవికిపోవటం వలన మోక్షం కలుగుతుంది అనుకొనటం అబద్ధం.

ధర్మరాజు : అర్జునా! నీ వాదం ఆమోద యోగ్యం కాదు. వేదాలు ప్రవృత్తి, నివృత్తి ధర్మాలను రెండింటినీ చెప్పాయి. అందులో జ్ఞానులు నివృత్తినే గౌరవిస్తారు. కర్మఫల త్యాగరూపమైన నివృత్తి గొప్పదా? ధనవాంఛ గొప్పదా? కర్మమార్గాన్ని అనుసరించేవారు అది గొప్పదని కొంతకాలం, కాదని కొంతకాలం భావిస్తారు. వాళ్ళు అల్పబుద్ధులు. శమ, దమ, త్యాగాది గుణాలు ఆనందహేతువులని జ్ఞానులు భావిస్తారు. వివేకవంతులు దానిని అంగీకరిస్తారు.

దేవస్థానుడు (ముని): ధర్మరాజా! అర్జునుడు ధర్మంగా పలికాడు. యోగసిద్ధి పొందాలంటే మెట్లదారి నాశ్రయించాలి. ధనాన్ని భోగాలకొరకు ఆర్జిస్తే తప్పు. కాని, యజ్ఞం కొరకు చేస్తే బ్రహ్మప్రాప్తికి నిచ్చెనవలె తోడ్పడుతుంది. యజ్ఞంలో వాడిన ధనాన్ని వినియోగిస్తే శమదమాలు కలుగుతాయి. వాటివలన బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. అందువలన దక్షిణలు విరివిగా ఇచ్చే యజ్ఞాలు చేయుము. శివుడూ, బ్రహ్మ, దేవతలూ, మరుత్తులూ, చక్రవర్తులూ అందరూ భూమిని పాలిస్తూ యజ్ఞాలు చేసి రాణించారు. అరిషడ్వర్గాలను జయించి ప్రజలను కాపాడే రాజును సమస్త గుణాలూ తమంతట తామే వచ్చి చేరతాయని బృహస్పతి చెప్పాడు. కాబట్టి కులధర్మాన్ని కాపాడుకొంటూ భూమిని పాలించుము. పూర్వ చక్రవర్తులవలె గృహస్థాశ్రమాన్ని నిర్వహించి చివరకు జ్ఞానబోధతో వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించుము (ఈ మాటలు విని ధర్మరాజు నిర్వేదంలో మునిగిపోయాడు).

అర్జునుడు : ధర్మరాజా! రాజధర్మాన్ని అనుసరించి యుద్ధం చేశావు. శత్రువులను చంపావు. రాజనీతిలో పాపాలు చేయటం ఉండదని పెద్దలంటారు. శత్రువులు ఉత్తమలోకాలకు వెళ్ళారు. నీకు దానివలన పాపం లేదు. కాబట్టి ధర్మానుసారం రాజ్యాన్ని స్వీకరించి, సత్కార్యాలు చేయుము. (ఈ మాటలకు ధర్మరాజు మారుపలకకుండా ఉండిపోయాడు).

వ్యాసమహర్షి : ధర్మరాజా! అర్జునుడి మాటలు నిజాలు. గృహస్థ ధర్మంకంటె రాజులకు మరొక పరమధర్మం లేదు. పరిపాలనలో ప్రజలను రక్షించకుండా వదలివేయటం రాజుకు పాపహేతువు. రాజుకు దండనీతికంటె మించిన ధర్మం మరొకటి లేదు. సుద్యుమ్నుడనే రాజు దండనీతిని అనుష్ఠించటం వలననే మోక్షం పొందాడు (అని అతడి కథ చెప్పాడు). న్యాయశాస్త్రం బాగా తెలిసి, ప్రజల మనోభావాలను గమనించి, మంచి చెడ్డల తారతమ్యం పట్టిచూచి దండనీతిని పాటించే రాజుకు మేలు జరుగుతుంది. హయగ్రీవుడనే రాజు యుద్ధంచేసి విశాలమైన రాజ్యాన్ని స్వాధీనపరచుకొని, ప్రజలను పాలించి, యజ్ఞాలు చేసి క్రమంగా శరీరవ్యామోహం వదలి ఉత్తమలోకాలు పొందాడు. రాజులకు యుద్ధాలు హానికరం కావు. కాబట్టి హింసను గూర్చిన అనుమానం వదలి అన్వీక్షకి, త్రయి, వార్త, దండనీతులనే క్షత్రియోచిత ధర్మాలను నిర్వహించుము.

ధర్మరాజు : మహర్షీ! భర్తలను కోల్పోయిన మహిళలు కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే నాలో రగులుతున్న దుఃఖం నాకు కలత కలిగిస్తూ ఉంటే మనస్సు శాంతిగా ఎట్లా ఉంటుంది? నేను రాజ్యాన్ని ఎట్లా పాలించగలను?

వ్యాసుడు : చావుపుట్టుకలు, హానివృద్ధులు మొదలైనవన్నీ కాలానికి లోబడి ఉంటాయి. అందువలన నీవు బాధపడవలసిన అవసరం లేదు. పూర్వం సేనజిత్తు అనే రాజు పుత్రమరణంవలన మిక్కిలి బాధపడి ఆత్మబోధవలన తేరుకొని, తా నెరిగిన దానిని లోకానికి చెప్పాడు. (వ్యాసు డా వృత్తాంతాన్ని చెప్పాడు). కాబట్టి కులధర్మం అవశ్య కర్తవ్యం.

ధర్మరాజు : మహర్షీ! అభిమన్యుడినీ, ఉపపాండవులనూ, కర్ణుడినీ, విరాటుడినీ, ద్రుపదుడినీ, ధృష్టద్యుమ్నుడినీ, భీష్ముడినీ, ద్రోణుడినీ చంపి పొందిన ఈ రాజ్యం శోకాన్నే తప్ప నాకు సుఖాన్ని కలిగిస్తుందా? పుత్రశోకంతో కుమిలిపోయే ద్రౌపదిని చూడగలనా? (అని బంధుమరణ శోక వ్యాకులు డయ్యాడు).

వ్యాసుడు : ధర్మజా! లోకంలో పదార్థాలు పెరగటం విరగటం కొరకే. మిత్రకార్యాలు సుఖాన్నిస్తాయనీ, శత్రుకార్యాలు దుఃఖాన్ని కలిగిస్తాయనీ, ధనమే సమృద్ధికి కారణమనీ, ధనం భోగాలకు సాధనమనీ - అనుకొనటం విధివ్రాతను కాదనటమే. కాబట్టి నిన్ను బ్రహ్మ ఏ ధర్మాచరణం కొరకు సృష్టించాడో, దానిని నిర్వహించి ధర్మరాజువు కమ్ము (దీనికి ఉపబలకంగా అశ్మకుడు జనకమహారాజుకు చేసిన బోధలను వినిపించాడు). (అయినా ధర్మజుడు మారుపలకలేదు. అప్పుడు అర్జునుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు).

అర్జునుడు : కృష్ణా! బంధుమరణంవలన కలిగిన శోకం కారణంగా ధర్మరాజు వివేకం బాగా దెబ్బతిని, మనస్సు వికలమైంది. వాటిని నీ హితోక్తులతో తేరికొనేటట్లు చేయుము.

శ్రీకృష్ణుడు : ధర్మరాజా! నీ వంటివాడు బాధతో ఇట్లా క్రుంగిపోవటం న్యాయమా? రణరంగంలో కన్నుమూసిన వారందరూ స్వర్గస్థులయ్యారు. ఒకరాజులే ఏమిటి? భూమిమీద ఎవరు శాశ్వతంగా నిలిచారు? సృంజయుడనే రాజు పుత్రశోకంతో మనోవేదన పడుతుంటే నారదుడు ఓదారుస్తూ మహాత్ములైన షోడశచక్రవర్తులు కూడా చివరకు మట్టిలో కలిసిపోవలసి వచ్చిందని వివరించి చెప్పాడు. దానితోపాటు పర్వతనారదుల వృత్తాంతం, సువర్ణష్ఠీవి కథా వినిపించాడు.

నారదుడు :

‘హరియుఁ బరాశరాత్మజుఁడు నాదరణాతిశయంబునన్ సవి
స్తరణ నుపన్యసించిన వచఃప్రకరంబు మహార్థగాథ; మి
ప్పరమహితోపదేశములు పాటిగఁబట్టి వసుంధరా ధురా
ధరణ మొనర్పు; మయ్యెడు నుదాత్తయశంబును ధర్మవృద్ధియున్’. **(శాంతి. 1.273)**

వ్యాసుడు : ప్రజారక్షణంకంటె ఉత్తమధర్మం రాజుకు మరొకటి లేదు. దానివలన బ్రాహ్మణుల వేదవిహిత కర్మలు మెరుగుగా ఉంటాయి. లేకపోతే పాడవుతాయి. వేదవిహిత కర్మలు బాగుంటే పుణ్యమూ, చెడిపోతే పాపమూ రాజుకు అధికంగా కలుగుతాయి. కనుక ప్రజారక్షణం చేయుము.

ధర్మరాజు : రాజ్యసంపాదన చేయాలనే కోరిక ఎక్కువై చంపకూడని వారిని ఎంతోమందిని చంపాను. అంతులేని ఆ క్రూరత్వం నా అంతరాత్మను తపింపచేస్తున్నది. అంతేకాని మీరంతా ఇంతగా చెప్పగా సందేహించటం మంచిదా?

వ్యాసుడు : ధర్మరాజా! మానవులు చేసే కర్మలన్నీ భగవంతుడి ఆజ్ఞమేరకే వర్తిస్తాయి. గొడ్డలితో చెట్టును నరికితే గొడ్డలికి పాపం వస్తుందా? అన్నింటినీ చేయించేవాడు భగవంతుడు. మానవుడు ఉపకరణం మాత్రమే. అందువలన మానవుడికి పాపమంటదు. అట్లే నీకూ. ఇష్టం లేకపోయినా తన కులానికి నిర్దేశించిన కర్మచేయటం ఉత్తమగతిని కలిగిస్తుంది. తనదికాని పని అంగీకరిస్తే పాపకారకమౌతుంది. కాబట్టి నీవు క్షత్రియ ధర్మాన్నే నిర్వర్తించుము. శత్రువులను చంపటం పాపమని నీ కనిపిస్తే దానికి తగిన పరిహారం చేసికొమ్ము. సంసారాన్ని వదలటం మంచిది కాదు. పై పెచ్చు అశుభం కూడా.

ధర్మరాజు : ఎందరో రాజులు, బంధువులు నా వలన చనిపోయారు. వారి భార్యలు కూడా ఆ మహాదుఃఖంతో చనిపోతే స్త్రీ హత్యాదోషం కూడా కలుగుతుంది. ఈ పాపం పోవాలంటే నే నేం చేయాలి? ఈ బాధతో భూభారాన్ని మోయటానికి ఎట్లా పూనుకొనగలను? ఘోరతపస్సు చేసి శరీరాన్ని వీడటం తప్ప నాకు మార్గాంతరం కనపడటం లేదు.

వ్యాసుడు : ధర్మరాజా! నీవు బాధపడకుము. యుద్ధంలో చనిపోయిన వారంతా రాజ్యంకొరకు, కీర్తికొరకు, అసూయతో యుద్ధంచేసి చనిపోయారు. వారు చేసిన పాపం నీ కంటదు. అంతేకాదు. వారి చావుకు వారి కర్మలే కారణం. ఆ కర్మలు నీకు తెలియవు. యముడికి తెలుసు. కాలం తీరితే చాలు యముడు చంపివేస్తాడు. దానికి నీవు కారణమని బాధపడటం వెర్రితనం. ఇది కారణంగా ఇల్లు వదలి పోతాననటం మరింత వెర్రితనం. కాలం ఆడించే బొమ్మలే

మానవులు. మరణించిన రాజుల రాజ్యాలను ధర్మబద్ధంగా వారి వారసులకు ఇచ్చివేయుము. సోదరులైన రాక్షసులను చంపిన ఇంద్రుడు పూజించబడుతున్నాడు కదా! నీ కిష్టమైతే ఆ ఇంద్రుడివలె యజ్ఞాలు ఆచరించుము. ముందుగా అశ్వమేధ యాగం చేయుము.

వ్యాసుడు చెప్పిన మాటలకు ధర్మరాజు మనసులో కలత దీరి సంతోషించాడు. పాపకర్మలను, వాటి పరిహారాలను గురించి వ్యాసుడిని అడిగాడు. ఆ ముని వివరంగా పేర్కొన్నాడు. అశ్వమేధయాగంలోని అవభృథ స్నానపు నీటిలో మునిగిన వారు కూడా పాపాలన్నీ పోగొట్టుకొని పవిత్రులౌతారు. అశ్వమేధయాగకర్త లోకపూజితు డౌతాడు.

ధర్మరాజు : ఏ విధంగా ధర్మమార్గాన్ని ఆధారం చేసికొని రాజ్యపాలన వ్యవహారాన్ని నిర్వర్తించి పాపం కలుగకుండా ఎట్లా నెగ్గగలనో తెలియజెప్పాలి. రాజధర్మాలు, వర్ణ ధర్మాలూ, ఆశ్రమధర్మాలూ, ఆపద్ధర్మాలు మొదలైన ధర్మాలనన్నిటిని తెలియచెప్పాలి. నాకు రాజ్యపాలనా, ధర్మాచరణా ఒకదాని కొకటి వ్యతిరేకమైనవిగా కనపడుతున్నాయి. దీనిని వివరించండి.

వ్యాసుడు : కురువంశంలోని వారందరికీ పెద్దదిక్కు భీష్ముడు. ఇంద్రాదులకు కూడా ఆయన పూజ్యుడు. చ్యవనాది మహర్షులవద్ద ధర్మబోధ పొందాడు. అతడికి ధర్మాలన్నీ కరతలామలకం వంటివి. ఉత్తమజ్ఞాని అయిన భీష్ముడు నీ వడిగిన అంశాలన్నీ వివరించగలడు. భీష్ముడు పై లోకాలకు వెళ్ళే సమయం సమీపిస్తున్నది. ఆలసించక నేను చెప్పినట్లు చేయుము.

ధర్మరాజు : ఎంతోమంది బంధువులను యుద్ధంలో చంపి మహాపాపం చేశాను. ఇప్పుడు ఆ మహాత్ముడి ఎదుటికి ఏ మొగంపెట్టుకొని పోయేది? ధర్మోపదేశం చేయుమని ఎట్లా అడిగేది?

శ్రీకృష్ణుడు : మహర్షి చెప్పిన మాట పాటించుము. నీకు మేలు కలుగుతుంది. ఏదయినా శోకంతో చేయట మెందుకు? ఇప్పుడు నగరానికి వెళ్ళి మరొకమారు వద్దాం పద! ప్రజలు నీ కొరకు మేఘం కొరకు చాతక పక్షులవలె ఎదురుచూస్తున్నారు. వారిని సంతోషపెట్టుము.

ధర్మరాజు సుముఖుడై పరివారం పరివేష్టించి రాగా చుక్కలలో చంద్రుడివలె వెలుగొందాడు. మరునాడు ఉదయం రథారూఢుడై కొలువుకూటానికి బయలుదేరాడు. ధర్మరాజు అధిరోహించిన రథానికి భీముడు సారథ్యం వహించాడు. అర్జునుడు వెల్లగొడుగు పట్టాడు. నకుల సహదేవులు వింజామరలు విసిరారు. పంచాగ్నులవలె పాండవులు ఆ రథంలో ప్రకాశించారు. మంగళవాద్యాలు సముద్రఘోషవలె మ్రోగాయి.

3. ధర్మజ పట్టాభిషేకం:

ధర్మరాజు హస్తినాపుర ప్రవేశయాత్ర మొదలయింది. గాంధారీ ధృతరాష్ట్రులు గొప్ప పల్లకీలో కూర్చుండి ముందుగా బయలుదేరారు. ఆ వెనుక ధర్మరాజు, ఆ వెనుక సాత్యకి శ్రీకృష్ణులు రథంలో సాగారు. ప్రక్కన ఒక రథంలో యుయుత్సుడూ, ఉచితవాహనాలలో కుంతీదేవ్యాదులను వెంటగొని విదురుడూ పయనమయ్యారు. రాజులందరూ సైన్యాలలో అన్నివైపులా పరివేష్టించి రాగా ధర్మరాజు యాత్ర సాగించాడు. పురం శోభాయమానంగా అలంకరించబడింది. అంగనలు పూలవాన కురిపించారు. ధర్మరాజును పౌరజనులు పలురకాలుగా కీర్తించారు. రాజపత్నులలో ద్రౌపదికి సాటి మరెవ్వరు లేరని పొగిడారు. నగరం చంద్రోదయ సమయంలోని సముద్రంవలె సంతోషంతో ఎగసిపడుతున్నది. ధర్మరాజు రాజప్రాసాదం వాకిలిని సమీపించాడు. బ్రాహ్మణులూ, స్త్రీలూ సమర్పించే మంగళద్రవ్యాలను ఆమోదించాడు. ముఖశాల దగ్గర దిగి ధౌమ్యధృతరాష్ట్రులు ముందు నడుస్తూ ఉండగా అంతఃపుర ప్రవేశానికి ఉపక్రమించాడు. ఇలవేల్పులను ముందుగా పూజించాడు. బయలు ప్రదేశానికి వచ్చి నగరదేవతలను

అర్చించటానికి తగిన వారిని నియోగించాడు. ఎన్నో దానధర్మాలు చేశాడు. బ్రాహ్మణాశీస్సులూ, మంగళవాద్యాలూ మారుమ్రోగాయి. ఆ తరువాత జనులందరూ నిశ్శబ్దంగా నిలబడి ధర్మరాజువైపు చూస్తున్నారు.

ఆ సమయంలో దుర్యోధనుడి మిత్రుడైన చార్వాకుడు బ్రాహ్మణుల మధ్యనుండి లేచి ఇట్లా అన్నాడు. 'ధర్మరాజా! బ్రాహ్మణులంతా కలిసి నన్ను పంపారు. ఘోరపాపం చేసిన ధర్మరాజు ఏమిరాజు? చంపేటప్పుడు తండ్రి, కొడుకు, సోదరుడు, గురువు, మిత్రుడు అని కూడా జంకలేదు. వీడిని తగలబెట్టినా తప్పులేదు. ఇట్లా మంచివారు ఏవగించుకునే ఆ రాజ్యం చేయటమెందుకు? బంధువధ చేసి ఎటువంటి భోగాలు అనుభవిస్తావు? నీవు మహాపాపివి' అన్నాడు. ఆ మాటలు విని బ్రాహ్మణులు కలవరపడ్డారు. ధర్మరాజు సిగ్గుతో తలవంచుకొన్నాడు. ధర్మరాజు నుదుటిపై చేతులు జోడించి 'నేను మునులందరిచేత ఆజ్ఞాపించబడి దృఢమైన నిర్ణయంతో వచ్చాను' అని ప్రకటించాడు. చార్వాకుడు తమ ప్రతినిధి కాడని బ్రాహ్మణులు పేర్కొన్నారు. ధర్మార్జితమైన రాజ్యం ధర్మజుడు కలకాలం అనుభవించగలుగుతాడని దీవించారు. దివ్యదృష్టితో ఆ చార్వాకుడిని గమనించి, దుర్యోధనుడి మిత్రుడిగా గుర్తించి, కంటిమంటలలో అతడిని పిడుగుపాటుకు పడిన వృక్షంవలె నేలగూలేటట్లు చేశారు. శ్రీకృష్ణుడు చార్వాకుడి శాపవృత్తాంతాన్ని చెప్పి, బ్రాహ్మణులను ప్రశంసించాడు. ధర్మరాజును పట్టాభిషేకానికి సిద్ధం కమ్మని పలికాడు.

పట్టాభిషేకానికి కావలసిన సంభారాలను సమాయత్తం చేయించారు. ఆరుబయట పెద్దకొలువు తీర్చారు. ధర్మరాజుకు ఎత్తైన బంగారపు సింహాసనాన్ని ఏర్పాటు చేశారు. మిగిలిన వారికి తగిన ఆసనాలను సమకూర్చారు. ధర్మరాజు తన మనస్సులో బాధనంతా దిగమ్రింగి, సంకల్పబలంతో తేరికొని, సింహాసనంమీద తూర్పు ముఖంగా ఆసీనుడయ్యాడు. ఆయనకు ఎదురుగా సాత్యకి సహిత శ్రీకృష్ణుడు బంగారు గద్దెపై కూర్చున్నాడు. భీమార్జునులు రత్నసింహాసనాలపై కుడిఎడమవైపులలోనూ, వెనుక ప్రక్క నకుల సహదేవులూ, మిగిలినవారు సముచిత స్థలాలలో, సముచిత ఆసనాలలో కూర్చున్నారు. పురప్రముఖులు కొలువుతీరారు. సభ చాల ప్రకాశించింది.

ధౌమ్యుడు ఈశాన్యదిక్కున పల్లంగా ఉన్నచోట వేదికను సిద్ధంచేశాడు. దానిమీద రత్నభద్ర పీఠాన్ని స్థాపించాడు. దానిమీద పులితోలు కప్పాడు. బంగారుదండలతో కూడుకొన్న శంఖాన్ని పవిత్రస్థలంలో నిలిపి పూజించాడు. దానిచుట్టూ మట్టి, బంగారు, వెండి, మణి కలశాలలో గంగాజలం నింపి, శుభద్రవ్యాలను అందులో ఉంచారు. మంత్రాలను పఠిస్తూ ధర్మరాజును భద్రపీఠంమీద కూర్చుండ బెట్టారు. మంగళాలంకార శోభిత అయిన ద్రౌపదిని ఆతడి ఎడమ ప్రక్కగా కూర్చుండబెట్టారు. ముందుంచిన అగ్నిలో దేవయజ్ఞ తంత్రం పూర్తి చేశారు. శుభసమయంలో శ్రీకృష్ణుడు అక్కడ పూజలో ఉన్న శంఖాన్ని తీసి 'ఈ భూమికి రాజువు కమ్ము' అని ప్రీతితో అభిషిక్తుడిని చేశాడు. ధృతరాష్ట్రాది ప్రముఖులందరూ ఆయాకలశాలలోని పవిత్ర జలాలతో ధర్మరాజును అభిషేకించారు. ధర్మరాజు చక్రవర్తి పదవిని స్వీకరించి యోగ్యులైన జనులకు అధిక సంపదలను దానాలు చేశాడు. ప్రజల ప్రశంసలకు కృతజ్ఞతలు చెప్పి, ధృతరాష్ట్రుడి పెద్దరికాన్ని పునరుద్ఘాటించాడు. ప్రజలనూ, ధృతరాష్ట్రాదులనూ సముచిత స్థలాలకు సాగనంపాడు. భీముడిని యువరాజుగా, షాడ్గుణ్య వివేకానికి విదురుడినీ, ఆదాయ వ్యయాలు తెలపటానికి సంజయుడినీ, సైన్యవ్యవహారాలు, జీతబత్యాలు చూడటానికి నకులుడినీ, శత్రురాజ్యాలను ఆక్రమించటానికి అర్జునుడినీ, పురోహిత కార్యాలకు ధౌమ్యుడినీ, రాజరక్షకుడిగా సహదేవుడినీ నియమించాడు.

ఆ తరువాత బ్రాహ్మణుల అనుమతితో మృత బంధువులందరికీ భక్తి ప్రపత్తులతో శ్రాద్ధకర్మలు నిర్వహించాడు. దుర్యోధనాదులకు ధృతరాష్ట్రుడిచేత శ్రాద్ధకర్మలు చేయించాడు. అన్నదానాలూ, జలదానాలూ, మణిదానాలూ చేశాడు. పితౄణం తీర్చికొని పరిశుద్ధుడయ్యాడు.

4. భీష్మ సందర్శనం:

ఒకనాడు ఉచిత సమయంలో శ్రీకృష్ణుడిని సందర్శించి వినయంతో నమస్కరించి ఇట్లా స్తుతించాడు. 'కృష్ణా! నీ అనుగ్రహం వలన వంశక్రమానుగతంగా పొందదగిన ప్రశస్త సామ్రాజ్యాన్ని నేను పొందగలిగాను ధన్యుడిని. విష్ణుదేవుడవైన నీవు మమ్ములను

బావలనీ, మరదులనీ పిలుస్తూ బంధుత్వాన్ని పాటిస్తూ, ప్రేమతో రక్షించావు. నీరక్షలో మేము భయంలేని జీవితం నడిపాము. నీ మహిమను కీర్తించటానికి మే మెంతవారం? నీవు సృష్టికి ఆద్యుడవని వేదాలు చెప్తున్నా, నీవు ఇటువంటివాడవని చెప్పలేకపోతున్నాయి. అవాఙ్మానసగోచరుడవైన నీ మహిమ తెలియటం సాధ్యంకాదు. నీ నామాలను భక్తితో కీర్తించే వారికి భోగాలనూ, మోక్షాన్నీ ప్రసాదించగలవు. నీ నామాలు అనంతాలు, నీ మహిమలు అమోఘాలు!' అని కీర్తించగా శ్రీకృష్ణుడు ధర్మరాజును గుణకీర్తనంతో అనుగ్రహించాడు. ఆ తరువాత కొలువు చాలించాడు.

అప్పుడు తమ్ములను చూచి, వా రిదివరలో పడిన కష్టాలను పేర్కొని, వారి కృషిని అభినందించి, రాజ్యాంగ సప్తకాన్ని రక్షిస్తూ రాజభోగాలను అనుభవించండని అనుమతించాడు. ధర్మరాజు దుర్యోధనుడి భవనం భీముడికి, దుశ్శాసనుడి మందిరం అర్జునుడికి, దుర్మర్షణుడి నివాసం నకులుడికి, దుర్ముఖుడి భవనం సహదేవుడికీ ఇచ్చి, యుయుత్సుడికీ, సంజయుడికీ, ధౌమ్యుడికీ వారి వారి గృహాలనే ఇచ్చాడు. శ్రీకృష్ణుడినీ, సాత్యకినీ అర్జునుడి గృహంలో విడిది చేయించాడు. అందరూ ఆనందంగా ఉన్నారు.

ధర్మరాజు గాంధారీ ధృతరాష్ట్ర విదురులకు రాజ్యాన్ని సమర్పించి, వారి అనుమతితో పరిపాలన సాగించసాగాడు. ఒకనాటి తెల్లవారుజామున శ్రీకృష్ణుడి విడిది మందిరానికి వెళ్ళి ఆతడి దివ్య మంగళవిగ్రహాన్ని దర్శించి, 'త్రిలోక వ్యాప్త విక్రముడవైన నీ కటాక్షంతోనే రాజ్యాన్ని పొంది త్రిలోక గౌరవాన్ని పొందాను' అంటూ సమీపించాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు ధ్యానమగ్నుడై ఉన్నాడు. ఆ పరిపూర్ణ ధ్యానస్థితికి ధర్మజుడు ఆశ్చర్యపడి, 'నిశ్చలదీప ప్రకాశంగా' నిలిచిన ఆ స్థితికి కారణ మేమిటని ప్రశ్నించాడు. శ్రీకృష్ణుడు ఆ సమాధి స్థితిని విరమించి సంభాషణ సాగించాడు.

శ్రీకృష్ణుడు : గంగాపుత్రుడైన భీష్ముడు సమాధిలో ఉండి నన్ను స్మరించాడు. నా మనస్సు అతడిలో లీనమయింది. నీ వా మహాత్ముడి వద్దకు వెళ్ళి సమస్త ధర్మాలను అడిగి తెలిసికొని సందేహనివృత్తిని చేసికొమ్ము.

ధర్మరాజు : నీవు ముందుండగా పితామహుడిని దర్శించాలని భావిస్తున్నాను. నీ సన్నిధి భీష్ముడికి కూడా ఆనందదాయకమౌతుంది. ఉత్తరాయణ పుణ్యకాలానికై ఎదురుచూస్తున్న భీష్ముడు పరబ్రహ్మ స్వరూపుడవైన నీ సన్నిధానాన్ని అభిలషిస్తూ ఉంటాడు. అతడిపై గల దయతో, నాపై ఉన్న ఆదరంతో భీష్ముడికి నీ దర్శనాన్ని కలిగించుము.

భీష్ము డాసమయంలో నవగ్రహాలచేత చుట్టబడిన చంద్రుడివలె నారదాది మహామునులు చుట్టూ పరివేష్టించి ఉండగా, అస్తమించబోతున్న సూర్యుడివలె ఉండి ఎలుగెత్తి విష్ణుసహస్ర నామస్తోత్రాన్ని పఠించాడు. చివరకు 'నమః కృష్ణాయ' అంటూ తలవంచి మ్రొక్కాడు. (భీష్ముడి స్తుతి స్తవరాజమనబడుతుంది. దీని పఠనంవలన సుగతి కలుగుతుంది.) ప్రశాంతాత్ముడై నిశ్శబ్దంగా ఉండిపోయాడు. మునులు భీష్ముడినీ, విష్ణుదేవుడినీ ప్రశంసించారు.

భీష్మస్తవాన్ని దివ్యశక్తితో స్వీకరించిన శ్రీకృష్ణుడు దయాంతఃకరణుడై శయ్యనుండి దిగి ధర్మజుడి వద్దకు వెళ్ళి, అతడిని ప్రబోధించి తన తమ్ముడైన సాత్యకితోనూ, భీమాదులతోను కలిసి భీష్ముడి వద్దకు రథాలపై పయనమయ్యారు. మార్గమధ్యంలో శమంత పంచకాలను చూచి శ్రీకృష్ణుడు ధర్మరాజుకు పరశురాముడి చరిత్రాన్ని విస్తరించి చెప్పాడు. ఓఘవతీ నదీ తీరంలో అంపశయ్యమీద పరుండి ఉన్న భీష్ముడిని అందరూ దర్శించారు, నమస్కరించి ఆతడి చుట్టూ కూర్చున్నారు.

5. శ్రీకృష్ణానుగ్రహం:

శ్రీకృష్ణుడు : మహానుభావా! నీ మనస్సు కలతలేకుండా ఉన్నదా? మానసిక బాధకంటె శరీరబాధ మిన్న అని అంటారు. శరీరంలో ఒక బాణమున్నా బాధిస్తుంది. కాగా, అనేక బాణాలు నాటిన నీ శరీరబాధను గురించి అడగాలా? ఇట్లా ఉన్న నీకు బాధ కలగలేదంటే దానికి నీ తండ్రి ఇచ్చిన వరమే కారణం. నీవు దేవతలకు సైతం ఉపదేశించగల సమర్థుడవు. మహర్షులవలె ద్వంద్వాతీతుడవు. బ్రహ్మచర్య దీక్షచేత మన్మథుడిని జయించినవాడవు, శరతల్పంమీద పడుకొని

స్వేచ్ఛామరణం ప్రకటించ గలిగిన వ్యక్తిని ముల్లోకాలలో ఎక్కడా ఇంతవరకు వినలేదు, కనలేదు. నీవు తపస్సంపన్నుడవు. లోకాలలోని సమస్త విషయాలను తెలిసికొన్న విజ్ఞుడవు. యుద్ధంలో చనిపోయిన బంధుమిత్రులను స్మరించి ధర్మరాజు శోకతప్తుడై ఉన్నాడు. నీ పుణ్యతమస్ఫుట వాక్యపద్ధతితో అతడి బాధను తొలగించుము. చతుర్వర్ణాల ప్రజలు చతురాశ్రమాలతో చేయవలసిన వేదవిహితమైన ధర్మాలన్నీ నీకు తెలుసును. ప్రవృత్తి నివృత్తి మార్గాలూ, సాంఖ్యయోగాలు, పురాణేతిహాసాలూ, ధర్మశాస్త్రాలూ నీకు కరతలామలకాలే. నీవు సర్వ సంశయాలను తీర్చగల సమర్థుడవు. నీవు ధర్మరాజును ఆదరించుము. నీవంటివారి సామర్థ్యం శోకమోహాలతో బాధపడే ప్రజలను తరింపచేయటమే ప్రయోజనం కదా!

భీష్ముడు : (కొద్దిగా కృష్ణుడివైపు ముఖం త్రిప్పి నమస్కరించి) లోకాలకు కర్తవు భర్తవు సంహర్తవు అయినవాడా! ఆశ్రితజనార్తి నిరాస నిపుణా! యోగీశ్వరా! కృష్ణా! నా కేది మేలో నీ మనస్సులో సంకల్పించుము.

శ్రీకృష్ణుడు : భీష్మతపస్స్వరూపుడా! నాయందు నీకెప్పుడూ అచంచలభక్తి నిలిచి ఉంటుంది. భక్తి ఆర్జవం కలిసి ఉన్న నీ హృదయంలో నా రూపు సదా ప్రత్యక్షమౌతుంది. నేటినుండి ఏబది ఆరు రోజులలో సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశిస్తాడు. నీవు మోక్షాన్ని పొందుతావు. నీవు లోకాంతరగతుడ వైతే ఈ లోకంలో జ్ఞానం మరుగైపోతుంది. నీవలన ధర్మవివేకాలతో కూడిన జ్ఞానాన్ని పొందటానికి వీరంతా వచ్చారు. వీరిలో ధర్మరాజుకు జ్ఞానోపదేశం చేయుము. పురుషార్థ వివేకాన్ని ప్రసాదించుము.

భీష్ముడు : సకలదైవ స్వరూపుడవైన శ్రీకృష్ణా! నీ తీయని మాటలు చెవులలో పడగానే అమృతరస ప్రవాహంవలె నాకు ఆనందాన్ని కలిగించాయి. వచోనైపుణ్యం నీ సొత్తు. నీ ముందు మాటలాడటం బ్రహ్మకు కూడా సాధ్యంకాదు. ఇక నేనెట్లా సమాధానా లిచ్చేది? విషాగ్నులతో దీటైన బాణాలు గ్రుచ్చుకొని నా దేహానికి కలిగిస్తున్న బాధ అపారం. మాటాడే శక్తి లేదు. దుర్బలత్వంతో నా నాలుక స్పష్టంగా పలుకలేకపోతున్నది. అందువలన నా అశక్తతకు మన్నించుము. ధర్మరాజుకు ఏది హితమో దానిని నీవే బోధించుము. నీ వుండగా నేను చెప్పటం గురు వుండగా శిష్యుడు చెప్పినట్లుంటుంది.

శ్రీకృష్ణుడు : భీష్మా! నీవు భగవత్తత్త్వవేదివి. కురువంశ భారం నీమీద ఆధారపడి ఉన్నది. నీకు మూడువరా లిస్తున్నాను. గుచ్చుకొన్న బాణాలవలన నీకు మూర్ఛగానీ, అలసటగానీ, నొప్పిగానీ కలుగకుండా సుఖాత్ముడవు ఔతావు. ఆకలిదప్పులు లేకుండా శక్తిమంతుడవుగా ఎల్లప్పుడూ ఉంటావు. సకలప్రాణుల వర్తనాలూ నీకు బుద్ధిగోచరమయి అతిశయజ్ఞానాన్ని కలిగిస్తాయి. వీటివలన కలిగే మహిమాతిశయంతో వర్ధిల్లుము.

వ్యాసాది మహర్షులందరూ శ్రీకృష్ణుడిని ప్రశంసించారు. దేవతలు పూలవాన కురిపించారు. సాయంకాలం కావటంచేత శ్రీకృష్ణాదులందరూ భీష్ముడికి నమస్కరించి మరునాడు ఉదయం తిరిగి వస్తామని చెప్పి హస్తినాపురానికి తిరిగి వెళ్ళారు. మరునాటి ఉదయం పెద్దలనూ పిన్నలనూ వెంటబెట్టుకొని ధర్మరాజు భీష్ముడిని దర్శించాడు. మహర్షి గణం వచ్చింది. 'నారదుడు సమస్త ధర్మపద్ధతులను అడిగి తెలిసికొనండి' అని అందరినీ ఉద్దేశించి చెప్పాడు. శ్రీకృష్ణుడు భీష్ముడిని అడిగి తెలిసికొనటానికి ధర్మరాజును మాత్రమే నిర్దేశించాడు. భీష్ముడి యోగక్షేమాలు కనుగొన్నాడు.

భీష్ముడు : కృష్ణా! నీవు దివ్యచిత్తంలో నన్ను భావించటంచేత నేను వృద్ధుడనైనా బాలుడివలెనయ్యాను. నీ ఆదేశానుసారం పాండవులకు చెప్పగోరినవన్నీ వివరించి చెప్తుతాను. అయినా పాండవులకు శుభప్రదమైన వాటిని నీ వెందుకు చెప్పవు? నీ అభిప్రాయ మేమిటి? చెప్పుము.

శ్రీకృష్ణుడు : భీష్మా! లోక శ్రేయస్సుకు, కీర్తికి నేనే మూలకారణం. అందులో సందేహం లేదు. ఇది నాకు వచ్చే క్రొత్తదైన కీర్తి కాదు. అత్యుత్తమ కీర్తి నీకు ప్రసాదించాలని నా జ్ఞానాన్ని నీ బుద్ధిలో ప్రవేశపెట్టుతున్నాను. నీ కీర్తి ఈ భూమి ఎంతకాలం ఉంటుందో అంతవరకు నశించకుండా ఉంటుంది. నీ మాటలన్నీ వేదాలతో సమానంగా గౌరవించబడతాయి. నీ వాక్య సముదాయాన్ని ధర్మరాజు వినటం ఉభయతారకం. చిరకీర్తి నీకు కలగాలని భావించి ఇట్లా చేశాను. నీ ధర్మ విజ్ఞాన వివేకం వలన పాండవులే కాక ఇక్కడ ఉన్న అందరూ కృతార్థు లౌతారు.

భీష్ముడు : తన జన్మకారణంగా మునీంద్రులందరికి మోక్షాన్ని కలిగించినవాడూ, భరతవంశీయులలో సాటిలేని వ్యక్తిత్వం కలవాడూ, సత్య, శౌచ, శాంతి, కాంతులకు ప్రకాశాన్ని కలిగించినవాడూ, పాత్రదానం, యజ్ఞాచరణం, బంధురక్షణం మొదలైన ఉత్తమ ధర్మాల నాచరించటంలో సంతోషాన్ని పొందేవాడూ, కామంవలన కాని, అర్థంవలన కాని, భయంవలన కాని అవినీతి మార్గంలో ప్రవేశించనివాడూ అయిన ఉత్తమగుణశోభితుడు ధర్మరాజు ఇక అడుగదలచుకొన్నవన్నీ అడుగవచ్చును.

శ్రీకృష్ణుడు : ధర్మరాజు యుద్ధంలో గురువులూ, బంధువులూ, మిత్రులూ అని లెక్కించక వాడి బాణాలతో అందరినీ సంహరించాడు. అనేకులు రణంలో నిహతులయ్యారు. అందువలన అతడు క్రూరుడని భావిస్తావేమో అని నీ ఎదుటపడటానికి భయపడుతున్నాడు.

భీష్ముడు : కృష్ణా! విద్యాబోధనం, దానాలిస్తూ యాగాలుచేయటం - బ్రాహ్మణులకు ఎట్లాగో, రాజులకు యుద్ధంచేయటం అట్లా సహజధర్మం. పాపవర్తనులు బంధువులైనా వారిని చంపటం రాజధర్మం. ధర్మాన్ని విడనాడి లోభగుణంతో అన్యాయమార్గవర్తులైనవారిని ఎవరినైనా యుద్ధంలో చంపటం పుణ్యకార్యమే. దుర్మార్గులను రణరంగంలో చంపి రక్తపుటేరులు పారించటం ధర్మపరుడైన రాజుకు అర్హమైన కార్యం.

ఆ మాటలు విని ధర్మరాజు చేతులు మోడ్చి నమస్కరించి, పాదాలకు తన తల తాకించి మ్రొక్కాడు. భీష్ము డాతడిని అభినందించి, అతడి తలను తనముఖానికి ఆనించి ప్రేమతో ఆఘ్రాణించి ఆదరించాడు. సంకోచం లేకుండా అడుగుమని కోరాడు. ధర్మరాజు శ్రీకృష్ణుడికి, పెద్దలకు, మునీంద్రులకు అభివాదనంచేసి, భీష్ముడికి ఎదురుగా కూర్చుండి ప్రశ్నించటం ప్రారంభించాడు.

6. ప్రశ్నోత్తర మాలిక:

ప్రశ్న 1. **ధర్మరాజు:** రాజు ధర్మస్వరూపు డని ధర్మవేత్త లంటారు. కాని, ధర్మ నిర్వహణం అతికష్ట సాధ్యమని భావిస్తాడు. కాబట్టి ముందుగా రాజధర్మరీతులను వినిపించుము (2.162).

భీష్ముడు : ధర్మరాజా! రాజధర్మాన్నీ చెప్పుతాను. ఆయా సందర్భాలలో ఆపద్ధర్మ, మోక్ష ధర్మాలను తెలియపరుస్తాను. రాజుకు దైవానుగ్రహం, పురుషయత్నం రెండూ కార్యసాధనకు కావాలి. దాంతీ, శాంతీ కలరాజు శ్రీమంతుడు, యశస్వి కాగలడు. సప్త ప్రకృతులను గుర్తించి సక్రమంగా నిర్వహించేటట్లు చేయాలి. బ్రాహ్మణులను నాశనం చేయదలిస్తే రాజే నశిస్తాడు. దోషంచేస్తే విప్రుడినైనా శిక్షించాలి. శాంతపరుడైన రాజును ప్రజలు ఆడిస్తారు. కోపిష్ఠి అయితే ప్రజలు కోపోద్రిక్తులౌతారు. సప్తరాజ్యాంగాలైన స్వామి, అమాత్యుడు, మిత్రుడు, కోశం, రాష్ట్రం, దుర్గం, బలం - అనే వాటికి వినాశకారి అయిన ఎవ్వడినైనా శిక్షించాలి. బృహస్పతి మరుత్తుడికి చెప్పిన నీతి వాక్యాలు స్మరించదగినవి. రాజు ఎవరినీ పూర్తిగా నమ్మరాదు. నమ్మకపోరాదు. ఏ అంశాన్నైనా ఉచితానుచితాలు తానే పరిశీలించి గ్రహించాలి. ప్రజారక్షణం చేయని రాజు అధ్యయనం చేయని ఋత్విజుడి వంటివాడు. శత్రుసంహారం అవశ్య రాజధర్మం. అల్పుడైన శత్రువు సైతం నిప్పువలె, విషంవలె నాశనంచేస్తాడు. కనుక ధీరుడైన రాజు శత్రుశేషం లేకుండా చేసికొనాలి. రాజ్యాన్ని రక్షించాలి.

ప్రశ్న 2. : పరాక్రమ తేజస్వి అయిన రాజు బుద్ధిమంతులైన ప్రజలను ఏవిధంగా వశంచేసికొంటాడు? సంరక్షిస్తాడు? నాశనంచేస్తాడు? విష్ణువుతో సమానంగా ఎట్లా గౌరవించబడతాడు? (2. 197).

భీష్ముడు : బ్రహ్మదేవుడు లోకంలో రక్షాస్థితి నేర్పరచటానికి సప్తసోపానాలు, దండనీతి ద్వాదశరాజమండలాలు, పంచోపాయాలు మొదలైనవాటిని, వాటి లక్షణాలను, అవి పురుషార్థకాలుగా ఉండేటట్లు, లక్ష అధ్యాయాల నీతిశాస్త్రాన్ని నిర్మించాడు. అది క్రమంగా మానవ లోకానికి అనుగుణంగా సంక్షిప్తం చేయబడింది. దానిని అభ్యసించి, ఆచరణలో పెట్టి, పెట్టించగలిగిన మానస పుత్రుడిని విష్ణువు సృష్టించాడు. అతడు విరజుడు. అతడు దండనీతిని పాటించటానికి భయపడ్డాడు. అతడి మనుమడు అనంగుడు దండనీతిని అమలుజరిపాడు. ఇట్లా రాజులలో కొందరు దండనీతిని పాటించక అసమర్థ లయ్యారు. పాటించి విష్ణుతేజులయ్యారు. ఆ వంశంలోనే వేనుడి చరిత్ర ప్రసిద్ధమైనది. వేనుడు ప్రజావిరుద్ధుడయ్యాడు. మునులు అతడిని మంత్రించి కుడితొడను మథించారు. నిషాదులు పుట్టి దండనీతి విరహితులయ్యారు. మరల కుడిబాహువు మథించారు. ఒక మహాపురుషుడు పుట్టాడు అతడిని దండనీతి ఆశ్రయించింది. అతడే వైన్యుడు. అతడు మునుల బోధ విన్నాడు. దురహంకారం, లోభం, కామక్రోధాలు అనే దుర్గుణాలను వదిలినవాడూ, సమస్త ప్రాణుల పట్ల సమభావంతో శాస్త్రసమ్మతంగా రాజధర్మాన్ని రక్షించేవాడూ, పక్షపాతం లేక కర్తవ్య పాలనం చేసేవాడూ, దండనీతిని అనుసరించి ధర్మసంరక్షణమే దైనందిన విధి అని నియమనిష్ఠలతో జీవించేవాడూ, వేదధర్మాన్ని రక్షించి, వర్ణసాంకర్యం పరిహరించి దయాంతఃకరణంతో ప్రజలను పాలించేవాడూ రాజు అనబడతాడు. ఆ ప్రతిజ్ఞను పాటించేవాడే పట్టాభిషేక యోగ్యుడు. అతడికి బ్రాహ్మణ సహాయ సహకారాలు అత్యవసరం. వైన్యుడు ఆ లక్షణాలన్నీ సాధించి సమస్త దేవతల యొక్క అనుగ్రహాన్ని పొందాడు. శాస్త్రోక్తంగా దండనీతితో ధర్మానురక్తుడై, సత్యవ్రతుడై, పరిపాలన సాగించాడు. అతడి సంతానం దండనీతిని అనుష్ఠించింది. శ్రీ మహావిష్ణువు ఫాలభాగంలో పుట్టిన లక్ష్మి ధర్మదేవుడి భార్య అయి, అర్థమనే పుత్రుడిని పొందింది. ఆ ముగ్గురూ రాజును ఆశ్రయిస్తారు. అందుకే రాజు, ఇతరులవంటివాడు కాక, విష్ణు సన్నిభుడుగా పరిగణించబడ్డాడు. వేదాలూ, పురాణాలూ, ఇతిహాసాలూ, చతుర్వర్ణాలూ, చతురాశ్రమాలూ వాటి రక్షణా రాజాజ్ఞకు లోనై ఉంటాయి. రాజులు దేవతలతో సమానులని అందుకే అంటారు.

ప్రశ్న 3. : ధర్మరాజు - తాతా! నాలుగు వర్ణాలూ, నాలుగు ఆశ్రమాలూ, వాటిని ఆచరించే పద్ధతులూ వివరించి, రాజధర్మాలను విపులీకరించుము. (2.219).

భీష్ముడు : నాలుగు వర్ణాలవారికి సామాన్య గుణాలు - కోపంలేకుండా శాంతంగా ఉండటం, సత్యాన్నే చెప్పటం, స్వభార్యయందే రమించటం, పరిశుద్ధత, రహస్యగోపనం, ద్రోహచింతలేకపోవటం అనే ఉత్తమగుణాలు.

బ్రాహ్మణ లక్షణాలు:- ఇంద్రియ నిగ్రహం శ్రేష్ఠ ధర్మం, వేదాధ్యయనం నిత్యకృత్యం. వేద విహిత కర్మలు సదా నిష్ఠతో నిర్వహించాలి. సన్మార్గవర్తనం, దయాంతఃకరణం, శాంతస్వభావం, అధిక ధనం లభిస్తే తన సంతానానికి కాక అర్హులైన వారికి పంచిపెట్టటం అర్హ లక్షణాలు.

క్షత్రియ లక్షణాలు :- ఆజ్ఞాచరణం, దానకర్మ, వేదాధ్యయనం, దొంగలను (నేరగాళ్ళను) శిక్షించటం, ప్రజానురాగంతో పాలించటం, యుద్ధంలో ఓడిపోతానని భయం లేకుండా పరాక్రమించటం రాజధర్మాలు. వీటన్నింటిలో యుద్ధమనేది ఉత్తమ ధర్మం.

వైశ్యలక్షణాలు :- వేదాధ్యయనం, దాన యజ్ఞాచరణం, న్యాయార్జనం, పశుపాలనం.

శూద్రలక్షణం :- బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు సముచిత రీతిలో పనులు చేస్తూ ఉండటం. రాజాజ్ఞతో ధనధాన్యాలు సమకూర్చుకొనాలి, రాజాజ్ఞ లేకుండానే దానధర్మాలు నిర్వహించవచ్చును. త్రివర్ణాలవారూ యజ్ఞకార్యాల్లో శ్రద్ధ కలిగి ఉండాలి. యజ్ఞకార్యం కర్మలన్నింటిలోనూశ్రేష్ఠం. యజ్ఞకర్త వర్ణాలవారందరి కంటె శ్రేష్ఠుడు.

చతురాశ్రమ లక్షణాలు:

బ్రహ్మచర్యాశ్రమం:- గురుసేవ, వేదాధ్యయనం, గోష్ఠులపట్ల, అలంకారాలపట్ల అనాసక్తి, భిక్షాన్నంతో జీవించటం, రాగ ద్వేషాలకు దూరమై సమభావంలో ఉండటం.

గృహస్థాశ్రమ ధర్మాలు: - స్వభార్యాసక్తి, దయ, సత్యనిష్ఠ, ఓర్పు, సజ్జనసాంగత్యం, దేవతల పితృదేవతల అతిథుల సమర్చనం, సమస్తాశ్రమ నిర్వాహకులను శక్త్యనుసారం పోషించటం.

వానప్రస్థాశ్రమ ధర్మాలు:- సంతానంపట్ల మమకారం వదలటం, తానొక్కడు గానీ, భార్యాసమేతంగా గానీ, ఘోరారణ్యానికి వెళ్ళటం, అభిమానాహంకారాలను వదలిపెట్టటం, జడలు ధరించి ఇంద్రియ నిగ్రహం పాటించటం, శాస్త్రాధ్యయనం చేయటం, జ్ఞానుల గోష్ఠిలో పాల్గొనటం.

సన్న్యాసాశ్రమ ధర్మాలు:- మమకార విరహితుడై ఎక్కడో ఒక్కచోట ఉంటూ, ఆకలైనప్పుడు ఏదో ఒకటి తింటూ, ఎక్కడ ఉన్నప్పుడు రాత్రి అవుతుందో అక్కడే పడుకొంటూ, అగ్నికార్యాలను త్యజించి నడుచుకొంటూ, తనంతటతాను ఏదీ కోరకుండా ఉంటూ, ఇంద్రియ నిగ్రహానికి ఉపకరించే పద్ధతులను మెచ్చుకొంటూ, నమస్కారాలను అంగీకరించకుండా ఉంటూ జీవితం గడపాలి.

చతుర్వర్ణాలవారెవరైనా ఈ నాలుగాశ్రమాలను చేపట్టవచ్చును. ఆశ్రమలక్షణాల కనుగుణంగా వర్తించవచ్చును. ధర్మాలన్నింటిలో రాజధర్మం శ్రేష్ఠమైనది. రాజంటే ధర్మదేవతే కాని వేరు కాదు. దీనికి ఉపబలకంగా మాంధాతృ చరిత్రాన్ని స్మరించవచ్చును.

ధర్మరాజా! కామక్రోధాలను దహించి, ఆశ్రమధర్మాలను రక్షిస్తూ, ప్రజలను దండనీతితో సమంగా కాపాడుతూ రాజ్యం చేయటం మంచిది. భిక్షాటన మొదలైన వాటివలన కలిగే మేలూ, శ్రేష్ఠమైన ధర్మాలవలన సమకూరే శ్రేయస్సు క్రమంగా రాజుకు లభిస్తాయి. రాజు 'నా శరీర రక్షణం ముఖ్యం' అనుకొనకుండా 'ప్రజారక్షణం కర్తవ్యం' అనే స్థిరసంకల్పంతో ఉండటంవలన సమస్త ధర్మనిర్వహణం వలన కలిగే ప్రయోజనాలన్నీ సిద్ధిస్తాయి.

ప్రశ్న 4. : రాష్ట్ర ప్రజలు ఏ కార్యాలు ఆచరిస్తే సుఖులౌతారు? (2.254).

భీష్ముడు : ధర్మరాజా! ఉత్తమగుణ విలసితుడైన రాజును అభిషేకించుకొని, ఆ రాజు మూలాన సమస్త కార్యాలను నిర్వర్తింపజేసికొంటూ ప్రజలు మిక్కిలి సుఖిస్తారు. రాజ్యపాలనం లేకపోతే ప్రజలు దుర్మార్గవర్తనులై పరస్పరం భార్యలను, సంపదలను దొంగిలించటం ప్రారంభిస్తారు. పెద్ద చేపలు చిన్న చేపలను మ్రింగినట్లుగా, బలవంతులు బలహీనులను బలిగొంటారు (హింసిస్తారు). రాజు లేకుండా ప్రజలు జీవించలేరు. వ్యవసాయం, వర్తకం, గోరక్షణం మొదలైన జీవనోపాధి మార్గాలు ధ్వంసమౌతాయి. దీనికి మనువు చరిత్ర దృష్టాంతం. ప్రజలు గౌరవించని ప్రభువును శత్రువులు లెక్కచేయరు. రాజు ప్రజలను తండ్రిగా కాపాడాలి. విరోధిజనభయంకరుడుగా ప్రకాశించాలి. అప్పుడే గౌరవం.

ప్రశ్న 5 : రాజు రక్షకుడే కాక దైవస్వరూపుడనే అంశం మరింత ధ్రువీకరించుము. (2. 264).

ఉత్తరం : బృహస్పతి వసునందనుడనే రాజుకు చెప్పిన రాజధర్మ ప్రకారం మరికొన్ని విశేషాలను వెల్లడిస్తుంది. వాటిల్లో కొన్ని- రాజులేకపోతే నీరు ఎండిపోయిన మడుగులో జలచరాలవలె ప్రజలు ఇక్కట్ల పాలౌతారు. రాజు లేని రాజ్యంలో ప్రజలు భయాందోళనలకు గురి అయి, హాహాకారాలు చేస్తూ తల్లడిల్లిపోతారు. రాజు లేకపోతే బంధుమిత్రులు లేనట్లే, రాజు ఉంటే సంపద, సంరక్షణ ఉన్నట్లే. రాజు చారచక్షువు. లోకాన్ని రక్షించేటప్పుడు సూర్యుడు. దుష్టులను సంహరించటంలో యముడు. కాబట్టి రాజు దైవస్వరూపుడు. ప్రజలు రాజుకు శరీరంవంటివారు. ప్రజలకు రాజు ఆత్మవంటివాడు. అందుచేత రాజు ప్రజలను సంరక్షించటంలోనూ, ప్రజలు రాజును సేవించటంలోనూ పరస్పరం విధ్యుక్త ధర్మాలను నెరవేరుస్తూ ప్రకాశించాలి.

ప్రశ్న 6 : రాజు గ్రామీణ ప్రజలను ఎట్లా పాలించాలి? శత్రుసంహారం ఎట్లా చేయాలి? (2. 275).

ఉత్తరం : రాజు మొట్టమొదట తనను తాను జయించుకొనాలి. అంటే ఇంద్రియ నిగ్రహం సాధించాలి. రాజు ఆ తరువాత శత్రువులను జయించాలి. రాజు తిరిగే చోట్లలో భద్రత కలిగించాలి. గూఢచారులతో శత్రు మిత్ర రహస్యాలను తెలిసికొని తగినట్లు వ్యవహరించాలి. తాను బలహీనుడని శత్రువులు గ్రహించకముందే, తనకంటె బలవంతుడైన శత్రువుతో వెంటనే సంధిచేసికొనాలి. చివరకు శత్రువును ధనమిచ్చి అయినాసరే తన రాజ్యాన్ని రక్షించుకొనాలి. శత్రువు మైమరచి ఉన్నప్పుడు దండెత్తాలి, లేదా సంక్షోభం కలిగించాలి. అనవసరంగా యుద్ధానికి దిగరాదు. ఒకవేళ యుద్ధమే అవసరమైతే సామదానభేదాలు విఫలమైనప్పుడే యుద్ధం ప్రకటించాలి.

స్వామి, అమాత్యుడు, జనపదం, ధనాగారం, సైన్యం, మిత్రులు, దుర్గం - అనే రాజ్యాంగ సప్తకాన్ని పరిశీలించాలి. సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సమాశ్రయం - అనే ఆరు రాజ్యతంత్రాలను రాజనీతితో నిర్వర్తిస్తూ ధర్మార్థకామాలను నిర్వర్తించాలి. మంత్రం, ప్రభువు, ఉత్సాహం అనే శక్తిత్రయాన్ని స్వాధీనం చేసికొని గుణత్రయంతో ధర్మానుగుణమైన సేవ చేయటం రాజనీతి.

ప్రశ్న 7 : రాజూ, దండనీతి - ఈ రెండూ కార్యసిద్ధి కలిగించే పద్ధతులు చెప్పుము. (2. 286).

ఉత్తరం : ధర్మరాజా! ఆయాయుగాలలో రాజనీతిని బట్టి ధర్మం కొనసాగుతుంది. కృతయుగంలో వలె రాజు ధర్మాన్ని మూడు పాదాల నిర్వహిస్తే, అదే రీతిగా ధర్మం అభివృద్ధి చెందుతుంది. లేని పక్షంలో - అంటే త్రేతా ద్వాపర కలియుగాలలో వలె క్రమంగా రాజు అనుసరించే దండనీతి ప్రకారం ధర్మం నశిస్తూ ఉంటుంది.

ప్రశ్న 8 : ఎటువంటి నడవడి కల రాజుకు శుభాలు కలుగుతాయి? (2. 295)

ఉత్తరం : ప్రజల తప్పులను పరిశీలించేవాడూ, ప్రజలు చేసిన పనులను గుర్తించేవాడూ, మదం, లోభం, ఆవేశం లేనివాడూ, దొంగ కానివాడూ, ఆత్మస్తుతి విముఖుడూ, నియమబద్ధమైన జీవితం గడిపేవాడూ, దానశీలి, పరాక్రమవంతుడు, నిగర్వి, కుత్సితుడు కానివాడు, పరస్త్రీ విముఖుడు, క్రోధరహితుడు అయిన రాజు మిక్కిలి ప్రకాశిస్తాడు. తోటమాలి కావలసిన పుష్పఫలాలను కోసుకొన్నట్లు రాజు కూడా జాగరూకుడై కప్పాలను గ్రహించాలి. అట్లాకాక ఫలపుష్పాల నిచ్చే చెట్లను నరికీ తగలబెట్టి బొగ్గులుగా మారిస్తే భూమి నాశనమౌతుంది. కాబట్టి తోటమాలివలె రాజు జాగరూకుడై ప్రజలను సంరక్షిస్తూ కప్పం గ్రహించేవాడికి మేలు కలుగుతుంది. ప్రజలను రక్షించటమే రాజుకు ప్రధాన ధర్మం. తపోయాగకర్మల కంటె అది ఉత్తమం. ప్రజారక్ష చేసే రాజుకు విజయంతో పాటు సంపద, కీర్తి ఉత్తమ గతులు లభిస్తాయి. (దీనికి ఉపబలకంగా భీష్ముడు పురూరవుడికి వాయుదేవుడు చెప్పిన రాజధర్మాలను కూడా తెలిపాడు).

ప్రశ్న 9 : ఏ పనులు చేస్తే పురోహితుడు మాన్యుడౌతాడు? (2. 304).

ఉత్తరం : పురోహితుడి విషయంలో శుక్రుడి వాక్యాలు కొన్ని వినుము. పురోహితుడి బుద్ధిబలంచేత నిర్వహించబడే యజ్ఞయాగాదులవలన రాజు అమర, గరుడ, గంధర్వ, విద్యాధరులు మొదలైన సమస్త దేవలోక వాసులకు సంతృప్తి కలిగించి శుభపరంపరలను పొందుతాడు. శాంతి పౌష్టిక కార్యాలూ, శత్రువినాశనమూ మంత్రవేత్త అయిన ఉత్తమ పురోహితుడి వలననే సాధ్యమని బృహస్పతి సైతం పేర్కొన్నాడు. బ్రాహ్మణ క్షత్రియులు అన్యోన్యులై అనుకూలంగా సరైన మార్గంలో రాజ్యకార్యకలాపాలు నిర్వర్తిస్తే బ్రహ్మాది దేవతలూ, బ్రాహ్మణాది సమస్త వర్ణాలవారూ మిక్కిలి సంతోషిస్తారు. ఈ అంశానికి ఉపబలకంగా ఐలుడికీ కశ్యపప్రజాపతికీ మధ్య సాగిన సంభాషణమనే ఇతిహాసం వినదగింది, అంతేకాక కుబేరుడికీ ముచుకుందుడికీ సాగిన సంవాదం స్మరించతగింది.

ప్రశ్న 10 : రాజ ధర్మాలలో పరమ సంపదనూ, పుణ్యలోక ప్రాప్తినీ ప్రసాదించగల ధర్మమేది? (2. 326).

ఉత్తరం : ధర్మరాజా! అత్యంతభీతులైన ఉత్తమ జనులకు అభయమిచ్చి, వారికి సమస్త సుఖాలు ప్రాప్తింపజేసి, సంతోషాంతరంగులను చేయటంకంటె పుణ్యలోకప్రాప్తిని కలిగించే ధర్మం మరొకటి లేదు.

ప్రశ్న 11 : బ్రాహ్మణాది వర్ణాలవారు తమతమ వర్ణధర్మాలను తప్పితే ఏ మౌతుంది? (2. 330).

ఉత్తరం : ఆపద సమయాలలో ఆయా వర్ణాలవారు స్వజాతి ధర్మాలను వదలినా నిందార్హులుకారు. శస్త్రోపజీవులైన రాజులు ఆచరించే ధర్మాలను బ్రాహ్మణులు ఆచరించి, బ్రాహ్మణ్యాన్ని కోల్పోయి, రాజుతో సమానులౌతారు. నిత్యకృత్యాలైన అగ్నిష్టోమాది కార్యాలను వదలిపెట్టి ధనలోభులై శూద్రులవలె ప్రవర్తించి శూద్రులతో సమానులౌతారు. అట్లాగే ఇతర వర్ణాలవారు తమతమ ధర్మాలను వదలిపెట్టి ఇతర ధర్మాచరణంచేత తమ వర్ణాలకంటె హీనులైన వారౌతారు. అట్లాంటివారు ఉత్తమ కార్యాలను ఆచరించటానికి అర్హులు కారు. ఈ అంశాలను రాజు జాగరూకుడై గుర్తించి, ఆయా వర్ణాలవారిని తగిన రీతిలో సంరక్షించటం రాజుకు ఉత్తమ ధర్మం. ప్రజలు ధర్మాచరణంవలన సంపాదించుకొనే పుణ్యంలో రక్షకుడైన రాజుకు నాలుగవవంతు వస్తుంది. పాపంలోకూడా అంతే. కొందరు ప్రజల పాపమంతా రాజుకు దక్కుతుందంటారు.

ప్రశ్న 12 : ఓ తాతా! అనేక పాపాలకు ఆకరమైన రాజ్యభారాన్ని అంగీకరించలేను. దండనీతి ప్రయోగం మిక్కిలి కఠినమైనది. దానిని నేను నిర్వహించలేను. ప్రశాంతమైన తపోవనంలో ముక్కుమూసికొని జీవించాలని కోరుకొంటున్నాను. (2. 333).

ఉత్తరం : ధర్మరాజా! ఇది నీలోని జడత్వమే కాని వేరు కాదు. కాకపోతే ఇది క్షత్రియ ధర్మమా? నీ మనసు మిక్కిలి మెత్తనిదని నాకు తెలుసు. అయినా రాజు కుండవలసిన లక్షణమా ఇది? నీకు నచ్చచెప్పటానికి నీ తండ్రి పాండురాజుగానీ, విచిత్రవీర్య శంతను మహారాజులుగానీ ఇప్పుడు లేరు కదా! వారు చెప్పితేనన్నా వింటావేమో? వారందరూ క్షత్రియోచిత ధర్మపాలన చేశారు. దండనీతితో రాజ్యం పాలించారు. ఆ పూర్వరాజుల సంప్రదాయాన్ని పాటించటం నీకూ ధర్మమే. రాజధర్మాలు చేయకుండా మానితే నరకప్రాప్తి తప్పదు. రాజధర్మం నిర్వహిస్తే ఇహపరసుఖాలు లభిస్తాయి. దీనిని తేటపరిచే కేకయరాజ రాక్షస సంవాదమనే ఇతిహాసం తప్పక విని దాని తాత్పర్యాన్ని గ్రహించి ఆచరించాలి.

ప్రశ్న 13 : జీవనం కొనసాగించటం కష్టమైనప్పుడు క్షత్రియోచిత కర్మానుష్ఠానం నెరపలేని బ్రాహ్మణుడు ఎట్లా జీవించాలి? (2. 343).

ఉత్తరం : బ్రాహ్మణుడు తన వృత్తిలో జీవించలేనప్పుడు ఆపద్ధర్మంగా వైశ్యవృత్తిని స్వీకరించి జీవించవచ్చును. అయితే అధిక ధనం లభిస్తుందన్న ఆశతో ఉప్పు, నువ్వులు, మాంసం, గోవులు, ఎద్దులు, అన్నం, కల్లు, నేయి, నూనె, తేనె, గుర్రాలు మొదలైనవి అమ్మరాదు.

ప్రశ్న 14 : యజ్ఞాలు ఏవిధంగా పవిత్రాలు (సత్యసమ్మతాలు- సమీచీనాలు) ఔతాయి? (2. 345)

ఉత్తరం : యజ్ఞకర్తకు శ్రద్ధ అత్యంతావశ్యకం. బూటకాలు పనికిరావు. వేదాలను అవమానించి తిరస్కరించరాదు. అంతేకాదు. యజ్ఞాలలో ఋత్విజుల కిచ్చే భూరిదక్షిణలు వేదమంత్రార్థాలకు మిక్కిలి పుష్టిని, తుష్టిని చేకూరుస్తాయి అని పెద్ద లంటారు.

ప్రశ్న 15 : నమ్మకమైన స్నేహితులు లేకపోతే రాజకార్యం నీతిమార్గంలో సాగటం కష్టం. ఎట్లాంటివాడిపట్ల మిక్కిలి నమ్మకం కలిగి ఉండాలి? (2. 350).

ఉత్తరం : నమ్మకపోవటం మృత్యుసమానం. అతిగా నమ్మటం అపమృత్యువువంటిది. కాబట్టి నమ్మీ నమ్మక పనులు సాధించాలి. ఎల్లప్పుడూ సూక్ష్మబుద్ధితో మిత్రుల వర్తనలను సమీక్షించుకొంటూ ఉండాలి. ఈ అంశంలో కాలక వృక్షీయ క్షేమదర్శుల సంవాదమనే ఇతిహాసం ప్రసిద్ధం.

ప్రశ్న 16 : మంత్రి ఎటువంటి వాడుగా ఉండాలి? (2. 368).

ఉత్తరం : జ్ఞానధనుడూ, పౌరజానపదులకు ఆప్తుడూ, కార్యవేత్తా, ధైర్యపరాక్రమాలలో గొప్పవాడూ, క్రౌర్యంలేనివాడు, పరిశుద్ధాత్ముడూ, రాజుపట్ల భక్తి గౌరవాతిశయాలతో సుఖదుఃఖాలను సమంగా స్వీకరించగలవాడై, చెమటను రక్తంగా భావించి, తెలియక తనపై దోషారోపణ చేసినా, కోపంతో దూషించినా, ఏ మాత్రం కలత చెందక, అనునయంతో రాజుపొందు చెడకుండా మసలుకొనగలిగినవాడూ, తమదోషాలను కప్పిపుచ్చుతూ, శత్రువుల లోపాలను గుర్తించి వాళ్ళను చిక్కులపాలు చేయగల నైపుణ్యం కలవాడూ అయిన విశాలబుద్ధి మంత్రిగా ఉండటానికి అర్హుడు.

ప్రశ్న 17 : ప్రజలలో కలిగే వివాదాలలో తీర్పుచెప్పేటప్పుడు రాజునకు ఎట్లాంటి నిందా, పాపం సోకకుండా ఉండేమార్గం ఏది? (2. 373).

ఉత్తరం : రాజుకు వ్యవహార శుద్ధి అవసరం. అది ప్రజల మన్ననలను పొందుతుంది. నిత్యసత్య వచనులూ, ధర్మాత్ములూ అయిన బ్రాహ్మణులూ, రాజూ కలిసి సమభావంతో ప్రజల వివాదాలు తీర్చేటప్పుడు, ఇరుపక్షాలవారి వాదాలనూ పక్షపాతం లేకుండా విని, ధనాశతో ధనవంతులవైపు మొగ్గకుండా, న్యాయమైన తీర్పు చెప్పి, శిక్షించవలసి వచ్చినప్పుడు ఉచితమైన శిక్ష విధించాలి. పక్షపాతబుద్ధితో తీర్పు చెప్పితే డేగను చూచిన పక్షులు చెల్లాచెదరై పోయినట్లు ప్రజలు రాజాశ్రయానికి దూరమౌతారు.

ప్రశ్న 18 : రాజధాని ఏ తీరులో ఉంటే మంచిది? (2. 382).

ఉత్తరం : విశాలమూ లోతూ అయిన అగడ్తతో, పొడవూ దిట్టమూ అయిన కోటను కలిగి, కోటకు తగిన ద్వారాలు కలిగి, వాటికి గట్టి కాపలాతో మనోహరమైన భవన సముదాయమూ, వీథులు, అంగళ్ళూ, వివిధ వస్తువులు శోభిల్లుతూ ఉండగా, సజ్జన సమూహంతో నిండి ఉండగా, వివిధ ధాన్యరాశులూ, రసద్రవ్యాలూ, పలు యంత్రాలూ, తగిన ఆయుధాలూ, మేటి యోధులూ, ఉత్తమ విద్వాంసులూ, విలాసినీమణులూ, దూతలూ మొదలైన పరివారాలూ నిండి ఉండగా

ఉత్సవాలూ, పండుగలూ, పబ్బాలూ వైభవంగా జరుగుతూ ఉంటే రాజధాని రాణిస్తుంది. అందులో నవరత్నాలు, బంగారంవంటి విలువగల వస్తువులకు, బంధువులకు నగరం సురక్షిత కోశంవలె ఉండాలి.

ప్రశ్న 19 : కోశాభివృద్ధిని కలిగించే మార్గాలు తెలుపుము.? (2. 390).

ఉత్తరం : రాజుకు ధనం సమకూర్చుకొనటంలో కృషీవలులు, వర్తకులు, గోపాలురు ముఖ్యమైన వనరులు. ధనధాన్యాలను ఉత్పత్తి చేసే స్థానాలకు ఏ మాత్రం భంగం కలుగని విధంగా మిక్కిలి నైపుణ్యంతో రాజు కోశాభివృద్ధిని సాధించాలి. ఆకలితో ఉన్న పులి తన పిల్లలను తానే తిన్నట్లుగా రాజు ధనాశతో ప్రజలనుండి పన్నులు వసూలుచేస్తే ప్రజాగ్రహంతో కోశాభివృద్ధి దెబ్బతింటుంది. ప్రజలకు బాధ కలుగకుండా జలగ నెత్తురు పీల్చినట్లు పన్నులు వసూలు చేయాలి. రాజు ధనసంపాదనకు ఉచితమైన మార్గాలను అన్వేషించాలి. అంతేకాని, కపటోపాయాలతో నైపుణ్యం ప్రదర్శించటం సమంజసం కాదు. ఈ రంగంలో పూర్వం ఉతథ్యుడు మాంధాతకు చెప్పిన హితవాక్యాలు తెలిసికొనదగినవి.

ప్రశ్న 20 : ధర్మమార్గానువర్తనంతో ఏ రీతి ప్రఖ్యాతిని పొందవచ్చును? (2. 407)

ఉత్తరం : పూర్వం వసుమను డనే కోసలరాజు ఇదేవిధంగా అడుగగా వామదేవమహర్షి చెప్పిన వాక్యాలే నీ ప్రశ్నకు తగిన ప్రత్యుత్తరమౌతుంది. ఆ వాక్యాల తాత్పర్య మేమంటే - ధనం కూడబెట్టటమే లక్ష్యంగా భావించి ధర్మాన్ని లెక్కచేయకపోతే, ఆ రాజు సంపాదించిన ధనం నాశనం కావటమే కాక, అతడికి దుష్కీర్తి, నరకప్రాప్తి సంభవిస్తాయి.

ప్రశ్న 21 : శత్రువులను జయించే సందర్భంలో యుద్ధనీతి ఎట్లా ఉండాలి? (2. 419).

ఉత్తరం : ధర్మరాజా! యుద్ధంలో శత్రువు సైన్యాలతో సిద్ధమై ఎదుర్కొంటే, నీవూ సైన్యంతో ఎదిరించాలి. శత్రువు ఎక్కటి కయ్యానికి సిద్ధమైతే నీవూ అసహాయశూరుడవై యుద్ధం చేయాలి. మాయోపాయాలతో శత్రువు యుద్ధం చేయటం ప్రారంభిస్తే నీవూ కపటోపాయాలతో ఎదిరించి విజయాన్ని సాధించాలి. వెన్నిచ్చి పారిపోయినా, ఏమరుపాటున పడిపోయినా, ఆయుధం భగ్నమైనా, శరణువేడుకొన్నా, మ్రొక్కినా, గుర్రాలు నేలపై కూలినా, పారిపోయినా, వేరొకడితో యుద్ధం చేస్తున్నా ఎట్లాంటి శత్రువునైనా చంపరాదు. అధర్మంగా శత్రువును చంపటం కంటె ధర్మయుద్ధ విహారంలో చావటం మంచిది. రాజు పడకమీద మరణించటం పనికిరాదు. అందుకని యుద్ధంలో ఓడిపోరాదు. శత్రువుపై దండెత్తిపోయి అతడి పట్టణాన్ని నాశనం చేసేటప్పుడు ప్రజలను మాత్సర్యంతో బాధించరాదు. కొల్లగొట్టేటప్పుడు బ్రాహ్మణగృహాలను, దేవాలయాలను దోచుకొనరాదు.

ప్రశ్న 22 : తాతా! రాజధర్మంకంటె పాపకార్యం మరొకటి లేదనిపిస్తున్నది. ఎట్లా చూచినా 'రాజ్యాంతే నరకం ధ్రువమ్' అని తేలుతున్నది. ఏమంటావు? (2. 425).

ఉత్తరం : శరణాగతులను సంరక్షించి, యుద్ధంలో శత్రువుల బాధలకు గురి అయిన వారిని తెచ్చి. వారికి తగిన సేవలు చేసి, బ్రాహ్మణులను పోషించి, అనేక యజ్ఞాలను నిర్వహించి, రాజు పాపాలను పరిహరించుకొనవచ్చును.

ప్రశ్న 23 : యుద్ధంలో వెనుదీయక పరాక్రమాలను ప్రదర్శించి ప్రాణాలను కోల్పోయిన వారికి ఎట్లాంటి లోకాలు కలుగుతాయి? (2. 427)

ఉత్తరం : నీ ప్రశ్నకు సమాధానంగా ఇంద్రాంబరీష సంవాదం చెప్పుతాను అందులోని ముఖ్యాంశాలు - ఎన్ని యజ్ఞయాగాదులైనా యుద్ధయజ్ఞానికి సమానం కావు. వీరుల తలలరాశులే వేదికగా, ఖడ్గబాణాది సాధనాలు సమిధలుగా, రక్తమే నేయిగా, మాంసం పురోడాశంగా, వీరమనే వ్రతం పూనిన వాడు యుద్ధమనే యజ్ఞాన్ని

సలిపి, రక్తమనే జలంతో కూడిందీ, మెదళ్ళనే బురద కలిగిందీ, వెంట్రుకలనే పాచి కలదీ, పేగులనే నురుగుకలదీ, యుద్ధభేరులనే కప్పలు కలదీ, ఖడ్గాలనే చేపలు కలదీ, ఏనుగుల మృతకళేబరాలనే ఇసుక దిబ్బలు కలదీ అయిన స్వర్గగంగలో అవభృథస్నానం చేసినా స్వర్గలోకంలో శాశ్వత పదవిని పొందగలుగుతారు. పుణ్యాత్ముడు కావటానికి యజ్ఞాలు చేయనక్కరలేదు. యుద్ధంలో సాహసోపేతంగా పోరాడటమే చాలు. ఇది యుద్ధాచరణం వలన కలిగే పుణ్యం.

ప్రశ్న 24 : పోరుకు పోవటానికి వీలైన కాలనిరూపణం మొదలైన ఉపాయాలను తెలియచెప్పుము. (3.2)

ఉత్తరం : వానలు పడేటప్పుడు, చలిలో వణికేటప్పుడు, బాగా ఎండలు కాసేటప్పుడు కాక, పంటలు పండేకాలంలో శత్రువులపైకి దండెత్తిపోవాలి. పచ్చికా, కట్టెలూ, నీళ్ళూ దొరికే త్రోవలో దండును నడిపించుకొని పోవటం మంచిది. పగవారు కలవరపడేటట్లు జెండాలూ, కవచాలూ, డాళ్ళూ, ధనుస్సులూ మొదలైన ఆయుధాలనూ, రథాల, ఏనుగుల, గుర్రాల వాహనాలను ఇంతకుముందు కనీవినీ ఎరుగని రీతిలో అమర్చుకొనాలి. హోరెత్తించే మంచి శంఖాలూ, మంచి బాకాలూ, మంచి డప్పులు మొదలైన చర్మవాద్యాలూ ఉండటం మంచిది. సైన్యం బసచేసేచోటు సమతల ప్రదేశంగా ఉండాలి. చారులను పంపించి విరోధుల మార్గాలను గూర్చి తెలిసికొనాలి. అప్పటికే వారు దండెత్తి వస్తుంటే కాలుమోపటానికి వీలులేని త్రోవలలో కాని, అలసిన సమయాలలోకాని, దండు విడిసినప్పుడు గానీ వాళ్ళను చంపటం తగిన పద్ధతి.

ప్రశ్న 25 : యుద్ధభటులుగా ఎట్లాంటి వారు ఉండాలి? (3. 9).

ఉత్తరం : ఏనుగు వంటి బలం, పులిసింహాలవంటి భీకరత్వం, చాకచక్యం గలవారు భటులుగా ఉండాలి. ఆయాదేశాలకు చెందిన వీరుల ప్రత్యేకతలను బట్టి వారిని సేనలో చేర్చుకొని ఆయా రంగాలలో ఉపయోగించుకొనాలి. ఉదాహరణకు గాంధార సింధుదేశీయులు గొడ్డళ్ళ, ఈటెల యుద్ధంలో, తూర్పుదేశంవారు ఏనుగుల నెక్కి చేసేయుద్ధంలో నిపుణులు, యవనులు కాంభోజులు అశ్వయుద్ధంలో, ఔశీనరదేశీయులు అన్ని ఆయుధాలతో చేసే యుద్ధాలలో ప్రసిద్ధులు. ఇట్లా వారివారి నేర్పుల నెరిగి వారి సేవలు వినియోగించుకొనాలి.

ప్రశ్న 26 : జయం సాధించే సేన ఎటువంటి లక్షణాలతో ఉంటుంది? (3. 11).

ఉత్తరం : విజయం సాధించే సేన మంచి ఉత్సాహంగా ఉంటుంది. గుర్రాల సకిలింతలు చెవికి ఇంపుగా ఉంటాయి. ఏనుగుల సేన విజృంభిస్తుంది. ఇవి విజయ సూచకాలు.

ప్రశ్న 27 : రాజు విరోధుల విషయంలో ఎట్లా ప్రవర్తించాలి? (3. 19).

ఉత్తరం : పగవాడిని తుదముట్టించాలన్నా, పాడుచేయాలన్నా అదనుకొరకు వేచి ఉండాలి. అంతేకాని, కరుకుగా, వ్యర్థంగా మాటలాడికాని, పుల్లవిరుపు పలుకులు పలికి గాని వాళ్ళను మోసగించని రీతిలో నమ్మినట్లు మాటలతో కనపరచాలి. కాని, లోపల ఏ మాత్రమూ నమ్మకం పెట్టుకొనకూడదు. ఒక్కసారి ఎక్కువమందిమీద ద్వేషం పెట్టుకొనకూడదు. తగ్గి ఉన్న పగవాడిపై పగపట్టాలి. కాని, మిగతా శత్రువులతో ఆత్మీయంగా మెలగాలి.

ప్రశ్న 28 : సొంతబలగంవలననో, ఇతరులవలననో రాజ్యం కోల్పోయి అగచాట్లు పడే రాజు తన బాధను ఎట్లా దిగమ్రింగు కొంటాడు? (3. 26).

ఉత్తరం : కోసలదేశరాజు క్షేమదర్శి విదేహరాజు చేతిలో రాజ్యాన్ని కోల్పోయి చాల దుఃఖించాడు. అంతకుముందు తనకు మంత్రిగా ఉండి, అడవులలోనికి వెళ్ళిన కాలవృక్షీయుడి నీడపట్టున చేరి నీ వడిగినట్లే అడిగాడు. ఆ రాజుకు ఆ ముని

చెప్పిన మాటలే నీ ప్రశ్నకు తగిన సమాధానం. ఆ తాత్పర్యం ఇది. అయిపోయిన దానిని గూర్చి విచారించి ప్రయోజనం లేదు. కాబోయే వాటిని గూర్చి ఆశ పనికిరాదు. దైన్యాన్ని దరిదాపులకు రానీయరాదు. దైవం ఎట్లా నడిపిస్తే అట్లా నడవక తప్పదనే నిశ్చయానికి రావాలి. రాజులకు జయాపజయాలు అనుభావ్యాలు, మద విషాదాలు అనాదరణీయాలు.

ప్రశ్న **29** : పరిజనంలోని గణజనులను పాలించే పద్ధతి తెలపండి. (3. 37).

ఉత్తరం : గణజనులు ఒక తెగకు చెందినవారైనా మంచిచెడ్డలు తెలియనివాళ్ళై, వారివారి తెలివిని, పౌరుషాన్నీ, గౌరవాన్నీ గూర్చి లెక్కచేయరు. అందువలన ఎట్లాంటి వారితో అయినా విరోధం పెట్టుకొంటారు. ఆ కారణంగా లోపలలోపల విభేదాలు వస్తాయి. దానిని ఆసరాగా తీసికొని శత్రువులు చేరదీస్తారు. గణజనంతో ఇట్లాంటి మనఃస్పర్థలు ఏర్పడితే మూలగద్దెకే ముప్పు వస్తుంది. కాబట్టి ఇదంతా రాకముందే వారినందరినీ రాజు మంచి మాటలు చెప్పి, దాన ధర్మాలు చేసి గౌరవించి ఆదరించాలి. వారిలో వారు విడిపోకుండా చూచుకొంటూ చక్కదిద్దుకొనాలి. చీలికలు వస్తే మాత్రం రాజ్యం కుప్పకూలిపోతుంది.

ప్రశ్న **30** : ధర్మాలు ఎన్నో రూపాలలో ఉన్నాయి. వాటన్నిటినీ ఆచరించటం సాధ్యం కాదు. కనుక ఏ ధర్మాన్ని ఆచరిస్తే మానవుడు ఇహపరాలలో సుఖిస్తాడు? (3. 42).

ఉత్తరం : తల్లీ, తండ్రీ, గురువూ నిత్యం సేవించదగినవారు. ఎంతో భక్తితో వారికి సేవలందిస్తూ వా రేది చెప్పితే దానిని ఆచరణలో పెట్టటం ఉత్తమ ధర్మం. ఈ ముగ్గురూ వేదత్రయం వంటివారు, త్రేతాగ్నులవంటివారు, ముల్లోకాల వంటివారు, త్రిమూర్తులవంటివారు. వీరిలో తల్లికే ఎక్కువ గౌరవం. తల్లిదండ్రుల మీద అభిమానం కలవాడు ఇహపరలోక సుఖాలు పొందుతాడు. గురువును సేవించుకొనేవాడు అవ్యయానందాన్ని పొందుతాడు.

ప్రశ్న **31** : లోకంలో నిజానిజాలు సిద్ధమై ఉన్నాయి. వాటి విషయంలో మనిషి తనకు తానుగా ఏ విధంగా ధర్మానికి బద్ధుడై ఉండాలి? (3. 44).

ఉత్తరం : ధర్మాలలో కెల్ల ఉత్తమ ధర్మం నిజం చెప్పటం. పాపాలలో కెల్ల మహాపాపం అబద్ధాలాడటం. విశేషమేమంటే - పరాయివాడి సొమ్మును, ఉసురునూ దోచుకొనాలనుకొనే పాపులతో నిజం చెప్పటం కన్నా చేటు మరొకటి లేదు. అబద్ధాలు ఆడైనా సరే అటువంటి వారిని బాధించటం ఎంతో న్యాయం. అంతేకాదు ప్రజలకు మేలు చేసే అబద్ధాలన్నీ పుణ్యాలు (ధర్మాలు) ఔతాయి. సాటి జీవులను వేధించే సత్యాలన్నీ పాపాలు (అధర్మాలు) ఔతాయి. అందరిలోనూ ఉన్న మంచి చెడులను అతిసూక్ష్మమైన వివేకంతో తెలిసికొనాలి.

ప్రశ్న **32** : ఎట్లాంటివారు తమ పాపాలనుండి విముక్తులు కాగలరు? (3. 46)

ఉత్తరం : వర్ణాశ్రమాచార నియమాలను పాటించేవారూ, ఇంద్రియ నిగ్రహం కలవారూ, నిందించగా నిందించనివారూ, ఉదారగుణం కలవారూ, అతిథులను ఆదరించేవారూ, వేదాలను వల్లించేవారూ, యుద్ధంలో తెగించి పోరాడేవారూ, దేవతారూపాలనన్నింటిని సమంగా భావిస్తూ మనసుకు నచ్చిన రూపాన్ని కొలిచేవారూ పాపమనే కొండలను సులభంగా దాటగలరు.

ప్రశ్న **33** : లోకంలో సౌమ్యులు అసౌమ్యులుగానూ, అసౌమ్యులు సౌమ్యులుగానూ కనిపిస్తుంటారు. వారి అసలు స్వరూపాన్ని తెలిసికొనటం ఎట్లా? (3. 52).

ఉత్తరం : ఈ ప్రశ్నకు వ్యాఘ్రగోమాయు సంవాదమనే ఇతిహాసం చక్కని సమాధానం. దానివలన తెలిసే తాత్పర్య మేమంటే రాజు ఇతరులు చెప్పే మాయమాటలలో పడి మోసపోకుండా మంచీచెడ్డా తానే యోచించుకొనాలి. ఇది మంచిది, మంచిదికాదు అని విడివిడిగా తెలిసికొనగల సామర్థ్యం కలిగి ఉండాలి. అపుడే పరిపాలకుడు సరైన నిర్ణయం తీసికొనగలడు.

ప్రశ్న 34 : రాజు ఎట్లా నడచుకొంటే సుఖపడతాడు? (3. 82)

ఉత్తరం : ఏమరుపాటు లేకుండా ఎదుటివారి సాయం కావాలి అని అనుకొనేవాడు తప్పక సుఖాలు పొందుతాడు. ఒంటె నక్కల కథ ఇందుకు తార్కాణం.

ప్రశ్న 35 : శత్రురాజు అధిక బలవంతుడైతే, అల్పబలంగలరాజు ఆపదలనుండి ఎట్లా గట్టెక్కగలుగుతాడు? (3. 85).

ఉత్తరం : బలహీనుడైన రాజు తన బలాన్నీ, ఎదుటివాడి బలాన్నీ అంచనావేసికొని, మొండిగా పోరుకు దిగకుండా, పగవాడి మిడిసిపాటును యుక్తియుక్తంగా తొలగించుకొనాలి (దాటివేయాలి). అపుడే ఆ రాజు ఎట్లాంటి చెరుపూ లేకుండా నిలబడగలుగుతాడు. ఈ వాస్తవానికి సముద్ర సరిత్సంవాదం అద్దంపట్టుతుంది.

ప్రశ్న 36 : మంచి కులంలో పుట్టిన సేవకుడు పదవికి తగ్గట్లుగా జతపడకపోతే రాజు ఏం చేయాలి? (3. 91)

ఉత్తరం : సామర్థ్యం తెలిసికొనకుండా కేవలం కులాన్ని మాత్రమే ప్రమాణంగా పెట్టుకొని సేవకులకు పదవు లివ్వరాదు. యోగ్యుడికి కులంతో పనిలేదు. దీనికి చిన్నకంతలలోకైనా దూసుకొని పోయేకాంతికిరణాలవలె చాతుర్యంగల పరిజనులను ఎక్కడబడితే అక్కడ ప్రవేశపెట్టాలి. రహస్యంగా ఎదుటివారి పనులన్నింటినీ ఎప్పటికప్పుడు చాల మెలకువగా పసికట్టాలి. సూర్యుడివలె వెలగటం రాజుకు తగును. దీనికి 'మునీ, కుక్కా' కథ ఒక చక్కని ఉదాహరణం.

ప్రశ్న 37 : రాజులకు దండం సర్వసాధారణం. దాని స్వరూపాన్ని తెలియజేయుము. (3. 108)

ఉత్తరం : దండనీతి మంచివాళ్ళను మెప్పిస్తుంది. చెడ్డవాళ్ళ పొగరును అణచివేస్తుంది. కత్తి, గద, తోమరం, విల్లమ్ములు, రోకలి, చక్రం, ఈటే, చిల్లకోల, త్రిశూలం, గొడ్డలి మొదలైనవి పదకొండు ధర్మనీతికి పనిముట్లు. దాని ఒంటిరంగు నల్లటినలుపు. దానికి నాలుగు కోరలూ, నాలుగు చేతులూ, ఎనిమిది కాళ్ళూ ఉంటాయి. పెక్కు చెవులూ కళ్ళూ ఉంటాయి. చూచేవారికి భయం కలిగించే ఎర్రటి ముఖం, గోరోచనంతో ఉండే జడలూ ఉంటాయి. ఇవీ దండం రూపరేఖలు. వసుహోముడు మాంధాతకి చెప్పిన దండోత్పత్తి ప్రకారం తెలిసికొన దగింది.

ప్రశ్న 38 : ధర్మార్థ కామాలతో ఎట్లా నడుచుకొంటే మంచిది? (3. 123)

ఉత్తరం : పూర్వం కామందకుడనే ముని అంగరిష్ఠుడనే రాజుకు తెలిపిన అంశం దీనికి తగిన సమాధానం. ధర్మం దక్కించుకొనటానికి ఆధారం అర్థం. ఆ అర్థం పట్ల నిష్ఠతో ఎట్లాగైనా ధర్మాపేక్షను విడనాడకూడదు. కామబుద్ధితో కాక లభ్యమైన తగిన సౌఖ్యాలను అనుభవిస్తూ రాజ్యాన్ని పాలించేవాడు ఉత్తముడు.

ప్రశ్న 39 : శీలం గొప్పదని లోకం మెచ్చుకొంటుంది. దాని స్వరూపం తెలుపుము. (3. 126).

ఉత్తరం : మంచి ప్రవర్తన కలిగి ఉండటమే శీలం. శీలవంతుడు సంపదలతో తులతూగుతాడు - ధర్మరాజువలె, ప్రహ్లాదుడివలె. త్రికరణశుద్ధిగా ప్రాణులకు ఎట్లాంటి హాని చేయకుండా ఉండటమే శీలం. శీలం వలన ధర్మం, ధర్మంవలన సత్యం, సత్యంవలన ప్రవర్తన, ప్రవర్తనవలన బలం, బలంవలన సంపత్తి రాణిస్తాయి. కనుక అన్ని శుభాలకూ శీలం మూలం.

ప్రశ్న 40 : ఆశను అణచటం కష్టం కదా! (3. 150).

ఉత్తరం : మనసును ఆశకు వశంచేస్తే, ఆశలు నిరంతరంగా కొనసాగుతూనే ఉంటాయి. కాబట్టి ఆశను చంపుకొనటమే సుఖం. ఆశ నెరవేరకపోయినా బాధపడవద్దు. సుమిత్రుడనే రాజు చరిత్రం ఈ నీతిని బోధిస్తుంది.

ప్రశ్న 41 : ఎన్ని విన్నా తనివి తీర లేదు; తాతా! మరికొన్ని ధర్మపద్ధతులు చెప్పుము? (3. 169).

ఉత్తరం : 1. రాజు తనదేశంలోనూ, శత్రుదేశంలోనూ ధనం సంపాదించుకొనాలి. ఏలుబడికీ, పుణ్యపురుషార్థాలకూ మూలం ఆ ధనమే. అయినా, రాజుకు శక్తికిమించిన యత్నం కూడదు.

2. ధనం లేని రాజును ప్రజలూ, కుటుంబ సభ్యులూ లక్ష్యపెట్టరు, పగవారు ఆదరించరు.

3. దారిదోపిడీ దొరలను రాజు తన సైన్యంలో చేర్చుకొనరాదు.

4. న్యాయాన్ని పట్టించుకొనని సైన్యం యుద్ధంలో గెలుపొందదు. దీనికి ఉపబలకంగా కాపవ్యోపాఖ్యానం తెలియదగినది.

5. దూరదృష్టితో పనిని ముందుగానే తెలిసికొని తగిన జాగ్రత్తతో దానిని చక్కదిద్దుకొనాలి. లేకపోతే మూర్ఖుడై విపత్తుకు గురి ఔతాడు. అప్పటికి తట్టినట్లు ఉపాయంతో అపాయాన్ని ధైర్యంగా ఎదుర్కొని పనిచేసేవాడు ఎప్పుడూ సందేహంతో ఊగిసలాడే బ్రతుకు బ్రతుకుతాడు. రాబోయే పనిని ముందుగా ఊహించుకొని సమర్థంగా ఆపనిని యుక్తిగా చేసికొనే నీతిమంతుడు సుఖంగా ఉంటాడు. ఈ నీతికి ఉదాహరణంగా దీర్ఘసూత్రుడు, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘదర్శి అనే మూడు చేపల కథను స్మరించాలి.

ప్రశ్న 42 : ఎంతోమంది శత్రువులచేత చిక్కి బలం కోల్పోయిన రాజు ఆ ఆపదనుండి ఎట్లా గట్టెక్కుతాడు? (3. 202)

ఉత్తరం : దీనికి తగిన ఉపాయం చెప్పేకథ 'మార్జాల మూషిక సంవాదం'. దాని తాత్పర్యం - తొందర పడక సరైన తరుణంలో చేసిన ప్రయత్నమే పరిపూర్ణంగా సఫలమౌతుంది. బలవంతుడైన శత్రువుతో అవసరం కొద్దీ స్నేహం చేసినా, ఆ అవసరం తీరగానే అతడి స్నేహాన్ని వదలుకొనాలి. ఒకవేళ నమ్మితే చివరకు ఆపదపొందక తప్పదు. నమ్మతగని వాళ్ళను నమ్మనే కూడదు. నమ్మదగ్గవాళ్ళనైనా తగినంతగానే నమ్మాలి. ఇతరులు నమ్మేటట్లు నడచుకొంటూనే తాను వాళ్ళను నమ్మకపోవటం నీతి. బలంగల శత్రువుల వలన కలిగే ఆపదలను తొలగించుకొనటానికి అల్పుడైన శత్రువునైనా తనతో కలుపుకొని జీవించవచ్చును.

ప్రశ్న 43 : ఎవడినీ నమ్మకపోతే మనస్సుకు ఊరట కలుగదు. నమ్మితే పాపాలు సంభవిస్తాయి. నమ్మటం నమ్మకపోవటం - అనే రెంటిలో ఏది ముఖ్యంగా ఆచరించతగిందో పేర్కొనుము. (3. 244)

ఉత్తరం : ఈ అంశాన్ని తేటపరిచేది బ్రహ్మదత్తుడికీ పూజని అనీ పేరుగల గోరువంకకూ సాగిన సంవాదం. దాని తాత్పర్యం - ప్రజలెవరినీ రాజు గట్టిగా నమ్మకూడదు. అప్పుడే తననూ, తన సంపత్తినీ సంరక్షించుకొనగలుగుతాడు. ఈ సందర్భంలో కణికుడు శత్రుంజయుడికి ఉపదేశించిన హితవచనాలను గమనించాలి. వాటి సారమేమంటే - సమయాన్నిబట్టి శత్రువును భుజాలమీద ఎక్కించుకొని మొయ్యాలి. సమయం కనిపెట్టి రాతినేలమీద కుండను ఎత్తి బ్రద్దలు కొట్టినట్లు నేర్పుగా శత్రువును నశింపచేయాలి. రాజు తాను తలపెట్టిన పని సానుకూలపడేదాకా ఎవ్వరూ తెలిసికొనలేని వాడుగా ఉండాలి. ప్రజల విషయంలో విన్నా వినని వాడివలె, చూచినా చూడనివాడివలె నడుచుకొనాలి.

ప్రశ్న 44 : కరువు కాటకాలలో తిండి దొరకనప్పుడు బ్రాహ్మణాది మూడు వర్ణాల వారు ఏ విధంగా ప్రాణాలు రక్షించుకొనాలి? (3. 298).

ఉత్తరం : ఈ సందేహాన్ని తీర్చేది విశ్వామిత్ర చండాల సంవాదం అనే ఇతిహాసం. ప్రాణం పోకుండా రక్షించుకొనటానికి, మరేం ఉపాయం లేనప్పుడు, దొంగతనం చేసి ఊపిరి నిలుపుకొనటం ధర్మమే ఔతుంది. అప్పుడు నీచుడి సొమ్మైనా పుచ్చుకొనటం ప్రశస్తమైనదే ఔతుంది.

ప్రశ్న 45 : శరణన్నవారిని ఆదుకొనాలి అనుకొనే వారికి ఏ పాటి ఫలితం దక్కుతుంది? (3. 304).

ఉత్తరం : పూర్వం శుక్రాచార్యుడు ముచుకుందుడనే రాజుకు చెప్పిన బోయవాడు పావురం కథ (లుబ్ధకపోతో పాఖ్యానం) ఈ ప్రశ్నకు ప్రచ్ఛన్న సమాధానం. ఆ కథా తాత్పర్యమిది - ఆదుకొనే వారికి ఆవును చంపిన పాపం కూడా పోతుంది. ఆదుకొననివాడు ఎన్నడూ వీడని పాపాన్ని అనుభవిస్తాడు.

ప్రశ్న 46 : తెలియకుండా చుట్టుకొన్న పాపాన్ని సజ్జనులు ఎట్లా పోగొట్టుకొనాలి? (3. 343).

ఉత్తరం : పరీక్షిన్మహారాజు కొడుకు జనమేజయుడు తనకు తెలియకుండానే బ్రహ్మహత్యాపాతకం చుట్టుకొన్నాడు. దానిని ఆతడు పోగొట్టుకొన్న కథ పురాణాలలో ప్రసిద్ధి కెక్కింది. దాని తాత్పర్యం ఇది - పాపం చేసి పరితపించినా, ఇక మీదట ఇట్లాంటి పాపాలకు ఒడిగట్టనని అనుకొన్నా, న్యాయంగా మెలగటం ఉత్తమం అని నిర్ణయించుకొన్నా, పుణ్యం పొందాలని అపేక్షపడి ఉపకారం చేసినా, వీటి అన్నిటివలన కానీ, ఏ ఒక్క అంశంవలన కానీ, పాపపంకం క్రమ క్రమంగా తుడిచిపెట్టుకొని పోతుంది. ఇందులో ఏమీ అనుమానం లేదు. జనమేజయుడు తీర్థయాత్రలు చేసి పుణ్యవంతు డయ్యాడు; అశ్వమేధయాగంచేసి రాజ్యాన్ని పాలించాడు. ఇంకా గృధ్రజంబుకోపాఖ్యానం కూడా వినుము. దాని తాత్పర్యం - కష్టాలలో ఉన్నవాళ్ళ కన్నీళ్ళు తుడవటం రాజుల కర్తవ్యం. స్వార్థపరుల పన్నాగాలను మాయగాళ్ళ మాటకారితనాన్నీ తెలిసికొని తెలివిగా వ్యవహరించాలి. ఇంకొక కథ 'పవన శాల్మలీ తరు సంవాదం' వినుము. దీనివలన మహాబలవంతుడితో బలహీనుడు తలపడి పగపెట్టుకొంటే తన వైభవాన్ని కోల్పోతాడని స్పష్టమౌతుంది.

ప్రశ్న 47 : పాపానికి మూలం ఏది? ఆ పాపం ఉండే స్థానాన్ని తెలియ చెప్పుము. (3. 398).

ఉత్తరం : పాపాలన్నిటికీ మూలం పేరాశ. అది కోరికలపట్ల నిలకడలేనితనాన్నీ, కోపాన్నీ, పగనూ, హింసాభావాన్నీ, ఇతరుల ఆస్తులపట్ల, స్త్రీలపట్ల కోరికనూ, దీనత్వాన్నీ, సిగ్గు ఓర్పు నిజాలపట్ల ఏవగింపునూ పుట్టిస్తుంది. న్యాయాన్ని చెరుస్తుంది. నిందలను లెక్కపెట్టకుండా ప్రతిదానికీ అత్యాశపడేవాడినిగా మనిషిని తయారు చేస్తుంది. కాబట్టి లోభులను విడిచిపెట్టాలి.

ప్రశ్న 48 : విపత్తులకూ, చెడునడతకూ అజ్ఞానమే ఆధారం అని విన్నాను. ఆ అజ్ఞానం తీరు తెన్నులను తెలుపుము. (3. 400).

ఉత్తరం : కోపం, దుఃఖం, ప్రేమ, పగ, అహంకారం, గర్వం, తొందరపాటు, మందకొడితనం - వీటి సంపర్కమే అజ్ఞానం అని పండితు లంటారు. పేరాస పడటం, తెలివి లేకపోవటం - ఈ రెండూ ఒకేరకమైన ఫలాన్ని ఇస్తాయి. లోభంవలన అజ్ఞానం పుట్టుతుంది.

ప్రశ్న 49 : ధర్మం నానాప్రకారంగా వింటుంటాం. విశిష్టమైన ధర్మ మేది? (3. 403).

ఉత్తరం : ధర్మాలన్నిటిలో దమం ఉత్తమం. అది ముక్తిదాయకం. సకలధర్మసారం; దమం కలవాడు కామక్రోధలోభ మదమాత్సర్యాలను జయిస్తాడు. పరబ్రహ్మమును చేరతాడు.

ప్రశ్న 50 : తపస్సు తీరును వివరించుము. (3.411)

ఉత్తరం : ధర్మాలకన్నిటికీ తపస్సే మూలం. ఆహార నియమమే తపస్సు. అదే మహాధర్మం. తపస్సువలన పంచమహాపాతకాలు మొదలైన పాపాలన్నీ పటాపంచలౌతాయి. సత్యం, శుచి మొదలైనవి అలవడతాయి. సమస్తకార్యసిద్ధులూ సులభంగా అందుబాటులోకి వస్తాయి.

ప్రశ్న 51 : దేవతలూ, పితృదేవతలూ, బ్రాహ్మణులూ మొదలైనవారంతా సత్యాన్ని మెచ్చుకొంటారు. దాని స్వరూపాన్నీ, దానిని అవలంబించే తీరునూ చెప్పుము. (3. 416).

ఉత్తరం : సమత, దమము, తితిక్ష, అమత్సరం, సిగ్గు, ధైర్యం, అనసూయ, ఆర్యత్వం, అహింస, దానం, క్షమ, యజనం, నిజం చెప్పటం - అనేవి సత్య స్వరూపాలు. నిత్యానుష్ఠానపరులకు ఈ గుణాలు సులభంగా, సుఖదంగా అలవడుతాయి. సత్యం అన్ని ధర్మాలకూ పాదువంటిది. సత్యంవలననే యోగక్షేమాలు కలుగుతాయి. అసత్యంకంటె వేరేపాపం లేదు. ఆలోచించగా ఒక్క సత్యంతో వేయి అశ్వమేధయాగాలు చేసిన ఫలంకూడా సాటిరాదు.

ప్రశ్న 52 : అరిషడ్వర్గం దేనివలన పుట్టుతాయి? దేనివలన గిట్టుతాయి? (3. 420).

ఉత్తరం : కామం సంకల్పం నుండి పుట్టుతుంది. దాని రూపం ఇట్లాంటిదని తెలిసికొంటే ఆ కోరిక పోతుంది. ఇతరులుచేసిన తప్పువలన కోపం వస్తుంది. తరగని ఓర్పు వలన అది తగ్గిపోతుంది. ప్రాణకోటి శాశ్వతం కాదు అనే తెలివి లేకపోవటం వలన లోభం పుట్టుతుంది. ఆ తెలివి పొందితే అది పోతుంది. అవివేకంవలన మోహం కలుగుతుంది. అధర్మం జోలికి పోకపోతే అది నశిస్తుంది. కులం, చదువూ, సంపదలవలన మదం ఏర్పడుతుంది. వాటి పెంపుదలను తలపోస్తే అదే దూరమవుతుంది. సాత్త్వికగుణం కొరవడటం వలన పగపుట్టుతుంది. మంచివాళ్ళను సేవించటంవలన అది తొలగుతుంది.

ప్రశ్న 53 : రాజునకు కావలసినవారూ, అక్కరలేనివారూ ఎట్లాంటివారు? (3. 467).

ఉత్తరం : ఓర్పుకలవారు, ధర్మశాస్త్రాలు తెలిసినవారు, సత్యవంతులు, చపలచిత్తం లేనివారు, పొగరుగానీ, పేరాశగానీ లేనివారూ, చక్కటి నడవడి కలవారూ, మాటకారితనం, పనులలో శ్రద్ధ, ఎంతో ఆనుకూల్యం కలిగిన సేవకులు యజమానికి సకల సంపదలు పొందిస్తారు. క్రూరులు, పేరాశపరులు, మూర్ఖులు, చాడీలు చెప్పేవారు, మందకొడులు, చేసిన మేలు మరిచిపోయేవారు, తెలివి మాలినవారు, అబద్ధాలాడేవారు, నిందపడేవారు, పిరికివారు, తెగింపులేనివారు, నీతిమాలినవారు, మితిమించిన చెడు అలవాట్లు కలవారు రాజునకు దగ్గరగా ఉంటే ఆపద ముంచుకొస్తుంది. నీచులలో కెల్లా చేసిన మేలు మరచిపోయేవారు (కృతఘ్నులు) అసలే తగినవారు కారు. దీనిని చెప్పే కాశ్యప గౌతమాఖ్యానం (నాడీ జంఘుడి చరిత్రం) ప్రసిద్ధం. బ్రాహ్మణహత్య చేసినవారికైనా పాపనిష్కృతి ఉన్నది కాని, కృతఘ్నుడికి మాత్రం పాపవిముక్తి లేదు. మిత్రద్రోహం కృతఘ్నత కంటె ఘోరమైనపాపం. మిత్రుడు ఇహపరలోకాల సౌఖ్యాన్ని అందించగలడు. ధనంకంటె మిత్రుడే మిన్న. మంచి మిత్రులను పొందటంవలన మేలు కలుగుతుంది.

(తృతీయాశ్వాసంలో 3. 428 - 440 పద్యాలలో లోకనీతులు, 3. 441 -452 పద్యాలలో నకులు డడుగగా భీష్ముడు చెప్పిన ఖడ్గమహిమ, ధర్మరాజ విదురాదుల సంభాషణలలో ధర్మార్థ కామాల తారతమ్య వివేచనం (3. 453 - 466) చెప్పబడి ఉన్నాయి.)

జి.వి. సుబ్రహ్మణ్యం

ప్రధాన సంపాదకుడు.

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము

(మొదటి భాగము)

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
మహర్షులు పాండవులం జూడవచ్చుట	12 - 1 - 1	01
నారదుఁడు ధర్మరాజునకుఁ గర్ణుని చరితంబు సెప్పుట	12 - 2 - 1	09
ధర్మరాజు స్త్రీలకు రహస్య రక్షణంబు లేకుండ శపియించుట	12 - 6 - 11	20
అర్జునుఁడు ధర్మజున కుచిత వచనంబుల మనస్తాపోపశమంబు సేయుట	12 - 8 - 1	23
నకులుఁడు ధర్మజునకు మనస్తాపోపశమంబు సేయుట	12 - 12 - 1	34
ద్రౌపది ధర్మజునకు హితవచనంబుల మనస్తాపోపశమంబు సేయుట	12 - 14 - 1	39
జనకున కతని సతితో నైన సంవాదం బర్జునుఁడు ధర్మజునికిఁ జెప్పుట	12 - 18 - 1	51
దేవస్థానుం డను ముని ధర్మజునకు హితోపదేశంబు సేయుట	12 - 20 - 1	56
పారాశర్యుఁడు సుద్యుమ్ను చరితంబు ధర్మజునకుఁ జెప్పుట	12 - 24 - 1	63
లిఖితుండు సుద్యుమ్నునిచేత నికృత్తకరుం డగుట	12 - 24 - 19	65
పారాశర్యుఁడు ధర్మజునకు సేనజిత్తువాక్యంబు లుపన్యసించుట	12 - 26 - 13	74
జనకున కశ్మకుండు సెప్పిననీతి వ్యాసుఁడు ధర్మజునకుఁ జెప్పుట	12 - 2 - 82	82
ధర్మరాజునకుఁ గృష్ణుఁడు షోడశరాజుల చరిత్రంబులు సెప్పుట	12 - 29 - 16	89
శ్రీ కృష్ణుఁడు ధర్మజునకుఁ బర్వత నారదుల వృత్తాంతంబు సెప్పుట	12 - 30 - 4	100
శార్దూలంబుచేఁ జచ్చిన సువర్ణష్ఠీవి నారదువలనఁ బునర్జీవితుఁ డగుట	12 - 31 - 41	109
కృష్ణద్వైపాయనుఁడు ధర్మజునకు ధర్మాధర్మంబు లెఱింగించుట	12 - 36 - 1	119
వ్యాసుఁడు ధర్మజునకు బ్రాయశ్చిత్త విశేషంబు లెఱిఁగించుట	12 - 36 -1	122

కృష్ణద్వైపాయనుఁడు ధర్మజునకు నపాత్రపురుషుల నెఱింగించుట	12 - 37 - 23	131
ధర్మరాజు సపరివారంబుగాఁ గరినగరంబుఁ బ్రవేశించుట	12 - 38 - 34	140
చార్వాకుం డను రాక్షసుఁడు బ్రాహ్మణ నిగ్రహంబునఁ జచ్చుట	12 - 39 - 22	145
ధర్మరాజు పట్టాభిషేక మహోత్సవము	12 - 40 - 9	151
ధర్మజుఁడు శ్రీకృష్ణు నుచిత వచనంబుల స్తుతించుట	12 - 43 - 1	159

ద్వితీయాశ్వాసము

ధర్మనందనుని ప్రవర్తనము	12 - 45 - 3	167
ధ్యానాసక్తుఁడైన శ్రీకృష్ణునింగని ధర్మజుఁడు సంభాషించుట	12 - 45 - 13	169
భీష్ముఁడు శ్రీకృష్ణుని భక్తియుక్తుండై స్తుతించుట	12 - 47 - 7	178
శ్రీకృష్ణుఁడు ధర్మరాజునకు బరశురాముని చరిత్రంబు చెప్పుట	12 - 49 - 1	195
పరశురాముఁడు కార్తవీర్యార్జునిఁ జంపుట	12 - 49 - 41	201
భూదేవి కశ్యపునితోఁ బరశురామునిచేఁ జావనిరాజులఁ జెప్పుట	12 - 49 - 66	206
కృష్ణుఁడు ధర్మజునకు ధర్మము లుపదేశింప భీష్ము నియమించుట	12 - 50 - 29	213
ధర్మరాజు కృష్ణాదులతోడ భీష్మపాలికిం బోవుట	12 - 53 - 27	222
భీష్ముఁడు ధర్మరాజును సప్రేమంబుగా గారవించుట	12 - 55 - 1	231
భీష్ముఁడు ధర్మజునకు విప్రులలో దండార్హుల నిరూపించుట	12 - 56 - 29	238
భీష్ముండు ధర్మజునకు దండనీతి జన్మప్రకారం బెఱింగించుట	12 - 59 - 11	247
వైన్యుం డనురాజు చరిత్రంబు భీష్ముఁడు ధర్మజునకుం జెప్పుట	12 - 59 - 201	252
భీష్ముఁడు ధర్మజునకు వర్ణాశ్రమ ధర్మంబు లెఱింగించుట	12 - 60 - 1	258
రాష్ట్రజనుల కర్మధర్మంబులు భీష్ముఁడు ధర్మజునకుఁ దెలుపుట	12 - 67 - 2	268
బృహస్పతి వసుమనుం డను రాజునకుం జెప్పిన రాజధర్మ ప్రకారము	12 - 68 - 1	273
వాయుదేవుఁడు పురూరవునకుఁ జెప్పిన రాజధర్మ ప్రకారము	12 - 73 - 2	286
కుబేరునకు ముచుకుందునకుఁ గలిగిన సంవాదము	12 - 75 - 3	291
కేకయరాజ రాక్షస సంవాద ప్రకారము	12 - 78 - 6	299
కాలక వృక్షీయ క్షేమదర్శ సంవాద ప్రకారము	12 - 83 - 1	306

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బండారంబు వృద్ధిసేయు తెఱంగు భీష్ముండు ధర్మజునకుఁ జెప్పుట	12 - 89 - 1	316
మాంధాతృన కుతథ్యుఁడు సెప్పిన హితవాక్యముల ప్రకారము	12 - 91 - 1	319
వసుమనుం డను రాజునకు వామదేవుండు సెప్పిన ధర్మప్రకారము	12 - 93 - 1	322
ధర్మజునకు భీష్ముండు సమరంబున పాడి దెల్పుట	12 - 96 - 6	326
ఇంద్రాంబరీష సంవాద ప్రకారము	12 - 99 - 1	329
సమరానివర్తనంబు వలని ఫలము	12 - 100 - 1	336

తృతీయాశ్వాసము

కాలనిరూపణాదులగు రణోపాయంబుల ప్రకారంబు	12 - 101 - 2	339
ధర్మజునకు భీష్ముఁడు శకునాపశకునములు దెలుపుట	12 - 103 - 2	344
రాజు పగఱయెడ నుండవలయు విధము	12 - 104 - 2	346
కాలకవృక్షీయ మహాముని క్షేమదర్శికిఁ జెప్పిన హితవాక్యములు	12 - 105 - 2	348
ధర్మజునకు భీష్ముండు గణజనులం బాలించు ప్రకారంబు సెప్పుట	12 - 108 - 10	353
ధర్మరాజునకు భీష్ముండు ధర్మసూక్ష్మత తెఱం గెఱింగించుట	12 - 109 - 3	355
పాపనిస్తరణ ప్రకారము	12 - 111 - 2	357
వ్యాఘ్రగోమాయువు సంవాదము	12 - 112 - 2	359
భీష్ముండు ధర్మజునకు సహాయ సంపన్నత్వం బావశ్యకం బగుట సెప్పుట	12 - 113 - 1, 2	367
సముద్ర సరిత్సంవాదము	12 - 114 - 2	369
కుర్కుర నీచత్వముం దెలుపునట్టి యితిహాసము	12 - 117 - 2	371
భీష్ముఁడు ధర్మజునకు దండనీతి ప్రభావం బెఱింగించుట	12 - 121 - 8	377
వసుహోముఁడు మాంధాతృనకుఁ జెప్పిన దండోత్పత్తి ప్రకారము	12 - 122 - 1	379
భీష్ముఁడు ధర్మరాజునకు ధర్మార్థకామంబుల తెఱం గెఱింగించుట	12 - 123 - 3	383
భీష్ముఁడు ధర్మజునకు సుమిత్రుఁ డను రాజు చరిత్రంబు సెప్పుట	12 - 125 - 8	392
భీష్ముఁడు ధర్మజునకుఁ గాపవ్యోపాఖ్యానము సెప్పుట	12 - 131 - 1	399
భీష్ముఁడు ధర్మజునకు దీర్ఘదర్శి మొదలగు మత్స్యముల తెఱం గెఱింగించుట	12 - 135 - 1	402
పలితరోమశు లను మూషికమార్జాలంబుల సంవాద ప్రకారము	12 - 136- 18	407

బ్రహ్మదత్తునితోఁ బూజని యను శకునికైన సంవాద ప్రకారము	12 - 137 - 4, 5	419
కణికుఁడు శత్రుంజయున కుపదేశించిన హితవచనముల ప్రకారము	12 - 138 - 4	424
విశ్వామిత్ర చండాల సంవాదము	12 - 139 - 12	428
భీష్ముఁడు ధర్మజునకు శరణాగత రక్షణ సుకృతం బెఱింగించుట	12 - 141 - 4	436
కపోతంబు దన శరీరమును బోయ కాహారంబుగా నిచ్చుట	12 - 142 - 43	441
భీష్ముఁడు ధర్మజునకు గృధ్రజంబుకోపాఖ్యానము సెప్పుట	12 - 149 - 1	454
భీష్ముఁడు ధర్మజునకు బవన శాల్మలీతరు సంవాదంబులు సెప్పుట	12 - 150 - 1	460
భీష్ముఁడు ధర్మజునకు దమంబు ప్రభావం బెఱింగించుట	12 - 154 - 6	467
భీష్ముఁడు ధర్మజునకు దపంబు విధము సెప్పుట	12 - 155 - 1	469
భీష్ముఁడు ధర్మజునకు సత్య స్వరూపాదులు సెప్పుట	12 - 156 - 3	470
భీష్ముఁడు ధర్మజున కరిషడ్వర్గాదులు దెలుపుట	12 - 157 - 3, 4	471
భీష్ముఁడు నకులునకు ఖడ్గ ప్రభావంబు తెఱం గెఱింగించుట	12 - 160 - 9	477
ధర్మజునితో విదురాదులు ధర్మార్థ కామంబుల తారతమ్యంబు సెప్పుట	12 - 161 - 4	482
భీష్ముఁడు ధర్మజునకు నాడీజంఘుని చరిత్రంబు సెప్పుట	12 - 162 - 28	486
నాడీజంఘుఁడు దుష్టబ్రాహ్మణునిచే మృతుండై మరల జీవించుట	12 - 166 -23	494

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీ సంక్రామణనిపుణ వి। లాస కటాక్షా! నివృత్తి లంపటచిత్తో
ల్లాసన దక్షా! వేద। వ్యాస వచోవిభవ లక్ష్య! హరిహరనాథా ! 1

ప్రతిపదార్థం: శ్రీ= సంపదను; సంక్రామణ= కలుగజేయటంలో; నిపుణ= మంచి నేర్పరి అయిన; విలాస కటాక్షా!= అందమైన క్రీగంటిచూపు కలవాడా!; నివృత్తి లంపట= సంసారబంధంనుండి విరక్తి చెందటంలో ఆసక్తమయిన; చిత్త= మనస్సుకు; ఉల్లాసన దక్షా!= ఉత్సాహాన్ని కలిగించటంలో సమర్థుడా!; వేదవ్యాస= వేదవ్యాసముని యొక్క; వచో విభవ= వాక్యసంపదకు అంటే ఆ మహర్షి రచించిన బ్రహ్మసూత్రాలలో, మహాభారత పురాణాదులలో గల వాఙ్మయవైభవాని కంతా; లక్ష్య!= లక్ష్యమైనవాడా!, గురి అయినవాడా!, హరిహరనాథా!= ఓ హరిహరనాథస్వామీ!

తాత్పర్యం: భక్తులకు కోరిన సంపద లన్నింటిని ప్రసాదించే నిపుణమైన అందమైన క్రీగంటి చూపులు కలవాడవూ, సంసారబంధాలను వదలి వైరాగ్య చిత్తవృత్తితో ఉన్న విరక్తుల హృదయాలకు ఎల్లప్పుడూ ఆనందోత్సాహాలను కలిగించేవాడవూ, వేదవ్యాస మునీంద్రులవారి వాఙ్మయ వైభవానికంతా గమ్యమైన వాడవూ అయిన ఓ హరిహరనాథస్వామీ! (సావధానంతో నేను చెప్పబోయే ఈ కావ్యార్థాలను అవధరించుము.)

విశేషం: ఆశ్వాసారంభంలో కృతిపతిని సంబోధిస్తూ కందపద్యం చెప్పటం ఆంధ్రకావ్య సంప్రదాయం. అందులో వాడబడే విశేషణాలు ఒక్కొక్కసారి ఆశ్వాస కథార్థాలను వ్యంజింపజేస్తూ ఉండవచ్చును. పాండవులకు శ్రీకృష్ణుడి కటాక్షం వలన రాజ్యసంపదలు దక్కటం, ధర్మరాజుకు మనస్తాపం పోగొట్టే ఉపదేశాలు వ్యాస శ్రీకృష్ణాదులు చేయటం, ధర్మజుడు శ్రీకృష్ణుడిని స్తుతించటం మొదలైన అంశాలున్న ఈ ప్రథమాశ్వాసానికి తగినట్లుగా హరిహరనాథుడికి విశేషణాలు తిక్కన వేయటం విశేషం.

మహర్షులు పాండవులం జూడవచ్చుట (సం. 12-1-1)

వ. **దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నట్లు సకల బంధుమిత్త్ర జనంబులకు నుదకకర్మం బాచరించి పాండవులు గంగాతీరంబున నశుచిత్వం బపనయించుటకయి యొక్కసమస్థలంబునం బటకుటీర సంవిధానంబు సేయించి, ధృతరాష్ట్ర విదుర సర్వభరత భార్యాసమేతంబుగా నచ్చట మాసమాత్రంబు నిలిచి; రట్టియెడం గృష్ణద్వైపాయన నారద దేవల దేవస్థాను కణ్వులు మొదలుగాఁగల మునీంద్రు లనేకులు శిష్యవర్గ సహితంబుగా ధర్మనందను సందర్శనంబునకుం జనుదెంచిన, నజ్జననాథుండు ప్రత్యుత్థాన ప్రణామ పాద్యాస నాకలనంబులను దత్కాలోచితార్చనంబులను నమ్మహాత్ములం బ్రీతులం గావించి, కృష్ణనిజానుజయుక్తంబుగా వారల నుపాసించి యుండ, వారలు బహువిధంబులగు ప్రియవచనంబుల నక్కురువంశసత్తము సంభావింప నారదుం డమ్మహనీయద్విజులం గలయం గనుంగొని యక్కౌంతేయాగ్రజుతోడం దాను గుశల ప్రశ్నంబు లగుమాట లాడంగలవాఁ డగుట వారి కెఱింగించి యమ్మహీపతియాననం బాలోకించి.** 2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దేవా!= ఓ హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= జనమేజయ మహారాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అట్లు= ఆ విధంగా (అంటే వెనుకటి పర్వంలో చెప్పిన విధంగా అని); సకల బంధుమిత్ర జనంబులకున్= బంధువులందరికీ, స్నేహితుల బృందాల కందరికీ; ఉదకకర్మంబు= నీటితో ఇచ్చే తర్పణాలు అనే అపరకర్మల విధానాన్ని; ఆచరించి= నిర్వహించి; చేసి; పాండవులు= పాండవులు; గంగాతీరంబునన్= గంగానది ఒడ్డున; అశుచిత్వంబున్= మైలను (మృతాశౌచాన్ని); అపనయించుటకయి= తొలగించుకొనటం కొరకు; ఒక్క సమస్థలంబునన్= మిట్ట పల్లాలు లేని ఒక నేలమీద; పటకుటీర సంవిధానంబు= గుడ్డతో చేసిన గుడారాలను కట్టించటం; చేయించి= జరిపి; ధృతరాష్ట్ర, విదుర, సర్వభరత భార్యాసమేతంబుగాన్= ధృతరాష్ట్రుడితో, విదురుడితో సమస్త భరత వంశీయుల భార్యలతో సహా; అచ్చటన్= ఆ ప్రదేశంలో; మాసమాత్రంబు= నెలరోజులు మాత్రమే; నిలిచిరి= ఉన్నారు; అట్టి+ఎడలన్= ఆ సందర్భంలో; కృష్ణద్వైపాయన నారద దేవల దేవస్థాణు కణ్వులు మొదలుగాన్+కల ముని+ఇంద్రులు+అనేకులు= వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థాణుడు, కణ్వుడు మొదలైన మహామునులు అనేకులు; శిష్యవర్గ సహితంబుగాన్= శిష్యుల సమూహాలతో కూడుకొని; ధర్మనందనుని సందర్శనంబునకున్= ధర్మరాజును దర్శించుకొనటానికి; చనుదెంచినన్= రాగా; ఆ+జననాథుండు= ఆ రాజు (ధర్మరాజు); ప్రత్యుత్థాన, ప్రణామపాద్య+ఆసన+ ఆకలనంబులను= అతిథులకు నిలిచి ముందేగి ఆహ్వానం చెప్పటం, నమస్కారం చేయటం, కాళ్ళకు నీళ్ళివ్వటం, కూర్చోవటానికి ఆసనమివ్వటం చేతనూ; తత్+కాల+ఉచిత+అర్చనంబులను= ఆ సమయానికి తగిన అనేక అతిథి పూజావిధుల చేత; ఆ+మహాత్ములన్= ఆ వచ్చిన గొప్పవారిని; ప్రీతులన్+కావించి= సంతుష్టులనుగా చేసి; కృష్ణ నిజ+అనుజయుక్తంబుగాన్= శ్రీకృష్ణుడితోనూ, తన సోదరులతోనూ కూడికొని; వారలన్= పెద్దలను; ఉపాసించి+ఉండన్= సేవిస్తూ ఉండగా; వారలు= అక్కడ చేరిన పెద్దలు; బహువిధంబులు+అగు= పలు రకాలైన; ప్రియవచనంబులన్= మంచి మాటలతో; ఆ+కురువంశ సత్తమున్= కురువంశంలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజును; సంభావింపన్= గౌరవింపగా; నారదుండు= నారదమహర్షి; ఆ+మహనీయ ద్విజులను= పెద్దలైన ఆ బ్రాహ్మణులను; కలయన్+కనుంగొని= తేరిపార చూచి; ఆ+కౌంతేయ+అగ్రజుతోడన్= కుంతీపుత్రులలో పెద్దవాడైన ఆ ధర్మరాజుతో; తాను= తాను (నారదుడు); కుశల ప్రశ్నంబులు+అగు మాటలు= యోగక్షేమాలు తెలిసికొనే మాటలు; ఆడన్+కలవాఁడు+అగుటన్= మాట్లాడాలని అనుకొంటున్న వాడనే సంగతి; వారికిన్= అక్కడి పెద్దలకు; ఎఱింగించి= తెలిపి; ఆ+మహీపతి ఆననంబు= ఆ రాజుమొగం; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! జనమేజయ మహారాజుకు వైశంపాయన మహర్షి ఈ విధంగా చెప్పాడు - పాండవులు తమ చనిపోయిన బంధుమిత్రుల కందరికీ జలతర్పణాలను ఇచ్చారు. మృతాశౌచాన్ని పోగొట్టుకొనటానికి గంగానదీ తీరంలో ఒక సమతల ప్రదేశంలో గుడ్డల గుడారాల నెత్తించారు. ధృతరాష్ట్ర, విదురాదులనూ, భరతవంశీయుల భార్యలనూ ఆ గుడారాలలో ఒక నెలరోజులు ఉంచారు. ఆ సందర్భంలో ధర్మరాజును దర్శించటానికి వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థాణుడు, కణ్వుడు మొదలైన మునీంద్రు లెందరో శిష్యులతో సహా విచ్చేశారు. ధర్మరాజు వారందరికీ ఎదురుపోయి, నమస్కరించి, అర్ఘ్యపాద్యాది పూజావిధులతో సత్కరించి వారిని సంతోషపెట్టాడు. శ్రీకృష్ణుడూ, సోదరులూ ఎల్లప్పుడూ తనతో కలిసి ఉంటూ ఉండగా ఆ మహర్షులను ధర్మజుడు సేవించాడు. ఆ రాజును వారందరు ప్రియవచనాలతో పలకరించారు. ఆ తరువాత ఆ మహాత్ములందరి పక్షాన ధర్మరాజును కుశల ప్రశ్నలతో కూడిన మాటలతో సమ్మానించటానికి నారదుడు ముందుకు వచ్చాడు. ఆ మహర్షి పెద్దల నందరిని కలయజూచి ధర్మరాజు ముఖంవైపు చూచి ఇట్లా అన్నాడు:

విశేషం: పితృకర్మలు చేసి పవిత్రులైన పాండవులను ఆశీర్వదించి భావి శుభాలను నిర్దేశించటానికి మునిపరిషత్తు నారదముఖంగా మాట్లాడుతున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శా. **' గోవిందుం డనిశంబు శోభన మెదం గోరంగఁ బార్థుండు ద**
ర్పావేశోజ్జ్వల బాహుసార మహనీయస్ఫూర్తి శోభిల్ల గాం
డీవోల్లాస విభాసియై సమరపాండిత్యంబు పాటింప సం
భావింపన్ జగమెల్ల రాజ్య మిటు లొప్పం గొంటె రాజోత్తమా! **3**

ప్రతిపదార్థం: రాజ+ఉత్తమా!= రాజులలో శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; గోవిందుండు= శ్రీకృష్ణుడు; అనిశంబున్= ఎల్లప్పుడు; శోభనము= శుభమును; ఎదన్= మనస్సులో; కోరంగన్= (నీకు కలుగుతూ ఉండాలని) సంకల్పించగా; దర్ప= గర్వంచేత; ఆవేశ= ఉత్సాహంచేత; ఉజ్జ్వల= ప్రకాశించే; బాహుసార= భుజబలంయొక్క; మహనీయస్ఫూర్తి = గొప్పదైన స్ఫూర్తితో; శోభిల్లన్ = ప్రకాశించగా; పార్థుండు= అర్జునుడు; గాండీవ+ఉల్లాస విభాసి ఐ= గాండీవం వలన కలిగే ఉత్సాహం చేత ప్రకాశించినవాడై; సమరపాండిత్యంబు= యుద్ధవిద్యా నైపుణ్యం; పాటింపన్= ఒప్పారగా; జగము+ఎల్లన్= లోకమంతా; సంభావింపన్= నిన్ను గౌరవిస్తూ ఉండగా; ఇటులు= ఈ విధంగా (కురుక్షేత్ర యుద్ధంలో విజయాన్ని సాధించి - అని భావం); రాజ్యము= రాజ్యాన్ని లేదా ప్రభుత్వాన్ని; ఒప్పన్= ఉచితమైన విధంగా; కొంటె!= తీసికొన్నావు కదా!

తాత్పర్యం: 'ధర్మజా! నీ అదృష్ట మేమని చెప్పాలి! అటు శ్రీకృష్ణుడు సదా తన మనస్సులో నీకు మేలు కలగాలని కోరుతూ ఉండగా, ఇటు గర్వోత్సాహాలతో ఉప్పొంగే బాహుబలంతో ప్రకాశించే పార్థుడు గాండీవ పరాక్రమంతో యుద్ధ విద్యా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఉండగా, ప్రజలందరూ నిన్ను గౌరవిస్తూ ఉండగా నీవు ఈ రాజ్యాన్ని ఈ విధంగా సగౌరవంగా సార్థకంగా పొందావు.

విశేషం: ధర్మరాజు విజయానికి గల హేతువులను చెప్తుతూ, అతడి రాజ్యప్రాప్తిలో ఉన్న ఒప్పిదాన్ని ప్రశంసించటం ఇందులోని విశేషం.

చ. **' భువన భయంకరంబు లగు పోరులఁ దమ్ములతోడఁ గూడ నీ**
వు వెడలఁబాటు లెస్స; యలవుం జలమున్ వెలయించుచోట ధ
ర్మువున కొకింతయుం దొలఁగఁ ద్రొక్కమి యెంతయుమేలు; దీనఁ గౌ
రవకులముఖ్య! యుమ్మలిక గ్రాఁచితె? చిత్తముఁ బ్రీతిఁ బొందెనే?' **4**

ప్రతిపదార్థం: కౌరవకులముఖ్య!= కౌరవకులంలో శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; ఈవు= నీవు; భువనభయంకరంబులు+అగు పోరులన్= భూలోకానికంతా లేదా లోకాల కన్నింటికీ భయాన్ని కలిగించే యుద్ధాలలో; తమ్ముల తోడన్+కూడన్= తమ్ముళ్ళందరితో; వెడలన్+పాటు= బయటపడటం; లెస్స=మంచిది, ఒప్పిదమైనది; అలవున్= బలాన్నీ; చలమున్= మాత్సర్యాన్నీ; వెలయించు చోటన్= ప్రదర్శించేటప్పుడు కూడా; ధర్మువునకున్= ధర్మమార్గానికి; ఒకింతయున్= ఏమాత్రంకూడా; తొలఁగన్+త్రొక్కమి= అడుగు ప్రక్కకు వేయకుండా ఉండటం; ఎంతయున్ మేలు= ఎంతయో శ్రేష్ఠం; దీనన్= దీనివలన; ఉమ్మలికన్=దుఃఖమును; క్రాఁచితె= తొలగించుకున్నావా; చిత్తమున్= మనస్సు; ప్రీతిన్= సంతోషాన్ని, తృప్తిని; పొందెనే?= పొందిందా?

తాత్పర్యం: 'కురువంశంలో ప్రసిద్ధుడా! ధర్మరాజా! లోకాల నన్నింటినీ భయపెట్టగలిగే భయంకర యుద్ధాలు సంభవించినప్పుడు నీ తమ్ములతో బయటపడడం మంచిది. యుద్ధాలలో పంతాలు పెరిగి బలాలనూ, మాత్సర్యాలనూ ప్రదర్శించే పట్టులలో సైతం ధర్మమార్గం నుండి ఏమాత్రం తప్పకుండా ఉండే నీ నియతి నీలోని ఎంతో మంచిగుణం. ధర్మరాజా! మరి - దీనివల్ల నీ దుఃఖాన్ని తొలగించుకున్నావా; ఇప్పుడు నీ మనస్సు సంతోషాన్ని పొందిందా?'

విశేషం: యుద్ధావేశంలో కూడా ధర్మం వీడని నియతి ధర్మజుడికి ఇక్కట్టులు తెచ్చిపెట్టినా, ఆ నియతీ, పాండవుల ఐకమత్యమూ చివరకు విజయాన్ని సాధించిపెట్టాయని నారదుడు ధర్మజుడిని అభినందించాడు. ధర్మజుడిది ధర్మయుద్ధమని (కలహాభోక్త) నారదుడు ప్రశంసించటం ఇందులోని విశేషం.

వ. అనిన విని యజ్జనవిభుం డమ్ముని విభున కిట్లనియె. 5

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+జన విభుండు= ఆ ధర్మరాజు; విని; ఆ+ముని విభునకున్= మునిపతియైన ఆ నారదుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: నారదుడి మాటలు విని ధర్మరాజు అతడితో ఇట్లా అన్నాడు:

సీ. ' కృష్ణుండు మామీఁదఁ గృపసేయుటయు, బ్రాహ్మ। ణానుగ్రహంబున ననిల పుత్ర
పార్థుల పటు బాహు బలమున మేదిని। యంతయుఁ జేకుఱునట్టి దయ్యె;
నైనను నతిఘోర మగు నఖిల జ్ఞాతి। వధ మొనరించుట వలన నధిక
గుణుని సౌభద్రునిఁ గుల భూషణంబుఁ బాం। చాలీ తనూజ పంచకముఁ గోలు

తే. పోకఁ జేసియు గెల్పు గెల్పుగ మదీయ। బుద్ధి గైకొన దయ్యెడు సిద్ధముఖ్య!
యదియుఁ గాక వేఱొక్కండు మదిఁ గలంచు। చున్నయది; దాని నేర్పడ విన్నవింతు. 6

ప్రతిపదార్థం: సిద్ధముఖ్య!= ముని శ్రేష్ఠుడవైన నారదా!; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; మామీఁదన్= మామీద (పాండవులమీద); కృపచేయుటయున్= దయచూపటం; బ్రాహ్మణ+అనుగ్రహంబునన్= బ్రహ్మవేత్తలయొక్క దయవలన; అనిలపుత్ర పార్థుల పటు బాహుబలమునన్= భీమార్జునుల గొప్పదైన భుజబలంచేత; మేదిని+అంతయున్= రాజ్యమంతా; చేకుఱునట్టిది+అయ్యెన్= చేతికి దక్కేదిగా అయింది; ఐనను= అయినప్పటికి; అతిఘోరము+అగు= మిక్కిలి దారుణమైన; అఖిల జ్ఞాతివధము= జ్ఞాతుల నందరినీ చంపటం; ఒనరించుటవలనన్= చేయటంవలన; అధికగుణునిన్= ఉత్తమగుణాలు కలవాడైన; కులభూషణంబున్= వంశానికి అలంకారమైన; సౌభద్రునిన్= అభిమన్యుడినీ; పాంచాలీ తనూజ పంచకమున్= ద్రౌపదికి పుట్టిన పుత్రపంచకాన్నీ; కోలుపోకన్+చేసియున్= కోల్పోవటంవలన; మదీయబుద్ధి= నా బుద్ధి; గెల్పు= ఈ గెలుపును; గెల్పుగన్= విజయంగా; గైకొనదు+అయ్యెడున్= గ్రహించజాలకపోతున్నది; అదియున్+కాక= అంతేకాక; మదిన్= నా మనస్సును; వేఱు+ఒక్కండు= మరొకటి; కలంచుచున్న అది= కలతపెట్టుతున్నది; దానిన్= ఆ సంగతిని; ఏర్పడన్= స్పష్టంగా; విన్నవింతున్= మనవి చేస్తాను.

తాత్పర్యం: 'ఓ మునీంద్రా! శ్రీకృష్ణుడు మామీద సదా కృపాదృష్టి ప్రసరిస్తూ ఉండటం చేతనూ, బ్రహ్మజ్ఞుల అనుగ్రహం చేతనూ, భీమార్జునుల మహాబాహుబలంతోనూ ఈ రాజ్యమంతా మాకు దక్కింది. అయినా, జ్ఞాతుల నందరినీ యుద్ధంలో అతిదారుణంగా వధచేయటం వలనా, వంశభూషణుడు, గుణవంతుడు అయిన అభిమన్యుడిని, పాంచాలీపుత్ర పంచకాన్నీ కోల్పోవటం వలనా నాకు కలిగిన విజయాన్ని విజయంగా స్వీకరించటానికి నా బుద్ధి అంగీకరించటంలేదు. అంతేకాక నా మనస్సును మరొక్క విషయం కలత పెట్టుతున్నది. దానిని మీకు స్పష్టంగా విన్నవించుకొంటాను.

చ. ఘనభుజ విక్రమోన్నతుఁడు, కౌరవకోటికిఁ బట్టుకొమ్మ మ
మ్ముని మొనఁ దూలపుచ్చిన మహాత్ముఁడు గర్ణుఁడు గొంతి తొల్తచూ
లని యుదక ప్రదాన సమయంబున నాయమచేత వింటి; నా
తని కుదకంబు లిచ్చుటకుఁ దా మముఁ బంచుట గోరి చెప్పినన్. 7

ప్రతిపదార్థం: ఘనభుజ విక్రమ+ఉన్నతుఁడు= గొప్పవైన భుజాల పరాక్రమంలో శ్రేష్ఠుడు అయినవాడు; కౌరవకోటికిన్= కౌరవబృందానికి; పట్టుకొమ్మ= ఆధారమైనవాడు; మమ్మున్= మమ్మల్ని (పాండవులను); అని మొనన్= యుద్ధవ్యూహాగ్రంలో; తూలపుచ్చిన= చిన్నపుచ్చిన; మహాత్ముఁడు= గొప్పవాడు అయిన; కర్ణుఁడు= కర్ణుడు; గొంతితొల్తచూలు+అని= కుంతికి పుట్టిన మొదటి బిడ్డ అని; తాన్= తాను (ఆ కుంతి); ఆతనికిన్= కర్ణుడికి; ఉదకంబులు= తర్పణాలు; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; మమున్= మమ్మల్ని (పాండవులను); పంచుటన్= పంపించటంకొరకు; కోరి= ఆసక్తితో, కావలెనని; చెప్పినన్= చెప్పగా; ఉదకప్రదాన సమయంబునన్= తర్పణాలిచ్చే సమయంలో; ఆయమచేతన్= కుంతిచేతనే; వింటిన్= విన్నాను.

తాత్పర్యం: తన భుజపరాక్రమంతో కౌరవుల కందరికీ ఆదరువుగా ఉన్నవాడూ, మమ్మల్ని రణరంగంలో చిన్నపుచ్చినవాడూ అయిన కర్ణుడు కుంతీదేవి మొదటిబిడ్డ అనే సంగతి తెలిపి, కర్ణుడికి జలతర్పణాలివ్వాలని మాకు చెప్పాలని కోరికపడి స్వయంగా వచ్చి మేము తర్పణాలిచ్చే సమయంలో ఆమె చెప్పితే విన్నాను.

వ. అప్పుడు దొడంగి యంతరంగంబు నిప్పులం బొరఁటినట్లయ్యెడి; నక్కుంతీమహాదేవి దాను దివాకరువరంబున నప్పురుషవరుం బడసి పాఱవైచుటయుం, బిదప నతండు ధార్తరాష్ట్రులపాల దొరయైయుండ మాకును వారికిం గలహంబు పుట్టిన నది మాన్పించుటకై యక్కొడుకు కడకుం జని యేకాంతంబునం బుట్టువు దెలుపుటయు, లోనయిన తద్విషయ వార్త లనుదినంబును జెప్పుచుండు. 8

ప్రతిపదార్థం: అప్పుడు+తొడంగి= అప్పటినుండి; అంతరంగంబు= మనస్సు; నిప్పులన్= నిప్పుకణాలలో; పొరఁటినట్లు+అయ్యెడిన్= పొరలించినట్లుగా అవుతున్నది; ఆ+కుంతీ మహాదేవి= ఆ కుంతీమహాదేవి; తాను= స్వయంగా; దివాకరుని వరంబునన్= సూర్యుడి వరంతో; ఆ+పురుషవరున్= ఆ పురుషశ్రేష్ఠుడైన కర్ణుడిని; పడసి= కని, పొంది; పాఱవైచుటయున్= (నీటిలో) వదలిపెట్టటమున్నూ; పిదపన్= ఆ తరువాత; అతండు= కర్ణుడు; ధార్తరాష్ట్రులపాలన్= ధృతరాష్ట్రుడి పుత్రులైన కౌరవుల కడ; దొర ఐ= రాజై (అంగదేశాధిపతి అయి); ఉండన్= ఉండగా; మాకును= మాకూ (పాండవులకూ); వారికిన్= వారికి (కౌరవులకూ); కలహంబు= తగాదా; పుట్టినన్= కలుగగా; అది= దానిని; మాన్పించుటకై= శాంతింపచేయటానికి; ఆ+కొడుకు కడకున్= కొడుకైన ఆ కర్ణుడి వద్దకు పోయి; ఏకాంతంబునన్= ఒంటరిగా ఉన్నప్పుడు; పుట్టువు= అతడి జన్మను గురించిన విషయం; తెలుపుటయున్= తెలియచెప్పటమున్నూ; లోనయిన= మొదలయిన; తద్విషయవార్తలు= అతడి సంగతులకు సంబంధించిన విశేషాలు; అనుదినంబును= ప్రతిరోజూ; చెప్పుచుండున్= చెపుతూ ఉంటుంది.

తాత్పర్యం: అప్పటినుండి నా మనస్సు నిప్పులలో దొరలించినట్లుంటుంది, ఆ కుంతీదేవి సూర్యవరప్రసాదంతో ఆ మహాత్ముడిని కని నీటిలో విడిచిపెట్టిన సంగతీ, ఆ తరువాత కర్ణుడు కౌరవుల వద్ద అంగరాజై ఉండగా వారికీ, మాకూ యుద్ధంరాగా, దానిని మాన్పించటానికై ఆమె ఒంటరిగా ఆ కొడుకు దగ్గరికి పోయి అతడి జన్మరహస్యం చెప్పిన సంగతీ, మొదలైన ఎన్నో అతడి విశేషాలను గురించి ప్రతిరోజూ మాకు చెపుతూ ఉంటుంది.

సీ. ఆ యమ దనపుత్రుఁ డవుట యెఱింగించి । 'తమ్ములలోనికి రమ్ము నీవు'
నావుడు నాతండు 'నాకుఁ గృతఘ్నత । వాటిల్లదే కురుపతిఁ దొఱంగి
వచ్చిన; నదిగాక వాసవితోడి క । య్యంబున కితఁ డోడె ననరె; యతఁడు
బెరయ నొండెను నన్ను బెరసి యొండెను నేవు; । రింతియకాని నీ వెపుడు నీకుఁ

ఆ. దనయు లార్వు రనకు' మనియె; నిద్దేవి 'ద । క్కనుజు లెల్లవారి కభయ మొసఁగు'
మనిన 'నట్ల కాక' యని మమ్ము నలువురఁ । బట్టెఁ గాని తెగఁడ ప్రాణములకు. 9

ప్రతిపదార్థం: ఆ+అమ్మ= ఆమె, కుంతి; తన పుత్రుఁడు+అవుట= తన కుమారు డౌతాడని; ఎఱింగించి= కర్ణుడికి తెలిపి; తమ్ముల లోనికిన్= నీకు తమ్ములైన పాండవులలోకి; నీవు; రమ్ము= వచ్చిచేరుము; నావుడున్= అనగా విని; ఆతండు= కర్ణుడు; కురుపతిన్= దుర్యోధనుడిని; తొఱంగి వచ్చినన్= వదలివస్తే; నాకున్= నాకు; కృతఘ్నత= ఉపకారికి అపకారం చేసిన దోషం; పాటిల్లదే!= కలుగదా? (కలుగుతుందని భావం.); అది+కాక= అంతేకాకుండా; ఇతఁడు= ఇతడు (కర్ణుడు); వాసవితోడి కయ్యంబునకున్= అర్జునుడితోడి యుద్ధానికి; ఓడెన్= భయపడ్డాడు; అనరె?= అనరా? (అంటారని భావం); అతఁడు= అర్జునుడు; బెరయన్+ఒండెను= కలిసికొని; నన్నున్= నన్ను (కర్ణుడిని); బెరసి+ఒండెను= కలిపికొని గాని; ఏవురు= అయిదుమంది; అంతియకాని= అంతేకాని; నీవు= నీవు(కుంతి); ఎపుడున్= ఎప్పుడైనా సరే; నీకున్= నీకు (కుంతికి); తనయులు= కుమారులు; ఆర్వురు= ఆరుగురు; అనకుము= అని చెప్పవద్దు; అనియెన్= అన్నాడు; ఈదేవి= కుంతీదేవి; తక్కు= మిగిలిన; అనుజులు= తమ్ములు; ఎల్లవారికిన్= అందరికి; అభయము= భయంలేదు అనేమాట; ఒసఁగుము= ఇమ్ము; అనినన్= అని అనగా; అట్లు+అ+కాక!= ఆ విధంగానే అగుగాక!; అని; మమ్మున్ నలువురన్= మా నలుగురను; పట్టెన్= బంధించాడు కాని; ప్రాణములకున్= ప్రాణాలు తీయటానికి అంటే చంపటానికి; తెగఁడు+అ= సాహసించనేలేదు.

తాత్పర్యం: కర్ణుడు తన కుమారు డనే విషయం అతడికి తెలిపి 'నీవు నీ తమ్ములలోనికి వచ్చి చేరు' మని అడిగింది. ఆ మాట కతడు ఇట్లా సమాధానం చెప్పాడు: 'నేను దుర్యోధనుడిని వదలివస్తే కృతఘ్నతాదోషం కలుగుతుంది. అంతేకాక నేను అర్జునుడితో యుద్ధం చేయటానికి జంకి ఆ వైపు వచ్చా నని కూడా అంటారు. నన్ను కలుపుకొని కాని, లేదా అర్జునుడిని కలుపుకొని కాని నీకు కొడుకు లెప్పుడైనా అయిదుగురే కాని ఆరుగురని మాత్రం అనబోకుము.' ఆ మాటలు విని కుంతి 'ఆ మిగిలిన కొడుకులకు అభయాన్ని ఇమ్ము' అని కర్ణుడిని కోరింది. ఆయన 'అట్లాగే కాని' మ్మని వరమిచ్చాడు. ఆ వాగ్దానం మేరకు మమ్ములను నలుగురినీ పట్టి బాధించాడే కాని, ప్రాణాలు తీసే ప్రయత్నం చేయలేదు.

విశేషం: కర్ణుడి సత్యవాక్య నిష్ఠను, తల్లిపై చూపిన గౌరవాన్నీ, అతడి ఉదాత్త ప్రవృత్తినీ ఇందులో ధర్మజుడు వ్యంగ్యంగా కీర్తించాడు.

ఆ. **తొల్లి తాన దాఁచెఁ దల్లి; పదంపడి । యతఁడు సెప్పవలవ దనఁగ దాఁచె;**
నిట్లుగాఁగ నెఱుఁగ మేవురమును నతం । డిట్టిఁ డగుట; దాన నింత వుట్టె. **10**

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం, మొదట్లో; తల్లి= కుంతీదేవి; తాన్+అ= తానే స్వయంగా; దాఁచెన్= రహస్యంగా ఉంచింది; పదంపడి= తరువాత; అతఁడు= కర్ణుడు; చెప్పన్ వలవదు= చెప్పవద్దు; అనఁగన్= అన్నట్లుగా; దాఁచెన్= రహస్యంగా ఉంచింది; ఇట్లుకాఁగన్= ఈ విధంగా కావటంచేత; అతండు= కర్ణుడు; ఇట్టిఁడు= ఇటువంటివాడు - అంటే కుంతీమహాదేవి మొదటి సంతానమైన వాడు కర్ణుడు; అగుటన్= కావటం; ఏవురమును= అయిదుగురం (పాండవులం); ఎఱుఁగము= ఎరుగం; దానన్= దానివలన; ఇంత= ఇంతటి వైపరీత్యం; పుట్టెన్= పుట్టింది.

తాత్పర్యం: కర్ణుడి జన్మవృత్తాంతాన్ని మొదట్లో తల్లి అయిన కుంతీదేవి స్వయంగా తానే రహస్యంగా ఉంచింది. ఆ తరువాత కర్ణుడు చెప్పటం సమంజసం కాదన్నట్లుగా గోప్యంగా దాచి ఉంచింది. అట్లా కావటంచేత కర్ణుడు కౌంతేయు డన్న సత్యాన్ని మే మైదుగురం తెలిసికొనలేకపోయాం. దానివలన ఇంతటి విపత్తు వాటిల్లింది.

విశేషం: ధర్మజుడి విషయవిశ్లేషణ వివేకం ఇందులో స్పష్టం.

క. **ఆతఁడు దుర్యోధనునకుఁ । బ్రీతిగ జూదంబునాఁడు పెక్కాడెను ధ**
ర్మేతరములు; వానికి మ । చ్చేతోగతి కోపభరము సెందక యుండున్. **11**

ప్రతిపదార్థం: జూదంబునాఁడు= ద్యూతం ఆడే రోజున; ఆతఁడు= కర్ణుడు; దుర్యోధనునకున్= దుర్యోధనుడికి; ప్రీతిగన్= సంతోషమయ్యేటట్లు; ధర్మ+ఇతరములు= అధర్మాలు; పెక్కు= అనేకాలు; ఆడెను= మాట్లాడాడు; వానికిన్= ఆ అధర్మవాక్యాలకు; మత్+చేతో గతి= నా చిత్తవృత్తి; కోపభరము= కోపతీవ్రతను; చెందక= పొందకుండా; ఉండున్= ఉండేది.

తాత్పర్యం: అలనాడు కురుసభలో కపటపుజూదం జరిగిన నాడు కర్ణుడు దుర్యోధనుడిని సంతోషపెట్టటానికి అధర్మాల నెన్నింటినో పలికాడు. అయినా అతడి మాటలకు నా మనస్సు కోపాతిశయాన్ని పొందకుండానే ఉండేది.

విశేషం: రక్తసంబంధం వలన కర్ణుడిపట్ల ధర్మజుడి అంతఃకరణం ఆర్ద్రంగా స్పందించేది; కాని, ఆ సంబంధం ఏమిటో ఆయనకు తెలిసేది కాదు. అది ఇప్పుడు తెలిసింది. గతంలోని అనుభవాలను అతడు మననం చేసుకొంటున్నాడు.

ఆ. అతనిమేను కుంతి యట్టుల కైవడి । యరయ నేను జూచి యాత్మ నెద్ది
కారణంబొ యిట్లుగా ననుచుండుదు ;। నేమి సేయువాఁడ నింకఁ జెపుమ! 12

ప్రతిపదార్థం: అరయన్= చూడగా; అతని మేను= కర్ణుడి శరీరం; కుంతి+అట్టుల= కుంతివలె; కైవడి= పోలిక (కలిగింది); నేను= నేను (ధర్మరాజు); చూచి= దానిని గమనించి; ఇట్లు+కాన్= ఈ విధంగా కావటానికి; ఎద్దికారణంబొ= కారణ మేమిటో అని; ఆత్మన్= నా హృదయంలో; అనుచుండుదున్= అనుకొంటూ ఉంటాను; ఇంకన్= ఇంత జరిగిపోయిన తరువాత ఇప్పుడు; ఏమి చేయువాఁడన్+చెపుమ!= ఏం చేసేది చెప్పండి నారదా!

తాత్పర్యం: చూస్తే కర్ణుడి శరీరం కుంతి పోలికలు కలిగి ఉండేది. నేను దానిని గమనించి అట్లా కావటానికి కారణ మేమై ఉంటుందా? అని మనస్సులో మథనపడుతుండేవాడిని. కాని, అంతా అయిపోయిన తరువాత ఇప్పుడు ఏమి చేసేది చెప్పండి నారదా!

క. కౌరవులు సేయు నవమతి । కారణముగఁ గోప మెత్తుఁ, గర్ణుని వదనాం
భోరుహముం గనుఁగొన శమ । మారున్ నావశముగాక యంతన బుద్ధిన్. 13

ప్రతిపదార్థం: కౌరవులు= ధార్తరాష్ట్రులు; చేయు= చేసేటటువంటి; అవమతి= అవమానం; కారణముగన్= నెపంగా; కోపము= కోపం; ఎత్తున్= మెండుగా కలిగేది; కర్ణుని= కర్ణుడియొక్క; వదన+అంభోరుహమున్= పద్మంవంటి ముఖాన్ని; కనుఁగొనన్= చూడగానే; అంతన్+అ= వెంటనే; నా వశము+కాక= నా వశంతప్పి; బుద్ధిన్= నా మనస్సులో; శమము+ఆరున్= శాంతి కలుగుతుంది, శాంతి నిండుతుంది.

తాత్పర్యం: కౌరవులు చేసే అవమానాలకు నాకు కోపం బాగా రెచ్చిపోతుండేది, కాని, కర్ణుడి ముఖకమలం చూస్తే చాలు. వెంటనే నాకు తెలియకుండానే నా మనస్సులో శాంతం నిండిపోతుండేది.

విశేషం: రక్తసంబంధం ఉండటం చేత కర్ణుడిపట్ల ధర్మజుడికి కోపం రాకపోగా, అతడి ముఖం చూస్తే మనస్సులో ఒకవిధమైన శాంతి కలిగేది. ఇది ధర్మజుడి నిర్మలమైన అంతఃకరణ ప్రవృత్తిని తెలుపుతున్నది.

ఉ. గాండివి నొవ్వఁబల్కి తిటు; 'గర్ణునిఁ జంపక వచ్చితేని త
మ్ముండవు గావు నాకు' నని మూర్ఖత; సోదరఘాతి నైన క
ష్టుండ; మనంబునం బెఱుగు శోకము నెట్లు సహింతుఁ? దప్పె; నా
తండును నేము నైన విబుధప్రకరంబును మాకు నడ్డమే!' 14

ప్రతిపదార్థం: కర్ణునిన్= కర్ణుడిని; చంపక= చంపకుండా; వచ్చితి(వి)+ఏని= యుద్ధభూమినుండి తిరిగివచ్చావా; నాకున్= నాకు (ధర్మరాజుకు); తమ్ముండవు కావు= సోదరుడవు కావు; అని; మూర్ఖతన్= తెలిసి తెలియనితనంతో, తెలివితక్కువతనంతో; ఇటు= ఈ విధంగా; గాండివిన్= అర్జునుడిని; నొవ్వన్= బాధపడేటట్లు; పల్కితిన్= మాట్లాడాను; సోదరఘాతిని+ఐన= సోదరుడిని చంపిన (వాడినైన); కష్టుండన్= పాపిష్ఠిని; మనంబునన్= హృదయంలో; పెఱుగు= పెంపొందే; శోకమును= దుఃఖాన్ని; ఎట్లు= ఏ విధంగా; సహింతున్?= భరించగలిగేది? (భరించలేనని భావం); తప్పెన్= అంతా తారుమారయింది లేదా మాకా అదృష్టం తప్పింది; ఆ తండునున్= ఆ కర్ణుడూ; ఏమున్= మేమునూ; ఐనన్= కలిసిఉన్నట్లయితే; మాకున్= మా అందరికి; విబుధ ప్రకరంబును= దేవతల గణాలు కూడా; అడ్డమే?= ఎదురు నిలువగలిగేవా? లేదా, మా కొక లెక్కా?

తాత్పర్యం: 'కర్ణుడిని చంపకుండా రణరంగంనుండి తిరిగి వచ్చావా? నీవు నాకు తమ్ముడివే కా' వని తెలివితక్కువతనంతో అర్జునుడు నొచ్చుకొనేటట్లు మాట్లాడాను. నిజంగా నేను అన్నను చంపిన పాపిష్ఠిని. నా హృదయంలో పెల్లుబుకే ఈ దుఃఖాన్ని నే నెట్లా ఓర్చుకొనేది? అంతా తారుమారైంది. ఆ కర్ణుడూ, మేమందరమూ కలిసి ఉంటే ఆ దేవతాగణాలు సైతం మాకు అడ్డం నిలువగలిగేవా?'

విశేషం: కర్ణుడి మరణానికి తన ప్రేరణ కారణమైనదని భావించిన ధర్మరాజు తాను చేసిన పాపానికి నిష్కృతి లేదని తీరని వేదన పడుతున్నాడు. ఈ మాటలలో ధర్మజుడి ఋజువర్తనం, బంధుప్రీతి, భ్రాతృప్రేమ, ధర్మనిరతి, ఆర్ద్రచిత్తవృత్తి, పరితాప పశ్చాత్తాపాలు కనపడుతున్నాయి.

వ. అని పలికి, 'మునీంద్రా! యమ్మార్తాండనందను రథచక్రంబు భూమిం గ్రుంగుటకుం గారణం బెద్ది? దాని, న వ్వీరుండు పరశురామునిచేత శప్తుండయిన తెఱంగును నెఱింగింప వలయు; భువనంబుల వర్తనంబులు నీకుం దేటపడనియవి లేవు; గావున ని న్నడిగెద' నని ప్రార్థించుటయు, 'నవ్విధంబంతయు వివరించెద విను' మని యమ్మహీపతి కమ్మహాత్ముం డిట్లనియె: 15

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ముని+ఇంద్రా!= ముని శ్రేష్ఠుడవైన ఓ నారదా!; ఆ+మార్తాండ నందను= సూర్యుడి కుమారుడైన ఆ కర్ణుడియొక్క; రథచక్రంబు= రథచక్రం; భూమిన్= నేలలో; క్రుంగుటకున్= క్రుంగటానికి; కారణంబు+ఎద్ది?= కారణం ఏది?; దానిన్= దానిని; ఆ+వీరుండు= పరాక్రమ వంతుడైన ఆ కర్ణుడు; పరశురామునిచేతన్= పరశురాముడివలన; శప్తుండు= శపించబడిన వాడయిన; తెఱంగును= విధానాన్ని; ఎఱింగింపన్ వలయున్= తెలియజేయాలి; భువనంబుల= (పదునాల్గు) లోకాలలో; వర్తనంబులు= జరిగే విశేషాలలో; నీకున్= నీకు; తేటపడనిఅవి= తెలియనివి; లేవు= ఉండవు; కావునన్= కాబట్టి; నిన్నున్= నిన్ను (నారదుడిని); అడిగెదన్= అడుగుతున్నాను; అని; ప్రార్థించుటయున్= వేడుకోగా; ఆ+విధంబు+అంతయున్= ఆ జరిగిన విధమంతటినీ; వివరించెదన్= వివరంగా చెపుతాను; వినుము; అని; ఆ+మహాత్ముండు= ఉత్తముడైన ఆ నారదుడు; ఆ+మహీపతికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'నారదమునీంద్రా! ఆ కర్ణుడి రథచక్రం రణరంగంలో భూమిలో క్రుంగిపోవటానికి గల కారణ మేమిటి? ఆ వీరుడు పరశురాముడి చేత శపించబడిన విధం ఎటువంటిది? నాకు తెలియజెప్పండి. మీకు పధ్నాలుగు లోకాలలో జరిగే విశేషాలన్నీ తెలిసికొనే శక్తి ఉన్నది కాబట్టి ఈ సంగతిని మిమ్ముల నడుగుతున్నాను' అని ప్రార్థించాడు ధర్మరాజు. అతడు అడిగిన విధంగా నారదుడు ఆ విశేషాలను వివరించటానికి పూనుకొని ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నారదుడు ధర్మరాజునకుఁ గర్ణుని చరితంబు సెప్పుట (సం. 12-2-1)

సీ. ' **మునిదత్త మగు మంత్రమున గొంతి కన్నియ । నాఁడు వేడుక దిననాథుఁ దనకుఁ**
బ్రత్యక్షముగఁ జేసి పడయుటఁ దా సిగ్గు । పెంపున సుతు వెలయింప దయ్యెఁ ;
కన్యాత్వవికలత గాకుండఁ దా సూర్య । వరము గల్గుటఁ జేసి వంశవర్య
యై పొల్చె; దేవరహస్య మిత్తెఱఁ, గిట్లు । పాఱవైవఁగఁ బడ్డ పట్టి సూతుఁ

తే. **డెత్తికొనిపోయె; సూతజుం డితఁ డనంగఁ । బెరిఁగి కర్ణుండు నీ నేర్పు భీములావు**
నరుని విలుబల్మి యతనికి హరికిఁ గలుగు । చెలిమి గని తద్ద వగఁ బొందుఁ జిత్త మెరియ. **16**

ప్రతిపదార్థం: గొంతి= కుంతి; కన్నియనాఁడు= కన్నెగా ఉన్నప్పుడు; ముని దత్తము+అగు మంత్రమునన్= దుర్వాస మహర్షి చేత ప్రసాదించబడిన మంత్రంతో; వేడుకన్= ఆసక్తితో; దిననాథున్= సూర్యుడిని; తనకున్= తనకు (కుంతికి); ప్రత్యక్షముగన్+చేసి= ఎదుట తోచువాడినిగా చేసికొని; సుతున్= కొడుకును; పడయుటన్= పొందటంచేత; తాన్= తాను(కుంతి); సిగ్గుపెంపునన్= మిక్కిలిసిగ్గుచేత; వెలయింపదు+అయ్యెన్= బయటపెట్టలేకపోయింది; కన్యాత్వ వికలత= (కొడుకును కన్న తరువాత కూడా) కన్యాత్వం భగ్నంకావటం; కాకుండన్= జరుగకుండా; సూర్యవరము= సూర్యుడిచ్చిన వరం; కల్గుటన్+చేసి= ఉండటం చేత; తాన్= తాను (కుంతి); వంశవర్య+ఐ= వంశంలో ఉత్తమురాలై, ఉత్తమ ఇల్లాలై; పొల్చెన్= ఒప్పారింది; ఈ+తెఱఁగు= ఈ విధంగా కావటం; దేవరహస్యము= దేవతలకు మాత్రమే తెలిసిన రహస్యం; ఇట్లు= ఈ విధంగా; పాఱవైవఁగన్+పడ్డ= త్యజించబడిన, వదలిపెట్టబడిన; పట్టి= కొడుకును; సూతుఁడు= రథసారథి ఒకడు; ఎత్తికొనిపోయెన్= పెంచుకొనటానికి తీసికొనిపోయాడు; ఇతఁడు= కర్ణుడు; సూతజుఁడు= సూతుడికి పుట్టినవాడు; అనంగన్= అని పేరుపడి; పెరిఁగి= పెద్దవాడై; కర్ణుండు= కర్ణుడు; నీ నేర్పు= నీకున్న నేర్పరితనం; భీములావు= భీముడిబలం; నరుని విలుబల్మి= అర్జునుడి కోదండపటిమ; అతనికిన్= అర్జునుడికి; హరికిన్= శ్రీకృష్ణుడికి; కలుగు= ఉండే; చెలిమి= స్నేహం; కని= చూచి; చిత్తము= మనస్సు; ఎరియన్= బాధపడేటట్లు, మండేటట్లు; తద్ద= అమితంగా; వగన్= చింతను; పొందున్= పొందుతూ ఉండేవాడు.

తాత్పర్యం: కుంతీదేవి కన్నెగా ఉన్నకాలంలో దుర్వాసోమహర్షి ఇచ్చిన మంత్ర ప్రభావం వలన సూర్యదేవుడిని ఆసక్తితో ప్రత్యక్షం చేసికొని కొడుకును కన్నందువలన మిక్కిలిసిగ్గుతో ఆ వాస్తవాన్ని ప్రకటించలేకపోయింది. కొడుకును కన్నప్పటికీ ఆమెకు కన్యాత్వం భగ్నం కాకుండా ఉండేటట్లు సూర్యదేవుడివరం ఉండటం వలన ఆమె ఉత్తమ గృహిణిగా ప్రసిద్ధి కెక్కింది. ఇదంతా దేవరహస్యం. ఆ విధంగా కుంతిచేత నదిలో విడువబడిన ఆమె కొడుకును సూతుడు చూచి ఇంటికి ఎత్తుకొనిపోయాడు. అందువలన కర్ణుడు సూతుడికి పుట్టినవాడనీ, సూతకులంలో పుట్టినవాడనీ లోకంలో ప్రసిద్ధి కెక్కుతూ పెరిగాడు. ధర్మరాజు నేర్పరితనం, భీముడి బాహుబలం, అర్జునుడి కోదండపాండిత్యం, అర్జునుడికీ శ్రీకృష్ణుడికీ గల స్నేహం - ఇవన్నీ చూచి హృదయం మండి కర్ణుడు బాగా బాధపడుతూ ఉండేవాడు.

క. **నకుల సహదేవ నయ శా । స్త్ర కళావేదిత్వమునకు జను లనురాగా**
ధికులై మిమ్ముం గొనియా । టకు నాతఁడు మనసు చేడ్పడం జింతిల్లున్. **17**

ప్రతిపదార్థం: ఆతఁడు= కర్ణుడు; నకుల సహదేవ= నకులసహదేవుల; నయశాస్త్ర కళావేదిత్వమునకున్= నీతి శాస్త్రాలయందు, కళలయందూ గల పాండిత్యానికీ; జనులు= ప్రజలు; అనురాగ+అధికులు+ఐ= మిక్కిలి ప్రీతి గలవారై; మిమ్మున్= మిమ్మల్ని (పాండవులను); కొనియాటకున్= మెచ్చుకొంటూ ఉంటున్నందుకు; మనసు= హృదయం; చేడ్పడన్= బాధపడగా, కలతచెందగా; చింతిల్లున్= విచారపడుతూ ఉండేవాడు.

తాత్పర్యం: నకుల సహదేవుల కుండే నీతి, శాస్త్రకళాపాండిత్యాన్నీ ప్రజలు మిక్కిలి ప్రీతితో (మిమ్మలను) మెచ్చుకొంటూ ఉండటం కర్ణుడికి నచ్చేదికాదు. అతడు దానికి మనసు కలతపడగా బాధపడుతూ ఉండేవాడు.

వ. ఇది తదీయ స్వభావం: బట్లుగాక దైవఘటనంబు నట్టిద; యమ్మాత్సర్యంబున నక్కర్ణుండు మీయెడ నీసు గలవాఁడయి దుర్యోధనుం గూడికొనియెఁ; బదంపడి ధనంజయు ధనుర్విద్యాతిశయం బుపలక్షించి, కుంభసంభవు పాలికిం జని, యేకాంతంబునందనకు బ్రహ్మాస్త్రంబు సాంగోపాంగంబుగా నుపదేశింప వలయు నని యడిగి, 'యేను సమరంబున సవ్యసాచికి సమానుండ నగుటఁ గోరి వచ్చితి; నీవు సర్వశిష్య సమాదరుండవు; భవత్ప్రసాదంబునగృతాస్త్రుండ నయి వెలయవలదే?' యనవుడు నద్దినానాథనందనునకు నగ్గురుం డిట్లనియె. 18

ప్రతిపదార్థం: ఇది= ఇటువంటిది; తదీయ= అతడి (కర్ణుడి); స్వభావంబు= నైజం; అట్లు+కాక= అంతేకాకుండా; దైవఘటనంబును= విధి సంవిధానంకూడా; అట్టిది+అ= అటువంటిదే; ఆ+కర్ణుండు= అటువంటి కర్ణుడు; ఆ+మాత్సర్యంబునన్= అటువంటి ద్వేషంతో; మీఎడన్= మీపట్ల; ఈసు= అసూయ; కలవాఁడు+అయి= పొందినవాడై; దుర్యోధనున్+కూడుకొనియెన్= దుర్యోధనుడితో చేరాడు; పదంపడి= ఆ తరువాత; ధనంజయు= అర్జునుడియొక్క; ధనుః+విద్యా+అతిశయంబు= విలువిద్యలోని మేటి తనాన్ని; ఉపలక్షించి= గమనించి; కుంభసంభవుపాలికిన్+చని= ద్రోణాచార్యుడి వద్దకుపోయి; ఏకాంతంబునన్= ఒంటరిగా ఉన్నప్పుడు; తనకున్= తనకు (కర్ణుడికి); బ్రహ్మ+అస్త్రంబు= బ్రహ్మమంత్రంతో ప్రయోగించే బాణాన్ని; స+అంగ+ఉప+అంగంబుగాన్= అంగ ఉపాంగాలతో సహా (ప్రయోగ ఉపసంహరణాదులతో సహా అని భావం); ఉపదేశింపన్ వలయున్= ఉపదేశించుము; అని అడిగి= అని ప్రార్థించి; ఏను= నేను(కర్ణుడు); సమరంబునన్= యుద్ధం చేయటంలో; సవ్యసాచికిన్= అర్జునుడికి; సమానుండన్= సమమైన నేర్పు కలవాడిని; అగుటన్= కావాలని; కోరి= అభిలాషపడి; వచ్చితిన్= వచ్చాను; ఈవు= నీవు (ద్రోణాచార్యుడు); సర్వశిష్యసమ+ఆదరుండవు= శిష్యులనందరిని సమంగా ఆదరించే వాడివి; భవత్+ప్రసాదంబునన్= నీ దయచేత; కృత+అస్త్రుండన్+అయి= మంత్ర సహిత మహాబాణమైన బ్రహ్మాస్త్రాన్ని పొందినవాడనయి; వెలయన్ వలదే?= ప్రకాశించవద్దా? (తప్పక ప్రకాశించాలి అని భావం); అనవుడున్= అనగా విని; ఆ+దిననాథ నందనునకున్= ఆ సూర్యకుమారుడైన కర్ణుడితో; ఆ+గురుండు= ఆ ఆచార్యుడైన ద్రోణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అది అతడి స్వభావం. అంతేకాక విధి సంవిధానం కూడా అటువంటిదే. మీమీది ద్వేషంతో ఆ కర్ణుడు అసూయ పెంచుకొని, దుర్యోధనుడితో చేతులు కలిపాడు. ఆ తరువాత అర్జునుడి విలువిద్యలోని మేటితనాన్ని గమనించి ఒకసారి ద్రోణాచార్యుడి వద్దకు వెళ్ళాడు. ఆయన ఏకాంతంగా ఉన్నప్పుడు తనకు బ్రహ్మాస్త్రాన్ని సాంగోపాంగంగా ఉపదేశించుమని కోరాడు. 'నేను యుద్ధం చేయటంలో అర్జునుడికి సమానుడను కావాలని కోరి వచ్చాను. నీవా - శిష్యులనందరినీ సమానంగా చూచేవాడవు. కాబట్టి నీదయవలన బ్రహ్మాస్త్రాన్ని పొంది ప్రకాశించవద్దా!' అని అన్నాడు. ఆ మాటలు విని కర్ణుడితో ద్రోణు డిట్లా అన్నాడు:

తే. 'వ్రత సమన్విత భూసుర వర్యుఁ డొండె। నిరుపమాన తపః పుణ్యనృపతి యొండెఁ
గాని యన్యులు బ్రహ్మాస్త్రదానమునకుఁ। బాత్రములు గారు; నీకు నీఁబాడి గాదు.' 19

ప్రతిపదార్థం: వ్రత= వేదశాస్త్రాలలో చెప్పబడిన విధివిధానాలతో; సమన్విత= కూడుకొన్న (జీవితవిధానం గల); భూసురవర్యుఁడు= బ్రాహ్మణశ్రేష్ఠుడు; ఒండు+ఎన్= ఒక్కడు మాత్రమే; నిరుపమాన= సాటిలేని; తపః= తపస్సువలన కలిగిన; పుణ్యా= పుణ్యాచిత్తవృత్తిగల;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నృపతి= రాజు (క్షత్రియుడు); ఒండు+ఎన్= ఒక్కడు మాత్రమే; కాని= వీరిద్దరు తప్ప; అన్యులు= ఇతరులు; బ్రహ్మ+అస్త్ర దానమునకున్= బ్రహ్మాస్త్రాన్ని ఇవ్వటానికి; పాత్రములు= యోగ్యులు; కారు= కారు (కాజాలరు కాబట్టి); నీకున్= నీకు (కర్ణుడికి); ఈన్= ఇవ్వటానికి; పాడి= న్యాయం, ధర్మం; కాదు.

తాత్పర్యం: 'వేదోక్త విధి విధానాలను జీవితవ్రతంగా పాటించే బ్రాహ్మణ శ్రేష్ఠుడుగాని, సాటిలేని తపఃప్రభావం వలన పుణ్యశీలుడైన రాజు కాని బ్రహ్మాస్త్రాన్ని దానం చేస్తే స్వీకరించటానికి యోగ్యులౌతారు కాని ఇతరులుకారు. కాబట్టి నీకు నేను బ్రహ్మాస్త్రాన్ని దానం చేయటం ధర్మంకాదు.'

వ. అనుటయు, నట్లకాక యని నిజమందిరంబునకుం జని, మఱునాఁడు గదలి మహేంద్రమహీధరంబున కరిగి పరశురామునిం గాంచి, వినయంబునం బ్రణమిల్లి, 'యేను బ్రాహ్మణుండ, భృగువంశజాతుండ, నస్త్రవిద్యాపేక్ష నిన్నాశ్రయింప వచ్చితి' ననిన నమ్మునివరుండు ప్రీతుండై కర్ణుం బరిగ్రహించి, యస్త్రపరిశ్రమంబు సేయించుచుండె; నట్టియెడ నాశ్రమ పరిసరంబున నొక్కచోఁ దనయంతన లాఘవాభ్యాసంబు సేయుచుండ నొక్క మహాద్విజుని హోమధేనువు వత్సంబడ్డంబు వాఱి బాణగోచరంబై మృతిం బొందిన గని యవ్విప్రుండు గోపంబున శాపం బిచ్చిన, దానం దేరు ధరణిం గ్రుంగె; జామదగ్న్యుండు శపించిన తెఱంగునుం జెప్పెద; నవ్వీరుం డతనికి భక్తుండై పరిశ్రమం బాచరింప నతండు బ్రహ్మాస్త్రంబు లోనుగా ననేకాస్త్రంబు లొసంగెఁ; బదంపడి యొక్కనాఁడు. **20**

ప్రతిపదార్థం: అనుటయున్= ఆ విధంగా ద్రోణు డనగా కర్ణుడు విని; అట్లు+అ కాక అని= అట్లాగే కానివ్వండి అని; నిజమందిరంబునకున్= తన (కర్ణుడి) ఇంటికి; చని= వెళ్ళి; మఱునాఁడు= ఆ మరుసటిరోజున; కదలి= ప్రయాణమై; మహేంద్ర మహీధరంబునకున్= మహేంద్రపర్వతానికి; అరిగి= వెళ్ళి; పరశురామునిన్+కాంచి= పరశురాముడిని దర్శించి; వినయంబునన్= అణకువతో; ప్రణమిల్లి= నమస్కరించి; ఏను= నేను(కర్ణుడను); బ్రాహ్మణుండన్= విప్రుడను; భృగువంశజాతుండన్= భృగుడి వంశంలో పుట్టినవాడను; అస్త్రవిద్యా+అపేక్షన్= మంత్ర సహితాలైన బాణవిద్యల మీది కోరికచేత; నిన్నున్= నిన్ను (పరశురాముడిని); ఆశ్రయింపన్= అండగొనుటకు; వచ్చితిన్= వచ్చాను; అనినన్= అని చెప్పగా; ఆ+మునివరుండు= ఆ మునిశ్రేష్ఠుడైన పరశురాముడు; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; కర్ణున్= కర్ణుడిని; పరిగ్రహించి= శిష్యుడిగా స్వీకరించి; అస్త్రపరిశ్రమంబు= మంత్ర సహితమైన బాణాల అభ్యాసం; చేయించుచుండెన్= చేయిస్తూ ఉన్నాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆశ్రమ పరిసరంబునన్= ఆశ్రమ సమీపంలో; ఒక్కచోన్= ఒకచోట; తన అంతన్+అ= తనంతటతాను, స్వయంగా; లాఘవ+అభ్యాసంబు= నేర్పుకొరకు చేసే అలవాటు పరిశ్రమ; చేయుచున్+ఉండన్= చేస్తూ ఉండగా; ఒక్క మహాద్విజుని= ఒక మహిమాన్వితుడైన బ్రాహ్మణుడియొక్క; హోమధేనువు వత్సంబు= యజ్ఞకార్యాదులకు పాలు, పెరుగు, నెయ్యి మొదలైన ద్రవ్యాలను అందించే ఆవుయొక్క దూడ; అడ్డంబు+పాఱి= అడ్డంగా పరుగెత్తి; బాణగోచరంబు+ఐ= బాణానికి విషయమై -అంటే బాణం తగిలినదై; మృతిన్+పొందినన్= చనిపోగా; ఆ+విప్రుండు= ఆ హోమధేనువు యజమానుడు అయిన బ్రాహ్మణుడు; కని= చూచి; కోపంబునన్= కోపంతో; శాపంబు+ఇచ్చినన్= శాపం ఇవ్వగా; దానన్= దానిచేత; తేరు= (కర్ణుడి)రథం; ధరణిన్= భూమిలో; క్రుంగెన్= దిగబడింది; జామదగ్న్యుండు= జమదగ్ని కుమారుడైన పరశురాముడు; శపించిన తెఱంగునున్= శపించిన విధానాన్ని కూడా; చెప్పెదన్= చెప్పెదను; ఆ+వీరుండు= ఆ వీరుడైన కర్ణుడు; అతనికిన్= పరశురాముడికి; భక్తుండు+ఐ= భక్తుడై; పరిశ్రమంబు= బాణవిద్యాభ్యాసాన్ని; ఆచరింపన్= చేయగా; అతండు= పరశురాముడు; బ్రహ్మ+అస్త్రంబు లోనుగాన్= బ్రహ్మాస్త్రం మొదలుగా; అనేక+అస్త్రంబులు= మంత్రసహితమైన బాణాలను పెక్కింటిని; ఒసంగెన్= ఇచ్చాడు; పదంపడి= తరువాత; ఒక్కనాఁడు= ఒకరోజున.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు అట్లా అనగానే మంచిదని కర్ణుడు తన ఇంటికి తిరిగిపోయి, మరునాడు బయలుదేరి మహేంద్రపర్వతానికి వెళ్ళి పరశురాముడిని దర్శించి వినయంతో నమస్కరించాడు. 'నేను బ్రాహ్మణుడిని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భృగువంశంలో పుట్టాను. అస్త్రవిద్య నేర్చుకొనాలన్న కోరికతో నిన్ను ఆశ్రయించటానికి వచ్చాను' - అని అన్నాడు. ఆ మాటలకు సంతోషపడి పరశురాముడు కర్ణుడిని శిష్యుడిగా స్వీకరించాడు. ఆపైన కర్ణుడు అస్త్రవిద్యలో అభ్యాసం చేస్తూ ఉన్నాడు. ఒకనాడు అతడు ఆశ్రమసమీప ప్రదేశంలో అస్త్రవిద్యాభ్యాసం చేస్తూ ఉండగా అతడి బాణం ఒక బ్రాహ్మణ శ్రేష్ఠుడి హోమధేనువు దూడకు తగలటంచేత అది చనిపోయింది. దానికి ఆ బ్రాహ్మణుడు కోపించి కర్ణుడికి శాపంపెట్టాడు. దానివలన అతడి రథం నేలలో క్రుంగిపోయింది. ఇది ఇట్లా ఉండగా పరశురాముడు కూడా కర్ణుడిని శపించిన విధాన్ని వివరిస్తాను. కర్ణుడు భక్తుడై పరశురాముడిని సేవించటం వలన ఆయన అతడికి బ్రహ్మాస్త్రం మొదలుకొని అనేకాస్త్రాలను నేర్పాడు. ఆ తరువాత ఒకనాడు.

తే. కర్ణునుత్సంగమున మస్తకంబుఁ జేర్చి , । గురుఁడు నిద్రింప వికృతాతి ఘోరరూప
మళక మనియెడు నొకకీట మద్దినేంద్ర । తనయ క్రీఁదొడఁ దొలిచె సత్వరముగాఁగ. 21

ప్రతిపదార్థం : గురుఁడు= గురువైన పరశురాముడు; కర్ణుని= కర్ణుడియొక్క; ఉత్సంగమునన్= తొడమీద; మస్తకంబున్= తలను; చేర్చి= ఉంచి; నిద్రింపన్= నిదురపోవగా; వికృత+అతిఘోరరూపము= వికారమైన; అతి భయంకరమైన ఆకారంగల; అళకము+అనియెడు= అళకం అనేపేరుగల; ఒక కీటకము= ఒక పురుగు; ఆ+దిన+ఇంద్రతనయున్= ఆ సూర్యుడి కుమారుడైన కర్ణుడియొక్క; క్రీఁదొడన్= క్రింది తొడభాగాన్ని; సత్వరము+కాఁగన్= వేగంగా; తొలిచెన్= తొలిచింది.

తాత్పర్యం: పరశురాముడు కర్ణుడి తొడమీద తలపెట్టి నిద్రపోయాడు. వికారమైన, భయంకరమైన ఆకారం కలిగిన అళకం అనే పురుగొకటి కర్ణుడి క్రిందితొడభాగాన్ని వడివడిగా తొలిచివేసింది.

వ. అతండును గురునకు నిద్రాభంగం బగుట కోర్వక ధైర్యంబునం గీటకృతంబున కోర్చి యచలుండై యుండె; నెత్తు రొండొండ పరఁగి పరశురామ శరీరంబు సోఁకిన, నమ్మహాత్ముండు మేల్కని 'రక్తం బెక్కడి' దని యడిగినఁ, దొడయెత్తి కీటంబుం జూపి 'యిది దొలుఁచుచుండ మీనిదుర సెడుటకుం జాలక కదలకుండితి' ననియె; నమ్ముని గనుంగొనిన నక్కీటంబు. 22

ప్రతిపదార్థం: అతండును= కర్ణుడుకూడ; గురునకున్= గురువైన పరశురాముడికి; నిద్రాభంగంబు+అగుటకున్= నిదురచెడి పోవటానికి; ఓర్వక= సహించక; ధైర్యంబునన్= ధైర్యంతో; కీటకృతంబునకున్= పురుగు చేసినదానికి; ఓర్చి= సహించి; అచలుండు+ఐ= చలించనివాడై (స్థిరుడై); ఉండెన్= ఉన్నాడు; నెత్తురు= రక్తం; ఒండు+ఒండన్= క్రమక్రమంగా; పరఁగి= వ్యాపించి; పరశురామ శరీరంబు సోఁకినన్= పరశురాముడి దేహాన్ని తాకగా; ఆ+మహా+ఆత్ముండు= గొప్పవాడైన ఆ పరశురాముడు; మేల్కని= నిద్రనుండి లేచి; రక్తంబు+ఎక్కడిది?= ఈ నెత్తురు ఎక్కడిది?; అని అడిగినన్= అని ప్రశ్నించగా; తొడ+ఎత్తి= తొడను పైకెత్తి; కీటంబున్+చూపి= తొడక్రింద నున్న పురుగును చూపి; ఇది= ఈ పురుగు; తొలుఁచుచున్+ఉండన్= తొలుస్తూ ఉండగా; మీ నిదుర= మీ నిద్ర; చెడుటకున్= పాడగుటకు; చాలక= ఇష్టపడక; కదలక+ఉండితిన్= కదలకుండా ఉండిపోయాను; అనియెన్= అని అన్నాడు; ఆ+ముని= ఆ పరశురాముడు; కనుఁగొనినన్= చూచినవెంటనే; ఆ+కీటంబు= ఆ పురుగు.

తాత్పర్యం: కర్ణుడు గురువుకు నిద్రాభంగం కావటానికి ఇష్టపడక, ధైర్యంతో ఆ పురుగు చేసే కొరుకుడుకు సహించి కదలకుండా ఉన్నాడు. నెత్తురు కారటం మొదలుపెట్టి క్రమంగా సాగి పరశురాముడి శరీరాన్ని తాకింది. ఆ స్పర్శకు పరశురాముడు మేల్కొని 'ఈ రక్తం ఎక్కడిది?' అని అడిగాడు. కర్ణుడు తొడ ఎత్తి కీటకాన్ని చూపి 'ఇది తొలుస్తూ ఉండగా మీ నిద్ర చెడకుండా ఉండాలని ఆ బాధను సహించి నేను కదలకుండా కూర్చున్నాను' అన్నాడు. పరశురాముడు ఆ కీటకాన్ని చూడగానే (తరువాతి పద్యంతో అన్వయం).

క. మృతిఁబొంది రాక్షసుండై । ఖతలంబున నుండి పలుకుఁ 'గరుణాకర! నీ
కతమున దారుణ శాప । ప్రతిహతి వాటిల్లె; నిపుడు ప్రకృతి వడసితిన్. 23

ప్రతిపదార్థం: మృతిన్+పొంది= (ఆ పురుగు) చనిపోయి; రాక్షసుండు+ఐ= రాక్షసరూపాన్ని పొంది; ఖతలంబునన్+ఉండి= ఆకాశప్రదేశంలో నిలువబడి; పలుకున్= ఈ విధంగా మాట్లాడింది; కరుణాకర!= దయామయా!; నీకతమునన్= నీ కారణంగా; దారుణ శాపప్రతిహతి= భయంకరమైన శాపముయొక్క నివృత్తి; పాటిల్లెన్= కలిగింది; ఇపుడు= శాపం తొలగిపోయిన తరువాత; ప్రకృతి= నిజరూపాన్ని; పడసితిన్= పొందాను.

తాత్పర్యం: పరశురాముడు చూడగానే ఆ పురుగు చనిపోయి రాక్షసరూపం పొంది ఆకాశప్రదేశంలో నిలిచి ఇట్లా పలికింది. 'ఓ దయామయా! నీ కారణంగా నాకు భయంకరమైన శాపం నివృత్తి చెందింది. నేను నా పూర్వరూపాన్ని పొందగలిగాను.

విశేషం: ఈ పద్యంలో పరశురాముడి చూపులకే అంత శక్తి ఉండగా, ఆతడి వచస్సుకు ఎంతటి శాపానుగ్రహాశక్తి ఉంటుందో ధ్వనిమయంగా కథకుడు సూచిస్తున్నాడు.

వ. ' గ్రస్తుం డనుపేరం బరఁగు నొక్క రక్కసుండ; భృగుపత్ని నపహరించి తదీయశాపంబునఁ గీటంబనై యుండి, భవదీయ విలోకనామృత సేకంబున సుఖి నైతి' నని చెప్పి, నమస్కరించి నిజేచ్ఛం జనియె; రాముండు రాధేయుధైర్యంబు మనంబున నిరూపించి యతనితోడ. 24

ప్రతిపదార్థం: గ్రస్తుండు+అనుపేరన్+పరఁగు= గ్రస్తుడు అనే పేరుతో ఒప్పారే; ఒక్కరక్కసుండన్= ఒక రాక్షసుడను; భృగుపత్నిన్= భృగుమహర్షిభార్యను; అపహరించి= దొంగిలించి; తదీయశాపంబునన్= అతడి శాపంవలన; కీటంబను+ఐ+ఉండి= పురుగునై ఉండి; భవదీయ= నీయొక్క; విలోకన= చూపులనెడి; అమృతసేకంబునన్= అమృతపు చిలకరింపుచేత; సుఖిని+ఐతిన్= సుఖం కలవాడనైనాను; అని చెప్పి= అని తన కథను చెప్పి; నమస్కరించి= దండాలు పెట్టి; నిజ+ఇచ్ఛన్+చనియెన్= తన ఇష్టం వచ్చిన విధంగా వెళ్ళిపోయాడు; రాముండు= పరశురాముడు; రాధేయుధైర్యంబున్= కర్ణుడి ధీరభావాన్ని; మనంబునన్= హృదయంలో; నిరూపించి= లెక్కకట్టి; అతనితోడన్= కర్ణుడితో.

తాత్పర్యం : గ్రస్తుడు అనే పేరుతో పిలువబడే ఒక రాక్షసుడిని నేను. భృగుమహర్షి భార్యను అపహరించి అతడి శాపానికి గురి అయి కీటకంగా ఉంటూ వచ్చాను. ఓ పరశురామా! నీ చూపులనే అమృతపు చిలకరింపుల వలన నేను మరల నిజరూపాన్ని పొంది సుఖంగా ఉన్నాను' - అని చెప్పి నమస్కరించి స్వేచ్ఛగా వెడలిపోయా డా రాక్షసుడు. ఆ తరువాత పరశురాముడు కర్ణుడు ప్రదర్శించిన అపూర్వధైర్యాన్ని మనసులో లోతుగా భావించి అతడితో- (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: రూపకం.

క. ' ఈతాల్మి లేదు బ్రాహ్మణ । జాతికి; నీ వెవ్వఁడవు నిజం' బనవుడు 'నే
సూతజుఁడ' ననియె వెఱచుచు । నాతం; డా మునివరేణ్యుఁ డతి కుపితుండై. 25

ప్రతిపదార్థం: బ్రాహ్మణజాతికిన్= బ్రాహ్మణజాతికి; ఈ తాల్మి= ఇటువంటి ఓర్పు; లేదు= ఉండదు; నిజంబు= నిజంగా; నీవు+ఎవ్వఁడవు?= నీవు ఎవరవు?; అనవుడున్= అనగా విని; ఏన్= నేను; సూతజుఁడన్= సూతపుత్రుడను - అని; ఆతండు= కర్ణుడు; వెఱచుచున్= భయపడుతూ; అనియెన్= అన్నాడు; ఆ మునివరేణ్యుండు= ఆ మునిశ్రేష్ఠుడైన పరశురాముడు; అతికుపితుండు+ఐ= మిక్కిలి కోపించినవాడై.

తాత్పర్యం : 'బ్రాహ్మణజాతికి ఇటువంటి ఓర్పు ఉండదు. నిజంగా నీ వెవడవు?' అని అడుగగా 'నేను సూతపుత్రుడ' నని కర్ణుడు భయపడుతూ సమాధానం చెప్పాడు. అందుకు పరశురాముడు మిక్కిలి కోపించి.

వ. 'నీవు బ్రాహ్మణుండ నని కపటంబున మత్పరిగ్రహంబు వడసితివి; తత్ఫలం బనుభవింపు' మని యస్త్రవిద్యావిభవంబు వికలంబుగా శపియించెఁ; గర్ణుండునుం జేయునది లేక వగచుచు వచ్చి దుర్యోధనుం గాంచి. 26

ప్రతిపదార్థం: బ్రాహ్మణుండను+అని= నేను బ్రాహ్మణుడను అని; నీవు= నీవు(కర్ణుడు); కపటంబునన్= వంచనతో; మత్+పరిగ్రహంబున్= నా శిష్యత్వమును; పడసితివి= పొందావు; తద్+ఫలంబు= దాని ఫలితాన్ని; అనుభవింపుము= పొందుము; అని= అని పలికి; అస్త్ర విద్యావిభవంబు= మంత్ర బాణవిద్యావైభవం; వికలంబు+కాన్= భగ్నమై పోయేటట్లు; శపియించెన్= శాపం పెట్టాడు; కర్ణుండునున్= కర్ణుడు కూడా; చేయునది లేక= చేయగలిగిందేమీ లేక; వగచుచున్= విచారపడుతూ; వచ్చి= తిరిగివచ్చి; దుర్యోధనున్= దుర్యోధనుడిని; కాంచి= చూచి.

తాత్పర్యం: 'బ్రాహ్మణుడను అని పలికి నీవు వంచనతో నా శిష్యత్వాన్ని గ్రహించావు. దాని ఫలితాన్ని అనుభవించుము. నా వలన నేర్చుకొన్న అస్త్రవిద్యా సంపద మొత్తం భగ్నమైపోవుగాక!' అని శపించాడు. కర్ణుడుకూడా చేయగలిగిందేమీ లేక విచారపడుతూ వచ్చి దుర్యోధనుడిని చూచి.

ఆ. 'అధిప! పరశురాము నాశ్రయించితిఁ; గృతా । స్త్రుండ నైతి, నన్ను భండనమున
మార్కొనంగ లేరు మగ లిజ్జగంబున' । ననుడు నతఁడు ప్రముదితాత్ముఁ డయ్యె. 27

ప్రతిపదార్థం: అధిప!= ప్రభూ! దుర్యోధనా!; పరశురామున్+ఆశ్రయించితిన్= పరశురాముడిని శరణువేడాను; కృత+అస్త్రుండను+ఐతిన్= గైకొనబడిన అస్త్రములు కలవాడి నైనాను (అస్త్రవిజ్ఞానాన్ని పొందాను); ఈ జగంబునన్= ఈ లోకంలో; మగలు= వీరులు; భండనమునన్= యుద్ధంలో; నన్నున్; మార్కొనంగన్‌లేరు= ఎదుర్కొనలేరు; అనుడున్= అనగా విని; అతఁడు= దుర్యోధనుడు; ప్రముదిత+ఆత్ముఁడు= సంతోషించిన హృదయం కలవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: 'ప్రభూ! నేను పరశురాముడిని ఆశ్రయించి అస్త్రవిద్యను గడించాను. ఇప్పు డీలోకంలో వీరు లెవ్వరూ యుద్ధంలో నన్ను ఎదుర్కొనేవారు లేరు' అని అనగా విని దుర్యోధనుడు సంతుష్టాంతరంగు డయ్యాడు.

విశేషం: కర్ణుడు అబద్ధా లాడటంలో వెనుకాడ డని మరొకసారి రుజువైంది - అవి సుయోధనుడికి సంతోషం కలిగిస్తే చాలు.

వ. ఇవి మీ యన్న వోయిన పోక; లిట్లు దుర్యోధనునకు ననుంగైయుండఁ, గళింగపతి యగు చిత్రాంగదుండు శుభాంగి యను నిజపుత్రికి స్వయంవర మహోత్సవంబు సేయించువాఁడై చాటించిన, శిశుపాలుండును, నీలుండును, జరాసంధుండును, రుక్మియు లోనుగా రాజు లనేకులు తదీయరాజధాని యగు రాజపురంబునకుం జనిరి; దుర్యోధనుండును దోహలంబున సముచిత చతురంగ బలసమేతుండును గల్పిత రథారూఢుండును గర్ణసహాయుండునునై యరిగెఁ; నట్లు గూడిన భూపతులకుం దగుసంవిధానంబు లాచరించి. 28

ప్రతిపదార్థం: ఇవి= ఇప్పుడు చెప్పినవి; మీ+అన్న= మీ అన్న అయిన కర్ణుడు; పోయినపోకలు= నడచిన విధాలు; ఇట్లు= ఈ విధంగా; దుర్యోధనునకున్= దుర్యోధనుడికి; అనుంగు+ఐ+ఉండన్= ప్రియస్నేహితుడై ఉండగా; కళింగపతి+అగు చిత్రాంగదుండు= కళింగదేశానికి రాజైన చిత్రాంగదుడు; శుభాంగి+అను నిజపుత్రికిన్= శుభాంగి అనే పేరుగల తన కొమార్తెకు; స్వయంవర మహా+ఉత్సవంబు= స్వయంగా కన్యవరుడిని నిండుసభలో ఎన్నుకొనే వేడుకను; చేయించువాఁడు+ఐ= నిర్వహింపదలచి;

చాటించినన్ ప్రకటన చేయించగా; శిశుపాలుండును, నీలుండును, జరాసంధుండును, రుక్మియున్; లోనుగాన్= మొదలుగా; రాజులు+అనేకులు= పెక్కుమంది రాజులు; తదీయ రాజధాని+అగు= చిత్రాంగదుడి రాజధాని అయిన; రాజపురంబునకున్+చనిరి= రాజపురానికి వెళ్ళారు; దుర్యోధనుండును= దుర్యోధనుడు కూడా; దోహలంబునన్= ఉత్సాహంతో; సముచిత= యోగ్యమైన; చతుః+అంగబలసమేతుండును= రథగజ అశ్వపదాతులనే నాలుగు అంగాలుగల సైన్యంతో కూడుకొని; కల్పితరథ+ఆరూఢుండును= సిద్ధం చేయబడిన రథాన్ని ఎక్కినవాడై; కర్ణసహాయుండును+ఐ= కర్ణుడి సహాయం తీసికొన్నవాడుకూడా అయి; అరిగెన్= వెళ్ళాడు; అట్లు= ఆ విధంగా; కూడిన భూపతులకున్= సమావేశమైన రాజులకు; తగు సంవిధానంబు= ఉచితమైన సదుపాయాలు; ఆచరించి= చేసి.

తాత్పర్యం: మీ అన్న అయిన కర్ణుడు నడచిన విధా లటువంటివి. ఆ విధంగా కర్ణుడు దుర్యోధనుడికి ఆప్తమిత్రుడై ఉండగా కళింగరాజ్యాన్ని పరిపాలించే చిత్రాంగదుడనే రాజు తన పుత్రిక శుభాంగికి స్వయంవర మహోత్సవాన్ని చాటాడు. దానికి శిశుపాలుడు, నీలుడు, జరాసంధుడు, రుక్మి మొదలైన రాజు లెందరో చిత్రాంగదుడి రాజధానీ నగరమైన రాజపురానికి చేరారు. దుర్యోధనుడు కూడా ఉత్సాహంతో చతురంగ బలాలను వెంటబెట్టుకొని, కర్ణసహాయుడై, రథమెక్కి రాజపురానికి వెళ్ళాడు. అట్లా సమావేశమైన రాజులకందరికీ చిత్రాంగదుడు సముచిత సత్కారాలు చేసి.

సీ. **కాళింగుఁ డాత్మీయ కన్యాస్వయంవర । కార్యంబు నడప, నక్కన్య సఖులు**
దాదులు పేర్వేర ధరణీపతులఁ జూపి । చెప్పంగఁ జూచుచుఁ జేతఁ బుష్ప
మాలిక యొప్పఁ దన్మధ్య వీథికి నల్ల । నడచుచుఁ గురుపతిఁ గడచిపోయె;
నతఁ డల్గి యచ్చపలాక్షిఁ బోనీ కాఁగి । పట్టి, రథంబుపైఁ బెట్టఁ బనిచి

ఆ. **యేఁగుచున్న, రాజు లెల్ల సంక్షోభించి, । కూడుకొని యుదగ్ర ఘోరభంగిఁ**
దాఁకి; రవ్విభుండుఁ దలఁకక బలశౌర్య । ములు పొగడ్త కెక్కఁ బోరె నధిప! 30

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; కాళింగుఁడు= కళింగదేశాధిపతి చిత్రాంగదుడు; ఆత్మీయకన్యా స్వయంవర కార్యంబు= తన కూతు స్వయంవరోత్సవ కార్యక్రమాన్ని; నడపన్= నిర్వహించగా; ఆ+కన్యసఖులు, దాదులు= స్వయంవరకన్య అయిన శుభాంగి యొక్క చెలికత్తెలు; పెంచిన దాదులు; పేరు+పేరన్= ఒక్కొక్కరి పేరు చెప్పుతూ; ధరణీపతులన్= రాజులను; చూపి= చూపించి; చెప్పంగన్= పరిచయం చేయగా; చూచుచున్= (శుభాంగి వారిని) చూస్తూ; చేతన్+పుష్పమాలిక ఒప్పన్= చేతిలో కల్యాణపుష్పమాల ఒప్పారగా; తద్+మధ్యవీథికిన్= రాజుల నడుమనున్న బాటలో; అల్లన్= మెల్లగా; నడచుచున్= ముందుకు సాగుతూ; కురుపతిన్= దుర్యోధనుడిని; కడచిపోయెన్= దాటిపోయింది; అతఁడు= దుర్యోధనుడు; అల్గి= కోపించి; ఆ+చపలాక్షిన్= చలించేకన్నులు గల ఆ శుభాంగిని; పోనీక= ముందుకు పోకుండ; ఆఁగిపట్టి= ఆపి పట్టుకొని; రథంబుపైన్= రథంమీద; పెట్టన్= ఉంచటానికి; పనిచి= ఆజ్ఞాపించి; ఏఁగుచున్నన్= సభను వీడిపోతూ ఉండగా; రాజులు+ఎల్లన్= రాజులందరూ; సంక్షోభించి= కలతచెంది; కూడుకొని= ఒక్కటై; ఉదగ్రఘోరభంగిన్= అతి భయంకరమైన విధంగా; తాఁకిరి= ఎదుర్కొన్నారు; ఆ+విభుండున్= ఆ రాజు(దుర్యోధనుడు) కూడ; తలఁకక= భయపడక; బలశౌర్యములు= బలపరాక్రమాలు; పొగడ్తకెక్కన్= కీర్తించబడేటట్లుగా; పోరెన్= యుద్ధం చేశాడు.

తాత్పర్యం: ధర్మరాజా! చిత్రాంగదుడు తన కూతురైన శుభాంగికి స్వయంవర మహోత్సవ కార్యాన్ని నిర్వహిస్తున్నాడు. చెలికత్తెలు, దాదులు పేరుపేరున రాజులను చూపి పరిచయం చేస్తూ ఉండగా ఆ కన్య వారిని చూస్తూ చేతిలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కల్యాణపుష్పమాలను ధరించి రాజుల నడుమనున్న దారిని మెల్లగా నడుస్తూ దుర్యోధనుడిని దాటిపోయింది. అందుకు రారాజుకు కోపం వచ్చింది. ఆమెను ముందుకు సాగకుండా ఆపి పట్టి, రథంమీద ఉంచటానికి ఆజ్ఞాపించి, తాను సభను వీడి వెళ్ళనారంభించాడు. సభలోని రాజులందరూ కలవరపడి, గుమిగూడి అతిభయంకరమైన విధంగా అతడిని ఎదుర్కొన్నారు. దుర్యోధనుడు కూడా వెనుకాడక అందరూ అతడి బలపరాక్రమాలను పొగడేటట్లు యుద్ధం చేశాడు.

వ. అట్టియెడ. 30

తాత్పర్యం: ఆ సమయంలో.

శా. భల్లంబుల్ పరఁగించి యుగ్రముగ భూపాలోత్తమాంగంబులన్
డొల్లం జేయుచుఁ, జిత్ర లాఘవము నాటోపంబు దర్పంబు రా
జిల్లం గుంభిఘటారథవ్రజ హయశ్రేణీ పదాతి ప్రతా
నోల్లాసంబుల రూపుమాపుచు నవార్యుం డయ్యెఁ గర్ణుం డనిన్. 31

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధంలో; కర్ణుండు= కర్ణుడు; భల్లంబులన్= బల్లెములను; పరఁగించి= ప్రయోగించి; ఉగ్రముగన్= భయంకరంగా; భూపాల+ఉత్తమ+అంగంబులన్= రాజుల తలలను; డొల్లన్+చేయుచున్= నేలరాలేటట్లు చేస్తూ; చిత్రలాఘవమున్= అద్భుతమైన నేర్పును; ఆటోపంబున్= వేగిరపాటును; దర్పంబున్= గర్వం; రాజిల్లన్= ప్రకాశించగా; కుంభిఘటా= ఏనుగుల గుంపులయొక్క; రథవ్రజ= రథసమూహాలయొక్క; హయశ్రేణీ= గుర్రాలవరుసలయొక్క; పదాతిప్రతాన= కాల్బలాల సముదాయంయొక్క; ఉల్లాసంబులన్= అతిశయాలను; రూపుమాపుచున్= అణస్తూ; అవార్యుండు= వారించటానికి శక్యం కానివాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: బల్లెములను ప్రయోగించి రాజుల శిరస్సులను భయంకరంగా నేల రాలేటట్లు చేస్తూ, విచిత్రమైన నేర్పు, వేగం, గర్వం ప్రకాశించేటట్లు చేస్తూ ఏనుగుల, రథాల, గుర్రాల, పదాతుల సమూహాలను మట్టుపెట్టుతూ, అందరికీ వారించటానికి శక్యం కానివాడుగా కర్ణుడు యుద్ధరంగంలో నిలిచాడు.

వ. ఇవ్విధంబున విక్రమించు నవ్వీరవర్యుని శౌర్యబాహువీర్యంబులకు భయంబుఁగొని హతశేషులైన భూపతులు పఱచినం బ్రీతుం డగుచు నక్కురుకుమారుండు గన్యారత్నంబుఁ గొని కరినగరంబున కరుగుదెంచె; నప్పగ మనంబునఁ బెట్టికొని పదంపడి జరాసంధుం డక్కమలబంధుపుత్త్రు నెక్కటిపోరికిం బిలిచినం బోయి. 32

ప్రతిపదార్థం: ఈవిధంబునన్= పైన చెప్పిన విధంగా; విక్రమించు= పరాక్రమం ప్రదర్శించే; ఆ+వీరవర్యుని= ఉత్తమ వీరుడైన ఆ కర్ణుడియొక్క; శౌర్యబాహు వీర్యంబులకున్= పరాక్రమానికీ, భుజబలానికీ; భయంబున్+కొని= భయపడి; హతశేషులు+ఐన భూపతులు= చావగా మిగిలిన రాజులు; పఱచినన్= పరుగెత్తగా, పారిపోగా; ఆ+కురుకుమారుండు= ఆ దుర్యోధనుడు; ప్రీతుండు+అగుచున్= సంతోషించినవాడౌతూ; కన్యారత్నంబున్= శ్రేష్ఠురాలైన ఆ కన్యను (శుభాంగిని); కొని= గ్రహించి; కరినగరంబునకున్= హస్తినాపురానికి; అరుదెంచెన్= వచ్చాడు; జరాసంధుండు= జరాసంధుడు; ఆ+పగన్= ఆ కచ్చెను; మనంబునన్= మనసులో; పెట్టికొని= ఉంచుకొని; పదంపడి= ఆ తరువాత ఒకసారి; కమలబంధు పుత్త్రున్= సూర్యుడి కుమారుడైన కర్ణుడిని; ఎక్కటి పోరికిన్= ఒంటరిగా చేసే పోరుకు (అంటే ద్వంద్వయుద్ధానికి); పిలిచినన్= ఆహ్వానించగా; పోయి.

తాత్పర్యం: ఆ విధంగా బలపరాక్రమాలను ప్రదర్శించే వీరవర్యుడైన కర్ణుడిని చూచి, చావగా మిగిలిన రాజులు భయపడి పలాయనం చిత్తగించారు. దుర్యోధనుడు సంతోషించి కన్యారత్నమైన శుభాంగిని తీసికొని హస్తినాపురానికి చేరుకొన్నాడు. అయితే, అప్పటి పగను మనసులో పెట్టుకొన్న జరాసంధుడు కర్ణుడిని ఒంటరిపోరుకు (ద్వంద్వయుద్ధానికి) ఆహ్వానించాడు. కర్ణుడు వెళ్ళాడు.

సీ. **ఎక్కటెక్కటిపోరి యిద్ధదివ్యాస్త్ర సం । చయవంతుఁ డగు జరాసంధు బాణ**
ధనురాది వివిధసాధనములు దనచేతఁ । దన యస్త్రశస్త్రసంతాన మెల్ల
నాతనిచే మడియంగ రథంబులు । డిగ్గి పెంపారెడు నగ్గలికల
నాతండుఁ దాను బాహాసంగరమునకుఁ । జొచ్చి పెనంగఁగ నొచ్చి యతని

ఆ. **యంగసంధి వికల మగుటయుఁ బోరు సా । లించి యతఁడు గారవించి తనకు**
మహితవిభవ మైన మాలినీ నగర మీ । నధికతేజ మెసఁగ నరుగుదెంచె. 33

ప్రతిపదార్థం : ఎక్కటి+ఎక్కటి= ఒంటరొంటరిగా; పోరి= యుద్ధంచేసి; ఇద్ధ దివ్య+అస్త్ర సంచయవంతుఁడు+అగు= ప్రకాశించే మహిమాన్వితాలైన మంత్రపూరిత బాణ సమూహాలతో కూడుకొన్నవాడైన; జరాసంధు= జరాసంధుడియొక్క; బాణధనుః+ఆది వివిధ సాధనములు= బాణాలు, విల్లమ్ములు మొదలైన పలురకాలైన పనిముట్లు; తనచేతన్= తన (కర్ణుడి) చేతను; తన+అస్త్ర శస్త్ర సంతానము+ఎల్లన్= కర్ణుడి మంత్రసహితబాణాలయొక్కయు, మంత్రరహిత బాణాలయొక్కయు సమూహాలన్నింటిని; ఆతనిచేన్= జరాసంధుడిచేతను; మడియంగన్= ధ్వంసంకాగా; ఆతండున్+తానున్= జరాసంధుడూ, కర్ణుడూ; రథంబులు= రథాలను; డిగ్గి= దిగి; పెంపు+ఆరెడు= అతిశయించే; అగ్గలికలన్= పూనికలతో, బాహాసంగరమునకున్= బాహుయుద్ధానికి; చొచ్చి= ప్రవేశించి; పెనంగఁగన్= ద్వంద్వయుద్ధం చేయగా; నొచ్చి= నొప్పిచెంది; అతని+అంగసంధి= జరాసంధుడి శరీరంలోని కీలు; వికలము+అగుటయున్= విరగగా; పోరు= యుద్ధం; చాలించి= మాని; అతడు= జరాసంధుడు; గారవించి= సన్మానించి; తనకున్= కర్ణుడికి; మహితవిభవము+ఐన= అధికసంపద కలిగినదైన; మాలినీనగరము= మాలిని అనే పేరుగల పట్టణాన్ని; ఈన్= ఈయగా; అధికతేజము= మిక్కిలి పరాక్రమం; ఎసఁగన్= ఒప్పారగా, ప్రకాశించగా; అరుగుదెంచెన్= తిరిగి వచ్చాడు.

తాత్పర్యం: కర్ణ జరాసంధు లిరువురూ అసహాయవీరులై యుద్ధంచేశారు. కర్ణుడు జరాసంధుడి దివ్యాస్త్ర సముదాయాన్ని, ధనురాది సాధనాలనూ ధ్వంసం చేశాడు. జరాసంధుడు కూడా కర్ణుడి అస్త్రశస్త్రాలను వమ్ముచేశాడు. ఆపైన ఇరువురూ రథాలపై నుండి నేలమీదకు దిగి, పెరిగిన పట్టుదలతో బాహాబాహీ యుద్ధానికి పూనుకొని తలపడ్డారు. జరాసంధుడు బాధపొంది కీలు విరుగగొట్టుకొన్నాడు. అంతటితో పోరు ఇరువురూ చాలించారు. జరాసంధుడు కర్ణుడి పౌరుషానికి మెచ్చి గారవించి, అధిక సంపదలకు నిలయమైన మాలినీనగరాన్ని అతడి కిచ్చాడు. కర్ణుడు అమిత తేజంతో తిరిగి వచ్చాడు.

వ. **ఈ రెండ వదానంబులు నీవును గొంత యెఱుంగుదు; దిట్లు ప్రసిద్ధబలపరాక్రముండైన కర్ణు నుదీర్ణత్వంబు సెఱుచుటకునై సహజ కవచకుండలంబులు భిక్షించి పుచ్చుకొని నాకలోకపతి నీకు హితం బాచరించె; దానంజేసి ధనంజయుం డతనిం దెగటార్పం జాలె' నని చెప్పి వెండియు.** 34

ప్రతిపదార్థం: ఈరెండు+అవదానంబులు= జరిగిన ఈ రెండు మంచి పనులు; నీవును= నీవుకూడ; కొంత+ఎఱుంగుదు(వు)= కొంత తెలిసికొని ఉంటావు; ఇట్లు= పైన చెప్పబడిన విధంగా; ప్రసిద్ధబల పరాక్రముండు+ఐన= ప్రకటమైన బలపరాక్రమాలు కలవాడైన; కర్ణు= కర్ణుడియొక్క; ఉదీర్ణత్వంబు= గొప్పతనమును; చెఱుచుటకునై= పాడుచేయటానికై; నాకలోకపతి= స్వర్గలోకాధిపతిఅయిన

ఇంద్రుడు; సహజ కవచకుండలంబులు= పుట్టుకతో నైజంగా వచ్చిన కవచాన్నీ, కుండలాలనూ; భిక్షించి= అడిగికొని; పుచ్చుకొని= తీసికొని; నీకున్= నీకు (ధర్మరాజుకు); హితంబు= మేలు; ఆచరించెన్= చేశాడు; దానన్+చేసి= అది కారణంగా; ధనంజయుండు= అర్జునుడు; అతనిన్= కర్ణుడిని; తెగటార్పన్+చాలెన్= చంపగలిగాడు; అని చెప్పి= ఈ విధంగా చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: జరిగిన ఈ రెండు మంచి పనులు నీకు కూడా కొంత తెలిసి ఉండవచ్చును. అట్లా బలపరాక్రమాలలో జగత్ప్రసిద్ధుడైన కర్ణుడి గొప్పతనాన్ని ధ్వంసం చేయదలచి ఇంద్రుడు అతడి కవచకుండలాలను భిక్షగా అడిగి పుచ్చుకొన్నాడు. దానివలన ధర్మజా! నీకు మేలు జరిగింది. దానివలననే అర్జునుడు కర్ణుడిని సంహరించగలిగాడు' - అని చెప్పి, మరల ఇట్లా అన్నాడు:

చ. **' వినుము నరేంద్ర! విప్రుఁ డలివెన్, జమదగ్నిసుతుండు శాప మి**
చ్చె, నమరభర్త వంచనము సేసె, వరం బని కోరి కుంతి మా
న్పె నలుక, భీష్ముఁ డర్ధరథుఁ జేసి యడంచెఁ, గలంచె మద్రరా
జనుచిత మాడి, శౌరి విధి యయ్యెఁ, నరుం డనిఁ జంపెఁ గర్ణునిన్. 35

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= ధర్మరాజా!; వినుము= గ్రహించుము; విప్రుఁడు= బ్రాహ్మణుడు; అలివెన్= కోపగించాడు; జమదగ్నిసుతుండు= జమదగ్నిమహర్షి కుమారుడైన పరశురాముడు; శాపము+ఇచ్చెన్= శాపం పెట్టాడు; అమరభర్త= దేవతల రాజైన ఇంద్రుడు; వంచనము= మోసం; చేసెన్= చేశాడు; కుంతి= కుంతీదేవి; వరంబు+అని= వర మనే పేరుతో; కోరి= అడిగి; అలుకన్= తన పుత్రులమీది కోపాన్ని; మాన్పెన్= తగ్గించింది; భీష్ముఁడు= భీష్ముడు; అర్ధరథున్= ఒక రథికుడితో కూడ సమంగా పోరలేని వీరుడిగా; చేసి= నిర్ణయించి; అడంచెన్= అణచాడు; మద్రరాజు= మద్రదేశ ప్రభువు శల్యుడు; అనుచితము+ఆడి= అయోగ్యాలైన మాటలు మాట్లాడి; కలంచెన్= హృదయాన్ని కలవరపెట్టాడు; శౌరి= కృష్ణుడు; విధి= తలవ్రాత; అయ్యెన్= అయ్యాడు; అనిన్= యుద్ధంలో; నరుండు= అర్జునుడు; కర్ణునిన్= కర్ణుడిని; చంపెన్= చంపాడు.

తాత్పర్యం: ధర్మరాజా! నేను చెప్పేది విని గ్రహించుము. బ్రాహ్మణుడు కర్ణుడిని కోపగించి శపించాడు. ఆ తరువాత పరశురాముడు శాపం పెట్టాడు. ఇంద్రుడు మోసంచేసి సహజకవచకుండలాలను గ్రహించాడు. కుంతి వరమనే నెపంతో కోరి కోపాన్ని మాన్పింది; భీష్ముడు కర్ణుడిని అర్ధరథుడిగా చేసి అగౌరవపరిచాడు; శల్యుడు అనుచిత సంభాషణలతో కర్ణుడి హృదయాన్ని కలతపెట్టాడు. కృష్ణుడు అతడికి దాటరాని విధిగా నిలిచాడు. ఇన్ని జరుగగా అర్జునుడు కర్ణుడిని రణరంగంలో వధించగలిగాడు!

విశేషం: కర్ణుడి జీవితాన్నంతా ఒక్క పద్యంలో ఇమిడ్చిన రచన ఇది. పండిత లోకంలో అమిత ప్రచారంలో ఉన్న పద్య మిది. ఎంతటి మహాత్ముడైనా దైవబలం లేకపోతే ఎట్లా కుప్పకూలిపోతాడో చెప్పటానికి విజ్ఞులు ఈ పద్యాన్ని ఒక స్ఫూర్తిగా సంభాషణలలో వాడుకొంటూ ఉంటారు.

వ. **అట్లుంగాక. 36**

తాత్పర్యం: అట్లా కాకపోతే.

క. **హర సురపతి యమ వరుణులు । గురుకృపులును దివ్యబాణకోటు లొసఁగుటన్**
నరుశక్తి కర్ణుతేజ । స్ఫురణము నార్పంగఁ జాలెఁ జువ్వె నృపాలా! ' 37

ప్రతిపదార్థం: నృపాలా!= ధర్మరాజా!; హర, సురపతి, యమ, వరుణులు, గురుకృపులును= శివుడు, ఇంద్రుడు, యముడు, వరుణుడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు; దివ్యబాణకోటులు= మహిమాన్వితాలైన లెక్కకు మించిన బాణాలను; ఒసంగుటన్= ఇవ్వటంవలన; నరుశక్తి= అర్జునుడి పరాక్రమం; కర్ణుతేజః+స్ఫురణమున్= కర్ణుడియొక్క ప్రతాపదీప్తిని; ఆర్పంగన్+చాలెన్+చువ్వె!= ఆర్పగలిగింది సుమా!

తాత్పర్యం: ధర్మరాజా! శివుడు, ఇంద్రుడు, యముడు, వరుణుడు, ద్రోణుడు, కృపుడు మొదలైనవారందరూ లెక్కకు మించిన దివ్యబాణాలను ఉపదేశించటంవలన అర్జునుడి ప్రతాపతేజం కర్ణుడి పరాక్రమతేజాన్ని ఆర్పగలిగింది సుమా!'

వ. అనిన విని శోకవ్యాకులుండైన యన్నరపతి గన్నీరొలుక నిట్టూర్పు నిగిడించినం దత్సమీపంబున నున్న కుంతి గనుంగొని యడ లుడుపుటకై యతనితో నిట్లనియె. 38

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని; శోకవ్యాకులుండు+ఐన= దుఃఖంచేత కలతచెందినవాడైన; ఆ+నరపతి= ఆ రాజైన యుధిష్ఠిరుడు; కన్నీరు+ఒలుకన్= కన్నీరు కారగా; నిట్టూర్పు నిగిడించినన్= దీర్ఘనిశ్వాస వదలగా; తద్+సమీపంబునన్= ఆ సమీపప్రాంతంలో ఉన్న; కుంతి= కుంతీదేవి; కనుంగొని= చూచి; అడలు= దుఃఖాన్ని; ఉడుపుటకున్+ఐ= ఉపశమింపచేయటానికి; అతనితోన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: అని నారదుడు చెప్పగా విని తీవ్రమైన దుఃఖంచేత కలతచెంది ధర్మరాజు కన్నీరు మున్నీరు కాగా, దీర్ఘనిశ్వాస విడుస్తూ ఉండగా అతడి సమీపంలో ఉన్న కుంతీదేవి అతడి అవస్థను చూచి, అతడి శోకాన్ని మాన్పాలని అతడితో ఇట్లా అన్నది:

చ. ' జననముఁ దెల్పి యేఁ బిలువ 'సత్యము సుమ్మర కుంతి భాషణం'
బని తనుజత్వజాతకృప నంబుజమిత్రుఁడు వల్కె; నేమిటన్
గొనకొన నేరఁడయ్యె నినుఁ గూడ సుయోధనుఁ బట్టి; యట్టి క
ర్ణున కయి నీవు నేటికి మనోవ్యథఁ బొందఁగ నిట్లు పుత్రకా!' 39

ప్రతిపదార్థం: పుత్రకా!= కుమారా! (ధర్మరాజా!); ఏన్= నేను (కుంతి); జననమున్+తెల్పి= పుట్టుకను గూర్చిన సత్యాన్ని తెలియజెప్పి; పిలువన్= (పాండవుల పక్షంలో చేరుమని) పిలువగా; అంబుజమిత్రుఁడు= సూర్యుడు; తనుజత్వ జాత కృపన్= కన్నకొడుకనే భావంతో కలిగిన కరుణతో; కుంతిభాషణంబు= కుంతీదేవిమాటలు; సత్యము సుమ్మర!= నిజం సుమా!; అని; పల్కెన్= పలికాడు; (కాని); సుయోధనున్+పట్టి= దుర్యోధనుడిని ఆశ్రయించి; నినున్= నిన్ను (ధర్మరాజుతో); కూడన్= చేరటానికి; ఏమిటన్= ఏ విధంగా కూడా; గొనకొనన్ నేరఁడు+అయ్యెన్= యత్నించజాలకపోయాడు; అట్టి= అటువంటి; కర్ణునకున్+అయి= కర్ణుడి గురించి; నీవు; ఇట్లు= ఈ విధంగా; మనోవ్యథన్= మానసిక వేదనను; పొందఁగన్+ఏటికిన్?= పొందటం ఎందుకు?

తాత్పర్యం: 'కుమారా! పుట్టుకను గురించిన నిజాన్ని చెప్పి అతడిని నీవైపు నేను ఆహ్వానించినప్పుడు, ఆ సూర్యభగవానుడు కూడా కన్నకొడుకనే భావంతో కలిగిన కరుణతో 'కుంతి చెప్పిన మాట నిజం; నమ్ము నాయనా!' అని పలికాడు. కాని, కర్ణుడు దుర్యోధనుడిని ఆశ్రయించి నీవైపు రావటానికి ఏ విధంగానూ ప్రయత్నం చేయలేకపోయాడు. కాబట్టి అటువంటి కర్ణుడికొరకు నీ వెందుకు ఈ విధంగా మానసిక వేదనను పొందుతావు?' (వలదని భావం).

వ. అనుటయు నవ్వచనంబులు దనకు నసహ్యంబు లైనం గటకటంబడి యద్దేవి నాలోకించి 'భవదీయ మంత్రకార్య గోపనంబునం గాదె యింత పుట్టె' నని పలికి, యంత నిలువక 40

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనుటయున్= అని కుంతీదేవి పలుకగా; ఆ+వచనంబులు= ఆ మాటలు; తనకున్= ధర్మరాజుకు; అసహ్యంబులు+ఐనన్= ఏవగింపు కలిగించినవి కాగా; కటకటంబడి= బాధచెంది; ఆ+దేవిన్= ఆ రాణిని (కుంతిని); ఆలోకించి= చూచి; భవదీయ= నీయొక్క; మంత్రకార్య= రాజనీతి చర్యలను; గోపనంబునన్= రహస్యంగా ఉంచటం వలన; కాదె!= కాదా!; ఇంత= ఇంతటి విపరీతపరిణామం; పుట్టెన్= కలిగింది; అని పలికి= అని చెప్పి; అంతన్ నిలువక= అంతటితో ఆగక.

తాత్పర్యం: అని మాట్లాడిన కుంతీదేవి పలుకులు ధర్మరాజుకు ఏవగింపు కలిగించటంతో అతడు బాధపడి కుంతీదేవిని చూచి ఇట్లా అన్నాడు: 'నీవు నిర్వహించిన ఈ రాచకార్యాన్ని రహస్యంగా ఉంచటం వలననే ఇంతటి విపరీత పరిణామం కలిగింది' అని అంటూ అంతటితో ఆగక - (తరువాతి పద్యంతో అన్వయం).

ధర్మరాజు స్త్రీలకు రహస్య రక్షణంబు లేకుండ శపియించుట (సం. 12-6-11)

తే. **' అంగనాజనమ్ములకు రహస్య రక్ష। ణంబునందలి శక్తి మనంబులందుఁ**
గలుగకుండెడు మెల్లలోకముల' నని శ। పించె నా ధర్మదేవతాప్రియసుతుండు. **41**

ప్రతిపదార్థం: ఆ ధర్మదేవతాప్రియనందనుండు= యమధర్మరాజు ప్రియకుమారుడు ఆ ధర్మరాజు; ఎల్ల లోకములన్= అన్ని లోకాలలోనూ; అంగనాజనమ్ములకున్= స్త్రీజనులకు; రహస్యరక్షణంబునందలి శక్తి= గోప్యంగా ఉంచదగినవాటిని రహస్యంగా ఉంచి కాపాడే విధానంలో ఉండే బిగువు; మనంబుల+అందున్= మనస్సులలో; కలుగక+ఉండెడు(ఉండెడున్+ఎల్ల= ఉండెడుమెల్ల) కలుగకుండా ఉండుగాక!; అని శపించెన్= అని శాపంపెట్టాడు.

తాత్పర్యం: అన్ని లోకాలలో ఉండే ఆడవారికి రహస్యాలను రహస్యంగా కాపాడే శక్తి వారి మనస్సులలో లేకుండా పోవుగాక! అని ధర్మరాజు శపించాడు.

విశేషం: 'ఆడవారి నోళ్ళల్లో ఆవగింజైనా నానదు' అనే సామెత ఇట్లా పుట్టిందేమో!

వ. **ఇట్లు మహాతేజోధనుం డగు నజ్జననాథుం డట్లు శపియించి కుంతి చేసిన కర్ణగోపనంబు ప్రసంగంబుగా నంతరంగంబు గృతపడిన కార్యంబులదెస నిగుడం దనకతంబున మృతిఁబొందిన యుభయపక్ష బంధుమిత్రకోటులం దలంచి యుమ్మలించి విశేషించి కర్ణుచావునకుఁ దూరవగచి విహ్వలించి వివ్వచ్చునాననం బాలోకించి యిట్లనియె.** **42**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మహాతేజోధనుండు+అగు= గొప్పదైన ప్రకాశం (ప్రతాపం) ధనంగా కలవాడైన; ఆ+జననాథుండు= ఆ ధర్మరాజు; అట్లు= ఆ విధంగా; శపియించి= శాపంపెట్టి; కుంతి= కుంతీదేవి; చేసిన= ఒనర్చిన; కర్ణగోపనంబు= కర్ణుడిని గురించిన అంశాలను రహస్యంగా ఉంచిన అంశం; ప్రసంగంబుగాన్= చర్చనీయాంశం కాగా; అంతరంగంబు= మనస్సు; కృతము+పడిన= కడచిన; కార్యంబులదెస= పనులవైపు; నిగుడన్= ప్రసరించగా; తన కతంబునన్= తన కారణంగా; మృతిన్+పొందిన= చనిపోయిన; ఉభయపక్ష= రెండు (కౌరవ పాండవ) పక్షాలకు చెందిన; బంధుమిత్ర కోటులన్= అసంఖ్యాకులైన బంధువులను, మిత్రులను; తలంచి= స్మరించి; ఉమ్మలించి= శోకించి; విశేషించి= అధికంగా; కర్ణుచావునకున్= కర్ణుడి మరణానికి; తూరన్ వగచి= నొచ్చేటట్లుగా దుఃఖించి; విహ్వలించి= దుఃఖాతిశయం వలన శరీరం వశం తప్పినవాడై; వివ్వచ్చు+ఆననంబు= అర్జునుడి ముఖాన్ని; ఆలోకించి= చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: తేజోవంతుడైన ధర్మరాజు ఆ విధంగా శపించి, కుంతీదేవి కర్ణుడి విషయాలు దాచి ఉంచటమనే అంశం చర్చనీయాంశం కాగా, అతడి మనస్సు కడచిన కార్యములపట్ల ప్రసరించింది. అది కారణంగా కౌరవపాండవ

పక్షాలలో అసంఖ్యాకంగా ప్రాణాలు కోల్పోయిన బంధుమిత్రులు జ్ఞాపకం వచ్చారు. దానికి అమితంగా దుఃఖించాడు. విశేషించి కర్ణుడి మరణం అతడి మనస్సును గాయపరచింది. శోకతీవ్రతచేత శరీరం తూలినట్లయింది. అప్పుడు ధర్మరాజు అర్జునుడి మొగంవైపు చూచి ఈ విధంగా అన్నాడు:

క. ‘ మన కేటిరాజ్య? మొండొక । జనపదమున కేఁగి భైక్షచర్యావిధి జీ
వనము నడిపికొనియుండుద । మనఘా! యట్లయిన సుఖుల మవుదుము సుమ్మీ!’ 43

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! అర్జునుడా!; మనకున్= మనకు (పాండవులకు); ఏటిరాజ్యము?= రాజ్యమేమిటికి? (ఎందుకు? అని భావం; వలదు అని తాత్పర్యం); ఒండు+ఒక= మరియొక; జనపదమునకున్= జనస్థానానికి; ఏఁగి= వెళ్ళి; భైక్షచర్యావిధిన్= బిచ్చమెత్తుకొనే కార్యక్రమంతో; జీవనము= బ్రదుకు; నడిపికొని+ఉండుదము= సాగించుకొంటూ ఉందాము; అట్లు+అయినన్= ఆ విధంగా చేసినట్లయితే; సుఖులము= సుఖించినవారం; అవుదుము= అవుతాము; సుమ్మీ!= సుమా!

తాత్పర్యం: ‘పాపరహితుడవైన పార్థుడా! మన కెందుకీ రాజ్యం? మరొక జనస్థానానికి వెళ్ళి అక్కడ బిచ్చమెత్తుకొనే కార్యక్రమంతో బ్రదుకును సాగించుకొంటూ ఉందాము. అట్లాగైతే మనం సుఖంగా ఉంటాము సుమా!’

విశేషం: ధర్మజుడు శోకతీవ్రత చేత విరక్తిని ప్రకటిస్తున్నాడు.

వ. అని వెండియు. 44

తాత్పర్యం: అని ఇంకా (ఇట్లా అన్నాడు ధర్మజుడు).

సీ. ‘ జ్ఞాతుల నందఱఁ జంపితి, మది యాత్మ । వధము కాదే! రాజవర్తనంబుఁ
గాల్పు; మహింస నిక్కము దాల్మి మత్సర । వర్జన మిది వనవాసజనుల
కాగమ విహితంబు లటె; యింత యొప్పునే? । వనమున వసియింపవలయు వింటె;
యసుఖదంబైన రాజ్యామిషంబునకుఁ గు । క్కల భంగిఁ దమలోనఁ గాటులాడి

తే. కులము నెల్లను బొలియింపఁ గుత్సితంపు । బ్రదుకు వచ్చెనె యను వగపాలు వడఁగఁ
బ్రమద మొసఁగదు త్రైలోక్యరాజ్య మైనఁ; । గాన నే నొల్ల మహి; మీర కైకొనుండు. 45

ప్రతిపదార్థం: జ్ఞాతులన్+అందఱన్= సగోత్రికులనందరిని; చంపితిమి= ప్రాణాలు తీశాము; అది= ఆ విధంగా చేయటం; ఆత్మవధము+అ= మనలను మనం చంపుకొనటమే; కాదే!= కాదా!; రాజవర్తనంబున్= క్షత్రియధర్మాన్ని; కాల్పుము= కాల్చివేయుము; (అనగా దానిని తిరస్కరించుము అని భావం); అహింస= హింసచేయకుండటం; నిక్కము= ఋజువర్తనం; సత్యాన్ని పాటించటం; తాల్మి= ఓర్పు; మత్సర వర్జనము= అసూయను విడనాడటం; ఇది= ఇటువంటి గుణాలు కలిగి ఉండే వర్తనం; వనవాస జనులకున్= తపోవనాలలో నియమనిష్ఠలతో నివసించేవారికి; ఆగమ విహితంబులు+అటె!= వేద సమ్మతాలట కదా!; అంత+ఒప్పునే?= ఎంత సముచితంగా ఉంది?; వనమునన్+వసియింపన్ వలయున్= మనం వనంలోనే (తపోవనంలోనే) నివసించాలి; వింటివి+ఎ?= విన్నావా? (గ్రహించావా, తెలిసిందా? అని భావం); అసుఖదంబు+ఐన= దుఃఖాన్ని కలిగించేదైన; రాజ్య+ఆమిషంబునకున్= రాజ్యమనే మాంసం కొరకు; కుక్కలభంగిన్= కుక్కలవలె; తమలోనన్= తమలోతాము; కాటులాడి= కరచుకొని (తగాదాలాడుకొని); కులమున్+ఎల్లన్= వంశాన్నంతటిని; పొలియింపన్= నశింపచేయటానికి; కుత్సితంపుబ్రదుకు= హేయమైన జీవితం జీవించవలసి; వచ్చెనె?= వచ్చిందా?; అను= అనే విధమైన; వగ= దిగులు; పాలుపడఁగన్= పొందేటట్లుండే; త్రైలోక్యరాజ్యము+ఐనన్= మూడులోకాలను (భూలోకం, స్వర్గలోకం, పాతాళలోకం) పాలించే పరిపాలనమైనా; ప్రమదము= సంతోషాన్ని; ఒసఁగదు= కలిగించదు; కానన్= కాబట్టి; ఏన్= నేను (ధర్మరాజు); మహిన్= రాజ్యాన్ని; ఒల్లన్= కోరను; మీరు+అ= మీరే; కైకొనుండు= తీసికొనండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'సగోత్రికుల నందరినీ చంపాను, అది ఆత్మవధ కాదా? ఈ క్షత్రియధర్మాన్ని తగులబెట్టుము. అహింస, సత్యం, ఓర్పు, అనసూయ - ఇటువంటి గుణాలు వనవాసం చేసేవారి కుండదగిన వని వేదాలు చెప్పాయి. నిజంగా, ఎంత సముచితంగా ఉంది! మనం వనంలో నివసిద్దాం; గ్రహించావా? సుఖాన్నివ్వని రాజ్యమనే మాంసఖండం కొరకై కుక్కలు ఎగబడి కాట్లాడుకొన్నట్లుగా తమలో తాము యుద్ధం చేసికొని, వంశాన్నంతా నాశనం చేసికొనే హేయమైన బ్రదుకు బ్రదుకవలసి వచ్చెనే అనే దుఃఖం మిగిలించేదై ముల్లోకాల నేలే ప్రభుత్వమైనా నాకు సంతోషాన్ని కలిగించదు. కాబట్టి నేను రాజ్యాన్ని స్వీకరించను, మీరే తీసికొనండి.

మ. **ధృతరాష్ట్రుండు దనూజుకీడు సమబుద్ధిం జూడ కన్నీచుఁ డే**
గతిఁ జన్నం జననిచ్చెఁ గాని మగుడంగాఁ దివ్వఁ డయ్యేన్; నిరా
కృతశీలుండగు నా సుయోధనుఁడు సంక్షీణంబు సేసెం గులం;
బతనిం జంపఁగఁ గోపమాఱె; మది శోకాక్రాంత మయ్యెం దుదిన్. 46

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; సమబుద్ధిన్= సమదృష్టితో; తనూజు కీడు= కుమారుడైన దుర్యోధనుడికి కాగల ఆపదను; చూడక= గమనించక; ఆ+నీచుఁడు= ఆ అధముడైన దుర్యోధనుడు; ఏగతిన్= ఏవిధంగా; చన్నన్= నడిస్తే, వ్యవహరిస్తే; చనన్+ఇచ్చెన్= నడవనిచ్చాడు, వ్యవహరించనిచ్చాడు; కాని; మగుడంగాన్+తివ్వఁడు+అయ్యెన్= మరలింపజేయటానికి యత్నించినవాడు కాడు; నిరాకృతశీలుండు+అగు= నిరాకరించబడిన శీలంగలవాడైన; ఆ+సుయోధనుఁడు= ఆ దుర్యోధనుడు; కులంబు= వంశాన్ని; సంక్షీణంబు+చేసెన్= బాగా నాశనం చేశాడు; అతనిన్= ఆ దుర్యోధనుడిని; చంపఁగన్= యుద్ధంలో చంపివేయగా; కోపము= కోపం; ఆఱెన్= చల్లారింది; తుదిన్= చివరకు; మది= హృదయం; శోక+ఆక్రాంతము+అయ్యెన్= తీవ్రమైన దుఃఖంతో నిండినదైపోయింది.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ధర్మాధర్మాలయందు పక్షపాతం లేని సమదృష్టితో చూడక తన కొడుకైన దుర్యోధనుడికి రాబోయే కీడును వారించలేకపోయాడు. నీచుడైన ఆ సుయోధనుడు ఎట్లా నడిస్తే అట్లా నడవనిచ్చాడే కాని మరల్చటానికి ఎన్నడూ ప్రయత్నం చేయలేదు. గర్హించదగిన శీలంగల ఆ దుర్యోధనుడు వంశాన్నంతా నాశనం చేసి పెట్టాడు. అతడిని చంపటంవలన కోపంమాత్రం చల్లారింది. కాని, చివరకు మనసు శోకంతో నిండి దుర్భరమైపోయింది.

విశేషం: పగవలన బంధుజన హింసవలన కలిగే శోకం యుద్ధసమయంలో ధర్మరాజుకు గోచరించలేదు; ఆ తరువాత జ్ఞాతులకు ఉత్తరకర్మలు చేస్తున్నప్పుడు అతడి హృదయం శోక సముద్రమై పోయింది. పగ తీరిన తరువాతి వగ ఇది.

వ. **ఆ దుర్జనుండు కర్జం బెఱుంగక దుర్మానంబు వాటించిన సైరించి తొలంగనైతి; రాజ్యపరిగ్రహపరత్వంబు మచ్చిత్తంబునం గలిమింజేసి కిల్బిషం బత్యంతంబు నాచరింప వలసెఁ; బరిగ్రహ దోషంబు పరిగ్రహత్యాగంబునం గాని పోదు; పరిగ్రహత్యాగశీలుండు జన్మమరణ దుఃఖంబులం బొరయం డని శ్రుతులు సెప్పెడు; నొకనికి సకలధర్మంబులు ననుష్ఠింప శక్యం బగునే? యపరిగ్రహం బొక్కటన శుద్ధుండ నయ్యెద; మీరు భూమిపాలన పరిగ్రహ తత్పరత్వంబున వర్ణాశ్రమధర్మరక్షణంబు సేయుం; డేను గాననంబునకుం జని మునిజన సకాశంబున సుఖినై యుండెద' ననిన విని యింద్రాంశసంజనితత్వకలితతేజోధనుం డగు నర్జునజయుండు దనయూష్మలత్వంబునకు నవ్వాక్యంబులు దుస్సహంబు లైనం బదరి దరస్మితంబునఁ దద్వికారంబుఁ గప్పి యప్పుడమిఱేని కిట్లనియె:** 47

ప్రతిపదార్థం: ఆ దుర్జనుండు= ఆ దుర్మార్గుడైన దుర్యోధనుడు; కర్జంబు= చేయదగిన కార్యం; కర్తవ్యం; ఎఱుంగక= తెలియజాలక; దుర్మానంబు= దురభిమానాన్ని; పాటించినన్= అనుసరించగా; సైరించి= దానిని ఓర్చి; తొలంగన్+ఐతిన్= పట్టువీడలేకపోయాను; రాజ్యపరిగ్రహపరత్వంబు= రాజ్యాన్ని గ్రహించాలన్న ఆసక్తి; మత్+చిత్తంబునన్= నా మనసులో; కలిమిన్+చేసి= కలిగి ఉండటంచేత; కిల్బిషంబు= పాపాన్ని; అత్యంతంబున్= అత్యధికంగా; ఆచరింపన్ వలసెన్= చేయవలసి వచ్చింది; పరిగ్రహదోషంబు= రాజ్యస్వీకరణదోషం; పరిగ్రహత్యాగంబునన్+కాని= స్వీకరించినదానిని వదలివేయటం వలనగాని; పోదు= తొలగిపోదు; పరిగ్రహత్యాగశీలుఁడు= స్వీకరించినదానిని త్యాగం చేయగల మనఃప్రవృత్తి (స్వభావం) కలవాడు; జన్మమరణదుఃఖంబులన్= పుట్టుకచావుల వలన కలిగే శోకాలను; పొరయండు+అని= పొందడని; శ్రుతులు= వేదాలు; చెప్పెడున్= చెపుతూ ఉంటాయి; ఒకనికిన్= ఒంటరివాడికి; సకలధర్మంబులున్= ధర్మాలనన్నింటిని; అనుష్ఠింపన్= ఆచరించటానికి; శక్యంబు+అగునే!= సాధ్యం అవుతుందా?; అపరిగ్రహంబు= స్వీకరించకుండటం-త్యాగం; ఒక్కటన్+అ= ఒక్కదానిచేతనే; శుద్ధుండన్+అయ్యెదన్= పవిత్రుడనౌతాను; మీరు= మీరు(భీమాదులు); భూమిపాలన పరిగ్రహ తత్పరత్వంబునన్= నేలను పాలించే ధర్మాన్ని స్వీకరించటంలోని ఆసక్తితో; వర్ణ+ఆశ్రమ ధర్మరక్షణంబున్= వర్ణాలను, ఆశ్రమధర్మాలను కాపాడటం; చేయుండు= నిర్వహించండి; ఏను= నేను(ధర్మరాజు); కాననంబునకున్= అడవికి; చని= వెళ్ళి; మునిజన సకాశంబునన్= ఋషుల సమూహాలసమీపంలో; సుఖిని+ఐ= సంతోషం కలవాడనై; ఉండెదన్= ఉంటాను; అనినన్= అని పలుకగా; ఇంద్ర+అంశసంజనితత్వ కలిత తేజోధనుండు+అగు= ఇంద్రుడియొక్క కళతో పుట్టిన స్వభావంతో కూడుకొన్న పరాక్రమమనే సంపద కలవాడైన; ఆ+ధనంజయుండు= ఆ అర్జునుడు; తన= తనయొక్క; ఊష్మలత్వంబునకున్= ఉబ్బరికాన్ని, పరాక్రమానికి; ఆ+వాక్యంబులు= ఆ ధర్మరాజు పలికిన మాటలు; దుస్సహంబులు+ఐనన్= సహింపజాలనివి కాగా; పదరి= కోపించి; దరస్మితంబునన్= చిరునవ్వుతో; ఆ+వికారంబున్= ఆ మనోభావాన్ని; కప్పి= కప్పిపుచ్చి; ఆ+పుడమితేనికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'దుర్మార్గుడైన ఆ దుర్యోధనుడు కర్తవ్యాన్ని తెలిసికొనకుండా దురభిమానంతో వ్యవహరించినా సహించి, కర్తవ్యంనుండి నేను వైదొలగలేదు. రాజ్యాన్ని పొందాలనే ఆసక్తి నామనసులో బలంగా ఉండటంచేత అమితమైన పాపాన్ని ఆచరించవలసి వచ్చింది. రాజ్య స్వీకారదోషం రాజ్యపరిత్యాగంవలన గాని పోదు. త్యాగశీలుడు జననమరణ దుఃఖాలను పొందడని వేదాలు చెప్పుతున్నాయి. ఒక్కడికి ధర్మాలన్నీ చేయటం సాధ్యపడదు. నేను (రాజ్య)త్యాగం వలన పరిశుద్ధుడనౌతాను. మీరు రాజ్యపాలన స్వీకరించి ఆసక్తితో వర్ణాశ్రమ ధర్మరక్షణం చేయండి. నేను తపోవనానికి వెళ్ళి మునిజనసమూహ సన్నిధానంలో సుఖంగా ఉంటాను' - అని ధర్మరాజు అనగా ఇంద్రతేజోధనుడైన అర్జునుడు తన పరాక్రమానికి ఆ వాక్యాలు సహింపశక్యంగానివి కాగా కోపించి, చిరునవ్వుతో ఆ మనోవికారాన్ని కప్పిపుచ్చి, ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు:

అర్జునుఁడు ధర్మజున కుచిత వచనంబుల మనస్తాపోపశమంబు సేయుట: (సం. 12-8-1)

క. 'ఓహో! యిట్టివి గలవే? । బాహాదర్పమునఁ బరులఁ బరిమార్చి తుదిన్
మాహాత్మ్యం బెడలఁగ భి । క్షాహారత నొందఁ దలఁప నగునె నరేంద్రా! 48

ప్రతిపదార్థం: ఓహో!= ఆహా! (ఆశ్చర్యార్థకం); ఇట్టివి కలవే?= ఇటువంటివి (మాటలు) ఎక్కడైనా ఉన్నాయా? (ఇటువంటి మాటలు నేనెన్నడూ వినలేదనీ, వినదగినవి కావనీ భావం; సహజవిరుద్ధమని భావం); బాహాదర్పమునన్= భుజబలగర్వంచేత; పరులన్= శత్రువులను; పరిమార్చి= చంపి; నర+ఇంద్రా!= రాజువైన ధర్మరాజా!; తుదిన్= చివరకు; మాహాత్మ్యంబు= ఆ గొప్పతనమంతా; ఎడలఁగన్= తొలగిపోయేటట్లుగా; భిక్షా+ఆహారతన్= తిరిపెమెత్తి భుజించటాన్ని; ఒందన్= పొందటానికి; తలఁపన్= కోరటం; అగునె?= న్యాయమా? (కాదని భావం).

తాత్పర్యం: 'ఓహో నా కాశ్చర్యం వేస్తున్నది. ఇటువంటి మాటలు ఎక్కడైనా ఉంటాయా? భుజబలంతో శత్రువులను యుద్ధంలో చంపి, చివరకు ఆ గొప్పతనమంతా కుప్పకూలేటట్లు బిచ్చమెత్తుకొనటాన్ని కోరటం నీకు తగునా ధర్మరాజా!

సీ. ధర్మపథంబున ధరణి సేకుఱినఁ బా । లింపక సత్త్వంబు పెంపు మాలి
విడుచుట యొప్పునే; వినుః మిట్టులైన ము । న్నేల భూపాలుర నెల్లఁ జంపి?
తడలి రాజ్యము దక్కి యడవికిఁ జనిన బే । లందురు గాక, మే లండ్రె జనులు?
కిల్బిషశంక గల్గిన నశ్వమేధాది । పుణ్యకర్మంబులఁ బోదె? వంశ

ఆ. ధర్మ మెడలఁ గృపణకర్మంబుఁ గోరి; త । ర్థంబు సువ్వె సకలధర్మకారి;
'యొడమి లేనివాఁడ నడపీనుఁ' గను నహు । షోక్తి వినమె? దాని నూఁద వలదె? 49

ప్రతిపదార్థం: ధర్మపథంబునన్= న్యాయమార్గంలో; ధరణి= రాజ్యం; చేకుఱినన్= సమకూరగా; పాలింపక= ఏలకుండా; సత్త్వంబుపెంపు= బలగౌరవాన్ని; మాలి= వదలి; విడుచుట= రాజ్యపాలనాన్ని వదలిపెట్టటం; ఒప్పునే?= న్యాయమౌనా? (కాదని భావం); వినుము= నేను చెప్పే మాటలు శ్రద్ధగా విని గ్రహించుము; ఇట్టులు+ఐనన్= ఈ విధంగా రాజ్యాన్ని త్యాగం చేసేటట్లయితే; మున్ను= పూర్వం; భూపాలురన్+ఎల్లన్= రాజుల నందరినీ; ఏల= ఎందుకు; చంపితి?= చంపావు?; అడలి= భయపడి; రాజ్యము తక్కి= రాజ్యాన్ని కాదని; అడవికిన్= (తపో) వనానికి; చనినన్= వెళ్ళినట్లయితే; జనులు= ప్రజలు; బేల= పిరికిపంద అని; అందురు= అంటారు; కాక= అట్లు కాక; మేలు= శుభం, యోగ్యం; అండ్రె?= అని అంటారా? (అనరని భావం); కిల్బిషశంక= పాపం కలుగుతుందనే అనుమానం; కల్గినన్= కలిగినట్లయితే; (అది); అశ్వమేధ+అది= అశ్వమేధయాగం మొదలైన; పుణ్యకర్మంబులన్= పుణ్యకార్యాలతో; పోదె?= తొలగిపోదా?; వంశధర్మము= వంశపరంపరగా వస్తున్న రాజ్యపాలనమనే ధర్మం; ఎడలన్= దూరమయ్యేటట్లు; కృపణకర్మంబు= దీనులు ఆచరించే ధర్మాన్ని; కోరితి(వి)= కోరావు; సకలధర్మకారి= సర్వ ధర్మాలను నెరవేర్చేది; అర్థంబు+చువ్వె!= సంపదయే (ధనమే) సుమా!; ఒడమి లేనివాఁడు+అ= ధనం లేనివాడు మాత్రమే; నడపీనుఁగు= నడుస్తున్న పీనుఁగు వంటివాడు (బ్రదికి ఉండికూడా చచ్చినవాడితో సమానమైనవాడు; ఏమీ సాధించలేని నిరర్థకు డని భావం); అను= అని ప్రసిద్ధికెక్కిన; నహుష+ఉక్తి= నహుషుడి సూక్తి (సుభాషితం); వినమె?= వినమా? (ప్రసిద్ధమని భావం); దానిని= ఆ మాటను; ఊఁదవలదె?= ఊతగా తీసికొనవలదా? (గణించవద్దా? అని భావం).

తాత్పర్యం: ధర్మమార్గంలో రాజ్యం వశమైతే దానిని పాలించకుండా, పరాక్రమాతిశయాన్ని ప్రదర్శించకుండా వదలివేయటం న్యాయం కాదు. నీ కిటువంటి సంకల్పమే ఉంటే ముందుగా రాజులనందరినీ ఎందుకు చంపావు? భయపడి రాజ్యం వదలి అడవులకు పోతే, నిన్ను బేలవని అందరూ గేలిచేస్తారు. జనులెవ్వరూ నీ పనిని మెచ్చుకోరు. పాపం కలిగిందన్న అనుమానం ఏర్పడితే అశ్వమేధయాగంవంటి పుణ్యకార్యాలు చేస్తే అది తొలగిపోదా? మన వంశధర్మం వీగి పోయేటట్లు ఈ దీనమైన చర్యను నీ వెన్నుకొన్నావు. సకలధర్మాలను నెరవేర్చగలిగింది సంపదయే కదా! ధనంలేనివాడు నడపీనుగువంటివాడనే నహుషవాక్యం లోక ప్రసిద్ధం. దానిని గణించవలదా?

విశేషం: ప్రయత్న పూర్వకంగా సాధించుకొన్న రాజ్యాన్ని అనుభవించాలి - అనే తనప్రతిపాదనకు చంద్రవంశజులలో ప్రసిద్ధుడై, ఇంద్రపదవి నధిష్ఠించిన నహుషుడి సూక్తిని ప్రమాణంగా చూపాడు అర్జునుడు. అర్జునుడి వాక్యాలు తర్కబద్ధంగా సాగుతున్నాయి.

క. సరిగా నెన్నుదు రార్యులు । దరిద్రునిం బతితునిం గృతఘ్నుని జడునిన్
దొరకొను ధర్మముఁ గామముఁ । బరమగతియు నర్థమునన పౌరవముఖ్యా! 50

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశజులలో గొప్పవాడవైన ఓ ధర్మరాజా!; ఆర్యులు= ఉత్తములు; దరిద్రునిన్= ధనంలేనివాడిని; పతితునిన్= భ్రష్టుడైనవాడిని; కృతఘ్నునిన్= మేలు చేసినవారి మేలు మరచుటయే కాక వారికి అపకారం చేసేవాడిని; జడునిన్= మూర్ఖుడిని; సరిగాన్= సమానంగా; ఎన్నుదురు= లెక్కిస్తారు; అర్థమునన= ధనంచేతనే; ధర్మమున్, కామమున్, పరమగతియున్= ధర్మకామమోక్షాలు; దొరకొనున్= కలుగుతాయి.

తాత్పర్యం: బీదవాడినీ, పతితుడినీ, కృతజ్ఞత లేనివాడినీ, మూర్ఖుడినీ సమంగా భావిస్తారు ఉత్తములు. కాబట్టి ఓ ధర్మరాజా! ధన ముంటేనే పురుషార్థాలు ఫలిస్తాయి.

క. కలిమియ చుట్టలఁ జేర్చుం; । గలిమియ చెలులను ఘటించుఁ గలిమియ శౌర్యో
జ్జ్వలుఁ డనిపించుం; గలిమియ । పలువురు సద్బుద్ధి యనఁగఁ బరఁగం జేయున్. 51

ప్రతిపదార్థం: కలిమి+అ= సంపదయే; చుట్టలన్= బంధువులను (చుట్టాలకు రూపాంతరం); చేర్చున్= కూరుస్తుంది; కలిమి+అ= సంపదయే; చెలులను= మిత్రులను; ఘటించున్= సమకూరుస్తుంది; కలిమి+అ= సంపదయే; శౌర్య+ఉజ్జ్వలుఁడు+అనిపించున్= ప్రతాపంచేత వెలుగొందేవాడని భావింప జేస్తుంది; కలిమి+అ= సంపదయే; సద్బుద్ధి+అనఁగన్+పరఁగన్+చేయున్= మంచిబుద్ధిగలవాడని వలె ఒప్పేటట్లు చేస్తుంది.

తాత్పర్యం: సంపదయే చుట్టాలను రప్పిస్తుంది; సంపదయే మిత్రులను సమకూరుస్తుంది; సంపదయే ప్రతాపాన్ని ప్రకాశించేటట్లు చేస్తుంది; సంపదయే సద్బుద్ధి అని ఒప్పేటట్లు చేస్తుంది.

విశేషం: ఇందులో 'కలిమియ' అనే పదం నాలుగుసార్లు ప్రయోగించటం దాని ప్రాధాన్యం నొక్కి చెప్పటానికే; వినేవాడి మనసుపై గాఢమైన ప్రభావం వేయటానికే. అర్జునుడి అనునయవాక్యశిల్పం తిక్కన కవితలో తళుక్కుమంటున్నది.

క. ఏవాని బంధుమిత్రులు । జీవధనంబులును డప్పిఁ జెందును గృశునిం
గా వాని నెన్నఁగాఁ దగుఁ, । గేవల తనుకార్శ్యయుతుఁడు గృశుఁడె నరేంద్రా! 52

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా! ధర్మరాజా!; ఏవాని= ఎవడియొక్క; బంధుమిత్రులు= చుట్టాలు, స్నేహితులు; జీవధనంబులును= ప్రాణాలు, సంపదలు (ప్రాణాలతో ఉన్న సంపదలు - అంటే ఆశ్రితులు అని కూడా గ్రహించవచ్చును); డప్పిన్+చెందును= దాహంతో పరితపిస్తారో(దప్పిక కొనుట - అనేది తెలుగు నుడికారం. కనీసపౌకర్యాల కొరకు అర్రులు సాచటాన్ని ఇక్కడ డప్పిగొనటంగా గ్రహించాలి); వానిన్= అటువంటి వాడిని; కృశునిన్+కాన్= చిక్కినవాడిగా, క్షీణించినవాడిగా, బలహీనుడిగా; ఎన్నఁగాన్+తగున్= లెక్కించతగుతుంది; కేవల తను కార్శ్యయుతుఁడు= ఒడలు మాత్రమే సన్నబడినవాడు; కృశుఁడె?= చిక్కినవాడా?; కృశించినవాడా?; బలహీనుడా? (కాడని భావం).

తాత్పర్యం: ఓ రాజా! ఎవడి బంధుమిత్రులు ఆశ్రితులు ప్రాణాలు సంపదలు దప్పికతో కృశించి కొట్టుమిట్టాడుతుంటారో అతడు నిజంగా బలహీను డనబడతాడు కాని ఒడలు చిక్కి సన్నబడినవాడు కాడు.

వ. కావున నర్థోపార్జనంబును బంధుమిత్త్రపరితోషంబును భూపతులకుం బరమ పురుషార్థం; బదియునుం గాక. 53

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అర్థ+ఉపార్జనంబును= ధనం సంపాదించటమున్నూ; బంధుమిత్రపరితోషంబును= చుట్టాల, మిత్రుల సంతోషమున్నూ; భూపతులకున్= రాజులకు; పరమ పురుషార్థంబు= ముఖ్యంగా సాధింప దగింది (అదే వారికి మోక్షమనే అర్థం చమత్కారం); అదియునున్+కాక= అంతేకాకుండా (ఇది మరొక అంశానికి ఉపక్రమణిక).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కాబట్టి ధనసంపాదన, బంధుమిత్రులను సంతోషపెట్టటం రాజులకు ప్రధానకర్తవ్యం (మోక్షప్రదం). అంతేకాక (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **జ్ఞాతి నాశనమునఁ గాదె సకల దేవ । తలు ప్రవర్ధన మొందుట; ధనము లడిచి**
పొడిచి యొప్పనివారిచేఁ బుచ్చికొనక । యడఁగియుండంగఁ జేరునే యంద్రు బుధులు. **54**

ప్రతిపదార్థం: జ్ఞాతి నాశనమునన్+కాదె= సగోత్రికులు చనిపోవటం వలననే కాదా!; సకల దేవతలు ప్రవర్ధన మొందుట= సమస్త దేవతలు వృద్ధి పొందటం; ధనములు= సంపదలు; అడిచి= కొట్టి; పొడిచి= పోట్లాడి; ఒప్పనివారిచేన్= శత్రువులచేత; పుచ్చికొనక= గ్రహించక; అడఁగి+ఉండంగన్= అణకువతో ఉంటే; చేరునే= సంపదలు వస్తాయా?; అని; బుధులు= పండితులు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: సగోత్రికులు చావటంవలన కదా దేవతలు సైతం అభివృద్ధి చెందారు. సంపదలను కొల్లగొట్టి, పోరు చేసి శత్రువులనుండి గ్రహించక అణగిమణగి ఉంటే సంపదలు సమకూరుతాయా? - అని పండితులు అంటారు.

వ. **వేదంబులు నిట్లు సెప్పుఁ బృథివి బలువునం గైకొని పార్థివు లర్థంబు లుపార్జించి పర్జన్యాదులగు నాదిత్యుల నధ్వరక్రియాజాతంబునం బ్రీతులంజేసి యుత్తమలోకంబులు వడయుదు; రిట్టితెరువు వట్టి దిలీప నృగ నహుషాంబరీష మాంధాతలు నడచుట వినమె? తత్పదవి నీ కొదవి యున్నయది; తదీయ ప్రకారంబున బహుళదక్షిణవిధానంబుగాఁబ్రభూతంబైన యజ్ఞంబు సేయవైతేనిఁ జూవె నకిల్బిషుండ వగుట; యశ్వమేధంబు సేసిన రాజు లెల్ల నవభృథంబునం బరిపూతాత్ము లగుదు' రని పలికిన న య్యజాతశత్రుండు.** **55**

ప్రతిపదార్థం: వేదంబులును= వేదాలుకూడా; ఇట్లు+చెప్పున్= ఈ విధంగా చెప్పుతాయి; పార్థివులు= క్షత్రియులు, రాజులు; పృథివిన్= రాజ్యాన్ని; బలువునన్= బలంతో; కైకొని= ఆక్రమించి, గ్రహించి; అర్థంబులు= సంపదలు, ధనాలు; ఉపార్జించి= సంపాదించి; పర్జన్య+ఆదులు+అగు= పర్జన్యుడు మొదలైన; ఆదిత్యులన్= వేల్పులను; అధ్వరక్రియాజాతంబునన్= యజ్ఞక్రియల సముదాయంచేత; ప్రీతులన్+చేసి= సంతుష్టులను చేసి; ఉత్తమలోకంబులు+పడయుదురు= పుణ్యలోకాలను పొందుతారు; ఈ+తెరువు+పట్టి= ఈ త్రోవననుసరించి; దిలీప, నృగ, నహుష, అంబరీష, మాంధాతలు అనే మహారాజులు; నడచుట= ప్రవర్తించటం; వినమె?= వినమా? ప్రసిద్ధి కాదా?; తద్+పదవి= అటువంటి అధికారం; నీకున్+ఒదవి+ఉన్న అది= నీకు కలిగి ఉన్నది; తదీయ ప్రకారంబునన్= అదే విధంగా; బహుళదక్షిణ విధానంబుగాన్= అనేకవిధాలైన దక్షిణ లిచ్చే పద్ధతిలో; ప్రభూత= శ్రేష్ఠమైన; దైవయజ్ఞంబు= దేవసంబంధమైన యజ్ఞాన్ని; చేయవైతివి+ఏనిన్+చూవె!= చేయకపోతే సుమా!; అకిల్బిషుండవు+అగుటన్= పాపం లేనివాడ వగుటచేత; అశ్వమేధంబు+చేసినరాజులు+ఎల్లన్= అశ్వమేధయాగం చేసిన రాజులందరూ; అవభృథంబునన్= యజ్ఞం ముగిసిన తరుణంలో చేసే పవిత్రమంత్ర జలస్నానంవలన; పరిపూతులు+అగుదురు= పవిత్రు లౌతారు; అని పలికినన్= ఈ విధంగా అర్జునుడు పలుకగా; ఆ+అజాతశత్రుండు= ఆ ధర్మరాజు.

తాత్పర్యం: వేదాలు కూడా ఇట్లా చెప్పుతున్నాయి. క్షత్రియులు బల పరాక్రమాలతో రాజ్యాలను గెలుచుకొని, సంపదలు సంపాదించి, పర్జన్యుడు మొదలైన దేవతలను యజ్ఞకార్య సముదాయంతో సంతోషపెట్టి స్వర్గాదిలోకాలను పొందుతారు. అదే పద్ధతి నాశ్రయించి దిలీపుడు, నృగుడు, సగరుడు, నహుషుడు, అంబరీషుడు, మాంధాత మొదలైన రాజులు నడచుకొనటం వినలేదా? అటువంటి ఉత్తమగతి నీకు అనువై ఉన్నది. వారు నడచిన మార్గంలోనే నీవు కూడా నడచి అనేక దక్షిణలతో కూడిన బహుళ యజ్ఞాలు చేయకపోతే పుణ్యాత్ముడవు కావు. అశ్వమేధయాగం చేసిన రాజు లందరూ అవభృథస్నానంతో పవిత్రు లౌతా' రని పలుకగా విని, ధర్మరాజు (తరువాతి పద్యంతో అన్వయం).

క. వెడవెడ నప్పలుకులు చెవి । నిడి, కొండొకసేపు చింత యెసకంబున పా
ల్పడి యూరకుండి చిత్తం । బడలునఁ జిక్కువడ నిట్టు లను నర్జునుతోన్. 56

ప్రతిపదార్థం: ఆ+పలుకులు= ఆ విధంగా అర్జునుడు పలికిన మాటలను; వెడవెడన్= మందంగా (అంత ఆసక్తి లేకుండా); చెవిన్+ఇడి= విని; కొండొకసేపు= కొంతసేపు; చింత= దిగులు యొక్క; లేదా ఆలోచనయొక్క ఎసకంబున పాల్పడి = అతిశయానికిలొంగి; ఊరక+ఉండి= మాటలాడక కూర్చుండి; చిత్తంబు= మనస్సు; అడలునన్= దుఃఖంతో; చిక్కు+పడన్= కలతపడగా; అర్జునుతోన్= అర్జునుడితో; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు మాట్లాడిన మాటలను యుధిష్ఠిరుడు అనాసక్తంగానే విన్నాడు. కొంతసేపు దిగులులో, ఆలోచనాతిశయంలో మునిగిపోయాడు. మనస్సు దుఃఖంతో కలతచెందగా అర్జునుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: తిక్కన మానసికావస్థలను అభినయసుందరంగా వ్యక్తీకరించటానికి ఈ పద్యం ఉదాహరణం. 'చెవి నిడి' - అనే ప్రయోగంతో ధర్మజుడు చెవు లొప్పగించి విన్నా మనసార వినలేదని సూచన; మరికొంతసేపు ఆలోచనలో మునిగిపోవటం అతడిలో మార్పు రాలేదనటానికి చిహ్నం.

క. 'నేమపుఁ దెరు వొక్కటి గల; । దే మెచ్చితి దాని; నడుగు మెయ్యది యని సు
త్రామసుత! యడుగకున్నను । నేమి? వినుము చెప్పెదను మునీంద్రుల కెక్కన్. 57

ప్రతిపదార్థం: సుత్రామసుత!= ఇంద్రుడి పుత్రుడవైన అర్జునా!; నేమము+తెరువు= నియమమార్గం; ఒక్కటి= ఒకటి; కలదు= ఉన్నది; దానిన్= ఆ మార్గాన్ని; ఏన్= నేను; మెచ్చితిన్= అభిమానించాను; ఏ+అది+అని= అది యేమిటని; అడుగక+ఉన్నను= ప్రశ్నించకపోయినా; ఏమి?= ఏమైనది?; ముని+ఇంద్రులకున్+ఎక్కన్= ఋషి శ్రేష్ఠులకు నచ్చేటట్లుగా; చెప్పెదను వినుము= చెప్పుతాను వినుము.

తాత్పర్యం: అర్జునా! నాకొక నియమమార్గం నచ్చింది. అది ఏమిటని నీవు అడుగక పోయినా మునీంద్రులు మెచ్చేటట్లు చెప్పుతాను వినుము.

విశేషం: ధర్మజుడి మనసులోని అనిష్టం మాటవెటకారంలో ధ్వనిస్తున్నది.

సీ. 'సారహీనము లగు సంసారసుఖములు । విడిచి, యేకాకి నై యడవి కేఁగి,
తాపస వాక్యామృతములు వీనులఁ గ్రోలి, । చెలిమి వేర్పాటను చిరమరలకుఁ
జొరక, నిందాస్తుతుల్ సరిగాఁ గొనుచుఁ గత్తి । నొకఁడు వ్రేసినను వేఱొక్కరుండు
చందనం బలఁదిన డెంద మయ్యిరువుర । యెడ సమంబుగ మూఁగజడుఁ డనంగ

తే. మెలఁగి, తగువేళఁ బర్ణశాలలకు నరిగి । యెత్తఁగా భిక్ష యెవ్వార లెట్టు లేమి
యిడినఁ గైకొని నాలుగే నెడల మాత్రఁ । గన్నదానఁ దృప్తుండనై యున్న మేలు. 58

ప్రతిపదార్థం: సారహీనములు+అగు= నీరసములైన; సంసారసుఖములు= సంసారానికి సంబంధించిన అనేక సుఖాలు; విడిచి= వదలిపెట్టి; ఏకాకిని+ఐ= ఒంటరిగా; అడవికిన్+ఏఁగి= అరణ్యానికి పోయి; తాపసవాక్య+అమృతములు= మునులయొక్క అమృతంవంటి వాక్యాలను; వీనులన్= చెవులతో; క్రోలి= త్రావి; చెలిమి వేర్పాటను= స్నేహం,విరోధం,అనురెంటిలో; చిరమరలకున్= భేదభావాలకు; చొరక= ప్రవేశించక; నిందాస్తుతుల్= నిందలను, ప్రశంసలను; సరిగాన్+కొనుచున్= సమచిత్తంతో గ్రహిస్తూ; ఒకఁడు+కత్తిన్+వ్రేసినను= ఒకడు కత్తితో నరికినా (హింసించినా); వేఱు+ఒక్కరుండు= మరొకడు; చందనంబు+అలఁదినన్=

మంచి గంధం పూసినా (సేవించినా); ఆ+ఇరువుర ఎడన్= ఆ ఇద్దరిపట్ల; డెందము= హృదయం; సమంబుగన్= సమభావంతో మెలగేటట్లు; మూఁగజడుఁడు+అనంగన్= మాటలు రాని మూర్ఖుడో మొద్దో అన్నట్లు; తగువేళన్= తగినసమయంలో; పర్ణశాలలకున్+అరిగి= ఆశ్రమవాసులు నివసించే పూరిళ్ళకు వెళ్ళి; భిక్ష+ఎత్తఁగాన్= భిక్ష అడుగగా; ఏ+వారలు= ఎటువంటివారైనా; ఎట్టులు= ఏ విధంగానైనా; ఏమి+ఇడినన్= ఏది భిక్షగా ఇచ్చినా; కైకొని= స్వీకరించి; నాలుగు+ఏను+ఎడల మాత్రన్+కన్నదానన్= నాలుగు అయిదుచోట్ల (ఇండ్లలో) కలిగిన (లభించిన) దానితో; తృప్తుండను+ఐ= తృప్తి పొందినవాడనై; ఉన్నన్+మేలు= ఉండటం మంచిది.

తాత్పర్యం: నీరసాలైన సంసారసుఖాలను వదలి ఒంటరివాడనై అడవికిపోయి, మునుల బోధామృతాలను చెవులారా వింటూ, స్నేహవైరాలపట్ల కలత చెందకుండా, నిందలను, ప్రశంసలను సమచిత్తంతో గ్రహిస్తూ, ఒకడు కత్తితో గాయం చేసినా, మరొకడు మంచిగంధంతో పూతలు పూసినా వారిరువురిపట్లా సమంగా స్పందిస్తూ, మూగవాడైన మూర్ఖుడివలె మెలగుతూ, తగిన వేళలలో ఆశ్రమాలలో భిక్షనడిగికొని, ఎవరేదిపెడితే దానిని తీసికొని, నాల్గుదిక్కులలో కలిగిన దానితో తృప్తిపడుతూ ఉండటం మేలు.

విశేషం: అలం: ఉపమ. ద్వంద్వాతీతమైన చిత్తంతో, అసంగుడై స్థితప్రజ్ఞుడివలె మునివృత్తితో జీవించటం ఉత్తమధర్మమని యుధిష్ఠిరుడు వివరించి చెప్పాడు.

క. అటుగాక కర్మగతి లం । పటుఁడ నగుదు నేని నల్పఫల భాగితమై
నట యిట దిరుగుచు మోక్ష ని । కట వృత్తికి బాహిరుండఁ గానె కుమారా! 59

ప్రతిపదార్థం: అటు+కాక= అట్లా కాకుండా; కర్మగతిన్= కర్మలను ఆచరించే పద్ధతిలో; కుమారా!= వత్సా! , అర్జునా!; లంపటుఁడన్= అత్యాసక్తి కలవాడను; అగుదున్+ఏనిన్= అయినట్లయితే; అల్పఫలభాగితము+ఐ= స్వల్పమైన ఫలమిచ్చేది కావటంచేత; అట+ఇట+తిరుగుచున్= పెక్కురకాలుగా నిలకడలేక తిరుగుతూ; మోక్షనికట వృత్తికిన్= మోక్షానికి సమీపంలో ఉన్న చిత్తవృత్తికి; బాహిరుఁడన్= దూరమయినవాడిని; కానె?= కానా? (ఔతానని భావం).

తాత్పర్యం: అట్లా కాకుండా కర్మమార్గంలో కూరుకొనిపోతే ఓ అర్జునా! అది స్వల్పఫలా న్నిచ్చేదే కాబట్టి నేను పరిపరివిధాల తిరుగుతూ మోక్షప్రవృత్తికి దూరమైపోయేవాడిని కానా?

వ. కావున నాకు దొరకొన్న విమలప్రజ్ఞామృతం బనుభవింపక తక్కుదునే? యిది శాశ్వతపదప్రదం' బనిన విని యనిలతనయుం డతని కిట్లనియె. 60

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నాకున్= నాకు(ధర్మరాజుకు); దొరకొన్న= కలిగిన, సిద్ధించిన; విమలప్రజ్ఞా+అమృతంబు= అమృతంవంటి నిర్మలజ్ఞానాన్ని; అనుభవింపన్= అనుభవించకుండా; తక్కుదునే?= విడువగలనా?; ఇది= ఈ జ్ఞానం; శాశ్వతపదప్రదంబు= మోక్షా న్నిచ్చేది; అనినన్+విని= అనగా విని; అనిలతనయుండు= వాయుపుత్రుడైన భీముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: కాబట్టి నాకు సిద్ధించిన అమృతంవంటి నిర్మలజ్ఞానాన్ని అనుభవించకుండా ఉండగలనా? ఈ జ్ఞానం మోక్షా న్నిచ్చేది' - అని ధర్మరాజు పలుకగా భీము డా మాటలు విని ఇట్లా అన్నాడు.

క. 'శ్రుతివిహిత కర్మజాత । స్థితి యోగ్యుఁడ వైన నీకుఁ జేయఁగ వశమే
యతిలోకజ్ఞానసమ । న్వితయతిజనకృత్య? మటు వివేకింపు మెదన్. 61

ప్రతిపదార్థం: శ్రుతివిహిత= వేద సమ్మతమైన; కర్మజాతస్థితియోగ్యుఁడవు= కర్మల సమూహముయొక్క ఉనికికి తగినవాడవు; ఐన నీకున్= అయిన నీకు; అతిలోకజ్ఞానసమన్విత= ఆధ్యాత్మజ్ఞానంతో కూడుకొన్న; యతిజనకృత్యము= మునిజనుల ఆచారం; నీకున్= నీకు; చేయఁగన్+వశమే?= ఆచరించటం సాధ్యమౌతుందా?; అటు= ఆ విధంగా; ఎదన్= చిత్తమునందు; వివేకింపుము= ఆలోచించుము.

తాత్పర్యం: వేదాలలో చెప్పిన కర్మలను ఆచరించే స్థితికి యోగ్యుడవైన నీకు లోకాతీతజ్ఞాన సమన్వితమైన మునుల ఆచారాన్ని అవలంబించడం సాధ్యమౌతుందా? నీవే నీ మనస్సులో ఆలోచించుకొనుము!

చ. **అడలున రాజధర్మములయందు జనించె నసూయ నీకు ని**
ప్పుడు; ముని నిస్పృహుండ వయి పోవఁగఁ గన్నఁ గులంబువారు ని
ప్పుడమి నృపాలురున్ బ్రతికిపోదురు నెమ్మది; నట్టులైన నే
ముడుగుదు మస్త్రజీవన సముద్ధతిఁ, జొత్తుము భైక్షవృత్తికిన్. **62**

ప్రతిపదార్థం: అడలునన్= దుఃఖంచేత; నీకున్= నీకు (ధర్మరాజుకు); ఇప్పుడు= ఈ తరుణంలో; రాజధర్మముల+అందున్= రాజులు(క్షత్రియులు) నిర్వహించే ధర్మాలపట్ల; అసూయ= ఈర్ష్య; జనించెన్= పుట్టింది; ముని= పూర్వం; నిస్పృహుఁడవు+అయి= అనాసక్తుడవై; పోవఁగన్+కన్నన్= పోయిఉన్నట్లయితే; కులంబువారు= క్షత్రియులు, వంశజులు; ఈ పుడమి నృపాలురున్= ఈ భూమిపై గల రాజులు; నెమ్మదిన్= ప్రీతితో; బ్రతికిపోదురు= ప్రాణాలతో బ్రతికిపోయి ఉండేవారు; అట్టులు+ఐనన్= అదే విధంగా జరిగి ఉన్నట్లయితే; ఏము= మేము (భీమాదులని భావం); అస్త్రజీవన సముద్ధతిన్= ఆయుధాలనుపట్టి జీవించే గర్వోన్నతిని; ఉడుగుదుము= వదలిఉండే వాళ్ళం; భైక్షవృత్తికిన్= బిచ్చమెత్తి బ్రతికే వృత్తిలో; చొత్తుము= ప్రవేశించేవారం.

తాత్పర్యం: 'నీ కిప్పుడు కలిగిన దుఃఖంచేత రాజధర్మాలమీద అసూయ కలిగింది కాని, ముందుకాలంలో నిజంగా నీవు అనాసక్తుడవై ఉన్నట్లయితే మనవంశజులు, భూమిని పాలించే రాజులూ ప్రాణాలతో బ్రతికిపోయి ఉండేవారు. మే మీ అస్త్రజీవన గర్వోన్నతిని వదలి ఉండేవాళ్ళం; బిచ్చమెత్తుకొని బ్రతికే పద్ధతిలో ప్రవేశించి ఉండేవాళ్ళం.

క. **వాఁడి యగు నలుక లోకము। పోఁడిమి సెడఁ గయ్యు మట్లు పొడిచి వనటమై**
నేఁ డింక నడవికిం జను। వాఁడం గా కనినఁ బుడమివారలు నగరే! **63**

ప్రతిపదార్థం: వాఁడి+అగు+అలుకన్= తీక్ష్ణమైన కోపంతో; లోకము పోడిమి+చెడన్= లౌకిక సుఖాలు, సంపదలు చెడేటట్లుగా; కయ్యము= యుద్ధమును; అట్లు= అంత భీకరంగా; పొడిచి= పోట్లాడి, యుద్ధంచేసి; నేఁడు= ఈనాడు; వనటమైన్= దుఃఖంచేత; ఇంకన్= ఇకమీదట; అడవికిన్= అరణ్యానికి; చనువాఁడన్+కాక+అనినన్= వెళ్తాను సుమా అని అంటే; పుడమివారలు= లోకులు; నగరే?= నవ్విపోరా? ఎగతాళిచేయరా?

తాత్పర్యం: ఆనాడు అంత తీవ్రమైన కోపంతో లౌకిక సుఖాలు చెడిపోయేటట్లు అంత భీకరంగా యుద్ధం చేసి, నేడు అడవికి పోతున్నానని అంటే లోకులు అవహేళన చేయరా?

సీ. **పనివడి త్రవ్వి కూపమునందు నుదకంబు। పానంబు సేయని వాని భంగి,**
యున్నతతరు వెక్కి జున్ను సేకుఱఁ గొని। తేనియ యానని వాని భంగి,
యాఁకొని యొడఁగూర్చి యన్నంబు తళియకు। వచ్చినఁ గుడువనివాని భంగి,
తమకించి యొకభంగిఁ దనవశంబుగఁ జేసి। మానినిఁ గవయని వాని భంగి,

ఆ. గాదె కురువరేణ్య! ఘనశక్తి శౌర్య సం। పన్నులైన పగఱ భండనమున
నోర్చి పూజ్యరాజ్య మొల్లక యడవికి। నేఁగు; టీవ యెఱుఁగు దిత్తెఱంగు. 64

ప్రతిపదార్థం: పనివడి= అక్కరపడి; త్రవ్వి= లోతుగా త్రవ్వి; కూపమునందున్= బావిలోని; ఉదకంబు= నీరు; పానము+చేయనివాని భంగి= త్రాగనివాడి విధమూ; ఉన్నతతరువు+ఎక్కి= ఎత్తైన చెట్టును ఎక్కి; జున్ను+చేకుఱన్+గొని= తేనెతెట్టెను సాధించి; తేనియ+ఆననివాని భంగి= తేనెను రుచిచూడని వాడి విధమూ; ఆఁకలి+కొని= ఆకలి వేసి; ఒడఁగూర్చి= సమకూర్చుకొని; అన్నంబు= ఆహారం; తళియకున్= కంచంలోనికి; వచ్చినన్= రాగా; కుడువని వాని భంగి= తిననివాడి విధమూ; తమకించి= త్వరపడి; ఒక భంగిన్= ఒక ఉపాయంతో; తన వశంబుగన్+చేసి= తనకు లొంగేటట్లు సిద్ధంచేసి; మానినిన్= స్త్రీని; కవయనివాని భంగి= కూడనివాడి విధమూ; కాదె?= కాదా? (అగును అని భావం); ఘనశక్తి శౌర్యసంపన్నులు+అయిన= అపారమైన బలపరాక్రమ సంపద గలవారైన; పగఱన్= శత్రువులను; భండనమునన్= యుద్ధంలో; ఓర్చి= జయించి; పూజ్య= గౌరవించదగిన; రాజ్యము= ప్రభుత్వమును; ఒల్లక= అంగీకరించక; అడవికిన్+ఏఁగుట= అడవికి పోవటం; కురువరేణ్య!= కురువంశజులలో శ్రేష్ఠుడవైన ధర్మరాజా!; ఈవ= నీవే; ఈ+తెఱంగు= ఈ విధాన్ని; ఎఱుఁగుదు(వు)= తెలిసినవాడవు.

తాత్పర్యం: అక్కరపడి బావి త్రవ్వి అందులోని నీటిని త్రాగనివాడి విధంగా, ఎత్తైన చెట్టు నెక్కి తేనెతెట్టెను పట్టి తేనెను రుచిచూడని వాడి విధంగా, ఆకలివేయగా సమకూర్చుకొన్న అన్నం కంచంలో ఉంచుకొని తిననివాడి విధంగా, త్వరపడి ఒక ఉపాయంతో వనితను తనకు వశంచేసికొని కూడా ఆమెను కూడని వాడి విధంగా, అపార బలసంపన్నులైన శత్రువులను యుద్ధంలో జయించి, సాధించిన పూజ్యమైన సామ్రాజ్యాన్ని గ్రహించకుండా అడవికి పోవటం కూడా అటువంటిదే కదా! కురుశ్రేష్ఠుడవైన ధర్మరాజా! ఈ సంగతి నీకు కూడా తెలుసు.

విశేషం: అలం: ఉపమ. మాలోపమతో ప్రతిపాద్యాంశాన్ని సమర్థించే ఈ వాక్య విన్యాసం. భీముడి స్వభావాన్నీ, అన్నగారి మనసును మార్చటానికి చేస్తున్న తీవ్రయత్నాన్నీ ధ్వనింపజేస్తున్నది.

క. నీ వడవి కరుగ నొడఁబడి। నీ వెనుకన వచ్చునపుడు నిందింతురు మ
'మ్మీ వెఱ్ఱు లితని మాన్పం। గా వలఁతులు గార' యని జగజ్జను లధిపా! 65

ప్రతిపదార్థం: నీవు= నీవు (ధర్మజుడు); అడవికిన్= అరణ్యానికి; అరుగన్= వెళ్ళటానికి; ఒడఁబడి= అంగీకరించి; నీ వెనుకన్+అ= నీ వెంటనే; వచ్చునపుడు= వచ్చే సందర్భంలో; అధిపా!= ఓ రాజా!; జగత్+జనులు= లోకులు; ఈ వెఱ్ఱులు = ఈ వెర్రివారు (భీమాదులు); అతనిన్= ధర్మరాజును; మాన్పంగాన్= అడవులకు పోకుండా మానేటట్లు చేయటానికి; వలఁతులు+కారు+అ= సమర్థులు కారు; అని= అనిఅంటూ; మమ్మున్= మమ్ములను (భీమాదులను); నిందింతురు= దూషిస్తారు.

తాత్పర్యం: నీవు అడవికి పోవటానికి అంగీకరించి, నీ వెనుక మేముకూడా కలిసి వస్తున్నప్పుడు - ఓ ధర్మరాజా! లోకు లందరూ 'ఈ వెర్రివాళ్ళు ధర్మరాజును అడవికి పోకుండా మాన్పే సామర్థ్యం లేనివారు' అని మమ్మల్ని నిందిస్తారు.

విశేషం: భీముడి అభిమానం ఈ మాటలలో ధ్వనిస్తున్నది.

క. భోగములఁ బాపి నిందా। భాగులఁగాఁ జేసి యడవి పాల్పఱిచెదవే
నీ గారవంపుఁ దమ్ముల। సాగరవృతధరణిఁ గలుగు జనములు వగవన్.' 66

ప్రతిపదార్థం: నీ గారవంపు+తమ్ములన్= నీ అనుగు తమ్ములను; భోగములన్= సంపదలనుండి; పాపి= దూరంచేసి; నిందాభాగులన్+కాన్+చేసి= నిందల పాలయ్యే వారినిగా చేసి; సాగరవృత= సముద్రంచేత చుట్టబడిన; ధరణిన్= భూమిపై; కలుగు= నివసించే; జనులు= ప్రజలు; వగవన్= దుఃఖించగా; అడవిపాల్+పఱిచెదనే?= అడవులపాలు చేస్తావా?

తాత్పర్యం: నీ అనుగు తమ్ములను భోగాలనుండి దూరంచేసి, నిందల పాలయ్యే వారినిగా చేసి, అడవులపాలు చేస్తావా? నాలుగు సముద్రాలచేత చుట్టబడిన ఈ భూమిమీద నివసించే ప్రజలంతా దుఃఖిస్తారు.

క. **'కేవల నిష్కర్మత మో। క్షావహ మగునేని గిరులు నవనీజములున్**
భూవర! ముక్తిం బడయం। గా వలవదె; యడవి నునికి కైవల్యదమే? **68**

ప్రతిపదార్థం: భూవర!= రాజా! (ధర్మరాజా!); కేవల నిష్కర్మత= నిష్ఫలమైన కర్మరాహిత్యం (నిరర్థకమైన పనిలేనితనం); మోక్ష+ఆవహము+అగునేని= ముక్తిని కలిగించేదే అయితే; గిరులున్= పర్వతాలూ; అవనీజములున్= చెట్లూ; ముక్తిన్= మోక్షాన్ని; పడయంగాన్+వలవదె?= పొందవద్దా?; అడవిన్= అడవిలో; ఉనికి= ఉండటం; కైవల్యదము+ఏ?= మోక్షాన్ని ఇచ్చేదా? (కాదని భావం).

తాత్పర్యం: 'ఓ రాజా! ఏ ప్రయోజనం లేని కర్మరాహిత్యమే మోక్షాన్ని కలిగించేదైతే కొండలూ, చెట్లూ ముక్తిని పొందగలిగి ఉండాలి కదా! కాబట్టి అడవిలో ఉండటమే మోక్షం కలిగించే దవుతుందా?

క. **ఫలములయెడ బ్రహ్మార్పణ। కలనపరుం డగుచుఁ గార్య కర్మము నడపన్**
వలయుం; దత్త్వజ్ఞానము। దలకొనినం గర్మశమము దానై కలుగున్. **69**

ప్రతిపదార్థం: ఫలముల ఎడన్= కర్మఫలాలపట్ల; బ్రహ్మ+అర్పణ కలనపరుండు+అగుచున్= బ్రహ్మమునకు (దైవానికి) సమర్పించాలనే స్పృహతో కూడుకొన్నవాడు ఔతూ; కార్యకర్మము= లౌకిక వ్యవహారాలు, వేదవిహిత కర్మము= వేదాలలో విధించబడిన విధిని; నడపన్+వలయున్= ఆచరించాలి; తత్త్వజ్ఞానము= ఆత్మ తత్త్వాన్ని గూర్చిన జ్ఞానం కొరకు; తలకొనినన్= పూనుకొంటే; కర్మశమము= కర్మలు ఉపశమించటం; తానై= తనంతట తానే; కలుగున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: విధ్యుక్తకర్మలను ఫలంమీద కోరికలేకుండా బ్రహ్మార్పణభావంతో సాగించాలి. ఆత్మతత్త్వజ్ఞాన సాధనకు పూనుకొంటే కర్మరాహిత్యం తనంతట తానే కలుగుతుంది.

వ. **కావునం గర్మహీనత్వం బపవర్గకరంబుగా' దనవుడు నర్జునుండు ధర్మనందను నుద్దేశించి 'దేవా! యొక్కయితిహాసంబు గల దవధరింపు' మని యిట్లనియె.** **70**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; కర్మహీనత్వంబు= కర్మలు చేయకుండా ఉండటం; అపవర్గకరంబు+కాదు= మోక్షాన్ని కలిగించేది కాదు; అనవుడున్= అని భీముడు అనగా; అర్జునుండు= అర్జునుడు; ధర్మనందనున్+ఉద్దేశించి= ధర్మరాజుతో; దేవా!= ప్రభూ!; ఒక్క+ఇతిహాసంబు= పరంపరగా చెప్పుకొనే కథ ఒకటి; కలదు= ఉన్నది; అవధరింపుము= విను, చిత్తగించుము; అని+ఇట్లు+అనియెన్= అని ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: కాబట్టి కర్మలు చేయకపోవటం మోక్షాన్ని కలిగించ లేదు' అని భీము డనగా, ఆ తరువాత అర్జునుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: 'రాజా! ఒక ఇతిహాసం ఉన్నది. చెప్తుతాను వినుము.'

విశేషం: భీమవాక్యాలకు దృష్టాంతరూపమైన ఇతిహాసాన్ని చెప్తుతూ అర్జునుడు మిత్రసమ్మితంగా హితవును బోధిస్తున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. ' కొందఱు బ్రాహ్మణుల్ గొండుక లాత్మ కు। లోచితాచారంబు లుడిగి కాన
లకుఁ జన్న వజ్రి వారికిఁ గృప చేసి ప। తత్త్రిరూపమునఁ దత్పార్శ్వమునకు
నరిగి, 'మీ కైకొన్న తెరు వొప్ప' దనవుడు। విని, వా రఖిల మార్గవేది యద్భు
తాస్పద మీపక్షి యని దాని కభిముఖు। లై 'సత్పథం బెద్ది యనఘ! చెపుమ!'

తే. యనిన 'నలుగాలివాన గోవును, నశేష। శబ్దముల మంత్రమును, లోహజాతిఁ గాంచ
నమును, మనుజుల విప్రుండు సమధికత్వ। భాజనము లండ్రు వేదప్రపంచవిదులు.' 71

ప్రతిపదార్థం: కొందఱు బ్రాహ్మణుల్+కొండుకలు= కొందరు బ్రాహ్మణ బ్రహ్మచారులు; ఆత్మకుల+ఉచిత+ఆచారంబులు= తమ కులానికి అనువైన ఆచారాలను; ఉడిగి= వదలి; కానలకున్= అడవులకు; చన్నన్= పోగా; వజ్రి= ఇంద్రుడు; వారికిన్= వారిఅందు; కృపచేసి= దయచూపి; పతత్త్రిరూపమునన్= పక్షి ఆకారంలో; తద్+పార్శ్వమునకున్+అరిగి= వారి దగ్గరకు వెళ్ళి; మీ కైకొన్న తెరువు+ఒప్పదు= మీరు ఎన్నుకొన్న మార్గం ఉచితమైనది కాదు; అనవుడున్= అనగా విని, వారు= ఆ బ్రాహ్మణులు; ఈపక్షి= (పక్షిరూపంలో ఉన్న ఇంద్రుడు) ఈ పక్షి; అఖిలమార్గవేది= సర్వ ధర్మమార్గాలను తెలిసినది; అద్భుత+ఆస్పదము= ఆశ్చర్యాన్ని కలిగించేది; అని= అని అనుకొని; దానికిన్= ఆ పక్షికి; అభిముఖులు+ఐ= ఎదురుగా నిలిచినవారై; అనఘ!= ఓ పాపరహితుడా!; సత్+పథంబు= ఉత్తమమార్గం; ఎద్ది= ఏదో; చెపుమ!= చెప్పుము!; అనినన్= అనగా; నలు+కాలివానన్= నాలుగు కాళ్ళ జంతువులలో; గోవును= ఆవును; అశేషశబ్దములన్= అనంత శబ్దాలలో; మంత్రమును= బీజాక్షరసహితమైన మంత్రాన్నీ; లోహజాతిన్= లోహసముదాయంలో; కాంచనమును= బంగారాన్ని; మనుజులన్= మానవులలో; విప్రుండు= బ్రాహ్మణుడు; వేదప్రపంచ విదులు= వేదజగత్తుకు సంబంధించిన జ్ఞానం కలవారు; సమధికత్వ భాజనములు+అండ్రు= ఆధిక్యానికి ఆలంబనాలని అంటారు.

తాత్పర్యం: 'బ్రాహ్మణ బ్రహ్మచారులు కొందరు తమ కులాచారాలను వదలి అడవులకు వెళ్ళారు. ఇంద్రుడు వారిని చూచి జాలిపడి ఒక పక్షిరూపం దాల్చి వారి సమీపానికి చేరి, 'మీ రెన్నుకొన్న మార్గం మంచిదికాదు' అని అన్నాడు. ఆ పక్షిమాటలు విని ఆ బ్రాహ్మణబాలురు 'ఈ పక్షి అనేక ధర్మమార్గాలు తెలిసింది, అద్భుత' మని దానిముందు చేరి 'పుణ్యాత్మా! సన్మార్గం ఏమిటో చెప్పు' మని కోరారు. అప్పు డా పక్షి ఇట్లా చెప్పనారంభించింది. 'నాలుగు కాళ్ళున్న జంతువులలో గోవు, అనంత శబ్దరాశిలో మంత్రం, లోహజాతిలో బంగారం, మానవులలో బ్రాహ్మణుడు అధికులు అని వేదవిదులు పేర్కొంటారు'.

విశేషం: మనుజుల విప్రుండు - అజడమైన మనుజశబ్ద సప్తమికి ద్వితీయ రావడం విశేషం. సూ. కొన్ని యెడల నజడంబు తృతీయా సప్తములకును ద్వితీయ చూపట్టెడి. ప్రౌఢ కారక - 18. 'జకంబు తృతీయాసప్తములకు ద్వితీయ బహుళంబుగానగు - బాలవ్యా. కారక. 22 అనుసూత్రమునకు సవరింపు.

వ. ఇ ట్లుత్తముం డైన విప్రుం డుత్తమ మంత్రోపాశ్రితంబులగు విహిత కర్మంబులు నడపుట రత్నకాంచన సాంగత్యంబునుం బోలె లోకసంస్తుత్యంబై యుండు; నాలస్యంబునఁ గ్రోధంబున శోకంబునఁ దదనుష్ఠానంబు విడుచుట పాతకం; బజ్ఞానులగు నర్థహీనులు సన్న్యాసకాల వివేకంబు లేక వేగిరపడి యుభయభ్రష్టు లగుదురు; గృహస్థ ధర్మంబున వర్తించి యతిథి దేవ పితృసంతృప్తి సేయుచు శిష్టాన్న భోజన పరులగు పుణ్యులకుం బుణ్యలోకంబు లఱచేతిలోనివి గావె?; బ్రహ్మార్పితం బయిన సత్కర్మకలాపంబు మహానందంబుఁ జేయు ననుటయు. 72

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఉత్తముండు+ఐన= శ్రేష్ఠుడైన; విప్రుండు= బ్రాహ్మణుడు; ఉత్తమ మంత్ర+ఉప+ఆశ్రితంబులు+ అగు= శ్రేష్ఠములైన మంత్రాలను; ఆశ్రయించిన వైన; విహితకర్మంబులు= యోగ్యములైన ఆచరణములను; నడపుట= సాగించటం; రత్న కాంచన సాంగత్యంబునున్+పోలెన్= రత్నానికీ, బంగారానికీ ఏర్పడిన కలయికవలె; లోక సంస్తుత్యంబు+ఐ+ఉండున్= జనులచేత కీర్తించదగినదై ఉంటుంది; ఆలస్యంబునన్= అలసభావంచేతగాని; క్రోధంబునన్= కోపంవలనగాని; శోకంబునన్= దుఃఖతీవ్రతవలనగానీ; తద్+అనుష్ఠానంబు= దానిని ఆచరించటం; విడుచుట= వదలిపెట్టటం; పాతకంబు= పాపం; అజ్ఞానులు+అగు= మూఢులైన; అర్థహీనులు= ప్రయోజనం లేనివారు, ధనంలేనివారు; సన్న్యాసకాల వివేకంబు లేక= సన్న్యాసం ఎప్పుడు తీసికొనాలో తెలియనివారై; వేగిరపడి= తొందరపడి (సన్న్యాసాశ్రమం తీసికొని); ఉభయ భ్రష్టులు+అగుదురు= ఇహపరాలకు చెందని పతితులౌతారు; గృహస్థ ధర్మంబునన్= గృహస్థాశ్రమ ధర్మంలో; వర్తించి= కర్మలను ఆచరించి; అతిథి దేవపితృసంతృప్తి+చేయుచున్= అతిథులను, దేవతలను, పితృదేవతలను సంతోషపెట్టుతూ; శిష్ట+అన్నభోజనపరులు= శుద్ధమైన అన్నాన్ని భుజించటంలో ఆసక్తి గలవారైన; పుణ్యులకున్= పుణ్యాత్ములకు, పవిత్రులకు; పుణ్యలోకంబులు= పుణ్యులు పొందే స్వర్గాదిలోకాలు; అరచేతిలోనివి= అరచేతిలో ఉన్నట్లు అందుబాటులో ఉండేవి; కావె?= కావా?; బ్రహ్మ+అర్పితంబు+అయిన= పరమాత్మకు నివేదించిన; సత్+కర్మకలాపంబు= పుణ్యకర్మల సమూహం; మహా+ఆనందంబున్= గొప్పదైన ఆనందాన్ని (బ్రహ్మానందాన్ని); చేయును= కలిగిస్తుంది; అనుటయున్= అని అనగా.

తాత్పర్యం: ఈ విధంగా బ్రాహ్మణోత్తముడు ఉత్తమమంత్రాల నాశ్రయించిన యోగ్యమైన కర్మలను అనుష్ఠించటం రత్నానికీ, బంగారానికీ పొత్తు కుదిరినట్లు శ్లాఘించదగినదై ఉంటుంది. అలసత్వం వలనగాని, క్రోధంవలనగాని, శోకం వలనగాని ఆ కర్మలను చేయకుండా వదలటం పాపం. అజ్ఞానులైన అర్థహీనులు సన్న్యాసం ఎప్పుడు తీసికొనాలో తెలియక త్వరపడి ఇహపరాలకు భ్రష్టులౌతారు. గృహస్థాశ్రమ ధర్మాన్ని నిర్వర్తించి అతిథులనూ, దేవతలనూ, పితృదేవతలనూ సంతృప్తి పరుస్తూ, శిష్టమైన ఆహారాన్ని భుజిస్తూ జీవితం సాగించే పుణ్యాత్ములకు స్వర్గాది పుణ్యలోకాలు కరతలామలకాలు. బ్రహ్మార్పణభావంతో చేసే సత్కర్మలు బ్రహ్మానందాన్ని కలిగిస్తాయి' - అని అనగా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. విని వారు దెలిసి మరలం । జనిరి గృహస్థత్వ ధర్మ సదనుష్ఠానం
బునకు; నటు లగుట నేలుము । జనవల్లభ! పుడమి; నడపు జన్నము లెలమిన్.' 73

ప్రతిపదార్థం: వారు= ఆ బ్రాహ్మణులు; విని= ఆ మాటలు విని; తెలిసి= వాటి అర్థాన్ని తెలిసికొని; గృహస్థత్వ ధర్మసత్+అనుష్ఠానంబునకున్= గృహస్థాశ్రమానికి సంబంధించిన ధర్మాలను లెస్సగా అనుష్ఠించటానికి; మరలన్+చనిరి= తిరిగి తమ నివాసాలకు వెళ్ళారు; అటులు+అగుటన్= అది న్యాయం కాబట్టి; జనవల్లభ!= ఓ రాజా! (ధర్మరాజా!); పుడమిన్= రాజ్యాన్ని; ఏలుము= పాలించుము; ఎలమిన్= ప్రీతితో; జన్నములు= యజ్ఞాలు; నడపు= సాగించుము.

తాత్పర్యం: ఈ విధంగా వా రామాటలు విని, తాత్పర్యాన్ని గ్రహించి, గృహస్థాశ్రమంలో నిర్వహించవలసిన ధర్మాలను ఆచరించటానికి ఇండ్లకు తిరిగి వెళ్ళిపోయారు. అది అందరికీ వర్తిస్తుంది. కాబట్టి ఓ రాజా! నీవు రాజ్యాన్ని పాలించుము; ప్రీతితో యజ్ఞాలను నడపించుము.'

వ. అని చెప్పె; నప్పుడు నకులుం డన్నరనాథున కిట్లనియె. 74

ప్రతిపదార్థం: అని చెప్పెన్= అని అర్జునుడు చెప్పాడు; అప్పుడు= ఆ తరువాత; నకులుండు= నకులుడు; ఆ+నరనాథునకున్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని అర్జునుడు చెప్పిన తరువాత నకులుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

నకులుఁడు ధర్మజునకు మనస్తాపోపశమంబు సేయుట (సం. 12-12-1)

సీ. **' దేవతల్ వేదవిధి ప్రవర్తకులు; బ్రా । హ్మణులును వారలయట్ల శ్రుతుల**
కింకరులై కాదె కిల్బిషంబులఁ బాసి । వారిచందమున శాశ్వత విభూతి
నొందుట; యజ్ఞాదు లుడుగుట సంపరి । త్యాగమే?; పాడిమై నర్థముల ను
పార్జించి దేవతా బ్రాహ్మణ పూజగా । నిడుచుఁ దత్ఫలకోటి విడుపుగాక;

ఆ. **క్రోధశోకహర్ష కోటుల గృహముతో । విడిచి యోగ మూఁది వృక్షమూల**
వాసనిరతి నుండువాఁడెపో సంపరి । త్యాగి; నృపుల కది సమర్థ మగునె? **75**

ప్రతిపదార్థం: దేవతల్= దేవతలు; వేదవిధి ప్రవర్తకులు= వేదాలలో చెప్పబడిన విధులను (నియమాలను) ప్రవర్తింపచేసేవారు; బ్రాహ్మణులును= బ్రాహ్మణులు కూడా; వారల+అట్లు+అ= దేవతలవలెనే; శ్రుతులకింకరులు+ఐ= వేదాలకు దాసులై; కాదె= కాదా; కిల్బిషంబులన్+పాసి= పాపాలనుండి విముక్తులై; వారి చందమునన్= దేవతల విధంగా; శాశ్వత విభూతిన్+ఒందుట= నిత్యమైన మహిమను పొందటం; యజ్ఞ+ఆదులు+ఉడుగుట= యజ్ఞాలు మొదలైనవి వదలిపెట్టటం; సంపరిత్యాగమే?= సన్న్యాసమౌతుందా? (కాదని భావం); పాడిమైన్= న్యాయంగా; అర్థములన్+ఉపార్జించి= సంపదలను గడించి; దేవతా బ్రాహ్మణ పుజగాన్+ఇడుచున్= దేవతలకు, బ్రాహ్మణులకు చేసే అర్చనగా వాటిని అర్పణం చేస్తూ; తత్ఫలకోటి విడుపు కాక= వాటివలన కలిగే అనేక ఫలాలను త్యాగం చేయటమే సంపరిత్యాగం అవుతుంది; క్రోధశోక హర్ష కోటులన్= కోపాల, తాపాల, సంతోషాల సమూహాన్ని; గృహముతోన్= గృహస్థాశ్రమంతోపాటు; విడిచి= పరిత్యజించి; యోగము+ఊఁది= యోగాన్ని ఆశ్రయించి; వృక్షమూలవాస నిరతిన్= చెట్ల మొదళ్ళలో నివసించే ఆసక్తితో; ఉండువాఁడె పో!= ఉండేవాడే సుమా!; సంపరిత్యాగి= నిస్సంగుడు; నృపులకున్= రాజులకు; అది= ఆ నిస్సంగత్వం; సమర్థము= యోగ్యమైనది; అగునె?= అవుతుందా? (కాదని భావం).

తాత్పర్యం: వేదవిధిని ప్రవర్తింపచేసేవారు దేవతలు. వారివలె బ్రాహ్మణులుకూడా వేదకింకరులై పాపవిముక్తులై నిత్యమహిమను పొందుతారు. యజ్ఞాదులను మానివేయటం అసంగమౌతుందా? న్యాయంగా సంపదలు గడించి దేవతలకు, బ్రాహ్మణులకు పూజలుగా ఇస్తూ, తత్ఫలాలను విడవటమే నిస్సంగప్రవృత్తి అవుతుంది. క్రోధం, శోకం, హర్షం మొదలైన భావాలతోపాటు గృహస్థాశ్రమాన్ని వదలి యోగాన్ని ఆశ్రయించి వృక్షమూలంలో నివసిస్తూ ఉండేవాడే సంపరిత్యాగి. రాజులకు అది యోగ్యం అవుతుందా? (కాదని భావం).

క. **తక్కిన మూఁ డాశ్రమములు, । నొక్కదెస గృహస్థ ధర్మ మొకదెసఁ దులయం**
దెక్కింప వానితో న । య్యొక్కటి సరిదూఁగె నందు రుర్వీశ! బుధుల్. **76**

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ!= భూపాలా! ధర్మరాజా!; తుల అందున్= త్రాసులో; ఒక్క దెసన్= ఒకవైపున; తక్కిన మూఁడు+ఆశ్రమములు= గృహస్థాశ్రమం కాక మిగిలిన మూ డాశ్రమాలూ (బ్రహ్మచర్య, సన్న్యాస, వానప్రస్థాశ్రమాలు); ఒక దెసన్= మరియొక వైపున; గృహస్థ ధర్మము= గార్హస్థ్యాశ్రమం; ఎక్కింపన్= ఎత్తి ఉంచగా; వానితోన్= ఆ మూడింటితో; ఆ+ఒక్కటి= ఆ గార్హస్థ్యాశ్రమం ఒక్కటి; సరి+తూఁగెన్= సమంగా తూగిందని; బుధులు= పండితులు; అందురు= అంటారు.

తాత్పర్యం: ఒక త్రాసులో ఒకవైపు బ్రహ్మచర్య, సన్న్యాస, వానప్రస్థాశ్రమాలను మూడింటిని, మరొకవైపు గృహస్థాశ్రమ ధర్మాన్నీ ఎక్కించగా ఆ మూడింటితో ఇది ఒక్కటి సరితూగిందని పండితులంటారు ధర్మరాజా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మహాభారతం గృహస్థాశ్రమధర్మ ప్రాశస్త్యాన్ని ప్రతిపాదించటానికే పుట్టిందని ఇటువంటి సూక్తుల వలన ధ్వనించబడుతున్నది.

వ. కావున గృహస్థ ధర్మంబ యాదరణీయం; బట్లుంగాక. 77

తాత్పర్యం: కాబట్టి గృహస్థధర్మం గౌరవించదగింది. అట్లా కాక (తరువాతి పద్యంతో అన్వయం).

క. జతనంబున నర్థము సం । చితముగఁ గావించి క్రతువిశేషంబుల దే
వతలం దృప్తులఁ జేయమి । యతికిల్బిషకారి యందు రాగమవేదుల్. 78

ప్రతిపదార్థం: జతనంబునన్= ప్రయత్నంతో; అర్థము= ధనాన్ని; సంచితముగన్= కూడబెట్టేదిగా; కావించి= చేసి; క్రతువిశేషంబులన్= యజ్ఞవిశేషాలతో; దేవతలన్= దేవతలను; తృప్తులన్+చేయమి= సంతృప్తులుగా చేయకుండా ఉండటం; అతికిల్బిషకారి= మిక్కిలి పాపహేతువని; ఆగమవేదుల్= వేదవిద్వాంసులు; అందురు= అంటారు.

తాత్పర్యం: ప్రయత్నపూర్వకంగా ధనాన్ని కూడబెట్టి విశేషక్రతువులు చేసి దేవతలను తృప్తి చేయకపోతే మిక్కిలి పాపం కలుగుతుందని వేదవిదులు అంటారు.

చ. వినుము! తమోమయం బయిన విశ్వముఁ దా వెలిఁగించు నీశ్వరుం
డన నొకరుండు; వర్ణతతి నాశ్రమకోటిని వాఁడుఁ గాదె చే
సె; నిఖిల కర్మయోగ సవిశేషత గల్గుటయుం దదీయ క
ల్పనను; తదాజ్ఞకుం దొలఁగఁ బాడియె శోకము గారణంబుగన్. 79

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! వినుము; తమోమయంబు+అయిన= అంధకారంతో నిండినదయిన; విశ్వమున్= జగత్తును; ఈశ్వరుండు+అనన్+ఒకరుండు= ఈశ్వరు డనే పేరు కలిగిన ఒకడు; తాన్+వెలిఁగించున్= తన ప్రకాశంతో వెలుగు నింపుతాడు; వర్ణతతిన్= వర్ణాలను; ఆశ్రమ కోటిని= ఆశ్రమ సమూహాన్ని; వాఁడు+కాదె+చేసెన్= వాడేకదా ఏర్పరిచింది; తదీయ కల్పనను= ఆతడి కల్పనచేతనే; నిఖిల కర్మయోగ సవిశేషత= సమస్త కర్మయోగ విశేషభావం; కల్గుటయున్= ఏర్పడటం కూడా; తద్= అటువంటి ఆ ఈశ్వరుడియొక్క; ఆజ్ఞకున్= శాసనానికి; శోకము+కారణంబుగన్= శోకం కారణంగా; తొలఁగన్= దూరం కావటం; పాడియె?= న్యాయమా? (కాదని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. అంధకార బంధురమైన ఈ విశ్వంలో ఈశ్వరుడనే వాడొకడు వెలుగును ప్రసాదిస్తాడు. అతడే కదా వర్ణ సముదాయాన్నీ, ఆశ్రమకోటినీ ఏర్పరచింది! సమస్త కర్మయోగ విశేషభావం కలగటం ఆయన కల్పనయే. శోకం కారణంగా ఆతడి ఆజ్ఞను మీరటం న్యాయమా? (కాదని భావం).

వ. హింసాదోషంబు గలుగునను శంకకుం బనిలే; దవధరింపుము. 80

తాత్పర్యం: హింసచేసిన పాపం కలుగుతుందనే అనుమానం పడవలసిన పని లేదు; వినుము.

క. పరుల వధింపక యెవ్వఁడు । ధర యేలెం జెపుమ పూర్వ ధరణీశులలోఁ?
బొరయదు పాపము సుగతిక । యరిగిరి వా; రీవు నట్ల యగు టొప్పు నృపా! 81

ప్రతిపదార్థం: నృపా!= రాజా! (ధర్మరాజా!); పూర్వధరణీ+ఈశులలోన్= మున్నున్న రాజులలో; ఏ+వాఁడు?= ఎవడు?; పరులన్= శత్రువులను; వధింపక= చంపక; ధర= భూమిని; ఏలెన్= పాలించాడో; చెపుమ= తెల్పుము; పాపము= దోషం; పొరయదు= (వారికి) కలుగదు; వారు= ఆ పూర్వ చక్రవర్తులు; సుగతికిన్+అ= ఉత్తమ గతికే (మోక్షానికే); అరిగిరి= వెళ్ళారు; నీవున్= నీవు కూడా; అట్లు+అ= ఆ విధంగానే; అగుట= కావటం; ఒప్పున్= సబబు.

తాత్పర్యం: రాజా! పూర్వ చక్రవర్తులలో శత్రువులను చంపకుండా ఎవడు రాజ్యాన్ని పాలించాడో చెప్పుము. వారికి పాపం కలుగలేదే! వారు ఉత్తమగతులనే పొందారు. కాబట్టి నీవు కూడా ఆ విధంగా కావటం సముచితం.

క. రక్ష ప్రజ గోరు నిజయో । గక్షేమార్థముగ; జన సుఖస్థితి నడపన్
దక్షుఁ డగు రాజు నడప కు । పేక్షించినఁ బాప మొందదే కురుముఖ్యా! 82

ప్రతిపదార్థం: కురుముఖ్యా!= కురుశ్రేష్ఠుడవైన ధర్మరాజా!; నిజయోగక్షేమ+అర్థముగన్= తమ యోగక్షేమాల కొరకు; ప్రజ= ప్రజలు; రక్షన్= రక్షణను; కోరున్= కోరుతూ ఉంటారు; జనసుఖస్థితి= ప్రజలు సుఖంగా జీవించే వ్యవస్థను; నడపన్= సాగించటానికి; దక్షుఁడు+అగు= సమర్థుడైన; రాజు= ప్రభువు; నడపక= నిర్వహించక; ఉపేక్షించినన్= నిర్లక్ష్యం చేస్తే; పాపము+ఒందదా?= పాపం కలుగదా?.

తాత్పర్యం: తమ యోగక్షేమాల కొరకు ప్రజలు రక్షను కోరుతుంటారు. ప్రజలు సుఖంగా ఉండగలిగే వ్యవస్థను నడపగలిగిన సమర్థుడైన ప్రభువు దానిని నిర్వహించకుండా నిర్లిప్తంగా ఉంటే పాపం పొందదా ధర్మరాజా!

తే. గోవులను ఘోటకంబులఁ గుంజరముల । దాసులను బ్రీతి నిమ్మెల్ల ధాన్యములను
గ్రామముల మందిరముల నిష్కముల పెక్కు । నొసఁగు తత్తత్సుపాత్రత్వయుక్త విధుల. 83

ప్రతిపదార్థం: గోవులను= ఆవులను; ఘోటకంబులన్= గుర్రాలను; కుంజరములన్= ఏనుగులను; దాసులను= సేవకులను; ఎల్లధాన్యములను= అన్ని రకాలైన ధాన్యాలను; గ్రామములన్= ఊళ్ళను (అగ్రహారాదులు); మందిరములన్= గృహాలను; నిష్కములన్= బంగారు నాణెములను; పెక్కు= అధిక సంఖ్యలో; తద్+తద్+సుపాత్రత్వయుక్త విధులన్= దానం చేస్తున్న ఆయా వస్తువులను స్వీకరించదగినవారి ఉత్తమ యోగ్యతలతో కూడుకొన్న నియమాలతో; ప్రీతిన్= సంతోషంగా; ఇమ్ము= దానమిమ్ము.

తాత్పర్యం: ఆవులను, గుర్రాలను, ఏనుగులను, సేవకులను, బహుధాన్యాలను, గ్రామాలను, గృహాలను, బంగారు నాణెములను, అవి దానం చేయదగిన అర్హత ఉన్నవారికి విధివిధానంగా నీవు దానం చేయుము.

వ. వీని నన్నింటి రిత్తవో విడిచి పోయెద ననుట నీ యట్టి మహానుభావునకుం దగునే?' యని పలికినం దదనంతరంబ సహదేవుం డమ్మహీపతి కిట్లనియె. 84

ప్రతిపదార్థం: వీనిన్= పైన చెప్పిన వాటినన్నింటిని; రిత్త+పో+విడిచి= నిష్ప్రయోజనంగా వదలిపెట్టి; పోయెదన్+అనుట= (అడవికి) పోతాననటం; నీ+అట్టి= నీ వంటి; మహా+అనుభావునకున్= ఉత్తముడికి; తగునే?= యోగ్యమౌతుందా?; అని పలికినన్= అని మాట్లాడగా; తదనంతరంబు+అ= ఆ తరువాతనే; సహదేవుండు= సహదేవుడు; ఆ+మహీపతికిన్= ఆ రాజుకు (ధర్మరాజుతో); ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: వీటినన్నింటిని వదలి అడవికి పోతాననటం నీవంటి ఉత్తములకు తగునా?' అని పలుకగా ఆ తరువాత సహదేవుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: భీముడు, అర్జునుడు, నకులుడు పలికిన మాటలు ఆయా పాత్రల స్వభావానికి అనుగుణంగా ఉండటం గమనించదగిన అంశం. వక్తల మాటల తీరులు వేరైనా వక్తవ్యాంశ తాత్పర్యం ఒక్కటే!

సీ. **'వెలి వెలి వస్తువుల్ విడిచెఁబో నరుఁడు గ । ర్మిష్ఠతం గాదె శరీర యాత్ర**
నడపువాఁ; డది మోక్షణంబు గానేరదు; । శారీర సౌఖ్యసంసక్తి వదలి
బాహ్యపదార్థముల్ పాటించి నిజవంశ । ధర్మముల్ వదలక తగఁ జరింపు
మమత బంధంబు నిర్మమత మోక్షంబును । జేయు; నింత యెఱింగి చేసి రధిప!

తే. **రాజ్య మెలమి మన్వాదు; లరణ్యమునకు । నరిగి నీ వందు వలయు ద్రవ్యముల మీఁదఁ**
జేయవలదె మమత్వంబు; వేయు నేల? । యదియు సంసార చక్రవాహకము గాదె? **85**

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; నరుఁడు= మానవుడు; వెలివెలి వస్తువుల్= పైపై పదార్థాలు; విడిచెన్+పో= విడిచిపెట్టా డనుకొన్నా; శరీరయాత్ర= జీవితయాత్ర; కర్మిష్ఠతన్+కాదె= కర్మలయందలి నిష్ఠతోనే కదా; నడుపువాఁడు= సాగించేవాడు; అది= ఆ విధం; మోక్షణంబు= మోక్షం (బంధవిముక్తి); కానేరదు= కాజాలదు; శారీర సౌఖ్యసంసక్తి= శరీర సుఖం మీది రక్తి; వదలి= త్యజించి; బాహ్యపదార్థముల్= లౌకిక విషయాలను; పాటిస్తూ= ఆచరిస్తూ; నిజవంశధర్మముల్= తన వంశంలో చేయవలసిన కర్తవ్యాలను; వదలక= వీడక; తగన్= ఒప్పునట్లు; చరింపు= వర్తించుము; మమత= మోహం; బంధంబు= సంసార సంగమును కలిగించేది; నిర్మమత= మోహం లేకపోవటం; మోక్షంబును+చేయున్= మోక్షాన్ని కలిగిస్తుంది; ఇంత= ఈ తాత్పర్యాన్ని; ఎఱింగి= తెలిసికొని; మను+ఆదులు= మనువు మొదలైనవారు; రాజ్యము= పరిపాలనం; ఎలమిన్= ప్రీతితో; చేసిరి= నిర్వహించారు; నీవు= నీవు (ధర్మరాజు); అరణ్యమునకున్= అడవికి; అరిగి= వెడలి; వలయు ద్రవ్యముల మీఁదన్= కావలసిన వస్తువులమీద; మమత్వంబున్= మమకారాన్ని; చేయన్‌వలదె?= చేయవద్దా? (పెంచుకొనవద్దా? అని భావం); వేయున్+ఏల?= పలుమాట లెందుకు?; అదియున్= ఆ విధంగా అరణ్యంలో నివసించటం; సంసార చక్రవాహకము+కాదె?= సంసార చక్రపు (చావు పుట్టుకల వలయానికి) ఇరుసువంటిది కాదా?

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! మానవుడు పైపై విషయాలను ఎన్ని వదలినా కర్మరుడై శరీరయాత్ర సాగిస్తూ ఉంటాడు. అది మోక్షం కాజాలదు. శరీరసుఖ ఆసక్తిని మానుకొని బాహ్య విషయాలను పాటిస్తూ స్వీయవంశానుగుణాలైన ధర్మాలను విడువకుండా తగునట్లు జీవితాన్ని సాగించుము. మమకారం బంధాన్నీ, నిర్మోహం మోక్షాన్నీ కలుగజేస్తాయి. మన్వాదులు దీనిని తెలిపి రాజ్యం చేశారు. నీవు అరణ్యానికి వెడలినా అక్కడ జీవించటానికి కావలసిన ద్రవ్యాలమీద మమత్వాన్ని కలిగి ఉండవలసిందే కదా! వేయిమాట లెందుకు? అదే సంసారచక్రానికి ఆధారం కదా!

తే. **నీవ చుట్టంబుఁ బక్కంబు, నీవ చెలియు, । నీవ తల్లియుఁ దండ్రియు, నీవ గురువు,**
నీవ దైవంబుఁ గావున నా విషాద । భాషణంబులు సైరింపు భరతముఖ్య!. **86**

ప్రతిపదార్థం: భరతముఖ్య!= భరతవంశ శ్రేష్ఠుడవైన ధర్మరాజా!; నీవు+అ= నీవే (ధర్మరాజే); చుట్టంబు= బంధువు; పక్కంబు= తోడు; నీవ చెలియున్= నీవే నెచ్చెలివి; నీవ తల్లియున్= నీవే అమ్మవు; తండ్రియున్= జనకుడవు; నీవ గురువు= నీవే ఆచార్యుడవు; నీవ దైవంబు= నీవే వేల్పువు; కావునన్= కాబట్టి; నా విషాద భాషణంబులు= నా కన్నీటి మాటలు; సైరింపు(ము)= మన్నించుము.

తాత్పర్యం: ఓ భరతవంశశ్రేష్ఠా! నీవే నా బంధువవు, నీవే నా తోడువు, నీవే నా నెచ్చెలివి, తల్లివి, తండ్రివి, గురువవు, దైవానివి. కాబట్టి నా కన్నీటి మాటలను మన్నించుము.

క. తథ్యము లైనను దలఁప న । తథ్యము లైనను సభక్తి తాత్పర్యము వై
తథ్యంబుఁ బొరయకుండఁగఁ । బథ్యంబుగఁ గొనుము నాదు పలుకులు కరుణన్.' 87

ప్రతిపదార్థం: నాదు పలుకులు= నా మాటలు; తథ్యములు+ఐనను= సత్యాలైనా; తలఁపన్= ఆలోచించగా; అతథ్యములు+ఐనను= అసత్యాలైనా; సభక్తి తాత్పర్యము= భక్తిభావంతో కూడుకొని ఉన్నవి; వైతథ్యంబున్= అసత్యభావాన్ని; పొరయక+ఉండఁగన్= కలుగకుండగా; కరుణన్= దయతో; కొనుము= స్వీకరించుము (అంగీకరించుము).

తాత్పర్యం: నా మాటలు సత్యాలైనా, అసత్యాలైనా భక్తిభావంతో కూడికొని ఉన్నాయి. కాబట్టి వాటికి అసత్యస్వభావం కలుగకుండా దయతో అంగీకరించుము'.

విశేషం: సహదేవుడు భక్తితో ధర్మజుడిని అనునయించే యత్నం చేశాడు. చివరి రెండు పద్యాలు శరణాగతభావాన్ని వెలువరిస్తున్నట్లున్నాయి. భక్తుల కోర్కెలను మన్నించే దైవం వాటిలోని సత్యాసత్యాలను పరిగణించడని పలికి సహదేవుడు వేస్తున్న ముందుకాళ్ళకు బంధాలు ఈ మాటలు. ధర్మజుడిపై ఆతడికి గల భక్తి, అనురక్తి ఇందులోని వ్యంగ్యం.

వ. అనియె; నిట్లు దమ్ములందఱును బోధించు పలుకులు విని ధర్మనందనుం డూరక యుండె; నతనియెడ సవిశేష బహుమానయు, నతనిచేత సంతతోపలాలితయు, ధర్మాధర్మ నిదర్శన శీలయు నగు పాంచాలి భద్రగజప్రతిమానులైన యప్పవమానతనయ ధనంజయ నకుల సహదేవుల మధ్యంబున యూథపతివోలె నున్నయన్నరేంద్రు నల్లన చేరి, 'యేనును నా యెఱింగినంత సెప్పెద' నని యనుజ్ఞఁ గొని యవ్విభు వదనంబున నిజ విశాలలోచన రోచులు పరఁగ వినయం బాననంబున నతిశయిల్ల నిట్లనియె. 88

ప్రతిపదార్థం: అనియెన్= సహదేవు డట్లా పలికాడు; ఇట్లు= ఈ విధంగా, క్రమంగా; తమ్ములు+అందఱును బోధించు పలుకులు విని= తమ్ములందరు ప్రబోధిస్తూ చెప్పిన మాటలు విని; ధర్మనందనుండు+ఊరక+ఉండెన్= ధర్మరాజు మిన్నక ఉన్నాడు; అతని యెడన్= ధర్మరాజుపట్ల; సవిశేషబహుమానయున్= అతిశయించిన గౌరవమర్యాదలు కలది; అతనిచేతన్= ధర్మరాజుచేత; సంతత+ఉపలాలితయున్= ఎల్లప్పుడూ బుజ్జగించబడుతూ ఉండేది; ధర్మ+అధర్మ నిదర్శన శీలయును+అగు= ధర్మాన్నీ అధర్మాన్నీ నిరూపించగల స్వభావం కలది అయిన; పాంచాలి= ద్రౌపది; భద్రగజప్రతిమానులు+ఐన= శ్రేష్ఠమైన ఏనుగులతో సమానులైన; ఆ+పవమాన తనయ ధనంజయ నకుల సహదేవుల మధ్యంబునన్= ఆ భీమార్జున నకుల సహదేవుల నడుమ; యూథపతివోలెన్+ఉన్న= గజరాజువలె ఉన్న; ఆ+నరేంద్రున్= ఆ రాజును; అల్లన చేరి= మెల్లగా సమీపించి; ఏనును= నేను కూడా; నా+ఎఱింగినంత= నా తెలిసినంత; చెప్పెదన్= చెప్తుతాను; అని= అని; అనుజ్ఞన్+కొని= అనుమతిని తీసికొని; ఆ+విభువదనంబునన్= ధర్మజుడి ముఖమునందు; నిజవిశాల లోచన రోచులు= తన విశాలమైన కనుచూపుల కాంతులు; పరఁగన్= వ్యాపించగా; వినయంబు= అణకువ; ఆననంబునన్= ముఖంలో; అతిశయిల్లన్= వికసించగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆ విధంగా తమ్ములందరూ బోధించిన మాటలు విని ధర్మరాజు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ధర్మరాజుపట్ల అధికమైన గౌరవమర్యాదలు కలదీ, అతడిచేత ఎల్లప్పుడూ లాలించబడుతూ ఉండేదీ, ధర్మాధర్మాలను నిరూపించే స్వభావం కలదీ అయిన ద్రౌపది భద్రగజాలతో సమానులైన ఆ భీమార్జున నకుల సహదేవుల నడుమ గజయూథపతివోలె నున్న ధర్మరాజును మెల్లగా సమీపించి 'నేను కూడా నా తెలిసినంత చెప్తుతాను' అని అనుమతి తీసికొని ధర్మజుడి ముఖంపై తన విశాలనేత్రాల చూపుల వెలుగులు వ్యాపింపచేసి వినయం ముఖాన వికసించగా ఇట్లా అన్నది.

విశేషం: అలం: ఉపమ. భీమాదులు పలికినప్పటికంటె ద్రౌపది పలికేటప్పుడు అభినయాన్ని విశేషంగా వర్ణించటం తిక్కనగారి పాత్రోచిత నాటకీయ ఫణితి.

ద్రౌపది ధర్మజునకు హితవచనంబుల మనస్తాపోపశమంబు సేయుట (సం. 12-14-1)

సీ. ' శోకాగ్ని దనికిన సొగయు నీ తమ్ముల । నుపపన్న వాక్యామృతోపయుక్తిఁ
దేర్పుము; గానలం ద్రిమ్మరునాఁడు వీ । రాయాసములఁ బడు టవధరించి
సమయ కాలము సన్నఁ జని సుయోధనుఁ జంపి । భోగంబులను బహుత్యాగములను
యాగంబులను సద్విహారముల్ సలుపుద । మని యూరడింపవే; యరిగణంబుఁ

తే. ద్రుంచి రాజ్యంబు సేకొంటి; తొఱఁగి పోదు । గాక యని యిప్పు డుడికింప నీకుఁ దగునె?
ధర్మమును సత్యమును నుచితంబు నిన్నుఁ । గడవ నెఱిఁగెడువారలు గలరె యధిప!' 89

ప్రతిపదార్థం: అధిప!= ప్రభూ! (ధర్మరాజా!); శోక+అగ్ని= శోకమనే అగ్ని; తనికినన్= సమీపించగా, తాకగా; సొగయు= చొక్కు; నీ తమ్ములన్= నీ సోదరులైన భీమాదులను; ఉపపన్న వాక్య+అమృత+ఉపయుక్తిన్= ఉపపత్తులు కలిగిన వాక్యాలనే అమృతమును ఉపయోగించటం వలన; తేర్పుము= తేటపడేటట్లు చేయుము, తేరుకొనేటట్లు చేయుము; కానలన్= అరణ్యాలలో; త్రిమ్మరునాఁడు= తిరుగాడే సమయంలో; వీరు= భీమాదులు; ఆయాసములన్= కష్టాలను; పడుట= పొందటం; అవధరించి= గమనించి; సమయకాలము= నియమసమయం; చన్నన్= కడచిపోగా; చని= (దండెత్తి)పోయి; సుయోధనున్+చంపి= దుర్యోధనుడిని చంపి; భోగంబులను= సంపదలను అనుభవించుటలను; బహుత్యాగములను= పలురకాల త్యాగాలను; యాగంబులను= యజ్ఞాలను; సత్+విహారముల్= ఉచితములైన విలాస క్రీడలతో వేడుకగా తిరుగుటలు; సలుపుదము+అని= చేద్దామని; ఊరడింపవే?= బుజ్జగించలేదా?; అరిగణంబున్= శత్రు సమూహాన్ని; త్రుంచి= చంపి; రాజ్యంబు= ప్రభుత్వాన్ని; చేకొంటి(వి)= చేపట్టావు; తొఱఁగిపోదున్+కాక!= దానిని వదలిపోతాను సుమా!; అని= అని; ఇప్పుడు= ఈ సమయంలో; ఉడికింపన్= తపింపచేయటం, ఎదుటివారికి ఉలుకు పుట్టించటం; నీకున్= నీకు (ధర్మరాజుకు); తగునె?= ఉచితమా? (కాదని భావం); ధర్మమును= ధర్మాన్నీ; సత్యమును= సత్యాన్నీ; ఉచితంబు= ఔచిత్యాన్నీ గురించి; నిన్నున్+కడవన్= నిన్ను మించేటట్లుగా; ఎఱిఁగెడువారలు= తెలిసినవారు; కలరె?= కలరా?(లేరని భావం).

తాత్పర్యం: 'ధర్మరాజా! శోకాగ్ని సోకటంవలన బాధపడుతున్న నీ తమ్ములను సోపపత్తికాలైన అనునయ వాక్యాలనే అమృత సేచనంతో ఓదార్చుము. అరణ్యావాసంలో వీరు అనేక కష్టాలను అనుభవించటాన్ని తెలిసికొని, నియమసమయం ముగిసిపోగా దుర్యోధనుడిని చంపి, భోగాలను, అనేక త్యాగాలను, యజ్ఞాలను, వినోదవిహారాలను చేద్దామని వీరిని ఊరడించలేదా!. శత్రువులను సంహరించి రాజ్యాన్ని స్వీకరించావు, ఇప్పుడు 'రాజ్యాన్ని త్యజించి పోతాను సుమా!' అని వీరిని తపింపచేయటం న్యాయమా? ధర్మమును గురించి, సత్యాన్ని గురించి, ఔచిత్యాన్ని గురించి నిన్ను మించి తెలిసినవా రున్నారా?' (లేరని భావం).

విశేషం: భీమాదులు ఉపక్రమించే పద్ధతిలోనూ, ద్రౌపది మొదలు పెట్టే విధంలోనూ కొట్టవచ్చిన మార్పు గమనించతగింది. ఆమె 'ధర్మాధర్మ నిదర్శన శీల' అని నిరూపితమయ్యేటట్లు మాటలనేర్పు కూర్చబడింది.

వ. అని ముట్టనాడి, మఱియును. 90

తాత్పర్యం: అని మర్మం తాకేటట్లుగా (గుండెకు గుచ్చుకొనేటట్లు) మాట్లాడి, (ఇంకా ఇట్లా అన్నది).

క. ' పేదమన సగుట ధర్మువు । గాదు నరేంద్రునకు; జగము గావం బ్రోవం
గాదె నృపు లోకపాలాం । శోదితుఁగాఁ జేసెఁ బద్మయోని చతురతన్. 91

ప్రతిపదార్థం: నర+ఇంద్రునకున్= రాజునకు; పేదమనసు+అగుట= బేల అయిన మనసు కలవాడు కావటం; ధర్మువు+కాదు= సహజధర్మం కాదు; పద్మయోని= బ్రహ్మ; చతురతన్= నేర్పుతో; నృపున్= క్షత్రియుడిని, రాజును; జగమున్= లోకమును; కావన్= రక్షించటానికి; ప్రోవన్= పోషించటానికికాదా?; లోకపాల+అంశ+ఉదితున్+కాన్= దిక్పాలకుల అంశతో పుట్టినవాడయ్యేటట్లుగా; చేసెన్= సృష్టించాడు.

తాత్పర్యం: రాజు ధైర్యస్థైర్య గుణాలను కోల్పోయిన బేల అయిన మనసు కలవాడుగా ఉండటం ధర్మం కాదు. బ్రహ్మ నైపుణ్యంతో రాజును లోకాన్ని రక్షించటానికీ, పోషించటానికీ కదా దిక్పాలకాంశంతో సృష్టించాడు!

క. నరరూపంబునఁ బరఁగెడు । పరదేవత గాక నృపుఁడు బాలుఁ డయిన న
ప్పురుషు నెడ నేమి వొమ్మని । తిరిగిన దుర్మతులఁ బొందదే కీ డధిపా! 92

ప్రతిపదార్థం: అధిపా!= ధర్మరాజా!; నృపుఁడు= రాజు; నరరూపంబునన్= మానవాకారంతో; పరఁగెడు= విహరించే; పరదేవత= శ్రేష్ఠమైన దైవం; కాక= కాకుండా; బాలుఁడు= పసివాడు (అప్రౌఢుడని భావం); అయినన్= అయితే; ఆ+పురుషుని+ఎడన్= ఆతడిపట్ల; ఏమి+పొమ్ము+అని= ఏమి లాభమని (జాతీయం) నిర్లక్ష్య భావంతో; తిరిగిన= చరించే, వర్తించే; దుర్మతులన్= దుర్మార్గులవలన; కీడు= ఆపద; పొందదే?= కలుగదా? (కలుగుతుంది అని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! ప్రభువు మానవాకారంతో నడయాడే పరదైవంవలె కాకుండా బాలుడివలె అప్రౌఢుడైతే ఆతడిపట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శించే దుర్మార్గులవలన కీడు తప్పక వాటిల్లుతుంది.

ఉ. నేరక చేర నొక్కనిన నీఱుగఁ జేయుఁ గృశానుఁ డిద్ధ ధా
త్రీరమణాగ్ని గాల్చు నతితీవ్రత వంశము నెల్ల; నిట్లుగాఁ
గౌరవకోటి దర్పమునఁ గానక నిన్నుఁ బరాభవించి దు
ర్వారభవత్ప్రకోపశిఖిఁ గ్రాఁగె; మదిన్ వగ పేల దీనికిన్. 93

ప్రతిపదార్థం: కృశానుఁడు= అగ్ని; నేరక= తెలియక; చేరన్= సమీపించగా; ఒక్కనిన= ఒకడిని మాత్రమే; నీఱుగన్= బూదిగా; చేయున్= చేస్తాడు; ఇద్ధ= ప్రకాశితమైన; ధాత్రీరమణ+అగ్ని= రాజు అనెడి అగ్ని; అతి తీవ్రతన్= అత్యంతమైన వేడిమితో (పరాక్రమంతో); వంశమును+ఎల్లన్= కులాన్నంతా - వెదురు; కాల్చున్= కాల్చివేస్తుంది; ఇట్లుకాన్= ఈ విధంగానే; కౌరవకోటి= కౌరవసమూహం; దర్పమునన్= గర్వంచేత; కానక= వెనుక ముం దాలోచించక; నిన్నున్= నిన్ను (ధర్మరాజును); పరాభవించి= అవమానించి; దుర్వార= ఆపుటకు వీలుకాని; భవత్+ప్రకోప శిఖిన్= నీ యొక్క క్రోధమనే అగ్నిలో; క్రాఁగెన్= తగులబడింది; దీనికిన్= ఈ జరిగిన దానికి; మదిన్= హృదయంలో; వగపు= దుఃఖం; ఏల?= ఎందుకు?.

తాత్పర్యం: లోకంలో అగ్ని దగ్గరకు ఎవరైనా తెలియక సమీపిస్తే అతడి నొక్కడినే అది బూది చేసివేస్తుంది. కాని, ప్రకాశవంతుడైన రాజనే అగ్ని అతితీవ్రతతో వంశాన్నే (వెదురు) కాల్చివేస్తుంది. అందువలననే ని న్నా కౌరవులు గర్వాతిశయంతో కన్నుమిన్నుగానక అట్లా అవమానించి నీ తిరుగులేని కోపాగ్నిలో దగ్ధమై పోయారు. ఈ జరిగిన దానికి నీ మనస్సులో దుఃఖ మెందుకు?

విశేషం: ఇందులో రూపకానుప్రాణితోపమాలంకారం సార్థకంగా వాడబడింది. 'వంశ' శబ్దంలో శ్లేషాలంకారం. వంశము= (నానా) కులము, వెదురు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **నృపునందు విధి దండనీతి ప్రతిష్ఠించెఁ । గావున నపరాధగతి యెఱింగి**
దండించు నృపతికి రెండు లోకంబులుఁ । జేకుఱుఁ; దోషంబు సేయ నుదుట
నచ్చొత్తి వెడలంగ నడుచు విప్రుని నైన । భూవరుం; డిది మెచ్చు దేవకోటి;
సభ కేకవస్త్ర రజస్వల యనక నన్ । దలవట్టి యీడ్చిన తప్పుఁ; దనదు

తే. **తొడలు సూపిన తప్పును, దుష్ట కష్ట । తర వచనములఁ బఱిచిన తప్పు, ననుజు**
నందు దుర్యోధనునియందు ననుఁగు నందుఁ । గాంచి దండించి; తిట్టిది కల్మషంబె? 94

ప్రతిపదార్థం: నృపునందున్= రాజునందు; విధి= బ్రహ్మ; దండనీతి= దుష్టులను శిక్షించే పద్ధతి; ప్రతిష్ఠించెన్= స్థాపన చేశాడు; కావునన్= కాబట్టి; అపరాధగతి= చేసిన నేరము యొక్క విధమును; ఎఱింగి= తెలిసికొని; దండించు= శిక్షించే; నృపతికిన్= రాజుకు; రెండు లోకంబులున్= ఇహపరలోకాలు; చేకుఱున్= సిద్ధిస్తాయి; భూవరుండు= రాజు; దోషంబు+చేయన్= పాపంచేస్తే; విప్రునిన్+ఐనన్= బ్రాహ్మణుడిని సైతం; నుదుటన్+అచ్చొత్తి= (జాతీయం) ముఖాన ముద్రవేసి, (దొంగలకు వేసే ఒక శిక్ష); వెడలంగన్ అడుచున్= బహిష్కరిస్తాడు; అది= ఆ పనిని; దేవకోటి= దేవతల సమూహం; మెచ్చున్= కీర్తిస్తుంది; సభన్= (ఆనాటి కపట ద్యూత) సభలో; ఏకవస్త్ర= ఒకచీర తాల్చిన; రజస్వల= ఋతుమతి; అనక+నన్= అనిభావించక నన్ను (ద్రౌపదిని); తల+పట్టి= జుట్టుపట్టుకొని; ఈడ్చిన తప్పున్= లాగిన దోషాన్ని; తనదు తొడలు+చూపిన తప్పునున్= (ద్రౌపదిని కూర్చుండుమని సైగ చేస్తూ) తొడను చూపించిన దోషాన్ని; దుష్టకష్టతర వచనములన్= దుర్మార్గాలు, అమితమైన బాధను కలిగించేవి అయిన మాటలతో; పఱిచిన తప్పున్= పాటుపడజేసిన దోషాన్ని; అనుజునందున్= తమ్మునందును (దుర్యోధనుడి తమ్ముడైన దుశ్శాసనుడి అందు); దుర్యోధనుని అందున్= సుయోధను నందును; అనుఁగునందున్= దుర్యోధనుడికి ప్రీతిపాత్రుడైన కర్ణుడియందు; కాంచి= చూచి; దండించితి(వి)= శిక్షించావు; ఇట్టిది= ఇటువంటిది; కిల్బిషంబె?= పాపమా? (కాదని భావం).

తాత్పర్యం: బ్రహ్మదేవుడు రాజునందు దండనీతిని ప్రతిష్ఠించాడు. కాబట్టి అతడు అపరాధం చేసినవారి పద్ధతుల ననుసరించి అనువుగా దండిస్తే ఇహపరాలూ సిద్ధిస్తాయి. తప్పు చేస్తే బ్రాహ్మణుడిని సైతం ముఖంమీద ముద్రకొట్టి దేశంనుండి వెడలగొట్టుతాడు. దీనిని దేవతలు మెచ్చుతారు. ఆనాడు ఆ సభలో ఒంటి చీర తాల్చినదానిని, రజస్వలను అయిన నన్ను జుట్టుపట్టి ఈడ్చిన తప్పు, తన తొడలు చూపిన తప్పు. దుష్టములైన, అత్యంత కష్టములైన మాటలాడి పాటుబడజేసిన తప్పు గణించి వరుసగా తమ్ముడైన దుశ్శాసనుడిని, దుర్యోధనుడిని, అతడి ప్రియమిత్రుడైన కర్ణుడిని దండించావు; ఇది పాప మెట్లా అవుతుంది?

క. **గరదుని, గృహదాహకు, మం । త్రరహస్య విభేది, వధవిధాయిఁ, బరసతీ**
హరు, బంధుఘాతిఁ, బరధన । హరణ పరునిఁ, జంపి పుణ్యుఁ డగు నృపుఁ డనఘా! 95

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడవైన పుణ్యాత్ముడా! (ధర్మరాజా!); గరదునిన్= విషం పెట్టేవాడిని; గృహదాహకున్= ఇల్లు తగులబెట్టేవాడిని; మంత్రరహస్య విభేదిన్= రాజకీయ తంత్రమర్మాలను బయటపెట్టేవాడిని; వధ విధాయిన్= వధను విధించేవాడిని; పరసతీహరున్= ఇతరుల భార్యలను దొంగిలించేవాడిని; బంధుఘాతిన్= బందుగులను చంపేవాడిని; పరధనహరణపరునిన్= ఇతరుల ధనాన్ని దొంగిలించటంలో ఆసక్తి కలవాడిని; చంపి= ప్రాణాలు తీసి; నృపుఁడు= రాజు; పుణ్యుఁడు= పుణ్యుడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: విషం పెట్టేవాడినీ, ఇల్లు తగులబెట్టేవాడినీ, రాజకీయ తంత్ర రహస్యాలను బయటపెట్టేవాడినీ, వధను విధించే వాడినీ, పరసతులను హరించే వాడినీ, బంధువులను చంపేవాడినీ, ఇతరుల సంపదలు దొంగిలించేవాడినీ చంపి రాజు పుణ్యుడౌతాడు ధర్మజా!

విశేషం: ఈ విశేషణాలన్నీ దుర్యోధనుడికి వర్తించటం గమనించదగిన అంశం.

క. దండార్హులైన వారల । దండింపకయున్నఁ జువ్వె ధాత్రీవిభు నా
ఖండల సన్నిభు నైనఁ బ్ర । చండపుఁ గిల్బిషము వొందు జగతీనాథా! 96

ప్రతిపదార్థం: జగతీనాథా!= భూనాథా! ధర్మజా!; దండ+అర్హులు+ఐన వారలన్= దండింప (శిక్షింప) దగినవారిని; దండింపక+ఉన్నన్= శిక్షించకుండా ఉంటే; ఆఖండల సన్నిభున్+ఐనన్= ఇంద్రుడితో సమానమైనవాడైనా; ధాత్రీవిభున్= రాజును; ప్రచండము+కిల్బిషము= మహాపాపం; పొందున్= కలుగుతుంది; చువ్వె!= సుమా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! శిక్షించదగిన వారిని శిక్షించక ఉంటే ఇంద్రతుల్యుడైన ప్రభువునకు సైతం మహాపాపం కలుగుతుంది సుమా!

క. పేదలకును సాధులకును । వేదములకుఁ దాపసులకు వేయేల సమ
స్తాదిత్యులకును దండమ । కాదె బ్రదుకుఁ జేయు రాజు గావింపంగన్. 97

ప్రతిపదార్థం: రాజు= ప్రభువు; కావింపంగన్= వర్తింపజేయగా; దండము+అ= దుష్టులను శిక్షించటమే; పేదలకును= బీదవారికీ; సాధులకును= మంచివారికీ; వేదములకున్= వేదాలకూ; వేయి+ఏల= పలుమాట లెందుకు?; సమస్త+ఆదిత్యులకున్= వేల్పులందరికీ; బ్రతుకున్+చేయున్+కాదె!= సుఖంగా జీవించేటట్లు చేస్తుంది కదా! (రక్షణ కల్పిస్తుంది కదా అని భావం).

తాత్పర్యం: రాజు ప్రవర్తింపజేసే దండం పేదలకూ, మంచివారికీ, వేదాలకూ, ఇన్ని మాట లెందుకు? దేవత లందరికి కూడా సుఖజీవనాన్ని కలిగించే రక్షగా రూపొందుతుంది కదా!

వ. కావున. 98

తాత్పర్యం: కాబట్టి.

ఆ. ఉచిత దండవృత్తి నుర్వీ ప్రజాభి ర । క్షణము నోపి చేఁత గాక రాజ
వంశజునకు ధర్మువా? భూసురార్హంబు । లైన శమదమాదు లాత్మ నిడుట.' 99

ప్రతిపదార్థం: ఉచిత దండవృత్తిన్= యోగ్యమైన దండ ప్రవృత్తితో; ఉర్వీ ప్రజా+అభిరక్షణమును= భూ ప్రజలను రక్షించటం; ఓపి= సామర్థ్యంతో; చేఁతగాక= చేయుటకాక; రాజవంశజునకున్= రాజవంశంలో పుట్టిన వాడికి; భూసుర+అర్హంబులు+ఐన= బ్రాహ్మణులకు యోగ్యాలైన; శమదమ+ఆదులు= అంతరింద్రియ, బహిరింద్రియ నిగ్రహాదులను; ఆత్మన్+ఇడుట= మనస్సులో ఉంచుకొనటం; ధర్మువా?= ధర్మమా? (కాదని భావం).

తాత్పర్యం: పాపాత్ములను సముచితంగా శిక్షించే ప్రవృత్తి కలిగి, భూప్రజలను రక్షించే బాధ్యతను సామర్థ్యంతో చేయటంకాక రాజవంశజులు బ్రాహ్మణు లనుసరించే అంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహాదులను మనసునందు పోషించటం ధర్మమా?' (ధర్మం కాదని భావం).

వ. అని యంత నిలువక చనవు మెఱసి మేలంపుఁ జందంబున. 100

ప్రతిదార్థం: అని= అని మాట్లాడి; అంతన్+నిలువక= అంతటితో ఆగక; చనవు మెఱసి= అనురాగం ఒలుకబోసి (ఎంతో సన్నిహిత భావం వెలుగొందేటట్లు మెలగి); మేలపుఁ జందంబునన్= (మేలము+చందంబునన్)= పరిహాసమాడుతున్నట్లు.

తాత్పర్యం: ఈ మాటలు పలికి, అంతటితో ఆగకుండా, బాగా చనవు తీసికొని పరిహాసమాడుతున్నట్లు (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. ' వైదిక ధర్మచారి జనవత్సల! నీ మదిఁ బట్టుకొన్న యు
న్మాదము హీనమానవు మనంబునఁ బుట్టిన వెఱ్ఱివోలె న
స్యాదులఁ దీర్చు టొప్పదు; నిజానుజ వర్గము మీఁదఁ గల్గున
త్యాదర సాంద్రసార కరుణామృత మానఁగ నిమ్ము నెమ్మదిన్.' 101

ప్రతిపదార్థం: వైదిక ధర్మచారి జనకవత్సల!= వైదిక ధర్మాలను ఆచరించే ప్రజలయందు దయాభావం కలవాడా! ధర్మరాజా!; నీ మదిన్= నీ మనస్సు; పట్టుకొన్న= ఆవహించిన; ఉత్+మాదము= పిచ్చి; హీనమానవు మనంబునన్= నీచుడైన మనిషియొక్క మనస్సులో; పుట్టిన= కలిగిన; వెఱ్ఱి పోలెన్= పిచ్చివలె; నస్యాదులన్= నస్యము మొదలైన వాటితో(పొడుములు పీల్చటం వలన); తీర్చుట= పోగొట్టటం, తీర్చటం; ఒప్పదు= తగదు; నెఱ+మదిన్= నిండు మనస్సుతో; నిజ+అనుజవర్గము మీఁదన్= నీ సోదర బృందం మీద; కల్గు+అతి+ఆదర= కలిగి ఉండే మిక్కిలి మర్యాద వలన; సాంద్ర= దట్టమైన; సార, కరుణా+అమృతము= చిక్కని దయ అనెడి అమృతం; ఆనఁగన్+ఇమ్ము= ఆస్వాదించేటట్లు చేయుము.

తాత్పర్యం: ' వైదికధర్మాలను ఆచరించే జనులపై ప్రేమకల ధర్మరాజా! నీ మనస్సున ఆవహించిన పిచ్చి సామాన్య మానవుడి మనస్సులో కలిగిన పిచ్చివలె పొడుములు పీల్చటం మొదలైన వాటివలన పోగొట్టటం సాధ్యంకాదు. నీ నిండు మనస్సును (మనసారా) నీ తమ్ముళ్ళపై ఉన్న అధికమైన చిక్కని దయ అనే అమృతాన్ని త్రాగనిమ్ము'. (నీకు కలిగిన పిచ్చికి మందు సోదరప్రేమే అని భావం).

విశేషం: అలం: ఉపమ. నస్యాదుల్ని పీల్పించి వెర్రిని కుదర్చటం లోక విదితమే!

వ. అని పలికి యిట్లనియె. 102

తాత్పర్యం: అని చెప్పి, (ద్రౌపది) మరల ఇట్లా అన్నది.

క. ' నాయట్లు వడిన యంగన। లేయెడలం గలరె? యిట్టి యేనును ధర్మా
పాయము నీకగు, నను వెఱఁ। బాయన గృహధర్మవృత్తిఁ బౌరవముఖ్యా!' 103

ప్రతిపదార్థం: పౌరవ ముఖ్యా!= పురువంశంలో పుట్టిన వారిలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; నా+అట్లు= నా వలె; పడిన= అగచాట్లు పడ్డ; అంగనలు= స్త్రీలు; ఏ+ఎడలన్= ఎక్కడకూడా; కలరు+ఎ?= ఉన్నారా? (లేరని భావం); ఇట్టి= ఇటువంటి; ఏనును= నేను కూడా; నీకున్= నీకు (ధర్మరాజుకు); ధర్మ+అపాయము= ధర్మహాని; అగున్= ఔతుంది; అను= అనే; వెఱన్= భయంతో; గృహధర్మ వృత్తిన్= కుటుంబ ధర్మాన్ని నిర్వహించే స్వభావాన్ని; పాయను+అ= వదలిపెట్టను.

తాత్పర్యం: 'ధర్మరాజా! నా వలె కష్టాలు పడిన వనితలు ఎక్కడైనా ఉన్నారా? ఇటువంటి నేను నీ కెక్కడ ధర్మలోపం కలుగుతుందో అనే భయంతో గృహస్థ ధర్మపద్ధతిని వీడకుండా ఉన్నాను'.

వ. అని వెండియు. 104

తాత్పర్యం: అని మరల (ఇట్లా అన్నది).

క. ' కౌరవులు దమదురితమునఁ । దా రెరిసిరి; కల్మషంబు దానఁ గలదె? భూ
భారము వహింపు, బహుయ । జ్ఞారంభణ మాచరింపు మఖిలహితముగన్. 105

ప్రతిపదార్థం: కౌరవులు= దుర్యోధనాదులు; తమ, దురితమునన్= తాము చేసికొన్న పాపంవలన; తారు= తాము; ఎరిసిరి= నశించారు; దానన్= దానివలన (వారి కర్మంవలన వారు చనిపోయినందు వలన); కల్మషంబు= పాపం; కలదె?= (నీకు) కలుగుతుందా? (కలుగదని భావం); భూభారము= రాజ్యభారాన్ని (పరిపాలన బాధ్యతలను; వహింపు(ము)= పూనుము; అఖిల, హితముగన్= అందరికీ మేలు జరిగేటట్లుగా (లోక కల్యాణం కొరకు); యజ్ఞ+ఆరంభణము= యజ్ఞాలు మొదలు పెట్టి; ఆచరింపుము= చేయుము.

తాత్పర్యం: కౌరవులు తమ పాపం పండి తాము నశించారు. వారి చావునకు వారే కారకులైనప్పుడు నీకు పాపం ఎట్లా కలుగుతుంది? కాబట్టి విచారం మాని, రాజ్యపరిపాలనాన్ని చేపట్టుము; సర్వలోక కల్యాణం కలిగేటట్లు అనేక యజ్ఞాలను ఆరంభించి నిర్వహించుము.

క. సురగురుఁడును శుక్రుండును । బరిపాటిగ దండనీతిఁ బలికిరి దానం
బరిణతుఁడవు; నీ వనుజులు । పరికరముగ నడపు ధర్మభాసుర! దానిన్.' 106

ప్రతిపదార్థం: ధర్మభాసుర!= ధర్మాచరణంచేత ప్రకాశించేవాడా! ధర్మరాజా!; సురగురుఁడును= దేవతలకు గురువైన బృహస్పతీ; శుక్రుండును - (రాక్షస గురువైన) శుక్రాచార్యుడూ; దండనీతిన్= యుద్ధంలో పాటించవలసిన రాజనీతిని గురించి; పరిపాటిగన్= క్రమంగా; పలికిరి= చెప్పి ఉన్నారు; దానన్= ఆ రాజనీతిలో; పరిణతుఁడవు= పండితుడవు (మంచి అనుభవమున్నవాడవు); దానిన్= ఆ రాజనీతిని; నీవు= (ధర్మరాజా!); అనుజులు= తమ్ములు (భీమాదులు); పరికరముగన్= సాధనంగా, ఉపకరణంగా; నడపు(ము)= సాగించుము.

తాత్పర్యం: ధర్మరాజా! బృహస్పతీ, శుక్రాచార్యుడూ యుద్ధనీతిని ప్రచురంగా తెలియచెప్పారు. ఆ నీతిలో నీవు మంచి అనుభవజ్ఞుడవు. దానిని నీ తమ్ములను ఉపకరణాలుగా చేసికొని ఆచరణలో పెట్టుము'.

వ. అనినం బాంచాలితో మఱుమాట లాడక యూరకయున్న యన్నరేంద్రునకు నింద్రనందనుం డిట్లనియె. 107

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పాంచాలితోన్= ద్రౌపదితో; మఱు మాటలు+ఆడక= సమాధానపు మాటలు పలుకకుండా; ఊరక+ఉన్న= మిన్నకున్న; ఆ+నర+ఇంద్రునకున్= ఆ రాజుకు - ధర్మరాజుతో; ఇంద్రతనయుండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని పాంచాలి అనగా, ఆమెతో మారుపలుక కుండా ధర్మరాజు మిన్నకున్నాడు. అప్పుడు ఆయనతో అర్జునుడు ఇట్లా అన్నాడు.

సీ. ' దక్షుఁడై భూపతి దండనీతి నయింప । కున్న సన్యాసులు నుత్పథ ప్ర
వర్తను లగుదురు; వావిరి నన్యోన్య । ధనధాన్య పశుభూమి దారహరణ
మాచరింతురు జను; లప్పాప మవ్విభు । నొందు; దండము హింసయుఁగఁ దలంప
వలదు; దుర్వృత్తుల వధియించు రుద్రుని । గోవిందు వాసవు గుహునిఁ జూడు;

తే. మా మహాత్ములు దక్కు నున్మార్గ చరుల । దండితులఁ జేత వినమె! యధర్మ మడంగు;
ధర్మ మెసఁగు దండమున నర్థంబుఁ గామ । మును నదూష్యంబులై సిద్ధిఁ బొందు నధిప! 108

ప్రతిపదార్థం: అధిప!= రాజా! (ధర్మరాజా!); భూపతి= రాజ్యాన్ని పాలించే రాజు; దక్షుఁడు+ఐ= సమర్థుడై; దండనీతి= యుద్ధనీతిని; నయింపక+ఉన్నన్= ఆచరించకపోతే (నడిపించకపోతే); సత్+న్యాసులున్= సన్న్యాసాశ్రమం తీసికొన్న వారుకూడా; ఉత్+పథ, ప్రవర్తనులు= గర్వమార్గంలో నడిచేవారు; అగుదురు= ఔతారు; జనులు= ప్రజలు; వావిరిన్= అధికంగా; అన్యోన్య, ధన, ధాన్య, పశు, భూమి, దార హరణము= ఒకరి ధనాన్ని, పంటలను, పశువులను, భూమిని, భార్యను మరొకరు దొంగిలించటం; ఆచరింతురు= చేస్తారు; ఆ+పాపము= ఆ విధంగా ప్రజలుచేసే పాపం; ఆ+విభున్= ఆ రాజును; ఒందున్= పొందుతుంది; దండము= యుద్ధం చేయటం - దండోపాయం; హింసయుఁగన్= హింసగా; తలంపన్‌వలదు= భావించవద్దు; దుః+వృత్తులన్= దుర్మార్గులను; వధియించు= చంపే; రుద్రునిన్= రుద్రుడిని; గోవిందున్= విష్ణువును; వాసవున్= ఇంద్రుడిని; గుహునిన్= కుమార స్వామిని; చూడుము= కనుగొనుము; ఆ+మహాత్ములు= ఆ గొప్పవారు; తక్కన్= మిగిలిన; ఉత్+మార్గచరులన్= చెడునడవడికతో మెలగే వారిని; దండితులన్+చేఁత= శిక్షింపబడిన వారినిగా చేయటం; వినము+ఎ?= విని ఉండలేదా?; దండమునన్= దండంచేత; అధర్మము= అన్యాయం; అడఁగున్= నశించిపోతుంది; ధర్మము+ఎసఁగున్= ధర్మం అతిశయిస్తుంది; అర్థంబున్= ధనసంపాదన రూపమైన అర్థ పురుషార్థం; కామమును= కామపురుషార్థం; అదూష్యంబులు+ఐ= నిందలేనివై; సిద్ధిన్+పొందున్= ఫలితాన్ని పొందుతాయి.

తాత్పర్యం: ధర్మరాజా! పాలకుడు సమర్థుడై దండనీతిని పాటించకపోతే సన్న్యాసులు కూడా అక్రమమార్గాలను అనుసరిస్తారు. ప్రజలు ఒకరి ధనాన్ని, ధాన్యాన్ని, పశువులను, భూమిని, భార్యలను మరొకరు అపహరిస్తారు. వాటివలన కలిగే పాపం ఆ రాజుకు చెందుతుంది. దండనీతిని హింసగా భావించవద్దు. రుద్రుడు, విష్ణువు, ఇంద్రుడు, గుహుడు మొదలైనవారిని చూడుము - ఎట్లా అవినయ ప్రవృత్తులైనవారిని దండిస్తారో? ఆ మహాత్ములు ఆ విధంగా మిగిలిన దుర్మార్గులను దండించటం చేతనే ఆయా గౌరవాలను పొందుతున్నారు. దండనీతివలన అధర్మం అణగారుతుంది. ధర్మం వర్ధిల్లుతుంది. అర్థకామాలు నిందలపాలు కాకుండా ఫలవంతా లౌతాయి.

వ. దండంబున సకల జన శ్రీరక్షణంబు సేయంబూనిన భూనాథునక యేల యోగ్యహింసకుం దొలంగ నెట్టివారికి వశంబుగా; దవధరింపుము. 109

ప్రతిపదార్థం: దండంబునన్= దండనీతిచేత; సకల, జన, శ్రీ, రక్షణంబు= ప్రజలందరి సంపదను కాపాడటం; చేయన్+పూనిన= చేయటానికి పూనుకొన్న; భూనాథునకున్+అ= రాజునకు మాత్రమే; ఏల?= ఎందుకు? (రాజుకు మాత్రమే కాదని భావం); యోగ్యహింసకున్= ఉచితమైన హింసనుండి; తొలంగన్= ప్రక్కకు పోవటానికి; ఎట్టివారికిన్= ఎటువంటి వారికైనా సరే; వశంబు, కాదు= వీలుకాదు; అవధరింపుము= (దానికి సమాధానం నేను చెప్పుతాను) వినుము.

తాత్పర్యం: దండనీతి నాశ్రయించి ప్రజలందరి సంపదను రక్షించే రాజుకే కాదు ఉచితమైన హింసనుండి తప్పించుకొనటానికి ఎవరికైనా వీలుండదు. ఎందువలన అంటే నేను చెప్పుతాను వినుము.

ఉ. కాయలఁ బండ్ల నీళులను గల్గవె సూక్ష్మపు జంతువుల్? మునుల్
సేయరె హింస వాని? నుపజీవితఁ ద్రవ్వరె కందమూలముల్?
నీ యెడఁ జూడు! ప్రాణములు నిల్వఁగ నేర వహింస నేరికిన్;
వేయును నేల? భక్ష్యముగ వేధ విధింపఁడె ప్రాణిఁ బ్రాణికిన్? 110

ప్రతిపదార్థం: సూక్ష్మపు జంతువుల్= (నులి) చిన్న పురుగులు సూక్ష్మజీవులు; కాయలన్= చెట్ల కాయలలో; పండ్లన్= పండ్లలో; నీళులను= నీళ్ళలో; కల్గవె?= ఉండవా?; మునుల్= ఋషులు; వానిన్= ఆ సూక్ష్మజీవులను; హింస, చేయరె?= చంపరా?;

కందమూలముల్= కందమూలాలను, దుంపలను; ఉపజీవితన్= వాటిమీద వారు ఆధారపడి ఉండటంచేత; త్రవ్వరె?= వాటిని త్రవ్వివేయరా?; నీ+ఎడన్= నీ పక్షంలో; చూడు(ము)= గమనించుము; ఏరికిన్= ఎవ్వరికీ; అహింసన్= హింసచేయకుండా ఉండటంచేత; ప్రాణములు= ప్రాణాలు; నిల్వఁగన్ నేరవు= నిలువజాలవు; వేయును+ఏల?= పెక్కుమాట లెందుకు?; వేధ= బ్రహ్మదేవుడు; ప్రాణికిన్= ఒక ప్రాణికి; ప్రాణిన్= మరొక ప్రాణిని; భక్ష్యముగన్= తినదగిన ఆహారంగా; విధింపఁడె?= నియమించడా?

తాత్పర్యం: కాయలలో, పండ్లలో, నీళ్ళలో సూక్ష్మజీవులు పుట్టవా? వాటిని మునులు హింసించరా? వారు కందమూలాలను త్రవ్వి వాటిపై జీవించటం లేదా? ఇక నీ పక్షంలో చూడుము. అహింస పాటించినట్లయితే ఎవరికైనా ప్రాణాలు నిలుస్తాయా? ఇంక పలుమాట లెందుకు? బ్రహ్మదేవుడే ఒకప్రాణికి మరొక ప్రాణిని ఆహారంగా ఏర్పాటు చేయలేదా?

క. విను! పశుహింసా కృతయా । గ నిరూఢుని ధర్మపరునిఁగా వేదంబుల్
గొనియాడెడు సముచిత హిం । సన మరయ నహింస గాన జగతీనాథా! 111

ప్రతిపదార్థం: జగతీనాథా!= రాజా! ధర్మరాజా!; విను= వినుము; అరయన్= పరిశీలించగా; సముచిత, హింసనము= యోగ్యమైన హింస; అహింస= అహింసయే; కాన= కాబట్టి; పశు, హింసా, కృత, యాగ, నిరూఢునిన్= జంతువులను బలిఇస్తూ చేసే యజ్ఞాలను చేయటంలో నిమగ్నుడైనవాడిని; ధర్మపరునిన్+కాన్= ధర్మాన్ని ఆచరించే వాడిగా; వేదంబుల్= వేదాలు; కొనియాడెడున్= కీర్తిస్తాయి.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. పరిశీలించి చూస్తే యోగ్యమైన హింస అహింసయే ఔతుంది. అందువలననే, జంతుబలు లిచ్చే యాగాలను చేసే నిష్ఠాపరులను వేదాలు ధర్మపరులుగానే కొనియాడుతున్నాయి.

క. అరివీరుల ఘోరంబగు । దురమున వధియించుటేల దోసం బయ్యెన్?
ధరణీశ! పాండు పాలిత । ధరావలయ మాసపడుట దగదే నీకున్? 112

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= ప్రభువా! - ధర్మరాజా!; ఘోరంబు+అగు= దారుణమైన; దురమునన్= యుద్ధంలో; అరివీరులన్= శత్రువీరులను; వధియించుట= చంపటం; ఏల= ఎట్లా; దోసంబు+అయ్యెన్?= తప్పు అయింది?; పాండు, పాలిత, ధరా, వలయము= పాండురాజుచేత పాలించబడిన భూ మండలాన్ని; నీకున్= నీకు; ఆసపడుట= కోరటం; తగదు+ఏ?= తగదా? న్యాయం కాదా?

తాత్పర్యం: ధర్మరాజా! భయంకరమైన యుద్ధంలో శత్రువీరులను చంపటం దోషం ఎట్లా ఔతుంది? పాండురాజు పాలించిన భూమండలాన్ని నీవు ఆశించటం న్యాయం కాదా? (న్యాయమే అని భావం).

క. ఇల నీ కైకొన్న తెఱఁగు । దలఁపఁగ ధర్మంబొ కాదొ దైవం బెఱుఁగున్;
వలవని చింత యుడిగి ధృతి । దలకొని పాలింపు యజ్ఞదక్షుఁడ వగుచున్.' 113

ప్రతిపదార్థం: ఇలన్= ఈ నేలను, రాజ్యాన్ని; నీ+కైకొన్న= నీవు తీసికొన్న; తెఱఁగు= విధానం; తలఁపఁగన్= ఆలోచించగా; ధర్మంబు+ఒ? కాదు+ఒ?= న్యాయమో?, అన్యాయమో?; దైవంబు+ఎఱుఁగున్= దేవుడికి తెలుసు; వలవని= కూడని; చింత= విచారాన్ని; ఉడిగి= మాని; ధృతి= ధైర్యం; తలకొని= వహించి; యజ్ఞదక్షుఁడవు+అగుచున్= యాగాలు చేయటంలో సమర్థుడవౌతూ; పాలింపుము= రాజ్యాన్ని ఏలుము.

తాత్పర్యం: ఈ నేలను నీవు గ్రహించిన విధానం ధర్మమో, అధర్మమో ఆ దేవు డెరుగును. కూడని ఈ విచారాన్ని మానుకొమ్ము. యజ్ఞాలను నిర్వహిస్తూ సామర్థ్యంతో ధైర్యంతో రాజ్యాన్ని పాలించుము'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అని పలుకు పార్థు పలుకులు । విని పలుకక యున్న మనుజవిభుదెసఁ గోపిం
చిన తన మది వెడఁ గుడుపుచు । ననిలసుతుం డిట్టు లనియె నాతనితోడన్. 114

ప్రతిపదార్థం: అని పలుకు, పార్థు, పలుకులు= అని అంటున్న అర్జునుడి మాటలు; విని; పలుకక+ఉన్న= మాటాడకుండా ఉన్న; మనుజ విభు దెసన్= రాజు (ధర్మరాజు) మీద; కోపించిన= కోపపడిన; తనమదిన్= తన మనస్సును; వెడఁగు+ఉడుపుచున్= వికారాన్ని పోగొట్టుకుంటూ; అనిలసుతుండు= భీముడు; అతనితోడన్= ధర్మరాజుతో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అనునయంగా చెప్పిన అర్జునుడి మాటలు విని మాట్లాడకుండా ఉన్న ధర్మరాజు పట్ల కోపం తెచ్చుకొన్న తన మనోవికారాన్ని వదలి భీముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

ఉ. ' నీవు సమస్త ధర్మ పరినిశ్చయవేదివి; నీ చరిత్ర మే
మే వసుధేశ! వంక యని మెచ్చక చక్కఁగఁ జేయువార మే
నీ వచన ప్రపంచముల కింకఁ జొరం జొర నంచు నుండియున్
వావిరిఁ జెప్పఁగా వలసె వాలిన దుఃఖము దాల్మిఁ గ్రాఁచినన్. 115

ప్రతిపదార్థం: వసుధా+ఈశ= భూమిపతీ! ధర్మరాజా!; నీవు; సమస్త ధర్మ= అన్ని ధర్మాలను; పరినిశ్చయ= పూర్తిగా (చక్కగా, సరిగా) నిర్ధారించటంలో; వేదివి= పండితుడవు; ఏమే= మేమా; నీ చరిత్రము= నీ నడవడికను; వంక+అని= నెపం (కారణం) అని, లోపమని; మెచ్చక= మెచ్చుకొనక; చక్కఁగన్= ముక్కు సూటిగా; చేయువారము?= చేయగలిగినవారము (కామని భావం); ఏను= నేను; ఈ వచన ప్రపంచములకున్= ఈ వాక్యసమూహాలకు; ఇంకన్= ఇటుపైన; చొరన్+చొరన్= ప్రవేశింపనే ప్రవేశింపను; అంచున్+ఉండియున్= అంటూ ఉండి కూడా; వాలిన దుఃఖము= పైన కమ్మిన శోకం (బాధ); తాల్మిన్= ఓర్పును; క్రాఁచినన్= మరుగుపెట్టగా; వావిరిన్= క్రమంగా, నెమ్మదిగా; చెప్పఁగాన్+వలసెన్= చెప్పవలసి వచ్చింది. (మాటాడక తప్పలేదని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! నీవు అన్నిధర్మాలూ సంపూర్ణంగా నిర్ధారించటం తెలిసినవాడవు. మేమా, నీ చరిత్రకు వంకపెట్టి చక్కబెట్టేవాళ్ళం! నేను (భీముడు) నీ మాటల విస్తారంలో ఇంక జోక్యం కలగజేసికొనగూడదని ఉండి కూడా, అమితమైన దుఃఖం నా ఓర్పును నశింపజేయటంవలన చెప్పవలసి వచ్చింది.

వ. అవధరింపుము. 116

తాత్పర్యం: వినుము.

క. ఒడఁగూడిన సామ్రాజ్యము । నడలున దిగఁ ద్రావి చనిన నఖిల జనులు నిన్
గడుఁ బేదమనసువాఁ డని । చెడనాడుదు రనిన, మము నిసీయను టరుదే! 117

ప్రతిపదార్థం: ఒడఁగూడిన= సమకూరిన; సామ్రాజ్యము= విశాలమైన రాజ్యం; అడలునన్= భయంతో; దిగన్+త్రావి= దిగవిడిచి, వదలి; చనినన్= పోతే; నిఖిలజనులు= ప్రజలందరూ; నిన్= నిన్ను; కడున్+పేదమనసువాఁడు+అని= మిక్కిలి పిరికి మనసు కలవాడని; చెడన్+ఆడుదురు= తిట్టుతారు; అనినన్= అనగా; మమున్= మమ్ములను; ఇసీ!= ఛీ! అని; అనుట= అనటం; అరుదే?= అరుదా? ఆశ్చర్యమా?

తాత్పర్యం: లభ్యమైన సామ్రాజ్యాన్ని భయంతో వదలి వెళ్ళినట్లైతే, ప్రజలంతా నిన్ను పిరికివాడని చులకనగా మాట్లాడతారు. అటువంటప్పుడు మమ్ములను ఛీత్కరించటంలో ఆశ్చర్యం ఉండదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. కపటద్యూతమునం బరాభవము రాఁగా సూనృతం బూఁది భూ
మిప! మమ్ముం జులుకంగఁ జేసి నినుఁ బేర్మిం బాపికొంచున్ దురం
తపు దుఃఖంబుల కోర్చి పోయి; తది యుద్ధక్రీడ నప్పాపక
ర్మపు జాతిం దెగటారఁ జేయఁగఁ బ్రకీర్త్యం బయ్యె లోకంబులన్. 118

ప్రతిపదార్థం: భూమిప! రాజా! ధర్మరాజా!; కపట ద్యూతమునన్= వంచనతో కూడిన జూదంలో; పరాభవము= అవమానం; రాఁగాన్= కలుగగా; సూనృతంబు= పుణ్యాన్ని, సత్యాన్ని; ఊఁది= ఊతగా తీసికొని; మమ్మున్= మమ్ములను; చులుకంగన్+చేసి= తేలికపరిచి; నినున్= నిన్ను; పేర్మిన్= ప్రీతితో, గొప్పతనం నుండి; పాపికొంచున్= దూరం చేసికొంటూ; దురంతపు(ము)= భరించరాని; దుఃఖంబులకున్= కష్టాలకు; ఓర్చి= సహించి; పోయితి(వి)= వెళ్ళావు; అది= ఆ విధంగా కష్టాలకు ఓర్వటం; యుద్ధక్రీడన్= యుద్ధమనే ఆటలో; ఆ+పాపకర్మపు జాతిన్= ఆ పాపిష్టి వర్గాన్ని (కౌరవ సమూహాన్ని); తెగటారన్+చేయఁగన్= చంపటంచేత; లోకంబులన్= లోకాలలో; ప్రకీర్త్యంబు+అయ్యెన్= గొప్పగా కీర్తించదగినదైనది.

తాత్పర్యం: ధర్మరాజా! మాయాద్యూతంలో ఓడిపోవటం వలన అవమానాల పాలు కాగా, సత్యాన్ని అవలంబించి గ్రహించి, మమ్ములను చులకన చేసి, నీ ఘనతను వదలుకొని, భరించలేని కష్టాలను సహించావు, యుద్ధక్రీడలో దుష్కర్మలు చేసినవారిని చంపటంతో, నీ సత్యనిరతి అన్ని లోకాలలో కీర్తించ దగినదయింది.

వ. దుర్జయులగు విరోధుల నిర్జించి యుపార్జించిన పృథివీప్రముఖ పదార్థంబులు నిరర్థకంబులు సేసి వనంబునకుం జను చులుకఁదనం బేమిటం బాపికొనువాఁడ? వట్లుం గాక. 119

ప్రతిపదార్థం: దుర్జయులు+అగు= జయించ సాధ్యంకానివారైన; విరోధులన్= శత్రువులను; నిర్జించి= జయించి; ఉపార్జించిన= సంపాదించిన; పృథివీ, ప్రముఖ, పదార్థంబులు= భూమి (రాజ్యం) మొదలైన వస్తువులను; నిరర్థకంబులు చేసి= పనికిమాలిన వాటినిగా చేసి; వనంబునకున్= అరణ్యానికి; చను= వెళ్ళే; చులుకఁదనంబు= తేలికతనం; ఏమిటన్= దేనితో; పాపికొనువాఁడవు?= పోగొట్టుకొంటావు?; అట్లున్+కాక= అట్లా కాకుండా, అంతే కాకుండా.

తాత్పర్యం: అసాధ్యులైన శత్రువులను జయించి సంపాదించిన సామ్రాజ్యం మొదలైన పదార్థాల నన్నింటినీ పనికిమాలిన వాటినిగా చేసి అరణ్యానికి (వెళ్ళటం అని భావించే) చులుకనతనాన్ని ఏ విధంగా పోగొట్టుకొంటావు? అంతేకాక. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఆ సభలోఁ బడినట్టి బన్నంబును, । నడవులఁ దిరిగెడు నవుడు దుష్ట
దైత్యులచేత సైంధవునిచే నొఱపులఁ । బడ్డ విషాదంబుఁ, బరమ దైన్య
మున కోర్చి కొలిచి మాత్స్యుని పాల నున్న । దుఃఖంబును, ద్రోహులఁ గనుపుగొట్టి
వెలువరించెద నని తలఁచి కృష్ణుని నిశ్చ । యంబూఁది ధర్మంబ యగుటఁ దెలిసి

తే. రణ మొనర్చితి; నిను ధార్తరాష్ట్రు లొండె । నీవు వారల నొండెను జావఁ జూడ
వలయు టప్పు డెఱుంగవే వసుమతీశ! । యిప్పు డడలుట నింద్యంబ; యింత నిజము. 120

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= భూమికి ప్రభువైనవాడా! ధర్మరాజా!; ఆ+సభలోన్= అలనాటి (మాయాద్యూత) సభలో; పడినట్టి= పొందిన; బన్నంబును= అవమానమున్నూ; అడవులన్= అరణ్యాలలో; తిరిగెడు+అపుడు= తిరిగేటప్పుడు; దుష్టదైత్యుల చేతన్= దుర్మార్గులైన రాక్షసుల వలన; సైంధవునిచేన్= సైంధవుడివలన; ఒఱపులన్+పడ్డ= ఇబ్బందులు పడిన; విషాదంబున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుఃఖాన్నీ; పరమ, దైన్యమునకున్+ఓర్చి= మిక్కిలి తక్కువతనానికి సహించి; కొలిచి= సేవించి; మాత్స్యుని పాలన్+ఉన్న= మత్స్యదేశానికి రాజైన విరాటుడి వద్ద (కొలువులో) ఉన్నప్పటి; దుఃఖంబును= బాధనూ; ద్రోహులన్= మనకు కీడుచేసిన (కౌరవులను) వారిని; కనుపు+కొట్టి= ఖండించి, సంహరించి; వెలువరించెదన్+అని= తొలగించి వేస్తానని; తలఁచి= అనుకొని; కృష్ణుని, నిశ్చయంబు+ఊఁది= శ్రీకృష్ణుడి నిర్ణయాన్ని ఆధారంగా చేసికొని; ధర్మంబు+అ= న్యాయమే; అగుటన్= అయి ఉండటాన్ని; తెలిసి= గ్రహించి; రణము= యుద్ధాన్ని; ఒనర్చితి(వి)= చేశావు; నినున్= నిన్ను (ధర్మరాజును); ధార్తరాష్ట్రులు+ఒండెన్= కౌరవులు కాని; నీవు= (ధర్మరాజు); వారలన్+ఒండెన్= కౌరవులను గాని; చావన్+చూడన్వలయుట= చావగా తప్పక చూడాలని అనుకొనటం; అప్పుడు= ఆ యుద్ధం మొదలు పెట్టేటప్పుడు; ఎఱుంగవు+ఏ?= ఎరుగవా? (తెలియదా?); ఇప్పుడు= ఈ సమయంలో; (ఇంత జరిగిన తరువాత); అడలుట= దుఃఖించటం; నింద్యంబు+అ= నిందించదగిందే; ఇంత= ఇది మాత్రం; నిజము= సత్యం.

తాత్పర్యం: ఆనాటి కౌరవసభలో పడిన కష్టం, అరణ్యాలలో తిరిగే సమయంలో, దుర్మార్గులైన రాక్షసులు, సైంధవుడు పెట్టిన బాధలవలన కలిగిన దుఃఖం, మిక్కిలి హీనత్వాన్ని ఓర్చుకొని మత్స్యదేశపు రాజైన విరటుడి కొలువులో ఉన్నప్పటి శోకం, తమకు కీడుచేసిన కౌరవులను సంహరించి పోగొట్టాలని అనుకొని, కృష్ణుడి నిర్ణయాన్ని అవలంబించి, అది ధర్మమే కావటం తెలిసి యుద్ధం చేశావు. నిన్ను కౌరవులో, నీవు కౌరవులనో చంపటం తప్పదన్న సంగతి నీకప్పుడు తెలియదా? ఇప్పుడు దుఃఖించటం నింద్యం. ఇది నిజం.

క. పను లేము సేయఁగా దు । ర్జనులం జెఱుచుచును, సాధుజనుల మనుచుచున్
జననాథ! మహాయజ్ఞము । లొనర్చుచును, వెలయు కురు కులోత్తంసమవై'. 121

ప్రతిపదార్థం: జననాథ!= రాజా! ధర్మరాజా!; ఏము= మేము (భీమాదులు); పనులు= చేయవలసిన పనులు; చేయఁగాన్= చేస్తూ ఉండగా; దుర్జనులన్= దుర్మార్గులను; చెఱుచుచును= నశింపచేస్తూ; సాధుజనులను= మంచివారిని; మనుచుచున్= రక్షిస్తూ; మహాయజ్ఞములు+ఒనర్చుచును= గొప్ప గొప్ప యజ్ఞాలుచేస్తూ; కురుకుల ఉత్తంసమవు+ఐ= కురువంశంలో శ్రేష్ఠుడవై; వెలయు(ము)= ప్రకాశించుము.

తాత్పర్యం: ధర్మరాజా! మేమందరమూ నీవు చెప్పిన పనులను చేస్తూ ఉండగా, నీవు దుర్మార్గులను చెండాడుతూ, మంచివారిని రక్షిస్తూ గొప్ప గొప్ప యాగాలను చేస్తూ కురువంశంలో శ్రేష్ఠుడవై ప్రకాశించుము'.

వ. అనిన విని ధర్మతనయుం డిట్లనియె. 122

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు ఇట్లా అన్నాడు:

చ. ' మదమును రాగమున్ భయము మానము లోనగు కిల్బిషంబులన్
హృదయముఁ జొన్పి భూజనుల నేలుట మేలని పల్కె; దార్తికా
స్పదమని రార్యు లామిషముపై తగు; లిమ్మహియెల్ల నేలినం
దుది నరకం బొకండ; నృపతుల్ సుఖులే? యుపశాంతి యొప్పదే! 123

ప్రతిపదార్థం: మదమును= గర్వమూ; రాగమున్= అనురాగమూ, అభిలాష; భయము= భయమూ, వెరపూ; మానము= అభిమానం, అహంకారం; లోన్+అగు= మొదలైన; కిల్బిషంబులన్= దోషాలలో; హృదయమున్+చొన్పి= మనసును ప్రవేశపెట్టి; భూజనులన్= ప్రజలను; ఏలుట= పాలించటం; మేలు+అని= మంచిదని; పల్కెదు= (నీవు) పలుకుతావు; (కాని) ఆర్యులు= పెద్దలు;

ఆమిషముపైన్= మాంసంమీది; తగులు= ఆసక్తి; ఆర్తికిన్= దుఃఖానికి; ఆస్పదము+అనిరి= చోటైనదని అన్నారు; ఈ+మహి+ఎల్లన్= ఈ భూమినంతా; ఏలినన్= పాలించినప్పటికీ; తుదిన్= చివరకు; నరకంబు= నరకం(పొందటం); ఒకండు+అ= ఒక్కటే (మిగిలేది); నృపతుల్= రాజులు; సుఖులే?= సుఖంగా ఉండగలరా? (కాదని, దుఃఖితులని భావం); ఉపశాంతి= శమనం (అంతరింద్రియ నిగ్రహం); ఒప్పదే?= తగదా? (తగునని భావం).

తాత్పర్యం: గర్వం, అనురాగం, భయం, అహంకారం అనే దోషాలను మనస్సులో నింపుకొని ప్రజలను పాలించటం మేలని నీవు పలుకుతావు. పెద్దలు రాజ్యపాలనం దుఃఖానికి చోటైనదని అంటారు. రాజ్యపాలనమంటే చేప ఎరను ఆశించి తగులుకొన్నట్లే అనిపిస్తుంది. ఒకవేళ, ఇవన్నీ పరిగణించకుండా, భూమినంతా పాలించినా చివరకు నరక మొక్కటే మిగిలేది. నిజానికి రాజులకు సుఖమెక్కడ ఉన్నది? వారికి శాంతి తగదా?

తే. కామభోగముల్ మేలనం గాదు; వాని । విడిచి చూడుము; పొందెదు విపుల సుఖము;
కాయలాకులు నీళ్ళును గాలి యనుభ । వించియున్న మునీంద్రులు వెఱ్ఱివారె! 124

ప్రతిపదార్థం: కామభోగముల్= కోర్కెలూ, భోగాలూ అనుభవించటాలు; మేలు+అనన్+కాదు= మంచివి అనలేము; వానిన్= ఆ కామభోగాలను; విడిచి= వదలిపెట్టి; చూడుము= గమనించుము; విపుల సుఖము= విస్తారమైన సంతోషాన్ని (అనంతమైన ఆనందాన్ని); పొందెదు(వు)= పొందుతావు; కాయలు+ఆకులు= పండ్లు, ఆకుకూరలు; నీళ్ళును= నీటినీ; గాలి= గాలీ; అనుభవించి+ఉన్న= తిని జీవించి ఉన్న; ముని+ఇంద్రులు= ఋషిశ్రేష్ఠులు; వెఱ్ఱివారె?= పిచ్చివారా? (తెలివి తక్కువవారా?) (కారని భావం).

తాత్పర్యం: కోరికలను తీర్చికొనటం మంచిది అనటానికి వీలులేదు. కామభోగాలను విడిచిపెడితే పొందే అనంతమైన ఆనందాన్ని నీవు గమనించుము. కాయలు, ఆకులు, నీళ్ళు, గాలి మాత్రమే తింటూ కలకాలం ఉన్న మునిశ్రేష్ఠులు పిచ్చివారా? (కాదని భావం).

క. దుర్మతు లామిషగత మగు । కర్మము పాటించి బంధకలితు లగుదు; ర
య్యూర్మి గడచి సువిచారులు । నిర్మమతను ముక్తిపడయ నేర్తురు వత్సా! 125

ప్రతిపదార్థం: వత్సా!= చిన్నవాడా! భీమసేనా!; దుర్మతులు= చెడు తలపులు కలవారు; అమిషగతము+అగు= ఎరలో ఉన్న; కర్మము= చేసిన కర్మను; పాటించి= అనుసరించి; బంధ, కలితులు+అగుదురు= సంసార బంధాలతో కూడికొన్నవారు ఔతారు; సువిచారులు= జ్ఞానులు; ఆ+ఊర్మి= కెరటం, కడచి= దాటి; నిర్మమతను= మమకారాలు లేని చిత్త వృత్తితో; ముక్తిన్= మోక్షాన్ని; పడయన్ నేర్తురు= పొందగలుగుతారు.

తాత్పర్యం: నాయనా! భీమసేనా! చెడ్డవారు శరీర సంబంధమైన తాము చేసిన కర్మల ననుసరించి బంధాలలో ఇరుక్కొన్నవా రవుతారు. ఎరుక గలిగినవారు ఆ వికారాలకు లోనుకాక వాటిపై మమకారం లేని వారై ముక్తసంగు లౌతారు.

విశేషం: ఊర్మి= బంధకారకమైన కోరిక. ఇది ఆరు విధాలు: 1. క్షుత్, 2. తృష్ణ, 3. శోకం, 4. మోహం, 5. జర, 6. మరణం.

వ. జనకుని వచనంబులు వినమే! వాని నీకుం జెప్పెద నాకర్ణింపుము. 126

ప్రతిపదార్థం: జనకుని= జనకమహారాజు యొక్క; వచనంబులు= మాటలు; వినము+ఏ?= మనం వినలేదా?; వానిన్= ఆ మాటలు; నీకున్= నీకు; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: జనకుడు (అనే రాజర్షి) చెప్పిన మాటలు మనం వినమా? (ప్రసిద్ధే కదా!) వాటిని నీకు చెప్పుతాను వినుము.

ఆ. ' ఒకటి దెసను దృష్ణ యొలయదు గావున । నేమి యర్థములును లేమి లేదు?
కాలఁ జొచ్చె మిథిల గాలదు నాకు నం । దొక్కఁ డైన; నింత నిక్కువంబు.' 127

ప్రతిపదార్థం: ఒకటి దెసనున్= ఒకదానివైపు కూడా; తృష్ణ= కోరిక, ఆశ; ఒలయదు= ప్రసరించదు, పొందదు; కావునన్= కాబట్టి; ఏమి= ఎటువంటి; అర్థములును= సంపదలు కూడా; లేమి= లేకపోవటం అనేది; లేదు= లేదు; మిథిల= మిథిలానగరం; కాలన్+చొచ్చెన్= తగలబడసాగింది; (అయినా); నాకున్= నాకు, నా దృష్టిలో; అందున్= ఆ మిథిలలో; ఒక్కఁడు+ఐనన్= ఒక్కటి కూడా; కాలదు= తగలబడదు; ఇంత= ఇంతవరకు మాత్రం; నిక్కువంబు= నిజం.

తాత్పర్యం: 'దేనిమీదా కోరిక కలగదు కాబట్టి ఎటువంటి సంపదా, ప్రయోజనమూ లేకపోవట మనేది లేదు. అంటే అన్నీ ఉన్నట్లే ఉంటుంది. మిథిలానగరం తగలబడుతున్నా నా దృష్టిలో మాత్రం అందులో ఏ ఒక్క వస్తువూ తగలబడదు. ఇది నిజం'.

క. అని పలుకు జనకుఁ దెగడిరె । జను? లుల్లము శాంతిఁ బొంది సంసారం బొ
ల్లనివాఁడు నింద కర్హుం । డని పలుకుట నీక యొప్పు నధికవిచారా! 128

ప్రతిపదార్థం: అని, పలుకు= అని చెప్పే; జనకున్= జనక మహారాజును; జనులు= ప్రజలు; తెగడిరె?= నిందించారా?; అధిక విచారా!= మిక్కిలి జిజ్ఞాస కలవాడా!(ఆలోచనాపరుడా!); ఉల్లము= మనస్సు; శాంతిన్+పొంది= ప్రశాంతతనుపొంది; సంసారంబు+ఒల్లనివాఁడు= సంసారాన్ని కోరనివాడు; నిందకున్= అపకీర్తికి, పాపానికి; అర్హుండు+అని పలుకుట= యోగ్యుడని చెప్పటం; నీకున్+అ= నీకే; ఒప్పున్= తగి ఉన్నది.

తాత్పర్యం: అని చెప్పిన జనకమహారాజును ప్రజలు కాదన్నారా? నిందించారా? కాబట్టి ఓ ఆలోచనాశీలీ! మనస్సు శాంతిని పొంది సంసారబంధాన్ని త్రెంచుకొన్నవాడు నిందపొందటానికి యోగ్యుడని పలకటం నీకే తగింది.

తే. వినుము! ప్రజ్ఞాధిరూఢుఁడై వనట । దక్కి సంసృతిక్లేశపరుల భూస్థలిఁ జరించు
వారి నచలంబుపై నున్నవాఁడు । సూచునట్లు చూచుట సూవె నే ర్పమలహృదయ!' 129

ప్రతిపదార్థం: అమలహృదయ!= నిర్మలమైన మనస్సు కలవాడా! భీమసేనా!; వినుము; ప్రజ్ఞా+అధిరూఢుఁడు+ఐ= జ్ఞాని అయి; వనట+తక్కి= దుఃఖం వదలి; సంసృతి క్లేశపరులన్= సంసార దుఃఖాలలో ఆసక్తి కలవారిని; భూస్థలిన్= నేలమీద; చరించు వారిన్= తిరిగే వారిని; అచలంబుపైన్= కొండమీద; ఉన్నవాఁడు; చూచు+అట్లు+అ= చూచే విధంగానే; చూచుట= చూడటం; నేర్పు= తెలివి; చూవె!= సుమా!

తాత్పర్యం: మంచి మనసుగల భీమసేనా! వినుము. దుఃఖంనుండి దూరమై ప్రజ్ఞావంతుడైన జ్ఞాని సంసార దుఃఖాలలో ఆసక్తికలవారిని కొండమీద ఉన్నవాడు నేలమీద తిరుగుతున్నవారిని చూచేటట్లు చూడటమే నేర్పు సుమా!'

జనకున కతని సతితో నైన సంవాదం బర్జునుఁడు ధర్మజునికిఁ జెప్పుట (సం. 12-18-1)

వ. అని పలికి మఱి పలుకకున్న యప్పుడమి తేనికిం గవ్వడి యిట్లనియె. 130

ప్రతిపదార్థం: అని పలికి; మఱి= మరల; పలుకక+ఉన్న= మాట్లాడకుండా ఉన్న; ఆ+పుడమిఱేనికిన్= ఆ రాజుకు, ధర్మరాజుకు; కవ్వడి= అర్జునుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని పలికి మరిం కేమీ మాట్లాడకుండా ధర్మరాజు మిన్నకుండగా అర్జునుడు ఆయనతో ఇట్లా అన్నాడు.

క. ' జననాథ! నీవు సెప్పిన । జనక నృపాలునకు నతివిశదమానస యా
తని భార్యకు నీ క్రియ న । య్యెను సంవాదంబు; దాని నేర్పడ వినుమా! 131

ప్రతిపదార్థం: జననాథ!= రాజా! ధర్మరాజా!; నీవు+చెప్పిన= నీవు పేర్కొన్న; జనక నృపాలునకున్= జనక మహారాజుకూ; అతి, విశద, మానస= మిక్కిలి నిర్మలమైన మనస్సు కలిగిన; అతని, భార్యకున్= జనకుడి భార్యకూ; సంవాదంబు= సంభాషణం; ఈ క్రియన్= ఈ విధంగా; అయ్యెన్= అయింది; దానిన్= ఆ సంవాదాన్ని; ఏర్పడన్= స్పష్టమయ్యేటట్లు; వినుమా!= వినుము!

తాత్పర్యం: 'ధర్మరాజా! నీవు పేర్కొన్న ఆ జనకమహారాజుకు, నిర్మలమైన మనస్సు గల అతడి భార్యకూ నడుమ ఈ క్రింది విధంగా సంవాదం జరిగింది. దానిని తేటపడేటట్లు చెప్తుతాను వినుము.

వ. అమ్మహీపతి పూజ్యరాజ్యం బొల్లక విడిచి భిక్షావృత్తికి వెడలఁ జూచినం దదీయ భార్య యతని కిట్లనియె. 132

ప్రతిపదార్థం: ఆ+మహీపతి= ఆ రాజు - జనక మహారాజు; పూజ్య, రాజ్యంబు= గౌరవించదగిన రాజ్యాన్ని; ఒల్లక= అంగీకరించక; విడిచి= వదలిపెట్టి; భిక్షావృత్తికిన్= బిచ్చమెత్తుకొనటానికి; వెడలన్+చూచినన్= పోబోగా; తదీయ= అతడి; భార్య= ఇల్లాలు; అతనికిన్= అతడితో (జనకుడితో); ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ఆ రాజు గౌరవించదగిన రాజ్యాన్ని గ్రహించకుండా, వదలి బిచ్చమెత్తుకొని జీవించటానికి పూనుకొనగా, ఆతడి భార్య అతడితో ఇట్లా అన్నది.

సీ. ' పుడమి యేలుట డిగ్గవిడిచి భిక్షార్థివై । పోయిన నతిథి సంపూజనంబు,
దేవ తర్పణ పితృదేవతర్పణములుఁ । గలుగునే? కాషాయములు ధరించి
ముండుఁడై నతఁ డన్నమునకు గృహంబుల । కరుగక యున్నె? గృహస్థుఁ డెల్ల
వారికి నన్నంబు గారుణ్యమునఁ బెట్టు । నన్నదానము సేఁత యధికధర్మ

ఆ. మనుట వినమె? పెట్టు నతనిఁ జేయొడ్డెడు, । వానిఁ దలఁప నందు వరుఁడు పెట్టు
వాఁడ యగుట నిక్కువం; బింత సూడక । యిట్లు దీనవృత్తి కేఁగఁ దలఁతె? 133

ప్రతిపదార్థం: పుడమి+ఏలుట= రాజ్యాన్ని పాలించటం; డిగ్గ విడిచి= వదలివేసి; భిక్షా+అర్థివి+ఐ= బిచ్చం అడుగుకొనే వాడివై; పోయినన్= పోతే; అతిథి, సంపూజనంబు= ఇంటికి వచ్చిన అతిథులను గౌరవించటం; దేవతర్పణ, పితృదేవతర్పణములున్= దేవతలకిచ్చే మంత్ర జలాలూ, పితృదేవతలకిచ్చే తర్పణాలూ; కలుగును+ఏ?= ఏర్పడతాయా?; అతఁడు= రాజ్యమేలవలసినవాడు; ముండుఁడు+ఐ= తలగొరిగించుకొన్నవాడై; కాషాయములు= కావిబట్టలు (కాషాయపు రంగు దుస్తులు); ధరించి= కట్టుకొని; అన్నమునకున్= భిక్షకొరకు; గృహంబులకున్= గృహస్థాశ్రమ వాసులు నివసించే ఇండ్లకు; అరుగక+ఉన్నె?= వెళ్ళకుండా ఉంటాడా?; గృహస్థుఁడు= గృహస్థాశ్రమంలో ఉన్న కుటుంబి (పెళ్ళాం బిడ్డలతో కలిసి ఉండేవాడు); ఎల్లవారికిన్= అందరికీ; కారుణ్యంబునన్= దయతో; అన్నంబు= అన్నాన్ని (భిక్షను); పెట్టున్= పెట్టుతాడు; అన్నదానము+చేఁత= అన్నాన్ని దానం చేయటం (అడిగినవారికి పెట్టటం); అధిక ధర్మము= గొప్పధర్మం; అనుటన్= అనటం; వినము+ఎ?= వినమా?; పెట్టు+అతనిన్= అన్నం పెట్టే వాడినీ;

చేయి+ఒడ్డెడు వానిన్= చేయి చాచేవాడినీ; తలఁపన్= భావించగా; అందున్= వారిద్దరిలో; పెట్టువాఁడు= అన్నం పెట్టేవాడు; వరుఁడు= శ్రేష్ఠుడు; అగుట= కావటం; నిక్కువంబు= నిజం; ఇంత, చూడక= ఈ మాత్రం గమనించకుండానే; ఇట్లు= ఈ రీతిగా; దీన వృత్తికిన్= జాలిగొలిపే పద్ధతికి; ఏఁగన్+తలఁతె?= వెళ్ళాలని భావిస్తావా?

తాత్పర్యం: 'రాజ్యపరిపాలనను జారవిడిచి బిచ్చమెత్తుకొనే వృత్తిని స్వీకరిస్తే నీ ఇంటిపట్టున అతిథిపూజ లేమి కావాలి? దేవతలకూ, పితృదేవతలకూ నీ విచ్చే మంత్రజలాలూ, తర్పణాలూ ఎవ రివ్వాలి? గృహస్థుడు తలగొరిగించుకొని, కాషాయాంబరాలు కట్టుకొనికూడా భిక్షకొరకు ఇంటింటికి తిరగకుండా ఉండగలడా? గృహస్థాశ్రమంలో ఉన్న సంసారి దయతో అందరికీ అన్నం పెట్టుతాడు. ధర్మాలన్నింటిలో అన్నదానమే ఉత్తమ ధర్మం - అని లోకంలో ప్రసిద్ధంగా వినమా? అన్నం పెట్టేవాడిని, చేయి సాచేవాడినీ సరితూస్తే వారిలో అన్నం పెట్టేవాడే శ్రేష్ఠు డనటం నిజం. ఈ మాత్రం గమనించకుండా ఈ విధంగా దీనుడవై పోవాలని భావిస్తావా?

క. త్రైవిద్యులగు మహాత్ములు । నీ వలనన బ్రదుకఁ దలఁప నిష్క్రియత మెయిన్
నీ విందఱఁ జెఱిచెద; విది । దేవా! ధర్మంబు గాదు; దీని నుడుగవే! 134

ప్రతిపదార్థం: త్రైవిద్యులు+అగు= మూడు వేదాలు తెలిసినవారైన; మహాత్ములు= గొప్పవారు; నీ వలనన్+అ= నీ వలననే; బ్రదుకన్+తలఁపన్= జీవించాలని భావించగా; నిష్క్రియత మెయిన్= క్రియారాహిత్యంతో; నీవు; ఇందఱన్= ఇంతమందిని; చెఱిచెదవు= బ్రతుకులు పాడుచేస్తావు - నిరాశా పరులను చేస్తావు; దేవా!; ప్రభూ! జనక మహారాజా!; ఇది= ఈ పని; ధర్మంబు+కాదు= న్యాయం కాదు; దీనిన్= దీనిని; ఉడుగవే= వదలి పెట్టుము.

తాత్పర్యం: వేదత్రయ విదులైన మహాత్ములు నీవలననే బ్రతుకులు సాగించాలని ఆశపడుతున్నారు. నీవు క్రియారహితుడ వైతే ఇంతమంది నిరాశకు గురికాక తప్పదు. వారి బ్రతుకులు పాడుచేయకుము. ఇది ధర్మం కాదు. కాబట్టి మానుము.

తే. అధిప! మీ తల్లియుల్లంబు నడలు వెల్లి । ముంచి, సతి శోకసంతాపమూర్తిఁ జేసి
వంశవిహిత ధర్మంబుల వదలి వెడలి । పోయి యేగతిఁ బోయెదవో యెఱుంగ. 135

ప్రతిపదార్థం: అధిప!= రాజా! జనకమహారాజా!; మీ తల్లి ఉల్లంబు= మీ కన్నతల్లి మనసు; అడలు వెల్లిన్= దుఃఖప్రవాహంలో; ముంచి= ముంచి; సతిన్= భార్యను; శోక సంతాప మూర్తిన్+చేసి= దుఃఖంచేత వేదన పొందే ఆకారం కలదానిగా చేసి; వంశ విహిత ధర్మంబులన్= వంశ మర్యాదకు యోగ్యమైన ధర్మాలను; వదలి= మాని; వెడలి పోయి= దూరంగా వెళ్ళి; ఏ గతిన్= ఏ విధంగా; పోయెదవో?= ముందుకు పోగలవో? (జీవితాన్ని ఎట్లా కొనసాగిస్తావో?); ఎఱుంగన్= తెలియజాలను (నాకు తెలియటం లేదు).

తాత్పర్యం: రాజా! నీ కన్నతల్లి మనసును దుఃఖసముద్రంలో ముంచి, నీ భార్యను శోకంతో వేదనపొందే ఆర్తమూర్తిగా చేసి, వంశమర్యాద ననుసరించి చేసే ధర్మకర్మ లన్నింటినీ వదలి, దూరంగా తొలగిపోయి ఏ విధంగా నీ జీవితాన్ని సాగిస్తావో నాకు తెలియకుండా ఉన్నది.

క. చలిపందిరి చందంబున । ఫలభరితంబైన తరువుభంగిఁ బ్రజల డ
ప్పులు దీర్ప నమరియుండెడు । నలఘుచరిత్రునకు లఘుత యగునే కోరన్. 136

ప్రతిపదార్థం: చలిపందిరి= ఎండా కాలంలో దప్పిక తీర్చటానికి ఏర్పరచిన తాటాకు పందిరి (చలివేంద్రం) పానీయశాల; చందంబునన్= వలె; ఫల భరితంబు+ఐన= పండ్లతో నిండినదైన; తరువు భంగిన్= చెట్టువలె; ప్రజల= జనులయొక్క; దప్పులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దప్పికలు; తీర్పన్= తీర్చటానికి; అమరి+ఉండెడు= ఏర్పాటై ఉన్న; అలఘు చరిత్రునకున్= గొప్పదైన శీలం కలవాడికి; లఘుత= అల్పత్వాన్ని; కోరన్= కోరటం; అగునే?= తగునా? (తగదని భావం).

తాత్పర్యం: ప్రజల దప్పిని, ఆకలిని తీర్చటానికి అనువుగా చలిపందిరి విధంగా, పండ్లతో నిండుగా ఉన్న చెట్టువలె అమరి ఉండిన (ఇది గృహస్థాశ్రమ ధర్మం) ఉత్తమ శీలవంతుడు అల్పత్వాన్ని కోరటం తగునా?

విశేషం: అలం: ఉపమ. చలిపందిరి దప్పి తీరుస్తుంది. ఫలవృక్షం ఆకలి తీరుస్తుంది. గృహస్థుడు రెండూ తీరుస్తాడు.

వ. ఇది ధర్మవిరోధంబు, దీన మోక్షంబు గలుగుననుట నాకుం జూడ సందియం' బని చెప్పెఁ; ననవుడు నయ్యజాతశత్రుండు పురుహూత పుత్రున కిట్లనియె. 137

ప్రతిపదార్థం: ఇది= రాజ్యపాలనను త్యజించటం; ధర్మవిరోధంబు= ధర్మానికి వ్యతిరేకం; దీనన్= దీనివలన; మోక్షంబు= మోక్షం; కలుగును+అనుట= కలుగుతుందనటం; నాకున్+చూడన్= నా దృష్టిలో; సందియంబు= అనుమానం; అని, చెప్పెను= అని అన్నది; అనవుడున్= అనగా; ఆ+అజాతశత్రుండు= ఆ ధర్మరాజు; పురుహూత పుత్రునకున్= అర్జునుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: రాజ్యత్యాగం ధర్మవిరోధం. దీనివలన మోక్షం కలుగుతుందని అనటం నాకు చూడగా అనుమానంగా ఉన్నది' అని జనకుడి భార్య అన్నదని అర్జునుడు తెలిపాడు. ఆ మాటలు విని ధర్మరాజు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

మ. 'శ్రుతి వాక్యంబులు కర్మనిష్ఠ వినుతించున్; నిష్క్రియత్వంబు స
ద్గతిఁ గావించుట యూఁది చెప్పు; నిటు చిత్త ప్రక్రియల్ రెండు చో
దితముల్; వానిని వింటిమన్న కలుచన్ దీపించునే తత్త్వ సం
గత బోధంబు? సుకర్మతం గలుగు నాకం బాత్తవీరవ్రతా! 138

ప్రతిపదార్థం: ఆత్తవీరవ్రతా!= పొందబడిన (సహజమైన) వీరవ్రతం కలవాడా! అర్జునా!; శ్రుతి వాక్యంబులు= వేదవాక్యాలు; కర్మనిష్ఠన్= కర్మాచరణంలోని దీక్షను; వినుతించున్= కీర్తిస్తాయి; నిష్క్రియత్వంబు= కర్మలు చేయకుండా ఉండటం; సద్గతిన్= ఉత్తమలోక స్థితిని; కావించుట= కలిగించటం; ఊఁది= గట్టిగా నొక్కి; చెప్పున్= చెప్తుతాయి; ఇటు= ఈ విధంగా; చిత్తప్రక్రియల్= మానసిక ప్రవృత్తులు; రెండు= రెండు రకాలుగా; చోదితముల్= ప్రేరేపించబడతాయి; వానినిన్= వాటిని; వింటిమి+అన్న కలుచన్= విన్నామనే కలతవలన; తత్త్వసంగత బోధంబు= జ్ఞానంతో కూడికొన్న తెలివి; దీపించునే?= ప్రకాశిస్తుందా?; సుకర్మతన్= సత్కర్మలు చేయటంవలన; నాకంబు= స్వర్గం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: 'అర్జునా! వేదవాక్యాలు కర్మమార్గంలో నిష్ఠామయమైన జీవితం గడిపే విధానాన్ని బాగా కీర్తించాయి. అంతేకాదు. నిష్క్రియత్వం సద్గతిని కలిగిస్తుందని కూడా నొక్కి వక్కాణించాయి. ఈ విధంగా రెండు రకాలుగా చిత్తవృత్తులను వేదాలు ప్రేరేపిస్తున్నాయి. వీటి నన్నింటిని విని మనసు కలతపెట్టుకొంటే జ్ఞానవివేకం మన బుద్ధిలో వెలుగొందుతుందా? నిజానికి మంచి కర్మలు చేస్తే స్వర్గం లభిస్తుంది.

తే. తత్త్వబోధంబు గలుగు నతండు నన్నుఁ। దెగడనేరఁడు; నీవు భ్రాతృత్వ సౌహృ
దమునఁ గర్మంబు విడుచు టధర్మ వనిన। పలుకు ప్రియమ జగన్న్యాయ పథము గనుట. 139

ప్రతిపదార్థం: తత్త్వబోధంబు కలుగు నతండు= జ్ఞానబోధ కలవాడు; నన్నున్= నన్ను - ధర్మరాజును; తెగడన్ నేరఁడు= తిట్టలేడు, నిందించలేడు; నీవు= నీవు - అర్జునుడు; భ్రాతృత్వ సౌహృదమునన్= సోదర ప్రేమతో; కర్మంబు విడుచుట= కర్మ పరిత్యాగం;

అధర్మువు+అనిన= అధర్మం అన్న; పలుకు= మాట; జగత్+న్యాయ పథము= లోకన్యాయ మార్గం; కనుటన్= పొందటంచేత; ప్రియము+అ= సంతోషకరమే.

తాత్పర్యం: జ్ఞానబోధ కలవాడు నన్ను తప్పుపట్టడు. నీవు సోదరప్రేమతో కర్మపరిత్యాగం అధర్మం అన్నమాట లోకన్యాయాన్ని అనుసరించి ఉండటం చేత సంతోషకరమే.

సీ. **వడముడియును నీవు వాయు వాసవుల। శక్తులు ధరియించిన దుర్జయులరు;**
హరి కరుణాతిశయమునఁ దత్తేజంబు। మీయందుఁ దగ సంక్రమించి యుండు;
మీరు సంగరశాస్త్ర సారపారగులరు। గాక తత్త్వజ్ఞాన ఘనమతులరె?
యనఁటికంబమునట్ల యనిరి నిస్సారత। సంసార మనఁగ నిస్సం ప్రబుద్ధు

తే. **లది ప్రసిద్ధము; విను తృష్ణ యడఁచి కర్మ। వృత్తి విడిచి నిరాలంబచిత్తుఁ డైన**
యాతఁడో సుఖి దోషదుఃఖాకరంబు। లగు ధనంబులు గోరెడు నతఁడొ? చెపుమ! **140**

ప్రతిపదార్థం: వడముడియును= భీముడూ; నీవున్= నీవూ (అర్జునుడు); వాయు వాసవుల= వాయుదేవుడియొక్క, ఇంద్రుడియొక్క; శక్తులు= బలాలు, మహిమలు; ధరియించిన= వహించిన; దుర్జయులరు= జయించటానికి శక్యం కానివారు; హరి= శ్రీకృష్ణుడియొక్క కరుణ+అతిశయమునన్= దయా విశేషంచేత; తద్+తేజంబు= ఆతడి శక్తి ప్రకాశం; మీ+అందున్= మీలో; తగన్= ఒప్పునట్లుగా; సంక్రమించి+ఉండున్= కలిగి ఉంటుంది; మీరు= (భీమార్జునులు); సంగరశాస్త్ర సార పారగులరు= యుద్ధశాస్త్రంలోని తాత్పర్యంలో తీరం ముట్టిన వారు (పండితులు); కాక= ఔతారు కాని; తత్త్వజ్ఞాన ఘనమతులరె?= వేదాంత జ్ఞానంలో గొప్పపండితులా?; సంసారము= ఈ సంసారం; అనఁగన్= అంటే; నిస్సారత= సారం లేకపోవటంలో; అనఁటి కంబము+అట్లు+అ= అరటిబోదె వంటిదే అని; నిస్సంప్రబుద్ధులు= పరిపూర్ణమైన ఎరుక గలవారు; అనిరి= అన్నారు; అది= ఆ మాట; ప్రసిద్ధము= అందరికీ బాగా తెలిసిందే; విను= వినుము; తృష్ణ= కోర్కె, ఆశ; అడఁచి= అణచికొని; కర్మ వృత్తి= కర్మలయందు వర్తించటం (చేయటం); విడిచి= వదలి; నిరాలంబచిత్తుఁడు+ఐన= ఆధారంలేని మనఃప్రవృత్తి కలవాడైన; ఆతఁడో= వాడో; దోష దుఃఖ+ఆకరంబు+అగు= పాపాలకూ, దుఃఖాలకూ ఆధారాలైన; ధనంబులు= సంపదలను; కోరెడు+అతఁడొ= కోరేవాడో; సుఖి= సుఖంగా ఉండేవాడు; చెపుమ!= చెప్పుము.

తాత్పర్యం: భీముడు, వాయుదేవుడి శక్తిని, నీవు ఇంద్రుడి మహత్త్వాన్ని ధరించి శత్రువులకు గెలవటానికి వీలుకానివారు. అంతేకాక, శ్రీకృష్ణుడి దయావిశేషంచేత అతడి ప్రకాశంకూడా మీలో చేరి ఉన్నది. మీరు యుద్ధవిద్యలో పండితులే కాని, వేదాంత తత్త్వజ్ఞానంలో గొప్పవారు కాదు కదా! సారహీనంగా ఉండటంలో ఈ సంసారం అరటిబోదెవంటిదని ఆత్మజ్ఞానం కలిగినవారు అన్నమాట అందరికీ తెలిసినదే. కోరికలు వదలి, కర్మల నాచరించటం (కర్మసంగం) వదలి చిత్తము దేనిపై లగ్నంచేయకుండా ఉండేవాడు సుఖంగా ఉంటాడా? లేక సమస్తదోషాలకూ, బాధలకూ, నిలయమైన ధనం కోరేవాడు సుఖంగా ఉంటాడా? జాగ్రత్తగా విని (ఆలోచించి) చెప్పుము.

ఉ. **ఆదటఁ బూర్వశాస్త్రముల యర్థము లారఁగఁ గ్రోలి తత్త్వసం**
వేద సుధారసంబున చవిం జిరసౌఖ్యముఁ బొంద నేర కి
మ్మేదిని నెందునుం దిరిగి మేలని కర్మము యూఁది చెప్పుచుం
గా దని శాంతి యొప్పనిదిగాఁ జెడనాడుదు రల్పబోధనుల్. **141**

ప్రతిపదార్థం: అల్పబోధనుల్= మిడిమిడి జ్ఞానం కలవారు (అల్పజ్ఞానులు); ఆదటన్= ప్రేమతో, భక్తితో; పూర్వశాస్త్రముల+అర్థములు= ప్రాచీన శాస్త్రగ్రంథాలలోని తాత్పర్యాలను; ఆరఁగన్= నిండుగా, పూర్తిగా; క్రోలి= ఆస్వాదించి; తత్త్వ సంవేద సుధారసంబున=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వేదాంత జ్ఞానమనే అమృత రసంలోని; చవిన్= రుచిచేత; చిరసౌఖ్యమున్= దీర్ఘకాల సుఖాన్ని; పొందనేరక= పొందలేక; ఈ+మేదినిన్= ఈ భూమియందు; ఎందునున్+తిరిగి= ఎక్కడైనా సంచరించి; కర్మము+అ= కర్మమార్గమే; మేలు+అని= మంచిదని; ఊది చెప్పుచున్= నొక్కి చెప్పుతూ; కాదు+అని= అది కాదని; శాంతి= శాంతం; ఒప్పునిదిగాన్= తగినది కానట్లుగా; చెడన్+ఆడుదురు= నిందిస్తారు.

తాత్పర్యం: శ్రద్ధగా పూర్వమీమాంసా శాస్త్రాలన్నీ పూర్తిగా చదివి, వాటి అర్థాన్ని సంపూర్ణంగా ఆస్వాదించి కూడా, జ్ఞానబోధ కొద్దిగా మాత్రమే కలిగినవారు, తత్త్వజ్ఞానం అనే అమృతంలోని రుచి కారణంగా శాశ్వతసుఖాన్ని (ఆనందాన్ని) పొందలేక, భూమండలంపై ఎక్కడెక్కడో తిరిగి, కర్మమార్గమే మంచిదని నొక్కి వక్కాణిస్తూ, మరల కాదని చెపుతూ శాంతి తగదంటూ చెడుమాటలు మాట్లాడుతూ ఉంటారు.

విశేషం: ఊరక గ్రంథాలు చదివినా, వాటి అర్థం తెలిసికొన్నా ప్రయోజనం లేదు. 'బోధము' అంటే ఈ గ్రంథాలన్నీ దేని గురించి చెపుతున్నాయో ఆ జ్ఞానం ఆత్మను వెలిగించి అనుభూతం కావటం. అది 'స్వల్పం' కనుక, 'తత్త్వము' అనగా అసలు విషయం తెలియక అయోమయంలో పడి, కొంతకాలం మంచిదన్నదానినే తరువాత కాదనటం జరుగుతుంది. అందుకే 'అల్పబోధనుల'నే మాట ప్రయోగించటం జరిగింది.

క. విమల జ్ఞానులు శమమును। దమమును ద్యాగంబు శాశ్వత ప్రచురానం
దమునకు మూలము లండ్రు; ని। జముగాఁ గైకొందు రవి ప్రసన్నవివేకుల్.' 142

ప్రతిపదార్థం: విమల జ్ఞానులు= అచ్చమైన జ్ఞానం కలవారు; శమమును= అంతరింద్రియ నిగ్రహమూ; దమమును= బహిరింద్రియ నిగ్రహమూ; త్యాగంబు= త్యాగశీలమూ; శాశ్వత= స్థిరమైన; ప్రచుర= మిక్కుటమైన; ఆనందమునకున్= ఆనందం పొందటానికి; మూలములు= మొదళ్ళు, కారణాలు; అండ్రు= అంటారు; ప్రసన్న+వివేకులు= కార్యాకార్య విచక్షణా జ్ఞానం కలిగినవారు; అవి= ఆ మాటలు; నిజము+కాన్= నిజమే అని; కైకొందురు= స్వీకరిస్తారు, అంగీకరిస్తారు.

తాత్పర్యం: అంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహం, త్యాగబుద్ధీ శాశ్వతమైన అధికమైన ఆనందాన్ని కలిగించటానికి హేతువులని అచ్చమైన జ్ఞానం కలవారు చెప్పారు. చక్కని విచక్షణాజ్ఞానం కలవా రామాటలు వాస్తవమని అంగీకరిస్తారు'.

వ. అనిన విని దేవస్థానుం డమ్మానవపతి కిట్లనియె. 143

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; దేవస్థానుండు= దేవస్థానుడు అనే పేరు కల ముని; ఆ+మానవపతికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ మాటలను విన్న దేవస్థానుడనే ముని ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు.

దేవస్థానుం డను ముని ధర్మజునకు హితోపదేశంబు సేయుట (సం. 12-20-1)

సీ. ధనము లుత్కృష్టంబు లను ధనంజయు మాట। పాటిగాఁ గొనుము; సోపానభంగి
నున్నది మార్గంబు యోగసమారోహ। ణమునకు; దానన నడచి కాక
వడి నుల్కిపడ నీకు వచ్చునే? ధనసంగ్ర। హంబు భోగార్థ కృతంబు దుష్ట
మగుటయుఁ గలదు; యజ్ఞార్థ కృతంబైన। నదియ నిచ్చెన బ్రహ్మపదము నొంద;

తే. యజ్ఞపరిశిష్ట ధనభోగ మాత్మకలఁక । యుడుపు; నమ్మెయి శమదమయుక్తి గలుగు;
శమము దమమును దత్త్వ విజ్ఞానదములు । గాన దక్షిణాధిక యజ్ఞకర్త వగుము. 144

ప్రతిపదార్థం: ధనములు= సంపదలు; ఉత్కృష్టంబులు+అను= శ్రేష్ఠమైనవి అనే; ధనంజయు= అర్జునుడి; మాట= పలుకును; పాటిగాన్= న్యాయమైనదిగా; కొనుము= గ్రహించుము; యోగసమారోహణమునకున్= యోగసిద్ధి పొందటానికి ఎక్కవలసిన; మార్గంబు= దారి; సోపాన+భంగిన్= మెట్లవలె; ఉన్నది= ఉన్నది; దానన్+అ= ఆ మెట్ల దారిలోనే; నడచి+కాక= పయనించినట్లయితే తప్ప; నీకున్; వడిన్+ఉల్కిపడన్= వేగంగా భయంతో కంపించటంవలన; వచ్చునే= (యోగసిద్ధి) లభిస్తుందా?; భోగ+అర్థకృతంబు= అనుభవించటమే ప్రయోజనంగా చేసిన; ధన సంగ్రహంబు= ధనాన్ని సంపాదించి కూడబెట్టటం; దుష్టము= చెడ్డది; అగుటయున్+కలదు= అవటం కూడ ఉన్నది; యజ్ఞ+అర్థ+కృతంబు+ఐన= యజ్ఞం కొరకు చేసినదైతే; అది+అ= అదే; బ్రహ్మపదమున్+ఒందన్= బ్రహ్మలోక ప్రాప్తికి; నిచ్చెన; యజ్ఞ= యాగములందు; పరిశిష్ట= మిగిలిన; ధనభోగము= ధనమును అనుభవించటం; ఆత్మ కలఁక= ఆత్మలోని కలతను; ఉడుపున్= పోగొట్టుతుంది; ఆ+మెయిన్= ఆ పద్ధతిలో; శమ+దమ+యుక్తి+కలుగన్= అంతరింద్రియ, బాహ్యేంద్రియ నిగ్రహం; దమమును= బాహ్యేంద్రియ నిగ్రహం; తత్త్వ విజ్ఞానదములు= పరతత్త్వ (బ్రహ్మ)సంబంధమైన జ్ఞానాన్ని ఇస్తాయి; కాన= అందువలన; దక్షిణా+అధిక= అధిక దక్షిణలతో యజ్ఞకర్తవు= యజ్ఞం చేసినవాడవు; అగుము= కమ్ము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! సంపదలు శ్రేష్ఠమైనవి అని చెప్పిన అర్జునుడి మాటలు తప్పక పాటించుము. యోగసిద్ధి (జీవాత్మ పరమాత్మల కలయిక) ఎక్కటానికి చక్కని మెట్లదారి ఉన్నది. ఆ దారిలో వెళ్ళితేనే తప్ప యోగసిద్ధి లభ్యంకాదు. ధనసముపార్జనం తాను భోగాల ననుభవించటానికి చేస్తే తప్పు. యజ్ఞంకొరకు చేస్తే బ్రహ్మపదం పొందటానికి నిచ్చెనవలె ఉపయోగపడుతుంది. యజ్ఞంలో వాడగా మిగిలిన ధనం వాడటం మనోవ్యాకులతను పోగొట్టుతుంది. అట్లా చేయటంవలన శమదమాలు కలుగుతాయి. శమదమాలు బ్రహ్మజ్ఞానాన్నిస్తాయి. అందువలన దక్షిణ లెక్కువగా ఉండే యజ్ఞం చేసినవాడవు కమ్ము.

చ. హరుఁడును సర్వమేధ మను యాగమునం బ్రచుర ప్రకాశతం
బొరయఁగ వేడ్కఁ జేసె విధిపూర్వ దిగీశముఖామరుల్ మహా
ధ్వరములఁ గాదె పేర్కొనుట ధాత్రి సధర్మత నేలి యజ్ఞ త
త్పరత వెలుంగరే నృపులు, పార్థివముఖ్య! మరుత్త ముఖ్యులున్. 145

ప్రతిపదార్థం: పార్థివముఖ్య!= రాజశ్రేష్ఠా! ధర్మరాజా!; హరుఁడును= శివుడుకూడా; సర్వమేధము+అను= సర్వమేధము అనే పేరుగల; యాగమునన్= యజ్ఞంతో; ప్రచుర ప్రకాశతన్+పొరయఁగన్= అధికమైన తేజాన్ని పొందటానికి; వేడ్కన్= వేడుకతో, సంబరంగా; చేసెన్= నిర్వహించాడు, చేశాడు; విధి, పూర్వదిగీశముఖామరుల్= బ్రహ్మ, ఇంద్రుడు మొదలయిన దేవతలు అందరు; మహా+అధ్వరములన్= గొప్పయజ్ఞాలవలన, కాదె= కదా!; పేర్కొనుట= కీర్తి పొందింది; మరుత్త ముఖ్యులున్= మరుత్తు మొదలైన; నృపులు= రాజులు; ధాత్రిన్= భూమిని; సధర్మతన్= ధర్మంతో, ధర్మమార్గంలో; ఏలి= పరిపాలించి; యజ్ఞతత్పరతన్= యజ్ఞం చెయ్యటంలో నిమగ్నులై; వెలుంగరే?= ప్రకాశించటం లేదా?

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడవైన ధర్మరాజా! శివుడు కూడ సర్వమేధం అనే పేరున్న యాగాన్ని చేసి కీర్తిని, తేజాన్ని పొందాడు. బ్రహ్మ, ఇంద్రుడు, మొదలైన దేవతలందరూ గొప్ప యజ్ఞాలు చేసి కదా పేరుపొందింది! మరుత్తు మొదలైన చక్రవర్తులందరూ భూమిని ధర్మమార్గంలో పాలిస్తూ యజ్ఞాలు చేసి ప్రకాశించారు కదా!

వ. వినుము దివస్పతి యడుగ బృహస్పతి సన్మార్గ నిర్దేశకుండై చెప్పిన మార్గంబు. 146

ప్రతిపదార్థం: దివస్పతి= ఇంద్రుడు; అడుగన్= ప్రశ్నించగా; బృహస్పతి= దేవగురువు; సన్మార్గ= మంచి దారిని; నిర్దేశకుండు+ఐ= చూపించినవాడై; చెప్పిన= బోధించినటువంటి; మార్గంబు= పద్ధతి; వినుము= వినుము.

తాత్పర్యం: ఇంద్రుడు అడిగితే బృహస్పతి మంచి మార్గాన్ని సూచిస్తూ చెప్పిన పద్ధతిని వినుము.

ఉ. కామముఁ గ్రోధమున్ మనసుఁ గాడఁగఁ బాఱుట మాన్చి యింద్రియ
స్తోమ విమార్గ వర్తనము ద్రుంచుచు నెవ్వగ లేక రక్షణం
బేమర కెవ్వరిం జెనకి యించుక నొంపక లోక మేలఁగా
నా మహితాత్ము సర్వమహిమాతిశయంబును జెందు వాసవా! 147

ప్రతిపదార్థం: వాసవా!= ఇంద్రుడా!; కామము= కోరిక; క్రోధమున్= కోపమూ; మనసున్= మనస్సును; కాఁడఁగన్+పారుట= కలత పెట్టటం; మాన్చి= మానిపించి, ఆపి; ఇంద్రియస్తోమ= ఇంద్రియాల సమూహం యొక్క; విమార్గ వర్తనము= చెడ్డదారులలో నడవటం; త్రుంచుచున్= (తెగవేస్తూ) అరికట్టుతూ; నెఱ+వగ= అధికమైన బాధను; లేక= పొందక; రక్షణంబు= ప్రజాసంరక్షణం, ప్రజలను కాపాడటం; ఏమరక= అశ్రద్ధ చేయక; ఎవ్వరిన్= ఎవరినీ; చెనకి= ఎదిరించి; ఇంచుక= కొద్దిగా కూడా; నొంపక= బాధించక; లోకము+ఏలఁగాన్= భూమిని పరిపాలించినట్లైతే; ఆ మహితాత్మున్= ఆ మహాత్ముడిని, ఆ మహానుభావుడిని; సర్వ= సమస్తమైన; మహిమ+అతిశయింబును= గొప్పతనం యొక్క ఆధిక్యం; చెందును= ప్రాప్తిస్తుంది.

తాత్పర్యం: అరిషడ్వర్గాలలోనివైన కామక్రోధాలను మనస్సులో వర్తించకుండా ఆపి, ఇంద్రియాలను పక్కదారులు పట్టకుండా అరికట్టి, తాను శోకం పొందకుండా ఉండి, ప్రజలను కాపాడటంలో అప్రమత్తుడై ఉండి ఎవ్వరినీ కొద్దిగా కూడా బాధించక, లోక పరిపాలన చేసే మహాత్ముడిని సమస్తమైన మహత్తరగుణాలు తమంత తాముగా వచ్చి చేరుతాయి.

వ. అనియె మఱియు నాకర్ణింపుము. 148

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; మఱియున్= ఇంకా; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఈ మాటలు చెప్పి, ఇంకా వినుమని ఇట్లా అన్నాడు దేవస్థానుడు.

ఉ. కర్మము మేలు నా విగతకర్మము మేలన రెండు నొప్పునే?
కర్మఫలంబు నర్పితముగాఁ దగ నీశ్వరునందుఁ జేత స
ద్ధర్మముగా కనంగ వివిధంబగు ధర్మపథంబులోన మేల్
ధార్మికవర్య! యేర్పఱుపఁ దా వశమే వగ బుద్ధి గుందఁగన్. 149

ప్రతిపదార్థం: ధార్మికవర్య!= ధర్మమార్గంలో నడిచేవారిలో శ్రేష్ఠుడా!; కర్మము= కర్మాచరణం; మేలు= మంచిది; నాన్= అనగా; విగతకర్మము= కర్మాచరణం లేకుండటం; మేలు= మంచిది; అనన్= అనగా; రెండున్= రెండూ; ఒప్పునే?= కుదురుతాయా?; తగన్= చక్కగా; కర్మఫలంబున్= చేసిన కర్మల యొక్క ఫలితాన్ని; ఈశ్వరున్+అందున్= పరమాత్మయందు; అర్పితముగాన్= సమర్పించే విధంగా; చేఁత= చేయటం; సత్+ధర్మము+కాక= మంచి ఆచరణీయ పద్ధతి అవుతుంది; అనంగన్= అంటూ ఉండగా; వివిధంబు+అగు= అనేకంగా విస్తరించిన; ధర్మపథంబులోనన్= ధర్మమార్గంలో; మేల్= ఇది మంచిది అని;

ఏర్పఱుపన్= నిర్ధారించటానికి; తాన్= తాను; వగన్= శ్రమతో; బుద్ధిన్= మనస్సులో; కుందఁగన్= బాధపడటం; వశమే?= శక్యమా? వీలవుతుందా?

తాత్పర్యం: 'ధర్మమార్గానువర్తివైన ధర్మరాజా! కర్మానుచరణం మంచిది, కర్మత్యాగం మంచిది అంటే - రెండూ సరైనవి ఎట్లా అవుతాయి? కర్మల నాచరిస్తూ, కర్మఫలాన్ని పరమాత్మయందు సమర్పించటం మంచి ధర్మం అవుతుంది. వివిధమైన రూపాలుగా విస్తరించిన ధర్మమార్గంలో ఏది మంచిది? అని మనసులో ఎంత విచారించినా, నిర్ధారించటం వీలవుతుందా?

విశేషం: ఇది ధర్మం అని నిర్ధారించటం కష్టం. కర్మ త్యాగంకన్నా, కర్మఫల త్యాగం శ్రేష్ఠమని చెప్పటం తాత్పర్యం.

ఉ. **కావున సిద్ధ్యసిద్ధుల వికారముఁ బొందక ద్రోహ మెయ్యెడన్**
వావిరిఁ జేయ కేలు భువనంబు భవత్కుల ధర్మరక్షివై!
భూవరు లిట్లు సేసి, తుదిఁ బుత్రుల గద్దియలందు నిల్పి కా
దే వనవాసు లైరి దృఢదీప్త నిరంజన బోధసంపదన్. **150**

ప్రతిపదార్థం: కావునన్= కనుక; సిద్ధి+అసిద్ధుల= కార్యం సిద్ధించినప్పుడు, సిద్ధించనప్పుడూ (జయాపజయాలలో); వికారమున్+పొందక= మనోవికారం (జయానికి పొంగటం, అపజయానికి క్రుంగటం) పొందకుండా; ద్రోహము= నమ్మించి మోసగించటం; ఏ+ఎడన్= ఎక్కడా కూడా; వావిరిన్= క్రమంగా; చేయక= చెయ్యకుండా; భవత్+కుల+రక్షివి+ఐ= నీ కులధర్మాన్ని కాపాడుతున్నవాడివై; భువనంబున్= లోకమును, భూమిని; ఏలు= పాలించుము; భూవరులు= రాజులు; ఇట్లు+చేసి= పైన చెప్పిన విధంగానే ఆచరించి; తుదిన్= చివరకు; పుత్రులన్= కుమారులను; గద్దియల+అందున్= సింహాసనాలపై; నిల్పి= కూర్చోపెట్టి; దృఢ, దీప్త, నిరంజన, బోధ, సంపదన్= స్థిరమైన, ప్రకాశవంతమైన, అమలిన, జ్ఞానబోధ అనే సంపదతో; వనవాసులు+ఐరి= వానప్రస్థాశ్రమానికి వెళ్ళారు; కాదు+ఏ!= కదా!.

తాత్పర్యం: ధర్మరాజా! అందువలన, జయాపజయాలు కలిగినప్పుడు పొంగిపోవటం, క్రుంగిపోవటం వంటి మనోవికారాలు పొందకుండా - అంటే చిత్త స్థైర్యంతో ఎవరినీ నమ్మించి మోసం చేయకుండా, నీ కులధర్మాన్ని కాపాడుకొంటూ భూమిని పరిపాలించవలసింది. పూర్వపు రాజులందరూ ఇదే విధంగా ప్రవర్తించి చివరకు కుమారులను సింహాసనంపై నిల్పి స్థిరమైన ప్రకాశవంతమైన అమలినమైన జ్ఞానబోధ అనే సంపదతో వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించారు కదా!'

వ. **అనిన విని నిర్విణ్ణమానసుండై యున్న యన్నకు నర్జునుం డిట్లనియె.** **151**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; నిర్విణ్ణమానసుండు+ఐ= నిర్వేదంతో కూడుకొన్న మనస్సు కలవాడై; ఉన్న= ఉండిపోయిన; అన్నకున్= అన్న అయిన ధర్మరాజుతో; అర్జునుండు+ఇట్లనియెన్= అర్జును డీ విధంగా మాట్లాడాడు.

తాత్పర్యం: దేవస్థాను డనే ముని మాట్లాడిన మాటలను విని, నిర్వేదంతో ఉన్న ధర్మరాజును చూచి; అర్జునుడు ఈ విధంగా మాట్లాడాడు.

సీ. **' క్షత్రియ ధర్మ నిష్ఠాపరత్వంబున। సమరంబు సేసితి; శస్త్రనిహతిఁ**
బూతాత్ములై రిపుల్ వోయిరి సద్గతి;। కమ్మెయి రాచకర్మ మ్మొనర్చు
విప్రునకైనను సుప్రశస్తం; బది। రౌద్రం బగుట బాలురకును దెల్ల
మైనను నిట్లుండు నార్యోక్తి; నృపనీతి। దురితంబు సేయునే? యొరుఁడు వెట్టఁ

ఆ. **గుడువ నృపతి మాత్రకునకును గాదన్న। గౌరవాన్వయాగ్రగణ్యుఁ డైన**
నీకుఁ దగునె? విడువు శోకంబు; వజ్రస। న్నిభము గాదె నృపుల నెమ్మనంబు. **152**

ప్రతిపదార్థం: క్షత్రియ ధర్మ నిష్ఠాపరత్వంబునన్= రాజధర్మం పాటించటంలో నిమగ్నుడవై ఉండి; సమరంబు= యుద్ధం; చేసితి(వి)= చేశావు; శస్త్ర= ఆయుధాలచేత; నిహతిన్= చంపబడటంచేత; పూత+ఆత్ములు+ఐ= పరిశుద్ధం చేయబడిన ఆత్మలు కలవారై; రిపుల్= శత్రువులు; సత్+గతికిన్= ఉత్తమ లోకాలకు; పోయిరి= వెళ్ళారు; ఆ+మెయి= ఆ పద్ధతి; రాజకర్మమ్ము= రాచరికం; ఒనర్చు= చేసేటువంటి; విప్రునకున్+ఐనను= బ్రాహ్మణుడికి అయినా; సు+ప్రశస్తంబు= బాగా మేలైన విషయం; అది= రాజ్యపాలన, యుద్ధం చేసే విషయం; రౌద్రంబు+అగుట= మిక్కిలి భయంకరమైనది అనే సంగతి; బాలురకును= పిల్లలకు కూడా; తెల్లము= స్పష్టం, బాగా తెలుసు; ఐనను= అయినా కాని; నృపనీతి= రాజనీతి; దురితంబు= పాపం; చేయును+ఏ?= చేస్తుందా?; అని; ఆర్యోక్తి= పెద్దలమాట; ఇట్లు+ఉండున్= ఈ విధంగా ఉన్నది; ఒరుఁడు= ఇతరుడు; పెట్టన్= పెట్టగా; కుడువన్= తినటం; నృపతి మాత్రకునకును= మామూలు రాజైనవాడికి; కాదు+అన్నన్= కుదరదు అనగా; కౌరవ+అన్వయ+అగ్రగణ్యుఁడు+ఐన= కురువంశంలో మొదట లెక్కింపదగినవాడైన; నీకున్= ధర్మరాజుకు; తగునె?= సరి అయినదా? (సరిపడ దని భావం); శోకము= విచారం; విడువు= వదలిపెట్టుము; నృపుల= రాజుల; నెఱ+మనంబు= నిండుమనస్సు; వజ్ర+సన్నిభము= వజ్రాయుధంతో సమానమైనది; కాదు+ఏ= కదా!

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజధర్మాన్ని అనుష్ఠించటంలో భాగంగా యుద్ధం చేశావు. ఆ యుద్ధంలో ఆయుధాలు తగలటంతో పవిత్రులైన శత్రువులు ఉత్తమ లోకప్రాప్తిని పొందారు. ఈ విధమైన రాజధర్మ నిర్వహణ రాజ్యభారం నిర్వహించే బ్రాహ్మణుడికైనా శ్రేష్ఠమైనది. రాజ్యభారం వహించటం, యుద్ధం చేయటం, రౌద్రరసంతో కూడుకొన్నవనే సంగతి పిల్లలకైనా తెలుసు. రాజనీతిలో పాపాలు చేయటం ఉండదని ఆ పెద్దలు చెప్పేమాట. మామూలు రాజునకైనా ఇతరులు పెడుతుండగా తినటం తగదు. అటువంటిది, కౌరవవంశంలో శ్రేష్ఠుడవైన నీకు అది తగింది కాదు. కనుక శోకం వదలిపెట్టుము. రాజుల మనస్సులు వజ్రంతో సమంగా ఉండాలి సుమా! (రాజుల మనసులు వజ్రంవలె కఠినంగా మొక్కవోనివిగా ఉండాలని భావం).

వ. **అట్లుంగాక.** **153**

తాత్పర్యం: అంతేకాక.

ఉ. **వైరివధంబు నీకును నవశ్యముఁ జేయక పోవరానిదై**
వైరులకున్ భవత్సమరవాంఛన సద్గతి కేఁగఁ బాలి దై
చేరె విధాతృ సంఘటనఁ; జింతకుఁ గారణమేమి? ధర్మ వి
స్తార విదుండ వీ; వకట! ధైర్య సమగ్రుఁడవై వెలుంగవే. **154**

ప్రతిపదార్థం: విధాతృ= బ్రహ్మయొక్క; సంఘటనన్= కూర్పువలన (ఏర్పాటు వలన); వైరివధంబు= శత్రు సంహారం; అవశ్యమున్= తప్పక; చేయకపోవరానిది+ఐ= చేయకుండ వీలులేనిదై; నీకునున్= నీకూ (ధర్మరాజుకు); భవత్= నీతో; సమర వాంఛన్+అ= యుద్ధం చేసే కోరికతోనే; సద్గతికిన్+ఏఁగన్= మంచి లోకాలకు వెళ్ళటానికి; వైరులకున్= శత్రువులకు; పాలిది+ఐ= భాగస్థమై, వంతుగా; చేరెన్= కూడాయి (సంఘటిల్లాయి); చింతకున్= బాధపడటానికి; కారణము= హేతువు; ఏమి= ఏముంది; అకట!= అయ్యో!; ఈవు= నీవు; ధర్మ విస్తార విదుండవు= ధర్మ స్వరూపం బాగా తెలిసినవాడివి; ధైర్య సమగ్రుఁడవు+ఐ= ధైర్యంతో కూడుకొన్న వాడివై; వెలుంగవు+ఏ= ప్రకాశించుము.

తాత్పర్యం: శత్రువధ చేయక తప్పనట్లు నీకూ నీతో యుద్ధం చేయాలనే కోరికతోనే ఉత్తమగతులకు వెళ్ళటం నీ శత్రువులకూ వంతులుగా చక్కగా సంఘటిత పరచాడు బ్రహ్మ. ఇందులో బాధపడవలసిన దేముంది? నీకు ధర్మస్వరూపం బాగా తెలుసు. అందువలన ధైర్యాన్ని కూడగట్టుకొని ప్రకాశించుము.

వ. రాజధర్మోపాత్తంబై భవదాయత్తంబైన పూజ్యసామ్రాజ్యంబుఁ బరిపాలించుచుఁ బుణ్యక్రియానుష్ఠాన పరుండ వగు' మని పలికిన మఱుమాట పలుక కున్న యన్నరేంద్రునకు మునీంద్ర వర్యుం డగు పారాశర్యుం డిట్లనియె. 155

ప్రతిపదార్థం: రాజధర్మ+ఉపాత్తంబు+ఐ= క్షత్రియ ధర్మంతో పొందబడినదై; భవత్+ఆయత్తంబు+ఐన= నీ అధీనం అయిన; పూజ్య= పూజించదగిన; సామ్రాజ్యంబున్= మహా సామ్రాజ్యాన్ని; పరిపాలించుచున్= చక్కగా పాలనచేస్తూ; పుణ్యక్రియా= మంచి పనులు; అనుష్ఠాన పరుండవు= ఆచరించటంలో నిమగ్నుడవు; అగుము= కమ్ము; అని పలికినన్= అంటూ అర్జునుడు చెప్పగా; మఱుమాట= మరొక మాట; పలుకక+ఉన్న= మాట్లాడకుండా ఉన్న; ఆ+నర+ఇంద్రునకున్= ఆ రాజశ్రేష్ఠుడితో (ధర్మరాజుతో); ముని+ఇంద్ర+వర్యుండు+అగు= మునులలో శ్రేష్ఠుడైన; పారాశర్యుండు= వ్యాసుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: రాజధర్మానుసారం నీవు పొంది, నీ అధీనంలో ఉన్న మహా సామ్రాజ్యాన్ని పరిపాలిస్తూ, సత్కార్యాలు చేయటంలో నిమగ్నుడవై ఉండవలసింది' అని అర్జును డన్న మాటలకు మారుమాట్లాడకుండా ఉన్న ధర్మరాజుతో వ్యాసమహర్షి ఇట్లా అన్నాడు.

సీ. ' అర్జును పలుకు సత్యంబు సమీచీన; । మార్యజనంబు గృహస్థ ధర్మ
ముత్తమం బని చెప్పు నుర్వీశ! పశుపక్షు । లాదిగ జీవుల కాశ్రయంబు;
నృపులకు నది దక్కఁ దపమును దమమును । బ్రహ్మచర్యమును ధర్మములు గావు;
ధనములఁ దనియుట యని కోహటించుట । ప్రజల రక్షింపమి రాజకోటి

ఆ. కరయఁ బాతకంబు లండ్రు; నీ వక్కడ । వేదచోదనా ప్రవీణ మయిన
మనసు నేల యిట్లు మార్గవృత్తికిఁ జొర । నిచ్చె; దోపి ధరణి యేలు మనఘ! 156

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ!= భూమీపతీ! ధర్మరాజా!; అర్జును పలుకు= అర్జునుడు చెప్పిన మాటలు; సత్యంబు= నిజం, వాస్తవం; సమీచీనము= యుక్తం; ఆర్యజనంబు= పూజ్యులైనవారు, పెద్దలు; గృహస్థధర్మము= గృహస్థాశ్రమ ధర్మం; ఉత్తమంబు+అని= శ్రేష్ఠమని; చెప్పును= చెపుతారు; పశు+పక్షులు+ఆదిగాన్+జీవులకున్= జంతువులు, పక్షులు మొదలైన సమస్త ప్రాణులకు; ఆశ్రయంబు= శరణమైనట్టిది (అయిన); అది= ఆ గృహస్థాశ్రమధర్మం; తక్క= కాక; నృపులకున్= రాజులకు; తపమును= తపస్సును; దమమును= ఇంద్రియ నిగ్రహం; బ్రహ్మచర్యమును= బ్రహ్మచర్యాశ్రమమును పాలించటం (వివాహం చేసికొని గృహస్థాశ్రమ ధర్మాన్ని స్వీకరించక, వేదాధ్యయన పరుడై ఉండిపోవటం); ధర్మములు+కావు= ఆచరించవలసిన విధులు కావు; ధనములన్= సంపదలవలన; తనియుట= సంతృప్తిచెందటం; అనికిన్= యుద్ధానికి; ఓహటించుట= వెనకాడటం; ప్రజలన్= పాలితులను; రక్షింపమి= కాపాడకుండా ఉండటం (అనేవి); అరయన్= పరిశీలించి చూడగా; రాజకోటికిన్= రాజసమూహానికి; పాతకంబులు= నివృత్తి లేని పాపాలు; అండ్రు= అంటారు; అక్కట!= అయ్యో!; నీవు= నీవు; వేద+చోదనా+ప్రవీణము+అయిన+మనసున్= వేదములు చెప్పిన మార్గంలో నడవటంలో నేర్పుగల నీ మనస్సును; ఇట్లు= ఈ విధంగా; అమార్గవృత్తికిన్= కూడని దారిలో చరించటానికి (అపమార్గంలో నడవటానికి); ఏల= ఎందుకు; చొరన్+ఇచ్చెదు?= వెళ్ళనిస్తావు?; అనఘ!= పాపరహితుడ వైన ధర్మరాజా!; ఓపి= సామర్థ్యంతో; ధరణి= భూమిని; ఏలుము= పరిపాలించుము.

తాత్పర్యం: 'ధర్మరాజా! అర్జునుడు చెప్పిన మాటలు నిజమైనవి, తగినవి. పూజనీయులైన పెద్దలు గృహస్థాశ్రమ ధర్మమే అన్నింటికన్న గొప్పది అని చెపుతారు. ఎందుకంటే, పశు పక్ష్యాది సమస్త ప్రాణులకు అది ఆధారం. గృహస్థ ధర్మం నిర్వహించటంకంటె రాజులకు మరొక పరమధర్మం లేదు. తపస్సు, ఇంద్రియ నిగ్రహం, బ్రహ్మచర్యం రాజధర్మాలు కావు. ఉన్న ధనంతో తృప్తి చెంది ఊరుకొనటం, యుద్ధానికి వెనకాడటం, తనపాలనలోని ప్రజలను రక్షించకుండా వదలెయ్యటం, రాజులకు నివృత్తిలేని పాపహేతువు లవుతాయి. వేద విహితమైన మార్గంలో నడవటంలో నేర్పరివైన నీవు ఈ విధంగా నీ మనస్సును అపమార్గంలోనికి పోనిస్తున్నావెందుకు? పాపరహితుడవైన ధర్మరాజా! సమర్థతతో భూమిని పాలించుము.

విశేషం: చతురాశ్రమాలు: 1. బ్రహ్మచర్యం - విద్యార్జనాకాలం; 2. గృహస్థం - వివాహితుడై ప్రజాతంతువును అవిచ్ఛిన్నంగా కొనసాగించే కాలం; 3. వానప్రస్థం - తన విధులు, బాధ్యతలు తీరినకాలం; 4. సన్న్యాసం - అన్నింటిని భగవంతుడియం దుంచి, సమస్తమున పరమాత్మను దర్శిస్తూ గడిపే కాలం. సనాతన ధర్మం మానవుని జీవితాన్ని ఈ నాలుగు భాగాలుగా విభజించింది.

క. నీ వార్యబోధితుండవు। గావే! వర్ణాశ్రమ ప్రకారములు వినం
గావలయునె ధర్మంబులు। భూవరునకు దండనీతిఁ బోలంగలవే! 157

ప్రతిపదార్థం: నీవు= నీవు (ధర్మరాజు); ఆర్యబోధితుండవు= పూజ్యులచేత జ్ఞాన బోధను పొందినవాడవు; కావు+ఏ?= కావా ఏమి? వర్ణ+ఆశ్రమ+ప్రకారములు= చతుర్వర్ణాల, చతురాశ్రమాల పద్ధతులు; వినంగాన్+వలయును+ఎ?= వినవలసి ఉన్నదా ఏమి?; భూవరునకున్= భూపాలకుడైన రాజునకు; ధర్మంబులు= ఇతర ధర్మాలన్నీ; దండనీతిన్= రాజనీతితో; పోలన్+కలవే?= సమానం కాగలవా?

తాత్పర్యం: 'ధర్మరాజా! నీవు పెద్దలవద్ద జ్ఞానాన్ని పొందలేదా? వర్ణాశ్రమధర్మాలు, పద్ధతులు తెలిసికొనవలసి ఉన్నదా? రాజునకు దండనీతిని (రాజ్యపాలన, యుద్ధనీతి మొదలైనవాటిని) మించిన ధర్మం మరొక్కటి లేదు.

విశేషం: 1. ధర్మరాజు అజ్ఞానంతో ప్రవర్తిస్తే ఆ తప్పు విద్యా బోధన చేసిన గురువుది అనటం ధర్మరాజు గురువును చులకన చేయటం - అది ధర్మరాజు సహించలేడు కదా!

2. మానవ జీవిత కాలాన్ని చతురాశ్రమాలుగా విభజించినట్లే, సమాజం మానవుల వృత్తి, ప్రవృత్తుల రీత్యా నాలుగు భాగాలుగా విభజించబడింది. అవే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు. ఈ వర్ణాలు ఈనాడు సమాజంలో అమలులో ఉన్న కులాలు ఒకటి కావు. రెంటికీ హస్తిమశకాంతరం ఉన్నది.

3. రాజ్యపాలనకు సంబంధించిన అంశాలన్నీ దండనీతిలో భాగం.

వ. సుద్యుమ్నుండను ధరణీశుండు దండనీతిని కాదె యపవర్గంబు వడసె' ననుటయు, నజాతశత్రుం 'డాసుద్యుమ్ను వృత్తాంతంబు వినవలతు నానతి' మ్మనిన నమ్మహీపతి కమ్మునిపతి యిట్లనియె. 158

ప్రతిపదార్థం: సుద్యుమ్నుండు+అను= సుద్యుమ్నుడు అనే పేరున్న; ధరణీ+ఈశుండు= రాజు; దండనీతిన్+అ= దండనీతి వలననే; కాదు+ఏ= కదా; అపవర్గంబు= మోక్షం; పడసెన్= పొందాడు; అనుటయున్= అనగా; అజాతశత్రుండు= ధర్మరాజు; ఆ సుద్యుమ్ను వృత్తాంతంబు= ఆ సుద్యుమ్నుడనే పేరుగల రాజు చరిత్ర; వినవలతున్= వినాలని కోరుకొంటున్నాను; ఆనతి+ఇమ్ము+అనినన్= సెలవీయవలసింది అనగా; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు (ధర్మరాజుకు); ఆ+మునిపతి= ఆ మునిశ్రేష్ఠుడైన వ్యాసుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'సుద్యుమ్ను డనేరాజు దండనీతిని అనుష్ఠించటం వలననే మోక్షం పొందాడు' అని వ్యాసుడు చెప్పగానే ధర్మరాజు 'ఆ సుద్యుమ్నుడి చరిత్ర వినాలనుకొంటున్నాను చెప్పుము' అని ప్రార్థించగా, ధర్మరాజుకు వ్యాసుడు ఇట్లా చెప్పసాగాడు.

పారాశర్యుఁడు సుద్యుమ్న చరితంబు ధర్మజునకుఁ జెప్పుట (సం. 12-24-1)

క. **' విను శంఖుండును లిఖితుం । డన నిరువురు విప్రవర్యు లన్నయుఁ దమ్ముం**
డును గలరు బాహుదాతీ । ర నివాసులు ధర్మతత్పర మనోవృత్తుల్. **159**

ప్రతిపదార్థం: విను= ధర్మరాజా! వినుము; బాహుదాతీర నివాసులు= బాహుదా నదీ తీరంలో నివసించే వారైన; ధర్మ+తత్పర+మనోవృత్తుల్= ధర్మమార్గంలో నడవటంలో లగ్నమైన మనోధర్మం కలవారైన; అన్నయున్+తమ్ముండును= అన్నదమ్ములైన; శంఖుండును+లిఖితుండు+అనన్= శంఖుడు, లిఖితుడు అనే పేర్లు కల; ఇరువురు= ఇద్దరు; విప్రవర్యులు= బ్రాహ్మణోత్తములు; కలరు= ఉన్నారు.

తాత్పర్యం: 'ధర్మరాజా! వినుము. బాహుదానదీ తీరంలో, ధర్మమార్గ ప్రవర్తనులైన శంఖుడు, లిఖితుడు అనే పేర్లు కల అన్నదమ్ములైన బ్రాహ్మణోత్తములు ఇద్దరు ఉన్నారు.

సీ. **వారి యాశ్రమముల భూరిపుష్ప ఫలాభి । వృద్ధి నొప్పారెడి వివిధ భూరు**
హంబులు గల; వొకయపుడు శంఖుండు గృహమ్మున లేకుండ ననుజుఁ డచటి
కరిగి యందొక మ్రాన నారఁబండిన పండ్లు । గని వేడ్కమై గోసికొని తినంగ,
నయ్యన్న యేతెంచి 'యనుజ! యీ ఫలము లె । క్కడివి చెప్పు' నావుడును వార్చి

తే. **ప్రణతుఁడై 'యిచ్చటివి'యని పలికె లిఖితుఁ; । డాతఁ 'డనుమతి లేక కోయంగఁ దగునె?**
మ్రుచ్చిమియ కాదె యది? పాప మచ్చుపడియె; । నృపతిచే దండితుండవై నీఁగికొనుము. **160**

ప్రతిపదార్థం: వారి= ఆ శంఖలిఖితుల; ఆశ్రమములన్= ఆశ్రమాలలో; భూరి= అధికమైన; పుష్ప+ఫల+అభివృద్ధిన్= పూలు పండ్లు పెంపొందటంచేత; ఒప్పు+ఆరెడి= అందగించే; వివిధ= అనేకములైన; భూరుహంబులు= వృక్షాలు; కలవు= ఉన్నాయి; ఒక+అపుడు= ఒక సమయంలో; శంఖుండు= అన్నగారైన శంఖుడు; గృహమ్మునన్= ఇంటిలో; లేక+ఉండన్= లేకపోగా; అనుజుండు= తమ్ముడు; అచటికిన్+అరిగి= అన్న ఆశ్రమానికి వెళ్ళి; అందున్= అక్కడ; ఒక మ్రానన్= ఒక చెట్టుకు; ఆరన్+పండిన= విరగ కాసిన; పండ్లు+కని= పళ్ళనుచూచి; వేడ్కమైన్= వేడుకతో, ముచ్చటపడి; కోసికొని= తెంపుకొని; తినంగన్= తినగా; ఆ+అన్న= ఆ అన్న అయిన శంఖుడు; ఏతెంచి= వచ్చి; అనుజ!= తమ్ముడా!; ఈ ఫలములు= ఈ పళ్ళు; ఎక్కడి+అవి?= ఎచటివి?; చెప్పు= తెలుపుము; నావుడును= అని అనగా; లిఖితుఁడు= తమ్ముడైన లిఖితుడు; వార్చి= ఆచమించి; ప్రణతుఁడు+ఐ= అన్నకు నమస్కరించినవాడై; ఇచ్చటివి+అ= ఇక్కడివే; అని+పలికెన్= అని చెప్పాడు; ఆతండు= అన్న అయిన శంఖుడు; అనుమతిలేక= అనుజ్ఞ తీసికొనక; కోయంగన్+తగునె?= పళ్ళు కోయవచ్చునా?; అది= అట్లా అనుమతి లేకుండా కోయటం; మ్రుచ్చిమి+అ= దొంగతనమే; కాదు+ఎ?= కాదా?; పాపము= దోషం; అచ్చుపడియెన్= స్పష్టపడింది; నృపతిచేన్= రాజుచేత; దండితుండవు+ఐ= శిక్షించబడినవాడవై; నీఁగికొనుము= పోగొట్టుకొనుము.

తాత్పర్యం: ఆ విప్రసోదరులు శంఖ లిఖితుల ఆశ్రమాలు పూలతోనూ, పళ్ళతోనూ నిండిన చెట్లు కలిగి ఉండి అందగిస్తున్నాయి. ఒకసారి శంఖుడు ఇంట లేనప్పుడు లిఖితుడు అక్కడికి వెళ్ళి, ఒక చెట్టున ఉన్న ఆరముగ్గిన పళ్ళను చూచి, ముచ్చటపడి కోసికొని తిన్నాడు. అంతలో అక్కడికి వచ్చిన శంఖుడు 'ఆ పళ్ళెక్కడివి?' అని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రశ్నించాడు. దానికి లిఖితుడు ఆచమించి, అన్నకు నమస్కరించి, 'ఇచ్చటివే' అని జవాబిచ్చాడు. దానికి శంఖుడు 'అనుమతి లేకుండా పళ్ళు కోయవచ్చా? అది దొంగతనం కాదా? పాపం చేసినట్లు నిర్ధారణ అయింది. రాజుచేత శిక్షించబడి పాపాన్ని పోగొట్టుకొనుము.

వ. రయంబున రాజసన్నిధికిం జని, భవత్కర్మం బుపన్యసించి దండించుట వేఁడు' మని పలికినం దెలిసి 'యట్లకాక' యని లిఖితుండు సుద్యుమ్నుఁ గానంబోయి నగరి వాకిట నిలిచినం, బ్రతిహారు లమ్మహాత్ము నరుగుదెంచుట యమ్మహీపతి కెఱింగించిన, నతండు సంభ్రమంబున సామాత్యుండై యాసంశితవ్రతుం డున్నయెడకుం జని వినయంబు సేసి 'మీర లిచ్చటికి వేంచేసిన ప్రయోజనం బేమి? యానతిండు; మీ చెప్పినట్ల చేసెద' నని విన్నవించిన నా విప్రవర్యుం డాతని కిట్లనియె. 161

ప్రతిపదార్థం: రయంబునన్= వేగంగా (వెంటనే); రాజ సన్నిధికిన్= రాజ సమ్ముఖానికి (రాజు వద్దకు); చని= వెళ్ళి; భవత్కర్మంబు= నీవు చేసిన పని; ఉపన్యసించి= చెప్పి; దండించుట= శిక్షించటాన్ని; వేడుము= ప్రార్థించుము; అని పలికినన్= అని చెప్పగా; తెలిసి= తప్పు తెలిసికొని; అట్లు+అ+కాక+అని= అట్లే జరుగును గాక అని (సరే అని); లిఖితుండు; సుద్యుమ్నున్= సుద్యుమ్నుడిని; కానన్+పోయి= చూడటానికి వెళ్ళి; నగరి వాకిటన్= రాజద్వారం వద్ద; నిలిచినన్= నిలువగా; ప్రతిహారులు= ద్వారపాలకులు; ఆ+మహాత్మున్= ఆ మహానుభావుడియొక్క; అరుగుదెంచుట= రాకను; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు; ఎఱింగించినన్= తెలియ చెప్పగా; అతండు= ఆ రాజు; సంభ్రమంబునన్= తత్తరపాటుతో (వెనువెంటనే); స+అమాత్యుండు+ఐ= మంత్రులతో కూడుకొన్నవాడై; ఆ సంశిత వ్రతుండు= అనుమానించబడని దీక్ష కలవాడు; ఉన్న+ఎడకున్= నిలిచి ఉన్నచోటికి; చని= వెళ్ళి; వినయంబు+చేసి= వినయంతో; మీరలు= మీరు; ఇచ్చటికిన్= ఇక్కడికి; వేంచేసిన= వచ్చిన; ప్రయోజనంబు+ఏమి?= కారణం ఏమిటి? (ఉద్దేశం ఏమిటి?); ఆనతి+ఇండు= ఆజ్ఞాపించండి; మీ చెప్పిన+అట్లు+అ= మీరు చెప్పిన విధంగానే; చేసెదన్= చేస్తాను; అని విన్నవించినన్= అని ప్రార్థించగా; ఆ విప్రవర్యుండు= ఆ బ్రాహ్మణోత్తముడు; ఆతనికిన్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'రాజు వద్దకు వెళ్ళి, నువ్వు చేసిన పని చెప్పి, దండించుమని అడుగు అని తమ్ముడితో అన్నాడు. అతడు తన తప్పు తెలిసికొన్నవాడై, సరేనని సుద్యుమ్నుడనే రాజును కలవటానికి వెళ్ళి రాజద్వారం వద్ద నిలిచాడు, ప్రతిహారు లాసంగతి రాజునకు తెలుపగా అతడు హడావుడిగా మంత్రులందరితో కలిసి లిఖితు డున్న చోటికి వచ్చి వినయంగా 'మీ రిచ్చటికి ఏ ప్రయోజనాన్ని ఆశించి వచ్చారు? మీరు చెప్పినట్లుగా నడచుకొంటాను' అని ప్రార్థించాడు. అప్పు డా లిఖితుడు రాజుతో ఈ విధంగా చెప్పాడు.

**ఆ. ' చెప్పినట్ల యేను జేసెద నని యొడం । బడినవాఁడ వింకఁ బలుకు దిరుగఁ
గామి మఱవ కుండఁగా నీకు వలయుఁ జు । మ్మయ్య దండధారకాగ్రగణ్య!' 162**

ప్రతిపదార్థం: దండధారక+అగ్రగణ్య!= పాలనా దండాన్ని ధరించిన రాజులలో శ్రేష్ఠుడా! సుద్యుమ్నా!; ఏనున్= నేను; చెప్పిన+అట్లు+అ= చెప్పిన విధంగానే; చేసెదన్+అని= చేస్తానని; ఒడంబడినవాఁడవు= అంగీకరించావు; నీకున్= నీకు; ఇంకన్= ఇకపై; పలుకు= మాట; తిరుగన్= వెనక్కితీసికొనటం; కామిన్= వీలుకాదని; మఱవక+ఉండఁగాన్= మరచిపోకుండా; వలయున్+చుమ్ము+అయ్య!= ఉండాలి సుమా!

తాత్పర్యం: 'రాజదండాన్ని ధరించిన వారిలో శ్రేష్ఠుడవైన సుద్యుమ్న రాజా! 'నేను చెప్పినట్లు చేస్తానని ఒప్పుకొన్నావు. ఇక మాట తప్పటానికి వీలులేదని మరవవద్దు'.

వ. అని యూఁది పలికి, 'మద్గురుని యనుమతి లేక తదీయ తరుఫలంబులు గోసికొని యుపయోగించితి; నది మ్రుచ్చిమి; మ్రుచ్చుల దండించు తెఱంగున దండించి నన్ను గతకల్మషుం జేయుము; రాజదండితునకు యమదండంబు లేదని పెద్దలు సెప్పుదురు; నిన్నును దండధారణ వైకల్య కిల్బిషంబు వొరయకుండ వలయు' నని తేటపడ నాడిన, నమ్మాటలకు మనంబున విషాంబు నొంది, యమ్మేదినీవరుండు భూసురవరుం బ్రార్థించి. 163

ప్రతిపదార్థం: అని+ఊఁది పలికి= అంటూ నొక్కి వక్కాణించి; మత్+గురుని= నా అన్నయొక్క; అనుమతి లేక= అనుజ్ఞ లేకుండా; తదీయ= అతడియొక్క; తరు= చెట్టుయొక్క; ఫలంబులు= పళ్ళు; కోసికొని+ఉపయోగించితిన్= కోసికొని తిన్నాను; అది= అట్లా చేయటం; మ్రుచ్చిమి= దొంగతనం; మ్రుచ్చులన్= దొంగలను; దండించు+తెఱంగునన్= శిక్షించే తీరులో; దండించిన్= శిక్షించి; నన్నున్= నన్ను; గతకల్మషున్= పోయిన పాపం కలవాడినిగా; చేయుము= చేయుము; రాజదండితునకున్= రాజుచేత శిక్షించబడినవాడికి; యమదండంబు= యముడిచేతి శిక్ష; లేదు+అని= ఉండదని; పెద్దలు= ఆర్యులు; చెప్పుదురు= చెప్పుతారు; నిన్నును= నిన్ను కూడా; దండధారణ= రాజదండాన్ని ధరించి కూడా; వైకల్య కల్బిషంబు= వికలత్వం (సరిగా నిర్వహించకపోవటం) అనే పాపం; పొరయక+ఉండవలయును+అని= పొందకుండా ఉండాలి అని; తేటపడన్= స్పష్టపడేటట్లుగా; ఆడినన్= మాటాడగా; ఆ+మాటలకున్= లిఖితుడు పలికిన మాటలకు; మనంబునన్= మనస్సులో; విషాదంబున్+పొంది= దుఃఖాన్నిపొంది; ఆ+మేదినీవరుండు= ఆ రాజు; భూసురవరున్= బ్రాహ్మణోత్తముడిని; ప్రార్థించి= వేడి.

తాత్పర్యం: అంటూ గట్టిగా చెప్పి, 'నా అన్న అనుమతిలేకుండా, అతడి చెట్టుపళ్ళు కోసికొని తిన్నాను. అట్లా చేయటం దొంగతనమే. కనుక నన్ను దొంగలను శిక్షించే తీరులో దండించి పాపరహితుడిని చేయుము. రాజదండన పొందిన వాడికి యమదండన ఉండదని పెద్ద లంటారు. అట్లా చేస్తే నీకు దండధారివై కర్తవ్యం నుండి తొలగిన పాపం అంటకుండా ఉంటుంది' అని తేట తెల్లంగా చెప్పాడు. ఆ మాటలు విన్న రాజు మనసులో చాలా బాధపడి ఆ విప్రుడిని ప్రార్థించి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. ' అనఘచరిత! యిట్లు నను నియోగించుట । యుడుగు' మని యమాత్యయుతము గాఁగ
భక్తి మెఱసి యెన్నిభంగులఁ జెప్పిన । నియ్యకొనక యున్న నెట్టకేని. 164

ప్రతిపదార్థం: అనఘ చరిత!= పాపంలేని పవిత్రమైన నడవడిక కలవాడా! లిఖితుడా!; ఇట్లు= ఈ విధంగా; ననున్ నియోగించుట= నన్ను ఆజ్ఞాపించటం; ఉడుగుము+అని= మానుమని; అమాత్యయుతము+కాఁగన్= మంత్రులతో కూడుకొని; భక్తి మెఱసి= భక్తి ప్రకటమయ్యేటట్లు; ఎన్ని భంగులన్= ఎన్ని విధాలుగా; చెప్పినన్= చెప్పినా కాని; ఇయ్యకొనక= అంగీకరించక; ఉన్నన్= ఉండగా; ఎట్టకేని= చిట్టచివర కేదో విధంగా.

తాత్పర్యం: 'పాపరహితమైన (నిర్మలమైన) నడవడిక కలిగిన విప్రోత్తమా! నన్ను ఈ విధంగా ఆజ్ఞాపించటం మానుము' అని మంత్రులతో కలిసి భక్తితో ఎన్నో విధాలుగా వేడుకొన్నా అంగీకరించకపోవటంతో, చిట్టచివరికి. (తరువాతి వచనంతో అన్వయం).

లిఖితుండు సుద్యుమ్నునిచేత నికృత్తకరుం డగుట (సం. 12-24-19)

వ. నిశ్చయించి సముచిత దండనీతి వ్రతశీలుండగు నన్నరపాలుం డమ్మహాద్విజునిం గరయుగచ్ఛేదనంబున దండింతుం జేసిన, నతం డతని దీవించి మగిడి చని శంఖునిం గని నికృత్తంబు లైన హస్తంబులు సూపి 'సమ్యగనుభూత దండితుండ నైతి' ననిన నాతండు ప్రీతుండై. 165

ప్రతిపదార్థం: నిశ్చయించి= నిర్ణయించుకొని (లిఖితుడు కోరినట్లు చేయటానికి నిశ్చయించుకొని); సముచిత= బాగా తగిన; దండనీతి వ్రతశీలుండు+అగు= దండనీతిని అమలు పరచే స్వభావం కలిగినవాడైన; ఆ+నరపాలుండు= ఆ సుద్యుమ్న రాజు; ఆ+మహాద్విజునిన్= ఆ గొప్ప విప్రుడిని; కరయుగ= రెండు చేతులను; ఛేదనంబునన్= ఖండించటంతో; దండితున్+చేసినన్= శిక్షించబడిన వాడినిగా చేయగా; అతండు+అతనిన్= లిఖితుడు సుద్యుమ్నుడిని; దీవించి= ఆశీర్వదించి; మగిడి చని= తిరిగివెళ్ళి; శంఖునిన్+కని= తన అన్న అయిన శంఖుడిని చూచి; నికృత్తంబులు+అయిన= ఖండించబడిన; హస్తంబులు= చేతులను; చూపి= చూపించి; సమ్యక్= చక్కగా; అనుభూత= అనుభవించిన; దండితుండన్+ఐతిన్= శిక్షపొందిన వాడినయ్యాను; అనినన్= అనగా; ఆతండు= ఆ శంఖుడు; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై.

తాత్పర్యం: ఒక నిశ్చయానికి వచ్చినవాడై, దండనీతిని చక్కగా అమలు పరిచే స్వభావం కల సుద్యుమ్నుడు ఆ మహానుభావుడైన లిఖితుడి చేతులు రెంటినీ ఖండించి శిక్షించాడు. ఆ లిఖితుడు రాజును ఆశీర్వదించి అన్నగారి వద్దకు వెళ్ళి తన తెగిన చేతులు చూపి, చక్కని దండనను అనుభవించానని చెప్పగా, శంఖుడు సంతోషించి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **ధర్మమార్గ ముల్లంఘింపఁ దగదుగాన । వలసె నిష్కృతి కులమెల్ల వెలసె నీ క**
తమున సురముని పితృ తర్పణములు సేయు । మరిగి బాహుదాపుణ్యతోయముల ననఘ. **166**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! (ఇక్కడ ఈ ప్రయోగం సార్థకం); ధర్మమార్గము= ధర్మముయొక్క పద్ధతి; ఉల్లంఘింపన్= దాటటం; తగదు= ఉచితం కాదు (కూడదు); కాన= అందువలన; నిష్కృతి= చేసిన దానికి ప్రాయశ్చిత్తం; వలసెన్= చేయవలసి వచ్చింది; నీ కతమునన్= నీ కారణంగా; కులము+ఎల్లన్= వంశమంతా; వెలసెన్= ప్రకాశించింది; అరిగి= వెళ్ళి; బాహుదా పుణ్యతోయములన్= పవిత్రమైన బాహుదా నది నీళ్ళలో; సుర+ముని+పితృ= దేవతలకు, మునులకు, పితరులకు; తర్పణములు= జలాంజలులు; చేయుము= చేయవలసినది.

తాత్పర్యం: 'పాపాలను పోగొట్టుకొన్న లిఖితుడా! ధర్మమార్గాన్ని ఎవరూ తప్పకూడదు. కనుక ప్రాయశ్చిత్తం అవసరమైనది. నీవలన మన వంశమంతా ప్రకాశిస్తున్నది. వెళ్ళి బాహుదానదిలోని పుణ్యప్రదమైన నీటిలో దేవతలకు, మునులకు, పితరులకు తర్పణా లిమ్ము.

వ. **వినుము.** **167**

తాత్పర్యం: (ఇంకా) వినుము.

తే. **కల్లు ద్రావుట, గురుపత్నిఁ గవయుటయును, । విప్రుఁ జంపుట, బ్రహ్మ స్వవిషయ మైన**
ముచ్చిలుటయును నివి గల క్రూరజనులఁ । బ్రీతిఁబొందుటయును మహాపాతకములు. **168**

ప్రతిపదార్థం: కల్లు+త్రావుట= సురాపానం; గురుపత్నిన్= గురువు యొక్క (అన్న, పెద్దవాడు, విద్యా బోధన చేసినవాడియొక్క) భార్యను; కవయుటయును= కూడటం; విప్రున్= బ్రాహ్మణుడిని; చంపుట= చంపటం; బ్రహ్మస్వవిషయము+ఐన= బ్రాహ్మణుడికి చెందిన ధనమునకు సంబంధించిన; ముచ్చిలుటయును= దొంగిలించటం; ఇవి+కల= ఈ నాలుగు లక్షణాలు ఉన్న; జనులన్= మానవులతో; ప్రీతిన్= ఇష్టంతో; పొందుటయును= కలిసి ఉండటం; మహాపాతకములు= పెద్దపాపపు పనులు.

తాత్పర్యం: సురాపానం, గురుపత్నిని కూడటం, బ్రాహ్మణుడిని చంపటం, బ్రాహ్మణుల ధనము దొంగిలించటం- ఈ నాలుగు లక్షణాలు కలవారితో ఇష్టంతో కలిసి ఉండటం మహాపాతకాలు (నిష్కృతిలేని పాపాలు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇమ్మహాపాతకంబు లేనింటిలోన నెద్ది సేసిన నే జాతివాఁడును దండనీయుండ, విశేషించి తస్కరుండు శారీరదండ యోగ్యుండు; రాజదండితులు సుకృత వంతుల భంగిఁ బుణ్యలోక ప్రాప్తులగుదురు; నీ వమ్మహారాజు చేత దండింప బడుటం బుణ్యాత్ముండవును వంశోద్ధారణ సమర్థుండవు నైతివి; సంతోషింపుము పొ'మ్మనినం బోయి లిఖితుండు. 169

ప్రతిపదార్థం: ఈ+మహాపాతకంబులు= ఈ గొప్ప పాపకార్యాలు; ఏనింటిలోనన్= ఐదింటిలో; ఎద్ది+చేసినన్= ఏది ఆచరించినా; ఏ జాతివాఁడును= ఏ వర్ణస్థుడైనా; దండనీయుండు+అ= శిక్షార్హుడే; విశేషించి= ప్రత్యేకంగా; తస్కరుండు= దొంగ; శారీరదండ యోగ్యుండు= శారీరకమైన శిక్షకు తగినవాడు; రాజదండితులు= రాజుచేత శిక్షించబడినవారు; సుకృతవంతుల భంగిన్= పుణ్యకార్యాలు చేసినవారివలె; పుణ్యలోక+ప్రాప్తులు= సత్కార్యాలు చేసినవారు పోయే లోకాలను పొందినవారవుతారు; నీవు= నీవు; ఆ+మహారాజుచేతన్= ఆ సుద్యుమ్నుడిచేత; దండింపఁబడుటన్= శిక్షించబడి ఉండటంచేత; పుణ్యాత్ముండవును= సుకృతివి; వంశ+ఉద్ధరణ+సమర్థుండవును= కులపావనుడవు; ఐతివి= అయ్యావు; సంతోషింపుము= ఆనందించుము; పొమ్ము= వెళ్ళుము; అనినన్= అనగా; లిఖితుండు= లిఖితుడు; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: 'ఈ ఐదు మహాపాతకాలలో ఏ ఒక్కటిచేసినా, ఏ వర్ణస్థుడైనా దండించ తగినవాడే. ప్రత్యేకించి దొంగ శరీరదండనకు అర్హుడు. రాజదండన పొందినవారు పుణ్యాత్ములవలె పుణ్యలోకాలకే పోతారు. నీవు సుద్యుమ్న మహారాజుచేత దండన పొందావు కనుక పుణ్యాత్ముడివి. వంశపావనుడివి అయ్యావు. దీనికి సంతోషించుము. ఇక వెళ్ళుము' అన్నాడు. లిఖితుడు అన్న చెప్పినట్లుగా వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. బాహుదానదియం దవగాహనంబు। సేయఁ బ్రభవించె నాతని చేతు లపుడ
విస్మయం బంది యతఁడు వేవేగ వచ్చె। నన్నపాలికి మగుడఁ బ్రహర్షమెసఁగ. 170

ప్రతిపదార్థం: బాహుదానదియందున్= బాహుదానదిలో; అవగాహనంబు+చేయన్= మునుగగా; అపుడు+అ= అప్పుడే; ఆతని చేతులు= ఆతడి చేతులు; ప్రభవించెన్= పుట్టాయి, మొలిచాయి; అతఁడు= ఆ లిఖితుడు; విస్మయంబు+అంది= ఆశ్చర్యపోయి; వేవేగ= మిక్కిలి వేగంగా; మగుడన్= తిరిగి; ప్రహర్షము+ఎసఁగన్= మిక్కిలి సంతోషం విజృంభించగా; అన్నపాలికిన్= అన్న దగ్గరికి; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: బాహుదానదిలో మునుగగానే లిఖితుడికి చేతులు మొలిచాయి. అతడు ఆశ్చర్యంతో, ఎక్కువైన ఆనందంతో వేగంగా అన్న దగ్గరకు తిరిగి వచ్చాడు.

విశేషం: బాహు= చేతులు; ద= ఇచ్చునది అనే పేరు ఈ సంఘటనతో ఆ నదికి సార్థకం అయింది.

వ. వచ్చి యరుణ కమలంబులం దెగడు తన కరంబులం జూపిన నతండు 'దీనికి నచ్చెరు పడనేల? యిది మదీయ తపోవిభవంబున దైవకృతం బైన విశేషంబు; నీవు శుచి వగుట దైవంబున కెక్కె; సుద్యుమ్నుండును నీ పుణ్యానుష్ఠానంబున నిజపితృవర్గ సహితంబుగా నిర్మలాత్ముండయ్యె' ననియె; నట్లగుటం జేసి. 171

ప్రతిపదార్థం: వచ్చి; అరుణ= ఎర్రని; కమలంబులన్= తామరలను; తెగడు= తిరస్కరించే; తనకరంబులన్= తన చేతులను; చూపినన్= చూపించగా; అతండు= ఆ శంఖుడు; దీనికిన్= ఈ చేతులు తిరిగి రావటానికి; అచ్చెరువడన్+ఏల?= ఆశ్చర్యపడటం ఎందుకు?; ఇది= ఈ విషయం; మదీయ= నా దైన; తపోవిభవంబునన్= తపస్సుయొక్క గొప్పతనం కారణంగా; దైవకృతంబు+ఐన= భగవంతుడు చేసిన; విశేషంబు= ప్రత్యేకాంశము; నీవు= నువ్వు (లిఖితుడు); శుచివి= పరిశుద్ధుడవు; అగుట= అవటం;

దైవంబునకున్= భగవంతుడికి; ఎక్కెన్= నచ్చింది; సుద్యుమ్నుండునున్= సుద్యుమ్నుడు కూడా; ఈ పుణ్య+అనుష్ఠానంబునన్= ఈ పుణ్యకార్యాన్ని ఆచరించటం వలన; నిజ= తన; పితృవర్గ+సహితంబుగాన్= పితరుల సమూహంతో కూడ; నిర్మల+ఆత్ముండు+అయ్యెన్= పవిత్రాత్ముడయ్యాడు; అనియెన్= అన్నాడు; అట్లు= ఆ విధంగా; అగుటన్+చేసి= అవటంచేత.

తాత్పర్యం: అన్నవద్దకు వచ్చి ఎర్రతామరలకన్న అందంగా ఉన్న తన చేతులను చూపించగా, ఆ శంఖుడు తమ్ముడితో 'దీనికంత ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఇది నా తపోవిభవం కారణంగా భగవంతుడు చేసిన అద్భుతం. నీవు పరిశుద్ధుడ వని పరమాత్మకు తెలిసింది. ఈ పుణ్యకార్యాచరణవలన సుద్యుమ్నుడు కూడా తన పితరులతో సహా పవిత్రుడయ్యాడు' అన్నాడు. అందువలన - (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **జననుత! నీవునుం దగఁ బ్రజాపరిరక్షణ మాచరింపు; నీ**
యనుజునిమాట వేదవచనార్థ నిరూఢము; రాజనీతి దం
డనమునఁ గాని యొండున నొడంబడ దెన్నఁడు నార్యకోటియం
దును వగదక్కు మేలు మిలఁ దుష్టిగఁ జేయుము మేటి జన్నముల్.' **172**

ప్రతిపదార్థం: జననుత!= ప్రజలచేత కీర్తించబడే ధర్మరాజా!; నీవునున్= నీవు కూడా; తగన్= చక్కగా; ప్రజాపరిరక్షణము= ప్రజలను చక్కగా కాపాడటాన్ని; ఆచరింపు= చేయుము; నీ+అనుజుని+మాట= నీ తమ్ముడు చెప్పినమాట; వేదవచన+అర్థనిరూఢము= వేదవాక్కులలోని అర్థాన్ని తెలియజెప్పేది; ఆర్యకోటి+అందును= పూజనీయులైనవారిలో కూడా; రాజనీతి= రాజ్యపాలనలోని న్యాయం; దండనమునన్+కాని= దండనచేత కాని; ఒండునన్= మరొక విధంగా; ఎన్నడున్= ఎప్పుడూ; ఒడంబడదు= కుదరదు; వగన్= బాధను; తక్కుము= వదలుము; ఇలన్= భూమిని; ఏలుము= పాలించుము; మేటి= గొప్ప; జన్నముల్= యజ్ఞాలు; తుష్టిగన్= తృప్తిగా; చేయుము.

తాత్పర్యం: 'ప్రజలచేత కీర్తించబడే ధర్మరాజా! నీవు కూడా చక్కగా ప్రజలను పాలించుము. నీ తమ్ముడు చెప్పినమాట వేదార్థంతో నిండింది. పూజ్యులైనవారు కూడా రాజనీతిలో దండనమున తప్ప మరొకరీతిగా రక్షణం ఏర్పడదు. కనుక శోకాన్ని వదలుము; భూమిని పాలించుము, గొప్ప గొప్ప యజ్ఞాలను తృప్తిగా చేయుము'.

వ. **అని చెప్పి మఱియు నిట్లనియె.** **173**

ప్రతిపదార్థం: అని చెప్పి= ఈ విధంగా చెప్పి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పారాశర్యు డీ విధంగా చెప్పి, ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. **' అడవుల మీరున్నయపుడు నీ తమ్ములు । వివిధ మనోరథావేశ కలిత**
హృదయులై యుండుదు; రదయత వీరి । నుపేక్షింప కిల యేలి యెల్లభోగ
ములకును భాజనంబులఁగా నొనర్పుము । తురగ మేధాది క్రతు ప్రయుక్తిఁ
బరఁగుము; వీరలు బహుయజ్ఞములు సేయు । వా రటమీఁద నిర్ద్వంద్వవృత్తి

తే. **వెడలెదవు గాక విను మేము వెట్టివార; । మే మహీశ్వర నీ మది మేలుగంటి**
మతిథి సుర పితృ విషయము నప్పు చిక్కు । గలిగియుండంగ నది నీకుఁ గాదు గాని. **174**

ప్రతిపదార్థం: మహీ+ఈశ్వర!= భూపతీ! ధర్మరాజా!; వినుము= వినవలసింది; అడవులన్= అరణ్యాలలో; మీరు; ఉన్న+అపుడు= నివసించినప్పుడు; నీ తమ్ములు= నీ అనుజులు; వివిధ= అనేకమైన; మనోరథ+ఆవేశ+కలిత+హృదయులు+ఐ= కోరికలతోనూ,

ఆవేశాలతోనూ కూడుకొన్న మనస్సులు కలవారై; ఉండుదురు= ఉండి ఉంటారు; అదయతన్= దయలేకుండగ; వీరిన్= నీ తమ్ములను; ఉపేక్షింపక= నిర్లక్ష్యం చేయక, పట్టించుకొనక పోవటం మాని; ఇల= భూమిని; ఏలి= పాలించి; ఎల్లభోగములకును= అన్ని భోగాలకు; భాజనంబులన్+కాన్= అర్హులయ్యేటట్లుగా; ఒనర్పుము= చేయుము; తురగమేధ+ఆది= అశ్వమేధం మొదలైన; క్రతు= యజ్ఞాలయొక్క; ప్రయుక్తిన్= ప్రయోగంలో (చేయటంవలన); పరఁగుము= నిమగ్నుడవు కమ్ము; వీరలు= నీ తమ్ములు; బహు= అనేకమైన; యజ్ఞములు= యాగాలు; చేయువారు= చేస్తారు; అటమీఁదన్= ఆ తరువాత; నిర్ద్వంద్వవృత్తి= ద్వంద్వాతీతమైన ప్రవృత్తిచేత; వెడలెదవుగాక= ముక్తిని పొందెదవుగాక; ఏము= మేము; వెఱ్ఱివారము+ఏ?= తెలివిలేని వారమా?; నీ మది= నీ మనస్సులో; మేలు+కంటిమి= శ్రేయస్సు ఏదో చూచాము; అతిథి సుర పితృ విషయమున్= అతిథుల, దేవతల, పితృదేవతల విషయంలో; అప్పు= ఋణం; చిక్కు= బాధ; కలిగి+ఉండఁగన్= మిగిలిపోయి ఉంటే; అది= ఆ ఋణ శేషం; నీకున్= నీకు; కాదు+కాని= తగదు.

తాత్పర్యం: 'ధర్మరాజా! వినుము. మీరు వనవాసం చేసేటప్పుడు నీ తమ్ములు పెక్కు కోరికలను, ఆవేశాలను పొంది ఉంటారు. నిర్దయతో వారిని నిర్లక్ష్యం చేయవద్దు. భూమిని పాలించి వారికి భోగాలన్నీ అందేటట్లు చూడుము. అశ్వమేధాది యాగాలు చేయుము. నీ తమ్ములు కూడా అనేక యజ్ఞాలు చేస్తారు, ఆ తరువాత ద్వంద్వాలకు అతీతమైన నడవడికతో ముక్తిని పొందగలవు. మేము తెలివిలేని వాళ్ళమా? నీ మదికి హితమైన దానిని గమనించాము, అతిథి, దేవ, పితృ ఋణాల బాధ మిగిలి ఉండటం నీకు తగదు. (వాటిని తీర్చటం మంచిదని సూచన).

విశేషం: అన్నమాట మీద తమ కోరికలను, ఆవేశకావేశాలను, కోపాలను అణచుకొన్న తమ్ములమాట వినటం ధర్మరాజు ధర్మం అని వ్యాసుడి సూచన.

ఆ. న్యాయశాస్త్రవేదియై యింగితాకార। చేష్ట లెఱిఁగి జనుల శిష్టదుష్ట
తావిశేష మరసి దండనీతి యొనర్చు। పతికి నెల్ల మేలుఁ బడయవచ్చు. 175

ప్రతిపదార్థం: న్యాయశాస్త్రవేది+ఐ= న్యాయశాస్త్రాన్ని బాగా తెలిసినవాడై; జనుల= ప్రజల; ఇంగిత= మనసులోని భావనయొక్క; ఆకార= రూపమును; చేష్టలు= చేతలును; ఎఱిఁగి= తెలిసి; శిష్టదుష్టతావిశేషము= మంచితనం, చెడ్డతనాలలోని విశేషాలను; అరసి= పరికించి; దండనీతి+ఒనర్చు= దండనీతిని అమలు పరచే; పతికిన్= రాజునకు; ఎల్లమేలున్= అంతా శుభమునే; పడయవచ్చున్= పొందవీలవుతుంది.

తాత్పర్యం: న్యాయశాస్త్రం బాగా తెలిసి, ప్రజలమనోభావనలు (అభిప్రాయాలు) వాటి రూపరేఖలు, చేష్టలు, మంచి చెడుల తారతమ్యం పట్టిచూసి దండనీతిని అమలు పరిచే రాజునకు అంతా మేలు జరుగుతుంది.

క. అరి యాఱవపాలు గొనుచుఁ। గరుణ గలిగి ప్రజలఁ దండ్రిగతి మధ్యస్థా
చరణంబునఁ బాలించుట। పరమ పదముఁజేర్చు విడువు భయసంశయముల్. 176

ప్రతిపదార్థం: అరి= పన్ను, కప్పం; ఆఱవపాలు= ఆరవవంతు; కొనుచున్= తీసికొంటూ; కరుణ+కలిగి= దయ కలిగినవాడై; ప్రజలన్= పౌరులను; తండ్రిగతిన్= కన్న తండ్రివలె; మధ్యస్థ+ఆచరణంబునన్= పక్షపాతం లేని వర్తనంతో; పాలించుట= పరిపాలన చేయటం; పరమపదమున్= మోక్షానికి; చేర్చున్= చేరుస్తుంది; భయ సంశయముల్= భయాన్ని, అనుమానాన్ని; విడువు= వదలిపెట్టుము.

తాత్పర్యం: ప్రజల ఆదాయం నుండి ఆరవభాగం పన్నుగా తీసికొంటూ, ప్రజలను కన్నతండ్రివలె కరుణా హృదయంతో పక్షపాతం లేని వర్తనంతో పాలనచేస్తే, అది మోక్షపదవికి చేరుస్తుంది. భయాన్ని, సందేహాన్ని వదలుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. **ఇవ్విధంబు గాక క్రొవ్వి కామ క్రోధ । కలిత చిత్తవృత్తిఁ దొలఁగ నడచు**
పతికి నగుఁ జతుర్థ భాగంబు ప్రజసేయు । పాపములఁ గులప్రదీపచరిత! **177**

ప్రతిపదార్థం: కులప్రదీపచరిత!= వంశాన్ని బాగా ప్రకాశింపచేసే నడతకల ధర్మరాజా!; ఈ+విధంబు= ఈ పద్ధతి; కాక= కాకుండా; క్రొవ్వి= పొగరెక్కి, అహంకరించి; కామ= కామంచేత; క్రోధ= కోపంచేత; కలిత= కూడుకొన్న; చిత్తవృత్తిన్= మనోవ్యాపారంతో; తొలఁగన్= తప్పి; నడచు= ప్రవర్తించే; పతికిన్= రాజునకు; ప్రజ+చేయు= పౌరులు చేసే; పాపములన్= పాపకార్యాలలో, చెడుపనులలో; చతుర్థభాగంబు= నాలుగవ వంతు; అగున్= అవుతుంది (వర్తిస్తుంది, చెందుతుంది).

తాత్పర్యం: వంశప్రతిష్ఠను పెంచే ధర్మరాజా! ఈ చెప్పిన పద్ధతిలో కాక, రాజు ననే అహంకారంతో కామక్రోధాలతో కూడుకొన్న మనోవ్యాపారం కలిగి, పద్ధతి తప్పి నడచుకొంటే, ప్రజలు చేసే పాపాలలో నాలుగవవంతు రాజునకు చెందుతుంది.

చ. **క్రమమున నైన శాత్రవులఁ గ్రందున నైనను జావఁ జేఁత ధ**
ర్మము విను పాపకర్ములగు రాజులతోఁ దగ సంధి సేఁత దో
షము విభుఁ డుర్వి యమ్ముకొని సంగరముం దొలఁగింపఁ గూడునే
సమరజితావనీభరణశాలితఁ బోలునె యొండు ధర్మముల్. **178**

ప్రతిపదార్థం: విను= ధర్మరాజా! వినుము; క్రమమునన్+ఐన= వరుసగా (ఒక పద్ధతిలో) అయినా; క్రందునన్+ఐనను= సందడిగా (ఒక్కసారిగా) అయినా; శాత్రవులన్= వైరులను; చావన్+చేఁత= చచ్చేటట్లు చేయటం; ధర్మము= చేయవలసిన విధి; పాపకర్ములు+అగు= చెడ్డపనులు చేసే వారైన; రాజులతోన్= రాజులతో; తగన్= చక్కగా; సంధి+చేఁత= సంధిచేయటం; దోషము= తప్పు; విభుఁడు= రాజు; ఉర్వి= భూమిని; అమ్ముకొని= విక్రయించి; సంగరమున్= యుద్ధాన్ని; తొలఁగింపన్+కూడును+ఏ?= తీసివేయటం (ఆపటం) తగినదా?; సమరజిత= యుద్ధంలో గెలువబడిన; అవనీభరణశాలితన్= భూభార దక్షతను; ఒండు ధర్మముల్= ఇతర ధర్మాలు (విధులు); పోలును+ఏ?= సరిపోతాయా?

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. నెమ్మది నెమ్మదిగా నైనా, ఒక్కసారిగా అయినా శత్రువులను మట్టుపెట్టటం విధ్యుక్తధర్మం. దుర్మార్గులైన రాజులతో సంధి చేసికొనటం తప్పు. భూమిని అమ్ముకొని యుద్ధాన్ని తొలగించటం (అంటే యుద్ధం చేయకుండా ఉండటం కోసం శత్రువులకు కొంతభూమిని ఇచ్చేయటం), వలన కలిసిరాదు కదా! యుద్ధంలో గెలిచిన రాజ్యభారాన్ని వహించగల సామర్థ్యంతో పోల్చగల ధర్మం మరొక్కటి లేదు.

వ. **కావున.** **179**

తాత్పర్యం: అందువలన.

క. **పో రుడుగను సమకూరద । కౌరవపతితోడ సంధి గావింపమి హిం**
సారుచి నైతి ననుట యవి । చారత నృపవంశకలితజని యగు నీకున్. **180**

ప్రతిపదార్థం: నృపవంశ కలిత జని= రాజవంశముతో కూడుకొన్న పుట్టువు కలవాడవు; అగు= అయిన; నీకున్= నీకు; పోరు= యుద్ధం; ఉడుగను= మానటం; సమకూరదు+అ= కుదరదు (సిద్ధించదు); కౌరవపతితోడన్= దుర్యోధనుడితో; సంధి+కావింపమిన్= సంధి చేయకపోవటం వలన; హింసారుచిన్= హింసయందు ఇష్టం కలవాడిని; ఐతిన్= అయ్యాను; అనుట= అనుకొనటం; అవిచారత= ఆలోచించకపోవటమే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మరాజా! రాజవంశంలో జన్మించిన నీకు యుద్ధం మానటం కుదరదు. దుర్యోధనుడితో సంధిచేయకపోవటంవలన హింసయందు అభిరుచి కలవాడిని అయ్యాను అనుకొనటం ఆలోచనారాహిత్యమే.

శా. **భూవిస్తారము నాక్రమించి ప్రజలం బ్రోవంగ దండింపనుం**
గావన్ నేర్చి మఖక్రియల్ నడపి సంగ్రామాగ్ని కాజ్యాహుతుల్
గా వైరిక్షతజంబు వేల్చి తనుషంగక్షేపకుండై హయ
గ్రీవుం డుత్తమసిద్ధిఁ బొందె; రణముల్ గీడే నృపశ్రేణికిన్? **181**

ప్రతిపదార్థం: హయగ్రీవుండు= హయగ్రీవుడనే రాజు; భూవిస్తారమున్= విస్తృతమైన భూమిని; ఆక్రమించి= స్వాధీన పరచుకొని; ప్రజలన్= జనులను; ప్రోవంగన్= కాపాడగా; దండింపనున్= శిక్షింపగాను; కావన్= రక్షించగాను; నేర్చి= తెలిసికొని; మఖక్రియల్= యజ్ఞకార్యాలు; నడపి= నిర్వర్తించి; సంగ్రామ+అగ్నికిన్= యుద్ధమనే అగ్నికి; ఆజ్య+ఆహుతుల్= నేతితోడి హోమద్రవ్యాలు; కాన్= అయ్యేటట్లు; వైరి= శత్రువుల; క్షతజంబు= నెత్తురును; వేల్చి= హోమంచేసి; తనుషంగక్షేపకుండు+ఐ= శరీర వ్యామోహం వదలినవాడై; ఉత్తమసిద్ధిన్= ఉత్తమగతిని; పొందెన్= పొందాడు; నృపశ్రేణికిన్= రాజ సమూహానికి; రణముల్= యుద్ధాలు; కీడు+ఏ?= హానికరాలా? (కావు అని భావం).

తాత్పర్యం: హయగ్రీవు డనే పేరుగల రాజు విశాలమైన సామ్రాజ్యాన్ని స్వాధీనపరచుకొని, ప్రజలను కాపాడటం, శిక్షించటం, రక్షించటం తెలిసికొని యజ్ఞాలు చేసి, యుద్ధ మనే అగ్నికి శత్రువుల రక్తమనే నేతితో కూడిన హోమ ద్రవ్యం అయ్యేటట్లుగా హోమంచేసి, శరీర వ్యామోహం వదలినవాడై ఉత్తమలోకాలు పొందాడు. రాజులకు యుద్ధాలు హానికరాలు కావు కదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. విశేషాంశాన్ని సామాన్యాంశం సమర్థిస్తున్నది.

వ. **సంగరంబునం జంపుటయుం జచ్చుటయును బ్రజాపరిపాలనంబును దగిన తెఱంగున దండించుటయును నుత్తమ క్షత్త్ర ధర్మంబులు గావున హింసవలని శంక విడిచి యాన్వీక్షకీ త్రయీవార్తా దండనీతు లను రాజవిద్యలయందును బ్రవీణులగు సహాయులతోడం గూడి సర్వ వ్యవహారంబులు నిర్వహింప నిర్వాణం బనతిదూరం బగుఁ; గలంక దక్కు' మని పలికె; సకల లోక గ్రాహ్యవచనుండగు నమ్మహాముని యిట్లు సెప్పం దెలివొందక యున్న ధర్మనందనుం గనుంగొని పురందరనందనుం డుల్లంబునం గోపంబు గదుర మొగంబునం దోఁపనీక యుండె; నప్పాండవాగ్రజుం దత్తపోతధనవర్యు వదనంబునం జూడ్కి నిలిపి నిభృతంబుగా నిట్లనియె.** **182**

ప్రతిపదార్థం: సంగరంబునన్= యుద్ధంలో; చంపుటయున్= చంపటమూ; చచ్చుటయును= చనిపోవటమూ; ప్రజాపరిపాలనంబును= జనులను పాలించటమూ; తగిన తెఱంగునన్= ఉచితమైన రీతిలో; దండిచుటయును= శిక్షించటమూ; ఉత్తమ క్షత్త్రధర్మంబులు= శ్రేష్ఠులైన రాజులు ఆచరించవలసిన విధులు; కావునన్= కనుక; హింసవలని= హింసను గూర్చిన; శంక= సంశయం; విడిచి= వదలి; ఆన్వీక్షకీ= విజ్ఞానాన్ని తెలిపే విద్య; త్రయీ= ధర్మాధర్మాలు తెలిపే విద్య; వార్తా= అర్థానర్థాలను తెలిపే విద్య; దండనీతులను= దండనీతి నయానయాలను తెలిపే విద్య అనే; రాజవిద్యల+అందును= క్షత్రియ ఉచితమైన విద్యలలో; ప్రవీణులు= పారంగతులు; అగు= అయినటువంటి; సహాయులతోడన్+కూడి= తోడ్పడేవారితో కలిసి; సర్వ= సమస్తమైన; వ్యవహారంబులు= పనులు; నిర్వహింపన్= చక్కగా చేయగా; నిర్వాణంబు= ముక్తి; అనతి దూరంబు+అగున్= దగ్గర అవుతుంది; కలంక= కలత, విచారం; తక్కుము= వీడుము; అని పలికెన్= అంటూ చెప్పాడు (వ్యాసుడు); సకల= సమస్త; లోక= లోకాలవారిచేత; గ్రాహ్య= గ్రహించదగిన,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్వీకరించదగిన; వచనుండు+అగు= మాటలు కలవాడైన; ఆ+మహాముని= ఆ గొప్పముని; ఇట్లు= ఈ విధంగా; చెప్పన్= చెప్పగా; తెలివి+ఒందక+ఉన్న= బోధకలుగక ఉన్న; ధర్మనందనున్= ధర్మరాజును; కనుంగొని= చూచి; పురందర నందనుండు= ఇంద్రజుడైన అర్జునుడు; ఉల్లంబునన్= మనస్సులో; కోపంబు= కోపం; కదురన్= కలిగినా; మొగంబునన్= ముఖాన; తోఁపనీక= కనబడనీయక; ఉండెన్= ఉన్నాడు; ఆ+పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; ఆ+తపోధనవర్యు= తపస్సే ధనంగా కలవారిలో శ్రేష్ఠుడైన వ్యాసుడి; వదనంబునన్= ముఖమునందు; చూడ్కి= చూపు; నిలిపి= స్థిరంగా ఉంచి; నిభృతంబు+కాన్= వినయంగా, స్పష్టంగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: యుద్ధంలో చంపటం, చనిపోవటం, ప్రజలను పాలించటం, ఉచితమైన రీతిలో దండించటం శ్రేష్ఠమైన రాజధర్మాలు. అందువలన హింసను గూర్చిన సంశయం వదలి, విజ్ఞానాన్ని తెలిపే ఆన్వీక్షకి, ధర్మాధర్మాలు తెలిపే త్రయీ, అర్థానర్థాలను తెలిపే వార్త, నయానయాలను తెలిపే దండనీతి అనబడే నాలుగు క్షత్రియోచిత విద్యలలోనూ పండితులైనవారి సాహాయ్యంతో అన్ని కార్యాలను చక్కగా నిర్వర్తిస్తే మోక్షం అతి సమీపంలో ఉంటుంది. విచారం వదలిపెట్టుము' అన్నాడు వ్యాసుడు. అన్ని లోకాల వారిచేత గ్రహించదగిన మాటలు (అన్ని లోకాలవారు సమ్మతించే మాటలు) కల ముని శ్రేష్ఠుడైన వ్యాసు డీ విధంగా చెప్పగా, వివేకం కలుగకుండా ఉన్న ధర్మరాజును చూచి అర్జునుడికి మనస్సులో కోపం కలిగింది కాని ముఖం మీద దానిని కనబడనీయలేదు. అప్పు డా ధర్మరాజు తపోధనశ్రేష్ఠుడైన వ్యాసుడి ముఖంపై తన చూపు నిలిపి (ముఖంలోకి చూస్తూ) వినయంగా ఈ విధంగా పలికాడు.

క. ' పతులు మృతులైనఁ బొగిలెడు । సతుల విలాపములు శోక సంతాపం బు
త్థితముగఁ జేయఁగ నే వసు । మతి యేలిన కలఁచుకలఁక మానునె బుద్ధిన్?' 183

ప్రతిపదార్థం: పతులు= భర్తలు; మృతులు+ఐనన్= మరణించగా; పొగిలెడు= కుమిలిపోయే; సతుల= భార్యల; విలాపములు= ఏడుపులు; శోక= విషాదంవలన; సంతాపము= రగులుతున్న బాధను; ఉత్థితముగన్= పైకెగసేటట్లు; చేయఁగన్= చేస్తుండగా; ఏన్= నేను; వసుమతి= భూమిని; ఏలిన= పాలించినట్లైతే; కలఁచు= బాధపెట్టే; కలఁక= కలత; బుద్ధిన్= మనస్సులో; మానును+ఎ?= తగ్గుతుందా? (తగ్గదని భావం).

తాత్పర్యం: 'మహర్షీ! భర్తలు మరణించగా కుమిలిపోయే భార్యల రోదనలు నాలో రగులుతున్న దుఃఖాలవలన పైకి ఎగదట్టుతుండగా, భూమిని నేను పరిపాలిస్తే అది మనసులోని కలతని పోగొట్ట గలదా?' (పోగొట్టలేదు).

వ. అనుటయు నమ్మునివరుం డతని కిట్లనియె. 184

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+మునివరుండు= ఆ మునులలో ఉత్తముడైన వ్యాసుడు; అతనికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఈ విధంగా ప్రశ్నించగా, మునిశ్రేష్ఠుడైన వ్యాసు డాతడితో ఇట్లా అన్నాడు.

సీ. ' దుఃఖంబుఁ బొమ్మని త్రోవ, సుఖంబు ర । మ్మని తెచ్చికొన వశమయ్య? వానిఁ
దొలుబామునందలి దుష్కృతంబును సుకృ । తంబు హేతువులుగఁ దగిలి చేయుఁ
బురుషుని కాలంబు; దిరములు గా వవి; పొరిఁ । బొరి వచ్చుచుఁ బోవుచుండు;
నర్థముల్ దుర్బుద్ధికైనను సిద్ధించు । నగు కాలమున; నార్యులయ్యుఁ గాని

ఆ. కాలమున ఘటింపఁగా నేర; వనిల వ । ర్షాతపేందురుచులు నధిప! కాల
కల్పితములు; మంత్రశిల్పౌషధంబులు । మేలుసేఁత కాలకీలితంబు. 185

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; దుఃఖంబున్= బాధను; పొమ్ము+అని= వెడలిపొమ్మని; త్రోవన్= త్రోసివేయటానికి; సుఖంబు= సౌఖ్యాన్ని; రమ్ము+అని= రారమ్మని; తెచ్చికొనన్= తీసికొనిరావటానికి; వశము+అయ్యె?= మనవశమా నాయనా?; వానిన్= ఆ సుఖ దుఃఖాలను; తొలుబామునందలి= పూర్వ జన్మయందలి; దుష్కృతంబును= చెడుపనులును, పాపకృత్యాలు; సుకృతంబు= మంచిపనులు, పుణ్యకార్యాలు; హేతువులుగన్= కారణాలుగా; పురుషుని= మానవుడిని; కాలంబు= కాలం, విధి; తగిలి చేయున్= పూనికతో చేస్తుంది; అవి= ఆ సుఖదుఃఖాలు; తిరములు= స్థిరమైనవి, శాశ్వతమైనవి; కావు; పొరిన్+పొరిన్= మరల మరల; వచ్చుచున్= వస్తూ; పోవుచున్= పోతూ; ఉండున్= ఉంటాయి; అగుకాలము= అయిన కాలంలో, కాలం కలిసి వచ్చినప్పుడు; దుర్బుద్ధికిన్+ఐనను= దురాత్ముడికైనా; అర్థముల్= సంపదలు; సిద్ధించున్= లభిస్తాయి; కాని కాలమునన్= కాలం కలిసి రాకపోతే; ఆర్యులు+అయ్యున్= సత్ప్రవర్తన కలిగిన వారికైనా; ఘటింపనేరవు= (ధనములు) లభించవు; అనిల= వాయువు; వర్ష= వాన; ఆతప= ఎండ; ఇందురుచులు= చంద్రకాంతులు, వెన్నెల; కాల కల్పితములు= కాలం కూర్చినట్టివి; మంత్ర= మంత్రాలు, ఆలోచనం; శిల్ప= బొమ్మలు (ఆకృతులు విగ్రహాలు); ఔషధంబులు= మందులు; మేలు+చేఁత= మంచిచేయటం; కాలకీలితంబు= కాలం యొక్క ఏర్పాటే.

తాత్పర్యం: 'ధర్మరాజా! బాధలను పొమ్మని తోసివెయ్యటం, సుఖాలను రమ్మని తీసికొనిరావటం, మనవశంలో లేదు. పూర్వజన్మలో చేసిన మంచి చెడు పనుల కారణంగా, కాలమే సుఖదుఃఖాలను తగినట్లుగా కలిగిస్తుంది. ఆ సుఖదుఃఖాలు కలకాలం నిలిచేవి కావు. మాటి మాటికి వస్తూ, పోతూ ఉంటాయి. కాలం కలిసివస్తే ఎంతటి దుర్మార్గుడికైనా సంపదలు సిద్ధిస్తాయి. కాలం కలిసిరాకపోతే సచ్ఛీలుడికైనా సంపదలు రావు. గాలి, వాన, ఎండ, వెన్నెల మొదలైనవన్నీ కాలంచేత చేయబడినవే. ఆలోచన లేక మంత్రములుకాని, కూర్పులు, లేక శిల్పాకృతులు కాని, మందులుకాని ఫలించి మేలు చేయటం కాలఘటనమే.

విశేషం: మంత్రాలు, యంత్రాలు, మందులు పనిచేశాయని మానవులు భ్రమపడతారు. వాస్తవానికి కాలం కలిసి వచ్చినప్పుడే అవి సత్ఫలితాల నిస్తాయి. ఇంకా సరిగా చెప్పాలంటే కాలం కలిసివచ్చినప్పుడే వాటిని ఆశ్రయించటం జరుగుతుంది.

క. కమలంబులుఁ దొవలు వికా । సముఁ బొందుట, లతలుఁ దరులు సకుసుమ ఫలభా
వముఁ బొందుట, పక్షులును మృ । గములును మదకలము లగుట కాలకలితముల్. 186

ప్రతిపదార్థం: కమలంబులున్= తామరలు; తొవలు= కలువలు; వికాసమున్+పొందుట= విచ్చుకొనటం; లతలున్= తీగలు; తరులు= వృక్షాలు; సకుసుమ+ఫల+భావమున్+పొందుట= పూలతోనూ, పళ్ళతోనూ కూడుకొన్న స్థితిని పొందటం; పక్షులును= పిట్టలూ; మృగములును= జంతువులూ; మదకలములు= మదంతో కూడినవి కావటం - సంతానోత్పత్తికి సిద్ధంగా ఉండటం; కాలకలితముల్= కాలంయొక్క కల్పనలే.

తాత్పర్యం: ధర్మరాజా! తామరలు, కలువలు విచ్చుకొనటం (ఇవి సూర్యోదయ చంద్రోదయ సూచకాలు), తీగలూ వృక్షాలూ, పూలతోనూ, పళ్ళతోనూ నిండి ఉండటం (ఇవి ఋతువులకు సూచకాలు), పక్షులూ, మృగాలూ సంతానోత్పత్తికి సిద్ధంకావటం కాలంయొక్క కల్పనలే.

వ. మఱియు జనన మరణంబులును, హానివృద్ధులును, లోనుగా సకలంబును గాలాధీనంబ కావున నీకు శోకింపం బనిలేదు; తొల్లి సేనజిత్తను మానవపతి పుత్ర మరణ శోకార్తుండై యుండి తనలోనన తెలిసి సజ్జన సన్నిధి నుపన్యసించిన వాక్యంబు లాకర్ణింపుము. 187

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకనూ వినుము; జనన+మరణంబులును= పుట్టుక, చావు; హానివృద్ధులును= నశించటం, పెరగటం; లోనుగాన్= మొదలైన; సకలంబును= సమస్తమూ; కాల+అధీనంబు+అ= కాలానికి లోబడి ఉంటుంది; కావునన్= కనుక; నీకున్; శోకింపన్= బాధపడే; పని లేదు= అవసరం లేదు; తొల్లి= పూర్వం; సేనజిత్తు+అను= సేనజిత్తు అనే పేరుగల; మానవపతి= రాజు; పుత్రమరణ= కుమారుడి చావువలన; శోక+ఆర్తుండు+ఐ= విషాదంతో బాధపడిన వాడై; ఉండి; తనలోనన్+అ= తనమనస్సులోనే; తెలిసి= ఎరిగినవాడై, జ్ఞానబోధ పొంది; సత్+జన= ఆర్యుల; సన్నిధిన్= సమక్షంలో; ఉపన్యసించిన= మాటాడిన; వాక్యంబులు= వచనాలు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ధర్మరాజా! అంతేకాదు. చావు పుట్టుకలు, ఎదుగుదల, తరుగుదలలు మొదలైన సర్వమూ కాలానికి లోనై ఉంటాయి సుమా! అందువలన నీవు బాధపడవలసిన పనిలేదు. పూర్వం సేనజిత్తు అనే రాజు పుత్రమరణం వలన మిక్కిలి బాధపడి, జ్ఞానబోధను తనలోనుండే పొందాడు. (బయటినుండి ఎవరూ అతడికి బోధ చేయలేదు). తానెరిగిన దానిని పెద్దల సాన్నిధ్యంలో చెప్పాడు. ఆ మాటలు వినుము.

విశేషం: జ్ఞానం ఎప్పుడూ మనిషికి అంతరంగంలో నిక్షిప్తమై ఉంటుంది. బాహ్యమైన బోధలు దోహదం మాత్రం చేస్తాయి. జ్ఞానబోధ 'తన' (ఆత్మ)లో నుండి మాత్రమే కలుగుతుంది. ఈ వాస్తవాన్ని వ్యాసుడు ధర్మరాజుకు కూడా తెలిపాడు.

పారాశర్యుఁడు ధర్మజునకు సేనజిత్తువాక్యంబు లుపన్యసించుట (సం.12-26-18)

సీ. **'తారు గొందఱకు బాధకు లయి నడచుట । పరులచే బాధలఁ బడుట గలుగు;**
నివి కాలభావ్యంబు; లెఱుక కల్గిన నొరుఁ । బఱిచితి నొరులచేఁ బడితి ననుచుఁ
బురుషుండు ప్రియశోకములఁ బొందఁ; డర్థ దా । రాపత్య బాంధవహాని కాత్మఁ
గుందంగ నడలుట మందబుద్ధిత్వంబు; । వగఁ గీడు మానునే? వలవ దడల;

తే. **శోకభయకారణంబులు లోకమున న । నేకములు; దానఁ దలసూపు శోకములకు**
భయములకు బుద్ధి నెడయీఁడు పండితుండు । మూఢుఁడవి త్రోవనేరండు మునుఁగు వగల. **188**

ప్రతిపదార్థం: తారు= తాము; కొందఱకున్= కొంతమందికి; బాధకులు+అయి= బాధించేవారై; నడచుట= ప్రవర్తించటం; పరులచేన్= ఇతరులచేత; బాధలుపడుట= కష్టపడటం; కలుగున్= జరుగుతాయి; ఇవి= ఈ కష్టపెట్టటం, కష్టపడటం అనేవి; కాలభావ్యంబులు= కాల స్వరూపంగా భావించదగినవి; ఎఱుక కల్గినన్= ఈ జ్ఞానం ఉంటే; పురుషుండు= మానవుడు; ఒరున్= పరుని; పఱిచితిన్= నేలకూల్చాను; ఒరులచేన్= ఇతరులచేత; పడితిన్= బాధపడ్డాను; అనుచున్= అంటూ; ప్రియశోకములన్= సంతోషాన్ని, దుఖాన్ని; పొందఁడు= కలిగి ఉండడు; అర్థ= ధన; దార= భార్య; అపత్య= సంతతి; బాంధవ= చుట్టాలయొక్క; హానికిన్= నష్టానికి; ఆత్మన్= మనసులో; కుందంగన్= కుమిలిపోయేటట్లు; అడలుట= ఏడ్వటం; మంద బుద్ధిత్వంబు= తెలివితక్కువతనం; వగన్= బాధవలన; కీడు= చేటు; మానును+ఏ?= తగ్గుతుందా?; అడలన్= దుఃఖించటం; వలవదు= కూడదు; లోకమునన్= లోకంలో; శోక, భయ, కారణంబులు= దుఃఖానికి, భయానికి, కారణాలు; అనేకములు= ఎన్నో ఉన్నాయి; దానన్= ఆ కారణంగా; పండితుండు= జ్ఞాని; తల+చూపు= పొడగట్టే, కనిపించే; శోకములకున్= దుఃఖాలకు; భయములకున్= భయాలకు; బుద్ధిన్= మనసులో; ఎడ+ఈఁడు= చోటుఇవ్వడు; మూఢుఁడు= మూర్ఖుడు; అవి= వాటిని; త్రోవనేరండు= తొలగ త్రోయలేడు; వగలన్= బాధలలో; మునుఁగున్= మునిగిపోతాడు.

తాత్పర్యం: 'లోకంలో తాము కొందరిని బాధించటం, కొందరు తమనే బాధపెట్టటం జరుగుతాయి. ఇవన్నీ కాలప్రభావాలనే భావించాలి. ఈ జ్ఞానం ఉన్న మానవుడు తాను బాధించాననో, బాధపడ్డాననో సంతోషాన్ని, దుఃఖాన్ని

పొందడు. ధనం, భార్య, సంతానం, బంధువులు పోయినప్పుడు మనసు కష్టపడేటట్లు బాధ పడటం తెలివితక్కువతనం అవుతుంది. బాధపడితే జరిగిన నష్టం పోతుందా? కనుక బాధపడకూడదు. భయానికి, శోకానికి లోకంలో కారణాలు అనేకం. అందువలననే జ్ఞాని అయినవాడు తన మనస్సులో భయశోకాలకు తావీయడు. మూర్ఖుడు వాటిని తొలగించలేక, బాధలలో మునిగిపోతాడు.

క. వినుఁ డీ సుఖమును దుఃఖము । ననిత్యములు గాన వానియాగమ కాలం
బున ముదమును శోకము మొగ । కొనమియ చు మ్మురవు శాంతి గోరు జనులకున్. 189

ప్రతిపదార్థం: వినుఁడు+ఈ= వినవలసింది; సుఖమును= సంతోషం; దుఃఖమును= బాధా; అనిత్యములు= శాశ్వతాలు కావు, తాత్కాలికాలు; కాన= కనుక; శాంతిన్= మనశ్శాంతిని; కోరు= కావాలనుకొనే; జనులకున్= మానవులకు; వాని= ఆ సుఖదుఃఖాల; ఆగమ కాలంబునన్= వచ్చే సమయంలో; ముదమును= సంతోషానికి; శోకమును= బాధకు; మొగకొనమి+అ= అభిముఖం కాకపోవటమే; ఉరవు= ఉచితం; చుమ్ము= సుమా!

తాత్పర్యం: సుఖదుఃఖాలు తాత్కాలికాలు కనుక, శాంతికాముకులైన జనులు సుఖం వచ్చినప్పుడు సంతోషాన్నీ, దుఃఖం వచ్చిప్పుడు బాధనూ పొందకుండా ఉండటం ఉచితం.

తే. మూఢతమబుద్ధు లగువారుఁ బ్రౌఢతమ వి । వేకులును సుఖు; లట్టులు గాక కొంత
ప్రజ్ఞగలవారలై యపప్రతిభు లైన । జనులు దుఃఖార్తు లగుట నిస్సంశయంబు.' 190

ప్రతిపదార్థం: మూఢతమ బుద్ధులు+అగువారు= మిక్కిలి మూర్ఖమైన బుద్ధికలవారూ; ప్రౌఢతమవివేకులును= మిక్కిలి ఘనమైన, గాఢమైన విచక్షణాజ్ఞానం కలిగినవారూ; సుఖులు= సుఖపడతారు; అట్టులు= ఆ విధంగా; కాక= కాకుండా; కొంత= కొద్ది; ప్రజ్ఞకలవారలు+ఐ= స్వతస్సిద్ధమైన తెలివి కలిగినవారై; అపప్రతిభులు+ఐన= సరైన ప్రతిభ లేని వారైనటువంటి; జనులు= మానవులు; దుఃఖ+ఆర్తులు= శోకంతో బాధపడేవారు; అగుట= అవటం; నిస్సంశయంబు= నిస్సందేహం, తప్పనిసరి.

తాత్పర్యం: మూర్ఖచక్రవర్తులూ (ఏమీ తెలియనివారు) జ్ఞానశ్రేష్ఠులూ (అన్నీ తెలిసినవారు) సుఖజీవులు. అట్లా కాకుండా తెలివి ఉండి, ప్రతిభ సరైన దారిలో లేనివారు మాత్రం దుఃఖంతో బాధపడటం తప్పదు'.

విశేషం: తెలిసీ తెలియని వారికే దుఃఖం కలుగుతుంది. మిడిమిడి జ్ఞానం భయహేతువు.

వ. అనియె; నాసేనజితుం డుదాత్త వివేక నిరూఢుం; డతని వచనంబులు విద్వదాదరణీయంబు; లిందలి యర్థంబు నీ చిత్తంబున నలవరింపుము; వగ యుజ్జగింపు' మని వెండియు. 191

ప్రతిపదార్థం: ఉదాత్త= అధికమైన; వివేక= విచక్షణాజ్ఞానం (మంచి చెడ్డలను నిత్యానిత్యాలను ఏర్పరచి చూడగల తెలివి)లో; నిరూఢుండు= బాగా పాతుకొని స్థిరపడిన వాడైన; ఆ సేనజితుండు= ఆ సేనజితుడు అనేరాజు; అనియెన్= పలికాడు; అతని వచనంబులు= అతడి మాటలు; విద్వత్= పండితులచేత; ఆదరణీయంబులు= ఆదరించదగినవి, అంగీకరించదగినవి; ఇందలి= ఈ మాటలలోని; అర్థంబు= భావం; నీ చిత్తంబునన్= నీ మనస్సులో; అలవరింపుము= అనుసరించుము; వగ= బాధను; ఉజ్జగింపుము= వదలుము; అని= పలికి; వెండియున్= తిరిగి, ఇంకనూ.

తాత్పర్యం: నిత్యానిత్య వివేకజ్ఞానాన్ని చక్కగా నిరూపించినవాడైన సేనజిత్తు ఆ విధంగా ఉపన్యసించాడు. అతడి మాటలు పండితులు ఆదరించదగినవి. ఆ మాటలలోని భావాన్ని నీ మనస్సుకు కాస్త పట్టనిమ్ము. శోకాన్ని వదలిపెట్టుము.' అని చెప్పి వ్యాసుడు ఇంకా ఇట్లా అన్నాడు.

తే. **' వర్ణముల నాశ్రమంబుల వలను మెఱసి । యరసి చక్కని తెరువున నరుగఁ జేసి**
ధరణి పాలింపు సముచిత దండధరణ । మాచరింపుము; నీ కిది యర్హవృత్తి. **192**

ప్రతిపదార్థం: వర్ణములన్+ఆశ్రమంబులన్= చతుర్వర్ణాలనూ, చతురాశ్రమాలనూ, వలను= వీలు; మెఱసి= ప్రకాశించి, కలిగి; అరసి= పరికించి, చూచి; చక్కని= సరైన, తిన్ననైన; తెరువునన్= దారిలో; అరుగన్+చేసి= నడచేటట్లుచేసి; ధరణి= భూమిని; పాలింపు= పాలనచేయుము; సముచిత= చక్కగా తగినటువంటి; దండధరణము= దండనీతిని వహించటం; ఆచరింపుము= చేయుము; నీకున్; ఇది= భూ పరిపాలనే; అర్హవృత్తి= తగినటువంటి జీవన విధానం.

తాత్పర్యం: నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాలు సరైన దారిలో నడిచేటట్లుగా వాటి ఆనుపానులు బాగా పరికించి తెలిసికొని భూమిని పాలించుము; చక్కని దండనీతిని అమలు పరచుము; నీకు తగిన జీవన విధానం ఇదే.

క. **దివికిం జనినను నెవ్వని । వివిధ గుణము లఖిల జనులు వినుతింతురు వాఁ**
డవనీశ్వర! సత్పురుషుం । డవునని కయికొండ్రు బుద్ధి నార్యజనంబుల్. **193**

ప్రతిపదార్థం: అవనీ+ఈశ్వర!= రాజా!; దివికిన్= స్వర్గానికి; చనిననున్= వెళ్ళినా, (స్వర్గస్థుడైనా); ఎవ్వని= ఎవరి; వివిధ= అనేకమైన; గుణములు= సద్గుణాలను; అఖిలజనులు= జనులందరు; వినుతింతురు= కీర్తిస్తారో; వాఁడు= అతడు; సత్+పురుషుండు+అవును+అని= సజ్జనుడవుతాడని; ఆర్యజనంబుల్= పెద్దలు; బుద్ధిన్= మనస్సులో; కయికొంద్రు= అంగీకరిస్తారు.

తాత్పర్యం: 'ధర్మరాజా! స్వర్గస్థుడైన తరువాత కూడా ఎవరి సద్గుణాలను లోకంలోని వారంతా కీర్తిస్తుంటారో, అట్టివాడు సజ్జను డని పెద్దలు అంగీకరిస్తారు.

వ. **కావున సకల జనహృదయ ప్రియహితం బగు పృథ్వీపరిరక్షణంబు నీకుం గులధర్మంబై కర్తవ్యం బగుట యుఱవుగాదె!' యనిన యమ్మునీంద్రునకు నమ్మనుజేంద్రుం డిట్లనియె.** **194**

ప్రతిపదార్థం: కావునన్= కనుక; సకల= సమస్తమైన; జన= ప్రజల; హృదయ= మనసులకు; ప్రియ= ఇష్టము; హితంబు= మేలు; అగు= అయిన; పృథ్వీ= భూమియొక్క; పరిరక్షణంబు= కాపాడటం; నీకున్= నీకు; కులధర్మంబు+ఐ= నీవు జన్మించిన రాజవంశం యొక్క విధి అయి ఉండి; కర్తవ్యంబు+అగుట= నీవు చేయవలసిన పని అయి ఉండటం; ఉఱవు= ఉచితం; కాదు+ఎ!= కదా!; అనిన= అన్న; ఆ+ముని+ఇంద్రునకున్= ఆ మునిశ్రేష్ఠుడితో; ఆ+మనుజ+ఇంద్రుండు= రాజశ్రేష్ఠుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కనుక సమస్తమైన ప్రజల హృదయాలకు, ఇష్టాన్నీ, మేలునూ కలిగించే రాజ్యపాలనం. నీకు జన్మతః ప్రాప్తించిన కులధర్మం అయి, తప్పక నిర్వర్తించవలసిన కర్తవ్యంగా ఉన్నది' అని ముని అన్నమాటలు విని రాజు ఈ విధంగా పలికాడు.

తే. **మఱవవచ్చునె నా కభిమన్యు ద్రౌప । దేయులను గర్ణు మత్స్య భూనాయకుండు**
ద్రుపద నృపతియు ధృష్టకేతుండు మాన । సమునఁ బాయుదురే యెట్లు శాంతి గలుగు? **195**

ప్రతిపదార్థం: నాకున్; అభిమన్యున్= అభిమన్యుడినీ; ద్రౌపదేయులను= ద్రౌపది పుత్రులైన ఉపపాండవులనూ; కర్ణున్= కర్ణుడినీ; మఱవన్+వచ్చును+ఎ= మరవటం వీలవుతుందా; మత్స్యభూనాయకుండు= మత్స్యదేశరాజు అయిన విరటుడు; ద్రుపదనృపతియున్= ద్రుపద మహారాజా; ధృష్టకేతుండు= ధృష్టద్యుమ్నుడు; మానసమునన్= మనస్సునందుండి; పాయుదురు+ఎ?= పోగలరా?; ఎట్లు= ఏ విధంగా; శాంతి= మనశ్శాంతి; కలుగున్?= కలుగుతుంది?

తాత్పర్యం: 'మహర్షీ! నాకు అభిమన్యుడినీ, ఉపపాండవులనూ, కర్ణుడినీ మరవటం వీలవుతుందా? (మరవలేనని భావం). విరాటరాజును, ద్రుపదమహారాజును, ధృష్టద్యుమ్నుడినీ మనసులోనుండి తొలగించగలనా? (మరవలేనని భావం). అట్టి స్థితిలో నాకు శాంతి ఎట్లా కలుగుతుంది?

సీ. **తొడలపై నర్మిలి నిడికొని న న్నుప । లాలించుచుండు బాల్యమున నట్టి**
భీష్మునిఁ జంపితి; బీభత్సు భల్లముల్ । దనువు సెక్కంగ నాతఁడు శిఖండిఁ
జూచుచు నుండుటఁ జూచితి; నది యుల్ల । మలమటఁ బెట్టెడి; నట్లుగాక
యా భంగి నున్నప్పు డాతఁ డాద్రుపదజు । నేయమిఁ దలఁచిన నెరియు మనసు;

తే. **పరశురాముని నోర్చిన బల్లిదుండు, । కాశిరాజ కన్యకలకుఁ గాఁగఁ బుడమి**
నరపతుల నెల్ల గెలిచిన బిరుదు గలన । నాఅడియ పడు టూహింప నడలు గదురు. **196**

ప్రతిపదార్థం: బాల్యమునన్= పసితనంలో; తొడలపైన్= ఒడిలో; అర్మిలిన్= ప్రేమతో; ఇడికొని= కూర్చుండపెట్టుకొని; నన్నున్+ఉపలాలించుచున్+ఉండు= నన్ను బుజ్జగిస్తూ ఉండే; అట్టి= అటువంటి; భీష్మునిన్= పితామహుడిని; చంపితిన్= చంపాను; బీభత్సు= అర్జునుడి; భల్లముల్= బాణాలు; తనువు= శరీరాన్ని; చెక్కంగన్= నాటుకొనగా; ఆతఁడు= ఆ భీష్ముడు; శిఖండిన్= శిఖండిని; చూచుచున్= చూస్తూ; ఉండుటన్= ఉండటం; చూచితిన్= చూచాను; అది= ఆ దృశ్యం; ఉల్లమున్= మనస్సును; అలమటన్= బాధ, చింత; పెట్టెడిన్= పెట్టుతుంది; అట్లు+కాక= అదేకాక; ఆ భంగిన్= ఆ విధంగా; ఉన్నప్పుడు= ఉన్న సమయంలో; ఆతఁడు= ఆ భీష్ముడు; ఆ ద్రుపదజున్= శిఖండిని; ఏయమిన్= బాణాలతో కొట్టకపోవటాన్ని; తలఁచినన్= తలచుకొంటే; మనసు= మనస్సు; ఎరియున్= కష్టపడుతుంది; పరశురామునిన్= భార్గవరాముడిని; ఓర్చిన= ఓడించిన; బల్లిదుండు= వీరుడు; కాశిరాజ కన్యకలకున్+కాఁగన్= కాశీరాజు కుమార్తెలైన అంబ, అంబిక, అంబాలికల కొరకు; పుడమి= భూలోకంలోని; నరపతులన్= రాజులను; ఎల్లన్= అందరినీ; గెలిచిన= ఓడించిన; బిరుదు= ప్రఖ్యాతుడు; కలనన్= యుద్ధంలో; ఆఅడి+అ= కష్టమే, ఇబ్బంది; పడుట= పడటం; ఊహింపన్= తలచుకొంటే; అడలు= బాధ; కదురున్= కలుగుతుంది.

తాత్పర్యం: చిన్నతనంలో ప్రేమగా ఒడిలో కూర్చోపెట్టుకొని బుజ్జగించి ముద్దుచేసిన భీష్ముడిని చంపించాను. అర్జునుడి బాణాలు శరీరంలో నాటుకొంటూ ఉండగా, శిఖండివంక చూస్తూ ఉన్న దృశ్యం నా మనస్సును కష్టపెట్టుతూనే ఉంటుంది. ఆయన ఆ స్థితిలో శిఖండిపై బాణాలు వేయకుండా ఉండటం తలచుకొంటే మనసుకి కష్టంగానే ఉంటుంది. పరశురాముడంతటి వాడినే గెలిచిన యోధుడు, అంబ, అంబిక, అంబాలికలకై భూతలంపై ఉన్న రాజులందరినీ గెలిచిన ప్రసిద్ధుడు అయినటువంటి వాడు యుద్ధభూమిలో ఇరుకున పడటం తలచుకొంటే బాధ కలుగుతుంది.

ఆ. **అల్పకాల భోగ్యమైన రాజ్యమునకుఁ । గా ననల్పకీర్తిఘనుని జరఠ**
సింహకల్పు వంశశేఖరజన్ముఁ ద్రుం । చితి మనంబు వగలఁ జివుక కున్నె. **197**

ప్రతిపదార్థం: అల్పకాల= కొద్దికాలం; భోగ్యము+ఐన= అనుభవించదగినదైన; రాజ్యమునకున్+కాన్= రాజ్యంకొరకు; ఆనల్ప= తక్కువ కాని, అధికమైన; కీర్తిఘనుని= కీర్తిచే గొప్పవాడైన; జరఠ= ముసలిదైన; సింహకల్పున్= సింహంతో; సమానమైనవాడిని; వంశశేఖరజన్మున్= కులంలో తలమానికమై జన్మించినవాడిని; త్రుంచితిన్= సంహరించాను; మనంబు= మనస్సు; వగలన్= బాధలతో; చివుకక+ఉన్నె?= చీకిపోకుండా ఉంటుందా?

తాత్పర్యం: అశాశ్వతమైన రాజ్యభోగంకొరకు గొప్పకీర్తి కలవాడు, గట్టి వృద్ధసింహంతో సమానుడు, కురువంశానికి తలమానికమైనవాడు అయిన భీష్ముడిని సంహరించాను. దానికి నా మనస్సు బాధతో చివికి పోకుండా ఉంటుందా? (ఉండదని భావం).

మ. **జన సంపూజ్య పదారవిందుఁ డగు నాచార్యుండు శోకించి నం**
దను చొప్పారయ వేఁడి పెద్దయు ననుం దా నమ్మి యర్థింపఁ జా
వని వానిం గరిచావు బుద్ధి నిడి యశ్వత్థామ సచ్చెన్ నిజం
బని యే బొంకితి మేదినీభరణ మర్హంబే గురుద్రోహికిన్? **198**

ప్రతిపదార్థం: జన= జనులందరిచేత; సంపూజ్య= చక్కగా పూజించదగిన; పద+అరవిందుఁడు+అగు= పాదపద్మాలు కలవాడైన; ఆచార్యుండు= గురువు; శోకించి= బాధపడి; నందను= పుత్రుడి; చొప్పు+ఆరయన్= జాడతెలుసుకొనగా; వేఁడి= ప్రార్థించి; పెద్దయున్= అధికంగా; ననున్= నన్ను; తాన్= అతడు; నమ్మి= విశ్వసించి; అర్థింపన్= కోరగా; చావనివానిన్= చనిపోనివాడిని; కరిచావు= ఏనుగు మరణాన్ని; బుద్ధిన్+ఇడి= మనస్సులో పెట్టుకొని; అశ్వత్థామ+చచ్చెన్= అశ్వత్థామ చచ్చిపోయాడు; నిజంబు= నిజం; అని; ఏన్= నేను; బొంకితిన్= అబద్ధమాడాను; గురు ద్రోహికిన్= గురువుకు ద్రోహం చేసిన పాపికి; మేదినీభరణము= భూభారం వహించటం; అర్హంబు+ఏ?= తగినదా?

తాత్పర్యం: ప్రజలందరిచేత బాగా పూజింపబడే పాదపద్మాలు కల గురువైన ద్రోణుడు, తనకుమారుడి జాడ తెలియక బాధపడి, నాపై నమ్మకంతో వెదకుమని కోరగా - చచ్చిన ఏనుగును మనస్సులో పెట్టుకొని, చావని గురుపుత్రుడి గురించి 'అశ్వత్థామ చనిపోయాడు. ఇది నిజం.' అని అబద్ధమాడాను. గురుద్రోహికి భూభారం వహించే అర్హత ఉంటుందా? (ఉండదని భావం).

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

ఆ. **రాజ్యలాభ లోభరతుఁ డయి కడుఁ బాప । మైన బొంకు మాటలాడి గురునిఁ**
గూల్పనేర్చినట్టి క్రూరాత్ముఁ డేగతిఁ । బోవువాఁడు సెపుమ బుధవరేణ్య! **199**

ప్రతిపదార్థం: బుధవరేణ్య!= పండితోత్తముడా!; రాజ్యలాభ= రాజ్యం పొందాలనే; లోభరతుఁడు+అయి= లోభబుద్ధికలవాడై; కడున్= మిక్కిలి; పాపము+ఐన= దుష్కర్మమైన; బొంకుమాటలు= అబద్ధపు పలుకులు; ఆడి= పలికి; గురునిన్= ఆచార్యుడిని; కూల్పన్= పడగొట్టటం; నేర్చిన+అట్టి= తెలిసికొన్నటువంటి; క్రూర+ఆత్ముఁడు= దుర్బుద్ధి; ఏగతిన్= ఏ గతికి; పోవువాఁడు= వెళ్ళుతాడో; చెపుము+అ= చెప్పుము.

తాత్పర్యం: అన్నీ తెలిసిన పండితులలో ఉత్తముడైనవాడా! రాజ్యం పొందాలనే దురాశతో నిండిన మనసు కలవాడై మిక్కిలి పాపకార్యమైన అసత్యం పలికి, గురువును చంపటం నేర్చుకొన్న కఠినాత్ము డేగతి పొందుతాడో చెప్పుము.

క. **భ్రాత మహాత్ముఁడు గర్ణుం । డాతనిఁ జంపించి యేలు నవనీరాజ్యం**
బాతురత సేయుఁ గాక సు । ఖాతిశయము మతికి నొసఁగునయ్య మునీంద్రా! **200**

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= మునివర్యా!; కర్ణుండు= కర్ణుడు; భ్రాత= సోదరుడు; మహా+ఆత్ముఁడు= మహానుభావుడు; ఆతనిన్= ఆ కర్ణుడిని; చంపించి= చంపేటట్లు చేసి; ఏలు= పాలించే; అవనీరాజ్యంబు= ధరణీరాజ్యం; ఆతురత= కల్లోలం,

బాధ; చేయున్= కలిగిస్తుంది; కాక= తప్ప; సుఖ+అతిశయము= అధికమైన సుఖాన్ని; మతికిన్= మనస్సుకు; ఒసగును+అయ్యా!= ఇస్తుందా? (ఇవ్వదని భావం).

తాత్పర్యం: మునీంద్రా! మహానుభావుడు, సోదరుడు అయిన కర్ణుడిని చంపించి చేసే రాజ్యపాలన బాధకలిగిస్తుందే కాని మనసుకు అధికమైన సుఖాన్ని ఇవ్వగలదా?

చ. కడిఁది మగండు కుంభజుఁడు గావఁగ నొప్పిన మంటవోలె నుం
డెడి మొనఁ జూచి చూచి యిది దెప్పర మ న్వగ లేక పంచితిం
గొడుకుఁ జొరంగ; నత్తెఱఁగు క్రూరత సైఁప సుభద్ర యట్లుఁ గ
వ్వడిక్రియ నేర్తురే యొరులు? వల్లభుఁ డేలగు నట్టిఁ డుర్వికిన్. 201

ప్రతిపదార్థం: కడిఁది= అధికమైన, గొప్ప; మగండు= శూరుడు; అయిన; కుంభజుఁడు= ద్రోణుడు; కావఁగన్= కాపాడుతుండగా; ఒప్పిన= పెద్దదైన; మంట+పోలెన్= అగ్నిజ్వాలవలె; ఉండెడి= ఉన్నటువంటి; మొనన్= సైన్యాన్ని; చూచి= పరికించి; ఇది= ఈ సైన్యం; డెప్పరము= దుస్సహం; అను= అనే; వగ= బాధ; లేక; కొడుకున్= కుమారుడిని, అభిమన్యుడిని; చొరంగన్= దూరుటకు, ప్రవేశించటానికి; పంచితిన్= పంపాను; ఆ+తెఱఁగు= ఆ విధమైన; క్రూరత= కాఠిన్యం; సుభద్ర+అట్లు= సుభద్రవలె; కవ్వడి+క్రియన్= అర్జునుడివలె; ఒరులు= ఇతరులు; సైఁపన్= సహించటం; నేర్తురే?= నేర్వగలరా?; అట్టిఁడు= అట్టివాడు (అట్టి క్రూరుడు); ఉర్వికిన్= భూమికి; వల్లభుఁడు= భర్త, రాజు; ఏల+అగున్?= ఏవిధంగా కాగలడు?

తాత్పర్యం: చాల గొప్ప శూరుడైన ద్రోణుడు కాపాడుతుండగా, పెద్ద అగ్నిజ్వాలవలె ఉన్న సైన్యాన్ని పరికించి కూడా దీనిని తట్టుకొనటం చాల కష్టం అనే బాధ లేక, కుమారుడైన అభిమన్యుడిని అందులో ప్రవేశించటానికి పంపించాను. అటువంటి నా క్రూరత్వాన్ని సుభద్రార్జునులవలె సహించగలవా రెవరైనా ఉంటారా? పసిబాలుడిని యుద్ధానికి పంపినటువంటి క్రూరుడు భూమిని పరిపాలించటానికి అర్హుడెట్లా అవుతాడు? (అభిమన్యుడిని యుద్ధానికి పంపి, మరణానికి కారణం అయినందువలన తనకు రాజ్యార్హత లేదని భావం.)

చ. అడ లెదఁ బొందఁగాఁ దగనియట్టిది ద్రోవది మేరుకల్పులం
గొడుకుల నేవురన్ జముఁడు గొన్న నలందురఁ జూడనేర్తునే?
పుడమి గిరీంద్ర పంచకము పోయినఁ బాడటినట్టు లున్న య
ప్పడఁతుక యెట్టులోర్చు గృహభారము నెమ్మది నిర్వహింపఁగన్. 202

ప్రతిపదార్థం: అడలు= భయం; ఎదన్= మనసులో; పొందఁగాన్= పొందటానికి; తగని+అట్టిది= వీలుకానిది అయిన; ద్రోవది= ద్రౌపది; మేరు కల్పులన్= మేరుపర్వతంతో సమానమైన వారైన; కొడుకులన్= కుమారులను; ఏవురన్= ఐదుగురిని; జముఁడు= యముడు; కొన్నన్= తీసికొనిపోగా; అలందురన్= దుఃఖిస్తుండగా; చూడ నేర్తునే?= చూడగలనా?; పుడమి= భూమిపై; గిరీంద్ర పంచకము= ఐదు పర్వతరాజాలు; పోయినన్= పోగా; పాడటినట్టులు+ఉన్న= పాడుపడినట్లుగా ఉన్నటువంటి; ఆ+పడఁతుక= ఆ స్త్రీ, ద్రౌపది; గృహభారము= ఇంటి బాధ్యత; నెఱ+మదిన్= నిండుమనసుతో, మనఃపూర్వకంగా; నిర్వహింపఁగన్= మోయటం; ఎట్టులు+ఓర్చున్?= ఎట్లా భరించగలుగుతుంది?

తాత్పర్యం: భయం బాధ మొదలైనవి మనసులో సహించలేనిది అయిన ద్రౌపది మేరుపర్వతంవలె గంభీరులు ఉన్నతులు అయిన కుమారులు ఐదుగురినీ యముడు తీసికొని పోగా, దుఃఖిస్తుండగా, నేను చూడగలనా? (ద్రౌపది

దుఃఖాన్ని చూడలేనని భావం). గొప్ప పర్వతాలు అయిదింటిని కోల్పోవటంవలన పాడుపడినట్లుగా ఉన్న భూదేవివలె ఉన్న ద్రౌపది గృహభారాన్ని మనఃస్ఫూర్తిగా నిర్వహించగలదా? (లేదేమో నని భావం).

విశేషం: అలం: ఉపమ.

క. ప్రాయోపవేశమున ని । క్కాయంబు దొఱంగు తలఁపు గదిరెడి; సంతా
పాయత్తచిత్తు నకటక । టా యని పోనిండు నను దృఢవ్రతయుక్తిన్. **203**

ప్రతిపదార్థం: ప్రాయోపవేశమునన్= మరణంకొరకు ఎదురుచూస్తూ ఆహారం తీసికొనకుండా ఉండటం అనే పద్ధతితో; ఈ+కాయంబున్= ఈ శరీరాన్ని; తొఱంగు= వదిలే; తలంపు= ఆలోచన; కదిరెడిన్= కలుగుతున్నది; సంతాప+ఆయత్త+చిత్తున్= మిక్కిలి బాధతో సిద్ధపడిన మనస్సు కలవాడిని; అకట+అకటా+అని= అయ్యయ్యో అనుకొని; దృఢవ్రతయుక్తిన్= గట్టి నియమంతో కూడినవాడనైన; ననున్= నన్ను; పోనిండు= వెళ్ళనివ్వండి.

తాత్పర్యం: నిరశనదీక్షతో మరణంకొరకు ఎదురు చూచి శరీరం వదలాలనే ఆలోచన కలుగుతున్నది. ఎంతో బాధవలన దానికి సిద్ధపడిన మనసుకలవాడినై, స్థిరమైన నియమంతో ఉన్న నన్ను అయ్యో అని జాలిపడి వెళ్ళనివ్వండి'.

వ. అని పలికి బంధుమరణ శోక వ్యాకులుం డయి యున్న యున్నరనాథవరేణ్యుతో నమ్మునినాథ వరేణ్యం డిట్లనియె. **204**

ప్రతిపదార్థం: అని పలికి= ఈ విధంగా మాటాడి; బంధుమరణ= చుట్టముల చావువలన కలిగిన; శోక= విషాదంతో; వ్యాకులుండు+అయి= కలతపడినవాడై; ఉన్న= ఉన్నటువంటి; ఆ+నరనాథవరేణ్యుతోన్= ఆ రాజశ్రేష్ఠుడితో; ఆ+మునినాథవరేణ్యుండు= ఆ మునీశ్వరులలో శ్రేష్ఠుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా మాట్లాడి, చుట్టాలందరు చనిపోవటంతో బాధపడి కలతచెందిన మనస్సు కల రాజోత్తముడైన ధర్మరాజుతో మునిసత్తముడైన వ్యాసు డిట్లా అన్నాడు.

ఆ. 'ఇట్లనంగఁ దగునె? యిమ్మెయి నడల నీ । యట్టి ధైర్యఘనున కగునె యనఘ!
బుద్ధి సెప్పవలసెఁ బునరుక్తభాషలఁ । జెవులు మదియుఁ గూడఁ జేర్చి వినుము. **205**

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడవైన ధర్మరాజా!; ఇట్లు= ఈ విధంగా; అనంగన్= అనటం; తగునె?= న్యాయమా?; నీ+అట్టి= నీ వంటి; ధైర్య ఘనునకున్= ధైర్యంచేత గొప్పవాడైనవాడికి; ఈ+మెయిన్= ఈ విధంగా; అడలన్= భయపడటం; అగును+ఎ?= తగునా?; పునః ఉక్త= మళ్ళీ చెప్పిన; భాషలన్= మాటలతో; బుద్ధి+చెప్పవలసెన్= కర్తవ్యబోధ చేయాల్సి వచ్చింది; చెవులు= కర్ణాలూ; మదియున్= మనస్సునూ; కూడన్+చేర్చి= కలిసేటట్లుగా చేర్చి; వినుము= వినుము.

తాత్పర్యం: 'పుణ్యశీలివైన ధర్మరాజా! నీవీ విధంగా మాట్లాడటం తగదు. నీ వంటి ధైర్యశాలికి ఇట్లా భయపడటం కూడదు. మళ్ళీ మళ్ళీ నీకు కర్తవ్య బోధచేయవలసి వస్తున్నది. ఈ మారు చెవులూ మనసును కూడా చేర్చి వినుము.

తే. పొదలుఁ దఱుఁగుటకై, పొడవొదవుఁ బడుట । కై, కడుం జేరుఁ బాయుటకై, జనించుఁ
బొలియుటకునై సుఖంబులఁ బొందు దుఃఖ । మొందుటకునై పదార్థము లెందు నధిప! **206**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఎందున్= ఎక్కడైనా; పదార్థములు= వస్తువులు; తఱుఁగుటకై= తగ్గటానికి (నశించటానికి); పొదలున్= వృద్ధిపొందుతాయి; పడుటకై= పతనం కావటానికే; పొడవు+ఒదవున్= రూపొందుతాయి; పాయుటకై= వదలి వెళ్ళటానికే;

కడున్= మిక్కిలి; చేరున్= (దగ్గర) సమీపం అవుతాయి; పొలియుటకునై= చనిపోవటానికే; జనించున్= పుట్టుతాయి; దుఃఖము= బాధ; ఒందుటకునై= పొందటానికి; సుఖంబులన్= సుఖాలను; పొందున్= కలిగి ఉంటాయి.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఎక్కడైనా పదార్థం వృద్ధిపొందటం నశించటానికే, ఎత్తుపెరగటం విరగటానికే. దగ్గరకావటం దూరమవటానికే, పుట్టటం గిట్టటానికే, సుఖపడటం కష్టాలు పొందటానికే.

ఉ. **మిత్రులచేఁతలన్ సుఖము మేకొను నంటయుఁ, జెందు దుఃఖముల్**
శత్రులచెయ్వి నంటయును, సన్మతి దా ధనమూల మంటయున్,
గోత్రవరేణ్య! భోగములకున్ ధనముల్ గరణంబు లంటయుం,
జిత్రచరిత్రుఁడైన విధి చేష్ట దొఱంగిన నీటివ్రా లగున్. **207**

ప్రతిపదార్థం: గోత్రవరేణ్య!= రాజోత్తమా! ధర్మరాజా!; మిత్రుల= హితుల; చేఁతలన్= పనులవలన; సుఖము= సౌఖ్యం; మేకొనున్= కలుగుతుంది; అంటయున్= అనటమూ; శత్రుల= వైరుల; చెయ్విన్= చేతవలన; దుఃఖములు= కష్టాలు; చెందున్= వస్తాయి; అంటయును= అనటమూ; సత్+మతి= సద్బుద్ధి; తాన్= అది; ధనమూలము= ధనం మొదలుగా కలది; అంటయున్= అనటమూ; భోగములకున్= సుఖానుభవాలకు; ధనముల్= సంపదలు; కరణంబులు= సాధనాలు; అంటయున్= అనటమూ; చిత్ర చరిత్రుఁడు+ఐన= మానవమేధకు అంతుచిక్కని నడత కలవాడైన; విధి= విధాత; చేష్ట= కార్యం; తొఱంగిన= విడిచిన, కాదనిన; నీటివ్రాలు= నీటిపైన వ్రాత; అగున్= అవుతుంది.

తాత్పర్యం: రాజశ్రేష్ఠా! ధర్మరాజా! మిత్రులు చేసే పనులవలన సుఖాలు కలుగుతా యని, శత్రువుల పనులవలన దుఃఖాలు కలుగుతా యని, సద్బుద్ధికి ధనం కారణమని, భోగాలకు ధనం సాధనమవుతుందని, అనటం - చిత్రమైన నడత కలవాడైన బ్రహ్మచేతలను కాదన్నచో; నీటి మీద వ్రాసిన వ్రాత అవుతుంది (కల్ల అవుతుంది).

వ. **కావున నెవ్వగ నొందం బనిలేదు.** **208**

ప్రతిపదార్థం: కావునన్= కనుక; నెఱ+వగన్= ఎక్కువ బాధను; ఒందన్= పొందవలసిన; పని లేదు= అక్కర లేదు.

తాత్పర్యం: అందువలన ఎక్కువ బాధపడవలసిన పని లేదు.

ఆ. **ధాత నిన్ను నేమి ధర్మంబు నడపుట । కై సృజించె దాని నాచరించి**
యుండు; నీవు నీక యొడయుండవే? ధాతృ । నోదిత ప్రవర్తనుఁడవు గాక!' **209**

ప్రతిపదార్థం: ధాత= సృష్టికర్త; నిన్నున్= నిన్ను; ఏమి ధర్మంబు= ఏ ధర్మాన్ని; నడపుటకై= ప్రవర్తింపచేయటానికి; సృజించెన్= సృష్టించాడో; దానిన్= ఆ ధర్మాన్ని; ఆచరించి= అమలు జరిపి; ఉండు= ఉండుము; ధాతృనోదిత= బ్రహ్మచేత ప్రేరేపింపబడిన; ప్రవర్తనుఁడవు+కాక= ప్రవర్తన (నడవడిక) కలిగిన వాడవు అవక; నీకున్+అ= నీకే; నీవు= నీవు; ఒడయుండవు+ఏ?= రాజువా?

తాత్పర్యం: నిన్ను బ్రహ్మ ఏ ధర్మాచరణకొరకు సృష్టించాడో, దానిని అమలు జరపవలసి ఉన్నది. నీకు నీవే రాజు వనుకొంటున్నావా? బ్రహ్మచేత నిర్దేశించబడిన నడత కలవాడివి కాక నీకు నీవే అధిపతివా?' (కావు - అని భావం.)

విశేషం: విధివ్రాత ననుసరించి ప్రవర్తిస్తారే కాని మానవులు స్వయంగా చేయలేరు అని భావం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి యప్పారాశర్యుండు వెండియు నిట్లను 'విదేహరా జగు జనకుండు వివేకపరిపాకంబు నొందక మున్నొకసమయంబున బంధువియోగంబు వాటిల్ల విషాదంబు నొంది, గృహంబు దొఱంగి వెడలు వాఁడయ్యె; నట్టియెడ నతని పాలికి నశ్మకుం డను విప్రవర్యుండు వచ్చిన నవ్వసుమతీపతి సముచిత ప్రకారంబునం బూజితుం జేసి. 210

ప్రతిపదార్థం: అని పలికి= ఇట్లా చెప్పి; ఆ+పారాశర్యుండు= ఆ పరాశరాత్మజుడు వ్యాసుడు; వెండియున్= ఇంకా; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; విదేహరాజు+అగు= విదేహరాజ్యాధిపతి అయిన జనకమహారాజు; వివేకపరిపాకంబున్= నిత్యానిత్య వివేకంలో పరిణతి (పరిపక్వత)ని; ఒందకమున్ను= చెందక ముందు; ఒక సమయంబునన్= ఒకసారి; బంధువియోగంబు= చుట్టాలను కోల్పోవటం; పాటిల్లన్= కలుగగా; విషాదంబును= దుఃఖాన్ని; ఒంది= పొంది; గృహంబు= ఇంటిని; తొఱంగి= వదలి; వెడలువాఁడు+అయ్యెన్= వెళ్ళిపోవటానికి సిద్ధమయ్యాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; అతని పాలికిన్= ఆ జనకుడి వద్దకు; అశ్మకుండు+అను= అశ్మకుడనే పేరుగల; విప్రవర్యుండు= బ్రాహ్మణోత్తముడు; వచ్చినన్= రాగా; ఆ+వసుమతీపతి= ఆ రాజు (జనకుడు); సముచిత= తగిన; ప్రకారంబునన్= పద్ధతిలో; పూజితున్+చేసి= పూజించి.

తాత్పర్యం: ఈ విధంగా మాట్లాడి వ్యాసుడు ఇంకా ఇట్లా చెప్పాడు. 'ధర్మజా! విదేహరాజైన జనకుడు తత్త్వజ్ఞాన పరిపూర్ణుడు కాకముందు, ఒకసారి బంధువులను కోల్పోవటం జరిగి, ఆ బాధతో ఇల్లు వదలి పోదలచాడు. ఆ సమయంలో అశ్మకుడనే బ్రాహ్మణుడు జనకుడివద్దకు వచ్చాడు. జనకు డాతనిని తగినట్లుగా పూజించాడు (తరువాతి పద్యంతో అన్వయం).

జనకున కశ్మకుండు సెప్పిన నీతి వ్యాసుఁడు ధర్మజునకుఁ జెప్పుట (సం. 12-28-2)

తే. 'అర్థములు బంధువులుఁ గల్గినపుడు తద్వి । యోగమైనట్టి యెడను మర్త్యునకు నెద్ది
తలఁపుమై నున్న మదవిషాదంబు లడర । కుండుఁ జెప్పవె యది కృపాయుక్తి ననఘ!' 211

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; అర్థములు= ధనములు, సంపదలు; బంధువులున్= చుట్టాలు; కల్గినపుడు= ఉన్నప్పుడూ; తద్= వాటి; వియోగము= ఎడబాటు; ఐన+అట్టి+ఎడను= కలిగిన సందర్భంలోనూ; మర్త్యునకున్= మానవుడికి; ఎద్ది= ఏది; తలఁపుమైన్= ఆలోచనలో, బుద్ధిలో; ఉన్నన్= ఉంటే; మద విషాదంబులు= అహంకారం, దుఃఖం; అడరక+ఉండున్= విజృంభించకుండ ఉంటాయో; అది= దానిని; కృపాయుక్తిన్= దయతో కూడిన వాడవై; చెప్పవు+ఎ?= తెలియచెప్పవా? (చెప్పుమని ప్రార్థన).

తాత్పర్యం: 'మానవుడి బుద్ధిలో ఏది ఉంటే, ధనం, బంధువులు కలిగినపుడు అహంకారం, అవి పోతే దుఃఖం కలుగకుండా ఉంటాయో దానిని దయతో నాకు తెలియజెప్పుము'.

వ. అని యడిగిన నాతం డిట్లనియె. 212

ప్రతిపదార్థం: అని= అంటూ; అడిగినన్= అడుగగా; ఆతండు= ఆ అశ్మకుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: జనకు డట్లా అడగగానే అశ్మకు డీ విధంగా జవా బిచ్చాడు.

సీ. 'దుఃఖంబు సుఖమును దోడివ సంసార । మునకుఁ; దద్వశగతిఁ బోవు నరుని
యాత్మ నంబుదము గా ద్రపహరించిన విధం । బున నవి సెఱుచు; నేపున సుఖైక
భాగియు దుఃఖైకభాగియు లేమి లో । కంబునం దెలియంగఁ గనుట మందు
వానికి; విను జర రానీక త్రోవంగఁ । జావక యుండ వశంబె జలధి

తే. వలయ వేష్టిత క్షితి నేలు వానికైన। నధిప! యెద్ది వాటిల్లిన ననుభవించు
నపుడు ప్రాప్తవ్య మిది యని యంతరంగ। విభ్రమము లేక యునికి వివేక సరణి. 213

ప్రతిపదార్థం: అధిప!= జనక మహారాజా!; దుఃఖంబు= శోకం; సుఖమును= సంతోషమూ; సంసారమునకున్= గృహస్థజీవనానికి; తోడివి+అ= కలిసి ఉండేవే; తద్= వాటికి; వశగతిన్= లొంగిన విధంగా; పోవు= వర్తించే; నరుని= మానవుడిని; ఆత్మన్= మనస్సును; అంబుదము= మేఘాన్ని; గాడ్పు= గాలి, వాయువు; అపహరించిన విధంబునన్= మాయం చేసినట్లుగా; అవి= ఆ సుఖదుఃఖాలు; చెఱుచున్= చెడగొడతాయి; ఏపునన్= అధికంగా, మిక్కిలి; సుఖ+ఏక+భాగియున్= సుఖమును మాత్రమే అనుభవించే వాడు కాని; దుఃఖ+ఏక+భాగియున్= దుఃఖాన్ని మాత్రమే అనుభవించే వాడు కాని; లోకంబునన్= లోకంలో; లేమి= లేకపోవటం; తెలియంగన్+కనుట= తెలిసేటట్లు చూడటం (తెలిసికొనటం); వానికిన్= ఆ సుఖదుఃఖాలకు; మందు= ఔషధం, ప్రతిచర్య; విను= వినుము; జలధి+వలయ+వేష్టిత= సముద్రమనే వలయంచేత చుట్టబడిన; క్షితిన్= భూమిని; ఏలువానికిన్+ఐనన్= పాలించే చక్రవర్తికైనా; జర= ముసలితనమును; రానీక= రానీయక; త్రోవంగన్= ఆవలకు నెట్టటం; చావక= మరణించక; ఉండన్= ఉండటం; వశంబు+ఎ?= చేతులలో ఉన్నదా? వీలవుతుందా?; ఎద్ది= ఏది; పాటిల్లినన్= సంభవించినా, వచ్చినా; అనుభవించు+అపుడు= అనుభవించే సమయంలో; ఇది= ఆ వచ్చినది; ప్రాప్తవ్యము= పొందదగింది; అని= అనుకొని; అంతరంగ విభ్రమము=మనస్సు భ్రమపడటం, చెదరటం; లేక= లేకుండా; ఉనికి= ఉండటం; వివేకసరణి= జ్ఞానమార్గం, తెలిసినవారి పద్ధతి.

తాత్పర్యం: 'జనక మహారాజా! సుఖదుఃఖాలు సంసార జీవనంలో కలిసే ఉంటాయి. గాలి మేఘాన్ని చెదరగొట్టినట్లు, వాటికి లోనై వర్తించే మానవుడి ఆత్మను అవి చెదరగొడతాయి. లోకంలో అధికమైన సుఖాలు మాత్రమే అనుభవించే వారు కాని, దుఃఖాలు మాత్రమే అనుభవించేవారు కాని లేరని తెలిసికొనటమే వాటికి తగిన మందు. సముద్రం చేత చుట్టబడిన భూమండలాన్నంతటినీ పరిపాలించే చక్రవర్తికి అయినా వార్ధకాన్ని దగ్గరకు రానీయక దూరంగా నెట్టటం కాని, చనిపోకుండా ఉండటం కాని వశమా? (కాదు కదా!) ఏది ఘటిల్లినా, అది ప్రాప్తం అనుకొని చిత్తం చెదరకుండా ఉండటం జ్ఞానుల పద్ధతి.

విశేషం: అలం: ఉపమ.

క. నరవర! సరసాన్నంబులుఁ। బరిమళ సద్వస్తువులును బరమశయన వి
ష్టరములుఁ గాలాధీనత। నరుఁ బొందుం, బాయు; వాని నమ్మమియ యుఱున్. 214

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; సరస+అన్నంబులున్= ఆరు రుచులతో కూడిన ఆహారాలు; పరిమళ= సువాసనలు చిమ్మే; సత్+వస్తువులును= మంచి పదార్థాలు; పరమ= ఉత్తమోత్తమమైన; శయనవిష్టరములున్= శయ్యలు, ఆసనాలు; కాల+అధీనతన్= కాలానికి లోబడి; నరున్= మానవుడిని; పొందున్= చేరుతాయి; పాయున్= వదలిపోతాయి; వానిన్= వాటిని; నమ్మమి+అ= నమ్మక పోవటమే; ఉఱున్= తగును.

తాత్పర్యం: రాజా! షడ్రసోపేతమైన ఆహారాలు, సుగంధభరితమైన అనేక ద్రవ్యాలు, ఉత్తమోత్తమమైన శయ్యలు, ఆసనాలు, కాలానుగుణంగా మానవులకు దొరుకుతూ ఉంటాయి, పోతూ ఉంటాయి. వాటిని నమ్మకుండా ఉండటమే మంచిది.

చ. వల నధికంబుగాఁ గలుగు వైద్యులు శాస్త్రము లభ్యసించి మం
దుల నొడఁగూర్ప నేర్చి తనదోషము లారయ బుద్ధి గల్గి యా
ర్తులకుఁ జికిత్స సేసెదరు; రోగము వాయమి లేదే? వారు రో
గు లగుట గానమెట్లు ప్రతికూలవిధిన్ నరునేర్పు ద్రోచునే? 215

ప్రతిపదార్థం: వలను= వీలు, ఆనుకూల్యం; అధికంబు+కాన్= ఎక్కువగా; కలుగు= కలిగిన; వైద్యులు= భిషక్కులు; శాస్త్రములు= రోగనిదానానికి సంబంధించిన శాస్త్రాలను; అభ్యసించి= చదివి; మందులన్= ఓషధులను; ఒడన్+కూర్పన్= తగిన విధంగా కలపటం; నేర్చి= అభ్యసించి; తనుదోషములు= వాత, పిత్త, కఫాది శరీర దోషాలు; ఆరయన్= గుర్తించే; బుద్ధి= తెలివి; కల్గి= ఉండి; ఆర్తులకున్= బాధపడుతున్నవారికి; చికిత్స= వైద్యం; చేసెదరు= చేస్తారు; రోగము= వ్యాధి; పాయమి= పోకపోవటం; లేదు+ఎ?= లేదా;? వారు= ఆ వైద్యులు; రోగులు+అగుట= వ్యాధి పీడితులవటం; కానము+ఎట్లు?= చూడటం లేదా?; నరునేర్పు= మానవుడి కౌశలం; ప్రతికూలవిధిన్= విధివైపరీత్యాన్ని; త్రోచును+ఏ?= నెట్టివేయగలదా? (లేదని భావం).

తాత్పర్యం: అవకాశం అధికంగా కలిగిన వైద్యులు వైద్యశాస్త్రాన్ని బాగా అధ్యయనం చేసి, మందులను సరిగా తయారుచేయటం నేర్చుకొని, శరీరదోషాలను గుర్తించే తెలివి కలిగి ఉండి, రోగులకు వైద్యం చేస్తారు. అయినా, రోగం తగ్గకపోవటం ఉంటుంది కదా! ఆ వైద్యులే రోగులవటం కూడా చూస్తున్నామే. మానవుడి నేర్పు విధివైపరీత్యాన్ని తొలగించలేదు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. మానవుడి మేధకన్న విధి బలీయమని అందరూ విధికి తల ఒగ్గవలసినవారేనని చెప్పటం.

సీ. **సద్వంశ జన్మంబు సౌందర్యమును బలం ၊బును సుభగతయును భోగములును**
భవితవ్యతానురూపంబులు పేదలై ၊ పెంచుట కలయంగఁ బెల్లు పుట్టు
దురు ప్రజ లెంతయు సిరిగలవారు గో ၊ రంగఁ బుట్టరు; దరిద్రపు జనంబు
లాఁకటం దిని ఱాలు నఱిగించు కొందరు; ၊ భోజ్య సంపన్నులు భోజనంబుఁ

తే. **బూర్ణముగఁ జేయఁజాలరు భూపవర్య! ၊ వెలఁది జూదంబు పానంబు వేఁట యతిని**
షేవితములు గాఁదగ దని చెప్ప వినుచు ၊ వలను గలవార చెడుదురు వానివలన. **216**

ప్రతిపదార్థం: సద్వంశ జన్మంబు= కులీనత; సౌందర్యమును= అందచందాలు; బలంబును= శక్తి; సుభగతయును= సౌభాగ్యం, అదృష్టం; భోగములును= అనుభవించదగిన సంపదలూ; భవితవ్యతా+అనురూపంబులు= సుకృతానికి తగినటువంటివి; పేదలు+ఐ= బీదవారై; పెంచుటకున్= పెద్దచేయటానికి; అలయంగన్= అలసిపోతుండగా; ప్రజలు= సంతానం; పెల్లు= అధికంగా; పుట్టుదురు= జన్మిస్తారు; సిరిగలవారు= ధనవంతులు; ఎంతయున్= ఎంతగానో; కోరంగన్= కావాలని కోరుకొన్నా; పుట్టరు= కలుగరు; దరిద్రము+జనంబులు= బీదవారైన మనుష్యులు; ఆఁకటన్= ఆకలితో; ఱాలున్= రాళ్ళను; తిని= తిని; అఱిగించుకొందురు= జీర్ణంచేసికొంటారు; భోజ్యసంపన్నులు= ఆహార సంపద ఎక్కువ ఉన్నవారు; భోజనంబున్ అన్నం తినటం; పూర్ణముగన్= పూర్తిగా, నిండుగా; చేయన్+చాలరు= చేయలేరు; భూపవర్య!= రాజోత్తమా!; వెలఁది= స్త్రీ; జూదంబు= ద్యూతం; పానంబు= సురాపానం; వేఁట= మృగయా వినోదం; అతి= పరిమితిని మించి; నిషేవితములు= సేవించదగినవి, అనుభవించదగినవి; కాన్+తగదు+అని= కాదని; చెప్పన్= (పెద్దలు) చెప్పగా; వినుచున్= వింటూ; వలను+కలవారు+అ=తగినవారు; వానివలనన్= ఆ వ్యసనాల కారణంగా; చెడుదురు= నశిస్తారు.

తాత్పర్యం: ఓ జనక మహారాజా! కులీనత, చక్కదనం, బలం, అదృష్టం, భోగాలు సుకృతానికి తగినట్లు లభిస్తాయి. పెంచటానికి కష్టపడే పేదలకు పిల్లలు ఎంతోమంది కలుగుతారు. కావాలని కోరే ధనవంతులకు సంతానం కలుగదు. బీదలు ఆకలితో రాళ్ళు తిని అరిగించుకొంటారు. సంపన్నులు కడుపునిండా తినలేరు. స్త్రీలు, జూదం, సుర, వేట మొదలైనవి మితిమీరి అనుభవించకూడదని పెద్దలు చెప్పగా వింటూ అన్నీ తగినవారు కూడా వాటివలన నశిస్తూ ఉంటారు.

విశేషం: జ్ఞానం కలిగి ఉండటం, దానిని అమలు పరచటం ఒకటి కాదు.

వ. అట్టివి దైవకృతంబులు గావున నిష్టానిష్ట ప్రాప్తులకుం గారణంబులు గనికొనలేవు; బాంధవలాభంబును దద్వియోగంబును వఱదం గాష్ఠంబులు సంగతంబులై పదంపడి పాసిన చందంబు. 217

ప్రతిపదార్థం: అట్టివి= అటువంటివి; దైవకృతంబులు= భగవంతుడిచేత చేయబడినవి (మానవులు చేసినవి కావు); కావునన్= అందువలన; ఇష్ట+అనిష్ట+ప్రాప్తులకున్= ప్రియమైనవి, అప్రియమైనవి పొందటానికి; కారణంబులు= హేతువులు; కనికొనలేవు= కనిపెట్టలేవు; బాంధవ లాభంబును= బంధువుల ప్రాప్తియు, (చుట్టాలను కలిగి ఉండటం); తద్+వియోగంబును= వారి ఎడబాటును; వఱదన్= ప్రవాహంలో; కాష్ఠంబులు= కట్టెలు; సంగతంబులు+ఐ= కలసికొని; పదంపడి= తరువాత; పాసిన= దూరమైన; చందంబు= తీరు.

తాత్పర్యం: అటువంటివి విధికృతాలు. మానవులు చేసినవి కావు. అందువలన మనం ఇష్టమైనవి పొందటం, ఇష్టం లేనివి ప్రాప్తించటం అనేవాటికి హేతువును కనిపెట్టలేవు. బంధుప్రాప్తి, వారి ఎడబాటు ప్రవాహంలో కొట్టుకొని పోతూ కట్టెలు కలిసికొని, విడిపోవటం వంటిదే.

విశేషం: అలం: ఉపమ.

తే. మాతృ పితృ దార పుత్రక భ్రాతృ శతస । హస్రకంబులు సంసృతి ననుభవింపఁ
బడియె; నిందులో నెవ్వరి కడలువాఁడు । నరుఁ డనిత్యత యూహించు టరయ నుఱవు. 218

ప్రతిపదార్థం: మాతృ+పితృ+దార+పుత్రక+భ్రాతృ+శత సహస్రకంబులు= తల్లి, తండ్రి, భార్య, పిల్లలు, సోదరుల వందలవేలు (లక్షలు); సంసృతిన్= సంసారంలో; అనుభవింపఁబడియెన్= అనుభవించబడ్డారు; ఇందులోన్= ఈ లక్షల బంధుత్వాలలో; ఎవ్వరికిన్= ఎవ్వరికొరకు; నరుఁడు= మానవుడు; అడలువాఁడు?= బాధపడుతాడు?; అనిత్యత= అశాశ్వతత్వాన్ని, నిలకడలేనితనాన్ని; ఊహించుట= భావన చేయటం; అరయన్= పరికించగా; ఉఱవు= ఉచితం; తగినది.

తాత్పర్యం: ఈ జననమరణ చక్రరూపమైన సంసారంలో (అనేక జన్మలలో) లక్షలకొద్ది తల్లి, తండ్రి, భార్య, పిల్లలు, సోదరుల బంధం అనుభవించబడింది. ఇందులో ఎవరికొరకని మనిషి బాధపడగలడు? దీనిని లెస్సగా భావించి మానవజీవితం ఎంత అశాశ్వతమైనదో తెలిసికొనటం సముచితం.

విశేషం: సంసారం అంటే జననమరణ చక్రం అనీ జీవితంలోబంధుత్వాదులు అశాశ్వతమనీ తెలియటం జ్ఞానమనీ తాత్పర్యం.

క. జనన జరామరణ గ్రా । హనిబిడ కాలాబ్ధి మగ్నమని జగము నెఱిం
గినవాఁడు ధర్మవర్తన । మున నుండుం జింత దక్కి భూపవరేణ్యా! 219

ప్రతిపదార్థం: భూపవరేణ్యా!= రాజులలో ఎన్నదగినవాడా!; జనన= పుట్టుక; మరణ= చావు అనే; గ్రాహ= మొసళ్ళచేత; నిబిడ= దట్టమైన; కాల+అబ్ధి= కాలమనే సముద్రంలో; మగ్నము+అని= మునిగినదని; జగమున్= లోకమును; ఎఱింగినవాఁడు= తెలిసికొన్నవాడు; చింతన్+తక్కి= శోకమును వదలి; ధర్మవర్తనమునన్= ధర్మమార్గ ప్రవర్తన కలిగి; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: జనకమహారాజా! ఈ లోకం చావు పుట్టుకలనే మొసళ్ళతో బాగా నిండిపోయి ఉన్న కాలం అనే సముద్రంలో మునిగిపోయి ఉన్నది - అని తెలిసికొన్న మానవుడు శోకాన్ని వదలి, ధర్మమార్గంలో నడుస్తాడు.

విశేషం: అలం: రూపకం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **తన యొడ లెరవనినను మను । జునకును బంధుతతి సతమె? శోకించిన వ**
చ్చునె చచ్చిన జంతువు? నె । మ్మన మధికము నొచ్చుఁ గాక మహితవివేకా! 220

ప్రతిపదార్థం: మహిత వివేకా!= గొప్ప విచక్షణా జ్ఞానం కల జనక మహారాజా!; మనుజునకున్= మానవుడికి; తన= తనయొక్క; ఒడలు= శరీరం, తనువు; ఎరవు+అనినను= తిరిగి ఇచ్చివేయటానికి అరువుగా అడిగి (యాచించి) తెచ్చుకొన్నది అనగా; బంధుతతి= బంధువర్గం; సతము+ఎ?= శాశ్వతమా?; చచ్చిన= చనిపోయిన; జంతువు= ప్రాణి; శోకించినన్= ఏడ్చినంత మాత్రాన; వచ్చును+ఎ= తిరిగి వస్తుందా?; నెఱ+మనము= నిండుమనసు (బాధపడటం వలన); అధికము= ఎక్కువగా; నొచ్చున్+కాక= బాధపడుతుంది తప్ప!

తాత్పర్యం: వివేకవంతుడవైన జనకమహారాజా! మానవుడికి తన శరీరమే అడిగి, అప్పుగా తెచ్చుకొన్నటువంటిది. అటువంటప్పుడు బంధువులు శాశ్వతమా? ఎంత బాధపడినా చచ్చిన జీవి తిరిగి రాదు కదా! అట్లా బాధపడటం వలన మనసు మరింత నొచ్చుకొనటం తప్ప ప్రయోజనం లేదు.

విశేషం: జీవుడు శరీరధారి మాత్రమే. ప్రతి జన్మలోనూ జీవుడు తను నివసించటానికి వీలుగా ఒక శరీరం కావాలని అడిగి తెచ్చుకుంటాడు. జీవుడు శరీరం కాదు; శరీరం జీవుడు నివసించే ఇల్లు వంటిది. ఇక బంధుత్వాలు తాత్కాలికాలే.

ఉ. **కావున నెవ్వగల్ విడువు; గైకొను మాత్మకులార్హ కర్మ సం**
సేవన తత్పరత్వము; విశిష్టజనంబుల సంగతిన్ భవ
ద్భావము కల్మషంబు దెగఁ బాచి శుచిత్వముఁ బొందు; లోకసం
భావిత కీర్తి వయ్యెదు నృపాలక! నా పలు కూఁదు పాటిగాన్.' 221

ప్రతిపదార్థం: నృపాలక!= రాజా!; కావునన్= అందువలన; నెఱ+వగల్= నిండు బాధలు; విడువు= వదలిపెట్టుము; ఆత్మకుల= నీ వంశానికి; అర్హ= తగిన; కర్మసంసేవన= పనిని బాగా చేయటంలో; తత్పరత్వమును= ఆశను, ఇష్టమును; కైకొనుము= స్వీకరించుము; విశిష్టజనంబుల= గొప్ప వ్యక్తుల, మహాత్ముల; సంగతిన్= సాంగత్యంలో; భవత్= నీ; భావము= ఆలోచన (ఊహ) లోని; కల్మషంబు= మలినాన్ని; తెగన్=+పాచి= పోయేటట్లు చేసి; శుచిత్వమున్= పవిత్రతను, నిర్మలత్వాన్ని; పొందు(ము)= సముపార్జించుకో; లోకసంభావిత= లోకంలోని అందరిచేత గౌరవించదగిన; కీర్తివి= కీర్తి కలవాడివి; అయ్యెదు= అవుతావు; నా పలుకు= నా మాట; పాటి+కాన్= తగినదని; ఊఁదు(ము)= గట్టిగా పట్టుకో, ఆచరించుము, నమ్ముము.

తాత్పర్యం: ఓ జనకమహారాజా! అందువలన బాధపడటం మానుము. నీ వంశానుగుణమైన పని (రాజ్యపాలన) ఆచరించటంలో నిమగ్నుడవు అయిపొమ్ము! సత్పురుషుల సాంగత్యంలో నీ మనసులోని మాలిన్యాన్ని పోగొట్టుకొని పవిత్రతను సంతరించుకొమ్ము. అపుడు లోకులందరిచేత గౌరవించబడే కీర్తి కలవాడి వవుతావు. నా మాటను తప్పక నమ్మి పాటించుము'.

వ. **అనుటయుం దెలిసి జనకుం డమ్మునిని నామంత్రితుంజేసి నిజకర్మతంత్ర నిర్వహణంబునకై గృహంబున నిలిచె; నీవు నట్లు యుమ్మలికం బుజ్జగింపు ముత్తమ క్షాత్త్ర సరణి సాధితంబైన భూవలయంబుఁ బాలింపుము; తక్కటి తలంపులు దక్కు'మని పలికిన విని పలుక కున్న యగ్రజుం జూచి సవ్యసాచి జనార్దనుతో నిట్లనియె.222**

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; తెలిసి= వివేకం కలిగినవాడై; జనకుండు= జనకమహారాజు; ఆ+మునిన్= అశ్మకమునిని; ఆమంత్రితున్+చేసి= వీడుకొలిపి; నిజకర్మ= తన పని అయిన; తంత్ర= స్వరాష్ట్ర పాలన; నిర్వహణంబునకున్+ఐ= వహించటానికి;

గృహంబునన్= ఇంటియందు; నిలిచెన్= ఉండిపోయాడు; నీవును= నీవు కూడా; అట్లు+అ= అదే విధంగా; ఉమ్మలికంబు= శోకం; ఉజ్జగింపుము= వదలుము; ఉత్తమ= శ్రేష్ఠమైన; క్షాత్రసరణి= క్షత్రియోచిత పద్ధతిలో; సాధితంబు+ఐన= పొందినది అయిన; భూవలయంబున్= భూమండలాన్ని; పాలింపుము= ఏలుము; తక్కటి= మిగిలిన; తలంపులు= ఆలోచనలు; తక్కుము= వదలుము; అని; పలికినన్= చెప్పగా; విని= ఆలకించి; పలుకక+ఉన్న= మాటాడక ఉన్న; అగ్రజున్= అన్నగారిని; చూచి= కని; సవ్యసాచి= అర్జునుడు; జనార్దనుతోన్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అశ్మకు డన్న ఆ మాటలతో జ్ఞానం కలిగినవాడై జనకమహారాజు ఆ మునికి వీడ్కోలు పలికి, తన విధ్యుక్తధర్మమైన రాజ్యపాలనా తంత్రాన్ని నిర్వర్తించటానికి ఇంట్లోనే ఉండిపోయాడు. నీవు కూడా అదేవిధంగా విషాదాన్ని వదలి, రాజధర్మానికి తగిన పద్ధతిలో సంపాదించిన భూమండలాన్ని ఏలుము. మిగిలిన ఆలోచనలను వదలుము' అని వ్యాసుడు చెప్పగా విని, మారు మాటాడని అన్నగారిని చూచి అర్జునుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

క. ' బహుబంధుమరణ శోక । ప్రహత వివేకమయి ధర్మరాజునకు మనో
మహిమ వికలమయ్యెం; । బర । మహిత వచోవృత్తిఁ దేర్పు మహితవిచారా! 223

ప్రతిపదార్థం: మహితవిచారా!= గొప్ప ఆలోచన కలిగిన శ్రీకృష్ణా!; ధర్మరాజునకున్; బహు= పెక్కు; బంధుమరణ= చుట్టాల చావువలన కలిగిన; శోక= విషాదంచేత; ప్రహత= బాగా దెబ్బతిన్న; వివేకము+అయి= విచక్షణాజ్ఞానం కలిగి; మనోమహిమ= మనసుయొక్క గొప్పతనం; వికలము= చెదరినది; అయ్యెన్= అయింది; పరమహిత= అన్నింటికన్న గొప్పదైన మేలు కలిగించే; వచోవృత్తిన్= మాటల తీరుతో; తేర్పు= తేటపడేటట్లు చేయుము.

తాత్పర్యం: 'గొప్ప భావనలు కల కృష్ణా! బహుబంధుమరణంవలన కలిగిన శోకం కారణంగా ధర్మరాజు వివేకం బాగా దెబ్బతిని, మనసు వికలమైంది. దానిని పరమ శ్రేయోదాయకమైన నీ హితోక్తులతో తేరుకొనేటట్లు చేయుము'.

వ. అనిన నచ్యుతుండు పాండవాగ్రజుఁ జేరంజని, యభివందనం బాచరించి, యతని కరంబు వట్టికొని, వదనంబు విరిదమ్మి చందంబు నొంద మధురాక్షర విన్యాసంబుగా నిట్లనియె. 224

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అచ్యుతుండు= నాశరహితుడైన శ్రీకృష్ణుడు; పాండవ+అగ్రజున్= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజును; చేరన్+చని= సమీపించి; అభివందనంబు+ఆచరించి= నమస్కారం చేసి; అతని= ధర్మరాజు;కరంబు= చేతిని; పట్టికొని= చేతితో పట్టుకొని; వదనంబు= ముఖం; విరిదమ్మి= విచ్చిన తామరపూవు; చందంబును+ఒందన్= వలెకాగా; మధుర+అక్షర+విన్యాసంబు+కాన్= తియ్యని మాటల కూర్పుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అర్జును డట్లా అడగగానే శ్రీకృష్ణుడు ధర్మరాజు దగ్గరకు వెళ్ళి, నమస్కరించి, అతడి చేతిని పట్టుకొని, వికసించిన తామరపూవువలె ఉన్న ముఖంతో, తియ్యగా ఈ విధంగా మాట్లాడాడు.

విశేషం: అలం: ఉపమ.

మ. ' పురుషవ్యాఘ్ర! మనంబు గుంద వగలం బొందంగ నీకేల? సం
గరకేలిన్ భవదీయబంధు లతిలోకంబైన తెంపొప్పఁ బో
యిరి నాకంబున; కట్లుగాక కలగాదే రాజవృత్తంబు దా
నరయన్ రాజుల యేల? యేజనులు నిత్యాయుర్ధనుల్ సెప్పుమా! 225

ప్రతిపదార్థం: పురుషవ్యాఘ్రు!= మనుజోత్తమా! ధర్మరాజా!; నీకు= నీవంటివాడికి; మనంబు= మనస్సు; కుందన్= కుంగిపోయేటట్లు; వగలన్= బాధలను; పొందంగన్= అనుభవించటం; ఏల?= ఎందుకు?; సంగరకేలిన్= యుద్ధమనే ఆటలో; భవదీయ= నీ; బంధులు= చుట్టాలు; అతిలోకంబు+ఐన= మానవాతీతమైన; తెంపు+ఒప్పన్= సాహసం ప్రకటమయ్యేటట్లు; నాకంబునకున్= స్వర్గానికి; పోయిరి= వెళ్ళారు; అట్లు+కాక= ఆ విధంగా కాకపోయినా; రాజవృత్తంబు= రాచకరికము; తాన్= అది; కలగాదే= స్వప్నమే కదా!; అరయన్= పరికించి చూస్తే; రాజులు+అ= రాజులే; ఏల= ఎందుకు?; ఏ జనుల్= ఏ మనుష్యులు; నిత్య+ఆయుర్ధనుల్= శాశ్వతమైన ఆయువనే ధనం కలవారో; చెప్పుమా?= చెప్పుము!

తాత్పర్యం: కృష్ణు డిట్లా అన్నాడు: 'పురుషశ్రేష్ఠుడవైన ధర్మరాజా! నీ వంటివాడు బాధలతో క్రుంగిపోవటం ఎందుకు? రణరంగంలో, కేళీప్రాయంగా నీ బంధువులు మానవాతీతమైన శౌర్యాన్ని ప్రదర్శించి స్వర్గస్థులయ్యారు. రాచరికం అన్నది కలకాక వాస్తవం కాదు కదా! ఒక్క రాజులే ఏమిటి? శాశ్వతమైన ఆయుర్దాయం కల మనుష్య లెక్కడ ఉన్నారు చెప్పుము'.

వ. అని పలికి వెండియు. 226

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికి= మాటాడి; వెండియున్= తిరిగి, ఇంకా.

తాత్పర్యం: శ్రీకృష్ణు డీ విధంగా మాటాడి ఇంకా ఇట్లా అన్నాడు- (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ' తొల్లి సృంజయుఁ డను మహీవల్లభుండు । పుత్రశోకాతురత్వంబుఁ బొందియున్న
నుపశమంబుగఁ బ్రాక్తననృపులఁ జెప్పి । తెలిపె నిమ్మౌని యంతకు బలిమి కలిమి.' 227

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; సృంజయుఁడు+అను= సృంజయు డనే పేరుగల; మహీవల్లభుండు= భూభర్త (రాజు); పుత్రశోక+ఆతురత్వంబున్= పుత్రశోకంవలని బాధను; పొంది+ఉండి= కలిగి ఉండగా; ఈ+మౌని= ఈ ముని - నారదుడు; ఉపశమంబుగన్= ఓదార్పుగా; ప్రాక్తన= ప్రాచీన; నృపులన్= రాజులను (వారి చరిత్రలను); చెప్పి= పలికి; అంతకు= యముడి; బలిమి కలిమి= బలాధిక్యాన్ని; తెలిపెన్= తెలియచెప్పాడు.

తాత్పర్యం: 'పూర్వం సృంజయుడనే రాజు పుత్రశోకంతో బాగా బాధపడుతూ ఉంటే, నారదమహర్షి అతడికి ఓదార్పు కలగటంకొరకు, ప్రాచీన రాజులనుగురించి, యముడి సామర్థ్యాన్ని గురించి తెలియజెప్పాడు'.

వ. అని యెఱింగించి నారదుం జూపి 'యిమ్మహాత్ముం డట్లు మరుత్తసుహోత్రాదులగు రాజుల పరమోత్కృష్ట కర్మంబులును, నట్టివారికిం గాలవశత్వంబునం బొందకుండ రామియుం దెలియ నుపన్యసించిన వాక్యంబు లభిమన్యు మరణశోక వ్యాకులుండ వగు నీకుం దాపోపశమంబుగాఁ గృపాతిశయంబునం బరిపాటి వీరలు సెప్పి'రని పారాశర్యమునీశ్వరు నిర్దేశించి, 'వీరి వచనంబుల యేనునుం జెప్పెద నాకర్ణింపు' మని యిట్లనియె. 228

ప్రతిపదార్థం: అని= అంటూ; ఎఱిగించి= బోధపరచి; నారదున్+చూపి= నారద మహర్షిని చూపించి; ఈ+మహాత్ముండు= ఈ మహానుభావుడు; అట్లు= ఆ విధంగా; మరుత్తసుహోత్ర+ఆదులు+అగు= మరుత్తుడు, సుహోత్రుడు మొదలైన; రాజులు= చక్రవర్తుల; పరమ+ఉత్కృష్ట+కర్మంబులును= మిక్కిలి శ్రేష్ఠమైన కార్యాలను; అట్టివారికిన్= అటువంటి వారికి కూడా; కాలవశత్వంబునన్+పొందక+ఉండ+రామియున్= కాలధర్మాన్ని (మరణాన్ని) చెందకుండా ఉండకపోవటాన్నీ; తెలియన్= బోధపడేటట్లు; ఉపన్యసించిన= పలికిన; వాక్యంబులు= మాటలు; అభిమన్యు+మరణ+శోక= అభిమన్యుడి మరణం వలన కలిగిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బాధచేత; వ్యాకులుండవు+అగు= కల్లోల పడినవాడవైన; నీకున్= నీకు; తాప+ఉపశమంబు+కాన్= బాధా నివారిణి అయ్యేటట్లు; కృపా+అతిశయంబునన్= అధికమైన దయతో; పరిపాటిన్= క్రమంగా; వీరలు= వీరు; చెప్పిరి+అని= చెప్పారని; పారాశర్యముని+ఈశ్వరున్= వ్యాసమునిని; నిర్దేశించి= చెప్పి (చూపి); వీరి వచనంబులు+అ= వీరి మాటలే; ఏనునున్= నేను కూడా; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము; అని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఈ విధంగా చెప్పి, బోధచేసి, నారదమహర్షిని చూపించి, 'ఈ మహానుభావుడు సృంజయుడికి మరుత్తు, సుహోత్రుడు మొదలైన చక్రవర్తులు చేసిన మహత్కార్యాలన్నీ చెప్పి, వారుకూడా కాలధర్మం చెందటాన్నీ తెలిసేటట్లు చెప్పిన మాటలనే ఇప్పుడు వీరు అభిమన్యుడి మరణంవలన కలతచెందిన నీకు బాధ తగ్గించటానికి ఎంతో దయతో చెప్పారు' అని వ్యాసమహర్షిని చూపించి 'వీరు చెప్పిన మాటలే నేను కూడా చెప్పుతాను వినుము' అని ఈ విధంగా చెప్పటం మొదలు పెట్టాడు.

ధర్మరాజునకుఁ గృష్ణుఁడు షోడశరాజుల చరిత్రంబులు సెప్పుట (సం. 12-29-16)

సీ. **'సంవర్తుఁ డను మహాసంయమి దేవతా। గురుతోడి యీసున నరుగుదెంచి,**
పూని యుపద్రష్టయై నడపంగ హి। మాచలపాదంబునందు శక్ర
వరుణ ప్రభృతులైన సురలు మహామునీం। ద్రులును సహాయులై మెలఁగుచుండ
శాలా ప్రముఖ భవ్యసాధనమ్ములు గన। కనకమయంబులుగ వస్త్రకాంచనాజ్య

ఆ. **దధిపయః ఫలాది తర్పణ ద్రవ్యస। మృద్ధి సకలజనులు మెచ్చఁ బెక్కు**
లధ్వరములు సేసె; నట్టి మరుత్తుండు। నిత్యపదవి నుండ నేర్చెనయ్య?' **229**

ప్రతిపదార్థం: సంవర్తుఁడు+అను= సంవర్తుడనే పేరుగల; మహాసంయమి= గొప్పముని; దేవతాగురుతోడి= దేవగురువైన బృహస్పతితో; ఈసునన్= అసూయతో, ఈర్ష్యతో; అరుగుదెంచి= వచ్చి; పూని= పట్టుపట్టి; ఉపద్రష్ట+ఐ= కార్యనిర్వాహకుడై; నడపంగన్= జరిపించగా; హిమ+అచల= హిమవత్పర్వతముయొక్క; పాదంబున+అందున్= మొదట్లో; శక్ర= ఇంద్రుడు; వరుణ= వరుణుడు; ప్రభృతులు+ఐన= మొదలైన; సురలు= దేవతలూ; మహాముని+ఇంద్రులును= గొప్ప ఋషివరులూ; సహాయులు+ఐ= తోడుపడేవారై; మెలఁగుచున్+ఉండన్= ప్రవర్తిస్తూ ఉండగా; శాలాప్రముఖ= యజ్ఞశాల మొదలైన; భవ్యసాధనమ్ములు= శుభప్రదమైన యజ్ఞోపకరణాలు; కనకమయంబులుగన్= బంగారపువిగా; వస్త్ర= వస్త్రములు; కాంచన= బంగారు; ఆజ్య= నేయి; దధి= పెరుగు; పయః= పాలు; ఫల= పండ్లు; ఆది= మొదలైన; తర్పణ= దేవతల తృప్తికొరకు సమర్పించే; ద్రవ్య సమృద్ధి= వస్తువుల ఆధిక్యం; సకల జనులు= సమస్త ప్రజలు; మెచ్చన్= పొగడగా; పెక్కు= అనేకమైన; అధ్వరములు= యజ్ఞాలు; చేసెన్= చేశాడు; అట్టి= అటువంటి; మరుత్తుండు= మరుత్తుడు అనే చక్రవర్తి; నిత్యపదవిన్= శాశ్వతమైన స్థానంలో; ఉండన్+నేర్చెన్+అయ్య?= ఉండగలిగాడా?

తాత్పర్యం: 'ధర్మరాజా! పూర్వం సంవర్తుడనే గొప్పముని దేవగురువైన బృహస్పతిపై అసూయచెంది పట్టుదలగావచ్చి, హిమవన్నగం మొదట తనపర్యవేక్షణలో మరుత్తుచేత ఎన్నో యజ్ఞాలు చేయించాడు; ఆ యజ్ఞాలకు ఇంద్రుడు వరుణుడు మొదలైన దేవతలు, మహర్షులు సహాయులుగా ఉన్నారు. ఆ యజ్ఞశాల, యజ్ఞోపకరణాలు మొదలైనవన్నీ బంగారంతో చేయబడ్డవే. దేవతల తృప్తికొరకు అర్పించిన వస్త్రాలు, బంగారం, నెయ్యి, పాలు, పెరుగు, పళ్ళు మొదలైనవి సమస్త జనాలు మెచ్చుకొనేటంత అధికంగా ఉన్నాయి. అటువంటి గొప్పయజ్ఞాలు చేసిన మరుత్తుడు శాశ్వతంగా తనపదవిలో (రాజుగా) ఉండగలిగాడా? (లేదు కదా అని భావం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. ' సన్మార్గమున రాజ్య సంపద నొంది భూ । సురపూజ లొనరించి సువ్రతముల
బృందారకులఁ బ్రీతిఁ బొందింపఁ, దన కర్థిఁ । బర్జన్యుఁ డేఁటేఁటఁ బసిఁడి వాన
కనకమయములైన కర్కట ఝష నక్ర। కూర్మచయముతోడఁ గురియుచుండ
నయ్యర్థ మెల్ల ధనార్థుల కిచ్చుచుఁ । గురుజాంగలంబునఁ బరమనిష్ఠ

ఆ. నశ్వమేధ ముఖములైన రాజార్హయ । జ్ఞములు పెక్కు సేసి సకల జనులు
పొగడునట్టి పాట నెగడె సుహోత్రుఁ; డ । వ్విభుఁడు దెగియె ననుట వినమె యధిప!' 230

ప్రతిపదార్థం: అధిప!= రాజా! (ధర్మరాజా!); సుహోత్రుఁడు= సుహోత్రుడనే పేరుగల చక్రవర్తి; సత్+మార్గమునన్= మంచిదారిలో, సత్ప్రవర్తనతో; రాజ్యసంపదన్+ఒంది= రాజ్యమనే సంపదను పొంది; భూసుర+ బ్రాహ్మణ; పూజలు+ఒనరించి= పూజలు చేసి; సువ్రతములన్= మంచి వ్రతాలతో, పూజాదికాలతోనూ, మంచి ప్రవర్తనతోను); బృందారకులన్= దేవతలను; ప్రీతిన్+పొందింపన్= సంతసింపజేయగా; తనకున్= సుహోత్రునకు; అర్థిన్= ఇష్టంతో; పర్జన్యుఁడు= ఇంద్రుడు; ఏఁట+ఏఁటన్= ప్రతి ఏడాది; కనకమయములు+ఐన= బంగారంతోచేయబడినవైన; కర్కట= పీతల; ఝష= చేపల; నక్ర= మొసళ్ళ; కూర్మ= తాబేళ్ళ; చయముతోడన్= సమూహంతో; పసిఁడివాన= బంగారువాన; కురియుచున్+ఉండన్= కురిపిస్తూ ఉండగా; ఆ+అర్థము+ఎల్లన్= ఆ ధనమునంతా; ధన+అర్థులకున్= ధనంకోరిన వారికి; ఇచ్చుచున్= ఇస్తూ; కురుజాంగలంబునన్= ఉత్తర కురుభూములలో; పరమ నిష్ఠన్= మిక్కిలి నియమ నిష్ఠలతో; అశ్వమేధముఖములు+ఐన= అశ్వమేధం మొదలైన; రాజ+అర్హ= రాజులకు తగిన; యజ్ఞములు= యాగాలు; పెక్కు= అనేకం; చేసి= ఆచరించి; సకలజనులు= ప్రజలందరు; పొగడు+అట్టి= మెచ్చుకొనేటటువంటి; పాటన్= విధంగా; నెగడెన్= వర్ధిల్లాడు; ఆ+విభుఁడున్= ఆ రాజుకూడా; తెగియెన్= మరణించాడు; అనుట= అనటం; వినము+ఎ?= వినలేదా?

తాత్పర్యం: 'ధర్మరాజా! సుహోత్రుడనే చక్రవర్తి మంచి ప్రవర్తన కలవాడై రాజ్యాన్ని పొంది, బ్రాహ్మణులను పూజించి, మంచి ప్రవర్తనతో, వ్రతాలతో దేవతలను మెప్పించాడు. మెచ్చిన ఇంద్రుడు ప్రతి ఏడాది బంగారు పీతలు, చేపలు, మొసళ్ళు, తాబేళ్ళతో నిండిన బంగారు వాన కురిపించేవాడు. సుహోత్రు డా ధనాన్ని కోరినవారికి ఇస్తూ, ఉత్తర కురుదేశాలలో గొప్ప నిష్ఠాపరుడై రాజోచితాలైన అశ్వమేధాది యజ్ఞాలనెన్నింటినో చేశాడు. ప్రజల మెప్పు పొందే విధంగా ప్రవర్తించాడు. అటువంటి సుహోత్రుడు కూడా చనిపోయాడని విన్నాము కదా!'

సీ. ' కాంచనాలంకార కాంతంబులై రూఢి । కెక్కిన గజములు పెక్కు వేలు,
జవసత్త్వ రూపాది సకల గుణములఁ । బెం పెసఁగిన హయము లనేక లక్ష,
లమలిన స్వర్ణమయములగు కొమ్ములం । గొమరారు పశువులు గోటు, లూర్జి
తాంగక విలసదజావికంబులు గణ । నాతీతములు గన్య లప్రమేయ,

ఆ. లఖిల రత్న విరచితాభరణంబు ల । నల్పములు మహీసురావళులకు
నిచ్చి చేసెఁ గ్రతువు లెన్నియేనియు నంగుఁ । డతఁడు నన్యలోకగతుఁడు గాఁడె!' 231

ప్రతిపదార్థం: అంగుఁడు= అంగుడనే రాజు; కాంచన+అలంకార= బంగారు నగలతో; కాంతంబులు+ఐ= ఆకర్షణీయాలై; రూఢికిన్+ఎక్కిన= ప్రశస్తి వహించిన; గజములు= ఏనుగులు; పెక్కువేలు= ఎన్నో వేలు; జవ= వేగం; సత్త్వ= బలం; రూప+ఆది= చక్కని ఆకారం మొదలైన; సకల= అన్ని; గుణములన్= సద్గుణాలతో; పెంపు+ఎసఁగిన= ఆధిక్యం వహించిన; హయములు= గుర్రాలు; అనేక లక్షలు= ఎన్నో లక్షలు; అమలిన= స్వచ్ఛమైన; స్వర్ణమయములు+అగు= బంగారంతో చేయబడినవైన; కొమ్ములన్=

శృంగాలతో; కొమరారు= అందగించే; పశువులు= గోవులు; కోటులు= కోట్లు; ఊర్జిత= దృఢమైన; అంగక= అవయవాలతో; విలసత్= ఒప్పే; అజ+అవికంబులు= మేకలు, గొఱ్ఱెలు; గణన+అతీతములున్= లెక్కపెట్టటానికి వీలుకానన్ని; కన్యలు= వివాహయోగ్యలైన యువతులు; అప్రమేయలు= మితిలేనంత మందిని; అఖిల= సమస్త; రత్నవిరచిత+ఆభరణంబులు= రత్నాలతో తయారు చేయబడిన నగలు; న+అల్పములు= తక్కువ కానన్ని (అధిక సంఖ్యాకాలు); మహీసుర+ఆవళులకున్= బ్రాహ్మణ బృందాలకు; ఇచ్చి= ఒసగి; క్రతువులు= యజ్ఞాలు; ఎన్ని+ఏనియున్= ఎన్నో; చేసెన్= చేశాడు; అతఁడున్= ఆ అంగుడు కూడా; అన్యలోక గతుఁడు= పరలోక గతుడు, మరణించినవాడు; కాఁడు+ఎ?= కాలేదా?

తాత్పర్యం: 'ధర్మరాజా! అంగుడనే చక్రవర్తి ఎన్నో యజ్ఞాలు చేశాడు. ఆ యజ్ఞాలలో, బంగారు నగలతో ఆకర్షణీయంగా ఉండి ప్రశస్తమైన పెక్కువేల ఏనుగులను, మంచి వేగం, బలం, రూపాలతో గొప్పవైన అనేక లక్షల గుర్రాలను, మంచి బంగారంతో అలంకరించిన కొమ్ములతో అందగించే కోట్లకొలది గోవులను, దృఢమైన శరీరావయవాలతో ఒప్పే అసంఖ్యాకమైన మేకలను, గొఱ్ఱెలను,అంతులేనంతమంది వివాహ యోగ్యలైన యువతులను, నవరత్న ఖచితాలైన నగలను అధిక సంఖ్యలో బ్రాహ్మణబృందాలకు ఇచ్చాడు. ఆ అంగుడు కూడా మరణించాడు కదా!'

సీ. **' ఏడు దీవులయందుఁ గ్రీడాగతులఁ దన । రథము చరింప, నరాతు లనఁగ**
వినియు నెఱుంగక విభవ మార్జించుచోఁ । బ్రజల నొప్పింపని పరమపుణ్య
కర్మంబునకు మెచ్చి గారవంబునఁ దన । కక్షయ సాధనము ఫాలాక్షుఁ డొసఁగ
నశ్వమేధములు జాహ్నవిపొంత శిష్ట జ । నాకీర్ణములుగఁ బె క్కాచరించెఁ;

ఆ. **దారకములు వృష్టిధారలు లెక్కింప । వచ్చుఁ గాని యతని యిచ్చుగోవు**
లెన్నఁ గొలఁది గాదు; సన్నుతిపాత్ర మా । శిబికి నుర్వి నునికి సెల్లె నెట్లు?' **232**

ప్రతిపదార్థం: ఏడుదీవుల+అందున్= సప్తద్వీపాలలో; క్రీడాగతులన్= ఆటలకైపోయిన విధంగా; తన= శిబిచక్రవర్తియొక్క; రథము= తేరు; చరింపన్= తిరుగగా; అరాతులు+అనఁగన్= శత్రువులు అనే మాట; వినియున్= వినికూడా; ఎఱుంగక= తెలియక; విభవము= సంపద; ఆర్జించుచోన్= సంపాదించేటప్పుడు; ప్రజలన్= పౌరులను; నొప్పింపని= బాధించని; పరమపుణ్యకర్మంబునకున్= మిక్కిలి మంచి ప్రవర్తనకు; మెచ్చి= మెచ్చుకొని; ఫాలాక్షుఁడు= నిటలనేత్రుడు, శివుడు; తనకున్= శిబికి; గారవంబునన్= ఆదరంతో; అక్షయ ధనము= (నశించని) తరగని సంపదను; ఒసఁగన్= ఇయ్యగా; జాహ్నవి పొంతన్= గంగ ఒడ్డున; శిష్టజన+ఆకీర్ణంబులుగన్= సజ్జనులతో నిండి ఉండేటట్లుగా; అశ్వమేధములు= అశ్వమేధ యజ్ఞాలు; పెక్కు= అనేకాలు; ఆచరించెన్= చేశాడు; తారకములు= చుక్కలు; వృష్టిధారలు= వానలోని చాళ్ళు; లెక్కింపన్+వచ్చున్= లెక్కపెట్టవచ్చును; కాని; అతని+ఇచ్చు= శిబి దానం చేసే; గోవులు+ఎన్నన్= ఆవులను లెక్కపెట్టటం; కొలఁది+కాదు= వీలుకాదు; సన్నుతి పాత్రము= బాగా పొగడదగిన వాడైన; ఆ శిబికిన్= ఆ శిబిచక్రవర్తికి; ఉర్విన్= భూమిపై; ఉనికి= అస్తిత్వం, ఉండటం; ఎట్లు= ఏ విధంగా; చెల్లెన్?= చెల్లింది?

తాత్పర్యం: 'ధర్మరాజా! శిబిచక్రవర్తి ఏడు ద్వీపాలలో యథేచ్ఛగా తన రథాన్ని నడపగలిగేవాడు. అతడికి శత్రువులన్న మాటే వినబడదు. ధనసంపాదనకై ప్రజలను బాధించని అతడి మంచి ప్రవర్తనకు మెచ్చి శివుడు నశించని ధనాన్ని ప్రసాదించాడు. దానితో గంగాతీరంలో సజ్జనులతో నిండి ఉండేటట్లుగా అనేక అశ్వమేధాలు చేశాడు. నక్షత్రాలను, వర్షధారలను అయినా లెక్కించవచ్చును కాని, శిబి దానం చేసిన ఆవులను లెక్కించటం సాధ్యంకాదు. అటువంటి పొగడదగిన శిబికి భూమిపై కాలం ఎట్లా చెల్లింది?'

సీ. ' **యౌవనంబునఁ దప మాచరింపఁగఁ దండ్రి । పంపున నరిగిన పెంపుకలిమి,**
సేతువు జలధిఁ బ్రఖ్యాతంబుగా నొన । ర్చిన మర్త్యలోక పావన విభూతి
త్రైలోక్యకంటకు దశముఖు బంధు యు । క్తంబుగాఁ జంపిన కలితనమ్ము,
బాలుర మరణంబు వాటిల్లకుండఁగఁ । జేసిన యత్యంత చిత్రమహిమ,

ఆ. **గలిగి యశ్వమేధములు మున్నుగా ననే । కాధ్వరము లొనర్చి యఖిల జనులఁ**
దల్లివోలె నరసి దశరథరాముండు । కాలవశత నొందెఁ గాదె యధిప! **233**

ప్రతిపదార్థం: అధిప!= ధర్మరాజా!; దశరథ రాముండు= దశరథ పుత్రుడైన శ్రీరామచంద్ర చక్రవర్తి; తండ్రి పంపునన్= తండ్రి ఆనతి మేరకు; యౌవనంబునన్= తరుణ వయస్సులో; తపము+ఆచరింపఁగన్= తపస్సు చేయటానికి; అరిగిన= వెళ్ళిన; పెంపు కలిమి= ఆధిక్యమనే సంపద; జలధిన్= సముద్రంలో; సేతువు= వారధిని; ప్రఖ్యాతంబు+కాన్= ప్రతిష్ఠాత్మకంగా; ఒనర్చిన= నిర్మించిన; మర్త్యలోక= మానవలోకాన్ని; పావనవిభూతి= పవిత్రీకరించిన వైభవం; త్రైలోక్య కంటకున్= ముల్లోకాలను బాధించే; దశముఖున్= దశకంఠుడైన రావణుడిని; బంధుయుక్తంబు+గాన్= చుట్టాలందరితో కూడా; చంపిన= సంహరించిన; కలితనమ్ము= సామర్థ్యం; బాలుర= పసిపిల్లలు; మరణంబు= చావు; పాటిల్లక+ఉండంగన్= సంభవించకుండా; చేసిన= చేసినటువంటి; అతి+అంత= అధికమైన; చిత్రమహిమన్= అద్భుతావహమైన మహత్తును; కలిగి= కలిగి ఉండి; అశ్వమేధములు మున్నుగాన్= హయమేధం మొదలైన; అనేక+అధ్వరములు= ఎన్నో యజ్ఞాలు; ఒనర్చి= చేసి; అఖిల జనులన్= ప్రజలందరినీ; తల్లి+పోలెన్= తల్లివలె; అరసి= చూచి, కాపాడి (కూడ); కాలవశతన్+ఒందెన్= కాలధర్మాన్ని చెందాడు; కాదు+ఎ!= కదా!

తాత్పర్యం: 'ధర్మరాజా!; దశరథ పుత్రుడైన శ్రీరాముడు, తండ్రి ఆజ్ఞానుసారం యౌవనంలో తపస్సు చేయటానికి వెళ్ళటం అనే ఘనత కలిగి, లోకమంతా మెచ్చేవిధంగా సముద్రంలో వారధి నిర్మించి, మానవలోక పావనమనే వైభవాన్ని కలిగి, ముల్లోకాలను బాధించే రావణుడిని బంధువులతో కలిపి సంహరించిన సామర్థ్యం కలిగి, పసివారి మరణాలు జరగకుండా చేసిన అద్భుత మహత్తు కలిగి, అశ్వమేధం మొదలైన ఎన్నో యజ్ఞాలు చేసి, ప్రజలను కన్నతల్లివలె సంరక్షించి కూడా కాలధర్మం చెందాడు కదా!'

సీ. ' **పూర్వవంశ్యులఁ గావఁ బూని వియద్గంగ । నవని భాగీరథి యనఁగఁ బఱపి,**
శక్రుండు మెచ్చఁ బరాక్రమంబునఁ బేర్చి । యప్రతిహతముగ నశ్వమేధ
యాగంబు లొనరించు నప్పుడు వేయి వే । ల రదంబులందుఁ గన్యల నలంకృ
తలఁ జేసి యునిచి, రథంబు రథంబున । కిభములు నూఱు నూఱేసి యేనుఁ

తే. **గేనుఁగునకు గుఱ్ఱములు వేయేసి పాఁటి । హయముహయమున కట్ల గోచయ మమర్చి**
భూరి భూరి యుతంబుగ భూసురులకు । నొసఁగినట్టి భగీరథుం డున్నవాఁడె?' **234**

ప్రతిపదార్థం: పూర్వవంశ్యులన్= తమ వంశంలోని పూర్వులను; కావన్+పూని= రక్షించాలని (ఉద్ధరించాలని) దీక్ష వహించి; వియత్+గంగన్= ఆకాశగంగను; అవనిన్= భూమిపై; భాగీరథి+అనఁగన్= భగీరథుడిచేత తీసికొనిరాబడినదనే పేరు పొందేటట్లుగా; పఱపి= ప్రవహింపచేసి; శక్రుండు= ఇంద్రుడు; మెచ్చన్= పొగడే విధంగా; పరాక్రమంబునన్= శౌర్యంతో; అతిశయించి= మించి; అప్రతిహతముగన్= ఎదురులేని విధంగా; అశ్వమేధ యాగంబులు= అశ్వమేధ యజ్ఞాలు; ఒనరించు+అప్పుడు= చేసే సమయంలో; వేయివేల రదంబుల+అందున్= పదిలక్షల రథాలలో; కన్యలన్= వివాహయోగ్యలయిన యువతులను; అలంకృతలను= సర్వాభరణ భూషితలను; చేసి= కావించి; ఉంచి= నిలిపి; రథంబు రథంబునకున్= ప్రతి రథానికి; ఇభములు= ఏనుగులు; నూఱు+నూఱేసి= నూరేసి చొప్పున; ఏనుఁగు+ఏనుఁగునకున్= ఒక్కొక్క ఏనుగుకు; గుఱ్ఱములు= గుర్రాలు; వేయేసి= వెయ్యి చొప్పున; హయము

హయమునకున్= ప్రతి గుర్రానికి; అట్ల= అదే విధంగా, అంటే వెయ్యి చొప్పున; గోచయము= ఆవుల సముదాయం; అమర్చి= ఏర్పాటుచేసి; భూరి= గొప్ప; అధికమైన= భూరియుతంబుగన్= బంగారంతో కూడుకొని ఉండేటట్లుగా; భూసురులకున్= బ్రాహ్మణులకు; ఒసఁగిన+అట్టి= దానం చేసినటువంటి; భగీరథుండు= భగీరథ చక్రవర్తి; ఉన్నవాఁడె?= జీవించి ఉన్నాడా? (లేదు కదా అని భావం).

తాత్పర్యం: 'ధర్మరాజా! తన వంశంలోని పూర్వులకు (సగర పుత్రులు) సద్గతులు కల్పించాలని సమకట్టి ఆకాశగంగను భూమిపై భాగీరథి అనే పేరుతో ప్రవహింపచేసి, ఇంద్రుడిని మెప్పించేటంత పరాక్రమంతో అతిశయించి, అశ్వమేధ యాగాలు చేసే సమయంలో పదిలక్షల రథాలపై అలంకృతకన్యల నుంచి ఒక్కొక్క రథంతో నూరేసి ఏనుగులను, ఒక్కొక్క ఏనుగుతోపాటు వెయ్యేసి గుర్రాలను, ఒక్కొక్క గుర్రంతో పాటు వెయ్యేసి గోవులను కూర్చి, అంతులేని బంగారంతో జతపరచి బ్రాహ్మణులకు దానమిచ్చిన వితరణశీలి అయిన భగీరథుడు జీవించి ఉన్నాడా? (లేదు కదా అని అర్థం)'.

విశేషం: పదివేల మంది బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి ఒక రథం, పదివేల ఏనుగులు, కోటి గుర్రాలు, వెయ్యికోట్ల గోవులను బంగారంతో సహా దానం చేశాడట భగీరథుడు.

సీ. **' అర్థి విశ్వావసుం డాదిగాఁ గలుగు గం । ధర్వులు హృద్య వాదన మొనర్ప,**
నప్సరో నికురంబ మాటలుఁ బాటలు । నై వినోదింపఁగ, నమర గణము
బహు విధాలంకార భంగుల విన్నాణు । వులు సూప దివ్యమునులు నుతింప,
మనుజ లోకంబెల్లఁ గన కాన్న వస్త్ర భూ । షణ దానములఁ దృప్తి సనఁగ నశ్వ

ఆ. **మేధ సమితిఁ జేసి మెప్పించె నింద్రుని । శతతమాధ్వరమున; నతఁడు హయము**
నాసపడిన నిచ్చె; నాదిలీపునిఁ జూపు । మా! ధరిత్రి నిపుడు మనుజనాథ!' **235.**

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా! ధర్మరాజా!; అర్థిన్= కోరికతో, ఇష్టంతో; విశ్వావసుండు+ఆదిగాన్= విశ్వావసుడు మొదలుగా; కలుగు= ఉన్న; గంధర్వులు= గంధర్వులనే దేవజాతి; హృద్య= మనోహరమైన; వాదనము+ఒనర్పన్= వాద్యాలు మ్రోయిస్తుండగా; అప్సరోనికురంబము= అప్సరసల సమూహం; ఆటలు+పాటలును+ఐ= నృత్యగానాలతో; వినోదింపఁగన్= ఆనందిస్తుండగా; అమరగణము= దేవతాబృందం; బహువిధ= అనేక విధాలైన; అలంకారభంగులు= అలంకారాల (నగలును, ఉపమాది అర్థాలంకారాలు శబ్దాలంకారాలును) రీతులలో; విన్నాణువులు= నేర్పులు; చూపన్= ప్రదర్శిస్తుండగా; దివ్యమునులు=దేవఋషులు; నుతింపన్= పొగడుతుండగా; మనుజలోకంబు+ఎల్లన్= మానవ సముదాయమంతా; కనక+అన్న+వస్త్ర+భూషణ దానములన్= బంగారం, ఆహారం, వస్త్రాలు, ఆభరణాల దానాలతో; తృప్తి+చనఁగన్= సంతృప్తి పొందగా; అశ్వమేధ సమితిన్= అశ్వమేధ యాగాల సముదాయాన్ని; చేసి= ఆచరించి; శతతమ+అధ్వరమునన్= నూరుదాటిన తరువాతి యజ్ఞంలో; ఇంద్రునిన్= శతమఖుడిని; మెప్పించెన్= సంతోషపరచాడు; అతఁడు= ఆ ఇంద్రుడు; హయమును= గుర్రమును; ఆసపడినన్= కోరగా; ఇచ్చెన్= ఇచ్చాడు; ఆ దిలీపునిన్= అటువంటి దిలీప చక్రవర్తిని; ఇపుడు= ఇప్పుడు; ధరిత్రిన్= భూమిపై; చూపుమా!= చూపించుము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! దిలీపచక్రవర్తి అనేక అశ్వమేధయాగాలు చేశాడు. ఆ యాగాలలో విశ్వావసుడు మొదలైన గంధర్వులు ఎంతో ఇష్టంగా మనోహరమైన వాద్యాలు వాయించేవారు. అప్సరసలు నృత్యగానాలతో వినోదింపచేసేవారు. దేవతలు ఎన్నో శబ్ద, అర్థాలంకారాలలో (కవితలలో) భూషణాలను తాల్చే రీతులలో తమ నేర్పును ప్రదర్శించేవారు. దేవర్షులు పొగడుతూ ఉండేవారు. బంగారు, ఆహార, వస్త్ర, ఆభరణ దానాలతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మానవులు తృప్తి పడుతూ ఉండేవారు. ఇంద్రుడిని కూడా ఆతడు మెప్పించాడు. ఇంద్రుడు అశ్వాన్ని కోరితే ఇచ్చాడు. అటువంటి దిలీపచక్రవర్తిని ఈనాడు భూమిపై చూపించుము' (చూపించలేడని అతడు గతించాడని భావం).

సీ. ' జననమాదిగఁ బాకశాసను కరమునఁ । బ్రభవించు నేయును బాలు ద్రావి,
ద్వాదశదినము లాతఁడు గారవింపంగ । వర్ధిల్లి పండ్రెండు వత్సరముల
ప్రాయమై రాజ్యసంప్రాప్తికి నేతెంచి । యర్కుని యుదయంబు నస్తమయము
నగుపట్లు పొలిమేరలైన మహాక్షేత్ర । మంతయు నొక్కండ యనుభవించె;

ఆ. నన్నపర్వతముల నాజ్యనదుల విప్ర । భోజనము లొనర్చి రాజసూయ
ములును నశ్వమేధములుఁ జేసె మాంధాతృఁ । డింద నిలిచెనే నరేంద్రముఖ్య!' 236

ప్రతిపదార్థం: నర+ఇంద్రముఖ్య!= రాజోత్తమా! ధర్మరాజా!; జననము+ఆదిగన్= పుట్టినప్పటినుండి; పాకశాసను= ఇంద్రుడి; కరమునన్= చేతిలో; ప్రభవించు= పుట్టే; నేయును= నేతిని; పాలున్= పాలను; త్రావి= క్రోలి; ద్వాదశదినములు= పన్నెండు రోజులు; ఆతఁడు= ఆ ఇంద్రుడు; గారవింపంగన్= ఆదరించగా; వర్ధిల్లి= పెరిగి; పండ్రెండు వత్సరముల ప్రాయము+ఐ= పన్నెండు ఏడుల వయసు కలవాడై; రాజ్యసంప్రాప్తికిన్= రాజ్యమును పొందటానికి; ఏతెంచి= వచ్చి; అర్కుని= సూర్యుడి; ఉదయంబున్+అస్తమయమున్+అగుపట్లు= ఉదయించే, అస్తమించే చోట్లు - తూర్పుకొండ, పడమటికొండలు; పొలిమేరలు+ఐన= సరిహద్దులైన; మహాక్షేత్రము+అంతయున్= గొప్పదైన భూమి సమస్తమును; ఒక్కండు+అ= ఒక్కడే; అనుభవించెన్= పాలించాడు; అన్నపర్వతములన్= అన్నపు కొండలతో; ఆజ్యనదులన్= నేతి నదులతో; విప్రభోజనములు+ఒనర్చి= బ్రాహ్మణులకు భోజనాలుపెట్టి; రాజసూయములును; అశ్వమేధములున్; చేసెన్= ఆచరించాడు; మాంధాతృఁడు= అటువంటి మాంధాతృ చక్రవర్తి; ఇందున్+అ= ఈ నేలపైనే?; నిలిచెన్+ఏ= జీవించి ఉన్నాడా? (జీవించి లేడని భావం).

తాత్పర్యం: 'ధర్మరాజా! మాంధాతృ చక్రవర్తి పుట్టినప్పటి నుండి పన్నెండు రోజులు ఇంద్రుడి చేతినుండి పుట్టిన పాలు నెయ్యి త్రాగి పెరిగాడు. పన్నెండు సంవత్సరాల వయసులో రాజ్యాన్ని స్వీకరించాడు. సూర్యోదయ సూర్యాస్తమయాలయ్యే తూర్పు పడమర కొండలే తన రాజ్యానికి సరిహద్దులుగా భూమినంతా ఒక్కడే పాలించాడు. అశ్వమేధ రాజసూయ యాగాలు చేసి, అన్నపు కొండలు, నేతినదులతో బ్రాహ్మణ సంతర్పణం చేశాడు. అట్టి మాంధాత భూమిపై ఇప్పటివరకు జీవించి లేడు కదా!

సీ. ' అనిమిషాసురయుద్ధమున నసురావలి । సమయించి, వర్ణాశ్రమముల నేర్ప
రించి, భూమి యలంకరించి యగ్నిష్టోమ । హయమేధ వాజపేయాతిరాత్ర
పౌండరీకము లనఁ బరఁగిన యధ్వరం । బు లనేకములు సేసి, భూసురులకు
నఖిల భూములఁ గల యర్థంబు లెల్లను । దనకని యేమియు నునుప కిచ్చె;

ఆ. శుక్రు నల్లుఁ డనఁగ శోభిల్లి తనయందు । ధర్మతత్త్వ మూర్జితముగ నియమ
నిష్ఠుఁడై యయాతి నెగడె; శాశ్వతుఁ డయ్యె । నే నృపాల యమ్మహీశ్వరుండు?' 237

ప్రతిపదార్థం: నృపాల!= ఓ ధర్మరాజా! యయాతి; అనిమిష= దేవతల; అసుర= రాక్షసుల; యుద్ధమునన్= రణంలో; అసుర+ఆవలి= రాక్షస సమూహాలను; సమయించి= సంహరించి, చంపి; వర్ణ+ఆశ్రమములన్+ఏర్పరించి= నాలుగు వర్ణాల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నాలుగు ఆశ్రమాల ధర్మాలను విస్పష్టంగా నిర్ధారించి; భూమి+అలంకరించి= ధరణికి సొగసులు కూర్చి (చక్కగా పాలించి); అగ్నిష్టోమ, హయమేధ, వాజపేయ, అతిరాత్ర, పౌండరీకములు; అనన్+పరఁగిన= అనే పేర్లతో ప్రఖ్యాతి పొందిన; అధ్వరంబులు+అనేకములు= లెక్కలేనన్ని యజ్ఞాలు; చేసి= ఆచరించి; అఖిల= సమస్తమైన; భూములన్= ప్రదేశాలలో; కల= ఉన్నటువంటి; అర్థంబులు+ఎల్లను= ధనాలు అన్నీ; తనకున్+అని= తన కొరకు అంటూ; ఏమియున్+ఉనుపక= ఏమీ ఉంచుకొనక; భూసురులకున్= బ్రాహ్మణులకు; ఇచ్చెన్= దానం చేశాడు; శుక్రు= శుక్రాచార్యుడి; అల్లుఁడు+అనంగన్= అల్లుడుగా; శోభిల్లి= ఒప్పి; తన+అందున్= తనలో; ధర్మతత్త్వము= ధర్మంయొక్క స్వభావం; ఊర్జితముగన్= దృఢంగా నిలువగా; నియమ నిష్ఠుఁడు+ఐ= నియమాలయందు నిష్ఠగలవాడై; నెగడెన్= వర్ధిల్లాడు; ఆ+మహీ+ఈశ్వరుండు= ఆ రాజు; శాశ్వతుఁడు= నిత్యుడు; అయ్యెను+ఏ?= అయ్యాడా? (కాలేదు కదా అని భావం).

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! యయాతి దేవాసుర యుద్ధంలో రాక్షసులను సంహరించాడు. వర్ణాశ్రమ ధర్మాలను స్థిరపరిచాడు. రాజ్యానికి సొగసులు కూర్చాడు. అగ్నిష్టోమం, అశ్వమేధం, వాజపేయం, అతిరాత్రం, పౌండరీకం మొదలైన యజ్ఞాలు అనేకం చేశాడు. అపుడు అన్ని దేశాలలో ఉన్న ధనాలను గ్రహించినా, తన కంటూ ఏమీ ఉంచుకొనకుండా, బ్రాహ్మణులకు దానం చేశాడు, శుక్రాచార్యుడి అల్లుడుగా పేరొంది, ధర్మస్వభావాన్ని తనలో స్థిరంగా నిలిపి, నియమనిష్ఠలు కలవాడై ఒప్పారాడు. అటువంటి యయాతి భూమిపై శాశ్వతంగా ఉండగలిగాడా?' (లేదని భావం).

సీ. **' ఓర్వక పెక్కండ్రు రుర్వీశు లొక్కటఁ । బైనెత్తి వచ్చిన భండనమున**
వారిహేతిచ్ఛత్ర వాహనధ్వజములు । నఱకిన నడునడ నడిఁకి వార
లభయంబు వేడిన నందఱఁ గృపఁగాచి । యేచి యీపెన్నేల యెల్లఁ దాన
కొని యధ్వరములు పె క్కొనరించి వేడుకఁ । బాయసంబులు నపూపములు మోద

ఆ. **కములు లోనుగాఁగఁ గల వంటకముల ను । ర్వీసురావళులకుఁ బ్రీతిఁ జేసి,**
దక్షిణలుగ మణివితానంబు లిచ్చిన । యంబరీషుఁ డేమి యయ్యెఁ జెపుమ!' **238**

ప్రతిపదార్థం: ఓర్వక= అసూయతో; పెక్కండ్రు= అనేకులు; ఉర్వీ+ఈశులు= భూపతులు, రాజులు; ఒక్కటన్= ఒక్కసారిగా; పైన్+ఎత్తివచ్చినన్= తనపై దండెత్తిరాగా; భండనమునన్= యుద్ధంలో; వారి= ఆ అందరు రాజులయొక్క; హేతి= ఆయుధాలు; ఛత్ర= గొడుగులు; వాహన= వాహనాలు; ధ్వజములు= జెండాలు; నఱకినన్= ఖండించగా; నడునడ నడిఁకి= గడగడ వణికి; వారలు= ఆ రాజులు; అభయంబు= శరణం; వేడినన్= కోరగా; అందఱన్= వారినందరినీ; కృపన్= దయతో; కాచి= కాపాడి; ఏచి= విజృంభించి; ఈ+పెను+నేల= ఈ విశాలమైన భూమిని; ఎల్లన్= అంతటిని; తాను+అ= తానే; కొని= స్వీకరించి; అధ్వరములు= యజ్ఞాలు; పెక్కు= అనేకం; ఒనరించి= చేసి; వేడుకన్= ఇష్టంతో; పాయసంబులున్= పరమాన్నాలు; అపూపములు= పిండివంటలు; (అప్పాలు మొదలైనవి); మోదకములు= కుడుములు; లోనుకాఁగన్+కల= మొదలైన; వంటకములను= పాకాలను; ఉర్వీసుర+ఆవళులకున్= బ్రాహ్మణ సమూహాలకు; ప్రీతిన్= సంతోషంగా; చేసి= కల్పించి, కూర్చి; దక్షిణలుగన్= కానుకలుగా; మణివితానంబులు= రత్నాల రాసులను; ఇచ్చిన= ఇచ్చినటువంటి; అంబరీషుఁడు= అంబరీష చక్రవర్తి; ఏమి+అయ్యెన్= ఏమయ్యాడో; చెపుమ!= చెప్పుము.

తాత్పర్యం: 'ధర్మరాజా! అసూయ చెందిన రాజులందరూ ఒక్కటై తన పైకి దండెత్తిరాగా, యుద్ధంలో వారందరి ఆయుధాలను, గొడుగులను, వాహనాలను, జెండాలను తెగగొట్టగా, వారందరూ గడగడవణికిపోయి శరణు కోరగా, దయతో వారందరినీ కాపాడి, భూమండలాన్నంతా తానొక్కడే పరిపాలించి, ఎన్నో యజ్ఞాలు చేసి, సంతోషంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బ్రాహ్మణులకు పరమాన్నాలు, పిండివంటలు, కుడుములు మొదలైన పాకాలను కల్పించి (చేయించి పెట్టి), రత్నాలరాసులను దక్షిణలుగా ఇచ్చిన అంబరీషు డేమయ్యాడో చెప్పుము?' (శాశ్వతంగా నిలిచి లేడు కదా! శరీరం వదలక తప్పలేదే అని భావం).

సీ. ' లక్ష భార్యల నుపలాలించి, యొక్కొక్క । వెలఁదికి వేవురు వేవురాత్మ
జులు గాఁగఁ బదికోటు లలఘుమూర్తులఁ గాంచె; । వారును దోర్బలోజ్జ్వలులు నార్య
చరితులునై పేర్చి తురగ మేధంబు లం । దఱు బహు దక్షిణోదాత్త భంగిఁ
జేయుచుఁ దనపంపు సేసి వర్తింపంగఁ । దానును విశ్రుతాధ్వరము లొప్పఁ

తే. పెంపు సొంపును సువ్రత సంపదయును । నిర్మల శ్రద్ధయును గర్మ నిపుణతయును
నెఱయ శశిబిందుఁ డొనరించి నెగడె నతఁడు । వడయఁ జాలెనె యెన్నఁడుఁ జెడనియొడలు?' 239

ప్రతిపదార్థం: శశిబిందుఁడు= శశిబిందుడనే చక్రవర్తి; లక్షభార్యలన్= లక్షమంది భార్యలను; ఉపలాలించి= బుజ్జగించి; ఒక్కొక్క వెలఁదికిన్= ఒక్కొక్క స్త్రీకి; వేవురు వేవురు= వెయ్యిమంది చొప్పున; ఆత్మజులు కాఁగన్= కుమారులుగా; పదికోటులు= పది కోట్లమంది; అలఘుమూర్తులన్= గొప్పరూపంకలవారిని; కాంచెన్= పొందాడు; వారును= ఆ కొడుకులు కూడా; అందఱున్= అంతమంది; దోర్బల+ఉజ్జ్వలులు= బాహుబలంతో ప్రకాశించేవారు; ఆర్యచరితులును= మంచి నడతకలవారు; ఐ= అయి ఉండి; పేర్చి= అతిశయించి; బహు= అనేక; దక్షిణా= కానుకలతో; ఉదాత్తభంగిన్= గొప్పగా; తురగమేధంబులు= అశ్వమేధయాగాలు; చేయుచున్= చేస్తూ; తనపంపు= తన ఆదేశాన్ని; చేసి= అనుసరించి; వర్తింపంగన్= నడుచుకొంటూ ఉండగా; తానును= తనుకూడా; పెంపుసొంపును= తన ఆధిక్యంయొక్క చందము; సువ్రత సంపదయును= మంచి ప్రవర్తన అనే సంపద; నిర్మల శ్రద్ధయును= అచ్చపు ఆసక్తి; కర్మ నిపుణతయును= పనులయందు నేర్పరితనమూ; నెఱయన్= నిండగా (పూర్ణంగా ఉండగా); విశ్రుత+అధ్వరములు= పేరెన్నికగన్న యజ్ఞాలు; ఒప్పన్= చక్కగా; ఒనరించి= చేసి; నెగడెన్= వర్ధిల్లాడు; అతఁడు= అట్టి ఘనుడైన శశిబిందుడు; ఎన్నఁడు= ఎప్పటికీ; చెడని= నశించని; ఒడలు= శరీరమును; పడయన్+చాలెను+ఎ= పొందగలిగాడా? (లేదని భావం).

తాత్పర్యం: 'ధర్మరాజా! శశిబిందుడనే చక్రవర్తి లక్షమంది భార్యలను చక్కగా లాలించి, ఒక్కొక్కరివలన వెయ్యిమంది చొప్పున పదికోట్లమంది ఉత్తమ కుమారులను పొంది, వారందరూ తన ఆజ్ఞమేరకు సత్ప్రవర్తన కలవారై, బాహుబలంతో ప్రకాశిస్తూ ఎన్నో అశ్వమేధ యాగాలు భూరిదక్షణలిచ్చి చేయగా, తాను కూడా సత్ప్రవర్తన కలవాడై, ఎంతో ఆసక్తితో నేర్పరితనంతో చెప్పుకొన దగ్గవిధంగా యజ్ఞాలు చేశాడు. అట్టి వాడు కూడా శాశ్వతమైన శరీరం పొంద గలిగాడా?' (అతడు కూడా శరీరం వదిలాడు కదా అని భావం).

సీ. ' అధిక తపంబున నగ్ని నారాధించి । ప్రత్యక్షమగుటయు బ్రహ్మచర్య
వృత్తంబు దమమును వేదవిత్త్వము నహిం । సయుఁ బాత్రదానంబు శమము వరము
గాఁ గోరికొని వేదికాస్థలి మణికన । కాత్మిక యై ముప్పదాఱు యోజ
నముల దైర్ఘ్యము నంత కమరు విస్తారంబుఁ । గలుగంగ నొనరించి క్రతువు సేసి

తే. విప్ర తతికి దాని నతి ప్రియమున । నిచ్చెఁ; దనపేర గయ నుతి కెక్క వటము;
పొగడు వడయంగఁ బుణ్యుఁడై నెగడె గయుఁడు । భూవరోత్తమ! యతఁ డెందు బోయెఁ జెపుమ!'240

ప్రతిపదార్థం: భూవర+ఉత్తమ!= రాజవర్యా! ధర్మరాజా!; గయుఁడు= గయుడనే పేరుగల చక్రవర్తి; అధిక= మిక్కిలి అయిన; తపంబునన్= తపస్సుతో; అగ్నిన్+ఆరాధించి= అగ్నిదేవుడిని (అర్చించి) సేవించి; ప్రత్యక్షము+అగుటయున్= ఆ అగ్ని

సాక్షాత్కరించగా; బ్రహ్మచర్య వృత్తంబు= బ్రహ్మచారిగా నడుచుకొనే పద్ధతి; దమమును= బహిరింద్రియ నిగ్రహమును; వేదవిత్త్వమున్= వేదాలను తెలిసికొనగలగటం (వేదసారాన్ని తెలిసికొనటం); అహింసయున్= హింసచేయకుండటం; పాత్రదానంబు= అర్హులకు దానం చేయటం; శమము= అంతరింద్రియ నిగ్రహం; వరము గాన్= వరము లయ్యేటట్లుగా; కోరికొని= ప్రార్థించి; మణి+కనక+ఆత్మక+ఐ= రత్నములు బంగారుతో కూర్చినదై; ముప్పదారుయోజనముల= ముప్పది ఆరు యోజనాల; దైర్ఘ్యము= పొడవు; అంతకు+అమర= దానికి తగిన; విస్తారంబున్= వైశాల్యం; కలుగంగన్= ఉండేటట్లుగా; వేదికాస్థలిన్= తిన్నెను; ఒనరించి= ఏర్పాటుచేసి; క్రతువు+చేసి= యజ్ఞంచేసి; విప్రతతికిన్= బ్రాహ్మణ సమూహానికి; దానము; అతిప్రియముగన్+ఇచ్చెన్= ఎంతో ఇష్టంతో ఇచ్చాడు; తనపేరన్= తన పేరుతో; గయ= గయలో; నుతికిన్+ఎక్కన్= కీర్తి కలిగేటట్లు; వటము= మర్రిచెట్టు; పొగడు+పడయంగన్= మెప్పుపొందగా; పుణ్యుఁడు+ఐ= సత్కర్మలు ఆచరించినవాడై; నెగడెన్= వర్ధిల్లాడు; అతఁడు= ఆ గయుడు; ఎందున్+పోయెన్?= ఎక్కడికి వెళ్ళాడు?; చెపుము+అ= చెప్పుమా!.

తాత్పర్యం: 'ధర్మరాజా! గయుడనే చక్రవర్తి ఎంతో తపస్సుచేసి అగ్ని నారాధించి, ప్రత్యక్షం చేసికొన్నాడు. బ్రహ్మచర్యవృత్తిని, అనగా బ్రహ్మచారిగానే ఉండిపోవటాన్ని, అంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహాన్ని, వేదజ్ఞానం కలిగి ఉండటాన్ని, అహింసను, పాత్రత ఎరిగి దానం చేయటాన్ని వరాలుగా కావాలని ప్రార్థించి పొందాడు. ముప్పది ఆరు యోజనాల పొడవు, దానికి తగిన వైశాల్యం కలిగిన మణులతో బంగారంతో కూడిన వేదికను నిర్మింపచేసి యజ్ఞంచేసి, బ్రాహ్మణులకు దానిని ఎంతో ఇష్టంతో దానం చేశాడు. ఆ ప్రదేశం అతడి పేరు మీదుగా గయ వటవృక్షం ప్రఖ్యాతి చెందగా, గయుడెన్నో సత్కర్మలు చేసి వర్ధిల్లాడు. మరి, అత డెక్కడికి పోయాడు? చెప్పుము'.

విశేషం: యోజనము= నాలుగు కోసుల దూరం - ఎనిమిది మైళ్ళ దూరం. (కోసు= రెండువేల విండ్ల దూరం).

దైవం ప్రత్యక్షమైతే ఎవరైనా కోరేవి భోగభాగ్యాలు. కాని, గయుడు కోరినవి తద్భిన్నమైనవి. అందునా పొందటానికి కష్టమైన వరం బ్రహ్మచర్యం. మానవుడు గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలను క్రమంగా పాటించాలి. ఆ క్రమం తప్పటానికి వేదవిహితమైన వర్ణాశ్రమధర్మం అంగీకరించదు. కనుక ఆ బ్రహ్మచర్యాశ్రమాన్ని పాటించటం వరంగా పొందవలసి వచ్చింది. వేదం చదవటం మానవ ప్రయత్నం, దాని సారం లేక తత్త్వం తెలియటం మాత్రం భగవదనుగ్రహమే.

సీ. **'ఇరువది వేవురు పరిణతపాచకు । లభ్యాగతులకును నతిథులకును**
బాటించి క్రొత్తగాఁ బవలును రేయును । వలయు నన్నము లిడ వెలసి పశువు
లర్థి నుత్తమ గతికై తార చనుదేర । విశసించు చమరులు వేడ్కతోడఁ
బొడసూపి కడుపారఁ గుడువ హవిర్భాగ । ములు వెట్టు నివ్విధంబున మహోద్ధు

తే. **తముగ నొనరించె సత్త్రయాగము తదుత్స । వంబు గొనియాడ వచ్చిన వార లెల్లఁ**
బ్రచుర పుణ్యాత్ముఁ డన నొప్పె రంతిదేవుఁ; । డవ్విభునకును వలసె లోకాంతరంబు.' **241**

ప్రతిపదార్థం: రంతిదేవుఁడు= రంతిదేవుడనే చక్రవర్తి; ఇరువది వేవురు= ఇరువది వేలమంది; పరిణతపాచకులు= నేర్పరులైన వంటవారు; అభ్యాగతులకును= భోజన సమయానికి వచ్చిన వారికీ; అతిథులకును= ఆహూతులకూ; పాటించి= శ్రద్ధగా; క్రొత్తగాన్= అప్పటికప్పుడు; పవలును రేయును= పగటివేళల, రాత్రివేళల; వలయు= కావలసిన, తగిన; అన్నములు= ఆహారాలు; ఇడన్= పెట్టుతుండగా; పశువులు= యజ్ఞపశువులు; అర్థిన్= కోరికతో; ఉత్తమగతికిన్+ఐ= సద్గతులు పొందటానికి; తారు+అ= తమంతట తామే; చనుదేరన్= రాగా, వచ్చిచేరగా; విశసించుచున్= సంహరిస్తూ, బలిఇస్తూ; అమరులు= దేవతలు; వేడ్కతోడన్= వేడుకతో, ఇష్టంతో; పొడ+చూపి= రూపుకట్టి, ప్రత్యక్షమై; కడుపారన్= కడుపునిండుగా; కుడువన్= తినుచుండగా; హవిర్భాగములు+పెట్టున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యజ్ఞంలో హోమద్రవ్యాలు సమర్పించేవాడూ; ఈ+విధంబునన్= ఈ పద్ధతిలో, ఈ తీరుగా; మహా+అద్భుతముగన్= మిక్కిలి ఆశ్చర్యకరంగా; సత్త్రయాగము= ఎన్నో సంవత్సరాలపాటు జరిపే పెద్ద యాగమును; ఒనరించెన్= చేశాడు; తద్= ఆ; ఉత్సవంబున్= వేడుకను; కొని+ఆడన్= కీర్తించటానికి; వచ్చినవారలు+ఎల్లన్= వచ్చినవారందరూ; ప్రచుర= అధికమైన; పుణ్య+ఆత్ముండు= పవిత్ర స్వభావం కలవాడు; అనన్+ఒప్పెన్= అనేటట్లుగా ప్రకాశించాడు; ఆ+విభునకును= ఆ రాజుకు కూడా; లోక+అంతరంబు= పరలోకం; వలసెన్= తప్పలేదు.

తాత్పర్యం: 'ధర్మరాజా! రంతిదేవుడనే చక్రవర్తి సత్త్రయాగం నిర్వహించాడు. ఇది ఎన్నో సంవత్సరాల పాటు జరిగే యజ్ఞం. అంతకాలం ఆహూతులైనవారికి, భోజనసమయానికి పిలవక వచ్చేవారికి, అందరికీ రాత్రిపవలూ అప్పటికప్పుడు కావలసిన ఆహారం పెట్టటానికని ఇరవైవేల మంది పాకకళాప్రవీణులైన వంటవారిని నియమించాడు. ఆ యజ్ఞంలో బలిపశువులుగా ఉంటే తమకు ఉత్తమ గతులు లభిస్తాయని కోరి వచ్చిన పశువులనే చంపాడు. అత డర్పించే యజ్ఞభాగాలు స్వీకరించటానికి దేవతలు స్వయంగా వచ్చి కడుపారా భుజించేవారు. ఆశ్చర్యపడేటట్లుగా జరిగిన ఆ సత్త్రయాగం చూచిన వారంతా రంతిదేవుడిని పుణ్యాత్ముడని ఎంతో పొగడారు. అట్టి రంతిదేవుడు కూడా లోకాంతర గతుడయ్యాడు కదా!'

సీ. **' శరభ సింహాత్యుగ్ర సత్త్వచయంబుల । నేడిక లెట్లట్ల యెక్కియాడి,**
కట్టుచు విడుచుచుఁ గణ్వాశ్రమంబున । దమియింపఁగా సర్వదమన నామ
మిడియె నమ్ముని; పదంపడి మహారాజ్య । పదస్థుఁడై కాళిందితటమునందు
భాగీరథీ తీరభాగంబునను సర । స్వతి సమీపమునను వాజిమేధ

తే. **రాజసూయాది వివిధాధ్వరము లొనర్చి । కనక నిర్మిత కరితురంగమ రథంబు**
లసదృశ ప్రీతి విప్రుల కొసఁగె భరతుఁ; । డన్నరేంద్రచంద్రుండును జన్నవాఁడ.' **242**

ప్రతిపదార్థం: భరతుఁడు= భరతుడనే చక్రవర్తి; శరభ= మీగండ్ల మెకము; సింహ= సింహం మొదలైన; అతి+ఉగ్ర= మిక్కిలి భయంకరమైన; సత్త్వచయంబులన్= మృగ సమూహాలను; ఏడికలు+ఎట్లు+అట్లు= పొట్టేళ్ళవలె; ఎక్కి= అధిరోహించి; ఆడి= క్రీడించి; కట్టుచున్= ఆ మృగాలను కట్టివేస్తూ; విడుచుచున్= వదలివేస్తూ; కణ్వ+ఆశ్రమంబు= కణ్వుడి ఆశ్రమంలో; దమియింపఁగాన్= నిగ్రహించగా; ఆ+ముని= ఆ కణ్వమహాముని; సర్వదమన= అన్నిటిని నిగ్రహించేవాడు అని 'సర్వదమనుడు' అనే; నామము+ఇడియెన్= పేరు పెట్టాడు; పదంపడి= తరువాత; మహారాజ్య పదస్థుఁడు+ఐ= గొప్ప సామ్రాజ్య పదవి పొందినవాడై; కాళింది తటమునందున్= యమునా నదీ తీరంలోనూ; భాగీరథీ= గంగానది; తీరభాగంబునను= తటాలలోనూ; సరస్వతి= సరస్వతీనది; సమీపమునను= దగ్గరలోనూ; వాజిమేధ= అశ్వమేధ; రాజసూయ+ఆది= రాజసూయం మొదలైన; వివిధ= అనేకమైన; అధ్వరములు= యజ్ఞాలు; ఒనర్చి= చేసి; కనకనిర్మిత= బంగారంతో చేయబడిన; కరి= ఏనుగులు; తురంగమ= గుర్రాలు; రథంబులు= రథాలను; అసదృశ= పోలిక చెప్పటానికి వీలుకాని, సాటిలేని; ప్రీతిన్= తృప్తితో; విప్రులకున్= బ్రాహ్మణులకు; ఒసఁగెన్= ఇచ్చాడు; ఆ+నర+ఇంద్ర చంద్రుండును= ఆ రాజోత్తముడు కూడా; చన్నవాఁడు+అ= వెళ్ళినవాడే, చనిపోయినవాడే కదా!

తాత్పర్యం: 'ధర్మరాజా! కణ్వాశ్రమంలో శరభాలు సింహాలు మొదలైన భయంకరమైన మృగాలను గొర్రెపొట్టేళ్ళను ఎక్కినంత సులభంగా ఎక్కి, వాటిని బంధిస్తూ వదలుతూ, తన అధీనంలో ఉంచుకొన్న భరతుడికి, కణ్వుడు సర్వదమనుడని పేరు పెట్టాడు. తరువాత అతడు రాజ్యపదవిని పొంది, యమున, గంగ, సరస్వతీ నదీతీరాలలో అశ్వమేధం, రాజసూయంవంటి అనేక యజ్ఞాలు చేసి బంగారు ఏనుగులను, గుర్రాలను, రథాలను బ్రాహ్మణులకు ఇష్టంతో దానం చేశాడు. అటువంటి రాజశ్రేష్ఠుడైన భరతుడు కూడా పరలోకవాసి అయ్యాడు కదా!'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. ' మిఱ్ఱు పల్లంబునై మెలఁగంగఁ దనరథ । ప్రముఖ వాహనములఁ బఱప ననువు
గాకున్న మేదినిఁ గని సమస్థలియుగ । వెరవున నొనరించి విశ్రుతముగఁ
దనపేరఁ బృథివి నాఁ జనఁజేసి గోరూప । మైన యివ్వసుమతి నమరనగముఁ
బనిచి యోషధులును బహురత్నములుఁ । బిదికించి జనంబుఁ బోషించెఁ బృథుఁడు;

తే. సేసె నానాధ్వరము లవి సెప్ప నేల? । సకల ధాత్రి బ్రాహ్మణులకు సత్కరించె;
నమ్మహానుభావునకును నతులయశమ । కాక సుస్థిరమయ్యెనే కాయ మనఘ! 243

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! ధర్మరాజా!; మిఱ్ఱు పల్లంబును+ఐ= ఎత్తుపల్లాలుగా ఉండి; మెలఁగంగన్= కదలటానికి; తన రథ ప్రముఖ= తనవైన రథాలు మొదలైన; వాహనములన్= వాహనాలను; పఱపన్= నడిపించటానికి; అనువు+కాక+ఉన్న= వీలుకాకుండా ఉన్నటువంటి; మేదినిన్= భూమిని; కని= చూచి; సమస్థలియుఁగన్= చదునైన ఉపరితలం కలదిగా; వెరవునన్= ఉపాయంతో; ఒనరించి= చేసి; తనపేరన్= తన పేరుమీదుగా; పృథివినాన్= పృథివి (అనగ) అనే పేరుతో; విశ్రుతముగన్= ప్రఖ్యాతి చెందేటట్లు; చనన్+చేసి= చెల్లేటట్లుగా చేసి; గోరూపము+ఐన= ఆవు ఆకృతి ధరించిన; ఈ+వసుమతిన్= ఈ భూమిని; అమరనగమున్= హిమవత్పర్వతాన్ని; పనిచి= పంపి; ఔషధులును= తరు, లతా, గుల్మాదులైన చెట్లను; బహు= అనేకమైన; రత్నములున్= మణులను; పిదికించి= పిదికేటట్లు చేసి; జనంబున్= ప్రజలను; పోషించెన్= బ్రదికించాడు; నానా+అధ్వరములు= అనేక యజ్ఞాలు; చేసెన్= చేశాడు; అవి= వాటిని; చెప్పన్+ఏల?= చెప్పవలసిన పనిలేదు; సకల= సమస్తమైన; ధాత్రిన్= భూమిఅందలి; బ్రాహ్మణులకున్= విప్రులకు; సత్కరించెన్= సన్మానంచేశాడు; ఆ+మహానుభావునకున్= ఆ మహాత్ముడికి; అతుల= పోలిక చెప్పటానికి వీలుకానంత; యశము+అ= కీర్తిమాత్రమే; కాక= తప్ప; కాయము= శరీరం; సుస్థిరము+అయ్యెను+ఏ?= శాశ్వతమయిందా?

తాత్పర్యం: 'పాపరహితుడవైన ధర్మరాజా! పూర్వం భూమి ఎత్తుపల్లాలుగా ఉండి మనుష్యులు తిరగటానికి, రథాలు మొదలైన వాహనాలు నడవటానికి అనువుగా లేకపోతే, చూచి భూమిని చదునుగా ఉండేటట్లు చేశాడు పృథుచక్రవర్తి, అప్పటి నుండి అతడి పేరుమీద పృథ్వి అనే పేరు భూమికి చలామణి అయింది. గోరూపమైన భూమినుండి హిమవంతుడిని దూడగాచేసి ఓషధులను, మణులను పితికి ప్రజలను పోషించాడు. ఎన్నో యజ్ఞాలు చేశాడు. వాటిని గురించి చెప్పలేము. భూలోకంలోని బ్రాహ్మణులందరినీ సన్మానించాడు. ఆ మహానుభావుడికి అంతులేని కీర్తి తప్ప శరీరం స్థిరంగా నిలిచిందా? (కీర్తి మిగిలి, శరీరం నశించింది కదా!)'.

సీ. ' బ్రహ్మ విద్వేషంబుఁ బరికించి కోపించి । యవిజేయుఁడైన సహస్రబాహుఁ
బరిమార్చి నృపతులఁ దరమిడి తునుమాడె । నిరువదియొక్క మా ఱెల్లచోట
నందఱయేలెడు నన్ని భూములుఁ దాన । యేలె ధర్మోజ్జ్వల పాలనమున;
రాజయోగ్యములు ధరామరార్థంబులు । నగు నధ్వరములు పె క్కాచరించెఁ;

ఆ. గశ్యపునకు నిచ్చి కాశ్యపి యను పేరఁ । జనఁగఁ జేసె నుర్వి జామదగ్న్యు
వినమె యామహాత్ముఁడును ససంతోష వి । భ్రాంతి గలిగెనేని బ్రదుక లేఁడు.' 244

ప్రతిపదార్థం: బ్రహ్మవిద్వేషంబున్= బ్రాహ్మణద్వేషాన్ని (బ్రహ్మజ్ఞానాన్ని ద్వేషించటం); పరికించి= గమనించి; కోపించి= కోపం కలవాడై; అవిజేయుఁడు+ఐన= గెలవటానికి వీలుకానటువంటి; సహస్రబాహున్= వేయిచేతులుగల కార్తవీర్యార్జునుడిని; పరిమార్చి= చంపి; నృపతులన్= రాజులను; ఇరువదిఒక్కమాఱు= ఇర్వై ఒక్కసార్లు; తరమిడి= వరసపెట్టి; తునుమాడెన్= సంహరించాడు; ఎల్లచోటన్= అన్నితావుల; అందఱు+ఏలెడు= అందరూ పరిపాలించే; అన్ని భూములున్= అన్ని రాజ్యాలనూ; తాను+అ= తానే; ధర్మ+ఉజ్జ్వల+పాలనమునన్= ధర్మపద్ధతిలో మిక్కిలి ప్రకాశించే పరిపాలనతో; ఏలెన్= పాలించాడు; రాజ యోగ్యములు= రాజులకు

తగినవి; ధరా+అమర+అర్హంబులున్= బ్రాహ్మణులకు తగినవి; అగు= అయిన; అధ్వరములు= యజ్ఞాలు; పెక్కు+ఆచరించెన్= ఎన్నో చేశాడు; ఉర్విన్= భూమిని; కశ్యపునకున్= కశ్యప ప్రజాపతికి; ఇచ్చి= ఒసగి, దానంచేసి; కాశ్యపి+అనుపేరన్= కాశ్యపి అనే పేరుతో; చనఁగన్+చేసెన్= చెల్లుబాటయ్యేటట్లు చేశాడు; జామదగ్న్యున్= అటువంటి జమదగ్ని పుత్రుడైన పరశురాముడిని గూర్చి; వినము+ఎ= వినలేదా?; ఆ+మహా+ఆత్ముఁడును= ఆ మహానుభావుడు కూడా; స+సంతోష విభ్రాంతిన్= సంతోషంతో కూడిన విభ్రమం; కలిగెన్+ఏని= పొందినప్పటికీ; బ్రదుకలేఁడు= బ్రతుకజాలడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! జమదగ్ని పుత్రుడైన పరశురాముడు బ్రహ్మద్వేషీ, జయించ శక్యం కానివాడూ అయిన వేయి చేతుల కార్తవీర్యుడిని చంపి, వరుసగా ఇరవై ఒక్కమారు రాజులందరినీ సంహరించి, వారందరి రాజ్యాలనూ తానొక్కడే ధర్మ బద్ధంగా పరిపాలించి, రాజులు చేయదగినవీ, బ్రాహ్మణులు చేయదగినవీ అయిన యజ్ఞాలు అనేకం చేసి, భూమినంతటినీ కశ్యపప్రజాపతికి దానంచేసి, భూమికి కాశ్యపి అనే పేరు స్థిరపరిచాడు. అవన్నీ మనం విన్నాం కదా! ఆ మహానుభావుడు కూడా సంతోష దుఃఖాలతో కూడిన బ్రతుకుతో కలకాలం జీవించలేకపోయాడు'.

వ. అని చెప్పిన యప్పుండరీకాక్షునితోఁ బాండవాగ్రజుండు 'సృంజయ సుతుండైన సువర్ణష్ఠీవిజన్మంబును, వాఁడు మృతుం డయిన విధంబును వినినది యయినను, సువ్యక్తంబుగా వినవలతుం జెప్పవే!' యనిన నతం డతని కిట్లను 'నీకు నాఁడు కృష్ణద్వైపాయనుం డక్కుమారు వృత్తాంతంబు నారదు నధీనంబగుటం జేసి తద్వ్యాపారంబు సెప్పెఁ; బర్వతునిం జెప్పండు గాని పర్వతుండును సహకారి; యత్తెఱం గాకర్ణింపుము.' 245

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; చెప్పిన= చెప్పిన; ఆ+పుండరీక+అక్షునితోన్= తెల్లతామరలవంటి కన్నులు కల శ్రీకృష్ణుడితో; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; సృంజయ సుతుండు+ఐన= సృంజయుడి కుమారుడైన; సువర్ణష్ఠీవి; జన్మంబును= పుట్టుకనూ; వాఁడు= ఆ సువర్ణష్ఠీవి; మృతుండు+ఐన= చనిపోయిన; విధంబును= ప్రకారమూ; వినినన్+అది= విన్నదే; అయినను= అయినా; సువ్యక్తంబుగాన్= బాగా తెలిసేవిధంగా (అర్థం అయ్యేటట్లు); వినవలతున్= వినాలని కోరుకొంటున్నాను; చెప్పుము+ఏ= చెప్పవలసింది; అనినన్= అనగా; అతనికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనున్= (శ్రీకృష్ణుడు) అన్నాడు; నీకున్; నాఁడు= అప్పుడు; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; ఆ+కుమారు= ఆ బాలుడి; వృత్తాంతంబు= చరిత్ర; నారదు+అధీనంబు+అగుటన్+చేసి= నారదుడికి చెంది ఉండటం వలన; తద్+వ్యాపారంబు= ఆ నారదుడి వ్యవహారం; చెప్పెన్= చెప్పాడు; పర్వతునిన్= పర్వతుడి గురించి; చెప్పండు= చెప్పలేదు; కాని; పర్వతుండును= పర్వతుడు కూడా; సహకారి= తోడ్పడినవాడు; ఆ+తెఱంగు= ఆ క్రమం; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఈ విధంగా చెప్పిన కృష్ణుడితో ధర్మరాజు 'సృంజయుడి కుమారుడైన సువర్ణష్ఠీవి పుట్టుక, అతడు మరణించిన విధం విన్నదే అయినా, మరింత బాగా తెలిసేటట్లు వినా లనుకొంటున్నాను, చెప్పవలసింది' అన్నాడు. దానికి శ్రీకృష్ణు డిట్లా చెప్పటం ప్రారంభించాడు. 'నీకు ఆనాడు వ్యాసుడు ఆ బాలుడి వృత్తాంతం నారదుడికి చెందినది అవటంచేత అతడికి సంబంధించిన విషయమే చెప్పాడు. పర్వతుడిని గురించి చెప్పలేదు. కాని ఈ విషయంలో పర్వతుడుకూడా సహకరించాడు. ఆ విధం అంతా చెప్పుతాను వినుము'.

శ్రీకృష్ణుఁడు ధర్మజునకుఁ బర్వత నారదుల వృత్తాంతంబు సెప్పుట (సం. 12-30-4)

సీ. ' అధిప! నారదు చెలియలి కొడు కప్పర్వ। తుం డిద్దఱును మహీమండలమునఁ
దిమ్మరు వేడుక దివినుండి యొక్కటఁ। జనుదెంచి తమలోన సమయ మధిక
నిష్ఠమైఁ జేసిరి నిజ చిత్తవృత్తు 'లొం। డొరులకు దాఁపక యుండువార;
మటుకాక దాఁప శాపార్హత వాటిల్లుఁ। గలయది' యని యిట్లు గలయఁ బలికి

తే. యుచిత వర్తనమున నుండి యొక్కనాఁడు । సృంజయునిఁ గాంచి యతఁడు విశిష్ట భక్తి నర్చనము సేసినను 'భవదాలయమున । ననఘ! వసియింతుమే కొన్ని దినము' లనిరి. 246

ప్రతిపదార్థం: అధిప!= ధర్మరాజా!; ఆ+పర్వతుండు= ఆ పర్వతుడు; నారదు= నారదుడియొక్క; చెలియలికొడుకు= చెల్లెలి కుమారుడు; ఇద్దఱును= నారద పర్వతులు; మహీమండలంబునన్= భూలోకంలో; త్రిమ్మరువేడుకన్= యథేచ్ఛగా విహరించాలనే కోరికతో; దివినుండి= దేవలోకం నుండి; ఒక్కటన్= ఒకేసారి; చనుదెంచి= వచ్చి; తమలోనన్= తమమధ్య; సమయము= ఒప్పందం, ఒడంబడిక; అధికనిష్ఠమైన్= మిక్కిలి గట్టిగా; చేసిరి= చేసికొన్నారు; నిజ= తమయొక్క; చిత్తవృత్తులు= మనోభావాలు; ఒండొరులకున్= పరస్పరం; దాఁపక+ఉండువారము= దాచుకొనకుండా ఉందాం; అట్లుకాక= ఆ విధంగా కాక; దాఁపన్= దాచినట్లయితే; శాప+అర్హత= శాపంపొందే అర్హత; పాటిల్లన్+కల+అది= కాగలదు; అని= ఈ విధంగా; కలయన్+పలికి= ఇరువురూ కలిసి అనుకొని; ఉచిత= తగిన; వర్తనమునన్= నడవడికతో; ఉండి= ప్రవర్తించి; ఒక్కనాఁడు= ఒకరోజు; సృంజయుని; కాంచి= చూచి; అతఁడు= ఆ సృంజయుడు; విశిష్టభక్తిన్= విశేషమైన భక్తితో; అర్చనము= పూజ, సేవ; చేసినను= చేయగా; అనఘ!= పాపరహితుడా!; భవత్+ఆలయమునన్= నీ గృహంలో; కొన్ని దినములు= కొద్ది రోజులు; నివసింతుము+ఏ?= ఉండమా?; అనిరి= అన్నారు.

తాత్పర్యం: ధర్మరాజా! పర్వతుడు నారదుడి చెల్లెలి కుమారుడు. వారిద్దరూ భూలోకంలో కొంతకాలం విహరించాలనే కోరికతో ఒకేసారి భూలోకం వచ్చారు. తమ మనోభావాలను దాచకుండా ఒకరితో ఒకరు చెప్పుకొనాలని, దాచినట్లైతే శాపార్హు లౌతారని ఒప్పందం చేసికొన్నారు. దానికి తగినట్లుగా ప్రవర్తిస్తూ ఒకనాడు సృంజయుడిని చూచారు. అతడు ప్రత్యేకమైన భక్తితో సేవించగా, అతడి ఇంట కొద్దికాలం ఉండమా? - అన్నారు.

వ. అని పలికిన నా పృథ్వీపతి ప్రియంబంది సుకుమారి యనుపేరం బరఁగిన నిజనందన రావించి 'యిక్కన్నియ మీకుం బరిచర్య సేయ సమాధానంబున నుండుం'డని యన్నెలంతతో 'నీవు దేవోపచారంబుల వీరి నారాధింపు' మని నియోగించి వలయు వస్తువులు సమగ్రంబులుగా సమకట్టినం, బ్రీతులై యమ్మునులు సుఖంబున్న సమయంబున. 247

ప్రతిపదార్థం: అని పలికినన్= ఈ విధంగా అడుగగా; ఆ పృథ్వీపతి= ఆ రాజు, సృంజయుడు; ప్రియంబు+అంది= సంతోషపడి; సుకుమారి+అను+పేరన్+పరఁగిన= సుకుమారి అనే పేరుగల; నిజనందనన్= తనకుమార్తెను; రావించి= పిలిపించి; ఈ+కన్నియ= ఈ కన్య, ఈ బాలిక; మీకున్= మీకు; పరిచర్య+చేయన్= సేవలు చేస్తుండగా; సమ్+ఆ ధానంబునన్+ఉండుండు= అంగీకరించి ఉండండి; అని= పలికి; ఆ+నెలంతతోన్= ఆ బాలికతో; నీవు; దేవ+ఉపచారంబులు= దేవతలకు చేసే ఉపచారాలతో; వీరిన్= ఈ మునులను; ఆరాధింపుము+అని= సేవించుము (పూజించుము) అని; నియోగించి= ఆజ్ఞాపించి; వలయు= కావలసిన; వస్తువులు= పదార్థాలు; సమగ్రంబులు+కాన్= పరిపూర్ణంగా; సమకట్టినన్= సిద్ధపరచగా; ప్రీతులు+ఐ= సంతసించినవారై; ఆ+మునులు= ఆ ఋషులు; సుఖంబు+ఉన్న= హాయిగా ఉన్నటువంటి; సమయంబున= కాలంలో.

తాత్పర్యం: అని పర్వతనారదాదులు అంటే ఆ సృంజయుడు సంతోషపడి, సుకుమారి అనే పేరున్న తన కుమార్తెను పిలిపించి 'ఈ కన్య మీకు ఉపచారాలు చేస్తుంది. అంగీకరించండి' అని చెప్పి, ఆమెతో 'నీవు ఈ మునులను దేవతలకు చేసే ఉపచారాలతో (షోడశోపచారాలతో) సేవించుము' అని ఆజ్ఞాపించి, కావలసిన పదార్థాల నన్నింటిని పరిపూర్ణంగా ఏర్పాటు చేయగా, ఆ మునులు సుఖంగా ఉన్న సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. అల్లఁదనంబున యనువు మైకొనఁజూచు । నడపు కాంతికి వింత తొడవు గాఁగ,
వెడవెడ నూఁగారు వింతయై యేర్పడఁ । దారనివళులలో నారు నిగుడ,
నిట్టలు ద్రోచుచు నెలవులకల మేర । లెల్లను బిగియెక్కి యేర్పడంగఁ,
దెలుపును గప్పును వెలయంగ మెఱుఁగెక్కు । తారకంబులఁ గల్కితనము దొడరఁ

ఆ. జరణములును నడుముఁ జన్నులుఁ గన్నులు । జవ్వనంబు చెన్ను నివ్వటిల్లు
చునికిఁ దెలుప సృంజయుని పుత్రి మెలఁగు వి । ధంబు నారదునకుఁ దగు లొనర్చె. 248

ప్రతిపదార్థం: అల్లఁదనంబున= నెమ్మదితనంతో; అనువు= వీలు, ఉపాయం; మైకొనన్+చూచు= అంగీకరించ ప్రయత్నించే; నడపు= గమనం; కాంతికిన్= జిగికి, శోభకు; వింత= క్రొత్తదైన; తొడవు+కాఁగన్= అలంకారం కాగా; వెడవెడ= కొద్దిగా; నూఁగారు= రోమాళి; వింతఐ= క్రొత్తదిగా; ఏర్పడన్= కలుగగా; తారని= కలువని (ఇంకా సరిగా ఏర్పడని) వళులలోన్= త్రివళులలో; ఆరు= నూగారు; నిగుడన్= వ్యాపించగా; నిట్టలు= స్థానాలు (తమ తమ); త్రోచుచున్= ఆవలకు నెట్టుతూ; నెలవులకున్= స్థానాలకు; అల= ఆ; మేరలు= హద్దులు; ఎల్లను= అన్ని; బిగి+ఎక్కి= బిగువు కలిగి; ఏర్పడంగన్= తయారుకాగా; తెలుపును= తెల్లదనం; కప్పును= నల్లదనం; వెలయంగన్= ఒప్పగా; మెఱుఁగు+ఎక్కు= కాంతి ఎక్కువ అవుతున్న; తారకంబులన్= కను గ్రుడ్లలో; కల్కితనము= మనోహరత్వం, గడుసరితనం; తొడరన్= అతిశయించగా; చరణములును= పాదాలూ; నడుమున్= నడుమూ; చన్నులున్= వక్షోజాలూ; కన్నులు= నయనాలూ; జవ్వనంబు= యౌవనము యొక్క; చెన్ను= అందం; నివ్వటిల్లుచున్= అతిశయిస్తూ; ఉనికి= ఉండటాన్ని; తెలుపన్= ప్రకటించగా; సృంజయుని పుత్రి= సుకుమారి; మెలఁగు విధంబు= ప్రవర్తించే తీరు; నారదునకున్= నారద మహర్షికి; తగులు+ఒనర్చె= మోహాన్ని కలిగించింది.

తాత్పర్యం: నెమ్మదితనంతో వీలు చూచుకొని అతిశయించే నడక ఆ సుకుమారి శోభకు క్రొత్త అందాన్ని కూర్చగా, అప్పుడే స్వల్పంగా రూపు కడుతున్న నూగారు, ఇంకా స్పష్టంగా ఏర్పడని త్రివళుల (పొట్టపై అందగత్తెలకుండే మూడు ముడుతలు)లో వ్యాపించగా, (శరీరావయవాలు) తమతమ స్థానాలను దాటి (విస్తరించి), క్రొత్త హద్దులను స్థిరపరచగా, తెలుపునలుపులతో మరింత కాంతిమంతమౌతున్న కంటిపాపల మనోహరత్వం అతిశయించగా, పాదాలు, నడుము, వక్షోజాలు, కన్నులు యౌవన సౌందర్యం అధికమవటాన్ని తెలుపుతుండగా సృంజయుడి కుమార్తె సుకుమారి ప్రవర్తించే తీరు నారదమహర్షికి ఆకర్షణ కలుగజేసింది.

విశేషం: అలం: యథాసంఖ్యం

క. నారదుఁడు మదనబాణా । సారము దనుఁ బొదువ ధైర్యసారమెడలి దు
ర్వార మనోవ్యథవంతం । గూరి క్రమంబునఁ గృశాంగకుండయ్యె నృపా! 249

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; నారదుఁడు= నారదమహర్షి; మదనబాణ+ఆసారము= మన్మథబాణాల జడివాన; తనున్= తనను; పొదువన్= క్రమ్మగా; ధైర్యసారము= ధైర్యంయొక్క బలం; ఎడలి= కోల్పోయి, దుర్వార= వారించరాని; ఆపలేని; మనోవ్యథ వంతన్= మానసికతాపం వలని బాధలో; కూరి= కూరుకుపోయి; క్రమంబునన్= నెమ్మది నెమ్మదిగా; కృశ+అంగకుండు= క్షీణించిన శరీరావయవాలు కలవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: ధర్మరాజా! నారదమహర్షి మన్మథబాణాల జడివాన తనను ముంచెత్తగా, ధైర్యం కోల్పోయినవాడై, నివారించలేని మనోవికార బాధలో కూరుకొనిపోయి నెమ్మదిగా చిక్కిపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్లు కామబారిం బడి నలంగియుఁ దనతో నుగ్గడింప సిగ్గుపడి. 250

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; కాము+బారిన్+పడి= మన్మథబాధ పాలబడి; నలంగియున్= బాధపడి కూడా; తనతోన్= పర్వతుడితో; ఉగ్గడింపన్= చెప్పటానికి; సిగ్గు+పడి= సిగ్గిల్లి.

తాత్పర్యం: ఆ విధంగా మన్మథుడి బాణాలకు ఎర అయి, బాధపడుతూ కూడా తనతో చెప్పటానికి సిగ్గుపడి. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. వెనుఁబడు చిత్తవృత్తియును, వెల్వెలఁ బాఱెడు నాననంబు నై
యనిశముఁ గుందు, మామఁ గని యల్లుఁ 'డితం డిటు లేల వంతఁ బొం
దెనో!' యనుచింత నొంది, తన దివ్యమతిం బరికించి కాంచి 'కూ
డునె సమయంబు దప్పఁగ? గడుం గుటిలాత్ముఁడవైతి నా యెడన్.' 251

ప్రతిపదార్థం: వెనుఁబడు= విషాదానికి లోనైన; చిత్తవృత్తియును= మనోభావమూ; వెల్వెలన్+పాఱెడు= పాలిపోయిన; ఆననంబును+ఐ= ముఖం కలవాడై; అనిశమున్= నిరంతరం; కుందు= బాధపడుతున్న; మామన్+కని= మేనమామ అయిన నారదుడిని చూచి; అల్లుఁడు= పర్వతుడు; ఇతండు= ఈ నారదుడు; ఇటులు= ఈ విధంగా; ఏల= ఏ కారణంగా; వంతన్= బాధను; పొందెను+ఒ?= పొందాడో?; అను చింతన్+ఒంది= అనే ఆలోచన కలిగి; తన దివ్యమతిన్= తన దివ్యదృష్టితో; పరికించి= చూచి; సమయంబున్= ఒప్పందాన్ని; తప్పఁగన్= తప్పటం; కూడును+ఎ?= తగినదా?; నా+ఎడన్= నా పట్ల; కడున్= మిక్కిలి; కుటిల+ఆత్ముఁడవు= దుర్బుద్ధి కలవాడివి; ఐతి(వి)= అయ్యావు.

తాత్పర్యం: మనసులో విషాదం, పాలిపోయిన ముఖం కలిగి నిరంతరం బాధపడుతూ ఉన్న తన మేనమామ నారదుడిని చూచి పర్వతుడు తనమామ ఎందుకు అంత బాధపడుతున్నాడా? అని ఆలోచించి, దివ్యదృష్టితో తెలిసికొన్నాడు. 'మాటతప్పి, నా పట్ల దుర్బుద్ధివి అయ్యావు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. రాచకూఁతు మీఁద రాగంబు పుట్టుట । నాకుఁ జెప్పవైతి; నీకు శాప
మిత్తు; నమ్మృగాక్షి నీవు వరింపక । నిలువలేవు మరుఁడు బలియుఁడగుట. 252

ప్రతిపదార్థం: రాచకూఁతు+మీఁదన్= రాజకుమార్తెపై; రాగంబు పుట్టుట= ప్రేమ కలగటం; నాకున్ చెప్పవు+ఐతి(వి)= నాకు చెప్పలేదు; నీకున్; శాపము+ఇత్తున్= శాపం ఇస్తాను; మరుఁడు= మన్మథుడు; బలియుఁడు= బలవంతుడు; అగుటన్= కావటం వలన; ఆ+మృగ+అక్షిన్= ఆ లేడి కళ్ళవంటి కళ్ళుగల సుకుమారిని; వరింపక= వివాహమాడక; నిలువలేవు= ఉండలేవు.

తాత్పర్యం: రాజకుమార్తెపై నీకు అనురాగం కలిగిందని నాకు చెప్పలేదు. నిన్ను శపిస్తాను. మన్మథుడి ప్రాబల్యం కారణంగా నీ వా సుకుమారిని పరిణయం చేసికొనక ఉండలేవు.

వ. పాణిగ్రహణానంతరంబ వానర వదనుండ వగు' మనవుడు నారదుండు 'నీకు నాకలోకంబునకుం జనుట లేకుండెడు' మని ప్రతిశాపం బిచ్చినం, బర్వతుం డచ్చోటు వాసిపోయి భూజనంబులు పూజింపఁ బ్రవర్తిల్లుచుండె. 253

ప్రతిపదార్థం: పాణిగ్రహణ+అనంతరంబు+అ= వివాహం తరువాత వెంటనే; వానర వదనుండవు= కోతిమొగం కలవాడివి; అగుము= కమ్ము; అనవుడున్= అనగా; నారదుండు; నీకున్= పర్వతుడికి; నాకలోకంబునకున్= స్వర్గలోకానికి; చనుట= వెళ్ళటం; లేక+ఉండెడున్= లేక ఉందువుగాక; అని= అంటూ; ప్రతిశాపంబు= ఎదురు శాపం; ఇచ్చినన్= ఇవ్వగా; పర్వతుండు; ఆ+చోటు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ ప్రదేశాన్ని; పాసి= వీడి; పోయి= వెళ్ళి; భూజనంబులు= భూలోక ప్రజలు; పూజింపన్= ఆరాధిస్తుండగా; ప్రవర్తిల్లుచుండెన్= నడుచుకొంటూ ఉన్నాడు.

తాత్పర్యం: వివాహం అయిన వెంటనే కోతి మొగం కలవాడివి అవుతావు' అని పర్వతుడు అనగానే, 'నీవు స్వర్గలోకానికి వెళ్ళకుందువుగాక!' అని నారదుడు ఎదురు శాపం ఇచ్చాడు. పర్వతుడు ఆ ప్రదేశం వదలి వెళ్ళి భూలోకంలోని ప్రజలచేత పూజలందుకొంటూ తిరుగసాగాడు.

శా. శాప ప్రాప్తికి నోర్చి తా నడిగి యా చంద్రాస్య నన్నారదుం
డా పృథ్వీపతి యీఁ బ్రియంబున వివాహం బయ్యె నమ్మాత్రలో
భూపా! యమ్ముని వానరాననతమైఁ బొల్పేద నక్కాంత త
ద్రూప ప్రాప్తి విరక్తగాక తగఁ బ్రీతుం జేయుచుండెం బతిన్. 254

ప్రతిపదార్థం: భూపా!= ధర్మరాజా!; ఆ+నారదుండు= ఆ నారదమహర్షి; శాపప్రాప్తికిన్= శాపం పొందటాన్ని కూడా; ఓర్చి= సహించి; తాన్= తానే; ఆ+చంద్ర+ఆస్యన్= చంద్రుడివంటి ముఖం కల సుకుమారిని; అడిగి= వేడి; ఆ పృథ్వీపతి= ఆ రాజు (సృంజయుడు); ఈన్= ఒసగగా; ప్రియంబునన్= ఇష్టంతో; వివాహంబు+అయ్యెన్= వివాహం చేసికొన్నాడు; ఆ+మాత్రలోన్= అంతలో; ఆ+ముని= ఆ నారదుడు; వానర+ఆననత+మైన్= కోతిమొగం కలిగి ఉండటంతో; పొల్పు+ఏదన్= అందంపోగా; ఆ+కాంత= ఆ సుకుమారి; తద్+రూప+ప్రాప్తిన్= ఆ కోతి రూపం పొందినందువలన; విరక్త+కాక= అనిష్టాన్ని పెంచుకొనకుండా; తగన్= చక్కగా; పతిన్= భర్తను; ప్రీతున్= సంతృప్తి చెందినవాడిని; చేయుచున్+ఉండెన్= చేస్తున్నది.

తాత్పర్యం: ధర్మరాజా! నారదమహర్షి తనకు శాపం వచ్చినా సహించి, సృంజయుడిని తానే అడిగి, సుకుమారిని ఎంతో ఇష్టంగా వివాహం చేసికొన్నాడు. మరుక్షణం కోతిముఖం పొంది తన అందాన్ని కోల్పోయాడు. నారదుడు అటువంటి వికారమైన రూపం పొందినా ఆ సుకుమారి భర్తపై అనిష్టం ప్రకటించకుండా అతడిని సుఖపెట్టుతూ ఉన్నది.

వ. ఇట్లు పతివ్రతయై సుకుమారి నారదు నారాధించుచుండెఁ;బదంపడి యొక్క నాఁ డేమేనియుుం బనికి వనంబునకు నారదుండు వోయినయెడం బర్వతుండు డబ్బాటు గాంచి నమస్కరించి 'నాకిచ్చిన శాపంబు మరల్పవే!' యనుటయు నారదుండు 'నీవు గావె మున్ను శపించిన వాఁడవు; ముందర నీ యిచ్చిన శాపంబు మరల్పందగు' నని పలికిన, నతం 'డట్లకాక' యనియె; నివ్విధంబున నొడంబడి యిరువురు నొండొరువుల శాపంబులు మరల్చి; రయ్యల్లుండును మామతోడన వచ్చి మందిర ప్రవేశంబు సేయు సమయంబున నా రాజనందన నిజపురుషుం జూచి పరపురుషుండ కాఁ దలంచి, మఱిచూడక మాఱుమొగంబు వెట్టికొని పోవుటయు. 255

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పతివ్రత+ఐ= పతిని అనుసరించే ప్రవర్తన కలదై; సుకుమారి= సృంజయుడి కుమార్తె, నారదున్= నారదుడిని; ఆరాధించుచున్+ఉండెన్= సేవించుకొంటూ ఉన్నది; పదంపడి= తరువాత; ఒక్క+నాఁడు= ఒక రోజు; ఏమి+ఏనియున్= ఏదో ఒక; పనికిన్= కార్యానికి; నారదుండు; వనంబునకున్= అరణ్యానికి; పోయిన+ఎడన్= వెళ్ళినప్పుడు; పర్వతుండు; డబ్బాటు= అకస్మాత్తుగా; కాంచి= చూచి; నమస్కరించి= మ్రొక్కి; నాకున్+ఇచ్చిన= నాకొసంగిన; శాపంబు= శాపాన్ని; మరల్పుము+ఏ?= వెనక్కు తీసికొనవా?; అనుటయున్= అనగా; నారదుండు; మున్ను= ముందు; శపించినవాఁడవు= తిట్టినవాడివి; నీవు+కావు+ఏ!= నీవే కదా!; ముందర= ముందు; నీ+ఇచ్చిన= నీ విచ్చిన; శాపంబు= తిట్టు; మరల్పన్+తగున్= వెనుకకు తీసికొనటం తగి ఉంటుంది;

అనిపలికినన్= అంటూ మాట్లాడగా; అతండు= ఆ పర్వతుడు; అట్లు+అ+కాక= అట్లే అగుగాక; అనియెన్= అన్నాడు; ఈ+విధంబునన్= ఈ తీరుగా; ఒడంబడి= అంగీకరించి; ఇరువురున్= ఇద్దరూ; ఒండొరువుల= పరస్పర; శాపంబులు= శాపాలను; మరల్చిరి= వెనుద్రిప్పారు; ఆ+అల్లుండును= ఆ పర్వతుడు కూడా; మామతోడన= నారదుడితోనే; వచ్చి= ఏతెంచి; మందిర ప్రవేశంబు+చేయు= ఇంటిలో అడుగుపెట్టే; సమయంబునన్= తరుణంలో; ఆ రాజనందన= ఆ రాకుమారి - సుకుమారి; నిజపురుషున్= తన భర్తను; చూచి= కని; పరపురుషుండు= పరాయి మగవాడు; కాన్+తలంచి= అయి ఉంటా డనుకొని; మఱిచూడక= మళ్ళీ చూడకుండా; మాఱుమొగంబు= ఎడమొగం; పెట్టికొని= పెట్టుకొని; పోవుటయున్= వెళ్ళిపోగా.

తాత్పర్యం: భర్త కురూపి అయినా సుకుమారి పతివ్రత అయి భర్తను సేవిస్తూ ఉన్నది. ఒకరోజు ఏదో పనిమీద నారదుడు అడవికి వెళ్ళగా హఠాత్తుగా పర్వతుడు చూచి నమస్కరించి తన కిచ్చిన శాపాన్ని వెనుకకు తీసికొనుమని అడిగాడు. దానికి నారదుడు 'ముందుగా శపించినది నీవు కనుక నీవే ముందు మరల్చాలి' అన్నాడు. దానికా పర్వతుడు సరేనన్నాడు. ఈ విధంగా ఇద్దరూ పరస్పరం శాపాలు మరల్చారు. మామా అల్లు ళ్ళిద్దరూ వచ్చి ఇంటిలో ప్రవేశించబోతూ ఉండగా, సుకుమారి తన భర్త అయిన నారదుడిని పరాయివాడిగా భావించి తిరిగిచూడక పెడమొగం పెట్టుకొని పోయింది.

ఆ. నగుచుఁ బర్వతుండు 'నాతి! నీపతి యగు । విశ్వసింపు'మని సవిస్తరముగ
శాపములును మోక్షసంవిధానములును । జెప్పి తీర్చె దాని చిత్తవృత్తి. 256

ప్రతిపదార్థం: పర్వతుండు; నగుచున్= నవ్వుతూ; నాతి!= ఓ సుకుమారీ!; నీపతి+అగు= (ఇతడు) నీ భర్తయే (అయి ఉన్నాడు); విశ్వసింపుము+అని= నమ్ముమని; సవిస్తరముగన్= అన్ని వివరాలతో; శాపములును= ఒకరినొకరు శపించుకొనటం;మోక్షసంవిధానములును= శాపావనసానపు తీరులూ; చెప్పి= తెలిపి; దాని= ఆ సుకుమారి యొక్క; చిత్తవృత్తిన్= మనసును; తీర్చెన్= కలత తీర్చాడు.

తాత్పర్యం: అపుడు పర్వతుడు నవ్వుతూ, 'సుకుమారీ! ఇతడు నీ భర్త అని నమ్ముము' అని శాపాలవృత్తాంతం, అవి పోయిన వృత్తాంతం వివరంగా చెప్పి ఆమె మనసులోని కలతను తీర్చాడు.

వ. ఇట్లు నారదుండును బర్వతుండును బరస్పర ప్రియకారులైరి; కౌరవోత్తమా! నీ యడిగిన సువర్ణష్ఠీవి వృత్తాంతంబు నిమ్మునివరుండు దేటపడం జెప్పెడు' నని సృంజయపుత్త్ర చరిత్ర కథనంబు నారదు కృత్యంబుగాఁ బలుకుచు నతనిం జూపిన, నాతం 'డిప్పుడు శౌరి చెప్పినయంతయు నిట్టిద' యక్కుమారు తెఱంగుఁ జెప్పెద నాకర్ణింపు'మని యప్పాండవాగ్రజున కభిముఖుండై యిట్లనియె. 257

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నారదుండును, పర్వతుండును; పరస్పర= ఒకరికొకరు; ప్రియకారులు= మేలు చేసికొన్నవారు; ఐరి= అయ్యారు; కౌరవ+ఉత్తమా!= కౌరవులలో శ్రేష్ఠుడవైన ధర్మరాజా!; నీ+అడిగిన= నీవు అడిగినటువంటి; సువర్ణష్ఠీవి; వృత్తాంతంబున్= చరిత్రను; ఈ+మునివరుండు= ఈ ఋషి శ్రేష్ఠుడు నారదుడు; తేటపడన్= స్పష్టమయ్యేటట్లు; చెప్పెడున్= చెప్తాడు; అని= అంటూ; సృంజయ పుత్ర చరిత్ర= సృంజయుడి కుమారుడైన సువర్ణష్ఠీవి కథ; కథనంబు= చెప్పటం; నారదు కృత్యంబు+కాన్= నారదుడు చేయవలసిన పని అని; పలుకుచున్= చెప్తూ; అతనిన్= ఆ నారదుడినే; చూపినన్= చూపగా; ఆతండు= ఆ నారదుడు; ఇప్పుడు; శౌరి= కృష్ణుడు; చెప్పిన+అంతయున్= చెప్పినదంతా; ఇట్టిది+అ= అటువంటిదే, నిజమే; ఆ+కుమారు= ఆ బాలుడి; తెఱంగున్= విధం; చెప్పెదన్= చెప్తాను; ఆకర్ణింపుము= వినుము; అని= పలికి; ఆ+పాండవ+అగ్రజునకున్= ఆ ధర్మరాజుకు; అభిముఖుండు+ఐ= ఎదురుగా నిలిచినవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ విధంగా నారదుడు పర్వతుడు ఒకరికొకరకు ఒకరు ఉపకారం చేసికొన్నారు. నీవు అడిగిన సువర్ణష్ఠీవి వృత్తాంతాన్ని మునివర్యుడైన నారదుడు మీకు తేటతెల్లంగా వినిపిస్తాడు. సువర్ణష్ఠీవి కథ చెప్పటం నారదుడి పని' అని చెప్పి శ్రీకృష్ణుడు నారదుడిని చూపగా, అతడు 'కృష్ణుడు చెప్పినదంతా వాస్తవమే' అని, 'ఇక సువర్ణష్ఠీవి కథ విను' మని ధర్మరాజు ఎదుట నిలిచి ఇట్లా చెప్పటం ప్రారంభించాడు.

సీ. **' అవ్విధంబున నేను నల్లుండు సంప్రీతి । సృంజయుపాల వసింపఁ గొన్ని**
సంవత్సరంబులు సనినఁ, దదాశ్రిత । బ్రాహ్మణోత్తముల సంప్రార్థనంబు
గలుగంగ మాకును గమనేచ్ఛ పుట్టంగ । నా రాజునకు నుపకార మొకటి
సేయఁ దలంచి యే మాయన సన్నిధి । కరిగి కోరుము వరమంటి మనిన

ఆ. **నతఁడు 'మీరు ప్రీతులయినకంటెను నొండు । గలవె వరము?' లనిన గారవించి**
యనిమిషలను మిగులు తనయునిఁ బడయంగ । వలచియుండు దట్టి వానిఁ గనుము. **258**

ప్రతిపదార్థం: ఆ+విధంబునన్= ఆ విధంగా; నేనును+అల్లుండున్= నేనూ నా మేనల్లుడైన పర్వతుడూ; సంప్రీతిన్= మిక్కిలి ఇష్టంతో; సృంజయపాలన్= సృంజయుడివద్ద; వసింపన్= నివసించగా, ఉండగా; కొన్ని సంవత్సరంబులు= కొన్ని ఏళ్ళు; చనినన్= కడవగా; తద్+ఆశ్రిత= ఆ సృంజయుడిని ఆశ్రయించుకొని ఉన్న; బ్రాహ్మణ+ఉత్తముల= విప్రవర్యుల; సంప్రార్థనంబు= విన్నపం; కలుగంగన్= ఉండగా; మాకును= మాకు కూడా; గమన+ఇచ్ఛ= వెళ్ళాలనే కోరిక; పుట్టంగన్= కలుగగా; ఆ రాజునకున్= ఆ సృంజయుడికి; ఉపకారము+ఒకటి= ఒక మేలు; చేయన్+తలంచి= ఒనరించా లనుకొని; ఏము= మేము; ఆయన సన్నిధికిన్= ఆ సృంజయుడి వద్దకు; అరిగి= వెళ్ళి; కోరుము వరము= వరంకోరుకొనుము; అంటిమి= అన్నాము; అనినన్= అనగా; అతడు= ఆ సృంజయుడు; మీరు; ప్రీతులు+అయిన= సంతసించినవారు అయిన; కంటెను= దానికన్న; ఒండు= వేరు; వరములు= కోరదగినవి; కలవు+ఎ?= ఉన్నాయా?; అనినన్= అనగా; గారవించి= ఆదరించి; అనిమిషలను= దేవతలను; మిగులు= అతిశయించే; తనయునిన్= కుమారుడిని; పడయంగన్= పొందాలని; వలచి= కోరి; ఉండుదు(వు)= ఉన్నావు; అట్టివానిన్= అటువంటి కుమారుడిని; కనుము= పొందుము.

తాత్పర్యం: ఆ విధంగా నేనూ నా మేనల్లుడూ ఆ సృంజయుడి వద్ద కొన్ని ఏళ్ళు ఉన్న తరువాత అతడి ఆశ్రయంలో ఉన్న బ్రాహ్మణులు కోరగా, మాకూ వెళ్ళుదామనే కోరిక కలగటంతో సృంజయుడికి ఏదైనా మేలు చేయాలనే ఉద్దేశంతో ఆయన వద్దకు వెళ్ళి వరం కోరుకొమ్మన్నాము. అతడు 'మీరు సంతుష్టులవటానికి మించిన వరాలు ఇంకేమున్నాయి?' అన్నాడు. అతడిని గౌరవించి 'దేవతలను మించిన కొడుకును పొందాలని కోరుకొంటున్నావు కనుక అట్టి కొడుకును పొందుతావు.'

వ. **అంటి: మట్టియెడ నింద్ర తేజో రక్షణాయత్త చిత్తుండగు నప్పర్వతుం డప్పుడమిటేనితో 'విను మక్కుమారుండు దీర్ఘాయురుపేతుండు గాకుండు' ననియె దానికి నమ్మానవపతి యుమ్మలించి యమ్మహాత్ము నాననంబునం జూడ్కి నిలిపి 'యి ట్లేల యుష్మ దనుగ్రహం బనూనంబు గావలవదే?' యని ప్రార్థించిన నమ్మాట కమ్ముని మఱుమాట వలుకకున్న నే నన్నరనాథుపైఁ గలుగు కరుణావిశేషంబున.** **259**

ప్రతిపదార్థం: అంటిమి= అన్నాము; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఇంద్రతేజోరక్షణ= ఇంద్రుడియొక్క తేజమును రక్షించటంలో; ఆయత్త= సిద్ధపడిన; చిత్తుండు= మనసు కలవాడు; అగు= అయిన; ఆ+పర్వతుండు= ఆ పర్వతుడు; ఆ+పుడమి ఱేనితోన్= ఆ రాజుతో; వినుము= వినుము; ఆ+కుమారుండు= ఆ బాలుడు; దీర్ఘ+ఆయుః+ఉపేతుఁడు= అధికమైన ఆయుస్సుతో కూడుకొన్నవాడు; కాక+ఉండున్= కాకపోతాడు; అనియెన్= అన్నాడు; దానికిన్= ఆ మాటలకు; ఆ+మానవపతి= ఆ రాజు;

ఉమ్మలించి= బాధపడి; ఆ+మహాత్ము= ఆ మహానుభావుడైన పర్వతుడి; ఆననంబునన్= ముఖంపై; చూడ్కి= చూపు; నిలిపి= కేంద్రీకరించి; ఇట్లు+ఏల= ఈ విధంగా ఎందుకు; యుష్మత్+అనుగ్రహంబు= మీ అనుగ్రహం; అనూనంబు= తక్కువ కానిది; కావలదు+ఏ!= అయి ఉండాలి కదా!; అని; ప్రార్థించినన్= వేడగా; ఆ+మాటకున్= ఆ పలుకునకు; ఆ+ముని= ఆ పర్వతుడు; మఱుమాట= మారుమాట; పలుకక= మాట్లాడక; ఉన్నన్= ఉండగా; ఏన్= నేను; ఆ+నరనాథుపైన్= ఆ రాజుమీద; కలుగు= ఉన్న; కరుణా విశేషంబునన్= దయావిశేషంవలన.

తాత్పర్యం: అని అన్నాం. ఆ సమయంలో ఇంద్రుడి మహత్త్వాన్ని రక్షించటంలో నిమగ్నమైన మనసున్న పర్వతుడు ఆ రాజుతో 'వినుము - ఆ బాలుడు దీర్ఘాయువు కలవాడు కాకుండా ఉంటాడు' అన్నాడు. దానికి ఆ రాజు బాధపడి పర్వతుడి ముఖంపై చూపు కేంద్రీకరించి, 'ఇట్లా ఎందుకు అన్నారు? మీ దయలో లోటు ఉండకూడదు కదా!' అని వేడుకొన్నాడు. ఆ మాటలకు పర్వతుడు మారుపలుక లేదు. నేను ఆ రాజుపై ఉన్న ప్రత్యేకమైన దయతో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **వలదు శంకింప నింద్రుని వలనఁ బుట్టు। నెడరు వొందక యుండంగఁ గొడుకు నోపి**
నంత గావుము; గావంగనైన చావు। నపుడు నన్నుఁ దలంపు;మే నది మరల్తు. **260**

ప్రతిపదార్థం: శంకింపన్= అనుమానించ; వలదు= వద్దు; ఇంద్రునివలనన్= ఇంద్రుడి నుండి; పుట్టు= కలుగబోయే; ఎడరు= ఆపద; పొందక+ఉండంగన్= కలుగకుండా ఉండేటట్లు; కొడుకున్= కుమారుడిని; ఓపిన+అంత= చేతనైనంత; కావుము= కాపాడుము; కావంగన్= కాపాడుతున్నా; ఐన= కలిగిన; చావునపుడు= మరణ సమయంలో; నన్నున్= నన్ను (నారదుడిని); తలంపుము= తలచుకొమ్ము; ఏన్= నేను; అది= ఆ మరణాన్ని; మరల్తున్= తిప్పికొడతాను.

తాత్పర్యం: రాజా! నీవు అనుమానించవద్దు. ఇంద్రుడివలన కలిగే ఆపద నీ కుమారుడిని సమీపించకుండా నీకు చేతనైనంత కాపాడు. ఎంత రక్షించినా, మరణం సంభవిస్తే ఆ సమయంలో నన్ను తలచుకొమ్ము. నే నా చావును వెనక్కి తిప్పుతాను.

వ. **అక్కుమారుండు నిజనిష్ఠీవ నాదులు సువర్ణమయంబు లగుటంజేసి సువర్ణష్ఠీవి యనం బరఁగుఁ;బ్రమోదంబునం బొందుము.'** **261**

ప్రతిపదార్థం: నిజ= తన; నిష్ఠీవన+ఆదులు= ఉమ్మి మొదలైనవి; సువర్ణమయంబులు= బంగారపువి; అగుటన్+చేసి కావటంవలన; ఆ+కుమారుండు= ఆ బాలుడు; సువర్ణష్ఠీవి; అనన్+పరఁగున్= అని ప్రసిద్ధుడవుతాడు; ప్రమోదంబునన్ పొందుము= సంతోషము కలిగి ఉండుము.

తాత్పర్యం: నీకు పుట్టబోయే కుమారుడి ఉమ్మి మొదలైనవి బంగారంతో నిండినవి కావటంవలన సువర్ణష్ఠీవి అనే పేరుతో ప్రసిద్ధుడౌతాడు. నీవు సంతోషంగా ఉండుము.

క. **అని యూఱడిల్లఁ బలికిన। విని యాతఁడు సంతసంబు వెల్లిం దేలెం**
జని యే మీప్సితవర్తన। మున నుండితి; మవ్విభుండు పుత్రునిఁ గాంచెన్. **262**

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; ఊఱడిల్లన్= ఓదార్పు పొందేటట్లుగా; పలికినన్= పలుకగా; విని= ఆకర్ణించి; ఆతఁడు= ఆ సృంజయుడు; సంతసంబు= ఆనందపు; వెల్లిన్= ప్రవాహంలో; తేలెన్= తేలియాడాడు; ఏము= మేము; చని= వెడలి; ఈప్సిత+వర్తనమునన్= యథేచ్ఛగా; ఉండితిమి= ఉన్నాం; ఆ+విభుండు= ఆ రాజు; పుత్రునిన్= కుమారుడిని; కాంచెన్= పొందాడు.

తాత్పర్యం: ఆ విధంగా ఓదార్పుమాటలు పలుకగా, ఆ సృంజయుడు ఆనంద ప్రవాహంలో తేలియాడాడు. మేము యథేచ్ఛగా సంచరిస్తూ ఉన్నాం. ఆ రాజు కుమారుడిని పొందాడు.

వ. వాఁడును మలమూత్ర లాలాశ్రు స్వేదంబులు గనక మయంబులయి తొరుఁగం బెరుఁగుచుండె; నా సమయంబున నెడరువేచి వెంగలు లగు మ్రుచ్చు లబ్బాలుం బట్టి నోరం జీర దుఱిమి, యడవికిం గొనిపోయి యొడలు జల్లించి పసిండి గానక పీనుంగు వైచి పోయిరి. సృంజయుండును దనకొడుకు నింద్రుం డపహరించె నను తలంపున శోకార్తినొంది పలవించుచు నన్నుం దలంచినం బోయి నీకుం బుండరీకాక్షుం డిప్పుడు సెప్పిన యాది రాజ విషయంబు లగు శోకోపశమన వచనంబులు సెప్పి, యంకిలి దేర్చి యవిచారపరులగు తస్కరులా శిశువుం జంపుట యెఱింగించి. 263

ప్రతిపదార్థం: వాఁడును= ఆ బాలుడు కూడా; మల; మూత్ర; లాలా= ఉమ్మి; అశ్రు= కన్నీరు; స్వేదంబులు= చెమట; కనకమయంబులు+అయి= బంగారువి అయి; తొరుఁగన్= స్రవించుచుండగా; పెరుఁగుచున్+ఉండెన్= పెద్దవాడవుతూ ఉన్నాడు; ఆ సమయంబునన్= ఆ సమయంలో; ఎడరు= అవకాశంకొరకు; వేచి= ఎదురుచూచి; వెంగలులు= అవివేకులు; అగు= అయిన; మ్రుచ్చులు= దొంగలు; ఆ+బాలున్= ఆ పసివాడిని; పట్టి= పట్టుకొని; నోరన్= నోటియందు; చీర= వస్త్రం; తుఱిమి= కూరి, చొనిపి; అడవికిన్= అరణ్యానికి; కొనిపోయి= తీసికొనివెళ్ళి; ఒడలు= శరీరం; జల్లించి= శోధించి; పసిండిన్= బంగారాన్ని; కానక= చూడక; పీనుంగు= శవాన్ని; వైచి= పారవైచి; పోయిరి= వెళ్ళిపోయారు; సృంజయుండును= సృంజయుడు కూడా; తనకొడుకున్= తన కుమారుడిని; ఇంద్రుండు; అపహరించెను= దొంగిలించాడు; అను= అనే; తలంపునన్= ఆలోచనతో; శోక+ఆర్తిన్= దుఃఖం వలన బాధను; ఒంది= పొంది; పలవించుచున్= దుఃఖిస్తూ; నన్నున్= నన్ను; తలంచినన్= తలచుకొనగానే; పోయి= వెళ్ళి; నీకున్= నీకు (ధర్మరాజుకు); పుండరీక+అక్షుండు= తెల్లతామరలవంటి కన్నులు కల శ్రీకృష్ణుడు; ఇప్పుడు= ఈ సమయంలో; చెప్పిన= చెప్పినటువంటి; ఆది= పూర్వపు; రాజవిషయంబులు+అగు= రాజులకు చెందినవి అయిన; శోక= దుఃఖాన్ని; ఉపశమన= తగ్గించే; వచనంబులు= మాటలు; చెప్పి= పలికి; అంకిలి= కలత; తేర్చి= తీర్చి; అవిచారపరులు+అగు= అవివేకులు అయిన; తస్కరులు= దొంగలు; ఆ శిశువున్= ఆ పసివాడిని; చంపుట= చంపటం; ఎఱింగించి= తెలియపరచి.

తాత్పర్యం: ఆ సృంజయుడి కుమారుడైన సువర్ణష్ఠీవి తన మలమూత్రాలు, ఉమ్మి, చెమట, కన్నీరు మొదలైనవి బంగారు మయములుగా స్రవిస్తూ ఉండగా, పెరిగి పెద్దవాడవుతూ ఉన్నాడు. ఆ సమయంలో అవకాశంకొరకు ఎదురుచూచి అవివేకులైన దొంగలు ఆ బాలుడిని పట్టుకొని నోట్లో గుడ్డలు కుక్కి, అడవిలోకి తీసికొనిపోయి, ఒడలంతా వెదకి బంగారం కనబడకపోవటంతో ఆ శవాన్ని పారేసి వెళ్ళిపోయారు. సృంజయుడు తన కొడుకును ఇంద్రుడే దొంగిలించాడనే ఆలోచనతో బాధపడి విచారిస్తూ నన్ను తలచుకొన్నాడు. నేను వెళ్ళి, నీ కిప్పుడు శ్రీకృష్ణుడు చెప్పినటువంటి పూర్వ రాజచరిత్రలు - శోకాన్ని తగ్గించేవి, చెప్పి అతడి బాధను తగ్గించి, ఆ బాలుడిని అవివేకులైన దొంగలు సంహరించిన విషయం తెలియ చెప్పాను.

క. మ్రుచ్చుల మూఢత్వమునం । జచ్చి నరకవాసమునకుఁ జనిన తనయు నేఁ
దెచ్చి మగుడంగ వే నీ । కిచ్చెద; వగ పుడుగు మింకనేనియు నధిపా!' 264

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; మ్రుచ్చుల= దొంగల; మూఢత్వమునన్= అజ్ఞానంవలన; చచ్చి= మరణించి; నరకవాసమునకున్= నరకలోకానికి; చనిన= వెళ్ళిన; తనయున్= కుమారుడిని; ఏన్= నేను; తెచ్చి= తీసికొనివచ్చి; మగుడంగన్= తిరిగి; వే= వేగంగా; నీకున్+ఇచ్చెదన్= నీకు ఇస్తాను; ఇంకన్+ఏనియున్= ఇకనైనా; వగపున్= దుఃఖాన్ని; ఉడుగుము= వదలుము.

తాత్పర్యం: రాజా! సృంజయా! దొంగల మూర్ఖత్వంవలన చనిపోయిన యమలోకంలో ఉన్న నీ కుమారుడిని నేను వేగంగా తెచ్చి నీకు తిరిగి ఇస్తాను. ఇకనైనా నీ శోకాన్ని వదలిపెట్టుము'.

వ. అని చెప్పి యేనును. 265

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; చెప్పి= పలికి; ఏనును= నేను కూడా.

తాత్పర్యం: ఈ విధంగా చెప్పి నేను కూడా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. భావమున నమ్మెయికిఁ దగు । దీవన యిచ్చుటయు, నరుగుదెంచె సువర్ణ
ష్ఠీవి గడు నద్భుతమ్ముగ; । నా విభుఁడుఁ బ్రమోద సంభృతాత్ముం డయ్యెన్. 266

ప్రతిపదార్థం: భావమునన్= మనసులో; ఆ+మెయికిన్= దానికి; తగు= తగినటువంటి; దీవన= ఆశీస్సు; ఇచ్చుటయున్= ఇవ్వగానే; సువర్ణష్ఠీవి; కడున్= మిక్కిలి; అద్భుతమ్ముగన్= ఆశ్చర్యం కలిగించేటట్లు; అరుగుదెంచెన్= వచ్చాడు; ఆ విభుఁడున్= ఆ సృంజయుడు కూడా; ప్రమోద సంభృత+ఆత్ముండు= సంతోషంతో నిండిన మనస్సు కలవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: మనస్సులో దానికి (సువర్ణష్ఠీవి తిరిగి రావటానికి) తగినటువంటి ఆశీస్సు ఇవ్వగానే, ఎంతో ఆశ్చర్యం కలిగేటట్లు సువర్ణష్ఠీవి తిరిగి వచ్చాడు. సృంజయుడి మనస్సు సంతోషంతో నిండిపోయింది.

తే. అతని వీడ్కొని సంప్రీతి నరుగుచుండి । 'యింద్రుచేఁత గా దిది విను! మిక్కుమారుఁ
జంప నింద్రుఁడు వేచు రక్షణము మఱవ । వలదు నీ'వని చెప్పితి వసుమతీశ! 267

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= భూమిపతీ!, ధర్మరాజా!; అతని= ఆ సృంజయుడిని; వీడ్కొని= సెలవుదీసికొని; సంప్రీతిన్= ఇష్టంతో; అరుగుచున్+ఉండి= వెళ్ళబోతూ; విను= వినుము; ఇది= ఈ పని; ఇంద్రుచేఁత= ఇంద్రుడి పని; కాదు; ఈ+కుమారున్= ఈ బాలుడిని; చంపన్= చంపటానికి; ఇంద్రుఁడు= దేవేంద్రుడు; వేచున్= ఎదురుచూస్తూ ఉంటాడు; నీవు; రక్షణము= కుమారుడిని కాపాడటం; మఱవ వలదు= మరచిపోవద్దు; అని= అంటూ; చెప్పితిన్= చెప్పాను.

తాత్పర్యం: ధర్మరాజా! ఆ సృంజయుడివద్ద సెలవు తీసికొని బయలుదేరుతూ ఇట్లా చెప్పాను. 'సృంజయా! వినుము. ఈ పని చేసింది ఇంద్రుడు కాదు. కాని, ఇంద్రుడు ఈ పసివాడిని చంపటానికి అవకాశంకొరకు ఎదురుచూస్తూ ఉంటాడు. కుమారుడి రక్షణ విషయం మరువవద్దు'.

శార్దూలంబుచేఁ జచ్చిన సువర్ణష్ఠీవి నారదువలనఁ బునర్జీవితుఁ డగుట (సం. 12-31-41)

వ. ఏను బోయిన కొండొక కాలంబునకు నాఖండలుం డక్కుమారుండు దన్ను మిగులునని శంకించి చంపింపం దలంచి నన్నుం బర్వతునిం దలంచి పుయిలోడి బృహస్పతితో విచారించిన, నతం డతని భయం బుడిపె; నతండును దివ్యంబగుట సబుద్ధికంబైన వజ్రంబు నాలోకించి 'నీవు శార్దూలరూపంబున సృంజయ సుతుండగు సువర్ణష్ఠీవిం జంపు' మనుటయు నప్పని పూని యది సను సమయంబున. 268

ప్రతిపదార్థం: ఏను= నేను; పోయిన= వెళ్ళిన; కొండొక= కొద్ది; కాలంబునకున్= కాలానికి; ఆఖండలుండు= ఇంద్రుడు; ఆ+కుమారుండు= ఆ బాలుడు; తన్నున్= తనను; మిగులును+అని= మించుతాడు అని; శంకించి= అనుమానించి; చంపింపన్= చంపించాలని; తలంచి= అనుకొని; నన్నున్= నన్ను (నారదుడిని); పర్వతునిన్; తలంచి= గుర్తుచేసికొని; పుయిలోడి= వెనుకాడి;

బృహస్పతితోఁ= దేవగురువుతో; విచారించినన్= ఆలోచన చేయగా; అతండు= ఆ బృహస్పతి; అతని= ఇంద్రుడి; భయంబు= భయాన్ని; ఉడిపెన్= పోగొట్టాడు; అతండును= ఆ ఇంద్రుడు కూడా; దివ్యంబు+అగుటన్= దేవలోకానికి చెందినవి కావటంవలన; సబుద్ధికంబు+ఐన= విచక్షణాజ్ఞానం కలిగిన; వజ్రంబున్= వజ్రాయుధాన్ని; ఆలోకించి= చూచి; నీవు; శార్దూలరూపంబునన్= పెద్దపులి ఆకారంలో; సృంజయ సుతుండు+అగు= సృంజయుడి కుమారుడైన; సువర్ణష్ఠీవిన్= సువర్ణష్ఠీవిని; చంపుము= సంహరించుము; అనుటయున్= అనగా; ఆ+పని= ఆ కార్యాన్ని; పూని= వహించి; అది= ఆ వజ్రాయుధం; చను= వెళ్ళే; సమయంబునన్= సమయంలో.

తాత్పర్యం: ఆవిధంగా చెప్పి నేను వెళ్ళిన కొద్దికాలానికి ఇంద్రుడు ఆ సువర్ణష్ఠీవి తనను మించిపోతాడని అనుమానించి చంపించా లనుకొని, నారదుడినీ, పర్వతుడినీ తలచుకొని వెనుకాడి బృహస్పతితో ఆలోచించాడు. దేవగురువు ఇంద్రుడి భయాన్ని పోగొట్టాడు. అపు డా ఇంద్రుడు దివ్యమైనది కావటంవలన విచక్షణాజ్ఞానం కలిగిన వజ్రాయుధాన్ని చూచి, 'నీవు పెద్దపులి రూపంలో సృంజయుడి పుత్రుడైన సువర్ణష్ఠీవిని చంపుము' అన్నాడు. ఆ కార్యభారం వహించి వజ్రాయుధం వెళ్ళుతున్న సమయంలో.

సీ. **సృంజయుం డుజ్జ్వల శ్రీసముల్లాస ప్ర। హర్ష మొప్పంగఁ బ్రియాంగనలును**
దానుఁ గుమార యుక్తముగ భాగీరథీ। తీరకాంతార ప్రదేశనిత్య
వసనేచ్ఛమెయి నుండి కుసుమాపచయముఖ। బహువిధ కేళితత్పరత నొంది
యొండుదలంపు లేకుండ నద్దంభోళి। వంచన నయ్యెడఁ బొంచి నిలిచి

తే. **తెఱపి గాంచి శార్దూలమై యుటికి వార। ణేంద్రసమయాను నమ్మానవేంద్ర తనయు**
వ్రచ్చి యంతర్హితం బయ్యెఁ; జచ్చె వాఁడు;। దాది యాక్రోశమున నార్తనాద మెసఁగ. 269

ప్రతిపదార్థం: సృంజయుండు; ఉజ్జ్వల= ప్రకాశమానమైన; శ్రీ= సంపదల; సమ్+ఉల్లాస= చక్కని సంతోషంతో; ప్రహర్షము= చిక్కని ఆనందం; ఒప్పఁగన్= విలసిల్లగా; ప్రియ+అంగనలును= ప్రేమా స్పదలైన భార్యలు; తానున్= తాను; కుమార యుక్తముగన్= కొడుకుతో కలిసి; భాగీరథీ= గంగానది; తీర= ఒడ్డున ఉన్న; కాంతార ప్రదేశ= అరణ్య సీమలలో; నిత్యవసన+ఇచ్ఛ మెయిన్= సతతమూ ఉండాలనే కోరికతో; ఉండి= నిలిచి; కుసుమ= పూలు; అపచయ= కోయటం; ముఖ= మొదలైన; బహువిధ= అనేక విధాలైన; కేలి+తత్పరతన్= క్రీడలలోమగ్నులై ఉండటాన్ని; ఒంది= పొంది; ఒండు= వేరు; తలంపు= ఆలోచన; లేక+ఉండన్= లేకుండా ఉండగా; ఆ+దంభోళి= ఆ వజ్రాయుధం; వంచనన్= మోసంతో; ఆ+ఎడన్= ఆ సమీపంలో; పొంచి= దాగికొని; నిలిచి= నిలబడి; తెఱపి= వీలు; కాంచి= చూచి; శార్దూలము+ఐ= బెబ్బులిగా మారి; ఉటికి= దుమికి; వారణ+ఇంద్ర సమానయానున్= గజేంద్రుడి నడకతో సమమైన నడకగలవాడైన; ఆ+మానవ+ఇంద్ర+తనయున్= ఆ రాజు పుత్రుడిని; వ్రచ్చి= చీల్చి (సంహరించి); అంతర్హితంబు+అయ్యెన్= మాయమయింది; వాఁడు= ఆ సువర్ణష్ఠీవి; చచ్చెన్= చనిపోయాడు దాది= ధాత్రి; ఆక్రోశమునన్= ఆవేదనతో; ఆర్తనాదము+ఎసఁగన్= భయంతో పెట్టిన కేక వ్యాపించగా.

తాత్పర్యం: సృంజయుడు మిక్కిలి ప్రకాశించే సంపదల విలాసంతో ఆనందంగా ప్రియురాండ్రతో కలిసి కుమారుడితోకూడా గంగానదీ తీర అరణ్య ప్రదేశాలలో ఉండాలని వెళ్ళి, పుష్పాపచయం వంటి అనేక క్రీడలలో నిమగ్నమై వేరే ఆలోచనలేకుండా ఉన్నాడు. అపు డా వజ్రాయుధం మోసంతో అక్కడే నక్కి ఉండి వీలుచూచుకొని బెబ్బులిగా మారి గజేంద్రగమనుడైన సువర్ణష్ఠీవిపై దుమికి, చీల్చి మాయమయింది. ఆ బాలుడు మరణించాడు. భయంతో దాది పెట్టిన కేక అందరికీ వినిపిస్తుండగా.

క. విని సృంజయుండును బ్రియా। జనములు వే పాఱుదెంచి చచ్చిన బాలుం
గని బహులశోకపూరం। బున మునిఁగిరి విప్రలాపములు పెల్లెసఁగన్. 270

ప్రతిపదార్థం: విని= ఆ దాదిపెట్టిన కేక విని; సృంజయుండును; ప్రియాజనములు= అతడి భార్యలును; వే= వేగంగా; పాఱుదెంచి= పరుగునవచ్చి; చచ్చిన= మరణించిన; బాలున్= పసివాడిని; కని= చూచి; విప్రలాపములు= ఏడుపులు; పెల్లు+ఎసఁగన్= ఎక్కువ కాగా; బహుల= ఎక్కువైన; శోకపూరంబునన్= నిండుశోకంలో; మునిఁగిరి= మునిగిపోయారు.

తాత్పర్యం: (దాది పెట్టిన కేక) విని సృంజయుడు, అతడి భార్యలు వేగంగా పరుగున వచ్చి చనిపోయిన శిశువును చూచి ఏడుపులు ఎక్కువ కాగా, అధికమైన శోకసముద్రంలో మునిగిపోయారు.

ఆ. అట్టి యవసరమున నమ్మహీపతి నన్నుఁ। దలఁచెఁ; నప్పు డేను బలవిరోధి
మది విరోధ ముడిపి మసలక వచ్చి య। బ్బాలు ప్రాణ మెత్తి ప్రమద మెసఁగ. 271

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; అవసరమునన్= సందర్భంలో; ఆ+మహీపతి= ఆ రాజు-; సృంజయుడు; నన్నున్= నన్ను (నారదుడిని); తలఁచెన్= భావన చేశాడు; అప్పుడు= ఆ సమయంలో; ఏను= నేను; బలవిరోధి= ఇంద్రుడి; మది= మనసులో; విరోధము= శత్రుభావాన్ని, వైరాన్ని; ఉడిపి= పోగొట్టి; మసలక= ఆలసించక; వచ్చి; ఆ+బాలు= ఆ సువర్ణష్ఠీవి; ప్రాణము= జీవం; ఎత్తి= తీసి (కలిగించి); ప్రమదము= సంతోషం; ఎసఁగన్= ఎక్కువ కాగా.

తాత్పర్యం: ఆ సమయంలో సృంజయచక్రవర్తి నన్ను తలచుకొన్నాడు. నేను ఇంద్రుడి మనస్సులోని వైరాన్ని పోగొట్టి, ఆలస్యం చేయకుండా వచ్చి, ఆ రాజు సంతోషం ఎక్కువ అయ్యే విధంగా ఆ బాలుడికి ప్రాణం పోసి. (తరువాతి పద్యంతో అన్వయం)

వ. ఉచిత సల్లాపంబుల నించుకసేపు నిలిచి, యన్నరపతి యనుమతి సేయ నరిగితి; సువర్ణష్ఠీవియుం దండ్రికి సంతసం బెసంగు తెఱంగునం బ్రవర్తిల్లి యతని పిమ్మటం బృథ్వీభారంబు పూని శిష్టానుగ్రహ దుష్ట నిగ్రహంబులు నడపుచు, జన్నంబులు సేయుచు, శతాధిక సహస్రవర్షంబులు రాజ్యంబు సేసె'నని చెప్పి నారదుండు వెండియు. 272

ప్రతిపదార్థం: ఉచిత= తగిన; సల్లాపంబులన్= మంచిమాటలతో; ఇంచుకసేపు= కొద్ది సమయం; నిలిచి= ఉండి; ఆ+నరపతి= ఆ రాజు; అనుజ్ఞ+చేయన్= అనుమతీయగా; అరిగితిన్= వెళ్ళాను; సువర్ణష్ఠీవియున్= సువర్ణష్ఠీవి కూడా; తండ్రికిన్= జనకుడికి; సంతసంబు= సంతోషం; ఎసంగు= ఎక్కువ అయ్యే; తెఱంగునన్= పద్ధతిలో; ప్రవర్తిల్లి= నడచుకొని; అతని పిమ్మటన్= తండ్రి తరువాత; పృథ్వీభారంబు= భూభారాన్ని; పూని= వహించి; శిష్ట= సజ్జనులను; అనుగ్రహ= దయచూడటం; దుష్ట= దుర్జనులను; నిగ్రహంబులు= దండించటం; నడపుచున్= నిర్వర్తిస్తూ; జన్నంబులు= యజ్ఞాలు; చేయుచున్= చేస్తూ; శతాధిక సహస్ర వర్షంబులు = పదకొండువేల సంవత్సరాలు; రాజ్యంబు+చేసెన్= రాజ్యపరిపాలన చేశాడు; అని= అంటూ; చెప్పి= పలికి; నారదుండు; వెండియున్ = తిరిగి.

తాత్పర్యం: సమయానుగుణంగా మాట్లాడుతూ కొద్దిసేపు ఉండి, సృంజయుడు అనుమతించగా నేను వెళ్ళిపోయాను, సువర్ణష్ఠీవి తండ్రికి సంతోషం కలిగేటట్లు నడుచుకొంటూ అతడి తరువాత రాజ్యభారాన్ని వహించి శిష్టరక్షణ, దుష్టశిక్షణ చేస్తూ యజ్ఞాలు చేస్తూ, లక్ష సంవత్సరాలు రాజ్యాన్ని పాలించాడు' అని నారదుడు చెప్పి ఇంకా - (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **' హరియుఁ బరాశరాత్మజుఁడు నాదరణాతిశయంబునన్ సవి**
స్తరత నుపన్యసించిన వచః ప్రకరంబు మహార్థ గాఢమి
ప్పరమహితోపదేశములు పాటిగఁ బట్టి వసుంధరాధురా
ధరణ మొనర్పు మయ్యెడు నుదాత్తయశంబును ధర్మవృద్ధియున్.' **273**

ప్రతిపదార్థం: హరియున్= శ్రీకృష్ణుడును; పరాశర+ఆత్మజుఁడున్= పరాశరుడి కుమారుడైన వ్యాసుడును; ఆదరణ+అతిశయంబునన్= ప్రేమాధిక్యంతో; సవిస్తరతన్= విపులంగా; ఉపన్యసించిన= పలికిన; వచఃప్రకరంబు= మాటల సముదాయం; మహా= గొప్ప; అర్థ= భావంతో; గాఢము= నిండినది, లోతైనది; ఆ పరమ= ఆ ఉత్తమమైన; హిత= మేలుకలిగించే; ఉపదేశములు= బోధలు; పాటిగన్+పట్టి= ప్రమాణంగా గ్రహించి; వసుంధరా ధురా= భూభారాన్ని; ధరణము= వహించటం; ఒనర్పుము= కావించుము; ఉదాత్త= అధికమైన; యశంబును= కీర్తియు; ధర్మవృద్ధియున్= ధర్మం పెంపొందటమునూ; అయ్యెడున్= జరుగుతాయి.

తాత్పర్యం: 'ధర్మరాజా! శ్రీకృష్ణుడు, వ్యాసుడు నీ మీద ప్రేమాతిశయంతో చెప్పిన మాటలన్నీ గొప్పలోతైన భావాలతో నిండి ఉన్నాయి. ఆ ఉత్తమమైన మేలు కలిగించే బోధనలను మనసున పెట్టుకొని, భూభారాన్ని వహించవలసినది. దానివలన గొప్ప కీర్తి, ధర్మవృద్ధి సిద్ధిస్తాయి'.

వ. **అనిన నజాతశత్రుం డూరకున్నఁ బరాశరపుత్రుండు పరమకరుణావిధేయచిత్తుండై యతని నుద్దేశించి యిట్లనియె.** **274**

ప్రతిపదార్థం: అనినన్= నారదు డీ విధంగా పలుకగా; అజాతశత్రుండు= ధర్మరాజు; ఊరక+ఉన్నన్= మాటాడక మిన్నకుండగా; పరాశర పుత్రుండు= పరాశరుడి కుమారుడైన వ్యాసుడు; పరమ= మిక్కిలి; కరుణా విధేయ చిత్తుండు+ఐ= కరుణకు లోనైన మనస్సు కలవాడై; అతనిన్= ఆ ధర్మరాజును; ఉద్దేశించి= ఉపలక్షించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా నారదుడు చెప్పిన మాటలు విని మిన్నకున్న ధర్మజుడిని ఉద్దేశించి, అధికమైన కరుణ నిండిన మనస్సు కలవాడై వ్యాసుడు ఈ విధంగా అన్నాడు.

సీ. **' క్షత్రియులకుఁ బ్రజాసంరక్షఁ గడచిన । ధర్మంబు గలుగునే? దాని వలన**
వేద సంచోదిత విప్రకర్మంబులు । లెస్సలయ్యెడు; నదిలేక యున్నఁ
జెడియెడు; లెస్సైనఁ జెడినను రాజున । కగుఁ బుణ్యపాపంబు లగ్గలములు;
గాన జనాభిరక్షణ మొనరింపుము' । నావుడు నన్నరనాథుఁ 'డిట్లు

తే. **మీరు సెప్పంగ నురియాట మేలె రాజ్య । కాంక్ష మిగిలి, యేఁ జంపంగఁ గాని యట్టి**
వారిఁ బలువురఁ జంపిన క్రూరతా వి । శేష మాత్మదహించుటఁ జేసి గాక!' **275**

ప్రతిపదార్థం: క్షత్రియులకున్= రాజవంశీయులకు; ప్రజాసంరక్షన్= ప్రజలను చక్కగా కాపాడటాన్ని; కడచిన= మించిన; ధర్మము= చేయవలసిన కర్తవ్యం; కలుగును+ఏ?= ఉన్నదా?; దానివలనన్= ఆ ప్రజా సంరక్షణ వలన; వేద= వేదాలచేత; సంచోదిత= చక్కగా నడపబడే; విప్రకర్మంబులు= బ్రాహ్మణులు ఆచరించే కర్మలు అనగా అధ్యయన, అధ్యాపన, యజన యాజనాదులు; లెస్సలు= మంచివి, శ్రేష్ఠమైనవి; అయ్యెడున్= అవుతాయి; అది= ఆ ప్రజాపరిరక్షణ; లేక+ఉన్నన్= లేకపోతే; చెడియెడున్= బ్రాహ్మణ ధర్మాలు పాడవుతాయి; లెస్స+ఐనన్= బాగా ఉన్నా; చెడినను= పాడయినా; రాజునకున్= రాజునకు; అగు= అయ్యే, కలిగే; పుణ్యపాపంబులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పుణ్యం, పాపం; అగ్గలములు= అధికం; కాన= అందువలన; జన+అభి రక్షణము= ప్రజలను చక్కగా కాపాడటం; ఒనరింపుము= చేయుము; నావుడున్= అనగా; ఆ+నరనాథుఁడు= ఆ రాజు (ధర్మరాజు); ఇట్లు+ ఈ విధంగా; మీరు= మీరందరూ; చెప్పంగన్= చెప్పగా; రాజ్యకాంక్ష= రాజ్యం సంపాదించాలనే కోరిక; మిగిలి= ఎక్కువై; ఏన్= నేను; చంపఁగన్+కాని= చంపకూడని; అట్టివారిన్= అటువంటి వారిని; పలువురన్= అనేకులను; చంపిన= సంహరించినటువంటి; క్రూరతా= క్రూరత్వపు; విశేషము= ప్రత్యేకత, ఆధిక్యం; ఆత్మ= ఆ మనసును (అంతరాత్మను); దహించుటన్= తపింపచేయటంచేత; కాక= కాకపోతే; ఉరియాట= ఉట్టివలె ఊగిసలాడటం, సందేహించటం; మేలు+ఎ?= మంచిదా?

తాత్పర్యం: 'రాజులకు ప్రజలను రక్షించటాన్ని మించిన ధర్మం మరొక్కటి ఉన్నదా? ఆ ప్రజాసంరక్షణంవలన బ్రాహ్మణులు వేద విహిత కర్మలు మెరుగుగా ఉంటాయి. లేకపోతే పాడవుతాయి. వేదవిహిత కర్మలు బాగుంటే పుణ్యమూ, చెడిపోతే పాపమూ రాజునకు అధికంగా కలుగుతాయి. కనుక ప్రజారక్షణం చేయవలసినది' అని వ్యాసు డీమాటలనగా, ధర్మరాజు ఇట్లా బదులు చెప్పాడు. 'రాజ్యసంపాదన చేయాలనే కోరిక ఎక్కువై చంపకూడని వారిని ఎంతోమందిని చంపాను. అంతులేని ఆ క్రూరత్వం నా అంతరాత్మను తపింపచేస్తున్నది. అంతేకాని మీరంతా ఇంతగా చెప్పాక సందేహించటం మంచిదా?' (కాదని భావం).

విశేషం: తమిళంలో ఉట్టిని 'ఉరి' అంటారు.

వ. అనిన విని యమ్మునిపతి యమ్మహీపతి కిట్లనియె. 276

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+మునిపతి= ఆ మునివర్యుడైన వ్యాసుడు; ఆ+మహీపతికిన్= ఆ రాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు అన్నమాటలు విన్న వ్యాసుడు అతడితో ఈ విధంగా అన్నాడు.

చ. ' మనుజులు సేయ నెవ్వరు సమస్తము నీశ్వరునాజ్ఞఁ జెల్లెడు
న్వినుము కుఠారపాణి ధరణీరుహముల్ నఱకంగఁ బాప మొం
దునొకొ! కుఠారమున్ జనులు దోసముఁ బొందరు కర్త యీశ్వరుం
డనియెడి నిశ్చయంబు దృఢమై మది నిల్చినఁ జాలు భూవరా! 277

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; చేయను= కర్మలు ఆచరించటానికి; మనుజులు= మానవులు; ఎవ్వరు?= ఎవరు?; సమస్తమున్= సకలం; ఈశ్వరు+ఆజ్ఞన్= పరమాత్ముడి ఆనతితో; చెల్లెడున్= నడుస్తుంది; వినుము= ఆలకించుము; కుఠారపాణి= గొడ్డలి ధరించినవాడు; ధరణీరుహముల్= చెట్లను; నఱకంగన్= ఛేదించగా; కుఠారమున్= గొడ్డలికి; పాపము+ఒందున్+ఒకొ!= పాపం వస్తుందా!; కర్త= అన్నింటినీ చేసేవాడు; ఈశ్వరుండు+అనియెడు= పరమాత్మయే అనేటటువంటి; నిశ్చయము= దృఢమైన భావం; మదిన్= మనస్సునందు; నిల్చినన్= ఉన్నట్లయితే; చాలున్= సరిపోతుంది; జనులు= మానవులు; దోసమున్= పాపాన్ని; పొందరు= కలిగి ఉండరు.

తాత్పర్యం: 'ధర్మరాజా! పనులు చెయ్యటానికి మనుష్యులెవ్వరు? (మానవులు తమంత తాము కర్మలు ఆచరిస్తున్నా మనుకొనటం అజ్ఞానం) అంతా భగవంతుడి ఆజ్ఞమేరకు వర్తిస్తూ ఉంటుంది. గొడ్డలిని చేతపట్టినవాడు చెట్టును నరికితే ఆ పాపం గొడ్డలికి వస్తుందా చెప్పుము; అన్నింటినీ చేయించేవాడు పరమాత్ముడే అనే భావం మనసులో గట్టిగా ఉంటే చాలు, మానవులకు ఎటువంటి పాపమూ అంటదు.

విశేషం: బంధుమరణానికి తానే కారకుడని అనుకొంటున్నాడు ధర్మరాజు. అందువలన అతడికి బాధ కలుగుతున్నది. ఆ పనికి తాను సాధనం మాత్రమే అని గుర్తిస్తే ఆ బాధ ఉండదు. ఈ బోధను అర్జునుడికి సంగ్రామ క్షేత్రంలోనే అందించాడు శ్రీకృష్ణుడు.

వ. కర్మఫలం బీశ్వరుని యదియ; తదర్పణ బుద్ధి సహితంబుగాఁ బ్రబుద్ధులు వేదచోదిత కర్మంబు లనుష్ఠింతురు. 278

ప్రతిపదార్థం: కర్మఫలంబు= చేసిన పనుల ఫలితం; ఈశ్వరుని+అది+అ= భగవంతుడిదే; తద్= అతడికి; అర్పణ= సమర్పిస్తున్నామనే; బుద్ధి సహితంబుగాన్= వివేకంతో కూడుకొని; ప్రబుద్ధులు= జ్ఞానులైనవారు; వేద చోదిత= వేదం నిర్దేశించిన (వేద విహిత); కర్మంబులు= కార్యాలు; అనుష్ఠింతురు= ఆచరిస్తారు.

తాత్పర్యం: కర్తృత్వంతోపాటు కర్మఫలం కూడా పరమాత్మకే చెందుతుంది. విశేషమైన ఆత్మజ్ఞానం కలిగినవారు వేదవిహిత కర్మలనన్నింటిని భగవదర్పితంగానే చేస్తారు.

తే. ఒప్పకున్నను నాత్మకులోక్తకర్మ । మూర్ధ్వగతిఁ జేర్చుఁ; బరకర్మ మొప్పెనేని
నార్యజనములు గిల్బిషమండ్రు దానిఁ; । గాన నడపుము నిజవంశకర్మ మధిప! 279

ప్రతిపదార్థం: అధిప!= ధర్మరాజా!; ఆర్యజనులు= పెద్దలు; ఒప్పక+ఉన్ననున్= అంగీకారం కాకపోయినా, ఇష్టం లేకపోయినా; ఆత్మ= తన; కుల= వంశానికి; ఉక్త= చెప్పబడిన, నిర్దేశించబడిన; కర్మము= పని; ఊర్ధ్వగతిన్= పైలోకాలకు; చేర్చున్= చేర్చుతుంది; పరకర్మము= తనదికాని పని; ఒప్పెన్+ఏనిన్= మంచిదైనా; దానిన్= ఆ పనిని; కిల్బిషము= పాపం; అండ్రు= అంటారు; కాన= కనుక; నిజవంశ కర్మము= నీ కుల ధర్మాన్ని; నడపుము= నిర్వర్తించుము.

తాత్పర్యం: ధర్మరాజా! ఇష్టంలేకపోయినా తన కులానికి చెప్పబడిన కర్మ చేయటం ఉత్తమగతిని (మోక్షాన్ని) కలిగిస్తుందనీ, తనది కాని పని అంగీకరిస్తే పాపకారకమని అంటారు పెద్దలు. అందువలన నీ కులధర్మాన్ని నిర్వర్తించుము.

క. అరివధము పాప మని మది । మెరమెర గలిగినను, దగిన మెయిఁ జేయుము భూ
వర! ప్రాయశ్చిత్తము గృహ । ధుర యుడుగుట మేలె కీడుతోఁ జన నగునే!' 280

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; అరి= శత్రువులను; వధము= చంపటం; పాపము+అని= కిల్బిషమని; మదిన్= మనసులో; మెరమెర= మనోవ్యథ; కలిగినను= కలిగినప్పటికీ; తగినమెయిన్= దానికి తగిన విధంగా; ప్రాయశ్చిత్తము= పరిహారం; చేయుము; గృహధుర= సంసారభారం; ఉడుగుట= వదలటం; మేలు+ఎ?= మంచిదా? (కాదని భావం); కీడుతోన్+అశుభమైన దానితో; చనన్= ప్రవర్తించటం; అగును+ఏ?= తగునా? (తగదని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! శత్రువులను చంపటం పాపం అనే బాధ నీ మనసులో ఉంటే దానికి తగిన పరిహారం చేసికొనుము. అంతేకాని సంసార భారాన్ని వదలటం మంచిదికాదు. అశుభవర్తనం కూడదు'.

వ. అనుటయుఁ గౌంతేయాగ్రజుండు సాత్యవతేయు నాననం బాలోకించి పుత్త్రులుం బౌత్త్రులు నన్నలుం దమ్ములు జనకులుం దాతలు మామలు గురువులు సంబంధులు సఖులు నల్లురు బావలు మఱందులు మఱియుఁ బవిత్రులగు ధాత్రీపతులు నాచేత మడిసిరి; తదీయ స్త్రీజనంబులు పతిసుత సోదర పితృ మరణశోకసంతాపాతిశయంబునం బలవించి పలవించి ప్రాణంబులు విడుతురు గావున దాని సూక్ష్మంబుగా

విచారించిన వనితావధ పాతకంబునుం బాటిల్లె నెయ్యది కడగా నిష్కల్మషుండ నగుదు? నను వెగడున మునింగిన మనంబు మహీభరణంబున కెట్లు సొచ్చు? నుగ్రంబైన తపంబునం దనువు దొఱంగుట దక్క నొండు విధంబు నాకుం జూడ లేకున్న యది' యనిన విని యమ్మునీశ్వరుండు నిజబుద్ధి నిపుణంబుగా నిరూపించి యన్నరపతి కిట్లనియె. 281

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతీపుత్రులలో పెద్దవాడైన ధర్మరాజా!; సాత్యవతేయున్= సత్యవతీ పుత్రుడైన వ్యాసుడి; ఆననంబు= ముఖం; ఆలోకించి= చూచి; పుత్రులున్= కుమారులు; పౌత్రులున్= మనుమలు; అన్నలున్+తమ్ములు= సోదరులు; జనకులున్= తండ్రులు; తాతలు= పితామహులు, మాతామహులు; మామలు= మామలు; గురువులు= విద్యాబోధ చేసిన గురువులు; సంబంధులు= చుట్టాలు; సఖులున్= స్నేహితులు; అల్లురు= జామాతలు, మేనల్లురు; బావలు+మఱందులు= బావ మరదులు; మఱియున్= ఇంకా; పవిత్రులు+అగు= నిర్మలులైన; ధాత్రీపతులు= రాజులు; నా చేతన్= నావలన, నా కారణంగా; మడిసిరి= మరణించారు; తదీయ= వారి; స్త్రీజనంబులు= ఆడువారు; పతి= భర్త; సుత= కొడుకు; సోదర= అన్నదమ్ములు; పితృ= తండ్రి; మరణ= చనిపోవటం అనే; శోక= విషాదం వలన కలిగిన; సంతాప= అధికమైన బాధయొక్క; అతిశయంబునన్= ఆధిక్యం వలన; పలవించి పలవించి= ఏడ్చి ఏడ్చి; ప్రాణంబులు విడుతురు= ప్రాణాలు వదలుతారు, మరణిస్తారు; కావున= కనుక; దానిన్= ఈ విషయాన్నంతా; సూక్ష్మంబుగాన్= నిశితంగా; విచారించినన్= ఆలోచిస్తే; వనితావధ= స్త్రీలను చంపటం అనే; పాతకంబును= మహాపాపం కూడా; పాటిల్లెన్= వచ్చింది; ఎయ్యది= ఏది; కడగాన్= దిక్కుకాగా (ఆశ్రమించగా); నిష్కల్మషుండన్= పాపరహితుడిని; అగుదున్= అవుతాను; అను= అనే; వెగడునన్= తల్లడపాటున; మునింగిన= మునిగిపోయిన; మనంబు= మనస్సు; మహీభరణంబునకున్= భూభారాన్ని వహించటానికి; ఎట్లు= ఏ విధంగా; చొచ్చున్?= పూనుకొంటుంది?; ఉగ్రంబు+ఐన= భయంకరమైన; తపంబునన్= తపస్సుతో; తనువున్+తొఱంగుట= శరీరాన్ని వదలటం; తక్క= తప్ప, కాక; ఒండు విధంబు= మరొక పద్ధతి; నాకున్= నాకు; చూడన్= పరికించగా; లేక+ఉన్న+అది= లేదు, కనబడదు; అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+ముని+ఈశ్వరుండు= ఆ మునిశ్రేష్ఠుడైన వ్యాసుడు; నిజ= తన; బుద్ధి= తెలివి; నిపుణంబు+కాన్= నేర్పరితనంతో; నిరూపించి= చూపించి, నిర్ధారించి; ఆ+నరపతికిన్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా పలికిన వ్యాసుడి ముఖంలోకి చూస్తూ ధర్మరాజు ఇట్లా అన్నాడు: 'కొడుకులు, మనుమలు, అన్నలు, తమ్ములు, తండ్రులు, తాతలు, మామలు, గురువులు, చుట్టాలు, మిత్రులు, అల్లురు, బావలు, మరదులు, నిర్మలులైన రాజులు నా కారణంగా చనిపోయారు. వారి ఆడవారు, భర్తలు, పిల్లలు, సోదరులు, తండ్రులు మరణించటం అనే విషాదం వలన కలిగిన అధికమైన దుఃఖంతో ఏడిచి, ఏడిచి ప్రాణాలు వదలుతారు. కనుక నిశితంగా పరిశీలిస్తే స్త్రీవధ అనే మహాపాపం కూడా నాకు చెందుతుంది. దేనిని ఆశ్రయిస్తే పాపరహితుడ నవుతాను?- అనే బాధలో మునిగిపోయిన మనసు భూభారాన్ని మోయటానికి ఎట్లా పూనుకొంటుంది? తీవ్రమైన తపస్సు చేసి శరీరం వదలటం తప్ప మరో మార్గం నాకు కనబడటంలేదు'. ఆ మాటలు విని వ్యాసుడు తన బుద్ధికౌశలంతో పరికించి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

సీ. 'విడువు ముమ్మలికంబు వినుము నీ చెప్పిన । యందఱు భూముల కాసపడియుఁ
బెంపును దేజంబుఁ బేరును గోరియు । నీసున సమరంబు సేసి చచ్చి
రాపని కిల్బిషం బగునె నీ కట్లును । గాక వారల నెట్టి కర్మగతులు
మృతులఁ గావించెనో మతి నెఱుంగుదె వాని । నెఱుఁగుఁ గాలుఁడు చావనేరి కెద్ది

తే. తఱి యతం డప్డు దెగటార్చు దాని నీవు । సేసినాఁడవుగా మదిఁ జింత సొనిపి
యుడుకు టొక వెఱ్ఱి దీనిపై నొల్లగృహము । విడుతుఁ గా కనుటిది పెద్ద వెఱ్ఱి యధిప! 282

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఉమ్మలికంబు= బాధపడటం; విడువుము= వదలిపెట్టుము; నీ చెప్పిన= నీవు పేర్కొన్న; అందఱు= అంతమంది; భూములకున్= రాజ్యాలకు; ఆసపడియున్= ఆశించి; పెంపును= వృద్ధిని; తేజంబున్= పరాక్రమాన్ని; పేరును= కీర్తిని; కోరియున్= కోరుకొని; ఈసునన్= అసూయతో; సమరంబు= యుద్ధం; చేసి= ఒనరించి; చచ్చిరి= చనిపోయారు; ఆ పని= ఆ కార్యం (అట్లు వారు చచ్చుట); నీకున్= నీకు (ధర్మరాజుకు); కిల్బిషంబు= పాపం; అగును+ఎ?= అవుతుందా?; అట్లును+కాక= అంతే కాక; వారలన్= ఆ రాజులను; ఎట్టి= ఎటువంటి; కర్మగతులు= పనితీరులు; మృతులన్= చనిపోయిన వారినిగా; కావించెను+ఓ?= చేశామో? మతిన్= బుద్ధిలో; ఎఱుంగుదు(వు)+ఎ?= తెలిసికొన్నావా?; కాలుఁడు= యముడు; వానిన్= ఆ కర్మగతులను; ఎఱుంగున్= తెలియును; చావన్= చావటానికి; ఏరికిన్= ఎవరికి; ఎద్ది= ఏది; తఱి= సమయమో; అతండు= ఆ యముడు; అప్డు= ఆ సమయంలో; తెగటార్చున్= సంహరిస్తాడు; దానిని= ఆచరించటం; నీవు; చేసినవాఁడవు+కాక= చేశావని; మదిన్= మనస్సులో; చింత= బాధ; చొనిపి= ప్రవేశపెట్టి; ఉడుకుట= తపించటం; ఒక వెఱ్ఱి= పిచ్చితనం; దీనిపైన్= ఆ పిచ్చి కారణంగా; గృహము= ఇల్లు; ఒల్లన్= అంగీకరించను; విడుతున్+కాక= వదలుతాను; అనుట= అనటం; ఇది= అనేది; పెద్దవెఱ్ఱి= ఇంకా పెద్ద పిచ్చితనం.

తాత్పర్యం: 'ధర్మరాజా! బాధపడటం వదలిపెట్టుము. నీవు చెప్పిన వారంతా రాజ్యంకొరకు ఆశపడి, గొప్పతనాన్ని, పరాక్రమాన్ని, కీర్తిని కోరుకొని, అసూయతో యుద్ధంచేసి చనిపోయారు. వారు చేసినపనికి పాపం నీ కెట్లా వస్తుంది? అంతే కాదు. వారి కర్మగతులే వారిని చంపాయి. వారి కర్మలు నీకు తెలియవు. యముడికి తెలుసు. యముడు ఎవరికి చనిపోయే సమయం ఎప్పుడో, అప్పుడు వారిని చంపుతాడు. ఆ సంహారం నీవు చేశావని నీ మనసులో బాధపడటం పిచ్చితనం. ఆ కారణంగా ఇల్లు వద్దని వదలిపెడతా ననటం ఇంకా పెద్ద పిచ్చితనం.

క. నేర్పరి పెక్కువిధంబుల । నార్పఁగ బొమ్మలు గడంగి యాడెడు చందం
బేర్పడఁ గాన్పుము కాల స । మర్పిత కార్యకరు లైన మానవుల దెసన్. 283

ప్రతిపదార్థం: నేర్పరి= నిపుణుడైనవాడు; పెక్కు విధంబులన్= బహుభంగుల; ఆర్పఁగన్= ఆడించగా; బొమ్మలు= ప్రతిమలు; కడంగి= పూని; ఆడెడు= కదిలే; చందంబు= తీరు; ఏర్పడన్= స్పష్టమయ్యే విధంగా; కాలసమర్పిత= కాలంచేత చక్కగా అప్పగించబడిన; కార్యకరులు+ఐన= పనులు నిర్వర్తించే వారైన; మానవుల దెసన్= మానవులవైపు; కాన్పుము= చూడుము.

తాత్పర్యం: నిపుణుడైనవాడు అనేక విధాలుగా ఆడిస్తుంటే కదిలే బొమ్మలను చూచినట్లే, కాలం చెప్పిన పని చేసే మనుషులను కూడా చూడుము.

విశేషం: అలం: ఉపమ.

వ. నీకుం బాపంబునకుం బనిలేదు పనిగా కుండుంగాక! 284

ప్రతిపదార్థం: నీకున్= నీకు; పాపంబునకున్= పాపానికి; పనిలేదు= అవసరం లేదు; పని= అవసరం; కాక+ఉండున్+కాక= అవకుండును గాక.

తాత్పర్యం: ధర్మరాజా! అందువలన నీకు పాపం లేదు. ఇక రాకుండా ఉండుగాక!

క. ఇచ్చు కృప కల్మి యెప్పదె? । చచ్చిన నరపతుల యేలు జనపదములు నీ
విచ్చెదవు గాక మనమునఁ । బొచ్చెము లేక తగ వారిపుత్త్రుల కధిపా! 285

ప్రతిపదార్థం: అధిపా!= ధర్మరాజా!; చచ్చిన= మరణించిన; నరపతులు= రాజుల; ఏలు= పాలించే; జనపదములు= గ్రామాలు; మనమునన్= మనస్సులో; పొచ్చెము= కపటం; లేక= ఉండక; తగన్= తగినట్లు; వారి= ఆ రాజుల; పుత్రులకున్= కుమారులకు; నీవు= నీవు; ఇచ్చెదవు+కాక= ప్రసాదించెదవు కాక; ఇచ్చు= ఇచ్చే; కృప= దయ అనే; కల్మి= సంపద; ఒప్పదు+ఎ?= తగిఉంటుంది కదా!

తాత్పర్యం: ధర్మరాజా! మరణించిన రాజుల ఏలుబడిలోని గ్రామాలను మనసులో ఎటువంటి కపటం లేనివాడవై వారి కొడుకులకు ఇద్దువు గాని. ఇవ్వటం అనేది దయ అనే సంపదవలన కలుగుతుంది కదా!

ఆ. **కొడుకు లేనిచోటఁ గూఁతుఁ బ్రతిష్ఠింపు; । దానఁ జేసి వారి తల్లు లధిక**
హర్ష మొందుదురు; ప్రియంబును నీ కగుఁ; । బుణ్యమును యశంబుఁ బొందు నిన్ను. **286**

ప్రతిపదార్థం: కొడుకు= కుమారుడు; లేనిచోటన్= ఉండని తావున; కూఁతున్= కుమార్తెను; ప్రతిష్ఠింపుము= నిలుపుము; దానను+చేసి= అది కారణంగా; వారి తల్లులు= ఆ కుమార్తెల తల్లులు; అధిక= ఎక్కువ; హర్షము= సంతోషం; ఒందుదురు= పొందుతారు; నీకున్; ప్రియంబును= సంతోషం; అగున్= కలుగుతుంది; నిన్ను; పుణ్యము= సుకృతం; యశంబున్= కీర్తి; పొందున్= కలుగుతాయి.

తాత్పర్యం: ధర్మరాజా! కుమారుడు లేని రాజ్యంలో కుమార్తెను సింహాసనంపై నిలుపుము. దానివలన వారి తల్లులు ఎంతో సంతసిస్తారు. నీకు కూడా సంతోషం, సుకృతం, కీర్తి కలుగుతాయి.

మ. **అనుమానింపకు తోడఁబుట్టువులు గారా తున్మితూఁటాడె నెం**
దును గ్రొన్నెత్తురు లేఱులై పఱవ నింద్రుం డుగ్రతన్ దైత్యులన్?
మును లవ్వీరు భజింపరే? క్రతువు లామోదంబుతో నమ్మహా
త్మునిఁ జేయింపరె? యూర్ధ్వలోక మదిగాదో? యేలఁడో నాకమున్? **287**

ప్రతిపదార్థం: అనుమానింపకు= శంకించవలదు; ఇంద్రుండు= దేవేంద్రుడు; ఉగ్రతన్= భీకరంగా; ఎందును= ఎచట చూచినా; క్రొత్త+నెత్తురులు= అపుడే స్రవించిన నెత్తురులు; ఏఱులు+ఐ= ప్రవాహాలుగా; పఱవన్= ప్రవహించగా; దైత్యులన్= రాక్షసులను; తున్మితూఁటాడెన్= ముక్కలు చేసి సంహరించాడు; తోడన్+పుట్టువులు= (వారు) సహజన్ములు; కారా?= కాకపోయారా? (సహజన్ములే కదా అని భావం); మునులు= ఋషులు; ఆ+వీరున్= ఆ పరాక్రమశాలిని; భజింపరు+ఏ?= సేవించటం లేదా?; ఆమోదంబుతోన్= అంగీకారంతో, ఇష్టంతో; ఆ+మహా+ఆత్మునిన్= ఆ మహానుభావుడిని ఉద్దేశించి; క్రతువులు= యజ్ఞాలు; చేయింపరు+ఏ?= జరిపించటం లేదా?; నాకమున్= స్వర్గాన్ని; ఏలఁడు+ఓ?= పాలించటం లేదా?; అది= అతడు పాలించే స్వర్గం; ఊర్ధ్వలోకము= ఉన్నతమైన లోకం; కాదు+ఓ?= కాకపోయిందా?

తాత్పర్యం: ధర్మరాజా! నీవు శంకించ పనిలేదు. దేవేంద్రుడు రాక్షసులను నెత్తురుటేరులు ప్రవహించేటట్లుగా భయంకరంగా నరికి సంహరించాడు. ఆ రాక్షసులు ఇంద్రుడికి సోదరులే కదా! మునులు ఆ శూరుడిని పూజిస్తూనే ఉన్నారు కదా! ఆ ఘనుడిని ఉద్దేశించి యాగాలు చేస్తున్నారు కదా! అతడు స్వర్గాన్ని పరిపాలించటం లేదా? ఆ స్వర్గం పై లోకమే కదా!

విశేషం: సోదరులను చంపిన ఇంద్రుడు పూజించబడుతూ, అతడికై యజ్ఞాలు చెయ్యబడుతూ, భూలోకాని కన్న ఉన్నతలోకాన్ని పాలిస్తున్నాడు అనే పోలిక బంధువధ పాపం అనే భావం పోగొట్టటానికి చెప్పటం జరిగింది.

శా. నీవున్ ధర్మవిరోధులైన జనతా నింద్యాత్ములం బుణ్యమా
ర్గావష్టంభము దేజరిల్ల నృపవంశాచార మొప్పారఁ దో
డై వీరానుజు లుల్లసిల్లఁగ మహోగ్రాజిం దెగం జూచి తా
దేవాధీశుఁడ పోలె శిష్టపరిషత్సేవ్యుండ వై తా పనిన్. 288

ప్రతిపదార్థం: నీవున్= నీవు కూడా; ధర్మవిరోధులు+ఐన= ధర్మమార్గానికి వ్యతిరేకులైన; జనతా= ప్రజలచేత; నింద్య+ఆత్ములన్= నిందింపదగిన స్వభావం కలవారిని; పుణ్యమార్గ+అవష్టంభము= ధర్మమార్గం యొక్క ఊత; తేజరిల్లన్= ప్రకాశించగా, ఒప్పగా; నృపవంశ+ఆచారము= రాజవంశమువారికి అలవాటైన ప్రవర్తన; ఒప్పారన్= తగి ఉండగా; తోడు+ఐ= అందగించగా; వీర+అనుజులు= పరాక్రమవంతులైన తమ్ములు; ఉల్లసిల్లఁగన్= సంతోషించగా; మహా+ఉగ్ర+ఆజిన్= గొప్ప, భయంకరమైన రణంలో; తెగన్+చూచితి= చనిపోయేటట్లు చేశావు; ఆ దేవ+అధీశుఁడు+అ= ఆ దేవేంద్రుడి; పోలెన్= వలె; ఆపనిన్= శత్రుసంహార కార్యం వలన; శిష్ట= సజ్జనుల; పరిషత్= సముదాయంచేత; సంసేవ్యుండవు+ఐతి(వి)= బాగా సేవించదగినవాడ వయ్యావు.

తాత్పర్యం: ధర్మరాజా! నీవు కూడా అధర్మవర్తనులను, ప్రజలచేత నిందించదగిన గుణం కలవారినీ వీరులైన తమ్ముల సహకారంతో భయంకరమైన యుద్ధంలో ధర్మమార్గాన్ని ఊతగా గ్రహించి రాజధర్మానికి తగినట్లు సంహరించావు. ఈ పనివలననే దేవేంద్రుడివలె నీవు కూడా సజ్జనుల సముదాయంచేత సేవించ తగిన వాడివయ్యావు.

ఆ. వలయునేని యధిప! వాసవుచాడ్పునఁ । గ్రతుపరుండ వగుము; రాజధర్మ
కలితమైన పుడమిఁ గైకొమ్ము; తొలిదొలి । యశ్వమేధయాగ మాచరింపు.' 289

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వలయున్+ఏని= కావాలంటే; వాసవు= ఇంద్రుడి; చాడ్పునన్= వలె; క్రతుపరుండవు= యజ్ఞాలు చేయటంలో నిమగ్నుడవు; అగుము= కమ్ము; రాజధర్మ కలితము+ఐన= రాజధర్మంతో కూడుకొన్న; పుడమిన్= భూమిని; కైకొమ్ము= గ్రహించుము; తొలితొలి= మున్ముందు; అశ్వమేధయాగము; ఆచరింపు(ము)= చేయుము.

తాత్పర్యం: ధర్మరాజా! నీ కిష్టమయితే ఇంద్రుడివలె యజ్ఞాలు చేయటంలో ఆసక్తిని చూపించుము. క్షత్రియోచిత ధర్మంగా రాజ్యాన్ని స్వీకరించుము. ముందుగా అశ్వమేధయాగం చేయుము'.

వ. అనిన విని యంకిలి దేఱిన డెందంబుతో ధర్మనందనుం డెట్టి కర్మంబులు పాపంబు; లేపాపంబున కెద్ది ప్రాయశ్చిత్తంబు? మునీంద్రా! యెఱింగింపవే' యనుటయు, నతనికి నమ్మహాత్ముం డి ట్లనియె. 290

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; అంకిలి= కలత; తేఱిన= తీరిన; డెందంబుతోన్= హృదయంతో; ధర్మనందనుండు= ధర్మరాజు; ముని+ఇంద్రా!= మునులలో ఉత్తముడవైన వ్యాసమహర్షీ!; ఎట్టి కర్మంబులు= ఎటువంటి పనులు; పాపంబులు= చెడ్డవి; ఏపాపంబునకున్= ఏ చెడ్డపనికి; ఎద్ది= ఏది; ప్రాయశ్చిత్తంబు= పాపపరిహార ప్రక్రియ; ఎఱింగింపుము+ఏ!= తెలియపరచుమా!; అనుటయున్= అనగా; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఆ+మహా+ఆత్ముండు= ఆ మహానుభావుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వ్యాసుడు చెప్పిన మాటలతో కలత తీరిన హృదయంతో ధర్మరాజు వ్యాసుడి నీ విధంగా అడిగాడు. 'మునీంద్రా! ఏ పనులు పాపం? ఏ పాపానికి పరిహారం ఏమిటి? తెలియపరచవలసింది'? అని. దానికి వ్యాసుడీ విధంగా జవాబు చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కృష్ణద్వైపాయనుఁడు ధర్మజునకు ధర్మాధర్మంబు లెఱింగించుట (సం. 12-35-1)

ఆ. ‘ ఆగమోక్త కర్మ మాచరింపమియు, ని । షిద్ధమైన దానిఁ జేయుటయును,
బ్రాజ్ఞజనులు ధరణిపాలవరేణ్య! చె । ప్పుదురు పాపములుగ బోధ్యతతికి. 291

ప్రతిపదార్థం: ధరణిపాలవరేణ్య!= రాజులలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; ఆగమ= వేదాలు; ఉక్త= చెప్పిన; కర్మము= పని; ఆచరింపమియున్= చేయకపోవటమూ; నిషిద్ధము+ఐన దానిన్= చేయవద్దని చెప్పినదానిని; చేయుటయునున్= చేయటమూ; పాపములుగన్= పాపాలుగా; ప్రాజ్ఞ జనులు= బాగా తెలిసినవారు; బోధ్యతతికిన్= శిష్యగణాలకు; చెప్పుదురు= చెప్తారు.

తాత్పర్యం: ‘ధర్మరాజా! వేదవిహితమైన కర్మలు చేయకపోవటం, కూడనివి చేయటం పాపాలు అని తెలిసినవారు శిష్యగణాలకు చెప్తారు.

వ. ఇది కల్మష సామాన్య నిర్దేశంబు; విశేషంబు వినుము. 292

ప్రతిపదార్థం: ఇది= ఈ మాట; కల్మష= పాపముల గూర్చి; సామాన్య= సాధారణమైన; నిర్దేశము= చెప్పటం (చెప్పినమాట); విశేషంబు= మఱింత (పాపంలోని తేడాలు); వినుము= ఆకర్ణించుము.

తాత్పర్యం: ఈ మాట పాపం గురించి మామూలుగా చెప్పేది. అందులోని తేడాలు కూడా వినుము.

సీ. ఆదిత్యు నుదయాస్తమయ కాలముల నిద్రఁ । బొందుటయును, బాత్రభూతుఁ డింటి
కరుగుదెంచినఁ బూజ యాచరింపమియును, । బరదారగమనంబు, గురుల కెదురు
సేఁతయు, గ్రామంబు సెఱుచుటయును, వేద । విక్రయంబును, రసవిక్రయంబు,
భృత్యుఁ బ్రోవమియు, నసత్యోపచారంబు, । గహనదాహము, నన్యకర్మకృతియుఁ,
తే. దనదుకర్మంబు విడుచుటయును, వృథాప । శు ప్రహరణంబు, మేదినీసురుల కలిమిఁ
గొనుటయును, శరణార్థిఁ జేకొనమి, విప్ర । వధయుఁ బాపంబు లందురు బుధజనములు. 293

ప్రతిపదార్థం: ఆదిత్యున్= సూర్యుడి; ఉదయ+అస్తమయ కాలములన్= ఉదయించే, అస్తమించే సమయాలలో; నిద్రన్+పొందుటయును= నిద్రించటమూ; పాత్ర భూతుఁడు= యోగ్యుడు; ఇంటికిన్= గృహానికి; అరుగుదెంచినన్= రాగా; పూజ+ఆచరింపమియును= పూజించకపోవటమూ; పరదారగమనంబు= ఇతరుల భార్యల పొందూ; గురులకున్= పెద్దలకు; ఎదురు+చేఁతయున్= వ్యతిరేకంగా ఆచరించటం; గ్రామంబు= జనపదం; చెఱుచుట= పాడుపెట్టటం; వేద విక్రయంబును= వేదమును (చదువును) అమ్ముకొనటం; రసవిక్రయంబున్= ఉప్పు,బెల్లం (మొదలగువాటిని) అమ్మటం; భృత్యున్= సేవకుడిని; ప్రోవమియున్= రక్షించకుండా ఉండటం; అసత్య+ఉపచారంబు= కపటమైన సేవ లేదా అబద్ధమును సేవించటం; గహనదాహమున్= అడవులను తగులబెట్టటం; అన్య కర్మ కృతియున్= ఇతరుల పనిని చేయటం; తనదుకర్మంబు= తనదైనపనిని; విడుచుటయును= వదలిపెట్టటం; వృథా= అనవసరంగా; పశుప్రహరణంబు= జంతువులను కొట్టటం; మేదినీ సురుల= బ్రాహ్మణుల; కలిమిన్= సంపదను; కొనుటయును= తీసికొనటం; శరణ+అర్థిన్= శరణు కోరినవాడిని; చేకొనమి= రక్షించకపోవటం; విప్రవధయున్= బ్రాహ్మణుడిని చంపటం; (అనేవి) బుధజనులు= పండితులు; పాపంబులు= దుష్కృతాలు; అందురు= అంటారు.

తాత్పర్యం: సూర్యోదయ సూర్యాస్తమయ సమయాలలో నిద్రపోవటం, అర్హుడైనవాడు ఇంటికి వచ్చినప్పుడు సేవించకపోవటం, పరుల భార్యలను పొందటం, పెద్దలు చెప్పినదానికి వ్యతిరేకంగా ఆచరించటం, ఊరును నాశనంచేయటం, వేదాలను (చదువును) అమ్ముకొనటం, ఉప్పు,బెల్లం మొదలగువాటిని అమ్ముకొనటం, సేవకులను కాపాడకపోవటం,

కపటపు సేవ, అడవులను తగులపెట్టటం, తనదికానిపని చెయ్యటం, తనపని చేయకపోవటం, అనవసరంగా జంతువులను కొట్టటం (హింసించటం), బ్రాహ్మణుల సంపదలను తీసికొనటం, శరణుకోరిన వారిని ఆదరించకపోవటం పాపకార్యాలని పండితులు చెప్పుతారు.

వ. పాపంబులుంబోలె నుండియు దూష్యంబులు గాని వానిం జెప్పెద నాకర్ణింపుము. 294

ప్రతిపదార్థం: పాపంబులున్= పాపకార్యాలు; పోలెన్= వలె; ఉండియున్= ఉండికూడా; దూష్యంబులు= నిందించ దగినవి; కాని వానిన్= కాని విషయాలను; చెప్పెదన్= చెపుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: పాపకార్యాలవలె కనపడుతున్నా నిందించ తగినవి కానివాటిని చెప్పుతాను వినుము.

క. దురమునఁ గైదువుఁ గొని తనుఁ। బొరిగొన నేతెంచునట్టి పురుషుని వేదాం
త రహస్యవేది నయినను। బొరిగొనినను గిల్బిషంబు వొందదు వత్సా! 295

ప్రతిపదార్థం: వత్సా!= నాయనా!; దురమునన్= యుద్ధంలో; కైదువున్= ఆయుధాన్ని; కొని= పట్టి; తనున్= తనను; పొరిగొనన్= చంపటానికి; ఏతెంచు+అట్టి= వచ్చేటటువంటి; పురుషునిన్= మానవుడిని; వేదాంత= ఉపనిషత్తులలోని; రహస్య= అంతరార్థాన్ని; వేదిన్= ఎరిగినవాడిని; అయినను= అయినాసరే; పొరిగొనిననున్= చంపినా; కిల్బిషంబు= పాపం; పొందదు= రాదు.

తాత్పర్యం: నాయనా! ధర్మరాజా! యుద్ధంలో చేత ఆయుధం పట్టి తనను సంహరించటానికి వస్తున్నవాడు ఉపనిషత్తుల పరమార్థం తెలిసిన పండితుడయినా సరే, చంపితే పాపం రాదు.

క. ధరణీసురవిత్తము నప। హరింపఁగాఁ గని వధించు నతఁడు దురితముం
బొరయఁ డొక యించుకయు నని। నరేంద్ర! చెప్పుదురు ధర్మనానార్థవిదుల్. 296

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ధర్మరాజా!; ధరణీసుర= బ్రాహ్మణుల; విత్తములన్= ధనాన్ని; అపహరింపఁగాన్= దొంగిలించగా; కని= చూచి; వధించు= చంపే; అతఁడు= వాడు; ఒక+ఇంచుకయున్= కొద్దిగా కూడా; దురితమున్= పాపాన్ని; పొరయఁడు= పొందడు; అని= అంటూ; ధర్మ= ధర్మమార్గం యొక్క; నానా= అనేకమైన; అర్థవిదుల్= తత్త్వం తెలిసినవారు; చెప్పుదురు= చెప్పుతారు.

తాత్పర్యం: ధర్మరాజా! బ్రాహ్మణుల ధనాన్ని దొంగిలిస్తుండగా చూచిన దొంగను చంపినవాడికి పాపం కొద్దిగా కూడా రాదని ధర్మమార్గం యొక్క పద్ధతులు బాగా తెలిసినవారు చెప్పుతారు.

క. జీవిత సంశయవేళను। భూవర! యొం దన్నపానములు దొరకమిఁ గల్
ద్రావినఁ, గల్లగు టెఱుంగక। త్రావిన నద్దురితమధిక ధర్మమునఁ జెడున్. 297

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; జీవిత సంశయవేళను= బ్రదకటం అనుమానాస్పదంగా ఉన్న సమయంలో; ఒండు= వేరు; అన్నపానములు= తినేవి, త్రాగేవి; దొరకమిన్= లభించకపోవటంతో; కల్= కల్లు; త్రావినన్= త్రాగినా; కల్లు+అగుట= కల్లు అని; ఎఱుంగక= తెలియక; త్రావినన్= త్రాగిన; ఆ+దురితము= ఆ పాపం; అధిక= ఎక్కువ; ధర్మమునన్= పుణ్యం చేయుటంవలన; చెడున్= నశిస్తుంది.

తాత్పర్యం: ధర్మరాజా! ప్రాణం నిలవదనే పరిస్థితులలో తినటానికి, త్రాగటానికి వేరే ఏమీ దొరకనప్పుడు (ప్రాణం నిలపటం కొరకు) కల్లు త్రాగిన పాపం, త్రాగినది కల్లు అని తెలియక త్రాగిన ఆ పాపం అధికమైన పుణ్యకార్యాలు చేయటంతో నశిస్తుంది.

క. గురుసంరక్షణమునకును । బరమాపదయైన యెడను బ్రాహ్మణధనముల్
విరహితములుగాఁ బెఱచోఁ । జొరఁగానగు ముచ్చిమికి వసుమతీనాథా! 298

ప్రతిపదార్థం: వసుమతీనాథా!= ధరణీపతీ! ధర్మరాజా!; గురుసంరక్షణమునకును= గురువును, పెద్దలను రక్షించటానికి; పరమ= గొప్ప; ఆపద= కష్టం; ఐన+ఎడన్= కలిగినప్పుడు; బ్రాహ్మణ ధనముల్= విప్రుల సొత్తులు; విరహితములు+కాన్= విడువబడినవై; పెఱచోన్= పరాయిచోటికి; చొరగాన్+అగు= పోయే; ముచ్చిమికిన్= దొంగతనానికి.

తాత్పర్యం: ధర్మరాజా! గురువులను, పెద్దలను రక్షించటానికి, పెద్ద ఆపద కలిగినప్పుడు, బ్రాహ్మణుల ధనాలు వారినుండి అపహరించబడిన సమయంలోనూ. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ప్రాణహాని దప్పించుచోఁ, బరిణయంబు । నందు గురుజన కార్యార్థమయ్యు నంగ
నా జనముతోడి సంభాషణమున సర్వ । ధనముఁ జెడియెడు నెడ బొంకఁ జను నృపాల! 299

ప్రతిపదార్థం: నృపాల!= రాజా!; ప్రాణహానిన్= ప్రాణనష్టాన్ని; తప్పించుచోన్= తప్పించే సమయంలో; పరిణయంబున్+అందున్= వివాహంలో; గురుజన= పెద్దల; కార్య+అర్థము+అయ్యున్= ప్రయోజనంకొరకు; అంగనాజనము= స్త్రీల; తోడి= తోటి; సంభాషణమునన్= మాట్లాడటంలో; సర్వధనమున్= సంపద అంతా; చెడియెడు+ఎడన్= నశించే సమయంలో; బొంకన్+చనున్= అబద్ధం చెప్పవచ్చును.

తాత్పర్యం: ధర్మరాజా! ప్రాణనష్టాన్ని తప్పించటానికి, వివాహంలో పెద్దల పనికొరకు, స్త్రీలతోడి మాటలలో, సంపద అంతా కోల్పోయే సమయంలో అసత్యం చెప్పవచ్చును.

క. కలలోనఁ జరమధాతు । స్ఖలనము గలిగినను బ్రహ్మచర్యము సెడ దు
జ్జ్వలవహ్ని నేయి వేల్చినఁ । దొలఁగుం గిల్బిషము దురితదూరచరిత్రా! 300

ప్రతిపదార్థం: దురిత= పాపాలకు; దూర= దూరమైన; చరిత్రా!= నడవడిక కలిగిన ధర్మరాజా!; కలలోనన్= స్వప్నంలో; చరమధాతు స్ఖలనము= వీర్యస్ఖలనం; కలిగినను= జరిగినట్లైతే; బ్రహ్మచర్యము= బ్రహ్మచర్యదీక్ష;చెడదు= పాడవదు, చెడిపోదు; ఉజ్జ్వల= బాగామండే; వహ్నిన్= అగ్నిలో; నేయి= ఘృతమును; వేల్చినన్= హోమం చేస్తే; కిల్బిషము= పాపం; తొలఁగున్= పోతుంది.

తాత్పర్యం: పాపరహితమైన నడవడిక కల ధర్మరాజా! కలలో వీర్యస్ఖలనం జరిగితే బ్రహ్మచర్యదీక్ష చెడదు. బాగా మండుతున్న అగ్నిలో నేతితో హోమం చేస్తే ఆ పాపం పోతుంది.

ఆ. అన్న పతితుఁడైన నటుగాక సన్న్యాసి । యయ్యెనేని తమ్ముఁ డాతఁ డుండ
దార సంగ్రహంబుఁ దాఁ జేసి పాపంబుఁ । బొరయఁ డండ్రు బుధులు కురువరేణ్య! 301

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశోత్తముడవైన ఓ ధర్మరాజా!; అన్న= జ్యేష్ఠసోదరుడు; పతితుఁడు+ఐనన్= అధర్మవర్తనుడైనా; అటు+కాక= ఆ విధం గాకపోయినా; సన్న్యాసి+అయ్యెన్+ఏని= సన్న్యాసం పుచ్చుకొని సంసారం వదలినా; ఆతఁడు+ఉండన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అన్న జీవించి ఉండగానే; తమ్ముఁడు; దారసంగ్రహంబు= అతడి భార్యను స్వీకరించటం; తాన్+చేసి= తనే చేసి; పాపంబున్= దురితం; పొరయఁడు= పొందడు; అండ్రు= అంటారు; బుధులు= పండితులు.

తాత్పర్యం: ధర్మరాజా! అన్న అధర్మవర్తనుడైనా, సన్న్యాసం స్వీకరించినా అతడి భార్యను, అతడు ఉండగానే తమ్ముడు స్వీకరిస్తే పాపం కాదు అని పండితులు అంటారు.

తే. **అడవి గోవులకై కాల్చు టధ్వరమునఁ । బశువుఁ, జంపుట, దాన మపాత్రభూతుఁ**
డగు టెఱుంగక యిచ్చుట, దగనిబంటుఁ । బ్రోవకుండుట గీడులు గావు వత్స! **302**

ప్రతిపదార్థం: వత్స!= కుమారా! ధర్మజా!; అడవి= వనాన్ని; గోవులకున్+ఐ= ఆవులకొరకు; కాల్చుట= తగులబెట్టటం; అధ్వరమునన్= యజ్ఞంలో; పశువున్= జంతువును; చంపుట= చంపటం; అపాత్రభూతుఁడు= యోగ్యతలేనివాడు; అగుట= అవటం; ఎఱుంగక= తెలియక; ఇచ్చుట= ఇవ్వటం; తగని= అనర్హుడైన; బంటున్= సేవకుడిని; ప్రోవక= కాపాడక; ఉండుట= ఉండటం; కీడులు= చెడుపనులు, పాపాలు; కావు= అవవు.

తాత్పర్యం: కుమారా! ధర్మజా! గోవులకొరకు వనాన్ని తగులబెట్టటం, యజ్ఞంలో జంతువును చంపటం, అయోగ్యుడని తెలియక దానం ఇవ్వటం, అనర్హుడైన సేవకుడిని రక్షించకుండా వదలటం పాపాలు కావు.

వ. **తపంబుల దానంబుల మఱియునుం దగిన పుణ్యకర్మంబులనుం బాపంబులు పరిక్షీణంబు లగు నను నిది సామాన్య వచనంబు; ప్రాయశ్చిత్త విశేషంబు లెఱింగించెద.** **303**

ప్రతిపదార్థం: తపంబులన్= తపస్సులచేత; దానంబులన్= దానములు చేయటంచేత; మఱియునున్= ఇంకా; తగిన= యుక్తమైన; పుణ్యకర్మంబులనున్= సత్కార్యాచరణాలవలన; పాపంబులు= దురితాలు; పరిక్షీణంబులు= బాగా కృశించినవి; అగును= అవుతాయి; అను+ఇది= అనే ఈ మాట; ప్రాయశ్చిత్త= పాపపరిహార; విశేషంబులు= భేదాలు; ఎఱింగించెదన్= తెలియచెప్పుతాను.

తాత్పర్యం: తపస్సు, దానం, ఇంకా ఇతర సత్కర్మాచరణం వలన పాపాలు బాగా తగ్గుతాయి అనేది మామూలు మాట. ఇంక పాపపరిహార ప్రక్రియలలోని భేదాలు చెప్పుతాను.

వ్యాసుఁడు ధర్మజునకుఁ బ్రాయశ్చిత్త విశేషంబు లెఱింగించుట (సం. 12-36-1)

సీ. **వినుము! కర్మము దెల్పుచును గపాలంబున । నెత్తిన భైక్షాన్న మేకకాల**
మశనంబు గొనుచు ఖట్వాంగ చిహ్నము బ్రహ్మ । చర్యంబునై యధశ్శయన మాచ
రించుచు నిట్లు పండ్రెండు వర్షంబులు । వ్రతవృత్తి నడపంగ బ్రహ్మహత్య
కిల్బిషంబు దొలఁగుఁ; గృచ్ఛ్రముల్ నడపిన । నాఱు వత్సరముల నడఁగు మూఁడు

తే. **హాయనంబులు నడపఁ జాంద్రాయణములఁ । బోవు నిష్ఠానిరతి మాస భోజియైన**
నబ్దమునఁబాయు; నటుగాక యశ్వమేధ । యాజి యగునేని వలదు భిక్షాదు లధిప! **304**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వినుము; కర్మమున్= చేసిన పనిని; తెల్పుచును= ప్రకటించుకొంటూ; కపాలంబునన్= పుర్రెలో; ఎత్తిన భిక్షాన్నము= తిరిపె మెత్తి తెచ్చిన ఆహారం; ఏకకాలంబు= ఒక్కమారు; అశనంబున్= ఆహారాన్ని; కొనుచున్= తింటూ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఖట్వాంగచిహ్నము= మంచపుకోడు ఆకారంలో ఉన్న ఆయుధం గుర్తుగా; బ్రహ్మచర్యంబును+ఐ= బ్రహ్మచర్య ధర్మాన్ని పాటిస్తూ; అధశ్శయనము= నేలమీద పడుకొనటం; ఆచరించుచున్= చేస్తూ; ఇట్లు= ఈ విధంగా; పండ్రెండు వర్షంబులు= పన్నెండు సంవత్సరాలు; వ్రతవృత్తిన్= నియమబద్ధమైన జీవితం; నడపంగన్= గడపగా; బ్రహ్మహత్య కిల్బిషంబు= బ్రహ్మహత్యాపాపం (బ్రాహ్మణవధ చేసిన పాపం); తొఱంగున్= పోతుంది; కృచ్ఛముల్= సాంతపనాదివ్రతాలు; నడపినన్= ఆచరించితే; ఆఱు వత్సరములన్= ఆరేళ్ళలో; అడఁగును= నశిస్తుంది; మూడు హాయనంబులు= మూడు సంవత్సరాలు; నడపన్= ఆచరించగా; చాంద్రాయణములన్= చాంద్రాయణ వ్రతాలవలన; పోవును= పోతుంది; నిష్ఠానిరతిన్= నియమాలయందు ఆసక్తితో; మాసభోజి+ఐనన్= భుజిస్తే; అబ్దమునన్= సంవత్సరంలో; పాయున్= పోతుంది; అటు+కాక= ఆ విధంగా కాకపోతే; అశ్వమేధయాజి= అశ్వమేధ యజ్ఞం చేసినవాడు; అగున్+ఏని= అయినట్లయితే; భిక్షా+ఆదులు= భిక్షాన్నం తినటం మొదలైనవి; వలదు= అక్కరలేదు.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము; బ్రహ్మహత్యాదోషం పోవటానికి ప్రాయశ్చిత్తాలివి. తను చేసిన పని అందరికీ చెప్తుతూ, పురాలలో భిక్షాటన చేసి తెచ్చిన ఆహారాన్ని రోజుకు ఒక్కసారి మాత్రమే తింటూ, ఖట్వాంగాన్ని గుర్తుగా గ్రహించి, బ్రహ్మచర్య ఆశ్రమధర్మాన్ని పాటిస్తూ నేలమీద పడుకొంటూ పన్నెండు సంవత్సరాలు నియమబద్ధ జీవితం గడపాలి. లేదా సాంతపనాది వ్రతాలు ఆరు సంవత్సరాలు ఆచరించాలి. లేకుంటే మూడు సంవత్సరాలు చాంద్రాయణ వ్రతం చేయాలి. అదీ కాకుంటే నిష్ఠగా మాసభోజి అయి ఒక్క ఏడాది ఉండాలి. అశ్వమేధయాగం చేస్తే మిగిలిన వేవీ చేయనక్కరలేదు.

విశేషం: 1. కృచ్ఛము: మూడు రోజులు పగలు భోజనం చేసి, మూడురోజులు రాత్రిభోజనం చేసి, మూడురోజులు అడగకుండా లభించింది తిని, మూడు రోజులు అస లేమీ తినకుండా నిరాహారంగా ఉండే వ్రతం. పంచగవ్యము, కుశోదకం మాత్రమే స్వీకరించి, ఒకరాత్రి ఉపవసించే వ్రతాన్ని కృచ్ఛము అంటారు. పంచగవ్యం అంటే గోవుకు సంబంధించిన 5 పదార్థాలు. 1. నేయి, 2. పాలు, 3. పెరుగు, 4. మూత్రం, 5. పేడ. గోమూత్రాన్ని మట్టిమూకుడులో ఇగిర్చి మిగిలినది లవణరూపంలో స్వీకరిస్తారు. ఆవుపేడను పుటంపెట్టి, నీటిలో బాగా కడిగి, ఆపై దానిపై తేర్చిన నీటిరూపంలో స్వీకరిస్తారు. ఇది ఒక్కనాటి నియమం. దీనిని ఆరు సంవత్సరాలు పాటించాలి.

2. చాంద్రాయణము: పూర్ణిమనాడు పూర్తిగా ఆహారం తీసికొని, కృష్ణపక్షంలో రోజుకొక్క ముద్దచొప్పున తగ్గిస్తూ, అమవాస్యనాడు పూర్తిగా ఉపవసించి, మరునాటి నుండి శుక్లపక్షంలో రోజు కొక్క ముద్ద చొప్పున హెచ్చిస్తూ పూర్ణిమనాటికి పూర్తిగా ఆహారం తీసికొనటం అనే వ్రతం.

3. మాస భోజి: రోజుకొక్క మాస ప్రమాణం మాత్రమే ఆహారం తీసికొనటం. రెండున్నర చిన్నాల ఎత్తు బరువును మాసం అంటారు. ఇది బంగారాన్ని తూచే బరువు. అంటే అంత తక్కువ ఆహారం.

ఈ వ్రతాలన్నింటిలోనూ ఆహారనియమం, శరీరశోషణం ముఖ్యాంశాలు. శరీరంతో చేసిన పాపానికి శరీరశోషణం అవసరం కదా!

క. అవనీశ! యశ్వమేధము । నవబృథమున నీరఁ గ్రుంకి యన్యుఁడు శుద్ధుం
డవుఁ బాపుఁ డైనఁ; దత్క । ర్త విశేషము లోక పూజితం బగు టరుదే! 305

ప్రతిపదార్థం: అవనీ+ఈశ!= ఓ రాజా!; అశ్వమేధము-అవభృథమునన్= అశ్వమేధయాగంలోని దీక్షాంతమున చేసే స్నానంలో; నీరన్= నీటిలో; క్రుంకి= మునిగి; అన్యుఁడు= ఇతరుడు; పాపుఁడు+ఐనన్= పాపం చేసినవాడైనా; శుద్ధుండు+అవున్= పవిత్రుడౌతాడు; తద్+కర్త= అశ్వమేధం చేసినవాడు; విశేషము= అధికంగా; లోకపూజితంబు= లోకంలోని అందరిచేత; పూజితంబు= పూజించబడటం; అరుదు+ఏ?= వింతయా? (వింతకాదు)

తాత్పర్యం: ధర్మరాజా! అశ్వమేధయాగంలోని దీక్షాంత స్నానపునీటిలో మునిగిన ఇతరు డెవరైనా, ఎంతటిపాపి అయినా పవిత్రుడౌతాడు. అటువంటిది ఆ అశ్వమేధయాగం చేసినవాడు లోకపూజితు డవటంలో ఆశ్చర్యం లేదు కదా!

సం॥ 35-10

తే. పుష్టగోలక్ష యొండెఁ గాంభోజవాజి । శతక మొండెను భూసురతతికి నొసఁగఁ
బాయు బ్రాహ్మణార్థాహవ ప్రాణహాని । యైన నొండెను జెడు బ్రహ్మహత్యకీడు. 306

ప్రతిపదార్థం: పుష్ట= బలిసిన; గోలక్ష= లక్షగోవులు; ఒండెన్= కాని; కాంభోజవాజి= కాంభోజదేశంలోని శ్రేష్ఠమైన గుర్రాలు; శతకము= వంద; ఒండెను= కాని; భూసురతతికిన్= బ్రాహ్మణుల సముదాయమునకు; ఒసఁగన్= దానం చేయగా; బ్రాహ్మణ+అర్థ= బ్రాహ్మణుల కొరకు చేసిన; ఆహవ= యుద్ధమందు; ప్రాణ, హాని, ఐనన్= ప్రాణములను పోగొట్టుకున్నా; బ్రహ్మహత్యకీడు= బ్రహ్మహత్యా పాతకం; పాయున్= పోతుంది; ఒండెను= అయినా; చెడున్= పోతుంది.

తాత్పర్యం: బ్రాహ్మణులకు పుష్టిగా ఉన్న లక్ష గోవులను, కాంభోజదేశానికి చెందిన వంద గుర్రాలను దానం చేసినా, బ్రాహ్మణులకోసం చేసిన యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్నా బ్రహ్మహత్యాపాతకం తొలగిపోతుంది.

సీ. **కల్లుద్రావిన పాతకం బది యగ్నివ । ర్ణముగాఁగఁ గాఁచి పానంబు సేయఁ**
గనుమూసి యుఱుకంగ ననలంబుఁ జొర మహా । ప్రస్థాన మాచరింపంగఁ బాయు
నట్లును గాక బృహస్పతి సవనమ । న్క్రతు వొనరించిన నతివిశిష్ట
భూమిదానమునను బోవు నక్కీడ్గురు । తల్పగుం డనలప్రతప్త మైన

ఆ. **యాయసాంగనాంగ మాలింగనము సేసి । యైనఁ గోసి కరమునందు మేహ**
నము ధరించి యంబరముఁ జూచు చరిగియే । నియును జచ్చి యఘము నిస్తరించు. 307

ప్రతిపదార్థం: కల్లున్+త్రావిన= మద్యం సేవించిన; పాతకంబు= మహాపాపం; అది= ఆ మద్యం; అగ్నివర్ణము+కాఁగన్= మంటవలె ఎర్రని రంగు వచ్చేదాకా; కాఁచి= మరిగించి; పానంబు+చేయన్= తాగగా; కనుమూసి= కళ్ళు మూసికొని; అనలంబున్= అగ్నిలో; చొరన్= ప్రవేశించగా; ఉఱుకంగన్= దుముకగా; మహాప్రస్థానము= తిరిగిరాని ప్రయాణం (శరీరం పడిపోయేదాకా అవిశ్రాంతంగా ఉత్తరాభిముఖుడై వెళ్ళి శరీరత్యాగం చేయటం); ఆచరింపంగన్= చేయగా; పాయున్= పోతుంది; అట్లును+కాక= అట్లా కాకపోతే; బృహస్పతి సవనము= బృహస్పతి యజ్ఞం; అన్+క్రతువు= అనే యజ్ఞం; ఒనరించినన్= చేసినా; అతివిశిష్ట= చాలా ఎక్కువైన; భూమిదానంబునను= భూమిని దానం చేయటం వలనా; ఆ+కీడు= కల్లు త్రావిన పాపం; పోవున్= పోతుంది; గురుతల్పగుండు= గురుదారగమనం చేసినవాడు; అనల= అగ్నిలో; ప్రతప్తము+ఐన= బాగా కాలిన; ఆయస= ఇనుప; అంగనా= స్త్రీ; అంగము= దేహం; ఆలింగనము+చేసి= కౌగిలించుకొని; ఐనన్= అయినా; మేహనము= మేఢ్రమును; కోసి= నరికి; కరమునందున్= చేతిలో; ధరించి= పట్టుకొని; అంబరమున్= ఆకాశాన్ని; చూచుచున్= చూస్తూ; అరిగి= వెళ్ళి; చచ్చి= మరణించి; ఏనియును= అయినా; అఘమున్= పాపాన్ని; నిస్తరించున్= పోగొట్టుకొంటాడు.

తాత్పర్యం: కల్లు సేవిస్తే వచ్చే పాతకం ఆ మద్యాన్ని ఎర్రగా కాచి తాగినా, కళ్ళు మూసికొని నిప్పులలో దూకినా, మహాప్రస్థానం చేసినా, బృహస్పతి సవనం అనే యజ్ఞం చేసినా, చాలా అధికమైన భూదానం చేసినా పోతుంది. గురుపత్నిని పొందినవాడు ఆ పాపం పోవటానికి బాగా కాల్చిన ఇనుపస్త్రీమూర్తిని కౌగిలించుకొనాలి. లేదా తన మేఢ్రాన్ని (ఆ పాపం చేయటానికి మూలం అదే కనుక) కోసి చేతిలో పట్టుకొని ఆకాశం వంక చూస్తూ పోయి మరణించాలి.

క. గురుతల్పగుండు రణమున । గురునకునై చచ్చియేని కురువర ధరణీ
సురులకు సర్వధనము భ । క్తి రతి నొసఁగియేని పాతకిత్వముఁ దొఱఁగున్. 308

ప్రతిపదార్థం: కురువర!= కురువంశరాజులలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; గురుతల్పగతుండు= గురుపత్నితో వ్యభిచరించినవాడు; రణమునన్= యుద్ధంలో; గురునకున్+ఐ= గురువు కొరకు; చచ్చి+ఏని= చనిపోయి కాని; ధరణీసురులకున్= విప్రులకు; సర్వధనము= సంపదనంతా; భక్తిరతిన్= భక్తితో, ఇష్టంతో; ఒసఁగి+ఏని= దానం చేసికాని; పాతకిత్వమున్= పాపభావాన్ని; తొఱఁగున్= పోగొట్టుకొంటాడు.

తాత్పర్యం: ధర్మరాజా! గురుపత్నీగమనం చేసినవాడు యుద్ధంలో ఆ గురువుకొరకు ప్రాణా లర్పించినా, తన ధనాన్నంతా విప్రులకు దానం చేసినా ఆ పాపం పోతుంది.

క. ధరణీసురుస్వర్ణము నప । హరించినతఁ డంత కనక మట్టిద వినయో
త్తరుఁడై మగుడఁగ నిచ్చినఁ । బరిహృత మగుఁ గల్మషంబు పౌరవముఖ్యా! 309

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశ శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; ధరణీసురు= విప్రుడి; స్వర్ణమున్= బంగారం; అపహరించిన= దొంగిలించిన; అతఁడు= వాడు; అంత కనకము= అంతే బంగారం; అట్టిది+అ= అటువంటిదే; వినయ+ఉత్తరుఁడు+ఐ= వినయంతో కూడుకొన్నవాడై; మగుడఁగన్= మరల; ఇచ్చినన్= ఇవ్వగా; కల్మషంబు= పాపం; పరిహృతము= పోగొట్టబడింది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: పౌరవవంశోత్తముడ వైన ధర్మరాజా! బ్రాహ్మణుడి బంగారాన్ని దొంగిలించిన వాడు అంతే బంగారం, అటువంటిదే వినయంతో తిరిగి ఇస్తే ఆ పాపం పోతుంది.

క. అనృతోపచారకలనం । బునఁ బుట్టిన పాతకంబు వోవుం దా నె
వ్వని నపచరించెఁ దగ నా । తనిఁ బ్రీతుంజేయ ధర్మతత్త్వప్రవణా! 310

ప్రతిపదార్థం: ధర్మతత్త్వప్రవణా!= ధర్మంయొక్క స్వభావం బాగా తెలిసిన ఓ ధర్మరాజా!; అనృత= అసత్యానికి; ఉపచార= సేవ; కలనంబునన్= చేయటం వలన; పుట్టిన= జనించిన; పాతకంబు= పాపం; ఎవ్వనిన్= ఎవరికి; అపచరించెన్= అపచారం చేశాడో; తగన్= చక్కగా; ఆతనిన్= ఆ వ్యక్తిని; ప్రీతున్= సంతసించినవాడినిగా; చేయన్= చేసినచో; పోవున్= పోతుంది.

తాత్పర్యం: ధర్మతత్త్వం బాగా తెలిసిన ఓ ధర్మరాజా! అబద్ధాన్ని ఆడటంవలన కలిగిన పాపం, ఎవరికి అపచారం చేశాడో ఆ వ్యక్తిని సంతోషపెట్టితే పోతుంది.

క. గురువునకు మాఱువల్కుటఁ । బొరసిన కల్మషము వాసిపోవు నతనికిం
బరితోషముగా వినయపు । వెరవున నుపహార మిచ్చి వినతుం డయినన్. 311

ప్రతిపదార్థం: గురువునకున్= ఆచార్యుడికి; మాఱుపల్కుటన్= ఎదురుచెప్పటం వలన; పొరసిన= కలిగిన; కల్మషము= పాపం; అతనికిన్= ఆ గురువుకు; పరితోషముగాన్= సంతోషం కలిగేటట్లు; వినయము+వెరవునన్= వినయంతో కూడిన ఉపాయంతో; ఉపహారము= కానుక; ఇచ్చి= ఒసగి; వినతుండు= నమస్కరించినవాడు; అయినన్= అయితే; పాసిపోవున్= తొలగిపోతుంది.

తాత్పర్యం: గురువును ఎదిరించటంవలన కలిగిన పాపం, ఆ గురువుకు సంతోషం కలిగేటట్లు వినయంతో నమస్కరించి కానుక ఇస్తే తొలగిపోతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **పరదార గమనదోషము । పరిహృతమగు నొక్కయేఁడు పరమ నియతుఁడై**
చరియించినఁ గృచ్ఛ్రంబులు । గురుకుల జలనిధి శశాంక! గుణమణి నికరా! **312**

ప్రతిపదార్థం: కురుకుల= కురువంశమనే; జలనిధి= సముద్రానికి; శశాంక= చంద్రుడి వంటివాడా!; గుణమణి= శ్రేష్ఠమైన రత్నాలవంటి గుణాలకు; నికరా!= ప్రోగువంటివాడా!, ధర్మరాజా!; పర= ఇతరుల; దార= భార్యను; గమన= పొందిన; దోషము= పాపం; ఒక్కఏఁడు= ఒక్క సంవత్సరం; పరమ= మిక్కిలి; నియతుఁడు+ఐ= నియమాలు కలవాడై; కృచ్ఛ్రంబులు= సాంతపనాది వ్రతాలు; చరియించినన్= ఆచరించగా; పరిహృతము+అగున్= పరిహరించబడుతుంది.

తాత్పర్యం: కురువంశ చంద్రమా! సద్గుణరాశీ! ధర్మరాజా! ఇతరుల భార్యలను పొందిన పాపం ఒక్క సంవత్సరం అధికమైన నియమంతో కృచ్ఛ్రవ్రతాలను ఆచరిస్తే పోతుంది.

విశేషం: కృచ్ఛ్రముల వివరం 304వ పద్యంలో ఇవ్వబడింది.

ఆ. **వావి గానియట్టి వనితఁ బొందినపాప । మాఱునెలలఁ బాయు నార్ద్రవస్త్ర**
ధరణ భస్మశయన పరతఁ బాటించుచు । నియతి నుండెనేని నృపవరేణ్య! **313**

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజోత్తమా!; వావి= వరుస; కాని+అట్టి= కానిదైన; వనితన్= స్త్రీని; పొందిన= కూడిన; పాపము= దురితం; ఆర్ద్రవస్త్రధరణ= తడిబట్టలు ధరించటం; భస్మశయనపరతన్= బూడిదలో పడుకొనటం; పాటించుచున్= అనుసరిస్తూ (చేస్తూ); నియతిన్= నియమంతో; ఉండెన్+ఏని= ఉన్నట్లయితే; ఆఱునెలలన్= ఆరునెలలలో; పాయున్= పోతుంది.

తాత్పర్యం: ధర్మరాజా! వరుసకాని స్త్రీని కూడిన పాపం - తడిబట్టలు కట్టుకొనటం, బూడిదలో పడుకొనటం అనే నియమాలను శ్రద్ధగా పాటిస్తే ఆరునెలలలో పోతుంది.

క. **పరపురుష సంగమంబునఁ । బరిహృతయై యున్నయట్టి భామిని శుద్ధిం**
బొరయు రజస్వలయై కం । చరయఁగ భస్మమున శుద్ధమైన విధమునన్. **314**

ప్రతిపదార్థం: పరపురుష= పరాయి పురుషుడి; సంగమంబునన్= పొందువలన; పరిహృత+ఐ= వదలబడినదై; ఉన్న+అట్టి= ఉన్నటువంటి; భామిని= స్త్రీ; అరయఁగన్= పరికించి చూడగా; కంచు= కాంస్యం; భస్మమునన్= బూడిదతో; శుద్ధము= మలినం లేనిది; ఐన విధమునను= అయ్యే పద్ధతిలోనే; రజస్వల+ఐ= నెలసరి ఋతువు కలిగినదై; శుద్ధిన్= స్వచ్ఛతను; పొరయున్= పొందుతుంది.

తాత్పర్యం: పరపురుషుడి పొందువలన వదలబడిన స్త్రీ, బూడిదతో కంచు నిర్మలత్వాన్ని పొందిన విధంగా, రజోదర్శనంతో మాలిన్యం పోయి పవిత్రమౌతుంది.

ఆ. **నఱకఁదగని మ్రాను నఱకినఁ, దిర్యగ్వ । ధంబుఁ జేసినను, నఘంబుఁ బాచి**
కొనునరుండు మూఁడు దినములఁ దనచేఁత । పలుకుచును సమీరభక్షుఁ డయిన.' **315**

ప్రతిపదార్థం: నఱకన్+తగని= కొట్టివేయకూడని; మ్రానున్= చెట్టును; నఱకినన్= కొట్టినా; తిర్యక్+వధంబున్= జంతులను చంపటం; చేసినను= చేసినా; అఘంబున్= ఆ పాపాన్ని; మూఁడు దినములు= మూడు రోజులు; తనచేఁత= తాను చేసిన పని; పలుకుచును= చెప్తుతూ; సమీరభక్షకుండు+అయినన్= గాలిని ఆహారంగా తింటూ ఉన్నట్లయితే; నరుండు= మానవుడు; పాచికొను= పోగొట్టుకుంటాడు.

తాత్పర్యం: నరకకూడని చెట్టును కొట్టినా, జంతువులను చంపినా, వచ్చిన పాపాన్ని మనిషి మూడురోజులపాటు తాను చేసిన పనిని చెప్పుకొంటూ గాలి మాత్రమే తింటూ (అన్న పానీయాలు మాని) ఉండి పోగొట్టుకొంటాడు.'

వ. అని చెప్పి వెండియు. 316

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; చెప్పి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఈ మాటలు చెప్పి వ్యాసుడు ఇంకా (ఇట్లా అన్నాడు):

క. ' మితభోజియై వివిక్త । క్షితి సావిత్రీజపంబు సేయునది యహః
స్థితియు నిశాసీనత్వము । మతి నేమఱకట్టులైన మడియు నఘంబుల్. 317

ప్రతిపదార్థం: మిత= పరిమితంగా; భోజి+ఐ= తినేవాడవై; వివిక్త= పవిత్ర (ఏకాంత); క్షితిన్= భూమిలో; సావిత్రీజపంబు=గాయత్రీమంత్రజపాన్ని; చేయునది= చేయాలి; అహః+స్థితియున్= పగలు నిలుచుండి మేల్కొని ఉండుటను; నిశా+ఆసీనత్వము= రాత్రియందు విశ్రయించుటయు కూర్చుండి ఉన్నప్పుడు; మతిన్= మనసులో; ఏమఱక= మరచిపోక; అట్టులు+ఐనన్= అట్లా చేసినట్లయితే; అఘంబుల్= పాపాలు; మడియున్= నశిస్తాయి.

తాత్పర్యం: 'ఆహారం మితంగా తీసికొంటూ, ఏకాంతస్థలంలో పగలు అయ్యేప్పుడు (ఉదయ సంధ్యలో) రాత్రి ఉన్నప్పుడు (సాయంసంధ్యలో) మనసులో ఏమరుపాటు లేక గాయత్రీమంత్రజపం చేస్తే పాపాలన్నీ నశిస్తాయి.

విశేషం: గాయత్రీమంత్రాధిదేవత సావిత్రి. సావిత్రీజపం అంటే గాయత్రి జపం అని భావం.

తే. పుణ్యకర్మముల్ సేయుచు భూసురులకు । వివిధ ధనములు ప్రీతితో వినయ మొప్ప
నొసఁగుచుండెడువారు పూర్వోపచితము । లైన కిల్బిషములఁ బాతు రవనినాథ! 318

ప్రతిపదార్థం: అవనినాథ!= భూమీపతీ!; పుణ్యకర్మముల్= మంచిపనులు; చేయుచున్= చేస్తూ; భూసురులకున్= విప్రులకు; వివిధ= అనేకములైన; ధనములు= సంపదలు; ప్రీతితోన్= ఇష్టంతో; వినయము+ఒప్పన్= వినమ్రత ప్రకాశించగా; ఒసఁగుచున్+ఉండెడువారు= ఇస్తూ ఉండేవారు; పూర్వ+ఉపచితములు= ఇంతకుముందు సంపాదించి పెట్టుకొన్నవి; ఐన= అయినటువంటి; కిల్బిషములన్= పాపాలను; పాతురు= పోగొట్టుకొంటారు.

తాత్పర్యం: సత్కర్మలు ఆచరిస్తూ, బ్రాహ్మణుల కనేకమైన సంపదలను ఇష్టంతో, వినయంతో దానం చేస్తూ ఉండేవారు పూర్వజన్మలలో కూడబెట్టిన పాపాలను కూడా పోగొట్టుకొంటారు.

క. విను మాస్తికతా శ్రద్ధా । వినయంబులు గలుగువారు వీనికి నెల్లన్
జననాథ! యర్హు; లవి లే । నినరులు పాపములఁ దొలఁగ నేర్తురె యెట్లున్. 319

ప్రతిపదార్థం: జననాథ!= రాజా!; విను= ఆలకించుము; ఆస్తికతా= భగవంతుడి యందు విశ్వాసబుద్ధి; శ్రద్ధా= ఆసక్తి; వినయంబులు= వినయం; కలుగువారు= ఉన్నవారు; వీనికిన్= ఇంతకుముందు చెప్పిన ప్రాయశ్చిత్తాదులకు; ఎల్లన్= అన్నింటికీ; అర్హులు= యోగ్యత ఉన్నవారు; అవి= ఆస్తికతా, శ్రద్ధా వినయాలు; లేని నరులు= లేనటువంటి మానవులు; ఎట్లున్= ఏ విధంగా; పాపములన్= పాపాలను; తొలఁగన్+నేర్తురు+ఎ?= పోగొట్టుకొనగలుగుతారు? (పోగొట్టుకొనలేరని భావం.)

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. భగవంతుడి పట్ల విశ్వాసం, శ్రద్ధ, వినయం ఉన్నవాళ్ళే ప్రాయశ్చిత్తా లన్నింటికీ అర్హులు. అవి లేనివారు పాపాలను ఎట్లా పోగొట్టుకొంటారు?

వ. ఆస్తికతా శ్రద్ధా వినయంబులు నీకు సహజంబులు గావే! కావునఁ బ్రాయశ్చిత్తంబు లల్పంబు లైననుం బాపంబులం బాపనోపుఁ; బాపం బని నీవు శంకించు కర్మంబు భారతయోధ వధంబ కాదె! యది యాత్మరక్షణంబునకై చేయుటం జేసియు, నుత్తమక్షత్రధర్మం బగుట నిరూపింపం బాపంబుం బొరయకున్న యది; యట్లుంగాక భవదంతఃకరణంబున జనియించిన కరుణయుం, బశ్చాత్తాపంబును, నిన్నుం బరిశుద్ధునింజేసె; నీవు ప్రాణబాధకంబు లగు తపశ్చరణంబులకుం జొరం జూడకుము; కురుకుల చూడామణిత్వంబునకు మూలంబయిన మహీపాలనం బాచరింపు' మనిన నబ్బాదరాయణుతో నమ్మేదినీరమణుం 'డపేయంబులు నభోజ్యంబులు నెయ్యవి? యపాత్రభూతపురుషు లెట్టివారు? మహాపురుషా! యెఱింగింపవే' యని యడిగిన నతం డిట్లనియె. 320

ప్రతిపదార్థం: ఆస్తికతా= భగవంతుడియందు విశ్వాసబుద్ధి; శ్రద్ధా= ఆసక్తి; వినయంబులు= వినమ్రత; నీకున్= నీకు (ధర్మరాజుకు); సహజంబులు= స్వభావసిద్ధమైనవి; కావు+ఏ!= కదా!; కావునన్= కనుక; ప్రాయశ్చిత్తంబులు= పాపపరిహార కర్మలు; అల్పంబులు+ఐననున్= తక్కువవి అయినా; పాపంబులన్= దురితాలను; పాపన్= పోగొట్టటానికి; ఓపున్= సమర్థములై ఉన్నాయి; పాపంబు+అని= అఘమని; నీవు శంకించు= నీవు అనుమానించే; కర్మంబు= పని; భారత= భరతవంశానికి చెందిన; యోధ= వీరుల; వధంబు+అ= సంహారమే; కాదు+ఎ!= కదా!; అది= ఆ పని; ఆత్మరక్షణంబునకున్+ఐ= తనను తాను రక్షించుకొనటానికి; చేయుటన్+చేసియున్= చేయటం వలన; ఉత్తమ= శ్రేష్ఠమైన; క్షత్రధర్మంబు= రాజోచిత కర్తవ్యం; అగుట= అవటం; నిరూపింపన్= నిరూపించటం వలన; పాపంబున్= దురితాన్ని; పొరయన్= పొందక; ఉన్న+అది= ఉన్నది; అట్లున్+కాక= అంతేకాక; భవత్= నీ; అంతఃకరణంబునన్= మనస్సులో; జనియించిన= పుట్టిన; కరుణయున్= దయయూ; పశ్చాత్తాపంబును= చేసిన పనికి బాధపడటం; నిన్నున్= నిన్ను; పరిశుద్ధునిన్= పవిత్రుడిగా; చేసెన్= చేశాయి; నీవు; ప్రాణబాధకంబులు+అగు= ప్రాణానికి కష్టం కలిగించేవి అయిన; తపశ్చరణంబులకున్= తపస్సు చేయటం మొదలైన పనులు; చొరన్+చూడకుము= మొదలుపెట్టాలనుకొనవద్దు; కురుకుల= కురువంశంయొక్క; చూడామణిత్వంబునకున్= ఉన్నతమైన గౌరవార్హమైన స్థితికి; మూలంబు+అయిన= కారణమైన; మహీపాలనంబు= భూమిని పరిపాలించటం; ఆచరింపుము= చేయుము; అనినన్= అనగా; ఆ+బాదరాయణుతోన్= ఆ వ్యాసుడితో; ఆ+మేదినీరమణుండు= ఆ రాజు; అపేయంబులున్= తాగకూడనివి; అభోజ్యంబులున్= తినకూడనివి; ఏ+అవి?= ఏవి?; అపాత్రభూత= అనర్హులైన; పురుషులు= మానవులు; ఎట్టివారు?= ఎటువంటివారు?; ఎవరు?; మహాపురుషా!= మహానుభావా!; ఎఱింగింపుము+ఏ?= తెలియచేయవా? అని; అడిగినన్= అడుగగా; అతండు= ఆ వ్యాసుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఆస్తిక్యబుద్ధి, శ్రద్ధ, వినయం నీ నైజాలే కదా! కనుక స్వల్ప ప్రాయశ్చిత్తాలు పాపాలను పోగొట్టుతాయి. నీవు పాపం అని సందేహించేది భరతవంశవీరుల సంహారమే కదా! అది ఆత్మరక్షణకొరకు చేసిందే కాక ఉత్తమమైన రాజధర్మం అని నిరూపించబడటం వలన పాపం కాదు. అంతేకాదు. నీ మనస్సులో కలిగిన దయ, పశ్చాత్తాపాల కారణంగా నీవు నిర్మలుడ వయ్యావు. అందువలన నీవు తపస్సు మొదలైన పనులు ప్రారంభించకుము. కురువంశం సర్వశ్రేష్ఠంగా గౌరవించబడటానికి కారణమైన రాజ్యపాలనం నిర్వర్తించుము' అని చెప్పిన వ్యాసుడితో ధర్మరాజు ఇట్లా అన్నాడు: 'మహానుభావా! తాగకూడనివి, తినకూడనివి ఏవి? ఎటువంటివారు అయోగ్యులు? తెలియచెప్పవలసినది'. దానికి వ్యాసు డిట్లా చెప్పటం మొదలుపెట్టాడు.

క. తురగియు నుష్ట్రియు ఖరియును । గురిసిన దుగ్ధములు నింద్యకోటి గణితముల్
ధరణీసురాది జను ల । ప్పొరువునఁ బోయిన నఘంబుఁ బొందుదు రధిపా! 321

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; తురగియున్= ఆడగుర్రం; ఉష్ట్రియున్= ఆడ ఒంటె; ఖరియును= ఆడ గాడిద; కురిసిన= స్రవించిన; దుగ్ధములు= పాలు; నింద్య= నిందించదగిన; కోటి= సముదాయంగా; గణితముల్= పరిగణించబడ్డాయి; ధరణీసుర= బ్రాహ్మణ; ఆది= మొదలైన; జనులు= మానవులు; ఆ+పొరువునన్= వాటి సమీపానికి; పోయినన్= వెళ్ళినట్లయితే; అఘంబు= పాపం; పొందుదురు= పొందుతారు.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఆడ గుర్రం, ఆడ ఒంటె, ఆడ గాడిద ఇచ్చినపాలు నిందించ తగినవిగా పరిగణిస్తారు. బ్రాహ్మణులు మొదలైనవారు వాటి సమీపానికి వెళ్ళితే పాపం పొందుతారు.

సీ. మానుషీక్షీరంబు, నీనిన పదినాళ్ల । లోనిధేనువుల పాలును నపేయ
ములు; ప్రేతవిషయాన్నమును, సూతకాన్నంబుఁ, । దలవరియన్నంబుఁ, గులటయన్న
మును, వనితోపజీవనశీలు నన్నంబు, । నాడెడు పాడెడునట్టివాని
యన్నంబు, జూదరియన్నంబు, సూనరి । యన్నంబు బహివెట్టినతని యన్న

ఆ. మును, నిజాగ్రజునకు మును పెండ్లియాడిన । పురుషు నన్నమును, నభోజ్య మండ్రు;
వందియన్న మధిక నిందాస్పదంబు; ప । ర్యుషిత శుష్కములను నుడుగవలయు. 322

ప్రతిపదార్థం: మానుషీక్షీరంబు= మానవులపాలు; ఈనిన= ప్రసవించిన; పదినాళ్ళ= పదిరోజుల; లోని= లోపు; ధేనువుల= ఆవుల; పాలునున్= పాలునూ; అపేయములు= త్రాగకూడనివి; ప్రేతవిషయ= శవసంబంధమైన; అన్నమును= ఆహారం; సూతక+అన్నంబున్= అశౌచాలలోని (జాత అశౌచం - పురుడు, మృత అశౌచం - మైల) ఆహారం; తలవరి= తలారి; అన్నంబును= ఆహారం; కులట= వేశ్య అయిన స్త్రీ; అన్నమును= ఆహారం; వనిత= స్త్రీని; ఉపజీవనశీలుని= అనుసరించి జీవనం గడిపేవాడి (జీవనానికి స్త్రీపై ఆధారపడినవాడి); అన్నంబున్= ఆహారం; ఆడెడు= ఆడుతూ; పాడెడు= పాడుతూ ఉండే; అట్టివాని= అటువంటివాడి; అన్నంబు= ఆహారము; జూదరి= జూదగాడి; అన్నంబు= ఆహారం; సూనరి= పూలమ్మి బతికేవాడి; అన్నంబు= ఆహారం; బహి+పెట్టిన+అతని= వెలివేసినవాడి; అన్నమును= ఆహారం; నిజ= తన; అగ్రజునకున్= అన్నకన్న; మును= ముందుగా; పెండ్లి+ఆడిన= వివాహం చేసికొన్న; పురుషుని= మానవుడి; అన్నమునున్= ఆహారం; అభోజ్యము= తినతగనిది; అండ్రు= అంటారు; వంది= భట్టు (స్తుతి చేసి జీవించేవాడు); అన్నము= ఆహారం; అధిక= ఎక్కువగా; నిందా+ఆస్పదంబు= నిందకు తగినవి; పర్యుషిత= నిలవచేయబడినవి; శుష్కములనున్= ఎండినవి (వరుగులు); ఉడుగవలయున్= వదలివేయాలి.

తాత్పర్యం: మనిషిపాలు, ఈనిన పదిరోజుల లోపుగా ఆవుపాలు త్రాగకూడనివి. శవసంబంధమైనది అశౌచమైన (పురుడు, మైల సంబంధమైన)ది, తలారి ఇచ్చినది, కులట ఇచ్చినది, బ్రతుకు తెరువుకు స్త్రీపై ఆధారపడిన వాడు ఇచ్చినది, ఆడుతూ పాడుతూ ఉండేవాడు ఇచ్చినది, జూదగాడిచ్చినది, పూలమ్ముమవాడు ఇచ్చినది, వెలివేసినవాడు ఇచ్చినది, అన్నకంటె ముందు పెండ్లి చేసికొన్నవాడు ఇచ్చినది అయిన ఆహారం తినకూడనిది. స్తుతి చేసి జీవించేవాడి ఆహారం మరీ నిందించ తగినది. పాచిపోయినది (నిలవది), ఎండినది అయిన ఆహారాన్ని వదలివేయాలి.

క. విను! సురతోఁ గూడఁగఁ దె । చ్చినయట్టిది యెద్దియును భుజింప రభోజ్య
త్వ నిరూపణ నిపుణతగల । మనుజోత్తము లఖిలలోకమాన్యచరిత్రా! 323

ప్రతిపదార్థం: అఖిల= సమస్త; లోక= లోకంచేత; మాన్య= గౌరవించదగిన; చరిత్రా!= నడవడిక కలవాడా!; విను= ఆలకించుము; సురతోన్= కల్లుతో; కూడఁగన్= కలిపి; తెచ్చిన+అట్టిది= తీసికొనివచ్చినటువంటిది; ఎద్దియును= ఏదికూడ; అభోజ్యత్వ= తినకూడనివి; నిరూపణ= నిర్ధారించే; నిపుణత= నేర్పరితనం; కల= ఉన్న; మనుజ+ఉత్తములు= మానవశ్రేష్ఠులు; భుజింపరు= తినరు.

తాత్పర్యం: లోకంలో అందరిచేతా గౌరవించబడే ప్రవర్తన కల ధర్మరాజా! వినుము. తినకూడని వాటిని నిర్ధారించే చాతుర్యం ఉన్న ఉత్తములైనవారు కల్లుతో కలిపి తెచ్చిన వస్తువు ఏదైనా తినరు.

క. పులగముఁ బాయస మట్టులుఁ । బలలము నర్చనకుఁ గాక పక్వములయినం
గలుగు నభోజ్యత్వము వి । చ్చలవిడి వంటకము సేసి చనదు భుజింపన్.' 324

ప్రతిపదార్థం: పులగమున్= ముద్గాన్నము (పెసరపప్పు బియ్యం కలిపి వండిన అన్నం); పాయసము= పరమాన్నం; అట్టులు= అపూపములు; పలలము= నువ్వులపొడి (మాంసం అనే అర్థం కూడా ఉన్నది); అర్చనకున్+కాక= దేవతారాధనకు కాక; పక్వములు= వండినవి; అయినన్= అయితే; అభోజ్యత్వము= తినగూడకపోవటం; కలుగున్= కలుగుతుంది; విచ్చలవిడి= యథేచ్ఛగా; వంటకము= వండిన పదార్థాన్ని; చేసి= తయారుచేసి (వండి); భుజింపన్= తినటం; చనదు= కూడదు.

తాత్పర్యం: పులగం (పొంగలి), పరమాన్నం, అప్పాలు మొదలైన పిండివంటలు, నువ్వులపిండి మొదలైనవి దేవతార్చనకే వండాలి. అట్లా కాకపోతే అవి తినగూడనివి అవుతాయి. కనుక యథేచ్ఛగా వండి తినకూడదు.'

వ. అని వెండియు. 325

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా చెప్పి; వెండియున్= తిరిగి, ఇంకా.

తాత్పర్యం: వ్యాసు డీ విధంగా చెప్పి ఇంకా (ఇట్లా అన్నాడు):

తే. అతిథి పితృదేవతా పూజ లాచరించి । కాని గృహమేధులకు భోజ్యమైనఁ గుడువఁ
దగదు; యజ్ఞశిష్టం బమృతంబు గాఁగ । నార్యజనములు సెప్పుదు రధిపవర్య! 326

ప్రతిపదార్థం: అధిపవర్య!= రాజోత్తమా! ధర్మరాజా!; అతిథి= విందుల (ఇంటికి వచ్చిన వాళ్ళు); పితృదేవతా= పితృదేవతల; పూజలు= అర్చనలు; ఆచరించి కాని= చేసికాని; గృహమేధులకున్= ఇంటి యజమానులకు; భోజ్యము+ఐనన్= తినదగినదైనా; కుడువన్= తినటం; తగదు= కూడదు; యజ్ఞవిశిష్టంబు= యజ్ఞంలో మిగిలినది (ప్రసాదం); అమృతంబు+కాఁగన్= అమృతమౌతుందని; ఆర్యజనులు= పెద్దలు; చెప్పుదురు= చెప్పుతారు.

తాత్పర్యం: 'ధర్మరాజా! గృహస్థాశ్రమ ధర్మాన్ని పాటించేవారు అతిథిపూజ, పితృదేవతాపూజ, దేవతాపూజ చేసికొని గాని తినదగిన దానినైనా తినరాదు. యజ్ఞంలో మిగిలినది (యజ్ఞప్రసాదం) అమృతమౌతుం దని పెద్దలు చెప్పుతారు.

క. ఆలును బిడ్డలు బంధులు । నై లీలఁ జరించుచును గృహస్థుఁడు దత్త
ల్లోలత్వరహిత చిత్తత । మేలుగ నలవఱుపవలయు మీఁ దెఱిఁగి నృపా!' 327

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; గృహస్థుఁడు= యజమాని; ఆలును= భార్య; బిడ్డలు= పిల్లలు; బంధులున్= చుట్టాలు; ఐ= అయి; లీలన్= క్రీడాప్రాయంగా; చరించుచును= ప్రవర్తిస్తూ; మీఁదు= తదుపరి రాబోయేది; ఎఱిఁగి= తెలిసికొని; తద్+తద్= ఆయా; లోలత్వరహిత= ఊగిసలాట లేని, స్థిరమైన; చిత్తత= మనసు కలిగించటాన్ని; మేలుగన్= బాగుగా; అలవఱుప వలయున్= అలవాటు చేయాలి, ప్రవర్తించాలి.

తాత్పర్యం: రాజా! గృహస్థుడు (గృహస్థాశ్రమ ధర్మం పాటించేవాడు) భార్య, పిల్లలు, చుట్టాలు అంటూ క్రీడాప్రాయంగా చరిస్తూనే, తరువాత రాబోయేది (పరం) గుర్తించి, ఆ బంధాలలో పూర్తిగా నిమగ్నం కాని మనస్సు కలిగి ఉండటాన్ని అలవాటు చేసికొనాలి (సాధన చేయాలి). ఇహంలో ఉంటూ అందులో మునిగిపోక పరం గుర్తించి సాధన చేయాలి'.

కృష్ణద్వైపాయనుఁడు ధర్మజునకు నపాత్రపురుషుల నెఱింగించుట (సం. 12-37-23)

వ. అని యిట్లు చెప్పి 'యపాత్రభూతపురుషుల నాకర్ణింపు'మని పలికి. 328

ప్రతిపదార్థం: అని= అంటూ; ఇట్లు= ఈ విధంగా; చెప్పి= పలికి; అపాత్రభూతపురుషులన్= దాన యోగ్యత లేని వారయిన మానవులను గూర్చి; ఆకర్ణింపుము= వినుము; అని పలికి= అని మాట్లాడి.

తాత్పర్యం: వ్యాసు డీ విధంగా చెప్పి 'దాన యోగ్యత లేని మానవులను గూర్చి చెప్పుతాను వినుము'. అని పలికి- (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. పాడియు నాడియు బ్రదుకు వారలఁ బరి । హాసకు దుర్జను నంగహీను
మత్తుని ప్రుచ్చు నున్మత్తు నపుంసకుఁ । జెనఁటి మాటలఁ దేల్చు మనుజుఁ గులము
చాలమి వేదంబు చదువమి నిజవృత్తి । హాని దుర్వృత్తి గలట్టి వాని
దానపాత్రంబులుగా నియ్యకొనరు పె । ద్దలు; దీనుఁడును విపద్బాధితుండు

తే. నీగి కర్హులు; దయపేర్మి నిచ్చుచోట । నైన నవగుణ మెక్కుడై కానఁబడిన
నిందితాత్ముల కిచ్చుట నిష్ఫలంబు; । పాత్ర నిశ్చయ మిట్టిది పౌరవేంద్ర! 329

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర= పురువంశోత్తమ!; పాడియున్= గానంచేసి; ఆడియున్= నృత్యంచేసి; బ్రదుకు= జీవించే; వారలన్= వారిని; పరిహాసకున్= విదూషకుడిని; దుర్జనున్= దుష్టుడిని; అంగహీనున్= అంగవైకల్యం కలవాడిని; మత్తునిన్= మదించిన వాడిని; ప్రుచ్చున్= దొంగను; ఉన్మత్తున్= పిచ్చివాడిని; నపుంసకున్= షండుడిని; చెనఁటి= కుత్సితపు; మాటలన్= మాటలతో; తేల్చు= తేలియాడునట్లు చేసే; మనుజున్= మానవుడిని; కులము= వంశం; చాలమి= చాలకపోవటం; (సద్వంశసంజాతుడు కాకపోవటం); వేదంబు చదువమి= వేదాధ్యయనం చేయకపోవటం; నిజవృత్తి= తనదైన ధర్మానికి; హాని= చేటు; దుస్+వృత్తి= చెడువర్తనం; కల+అట్టి= కలిగినటువంటి; వానిన్= వ్యక్తిని; పెద్దలు= ఆర్యులు; దానపాత్రంబులు+కాన్= దానం చేయటానికి అర్హులనుగా; ఇయ్యకొనరు= అంగీకరించరు; దీనుఁడును= శోచనీయమైన స్థితిలో ఉన్నవాడు; విపద్+బాధితుండును= ఆపదలచేత కష్టపడుతున్నవాడు; ఈగికిన్= దానానికి; అర్హులు= యోగ్యులు; దయపేర్మిన్= ఎక్కువకరుణతో; ఇచ్చు+చోటన్+ఐనన్= ఇచ్చేటటువంటి చోట అయినా; అవగుణము= దుర్గుణం; ఎక్కుడు+ఐ= అధికంగా; కానఁబడిన= కనబడిన; నిందిత+ఆత్ములకున్= దూష్యులకు; ఇచ్చుట= దానం చేయటం; నిష్ఫలంబు= వృథ; పాత్ర నిశ్చయము= యోగ్యతను నిర్ణయించటం; ఇట్టిది= ఇటువంటిది.

తాత్పర్యం: పురువంశశ్రేష్ఠుడవైన ధర్మరాజా! ఆటపాటలతో జీవనం సాగించే గాయకులు నటులు, విదూషకులు, దుష్టులు, అంగవికలులు, మదించినవారు, దొంగలు, పిచ్చివారు, నపుంసకులు, కుత్సితమైన మాటలతో మోసం చేసేవారు, కులహీన, విద్యావిహీనులై, కులవృత్తిని వదలి, చెడునడత కలిగినవారు - వీరినందరను పెద్దలు దానానికి అర్హులుగా అంగీకరించరు. దీనులు, ఆపదలలో కొట్టుమిట్టాడుతున్నవారు దానానికి అర్హులు. దయపెచ్చుపెరిగి ఇచ్చేప్పుడు కూడా దుర్గుణాలు ఎక్కువగా ఉన్న నిందార్హులకు దానం చేయటం నిష్ఫలం. దానపాత్రత నిర్ణయం ఇది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. శిల చేవమ్రాను దెప్పగ । జలనిధిఁ గడవ దొరకొనిన చాడ్పగుఁ బాత్రం
బులు గానియెడల దానం । బులఁ బాపము నిస్తరింప బుద్ధిఁ దలఁచినన్. 330

ప్రతిపదార్థం: పాత్రంబులు= అర్హులు; కాని= కానట్టి; ఎడలన్= తావుల; దానంబులన్= దానం చేయటం వలన; పాపము= దురితాన్ని; నిస్తరింపన్= దాటటానికి (పోగొట్టుకొనటానికి); బుద్ధిన్= మనసులో; తలఁచినన్= ఆలోచించినట్లయితే; శిల= రాయి; చేవమ్రానున్= బాగా ముదిరిన చెట్టు; తెప్పగన్= తెప్పకొయ్య (నదిని దాటటానికి ఉపయోగించే కొయ్య)గా చేసికొని; జలనిధిన్= సముద్రాన్ని; కడవన్= దాటటం; దొరకొనిన= పూనుకొన్న; చాడ్పు= తీరు; అగున్= అవుతుంది.

తాత్పర్యం: అనర్హులైన వారికి దానం చేసి దానివలన పాపం పోగొట్టుకోవాలనుకోవటం - రాతిని, ముదిరిన చెట్టుకొయ్యను తెప్పగా చేసికొని సముద్రం దాటాలనుకోవటం అవుతుంది.

విశేషం: అలం: ఉపమ.

ఆ. పునుకఁ గుక్కతిత్తిఁ బోసినపాలు నీ । ళ్ళధిక నిందఁ బొరయునట్లు దుష్ట
మై యపాత్ర విషయ మగు నీగి వృథవోవు । నిచ్చుచోటఁ బాత్ర మెఱుఁగవలయు. 331

ప్రతిపదార్థం: పునుకన్= కపాలం (పుర్రెలో); కుక్కతిత్తిన్= నికృష్టమైన తోలుసంచిలో; పోసిన= ఉంచిన; పాలు= క్షీరం; నీళ్ళు= జలం; అధికనిందన్= ఎక్కువ దోషాన్ని; పొరయున్+అట్లు= పొందే విధంగా; దుష్టము+ఐ= చెడ్డదై; అపాత్ర విషయము+అగు= అనర్హులైన వారికి ఇచ్చిన; ఈగి= దానం; వృథ+పోవున్= వ్యర్థం అవుతుంది; ఇచ్చుచోటన్= దానం చేసే తావున; పాత్రము= అర్హతను; ఎఱుఁగన్+వలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: కపాలంలోనూ, నికృష్టమైన (కుక్క) తోలుసంచిలోనూ పోసిన పాలు, నీళ్ళు దోషభూయిష్ఠం అయినట్లే, చెడ్డదైన అపాత్రదానం నిష్ఫలం. కనుక దానం చేసేటప్పుడు పాత్రతను తెలిసికొనాలి.

తే. షండునకు బిడ్డ నిచ్చిన చందమొందు, । బూదిలో నేయి వేల్చుటఁ బోలు, నోటి
కడవ నీళ్ళులు వెట్టిన కరణియగు న । పాత్రజనులకుఁ బెట్టుట పౌరవేంద్ర! 332

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర!= పురువంశోత్తమా! ధర్మరాజా!; అపాత్రజనులకున్= అనర్హులైనవారికి; పెట్టుట= ఇవ్వటం (దానం చేయటం); షండునకున్= నపుంసకుడికి; బిడ్డను= పిల్లను; ఇచ్చిన= ఒసగిన; చందము= తీరు; ఒందున్= అవుతుంది; బూదిలోన్= బూడిదలో; నేయి= ఆజ్యం; వేల్చుటన్= హోమం చేయటాన్ని; పోలున్= పోలుతుంది; ఓటికడవన్= ఓటికుండలో; నీళ్ళులు= నీళ్ళు; పెట్టిన= ఉంచిన; కరణి= తీరు; అగున్= అవుతుంది.

తాత్పర్యం: పురువంశోత్తమా! ధర్మరాజా! అయోగ్యులకు దానం చేయటం అనేది నపుంసకుడికి కన్య నిచ్చినట్లు, బూడిదలో నేతిని హోమం చేసినట్లు, ఓటికుండలో నీళ్ళు పోసినట్లు నిష్ఫలం అవుతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. దానవిధి యరయ నసమీ । చీనంబగునేని కీడు సేయుం గురుధా
త్రీనాథ! మఱియుఁ బాత్రం । బైనను గొన్నతని కిచ్చునతనికి నెట్లున్. 333

ప్రతిపదార్థం: కురుధాత్రీనాథ!= కురురాజా!; అరయన్= పరికించి చూడగా; దానవిధి= దానపద్ధతి; అసమీచీనంబు= తగినది కానిది; అగును+ఏని= అయినట్లయితే; కీడు= హాని; చేయున్= చేస్తుంది; మఱియున్= ఇంకా; పాత్రంబు+ఐనను= తగినది

అయితే; కొన్న+అతనికిన్= దానం స్వీకరించినవాడికి; ఇచ్చు+అతనికిన్= ఇచ్చినవాడికి; ఎట్లున్= ఏ విధమో; (అదే విధమైన మేలు జరుగుతుందని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! దాన పద్ధతి తగినది కాకపోతే కీడు కలిగిస్తుంది. అదే తగినదైతే దానం చేసిన వ్యక్తివలె పుచ్చుకొన్న వ్యక్తికి కూడ అవుతుంది. అంటే మేలు జరుగుతుంది.

క. కావున విను పాత్రము మే । లై విహితాచరణ సౌమ్యమగు దానము ధా
త్రీవర! దాత్రాదాతల । దా వెలయించు భువనద్వితయరంజకతన్.' 334

ప్రతిపదార్థం: ధాత్రీవర!= రాజా!; విను= ఆలకించుము; కావునన్= అందువలన; పాత్రము= యోగ్యత; మేలు+ఐ= శ్రేష్ఠమై; విహిత= విధ్యుక్తంగా; ఆచరణ= చేయబడింది; సౌమ్యము= తిన్ననిది; అగు= అయిన; దానము= ఈవి; దాత్రాదాతలన్= దానం పుచ్చుకున్న వారిని, ఇచ్చినవారిని; తాన్= తాను; భువనద్వితయ= రెండులోకాలలోనూ (ఇహపరాల్లో); రంజకతన్= సంతోషాన్ని; వెలయించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. యోగ్యమై చక్కగా విధ్యుక్తంగా చేసిన దానం పుచ్చుకొన్నవాడికి ఇచ్చినవాడికి ఇరువురికీ ఇహపరాలలో సంతోషాన్ని కలిగిస్తుంది.'

వ. అని చెప్పి 'యేను నీకు బుద్ధులు సెప్పంజొచ్చి సంక్షేపరూపంబునం గీడు మే లెఱింగించితి; నిప్పలుకులు పాటిగాఁ గొని విహితానుష్ఠానపరుండ వగు' మనుటయు, నమ్మనుజపతి యమ్మునిపతితో 'మహాత్మా! భవదనుగృహీతంబు లైన యివ్వాక్యంబులు హర్షంబు నావహించె; నెప్పాట ధర్మంబగు మార్గం బవలంబించి రాజ్యతంత్రంబు నడపి, యశుభంబునం దొడరక జయింతు; నట్టి తెఱంగు గలుగం గృపసేసి రాజధర్మంబులుం దక్కునుం గలుగు వర్ణాశ్రమ ధర్మంబులు నాపద్ధర్మంబులును లోనుగా నెఱుంగం దగు ధర్మంబులెల్ల నెఱింగింపవే! నాకుం జూడ రాజ్యంబును ధర్మచర్యయును బరస్పర విరుద్ధంబు లయినట్లున్నవి గావున నివ్విధంబున విన్నవింప వలసె'నని చెప్పుటయు, నత్తాపసోత్తముండు ప్రీతచిత్తుండై యతండు విన నారదుతోడ 'నీ భూపతి భీష్ము పాలికిం బోవలయు; నయ్యార్యవర్యు చేత సకల ధర్మంబులు వినువాఁ డగుట యర్థప్రకారం' బనవుడు నారదుం 'డిది లెస్స'యని వలికిన నప్పరాశరపుత్రుం డయ్యజాతశత్రున కిట్లనియె. 335

ప్రతిపదార్థం: అని= అంటూ; చెప్పి= పలికి; ఏను= నేను; నీకున్; బుద్ధులు= జ్ఞానబోధ; చెప్పన్= చెప్పటం; చొచ్చి= మొదలుపెట్టి; సంక్షేపరూపంబునన్= క్లుప్తంగా; కీడు= హాని; మేలు= మంచి; ఎఱింగించితిని= తెలియచెప్పాను; ఈ+పలుకులు= ఈ మాటలు; పాటి+కాన్= ప్రమాణంగా; కొని= గ్రహించి; విహిత= విధ్యుక్తమైన; అనుష్ఠాన పరుండవు+అగుము= నియమాలను ఆచరించేవాడివి కమ్ము; అనుటయున్= అనగా; ఆ+మనుజపతి= ఆరాజు (ధర్మరాజు); ఆ+మునిపతితోన్= ఆ వ్యాసుడితో; మహా+ఆత్మా!= మహానుభావా!; భవత్+అనుగృహీతంబులు+ఐన= నీవు దయ చేసినటువంటి; ఈ+వాక్యంబులు= ఈ మాటలు; హర్షంబును= సంతోషాన్ని; ఆవహించెన్= కలిగించాయి; ఏ+పాటన్= ఏ విధంగా; ధర్మంబు+అగు= వేదోక్తమైన ధర్మరూపంగల; మార్గంబు= పద్ధతి; అవలంబించి= పాటించి; రాజ్యతంత్రంబు= రాజ్యపాలనా వ్యవహారం; నడపి= నిర్వర్తించి; అశుభంబునున్= అమంగళం; తొడరక= కలగక; జయింతున్= నెగ్గుతాను; అట్టి= అటువంటి; తెఱంగు= పద్ధతి; కలుగన్= ఉండేటట్లు; కృప+చేసి= అనుగ్రహించి; రాజధర్మంబులున్= రాజులు ఆచరించవలసిన విధులు; తక్కునుం+కలుగు= మిగిలిన; వర్ణ+ఆశ్రమ ధర్మంబులు= చాతుర్వర్ణ్య చతురాశ్రమ ధర్మాలు; ఆపద్+ధర్మంబులును= ఆపదలలో చేయదగిన విధులు; లోనుగాన్= మొదలైన; ఎఱుంగన్+తగు= తెలిసికొనదగిన; ధర్మంబులు+ఎల్లన్= ధర్మాలు అన్నీ; ఎఱింగింపుము+ఏ?= తెలియచెప్పవా? (చెప్పవలసినదని భావం); నాకున్= నాకు; చూడన్= చూడగా; రాజ్యంబును= రాజ్యపరిపాలనను; ధర్మచర్యయును= ధర్మాచరణం; పరస్పర= ఒకదాని కొకటి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విరుద్ధంబులు= వ్యతిరేకాలు; అయిన+అట్లు= అయిన విధంగా; ఉన్నవి= ఉన్నాయి; కావునన్= కనుక; ఈ+విధంబునన్= ఈ తీరులో; విన్నవింప= వేడుకొన; వలసెన్= వలసి వచ్చింది; అని= అంటూ; చెప్పుటయున్= చెప్పగా; ఆ+తాపస+ఉత్తముండు= ఆ తపస్వులలో శ్రేష్ఠుడైన వ్యాసుడు; ప్రీతచిత్తుండు+ఐ= సంతసించిన మనసు కలవాడై; అతండు= ఆ ధర్మరాజు; వినన్= వింటూ ఉండగా; నారదుతోడన్= నారద మహర్షితో; ఈ భూపతి= ఈ రాజు; భీష్మపాలికిన్= భీష్ముడి వద్దకు; పోవలయున్= వెళ్ళవలసి ఉన్నది; ఆ+ఆర్యవర్యుచేతన్= ఆ పూజనీయులలో శ్రేష్ఠుడైన భీష్ముడిచేత; సకల ధర్మంబులు= సమస్తమైన విధులు; వినువాఁడు= ఆలకించినవాడు; అగుట= అవటం; అర్హ= తగిన; ప్రకారంబు= పద్ధతి; అనవుడున్= అనగానే; నారదుండు; ఇది= ఈ మాట; లెస్స= మంచిది; అని+పలికినన్= అని అనగానే; ఆ+పరాశర పుత్రుండు= ఆ పరాశరుడి కుమారుడైన వ్యాసుడు; ఆ+అజాతశత్రునకున్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అంటూ చెప్పి, 'నేను నీకు జ్ఞానబోధ చేయటం మొదలుపెట్టి క్లుప్తంగా మంచిచెడులు తెలియపరిచాను. నేను చెప్పిన ఈ మాటలు ప్రమాణంగా గ్రహించి విధ్యుక్తధర్మాలను ఆచరించటంలో నిమగ్నుడవు కమ్మ' అనగా, ధర్మరాజు వ్యాసుడితో ఇట్లా అన్నాడు: 'మహానుభావా! నీవు దయచేసిన ఈ మాటలు సంతోషాన్ని కలిగించాయి. ఏ విధంగా ధర్మమార్గాన్ని ఆధారం చేసికొని రాజ్యపాలనావ్యవహారాన్ని నిర్వర్తించి అమంగళం (పాపం) కలుగకుండా నెగ్గగలనో ఆ పద్ధతి దయతో తెలియజెప్పి, రాజులు ఆచరించవలసిన విధులు, మిగిలిన వర్ణ, ఆశ్రమధర్మాలు, ఆపదలలో పాటించవలసిన ధర్మాలు, మొదలైన తెలిసికొనదగిన ధర్మా లనన్నింటిని తెలియపరచాలి. నాకు రాజ్యపాలన, ధర్మాచరణ ఒకదానికొకటి వ్యతిరేకమైనవిగా కనపడుతున్నాయి. కనుక ఈ విధంగా ప్రార్థించవలసి వచ్చింది' అనటంతో ఆ తపోధనుడు మనసులో సంతసించి ధర్మరాజు వింటూ ఉండగా నారదుడితో 'ఈ రాజు (ధర్మరాజు) భీష్ముడి దగ్గరకు వెళ్ళవలసి ఉన్నది. ఆ పూజనీయుడినుండి సమస్తధర్మాలు వినటం తగిన పద్ధతి' అన్నాడు. నారదుడు 'అదే మంచిది' అని అనగా వ్యాసుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

ఆ. కురుపితామహుండు గురుబుద్ధి నింద్రాదు । లకును మాననీయుఁ డకుటిలాత్మ
కుండు పరశురాము కోదండవిద్యాది । సుగుణములకు నెల్లఁ జొచ్చినిల్లు. 336

ప్రతిపదార్థం: కురుపితామహుండు= కురువంశంలోని వారి కందరకు పెద్ద అయిన భీష్ముడు; గురు= గొప్ప, ఘనమైన; బుద్ధిన్= మతిలో, తెలివిలో; ఇంద్ర+ఆదులకును= ఇంద్రుడు మొదలైన వారికి కూడ; మాననీయుఁడు= గౌరవించదగినవాడు; అకుటిల+ఆత్మకుండు= కుత్సితంలేని మనస్సు కలవాడు; పరశురాము= భార్గవరాముని యొక్క; కోదండ విద్య= విలువిద్య; ఆది= మొదలైన; సుగుణములకున్= మంచి లక్షణాలకు; ఎల్లన్= అన్నింటికి; చొచ్చిన+ఇల్లు= మెట్టినిల్లు.

తాత్పర్యం: 'కురువంశంలోని వారందరికి పెద్దదిక్కు అయిన భీష్ముడు తన గొప్ప మేధవలన ఇంద్రుడు మొదలైన వారికి కూడా పూజనీయుడు. నిర్మలమైన మనస్సుకలవాడు. పరశురాముడి విలువిద్య మొదలైన సద్గుణాలకన్నిటికీ నిలయమైనవాడు. (పరశురాముడి విద్యలు, సద్గుణాలు శిష్యుడైన భీష్ముడి వద్ద స్థిరనివాసం చేశాయి.)

క. సురతటినీ పుణ్యతమో । దరమున జన్మించినాఁ డుదాత్తవ్రతత
త్పరుఁ డతని కెల్ల ధర్మముఁ । గరస్థలామలక సన్నికాశం బధిపా! 337

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; సురతటినీ= సురగంగ; పుణ్యతమ= మిక్కిలి పుణ్యప్రదమైన; ఉదరమునన్= గర్భాన; జన్మించినాఁడు= పుట్టాడు; ఉదాత్త= గొప్ప; వ్రతతత్పరుఁడు= నియమాచరణంలో నిష్ఠకలవాడు; అతనికిన్= ఆ భీష్ముడికి; ఎల్లధర్మమున్= ధర్మశాస్త్రమంతా; కరస్థల= అరచేతియందుంచబడ్డ; ఆమలక= ఉసిరికతో; సన్నికాశంబు= సమానం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మరాజా! మిక్కిలి పుణ్యవంతమైన సురగంగాగర్భానపుట్టాడు. గొప్పదైన నియమాన్ని నిష్ఠగా ఆచరిస్తున్నవాడు. ఆ భీష్ముడికి ధర్మాలన్నీ కరతలామలకం వంటివి.

క. చ్యవనుఁడు మార్కండేయుం । డు వసిష్ఠుఁడు లోనుఁగా బటు ప్రాజ్ఞులు గా
రవమున వినిపింపఁగఁ దెలి । య వినియె ధర్మప్రపంచ మతఁ డఖిలంబున్. 338

ప్రతిపదార్థం: అతఁడు= ఆ భీష్ముడు; చ్యవనుఁడు; మార్కండేయుండు; వసిష్ఠుఁడు; లోనుగాన్= మొదలైన; పటు= గట్టి; గొప్ప; ప్రాజ్ఞులు= తెలిసినవారు; గారవమునన్= ఆదరంతో; వినిపింపఁగన్= చెప్పగా; తెలియన్= బాగా బోధపడేటట్లుగా; ధర్మప్రపంచము= ధర్మం యొక్క విస్తృతిని; అఖిలమున్= అంతటినీ; వినియెన్= గ్రహించాడు.

తాత్పర్యం: చ్యవనుడు, మార్కండేయుడు, వసిష్ఠుడు మొదలైన గొప్ప పండితులు ఆదరంతో బాగా బోధచేయగా ఆ భీష్ముడు ధర్మంయొక్క సమగ్రస్వరూపాన్ని తెలిసికొన్నాడు.

తే. శాంతమానసుఁడైన యా శాంతనవుఁడు । విస్మయావహ చరితుండు; వినుము వలసి
నపుడు విడుచుటకై ప్రాణ మాఁగినాఁడు । గాదె! యొరు లంతవా రెందుఁ గలరె నరులు. 339

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! వినుము; శాంతమానసుఁడు+ఐన= రాగద్వేషాదులు లేని ప్రశాంతమైన మనస్సు; కలవాడైన; శాంతనవుఁడు= శంతనుడి కుమారుడు భీష్ముడు; విస్మయ+ఆవహ= ఆశ్చర్యం కలిగించే; చరితుండు= చరిత్ర కలవాడు; వలసిన+అపుడు= ఇష్టమైన (తగిన) సమయంలో; విడుచుటకున్+ఐ= వదలటంకొరకు; ప్రాణము= శరీరంలో జీవాన్ని; ఆఁగినాఁడు= నిలిపాడు; కాదు+ఎ!= కదా!; నరులు= మానవులు; ఒరులు= ఇతరులు; అంతవారు= అంతటి వారు; ఎందున్= ఎక్కడైనా; కలరు+ఎ?= ఉన్నారా? (లేరని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. ప్రశాంత చిత్తం కలవాడైన భీష్ముడి చరిత్ర ఆశ్చర్యం కలిగిస్తుంది. తగిన సమయంలో వదలటానికి ప్రాణాలు నిలిపి ఉన్నాడు. ఎక్కడైనా ఇతర మానవులు అంతటి వారున్నారా? (లేరు కదా అని భావం).

చ. అతనికి నీ పయిం గరుణ యగ్గలు; మట్లగుటం గురుక్షమా
పతివర! పొమ్ము నీ వతనిపాలికి; నాతఁడు నిన్ను సంప్రబో
ధితుఁడుగఁ జేయు ధర్మములు దేటపడంగ నుపన్యసించు; మా
మత మిది; దీనఁ గీర్తియు సమంచిత ధర్మముఁ బెంపు నొందెడున్. 340

ప్రతిపదార్థం: కురుక్షమాపతి వర!= కురువంశరాజులలో ఉత్తముడవైన ధర్మరాజా!; అతనికిన్= అట్టి భీష్ముడికి; నీపయిన్= నీమీద; కరుణ= దయ; అగ్గలము= అధికం; అట్లు= ఆ విధంగా; అగుటన్= కావటం వలన; నీవు; అతనిపాలికిన్= ఆ భీష్ముడి వద్దకు; పొమ్ము= వెళ్ళుము; ఆతఁడు= ఆ భీష్ముడు; నిన్ను; సం+ప్రబోధితుడుగన్= బాగా బోధపడినవాడినిగా (తెలిసినవాడిగా); చేయున్= చేస్తాడు; ధర్మములు= విధులు; తేటపడంగన్= స్పష్టమయ్యేటట్లుగా; ఉపన్యసించున్= వివరిస్తాడు; ఇది; మా మతము= మా అభిప్రాయం; దీనన్= ఈ పనివలన; కీర్తియున్= యశం; సమంచిత= చక్కని; ధర్మమున్= వేదచోదిత ధర్మం కూడా; పెంపున్= వృద్ధిని; ఒందెడున్= పొందుతుంది.

తాత్పర్యం: కురువంశ శ్రేష్ఠుడవైన ధర్మరాజా! అట్టి జ్ఞానవంతుడైన భీష్ముడికి నీమీద దయ చాల ఎక్కువ. కనుక నీ వతడి వద్దకు వెళ్ళుము. అతడు నీకు బాగా జ్ఞానప్రబోధ చేసి, ధర్మాలు మరింత తేలికగా అర్థమయ్యే

విధంగా వివరిస్తాడు. ఇది మా అభిప్రాయం. ఈ పనివలన నీకు మంచి కీర్తి, చక్కని వేదచోదితధర్మం వృద్ధి పొందుతాయి.

వ. అయ్యుత్తమోత్తమునకు నూర్ధ్వలోక గమనంబునకు సమయం బాసన్నంబగుచు వచ్చెం; దడయ కట్లు సేయు' మనిన విని యవ్వసుమతీపతి 'మునీంద్రా! బహుబంధు వధపాతకం బాచరించి యమ్మాననీయాత్ము నెదిరి కెట్లు వోదు? నట్లుం గాక యకృత్రిమ సమరశీలియగు నగ్గుణశాలిం గృత్రిమ సమరంబునం గూల్చి, క్రమ్మఱ నమ్మహాత్ము మొగంబు సూచి, నాకు ధర్మంబు లుపదేశింపవే యని యడుగ నేర్తునే?' యనుటయు నజ్జననాథునకు జనార్దనుం డిట్లనియె. 341

ప్రతిపదార్థం: ఆ+ఉత్తమ+ఉత్తమునకున్= ఆ శ్రేష్ఠాతిశ్రేష్ఠుడికి; ఊర్ధ్వలోక= పైలోకాలకు; గమనంబునకున్= వెళ్ళటానికి; సమయంబు= కాలం; ఆసన్నంబు+అగుచున్= దగ్గరవుతూ; వచ్చెన్= వచ్చింది; తడయక= ఆలసించక; అట్లు= మేము చెప్పినట్లు; చేయుము; అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+వసుమతీ+పతి= భూభర్త, ధర్మరాజు; ముని+ఇంద్రా!= మునివర్యా!; బహు= అనేక; బంధు= చుట్టాలను; వధ= చంపటం అనే; పాతకంబు= పాపం; ఆచరించి= చేసి; ఆ+మాననీయ+ఆత్ము= ఆ మహాత్ముడి; ఎదిరికిన్= ఎదుటికి; ఎట్లు= ఏ విధంగా; పోదున్?= వెళ్ళగలను?; అట్లున్+కాక= అంతేకాక; అకృత్రిమ= అసహజంకాని; సమరశీలి అగు= యుద్ధం చేసే స్వభావం కలవాడైన; ఆ+గుణశాలిన్= ఆ గుణవంతుడిని; కృత్రిమము+ఐన= అసహజమైన; సమరంబునన్= యుద్ధంలో; కూల్చి= పడగొట్టి; క్రమ్మఱన్= తిరిగి; ఆ+మహాత్ము= ఆ మహానుభావుడి; మొగంబు= ముఖం; చూచి= ఆలోకించి; నాకున్; ధర్మంబులు= ధర్మపద్ధతులు; ఉపదేశింపవు+ఏ?= బోధ చేయవా?; అని= అంటూ; అడుగన్= అడగటానికి; నేర్తును+ఏ?= సమర్థుడనవుతానా?; అనుటయున్= అనగా; ఆ+జననాథునకున్= ఆ రాజునకు; జనార్దనుండు= శ్రీ కృష్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ శ్రేష్ఠుడైన భీష్ముడు పై లోకాలకు వెళ్ళే సమయం సమీపిస్తున్నది. ఆలసించక మేము చెప్పినట్లు చేయుము' అని వ్యాసు డనగా విని ధర్మరాజు 'మునివరా! ఎంతోమంది బంధువులను వధించటం అనే మహా పాపాన్ని చేసి ఆ మహాత్ముడి ఎదుటికి ఎట్లా వెళ్ళగలను? అంతేకాదు. న్యాయంగా యుద్ధం చేసే స్వభావం కలిగిన ఆ సద్గుణరాశిని అధర్మయుద్ధంలో పడగొట్టి, తిరిగి ఆ ధర్మాత్ముడి మొగం చూచి, నాకు ధర్మోపదేశం చేయుమని ఏ విధంగా అడుగగలను?' అన్నాడు. అప్పుడు ధర్మరాజుతో కృష్ణు డిట్లా అన్నాడు:

తే. 'ఇంత నిర్బంధ మేటికి 'నిమ్మునీంద్రు । పనుపు సేయుదు గాక! యిప్పాట నెల్ల
పెనుపులకుఁ బాత్రమయ్యెదు; వనటతోడ । నెద్దియును నేల? పురమున కేఁగు మిపుడు. 342

ప్రతిపదార్థం: ఇంత= ఇంతటి; నిర్బంధము= తప్పనిసరి; ఏటికిన్?= ఎందుకు?; ఈ+ముని+ఇంద్రు= ఈ మునివరుడైన వ్యాసుడి; పనుపు= ఆజ్ఞ; చేయుదు+కాక!= చేస్తావు సుమా!; ఈ పాటన్= పద్ధతితో; ఎల్ల= అన్ని; పెనుపులకున్= వృద్ధులకు, అభ్యుదయాలకు; పాత్రము= అర్హుడవు; అయ్యెదు= అవుతావు; వనటతోడన్= శోకంతో; ఎద్దియున్= ఏది అయినా; ఏల?= ఎందుకు?; ఇపుడు= ఇప్పుడు; పురమునకున్= నగరానికి; ఏఁగుము= వెళ్ళుము.

తాత్పర్యం: 'ఇంత తప్పనిసరి అనటం ఎందుకు? వ్యాసుడు ఆనతిచ్చినది నీవు చేస్తావు సుమా! ఈ పనివలన నీవన్నివిధాలా వృద్ధిలోకి రావటానికి అర్హత కలవాడివి అవుతావు. ఏదయినా శోకంతో చేయటం ఎందుకు? ఇప్పుడు నగరానికి వెళ్ళుము.

వ. మరల గాంగేయు కడకు వత్త; మదిమేలు, లె' మ్మని పలికి వెండియు. 343

ప్రతిపదార్థం: మరలన్= తిరిగి; గాంగేయు= గంగాపుత్రుడైన భీష్ముడి; కడకున్= వద్దకు; వత్తము= వద్దాము; అది= ఆ పని; మేలు= మంచిది; లెమ్ము= బయలుదేరుము; అని= అంటూ; పలికి= చెప్పి; వెండియున్= తిరిగి; ఇంకా.

తాత్పర్యం: భీష్ముడివద్దకు మరొకమారు వద్దాము. అదే మంచిది. లెమ్ము' (నగరానికి వెళ్ళటానికి) అని చెప్పి శ్రీకృష్ణుడు ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ' తమ్ములును విప్రవరులును ధరణిఁ గల్గు । బహువిధంబుల ప్రజలును బార్థివేంద్ర
చాతకప్రకరములు పర్జన్యుఁ గోరు । నట్లు నినుఁ గోరుదురు కృప నాదరింపు. 344

ప్రతిపదార్థం: పార్థివ+ఇంద్ర!= రాజోత్తమా! ధర్మరాజా!; తమ్ములును= సోదరులు; విప్రవరులును= బ్రాహ్మణశ్రేష్ఠులు; ధరణిన్= భూమిపై; కల్గు= ఉన్న; బహువిధంబుల= అనేకములైన (వివిధ వర్ణాలకు, జాతులకు చెందిన); ప్రజలును= మానవులు; చాతక= వానకోయిల; ప్రకరములు= గుంపులు; పర్జన్యున్= మేఘుడిని; కోరు+అట్లు= కోరే విధంగా; నినున్= నిన్ను; కోరుదురు= కావాలనుకొంటారు; కృపన్= దయతో; ఆదరింపు(ము)= కాపాడుము (చేరదీయుము).

తాత్పర్యం: 'ధర్మరాజా! నీ తమ్ములు, బ్రాహ్మణోత్తములు, ఇంకా భూమిపై ఉన్న నానావిధ జాతివర్ణాలకు చెందిన జనులు వానకోయిలలు మేఘంకొరకు ఎదురు చూచే విధంగా, నిన్నే కావాలనుకొంటున్నారు. వారిని దయతో ఆదరించుము.

విశేషం: అలం: ఉపమ.

వ. ఈ సర్వజనంబుల మనోరథంబును సఫలంబులు సేయు' మని ప్రార్థించె; నివ్విధంబునం గృష్ణద్వైపాయన నారద దేవల దేవస్థాను కృష్ణులు లోనుగాఁ బెక్కండ్రు పెక్కుదెఱంగులఁ జెప్పిన వాక్యంబులఁ జిత్తంబు కలంకదేఱి, కౌంతేయాగ్రజుండు రాజ్యభార నిర్వహణోత్సాహం బంకురింప, శిశిరాపగమ సమయ కమలంబు ననుకరించు నాననంబుతో నప్పారాశర్య ప్రముఖ మునివరులకుం బ్రదక్షిణంబును దండప్రణామంబును నాచరించి, వారల వలన వసుమతీ వహనానుజ్ఞయు వివిధాశీర్వాదంబులుం బడసి వెలింగె; వారును నిజస్థానంబులకుం జనిరి; తదనంతరంబ. 345

ప్రతిపదార్థం: ఈ సర్వజనంబుల= ఇప్పుడు చెప్పిన అందరు జనుల; మనోరథంబును= కోరికను; సఫలంబు= ఫలవంతం; చేయుము; అని= అంటూ (శ్రీకృష్ణుడు); ప్రార్థించెన్= వేడుకొన్నాడు; ఈ విధంబునన్= ఈ తీరుగా; కృష్ణద్వైపాయన= వ్యాసుడు; నారద; దేవల; దేవస్థాను; కృష్ణులు; లోనుగాన్= మొదలైన; పెక్కండ్రు= అనేకులు; పెక్కు= బహు; తెఱంగులన్= భంగుల; చెప్పిన= బోధించిన; వాక్యంబులన్= మాటలతో; చిత్తంబు= మనస్సు; కలంక= కలత (బాధ); తేఱి= తేరుకొని; కౌంతేయ+అగ్రజుండు= కుంతీపుత్రులలో పెద్దవాడైన ధర్మరాజు; రాజ్యభార= రాజ్యపరిపాలన అనే బాధ్యతను; నిర్వహణ= మోయాలనే; ఉత్సాహంబు= ఆసక్తి; అంకురింపన్= మొలకెత్తగా; శిశిర= శిశిర ఋతువు యొక్క; అపగమ= వెనుదిరిగే; సమయ= కాలంలోని; కమలంబు= పద్మాన్ని; అనుకరించు= పోలిఉన్న; ఆననంబుతోన్= ముఖంతో; ఆ+పారాశర్య ప్రముఖ= వ్యాసుడు మొదలైన; మునివరులకున్= ఋషి శ్రేష్ఠులకు; ప్రదక్షిణంబు= వలగొనుట; దండప్రణామంబును= సాష్టాంగ దండ ప్రణామం (సాగిలి మొక్కటం); చేసి= ఆచరించి; వారలవలనన్= ఆ మునులనుండి; వసుమతీ వహన= భూభార నిర్వహణానికి; అనుజ్ఞయున్= అనుమతిని; వివిధ= అనేక; ఆశీర్వాదంబులున్= ఆశీస్సులును; పడసి= పొంది; వెలింగెన్= ప్రకాశించాడు; వారును= ఆ మునులును; నిజ= తమ; స్థానంబులకున్= తావులకు; చనిరి= వెళ్ళారు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: నిన్ను కోరే అందరు జనుల కోరికను తీర్చుము' అని శ్రీకృష్ణుడు ధర్మరాజును వేడుకొన్నాడు. ఈ విధంగా వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థాణుడు, కృష్ణుడు మొదలైన అనేకులు అనేకవిధాలుగా బోధించగా ఆ మాటతో మనస్సులో కలతపాటుపోయి, ధర్మరాజుకు రాజ్యపాలన చేయాలనే ఆసక్తి మొలకెత్తింది. శిశిర ఋతువు వెళ్ళిపోయి వసంత ఋతువు ప్రవేశించిన కాలంలో ఉన్న పద్మంవలె వికసించిన ముఖం కలవాడై, వ్యాసుడు మొదలైన మునులకు ప్రదక్షిణలు, సాష్టాంగ దండప్రణామాలు చేసి, వారినుండి భూభారనిర్వహణానికి అనుమతిని, అనేక ఆశీస్సులను పొంది రాణించాడు. ఆ మునులు మొదలైనవారంతా తమ తమ స్థానాలకు వెళ్ళిపోయారు. ఆ తరువాత.

విశేషం: అలం: ఉపమ.

సీ. **దేవభూదేవ పూజావిశేషము లాచరించి । యక్కురుకులశ్రేష్ఠుఁ డుర్వి**
నెడనెడ బ్రుంగుడువడి యున్నరాజులు । సనుదెంచి కను నవసరము వేచి
యునికి కృష్ణునిచేత విని పూసి తొడి కట్టి । కొలువిచ్చి, మణిహేమకుంజరాశ్వ
కాంతాదులగు తగుకానికల్ గైకొని, । యాన్నృపాలురకుఁ బ్రియం బొనర్చి,

తే. **యమ్ముకుందుండు వారును దమ్ముగమియుఁ । దక్కుఁగల బంధుమిత్త్రులు ధౌమ్య ముఖ్య**
సూరిజనములు బలయంగఁ దారకముల । మధ్యమున చొప్పుచంద్రుని మాడ్కిఁ బొలిచె. **346**

ప్రతిపదార్థం: ఆ+కురుకులశ్రేష్ఠుఁడు= ఆ కురువంశోత్తముడు; దేవ= దేవతలకు; భూదేవ= బ్రాహ్మణులకు; పూజావిశేషంబులు= ప్రత్యేక పూజలు మొదలైనవి; ఆచరించి= చేసి; ఎడన్+ఎడన్= అక్కడక్కడా; బ్రుంగుడు+పడి= దాగుకొని (యుద్ధానికి రాక); ఉన్న= ఉన్నటువంటి; రాజులు; చనుదెంచి= వచ్చి; కను+అవసరము= దర్శించటానికి తగిన సమయం కొరకు; వేచి+ఉనికి= ఎదురుచూస్తూ ఉండటం; కృష్ణునిచేతన్= కృష్ణుడు చెప్పగా; విని= ఆలకించి; పూసి= చందనాదులు అలదికొని; తొడి= అలంకరించుకొని; కట్టి= వస్త్రధారణచేసి; కొలువు+ఇచ్చి= తన ఆస్థానంలో స్థానమిచ్చి; మణి= మణులు; హేమ= బంగారం; కుంజర= ఏనుగులు; అశ్వ= గుర్రాలు; కాంతా= స్త్రీలు; ఆదులు+అగు= మొదలైన; తగు= యోగ్యమైన; కానికల్= ఉపహారాలు; కైకొని= స్వీకరించి; ఆ నృపాలురకున్= ఆ రాజులకు; ప్రియంబు= ఇష్టాన్ని; ఒనర్చి= కలిగించి; ఆ+ముకుందుండు= ఆ శ్రీకృష్ణుడు; వారును= ఆ రాజులు; తమ్ముగమియున్= సోదరబృందం; తక్కుఁగల= మిగిలిన; బంధు= చుట్టాలు; మిత్త్రులు= స్నేహితులు; ధౌమ్యముఖ్య= ధౌమ్యుడు మొదలైన; సూరిజనములు= పండితులు; బలయంగన్= పరివేష్టించి ఉండగా; తారకముల= నక్షత్రాల; మధ్యమునన్= మధ్యలో; ఒప్పు= అందగించే; చంద్రుని= చంద్రుడి; మాడ్కిన్= వలె; పొలిచెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: ఆ కురుకులోత్తముడైన ధర్మరాజు దేవబ్రాహ్మణ పూజలు విశేషంగా చేసి, అక్కడక్కడా దాగుకొని ఉన్న (యుద్ధంలో పాల్గొనక తప్పించుకొన్న) రాజులు వచ్చి దర్శించటానికి తగిన సమయంకొరకు కాచుకొని ఉన్నారని శ్రీకృష్ణుడు చెప్పగా విని, సంభ్రమంగా మైపూతలు, వస్త్రాలు ధరించి, వారికి ఆస్థానంలో తా విచ్చి, వా రిచ్చిన మణులు, బంగారం, ఏనుగులు, గుర్రాలు, స్త్రీలు మొదలైన యోగ్యమైన కానుకలను స్వీకరించి, ఆ రాజులకు సంతోషాన్ని కలిగించి, ఆ సామంతరాజులు, తమ్ముల బృందం, మిగిలిన బంధువులు, స్నేహితులు, ధౌమ్యుడు మొదలైన పండితులు తనను పరివేష్టించి ఉండగా చుక్కలమధ్య చంద్రుడివలె ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. **మఱునాఁడు కల్యంబునం గాలోచితకృత్యంబు లాచరించి ధవళానులేపన మాల్యవస్త్రాభరణంబుల నలంకృతుండై.** **347**

ప్రతిపదార్థం: మఱునాఁడు= మరుసటిరోజు; కల్యంబునన్= వేకువనే; కాల+ఉచిత= సమయానికి తగిన; కృత్యంబులు= పనులు; ఆచరించి= చేసి; ధవళ= తెల్లని; మాల్య= పూలదండలు; వస్త్ర= వస్త్రములు; ఆభరణంబులన్= నగలతోను; అలంకృతుఁడు+ఐ= అలంకరించబడినవాడై.

తాత్పర్యం: మరుసటిరోజు వేకువనే సమయోచితమైన పనులు (కాలకృత్యాదులు) నిర్వర్తించి, తెల్లని పూలదండలు, వస్త్రాలు, నగలు అలంకరించుకొని (తరువాతి పద్యంతో అన్వయం).

క. **నవమగు రథమున షోడశ । ధవళహరులఁ బూన్పఁ బనిచి ధరణిపుఁడు విధుం**
డవిరళ సుధారథం బె । క్కువిధము దోఁపంగ నెక్కెఁ గురువంశనిధీ! 348

ప్రతిపదార్థం: కురువంశనిధీ= కురువంశానికి పెన్నిధివంటి జనమేజయ చక్రవర్తీ!; నవము+అగు= క్రొత్తది అయిన; రథమునన్= రథానికి; షోడశ= పదునారు; ధవళ= తెల్లని; హరులన్= గుర్రాలను; పూన్పన్= పూన్చుమని; పనిచి= ఆజ్ఞాపించి; ధరణిపుఁడు= రాజు, ధర్మరాజు; విధుండు= చంద్రుడు; అవిరళ= ఎడబాయని; సుధారథంబు= వెన్నెల అనే రథాన్ని; ఎక్కు= అధిరోహించే; విధము= తీరు; తోఁపంగన్= అనిపించగా; ఎక్కెన్= అధిరోహించాడు.

తాత్పర్యం: జనమేజయ చక్రవర్తీ! ధర్మరాజు కొత్తరథానికి పదహారు తెల్లని గుర్రాలను పూన్చుమని ఆజ్ఞాపించి, ఆ రథాన్ని చంద్రుడు తనని ఎడబాయని వెన్నెలరథాన్ని ఎక్కిన విధం తలపింపచేస్తూ అధిరోహించాడు.

విశేషం: అలం: ఉపమ.

శా. **సారథ్యంబు వహింప భీముఁడు, సితచ్ఛత్రంబు గాండీవి సె**
ల్వారం బట్టఁగఁ, జామరల్ గవ లిడన్ హారిప్రభంబయ్యెఁ; న
త్తేరం దేవురు నగ్నిపంచకము వేదిం బొల్చునట్లొప్పి రం
భోరాశిధ్వనివోలెఁ దూర్యనికరంబుల్ మ్రోసె నొక్కుమ్మడిన్. 349

ప్రతిపదార్థం: భీముఁడు= భీమసేనుడు; సారథ్యంబు+వహింపన్= రథచోదనం చేయగా; గాండీవి= అర్జునుడు; సితచ్ఛత్రంబు= తెల్లగొడుగు; చెల్వారన్= అందమతిశయించగా; పట్టఁగన్= పట్టుకొనగా; కవలు= నకుల సహదేవులు; చామరల్= వింజామరాలను; ఇడన్= పట్టుకోగా (వీచగా); ఆ+తేరు+అందున్= ఆ రథంలో; హారి= మనోహరమైన; ప్రభంబు+అయ్యెన్= కాంతికలిగిన దయింది (ప్రకాశించింది); ఆ+తేరు+అందున్= ఆ రథంలో; ఏవురున్= అయిదుగురు (పాండవులు); అగ్నిపంచకము= పంచాగ్నులు; వేదిన్=అందు; యజ్ఞవేదికయందు; పొల్చున్+అట్లు= వెలిగేటట్లు; ఒప్పిరి= అందగించారు; అంభోరాశి= సముద్రపు; ధ్వని= శబ్దం; పోలెన్= వలె; తూర్యనికరంబుల్= వాద్య సముదాయాలు; ఒక్కుమ్మడిన్= ఒక్కసారిగా; మ్రోసెన్= మ్రోగాయి.

తాత్పర్యం: ధర్మరాజు అధిరోహించిన రథానికి భీముడు సారథ్యం వహించాడు. అర్జునుడు వెల్లగొడుగును అంద మొప్పుగా పట్టాడు. నకుల సహదేవులు వింజామరలు పట్టుకొని వీస్తున్నారు. వారితో ఆ రథం మనోహరమై ఒప్పారింది. పంచాగ్నులు యజ్ఞవేదికపై పొలుపారినట్టు పాండవులైదుగురూ ఆ రథంలో ప్రకాశించారు. సముద్రఘోషవలె వాద్యాలన్నీ ఒక్కసారిగా మ్రోగాయి.

విశేషం: అలం: ఉపమ. పంచాగ్నులు: 1. ఆహవనీయాగ్ని, 2. దక్షిణాగ్ని, 3. గార్హపత్యాగ్ని, 4. సభ్యాగ్ని, 5. అపసధ్యాగ్ని - ఇవి యజ్ఞవేదికి తూర్పు, దక్షిణ, పశ్చిమ, ఈశాన్య దిక్కులం దుంటాయి.

ధర్మరాజు సపరివారంబుగాఁ గరినగరంబుఁ బ్రవేశించుట: (సం. 12-38-34)

వ. ఇట్లు నితాంతకాంతిప్రకారుండై పాండవాగ్రజుండు పాండురాజాగ్రజు నతని దేవిం బ్రభూతాందోళికారూఢులం జేసి పురస్కరించుకొని శైబ్య సుగ్రీవ మేఘపుష్పవలాహకంబు లను వాహంబులు పూనినరథంబున సాత్యకి సహితుండయి వెలుంగు వెన్నునిం బిఱింది దెసం బెట్టికొని, యతని కెలన మనోజవంబులగు హయంబులం బూన్చిన యవదాత స్యందనంబున యుయుత్సుం డరుగుదేర, నుచిత వాహనారూఢుండై విదురుండు కుంతీప్రముఖ కురుస్త్రీజనంబుల నందలంబుల నిడికొని వెనుకనడవ, నరేంద్రులు నానాముఖంబులం దమతమ సేనల తోడం గూడఁ గొలిచి చనుదెంచుచుండం జనునప్పుడు. 350

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవ+అగ్రజుండు= పాండు రాజకుమారులలో పెద్దవాడైన ధర్మరాజు; నితాంత= ఎడతెగని, అంతులేని; కాంతి ప్రకారుండు+ఐ= వెలుగుతో కూడినవాడై; పాండురాజ+అగ్రజున్= పాండురాజు అన్న అయిన ధృతరాష్ట్రుడిని; అతని దేవిన్= అతడి భార్య అయిన గాంధారిని; ప్రభూత= ఉన్నతమైన; గొప్ప; ఆందోళికా= పల్లకీని; ఆరూఢులన్= అధిరోహించిన వారినిగా; చేసి= ఒనర్చి; పురస్కరించుకొని= వారిని ముందుండేటట్లుగా చేసి; శైబ్య=శైబ్యం ; సుగ్రీవ= సుగ్రీవం; మేఘపుష్ప=మేఘపుష్పం; వలాహకంబులు= వలహకం; అను= అనే పేర్లుగల; వాహంబులు= గుర్రాలు; పూనిన= పూన్చిన; రథంబునన్= తేరుపై; సాత్యకి సహితుండు+ఐ= సాత్యకితో కూడుకొన్నవాడై; వెలుంగు= ప్రకాశించే; వెన్నుని= శ్రీకృష్ణుడి; పిఱిందిదెసన్= వెనుకవైపు; పెట్టికొని= ఉంచుకొని; అతని= ధర్మరాజు; కెలనన్= పార్శ్వాన; మనోజవంబులు+అగు= మనసంతటి వేగంకల; హయంబులన్= గుర్రాలను; పూన్చిన= పూనిన; అవదాత= శ్రేష్ఠమైన, స్వచ్ఛమైన; స్యందనంబునన్= రథంలో; యుయుత్సుండు; అరుగు+తేరన్= వస్తుండగా; ఉచిత= తగిన; వాహన+ఆరూఢుండు+ఐ= రథాన్ని అధిరోహించినవాడై; విదురుండు; కుంతీప్రముఖ= కుంతీదేవి మొదలైన; కురుస్త్రీజనంబులన్= కౌరవస్త్రీలను; అందలంబులన్= పల్లకీలలో; ఇడికొని= ఉంచి; వెనుక నడువన్= వెనుకగా వస్తుండగా; నరేంద్రులు= రాజులు; నానా ముఖంబులన్= అన్ని వైపులనుండి; తమతమ= తమయొక్క; సేనలతోడన్= సైన్యాలతో; కూడన్= కలిసి; కొలిచి= సేవించి; చనుదెంచుచుండన్= వస్తూ ఉండగా; చను+అప్పుడు= వెళ్ళే సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు అంతులేని ప్రకాశంతో వెలిగిపోతూ ధృతరాష్ట్రుడినీ, గాంధారినీ గొప్ప పల్లకిలో కూర్చుండబెట్టి తన ముందుంచుకొని, శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకాలు అనే గుర్రాలను పూన్చిన రథంపై సాత్యకితో కలిసి శ్రీకృష్ణుడు వెనుక వస్తుండగా, ప్రక్కనే మనోవేగంతో పరుగెత్తే గుర్రాలను పూన్చిన శ్రేష్ఠమైన రథంపై యుయుత్సుడు వస్తుండగా, తనకు యోగ్యమైన వాహనాన్ని తా నధిరోహించి, కుంతీదేవి మొదలైన అంతఃపుర స్త్రీలను పల్లకీలలో ఉంచి, విదురుడు వెనుక వస్తుండగా, రాజులు అన్ని వైపుల నుండి తమ సైన్యాలతో కలిసి సేవిస్తుండగా, బయలుదేరే సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ద్విరదంబుల నరదంబులఁ । దురగంబులఁ గాల్బలములఁ దూర్యంబుల సీ
గిరులన్ గొడుగులఁ బడగలఁ । బరిస్ఫురిత మయ్యె నతని పయనంబు గడున్. 351

ప్రతిపదార్థం: అతని పయనంబు= ఆ ధర్మరాజు ప్రయాణం; ద్విరదంబులన్= ఏనుగులతో; అరదంబులన్= రథాలతో; తురగంబులన్= గుర్రాలతో; కాల్బలములన్= బంటులతో; తూర్యంబులన్ సీగిరులన్= వింజామరలతో; గొడుగులన్= ఛత్రాలతో; పడగలన్= ధ్వజాలతో; కడున్= మిక్కిలి; పరిస్ఫురితము+అయ్యెన్= ప్రకటితం అయింది.

తాత్పర్యం: ఆ విధంగా సాగుతున్న ధర్మరాజు ప్రయాణం ఏనుగులు, రథాలు, గుర్రాలు, బంటులు, వాద్యాలు,వింజామరలు, ఛత్రాలు, ధ్వజాలతో అధికంగా ప్రకటిత మయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియును. 352

తాత్పర్యం: అంతేకాక, ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. వందిజనులుఁ బాఠకులుం। గ్రందుకొనం బొగడఁ జదువఁగా మాగధు లా
నందముగఁ బాడ నుచితపు। మందత్వము గమనమునకు మహిమ యొనర్పన్. 353

ప్రతిపదార్థం: వందిజనులు= భట్టులు; పాఠకులున్= వేదపాఠం చదివేవారు; క్రందుకొనన్= అతిశయించినట్లు; పొగడన్= కీర్తిస్తుండగా; చదువఁగాన్= పఠిస్తుండగా; మాగధులు= వంశకీర్తనం చేసేవారు; ఆనందముగన్= సంతోషంగా; పాడన్= పాడుతుండగా; ఉచితము+మందత్వము= తగినటువంటి నెమ్మదితనం; గమనమునకున్= నడకకు; మహిమ= గొప్పదనం; ఒనర్పన్= కూర్చగా.

తాత్పర్యం: రాజును పొగడి జీవించే వందులు కీర్తిస్తుండగా, వేదపాఠం చదివేవారు పఠిస్తుండగా, వంశచరిత్రను, ప్రతిష్ఠను కీర్తించే మాగధులు సంతోషంగా పాడుతుండగా, తగిన నెమ్మదితనం ప్రయాణానికి గొప్పతనాన్ని కూర్చగా. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. అన్నరనాథుండు నడచి నాగనగరంబు ప్రవేశించె; నంతకుమున్న యందలి జనంబులు గలువడములును దోరణంబులను గ్రముక కదళీస్తంభపూర్ణకుంభ స్థాపనంబులను కస్తూరి కలయంపులను గర్పూరపు ముగ్గులను బుష్పోపహారంబులను బ్రాలంబమాలికలను నొప్పు మిగుల నప్పురం బలంకరించి, యాబాల వృద్ధంబుగాఁ బరమాంబరానులేపన మాల్య భూషణంబులం బొలిచి, బహుల ప్రమదంబున సమ్మర్దంబులగు సంచారంబులం జారుత్వవిశేషంబు వహించి రక్కురు రాజోత్తముండు రాజమార్గంబు దఱిసి చనుసమయంబున. 354

ప్రతిపదార్థం: ఆ+నరనాథుండు= ఆ రాజు; నడచి= వెడలి; నాగపురంబు= హస్తినాపురంలో; ప్రవేశించెన్= అడుగుపెట్టాడు; అంతకుమున్ను+అ= అంతకన్న ముందే; అందలి= అచటి; జనంబులు= ప్రజలు; కలువడములును= వేడుకగా ధ్వజస్తంభాలకు వేలాడగట్టిన కలువపూదండలు; తోరణంబులను= మంగళచిహ్నాలైన మామిడాకుల దండలు; క్రముక= పోక; కదళీ= అరటి; స్తంభ= బోదెలతోను; పూర్ణకుంభ స్థాపనంబులను= నిండైన కలశాలను శుభచిహ్నంగా నిలపటం; కస్తూరి కలయంపులను= కస్తూరి కలిపి చల్లిన కళ్ళాపులతోను; కర్పూరము+ముగ్గులను= కర్పూరంతో వేసిన రంగవల్లికలతోను; పుష్ప+ఉపహారంబులను= పూల కానుకలతో (పుష్పగుచ్ఛాలు మొదలైనవి); ప్రాలంబ మాలికలను= బాగా వేలాడుతున్న దండలతోను; ఒప్పు+మిగులన్= అందం అతిశయించగా; ఆ+పురంబు= ఆ నగరాన్ని; అలంకరించి= సింగారించి; ఆ బాల వృద్ధంబుగాన్= పిల్లలు మొదలు పెద్దలవరకు అందరునూ; పరమ= శ్రేష్ఠమైన; అంబర= వస్త్రాలు; అనులేపన=మైపూతలు; మాల్య= పూలమాలలు; భూషణంబులన్= నగలతో; పొలిచి= చక్కనై, అలంకరించుకొని; బహుల ప్రమదంబునన్= ఎంతో సంతోషంతో; సమ్మర్దంబులు+అగు= ఒకరితో ఒకరు రాజుకుంటున్నట్లు; సంచారంబులన్= కదలికలతో (తిరుగాడుతూ); చారుత్వ విశేషంబుల= ఒప్పిదమైన అతిశయాన్ని; వహించిరి= కలిగి ఉన్నారు; ఆ+కురురాజ+ఉత్తముండు= ఆ కురువంశ రాజులలో శ్రేష్ఠుడైన ధర్మరాజు; రాజమార్గంబు= రాచబాటను; తఱిసి= సమీపించి; చను సమయంబునన్= వెళ్ళే సమయంలో.

తాత్పర్యం: ధర్మరాజు నడచి హస్తినాపురంలో ప్రవేశించాడు. అంతకన్న ముందుగా హస్తినాపురజనులు ధ్వజస్తంభాలకు కలువపూల దండలను వ్రేలాడగట్టి, మంగళతోరణాలు కట్టి, పోక అరటిబోదెలను, పూర్ణకలశాలను స్థాపించి, కస్తూరితో కళ్ళాపి చల్లి, కర్పూరపు రంగవల్లులు తీర్చి, పూలగుత్తులతోనూ, చక్కగా వ్రేలాడుతున్న పూలదండలతోను ఎంతో అందంగా ఆ నగరాన్ని అలంకరించారు. పసిపిల్లల నుండి వృద్ధులవరకు అందరూ ఎంతో శ్రేష్ఠమైన వస్త్రాలను, మై పూతలను, పూలదండలను, నగలను ధరించి చక్కదనంతో ఒప్పారుతూ ఎంతో ఆనందంగా ఒకరినొకరు

ఒరుసుకొంటూ (వీథులలో ఎడంలేని విధంగా జనులతో నిండాయని భావం.) చాలా సంబరంగా తిరుగుతున్నారు. అప్పుడు ధర్మరాజు రాచబాటను సమీపించి వెళ్ళే సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. హర్మ్యములనుండి పణ్యపుణ్యాంగనాని । కరము లక్షతయుత, మౌక్తికముల సేస
లొలుకఁ గల్పలతాచయంబులును పుష్ప । వృష్టి పెల్లుగఁ గురిసిన విధము దోఁచె. 355

ప్రతిపదార్థం: హర్మ్యములనుండి= భవనములపై నుండి; పణ్య+పుణ్య+అంగనా= వేశ్యాస్త్రీల, పుణ్యస్త్రీల; నికరములు= సముదాయాలు; అక్షతయుత= అక్షతలతో (నలగని పూలతో); కూడిన; మౌక్తికముల= ముత్యాల; సేసలు+ఒలుకన్= అక్షతలు చల్లగా; కల్పలతా= కల్పవృక్షాల; చయంబులు= గుంపులు; పుష్పవృష్టి= పూలవాన; పెల్లుగన్= అధికంగా; కురిసిన విధము= కురిసినట్లుగా; తోఁచెన్= అనిపించింది.

తాత్పర్యం: భవనాల పైనుండి వేశ్యాంగనలు, పుణ్యస్త్రీలు గుంపులుగా చేరి ముత్యాలతో కూడిన నలగని పూలు అక్షతలుగా చల్లుతుండగా కల్పవృక్షాల సముదాయం అధికంగా పూలవాన కురిపించినట్లుగా అనిపించింది.

విశేషం: అలం: ఉపమ.

వ. అట్టియెడఁ జూడం బఱతెంచిన పౌరజానపద జనంబులు దమలోన. 356

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; చూడన్= చూడటానికి; పఱతెంచిన= వచ్చిన; పౌర= పురజనులు; జానపదజనంబులు= జానపదులు; తమలోనన్= తమలోతాము.

తాత్పర్యం: ఆ సమయంలో అక్కడికి చూడటానికి వచ్చిన నగరవాసులు, గ్రామవాసులు అయిన ప్రజలు తమలో తాము. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'దిగ్విజయంబునం దేజస్వి యయ్యు న । జాతశత్రుం డనఁ జను నితండె;
రాజసూయ మహాధ్వరము సేసి విప్రులఁ । గనక రత్నాదులఁ దనిపె నితఁడె;
నిత్యవ్రతంబుగా సత్యంబు పాలించు । నిష్ఠ యస్ఖలితగా నెఱపె నితఁడె;
ధర్మైక నిరతుఁ డీతం డొక్కరుఁడ చువ్వె । యని పల్కుటకుఁ బాత్ర మయ్యె నితఁడె;

తే. బలముఁ దగవును ధర్మంబు వెలయఁ బగఱ । ననవశేషంబుగాఁ దెగటార్చె నితఁడె'
యనఁగ మఱియును వివిధ కీర్తనల హర్ష । వచనముల నుల్లసిల్లు రవంబు మిగిలె. 357

ప్రతిపదార్థం: ఇతండు+ఎ= ఇతడు మాత్రమే; దిగ్విజయంబునన్= అన్ని దిక్కులు జయించటంతో; తేజస్వి= కాంతిమంతుడు; అయ్యున్= అయి ఉండికూడ; అజాతశత్రుండు= పుట్టని శత్రువులు గలవాడు; అనన్= అనగా; చనున్= చెల్లుతున్నాడు; ఇతఁడు+ఎ= ఇతడే; రాజసూయ మహా+అధ్వరము= రాజసూయం అనే పేరున్న గొప్పయజ్ఞం; చేసి= ఒనరించి; విప్రులన్= బ్రాహ్మణులను; కనక= బంగారం; రత్న= మణులు; ఆదులన్= మొదలైన వాటితో; తనిపెన్= సంతృప్తి పరిచాడు; ఇతఁడు+ఎ= ఇతడే సుమా!; నిత్య= ఎల్లప్పుడూ; వ్రతంబు+కాన్= ఆచరించవలసిన పద్ధతిగా; సత్యంబు= సత్యవాక్యాన్ని; పాలించు= అనుసరించే; నిష్ఠ= నియమం; అస్ఖలిత+కాన్= చెక్కుచెదరకుండా; నెఱపెన్= అమలు జరిపాడు; ఇతఁడు+ఎ= ఇతడే, ఈ ధర్మరాజే; ధర్మ+ఏక+నిరతుఁడు= వేదచోదిత మార్గంలో అనన్యనిష్ఠ కలవాడు; ఈతండు= ఈ ధర్మరాజు; ఒక్కరుఁడు+అ= ఒక్కడే; చువ్వె= సుమా!; అని పల్కుటకున్= అంటూ చెప్పటానికి; పాత్రము= అర్హుడు; అయ్యెన్= అయ్యాడు; ఇతఁడు+ఎ= ఇతడే;

బలమున్= శక్తి; తగవును= న్యాయం; ధర్మంబు= వేదోక్తవిధి నిర్వహణం; వెలయన్= ఒప్పగా; పగఱన్= శత్రువులను; అనవశేషంబు+కాన్= మిగలకుండా; తెగటార్చెన్= సంహరించాడు; అనఁగన్= అనేట్లుగా; మఱియును= ఇంకా; వివిధ కీర్తనలన్= అనేక విధాలైన పొగడ్తలతోను; హర్షవచనములన్= సంతోషంతో కూడిన మాటలతోను; ఉల్లసిల్లు= అతిశయించే; రవంబు= ధ్వని; మిగిలెన్= ఎక్కువయింది.

తాత్పర్యం: 'అన్ని దిక్కుల రాజులను జయించి కీర్తిమంతుడై కూడ 'అజాతశత్రుడు' అని ప్రసిద్ధి కెక్కింది ఇతడే. రాజసూయం అనే గొప్ప యజ్ఞం చేసి బ్రాహ్మణులను బంగారం, రత్నాలు మొదలైన వాటితో తృప్తి పరచిం దితడే. సత్యవాక్య పరిపాలనను నిరంతరం ఆచరించే నియమంపట్ల ఉన్న లగ్నత చెక్కుచెదరనీయనిది ఇతడే. ధర్మాచరణంలో అనన్యనిష్ఠ గలవా డితడొక్కడే సుమా! అని చెప్పటానికి తగిన అర్హత కలవా డితడే. శక్తి, న్యాయం, ధర్మం ఒప్పేటట్లుగా శత్రువులను నిశ్శేషంగా చంపింది ఇతడే' అంటూ, ఇంకా అనేక పొగడ్తలతోనూ, సంతోషంతో కూడిన మాటలతోనూ అధికమైన శబ్దం అతిశయించింది.

విశేషం: అజాతశత్రుడు: పుట్టని శత్రువులు కలవాడు. అంటే ధర్మరాజు ఎవరినీ తన శత్రువులుగా భావించడు. ఇతరులు ధర్మరాజును శత్రువు అనుకుంటే అనుకొనవచ్చును. అంతశ్శత్రువుల పుట్టుక తనలో లేనివాడు. దిగ్విజయం చేసికూడా అజాతశత్రువు అనే బిరుదాన్ని నిలుపుకొన్న ఘనత ధర్మరాజుకే దక్కింది.

క. లావులు వెరవులుఁ దాల్ములుఁ । జేవలు నస్ఖలితములుగఁ జెల్లు పనులు నా
నా విధములఁ బేర్కొనుచుం । బావని నరుఁ గవలఁ బొగడు పటురవ మెసఁగెన్. 358

ప్రతిపదార్థం: లావులు= బలాలు; వెరవులున్= ఉపాయాలు; తాల్ములున్= ఓర్పులూ; చేవలున్= సామర్థ్యాలూ; అస్ఖలితములుగన్= జారనివిగా (చెక్కుచెదరక); చెల్లు= నడిచే; పనులు= కార్యాలు; నానావిధములన్= అనేక తీరులుగా; పేర్కొనుచున్= ఏకరువు పెట్టుతూ; పావనిన్= భీముడిని; నరున్= అర్జునుడిని; కవలన్= నకుల సహదేవులనూ; పొగడు= కీర్తించే; పటు= గొప్ప; రవము= ధ్వని; ఎసఁగెన్= ఎక్కువైంది.

తాత్పర్యం: బలాలు, ఉపాయాలు, ఓర్పులు, సామర్థ్యాలు ఏమాత్రం చెదరకుండ (తక్కువకాకుండా) నిర్వర్తించిన ఘనకార్యాలనన్నింటిని అనేక విధాలుగా చెప్పుకొంటూ (పౌరులు) భీమార్జున నకుల సహదేవులని పొగడుతున్న ధ్వనులు మిన్నుముట్టుతున్నాయి.

విశేషం: అలం: యథాసంఖ్యం. భీమాదులందరిలో సమష్టిగా నాలుగు గుణాలు చూస్తున్నా, ప్రత్యేకించి భీముడిలో బలం, అర్జునుడిలో ఉపాయం, నకులుడిలో ఓర్పు, సహదేవుడిలో సామర్థ్యం గమనించి ప్రజలు కీర్తించారని క్రమాలంకారం వలన గ్రహించవచ్చును.

క. 'వ్రతచర్యయు భాగ్యంబును । ధృతియు మతియు నరయ ద్రౌపదికి నెనయగు భూ
పతివల్లభాజనము లీ । క్షితిఁ గలరే' యనురవంబు సెలఁగెం గలయన్. 359

ప్రతిపదార్థం: వ్రతచర్యయున్= ఉపవాసాది పుణ్యకర్మలు, నోములు మొదలైనవి ఆచరించటం; భాగ్యంబును= అదృష్టం, పతుల అనురాగం; ధృతియున్= ధైర్యం; మతియున్= తెలివి; అరయన్= చూడగా; ద్రౌపదికిన్= ద్రౌపదితో; ఎన+అగు= సాటి అయిన; భూపతివల్లభాజనములు= రాజపత్నులు; ఈక్షితిన్= ఈ భూమిలో; కలరు+ఏ?= ఉన్నారా? (లేరని భావం); అను= అనే; రవంబు= ధ్వని; కలయన్= అంతటా; చెలఁగెన్= వ్యాపించింది.

తాత్పర్యం: 'పుణ్యకర్మలు, నోములు చేయటంలోనూ, అదృష్టం, ధైర్యం, తెలివి కలిగి ఉండటంలోనూ, రాజపత్నులెవ్వరూ ద్రౌపదికి సాటి అయినవారు ఈ భూమిలో ఉన్నారా?' (లేరు అని భావం) అనే ప్రశంసల సవ్వడి అంతటా వ్యాపించింది.

వ. ఇట్లు పెల్లయిన మ్రోఁతను దరంగితము లైన నెరవుల పెంపునఁ బురంబు చంద్రోదయ ఘూర్ణమానంబైన మహార్ణవంబు ననుకరించె; నా ధర్మరాజు రాజమందిరద్వారంబు సేరంజనియె; నప్పుడు బహువిధంబులగు శోభనద్రవ్యంబులు గరంబులంగొని భవ్యభూసురులును బుణ్యాంగనలును నెదుర్కొన, వాని నెల్లం గైకొనుచుం బ్రవేశించి యతం డేనుంగు మొగసాల నరదంబు డిగ్గి, ధౌమ్య ధృతరాష్ట్ర పురస్సరంబుగా నభ్యంతర నివాసంబు సొచ్చి, గృహదేవతలం బూజించి, మగుడ బహిరంగణ భూమికి వచ్చి, నగర దేవతా పూజలు సేయింపం దగువారలం బనిచి, బ్రాహ్మణ సంఘంబులం గానిపించుకొని, కనకంబులును గోవులు మొదలైన వివిధ వస్తువులు నొసంగె; నప్పు డాశీర్వాద నాదంబులను శంఖభేరీ ప్రముఖ మంగళ తూర్యరవంబులను రోదసి పిక్కటిల్లెఁ; దదనంతరంబ నిశ్శబ్దంబై యున్న సకల జనంబులును నజ్జనపాలు నాననం బాలోకించు చుండి; రట్టియెడ దుర్యోధన సఖుండైన చార్వాకుం డను నొక్క రక్కసుండు విప్రాకారంబు గైకొని త్రిదండి వేషం బలవడ నయ్యవనీదేవతాకోటిలో నిల్చి యన్నరనాథున కిట్లనియె. 360

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పెల్లు+అయిన= అధికమైన; మ్రోఁతను= ధ్వనితో; తరంగితములు+ఐన= ఉప్పొంగిన; నెరవుల= మార్గాల; పెంపునన్= ఆధిక్యంతో; పురంబు= నగరం; చంద్ర+ఉదయ= చంద్రోదయ సమయంలో; ఘూర్ణమానంబు+ఐన= ఎగసిపడుతున్న; మహా+అర్ణవంబును= గొప్ప సముద్రాన్ని; అనుకరించెను= పోలి ఉన్నది; ఆ ధర్మరాజు; రాజమందిర ద్వారంబు= రాజప్రాసాదపు వాకిలిని; చేరన్+చనియెన్= సమీపించపోయాడు; అప్పుడు= ఆ సమయంలో; బహువిధంబులు+అగు= వివిధ ప్రకారాలైన; శోభనద్రవ్యంబులు= మంగళ ద్రవ్యాలు; కరంబులన్= చేతులలో; కొని= పట్టుకొని; భవ్యభూసురులును= శుభప్రదులైన బ్రాహ్మణులు; పుణ్య+అంగనలునున్= పుణ్యస్త్రీలు, ముత్తైదువలు; ఎదుర్కొనన్= ఎదురురాగా; వానిన్+ఎల్లన్= వాటినన్నింటిని; కైకొనుచున్= గ్రహిస్తూ; ప్రవేశించి= అడుగిడి; ఏనుంగు= పెద్దదైన; మొగసాలన్= ముఖశాలలో; అరదంబు= రథం; డిగ్గి= దిగి; ధౌమ్య= ధౌమ్యుడు; ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రుడు; పురస్సరంబు+కాన్= ముందు నడుస్తుండగా; అభి+అంతర, నివాసంబు= అంతఃపురం; చొచ్చి= ప్రవేశించి; గృహదేవతలన్= తమ ఇంటి దైవాలను (కులదైవాలను); పూజించి= అర్చించి; మగుడన్= తిరిగి; మరల; బహిః+అంగణ భూమికిన్= ముంగిలికి వెలుపల ఉన్న ప్రదేశానికి; వచ్చి= చేరి; నగరదేవతా= నగరాధిదేవత; పూజలు= అర్చనలు; చేయింపన్= నిర్వర్తించటానికి; తగువారలన్= తగినవారిని; పనిచి= పంపి; బ్రాహ్మణ సంఘంబులన్= విప్రగణాలను; కానిపించుకొని= దర్శించుకొని; కనకంబులును= బంగారాలు; గోవులు= ఆవులు; మొదలు+ఐన= ఆదిగా; వివిధ+ అనేకమైన; వస్తువులున్= సంభారాలను; ఒసంగెన్= ఇచ్చాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆశీర్వాదనాదంబులను= ఆశీర్వచనాలతోనూ; శంఖ= శంఖాలు; భేరీ= దుందుభులు; ప్రముఖ= మొదలైన; మంగళ= శుభప్రదమైన; తూర్య= వాద్యాల; రవంబులను= ధ్వనులతో; రోదసి= అంతరిక్షం; పిక్కటిల్లెన్= పూర్తిగా నిండిపోయింది; తద్= ఆ; అనంతరంబు+అ= తర్వాత; నిశ్శబ్దంబు+ఐ= శబ్దం లేనిదై; ఉన్నన్= ఉండగా; సకల= సమస్తమైన; జనంబులునున్= ప్రజలు; ఆ+జనపాలున్= ఆ రాజుయొక్క; ఆననంబు= ముఖం; ఆలోకించుచున్+ఉండిరి= చూస్తూ ఉండిపోయారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; దుర్యోధన సఖుండు= దుర్యోధనుడి మిత్రుడైన; చార్వాకుండు+అను= చార్వాకుడు అనే; ఒక్కరక్కసుండు= ఒక రాక్షసుడు; విప్ర+ఆకారంబున్= బ్రాహ్మణరూపం; కైకొని= గ్రహించి; త్రిదండి= సన్యాసి; వేషం= అలంకారం; అలవడన్= ధరించి; ఆ+అవనీదేవతాకోటిలోన్= బ్రాహ్మణ సముదాయంలో; నిల్చి= ఉండి; ఆ+నరనాథునకున్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అత్యధికమైన ధ్వనులతో ఉప్పొంగిన బాటల అతిశయంతో ఆ నగరం చంద్రోదయ సమయంలో ఎగసిపడుతున్న మహాసముద్రం వలె ఉన్నది. అప్పు డా ధర్మరాజు రాజప్రాసాదాల వాకిలి సమీపించాడు. ఆ సమయంలో ఎన్నో రకాల మంగళద్రవ్యాలు చేతులలో ధరించి శుభప్రదులైన బ్రాహ్మణులు, పుణ్యస్త్రీలు ఎదురు రాగా ఆ మంగళద్రవ్యాల నన్నింటినీ గ్రహిస్తూ నగరులో ప్రవేశించి, చాల పెద్దదైన ముఖశాల (గజశాల) వద్ద

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రథం దిగి, ధౌమ్యుడు, ధృతరాష్ట్రుడు ముందు నడుస్తుండగా అంతఃపురం ప్రవేశించి, తమ ఇలవేల్పులను అర్చించి, తిరిగి వెలుపలి ప్రదేశానికి వచ్చి, నగర దేవత పూజలు చేయించటానికి అర్హులైనవారిని ఏర్పాటు చేయించి, బ్రాహ్మణులను దర్శించుకొని, వారికి బంగారం, గోవులు మొదలైన అనేక సంభారాలు దానం చేశాడు. అప్పుడు ఆ బ్రాహ్మణులు చేసిన ఆశీస్సుల ధ్వనులతోనూ, శంఖం భేరీ మొదలైన మంగళ వాద్యాల ఘోషతోనూ ఆకాశం మారుమ్రోగింది. ఆ తరువాత జనులంతా శబ్దం చేయకుండా ధర్మరాజు ముఖం చూస్తూ ఉండిపోయారు. అటువంటి సమయంలో దుర్యోధనుడి మిత్రుడైన చార్వాకుడు అనే పేరుగల రాక్షసు డొకడు బ్రాహ్మణరూపం ధరించి సన్న్యాసి వేషం వేసికొని, బ్రాహ్మణసమూహంలో నిలబడి ఆ రాజుతో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉపమ. త్రిదండి= మనోదండం, వాగ్దండం, కర్మదండం అనే మూడు దండాలు ఉన్నవాడు సన్న్యాసి.

చార్వాకుం డను రాక్షసుఁడు బ్రాహ్మణ నిగ్రహంబునఁ జచ్చుట (సం. 12-39-22)

చ. ‘ **వినుము నరేంద్ర! సర్వమగు విప్రజనంబును గూడి నన్నుఁ బం**
చిన విధ ‘మీతఁ డేటిపతి? సేసిన పాపము పెద్ద; చంపుచో
జనకుఁడు బ్రాత పుత్త్రుఁడను శంక యొకించుక లేదు; సద్గురుం
డనియెడి కొంకు బుద్ధి నిసుమంతయుఁ బుట్టదు; వీనిఁ గాల్పనే!’ **361**

ప్రతిపదార్థం: నరేంద్ర!= రాజా!; సర్వము+అగు= సమస్తమైన; విప్రజనంబును= బ్రాహ్మణసమూహం; కూడి= కలిసి; నన్నున్= నన్ను; పంచిన= పంపిన; విధము= పద్ధతి, కారణం; వినుము= ఆలకించుము; ఈతఁడు= ఈ ధర్మరాజు; ఏటి పతి?= ఎటువంటి రాజు?; చేసిన పాపము= ఆచరించిన దుష్కృత్యం; పెద్ద= ఘనం; చంపుచోన్= చంపే సమయంలో; జనకుఁడు= తండ్రి; భ్రాత= సోదరుడు; పుత్త్రుఁడు= కుమారుడు; అను= అనే; శంక= అనుమానం, సందేహం; ఒక+ఇంచుక= కొద్దిగా కూడ; లేదు= లేకపోయింది; సత్+గురుండు= మంచిగురువు; అనియెడి= అనే; కొంకు= భయం; బుద్ధిన్= మనసులో; ఇసుమంతయున్= అతి స్వల్పంగా కూడ; పుట్టదు= కలగలేదు; వీనిన్= ఈ ధర్మరాజును; కాల్పను+ఏ?= తగులబెట్టాలా? (ఏం చేసినా తప్పులేదు నిష్ప్రయోజనం అనే భావం ప్రకటించటానికి వాడే ప్రయోగం).

తాత్పర్యం: ‘ధర్మరాజా! బ్రాహ్మణులంతా కలిసి నన్ను పంపిన కారణం వినుము. ఘనమైన పాపం చేసిన ఇతడేం రాజు? చంపే సమయంలో తండ్రి, సోదరుడు, కొడుకు అని కూడ సందేహించలేదు. విద్య నేర్పిన గురువని మనసులో కొంచెం కూడ భయపడలేదు. వీడిని తగలపెట్టినా తప్పులేదు కదా!’

వ. **అను మని రని పలికి వెండియు.** **362**

ప్రతిపదార్థం: అనుము= అనవలసినది; అనిరి; అని= అన్నారని; పలికి= మాట్లాడి; వెండియున్= తిరిగి, ఇంకా.

తాత్పర్యం: అనుమని అన్నారు’ అని చెప్పి ఇంకా - (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. ‘ **ఇట్లు శిష్టజనము లేవగింపఁగఁ జేయు । రాజ్య మేల బంధురాజి నెల్లఁ**
బొలియఁజేసి యెట్టి భోగంబు లనుభవిం । చెదవు? కల్మషంబు చిక్కె నీకు. **363**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; శిష్టజనములు= సజ్జనులు; ఏవగింపఁగన్= అసహ్యించుకుంటూ ఉండగా; చేయు= చేసే; రాజ్యము+ఏల?= రాజ్యపాలన ఎందుకు?; బంధు= చుట్టాల; రాజిన్= సమూహాన్ని; ఎల్లన్= అంతటినీ; పొలియన్+చేసి= చంపి; ఎట్టి= ఎటువంటి; భోగంబులు= సుఖాలు; అనుభవించెదవు?= అనుభవిస్తావు?; నీకు; కల్మషంబు= పాపం; చిక్కెన్= కలిగింది.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఈ విధంగా సజ్జనులు అంతా అసహ్యించుకొంటూ ఉండగా రాజ్యం చెయ్యటం ఎందుకు? బంధువుల నందరినీ చంపి నీవు ఎటువంటి భోగాలు అనుభవిస్తావు? నీకు పాపం కలిగింది.'

వ. **అనిన విని యవ్విప్రు లత్యంత వ్యథితాంతఃకరణు లగుచు నొండొరుల మొగంబులు సూచి 'యిట్లు పుట్టం బని యేమి?' యను వచంబులతోఁ దిరుగుడు వడిరి; ధర్మనందనుండు లజ్జావనత వదనుండై యూరకుండి, వారలవలను గనుంగొని కేలు మొగిచి ఫాలభాగంబునఁ గదియించి యిట్లనియె.** **364**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+విప్రులు= ఆ బ్రాహ్మణులు; అతి+అంత= మిక్కిలి; వ్యథిత= బాధపడిన; అంతఃకరణులు= మనస్సు కలవారు; అగుచున్= ఔతూ; ఒండొరుల= పరస్పరం; మొగంబులు= ముఖాలు; చూచి= ఆలోకించి; ఇట్లు= ఇటువంటిది; పుట్టన్= కలగటానికి; పని+ఏమి?= కారణం ఏమిటి?; అను= అనే; వచనంబులతోన్= మాటలతో; తిరుగుడు+పడిరి= కల్లోల పడ్డారు; ధర్మనందనుండు= ధర్మరాజు; లజ్జ= సిగ్గుచేత; అవనత= క్రిందికి దించిన; వదనుండు+ఐ= ముఖం కలవాడై; ఊరక+ఉండి= మిన్నకుండి; వారల= వారి; వలను= దిక్కు, వైపు; కనుంగొని= చూచి; కేలు మొగిచి= చేతులు జోడించి; ఫాలభాగంబునన్= నుదుట; కదియించి= కీలించి, ఉంచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ చార్వాకుడు అన్నమాటలు విని అక్కడ ఉన్న బ్రాహ్మణులంతా మనస్సులలో ఎంతో బాధపడినవారై ఒకరి మొగం ఒకరు చూచుకొంటూ 'ఇటువంటి మాట రావటానికి కారణం ఏమిటి?' అని అనుకొంటూ కల్లోలపడ్డారు. ధర్మరాజు సిగ్గుతో తలవంచుకొని, వారివంక చూచి, చేతులు జోడించి నుదుట ఉంచి, ఇట్లా అన్నాడు:

తే. **'మ్రొక్కి వేఁడెద నను మీరు ధిక్కరింప । కాదరింపుఁడు; మునిసమూహానుమతుఁడ**
నై వినిశ్చియ పరికలితాంతరంగ । వర్తనముతోడ నిచటికి వచ్చినాఁడ.' **365**

ప్రతిపదార్థం: (మీకు) మ్రొక్కి= నమస్కరించి; వేఁడెదన్= ప్రార్థిస్తున్నాను; నను= నన్నున్; మీరు; ధిక్కరింపక= ఎదిరించక, వ్యతిరేకించకుండా; ఆదరింపుఁడు= మన్నించండి; ముని సమూహ= మునుల సముదాయంచేత; అనుమతుఁడను+ఐ= ఆజ్ఞపొందినవాడినై; వినిశ్చయ= గట్టి నిర్ణయంతో; పరికలిత= బాగా కూడుకొన్న; అంతరంగ వర్తనముతోడన్= మనః ప్రవృత్తితో; ఇచటికిన్= ఇక్కడికి; వచ్చినాఁడన్= వచ్చాను.

తాత్పర్యం: 'మీకు నమస్కరించి ప్రార్థిస్తున్నాను. నన్ను కాదనక మన్నించండి, మునులందరిచేత ఆజ్ఞాపించబడి, దృఢమైన నిర్ణయంతో కూడుకొన్న మనఃప్రవృత్తితో ఇక్కడికి వచ్చాను'.

వ. **అనవుడు భయ సంభ్రమ భరితు లగుచు నా భూసురులు 'దేవా! యీ వాక్యంబులు మావలనం బుట్టినవి గా' విది యేమియో కాని, నీ వుత్తమ క్షత్త్రధర్మంబున సముపార్జించిన యుజ్జ్వలశ్రీ సుస్థిరతం బొందెడు' మని యతనికి నాశ్వాసం బొనర్చి, యమ్మాయాభిక్షువు నాలోకించి, పరమబోధనంబున నప్పురుషాధము నెఱింగి, యమ్మహీపతితో 'వీఁడు దుర్యోధన సఖుం డగు రాక్షసుండు సన్యాసి వేషంబున నేతెంచి యతనికి హితం బాచరించువాఁడై యీ దుర్వచనంబు లాడె; నీ కుక్క మొఱఁగిన యంతన పాలమున్నీరుం బోని నీకుం గలంగ నేల? ధర్మాత్ములగు తమ్ములు పనుపు సేయం బూజ్యంబగు సామ్రాజ్యంబు వహింపు'మని యాదరించి.** **366**

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; భయ= బెదరు; సంభ్రమ= తడబాటు; భరితులు= నిండుగా కలిగినవారు; అగుచున్= అవుతూ; ఆ భూసురులు= ఆ బ్రాహ్మణులు; దేవా!= ప్రభూ!; ఈ వాక్యంబులు= ఈ మాటలు; మావలనన్= మా నుండి; పుట్టినవి కావు= పుట్టలేదు; ఇది= ఈ మాటలు పుట్టటం; ఏమి+ఓ+కాని= ఏమైనా అవనీ (పట్టించుకొనవద్దని భావం); నీవు; ఉత్తమ= గొప్ప;

క్షత్ర+ధర్మంబునన్= రాజోచితమైన పద్ధతిలో; సముపార్జించిన= సంపాదించిన; ఉజ్జ్వలశ్రీ= ప్రకాశించే సంపద (రాజ్యం, కీర్తి మొదలైనవన్నీ); సుస్థిరతన్= శాశ్వతత్వాన్ని; పొందెడున్+అని= పొందుదువుగాక!; (ఎదుతల ద్రుతంబున కచ్చు పరంగునపుడు మకారంబగు. అయ్యెడున్+అని= అయ్యెడుమని, కావుతన్+అని= కావుతమని); అని= అని పలికి; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఆశ్వాసంబు= సాంత్వనం; ఒనర్చి= కలిగించి; ఆ+మాయాభిక్షువున్= ఆ కపట సన్న్యాసిని; ఆలోకించి= చూచి; పరమబోధంబునన్= దివ్యమైన జ్ఞానంతో (దివ్యదృష్టితో); ఆ+పురుష+అధమున్= మనవులలో నీచుడిని; ఎఱింగి= గుర్తించి; ఆ+మహీపతితోన్= ఆ ధర్మరాజుతో; వీఁడు= ఈ మాయావి; దుర్యోధన సఖుండు+అగు= దుర్యోధనుడి మిత్రుడైన; రాక్షసుండు= రక్కసి; సన్న్యాసివేషంబునన్= యతి వేషంలో; ఏతెంచి= వచ్చి; అతనికిన్= దుర్యోధనుడికి; హితంబు= మేలు; ఆచరించువాఁడు+ఐ= చేసేవాడై; ఈ దుర్వచనంబులు= ఈ చెడు మాటలు; ఆడెన్= పలికాడు; ఈ కుక్క= ఈ నీచుడు; మొఱఁగిన+అంతన= అరచినంత మాత్రాన; పాలమున్నీరున్+పోలు= పాలసముద్రంవంటి; నీకున్= నీకు; కలంగన్= బాధ పడటం; ఏల?= ఎందుకు?; ధర్మ+ఆత్ములు= ధర్మబుద్ధికలవారు; అగు= అయిన; తమ్ములు= అనుజులు; పనుపు= నీ ఆజ్ఞను; చేయన్= అమలు జరుపుతూ ఉండగా; పూజ్యంబు+అగు= పవిత్రమైన; సామ్రాజ్యంబు= రాజ్యభారాన్ని; వహింపుము= నిర్వహించుము; అని= అని పలికి; ఆదరించి= మన్నించి.

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా పలుకగా బ్రాహ్మణులు భయంతో కంగారుగా 'ప్రభూ! ఈ మాటలు మా నుండి రాలేదు. అవి ఏమైనా కానిమ్ము (పాటించవద్దని భావం), నీవు శ్రేష్ఠమైన రాజోచిత మార్గంలో సంపాదించిన ప్రకాశించే సంపదను అంటే రాజ్యం కీర్తి మొదలైనవన్నీ కలకాలం నిలిచి ఉంటాయి' అని ధర్మరాజుతో సాంత్వన వచనాలు పలికారు. ఆ కపటయతిని చూచి, దివ్యదృష్టితో ఆ నీచుడిని గుర్తించి, ధర్మరాజుతో ఈ విధంగా పలికారు. 'వీడు దుర్యోధనుడి స్నేహితుడైన ఒక రాక్షసుడు. దుర్యోధనుడికి మేలు చేయా లని ఈ చెడుమాటలు పలికాడు. ఈ నీచుడు కుక్కవలె మొరిగినంత మాత్రాన పాలసముద్రంవలె స్వచ్ఛంగా ఉన్న నీవు బాధపడలసిన పని లేదు. ధర్మమార్గంలో నడిచే నీ తమ్ముళ్ళు నీ ఆజ్ఞను అమలు జరుపుతుండగా, పవిత్రమైన రాజ్యభారం వహించుము' అని ఆదరించారు.

క. **ఆ రాక్షసుఁ గనుఁగొని కో । పారంజిత నేత్రు లగుచు నవ్విప్రులు హుం**
కార ముఖరు లగుటయు, నతి । ఘోరాకృతితోడ వాఁడు గూలెం బుడమిన్. **367**

ప్రతిపదార్థం: ఆ రాక్షసున్= ఆ చార్వాకుడిని; కనుఁగొని= చూచి; కోప= కోపంతో; ఆరంజిత= బాగా ఎర్రబడిన; నేత్రులు+అగుచున్= కన్నులు కలవారై; ఆ+విప్రులు= ఆ బ్రాహ్మణులు; హుంకారముఖరులు= హుం అనే ధ్వనిచేస్తున్న నోరు కలవారు; అగుటయున్= కావటంతో; అతిఘోర+ఆకృతితోడన్= మిక్కిలి భయంకరమైన రూపంతో; వాఁడు= ఆ రక్కసి; పుడమిన్= భూమిపై; కూలెన్= పడ్డాడు.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణులు చార్వాకుడిని చూచి కోపంతో కన్నులు ఎర్రబడగా, హుంకారంచేయటంతో వాడు భయంకరమైన రూపంతో నేల కూలాడు.

తే. **బ్రహ్మతేజో నిహతి నిట్లుపడి మహాశ । నిప్రహతి పాతితోర్విజనిభత నొంది**
యున్న యద్దానవునిఁ జూచి యన్నరేంద్రుఁ । డెలమి సొంపు వహించెఁ దమ్ములును దాను. **368**

ప్రతిపదార్థం: బ్రహ్మ= బ్రాహ్మణ; తేజోనిహతిన్= తేజస్సువలన చంపబడి; ఇట్లు= ఈ విధంగా; పడి= నేలకూలి; మహా+అశని= గొప్ప పిడుగుయొక్క; ప్రహతిన్= దెబ్బచేత; పాతిత= పడగొట్టబడిన (నేలకూలిన); ఉర్విజ= చెట్టు; నిభతన్= పోలికను; పొంది= కలిగి; ఉన్న= ఉండిన; ఆ+దానవునిన్= ఆ రాక్షసుడిని; చూచి= కని; ఆ+నర+ఇంద్రుఁడు= ఆ రాజశ్రేష్ఠుడు; తాను= తను; తమ్ములును= సోదరులూ; ఎలమి= వికాసం; సొంపు= సంతోషం; వహించెన్= పొందాడు.

తాత్పర్యం: బ్రాహ్మణుల తేజస్సువలన చంపబడి నేలకూలి, పెద్దపిడుగుపాటుతో నేలకూలిన వృక్షంవలె ఉన్న ఆ రాక్షసుడిని చూచి ధర్మరాజు తమ్ములతో కూడి వికాసాన్నీ, సంతోషాన్నీ పొందాడు.

వ. ఇట్లు ప్రీతుండై యజాతశత్రుం డవ్విప్రసమూహంబునకు సవిశేషార్చనం బొనర్చి వీడుకొలిపె; నప్పు డచ్యుతుండు బ్రాహ్మణస్తుతి సేసి యజ్ఞనపతితో నిట్లనుఁ; 'గృతయుగంబునం జార్వాకుం డనుదైత్యుండు తపం బొనరించి పద్మభవుండు ప్రత్యక్షంబయిన నఖిల భూతంబుల వలనను నభయంబు వేఁడిన నద్దేవుండు భూదేవతల కనిష్టంబులైన పనులు సేయకుండు వాఁడవు; చేసితేని యదియ నీకుఁ దుది యని' పలికి యవ్వరం బొసంగె నట్లు లబ్ధవరుండై వాఁడు గర్వించి గీర్వాణుల బాధింపం దొడంగిన, వారు విరించిం గాంచి యా రక్కసుండు సేయు బాధలు సెప్పిన, 'నమ్మహాత్ముం డేను మున్న యెఱింగి యొనర్చినవాఁడు దుర్యోధనుం డను రాజునకు నెచ్చెలియై యచ్చపలుండు తత్కార్యం బాదరింపంజొచ్చి మహీసురులకు మనోవ్యథాకరంబగు కర్మంబు సేయు; నప్పనికారణంబుగా వారల కోపంబునం గూలం గలవాఁ డని పలికె; నద్దానవుండు నేఁ డిట వచ్చి తన దుర్వినయంబున బ్రహ్మదండ నిహతుండై పడియున్నవాఁ'డని చెప్పి, యప్పీనుంగు వెడలవైపించి, యా భూపాలు నుద్దేశించి వెండియు. 369

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; అజాతశత్రుండు= ధర్మరాజు; ఆ+విప్ర సమూహంబునకున్= ఆ బ్రాహ్మణుల సముదాయానికి; సవిశేష= ప్రత్యేకమైన; అర్చనంబు= పూజ; ఒనర్చి= చేసి; వీడుకొలిపెన్= సెలవుతీసికొని పంపించాడు; అప్పుడు= ఆ సమయంలో; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; బ్రాహ్మణ= బ్రాహ్మణులను; స్తుతి+చేసి= కీర్తించి; ఆ+జనపతితోన్= ఆ రాజుతో (ధర్మరాజుతో); ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; కృతయుగంబునన్= కృతయుగంలో; చార్వాకుండు= చార్వాకుడనే పేరుగల; దైత్యుండు= రాక్షసుడు; తపంబు= తపస్సు; ఒనరించి= చేసి; పద్మభవుండు= బ్రహ్మ; ప్రత్యక్షంబు+అయినన్= దర్శన మీయగా; అఖిల= సమస్తమైన; భూతంబుల వలననున్= ప్రాణులనుండి; అభయంబు= భయంలేకపోవటాన్ని; వేఁడినన్= ప్రార్థించగా; ఆ+దేవుండు= ఆ దేవతా ముఖ్యుడు; భూ దేవతలకున్= బ్రాహ్మణులకు; అనిష్టంబులు+ఐన= ఇష్టంకాని, కష్టం కలిగించే; పనులు= చేతలు; చేయక+ఉండువాఁడవు= చేయకుండా ఉండుము; చేసితి(వి)+ఏని= చేసినట్లైతే; అది+అ= అదే; నీకున్+తుది= నీకు చివర (అంతం); అని= అంటూ; పలికి= చెప్పి; ఆ+వరంబు= అత డడిగిన వరం; ఒసంగెన్= ఇచ్చాడు; అట్లు= ఆ విధంగా; లబ్ధవరుండు+ఐ= వరం పొందినవాడై; వాఁడు= ఆ చార్వాకుడు; గర్వించి= అహంకరించి; గీర్వాణులన్= దేవతలను; బాధింపన్= కష్టపెట్టటం; తొడంగినన్= ప్రారంభించగా; వారు= ఆ దేవతలు; విరించిన్= బ్రహ్మను; కాంచి= దర్శించుకొని; ఆ రక్కసుండు= ఆ రాక్షసుడు; చేయు= చేసే, పెట్టే; బాధలు= కష్టాలు; చెప్పినన్= చెప్పగా; ఆ+మహా+ఆత్ముండు= ఆ మహానుభావుడు; ఏను= నేను; మున్ను+అ= ముందే; ఎఱింగి= తెలిసి; ఒనర్చినవాఁడన్= చేశాను; దుర్యోధనుండు+అను= దుర్యోధనుడనే పేరుగల; రాజునకున్= రాజునకు; నెఱ+చెలి= మంచి మిత్రుడు; ఐ= అయి; ఆ+చపలుండు= ఆ స్థిరబుద్ధిలేనివాడు; తద్+కార్యంబు= అతడి పని; ఆచరింపన్+చొచ్చి= చేయటం మొదలుపెట్టి; మహీసురులకున్= బ్రాహ్మణులకు; మనోవ్యథాకరంబు= మనస్సుకు బాధకలిగేది; అగు= అయిన; కర్మంబు= పని; చేయున్= చేస్తాడు; ఆ+పని= ఆ చేష్ట; కారణంబుగాన్= నిమిత్తంగా; వారలకోపంబునన్= వారి కోపంతో; కూలన్+కలవాఁడు= చనిపోగలడు; అని పలికెన్= అని చెప్పాడు; ఆ+దానవుండు= ఆ రాక్షసుడు; నేఁడు= ఈ రోజు; ఇట= ఇక్కడికి; వచ్చి= అరుదెంచి; తన= తన యొక్క; దుస్+వినయంబునన్= అవినీతితో; బ్రహ్మదండ= బ్రాహ్మణుల దండన చేత; నిహతుండు+ఐ= చంపబడిన వాడై; పడి+ఉన్నవాఁడు= నేలకూలాడు; అని+చెప్పి= అంటూ తెలియచేసి; ఆ+పీనుంగున్= ఆ శవాన్ని; వెడల= దూరంగా; వైపించి= వేయించి; ఆ భూపాలున్= ఆ రాజును; ఉద్దేశించి= లక్షించి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఈ విధంగా సంతోషించిన ధర్మరాజు ఆ బ్రాహ్మణ సమూహానికి విశేషమైన పూజలు చేసి వీడ్కోలు పలికాడు, అప్పుడు శ్రీకృష్ణుడు బ్రాహ్మణులను కీర్తించి, ధర్మరాజుతో ఈ విధంగా పలికాడు. 'కృతయుగంలో చార్వాకుడనే పేరున్న రాక్షసుడు తపస్సుచేసి బ్రహ్మను ప్రత్యక్షంచేసికొని తనకు సమస్తప్రాణుల వలన భయంలేకుండా ఉండేటట్లు వరం కోరాడు. బ్రాహ్మణులకు అనిష్టమైన పనులు చేయకుండా ఉండుము. అట్లా చేస్తే అదే నీకు ఆఖరు (ఆపై నీవుండవు). అని చెప్పి అతడు కోరిన వరం ప్రసాదించాడు. వాడు ఆ విధంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వరం పొంది అహంకరించి దేవతలను బాధించటం మొదలు పెట్టాడు. దేవతలు బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ఆ రాక్షసుడు పెట్టే బాధలు చెప్పారు. ఆ మహానుభావుడు 'నే నీ సంగతి ముందే తెలిసికొని తగినట్లుగా ఏర్పాటు చేశాను. దుర్యోధనుడనే రాజుకు మిత్రుడై ఆ బుద్ధిస్థిరతలేని చార్వాకుడు ఆ దుర్యోధనుడి పని చేయాలనుకొని బ్రాహ్మణులకు బాధ కలిగించే పని చేస్తాడు. ఆ చార్వాకుడు ఈ రోజు ఇక్కడికి వచ్చి తన వినయరాహిత్యంవలన బ్రాహ్మణుల దండనచేత చంపబడ్డాడు' ఆ శవాన్ని బయటపారవేయుమని చెప్పి ధర్మరాజుతో ఇంకా ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. 'మాఱుకొన్నవారి నీఱు సేయుము; ప్రజ । నరసి మనుపు; ధరణిసురులఁ బ్రోవు;
మఖిల బంధుజనుల నాశ్రితులను సుఖ । వృత్తి మనుపు పెంపు వెలయ నధిప! 370

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; మాఱుకొన్నవారిన్= ఎదిరించినవారిని; నీఱు= బూడిద; చేయుము= కావించుము; ప్రజన్= పౌరులను; అరసి= విచారించి (కనుగొని); మనుపు= కాపాడుము; ధరణి సురులన్= బ్రాహ్మణులను; ప్రోవుము= కాపాడుము; పెంపు= ఆధిక్యం, గొప్పతనం; వెలయన్= ఒప్పగా; అఖిల= సమస్తమైన; బంధుజనులన్= చుట్టాలను; ఆశ్రితులను= శరణు జొచ్చినవారిని; సుఖవృత్తిన్= సుఖంగా ఉండేటట్లు; మనుపు= కాపాడుము.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఎదిరించిన వాళ్ళను మసిచేయుము. ప్రజల కష్టసుఖాలు విచారించి రక్షించుము. నీ గొప్పతనం ప్రకటమయ్యే విధంగా బంధువులను, ఆశ్రయించుకొన్నవారిని సుఖంగా ఉండేటట్లు కాపాడుము.

వ. రాజ్యాభిషేక శోభనం బనుభవింపు' మని పలికి, యాభిషేచనిక ద్రవ్యానయనంబునకుం దగువారిం బనిచి బయలి పెద్దకొలువుకూటంబున నమ్మహీపతికి మహోన్నత హేమమయ సింహాసనంబు పెట్టించి, వెలయువారలకెల్ల సముచిత సమంచిత పీఠంబు లుపచరింప నియోగించిన, నప్పాండవాగ్రజుం డుల్లంబు కలంక యెల్ల డిగ్గఁద్రావి, యిచ్చం దెలివొంది, చెలువొందు నిజపీఠంబునం బూర్వాభిముఖుండై కూర్చుండె; నతని కట్టెదురం గనత్కాంచ నాసనంబున సాత్యకి సమేతంబుగా శౌరియు, వలపటను దాపటను మణిపీఠంబుల వడముడియుఁ గవ్వడియును, వెనుకం గనకాయుత కుబ్జాసనంబులం గవల నిరువంకల నునిచికొని కుంతీమహాదేవియు దామోదరుని దక్షిణ దిక్కున నర్చిస్సముజ్జ్వలం బగు నాసనంబున ధృతరాష్ట్రుండును దదీయ ప్రాక్ప్రదేశంబునం బ్రస్ఫురిత పీఠంబుల విదురుండునుధౌమ్యుండును, ధృతరాష్ట్రుని పిఱుంద నర్హపీఠంబుల గాంధారీ యుయుత్సు సంజయులునుం గూర్చుండి; రా సమయంబున నంబుజాక్షుండు గృపావిశేషంబునఁ గృపాచార్యుం దగుతెఱంగున నయ్యజాతశత్రుం గానిపించి యోగ్యాసనంబున ధౌమ్యు సమీపంబున నతని నునిచె; నంత నప్పుడమిఱేఁడు సిత కుసుమాక్షత కాంచన రజత రత్న గర్భాస్పర్శనం బాచరించెఁ; దదనంతరంబ. 371

ప్రతిపదార్థం: రాజ్య+అభిషేక= పట్టాభిషేకం అనే; శోభనంబు= వైభవం; అనుభవింపుము= పొందుము; అని+పలికి= అంటూ చెప్పి; ఆభిషేక సంబంధమైన; ద్రవ్య= సంభారాల; ఆనయనంబునకున్= తీసికొనిరావటానికి; తగువారిన్= అర్హులైన వారిని; పనిచి= పంపి; బయలి= ఆరుబయట; పెద్ద= విశాలమైన; కొలువు కూటంబునన్= సభాస్థలియందు; ఆ+మహీపతికిన్= ఆ రాజుకు (ధర్మరాజుకు); మహా= ఘనమైన; ఉన్నత= ఎత్తైన; హేమమయ= బంగారంతో చేయబడిన; సింహాసనంబు= సింహపు ముఖం ఉన్న ఎత్తైన బంగారు ఆసనం, రాజోచితమైనది; పెట్టించి= ఏర్పరచి; వలయువారలకున్= అయినవారికి, ఆప్తులకు; ఎల్లన్= అందరికీ; సముచిత= బాగా తగిన; సమంచిత= గొప్పవైన; పీఠంబులు= ఆసనాలు; ఉపచరింపన్= సన్మానించటానికి, సేవించటానికి;

నియోగించినన్= ఏర్పాటుచేయగా; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; ఉల్లంబు కలంక= మనస్సులోని బాధ; ఎల్లన్= అంతటినీ; డిగ్గన్+త్రావి= దిగమ్రింగి; ఇచ్చన్= కోరికతో, సంకల్పంతో; తెలివి+ఒంది= ఎఱుక కలిగి; చెలువు+ఒందు= అందగించే; నిజ= తన; పీఠంబునన్= సింహాసనం మీద; పూర్వ+అభిముఖుండు+ఐ= తూర్పుదిక్కుగా ముఖం కలవాడై; కూర్చుండెన్= అధివసించి ఉన్నాడు; అతని= ఆ ధర్మరాజు; కడు+ఎదురన్= ఎట్టఎదురుగా; కనత్= ప్రకాశించే; కాంచన= బంగారు; ఆసనంబునన్= పీఠంమీద; సాత్యకి సమేతంబుగాన్= సాత్యకితో కూడుకొన్నవాడై శౌరియున్= కృష్ణుడును; వలపటను= కుడిప్రక్కన; దాపటను= ఎడమప్రక్కన; మణిపీఠంబులన్= రత్నమయ ఆసనాలపై; వడముడియున్= భీముడూ; కవ్వడియును= అర్జునుడు; వెనుకన్= వెనుక ప్రక్కగా, కనక+ఆయత+కుబ్జ= బంగారపు విశాలమైన పొట్టిది అయిన; ఆసనంబులన్= పీఠాలమీద; కవలన్= నకుల సహదేవులను; ఇరువంకలన్= రెండువైపులా; ఉనిచికొని= కూర్చుండబెట్టుకొని; కుంతీమహాదేవియున్= కుంతీదేవి; దామోదరు= కృష్ణుడు; దక్షిణ దిక్కునన్= కుడిప్రక్క; అర్చిస్= కాంతులతో; సముజ్జ్వలంబు= బాగా ప్రకాశించే; ఆసనంబునన్= పీఠంపై ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడు; తదీయ= అతడికి; ప్రాక్+ప్రదేశంబునన్= తూర్పువైపున; ప్రస్ఫురిత= బాగా ప్రకాశించే; పీఠంబులన్= ఆసనాలపై; విదురుండును= విదురుడు; ధౌమ్యుండును= పురోహితుడైన ధౌమ్యుడు; ధృతరాష్ట్రుని పిఱుందన్= ధృతరాష్ట్రుడి వెనుక ప్రక్క; అర్హపీఠంబులన్= తగిన ఆసనాలమీద; గాంధారీ, యుయుత్సు, సంజయులునున్= గాంధారీదేవి, యుయుత్సుడు, సంజయుడు; కూర్చుండిరి= ఆసీనులై ఉన్నారు; ఆ సమయంబునన్= అట్టి సమయంలో; అంబుజ+అక్షుండు= పద్మాలవంటి కన్నుల కల శ్రీకృష్ణుడు; కృపావిశేషంబునన్= దయాతిశయంతో; కృప+ఆచార్యున్= కృపాచార్యుడిని; తగు= తగిన; తెఱంగునన్= తీరులో; ఆ+అజాతశత్రున్= ఆ ధర్మరాజుకు; కానిపించి= కనబడచేసి; యోగ్య+ఆసనంబునన్= ఉచితాసనంపై; ధౌమ్యు= పురోహితుడైన ధౌమ్యుడిని; సమీపంబునన్= చేరువలో, ప్రక్కనే; అతనిన్= ఆ కృపాచార్యుడిని; ఉనిచెన్= కూర్చుండచేశాడు; అంతన్= అప్పుడు; ఆ+పుడమితేఁడు= ఆ భూపతి, ధర్మరాజు; సిత= తెల్లని; కుసుమ= పూలు; అక్షత= అక్షతలు; కాంచన= బంగారు; రజత= వెండి; రత్నగర్భ= భూమి; స్పర్శనంబు= తాకటం; ఆచరించెన్= చేశాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: పట్టాభిషేక వైభవాన్ని అనుభవించుము' అని శ్రీకృష్ణుడు చెప్పి అభిషేకానికి కావలసిన వస్తు సంభారాలను తీసికొని రావటానికి అర్హులైన వారిని పంపాడు. ఆరుబయట పెద్ద కొలువుతీర్చి, ధర్మరాజుకు గొప్ప ఎత్తైన బంగారు సింహాసనాన్ని ఏర్పాటుచేసి, అయినవారందరికీ తగిన, ఘనమైన ఆసనాలు ఏర్పాటుచేయుమని అర్జునుడికి చెప్పాడు. అప్పుడు ధర్మరాజు తన మనస్సులోని బాధనంతా దిగమ్రింగి, సంకల్పంతో తేరుకొని, ప్రకాశిస్తున్న తన ఆసనం మీద తూర్పుముఖంగా కూర్చున్నాడు. అతడికి ఎదురుగా బంగారు పీఠంపై సాత్యకితో కలిసి శ్రీకృష్ణుడు కూర్చున్నాడు. రత్నమయ పీఠాలపై కుడిఎడమల భీముడు, అర్జునుడు, వెనుక ప్రక్క విశాలములు, పొట్టివి అయిన బంగారు ఆసనాల మీద నకుల సహదేవులు చెరొకప్రక్క ఉండగా; కుంతీదేవి, కృష్ణుడికి కుడి ప్రక్కగా కాంతులతో ప్రకాశించే పీఠంమీద ధృతరాష్ట్రుడు, అతడికి తూర్పువైపు వెలిగిపోయే ఆసనాలమీద విదురుడు, ధౌమ్యుడు, ధృతరాష్ట్రుడికి వెనుకగా ఉచితాసనాలమీద గాంధారి, యుయుత్సుడు, సంజయుడు ఆసీనులై ఉన్నారు. ఆ సమయంలో తన కరుణా విశేషంతో శ్రీకృష్ణుడు ధర్మరాజుకు కృపాచార్యుడి దర్శనం కలిగించి, ధౌమ్యుడి ప్రక్కన ఉచితాసనంపై అధివసింపచేశాడు. ఆ ధర్మరాజు తెల్లని పూలను, అక్షతలను, బంగారాన్ని, వెండిని, భూదేవిని స్పృశించాడు. ఆ తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. విద్వత్సమూహంబు, వివిధ దేశాధీశ। సంఘంబుఁ, గార్యవిచారపరులు,
నర్థార్జనాది కృత్యంబుల వారలు, । బహుపరిచర్యలఁ బరఁగు జనులు,
వైశ్యప్రముఖ పౌరవర్గంబులును, ముఖ్య । హాలికాది జానపదావలులును,
వైణిక గాయక వాంశికాది వినోద । కరులును, వారసుందరులు లోను

ఆ. గాఁగఁ దగినవారు గాంచి యవ్విభుని స । త్కారములఁ బ్రమోదితాత్ము లగుచు
భావములు దలిర్ప సేవించియుండ న । క్కొలువు సాల నొప్పెఁ గురువరేణ్య! 372

ప్రతిపదార్థం: కురువరేణ్య!= జనమే జయమహారాజా!; విద్వత్= పండితుల; సమూహంబు= గణము; వివిధ= అనేక; దేశ+అధీశ= రాజుల; సంఘంబున్= సమూహం; కార్యవిచారపరులు= మంత్రులు; అర్థ+ఆర్జన= ధనసముపార్జన; ఆది= మొదలైన; కృత్యంబుల వారలు= పనులు చేసేవారు; బహు= నానా; పరిచర్యలన్= సేవలలో; పరఁగు= ఒప్పే; జనులు= వారు (మానవులు); వైశ్యప్రముఖ= వైశ్యులు మొదలైన; పౌరవర్గంబులును= పురజనుల గణాలు; ముఖ్య= ప్రధానమైన; హలిక+ఆది= కృషీవలులు మొదలైన; జానపద+ఆవలులును= గ్రామీణజన సమూహాలు; వైణిక= వీణ వాయించేవారు; గాయక= పాడేవారు; వాంశిక= వేణువూదేవారు; ఆది= మొదలైన; వినోద కరులును= వినోదం కలిగించేవారు; వారసుందరులు= వేశ్యాస్త్రీలు; లోను+కాఁగన్= మొదలుగా; తగినవారు= యోగ్యులు; కాంచి= దర్శించుకొని; సత్కారములన్= సన్మానాలతో; ప్రమోదిత= మిక్కిలి సంతోషపెట్టబడిన; ఆత్ములు= మనస్సులు కలవారు; అగుచున్= ఔతూ; భావములు= తలపులు; తలిర్పన్= సంతోషంతో అతిశయించగా; సేవించి+ఉండన్= కొలువుతీరి ఉండగా; ఆ+కొలువు= ఆ సభ; చాలన్= అధికంగా; ఒప్పెన్= అందగించింది.

తాత్పర్యం: జనమేజయా! పండితుల సమూహం, వివిధ దేశాల రాజుల సముదాయం, మంత్రులు, ధనార్జన మొదలైనవి చేసేవారు, వివిధ పరిచర్యలు చేసే సేవకజనం, వైశ్య ప్రముఖులు మొదలైన పౌరులు, కృషీవలులు మొదలైన గ్రామీణులు, వీణ వేణువు మొదలైన సంగీత వాద్యాలను పలికించటంలో నేర్పరులు, గాయకులు, వేశ్యలు మొదలైనవారంతా ధర్మరాజును దర్శించుకొని, అతడిచేత సన్మానాలు పొంది, మనసులో ఎంతో సంతసిస్తూ కొలువు తీర్చి ఉండగా ఆ సభ చాల ప్రకాశించింది.

విశేషం: రాజ్యపాలనకు కావలసిన అంగాలన్నీ (మంత్రం, ధనం, కార్యాచరణం, సేవ), సుఖస్థితికి వలసినవి (వ్యాపారం, పాడిపంట) వినోదం - అన్నీ సమకూడి ఉన్నాయి సభలో.

ధర్మరాజు పట్టాభిషేక మహోత్సవము (సం. 12-40-9)

వ. అంత నాభిషేచనిక ద్రవ్య సంచయంబు సన్నిహితం బగుటయు, మాధవానుమతుండై ధౌమ్యుండు ప్రాగు దకీ ప్లవనంబైన వేదికాతలం బలంకరించి యందు జాతరూప నవరత్న ఖచితంబును దృఢపాదంబు నగు భద్రపీఠంబు ప్రతిష్ఠించి, శార్దూల చర్మాస్తరణ శోభితంబు సేసి యర్చించి, కాంచనదామజుష్టం బగు నుత్కృష్టఘన శంఖంబు సమంచిత స్థండిలంబున నిలిపి పూజించి, దానను దానిచుట్టునుం బార్థివంబులు హైమంబులు రాజతంబులు రత్నమయంబులు నగు కుంభంబు లొనర్చి వానను గాంగంబులగు జలంబులు నినిచి యన్నింటికి రత్నమంగళతరు త్వక్పల్లవ కుసుమంబులను బంచగవ్యంబులను సమంత్రకంబుగా సంస్కారంబు నిర్వర్తించి. 373

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; ఆభిషేచనిక= అభిషేక సంబంధమైన; ద్రవ్యసంచయంబు= వస్తుసముదాయం; సన్నిహితంబు= బాగా దగ్గరకు వచ్చినది; అగుటయున్= కావటంతో; మాధవ+అనుమతుండు+ఐ= కృష్ణుడిచేత అనుజ్ఞపొందినవాడై; ధౌమ్యుండు= పురోహితుడైన ధౌమ్యుడు; ప్రాక్+ఉదక్ (ప్రాగుదీచీ పాఠాంతరం)= తూర్పు, ఉత్తరం, అనగా ఆ దిక్కుల మధ్య ఉండే ఈశాన్యం; ప్లవనంబు+ఐన= పల్లంగా ఉన్న; వేదికాతలంబు= వేదికను; అలంకరించి= అలంకారం చేసి; అందున్= అచట; జాతరూప= బంగారుమయమైనవి; నవరత్న ఖచితంబును= నవరత్నాలతో తాపటం చేయబడింది; దృఢపాదంబును= స్థిరమైన బలమైన కాళ్ళు కలిగినది; అగు= అయిన; భద్ర= శుభప్రదమైన; పీఠంబు= ఆసనం, పీట; ప్రతిష్ఠించి= స్థాపించి; శార్దూలచర్మ= పులితోలు; ఆస్తరణము= పరుపుతో; శోభితంబు+చేసి=

అలంకరించి; అర్చించి= పూజించి; కాంచన= బంగారు; దామ= దండతో; జుష్టంబు+అగు= చేరినదైన; ఉత్కృష్ట= శ్రేష్ఠమైన; ఘన= పెద్ద; శంఖంబు= శంకువుని; సమంచిత= బాగా తగిన; స్థండిలంబునన్= వ్రతము కొరకు దర్భాదులచేత సంస్కరించబడిన స్థలమున; నిలిపి= నిలబెట్టి; పూజించి= అర్చించి; దానన్= దానియందు; దానిచుట్టునున్= ఆ శంఖం చుట్టూ; పార్థివంబులు= మట్టివి; హైమంబులు= బంగారువి; రాజతంబులు= వెండివి; రత్నమయంబులున్= రత్నాలతో చేయబడినవి; అగు= అయిన; కుంభంబులు= కలశాలు; ఒనర్చి= ఏర్పాటుచేసి, పెట్టి ఉంచి; వానను= ఆ కలశాలలో; గాంగంబులు+అగు= గంగానదివైన; జలంబులు= నీరు; నినిచి= నింపి; అన్నింటికిన్= ఆ కలశాలన్నింటికీ; రత్న= మణులతోను; మంగళతరు= శుభప్రదమైన చెట్ల; త్వక్+పల్లవ+కుసుమంబులను= బెరడులు, చిగుళ్ళు, పూలతోను; పంచగవ్యంబులను= గోసంబంధమైన అయిదు వస్తువులతోను (ఆవుపాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, పేడ); సమంత్రికంబు+కాన్= మంత్రపూతంగా; సంస్కారంబు= సంస్కరణ; నిర్వర్తించి= చేసి.

తాత్పర్యం: ఆ విధంగా కొలువుతీరిన సమయంలో పట్టాభిషేకానికి కావలసిన సంభారాలు రావటంతో, కృష్ణుడు ఆజ్ఞాపించగానే పురోహితుడైన ధౌమ్యుడు ఈశాన్యదిక్కున పల్లంగా ఉన్న (ఇది వాస్తు శాస్త్రాన్ని అనుసరించి శుభం) వేదికను అలంకరించాడు. ఆ వేదికపై నవరత్నాలు పొదిగిన బలమైన కాళ్ళుగల బంగారపు భద్రపీఠాన్ని స్థాపించి, ఆ పీఠంపై పులితోలు పరచి అలంకరించి, పూజించి, బంగారు దండలతో కూడుకొని ఉన్న శ్రేష్ఠమైన గొప్ప శంఖాన్ని యజ్ఞార్థం దర్భాదులచేత సంస్కరించబడి బాగా ఒప్పే స్థలంలో నిలబెట్టి పూజించి, ఆ స్థలంలోనూ దానిచుట్టూ మట్టి, బంగారు, వెండి, మణి కలశాలనుంచి, ఆ కలశాలలో గంగాజలం నింపి, ఆ కలశాల నన్నింటిని రత్నాలతోను, శుభప్రదమైన వృక్షాల బెరడులు, చిగుళ్ళు, పూలతోనూ, పంచగవ్యాలతోనూ మంత్రపూతంగా సంస్కరించి. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **వీర్యవంతములగు వివిధ మంత్రంబుల। తోఁ గూడ సద్ద్విజస్తోమ పరివృ**
తునిఁ జేసికొని రాజుఁ దోడ్కొనియేఁగి యా। వినుత పీఠంబున నునిచి, శోభ
నాలంకరణమున నభిరామ యైన పాం। చాలిఁ దద్వామపార్శ్వమున సహస
మాసీనఁ గావించి, యగ్నిముఖము సేసి। కొని హోమ తంత్ర వర్తన మొనర్చె;

తే. **నంత నూర్జిత శుభవేళ యగుడు శంఖ। చక్రధరుఁ డా సమర్చిత శంఖ మెత్తి**
'పృథివి కధిపతి వగు' మని ప్రీతి నా పృ। థాసుతుని నభిషిక్తునిఁ జేసె నధిప! **374**

ప్రతిపదార్థం: అధిప!= రాజా! జనమేజయా!; వీర్యవంతములు+అగు= శక్తిమంతాలైన; వివిధ= అనేక; మంత్రంబులతోన్= మంత్రాలతో; కూడ= కూడి; సత్+ద్విజస్తోమ= మంచి బ్రాహ్మణ గణంతో; పరివృతునిన్= చుట్టబడినవాడుగా, పరివేష్టింపబడినవాడుగా; చేసికొని= చేసి; రాజున్= ధర్మరాజును; తోడ్కొని= వెంట తీసికొని; ఏఁగి= వెళ్ళి; ఆ వినుత పీఠంబునన్= ఆ బాగా కీర్తించబడిన ఆసనంపై; ఉనిచి= నిలిపి; శోభన+అలంకరణమునన్= మంగళకరమైన సింగారాలతో; అభిరామ+ఐన= మనోహరంగా ఉన్న; పాంచాలిన్= పాంచాలరాజపుత్రి అయిన కృష్ణను; తద్+వామపార్శ్వమునన్= ధర్మరాజుకు ఎడమ ప్రక్క; సహసమాసీనన్= కలిసి చక్కగా కూర్చున్న దానిగా; కావించి= చేసి; అగ్ని ముఖము= అగ్నికి ఎదురుగా ఉండేటట్లు; చేసికొని= ఏర్పాటు చేసికొని; హోమతంత్రవర్తనము= దేవయజ్ఞ పద్ధతి ఆచరణం; ఒనర్చెన్= నిర్వర్తించాడు; అంతన్= అప్పుడు; ఊర్జిత= దృఢమని నిశ్చయించిన; శుభవేళ= మంగళకాలం; అగుడున్= అవగానే; శంఖ చక్రధరుఁడు= శంఖచక్రాలు ధరించిన వాడైన శ్రీకృష్ణుడు; ఆ సమర్చిత శంఖము+ఎత్తి= ఆ పూజించబడిన శంఖాన్ని ఎత్తి; పృథివికిన్= భూమికి, రాజ్యానికి; అధిపతివి= రాజువు; అగుము= కమ్ము; అని= పలికి; ప్రీతిన్= ఇష్టంతో; పృథాసుతునిన్= కుంతీపుత్రుడైన ధర్మజుడిని; అభిషిక్తునిన్= పట్టాభిషిక్తుడిగా; చేసెన్= చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శక్తిమంతాలైన మంత్రాలు చదువుతున్న సద్బ్రాహ్మణులతో పరివేష్టించబడినవాడినిగా చేసి, ఆ ధర్మరాజును వెంటబెట్టుకొని తీసికొనివెళ్ళి బహుధా స్తుతించబడిన ఆ ఆసనంపై కూర్చొనపెట్టి, మంగళాలంకార శోభిత అయి మనోహరంగా ఉన్న ద్రౌపదిని ధర్మరాజు ఎడమప్రక్క కూర్చుండబెట్టి, అగ్నిని ఎదురుగా ఉంచుకొని దేవయజ్ఞ తంత్రం పూర్తిచేసి, నిశ్చయించిన శుభసమయంలో శ్రీకృష్ణుడు, అంతకు ముందు పూజించిన శంఖాన్ని తీసి దానితో 'ఈ భూమికి రాజువు కమ్ము' అని ఇష్టంతో ధర్మరాజును అభిషిక్తుడిని చేశాడు.

విశేషం: అగ్నిముఖం= జీడిచెట్టు, అగ్నిముఖుఁడు= బ్రాహ్మణుడు, వేలుపు. శంఖంలోని నీటితో అభిషేకించినవాడు శంఖచక్రధరుడనటం సందర్భోచితం.

వ. అప్పుడు చిత్తం బుత్తమ ప్రకారంబై యాంబికేయుండు ప్రసన్నవదనుం డగుచుం బ్రతిష్ఠితంబు లయిన కలశంబులలో నుజ్జ్వలం బగు నొక్కటి ధౌమ్యుం డంది యీ నెత్తి యా భూపోత్తము నభిషేకించె; మఱియుం బ్రభూతాత్ము లగు రాజులును, బ్రకృతులలోనం దగువారును,, దదభిషేక శోభనం బాచరించిరి; శంఖానక దుందుభి ప్రభృతి మంగళతూర్యంబులు గంభీర నాదంబులం జెలంగె; నివ్విధంబున సుహృజ్జన హృదయంబు లానందింప ధర్మనందనుండు సామ్రాజ్య పదస్థుండై భూసుర దీనానాథ ప్రముఖ పాత్రంబులకు వివిధ బహుధనంబు లొసంగె; నట్టియెడ విద్యా విశిష్ట బ్రాహ్మణాది పురుష సత్తము లక్కురుసత్తమున కభిముఖులై 'దేవా! దైవ మానుషంబుల కలిమి నతిమానుషంబగు నీ విజయంబును వసుధాధిపత్య సంప్రాప్తియు నింత యొప్పునే!' యనిన విని వారలతో నవ్వసుంధరా వల్లభుండు. 375

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; చిత్తంబు= మనస్సు; ఉత్తమ ప్రకారంబు+ఐ= శ్రేష్ఠమైన తీరులో ఉండగా; ఆంబికేయుండు= అంబిక కుమారుడైన ధృతరాష్ట్రుడు; ప్రసన్నవదనుండు+అగుచున్= నిర్మలమైన ముఖం కలవాడై; ప్రతిష్ఠితంబులు+అయిన= స్థాపించబడిన; కలశంబులలోన్= కుంభాలలో; ఉజ్జ్వలంబు+అగు= ప్రకాశించే, మెరుగైన; ఒక్కటి= ఒక్కదానిని; ధౌమ్యుండు; అంది+ఈన్= అందించగా; ఎత్తి= పై కెత్తి; ఆ భూప+ఉత్తమున్= ఆ రాజవరుడైన ధర్మరాజును; అభిషేకించెన్= అభిషేకించాడు; మఱియున్= ఇంకా; ప్రభూత+ఆత్ములు+అగు= మహాత్ములైన; రాజులును= భూపతులు; ప్రకృతులలోన్= పౌరులలో; తగువారును= అర్హులైనవారు; తద్= ఆ; అభిషేకశోభనంబు= అభిషేకమనే శుభకార్యాన్ని; ఆచరించిరి= చేశారు; శంఖ= శంఖాలు; ఆనక= తప్పెటలు; దుందుభి= భేరులు; ప్రభృతి= మొదలైన; మంగళతూర్యంబులు= మంగళవాద్యాలు; గంభీర నాదంబులన్= ఘనమైన ధ్వనులతో; చెలంగెన్= వ్యాపించాయి; ఈ+విధంబునన్= ఈ తీరున; సుహృద్+జన= మిత్రులు; ఆప్తులు అయిన వారి; హృదయంబులు= మనసులు; ఆనందింపన్= సంతసించగా; ధర్మనందనుండు= ధర్మరాజు; సామ్రాజ్యపదస్థుండు+ఐ= చక్రవర్తి పదవియందున్నవాడై; భూసుర= బ్రాహ్మణులు; దీన= దీనులు; అనాథ= దిక్కులేనివారు; ప్రముఖ= మొదలైన; పాత్రంబులకున్= అర్హులైనవారికి; వివిధ= అనేక విధాలైన; బహు= అధికంగా; ధనంబులు= సంపదలు; ఒసంగెన్= ఇచ్చాడు; అట్టి+ఎడన్= అటువంటి సమయంలో; విద్యావిశిష్ట= గొప్పవిద్యావంతులైన; బ్రాహ్మణ= బ్రాహ్మణులు; ఆది= మొదలైన; పురుష+సత్తములు= మానవోత్తములు; ఆ+కురుసత్తమునకున్= కౌరవోత్తముడైన ధర్మరాజుకు; అభిముఖులు+ఐ= ఎదురుగా నిలిచినవారై; దేవా!= ప్రభూ!; దైవ= దేవతా; మానుషంబుల= మానవ సంబంధమైన శక్తుల; కలిమిన్= సంపదతో; అతిమానుషంబు+అగు మానవాతీతమైన; ఈ విజయంబును= ఈ గెలుపూ; వసుధా+ఆధిపత్య+సంప్రాప్తియున్= రాజ్యపాలన లభించటం; ఇంత= ఇంతగా; ఒప్పును+ఏ?= అందగిస్తాయా?; అనినన్= అనగా; విని= ఆలకించి; వారలతోన్= బ్రాహ్మణాదులతో; ఆ+వసుంధరావల్లభుండు= ఆ ధర్మరాజు.

తాత్పర్యం: అటుపై మంచి మనసుతో ధృతరాష్ట్రుడు నిర్మలమైన ముఖంకలవాడై ప్రతిష్ఠించిన కలశాలలో మేలైన దాని నొకదానిని ధౌమ్యుడు తనకు అందించగా, దానిని ఎత్తి ధర్మరాజు నభిషేకించాడు. ఇంకా మహాత్ములైన రాజులు, ప్రముఖులైన పౌరులు కూడా ఆ అభిషేక శుభకార్యాన్ని నిర్వర్తించారు. శంఖాలు, తప్పెటలు, భేరులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మొదలైన మంగళవాద్యాల గొప్ప ధ్వనులు బాగా వ్యాపించాయి; ఈ విధంగా ఆప్తుల హృదయాలు సంతసించగా ధర్మరాజు చక్రవర్తి పదవి నధిష్ఠించి బ్రాహ్మణులు, దీనులు, దిక్కులేనివారు మొదలైన దానయోగ్యులకు అనేక విధాలైన అధికమైన సంపదలు దానం చేశాడు. ఆ సమయంలో పండితులు, బ్రాహ్మణులు మొదలైన మనుజశ్రేష్ఠులు ధర్మరాజు కెదురుగా నిలిచి 'ప్రభూ! దేవమానవ శక్తులు బాగా కలిగి ఉండటం వలన ప్రాప్తించిన నీ విజయం, రాజ్యపాలన ప్రాప్తి ఎంత యోగ్యంగా ఉన్నాయి! (తమ ఊహనుమించి అందగించాయని భావం)' అనగా విని వారితో ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **' కలిగె లేకుండె ని ట్లలఘు గుణంబులు । వాక్రుచ్చి మీయంత వార లిట్లు**
గొనియాడఁ బాండునందనులు ధన్యాత్ములు' । యని పల్కి యంబికాతనయుఁ జూపి
' తండ్రియు గురువును దైవంబు నీతఁడ । మాకు; మీ రెల్ల నీ మనుజవిభుని
పనుపు సేయుటయు, నీతనికిఁ బ్రియంబు గా । వించుటయును, మమ్ము వేనవేల

తే. **విధులఁ బ్రీతులఁ జేఁత యుర్వీజనులుఁ । బౌరులును మీరలును దొంటిభంగిఁ దప్ప**
కిమ్మహారాజునెడ వినయమ్ముతోడ । నడచుచుంటయు యెంతయు నాకుఁ బ్రియము. 376

ప్రతిపదార్థం: కలిగెన్= ఉన్నవో; లేకుండెన్= లేవో; ఇట్లు= ఈ విధంగా; అలఘు= గొప్ప; గుణంబులు= సద్గుణాలు; వాక్రుచ్చి= పేర్కొని; మీ+అంతవారలు= మీ అంతటి పెద్దలు; ఇట్లు; ఈ విధంగా; కొనియాడన్= కీర్తించగా; పాండునందనులు= పాండురాజు పుత్రులు; ధన్య+ఆత్ములు+అ= అదృష్టవంతులే; అని పలికి= అని చెప్పి; అంబికాతనయున్= ధృతరాష్ట్రుడిని; చూపి= చూపించి; మాకున్= పాండవులకు; తండ్రియున్= జనకుడు; గురువును= పెద్ద; దైవంబున్= దైవం; ఈతఁడు+అ= ఇతడే; మీరు+ఎల్లన్= మీరంతా; ఈ మనుజ విభుని= ఈ రాజుయొక్క; పనుపు= ఆజ్ఞ; చేయుటయున్= అమలు జరపటం; ఈతనికిన్= ఈ ధృతరాష్ట్రుడికి; ప్రియంబు= ఇష్టమైనది; కావించుటయును= చేయటం; మమ్మున్= మమ్ములను (పాండవులను); వేనవేల= వేలాది; విధులన్= తీరులలో; ప్రీతులన్= సంతసించినవారినిగా; చేఁత= చేయటం (ఔతుంది); ఉర్వీజనులన్= భూప్రజలు; పౌరులును= పురజనులు; మీరలును= మీరందరూ; తొంటిభంగిన్= పూర్వంవలెనే; తప్పక= కాదనక, పొరబడక; ఈ+మహారాజు+ఎడన్= ఈ చక్రవర్తిపట్ల; వినయమ్ముతోడన్= వినమ్రతతో; నడచుచున్+ఉంటయున్= నడుస్తూ ఉండటం; నాకున్; ఎంతయున్= ఎంతో; ప్రియంబు= ఇష్టం.

తాత్పర్యం: 'ఈ గొప్ప సద్గుణాలు ఉన్నాయో లేవో కాని వాటిని పేర్కొని, మీ అంతటి పెద్దలు ఈ విధంగా పొగడుతుంటే పాండవులు అదృష్టవంతులే' అని పలికి, ధృతరాష్ట్రుడిని చూపించి ఇట్లా అన్నాడు: 'మాకు తండ్రి, గురువు, దైవం ఈ ధృతరాష్ట్రుడే. ఈతడి ఆజ్ఞ అమలు చేయటం, ఇతడికి ఇష్టమైనది చేయటం వేలాది తీరులలో మమ్మల్ని సంతోషపెట్టటం అవుతుంది. దేశప్రజలు, పౌరులు, మీరు అందరూ పూర్వంవలె (ధృతరాష్ట్రుడు పరిపాలిస్తున్న కాలంలో వలె) ఈ ధృతరాష్ట్రుడి పట్ల వినమ్రతతో నడుచుకొనటం మాకు ఎంతో ఇష్టం.

క. **జ్ఞాతివధ మట్లు సేసియు । నీతనిఁ గొల్చుటకుఁ గాఁగ నీ గృహధర్మో**
పేతత్వము బొరసితి భూ । భూతికి మనకు విభుఁ డీ ప్రభువ మఱవకుఁడీ!' 377

ప్రతిపదార్థం: జ్ఞాతివధము= దాయాదులను చంపటం; అట్లు= ఆ విధంగా; చేసియున్= చేసికూడా; ఈతనిన్= ఈ ధృతరాష్ట్రుడిని; కొల్చుటకున్= సేవించటానికి; కాఁగన్= మాత్రమే; ఈ గృహధర్మ= గృహస్థాశ్రమ ధర్మంతో; ఉపేతత్వమున్= కూడి ఉండటాన్ని; పొరసితిన్= పొందాను; భూభూతికిన్= ఈ భూమిపైగల ఐశ్వర్యానికి; మనకు= మనకు; ఈ ప్రభువు+అ= ఈ రాజే; విభుఁడు= అధిపతి; మఱవకుఁడీ!= మరచిపోవద్దు సుమా!

తాత్పర్యం: ఆ విధంగా దాయాదులను చంపి కూడా గృహస్థాశ్రమ ధర్మాన్ని అనుష్ఠించటం, ఈ ధృతరాష్ట్రుడిని సేవించటంకొరకే. భూమిపై ఉన్న ఐశ్వర్యానికి, మనకు అధిపతి ఈ రాజే అని మరవవద్దు సుమా!'

వ. **అని చెప్పి నిజేచ్ఛ వర్తించి సుఖంబుండు వారుగాఁ బ్రార్థించి, వినయంబుతో ధృతరాష్ట్ర గాంధారుల నగరిలోని కనిచి, పౌరులను జానపదులను బోవంబనిచి, సగౌరవంబుగాఁ గృపాచార్యు నిజనివాసంబున కరుగ వీడ్కొలిపి, యువరాజ పదంబున భీమసేను నిలిపి, కర్తవ్య విచారంబునకుఁ దదీయ నిశ్చయంబునకును సంధివిగ్రహాది షాడ్గుణ్య చింతనంబునకును విదురునిం బ్రియవచన పూర్వకంబుగా నియోగించి, వలయుపనులు వెనుక ముంద రరసి యెఱింగించుటకు నాయవ్యయంబు లెఱింగించుటకునై సంజయుం జొనిపి, సేనల కొలందులను గనుంగొనుటకు భృత్యులకు జీవితంబులు వెట్టుటకుఁ గర్మకలాపంబులు సేయించుటకును నకులు నాజ్ఞాపించి, దర్పితుల మర్దించుటకుఁ బరచక్రంబు లాక్రమించుటకు నర్జును నిర్దేశించి, బ్రాహ్మణకార్యంబులకు శ్రౌత స్మార్తకృత్య సమనుష్ఠానంబునకు ధౌమ్యుం జాలించి, సహదేవుం జూచి 'నీవు మదీయ గోపనపరుండవై సర్వావస్థల యందును మత్సమీపంబున నిల్చునది' యని పలికి, మఱియుం గరణీయంబు లగు నధికారంబుల నెల్లను గల్పించి , వీరల మీఁదన పెట్టి, యుయుత్సుం గనుంగొని, విదుర సంజయుల నాలోకించి 'మీర లనుదినంబును నవధానంబు గలిగి రాచవారి యోగక్షేమంబు లేనెట్లట్ల నిర్వహింప వలయుఁ బురజనంబుల భూజనంబుల కర్జంబులు రాచవారి కెఱింగించి, పంచినట్లు నడపంగలవార'లని యప్పగించి యభ్యంతర మందిరంబునకు విజయంచేయు'మని కుంతీదేవినిం బాంచాలీ సహితంబుగాఁ బుచ్చి.** **378**

ప్రతిపదార్థం: అని= అంటూ; చెప్పి= పలికి; నిజ+ఇచ్ఛన్= తమ ఇష్టం వచ్చినట్లు; వర్తించి= ప్రవర్తించి, నడచి; సుఖంబు+ఉండువారు+కాన్= హాయిగా జీవించేవారు కమ్మని; ప్రార్థించి= వేడుకొని; వినయంబుతోన్= వినమ్రతతో; ధృతరాష్ట్ర గాంధారులన్= ధృతరాష్ట్రుడినీ, గాంధారినీ; నగరిలోనికిన్= రాజప్రాసాదంలోకి; అనిచి= పంపి; పౌరులను= పురజనులను; జానపదులను= గ్రామప్రజలను; పోవన్+పనిచి= వీడ్కొలిపి; కృప+ఆచార్యున్= కృపాచార్యుడిని; సగౌరవంబుగాన్= గౌరవపురస్సరంగా; నిజనివాసంబునకున్= తన (కృపాచార్యుడి) ఇంటికి; అరుగన్= వెళ్ళటానికి; వీడ్కొలిపి= వీడుకోలు చెప్పి; యువరాజ పదంబునన్= యువరాజ పదవిలో; భీమసేనున్= భీముడిని; నిలిపి= ఉంచి; కర్తవ్య= చేయవలసినది; విచారంబునకున్= ఆలోచించటానికి; తదీయ= దానిని; నిశ్చయంబునకును= నిర్ణయించటానికి; సంధి విగ్రహ+ఆది= సంధి విగ్రహం మొదలైన; షాడ్గుణ్య= ఆరు గుణాల; చింతనంబునకును= ఆలోచనకు; విదురునిన్= విదురుడిని; ప్రియవచన పూర్వకంబుగాన్= మంచిమాటలతో; నియోగించి= ఒప్పించి (ఆజ్ఞాపించి); వలయు= అవసరమైన; పనులు= కార్యాలు; వెనుక ముందు= వరుస క్రమం; అరసి= చూచి; ఎఱింగించుటకున్= తెలియచెప్పటానికి; ఆయవ్యయంబులు= ఆదాయం, ఖర్చు; ఎఱింగించుటకును= తెలియపరచటానికి; సంజయున్= సంజయుడిని; చొనిపి= ప్రవేశపెట్టి; సేనల= సైన్యం; కొలందులు= పరిమితులు, లెక్కలు; కనుంగొనుటకున్= చూడటానికి; భృత్యులకున్= సేవకులకు; జీవితంబులు= జీతాలు; పెట్టుటకున్= ఇవ్వటానికి; కర్మకలాపంబులు= పనిపాటలు; చేయించుటకున్= చేయించటానికి; నకులున్+ఆజ్ఞాపించి= నకులుడిని నియోగించి; దర్పితులన్= అహంకరించినవారిని; మర్దించుటకున్= నుగ్గుచేయటానికి; పరచక్రంబులు= ఇతర రాజ్యాలను; ఆక్రమించుటకున్= స్వాధీనం చేసికొనటానికి; అర్జునున్= అర్జునుడిని నియమించి; బ్రాహ్మణకార్యంబులకున్= విప్రుల పనులకు; శ్రౌత= వేదసంబంధమైన; స్మార్త= స్మృతులకు సంబంధించిన; కృత్య= కార్యాలు; సమనుష్ఠానంబునకున్= చక్కగా నిర్వర్తింపబడటానికి; ధౌమ్యున్= ధౌమ్యుడిని; చాలించి= నియోగించి; సహదేవున్= సహదేవుడిని; చూచి= కని; నీవు; మదీయ= నా; గోపన పరుండవు+ఐ= నా రక్షణ చూచే వాడవై; సర్వ+అవస్థలఅందున్= అన్ని స్థితులలోను; మత్= నా; సమీపంబునన్= చేరువలో; నిల్చునది= నిలవవలసింది; అని= అంటూ; పలికి= మాటాడి; కరణీయంబులు+అగు= చేయదగినవి అయిన; అధికారంబులన్= పెత్తనాలు; ఎల్లను= అన్నింటినీ;

కల్పించి= కలుగచేసి; వారలమీఁదను+అ= వారి మీదే; పెట్టి= ఉంచి; యుయుత్సున్= యుయుత్సుడిని; కనుంగొని= చూచి; విదుర సంజయులన్= విదురుడినీ, సంజయుడినీ; ఆలోకించి= చూచి; మీరలు= మీరు; అనుదినంబును= ప్రతిరోజూ; అవధానంబు= హెచ్చరిక; కలిగి= కలిగి ఉండి; రాచవారి= రాజవంశంవారి; యోగక్షేమంబులు= లాభం, మేలు; ఏను= నేను; ఎట్లు+అట్లు+అ= ఎట్లో అట్లే; నిర్వహింపవలయున్= నిర్వర్తించాలో; పురజనంబుల= పౌరుల; భూజనంబుల= ప్రజల; కర్జంబులు= కార్యాలు; రాచవారికిన్= పాలకులకు; ఎఱింగించి= తెలియజేసి; పంచిన+అట్లు= ఆజ్ఞాపించినట్లుగా; నడపన్+కలవారలు= నడిపించగలరు; అని= పలికి; అప్పగించి= అప్పచెప్పి; కుంతీదేవినిన్= కుంతీదేవిని; పాంచాలీ సహితంబుగాన్= ద్రౌపదితోపాటు; అభ్యంతర మందిరంబునకున్= అంతఃపురానికి; విజయం చేయుము+అని= వేంచేయుమని; పుచ్చి= పంపి.

తాత్పర్యం: ఈ విధంగా చెప్పి తమ ఇచ్చవచ్చినట్లు నడచి సుఖంగా ఉండండని వారిని ప్రార్థించాడు. గాంధారీధృతరాష్ట్రులను వినమ్రంగా రాజప్రాసాదానికి పంపాడు. పురజనులను, గ్రామీణులను వెళ్ళండని సెలవిచ్చాడు. కృపాచార్యుడిని గౌరవపురస్సరంగా స్వగృహానికి వెళ్ళటానికి వీడ్కోలు చెప్పాడు. భీముడిని యువరాజు స్థానంలో నిలిపాడు. కర్తవ్యం ఆలోచించి నిర్ణయించటానికి శత్రువుతో పొందు, యుద్ధం మొదలైన ఆరు రాజగుణాలు ఆలోచించటానికి మంచి మాటలతో విదురుడిని అంగీకరింపచేసి, చేయవలసిన పనుల వరుసక్రమం చూచి చెప్పటానికి, ఆదాయం వ్యయం తెలపటానికి సంజయుడిని నియమించి, సైన్యం వివరాలు తెలిసికొని, సేవకులకు జీతాలు ఇవ్వటానికి, వారిచేత పనులు చేయించటానికి నకులుడిని నియమించి. అహంకరించినవారిని అణచటానికి, శత్రురాజ్యాలు ఆక్రమించటానికి అర్జునుడిని నియోగించి, బ్రాహ్మణుల పనులను, వేద, స్మృతి సంబంధి కార్యాచరణను ధౌమ్యుడికి అప్పగించి, సహదేవుడి వంక చూచి 'నీవు నన్ను రక్షిస్తూ, ఎల్లవేళలా నా చేరువలో ఉండు' మని ఆజ్ఞాపించి, చేయదగిన పనులను తగిన పెత్తనం కల్పించి తగిన వారికి అప్పగించాడు. యుయుత్సుడిని, విదురుడిని, సంజయుడినీ చూచి 'మీరు ఎప్పుడూ హెచ్చరికతో ఉండి రాజవంశంవారి లాభాన్నీ మంచినీ నేను చూడాల్సిన విధంగా చూస్తూ, పురజనుల, సర్వజనుల పనులు పాలకులకు చెప్పి, ఆజ్ఞాపించిన విధంగా పనులు నిర్వర్తించగలరు' అన్నాడు. కుంతీదేవిని ద్రౌపదితో కూడా అంతఃపురానికి పంపాడు.

విశేషం: షడ్గుణాలు= సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధము, ఆశ్రయం. సంధి= శత్రువుతోపొత్తు - ఇది మూడు విధాలు: 1. కోశప్రధాన హేతుకం, 2. దండప్రధానహేతుకం; 3. భూమిప్రధాన హేతుకం.

తే. ప్రేమ సంప్రీతి వినయ మిశ్రిత విలోక । నంబు గృష్ణుని ముఖకమలంబునందు
మాసరంబగు వికసన మధువునకు మ । ధువ్రతంబయి నిగుడ నా సువ్రతుండు. 379

ప్రతిపదార్థం: ప్రేమ= అనురాగం; సంప్రీతి= మిక్కిలి ఇష్టం; వినయ= వినమ్రత; మిశ్రిత= కలిసిన; విలోకనంబు= చూపు; కృష్ణుని= శ్రీకృష్ణుడి; ముఖ= ముఖమనే; కమలంబునందున్= పద్మంలో; మాసరంబు+అగు= అధికమైన వికసన= వికాసమనే; మధువునకున్= తేనెకొరకు; మధువ్రతంబు+అయి= తేనె త్రాగే తుమ్మెద అయి; నిగుడన్= ఒప్పారగా; ఆ సువ్రతుండు= ఆ సదాచారి.

తాత్పర్యం: అనురాగం, ఎంతో ఇష్టం, వినయం కలిసిన ధర్మరాజు చూపులు కృష్ణుడి ముఖమనే పద్మంలో వృద్ధిపొందే తేనెకొరకు తుమ్మెదవలె ప్రసరిస్తుండగా ఆ ధర్మరాజు. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అమ్మహాత్ముని సాత్యకి సహితంబుగా వీడుపట్టున కనుప ననుజన్ముల ననిచి, యుచితవర్తనంబున నుండి పదంపడి భండనంబునం జచ్చిన వారిం జిత్తంబున నిరూపించి తొడంగి. 380

ప్రతిపదార్థం: ఆ+మహాత్మునిన్= ఆ ఘనుడైన శ్రీకృష్ణుడిని; సాత్యకి సహితంబుగాన్= సాత్యకితో సహా; వీడుపట్టునకున్= ఇంటికి; అనుపన్= పంపటానికి; అనుజన్ములన్= తమ్ములను; అనిచి= పంపి; ఉచిత= తగిన; వర్తనంబునన్= నడవడికతో, ఉండి; పదంపడి= తరువాత; భండనంబునన్= యుద్ధంలో; చచ్చినవారిన్= మరణించినవారిని; చిత్తంబునన్= మనస్సులో; నిరూపించి= గుర్తించి; తొడంగి= ప్రారంభించి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడిని సాత్యకితో కూడా విడిదికి పంపండని తమ్ములను ఆజ్ఞాపించి, యోగ్యమైన నడవడికతో ఉండి, తరువాత (కొంతకాలానికి) యుద్ధంలో మరణించిన వారిని మనసులో గుర్తించి, పూనుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **బ్రాహ్మణానుజ్ఞతోఁ గూడ బంధుజనుల । కందఱకు వేఱువేఱు మహావిభూతి**
వెలయ నంచిత శ్రాద్ధ క్రియలు సభక్తి । కముగ రత్న హేమాది దానములు మెఱయ. **381**

ప్రతిపదార్థం: బ్రాహ్మణ= విప్రుల; అనుజ్ఞతోన్= అనుమతితో; కూడన్= తగినట్లుగా; బంధుజనులకున్= చుట్టాలకు; అందఱకున్= అంతమందికి; వేఱువేఱు= విడి విడిగా; మహా= గొప్ప; విభూతి= వైభవం; వెలయన్= ఒప్పుగా; అంచిత= గౌరవించదగిన విధంగా; రత్న= మణులు; హేమ= బంగారం; ఆది= మొదలైన; దానములు= దానాలు; మెఱయన్= వెలుగుతుండగా; శ్రాద్ధక్రియలు= అపరకర్మలు; సభక్తికముగన్= భక్తితో.

తాత్పర్యం: బ్రాహ్మణుల అనుమతిలో తగినట్లుగా, బంధువులందరికీ విడి విడిగా శ్రాద్ధకర్మలను వైభవంతో, భక్తిపూర్వకంగా, మణులు రత్నాలు దానంగా ఇస్తూ. (తరువాతి వచనంతో అన్వయం).

వ. **అనుష్ఠించి ద్రోణాచార్య ద్రుపద తద్బంధు విరాట తదీయ జ్ఞాతులకును బ్రత్యేకంబ కర్ణాభిమన్యు ప్రభృతుల కెట్లట్ల సర్వదక్షిణ సామగ్రి వెలయం బరలోక క్రియలు నిర్వర్తింపంజేసి, దుర్యోధనాదులకు నంతకంటె విభవం బెసంగ ధృతరాష్ట్రుం డౌర్ధ్వదైహిక విధు లాచరించునట్లుగా నొనర్చి, తా నెఱింగిన వారల కెల్ల లగ్గు సేయుటకుఁ, దగు బంధులు లేని వసుంధరాధిపుల నెల్ల నుద్దేశించి యంచితదానంబులతోఁ జేయ ధౌమ్యుం బనిచెఁ; మఱియును.** **382**

ప్రతిపదార్థం: అనుష్ఠించి= ఆచరించి; ద్రోణ+ఆచార్య= ద్రోణుడికి; ద్రుపద= ద్రుపద మహారాజునకు; తద్+బంధు= ద్రుపదుడి బంధువులకు; విరాట= విరాటరాజుకు; తదీయ= అతడి; జ్ఞాతులకును= దాయాదులకు; ప్రత్యేకంబ= విశేషంగా; కర్ణ= కర్ణుడు; అభిమన్యు= అభిమన్యుడు; ప్రభృతులకున్= మొదలైనవారికి; ఎట్లు+ఎట్లు+అ= ఏ విధమో అదే విధంగా; సర్వ= సమస్తమైన; దక్షిణ సామగ్రి= దాన సమయంలో ఇచ్చే దక్షిణకు ఉపయోగించే వస్తువులు; వెలయన్= ఒప్పుగా, ఉండగా; పరలోక క్రియలు= ఉత్తర క్రియలు; నిర్వర్తింపన్+చేసి= చేయించి; దుర్యోధన+ఆదులకున్= దుర్యోధనుడు మొదలైనవారికి; అంతకంటెన్= మిగిలిన వారికంటె; విభవంబు= వైభవం; ఎసంగన్= అధికంకాగా; ధృతరాష్ట్రుండు; ఔర్ధ్వదైహిక= పరలోక; విధులు= క్రియలు; ఆచరించునట్లుగాన్= చేసేటట్లుగా; ఒనర్చి= చేసి; తాన్= తాను; ఎఱింగిన= తెలిసిన; వారలకున్+ఎల్లన్= వారందరికీ; లగ్గు= శుభం; చేయుటకున్= చేయటానికి; తగు= తగిన; బంధులు= చుట్టాలు; లేని= లేనటువంటి; వసుంధరా+అధిపులన్= రాజులకు; ఎల్లన్= అందరినీ; ఉద్దేశించి= లక్షించి; అంచిత= గౌరవించతగిన, గొప్ప; దానంబులతోన్= దానాలతో; చేయన్= చేయటానికి; ధౌమ్యున్= ధౌమ్యుడిని; పనిచెన్= నియోగించాడు; మఱియును=ఇంకా.

తాత్పర్యం: శ్రాద్ధకర్మలు నిర్వర్తించాడు ద్రోణుడికీ, ద్రుపదుడికీ అతడి బంధువులకు, విరాటరాజుకు అతడి జ్ఞాతులకు, కర్ణాభిమన్యులకు విశేషంగాను అన్ని దక్షిణలు మొదలైన వాటితో ఉత్తరలోక క్రియలు జరిపించాడు. దుర్యోధనాదులకు

అంతకన్న గొప్ప వైభవంగా పరలోక క్రియలు ధృతరాష్ట్రుడిచేత చేయించాడు. తనకు తెలిసినవారి కందరికీ శుభం కలిగించాలని అనుకొని ఉత్తర క్రియలు చేసే తగిన వారసులు లేని రాజులందరికొరకు తగిన దానాదులతో పరలోక క్రియలు నిర్వర్తించటానికి తనపురోహితుడైన ధౌమ్యుడిని నియోగించాడు. అంతేకాక.

క. చలివందిరులును సత్తం। బులుఁ బెట్టించెను, దటాకములు దేవగృహ
మ్ములుఁ గల్పించెను, బంధుజ। నులకు సుగతి యగుటకై వినుతభంగి నృపా! 383

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; బంధుజనులకున్= చుట్టాలకు; సుగతి= మంచిగతులు; అగుటకున్+ఐ= కలగటానికి; చలిపందిరులును= చలివేంద్రాలు (దాహార్తులకు నీటిని పోసేచోట్లు); సత్త్రంబులును= బాటసారులకు భోజనంపెట్టేచోటులు; పెట్టించెను= ఏర్పాటు చేశాడు; తటాకములు= చెరువులు; దేవగృహమ్ములు= దేవాలయాలు; కల్పించెను= నిర్మించాడు.

తాత్పర్యం: బంధువులకు ఉత్తమ లోకాలు ప్రాప్తించాలని ధర్మరాజు చలివేందరాలు సత్త్రాలు (మనిషికి అవసరమైన అన్నపానీయాలు అందరికీ అందించే తావులు) ఏర్పాటు చేశాడు. చెరువులు, దేవాలయాలు నిర్మాణం చేశాడు.

క. లోకమునఁ గలుగు భూసుర। లోకమునకు నెల్ల గోవులుం బసిఁడియు నా
నా కల్పంబులు బంధుల। కై కోటివిధముల నిచ్చె నతులిత భక్తిన్. 384

ప్రతిపదార్థం: నానాకల్పంబులు= అనేక కల్పముల కాలం; బంధువులకున్+ఐ= చుట్టాల సద్గతులకొరకు; లోకమునన్= జగత్తులో; కలుగు= ఉన్న; భూసుర= బ్రాహ్మణ; లోకమునకున్= సమూహానికి; ఎల్లన్= అందరికీ; గోవులున్= ఆవులును; పసిఁడియున్= బంగారం; కోటి విధములన్= ఎన్నో తీరులుగా; అతుల భక్తిన్= సాటిలేని భక్తిభావంతో; ఇచ్చెన్= దానం చేశాడు.

తాత్పర్యం: ఎన్నో కల్పాలకాలం తన బంధువులకు సద్గతులు లభించాలని, లోకంలో ఉన్న బ్రాహ్మణ సమూహం అంతటికీ, గోవులు, బంగారం ఎన్నో విధమైన పద్ధతులలో భక్తిభావంతో దానం చేశాడు.

వ. ఇట్లు సకలబాంధవ సుహృజ్జనంబులకుం బారలౌకికక్రియలు సేసి యనృణత్వంబున వెలింగి జగంబులచేతం బొగడు వడసి, గృతకృత్యంబుఁ బొందె; నివ్విధంబునఁ బ్రాప్తసామ్రాజ్యం డయిన పాండవాగ్రజుం డొక్క సముచితావసరంబున గోవిందున కభిముఖుం డయి వినయంబునం గేలు మొగిచి. 385

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సకల= అందరు; బాంధవ= బంధువులు; సుహృత్+జనంబులకున్= మిత్రులకు; పారలౌకిక క్రియలు= ఉత్తర క్రియలు; చేసి= ఆచరించి; అనృణత్వంబున= ఋణంలేకపోవటంతో; వెలింగి= ఒప్పి; జగంబులచేతన్= లోకాలన్నిటి చేత; పొగడు+పడసి= కీర్తిని పొంది; కృతకృత్యతన్= ధన్యతను; పొందెన్= పొందాడు; ఈ విధంబునన్= ఈ తీరుగా; ప్రాప్త= పొందిన; సామ్రాజ్యుండు+ఐన= రాజ్యం కలవాడైన; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; ఒక్క= ఒక; సముచిత+అవసరంబునన్= తగిన సమయంలో; గోవిందునకున్= కృష్ణుడికి; అభిముఖుండు+అయి= ఎదురు నిలిచినవాడై; వినయంబునన్= వినమ్రంగా; కేలు మొగిచి= చేతులు జోడించి.

తాత్పర్యం: ఈ విధంగా బంధువులకు స్నేహితులకు ఉత్తరక్రియలు నిర్వర్తించి, ఋణం లేనివాడై ఒప్పి లోకాలన్నిటిచేత కీర్తించబడినవాడై ధన్యుడయ్యాడు. ఈ విధంగా రాజ్యం పొందినవాడైన ధర్మరాజు తగిన సమయంలో శ్రీకృష్ణుడి ఎదుట నిలిచి వినయంతో నమస్కరించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మానవుడికి మూడు ఋణాలుంటాయి. 1. దేవఋణం, 2. ఋషిఋణం, 3. పితౄణం. పితౄణం చనిపోయినవారికి ఉత్తరక్రియలు నిర్వహించటంద్వారా తీరుతుంది. కనుక ధర్మరాజు బంధుమిత్రులందరికీ శ్రాద్ధకర్మలు నిర్వర్తించి ఋణవిముక్తుడయ్యాడు.

ధర్మజుఁడు శ్రీకృష్ణు నుచిత వచనంబుల స్తుతించుట (సం. 12-43-1)

తే. **అమల భవదీయ సుప్రసాదమునఁ జేసి । పితృపితామహక్రమయోగ్య పీఠ మైన**
వినుత సామ్రాజ్యమున కేను విభుఁడనై కృ । తార్థతానంద పూర్ణుండ నైతిఁ గృష్ణ!' **386**

ప్రతిపదార్థం: కృష్ణ!= కృష్ణా!; అమల= స్వచ్ఛమైన; భవదీయ= నీ యొక్క; సుప్రసాదమునన్+చేసి= అనుగ్రహంచేత పితృపితామహక్రమ= తండ్రి, తాతల వరుసలో; యోగ్య= అర్హ (పొందదగిన); పీఠము+ఐన= ఆసనమైన; వినుత= కీర్తనీయమైన; సామ్రాజ్యమునకున్= ఈ మహారాజ్యానికి; ఏను= నేను; విభుఁడను+ఐ= రాజునై; కృత+అర్థతా= కోరినది నెరవేరటం అనే; ఆనంద= సంతోషంతో; పరిపూర్ణుండను+ఐతిన్= పూర్తిగా నిండినవాడి నయ్యాను.

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! అచ్ఛమైన నీ అనుగ్రహంవలన తాత తండ్రులచేత వరుసగా (వంశక్రమానుగతంగా) పొందదగినదైన ప్రశస్తమైన సామ్రాజ్యానికి నేను రాజునయ్యాను. ధన్యతనొందటంవలన కలిగిన ఆనందంతో పూర్తిగా నిండిపోయాను'.

వ. **అని మఱియును.** **387**

తాత్పర్యం: అని చెప్పి, ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **'బావలు మఱఁదులు ననుచును । నీవు కృపాతిశయ మెసఁగ నెమ్మిని మమ్ముం**
గావను బ్రోవను దలఁచి ర । మావర! కలిపికొని తిరిగి మన్నించుటలన్. **388**

ప్రతిపదార్థం: రమావర!= లక్ష్మీపతీ!; నీవు; కృపా+అతిశయము= కరుణయొక్క; ఆధిక్యం; ఎసఁగన్= మించగా; బావలు, మఱఁదులున్= మేనత్త కొడుకులు; అనుచును= అంటూ; కలిపికొని= చేరదీసి; తిరిగి= కలిసివర్తించి; మన్నించుటలన్= ఆదరించటాలతో; నెమ్మిని= ప్రేమతో; మమ్మున్= మమ్మల్ని (పాండవులను); కావను= కాపాడాలని; ప్రోవను= రక్షించాలని; తలఁచి= అనుకొని.

తాత్పర్యం: లక్ష్మీపతివైన శ్రీకృష్ణా! మమ్మల్ని బావలూ, మరదులూ అంటూ నీతో కలుపుకొని ప్రవర్తించటం, కరుణాతిశయంతో, ప్రేమతో మమ్ములను కాచి రక్షించాలని తలంచి.

వ. **తేఁకువలేక మెలంగితిమి గాక! భవదీయ మహానుభావం బున్నరూపెఱుంగను దగం గొనియాడను నే మెంతటి వార?'మని పలికి వెండియు.** **389**

ప్రతిపదార్థం: తేఁకువ= భయం; లేక= లేకుండ; మెలంగితిమి= జీవించాము; కాక; భవదీయ= నీ; మహా+అనుభావంబు= మాహాత్మ్యం; ఉన్నరూపు= కలరూపు, వాస్తవం; ఎఱుంగనున్= తెలిసికొనటానికి; తగన్= చక్కగా; కొని+ఆడనున్= పొగడటానికి; ఏము= మేము; ఎంతటివారము?= ఎంత? చాలగలమా?; అని= అంటూ; పలికి= మాటాడి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: (ఆ కారణంచేతనే) మేము భయం లేకుండ జీవించాము కదా! నీ గొప్పతనం, నీ నిజరూపం తెలిసికొనటానికి, చక్కగా కీర్తించటానికి మేమెంతటి వారం? (సమర్థులం కాము అని భావం)' అంటూ మాటాడి, ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ' ఆదిమ పురుషుఁడ వగుటను । వేదంబులు సెప్పు నవియు వెఱచుఁ బలుకఁగా
నీదృక్ప్రకారుఁ డని దా । మోదర! నీ పెం పెఱుంగ నొరులు కలవియే? 390

ప్రతిపదార్థం: దామోదర!= కృష్ణా!; వేదంబులు= వేదాలు; ఆదిమ పురుషుఁడవు+అగుటను= సృష్టిలో మొట్టమొదటి శరీరధారివి; అగుటను= కావటం; చెప్పున్= చెపుతాయి; ఈదృక్+ప్రకారుఁడు+అని= ఈ విధమైనవాడు అని; పలుకఁగాన్= చెప్పటానికి; అవియున్= ఆ వేదాలు కూడా; వెఱచున్= భయపడతాయి; ఒరులకున్= ఇతరులకు; నీ పెంపు= నీ ఘనత; ఎఱుంగన్= తెలియటం; అలవి+ఏ= సాధ్యమౌతుందా?

తాత్పర్యం: 'కృష్ణా! నీవు సృష్టికి ఆద్యుడవని వేదాలు చెప్పుతున్నాయి. కాని, నీ విటువంటివాడివని ఇదమిత్థంగా చెప్పటానికి ఆ వేదాలే భయపడుతున్నాయి. అటువంటప్పుడు ఇతరులకు నీ ఘనత తెలిసికొనటం సాధ్యమా? (కాదు అని భావం).

క. దురితములఁ జెఱుప శుభములఁ । బెరిఁగింపం జాలునట్టి పేళ్ళులు నీకుం
బురుషోత్తమ! కడుఁ బె క్కవి । పరమార్థ ద్యోతకములు భావింపంగన్. 391

ప్రతిపదార్థం: పురుష+ఉత్తమ!= జీవులలో శ్రేష్ఠుడా!; దురితములన్= పాపాలను; చెఱుపన్= పోగొట్టటానికి; శుభములన్= శ్రేయములను; పెరిఁగింపన్= వృద్ధిచేయటానికి; చాలునట్టి= సమర్థమైన; పేళ్ళులు= నామాలు, బిరుదులు; నీకున్= నీకు; కడున్= మిక్కిలి; పెక్కు= ఎక్కువ; అవి= ఆ పేరులు; భావింపంగన్= భావనచేస్తే, బాగా మననం చేస్తే; పరమ+అర్థ= ఉత్కృష్టమైన ప్రయోజనాన్ని (పరమాత్మను); ద్యోతకములు= ప్రకాశింపచేసేవి (తెలియచెప్పేవి).

తాత్పర్యం: పురుషోత్తముడవైన శ్రీకృష్ణా! పాపాలు పోగొట్టేవీ పుణ్యాలు పెంచేవీ అయిన పేరులు నీకు ఎన్నో ఉన్నాయి. వాటిని భావన చేస్తే అవి పరమాత్మను తెలియచేస్తాయి.

విశేషం: పురుషోత్తముడు అనేది సార్థక ప్రయోగం. పురుషుడు అంటే శరీరధారి, ప్రాణి అని అర్థం. పురుషోత్తముడు అంటే జీవులన్నింటిలోను ఉత్కృష్టుడు అని సామాన్యార్థం. దానినే 'భావన' చేస్తే సర్వజీవులలోనూ ఉత్తమపురుష (నేను, తాను - ఆత్మను) గా ఉండేవాడని ద్యోతకం అవుతుంది (స్ఫురిస్తుంది).

భావన= ఒక భావాన్ని మననం చేసి చేసీ అదే తాను అయిపోవటం.

పరమార్థం= పురుషార్థాలకు పైన ఉన్నది.

భగవంతుడికి ఉన్న నామాలు స్వల్ప ప్రయోజనాలను ఆశించినవారికి (పాపాలు పోవటం, పుణ్యాలు కలగటం వంటివి) అంతే అందజేస్తాయి. వాటి పరమార్థం తెలిసి భావించినవారికి పరమార్థాన్నే స్ఫురింపచేస్తాయి. ఈ విషయం నిరూపించటానికి పురుషోత్తమ అనే నామమే ఉదాహరణ. సామాన్యార్థం శ్రేష్ఠుడు అని పరమార్థం - సర్వవ్యాపి, అంతర్యామి అయిన పరమాత్మ అని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **ప్రయతు లగు సద్విజులు వానిఁ బరమభక్తి । యుక్తి నెపుడుఁ బఠించుచు భక్తి ముక్తి**
దాయి వగు నిన్ను సతతంబుఁ దలఁచుచును న । మస్కృతులు సేసి యవ్యయ మహిమఁగంద్రు.'392

ప్రతిపదార్థం: ప్రయతులు+అగు= పరిశుద్ధులైన; సత్+ద్విజులు= సత్‌బ్రాహ్మణులు; వానిన్= ఆ నామాలను; పరమ= ఉత్కృష్టమైన ; భక్తియుక్తిన్= భక్తికలిగి; ఎపుడున్= ఎల్లప్పుడు, సదా; పఠించుచున్= చదువుతూ, పారాయణచేస్తూ; భుక్తి= భోజనం, భోగం; ముక్తి= మోక్షం; దాయివి+అగు= ఇచ్చేవాడివైన; నిన్నున్; సతతంబున్= ఎల్లప్పుడూ; తలఁచుచును= భావిస్తూ; నమస్కృతులు= కైమోడ్పులు; చేసి= ఆచరించి; అవ్యయ= వ్యయం కాని, స్థిరమైన; మహిమన్= మాహాత్మ్యాన్ని; కంద్రు= పొందుతారు.

తాత్పర్యం: బహిరంతర శుద్ధులైన సద్బ్రాహ్మణులు ఆ నీ నామాలను చాలా గొప్పదైన భక్తితో వల్లెవేస్తూ భోగాలనూ, మోక్షాన్నీ ప్రసాదించే నిన్ను సదా భావిస్తూ నీకు నమస్కరిస్తూ ఉండి నశించని శాశ్వతమైన మహత్త్వాన్ని పొందుతారు'.

వ. **అని పలికి విష్ణు విశ్వాత్మ జిష్ణు శర్వ హంస దామోదర శంభు ప్రముఖంబులగు ప్రభూత నామంబులం బ్రస్తుతించినఁ బ్రీతుండై పుష్కరాక్షుండు పుష్కలంబైన వాగ్విశేషంబుల నా ధర్మనందను నభినందించెఁ; దదనంతరంబ కొల్చియున్న జనంబుల నిజనివాసంబులకుం బోవం బనిచి, యక్కురుసత్తముండు దమ్ముల నాలోకించి.** **393**

ప్రతిపదార్థం: అనిపలికి= అంటూ మాటాడి; విష్ణు= వ్యాపనశీలం కలిగి విశ్వమంతా వ్యాపించినవాడు; విశ్వ+ఆత్మ= విశ్వానికి ఆత్మ అయినవాడు, విశ్వమే తాను (ఆత్మ) అయినవాడు; జిష్ణు= జయశీలి, జయించే లక్షణం కలవాడు; శర్వ= సంహారసమయంలో సకల ప్రాణులను రుద్రరూపంలో సంహరించేవాడును; హంస= ఉచ్ఛ్వాస నిశ్వాసరూపమైన ప్రాణంగా, ఓంకారంగా జీవులలో ఉండేవాడు; దామోదర= దామము(మాల)ఉదరమునందు కలవాడు; శంభు= సుఖాన్ని (భక్తులకు) కలిగించేవాడు; ప్రముఖంబులు+అగు= మొదలైన; ప్రభూత= గొప్ప; నామంబులన్= పేరులతో; ప్రస్తుతించినన్= కీర్తించగా; ప్రీతుండు+ఐ= సంతసించినవాడై; పుష్కర+అక్షుండు= తామరలను పోలిన కన్నులు కలవాడు అయిన శ్రీకృష్ణుడు; పుష్కలంబు+ఐన= సమృద్ధిగా ఉన్న; వాక్+విశేషంబులన్= విశేషమైన మాటలతో; ఆ ధర్మనందనున్= ఆ ధర్మరాజును; అభినందించెన్= పొగిడాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; కొల్చి+ఉన్న= కొలువు తీర్చి ఉన్న; జనంబులన్= ప్రజలను; నిజనివాసంబులకున్= తమ ఇళ్ళకు; పోవన్= వెళ్ళండని; పనిచి= ఆజ్ఞాపించి; ఆ+కురుసత్తముండు= ధర్మరాజు; తమ్ములన్= అనుజులను; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అని మాటాడి ధర్మరాజు కృష్ణుడిని విష్ణువు, విశ్వాత్ముడు, జిష్ణువు, శర్వుడు, హంసుడు, దామోదరుడు, శంభుడు మొదలైన పవిత్ర నామాలతో కీర్తించాడు. దానికి సంతసించిన శ్రీకృష్ణుడు సమృద్ధమైన మాటలతో విశేషంగా ధర్మరాజును అభినందించాడు. ఆ తరువాత కొలువుతీరి ఉన్న ప్రజలనందరినీ తమ తమ ఇళ్ళకు వెళ్ళుడని పంపించాడు. అప్పుడు తమ్ములను చూచి.

మ. **' అటవీదేశములందు గాఢబహులాయాసంబులం గంది, దు**
ర్ఘట మత్స్యేశ్వరు సేవఁ గుంది, బహుసంగ్రామంబులన్ విద్విష
త్పటు నానాస్త్ర మహోగ్ర శస్త్రచయ నిర్ఘాతాంగతం బొంది యు
త్కట దుఃఖంబుల మీర లొందితి రభేద్యస్థైర్యులై నాకుఁగాన్. **394**

ప్రతిపదార్థం: 'మీరలు= మీరు; నాకున్+కాన్= నాకొరకు; అభేద్య స్థైర్యులు+ఐ= మొక్కవోని స్థిరత్వం కలవారై; అటవీ దేశముల +అందున్= అరణ్య ప్రదేశాలలో; గాఢ= తీవ్రమైన; బహుల= అనేక; ఆయాసంబులన్= శ్రమలతో; కంది= బాధపడి; దుర్ఘట= కలగకూడనటువంటి; మత్స్య+ఈశ్వరు= మత్స్యదేశరాజైన విరటుడి; సేవన్= కొలువులో; కుంది= వగచి; బహు= అనేక; సంగ్రామంబులన్= యుద్ధాలలో; విద్విషత్= శత్రువుల; పటు= పటిష్ఠమైన; నానా= బహు; అస్త్ర= మంత్రపూతంగా ప్రయోగించే ఆయుధాల వలన; మహా+ఉగ్ర= గొప్ప భయంకరమైన; శస్త్రచయ= ఆయుధ సమూహంవలన; నిర్భగ్న+అంగతన్= మిక్కిలి దెబ్బతిన్న శరీరం; పొంది= కలిగి ఉండి; ఉత్కట= అధికమైన; దుఃఖంబులన్= శోకాలను; ఒందితిరి= పొందారు.

తాత్పర్యం: 'మీరు నా కొరకు స్థైర్యం చెదరనివారై అడవులలో తీవ్రమైన కష్టాలు ఎన్నో అనుభవించి బాధపడ్డారు. దురదృష్టవశాత్తు విరటుడి కొలువులో సేవచేసి కష్టపడ్డారు. అనేక యుద్ధాలలో అస్త్రశస్త్రాలచేత దెబ్బతిన్న అవయవాలు కలవారయ్యారు. అధికమైన శోకాన్ని పొందారు.

వ. **నన్నుం గృతకృత్యునిం జేసితిరి; కృష్ణ ప్రసాద లబ్ధంబయిన యీ జయశోభనంబు నిజేచ్ఛాకలిత సుఖావాప్తి లీల ననుభవించుచు నాత్మప్రియ ప్రకారంబుల వర్తించుచు, నవధానంబుతో రాజ్యాంగ సప్తకం బరయుం'డని చెప్పి యాంబికేయు ననుజ్ఞతోడ.** **395**

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను; కృతకృత్యునిన్= ధన్యుడిని; చేసితిరి= చేశారు; కృష్ణ= శ్రీకృష్ణుడి; ప్రసాద= అనుగ్రహంవలన; లబ్ధంబు+ఐన= లభించిన; ఈ జయశోభనంబు= ఈ విజయంయొక్క వైభవం; నిజ+ఇచ్ఛా కలిత= మీమీ కోరికలతో కూడుకొన్న; సుఖ+అవాప్తి= సుఖమును పొందటం అనే; లీలన్= విలాసాన్ని; అనుభవించుచున్= అనుభూతిచెందుతూ; ఆత్మ ప్రియ ప్రకారంబులన్= మనసుకు నచ్చిన తీరులలో; వర్తించుచున్= మెలగుతూ; అవధానంబుతోన్= హెచ్చరికతో; రాజ్యాంగ సప్తకంబు= రాజ్యపాలనాతంత్రంలోని ఏడు అంశాలు; అరయుండు= చూస్తూ ఉండండి; అని= అంటూ; చెప్పి= పలికి; ఆంబికేయు= ధృతరాష్ట్రుడి; అనుజ్ఞ+తోడన్= అనుమతితో.

తాత్పర్యం: 'అట్లా కష్టపడి నన్ను ధన్యుడిని చేశారు. శ్రీకృష్ణుడి అనుగ్రహంవలన లభించిన ఈ విజయ వైభవాన్ని మీమీ ఇష్టాలతో కూడిన సుఖాన్ని పొందటం అనే క్రీడను అనుభవిస్తూ, మీకు నచ్చిన విధంగా నడుచుకొంటూ హెచ్చరికతో (జాగరూకులై) రాజ్యాంగసప్తకాన్ని చూడండి (పట్టించుకొండని భావం)' అని చెప్పి ధృతరాష్ట్రుడి అనుమతితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: రాజ్యాంగ సప్తకం: 1. ప్రభువు, 2. మంత్రము, 3. ధనాగారం, 4. దుర్గం, 5. సైన్యం, 6. రాష్ట్రం (ప్రజలు), 7. మిత్రులైన రాజులు.

సీ. **బహురత్నమయ ఘనప్రాసాదమండప । దాసదాసీ జనోద్భాసితంబుఁ,**
దత్తుల్య వైభవ తదధిక ధనధాన్య । ముఖవస్తు సంచయ సుఖకరంబుఁ,
గిన్నర వల్లభ గృహసమానత్వ మ । హావిభూతి స్ఫురణాంచితంబు,
సర్వసంపత్స్ఫూర్తి చారు వామాక్షీ ప్ర । చార సంశోభిత స్థలచయంబు,

తే. **నైనవాని రారాజుని ల్లనిలజునకు, । దుస్ససేను మందిరము పార్థునకు, వరుస**
తోడ దుర్మర్షణునియును దుర్ముఖునియు । నిండ్లు గవలకు సంప్రీతి నిచ్చె నృపతి. **396**

ప్రతిపదార్థం: నృపతి= రాజు; బహు= నానా; రత్నమయ= మణులతో నిండిన; ఘన= గొప్ప; ప్రాసాద= నగరు; మండప= మంటపం; దాసదాసీజన= సేవకులు, సేవకురాండ్రతో; ఉత్+భాసితంబు= బాగా పైకి వెలిగేది; తద్+తుల్య= దానితో సమానమైన; వైభవ= విభవం; తద్+అధిక= దానికన్న ఎక్కువైన; ధన, ధాన్య= ధనం, ధాన్యం; ముఖ= మొదలైన; వస్తుసంచయ= వస్తు సముదాయంతో; సుఖకరంబున్= హాయిగొలిపేది; కిన్నరవల్లభ= కుబేరుడి; గృహ= ఇంటితో; సమానత్వ= సమానమైన; మహా= గొప్ప; విభూతి= వైభవం; స్ఫురణ= గుర్తుకు తెచ్చే; అంచితము= ఒప్పుకలది; సర్వ= సమస్త; సంపద్= సంపదల; స్ఫూర్తి= ప్రకటమవటంచేత; చారు= మనోహరమైన; వామ+అక్షి= అందమైన కన్నులు కల స్త్రీల; ప్రచార= కదలికలతో; సంశోభిత= బాగా అందమైన; స్థలచయంబున్= అనేక ప్రదేశాలు కలిగినది; ఐనవానిన్= అయినటువంటివాటిని; రారాజు= దుర్యోధనుడి; ఇల్లు= భవనం; అనిలజనకున్= భీముడికి; దుస్ససేనుమందిరము= దుశ్శాసనుడి భవనం; పార్థునకున్= అర్జునుడికి; వరుసతోడన్= క్రమంగా; దుర్మర్షణునియును దుర్ముఖునియును= దుర్మర్షణ, దుర్ముఖుల; ఇండ్లు= మందిరాలు; కవలకున్= నకుల సహదేవులకు; సంప్రీతిన్= మిక్కిలి ఇష్టంతో; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: ధర్మరాజు దుర్యోధనుడి భవనం భీముడికి, దుశ్శాసనుడి మందిరం అర్జునుడికి, దుర్మర్షణుడి నివాసం నకులుడికి, దుర్ముఖుడి నికేతనం సహదేవుడికి ఇష్టంగా ఇచ్చాడు. ఆ భవనాలు మణిమయాలు. గొప్ప అంతఃపురాలు, మండపాలు, దాసదాసీజనాలతో ప్రకాశిస్తున్నాయి. ఆ వైభవాన్ని మించి ధనధాన్యాదులైన సంభారాలతో సుఖాన్ని కల్పిస్తాయి. కుబేరుడి ఇంటితో సమానమైన గొప్ప వైభవాన్ని కలిగి దానిని గుర్తుకు తెచ్చేవి, సమస్త సంపదలను ప్రకటించే అందగత్తెలు అటునిటు తిరుగుతూ ఉండగా కళకళలాడే ప్రదేశాలెన్నో కలిగినవి - ఆ మందిరాలు.

వ. **మఱియు విదుర యుయుత్సు సంజయ ధౌమ్యుల వదనంబు లాలోకించి 'మీ మీ నికేతనంబుల మీరలు గైకొనుం' డని నియోగించి, పెద్ద నగరిలోన ధృతరాష్ట్రుండు మున్ను పన్నుగా వసియించు హర్మ్యంబున నజ్జనపతి నునిచె; నివ్విధంబున గృహంబులు విభజించి యిచ్చి కృష్ణ సాత్యకుల సవ్యసాచి సదనంబున నిల్చునట్లుగా నిర్దేశించి, యందఱం బోవం బనిచి యభ్యంతర మందిరంబున కరిగె; నా భీమసేనాదు లమ్మహనీయ వాసంబులు సేకొని యందుఁ బ్రభూతాన్న పానాద్యనుభవంబుల సుఖించియుండ నవ్విభుండు నిజేచ్ఛ విహరించె'నని యిట్లు ధర్మపుత్రు చరిత్రంబు సెప్పిన విని 'యబ్భంగిం బ్రాప్తసామ్రాజ్యుండై పాండవాగ్రజుండు పదంపడి యెత్తెఱంగున వర్తించె? సకల జగద్గురుం డగు కృష్ణుండు మఱి యెట్లుండె? నెఱింగింపు' మనుటయు.** **397**

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; విదుర; యుయుత్సు; సంజయ; ధౌమ్యుల; వదనంబులు= ముఖాలు; ఆలోకించి= చూచి; మీమీ నికేతనంబులు= మీమీ భవనాలు; మీరలు= మీరు; కైకొనుండు= స్వీకరించండి; అని; నియోగించి= పనిచి; పెద్ద నగరిలోన= ప్రధాన ప్రాసాదంలో; ధృతరాష్ట్రుండు; మున్ను= పూర్వం; పన్నుగాన్= చక్కగా; వసియించు= నివసించే; హర్మ్యంబునన్= భవనంలో; ఆ+జనపతిన్= ఆ ధృతరాష్ట్రుడిని; ఉనిచెన్= ఉంచాడు; ఈ+విధంబునన్= ఈ రకంగా; గృహంబులు= భవనాలు; విభజించి= విభాగంచేసి (కేటాయించి); ఇచ్చి= ఒసగి; కృష్ణసాత్యకుల= శ్రీకృష్ణుడిని, సాత్యకిని; సవ్యసాచి= కవ్వడి; సదనంబునన్= భవనంలో; నిల్చునట్లుగాన్= ఉండేటట్లు; నిర్దేశించి= సూచించి; అందఱన్= అందరినీ; పోవన్+పనిచి= వెళ్ళుడని పంపి; అభి+అంతర+మందిరంబునకున్= తన ఏకాంత మందిరానికి; అరిగెన్= వెళ్ళాడు; ఆ భీమసేన+ఆదులు= ఆ భీముడు మొదలైనవారు; ఆ+మహనీయ వాసంబులు= ఆ ఘనమైన గృహాలు; చేకొని= స్వీకరించి; అందున్= ఆ భవనాలలో; ప్రభూత= అధికమైన; అన్న, పాన+ఆది+అనుభవంబులన్= భోజనాలు పానీయాలు మొదలైనవి అనుభవిస్తూ; సుఖించి= సుఖపడుతూ;

ఉండన్= ఉండగా; ఆ+విభుండు= ఆ రాజు (ధర్మరాజు); నిజ+ఇచ్ఛన్= తనకు నచ్చినట్లు; విహరించెన్= చరించాడు; అని= అంటూ; ఇట్లు= ఈ విధంగా; ధర్మపుత్రు= ధర్మరాజు; చరిత్రంబు= చరిత; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; ఆ+భంగిన్= ఆ విధంగా; ప్రాప్త= పొందిన; సామ్రాజ్యుండు+ఐ= మహాసామ్రాజ్యం కలిగినవాడై; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; పదంపడి= తరువాత; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; వర్తించెన్= చరించాడు? (ప్రవర్తించాడు); సకల= సమస్తమైన; జగత్= లోకాలకు; గురుండు= ఉపదేష్ట; అయిన= అయినటువంటి; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; మఱి= ఇంకా; ఎట్లు+ఉండెన్?= ఏ విధంగా ఉన్నాడు?; ఎఱింగింపుము= తెలియజెప్పుము; అనుటయున్= అనగా.

తాత్పర్యం: ఇంకా విదురుడినీ, యుయుత్సుడినీ, సంజయుడినీ, ధౌమ్యుడినీ చూచి 'మీరు మీమీ ఇళ్ళను (అంతకు ముందు వారు నివాసం చేసినవి) స్వీకరించండి' అని చెప్పాడు. ప్రధానప్రాసాదంలో ధృతరాష్ట్రుడు ఇంతకుముందు ఉంటున్న ఇంటిలో అతడిని ఉంచాడు. ఈ విధంగా భవనాలను అందరికీ కేటాయించి ఇచ్చి, కృష్ణుడూ, సాత్యకీ అర్జునుడి గృహంలో ఉండేటట్లు ఏర్పాటు చేశాడు. అందరిని వెళ్ళుడని పంపి, తాను తన అభ్యంతర మందిరానికి వెళ్ళాడు. భీముడు మొదలైనవారంతా ఆ ఘనమైన మందిరాలను స్వీకరించి, అచట సిద్ధంగా ఉన్న పవిత్రమైన భోజనపానీయాలను అనుభవిస్తూ ఆనందంగా ఉన్నారు. ధర్మరాజు కూడా తనకు నచ్చినవిధంగా ఉన్నాడు. ఈ విధంగా ఉన్న ధర్మరాజు చరిత్రను వైశంపాయనుడు చెప్పగా విన్న జనమేజయుడు 'ఈ విధంగా రాజ్యం పొందిన ధర్మరాజు ఆ తరువాత ఏ విధంగా నడుచుకొన్నాడు? అన్నిలోకాలవారికి గురువైన శ్రీకృష్ణ డే విధంగా ఉన్నాడు? తెలియచెప్పుము' అని అనగా. (తరువాతి ఆశ్వాసంలోని రెండవ వచనంతో అన్వయం).

ఆశ్వాసాంతము

శా. **భక్తాంభోరుహ బాలసూర్య! దనుజ ప్రధ్వంసనాచార్య! సు**
వ్యక్తావ్యక్త నిజప్రకార! సదయ వ్యాపార! దాంతిక్షమా
సక్త నిత్య స్వీకృత! వేదపరిషత్సంస్తుత్య! మాయా విని
ర్ము క్త ద్యోతన! తార్క్ష్యశాక్వర మహామూర్తి స్ఫురత్కేతనా! 398

ప్రతిపదార్థం: భక్త= భక్తులు అనే; అంభోరుహ= పద్మాలకు; బాలసూర్య!= ఉదయసూర్యుడి వంటివాడా!; దనుజ= రాక్షసులను; ప్రధ్వంసన= సమూలంగా నశింపచేయటంలో; ఆచార్య!=చేసేవాడా! ప్రముఖుడా! సువ్యక్త= బాగా తెలియబడే; అవ్యక్త= ఏమీ ప్రకటంకాని; నిజ= నీ దైన; ప్రకార= పద్ధతి కలవాడా!; సదయ= కరుణతో కూడిన; వ్యాపార!= చేతలు కలవాడా?; దాంతి= ఇంద్రియ నిగ్రహమందునూ; క్షమా= ఓర్పునందునూ; అసక్త= అసక్తులైన వారిచేత; స్వీకృత= స్వీకరించబడిన; నిత్య= శాశ్వతుడా!; వేదపరిషద్= వేదసభలలో; సంస్తుత్య= బాగా కీర్తించబడేవాడా!; మాయా= అవిద్య; వినిర్ముక్త= బాగా తొలగించుకొన్నవారికి; ద్యోతన= దర్శనమిచ్చువాడా!; తార్క్ష్య= గరుడుడు; శాక్వర= ఎద్దు(నందిఅను); మహామూర్తి= గొప్ప ఆకృతులచే; స్ఫురత్= ప్రకాశించు; కేతనా!= జెండాలు కలవాడా! (హరిహరనాథా! -అని భావం).

తాత్పర్యం: భక్తుల హృదయపద్మాలకు ఉదయసూర్యుడివంటివాడా! రాక్షసులను సంహరించడంలో గొప్పవాడా! నీ చేతలలో ప్రకటం అవుతూనే, కాకుండా ఉండేవాడా! దయతో వర్తించేవాడా! ఇంద్రియనిగ్రహంలోనూ క్షమలోనూ

ఆసక్తి కలవారిచే గ్రహించబడిన నిత్య స్వరూపుడా! వేదపరిషత్తులచేత నుతింపబడేవాడా!, అవిద్యను వదలినవారికి దర్శనమిచ్చేవాడా! గరుడుడు, నంది అను గుర్తులు కల జెండాలు కలవాడా! హరిహరనాథా!

విశేషం: 'శాక్వరమహామూర్తి' అనే పాదానికి 'శాశ్వతమహామూర్తి' అనే పాఠం కొన్ని ప్రతులలో కానవస్తున్నది. కాని ఇక్కడ శాక్వర (శాక్కర) శబ్దమే ఉచితమైనది. శాక్వర - శాక్కర (ఆప్టే నిఘంటువు). హరిహరనాథుడు గరుత్మంతుడిచేత, వృషభంచేత ప్రకాశించే కేతనం కలవాడు.

క. భవదుఃఖ భరనిరాస । ప్రవీణ! నానాభిధాన! పారాశర్య
స్తవనీయ ఓరుగంటి గుణ నిధాన! స । మవబోధ నిరంతరా విదాత్మాధీనా! 399

ప్రతిపదార్థం: భవదుఃఖ భార= సంసారదుఃఖ భారాన్ని; నిరాస= పోగొట్టటంలో; ప్రవీణ!= నేర్పరి అయినవాడా!; నానా+అభిధాన= ఎన్నో పేర్లు కలవాడా!; పారాశర్య= పరాశరుడి పుత్రుడైన వ్యాసుడిచేత; స్తవనీయ!= పొగడబడినవాడా!; గుణ= అన్ని గుణాలకు; నిధాన!= నిలయమైనవాడా!; సమ్+అవబోధ= నిరంతరా ఎడతెగనిజ్ఞానమే స్వరూపముగా కలవాడా!; విద్+ఆత్మ= బోధకలిగినవారికి; అధీనా!= లోబడి ఉండేవాడా! (హరిహరనాథా!)

తాత్పర్యం: జననమరణ స్వరూపమైన సంసార దుఃఖభారాన్ని పోగొట్టటంలో నేర్పరీ! ఎన్నో నామాలు కలవాడా! (అన్ని నామాలూ ఆయనవే), వ్యాసుడిచేత కీర్తించబడినవాడా! (పురాణ, ఉపపురాణ, మహాపురాణ, బ్రహ్మసూత్రాలలో) సమస్త గుణాలకు నిలయమైనవాడా!, ఎల్లప్పుడూ మేలుకొని ఉండేవాడా! (నిత్య జాగరమూర్తీ), ఎరుకగలవారికి అధీనుడవు అయినవాడా! (హరిహరనాథా!)

మాలిని:

ప్రకృతి పురుష యోగీ! భక్తతాత్పర్య రాగీ! । సకృప హృదయపద్మా! శాంతి చిత్తైక సద్మా!
వికృతి రహితమూర్తీ! విశ్వభూత ప్రవర్తీ! । సుకృత ఫలమయాత్మా! సుస్థిరానంద వర్త్మా! 400

ప్రతిపదార్థం: ప్రకృతి= పంచభూతాత్మకమూ, త్రిగుణాత్మకమూ అయిన వ్యక్త సృష్టి; పురుష= పరమ పురుషుడు (అవ్యక్తుడు); యోగీ!= చక్కగా కలిసిన రూపమైనవాడా!; భక్త= భక్తుల; తాత్పర్య= అభిప్రాయం (తత్పరత) అందు; రాగీ!= అనురాగం కలవాడా!; సకృప= దయతోకూడిన; హృదయపద్మా!= పద్మంవంటి హృదయం కలవాడా!; శాంతి= కల్లోలంలేని, ప్రశాంతమైన; చిత్త= మనస్సు; ఏకసద్మా!= ఒకే ఒక నివాసంగా కలవాడా!; విశ్వ= లోకమండలి; భూత= ప్రాణులను; ప్రవర్తీ!= నడిపించేవాడా!; సుకృత= పుణ్యాల; ఫలమయ= ఫలస్వరూపమైన; ఆత్మ!= రూపం (మనస్సు) కలవాడా!; సుస్థిర= మిక్కిలి స్థిరమైన; ఆనంద వర్త్మా!= ఆనంద మార్గం కలవాడా!; (హరిహరనాథా!).

తాత్పర్యం: ప్రకృతి, పురుషుడు కలిసినట్టి రూపం కలవాడా! భక్తతత్పరతయందు అనురాగం కలవాడా! దయతో కూడిన హృదయపద్మం కలవాడా!, ప్రశాంతమైన చిత్తమే నివాసమైనవాడా!, మార్పుచెందని రూపం కలవాడా!, లోకాలన్నింటినీ, ప్రాణులందరినీ నడిపించేవాడా!, పుణ్య స్వరూపమైన మనస్సు, శాశ్వతమైన ఆనంద స్వరూపం కలవాడా! (హరిహరనాథా!).

విశేషం: ఈ వృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, న, మ, య, య గణాలుంటాయి. 9వ అక్షరం యతిస్థానం - ప్రాసనియమం నియతం.

గద్యము

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున శాంతి పర్వంబు నందుఁ బ్రథమాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఇప్పటివరకు చెప్పింది; శ్రీమత్= శుభప్రదమూ; ఉభయకవిమిత్త్ర= ఉభయ కవిమిత్రుడనే బిరుదు కలిగినవాడు, శైవ, వైష్ణవ, దేశిమార్గ కవులందరికీ హితుడైనవాడూ; కొమ్మన+అమాత్య పుత్త్ర= కొమ్మనామాత్యుడి కుమారుడైనవాడూ; బుధ= పండితులను, దేవతలను; ఆరాధన= పూజించటంచేత; విరాజి= ప్రకాశించేవాడూ (పండితులు తనను గౌరవించటంచేత రాణించేవాడూ) అయిన; తిక్కన సోమయాజి= సోమయాజి అయిన తిక్కన; ప్రణీతంబు+అయిన= చెప్పిన; శ్రీమహాభారతంబున= శ్రీ మహాభారతంలోని; శాంతిపర్వంబు అందున్= శాంతిపర్వంలో; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసం.

తాత్పర్యం: ఇప్పటివరకు చెప్పినది శుభప్రదమైన, ఉభయకవిమిత్రుడనే బిరుదు కలిగినవాడూ, కొమ్మనామాత్యుడి కుమారుడైనవాడూ, పండితులను, దేవతలను పూజించి ప్రకాశించేవాడూ (పండితులచేత గౌరవించబడి రాణించేవాడూ అయిన) తిక్కనసోమయాజిచేత చెప్పబడిన శ్రీమహాభారతంలో శాంతిపర్వంలోని మొదటి ఆశ్వాసం.

శాంతిపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీ శుచితాధృతి కరణ క । లా శౌండ కటాక్షలీల! లౌల్యరహిత! లో
లా శక్తిత్రయ సమయు । క్త్యాశోభిత రూపహేల! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= ఐశ్వర్యం; శుచితా= త్రికరణ శౌచం; ధృతి= ధీరత్వాలను; కరణ= కలుగజేయటం అనే; కలా= విద్యయందు; శౌండ= ప్రసిద్ధమగు; కటాక్షలీల!= కడగంటిచూపుల విలాసం కలవాడా!; లౌల్య-రహిత= చపలత్వము లేనివాడా!; లోలా= లక్ష్మీరూపమగు; శక్తిత్రయ= మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ రూపములగు మూడు శక్తులతో; సమ= తుల్యముగా; యుక్తి= కూడుటచేత; ఆశోభిత= అంతటా ప్రకాశించు; రూప-హేల!= సౌందర్యము, విలాసము గలవాడా!; హరిహరనాథా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీ కటాక్షప్రసారంచేతనే జనులకు సంపద, త్రికరణశుద్ధి, ధైర్యం కలుగుతాయి. నీవు స్థిరమైనవాడవు. బ్రహ్మవిష్ణు శివరూపాన సరస్వతీ, లక్ష్మీ, గౌరీ రూప శక్తిత్రయంతో కూడి విశ్వవ్యవహారానికి, అనేక సుందరరూపాలతో కూడి ఉంటావు. లేదా ఇచ్ఛా జ్ఞాన క్రియాశక్తులనుబట్టి అనేకావతారాలతో శోభిల్లుతావు.

ధర్మనందనుని ప్రవర్తన (సం. 12-45-3)

వ. **దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నిట్లు సమధిగత సామ్రాజ్యుండై ధర్మనందనుండు దేజో విశేషంబున మహోజ్జ్వలత్వంబునొంది మహీసురుల నాశ్రితజనంబుల నర్థులం గృతార్థులంగావించి, ధృతరాష్ట్ర గాంధారీ విదురులకు రాజ్యంబు సమర్పించి, 'మీరలింతతటికి నొడయుల రేను మీ పనిచిన పని సేసి పెట్టిన యట్లు గుడిచి యుండం గలవాఁడ' నని పలికి, నిత్యంబును వారల యనుమతి గొని భవ్యమార్గంబునం బ్రజలం బాలించుచు, వారికిం బూర్వప్రకారంబుకంటె నతిశయిల్ల నెల్ల వర్తనంబులు సంప్రీతిం జెల్లించుచు విపతులైన సతుల నుమ్మలికంబు వొరయకుండం గరుణ నరయుచుఁ, గృప యుయుత్సు సంజయులకుం గౌరవామాత్యులకు మన్ననలు సలుపుచుఁ, గుంతీదేవికి శుశ్రూష యాచరించుచుఁ, బాంచాలికి సౌమనస్యం బాపాదించుచు ధౌమ్యునకు సగౌరవంబుగా సకల సంపదలు నొసంగి, తన్ముఖంబున దేవ పితృ పూజనంబులు నతిథి తర్పణంబులు వైదేశిక విప్రార్చనంబులు దీనానాథ పోషణంబులుం బరమ సంతోషంబుతో నడపుచుం గృష్ణు నారాధించుచు సమస్త పౌరజనపదకోటుల మనంబులం బ్రమోదంబు పరిపూర్ణంబగునట్లుగా నిర్విఘ్నంబునఁ బ్రవర్తిల్లుచుండి, యొక్కనాఁడు రేపకడ కృష్ణుని యున్న మందిరంబునకుం బోయి.** 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు= వ్యాసమహర్షికి శిష్యుడైన వైశంపాయనుడు; జనమేజయునకున్= పరీక్షిన్మహారాజు పుత్రుడైన జనమేజయునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; ఇట్లు= ఈ విధంగా; సమ్+అధిగత సామ్రాజ్యుండు+ఐ= రాజ్యాన్ని పొందినవాడై; ధర్మనందనుండు= ధర్మరాజు; తేజః+విశేషంబునన్= రాజ్యాభిషిక్తుడు కావటం వలన పొందిన విశేషమైన కాంతిచేత; మహా+ఉత్+జ్వలత్వంబున్+ఒంది= గొప్పదైన మిక్కిలి ప్రకాశాన్ని పొంది; మహీసురులన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భూదేవతలైన బ్రాహ్మణులను; ఆశ్రితజనంబులన్= ఆశ్రయించిన ప్రజలను; అర్థులన్= కోరికతో వచ్చినవారిని; కృత+అర్థులన్+కావించి= తీరిన కోర్కెలు గలవారినిగా చేసి; ధృతరాష్ట్ర గాంధారీ విదురులకున్= ధృతరాష్ట్రుడికి, గాంధారికి, విదురుడికి; రాజ్యంబు సమర్పించి= రాజ్యాన్ని ఇచ్చి; మీరలు= మీరు; ఇంతటికిన్+ఒడయులరు= దీనికంతటికి ప్రభువులు; ఏను= నేను (ధర్మరాజు); మీ పనిచిన పని+చేసి= మీరు ఆజ్ఞాపించిన పనిని చేసి; పెట్టిన+అట్లు= పెట్టిన రీతిగా; కుడిచి= తిని; ఉండన్+కలవాఁడను= ఉండగలను; అని పలికి= అని చెప్పి; నిత్యంబును= ప్రతి దినమూ; వారల+అనుమతిన్= వారి అనుజ్ఞను; కొని= తీసికొని; భవ్యమార్గంబునన్= సరైన పద్ధతిలో; ప్రజలన్+పాలించుచున్= ప్రజలను ఏలుతూ; వారికిన్= వారికి; పూర్వప్రకారంబు కంటెన్= ముందటి పద్ధతికంటె; అతిశయిల్లన్= మించేటట్లుగా; ఎల్ల వర్తనంబులు= అన్ని కార్యాలను; సంప్రీతిన్= సంతోషం కలిగించే విధంగా; చెల్లించుచున్= చేస్తూ; విపతులు+ఐన= భర్తలను పోగొట్టుకొన్న; సతులన్= స్త్రీలను; ఉమ్మలికంబు+పొరయకుండన్= దుఃఖం కలుగకుండా; కరుణన్= దయతో; అరయుచున్= గమనిస్తూ; కృప యుయుత్సు సంజయులకున్= కృపాచార్య, యుయుత్సు, సంజయులకు; కౌరవ+అమాత్యులకున్= కౌరవుల మంత్రులకు; మన్ననలు+చలుపుచున్= గౌరవిస్తూ; కుంతీదేవికిన్= తల్లిఅయిన కుంతీదేవికి; శుశ్రూష+ఆచరించుచున్= సేవ చేస్తూ; పాంచాలికిన్= ద్రౌపదికి; సౌమనస్యంబు+ఆపాదించుచున్= సంతోషాన్ని కలిగిస్తూ; ధౌమ్యునకున్= పాండవ పురోహితుడైన ధౌమ్య మహర్షికి; సగౌరవంబుగాన్= గౌరవ పూర్వకంగా; సకల సంపదలున్+ఒసంగి= సర్వ సంపదల నిచ్చి; తద్+ముఖంబునన్= ఆయన ఆధ్వర్యవంలో; దేవ పితృ పూజనంబులున్= దేవతల, పితృదేవతల పూజాదికాలు; అతిథి తర్పణంబులు= అతిథులకు తృప్తి; వైదేశిక= ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన; విప్ర+అర్చనంబులు= బ్రాహ్మణులకు పూజలు; దీన+అనాథ పోషణంబులున్= దీనుల, అనాథల యొక్క సంరక్షణలు; పరమ= మిక్కిలి; సంతోషంబుతోన్= ఆనందంతో; నడుపుచున్= నిర్వర్తిస్తూ; కృష్ణున్+ఆరాధించుచున్= శ్రీకృష్ణుడిని పూజిస్తూ; సమస్త= ఎల్ల; పౌర= పుర ప్రజలను; జనపదకోటుల= గ్రామీణ ప్రజా సముదాయాల; మనంబులన్= మనసులలో; ప్రమోదంబున్= ఆనందాన్ని; పరిపూర్ణంబు+ అగునట్లుగాన్= నిండేటట్లుగా; ఈ+విధంబునన్= ఈ రీతిగా; ప్రవర్తిల్లుచున్+ఉండి= నడుచుకొంటూ ఉండి; ఒక్కనాఁడు= ఒకానొక రోజు; రేపకడ= తెల్లవారుజామున; కృష్ణుని+ఉన్న మందిరంబునకున్+పోయి= శ్రీకృష్ణుడి విడిది మందిరానికి వెళ్ళి.

తాత్పర్యం: వైశంపాయనుడు జనమేజయుడికి ఈ విధంగా చెప్పాడు: ఓ రాజా! ఈ రీతిగా ధర్మరాజు రాజ్యాన్ని పొందినవాడై విశేషకాంతిచేత మిక్కిలి ప్రకాశిస్తూ బ్రాహ్మణుల, ఆశ్రయించిన వారల, కోరికతో తన వద్ద చేరిన వారల కోర్కెల్ని తీర్చి, గాంధారీ ధృతరాష్ట్ర విదురులకు రాజ్యాన్ని సమర్పించి 'మీరు దీనికంతటికీ ప్రభువులు, నేను మీరు చెప్పిన పనిని చేసి, మీరు పెట్టిన దానిని తింటూ ఉండగలను' అని పలికాడు. ప్రతిరోజూ వారి అనుమతి తీసికొని సరైన పద్ధతిలో ప్రజలను పాలిస్తూ వారందరికీ పూర్వంకంటె అధికమైన జీవనభృతులను కల్పిస్తూ, భర్తలను పోగొట్టుకొన్న స్త్రీలకు దుఃఖం కలుగకుండా దయతో గమనిస్తూ, కృపాచార్య, యుయుత్సు సంజయులను, కౌరవమంత్రులను గౌరవిస్తూ, తల్లి అయిన కుంతిని సేవిస్తూ, ద్రౌపదికి సంతోషాన్ని కలిగిస్తూ, ధౌమ్యమహర్షికి సకల సంపదల నిచ్చి ఆయన ఆధ్వర్యవంలో దేవతల, పితృదేవతల పూజాదికాలు నిర్వర్తించి, అతిథులకు సంతృప్తి కలిగిస్తూ, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన బ్రాహ్మణులను అర్చిస్తూ, దీనులను, అనాథలను సంరక్షిస్తూ శ్రీకృష్ణుడిని పూజిస్తూ, సమస్త నగరవాసుల, గ్రామీణుల మనసులను పరిపూర్ణంగా ఆనందంతో నిండింపజేస్తూ ఉన్నాడు. ఈ విధంగా ప్రవర్తిస్తున్న సమయంలో ఒకనాడు తెల్లవారుజామున ధర్మరాజు శ్రీకృష్ణుడి విడిది మందిరానికి వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఈ వచనంలో 'సమధిగత సామ్రాజ్యుండై ధర్మనందనుండు' అని చెప్పటంలో శత్రువులైన కౌరవులను కురుక్షేత్ర ధర్మయుద్ధంలో జయించి ధర్మరాజు రాజ్యాన్ని పొందినట్లు విదితమవుతుంది. తాను ధర్మబద్ధంగా సాధించుకొన్న రాజ్యాన్ని ధృతరాష్ట్ర గాంధారీ విదురులకు సమర్పించి, వారినే తన ప్రభువులుగా, తానే వారి సేవకుడుగా భావించటంలో ధర్మరాజు వినయం స్పష్టం కావటమే కాక, పుత్రశోక సంతప్తులైన గాంధారీ ధృతరాష్ట్రులకు సంతోషాన్ని చేకూర్చినట్లు వెల్లడవుతున్నది. భర్తృహీనలై దుఃఖితమతు

లైన స్త్రీలను బాధ్యతాయుత ప్రవర్తనతోపాటు ధర్మరాజు దయతో చూచిన తీరు స్పష్టమవుతున్నది. పెద్దలపట్ల, అతిథులపట్ల, దేవబ్రాహ్మణుల, దీనుల, అనాథల, పురజనుల, గ్రామీణుల పట్ల రాజుగా తన ధర్మాన్ని ధర్మరాజు నిర్వర్తించిన తీరులో ఆయన వ్యక్తిత్వం ప్రదర్శితమవుతున్నది.

ధ్యానాసక్తుఁడైన శ్రీకృష్ణునింగని ధర్మజుఁడు సంభాషించుట (సం.12-45-13)

సీ. మణిహేమ పర్యంక మహితోపవేశుని సురుచిరాభరణ విస్ఫురితగాత్రుఁ,
గౌస్తుభరత్న వికాసి వక్షస్థలుఁ, బీతకౌశేయ సంవీతమూర్తి,
మేరు తటీగత మేఘసంకాశు నక్షత్రగణావృత గగన సదృశు,
నూతనోదిత రవి ద్యోతితోదయ గిరి నిభు రుక్మ బద్ధేంద్రనీల తుల్యు,

ఆ. నమ్మురారిఁ గని కృతాంజలి యై భక్తిఁ । జిత్తవృత్తి గరము జొత్తిలంగ
నంతకంత కాననాంబుజ మలరంగ । నిట్టు లనియెఁ దియ్య మెసక మెసఁగ. 3

ప్రతిపదార్థం: మణి= మణులతో కూడిన; హేమ= బంగారు మయమైన; పర్యంక= పాన్పుమీద; మహిత= బాగుగా; ఉపవేశునిన్= కూర్చున్న వాడిని; సురుచిర= మిక్కిలి కాంతిమంతమైన; ఆభరణ= అలంకారాలతో; విస్ఫురిత= ఎక్కువగా ప్రకాశిస్తున్న; గాత్రున్= శరీరం కలవాడిని; కౌస్తుభరత్న= కౌస్తుభమనెడి రత్నంచేత; వికాసి= ప్రకాశిస్తున్న; వక్షస్థలున్= ఉరో భాగం కలిగినవాడిని; పీత= పచ్చని; కౌశేయ= పట్టు వస్త్రాన్ని; సంవీతమూర్తిన్= హారంవలె ధరించిన స్వరూపం కలవాడిని; మేరుతటీ= మేరుపర్వత ప్రదేశంలో; గత= ఉన్న; మేఘ= మేఘంతో; సంకాశున్= సమానమైన వాడిని; నక్షత్రగణ= చుక్కల గుంపులచేత; ఆవృత= కప్పబడిన; గగన= ఆకాశంతో; సదృశున్= సమానమైనవాడిని; నూతన= అప్పుడే; ఉదిత= పుట్టిన; రవి= సూర్యునియొక్క; ద్యోతిత= కాంతితో కూడిన; ఉదయగిరి= ఉదయ పర్వతంతో; నిభున్= సమానమైన వాడిని; రుక్మ= బంగారంలో; బద్ధ= కూర్చబడిన (ఖచిత); ఇంద్రనీలతుల్యున్= ఇంద్రనీలంతో సమానమైనవాడిని; ఆ+ముర+అరిన్+కని= ఆ ముర అనే రాక్షసుడికి శత్రువైన శ్రీకృష్ణుడిని చూచి; కృత+అంజలి+ఐ= నమస్కరించిన వాడై; భక్తిన్= భక్తితో; చిత్తవృత్తి= మనోవృత్తి; కరము= మిక్కిలి; జొత్తిలంగన్= రంజిల్లగా; అంతకున్+అంతకున్= అంతకంతకు; ఆనన+అంబుజము= పద్మమువంటి ముఖము; అలరంగన్= ఒప్పుతూ ఉండగా; తియ్యము+ఎసక మెసఁగన్= ప్రేమ అతిశయింపగా; ఇట్టులు+అనియెన్= (ధర్మరాజు) ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: మిక్కిలి కాంతిమంతమైన అలంకారాలతో ప్రకాశిస్తున్న శరీరం కలిగిన వాడూ, కౌస్తుభమనే రత్నాన్ని ఉరోభాగాన ధరించినవాడూ, పచ్చని పట్టు వస్త్రాన్ని హారంలా వేసుకొన్నవాడూ, మేరుపర్వత ప్రాంతంలో ఉన్న మేఘంతో సమానమైనవాడూ, చుక్కల గుంపులతో చుట్టబడిన ఆకాశంతో సమానమైనవాడూ, అప్పుడే ఉదయించిన సూర్యకాంతితో కూడిన ఉదయపర్వతంతో సమానమైనవాడూ, బంగారంలో పొదగబడిన ఇంద్రనీలమణితో సమానమైనవాడూ, మణులతోకూడి బంగారుమయమైన పాన్పుమీద ప్రశస్తంగా కూర్చున్నవాడూ అయిన శ్రీకృష్ణుడిని చూచి ధర్మరాజు నమస్కరించి తన మనస్సు భక్తినిమగ్నం కాగా అంతకంతకూ తన ముఖపద్మం ప్రకాశిస్తూ ఉండగా అతిశయించిన ప్రేమతో ఈ విధంగా పలికాడు.

విశేషం: సామాన్యంగా తిక్కన శైలి అలతి అలతి పద ప్రయోగంతో ఉంటుంది. కానీ ఇక్కడ శ్రీకృష్ణుని వ్యక్తిత్వ విశిష్ట వివరణకు సంస్కృత శబ్దాలను గ్రహించాడు. 'మహితోపవేశుని' అని ప్రయోగించటంలో తిక్కన శ్రీకృష్ణుడు గంభీరంగా కూర్చొని ఉన్న తీరు స్పష్టం చేశాడు.

మురారి: మురాసురుడనే రాక్షసుడికి శత్రువు అయిన కృష్ణుడు.

మురాసురుడు బ్రహ్మనుగూర్చి తపస్సు చేసి తన అరచేతిని ఎవడిపయి పెడితే వాడు భస్మమయ్యే వరాన్ని పొందాడు. విర్రవీగిన మురుడు విష్ణువును సంహరింపదలచాడు. ఆ సంగతి గుర్తించిన విష్ణువు, నీ గుండెలేల తటపటా కొట్టుకుంటున్నాయని అనగానే, లేదే అంటూ తన గుండెపయి తన అరచేతిని ఉంచుకొనగానే మురాసురుడు భస్మమయిపోయాడు.

తే. 'కడపితే రాత్రి సులభసౌఖ్యంబుగా? మ । నంబు గాఢప్రసన్నమే యంబుజాక్ష!
దైవి యగు నీదు బుద్ధి కతమునఁ గాదె । ధర్మగతిఁ బ్రాభవంబుఁ బొందఁగఁ గంటి. 4

ప్రతిపదార్థం: అంబుజ+అక్ష!= పద్మాలవంటి కన్నులు కలిగిన శ్రీకృష్ణా!; సులభ సౌఖ్యంబుగాన్= హాయిగా (సుఖంగా); రాత్రిన్= రాత్రి; కడపితి+ఏ?= గడపావు కదా; మనంబు= నీ మనస్సు; గాఢ= మిక్కిలిగా; ప్రసన్నమే?= ప్రశాంతంగా ఉన్నదా?; దైవి+అగు= దైవసంబంధమైన; నీ+బుద్ధి కతమునన్= నీ బుద్ధి విశేషం వలన; ధర్మగతిన్= ధర్మమార్గంలో; ప్రాభవంబున్= రాజ్యాధికారాన్ని; పొందంగన్+కంటిన్= పొందితిని; కాదె!= కదా!

తాత్పర్యం: 'ఓ శ్రీకృష్ణా! రాత్రి సుఖంగా గడిపావు కదా! నీ మనసు మిక్కిలి ప్రశాంతంగా ఉంది కదా! దేవుడవే అయిన నీ బుద్ధివిశేషంవలన నేను ధర్మమార్గంలో రాజ్యాధికారాన్ని పొందగలిగాను కదా! (అని ధర్మరాజు పలికాడు.)

విశేషం: తిక్కన సహజశైలికి చక్కటి నిదర్శన మీ పద్యం. చిన్న చిన్న వాక్యాలలో సన్నిహితులను పలకరించే తీరును వ్యక్తం చేసిన తిక్కన లోకజ్ఞత ఇక్కడ వ్యక్తమవుతున్నది. 'దైవియగు' అని వాచ్యం చేసి శ్రీకృష్ణుడిని కేవలం బావగానే కాక, తనకు కూర్చు నెయ్యుడే కాక, భగవంతుడుగా గుర్తించటం ధర్మరాజు విజ్ఞతకు నిదర్శనం.

వ. త్రిభువన వ్యాప్త విక్రముండ వగు నీ కటాక్షంబున కలిమిం గాదె జగత్త్రయ సంభావనీయుండనై వెలింగితి'
ననుచుం జేరంబోయి. 5

ప్రతిపదార్థం: త్రిభువన= ముల్లోకాలలో; వ్యాప్త= వ్యాపించిన; విక్రముండవు+అగు= పరాక్రమం కలిగిన వాడవైన (ముల్లోకాలను ఆక్రమించిన వామనుడని అర్థాంతరం); నీ= నీయొక్క; కటాక్షంబున కలిమిన్+కాదె= కటాక్షం యొక్క కలిమిచేతనే కదా! (ఉండుటచేతనే కదా అని అర్థాంతరం); జగత్త్రయ= ముల్లోకాలచేత; సంభావనీయుండను+ఐ= గౌరవించదగినవాడనై; వెలింగితిని= ప్రకాశించాను; అనుచున్= అని పలుకుతూ; చేరన్+పోయి= సమీపించి.

తాత్పర్యం: ఓ కృష్ణా! ముల్లోకాలలో వ్యాపించిన పరాక్రమం కలిగిన నీ దయవలననే ముల్లోకాల చేత గౌరవించదగిన వాడనై ప్రకాశించాను' అని అంటూ ధర్మరాజు శ్రీకృష్ణుడిని సమీపించి.

విశేషం: దశావతారాలలో వామనరూపంలో బలిచక్రవర్తిని మూడడుగు లడిగి ముల్లోకాలు వ్యాపించి బలిని అణచిన త్రివిక్రముడు శ్రీకృష్ణుడు కావటం వలన ఆ సంగతిని గుర్తుచేసి, శ్రీకృష్ణుడు త్రివిక్రముడు కావటం వలనే తనను (ధర్మరాజును) ముల్లోకాలలోను గౌరవనీయుడుగా ప్రకాశించేటట్లు చేయగలిగాడని ధర్మరాజుచేత పలికించటం వలన తిక్కన సాభిప్రాయ పదప్రయోగ దక్షత వ్యక్తమవుతున్నది.

క. తన యుచితాలాపములకు । మనుజేశ్వర! మాధవుండు మఱుమాట యొకం
డును బలుకక భవ్య ధ్యా । న నిరూఢత నున్న యపుడు నరపతి యతనిన్. 6

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= ఓ జనమేజయ మహారాజా! తన= తన (ధర్మరాజు) యొక్క; ఉచిత= తగిన; ఆలాపములకున్= మాటలకు; మాధవుండు= శ్రీకృష్ణుడు; మఱుమాట+ఒకండును= బదులుమాట కూడా; పలుకక= మాటలాడక; భవ్య= శ్రేష్ఠమైన; ధ్యాన నిరూఢతన్+ఉన్న= విశిష్ట ధ్యానంలో ఉన్న; అపుడు= ఆ సమయంలో; నరపతి= రాజైన ధర్మరాజు; అతనిన్= ఆ శ్రీకృష్ణుడితో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ధర్మరాజు తగిన రీతిలో పలికిన ఆ పలుకులకు కృష్ణుడు మరేమీ మాటలాడక శ్రేష్ఠమైన, విశిష్టమైన ధ్యానంలో ఉండగా అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణుడిని.

వ. నిరూపించి యిట్లనియె. 7

ప్రతిపదార్థం: నిరూపించి= శ్రీకృష్ణుడిని చూచి; ఇట్లు+అనియెన్= ధర్మరాజు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు శ్రీకృష్ణుడిని చూచి ఈ విధంగా అన్నాడు.

సీ. 'పంచాత్మకంబైన పవనంబు నిగృహీత మైనది, భవదింద్రియములు మనము
నందాఁగఁ బడ్డవి, యవియును నదియును । బుద్ధియం । దొదిఁగించి శుద్ధమైన
నాలవ తెరువున లోలతారహితముల్ । గాఁగ నిన్నియును సంకలితములుగ
నంచిత క్షేత్రజ్ఞునందుఁ గూర్చినవాఁడ । వీ పరమధ్యాన మేమి కతన

తే. నొలసెనొకొ! లోకములకు నొండొక్క వింత । లేక నెమ్మది యున్నదియే? కరంబు
విస్మయముఁ బొందె నా మది; వినఁగ నర్హ । మేని వినిపింపవే నాకు నిత్తెఱంగు.' 8

ప్రతిపదార్థం: పంచ+ఆత్మకంబు+ఐన పవనంబు= పంచ ప్రాణాలతో (ప్రాణం, అపానం, సమానం, ఉదానం, వ్యానం) కూడిన గాలి (ప్రాణవాయువు); నిగృహీతము+ఐనది= నిగ్రహించ బడింది; భవత్+ఇంద్రియములు= నీయొక్క ఇంద్రియాలు (శ్రోత్ర, చర్మ, చక్షుస్, జిహ్వ, నాసిక - అనే జ్ఞానేంద్రియాలు, వాక్కు, హస్త, పాద, పాయువు, ఉపస్థ - అనే కర్మేంద్రియాలు); మనంబునన్= మనసునందు; ఆఁగఁబడ్డవి= నిల్పబడ్డాయి; అవియును= ఆ ఇంద్రియాలూ; అదియును= ఆ మనస్సూ; బుద్ధి+అందు+ఒదిఁగించి= బుద్ధియందు చేర్చి; శుద్ధము+ఐన= స్వచ్ఛమైన; నాలవ తెరువునన్= నాలుగవదైన మార్గంలో (జాగ్రత్, స్వప్న, సుషుప్తి కాక నాలుగవదైన ధ్యాన మార్గంలో); లోలతా రహితముల్+కాఁగన్= చలనం లేకుండునట్లు కాగా; ఇన్నియును= వీటన్నింటిని; సంకలితములుగన్= కూడుకొన్నట్లుగా; అంచిత= తగినట్లు; క్షేత్రజ్ఞునందున్= జీవుడి యందు; కూర్చినవాఁడవు= చేర్చినవాడవు; ఈ పరమ ధ్యానము= ఇట్లాంటి శ్రేష్ఠమైన ధ్యానం; ఏమి కతనన్= ఏ కారణం వలన; ఒలసెన్+ఒకొ!= కలిగిందో కదా!; లోకములకున్= సమస్త లోకాలకు; ఒండు+ఒక్క= వేరొక; వింతలేక= ఎలాంటి విచిత్రమూ లేకుండా; నెమ్మది+ఉన్నదియే?= ప్రశాంతంగా ఉన్నదా?; నా మది= నా మనస్సు; కరంబు= మిక్కిలి; విస్మయమున్+పొందెన్= ఆశ్చర్యాన్ని పొందింది; వినఁగన్+అర్హము+ఏని= వినదగిన విషయమైతే (రహస్యం కాకుంటే); నాకున్= నాకు (ధర్మరాజునకు) ఈ+తెఱంగున్= ఈ పద్ధతిని; వినిపింపవే= తెలియజేయవా?

తాత్పర్యం: 'ఓ కృష్ణా! అయిదు విధాలయిన వాయువు బంధించబడింది. నీ ఇంద్రియాలు మనసులో నిల్ప బడ్డాయి. మనసును బుద్ధియందు చేర్చి స్వచ్ఛమైన ధ్యాన మార్గంలో చలన రహితంగా, తగిన రీతిలో జీవుడి యందు వీటన్నిటినీ చేర్చావు. ఇటువంటి శ్రేష్ఠమైన ధ్యానం ఎందుకు చేస్తున్నావు? సమస్తలోకాలలో ఎట్లాంటి వింత జరగకుండా ప్రశాంతతతో ఉన్నది కదా! అందుకే నా మనసు ఎంతో ఆశ్చర్యాన్ని పొందింది. రహస్యం కాకుంటే ఈ నీ ధ్యానస్థితికి కారణం నాకు తెలియ జేస్తావా? అని ధర్మరాజు అడిగాడు.

విశేషం: మూలంలో శ్రీకృష్ణుడి ధ్యానాన్ని వర్ణిస్తున్న సందర్భంలో వ్యాస భగవానుడు చెప్పిన 'స్థాణుకుడ్య శిలాభూతో నిరీహశ్చాసి' అనే పలుకులను సముచితం కాదని భావించి తిక్కన 'లోల రహితముల్ గాఁగ' అని మార్చాడు. ఇక్కడ స్థాణు, కుడ్య, శిలాభూతః అనటం నిశ్చైతన్య ద్యోతకమని భావించి 'లోల రహితముల్ గాఁగ' అంటే చైతన్యవంతుడైన ఆ మహనీయుడు సమస్తమూ స్తంభింపజేసి ధ్యాననిమగ్నుడైనట్లు వర్ణించటంలో తిక్కన ప్రతిభ గోచరిస్తున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆది శంకరాచార్య విరచితమైన నిర్వాణషట్క స్తోత్రంలోని

శ్లో: "మనోబుద్ధ్యహంకార చిత్తాని నాహం । నశ్రోత్రం న జిహ్వా న చ ఘ్రాణ నేత్రే
న చ వ్యోమ భూమి ర్న తేజో న వాయు । శ్చిదానంద రూప శ్శివోఽహం శివోఽహమ్"

అనే శ్లోకభావాన్ని తిక్కన ఈ పద్యంలో పొదిగాడా అని అనిపిస్తుంది. ధర్మరాజు శ్రీకృష్ణుడి ధ్యాననిష్ఠలోని విశేషాన్ని తెలిసికొనాలనే కుతూహలంతో 'విన౯గ నర్హమేని వినిపింపవే' అని అడగటంలో ఎంతో మర్యాద, మనస్సంస్కారమూ విదితమై, తిక్కన లోకజ్ఞతను ప్రకటిస్తున్నది.

వ. అని యిట్లు ధర్మనందనుండు నివాతనిశ్చలదీప ప్రకారంబున నున్న యప్పరమపురుషుం బ్రార్థించి మఱియును. 9

ప్రతిపదార్థం: అని= అని పలికి; ఇట్లు= ఈ విధంగా; ధర్మనందనుండు= ధర్మరాజు; నివాత= గాలి లేకపోవటంవలన; నిశ్చల= కదలిక లేని; దీప ప్రకారంబునన్+ఉన్న= దీపంవలె ఉన్న; ఆ+పరమ పురుషున్= ఆ పురుషోత్తముడిని; ప్రార్థించి= ప్రార్థించి (వేడుకొని); మఱియును= ఇంకా.

తాత్పర్యం: అని పలికి ఈ విధంగా ధర్మరాజు "గాలి లేనందువలన కదలకుండా ఉన్న దీపంవలె ప్రకాశిస్తున్న ఆ పురుషోత్తముడైన శ్రీకృష్ణుడిని ప్రార్థించి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'క్షరము నక్షరమును నీవ; కర్తయును వి । కర్తయును నీవ; యాద్యంత గతులు నీవ;
యొక్క౯డై వెలి౯గెడు పురుషోత్తమాభి । ధాన వాచ్య వినమ్ర వాత్సల్య కల్య! 10

ప్రతిపదార్థం: నీవు+అ= నీవే (శ్రీకృష్ణుడవు); క్షరమున్= నశించెడి వాడవు; అక్షరమును= నాశరహితుడవు; నీవు+అ= నీవే; ఆది+అంతగతులు= మొదలు తుద అయిన వాడవు; వినమ్ర= వినయంతో కూడిన; వాత్సల్య= ప్రేమచేత; కల్య!= నేర్పరి అయిన వాడా!; (నీవు); ఒక్క౯డై= సమస్తమూ ఒక్కడివే ఐ; వెలిగెడు= ప్రకాశించే; పురుష+ఉత్తమ+అభిధాన వాచ్య!= పురుషోత్తము౯డనే పేరుతో పిలువబడుతున్నవాడా!

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! నశించేవాడవు, నాశరహితుడవు నీవే. ఈ సమస్తసృష్టికి కర్తవు నీవే. సర్వవినాశకారివి నీవే; ఈ సృష్టికి ఆది, అంతమూ నీవే. అంతకు మించి వాత్సల్యాన్ని వర్షిస్తూ పురుషోత్తముడని పిలువబడుతూ సమస్తంలో ఏకస్వరూపంతో వెలిగే మహనీయుడవు నీవే.

విశేషం: ఈ పద్యం వ్యాస భారతంలోని "త్వం హి కర్తా వికర్తా చ త్వం క్షరమ్ చాక్షరం చా హి" అనే శ్లోకానికి యథాతథానువాదం. అంతే కాకుండా భగవద్గీతలోని పదిహేనవ అధ్యాయంలో 16, 17, 18 శ్లోకాలలో వివరించిన క్షర, అక్షర, పురుషోత్తమ శబ్దాల విశిష్టతను ప్రతిబింబిస్తున్నది.

వ. ప్రసన్నుండ వగుము; నా డెందంబు సందియంబు వాయం జేయవే!' యని విన్నవించినం బాంచజన్యధరుండు బుద్ధియు మనంబు నింద్రియంబులును గోచరత్వ సంప్రాప్తంబులు గావించి, కొంచెపు నగవున నెమ్మొగం బొప్ప నప్పుడమిఱేని నాలోకించి యిట్లనియె. 11

ప్రతిపదార్థం: ప్రసన్నుండవు+అగుము= శాంత చిత్తుడవు కమ్ము; నా డెందంబు= నా హృదయంయొక్క; సందియంబు+పాయన్+చేయవే!= అనుమానాన్ని తొలగించవా?; అని విన్నవించినన్= అని తెలుపగా; పాంచజన్యధరుండు= పాంచజన్య మనే శంఖాన్ని ధరించినవాడైన శ్రీకృష్ణుడు; బుద్ధియున్= బుద్ధిని; మనంబున్= మనసును; ఇంద్రియంబులును= ఇంద్రియాలను;

గోచరత్వ సంప్రాప్తంబులు+కావించి= కనిపించేటట్లు సహజస్థితికి తెచ్చి; కొంచెము+నగవునన్= చిరునవ్వుతో; నెఱ+మొగంబు+ఒప్పన్= అందమైన ముఖంతో అలరారుతూ; ఆ+పుడమి ఱేనిన్= ఆ ధర్మరాజును; ఆలోకించి= చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణుడితో 'నీవు శాంతచిత్తుడవై, నా హృదయంలోని అనుమానాన్ని తొలగించవా?' అని ప్రార్థించగా పాంచజన్యధరుడైన శ్రీకృష్ణుడు తన మనోబుద్ధీంద్రియాలను సహజస్థితికి తెచ్చి - అంటే ధ్యానాన్ని విరమించి - చిరునవ్వుతో, ప్రసన్నవదనంతో ఆ ధర్మరాజును చూచి ఇట్లా అన్నాడు.

సీ. 'గంగ యెవ్వనిఁ 'దన గర్భంబునం దతి । శ్లాఘా సమేతయై సంభరించె;
భార్గవుం డెవ్వనిఁ బరమశిష్యుఁడు గాఁగఁ । బడసి గురుత్వ మెక్కుడుగ నెగడె;
నారాముఁ డెవ్వనితో రాసి యిరువది । మూఁడు దినములకు వాఁడి దఱిఁగెఁ;
గాశీశు కన్యలు గారణంబుగఁ బోరి । యెవ్వని కోడి రనేక నృపులు;

తే. వేదములు నాలుగును ధనుర్వేదమును మ । హాస్త్రములుఁ జెంది యెవ్వనియందు వెలిఁగె
నట్టి భీష్ముండు న న్నిప్పు డాత్మఁ దలఁచు । చునికిఁ దద్గతమయ్యె నా మనము నధిప! 12

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; ఎవ్వనిన్= ఎవడిని; తన గర్భంబునందున్= తన గర్భంలో; అతి= మిక్కిలి; శ్లాఘాసమేతము+ఐ= ప్రశంసతో కూడినదై; గంగ= గంగాదేవి; సంభరించెన్= చక్కగా భరించిందో; ఎవ్వనిన్= ఎవడినైతే= పరమశిష్యుఁడు+కాఁగన్= ఉత్తమ శిష్యుడిగా; పడసి= పొంది; భార్గవుండు= భృగువంశజుడైన పరశురాముడు; గురుత్వము= గురుస్థానం; ఎక్కుడుగన్=ఎక్కువగా; నెగడెన్= ప్రసిద్ధి పొందాడో; ఎవ్వనితోన్= ఎవడితో; రాసి= ఎదుర్కొని; ఇరువది మూఁడు దినములకున్= ఇరవై మూడు రోజులకు; ఆ రాముఁడు= ఆ పరశురాముడు; వాఁడి+తఱిఁగెన్= పరాక్రమాన్ని కోల్పోయాడో; అనేక నృపులు= రాజులు పెక్కుమంది; కాశీ+ఈశు కన్యలు= కాశీరాజు పుత్రికల; కారణంబుగన్= నిమిత్తంగా; పోరి= యుద్ధంచేసి; ఎవ్వనికిన్+ఓడిరి= ఎవడితో ఓడిపోయారో; వేదములు నాలుగును= ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణం అనే వేదాలు నాలిగింటిని; ధనుః+వేదమును= ధనుర్వేదాన్ని (విలువిద్యను); మహా+అస్త్రములున్= గొప్పవైన బాణాలను (మంత్ర పూర్వకంగా ప్రయోగించేవి); చెంది= పొంది; ఎవ్వని+అందున్= ఎవనియందు; వెలిగెన్= ప్రకాశించెనో; అట్టి= అటువంటి; భీష్ముండు= భీష్ముడు; నన్నున్+ఇప్పుడు+ఆత్మన్+తలఁచుచున్+ఉనికిన్= ఆత్మలో న న్నిప్పుడు స్మరిస్తూ ఉండటంవలన; నా మనమున్= నా మనస్సు కూడా; తద్+గతము+అయ్యెన్= అతడియందు లీనమైనది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ప్రశంసనీయమైన గంగాదేవి ఎవడిని గర్భాన భరించిందో, ఎవడు తనకు శిష్యుడు కావటంవలన పరశురాముడు గురుశ్రేష్ఠుడయ్యాడో, ఆ పరశురాముడే ఎవడితో ఇరవై మూడు రోజులు యుద్ధంచేసి పరాక్రమాన్ని కోల్పోయాడో, కాశీరాజపుత్రికల కారణంగా పెక్కుమంది రాజులు ఎవడితో పోరాడి ఓడిపోయారో, చతుర్వేదాలు, ధనుర్వేదం, మహాస్త్రాలు పొంది ఎవడియందు అవి ప్రకాశించాయో అట్లాంటి భీష్ముడు ఈ సమయంలో నన్ను మదిలో స్మరించటంవలన నా మనస్సు అతడియందు లీనమైనది.

విశేషం: శంతనుడివలన గంగాదేవి భీష్ముడిని పుత్రునిగా పొందింది. లోకంలో గురువులకు ఎంతో మంది శిష్యులుంటారు. కాని, భీష్ముడు పరశురాముడికి శిష్యశ్రేష్ఠుడు కావటం వలన పరశురాముడి గురుత్వం లోక ప్రసిద్ధంగా వెలిగింది. అంటే గురువు వలన శిష్యుడికి ప్రఖ్యాతి రావటం లోక సహజం. కాని, ఇక్కడ భీష్ముడి వలన గురువైన పరశురామునికి కీర్తి సిద్ధించటం విశేషం. గురువైన పరశురాముడు అంబకు అభయ మిచ్చి శిష్యుడైన భీష్ముడితో ఇరవైమూడు రోజులు పోరాడి పరాక్రమహీను డయ్యాడు. ఇక్కడ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీష్ముడు గురువును మించిన శిష్యుడయ్యాడు. అయినా 'శిష్యా దిచ్ఛేత్ పరాజయమ్' అన్న న్యాయాన్ని అనుసరించి పరశురాముడు గురుశ్రేష్ఠు డయ్యాడు. బహుశః ఏ గురువుకు ఇట్లాంటి గౌరవం దక్కలేదేమో! కాశీరాజు తన పుత్రికలైన అంబ, అంబిక, అంబాలికలకు స్వయంవరాన్ని ప్రకటించగా భీష్ముడు తన సోదరులైన చిత్రాంగద, విచిత్రవీర్యులకు వివాహం గావించటానికి సమస్త రాజులను తా నొక్కడే జయించి కాశీరాజు పుత్రికలను తెచ్చిన పరాక్రమ సంపన్నుడు భీష్ముడు. చతుర్వేదాలను, ధనుర్వేదాన్ని, మహాస్త్రాలను పొందటం వలన ఒక వ్యక్తి ప్రకాశిస్తాడు. కాని, ఇవన్నీ భీష్ముడి వశం కావటం వలన అవే ప్రశస్తంగా వెలుగొందాయి - అని తిక్కన చెప్పటంలో భీష్ముని పరాక్రమవైశిష్ట్యం వ్యక్తమవుతున్నది. ఇక్కడ భక్తితత్త్వం భీష్ముడిలో, భక్తపరాధీనత శ్రీకృష్ణుడిలో స్పష్టమవుతున్నాయి.

క. అనలము శమించు చాడ్పున । ననఘ! యతండు పరమోన్ముఖాత్ముండై తా
ననుఁ దలఁచె నింద్రియంబులు । మనమునఁ దగ నిగ్రహించి మహిత సమాధిన్. 13

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడైన ఓ ధర్మరాజా!; అతండు= ఆ భీష్ముడు; పరమ+ఉత్+ముఖ+ఆత్ముండు+ఐ= నాకు మిక్కిలి అభిముఖమైన ఆత్మ కలిగినవాడై; అనలము= అగ్ని; శమించు చాడ్పునన్= అణగినట్లు; తాన్= ఆ భీష్ముడు; ఇంద్రియంబులు= కర్మేంద్రియ, జ్ఞానేంద్రియాలను; మనమునన్= మనస్సునందు; తగన్= ఉచిత రీతిని; నిగ్రహించి= అణచిపెట్టి; మహిత= శ్రేష్ఠమైన; సమాధిన్= మనోలయస్థితిలో; ననున్+తలఁచెన్= నన్ను స్మరించాడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆ భీష్ముడు సమాధినిష్ఠలోని ఆసక్తిచేత, నిప్పు అణగిపోయినట్లు, జ్ఞాన, కర్మేంద్రియాలను మనస్సు నందు నిగ్రహించి, అత్యంత సమాధినిష్ఠలో ఉంటూ నన్ను స్మరించాడు.

విశేషం: సమాధి అష్టాంగాలలో ఒకటి. అష్టాంగాలు: యమం, నియమం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధ్యానం, ధారణ, మననం, సమాధి.

ధర్మరాజు శ్రీకృష్ణుడిని దర్శించి సంభాషించినప్పుడు సమాధినిమగ్నుడనై ఉన్నా నని, దీనికి కారణం పరమ కృష్ణభక్తుడైన భీష్ముడు తనను స్మరించటం వలననే తాను సమాధిగతుడనయ్యానని కృష్ణుడు బదులు చెప్పాడు. అంతేకాక భీష్ముడు యుద్ధరంగంలో అగ్నివలె జాజ్వల్యమానంగా ప్రకాశించి ఇప్పుడు శరతల్పగతుడై అగ్ని అణగినట్లు సమాధిగతుడై తనను ధ్యానించాడని ధర్మరాజుకు తెలిపి భీష్ముడి భక్తితత్త్వాన్ని వివరించాడు.

క. శరతల్పగతుం డతఁడే । శరణంబుగ నాశ్రయించి సద్భావ వ్యా
ప్తిరతుం డగుటను విను త । త్పరత నతనియందు నాదు భావం బెలసెన్. 14

ప్రతిపదార్థం: విను= (ఓ ధర్మరాజా!) వినుము; శరతల్పగతుండు= బాణాలతో చేయబడిన పాన్పునందు పరుండిన; అతఁడు= ఆ భీష్ముడు; ఏన్= నేను; శరణంబుగన్+ఆశ్రయించి= రక్షకుడని ఆశ్రయించి; సత్+భావ= శ్రేష్ఠమైన మనస్సు నందు; వ్యాప్తి రతుండు+అగుటను= అంతట వ్యాప్తిచేత! ఆసక్తు డగుట వలన; అతని+అందున్= ఆ భీష్ముడి అందు; నాదు భావంబు= నా మనస్సు; తత్పరతన్= పారవశ్యంతో; ఎలసెన్= చేరి ఉన్నది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! వినుము. శరతల్పగతుడై ఆ భీష్ముడు నన్నే శరణుగా భావించి నన్ను సమాధి నిష్ఠతో ధ్యానించటం వలన భక్త పరాధీనుడ నైన నేను ఆ భీష్ముడి మనస్సునందు సంలీనుడినై ఉన్నాను.

వ. ఇది మదీయ ధ్యానంబు తెఱం; గమ్మహాత్ముండు వసిష్ఠ శిష్యుండు, భూత భవిష్య ద్వర్తమానవేది, సర్వ విద్యా ధార భూతుం డాతం డస్తమించిన ధాత్రి యస్తమిత సుధాగభస్తి యగు రాత్రియుంబోలె నగు; సకలజ్ఞానంబులు ననాశ్రయంబులై పొనుంగు పడుం; గావున నీ వతని పాలికిం బోయి నీ యడుగం దలంచిన యఖిల ధర్మంబులు

నడిగి చెప్పించుకొని నిశ్శేష నిరస్త సంశయుండవు గావలయు'నని యానతిచ్చిన నమ్మానవపతి గద్గద కంఠుం డగుచు నా వైకుంఠున కి ట్లనియె. 15

ప్రతిపదార్థం: ఇది= ఈ పైని చెప్పబడినది; మదీయ= నా యొక్క; ధ్యానంబు= ధ్యానం యొక్క; తెఱంగు= విధం; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడైన భీష్ముడు; వసిష్ఠ శిష్యుండు= వసిష్ఠుడి శిష్యుడు; భూత= గతకాలం; భవిష్యత్= రాబోయే కాలం; వర్తమాన= నడుస్తున్న కాలం; వేది= తెలిసినవాడు (అంటే త్రికాల వేది); సర్వ విద్యా+ఆధారభూతుండు= సమస్త విద్యలకు ఆధారమైన వాడు; ఆతండు+అస్తమించినన్= ఆ భీష్ముడు కన్ను మూస్తే; ధాత్రి= భూమి; అస్తమిత= అడగిపోయిన లేదా అంతరించిన; సుధా= చల్లనైన; గభస్తి+అగు= కిరణాలు కలిగిన చంద్రుడు గల; రాత్రియున్+పోలెన్+అగున్= రాత్రివలె ఔతుంది; సకల జ్ఞానంబులు= సమస్త జ్ఞానాలు (మోక్షేధీర్జ్ఞానమ్ - జ్ఞాయతే అనే నేతి జ్ఞానం జ్ఞా అవబోధనే. దీనిచేత నెరుగబడును. మోక్షసాధనమైన బుద్ధి పేరు, ధీః ధ్యాయం త్యనయేతి ధీః ధ్యై చింతాయాం. దీని చేత ధ్యానము చేయుదురు. గురుబాల ప్రబోధిక పుటలు 111, 114, అంటే ధ్యానం ద్వారా మోక్షసాధనమైనదే జ్ఞానం. ఇంతేకాక శ్రీసూర్య రాయాంధ్ర నిఘంటువులో 1. (వేదాంత) పదార్థములను గ్రహించెడు మానసిక వృత్తి, బోధము, ఎఱుక; 2. పరమాత్మ విషయమైన వివేచనము; 3. తత్త్వ జ్ఞానము; 4. పరమాత్మ జ్ఞాన సాధనమైన శాస్త్రాదుల వలన కలిగిన ఆత్మసాక్షాత్కారము; 5. వేద వేదాంగార్థ విషయమైన యెరుక; 6.ఆత్మ స్వరూప ప్రకాశనము; 7. మోక్ష ఫలకమైన బుద్ధి - అని అనేక రీతుల జ్ఞాన శబ్దార్థాలున్నాయి. 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' త్తై. ఉప. 2-1) (బ్రహ్మము సత్యము జ్ఞానము అనంతమును) అనంతమైన బ్రహ్మము సత్యజ్ఞానమని అంటే (బ్రహ్మజ్ఞానమే జ్ఞానం) ఇన్ని జ్ఞానాలు; న+ఆశ్రయంబులై= అనాశ్రయంబులై= ఆశ్రమ రహితాలై; పొనుంగుపడున్+కావున(న్)= నిస్తేజమవుతాయి, శూన్యమవుతాయి, లేదా నశిస్తాయి కనుక; నీవు+అతని పాలికిన్+పోయి= నీవు ఆ భీష్ముడివద్దకు వెళ్ళి; నీ+అడుగన్+తలంచిన= నీవు అతడిని అడుగదలచిన; అఖిలధర్మంబులన్+అడిగి= అన్ని ధర్మాలను అడిగి; చెప్పించుకొని; నిశ్శేష= శేషరహితంగా అంటే ఏమీ మిగలకుండా; నిరస్త= పోయినటువంటి; సంశయుండవు= సందేహం కలవాడవు, సందేహ రహితుడవు కావలసి ఉన్నది; అని+ఆనతిచ్చినన్= అని ఆజ్ఞాపించగా; ఆ+మానవపతి= ఆ ధర్మరాజు; గద్గద కంఠుండు+అగుచున్= డగ్గుత్తిక కలవాడై; ఆ వైకుంఠునకున్+ఇట్లు+అనియెన్= ఆ వైకుంఠుడైన శ్రీకృష్ణుడితో ఇలా అన్నాడు.

తాత్పర్యం: పై పద్యాల్లో చెప్పిన రీతిగా అది శ్రీకృష్ణుడి ధ్యాన పద్ధతి అని ధర్మరాజునకు తెలియజెప్పాడు. వసిష్ఠ శిష్యుడు, త్రికాలవేది, సమస్త విద్యలకు నిలయుడు అయిన భీష్ముడు స్వర్గతుడైతే ఈ భూమి చంద్రరహితమైన రాత్రివలె అవుతుంది. సర్వజ్ఞానాలు - అంటే వేద వేదాంతాలు తత్త్వ జ్ఞానాదులన్నీ ఆశ్రయరహితాలై అదృశ్యమై పోతాయి. అందువలన భీష్ముడివద్దకు వెళ్ళి నీవు అడుగదలచిన సమస్త ధర్మాలను అడిగి తెలిసికొని సందేహ నివృత్తిని పొందవలసిం'దని శ్రీకృష్ణుడు ఆనతివ్వగా, ఆ ధర్మరాజు డగ్గుత్తికతో శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: భీష్ముడు వసిష్ఠుడివలన సకలవేదాలను, శాస్త్రాలను చదివాడు. పరశురాముడివద్ద అస్త్రవిద్యాపారీణు డయ్యాడు. ఆత్మవిజ్ఞానంలో సనత్కుమారునంతటివాడు. సర్వశాస్త్ర విద్యా నైపుణ్యంలో బృహస్పతిని పోలినవాడు. ఈ విషయాలను తిక్కన సూచించాడు.

ఉ. 'శంతనుసూనుగౌరవము సర్వము మున్నును వింటి విప్రుల
త్యంతము వేడ్కఁ జెప్ప నతఁ డట్టిఁడ; యాతని నీవు మున్నుగా
నెంతయు భక్తిఁ గాంచుటకు నే మదిఁ గోరెద నమ్మహాత్ముఁడున్
సంతసమందు నీదయిన సన్నిధిఁ గాంచిన భక్తవత్సలా! 16

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భక్తవత్సలా!= భక్తులయందు వాత్సల్యం కలవాడా!; విప్రులు+అత్యంతము= బ్రాహ్మణులు మిక్కిలి; వేడ్కన్+చెప్పన్= సంతోషంతో చెప్పగా; శంతనుసూను= శంతను మహారాజు పుత్రుడైన భీష్ముడి యొక్క; గౌరవమున్= గొప్పతనాన్ని; సర్వమున్= సమస్తమూ; మున్నును= ముందే; వింటిన్= విన్నాను; అతఁడు+అట్టి+వాఁడు+అ= ఆ భీష్ముడు అంత గొప్పవాడే; నీవు మున్నుగాన్= నీవు ముందుండగా అంటే నీతోపాటు; ఎంతయున్ భక్తిన్= ఎంతో భక్తితో; ఆతనిన్= ఆ మహనీయుని; కాంచుటకున్+ఏన్+మదిన్+కోరెదన్= దర్శించటానికి నేను నా మనస్సులో కోరుకొంటున్నాను; నీదు+అయిన= నీ యొక్క; సన్నిధిన్+కాంచినన్= చేరువను అంటే సామీప్యాన్ని చూస్తే; ఆ+మహా+ఆత్ముఁడున్= ఆ మహనీయుడు కూడా; సంతసము+అందున్= సంతోషిస్తాడు.

తాత్పర్యం: భక్తవత్సలుడ వైన ఓ శ్రీకృష్ణా! ఇంతకు ముందే బ్రాహ్మణోత్తములు వివరించగా శంతను మహారాజు పుత్రుడైన ఆ భీష్ముడి గౌరవ మెంతటిదో నేను గుర్తించాను. నీవు చెప్పినట్లు భీష్మ డంతటి మహనీయుడే. సందేహం లేదు. నీవు ముందుండగా ఆ మహాత్ముడిని దర్శించటానికి కుతూహల చిత్తుడనయి ఉన్నాను. నీ సన్నిధిని కాంచిన భీష్ముడు కూడా ఆనందిస్తాడు.' అని ధర్మరాజు శ్రీకృష్ణుడితో చెప్పాడు.

వ. ఉత్తరాయణంబు వేచికొని యున్న యన్నరోత్తముండు బ్రహ్మమయనిధి యయిన నీ సందర్శనంబు గోరు; నా మీఁది యనుగ్రహంబునను నతని యెడం గలుగు పరిగ్రహంబునను దేవా! నీ విట్లు సేయవలయు' ననుటయు, నద్దేవకీ నందనుండు సమీప గతుం డగు సాత్యకిం గనుంగొని 'రథంబు సమకట్టుమని దారుకునకుం జెప్పుము; భీమార్జున నకుల సహదేవులను గృప యుయుత్సు సంజయులను రావింపు' మనిన నతం డట్ల చేసె దారుకుండునుం దే రాయితంబు గావించె. 17

ప్రతిపదార్థం: దేవా!= ఓ శ్రీకృష్ణా!; ఉత్తర+అయనంబు= ఉత్తరాయణం అంటే ఉత్తర దిక్కులోని సూర్యగమనం (సంవత్సరంలో ఆరు నెలలపాటు సూర్యుడు ఉత్తర, దక్షిణ దిక్కులలో ఉంటాడు); వేచికొనిఉన్న= ప్రతీక్షిస్తున్న; ఆ నర+ఉత్తముండు= ఆ మానవ శ్రేష్ఠుడు అయిన భీష్ముడు; బ్రహ్మ+మయ నిధి+అయిన= బ్రహ్మమయమైన నిధి; నీ సందర్శనంబున్= నిన్ను చూడటాన్ని; కోరున్= కోరుకొంటున్నాడు; నా మీఁది+అనుగ్రహంబుననున్= నాపైని దయవలననూ; అతని యెడన్+కలుగు= ఆ భీష్మునిపై కలిగే; పరిగ్రహంబుననున్= ప్రీతితో స్వీకరించటంతోనూ; నీవు+ఇట్లు+చేయవలయున్+అనుటయున్= నీవీ విధంగా చేయాలని ధర్మరాజు చెప్పగా; ఆ+దేవకీ నందనుండు= ఆ దేవకీదేవి పుత్రుడు శ్రీకృష్ణుడు; సమీప గతుండు+అగు= దగ్గరలోనే ఉన్నటువంటి; సాత్యకిన్+కనుంగొని= తమ్ముడైన సాత్యకిని చూచి; రథంబు= రథాన్ని; సమకట్టుము+అని= సిద్ధం చేయుమని; దారుకునకున్+చెప్పుము= సారథియైన దారుకునకు చెప్పు; భీమ+అర్జున నకుల సహదేవులను+కృప యుయుత్సు సంజయులను= భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు, కృపుడు, యుయుత్సుడు, సంజయుడు అనేవారిని; రావింపుము+అనినన్= పిలిపించుమని చెప్పగా; అతండు+అట్లు చేసెన్= ఆ సాత్యకి అట్లా చేశాడు; దారుకుండునున్+తేరు+ఆయితంబు+కావించె(న్)= సారథి అయిన దారుకుడు రథం సిద్ధం చేశాడు.

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! తనువు చాలించాలని ఉత్తరాయణం కొరకు ఎదురుచూస్తున్న ఆ మహనీయుడైన భీష్ముడు పరబ్రహ్మ స్వరూపుడవు, అన్నిటికీ నిధివైన నీ సాన్నిధ్యాన్ని అభిలషిస్తూ ఉంటాడు. అతడిపై గల దయతోను, నా మీది ఆదరంతోను నీ వా మహాత్ముడి వద్దకు వెళ్ళవలసిం' దని కోరుతున్నానని ధర్మరాజు వేడుకొన్నాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజు అభ్యర్థనను గుర్తించి, తన సమీపంలోనే ఉన్న తమ్ముడైన సాత్యకిని పిలిచి 'వెంటనే రథం సిద్ధం చేయవలసిం దని సారథి అయిన దారుకుడితో చెప్పుము. భీమార్జున నకుల సహదేవులను, కృపాచార్య,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యుయుత్సు, సంజయులను వెనువెంటనే రప్పించుము' అని సెలవిచ్చాడు. వెంటనే సాత్యకి అన్న మాటలను పాటించాడు. దారుకుడు రథం ఆయత్తం చేశాడు.

విశేషం: సంవత్సరంలో ఆరేసి నెలలపాటు సూర్యుడు ఉత్తర దక్షిణ దిక్కులలో పయనిస్తూ ఉంటాడు.

ఉత్తరాయణం: మకర సంక్రాంతి మొదలుకొని కర్కాటక సంక్రాంతి వరకు గల కాలాన్ని ఉత్తరాయణ మంటారు. ఉత్తరాయణ పుణ్యకాలంలో పరమపదిస్తే ఉత్తమ గతులు కలుగుతాయని విశ్వాసం. అందుకే భీష్ముడు ఉత్తరాయణం కోసం వేచి ఉన్నాడు.

బ్రహ్మలవికారం: బ్రహ్మ నవబ్రహ్మలని ప్రతీతి. భృగువు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అంగిరసుడు, దక్షుడు, అత్రి, మరీచి, వసిష్ఠుడు - అనీ వీరే కాక బాల, కుమార, అర్క, వీర, విశ్వ, తారక, గరుడ, స్వర్గ, పద్మ బ్రహ్మలనీ నవబ్రహ్మలు.

బ్రహ్మమయోనిధిః అనే మూల ప్రయోగాన్ని తిక్కన 'బ్రహ్మమయనిధి' అని యథాతథంగా వాడుకొన్నాడు. పరబ్రహ్మ స్వరూపుడు, సమస్తనిధి అయిన శ్రీకృష్ణుడు అని అర్థం.

క. అది రత్నరుచుల పెల్లున । నుదితార్కునిఁ బోలి వెలుఁగుచుండెను జవసం
పదుదీర్ణ సత్త్వ సారా । స్పద సుగ్రీవాదిరథ్య సంశోభిత మై. 18

ప్రతిపదార్థం: అది= ఆ రథం (దారుకుడు ఆయత్తం చేసి తెచ్చిన శ్రీకృష్ణుడి రథం); జవ= వేగంయొక్క; సంపద్= సంపద అంటే ఆధిక్యం చేత; ఉదీర్ణ= గొప్పదయినట్టి; సత్త్వ= బలం యొక్క; సార= సారానికి (చేవకు); ఆస్పద= ఆటపట్టయిన; సుగ్రీవ+ఆది= శ్రీకృష్ణుడి రథానికి పూన్చిన గుర్రాలలో (సుగ్రీవం, శైబ్యం, మేఘ పుష్పం, వలాహకం అనే నాలుగింటిలో) ఒకటైన సుగ్రీవమనే గుర్రం మొదలుకొని; రథ్య= గుర్రాలచేత; సంశోభితము+ఐ= మిక్కిలి అందమైనదై; రత్న= మణుల యొక్క (నవరత్నాలు: మౌక్తికం, పద్మరాగం, వజ్రం, వైడూర్యం, ప్రవాళం, మరకతం, నీలం, గోమేధికం, పుష్యరాగం); రుచుల= కాంతుల యొక్క; పెల్లునన్= ఆధిక్యంచేత; ఉదిత= అప్పుడే ఉదయించిన; అర్కునిన్+పోలి= సూర్యుడివలె; వెలుఁగుచుండెను= ప్రకాశిస్తూ ఉన్నది.

తాత్పర్యం: ఆ విధంగా దారుకుడు ఆయత్తంచేసి తెచ్చిన శ్రీకృష్ణుడి రథం అత్యంత వేగవంతమూ, దేహదార్ఢ్యమూ కలిగిన సుగ్రీవం మొదలైన శ్రీకృష్ణ రథాశ్వాలతో శోభావహమై, నవరత్న శోభితమై ఉండటంచేత, అప్పుడే ఉదయించిన సూర్యుడివలె ప్రకాశిస్తూ మనోహరమై ఒప్పుతూ ఉండింది.

వ. ఆ సమయంబున నక్కడం బారాశర్య నారద దేవల దేవస్థాను వాత్స్య దేవరాత ప్రభృతి పరమ మునీంద్ర పరివేష్టనంబు గలిగి గాంగేయుండు గ్రహగణ పరివృతుండైన చంద్రుండునుంబోలెఁ దల్పీభూత శాతశరశతంబుల చేత శోభిల్లి సందర్శనీయగభస్తి వితానుండగు నస్తమయ సమయ భానుం గ్రేణిసేయుచుఁ గృష్ణుం జిత్తంబున నిరతిశయ నిష్ఠ నిలిపికొనియుండి చేతులు మొగిడ్చి సుపుష్టస్వరంబున నిట్లని స్తుతియించె. 19

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ దారుకుడు శ్రీకృష్ణుడి రథం సిద్ధంచేసి తెచ్చినప్పుడు; అక్కడన్= శరతల్పగతుడై భీష్ముడున్న ప్రదేశంలో; పారాశర్య నారద దేవల దేవస్థానువాత్స్య దేవరాత= పరాశరుని పుత్రుడైన వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థానుడు, వాత్స్యుడు, దేవరాతుడు; ప్రభృతి= మొదలైన; పరమ ముని+ఇంద్ర= శ్రేష్ఠులైన ముని నాథులచేత; పరివేష్టనంబు+కలిగి= చుట్టు ఉన్నటువంటి వారిని కలిగి ఉన్న; గాంగేయుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; గ్రహగణ= నవగ్రహాల సమూహంచేత; పరివృతుండు+ఐన= చుట్టబడిన వాడైన; చంద్రుండునున్+పోలెన్= చంద్రుడివలె; తల్పీభూత= పాన్పుగా చేయబడిన; శాత= వాడి అయిన; శరశతంబుచేతన్= నూరు బాణాలచేత; శోభిల్లి= ప్రకాశించినవాడై; సందర్శనీయ= చూడటానికి వీలయిన; గభస్తి=

సూర్య కిరణములయొక్క; వితానుండగు= సమూహమును కలిగినవాడయి; అస్తమయ= అస్తమించే; సమయ= కాలమందలి భానున్= సూర్యుని; శ్రేణి+చేయుచున్= పరిహసిస్తూ; కృష్ణున్= కృష్ణుడి; చిత్తంబునన్= మనస్సునందు; నిరతిశయ నిష్ఠన్= మిక్కిలి నిష్ఠతో; నిలిపికొనిఉండి= ఉంచుకొని; చేతులు మొగిడిచి= (నమస్కార పూర్వకంగా) చేతులు జోడించి; సుపుష్ట స్వరంబునన్= ఉచ్చైస్స్వరంతో; ఇట్లు+అని= ఈ విధంగా; స్తుతించెన్= స్తోత్రం చేశాడు.

తాత్పర్యం: దారుకుడు సిద్ధంచేసి రథం తెచ్చిన సమయంలో భీష్ముడు శరతల్పగతుడై ఉన్న ప్రదేశంలో వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థాణుడు, వాత్స్యుడు, దేవరాతుడు ప్రభృతులయిన మహాముని శ్రేష్ఠులచేత చుట్టబడిన భీష్ముడు నవగ్రహాల సమూహంచేత చుట్టబడిన చంద్రుడివలె వాడి అయిన అనేక బాణాలచేత చేయబడిన పాన్పుమీద ప్రకాశిస్తూ చూడటానికి వీలయిన అస్తమయసూర్యుడిని పరిహసిస్తూ శ్రీకృష్ణుడిని నిరతిశయమైన నిష్ఠతో తన మనస్సునం దుంచుకొని ఉండి, చేతులు జోడించి ఉచ్చైస్స్వరంతో ఈ విధంగా స్తుతించాడు.

విశేషం: అలం: ఉపమ. మహర్షుల జాబితా మూలంలో ఎక్కువగా ఉండగా తిక్కన దాన్ని సంక్షిప్తంచేసి వ్యాస, నారద, దేవల, దేవస్థాణు, వాత్స్య, దేవరాత ప్రభృతి మహామునిశ్రేష్ఠులు అని మాత్రం పేర్కొన్నాడు. మునులచేత చుట్టబడిన భీష్ముడు గ్రహగణాలతో చుట్టబడిన చంద్రుడివలె ఉన్నాడని చెప్పటంలో భీష్ముడు పండిపోయిన రీతి స్పష్టమవుతుంది. ఇంకా స్వర్గతుడు కావటానికి సిద్ధంగా ఉండి ఉత్తరాయణం కొరకు ఎదురు చూస్తున్న భీష్ముడి "సందర్శనీయ గభస్తి వితానుండగు నస్తమయ సమయ భానుంగ్రేణి సేయుచు" - అని సముచితంగా వర్ణించాడు తిక్కన.

భీష్ముఁడు శ్రీకృష్ణుని భక్తియుక్తుండై స్తుతించుట (సం. 12-47-7)

సీ. **'శుచియును హంసుండు శుచిషత్తుఁ బరముండుఁ। బరమేష్ఠియును నగు భవ్యుఁ గొలుతు;**
మునులును సురలు నెవ్వనియున్నరూపెఱుం। గరు సర్వవిదుని నప్పురుషుఁ గొలుతు;
శ్రుతులు సెప్పఁగ మహామతులు దుఃఖౌషధం। బుగ నెఱింగెడు పుణ్యమూర్తిఁ గొలుతు;
లోకంబు లెల్లఁ గల్గుట నిల్చు టొదుఁగుట। తనయంద యగు మహోత్తరునిఁ గొలుతు;

తే. **బక్షి రత్నచయంబు బుష్ప వ్రజంబుఁ। బంజరము త్రాడు నార యుపాశ్రయముగ**
నుండు చాడ్పున విశ్వంబు నుండుటకు సు। ఖాస్పదం బగు పుండరీకాక్షుఁ గొలుతు. **20**

ప్రతిపదార్థం: శుచియును= శుచి అయిన అగ్ని; హంసుండున్= సూర్యుడు; శుచిషత్తున్= శుచి అయిన ప్రదేశాలలో నివసించే వాడైన బ్రహ్మ; పరముండున్= పరమాత్ముడూ; పరమేష్ఠియున్= పరబ్రహ్మ; అగు= అయినట్టి; భవ్యున్= శ్రేష్ఠుడయిన శ్రీకృష్ణుడిని; కొలుతున్= పూజిస్తాను; మునులును= మహర్షులూ; సురలున్= దేవతలూ; ఎవ్వని= ఎవడియొక్క; ఉన్నరూపు= నిజమైన స్వరూపాన్ని; ఎఱుంగరు= తెలియరో అట్టి; సర్వవిదునిన్= సమస్తం తెలిసిన; ఆ+పురుషున్= ఆ పరమ పురుషుడైన శ్రీకృష్ణుడిని; కొలుతున్= అర్చిస్తాను; శ్రుతులు= వేదాలు; చెప్పఁగన్= (ఎవరిని గురించి) చెప్పుతున్నాయో; మహామతులు= జ్ఞాన సంపన్నులు (బుద్ధిమంతులు); దుఃఖ= దుఃఖమనే రోగానికి; ఔషధంబుగన్= మందువలె; ఎఱింగెడు= తెలిసికొనేటటువంటి; పుణ్యమూర్తిన్= పుణ్య పురుషుడైన శ్రీకృష్ణుడిని; కొలుతున్= ప్రార్థిస్తాను; లోకంబులు+ఎల్లన్= జగత్తులన్నీ; కల్గుట= సృజించబడటం; నిల్చుట= నిలబడటం (స్థితి); ఒదుఁగుట= నాశనం కావటం (లయం); తనయందు+అ+అగు= తనలోనే ఉన్న; మహా+ఉత్తరున్= మహాశ్రేష్ఠుడైన ఆ శ్రీకృష్ణుడిని; కొలుతున్= కొలుస్తాను; పక్షి= పిట్ట; రత్నచయంబున్= మణుల యొక్క సమూహమూ; పుష్ప వ్రజంబున్= పువ్వుల సమూహమూ; పంజరమున్= పంజరం వలననూ; త్రాడున్= దారం వలననూ; నారయున్= నార వలననూ;

ఉప+ఆశ్రయముగన్= ప్రాపుగా; ఉండు చాడ్పునన్= ఉన్నట్లుగా; విశ్వంబు= ఈ ప్రపంచమంతా; ఉండుటకున్= (సువ్యవస్థితమై) నిలవటానికి; సుఖ+ఆస్పదంబు+అగు= సుఖమయం - ఏ విధమైన ఇబ్బంది లేకుండా ఉండే ఆశ్రయమైన; పుండరీక+అక్షున్= తెల్ల తామరల వంటి కన్నులు కలిగిన శ్రీకృష్ణుడిని; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: శుచి, హంసుడు, శుచిషత్తు, పరమాత్ముడు, పరబ్రహ్మ అయిన శ్రీకృష్ణుడిని పూజిస్తాను, మహర్షులు దేవతలు కూడా ఎవడి కలరూపు తెలిసికొనలేకపోయారో అట్లాంటి పరమ పురుషుడైన శ్రీకృష్ణుడిని అర్చిస్తాను. ప్రాజ్ఞులు దుఃఖరోగానికి ఎవరినయితే ఔషధంగా భావించారో ఆ పుణ్యపురుషుడైన శ్రీకృష్ణుడిని ప్రార్థిస్తాను. ఈ జగత్తులన్నింటి సృష్టి స్థితి లయములకు కారణ మెవ్వడో ఆ మహాశ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడిని కొలుస్తాను. పక్షి పంజరాన్ని, రత్నసమూహం దారమునూ, పూలు నారనూ ప్రాపుగా గొని ఉన్నట్లుగానే ఈ ప్రపంచం సువ్యవస్థితమై నిలవటానికి ఉత్తమాశ్రయమైన పుండరీకాక్షు డైన శ్రీకృష్ణుడిని స్మరిస్తాను.

విశేషం: అలం: యథాసంఖ్యం. పరబ్రహ్మ వరకు సమస్త దేవతామయుడై సర్వజగత్తుల సృష్టి స్థితి లయ కారణ భూతుడయి సమస్తమూ తానే అయిన శ్రీకృష్ణుడిని భీష్ముడు స్తుతించాడు. సమస్తకారణభూతుడు కృష్ణుడు అనటానికి ఈ పద్యంలోని ప్రతి పదమూ ఉపకరిస్తుంది.

ఆ. హరి సహస్ర శీర్షుఁ బరము సహస్రాక్షు । వేదమయు సహస్రపాదు నలఁతు
లైన వారి కంటె నలఁతి పెద్దలకును । జాలఁబెద్ద యగు దయాళుఁ గొలుతు. 21

ప్రతిపదార్థం: హరిన్= శ్రీకృష్ణుడిని; సహస్ర శీర్షున్= వేయి తలలు కలవాడిని; పరమున్= శ్రీకృష్ణుడిని; సహస్ర+అక్షున్= వేయి కన్నులు కలవాడిని; వేదమయున్= సమస్త వేదములూ తానే అయినవాడిని; సహస్రపాదున్= వేయి పాదాలు కలవాడిని; అలఁతులైన వారి కంటెన్= మిక్కిలి చిన్నవారికంటె; అలఁతిన్= చిన్న వానిని; పెద్దలకున్+చాలఁ+పెద్ద అగు= మిక్కిలి పెద్దలైన వారికంటె మిక్కిలి పెద్దవాడైన; దయాళున్= దయామయుడైన శ్రీకృష్ణుడిని; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: వేయి తలలతో, వేయి కన్నులతో, వేయి పాదాలతో, వేదమయుడై పరమశ్రేష్ఠుడైన హరిని, చిన్నవారికంటె మిక్కిలి చిన్నవాడైన వాడిని, పెద్దలకంటె మిక్కిలి పెద్దవాడయిన వాడిని దయామయుడైన శ్రీకృష్ణుడిని స్మరిస్తాను.

విశేషం: సహస్ర శీర్షాదిగా పురుష సూక్తంలోను విష్ణు సహస్రనామ స్తోత్రంలోనూ, విష్ణువును గూర్చి చెప్పబడిన అంశాలను, "అణోరణీయాన్ మహతో మహీయాన్" అన్న విశేషాలను వ్యాస మహర్షి ప్రయోగించాడు. అదే రీతిగా తిక్కన ఈ చిన్న పద్యంలోనూ కూర్చటం విశేషం.

క. అమృతమయు, ఋగ్యజు స్సా । మముల యుపనిషద్వచ స్సమాజములకు వా
చ్యమయిన పురుషోత్తము, ని । క్కము రూపగు వాని భక్తిగమ్యుఁ దలంతున్. 22

ప్రతిపదార్థం: అమృతమయున్= నాశరహితుడిని; ఋక్+యజుః+సామముల= ఋగ్వేద, యజుర్వేద, సామవేదాల యొక్క; ఉపనిషత్+వచః+సమాజములకున్= ఉపనిషత్తులలోని వాక్య సమూహానికి; వాచ్యము+అయిన= అభివ్యక్తీకరించే (తెలియజేసే); నిక్కము రూపు+అగు వానిన్= సత్య స్వరూపమైన వాడిని; భక్తి గమ్యున్= భక్తితో పొంద దగినవాడిని; పురుషోత్తమున్= పురుషోత్తముడైన శ్రీకృష్ణుడిని; తలంతున్= స్మరిస్తాను.

తాత్పర్యం: అమృతమయుడు, వేదాలు, ఉపనిషత్తుల వాక్య సమూహాలచేత వాచ్యుడు, సత్యస్వరూపుడు, భక్తితో పొంద దగినవాడూ అయిన పురుషోత్తముడిని ధ్యానిస్తున్నాను.

విశేషం: భగవంతుడు భక్తపరాధీనుడు అనే అంశాన్ని తెలియచేయటానికే తిక్కన 'భక్తిగమ్యుఁడు' అనే మాట ప్రయోగించాడు.

ఆ. అరణి నగ్ని వొడము కరణి దేవకి యందు । విప్రకర్మయజ్ఞ వేద గుప్తి
కై జనించె నెవ్వఁ డవ్వసుదేవ నం । దను భజింతు నేకతానిరూఢి. 23

ప్రతిపదార్థం: ఎవ్వఁడు= ఎవడైతే; అరణిన్= త్రచ్చి నిప్పు పుట్టించే కొయ్యవలన; అగ్ని= అగ్నిదేవుడు; పొడము కరణిన్= పుట్టిన రీతిగా; దేవకి+అందున్= దేవకీదేవి గర్భమందు; విప్రకర్మయజ్ఞ= బ్రాహ్మణులయొక్క కర్తవ్యమైన యజ్ఞాలయొక్క; వేద= వేదాలయొక్క; గుప్తికయి= సంరక్షించుటకయి; జనించెన్= పుట్టాడో; ఆ+వసుదేవ నందనున్= ఆ వసుదేవ పుత్రుడైన శ్రీకృష్ణుడిని; ఏకతా నిరూఢిన్= ఏకాగ్ర చిత్తంతో; భజింతున్= కొలుస్తాను.

తాత్పర్యం: అరణుల రాపిడివలన అగ్నిదేవుడు ఉద్భవించినట్లు దేవకీదేవి వసుదేవులకు సుతుడుగా, బ్రాహ్మణ కర్తవ్యమైన యజ్ఞ వేదాలను సంరక్షించటంకొరకు జన్మించిన శ్రీకృష్ణుడిని ఏకాగ్రచిత్తంతో స్మరిస్తాను.

విశేషం: అలం: ఉపమ. పరిశుద్ధమైన అగ్నివలె శ్రీకృష్ణుడు సైతం యజ్ఞ వేదాల సంరక్షకుడిగా పరిశుద్ధుడనే అంశాన్ని కవి ఈ పద్యంలో స్పష్టం చేశాడు. 'ఏకతానిరూఢి' అంటే జ్ఞాన కర్మేంద్రియాలను మనస్సునందు సమైక్యం చేసికొని భీష్ముడు శ్రీకృష్ణుడిని స్తుతించాడని భావం.

తే. ఒకఁడు పండ్రెండు మూర్తులై యుండునట్లు । గా హిరణ్య వర్ణంబగు గర్భ మదితి
దాల్చి యెవ్వానిఁ గనియె దైత్యఘ్ను నట్టి । దేవు సూర్యాత్మకునిఁ బ్రణుతింతు విష్ణు. 24

ప్రతిపదార్థం: ఒకఁడు= ఒక్కడే; పండ్రెండు మూర్తులు+ఐ= పండ్రెండుగురు ఆదిత్యులై; ఉండునట్లుగాన్= ఉండే రీతిగా; అదితి= కశ్యప ప్రజాపతి భార్య అయిన అదితి; హిరణ్య వర్ణంబు+అగు= బంగారు రంగు కలిగిన; గర్భము+తాల్చి= గర్భం ధరించి; ఏ+వానిన్+కనియెన్= ఎవడిని కన్నదో; అట్టి దైత్యఘ్నున్= రాక్షసుడైన బలిచక్రవర్తిని సంహరించిన అట్టి వామనుడనే వాడిని; దేవున్= భగవంతుడిని; సూర్య+ఆత్మకునిన్= ద్వాదశ సూర్యాత్మకుడైన; విష్ణు(న్)= శ్రీ మహా విష్ణువును; ప్రణుతింతున్= నమస్కరిస్తున్నాను.

తాత్పర్యం: విష్ణువు ద్వాదశ సూర్యాత్మకుడు. బలిచక్రవర్తి సంహారార్థం అదితి గర్భంలో వామనమూర్తిగా జన్మించిన శ్రీ మహావిష్ణువును దేవదేవుడిగా సంస్మరిస్తాను.

విశేషం: ద్వాదశాదిత్యులు: అంశుడు, భగుడు, మిత్రుడు, వరుణుడు, ధాత, అర్యముడు, జయంతుడు, భాస్కరుడు, త్వష్ట, పూషుడు, ఇంద్రుడు, విష్ణువు. ద్వాదశాదిత్యులలో ఒకడు విష్ణువు. సూర్యాత్మకు డైన శ్రీకృష్ణుడిని స్మరిస్తున్నాడు భీష్ముడు.

క. సురపితృకోట్లం బూర్వా । పర పక్ష దినముల నమృత పాన ప్రీతిం
బొరయం జేయుచు వెలిఁగెడు । హరి సోమాత్మకునిఁ గొల్తు నాత్మేశ్వరునిన్. 25

ప్రతిపదార్థం: సురపితృకోట్లన్= దేవతలయొక్క, పితరుల యొక్క సమూహాలకు; పూర్వ+అపర పక్ష దినములన్= నెలలో శుక్ల, కృష్ణ పక్ష దినాలలో; అమృతపాన= అమృతాన్ని త్రాగటమునందలి; ప్రీతిన్= ఇష్టంతో; పొరయన్+చేయుచున్= పొందజేస్తూ; వెలిఁగెడు= ప్రకాశించునట్టి; ఆత్మ+ఈశ్వరునిన్= నా హృదయాధీశ్వరుడైన; సోమ+ఆత్మకునిన్= చంద్రాత్మకుడైన హరిని; కొల్తున్= పూజిస్తాను.

తాత్పర్యం: నెలలోని శుక్లపక్షంలో దేవతలను, కృష్ణ పక్షంలో పితృదేవతలను తన అమృతాన్ని ప్రీతితో ఇచ్చి పోషించే ఓషధీరూపు డైన వాడిని, నా హృదయాధీశ్వరు డైన చంద్రాత్మకు డైన హరిని ధ్యానిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: దక్షుడు శపించిన సందర్భంలో శివుని ఆశ్రయించగా తగవు తీర్చటానికి బ్రహ్మ చంద్రుడిని రెండుగా విభజించి శివుడి తలపై సగమూ, హిమవత్పర్వతంలో సగమూ ఉండేటట్లు నిర్ణయించాడు. దక్షుడి శాపం అనృతం కాకుండటానికి తారల కిచ్చిన భాగం వృద్ధి క్షయాలు పొందుతూ ఉండేది. ఆ వృద్ధి క్షయాలలో శుక్లపక్షంలో దేవతలను, కృష్ణపక్షంలో పితరులను సంతోష పరుస్తూ చంద్రుడు ఉంటాడు. అట్లాంటి చంద్రాత్మకుడైన శ్రీ మహావిష్ణువును భీష్ముడు స్తుతిస్తున్నాడు.

తే. **విశ్వసృజులను మునులచే వితతమగు స । హస్ర వత్సర కలిత మహాధ్వరమునఁ**
గశ్యపబ్రహ్మ యెవ్వానిఁ గనియెఁ గనక । పక్షు దార్క్ష్యాత్ముఁ దలఁతు నప్పద్మనాభు. **26**

ప్రతిపదార్థం: విశ్వసృజులు+అను= విశ్వ సృష్టికర్తలు (నవ బ్రహ్మలు) అనే; మునులచేన్= మహర్షులచేత; వితతము+అగు= విస్తృతమైన; సహస్ర వత్సర కలిత= వేయేండ్లతో కూడినట్టి; మహా+అధ్వరమునన్= గొప్ప యజ్ఞమందు; కశ్యపబ్రహ్మ= కశ్యపుడనే ప్రజాపతి; ఏ+వానిన్= ఎవ్వడినైతే; కనియెన్= కన్నాడో అట్లాంటి ; కనక పక్షున్+తార్క్ష్య+ఆత్మున్= బంగారు రెక్కలు కలిగినట్టి గరుత్మంతుడిని ఆత్మగా గల; ఆ+పద్మనాభున్= పద్మం నాభియందు గల ఆ మహావిష్ణువును; తలఁతున్= స్మరిస్తాను.

తాత్పర్యం: విశ్వసృజు లనబడే మహర్షులు వేయి సంవత్సరాలపాటు చేసిన యజ్ఞంలో కశ్యపప్రజాపతికి సువర్ణపక్షుడైన గరుత్మంతుడు జన్మించాడు. అట్లాంటి గరుడుని ఆత్మగా గల శ్రీ మహావిష్ణువును స్మరిస్తాను.

విశేషం: 'విశ్వసృక్' అన్నది విష్ణు సహస్ర నామాలలో ఒకటి. విష్ణువు నవబ్రహ్మాత్మకుడు. అందువలన నవబ్రహ్మలు చేసిన వెయ్యేండ్ల యాగ సమయంలో కశ్యపప్రజాపతికి గరుత్మంతుడు వినతవలన జన్మించాడు.

క. **సువ్యక్త క్షేత్రంబున । నవ్యక్తాకృతి నిరూఢి నాసీనుం డై**
భవ్యత నుండెడు క్షేత్రా । త్మ వ్యపదిష్టుఁ బ్రణుతింతు దామోదరునిన్. **27**

ప్రతిపదార్థం: సువ్యక్త= స్పష్టంగా తెలియవస్తున్న; క్షేత్రమునన్= జీవుడుండే శరీరమందు; అవ్యక్త+ఆకృతి నిరూఢిన్= తెలియరానట్టి ఆకారంతో ప్రసిద్ధంగా; ఆసీనుండు+ఐ= కూర్చున్నవాడై; భవ్యతన్+ఉండెడు= యోగ్యమైన రీతిలో ఉండే (అంటే యోగంలో ఉండే); క్షేత్ర+ఆత్మ+వి+అపదిష్టున్= క్షేత్రాత్ముడని పిలువబడుతున్న ప్రసిద్ధుడైన; దామ+ఉదరున్= తులసిమాలను ఉదరమందు కలిగిన శ్రీమహావిష్ణువును; ప్రణుతింతున్= ప్రార్థిస్తున్నాను.

తాత్పర్యం: స్పష్టంగా తెలిసే దేహమందు తెలియరానట్టి యోగంలో ఉండే క్షేత్రాత్ముడుగా ప్రసిద్ధుడైన దామోదరుడైన ఆ శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తున్నాను.

విశేషం: విష్ణు సహస్రనామాలలో విష్ణువు క్షేత్ర క్షేత్రజ్ఞుడిగా చెప్పబడుతున్న అంశాన్ని ఇక్కడ గుర్తించవలసి ఉన్నది.

క. **ప్రకృతి వికృతులను షోడశ । వికారముల బెరసి ప్రకృతి వికృతిత్వము లొం**
దక యుండఁ గాంతు రెవ్వని । సకల మునులు దలఁతు నట్టి సాంఖ్యాత్ము హరిన్. **28**

ప్రతిపదార్థం: ప్రకృతి వికృతులను= సహజమైన ప్రకృతులు, వాటి వ్యతిరేకమైన వికారాలు అనే; షోడశ వికారముల బెరసి= పదహారు వికారాలతో కూడి; ప్రకృతి వికృతిత్వములు+ఒందక ఉండన్= ప్రకృతిని కాని, వికృతిని కాని ఏ మాత్రం పొందకుండేటట్లుగా; ఏ+వానిన్= ఎవ్వడిని; సకలమునులు= సమస్త మహర్షులు; కాంతురు= చూడగలరో (దర్శించగలరో); అట్టి= అటువంటి; సాంఖ్య+ఆత్మున్+హరిన్= యోగాత్ముడైన శ్రీకృష్ణుడిని; తలఁతున్= ప్రార్థిస్తాను.

తాత్పర్యం: సహజమూ, తద్వ్యతిరేకమూ అయిన ప్రకృతి వికృతులను పదహారు వికారాలతో కూడి ఉండి కూడా, ప్రకృతి వికృతులను ఏ మాత్రమూ పొందకుండేటట్లు మహర్షి సత్తములు ఎవ్వడినైతే దర్శిస్తారో అటువంటి సాంఖ్యాత్ముడైన ఆ శ్రీమహావిష్ణువును స్మరిస్తాను.

విశేషం: ప్రకృతులు: అష్ట ప్రకృతులు= అవ్యక్తం, బుద్ధి, అహంకారం, పంచతన్మాత్రలు; శబ్ద స్పర్శ రూప రస గంధాలు; వికారము (సాంఖ్య) మూల ప్రకృతి నుండి పుట్టినవి; ఇవి పదహారు; షోడశ వికారాలు: పంచ జ్ఞానేంద్రియాలు (శ్రోత్రం, చర్మం, చక్షువు, జిహ్వ, నాసిక), పంచ కర్మేంద్రియాలు (వాక్కు, హస్తం, పాదాలు, పాయువు, ఉపస్థ), పంచేంద్రియార్థాలు (ప్రాణం, అపానం, సమానం, ఉదానం, వ్యానం)+మనస్సు.

సాంఖ్యం: షడ్దర్శనాలు (సాంఖ్యం, యోగం, న్యాయం, వైశేషికం, మీమాంస, వేదాంతం)లో ఒకటి. పంచవింశతి తత్త్వాల (ఇరవై ఐదు తత్త్వాలలో ప్రకృతి పురుషుడు, బుద్ధి, అహంకారం, మనస్సు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచ మహాభూతాలు; పంచ తన్మాత్రలు) ఇందులో ప్రకృతి పురుషులను గూర్చి చెప్పేదే సాంఖ్యం. ఇక్కడ వేదాంతం అంగీకరించిన రీతిగా భగవంతుడే సృష్టి స్థితి లయ కారకుడన్న అంశాన్ని సాంఖ్యం అంగీకరించదు. పైపెచ్చు ఈ సమస్తానికి ప్రకృతే మూలమని నిరూపిస్తుంది.

క. **అంతశ్చర మారుతములు। శాంతములుగఁ జేసి యనలసత్వము శమమున్**
దాంతియు గల జనములు గను। నంతర్హితుఁ గొలుతు జలశయను యోగాత్మున్. **29**

ప్రతిపదార్థం: అంతః+చర+మారుతములు= శరీరంలోపల ఉండే ప్రాణవాయువులు (ప్రాణం, అపానం, సమానం, ఉదానం, వ్యానం); శాంతములుగన్+చేసి= శాంతింపజేసి (చలనం లేకుండా చేసి); అనలసత్త్వమున్= ఏకాగ్రతతో, అలసత్వం లేకుండా; శమమున్= నిగ్రహం (జ్ఞానేంద్రియ నిగ్రహం); దాంతి= కర్మేంద్రియ నిగ్రహం; కల= కలిగినటువంటి; జనములు= యోగులు; కను= చూడగలిగినటువంటి; అంతర్హితున్= ఇంద్రియ నిగ్రహంచేత అంతర్ముఖీనుడైన వాడిని; జలశయనున్= నీటియందు శేషుడిని పాన్పుగ చేసికొని ఉన్నటువంటి వాడిని; యోగ+ఆత్మున్= యోగముద్రలో ఉన్నటువంటి శ్రీమహావిష్ణువును; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: పంచ ప్రాణాలను శాంతింపజేసి అలసత్వం లేని శాంతి దాంతులతో ఒప్పుతున్న యోగులు చూడగలిగిన అంతర్ముఖీనుడై ప్రళయాంతంలోని మహాజలాలలో శేషశయనుడై యోగనిద్రాముద్రితుడై ఉన్న శ్రీమహావిష్ణువును పూజిస్తాను.

విశేషం: శమము= జ్ఞానేంద్రియ నిగ్రహం; దాంతి= కర్మేంద్రియ నిగ్రహం.

క. **ఉపరమముం బ్రాపించిన। యపుణ్య పుణ్యములు గలుగు నతిశాంతులు భ**
వ్యపుగతిఁ బొందెదు నానం। దపు రూపుని విష్ణుఁ దలఁచెదను మోక్షాత్మున్. **30**

ప్రతిపదార్థం: ఉపరమమున్+ప్రాపించిన= సమస్త విషయ సంబంధమైన కోరికలను వదలిపెట్టిన (విషయ వైరాగ్యాన్ని పొందిన); అపుణ్య పుణ్యములు+కలుగు= పుణ్యాపుణ్యములు సమంగా చూడగలిగే; అతిశాంతులు= జ్ఞాన కర్మేంద్రియాది నిగ్రహం కలిగిన మహాత్ములు; భవ్యము+గతిన్+పొందెడు= శ్రేష్ఠమైన మార్గాన్ని పొందేటటువంటి; ఆనందపు రూపుని(న్)= ఆనందమే (బ్రహ్మానందమే) స్వరూపంగా కలిగిన; మోక్ష+ఆత్మున్= మోక్ష స్వరూపుడు అయిన; విష్ణున్= శ్రీ మహావిష్ణువును; తలఁచెదను= స్మరిస్తాను.

తాత్పర్యం: విషయ వైరాగ్యాన్ని పొందిన ద్వంద్వాతీతులైన తపస్వులు శ్రేష్ఠమైన పద్ధతిలో పొందే బ్రహ్మానంద స్వరూపుడైన వాడును, మోక్షప్రదాత అయిన శ్రీ మహావిష్ణువును స్మరిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: విషయ వాంఛా రహితులైన విరాగులు, పుణ్యాపాపాలకు అతీతులు. ద్వంద్వాతీతులు వారే. అటువంటి మహాత్ములే అతి శాంతులు. అటువంటి మహనీయులు 'భవ్యపు గతిన్' అంటే విష్ణుసహస్ర నామావళిలో ఒకటైనది భవ్యశబ్దం కనుక, అటువంటి గతిని పొందగలిగే బ్రహ్మానంద స్వరూపుడు శ్రీమహావిష్ణువు.

తే. చరణ నాభి శీర్షంబులు ధరయు నంత । రిక్షమును దివమును జగచ్చక్షు రగ్ని
దిశలు దృఙ్ముఖ శ్రోత్రముల్ దీప్తు లెమ్మ । హాంగునకు నట్టి హరిని లోకాత్ముఁ దలఁతు. 31

ప్రతిపదార్థం: ఏ+మహా+అంగునకున్= సమస్తాన్ని శరీరంగా కలిగిన ఏ మహాత్ముడికి; ధరయున్+అంతరిక్షమున్+దివమును= భూమి, ఆకాశం, స్వర్గం, క్రమంగా; చరణనాభి శీర్షంబులు= పాదాలు, బొడ్డు, తల అయి ఉన్నాయో అట్లాగే; జగత్+చక్షుః+అగ్ని దిశలు= సూర్యుడు, అగ్ని, దిక్కులు క్రమంగా; ముఖ+శ్రోత్రముల్+దీప్తుల్= ముఖం, చెవులు, కాంతులు అయి ఉన్నాయో; అట్టి లోక+ఆత్మున్= జగత్తులన్నింటిని ఆత్మగా కలిగిన వాడైన శ్రీమహావిష్ణువును; తలఁతున్= స్మరిస్తాను (పూజిస్తాను).

తాత్పర్యం: ఈ భూమి, ఆకాశం, స్వర్గం, ముల్లోకాలు వరుసగా శ్రీమహావిష్ణువునకు పాదాలు, బొడ్డు, తల. సూర్యుఁడు, కళ్ళు, అగ్ని, దిక్కులు శ్రీ మహావిష్ణువునకు. చూపులు, ముఖం, చెవులు, కాంతులు అయి ఒప్పుతున్నాయి. అట్టి లోకాత్ముడూ మహాంగుడూ అయిన శ్రీమహావిష్ణువును స్మరిస్తాను.

విశేషం: కవి ఇందులో శ్రీ మహావిష్ణువు యొక్క విశ్వస్వరూపాన్ని వివిధ రీతుల, అదే మహాశరీరంగా అభివర్ణించాడు.

క. భూతముల మ్రింగి, లోక । వ్రాతము జలమయముఁ జేసి, వశ్యాత్మత ని
ద్రాతిశయంబున బాలుం । డై తేలెడు వానిఁ దలఁతు హరి మాయాత్మున్. 32

ప్రతిపదార్థం: భూతములన్ మ్రింగి= ప్రాణులనన్నింటిని తనలో ఇముడ్చుకొని; లోక వ్రాతమున్= జగత్తుల సమూహాలను; జలమయమున్+చేసి= నీటి మయంచేసి; వశ్య+ఆత్మతన్= తన అధీనం చేసికొన్న ఆత్మతో (సమస్త ఇంద్రియాల నిగ్రహంతో); నిద్రా+అతిశయంబునన్= అధికమైన యోగ నిద్రతో; బాలుండు+ఐ= పసిపాపడై; తేలెడు వానిన్= నీటిపై మఱ్ఱియాకుపై తేలియాడుతుండే; మాయా+ఆత్మున్= యోగమాయ ఆత్మగా కలిగిన; హరిన్= శ్రీ మహావిష్ణువును; తలఁతున్= స్మరిస్తాను.

తాత్పర్యం: ప్రళయాంతంలో సమస్త ప్రాణికోటిని తనయందే సంలీనం చేసికొని, ప్రపంచమంతటినీ నీటిలో మగ్నంచేసి, తన ఆత్మను అధీనం చేసుకొని యోగనిద్రలో నీటిపై మఱ్ఱియాకుమీద పసిపాపడై తేలియాడే మాయాత్ముడైన ఆ శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తాను.

విశేషం: ప్రళయాంతంలో సమస్త ప్రాణికోటి నశించి పోతుంది. సర్వాంతర్యామి అయిన ఆ మహావిష్ణువు సమస్తాన్ని తనలో ఇముడ్చుకొని ఏమీ తెలియని పసివాడివలె నీటిపై తేలియాడుతుంటాడనే అంశం పురాణప్రసిద్ధమే. అదంతా శ్రీ మహావిష్ణువు యొక్క మాయ అన్నది విశేషార్థం.

తే. అంబుదంబులు గేశంబులందు, నదులు । సర్వ తనుసంధులందును, జలధు లుదర
దేశమున యందు నున్నట్టి దేవదేవుఁ । గొలుతుఁ దోయాత్ము దేవకికొడుకుఁ గృష్ణు. 33

ప్రతిపదార్థం: అంబుదంబులు= నీటి నొసగే మేఘాలు; కేశంబులందున్= తలలోని కురులందు; నదులు= నదులు; సర్వతను సంధులందును= సమస్త శరీరంయొక్క కలయికలోను; జలధుల్+ఉదరదేశమున+అందున్= సముద్రాలు కడుపు ప్రదేశంలోనూ; ఉన్న+అట్టి= ఉన్నట్టి; దేవదేవున్= దేవతలకు దేవుడైన; తోయ+ఆత్మున్= జలస్వరూపుడైన; దేవకి కొడుకున్= దేవకీదేవి కుమారుడైన; విష్ణున్= శ్రీ మహావిష్ణుమూర్తిని; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: వర్షపు మేఘాలను తలనీలాలలోను, నదులను అన్ని శరీరావయవ సంధులలోనూ, సముద్రాలను కుక్షిలోనూ కలిగిన దేవాదిదేవుడు, నారాయణుడు, దేవకీదేవిపుత్రుడైన శ్రీకృష్ణమూర్తిని పూజిస్తాను.

తే. వదన బాహూరు పదము లెవ్వాఁడు విప్ర। రాజ వైశ్య శూద్రులకు సంప్రభవ దేశ
ములుగ వెలుఁగొందు నమ్మహామూర్తి విభవ। దీప్తు వర్ణాత్మకునిఁ బ్రణుతింతు విష్ణు. 34

ప్రతిపదార్థం: ఏ+వాఁడు= ఎవ్వడైతే; వదన బాహు+ఊరు పదముల్= ముఖం, భుజాలు, తొడలు, పాదాలు (క్రమంగా); విప్ర రాజ వైశ్య శూద్రులకున్= బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనేవారికి; సంప్రభవ దేశములుగన్= పుట్టిన ప్రదేశాలుగా కలిగి; వెలుఁగొందున్= ప్రకాశిస్తున్నాడో; ఆ+మహామూర్తిన్= ఆ మహా స్వరూపుడిని; విభవ దీప్తున్= వైభవకాంతిమంతుడిని; వర్ణ+ఆత్మకునిన్= నాలుగు వర్ణాలను ఏర్పరచిన వాడిని; విష్ణున్= శ్రీమహావిష్ణువును; ప్రణుతింతున్= స్తుతిస్తాను.

తాత్పర్యం: శ్రీ మహావిష్ణువు ముఖం నుండి బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, ఊరువుల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు అనే నాలుగు వర్ణాలవారు ఉద్భవించారు. అట్లాంటి చతుర్వర్ణాత్మకుడైన శ్రీ మహావిష్ణువును స్తుతిస్తాను.

విశేషం: బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు విష్ణువు ముఖం, బాహువులు, ఊరువులు, పాదాల నుంచి ఉద్భవించారన్న ఈ అంశం పురుష సూక్తంలోను,

"బ్రాహ్మణోz స్య ముఖ మాసీత్ । బాహూ రాజన్యః కృతః
ఊరూతదస్యయ ద్వైశ్యః । పద్భ్యాగ్ం శూద్రో అజాయత"

అని చెప్పబడింది. నాలుగు వర్ణాలు తానే సృష్టించానని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన అంశం తెలిసిందే. "చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణ కర్మ విభాగశః" (4-13)

క. మాసర్త్వయనాబ్దమయో। ద్భాసిత రూపుఁ డయి సృష్టిఁ బ్రళయంబుఁ దగం
జేసి పొలుపారు శౌరి ను। పాసింతును యోగి భోగ్యబలుఁ గాలాత్మున్. 35

ప్రతిపదార్థం: మాస+ఋతు+అయన= (సంవత్సరంలో) నెలలు (పండ్రెండు) ఋతువులు (ఆరు) అయనాలు (ఉత్తరాయన దక్షిణాయనాలు (రెండు); అబ్దమయ= (అరవై) సంవత్సరాలతో కూడి; ఉద్భాసిత+రూపుఁడు+అయి= ప్రకాశిస్తున్న స్వరూపం కలిగి; సృష్టిన్+ప్రళయంబున్+తగన్+చేసి= కాలాత్మకుడై ఈ ప్రపంచాన్ని సృష్టించి వినాశనం చేసి; పొలుపు+ఆరి= ఒప్పి; యోగి భోగ్య బలున్+కాల+ఆత్మున్= మహాయోగీ (సమస్తాన్ని అనుభవించే మహాబల సంపన్నుడూ, కాలస్వరూపుడూ అయిన); శౌరిన్= శూర వంశీయుడైన శ్రీమహావిష్ణువును; ఉపాసింతును= పూజిస్తాను.

తాత్పర్యం: నెలలు, ఋతువులు, ఉత్తర దక్షిణాయనాలు, సంవత్సరాలు తానే అయి, సృష్టి ప్రళయాలకు కర్త అయి, కాలస్వరూపుడై యోగి భోగి అయి ఒప్పుతూ ఉన్న ఆ శ్రీమహావిష్ణువును భజిస్తాను.

క. ముని దివిజాదిక లోకము। లనంతుఁ డన జగతి కెల్ల నాధారం బై
పెనుపొందెడు శేషాత్ముని। వినుతింతున్ విష్ణుభక్తి విభవ విధాయిన్. 36

ప్రతిపదార్థం: ముని= మహర్షులయొక్క; దివిజ+ఆదిక లోకముల్= దేవతలయొక్క లోకమైన స్వర్గం మొదలుకొని; జగతికిన్ ఎల్లన్= సమస్త జగత్తునకు; అనంతుఁడు+అనన్= అంతంలేని వాడైన శేషుడనే ప్రసిద్ధుడు; ఆధారంబు+ఐ= భరించే ఆధారభూతమై;

పెనుపొందెడు= అతిశయిల్లుతున్న; విష్ణుభక్తి విభవ విధాయిన్= విష్ణుభక్తి వైభవాన్ని విధించే వాడైన; శేష+ఆత్మునిన్= ఆదిశేషస్వరూపుడైన శ్రీమహావిష్ణువును; వినుతింతున్= స్తుతిస్తాను.

తాత్పర్యం: మునులలోకం, దేవలోకమైన స్వర్గం మొదలుకొని సమస్త లోకాలను అనంతుడన్న పేరుతో మోస్తూ అతిశయిల్లుతూ ఉన్న విష్ణుభక్తి వైభవాన్ని విధించే ఆదిశేషాత్ముడైన శ్రీమహావిష్ణువును స్తుతిస్తాను.

క. ఆదిత్య మరుద్వసురు । ద్రాదిదివిజ గణము లెల్ల నవయవ రూపో
త్పాదకలితు లెవ్వానికి । నా దేవుని సంస్తుతింతు హరి దేవాత్మున్. 37

ప్రతిపదార్థం: ఏ+వానికిన్= ఎవడికైతే; ఆదిత్య= ద్వాదశాదిత్యులును; మరుత్= మరుద్గణాలూ; వసు= అష్టవసువులూ; రుద్రులు= ఏకాదశ రుద్రులూ; ఆది= మొదలైన; దివిజ గణములు= సమస్త దేవతా సమూహాలు; అవయవ= శరీరంలోని అవయవములచేత; రూప+ఉత్పాదక= రూప నిర్మాణానికి; కలితులు= కూడి ఉన్నటువంటి వారో; అట్టి= ఆ; దేవునిన్= భగవంతుడిని; దేవ+ఆత్మున్= సమస్త దేవతలను ఆత్మగా కలవాడైన; హరిన్= శ్రీమహావిష్ణువును; సంస్తుతింతున్= ప్రార్థిస్తాను.

తాత్పర్యం: ద్వాదశాదిత్యులు, మరుత్తులు, అష్టవసువులు, ఏకాదశరుద్రులు, మొదలైన దేవగణాలన్నీ శ్రీమహావిష్ణువునకు అంగభూతులో అట్లాంటి దేవాత్మకూడా ఆ మహాదేవుడైన విష్ణువును సంస్తుతిస్తాను.

విశేషం: ద్వాదశాదిత్యులు: ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూషుడు, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు.

మరుత్తులు: దితి కశ్యపుల సంతానం మరుద్గణం,

అష్ట వసువులు: ఆపుడు, ధ్రువుడు, సోముడు, అధ్వరుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, విభావసుడు.

ఏకాదశ రుద్రులు: అజుడు, ఏకపాదుడు, శంభుడు, హరుడు, త్ర్యంబకుడు, అహిర్బుధ్నుడు, త్వష్ట, రుద్రుడు, అపరాజితుడు, ఈశానుడు, త్రిభువనుడు.

ఇవన్నియూ దేవగణాలు.

క. సర్వము నందును దానున్ । సర్వముఁ దనయందు నుండు సంచారంబున్
సర్వమునకుఁ దన వలనన । సర్వాత్మకు నట్టి వృష్ణిసత్తముఁ దలఁతున్. 38

ప్రతిపదార్థం: సర్వమునందున్+తానున్= సమస్తమునందును భగవంతుడు; సర్వమున్ తనయందున్+ఉండున్= సమస్తం భగవంతుడియందు ఉన్నట్టి; తన వలనన= భగవంతుడి వలనే; సర్వమునకున్= సమస్తానికి; సంచారంబున్= సంచరించటం; ఉండున్= ఉండునో; సర్వ+ఆత్మకున్= సమస్తానికి ఆత్మగా కలిగిన; అట్టి= అటువంటి; వృష్ణి సత్తమున్= వృష్ణి వంశంలో శ్రేష్ఠుడైన శ్రీమహావిష్ణువును; తలఁతున్= ప్రార్థిస్తాను.

తాత్పర్యం: సమస్తమూ భగవంతుడిలోనూ, సమస్తమూ భగవంతుడి యందు సమస్తమునకు తనవలనే మెలగుట జరుగునో అట్లాంటి సర్వాత్మకుడైన శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తాను.

క. మీనయి తా నతలగతం । బైన నిగమ చయముఁ దెచ్చి యజునకు నొసఁగం
గా నేర్చిన సుమనస్స । మ్మానిత విగ్రహు భజింతు మత్స్యాత్ము హరిన్. 39

ప్రతిపదార్థం: తాన్= తాను (భగవంతుడైన విష్ణువు); మీను+అయి= చేప అయి; అతలగతంబు+ఐన= అధో లోకానికి చేరిన; నిగమ చయమున్+తెచ్చి= వేద సమూహాన్ని తెచ్చి; అజునకున్= బ్రహ్మకు; ఒసగంగాన్+నేర్చిన= తెచ్చి ఇచ్చే నేర్పు కలిగిన వాడును; సుమనస్+సం+మానిత+విగ్రహున్= దేవతలచేత సమ్మానింపబడిన స్వరూపుడైన; మత్స్య+ఆత్మ(న్)= మత్స్యావతారుడైన శ్రీమహావిష్ణువును; భజింతున్= పూజిస్తాను.

తాత్పర్యం: అనాదికాలంలో సోమకు డనే రాక్షసుడు వేదాలను అపహరించుకొని సముద్రంలో అధోలోకానికి వెళ్ళిపోగా, సోమకాసురుడిని సంహరించి మళ్ళీ ఆ వేదాలను బ్రహ్మకు తెచ్చి ఇచ్చి దేవతలచేత కొనియాడ బడిన మత్స్యావతారు డయిన శ్రీమహావిష్ణువును పూజిస్తాను.

క. **అమృత మథనమున మంథన । గము లీలోద్ధరణకేళిఁ గైకొని సురసం**
ఘమునకుఁ బ్రియ మొనరించిన । యమేయుఁ గూర్మాత్ము నంబుజాక్షుం గొలుతున్. 40

ప్రతిపదార్థం: అమృతమథనమునన్= అమృతం కొరకు పాల సముద్రాన్ని చిలికినప్పుడు; మంథనగమున్= మంథర పర్వతాన్ని; లీల= విలాసంతో; ఉద్ధరణ కేళిన్= ఎత్తుట అనే ఆటగా; కైకొని= గ్రహించి; సుర సంఘమునకున్= దేవతల సమూహానికి; ప్రియము+ఒనరించిన= ప్రీతి కూర్చిన (ఆనందాన్ని కలిగించిన); అమేయున్= అపరిమితుడు అయిన విష్ణువును; అంబుజ+అక్షున్= పద్మాక్షుడిని; కూర్మ+ఆత్మన్= కూర్మావతార మెత్తిన విష్ణువును; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: మంథరపర్వతాన్ని కవ్వంగా చేసికొని పాలసముద్రాన్ని దేవతలు, రాక్షసులు చిలికిన సందర్భంలో మంథర పర్వతం సముద్రంలో మునిగిపోకుండా విలాసంగా ఎత్తి పట్టుకొని దేవతా సమూహానికి అత్యంతమూ ఆనందం కూర్చిన కూర్మావతారరూపుడైన శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తాను.

క. **వారాహ రూపమునఁ బెం । పారిన తన దంష్ట్ర నొకట నవని సగిరికాం**
తారంబుగ నెత్తిన యా । శౌరిం గ్రోడాత్ముఁదలఁతు సమ్యగ్భక్తిన్. 41

ప్రతిపదార్థం: వారాహ రూపమునన్= వరాహ అవతారంలో; పెంపు+ఆరిన= అతిశయించిన; తన= తనదైన; ఒకటన్= ఒక్కటి అయిన; దంష్ట్రన్= కోరచేత; సగిరి కాంతారంబుగన్= పర్వతాలు, అరణ్యాలతో కూడిన; అవనిన్= భూమిని; ఎత్తిన= ఎత్తినట్టి; క్రోడా+ఆత్మన్= వరాహాన్ని ఆత్మగా కలిగిన; ఆ శౌరిన్= ఆ శ్రీమహావిష్ణువును; సమ్యక్+భక్తిన్= సమంచితమైన భక్తితో; తలఁతున్= స్మరిస్తాను (భావిస్తాను).

తాత్పర్యం: వరాహావతార మెత్తి పర్వతారణ్యాలతో కూడిన భూమి నంతటిని బలోపేతమైన తన ఒకే దంష్ట్రచేత ఉద్ధరించిన వరాహాత్ముడైన శ్రీమహావిష్ణువును సదా భక్తితో పూజిస్తాను.

ఆ. **నారసింహవపు రుదార భావము నొంది । ఘను హిరణ్యకశిపు ఖర నఖముల**
వ్రచ్చి దీప్తమూర్తి వఱలు నృసింహాత్ము । నాత్మభవుని భక్తి నాశ్రయింతు. 42

ప్రతిపదార్థం: నారసింహ= సగం నరుడు, సగం సింహము అయిన; వపుః= శరీరంతో; ఉదార భావమును+ఒంది= ఉదార స్వభావమును పొంది; ఘనున్= గొప్పవాడయిన; హిరణ్య కశిపున్= హిరణ్య కశిపుడిని; ఖరనఖములన్= వాడి అయిన గోళ్ళచేత; వ్రచ్చి= చీల్చి; దీప్తమూర్తిన్= తేజస్వంతుడిని; వఱలు= ప్రకాశించునటువంటి; నృసింహ+ఆత్మన్= నృసింహస్వరూపం కలిగినవాడిని; ఆత్మభవునిన్= స్వయంగా పుట్టినవాడైన విష్ణువును; భక్తిన్= భక్తితో; ఆశ్రయింతున్= శరణువేడుతాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నరసింహావతారమెత్తి మదించిన హిరణ్యకశిపుడిని వాడి అయిన తన గోళ్ళతో చీల్చి ప్రసిద్ధిపొందిన నరసింహాత్ము డైన శ్రీమహావిష్ణువును ఆశ్రయిస్తాను.

క. వామన రూపంబున ను । ద్దామ బలున్ బలి నడంచి త్రైలోక్యాతి
క్రామితఁ బేర్చిన యద్భుత । ధాముం గ్రాంతాత్ముఁ దలఁతు దామోదరునిన్. 43

ప్రతిపదార్థం: వామన రూపంబునన్= వామనావతారంలో; ఉద్దామబలున్= అత్యంత బలం కలవాడైన; బలిన్= బలిచక్రవర్తిని; అడంచి= అణచివైచి; త్రైలోక్య+అతిక్రామితన్= ముల్లోకాల ఆక్రమణంతో; పేర్చిన= అతిశయించిన; అద్భుతధామున్= ఆశ్చర్యకరమైన నివాసం కలవాడై; క్రాంత+ఆత్మున్= ఆక్రమించిన ఆత్మగా కలిగి; దామ+ఉదరునిన్= శ్రీమహావిష్ణువును; తలఁతున్= భావిస్తాను.

తాత్పర్యం: వామనావతారమెత్తి, అత్యంత బలాఢ్యుడైన బలిచక్రవర్తిని మూడడుగు లడిగి ముల్లోకాలు ఆక్రమించుకొని బలిచక్రవర్తిని త్రొక్కిపెట్టి అణచి వేసిన వామన స్వరూపుడైన శ్రీమహావిష్ణువును సంస్మరిస్తాను.

ఆ. పరశురాముఁ డనఁగ భవ్యుఁడు జమదగ్ని । కుద్భవించి యిరువదొక్కమాఱు
మనుజపతుల నెల్లఁ దునిమిన క్రోధాత్ము । నధిక భక్తి శార్ఙ్గినాశ్రయించు 44

ప్రతిపదార్థం: పరశురాముఁడు+అనఁగన్= పరశురాముడనగ; భవ్యుఁడు= శ్రేష్ఠుడైన; జమదగ్నికిన్+ఉద్భవించి= జమదగ్ని మహర్షికి జన్మించి; ఇరువది+ఒక్కమాఱు= ఇరవై ఒక్కసార్లు; మనుజపతులన్+ఎల్లన్= సమస్త రాజులను; తునిమిన= సంహరించిన; క్రోధ+ఆత్మున్= క్రోధ స్వభావుడైన; శార్ఙ్గిన్= శార్ఙ్గమును ధరించిన వాడైన శ్రీమహావిష్ణువును; అధిక భక్తిన్= అమితమైన భక్తితో; ఆశ్రయింతున్= ఆశ్రయిస్తాను.

తాత్పర్యం: శ్రీమహావిష్ణువు పరశురాముడనే పేరుతో మహర్షి సత్తముడైన జమదగ్నికి జన్మించి ఇరవై ఒక్కసార్లు రాజని పేరున్న వారిని అందరిని సంహరించి క్రోధాత్ముడైన శ్రీమహావిష్ణువును అమితమైన భక్తితో ఆశ్రయిస్తాను.

క. క్షత్రాత్ముఁ గొలుతు దశరథ । పుత్రున్ శ్రీరాముఁ డనఁగఁ బొలిచిన దేవున్
శత్రుభయదు రావణు నొక । మాత్రం దునుమాడినట్టి మధుసూదనునిన్. 45

ప్రతిపదార్థం: దశరథ పుత్రున్= దశరథ మహారాజు కుమారుడైన; శ్రీరాముఁడు+అనఁగన్= శ్రీరాము డనే పేరుతో; శత్రు భయదున్= శత్రువులకు భయం కలిగించేవాడైన; రావణున్= రావణాసురుడిని; ఒక మాత్రన్= ఒక్కత్రుటిలో; తునుమాడినట్టి= సంహరించినట్టి; పొలిచిన= అతిశయించిన; దేవున్= దేవుడిని; క్షత్ర+ఆత్మున్= క్షత్రస్వరూపుడైన; మధుసూదనునిన్= మధు అనే రాక్షసుడిని సంహరించిన వాడైన శ్రీమహావిష్ణువును; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: దశరథ మహారాజు కుమారుడు శ్రీరాముడుగా జన్మించి, శత్రుభయంకరుడైన రావణాసురుడిని అవలీలగా సంహరించిన క్షత్రాత్ముడైన శ్రీమహావిష్ణువును పూజిస్తాను.

క. హల ముసల ధరునిఁ గరుణా । నిలయ హృదయు రాము రౌహిణేయు సితాంగున్
జలద నిభాంబరుని శుచిం । దలఁతును గోవిందు శౌర్యధను భోగాత్మున్. 46

ప్రతిపదార్థం: హల ముసల ధరునిన్= నాగలి, రోకలి ఆయుధాలుగా కలిగినవాడిని; కరుణా నిలయ హృదయున్= దయకు ఆటపట్టయిన హృదయం కలవాడిని; రౌహిణేయున్= రోహిణీదేవియొక్క కుమారుడైన; సిత+అంగున్= తెల్లనయిన శరీరం కలవాడిని; జలద నిభ+అంబరునిన్= మేఘంతో సమానమైన నీలవస్త్రం కలవాడిని; శుచిన్= పరిశుద్ధుడైన వాడిని; శౌర్యధనున్= పరాక్రమమే ధనంగా కలవాడిని; భోగ+ఆత్మున్= భోగాత్ముడైన; రాముని= బలరాముడిని; గోవిందున్= శ్రీమహావిష్ణువును; తలఁతును= భావిస్తాను.

తాత్పర్యం: నాగలిని, రోకటిని ఆయుధాలుగా కలిగిన వాడిని, దయాంతఃకరణుడు, రోహిణీదేవి పుత్రుడు, తెల్లని శరీరం కలవాడు, మేఘంతో సమాన మైన వస్త్రం కలవాడు, పరిశుద్ధుడు, శౌర్యధనుడు భోగాత్ముడు శ్రీమహావిష్ణువు అయిన బలరాముడిని తలుస్తాను.

మ. **యదువంశంబున వాసుదేవుఁ డనఁ గ్రీడార్థంబు జన్మించి, దు**
ర్మద దైత్యావలిఁ గూల్చి, పార్థునకు సారథ్యంబు త్రైలోక్య స
మ్మద మారంగ నొనర్చి, దేవముని సమ్మానోద్ధృతిన్ భూభరం
బు దొలంగించిన చక్రి నంబురుహనాభుం గొల్తుఁ గృష్ణాత్మునిన్. 47

ప్రతిపదార్థం: యదువంశంబునన్= యాదవ వంశంలో; వాసుదేవుఁడు+అనన్= వసుదేవ కుమారుడై; క్రీడా+అర్థంబు= వినోదార్థం; జన్మించి= పుట్టి; దుర్మద దైత్య+ఆవలిన్= దుర్మార్గులైన రాక్షసుల సమూహాన్ని; కూల్చి= నాశనం చేసి; పార్థునకున్= అర్జునుడికి; సారథ్యంబున్= రథచోదకత్వం; త్రైలోక్య సమ్మదము+ఆరంగన్= ముల్లోకాలకు ఆనందం కలిగేటట్లుగా; ఒనర్చి= చేసి; దేవముని సమ్+మాన+ఉద్ధృతిన్= దేవతల, మునులయొక్క గౌరవాధిక్యంతో; భూభరంబు+తొలంగించిన= భూభారాన్ని తొలగించిన; చక్రిన్= చక్రాయుధుడిని; అంబురుహ నాభున్= పద్మం నాభియందు కలవాడిని; కృష్ణాత్మునిన్= కృష్ణపరమాత్మను; కొలుతున్= పూజిస్తాను.

తాత్పర్యం: యాదవ వంశంలో దేవకీ వసుదేవులకు పుత్రుడై వినోదార్థంగా పుట్టి దుర్మార్గులైన రాక్షస సమూహాన్ని నాశనం చేసి ముల్లోకాలు హర్షించేటట్లు అర్జునుడికి సారథ్యంచేసి దేవమునులకు మిక్కిలి గౌరవం చేకూరుస్తూ భూభారాన్ని తొలగించిన పద్మనాభుడు, కృష్ణస్వరూపుడైన శ్రీమహావిష్ణువును కొలుస్తాను.

క. **కలికాల చలిత ధర్మము । నిలుపంగల యట్టి విష్ణునిం గల్క్యాత్మం**
దలఁతుఁ దురగ వాహను మ్లే । చ్ఛుల నెల్లం గీటడంచు శుభచారిత్రున్. 48

ప్రతిపదార్థం: కలికాల చలిత ధర్మము నిలుపన్= కలియుగంలో చలించే - నాశమయ్యే; ధర్మమున్= ధర్మాన్ని; నిలుపన్ కల= నిలుప సమర్థుడైనట్టి; తురగ వాహనున్= అశ్వారూఢుడూ (గుఱ్ఱం వాహనంగా కలవాడూ); మ్లేచ్ఛులన్+ఎల్లన్= మ్లేచ్ఛజాతివారి నందరిని; గీటడంచు= నాశనం చేసే; శుభ చారిత్రున్= ఉత్తమ చరిత్ర కలవాడును; కల్కి+ఆత్మన్= కల్క్యవతారుడిని; విష్ణునిన్= శ్రీమహావిష్ణువును; తలఁతున్= సంస్మరిస్తాను.

తాత్పర్యం: కలియుగంలో విచలితమయిపోయే ధర్మాన్ని నిలబెట్ట గలిగినట్టివాడూ, మ్లేచ్ఛజాతినంతటిని సర్వనాశనం చేయగలవాడూ, అశ్వవాహనం కలవాడూ, శుభప్రదమైన చరిత్ర కలవాడూ, కల్క్యవతారుడూ అయిన శ్రీమహావిష్ణువును భావిస్తాను.

ఆ. **క్షరము లైన భూత సంఘంబులం దెల్ల । నక్షర స్వరూపుఁడై వెలుంగు**
సకల బుద్ధివృత్తి సాక్షి సాక్ష్యాత్ము న । స్పందబోధఘను ముకుందుఁ దలఁతు. 49

ప్రతిపదార్థం: క్షరములు+ఐన= నశించి పోయేటటువంటివైన; భూత సంఘంబులు+ఎల్లన్= సమస్త ప్రాణికోటులందును; అక్షర స్వరూపుఁడు+ఐ= వినాశంలేని మూర్తిమంతుడై; వెలుంగు= ప్రకాశించే; సకల బుద్ధి వృత్తి సాక్షి= సమస్త జ్ఞాన వ్యాపారాలకు సాక్షీభూతుడైన; సాక్ష్య+ఆత్మున్= సాక్ష్యాత్ముడైన; న+స్పంద= చలనంలేని; బోధ= జ్ఞానంచేత; ఘనున్= గొప్పవాడైన; ముకుందున్= శ్రీమహావిష్ణువును; తలఁతున్= స్మరిస్తాను.

తాత్పర్యం: నశించిపోయే సమస్త ప్రాణికోటి యందును నాశరహితుడై మూర్తిమంతుడై ప్రకాశించే సమస్త బుద్ధి వ్యాపారాలకు సాక్షీభూతుడైన సాక్షాత్తు సాక్ష్యాత్ముడై స్థిరమైన జ్ఞానంచేత గొప్పవాడైన శ్రీమహావిష్ణువును భావిస్తాను.

సీ. పరమేశ పుణ్య, సుబ్రహ్మణ్య, భక్తవ । త్సల, మహాదేవ, విశ్వప్రకాశ
కరణ, హృషీకేశ, వరద నారాయణ, । రాజీవనయన, హిరణ్యనాభ,
యఖిల లోక నమస్కృతాంఘ్రి సరోరుహ । యజ్ఞాంగ, యచ్యుత, యమృతరూప!
నీకు మ్రొక్కెదఁ గరుణింపవే యతసీ కు । సుమ వర్ణ పీతాంబరము ధరించి

ఆ. యున్న నిన్ను నెవ్వ రుల్లంబునందుఁ ద । లంతు రట్టి వారలకు భయంబు
గలుగదెందు నేమి కార్యంబులం దెప్డు । వినుత మంగళాయతనమ వగుట. 50

ప్రతిపదార్థం: ఎందున్= ఎక్కడైనా; ఏమి కార్యంబులందున్= ఎట్లాంటి పనులలోఅయినా; ఎప్పుడున్= ఎప్పుడైనా; వినుత మంగళ+ఆయతనమవు+అగుటన్= కొనియాడబడే శుభానికి నివాసం కావటం వలన; పరమ+ఈశ!= దేవాధిదేవుడా!; పుణ్య!= పుణ్యాత్ముడా!; సుబ్రహ్మణ్య!= సుబ్రహ్మణ్య స్వరూపుడా!; భక్తవత్సల!= భక్తులయందు వాత్సల్యం కలవాడా!; మహాదేవ!= ఘనమైన దైవమా!; విశ్వప్రకాశ కరణ!= జగత్తున కంతటికిని కాంతిని ప్రసాదించేవాడా!; హృషీక+ఈశ!= ఇంద్రియాలకు ఈశ్వరుడైన వాడా!; వరద!= వరాలనిచ్చేవాడా!; నారాయణ!= నీటిని స్థానంగా కలవాడా!; రాజీవ నయన!= పద్మనయన!; హిరణ్యనాభ!= బంగారుమయమైన బొడ్డు కలవాడా!; అఖిల= సమస్త; లోక= లోకాలచేత; నమస్కృత= నమస్కరింపబడుతున్న; అంఘ్రి సరోరుహ!= పాదపద్మాలు కలిగినవాడా!; యజ్ఞ+అంగ= యజ్ఞమందలి హవిర్భాగాలను గ్రహించేవాడా!; అచ్యుత!= నాశంలేని వాడా!; అమృతరూప!= అమృతమయ స్వరూపా!; అతసీ కుసుమ వర్ణ!= అవిసె పూవు వర్ణం కలవాడా!; పీత+అంబరము ధరించి ఉన్న నిన్నున్= పచ్చని వస్త్రం ధరించి ఉన్న నిన్ను; ఎవ్వరు+ఉల్లంబునందున్= ఎవ్వరయితే మనస్సులో; తలంతురు= స్మరిస్తారో; అట్టివారలకున్= అట్లాంటి వారికి; భయంబు కలుగదు= భయముండదు.

తాత్పర్యం: ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏ కార్యంలోనైనా మంగళప్రదుడవగుటచేత భక్తవత్సల, నారాయణ, అచ్యుతాది నామాదులచేత ప్రసిద్ధుడై అతసీ పుష్ప సంకాశుడవయి, పీతాంబరధరుడవయి సమస్తలోకాలచేత నమస్కరించ బడుతున్న పాదపద్మాలు కలవాడా! నిన్ను స్మరించే వారందరికి ఎట్లాంటి భయం కలుగదు.

విశేషం: మూలంలోని అనేక శ్లోకాలను సంక్షిప్తంచేసి శ్రీమహావిష్ణువు నామ సంస్మరణం భీష్మునిచేత తిక్కన చేయించాడు.

క. మంగళము విష్ణుదేవుఁడు । మంగళ మెమ్మైఁ దలంప మధురిపుఁ డుద్య
న్మంగళ మంభోజాక్షుఁడు । మంగళ మఖిలము విహంగమ ధ్వజుఁ డరయన్. 51

ప్రతిపదార్థం: అరయన్= చూడగా; ఏ+మెయిన్+తలంపన్= ఏ విధంగా ఆలోచించినా విష్ణుదేవుడు; మంగళము= శుభంకరుడు; మధురిపుఁడు= మధుడనే రాక్షసుడి శత్రువైన విష్ణువు మంగళ ప్రదుడు; అంభోజ+అక్షుఁడు= నీటినుండి పుట్టిన తామరలవంటి

కన్నులు కలవాడు; ఉద్యత్+మంగళము= అత్యంత శుభప్రదుడు; విహంగమ ధ్వజుఁడు= గరుత్మంతుడిని ధ్వజంగా కలిగిన శ్రీమహావిష్ణువు; అఖిలము= సమస్తం; మంగళము= మంగళం కూర్చువాడు.

తాత్పర్యం: ఎన్నివిధాల ఆలోచించినా విష్ణుదేవుడు, మధురిపుడు, అంభోజాక్షుడు, విహంగమధ్వజుడు అని ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణువు శుభంకరుడు.

క. నారాయణ పరములు నిజ । మారయ బ్రహ్మంబుఁ బరము నంచిత సత్యో
దార తపంబులుఁ గావున । నారాయణపరత వీని నాల్గిటి నిచ్చున్. 52

ప్రతిపదార్థం: నిజము+ఆరయన్= వాస్తవం పరిశీలించగా; బ్రహ్మంబున్= పరబ్రహ్మం; పరమున్= మోక్షం; అంచిత సత్య= అత్యుత్తమ సత్యం; ఉదార తపంబులున్= ఉన్నత తపస్సు అనేవి; నారాయణ పరములు= శ్రీమన్నారాయణుడి అధీనాలు; కావునన్= అందుచేతనే; నారాయణ పరత= విష్ణుభక్తి; వీనిని+నాల్గిటిన్+ఇచ్చున్= ఈ నాలుగింటిని ప్రసాదిస్తుంది.

తాత్పర్యం: పరబ్రహ్మం, మోక్షం, అత్యున్నత సత్యం, తపస్సు అన్నవి శ్రీమహావిష్ణువు పరమై ఉన్నాయి. కాబట్టి విష్ణువును ధ్యానించేవారికి ఆ శ్రీమహావిష్ణువు ఈ నాలిగింటిని ప్రసాదిస్తాడు.

తే. విష్ణుమయ మగ్ని, హవియును విష్ణుమయము, । విష్ణుమయము సర్వంబును విశదబుద్ధి
నిట్లగుటఁ గందుఁ గావున నించుకేనిఁ । గల్మషము నాకు లేకున్కి గానవచ్చు. 53

ప్రతిపదార్థం: అగ్ని విష్ణుమయము= అగ్ని స్వరూపుడు విష్ణువు; విష్ణుమయము హవియును= హవిస్సుకూడ విష్ణుమయమే; సర్వంబును విష్ణుమయము= విష్ణువు సమస్తంలోను ఉండేవాడు; ఇట్లు+అగుటన్= ఈ విధమగుటచేత; విశద బుద్ధిన్+కందున్= విస్పష్టమైన మనస్సుతో చూస్తున్నాను. కావునన్= అందువలననే; ఇంచుకేనిన్= కొంచెమైనా; కల్మషము లేకున్కి= పాపం లేకపోవటం; నాకు కానవచ్చున్= నాకు కనిపిస్తుంది.

తాత్పర్యం: అగ్ని స్వరూపుడు, హవిస్స్వరూపుడు, సమస్త స్వరూపుడు శ్రీమహావిష్ణువు కావటంచేత, విస్పష్ట జ్ఞానంతో చూడగలుగుతున్నాను. నాకు ఏ పాపం అంటదు. కనుక ఆ మహావిష్ణువు కనిపిస్తున్నాడు.

క. శరణాగతుండ భక్తుఁడఁ । బరమ పదవిఁ గోరెదను శుభంబుగ నన్నుం
బరికించి యేది మే ల । య్యిరవు దొరకొనంగఁ దలఁపవే కమలాక్షా! 54

ప్రతిపదార్థం: కమల+అక్ష!= కమలములవంటి కన్నులు కల ఓ శ్రీమహావిష్ణూ!; శరణాగతుండన్= శరణని వేడుకొంటున్నాను; భక్తుఁడన్= నీ పరమ భక్తుడను; పరమపదవిన్+కోరెదన్= మోక్షపదవిని కోరుతున్నాను; శుభంబుగన్= శుభం కలిగేటట్లుగా; నన్నున్+పరికించి= నన్ను పరిశీలించి; ఏది మేలు+ఆ+ఇరవు= ఏది మంచిదో ఆ చోటు (విధానం); దొరకొనంగన్= ఒప్పునట్లుగ; తలఁపవే= భావించవా!.

తాత్పర్యం: ఓ కమలాక్షా! నీకు పరమభక్తుడనయి, శరణాగతుడనయి ఉన్నాను. మోక్షపదవిని కోరుకొంటున్నాను. మంగళప్రదమై ఏది ఉత్తమమైన స్థానమౌతుందో దానిని తగిన రీతిగా నాకు అనుగ్రహించుము.

తే. తపమునకు విద్యకును జనుస్థానమైన । జనన రహితుని యజ్ఞాత్ము శౌరి వాఙ్మ
యాధ్వరార్చితుఁ జేసితి; నా జనార్ద । నుండు మద్భజనమునఁ బ్రీతుండు గాత!' 55

ప్రతిపదార్థం: తపమునకున్= తపస్సునకు; విద్యకును= సర్వ విద్యలకును; జనుః+స్థానము+అయిన= పుట్టుకకు నిలయమైన; జనన రహితునిన్= పుట్టుకలేని వాడిని; యజ్ఞ+ఆత్మున్= యజ్ఞస్వరూపుడిని; శౌరిన్= శూరవంశజుడైన శ్రీమహావిష్ణువును; వాఙ్మయ+అధ్వర+అర్చితున్+చేసితిన్= మాటలనే యాగంచేత పూజితుడిగా; చేసితిన్= చేశాను; ఆ జనార్దనుండు= ఆ శ్రీమహావిష్ణువు; మత్+భజనమునన్= నా భక్తివలన; ప్రీతుండు గాత!= సంప్రీతుడగుగాక!

తాత్పర్యం: శ్రీమహావిష్ణువు సమస్త తపస్సులకు, సర్వ విద్యలకు పుట్టుక స్థానమైనవాడు. పుట్టుక లేనివాడు. యజ్ఞస్వరూపుడు. అటువంటి మహావిష్ణువును నా వాక్కులనే - అంటే స్తవరాజం అనే - యాగంచేత పూజించాను. ఆ మహావిష్ణువు నా పూజకు సంప్రీతుడై నాకు మోక్షమొసగుగాక!

క. అని యి ట్లతుల స్తోత్రం । బున హరిఁ బూజించి గంగపుత్త్రుఁడు మదిలో
న నమః కృష్ణాయ యనుచు । వినతశిరస్కుఁ డయి మ్రొక్కె విశ్రుతభక్తిన్. 56

ప్రతిపదార్థం: అని; గంగ పుత్త్రుఁడు= గంగాసుతుడైన భీష్ముడు; ఇట్లు+అతుల స్తోత్రంబునన్= సాటిలేని స్తవరాజంచేత; హరిన్+పూజించి= శ్రీమహావిష్ణువును పూజించి; మదిలోనన్= మనసునందే; కృష్ణాయ నమః= కృష్ణుడికి నమస్కారం; అనుచున్= అంటూ; వినత శిరస్కుఁడు+అయి= తలవంచినవాడయి; విశ్రుత భక్తిన్= ప్రసిద్ధమైన భక్తితో; మ్రొక్కెన్= నమస్కరించాడు.

తాత్పర్యం: అని భీష్ముడు సాటిలేని మేటి స్తోత్రంతో శ్రీమహావిష్ణువును పూజించి మనస్సులోనే 'కృష్ణుడికి నా నమస్కార' మంటూ శిరస్సు వంచి, ప్రసిద్ధమైన భక్తితో ప్రార్థించాడు.

వ. అని పలికె నని చెప్పి వైశంపాయనుం డిట్లనియె. 57

తాత్పర్యం: అని భీష్ముడు తెలిపాడని వైశంపాయనుడు ఇట్లా పేర్కొన్నాడు.

క. స్తవరాజం బనఁగ ముని । స్తవనీయం బైన యీ వృషాకపి భవ్య
స్తవనామృతార్ణవము సం । స్తవనంబున నిచ్చు సుగతి జగతీనాథా! 58

ప్రతిపదార్థం: జగతీనాథా!= జగత్తునకు నాథుడైన ఓ జనమేజయ మహారాజా!; స్తవరాజంబు+అనఁగన్= స్తోత్రాలలో శ్రేష్ఠమైనదనబడే; ముని స్తవనీయంబు+ఐన= మహర్షులచేత స్తుతించదగినదైన; వృషాకపి= శ్రీమహావిష్ణువుయొక్క; భవ్య= శ్రేష్ఠమైన; స్తవన= స్తోత్రమనే; అమృత+అర్ణవము= అమృత సాగరం; సంస్తవనంబునన్= మిక్కిలి స్తుతించుటవలన; సుగతిన్= మోక్షాన్ని; ఇచ్చున్= ఇస్తుంది.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! ఈ స్తవరాజం మహర్షులచేత స్తుతించదగింది. ఆ శ్రీమహావిష్ణువు శ్రేష్ఠమైన స్తోత్రమనే అమృతసాగరాన్ని సంస్తుతించటం వలన అందరికీ మోక్షం ప్రాప్తిస్తుంది.

విశేషం: శరతల్పగతుడైన భీష్ముడు మోక్షార్థమై ఉత్తరాయణం కొరకు వేచిఉండి శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణుడిని స్తవరాజమనే ఈ స్తోత్రరాజంతో స్తుతించాడు.

క. విను జనమేజయ భూవర! । యనుత్తమంబయిన యిమ్మహా స్తవము పఠిం
చిన వినినను వ్రాసిన శ్రీ । యును నాయువుఁ బెంపుఁ బేరు నొసఁగు జనులకున్. 59

ప్రతిపదార్థం: భూవర!= ఓ జనమేజయ మహారాజా!; వినుము; అనుత్తమంబు+అయిన= అతిశ్రేష్ఠమైన; ఈ+మహాస్తవము= ఈ స్తవరాజమును; పఠించినన్= చదివినా; వినినన్= విన్నా; వ్రాసినన్= వ్రాసినా; శ్రీయును= సంపదను; ఆయువున్= ఆయుస్సును; పెంపున్= అభివృద్ధిని; పేరును= ప్రఖ్యాతిని; జనులకున్+ఒసఁగున్= ప్రజలకు ప్రసాదిస్తుంది.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! భీష్మకృత మైన అత్యుత్తమమైన ఈ స్తవరాజాన్ని పఠించినా, విన్నా, వ్రాసినా వారికి సంపదను, ఆయుస్సును, పేరు ప్రఖ్యాతులను ప్రసాదిస్తుంది.

వ. అని చెప్పి వైశంపాయనుండు వెండియు నిట్లనియె. 60

తాత్పర్యం: అని పలికి, వైశంపాయనుడు మరల ఈ విధంగా అన్నాడు.

తే. అట్లు హరిఁ బ్రస్తుతించి శాంతాత్మవృత్తి । నూరకున్న శాంతనవుని భూరితేజు
న ముకుందునిఁ గీర్తించి రచట నున్న । పరమ మునులు గద్గదికతోఁ గురువరేణ్య! 61

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశ శ్రేష్ఠుడైన ఓ జనమేజయ మహారాజా!; అట్లు= పైన పేర్కొన్న రీతిగా; హరిన్= శ్రీమహావిష్ణువును; ప్రస్తుతించి= స్తోత్రం చేసి; శాంత+ఆత్మ+వృత్తిన్= ప్రశాంతమైన మానసిక స్థితిలో; ఊరక+ఉన్నన్= మాట్లాడకుండగా; శాంతనవునిన్= శంతన మహారాజు పుత్రుడైన భీష్ముడిని; భూరితేజున్= అత్యంత తేజశ్శాలిని; ఆ+ముకుందునిన్= ఆ శ్రీమహావిష్ణువును; అచటన్+ఉన్న= అక్కడున్న; పరమ మునులు= ముని శ్రేష్ఠులు; గద్గదికతోన్= డగ్గుత్తికతో; కీర్తించిరి= ప్రస్తుతించారు.

తాత్పర్యం: శ్రీమహావిష్ణువును స్తవరాజంతో స్తుతించి ప్రశాంతాత్ముడై మాటాడక ఊరకున్న శాంతనవుడిని, తేజశ్శాలి అయిన శ్రీమహావిష్ణువును, మహామునులు డగ్గుత్తికతో ప్రశంసించారు.

వ. అంత నిక్కడ. 62

తాత్పర్యం: అంతట ఇక్కడ. (ధర్మరాజాదులతో కూడిన శ్రీకృష్ణు డున్న ప్రదేశంలో)

ఉ. ఆ దివిజాపగాతనయు నంచిత భక్తికిఁ బ్రీతిఁ బొంది దా
మోదరుఁ డప్పు డన్నరవరోత్తముచి త్తమునందు సర్వలో
కాదృత దివ్యబోధ మహిమాతిశయం బుదయింపఁ జేయుచుం
దా దయతోడ సెజ్జ డిగి ధర్మజుమోమునఁ జూడ్కి పర్వఁగన్. 63

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; దామ+ఉదరుఁడు= శ్రీకృష్ణుడు; ఆ దివిజ+ఆపగా= ఆ దేవతా సంబంధమైన గంగానదియొక్క; తనయు= పుత్రుడి (భీష్ముడి); అంచిత భక్తికిన్= అకుంఠిత భక్తికి; ప్రీతిన్+పొంది= సంతోషించి; ఆ నరవర+ఉత్తము= ఆ రాజశ్రేష్ఠుడైన భీష్ముడియొక్క; చిత్తమునందున్= మనస్సునందు; సర్వలోక= సమస్త జగత్తులచేత ఆదృత= ఆదరింపబడిన; దివ్యబోధ= శ్రేష్ఠమైన జ్ఞానబోధ యొక్క; మహిమ+అతిశయంబు= అతిశయించిన మాహాత్మ్యం; ఉదయింపన్+చేయుచున్= కలిగింపచేస్తూ; తాన్+దయతోడన్= శ్రీకృష్ణుడు కరుణతో; సెజ్జ డిగి= పాన్పునుండి దిగి; ధర్మజుమోమునన్= ధర్మరాజుయొక్క ముఖము నందు; చూడ్కి పర్వఁగన్= చూపులు వ్యాపించగా.

తాత్పర్యం: భీష్ముడు శ్రీకృష్ణుడిని ప్రగాఢభక్తితో స్తుతించగా శ్రీకృష్ణుడు పరమానందభరితుడై ఆ భీష్ముడి మనస్సునందు సమస్త లోకాలకు చేసిన ప్రబోధాతిశయాన్ని ప్రసాదిస్తూ దయాంతఃకరణుడై పాన్పునుండి దిగి ధర్మరాజు ముఖ మవలోకించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: శ్రీమహావిష్ణువునందు సమస్తలోకాలు ఉన్నాయి. కనుక భీష్మ స్తవరాజం వలన సంప్రీతుడైన శ్రీకృష్ణుడు సమస్తలోకాలకు ఆదర పూర్వకంగా చేసిన దివ్యప్రబోధంయొక్క అతిశయాన్ని చూడగలిగాడు. ఆ వెనువెంటనే ధర్మజుడి ముఖాన్ని అవలోకించాడు.

వ. 'భీష్ము పాలికిం బోదము ర' మ్మని పలికి కృతపరికరబద్ధుండై వెడలి రథం బెక్కి,సాత్యకిం దన పిఱింది వలనం బెట్టికొనియె; ధర్మనందన ధనంజయు లొక్క తేరును మారుతి నకుల సహదేవు లొక్క యరదంబును గృప యుయుత్సు సంజయు లొక్కస్యందనంబును నెక్కి తదీయంబులగు నేమీ నినాదంబులు దిక్కులం బిక్కటిల్ల నుచిత పరివార పరివృతులై నడచి; ర ట్లరిగి యస్థికేశ బహులంబును బహు ద్విప కుంభ ఖండ నర కపాల పాళి నిబిడంబును నై ప్రేతపత్యనుభూతోజ్ఝితం బైన యాపాన భూభాగంబు ననుకరించు, కురుక్షేత్రంబు దఱియు సమయంబున నయ్యంబుజాక్షుండు పాండవాగ్రజుతోడ. 64

ప్రతిపదార్థం: (శ్రీకృష్ణుడు); భీష్మపాలికిన్+పోదము రమ్ము+అని పలికి= భీష్ముడివద్దకు పోదాం రమ్మని చెప్పి; కృత= చేయబడిన; పరికర= సాధనాలచేత; బద్ధుండు+అయి= ప్రయాణ సన్నద్ధుడయి, వెడలి; రథంబు+ఎక్కి= తేరును ఎక్కి; సాత్యకిన్= తమ్ముడైన సాత్యకిని; తన పిఱింది వలనన్= తన వెనుక; పెట్టుకొనియెన్= కూర్చుండబెట్టుకొన్నాడు; ధర్మనందన ధనంజయులు= ధర్మరాజు, అర్జునుడు; ఒక్కతేరును= ఒక్క రథాన్ని; మారుతి నకుల సహదేవులు= భీముడు, నకుల, సహదేవులు; ఒక్క రథంబును= వేరొక రథాన్ని; కృప యుయుత్సు సంజయులు= కృపుడు, యుయుత్సుడు, సంజయుడు ముగ్గురు; ఒక్క స్యందనంబును= మరొక రథాన్ని, ఎక్కి; తదీయంబులు+అగు= ఆ రథాలయొక్క; నేమీ నినాదంబులు= రథ చక్రాల శబ్దాలు; దిక్కులన్+పిక్కటిల్లన్= దిశలన్నిట అతిశయించగా; ఉచిత పరివార పరివృతులు+అయి= తగిన పరివారంచేత చుట్టబడిన వారై; నడచిరి= వెళ్ళారు; అట్లు+అరిగి= అట్లా వెళ్ళి; అస్థికేశ బహులంబును= ఎముకలు, వెంట్రుకలయొక్క సమూహం కలది; బహు= అనేకములైన; ద్విప= ఏనుగుల యొక్క; కుంభ= కుంభస్థలాలయొక్క; ఖండ= ముక్కలతోను; నర= మనుష్యులయొక్క; కపాలపాళి= పుర్రెల సమూహం చేత; నిబిడంబును+అయి= దట్టంగా వ్యాపించినది అయి; ప్రేతపతి= ప్రేతాలకు అధిపతి అయిన యమధర్మరాజు చేత; అనుభూత= అనుభవించి; ఉజ్ఝితము+అయిన= వదలివేయబడిన; ఆపాన భూభాగంబున్+అనుకరించు= పానభూమి- అంటే మద్యపానశాలవలె కనిపిస్తున్న; కురుక్షేత్రంబు+తఱియు= కురుక్షేత్రాన్ని సమీపించే; సమయంబునన్= ఆ సమయంలో; అంబుజ+అక్షుండు= తామరలవంటి కన్నులు కల ఆ శ్రీకృష్ణుడు; పాండవ+అగ్రజుతోడన్= ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు 'భీష్ముడివద్దకు పోదము ర'మ్మని ధర్మరాజుతో చెప్పి ప్రయాణ సన్నద్ధుడై, రథం అధిరోహించి సాత్యకిని తన రథంలో వెనుకనే కూర్చుండబెట్టుకొన్నాడు. ధర్మరాజు, అర్జునుడు ఇద్దరు ఒక రథంలోనూ, భీమ నకుల సహదేవులు మరొక రథంలోనూ, కృపుడు, యుయుత్సుడు, సంజయుడు మరొక రథంలోనూ, ఎక్కి కూర్చున్నారు. రథాలు వెళ్ళుతూ ఉండగా ఆ వేగానికి రథచక్రాల శబ్దాలు దశదిశల వ్యాపించాయి. తమతోపాటు తగిన పరివారం బయలుదేరి వెళ్ళింది. వెళ్ళుతూ మహాభారత యుద్ధం జరిగిన కురుక్షేత్రాన్ని దర్శించారు. ఆ కురుక్షేత్రం ఎముకలు, వెంట్రుకల సమూహంతోనూ, అనేకమైన ఏనుగుల కుంభస్థలాల ముక్కలతోను, మానవుల కపాలాల సమూహంతోను దట్టమై, యముడు అనుభవించి త్రావి వదలినట్టి పానశాలాప్రదేశాన్ని అనుకరిస్తూ కనిపించింది. అప్పుడు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తే. 'దూరమున నైదు మడుపులు దోఁచుచున్న । యవి నరేశ్వర! మును వీనియందుఁ గాదె
పరశురాముండు సేసెఁ దర్పణము నృపుల । రక్తమున భూరితర పితృభక్తి వెలయ. 65

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= ఓ ధర్మరాజా! దూరమునన్= దూరంగా; అయిదు మడుపులు= ఐదు నీటి కుంటలు; తోఁచుచున్నఅవి= కనిపిస్తున్నాయి; మును= పూర్వం; పరశురాముండు= జమదగ్ని పుత్రుడైన పరశురాముడు; భూరి తరపితృభక్తి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రగాఢమైన పితృభక్తి; వెలయన్= ఒప్పునట్లు; నృపుల రక్తమునన్= రాజుల రక్తంతో; తర్పణము= పితరులకర్పించే తర్పణం; వీనియందున్= ఈ అయిదు మడుగులలో; చేసెన్+కాదె!= చేశాడు కదా!

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఈ కురుక్షేత్రంలో దూరంగా అయిదు మడుగులు కనిపిస్తున్నాయి. పూర్వం పరశురాముడు రాజులపై ఇరవై ఒక్కసార్లు దండెత్తి వెళ్ళి, వాళ్ళను సంహరించి వారి రక్తంతో అత్యంత పితృభక్తిని ప్రకటించి ఈ ఐదుమడుగులలోనే తర్పణం చేసి సంతృప్తు డయ్యాడు కదా!

విశేషం: త్రేతా ద్వాపర సంధి యుగంలో ఇరవై ఒక్కమార్లు శత్రుసంహారం చేసి, ఈ ప్రదేశంలో ఐదు మడుగులు చేసి, శత్రువుల రక్తంతో ఈ ఐదు మడుగులలో పితృతర్పణం చేశాడు పరశురాముడు. పితృప్రార్థనంతో పరశురాముడి కోపం ఉపశాంతించటం జరిగింది. అందువలననే ఈ ప్రాంతం శమంతక పంచకమని ప్రసిద్ధి పొందింది. కురుక్షేత్రంలోని భాగ మది.

మ. క్షితి నెందుం జరియించి భూపతుల నిశ్శేషంబుగా నేకవిం
శతి వారంబులు ద్రుంచి యాతఁడు దుదిన్ శాంతత్వముం బొందె సు
వ్రతుఁడై' నావుడు నమ్మహీశుఁ 'డతఁ డీ క్రౌర్యంబు సేయంగ నే
ల తొడంగెన్? నృపు లెట్లు గల్గి రిల యెల్లం గైకొనం గ్రమ్మఱన్?' 66

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ పరశురాముడు; సువ్రతుఁడు+ఐ= క్షత్రియ సంహారమే వ్రతంగా కలవాడయి; క్షితిన్+ఎందున్+చరియించి= భూమి అంతట తిరిగి; ఏక వింశతి వారంబులు= ఇరవై ఒక్కమారులు; భూపతులన్= రాజులను; నిశ్శేషంబుగాన్= మిగులకుండ; ద్రుంచి= చంపి; తుదిన్= చివర; శాంతత్వమున్+పొందెన్= శాంతిని పొందాడు; నావుడున్= అని శ్రీకృష్ణుడు చెప్పగా; ఆ+మహీశుఁడు= ఆ భూమిపతి అయిన ధర్మరాజు; అతడు+ఈ క్రౌర్యంబు+చేయంగన్= ఆ పరశురాముడు ఈ క్రూర కార్యం చేయటానికి; ఏల తొడంగెన్?= ఎందుకు ప్రయత్నించాడు?; ఇల+ఎల్లన్+కైకొనన్= ఈ భూమినంతటిని గ్రహించటానికి; క్రమ్మఱన్= మరల; ఎట్లు నృపులు కల్గిరి?= ఏ విధంగా రాజులు జన్మించారు? అని ప్రశ్నించాడు.

తాత్పర్యం: పరశురాముడు భూమి నంతటను తిరిగి ఇరవై ఒక్కమారులు రాజులందరిని శత్రుశేషం లేకుండా సంహరించి చిట్టచివరకు శాంతాత్ముడయ్యాడు' అని శ్రీకృష్ణుడు చెప్పగా ధర్మరాజు విని 'ఈ క్రూరకార్యాన్ని పరశురాముడు ఎందుకు చేయవలసి వచ్చింది? క్షత్రియులందరిని సంహరించగా ఎట్లా పునరుజ్జీవితు లయ్యారు? ఈ భూమినంతటిని మళ్ళీ ఎట్లా ఆక్రమించారు?'

విశేషం: మూలమందలి ఆరు శ్లోకాలను సంక్షిప్తీకరించి తిక్కన ఈ పద్యంలో పరశురాముడు క్షత్రియ సంహారంచేసిన విషయాన్ని వివరించాడు.

వ. అనుటయు నచ్యుతుండు 'నప్పరశురామ జన్మప్రపంచంబును, దదీయ క్రోధ కారణంబును, నృపలోక మారణంబును, భూపాల వంశ పునస్సంభవ ప్రకారంబును మునులవలన వినిన చొప్పునం జెప్పెద' నని యజ్ఞనపతి కి ట్లనియె. 67

ప్రతిపదార్థం: అనుటయున్= అని అడుగగా; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; ఆ+పరశురామ+జన్మ ప్రపంచంబును= ఆ పరశురాముడి యొక్క జనన వివరణను; తదీయ క్రోధ కారణంబును= ఆయన కోప హేతువును; నృపలోక మారణంబును= రాజ సమూహము యొక్క సంహారాన్ని; భూపాల వంశ= రాజులయొక్క వంశాల యొక్క; పునః+సంభవ ప్రకారంబును= మరల జన్మించిన విధాన్నీ; మునుల వలనన్= మహర్షుల వలన; వినిన చొప్పునన్+చెప్పెదన్= వినిన రీతిగా వివరిస్తాను; అని+ఆ+జనపతికిన్= అని ఆ ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఈ క్రింది విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా శ్రీకృష్ణుడు 'పరశురాముడి జననరీతిని, ఆయనకు కలిగిన కోపహేతువును, రాజ సమూహ సంహారాన్ని, మళ్ళీ రాజులు జనించిన రీతిని మహర్షులవలన విన్న విధానాన్ని చెపుతున్నా'నని ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

శ్రీకృష్ణుఁడు ధర్మరాజునకుఁ బరశురాముని చరిత్రంబు చెప్పుట (సం. 12-49-1)

సీ. **కలఁడు జహ్నుం డనఁగాఁ దొల్లి యొక మహీ । పతి యుజహ్నుండు దత్సుతుఁడు; వాని**
కుదయించె వల్లభుం డుర్వీశ! యాతని । కొడుకు తపోనిష్ఠఁ గుశికుఁ డింద్రు
మెచ్చించి జగముల మేటినాఁ దగుపుత్త్రు । వేఁడిన దాన నవ్విభున కుద్భ
వమ్మయి కౌశికుఁ డిమ్మహి గాధి నా । మమ్మునఁ బరఁగె నమ్మనుజవిభుఁడు

తే. **సత్యవతి యను తన కన్య సంప్రమోద । మున ఋచీకున కిచ్చె; నమ్ముని సుకర్మ**
నిరతి సంతాన వాంఛమైఁ జరు యుగంబుఁ । దనకు మామకునై కల్పితముగఁ జేసి. 68

ప్రతిపదార్థం: ఉర్వీశ!= ఓ ధర్మరాజా! తొల్లి= పూర్వం; జహ్నుండు+అనఁగాన్= జహ్నుడనే పేరుతో; ఒక మహీపతి= ఒకరాజు; కలఁడు= ఉండేవాడు; తత్సుతుఁడు ఉజహ్నుండు= ఆతడి కుమారుడు ఉజహ్నుడు; వానికి; వల్లభుండు ఉదయించెన్= అతడికి వల్లభుడనేవాడు జన్మించాడు; ఆతని కొడుకు= ఆ వల్లభుడి కుమారుడు; కుశికుఁడు= కుశికుడనే పేరు కలవాడు; తపః+నిష్ఠన్= తపోనిష్ఠచేత; ఇంద్రున్+మెచ్చించి= దేవేంద్రుడిని మెప్పించి; జగములన్ మేటి నాన్ తగు= లోకంలో అన్నిట సాటిలేని మేటి అనదగిన; పుత్రున్+వేడినన్= కుమారుడిని వేడుకొనగా; దానన్+ఆ+విభునకున్= ఆ ఇంద్రుడి వరంవలన కుశికుడనే రాజునకు; కౌశికుఁడు+ఉద్భవంబు+అయి= కౌశికుడు జన్మించి; ఈ+మహిన్= ఈ భూలోకంలో; గాధి నామంబునన్+పరఁగెన్= గాధి అనే పేరుతో ప్రసిద్ధు డయ్యాడు; ఆ+మనుజ విభుఁడు= ఆ రాజైన గాధి; సత్యవతి+అను= సత్యవతి అనే; తన కన్యన్= తన కూతురును; సంప్రమోదమునన్= అత్యంత ఆనందంతో; ఋచీకునకున్+ఇచ్చెన్= ఋచీకుడనే మునికి ఇచ్చి పెండ్లి చేశాడు; ఆ+ముని= ఆ ఋచీక మహర్షి; సుకర్మ నిరతిన్= ఉత్తమ కర్మాచరణాసక్తితో; సంతాన వాంఛమైన్= సంతానం మీది కోరికతో; చరు యుగంబున్= హవిస్సుల జంటను; తనకున్ మామకున్= తనకు మామకును; కల్పితంబుగన్+చేసి= కల్పించి.

తాత్పర్యం: పూర్వం జహ్ను డనే రాజు ఉండేవాడు. అతడి కుమారుడు ఉజహ్నుడు. అతడి పుత్రుడు వల్లభుడు. అతడి కుమారుడు కుశికుడు. ఈ కుశికుడు ఘోరతపం చేసి ఇంద్రుడిని మెప్పించి లోకా లన్నిట సాటిలేని మేటి అయిన పుత్రుడిని ఇమ్మని వేడుకొనగా, ఇంద్రవరం వలన కౌశికుడు ఉద్భవించాడు. అతడే గాధి అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. ఈ గాధి తన పుత్రిక అయిన సత్యవతిని సంతోషంగా ఋచీకు డనే ముని కిచ్చి పెండ్లి చేశాడు. ఆ ఋచీకమహర్షి ఉత్తమ తపఃకర్మ లాచరించి సంతానాన్ని వాంఛించాడు. అందుకు తనకే కాక మామకు కూడా సంతానాన్ని ఆశించి హవిస్సుల జంటను కల్పించాడు.

విశేషం: 'ఉజహ్నుండు' పాఠాంతరంలో వావిళ్ళ ప్రతిలో అజహ్నుడు అని ఉండగా, మరొక ప్రతిలో ఉజహ్నుడు అని ఉన్నది. మూలంలో మాత్రం 'ఉజహ్నుడు' అని ఉన్నది. కాబట్టి ఆ పాఠమే గ్రహించబడింది. వావిళ్ళ ప్రతిలో పల్లవుడని ఉండగా తక్కిన ప్రతులలో వల్లభుడని ఉన్నది. మూలంలో వల్లభుడని ఉన్నది.

వ. **ఆ భృగునందను డచ్చరువులు నిజభార్య ముందట నిడి 'క్షత్రియాజేయుండును క్షత్రియ సూదనుండును నగు క్షత్రియోత్తముం డిచ్చరువున జన్మించు; దీని మీ తల్లికి నిమ్ము; తపోధృతి శమంబుల నుత్కృష్టుండగు ద్విజ శ్రేష్ఠుండు దీని వలనం బుట్టు; నిది నీ వుపయోగింపు' మని వాని నేర్పరించి 'భవజ్జననీ జనకు లిప్పుడు వచ్చెద**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రని చెప్పి నదీ స్నానార్థియయి యరిగెం; దదనంతరంబ తదాశ్రమంబునకుం దీర్థయాత్రాపరుండయి గాధి గృహిణీ సహితంబుగాఁ జనుదెంచిన, సత్యవతియు నిజ భర్త గావించిన చరుద్వయంబు మాతకుం జూపి తత్ప్రభావ భేదం బుపన్యసించినం బ్రీత యై యద్దేవి పరమపావనస్నానం బాచరించి చరువుపయోగించు నప్పుడజ్ఞానంబునం దన చరువు కూఁతున కిచ్చి కూతుచరువు దానుపయోగించె; నయ్యువతియుం దలంపులేమి నా లేమ యిచ్చిన భంగిన కుడిచె; నంత భార్గవుండు వచ్చి పత్నిం జూచి దివ్య బోధనంబు నెఱింగి 'క్షత్రియాంతకరం బగు గర్భంబు ధరియించినదాన' వనవుడు నత్తరుణియుఁ దత్పాదంబులకుం బ్రణతయై 'మీ రిట్లానతీఁ దగునె?' యని వడవడ వడంకుచుఁ గేలు మొగిచి నిలిచిన, నత్తపోధనుం డత్తెఱవతో 'నత్తెఱంగు నా తలంపున వచ్చినది గాదు; భవన్మాతృ బుద్ధిహానిం జేసి చరు వ్యత్యాసంబున నయ్యెఁ; నీకుఁ గ్రూరకర్ముండును మహాబలుండును నగు పుత్రుం డుద్భవించు; నా యమకు బ్రహ్మభూతుండు దపోధనుండును నగువా డుదయించు; నేను దపంబున విశ్వబ్రహ్మంబు నచ్చరువున నావహించినవాఁడ'నని పలుకుటయు. 69.

ప్రతిపదార్థం: ఆ భృగు నందనుండు= ఆ భృగు వంశీకుడైన ఋచీకుడనే మహర్షి; ఆ+చరువులు= ఆ రెండు హవిస్సులను; నిజభార్యముందటన్+ఇడి= తన భార్య ముందట ఉంచి; క్షత్రియ+అజేయుండును= రాజులచేత జయింపబడని వాడును; క్షత్రియ సూదనుండును= రాజులను వధించేవాడును; అగు= అయిన; క్షత్రియ+ఉత్తముండు= రాజశ్రేష్ఠుడు; ఈ+చరువునన్= ఈ హవిస్సునందు; జన్మించున్= జన్మిస్తాడు; దీనిన్= ఈ మొదటి హవిస్సును; నీ తల్లికిన్+ఇమ్ము= మీ అమ్మకు ఇమ్ము; తపః+ధృతి శమంబులన్= గొప్ప తపస్సు శాంతులచేత; ఉత్కృష్టుండు+అగు= గొప్పవాడైన; ద్విజశ్రేష్ఠుండు= బ్రాహ్మణోత్తముడు; దీనివలనన్= ఈ మరొక హవిస్సు వలన పుట్టుతాడు; ఇది నీవు+ఉపయోగింపుము= దీనిని నీవు భుజింపవలసిందని; వానిని= ఆ హవిస్సులను; ఏర్పరించి= విభజించి; భవత్+జననీ జనకులు= మీ తల్లిదండ్రులు; ఇప్పుడు వచ్చెదరు= కొద్దిసేపటిలో వస్తారని తెలిపి; నదీ స్నాన+అర్థి+అయి= నదిలో స్నానం చెయ్యటం కొరకు(ఋచీకుడు); అరిగెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; తద్+ఆశ్రమంబునకున్= ఆ ఆశ్రమానికి; తీర్థయాత్రాపరుండు+ఐ= తీర్థయాత్రలలో ఆసక్తి కలవాడై; గాధి= ఋచీకుడి మామ అయిన గాధి; గృహిణీ సహితంబుగాన్= భార్యతోపాటు; చనుదెంచినన్= రాగా; సత్యవతియున్= ఆ దంపతుల పుత్రి అయిన సత్యవతి; నిజభర్త= తన భర్త అయిన ఋచీకుడు; కావించిన= చేసిన; చరుద్వయంబు= హవిస్సుల జంటను; మాతకున్+చూపి= తల్లికి చూపెట్టి; తత్ప్రభావ భేదంబున్+ఉపన్యసించినన్= ఆ హవిస్సుల జంట యొక్క మహిమల భేదాన్ని వివరించగా; ఆ+దేవి= ఆ సత్యవతి తల్లి; ప్రీత+ఐ= సంతుష్ట అయి; పరమపావన స్నానంబు+ఆచరించి= మిక్కిలి పవిత్రమైన స్నానం చేసి; చరువు+ఉపయోగించునప్పుడు= ఆ హవిర్భాగాన్ని ఉపయోగిస్తున్నప్పుడు; న+జ్ఞానంబునన్= తెలివి తక్కువ వలన; తన చరువు కూఁతునకున్+ఇచ్చి= తాను భుజించవలసిన హవిర్భాగాన్ని పుత్రికకు ఇచ్చి; కూఁతు చరువు= కూతురు గ్రహించవలసిన హవిర్భాగాన్ని; తాన్+ఉపయోగించెన్= తాను గ్రహించింది; ఆ+యువతియున్= ఆ సత్యవతియు; తలంపు లేమిన్= గుర్తులేకపోవటంచేత; ఆ లేమ యిచ్చిన భంగిన= ఆ తల్లి ఇచ్చిన విధంగానే; కుడిచెన్= స్వీకరించింది; అంతన్= అంతలోపల; భార్గవుండు వచ్చి= భృగు వంశీకుడైన ఋచీకుడు వచ్చి; పత్నిన్ చూచి= భార్య అయిన సత్యవతిని చూచి; దివ్యబోధనంబునన్+ఎఱింగి= దివ్య జ్ఞానంతో తెలిసికొని; క్షత్రియ+అంతకరంబు+అగు= రాజ వినాశకమైన; గర్భంబున్+ధరించినదానవు= గర్భం ధరించావు; అనవుడన్= అని చెప్పగా; ఆ+తరుణియున్= ఆ సత్యవతి; తద్+పాదంబులకున్= ఆతడి కాళ్ళకు; ప్రణతఅయి= నమస్కరించినదై; మీరు+ఇట్లు+ఆనతి+ఈన్+తగునె?= మీరు ఈ విధంగా అనటం సమంజసం కాదు; అని వడవడ వడంకుచున్= గజగజ వణకుతూ; కేలు మొగిచి= చేతులు జోడించి; నిలిచినన్= నిలువగా; ఆ+తపోధనుండు= తపస్సే ధనంగా కల ఆ ఋచీకుడు; ఆ+తెఱవతోన్= ఆ సత్యవతితో; ఆ+తెఱంగు= ఆ విధం; నా తలంపున వచ్చినది కాదు= నా ఎరుకతో వచ్చినది కాదు (కావాలని చేసినది కాదు); భవత్+మాతృ+బుద్ధిహానిన్+చేసి= నీ తల్లి బుద్ధిలేమితనంవలన; చరు వ్యత్యాసంబునన్+అయ్యెన్= హవిస్సులు మారటం వలన జరిగింది;

నీకున్= నీకు; క్రూర కర్ముండును= ఘోరకృత్యాలు చేసేవాడును; మహాబలుండును= మిక్కిలి పరాక్రమవంతుడును; అగు= అయిన; పుత్రుండు= కుమారుడు; ఉద్భవించున్= పుట్టుతాడు; ఆయమకున్= నీ తల్లికి; బ్రహ్మభూతుండు= బ్రహ్మజ్ఞాని; తపోధనుండు= తపస్సే ధనంగా కలవాఁడు; అగువాడు= అయినవాడు; ఉద్భవించున్= పుట్టుతాడు; ఏను= నేను; తపంబునన్= తపస్సుచేత; విశ్వ బ్రహ్మంబున్= పరబ్రహ్మమును; ఆ+చరువునన్= ఆ హవిస్సునందు; ఆవహించినవాఁడను= ప్రవేశపెట్టాను; అని పలుకుటయున్= అని చెప్పగా.

తాత్పర్యం: ఆ ఋచీకుడు రెండు హవిర్భాగాలను, భార్య సత్యవతికి చూపించి 'రాజులచేత జయించబడనివాడు, క్షత్రియ సంహారకుడు అయిన ఉత్తమ క్షత్రియుడు మొదటి హవిర్భాగంవలన జన్మిస్తాడు. ఇది మీ తల్లికి ఇమ్ము. తపస్సంపన్నుడైన బ్రాహ్మణోత్తముడు రెండవ హవిస్సువలన జన్మిస్తాడు. దీనిని నీవు స్వీకరించుము' అని చెప్పి 'త్వరలోనే నీ తల్లిదండ్రులు ఇక్కడకు వస్తా' రని చెప్పి నదీస్నానానికై వెళ్ళిపోయాడు. కొంతసేపటికి తీర్థయాత్రలు చేస్తూ గాధి భార్యాసమేతంగా ఆ ఆశ్రమానికి వచ్చాడు. సత్యవతి ఆ హవిర్భాగాలను చూపి భర్త చెప్పిన విషయాన్ని తెలుపగా తల్లి సంతోషించి, సత్యవతి స్వీకరింపవలసిన హవిస్సును తాను, తాను భుజింపవలసింది సత్యవతి వ్యత్యస్తంగా భుజించారు. ఆ వెనుక ఋచీకుడు వచ్చి బ్రహ్మజ్ఞానంతో 'నీగర్భంలో క్రూరకర్ముడు ఉన్నా' డని చెప్పగా సత్యవతి 'ఇట్లా అనుగ్రహిస్తారా?' అని గజగజ వణికిపోయింది. అప్పుడు ఋచీకుడు తాను ఆ విధంగా భావించ లేదని మీ తల్లి బుద్ధిలేమితనంవల్ల హవిర్భాగాల వ్యత్యస్తం జరిగిందని చెప్పాడు. 'నీకు క్రూరకర్ముడు, మహాబలుడు అయిన పుత్రుడు ఉద్భవిస్తాడు. ఆవిడకు బ్రహ్మజ్ఞాని, తపస్సంపన్నుడైనవాడు పుట్టుతాడు. నేను ఘోరతపస్సుచేసి పరబ్రహ్మను ఆ హవిర్భాగంలో ఆవహింపచేశాను' అని చెప్పాడు.

క. అమ్ముగ్ధ యతని కిట్లను । 'నిమ్మూఁడు జగములు మీర లితరంబులుగాఁ
గ్రమ్మనఁ జేయఁగఁ జాలుదు;। రెమ్మెయి నైనఁ గృపసేయరే నా మీఁదన్. 70

ప్రతిపదార్థం: ఆ+ముగ్ధ= ఆ ముద్దరాలైన సత్యవతి; అతనికిన్+ఇట్లు+అనున్= భర్త అయిన ఋచీకుడితో ఇట్లాఅన్నది; మీరలు= మీరు; ఈ+మూఁడు జగములు= ఈ ముల్లోకాలను; ఇతరంబులుగాన్= వేరుగా; క్రమ్మనన్= వెనువెంటనే; చేయఁగన్+చాలుదురు= చేయగల సమర్థులు; ఏ+మెయిన్+అయినన్= ఏ విధంగా నైనా సరే; నా మీఁదన్= నాపై; కృప చేయరే!= దయ చూపించరా!

తాత్పర్యం: వెనువెంటనే ముగ్ధ అయిన సత్యవతి భర్తతో ఇట్లా అన్నది - 'ఈ ముల్లోకాలను మార్చగలిగిన సమర్థులు మీరు. ఏ విధంగానైనా నా మీద దయతో అనుగ్రహించరా!

వ. క్రూరుండగు కొడుకుం గనుట కోర్వ' ననుటయు ననుగ్రహాతిశయంబున నమ్మహాముని 'యవ్విశేషంబు నా పుత్రునకు లేకుండెడు; బౌత్రునియం దావహిల్లెడు; నీ కెట్లు ప్రియం బట్లకాఁగలయది' యనియె; నట్ల యత్తన్వి తపో నిరతుండును, దాంతుండును, శాంతుండును నైన జమదగ్నిం గనియె; బ్రహ్మర్షి సదృశుం డగు విశ్వామిత్రుని గాధిపత్ని గాంచె. 71

ప్రతిపదార్థం: క్రూరుండు+అగు= భయంకరుడైన; కొడుకున్+కనుటకున్+ఓర్వన్+అనుటయున్= కుమారుడిని పొందటానికి సహించనని సత్యవతి చెప్పగా; అనుగ్రహ+అతిశయంబునన్= అధికమైన దయతో; ఆ+మహాముని= ఆ మహర్షి శ్రేష్ఠుడు; ఆ+విశేషంబు= క్రూరుడై పుట్టే విశేషం; నా పుత్రునకున్ లేకుండెడున్= నా కుమారుడికి లేకుండుగాక!; పౌత్రుని యందున్+ఆవహిల్లెడున్= మనుమని యందు కలుగుతుంది; నీకున్+ఎట్లు ప్రియంబు+అట్లకాన్+కల అది= నీకు ప్రియమైన దేదో అదే రీతిగా జరుగుతుంది; అనియెన్= అని ఋచీకుడు అనుగ్రహించాడు; అట్లు+అ+తన్వి= అదే రీతిగా ఆ సత్యవతి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తపః+నిరతుండును= తపస్సు నందతిశయమైన ఆసక్తి కలవాడు; దాంతుండును= కర్మేంద్రియ నిగ్రహం కలవాడు (తపః క్లేశాలకు ఓర్చుకొనేవాడు); శాంతుండునున్= కర్మేంద్రియ నిగ్రహం కలవాడు; ఐన= అయినట్టి; జమదగ్నిన్+కనియెన్= జమదగ్ని అనే కుమారుడిని పొందింది; బ్రహ్మర్షి సదృశుండు+అగు= బ్రహ్మవేత్త అయిన మహర్షితో సమానుడైన; విశ్వామిత్రుని= విశ్వామిత్రుడనే పేరు కలిగినవాడిని; గాధి పత్ని+కాంచెన్= గాధి భార్య పొందింది.

తాత్పర్యం: క్రూరాత్ముడైన కుమారుడిని పొందటానికి నేను అంగీకరించ నని సత్యవతి చెప్పింది. ఆ మహర్షి సత్తముడైన ఋచీకుడు ఆ క్రూరాత్మత పుత్రుడియందు గాక, మనుమని యందుంటుందనీ, ఆమె కోరిన రీతిగా జరుగుతుందని అనుగ్రహించాడు. అట్లాగే సత్యవతి తపస్సంపన్నుడు, జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ నిగ్రహం కలవాడు అయిన జమదగ్నిని పుత్రుడిగా పొందింది. గాధి భార్య బ్రహ్మర్షి సమానుడైన విశ్వామిత్రుడిని కన్నది.

క. జమదగ్ని సర్వ విద్యా । సమేతుఁడు నుదారగుణుఁడుఁ జాపాగమవే
దిమతియు నగు రామునిఁ గాం । చె మహీపతి హనన శీలు శిఖినిభమూర్తిన్. 72

ప్రతిపదార్థం: జమదగ్ని= జమదగ్ని మహర్షి; సర్వవిద్యా సమేతుఁడు= సమస్త విద్యలను కలిగినవాడూ; ఉదార గుణుఁడు= ఔదార్యవంతుడూ; చాప+ఆగమవేదిమతియున్= ధనుర్వేదమునందు బుద్ధిమంతుడూ; మహీపతి హనన శీలున్= రాజులను సంహరించగల సమర్థుడూ; శిఖి నిభమూర్తిన్= అగ్ని శిఖతో సమానమైన స్వరూపం కలవాడూ; అగు= అయినట్టి; రామునిన్+కాంచెన్= పరశురాముడిని పుత్రుడిగా పొందాడు.

తాత్పర్యం: జమదగ్ని సమస్తవిద్యలను నేర్చినవాడూ, ఉదారస్వభావుడూ, ధనుర్వేదాన్ని గ్రహించిన బుద్ధిమంతుడూ, రాజులను సంహరించగల సమర్థుడూ అగ్ని సమానుడూ అయిన పరశురాముడిని కుమారుడిగా పొందాడు.

వ. అక్కాలంబునందు హైహయ వంశవరుండు. 73

ప్రతిపదార్థం: ఆ+కాలంబునందున్= అదే కాలంలో; హైహయ వంశవరుండు= హైహయ వంశంలో శ్రేష్ఠుడైనవాడు.

తాత్పర్యం: అదే కాలంలో హైహయవంశశ్రేష్ఠుడైనవాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. దుర్జయ విక్రమోజ్జ్వలుఁడు దోష వివర్జిత బుద్ధి కార్తవీ
ర్యార్జునుఁ డేడుదీవులు నయాన్విత శూరత నేలుచుండ ధ
ర్మార్జనలోల బుద్ధియు మహాస్త్రబలంబు సహస్ర బాహుతా
స్ఫూర్జనమున్ వెలుంగఁగ నృపుల్ దన యాజ్ఞఁ దలన్ వహింపఁగన్. 74

ప్రతిపదార్థం: దుర్జయ విక్రమ+ఉత్+జ్వలుఁడున్= జయించటానికి వీలు గాని పరాక్రమంతో ప్రకాశిస్తున్నవాడు; దోష వివర్జిత బుద్ధి= పాపాన్ని వదలిన బుద్ధి కలవాడు (అయిన); కార్తవీర్య+అర్జునుఁడు= కార్తవీర్యార్జును డనే పేరు కలిగిన హైహయరాజు; ధర్మ+ఆర్జన లోల బుద్ధియున్= పురుషార్థాలలో ఒకటైన ధర్మ సంపాదనమునందు ఆసక్తమైన బుద్ధితో; మహా+అస్త్రబలంబున్= గొప్ప బాణవిద్యయొక్క బలంతోను; సహస్ర బాహుతా స్ఫూర్జనమున్= వేయి చేతులు గలిగియుండుటవలని ప్రకాశాతిశయంతోను (స్ఫూర్తితోను); వెలుంగఁగన్= ప్రసిద్ధమై వెలుగగా; నృపుల్= (సామంత) రాజులు; తన ఆజ్ఞన్+తలన్ వహింపఁగన్= ఆ కార్తవీర్యార్జునుడి ఆనతి ఔదల దాల్చగా; నయ+అన్విత శూరతన్= నీతితో కూడిన అంటే నీతిమంతమైన పరాక్రమంతో; ఏడు దీవులు= ఏడు దీవుల రాజ్యాన్ని; ఏలుచుండున్= పరిపాలిస్తూ ఉంటాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శత్రువులకు జయించరానంతటి పరాక్రమంతో ఎట్లాంటి పాపమూ లేనట్టి బుద్ధి సంపన్నుడు అయిన హైహయవంశ రాజు అయిన కార్తవీర్యార్జునుడు ధర్మంలో ఆసక్తమైన బుద్ధిచేతను, అస్త్రవిద్యాబల సంపన్నత చేతను, వేయిచేతుల బలాఢ్యతతోనూ, ప్రకాశిస్తూ రాజులందరూ తన ఆజ్ఞను శిరసావహిస్తుండగా నీతియుత పరాక్రమంతో సప్తద్వీపాలతో కూడిన భూమిని పాలిస్తూ ఉండేవాడు.

విశేషం: కార్తవీర్యార్జునుడు; హైహయ వంశీకుడైన కృతవీర్యుడి కుమారుడు కార్తవీర్యుడు. అతడి పేరు అర్జునుడు. కార్తవీర్యార్జునుడు. ఇతడు దత్తాత్రేయుడిని సేవించి, ఆతడి వరప్రసాదంవలన సహస్ర బాహువులు, యుద్ధంలో విజయమేగాని ఓటమిలేనట్లు, వరాలు పొందాడు.

క. ఆ రాజు నగ్నిదేవుఁడు । గారవమున నడుగ నతఁడు గడుఁబెంపున నా
హారముగ నిచ్చె గిరినగ । రారణ్య గ్రామ ఖర్వటాదు లతనికిన్. 75

ప్రతిపదార్థం: అగ్నిదేవుఁడు= సర్వభక్షకుడైన అగ్నిదేవుడు; ఆ రాజున్= హైహయ వంశీకుడైన కార్తవీర్యార్జునుడిని; గారవమున్= గౌరవంతో (ప్రీతితో); అడుగన్= అడుగగానే; అతఁడు+కడున్+పెంపునన్= ఆ కార్తవీర్యార్జునుడు మిక్కిలి అతిశయంతో; అతనికిన్= ఆ అగ్నికి; గిరి నగర+అరణ్య గ్రామ ఖర్వట+ఆదుల్= పర్వతాలు, నగరాలు, అడవులు, గ్రామాలు, అన్ని వృత్తులవాళ్ళు ఉండే పల్లెలు మొదలైన వాటి నన్నింటిని; ఆహారముగన్+ఇచ్చెన్= ఆహారంగా స్వీకరించటానికి ఇచ్చాడు.

తాత్పర్యం: ఒకానొకరోజు క్షుధార్తుడయిన అగ్నిదేవుడు కార్తవీర్యార్జునుడి వద్దకు వెళ్ళి ప్రార్థించగా పర్వతాలు, అరణ్యాలు, పట్టణాలు, గ్రామాలు, వృత్తిపనులవా ళ్ళుండే పల్లెటూళ్ళు అగ్నిదేవుడికి ఆహారంగా ఇచ్చాడు.

వ. ఇచ్చిన నగ్నిదేవుం డాహారంబుగాఁ గొను తరువాత మిత్రావరుణనందను నాశ్రమకాననం బతండు లేని సమయంబున సమసిన నమ్మహాత్ముం డెఱింగి వచ్చి యా సర్వభక్షకునకు రక్షణం బాచరించుచు వర్తించు కార్తవీర్యునిం గని కనలి 'నీవు మదీయ తపోవనంబు పరిహరింపక గహన సామాన్య బుద్ధిం గాల్చితి; నీ బాహులు రాముండు నఱకువాఁ'డని శాపం బిచ్చె; సహస్రబాహుండును దానికి విషాదంబు నొంది యధిక తాత్పర్యంబుతో ధర్మకార్యంబుల నడుపుచుండె. 76

ప్రతిపదార్థం: ఇచ్చినన్= కార్తవీర్యార్జునుడు దానమివ్వగా; అగ్నిదేవుండు+ఆహారంబుగాన్= సర్వభక్షకుడైన అగ్నిదేవుడు ఆహారంగా; కొను తరువాత= స్వీకరించిన వెనుక; మిత్రావరుణ నందనున్= మిత్రావరుణుల యొక్క కుమారుడు (వసిష్ఠ మహర్షి); ఆశ్రమ కాననంబు= ఆశ్రమాటవి; అతండు లేని సమయంబునన్= అతడు లేని సమయంలో; సమసినన్= నాశనమై పోగా; ఆ+మహాత్ముండు= ఆ మహర్షి వసిష్ఠుడు; ఎఱింగి వచ్చి= తెలిసికొని వచ్చి; ఆ సర్వభక్షకునకున్= సర్వాన్ని తినే వాడైన అగ్నికి; రక్షణంబు+ఆచరించుచున్= కాపాడుతూ; వర్తించు= నడుచుకొంటున్నటువంటి; కార్తవీర్యునిన్+కని= కార్తవీర్యార్జునుడిని చూచి; కనలి= కోపించి; నీవు= (కార్తవీర్యార్జునుడు); మదీయ తపోవనంబు= నా ఆశ్రమాన్ని; పరిహరింపక= వదలిపెట్టక; గహన సామాన్య బుద్ధిన్= సాధారణ అరణ్యమనే భావనతో; కాల్చితి(వి)= కాల్చివేశావు?; నీ బాహులు= నీ వేయి చేతులు; రాముండు నఱకువాఁడు+అని= పరశురాముడు ఖండిస్తాడని; శాపంబు+ఇచ్చెన్= శపించాడు; సహస్ర బాహుండును= వెయ్యి చేతులుగల కార్తవీర్యార్జునుడును; దానికిన్= అందుకు; విషాదంబున్+ఒంది= దుఃఖించి; అధిక తాత్పర్యంబుతోన్= ముందుకంటె మరింత అభినివేశంతో; ధర్మకార్యంబులన్= ధర్మగుణంతో సమస్తమైన పనులను; నడుపుచుండెన్= చేస్తూ ఉండేవాడు.

తాత్పర్యం: అగ్నిదేవుడు యాచించగానే కార్తవీర్యార్జునుడు సమస్తమూ ఇచ్చివేయగా, ఆహారంగా స్వీకరించాక వసిష్ఠాశ్రమాన్ని సైతం అతడు లేని సమయాన అగ్నిదేవుడు సమస్తమూ భక్షించాడని తెలిసికొన్న వసిష్ఠమహర్షి

అగ్నిదేవుడికి రక్షకుడైన కార్తవీర్యార్జునుడిని చూచి మిక్కిలి కోపించి, 'నీవు తపోవనాన్ని మిగల్చకుండా సామాన్యమైన అరణ్యంగా భావించి కాల్పించావు. పరశురాముడు నీ బాహువులను ఖండిస్తా'డని శాపమివ్వగా అందుకు కార్తవీర్యార్జునుడు దుఃఖించినప్పటికి మరింత అభినివేశంతో ధర్మకార్యాలు నిర్వర్తిస్తూనే వచ్చాడు.

క. శాపము గారణముగ నా । భూపతి కవినీతులైన పుత్రులు సబలా
టోపాత్ములు పలువురు సిం । హోపములు జనించి ధాత్రి నుద్ధటవృత్తిన్. 77

ప్రతిపదార్థం: శాపము కారణముగన్= వసిష్ఠుని యొక్క శాపకారణంచేత; ఆ భూపతికిన్= ఆ రాజైన కార్తవీర్యార్జునుడికి; సబల+ఆటోప+ఆత్ములు= బలంతో కూడి ఉండటం వలన వేగిరపాటు కల బుద్ధితో ఉన్నవారు; సింహ+ఉపములు= సింహాలతో సమానమైనవారు; పలువురు= అనేకులు; జనించి= పుట్టి; ధాత్రిన్= భూమిపై; ఉద్భట వృత్తిన్= భయంకరమైన నడవడితో.

తాత్పర్యం: వసిష్ఠుడు ఇచ్చిన శాపం మూలంగా కార్తవీర్యార్జునుడికి నీతిలేనివారు, అత్యంత బలం వలన వేగిరపాటు కలవారు, సింహ పరాక్రములు అయిన అనేక పుత్రులు జన్మించారు. పుట్టి భూమిని భయంకర వృత్తితో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: దహించివేయబడిన ఆశ్రమంవలె కార్తవీర్యార్జునుని వేయి చేతులు ఖండించబడతాయని వసిష్ఠుడి శాపం. కాని, శాపం కారణంగా అని తిక్కన మూలంలో లేని శాపకారణాన్ని పేర్కొన్నాడు. అందువలననే దుర్మార్గులైన అనేక పుత్రులు కార్తవీర్యార్జునుడికి కలిగారు. బహుశః వినీతుడైన కార్తవీర్యార్జునుడికి నాశముండదని, అందువలననే అవినీతులైన పుత్రులు జన్మించారని తిక్కన భావించి ఉండవచ్చును.

వ. ఎందునుం జరియించువా రొక్కనాఁడు జమదగ్ని యాశ్రమంబునకుం బోయి యతండునుం జామదగ్న్యుండును నయ్యెడ లేకుండ హోమధేనువును వత్సంబునుం దమ మందిరంబునకుం గొనివచ్చి; రిట్లు దెచ్చుట సహస్ర బాహుం డెఱుంగఁడు. 78

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు= ఒకనొక రోజు; ఎందునున్+చరియించువారు= (పెరిగి పెద్దవారైన కార్తవీర్యార్జునుడి పుత్రులు) ఎక్కడెక్కడో తిరుగుతూ; జమదగ్ని+ఆశ్రమంబునకున్+పోయి= జమదగ్ని మహర్షి తపోవనానికి వెళ్ళి; అతండునున్+ జామదగ్న్యుండునున్= ఆ జమదగ్నియు ఆతని కుమారుడైన పరశురాముడూ; ఆ+ఎడన్= ఆ తపోవనంలో; లేక+ఉండన్= లేకుండగా; హోమధేనువును= యాగ సంబంధమైన ఆవును; వత్సంబునున్= దాని దూడను; తమ మందిరమునకున్= వారి అంతఃపురానికి; కొనివచ్చిరి= పట్టి తెచ్చారు; ఇట్లు తెచ్చుటన్= ఈ విధంగా తీసికొనిరావటం; సహస్ర బాహుండు+ఎఱుంగఁడు= వేయి చేతులు కల కార్తవీర్యార్జునుడికి తెలియదు.

తాత్పర్యం: కార్తవీర్యార్జునుడి పుత్రులు ఎక్కడెక్కడో తిరిగి, జమదగ్ని తపోవనానికి వెళ్ళి, జమదగ్నీ అతని కుమారుడైన పరశురాముడూ లేని సమయంలో వారి యాగధేనువును, దూడను పట్టి తెచ్చి తమ అంతఃపురంలో కట్టివేశారు. ఈ తెచ్చిన విషయం కార్తవీర్యార్జునుడికి తెలియదు.

క. అట రాముఁ డెఱిఁగి పరమో । ద్భట మగు కోపమునఁ జాప పరశుముఖ మహో
త్కట శస్త్రాస్త్రంబులతోఁ । బటుగతి వచ్చెను సహస్రబాహుని మీఁదన్. 79

ప్రతిపదార్థం: అటన్= ఆ తపోవనంలో; రాముఁడు+ఎఱిఁగి= పరశురాముడు తెలిసికొని; పరమ+ఉద్భటము+అగు= మిక్కిలి సంభ్రమంతో కూడిన; కోపమునన్= కోపంతో; చాప పరశు ముఖ మహా+ఉత్కట శస్త్ర+అస్త్రంబులతోన్= విల్లు, గండ్రగొడ్డలి

మొదలైన అత్యంత భయంకరమైన ఆయుధాలు మంత్ర పూతమైన బాణాలతో; సహస్ర బాహుని మీఁదన్= కార్తవీర్యార్జునుడి పైకి; పటుగతిన్= మిక్కిలి ఉద్ధతితో; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఆశ్రమంలో తాములేని సమయంలో యాగధేనువును, దూడను దుర్మార్గులైన కార్తవీర్యార్జునుడి పుత్రులు తీసికొనిపోయారన్న విషయాన్ని తెలిసికొని పరశురాముడు సంభ్రమంతో కూడిన కోపంతో ధనుస్సు, గండ్రగొడ్డలి మొదలైన శస్త్రాస్త్రాలతో కార్తవీర్యార్జునుడిపైకి ఉద్ధతుడై దాడికి వెళ్ళాడు.

పరశురాముఁడు కార్తవీర్యార్జునునిఁ జంపుట (సం. 12-49-41)

ఆ. వచ్చి ముట్టి కయ్య మిచ్చిన నవ్విభు । నొంచి బాహు వనముఁ జంచ దుగ్ర
పరశు ఘోరధారపాల్ సేసి పోయి ని । జేచ్ఛ నుండె మేదినీశవర్య! 80

ప్రతిపదార్థం: మేదినీ+ఈశవర్య!= భూమికి అధిపతులైన వారిలో శ్రేష్ఠుడైన ఓ జనమేజయ మహారాజా!; వచ్చి= క్రుద్ధుడై వచ్చిన పరశురాముడు; ముట్టి= ఎదుర్కొని; కయ్యము+ఇచ్చినన్= యుద్ధం చేసి; ఆ+విభున్+నొంచి= ఆ రాజైన కార్తవీర్యార్జునుడిని బాధించి; బాహువనమున్= చేతులనే అరణ్యాన్ని; చంచత్+ఉగ్ర పరశు ఘోరధార పాల్+చేసి పోయి= ప్రకాశిస్తున్న భయంకరమైన గండ్రగొడ్డలియొక్క వాడి అయిన వాదరకు బలిచేసి తిరిగిపోయి; నిజ+ఇచ్ఛన్+ఉండెన్= స్వేచ్ఛగా ఉండిపోయాడు.

తాత్పర్యం: జమదగ్నీ అతడికుమారుడు పరశురాముడూ ఆశ్రమంలో లేని సమయంలో ధేనువును, దూడను బలాత్కారంతో తెచ్చి అంతఃపురంలో ఉంచుకొన్నాడు కార్తవీర్యార్జునుడు. ఆ సంగతి తెలిసిన పరశురాముడు కుపితుడై కార్తవీర్యార్జునుడిపై దండెత్తిపోయి తన పరశువుతో అతడిని సంహరించి యాగధేనువును, దూడను గ్రహించి తిరిగి ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

చ. అతఁడు సమిత్కుశాభిహరణార్థము గానకు నేఁగియుండఁగా
నతి కుపితాత్ము లై కడఁగి యర్జునసూనులు వోయి ముట్టి త
త్పితృశిరమున్ వెసం దునిమి ప్రీతిమెయిం జనుదెంచి; రమ్మహో
ద్ధతుఁ డట వచ్చి వారి చరితం బెఱిఁగెం దమ తల్లి సెప్పఁగన్. 81

ప్రతిపదార్థం: అతఁడు= పరశురాముడు; సమిత్+కుశ+అభిహరణ+అర్థము= సమిధలను, దర్భలను తీసికొని రావటం కొరకు; కానకున్+ఏఁగి+ఉండఁగాన్= అడవికి వెళ్ళి ఉండగా; అర్జున సూనులు= కార్తవీర్యార్జునుడి పుత్రులు; అతి కుపిత+ఆత్ములు+ఐ= మిక్కిలి కోపంతో కూడిన మనస్సు కలవారై; కడఁగి= పూనికతో జమదగ్ని ఆశ్రమానికి పోయి; ముట్టి= ఎదుర్కొని; తద్+పితృశిరమున్= ఆ పరశురాముడి తండ్రి జమదగ్ని యొక్క తలను; వెసన్+తునిమి= వెంటనే ఖండించి; ప్రీతిమెయిన్+చనుదెంచిరి= సంతోషంతో తిరిగి వచ్చారు; ఆ+మహా+ఉద్ధతుఁడు= ఆ పరాక్రమ వంతుడైన పరశురాముడు; అటన్+వచ్చి= ఆశ్రమానికి తిరిగివచ్చి; తమ తల్లి+చెప్పఁగన్= పరశురాముడి తల్లి రేణుకాదేవి చెప్పగా; వారి చరితంబు+ఎఱింగెన్= కార్తవీర్యార్జునుడి పుత్రుల దుర్మార్గ చరిత్రను తెలిసికొన్నాడు.

తాత్పర్యం: సమిధలు, దర్భలు తీసికొని రావటానికై అరణ్యానికి పరశురాముడు వెళ్ళి ఉండగా, కార్తవీర్యార్జునుడి పుత్రులు క్రోధాత్ములై ఆ ఆశ్రమానికి వెళ్ళి, జమదగ్ని తల నరికి హాయిగా వెనుదిరిగి వచ్చారు. అప్పుడు పరాక్రమ సంపన్నుడైన పరశురాముడు ఆశ్రమానికి తిరిగివచ్చి దుష్టులైన కార్తవీర్యార్జునుడి పుత్రులు చేసిన పనిని తల్లివలన తెలిసికొన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అ ట్లెఱింగి. 82

తాత్పర్యం: ఆ విధంగా తెలిసికొని - (తరువాతి పద్యంతో అన్వయం).

శా. రాముం డుద్ధత రోషపావక శిఖాప్రస్ఫీతుఁడై తున్ముదున్
భూమీశాలిఁ గుఠారధార నని విస్ఫూర్జద్గతిన్ హైహయ
స్తోమం బాదిగఁ జొచ్చి రాజకులముం దున్మాడి చేసెన్ సము
ద్దామ క్రీడను రౌద్ర మొప్ప నిల రక్తస్యంద సంసిక్తఁగన్. 83

ప్రతిపదార్థం: రాముండు= పరశురాముడు; ఉద్ధత రోషపావక శిఖా ప్రస్ఫీతుఁడు+ఐ= ఎక్కువైన కోపమనే అగ్ని శిఖలతో ప్రకాశిస్తున్న వాడై; భూమీ+ఈశ+ఆలిన్= రాజుల సమూహాన్ని; కుఠారధారన్= గండ్రగొడ్డలి వాదరచేత; తున్ముదున్+అని= సంహరిస్తానని; విస్ఫూర్జత్+గతిన్= అత్యంతం ప్రకాశించేవేగంతో; హైహయ స్తోమంబు+ఆదిగన్= హైహయ రాజ సమూహం మొదలుకొని; చొచ్చి= చంపటానికి ప్రవేశించి; రాజకులమున్ తున్మాడి= సమస్త రాజ సమూహాలను సంహరించి; రౌద్రము+ఒప్పన్= వీరోచితంగా; సమ్+ఉద్దామ క్రీడను= ఏ మాత్రం ఎదురులేని ఆటగా; ఇలన్= భూమి; రక్తస్యంద సంసిక్తఁగన్= రక్తం చిందించటంచేత తడిసి పోయేటట్లుగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: తన తండ్రి తలను కార్తవీర్యార్జునుడి పుత్రులు నరికివెళ్ళిన సంగతి తెలిసిన పరశురాముడు అత్యంత భయంకరమైన అగ్నిశిఖవలె జాజ్వల్యమానంగా వెలుగొందుతూ, తన గండ్రగొడ్డలితో సమస్త క్షత్రియ సమూహాన్ని సంహరిస్తానంటూ వెళ్ళి హైహయ వంశరాజులను మొదలుకొని సమస్త క్షత్రియ రాజులను తుదముట్టించి అత్యంత రౌద్రంతో రాజుల రక్తంతో భూమిని తడిపివేశాడు.

విశేషం: తిక్కన అలతి అలతి పదాలతో రచించటమే అతని సహజశైలి. అయినా, వీర రసోదంచితంగా శార్దూల వృత్తంలో శబ్దఝడితిని పరశురాముడి కుఠారం ఝళిపించినట్లు రౌద్రోచితంగా రచించటం తిక్కన "రసాభ్యుచిత బంధం".

వ. ఇట్లు సేసి పరమకృపావిష్ట హృదయుండై తపోవనంబునకుం జనియెఁ; బదంపడి బహువత్సరంబులు సనిన విశ్వామిత్ర పౌత్రుండైన పరావసు వనురాజు దుర్వినీతుండై గర్వోద్రేకంబునం బరశురాము నధిక్షేపించి, రాజులకు వెఱచి డాఁగి యున్నవాఁడ వని విశిష్ట జన సన్నిధిం బలికి బాల వృద్ధ భావంబున నుపేక్షితులై యతని చేత మున్నుచావక యున్న ప్రతర్దనాదుల నుగ్గడించి. 84

ప్రతిపదార్థం: ఇట్లు+చేసి= ఈ విధంగా భయంకరమైన రాజ సంహారం చేసి; పరమకృపా+ఆవిష్ట+హృదయుండు+ఐ= అత్యున్నతమైన దయతో కూడిన హృదయం కలవాడై; తపః+వనంబునకున్= తపస్సుకొరకైన అరణ్యానికి; చనియెన్= వెళ్ళిపోయాడు; పదంపడి= ఆ తరువాత; బహువత్సరంబులు+చనినన్= అనేక సంవత్సరాలు గడిచిపోగా; విశ్వామిత్ర పౌత్రుండు+ఐన= విశ్వామిత్రుడియొక్క మనుమడైన; పరావసువు+అనురాజు= పరావసువనే పేరుగల రాజు; దుః+వినీతుండు+అయి= దుష్టనీతిగలవాడై; గర్వ+ఉద్రేకంబునన్= పొగరుమోతు తనంతో కూడిన కోపంతో;పరశురామున్+అధిక్షేపించి= పరశురాముడిని హేళనచేసి; రాజులకున్ వెఱచి= రాజులకు భయపడి; డాఁగి+ఉన్నవాఁడవు= తపోవనంలో ఎట్లా దాక్కొన్నావు అని; విశిష్టజన సన్నిధిన్+పలికి= ఉత్తమ జనుల ఎదుట చెప్పి; బాలవృద్ధ భావంబునన్= పసిపిల్లలు, ముది వగ్గులు అనే భావంతో; ఉపేక్షితులు+అయి= లెక్కచేయబడనివారయి; అతని చేతన్= ఆ పరశురాముడిచేత; మున్ను చావకఉన్న= ముందు చావకుండా బ్రతికి ఉన్నట్టి; ప్రతర్దన+ఆదులన్= ప్రతర్దనుడనే రాజు మొదలైనవారిని; ఉగ్గడించి= చెప్పి.

తాత్పర్యం: పరశురాముడు సమస్త రాజ సంహారం చేసి ఆ తరువాత మిక్కిలి దయాంతఃకరణుడై తపస్సు నిమిత్తం ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. తరువాత అనేక సంవత్సరాలు గడచిపోయాయి. ఆ వెనుక విశ్వామిత్రుడి మనుమడైన పరావసువు అనే రాజు నీతిమాలినవాడై గర్వంతో ఉద్రేక పూరితుడై, చేసిన ప్రతిజ్ఞను మరచి రాజులకు భయపడి తపోవనంలో దాక్కొన్నాడని ఆర్యుల ఎదుట పరశురాముడిని పరిహసించాడు. చిన్న పిల్లలు, ముసలివాళ్ళనే భావంతో అప్పుడు సంహరించక వదలిపెట్టబడిన ప్రతర్దనుడు మొదలైన రాజులను ఉదాహరించి చెప్పాడు.

ఆ. 'నృపులు గారె వారు? నీవు మిథ్యా ప్రతి । జ్ఞాభిమాని' వనుడు నతఁడు మగుడ
రోషమెత్తి కడఁగి క్రూరత నాబాల । వృద్ధముగ నరేంద్ర వితతి నఱికె. 85

ప్రతిపదార్థం: వారు; నృపులు+కారె?= పైన పేర్కొన్న ప్రతర్దనాదులు రాజులు కారా?; నీవు= ఓ పరశురామా! నీవు; మిథ్యా ప్రతిజ్ఞా+అభిమానివి+అనుడున్= అసత్యమైన ప్రతిజ్ఞయందు అభిమానం కలవాడవు (ప్రతిజ్ఞచేసి నెరవేర్చుకొనలేనివాడవు); అనుడున్= అని పరావసువు పలుకగా; అతఁడు= ఆ పరశురాముడు; మగుడన్= మరల; రోషము+ఎత్తి= కోపంవచ్చి; కడఁగి= ప్రయత్నించి; ఆ బాల వృద్ధముగన్= పిల్లలు మొదలుకొని ముసలి వాళ్ళవరకు; నర+ఇంద్ర+వితతిన్= రాజశ్రేష్ఠుల సమూహాన్ని; క్రూరతన్= మిక్కిలి క్రూరభావంతో; నఱికెన్= సంహరించాడు.

తాత్పర్యం: 'ప్రతర్దనుడు మొదలుకొని ఉన్న వారందరు రాజులు కారా? చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకొనలేని వాడవు అని పరావసు డనే రాజు పలుకగా, పరశురాముడు కోపోద్రిక్తుడై బాలురు వృద్ధులు అని లెక్కచేయక సమస్త రాజ లోకాన్ని క్రూరాత్ముడై సంహరించాడు.

వ. గర్భంబుల నున్న యర్భకులను మఱియు వివిధ ప్రకారంబులఁ బోరం దప్పిపోయి పుడమి యేలు రాజులం గాలాంతరంబుల వెదకి వెదకి వధియించె; నిట్లిరువది యొక్క మాఱు నేల నిః క్షత్రంబు గావించి యశ్వమేధ యాగంబు సేసి, దక్షిణగా నీ క్షితి యంతయుం గశ్యపున కిచ్చెఁ; బదంపడి యమ్ముని యా జామదగ్న్యుతో ని ట్లనియె. 86

ప్రతిపదార్థం: గర్భంబులన్+ఉన్న+అర్భకులను= తల్లుల కడుపులందున్న పసికూనలను; మఱియున్= అంతేకాక; వివిధ ప్రకారంబులన్= అనేక రీతులుగా; పోరన్+తప్పిపోయి= యుద్ధంలో తప్పించుకొనిపోయి; పుడమి+ఏలు రాజులన్= భూమినేలుతున్న రాజులను; కాల+అంతరంబులన్= వివిధ కాలాలలో; వెదకి వెదకి= రాజులను వెదకి వెదకి; వధియించెన్= సంహరించాడు; ఇట్లు+ఇరువది ఒక్కమాఱు= ఈ విధంగా ఇరవై ఒక్కసార్లు; నేలన్= భూమిని; నిః+క్షత్రంబు కావించి= రాజులు లేకుండా చేసి; అశ్వమేధ యాగంబు+చేసి= అశ్వమేధ మనే యజ్ఞాన్ని చేసి; ఈ క్షితి+అంతయున్= ఈ భూమినంతటిని; కశ్యపునకున్= కశ్యప ప్రజాపతికి; దక్షిణగాన్+ఇచ్చెన్= దానం చేశాడు; పదంపడి= ఆ తరువాత; ఆ+ముని= ఆ కశ్యప ప్రజాపతి; ఆ జామదగ్న్యుతోన్= ఆ జమదగ్ని కుమారుడైన పరశురాముడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: తల్లుల గర్భాల్లో ఉన్న శిశువులను అనేక రీతులుగా యుద్ధంలో తప్పించుకొనిపోయి రాజ్యమేలుతున్న రాజులను అనేక సంవత్సరాలపాటు వెదకి వెదకి పరశురాముడు సంహరించాడు. ఆ విధంగా ఇరవై ఒక్కసార్లు ఈ భూమిపై రాజులు లేకుండా చేసి అశ్వమేధయాగం చేసి, ఈ భూమినంతటిని కశ్యప ప్రజాపతికి దానమిచ్చాడు. ఆ కశ్యపుడు పరశురాముడితో ఇట్లా అన్నాడు.

తే. 'అశ్వమేధ యాగంబున నవని యెల్ల । నాకు దక్షిణగా నిచ్చినాఁడ; వింక
నాధిపత్యంబు నీకు లే దరుగు దక్షి । ణాబ్ధిపారదేశమునకు నసఘచరిత! 87

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: న+అఘ చరిత్ర!= ఓ పాప రహితుడైన పరశురామా!; అశ్వమేధ యాగంబునన్= అశ్వమేధయాగంలో; అవని+ఎల్లన్= భూమినంతటిని; నాకున్ దక్షిణగాన్+ఇచ్చినాఁడవు= నాకు దానం చేశావు; ఇంకన్= ఇక మీదట; నీకున్; ఆధిపత్యంబు= అధికారం; లేదు= లేదు; దక్షిణ+అబ్ధి+పారదేశమునకున్= దక్షిణ సముద్రతీర దేశానికి; అరుగు= వెళ్ళుము.

తాత్పర్యం: 'పాపరహితుడవైన ఓ పరశురామా! అశ్వమేధయాగం చేసి ఈ భూమినంతటిని నాకు దానం చేశావు. ఇంక ఈ భూమిమీద నీకు అధికారం లేదు. కాబట్టి దక్షిణసముద్రం హద్దుగా కలిగిన ప్రదేశానికి వెళ్ళుము' అని కశ్యపప్రజాపతి పలికాడు.)

వ. అని పలికి యెందేని నేమేనియుం దెఱంగున శేషించినరాజ పింఛంబునకు నిశ్శేషత్వంబు వాటిల్లకుండం బరిహరించు బుద్ధిం బలికిన నప్పురుష సింహుండు 'నట్ల కాక' యని పోవ, నతని వలని వెఱపున నవ్వలని సముద్రుండు శూర్పాకార ప్రదేశంబు బెరయం గొంతదేశం బతనికి విహారస్థానంబు గావించె; నివ్విధంబునం గశ్యప మునీంద్రుండు పరిగ్రహించి భూమి భూసుర ప్రకరంబుల కిచ్చి తపోవనంబున కరిగె; భూమియు నతనిపేరఁ గాశ్యపి యన నెగడెఁ; గొండొక కాలంబునకు వైశ్య శూద్ర ప్రముఖులు దర్పితులై వివిధ ప్రకారంబుల విప్రదారధన ధాన్యాదు లపహరింపం దొడంగిరి. 88

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఎందున్+ఏనిన్+ఏమి+ఏనియున్+తెఱంగునన్= ఎక్కడైనా ఎట్లాంటి విధంగానైనా; శేషించిన= మిగిలిన అంటే పరశురాముడు వధించగా మిగిలిన; రాజ పింఛంబునకున్= రాజుల సమూహానికి; నిఃశేషత్వంబు+పాటిల్లకుండన్= ఏ మాత్రమూ మిగులు లేకుండాపోవటాన్ని; పరిహరించుబుద్ధిన్+పలికినన్= నివారించదలచి చెప్పగా; ఆ+పురుష సింహుండు= పురుషులలో శ్రేష్ఠుడైన ఆ పరశురాముడు; అట్లకాక+అనిపోవన్= అట్లాగేనని పోగా; అతని వలని వెఱపునన్= ఆ పరశురాముడి వలన భయంతో; ఆ+వలని= దక్షిణ దిక్కునందలి; సముద్రుండు= సాగరుడు; శూర్ప+ఆకార ప్రదేశంబు బెరయన్= చేట ఆకారంతోటి స్థలం కలిగిన; కొంత దేశంబు= కొంత భూమిని; అతనికిన్= ఆ పరశురాముడికి; విహార స్థానంబు+కావించెన్= మసలటానికి తగిన ప్రదేశంగా చేశాడు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; కశ్యపముని+ఇంద్రుండు= మహర్షి శ్రేష్ఠుడైన కశ్యపుడు; పరిగ్రహించి= పరశురాముడి వలన దానంగా పొంది; భూమిన్= భూమినంతటిని; భూసుర ప్రకరంబులకున్+ఇచ్చి= బ్రాహ్మణ సమూహాలకు ఇచ్చి; తపః+వనంబునకున్+అరిగెన్= తపస్సుకై వనానికి వెళ్ళిపోయాడు; భూమియున్= (అప్పటి నుండి) ఈ భూమి; అతని పేరన్= ఆ కశ్యప ప్రజాపతి దానంగా గ్రహించి రాజులకు ఇవ్వటం వలన; కాశ్యపి+అనన్+నెగడెన్= కాశ్యపి అని ప్రసిద్ధి పొందింది; కొండొక కాలంబునకున్= కొంతకాలానికి; వైశ్య శూద్ర ప్రముఖులు= వైశ్యులలో, శూద్రులలో ముఖ్యులైన వాళ్ళు; దర్పితులు+ఐ= గర్వించి; వివిధ ప్రకారంబులన్= అనేక రీతులుగా; విప్రదార ధన ధాన్య+ఆదులన్= బ్రాహ్మణుల భార్యలూ, ధనమూ, ధాన్యమూ మొదలైన వాటిని; అపహరింపన్+తొడంగిరి= దొంగిలించ నారంభించారు.

తాత్పర్యం: కశ్యపప్రజాపతి అవశేషం లేకుండా రాజలోకం నశించి పోతుందేమోనన్న శంకతో దానంగా నా కిచ్చిన రాజ్యంపైన నీకు అధికారం లేదని పరశురాముడిని దక్షిణసముద్రం ఎల్లగా ఉన్న ప్రదేశంలోని తపోవనానికి పొమ్మన్నాడు. అదేరీతి అతడు వెళ్ళిపోయాడు. పరశురాముడివలన భయంతో దక్షిణసముద్రుడు అతడు విహరించటానికి చేట ఆకారంతో కొంత భూమి నిచ్చాడు. పరశురాముడి వలన దానంగా పొందిన భూమి నంతటిని బ్రాహ్మణుల సమూహానికి సమర్పించి, కశ్యపుడు తపోవనానికి వెళ్ళిపోయాడు. అప్పటి నుండి భూమి 'కాశ్యపి' అనే ప్రసిద్ధి పొందింది. కొంత కాలానికి వైశ్య శూద్రులలో శ్రేష్ఠులైన వాళ్ళు మిక్కిలి గర్వించి అనేక రీతులుగా బ్రాహ్మణుల భార్యలను, ధనధాన్యాలను మొదలైన వాటిని దొంగిలించటం మొదలు పెట్టారు.

సీ. **పదపడి విప్రులు పథము దప్పి వధంబు । మద్యపానంబు సన్మార్గ వర్తు**
లైన సాధుల ధన మపహరించుటయును । మొదలుగాఁగ నకృత్యములకుఁ జొచ్చి
రధ్వరాదిక సత్క్రియల్ ప్రవర్తింపక । తెక్కలిబంది యే దిక్కులందు
దఱుచయ్యె నిమ్మెయి ధర్మంబు సెడి యధ । ర్మంబు వర్తించి యరాజకత్వ

ఆ. **దోష జాతమైన దురిత బాహుళ్యంబు । గుతిలపెట్ట భూమి యతలమునకుఁ**
బోవ నెఱిఁగి కశ్యపుఁడు నిజోరువు నెఱి । గ్రుచ్చి దాపు గాఁగ నిచ్చి యెత్తె. **89**

ప్రతిపదార్థం: పదపడి= ఆ వెనుక; విప్రులు= బ్రాహ్మణులు; పథము+తప్పి= ధర్మ మార్గాన్ని తప్పి; వధంబు= హత్యను; మద్యపానంబు= మద్యం సేవించటం; సత్+మార్గవర్తులు+అయిన= ఉత్తమ మార్గంలో నడచుకొంటున్న; సాధుల= ఉత్తములయొక్క; ధనము+అపహరించుటయును= ద్రవ్యాన్ని దొంగిలించటం; మొదలుకాఁగన్= మొదలుకొని; అకృత్యములకున్+చొచ్చిరి= దుర్మార్గ ప్రవర్తనలకు పూనుకొన్నారు; అధ్వర+ఆదిక+సత్+క్రియల్= యాగం మొదలైన ఉత్తమ కార్యాలు; ప్రవర్తింపక= జరగక; తెక్కలి= దొంగిలించటం; బంది= చెరబట్టటం; ఏ దిక్కులందున్= అన్నిచోట్ల; తఱుచు+అయ్యెన్= అతి సామాన్యమై పోయింది; ఈ+మెయిన్= ఈ విధంగా; ధర్మంబు+చెడి= ధర్మం చెడిపోయి; అధర్మంబు వర్తించి= అధర్మం అధికమై; అరాజకత్వ దోష జాతము+అయినన్= రాజులు లేమి వలన కలిగిన దోషంవలన ఏర్పడిన; దురిత బాహుళ్యంబు= దుర్మార్గం అధికమై; కుతిల పెట్టన్= కుంగదీయగా; భూమి= భూమాత; అతలమునకున్+పోవన్= భూమి కిందటి లోకానికి వెళ్ళగా; కశ్యపుఁడు= కశ్యప ప్రజాపతి తెలిసికొని; నిజ+ఊరువున్= తన తొడను; నెఱి గ్రుచ్చి= చక్కగా సంధించి; దాపు+కాఁగన్+ఇచ్చి+ఎత్తెన్= ఆధారం కాగా భూమిని ఎత్తి పట్టాడు.

తాత్పర్యం: కశ్యప ప్రజాపతి బ్రాహ్మణసమూహానికి రాజ్యం అప్పగించి వెళ్ళిపోయాడు. ఆ తరువాత బ్రాహ్మణులు ధర్మమార్గాన్ని వదలిపెట్టి కారణరహితంగా వధించటం, మద్యం సేవించటం, ఉత్తమమార్గంలో నడుస్తూ ఉన్న సాధుజనుల భార్యలను ధనధాన్యాలను దొంగిలించటం మొదలైన పనులు చేస్తూ అధర్మానికి పాలుపడ్డారు. తాము నిర్వహించవలసిన యజ్ఞయాగాది కర్మలు వదలిపెట్టి ఇతరులను దోచుకొనటం, చెరపట్టటం సామాన్యమైపోయింది. ఈ విధంగా అధర్మమార్గమే ప్రధానమై రాజులు లేకుండటంవలన అరాజకత్వంవలన కలిగిన అనేక దోషజాలం భూమిని క్రుంగదీసింది. భూమి భరించలేక కిందికి వెళ్ళిపోయింది. ఈ విషయాన్ని తెలిసికొన్న కశ్యపప్రజాపతి తన ఊరువులను ఆధారంగా చేసి భూమిని పైకి ఎత్తాడు.

వ. **అది కారణంబుగా ధరణి యుర్వి యనం బ్రసిద్ధి వహించె; నయ్యుద్ధరణ సమయంబునం గాశ్యపి గశ్యపుని వేఁడుకొని యుత్తమ క్షత్రియులు దండనీతి ప్రయోగంబునం జేసి ధర్మంబు రక్షించి తన్ను సురక్షితం జేయువారుగా వరంబు వడయుటకై యమ్మహామునితో ని ట్లనియె.** **90**

ప్రతిపదార్థం: అది కారణంబుగాన్= రసాతలానికి వెళ్ళిన భూమిని కశ్యప ప్రజాపతి తన ఊరువులు ఆధారంగా, ఎత్తి పట్టటమనే కారణం వలన; ధరణి= ఈ భూమి; ఉర్వి+అనన్= ఉర్వి అనే పేరుతో; ప్రసిద్ధి వహించెన్= ప్రఖ్యాతి చెందింది; ఆ+ఉద్ధరణ సమయంబునన్= ఆ విధంగా ఉద్ధరించబడిన సమయంలో; కాశ్యపి= కాశ్యపి అనబడే భూమి; కశ్యపుని వేఁడుకొని= కశ్యప ప్రజాపతిని ప్రార్థించి; ఉత్తమ క్షత్రియులు= శ్రేష్ఠులైన రాజులు; దండనీతి ప్రయోగంబునన్+చేసి= దండోపాయమనే నీతి మార్గంవలన (సామ, దాన, భేద, దండోపాయాలనే చతురుపాయాలలో ఒకటైన దండోపాయం వలన); ధర్మంబు రక్షించి= ఉత్తమ ధర్మాన్ని పరిరక్షించి; తన్ను= భూమిని; సురక్షితన్+చేయువారుగాన్= భయంలేని దానినిగా చేయగలవారుగా; వరంబున్+పడయుటకై= వరం పొందటానికై; ఆ మహామునితోన్= ఆ మహర్షితో; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పింది.

తాత్పర్యం: కశ్యపుడు కిందికి వెళ్ళిన భూమిని తన ఊరువు ఆధారంగా పైకి ఎత్తటంవలన ఈ భూమి ఉర్వి అని ప్రసిద్ధి కెక్కింది. ఆ సమయంలోనే ఉత్తమ రాజులు దండనీతి మార్గాన్ననుసరించి ధర్మాన్ని రక్షించి తనను సురక్షితను చేయగలవారుగా కశ్యపుడివలన వరం పొందటానికి ఆ మహర్షితో ఇట్లా అన్నది.

భూదేవి కశ్యపునితోఁ బరశురామునిచేఁ జావనిరాజులఁ జెప్పుట. (సం. 12-49-66)

క. **'నాయందచట నచట రా। మాయత బాహా విభూతి కగపడని ఘనుల్**
ధీయుక్తులు గల; రన్నర। నాయకులను వినుము పనుపు నను రక్షింపన్.' 91

ప్రతిపదార్థం: వినుము= ఓ కశ్యప ప్రజాపతీ! వినుము; నా యందున్+అచటన్+అచటన్= భూమిమీద అక్కడక్కడ; రామ= పరశురాముడి యొక్క; ఆయత= పొడవైన; బాహా= చేతుల యొక్క; విభూతికిన్= సంపదకు; కనపడని= కనిపించని; ఘనుల్= గొప్పవారు; ధీయుక్తులు= బుద్ధిశాలులు; కలరు= ఉన్నారు; ఆ+నరనాయకులను= ఆ రాజులను; నను రక్షింపన్= నన్ను రక్షించటానికి; పనుపు(ము)= ఆజ్ఞాపించుము.

తాత్పర్యం: 'ఓ కశ్యప ప్రజాపతీ! పరశురాముడి బాహు పరాక్రమ సంపదకు కనిపించకుండా తప్పించుకొన్న రాజులు అక్కడక్కడ ఉన్నారు. అటువంటి ప్రజా నాయకులను నా సంరక్షణార్థం పంపుము' (అని భూదేవి ప్రార్థించింది.)

వ. **అని పలికి యద్దేవి తన సురక్షితత్వంబున హైహయులు గొందఱు చావునకుం దప్పుటయు, పౌరవాన్వయ ప్రభావుండగు విదూరథ సుతుండు ఋక్షవత్పర్వతంబున ఋక్షంబులచేత రక్షితుం డగుటయు, సౌదాసవంశ జనితుం డొక్కరుండు పరాశర సంయమి వరు నధ్వర కాలంబునంఁ జేరినఁ గారుణ్యాతిశయంబున నమ్మహాత్ముండు వాని శూద్ర ప్రవర్తనంబున సర్వ కర్మంబులుఁ జేయించుకొని రక్షింప సర్వకర్ముం డనం బరఁగుటయు, శిబి మనుమఁడు గోపతి యనువాఁడు, వనంబున గోవులు రక్షించిన బ్రతికియునికియుం, బ్రతర్దన పుత్రుడు వత్సాభిధానుండు వత్సంబులు గోష్ఠంబున రక్షణం బాచరింప సంచరించుటయు, దివిరథ తనయుం డగు దధివాహను కొడు కంగుం డనువాఁడు గంగా కూలంబుల గౌతమ మునీంద్రుని రక్షం జేసి నిర్భయుండై వర్తిల్లుటయు, బృహద్రథ కులజాతుండు భూరి నామధేయుండు గృధ్రకూట శైలంబున గోలాంగూలంబులు రక్షించుట వలనఁ గలిగి యుండుటయు, మరుత్త సంతాన సంభవులు చతుర్వర్ష వయస్కులగువారు ముప్పురు సముద్రుండు రక్షకుండై పెనుపం దత్తీరంబునం బెరుఁగుటయుం జెప్పి వా రుత్తమ క్షత్రియులు వారలు సమ్యక్పరిపాలనంబున నన్నరయువారుగా ననుగ్రహించిన నచలితనై యుండెద.** 92

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఆ+దేవి= ఆ భూదేవి; తన సురక్షితత్వంబునన్= తాను రక్షించగా; కొందఱు హైహయులు= కొంత మంది హైహయరాజులు; చావునకున్+తప్పుటయున్= మరణం నుండి తప్పించుకొనటం వలన; పౌరవ+అన్వయ+ప్రభవుండు+ అగు= పూరు వంశంలో జన్మించిన వాడగు; విదూరథ సుతుండు= విధూరథు డనే వాడి కుమారుడు; ఋక్షవత్పర్వతంబునన్= ఋక్షవంతమనే పర్వతంలో; ఋక్షంబులచేతన్= ఎలుగుబంట్ల చేత; రక్షితుండు+అగుటయున్= కాపాడబడి; సౌదాసవంశ జనితుండు= సుదాస వంశస్థుడు; ఒక్కరుండు= ఒక్కడు; పరాశర సంయమి వరు+అధ్వర కాలంబునన్+చేరినన్= మునిశ్రేష్ఠుడైన పరాశరుడియొక్క యాగకాలంలో చేరగా; కారుణ్య+అతిశయంబునన్= దయాతిశయంతో; ఆ+మహాత్ముండు= ఆ మహాత్ముడైన పరాశరుడు; వాని= వానియొక్క; శూద్ర ప్రవర్తనంబునన్= శూద్రోచితమైన నడవడికతో; సర్వకర్మంబులును= సమస్త కార్యాలను

చేయించుకొని; రక్షింపన్= రక్షించగా; సర్వకర్ముండు+అనన్+పఁరగుటయున్= సర్వకర్ముడని పిలువ బడటమూ; శిబిమనుమఁడు= శిబిచక్రవర్తి మనుమడు; గోపతి= గోపతి అనేవాడు; వనంబునన్= అరణ్యంలో; గోవులు రక్షించినన్= గోవులను రక్షించటం వలన; బ్రతికి+ఉనికియున్= జీవించి ఉండటమూ; ప్రతర్దన పుత్రుఁడు= ప్రతర్దనుడనే వాడి కుమారుడు; వత్స+అభిధానుఁడు= వత్సుడనే పేరుతో; వత్సంబులు= దూడలు; గోష్ఠంబునన్= గోశాలలో; రక్షణంబు+ఆచరింపన్= సంరక్షించగా; సంచరించుటయున్= తిరుగటమూ; దివిరథ తనయుండు+అగు= దివిరథుడియొక్క కుమారుడు అయిన; దధివాహను కొడుకు= దధి వాహనుడి కొడుకు అయిన; అంగుండు+అనువాఁడు= అంగుడనేవాడు; గంగా+కూలంబునన్= గంగానదీ తీరంలో, గౌతమ+ముని+ఇంద్రుని+రక్షన్+చేసి= గౌతమ ముని శ్రేష్ఠుని రక్షణవలన; నిర్భయుండు+అయి= భీతిలేనివాడై; వర్తిల్లుటయున్= జీవించటమూ; బృహద్రథ కుల జాతుండు= బృహద్రథుని వంశంలో పుట్టిన వాడైన; భూరి నామధేయుండు= భూరి అనే పేరు కలవాడు; గృధ్ర కూట శైలంబునన్= గృధ్ర కూటమనే పర్వతంలో; గోలాంగూలంబులు= కొండముచ్చులు; రక్షించుట వలనన్+కలిగిన= రక్షించటంచేత బ్రతికి ఉండటమూ; మరుత్త సంతాన సంభవులు= మరుత్తుడనే వాడి సంతానం వలన కలిగిన; చతుర్+వర్ష+వయస్కు+లగువారు= నాలుగు సంవత్సరాల వయస్సు కలిగిన వారైన; ముప్పురు= ముగ్గురు; సముద్రుండు= సాగరుడు; రక్షకుండై పెనుపన్= రక్షకుడై పోషింపగా; తద్+తీరంబునన్= ఆ తీరంలో; పెఱుంగుటయున్+చెప్పి= పెరగటాన్ని తెలియజేసి; వారు+ఉత్తమ క్షత్రియులు= పైన పేర్కొన్న వారందరు ఉత్తమరాజులు; వారలు= వారందరు; సమ్యక్+పరిపాలనంబునన్= మంచి ఏలుబడితో; నన్నున్+అరయువారుగాన్= నన్ను జాగ్రత్తగా చూసేవారుగా; అనుగ్రహించినన్= ప్రసాదిస్తే; అచలితన్+అయి+ఉండెదను= స్థిరంగా ఉండగలను.

తాత్పర్యం: ఆ భూదేవి సంరక్షించగా చావునుండి తప్పించుకొని, హైహయవంశరాజులు కొందరు చావకుండా బతికిపోయారు. కురువంశంలో జన్మించిన విదూరథుడి కుమారుడు ఋక్షవంతమనేపర్వతంలో ఎలుగుబంట్లచేత రక్షించబడ్డాడు. సుదాసు వంశంలో జన్మించిన ఒకడిని యాగకాలంలో పరాశరుడు దయతలచి అతడిచేత శూద్రకులోచితంగా సర్వకర్మలు చేయించుకొనటం వలన సర్వకర్ముడనే ప్రసిద్ధిపొంది మిగిలిపోయాడు. శిబిచక్రవర్తి మనుమడైన వాడు అరణ్యంలో గోవులు రక్షింప బ్రతికిపోయాడు. ప్రతర్దనకుమారుడైన వత్సుడనే పేరు కలిగినవాడు దూడలను గోశాలలో సంరక్షింప బ్రతికిపోయాడు. దివిరథుని కుమారుడైన దధివాహనుడనే వాడికొడుకైన అంగుడనే వాడు గంగాతీరంలో గౌతమమహర్షి సంరక్షించటంవలన జీవించాడు. బృహద్రథవంశంలో పుట్టిన భూరి అనే పేరు కలవాడు గృధ్రకూట పర్వతంలో కొండముచ్చుల రక్షణలో బ్రతికి బట్టకట్టాడు. మరుత్తుయొక్క సంతానంవలన పుట్టిన నాలుగేళ్ళ వయస్సున్న ముగ్గురు సముద్రుడి రక్షణలో పెరిగి పెద్దవారయ్యారు - అని చెప్పి 'వాళ్ళంతా ఉత్తమ క్షత్రియులు. సముచితమైన పరిపాలనలో పాలించగలవారినిగా నాకు ప్రసాదించండి. అప్పుడు నేను స్థిరంగా ఉండగలను'

క. వారల పెద్దలు నాకై । పోరఁ బరశురాము చేతఁ బొలిసిరి; నాకున్
వారి నధిపతులఁ జేయుట । గోరందగుఁ గాన యిట్లు గోరితి ననఘా!' 93

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాప రహితుడైన కశ్యప ప్రజాపతీ! వారల పెద్దలు= పైన పేర్కొన్న వారు పెద్దలు; నాకై పోరన్= భూమికొరకు యుద్ధం చేయగా; పరశురాము చేతన్+పొలిసిరి= పరశురాముడిచేత చనిపోయారు; నాకున్+వారిన్+అధిపతులన్+చేయుట= నాకు వారిని అధినేతలుగా చేయటం; కోరన్+తగున్= కోరతగినదే; కాన= కావున; ఇట్లు+కోరితిన్= అందుకే నేనిట్లా ప్రార్థించాను.

తాత్పర్యం: అనేక విధాలుగా రక్షించబడిన రాజవంశజుల పెద్దలందరు భూమికొరకు పోరాడిన వారే. అయితే వారందరు పరశురాముడి చేత సంహరించబడ్డారు. అందుకే వారు రాజ్యాధిపతులు కాదగిన వారని ఇట్లా కోరుకొన్నాను.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. అనిన విని వారి రావించి య మ్మునీంద్రుఁ । డందఱను జూచి యాధిపత్యమున కిమ్మ
హాభుజులు దగు వారని యవనిఁ దగిన । యట్లు విభజించి యభిషేక మాచరించె. 94

ప్రతిపదార్థం: అనినన్+విని= అని పలుకగా విని; వారిన్ రావించి= వారిని రప్పించి; ఆ+ముని+ఇంద్రుఁడు= ఆ మునిశ్రేష్ఠుడైన కశ్యపుడు; అందఱను+చూచి= వచ్చిన రాజులందరిని పరిశీలించి చూచి; ఆధిపత్యమునకున్= అధికారానికి; ఈ+మహాభుజులు= ఈ మహా పరాక్రమ సంపన్నులు; తగువారు+అని= అర్హులని; తగిన+అట్లు= ఉచితమైన రీతిని; అవనిన్= భూమిని; విభజించి= పంచి; అభిషేకము+ఆచరించెన్= వారందరిని రాజ్యాభిషిక్తులను చేశాడు.

తాత్పర్యం: ఆ కశ్యపప్రజాపతి భూదేవివలన తెలిసికొని రాజులందరిని పిలిపించి చూచి, రాజ్యాధిపత్యానికి అర్హులని భావించి, ఉచితమైన రీతిగా భూమిని విభాగించి వారిని రాజ్యాభిషిక్తులను చేశాడు.

క. ఆ నృపుల వంశముల నా । నా నృపతులు పుట్టి; రిట్లు నరవర! నృప సం
తానములు పెక్కు గలిగి మ । హీనాథత్వమున వ్రాలె నెందును గలయన్. 95

ప్రతిపదార్థం: నరవర!= ఓ రాజశ్రేష్ఠుడవైన ధర్మరాజా!; ఆ నృపుల వంశములన్= ఆ రాజుల వంశాల మూలాన; నానా నృపతులు= అనేక రాజులు; పుట్టిరి= జన్మించారు; ఇట్లు= ఈ విధంగా; నృప సంతానములు= రాజ సంతతులు; పెక్కు+కలిగి= అనేకం పుట్టి; ఎందునున్+కలయన్= భూమి అంతటను; మహీనాథత్వమునన్+వ్రాలెన్= రాజ్యాధికారంలో ప్రవేశించారు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆ పైన పేర్కొన్న రాజవంశాలలో పెక్కుమంది రాజులు పుట్టారు. ఈ విధంగా రాజవంశాలు పుట్టి పెరిగి భూమి అంతట రాజ్యాధికారంలో ప్రవేశించారు.

క. అప్పరుసునఁ బెరిఁగిన నృపు । లిప్పుడు భారత రణోపహృతులై పలువుర్
గుప్పలు గొనఁబడి; రనికిం । దప్పిన వాఁడొకఁ డొకండ ధర నంతంతన్. 96

ప్రతిపదార్థం: ఆ+పరుసునన్= ఆ విధంగా; పెరిఁగిన నృపులు= వృద్ధిపొందిన రాజులు; భారతరణ+ఉపహృతులు+అయి= భారత యుద్ధంలో సంహరించబడినవారై; పలువుర్= అనేకులు; కుప్పలు గొనన్+పడిరి= కుప్పలుగా పడి ఉన్నారు; ధరన్= భూమిపై; అంతన్+అంతన్= అక్కడక్కడ; ఒకఁడు+ఒకండు= ఒక్కొక్కడు; అనికిన్= యుద్ధానికి గురికాక; తప్పినవాఁడు= తప్పించుకొన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా అభివృద్ధి చెందిన రాజులు భారతయుద్ధంలో సంహరించబడి కుప్పలుగా కూలి పడి ఉన్నారు. భూమిమీద అక్కడక్కడ ఒక్కొక్కడుగా యుద్ధంలో తప్పించుకొని ఉన్నారు.

వ. నీ వడిగిన పూర్వ వృత్తాంతంబు చిత్తాయత్తంబుగా నెఱింగించితి; ననవుడు ధర్మనందనుండు గోవిందు తోడఁ 'బరశురాముఁ డింతటి వాఁడగునే? కోపంబును, విక్రమాటోపంబును జిత్రంబుగా ధాత్రి నిఃక్షత్రంబు సేసె' నని పలికె; వెండియు. 97

ప్రతిపదార్థం: నీవు+అడిగిన= నీవు అడిగిన; పూర్వ వృత్తాంతంబు= పూర్వ చరిత్ర; చిత్త+ఆయత్తంబుగాన్= మనస్సుకు హత్తుకొనేటట్లుగా; ఎఱింగించితిన్= తెలిపాను; అనవుడున్= అనగానే; ధర్మనందనుండు= ధర్మరాజు; గోవిందు తోడన్= కృష్ణుడితో; పరశురాముఁడు+ఇంతటివాఁడు+అగునే?= పరశురాముడు ఇంత గొప్పవాడా?; కోపంబును= కోపమూ; విక్రమ+ఆటోపంబును= పరాక్రమాతిశయమూ; చిత్రంబుగాన్= ఆశ్చర్యం కొల్పగా; నిః క్షత్రంబుగాన్+చేసెన్= రాజులు లేకుండా చేశాడు; అని పలికెన్= అని అన్నాడు; వెండియున్= మరల.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ధర్మరాజుతో 'నీవు అడిగిన పూర్వకథ - అంటే పరశురాముడిచేత సమస్తరాజులు సంహరించబడిన ఈ భూమి మీద రాజులు ఎట్లా పుట్టారని నీవు అడిగిన ప్రశ్నకు సమాధానంగా పూర్వకథ - అంతటిని మనస్సుకు హత్తుకొనేటట్లు తెలిపాను' - అని చెప్పాడు. ధర్మరాజు ఆశ్చర్య చకితుడై 'పరశురాముడు ఇంత గొప్పవాడా? అత్యంత కోపంతో పరాక్రమంతో భూమిని అంతటిని క్షత్రియ రహితంగా చేయగలిగా'డని ప్రశంసించాడు.

తే. **'ధరణియును ఋక్షములుఁ బరాశరుఁడు గో స । మూహములు వత్సములు గౌతముండు గపులుఁ**
దోయధియు నింత పుణ్యంబు సేయునే? జ । నంబు భాగ్యంబు నభివర్ణనమున కెక్కె' **98**

ప్రతిపదార్థం: ధరణియును= భూమి; ఋక్షములు= ఎలుగు బంట్లు; పరాశరుఁడు= పరాశరుడు; గో సమూహములు= ఆలమందలు; వత్సములు= దూడలు; గౌతముండు= గౌతమ మహర్షి; కపులున్= కోతులు; తోయధియున్= నీటికి నిధి అయిన సముద్రుడు; ఇంత పుణ్యంబు+చేయునే?= ఇంత పుణ్యం సంపాదిస్తాయా?; జనంబు భాగ్యంబున్= ప్రజల అదృష్టం; అభివర్ణనమునకున్+ఎక్కెన్= పొగడ్తకు తగినదయింది.

తాత్పర్యం: పరశురాముడి కుఠారానికి బలికాకుండా రాజులను రక్షించిన భూమి, ఎలుగుబంట్లు, ఆవుల మందలు, దూడలు, కోతులు, సముద్రం మాత్రమే కాక పరాశర మహర్షి, గౌతమ ముని కూడా ఇంత పుణ్యానికి నోచుకున్నారా? నిజంగా ఇది ప్రజల అదృష్టంగా అభివర్ణించదగింది'.

వ. **అని యిట్లు సల్లాపంబు సేయుచు మాధవ ధర్మజు లరిగి, యోఘవతీ తీరంబున శరతల్పగతుం డై గాంగేయుం డున్నెడ కనతి దూరంబున రథావతరణంబు సేసిన, భీమసేన ప్రముఖులుం గృపాదులు నరదంబులు డిగ్గి, రిట్లందఱు నంతరంగంబు లేకాగ్రంబులు సేసికొని చేరం జని, సాత్యవతేయ ప్రభృతి మునీంద్రులకుం బ్రణమిల్లి, మఱి భీష్ముం గాంచి రట్లు సముచిత ప్రకారంబునం గని యతనిం బరివేష్టించి యాసీనులై రప్పు డచ్యుతుం డమ్మహాత్ము నాలోకించి యుమ్మలించుచు నతనితోడ.** **99**

ప్రతిపదార్థం: అని; ఇట్లు; సల్లాపంబు+చేయుచున్= సంభాషించుకొంటూ; మాధవ ధర్మజులు+అరిగి= కృష్ణ ధర్మరాజులు వెళ్ళి; ఓఘవతీ తీరంబునన్= ఓఘవతీ నది ఒడ్డున; శరతల్ప గతుండు+అయి= అమ్ముల పాన్పునందు పడుకొన్న వాడై; గాంగేయుండు+ఉన్న+ఎడకున్= భీష్ముడు ఉన్న ప్రదేశానికి; అనతి దూరంబునన్= దగ్గరలోనే; రథ+అవతరణంబు+చేసినన్= రథంలో నుండి దిగగానే; భీమసేన ప్రముఖులున్= భీముడు మొదలైనవారును; కృప+ఆదులున్= కృపాచార్యుడు మొదలైన వారును; అరదంబుల్+డిగ్గిరి= రథాల నుండి దిగిపోయారు; ఇట్లు+అందఱున్= ఈ విధంగా అందరూ; అంతరంగంబులు+; ఏక+అగ్రంబులు+చేసికొని= హృదయాలను ఏకాగ్రతతో ఉంచుకొని; చేరన్+చని= సమీపించి; సాత్యవతేయ ప్రభృతి ముని+ఇంద్రులకున్= సత్యవతీ పుత్రుడైన వ్యాసుడు మొదలైన మునిశ్రేష్ఠులకు; ప్రణమిల్లి= నమస్కరించి; మఱి= ఆ వెనుక; భీష్మున్+కాంచిరి= భీష్ముడిని సందర్శించారు; అట్లు= ఆ రీతిగా; సముచిత ప్రకారంబునన్+చని= తగినట్లుగా వెళ్ళి; అతనిన్= ఆ భీష్ముడిని; పరివేష్టించి= చుట్టుముట్టి; ఆసీనులు+ఐరి= కూర్చున్నారు; అప్పుడు+అచ్యుతుండు= ఆ సందర్భంలో శ్రీకృష్ణుడు; ఆ+మహాత్మున్= ఆ భీష్ముడిని; ఆలోకించి= చూచి; ఉమ్మలించుచున్= బాధపడుతూ; అతనితోడన్= ఆ భీష్ముడితో.

తాత్పర్యం: శ్రీకృష్ణ ధర్మరాజులు మాటలాడుకొంటూ వెళ్ళి ఓఘవతీ నదీతీరంలో అమ్ములపాన్పుపై పడుకొని భీష్ముడు ఉన్న ప్రదేశానికి దగ్గరలోనే రథం నుండి దిగారు. అట్లాగే భీముడు, కృపుడు మొదలైనవారు రథాలనుండి

దిగారు. అందరూ హృదయాలను స్వాయత్తపరచుకొని సమీపించి వ్యాసుడు మొదలైన మునిశ్రేష్ఠులకు నమస్కరించి ఆ వెనుక భీష్ముడిని దర్శించారు. ఆ విధంగా భీష్ముడిని దర్శించి చుట్టూ కూర్చున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు ఆ మహనీయుడిని పరిశీలించి బాధ పడుతూ - (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'నీకు మున్పోలె నవ్యాకులమై యున్న । యదియె చిత్తంబు? దేహంబు పీడ
ఘనము మనఃపీడకంటె నందురు బుధు । లొక ముల్కి యొడలిలో నున్న నలఁత
సేయు; నెమ్మెయి బహుసాయక కీలిత । మైన యంగంబు నొ వ్వడుగ నేల?
యిట్టు లుండియు నించుకేనియు దుఃఖంబుఁ । బొరయమి పితృవరస్ఫూర్తిఁ గాదె!

ఆ. దేవతలకు నైన నీ వుపదేశింతు । కలిమి లేములకు వికార మొంద
కుండ బోధ వృద్ధు లొరులు నిన్ దేర్పంగ । వలవ కునికి నిజ మవార్యతేజ! 100

ప్రతిపదార్థం: అవార్యతేజ!= వారించటానికి వీలులేని తేజస్సు కల ఓ భీష్ముడా!; నీకున్= నీకు; మున్+పోలెన్= ముందువలెనే; చిత్తంబు= మనస్సు; అవ్యాకులము+అయి ఉన్న అదియె?= కలత లేకుండా ఉన్నది కదా!; బుధులు= పెద్దలు; మనఃపీడకంటెన్= మానసిక బాధకంటె; దేహంబు పీడ= శారీరకమైన బాధ; ఘనంబు+అంద్రు= గొప్పది అంటారు; ఒక ముల్కి+ఒడలిలోన్+ఉన్నన్= ఒకే ఒక్క బాణం శరీరంలో ఉంటేనే; నలఁత చేయున్= బాధిస్తుంది; ఏ+మెయిన్= ఏ విధంగా; బహుసాయక కీలితము+అయిన= అనేక బాణాలచేత గుచ్చుకొనబడ్డ; అంగంబు= శరీరంయొక్క; నొవ్వు+అడుగన్+ఏల?= బాధ ఎట్లా ఉన్నది అని అడుగనక్కరలేదు కదా! ఇట్టులు+ఉండియున్= నీ శరీరంలో ఇన్ని బాణాలున్నా; ఇంచుక+ఏనియున్= కొంచెమైనా; దుఃఖంబు+పొరయమి= దుఃఖం కలుగకుండా ఉండటానికి; పితృవర స్ఫూర్తిన్+కాదె!= మీ తండ్రి అయిన శంతను మహారాజు ఇచ్చిన వరంయొక్క గొప్పతనం కదా!; దేవతలకున్+ఐనన్= దేవతలకు కూడా; నీవు+ఉపదేశింతు(వు)= ఉపదేశించుటకు సమర్థుడవు; కలిమి లేములకున్= ధనమున్నా, లేకున్నా; వికారము+ఒందకుండన్= వ్యతిరేక భావం పొందకుండా; ఒరులు= ఇతరులైన; బోధవృద్ధులు= జ్ఞానవృద్ధులు, పెద్దలు; నిన్నున్+తేర్పంగ వలవక+ఉనికి= నిజం నీకు బోధించవలసిన అవసరం లేని మాట వాస్తవం.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు భీష్ముడితో ఇట్లా అన్నాడు - 'ఓ మహానుభావా! నీ మనస్సు ఇదివరలోవలెనే కలత లేకుండా ఉన్నది కదా! మానసిక బాధకంటె శరీర బాధ గొప్పదని పెద్దలు చెప్పుతారు. శరీరంలో ఒక బాణమున్నా బాధిస్తుంది. కాగా, అనేక బాణాలు నాటిన నీ శారీరకబాధను గురించి అడగాలా? ఈ విధంగా ఉన్నప్పటికి నీకు బాధ కలగలేదంటే దానికి మీ తండ్రి వరమే కారణం. దేవతలకు సైతం నీవు ఉపదేశించగల సమర్థుడవు. నీకు బాధ ఉన్నా లేకున్నా నీకు ఏ పెద్దలు ప్రబోధించ నక్కరలేదు.

విశేషం: భీష్ముడు తన తండ్రికి సత్యవతిని భార్యగా చేయటంలో జీవితాంతం బ్రహ్మచర్యాన్ని పూనుతున్నట్లు శపథం చెయ్యటం మూలాన శంతనుడు మెచ్చుకొని భీష్ముడికి స్వచ్ఛంద మరణం వరంగా ప్రసాదించాడు. ఆ కారణంగానే శరతల్పగతుడైన భీష్ముడు యుద్ధంలో నాటిన శస్త్రాస్త్రాలు ఏ విధమైన బాధను కలిగించలేదని మన మిక్కడ గ్రహించవలసి ఉన్నది. తిక్కనలో సూక్తులు ఉన్నాయి. 'బుధులు మనః పీడకంటె దేహంబు పీడ ఘనము' అందురు. 'ఒక ముల్కి యొడలిలోనున్న నలఁత సేయు నెమ్మెయి బహుసాయక కీలితమైన యంగంబు నొ వ్వడుగ నేల?' ఇవి చక్కటి సామెతలు. కృష్ణుడి ఈ సమాశ్వాస వాక్యాలతో భీష్ముడు ఆనందించాడు. ఇక్కడ మనఃపీడకంటె దేహపీడ ఎక్కువంటాడు శ్రీకృష్ణుడు. కాని, లోకంలో మనోవేదన గొప్పదని గదా ప్రసిద్ధం? మరి ఏ న్యాయాన్ని అనుసరించి కృష్ణుడు అట్లా ప్రయోగించాడో తెలియదు. సమయానికి తగు మాటలాడు వైఖరి అంటే ఇదేనేమో!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. భూతంబుల సంసరణము । భూత భవద్భావి కార్యములు గర్మ సము
ద్యోతన భంగియు నీ యఱ । చేతివి కావె కురువంశశేఖరజన్మా! 101

ప్రతిపదార్థం: కురువంశ శేఖర జన్మా!= కురువంశమునందు శ్రేష్ఠమైన జన్మం కలిగిన ఓ భీష్మా!; భూతంబుల= సర్వప్రాణికోటియొక్క; సంసరణము= జీవనమూ; భూత= కడచిన; భవత్= జరుగుతున్న; భావి కార్యములు= భవిష్యత్ కాలమునకు సంబంధించిన కార్యములు; కర్మసమ్+ఉద్యోతన భంగియున్= కర్మలయొక్క అత్యంతంగా ప్రకాశించే రీతి; నీ+అరచేతివి కావే!= నీ కరతలాధీనాలే కదా!

తాత్పర్యం: ప్రాణికోటుల జీవనరీతి, త్రికాలాలలో చేసే కార్యకలాపాలు, కర్మానుష్ఠానంవలన ప్రకాశమానమై వెలుగొందే విధానం - ఓ భీష్మా! నీకు కరతలామలకమే కదా!' అని శ్రీకృష్ణుడు భీష్ముడిని ప్రశంసించాడు.

వ. అని వెండియు. 102

తాత్పర్యం: అని చెప్పి మరల - (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'రా జటె! రాగహీనుఁ డటె! రాజిత సుందరమూర్తి యట్టె! వి
భ్రాజిత సంపదున్నతి విభాసిత వర్తనుఁ డట్టె! కామినీ
రాజి మనోజ్ఞభంగి చతురత్వ ధనుండటె! బ్రహ్మచర్యదీ
క్షా జిత మన్మథుండు నటె! జన్మము లిట్టివి యెందు గల్గునే? 103

ప్రతిపదార్థం: రాజు+అటె!= రాజట కదా!; రాగహీనుఁడు+అటె!= రాగరహితుడట కదా; రాజిత సుందరమూర్తి+అట్టె!= ప్రకాశిస్తున్న సౌందర్యమూర్తి కూడానట కదా!; విభ్రాజిత సంపద్+ఉన్నతి= ప్రకాశమనే సంపదయొక్క ఔన్నత్యం చేత; విభాసిత= వెలుగొందుతున్న; వర్తనుఁడు+అట్టె!= నడవడిక కలవాడట!; కామినీ రాజి మనోజ్ఞ భంగి చతురత్వ ధనుండు+అటె!= స్త్రీ సమూహానికి మనోహరమైన రీతిలో, నైపుణ్యమనే సంపద కలవాడట కదా!; బ్రహ్మచర్య దీక్షా జిత మన్మథుండున్+అటె!= బ్రహ్మచర్యమనే పట్టుదలతో జయించబడిన మన్మథుడు కలవాడట!; ఇట్టివి జన్మముల్= ఇట్లాంటి పుట్టుకలు; ఎందున్+కలుగునే?= ఎక్కడైన సంభవిస్తాయా?

తాత్పర్యం: శ్రీకృష్ణుడు భీష్ముడిని ఉద్దేశించి ఈ విధంగా ప్రశంసించాడు; 'క్షత్రియుడుగా జన్మించాడు. మహర్షులవలె ద్వంద్వాతీతుడయ్యాడు, ప్రకాశిస్తున్న సౌందర్యమూర్తి. విభ్రాజమానమై అత్యున్నతంగా వెలుగొందే నడవడిక కలవాడు; స్త్రీసమూహానికి మనోహరమైన నైపుణ్యసంపద కలవాడు; బ్రహ్మచర్యదీక్షచేత మన్మథుడిని జయించినవాడు; ఇట్లాంటి జన్మలు మరెక్కడైనా సంభవిస్తాయా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. శ్రీకృష్ణుడు భీష్ముడిని ఉత్తమ గుణగణాలను మిక్కిలి ప్రశంసించాడు. అట్లాంటి గుణాలు కలవాడు కావటంవలన ధర్మజుడికి సమస్తధర్మాలను ప్రబోధించగలిగాడు భీష్ముడు. మూల శ్లోకాలకు వన్నె తెచ్చేరీతిలో మనోహరంగా రచించాడు తిక్కన. భీష్ముడి గొప్పతనాన్ని ప్రశంసిస్తూ చేసిన ఈ పద్యరచన తిక్కన శైలీవిన్యాసాని కొక మచ్చు తునక.

క. సురలును నసురులు యక్షులు । నురగులు గంధర్వులును మహోద్ధతిఁ బై పై
నురవడి వచ్చిన నొకఁడవ । పరాజితులఁ జేయు దుగ్ర బాహా స్ఫురణన్. 104

ప్రతిపదార్థం: సురలునున్= దేవతలును; అసురులున్= రాక్షసులును; యక్షులున్= యక్షులును; ఉరగులున్= నాగులును; గంధర్వులును; మహా+ఉద్ధతిన్= గొప్ప పరాక్రమంతో; పైపైన్= మీది మీదికి; ఉరవడిన్‌వచ్చినన్= మహావేగంతో వస్తే; ఒకఁడవు+అ= ఒక్కడవే; ఉగ్రబాహా స్ఫురణన్= భయంకరమైన బాహు పరాక్రమ స్ఫూర్తితో; పరాజితులన్+చేయుదు(వు)= ఓడించగలవు.

తాత్పర్యం: దేవతలు, రాక్షసులు, నాగులు, యక్షులు, గంధర్వులు మహాపరాక్రమంతో, మహావేగంతో మీది కెత్తి వచ్చినా లెక్కచేయక ఒక్కడవే ఎక్కటికయ్యంలో భయంకరమైన బాహుపరాక్రమంతో పరాజితులను చేయగల సమర్థుడవు.

చ. **దమమును సత్యముం దపము దానము వేదములందుఁ జాపవే**
దమునను గల్గు నైపుణియు, ధర్మవిధిజ్ఞతయున్, విరోధి భూ
రమణ విమర్దన క్రమ విరాజిత శౌర్యము నీకుఁ బోలె నై
జము లగువాఁడు వేఱొకఁడు శంతనునందన! పుట్టఁ డెన్నఁడున్. **105**

ప్రతిపదార్థం: శంతను నందన!= ఓ శంతను మహారాజు కుమారుడవైన భీష్మా!; దమమును= కర్మేంద్రియాల నిగ్రహం; సత్యమున్+తపమున్= సత్యం, తపస్సు; దానమున్= దానం; వేదములందున్+చాప వేదమునను= చతుర్వేదాలలోను, ధనుర్వేదంలోను; కల్గు= కలిగినట్టి; నైపుణియున్= నైపుణ్యం; ధర్మవిధిజ్ఞతయున్= ధర్మగుణం యొక్క జ్ఞానం; విరోధి= శత్రువులైన; భూరమణ= భూపతులను; మర్దన= సంహరించే; క్రమ= పద్ధతిచేత; విరాజిత= ప్రకాశిస్తున్న; శౌర్యమున్= పరాక్రమం; నీకున్+పోలెన్= నీకువలె; నైజములు+అగువాఁడు= సహజసిద్ధమైన వాడూ; ఎన్నఁడున్= ఏ కాలంలోనూ; వేఱు+ఒఁకడు= మరొకడు; పుట్టఁడు= జన్మించడు.

తాత్పర్యం: ఓ భీష్మా! దమమూ, సత్యం, తపోదానాలు, వేదాలలోనూ ధనుర్వేదంలోను అత్యంత నైపుణ్యం, ధర్మోచితమైన జ్ఞానం, శత్రురాజులను వధించి విరాజిల్లే పరాక్రమం - నీవలె సహజసిద్ధంగా కలవాడు, ఏ కాలంలోనూ జన్మించడు.'

విశేషం: తిక్కన పద్యరచనా శైలికి నిదర్శనం ఈ పద్యం. భీష్ముడి ఉత్తమ గుణగణాలను శ్రీకృష్ణుడు ఏకరువు పెట్టాడు ఈ పద్యంలో. తిక్కన రచనారీతిలో చక్కటి శైలీ విన్యాసంతో 103 పద్యంవలె మనోహరంగా రచించాడు. మూలంలోని మూడు శ్లోకాలను తిక్కన ఈ పద్యంలో సముచితంగా మనోహరంగా రచించాడు.

క. **వేయేల? సంభవించునె । సాయక తల్పమున నుండి చావఁగ నొల్లన్**
నా యిచ్చఁ గాక? యను నరుఁ । డే యుగమునఁ జూడ వినఁగ నెచ్చట నైనన్. **106**

ప్రతిపదార్థం: వేయి+ఏల?= వేయి మాట లెందుకు?; సాయక తల్పమునన్+ఉండి= అమ్ముల పాన్పునందుండి, శయనించి ఉండి; నా ఇచ్చన్+కాక= నా ఇష్టప్రకారం కాక; చావఁగన్+ఒల్లన్= మరణించ నిష్టపడను; అను= అనే; నరుఁడు= మానవుడు; ఏ యుగమునన్= ఏ యుగంలోనైనా; ఎచ్చటన్+ఐనన్= ముల్లోకాలలో ఎక్కడైనా; చూడన్ వినఁగన్= చూడగా, వినగా; సంభవించునె?= కలుగుతాడా?

తాత్పర్యం: ఏమైనా, శరతల్పగతుడై ఉండి, నా ఇష్టానుసారంగానే నేను మరణిస్తాను అని చెప్పగల మానవుడిని గూర్చి ఇంతకు ముందు యుగాలలోనూ, ముల్లోకాలలోనూ, ఎప్పుడైనా, ఎక్కడైనా వినబడటం గానీ, చూడబడటం గానీ జరిగిందా?

తే. **వసువులందును బెద్దవు, వాసవాది । సురుల మిగులుదు గుణముల, ధరణిసురులు**
సెప్ప విందు, నీ మహిమ నా చిత్తమునను । గందు ననుపమతేజ! గంగాతనూజ!' **107**

ప్రతిపదార్థం: అనుపమ తేజ!= సాటిలేని తేజస్సు కలవాడా; గంగా తనూజ!= గంగాదేవికి పుత్రుడైన భీష్మా!; వసువులందును+పెద్దవు= అష్టవసువులందరిలోను పెద్దవాడవు; గుణములన్= ఉత్తమ గుణగణాలలో; వాసవ+ఆది= ఇంద్రుడు మొదలుకొని; సురులన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దేవతలలో; మిగులుదు(వు)= శ్రేష్ఠుడనిపించు కొంటావు; నీ మహిమ= నీ మాహాత్మ్యాన్ని గూర్చి; ధరణి సురులు= భూ దేవతలైన బ్రాహ్మణులు; చెప్పన్ విందున్= పొగడగా విన్నాను; నా చిత్తమునను+కందున్= నా మనస్సులోను నే నెరుగుదును.

తాత్పర్యం: సాటిలేని తేజస్సంపన్నుడా! పవిత్ర గంగాదేవి పుత్రుడవైన ఓ భీష్మా! అష్టవసువులలో పెద్దవాడవు. ఉత్తమ గుణగణాలలో శ్రేష్ఠుడవైన నీతో ఇంద్రాది దేవతలు సైతం చాలరు. బ్రాహ్మణులు నీ మహిమను గూర్చి పొగడగా విన్నాను. నేను సైతం నా మనస్సులో గుర్తించాను'.

విశేషం: అష్టవసువులు: ఆపుడు, ధ్రువుడు, సోముడు, అధ్వరుడు, అనిలుడు, ప్రత్యూషుడు, అనలుడు, ప్రభాసుడు - అని ఎనిమిది మంది అందులో ప్రభాసుడే భీష్ముడుగా జన్మించాడు. ఒకానొక సమయంలో అష్టవసువులు భార్యా సమేతులై వశిష్ఠాశ్రమానికి వెళ్ళారు. వశిష్ఠుని హోమధేనువు పాలుతాగితే జరామరణాలు ఉండవని తెలిసి దాన్ని అష్టవసువులు అపహరిస్తారు. ఈ విషయం తెలుసుకొన్న వశిష్ఠుడు అష్టవసువులను మానవులుగా జన్మించమని శపిస్తాడు. అందులో ప్రభాసుని భార్య ఈ హోమధేనువు అపహరణకు మూలమని తెలిసి భూలోకంలో సంతాన రహితుడై చిరకాలం జీవించేటట్లు శపించాడు. అతడే భీష్ముడు.

వ. అని పలికి పాండవాగ్రజుం జూపి. 108

ప్రతిపదార్థం: అని పలికి= అని శ్రీకృష్ణుడు మాటలాడి; పాండవ+అగ్రజున్+చూపి= పాండవులలో మొదటి వాడైన ధర్మరాజును భీష్మునకు చూపించి.

తాత్పర్యం: అని శ్రీ కృష్ణుడు పలికి ధర్మరాజుకు భీష్ముడిని చూపించి - (తరువాతి పద్యంతో అన్వయం).

కృష్ణుఁడు ధర్మజునకు ధర్మము లుపదేశింప భీష్మ నియమించుట (సం. 12-50-29)

ఉ. 'నీవు తపో విశేష మహనీయతఁ జేసి జగంబు లన్నియున్
భావమునం గనుంగొని నృపాల మహోత్తర! చాలు; దీతఁ డ
త్యావిల చిత్తుఁడయ్యె సుహృదాప్తమృతిన్ దురటిల్లు నెవ్వగం
బోవగఁ ద్రోవు నీ దయిన పుణ్యతమస్ఫుట వాక్య పద్ధతిన్. 109

ప్రతిపదార్థం: నృపాల మహా+ఉత్తర=రాజులలో మహాశ్రేష్ఠుడైన ఓ భీష్మా!; నీవు; తపః+విశేష+మహనీయతన్+చేసి= విశిష్టమైన తపస్సు యొక్క, గొప్పతనం వలన; భావమునన్= మనస్సునందే; జగంబులు+అన్నియున్= లోకములన్నింటిని; కనుంగొని= తెలిసికొని; చాలుదు(వు)= సమర్థుడవై ఉంటావు; ఈతఁడు= ఈ ధర్మరాజు; సుహృద్+ఆప్తమృతిన్= స్నేహితుల, బంధువుల యొక్క మరణంచేత; అతి+ఆవిలచిత్తుఁడు+అయ్యెన్= అత్యంత బాధతో కూడిన చిత్తం కలవాడు అయ్యాడు; దురటిల్లున్= తపిస్తున్నాడు; నెఱ+వగన్= మిక్కిలి బాధను (ధర్మరాజుయొక్క బాధను); నీదు+అయిన= నీదైన; పుణ్యతమ స్ఫుట వాక్య పద్ధతిన్= మహా పుణ్యంతో కూడుకొని స్పష్టమైన మాటల రీతితో; పోవఁగన్+త్రోవు(ము)= తొలగి పోయేటట్లుగా చేయవలసింది. (శ్రీకృష్ణుడు కోరుతున్నాడు).

తాత్పర్యం: 'ఓ రాజశ్రేష్ఠుడైన భీష్మా! నీవు అత్యంత తపస్సంపన్నుడవు. అందువలననే లోకాలలో జరిగే సమస్త విషయాలను మనస్సునందే గ్రహించగలవు. ఈ ధర్మరాజు మిత్రులు, బంధువులు అందరు మరణించగా దుఃఖంతో బాధాతప్తుడై ఉన్నాడు. నీ ఉత్తమమైన మాటల పోహళింపుచేత ధర్మరాజు బాధను తొలగించవలసిందని కోరుతున్నాను.

విశేషం: 'నృపాలమహోత్తర' - అని తిక్కన భీష్ముడికి విశేషణం వాడటంతో భీష్ముడి రాజధర్మాన్ని, రాజనీతిని గుర్తింపచేస్తున్నాడు. అట్లాగే 'తపోవిశేష మహనీయత చేసి' అనే ప్రయోగంవలన భీష్ముడి తపోనిరతి, దాని మూలంగా సమస్త లోకజ్ఞత వ్యక్తం చేయటం జరిగింది. 'పుణ్యతమస్ఫుట వాక్యపద్ధతిన్' అనటంవలన దుఃఖితమతి అయిన ధర్మరాజును ప్రస్ఫుటమైన చక్కటి మాటల నీటుతో భీష్ముడు ఊరడించగల డని సంభావించవచ్చును.

వ. నాలుగు వర్ణంబులకును నాలుగాశ్రమంబులకు నిట్టిట్టివి యర్థంబులని నాలుగు వేదంబులం జెప్పిన ధర్మంబులు నీకు విదితంబులు; ప్రవృత్తి నివృత్తులును సాంఖ్యయోగంబులును బురాణేతిహాసంబులు ధర్మశాస్త్రంబులు నవగతంబులు; సర్వసంశయచ్ఛేదన దక్షుండ; వీ వీక్షితిపతి నాదరింపుము; శోక మోహగ్రస్తం బగు జనంబు నిస్తరింపంజేయుట గదా మిము బోటుల బుద్ధి విస్తారంబునకు ఫలం' బనిన విని మొగం బించుక యెత్తి కృతాంజలి యై గాంగేయుండు గోవిందున కిట్లనియె. 110

ప్రతిపదార్థం: నాలుగు వర్ణంబులకును= చతుర్వర్ణాలకు; నాలుగు+ఆశ్రమంబులకున్= మానవుడు ఆచరించవలసిన నాలుగు ఆశ్రమాలకు; ఇట్టివి+ఇట్టివి= ఇట్లాంటివి; అర్థములు+అని= తగినవని; నాలుగు వేదంబులన్= నాలుగు వేదాలలోను; చెప్పిన= చెప్పబడిన; ధర్మంబులు= సమస్త ధర్మాలు; నీకు విదితంబులు= నీకు తెలుసును కదా; ప్రవృత్తి నివృత్తులును= ప్రవృత్తి నివృత్తులనే చిత్తవృత్తులు; సాంఖ్య యోగంబులును= సాంఖ్య యోగాదులూ; పురాణ+ఇతిహాసంబులును= పురాణాలూ, ఇతిహాసాలూ; ధర్మశాస్త్రంబులును= ధర్మశాస్త్రాదులూ; అవగతములు= నీకు తెలిసినవే; ఈవు= నీవు; సర్వ సంశయ+ఛేదన దక్షుండవు= అన్ని సందేహాలను నివృత్తి చేయగల సమర్థుడవు; ఈక్షితిపతిన్+ఆదరింపుము= ఈధర్మరాజును ఆదరించుము; మిముబోటుల= మీలాంటి వారి; బుద్ధి విస్తారంబునకున్= విస్తృతమైన జ్ఞానానికి; శోక మోహ గ్రస్తంబు+అగు= దుఃఖ మోహాలతో కూడిన; జనంబున్= ప్రజలను; నిస్తరింపన్+చేయుట+ఫలంబు కదా!= ఊరడింపచేయటమే ప్రయోజనం కదా!; అనినన్ విని= అని చెప్పగా విని; మొగంబు+ఇంచుక+ఎత్తి= ముఖం కొద్దిగా పైకెత్తి; కృత+అంజలి+ఐ= చేతులు జోడించిన వాడై; గాంగేయుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; గోవిందునకున్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: చతుర్వర్ణాల ప్రజలు, చతురాశ్రమాలలో ఆయా ప్రజలు చేయవలసిన అర్థమైన కార్యకలాపాలు, చతుర్వేదాలలో చెప్పబడిన అన్ని ధర్మాలు నీకు తెలుసు. ప్రవృత్తినివృత్తి మార్గాలు, సాంఖ్యయోగాలు, పురాణేతిహాసాలు, ధర్మశాస్త్రాలు నీకు కరతలామలకాలే. నీవు సర్వసంశయాలను నివృత్తి చేయగల సమర్థుడవు. నీవు ఈ ధర్మరాజును ఆదరించుము. మీవంటి వారి సర్వసమర్థతకు, బుద్ధివిస్తారతకు, శోకమోహాలతో బాధా సంతప్తులైన ప్రజలను తరింపచేయటమే ప్రయోజనం కదా!' అని కృష్ణుడు పేర్కొనగా విని భీష్ముడు కొద్దిగా కృష్ణుడివైపు ముఖం తిప్పి, నమస్కరించి శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: నాలుగు వర్ణాలు: బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు.
నాలుగు ఆశ్రమాలు: బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం
నాలుగు వేదాలు: ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం

క. 'కర్తయును భర్తయును సం। హర్తయు జగములకు నీవ! యాశ్రిత జన ఘో
రార్తి నిరాస నిపుణ సం। కీర్తన! యోగీశ్వరేశ! కృష్ణ వరేణ్యా!' 111

ప్రతిపదార్థం: యోగి+ఈశ్వర+ఈశ!= యోగులలో శ్రేష్ఠులకు శ్రేష్ఠుడైన వాడా!; కృష్ణవరేణ్యా!= శ్రేష్ఠుడవైన ఓ కృష్ణా!; ఆశ్రిత= ఆశ్రయించిన; జన= జనులయొక్క; ఘోర+ఆర్తి= భయంకరమైన దుఃఖాన్ని; నిరాస నిపుణ సంకీర్తన= తొలగించుట యందు నిపుణుడవై కీర్తింపబడుతున్నవాడా; జగములకున్= లోకాలకు; కర్తయును= సృష్టికర్తా; భర్తయును= సంరక్షకుడును; సంహర్తయున్= వినాశకుడు; నీవ= నీవే.

తాత్పర్యం: 'యోగిశ్రేష్ఠుడవైన ఓ శ్రీకృష్ణా! ఆశ్రయించిన ప్రజల దుఃఖాన్ని పోగొట్టటంలో నిపుణుడవైనవాడా! జగత్తులన్నింటికీ సృష్టి స్థితి లయ కారకుడవు నీవే కదా!'

విశేషం: ఈ పద్యంలో శ్రీకృష్ణుడు సర్వశక్తి మంతుడని, కనుకనే ధర్మరాజు దుఃఖాన్ని పోగొట్టేవాడని ధ్వనింపచేస్తున్నాడు. కృష్ణుడు భీష్మడిని పొగడినదంతా ఒక ఎత్తైతే శ్రీకృష్ణుడిని భీష్ముడు పొగడటం ఒక ఎత్తు.

మూలంలోని తొమ్మిది శ్లోకాలలో భీష్ముడు శ్రీకృష్ణుని గూర్చి పలికిన ప్రశంసా వాక్యాలను తిక్కన చిన్న కందపద్యంలో చక్కగా ధ్వనింపచేశాడు. ఇంతకు క్రితం చేసిన స్తవరాజంలోని కొన్ని శ్లోకాల పునరుక్తులు మూలంలోని ఈ భాగంలో ఉన్నాయి. వాటిని పునరుక్తి చేయకుండా ఒకే పద్యంలో వివరించాడు తిక్కన.

వ. అని మఱియు ననేక ప్రకారములం బ్రశంసించి నాకు మేలెయ్యది దానిని నీ దివ్య చిత్తంబునం దలంపు మనవుడు నద్దేవుం డిట్లనియె. 112

ప్రతిపదార్థం: అని మఱియున్= అని చెప్పి మరల; అనేక ప్రకారంబులన్= వివిధ రీతులలో; ప్రశంసించి= పొగడి; నాకు మేలు+ఏ+అది= నాకు ఏది మంచిదో దానిని; నీ దివ్య చిత్తంబునన్+తలంపుము= నీ దేవతా సంబంధమైన మనస్సులో ఆలోచించుము; అనవుడున్= అనగానే; ఆ+దేవుండు+ఇట్లు+అనియెన్= ఆ దేవుడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని భీష్ముడు శ్రీకృష్ణుడిని అనేక రీతులుగా పొగడి 'నా కేది మేలో నీ మనస్సునందే ఆలోచించుము' అని చెప్పగా ఆ శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు.

తే. 'అచల భక్తి నిత్యంబు నాయందు నీకుఁ। గలిమిఁ జేసి నీ యంతరంగమున నాదు
దివ్యరూపంబు నొలయించితిం బ్రమోద। భాజనం బైతి భీష్మ తపస్స్వరూప! 113

ప్రతిపదార్థం: భీష్మ తపస్స్వరూప!= భయంకరమైన తపస్సే స్వరూపంగా కలిగిన ఓ భీష్మా!; నాయందున్= నాపై; అచలభక్తి= ప్రగాఢతమమైన భక్తి; నీకున్+కలిమిన్+చేసి= నీకుండటంచేత; నీ అంతరంగమునన్= నీ మనస్సునందు, హృదయంలో; నాదు= నా యొక్క; దివ్యరూపంబున్= దైవ స్వరూపాన్ని; ఒలయించితిన్= సంకల్పించాను; ప్రమోద భాజనంబు+అయితి= సంతోషానికి అర్హుడ వయ్యావు.

తాత్పర్యం: 'కఠినమైన శపథం చేసి ఘోరమైన తపస్సే రూపు దాల్చిన ఓ భీష్మా! ఎల్లప్పుడు నాయందు నీ భక్తి ప్రగాఢమై ఒప్పుతుంది. అందువలననే నీ హృదయంలో నా దైవస్వరూపాన్ని నిలిపాను. అత్యంత సంతోషానికి అర్హుడవయ్యావు.'

వ. మేలు వేఱ తలంప నేల?' యని వెండియు. 114

ప్రతిపదార్థం: మేలు= శ్రేయస్సు; వేఱ+తలంపన్+ఏల?= మరొక మారు ప్రత్యేకంగా ఆలోచించటం ఎందుకు?; వెండియున్= మరల.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు మెచ్చుకొంటూ మళ్ళీ మేలును గూర్చి ఆలోచింపనవసరం లేదని చెప్పి, మరల ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'భక్తియు నార్జవమును సం। యుక్తము లై యున్న యట్టి యుల్లంబున నా
సక్తి నిలుతు; నిందొకఁడు వి। యుక్తం బైనను వసింప నుర్వీనాథా! 115

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= ఓ రాజా భీష్మా!; భక్తియున్= భక్తియును; ఆర్జవమును= ఋజు మార్గమును; సంయుక్తములు+అయి+ ఉన్న+అట్టి= కలిసి ఉన్నటువంటి; ఉల్లంబునన్= మనస్సునందు; ఆసక్తిన్= నిలుతున్= మిక్కిలి ఆసక్తితో నివసిస్తూ ఉంటాను; ఇందున్+ఒకఁడు= వీటిలో ఏ ఒక్కటి; వియుక్తంబు+ఐనను= కలవకుండా పోయినట్లయితే; వసింపను= నివసించను.

తాత్పర్యం: 'ఓ భీష్మా! భక్తి, ఆర్జవము రెండు కలిసి ఉన్న మనస్సునందు నేను నివసిస్తాను. ఇందులో ఏ ఒక్కటి లేకపోయినా నేను ఉండను'

విశేషం: భక్తి, ఆర్జవము రెండూ భీష్ముని మనస్సులో ఉండటంవలననే శ్రీకృష్ణుడు ఆసక్తితో భీష్ముడి మనస్సునందు దైవస్వరూపాన్ని అధివసింప చేశాడు.

తే. **అనఘ! యినుఁ డింక నేఁబది యాఱు దివస । ములకుఁ దా నుత్తరాయణమునఁ జరింపఁ**
దొడఁగు; నీ వప్డు దేహంబు విడిచి యేఁ గు । దపునరావృత్తి పదమున కభినుతముగ. **116**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ భీష్మా!; ఇనుఁడు= సూర్యుడు; ఇంకన్= ఇటు తరువాత; ఏన్+పది యాఱు దివసములకున్= ఏబది ఆరు రోజులకు; తాన్+ఉత్తరాయణమునన్= తాను ఉత్తరాయణమునందు; చరింపన్+తొడఁగున్= ప్రవర్తించటం ప్రారంభిస్తాడు; నీవు+అప్పుడు= నీవు ఆ సందర్భంలో; దేహంబున్ విడిచి= ఈ భౌతిక శరీరాన్ని వదలి; అపునః+ఆవృత్తి పదమునకున్= మరల జన్మలేని మోక్షపదవికి; అభినుతముగన్= పొగడ దగినట్లు; ఏగుదు(వు)= వెళ్ళిపోతావు.

తాత్పర్యం: ఓ పాపరహితుడవైన భీష్మా! ఇప్పటి నుంచి ఏబది ఆరు రోజులలో సూర్యుడు ఉత్తరాయణంలో సంచరించటం ప్రారంభిస్తాడు. నీవు అప్పుడు ప్రశంసార్హమైన రీతిలో ఈ భౌతికదేహాన్ని వదలిపెట్టి "పునరపి జననం పునరపి మరణం'' అనే ఆవృత్తి లేకుండా జనులు నుతించేటట్లు మోక్షం పొందుతావు.

వ. **వీరె వసువులు విమానంబులతో నంతరిక్షంబున నంతర్హితులై నీ రాక ప్రతీక్షించి యున్న వా; రది యట్లుండె; నీవు సన్న నీ లోకంబున నెఱుక పొనుంగుపడుం గావున వీ రెల్ల సకల ధర్మవివేక లబ్ధికినయి యరుగుదెంచి పరివేష్టించి యున్నవా' రని తత్కాల సమాగత యోగ్యజనంబులం జూపి, ధర్మపుత్త్రు నుపలక్షించి, 'శోకోపహత బహుశ్రుతుం డగు నితండు దెలివొందునట్లుగా ధర్మార్థ సమాధి యుక్తంబులగు నుక్తి విశేషంబుల ననుగ్రహింప వలయు' ననుటయు నద్దేవకీనందనునకు దేవవ్రతుం డి ట్లనియె.** **117**

ప్రతిపదార్థం: వీరె వసువులు= వీరే వసువులు; విమానంబులతోన్= విమానాలలో కూర్చుండి; అంతరిక్షంబునన్= ఆకాశంలో; అంతర్హితులు+అయి= అదృశ్యులై; నీ రాకన్= నీ రాకను; ప్రతీక్షించి+ఉన్నవారు= వేచి ఉన్నారు; అది+అట్లు+ఉండెన్= ఆ విషయం అట్లా ఉండనీ; నీవు+చన్నన్= నీవు స్వర్గానికి వెళ్ళిపోతే; ఈ లోకంబునన్= ఈ జగత్తులో; ఎఱుక= జ్ఞానం; పొనుంగు పడున్= మరుగున పడిపోతుంది; కావునన్= అందుకే; వీరు+ఎల్లన్= వీరందరూ; సకలధర్మ వివేక లబ్ధికిన్+అయి= సమస్త ధర్మాలు వాటి విచక్షణలను పొందటానికై; అరుగుదెంచి= వచ్చి; పరివేష్టించి+ఉన్నవారు= చుట్టూ ఉన్నారు; అని= అనిచెప్పి; తద్+కాలసమాగత= ఆ సమయంలో వచ్చిన; యోగ్య జనంబులన్= అర్హులైన జనాన్ని చూపెట్టి; ధర్మపుత్రున్+ఉపలక్షించి= ధర్మరాజును ఉద్దేశించి; శోక+ఉపహత బహుశ్రుతుండు+అగు= బాధచేత దెబ్బతీయబడిన గొప్పపండితుడు; అయిన; ఇతండు= ఈ ధర్మరాజు; తెలివి+పొందునట్లుగాన్= తెలిసికొనేటట్లుగా; ధర్మ+అర్థ+సమాధియుక్తంబులు+అగు= పురుషార్థాలలో ధర్మం, అర్థం మోక్షమనే వాటికి తగిన రీతిగా; ఉక్తి విశేషంబులన్= సూక్తుల విశిష్టతతో; అనుగ్రహింపన్ వలయున్= దయచేయవలసింది; అనుటయును= అని ప్రార్థించగా; ఆ+దేవకీనందననునకున్= దేవకీ కుమారుడైన శ్రీకృష్ణుడితో; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అరుగో వసువులు ఆకాశంలో విమానారూఢులై అదృశ్యంగా నీ రాక కోసం ఎదురు చూస్తున్నారు. అది అట్లు ఉండనీ. నీవు దివంగతుడ వైతే ఈ లోకంలో జ్ఞానం మరుగున పడిపోతుంది. నీవలన ధర్మవివేకాలతో కూడిన జ్ఞానాన్ని పొందటానికి వీళ్ళంతా వచ్చారు' అని చెప్పి చుట్టూ చేరిన జనాన్ని చూపి ప్రత్యేకించి ధర్మరాజును ఉద్దేశించి 'బాధాతప్త హృదయుడైన ఇతడికి జ్ఞానోపదేశం చేయుము; ధర్మార్థ మోక్షాలను ఉచితరీతిని సూక్తిసుధతో దయచేయుము' అని కృష్ణుడు భీష్ముడిని ప్రార్థించాడు. అప్పుడు కృష్ణుడితో భీష్ముడు ఇట్లా అన్నాడు.

క. 'శివ! నారాయణ! యచ్యుత! । భవదీయము లైన మధుర భాషణములు నా
చెవు లానిన నమృత రస । ప్లవనంబునఁ బోలెఁ బ్రమద భరితుఁడ నైతిన్. 118

ప్రతిపదార్థం: శివ!= శుభప్రదాతా!; నారాయణ!= సర్వవ్యాపకా!; అచ్యుత!= శ్రీకృష్ణా!; భవదీయములు+ఐన= నీయొక్క; మధుర భాషణంబులు= తియ్యని మాటలు; నా చెవులు+ఆనినన్= నా చెవులలో సోకగానే; అమృత రసప్లవనంబునన్+పోలెన్= అమృతరసంలో తేలియాడుతున్నట్లు; ప్రమద భరితుఁడన్+ఐతిన్= సంతోష భరితుడ నయ్యాను.

తాత్పర్యం: 'శుభప్రదాతవూ, సర్వవ్యాపకుడవూ అయిన ఓ శ్రీకృష్ణా! నీ మధురమైన మాటలు నా చెవులలో పడగానే అవి అమృతరసప్రవాహంవలె ఉండగా సంతోషభరితుడను అయ్యాను.

తే. వాగ్విభుఁడ వైన నీ వచో వైభవంబు । లో సమస్తంబు నుండుట లోకనాథ!
నీదు సన్నిధిఁ బలుకంగ నేర రాదు । పద్మభవునకు; నే నెట్లు పలుకువాఁడ? 119

ప్రతిపదార్థం: లోకనాథ!= అన్ని లోకాలకు అధిపతివైన ఓ శ్రీకృష్ణా!; వాక్+విభుఁడవు+ఐన= మాటల వైభవం కలిగిన; నీ వచః+వైభవంబులోన్= నీ మాటల నైపుణ్యమందు; సమస్తంబున్+ఉండుటన్= సర్వమూ ఉండటం వలన; నీదు సన్నిధిన్= నీ ఎదుట; పద్మ భవునకున్= పద్మం నుంచి పుట్టిన బ్రహ్మకైనా; పలుకంగన్ నేరన్‌రాదు= మాటలాడటం సాధ్యం కాదు; నేను+ఎట్లు, పలుకువాఁడన్?= నే నే విధంగా మాటలాడగలను?

తాత్పర్యం: వాగ్విభవుడవైన ఓ శ్రీకృష్ణా! నీ మాటల నైపుణ్యంలో సమస్తమూ ఉంటుంది. అటువంటి నీ ముందు మాటలాడటం బ్రహ్మకు కూడా సాధ్యం కాదు. నీకు నే నెట్లా సమాధానం ఇవ్వగలను?

వ. విషానల సదృశంబు లగు శరంబులు సేయు వేదనం జేసి యంగంబులు నంతరంగంబు నవశంబులై యున్న యవి; ప్రతి సంభాషణ క్షమ లేదు; దౌర్బల్యంబున నెలుంగును నాలుకయుం బ్రస్ఫుట వర్తనంబులు గా;వే నెవ్విధంబున భాషింప నుత్సహింతుఁ? బ్రతిభాషా శక్తిలేమి సహించి నా దెసం బ్రసన్నుండ వగుము; ధర్మపుత్రున కెయ్యది హితం బది నీవ చెప్పుము; నీ వుండ నేను జెప్పుట గురుం డుండ శిష్యుండు సెప్పిన విధంబు గాదె' యనిన విని భక్తార్తిహరుం డైన హరి యతనితో నిట్లనియె. 120

ప్రతిపదార్థం: విష+అనల సదృశంబులు+అగు= విషంతోను, అగ్నితోను, సమానమైన; శరంబులు+చేయు= బాణాలు కలిగించే; వేదనన్+చేసి= బాధవలన; అంగంబులున్= అవయవాలు; అంతరంగంబున్= మనస్సును; అవశంబులు+ఐ+ఉన్న+అవి= నా వశం తప్పి ఉన్నవి; ప్రతి సంభాషణ క్షమ లేదు= ప్రత్యుత్తర మిచ్చే సామర్థ్యం లేదు; దౌర్బల్యమునన్= దుర్బలత్వం వలన; ఎలుంగును= కంఠధ్వని; నాలుకయును= నాలుక; ప్రస్ఫుట వర్తనంబులు+కావు= స్పష్టరీతిని మెలగటం లేదు; ఏను+ఏ+విధంబునన్= నేను ఏ రీతిగా; భాషింపన్= మాటలాడ; ఉత్సహింతున్?= ఉత్సాహ పడతాను?; ప్రతి భాషా శక్తి లేమిన్= ప్రత్యుత్తర మిచ్చే

శక్తి లేకపోవటం వలన; సహించి= ఓర్చుకొని; నా దెసన్= నా యందు; ప్రసన్నుండవు+అగుము= దయచూపించుము; ధర్మ పుత్రునకున్= ధర్మరాజుకు; ఏ+అది= ఏది; హితంబు+అది= మేలైనదో దానిని; నీవు+అ చెప్పుము= నీవే చెప్పుము; నీవు+ఉండన్= నీవు ఉండగా; నేను చెప్పుట= నేను చెప్పటం; గురుండు+ఉండన్= గురువు ఉండగా; శిష్యుండు+చెప్పిన విధంబు+కాదె!= శిష్యుడు చెప్పినట్లు అవుతుంది గదా; అనినన్ విని= అని పలుకగా విని; భక్త+ఆర్తి+హరుండు+ఐన= భక్తుల యొక్క దుఃఖాన్ని తొలగించే వాడైన; హరి= శ్రీకృష్ణుడు; అతనితోన్= ఆ భీష్మడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: విషముతో, అగ్నితో సమానమైన బాణాలు శరీరంమీద గుచ్చుకొని కలిగిస్తున్న బాధ శరీరంతోపాటు మనస్సును కూడా వశవర్తి కానీయటం లేదు. మీతో సంభాషించే సామర్థ్యం నాకు లేదు. ఈ దుర్బలత్వం వలన నా కంఠధ్వని నాలుక, స్పష్టతను కోల్పోయాయి. అట్లాంటి నేను మాటలాడటానికి ఎట్లా పూనుకొనేది? ప్రత్యుత్తరం ఇచ్చే శక్తి లేకపోవటం వలన నన్ను క్షమించి దయతో చూడుము. ధర్మరాజుకు ఏది మంచిదో అది నీవే చెప్పుము. నీవు ఉండగా నేను చెప్పటం అనేది - గురువు ఉండగా శిష్యుడు చెప్పినట్లు అవుతుంది' అని శ్రీకృష్ణుడితో భీష్ముడు చెప్పగా భక్తుల దుఃఖాలను పోగొట్టే శ్రీకృష్ణుడు భీష్మడితో ఇట్లా అన్నాడు.

క. 'కురువంశ ధురంధరుఁ డగు । పరమార్థజ్ఞునకు వినయఫణితిం దగు ని
ర్భర శరవేదన సెప్పితి; । వరములు మూఁడిత్తు గొనుము వసుధాధీశా! 121

ప్రతిపదార్థం: వసుధా+అధి+ఈశా!= భూమికి అధిపతివైన ఓ భీష్మా!; నిర్భర శర వేదన= భరింపశక్యం కాని బాణాల యొక్క బాధను గూర్చి; తగు= తగిన విధంగా; వినయ ఫణితిన్= వినయ మార్గంలో; చెప్పితి(వి)= చెప్పావు; కురువంశ ధురంధరుఁడు+అగు= కురువంశ భారాన్ని మోసేవాడవైన నీకు; పరమ+అర్థజ్ఞునకున్= భగవత్తత్త్వజ్ఞుడవైన నీకు; వరములు మూఁడు= మూడు వరాలను; ఇత్తున్= ఇస్తాను; కొనుము= స్వీకరించుము.

తాత్పర్యం: 'ఓ భీష్మా! భరింపశక్యం కాని వేదనను గూర్చి వినయంతో తెలిపావు. కురువంశభారం నీమీద ఆధారపడి ఉన్నది. భగవత్తత్త్వ జ్ఞానివి. అటువంటి నీకు మూడు వరాలు ఇస్తున్నాను. స్వీకరించుము'.

క. శరముల వలనను మూర్ఛం । బొరయక యొక్కింత డప్పిబొరయక నొప్పిం
బొరయక యవిద్ధ గాత్రుని । కరణి సుఖాత్ముఁడవు గమ్ము కౌరవనాథా! 122

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ఓ భీష్మా; శరముల వలనను= బాణాల వలన; మూర్ఛన్+పొరయక= మూర్ఛపొందకుండా; ఒక్కింత= కొంచెమైనా; డప్పిన్+పొరయక= అలసట చెందకుండా; నొప్పిన్+పొరయక= బాధ పొందకుండా; అవిద్ధ గాత్రుని కరణిన్= బాధించబడని శరీరం కలవాడుగా; సుఖ+ఆత్ముఁడవు+కమ్ము= కష్ట రహితుడవై ఉండుము.

తాత్పర్యం: ఓ భీష్మా! గ్రుచ్చుకొన్న బాణాల వలన మూర్ఛగానీ, అలసటగానీ, నొప్పిగానీ కలుగకుండా బాధా రహితమైన శరీరంతో సుఖంగా ఉండుము'.

ఆ. అనఘ! నీరువట్టు నాఁకలియును నెప్డుఁ । బొరయకుండునట్టి భూరి శక్తి
నీకుఁ గలుగ నేను నెమ్మనంబునఁ దలం । చితిఁ; దదీయ పీడఁ జెందకుండు. 123

ప్రతిపదార్థం: న+అఘ!= పాపరహితుడా! ఓ భీష్మా!; ఎప్పుడున్= ఏ సమయమందైనా; నీకున్; నీరువట్టున్= దప్పిక; ఆఁకలియున్= ఆకలీ; పొరయక+ఉండునట్టి= కలుగనట్టి; భూరిశక్తి కలుగన్= మిక్కిలి శక్తి కలిగే విధంగా; ఏను= నేను; నెఱ+మనంబునన్= నిండు మనస్సులో; తలంచితిన్= భావించాను; తదీయపీడన్= ఆ బాధను; చెందకుండు(ము)= పొందకుండా ఉండుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పాప రహితుడవైన ఓ భీష్మా! ఎప్పుడూ నీకు ఆకలి దప్పులు కలుగకుండా ఉండేటట్లుగా నీకు మహాశక్తి కలగాలని నా మనసులో సంకల్పించాను. వాటి పీడ నీకు ఉండదు.

క. విను! సకల భూతముల వ । ర్తనములు గను నపుడు బుద్ధి దవులఁ బడక యెం
దును బరఁగి దివ్యబోధం । బున నలవడునట్టి పెంపుఁ బొందు మనింద్యా! 124

ప్రతిపదార్థం: అనింద్యా!= పాపరహితుడా!; విను= వినుము; సకల భూతముల= సమస్త ప్రాణులయొక్క; వర్తనములు= నడవడికలను; కనునపుడు= గమనించే సమయంలో; బుద్ధి= నీ మనస్సు; ఎందునున్= ఏ విధంగానూ; తవులన్+పడక= వాటిలో చిక్కుకుండా; పరఁగి= ఒప్పి; దివ్య బోధంబునన్+అలవడు+అట్టి= దివ్య జ్ఞానంతో ఒప్పారుతూ ఉండునట్టి; పెంపున్+పొందుము= అట్లాంటి అతిశయాన్ని పొందుము.

తాత్పర్యం: ఓ భీష్మా! సకలప్రాణుల నడవడికలను గమనించేటప్పుడు నీ మనస్సు వాటికి అంటకుండా దివ్య ప్రబోధాన్ని పొందుతావు. అట్లాంటి శక్తితో అతిశయజ్ఞానాన్ని పొందుము.

వ. మత్ప్రసాదంబున నీదృశప్రభావ నిరూఢుండ వయి నెగడు' మని పల్కుటయుం, బారాశర్యాది పరమార్యు లప్పద్మనాభుం బ్రశంసించిరి; దివంబున దేవదుందుభులు మొరసె; మురారి భీష్మ ధర్మజుల మీఁదం గుసుమ వర్షంబు గురిసె; నప్సరోగణ గానంబు వీతెంచె; నచ్చటి యందఱు నాశ్చర్య ప్రమోదభరిత హృదయు లైరి. తదనంతరంబ యంబుజాప్తుం డపరగిరి శిఖరం బలంకరించె; నప్పు డమ్మును లచ్యుత గాంగేయ కౌంతేయాగ్రజుల నామంత్రితులం జేసి గమనోన్ముఖు లగుటయు, న మ్మాధవ యుధిష్ఠిరులును, సాత్యకియును భీమార్జున యమళులును, గృప యుయుత్సు సంజయులును వారలకుం బ్రణమిల్లిరి; వారలును రేపు వచ్చెద మని నిజస్థానంబులకుం జనిరి; కృష్ణాదులును దేవవ్రతున కభిముఖు లగుచు నట్ల పలికి, వలగొని యరిగి యరదంబు లెక్కిరి; వారి పిఱుంద మున్ను వచ్చిన వారణ రథ తురగ పదాతులు బలసి కొల్చి పోవం బురంబునకు వారు వోవు సమయంబున. 125

ప్రతిపదార్థం: మత్+ప్రసాదంబునన్= నా అనుగ్రహంతో; ఈదృశప్రభావ నిరూఢుండవు+అయి= ఇట్లాంటి మహిమాతిశయం కలవాడవై; నెగడుము= ప్రసిద్ధుడవు కమ్ము; అని పల్కుటయున్= అని శ్రీకృష్ణుడు చెప్పగా (అనుగ్రహించగా); పారాశర్య+ఆది= పరాశరుని కుమారుడైన వ్యాసుడు మొదలుకొని; పరమ+ఆర్యులు= ఆర్యశ్రేష్ఠులు; ఆ+పద్మనాభున్= ఆ శ్రీకృష్ణుడిని; ప్రశంసించిరి= ప్రస్తుతించారు; దివంబునన్= స్వర్గంలో; దేవదుందుభులు మొరసెన్= దేవతా సంబంధమైన భేరులు మ్రోగాయి; ముర+అరి భీష్మ ధర్మజులమీఁదన్= శ్రీకృష్ణుడు, భీష్ముడు, ధర్మజులమీద; కుసుమ వర్షంబు కురిసెన్= పూలవాన కురిసింది; అప్సరోగణ గానంబు= అప్సరసల బృందగానం; వీతెంచెన్= వినిపించింది; అచ్చటి+అందఱున్= అక్కడ ఉన్న వారంతా; ఆశ్చర్యప్రమోద భరిత హృదయులు= ఆశ్చర్యంతో కూడిన సంతోష మనస్కులు; ఐరి= అయ్యారు; తద్+అనంతరంబ= ఆ తరువాత; అంబుజ+ఆప్తుండు= పద్మబంధువైన సూర్యుడు; అపరగిరి శిఖరంబు= పడమటి కొండ శిఖరమును; అలంకరించెన్= అలంకరించాడు; అప్పుడు+ఆ+మునులు= ఆ సమయంలో అక్కడున్న మహర్షులు; అచ్యుత గాంగేయ కౌంతేయ+అగ్రజులన్= శ్రీకృష్ణ, భీష్మ, ధర్మరాజాదుల వద్ద; ఆమంత్రితులను చేసి= అనుజ్ఞపొంది; గమన+ఉన్ముఖులు+అగుటయున్=వెళ్ళిపోవటానికి సిద్ధం కాగా; ఆ+మాధవ+యుధిష్ఠిరులును సాత్యకియు, భీమార్జున యమళులును గృప యుయుత్సు సంజయులును= శ్రీకృష్ణ, ధర్మజ, సాత్యకి, భీమార్జునులు, కవలలైన నకుల సహదేవులు, కృప, యుయుత్సు, సంజయులును; వారలకున్= ఆ మహర్షులకు; ప్రణమిల్లిరి= నమస్కరించిరి; వారలను= ఆ మహర్షులును; రేపు వచ్చెదము+అని= ఉదయాన్నే వస్తామని; నిజస్థానంబులకున్+చనిరి= వాళ్ళ నివాసాలకు వెళ్ళారు; కృష్ణ+ఆదులును= కృష్ణుడు మొదలైనవారునూ; దేవవ్రతునకున్= భీష్మునకు; అభిముఖులు+ అగుచున్=ఎదురుగా నిలబడి; అట్లు+పలికి= అదే విధంగా పలికి; వలగొని= ప్రదక్షిణించి;

అరిగి= వెళ్ళి; అరదంబులు+ఎక్కిరి= రథాలు అధిరోహించారు; వారి పిఱుందన్= వారి వెనుకనే; మున్ను వచ్చిన= ముందే వచ్చిన; వారణ రథ తురగ పదాతులు= ఏనుగులు, రథాలు, గుర్రాలు, కాల్బలం; బలసి= గుమికూడి; కొల్చిపోవన్= అనుసరించి పోతూ ఉండగా; వారు= శ్రీకృష్ణాదులు; పురంబునకున్= హస్తినాపురానికి; పోవు సమయంబునన్= వెళ్తూ ఉన్న సందర్భంలో.

తాత్పర్యం: నా అనుగ్రహంతో పైన పేర్కొన్న మూడు వరాలవలన మహిమాతిశయుడవై వర్థిల్లు'మని శ్రీకృష్ణుడు భీష్ముడితో చెప్పాడు. వ్యాసాది మహర్షులంతా శ్రీకృష్ణుడిని ప్రశంసించారు. స్వర్గంలో దేవదుందుభులు మ్రోగాయి. కృష్ణుడు, భీష్ముడు, ధర్మరాజు మొదలైనవారి మీద పూలవాన కురిసింది. అప్సరోభామినుల బృందగానం వినిపించింది. అక్కడున్న వాళ్ళందరి హృదయాలు ఆశ్చర్యసంతోషాలతో నిండిపోయాయి. సూర్యుడు అస్తగిరి శిఖరాన్ని చేరాడు. అక్కడ ఉన్న మహర్షులంతా శ్రీకృష్ణ భీష్మ ధర్మరాజులవద్ద సెలవుపుచ్చుకొని పోవటానికి సిద్ధమయ్యారు. కృష్ణ ధర్మరాజ సాత్యకులు, భీమార్జున నకుల సహదేవులు. కృప, యుయుత్సు, సంజయులు మహర్షులకు నమస్కరించారు. ఆ మహర్షులును ఉదయాన్నే వస్తామని చెప్పి తమ నివాసాలకు వెళ్ళిపోయారు. కృష్ణుడు మొదలైనవారు భీష్ముడికి అభిముఖులై ఉదయాన్నే వస్తామని చెప్పి ప్రదక్షిణించి, రథాధిరోహణం చేశారు. అంతకు ముందే వచ్చినట్టి చతురంగబలాలు వారిని సేవిస్తూ వారి వెనుక హస్తినాపురానికి వెళ్ళుతూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. దినమున నెల్ల నుష్ణకరదీప్తులు పర్వి రసంబుఁ బీల్వ వం
దిన సకలౌషధి ప్రవితతిం దెలివొందఁగఁజేయు నేర్పు గ
ల్గిన తన రశ్మిజాలమున లీలఁ జకోరములన్ మదింపఁ జే
య నుదయమై వెలింగె నమృతాంశుఁడు సేనకుఁ దన్పు సేయుచున్. 126

ప్రతిపదార్థం: దినమునన్+ఎల్లన్= పగలంతా; ఉష్ణకరదీప్తులు= వేడి అయిన కిరణాలు కలిగిన సూర్యుడి యొక్క కాంతులు; పర్వి= వ్యాపించి; రసంబు+పీల్వన్= ఓషధుల రసాన్ని పీల్చి వేయగా; వందిన= వాడిపోయిన; సకల+ఓషధి ప్రవితతిన్= సమస్తమైన ఓషధుల సమూహాన్ని; తెలివి+ఒందఁగన్= మళ్ళీ చైతన్యవంతమయ్యేటట్లుగా; చేయునేర్పు+కల్గిన= చేయగల నేర్పరి తనండున్నటువంటి; తన రశ్మి జాలమునన్= తనదైన వెన్నెల సమూహంతో; లీలన్= విలాసంతో; చకోరములన్= చకోర పక్షులను; మదింపన్+చేయన్= బలాన్ని పుంజుకొనేటట్లు చేయటానికై; అమృత+అంశుఁడు= చల్లని కిరణాలు కలిగిన చంద్రుడు; ఉదయము+ఐ= ఉదయించి; సేనకున్= సైన్యానికి; తన్పు+చేయుచున్= సంతోషాన్ని కలిగిస్తూ; వెలింగెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: పగలంతా సూర్యుడి వేడిమి ఓషధుల రసాన్ని పీల్చివేయగా కందిపోయినటువంటి ఆ ఓషధుల సమూహాలకు ప్రాణవంతం చేయగల నేర్పున్న తన వెన్నెలల చల్లదనంతో ఆ కిరణాలను ఆహారంగా స్వీకరించి చకోరాలు మదించేటట్లుగా చేయటానికై చంద్రుడు ఉదయించి సైన్యానికి సంతోషం కలిగిస్తూ ప్రకాశించాడు.

విశేషం: "తతః పురస్తాత్..... గుణేన యోజయన్" అనే మూలశ్లోకానికి వన్నెలు దిద్దుతూ తిక్కన ఈ వృత్తాన్ని రచించాడు. మూలంలో ఓషధులను మళ్ళీ పునర్జీవితులను చేస్తున్నా నన్నాడే కానీ చకోర పక్షుల ప్రస్తావన లేదు. చంద్రకిరణాలను భక్షించి చకోరాలు జీవిస్తాయన్న అంశాన్ని చక్కగా వర్ణించాడు తిక్కన.

వ. ఇట్లుదయించి సుధామరీచి లోచనప్రీతి యాచరింపం బెంపు సుభగంబుగా శౌరి ప్రముఖులు పుర ప్రవేశంబు సేసి నిజ నివాసంబుల నుచిత వర్తనంబుల నా రాత్రి గడపి ప్రభాతం బగుటయు. 127

ప్రతిపదార్థం: ఇట్లు+ఉదయించి= ఈ విధంగా పుట్టిన; సుధామరీచి= చల్లనైన కిరణాలు కలవాడైన చంద్రుడు; లోచనప్రీతి+ఆచరింపన్= కన్నుల పండువు చేయగా; పెంపు సుభగంబుగాన్= అతిశయితమైన మనోహరంగా; శౌరి ప్రముఖులు= శ్రీకృష్ణుడు మొదలైనవారు; పుర ప్రవేశంబు+చేసి= హస్తినాపురంలోకి వెళ్ళి; నిజ నివాసంబులన్= స్వగృహాలలో; ఉచిత వర్తనంబులన్= తగిన పనులతో; ఆ రాత్రి గడపిరి= ఆ రాత్రి సుఖంగా గడిపారు; ప్రభాతంబు+అగుటయున్= తెల్లవారగానే.

తాత్పర్యం: ఆ రీతిగా చంద్రుడు ఉదయించి కన్నుల పండువు చేయగా శ్రీకృష్ణాదులు మిక్కిలి సంతోషంతో హస్తినాపుర ప్రవేశం చేసి స్వగృహాలలో తగిన రీతిగా ఆ రాత్రి గడిపారు. అంతలో తెల్లవారింది.

తే. **మంజుపాఠక రవమును మధురమాగ । ధస్వనంబును వినుచు మాధవుఁడు మేలు**
కాంచి తత్కాల సముచిత కర్మ జాత । మాచరించి భూసురులకు నర్చ లిచ్చి. **128**

ప్రతిపదార్థం: మంజుపాఠక రవమును= మనోహరమైన పాఠకులయొక్క శబ్దాలను; మధుర మాగధ స్వనంబును= తియ్యనైన మాగధుల యొక్క కంఠధ్వనిని వింటూ; మాధవుఁడు= శ్రీకృష్ణుడు, మేలుకాంచి= మేలుకొని; తద్+కాల= ఆ ఉదయకాలమందలి; సముచిత కర్మజాతము+ఆచరించి= తగిన కార్యక్రమాన్ని చేసి; భూసురులకున్= భూదేవు లైన బ్రాహ్మణులకు; అర్చలు ఇచ్చి= పూజలు చేసి.

తాత్పర్యం: మనోహరమైన వందిజన స్తోత్రాలను, శ్రుతిసుభగమైన మాగధుల కంఠధ్వనులను వింటూ శ్రీకృష్ణుడు మేల్కొని ఉదయాన్నే చేయవలసిన అర్హమైన కార్యకలాపాలను పూర్తిచేసి భూదేవతలను పూజించి.

వ. **మంగళప్రకారంబున నలంకరించి నిజాకృతి యాదర్శంబునందు దర్శించి యప్పుడు సన్నిహితుండైన సాత్యకి వదనం బవలోకించి భీష్ము పాలికిం బోవుటకుం బాండవాగ్రజుం డాయితంబగుట యెఱింగి 'మన వెలువడు చునికి యెఱింగింపు' మని పనిచె; నంతకు మున్న యక్కురుపుంగవుండు బుణ్య సంకీర్తనాశీర్వాదంబులను భద్రగాన నాదంబులను వీనులు వికసిల్ల మేలుకాంచి సమయ కృత్యంబు లనుష్ఠించి యుండ నా కృష్ణానుజుం డతనిం గని గాంగేయు కడ కరుగుటకై రథంబు సన్నద్ధంబు సేయించి 'నీరజనాభుఁడు నీ రాక వార్చి యున్న వాఁ'డని చెప్పుటయు, నమ్మనుజపతి పార్శ్వగతుం డగు పార్థుం గనుంగొని 'మనయరదంబు సంఘటింపుము; నేఁడు మొదలుగా నయ్యెడకు సైనికుల రానీకు; మంతః పరివారంబు వచ్చు టుడుపుము; శాంతనవుండు సందడింబడ నర్వుండు గాఁడు విశేషించి పరమ గుహ్యార్థంబు లగు వాక్యంబులు మనకు ననుగ్రహింపం గలవాఁడు గావున నిస్సమ్మర్దంబుగా నుపాసింప వలయు'నని పలికి యొక్కింత విచారించి తగు రాజులం గొందఱం బేరుకొని ధృతరాష్ట్రవిభుండును వారును వచ్చువారు; వారిం బిలువం బంపు' మనవుడుఁ బిలిపించి యతండు.** **129**

ప్రతిపదార్థం: మంగళ ప్రకారంబునన్+అలంకరించి= శుభప్రదంగా అలంకారం చేసికొని; నిజ+ఆకృతి= శ్రీకృష్ణుడు తన రూపాన్ని; ఆదర్శంబునందున్= అద్దంలో; దర్శించి= చూచికొని; అప్పుడు= వెంటనే; సన్నిహితుండు+ఐన= దగ్గరలోనే ఉన్న; సాత్యకి+వదనంబు+అవలోకించి= సాత్యకి ముఖాన్ని చూచి; భీష్ముపాలికిన్+పోవుటకున్= భీష్ముడి వద్దకు వెళ్ళటానికి; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; ఆయితంబు+అగుట+ఎఱింగి= సిద్ధమై ఉన్న విషయాన్ని తెలిసికొని; మన వెలువడుచున్+ఉనికి= మనం బయలుదేరుతున్న విషయాన్ని; ఎఱింగింపుము+అని+పనిచెన్= తెలియచేయవలసిందని పంపాడు; అంతకు మున్న= అంతకు ముందే; ఆ +కురుపుంగవుండు= ఆ కౌరవ శ్రేష్ఠుడైన ధర్మరాజు; పుణ్యసంకీర్తన+ఆశీర్వాదంబులను= పుణ్యప్రదమైన సంకీర్తనాత్మకమైన ఆశీస్సు; భద్రగాన నాదంబులను= మంగళకర సంగీత నాదాలతో; వీనులు వికసిల్లన్= చెవులకు ఇంపు కొల్పగా; మేలు కాంచి= నిద్ర లేచి; సమయ కృత్యంబులు+అనుష్ఠించి+ఉండన్= కాలకృత్యాలు చేసి ఉండగా; ఆ కృష్ణ+అనుజుండు= ఆ శ్రీకృష్ణుడి తమ్ముడైన సాత్యకి; అతనిన్+కని= ధర్మరాజును దర్శించి; గాంగేయు కడకున్+అరుగుటకున్+ఐ= భీష్ముడి వద్దకు

వెళ్ళటానికి; రథంబు సన్నద్ధంబు+చేయించి= రథం సిద్ధంచేయించి; నీరజనాభుఁడు= పద్మనాభుడైన శ్రీకృష్ణుడు; నీ రాక వార్చి+ఉన్నవాఁడు+అని= నీ రాక కొరకు వేచి ఉన్నాడని; చెప్పుటయున్= చెప్పగా; ఆ+మనుజపతి= ఆ ధర్మరాజు; పార్శ్వగతుండు+అగు= పక్కనే ఉన్నటువంటి; పార్థున్+కనుంగొని= అర్జునుడిని చూచి; మన+అరదంబు= మన రథాన్ని; సంఘటింపుము= సిద్ధం చేయుము; నేడు మొదలుగాన్= ఈనాటినుండి; ఆ+ఎడకున్= అక్కడకు; సైనికులన్ రానీకుము= దండు రానీయకుండా చూడుము; అంతఃపుర పరివారంబును= అంతఃపురంలోని సేవకులను; వచ్చుట+ఉడుపుము= రానీయకుము; శాంతనవుండు= శంతను పుత్రుడైన భీష్ముడు; సందడిన్+పడన్+అర్హుండు కాఁడు= జన సమ్మర్దానికి తగినవాడు కాడు; విశేషించి= ప్రత్యేకించి; పరమ గుహ్య+అర్థంబులు+అగు వాక్యంబులు= మిక్కిలి రహస్యమైన అర్థాలు గల మాటలు; మనకున్+అనుగ్రహింపన్+కలవాఁడు= మనకు ప్రసాదిస్తాడు; కావునన్= అందుకని; నిః+సమ్మర్దంబుగాన్= సందడి లేకుండా ఉపాసింపన్+వలయును+అని= పూజించవలసిందని; పలికి= చెప్పి; ఒక్క+ఇంత= కాస్త; విచారించి= ఆలోచించి; తగురాజులన్= అర్హులైన రాజులను; కొందఱన్ పేరుకొని= కొందరిని పేర్కొని; ధృతరాష్ట్ర విభుండును= ధృతరాష్ట్ర మహారాజు; వారును= పైన పేర్కొనబడ్డ రాజులు; వచ్చువారు= వస్తారు; వారిన్+పిలువన్+పంపుము= వారిని పిలిపించుము; అనవుడున్= అని చెప్పగా; అతండు= ఆ అర్జునుడు; పిలిపించి= పిలిపించి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు శుభప్రదంగా అలంకరించుకొని, తన మూర్తిని అద్దంలో చూచుకొని దగ్గరే ఉన్న సాత్యకిని చూచి భీష్ముడి వద్దకు పోవటానికి ధర్మరాజు సిద్ధమైన సంగతి తెలిసికొని మనం ప్రయాణమవుతున్న సంగతి చెప్పుమని పంపించాడు. అంతకుముందే ధర్మరాజు పుణ్యాత్ముల సంకీర్తనాశీస్సులూ, శుభప్రదమైన సంగీత నాదాలూ చెవి కింపు గొల్పుతుండగా నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకొని ఉండగా సాత్యకి ఆ ధర్మరాజును చూచి భీష్ముడి వద్దకు పోవటానికి రథం సిద్ధంచేయించి శ్రీకృష్ణుడు నీ రాకకొరకు ఎదురు చూస్తున్నాడని చెప్పాడు. వెంటనే ధర్మరాజు పక్కనే ఉన్న అర్జునుడిని చూచి 'మన రథాన్ని సిద్ధం చేయుము. ఈ రోజు నుండి అక్కడకు సైనికులను అంతఃపుర పరివారాన్ని రానీయకుము. భీష్ముడు జనసమ్మర్దాన్ని తట్టుకొనే స్థితిలో లేడు. పైపెచ్చు మనకు రహస్యార్థాలను తెలియచేయనున్నాడు. కాబట్టి సందడి లేకుండా మనం భీష్ముడిని సేవించవలసి ఉన్నది' అని చెప్పి, కొంత ఆలోచించి కొందరు రాజులపేర్లను చెప్పి, 'ధృతరాష్ట్ర మహారాజుతోపాటు వారిని కూడా పిలిపించవలసిం' దని చెప్పగా అర్జునుడు యథారీతిగా ఆచరించాడు.

ధర్మరాజు కృష్ణాదులతోడ భీష్మ పాలికింబోవుట (సం. 12-53-27)

క. అరదము వన్నిన నా భూ । వరుఁ డతఁడును దాను నెక్కి వడముడి వేఱొ
క్క రథమునఁ బిన్న తమ్ముల । నిరువురఁ గలపికొని యెలమి నేతేరంగన్. 130

ప్రతిపదార్థం: అరదము+పన్నినన్= రథాన్ని ఆయత్తం చేయగా; ఆ భూవరుఁడు= ధర్మరాజు; అతఁడును= అర్జునుడూ; తానున్= తానును (ధర్మరాజు); ఎక్కి= అధిరోహించి; వేఱు+ఒక్క రథమునన్= మరొక రథంలో; వడముడి= భీముడు; పిన్నతమ్ములన్+ఇరువురన్= చిన్న తమ్ములైన నకుల సహదేవు లిద్దరిని; కలపికొని= తనతో కలుపుకొని; ఎలమిన్+ఏతేరంగన్= సంతోషంతో బయలుదేరగా.

తాత్పర్యం: రథాన్ని ఆయత్తం చేయగా ధర్మరాజు అర్జునుడితోపాటు రథ మెక్కగా మరొక రథంలో భీముడు నకుల సహదేవులను కలుపుకొని సముచిత రీతిని బయలుదేరాడు.

క. వినుము! మహా భూతము లే । నును సమధిక రూపమున వినుతభంగిఁ దగం
జను తెఱఁగు దోఁప నెలమిం । జనియెను వసుదేవసుతుని సదనంబునకున్. 131

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వినుము= ఓ మహారాజా! వినుము (జనమేజయుడితో వైశంపాయనుడు చెప్పటం); మహాభూతముల్+ఏనును= పంచభూతాలు అయిదును; సమ్+అధిక రూపమునన్= చక్కటి రూపంతో; వినుత భంగిన్= ప్రశంసించ తగిన రీతిగా; తగన్+చను తెఱఁగు+తోఁపన్= సముచితంగా వెళ్ళుతున్న పద్ధతి స్పష్టమయ్యేట్లు; ఎలమిన్= బాగుగా; వసుదేవ సుతుని= వసుదేవుడి కుమారుడైన శ్రీకృష్ణుడి; సదనంబునకున్= భవనానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: పంచభూతాలు సముచితరూపంతో ప్రశంసనీయమైన రీతిలో సముచితంగా వెళ్ళుతూ ఉన్న పద్ధతి స్పష్టమయ్యేటట్లుగా ధర్మరాజు తమ్ములతో కూడి తాము అయిదుగురూ శ్రీకృష్ణుడి భవనానికి వెళ్ళారు.

విశేషం: అలం: ఉపమ.

వ. **రథగమన రవంబునం గృప యుయుత్సు సంజయులుం గూడుకొని; రంత.** **132**

ప్రతిపదార్థం: రథగమన రవంబునన్= రథం వెళ్ళుతున్న శబ్దంవలన; కృప యుయుత్సు సంజయులున్= కృపాచార్యుడు, యుయుత్సుడు, సంజయుడు ముగ్గురు; కూడుకొనిరి= కలిసికొన్నారు; అంతన్= ఆ తరువాత.

తాత్పర్యం: ధర్మరాజాదులు వెళ్ళుతున్న రథగమన శబ్దాలను గుర్తించి కృపుడు, యుయుత్సుడు, సంజయుడు ముగ్గురు వచ్చి కలిసికొన్నారు. ఆ వెనుక - (తరువాతి పద్యంతో అన్వయం).

క. **దారుకుఁడు వన్ని తెచ్చిన । తేరను వెలువడియె వాసుదేవుండును; న**
తేరులు నాలుగు నేమిక । లా రవ మెసఁగంగ బెరసి యరిగె నరేంద్రా! **133**

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= జనమేజయ మహారాజా!; దారుకుఁడు+వన్ని+తెచ్చినన్= శ్రీకృష్ణుడి రథసారథి అయిన దారుకుడు సిద్ధం చేసి తెచ్చిన; తేరను= రథమందు; వాసుదేవుండును= వసుదేవుడి కుమారుడైన శ్రీకృష్ణుడును; వెలువడియెన్= బయలుదేరి వచ్చాడు; ఆ+తేరులు నాలుగున్= ఆ నాలుగు రథాలు; నేమి+కలారవము+ఎసఁగంగన్= చక్రాల అతిశయమైన శబ్దం చేస్తూ ఉండగా; బెరసి+అరిగెన్= కలిసి బయలుదేరి వెళ్ళాయి.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! శ్రీకృష్ణుడి సారథి అయిన దారుకుడు సిద్ధం చేసి తెచ్చిన రథంలో శ్రీకృష్ణుడు బయలుదేరాడు. అర్జునుడితో ధర్మజుడు బయలుదేరిన రథమూ, నకుల సహదేవులతో భీముడు అధిరోహించిన రథమూ, కృప యుయుత్సు సంజయుల రథమూ. శ్రీకృష్ణుడు బయలుదేరిన రథమూ నాలిగింటి యొక్క చక్రాల శబ్దం అతిశయిస్తూ ఉండగా బయలుదేరి వెళ్ళాయి.

క. **జనమేజయ నృప! యంతకు । మును నారద ముఖ్యులైన మునివర్యులు శాం**
తనవుని పాలికి వచ్చిరి । వనజభవుని కడకు సురలు వచ్చు విధమునన్. **134**

ప్రతిపదార్థం: జనమేజయ నృప!= ఓ జనమేజయ మహారాజా!; అంతకుమును= అంతకు ముందే; నారద ముఖ్యులు+ఐన= నారద ప్రముఖులైన; ముని వర్యులు= మునిశ్రేష్ఠులు; వనజభవుని కడకున్= పద్మంనుండి పుట్టినవాడైన బ్రహ్మ వద్దకు; సురలు వచ్చు విధమునన్= దేవతలు వచ్చే విధంగా; శాంతనవుని పాలికిన్ వచ్చిరి= శంతను మహారాజు కుమారుడైన భీష్ముడి వద్దకు వచ్చారు.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! అంతకుముందే అంటే ఆ శ్రీకృష్ణాదులు రాకముందే నారదుడు మొదలైన మునిశ్రేష్ఠులు బ్రహ్మవద్దకు దేవతలు వచ్చినట్లుగా భీష్ముడి వద్దకు వచ్చారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ.

వ. అట్లు సంయమి వర పరిషత్పరివృతుండై యున్న య ద్దేవ వ్రతుని కడ చేర నరిగి శౌరి ప్రముఖులు రథంబులు డిగ్గి. 135

ప్రతిపదార్థం: అట్లు= ఆ రీతిగా; సంయమి వర పరిషత్+పరివృతుండు+ఐ+ఉన్న= మునిశ్రేష్ఠుల సమూహంతో చుట్టబడి ఉన్న; ఆ+దేవవ్రతుని కడ+చేరన్+అరిగి= ఆ భీష్ముడి దగ్గరకు వెళ్ళి; శౌరి ప్రముఖులు= కృష్ణుడు మొదలైన ముఖ్యులు; రథంబులు డిగ్గి= రథాలలోనుండి దిగి.

తాత్పర్యం: మునిశ్రేష్ఠుల సమూహంతో చుట్టబడి ఉన్న భీష్ముడి సమీపానికి వెళ్ళి, శ్రీకృష్ణాదులు రథాలలోనుండి దిగి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. తత్సమీపమునకు ధర్మనందన పుర । స్సరత నరిగి తొలుత సకల మునులఁ
బ్రణతిఁ దెలచి కదిసి బలసి యుపాసించి । రన్నదీతనూజు నధికభక్తి. 136

ప్రతిపదార్థం: తద్+సమీపమునకున్= వారి దగ్గరకు; ధర్మనందన పురస్సరతన్+అరిగి= ధర్మరాజును ముందుగా ఉంచుకొని వెళ్ళి; తొలుతన్= మొదట; సకల మునులన్= సమస్త మహర్షులను; ప్రణతిన్= నమ్రతతో; తెలచి= మొక్కి, నమస్కరించి; కదిసి= సమీపించి; బలసి= చుట్టుచేరి (పరివేష్టించి); ఆ+నదీ తనూజున్= ఆ గంగానదీ పుత్రుడైన భీష్ముడిని; అధిక భక్తిన్= అత్యంత భక్తితో; ఉపాసించిరి= పూజించారు.

తాత్పర్యం: శ్రీకృష్ణాదులు భీష్ముదు లున్న సమీపానికి ధర్మరాజును ముందుంచుకొని వెళ్ళి, మొదట సకల మహర్షులకు నమస్కరించి, అంతా పరివేష్టించి భీష్ముడిని మిక్కిలి భక్తితో పూజించారు.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె. 137

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా విన్న జనమేజయ మహారాజు; వైశంపాయనునకున్+ఇట్లు+అనియెన్= వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పగా వినిన జనమేజయుడు వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు.

మ. 'శరతల్పంబునఁ బొల్చు భీష్మకడకున్ సంప్రీతి న క్కౌరవే
శ్వరుఁడుం దమ్ములు గృష్ణుఁడుం జని మునివ్రాతంబుతోఁ గూడ న
ప్పరమోదాత్తుని చుట్టు నున్న యెడ నెబ్బంగిం బ్రవర్తించె వి
స్తర మాధుర్య మనోజ్ఞ సత్కథలు విస్పష్టంబుగాఁ జెప్పవే!' 138

ప్రతిపదార్థం: శరతల్పంబునన్+పొల్చు= అమ్ముల పాన్పుపై ప్రకాశించే; భీష్మకడకున్= భీష్ముడి వద్దకు; సంప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; ఆ+కౌరవ+ఈశ్వరుఁడున్= కౌరవశ్రేష్ఠుడైన ధర్మరాజు; తమ్ములున్= తమ్ములును (అయిన భీమార్జున నకుల సహదేవులు); కృష్ణుఁడున్= శ్రీకృష్ణుడును; చని= వెళ్ళి; ముని వ్రాతంబుతోన్+కూడన్= మునుల యొక్క సమూహంతో కూడా; ఆ+పరమ+ఉదాత్తుని చుట్టున్= ఆ పరమోన్నతుడైన భీష్ముడి చుట్టూ; ఉన్నఎడన్= ఉన్న సమయంలో; ఏ+భంగిన్+ప్రవర్తించెన్= ఏ రీతిగా నడుచుకొన్నాడో; విస్తర మాధుర్య మనోజ్ఞ సత్కథలు= విపులమై, తియ్యనై, మనోహరమైన ఉత్తమ కథలు; విస్పష్టంబుగాన్+చెప్పవే!= విశదంగా చెప్పుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'శరతల్పగతుడై ఒప్పుతున్న భీష్ముడి వద్దకు అత్యంత ప్రీతితో ధర్మరాజు, అతడి తమ్ములు, భీమార్జున నకుల సహదేవులు, శ్రీకృష్ణుడు మహర్షి గణంతో కూడా వెళ్ళి అతడిని ఉండగా ఆతడి ప్రవర్తన ఎట్లా ఉన్నది? విపులమూ, మధురమూ, మనోహరమూ అయిన ఆ కథలు వివరంగా చెప్పు'మని జనమేజయుడిని వైశంపాయనుడు కోరాడు.

వ. అని యడిగిన నమ్మహీవిభునకు వైశంపాయనుం డిట్లనియె; మున్ను ధర్మపుత్రుండు రావించిన ధృతరాష్ట్రుండును రాజులు నతనిపజ్జ నరిగి వారును గాంగేయు నుచిత ప్రకారంబునం గాంచి కొల్చి యుండి; రట్టియెడ నారదుండు ధర్మపుత్రాదుల న మ్మేదినీపతులం గలయం గనుంగొని. 139

ప్రతిపదార్థం: అని+అడిగినన్= అని అడుగగా; ఆ+మహీవిభునకున్= ఆ జనమేజయ మహారాజునకు; వైశంపాయనుండు+ఇట్లు+ అనియెన్= వైశంపాయనుడు ఇట్లా అన్నాడు; మున్ను= ఇంతకు ముందే; ధర్మపుత్రుండు రావించిన= ధర్మరాజు పిలిపించిన; ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్ర మహారాజూ; రాజులున్= ఇతర రాజులూ; ఆతనిపజ్జన్+అరిగి= ఆతని దగ్గరకు వెళ్ళి; వారును= వారందరూ; గాంగేయున్= గంగాదేవి పుత్రుడైన భీష్ముడిని; ఉచిత ప్రకారంబునన్+కాంచి= తగిన రీతిగా దర్శించి; కొల్చి ఉండిరి= సేవిస్తూ ఉన్నారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; నారదుండు= నారద మహర్షి; ధర్మపుత్ర+ఆదులన్= ధర్మరాజు మొదలైన వారిని; ఆ+మేదినీ పతులన్= ఆ రాజులను; కలయన్+కనుంగొని= కలయచూచి.

తాత్పర్యం: ధర్మరాజాదులు భీష్ముడి చుట్టూ చేరినప్పుడు భీష్ముని ప్రవర్తన ఎట్లుందో చెప్పుమని జనమేజయ మహారాజు అడుగగా వైశంపాయనుడు ఇట్లా చెప్పాడు: అంతకు ముందే ధర్మరాజు పిలిపించినట్టి ధృతరాష్ట్రుడు, తక్కిన రాజులు భీష్ముడి వద్దకు వెళ్ళి భీష్ముడిని తగిన రీతిగా దర్శించి సేవిస్తూ ఉన్నారు. ఆ సమయంలో నారద మహర్షి ధర్మరాజాదులనూ తక్కిన రాజులనూ కలయచూచి ఇట్లా అన్నాడు.

**క. 'శంతను నందనుఁ డపరది । గంత ప్రాప్తరవి యట్టివాఁడయ్యె నితఁడు లో
కాంతరగతుఁ డగుటకు ము । న్నంతఃకరణముల సంశయము వాయంగన్. 140**

ప్రతిపదార్థం: శంతను నందనుఁడు= శంతను మహారాజు కుమారుడైన భీష్ముడు; ఇతఁడు= ఈ భీష్ముడు; అపర దిక్+అంతప్రాప్తరవి+ అట్టి+వాఁడు+అయ్యెన్= పడమటి దిక్కుయొక్క అంతమును చేరిన సూర్యుడివంటి వాడు అయ్యాడు; లోక+అంతరగతుఁడు+ అగుటకున్= ఈ భూలోకం వదలి స్వర్లోకానికి వెళ్ళటానికి; మున్ను= ముందు; అంతః+కరణముల= మనస్సుతోపాటు జ్ఞాన కర్మేంద్రియాలయొక్క; సంశయము+పాయంగన్= సందేహాలు తొలగి పోయేటట్లుగా.

తాత్పర్యం: 'ఈ భీష్ముడు పశ్చిమదిక్కును చేరుతున్న సూర్యుడివలె ఒప్పుతున్నాడు. ఈ లోకం వదలిపెట్టి స్వర్గలోకానికి వెళ్ళే ముందు మనస్సుతోపాటు జ్ఞానకర్మేంద్రియాల సందేహాలు తొలగిపోయేటట్లుగా.

విశేషం: అలం: ఉపమ. పరలోకగతుడు కానున్న భీష్ముడిని అపరదిగభిముఖుడైన సూర్యుడితో పోల్చటం అత్యంతం సముచితంగా ఉన్నది.

వ. సకల ధర్మ ప్రకారంబు నడిగి తెలిసికొం'డనినఁ బ్రశ్నపాటవంబు లేమి నందఱు నొండొరువుల మొగంబులు సూచుచుండఁ బాండవాగ్రజుండు పుండరీకాక్షున కిట్లనియె. 141

ప్రతిపదార్థం: సకల ధర్మప్రకారంబున్+అడిగి= సమస్త ధర్మ పద్ధతులను అడిగి; తెలిసికొండు+అనినన్= తెలిసికొనవలసిందని నారదుడు చెప్పగా; ప్రశ్న పాటవంబు లేమిన్= ప్రశ్నించే పటుత్వం లేకపోవటం వలన; అందఱున్+ఒండొరువుల= అందరూ ఒకళ్ళొకళ్ళ; మొగంబులు చూచుచుండన్= ముఖాలు చూస్తుండగా; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; పుండరీక+అక్షునకున్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సమస్త ధర్మపద్ధతులనూ భీష్ముడిని అడిగి తెలిసికొనండని నారదుడు చెప్పగా ప్రశ్నించే తీరు తెలియక అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూస్తూ ఉన్న సమయంలో ధర్మరాజు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తే. **'నీవు దక్కంగ మందాకినీ తనూజు । తోడి సల్లాపములకు నుక్తులు ముకుంద!**
కలరె యెందును? ధర్మవేదులకు నెల్ల । గురుఁడ వీవ; సంభాషణపరుఁడ వగుము.' **142**

ప్రతిపదార్థం: ముకుంద!= ఓ కృష్ణా!; మందాకినీ తనూజు తోడి= గంగాదేవి పుత్రుడైన భీష్ముడితో; సల్లాపములకున్= మంచి మాటలకు (సంభాషణకు); నీవు తక్కంగన్= నీవు తప్ప; ఉక్తులు కలరె?= చెప్పగలవా రున్నారా?; ఎందునున్= ఎక్కడైనా; ధర్మవేదులకున్+ఎల్లన్= ధర్మమెరిగిన వారందరికి; ఈవ= నీవే; గురుఁడవు; సంభాషణ పరుఁడవు+అగుము= మాట్లాడటం ప్రారంభించుము.

తాత్పర్యం: 'భీష్ముడితో సంభాషించటానికి నీవు తప్ప అర్హులు లేరు. ధర్మవేత్తలందరికి నీవు గురుడవు. నీవు సంభాషణ ప్రారంభించుము.

విశేషం: 'ఉక్తులు' అనటానికి బదులు 'శక్తులు' అనే పాఠాంతరం సముచితం.

వ. **అనుటయు నచ్యుతుండు భీష్మున కత్యాసన్నుండై శారీర మానస కుశల ప్రశ్నంబుఁ జేసిన నతండు.** **143**

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; భీష్మునకున్+అతి+ఆసన్నుండు+ఐ= భీష్ముడికి మిక్కిలి సమీపంలో కూర్చున్నవాడై; శారీర మానస కుశల ప్రశ్నంబున్+చేసినన్= శరీరానికి సంబంధించి మనస్సుకు సంబంధించి క్షేమాన్ని గూర్చి అడుగగా; అతండు= ఆ భీష్ముడు.

తాత్పర్యం: అని ధర్మరాజు ప్రార్థించగా శ్రీకృష్ణుడు భీష్ముడికి మిక్కిలి సమీపంలో ఉంటూ అతడిని శరీరానికి మనస్సుకు సంబంధించిన క్షేమాన్ని గూర్చి ప్రశ్నించాడు. అప్పుడు భీష్ముడు ఇట్లా అన్నాడు.

ఉ. **'దేవ! భవత్ప్రసాదమునఁ దీఱె శరీరము నొప్పి డప్పి, మ**
ద్భావము నింద్రియంబులును బాటవ సంపద నొందె, వేద వి
ద్యా విభవంబు నాకుఁ బరతత్త్వ పరిస్ఫుట బోధ యుక్తమై
భావితమయ్యెఁ నాత్మఁ బరిపక్వ దయాకరచిత్త మాధవా! **144**

ప్రతిపదార్థం: పరిపక్వ దయాకర చిత్త!= పండిన కరుణకు నెలవైన చిత్తం కలవాడా!; మాధవా!= ఓ కృష్ణా!; దేవ!= మహానుభావా! భవత్+ప్రసాదమునన్= నీ అనుగ్రహంతో; శరీరము నొప్పి= శారీరకమైన బాధ; దప్పి= అలసట; తీఱెన్= తొలగిపోయాయి; మత్+భావంబున్= నా మనస్సును; ఇంద్రియంబులును= జ్ఞాన కర్మేంద్రియాలును; పాటవ సంపదన్+ఒందెన్= పటుత్వ సంపదను పొందాయి; నాకు; ఆత్మన్= ఆత్మలో; వేద విద్యా విభవంబు= చతుర్వేదాల విద్యయొక్క వైభవమూ; పరతత్త్వ

పరిస్ఫుట బోధయుక్తమై= పరమాత్మయొక్క స్పష్టమైన జ్ఞానంతో కూడినదయి; భావితము+అయ్యెన్= సంభావితమయింది (తెలిసికొన్నాను).

తాత్పర్యం: ఓ కృష్ణా! పరిపూర్ణ కరుణాకరా! నీ అనుగ్రహంతో శరీర సంబంధమైన నొప్పి, అలసట తీరిపోయాయి. నా మనస్సు, జ్ఞాన కర్మేంద్రియాలూ పాటవ సంపదతో ఒప్పారుతున్నాయి. నాకు నా ఆత్మలో వేదవిద్యా వైభవం స్పష్టమైన పరమాత్మ జ్ఞానంతో కూడినదై స్పష్టంగా తెలిసింది.

విశేషం: మూలంలోని ఎనిమిది శ్లోకాల భావాన్ని ఈ పద్యంలో తిక్కన కుదించి రచించాడు. ఆ ఎనిమిది శ్లోకాలలో భావాన్ని జారిపోనీయకుండా భీష్ముని మాటలుగా ఈ పద్యంలో మనోహరంగా చిత్రించాడు.

వ. దేవర దివ్య చిత్తంబున నన్నుం దలంచిన దానం జేసి బృంహితుండ నయ్యును గొండుక ప్రాయంబు వాఁడునుం బోలె నయితిఁ; జెప్ప వలయు వాని నెల్లం జెప్పెదఁ; బాండవ శుభకరంబైన వాని నీ వేల చెప్పవు? నీ తలం పేమి? సెప్పవే!' యనినఁ గృష్ణుండు గాంగేయున కిట్లనియె. 145

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను; దేవర దివ్య చిత్తంబునన్= భగవంతుడవైన నీ దివ్యమైన మనస్సులో; తలంచిన దానన్+చేసి= నన్ను తలంచటంవలన; బృంహితుండన్+అయ్యును= వృద్ధుడనైనప్పటికి; కొండుక ప్రాయంబు వాఁడునున్+పోలెన్+అయితిన్= చిన్న బాలుడివలె అయిపోయాను; చెప్పవలయు వానిన్+ఎల్లన్= చెప్పదగిన వాటి నన్నింటిని; చెప్పెదన్= వివరిస్తాను; పాండవ శుభకరంబు+ఐన దానిన్= పాండవులకు మంగళప్రదమైన దానిని; ఈవు+ఏల+చెప్పవు= నీవు ఎందుకు చెప్పవు; నీ తలంపు+ఏమి?= నీ అభిప్రాయం ఏమి?; చెప్పవే+అనినన్= చెప్పవలసిందని భీష్ముడు ప్రశ్నించగా; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; గాంగేయునకున్= భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: "నీ దివ్య చిత్తంలో నన్ను భావించటంచేత నేను వృద్ధుడనైనప్పటికీ, చిన్న బాలుడివలె అయిపోయాను. నీ ఆదేశానుసారం పాండవులకు చెప్పదలచినవన్నీ సవిస్తరంగా చెప్పుతాను. అయినా పాండవులకు శుభప్రదమైన వాటిని నీ వెందుకు చెప్పవు? నీ భావ మేమి? చెప్పుము' అని అడిగాడు. అప్పుడు కృష్ణుడు భీష్ముడితో ఇట్లా అన్నాడు.

తే. 'అనఘ! శ్రేయస్సునకు యశంబునకు నేను । మూలకందంబ; విను! చంద్రముండు శీత
కిరణుఁడను మాట విస్మయకరమె? చెపుమ; । యశ ముపార్జింపఁ గ్రొత్తపెం పగునె నాకు? 146

ప్రతిపదార్థం: న+అఘా!= పాపరహితుడవైన ఓ భీష్మా!; విను= వినుము; శ్రేయస్సునకున్= మేలునకు; యశంబునకున్= కీర్తికిని; ఏను= నేను; మూల కందంబన్= మూలాధారమైనవాడిని; చంద్రముండు= చంద్రుడు; శీత కిరణుడు+అనుమాట= చల్లనైన కిరణాలు కలవాడనే మాట; విస్మయకరమె= ఆశ్చర్యకరమా; చెపుమా= చెప్పు; నాకు; యశము+ఉపార్జింపన్= కీర్తిని సంపాదించటం; క్రొత్త పెంపు+అగునె= క్రొత్త అభివృద్ధి అవుతుందా?

తాత్పర్యం: 'ఓ భీష్మా! ప్రజాశ్రేయస్సుకు, కీర్తికి నేనే మూలకారణం. సందేహం లేదు. చంద్రుడు చల్లని కిరణాలు కలవాడనటంలో విచిత్రం లేదు కదా! అట్లాంటి నాకు కీర్తి సంపాదన కొత్తగా తెచ్చుకొన్న అభివృద్ధి అవుతుందా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. సామాన్యాంశం విశేషాంశం చేత సమర్థించబడుతున్నది.

క. పరమ మగు యశము నీకును । ధరణిం గలిగింపఁ బూని తాత్పర్యమునం
బురుషవర! నాదు బుద్ధి । స్ఫురణము నీ మనమునందుఁ జొనిపితి నెనయన్. 147

ప్రతిపదార్థం: పురుషవర!= ఓ మానవోత్తముడైన భీష్మా!; ధరణిన్= ఈ భూమి మీద; పరమము+అగు యశము= శ్రేష్ఠమైన కీర్తిని; నీకును కలిగింపన్+పూని= నీకు సంప్రాప్తింపచేయటానికి ప్రయత్నించి; తాత్పర్యమునన్= మనస్సునందు లేదా అభిమతంలో; నాదు= నా యొక్క; బుద్ధి స్ఫురణమున్= నా బుద్ధి జ్ఞానాన్ని; ఎనయన్= తగునట్లు; నీ మనమునందున్+చొనిపితిన్= నీ మనస్సునందు ఆపాదించాను.

తాత్పర్యం: ఓ మానవోత్తముడవైన భీష్మా! అత్యుత్తమ కీర్తిని నీకు కూడా ప్రసాదించదలచి తదనుగుణంగా నా జ్ఞానాన్ని నీ మనస్సులో ప్రవేశపెట్టాను.

విశేషం: చందమామకు వెన్నెల సహజమైన రీతిగా నాకు కీర్తి సహజమే. అయితే అత్యుత్తమ కీర్తిని భీష్ముడికి సైతం ప్రసాదించాలన్న కోరికతో ఆ జ్ఞానాన్ని అతడి మనస్సులో ప్రవేశపెట్టినట్లు కృష్ణుడు చెప్పటంలో ఎంతో విశేషమున్నది.

తే. ధరణి యెందాఁక నుండు సుస్థిరత నీదు । కీర్తి యందాఁక నక్షయస్ఫూర్తిఁ దాల్చి
నడవఁ గలయది నీవు సెప్పెడి సువాక్య । ములును వేదతుల్యంబులై వెలయుచుండు. 148

ప్రతిపదార్థం: ధరణి= ఈ భూమి; ఎంత+దాఁకన్= ఎంతకాలం దాకా; సుస్థిరతన్+ఉండున్= స్థిరమై ఉంటుందో; అంత+దాఁకన్= అంతవరకు; నీదు కీర్తి= నీ కీర్తి; అక్షయ స్ఫూర్తిన్+తాల్చి= నశించనిదై; నడవన్+కల+అది= కొనసాగుతుంది; నీవు+చెప్పెడి= నీవు ప్రబోధించబోయే; సువాక్యములును= మంచి మాటలును; వేద తుల్యంబులు+ఐ= వేదాలతో సమానమై; వెలయుచుండున్= ఒప్పారుతూ ఉంటాయి.

తాత్పర్యం: ఈ భూమి ఎంతకాలం సుస్థిరంగా ఉంటుందో నీ కీర్తి నశించనిదై అంత వరకు కొనసాగుతుంది. నీవు చెప్పే మంచి మాటలన్నీ వేదాలతో సమానమై ఒప్పారుతూ ఉంటాయి.

క. ధర్మజునకు నీ చెప్పెడు । ధర్మస్థితి వాక్య సమితి తాత్పర్యముతో
నిర్మలు లై కొనియాడెడు । ధార్మికులకు నుభయజగదుదాత్తత కలుగున్. 149

ప్రతిపదార్థం: ధర్మజునకున్= ధర్మరాజునకు; నీ చెప్పెడు= నీవు ప్రబోధించే; ధర్మస్థితి= ధర్మపద్ధతియొక్క; వాక్య సమితి= మాటల సమూహం; తాత్పర్యముతోన్= ఏకాగ్రతతో; నిర్మలులు+ఐ= పరిశుద్ధులై; కొనియాడెడు= ప్రశంసించే; ధార్మికులకున్= ధర్మాత్ములకు; ఉభయ జగత్+ఉదాత్తత= ఇహపరాలలోను, ఉత్తమత్వము; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ధర్మరాజుకు నీవు చెప్పే ధర్మంతో కూడిన వాక్యసమూహ సారం ఏకాగ్రతతో పరిశుద్ధులై ప్రశంసించే ధర్మాత్ములకు ఉభయతారకమై ఒప్పుతుంది.

వ. కావున నిట్లు సేసితి; భవదీయ ధర్మవేదిత్వంబును సవిశేష ప్రకారంబుగా నీ మనుమలు ధర్మజ భీమార్జున నకుల సహదేవులు భద్ర భాజనంబులుగా నీ యున్న మహీపతులు విని కృతార్థజన్ములుగా నఖిల ధర్మ ప్రకారబోధకంబు లగు వాక్యంబులు సెప్పు' మనుటయు శాంతనవుం 'డట్ల చేసెద' నని పలికి యాదరభరితుం డయి యిట్లనియె. 150

ప్రతిపదార్థం: కావునన్= అందుకని; ఇట్లు+చేసితిన్= ఇలా నిర్ణయించాను; భవదీయ= నీ యొక్క; ధర్మవేదిత్వంబును= ధర్మసంబంధమైన జ్ఞానాన్ని; సవిశేష ప్రకారంబుగాన్= విశేషంతో కూడిన పద్ధతితో; నీ మనుమలు= నీ మనుమలైన; ధర్మజ భీమ+అర్జున నకుల సహదేవులు= ధర్మరాజు భీముడు అర్జునుడు నకులుడు సహదేవు డనే ఐదుగురు; భద్ర భాజనంబులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గాన్= శుభార్హులయ్యేట్లుగా; ఈ+ఉన్న= ఇక్కడ గుమిగూడి ఉన్న; మహీపతులు= రాజులు; కృత+అర్థ జన్ములు+కాన్= పుట్టుకలు సఫలమయ్యేటట్లుగా; అఖిల ధర్మప్రకార బోధకంబులు+అగు= అన్ని ధర్మవిశేషాలను ప్రబోధించే; వాక్యంబులు+చెప్పుము+ అనుటయును= మాటలు చెప్పుమని శ్రీకృష్ణుడు కోరగా; శాంతనవుండు+అట్లు+చేసెదన్+అని= భీష్ముడు అట్లాగే చేస్తానని చెప్పి; ఆదరభరితుండు+అయి+ఇట్లు+అనియెన్= ప్రేమతో నిండినవాడై ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఓ భీష్మా! భూమి ఉన్నతంకాలం అపారకీర్తి నీకే రావాలని భావించి ఇట్లా చేశాను. నీ ధర్మ సంబంధమైన విజ్ఞాన విశేషాన్ని నీ మనుమలైన ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు శుభార్హులయ్యేటట్లుగా, ఇక్కడ పరివేష్టించి ఉన్న రాజుల పుట్టువు సఫలమయ్యేటట్లుగా సమస్త ధర్మవిశేషాలను బోధించే వాక్యాలను చెప్పవలసిం'దని శ్రీకృష్ణుడు కోరగా భీష్ముడు అట్లాగే చేస్తా'నని చెప్పి సంతోష భరితుడై ఇట్లా అన్నాడు.

సీ. **'ఎవ్వఁడు పుట్టిన నెల్ల మునీంద్రులు । నత్యంత సంప్రమోదాత్ము లైరి,**
పరమ ధార్మికులైన భరతుల యందును । నెవ్వరు నెవ్వని నెనయ లేరు,
సత్యంబు దాంతియు శౌచంబు శాంతియు । నలవడి యెవ్వనియందు వెలయుఁ,
బాత్రదానాధ్వర బంధు రక్షాది ధ । ర్మంబు లెవ్వనికిఁ బ్రియంబు లెపుడుఁ,

తే. **గామమున నైన విపులార్థ కారణమున । నైన భయమున నైనను నపథ వర్త**
నంబునకుఁ జొరఁ డెవ్వాఁడు నన్ను నేమి । యడుగఁ దలఁచె నా ధర్మజుం డడుగుఁ గాక!' **151**

ప్రతిపదార్థం: ఎవ్వఁడు పుట్టినన్= ఎవ్వడు పుట్టటం వలన; ఎల్ల ముని+ఇంద్రులున్= ముని శ్రేష్ఠులందరు; అత్యంత= మిక్కిలి; సంప్రమోద+ఆత్ములు+ఐరి= సంతోషాంతరంగు లయ్యారో; పరమ ధార్మికులు+ఐన= మిక్కిలి ధర్మగుణం కలవా రయిన; భరతుల యందునున్= భరత వంశంలో పుట్టిన వారి యందు; ఎవ్వరున్= ఎవ్వరు కూడా; ఎవ్వనిన్= ఎవ్వనితో; ఎనయన్+లేరు= సమానులు కారో; సత్యంబున్= సత్యమూ; దాంతియున్= కర్మేంద్రియాల నిగ్రహశక్తి; శౌచంబున్= శుచిత్వం; శాంతియున్= జ్ఞానేంద్రియాల నిగ్రహశక్తి; అలవడి= కలిగి; ఎవ్వనియందున్= ఎవ్వడితో అయితే; వెలయున్= ప్రకాశిస్తూ ఉంటాయో; పాత్రదాన+అధ్వర బంధురక్షా+ఆది= అర్హులైనవారికి దానాలు చెయ్యటం, యజ్ఞాలను బంధువులను రక్షించటం మొదలైన; ధర్మంబుల్= ధర్మాలు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; ఎవ్వనికిన్= ఎవడికయితే; ప్రియంబులు= ప్రియమయితే; కామమునన్+ఐనన్= కోరికవలన అయితేనేమీ; విపుల+అర్థ+కారణమునన్+ఐనన్= విస్తృత ధనం కారణం వలన అయినా; భయమునన్+ఐనన్= భయంవలన అయినా; అపథ వర్తనంబునకున్= చెడు మార్గ ప్రవర్తనకు; ఏ+వాఁడు= ఎవడయితే; చొరఁడు= ప్రవేశించడో; ఆ ధర్మజుండు= ఆ ధర్మరాజు; నన్నున్= నన్ను; ఏమి+అడుగన్+తలఁచెన్= ఏమి అడగాలని అనుకొంటున్నాడో; అడుగున్ కాక!= అది అడగవలసింది.

తాత్పర్యం: 'ఎవ్వడి జన్మకారణంగా సమస్త మునీంద్రులు సంతోషాంతరంగు లయ్యారో, పరమధార్మికు లని పేరు పొందిన భరత వంశీయులు కూడా ఎవ్వడితో సాటిరారో, సత్యం, శౌచం, శాంతి దాంతులు ఎవ్వడియందు ప్రకాశిస్తూ ఉంటాయో, పాత్రులైన వారికే దానం చేయటం, యజ్ఞాలనూ, బంధువులను, రక్షించటం మొదలైన ఉత్తమ ధర్మాలన్నీ ఎవడికి సంతోషాన్ని కలిగిస్తుంటాయో, కామంవలన కాని, అర్థంవలన కాని, భయంవలన కాని, అవినీతి మార్గంలో ఎవడయితే ప్రవేశించడో అటువంటి ఉత్తమగుణగణుడైన ధర్మరాజు అడుగదలచుకొన్న అన్నింటిని అడిగి సందేహ నివృత్తి చేసికొని తెలిసికొను గాక!'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనుటయు నతనితో నచ్యుతుండు. 152

ప్రతిపదార్థం: అనుటయున్= అని భీష్ముడు అనగానే; అతనితోన్= ఆ భీష్ముడితో; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: అని చెప్పగా భీష్ముడితో శ్రీకృష్ణుడు - (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'గురులను బంధుమిత్రులను గ్రూరశరంబులఁ గూల్చె నుగ్రతన్,
నరుల ననేకకోటుల రణంబునఁ దాఁ దెగటార్చెఁ గాన యి
క్కురుపతి నీ సమక్షమునకుం గదియం బుయిలోడెడుం గృపా
విరహిత కార్య కర్మరుఁడు వీఁ డని యాడుదొ యన్ తలంపునన్.' 153

ప్రతిపదార్థం: ఈ+కురుపతి= ఈ ధర్మరాజు; గురులను= గురువు లైన పెద్దలను; బంధుమిత్రులను= చుట్టాలను, స్నేహితులను; క్రూర శరంబులన్+కూల్చెన్= ఘోరమైన బాణాలతో పడగొట్టాడు; ఉగ్రతన్= కోపంతో; తాన్= ధర్మరాజు; నరులన్+అనేక కోటులన్= అనేకులైన మానవులను; తెగటార్చెన్= తెగ నరికాడు; కృపా విరహిత కార్య కర్మరుఁడు= దయారహిత కార్య నిర్వాహకుడు; వీఁడు+అని= ఇతడని; ఆడుదొ+అన్+తలంపునన్= అంటావేమో అనే భావంతో; నీ సమక్షమునకున్+కదియన్= నీ ఎదుటకు రావటానికి; పుయిలోడెడున్= సంకోచిస్తున్నాడు.

తాత్పర్యం: 'ఈ ధర్మరాజు యుద్ధంలో గురువులూ, బంధువులూ, మిత్రులూ అని లెక్కించక, భయంకరమైన బాణాలతో అందరినీ కూల్చాడు. అనేక మానవ కోటులను యుద్ధంలో సంహరించాడు. కనుక ఇతడు దయాంతఃకరణుడు కాడని అంటావేమో నని భావించి నీ ఎదుట పడటానికి సంకోచిస్తున్నాడు'.

వ. అనిన విని వాసుదేవునకు దేవవ్రతుం డి ట్లనియె. 154

ప్రతిపదార్థం: అనినన్+విని= అని చెప్పగా విని; వాసుదేవునకున్= శ్రీకృష్ణుడికి; దేవవ్రతుండు+ఇట్లు+అనియెన్= భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అనగా విని భీష్ముడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

సీ. 'విపులు కధ్యయన ప్రదానాధ్వరా । ద్యము లగు కర్మము లట్ల రాజు
లకు సంగరము తండ్రులను బుత్ర పౌత్రుల । గురుల నైనను బాపపరులఁ బోరఁ
జంపుట ధర్మంబు; సమయంబు విడిచి లో । భంబున నన్యాయ పథము నందు
వర్తించువారి నెవ్వరి నాహవంబునఁ । బొరివుచ్చఁగలిగినఁ బుణ్య కృతియ

ఆ. యట్లు గాక శోణితాంబుపూరముఁ గేశ । శైవలంబుఁ గాఁగ సమర భూమి
నక్కజపు నదీచయం బొనర్చిన రాజు । ధర్మవిదుఁ డనంగఁదగు ముకుంద!' 155

ప్రతిపదార్థం: ముకుంద!= ఓ శ్రీకృష్ణా!; విప్రులకున్= బ్రాహ్మణులకు; అధ్యయన ప్రదాన+అధ్వర+ఆద్యములు+అగు= వేదాధ్యయనమూ, దానమూ, యజ్ఞమూ మొదలైన; కర్మములు+అట్లు= కర్మాచరణ ఉన్న రీతిగానే; రాజులకున్ సంగరంబు= రాజులకు యుద్ధం; తండ్రులను; పుత్ర పౌత్రులన్= కుమారులను, మనుమలను; గురులన్+అయినను= గురువులయినప్పటికి; పాప పరులన్= దుర్మార్గులను; పోరన్+చంపుట= యుద్ధమునందు చంపటం; ధర్మంబు= ధర్మం; సమయంబు విడిచి= నీతి మార్గాన్ని వదలి; లోభంబునన్= అత్యాశతో; అన్యాయపథంబు నందు= అన్యాయ మార్గంలో; వర్తించువారిన్= నడుచుకొనే వారిని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎవ్వరిన్= ఎవ్వరినైనా; ఆహవంబునన్= యుద్ధంలో; పొరిపుచ్చన్+కలిగినన్= సంహరించగలిగితే; పుణ్యకృతియ= అదే పుణ్యకార్యం; అట్లున్+గాక= ఆ విధంగా కాకపోతే; సమర భూమిన్= యుద్ధభూమిని; శోణిత+అంబు పూరమున్= రక్త మనే జలప్రవాహం; కేశ శైవలంబున్+కాఁగన్= వెంట్రుక లనే నాఁచు అయ్యేటట్లుగా; అక్కజపు నదీ చయంబు+ఒనర్చినన్= ఆశ్చర్యకర మైన నదీ సమూ హాలుగా చేసిన; రాజు, ధర్మవిదుఁడు+అనంగన్+తగున్= రాజు ధర్మవేత్త అని అనటానికి అర్హుడైన వాడు.

తాత్పర్యం: 'ఓ కృష్ణా! వేదాధ్యయనం, దానపూర్వకమైన యాగాది కర్మాచరణం, బ్రాహ్మణులకు ఎట్లాగో అదే విధంగా రాజులకు యుద్ధం సహజం. పాపవర్తను లైన తండ్రులు, పుత్రులు, మనుమలు, గురువులు ఎవరినైనా యుద్ధంలో చంపటం రాజధర్మం. విధ్యుక్త ధర్మాన్ని వదలి లోభగుణంతో అన్యాయమార్గ వర్తనులైన వారిని ఎవరినైనా యుద్ధరంగంలో వధించటం పుణ్యకార్యమే. అంతే కాకుండా యుద్ధభూమిలో దుర్మార్గులను వధించి రక్త మనే జలపూరమూ కేశ పాశాలనే నాచూ నిండి ఉండే నదీసమూహాలుగా చేయటం ధర్మవిదుడైన రాజుకు అర్హమైన కార్యం'.

విశేషం: అలం: రూపకం.

భీష్మ్ముఁడు ధర్మరాజును సప్రేమంబుగా గారవించుట (సం. 12-55-1)

చ. **అన విని ధర్మసూనుఁడు కృతాంజలి యై తగ భీష్ము డాయ న**
ల్లన చని, కేలఁ బాదకమలంబు లమర్చి శిరంబు సోఁక వం
దన మొనరించినం, బిలిచి తా నభినందితుఁ జేసి మస్తకం
బునఁ గడు నర్మిలిం దనదు మో మిడి మూర్కొని సాదరంబుగన్. **156**

ప్రతిపదార్థం: అనన్ విని= భీష్ముడు శ్రీకృష్ణుడితో రాజ ధర్మాన్ని గూర్చి చెప్పగా విని; ధర్మ సూనుఁడు= ధర్మరాజు; కృత+అంజలిఐ= చేయబడిన నమస్కారం కలవాడై అంటే నమస్కరించి; తగన్= ఉచిత రీతిని; భీష్మున్= భీష్ముడిని; డాయన్+అల్లన చని= సమీపించటానికి మెల్లగా వెళ్ళి; కేలన్= తన చేతులతో; పాద కమలంబుల్+అమర్చి= (భీష్ముడి) పాద పద్మాలను పట్టుకొని; శిరంబు సోఁకన్= తల తాకేటట్లు; వందనము+ఒనరించినన్= నమస్కరించగా; పిలిచి; తాన్+అభినందితున్+చేసి= భీష్ముడు ధర్మరాజును సంతోషింపజేసి; మస్తకంబునన్+కడున్+నర్మిలిన్= ధర్మరాజు తలపై మిక్కిలి ప్రేమతో; తనదు మోము+ఇడి= తన ముఖ ముంచి; మూర్కొని= ఆఘ్రాణించి; స+ఆదరంబుగన్= ఆదరపూర్వకంగా.

తాత్పర్యం: ధర్మరాజు చేతులు మొగిడ్చి, భీష్ముడిని సమీపించి, ఆయన పాదపద్మాలను తన చేతులతో పట్టుకొని తన తలను తాకిస్తూ నమస్కరించగా, భీష్ముడు ధర్మరాజును అభినందించి, అతడి తలకు తన ముఖాన్ని ఆనించి ప్రేమతో ఆఘ్రాణించాడు. ధర్మరాజును ఆదరించాడు.

వ. **భీష్ముం డాభీమాగ్రజుం గూర్చుండం బనిచి, 'శంకింపక న న్నేమి యైన నడుగు' మనిన నమ్మహీపతి మాధవునకుం బ్రణమిల్లి, పారాశర్యప్రభృతి మునివరులకు నభివాదనం బాచరించి, సర్వకౌరవుల యనుమతి వడసి, యప్పితామహున కభిముఖుం డై నమస్కరించి యి ట్లనియె.** **157**

ప్రతిపదార్థం: భీష్ముండు+ఆ భీమ+అగ్రజున్+కూర్చుండన్+పనిచి= భీష్ముడు ఆ భీముడి అన్న అయిన ధర్మరాజును కూర్చుండగా నియమించి; శంకింపక= సంకోచం లేకుండా; నన్నున్+ఏమి+ఐనన్= నన్ను ఏదయినా; అడుగుము+అనినన్= అడుగు మని చెప్పగా; ఆ+మహీపతి= ఆ ధర్మరాజు; మాధవునకున్+ప్రణమిల్లి= శ్రీకృష్ణుడికి నమస్కరించి; పారాశర్యప్రభృతి= వ్యాసుడు మొదలైన;

మునివరులకున్= ముని శ్రేష్ఠులకు; అభివాదనంబు+ఆచరించి= మ్రొక్కి; సర్వ కౌరవుల+అనుమతి+పడసి= పెద్దవాడైన ధృతరాష్ట్రుడు మొదలుకొని సమస్త కౌరవుల అనుజ్ఞను పొంది; ఆ+పితామహునకున్+అభిముఖుండు+ఐ= ఆ తాత అయిన భీష్ముడికి ఎదురుగా కూర్చుండి, నమస్కరించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు (అడిగాడు).

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజును కూర్చుండ నియమించి 'సంకోచించకుండా ఏ మేమి అడుగదలచావో సమస్తమూ అడుగు' మని చెప్పాడు. ధర్మరాజు శ్రీకృష్ణుడికి నమస్కరించి వ్యాసాది మహామునిశ్రేష్ఠులకు ఏటికోళ్ళు పట్టి, ధృతరాష్ట్రాది సమస్త కౌరవుల ఆజ్ఞతో భీష్ముడికి అభిముఖుడై నమస్కరించి ప్రశ్నించాడు.

విశేషం: అభివాదనం: గోత్ర నామాదులు (ప్రవర) చెప్పి పాదాలు సోకేటట్లుచేసే నమస్కారం. దీనినే ఏటికోళ్ళు అంటారు. పెద్దలను దర్శించినపుడు తనగోత్రనామాలను చెబుతూ పాదాభివందనం చేయటం సంప్రదాయం. అట్లే ధర్మరాజు వ్యాసాది మహర్షులకు అభివాదనం చేశాడు.

చ. **'అరయఁగ రాజధర్మము సమాశ్రయ మై నడపుం ద్రివర్గమున్**
గురుతర మోక్షధర్మమునకుం దలఁపం దనప్రాప యూఁత భూ
వర! విను ఘోటకంబునకు వాగెయు, దంతికి నంకుశంబు నే
కరణి నివారకంబులు జగంబుల కట్టుల తాను నెమ్మెయిన్. **158**

ప్రతిపదార్థం: భూవర!= భూమికి భర్త అంటే రాజా - ఓ భీష్మా!; విను= వినుము; అరయఁగన్= పరిశీలించగా; రాజధర్మము= రాజుకు ఉండవసిన ధర్మం; సమ్+ఆశ్రయము+ఐ= చక్కటి ఆధారమై; త్రివర్గమున్= ధర్మం, అర్థం, కామం అనే మూడింటిని; నడపున్= కొనసాగిస్తుంది; తలఁపన్= ఆలోచించగా; గురుతర= మిక్కిలి గొప్పదైన; మోక్షధర్మమునకున్= పురుషార్థాలలో నాలుగవదైన మోక్షధర్మానికి; తన ప్రాప+ఊఁత= తన అండయే ఆశ్రయమూ, ఆధారమున్నూ; ఏ+మెయిన్= ఎట్లాగైనా; ఘోటకంబునకున్= గుర్రానికి; వాగెయున్= గుర్రపు కళ్ళేనికి తగిలించే పగ్గం; దంతికిన్= ఏనుగునకు; అంకుశంబున్= అంకుశం; ఏ కరణిన్= ఏ విధంగా; నివారకంబులు= నిరోధించగలవో; తాను= ఆ రాజధర్మం; జగంబులకున్+అట్టు= ఈ లోకాల కన్నింటికి అదే రీతి (నిరోధం).

తాత్పర్యం: 'ఓ తాతా! ప్రజాపరిపాలనా రూపమైన రాజధర్మమే శ్రేష్ఠమైనది. ఈ జీవలోకాని కెల్ల రాజధర్మమే ఆధారం. ధర్మార్థ కామాలు మూడు రాజధర్మంపై ఆధారపడి ఉన్నాయి. గుర్రానికి పగ్గమూ, ఏనుగుకు అంకుశం వలె లోకాన్ని శాసించేది రాజధర్మమే. ఇందులో సందేహం లేదు.

విశేషం: అలం: నిదర్శన.

క. **వ్యాకులతఁ బొంది రూపఱు। లోకస్థితి తొంటిరాజలోకముచే నం**
గీకృత మగు ధర్మ మనం। గీకృత మగునేని వీతకిల్బిషచరితా! **159**

ప్రతిపదార్థం: వీత కిల్బిష చరితా!= పోయిన పాపాలుగల చరిత్ర గలవాడా!, ఓ పవిత్రమైన చరిత్ర గల భీష్మా!; తొంటి= పూర్వపు; రాజలోకముచేన్= రాజసమూహాలచేత; అంగీకృతము+అగు= అంగీకరించబడినదైన; ధర్మము= ధర్మం; అనంగీకృతము+అగున్+ఏని= స్వీకరించి తదుచితంగా పరిపాలన సాగించక పోయినట్లైతే; లోకస్థితి= ఈ లోకపు పరిస్థితి; వ్యాకులతన్+పొంది= కలత చెంది; రూపఱున్= నాశనమైపోతుంది.

తాత్పర్యం: ఓ పరిశుద్ధ చరిత్రుడవైన తాతా! పూర్వ రాజులు అంగీకరించిన రాజధర్మాన్ని పాటించకపోతే ఈ లోకపు పరిస్థితి కలత చెంది నాశనమై పోతుంది.

క. తరణి వొడిచి తమము సెఱుచు । కరణిని లోకమునఁ గలుగు కల్మష మెల్లన్
ధరణిపతి ధర్మ మాత్మ । స్ఫురణంబునఁ జెఱుచు విమలబోధనచరితా! 160

ప్రతిపదార్థం: విమల బోధన చరితా!= నిర్మల జ్ఞాన చరిత్రుడా, ఓ తాతా!; తరణి+పొడిచి= సూర్యుడు ఉదయించి; తమము+చెఱుచు కరణిని= చీకటిని పోగొట్టేటట్లు; ధర్మము+ఆత్మ స్ఫురణంబునన్= ధర్మం మనస్సులో కలగగానే; ధరణిపతి= రాజు; లోకమునన్+కలుగు= ఈ లోకంలో ఉన్నట్టి; కల్మషము+ఎల్లన్= పాపమంతటినీ; చెఱుచున్= తొలగిస్తాడు, పోగొట్టుతాడు.

తాత్పర్యం: ఓ పితామహా! సూర్యోదయంతో చీకటి తొలగిపోయేటట్లు లోకంలోని పాపాలన్నీ రాజధర్మంచేతనే నాశనమౌతాయి.

విశేషం: అలం: ఉపమ. శ్లో॥ **"ఉదయన్ హి యథా సూర్యో నాశయ త్యశుభం తమః**
రాజ ధర్మ స్తథా లోక్యా మాక్షిప త్యశుభాం గతిమ్"

అనే సంస్కృత మూల శ్లోకానికి తిక్కన అనువాదం పై పద్యం. దీనికి ఆధారంగా ఉన్న స్మృతిని నీలకంఠీయం ఉదాహరించింది.

"రాజభిః కృతదండాస్తు శుద్ధ్యంతి మలినా జనాః
కృతార్థాశ్చ తతో యాంతి స్వర్గం సుకృతినో యథా॥

ఆ. అనఘ! నీదు బుద్ధి యతిలోక మగుటయుఁ । దెలిసికొనఁగ నాకు వలయునట్టి
ధర్మకోటి నీవ తగఁ జెప్ప వినవల । యుటయుఁ జెప్పె నంబుజోదరుండు. 161

ప్రతిపదార్థం: అనఘ!= పాప రహితుడవైన ఓ తాతా!; నీదు బుద్ధి= నీ బుద్ధి; అతిలోకము+అగుటయున్= లోకాతీతం- అసామాన్యం అంటే మానవులకు ఎవ్వరికీ లేని వైశిష్ట్యాన్ని కలిగి ఉండటం చేత; నాకున్; తెలిసికొనఁగన్= తెలిసికొనటానికి; వలయునట్టి= అవసరమైన; ధర్మకోటి= ధర్మాల సమూహం; నీవ= నీవే; తగన్+చెప్పన్= తగిన రీతిగా చెప్పగా; వినవలయుటయున్= నేను వినవలసింది గాను; అంబుజ+ఉదరుండు= పద్మం నాభియందు గలవాడైన ఆ శ్రీకృష్ణుడు; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'నిర్మలుడవైన ఓ తాతా! నీవు లోకాతీతమైన బుద్ధిసంపన్నుడ వనీ, నేను తెలిసికొనదగిన రాజధర్మాలు నీవు చెప్పగా నేను గ్రహించాలనీ ఆ శ్రీకృష్ణుడి నిర్ణయం. కాబట్టి సమస్త రాజధర్మాలను వివరించుమని ప్రార్థిస్తున్నాను.

విశేషం: .సమస్త రాజ ధర్మాలను అతిలోకజ్ఞుడైన భీష్ముడు ఒక్కడే చెప్పటానికి అర్హుడని విదితం.

ఆ. ధర్మవిదులు రాజు ధర్మ స్వరూపుఁగాఁ । జెప్ప విందుఁ దద్విశేషవృత్తి
భరముగాఁ దలంతు నరవర! చెప్పవే । మున్ను రాజ ధర్మముల తెఱంగు.' 162

ప్రతిపదార్థం: నరవర!= రాజశ్రేష్ఠుడవైన ఓ పితామహా!; రాజు ధర్మస్వరూపున్+కాన్= సమస్త ధర్మమే రాజుగా రూపం ఎత్తినట్లు; ధర్మవిదులు= ధర్మ స్వరూపాన్ని తెలిసిన వేత్తలు; చెప్పన్= తెలుపగా; విందున్= విన్నాను; తద్+విశేష వృత్తి= ఆ విశిష్ట మార్గం

-అంటే ఆ రాజ ధర్మమార్గం; భరముగాన్= బరువైన దానిగా అంటే ఆ రాజ ధర్మ నిర్వహణం కష్టతరమని; తలంతున్= భావిస్తున్నాను; మున్ను= ముందుగా; రాజధర్మములు= రాజు అనుసరించదగిన ధర్మాల యొక్క; తెఱంగు= విధానాన్ని; చెప్పవే= వివరించుము.

తాత్పర్యం: ఓ తాతా! రాజు ధర్మ స్వరూపు డని ధర్మవేత్తలు చెప్పగా విన్నాను. కానీ, ఆ రాజ ధర్మ నిర్వహణం అతికష్ట సాధ్యమని భావిస్తాను. కాబట్టి అటువంటి రాజ ధర్మరీతులను ముందుగా వివరించ గోరుతున్నాను.

చ. అనుటయు నాపగేయుఁడు మహత్త్వ సమంచిత మైన ధర్మము
న్వినుత విధాతృభావ మహనీయుఁడు గృష్ణుని, వేదమూర్తి నాఁ
జను ధరణీసురావలిఁ బ్రసక్తిఁ దలంచి నమస్కరించి, య
జ్జనపతి వక్త్ర మాదర రసప్లుత దృష్టిని జూచి యిట్లనున్. 163

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధర్మరాజు ప్రార్థించగా; ఆపగేయుఁడు= గంగాపుత్రుడైన భీష్ముడు; మహత్త్వ సమంచితము+ఐన= మహిమతో కూడుకొన్న; ధర్మమున్= ధర్మాన్ని; వినుత= ప్రస్తుతి కొన్న; విధాతృభావ మహనీయుఁడు= బ్రహ్మభావన చేత మహాత్ముడైన; కృష్ణునిన్= శ్రీకృష్ణుడిని; వేదమూర్తి నాన్+చను= వేదాల స్వరూపమో అనేటట్లు ఒప్పుతూ ఉన్న; ధరణీసుర+ఆవలిన్= భూదేవుల అంటే బ్రాహ్మణుల యొక్క సమూహాన్ని; ప్రసక్తిన్+తలంచి= ప్రస్తావ వశాన భావించి; నమస్కరించి; ఆ+జనపతి వక్త్రము= ఆ ధర్మరాజు ముఖాన్ని; ఆదర రసప్లుత దృష్టిని+చూచి= ఆదరమనే రసం స్రవించే చూపుతో చూచి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: రాజధర్మాలను తెలుపు మని ధర్మరాజు కోరగా భీష్ముడు మహిమాన్వితమైన ధర్మాన్ని, బ్రహ్మకల్ప స్వరూపుడైన శ్రీకృష్ణుడిని, వేదాలే రూపు దాల్చిన బ్రాహ్మణసమూహాన్ని స్మరించి, నమస్కరించి, ఆదర రసప్రవాహ దృష్టితో ధర్మరాజు ముఖాన్ని అవలోకించి ఇట్లా చెప్పాడు.

విశేషం: ధర్మం ప్రధానమైంది. దాని సవిస్తర ప్రశంస భీష్ముడు చేయబోతున్నాడు. కనుక మొదట ధర్మాన్ని స్మరించాడు. ఆ వెనుక ఆ సమస్త ధర్మానికి మూలమైన శ్రీకృష్ణుడిని, ఆ తరువాత వేదమూర్తులైన బ్రాహ్మణులను భీష్ముడు తలంచి, నమస్కరించటంలో ఔచిత్యమున్నది.

"నమో ధర్మాయ మహతే నమః కృష్ణాయ వేధసే ।
బ్రాహ్మణేభ్యో నమస్కృత్య ధర్మాన్ వక్ష్యామి శాశ్వతాన్" ॥

అని మూలం. ఇందులో తిక్కన ఆయా విశేషణాలతో 'అజ్జనపతి వక్త్రమాదర రసప్లుత దృష్టిని జూచి' అని కల్పించాడు. దీనివలన భీష్మునికి ధర్మజునిపై గల ప్రేమాదరాలు విదితమవుతాయి.

క. 'నృపధర్మము లన్నియు నీ । కుపదేశించెద విసంశయోక్తుల; మఱియున్
విపులఫలవంత మగు ధ । ర్మపథంబును నడుగునెడఁ గరము వివరింతున్. 164

ప్రతిపదార్థం: నీకు, నృప ధర్మములు+అన్నియున్= నీకు రాజ ధర్మాలన్నింటిని; విసంశయ+ఉక్తులన్= సందేహం లేనట్టి మాటలతో; ఉపదేశించెదన్= బోధిస్తాను; మఱియున్= ఇంకా; విపుల ఫలవంతము+అగు= విస్తారమైన ప్రయోజనకారిఅయిన; ధర్మపథంబునున్= (రాజధర్మంతోపాటు ఆపద్ధర్మం, మోక్షధర్మం మొదలైన) సమస్త ధర్మమార్గాలను; అడుగు+ఎడన్= (నీవు ఆయా సందర్భాలలో) అడిగేటప్పుడు; కరమున్= మిక్కిలిగా; వివరింతున్= విస్పష్టం చేస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజ ధర్మాలన్నింటిని ఏ విధమైన సందేహమూ లేని వాక్యాలతో విస్పష్టంగా వివరిస్తాను. అంతేగాక ఆయా సందర్భాలలో నీవు అడిగిన ఎంతో ఫలవంతమైన ఆపద్ధర్మ, మోక్షధర్మాదులను అత్యంత ప్రయోజనాత్మకంగా తెలుపుతాను.

వ. అవహితమతివై యాకర్ణింపుము. 165

ప్రతిపదార్థం: అవహిత మతివి+ఐ= అవధాన చిత్తుండవై (ఏకాగ్రచిత్తంతో); ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: కాబట్టి ఏ విధమైన వైకల్యమూ లేని ఏకాగ్రచిత్తుడవై వినుము.

ఆ. మేలు దనకుఁ గోరు మేదినీశుఁడు మున్ను। దేవతలకు భూమిదేవతలకుఁ
బూజ యాచరించు నోజ యత్నముఁ జేయ। వలయు రెండు గార్యఫలకరములు. 166

ప్రతిపదార్థం: తనకున్ మేలు+కోరు= తనకు శుభాన్ని కోరుకొనే; మేదినీ+ఈశుఁడు= భూమికి భర్త అయిన రాజు; మున్ను= ముందు; దేవతలకున్= దేవతలకును; భూమిదేవతలకున్= భూమిపై దేవతలైన బ్రాహ్మణులకు; ఓజన్= క్రమంగా; పూజ+ఆచరించు= పూజచేయటానికి; యత్నమున్+చేయవలయున్= ప్రయత్నించవలసి ఉన్నది; రెండున్= దైవతపురుషకారాలు రెండూ; కార్యఫల కరములు= (తలచిన) కార్యసాధనకు ప్రయోజన కారులు.

తాత్పర్యం: తనకు శుభం కలగాలని కోరుకొనే రాజు, మొట్టమొదట దేవతలకు, భూదేవతలకు పూజచేయవలసిన ఆవశ్యకత ఎంతేని ఉన్నది. దానిని విస్మరించక ప్రయత్నించాలి. దేవతల అనుగ్రహం, పురుషప్రయత్నం రెండూ రాజుకు కార్యసాధనకు ప్రయోజనకారణా లని గుర్తించాలి.

మ. విను ముద్యోగము రెంటి యందుఁ బర ముర్వీనాథ! యుద్యోగవం
తునకున్ దైవము దోడ్పడంగ ఫలసిద్ధుల్ సేకుఱున్; మానుషం
బున కొక్కొక్కెడ సిద్ధి దప్పిన వగల్ వొందంగరానీక య
ప్పని దైవోపహతంబుగాఁ గనుట భూపాలార్హ వృత్తంబగున్. 167

ప్రతిపదార్థం: ఉర్వీనాథ!= భూభర్త అయిన ఓ ధర్మరాజా! వినుము= ఆలకించుము; ఉద్యోగము= మానవప్రయత్నం; రెంటియందున్+పరము= దైవత పురుష కారాల రెంటిలోనూ శ్రేష్ఠమైనది; ఉద్యోగవంతునకున్= ప్రయత్నం చేసే రాజునకు; దైవము+తోడ్పడంగన్= భగవంతుడు సహాయంచేయటం వలన; ఫలసిద్ధుల్+చేకుఱున్= ప్రయోజనమూ; కోరిక లీడేరటం, సమకూరుతాయి; మానుషంబునకున్+ఒక్క+ఒక్క+ఎడన్= మానవ ప్రయత్నానికి ఒక్కొక్క సందర్భంలో; సిద్ధి+తప్పినన్ సిద్ధించక తప్పిపోతే; వగల్+పొందంగన్+రానీక= దుఃఖం పొందనీకుండ; ఆ+పని= కార్యం సిద్ధించకపోయిన ఆ కార్యం; దైవ+ఉపహతంబుగాన్+కనుట= భగవంతుడిచేత నాశనం చేయబడ్డ దానిగా తెలిసికొనటం; భూపాల+అర్హవృత్తంబు+అగున్= రాజులకు ఉచితమైన వర్తనమవుతుంది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! దైవత పురుష కారాలలో మానవప్రయత్నం శ్రేష్ఠమైనది. మానవప్రయత్నం మానక చేసే రాజుకు భగవంతుడు సహాయపడతాడు. అప్పుడు రాజుకు ఫలసిద్ధులు చేకూరుతాయి. కొన్ని సందర్భాలలో మానవప్రయత్నం ఫలించకపోవటమూ జరుగవచ్చును. అటువంటి సమయంలో దుఃఖించక, దైవోపహతంగా భావించటం సముచితరాజధర్మం.

విశేషం: దైవానుగ్రహమూ, మానవ ప్రయత్నమూ - ఈ రెంటిలో మానవ ప్రయత్నమే శ్రేష్ఠమైనది. అట్లా ప్రయత్నించే మానవుడికి ఫలసిద్ధులు చేకూరుతాయి. కొన్ని సందర్భాలలో ఫలించకపోతే అందుకు కారణం మానవ ప్రయత్న లోపం కాక భగవంతుడే కారణ మని భావించటం రాజధర్మ మని భీష్ముడి వివరణలోని సారాంశం.

క. దాంతియు విజితాత్మత్వము। శాంతియు శీలంబుఁగలుగు జగతీశుఁడ శ్రీ
మంతుండు యశస్వియు నై। యెంతయు సౌఖ్యంబు నొందు నిభపురనాథా! 168

ప్రతిపదార్థం: ఇభపుర నాథా!= హస్తినాపురానికి అధిపతి వయిన ఓ ధర్మరాజా!; శాంతియున్= ఇంద్రియ నిగ్రహమూ; విజిత+ఆత్మత్వమున్= జయించబడిన ఆత్మత్వాన్ని కలిగి ఉండటం; శాంతియున్= కామక్రోధాది రాహిత్యమూ; శీలంబున్+కలుగు= మంచి నడత కలిగినట్టి; జగతీ+ఈశుఁడు= జగత్తునకు అధిపతి అయిన రాజే; శ్రీమంతుండున్= సంపదగలవాడూ; యశస్వియున్+ఐ= కీర్తిమంతుడూ అయి; ఎంతయున్= మిక్కిలి; సౌఖ్యంబున్+ఒందున్= సుఖాలను పొందగలడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఇంద్రియ నిగ్రహమైన దాంతీ, ఆత్మజయమూ, మనోనిగ్రహమైన అంటే కామక్రోధాది రహితమైన శాంతీ, మంచి నడత కలిగినట్టి రాజు మాత్రమే శ్రీమంతుడూ, కీర్తిమంతుడూ అయి సమస్త సౌఖ్యాలను పొందగలడు'.

తే. ప్రకృతు లేడింటి నెఱి నడపంగ వలయుఁ। దాని కార్జవ సత్యముల్ దావలములు;
దండనీతి విధాన మంతటికి రక్ష। యర్హ మగు మెల్పుతోఁ జేయ నది వెలుంగు. 169

ప్రతిపదార్థం: ప్రకృతులు+ఏడింటిన్= ప్రకృతులు - స్వామి, అమాత్యుడు, సుహృత్తు, కోశం, రాష్ట్రం, దుర్గం, బలం - అనే ఏడింటిని; నెఱిన్= క్రమంగా (న్యాయంగా); నడపంగన్+వలయున్= నడిపించవలసి ఉన్నది; దానికిన్+ఆర్జవ సత్యముల్= (ప్రకృతు లేడింటిని క్రమంగా నడపటానికి) ఋజుభావం, సత్య మనేవి; తావలములు= ఆధారాలు (మూలాలు); అంతటికిన్= ఈ పై పేర్కొన్న సర్వస్వానికి; దండనీతి విధానము= కామందకాద్యర్థశాస్త్రపద్ధతి; రక్ష= సంరక్షకమైనది; అది; అర్హము+అగు= తగినట్టి; మెల్పుతోన్+చేయన్= జాగరూకతతో (నేర్పుతో) చేస్తే; వెలుంగున్= ప్రకాశిస్తుంది.

తాత్పర్యం: స్వామి, అమాత్యుడు, సుహృత్తు, కోశం, రాష్ట్రం, దుర్గం, బలం అనే ఏడు ప్రకృతులను రాజు గుర్తించి, సక్రమంగా నిర్వహించవలసి ఉన్నది. ఆ నిర్వహణకు రాజులో ఋజుభావమూ, సత్యమూ, ఆధార భూతమై ఉండాలి. దీనికి అంతటికి కామందకాదులు చెప్పిన అర్థశాస్త్ర ప్రకారం రాజుకు దండనీతి రక్ష. దానిని నేర్పుతో నిర్వహిస్తే విశిష్టంగా ప్రకాశించగలడు.

విశేషం: రాజుకు ఆర్జవ సత్యాలు ముఖ్యం. కామందకుడనే ముని ఆంగరిష్ఠుడనే రాజుకు తెలిపిన దండనీతిని తెలిసికొని ఉండవలసి ఉన్నది. జాగరూకుడైన రాజు కావించే తన్నిర్వహణంతో రాజనీతి విశిష్ట మవుతుం దని భీష్ముడి మాటల సారాంశం.

వ. అదియును బుద్ధిమంతులు బ్రాహ్మణులవలనం బ్రయోగింప; రయ్యర్థంబునకు మనువాక్యంబులు గల; వాకర్ణింపుము. 170

ప్రతిపదార్థం: అదియును= దానితోపాటు; బుద్ధిమంతులు= నేర్పరులు; బ్రాహ్మణుల వలనన్+ప్రయోగింపరు= బ్రాహ్మణుల పట్ల కొనసాగించరు; ఆ+అర్థంబునకున్= ఆ విషయానికి; మను వాక్యంబులు+కలవు= మనువు చెప్పిన నీతి వాక్యాలు ఉన్నాయి; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: పై రాజధర్మానుగుణులైన రాజులు నేర్పరులైతే బ్రాహ్మణుల విషయంలో దీన్ని కొనసాగించరు. ఈ అర్థాన్ని వివరించే మనువు చెప్పిన వాక్యాలను వినుము.

ఆ. ఇనుము ఱాత, నీర ననలంబు, విప్రుల। వలన రాజు, లుద్భవంబుఁ బొందు
టిది నిజంబు; తత్సమిద్ధ తేజము లెందుఁ। జెల్లుఁ బుట్టినెడలఁ జేటు నొందు. 171

ప్రతిపదార్థం: ఱాతన్= రాతివలన; ఇనుమున్= ఇనుమూ; నీరన్= నీటితో; అనలంబున్= అగ్నీ; విప్రుల వలనన్= బ్రాహ్మణులవలన; రాజులు= రాజులును; ఉద్భవంబున్+పొందుట+ఇది నిజంబు= జన్మించటమనేది వాస్తవం; తద్+సమ్+ఇద్ధతేజంబులు= వాటియొక్క పరిశుద్ధమైన కాంతులు; ఎందున్+చెల్లున్= ఎక్కడైనా ప్రకాశించగలవు; పుట్టిన+ఎడలన్+చేటున్+ఒందున్= కానీ జన్మస్థానాలలో నాశనమవుతాయి.

తాత్పర్యం: రాతివలన ఇనుమూ, నీటివలన అగ్ని, బ్రాహ్మణులవలన రాజులు జన్మించటం నిజమే. వాటి పరిశుద్ధ కాంతులు అన్నిచోట్ల ప్రకాశిస్తాయి. కాని, జన్మస్థానాలలో మాత్రం ప్రవర్తించవు.

విశేషం: ఒకచోట పుట్టి ఇతరత్రా విశిష్టంగా వెలుగవచ్చును. కాని, తమ జన్మస్థానంలో వాటి శక్తి ఉపకరించదు. దీని వివరణ తరువాతి పద్యంలో ఉన్నది.

క. శిలఁ ద్రెంపఁబోయి యినుమును। జలములు గొని కాల్వఁగడఁగి చని యనలంబుం
బొలియును; రాజును విప్రుల। కలిగి చెఱుపఁబోయి తాన యనయంబుఁ జెడున్. 172

ప్రతిపదార్థం: శిలన్+త్రెంపన్+పోయి= రాతిని ఖండింపబోయి; ఇనుమును= ఇనుమూ; జలములు+కొని= నీటిని గ్రహించి; కాల్వన్+కఁడగి చని= కాల్చివేయ ప్రయత్నించబోయి; పొలియును= అవే నశించిపోతాయి; రాజును= రాజూ; విప్రులకున్+అలిగి= బ్రాహ్మణులపై కోపగించి; చెఱుపన్+పోయి= నాశనంచేయ ప్రయత్నించి; అనయంబున్= ఎప్పుడైనా; తాన= తానే; చెడున్= నాశనమవుతాడు.

తాత్పర్యం: రాతిలోనుండి పుట్టిన ఇనుము రాతిని ఖండించబోయి తానే పాడవుతుంది. నీట పుట్టిన నిప్పు ఆ నీటిని గ్రహించి కాల్చబోయి తానే నశిస్తుంది. అదే రీతిగా బ్రాహ్మణులను నాశనం చేయదలిస్తే రాజే నశిస్తాడు.

విశేషం: ఈ న్యాయాన్ని అనుసరించి మూలచ్ఛేదం చేయబోతే ఆ చేయప్రయత్నించిన వారే నశిస్తారు. ముఖ్యంగా రాజు కిది చక్కటి నిరూపణ.

శా. ఈ వాక్యంబులు రెండుఁ జిత్తమున నీ వెల్లప్పుడున్ నిల్పి భూ
దేవశ్రేణియెడం గృపాన్వితుఁడవై దీప్తార్హ దండంబు స
ద్భావం బొప్పఁగ నొండెడన్ నడపు శాంతక్ష్మాసురోదార జి
హ్వా విశ్రాంతము బ్రహ్మ మట్లగుట దైవం బండ్రు విప్రున్ బుధుల్. 173

ప్రతిపదార్థం: ఈవు+ఎల్లప్పుడున్= నీవు అన్ని సమయాలలోను; ఈ వాక్యంబులు రెండున్= పైని పేర్కొన్న న్యాయాలను రెండింటిని; చిత్తమునన్+నిల్పి= నీ మనస్సులో ఉంచుకొని; భూదేవ శ్రేణి యెడన్= బ్రాహ్మణులయొక్క సమూహం పట్ల; కృపా+అన్వితుఁడవు+ఐ= దయ కలవాడవై; దీప్త+అర్హదండంబున్= ప్రకాశిస్తూ అర్హమైన (తగిన) రాజదండమూ; సద్భావంబు+ఒప్పఁగన్= సాధు భావం ఒప్పునట్లుగా; ఒండు+ఎడన్+నడపు= మరొకచోట ప్రవర్తింప చేయవలసింది; బ్రహ్మము= వేదము; శాంత= శాంతగుణ శీలురైన; క్ష్మాసుర= భూదేవతలు బ్రాహ్మణులయొక్క; ఉదార జిహ్వా= గొప్పదైన నాలుకపై; విశ్రాంతము= విశ్రమిస్తూ ఉంటుంది; అట్లు+అగుటన్= అలా ఉండటం చేత; బుధుల్= విద్వాంసులు; విప్రున్= బ్రాహ్మణుడిని; దైవంబు అండ్రు= దేవత అంటారు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! పైన పేర్కొన్న రెండు న్యాయాలను మనస్సులో ఉంచుకొని బ్రాహ్మణుల పట్ల దయాంతఃకరణుడవై ఉండుము. సద్భావంతో అర్థవంతమైన రాజదండమును, ఇతరులపట్ల ప్రవర్తింపజేయుము. శాంత స్వరూపులైన బ్రాహ్మణుల నాల్కలపై వేదాలు ఉంటాయి. కనుకనే విద్వాంసులు బ్రాహ్మణులను దేవతలుగా పేర్కొన్నారు.

వ. విప్రుని దండించు నెడలునుం గలవు; శుక్రుండును జెప్పినవాఁడు; వినుము. 174

ప్రతిపదార్థం: విప్రునిన్= బ్రాహ్మణుడిని; దండించు= శిక్షించే; ఎడలునున్+కలవు= అవకాశాలూ ఉన్నాయి. శుక్రుండునున్+చెప్పిన వాఁడు= శుక్రాచార్యుడు కూడా వివరించాడు; వినుము.

తాత్పర్యం: బ్రాహ్మణులను శిక్షించే పట్టులూ ఉన్నాయి. అట్లాంటి సందర్భాలను శుక్రాచార్యుడు వివరించాడు. చెప్పుతాను వినుము.

భీష్ముఁడు ధర్మరాజునకు విప్రులలో దండార్హుల నిరూపించుట (సం. 12-56-29)

క. శాంతుఁడు గా కని నాయుధ। వంతుం డై కవియు విప్రు వసుధేశుఁడు వే
దాంతి నయిన హింసించుట। యెంతయు ధర్మంబు; శ్రుతులు నిట్లని చెప్పున్. 175

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధంలో; ఆయుధ వంతుండు+ఐ= శస్త్రాస్త్రాలు ధరించి; శాంతుఁడు+కాక= శాంతం లేక; కవియు= ఎదుర్కొనే; వేదాంతిన్+అయినన్= వేదాంతినైనా; విప్రున్= బ్రాహ్మణుడిని; వసుధా+ఈశుఁడు= భూభర్త అయిన రాజు; హింసించుట= సంహరించటం; ఎంతయున్+ధర్మంబు= మిక్కిలి ధర్మం; ఇట్లు+అని= ఇదే ధర్మమని; శ్రుతులు చెప్పున్= వేదాలు చెప్పుతాయి.

తాత్పర్యం: యుద్ధంలో శస్త్రాస్త్రాలు ధరించి కోపోద్రిక్తుడై ఎదుర్కొనే బ్రాహ్మణుడు వేదాంతి అయినప్పటికీ అతడిని సంహరించటం రాజుకు పరమధర్మమని వేదాలు చెబుతున్నాయి.

క. గురుతల్పగు, భ్రూణహనున్,। నరేంద్ర విద్వేషి, బ్రాహ్మణఘ్నునిఁ బెలుచన్
ధరణి వెడల నడువ వలయు;। శరీర నిగ్రహము సేయఁ జన దెయ్యెడలన్. 176

ప్రతిపదార్థం: గురుతల్పగున్= గురు భార్యాగతుడయ్యే వాడిని; భ్రూణహనున్= శిశుహంతను; నర+ఇంద్ర విద్వేషిన్= రాజును ద్వేషించే వాడిని; బ్రాహ్మణఘ్నునిన్= బ్రాహ్మణులను సంహరించే వాడిని; పెలుచన్= కఠినంగా; ధరణి వెడలన్+నడువ వలయున్= తన రాజ్యం నుండి వెడలగొట్టవలసి ఉన్నది; ఏ+ఎడలన్= ఎట్లాంటి పరిస్థితిలో అయినా; శరీర నిగ్రహము+చేయన్+చనదు= శరీరాన్ని నాశనం చేయరాదు.

తాత్పర్యం: గురుతల్పగుడూ, శిశుహంతా, రాజద్వేషీ, బ్రాహ్మణహంతా అయిన బ్రాహ్మణుడిని రాజు తన రాజ్యం నుండి బహిష్కరించాలి. అంతేగాని అట్లాంటి వారిని వధించరాదు.

వ. దుర్గంబు లనేక విధంబులు గలవు; వానియందు నర దుర్గంబు వరిష్ఠంబు గావున వర్ణంబులు నాలిగింటి మీఁదను మేదినీశ్వరుండు దయ గలుగవలయుఁ; గేవల క్షమావంతుం డగుటకు సాదుటేనుంగు చందంబై యుండు; నివ్విషయంబున బృహస్పతి వచనంబులు గలవు; తదీయార్థంబులు వివరించెద. 177

ప్రతిపదార్థం: దుర్గంబులు+అనేక విధంబులు+కలవు= కోటలు అనేక పద్ధతులలో - ఆరువిధాలుగా ఉన్నాయి; వానియందున్= ఆ ఆరురకాల దుర్గాలలో; నరదుర్గంబు= చుట్టూ చతురంగ బలాలు గల కోట; వరిష్ఠంబు= మిక్కిలి శ్రేష్ఠమైనది; కావునన్= అందుచేత;

వర్ణంబులు నాలిగింటి మీఁదను= బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాల మీదా; మేదినీ+ఈశ్వరుండు= భూమి భర్త అయిన రాజు; దయ+కలుగ వలయున్= దయ కలిగి ఉండాలి; కేవల క్షమావంతుండు+అగుటకున్= కేవలం క్షమాగుణం కలిగి ఉండటం; సాదు+టు+ఏనుగు చందంబు+ఐ+ఉండున్= సాధువైన ఏనుగువలె ఉన్నట్లవుతుంది; ఈ+విషయంబునన్= ఈ వివరణకు; బృహస్పతి వచనంబులు+కలవు= బృహస్పతి వాక్యాలు ఉన్నాయి; తదీయ+అర్థంబులు= ఆ బృహస్పతి వచనాలకు అర్థాలను; వివరించెదన్= వివరిస్తాను.

తాత్పర్యం: దుర్గాలు పలు రీతులు. వాటిలో నరదుర్గం శ్రేష్ఠమైనది. అందువలన రాజు నాలుగు వర్ణాల ప్రజల మీదను దయాహృదయుడై ఉండటం అవసరం. అయితే రాజు కేవలం దయావంతు డైతే మాత్రం ఏనుగు సాధువై ఉన్నట్లే. ఈ వివరణకు తగిన బృహస్పతి వచనాలు ఉన్నాయి. ఆ వాక్యాలను వివరిస్తాను.

విశేషం: దుర్గంకోట - ఆరు రకాలు: ధన్వదుర్గం (నలుప్రక్కలా అయిదామడల మరుభూమిగల కోట), మహీదుర్గం (చుట్టూ మట్టి దిబ్బలు గల కోట), వార్‌క్షదుర్గం (చుట్టూ వృక్షాలుగల కోట), నరదుర్గం (చుట్టూ చతురంగ బలాలుగల కోట), జలదుర్గం (చుట్టూ నీరుగల కోట), గిరి దుర్గం (చుట్టూ కొండలు గల కోట).

సీ. మేదినీపతి యతిమృదువైన, మావంతుఁ । డేనుంగు నెట్లట్ల యెక్కి యాడఁ
జూచుఁ దేఁకువ సెడి నీచపుఁ బ్రజఃక్రూరుఁ । డగునేని లోకంబు బెగడు గుడుచుఁ
గాన వసంతంబుభానుని చాడ్పునఁ । దగియెడు పాటితో ధరణి ప్రజల
నుచితవర్తనముల నొందించునది; యిది । రాజ ధర్మములకు రాజు సుమ్ము;

ఆ. కౌరవేంద్ర! యదియుఁ గాక దండము పరీ । క్షా విశుద్ధి పూర్వకముగ వలయుఁ
దనతలంపు వెంటఁ దమకించి ప్రజకు నొ । వ్వుగఁ జరించుటయును దగదు పతికి. 178

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= కురువంశ రాజశ్రేష్ఠుడైన ఓ ధర్మరాజా!; మేదినీపతి= పుడమికి అధిపతి అయిన రాజు; అతి మృదువు+ఐనన్= మిక్కిలి మెత్తని వాడైతే; నీచము+ప్రజ= అధములైన ప్రజలు; తేఁకువ+చెడి= భయంలేక; మావంతుండు+ఏనుంగున్+ఎట్లు+అట్లు+ఎక్కి+ ఆడన్+చూచున్= మావటీడు ఏనుగుపైకి ఏ విధంగా అయితే ఎక్కి ఆడతాడో అట్లాగే ఆడటానికి ప్రయత్నిస్తాడు; క్రూరుఁడు+అగున్+ఏని= (రాజు) భయంకరుడైతే; లోకంబు= ఈ జగత్తు; బెగడు+కుడుచున్= భయపడుతుంది కానన్= అందుచేత; వసంతంబు భానుని చాడ్పునన్= వసంత ఋతువులోని సూర్యుడివలె; తగియెడు పాటితోన్= అవసరమైనంత మోతాదుతో; ధరణి ప్రజలన్= పౌరులను; ఉచిత వర్తనములన్+ఒందించునది= తగిన నడవడికలతో పాలించవలసింది; ఇది= ఈ పద్ధతి; రాజ ధర్మములకున్= రాజు ఆచరించవలసిన ధర్మాలకు; రాజు సుమ్ము!= శ్రేష్ఠమైనది సుమా!; అదియున్+కాక= అంతేకాక; దండము= చతురుపాయాలైన సామ దాన భేద దండోపాయాలలో చివరిదైన దండోపాయం; పరీక్షా విశుద్ధి పూర్వకముగన్ వలయున్= బహు జాగరూకతతో పరిశీలించాకే చేయవలసింది; పతికిన్= రాజునకు; తన తలంపు వెంటన్= తనకు తోచిన వెంటనే; తమకించి= త్వరపడి, వేగిరపడి; ప్రజకు నొవ్వగన్= ప్రజలకు బాధాకరంగా; చరించుటయును+తగదు= నడుచుకొనటం కూడా సముచితం కాదు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! వినుము. శాంతపరు డైన రాజు కోపరహితమైన ఏనుగువలె నీచులకు వశమవుతాడు. అట్లాంటి ఏనుగును మావటీడు తన ఇష్టానుసారం ఆడించునట్లే శాంతపరుడైన రాజును నీచప్రజలు ఆడిస్తారు. రాజు కోపస్వభావుడైతే ప్రజలు భయపడి పారిపోతారు. కాన, రాజు వసంత ఋతువులో సూర్యుడివలె సమభావంతో ప్రజలను పాలించవలసి ఉన్నది. ఇది రాజునకు ఉండవలసిన రాజధర్మాలలో అతిశ్రేష్ఠమైన ధర్మం. ప్రజల ఉపకారాపకారాది గుణాలవలన వ్యక్తమయ్యే శీలవృత్తులను బట్టి బహుజాగరూకతతో పరిశీలించి పరిపాలించవలసి ఉన్నది. తన కోపాన్ని ప్రజలపై రుద్దకుండా, వేగిరపాటు లేక ప్రజలకు బాధ కలిగించని రీతిలో రాజు నడుచుకొనవలసి ఉన్నది.

విశేషం: అలం: ఉపమ. మూలంలోని ఆరుశ్లోకాల కీ పద్యం తిక్కన అనువాదం. మూలసార మిందులో నిక్షిప్తం. మూలంలోని "క్షమావాన్" పదానికి మృదువనీ; 'తీక్ష్ణః' శబ్దానికి క్రూరుడైన అనీ తిక్కన ప్రయోగాలు. 'ప్రత్యక్షేణానుమానేన'.... పరీక్ష్య' అనే మాటల అర్థాన్ని తిక్కన 'పరీక్షా విశుద్ధి పూర్వకముగనే' అని ప్రయోగించాడు. 'వాసంతార్క ఇవ' . . . న శీతో నచఘర్మదః' మాటలకు 'వసంతంబు భానుని చాడ్పున దగియెడు పాటితో' అని తిక్కన అనువాదం. 'ఇది రాజధర్మములకు రాజు సుమ్మి' అనే తిక్కన మాట సామెత ఆమెతవలె ఉన్నది. రాజును ఏనుగుతోను, ప్రజలను మావటితోను పోల్చటమూ, ఏనుగునుబట్టి మావటివలె రాజునుబట్టి ప్రజలు ఉంటారని చక్కగా వివరించబడింది.

క. **విను గర్భిణి ప్రజ బ్రదుకున । కనురూపము లైన యట్టి యాహారంబుల్**
గొనుగతిఁ బతి ధరణీ ప్రజ । మనికికిఁ దగ నడచునది తమకి గా కెపుడున్. **179**

ప్రతిపదార్థం: విను= ఓ ధర్మరాజా! ఇంకా వినుము; ఎపుడున్= ఎల్లప్పుడు; తమకి గాక= తమకం (తొందర) పడేవాడు కాక; గర్భిణి= కడుపుతో ఉన్న స్త్రీ; ప్రజ బ్రదుకునకున్= కడుపులో పెరుగుతున్న శిశుపోషణకు; అనురూపములు+ఐన+అట్టి= తగినట్టి; ఆహారంబుల్+కొనుగతిన్= ఆహార పదార్థాలు తినే పద్ధతిలోనే; పతి= రాజు; ధరణీ ప్రజ= పౌరులయొక్క; మనికికిన్+తగన్ నడచునది= మనుగడకు తగినట్లు వర్తించాలి.

తాత్పర్యం: గర్భం ధరించిన స్త్రీ తన సంతానం క్రమంగా పెరగటానికై తగిన పథ్యాహార విహారాదులను ఆచరించినట్లే రాజుసైతం తొందరపడక తన ప్రజలకు క్షేమకరమైన రీతిలో వర్తించవలసి ఉంటుంది.

మ. **పరిహాసంబునఁ దేలి భృత్యులయెడం బ్రహ్లాదముం బొందు భూ**
వరునాజ్ఞం జన; రీగి మెచ్చరు పనిన్ వంచింతు రెగ్గాడఁ జొ
త్తురు; కౌతూహల వేష భూషణములం దుల్యత్వముం బొంది యే
తురు; వా రెల్లపదంబు వేఁడుదురు; సింతుర్ భూమి మాఱొడ్డులన్. **180**

ప్రతిపదార్థం: పరిహాసంబునన్+తేలి= పరియాచకాలలో తేలియాడి; భృత్యులఎడన్= సేవకుల యందు; ప్రహ్లాదమున్+పొందు= అత్యంత ఆనందాన్ని పొందే; భూవరున్+ఆజ్ఞన్+చనరు= రాజాజ్ఞ ప్రకారం నడచుకొనరు; ఈగిన్+మెచ్చరు= త్యాగశీలతను మెచ్చుకొనలేరు; పనిన్+వంచింతురు= కార్యాచరణలో మోసగిస్తారు; ఎగ్గు+ఆడన్+చొత్తురు= కీడు మాటలాడ ప్రయత్నిస్తారు; కౌతూహల వేష భూషణములన్= కుతూహలమైన వేష ధారణంలో, మాటలలో; తుల్యత్వమున్+పొంది= (రాజుతో) సమానత్వాన్ని భావించి; ఏతురు= విజృంభిస్తారు; వారు= సేవకులు లేదా ప్రజలు; ఎల్లపదంబు+వేడుదురు= అన్ని పదవులను ఆశిస్తారు; భూమి మాఱు+ఒడ్డులన్= భూమిని ప్రతివ్యూహాలు పన్ని; చింతుర్= పీడిస్తారు.

తాత్పర్యం: ప్రజలతో కలిసిమెలసి పరాచకాలాడుతూ ఆనందించే రాజును ప్రజలు లెక్కచేయరు. ఎంత త్యాగశీలు డైనా మెచ్చుకొనరు. తమ కర్తవ్యం ఆచరించక మోసగిస్తారు. కీడు తలపెట్టుతారు. కుతూహలమైన వేషభాషలలో రాజుతో సమానత్వాన్ని భావించి విజృంభిస్తారు. అన్ని పదవులను ఆశిస్తూ ప్రతివ్యూహాలు పన్ని భూమిని పీడిస్తారు.

వ. **కావున భృత్యుల యెడ నత్యంత హర్షంబునం దేలి తేఁకువసెడఁ జరింప వలదు; సప్తాంగంబుల యెడ విరోధం బాచరించువాని నెవ్వని నైనను విడువ వలయు'నని చెప్పి వెండియు.** **181**

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; భృత్యుల+ఎడన్= సేవకుల యందు; అతి+అంత హర్షంబునన్+తేలి= మిక్కిలి సంతోషంతో తేలియాడి; తేఁకువ+చెడన్+చరింప వలదు= ధైర్యంచెడి మసలుకొనకూడదు; సప్త+అంగంబుల+ఎడన్= ఏడు రాజ్యాంగాలైన-

స్వామి, అమాత్యుడు, మిత్రుడు, కోశం, రాష్ట్రం, దుర్గం, బలం-అనే వాటికి సంబంధించి; విరోధంబు+ఆచరించు వానిన్= విరుద్ధం చేసేవాడిని; ఎవ్వనిన్+ఐనను= ఎవ్వడినైనా; విడువ వలయున్+అని చెప్పి= వదలిపెట్ట వలసిం దని చెప్పి (శిక్షించవలసిం దని చెప్పి); వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: కాబట్టి సేవకులతో కలిసి మెలసి సంతోషంతో తేలియాడుతూ ధైర్యం కోల్పోయేటట్లు నడచుకొనరాదు. సప్తరాజ్యాంగా లైన స్వామి, అమాత్యుడు, మిత్రుడు, కోశం, రాష్ట్రం, దుర్గం, బలం - అనే వాటికి వినాశకారి అయిన వాడి నెవ్వడినైన పరిహరించడమే అంటే శిక్షించటమే సముచిత మని భీష్ముడు ధర్మరాజుతో చెప్పి, మళ్ళీ ఈ విధంగా అన్నాడు.

క. అవలేపంబునఁ గర్త । వ్య వివేకము లేక వలసినట్టుల యెవ్వం
డవినీతి సేయు ధరణీ । ధవుఁడు విడువ వలయుఁ దన కతఁడు గురుఁ డైనన్.' 182

ప్రతిపదార్థం: ధరణీ ధవుఁడు= భూభర్త అయిన రాజు; అవలేపంబునన్= గర్వంతో; కర్తవ్య వివేకము లేక= ఆచరించవలసిన దానియందు విచక్షణ లేకుండా; వలసినట్టుల= తన కిష్టం వచ్చినట్లు; ఎవ్వండు+అవినీతి+చేయున్= అవినీతికి పాల్పడే వాడెవడైనా; తనకున్= రాజునకు; అతఁడు; గురుఁడు+ఐనన్= గురువైనా సరే; విడువ వలయున్= వదలిపెట్టటమే సముచితం.

తాత్పర్యం: గర్వంతో కర్తవ్యరహితుడై విచక్షణ లేకుండా ప్రవర్తించే వ్యక్తి ఎవడైనా సరే, చివరికి రాజుకు గురువైనా సరే, వదలిపెట్టటమే రాజు ఆచరించవలసిన ధర్మం.'

వ. అని మరుత్తుండను మహారాజునకు బృహస్పతి యొడంబడం బలికె; నట్లగుట గురుండు మిత్రుండు పుత్రుండని మన్నింప వలవదు; తప్పు గలిగిన ధరణీపతులకు దండింప వలయు; సగరుండు దనకొడుకు నసమంజసునిం బౌరబాల బాధకుండుగాఁ దెలిసియు నుద్దాలకముని నిజ తనయు శ్వేతకేతుని విప్రులయెడ మిథ్యోపచారకుం డని యెఱింగియుఁ బరిత్యజించి రన వినమె! యిట్టి చరితంబుల రాజు ప్రజారంజకుండు గావలయు; నిక్కంబును జక్కటియునుం గలిగి జనుల చిత్తంబులు నొప్పింపక పెట్టవలయు; నట్టివి దఱి తోన పెట్టుచు సైరణ గలిగి వర్తిల్లు భూవల్లభుం డభివృద్ధి నొంది యతిశయిల్లు. 183

ప్రతిపదార్థం: అని= పై విధంగా చెప్పి; మరుత్తుండు+అను మహారాజునకున్= మరుత్తు డనే పేరు కలిగిన మహారాజునకు; బృహస్పతి; ఒడంబడన్+పలికెన్= అంగీకరించేటట్లు పలికారు; అట్లు+అగుటన్= కాబట్టి; గురుండు మిత్రుండు పుత్రుండు+అని= గురువు, స్నేహితుడు కుమారుడు అనే భావంతో; మన్నింపన్+వలవదు= గౌరవించవలసిన పని లేదు; తప్పు+కలిగినన్= దోషమున్నట్లైతే; ధరణీ పతులకున్= రాజులకు; దండింపన్+వలయున్= శిక్షించటం ఎంతైనా అవసరం; సగరుండు= సగర మహారాజు; తన కొడుకున్+అసమంజసునిన్= అసమంజసు డనే తన కుమారుడిని; పౌరబాల బాధకుండుగాన్+తెలిసియున్= పుర జనులను, పిల్లలను పీడించే వాడని తెలిసికొని; ఉద్దాలక ముని= ఉద్దాలకుడనే మహర్షి; నిజ తనయున్= తన కుమారుడైన; శ్వేతకేతునిన్= శ్వేతకేతు డనే వాడిని; విప్రుల యెడన్ బ్రాహ్మణులపట్ల; మిథ్యా+ఉపచారకుండు+అని= అసత్య సేవాచరణుడు - అంటే ఉపచారం చేయనట్టివాడని; ఎఱింగియున్+పరిత్యజించిరి= తెలిసికొని వదలిపెట్టారు; అనన్+వినమె= అని చెప్పగా తెలిసికొన్నాము గదా; ఇట్టి చరితంబులన్= ఇట్లాంటి వారి చరిత్రలను గుర్తించటం వలన; రాజు ప్రజారంజకుండు+కావలయున్= ప్రజలను సంతోష పెట్టేవాడు కావలసి ఉన్నది; నిక్కంబును+చక్కటియునున్+కలిగి= నిజాన్ని, న్యాయాన్ని కలిగి; జనుల చిత్తంబులు నొప్పింపక పెట్టవలయున్= ప్రజల మనస్సులను బాధించక, కొనసాగించవలసింది; అట్టివి= అలాంటి వాటిని; తఱితోన పెట్టుచున్=

తగిన సమయంలోనే చేస్తూ; సైరణ+కలిగి= క్షమాగుణంతో ఒప్పి; వర్తిల్లు= నడచుకొనే; భూ వల్లభుండు= భూమి భర్త అయిన రాజు; అభివృద్ధిన్+ఒంది+అతిశయిల్లున్= అభ్యున్నతిని పొంది ఆధిక్యంతో వెల్గొందుతాడు.

తాత్పర్యం: పై విధంగా మరుత్తుడనే మహారాజుకు బృహస్పతి సమ్మతించేటట్లు వివరించాడు. అందువలన గురువనీ, స్నేహితుడనీ, పుత్రుడనీ ఎవడైనా సరే క్షమించరాదు. తప్పుంటే శిక్షించవలసిందే. తన కుమారుడు పౌరులను, పసిపిల్లలను పీడిస్తున్నాడని తెలిసికొన్న సగరుడు, శ్వేతకేతువనే తన కుమారుడు బ్రాహ్మణులకు అసత్యోపచారం చేస్తున్నాడని తెలిసికొన్న ఉద్దాలక మహర్షి తమ కుమారులే అయినప్పటికి వదలిపెట్టారు. ఇట్లాంటి చరిత్రలను గ్రహించి ప్రజారంజకుడై వర్ధిల్లవలసి ఉన్నది. నిజాయితీ, న్యాయం కలిగి ప్రజల మనస్సులను బాధించక తగిన సమయంలో పీడిస్తూ క్షమాగుణం కలిగిన రాజు మాత్రమే అభ్యున్నతిని పొంది అతిశయిల్లుతాడు.

విశేషం: బృహస్పతి దేవగురువు. మరుత్తు అవీక్షిత్తు అనే రాజు కుమారుడు. ఇతడి తల్లి విశాల. మరుత్తు జన్మసమయంలో తుంబురుడు వచ్చి, ఆ బాలుడికి మరుత్తులన్నీ శుభం చేస్తాయని చెప్పాడట. అందుచేత అతడికి మరుత్తుడని పేరు పెట్టారు. చాలా ప్రసిద్ధి పొందిన రాజు. సగరుడు బాహువు (అసితుని) కుమారుడు. ఇతడికి కేసిని అనే భార్యయందు అసమంజసు డనే పుత్రుడు జన్మించి పిశాచకృత్యాలు చేస్తుండగా, పుత్రు డని పరిగణించక నగరంనుండి వెడలగొట్టాడు. ఉద్దాలకుడు ఒక మహర్షి. అతడి కుమారుడు శ్వేతకేతువు దుష్టుడు కాగా పరిత్యజించాడు.

క. 'తనకీడు వైదికపు వ । ర్తనములఁ గొని యడఁప వలయు; దానిం గడవన్
జనపతికి మేలు గలదే? । వినుము చతుర్వర్గ పరత విహిత మతనికిన్. 184

ప్రతిపదార్థం: వినుము= జాగరూకతతో వినుము; జనపతికిన్= రాజునకు; తన కీడు= రాజునకు కలిగే హానిని; వైదికపు వర్తనములన్+కొని= వేద విహితమైన కార్యాచరణతో; అడఁపన్+వలయున్= తొలగించుకొనవలసి ఉన్నది; దానిన్+కడవన్ మేలు+కలదే!= దానిని మించిన మేలున్నదా?; అతనికిన్= ఆ రాజునకు; చతుర్వర్గ పరత విహితము= ధర్మార్థ కామ మోక్షాలపై ఆసక్తి కలిగి ఉండటమే తగింది.

తాత్పర్యం: రాజునకు ఎలాంటి కీడు కలగకుండా, వేదవిహితమైన ఆచారాలతో నివారించుకొనవలయును. అంతకంటే వేరే ఉత్తమ మార్గం లేదు. ధర్మార్థ కామమోక్షాలనే చతుర్వర్గంపై దృష్టి ఉంచి ధర్మాచరణ చేసినప్పుడే రాజు తన ధర్మాన్ని నిర్వర్తించిన వా డవుతాడు. అంటే చతుర్వర్గం రాజుకు విహితం.

ఆ. సకల వర్ణ ధర్మ సంకర రక్షయు, । సంధి విగ్రహాది షడ్గుణములు,
నలయ కరయుటయును నర్థ సమ్యగుపార్జ । నమును నృపతి యెపుడు నడపవలయు. 185

ప్రతిపదార్థం: ఎప్పుడున్= ఎల్లప్పుడు; నృపతి= రాజు; సకల వర్ణ ధర్మ సంకర రక్షణయున్= సమస్తమైన వర్ణాలకు విహితమైన ధర్మాల కలయిక యొక్క సంరక్షణమూ; సంధి విగ్రహ+ఆది షడ్గుణములున్= సంధి విగ్రహం మొదలైన అంటే సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధం, ఆశ్రయం - అనే ఆరు గుణాలను; అలయక+అరయుటయునున్= విసుగు చెందకుండా పరిశీలిస్తూ ఉంటూ; అర్థసమ్యక్+ఉపార్జనమును= సముచితరీతిని ద్రవ్య సంపాదనను; నడపవలయున్= నిర్వర్తించవలసి ఉన్నది.

తాత్పర్యం: సమస్త వర్ణాలకు సంబంధించిన ధర్మాలను రక్షించటంలోనూ, సంధి విగ్రహాది ఆరు గుణాలను పాటించటంలోను అలపు లేక పరిశీలిస్తూ సముచితరీతిని ధనార్జన చేస్తూ రాజు తన ధర్మాన్ని నిర్వర్తించాలి.

విశేషం: వర్ణాలు: బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు - అనే నాలుగు వర్ణాలు.

షడ్గుణాలు: సంధి (ఒకటి కావటం); విగ్రహం (యుద్ధం చేయటం); యానం (తన శక్తి అధికమైనప్పుడు గానీ, శత్రువు బలం లేదని తెలిసినప్పుడు గానీ జయించటానికై వెళ్ళటం); ఆసనం (దుర్గాదులను సంరక్షించుకొంటూ ప్రయాణ విముఖంగా ఉండటం); ద్వైధం (తనపైకి ఇద్దరు శత్రువులు దండెత్తి వచ్చినప్పుడు ఒకడితో సంధి చేసుకొని, మరొకడితో విరోధించటం); ఆశ్రయం (అశక్తితో బలవంతుడిని ఆశ్రయించటం). ఇవి రాజు గమనించవలసిన షడ్గుణాలు.

క. పొనరిచి యాడెడు మాటలఁ । గొనఁ దలఁపక దుర్వినీత కోటి ధనంబుల్
దన కెక్కినట్టి తప్పులఁ । గొని సుజనుల కీఁగి నృపతి గుణమండ్రు బుధుల్. 186

ప్రతిపదార్థం: పొనరిచి+ఆడెడు మాటలన్= పొసగునట్లుపలికే మాటలను; కొనన్+తలఁపక= గ్రహించటానికి ఆలోచించక; తనకున్+ఎక్కినట్టి తప్పులన్+కొని= తనపై ఆపాదించబడ్డ దోషాలను గ్రహించి; దుర్వినీత కోటి ధనంబుల్= అవినీతి పరులైన పెక్కురి అపరాధుల ధనాన్ని; సుజనులకున్+ఈఁగి= మంచివారికి ఇవ్వటమనేది; నృపతి గుణము= రాజుయొక్క ధర్మ మని; బుధుల్= విద్వాంసులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: తన ఇచ్చకాలకై మాటలాడే మాటలను లెక్కించక, తన దృష్టికి వచ్చిన దోషాలను మాత్రమే గ్రహించి దానిని దండనగా గ్రహించిన దుష్టుల ధనాన్ని ఉత్తములకు ఇచ్చి సంతృప్తి పరచటమే రాజధర్మ మని బుధులు అంటా రని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

క. కడు నమ్మి యునికియును నె । క్కుడు నమ్మమియును సుశీల కుశలత గా; దె
య్యెడ నైనను బుద్ధి సొనిపి । తడవి కనికొనంగ వలయుఁ దగవుఁ దగమియున్. 187

ప్రతిపదార్థం: కడు నమ్మి+ఉనికియున్= మిక్కిలి నమ్మి ఉండటమూ; ఎక్కుడు నమ్మమియునున్= అధికంగా విశ్వసించక పోవటమూ; సుశీల కుశలత+కాదు= మంచి నడవడికకు క్షేమకరం కాదు; ఏ+ఎడన్+ఐనను= ఎట్టి పరిస్థితులలోనైనా సరే; బుద్ధి+చొనిపి= మనసు పెట్టి; తగవున్+తగమియున్= ఇది ఉచితం, ఇది అనుచితం అని; తడవి= పరిశీలించి; కనికొనంగ వలయున్= తెలిసికొని స్వీకరించవలసి ఉంటుంది.

తాత్పర్యం: పూర్తిగా విశ్వసించటం గానీ, ఏ మాత్రమూ నమ్మక పోవటం కానీ రాజు సద్వర్తనకు క్షేమకరం కాదు. ఏ విషయంలోనైనా సరే మనసుపెట్టి బహుజాగరూకతతో ఉచితానుచితాలను పరిశీలించి గ్రహించవలసి ఉన్నది.

క. ధన మపహరించుటయ తన । కనిశముఁ బని గాఁగ బ్రదుకు నతి లుబ్ధనకున్
విను! శత్రులచే నౌటకు । మును దన ప్రజలచేన చేటు మూఁడు నరేంద్రా! 188

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజులలో శ్రేష్ఠుడైన ఓ ధర్మరాజా! వినుము; తనకు+అనిశమున్= ఎల్లప్పుడు తనకు; ధనము+అపహరించుటయ= పరధనాన్ని దొంగలించటమే; పని+కాఁగన్= ముఖ్య ధర్మమని; బ్రదుకు+అతి లుబ్ధనకున్= జీవితం గడిపే మిక్కిలి పిసినారికి; శత్రులచేన్+ఔటకున్ మును= శత్రువుల వలన (కీడు) కలిగే ముందే; తన ప్రజచేన్= తన ప్రజల వలననే; చేటు మూడున్= వినాశం కలుగుతుంది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! జాగరూకతతో వినుము. ఇతరుల ధనమును అపహరించటమే తన పని అన్నట్లు భావించే పిసినారి రాజుకు ఇతరులవలన కలిగే దానికంటె ముందు తన ప్రజల వలననే వినాశం కలుగుతుంది.

ఆ. ధర్మరతులు, నర్థ నిర్మాణ చతురులు, । లౌల్యరహితులును, నలంఘితాజ్ఞు
లును, సునీతి నిపుణులును, గులజులు నగు । పరిజనములఁ బెనుపు పతికి హితము. 189

ప్రతిపదార్థం: ధర్మరతులున్= ధర్మంపై ఆసక్తి కలవారు; అర్థ నిర్మాణ చతురులున్= ద్రవ్యసంపాదనంలో నిపుణులైనవారు; లౌల్య రహితులునున్= చలించనట్టి వారు - స్థిర చిత్తులైన వారు; అలంఘిత+ఆజ్ఞులునున్= ఆజ్ఞ దాటనివారు; సునీతి నిపుణులును= ఉత్తమ నీతిని గ్రహించటంలో నైపుణ్యం కలవారూ; కులజులున్+అగు= ఉత్తమ కులంలో జన్మించినవారూ అయిన; పరిజనములన్+పెనుపు= పరివారం యొక్క పెంపు చేసికొనటం; పతికిన్= రాజునకు; హితము= ఉచితం.

తాత్పర్యం: ధర్మమం దాసక్తి కలవారు, ద్రవ్యాభివృద్ధి నిపుణులు, స్థిరచిత్తులు, రాజాజ్ఞ నతిక్రమించని ఉత్తమ నీతి కోవిదులూ, ఉత్తమ కుల సంజాతులు అయిన పరివారాన్ని పెంపు చేసికొనటమనేది రాజుకు చాలా ముఖ్యమైన ధర్మం.

చ. కపటము లేక, వైభవము గప్పక, యొండొరుమీఁద రాజుపై
నపరిమిత ప్రియం బెసఁగ నల్గక యుండు ముదంబుఁ బొంది యే
నృపు విషయంబునం బ్రజ వినిర్మలవృత్తతఁ బుత్రుభంగి నా
నృపు నృపుఁ డంద్రు గా కితరునిం దగువా రెద నియ్యకొందురే? 190

ప్రతిపదార్థం: ఏ నృపు విషయంబునన్= ఏ రాజు విషయంలోనైతే; ప్రజ= ప్రజలు; వినిర్మల వృత్తతన్= ఉత్తమ ప్రవర్తనతో; కపటము లేక= మోసం లేకుండా; వైభవము+కప్పక= విభవాన్ని అంటే సంపదను దాచుకొనక; ఒండు+ఒరుమీఁదన్= పరస్పరం ఒకరు మరొకళ్ళమీద; రాజుపైన్= రాజుమీద; అపరిమిత ప్రియంబు+ఎసఁగన్= అత్యంతమైన ప్రేమ అతిశయిల్లగా; అల్గక= కోపించక; ముదంబున్+పొంది= సంతోషం పొంది; పుత్రు భంగిన్= కుమారుడి వలె; ఉండున్= ఉంటాడో; ఆ నృపున్+నృపుఁడు+అంద్రు+కాక= రాజును రాజంటారు కాని; ఇతరునిన్+తగువారు+ఎదన్+ఇయ్యకొందురే?= తదితరమైన రాజును, అర్హులైన వారు హృదయంలో ఒప్పుకొంటారా?.

తాత్పర్యం: ఏ రాజు విషయంలో అయితే ప్రజలు ఉత్తమప్రవర్తనతో మోసం లేకుండా సంపదను దాచుకొనక, పరస్పరమూ, రాజు మీద మిక్కిలి ప్రేమతో మసలుకొంటూ, కోపం లేకుండా పుత్రుల వలె ఉంటారో అట్లాంటి రాజే నిజమైన రాజు. తదితరులను అర్హులైనవారు హృదయంలో ఒప్పుకొంటారా?

క. ధన దారాదికముల నె । వ్వనికిని రక్షించికొనఁగ వసమే రక్షా
ఘనుఁ డగు పతి గల్గిన గా । కనఁడే శుక్రుఁడు సుమతు లభినందింపన్. 191

ప్రతిపదార్థం: రక్షాఘనుఁడు+అగు పతి+కల్గినన్+కాక= (ప్రజలను) సంరక్షించటంలో పరాక్రమ వంతుడుగా ఉంటే తప్ప; ధనదార+ఆదికములన్= సంపదలను, భార్య మొదలైన వారిని; ఎవ్వనికిని= ఎవ్వడికైనా; రక్షించుకొనఁగన్ వసమే?= సంరక్షించుకొనటం సాధ్యమా? (అని); సుమతులు+అభినందింపన్= బుద్ధిమంతులు మెచ్చుకొనేటట్లు; శుక్రుఁడు= శుక్రాచార్యుడు; అనఁడే?= అనలేదా?

తాత్పర్యం: ప్రజలను సంరక్షించే పరాక్రమసంపన్నుడైన రాజు ఉంటే తప్ప సంపదలను, భార్య, బిడ్డలు మొదలైనవారిని రక్షించుకొనటం సాధ్యం కాదని బుద్ధిమంతులు మెచ్చుకొనేటట్లు శుక్రాచార్యుడు చెప్పలేదా?

క. అనధీయానుం డితఁ డనఁ । జను ఋత్విజునట్ల చూవె సంరక్షా క
ల్పన హీనుఁడైన నృపుఁడని । మనువు పలికెఁ గాదె బుద్ధిమంతులు మెచ్చన్. 192

ప్రతిపదార్థం: సంరక్షా కల్పన హీనుఁడు+ఐన నృపుఁడు= ప్రజా సంరక్షణ చేయటంలో చేతకానివాడైన రాజు; ఇతఁడు; అనధీయానుండు= అనధ్యయనుడు అంటే చదవని వాడు; అనన్+చను= అన దగిన; ఋత్విజున్+అట్ల చూవె= యజ్ఞకర్తచేత

ధనం పుచ్చుకొని యజ్ఞం చేయించేవానిలాంటివాడు సుమా; అని; మనువు; బుద్ధిమంతులు; మెచ్చన్= మెచ్చుకొనేటట్లు; పలికెన్+కాదె!= వివరించాడు కదా!

తాత్పర్యం: ప్రజాసంరక్షణం చేయటానికి తగిన ప్రయత్నం చేయని రాజు, అధ్యయనరహితుడైన ఋత్విజుడివంటి వాడని, మనువు బుద్ధిమంతులు మెచ్చుకొనేటట్లు వివరించాడు కదా!

విశేషం: అలం: ఉపమ. ఋత్విజునకు అధీత బోధాచరణాలు ఎంత ముఖ్యమో రాజనే వాడికి ప్రజలను సంరక్షించటానికి తగిన యత్నం చేయటం అంతముఖ్యం. ఋత్విజులు పదహారుగురు. బ్రహ్మ, ఉద్గాత, హోత, అధ్వర్యుడు, బ్రాహ్మణాచ్ఛంసి, ప్రస్తోత, మైత్రావరుణుడు, ప్రతిప్రస్థాత, పోత, ప్రతివార్త, అచ్ఛావాకుడు, నేష్ట, అగ్నీధ్రుడు, సుబ్రహ్మణ్యుడు, శ్రావస్తుతుడు, ఉన్నేత - అని.

వ. మఱియు బృహస్పతి మహేంద్ర భారద్వాజ ప్రముఖులగు రాజధర్మానుశాసకులు రాజత్వ మూలకారణంబు ప్రజాసంరక్షయ యనిరి గావున నెత్తెఱంగున నైనను లోకరక్షణంబు రాజున కవశ్య కర్తవ్యంబు. 193

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; బృహస్పతి, మహేంద్ర, భారద్వాజ ప్రముఖులు+అగు= బృహస్పతి, ఇంద్రుడు, భారద్వాజుడు మొదలుగా ముఖ్యులైన; రాజధర్మ+అనుశాసకులు= రాజు అనుసరించవలసిన ధర్మాలను శాసించిన వారు; రాజత్వ మూల కారణంబు= రాజనే వాడికి ఉండవలసిన ప్రధానకారణం; ప్రజా సంరక్షయ+అనిరి= ప్రజలను సుభిక్షంగా పరిపాలించటమే అని పేర్కొన్నారు; కావునన్= కాబట్టి; ఏ+తెఱంగునన్+ఐనను= ఏ విధంగానైనా; లోక రక్షణంబు= లోక సంరక్షణమే; రాజునకున్+అవశ్యకర్తవ్యంబు= రాజునకు తప్పనిసరి అయిన ధర్మం.

తాత్పర్యం: కాబట్టి బృహస్పతి, భారద్వాజుడు, ఇంద్రుడు అనే ప్రముఖులైనవారు రాజధర్మాలను శాసించినవారు రాజునకు ప్రథమకర్తవ్యం ప్రజాసంరక్షణమే అని పేర్కొన్నారు. కాబట్టి, ఏ విధంగా పరిశీలించినా రాజునకు లోకసంరక్షణమే అనుసరించదగిన తప్పనిసరి అయిన ధర్మం.

తే. సంతతోత్సాహవంతుఁడై శత్రుకోటి । నార్జవంబున నైన ననార్జవమున
నైనఁ జెఱుపన వలయు; నత్యల్పుఁడైనఁ । బగతుఁ డగ్ని విషంబుల పగిది నొంచు. 194

ప్రతిపదార్థం: సంతత+ఉత్సాహవంతుఁడు+ఐ= ఎల్లప్పుడు ఉత్సాహ పూరితుడై; ఆర్జవంబునన్+ఐనన్+అనార్జవమునన్+ఐనన్= ఋజుత్వం వలనగాని, ఋజుత్వాన్ని వదలిగాని అయినా; శత్రుకోటిన్= శత్రు సమూహాన్ని; చెఱుపన వలయున్= నాశనం చేసి తీరవలసిందే; అతి+అల్పుఁడు+ఐనన్+పగతుఁడు= మిక్కిలి చిన్నవాడైనా సరే శత్రువు; అగ్ని విషంబుల పగిదిన్+నొంచున్= నిప్పువలె, విషంవలె బాధిస్తాడు.

తాత్పర్యం: రాజు ఎల్లప్పుడు రాజ్యపాలనంలో ఉత్సాహవంతుడై ఋజుత్వంవలన గాని, తద్వ్యతిరేకంగా గాని, శత్రుసమూహాన్ని నాశనం చేయటమే రాజధర్మం. అందువలన మిక్కిలి అల్పుడైనవా డైనా శత్రువు నిప్పువలె, విషంవలె నొప్పిస్తాడు. కనుక తప్పక రాజు శత్రుసంహారి కావలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

క. విను నృప! రాజ్యామిషముం । గొనఁ బలువురచేతఁ బ్రాణగొడ్డంబై యు
న్నను ధీరుఁ డేమఱమి నది । దనకును దక్కించుకొను బుధస్తుత్యముగన్.' 195

ప్రతిపదార్థం: విను= వినుము; నృప= ఓ రాజా!; పలువురచేతన్= అనేకుల వలన; ప్రాణగొడ్డంబు+ఐ+ఉన్నను= ప్రాణానికి హింస కలిగించేదైన; ధీరుఁడు= ధైర్యవంతుడు; రాజ్య+ఆమిషమున్= రాజ్యమనే లాభాన్ని; కొనన్= పొందుటయందు; ఏమఱమిన్=

ఏమరుపాటు లేకుండటంచేత; బుధస్తుత్యముగన్= పండితులచేత పొగడబడేటట్లుగా; అది+తనకును= దానిని తనకై; దక్కించుకొనున్= చేజిక్కించుకొంటాడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ధీరుడైన రాజు అనేకు లడ్డగించి ప్రాణాంతకం చేసినా లెక్కచేయక రాజ్యమనే లాభాన్ని ఏమరకుండ పండిత ప్రశంసలు పొందేటట్లుగా తనకు చేజిక్కించుకొంటాడు.'

వ. **అని చెప్పి భీష్ముం 'డేను రాజధర్మప్రకారంబు సంక్షేప రూపంబున నెఱింగించితి; నీకు సందేహంబు గల యట్టిది యెయ్యది యడుగు' మనిన, ధర్మనందనుం డమ్మహాత్మునితో 'నరుణగభస్తి యస్తగిరి సేరెడు; నేఁటికిం బనివినియెద; రేపు వచ్చి యడిగెద' ననుచుం దత్పాదంబులకుం బ్రణతుండై వీడ్కొనియెఁ; బద్మనాభ ప్రముఖులును వీడ్కొనిరి; వారలందఱును మునులకు నభివాదనంబు లాచరించిరి; మునులు నిజ స్థానంబుల కరుగం దారును దృషద్వతి యను మహానదిం గృతసంధ్యావందనులై చని కరిపుర ప్రవేశంబు సేసి సుఖవృత్తి నా రాత్రి గడపి, కల్యంబునం గాలోచిత కృత్యంబు లాచరించి భీష్ముపాలికిం బోయి, యంతకు మున్న వచ్చి యున్న మునిలోకంబునకు నమస్కరించి సవినయంబును సకుశలప్రశ్నంబునుంగా నగ్గాంగేయునిం గదిసి బలసి కూర్చుండి; రా సమయంబునఁ బాండవాగ్రజుండు ప్రాంజలి యై యతని కిట్లనియె. 196**

ప్రతిపదార్థం: అని చెప్పి= పై విధంగా రాజధర్మాలను గూర్చి ధర్మరాజునకు చెప్పి; భీష్ముండు= శరతల్పగతు డైన భీష్ముడు; ఏను= నేను; రాజధర్మ ప్రకారంబున్= రాజులకు ఉండవలసిన ధర్మ పద్ధతులను; సంక్షేప రూపంబునన్= సంక్షిప్తంగా; ఎఱింగించితిన్= తెలియజేశాను; నీకు; సందేహంబు+కల+అట్టిది+ఏ+అది+అడుగుము+అనినన్= నీకు దేనియందు సందేహం కలదో దానిని అడుగుమని భీష్మ డనగా; ధర్మనందనుండు= ధర్మరాజు; ఆ+మహాత్మునితోన్= ఆ మహనీయుడైన భీష్ముడితో; అరుణ గభస్తి+అస్తగిరి+చేరెడున్= ఎర్రనైన కిరణాలు గల సూర్యుడు పడమటి కొండపై చేరుతున్నాడు; నేఁటికిన్+పనివినియెదన్= ఈ నాటికి నేను వెళ్ళి వచ్చెదను; రేపు వచ్చి+అడిగెదన్= ఉదయమే వచ్చి అడుగవలసినవి అడుగుతాను; అనుచున్= అంటూ; తద్+పాదంబులకున్= ఆ భీష్ముడి పాదాలకు; ప్రణతుండు+ఐ= నమస్కరించినవాడై; వీడ్కొనియెన్= వెళ్ళిపోయాడు; పద్మనాభ ప్రముఖులును= శ్రీకృష్ణుడు మొదలైనవారును; వీడ్కొనిరి= వెళ్ళిపోయారు; వారలు+అందఱును= వారందరు; మునులకున్= మహర్షులకు; అభివాదనంబులు+ఆచరించిరి= నమస్కరించారు; మునులు= మహర్షులు; నిజ స్థానంబులకున్+అరుగన్= తమ ఆశ్రమాలకు వెళ్ళిపోగా; తారును= తామును; దృషద్వతి+అను మహానదిన్= దృషద్వతి అనే మహానదియందు; కృతసంధ్యా వందనులు+ఐ= చేయబడిన సంధ్యావందనాదులు కలవారై; చని= వెళ్ళి; కరిపుర ప్రవేశంబు+చేసి= హస్తినాపురం ప్రవేశించి; సుఖవృత్తిన్= సౌఖ్యంగా; ఆ రాత్రి+కడపి= ఆ రాత్రి గడపి; కల్యంబునన్= వేకువనే; కాల+ఉచిత కృత్యంబులు+ఆచరించి= కాలకృత్యాలు తీర్చుకొని; భీష్మపాలికిన్+పోయి= భీష్ముని వద్దకు వెళ్ళి; అంతకు మున్ను+అ వచ్చి+ఉన్న= అంతకంటే ముందే వచ్చి ఉన్న; ముని లోకంబునకున్= మునుల సమూహానికి; నమస్కరించి; సవినయంబును= వినయంతోడను; సకుశల ప్రశ్నంబునున్+కాన్= క్షేమ సమాచారాన్ని అడుగుట తోడను; ఆ+గాంగేయునిన్+కదిసి= ఆ భీష్ముని సమీపించి; ఒలసి= చుట్టుముట్టి; కూర్చుండిరి= కూర్చున్నారు; ఆ సమయంబునన్= అప్పుడు; పాండవ+అగ్రజుండు= పాండవుల అన్నఅయిన ధర్మరాజు; ప్ర+అంజలి+ఐ= చేతులు మోడ్చినవాడై; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ భీష్ముడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'రాజధర్మాలను వివరించి ఇంక ఏవైన సందేహాలు ఉంటే అడుగవలసిం'దని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు. అప్పుడు ధర్మరాజు భీష్ముడితో 'ఇప్పుడు సూర్యుడు అస్తమిస్తున్నాడు కనుక ఈ పూటకు నిష్క్రమించి రేపు ఉదయమే వచ్చి అడుగుతాను' అని తెలిపాడు. భీష్ముడి పాదాలకు నమస్కరించి ధర్మరాజు వెళ్ళిపోయాడు. అట్లాగే శ్రీకృష్ణాదులు నమస్కరించారు. మునులు ఆశ్రమాలకు వెళ్ళిపోయారు. వారు దృషద్వతి అనే నదిలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంధ్యావందనాదులు చేసి హస్తినాపురం చేరారు. ఆ రాత్రి సుఖంగా గడపి వేకువ జామున కాలకృత్యాలు ముగించి భీష్ముడివద్దకు వెళ్ళి అంతకుముందే వచ్చిన మహర్షులకు నమస్కరించారు. వినయంతో కుశల ప్రశ్నలతో భీష్ముడిని సమీపించి, అందరు చుట్టూ కూర్చున్నారు. అప్పుడు ధర్మరాజు దోయిలొగ్గి భీష్ముడిని ఇట్లా ప్రశ్నించాడు.

సీ. 'రాజనామమునకు భాజనం బై మహా। ద్భుత చరిత్రుం డగు పురుషుఁ డొకఁడు
గలిమికి మూలంబు ఘన విశేషము గల్గ। నోపుఁ గౌరవ కుల దీపజనన
యది యెఱింగింపవే; యవయవంబులుఁ బ్రాణ। మానసంబులు జన్మ మరణములు శ
రీర యాత్రలు నెల్లవారికి నెట్లట్ల। కాని విభేదంబు గాన; మిట్టి

ఆ. రా జొకండు శూర తేజస్వి బుద్ధి మ। జ్జనుల నెట్లు దన వశంబు సేయ
నిలుపఁ జెఱుప నెల్లయిలయును నేల దై। వ నిభుఁడగుచు మ్రొక్కుగొనఁగఁ జాలె. 197

ప్రతిపదార్థం: కౌరవ కులదీప జనన!= కురువంశానికి దీపం వంటి జననం కలవాడా!; రాజనామమునకున్= రాజనే పేరునకు; భాజనంబు+ఐ= పాత్రమై (అర్హమై); మహా+అద్భుత చరిత్రుండు+అగు= మిక్కిలి ఆశ్చర్యకరమైన నడవడిక కలవాడైన; పురుషుఁడు+ఒకఁడు= ఒకానొక పురుషుడు; కలిమికిన్+మూలంబు= సంపదలకు హేతువు; ఘన విశేషము+కల్గన్+ఓపున్= మిక్కిలి ఔన్నత్యానికి తగినట్టి దానికి అర్హుడు; అవయవంబులున్= శరీరమందలి అవయవాలును; ప్రాణమానసంబులున్= ప్రాణం, మనస్సు; జన్మ మరణములున్= పుట్టుట గిట్టుటలును; శరీర యాత్రలున్= దేహ యాత్రలును; ఎల్లవారికిన్+ఎట్లు+అట్ల= అందరికి సమానమే; కాని= అయినప్పటికి; విభేదంబు+కానము= తేడా ఏమి లేదు; శూర తేజస్వి= పరాక్రమంచేత ప్రకాశిస్తున్నవాడు; ఇట్టి+రాజు+ఒకండు= ఇట్లాంటి ఒక రాజు; బుద్ధిమత్+జనులన్= బుద్ధిమంతులైన ప్రజలను; ఎట్లు= ఏ విధంగా; తన+వశంబు+చేయన్= తన వశవర్తులుగా చేసికొనటానికి; నిలుపన్= సంరక్షించటానికి; చెఱుపన్= నాశనం చేయటానికి; ఎల్ల యిలయును= సమస్తమైన భూమండలంలో; దైవ నిభుఁడు+అగుచున్= భగవంతుడితో సమానుడవుతూ; ఏల?= ఎందుకు?; మ్రొక్కు+కొనఁగన్+చాలెన్= నమస్కారానికి అర్హుడగుతున్నాడు; అది+ఎఱింగింపవే?= దాన్ని వివరించవా?

తాత్పర్యం: ఓ భీష్ముడా! రాజనే పేరుకు పాత్రమై ఉత్తమచరిత్ర కలవాడైన ఒకానొక మానవుడు సంపదలకు మూలం, ఔన్నత్యానికి అర్హుడు కావచ్చును. మానవు లందరికి ఉన్నట్లు శరీరావయవాలు, ప్రాణం, మనస్సు, పుట్టుట గిట్టుటలు, దేహయాత్రలు, రాజుకు కూడా సమానమే. భేద మేమీ కనిపించటం లేదు. పరాక్రమతేజస్వి అయిన ఒక రాజు బుద్ధిమంతు లైన ప్రజలను ఏ విధంగా తన వశం చేసికొంటాడు, సంరక్షిస్తాడు, నాశనం చేస్తాడు, ఈ భూమిపై ఏ విధంగా భగవంతుడితో సమానంగా పూజార్హుడవుతాడు? - అనే అంశాలను వివరించుము.

భీష్ముండు ధర్మజునకు దండనీతి జన్మప్రకారం బెఱింగించుట (సం. 12-59-11)

వ. అదియును వినవలతు'నని యడిగిన నమ్మనుజపతి కమ్మహాత్ముం డిట్లనియె. 198

ప్రతిపదార్థం: అదియును వినవలతున్+అని+అడిగినన్= పై విషయాలను వినాలన్న కోరిక ఉన్నదని ధర్మరాజు అడుగగా; ఆ+మనుజపతికిన్+ఆ+మహాత్ముండు+ఇట్లు+అనియెన్= ఆ ధర్మరాజుతో భీష్ముడు ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ఆ విషయాలను వినాలన్న కోరిక ఉన్న' దని ధర్మరాజు అడుగగా భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

క. 'విను! తొల్లి కృత యుగంబున। మనుజులయెడ దండనీతిమంతుం డై రా
జన నొకఁడు గలిగి యరయుట। మనుజేశ్వర! లేదు ధర్మమత మండ్రు తగన్. 199

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= ఓ ధర్మరాజా! వినుము; తొల్లి= పూర్వం; కృతయుగంబునన్= కృతయుగంలో; మనుజుల యెడన్= మానవుల పట్ల; దండనీతి మంతుండు+ఐ= శిక్షావిధి కలవాడై; రాజు+అనన్+ఒకఁడు+కలిగి+అరయుట లేదు= రాజనేవాడు ఒకడుండి పరిశీలించటం జరగలేదు; తగన్= తగినట్లు; ధర్మమతము+అండ్రు= దాన్ని తగినరీతి ధర్మమతమని అంటారు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! జాగరూకతతో వినుము. పూర్వం కృతయుగంలో మానవుల పట్ల శిక్షావిధి విధాయకుడై ఒకానొక రాజు ఉండి దీన్ని పరిశీలించినవాడు లేడు. కేవలం దానిని ధర్మమత మని పెద్దలు చెపుతారు.

క. **ఒండొరులకు రక్షకులై। యుండుదు; రట్లుండ దైన్య మొదవిన లోభం**
బొండొండు పెరిఁగి ధర్మము। ఖండితమై మొదలుకొని రకార్యంబులకున్. **200**

ప్రతిపదార్థం: ఒండు+ఒరులకున్= ఒకరి కొకరు; రక్షకులు+ఐ+ఉండుదురు= రక్షకులై ఉంటూ వచ్చారు; అట్లు+ఉండన్= ఆ విధంగా కొనసాగుతూ ఉండగా; దైన్యము+ఒదవినన్= దీన భావం కలుగగా; లోభంబు+ఒండొండ= పిసినారితనం ఒక్కొక్కటిగా; పెరిఁగి= అతిశయించి; ధర్మము ఖండితము+ఐ= ధర్మం వినాశమై; అకార్యంబులకున్= కానిపనులకు; మొదలుకొనిరి= ప్రారంభించారు.

తాత్పర్యం: పరస్పరం ఒకరికొకరు రక్షకులై ఉంటూ వచ్చారు. ఆ విధంగా ఉండగా దీనభావం కలిగి పిసినారితనం ఒక్కొక్కటి పెరిగి ధర్మం వినాశనమైనది. ఆ విధంగా ప్రజలు అకార్యాలకు పాల్పడ్డారు.

క. **క్రమమునఁ గామము రాగము। దమ మనముల నొదవఁగా మదం బెక్కిన వి**
భ్రమ మొందుచు విచ్చల విడి। విమార్గ చరితముల వేదవిధ్వంసకులై. **201**

ప్రతిపదార్థం: క్రమమునన్= వరుసగా; కామము= కోరిక; రాగము= మాత్సర్యం; తమ మనములన్+ఒదఁగాన్= తమ మనస్సులందు కలుగగా; మదంబు+ఎక్కినన్= క్రొవ్వెక్కగా; విభ్రమ మొందుచున్= విభ్రాంతి పొందుతూ, తొట్రుపాటుతో; విచ్చలవిడి= యథేచ్ఛగా; విమార్గ చరితములన్= దుర్మార్గమైన నడవడికలతో; వేద విధ్వంసకులు+ఐ= వేద వినాశకులై.

తాత్పర్యం: క్రమంగా కోరిక, మాత్సర్యం తమ మనస్సులందు కలుగగా, క్రొవ్వెక్కి విభ్రాంతులై యథేచ్ఛగా దుర్మార్గ ప్రవర్తనలతో వేదవినాశకులై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **మనుజులు ధర్మముఁ బొడవడఁ। చిన వేదముఁ గర్మములును జెడుటకు భయ మం**
దిన యింద్రాదులు గమలా। సనుఁ గానఁగ మునులుఁ దారుఁ జనిరి నరేంద్రా! **202**

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ఓ రాజా!; మనుజులు= మానవులు; ధర్మమున్+పొడవు+అడఁచినన్= ధర్మంయొక్క గొప్పతనాన్ని అణచివేయగా; వేదమున్+కర్మములునున్+చెడుటకున్= వేదాలు చేయవలసిన కర్మాదికాలు చెడిపోవటానికి; భయము+అందిన= భయపడినటువంటి; ఇంద్ర+ఆదులు= ఇంద్రుడు మొదలైన వారు; కమల+ఆసనున్+కానఁగన్= పద్మాన్ని ఆసనంగా కల బ్రహ్మను దర్శించటానికి; మునులున్+తారును+చనిరి= మహర్షులు ఇంద్రాదులు వెళ్ళారు.

తాత్పర్యం: ఓ రాజా! మానవులు ధర్మముయొక్క గొప్పతనాన్ని అణచివేయగా, వేదాలు చేయవలసిన కర్మలు చెడిపోవటానికి భయపడిన ఇంద్రుడు మొదలైన దేవతలు బ్రహ్మను సందర్శించటానికి మునులతోపాటు వెళ్ళారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. చని యద్దేవునిం గని 'మనుజ లోకంబున వేదంబులు ధర్మంబులుం బొడ వడంగిన నధ్వర రాహిత్యంబున నేమును దుర్బలులమై భయంబంది వచ్చితిమి; రక్షింపు'మని యవ్విబుధులు విన్నవించిన విరించి 'దానికిం బ్రతి విధానంబు సేసెద; మీరు వెఱవ వల' దని పలికి స్వామ్యమాత్య రాష్ట్ర దుర్గ కోశ సుహృద్బలంబులు నాన్వీక్షకీ త్రయీ వార్తా దండనీతులును, నరి మిత్త్రోదాసీ నాదిక ద్వాదశరాజ మండలంబును, సంధి విగ్రహ యానాసన ద్వైధీభావ సమాశ్రయంబులును మొదలుగా వలయు వానికిం బ్రబోధకంబులగు నానావయవంబులుం గలిగి ధర్మార్థకామ మోక్షంబులకు సాధకంబులయి యుండునట్లుగా నూఱువేలధ్యాయంబుల నఖిలలోక హితంబగు నీతిశాస్త్రంబు రచియించి, యిది లోక చరిత్ర నిర్మలీకరణంబునకుం గారణంబగు'నని యనుగ్రహించె నా లోక పితామహు లలాటంబున ననాది నిధనుండును, విశ్వజగత్కర్తయు సర్వ భూతాత్ముండును సనాతనుండును నగు విరూపాక్షుండు విశాలాక్షుండను నామంబున నావిర్భవించి యాగ్రంథం బధిగమించి దాని నభ్యసించుటకు మర్త్యుల కాయుర్బుద్ధులు సాలవని యుమ్మలించి యమ్మహనీయ తంత్రంబు సంక్షేపరూపంబునం బదివే లధ్యాయంబుల వైశాలాక్షం బన నిర్మించె. 203

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; ఆ+దేవునిన్+కని= ఆ బ్రహ్మదేవుడిని సందర్శించి; మనుజలోకంబునన్= భూలోకంలో; వేదంబులున్+ ధర్మంబులున్+పొడవు+అడంగినన్= వేదాలయొక్క, ధర్మాలయొక్క ఆధిక్యం తగ్గిపోగా; అధ్వర రాహిత్యంబునన్= యజ్ఞాలు లేకపోవటం వలన; ఏమును= మేమును; దుర్బలులము+ఐ= బలహీనులమై; భయంబు+అంది వచ్చితిమి= భయపడి వచ్చాము; రక్షింపుము+అని+ఆ+విబుధులు= కాపాడుమని ఆ దేవతలు; విన్నవించిన్= వేడుకొనగా; విరించి= బ్రహ్మ; దానికిన్+ప్రతి విధానంబు+చేసెదన్= అందుకు ప్రతిక్రియ చేస్తాను; మీరు వెఱవ వలదు+అని పలికి= మీరు భయపడవలసిన పనిలేదని చెప్పి; స్వామి+అమాత్య రాష్ట్ర దుర్గ కోశ సుహృద్+బలంబులున్ స్వామి, అమాత్యుడు, రాష్ట్రం, దుర్గం, కోశం, మిత్రులు, సైన్యమూ; ఆన్వీక్షకీ త్రయీ వార్తా దండ నీతులునున్= ఆన్వీక్షకి, త్రయి, వార్త, దండనీతి అనే నాలుగు విద్యలను; అరిమిత్ర+ఉదాసీన+ఆదిక ద్వాదశరాజ మండలంబును= శత్రువు, మిత్రుడు, ఉదాసీనుడు మొదలైన పండ్రెండు రాజ మండలాలును; సంధి విగ్రహ యాన+ఆసన ద్వైధీభావ సమాశ్రయంబులును= సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సమాశ్రయం అనే వాటి ఆధారంతో ఉన్నవి; మొదలుగాన్= మొదలుకొని; వలయువానికిన్= కావలసిన వాటికి; ప్రబోధకంబులు+ అగు= వివరణాత్మకాలైన; నానా అవయవంబులున్+కలిగి= అనేక అవయవాలతో ఒప్పి; ధర్మ+అర్థ కామ మోక్షంబులకున్= ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే వాటికి; సాధకంబులు+అయి+ఉండునట్లుగాన్= సాధనా లయ్యేటట్లుగా; నూఱువేల+ అధ్యాయంబులన్= లక్ష అధ్యాయాలతో; అఖిల లోకహితంబు+అగు= సమస్త లోకాలకు మంచిని చేకూర్చేటట్లుగా; నీతి శాస్త్రంబున్ రచియించి= ఈ నీతి శాస్త్ర రచన చేసి; ఇది లోక చరిత్ర నిర్మలీకరణంబునకున్+కారణంబు+అగును+అని+అనుగ్రహించెన్= ఈ నీతిశాస్త్రం లోకంలోని నడవడికలను పరిశుద్ధం చేయటానికి హేతు వవుతుం దని అనుగ్రహించాడు; ఆ లోక పితామహు లలాటంబునన్= ఆ బ్రహ్మయొక్క నొసట; అనాది నిధనుండును= మొదలు, తుదిలేనివాఁడును; విశ్వ జగత్కర్తయున్= విశ్వానికి (లోకాలకు) కర్త అయిన వాడును; సర్వభూత+ఆత్ముండున్= అన్ని ప్రాణులను తన ఆత్మలో కలవాడును; సనాతనుండునున్= శాశ్వతుడును; అగు= అయినటువంటి; విరూప+అక్షుండు= వికృతమైన కన్నులు కలవాడైన శివుడు; విశాల+అక్షుండు అను నామంబునన్= విశాలాక్షుడనే పేరుతో; ఆవిర్భవించి=పుట్టి; ఆ గ్రంథంబు+అధిగమించి=బ్రహ్మరచించిన నీతి శాస్త్రాన్ని చదివి; దానిన్+అభ్యసించుటకున్= దానిని నేర్చుకొనటానికి; మర్త్యులకున్+ఆయుఃబుద్ధులు+ చాలవు+అని+ఉమ్మలించి= మానవులకు ఆయుస్సు బుద్ధి చాల వని చింతించి; ఆ+మహనీయ తంత్రంబున్= ఆ మహిమాన్విత మైన నీతి శాస్త్రాన్ని; సంక్షేప రూపంబునన్= క్లుప్తంగా; పదివేలు+అధ్యాయంబులు= పదివేల అధ్యాయాలతో; వైశాలాక్షంబు+అనన్+నిర్మించెన్= వైశాలాక్షమనే నీతిశాస్త్ర సంగ్రహాన్ని నిర్మించాడు.

తాత్పర్యం: ఇంద్రాదులు మునులతోపాటు బ్రహ్మను సందర్శించి 'మానవలోకంలో వేదాలయొక్క, ధర్మాలయొక్క ఆధిక్యం నశించి యజ్ఞయాగాదులు లేకపోవటంవలన తాము బలహీనులం అవుతున్నా'మని తమ భయాన్ని తెల్పి రక్షించు మని ప్రార్థించారు. అందుకు బ్రహ్మ 'దానికి ప్రతిక్రియగా తగిన ఏర్పాటు చేస్తున్నా' నని భయపడవల దని తెల్పి సప్తోపాయాలు, దండనీతి రీతిని, ద్వాదశరాజ మండలాలను, పంచోపాయాలను మొదలైన వాటిని, వాటి వివరణతోపాటు పురుషార్థాలకు సాధకాలుగా ఉండేటట్లు లక్ష అధ్యాయాలతో సకలలోకహితార్థంగా నీతిశాస్త్రాన్ని రచించాడు. నీతి శాస్త్రం లోకంలోని ప్రజల నడవడికలను నిర్మలం చేస్తుం'దని అనుగ్రహించాడు. ఆ బ్రహ్మ నొసటినుండి విరూపాక్షుడు విశాలాక్షు డనే పేరుతో ఆవిర్భవించి, ఆ నీతి శాస్త్రాన్ని తెలిసికొని నేర్చుకొనటానికి కావలసిన ఆయుస్సు, బుద్ధి మనుష్యులకు చాలవని చింతించి ఆ మహిమాన్వితమైన నీతిశాస్త్రాన్ని సంక్షిప్తంగా పదివేల అధ్యాయాలతో 'వైశాలాక్ష' మనే పేరుతో నిర్మించాడు.

ఆ. హరునివలనఁ బడసి యాశాస్త్ర మమరేంద్రుఁ। డయిదు వేలు సేసె నమరగురుఁడు
దేటపడ నొనర్చెఁ ద్రిసహస్రకాధ్యాయ। రూప సమ్మితముగ భూపవర్య! 204

ప్రతిపదార్థం: భూపవర్య!= భూ భర్తలలో శ్రేష్ఠుడైన ఓ ధర్మరాజా!; హరుని వలనన్+పడసి= విశాలాక్షుడి వలన పొంది; అమర+ఇంద్రుడు= దేవేంద్రుడు; ఆ శాస్త్రమున్= ఆ నీతి శాస్త్రాన్ని; అయిదువేలు+చేసెన్= ఐదువేల అధ్యాయాలకే తగ్గించాడు; అమర గురుఁడు= దేవతల గురువైన బృహస్పతి; త్రి సహస్రక+అధ్యాయ రూప సమ్మితముగన్= మూడువేల అధ్యాయాలతో కూడినట్లుగా; తేటపడన్+ఒనర్చెన్= స్పష్టమయ్యేటట్లు నిర్మించాడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! విశాలాక్షుడివలన మహేంద్రుడు ఆ నీతిశాస్త్రాన్ని పొంది ఐదువేల అధ్యాయాలకు కుదించాడు. దానిని బృహస్పతి మూడువేల అధ్యాయాలతో అందరికి అర్థమయ్యే రీతిలో మరీ సంక్షిప్తంగా రచించాడు.

వ. దాని శుక్రుండు సహస్రాధ్యాయ పరిమితంబుఁ గావించె; మఱియు మనుష్యుల శక్తి యెఱింగి మునులు క్రమంబున సంక్షిప్త రూపంబులుగా గ్రంథంబులు గావించి;రిది నీతి శాస్త్రప్రవర్తన ప్రకారం;బట్లు సుర లమ్మేలు వడసి విశ్వలోకేశ్వరుం డగు విష్ణుపాలికిం జని తగం గని కార్యంబు విన్నవించి, నీతిశాస్త్ర సముద్భవం బెఱింగించి, దీని నధిగమింపను, దదీయాచారంబు నడపను శక్తుం డగు వాని నొక్కరుని నిర్దేశింపవలయు నని యభ్యర్థించిన నద్దేవుండు నిజతేజోమయుండుగా నొక్క మానసపుత్త్రు నిర్మించి విరజుం డను పేరిడియె; నతండు భూమికిం బ్రభువుగా నొల్లకుండెఁ; దత్సుతుండు కర్దముండు ననపేక్షిత రాజ్యుండై తపంబున కరిగెఁ; దదీయ పుత్త్రుం డనంగుండు దండనీతి నయించి భూ ప్రజలం బాలించె; నతని కొడుకు నీతి యనువాఁ డమ్మహారాజ్యంబున కభిషిక్తుండై యింద్రియ వశత్వంబు నొంది మృత్యుపుత్త్రి సునీథ యను కామినిం గమనీయాకార నతిమనోహర గుణ విభాసినిం బరిణయంబైన, దానియందు వేనుండు గలిగి మాతామహదోషంబునం జేసి రాగద్వేషంబులం బ్రజకు విరుద్ధుం డయ్యెఁ; నట్లగుటయు మహామునులు గూడి యేతెంచి మంత్రపూతంబు లగు కుశసంచయంబుల నతనిం బ్రశమితుం జేసి తద్దక్షిణోరుతలంబు మథించిన. 205

ప్రతిపదార్థం: దానిన్= ఆ నీతిశాస్త్రాన్ని; శుక్రుండు= శుక్రాచార్యుడు; సహస్ర+అధ్యాయ పరిమితంబున్+కావించెన్= వేయి అధ్యాయాలకు తగ్గించి రచించాడు; మఱియున్= ఇంకా; మనుష్యుల శక్తి+ఎఱింగి= మానవుల సామర్థ్యాన్ని గుర్తించి; మునులు; క్రమంబున్= వరుసగా; సంక్షిప్త రూపంబులుగాన్= క్లుప్తంగా; గ్రంథంబులు+కావించిరి= గ్రంథాలు రచించారు; ఇది నీతిశాస్త్ర ప్రవర్తన ప్రకారంబు= ఇది నీతిశాస్త్రం ప్రవర్తిల్లిన విధానం; అట్లు= ఆ విధంగా; సురలు+ఆ+మేలు పడసి= దేవతలు ఆ మేలును పొంది; విశ్వలోక+ఈశ్వరుండు+అగు= విశ్వానికి అంతటికి అధిపతియైన; విష్ణుపాలికిన్+చని= విష్ణువు వద్దకు వెళ్ళి; తగన్+కని= ఉచితరీతిని సందర్శించి; కార్యంబు విన్నవించి= తాము వచ్చిన పనిని తెలియజేసి; నీతిశాస్త్ర సముద్భవంబు+ఎఱింగించి= నీతిశాస్త్రం యొక్క పుట్టుకను తెలియ చెప్పి; దీనిన్+అధిగమింపను= దీనిని పఠించటానికి; తదీయ+ఆచారంబు నడపను= నీతిశాస్త్ర సంప్రదాయాన్ని నిర్వర్తించటానికి; శక్తుండు+అగువానిన్+ఒక్కరుని= సమర్థుడైన ఒక వ్యక్తిని; నిర్దేశింప వలయున్+అని+అభ్యర్థించినన్= చూపించవలసింది అని ప్రార్థించగా; ఆ+దేవుండు= ఆ విష్ణువు; నిజ తేజోమయుండు కాన్= తనదైన ప్రకాశం కలవాడైన; ఒక్కమానస పుత్రున్+నిర్మించి= ఒక్క మానసపుత్రుడిని సృష్టించి; విరజుండు+అనుపేరు+ఇడియెన్= విరజు డనే పేరు పెట్టాడు; అతండు= ఆ విరజుడు; భూమికిన్+ప్రభువుగాన్+ఒల్లకుండెన్= భూమికి రాజు కావటానికి ఇష్టపడలేదు. తద్+సుతుండు= అతడి కుమారుడు; కర్దముండున్= కర్దముడనే వాడు; అనపేక్షిత రాజ్యుండు+ఐ= ఇష్టంలేని రాజ్యం కలవాడై (అంటే రాజ్యంపై ఆసక్తిలేనివాడై); తపంబునకున్+అరిగెన్= తపస్సు చేసికొనటానికి వెళ్ళిపోయాడు; తదీయ పుత్త్రుండు+అనంగుండు= ఆ కర్దముడి కుమారుడైన అనంగుడు; దండనీతి నయించి= దండనీతి ననుసరించి; భూప్రజలన్+పాలించెన్= భూలోకంలోని ప్రజలను పరిపాలించాడు; అతని కొడుకు= అతడి పుత్రుడు; నీతి+అనువాఁడు= నీతి అనుపేరుగలవాడు; ఆ+మహారాజ్యంబునకున్+అభిషిక్తుండు+ఐ= ఆ గొప్ప రాజ్యానికి పట్టాభిషిక్తుడై; ఇంద్రియ వశత్వంబున్+ఒంది= ఇంద్రియాలకు లోనయి; మృత్యుపుత్రి= మృత్యువు యొక్క కుమారి అయిన; సునీథ+అను కామినిన్= సునీథ అనే స్త్రీని; కమనీయ+ఆకారన్= మనోహరమైన ఆకారం కలదానిని; అతి మనోహర గుణ విభాసినిన్+ పరిణయంబు+ అయినన్= మిక్కిలి సౌందర్యం, గుణాలచేత ప్రకాశిస్తున్న దానిని వివాహం కాగా; దానియందున్= ఆ సునీథయందు; వేనుండు+కలిగి= వేనుడనే వాడు పుట్టి; మాతామహ దోషంబునన్+చేసి= తల్లి తండ్రి యొక్క దోషం వలన; రాగ ద్వేషంబులన్= అనురాగ ద్వేషాల వలన; ప్రజకున్+విరుద్ధుండు+అయ్యెన్= ప్రజలకు విరోధి అయ్యాడు; అట్లు+అగుటయున్= ఆ విధంగా కావటం వలన; మహామునులు+కూడి+ఏతెంచి= మహర్షులు కలిసి వచ్చి; మంత్ర పూతంబులు+అగు= మంత్రాలచేత పవిత్రీకరించబడిన; కుశ సంచయంబులన్= దర్భల సమూహంతో; అతనిన్+ప్రశమితుం+చేసి= అతడిని ఉపశమింపజేసి; తద్+దక్షిణ+ఊరుతలంబు+మథించినన్= అతడి యొక్క కుడి తొడను మథించగా.

తాత్పర్యం: ఆ నీతిశాస్త్రాన్ని శుక్రాచార్యుడు వేయి అధ్యాయాలకు కుదించాడు. మహర్షులు క్రమంగా మానవుల శక్తికి అనుగుణంగా సంక్షిప్తం చేశారు. ఇది నీతిశాస్త్రం ప్రవర్తిల్లిన విధం. దేవతలు విష్ణుసన్నిధికి వెళ్ళి నీతిశాస్త్రం పుట్టుకను వివరించి, దాన్ని అభ్యసించి, తదుచితంగా నడపగల సమర్థుడిని నిర్దేశించుమని ప్రార్థించారు. విష్ణువు తనతో సమాన తేజస్సుగల మానసపుత్రుని సృష్టించి విరజు డని నామకరణం చేశాడు. అతడు రాజు కావటానికి అంగీకరించలేదు. అతడి కుమారుడు కర్దముడు రాజ్యపాలనకు ఇష్టపడక తపస్సుకు వెళ్ళిపోయాడు. అతడి కుమారుడు అనంగుడు దండనీతి ననుసరించి ప్రజలను పాలించాడు. అతడి పుత్రుడు నీతి అనేవాడు రాజ్యాభిషిక్తుడై చక్కటి అందచందాలతో ప్రకాశిస్తూ ఉండిన మృత్యుపుత్రిక అయిన సునీథను పెండ్లాడి ఆవిడయందు వేనుడనే కుమారుడిని పొందాడు. మాతామహుడి దోషంవలన వేనుడు రాగద్వేషాల కారణంగా ప్రజావిరుద్ధు డయ్యాడు. అట్లా కావటంతో మహామునులు కలిసి వచ్చి మంత్రాలతో పవిత్రీకరించిన దర్భలతో అతడిని ఉపశమింపజేసి అతడి కుడితొడను మథించారు.

క. **విను కాలిన కొఱవి తెఱం। గున నల్ల దనంబు మిగులు కుఱుచ యొడలు నె**
ఱ్ఱని కన్నులు నై యశుచి। త్వ నిరూఢుం డొకఁడు పుట్టె ధర్మతనూజా! 206

ప్రతిపదార్థం: ధర్మతనూజా!= ఓ ధర్మరాజా! విను= వినుము; కాలిన కొఱవి తెఱంగునన్= కాలిన కొరవివలె; నల్ల దనంబున్= నల్లదనం; మిగులు= అతిశయించే; కుఱుచ+ఒడలున్= మిక్కిలి పొట్టి శరీరమూ; ఎఱ్ఱని కన్నులున్+ఐ= ఎర్రని కన్నులు కలిగి; అశుచిత్వ నిరూఢుండు+ఒకఁడు= శుచి శుభ్రత లేనివా డొకడు; పుట్టెన్= జన్మించాడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! మునులు వేనుడి కుడితొడను మథించగా, కాలిన కొరవివలె నల్లనై, మిక్కిలి పొట్టి శరీరంతో ఎర్రని కన్నులు కలిగి, అశుచి అయిన ఒకడు జన్మించాడు.

వైన్యుం డనురాజు చరిత్రంబు భీష్ముఁడు ధర్మజునకుం జెప్పుట (సం. 12-59-201)

వ. **వానిం జూచి యా ఋషులు 'నిషీద' యని పలికి వర్జించుటం జేసి తత్సంతాన జాతులు నిషాదు లనం బరఁగి వింధ్యాది గిరి వన ప్రదేశంబులఁ గ్రూరత్వంబున వర్తిల్లి; రమ్మునులు మఱియు నా రాజు దక్షిణ బాహువు మథించిన నుజ్జ్వలత్కవచ శరశరాసన భాసమానుండును వేద వేదాంగ ధనుర్వేద పారగుండును నగు పరమాకారవంతుం డుదయించె; సకల దండనీతియు నప్పురుషు నాశ్రయించె; నతం; దమ్మహాత్ముల కభిముఖుండును బ్రాంజలియు నై వినయంబున. 207**

ప్రతిపదార్థం: వానిన్+చూచి= ఆ పొట్టి మనిషిని చూచి; ఆ ఋషులు= ఆ మహర్షులు; నిషీద+అని పలికి= కూర్చుండు మని చెప్పి; వర్జించుటన్+చేసి= వదలిపెట్టటం వలన; తద్+సంతాన జాతులు= ఆ పొట్టిమనిషికి జన్మించిన జాతులు; నిషాదులు+అనన్+పరఁగి= నిషాదులు అనే పేరుతో; వింధ్య+ఆది గిరి వన ప్రదేశంబులన్= వింధ్య మొదలైన పర్వతాలలో, అరణ్యాలలో; క్రూరత్వంబునన్= క్రూర స్వభావంతో; వర్తిల్లిరి= ప్రవర్తిల్లారు; ఆ+మునులు= ఆ మహర్షులు; మఱియున్= మళ్ళీ; ఆ రాజు దక్షిణ బాహువును మథించినన్= ఆ వేనుని కుడి భుజాన్ని మథించగా; ఉజ్జ్వలత్+కవచ శర శరాసన భాసమానుండునున్= ప్రకాశిస్తున్న కవచమూ, బాణాలు, విల్లుతో సూర్యకాంతితో ప్రకాశించే; వేద వేద+అంగ ధనుః+వేద పారగుండునున్+అగు= వేదాలలో వేదాంగాలలో, ధనుర్వేదంలో తుదముట్టి ఎరిగినవాడు అయిన; పరమ+ఆకారవంతుండు+ఉదయించెన్= శ్రేష్ఠమైన స్వరూపంతో జన్మించాడు; సకల దండనీతియున్= సమస్తమైన దండనీతి; ఆ+పురుషున్+ఆశ్రయించెన్= ఆ మహాపురుషుడిని ఆశ్రయించింది; అతండు+ఆ+మహాత్ములకున్= ఆ మహాపురుషుడు ఆ మహనీయులకు; అభిముఖుండును= ఎదురుగా నిలబడ్డవాడు; ప్ర+అంజలియున్+ఐ వినయంబునన్= దోసిలొగ్గినవాడు అయి, వినయంతో.

తాత్పర్యం: ఆ పొట్టి మనిషితో మునులు 'నిషీద' అనటంవలన అతడి సంతతి జాతులు నిషాదులై వింధ్యపర్వతం మొదలుకొని ఉన్న వనప్రదేశాలలో క్రూరస్వభావంతో నివసించటం ప్రారంభించారు. ఆ మహర్షులు మళ్ళీ వేనుడి కుడి బాహువును మథించగా వేద వేదాంగాలలోను, ధనుర్వేదంలోను పారంగతుడు - ప్రకాశించే కవచంతో, ధనుర్బాణాలతో మహాపురుషుడు జన్మించాడు. ఆ వెంటనే దండనీతి ఆ మహాపురుషుడిని ఆశ్రయించింది. ఆ పురుషుడు మునుల ఎదుట నిలిచి వినయంతో అంజలి ఘటించాడు.

తే. **'వినుఁడు! ధర్మార్థ తత్త్వ ప్రవీణ యగుచు। సూక్ష్మదర్శిని యైనది సుకృతులార!**
నాదు బుద్ధి; మీ కెప్పని నడపవలయు। దీనిఁ గొని నన్నుఁ బనుపరే దాని' కనిన. 208

ప్రతిపదార్థం: సుకృతులార!= పుణ్యాత్ములారా!; వినుఁడు= దయతో వినండి; నాదు బుద్ధి= నా యొక్క బుద్ధి; ధర్మ+అర్థ తత్త్వ ప్రవీణ+అగుచున్= ధర్మమూ, అర్థమూ వీటి స్వభావంలో నిపుణమై; సూక్ష్మదర్శిని+ఐనది= సూక్ష్మవివేచనతో ఒప్పుతూ

ఉన్నది; మీకున్+ఏ+పనిన్+నడపవలయున్= మీ కొరకు ఏ పని చేయాలో; దీనిన్+కొని= దీనిని గ్రహించి; దానికిన్= అందుకై; నన్నున్+పనుపరే!= నన్ను ఆజ్ఞాపించరా!; అనినన్= అని ప్రార్థించగా.

తాత్పర్యం: 'ఓ మహాత్ములారా! నా మనస్సు ధర్మార్థస్వభావాలలో ప్రవీణమయింది. సూక్ష్మవివేచనతో ఒప్పుతూ ఉన్నది. ఇటువంటి నా బుద్ధిని గ్రహించి, మీకై ఎట్లాంటి మహాకార్యం చేయమంటారో ఆజ్ఞాపించండి' అని ఆ మహాపురుషుడు ప్రార్థించాడు.

వ. వారునుం దత్సమయ సమాగతు లయిన విబుధులును నవ్వైన్యాభిధాను నభినందించి. 209

ప్రతిపదార్థం: వారునున్= ఆ మునులూ; తద్+సమాగతులు+అయిన= అక్కడికి వచ్చిన; విబుధులును= దేవతలూ; ఆ+వైన్య+అభిధానున్+అభినందించి= ఆ వైన్యుడనే పేరు కలిగిన ఆ మహాపురుషుడిని మెచ్చుకొని.

తాత్పర్యం: ఆ మహర్షులూ, అక్కడికి వచ్చిన విద్వాంసులు వైన్యు డనే పేరు కలిగిన ఆ మహాపురుషుడిని మెచ్చుకొని - (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. మాన లోభములఁ గామ క్రోధములఁ బాసి । సర్వ జంతువులకు సముఁడ వగుచు
నియత ధర్మము నీవు నిశ్శంక నడపుము; । ప్రియము నప్రియము నుపేక్షఁ గూర్పు;
'దండనీత్యాశ్రయ ధర్మంబు నా పని; । దీనిఁ జేయుదు సావధాన వృత్తి;
రక్షింతు శ్రుతుల; వర్ణముల సంకరములు । సొరనీ; నదండ్యులు ధరణి దివిజు

తే. లరయువాఁడ నే భూప్రజ'నని ప్రతిజ్ఞ । యను మహోన్నత పద మెక్కు మనుడు, నాతఁ
'డవనిసురులు సహాయత్వ మాచరించి । రేని న ట్లగుఁ గా' కనియెం గుమార! 210

ప్రతిపదార్థం: కుమార!= మనుమడైన ఓ ధర్మరాజా! మాన లోభములన్+కామ క్రోధములన్+పాసి= మాన లోభాలను, కామ క్రోధాలను వదలిపెట్టి; సర్వ జంతువులకున్= సమస్త ప్రాణులకు; సముఁడవు+అగుచున్= సమానుడ వవుతూ; నియత ధర్మమున్+ఈవు= నియమితమైన ధర్మాన్ని నీవు; నిశ్శంకన్+నడపుము= నిస్సందేహంగా కొనసాగించుము; ప్రియమున్+అప్రియమున్+ఉపేక్షన్+కూర్పు= ప్రియాప్రియాలను నిర్లిప్తంగా నిర్వహించుము; దండనీతి+ఆశ్రయ ధర్మంబు నా పని= దండనీతిని ఆశ్రయించిన ధర్మమే నేను చేయవలసిన పని; దీనిన్+చేయుదున్= దీనిని నేను చేస్తాను; స+అవధాన వృత్తిన్= ఏకాగ్రతతో కూడిన పద్ధతితో; శ్రుతులన్= వేదాలను; రక్షింతున్= రక్షిస్తాను; వర్ణములన్+సంకరములు= వర్ణసంకరం; చొరనీను= ప్రవేశింప నీయను; ఏను= నేను; ధరణిదివిజులు= బ్రాహ్మణులు; అదండ్యులు= శిక్షార్హులు కానివారైన; భూ ప్రజన్= భూమిలోని ప్రజానీకాన్ని; అరయువాఁడన్= ప్రేమతో చూస్తాను అని; ప్రతిజ్ఞ+అను= ప్రతిజ్ఞ అనే; మహా+ఉన్నత పదము+ఎక్కుము+ అనుడున్= అత్యున్నత పదవిని అలంకరించవలసిందని చెప్పగా; ఆతఁడు= ఆ మహాపురుషుడు; అవని సురులు= భూదేవతలైన బ్రాహ్మణులు; సహాయత్వము+ఆదరించిరి+ఏని= సహాయ సహకారా లందిస్తే; అట్లు+అగున్+కాక+ అనియెన్= మీరుకోరినట్లే ఔతుందని చెప్పాడు.

తాత్పర్యం: దురహంకారం, లోభం, కామక్రోధాలు అనే దుర్గుణాలను వదలి సమస్తప్రాణులపట్ల సముడవై, శాస్త్ర విహితంగా రాజధర్మాన్ని అనుక్షణం నిస్సంకోచంగా పరిపాలించవలసింది. ఇష్టానిష్టాలను లెక్కచేయక నిర్లిప్తుడవై కర్తవ్యాన్ని యథావిధిగా నిర్వర్తించాలి. దండనీతిని అనుసరించిన ధర్మసంరక్షణమే నా దైనందిన విధి. ఈ నియమ నిష్ఠలో సావధానుడనై వేదసంరక్షణతో వర్ణాశ్రమాల సాంకర్యం పరిహరిస్తాను. భూప్రజలందరినీ దయాంతఃకరణుడవై

పాలిస్తాననే దృఢప్రతిజ్ఞాసింహపీఠిపై అధిష్ఠితుడవు కావాలి అని మునులు ఆదేశించారు. 'నాకు బ్రాహ్మణులు సహాయసహకారా లందిస్తే అదే రీతిగా ప్రవర్తించగల'నని ఆ వైన్యుడు విన్నవించాడు.

వ. అనిన విని వారలు ప్రీతచిత్తులై యాతనికి మహీసురులు సహాయత్వం బాచరించువారుగా ననుమతి సేసి; రయ్యవసరంబున వాత్సల్యంబున సకల దివ్య పరివృతులై వచ్చి విష్ణు విధాతలు నమ్మునీశ్వరులును నక్కుమారు నఖిల ధరణీ సామ్రాజ్యాభిషేకంబు నిర్వర్తించి; రవ్విభునకు శుక్రుండు పురోహితుండును వాలఖిల్యుల యందు సారస్వతగణం బమాత్యులును గర్గుండు సాంవత్సరికుండు నై నడచిరి. మున్ను మహి విషమ యగుటయు నమ్మనుజపతి సమమూర్తి గావించుటయు విందుము. కరచరణాద్యవయవములతో నవనియు సాగరంబులును మహాగిరులును నగ్గురు ప్రభావుని భజియించె. 211

ప్రతిపదార్థం: అనినన్ విని= అని వైన్యుడు చెప్పగా మహర్షులు విని; వారలు= ఆ మహర్షులు; ప్రీతచిత్తులు+ఐ= మనసులో సంతోషించిన వారై; అతనికిన్= ఆ వైన్యునకు; మహీసురులు= బ్రాహ్మణులు; సహాయత్వంబు+ఆచరించు వారుగాన్= సహాయం చేసేవారుగా; అనుమతి+చేసిరి= అనుమతించారు; ఆ+అవసరంబునన్= ఆ సందర్భంలో; వాత్సల్యంబునన్= ప్రేమతో; సకలదివ్య పరివృతులు+ఐ= సమస్త దేవతలతో కూడినవారై; వచ్చి; విష్ణు విధాతలున్= విష్ణువూ, బ్రహ్మ; ఆ+ముని+ఈశ్వరులునున్= ఆ మునీంద్రులు; ఆ+కుమారున్= ఆ వైన్యుడిని; అఖిల ధరణీసామ్రాజ్య+అభిషేకంబున్+నిర్వర్తించిరి= సమస్త భూమికి రాజ్యాభిషిక్తుడినిచేశారు; ఆ+విభునకున్= ఆ వైన్యుడనే రాజుకు; శుక్రుండు పురోహితుండును= శుక్రాచార్యుడు పురోహితుడుగాను; వాలఖిల్యుల+అందున్= వాలఖిల్య మహర్షులలో; సారస్వత గణంబు= సారస్వత గణమనే మునులు; అమాత్యులును= మంత్రులుగానూ; గర్గుండు= గర్గుడు; సాంవత్సరికుండున్+ఐ= జ్యోతిష్కుడై; నడచిరి= ప్రవర్తించారు; మున్ను= పూర్వం; మహి= భూమి; విషమ+అగుటయున్= సమానంగా లేకపోవటం (ఎగుడు దిగుడుగా ఉండటం) వలన; ఆ+మనుజపతి= ఆ రాజు; సమమూర్తి+కావించుటయున్= మిట్ట పల్లాలు లేని సమతలమైన భూమిగా చేయటాన్ని; విందుము= విన్నాము; కరచరణ+ఆది+అవయవంబులతోన్= చేతులు, కాళ్ళు మొదలైన శరీర భాగాలతో; అవనియున్= భూమి; సాగరంబులును= సముద్రాలూ; మహాగిరులునున్= మహాపర్వతాలూ; ఆ+గురుప్రభావుని= గొప్ప మహిమను పొందిన వైన్యమహారాజును; భజియించెన్= సేవించాయి.

తాత్పర్యం: అని వైన్యుడు చెప్పగా విన్న మహర్షులు సంతోషచిత్తు లయ్యారు. వారు ఆ వైన్యుడికి బ్రాహ్మణులను సహాయకులుగా అనుమతించారు. ఆ సందర్భంలో ప్రేమతో సమస్తదేవతలతో కూడినవారైన బ్రహ్మవిష్ణువులూ మహర్షులూ సమస్తభూమికీ వైన్యుడిని రాజుగా అభిషేకించారు. ఆ వైన్యుడికి శుక్రాచార్యుడు పురోహితుడుగా సారస్వత్యగణం మంత్రులుగా, గర్గుడు జ్యోతిష్కుడుగా వర్తించారు. అంతకు ముందు భూమి మిట్టపల్లాలతో ఉండగా, వైన్యుడే సమతలం చేశా డని విన్నాం. శరీరావయవాలతో కూడి భూమీ, సప్త సముద్రాలూ, కులపర్వతాలూ ఆ మహానుభావుడిని సేవించాయి.

**క. సురపతి విభవము, మేరువు । హిరణ్యమును, గిన్న రేశుఁ డీడిత సంప
ద్గురుతయు నొసఁగిరి రథ కరి । తురగ భటావళులు తలఁపుతో నొడఁగూడెన్. 212**

ప్రతిపదార్థం: సురపతి= దేవతల రాజైన ఇంద్రుడు; విభవమున్= సమస్త వైభవాన్నీ; మేరువు= మేరుపర్వతం; హిరణ్యమును= బంగారాన్నీ; కిన్నర+ఈశుఁడు= కిన్నరులకు రాజైన కుబేరుడు; ఈడిత= ప్రశస్తమైన; సంపద్+గురుతయున్= అధికమైన సంపదనూ; ఒసఁగిరి= ప్రసాదించారు; తలఁపుతోన్= భావించగానే; రథ, కరి, తురగ, భట+ఆవళులు= రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలం యొక్క సమూహం; ఒడఁగూడెన్= సమకూడినది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ వైన్య మహారాజుకు ఇంద్రుడు సమస్త వైభవాన్నీ, మేరు పర్వతం బంగారాన్నీ, కుబేరుడు ప్రశస్తమూ, అధికమూ అయిన సంపదనూ ప్రసాదించారు. భావించిందే ఆలస్యంగా రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలముల సమూహమూ సమకూరాయి.

వ. ఇట్లు మహనీయ ప్రభుత్వ పదస్థుండై యమ్మహాత్ముండు శాస్త్రోక్త మార్గంబున దండనీతి పరిపాలనంబు ధర్మతాత్పర్య సమీచీనంబుగా నాచరించె. 213

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మహనీయ ప్రభుత్వ పదస్థుండు+ఐ= మహిమాన్వితమైన అధికార పదవిని పొందినవాడై; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడైన వైన్యుడు; శాస్త్ర+ఉక్తమార్గంబునన్= శాస్త్రాలలో చెప్పబడ్డ రీతిలో; దండనీతి పరిపాలనంబున్= దండనీతితో పాలించటాన్ని; ధర్మతాత్పర్య సమీచీనంబుగాన్+ఆచరించెన్= ధర్మానుగుణంగా, సత్యరీతిగా కొనసాగించాడు.

తాత్పర్యం: మహోన్నతమైన అధికార పదవిని అలంకరించిన ఆ వైన్యుడు, శాస్త్రోక్తంగా దండనీతితో ధర్మాను రక్తుడై, సత్యవ్రతుడై పరిపాలన సాగించాడు.

క. ఉరగాదులవలని భయముఁ । బొరయక యొండొరులతోడఁ బొసఁగి రుజలుఁ జి
త్తరుజలు లేక యతని తఱి । ధరణీప్రజ సస్యసంపదయుఁ గల్గి మనున్. 214

ప్రతిపదార్థం: అతని తఱిన్= ఆ వైన్య మహారాజు పరిపాలన సమయంలో; ధరణీ ప్రజలు= భూ ప్రజ; ఒండు+ఒరుల తోడన్+పొసఁగి= పరస్పరం కలసి మెలసి; ఉరగ+ఆదులవలని భయమున్+పొరయక= పాములు మొదలైన వాటి భయంలేకుండా; రుజలున్= శరీర సంబంధమైన రోగాలు; చిత్తరుజలు లేక= మానసిక రోగాలు లేకుండా; సస్యసంపదయున్+కల్గి= పైరు పంటల సంపదతో ఒప్పి; మనున్= జీవిస్తుంది.

తాత్పర్యం: ఆ వైన్యుడి పాలనలో ప్రజలంతా కలసి మెలసి పాములు మొదలైన విషపు పురుగుల బాధలు లేకుండా పాడిపంటలతో సుఖంగా జీవించారు.

తే. బ్రాహ్మణ క్షత సంత్రాణ పరతఁ జేసి । క్షత్రియాభిధానంబు, రంజనము నెల్ల
ప్రజకుఁ జేయుట కతమున రాజనామ । మును బ్రవర్తిల్లె నా నృపాలునకు నధిప! 215

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; ఆ నృపాలునకున్= ఆ వైన్య మహారాజుకు; బ్రాహ్మణ= బ్రాహ్మణులను; క్షతసంత్రాణ= వినాశంనుండి రక్షించటంలో; పరతన్+చేసి= ఆసక్తి కలిగి ఉండటంచేత; క్షత్రియ+అభిధానంబున్= క్షత్రియుడు అనే పేరును; ఎల్ల ప్రజకున్= సమస్త ప్రజలకూ; రంజనము చేయుట కతమునన్= ఆనందాన్ని కలిగించటం కారణంగా; రాజనామమును= రాజు అనే పేరును; ప్రవర్తిల్లెన్= కలిగాయి.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆ వైన్యమహారాజు బ్రాహ్మణులను వినాశనంనుండి రక్షించే ఆసక్తి కలిగి ఉండటంచేత క్షత్రియుడనే పేరునూ, సర్వప్రజలనూ రంజింపచేయటంచేత రాజు అనే పేరునూ పొందాడు.

వ. తత్సంతతి జాతు లెల్లను దత్కుల్యులై రాజత్వంబు వహించి దండనీతి పాలించిరి; రాజని యొకండు కలిగిన తెఱంగును రాజ్యస్థాపనంబును రాజు మిగిలి వర్తింపం దక్కిన జనంబులకు రాకుండుటయు విష్ణు విహితంబులు విష్ణుండు రాజుల నిజ తేజోంశంబులం బ్రవేశించి యుండునట్లగుటంజేసి దైవ నిభుండగుచు రా జెల్ల వారిచేతను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ్రొక్కం గొనజాలుఁ, దద్రక్షణంబును నాచరించు; నొక్కని వశంబున లోకంబంతయు వర్తిల్లుటకు దేవ సంబంధ కలితం బయిన గుణంబు వెలిగా నొండు కారణంబు కలదే? యాకర్ణింపుము. 216

ప్రతిపదార్థం: తద్+సంతతి జాతులు+ఎల్లను= ఆ వైన్యుడనే రాజుయొక్క సంతాన సమూహమంతా; తద్+కల్పులు+ఐ= అతడితో సమానులై; రాజత్వంబు వహించి= రాజ్యాధికారాన్ని పొంది; దండనీతి పాలించిరి= దండనీతితో రాజ్యాన్ని పాలించారు; రాజు+అని+ఒకండు= రాజు అనే పేరుతో ఒకడు; కలిగిన తెఱంగును= సంభవించిన రీతిని; రాజ్యస్థాపనంబును= రాజ్య నిర్మాణాన్ని; తక్కిన జనంబులకున్= తదితర ప్రజలకు; రాజు మిగిలి= రాజును అతిక్రమించి; వర్తింపన్= ప్రవర్తించటానికి; రాకుండుటయున్= వీలుకాకుండా; విష్ణువిహితంబులు= విష్ణువుచేత విధించబడ్డాయి; విష్ణుండు= విష్ణుమూర్తి; రాజుల= రాజులయందు; నిజ తేజః+అంశంబులన్ తన తేజోభాగాలను; ప్రవేశించి+ఉండునట్లు+అగుటన్+చేసి= ప్రవేశించి ఉంటాడు గాన; రాజు; దైవ నిభుండు+అగుచున్= దేవుడితో సమానమైనవాడై; ఎల్లవారిచేతను= సమస్త ప్రజలచేత; మ్రొక్కున్+కొనన్+చాలున్= నమస్కృతు లందు కొనటానికి అర్హుడయ్యాడు; తద్+రక్షణంబునున్+ఆచరించు= ఆ ప్రజలను రక్షిస్తాడు; ఒక్కని వశంబున్= ఒక్కడి వంశంలో; లోకంబు+అంతయున్= లోకమంతా; వర్తిల్లుటకున్= కొనసాగటానికి; దేవ సంబంధ కలితంబు+అయిన గుణంబు= దైవ సంబంధంతో కూడిన గుణం; వెలిగాన్= వేరుగా; ఒండుకారణంబు+కలదే?= ఇతర కారణ ముందా? (లేదు కదా); ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ వైన్యుడి సంతానమంతా అతడితో సమానులై దండనీతిని అనుసరించి రాజ్యం చేశారు. రాజనేవాడు పుట్టిన విధానమూ, రాజ్యస్థాపనమూ, రాజును అతిక్రమించకుండా ప్రజలు ప్రవర్తించటం అనే అంశాలు విష్ణునిర్ణాయకాలే. విష్ణువు రాజులందు తన తేజోభాగాలను ప్రవేశింపజేయటంవలన రాజు దైవసమానుడై ప్రజల నమస్కారాలకు అర్హుడయ్యాడు. ప్రజాసంరక్షణం ఒకడి అధీనంలో ఉండటం అనేది దైవాంశ సంబంధమైన గుణం కాక మరొకటి అవుతుందా? వినుము.

విశేషం: ఈ వచనం మూలాను సారంగా సాగింది. మూలంకంటే తిక్కన సరళంగా విపులంగా రచించటం విశేషం. ఈ వచనంలో రాజుకు సంబంధించి విష్ణు ప్రాధాన్యాన్ని చెప్పటానికి 'నా విష్ణుః పృథివీ పతిః' అనే సూక్తి ఆధారం. విష్ణ్వంశలేనివాడు రాజు కాలేడని స్పష్టం.

మ. హరిఫాలంబునఁ బుట్టి ధర్మమున కాలై యర్థమన్పుత్రకున్
సిరి కాంచెన్ దగ వారు ముప్వురును సుస్థేమోన్నతిన్ సంశ్రయిం
తురు భూపాలకు నాతఁ డన్యజనతా తుల్యోద్భవుం డెట్లు ని
ర్జర లోకార్హ సమగ్ర పుణ్య వితతి ప్రాప్తుండు గా కారయన్. 217

ప్రతిపదార్థం: సిరి= సంపద (లక్ష్మి); హరిఫాలంబునన్= విష్ణువు నొసట; పుట్టి= జన్మించి; ధర్మమునకున్+ఆలై= ధర్మదేవతకు భార్య అయి; అర్థమన్+పుత్రకున్= అర్థమనే కుమారుడిని; కాంచెన్= పొందింది; తగన్= తగిన రీతిలో; వారు ముప్వురును= లక్ష్మి, ధర్మదేవత, అర్థమనే పుత్రుడూ వీళ్ళు ముగ్గురూ; సుస్థేమ+ఉన్నతిన్= మిక్కిలి దృఢంగా; భూపాలకున్= రాజును; సంశ్రయింతురు= ఆశ్రయిస్తారు; ఆరయన్= పరిశీలించగా; ఆతఁడు= ఆ రాజు; నిర్జరలోక+అర్హ= స్వర్గ లోకార్హమైన; సమగ్ర= సంపూర్ణమైన; పుణ్యవితతి= పుణ్యసమూహాన్ని; ప్రాప్తుండు+కాక= పొందినవాడు కాకుండా; అన్యజనతా తుల్య+ఉద్భవుండు+ఎట్లు?= ఇతర ప్రజలతో సమానమైన జననం కలవా డెట్లా అవుతాడు?

తాత్పర్యం: శ్రీమహావిష్ణువు ఫాలభాగంలో ఉద్భవించిన లక్ష్మి, ధర్మదేవుడికి భార్యయై, అర్థమనే పుత్రుడిని పొందింది. లక్ష్మి, ధర్మదేవత, అర్థమనే పుత్రుడు - ఈ ముగ్గురూ మిక్కిలి దృఢంగా రాజును ఆశ్రయిస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అందుకే రాజు ఎంతో పుణ్యాన్ని పొందినవాడై స్వర్గలోకాన్ని పొందటానికి తగినవా డౌతాడు. అంతేగాని ఇతరులవంటి వాడు కాడు.

విశేషం: 'విష్ణోర్లలాటాత్కమలం సౌవర్ణమభవత్తథా, శ్రీస్సంభూతాయతో దేవీ పత్నీ ధర్మస్య ధీమతః' అంటూ సాగిన మూలంలోని నాలుగైదు శ్లోకాలకు యథామూల మీ పద్యం.

వ. దివంబున నుండి దండనీతి నయించుటకు వచ్చి వాసుదేవ మహత్త్వ భావితుండైన మహానుభావుండు కావున వర్ణంబులు నాశ్రమంబులుం దదాచార ప్రవర్తనంబులైన; వేద పురాణేతిహాసంబులును రాజున కధీనంబులు తదీయ మాహాత్మ్యంబున నతనియందు సౌందర్య శౌర్య చాతుర్యాది గుణంబులు కలుగ జనంబులు తలంతురు; తదాజ్ఞకు లోనై వర్తింతు రిది రాజులు దేవసములైన తెఱంగు; మఱియు నడుగవలయు వాని నడుగు' మనిన నయ్యాపగానందనునకుం బ్రణమిల్లి యప్పాండునందనుం డి ట్లనియె. 218

ప్రతిపదార్థం: దివంబునన్+ఉండి= స్వర్గం నుండి; దండనీతిన్ నయించుటకున్ వచ్చి= దండనీతిని ప్రాప్తింపజేయటం కొరకు వచ్చి; వాసుదేవ మహత్త్వ భావితుండు+ఐన= శ్రీమహావిష్ణువు మహిమను భావించేవాడైన; మహానుభావుండు+కావునన్= కాబట్టి; వర్ణంబులున్= చతుర్వర్ణాలూ; ఆశ్రమంబులున్= చతురాశ్రమాలూ; తద్+ఆచార ప్రవర్తనంబులు+ఐన= వాటి ఆచారాన్ని నిర్వహింపజేసేవైన; వేద పురాణ+ఇతిహాసంబులును= వేదాలూ, పురాణాలూ, ఇతిహాసాలూ; రాజునకు+అధీనంబులు= రాజు వశమై ఉంటాయి; తదీయ మాహాత్మ్యంబునన్= వాటియొక్క మహిమచేత; అతని+అందున్= ఆ రాజులో; సౌందర్య, శౌర్య చాతుర్య+ఆది గుణంబులు+కలుగన్= సౌందర్యమూ, పరాక్రమమూ, నైపుణ్యమూ మొదలైన ఉత్తమ గుణాలు ఉన్నాయని; జనంబులు= ప్రజలు; తలంతురు= భావిస్తారు; తద్+ఆజ్ఞకు లోను+ఐ= అందువలననే ఆ రాజాజ్ఞకు లోనై; వర్తింతురు= ప్రవర్తిస్తారు; ఇది రాజులు దేవ సములైన తెఱంగు= ఇది రాజులు దేవతలతో సమానులైన తీరు; మఱియున్= ఇంకా; అడుగవలయువానిన్= అడగవలసిన వాటిని; అడుగుము+అనినన్= అడుగు మని పల్కగా; ఆ+ఆపగా నందనునకున్= ఆ గంగాసుతుడైన భీష్మునకు; ప్రణమిల్లి= నమస్కరించి; ఆ+పాండునందనుండు= ఆ ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దండనీతిని ప్రాప్తింపజేయటానికి స్వర్గం నుండి దిగి వచ్చి శ్రీమహావిష్ణువు మహిమను భావించే మహానుభావుడు కావటంవలన, చతుర్వర్ణాలు, చతురాశ్రమాలు, వీటిని ఆచరించటానికి ఆధారాలైన వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు రాజునకు వశమై ఉంటాయి. వాటి మహిమచేతనే రాజులలో అందమూ, పరాక్రమమూ, నైపుణ్యమూ మొదలైన గుణాలు ఉంటా యని ప్రజలు భావించి రాజాజ్ఞకు లోనై ప్రవర్తిస్తారు. ఇది రాజులు దేవతలతో సమాన మని చెప్పిన తీరు. ఇంకా అడగవలసిన విషయాలు ఉంటే అడుగు'మని భీష్ముడు పల్కినప్పుడు ధర్మరాజు ఆయనకు నమస్కరించి ఇట్లా అన్నాడు.

తే. 'అనఘ! నాలుగు వర్ణము లాశ్రమములు । నెన్ని కల? వెవ్విధంబుల నన్నిటికిని
వర్తనమ్ములు? వేర్వేఱ వానిఁ దెలుపు । విశ్వ రాజధర్మములను విస్తరింపు. 219

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన తాతా!; నాలుగు వర్ణములు= బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాలూ; ఆశ్రమములున్= బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే నాలుగు ఆశ్రమాలూ; అన్నిటికినీ= వాటన్నిటికీ; వర్తనంబులు= ఆచరించే పద్ధతులు; ఏ+విధంబులన్= ఏ రీతులలో; ఎన్ని కలవు= ఎన్ని ఉన్నాయో; వానిన్= వాటిని; వేర్వేఱన్= వేర్వేరుగా; తెలుపు= వివరించుము; విశ్వ రాజ ధర్మములను= ఈ ప్రపంచంలోని రాజధర్మాలను; విస్తరింపు= వివరంగా చెప్పుము.

తాత్పర్యం: 'ఓ తాతా! నాలుగు వర్ణాలూ, నాలుగు ఆశ్రమాలూ వాటన్నిటినీ ఆచరించే పద్ధతులూ ఏ విధంగా ఎన్ని ఉన్నాయో విడి విడిగా వివరించుము. ప్రపంచంలోని రాజధర్మాలను విపులీకరించుము'.

భీష్ముఁడు ధర్మజునకు వర్ణాశ్రమధర్మంబు లెఱింగించుట (సం. 12-60-1)

వ. అని యడిగిన నా దేవవ్రతుం డన్నరదేవోత్తమున కిట్లనియె. 220

ప్రతిపదార్థం: అని+అడిగినన్= అని అడుగగా; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; ఆ+నరదేవ+ఉత్తమునకున్= ఆ రాజశ్రేష్ఠుడైన ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని అడుగగా ఆ భీష్ముడు నరశ్రేష్ఠుడైన ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

క. 'కోపంబు లేమి, సత్యా। లాపము నిజ దార పర విలాసము శుచితా
గోపన మద్రోహం బవ। నీపాలక! సర్వవర్ణ నియత గుణంబుల్ 221

ప్రతిపదార్థం: అవనీపాలక!= ఓ ధర్మరాజా!; కోపంబులేమి= కోపం లేకపోవటం; సత్య+ఆలాపమున్= సత్యం చెప్పటం; నిజదార= తన భార్యయందు; పరవిలాసము= అత్యంతాసక్తి; శుచితాగోపనము= పరిశుద్ధతతో కూడిన రహస్యరక్షణం; అద్రోహంబున్= ద్రోహచింతన లేకుండటం; సర్వవర్ణ నియత గుణంబుల్= సమస్త వర్ణాలకు నియమితమైన ఉత్తమగుణాలు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఎట్లాంటి పరిస్థితిలోనైనా కోపం లేకుండా శాంతంగా ఉండటం, సత్యాన్నే చెప్పటం, స్వభార్యయందు ఆసక్తితో ఉండటం, పరిశుద్ధతతో కూడిన రహస్య రక్షణం, ద్రోహచింతన లేకుండటం అనే ఉత్తమ గుణాలను నాలుగు వర్ణాలవారు పాటించాలి.

ఆ. బ్రాహ్మణునకు దమము పరమ ధర్మం బవ। శ్యంబుఁ గృత్య మధ్యయనము; దాన
సర్వ కర్మములును, శాసితంబులు; వాని। నడపవలయు నిష్ఠ యెడప కతఁడు. 222

ప్రతిపదార్థం: బ్రాహ్మణునకున్= బ్రాహ్మణుడికి; దమము= ఇంద్రియనిగ్రహం; పరమ ధర్మంబు= శ్రేష్ఠమైన ధర్మం; అధ్యయనము=వేదాధ్యయనం; అవశ్యంబున్+కృత్యము= తప్పనిసరిగా చేయవలసిన పని; దానన్= దానివలన; సర్వ కర్మములును= సమస్త విహిత కర్మలూ; శాసితంబులు= శాసించబడ్డాయి; అతఁడు= ఆ బ్రాహ్మణుడు; నిష్ఠ+ఎడపక= నిష్ఠను వదలకుండా; నడపవలయున్= నిర్వహించాలి.

తాత్పర్యం: బ్రాహ్మణుడికి ఇంద్రియనిగ్రహం శ్రేష్ఠధర్మం. వేదాధ్యయనం నిత్యకృత్యం. దానివలన సమస్త విహిత కర్మలూ (అంటే యజ్ఞయాగాది కర్మలూ) నియమించబడ్డాయి. అతడు వాటిని నిష్ఠతో నిర్వర్తించాలి.

ఉ. కాని పథంబునం జనక, కారుణికత్వము గల్గి, శాంతిమైఁ
దా నడవంగ విప్రున కుదాత్తధనం బొడఁగూడె నేని సం
తానముఁ గూర్ప నర్థులకు ధర్మ నిరూఢతఁ బంచి పెట్ట దు
ర్మాన విదూరుఁడై పరఁగఁ బ్రాప్తుఁడు కౌరవవంశదీపకా! 223

ప్రతిపదార్థం: కౌరవ వంశదీపకా!= కురువంశ శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; కాని పథంబునన్+చనక= చెడు మార్గంలో నడవకుండా; కారుణికత్వము+కల్గి= దయ కలిగి; శాంతిమైన్= శాంతంతో; నడవంగన్= ప్రవర్తించగా; విప్రునకున్= బ్రాహ్మణుడికి; ఉదాత్త

ధనంబు+ఒడఁగూడెన్+ఏని= అధిక ధనం లభిస్తే; తాన్= తాను (ఆ బ్రాహ్మణుడు); సంతానమున్+కూర్పన్= సంతానమునకు ఇవ్వటానికి; అర్హులకున్= పాత్రులైనవారికి; ధర్మనిరూఢతన్= ధర్మానుబద్ధంగా; పంచిపెట్టన్= పంచిపెట్టటం వలన; దుర్మాన విదూరుఁడు+ఐ= అవమానాలకు దూరమైనవాడై; పరఁగన్+ప్రాప్తుడు= మెలగటానికి అర్హుడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! దుర్మార్గవర్తనుడు కాక, దయాంతఃకరణుడుగా, శాంతస్వభావుడుగా మెలిగే బ్రాహ్మణుడికి అతిశయిత మైన ధనం లభిస్తే అతడు దానిని సంతానమునకు ఇవ్వటానికి, అర్హులైన వారికి పంచిపెట్టటంకొరకు వినియోగిస్తే అవమాన దూరుడై మెలగటానికి అర్హుడౌతాడు.

విశేషం: వావిళ్లవారి ప్రతిలో ' సంతానముఁ గూర్ప కర్హులకు' అని పాఠాంతరం ఉన్నది. అది బాగుగా ఉన్నది. విప్రుడికి అధిక ధనం లభిస్తే దానిని తన సంతానానికి ప్రవర్తింపజేయక అర్హులైనవారికి ధర్మనిరతితో పంచిపెట్టాలనడం బాగుగా నున్నది.

చ. **యజనము దాన కర్మమును నధ్యయనంబును దస్యుహింసయుం**
బ్రజ కనురాగ మొందఁ బరిపాలన చేఁతయు సంగరంబున
న్విజిత విభీతిమై నురవణించుటయున్ నృపధర్మముల్; కురు
వ్రజ తిలకాయమాన! సమరంబు సుధర్ముపు వీనిలోపలన్. **224**

ప్రతిపదార్థం: కురువ్రజ తిలకాయమాన!= కురువంశశ్రేష్ఠుడైన ఓ ధర్మరాజా!; యజనము= యజ్ఞాచరణమూ; దాన కర్మమునున్= దానం చెయ్యటమూ; అధ్యయనంబును= వేదాధ్యయనమూ; దస్యుహింసయున్= దొంగలను శిక్షించటమూ; ప్రజకున్+అనురాగము+ ఒందన్= ప్రజలకు ప్రేమ కలిగేటట్లు; పరిపాలన చేఁతయున్= పరిపాలించటమూ; సంగరంబునన్= యుద్ధంలో; విజిత విభీతిమైన్= ఓటమి భయం లేకుండా; ఉరవణించుటయున్= పరాక్రమించటమూ; నృపధర్మముల్= రాజధర్మాలు; వీనిలోపలన్= పైన పేర్కొన్న వాటన్నిటిలోను; సమరంబు= యుద్ధం చెయ్యటం; సుధర్మువు= అత్యుత్తమ ధర్మం.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! యజ్ఞాచరణమూ, దానకర్మమూ, వేదాధ్యయనమూ, దొంగలను శిక్షించటమూ, ప్రజానురాగంతో పరిపాలన చేయటమూ, యుద్ధంలో ఓడిపోతా ననే భయం లేకుండా పరాక్రమించటమూ రాజధర్మాలు. వీటన్నిటిలో యుద్ధ మనేది అత్యుత్తమ ధర్మం.

విశేషం: మూలంలో 'రాజు యజ్ఞం చెయ్యవచ్చు. యజ్ఞం చేయించకూడదు. దానం చెయ్యవచ్చు. యాచించకూడదు. అధ్యయనం చెయ్యవచ్చు. అధ్యాపనం చెయ్యకూడదు' అనే రీతిలో ఉండగా, నిషిద్ధధర్మాలను పరిహరించి తిక్కన రాజునకు అర్హధర్మాలను మాత్రమే పేర్కొనటంలో ఒక ప్రత్యేకతను ప్రదర్శించా డనవచ్చును.

తే. **అధ్యయన దాన యజ్ఞంబు లధిప! వైశ్య । నకును గృత్యముల్; శుద్ధార్జనమున ధనము**
సంచితవ్యంబు పసుల రక్షించువాఁ డ । తండు; వానికి నిది మహా ధర్మ మనఘ! **225**

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; వైశ్యునకును= చతుర్వర్ణాలలో మూడవ వాడైన వైశ్యుడికి; అధ్యయన= వేదాధ్యయనం; దాన యజ్ఞంబులు= దానం చేయటమూ, యజ్ఞం చేయటమూ అనేవి; కృత్యముల్= ఆచరించవలసిన కార్యాలు; అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; శుద్ధ+ఆర్జనమునన్= పరిశుద్ధమైన అంటే న్యాయ మార్గంలో సంపాదించిన; ధనము సంచితవ్యంబు= ధనం కూడబెట్టుకొనదగింది; అతండు= ఆ వైశ్యుడు; పసుల రక్షించువాఁడు= పశువులను రక్షించేవాడుగా ఉండాలి; వానికిన్+ఇది మహాధర్మము= ఆ వైశ్యుడి కిది ఉత్తమ ధర్మం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'పాప రహితుడవైన ఓ ధర్మరాజా! వైశ్యుడికి వేదాధ్యయనమూ, దాన యజ్ఞాచరణాలూ తప్పనిసరిగా ఆచరించవలసిన కార్యాలు. అతడు న్యాయమార్గంలోనే ధనార్జన చేసి కూడబెట్టాలి. పశుపాలనం వైశ్యుడి ప్రముఖ ధర్మం.

విశేషం: మూలంలో ఐదు శ్లోకాల్లో వైశ్యుని ధర్మాలు విస్తారంగా చెప్పబడగా తిక్కన ఈ తేటగీతిలో సంక్షిప్తంగా చెప్పాడు.

క. ఈ మూఁడు వర్ణములకును । దా మంచిగఁ బనులు సేఁత ధర్మువు కురు ధా
త్రీ మహిళేశ్వర! శూద్రున । కామెయి జీవనము వాని కజుఁడు విధించెన్. 226

ప్రతిపదార్థం: కురు ధాత్రీ మహిళా+ఈశ్వర!= కురుభూమి అనే స్త్రీకి భర్త అయిన ఓ ధర్మరాజా!; ఈ మూఁడు వర్ణములకును= పైన పేర్కొన్న బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులనే మూడు వర్ణాలకూ; తాన్= తాను (శూద్రుడు); మంచిగన్+పనులు+చేఁత= సముచితంగా పనులు చెయ్యటం; శూద్రునకున్ ధర్మువు= శూద్రుడికి ధర్మం; ఆ మెయిన్= ఆ విధంగా; వానికిన్= ఆ శూద్రుడికి; అజుఁడు= బ్రహ్మ; జీవనము= జీవిత విధానం; విధించెన్= నిర్ణయించాడు.

తాత్పర్యం: 'ఓధర్మరాజా! బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు సముచిత రీతిలో పనులు చేస్తూ ఉండటం శూద్రుడికి ధర్మం. అతడికి ఆ జీవనవిధిని బ్రహ్మ నిర్ణయించాడు.

క. ధనధాన్యంబులు కూర్చుట । జనపతి యనుమతము లేక చన;దతనికి దా
ననిరూఢి శ్రద్ధ గలిగినఁ । జనునది సుపవిత్ర యగుట జగతీనాథా! 227

ప్రతిపదార్థం: జగతీనాథా!= ఓ ధర్మరాజా!; అతనికిన్= ఆ శూద్రుడికి; జనపతి+అనుమతము లేక= రాజానుమతి లేకుండా; ధనధాన్యంబులు+కూర్చుట= ధనసంపాదనమూ, ధాన్యసేకరణమూ చెయ్యటం; చనదు= కూడదు; దాన నిరూఢిన్= దానం చేసి ప్రసిద్ధి పొందటంలో; శ్రద్ధ+కలిగినన్= ఆసక్తి ఉంటే; అది సుపవిత్ర+అగుట= అది మిక్కిలి పవిత్రమయినది కావటం వలన; చనున్= అర్హమైనదే (అంటే రాజానుమతి అవసరం లేదు).

తాత్పర్యం: శూద్రుడికి రాజానుమతి లేకుండా ధనధాన్యసేకరణం ఉచితం కాదు. ఉత్తమమార్గం కావటంవలన అతడు రాజానుమతి లేకుండానే దానధర్మాలకొరకు ధనం సంపాదించవచ్చును.

తే. అధిప! త్రైవర్ణికులకును యజ్ఞవిధుల । శ్రద్ధ కలిమికి మిగులు ధర్మంబు లేదు;
యజ్ఞమునకంటె నధికమైనదియుఁ గలదె? । యజ్ఞకర్తయ చూవె సర్వాధికుండు. 228

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; త్రైవర్ణికులకును= బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులనే మూడు వర్ణాలకు; యజ్ఞవిధులన్= యజ్ఞ కార్యాచరణంలో; శ్రద్ధ కలిమికిన్= ఆసక్తి కలిగి ఉండటం అనే దానికంటె; మిగులు ధర్మంబు లేదు= మించిన ధర్మం లేదు; యజ్ఞమునకంటెన్= యజ్ఞ కార్యంకంటే; అధికమైనదియున్+కలదె?= విశిష్టమైనది ఉన్నదా?; సర్వ+అధికుండు= అందరికంటె గొప్పవాడు; యజ్ఞ కర్తయ చూవె!= యజ్ఞ కర్తయే కదా!

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు యజ్ఞకార్యాచరణంలో శ్రద్ధ కలిగి ఉండటం ఉత్తమమైన ధర్మం. యజ్ఞకార్యంకంటె గొప్పది ఏమీ లేదు. అందరికంటె యజ్ఞకర్త గొప్పవాడు.

వ. ఆశ్రమ ధర్మంబు లాకర్ణింపుము. 229

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆశ్రమ ధర్మంబులు+ఆకర్ణింపుము= నాలుగు ఆశ్రమాలు - బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాలు అనే వాటి ధర్మాలను గూర్చి చెప్పుతాను వినుము.

తాత్పర్యం: ఆశ్రమ ధర్మాలు నాలుగు - బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాలు అనే వాటి ధర్మాలను గూర్చి చెప్పుతాను వినుము.

మ. గురుశుశ్రూషయు, నాగమాధ్యయనమున్, గోష్ఠీ నిరాసంబుఁ ద
త్పరతం బొందొరయంగఁ దాఁ జొరమియున్, భైక్షాశనత్వంబు, ష
ద్వర కర్మంబులయందు రాగభరగాఢద్వేషముల్ లేక, యె
వ్వరితోడం బగగాక యున్కియును భవ్య బ్రహ్మచర్యోక్తముల్. 230

ప్రతిపదార్థం: గురు శుశ్రూషయున్= గురువులకు సేవ చేయటమూ; ఆగమ+అధ్యయనమున్= వేదాధ్యయనమూ; గోష్ఠీనిరాసంబున్= సమావేశాలపట్ల నిరాసక్తతా; తత్పరతన్= ఆసక్తితో; పొందు+ఒరయంగన్= స్నేహం పొందడంలో; తాన్+చొరమియున్= తాను ఆసక్తుడు కాకుండా ఉండటమూ; భైక్ష+అశనత్వంబున్= భిక్షాన్నం భుజిస్తూ; రాగభర గాఢ ద్వేషముల్ లేక= ప్రేమాధిక్యం కానీ, ప్రగాఢమైన విద్వేషంగానీ లేకుండా; ఎవ్వరితోడన్+పగగాక= ఎవ్వరితోనూ శత్రుత్వం లేకుండటం అనే; షట్+వరకర్మంబుల+అందున్= శ్రేష్ఠమైన ఆరు కర్మల యందు; ఉన్కియున్= ఉండడమూ (జీవించటమూ); భవ్య బ్రహ్మచర్యా+ఉక్తముల్= శ్రేష్ఠమైన బ్రహ్మచర్యాశ్రమ విషయంలో చెప్పబడిన ధర్మాలు.

తాత్పర్యం: గురుసేవ, వేదాధ్యయనం, సమావేశాల పట్ల అనాసక్తత, అలంకారాల పట్ల ఆసక్తి లేకుండా ఉండటం, భిక్షాన్నంతో బ్రతకటం, మిక్కిలి ప్రేమ, గాఢద్వేషమూ లేకుండా ఎవరితోనూ శత్రుత్వం వహించకుండా ఉండటమూ ఆరు శ్రేష్ఠమైన కర్మలను ఆచరిస్తూ జీవించటమే బ్రహ్మచర్యాశ్రమంలో ముఖ్యధర్మం.

మ. నిజదారైకపరత్వముం గరుణయున్ నిక్కంబునుం దాల్మియున్
సుజనా సంగము దేవ పిత్రతిథి సంశుద్ధార్చనల్ హవ్య భు
గ్భజనంబున్ సకలాశ్రమస్థులను శక్యప్రక్రియం బ్రోపుఁ బం
కజగర్భుండు గృహస్థ ధర్మములుగాఁ గల్పించె నుర్వీశ్వరా! 231

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ్వరా!= భూమికి అధిపతివైన ఓ ధర్మరాజా!; నిజదార+ఏక పరత్వమున్= తన భార్య యందు మాత్రమే ఆసక్తిని కలిగి ఉండటమూ; కరుణయున్= దయ; నిక్కంబునున్= సత్యమూ; తాల్మియున్= ఓర్పు; సుజనా సంగమున్= సజ్జన సాంగత్యం; దేవ పితృ+అతిథి సంశుద్ధ+అర్చనల్= దేవతల, పితృదేవతల అతిథుల పరిశుద్ధమైన పూజలు; హవ్యభుక్+భజనంబున్= అగ్నిదేవుడి పూజ; సకల+ఆశ్రమస్థులను= సమస్త ఆశ్రమ ధర్మాలను నిర్వహించే వారిని; శక్య ప్రక్రియన్+ప్రోపు= యథాశక్తి రక్షించటమూ; గృహస్థ ధర్మములుగాన్= గృహస్థాశ్రమ ధర్మాలుగా; పంకజగర్భుండు= కమల భవుడైన బ్రహ్మ; కల్పించెన్= నిర్ణయించాడు.

తాత్పర్యం: 'ఓధర్మరాజా! స్వభార్యాసక్తి, దయ, సత్యనిష్ఠ, ఓర్పు, సజ్జనసాంగత్యం, దేవతల, పితృదేవతల, అతిథుల సమర్చనం, అగ్నిపూజ, సమస్త ఆశ్రమధర్మ నిర్వాహకులను శక్త్యనుసారం పోషించటమూ అనేవాటిని గృహస్థాశ్రమ ధర్మాలుగా బ్రహ్మ నిర్ణయించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శా. తానున్ భార్యయు నేఁగుఁ బేరడవికిం దా నొక్కఁ డైనం జనున్
మానాహంకృతులూడ్చు నింద్రియములన్ మర్దించు నచ్చో జడల్
పూనుం దాపస శాస్త్రముల్ చదువుఁ జల్పున్ గోష్ఠి తత్‌జ్ఞాళితో
వానప్రస్థ విధా ప్రవిష్టుఁడు ప్రజా వాత్సల్య నిఘ్నాత్మతన్. **232**

ప్రతిపదార్థం: వాన ప్రస్థ విధా ప్రవిష్టుఁడు= వానప్రస్థ మనే ఆశ్రమ విధానాన్ని స్వీకరించినవాడు; ప్రజా వాత్సల్య నిఘ్నాత్మతన్= సంతానం పట్ల మమకారం వదలినవాడై; పేరు+అడవికిన్= ఘోరారణ్యానికి; తానున్ భార్యయున్+ఏఁగున్= భార్యా సహితుడై వెళతాడు; తాను+ఒక్కఁడు+ఐనన్+చనున్= తా నొక్కడుగా నైనా వెళ్ళుతాడు; మాన+అహంకృతులు+ఊడ్చున్= అభిమానం, అహంకారం వదులుతాడు; ఇంద్రియములన్ మర్దించున్= ఇంద్రియాలను నిగ్రహిస్తాడు; అచ్చోన్= ఆ అరణ్యంలో; జడల్ పూనున్= జడలు ధరిస్తాడు; తాపస శాస్త్రముల్ చదువున్= తపస్సంబంధమైన శాస్త్రాలు తెలిసికొంటాడు; తద్+జ్ఞాళితోన్= ఆయా విషయాలలో జ్ఞానవంతులైన వారితో; గోష్ఠి సల్పున్= సమావేశమై చర్చిస్తాడు.

తాత్పర్యం: వానప్రస్థాశ్రమం స్వీకరించినవాడు సంతానంపట్ల మమకారాన్ని వదలి, తానొక్కడు గానీ, భార్యా సమేతంగా గానీ ఘోరారణ్యానికి వెళ్ళుతాడు, అభిమానాహంకారాలను వదలిపెట్టుతాడు. ఇంద్రియ నిగ్రహాన్ని కలిగి జడలు ధరిస్తాడు. తపస్సంబంధమైన శాస్త్రాధ్యయనం చేస్తాడు. ఆయా విషయాలలో ప్రవీణులైన జ్ఞానుల గోష్ఠిలో పాల్గొని విషయ చర్చ చేస్తాడు.

శా. ఎచ్చో నైనను నిల్చు, నాఁకటికి నేమేనిం గొనున్, రాత్రియై
నచ్చో నెమ్మి శయించు, నగ్ని పరిచర్యం బాసి వర్తించుఁ, దా
నిచ్చం గోరఁ డొకండు, నింద్రియ జయం బేపారు భోగంబులన్
మెచ్చున్ మ్రొక్కును నొల్లకుండు యతిపేర్మిన్ నిర్మముండై నృపా! **233**

ప్రతిపదార్థం: నృపా!= ఓ ధర్మరాజా!; యతి= సన్న్యాసాశ్రమం స్వీకరించినవాని; పేర్మిన్= విధంగా; నిర్మముండు+ఐ= మమకార రహితుడై; ఏ+చోటన్+ఐనను నిల్చున్= ఎక్కడైనా ఉంటాడు; ఆఁకటికిన్+ఏమి+ఏనిన్+కొనున్= ఆక లైతే ఏదో ఒకటి తింటాడు; రాత్రి+ఐనన్= రాత్రి కాగా; అచ్చోన్= అక్కడే; నెమ్మిన్‌శయించు= హాయిగా నిద్రిస్తాడు; అగ్ని పరిచర్యన్+పాసి= అగ్ని కార్యాన్ని వదలి; వర్తించున్= నడుచుకొంటాడు; తాన్= తాను; ఇచ్చన్= కావాలని (కోరికతో); ఒకండు= దేన్నీ; కోరఁడు= ఆశించడు (అర్థించడు); ఇంద్రియ జయంబు+ఏపారు భోగంబులన్ మెచ్చున్= ఇంద్రియ నిగ్రహానికి ఉపకరించే భోగాలను మెచ్చుకొంటాడు; మ్రొక్కునున్+ఒల్లకుండున్= నమస్కారాన్ని అంగీకరించడు.

తాత్పర్యం: 'ఓధర్మరాజా! సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించినవాడు మమకారరహితుడై ఎక్కడో ఒకచోట ఉంటూ, ఆక లైనప్పుడు ఏదో ఒకటి తింటూ, ఎక్కడ ఉన్నప్పుడు రాత్రి అవుతుందో అక్కడే హాయిగా పడుకొంటాడు. అగ్నికార్యాలను త్యజించి నడుచుకొంటాడు. తనంతట తానే దేనినీ కోరడు. ఇంద్రియ నిగ్రహానికి ఉపకరించే పద్ధతులను మెచ్చుకొంటాడు. నమస్కారాన్ని స్వీకరించడు.

విశేషం: తిక్కన నాలుగు ఆశ్రమ ధర్మాలను రెండు మత్తేభాలు, రెండు శార్దూలాలు అనే నాలుగు వృత్తాల్లో వర్ణించాడు. విషయ గౌరవాన్నిబట్టి వృత్త స్వీకరణం గావించటం తిక్కన కవితావైశిష్ట్యానికి తార్కాణం. సాధారణంగా జాత్యుపజాతులను స్వీకరించే తిక్కన ఈ సందర్భంలో వృత్తాలను స్వీకరించటంలో ఛందస్సు ఔచిత్యాన్ని పాటించా డని చెప్పవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **ఈ నాలుగాశ్రమములకుఁ । బూని చొరందగినవాఁడు భూదేవుఁడు రా**
జైనను వీనను వైశ్యుం । డేనియు వర్తించు శుద్ధ హృదయత కల్మిన్. **234**

ప్రతిపదార్థం: భూదేవుఁడు= బ్రాహ్మణుడైనా; రాజు+ఐనను= రాజైనా; వైశ్యుండు+ఏనియున్= వైశ్యుడైనా; ఈ నాలుగు+ఆశ్రమములకున్= ఈ నాలుగు ఆశ్రమాలకు; పూని= ప్రయత్నించి; చొరన్+తగినవాఁడు= స్వీకరించదగినవాడు; వీనను= వీటి యందు; శుద్ధ హృదయత కల్మిన్= పరిశుద్ధ హృదయ సంపదతో; వర్తించున్= నడచుకొంటాడు.

తాత్పర్యం: బ్రాహ్మణుడైనా, రాజైనా, వైశ్యుడైనా ఈ నాలుగు ఆశ్రమాలను స్వీకరించవచ్చును. స్వీకరించి తదుచితంగా హృదయనైర్మల్యంతో నడచుకొంటాడు.

తే. **సుమతిఁ డ్రైవర్ణికులకు శుశ్రూష సేసి । యాప్తసంతానుఁడయ్యు నిలాధినాథు**
ననుమతంబున శూద్రున కాశ్రమాంత । రంబు తగుఁ గాదు యతి గాఁగ రాజముఖ్య! **235**

ప్రతిపదార్థం: రాజముఖ్య!= రాజశ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; సుమతిన్= మంచిబుద్ధితో; త్రైవర్ణికులకున్= మూడు వర్ణాలైన బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు; శుశ్రూష+చేసి= సేవ చేసి; ఆప్త సంతానుఁడు+అయ్యున్= సంతానవంతుడైనా; శూద్రునకున్= శూద్రుడికి; ఇలా+అధినాథు+అనుమతంబున్= రాజానుమతితో; ఆశ్రమ+అంతరంబు+తగున్= ఇతరాశ్రమాలైన బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థాలను స్వీకరించవచ్చును; యతి+కాఁగన్ కాదు= సన్న్యాసాశ్రమ స్వీకారం తగదు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! బుద్ధిమంతుడై బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు సేవచేస్తూ, సంతానవంతుడై రాజానుమతితో శూద్రుడు బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థాశ్రమాలను స్వీకరించవచ్చును. కానీ సన్న్యాసాశ్రమాన్ని మాత్రం స్వీకరించకూడదు.

క. **నిజధర్మవర్తి యగు స । ద్ద్విజుఁ డగుఁ బాత్రంబు దాన విధి మఖముల క**
ట్ల జనేశ్వర నృపముఖులకు । నిజవిత్తము లీయ మాననీయత కలుగున్. **236**

ప్రతిపదార్థం: జన+ఈశ్వర!= ఓ ధర్మరాజా!; నిజధర్మవర్తి+అగు= తన ధర్మాన్ని నిర్వర్తించే; సత్+ద్విజుఁడు= ఉత్తమ బ్రాహ్మణుడు; దాన విధి మఖములకున్= యజ్ఞ యాగాదులలో దానం స్వీకరించటానికి; పాత్రంబు= అర్హుడు; అగున్= అవుతాడు; అట్ల= అదేవిధంగా; నిజవిత్తములు+ఈయన్= తమ ధనాన్ని సద్బ్రాహ్మణులకు దానం చెయ్యటంవలన; నృపముఖులకున్= రాజశ్రేష్ఠులకు; మాననీయత+కలుగున్= ఖ్యాతి కలుగుతుంది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! తన ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించే ఉత్తమ బ్రాహ్మణుడు యజ్ఞ యాగాదులలో దానం స్వీకరించటానికి అర్హుడౌతాడు. అట్లాంటి బ్రాహ్మణులకు తమ ధనాన్ని దానం చెయ్యటంవలన రాజశ్రేష్ఠులకు గౌరవం కలుగుతుంది.

తే. **వర్ణములు నాశ్రమంబులు వసుమతీశుఁ । డుక్తపథమున నడపించి యుభయలోక**
సిద్ధి గనుఁ దప్పఁ ద్రొక్కని శిష్టజనులు । గల నరేంద్రున కింద్రుండుఁ దలఁప సరియె? **237**

ప్రతిపదార్థం: వర్ణములున్= చాతుర్వర్ణ్యాలు; ఆశ్రమంబులున్= నాలుగు ఆశ్రమాలు; వసుమతీ+ఈశుఁడు= రాజు; ఉక్త పథమునన్= ఈ చెప్పబడిన మార్గాలలో; నడిపించి= ప్రజలను నడిపించి; ఉభయ లోక సిద్ధి+కనున్= ఇహ పరలోకాలలో ప్రయోజనాన్ని పొందుతాడు; తలఁపన్= ఆలోచించగా; తప్పన్+త్రొక్కని= ఈ మార్గాలను వ్యతిరేకించని; శిష్టజనులు+కల= ఉత్తమ పౌరులు కలిగిన; నర+ఇంద్రునకున్= రాజుకు; ఇంద్రుఁడు= ఇంద్రుడైనా; సరియె?= సమానుడా? (కాదు).

తాత్పర్యం: నాలుగు వర్ణాల వారిని నాలుగు ఆశ్రమాల వారిని పైన పేర్కొన్న మార్గంలో నడిపించే రాజు ఇహ పర సుఖాలను పొందుతాడు. ఈ మార్గాలకు వ్యతిరేకంగా నడచుకోని ఉత్తమ పౌరులు గల రాజుకు ఇంద్రుడు కూడా సమానుడు కాడు.

వ. అదియునుం గాక. 238

తాత్పర్యం: అంతే కాకుండా - (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఏనుంగు హజ్జలో నెల్ల సత్త్వంబుల । హజ్జలు నడఁగిన యట్ల పోలె;
రాజిత క్షత్ర ధర్మమునకు లోనయి । సర్వ ధర్మంబులుఁ జను మఖములు;
వేదంబులును శుభవృత్తంబులును దండ । నీతి మాసినఁ జెడు భూతలంబు;
సంస్కార రహితమై చాల హీనతఁ బొందు । నట్లైనఁ బ్రజకుఁ జే టావహిల్లు;

తే. రాజు లరసిన నెమ్మది బ్రదుకుఁ గాన । రాజు సర్వోత్తముఁడు; ధర్మరాజియందు
రాజధర్మంబ యెక్కుడు; రా జనంగ । ధర్మదేవత యన వేఱె ధర్మతనయ! 239

ప్రతిపదార్థం: ధర్మతనయ!= ఓ ధర్మరాజా!; ఏనుంగు హజ్జలోన్= ఏనుగు పాదముద్రలో; ఎల్లసత్త్వంబుల హజ్జలు= సమస్త ప్రాణుల అడుగులు; అడఁగిన+అట్లపోలెన్= కనబడకుండా పోయినట్లు; రాజిత= ప్రకాశిస్తున్న; క్షత్ర ధర్మమునకు లోనయి= రాజధర్మానికి లోబడి; సర్వధర్మంబులున్+చనున్= ఇతర సమస్త ధర్మాలు ప్రవర్తిస్తాయి; దండనీతి మాసినన్= దండనీతి చెడితే; మఖములు= యజ్ఞాలు; వేదంబులును= వేదాలు; శుభవృత్తంబులును= శుభకార్యాలు; చెడున్= నాశనమవుతాయి; భూతలంబు= భూమండలం; సంస్కార రహితము+ఐ= సంస్కారం లేకుండా; చాల హీనతన్+పొందున్= చాలా అల్పత్వాన్ని పొందుతుంది; అట్లు+ఐనన్= అట్లా జరిగితే; ప్రజకున్+చేటు+ఆవహిల్లున్= ప్రజలకు కీడు కలుగుతుంది; రాజులు+అరసినన్= రాజులు ప్రేమతో చూస్తే; నెమ్మదిన్ బ్రదుకున్+కానన్= ప్రజలు సంతోషంతో బ్రతుకుతారు కాబట్టి; రాజు; సర్వ+ఉత్తముండు= సర్వశ్రేష్ఠుడు; ధర్మరాజి+అందున్= ధర్మసమూహంలో; రాజధర్మంబు+అ+ఎక్కుడు= రాజధర్మమే గొప్పది; రాజు+అనంగన్= రాజన్నా; ధర్మదేవత+అనన్ వేఱె= ధర్మదేవత అన్నా వేరా? (వేరు కాదని భావం.)

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఏనుగు పాదముద్రలలో సమస్త ప్రాణుల అడుగులు అణగిపోయినట్లే విశిష్టరాజ ధర్మానికి సమస్త ధర్మాలు లోబడి ఉంటాయి. దండనీతి చెడితే వేదాధ్యయనం, యజ్ఞాచరణం, శుభకార్యాచరణలకు వినాశనం ఏర్పడుతుంది. ఈ భూమి అంతా సంస్కారరహితమై హీనస్థితిని పొందుతుంది. ప్రజలకు కీడు కలుగుతుంది. రాజు ప్రజలను ప్రేమతో పరిపాలిస్తే హాయిగా బ్రతుకుతారు. రాజు సర్వశ్రేష్ఠుడు. ఈ ధర్మా లన్నింటిలో రాజధర్మం శ్రేష్ఠమైనది. రాజంటే ధర్మదేవతే కాని వేరు కాదు.

వ. ఆకర్ణింపుము. 240

తాత్పర్యం: ఓ ధర్మరాజా! జాగరూకతతో వినుము - (తరువాతి పద్యంతో అన్వయం).

తే. తొల్లి మాంధాతృఁ డను మహీవల్లభుండు । విష్ణు సందర్శనము సేయ వేఁడి యొక మ
హాధ్వరము నిష్ఠమైఁ జేయ నమరవిభుఁడు । సన్నిహితుఁ డయ్యెఁ బ్రీతి నజ్జనవిభునకు. 241

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; మాంధాతృఁడు+అను మహీవల్లభుండు= మాంధాతృడనే మహారాజు; విష్ణు సందర్శనము+చేయన్ వేడి= విష్ణువును చూడగోరి; ఒక మహా+అధ్వరమున్= ఒక గొప్ప యజ్ఞాన్ని; నిష్ఠమైన్+చేయన్= మిక్కిలి నిష్ఠతో చేయగా; ఆ+జన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విభునకున్= ఆ రాజునకు; అమర విభుఁడు= దేవతల ప్రభువైన ఇంద్రుడు; ప్రీతిన్= సంతోషంతో; సన్నిహితుఁడు+అయ్యెన్= ప్రత్యక్షమయ్యాడు.

తాత్పర్యం: పూర్వం మాంధాతృ డనే మహారాజు విష్ణువును చూడగోరి గొప్ప నిష్ఠతో ఒక మహా యజ్ఞాన్ని చేశాడు. ఆ రాజునకు ఇంద్రుడు ప్రీతితో ప్రత్యక్షమయ్యాడు.

వ. అ ట్లింద్రుండు ప్రత్యక్షం బగుటయు. 242

తాత్పర్యం: ఆ విధంగా దేవేంద్రుడు ప్రత్యక్షం కాగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అన్నరపాలుఁడు తానున్ । జన్నమునకు వచ్చినట్టి జగతీశులు భ
క్తి న్నమ్రు లైరి దేహము । లు న్నేలయు ముదము మనములుం గలయంగన్. 243

ప్రతిపదార్థం: ఆ+నరపాలుఁడు= ఆ మాంధాతృ డనే మహారాజు; తానున్= తాను జన్నమునకు వచ్చినట్టి= యజ్ఞానికి వచ్చిన; జగతీ+ఈశులున్= రాజులు; భక్తిన్= భక్తి పూర్వకంగా; దేహములున్= శరీరాలూ; నేలయున్= భూమీ; ముదమున్= సంతోషమూ; మనములున్= మనస్సులూ; కలయంగన్= కలసిపోయేటట్లు; నమ్రులు+అయిరి= నమస్కరించారు.

తాత్పర్యం: ఆ మాంధాత, యజ్ఞానికి వచ్చిన రాజులూ తమకు ప్రత్యక్షమైన ఇంద్రుడికి భక్తితో సంతోషంగా సాష్టాంగ నమస్కారం చేశారు.

వ. అట్లు దండ ప్రణామంబులు సేసి లేచి చేతులు మొగిచి నిలిచిన సురేంద్రుఁ డన్నరేంద్రునితో నిట్లనియె. 244

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; దండ ప్రణామంబులు+చేసి లేచి= సాష్టాంగ నమస్కారాలు చేసి లేచి; చేతులు మొగిచి= చేతులు జోడించి; నిలిచినన్= నిలబడగా; సుర+ఇంద్రుఁడున్= దేవేంద్రుడు; ఆ+నర+ఇంద్రునితోన్= ఆ మాంధాతృ మహారాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా సాష్టాంగ నమస్కారాలు చేసి లేచి చేతులు జోడించి నిలబడగా ఆ దేవేంద్రుడు మాంధాతృ మహారాజుతో ఇట్లా అన్నాడు.

ఆ. విష్ణుఁ జూడ నీవు వేడుక పడితి నా । కైన నజున కైన నరిది విష్ణు
దర్శనంబు నీదు తలఁ పెద్ది యెఱిఁగింపు; । మది యొనర్చెదను మహానుభావ! 245

ప్రతిపదార్థం: మహానుభావ!= ఓ మహానుభావుడవైన మాంధాతా!; ఈవు= నీవు; విష్ణున్+చూడన్= విష్ణు సందర్శనం కొరకు; వేడుక పడితి(వి)= కుతూహల పడ్డావు; విష్ణు సందర్శనంబు= ఆ మహావిష్ణు దర్శనం; నాకున్+ఐనన్= నాకు గానీ (ఇంద్రుడికి); అజునకున్+ఐనన్= బ్రహ్మకుగానీ; అరిది= సులభసాధ్యం కాదు; నీ తలఁపు+ఎద్ది= నీ ఆలోచన ఏమిటి; ఎఱిఁగింపుము= తెలుపుము; అది+ఒనర్చెదను= ఆ తలపు నెరవేరుస్తాను.

తాత్పర్యం: 'ఓ మహానుభావా! మాంధాతా! నీవు విష్ణుసందర్శనానికి కుతూహలపడుతున్నావు. విష్ణుదర్శన మనేది నాకుగానీ, బ్రహ్మకుగానీ కష్టసాధ్యం. నీ ఆలోచన ఏమిటో చెప్పితే నేను నెరవేరుస్తాను'.

క. అనవుడు సాంసారిక వ । ర్తన ముడుపుము, భైక్షచరణ తత్పరత మనం
బున దృఢముగ నొందింపుము । ననుఁ జరితార్థునిఁగఁ జేయు నావుడు నగుచున్. 246

ప్రతిపదార్థం: అనవుడున్= అని ఇంద్రుడు చెప్పగా; సాంసారిక వర్తనము+ఉడుపుము= నా సంసార జీవితాన్ని తొలగించు; భైక్షచరణ తత్పరతన్= భిక్షమెత్తి జీవించే ఆసక్తిని; మనంబునన్= నా మనసులో; దృఢముగన్+ఒందింపుము= స్థిరీకరించుము; ననున్+చరితార్థు నిగన్+చేయు= నన్ను కృతార్థుడిగా చేయుము; నావుడున్= అని మాంధాత పలుకగా; నగుచున్= ఇంద్రుడు నవ్వుతూ.

తాత్పర్యం: అప్పుడు మాంధాత ఇంద్రుడితో సంసార జీవితాన్ని తొలగించి బిచ్చమెత్తుకొని జీవించే ఆసక్తిని మనసులో స్థిరీకరించి కృతార్థుడిగా చేయవలసిందని కోరుకొన్నాడు. ఆ సమయంలో ఇంద్రుడు నవ్వుతూ ఇట్లా అన్నాడు.

మ. 'ధరణీశా! నృపధర్మ ముత్తమము సద్ధర్మంబులం దెల్ల నే
తెరువున్ రా జరయంగఁ గాదె తగ సిద్ధిం బొందుఁ గామంబుఁ గ్రో
ధరయంబున్ మగిడించి దండము సమత్వవ్యాప్తిఁ జెల్లించుచున్
ధరఁ బాలించిన రాజు వొందుగతిఁ బొందన్ శక్యమే యేరికిన్? 247

ప్రతిపదార్థం: ధరణీ+ఈశా!= ఓ రాజా!; సత్+ధర్మంబులందున్+ఎల్లన్= అన్ని ఉత్తమ ధర్మాలలోను; నృప ధర్మము= రాజధర్మం; ఉత్తమము= శ్రేష్ఠమైనది; ఏ తెరువున్= ఏ మార్గమైనా; రాజు+అరయంగన్+కాదె= రాజు రక్షిస్తేనే కదా; తగన్= తగిన విధంగా; సిద్ధిన్+పొందున్= ఫలవంతమవుతుంది; కామంబు= కామాన్ని; క్రోధరయంబున్= కోపావేశాన్ని; మగిడించి= అణచిపెట్టి; దండము= దండనీతిని; సమత్వ వ్యాప్తిన్+చెల్లించుచున్= సమదృష్టితో చేస్తూ; ధరన్+పాలించిన రాజు= రాజ్యమేలిన రాజు; పొందుగతిన్= పొందే మార్గాన్ని పొందటం; ఏరికిన్= ఎవరికైనా; శక్యమే?= సాధ్యమా? (సాధ్యం కాదని భావం).

తాత్పర్యం: 'ఓ మాంధాతా! అన్ని ధర్మాలలోనూ రాజధర్మమే శ్రేష్ఠమైనది. ఏ రీతిగా చూసినా ప్రజలను ప్రేమతో పాలిస్తేనే రాజు ఉత్తమసిద్ధి పొందుతాడు. కామక్రోధాలను వర్జించి, దండనీతిని సమంగా అమలు చేస్తూ రాజ్య మేలే రాజు పొందే ఉత్తమగతి ఇతరులకు సాధ్యం కాదు'.

వ. అని పలికి పురందరుం డందఱు రాజులం గలయం గనుంగొని. 248

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; పురందరుండు= ఇంద్రుడు; అందఱు రాజులన్= అక్కడున్న రాజులందరినీ; కలయన్+కనుంగొని= పరిశీలనగా చూచి.

తాత్పర్యం: అని చెప్పి ఇంద్రుడు అక్కడున్న రాజులందరిని చూచి - (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'లోకపాలాత్ములరు మీరు మీకు భైక్ష। చరణ మర్హమే? ప్రజఁ బ్రోపు సమరముక్త
దేహు లగుటయు నమ్మేలు తెచ్చు సంశ। యంబు; వలవదు మీ పద మధికతరము. 249

ప్రతిపదార్థం: మీరు= మీరంతా; లోక పాల+ఆత్ములరు= లోక పాలకుల అంశలతో పుట్టారు; మీకున్; భైక్షచరణము+అర్హమే?= భిక్షాటనం తగిందా?; ప్రజన్= ప్రజలను; ప్రోపు= సంరక్షించటమూ; సమరముక్త దేహులు+అగుటయున్= యుద్ధంలో మరణించే శరీరం కలిగిన వారు కావటంవలన; ఆ+మేలు+తెచ్చున్= ఆ మంచిని చేకూరుస్తాయి; సంశయంబు వలవదు= సందేహించవద్దు; మీ పదము+అధిక తరము= మీ రాజ పదవి శ్రేష్ఠతరమైనది.

తాత్పర్యం: మీరు పాలకస్వరూపులు. మీకు భిక్షాచరణం తగదు. ప్రజారక్షణం, యుద్ధంలో శరీరత్యాగం, మీకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శుభప్రదం. ఇందులో సందేహం లేదు. మీ స్థానం చాలా గొప్పది.

వ. అని చెప్పి దేవేంద్రుండు దివంబునకుం జనియె. 250

తాత్పర్యం: అని తెలిపి దేవేంద్రుడు స్వర్గలోకానికి వెళ్ళాడు.

చ. అది యొకఁడేల వేదములయందుఁ బురాణములం బ్రసిద్ధకో
విదులు బహుప్రదేశముల వేమఱుఁ గాంచి మనుష్యులెల్ల భూ
మిదయితుకంటెఁ దక్కువ యమేయ సుధర్మము లీడుగావు ని
ర్మదకృత దండనీతి కనరా మనమెల్ల వినంగ నెప్పడున్. 251

ప్రతిపదార్థం: అది+ఒకఁడు+ఏల= అంతేకాదు; వేదముల+అందున్= వేదాలలోనూ; పురాణములన్= పురాణాలలోనూ; ప్రసిద్ధకోవిదులు= ప్రసిద్ధ పండితులు; బహు ప్రదేశములన్= పలుప్రాంతాలలో; వేమఱున్+కాంచి= అనేక పర్యాయాలు గమనించి, మనుష్యులు+ఎల్లన్= మానవులంతా; భూమిదయితు కంటెన్+తక్కువ= రాజుకంటె తక్కువవారు; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; నిర్మదకృత దండనీతికిన్= అహంకార రహితమైన దండనీతికి; అమేయ= కొలతకందని; సుధర్మములు= ఉత్తమధర్మాలు; ఈడు+కావు= సమానం కావని; మనము+ఎల్లన్ వినంగన్= మనమంతా వినే విధంగా; అనరా= చెప్పలేదా?

తాత్పర్యం: అంతేకాదు. వేదాలలో, పురాణాలలో, ఇంకా పలుచోట్ల ప్రసిద్ధ పండితులు అనేక పర్యాయాలు పరిశీలించి మానవులంతా రాజుకంటె తక్కువ అని చెప్పారు. మన కందరికీ స్పష్టమయ్యేటట్లు అహంకారరహితమైన దండనీతికి ఇతర ఉత్తమధర్మాలు సమానం కావని చెప్పగా వినలేదా?

ఉ. కావునఁ గామరోషములఁ గ్రాఁచుచు నాశ్రమకోటిఁ గాచుచున్
భూవలయ ప్రజన్ సమతఁ బ్రోచుచు రాజ్యముసేఁత మేలు; భి
క్షావిధి లోనుగాఁ గలుగు సారపు ధర్మములన్ ఘటించు మేల్
వావిరి నప్రయత్నమున వానికి వచ్చు నృపాల! యెమ్మెయిన్. 252

ప్రతిపదార్థం: నృపాల!= ఓ ధర్మరాజా!; కావునన్= కాబట్టి; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; కామ రోషములన్+క్రాఁచుచున్= కామక్రోధాలను దహిస్తూ; ఆశ్రమకోటిన్+కాచుచున్= ఆశ్రమ ధర్మాలను రక్షిస్తూ; భూవలయ ప్రజన్= భూ మండలంలోని ప్రజలను; సమతన్+ప్రోచుచున్= దండనీతితో సమానంగా పోషిస్తూ; రాజ్యము+చేఁత= రాజ్యాన్ని పాలించటం; మేలు= మంచిది; భిక్షావిధి లోనుగాన్+కలుగు= భిక్షాటనం మొదలైన వాటివలన కలిగేది; సారము+ధర్మములన్= శ్రేష్ఠమైన ధర్మాలతో; ఘటించు= కలిగే; మేల్= శుభం; వావిరి= క్రమంగా; అప్రయత్నమునన్= ప్రయత్నం లేకుండానే; వానికిన్ వచ్చు= ఆ రాజుకు చేకూరుతుంది.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! కామక్రోధాలను దహించి ఆశ్రమధర్మాలను రక్షిస్తూ ప్రజలను దండనీతితో సమంగా కాపాడుతూ రాజ్యం చేయటం మంచిది. భిక్షాటనం మొదలైన శ్రేష్ఠమైన ధర్మాలవలన సమకూరే శ్రేయస్సు క్రమంగా అనుకోకుండా రాజుకు లభిస్తుంది.

విశేషం: తిక్కన శైలి క్రమక్రమంగా ఉన్నతోన్నతమైనట్లు ఈ పద్యం నిరూపిస్తున్నది. అంత్యప్రాసలతో చెప్పదలచుకొన్న అభిప్రాయాన్ని స్పష్టం చేస్తున్న దీ పద్యం. 'సారపుధర్మములన్' అనే ప్రయోగం చేసి మరొక్కసారి శ్రీకృష్ణ రాయబార ఘట్టంలో శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో రాజధర్మాన్ని గూర్చి చెప్పే సందర్భంలోని 'సారపుధర్మమున్ విమల సత్యము. . . .' అనే పద్యాన్ని గుర్తుచేసి రాజధర్మ విశిష్టతను తిక్కన సోదాహరణంగా వివరించాడు.

చ. **అతిథుల దీనకోటుల ధనార్థిత లేని యతివ్రజంబు స**
మ్మతిఁ బరికింపు హర్ష మదమాన విషాదములం జొరంగ నీ
క తొలఁగఁ ద్రోవు నా యొడలు గావక భూప్రజఁ గాతు న న్విని
శ్చిత దృఢ బుద్ధి గల్గు మిది చేయు సమస్త సుధర్మసిద్ధులన్.' **253**

ప్రతిపదార్థం: అతిథులన్= అతిథులనూ; దీనకోటులన్= దీన జన సమూహాలనూ; ధన+అర్థిత లేని= ధనాన్ని కోరని; యతి వ్రజంబున్= సన్న్యాసుల సమూహాన్ని; సమ్మతిన్+పరికింపు= మంచి మనసుతో చూడుము; హర్ష= సంతోషం; మద= మదం; మాన= అభిమానం; విషాదములన్+చొరంగనీక= దుఃఖం మొదలైన వాటిని మనసులో ప్రవేశించనీయకుండా; తొలఁగన్+త్రోవు(ము)= తోసిపుచ్చుము; నా+ఒడలు+కావక= నా శరీర సంరక్షణ కాక; భూ ప్రజన్+కాతున్= భూ ప్రజల్ని రక్షిస్తాను; అనే; వినిశ్చిత దృఢబుద్ధిన్= నిశ్చితమూ స్థిరమూ అయిన మనస్సును; కల్గుము= కలిగి ఉండుము; ఇది= ఈ పద్ధతి; సమస్త సుధర్మ సిద్ధులన్= అనేక ఉత్తమ ధర్మాలవలన కలిగే ప్రయోజనాన్ని; చేయున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: అతిథులనూ, దీనులనూ, యతీంద్రులనూ మంచిమనసుతో గమనించుము. సంతోషమూ, అహంకారమూ, అభిమానమూ, దుఃఖమూ అనేవాటిని మనసులోనికి రానీయకుండా తొలగించుము. 'నా శరీర సంరక్షణమే ముఖ్యం' అని భావించక 'ప్రజలను కాపాడతాను' అనే స్థిరసంకల్పంతో ఉండటంవలన సమస్త ఉత్తమధర్మనిర్వహణంవలన కలిగే ప్రయోజనం సిద్ధిస్తుంది.'

వ. **అనిన విని యజాతశత్రుండు 'మహాపురుషా! వర్ణాశ్రమ విధంబులుం దద్రక్షణంబు చొప్పును దాన వచ్చు పెంపును నెఱింగించితి; రాష్ట్ర జనంబు లెయ్యది యాచరించి సుఖు లగుదు; రెఱింగింపవే!' యని యడిగిన నమ్మహీకాంతునకు శాంతనవుం డిట్లనియె.** **254**

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా విని; అజాతశత్రుండు= పుట్టని శత్రువులు గల ధర్మరాజు; మహాపురుషా!= పురుషోత్తమా!; వర్ణ+ఆశ్రమ విధంబులున్= వర్ణాశ్రమ ధర్మాలను; తద్+రక్షణంబు చొప్పును= వాటిని రక్షించే తీరునూ; దానన్= దానివలన; వచ్చు= కలిగే; పెంపును= ఆధిక్యాన్నీ; ఎఱింగించితి(వి)= తెలియజేశావు; రాష్ట్రజనంబులు= రాష్ట్ర ప్రజలు; ఏ+అది+ఆచరించి= దేన్ని చేసి; సుఖులు+అగుదురు= సుఖిస్తారో; ఎఱింగింపవే= తెలియజెప్పవే; అని+అడిగినన్= అని ప్రార్థించగా; ఆ+మహీకాంతునకున్= ఆ ధర్మరాజుతో; శాంతనవుండు+ఇట్లు+అనియెన్= భీష్ముడు ఇట్లా పలికాడు.

తాత్పర్యం: భీష్ముడు చెప్పిన మాటలను విన్న ధర్మరాజు భీష్ముడితో 'వర్ణాశ్రమ ధర్మాలను, వాటి సంరక్షణ విధానాన్ని, దానివలన కలిగే ఫలితాన్ని తెలియజేశావు. ఇంకా రాష్ట్రప్రజలు ఏ కార్యాచరణంవలన సుఖాన్ని పొందుతారో తెలియజేయుము' అని ప్రార్థించగా, ధర్మరాజుతో భీష్ముడు ఇట్లా అన్నాడు.

రాష్ట్ర జనుల కర్తవ్యధర్మములు భీష్ముఁడు ధర్మజునకుఁ దెలుపుట (సం. 12-67-2)

సీ. **రాజు నుత్తమగుణ భ్రాజిష్ణు నభిషిక్తుఁ। గావించుకొని, యెల్ల కార్యములును**
దన్ముఖంబునఁ జెల్లఁ; దద్దయు సుఖముండఁ। బడయుదు; రొకఁడు భూపాలనంబు
సేఁతలేకున్న దుశ్చేష్టితు లై జను। లన్యోన్య దారధనాపహరణ
మాచరింతురు; మీల యట్టుల బలవంతు। లల్పులఁ దమకు నాహారములుగఁ

తే. **గొంద్రు; భూపతిలేకున్న మంద్రె జనము?। లధిప! కృషి సేయుటయును బేహార మాడు**
టయును గోరక్ష గావించుటయును మొదలు। గాఁగఁ బ్రదికెడు తెరువులు గాసిగావె! **255**

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; ఉత్తమగుణ భ్రాజిష్ణున్= ఉత్తమ గుణాలచేత ప్రకాశించే రాజును; అభిషిక్తున్+కావించుకొని= రాజుగా అభిషేకించుకొని; ఎల్లకార్యములును= సమస్త కార్యాలనూ; తద్+ముఖంబునన్+చెల్లన్= ఆ రాజానుమతితో నెరవేరుతుండగా; తద్దయున్= మిక్కిలి; సుఖము+ఉండన్+పడయుదురు= సుఖంగా ఉంటారు; ఒకడు భూపాలనంబు+చేఁత లేకున్న= ఒకడు రాజ్యపాలనం చేయకపోతే (రాజు లేకపోతే); జనులు= ప్రజలు; దుశ్చేష్టితులు+ఐ= దుర్మార్గ వర్తనులై; అన్యోన్య= పరస్పరం; దార, ధన+అపహరణము+ఆచరింతురు= భార్యలను, ధనాన్ని దొంగిలిస్తారు; మీల+అట్టులన్= చేపల రీతిగా; బలవంతులు= బలం కలిగినవారు; అల్పులన్= బలహీనులను; తమకున్+ఆహారములుగన్+కొంద్రు= తమకు ఆహారంగా గ్రహిస్తారు; భూపతిలేకున్నన్= రాజు లేకుంటే; జనము= ప్రజలు; మంద్రె?= జీవిస్తారా?; కృషి+చేయుటయును= వ్యవసాయం చేయటమూ; బేహారము+ఆడుటయును= వ్యాపారం చేయటమూ; గోరక్ష కావించుటయును= ఆవులను కాపాడటమూ; మొదలుగాఁగన్= మొదలైన; బ్రదికెడు తెరువులు= జీవించే మార్గాలు; గాసి+కావె?= నాశనమవుతాయి కదా!

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఉత్తమగుణవిలసితుడైన రాజును అభిషేకించుకొని, ఆ రాజు మూలాన సమస్త కార్యాలను నిర్వర్తింపజేసికొంటూ ప్రజలు మిక్కిలి సుఖిస్తారు. రాజ్యపాలనం లేకపోతే ప్రజలు దుర్మార్గవర్తనులై పరస్పరం భార్యలను, ధనాన్ని దొంగిలించటం ప్రారంభిస్తారు. పెద్ద చేపలు చిన్న చేపలను మింగినట్లుగా బలవంతులు బలహీనులను ఆహారంగా గ్రహిస్తారు. రాజు లేకుండా ప్రజలు జీవించలేరు. వ్యవసాయమూ, వర్తకమూ, గోసంరక్షణమూ మొదలైన జీవనోపాధి మార్గాలు నాశనమవుతాయి.

వ. వినుము. 256

తాత్పర్యం: ఓ ధర్మరాజా! వినుము.

సీ. జను లొక్కతఱిఁ దొల్లి సమయంబుఁ దమలోనఁ । జేసి క్రూరతయు ముచ్చిమియు అంకు
సైఁపక యట్టి దుర్జను నందఱును గూడి । శాసించువారుగాఁ జాలి తమకు
నధిపతియుఁగ నొరునాసపడక యుండి । నడవడి బహుకారణములఁ జిక్కు
వడిన, విషణ్ణులై బ్రహ్మఁగానఁగఁ బోయి । మాకు రక్షకుఁడుగ మహిపుఁ డొకఁడు

తే. వలయు రూపింపు; మాతని గొలిచి బ్రదుకు । వార మనుటయు, నజుఁడును వారి వలని
కరుణ మనువు నిరూపించె; నరు లసత్య । చరితు లని పాలనమునకుఁ జొరఁడ యతఁడు. 257

ప్రతిపదార్థం: తొల్లి = పూర్వకాలంలో; ఒక్కతఱిన్= ఒకానొక సందర్భంలో; జనులు= ప్రజలు; తమలోనన్+సమయంబున్ చేసి= తమలో ఒక శపథంచేసి; క్రూరతయున్= క్రూరత్వమూ; ముచ్చిమియున్= దొంగతనమూ; అంకున్= వ్యభిచారమూ; సైఁపక= సహించలేక; అట్టి దుర్జనున్= అట్లాంటి దుర్మార్గుడిని; అందరును+కూడి= అందరూ కలిసి; శాసించు వారుగాన్+చాలి= అదుపులో పెట్ట గలిగేవారుగా ఉండి; తమకున్+అధిపతియుఁగన్= తమకు ప్రభువుగా; ఒరున్+ఆసపడక+ఉండి= ఇతరు డెవ్వడిని ఇష్టపడక; నడవడి= వారి జీవితం; బహుకారణములన్= అనేక కారణాలవలన; చిక్కు+పడినన్= కష్టాలమయం కాగా; విషణ్ణులు+ఐ= దుఃఖితులై; బ్రహ్మన్+కానఁగన్+పోయి= బ్రహ్మను దర్శించటానికై వెళ్ళి; మాకున్; రక్షకుడుగన్= సంరక్షకుడుగా; మహిపుఁడు+ఒకఁడు వలయున్= ఒకరాజు కావాలి; రూపింపుము= చూపించుము; ఆతనిన్+కొలిచి= అతడిని సేవించి; బ్రదుకువారము= జీవిస్తాం; అనుటయున్= అని ప్రార్థించగా; అజుఁడును= బ్రహ్మ; వారి వలని కరుణన్= వారి మీది దయతో; మనువు నిరూపించెన్= మనువు మీ రాజని చూపించాడు; అతఁడు= ఆ మనువు; నరులు+అసత్య చరితులు+అని= మానవులు అసత్య జీవనులని; పాలనమునకున్+చొరడు= ప్రజలను పాలించటానికి ఇష్టపడ లేదు.

తాత్పర్యం: పూర్వకాలంలో ఒకానొక సమయంలో ప్రజలు తమలోనే ఉన్న క్రూరత్వం, దొంగతనం, వ్యభిచారం మొదలైన దుర్గుణాలను సహించక అట్లాంటి పనులను చేస్తున్న దుర్మార్గుడిని అందరూ కలిసి శాసించగలిగి ఉండి, తమకు ఇతరు లెవరూ రాజుగా ఉండ నవసరం లేదని భావించి కొంతకాలం ఉండి, వారి జీవితాలు అనేక కారణాలవలన కష్టాలకు లోను కాగా, దుఃఖితులై బ్రహ్మను దర్శించటానికి వెళ్ళారు. వెళ్ళి 'మాకు రక్షకుడుగా రాజు ఒకడు కావాలి. నిర్దేశించుము. అతడిని సేవించి మేము జీవిస్తాం' అని అనగానే బ్రహ్మ వారి మీద దయతో మనువు అనే రాజును చూపించాడు. నరులు అసత్య వర్తనులు కాబట్టి ఆ మనువు వారిని పాలించటానికి ఇష్టపడలేదు.

వ. చొరకున్న నజ్జనంబు లమ్మహాత్మునితో 'నీకుం బుయిలోడ నేల? ప్రజలచేతఁ బశువులయందును బసిండిని నేఁ బది యగు నంశంబును, ధాన్యంబున దశమ భాగంబును భండారంబుగాఁ బుచ్చికొని శస్త్రోపజీవుల నెల్ల నీ వారిం జేసికొని బలవంతుండవై దుష్టనిగ్రహ శిష్ట ప్రతిపాలనం బాచరింపు; మే మందఱము ని న్ననుసరించి నీ పనుపు చేయంగల వార; మధర్మ వర్తనులు నీ చేతం జెడువారు; ధర్మవర్తనులు చేసిన ధర్మంబున నాఱవపాలు నిన్నుం జేరంగలయదిగా నొడంబడితి; మింద్రుండు దేవతల రక్షించు మాడ్కి' మమ్ము రక్షించుకొని సుఖంబుండు మనుటయు. 258

ప్రతిపదార్థం: చొరకున్నన్= ఆ మనువు అంగీకరించకపోవటంతో; ఆ జనంబులు= ఆ ప్రజలు; ఆ+మహా+ఆత్మునితోన్= ఆ మహనీయుడైన మనువుతో; నీకున్+పుయిలోడన్+ఏల?= నీకు సంకోచమెందుకు?; ప్రజలచేతన్= ప్రజలవలన; పశువుల+అందును= పశువులలో; పసిండిని= బంగారంలో; ఏఁబది+అగు అంశంబును= సగభాగమూ; ధాన్యంబునన్= పండించిన పంటలో; దశమ భాగంబును= పదవవంతును; భండారముగాన్= ధనకోశం కొరకై; పుచ్చికొని= తీసికొని; శస్త్ర+ఉపజీవులన్+ఎల్లన్= ఆయుధాల వలన జీవించేవారినందరినీ; నీవారిన్+చేసికొని= నీ అధీనంలో ఉంచుకొని; బలవంతుండవు+ఐ= బలసంపన్నుడవై; దుష్టనిగ్రహ= దుష్టశిక్షణ; శిష్ట ప్రతిపాలనంబు+ఆచరింపుము= దుష్టశిక్షణా శిష్ట రక్షణమూ చేయుము; ఏము+అందరమున్= మేమందరమూ; నిన్ను+అనుసరించి= నీకు అనుగుణంగా నడిచి; నీపనుపు+చేయన్+కలవారము= నీ ఆజ్ఞను పాటిస్తూ ఉంటాం; నీ చేతన్= నీ వలన; అధర్మవర్తనులు= దుర్మార్గాలు చేసినవారు; చెడువారు= చెడిపోతారు; ధర్మవర్తనులు= ధర్మాన్ని పాటించేవారు; చేసిన= ఆచరించే; ధర్మంబునన్= ధర్మంలో; ఆఱవపాలు= ఆరోవంతు; నిన్ను+చేరన్+కలయదిగాన్= నీకు చెందే విధంగా; ఒడంబడితిమి= అంగీకరించాం; ఇంద్రుండు= దేవేంద్రుడు; దేవతలన్ రక్షించు మాడ్కిన్= దేవతల్ని రక్షించే విధంగా; మమ్ము రక్షించుకొని= మా సంరక్షణ చేస్తూ; సుఖంబు+ఉండుము+అనుటయున్= సుఖంగా ఉండుము అని చెప్పగా.

తాత్పర్యం: మనువు ప్రజలను పాలించటానికి అంగీకరించకపోవటంతో ఆ మహనీయుడితో ప్రజలు ఇట్లా అన్నారు. 'నీకు సంకోచమెందుకు? ప్రజల నుండి పశువులలోను, బంగారంలోనూ సగభాగం నీ సొత్తు. పంటలలో పదవ భాగాన్ని కోశంకొరకు గ్రహించి, ఆయుధాల వలన జీవించేవారి నందరినీ నీవారిగా చేసికొని బలవంతుడవై దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావించుము. మేమంతా నీ ఆజ్ఞానుసారం ప్రవర్తిస్తాం. దుర్మార్గులు నీవలన నాశనమవుతారు. ధర్మాత్ములు చేసిన ధర్మంలో ఆరోవంతు నీకు చెందేటట్లు అంగీకరిస్తున్నాం. ఇంద్రుడు దేవతలను రక్షించే విధంగా మా రక్షణభారాన్ని స్వీకరించి సుఖంగా ఉండవలసింది' అని పలికారు.

క. అతఁ డొడఁబడి యత్తెఱఁగున । నతిబలవంతుఁ డయి నీతి నంచిత మగు ను
ద్ధత విక్రమమునఁ దగ నీ । క్షితిఁ బాలించె; సుఖులై రశేష జనములున్. 259

ప్రతిపదార్థం: ఆ+తెఱఁగునన్= ఆ విధంగా; అతఁడు+ఒడఁబడి= ఆ మనువు అంగీకరించి; అతిబలవంతుఁడు+అయి= మిక్కిలి బలవంతుడై; నీతిన్= దండనీతితో; అంచితము+అగు= ఒప్పుతున్న; ఉద్ధత విక్రమమునన్= పరాక్రమాతిశయంతో; తగన్= తగినరీతిలో; ఈ క్షితిన్= ఈ భూమిని; పాలించెన్= పరిపాలించాడు; అశేష జనములున్= ప్రజలంతా; సుఖులు+ఐరి= సుఖంగా జీవించారు.

తాత్పర్యం: ఆ విధంగా మనువు అంగీకరించి మిక్కిలి బలవంతుడై నీతిబద్ధంగా పరాక్రమాతిశయంతో, తగిన రీతిలో ఈ భూమిని పాలించాడు. సమస్తప్రజలూ సుఖజీవనం గడిపారు.

ఉ. **కావున మేలు సేయదె జగజ్జనకోటికి రాజునాజ్ఞమైఁ**
బోవుట; యాతనిం దగిన పూజలఁ దృప్తునిఁజేఁత; దేవసం
భావనఁ గొల్వ తండొకటఁబాడి తొఱంగిన సైఁచు టిట్లు సం
భావితుఁ జేయఁగా నతని పంపొనరింతురు మ్రొక్కి శత్రులున్. **260**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; రాజు+ఆజ్ఞమైన్+పోవుట= రాజాజ్ఞ చొప్పున నడచుకొనటం; ఆతనిన్= ఆ రాజును; తగిన పూజలన్= అర్హమైన పూజలతో; తృప్తునిన్+చేఁత= సంతృప్తి పరచటమూ; దేవ సంభావనన్+కొల్వు= దైవంతో సమానంగా సేవించటమూ; అతండు= ఆ రాజు; ఒకటన్= ఏదైనా ఒక విషయంలో; పాడి+తొఱంగినన్= న్యాయం తప్పినా; సైఁచుట= ఓర్చుకొనటం; జగత్+జనకోటికిన్= భూ ప్రజ సమూహానికి; మేలు+చేయదె?= శుభకరం కాదా?; ఇట్లు= ఈ విధంగా; సంభావితున్+చేయఁగాన్= ప్రజలు రాజును గౌరవించగా; శత్రులున్= శత్రువులు కూడా; మ్రొక్కి= నమస్కరించి; అతని పంపు+ఒనరింతురు= ఆ రాజాజ్ఞను శిరసావహిస్తారు.

తాత్పర్యం: అందువలన రాజానుమతితో నడుచుకొనటం, ఆ రాజును తగిన పూజలతో సంతృప్తి పరచటం, దైవంతో సమానంగా సేవించటం, ఒకవేళ ఏదైనా విషయంలో న్యాయం తప్పినా సహించటం ప్రజలకు మేలే కలిగిస్తుంది. ఈ విధంగా ప్రజలు రాజును గౌరవిస్తే శత్రువులు సైతం వినమ్రులై అతడి ఆజ్ఞను శిరసా వహిస్తారు.

క. **తనవారు పెద్ద సేయని । మనుజేశు నరాతిజనులు మదిని సరకుగాఁ**
గొన; రది భూప్రజ కొప్పదు । విను! కావునఁ బతికిఁ బ్రజలు వెఱచుట యొప్పున్. **261**

ప్రతిపదార్థం: విను= ఓ ధర్మరాజా! వినుము; తనవారు= తన రాజ్యంలోని ప్రజలే; పెద్ద+చేయని= గౌరవించని; మనుజ+ఈశున్= రాజును; అరాతి జనులున్= శత్రువులు కూడా; మదినిన్= మనసులో; సరకుగాన్+కొనరు= లెక్కచేయరు; అది= ఆ విధంగా రాజును గౌరవించక పోవటమనేది; భూ ప్రజకున్= ప్రజలకు; ఒప్పదు= తగదు; కావునన్= అందువలన; పతికిన్= రాజునకు; ప్రజలు వెఱచుట+ఒప్పున్= ప్రజలు భయపడటమే యుక్తం.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! తన ప్రజలే గౌరవించని రాజును శత్రువులు ఏ మాత్రం లెక్క చెయ్యరు. రాజును గౌరవించకపోవటం ప్రజలకు ఉచితం కాదు. కాబట్టి రాజు అంటే ప్రజలు భయపడటమే సముచితం.

తే. **వాహనాసన శయ్యా నివాసములును, । భోజ్య గంధ మాల్యాంబర భూషణములు,**
గుప్తియును నరపతికి నెక్కుడుగ వలయు । నను తలంపునఁ బ్రజలకు మనుట గుణము. **262**

ప్రతిపదార్థం: వాహన= వాహనం; ఆసన= పీఠం; శయ్యా= పడక; నివాసములును= గృహమూ అనేవి; భోజ్య, గంధ, మాల్య+అంబర భూషణములున్= ఆహార పదార్థాలు, చందనాది సుగంధాలు, పుష్పమాలలు,వస్త్రాలు,అలంకారాలు అనేవి; గుప్తియును= రక్షణమూ;

నరపతికిన్+ఎక్కుడుగగన్ వలయున్= రాజుకు ఎక్కువ అవసరం; అను తలంపునన్= అనే ఆలోచనతో; మనుట= జీవించటం; భూజనుల గుణము= ప్రజల కుండవలసిన సద్గుణం.

తాత్పర్యం: వాహనాలు, సింహాసనాలూ, శయ్యాగృహాలూ, ఆహార పదార్థాలూ, చందనాది సుగంధద్రవ్యాలూ, పుష్పమాలలూ, వస్త్రాలంకారాలూ, రక్షణా రాజుకు మిక్కిలి అవసరమనే సద్భావనతో ప్రజలు జీవించటం అవసరం.

చ. అతఁడును మందహాస సహితాలపనంబును, సత్యభాషణ
వ్రతమును, సంవిభాగ నిరవద్యతయున్, సమభావముం, గృత
జ్ఞతయు, జితేంద్రియత్వముఁ, బ్రసాద గుణంబును గల్గి భూమికిం
బితృసముఁడై విరోధి జన భీషణ సారత నొప్పఁ బెం పగున్.' 263

ప్రతిపదార్థం: అతఁడును= ఆ రాజుకూడా; మందహాస సహిత= చిరునవ్వుతో కూడిన; ఆలపనంబును= సల్లాపమూ; సత్యభాషణ వ్రతమును= సత్యాన్ని చెప్పే నియమమూ; సంవిభాగ నిరవద్యతయున్= విభజించటంలో ఉత్కృష్టతా; సమభావమున్= అందరిపట్ల సమానమైన భావమూ; కృతజ్ఞతయున్= చేసిన మేలును మరచిపోకుండటమూ; జిత+ఇంద్రియత్వమున్= ఇంద్రియ నిగ్రహమూ; ప్రసాద ఫలంబును= ప్రసన్న గుణమూ; కల్గి= కలిగి ఉండి; భూమికిన్= భూమి ప్రజలకు; పితృసముఁడు+ఐ= తండ్రితో సమానమైన వాడై; విరోధి జన భీషణ= శత్రు ప్రజలకు భయాన్ని కలిగించే రీతిలో; సారతన్= బలంతో (శౌర్యంతో); ఒప్పన్= వెలుగొందితే; పెంపు+అగున్= గొప్పగౌరవం కలుగుతుంది (అభ్యున్నతి కలుగుతుంది).

తాత్పర్యం: రాజు చిరునవ్వుతో కూడిన సల్లాపం, సత్య భాషణ నియమం, భాగవిభజనలో ఔన్నత్యం, అన్నిటియందు అందరియందు సమభావం, కృతజ్ఞతా భావం, ఇంద్రియ నిగ్రహం, ప్రసన్న గుణం కలిగి ఉండి భూప్రజలను తండ్రితో సమానంగా చూస్తూ విరోధిజన భయంకరుడై ప్రకాశిస్తే అత్యంత గౌరవం కలుగుతుంది'.

వ. అనుటయుం గౌంతేయాగ్రజుండు 'మనుష్యుల కెల్ల రాజ ధిపతియును దైవంబునుంగా విప్రులు చెప్పి; రట్లగుట యేమిటనో? యని యుండుదు;నది మీవలనం బ్రస్ఫుటంబుగా వింటి' నని పలికిన; గాంగేయుఁ 'డింకనుం జెప్పెదఁ దొల్లి వసుమనుం డను మానవేంద్రుండు నీవ పోలె వితర్కించి బృహస్పతి నడిగిన, నతం డతనికిఁ జెప్పిన భంగి యాకర్ణింపు' మని యిట్లనియె. 264

ప్రతిపదార్థం: అనుటయున్= అని భీష్ముడు చెప్పగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతీ పుత్రులలో పెద్దవాడైన ధర్మరాజు; మనుష్యులకున్+ఎల్లన్= మానవు లందరికీ; రాజు+అధిపతియును= రాజును ఏలికగాను; దైవంబునున్+కాన్= దేవుడుగాను; విప్రులు= బ్రాహ్మణులు; చెప్పిరి= చెప్పారు; అట్లు+అగుట+ఏమిటనో+అని+ఉండుదున్= అట్లా కావటం ఎందుకో అనే సందేహంతో ఉన్నాను; అది మీ వలనన్= అది మీ వలన; ప్రస్ఫుటంబుగాన్ వింటిని+అని పలికినన్= స్పష్టంగా విన్నానని చెప్పగా; గాంగేయుండు= భీష్ముడు; ఇంకనున్+చెప్పెదన్= ఇంకా చెప్పుతాను; తొల్లి= పూర్వం; వసుమనుండు+అను= వసుమనుడనే; మానవ+ఇంద్రుండు= మానవులలో శ్రేష్ఠుడైన రాజు; నీవపోలెన్= నీవలెనే; వితర్కించి= సందేహించి; బృహస్పతిన్+అడిగినన్= బృహస్పతిని అడుగగా; అతండు+అతనికిన్+చెప్పిన భంగిన్= ఆ బృహస్పతి వసుమను డనే రాజుకు చెప్పిన రీతిని; ఆకర్ణింపుము+అని= వినవలసిం దని; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'మానవులందరికీ రాజు ఏలిక మాత్రమే కాకుండా దైవస్వరూపుడని బ్రాహ్మణులు చెప్పారు. అ దేమిటో ఎందుకో అనే సందేహం ఉండేది. దానికి సమాధానంగా మీవలన స్పష్టంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తెలిసికొన్నాను' అని ధర్మరాజు పలికాడు. అప్పుడు భీష్ముడు 'ఇంకా వివరిస్తాను వినుము. పూర్వం వసుమనుడనే రాజు నీవలెనే వితర్కించి బృహస్పతిని ప్రశ్నించగా అతడు ఆ రాజుతో చెప్పిన విధానాన్ని తెలిసికొ'మ్మని ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

బృహస్పతి వసుమనుండను రాజునకుం జెప్పిన రాజధర్మ ప్రకారము (సం. 12-68-1)

తే. **లోకములు లోక ధర్మంబులును నృపాల! । రాజ మూలముల్; రాజ విరహిత మైన**
పుడమి జనులకు నింకిన మడువులోని । జలచరంబులు పడుపాటు సంభవిల్లు. 265

ప్రతిపదార్థం: నృపాల!= ఓ ధర్మరాజా!; లోకములున్= జగాలు; లోకధర్మంబులును= లోకాలలో అనుసరించబడే ధర్మాలు; రాజమూలముల్= రాజుపై ఆధారపడి ఉంటాయి; రాజ విరహితము+ఐన= రాజు లేకుండా పోతే; పుడమి జనులకున్= భూ ప్రజలకు; ఇంకిన మడువులోని= నీరు ఇంకిపోయిన చెరువులోని; జలచరంబులు= నీటిలోని ప్రాణులైన చేపలు; పడుపాటు= పడే కష్టం; సంభవిల్లున్= కలుగుతుంది.

తాత్పర్యం: 'ఓధర్మరాజా! లోకాలు, లోకధర్మాలు అనేవి రాజుమీద ఆధారపడి ఉంటాయి. రాజు లేకపోతే భూ ప్రజలకు నీ రింకిపోయిన మడుగులోని జలచరాలకు కలిగే కష్టం కలుగుతుంది.

విశేషం: అలం: నిదర్శన.

క. **తరణి శశాంకులతేజ । స్స్ఫురణము లేకున్న యట్లు భూజనములు ని**
ర్భర దురితతఁ జేడ్పడుదురు । నరపాలక విహిత పాలనము లేకున్నన్. 266

ప్రతిపదార్థం: నరపాలక విహిత పాలనము= రాజు విధించిన పరిపాలనం; లేకున్నన్= లేకపోతే; తరణి శశాంకుల= సూర్యచంద్రుల యొక్క; తేజః+స్ఫురణము లేకున్న+అట్లు= కాంతి స్ఫూర్తి లేని రీతిగా; భూజనములు= ప్రజలు; నిర్భరదురితతన్= అత్యంత పాపంతో; చేడ్పడుదురు= బాధలకు గురి అవుతారు.

తాత్పర్యం: రాజు విధించే పరిపాలనం లేకుండా పోతే సూర్యచంద్రుల వెలుగులు లేకపోయిన రీతిగానే ప్రజలు మిక్కిలి పాపంతో బాధలకు గురి అవుతారు.

విశేషం: అలం: నిదర్శన.

క. **తనధన మిదియని యూఱడి । మనఁ బరిణయ మాదియైన మహితోత్సవముల్**
కొనియాడ నెవ్వరికి వ । చ్చునె? జనపాలుండు లేనిచో నిర్భయతన్. 267

ప్రతిపదార్థం: జనపాలుండు లేనిచోన్= రాజు లేకుంటే; నిర్భయతన్= భయరహితంగా; ఇది తన ధనము+అని= ఇది తన ధనమని; ఊఱడి= ఉపశమించి; మనన్= బ్రతకటానికి; పరిణయము+ఆది+ఐన= వివాహం మొదలైన; మహిత+ఉత్సవముల్= గొప్ప ఉత్సవాలు; కొనియాడన్= ప్రశంసించటానికి; ఎవ్వరికిన్+వచ్చునె!= ఎవరికైనా సాధ్యమా!

తాత్పర్యం: రాజు లేకుండాపోతే నిర్భయంగా ఇది తన ధనమని, ప్రశాంతంగా జీవించటానికిగాని, వివాహాది శుభకార్యాలను మహోత్సాహంతో చేసి ప్రశంసించటానికి గాని ఎవరికీ సాధ్యం కాదు.

తే. **విభుఁడు లేకున్న జనములు సభయ హృదయు । లగుచు హాహా నినాదంబు లడరఁ దల్ల**
డిల్లుదురు; రాజు లేమియ యెల్లవారు । లేమి; కల్మియ కల్మి దుర్లేపరహిత! 268

ప్రతిపదార్థం: దుర్లేప రహిత!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; విభుఁడు లేకున్నన్= రాజు లేకపోతే; జనములు= ప్రజలు; సభయ హృదయులు+అగుచున్= భయంతో కూడిన మనస్సులు కలవారై; హాహా నినాదంబులు+అడరన్= హాహాకారాలు చేస్తూ; తల్లడిల్లుదురు= సంక్షోభం పొందుతారు; రాజు లేమియ= రాజు లేకపోవటమనేదే; ఎల్లవారు లేమి= అందరూ లేకపోవటమే; కల్మియ= రాజును కలిగి ఉండటమే; కల్మి= నిజమైన సంపద.

తాత్పర్యం: ఓ పాపరహితుడవైన ధర్మరాజా! రాజు లేని రాజ్యంలో ప్రజలు భయాందోళనలతో కూడిన హృదయాలు కలవారై, హాహాకారాలు చేస్తూ తల్లడిల్లి పోతారు. రాజు లేకపోవటం అంటే బంధుమిత్రాదులు లేనట్లే; రాజు ఉంటే అందరూ ఉన్నట్లే.

క. **యాగములును, భోగములును, । ద్యాగములును, బహువిధముల ధర్మములు మహా**
భాగా! నరపతి రక్షా । యోగంబునఁ జెల్లుఁ బ్రజకు నుల్లాసముగన్. **269**

ప్రతిపదార్థం: మహాభాగా!= గొప్ప భాగ్యవంతుడవైన ఓ ధర్మరాజా!; నరపతి రక్షా యోగంబునన్= రాజ సంరక్షణ మనే అదృష్టం వలన; యాగములున్= యజ్ఞాలు; భోగములును= సర్వభోగాలు; త్యాగములును= దానం చేయటం మొదలైన విడుపులు; బహువిధముల ధర్మములున్= పలువిధా లైన ధర్మాలు; ప్రజకున్= ప్రజలకు; ఉల్లాసముగన్= ఉత్సాహంతో కూడి; చెల్లున్= ఒప్పుతాయి.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజసంరక్షణ అనే అదృష్టం లభిస్తే ప్రజలకు యజ్ఞయాగాలు, భోగభాగ్యాలు, దానత్యాగాలు, పలురీతుల ధర్మాలు ఆనందోత్సాహంతో సమకూరుతాయి. అప్పుడు వారంతా ఆనందంగా జీవిస్తారు.

విశేషం: భోగాలు ఎనిమిది విధాలు: గృహం, శయ్య, వస్త్రం, ఆభరణం, స్త్రీ, పుష్పం, గంధం, తాంబూలం. ఇవి ప్రవృత్తి భోగాలు. అట్లాగే నివృత్తి భోగాలు ఉన్నాయి.

క. **ఒకరునికి నలిగి యాతని । సకల హిరణ్యంబు రత్న సంచయమును బు**
చ్చుకొనుం, దనవలచిన వా । నికి నిచ్చు ధనేశుఁ డండ్రు నృపు నట్టితఱిన్. **270**

ప్రతిపదార్థం: ఒకరునికిన్+అలిగి= రాజు ఒకానొక శత్రు రాజుపై కోపించి; ఆతని= అతడియొక్క; సకల హిరణ్యంబున్= బంగారాన్నంతటినీ; రత్న సంచయమును= రత్నరాశినీ; పుచ్చుకొనున్= స్వాధీనం చేసికొంటాడు; తన వలచిన వానికిన్+ఇచ్చున్= తాను (ఆ రాజు) తనకు ఇష్టుడైన వాడికి అనుగ్రహిస్తాడు; అట్టి తఱిన్= ఆ సమయంలో; నృపున్= రాజును; ధన+ఈశుఁడు+అండ్రు= ధనానికి అధిపతి అయిన కుబేరుడని (ఆర్యులు) అంటారు.

తాత్పర్యం: రాజు ఒకానొక శత్రువుపై ఆగ్రహించి వాడి సమస్త సంపదనూ రత్నరాసులనూ స్వాధీనం చేసికొని, తనకు ఇష్టమైనవాడికి అనుగ్రహిస్తాడు. ఆ సందర్భంలో రాజును కుబేరు డని పెద్దలు అంటారు.

తే. **చారచక్షుఁడై కను నెల్ల జగము; నపుడు । సూర్యుఁ డండ్రు నరేంద్రు నకార్యకరులఁ**
దునుము నయ్యెడ జముఁడు నాఁ జను; నతండు । దేవతాత్మకుఁ డగుట సందియమె యధిప! **271**

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; నర+ఇంద్రున్= మానవశ్రేష్ఠుడైన రాజును; చారచక్షుఁడు+ఐ= చారు లనే (వేగులనే) కన్నులు కలవాడై; ఎల్ల జగమున్= సమస్త లోకాన్ని; కనున్= గమనిస్తాడు కాబట్టి; అపుడు= ఆ సందర్భంలో; సూర్యుఁడు+అండ్రు= సూర్యుడని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(విద్వాంసులు) అంటారు; అకార్యకరులన్= కాని పనులు చేసేవారైన దుర్మార్గులను; తునుమున్= సంహరిస్తాడు; ఆ+ఎడన్= ఆ సందర్భంలో; జముఁడునాన్+చనున్= యముడుగా పిలువబడతాడు; అతండు= అట్లాంటి రాజు; దేవతా+ఆత్మకుఁడు+అగుట= దైవస్వరూపుడు కావటంలో; సందియమె?= సందేహముంటుందా? (ఉండదు).

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజు చారులనే కన్నులు కలిగి ఉండటంచేత చారచక్షు డని పిలువబడతాడు. అట్లాంటి చారచక్షువైన రాజు లోకాన్నంతటినీ జాగరూకుడై పరిశీలిస్తూ ఉంటాడు. అప్పుడు పెద్దలు రాజును సూర్యుడని ప్రశంసిస్తారు. దుర్మార్గులను సంహరించినప్పుడు రాజును యము డని విద్వాంసులు వక్కాణిస్తారు. కాబట్టి రాజు దైవస్వరూపుడు అనటంలో సందేహం ఉందా?

విశేషం: సర్వలోకసాక్షి సూర్యుడు. కనుకనే తిక్కన సూర్యప్రయోగం సార్థకం. యముడు సమవర్తి. అందుచేత రాజు దైవస్వరూపు డనటం తిక్కన విజ్ఞతకు ఔచిత్యానికి నిదర్శనం.

క. వినను నృప! సమ్రాట్టు విరా । ట్టనియెడు శబ్దములఁ బొగడు నాగమములు నె
ట్టన భూపాలకునన నా । తనిఁ దగ నర్చింపకుండఁ దగునె యొరులకున్? 272

ప్రతిపదార్థం: నృప!= ఓ ధర్మరాజా!; విను= జాగ్రత్తగా వినుము; సమ్రాట్టు= తన ఆజ్ఞతో రాజులను శిక్షించి రాజసూయయాగం చేసిన మండలేశ్వరుడు; విరాట్టు+అనియెడు= మిక్కిలి ప్రకాశించే వాడైన క్షత్రియుడు అనే; శబ్దములన్= మాటలచేత; భూపాలకున్= రాజును; నెట్టన= అనివార్యంగా; ఆగమములు= వేదాలు; పొగడున్+అనినన్= ప్రశంసిస్తున్నాయి అంటే; ఒరులకున్= ఇతరులకు అంటే పాలితులైన ప్రజలకు; అతనిన్= ఆ రాజును; తగన్= అర్హమైన రీతిలో; అర్చింపక+ఉండన్+తగునె?= పూజించకుండా ఉండటం సముచితమేనా? (కాదు).

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజును విరాట్టు, సమ్రాట్టు అని వేదాలు అనివార్యంగా ఘోషిస్తున్నాయి. అట్లాంటి రాజును ప్రజలు అర్హమైన రీతిలో పూజించకుండా ఉండటం తగునా?

విశేషం: 'రాజా భోజా విరాట్సమ్రాట్ క్షత్రియో భూపతి ర్నృపః
య ఏభి స్తూయతే శబ్దైః కస్తం నార్చితు మర్హతి।

అనే మూల శ్లోకానికి పై పద్యం తిక్కన అనువాదం తిక్కన 'రాజా, భోజః క్షత్రియః' అనే మాటలను వదలిపెట్టి 'విరాట్ సమ్రాట్టులను మాత్రం గ్రహించాడు. పై మూల శ్లోకానికి నీలకంఠ వ్యాఖ్య ఇట్లా ఉన్నది. 'రాజేతి రాజా రంజకః, భోజః భోజ్య సుఖానామ్ భోజయితా, వివిధం రాజత ఇతి విరాట్; శ్రీమాన్ సమ్రా డితి రాజ్ఞా మపి రాజ్యేz కుంఠి తైశ్వర్యః'

క. నియతిమెయి నెవ్వఁ డింద్రియ । జయమును, భక్తియును, జిత్తసారము, దృఢ సం
శ్రయముఁ గలిగి కొలుచుం గృప । నయసంపన్నునిఁగఁ జేయు నధిపతి యతనిన్. 273

ప్రతిపదార్థం: నృపున్= రాజును; ఎవ్వఁడు= ఎవడైతే; నియతిమెయిన్= నియమానుసారంగా; ఇంద్రియ జయమును= ఇంద్రియాలను జయించి; భక్తియును= భక్తిగలిగి; చిత్తసారమున్= మానసిక బలమైన; దృఢ సంశ్రయతయున్+కలిగి= స్థిరంగా ఆశ్రయించి; కొలుచున్= సేవిస్తాడో; అతనిన్= అట్లాంటివాడిని; అధిపతి= రాజు; నయసంపన్నునిఁగన్+చేయున్= నీతి సంపదగలవాడిగా సంపన్నుడిగా చేస్తాడు.

తాత్పర్యం: ఎవడు జితేంద్రియుడై, భక్తియుక్తుడై, దృఢచిత్తంతో రాజును ఆశ్రయించి నియమానుసారంగా సేవిస్తాడో, అట్లాంటివాడిని రాజు నీతిమంతుడిగా, సంపన్నుడిగా చేస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మూలంలోని మూడు శ్లోకాల భావాల్ని సంక్షిప్తీకరించి ముఖ్యాంశాల్ని తిక్కన ఈ కందంలో చెప్పాడు.

క. రాజునకుఁ బ్రజ శరీరము; । రాజు ప్రజకునాత్మ; కాన రాజుం బ్రజయున్
రాజోత్తమ! యన్యోన్య వి । రాజితు లై యుండవలయు రక్షార్చనలన్.' 274

ప్రతిపదార్థం: రాజ+ఉత్తమ!= రాజ శ్రేష్ఠుడ వైన ఓ ధర్మరాజా!; రాజునకున్= రాజుకు; ప్రజ శరీరము= ప్రజలు శరీరంవంటి వారు; రాజు; ప్రజకున్+ఆత్మ= ప్రజలకు ఆత్మవంటి వాడు; కానన్= అందువలన; రాజున్+ప్రజయున్= రాజు, ప్రజలు; రక్షా+అర్చనలన్= క్రమంగా సంరక్షణలోను; పూజించటం అంటే సేవించటంలోనూ; అన్యోన్య= పరస్పరం; విరాజితులు+ఐ= ప్రకాశిస్తూ; ఉండవలయున్= ప్రవర్తించాలి.

తాత్పర్యం: 'రాజశ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా! ప్రజలు రాజుకు శరీరంవంటి వారు. ప్రజలకు రాజు ఆత్మవంటి వాడు. అందుచేత రాజు ప్రజలను సంరక్షించటంలోనూ, ప్రజలు రాజును సేవించటంలోనూ పరస్పరం విధ్యుక్త ధర్మాలను నెరవేరుస్తూ ప్రకాశించాలి.'

విశేషం: అలం: కావ్యలింగం, యథాసంఖ్యం.మూలంలో 'రాజా ప్రజానాం హృదయం గరీయః' అనే మాటలు మాత్రం ఉండగా, తిక్కన స్వతంత్రంగా ఈ పద్యాన్ని సంతరించి తన రాజకీయ చతురతను ప్రకటించుకొన్నాడు. హృదయానికీ ఆత్మకీ గల భేదాన్ని గమనించి ఆత్మ ప్రయోగం చేసి శరీరాత్మలకుగల సంబంధాన్ని ప్రజలకు రాజుకు గల సంబంధంగా నిరూపించాడు. ఆత్మ శరీరాన్ని రక్షించినట్లే శరీరం ఆత్మను పూజించవలసి ఉన్నది. అట్లాగే రాజుకు ప్రజలను సంరక్షించవలసిన బాధ్యత ఉన్నట్లే ప్రజలకు ఆత్మ అయిన రాజును సేవించవలసిన ధర్మం ఉన్నది. కాబట్టి శరీరాత్మలవలె ప్రజలూ రాజూ పరస్పరం ఆధారాధేయాలు. ఇంకా స్వతంత్రించి తిక్కన ' రాజునకు ప్రజ శరీరము, రాజు ప్రజకు నాత్మ' అని సూక్తులవలె ప్రయోగించి తన సూక్తి వైచిత్రిని స్పష్టం చేశాడు. మూలానికి మెరుగులు దిద్దిన ఈ రచనలో తిక్కన నిగూఢార్థ రాజకీయ ప్రతిభాపాటవం విదితమవుతున్నది.

వ. అని యిట్లు బృహస్పతి యుపదేశించినం గౌసల్యపతి యగు నవ్వసుమనుండు ప్రయత్నంబునం బ్రజాపాలనం బాచరించె నని చెప్పుటయు ధర్మనందనుండు 'రాజు జనపద పరిపాలనంబును శత్రువధంబును మొదలైన కృత్యంబులు నడుపు తెఱం గెఱింగింపవే!' యనుటయు భీష్ముం డి ట్లనియె. 275

ప్రతిపదార్థం: అని+ఇట్లు= అని ఈ విధంగా; బృహస్పతి+ఉపదేశించినన్= బృహస్పతి రాజ ధర్మోపదేశం చేయగా; కౌసల్య పతి+అగున్+ఆ+వసుమనుండు= కోసల దేశాధిపతి అయిన ఆ వసుమనుడనే రాజు; ప్రయత్నంబునన్= ప్రయత్న పూర్వకంగా; ప్రజాపాలనంబు+ఆచరించెన్= ప్రజలను పాలించాడు; అని చెప్పుటయున్= అని భీష్ముడు చెప్పగా; ధర్మనందనుండు= ధర్మరాజు; రాజు= రాజు; జనపద పరిపాలనంబును= గ్రామీణ ప్రజలను పాలించే విధానమూ; శత్రువధంబును= శత్రువులను సంహరించే రీతి; మొదలైన కృత్యంబులు= మొదలైన కార్యాలను; నడపు తెఱంగు= నిర్వర్తించే విధానాన్ని; ఎఱింగింపవే= తెలియజేయుము; అనుటయున్= అని ప్రార్థించగా; భీష్ముండు+ఇట్లు+అనియెన్= భీష్ముడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: రాజనీతిని గూర్చి బృహస్పతి ఉపదేశించగా అదే రీతిలో వసుమనుడనే రాజు బహు జాగరూకుడై ప్రయత్నపూర్వకంగా రాజ్యపాలనం చేశాడని భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'రాజుగా జనపదాలను ఎట్లా పాలించాలి? శత్రుసంహారం ఎట్లా చెయ్యాలి? - మొదలైన కార్యాలను నిర్వహించే తీరును వివరించు' మని భీష్ముడిని ప్రార్థించాడు. అప్పుడు భీష్ముడు ధర్మరాజుకు ఇట్లా వివరించాడు.

క. 'తనుఁ దాన తొలుత గెలువన్ । మనుజపతికి వలయుఁ; బిదప మార్తుర గెలువన్
మనమునఁ దలంచునది; మును । దను గెలువని పతికిఁ గెలువఁ దరమే పగఱన్. 276

ప్రతిపదార్థం: మనుజపతికిన్= రాజునకు; తొలుతన్= మొట్టమొదట; తనున్+తాన= తనను తానే; గెలువన్ వలయున్= జయించవలసి ఉన్నది; పిదప= ఆ తరువాత (తనను తాను జయించిన వెనుక); మార్తురన్ గెలువన్= శత్రువులను జయించటాన్ని గూర్చి; మనమునన్= మనస్సునందు; తలంచునది= ఆలోచించవలసి ఉన్నది; మును= మొదటగా; తను గెలువని పతికిన్= తనను తాను జయించని రాజుకు; పగఱన్= శత్రువులను; గెలువన్+తరమే?= జయించటం సాధ్యమా?

తాత్పర్యం: రాజు మొట్టమొదట తన్ను తాను జయించుకొనాలి. అంటే ఇంద్రియనిగ్రహాన్ని సాధించవలసిన అవసరం ఉన్నది. రాజు తనను తాను జయించిన తరువాత శత్రువులను జయించాలి. ముందుగా తనను తాను జయించని రాజుకు శత్రువులను జయించటం సాధ్యం కాదు.

విశేషం: తనను తాను జయించటమంటే తనలోని శత్రువులైన అరిషడ్వర్గాలను జయించట మని అర్థం. అంతశ్శత్రువు లైన అరిషడ్వర్గాలను జయించినవాడు మాత్రమే బాహ్యశత్రువులను జయించగలుగుతాడు. అంటే ఇంద్రియనిగ్రహదక్షునికి మాత్రమే శత్రువులను జయించటం సాధ్యమవుతుందని అర్థం. మూలంలోని

"ఆత్మాజేయ స్సదా రాజ్ఞా తతో జేయాశ్చ శత్రవః

అజితాత్మా నరపతిః విజయేత కథం రిపూన్" (12-69-4) అనే శ్లోకానికి తిక్కన పై పద్యాన్ని కూర్చాడు.

ఆ. వినుము! తన్ను గెలుచు టన వేఱొకండె? పం । చేంద్రియములఁ దూలనీక కొలఁది
నాఁగుటయ జితేంద్రియత్వంబు గల రాజు । రిపులఁ జెఱుపఁజాలు నృపవరేణ్య! 277

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజశ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా! వినుము= జాగరూకుడవై వినుము; తన్నున్+గెలుచుట+అనన్= తనను తాను జయించటమంటే; పంచ+ఇంద్రియములన్= ఐదు ఇంద్రియాలను (త్వక్కు, చక్షువు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణము; ఇవి జ్ఞానేంద్రియములు. వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థము - ఇవి కర్మేంద్రియములు); తూలనీక కొలఁదిన్+అగుటయ= చలించిపోనీక శక్యమయ్యేటట్లు ఆపటమే అంటే నిగ్రహించటమే కాని; వేఱు+ఒకండె?= మరొకటి కాదు; జిత+ఇంద్రియత్వంబు+కలరాజు= ఇంద్రియాలను జయించిన రాజు; రిపులన్= శత్రువులను; చెఱుపన్+చాలున్ నాశనం చేసి జయించగలుగుతాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! తనను తాను జయించట మంటే వేరేమీ కాదు. ఇంద్రియాలను జయించటమే. ఇదే రాజు కర్తవ్యం. అట్లాంటి ఇంద్రియనిగ్రహం కల రాజు శత్రు సంహారం చేసి విజయాన్ని సాధిస్తా డనటంలో సందేహం లేదు. కాబట్టి ఇంద్రియజయ మనేది రాజునకు తప్పనిసరి అయిన గుణం.

క. ఆరామాదిక నిజ సం । చార స్థలములకు, దేశ సంధులకుఁ, బురీ
ద్వారములకు, నగరికిని ధ । రా రమణుఁ డొనర్ప వలయు రక్షలు నియతిన్. 278

ప్రతిపదార్థం: ధరారమణుఁడు= భూమికి భర్త అయిన రాజు; నియతిన్= నియమానుసారంగా (తప్పని సరిగా); ఆరామ+ఆదిక= ఉద్యానవనం మొదలైన; నిజసంచార స్థలములకున్= తన విహార ప్రదేశాలకు; దేశసంధులకున్= రాజ్యం సరిహద్దులకు; పురీద్వారములకున్= పురద్వారాలకు; నగరికిని= అంతఃపురానికి; రక్షలు= సంరక్షలు అంటే - ఎట్లాంటి శత్రుభయం లేకుండా రక్షణలు; ఒనర్పవలయున్= చేయాలి.

తాత్పర్యం: తనకు సంచారయోగ్యాలైన ఉద్యానవనాలు, రాజ్యం సరిహద్దులు, పురద్వారాలు, అంతఃపురాలు మొదలైన అన్నిచోట్ల తగిన సంరక్షకులను నియమించి రాజు ఎల్లప్పుడు జాగరూకుడై సంరక్షించుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. అరులకడ, నిజ భూమియం, దనుజ తనుజ। బాంధ వామాత్య మిత్రులపాల వేష
ధరుల వేగులఁగాఁ బెట్ట ధరణిపునకు। వలయు నొండొరు నెఱుఁగని వారిఁగాఁగ. 279

ప్రతిపదార్థం: అరులకడన్= శత్రురాజ్యంలోనూ; నిజభూమియందున్= తన రాజ్యంలోనూ; అనుజ తనుజ బాంధవ+అమాత్య మిత్రుల పాలన్= సోదరులు, పుత్రులు, బంధువులు, అమాత్యులు, స్నేహితుల వద్ద; ఒండొరున్= ఒకరినొకరు; ఎఱుఁగనివారిన్+కాఁగన్= తెలియనివారుగా; వేషధరులన్= మారువేషాలను ధరించిన వారిని; వేగులన్+కాన్+పెట్టవలయున్= గూఢచారులుగా నియమించాలి.

తాత్పర్యం: శత్రురాజుల సన్నిధిలోనూ, తన దేశంలోను, సోదరులు, పుత్రులు, బంధువులు, మంత్రులు, మిత్రులు అయినవారి వద్ద ఒకరినొకరు గుర్తించని రీతిగా మారువేషాలలో వేగులవారిని నియమించి, వారి వారి రహస్యాలను గుర్తిస్తూ జాగరూకతతో రాజు మెలగాలి.

క. తను హీనుం డని యెఱుఁగక। మును ప్రబలునితోడ శీఘ్రమున సంధానం
బొనరింప వలయు నతనికి। ధనం బొసఁగియైనఁ బతికిఁ దగు నిలఁ గావన్. 280

ప్రతిపదార్థం: తను= తాను (రాజు); హీనుండు+అని+ఎఱుఁగక మును= శత్రువుల కంటె తాను బలహీనుడని శత్రువులు గ్రహించకముందే; ప్రబలునితోడన్= అత్యంత బలసంపన్నుడైన శత్రువుతో; శీఘ్రమునన్= వెంటనే; సంధానంబు+ఒనర్పన్ వలయున్= సంధిచేసికొనాలి; అతనికిన్= ఆ శత్రువుకు; ధనంబు+ఒసఁగి+ఐనన్= ధనమిచ్చి అయినా; ఇలన్+కావన్= తన రాజ్యాన్ని రక్షించటం; పతికిన్+తగున్= రాజునకు తగిన ధర్మం.

తాత్పర్యం: తాను బలహీనుడని శత్రువులు గ్రహించకముందే, తనకంటె బలవంతు డైన శత్రువుతో వెనువెంటనే సంధిచేసికొనటం అవసరం. చివరకు శత్రువుకు ధన మిచ్చి అయినా సరే - తన రాజ్యాన్ని సంరక్షించుకొనటం రాజధర్మం.

విశేషం: సామ దాన భేద దండోపాయాలలో శత్రువులకంటె తాను బలహీనుడని గుర్తించినప్పుడు సామోపాయం ప్రధానమైనది. దానికి శత్రువు లొంగకపోతే దానోపాయంతో శత్రువును జయించాలని రాజనీతిలో వివరించబడింది.

క. మత్తుఁ బ్రమత్తుని విషయా। యత్తుని దుర్బలునిఁ జూచి యట్టి పగతుపై
నెత్తునది, శిఖి విషాదుల। నుత్తల పెట్టునది యతని యుర్విఁ గడంకన్. 281

ప్రతిపదార్థం మత్తున్= మదించిన వాడిని; ప్రమత్తునిన్= మిక్కిలి మత్తుడైన వాడిని; విషయ+ఆయత్తునిన్= విషయసుఖాలకు అధీనుడైన అంటే విషయలోలుడైన వాడిని; దుర్బలునిన్+చూచి= బలహీనుడిని పరిశీలించి; అట్టి పగతునిపైన్= అట్లాంటి శత్రువుపై; ఎత్తునది= దండెత్తిపోయి యుద్ధంచేయాలి; కడంకన్= ప్రయత్నంతో; అతని+ఉర్విన్= ఆ శత్రురాజ్యాన్ని; శిఖివిషాదులన్= అగ్ని, విషం మొదలైన వాటిచేత; ఉత్తల పెట్టునది= కలత చెందించాలి.

తాత్పర్యం: శత్రువు విషయలోలుడై మదించి మైమరచి ఉండగా గుర్తించి అట్లాంటి బలహీనుడిపై దండెత్తాలి. మిక్కిలి ప్రయత్నించి ఆ శత్రురాజ్యానికి నిప్పుపెట్టి, విషప్రయోగం చేసి అత్యంత సంక్షోభంలో ముంచి వేయాలి.

ఆ. కయ్యమునకు వలదు కాల్ద్రవ్వనధిప! సా। మమున భేదమునను మార్తు మనము
మెత్తఁ జేసి చెఱిచి మెయివడిఁ దప్పించు। కొనుతెఱం గెఱింగికొనుట మేలు. 282

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; కయ్యమునకున్= యుద్ధానికి; కాల్దవ్వన్ వలదు= కారణం లేకుండా యుద్ధానికి సిద్ధం కావద్దు; మార్తుమనమున్= శత్రువుయొక్క మనస్సును; సామమునన్ భేదమునన్= సామదానభేద దండోపాయాలనే నాలుగు ఉపాయాలలోనూ సామంవలన గాని, భేదంవలనగాని; మెత్తన్+చేసి= లొంగేటట్లు చేసి; చెఱిచి= నాశనం చేసి; మెయివడిన్= ఆనుకూల్యంతో; తప్పించుకొను తెఱంగు= శత్రువునుంచి తప్పించుకొనే మార్గం; ఎఱింగికొనుట మేలు= తెలిసికొనటం మంచిది.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! అనవసరంగా యుద్ధానికి సిద్ధపడకూడదు. ఒకవేళ యుద్ధమే అవసర మనిపిస్తే సామదాన భేద దండోపాయాలలో సామంవలనగాని లేదా భేదోపాయంవలనగాని శత్రువును నయాన భయాన వశంచేసికొని నాశనంచేసి ఆనుకూల్యంతో శత్రువునుంచి తప్పించుకొనే మార్గాన్ని గుర్తించటం మంచిది.

చ. **జనకుడుఁబోలె నర్మిలిఁ బ్రజం బరికించుచు షష్ఠభాగముం**
గొనునది; వారిచేత నరిఁ గోటి విధంబుల నాప్తదక్షులం
గని వన గోకులాకర నగ ప్రముఖార్థకరంబు లారయం
బనుచుచు నన్నిటన్ ధరణిపాలుఁడు కన్నిడియున్నఁ బెంపగున్. **283**

ప్రతిపదార్థం: ధరణి పాలుఁడు= రాజు; ప్రజన్= ప్రజలను; జనకుఁడున్+పోలెన్= తండ్రివలె; అర్మిలిన్= ప్రేమతో; పరికించుచున్= చూస్తూ; వారిచేతన్= వారి నుండి; అరిన్= పన్నును; షష్ఠభాగమున్+కొనునది= వారి ఆదాయంలో ఆరవభాగం మాత్రమే తీసుకొనేది; కోటివిధంబులన్= అనేక రీతులలో; ఆప్త దక్షులన్+కని= ఆత్మీయులైన వారిలో సమర్థులైన వారిని తెలిసికొని (గుర్తించి); వనగోకుల+ఆకర ప్రముఖ+అర్థకంబులు= అరణ్యాలు, గో సమూహాలు, గనులు మొదలైన ధనా న్నిచ్చే వాటిని; ఆరయన్+పనుచుచున్= పరిపాలించటానికి నియోగిస్తూ; అన్నిటన్= అన్ని వ్యవహారాలను; కన్ను+ఇడి+ఉన్నన్= కనిపెట్టి ఉండటం వలన; పెంపు+అగున్= అభివృద్ధి కలుగుతుంది.

తాత్పర్యం: రాజు ప్రజలను తండ్రివలె పరిపాలించాలి. ప్రజల ఆదాయంలో ఆరవభాగాన్ని మాత్రమే పన్నుగా గ్రహించాలి. అనేక రీతులుగా రాజు తన ఆప్తులలో దక్షులైనవారిని మాత్రమే ఆదాయాన్ని పెంచటానికి కారణాలైన అరణ్యాలు, గో సమూహాలు, గనులు మొదలైనవాటిమీద అజమాయిషీకై నియమించి, అన్ని వ్యవహారాలలోనూ ఒక కంట కనిపెట్టి ఉండటం మంచిది. దానివలన అభివృద్ధి కలుగుతుంది.

సీ. **కోట యేమఱ కెప్డుఁ బాటించి గడ్డియు । ఖాణంబుఁ గొల్చును గట్టియలును**
నేయు నూనియయును నాయుధమ్ములు నౌష । ధములు నాభీల యంత్రములుఁ గూప
ములు లోనుగా నందు వలయువాని సమగ్ర । ములుగ సంపాదించి భూరి ధైర్య
శౌర్యాది గుణముల సడిసన్న యాప్త యో । ధులఁ బె ల్లమర్చుట యలఘునీతి;

ఆ. **పగతుఁ డలిగి నడచు పథమునఁ దృణ కాష్ఠ । ములును ధాన్యతోయములును లేక**
యుండఁ జేసి మిత్రమండలేశుల నెత్తి । యరుగుదేరఁ బనుచునది విభుండు. **284**

ప్రతిపదార్థం: విభుండు= రాజు; ఎప్డున్= ఎల్లప్పుడు; ఏమరక= అశ్రద్ధ చేయక (జాగరూకతతో); కోట పాటించి= కోటను దృష్టిలో పెట్టుకొని; గడ్డియున్= పశువులకు అవసరమైన గడ్డిని; ఖాణంబున్= అశ్వాదులకు కావలసిన ఉలవలు మొదలైన ఆహార పదార్థాలను; కొల్చునున్= మానవులకు కావలసిన వరిధాన్యాన్ని; కట్టియలును= వంటచెఱకును; నేయున్= నేతినీ; నూనియయున్= నూనెనీ; ఆయుధమ్ములున్= యుద్ధాదులలో ఉపయోగించే ఆయుధాలను; ఔషధములున్= మందులను; ఆభీల= భయంకరమైన;

యంత్రములున్= యంత్రాలను; కూపములున్= బావులనూ; లోనుగాన్= మొదలైన; అందున్ వలయు వానిన్= వాటికి కావలసిన పరికరాలను; సమగ్రములుగన్= సంపూర్ణంగా; సంపాదించి= సమకూర్చుకొని; భూరి= అధికమైన; ధైర్య శౌర్య+ఆది గుణములన్= ధైర్యమూ, పరాక్రమమూ మొదలైన ఉత్తమ గుణాలలో; సడి+చన్న= నిందలేని; ఆప్త యోధులన్= ఆప్తులైన బంటులను; పెల్లు+అమర్చుట= అధికంగా నియమించటం; అలఘునీతి= రాజునకు ఉండవలసిన గొప్ప రాజనీతి; పగతుఁడు= శత్రువు; అలిగి= (రాజుపై) కోపించి; నడచు పథమునన్= ప్రయాణించే మార్గంలో; తృణ కాష్ఠములును= గడ్డి కట్టెలూ; ధాన్య తోయములును= (తినటానికి) ఆహార ధాన్యాలు (తాగటానికి) నీరూ; లేక+ఉండన్+చేసి= (శత్రువులకు) లభించకుండ చేసి; మిత్రమండల+ఈశులన్= తనకు మిత్రులైన (సమీప) మండలాధిపతులను; ఎత్తి+అరుగు దేరన్+పనుచునది= శత్రువులపై దండెత్తి పోయేటట్లు నియమించాలి.

తాత్పర్యం: రాజు ఎల్లప్పుడు బహు జాగరూకుడై పశువులకు గడ్డి, అశ్వగజాదులకు కావలసిన ఉలవలు మొదలైన ఆహార పదార్థాలు, ప్రజలకు అవసరమైన ధాన్యాదులు, కట్టెలు, నేయి, నూనె, సమస్తమైన ఆయుధాలు, మందులు, భయంకర యంత్రసామగ్రిని, నీటి బావులను సంపూర్ణంగా సమకూర్చుకొని అత్యంత ధైర్యపరాక్రమాది ఉత్తమ గుణాలతో నిందారహితులైన ఆప్తులైన యోధులను అధికంగా నియమించటం ఉత్తమ రాజనీతి. శత్రువు తనపై కోపించి దండెత్తి వస్తే, ఆ మార్గం తెలిసికొని, ఆ శత్రు సైన్యానికి గడ్డి, కట్టెలు, ధాన్యం, నీరూ లభించకుండా చేసి తనకు మిత్రులైన సమీప మండలాధిపతులను, ఆ శత్రువులపై దండెత్తి పోయేటట్లు పురికొల్పి నియోగించటమనేది ఉత్తమ రాజనీతి.

వ. **మఱియు రాజునకు రక్షింపవలయునది స్వామ్యమాత్య జనపద కోశ సైన్య మిత్ర దుర్గంబులను రాజ్యాంగ సప్తకంబు కన్నిడి యరయ వలయునది; సంధి విగ్రహ యానాసన ద్వైధీభావ సమాశ్రయంబులను షాడ్గుణ్యంబు నడపవలయునది; ధర్మార్థ కామంబు లను త్రితయంబు పాటింపవలయునది; మంత్ర ప్రభుత్వోత్సాహంబులను శక్తి త్రయంబు నిజవశవర్తిం జేయవలయునది; సత్త్వరజస్తమంబు లను గుణ త్రికంబు విశేషించి ధర్మసేవ సంతతంబు నాచరింపవలయునది; ప్రమాదంబున నర్థకామంబులు హీనంబు లైనను ధర్మనిష్ఠంజేసి ధరణీపరిపాలనంబు సుస్థిరంబై చెల్లు; నాంగిరస భార్గవాదులగు పెద్ద లిట్లని చెప్పిరి 'త్వక్చక్షు శ్రోత్ర జిహ్వా ఘ్రాణంబులను బుద్ధీంద్రియంబులును, వాక్పాణి పాద పాయూపస్థంబులను కర్మేంద్రియంబులును, మనంబునుం గూడ నేకాదశ సంఖ్యంబైన యింద్రియజాతంబు జయించి, కామజంబు లగు నక్ష మృగయా స్త్రీ పానార్థ దూషణంబులునుం, గ్రోధజంబు లగు వాక్పారుష్య దండపారుష్యంబులును నైన సప్తవ్యసనంబు లందగులక, యజ్ఞాధ్యయన దానతత్పరుం డగుచు దుర్మంత్రుల కుటిల వాక్యంబులకు లోనుగాక, నయవిక్రమ క్రమజ్ఞులైన యమాత్యులతో దైవ మానుష చింతనంబు చేయుచు దేవ బ్రాహ్మణ ప్రణామ తర్పణ రక్షణంబులుం జేసి, యశుభ నిరాసనంబును, శుభాపాదనంబును నొనర్చుచుఁ బ్రజలం బాలించు భూపతి యుభయ లోక సిద్ధులం బొందు.** **285**

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; రాజునకున్ రక్షింప వలయునవి= రాజు రక్షించవలసినవి ఉన్నాయి; స్వామి+అమాత్య జనపద కోశ సైన్య మిత్ర దుర్గంబులు+అను= స్వామి, మంత్రి, జనపదం, ధనాగారం, సైన్యం, మిత్రులు, దుర్గాలు అనే; రాజ్య+అంగసప్తకంబు= రాజ్యానికి భాగాలైన ఏడింటిని; కన్ను+ఇడి+అరయవలయునది= కనిపెట్టి పరిశీలించాలి; సంధి, విగ్రహ యాన+ఆసన ద్వైధీభావ సమాశ్రయంబులు+అను= సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సమాశ్రయం అనే; షాడ్గుణ్యంబున్= ఆరు గుణాలతో; నడపవలయునది= రాజనీతిని నిర్వర్తించాలి; ధర్మ+అర్థ కామంబులు+అను= ధర్మం, అర్థం, కామం అనే; వర్గత్రితయంబు= పురుషార్థాల్లోని ఈ మూడు వర్గాలను; పాటింపవలయునది= నిర్వర్తించాలి; మంత్ర, ప్రభుత్వ+ఉత్సాహంబులు+అను= మంత్రం,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రభువు, ఉత్సాహం అనే; శక్తి త్రయంబున్= మూడు శక్తులను; నిజవశవర్తిన్+చేయవలయునది= స్వాధీనం చేసికొనవలసి ఉన్నది; సత్త్వరజః+తమంబులు+అను= సత్త్వం, రజస్సు, తపస్సు అనే; గుణ త్రికంబున్= మూడు గుణాలను; విశేషించి= ప్రత్యేకించి; సతతమున్= ఎల్లప్పుడు; ధర్మసేవన్= ధర్మానుగుణమైన సేవను; ఆచరింపవలయునది= పాటించాలి; ప్రమాదంబునన్= ప్రమాదవశాత్తు; అర్థ కామంబులు= ధనమూ కోరికలు; హీనంబులు+ఐనను= హీనదశకు వచ్చినప్పటికి; ధర్మనిష్ఠన్+చేసి= ధర్మమునందు ఆసక్తుడై ఉండటం వలన; ధరణీ పరిపాలనంబు= రాజ్యపాలనం; సుస్థిరంబు+ఐ చెల్లున్= స్థిరంగా కొనసాగుతుంది; ఇట్లు+అని= ఇట్లాగని; ఆంగిరస భార్గవ+ఆదులు+అగు= ఆంగిరసుడు భార్గవుడు అనే మహర్షులు మొదలైన; పెద్దలు= వృద్ధులు (ఆర్యులు); చెప్పిరి= పలికారు; త్వక్+చక్షుః+శ్రోత్ర జిహ్వా+ఘ్రాణంబులు+అను= చర్మం, కన్నులు, చెవులు, నాలుక, ముక్కు అనే; బుద్ధి+ఇంద్రియంబులును= జ్ఞానేంద్రియాలు ఐదూ; వాక్+పాణి పాద పాయు+ఉపస్థంబులు+అను= వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థం అనే; కర్మ+ఇంద్రియంబులును= కర్మేంద్రియాలు ఐదూ; మనంబునున్+కూడన్= మనసూ కలసి; ఏకాదశ సంఖ్యంబు+ఐన= పదునొకండు సంఖ్యతో కూడినదైన; ఇంద్రియ జాతంబున్+జయించి= ఇంద్రియ సమూహాన్ని గెల్చి; కామజంబులు+అగు= కామం వలన కలిగిన; అక్ష, మృగయా, స్త్రీ, పాన, అర్థ, దూషణంబులున్= ద్యూతం, వేట, స్త్రీలోలత, మద్యపానం, నిరర్థక ధనవ్యయం అనే అయిదు వ్యసనాలూ; క్రోధజంబులు+అగు= కోపంవలన కలిగిన; వాక్పారుష్య దండ పారుష్యంబులునున్+ఐన= వాక్పారుష్యం, దండపారుష్యం అనే రెండు పారుష్యాలు అనే; సప్త వ్యసనంబులన్+తగులక= ఏడు వ్యసనాలకు లొంగక; యజ్ఞ+అధ్యయన దాన తత్పరుండు+అగుచున్= యజ్ఞాలు చేయటంలో, వేదాధ్యయనంలో, దానం చేయటంలో ఆసక్తుడై; దుః+మంత్రుల= దుష్టులైన మంత్రులయొక్క; కుటిల వాక్యంబులకున్= చెడ్డ మాటలకు; లోనుగాక= లొంగక; నయ విక్రమ క్రమజ్ఞులు+ఐన= నీతి పరాక్రమ మెరిగిన వారైన; అమాత్యులతోన్= మంత్రులతో; దైవ మానుష చింతనంబు+చేయుచున్= ఆయా దైవ మానుష వ్యవహారాలు నిర్వర్తిస్తూ; దేవ బ్రాహ్మణ తర్పణ రక్షణంబులన్+చేసి= దేవతలకు బ్రాహ్మణులకు నమస్కరిస్తూ, తర్పణాలిస్తూ వారిని రక్షిస్తూ ఉండటం చేత; అశుభ నిరాసనంబునున్= అశుభాలను తొలగించటమూ; శుభ+ఆధానంబునున్+ఒనర్చుచున్= శుభాలను చేకూరుస్తూ; ప్రజలన్= ప్రజలను; పాలించు భూపతి= పరిపాలించే రాజు; ఉభయలోక సిద్ధులన్+పొందున్= ఇహపరలోకాలు రెండింటిలోను కృతార్థు డౌతాడు.

తాత్పర్యం: ఇంకా రాజు జాగరూకతతో సంరక్షించవలసినవాటిని తెలుపుతాను విను మని ధర్మరాజుకు భీష్ముడు వివరించాడు. 'స్వామి, అమాత్యుడు, జనపదం, ధనాగారం, సైన్యం, మిత్రులు, దుర్గం - అనే రాజ్యాంగాలైన ఏడింటిని కనిపెట్టి పరిశీలించవలసిన అవసరం ఉన్నది. సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సమాశ్రయం - అనే ఆరు రాజ్యతంత్రాలను రాజనీతితో నిర్వర్తిస్తూ, ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలను నిర్వర్తించటం రాజధర్మం. మంత్రం, ప్రభువు, ఉత్సాహం అనే శక్తిత్రయాన్ని స్వాధీనం చేసికొని, సత్త్వ రజస్తమోగుణాలనే మూడింటితో ముఖ్యంగా ధర్మానుగుణమైన సేవచేయటం రాజనీతి. ప్రమాదవశాత్తు అర్థకామాలు హీనదశకు చేరినప్పటికీ రాజు ధర్మనిష్ఠాపరుడైతే రాజ్యపాలనం సుస్థిరమై కొనసాగుతుంది. రాజధర్మ మిది - అని ఆంగిరసుడు, భార్గవుడు మొదలైన మహర్షులు చెప్పారు. త్వక్కు, చక్షువు, శ్రోత్రం, జిహ్వ, ఘ్రాణం అనే ఐదు జ్ఞానేంద్రియాలు, వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థం అనే ఐదు కర్మేంద్రియాలు, మనస్సూ కలసి ఏకాదశ సంఖ్య గల ఇంద్రియ సమూహాన్ని జయించి కామంవలన పుట్టిన ద్యూతం, వేట, స్త్రీలోలత, మద్యపానం, నిరర్థకధనవ్యయం అనే ఐదు వ్యసనాలు, క్రోధంవలన కలిగిన వాక్పారుష్యం, దండపారుష్యం అనే రెండు పారుష్యాలు కలసిన సప్తవ్యసనాలకు లొంగక యజ్ఞాలు చేయటంలో, వేదాధ్యయనంలో దానంలో ఆసక్తుడై మంత్రుల కుటిలవాక్యాలకు దూరంగా ఉంటూ, రాజనీతి పరాక్రమం తెలిసిన మంత్రులతో, దైవమానుష చింతనతో, దేవబ్రాహ్మణులకు నమస్సులతో తర్పణలిస్తూ, సంరక్షణచేస్తూ అశుభాలకు దూరంగా సమస్త శుభాలను ప్రసాదిస్తూ ప్రజలను పాలించే రాజు ఇహపరలోకాలు రెండింటిలోను సిద్ధి పొందగలుగుతాడు'.

తే. అనిన విని ప్రీతి ధర్మనందనుఁడు రాజు । దండనీతియు ననఁగ నుదాత్తయుక్త
వస్తువులు రెండు నార్య ప్రశస్త కార్య । సిద్ధి గావించు తరములు సెప్పు మనఘ!' 286

ప్రతిపదార్థం: అనినన్ విని= అని రాజ ధర్మాన్ని గూర్చి భీష్ముడు చెప్పగా విని; ధర్మనందనుఁడు= ధర్మరాజు; ప్రీతిన్= సంతోషంతో; అనఘ!= పాపరహితుడవైన తాతా!; రాజు దండనీతియున్= రాజును, దండనీతి; అనఁగన్= అనేటువంటి; ఉదాత్త యుక్తవస్తువులు= శ్రేష్ఠము లైన ఈ అంశాలు; రెండును= రెండూ; ఆర్యప్రశస్తకార్య సిద్ధి కావించు= ఆర్యులయొక్క ప్రసిద్ధమైన కార్యాలు సిద్ధిపొందించే; తరములు= విధములు; చెప్పుము= వివరించుము.

తాత్పర్యం: రాజధర్మాన్ని గూర్చి భీష్ముడు విపులంగా వివరించగా విన్న ధర్మరాజు సంతోషంతో భీష్ముడితో 'రాజు, దండనీతి అనే శ్రేష్ఠమైన అంశాలు రెండూ ఆర్యప్రసిద్ధ కార్యసిద్ధిని ఎట్లా కలిగిస్తాయో ఆ పద్ధతులను అన్నిటినీ వివరించుము.'

వ. అని యడిగిన నప్పుడమిఱేనికి సరిత్సూనుం డిట్లనియె. 287

ప్రతిపదార్థం: అని+అడిగినన్= అని ధర్మరాజు అడుగగా; ఆ+పుడమి ఱేనికిన్= ఆ ధర్మరాజుతో; సరిత్+సూనుండు= నదీపుత్రుడైన భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని ధర్మరాజు భీష్ముడిని ప్రార్థించగా నదీసుతుడైన భీష్ముడు ధర్మరాజుతో ఈ విధంగా పలికాడు.

క. 'భూరమణుఁడు కాలమునకుఁ । గారణ మెట్లన్న ధర్మగతి పూర్ణత నొ
ప్పారంగ దండనీతి స । మారంభము నడపుఁ గృతయుగాగతి నధిపా! 288

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధర్మరాజా!; భూరమణుఁడు= భూమికి భర్తఅయిన రాజు; కాలమునకున్= కాలగమనానికి; కారణము+ఎట్లు+అన్నన్= ఏ విధంగా కారణ భూతుడౌతున్నా డంటే; ధర్మగతి= రాజ ధర్మవిధానం; పూర్ణతన్+ఒప్పారంగన్= సంపూర్ణమై విలసిల్లేటట్లుగా; కృతయుగ+ఆగతిన్= కృతయుగం రాకతో; దండనీతి సమారంభమున్= రాజనీతి ప్రారంభం; నడపున్= కొనసాగిస్తున్నాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజు కాలగమనానికి కారణభూతు డెట్లా అవుతున్నా డంటే, ధర్మవిధానం సంపూర్ణంగా విలసిల్లేటట్లు కృతయుగం రాకతో రాజనీతిని ప్రారంభించి కొనసాగించటంవలన మాత్రమే అని గ్రహించాలి' అని వివరించాడు.

వ. అందు. 289

తాత్పర్యం: ఆ కృతయుగంలో - (తరువాతి పద్యంతో అన్వయం).

క. ధర్మంబు పెరుఁగు వైదిక । కర్మఫలము లెసఁగు ఋతునికాయము ప్రజకున్
శర్మం బొనర్చు నాయువు । పేర్మిఁ బొరయు దున్నకయును బృథివి ఫలించున్. 290

ప్రతిపదార్థం: ధర్మంబు పెరుఁగున్= ధర్మం అభివృద్ధి చెందుతుంది; వైదిక కర్మ ఫలముల్+ఎసఁగున్= వేదాధ్యయనం, యజ్ఞయాగాది ధర్మాచరణాల ఫలితాలు అతిశయిస్తాయి; ప్రజకున్= ప్రజలకు; ఋతునికాయము= ఋతు సమూహం; శర్మంబు+ఒనర్చున్= శుభం చేకూర్చుతుంది; ఆయువు= జీవితకాలం; పేర్మిన్+పొరయున్= అతిశయమై ఒప్పుతుంది; దున్నక= దున్నకుండానే; పృథివి= భూమి; ఫలించున్= పండి పంటలిస్తుంది.

తాత్పర్యం: కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుంది. వేదాధ్యయనం, యజ్ఞయాగాది ధర్మాచరణ ఫలితాలు అతిశయిస్తుంటాయి. ప్రజలకు ఋతువు లన్నీ సంతోషాన్ని కలిగిస్తాయి. ప్రజలయొక్క ఆయువు అతిశయమై ఒప్పుతుంది. కర్షకులు దున్నకుండానే భూమి పంటలను ప్రసాదిస్తుంది.

తే. **రాజు మూఁడు భాగముల ధర్మంబు నడపుఁ । ద్రేత నమ్మెయి నది ప్రజాప్రీతి సలుపు**
ద్వాపరంబున నర్ధంబ యోపి చెల్లఁ । జేయు నక్కాల మమ్మాత్రఁ జెందు మేలు. **291**

ప్రతిపదార్థం: త్రేతన్= త్రేతాయుగంలో; రాజు; మూఁడు భాగములన్= మూడు భాగాలతో; ధర్మంబు నడపున్= ధర్మాన్ని కొనసాగిస్తాడు; ఆ+మెయిన్+అది= ఆ త్రేతాయుగంలోని పరిస్థితి ఆ విధంగా; ప్రజాప్రీతి+చలుపున్= ప్రజలకు ఆనందాన్ని చేకూరుస్తుంది; ద్వాపరంబునన్= ద్వాపరయుగంలో; అర్ధంబు+అ+ఓపి= ధర్మాన్ని రెండుపాదాలతో మాత్రమే; చెల్లన్+చేయున్= చెల్లుబడి అయ్యేటట్లు చేస్తాడు; ఆ+కాలము= ఆ ద్వాపరయుగంలో; ఆ+మాత్రన్= ఆ మాత్రమే; మేలు= మంచి; చెందున్= కలుగుతుంది.

తాత్పర్యం: త్రేతాయుగంలో రాజు ధర్మాన్ని మూడు పాదాలతో నడిపిస్తాడు. అది ప్రజలకు మిక్కిలి సంతోషాన్ని సమకూరుస్తుంది. ద్వాపరయుగంలో రాజు ధర్మాన్ని రెండు పాదాలతో నడపుతాడు. ఆ ద్వాపరయుగంలో ఆ మాత్రమే మేలు కలుగుతుంది.

క. **నరపతి ధర్మోపేక్షా । పరుఁ డగుఁ గలియుగమునందుఁ బాయును ధర్మ**
స్ఫురణ మధర్మం బెందును । బరఁగును వర్ణాశ్రమముల పథములు దప్పున్. **292**

ప్రతిపదార్థం: కలియుగము నందున్= కలియుగంలో; నరపతి= రాజు; ధర్మ+ఉపేక్షాపరుఁడు+అగున్= ధర్మం పట్ల అశ్రద్ధ వహిస్తాడు; ధర్మస్ఫురణము= ధర్మజ్ఞానం; పాయును= నశిస్తుంది; ఎందునున్= అంతటా; అధర్మంబు పరఁగును= అధర్మం వ్యాపిస్తుంది; వర్ణ+ఆశ్రమముల పథములు= నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాలకు సంబంధించిన మార్గాలు; తప్పున్= గతి తప్పుతాయి.

తాత్పర్యం: కలియుగంలో రాజు ధర్మంపట్ల శ్రద్ధ వహించడు. ధర్మజ్ఞానం క్రమంగా నశిస్తుంది. అధర్మం అంతటా వ్యాపిస్తుంది. నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాలు వాటికి సంబంధించిన పద్ధతులు క్రమంగా గతి తప్పుతాయి.

వ. **కాల ప్రభావం బిట్టిది యైనను.** **293**

తాత్పర్యం: కాలమహిమ ఇట్లాంటిది అయినప్పటికి - (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. **విభుని సకలధర్మవృత్తి నత్తఱి కృత । యుగముఁ బోలు ధర్మయుక్తి మాత్ర**
లరయ విభుల కెట్టులయ్యె నట్టి తెఱంగు । లవుల యుగములట్ల యగు నృపాల! **294**

ప్రతిపదార్థం: నృపాల!= ఓ ధర్మరాజా!; ఆ+తఱిన్= ఆ సమయంలో; విభుని సకల ధర్మవృత్తిన్= రాజుయొక్క సమస్త ధర్మ ప్రవృత్తి; కృతయుగమున్+పోలు= కృతయుగంలో వలె; ధర్మయుక్తి మాత్రలు+అరయన్= రాజనీతి విధానాన్ని పరిశీలించగా; విభులకున్= రాజులకు; ఎట్టులు+అయ్యెన్= ఏ విధంగా అయ్యాయో; అట్టి తెఱంగులు= ఆ రీతులు; అవుల యుగముల+అట్లు+అగున్= ఆ తరువాతి యుగాలలో రీతిగానే కొనసాగుతుంది.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఆయా యుగాలలో రాజనీతినిబట్టి ధర్మం కొనసాగుతుంది. కృతయుగంలో వలె రాజు ధర్మాన్ని నాలుగుపాదాల నిర్వహిస్తే అదే రీతిగా ధర్మం అభివృద్ధి చెందుతుంది. లేని పక్షంలో అంటే త్రేతా ద్వాపర కలియుగాలలో వలె క్రమంగా రాజు అనుసరించే దండనీతి ప్రకారం ధర్మం నశిస్తూ ఉంటుంది.

వ. అనుటయు నెట్టివాఁడైన విభుని శుభంబులు పొందు; ననుటయు ధర్మనందనునకు మందాకినీ నందనుం డిట్లనియె. 295

ప్రతిపదార్థం: అనుటయున్= అని భీష్ముడు చెప్పగా; ఎట్టివాఁడైన= ఎలాంటి వాడైన; విభునిన్= రాజును; శుభంబులు పొందున్= శుభములు చేకూరుతాయి; అనుటయున్= అని అడుగగా; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; మందాకినీ నందనుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఎట్లాంటి నడవడి కలిగిన రాజునకు శుభక్రమం చేకూరుతుందో తెలియజేయు'మని ధర్మరాజు ప్రార్థించగా భీష్ముడు ఇట్లా వివరించాడు.

మ. అరయుం దప్పు కృతం బెఱుంగు మదలోభావేశముల్ లే వము
ష్కరుఁ డాత్మస్తుతి లేదు చేయునియతిం గార్యంబు లీగుల్ ఘన
స్థిరముల్ శూరుఁడు గర్విగాఁడశరుఁ డస్త్రీలోలుఁ డక్రోధనుం
డరి నొవ్వం గొనఁ డ న్పొగడ్తఁ గను రా జత్యంత దీప్తుం డగున్.' 296

ప్రతిపదార్థం: రాజు= రాజు; తప్పు= తప్పును; అరయున్= పరిశీలిస్తాడు; కృతంబు+ఎఱుంగున్= చేసిన పనిని గుర్తిస్తాడు; మదలోభ+ఆవేశముల్ లేవు= మదం, పిసినారితనం, ఆవేశం మొదలైనవి కలిగి ఉండడు; అముష్కరుఁడు= దుర్మార్గుడు కానివాడు; ఆత్మస్తుతి లేదు= తనను తాను పొగడుకోడు; నియతిన్= నియమబద్ధంగా; కార్యంబులు= విధ్యుక్త ధర్మాలు; ఈగుల్= దాన ధర్మాలు; ఘన స్థిరముల్= అధికంగా పదికాలాలపాటు నిలిచేటట్లు; చేయున్= చేస్తాడు; శూరుఁడు= పరాక్రమవంతుడు; గర్విగాఁడు= గర్వం లేకుండా ఉంటాడు; అశరుఁడు= కుత్సితుడు కానివాడు; అస్త్రీలోలుఁడు= స్త్రీలౌల్యం లేనివాడు; అక్రోధనుండు= కోపంలేనివాడు; అరిన్= కప్పమును; నొవ్వన్= సామంత రాజులకు బాధకలిగేటట్లు; కొనఁడు= గ్రహించడు; అన్+పొగడ్తన్+కనున్= అనే ప్రశంసను పొందుతాడు; అతి+అంత= మిక్కిలి; దీప్తుండు+అగున్= తేజస్వంతుడై ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: రాజు ప్రజల తప్పులను పరిశీలిస్తాడు, చేసిన పనులను గుర్తిస్తాడు. మదమూ, లోభమూ, ఆవేశమూ లేనివాడు. దొంగకానివాడు, ఆత్మస్తుతి చేసికొనడు. నియమబద్ధంగా విధ్యుక్తధర్మాలను ఘనమైన దానాలను పదికాలాలు నిలిచేటట్లు నిర్వహిస్తాడు. పరాక్రమవంతుడు, నిగర్వి, కుత్సితుడు కానివాడు, పరస్త్రీలౌల్యం లేనివాడు, క్రోధరహితుడు, సామంతులను పీడిస్తూ కప్పం గ్రహించడు' అనే పొగడ్తలకు పాత్రుడైనవాడు. అట్లాంటి రాజు మిక్కిలి తేజస్సుతో ప్రకాశిస్తాడు.'

వ. అని చెప్పి వెండియు. 297

తాత్పర్యం: అని చెప్పి ఇంకా.

ఆ. 'సాంగ వేదవేది యగు పురోహితుఁ డెప్డు । నగర మెలఁగ వలయుఁ దగవుఁ గృపయుఁ
జక్కటియును గలుగు సచివునప్పనముల । నరులు నరయఁ బనుచునది విభుండు. 298

ప్రతిపదార్థం: విభుండు= రాజు; సాంగవేదవేది+అగు= అంగాలతో కూడిన వేదాలు తెలసినవాడైన; పురోహితుఁడు= బ్రాహ్మణుని; ఎప్టున్= ఎల్లప్పుడు; నగరమున్+మెలగవలయున్= పట్టణంలో ఉండేటట్లు నియమించాలి; తగవున్= సముచితమైన తీర్పు; కృపయున్= దయ; చక్కటియునున్+కలుగు= న్యాయం కలిగిన; సచివున్= మంత్రిని; అప్పనములున్= కానుకలను; అరులన్= కప్పములను; అరయన్+పనుచునది= పరిగ్రహించటానికి నియమించాలి.

తాత్పర్యం: రాజు వేదవేదాంగవేత్త అయిన పురోహితుడిని పట్టణంలో సదా ఉండేటట్లు నియమించాలి. సముచితమైన తీర్పు, దయ, న్యాయం కలిగిన అమాత్యుడిని మాత్రమే ప్రజలు ఇచ్చేకానుకలు కప్పాలు గ్రహించేటట్లుగా నియమించాలి.

క. పరుసఁదనముమెయి నరిగొనఁ । జొరఁదగ; దది పొదుఁగు గోయు చొప్పగు విను పా
ల్గురియించుకొనఁ దలంచిన । నరయవలదె గోవుఁ బ్రజయు నట్టిద యధిపా! 299

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా! విను= జాగరూకతతో వినుము; పరుసఁదనము మెయిన్= కాఠిన్యంతో; అరి+కొనన్+చొరన్+తగదు= కప్పం గ్రహించటానికి ప్రయత్నించకూడదు; అది= ఆ విధానం; పొదుఁగు+కోయు చొప్పు+అగున్= (పాలకోసం) ఆవు పొదుగు కోసినట్లవుతుంది; పాల్గురియించుకొనన్+తలంచినన్= ఆవు పొదుగునుండి పాలు పిండుకొనదలిస్తే; గోవున్= ఆవును; అరయవలదె!= జాగరూకతతో కాపాడు కొనాలి కదా!; ప్రజయున్= ప్రజానీకం కూడా; అట్టిది+అ= ఆ ఆవువంటిదే.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ప్రజలపై కాఠిన్యం వహించి కప్పం గ్రహించటానికి ప్రయత్నించకూడదు. కాఠిన్యంతో ప్రవర్తించి కప్పాన్ని గ్రహించటం పాలిస్తున్న ఆవు పొదుగును కోసిన దానితో సమానం. పాలు కావా లనుకొన్నప్పుడు ఆవును జాగ్రత్తగా రక్షించుకొనాలి కదా! అట్లాగే ప్రజలను కూడా పరిరక్షించుకొనాలి'

ఆ. కోరి తోఁటవాఁడు కుసుమ ఫలంబులు । కోయునట్లు రాజు కొనఁగవలయు
నప్పనములు; నఱికి యంగారములు చేయు । భంగి యైన భూమి పాడు గాదె? 300

ప్రతిపదార్థం: తోఁటవాఁడు= తోటమాలి; కోరి= ఇష్టపడి; కుసుమ ఫలంబులు= పుష్ప ఫలాలు; కోయునట్లు= కోసేరీతిగా; రాజు= ప్రభువు; అప్పనములు కొనఁగవలయున్= కానుకలు, కప్పాలు గ్రహించాలి; నఱికి= ఖండించి; అంగారములు చేయు భంగి+ఐనన్= నిప్పుపెట్టి బొగ్గలుగా చేసేరీతిలో ప్రవర్తిస్తే; భూమి పాడు+కాదె?= భూమి నాశనం కాదా? (అవుతుంది కదా అని భావం).

తాత్పర్యం: తోటమాలి కావలసిన పుష్పఫలాలను కోసుకొన్నట్లుగా రాజు కూడా జాగరూకుడై కప్పాలను గ్రహించాలి. అట్లా కాక ఫలపుష్పాదుల నిచ్చే చెట్లను నరికి నిప్పుపెట్టి బొగ్గలుగా చేస్తే భూమి నాశనమౌతుంది. కాబట్టి తోటమాలివలె రాజు జాగరూకుడై ప్రజలను సంరక్షిస్తూ కప్పం గ్రహించవలసి ఉంటుంది.

విశేషం: అలం: ఉపమ.

క. దయఁ బ్రజ రక్షించుటకు, నె । నయె తపములు నధ్వరములు నరవర దానన్
జయమును లక్ష్మియునుం గీ । ర్తియు సుగతియుఁ గలుగు వసుమతీనాథునకున్. 301

ప్రతిపదార్థం: నరవర!= నరులలో శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; వసుమతీ నాథునకున్= భూభర్తఅయిన రాజునకు; ప్రజన్= ప్రజలను; దయన్= దయతో; రక్షించుటకున్= సంరక్షించటంలో; తపములున్= తపస్సులు; అధ్వరములున్= యాగములు; ఎనయె?= సమానమా? (కావు); దానన్= దానివలన; జయమును= విజయమూ; లక్ష్మియున్= సంపద; కీర్తియున్= యశస్సును; సుగతియున్= ఉత్తమ గతులు; కలుగున్= ప్రాప్తిస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ప్రజలను సంరక్షించటమే రాజు ప్రధానధర్మం. కాని, ఆ రాజుచేసే తపస్సులు, యాగాలు, ప్రజలను దయతో సంరక్షించే దానితో సమానం కావు. రాజు రాజధర్మాన్ని అనుసరించి ప్రజలను సంరక్షిస్తే ఆ రాజునకు విజయంతోపాటు సంపద, కీర్తి ఉత్తమగతులు లభిస్తాయి' అని భీష్ముడు వివరించాడు.

వాయుదేవుఁడు పురూరవునకుఁ జెప్పిన రాజధర్మప్రకారము (సం. 12-73-2)

వ. విశేషించి పురోహితుం బాటింపవలయు వినుము. తొల్లి యైలుం డగు పురూరవుండు 'వసుధ విప్రక్షత్రియులం దెవ్వాని ధనంబై యుండునని వాయుదేవు నడిగిన నమ్మహాత్ముండు చతుర్ముఖుని ముఖ బాహూరు పాదంబులు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్రులకుఁ బ్రభవస్థానంబు లగుట చెప్పి యి ట్లుత్కృష్ట ప్రభవుండై సర్వ వర్ణంబులకు నీశ్వరుం డగు బ్రాహ్మణుం డీ పృథివీ ధన ధాన్యాది సమస్త వస్తువులునుం దా ననుభవింపను నొడ్లకు నొసంగను యుక్తుండు; దండనీతి ధారణంబునకు క్షత్రియుం జొనిపె బ్రాహ్మణ శాంతి పరత్వంబున క్షత్రియాధిపత్యప్రాప్తి పతిలేమి నంగన దేవరునిం బ్రతిగ్రహించినట్లున్నది; యిది భూమి తెఱంగి ట్లగుటం జేసి నిజధర్మవ్రతుండును, విద్వాంసుండును శాంతుండును నగు పురోహితునకు సర్వసంపదలును సమర్పించి జనపతి శుశ్రూషా పరుండును, నహంకార రహితుండును నై దండనీతి నయించి యుభయ లోకంబులనుం బెంపు వహించు. 302

ప్రతిపదార్థం: వినుము= ఓ ధర్మరాజా! వినుము; విశేషించి= ప్రత్యేకించి; పురోహితున్+పాటింపన్ వలయున్= బ్రాహ్మణుని గౌరవించాలి; తొల్లి= పూర్వం; ఐలుండు+అగు= ఇలా పుత్రుడైన; పురూరవుండు= పురూరవుడనే రాజు; వసుధ= ఈ భూమి; విప్ర క్షత్రియులందున్= బ్రాహ్మణ, క్షత్రియులలో; ఏ+వాని ధనంబు+ఐ+ఉండున్+అని= ఎవడి సొత్తై ఉంటుంది అని; వాయుదేవున్+అడిగినన్= వాయుదేవుడిని ప్రశ్నించగా; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడు; చతుర్ముఖుని= నాలుగు ముఖాలుగల బ్రహ్మయొక్క; ముఖ, బాహు+ఊరు పాదంబులు= ముఖం, బాహువులు, తొడలు, పాదాలు (క్రమంగా); బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకున్= బ్రాహ్మణులకు, క్షత్రియులకు, వైశ్యులకు, శూద్రులకు; ప్రభవస్థానంబులు+అగుట చెప్పి= పుట్టుక స్థానాలు కావటాన్ని వివరించి; ఇట్లు= ఈ విధంగా; ఉత్కృష్ట ప్రభవుండు+ఐ= శ్రేష్ఠమైన జన్మకలవాడై; సర్వవర్ణంబులకున్= అన్ని వర్ణాలకు; ఈశ్వరుండు+అగు బ్రాహ్మణుండు= అధిపతిఅయిన బ్రాహ్మణుడు; ఈ పృథివీ ధన ధాన్య+ఆది సమస్త వస్తువులునున్= ఈ భూమిలోని ధనమూ, ధాన్యమూ మొదలైన అన్ని వస్తువులను; తాన్+అనుభవింపను= తాను అనుభవించటానికి; ఒడ్లకున్+ఒసంగనున్= ఇతరులకు ఇవ్వటానికి; ఉక్తుండు+అగుటన్= నియమించబడి; దండనీతి ధారణంబునకున్= రాజధర్మ నిర్వహణకు; క్షత్రియున్+చొనిపెన్= క్షత్రియుడిని నియోగించాడు; బ్రాహ్మణ శాంతిపరత్వంబున్= బ్రాహ్మణుడికి సహజమైన శాంతి అందలి ఆసక్తివలన; క్షత్రియ+ఆధిపత్య ప్రాప్తి= రాజునకు అధికారం సంప్రాప్తం కావటంవలన; పతి లేమిన్= భర్త లేకపోవటం వలన; అంగన= స్త్రీ; దేవరునిన్= భర్తయొక్క సోదరుడిని; ప్రతిగ్రహించిన+అట్లు+ఉన్నది= భర్తకు బదులుగా గ్రహించినట్లున్నది; ఇది భూమి తెఱంగు= ఇది భూమి క్షత్రియులకు సంప్రాప్తించిన విధానం; ఇట్లు+అగుటన్+చేసి= ఇట్లా జరిగినందువలన; నిజ ధర్మ వ్రతుండును= తనదైన సనాతన ధర్మాన్ని పాటించేవాడు; విద్వాంసుండును= పండితుడు; శాంతుండును= ప్రశాంతమైన మనస్సు కలవాడు; అగు= అయిన; పురోహితునకున్= బ్రాహ్మణుడికి; సర్వ సంపదలును= సమస్త సంపదలను; సమర్పించి= ఇచ్చి; జనపతి= రాజు; శుశ్రూషా పరుండును= బ్రాహ్మణ సేవాసక్తుడూ; అహంకార రహితుండునున్+ఐ= అహంకారం లేనివాడై; దండనీతిన్ నయించి= దండనీతిని ప్రయోగించి; ఉభయ లోకంబులనున్= ఇహపర లోకాలు రెండింటిలో; పెంపున్ వహించున్= అభ్యున్నతిని పొందుతాడు.

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజుతో ఈ విధంగా పలికాడు - 'రాజు పురోహితుడిని గౌరవించవలసి ఉంటుంది. పూర్వం పురూరవుడు వాయుదేవుడితో బ్రాహ్మణ క్షత్రియులలో ఈ భూమి ఎవరి సొత్తని ప్రశ్నించాడు. అప్పుడు

వాయుదేవుడు పురూరవుడికి ఇట్లా వివరించాడు. 'బ్రహ్మయొక్క ముఖం, బాహువులు, తొడలు, పాదాల నుండి బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు జన్మించారు. ఉత్తమాంగంలో జన్మించిన బ్రాహ్మణుడు అన్ని వర్ణాలకు ఈశ్వరుడివంటివాడు. ఈ భూమిపై ఉన్న ధనధాన్యాది సమస్తవస్తువులను తా ననుభవిస్తూ ఇతరులకు ఇవ్వటానికి అర్హు డయ్యాడు. ఆ బ్రాహ్మణుడు దండనీతిని ధరించటానికి క్షత్రియుడిని నియోగించాడు. బ్రాహ్మణుడు సహజంగా శాంత్యనురక్తుడు కావటంవలన క్షత్రియుడు రాజ్యాన్ని పొందటం భర్త లేని స్త్రీ భర్తయొక్క సోదరుడిని ప్రతిగ్రహించినట్లుగా ఉన్నదని తెలిపాడు. ఇదిభూలోకంలోని క్షత్రియుల విధానం. తన సనాతనధర్మాన్ని సంరక్షిస్తున్నవాడు, విద్వాంసుడు, శాంతుడు అయిన పురోహితుడికి సమస్తసంపదలను సమర్పించి, బ్రాహ్మణుడికి సేవచేస్తూ అహంకారరహితుడై దండనీతిని ప్రయోగించే రాజు ఇహపరలోకాలలో ఉత్తమ గతులను పొందుతాడు.

విశేషం: అలం: ఉపమ.

క. రస గంధాద్యనుభవములు । పొసఁగవు భీతమగు చిత్తమున భయముం బా
ప సమర్థుఁడు కావున నృపుఁ । డసమానప్రభుతఁ బొందు నవనీనాథా! 303

ప్రతిపదార్థం: అవనీ నాథా!= భూ భర్త అయిన ఓ ధర్మరాజా!; రసగంధ+ఆది+అనుభవములు= రుచి, వాసన మొదలైన అనుభూతులు; పొసఁగవు= ఒప్పవు; భీతము+అగు చిత్తమునన్= భయభ్రాంత మైన మనసునందు; భయమున్+పాపన్= భయాన్ని తొలగించటానికి; సమర్థుఁడు= సామర్థ్యం కలవాడు; కావునన్= కాబట్టి; నృపుఁడు= రాజు; అసమాన ప్రభుతన్+పొందున్= సాటిలేని అధికారాన్ని పొందుతాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! రాజునకు రుచి వాసన మొదలైన అనుభూతులు పనికిరావు. భయపడ్డవారి భయాన్ని తొలగించటానికి రాజు సమర్థుడు. అందువలననే సాటిలేని అధికారాన్ని రాజు సంపాదించుకొంటాడు.'

క. అని వాయుదేవుఁ డి ట్లు । జ్జనపతి బోధించె ననుడు శాంతనవున క
మ్మనుజపతి యిట్టు లను 'నే । పనులఁ బురోహితుఁడు మాన్యభావము నొందున్?' 304

ప్రతిపదార్తం: అని ఇట్లు= అని ఈ విధంగా; వాయుదేవుఁడు= వాయుదేవుడు; ఆ+జనపతి= ఆ పురూరవుడికి; బోధించెన్= ప్రబోధించాడు; అనుడున్= అని చెప్పగా; శాంతనవునకున్= భీష్ముడికి; ఆ+మనుజపతి= ఆ నరపతి అయిన ధర్మరాజు; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నాడు; ఏ పనులన్= ఏ పనులతో; పురోహితుఁడు= బ్రాహ్మణుడు; మాన్యభావమున్+ఒందున్?= గౌరవభావాన్ని పొందుతాడు?.

తాత్పర్యం: అని వాయుదేవుడు పురూరవుడికి తెలిపినట్లు భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు. అప్పుడు 'ఏ ఉత్తమ కార్యాచరణ వలన బ్రాహ్మణుడు గౌరవభావాన్ని పొందుతాడో తెలుపవలసిం'దని ధర్మరాజు భీష్ముడిని ప్రార్థించాడు.

వ. అనిన నా ధర్మతనయుతో నద్దేవవ్రతుండు 'పురోహిత విషయంబులుగా శుక్రుండు చెప్పిన వాక్యంబులు గల వుపన్యసించెద నాకర్ణింపు'మని యిట్లనియె. 305

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ ధర్మతనయుతోన్= ఆ ధర్మరాజుతో; ఆ+దేవవ్రతుండు= ఆ భీష్ముడు; పురోహిత విషయంబులుగాన్= పురోహిత విషయమై; శుక్రుండు= శుక్రాచార్యుడు; చెప్పిన వాక్యంబులు+కలవు= చెప్పిన మాటలు ఉన్నాయి; ఉపన్యసించెదన్= ప్రసంగిస్తాను; ఆకర్ణింపుము= వినుము; అని+ఇట్లు+అనియెన్= అని ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని పైవిధంగా భీష్ముడు ధర్మరాజుతో చెప్పి, మళ్ళీ శుక్రాచార్యుడు పురోహితవిషయంగా చెప్పిన వాక్యాలను వివరిస్తా ననీ జాగరూకతతో వినవలసిం దనీ భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

తే. 'అమర గరుడ గంధర్వ విద్యాధరాది । దివ్యులకు నధ్వరంబులఁ దృప్తి సేసి
పరమ శుభములఁ బొందు భూవరుఁడు; దాని । కెల్ల మూలంబు దగు పురోహితుని బుద్ధి. 306

ప్రతిపదార్థం: భూవరుఁడు= భూమికి భర్త అయిన రాజు; అమర, గరుడ, గంధర్వ విద్యాధర+ఆది= దేవతలు, గంధర్వులు, విద్యాధరులు మొదలైన; దివ్యులకున్= దేవలోకంలో నివసించేవారికి; అధ్వరంబులన్= యజ్ఞయాగాదులచేత; తృప్తి+చేసి= సంతృప్తి కలుగజేసి; పరమశుభములన్+పొందున్= శ్రేష్ఠమైన శుభాలను పొందుతాడు; దానికిన్+ఎల్లన్= దానికంతటికీ; మూలంబు= హేతువు; తగు= అర్హుడైన; పురోహితుని బుద్ధి= పురోహితుడియొక్క ఆలోచనాబలం.

తాత్పర్యం: రాజు తా నాచరించే యజ్ఞయాగాదులచేత అమరులు, గరుడ, గంధర్వ, విద్యాధరులు మొదలైన సమస్త దేవలోకవాసులకు సంతృప్తి కలిగించే అత్యంత శ్రేష్ఠమైన శుభపరంపరను పొందుతాడు. దీని కంతటికీ పురోహితుడి బుద్ధి మూలకారణం.

క. రక్షః పిశాచ గుహ్యక । యక్షాదులు బాధవెట్టు నవనీనాథున్
దక్ష పురోహిత మంత్ర సు । రక్షా సంస్కారవిధి విరహితుం డైనన్. 307

ప్రతిపదార్థం: దక్ష= సమర్థుడైన; పురోహిత= పురోహితుడియొక్క; మంత్ర= మంత్రాలచేత; సురక్షా= శ్రేష్ఠమైన సంరక్షణతో కూడిన; సంస్కార విరహితుండు+ఐనన్= సంస్కారం లేనివాడైతే; అవనీనాథున్= భూ భర్తఅయిన రాజును; రక్షః పిశాచ గుహ్యక యక్ష+ఆదులు= రాక్షసులు, పిశాచులు, గుహ్యకులు, యక్షులు మొదలైన వాళ్ళు; బాధ+పెట్టున్= బాధిస్తూ ఉంటారు.

తాత్పర్యం: సమర్థుడైన పురోహితుడియొక్క మంత్రాదులచేత శ్రేష్ఠమైన సంరక్షణతో కూడిన సంస్కారం లేకుండా పోయిన రాజును రాక్షసులు, పిశాచులు, గుహ్యకులు, యక్షులు మొదలైనవాళ్ళు పీడిస్తారు.

క. వివిధోత్పాతంబులకున్ । నవళులలోఁ దోఁచు కీడునకుఁ దోడ్తో శాం
తి విధానంబున నిరసన । మవును బురోహితునిచేత ననవద్యముగన్. 308

ప్రతిపదార్థం: వివిధ+ఉత్పాతంబులకున్= అనేక విధాలైన అపశకునాలకు; నవళులలోన్+తోఁచు= అంతఃపురాలలో సంభవించే; కీడునకున్= అశుభానికి; తోడ్తోన్= వెనువెంటనే; అనవద్యముగన్= తిరుగులేకుండా; పురోహితునిచేతన్= పురోహితుడిచేత; శాంతి విధానంబునన్= శాంతికొరకు చేసే పనులవలన; నిరసనము+అవును= నివారణ జరుగుతుంది.

తాత్పర్యం: అనేకమైన ఉత్పాతాలకు, అంతఃపురాలలో సంభవించే అశుభాలకూ పురోహితుడి తిరుగులేని శాంతి కార్యాలవలన అశుభాల నివారణ జరుగుతుంది.

విశేషం: ఉత్పాతం, అపశకునం, ఇది మూడు విధాలు: దివ్యం (అపూర్వ నక్షత్రాదుల పుట్టుక); అంతరిక్షం: (పరివేషం, ఇంద్రధనుస్సు ఏర్పడటం, పిడుగులు పడటం); భౌమం: (దుఃఖరోగ ప్రదాలైన అపూర్వమైన చరాచర వస్తువులు కలగటం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఈ వాక్యంబులం దాత్పర్యంబు గలుగుము. బృహస్పతియును శాంతికంబును బౌష్టికంబును శత్రునాశంబును మంత్రాఢ్య పురోహిత సాధ్యంబు లనియెం గావున నీవును సంభావితపురోహితుండ వగుము. 309

ప్రతిపదార్థం: ఈ వాక్యంబులన్+తాత్పర్యంబు+కలుగుము= ఈ పైన చెప్పిన మాటలయందు జాగరూకత వహించుము; బృహస్పతియును= బృహస్పతి సైతం; శాంతికంబును= శాంతిని ప్రసాదించటానికి చేసే శాంతి కర్మలు; పౌష్టికంబును= పుష్టిని కలిగించే పౌష్టిక కర్మలు; శత్రునాశంబును= విరోధుల వినాశనమూ; మంత్ర+ఆఢ్య= మంత్రాలచేత సంపన్నుడైన; పురోహిత సాధ్యంబులు+అనియెన్= పురోహితుడి వలననే సాధ్యమవుతుందని చెప్పాడు; కావునన్+ఈవును= కనుక నీవు కూడా; సంభావిత పురోహితుండవు+అగుము= గౌరవించబడిన పురోహితుడిని కలవాడవు కమ్ము.

తాత్పర్యం: 'పురోహిత ప్రాధాన్యాన్ని గూర్చి చెప్పిన మాటలను జాగరూకతతో గ్రహించుము. శాంతి పౌష్టిక కార్యాలూ, శత్రువినాశనమూ మంత్రవేత్త అయిన ఉత్తమ పురోహితుడివలననే సాధ్యమవుతుందని బృహస్పతి సైతం వక్కాణించాడు. కాబట్టి నీవు కూడా ఉత్తమపురోహితుడిని చేరదీసి, గౌరవించి, అతడివలన సమస్త శుభాలను పొందుము'.

క. పరిశుద్ధి లేని కుత్సిత । పురోహితులు నీచదశలఁ బొందుదురు మహీ
వర! యల్పమె శుద్ధుండై । పురోహితత్వంబు సేఁత భూపతినగరన్. 310

ప్రతిపదార్థం: మహీవర!= భూ భర్తవైన ఓ ధర్మరాజా!; పరిశుద్ధి లేని= శ్రేష్ఠమైన చిత్తం లేని; కుత్సిత పురోహితులు= నీచులైన పురోహితులు; నీచదశలన్+పొందుదురు= నీచస్థితిని పొందుతారు; భూపతినగరన్= రాజాంతఃపురంలో; శుద్ధుండు+ఐ= పరి శుద్ధాత్ముడై; పురోహితత్వంబు+చేఁత= పౌరోహిత్యం నెరపటం; అల్పమే?= కొంచెపు పని కాదు కదా!

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! శ్రేష్ఠమైన చిత్తశుద్ధి లేని కుత్సితులైన పురోహితులు నీచస్థితికి జారిపోయి నాశనమవుతారు. కాని, రాజాంతఃపురాలలో పరిశుద్ధాత్ముడై పురోహితుడు పౌరోహిత్యం నెరపటం అంత తేలిక పని కాదు.

క. ఆరోగ్యము గల యుత్తముఁ । బౌరోహిత్యంబు నడపఁ బనుచునది ధరి
త్రీ రమణుఁ డతఁడు దాను స । మారంభము లెల్ల నేకమతి గను టొప్పున్. 311

ప్రతిపదార్థం: ధరిత్రీ రమణుఁడు= భూమికి భర్త అయిన రాజు; ఆరోగ్యము+కల= పూర్ణారోగ్యవంతుడైన; ఉత్తమున్= శ్రేష్ఠుడిని; పౌరోహిత్యంబు నడపన్+పనుచునది= పౌరోహిత్యం నిర్వహించటానికి ఆజ్ఞాపించవలసి ఉన్నది; అతఁడు+తానున్= ఆ పురోహితుడూ, రాజూ; సమ్+ఆరంభములు+ఎల్లన్= అన్ని ఉత్తమమైన ఆరంభసమయాలలోనూ; ఏకమతిన్+కనుట+ఒప్పున్= ఒకే బుద్ధితో పరిశీలించటం ఎంతైనా మంచిది.

తాత్పర్యం: రాజు జాగరూకుడై, పౌరోహిత్యం నెరపటానికి సంపూర్ణారోగ్యవంతుడైన వాడిని మాత్రమే పురోహితుడిగా నియమించాలి. ఆ రాజూ, పురోహితుడూ ఏకమనస్కులై సమస్త శుభకార్యాలలోనూ సమదృష్టి కలిగి మసలుకొనటం ఎంతైనా అవసరం.

క. బ్రహ్మ క్షత్త్రము లొంది, య । జిహ్మములై కృత్యములు విశిష్టత నడపన్
బ్రహ్మాదులు హర్షింతురు; । బ్రాహ్మణ ముఖ వర్ణసమితి ప్రమదముఁ బొందున్. 312

ప్రతిపదార్థం: బ్రహ్మ క్షత్త్రములు+ఒంది+అజిహ్మములు+ఐ= బ్రాహ్మణ క్షత్రియులు పొందుపడి సరిసమానులై; కృత్యములు= రాజ్యకార్య కలాపాలు; విశిష్టతన్ నడపన్= శ్రేష్ఠమైన రీతిని నిర్వహిస్తే; బ్రహ్మ+ఆదులు= బ్రహ్మ మొదలుకొని సమస్త దేవతలు; హర్షింతురు= సంతోషిస్తారు; బ్రాహ్మణ ముఖ వర్ణ సమితి= బ్రాహ్మణులు మొదలుకొని సమస్త వర్ణాల సమూహం; ప్రమదమున్+పొందున్= అత్యంత సంతోషాన్ని పొందుతుంది.

తాత్పర్యం: బ్రాహ్మణ క్షత్రియులు అన్యోన్యులై అనుకూలంగా, సరైన మార్గంలో రాజ్య కార్యకలాపాలను నిర్వర్తిస్తే, బ్రహ్మమొదలుకొని సమస్త దేవతలు, బ్రాహ్మణులు మొదలుకొని సమస్త వర్ణాలవారు మిక్కిలి సంతోషిస్తారు.

వ. ఈ యర్థంబునం దైల కశ్యప సంవాదంబను నితిహాసంబు కలదు; వినుమైలుండు గశ్యపుని బ్రహ్మక్షత్త్రప్రకారం బడిగిన నమ్మనుజపతికి నమ్మునీంద్రుం డిట్లనియె. 313

ప్రతిపదార్థం: ఈ+అర్థంబునందున్= ఈ బ్రాహ్మణ క్షత్రియుల పరస్పర అన్యోన్యతను గూర్చిన విషయంలో; ఐల కశ్యప సంవాదంబు+అను= ఐలుడు కశ్యప ప్రజాపతి అనేవారిద్దరి మధ్య జరిగిన సంభాషణమనే; ఇతిహాసంబు+కలదు= పూర్వకథ ఒకటి ఉన్నది; వినుము= జాగరూకతతో వినుము; ఐలుండు+కశ్యపునిన్= ఐలుడు కశ్యప ప్రజాపతితో; బ్రహ్మ క్షత్త్ర ప్రకారంబు+అడిగినన్= బ్రాహ్మణ క్షత్రియుల సంబంధాన్ని గూర్చి ప్రశ్నించగా; ఆ+మనుజపతికిన్= ఆ ఐలుడనే మహారాజుకు; ఆ+ముని+ఇంద్రుండు= ఆ మహర్షి సత్తముడైన కశ్యప ప్రజాపతి; ఇట్లు+అనియెన్= ఇట్లా వివరించాడు.

తాత్పర్యం: ఐల కశ్యపప్రజాపతి సంవాదంలో బ్రాహ్మణ క్షత్రియుల సంబంధానికి సంబంధించిన ఒక పూర్వ కథ ఉన్నది. ఆ కథ చెబుతాను వినుము. బ్రాహ్మణ క్షత్రియుల మధ్య ఉండే సంబంధాన్ని ఐలుడు అడుగగా కశ్యపప్రజాపతి ఈ విధంగా చెప్పాడు.

ఆ. 'క్షత్త్రమునకుఁ బుట్టఁగాఁ బట్టు బ్రహ్మంబు। బ్రాహ్మణునకు యోని రాజు గాన
యుభయ వర్ధనంబు నొండొంటి విడువమి। వెలుఁగు రెండు మాయు విడిచెనేని. 314

ప్రతిపదార్థం: క్షత్త్రమునకున్= క్షాత్రానికి (రాజుకు); పుట్టన్+కాన్+పట్టు బ్రహ్మంబు= పుట్టుక స్థానం బ్రాహ్మణుడు; బ్రాహ్మణునకున్= బ్రాహ్మణుడికి; యోని రాజు= జననస్థానం రాజు; కానన్= అందుచేత; ఉభయ వర్ధనంబున్= బ్రాహ్మణ క్షత్రియుల అభివృద్ధి; ఒండొంటిన్= ఒకటినొకటి అంటే బ్రాహ్మణ క్షత్రియులు పరస్పరం; విడువమిన్ వెలుఁగున్= వదలకుండటం వలననే ప్రకాశిస్తాయి; విడిచెన్+ఏని= పట్టువదలితే; రెండు మాయున్= బ్రాహ్మణ క్షత్రియ వర్ణాలు రెండూ నశిస్తాయి.

తాత్పర్యం: క్షత్రియుడికి పుట్టుక స్థానం బ్రాహ్మణుడు. బ్రాహ్మణుడికి జననస్థానం రాజు. అందుచేత బ్రాహ్మణ క్షత్రియ వర్ణాలు రెండూ పరస్పర ఆధారాధేయాలు కావటంవలన ఆ రెండు వర్ణాలు కలిసి సముచిత కార్యకలాపాలు నెరపినప్పుడే అభ్యున్నతితో ప్రకాశిస్తాయి. లేదా పట్టువదలితే పరస్పరం వినాశనమౌతాయి.

క. తమలోనఁ బొందుగల వి। ప్రమహీశులఁ బ్రజయుఁ బొదువుఁ బ్రజచే మాన్య
త్వము వడయఁగ నేరరు భే। దము గలిగిన నలఁతు రొలసి దస్యులు ప్రజలన్. 315

ప్రతిపదార్థం: తమలోనన్+పొందు+కల= క్షత్రియులూ బ్రాహ్మణులూ తమలో తాము అరమరికలు లేకుండా కలసి ఉంటే; విప్ర= బ్రాహ్మణులను; మహీ+ఈశులన్= రాజులను; ప్రజయున్+పొదువున్= ప్రజలు సైతం కలసి మెలసి ఉంటారు; భేదము+కలిగినన్= బ్రాహ్మణ క్షత్రియులలో విభేదం ఏర్పడితే; ప్రజచేన్= ప్రజలచేత; మాన్యత్వము+పడయఁగన్ నేరరు= గౌరవం పొందలేరు; ప్రజలన్= అప్పుడు ప్రజలను; దస్యులు= దొంగలు; ఒలసి= కదిసి (చుట్టుముట్టి ఎదుర్కొని); నలఁతురు= విసిగిస్తారు (పీడిస్తారు).

తాత్పర్యం: బ్రాహ్మణ క్షత్రియులు పరస్పరం అరమరికలు లేక కలసి మెలసి ఉంటే ప్రజలు గౌరవిస్తారు. వాళ్ళలో విభేదం ఉంటే మాత్రం అట్లాంటి బ్రాహ్మణ క్షత్రియుల పట్ల ప్రజలకు ఏ మాత్రం గౌరవం ఉండదు. ఇది అదనుగా గ్రహించి దొంగలు ప్రజలను పీడిస్తారు.

తే. అట్టి దశఁ బుట్టు రుద్రుని యలుక దాన । సకలమునకు వినాశంబు సంభవిల్లుఁ
గాన యెల్ల విధంబులఁ గలసి యుండ । వలయు నృపుఁడుఁ బురోధయు వసుమతీశ! 316

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= భూమికి భర్త అయిన ఓ ధర్మరాజా!; అట్టి దశన్= బ్రాహ్మణ క్షత్రియులకు అన్యోన్యత లేని సమయంలో; రుద్రుని+అలుక పుట్టున్= రుద్రదేవుడికి కోపం కలుగుతుంది; దానన్= ఆ రుద్రదేవుడి ఆగ్రహం వలన; సకలమునకున్= సమస్త ప్రపంచానికీ; వినాశంబు సంభవిల్లున్= విధ్వంసం కలుగుతుంది; కాన= అందుచేత; ఎల్ల విధంబులన్= అన్ని విధాలా; నృపుఁడున్+పురోధయున్= రాజూ, బ్రాహ్మణుడూ; కలసి+ఉండవలయున్= కలసి మెలసి ఉండటమే సముచితం.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! బ్రాహ్మణ క్షత్రియులకు అన్యోన్యత లేని సమయంలో రుద్రదేవునికి కోపం కలుగుతుంది. ఆయన ఆగ్రహంవలన సమస్తప్రపంచానికీ నాశనం కలుగుతుంది. అందువలన రాజూ, బ్రాహ్మణుడూ కలిసి మెలసి ఉండటమే సర్వవిధాలా సముచితం.

క. వినుము విశేషించి జనన । జనితోన్నతి విప్రుఁ డతని జనపతి వినయం
బున నడపవలయు దానను । మనుగడ యిరువురకుఁ బ్రజకు మహనీయ మగున్.' 317

ప్రతిపదార్థం: వినుము= సావధానుడవై వినుము; విశేషించి= ప్రత్యేకించి; జనన జనిత+ఉన్నతి విప్రుఁడు= పుట్టుకలోను, పుట్టిన దానిలోను బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు; జనపతి= రాజు; అతనిన్= ఆ బ్రాహ్మణుడి పట్ల; వినయంబునన్= మిక్కిలి వినమ్రతతో (భయ భక్తులతో); నడపవలయున్= జీవితయాత్ర సాగించాలి; దానను= ఆ విధంగా రాజు బ్రాహ్మణుడి పట్ల వినయంతో నడిపిస్తే; ఇరువురకున్+ప్రజకున్= బ్రాహ్మణ క్షత్రియులు ఇద్దరికీ ప్రజలకూ; మనుగడ= జీవితయాత్ర; మహనీయము+అగున్= మహోన్నతమై ఒప్పుతుంది.

తాత్పర్యం: పుట్టుకవలన, పుట్టిన తరువాత ఔన్నత్యం కారణంగా కూడా బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు. అందువలన రాజు బ్రాహ్మణుడి పట్ల వినయవినమితగాత్రుడై తన జీవితయాత్రను సాగించాలి. ఆ విధంగా గౌరవించటంవలన రాజుకూ, బ్రాహ్మణుడికీ దానివలన ప్రజలకూ జీవనయాత్ర మహోన్నత మౌతుంది.'

కుబేరునకు ముచుకుందునకుఁ గలిగిన సంవాదము (సం. 12-75-3)

వ. అని చెప్పి పురోహితుని విశేషంబు ముచుకుందుం డను రాజునకు వైశ్రవణునకుం గలిగిన సంవాదంబునఁ బ్రకటం బయ్యెః నత్తెఱం గెఱింగించెద. 318

ప్రతిపదార్థం: అని చెప్పి= అని బ్రాహ్మణ క్షత్రియుల సంబంధాన్ని పై రీతిలో చెప్పి; పురోహితుని విశేషంబున్= పురోహితుడియొక్క విశిష్టతను; ముచుకుందుండు+అను రాజునకున్= ముచుకుందు డనే రాజుకు; వైశ్రవణునకున్+కలిగిన= విశ్రవసుడి పుత్రుడైన వైశ్రవణునకు అంటే కుబేరునకు కలిగిన; సంవాదంబునన్= సంభాషణవలన; ప్రకటంబు+అయ్యెన్= స్పష్టమైనది; ఆ+తెఱంగు+ఎఱింగించెదన్= ఆ పద్ధతినంతటినీ వివరిస్తాను.

తాత్పర్యం: బ్రాహ్మణ క్షత్రియులు అన్యోన్యంగా ఉంటూ రాజు బ్రాహ్మణుడిని గౌరవించటమే మంచి' దని తెలిపి, ఇంకా పురోహితుడి విశిష్టతను వివరించే ముచుకుంద మహారాజుకూ కుబేరుడికీ జరిగిన సంవాదంలో వెల్లడైన తీరును వివరిస్తాను వినుమని భీష్ముడు ధర్మరాజునకు తెలిపాడు.

మ. వినుమారాజు సమస్త దిగ్విజయమున్ విస్ఫూర్తిమైఁ జేసి, తాఁ
దన లా వారయు బుద్ధి వైశ్రవణు మీఁదం బోవ నాతండు దై
త్యనికాయంబులఁ బంచినం దెరువునం దత్సైన్యముల్ రాజు మూఁ
క నతి క్షుభ్యము గాఁగఁ జేయుటయు స్రుక్కంబడ్డ చిత్తంబుతోన్. 319

ప్రతిపదార్థం: వినుము= ఓ ధర్మరాజా! వినుము; ఆ రాజు= ఆ ముచుకుందు డనే రాజు; విస్ఫూర్తిమైన్= మిక్కిలి పరాక్రమంతో దేదీప్యమానంగా; సమస్త దిక్+విజయమున్= అన్ని దిక్కుల విజయాన్ని; చేసి= సాధించి; తాన్+తనలావు+ఆరయు బుద్ధిన్= ఆ ముచుకుందుడు తన పరాక్రమాన్ని తెలిసికొనాలనే బుద్ధితో; వైశ్రవణు మీఁదన్+పోవన్= కుబేరుడిపై యుద్ధానికి పోగా; ఆతండు= ఆ కుబేరుడు; దైత్యనికాయంబులన్= రాక్షస సమూహాలను; పంచినన్= యుద్ధానికి వెళ్ళండని ఆజ్ఞాపించగా; తెరువునన్= మార్గమధ్యంలోనే; తద్+సైన్యముల్= ఆ కుబేరుడు పంపిన దైత్య సేనలు; రాజు మూఁకన్= ముచుకుందుడనే రాజు సైన్య సమూహాలను; అతి క్షుభ్యము+కాఁగన్= మిక్కిలి సంక్షోభం చెందేటట్లు; చేయుటయున్= బాధించగా; స్రుక్కన్+పడ్డ చిత్తంబుతోన్= కలత చెంది మూర్ఛపడ్డ మనసుతో.

తాత్పర్యం: 'ధర్మరాజా! సావధానంగా వినుము. ముచుకుంది డనే రాజు అన్ని దిక్కుల విజయాన్ని సాధించి తన పరాక్రమాన్ని పరీక్షించుకొనదలచి, కుబేరుడిపై కయ్యానికి కాలుదువ్వాడు. కుబేరుడు దైత్యసైన్యాల ననేకం పంపగా ఆ సైన్యాలు మార్గమధ్యంలోనే ముచుకుందుడి సైన్యాన్ని మట్టికరిపించి సంక్షోభింపజేశాయి. సంక్షుభిత మనస్కుడైన ముచుకుందుడు - (తరువాతి పద్యంతో అన్వయం).

క. నృపతి పురోహితు దూఱినఁ । దపముల మంత్రముల దేవతాపూజల వీ
ర్యపటుత్వ మతని సేనకు । నపరిమితము సేసె నమ్మహాత్ముం డధిపా! 320

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధర్మరాజా!; నృపతి= ఆ ముచుకుందుడనే రాజు; పురోహితున్ దూఱినన్= తన పురోహితుడిని నిందించగా; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడైన పురోహితుడు; తపములన్= తపస్సులచేత; మంత్రములన్= మంత్రాలచేత; దేవతాపూజలన్= దైవ పూజాదికాలచేత; అతని సేనకున్= ఆ ముచుకుందుడి సైన్యానికి; వీర్య పటుత్వము= పరాక్రమ తీక్ష్ణతను; అపరిమితము+చేసెన్= సాటిలేనంతగా ప్రసాదించాడు.

తాత్పర్యం: ఓటమి చవిచూసిన ముచుకుంది డనే రాజు తన పురోహితుడిని నిందించాడు. వెంటనే ఆ పురోహితుడు ఘోర తపస్సువలన, మహిమాన్విత మంత్రాల వలన, దైవపూజల మూలాన ముచుకుందుని సైన్యాలకు అత్యంత పరాక్రమ పటుత్వాన్ని ప్రసాదించాడు.

విశేషం: ఇక్కడ పురోహితుడి మహిమాన్విత శక్తి సామర్థ్యాలూ, అట్లాంటి పురోహిత విరహితంగా రాజు కొనసాగలే డనీ, పురోహిత మహిమ చేతనే రాజు విశిష్టుడు అవుతాడనీ సోదాహరణంగా నిరూపితం. అందువలనే ఈ కథ ఉదాహరించబడింది.

ఆ. బ్రహ్మశక్తిఁ బేర్చి రాజు సైన్యము దైత్య । సేన బడలు వడఁగఁ జేయ నాతఁ
డతి రయమున ముట్టె నలకఁ గుబేరుండు । ననికి వెడలె నిజ బలాన్వితముగ. 321

ప్రతిపదార్థం: బ్రహ్మశక్తిన్+పేర్చి= బ్రాహ్మణుడి యొక్క శక్తి వలన అతిశయించి; రాజు సైన్యము= ముచుకుందుడనే రాజుయొక్క సైన్యం; దైత్యసేన= కుబేరుడు పంపిన దైత్యసైన్యాన్ని; బడలు+పడఁగన్+చేయన్= బలహీనపడేటట్టు చేయగా; ఆతఁడు= ఆ ముచుకుందుడు; అతి రయమునన్= మిక్కిలి వేగంతో; ముట్టెన్= ఎదుర్కొన్నాడు; కుబేరుండు= కుబేరుడు; అలుకన్= కోపంతో; నిజబల+అన్వితముగన్= తన సైన్యాలతో కూడి; అనికి వెడలెన్= యుద్ధానికి వెళ్ళాడు.

తాత్పర్యం: బ్రాహ్మణుడి తపస్సు, మంత్రపూత దైవపూజాదికాలవలన పొందిన శక్తిచేత ముచుకుందుడి సైన్యం కుబేరుడి సైన్యాలను బలహీనపరిచేటట్లు ముచుకుందుడు తన సైన్యాలను పురికొల్పాడు. అందుకు ఆగ్రహించిన కుబేరుడు తన సైన్యసమూహాలతో ముచుకుందుడి సైన్యాలను ఎదుర్కొన్నాడు.

వ. వెడలి సమరంబు సేయు సమయంబునం గిన్నరేశ్వరుం డన్నరేశ్వరు నాలోకించి. 322

ప్రతిపదార్థం: వెడలి= కుబేరుడు యుద్ధానికి వెళ్ళి; సమరంబు+చేయు సమయంబునన్= యుద్ధం చేసే సమయంలో; కిన్నర+ఈశ్వరుండు= కిన్నరులకు అధిపతిఅయిన కుబేరుడు; ఆ+నర+ఈశ్వరున్+ఆలోకించి= ఆ ముచుకుందుడనే రాజును చూచి.

తాత్పర్యం: కుబేరుడు యుద్ధభూమికి వెళ్ళి యుద్ధం చేస్తున్న సమయంలో ముచుకుందుడిని చూచి - (తరువాతి పద్యంతో అన్వయం).

శా. 'దక్షుం డై తిటు బ్రహ్మశక్తిన భవద్బాహా విలాసం బమి
త్రక్షోభం బొనరించెనే?' యనుడు నాతం డిట్లు 'నీ వంటి బ్ర
హ్మ క్షత్రంబుల కేక యోని జననం బ వ్వేధ గల్పించె; యో
గ క్షేమాకలనంబు సంగతములై కావింపఁ బంపండొకో! 323

ప్రతిపదార్థం: ఇటు= ఈ విధంగా; బ్రహ్మశక్తిన్= బ్రాహ్మణశక్తి మూలంగానే; దక్షుండు+ఐతి(వి)= పరాక్రమ సంపన్నుడ వయ్యావు; భవత్+బాహా విలాసంబు= నీ యొక్క బాహు పరాక్రమం; అమిత క్షోభంబు+ఒనరించెనే?= శత్రువులకు సంక్షోభం కలిగించగలదా?; అనుడున్= అని పలుకగా; ఆతండు= ఆ ముచుకుందుడు; ఇట్లు= ఈ రీతిగా; నీవంటి= నీవంటి; బ్రహ్మ క్షత్రంబులకున్= బ్రాహ్మణ క్షత్రియులకు; ఏకయోని జననంబు= ఒకే జనన స్థానంలో పుట్టుకను; ఆ+వేధ కల్పించెన్= ఆ బ్రహ్మ సృజించాడు; యోగక్షేమ+ఆ కలనంబున్= ఆ బ్రహ్మ పరస్పర యోగక్షేమాల సంబంధాన్ని; సంగతములు+ఐ= ఒప్పిదమయ్యేటట్లు; కావింపన్+పంపండొకో!= చేయగా పంపడా?

తాత్పర్యం: 'ఓ ముచుకుంద మహారాజా! బ్రహ్మతేజశ్శక్తి మూలాన్నే నీకు ఇంతటి అపూర్వ పరాక్రమసామర్థ్యాలు ఒనగూడి, విజృంభించావు గానీ నీకు మామూలుగా ఇంతటి సామర్థ్య మేదీ?' అని కుబేరుడు అధిక్షేపించాడు. అప్పుడు ఆ ముచుకుందుడు ఇట్లా సమాధానం చెప్పాడు. 'బ్రహ్మక్షత్రాలకు ఒకే తేజోరాశిని బ్రహ్మదేవుడు అనుగ్రహించాడు. కనుకనే బ్రాహ్మణక్షత్రియుల యోగక్షేమాల సంబంధంగా ఆ బ్రహ్మ ఉపేక్షించి ఎట్లా ఉండగలడు?; తప్పకుండా ఆ బ్రహ్మ తగిన రీతిలోనే నా విషయంలో అనుగ్రహించాడు' అని వివరించాడు.

వ. అనుటయు ధనదుండు సాంత్వన స్వరంబున. 324

ప్రతిపదార్థం: అనుటయున్= అని ముచుకుందుడు చెప్పగా; ధనదుండు= కుబేరుడు; సాంత్వన స్వరంబునన్= అనునయ పూర్వకమైన కంఠంతో.

తాత్పర్యం: ముచుకుందుడు సమాధానం చెప్పగా విన్న కుబేరుడు అనునయంతో కూడిన మాటలతో - (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'నాకును నీకు నేటికి రణం బొనరింపఁగ నేను బంప నీ
వేక ముఖంబుగా ధరణి యేలుము' నావుడు నవ్వి యవ్విభుం
'డీ కుపతిత్వ మొల్ల నొరు నీగి మహత్త్వకరంబె విద్విష
ద్భీకర మద్భుజార్జితమ పెంపొనరంగ భుజింతు దిక్పతీ! 325

ప్రతిపదార్థం: నాకును నీకున్= నాకూ నీకూ (కుబేరుడికీ ముచుకుందుడికీ); రణంబు+ఒనరింపఁగన్+ఏటికిన్= యుద్ధం చెయ్యట మెందుకు?; ఏను+పంపన్= నేను ఆజ్ఞాపించగా; ఈవు+ఏకముఖంబుగాన్= నీవే స్వతంత్రంగా; ధరణి+ఏలుము= రాజ్యాన్ని పాలించుము; నావుడున్= అని కుబేరుడు అనగా; ఆ+విభుండు= ఆ ముచుకుందు డనే రాజు; నవ్వి= పరిహాస పూర్వకంగా నవ్వి; ఈ కుపతిత్వము+ఒల్లన్= ఈ కుటిల రాజ్యాధిపత్యం అంగీకరించలేను; ఒరు+ఈగి= ఇతరులు ఇచ్చిన దానం; మహత్త్వ కరంబె?= గొప్పదనాన్ని చేకూర్చగలదా?; విద్విషత్+భీకర= శత్రువులకు భయంకరమైన; మత్= నా యొక్క; భుజ+ఆర్జితము+అ= బాహుబలంతో సాధించిన రాజ్యాన్ని మాత్రమే; పెంపు+ఒనరంగన్= అతిశయించేటట్లుగా; భుజింతున్= అనుభవిస్తాను.

తాత్పర్యం: కుబేరుడు అనునయంగా ముచుకుందునితో 'నీకూ నాకూ యుద్ధం చెయ్యవలసిన అవసరంలేదు. నా నియోగంతో నీవు ఏకచ్ఛత్రాధిపత్యంగా ఈ రాజ్యాన్ని పాలించుకొమ్ము' అని చెప్పగా ఆ ముచుకుందుడు పరిహాసపూర్వకంగా 'ఓ కుబేరా! ఈ కపట రాజ్యాధిపత్యాన్ని నేను అంగీకరించను. ఇతరులు ఇచ్చే దానం స్వీకరిస్తే నాకు మహత్త్వకారణం కాజాలదు. నా బాహుపరాక్రమంతో శత్రుసంహారం చేసి సంపాదించిన రాజ్యాన్నే ఏలుతూ సమస్తభోగాలనూ అనుభవిస్తాను. అదే నాకు సముచితం' అని సమాధానం ఇచ్చాడు.

విశేషం: పరాక్రమ సంపన్నుడూ, వీరుడూ అయిన రాజు మహత్త్వానికి కారణం శత్రు సంహారంచేసి రాజ్యం చేజిక్కించుకొనటమేనని, వీరుడైన రాజు ఇతరులు ఇచ్చే దానాదులకు దోయిలొగ్గలేడని, అట్లా దానానికి చేతులు చాచటం అతడి పరాక్రమానికి మచ్చ అనీ, వీరవిస్ఫూర్తి సంపాదిత రాజ్యరమ భోగయోగ్యమని ముచుకుందుడి మాటలవలన విదిత మవుతుంది.

తిక్కన రచించిన ఈ ఉత్పలమాల ముచుకుందుడి వీరోచిత కార్యస్ఫురణకు సముచితంగా సాగింది.

వ. అనిన విని పౌలస్త్యుండు నీ వధికుండ వట్లు సేయు'మని గారవించిన ముచుకుందుండు ముదితుండై చని సకలోర్వియు నిర్వక్ర విక్రమంబున నేలె నని చెప్పిన విని యజాతశత్రుండు 'రాజధర్మంబులయం దైశ్వర్య ప్రీతి పుణ్యలోకంబులు నిరతిశయంబుగాఁ జేయం జాలునది యెయ్యది?' యని యడిగిన. 326

ప్రతిపదార్థం: అనినన్ విని= అని ముచుకుందుడు చెప్పగా విని; పౌలస్త్యుండు= పులస్త్యుడి వంశంలో జన్మించినవాడైన కుబేరుడు; నీవు+అధికుండవు+అట్లు+చేయుము+అని= నీవు గొప్పవాడవు అట్లాగే కానిమ్ము అని; గౌరవించినన్= మన్నించగా; ముచుకుందుఁడు= ముచుకుందు డనే రాజు; ముదితుండు+ఐ+చని= సంతోషంతో వెళ్ళి; సకల+ఉర్వియున్= సమస్త భూమండలాన్ని; నిర్వక్ర విక్రమంబునన్+ఏలెన్+అని చెప్పినన్ విని= సాటి లేని పరాక్రమంతో పరిపాలించా డని చెప్పగా విన్న; అజాత శత్రుండు= పుట్టని శత్రువులు గల ధర్మరాజు (శత్రువులు లేని ధర్మరాజు); రాజధర్మంబుల+అందున్= రాజుకు విహిత మైన ధర్మాలలో; ఐశ్వర్య ప్రీతి పుణ్యలోకంబులు= సంపద యందలి ప్రీతి; శాశ్వత పుణ్యలోక ప్రాప్తి అనే వాటిలో; నిరతిశయంబుగాన్= అత్యధికంగా; చేయన్+చాలునది+ఏ+అది= ఇవ్వగలిగిన ధర్మ మేది? అని+అడిగినన్= అని అడుగగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తన పరాక్రమంతో సంపాదించిన రాజ్యం నిర్వక్ర పరాక్రమంతో 'ఏలుతా' నని చెప్పిన ముచుకుందుడితో కుబేరుడు 'నీ వంతటి సమర్థుడవు. అట్లాగే చేయుము' అని చెప్పి మన్నించాడు. ముచుకుందుడు సంతోషించి సమస్తభూమండాలన్నీ పరాక్రమోపేతుడై పరిపాలించాడు. ఈ కథను భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'రాజధర్మాలలో పరమ సంపదను, పుణ్యలోకప్రాప్తిని ప్రసాదించగల ధర్మ మేదో' తెలియజేయవలసిందని భీష్ముడిని ప్రార్థించగా - (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అతని కిట్టు లనియె నమర తరంగిణీ । సూనుఁ 'డధిక భీతులైన సజ్జ
నులకు నభయ మొసఁగి యలఘు సౌఖ్యాత్ములఁ । జేఁత యెంతయును విశిష్ట మధిప!' 327

ప్రతిపదార్థం: అమర తరంగిణీ సూనుఁడు= దేవనది అయిన గంగాపుత్రుడైన భీష్ముడు; అతనికిన్+ఇట్టు+అనియెన్= ఆ ధర్మరాజుతో ఇట్లా అన్నాడు; అధిప!= ఓ ధర్మరాజా!; అధిక భీతుఁడు+ఐన= ఎక్కువ భయపడిన; సత్+జనులకున్= మంచి జనులకు; అభయము+ఒసఁగి= భయంలేదని చెప్పి, అనుగ్రహించి; అలఘు సౌఖ్య+ఆత్ములన్+చేఁత= మిక్కిలి సుఖాత్ములుగా చేయటం; ఎంతయును= మిక్కిలి; విశిష్టము= శ్రేష్ఠం.

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజుతో 'ఓ ధర్మరాజా! అత్యంత భీతులైన ఉత్తమజనులకు అభయ మిచ్చి, వారికి సమస్తసుఖాలు సంప్రాప్తింపజేసి సంతోషాంతరంగులను చేయట మనేది రాజునకు ఉండవలసిన విశిష్టధర్మం' అని పలికాడు.

వ. అని వెండియు. 328

తాత్పర్యం: అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'వినుఁ! పర్జన్యుఁడు భూతము । లను బండిన ప్రూను పక్షులను బ్రోచువిధం
బున నీవు బంధువుల, స । జ్జన యుతముగఁ బ్రోవు; మది ప్రశస్తం బనఘా! 329

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడ వైన ఓ ధర్మరాజా!; వినుఁ= శ్రద్ధతో వినుము; పర్జన్యుఁడు= వర్షాధి దేవతఅయిన ఇంద్రుడు; భూతములను= ప్రాణులనూ; పండిన మ్రాను= ఫలాలతో నిండిన చెట్టు; పక్షులను= అనేక పక్షి సంతతిని; ప్రోచు విధంబునన్= సంరక్షించే విధంగానే; ఈవు= నీవు; బంధువులను= చుట్టాలను; సత్+జనయుతముగన్+ప్రోవుము= మంచి జనులతో పాటు రక్షించుము; అది ప్రశస్తంబు= అది సర్వశ్రేష్ఠం.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఇంద్రుడు సమస్త ప్రాణికోటిని వర్షధారలతో సంరక్షించినట్లు, ఫలభరితమైన చెట్టు అనేక పక్షిసంతతిని పోషించిన రీతిగా, నీవు మంచివాళ్ళందరినీ చుట్టాలతోపాటు సంరక్షించుము. అది రాజధర్మాలలో మిక్కిలి ప్రశస్తమైనది.

విశేషం: అలం: మాలోపమ.

వ. అనిన విని ధర్మనందనుండు 'విప్రప్రభృతులకు నిజధర్మవర్తనంబుల జీవనంబుల నడవక తక్కిన నెే?' ట్లని యడిగినఁ బితామహుం డతనితో 'నాపద దనికిన నితర జాతి వృత్తంబు గర్వితంబుగా దట్లయినను నాయుధోపజీవనాదిక్షత్ర ధర్మంబులంజేసి బ్రాహ్మణ్యంబు వట్రపడి బ్రాహ్మణులు క్షత్రసము లగుదురు. వాణిజ్య ప్రముఖ వైశ్యక్రియ లాచరించి వైశ్యసము లగుదురు. నిత్యానుష్ఠానంబులు లోనుగాఁ గలయవి డిగవిడిచి

ధనలోభ తాత్పర్యంబున శూద్రప్రాయులై చరించి శూద్రసము లగుదురు; దక్కిన జాతులవారందరు దమదమ తారతమ్యంబులతో నిట్ల నిజజాతి విహీను లగుదు; రట్టివారు జాత్యుత్తమ కృత్యంబునకుఁ బాత్రంబులు గారు; భూకాంతుం డింతయు నెఱింగి యర్హప్రకారంబులం బ్రజ నడిపి రక్షించినం బ్రజాకృతం బగు ధర్మంబునందుఁ జతుర్థాంశంబునకు నుక్తుం డగుఁ బ్రజలఁ బాతకంబులం బొరయకుండ నరయం జాలక దండ్యదండన రహితుం డైన మహీవిభుని వారలచేసిన పాతకంబుల నాలవపాలు వొందుఁ; గొందఱు బుధు లంతయుం బొందు నని చెప్పుదు'రనుటయు నమ్మనుజనాథుండు. **330**

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా విన్న; ధర్మనందనుండు= ధర్మరాజు; విప్ర ప్రభృతులకున్= బ్రాహ్మణులు మొదలైన వర్ణాలవారికి; నిజ ధర్మవర్తనంబులన్= తమ ధర్మానుగుణ వర్తనాలలో; జీవనంబులు నడవక తక్కినన్= జీవితాలను సాగించకపోతే; ఎట్లు+అని+అడిగినన్= ఏమిటి గతి? అని ప్రశ్నించగా; పితామహుండు= కురుపితా మహుడైన భీష్ముడు; అతనితోన్= ఆ ధర్మరాజుతో; ఆపద దనికినన్= విపత్తు సంభవిస్తే; ఇతర జాతి వృత్తంబు= ఇతర వర్ణాల నడవడి; గర్హితంబు+కాదు= నిందించదగ్గది కాదు; అట్లు+అయినను= అట్లా అయినప్పటికి; ఆయుధ+ఉపజీవన+ఆది= ఆయుధాలతో జీవనం మొదులుకొని; క్షత్రధర్మంబులన్+చేసి= రాజధర్మాలవలన; బ్రాహ్మణత్వంబు వఱ్ఱపడి= బ్రాహ్మణత్వం క్షీణించి; బ్రాహ్మణులు క్షత్ర సములు+అగుదురు= బ్రాహ్మణులు రాజులతో సమాను లౌతారు; వాణిజ్య ప్రముఖ= వర్తకం మొదలైన; వైశ్యక్రియలు+ఆచరించి= వైశ్యులకు ఉచితమైన పనులు చేసి; వైశ్య సములు+అగుదురు= వైశ్యులతో సమాను లవుతారు; నిత్య+అనుష్ఠానంబులు= అనునిత్యమూ ఆచరించవలసిన అగ్ని కార్యాదులు; లోనుగాన్+కలయవి= మొదలుకొని గల కార్యా లన్నిటిని; డిగవిడిచి= వదలిపెట్టి; ధనలోభ తాత్పర్యంబునన్= ద్రవ్యంమీది ఆసక్తి మూలంగా; శూద్ర ప్రాయులు+ఐ చరించి= శూద్రులవలె నడుచుకొని; శూద్రసములు+అగుదురు= శూద్రులతో సమాను లవుతారు; తక్కిన జాతులవారు+అందఱున్= ఇతర వర్ణాల వారందరూ; తమతమ తారతమ్యంబులతోన్= వారి వారి తరతమ భేదాలతో; ఇట్లు= ఇదే రీతిగా; నిజ జాతి విహీనులు+అగుదురు= తమ వర్ణాలకంటె నీచులవుతారు; అట్టివారు= అట్లాంటివారు; జాతి+ఉత్తమ కృత్యంబునకున్= ఆయా వర్ణాల శ్రేష్ఠమైన కార్యాలకు; పాత్రంబులు+కారు= అర్హులు కాలేరు; భూకాంతుండు= భూమికి భర్త అయిన రాజు; ఇంతయున్+ఎఱింగి= పైన పేర్కొన్న సమస్తమూ గుర్తించి; అర్హ ప్రకారంబులన్= తగిన పద్ధతులలో; ప్రజన్ నడపి రక్షించినన్= ప్రజలను ఏలుకొని సంరక్షిస్తే; ప్రజాకృతంబు+అగు= ప్రజలు చేసిన; ధర్మంబునందున్= ధర్మంలో; చతుర్థ+అంశంబునకున్+ఉక్తుండు+అగున్= నాలుగో భాగానికి అర్హుడు అవుతాడు; ప్రజలన్= ప్రజలను; పాతకంబులన్+ పొరయకుండన్+అరయన్+చాలక= పాపాలు అంటకుండా పరిపాలించక పోతే; దండ్యదండన రహితుండు+ఐన= శిక్షార్హుడైన వాడిని శిక్షించ లేని; మహీవిభుని= రాజును; వారల చేసిన పాతకంబులన్= ప్రజలు చేసిన పాపాలలో; నాలవ పాలు పొందున్= నాలుగవ వంతు అనుభవిస్తాడు; కొందఱు బుధులు= (అయినా) కొంతమంది పండితులు; అంతయున్+పొందున్+అని చెప్పుదురు= ప్రజలు చేసిన పాపమంతా రాజుకు చెందుతుం దని చెప్తుతున్నారు; అనుటయున్= అని చెప్పగా; ఆ+మనుజ నాథుండు= ఆ మానవనాథుడైన ధర్మరాజు.

తాత్పర్యం: ప్రజలను సంరక్షించటం రాజధర్మాలలో శ్రేష్ఠమైనదని భీష్ముడు చెప్పగా, ధర్మరాజు 'బ్రాహ్మణుడు మొదలుకొని ఆయా వర్ణాలవారు స్వజాతి ధర్మ నిర్వహణం చేయకుండా తప్పితే పరిస్థితి ఏమిటి?' అని ప్రశ్నించాడు. 'ఆపద సమయాలలో ఆయా వర్ణాలవారు స్వజాతి ధర్మాన్ని వదలిపెట్టినా నిందార్హులు కారు. శస్త్రోపజీవులైన రాజులు ఆచరించే ధర్మాలను బ్రాహ్మణులు ఆచరించి, బ్రాహ్మణ్యాన్ని కోల్పోయి, రాజుతో సమానులౌతారు. వైశ్యులకు తగిన వాణిజ్యం మొదలుకొని ధర్మాలను పాటించి వైశ్యులతో సమానులౌతారు. నిత్యకృత్యాలైన అగ్నిష్టోమాది కార్యాలను వదలిపెట్టి, ధనలోభులై శూద్రులవలె ప్రవర్తించి శూద్రులతో సమాను లౌతారు. ఇట్లాగే ఇతర వర్ణాలవారు తమతమ ధర్మాలను వదలిపెట్టి ఇతర ధర్మాచరణచేత తమ వర్ణాలకంటె హీనమైన వారవుతారు. అట్లాంటి వారు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉత్తమ కార్యాలను ఆచరించటానికి అర్హులు కాలేరు. ఈ విషయాలను రాజు జాగరూకుడై గుర్తించి, ఆయా వర్ణాలవారిని తగిన రీతిలో సంరక్షించటం రాజుకు ఉత్తమధర్మం. ఆ ప్రజలు చేసే ధర్మానుగుణ ప్రవర్తనవలన వారు సంపాదించుకొనే ధర్మంలో నాలుగవ వంతు ఆ రాజుకు చెందుతుంది. ప్రజలకు ఎట్లాంటి పాపాలంటకుండా పాలించకపోయినా, శిక్షార్హులను దండించకపోయినా ఆ ప్రజలు చేసిన పాపంలో నాలుగవ వంతు రాజు అనుభవిస్తాడని కొందరు పెద్దలు చెప్తున్నారు. కాని, మరికొందరు ఆర్యులు అట్లాంటి ప్రజలు దుష్ట కార్యాచరణవలన సంపాదించుకొన్న పాపమంతా రాజే అనుభవించవలసి ఉంటుం దని వక్కాణించారు' అని భీష్ముడు ధర్మరాజునకు వివరించాడు.

ఆ. 'వినుము! వివిధ సుఖము లనుభవింపఁగ రాజ్య । విభవ యుక్తిఁ దిరుగ వేడ్క లేదు
నాకు ధర్మరక్షణము మీఁది భరముఁ ద । ల్లోప భయము మనములోనఁ బెద్ద. 331

ప్రతిపదార్థం: వినుము= ఓ తాతా వినుము; నాకున్= నాకు (ధర్మరాజుకు); వివిధ సుఖములు+అనుభవింపఁగన్= నాకు అనేక సుఖాలు అనుభవించా లనీ; రాజ్య విభవ యుక్తిన్+తిరుగన్= రాజ్య వైభవోపేతమైన యుక్తియుక్తంగా నడచుకోవాలనీ; వేడ్క లేదు= కోరిక లేదు; మనము లోనన్= నా మనస్సునందు; ధర్మరక్షణము మీఁది భరమున్= ధర్మాన్ని రక్షించే భారం; తద్+లోపభయమున్= తద్విరహితమైన దానివలన భయమూ; పెద్ద= మిక్కిలి పెద్దదిగా తోస్తున్నది.

తాత్పర్యం: 'ఓ తాతా వినుము! సమస్త సుఖాలు అనుభవించాలన్న కోరికగానీ, రాజ్య వైభవ సముపేతంగా జీవించాలన్న కుతూహలంగానీ నాకు లేదు. ధర్మరక్షణ చేయటమనే భారమూ, ధర్మరక్షణ చేయకపోవటమనే భయమూ నా మనసును మిక్కిలి పీడిస్తూ ఉంటాయి.

వ. కావున. 332

తాత్పర్యం: అందువలన.

చ. అనఘ! యనేక దోష మగునట్టి మహీవహనంబు నొల్ల; దం
డన పరుషత్వ మేటికి? దృఢ ప్రశమంబున నేను గానకుం
జనియెద' నన్న భీష్ముఁ 'డిది జాడ్యము గాక నృపాలధర్మమే
మనుజ వరేణ్య! నీ మనము మార్దవ మగ్గల; మిట్టు నొప్పునే? 333

ప్రతిపదార్థం: అనఘ!= పాప రహితుడవైన ఓ తాతా!; అనేక దోషము+అగునట్టి= అనేక పాపాలకు నిలయమైన; మహీవహనంబున్+ఒల్లన్= రాజ్యభారాన్ని మోయటానికి అంగీకరించలేను; దండన పరుషత్వము+ఏటికిన్= దండనీతితో కూడిన కాఠిన్యం ఎందుకు?; ఏను= నేను; దృఢ ప్రశమంబునన్= దిట్టమైన ప్రశాంతితో; కానకున్+చనియెదన్= తపోవనానికి వెళ్ళుతాను; అన్నన్= అని ధర్మరాజు తన అభిప్రాయాన్ని వెల్లడించగా; భీష్ముఁడు= తాత అయిన భీష్ముడు; మనుజవరేణ్య!= మానవశ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; ఇది జాడ్యము+కాక= ఇదొక రకమైన జడత్వమే కాని; నృపాల ధర్మమే!= క్షత్రియ ధర్మం అవుతుందా?; నీ మనము మార్దవము+అగ్గలము= నీ మనసు మృదుత్వం గొప్పది; ఇట్టున్+ఒప్పునే?= ఈ విధమైతే సముచితమేనా?

తాత్పర్యం: 'ఓ తాతా! అనేక పాపాలకు ఆకరమైన రాజ్యభారాన్ని అంగీకరించలేను. దండనీతి ప్రయోగం మిక్కిలి కఠినమైనది. దానిని నేను నిర్వహించలేను. పరమప్రశాంతమైన తపోవనంలో ముక్కుమూసికొని జీవించాలని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కోరుకొంటున్నాను' అని ధర్మరాజు తన దృఢాభిప్రాయాన్ని స్పష్టం చేశాడు. అప్పుడు భీష్ముడు ధర్మరాజు మానవశ్రేష్ఠుడనే విషయాన్ని గుర్తుచేసి 'ఇది నీలోని జడత్వమే గాని వేరు కాదు. కాకపోతే ఇది క్షత్రియధర్మమా? నీ మనసు మిక్కిలి మృదువైందనే విషయం నాకు తెలుసు. అయినా రాజైన వాడికి ఉండవలసిన లక్షణ మిదేనా? ఇది సముచితమేనా?'

వ. ని న్నొత్తి చెప్పుటకుఁ బాండు విచిత్రవీర్య శంతను లున్నవారే? నా బుద్ధి వినుము. 334

ప్రతిపదార్థం: నిన్నున్+ఒత్తి చెప్పుటకున్= నీకు గట్టిగా ప్రబోధించటానికి; పాండు విచిత్రవీర్య శంతనులు+ఉన్నవారే?= పాండు మహారాజుగాని విచిత్రవీర్య ధరాధిపతిగాని, శంతన మహారాజుగాని ప్రస్తుతం లేరు కదా!; నా బుద్ధిన్ వినుము= నా ఆలోచనను ఆలకించుము.

తాత్పర్యం: నిన్ను మిక్కిలి ప్రబోధించటానికి పాండురాజు గానీ, విచిత్రవీర్యుడు గాని, శంతన మహారాజుగాని లేరు కదా! కాబట్టి సహనంతో నా హితవును వినుము.

విశేషం: ఇక్కడ భీష్ముడు పాండురాజు, విచిత్రవీర్యుడు, శంతనులను ప్రస్తావించటం ఎంతో సముచితంగా ఉన్నది. సంక్షుభిత మనస్కులైన వారికి పెద్దల పలుకులు ఉపశమనాన్ని కలిగిస్తాయి. ఉత్తమమార్గాన్ని చూపుతాయి. అందుకే రాజ్యాధికారం వద్దంటున్న ధర్మరాజుతో భీష్ముడు 'నీకు ఇప్పుడు గట్టిగా ధర్మబోధ చెయ్యటానికి పాండురాజాది పెద్దలు లేరు. నీకు ఉన్న పెద్ద దిక్కు నేనే. అందుకే నీ హితాన్ని కోరి చెప్తున్న నా పలుకులను ఆలకించి ఆచరించుము' అని తన మాటలకు అనుగుణంగా ప్రవర్తించు మని ధర్మరాజుతో చెప్పాడు.

ఈ చిన్ని వచనంలో 'నిన్నొత్తి చెప్పుటకు' అని తిక్కన రచించి 'నిన్ను శాసించటానికి, నీకు తగిన రీతిలో చెప్పటానికి' అనే ప్రత్యేకార్థాలను స్ఫురింపజేసి తన ప్రత్యేకతను ప్రకటించుకొన్నాడు.

ఆ. ఈఁగ కాలి యంత యేనియు వీసర । పోవకుండ ధర్మమునన నడచి
రయ్య! తొంటి రాజుల క్రోధ కామ ప్ర । యుక్త దండధరణ మొప్పుఁ గాక. 335

ప్రతిపదార్థం: అయ్య!= ఓ ధర్మరాజా!; తొంటి రాజులు= పూర్వరాజులు; ఈఁగ కాలి+అంత+ఏనియున్= ఈగ కాలి అంత అంటే అణుమాత్రమైనా; వీసరపోవకుండన్= వెలితి రానీయకుండా; ధర్మమునన్ నడచిరి= రాజధర్మంతోనే నడచుకొన్నారు; అక్రోధ కామ ప్రయుక్త దండ ధరణము= కోపమూ, కామమూ లేని ప్రయోగంతో దండనీతిని ధరించటం; ఒప్పున్+కాక= సముచితం కదా!

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! పూర్వరాజులు అణుమాత్రమైనా వెలితిరానీయక క్షత్రియోచిత ధర్మపాలన సాగించారు. క్రోధాన్ని, కామాన్ని పరిత్యజించి దండనీతితో రాజ్యపాలన చేయటం రాజు వైన నీకు సముచితం'.

క. దానాధ్యయన యజనముల । తో నుర్వీజనులఁ గావఁ దొడఁగుట పతికిం
దా నజ కల్పిత ధర్మము; । దీని విడుపు నరకమునకుఁ దెరు వగు నధిపా! 336

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధర్మరాజా!; దాన+అధ్యయన యజనములతోన్= దానం చేయటం, వేదాధ్యయనం కొనసాగించటం, యజ్ఞయాగాది కార్యాచరణం - అనే వాటితో; ఉర్వీజనులన్= భూప్రజలను; కావన్+తొడఁగుట= సంరక్షించ నారంభించటం; పతికిన్+తాన్+అజ కల్పిత ధర్మము= రాజునకు అదే బ్రహ్మచేత సృష్టించబడిన ధర్మం; దీని విడుపు= దీన్ని చేయకుండా వదలిపెట్టటం; నరకమునకున్+తెరువు+అగున్= నరకానికి మార్గమవుతుంది.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! దాన ధర్మాలు, యజ్ఞయాగాలు, వేదాధ్యయనాదులు నీవంటి ఉత్తమ రాజులకు పరమేష్ఠి విధించిన విహితధర్మం. దీనిని చేయకుండా వదలిపెడితే నరకప్రాప్తి తప్పదు'.

క. కావున వర్ణాశ్రమముల । నేవిధమున నైన నడపు లెడలక యుండం
గావంగ నోపు నృపతికి । లే వలజ ళ్ళుభయలోక లీలలయందున్. 337

ప్రతిపదార్థం: కావునన్= అందువలన; వర్ణ+ఆశ్రమములన్= నాలుగు వర్ణాలను, నాలుగు వర్ణాలకు తగిన నాలుగు ఆశ్రమాలను; ఏ విధమునన్+ఐనన్= ఎన్ని కష్టాలకైనా ఓర్చి; నడపులు+ఎడలక+ఉండన్= కొనసాగింపులు వదలకుండా; కావంగన్+ఓపు= సంరక్షించే సామర్థ్యంగల; నృపతికిన్= రాజునకు; ఉభయ లోక లీలల యందున్= ఇహపరలోకాలలోని లీలా విశేషాలలో; అలజళ్ళు లేవు= ఎట్లాంటి భయాందోళనలు ఉండవు. (కాగా సర్వ సుఖ ప్రాప్తి కలుగుతుంది).

తాత్పర్యం: 'కాబట్టి నాలుగు వర్ణాలను, నాలుగు ఆశ్రమాలను ఎట్లాగైనాసరే నిర్వర్తిస్తే ఆ రాజునకు ఇహపరలోకాలలో ఎట్లాంటి భయాందోళనలు లేక సమస్త సౌఖ్యాలు సమకూరుతాయి అది రాజధర్మం'.

వ. ఇ ట్లగుటం దెలుపునది యొక్క యితిహాసంబు గల; దాకర్ణింపుము. 338

ప్రతిపదార్థం: ఇట్లు+అగుటన్+తెలుపునది= ఈ విధంగా జరిగిన దని తెలుపటానికి; ఒక్క+ఇతిహాసంబు+కలదు= ఒక పూర్వకథ ఉన్నది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: 'దీనిని సోదాహరణంగా వివరించే ఒక పూర్వకథ ఉన్నది చెప్పుతాను వినుము' అన్నాడు భీష్ముడు.

కేకయరాజ రాక్షస సంవాద ప్రకారము (సం. 12-78-6)

క. పరమ నియతిమైఁ గేకయ । నరపతి యధ్యయన విధి యొనర్పఁగ నటవీ
పరిసరమున కేఁగినయెడ । ధరణీశ్వర! పట్టె నొక్క దానవుఁ డతనిన్. 339

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= భూ భర్తవైన ఓ ధర్మరాజా!; కేకయ నరపతి= కేకయరాజు; పరమ నియతిమైన్= శ్రేష్ఠమైన నియమంతో; అధ్యయన విధి+ఒనర్పన్= వేదాధ్యయన విధి నిర్వహణకు; అటవీ పరిసరమునకున్+ఏగిన యెడన్= అరణ్యప్రాంతాలకు వెళ్ళినప్పుడు; అతనిన్= ఆ కేకయ రాజును; ఒక్కదానవుఁడు= ఒకానొక రాక్షసుడు; పట్టెన్= పట్టుకొన్నాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! కేకయరాజు పరమ నియమానుగుణంగా వేదాధ్యయనం నిర్వహించటంకొరకు అరణ్య ప్రాంతాలకు వెళ్ళిన సందర్భంలో ఆ రాజును ఒక రాక్షసుడు పట్టుకొన్నాడు.

వ. పట్టినఁ బ్రబలుం డగు నద్దనుజునిం ద్రోచిపోవంజాలక యమ్మహీపాలుండు వాని కిట్లనియె. 340

ప్రతిపదార్థం: పట్టినన్= రాక్షసుడు కేకయరాజును పట్టుకొనగా; ప్రబలుండు+అగు= మిక్కిలి బలవంతుడైన; ఆ+దనుజునిన్= ఆ రాక్షసుడిని; త్రోచి పోవన్+చాలక= త్రోసి పుచ్చలేక; ఆ+మహీపాలుండు= ఆ కేకయ రాజు; వానికిన్+ఇట్లు+అనియెన్= ఆ రాక్షసుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ రాక్షసుడు కేకయరాజును పట్టుకొనగా మిక్కిలి బలవంతుడైన ఆ రాక్షసుడిని ఎదిరించలేక ఆ కేకయరాజు రాక్షసుడితో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'మ్రుచ్చిమియును అంకు నెచ్చోట నైన నా । భూమిలోపల లేదు భూమిసురులు
వేదాధ్యయన యజ్ఞవిధి దానతత్పరుల్ । రాజులు బ్రాహ్మణారాధనంబు
జన్నముల్ సేఁతయు సమరానివర్తన । వ్రతమును గలరు గోరక్షణాది
వార్తావినీతులై వైశ్యులు నడపుదు । రమ్మూఁడు జాతుల కధికభక్తి

తే. తోడ శుశ్రూషసేసి శూద్రులు చరింతు; । రేమి రంధ్రంబు గాంచి నీ విట్లు వెరవు
మాలి పట్టి తత్యుద్ధతలీల నన్నుఁ? । దలఁప నిది నీకుఁ బథ్యమే దానవేంద్ర! 341

ప్రతిపదార్థం: దానవ+ఇంద్ర!= ఓ రాక్షస శ్రేష్ఠుడా!; నా భూమిలోపలన్= నా రాజ్యంలో; ఏ చోటన్+ఐనన్= ఎక్కడైనా; మ్రుచ్చిమియును= దొంగతనమూ; అంకు= వ్యభిచారమూ; లేదు= కనిపించదు; భూమిసురులు= బ్రాహ్మణులు; వేద+అధ్యయన, యజ్ఞవిధి, దాన తత్పరుల్= వేదాధ్యయనం చేయటమూ, యజ్ఞయాగాదులు ఆచరించటమూ, దానధర్మాలు చేయటమూ అనే పనుల్లో ఆసక్తిని కలిగి ఉంటున్నారు; రాజులు= క్షత్రియులు; బ్రాహ్మణ+ఆరాధనంబున్= బ్రాహ్మణులను పూజించటమూ; జన్నముల్+చేతఁయున్= యజ్ఞయాగాదులు చేయించటమూ; సమరానివర్తన (సమర+అని వర్తన)వ్రతమును+కలరు= యుద్ధము నుండి వెనుకకు తిరిగి రాకుండుట అనే వ్రతాలు కలిగి ఉన్నారు; వైశ్యులు; గోరక్షణ+ఆది= గోపాలనం మొదలుకొని; వార్తా వినీతులు+ఐ నడపుదురు= జీవనాన్ని నియమబద్ధంగా సాగిస్తున్నారు; శూద్రులు; ఆ+మూఁడు జాతులకున్= ఆ మూడు వర్ణాలకు; అధిక భక్తి తోడన్= మిక్కిలి భక్తితో; శుశ్రూష చేసి చరింతురు= సేవచేసి జీవిస్తున్నారు; ఇట్లు= ఈ విధంగా; నీవు; ఏమిరంధ్రంబు+కాంచి= ఏ దోషం చూచి; వెరవు మాలి= తెలివిలేనివాడవై; అతి+ఉద్ధతలీలన్= మిక్కిలి గర్వవిలాసంతో; నన్ను పట్టితి(వి)?= నన్ను పట్టుకొన్నావు?; తలఁపన్= ఆలోచించగా; ఇది= ఈ విధంగా నన్ను పట్టుకొనటం; నీకున్+పథ్యమే?= నీకు హితమేనా?

తాత్పర్యం: 'ఓ రాక్షసశ్రేష్ఠా! నా రాజ్యంలో ఎక్కడా జారచోర దురాచారాలు లేవు. బ్రాహ్మణులు వేదాధ్యయనంతో యజ్ఞయాగాదులు చేస్తున్నారు. రాజులు బ్రాహ్మణార్చనలతో పాటు యజ్ఞయాగాదులు, యుద్ధంలో పాల్గొనటం అనే వ్రతాలు పాటిస్తున్నారు. వైశ్యులు గోపాలన, వాణిజ్యం నిర్వహిస్తున్నారు. ఈ మూడు వర్ణాలవారిని శూద్రులు పరమభక్తిపరులై సేవిస్తున్నారు. నా రాజ్యంలో ఏ దోషాన్ని పసిగట్టి ఈ విధంగా గర్వించి అకారణంగా నన్ను పట్టుకొన్నావు? నీకిది ఉచితమా?'

విశేషం: నాలుగు వర్ణాల వాళ్ళు తమ జాత్యుచిత కార్యకలాపాలలో నిమగ్నులై సుఖజీవనం చేస్తున్నారనీ, అది మచ్చలేని తన రాజ్యపాలనమని కేకయరాజు రాక్షసుడికి తెలిపాడు.

చ. అనుటయు నమ్మహాదనుజుఁ డాతని కిట్లను 'నట్టి వానిఁగా
నినుఁ గని వర్ణరక్షణము నిర్మలచిత్తతఁ జేయు రాజు కీ
డునఁబడకున్కి దెల్పఁగఁ గడుం బ్రియమై చనుదెంచితిన్; మహీ
జనపరిరక్ష యస్ఖలిత సౌమ్యత నిట్ల యొనర్పు భూవరా!' 342

ప్రతిపదార్థం: అనుటయున్= అని కేకయ రాజు పలుకగా; ఆ+మహాదనుజుఁడు= ఆ గొప్ప రాక్షసుడు; అతనికిన్+ఇట్లు+అనున్= ఆ కేకయ రాజుతో ఇట్లా అన్నాడు; భూవరా!= ఓ రాజా!; అట్టివానిన్+కాన్= అట్లాంటి ఉత్తముడిగా; నిన్నున్+కని= నిన్ను చూచి; వర్ణ రక్షణమున్= వర్ణాశ్రమ ధర్మాలను; నిర్మల చిత్తతన్+చేయు= పరిశుద్ధ మనస్సుతో చేసే; రాజు; కీడునన్+పడక+ఉన్కి= ఆపదలపాలు కాకుండా ఉండటాన్ని; తెల్పఁగన్= తెలియజేయటానికి;కడున్+ప్రియమై= మిక్కిలి ప్రీతియై; చనుదెంచితిన్= వచ్చాను;

ఇట్లు= ఈ రీతిగానే; మహీజన పరిరక్ష= భూ ప్రజల సంరక్షణ; అస్ఖలిత= జారుపాటు లేని (తొట్రుపాటులేని లేదా చలించని); సౌమ్యతన్= మంచితనంతో; ఒనర్పు= కొనసాగించుము.

తాత్పర్యం: 'నన్నెందుకు బంధించా'వని కేకయరాజు ప్రశ్నించగా ఆ రాక్షసుడు అతనితో 'నీవు ఉత్తముడవని, నాలుగు వర్ణాశ్రమాల ధర్మనిర్వహణం నిర్మలమనస్సుతో చేసే రాజునకు ఎట్లాంటి ఆపదలు రావని తెలుపటానికి మిక్కిలి ప్రీతితో ని న్నీ విధంగా బంధించాను. ఇదే రీతిగా ప్రజలను ఏ మాత్రం తొట్రుపాటు లేని సౌమ్యతతో రాజ్యపాలన కొనసాగించుము'.

వ. అని పలికి సఖ్యంబు సేసి చనియె నని చెప్పినం గౌంతేయాగ్రజుండు సంతోషించి 'జీవనాభావం బైనచో క్షత్త్రియ కర్మానుష్ఠానంబునకు నశక్తుం డగు విప్రుం డెట్లు బ్రదుకు వాఁ?' డని యడిగిన భీష్ముం డిట్లనియె. 343

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; సఖ్యంబు+చేసి చనియెన్= స్నేహం చేసికొని వెళ్ళిపోయాడు; అని చెప్పినన్= అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతీపుత్రులలో పెద్దవాడైన ధర్మరాజు; సంతోషించి= ఆనందించి; జీవన+అభావంబు+ఐనచోన్= జీవనం కొనసాగించటం కష్టమైతే; క్షత్రియ కర్మ+అనుష్ఠానంబునకున్= రాజోచిత కర్మాచరణానికి; అశక్తుండు+అగు= శక్తిహీనుడైన; విప్రుండు= బ్రాహ్మణుడు; ఎట్లు బ్రదుకు వాఁడు?+అని+అడిగినన్= ఎట్లా జీవించగలడని ధర్మరాజు అడుగగా; భీష్ముండు+ఇట్లు+అనియెన్= భీష్ముడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కేకయరాజును రాక్షసుడు మెచ్చుకొని స్నేహం చేసి వెళ్ళిపోయాడు. ఈ కథ విన్న ధర్మరాజు సంతోషాంతరంగుడై 'జీవనం కొనసాగించటం కష్టమైనప్పుడు రాజోచిత కర్మానుష్ఠానం నెరపలేని బ్రాహ్మణుడు ఎట్లా జీవించగలడో వివరించు' మని భీష్ముడిని అడుగగా భీష్ముడు ఇట్లా సమాధానం చెప్పాడు.

చ. మనఁ జను నుప్పు నువ్వులును మాంసము గోవు వృషంబుఁ గూడుఁ గ
ల్లును ఘృత తైల మాక్షికములున్ ధృతకేసరమైన జంతువున్
ధన మధికంబుగాఁ బడయు దానికి నేనియు విక్రయింపఁ గా
దనుమతి యూఁది వైశ్యకృతినైనను విప్రున కాపదాగతిన్.' 344

ప్రతిపదార్థం: విప్రునకున్+ఆపద్+ఆగతిన్= బ్రాహ్మణుడు ఆపత్సమయంలో (అంటే ఆపద్ధర్మంగా); అనుమతి+ఊఁది= అనుజ్ఞ పొంది; వైశ్యకృతిన్+ఐనను= వైశ్య ధర్మాన్ని అవలంబించి అయినా; మనన్+చనున్= జీవించటం సముచితమే (అయితే); ధనము+అధికంబుగాన్+పడయుదానికిన్+ఏనియున్= ధనం ఎక్కువగా పొందటానికి; ఉప్పు, నువ్వులు, మాంసము, గోవు, వృషంబున్+కూడున్+కల్లును= ఉప్పు, నువ్వులు, మాంసము, ఆవు, ఎద్దు, అన్నము, కల్లు; ఘృత తైల మాక్షికములున్= నేయి, నూనె తేనెటీగల వలన తయారైన తేనెలను; ధృతకేసరము+ఐన జంతువున్= వెంట్రుకలు గల జంతువును (గుర్రము మొదలైనవి); విక్రయింపన్+కాదు= అమ్మరాదు.

తాత్పర్యం: బ్రాహ్మణుడు స్వకీయవృత్తిలో జీవించలేనప్పుడు ఆపద్ధర్మంగా వైశ్యవృత్తిని స్వీకరించి జీవించవచ్చును. అయితే అత్యధికంగా ధనం లభిస్తుం దన్న ఆశతో ఉప్పు, నువ్వులు, మాంసం, గోవు, ఎద్దు, అన్నం, కల్లు, నేయి, నూనె, తేనెలను కేసరాలు గల జంతువు అంటే గుర్రం మొదలైనవి అమ్మరాదు. ఇది నియమం' అని భీష్ముడు వివరించాడు.

విశేషం: మూలంలో సవిస్తరంగా సుమారు 7, 8 శ్లోకాలలో సాగిన వివరణను తిక్కన ఒక చంపకమాలలో సంక్షిప్తసుందరంగా వివరించాడు. మూలంలో తేనె సంగతి లేదు. మహిషమని మూలంలో ఉండగా తిక్కన గోవును పేర్కొన్నాడు. కేసరాలుగల జంతువు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గుర్రమని నీలకంఠ వ్యాఖ్య. కృతాన్నం అంటే పక్వాన్నమని నీలకంఠీయం. అన్నం విక్రయించరా దంటే అన్నం పరబ్రహ్మస్వరూపం-కనుక దానిని విక్రయిస్తే దానికి మూలమైన భూమిని విక్రయించినట్లే భూమి సర్వ దేవతామయం కనుక విక్రయించటం సముచితం కాదని వివరణ. మూలంలో నీటిని విక్రయిస్తే బ్రాహ్మణుడికి నరకప్రాప్తి కలుగుతుందని చెప్పబడింది. కాని ఆ విషయం తిక్కన తడవలేదు. విక్రయించరాదని నిషేధించాడు.

వ. అనిన విని ధర్మతనయుండు 'యజ్ఞంబు లెట్లయిన సమీచీనంబు లగు?'నని యడిగిన ననిమిష నదీనందనుం డతని కిట్లనియె. 345

ప్రతిపదార్థం: అనినన్ విని= అని భీష్ముడు చెప్పగా విని; ధర్మ తనయుండు= ధర్మరాజు; యజ్ఞంబులు+ఎట్లు+అయినన్= యజ్ఞాలు ఏ విధంగా; సమీచీనంబులు+అగున్+అని+అడిగినన్= పరిశుద్ధ మవుతాయో (సత్య సమ్మత మవుతాయో) తెలుపుమని ప్రశ్నించగా; అనిమిష నదీనందనుండు= దేవనది అయిన గంగానది యొక్క పుత్రుడైన భీష్ముడు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: బ్రాహ్మణుడు ఆపద్ధర్మంగా వైశ్యవృత్తిని అవలంబించినా అతడు అనుసరించవలసిన నియమాలను భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'యజ్ఞాలు సత్యసమ్మతాలు ఎట్లా అవుతాయో వివరించు' మని ప్రార్థించగా భీష్ముడు ఇట్లా స్పష్టం చేశాడు.

ఆ. 'శ్రద్ధ వలయు, మిథ్య చనదు, వేదంబులఁ । బరిభవింపఁ దగదు భవ్యయజ్ఞ
కర్త కెపుడు; నదియుఁ గాక దక్షిణలు మం । త్రార్థ పోషకంబులందు రధిప! 346

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; భవ్య యజ్ఞ కర్తకున్= శ్రేష్ఠమైన యజ్ఞ కర్తకు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; శ్రద్ధ వలయున్= శ్రద్ధ అవసరం; మిథ్య చనదు= బూటకం పనికిరాదు; వేదంబులన్+పరిభవింపన్+తగదు= వేదాలను అవమానించరాదు; అదియున్+కాక= అంతేకాక (మీదు మిక్కిలి); దక్షిణలు= యజ్ఞయాగాదులలో ఋత్విజులకు ఇచ్చే ధనం; మంత్ర+అర్థపోషకంబులు+ అందురు= వేద మంత్రార్థాలకు అత్యంత పుష్టిని కలిగిస్తుందని పెద్దల సూక్తి.

తాత్పర్యం: 'శ్రేష్ఠుడైన యజ్ఞకర్తకు ఎల్లప్పుడు శ్రద్ధ అత్యంతావశ్యకం. బూటకాలు పనికిరావు. వేదాలను అవమానించి తిరస్కరించరాదు. అంతేగాక యజ్ఞాది సమయాలలో ఋత్విజులు ఇచ్చే భూరిదక్షిణలు వేదమంత్రార్థాలకు మిక్కిలి పుష్టిని, తుష్టిని చేకూరుస్తా యని ఆర్యులు వక్కాణించారు.

క. ఈగతి యెఱింగి చేసిన । యాగము సోమాప్తుఁ జేయు నప్పురుషునిఁ ద
ద్యోగ మొనర్చు మహాసుఖ । యోగము సోమాధిరాజ్య యుక్తము శ్రుతులన్. 347

ప్రతిపదార్థం: ఈగతి+ఎఱింగి= ఈ విషయా న్నంతటినీ సంపూర్ణంగా తెలిసికొని; చేసిన యాగము= చేసిన యజ్ఞకార్యం; ఆ+పురుషునిన్= అట్లాంటి యజ్ఞం చేసిన వ్యక్తిని; సోమ+ఆప్తున్+చేయున్= సోమపానంతో కృతకృత్యుడిని చేస్తుంది; శ్రుతులన్= వేదాలలో; తద్+యోగము+ఒనర్చు= ఆ మహాయోగం చేకూర్చే; మహాసుఖయోగము= అత్యంత సుఖయోగం; సోమ+అధిరాజ్య యుక్తము= సోమపాన మనే అధిరాజ్యంతో కూడి ఉంటుంది.

తాత్పర్యం: సలక్షణంగా చేసిన యజ్ఞం యజ్ఞకర్తను పునీతం చేస్తుంది. అది మహాసుఖయోగం. శ్రుతులు ఈ అంశాన్ని స్పష్టం చేశాయి. ఇది 'సోమపాన' అధిరాజ్యం. శ్రుతులలో అట్లాంటి ఆ యోగం చేకూర్చే మహాసుఖయోగం సోమపాన మనే అధిరాజ్యంతో కూడి ఉంటుంది'.

ఆ. అధ్వరంబుకంటె నధికంబు దపము, ద । పం బనంగ మేని ప్రన్న(దనము
నివురఁ జేతగా దహింసయు సత్యవా । క్యంబు దమము దయయుఁ గాని యరయ 348

ప్రతిపదార్థం: అరయన్= పరిశీలించగా; అధ్వరంబు కంటెన్= యజ్ఞంకంటె; తపము అధికంబు= తపస్సు శ్రేష్ఠమైనది; తపంబు+అనంగన్= తపస్సంటే; మేని ప్రన్న(దనమున్+ఇవురన్+చేఁత+కాదు= శరీర మనోజ్ఞతను శుష్కింపచేయటం కాదు; అహింసయున్= హింసచేయకుండటం; సత్యవాక్యంబు= సత్యవచనం; దమము= ఇంద్రియ నిగ్రహం; దయయున్+కాని= దయ మొదలైన ఉత్తమ గుణాలు మాత్రమే.

తాత్పర్యం: పరిశీలించి చూడగా యజ్ఞయాగాదులకంటె తపస్సు శ్రేష్ఠమైనది. తపస్సంటే మేని పసలను శుష్కింపచేయటం కాదు. అహింస, సత్యవచనం, ఇంద్రియనిగ్రహం, దయ మొదలైన సద్గుణాలు కలిగి ఉండటమే'..

వ. అనిన. 349

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగా - (తరువాతి పద్యంతో అన్వయం).

చ. ప్రియమున ధర్మనందనుడు భీష్మునితో 'నృపు డెట్టిభంగి వా
నియెడఁ గరంబు నమ్మఁదగు; నిక్కపు మిత్రుఁడు లేని భర్తకున్
నయగతి సెల్లనేర' దనినన్ విని యిట్లను నాతఁ 'డేక బు
ద్ధియుతుఁడవై వినన్ వలయుఁ దెల్లముగా నెఱిఁగింతు భూవరా!' 350

ప్రతిపదార్థం: ధర్మనందనుఁడు= ధర్మరాజు; ప్రియమునన్= ప్రీతితో; భీష్మునితోన్= తాత అయిన భీష్ముడితో; నృపుఁడు+ఎట్టి భంగి వాని యెడన్= రాజు ఎట్లాంటి వాడి పట్ల; కరంబు= మిక్కిలి; నమ్మన్+తగున్= నమ్మకంతో ఉండవచ్చు; నిక్కము+మిత్రుఁడు లేని= నిజమైన (ఆప్తుడైన) స్నేహితుడు లేని; భర్తకున్= రాజునకు; నయగతి+చెల్లనేరదు= నీతి మార్గం సాగదు; అనినన్ విని= అని ప్రశ్నించగా విని; ఆతఁడు= ఆ భీష్ముడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; భూవరా!= ఓ ధర్మరాజా!; తెల్లముగాన్+ఎఱిఁగింతున్= స్పష్టంగా తెలుపుతాను; ఏక బుద్ధి యుతుఁడవై= ఏకాగ్రమైన బుద్ధి కలిగిన వాడవై; వినన్ వలయున్= వినవలసింది.

తాత్పర్యం: 'నమ్మకమైన స్నేహితులు లేకపోతే రాజకార్యం నీతిమార్గంలో సాగటం కష్టం. ఎట్లాంటివాడి పట్ల మిక్కిలి నమ్మకం కలిగి ఉండవచ్చో తెలుపవలసిం'దని ధర్మరాజు భీష్మడిని ప్రార్థించాడు. 'ఆ విషయాలు విశదం చేస్తాను గానీ బహుశ్రద్ధతో వినుము' అని భీష్ముడు ఆదేశించాడు.

క. 'నమ్మమి మృత్యువు, పెద్దయు । నమ్ముట యపమృత్యు వగుట నరపతి నమ్మీ
నమ్మక పనిగొనునది, ని । త్యమ్మును సూక్ష్మమతిఁ దాను నరయఁగ వలయున్. 351

ప్రతిపదార్థం: నరపతి= రాజు; నమ్మమి= నమ్మకపోవటం; మృత్యువు= మరణంతో సమానం (అంటే వినాశనకారి); పెద్దయున్ నమ్ముట= అధికంగా నమ్మటం; అపమృత్యువు+అగుటన్= అకస్మాత్తుగా కలిగే చావువంటిది కావటంవలన; నమ్మీ నమ్మక= కొంత నమ్మి, కొంత నమ్మక; పని+కొనునది= కార్యాన్ని సాధించుకొనాలి; తాను= రాజు; నిత్యమ్మును= ఎల్లప్పుడు; సూక్ష్మమతిన్= సూక్ష్మబుద్ధితో; అరయఁగన్ వలయున్= పరిశీలిస్తూ ఉండాలి.

తాత్పర్యం: రాజు నమ్మకపోవటమంటే మృత్యుసమానం అంటే వినాశకారి. అత్యంతం విశ్వసించటం అపమృత్యువుతో సమానం. కాబట్టి నమ్మీ నమ్మక పనులు సాధించాలి. ఎల్లప్పుడూ సూక్ష్మబుద్ధితో సర్వమూ పరిశీలిస్తూ ఉండవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

తే. తనకు మే లొనరించు నాతండు మిత్రుఁ; । డతఁడు నడపంగ నెల్ల కార్యములు శుభము
నొందు; నేమిట నేమఱకునికి తోడ । నృపుఁడు మిత్రుపైఁ గార్యముల్ నిలుప వలయు. 352

ప్రతిపదార్థం: తనకున్ మేలు+ఒనరించు+ఆతండు మిత్రుఁడు= తనకు (రాజుకు) మేలుచేసేవాడే నిజమైన స్నేహితుడు; అతఁడు= ఆ మిత్రుడు; నడపంగన్= రాజుచేత కార్యాచరణ చేయించగా; ఎల్లకార్యములు= అన్ని పనులు; శుభమున్+ఒందున్= శుభ ప్రదమవుతాయి; నృపుఁడు= రాజు; ఏమిటన్+ఏమఱక+ఉనికితోడన్= దేనియందూ అశ్రద్ధ లేకుండా ఉన్నట్లయితే; మిత్రుపైన్= స్నేహితుడిమీద; కార్యముల్ నిలుప వలయున్= కార్యభారాన్ని మోపాలి.

తాత్పర్యం: రాజుకు మేలు చేసేవాడే మిత్రుడు. అట్లాంటి మిత్రుడు నడిపిస్తే సమస్తకార్యాలూ శుభాన్ని చేకూరుస్తాయి. దేనిలోనూ ఏమరుపాటు లేనివాడైన స్నేహితుడిపై కార్యభారాన్ని మోపాలి. అప్పుడు అన్ని పనులు సానుకూలమవుతాయి.

ఉ. మన్ననకున్ మదింప కవమానము వచ్చిన స్రుక్క కొక్కభం
గిన్నెఱిఁ గార్యముల్ విగత కిల్బిషుఁడై తగఁ జేయునట్టి మి
త్త్రు న్నరనాయకుండు దనరూపుగ నగ్గలమైన శ్రీయు న
త్యున్నతియున్ ఘటించు మహిమోజ్జ్వలుఁ జేఁత సుఖావహం బగున్. 353

ప్రతిపదార్థం: మన్ననకున్ మదింపక= గౌరవం కలిగినప్పుడు గర్వించక; అవమానము వచ్చినన్ స్రుక్కక= అవమానం కలిగినప్పుడు పరితాప పడక; ఒక్కభంగిన్= ఒకేరీతిగా; నెఱిన్= నేర్పుతో (సొగసుగా); విగత కిల్బిషుఁడు+ఐ= పాపరహితుడై (దోష రహితుడై); తగన్= ఉచిత రీతిని; కార్యముల్ చేయునట్టి= పనులు చేసే; మిత్రున్= స్నేహితుడిని; నరనాయకుండు= రాజు; తన రూపుగన్= తనతో సమానంగా (భావించి); అగ్గలము+ఐ= అధికమైన; శ్రీయున్= సంపదను; అతి+ఉన్నతియున్= మిక్కిలి ఔన్నత్యాన్ని; ఘటించు= కలిగించే; మహిమ+ఉజ్జ్వలున్+చేఁత= మహిమతో ప్రకాశితుడిని చేయటం; సుఖ+ఆవహంబు+అగున్= సుఖాలను చేకూరుస్తుంది.

తాత్పర్యం: గౌరవానికి గర్వించక, అవమానానికి దుఃఖించక రెండింటినీ ఒకే రీతిగా భావించి, పాపరహితుడై ఉచిత రీతిని కార్యాలను సాధించే మిత్రుడిని, రాజు తనతో సమానంగా భావించి, అత్యధికంగా సంపదను ఇనుమిక్కిలి ఔన్నత్యాన్ని కలిగించగల మహిమాన్వితుడిగా చేయటం సుఖాస్పదం అవుతుంది!

క. వినుమట్టి మంత్రి గామం । బునఁ గ్రోధంబునను లోభమున భయమునఁ గా
ర్య నిరూపణంబు వదలక । వినీతుఁడై నడచు టధిక విభవముఁ జేయున్.' 354

ప్రతిపదార్థం: వినుము= సావధానుడవై వినుము; అట్టి మంత్రి= అట్లాంటి మంత్రి; కామంబునన్= కామంవలన; క్రోధంబునను= కోపంవలన; లోభమునన్= లోభ గుణం వలన; భయమునన్= భయంవలన; కార్య నిరూపణంబు= కార్యాచరణాన్ని; వదలక= వదలిపెట్టక; వినీతుఁడు+ఐ= ఉత్తమ నీతిమంతుడై; నడచుట= నిర్వహించటం అనేది; అధిక విభవమున్+చేయున్= మిక్కిలి వైభవాన్ని చేకూరుస్తుంది.

తాత్పర్యం: అట్లాంటి మంత్రి కామక్రోధ లోభ భయాదులవలన కార్య నిరూపణం వదలకుండా ఉత్తమ నీతిమంతుడై నిర్వహించటం అనేది అత్యంత వైభవాన్ని చేకూరుస్తుంది.'

వ. అని చెప్పి వెండియు. 355

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని ఈ విధంగా చెప్పి మళ్ళీ - (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'అన్నలుఁ దమ్ములుఁ గలుగుట । యున్నతుఁ జేయు నృపు నెంత యొఱపి ళ్ళయినన్
మన్ననయు నీగియును సం । పన్నంబులు గాఁగ వారిఁ బాటించు టురున్. 356

ప్రతిపదార్థం: అన్నలున్+తమ్ములున్+కలుగుట= అన్నలనూ తమ్ముళ్ళనూ కలిగి ఉండటం అనేది; నృపున్= రాజును; ఉన్నతున్+చేయున్= గొప్పవాడిని చేస్తుంది; ఎంత+ఒఱపిళ్ళు+అయినన్= ఎంత అయోగ్యులైనప్పటికీ; వారిన్= ఆ అన్నదమ్ములను; మన్ననయున్= గౌరవించటమూ; ఈగియును= ధనమిచ్చి ఆదరించటమూ; సంపన్నంబులు+కాఁగన్= సమృద్ధమయ్యేటట్టు; పాటించుట+ఉరున్= ఆదరించటమే సముచితం.

తాత్పర్యం: రాజునకు అన్నలు తమ్ములు ఉండటంవలన అతడు గొప్పవాడుగా గుర్తించబడతాడు. అన్నదమ్ములు ఎంత అయోగ్యులైనప్పటికీ వారిని మన్నించి, ధనమిచ్చి సమృద్ధమయ్యే రీతిలో ఆదరించటమే సముచితం.

వ. అది యెట్లంటేని. 357

తాత్పర్యం: అదెట్లాగంటే - (తరువాతి పద్యంతో అన్వయం).

క. బలఁగము గల భూపాలుఁడు । గెలని మహీశ్వరుల బుద్ధికిని వ్రేఁగగుచున్
బలియుఁ డగు; లేని వానిం । జులుకంగాఁ జూతు రెట్టి శూరుం డైనన్. 358

ప్రతిపదార్థం: బలఁగము+కల= బంధుమిత్రాదులు గల; భూపాలుఁడు= రాజు; కెలని= చుట్టు ప్రక్కల ఉన్న (సమీపంలోని); మహీ+ఈశ్వరుల బుద్ధికిని= రాజుల మనస్సులకు; వ్రేఁగు+అగుచున్= భారమవుతూ; బలియుఁడు+అగున్= బలవంతుడు అవుతాడు; ఎట్టి శూరుండు+ఐనన్= ఎట్లాంటి పరాక్రమవంతుడైనా; లేనివానిన్= బలగం లేనివాడిని; చులుకంగాన్+చూతురు= తేలికగా చూస్తారు.

తాత్పర్యం: బంధుమిత్రాదుల బలగం ఉన్న రాజు చుట్టుప్రక్కల ఉన్నవారికి భయంకలిగిస్తూ బలవంతుడవుతాడు. ఎంత పరాక్రమం కలవాడైనా బలగం లేనివాడైతే అతడిని తేలికగా చూస్తారు.

క. ఎక్కువ తక్కువ మాటలు । నుక్కివములు బంది గీడు లొందించుటలుం
బెక్కు దన యన్నదమ్ముల । దిక్కున నన్నియును సైఁపఁ దేజము సేయున్. 359

ప్రతిపదార్థం: ఎక్కువ తక్కువ మాటలు= పెద్దచేసి తక్కువ చేసి మాటలాడే మాటలు; ఉక్కివములు= కపటాలు; బంది+కీడులు+ఒందించుటలున్= నిర్బంధించటమూ ఆపదలు కలిగించటమూ అనే; పెక్కు= పెక్కింటిని; తన అన్న+తమ్ముల దిక్కునన్= తన అన్నదమ్ముల పక్షాన; సైఁపన్= సహించటం; తేజము+చేయున్= తేజస్సును కలిగిస్తుంది.

తాత్పర్యం: ఎక్కువ తక్కువ మాటలు, కపటాలు, నిర్బంధించటం, ఆపదలు కలిగించటం మొదలైన అనేకమైన వెన్ని ఉన్నా, అన్నింటిని అన్నదమ్ముల పట్ల సహించటం రాజునకు తేజః కారణ మవుతుంది. అంటే ఎంతో శోభావహం అవుతుం దని అర్థం.

క. లోపల రాఁజుచుఁ బొగయుచు । బాపంబులు దలఁతు రోపి బలిమియు వెఱపుం
జూపక తక్కరు కెలనికి । నేపాటను వారి నడపు టెంతయు నొప్పున్. 360

ప్రతిపదార్థం: లోపలన్= లోలోపలే; రాఁజుచున్+పొగయుచున్= నిప్పు రగులుకొంటూ పొగబారుతున్నట్లు; పాపంబులు= చేసిన తప్పిదాలను; తలఁతురు= ఆలోచిస్తారు; ఓపి= సహించి (శక్తితో); బలిమియున్= బలాన్ని; వెఱపున్+చూపక= భయాన్ని ప్రదర్శించకుండా; తక్కరు= వదలరు; కెలనికిన్= ప్రక్కవారికి; వారిన్= అట్లాంటి వారిని (దుష్టులను); ఏ పాటను= ఏ విధంగానైనా; అడఁపుట+ఎంతయున్+ఒప్పున్= నాశనం చేయటం మిక్కిలి మంచిది.

తాత్పర్యం: లోలోపలే నిప్పు రగిలి పొగబారుతున్నట్లు, దుర్మార్గులు రాజు దోషాలను గూర్చి ఆలోచిస్తూ ఉంటారు. వీలు చూచికొని ఓపికతో తమ బలాన్ని చూపి భయపెట్టకుండా ఉండరు. అట్లాంటి దుష్టులైనవారిని ఏ విధంగానైనా నాశనం చేయటం మంచిది. ఇది రాజనీతి.

తే. చాలుదురు వారు నృపతికి మేలు సేయఁ। గీడొనర్పంగఁ; గావునఁ గిల్బిషములఁ
బొరయ కుండంగ వారల నరసికొనుచుఁ। బొదివి నడపుట కార్యంబు భూవిభునకు.' 361

ప్రతిపదార్థం: నృపతికిన్= రాజునకు; వారు= అట్లాంటివారు; మేలు+చేయన్+కీడు+ఒనర్పంగన్ చాలుదురు= మేలు చేయటానికి గానీ ఆపదలు కూర్చటానికి గానీ తగుదురు (సమర్థులు); కావునన్= కాబట్టి; భూ విభునకున్= రాజునకు; కిల్బిషములన్+ పొరయకుండంగన్= పాపాలు సోకకుండా (కలుగకుండా); వారలన్+అరసికొనుచున్= అట్లాంటి వారిని; జాగరూకతతో పరిశీలించుకొంటూ; పొదివి నడపుట= కమ్ముకొని నడిపించటం; కార్యము= కర్తవ్యం.

తాత్పర్యం: అట్లాంటివాళ్ళు రాజుకు తామను కొంటే మేలుకానీ, కీడుకానీ చేయటానికి సమర్థులై ఉంటారు. తమ కేమాత్రం పాపం అంటనట్లు వాళ్ళను జాగరూకతతో చూస్తూ కమ్ముకొని నడిపించటమే రాజునకు కర్తవ్యం.'

వ. అనుటయు ధర్మజుండు 'ధనార్జనం బేమిటం బ్రస్ఫుటంబై నడచు?'నని యడిగిన యతనికి భీష్ముం డిట్లనియె. 362

ప్రతిపదార్థం: అనుటయున్= అని భీష్ముడు చెప్పగా; ధర్మజుండు= ధర్మరాజు; ధన+ఆర్జనంబు= ధన సంపాదనం; ఏమిటన్+ప్రస్ఫుటంబు+ఐ నడచున్= దేనివలన స్పష్టంగా కొనసాగుతుందో; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతనికిన్= ఆ ధర్మరాజుకు; భీష్ముండు+ఇట్లు+అనియెన్= భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: రాజు నడుచుకొనవలసిన తీరునుగూర్చి భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'ధనసంపాదనం ఏ విధంగా ప్రస్ఫుటంగా కొనసాగుతుందో తెలుపు' మని అడిగినప్పుడు భీష్ముడు ఇట్లా సమాధానం చెప్పాడు.

కాలక వృక్షీయ క్షేమదర్శి సంవాద ప్రకారము (సం. 12-83-1)

క. ఆయతికాఁడు వలయు నర। నాయకునకు వానికెల్ల నరులుం జేటుం
జేయఁ దలంతురు దా నవ। ధాయకు డై కావవలయు ధరణిపుఁ డతనిన్. 363

ప్రతిపదార్థం: నరనాయకునకున్= రాజునకు; ఆయతికాఁడు= ధనార్జనపరుడు; వలయున్= అవసరం; వానికిన్+ఎల్లనరులున్= అట్లాంటి ధనార్జనపరునకు ప్రజలంతా; చేటున్+చేయన్+తలంతురు= కీడు కలిగించటానికి ఆలోచిస్తారు; ధరణిపుఁడు= రాజు; తాన్= తాను; అవధాయకుఁడు+ఐ= ఏకాగ్రత కలవాడై (హెచ్చరిక కలవాడై); అతనిన్= ఆ ధనార్జనుడిని; కావన్ వలయున్= సంరక్షించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజుకు ధనార్జనాపరుడైన వ్యక్తి కావాలి. అట్లాంటి ధనార్జనా పరుడికి కీడు కలిగించటానికి ప్రజలు ఆలోచిస్తూ ఉంటారు. అట్లాంటి విషయాన్ని గ్రహించి రాజు అవధాన పరత్వంతో అతడిని సంరక్షించుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

వ. ఈ యర్థంబున నితిహాసంబు గల దాకర్ణింపుము; కాలక వృక్షీయ నామధేయుం డగు నొక్కముని క్షేమదర్శి యనియెడు కోసల భూవిభుని భూమికిం బంజరస్థంబుఁ జేసికొని యొక్క కాకంబుఁ దెచ్చి యిప్పక్షి త్రైకాల్యవేది యని యెల్ల జనంబులకుం జెప్పుచుఁ దిరిగి క్రమంబున రాజుం గని యతని కక్కాకంబుఁ జూపి 'నీయం దర్థార్జనాది నృప కార్యంబువలన నేమఱుట గలదు; దానం బుట్టిన సేగియెల్ల నిప్పులుఁగు సెప్పి నీకుం దప్పిన మ్రుచ్చులం బట్టింపఁ జాలు' నను పలుకు వలికి యమ్మహీవరు నాదరంబు వడసి వీడుఁ బట్టున కరిగిన. 364

ప్రతిపదార్థం: ఈ+అర్థంబునన్= ఈ విషయాన్ని తెలిపే; ఇతిహాసంబు+కలదు+ఆకర్ణింపుము= ఒక పూర్వ కథ ఉన్నది వినుము; కాలక వృక్షీయ నామధేయుండు+అగున్+ఒక్కముని= కాలక వృక్షీయుడనే పేరు కలిగిన ఒక మహర్షి; క్షేమదర్శి+అనియెడు= క్షేమదర్శి అనే పేరుగల; కోసల భూ విభుని భూమికిన్= కోసల దేశాధిపతిఅయిన క్షేమదర్శి రాజ్యానికి; పంజరస్థంబున్+చేసికొని= పంజరంలో ఉంచుకొని; ఒక్కకాకంబున్+తెచ్చి= ఒక కాకిని తెచ్చి; ఆ+పక్షి= ఆ కాకి; త్రైకాల్యవేది+అని= మూడు కాలాలను తెలిసికొన్నదని; ఎల్ల జనంబులకున్+చెప్పుచున్+తిరిగి= ప్రజలందరికీ తెలియజేస్తూ తిరిగి; క్రమంబునన్= క్రమంగా; రాజున్+కని= క్షేమదర్శి అనే రాజును దర్శించి; అతనికిన్= ఆ రాజునకు; ఆ+కాకంబున్+చూపి= ఆ కాకిని చూపించి; నీ+అందున్+అర్థ+ఆర్జన+ఆది= నీలో ధనార్జన మొదలైన; నృపకార్యంబుల వలనన్= రాజకార్యాలవలన; ఏమఱుట+కలదు= ఏమరుపాటు ఉన్నది; దానన్+పుట్టినసేగి+ఎల్లన్= అందువలన కలిగిన ఆపద నంతటినీ; ఈ+పులుఁగు+చెప్పి= ఈ పక్షి (కాకి) తెలిపి; నీకున్+తప్పిన= నీ నుండి తప్పించుకొన్న; మ్రుచ్చులన్+పట్టింపన్+చాలున్= దొంగలను పట్టించగల సామర్థ్యం దీనికి ఉన్నది; అను పలుకు+పలికి= అనే మాటలు చెప్పి; ఆ+మహీవరు+ఆదరంబు+పడసి= ఆ మహారాజు అభిమానంపొంది; వీడు పట్టునకున్+అరిగినన్= వాసస్థానానికి (విడిదికి) వెళ్ళిపోగా.

తాత్పర్యం: ధర్మరాజా! రాజునకు జాగ్రత్త చాలా అవసరం. ఇందుకు తగిన కథ చెప్పుతాను. వినుము. కాలకవృక్షీయుడు ఒక ముని. అతడు కోసలాధిపతి క్షేమదర్శి రాజ్యానికి వెళ్ళాడు. పంజరంలో ఉంచిన చిలుకను చూపుతూ 'ఇది త్రికాలవేది' అనేవాడు. కాకిని రాజుకు చూపెట్టుతూ 'రాజా! నీకు ధనార్జనపట్ల ఏమరుపాటు ఉన్నది. అందువలన అనేకమైన ఆపదలు. కాని, ఈ కాకి ఆవిపత్తు లన్నిటిని నీకు విశదం చేస్తుంది. నీ ఏమరుపాటువలన తప్పించుకొన్న దొంగలను పట్టిస్తుంది' - అన్నాడు. ఆ రాజు ఆదరం పొందాడు. తన నివాసానికి కదలి వెళ్ళాడు.

క. ఆ రాత్రి యవ్విభుని యధి । కారులు సంపి రొక భంగిఁ గాకము; మఱునాఁ
డా రాజున కవ్విప్రుఁడు । గోరి రహస్యంబుఁ జేసికొని యెఱిఁగించెన్. 365

ప్రతిపదార్థం: ఆ రాత్రి= అదేరోజు రాత్రి; ఆ+విభుని+అధికారులు= ఆ రాజాధికారులు; కాకమున్= కాకిని; ఒక భంగిన్= ఏదో ఒక విధంగా; చంపిరి= చంపారు; మఱునాఁడు= ఆ మరుసటి రోజు; ఆ+విప్రుఁడు= ఆ బ్రాహ్మణుడైన కాలక వృక్షీయుడు; కోరి= ప్రార్థించి; రహస్యంబున్+చేసికొని= రహస్యాన్ని గ్రహించి; ఎఱిఁగించెన్= తెలియజేశాడు.

తాత్పర్యం: ఆ రాత్రికి రాత్రే రాజాధికారులు కొంతమంది ఆ కాకిని ఒక ఉపాయంతో చంపారు. ఆ మరుసటిరోజు ఆ బ్రాహ్మణుడైన కాలకవృక్షీయుడు ఆ రహస్యాన్ని గ్రహించి, రాజునకు తెలియజేశాడు.

వ. అట్లు నియోగుల కపటోపాయంబునం గాకి మృతం బగుట సాభిజ్ఞానంబుగా నెఱింగించి, తన పేరు సెప్పి, 'యేను మీ తండ్రి సఖుండ; నతని పిమ్మట నిచ్చట నిలువ నొల్లక వనంబున కరిగి తపంబు సేయుచుండి, నీ మీఁది యధిక స్నేహంబునంజేసి, నీ దగు యోగక్షేమంబు లరయవేఁడి వచ్చి యీ రాష్ట్రంబునం బురంబునను వర్తించుచు భవదీయ రాజ్యలక్ష్మి మధుర భంగి యయ్యును నధము లగువాని యుక్తులవలనం జోరజన సంవృతంబైన కావేరియుంబోలె నుపయోగ్య గాకునికి యెఱింగి, నీకెఱింగించుటకై మిథ్యాభివర్ణితంబైన కాకంబు నెపంబిడి చొచ్చితి; దుర్మతులైన ద్రోహులు దానిం జంపుట కతంబున లోనం గీడు గలుగుట నీకుం గొంత గాననయ్యెఁ; గనుగలిగి యరసిన నింకనుం దేటపడియెడు నా యాప్తియును, గార్య వివేకంబు కలిమియు నమ్మి మదీయోపదేశంబు నాదరింపు; మిప్పుడు నన్నాదరింపక విడిచినవాఁడ వగుము; వంచకులైన యధికార పురుషులకు నేర్పుమైఁ గ్రమంబునఁ బరస్పర విరోధంబుఁ గలిగించి సంప్రీతి సెఱిచి నీవలసిన ట్లొక నొకనిం దండింపు' మని వారలం బేరు గ్రుచ్చి యుపదేశించిన. 366

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నియోగుల= రాజాధికారుల; కపట+ఉపాయంబునన్= మోసకృత్యం వలన; కాకి మృతంబు+అగుట= కాకి చనిపోవటం; స+అభిజ్ఞానంబుగాన్+ఎఱింగించి= గుర్తుండేటట్లు తెలిపి; తన పేరు+చెప్పి= తన పేరు తెలిపి; ఏను మీ తండ్రి సఖుండన్= నేను మీ తండ్రి స్నేహితుడిని; అతని పిమ్మటన్= అతడి మరణానంతరం; ఇచ్చట నిలువన్+ఒల్లక= ఈ రాజ్యంలో ఉండటం ఇష్టంలేక; వనంబునకున్+అరిగి= అడవికి వెళ్ళి; తపంబు+చేయుచుండి= తపస్సు చేస్తూ ఉండి; నీ మీఁది= నీ పైన ఉన్న; అధిక స్నేహంబునన్+చేసి= మిక్కిలి మైత్రివలన; నీది+అగు= నీ యొక్క; యోగక్షేమంబులు+అరయన్ వేఁడి వచ్చి= బాగోగులు తెలిసికొనటానికి వచ్చి; ఈ రాష్ట్రంబునన్+పురంబునను వర్తించుచున్= ఈ రాజ్యంలో నీ పట్టణంలో తిరుగుతూ; భవదీయ రాజ్యలక్ష్మి= నీ రాజ్యలక్ష్మి; మధుర భంగి+అయ్యునున్= మనోహరమైనప్పటికీ; అధములు+అగువాని యుక్తులవలనన్= నీచుల కపటాలోచనలవలన; చోర సంవృతంబు+ఐన కావేరియున్+పోలెన్= దొంగలతో కూడిన కావేరి నదీ ప్రాంతంవలె; ఉపయోగ్య+కాక+ఉనికి+ఎఱింగి= ఉపయోగ పడటం లేదని తెలిసి; నీకున్+ఎఱింగించుటకై= నీకు తెలియజేయటానికి; మిథ్య+అభివర్ణితంబు+ఐన= అబద్ధంగా వివరించిన; కాకంబు నెపంబు+ఇడి చొచ్చితిన్= కాకి కారణంగా వచ్చాను; దుర్మతులు+ఐన ద్రోహులు= దుర్మార్గులైన ద్రోహచింతనా పరులు; దానిన్+చంపుట కతంబునన్= ఆ కాకిని చంపటం కారణంగా; లోనన్+కీడు+కలుగుట= లోలోపలే ఆపద కలగటం; నీకున్+కొంత+కానన్+అయ్యెన్= నీకూ కొంత తెలిసింది; కను+కలిగి+అరసినన్= జాగరూకతతో గమనిస్తే; ఇంకనున్+తేట పడియెడున్= ఇంకా నీకు స్పష్టమౌతుంది; నా+ఆప్తియున్= నేను ఆప్తుడిని కావటమూ; కార్యవివేకంబు కలిమియున్ నమ్మి= కార్యాలోచన అనే వివేక సంపదను విశ్వసించి; మదీయ+ఉపదేశంబున్+ఆదరింపుము= నా ప్రబోధాన్ని మన్నించుము; ఇప్పుడు నన్నున్+ఆదరింపక= ఈ సమయంలో నన్ను గౌరవించక; విడిచినవాఁడవు+అగుము= నన్ను వదలిపెట్టినట్లు నటించుము; వంచకులు+ఐన= మోసకారులైన; అధికార పురుషులకున్= రాజాధికారులకు; నేర్పుమైన్= సామర్థ్యంతో; క్రమంబునన్= క్రమంగా; పరస్పర విరోధంబు+కలిగించి= వారిలో వారికి శత్రుత్వం కల్పించి; సంప్రీతి+చెఱిచి= వారి సంతోషాన్ని చెడగొట్టి; నీవలసిన+అట్లు+ఒకని+ఒకనిన్= నీకు సాధ్యమైన రీతిలో ఒక్కొక్కరిని; దండిపుము+అని= శిక్షించవలసిందని; వారలన్+పేరు+క్రుచ్చి= ఆ దోషులైనవారి పేర్లు పేర్కొని; ఉపదేశించినన్= బోధించగా.

తాత్పర్యం: ఆ విధంగా అధికారుల మోసంవలన కాకి చంపబడటాన్ని ఉదాహరణపూర్వకంగా నిరూపించి, తాను కాలకవృక్షీయుడనే ముని నని చెప్పి, 'మీ తండ్రి మిత్రుడిని. అతడి మరణానంతరం దుష్టులతో నిండిన ఈ దేశంలో జీవించటం ఇష్టంలేక అరణ్యంలో తపస్సు చేసికొంటూ వచ్చాను. నీ మీది వాత్సల్యంతో నీ యోగక్షేమాలు తెలిసికొనగోరి, నీ రాజ్యంలో నీ పట్టణంలో తిరుగుతూ నీ రాజ్యరమ మనోహరమైనా నీచుల నియోగంవలన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దొంగలచేత చుట్టబడ్డ కావేరీ తీరంవలె, ఉపకరించటంలేదని తెలిసికొని, నీకు ఈ విషయం స్పష్టం చేయటానికి కపటోపాయంతో కాకి త్రికాలవేది అనే నెపంతో నీ దగ్గరకు వచ్చాను. దుష్టబుద్ధులైన రాజాధికారులు కొందరు కాకిని చంపటంతో వాళ్ళ దౌష్ట్యం కొంత నీకు తెలిసింది. జాగరూకుడవై పరిశీలిస్తే నీకు ఇంకా విదితమవుతుంది. నేను నీకు లభించటాన్ని, నా కార్యవివేక సంపదను విశ్వసించి నా ప్రబోధాన్ని మన్నించుము. ప్రస్తుతం నన్ను మన్నించక వదలినట్లు నటించుము. మోసకారులైన రాజాధికారులకు నేర్పుతో వాళ్ళలో వాళ్ళకే విరోధాలు కల్పించి, వాళ్ళ సంతోషాన్ని భంగపరచి ఒక్కొక్కళ్ళను శిక్షించుము' అని పేరు పేరున దుష్టులను పేర్కొని ప్రబోధించగా - (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆ రాజు నట్ల చేసి మ । హారాజ్య స్థితికి నెల్ల నవ్విప్రు మహో
దారగుణు మంత్రిఁగాఁ గొని । సారధనప్రీతి సుఖ యశంబులు వడసెన్.' 367

ప్రతిపదార్థం: ఆ రాజు= ఆ క్షేమదర్శి అనే రాజు; అట్ల చేసి= కాలక వృక్షీయ మహర్షి చెప్పినట్లు దుష్టులను శిక్షించి; మహారాజ్య స్థితికిన్+ఎల్లన్= ఆ కోసల రాజ్యానికి అంతటికీ; ఆ విప్రున్= ఆ బ్రాహ్మణుడైన కాలక వృక్షీయుడిని; మహా+ఉదార గుణున్= మిక్కిలి గొప్ప గుణాలు కలవాడిని; మంత్రిన్+కాన్+కొని= మంత్రిగా నియమించి; సారధన ప్రీతి సుఖయశంబులు+పడసెన్= శ్రేష్ఠమైన ధనం, సంతోషం, సుఖం, కీర్తి అనే వాటిని పొందాడు.

తాత్పర్యం: క్షేమదర్శి అనే రాజు కాలకవృక్షీయుడి హితబోధను అనుసరించి దుష్టులను శిక్షించి, ఉత్తమగుణఖని అయిన అతడిని మంత్రిగా నియమించి, అతడి సాచివ్యంతో రాజ్యపాలన సాగించి శ్రేష్ఠమైన ధనం, సంతోషం, సుఖం, కీర్తి పొందాడు.'

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు 'మంత్రి యెట్టివాఁడు గావలయు నెఱింగింపు' మనుటయు గాంగేయుం డతని కిట్లనియె. 368

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా విని; కౌంతేయ+అగ్రజుండు= కుంతీ పుత్రులలో పెద్దవాడైన ధర్మరాజు; మంత్రి+ఎట్టివాఁడు+కావలయున్= మంత్రి ఎలాంటివాడై ఉండాలో; ఎఱింగింపుము+అనుటయున్= తెలుపవలసిందని కోరగా; గాంగేయుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ధర్మరాజుతో భీష్ముడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అప్పుడు ధర్మరాజు 'మంత్రి ఎట్లాంటి గుణగరిష్ఠుడై ఉండాలో తెలుపు'మని కోరగా భీష్ముడు ఇట్లా చెప్పాడు.

సీ. 'జ్ఞానపరుఁడుఁ బౌర జానపదాప్తుండుఁ । గార్యజ్ఞుఁడును ధైర్యశౌర్యఘనుఁడు
నక్రూరుఁడును విశుద్ధాత్ముండుఁ బతియెడ । భక్తను రాగ సంభ్రమము లెసఁగ
సమ సుఖదుఃఖుఁడై చెమరు నెత్తురు గాఁగఁ । దలఁచుచు నరయక తప్పు మీఁదఁ
బెట్టిన నలుకమైఁ బట్టినఁ గలఁక దా । నొందక తేర్చుచోఁ బొందు సెడక

తే. మెలఁగు వాఁడును నిజరంధ్రములకు మాటు । సేయఁ బరరంధ్రములు గని చిక్కువఱుపఁ
జాలు నిపుణుండు నైన విశాలబుద్ధి । గావలయు మంత్రిముఖ్యుండు గౌరవేంద్ర! 369

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కౌరవులలో శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; మంత్రి ముఖ్యుండు= మంత్రి శ్రేష్ఠుడు; జ్ఞానపరుఁడున్= ఉత్తమ జ్ఞాన సంపన్నుడూ; పౌరజానపద+ఆప్తుండున్= పౌరులకూ, జానపదులకూ ఆత్మీయుడూ; కార్యజ్ఞుఁడును= కార్యవేత్తా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధైర్యశౌర్య ఘనుఁడున్= ధైర్య పరాక్రమాలలో గొప్పవాడూ; అక్రూరుఁడును= క్రౌర్యం లేనివాడూ; విశుద్ధ+ఆత్ముండున్= పరిశుద్ధాత్మ కలవాడూ; పతి+ఎడన్= రాజుపట్ల; భక్తి+అనురాగ సంభ్రమములు+ఎసగన్= భక్తి ప్రేమభావాలు అధికం కాగా; సమసుఖదుఃఖుఁడు+ఐ= సుఖ దుఃఖాలను సమంగా స్వీకరించగల వాడై; చెమరు= చెమట; నెత్తురు+కాఁగన్+తలఁచుచున్= రక్తంగా భావించి; అరయక; తెలియక= తప్పు మీఁదన్+పెట్టినన్= ఏదేని దోషం తనమీద మోపినా; అలుకమైన్= కోపంతో; తిట్టినన్= దూషించినా; తాన్= తాను; కలఁక= కలత; ఒందక= చెందక; తేర్చుచోన్+పొందు+చెడక= అనునయించేటప్పుడు స్నేహం చెడక; మెలఁగువాఁడును= జాగకరూకతతో మసలుకొనేవాడూ; నిజ రంధ్రములకున్= తన రాజ్య సంబంధి దోషాలను; మాటు+చేయన్= కప్పిపుచ్చగల; పరరంధ్రములు+కని= శత్రువుల దోషాలను తెలిసికొని; చిక్కు+పఱుపన్+చాలు నిపుణుండు+ఐన= కష్టాలపాలు చేయగల నేర్పరి అయిన; విశాలబుద్ధి= విస్తృతమైన బుద్ధి సంపన్నుడు; కావలయున్= కావాలి.

తాత్పర్యం: 'జ్ఞానధనుడూ, పౌరజానపదులకు ఆప్తుడు, కార్యవేత్త, ధైర్యపరాక్రమాలలో గొప్పవాడూ, క్రౌర్యం లేనివాడు, పరిశుద్ధాత్ముడు, రాజుపట్ల భక్తి గౌరవాతిశయాలతో సుఖదుఃఖాలను సమంగా స్వీకరించగల వాడు, చెమటను రక్తంగా భావించి తెలియక తనపై దోషారోపణ చేసినా, కోపంతో దూషించినా, ఏ మాత్రం కలతచెందక అనునయంతో రాజు పొందు చెడకుండా మసలుకొనగలవాడూ, తమ దోషాలను కప్పిపుచ్చుతూ, శత్రువుల లోపాలను గుర్తించి వాళ్ళను చిక్కులపాలు చేయగల నైపుణ్యంకలవాడూ అయిన విశాలబుద్ధిగలవాడు మంత్రిగా ఉండటానికి అర్హుడు.'

వ. అని చెప్పి. 370

తాత్పర్యం: అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పి.

క. 'మృదు మధుర వాక్యముల నిం। పొదవెడు చిఱునవ్వుతోడ నుర్వీశుఁడు స
మ్మదము సచివులకుఁ బ్రజలకు । నొదవింపఁగవలయు;నది మహోన్నతిఁ జేయున్. 371

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశుఁడు= రాజు; సచివులకున్+ప్రజలకున్= మంత్రులకు, ప్రజలకు; మృదు మధుర వాక్యములన్= మెత్తని తియ్యనైన మాటలతో; చిఱునవ్వుతోడన్= దరహాసంతో; సమ్మదమున్= సంతోషాన్ని; ఒదవింపఁగన్ వలయున్= కలిగించవలసి ఉన్నది; అది మహా+ఉన్నతిన్+చేయున్= అది గొప్పదనాన్ని చేకూరుస్తుంది.

తాత్పర్యం: 'రాజు తన మంత్రులకు, ప్రజలకు మెత్తని తియ్యని మాటలతో సంతోషాన్ని కలిగించే చిరునవ్వుతో సమ్మదం చేకూర్చవలసి ఉన్నది. అది రాజునకు ఎంతో ఔన్నత్యాన్ని కలిగిస్తుంది.

తే. ఈగియును బ్రియ వచన సంయోగమునన । కాని జనులకు సంతోషకారి గాదు
పుచ్చి కొనునప్డు పల్కుల పొందుకలిమి । యెదిరి మదిఁ గందనీ దింత యెఱుఁగు మధిప!' 372

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; ఈగియును= దానంవలనగాని; ప్రియవచన సంయోగమునన కాని= ప్రియమైన మాటలతోగాని; జనులకున్ సంతోషకారి+కాదు= ప్రజలకు సంతోషం కలుగదు; పుచ్చికొనునప్డు= గ్రహించేటప్పుడు; పల్కుల పొందు కలిమి= మాటల పొందిక అనే సంపద; ఎదిరి మదిన్+కందన్+ఈదు= శత్రువుల మనస్సులను పీడించదు; ఇంత+ఎఱుఁగుము= ఈ సంగతి తెలిసికొమ్ము.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! దానంతోగాని, ప్రియమైన మాటలతోగాని ప్రజలకు సంతోషం కలుగదు. స్వీకరించే సమయంలో చక్కని మాటల పొందిక శత్రువుల మనస్సులను బాధించదు. దీనిని జాగరూకుడవై తెలిసికొమ్ము.

వ. అనుటయు ధర్మతనయుండు 'జనంబుల వివాదం బుడుపు నపుడు పుడమిఱేఁడు దూఱునుం బాపంబును బొరయకుండు తెఱంగు దెలుపవే 'యనిన దేవవ్రతుం డిట్లనియె. 373

ప్రతిపదార్థం: అనుటయున్= అని భీష్ముడు అనగా; ధర్మతనయుండు= ధర్మరాజు; జనంబుల వివాదంబు+ఉడుపునపుడు= ప్రజల తగాదాలను తీర్చేటప్పుడు; పుడమిఱేఁడు= రాజునకు; దూఱునున్+పాపంబును+పొరయకుండు తెఱంగు+తెలుపవే+అనినన్= నింద, పాపం సోకకుండా ఉండే మార్గం తెలుపుమని అనగా; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'ప్రజలలో కలిగే వివాదాలలో తీర్పు చెప్పేటప్పుడు రాజునకు ఎట్లాంటి నింద, పాపం, సోకకుండా ఉండే మార్గం ఏదో తెలుపు' మని ధర్మరాజు అడుగగా భీష్ముడు ఇట్లా చెప్పాడు.

సీ. 'వ్యవహారశుద్ధి సర్వ ప్రజా ప్రియకారి; । యదియ భూపతికి ధర్మాతిశయముఁ
గీర్తియుఁ జేయు; నక్షీణసత్యులు ధర్మ । పరులును నైన భూసురులు నీవు
ద్రాసులుం బోని చిత్తంబుల తోడుత । బ్రజ వివాదము లెడఁ బక్ష ముడిగి
విని ధన వాంఛమై ధనికుల దెస వ్రాలి । తీర్పక ధర్మంబు తెరువు దప్ప

ఆ. కుండఁ బాడిఁ దీర్చి దండింపఁ దగునెడ । ననుగుణంపు దండ మాచరింపు
మొఱఁగఁ బలికితేని నుండదు ప్రజ డేగఁ । గనిన పులుఁగుపిండు కరణిఁ జెదరు. 374

ప్రతిపదార్థం: భూపతికిన్= రాజునకు; వ్యవహారశుద్ధి= వ్యవహారంలో పరిశుద్ధత; సర్వప్రజా ప్రియకారి= సమస్త ప్రజలకూ సంతోషాన్ని గూర్చేది; అదియ= అదే; ధర్మ+అతిశయమున్= ధర్మాధికారాన్ని; కీర్తియున్+చేయున్= యశస్సును చేకూరుస్తుంది; అక్షీణ సత్యులు= ఏ మాత్రం సత్యం దప్పనివారు; ధర్మపరులు+ఐన= ధర్మాత్ములైన; భూసురులున్= భూదేవతలైన బ్రాహ్మణులు; ఈవున్= నీవును; త్రాసులున్+పోని చిత్తంబులతోడుతన్= త్రాసులవంటి మనస్సులతో; ప్రజ వివాదములు+ఎడన్= ప్రజల వివాదాలను పరిష్కరించే సందర్భంలో; పక్షము+ఉడిగి విని= పక్షపాతబుద్ధి లేక విని; ధనవాంఛమైన్= ధనంమీది ఆసక్తితో; ధనికుల దెస వ్రాలి తీర్పక= ధనికుల పక్షం వహించి తీర్పు చెప్పక; ధర్మంబుతెరువు+తప్పకుండన్= ధర్మమార్గం తప్పకుండా; పాడిన్+తీర్చి= న్యాయమైన తీర్పు చెప్పి; దండింపన్+తగున్+ఎడన్= శిక్షించవలసిన సందర్భంలో; అనుగుణము+దండము+ఆచరింపుము= తదుచితమైన శిక్ష విధించవలసింది; ఒఱఁగన్+పలికితి(వి)+ఏనిన్= పక్షపాతబుద్ధితో తీర్పు చెప్పితే; ప్రజ ఉండదు= ప్రజలు రాజాశ్రయంలో ఉండరు; డేగన్+కనిన= డేగను చూచిన; పులుఁగు పిండు కరణిన్+చెదరున్= పక్షుల సమూహంవలె చెదరిపోతారు.

తాత్పర్యం: 'వ్యవహారాలలో పరిశుద్ధత రాజునకు అవసరం. అదే సర్వప్రజలకు ప్రీతిని చేకూరుస్తుంది. అందువలన ధర్మాధిక్యమూ, కీర్తీ కలుగుతాయి. నిత్యసత్య వచనులు, ధర్మాత్ములు అయిన బ్రాహ్మణులూ నీవూ త్రాసులతో సమానమైన మనస్సులతో ప్రజల వివాదాలు తీర్చేటప్పుడు పక్షపాతం లేకుండా ఇరుపక్షాలవారి వాదనలను విని ధనాశతో ఐశ్వర్యవంతుల వైపు మొగ్గకుండా, న్యాయమైన తీర్పు చెప్పి శిక్షించవలసిన పట్ల, తదుచితమైన శిక్ష విధించాలి. పక్షపాతబుద్ధితో తీర్పు చెప్పితే డేగను చూచిన పక్షులు చెల్లా చెదరైపోయినట్లు ప్రజలు రాజాశ్రయంలో ఉండరు.

విశేషం: అలం: ఉపమ.

వ. దండించుట దానును. 375

తాత్పర్యం: శిక్షించటంలో తానూ - (తరువాతి పద్యంతో అన్వయం).

క. నఱకుట యర్థముఁ గొనుటయు । జెఱ నునుచుట కట్టి యడిచి చేడ్పాటొందం
బఱచుట మొదలుగఁ గల పలు । దెఱఁగులఁ దగవుమెయి నడచు ధీరవిచారా! 376

ప్రతిపదార్థం: ధీర విచారా!= ధీర విచారుడవైన ఓ ధర్మరాజా!; నఱకుట= ఖండించటం (సంహరించటం); అర్థమున్+కొనుటయున్= ధనం గ్రహించటం; చెఱన్+ఉనుచుట= కారాగారంలో బంధించటం; కట్టి= కట్టివేసి; అడిచి= అణచిపెట్టి; చేడ్పాటు+ఒందన్+పఱచుట= నాశనం చేయటం; మొదలుగన్+కల= మొదలైన; పలుతెఱఁగులన్= అనేక రీతులలో; తగవు మెయిన్= న్యాయమైన రీతిలో; నడచున్= ప్రవర్తిస్తాడు.

తాత్పర్యం: 'ధీరవిచారుడ వైన ఓ ధర్మరాజా! ఖండించటం అంటే శిరశ్ఛేదం, ధనం గ్రహించటం, కారాగారంలో బంధించటం, కట్టివేసి అడచిపెట్టి కీడు కలిగించటం మొదలైన పలురీతులలో న్యాయబద్ధంగా ప్రవర్తిస్తాడు.

వ. అని చెప్పి భీష్ముండు వెండియు ని ట్లనియె. 377

ప్రతిపదార్థం: అని చెప్పి= అని ఈ విధంగా చెప్పి; భీష్ముండు= భీష్ముడు; వెండియున్+ఇట్లు+అనియెన్= మళ్ళీ ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పై రీతిగా వివరించి భీష్ముడు ధర్మరాజుతో మళ్ళీ ఇట్లా అన్నాడు.

క. 'తన కడకు వచ్చి మొగమో । డని వాఁ డగు దూత పల్కుటకుఁ గోపింపం
జనదు జననాథునకు; దూ । తునిఁ జంపిన నరక మగుట ధ్రువ మని రార్యుల్. 378

ప్రతిపదార్థం: తనకడకున్ వచ్చి= తన ఆస్థానానికి వచ్చి; మొగము+ఓడనివాఁడు+అగు= మొగమోట మెరుగనివాడైన; దూత+పల్కుటకున్= దూత మాటలకు; జననాథునకున్= రాజునకు; కోపింపన్+చనదు= కోపగించుకొనటం సముచితం కాదు; దూతునిన్+చంపినన్= దూతను చంపినట్లైతే; నరకము+అగుట ధ్రువము+అని= నరక ప్రాప్తి తప్పదని; ఆర్యుల్= పెద్దలు; అనిరి= పలికారు.

తాత్పర్యం: దూత తన ఆస్థానానికి వచ్చి మొగమోటం లేకుండా మాట్లాడినప్పుడు ఆ మాటలకు రాజు కోపగించుకొనకూడదు. దూతను చంపితే నరకం తప్పదని పెద్దలు వక్కాణించారు.

తే. కులము, శీలంబు, హితవాక్యములును, నేర్పుఁ, । గార్యవాదిత్వ సద్వచో గౌరవంబుఁ,
దలఁపు గలుగుట, దక్షత, యలఘు గుణము । లండ్రు దూతకు నియ్యేడు నార్యజనులు. 379

ప్రతిపదార్థం: ఆర్యజనులు= పెద్దలు; దూతకున్= దూతకు (రాయబారికి); కులమున్= ఉత్తమ కులం; శీలంబున్= మంచి నడవడి; హిత వాక్యములును= మంచిని గోరి చెప్పే మాటలు; నేర్పు= నేర్పరితనం; కార్యవాదిత్వ సత్+వచః+గౌరవంబున్= కార్యసాధనకొరకు మంచి మాటలు పల్కటం; తలఁపు+కలుగుట= ఆలోచన కలగటం (సమయస్ఫూర్తి); దక్షత= సమర్థత అనే; ఈ+ఏడున్= ఈ ఏడు; అలఘు గుణములు+అండ్రు= గొప్ప గుణాలని పెద్దలు వక్కాణించారు.

తాత్పర్యం: 'ఉత్తమ కులం, మంచినడవడి, మంచినిగోరి చెప్పేమాటలు, నేర్పరితనం, కార్యసాధనకొరకు మంచి మాటలు పలకటం, సమయస్ఫూర్తి, దక్షత - అనే ఈ ఏడుగుణాలూ దూతకు ఉండవలసిన గొప్ప లక్షణాలని' పెద్దలు పలికారు.

క. మొనదీర్చు వెరవు, యంత్రము । లనేకము లొనర్చు నేర్పు, నాయుధముల వి
న్ననువును బోటుల కర్జం । బును సేనాపతికి నైజములు గావలయున్. 380

ప్రతిపదార్థం: మొన+తీర్చు వెరవున్= వ్యూహం పన్నే ఉపాయం; యంత్రములు+అనేకములు+ఒనర్చు నేర్పున్= అనేక యంత్రాలను తయారుచేయటంలో నైపుణ్యమూ; ఆయుధముల విన్ననువును= ఆయుధాలను ప్రయోగించటంలో నేర్పూ; పోటుల కర్జంబును= యుద్ధంలో సామర్థ్యం (యుద్ధకార్యాచరణం); సేనాపతికిన్= సైన్యాధిపతికి; నైజములు+కావలయున్= సహజ గుణాలై ఉండాలి.

తాత్పర్యం: యుద్ధవ్యూహాలు పన్నే ఉపాయమూ, అనేక యంత్రాల నిర్మాణంలో నైపుణ్యమూ, ఆయుధాలను ప్రయోగించటంలో నేర్పూ, యుద్ధకార్యాలలో సామర్థ్యమూ, సైన్యాధిపతికి ఉండవలసిన సహజగుణాలు.

క. తనయులనైనను నమ్మిన । జనపతి సిరి గోలుపోవుఁ; జతురతమై న
మ్మినవాఁడ పోలె నమ్మక । యునికి సకల జనుల యెడల నురవై యుండున్.' 381

ప్రతిపదార్థం: తనయులన్+ఐనను= తన పుత్రులనైనా; నమ్మిన= విశ్వసించిన; జనపతి= రాజు; సిరి+కోలుపోవున్= సంపదను పోగొట్టుకొంటాడు; చతురతమైన్= యుక్తితో; నమ్మినవాఁడ పోలెన్= విశ్వసించిన వాడివలెనే; నమ్మక+ఉనికి= నమ్మకుండా ఉండటమే; సకల జనుల+ఎడలన్= ప్రజలందరిపట్ల; ఉరవు+ఐ+ఉండున్= సముచితమై ఒప్పుతుంది.

తాత్పర్యం: రాజు తన పుత్రులనైనా మిక్కిలి నమ్మితే ఐశ్వర్యాన్ని కోల్పోతాడు. పుత్రులనే కాదు - సమస్త ప్రజలనూ నమ్మినట్లు నటిస్తూ రాజ్యపాలనం చేయటమే రాజునకు సముచిత ధర్మమై ఒప్పుతుంది.'

తే. అనిన విని పాండవాగ్రజుం 'డనఘ! పురము । భంగి యె ట్లైన మేలు? సెప్పంగ వలయు'
ననుడు నమ్మహీవిభునకు ననిమిషాప । గా తనూభవుఁ డి ట్లనుఁ బ్రీతితోడ. 382

ప్రతిపదార్థం: అనినన్= విని= అని చెప్పగా విని; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; అనఘ!= పాపరహితుడ వైన ఓ తాతా!; పురము భంగి= రాజధాని పద్ధతి; ఎట్లు+అయినన్ మేలు= ఏ విధంగా ఉంటే శ్రేయస్కరమో; చెప్పంగన్ వలయున్= తెలుపగోరుతున్నాను; అనుడున్= అని పలుకగా; ఆ+మహీవిభునకున్= ఆ మహారాజైన ధర్మరాజుతో; అనిమిష+ఆపగా తనూభవుఁడు= దేవతలనదిఅయిన గంగకుపుత్రుడైన భీష్ముడు; ప్రీతితోడన్= సంతోషంతో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కుమారుడు మొదలుకొని ప్రజలవరకూ రాజు ఏ విధమైన నమ్మకంతో ఉండాలో చెప్పగా విన్న ధర్మరాజు 'రాజధాని ఏ తీరులో ఉంటే మంచిదో తెలుపు'మని భీష్ముడిని కోరగా ఆయన సంతృప్తిపడి, ఇట్లా సమాధానం చెప్పాడు.

సీ. 'పరపు లోఁతును గల పరిఖతోఁ' బొడవును । ఘనమును నగుకోట గలిగి, తగిన
వాకిళ్ళు బలుపుఁ, గావలి నొప్ప రమ్య గృ । హవ్రాతములు గొమరారు వీథు
లందంబు లగు మేటి యంగళ్ళ నెల్ల వ । స్తువులును శోభిల్లు సుజన బహుళ
మై ధాన్యములును ఘృతాది రసద్రవ్య । ములును నానాయంత్రములును బహువి

ఆ. ధాయుధములు బిరుదు లగు యోధులును బండి । తులు విలాసినులును దూతముఖ్య
పరిజనము నెఱయఁ బరమోత్సవంబులు । మెఱయఁ బురము చెలువు మిగుల వలయు. 383

ప్రతిపదార్థం: పరపున్= విరివిగలిగి (విశాలమై); లోఁతును+కల= లోతు కలిగిన; పరిఖతోన్= అగడ్తతో; పొడవును ఘనమునున్= పొడవూ దిట్టమూ అయిన; కోట+కలిగి= కోటతో ఒప్పి; తగిన వాకిళ్ళు= అందుకు తగినట్టి ద్వారాలు; బలుపున్+కావలిన్+ఒప్పన్= వాటి వద్ద బలమైన కాపలా ఒప్పుతుండగా; రమ్యగృహ వ్రాతములు= మనోహరమైన భవన సమూహాలు (భవన సముదాయాలు); కొమరారు వీథులు= మనోజ్ఞమైన వీథులు; అందంబులు+అగు= అందమైన; మేటి+అంగళ్ళన్= పెద్ద పెద్ద దుకాణాలతో; ఎల్ల వస్తువులును శోభిల్లన్= సమస్త వస్తు సముదాయం శోభిస్తూ ఉండగా; సుజన బహుళము+ఐ= సజ్జన సమూహం గలదై; ధాన్యములును= వివిధ ధాన్యరాశులూ; ఘృత+ఆది రసద్రవ్యములును= నేయి నూనె మొదలైన రసద్రవ్యాలు; నానాయంత్రములును= వివిధ యంత్రాలతో; బహువిధ+ఆయుధములున్= అనేక విధాలైన ఆయుధాలూ; బిరుదులు+అగు యోధులును= ధీరులైన వీరులు; పండితులున్= విద్వాంసులు; విలాసినులును= విలాసినీ మణులు; దూత ముఖ్య పరిజనమున్= దూతమొదలైన పరివారమూ; నెరయన్= నిండి; పరమ+ఉత్సవంబులు= శ్రేష్ఠమైన పండుగలు పబ్బాలు; మెఱయన్= ప్రకాశిస్తూ ఉండగా; పురము= రాజధాని; చెలువు మిగులన్ వలయున్= మనోహరమై ఒప్పుతూ ఉండాలి.

తాత్పర్యం: విశాలమూ, లోతూ అయిన అగడ్తతో, పొడవూ దిట్టమూ అయిన కోటను కలిగి, ఆ కోటకు తగిన రీతిలో ద్వారాలు వాటికి గట్టి కాపలాతో మనోహరమైన భవన సముదాయమూ, మనోజ్ఞంగా తీర్చిదిద్దబడ్డ రాజవీథులు, అందమైన పెద్ద అంగళ్ళలో సమస్త వస్తు సముదాయమూ శోభిల్లుతూ ఉండగా, సజ్జనసమూహంతో నిండి ఉండగా, వివిధ ధాన్యరాశులు, నెయ్యి, నూనె మొదలైన రసద్రవ్యాలూ పలు యంత్రాలు, తగిన ఆయుధాలు, మేటి యోధులు, ఉత్తమ విద్వాంసులు, విలాసినీ మణులు, దూతలు మొదలైన పరివారమూ నిండి ఉండగా శ్రేష్ఠమైన ఉత్సవాలు, పండుగలు పబ్బాలు ప్రకాశిస్తూ ఉంటే రాజధాని మనోహరమై ఒప్పుతుంది.

విశేషం: ఇందులో వర్ణితమైన రాజధాని పూర్వరాజుల జీర్ణమైన కోట పేటలను పరిశీలిస్తే విదితమవుతుంది. మనోజ్ఞమైన భవన సముదాయంతో తీర్చిదిద్దినట్లు ఉండే రాజవీథులతో సమస్త వస్తు రసద్రవ్యాలతో నిండినట్టి దుకాణాలతో జనసమూహంతో, పండితులూ, కళాకారులు, విలాసినీజనం మొదలైన వారితో నగరం ప్రశస్తమై దేవసంబంధమూ, సమాజసంబంధమూ అయిన ఉత్సవాలతో పండగ పబ్బాలతో మనోహరమై రాజధాని ఉండాలని తిక్కన ఒక్క సీసంలో చక్కగా వర్ణించాడు. మూలంలో ఐదు శ్లోకాల్లో రాజధాని వర్ణనం ఉన్నది.

ఆ. అట్టి పురవరంబునందు రత్న స్వర్ణ । ముఖములగు పదార్థములకు బంధు
తతికిఁ బతి సురక్షిత స్థితి సేయువాఁ । డధిప! వినుము భూమి యరయు తెఱఁగు.' 384

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; వినుము= వినుము; అట్టి పురవరంబునందున్= అలాంటి ఉత్తమ నగరంలో; రత్న స్వర్ణ ముఖములు+అగు= నవరత్నాలు బంగారం మొదలైన; పదార్థములకున్= అమూల్య వస్తువులకు; బంధుతతికిన్= బంధు సమూహానికి; పతి= రాజు; సురక్షితస్థితి+చేయువాఁడు= రక్షణ కల్పించినవాడు; భూమి+అరయు తెఱఁగు= రాజ్యపాలన విధానం వినుము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! అట్లాంటి ఉన్నత నగరంలో నవరత్నాలు, బంగారం మొదలైన విలువగల వస్తువులకు, బంధువుల సమూహానికి రాజు సురక్షితస్థితిని కల్పించినప్పుడే రాజ్యపాలనం చేసే విధం వినుము.

వ. అని పలికి మఱియు. 385

తాత్పర్యం: అని పలికి ఇంకా భీష్ముడు ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'స్థలముఖ్యము లయ్యెడు పే । ర్కల యూళ్ళుల నెల్ల వెరవు గలిగిన విశ్వా
సులఁ బ్రభుత యిచ్చి భూపతి । నిలుప వలయు వర్ణరక్షణీయత వెలయన్. 386

ప్రతిపదార్థం: భూపతి= రాజు; స్థలముఖ్యములు+అయ్యెడు= ప్రముఖ ప్రదేశాలైన; పేరు+కల+ఊళ్ళులన్+ఎల్లన్= ప్రసిద్ధమైన పట్టణాలన్నిటిలోను; వెరవు+కలిగిన= ఉపాయం కలిగిన; విశ్వాసులన్= నమ్మదగిన వారికి; ప్రభుత+ఇచ్చి= రాజ్యాధికారం ఇచ్చి; వర్ణ రక్షణీయత వెలయన్= వర్ణాశ్రమ ధర్మ సంరక్షణం ప్రకాశించేటట్లు; నిలుప వలయున్= నియమించవలసి ఉన్నది.

తాత్పర్యం: రాజు ప్రసిద్ధ పట్టణాలన్నిటిలోను బుద్ధిశాలులూ, ఉపాయశాలులూ, విశ్వసనీయులూ అయినవారికి రాజ్యాధికారం ఇచ్చి వర్ణాశ్రమధర్మ సంరక్షణం ప్రకాశించేటట్లు చేయాలి.

క. చోరులచేఁ జెడకుండం, । గ్రూరులచేఁ జావకుండఁ గువలయ జనులన్
జారులచేఁ బడకుండ ధ । రారమణుఁడు నేర్పు గలిగి రక్షింపఁ దగున్. 387

ప్రతిపదార్థం: ధరారమణుఁడు= భూమికి భర్త అయిన రాజు; కువలయ జనులన్= భూప్రజలను; చోరులచేన్+చెడకుండన్= దొంగలవలన కీడు పొందకుండా; క్రూరులచేన్+చావక+ఉండన్= క్రూరాత్ములవలన మరణించకుండా; జారులచేన్+పడక+ఉండన్= జారులవలలో పడకుండా; నేర్పున్+కలిగి= జాగరూకతతో, నైపుణ్యంతో; రక్షింపన్+తగున్= సంరక్షించవలసి ఉన్నది.

తాత్పర్యం: రాజు తన ప్రజలను చోరులచేత కీడుపొందకుండా, క్రూరాత్ములచేత మరణించకుండా. జారుల వలలో తగులుకొనకుండా జాగరూకతతో సంరక్షించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

క. అవు బేహారముఁ, గృషియు, । న్సవరణలును బసులసొంపునన యట్లగుటన్
భువిఁ బసులు గలుగు కాఁపుల । నవనీశుఁడు గన్న ప్రజల య ట్లరయఁ దగున్. 388

ప్రతిపదార్థం: బేహారమున్= వాణిజ్యమూ; కృషియున్= వ్యవసాయమూ; సవరణలును= సేవలును; పసుల సొంపునను అవున్= పశువుల సంవృద్ధి వలననే పెంపొందుతాయి; అట్లు+అగుటన్= అందువలన; అవనీ+ఈశుఁడు= రాజు; భువిన్= తన రాజ్యంలో; పసులు+కలుగు+కాఁపులన్= పశుసంపద కలిగిన రక్షకులను; కన్న ప్రజల+అట్లు+అరయన్+తగున్= కన్న సంతానంవలె చూచుకొనటం మంచిది.

తాత్పర్యం: వాణిజ్యమూ, వ్యవసాయమూ, సేవా, పశుసంవృద్ధివలన అభివృద్ధి చెందుతాయి. కాబట్టి రాజు అట్లాంటి పశుసంపద గల వారిని కన్న సంతానంవలె ఏ లోటూ లేకుండా చూచుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

క. అరి మిగులఁ గొనుట, గ్రేపులఁ । బొరిమాలం బిదికినట్ల భూవర! కదుపున్
వెరవునఁ బెనిచిన యట్టగు । నరపతి ప్రజచేత నప్పనము దగఁ గొనినన్. 389

ప్రతిపదార్థం: భూవర!= ఓ ధర్మరాజా!; అరి= పన్ను; మిగులన్+కొనుట= ఎక్కువగా వసూలు చేయట మనేది; క్రేపులన్= దూడలను; పొరిమాలన్+పిదికిన+అట్లు= పాలు వదలకుండా పిండి చంపినట్లే; నరపతి= రాజు; ప్రజచేతన్= ప్రజలనుండి; అప్పనము+తగన్+కొనినన్= పన్నులు మొదలైన కానుకలు సముచిత రీతిని వసూలు చేస్తే; కదుపున్= ఆలమందలను; వెరవునన్= ఉపాయంతో; పెనిచిన+అట్టు+అగున్= పరిపోషించినట్లే అవుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ప్రజలనుండి పన్నులు అధికంగా వసూలు చేయటమనేది, పాలు వదలకుండా పిండి దూడలను చంపటం వంటిది. రాజు ప్రజలనుండి పన్నులు మొదలైన కానుకలను సముచిత రీతిలో వసూలు చేస్తే గోసంపదను పరిపోషించిన ట్లవుతుంది'.

బండారంబు వృద్ధి సేయుతెఱంగు భీష్ముఁడు ధర్మజునకుం జెప్పుట (సం. 12-89-1)

వ. అనిన విని పాండవాగ్రజుండు 'బండారంబు గలిగించు వెరవెట్టిది తెలుపు'మని యడిగిన నాపగాతనయుం డతని కిట్లనియె. 390

ప్రతిపదార్థం: అనినన్ విని= అని రాజు పన్నులు వసూలు చేసేటప్పుడు జాగరూకుడై ఉండాలని భీష్ముడు చెప్పగా విని; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; బండారంబు= కోశం; కలిగించు వెరవు+ఎట్టిది?= ఏర్పాటు చేసికొని అభివృద్ధి చేసే ఉపాయం ఎట్లాంటిదో; తెలుపుము+అని+అడిగినన్= తెలుపవలసిం దని కోరగా; ఆపగాతనయుండు= ఆ గంగాపుత్రుడైన భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'రాజు ప్రజలనుండి పన్నులు వసూలు చేసేటప్పుడు బహు జాగరూకుడై మసలుకొనాలని భీష్ముడు చెప్పగా, ధర్మరాజు విని, కోశాభివృద్ధికి మార్గాలను తెలుపవలసిందని కోరగా భీష్ముడు ఇట్లా సమాధానం చెప్పాడు.

క. 'విను కర్షకులును వణిజులు । ననఘా! గోరక్షకులు ధరాధీశునకున్
ధన మొడఁ గూడెడు చోటుల । ననేక విధములకు నెల్ల నాద్యస్థలముల్. 391

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; విను= జాగరూకుడవై వినుము; ధరా+అధి+ఈశునకున్= రాజునకు; కర్షకులును= రైతులు; వణిజులు= వర్తకులు; గోరక్షకులు= గోపాలకులు; ధనము+ఒడగూడెడు చోటులన్= ధనం అభివృద్ధి చెందే అంశాలలో; ఎల్లన్= అన్నిచోట్లా; ఆద్య స్థలముల్= ముఖ్యమైన పట్టులు (ఆధారాలు)

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! సావధానుడవై వినుము. రాజునకు ధనం సమకూర్చుకొనటంలో కృషీవలులు, వర్తకులు, గోపాలురు ముఖ్యమైన పట్టులు.

తే. ధనములకు ధాన్యములకు నుత్పత్తి తలము । లయినవాని కించుకయును హాని గాక
యుండఁ దనకును బండార మొదవఁ దగు ను । పార్జనము సేయవలయు భూపాలకుండు. 392

ప్రతిపదార్థం: భూపాలకుండు= రాజు; తనకును= తనకు; ధనములకున్= సంపదలకు; ధాన్యములకున్= పంటలకు; ఉత్పత్తి తలములు+అయిన= వానికి ఉత్పత్తి కారణాలైన ప్రదేశాలకు; ఇంచుకయును= కొంచెమైనా; హాని+కాక+ఉండన్= కీడు కలుగనీయకుండా; బండారము+ఒదవన్+తగు= కోశాభివృద్ధికి తగిన రీతిలో; ఉపార్జనము+చేయన్ వలయున్= సంపాదన చెయ్యాలి.

తాత్పర్యం: 'ధనధాన్యాలకు సముత్పత్తిస్థానాలైన పట్టులకు ఏ మాత్రం భంగం కలుగని రీతిలో మిక్కిలి నైపుణ్యంతో కోశాభివృద్ధికి రాజు ప్రయత్నించి తగిన రీతిలో సంపాదించాలి'.

విశేషం: ధనోత్పతికి వర్తక వాణిజ్యాలు, ధాన్యాభివృద్ధికి భూమి ఆధారాలు కాబట్టి ఇవి రాజాధీనంలోనే ఉండాలి. వాటికి హాని రానీయకుండా రాజు జాగరూకుడై కోశాభివృద్ధికి ప్రయత్నించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పులి గూనల దినుచందము। గలిగిన నంతటన నిలుచుఁ గాక ధనంబుల్
గలుగునె మీఁదం గావున। జలగ దిగిచినట్లు గొనఁగఁ జను నిల సొమ్ముల్. 393

ప్రతిపదార్థం: పులి+కూనల+తినుచందము+కలిగినన్= పులి ఈనిన వెంటనే ఆకలితో తన పిల్లలనే తినే తీరు అయితే; ధనంబుల్= సంపదలు; అంతటన= అంతటితోనే; నిలుచున్+కాక= అభివృద్ధిలేక ఆగిపోతాయి కాని; మీఁదన్+కలుగునె?= ఆపైన అభివృద్ధి కలుగుతుందా?; కావునన్= కాబట్టి; ఇలన్= భూమిపై; జలగ+తిగిచినట్లు= జలగ రక్తాన్ని లాగినట్లు; సొమ్ముల్= సంపదను; కొనఁగన్+చనున్= గ్రహించవలసి ఉంటుంది.

తాత్పర్యం: ఆకలితో పులి తన పిల్లలను తానే తిన్నట్లుగా, రాజు ప్రజలనుండి పన్నులు వసూలుచెయ్యటం ప్రారంభిస్తే కోశాభివృద్ధి చెందక ఆగిపోతుంది. అందువలన ఇతరులకు బాధకలగనీయకుండా తెలియకుండా జలగ నెత్తురు పీల్చిన రీతిలో రాజు ప్రజలనుండి ధనసంపాదన చేస్తే కోశం అభివృద్ధి చెందుతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. అరయుటఁ బ్రజ వర్ధింపఁగ। నరి యేఁటఁ గ్రమ ప్రవృద్ధ మౌనట్టులుగా
నరపతికిఁ గొనఁగ వచ్చు। న్వెరవులఁ బెంపంగఁ జాల నెఱయు ధనంబుల్. 394

ప్రతిపదార్థం: నరపతికిన్= రాజునకు; ప్రజన్= ప్రజలను; వర్ధింపఁగన్= ప్రవర్ధమానమై వెలిగేటట్లు; అరయుటయున్= జాగరూకతతో చూడటమనే దానివలన; ఏఁటన్= ప్రతి సంవత్సరమూ; అరి= పన్ను; క్రమ ప్రవృద్ధము+ఔనట్టులుగాన్= క్రమాభివృద్ధి పొందేటట్లుగా; కొనఁగన్ వచ్చున్= గ్రహించవచ్చును; వెరవులన్= ఉపాయాలతో; పెంపంగన్= అభివృద్ధి చేస్తే; ధనంబుల్= సంపదలు; చాలన్ నెఱయున్= అధికంగావచ్చి నిండుతాయి.

తాత్పర్యం: ప్రజాభివృద్ధికరమైన పనులు చేస్తూ, జాగరూకతతో పరిపాలించే రాజు ప్రతి సంవత్సరమూ క్రమాభివృద్ధి పొందేటట్లుగా గ్రహించవచ్చును. మూర్ఖపు పట్టుదలతోగాక, చక్కటి ఉపాయాలతో అభివృద్ధిచేస్తే తప్పకుండా కోశం ధనంతో నిండుతుంది.

క. దమియింపఁ దగిన వారల। సమయమున దమించి, వారి సంపదలు మహీ
రమణుండు దనదు బండా। రముగా సమకూర్చు జనము రాగిల్లంగన్. 395

ప్రతిపదార్థం: మహీరమణుండు= భూ భర్త అయిన రాజు; దమియింపన్+తగిన వారలన్= అణచివేయవలసిన వారిని; సమయమునన్= తగిన సమయంలో శిక్షించి; వారి సంపదలు= వారి సంపదలన్నిటినీ; జనము= ప్రజలు; రాగిల్లంగన్= సంతోషించేటట్లు; తనదు బండారము+కాన్= తన బొక్కసంగా; సమకూర్చున్= నింపుకొంటాడు.

తాత్పర్యం: 'రాజు తగిన సమయంలో శిక్షించవలసినవారిని దండించి, వారి సంపదలన్నింటిని గ్రహించి, ప్రజలు సంతోషించేటట్లుగా తన బొక్కసాన్ని నింపుకోవాలి'.

క. ఆ పనికిఁ గీడు రోయుచు। భూపాలుఁడు ధనము గలుగు పురుషుల సిరిఁ దా
జూ పోపక కొనఁ దగదు, ద। యాపరుఁడై పెంపవలయు నఖిలజనములన్. 396

ప్రతిపదార్థం: భూపాలుఁడు= రాజు; ధనము+కలుగు= ధనమున్నట్టి; పురుషుల సిరిన్= ప్రజల సంపదలకు; చూపు+ఓపక= కన్నుగుట్టి; కొనన్+తగదు= బలవంతంగా స్వాధీనం చేసికొనకూడదు; ఆ పనికిన్+కీడు రోయుచున్= అట్లాంటి పనికి ఆపద

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కలుగుతుందని అసహ్యించుకొని; దయాపరుఁడు+ఐ= కరుణాళువై; అఖిల జనములన్= సమస్త ప్రజలనూ; పెంపన్ వలయున్= అభివృద్ధి పరచాలి.

తాత్పర్యం: 'రాజు ధనవంతులైన ప్రజల సిరిసంపదలను చూచి ఓర్చుకొనలేక బలవంతంగా, అన్యాయంగా స్వాధీనం చేసికొనకూడదు. అట్లా చెయ్యటంవలన కీడు కలుగుతుందని గ్రహించి దయాంతఃకరణుడై అందరికీ ఆనందం కలిగించే రీతిలో ప్రజలను పాలించాలి'.

క. ప్రభువుల నుపచారంబుల । విభుఁ డనురాగిల్లఁ జేసి వెదగొనుఁ గాఁపుల్
సభయులు గాకుండ ధనం । బుభయ జగత్సిద్ధి పొంటె నుర్వీనాథా! 397

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= ఓ రాజా!; విభుఁడు= రాజు; ప్రభువులన్= సామంత రాజులను; ఉపచారంబులన్= తగిన గౌరవాదరాలతో; అనురాగిల్లన్+చేసి= కూరిమి నెరపి; కాఁపుల్= కర్షకులు; సభయులు+కాక+ఉండన్= భయంతో కూడినవారు కాకుండా; (భయ రహితంగా); ఉభయ జగత్+సిద్ధి పొంటెన్= ఇహపరలోకాలలో సిద్ధి పొందటంకొరకు; ధనంబు= సంపదను; వెద+కొనున్= అద నెరిగి గ్రహిస్తాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఉచితజ్ఞుడైన రాజు ఉభయలోకాలలో సిద్ధిపొందటంకొరకు సామంతరాజులను గౌరవాదరాలతో సమాదరించి కూరిమి నెరపి కర్షకులు భయభ్రాంతులు కాకుండా, అద నెరిగి పన్నులు వసూలు చేసి బొక్కసం నింపుకొంటాడు'.

క. ఆయతి కిమ్మెయిఁ గలుగు ను । పాయంబులు ధర్మమార్గ ఫలితంబులుగాఁ
జేయుటయును మేలు నృపతికి । మాయాకృతి నిపుణు డగుట మతిగాదు సుమీ! 398

ప్రతిపదార్థం: నృపతికిన్= రాజునకు; ఆయతికిన్+ ~~ఈ~~+మెయిన్+కలుగు= ధనసంపాదనకు (రాబడి) ~~ఈ~~ విధంగా కలిగే; ఉపాయంబులు= ఉచిత మార్గాలు; ధర్మమార్గఫలితంబులు+కాన్+చేయుటయును మేలు= ధర్మమార్గ ప్రయోజనాలుగా చేయటమే సముచితం; మాయాకృతి నిపుణుఁడు+అగుట= కపట కార్యాలలో నేర్పరి కావటం; మతి+కాదు సుమీ!= మంచిబుద్ధి లక్షణం కాదు సుమా!

తాత్పర్యం: 'రాజు ధనసంపాదనకు ఉచితమైన మార్గాలోచనల ఫలితంగా చేయటమే సముచితం. అంతేగాని, పన్నులు రాబట్టటంలో కపటోపాయాలలో నైపుణ్యం సాధించి ప్రవర్తించటం బుద్ధిమంతుడైన రాజునకు ఎంతమాత్రమూ సమంజసం కాదు'.

క. ధనము సవరించినఁ బ్రయో । జన మేమి యపాత్రములకుఁ జల్లి చెఱుచు నే
ని నరేంద్రముఖ్య! వ్యయములు । విను రక్షయ సిరికిఁ బాత్ర విషయము లైనన్. 399

ప్రతిపదార్థం: నర+ఇంద్ర ముఖ్య= రాజశ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; విను= సావధానంగా విను; అపాత్రములకున్+చల్లి= అర్హులు కానివారికి వెదజల్లి; చెఱుచున్+ఏని= నాశనం చేసేటట్లయితే; ధనము సవరించినన్= ధనాన్ని సంపాదిస్తే మాత్రం; ప్రయోజనము+ఏమి= ఫలితం ఏమిటి?; పాత్ర విషయములు+ఐనన్= అర్హులైనవారి విషయంలో అయితే; వ్యయములు= వెచ్చించటాలు; సిరికిన్= సంపదలకు; రక్షయ= సంరక్షణమే.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! సావధానుడవై వినుము. అపాత్రదానం చేసి ధనం వినాశనం చేసేటట్లయితే ఆ ధన సంపాదనవలన ప్రయోజనం లేదు. అయితే పాత్రదానం చేసి సిరిసంపదలను వెచ్చిస్తే మాత్రం ఆ సంపదకు అది సంరక్షణమేగాని నిష్ప్రయోజనం మాత్రం కాదు. కాబట్టి పాత్రదానం ముఖ్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ధనము ఉన్నందుకు దానం చెయ్యటమే ప్రయోజనం. ఊరికే కూడబెట్టినందువలన ప్రయోజనం లేదు. అయితే పాత్రా పాత్రవివేచన కలిగి దానం చెయ్యాలి. అర్హులైన వారికి దానం చేయటమనేది ముఖ్యం. అప్రాతదానం అనుచితం. పాత్రదానం చెయ్యటం వలన ఆ ధనానికి సంరక్షణమే గాని అన్యం కాదు' అని భీష్ముడి భావన.

వ. ఈ భంగి యైనం గోశ మిత్త్ర రాష్ట్ర బలంబులు వృద్ధిఁ బొందు; నీ విట్టి తెఱంగువాఁడవై ప్రజల రక్షింపుము. రణంబుల కలయక విరోధుల వధియింపుము మఖంబు లొనరింపుము ; దరిద్రులైన ధరణీసురాది సాధుల నరసి కుటుంబ రక్షణంబు సేయుము; మాంధాతృనకు నాంగిరసుం డగు నుతథ్యుండు సెప్పిన హిత వాక్యంబు లుపన్యసించెద; నాకర్ణింపుము. 400

ప్రతిపదార్థం: ఈ భంగి+ఐనన్= ఈ పద్ధతిని నీవు పాటిస్తే; కోశమిత్త్ర రాష్ట్రంబులున్= భండాగారం, స్నేహితులు, రాష్ట్రం, సైన్యబలం మొదలైనవన్నీ; వృద్ధిన్+పొందున్= అభివృద్ధి చెందుతాయి; ఈవు+ఇట్టి తెఱంగువాఁడవు+ఐ= నీవు ఈ మార్గంలో నడుస్తూ; ప్రజలన్ రక్షింపుము= ప్రజలను కాపాడుము; రణంబులకున్+అలయక= యుద్ధాలకు భయపడక; విరోధులన్ వధియింపుము= శత్రువులను సంహరించుము; మఖంబులు+ఒనరింపుము= యజ్ఞయాగాదులు చేయుము; దరిద్రులు+ఐన= దారిద్ర్యంతో బాధపడుతున్న; ధరణీసుర+ఆది సాధులన్+అరసి= భూ దేవులైన బ్రాహ్మణులు మొదలైన సాధువులను గమనించి; కుటుంబ రక్షణంబు+చేయుము= అట్లాంటివారి కుటుంబాలను సంరక్షించుము (ఈ సందర్భంలో); మాంధాతృనకున్= మాంధాత అనే రాజుకు; ఆంగిరసుండు+అగు= అంగిరస వంశీకుడైన; ఉతథ్యుండు= ఉతథ్యుడనే మహర్షి; చెప్పిన హిత వాక్యంబులు= ప్రబోధించిన హిత వచనాలు; ఉపన్యసించెదన్+ఆకర్ణింపుము= ప్రసంగిస్తాను - సావధానంతో వినుము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఈ రీతిగా నీవు నడచుకొన్నట్లయితే నీ భాండాగారంతోపాటు మిత్రబృందం, రాష్ట్రం, సైన్యం అభ్యున్నతి పొందుతుంది. కాబట్టి, ఈ మార్గంలో పయనించి ప్రజలను రక్షించుము. యుద్ధాలకు భయపడవద్దు. పరాక్రమాన్ని ప్రదర్శించి శత్రువులను సంహరించుము. యజ్ఞయాగాదులు ఆచరించి, దరిద్రులైన బ్రాహ్మణులు మొదలైన సాధుజనులను పరిశీలించి వారి కుటుంబాలను రక్షించుము. ఈ సందర్భంలో మాంధాతమహారాజునకు ఆంగిరసుడైన ఉతథ్యుడనే మహర్షి చెప్పిన హితవచనాలను ప్రసంగిస్తాను. సావధాన చిత్తుడవై వినుము' అని భీష్ముడు పలికాడు.

మాంధాతృన కుతథ్యుఁడు సెప్పిన హితవాక్యముల ప్రకారము (సం. 12-91-1)

తే. భూత వృద్ధులు ధనలాభములును గలుగు। ధర్మమును రాజనువాఁడు ధర్మరక్ష
కై జనించెను గావున నతఁ డరోష। కాముఁడై ధర్మనిరతుండు గాఁగ వలయు. 401

ప్రతిపదార్థం: ధర్మమునను= ధర్మంవలనే; భూతవృద్ధులు= ప్రాణికోటి అభివృద్ధులు; ధనలాభములును+కలుగున్= అత్యధిక ధనాభివృద్ధులు కలుగుతాయి; రాజు+అనువాఁడు= రాజనేవాడు; ధర్మరక్షణకున్+ఐ= ధర్మ సంరక్షణకొరకే; జనించెను= జన్మించాడు; కావునన్= కాబట్టి; అతఁడు= ఆ రాజు; అరోషకాముఁడు+ఐ= అహంకారం, కామం లేనివాడై; ధర్మనిరతుండు+కాఁగన్ వలయున్= ధర్మంపట్ల అత్యంతాసక్తి కలవాడై ఉండటం అవసరం.

తాత్పర్యం: 'ధర్మంవలననే ప్రాణికోటి అభివృద్ధి చెందుతుంది. అత్యంత ధనలాభం కలుగుతుంది. రాజనేవాడు ధర్మసంరక్షణకొరకే జన్మించాడు. అందుచేత అహంకార, కామ వివర్జితుడై ధర్మాసక్తుడై రాజు పరిపాలన చేయవలసి ఉంటుంది'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వినుధర్మమునకు బ్రాహ్మణ। జనము జననదేశ మగుట జనపతి భక్తిం
గొనియాడి యసూయా వ। ర్జనుఁడై తగు విప్రకోటి సంభావింపన్. 402

ప్రతిపదార్థం: విను= సావధానుడవై వినుము; ధర్మమునకున్= ధర్మానికి; జననదేశము= పుట్టుకచోటు; బ్రాహ్మణ జనము= బ్రాహ్మణులే; అగుటన్= కావటంవలన; జనపతి= రాజు; అసూయావర్జనుఁడు+ఐ= అసూయను తొలగించుకొన్నవాడై (లేనివాడై); విప్రకోటి(న్)= బ్రాహ్మణ సమూహాన్ని; భక్తిన్+కొనియాడి= భక్తితో ప్రశంసించి; సంభావింపన్+తగున్= గౌరవించటం యుక్తం.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! సావధానుడవై వినుము. ధర్మానికి జన్మస్థానం బ్రాహ్మణులే. కాబట్టి రాజు అసూయా రహితుడై బ్రాహ్మణ సమూహాన్ని పూజించి గౌరవించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది'.

చ. అనిమిషులున్ విభీతు లగునట్టి పదంబునఁ బేర్చి మున్ విరో
చన తనయుండు భూమిసురజాతి సువృత్తి కసూయచేసి నె
ట్టన సిరిఁ బాయడే? బలి దృఢంబగు భక్తివిశేషమూఁదఁగా
ననఘ! యతండు దాఁ బిదప నవ్యయసౌఖ్య విభూతి నొందఁడే? 403

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; మున్= పూర్వం; విరోచన తనయుండు= విరోచనుడి కుమారుడు; బలి= బలిచక్రవర్తి; అనిమిషులున్= దేవతలు సైతం; విభీతులు+అగునట్టి= భయపడేటట్లు; పదంబునన్+పేర్చి= పదవిలో అతిశయించి; భూమిసురజాతి= బ్రాహ్మణజాతి; సువృత్తికిన్+అసూయచేసి= ఉత్తమ ధర్మమార్గానికి అసూయపడి; నెట్టన= అనివార్యంగా; సిరిన్+పాయఁడే?= సంపదను పోగొట్టుకొనలేదా?; దృఢంబు+అగు= మిక్కిలి దృఢమైన; భక్తి విశేషము+ఊఁదన్+కాన్= భక్తి ప్రపత్తిని ఆధారం చేసుకొని; పిదపన్= ఆ తరువాత; అతండు= ఆ బలిచక్రవర్తి; తాన్= తాను; అవ్యయ సౌఖ్యవిభూతిన్= స్థిర సుఖ సంపదలను; ఒందఁడే?= పొందలేదా? (పొందాడు కదా!).

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! పూర్వం విరోచనపుత్రు డైన బలి దేవతలు సైతం భయభ్రాంతు లయ్యేటట్లు ఉన్నత పదవిలో విజృంభించి, బ్రాహ్మణుల ధర్మప్రవర్తనకు అసూయ పడి సమస్తసంపదలను కోల్పోయాడు. కాని, ఆ పిమ్మట దృఢమైన భక్తిప్రపత్తిని ఆధారం చేసికొనగా అతడే స్థిరమైన సుఖసంపదలను పొందాడు'.

ఆ. ధర్మమునకు సిరికిఁ దగ జనించినయది। దర్ప; మనిమిషులు నుదాత్తమునులు
నైన నగ్గుణమున నూనినఁ జెడుదురు। దాని గెలువవలయు ధరణిపునకు. 404

ప్రతిపదార్థం: ధర్మమునకున్= ధర్మానికి; సిరికిన్= సంపదకు; దర్పము= గర్వం; తగన్ జనించిన అది= పుట్టింది; అనిమిషులున్= దేవతలైనా; ఉదాత్తమునులున్+ఐనన్= ఉత్తమ మహర్షులైనా; ఆ+గుణమునన= ఆ గర్వమనే గుణాన్నే; ఊనినన్= పూనినట్లయితే; చెడుదురు= నాశనమౌతారు; ధరణిపునకున్= రాజు; దానిన్ గెలువన్ వలయున్= దానిని గెలువ వలసి ఉన్నది.

తాత్పర్యం: 'ధర్మానికి, సంపదకు దర్పమనే దుర్గుణం పుట్టింది. అయితే దేవతలైనా, మునీశ్వరులైనా ఆ దుర్గుణానికి లోనైతే నాశనమైపోతారు. కాబట్టి రాజు ఈ దర్పమనే దుర్గుణాన్ని నిశ్శేషంగా జయించవలసి ఉంటుంది.'

మ. పరనారీగమనాదిదోషములు భూపాలుండు సేయంగఁ ద
ద్ధరకున్ వర్షము లేకయుండుఁ; బ్రజకున్ దైన్యంబు వాటిల్లుఁ; బె
క్కు రుజల్ పైకొను; నెందునుం గలయ నుక్కుం దేజముం దక్కుఁను
ద్ధుర సైన్యంబుల శత్రు లొత్తుదురు; బంధుశ్రేణికిం జే టగున్. 405

ప్రతిపదార్థం: భూపాలుండు= రాజు; పరనారీగమన+ఆది దోషములు= పరస్త్రీని కోరి పొందటం మొదలైన తప్పిదాలు; చేయంగన్= చేయటంవలన; తద్+ధరకున్= ఆ రాజ్యంలో; వర్షము లేక+ఉండున్= వానలు కురవకుండా పోతాయి; ప్రజకున్= ప్రజలకు; దైన్యంబు+పాటిల్లున్= దీన భావం కలుగుతుంది; పెక్కు రుజల్= అనేక రోగాలు; పైకొనున్= పైబడి వ్యాపిస్తాయి; ఎందునున్+కలయన్= అన్నిచోట్లా వ్యాపించి; ఉక్కున్+తేజమున్+తక్కున్= పరాక్రమమూ, తేజస్సూ నశించిపోతాయి; శత్రులు= శత్రువులు; ఉద్ధుర సైన్యంబులన్= బలమైన సైన్యాలతో; ఒత్తుదురు= బాధిస్తారు (నాశనం చేస్తారు); బంధుశ్రేణికిన్= బంధువుల సమూహానికి; చేటు+అగున్= కీడు కలుగుతుంది.

తాత్పర్యం: 'రాజు పరస్త్రీలోలత్వం మొదలైన దుర్గుణాలతో ప్రవర్తిస్తే అతడి రాజ్యంలో వర్షాలు కురువవు. ప్రజలు దైన్యానికి లోనవుతారు. అనేక రోగాలు వ్యాపిస్తాయి. అవి అన్నిచోట్లా వ్యాపించటంవలన పరాక్రమమూ తేజస్సూ నశిస్తాయి. శత్రువులు బలమైన సైన్యంతో బాధిస్తారు. బంధుజనులకు కీడు కలుగుతుంది'.

విశేషం: కాబట్టి రాజు ఉత్తమ గుణ సంపన్నుడై, దుశ్శీలుడు గాక సమస్త ప్రజానీకానికి ఆదర్శ ప్రాయుడై ఉండి ప్రజలను కన్న సంతానంవలె పోషించాలి. వాస్తవానికి రాజు దుష్టుడైతే ప్రజలు అదే రీతిగా ఉంటారు. ఈ భావానికి మూలం 'యథారాజా తథాప్రజా' అనే సూక్తి.

క. కాని చెయిదములు సేయ క । నూనపు ధర్మమున నడచు నుర్వీశుఁడు సం
తానము బంధులుఁ బ్రజయును । దానును సేనలును శుభము దలకొనఁ బేర్చున్.' 406

ప్రతిపదార్థం: కాని చెయిదములు+చేయక= కానిపనులు చేయకుండా; అనూనపు ధర్మమునన్ నడచు= పరిపూర్ణ ధర్మమార్గంలో నడిచే; ఉర్వీ+ఈశుఁడు= భూమికి భర్త అయిన రాజు; తానును= తానూ; సంతానమున్= పుత్ర పౌత్రాదులూ; బంధువులున్= బంధువులు; ప్రజయునున్= ప్రజలూ; సేనలును= చతురంగ బలాలూ; శుభము+తలకొనన్+పేర్చున్= అత్యంత శుభాలు చేకూరి అతిశయిస్తారు.

తాత్పర్యం: 'చెడ్డపనులు చేయకుండా, పరిపూర్ణ ధర్మమార్గంలో నడచుకొనే రాజు సంతానం, బంధుమిత్రులు, ప్రజలు, చతురంగబలాలు మొదలైన సమస్తశుభాలతో కలకాలం సంతోషంగా జీవిస్తారు'.

విశేషం: పైన పేర్కొన్నట్లు రాజు ఉత్తమ గుణఖని అయితే సమస్త ప్రజలూ సుఖసంపదలతో విలసిల్లుతారు. రాజు సంతానం, బంధుమిత్రులు ఆనందిస్తారు.

వ. అని యిట్లు సెప్పిన వాక్యంబులం దెలివొంది ధర్మతత్పరుండై మాంధాతృండు మహావిభూతిం బొంది నెగడె; నీవును నట్ల నెగడు' మనిన ధర్మతనయుండు 'ధర్మంబున నెగడ దొరకొనుట యెట్టి భంగిం గలుగు?'నని యడుగుటయు, నతనితో నక్కురుపితామహుండు దొల్లి కౌసల్యుం డగు వసుమనుం డనురాజు వామదేవ మహాముని నిట్ల యడిగిన నతం డతనికి నుపదేశించిన తెఱం గెఱింగెద విను మని యిట్లనియె. 407

ప్రతిపదార్థం: అని+ఇట్లు+చెప్పిన వాక్యంబులన్= అని ఈ విధంగా ఉతథ్యుడనే మహర్షి చెప్పిన వచనాల వలన; తెలివి+ఒంది= బుద్ధిమంతు డైన; ధర్మతత్పరుండు+ఐ= ధర్మాసక్తుడై; మాంధాతృండు= మాంధాత అనే రాజు; మహావిభూతిన్+పొంది నెగడెన్= గొప్ప సంపదలను పొంది ప్రసిద్ధి గాంచాడు; ఈవునున్= నీవూ; అట్ల నెగడుము+అనినన్= అదే రీతిగా ప్రసిద్ధి పొందుమని అనగా; ధర్మతనయుఁడు= ధర్మరాజు; ధర్మంబునన్= ధర్మమార్గంలో; నెగడన్ దొరకొనుట= వర్ధిల్లటానికి పూనుకొనటం; ఎట్టి భంగిన్+కలుగున్+అని+అడుగుటయున్= ఏ విధంగా సాధ్యమౌతుందని అడుగగా; అతనితోన్= ఆ ధర్మరాజుతో; ఆ+కురు పితామహుండు= ఆ కౌరవ పితామహుడైన భీష్ముడు; తొల్లి= పూర్వం; కౌసల్యుండు+అగు= కోసలదేశాధీశు డైన;

వసుమనుండు+అనురాజు= వసుమనుం డనే రాజు; వామదేవ మహామునిన్+ఇట్లు+అ+అడిగినన్= వామదేవుడనే మహర్షిని ఇదే రీతిని అడుగగా; అతండు+అతనికిన్= ఆ వామదేవుడు వసుమనునికి; ఉపదేశించిన తెఱంగు+ఎఱింగించెదన్= ప్రబోధించిన తీరును తెలుపుతాను; వినుము+అని= వినవలసిందని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'రాజు ధర్మవర్తనుడు కావాలని ఉతథుడు చెప్పగా విన్న మాంధాత జ్ఞానవంతుడై ధర్మాసక్తితో నడచుకొని సమస్త సంపదలతో వర్ధిల్లాడు. అదే రీతిగా నీవు సైతం ప్రసిద్ధి పొందవలసిం'దని భీష్ముడు ధర్మరాజుకు ఉపదేశించాడు. అప్పుడు ధర్మరాజు ధర్మమార్గానువర్తనంతో ఏ రీతి ప్రఖ్యాతి పొందవచ్చునో చెప్పవలసిందని కోరగా భీష్ముడు కోసలదేశాధిపతి అయిన వసుమనుడు అనేరాజు వామదేవుడనే మహర్షిని ఇదే రీతిగా ప్రశ్నించినప్పుడు అతనికి ప్రబోధించిన తీరును వివరిస్తాను విను మని చెప్పాడు.'

వసుమనుం డను రాజునకు వామదేవుండు సెప్పిన ధర్మప్రకారము (సం. 12-93-1)

ఆ. అర్థసిద్ధికంటె నరయ నెక్కుడు ధర్మ । సిద్ధి; దాన సకల సిద్ధులును బ్ర
శస్త భంగిఁ జేరు; శాశ్వత కీర్తియు । సంభవించుఁ; గలుగు సద్గతియును. 408

ప్రతిపదార్థం: అరయన్= పరిశీలించగా; అర్థసిద్ధికంటెన్= ధన సంపాదనకంటె; ధర్మార్థ సిద్ధి ఎక్కుడు= ధర్మాన్ని సిద్ధింపజేసికొనటమే మంచిది; దానన్= దానివలన; ప్రశస్త భంగిన్= ప్రఖ్యాత పద్ధతిలో; సకల సిద్ధులునున్= సమస్తమైన ప్రయోజనాలు; చేరున్= సమకూరుతాయి; శాశ్వత కీర్తియున్ సంభవించున్= శాశ్వత కీర్తికూడా కలుగుతుంది; సత్+గతియును కలుగున్= ఉత్తమ లోకాలు ప్రాప్తిస్తాయి.

తాత్పర్యం: 'పరిశీలించి చూడగా, ధనసంపాదనకంటె ధర్మాన్ని సిద్ధింపజేసికొనటం శ్రేష్ఠం. ధర్మసిద్ధివలన సమస్త ప్రయోజనాలూ సిద్ధిస్తాయి. శాశ్వతకీర్తితోపాటు ఇహపరలోకాలలో సిద్ధి కలుగుతుంది.

క. ధనమునకై ధర్మము దెస । ననాదరము సేసెనేని నా నృపతికి న
ద్ధనమును జెడు; దుర్యశముం । బనుగొనుఁ దుది దుర్గతియును బాటిలు ననఘా! 409

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; ధనమునకున్+ఐ= ధనం కూడబెట్టటం కొరకు; ధర్మము దెసన్= ధర్మాన్ని గూర్చి; అనాదరము+చేసెన్+ఏనిన్= అశ్రద్ధతో ఉన్నట్లయితే; ఆ నృపతికిన్= అట్లాంటి రాజునకు; ఆ+ధనమును+చెడున్= ఆ సంపాదించిన ధనమూ నశిస్తుంది; దుస్+యశమున్+పనుగొనున్= దుష్కీర్తి కలుగుతుంది; తుదిన్= చివరకు; దుస్+గతియున్+పాటిలున్= నరకలోకం ప్రాప్తిస్తుంది.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ధనం కూడబెట్టటమే ధ్యేయంగా భావించి ధర్మాన్ని లెక్కచేయకపోతే, ఆ రాజు సంపాదించిన ధనం నాశనం కావటమే కాక, అతడికి దుష్కీర్తి, నరక ప్రాప్తి సంభవిస్తాయి.

క. లాభంబు ధర్మముఖ్యము । గా భరపడి మార్గశుద్ధి గనుఁగొని కైకో
లా భూవరునకు నిహపర । శోభనములు సేత చెప్పు శ్రుతి వాక్యంబుల్. 410

ప్రతిపదార్థం: ధర్మముఖ్యముగాన్= ధర్మ ప్రధానంగా; లాభంబు= ధన లాభాన్ని; భరపడి= భరించి; మార్గశుద్ధి+కనుఁగొని= ఉత్తమ మార్గమని భావించి; కైకోలు= గ్రహించట మనేది; ఆ భూవరునకున్= ఆ రాజునకు; ఇహపర శోభనములు+చేఁత= ఐహికాముష్మిక సుఖాల ప్రాప్తి (అని); శ్రుతి వాక్యంబుల్ చెప్పున్= వేదవాక్యాలు వక్కాణిస్తున్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ధార్మికదృష్టితో ధనార్జన చేయటం ఉత్తమమార్గంగా భావించే రాజునకు ఇహపరసౌఖ్యాలు దక్కుతాయని శ్రుతివాక్యాలు చెప్పుతున్నాయి.'

క. ధర్మ ప్రవృత్తియయ్యును । ధర్మము నా కింతకంటెఁ దత్తద్విధులం
బేర్మిం బొరయ వలయు నను । ధార్మికతాతృష్ణ నత్యుదాత్తుఁడు వొందున్.' 411

ప్రతిపదార్థం: ధర్మ ప్రవృత్తి+అయ్యును= ధర్మస్వభావం కలిగి ఉండి కూడా; ధర్మము= ధర్మమార్గం; నాకున్+ఇంతకంటెన్= నాకు దీనికంటె; తద్+తద్+విధులన్= ఆయా కార్యకలాపాలలో; పేర్మిన్+పొరయన్ వలయున్+అను= అతిశయితంగా కలగాలని; ధార్మికతా తృష్ణన్= ధర్మమార్గ దాహంతో; అతి+ఉదాత్తుఁడు+పొందున్= మిక్కిలి ఉత్తముడు పొందుతాడు.

తాత్పర్యం: 'ధర్మస్వభావం కలవాడైనా తా ననుసరించే ధర్మమార్గం మరింతగా - అంటే ఇబ్బడిముబ్బడిగా, తాను ఆచరించే ఆయా విధులలో మిక్కిలి అతిశయితమై ఒప్పాలని ధర్మంమీది దాహంతో మిక్కిలి ఉదాత్తుడైన రాజు ఉత్తమ ఫలితాలను పొందుతాడు.'

వ. అని తన వచనంబులం దెలివొందిన వసుమనుండను రాజుతో వామదేవుండు రాజ్యతంత్రంబున కెల్ల నాధార భూతంబు లగు సామ భేద దానదండంబులం బ్రయోగించు తెఱం గెఱింగించెద నాకర్ణింపు మని యిట్లనియె. 412

ప్రతిపదార్థం: అని తన వచనంబులన్= అని వామదేవుడి పలుకులవలన; తెలివి+ఒందిన= గ్రహించిన (తెలిసికొన్న); వసుమనుండు+అనురాజుతోన్= వసుమనుడనేరాజుతో; వామదేవుండు= వామదేవుడనే మహర్షి; రాజతంత్రంబునకున్+ఎల్లన్= రాజ్య వ్యాపార నిర్వహణానికి అంతటికీ; ఆధార భూతంబులు+అగు= ప్రధాన ఆధారమైన; సామభేద దాన దండంబులన్= సామం, భేదం, దానం, దండం అనే చతురుపాయాలను; ప్రయోగించు తెఱంగు+ఎఱింగించెదన్= పాటించే విధానాన్ని వివరిస్తాను; ఆకర్ణింపుము+అని+ఇట్లు+ అనియెన్= సావధానుడవై వినవలసిందని ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'అని వామదేవుడి మాటల సారాన్ని గ్రహించిన వసుమనుడనే రాజుతో వామదేవుడు మళ్ళీ రాజ్యపాలన వ్యవహారాన్ని నడిపించటానికి ప్రధాన ఆధారమైన సామ దాన భేద దండోపాయాలనే చతురుపాయాల ప్రయోగ విధానాన్ని వివరిస్తాను; సావధాన చిత్తుడవై వినవలసిన' దని ఇట్లా వివరించాడు.

క. మూలబలము సంతుష్టం । బై లాలిత మగుచునున్న యప్పు డసదుఁ జో
టాలోకించి నడవ భూ । పాలకునకు దండ మతిశుభం బొనరించున్. 413

ప్రతిపదార్థం: మూలబలము= చతురంగ బలంలోని ప్రధాన సైన్యం; సంతుష్టంబు+ఐ= సంతృప్తి పొంది; లాలితము+అగుచున్+ఉన్న+ అప్పుడు= లాలింపబడుతున్నప్పుడు; అసదు+చోటు+ఆలోకించి= శత్రువుల అసమర్థతను కనిపెట్టి; నడవన్= శత్రువులపై యుద్ధానికి వెళితే; భూపాలకునకున్= రాజుకు; దండము= సామదాన భేద దండాలలో దండనీతి; అతిశుభంబు+ఒనరించున్= మిక్కిలి శుభాన్ని చేకూరుస్తుంది.

తాత్పర్యం: 'తన చతురంగ బలాలలో మూలబలం - అంటే ప్రధానసైన్యం - శత్రుసంహారార్థమని భావించి సంతృప్తిపొంది సంతోషంతో దానిని ప్రేమగా చూస్తున్నప్పుడు శత్రువుల అసమర్థతను గమనించి, యుద్ధానికి వెళ్ళితే రాజునకు దండనీతివలన మిక్కిలి శుభం కలుగుతుంది.

చ. సమరము సాహసం బధిక సంపద లమ్మెయిఁ దెచ్చికోలు ప
థ్యమె రిపు లేల కల్గు దురహంకృతి పెంపును నుత్కటంపుఁ గో
పము మగిడింపఁజాలు నరపాలున కట్లగుటన్ హితంబు సా
మము దనయంతవాఁ డయిన మానవనాథు నెడన్ మహీశ్వరా! 414

ప్రతిపదార్థం: మహీ+ఈశ్వరా!= ఓ రాజా!; సమరము= యుద్ధమనేది; సాహసంబు= సాహసంతో కూడినపని; ఆ+మెయిన్= ఆ రీతిగా; అధిక సంపదలు= మిక్కిలి సిరిసంపదలను; తెచ్చికోలు పథ్యమె?= సంపాదించటం హితమేమీ కాదు; అహంకృతి పెంపునున్= అతిశయితమైన అహంకారాన్ని; ఉత్కటము+కోపమున్= అత్యధికమైన కోపాన్ని; మగిడింపన్+చాలు= ఉపసంహరించుకొనగల సమర్థుడైన; నరపాలునకున్= రాజునకు; రిపులు+ఏల కల్గుదురు?= శత్రువులు ఎందుకుంటారు?; అట్లు+అగుటన్= అట్లా కావటంవలన; తన+అంతవాఁడు+అయిన= తనతో సమానుడైన; మానవ నాథు+ఎడన్= రాజుపట్ల; సామము హితంబు= సామ దాన భేద దండోపాయాలనే చతురుపాయాలలో మొదటిదైన సామమే సముచితమైనది.

తాత్పర్యం: 'ఓ రాజా! యుద్ధమనేది సాహసకృత్యం. యుద్ధం చేసి శత్రు సంహారంవలన సంపాదించే సిరిసంపదలు మేలు కలిగించవు. అతిశయితమైన అహంకారాన్ని, అత్యధికకోపాన్ని తగ్గించుకొనగలిగిన సమర్థుడైన రాజునకు శత్రువులు ఎట్లా ఉంటారు? అందువలన ఎదుటి రాజు తనంతటి శత్రువని గ్రహించినప్పుడు సామోపాయంతో ప్రవర్తించటం శ్రేష్ఠం.'

క. తన భటులు గలఁగినప్పుడు । ధన మిచ్చి విరోధి నల్పతరు నైనను శాం
తునిఁ జేయవలయు దానము । నన యధికునిఁ దేర్చు టురవు నరపతి కెపుడున్. 415

ప్రతిపదార్థం: తన భటులు= తన సైన్యంలోని వీరులు; కలఁగినప్పుడు= కలత చెందినప్పుడు (అంతఃకలహాలతో ఉన్నప్పుడు); అల్ప తరున్+ఐనన్= బలహీనుడైనా సరే; విరోధిన్= శత్రువును; ధనము+ఇచ్చి= ధనాన్ని ఇచ్చి; శాంతునిన్+చేయన్ వలయున్= శాంతుడిని చేయటమే మంచిది; ఎప్పుడున్= ఎల్లప్పుడు; నరపతికిన్= రాజునకు; అధికునిన్= తనకంటె బలవంతుడైన శత్రువును; దానముననన= సామ దాన భేద దండోపాయాలలో దానం చేతనే; తేర్చుట+ఉరవు= సంతృప్తి పరచటమే సముచితం.

తాత్పర్యం: 'తన సైన్యంలోని అంతఃకలహాలు చెలరేగితే బలహీనుడైన శత్రువునైనా ధనం ఇచ్చి సంతృప్తి పరచటమే మంచిది. రాజునకు తన కంటె బలవంతుడైన శత్రువును దానం అనే ఉపాయంతో వశం చేసికొనటమే సముచితం'.

తే. ఆ యుపాయముల్ మూఁటికి ననువుగాని । యట్టి పగతునియెడ భేద మాచరింప
వలయు రంధ్రముల్ దగవేచు వలను గలిగి । తత్పరతఁ జేయఁజాలు సాధకులఁ బనిచి. 416

ప్రతిపదార్థం: ఆ+ఉపాయముల్+మూఁటికిన్= ఆ సామ దాన దండోపాయా లనే మూటికి; అనువు+కాని= సాధ్యంకాని; అట్టి పగతుని+ఎడన్= అట్లాంటి శత్రువుపట్ల; రంధ్రముల్= లోపాలను గ్రహించి; తగన్ వేచువలను+కలిగి= తగినట్లు బాధించే అవకాశం కలిగి; తత్పరతన్+చేయన్+చాలు= శ్రద్ధతో చేసే సమర్థులైన; సాధకులన్+పనిచి= కార్యసాధకులను పంపించి; భేదము+ఆచరింపన్ వలయున్= భేదోపాయాన్ని ప్రయోగించవలసి ఉంటుంది.

తాత్పర్యం: 'పైన పేర్కొన్నట్లు సామ దాన దండోపాయాలనే మూడింటికి అవకాశం లేనప్పుడు శత్రువుపట్ల కలిగిన లోపాలను పరిశీలించి తగినవిధంగా బాధించే అవకాశం కలిగినప్పుడు శ్రద్ధతో కార్యాన్ని సాధించగలవారిని భేదోపాయానికి నియోగించటం సముచితం'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇంతవరకు సామ దాన భేద దండోపాయాలనే నాలుగింటి ప్రయోగం ఎట్లా చేయాలో రాజు శత్రువులపట్ల ఎట్లా ప్రవర్తించాలో విదితం చేయబడింది.

వ. శుక్రమతంబునం బంచమోపాయంబైన యుపేక్ష వర్తిల్లు దానిం బ్రయోగించు భంగియుం జెప్పెద.417

ప్రతిపదార్థం: శుక్రమతంబునన్= శుక్రాచార్యుడి అభిప్రాయం ప్రకారం; పంచమ+ఉపాయంబు+ఐన+ఉపేక్ష వర్తిల్లున్= సామ దాన భేద దండోపాయాలు కాక ఐదో ఉపాయమైన ఉపేక్షా భావం ఒప్పుతుంది; దానిన్+ప్రయోగించు భంగియున్+చెప్పెదన్= ఆ ఉపేక్షా భావాన్ని ప్రయోగించే విధానాన్ని సైతం వివరిస్తాను.

తాత్పర్యం: 'శుక్రాచార్యుడి అభిప్రాయం ప్రకారం సామ దాన భేద దండోపాయాలు కాక, ఉపేక్షా భావమనే మరో ఐదో ఉపాయం ఉన్నది. దానిని ప్రయోగించే తీరు తెన్నులను వివరిస్తాను'.

మ. కలహంబుల్ దమలోనఁ జేసిన నుపేక్షానైపుణం బొప్ప శ
త్రులఁ జూడందగు భూతదానవుల పోరుం జూచిన ట్లెమ్మెయి
న్ములు ముంటం దగఁ బుచ్చు భంగి గలుగు న్భూనాథ! కీడైన మం
త్రులయేపున్ విభుఁ డిట్ల మాపునది నేర్పుం బెంపుఁ బొల్పారఁగన్. 418

ప్రతిపదార్థం: భూనాథ!= ఓ రాజా!; కలహంబుల్= పోట్లాటలు; తమలోనన్+చేసినన్= తమలో తమకు కలిగినట్లయితే; ఉపేక్షా నైపుణంబు+ఒప్పన్= ఉపేక్షాభావంలో నేర్పు నైపుణ్యం ఒప్పేటట్లుగా; భూత దానవుల పోరున్+చూచిన+అట్లు= భూతాలకు రాక్షసులకు కలిగిన యుద్ధాన్ని చూసినట్లుగా; శత్రువులన్+చూడన్+తగున్= శత్రువులను చూడవలసింది; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; ముల ముంటన్+తగన్+పుచ్చు భంగి+కలుగన్= ముల్లును ముల్లుతో తీసే తీరుగానే చూడాలి; విభుఁడు= రాజు; కీడు+ఐన= ఆపదను కలిగించే; మంత్రుల+ఏపున్= మంత్రుల అతిశయాన్ని; ఇట్లు+ ఇదే విధంగా; నేర్పున్= నేర్పరితనమూ; పెంపున్= ఆధిక్యమూ; పొల్పు+ఆరఁగన్= మిక్కిలి అతిశయించేటట్లుగా; మాపునది= తొలగించేది.

తాత్పర్యం: 'ఓ రాజా! వైరం తమలో తమకే కలిగితే భూత రాక్షసులకు యుద్ధం జరిగితే ఉపేక్షించినట్లు, శత్రువులను ఉపేక్షాభావంతో చూడవలసి ఉంటుంది. ఏ విధంగానైనా ముల్లును ముల్లుతో తీసే తీరులోనే చూడాలి. రాజు తనకు ఆపదలు కలిగించే మంత్రుల అతిశయాన్ని ఇదే విధంగా తన నేర్పరితనంతో, ఆధిక్యంతో తొలగించవలసి ఉంటుంది. ఇది సామదానభేద దండోపాయాలనే నాలుగు కాక ఉపేక్ష అనే ఐదో ఉపాయం. ఇది శుక్రనీతి ప్రకారం కొనసాగింది.

విశేషం: అలం: ఉపమ.

వ. అని యత్తెఱంగున వామదేవుండు సెప్పిన హితవచనంబులు వాటించి కోసలపతి భాసమానుండయ్యెఁ; నీవును నట్ల వర్తిల్లి వలెయు'మనినఁ బాండవాగ్రజుండు 'సమరంబున శత్రుల జయించునప్పటి పాడి యెట్లుండు?' ననుటయు భీష్ముం డతని కిట్లనియె. 419

ప్రతిపదార్థం: అని+ఆ+తెఱంగునన్= అని ఆ విధంగా; వామదేవుండు= వామదేవుడనే మహర్షి; చెప్పిన హితవచనంబులు+పాటించి= చెప్పిన హిత వాక్యాలను ఆచరించి; కోసలపతి= కోసలాధిపతి అయిన వసుమను డనే రాజు; భాసమానుండు+అయ్యెన్= తేజస్వంతు డయ్యాడు; ఈవునున్= నీవుకూడా; అట్ల వర్తిల్లి వెలయుము+అనినన్= అదే రీతిగా రాజ్యపాలనం చేసి ప్రసిద్ధి పొందవలసిందని చెప్పగా; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; సమరంబునన్= యుద్ధంలో; శత్రుల జయించునప్పటి పాడి=

శత్రువులను జయించే సమయంలోని యుద్ధనీతి; ఎట్లు+ఉండున్+అనుటయున్= ఎట్లా ఉంటుందో అని అడుగగా; భీష్ముండు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'అని ఉపేక్షాభావం వహించే తీరును, వామదేవుడనే మహర్షి చెప్పిన హితవచనాలను అనుసరించి కోసలదేశాధిపతి అయిన వసుమను డనే రాజు, సూర్యసమతేజుడై వెలుగొందాడు; నీవూ అదే రీతిగా రాజ్యపాలన చేసి, ప్రకాశించవలసిం'దని చెప్పగా, ధర్మరాజు 'శత్రువులను జయించే సందర్భంలో యుద్ధనీతి ఎట్లా ఉంటుందో చెప్పు' మని అడుగగా భీష్ముడు ఈ విధంగా వివరించాడు.

ధర్మజునకు భీష్ముండు సమరంబున పాడి దెల్పుట (సం. 12-96-6)

సీ. పగవాఁడు బలములఁ బన్ని త్రోచినఁ దాను । సబలుఁడై యొంటిమై సంగరంబు
గోరిన నమ్మెయి గొనకొని మాయ లొ । నర్చిన మాయలఁ బేర్చి గెలుపు
గొనునది; వెన్నిచ్చినను బ్రమాదంబునం । బడినను గైదువు భగ్నమైన
శరణన్న మ్రొక్కినఁ దురగాళి యెడలిన । నొరుతోడఁ బోరుచునున్న నెట్టి

ఆ. పగతునైనఁ జంపఁ దగ దధర్మంబునఁ । జంపు కంటె ధర్మసమర కేలిఁ
జావు మేలు; రాజు శయ్యఁ జచ్చుట గొఱ । గాదు గాన యోడఁ గాదు పోర. 420

ప్రతిపదార్థం: పగవాఁడు= శత్రువు; బలములన్+పన్ని త్రోచినన్= సైన్యాలతో సిద్ధమై ఎదుర్కొంటే; తానున్ సబలుఁడు+ఐ= తాను కూడా సైన్యాలతో కూడినవాడై; ఒంటిమైన్= ఒంటరిగానే; సంగరంబు+కోరినన్= యుద్ధానికి సిద్ధమైతే; ఆ+మెయి+గొనకొని= అదేరీతిగా ప్రయత్నించి; మాయలు+ఒనర్చినన్= శత్రువులు మాయలు చేస్తే; మాయలన్+పేర్చి= మాయలచేతనే అతిశయించి; గెలుపు+కొనునది= విజయం సాధించాలి; వెన్ను+ఇచ్చినను= పారిపోతూ వీపు చూపినా; ప్రమాదంబునన్+పడినను= యుద్ధరంగంలో ప్రమాదవశాత్తు పడిపోయినా; కైదువు భగ్నమైనన్= ఆయుధం నాశనమైనా; శరణు+అన్నన్= రక్షణకోరినా; మ్రొక్కినన్= నమస్కరించినా; తురగ+ఆళి+ఎడలినన్= గుర్రాల సమూహం వికలమైనా (అంటే చచ్చినా, పారిపోయినా); ఒరుతోడన్= మరొక వ్యక్తితో; పోరుచున్+ఉన్నన్= యుద్ధం చేస్తున్నా; ఎట్టి పగతున్+ఐనన్= ఎట్లాంటి శత్రువునైనా; చంపన్+తగదు= చంపటం న్యాయం కాదు; అధర్మంబున్= ధర్మవిరుద్ధంగా; చంపుకంటెన్= చంపటంకంటే; ధర్మసమరకేలిన్= ధర్మయుద్ధ విహారంలో; చావు మేలు= చనిపోవటమే మంచిది; రాజు; శయ్యన్+చచ్చుట+కొఱగాదు= పడకమీదనే చనిపోవటం ప్రయోజనకారి కాదు; కాన= అందుచేత; పోరన్= యుద్ధంలో; ఓడన్+కాదు= ఓడిపోరాదు.

తాత్పర్యం: యుద్ధనీతి భీష్ముడు ధర్మరాజుకు ఉపదేశించాడు. 'యుద్ధంలో శత్రువు సైన్యాలతో సిద్ధమై ఎదుర్కొంటే నీవూ సైన్యంతో ఎదిరించాలి. శత్రువు ఎక్కటి కయ్యానికి సిద్ధమైతే నీవూ అసహాయ శూరుడవై యుద్ధం చెయ్యాలి. మాయోపాయాలతో శత్రువు యుద్ధం చేయటం ప్రారంభిస్తే నీవూ కపటోపాయాలతో ఎదిరించి విజయాన్ని సాధించాలి. వెన్నిచ్చి పారిపోయినా, ఏమరుపాటున పడిపోయినా, ఆయుధం భగ్నమైనా, శరణువేడుకొన్నా, మ్రొక్కినా, గుర్రాలు నేలపైకూలినా, పారిపోయినా, వేరొకడితో యుద్ధం చేస్తున్నా ఎట్లాంటి శత్రువునైనా చంపరాదు. అధర్మంగా శత్రువును చంపటంకంటె ధర్మయుద్ధవిహారంలో చావటం మంచిది. రాజు పడకమీద మరణించటం పనికిరాదు. అందుకని యుద్ధంలో ఓడిపోరాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విను చిల్లయిడిన యాయుధ । మును విషలిప్తమగు శస్త్రమును నెట్టియ మి
త్త్రునిపై నైనఁ బ్రయోగిం । చిన నరపతి నరకమున వసించు నృపాలా! 421

ప్రతిపదార్థం: నృపాలా!= ఓ ధర్మరాజా!; విను= సావధానుడవై వినుము; చిల్ల ఇడిన+ఆయుధమును= అగ్రభాగంలో వంకరగా ఉండే ములికిని ఉంచి తయారుచేసిన ఆయుధాన్ని, విషలిప్తము+అగు= విషంపూసినదైన; శస్త్రమునున్= ఆయుధాన్ని; ఎట్టి+అమిత్త్రునిపైన్+ఐనన్= ఎట్లాంటి శత్రువుపై అయినా; ప్రయోగించిన= యుద్ధంలో ఉపయోగించిన; నరపతి= రాజు; నరకమున వసించున్= నరకాన్ని పొందుతాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! జాగరూకతతో వినుము. అగ్రభాగంలో ములికిని ఉంచి తయారుచేసిన ఆయుధాన్ని, లేదా విషంపూసిన ఆయుధాన్ని ఎట్లాంటి శత్రువుపైనైనా ప్రయోగించకూడదు. అట్లా ప్రయోగించే రాజునకు నరకప్రాప్తి తప్పదు. ఇది యుద్ధనీతిలో భాగం' అని భీష్ముడు వివరించాడు.

క. తనకుం దోడ్పడి యని నొ । చ్చిన వానిం గాంచి కడఁగి చేష్టింపక యు
న్న నరేంద్రుఁ బొందు పాపం । బునకుఁ గొలఁది గలదె భరతపుంగవ! తలఁపన్. 422

ప్రతిపదార్థం: భరత పుంగవ!= భరత వంశంలో శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; తలఁపన్= ఆలోచించగా; తనకున్+తోడ్పడి= తనకు సహాయం చేయవచ్చి; అనిన్= నొచ్చినవానిన్+కాంచి= యుద్ధంలో పీడితుడైన వాడిని చూచి; కడఁగి= పూనుకొని; చేష్టింపక+ఉన్న= పట్టించుకొనకుండా ఉన్న; నర+ఇంద్రున్= రాజును; పొందు పాపంబునకున్= పొందే పాపానికి; కొలఁది+కలదె?= ఇంత అని లెక్క ఉన్నదా?

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! ఆలోచిస్తే యుద్ధంలో తనకు సహాయం చేయటానికి వచ్చి ఘోరంగా పీడింపబడిన వాడిని పట్టించుకొనకుండా ఉండే రాజు భయంకరమైన పాపాన్ని పొందుతాడు'.

వ. అని చెప్పి వెండియు. 423

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ (ఇట్లా అన్నాడు).

చ. అరిపయిఁ బోయి వాని పుర మగ్గలికం జెఱుపంగఁ దద్ధరం
బరఁగు ప్రజం జలంబు మెయి బాధలఁ బెట్టు టధర్మమట్టి ని
ష్ఠురత యొనర్చుటప్పటికిఁ జూడఁగ మానఁగరాదయేని భూ
సుర గృహదేవగేహముల చూఱ నవశ్యము మాన్చు టొప్పగన్.' 424

ప్రతిపదార్థం: అరిపయిన్+పోయి= శత్రువుపై యుద్ధానికి వెళ్ళి; వాని పురము= ఆ శత్రువుయొక్క పట్టణాన్ని; అగ్గలికన్+చెఱుపంగన్= పరాక్రమంతో నాశనం చెయ్యటానికి; తద్+ధరన్+పరఁగు ప్రజన్= ఆ రాజ్యంలో నివసిస్తున్న ప్రజలను; చలంబు మెయిన్= మాత్సర్యంతో; బాధలన్+పెట్టుట+అధర్మము= బాధలకు గురిచేయటం ధర్మంకాదు; అట్టి నిష్ఠురత+ఒనర్చుట= అట్లాంటి కాఠిన్యం వహించటం; అప్పటికిన్+చూడఁగన్= ఆ సమయానికి (పరిశీలించగా); మానఁగన్ రాద+ఏనిన్= మానుకొనటం వీలుకాకపోతే; భూసురగృహ= బ్రాహ్మణుల ఇళ్ళను; దేవగేహములన్= దేవతా గృహాలను (దేవాలయాలను); చూఱన్= కొల్లగొట్టట మనేది; అవశ్యము= తప్పనిసరిగా; మాన్చుట+ఒప్పు+అగున్= వదలిపెట్టటమే సముచితమవుతుంది.

తాత్పర్యం: 'శత్రువుపై దండెత్తి పోయి అతడి పట్టణాన్ని నాశనం చేయటానికి అక్కడ నివసిస్తున్న ప్రజలను మాత్సర్యంతో బాధించటం అధర్మం. అట్లాంటి కాఠిన్యాన్ని మానుకొనటం, అప్పటికి వీలుకాకపోతే కనీసం బ్రాహ్మణుల ఇళ్ళను, దేవాలయాలను కొల్లగొట్టటం తప్పనిసరిగా మానుకొనటం సముచితం'.

వ. అనిన విని యజాతశత్రుండు 'రాజధర్మంబు కంటెం బాపకర్మంబు లేదు పొ'మ్మని పలికి 'యిట్లేని రాజున కెట్లును నధోగతి వాటిల్లుఁ గదే!' యనుటయు నాపగాతనయుం డిట్లనియె. 425

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా విని; అజాతశత్రుండు= పుట్టని శత్రువులుగల ధర్మరాజు; రాజధర్మంబు కంటెన్= రాజు ఆచరించవలసిన ధర్మంకంటే; పాపకర్మంబు లేదు పొమ్ము+అని పలికి= పాపకార్యం మరొకటి నిశ్చయంగా లేదని పలికి; ఇట్లు+ఏనిన్= ఇట్లాగైతే; రాజునకున్= రాజుకు; ఎట్లునున్= ఏ విధంగానైనా; అధః+గతి= దుర్గతి; పాటిల్లున్+కదే!= ప్రాప్తిస్తుంది కదా!; అనుటయున్= అనగా; ఆపగా తనయుండు+ఇట్లు+అనియెన్= దేవతల నది అయిన గంగ పుత్రుడైన భీష్ముడు ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'యుద్ధనీతిని భీష్ముడు విశదం చేయగా విన్న ధర్మరాజు 'రాజధర్మం కంటె మరొక పాపకార్యం నిశ్చయంగా లే'దని తన అసమ్మతిని తెలిపి, 'ఎట్లా చూచినా రాజుకు నరకప్రాప్తి తప్పటం లేదు కదా!' అని పలికినప్పుడు భీష్ముడు ఇట్లా వివరించాడు.

**క. 'శరణాగతుఁ గాచియు, నని । నరిపోటులఁ బడ్డఁ దెచ్చి యరసియు, ధరణీ
సురులం బ్రోచియు, నానా । ధ్వరములు సేసియును రాజు దలుఁగు దురితముల్. 426**

ప్రతిపదార్థం: శరణ+ఆగతున్+కాచియున్= శరణుకోరిన వాడిని రక్షించి; అనిన్+అరిపోటులన్+పడ్డన్= యుద్ధంలో శత్రువుల చేత దెబ్బలు తిన్నవాడిని; తెచ్చి+అరసియు= తీసికొని వచ్చి క్షేమాలపట్ల శ్రద్ధ వహించి; ధరణీసురులన్+ప్రోచియున్= భూదేవులైన బ్రాహ్మణులను పోషించి; నానా+అధ్వరములు+చేసియును= అనేక యజ్ఞయాగాలు చేసి; రాజు దురితముల్ తలుఁగున్= రాజు పాపాలను తొలగించుకొనవచ్చును.

తాత్పర్యం: 'శరణాగతులను సంరక్షించి, యుద్ధంలో శత్రువుల బాధలకు గురి అయినవారిని తెచ్చి, వారికి తగిన సేవచేసి, బ్రాహ్మణులను పోషించి, అనేక యజ్ఞాలను నిర్వహించి, రాజు పాపాలను పరిహరించుకొనవచ్చును.'

**క. అన విని యమ్మనుజేశ్వరుఁ । 'డని ననివర్తు లయి శౌర్య మభినుతి కెక్కం
దనువుఁ దొఱఁగిన వారికి । ననఘా! యెబ్భంగి లోక మగు?' నని యడిగెన్. 427**

ప్రతిపదార్థం: అనన్ విని= అని చెప్పగా విని; ఆ+మనుజ+ఈశ్వరుండు= ఆ రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు; అనఘా!= పాపరహితుడవైన తాతా!; అనిన్+అనివర్తులు+అయి= యుద్ధంలో వెనుదిరుగని వారై; శౌర్యము+అభినుతికిన్+ఎక్కన్= పరాక్రమం ప్రఖ్యాతి పొందగా; తనువున్+తొఱఁగినవారికిన్= శరీరం పోగొట్టుకొన్న వారికి (చనిపోయినవారికి); ఏ+భంగి లోకము+అగున్?= ఎట్లాంటి లోకాలు కలుగుతాయి?; అని+అడిగెన్= అని ప్రశ్నించాడు.

తాత్పర్యం: 'రాజధర్మాన్ని అనుసరించి ప్రజాసంరక్షణ చేస్తే ఉత్తమగతులు కలుగుతా' యని భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'యుద్ధంలో వెనుదీయక అరివీరభయంకరులై పరాక్రమసంపదను ప్రదర్శించి ప్రాణాలు కోల్పోయినవారికి ఎట్లాంటి లోకాలు కలుగుతాయో తెలుపు'మని భీష్ముడిని అడిగాడు.

వ. అడుగుటయు, నమ్మహీకాంతునితో 'శాంతనవుండు శక్రాంబరీషసంవాదంబు చెప్పెద; దాన నీ యడిగినయది దేటపడు నని యిట్లనియె. 428

ప్రతిపదార్థం: అడుగుటయున్= అని అడిగిన; ఆ+మహీకాంతునితోన్= ఆ ధర్మరాజుతో; శాంతనవుండు= భీష్ముడు; శక్ర+అంబరీష సంవాదంబున్= ఇంద్రుడికి అంబరీషుడికి మధ్య జరిగిన సంభాషణను; చెప్పెదన్= చెప్పుతాను; దానన్= దానివలన; నీ+అడిగిన+అది= నీవు అడిగిన ప్రశ్న; తేటపడున్= స్పష్టపడుతుంది; అని+ఇట్లు+అనియెన్= అని ఈ విధంగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'అని ప్రశ్నించిన ధర్మరాజుతో భీష్ముడు 'ఇంద్రుడికీ అంబరీషుడికీ మధ్య జరిగిన సంభాషణను విశదం చేస్తాను; దానివలన నీవు అడిగిన ప్రశ్నకు చక్కటి సమాధానం లభిస్తుం'దని ఇట్లా వివరించాడు.

ఇంద్రాంబరీష సంవాద ప్రకారము (సం. 12-99-1)

సీ. **అంబరీషుండు నానాధ్వరంబులు సేసి । కడచని వాసవు కడకు నేఁగి,**
యచట నుజ్జ్వల విమానారూఢుఁ డును మనో । హారి సంక్రీడనోదారచరితుఁ
డును నై వెలింగెడు తనదు బంటు సుదేవుఁ । డను వానిఁ జూచి యయ్యనిమిషేంద్రు
తోడ మదీయభృత్యుఁడు వీఁడు క్రతుముఖ్య । కర్మముల్ సేయఁ డెక్కారణమున

తే. **ననఘ! నాకంటెఁ గడుఁ బేర్చి యునికి గలిగె । ననుడు నా జిష్ణుఁ డిమ్మహాత్ముని తెఅంగు**
సెప్పఁ జిట్టలు వినఁగ వాంఛించితేని । వినుము చెప్పెద' నని యిట్టు లనియెఁ బ్రీతి. **429**

ప్రతిపదార్థం: అంబరీషుండు= అంబరీషుడనే రాజు; నానా+అధ్వరంబులు+చేసి= అనేక యజ్ఞాలు చేసి; కడచని= మరణించి; వాసవు కడకున్+ఏఁగి= ఇంద్రునివద్దకు వెళ్ళి; అచటన్= అక్కడనే; ఉత్+జ్వల విమాన+ఆరూఢుఁడును= ప్రకాశిస్తున్న విమానం ఎక్కినవాడు; మనః+హారిసమ్+క్రీడన+ఉదార చరితుఁడును+ఐ= మనోజ్ఞమైన చక్కగా క్రీడిస్తున్న ఉత్తమ ప్రవర్తన కలవాడై; వెలింగెడు= ప్రకాశిస్తున్న; తనదు బంటు= తన సేవకుడు; సుదేవుఁడు+అనువానిన్+చూచి= సుదేవుడనే వాడిని చూచి; ఆ+అనిమిష+ఇంద్రుతోడన్= దేవతలరాజైన ఇంద్రుడితో; అనఘా!= ఓ పాపరహితుడవైన మహేంద్రా!; వీఁడు మదీయ భృత్యుఁడు= యజ్ఞయాగాది కర్మలను ఆచరించలేదు; ఏ+కారణంబునన్= ఏ కారణంవలన; నాకంటెన్+కడున్+పేర్చి= నాకంటె మిక్కిలి అతిశయించి; ఉనికి+కలిగెన్= ఉండగలిగాడు (ఈ ఉన్నత స్థితిని పొందగలిగాడు); అనుడున్= అనగానే; ఆ జిష్ణుఁడు= ఆ ఇంద్రుడు; ఈ+మహాత్ముని తెఅంగు చెప్పన్+చిట్టలు= ఈ మహాత్ముడి గూర్చి చెబితే చాలా ఆశ్చర్యకరం; వినఁగన్ వాంఛించితి(వి)+ఏని= వినాలన్న కోరిక ఉంటే; వినుము చెప్పెదన్= విను చెప్పుతాను; అని ప్రీతిన్ ఇట్టులు+అనియెన్= అని సంతోషంగా ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'అంబరీషుడనే రాజు అనేక యజ్ఞయాగాలు చేసి, ఆ పుణ్యంతో మరణించి స్వర్గలోకానికి, ఇంద్రుడి సన్నిధికి వెళ్ళాడు. అక్కడ ప్రకాశమానమైన విమానంలో అధివసించి మనోజ్ఞ క్రీడావినోదాలలో నిమగ్నుడై ఉన్న సుదేవుడనేవాడిని చూచి ఇంద్రుడితో 'వీడు నా సేవకుడు. యజ్ఞయాగాది ముఖ్యకార్యాలు ఆచరించ లేదు. మరి వీడు ఎట్లా నాకంటె విశిష్టుడై ఉన్నతంగా వెలుగొందుతున్నాడు? అని ప్రశ్నించాడు. 'ఇతడి చరిత్ర మిక్కిలి విచిత్రమైనది. వినాలన్న కోరిక ఉంటే చెప్పుతాను వినుము' అని ఇంద్రుడు ఇట్లా చెప్పాడు.

వ. **శతశృంగుం డనియెడి దానవుని తనూజులు సదముండును విదముండును దముండును ననియెడు వారలు.** **430**

ప్రతిపదార్థం: శతశృంగుండు+అనియెడి= శతశృంగు డనే; దానవుని తనూజులు= రాక్షసుడి కుమారులు; సదముండును విదముండును దముండునున్+అనియెడు వారలు= సదముడు, విదముడు, దముడు అనేవాళ్ళు.

తాత్పర్యం: శతశృంగుడనే రాక్షసుడి కుమారులైన సదముడు, విదముడు, దముడు అనేవాళ్ళు (తరువాతి పద్యంతో అన్వయం).

శా. **బాహాగర్వము సూపఁగోరి పటుదర్పం బొప్ప నుగ్రాహవో**
త్సాహం బూర్జితభంగిగా భయద ఘోషస్ఫీత నానావిధ
వ్యూహంబుల్ ధరణీప్రకంపనము లై యుద్దామ సర్వాంగ స
న్నాహత్వంబునఁ బేర్చి తోడ నడవ న్సంరంభ శుంభద్గతిన్. **431**

ప్రతిపదార్థం: బాహాగర్వము+చూపన్+కోరి= భుజ పరాక్రమాన్ని ప్రదర్శించటానికి ఇష్టపడి; పటుదర్పంబు+ఒప్పన్= మిక్కిలి గర్వాతిశయంతో; ఉగ్ర+ఆహవ+ఉత్సాహంబు= భయంకరమైన యుద్ధంపట్ల ఉత్సాహంగా; ఊర్జిత భంగి+కాన్= దృఢరీతిగా; భయద ఘోష స్ఫీత నానావిధ వ్యూహంబుల్= భయాన్ని గొల్పుతున్న శబ్దాలతో అధికమైన అనేక యుద్ధ వ్యూహాలు; ధరణీ ప్రకంపనంబులు+ఐ= భూమి సంచలనాలు; ఉద్దామ సర్వ+అంగసన్నాహత్వంబునన్+పేర్చి= అధికమైన అన్ని చతురంగ సైన్యాలతో, పరికరాలతో ఆయత్తమై అతిశయించి; సంరంభ శుంభత్+గతిన్= ఆటోపంతో కూడిన తీవ్రవేగంతో; తోడన్ నడవన్= తమతోపాటు నడుస్తూ ఉండగా.

తాత్పర్యం: శతశృంగు డనే రాక్షసుడి పుత్రులైన సదముడు, విదముడు, దముడు అనే ముగ్గురు భుజ పరాక్రమాన్ని ప్రదర్శించదలచి అత్యధిక గర్వంతో భయంకర యుద్ధోత్సాహం అత్యంతమై ఒప్పగా భయంకరమైన శబ్దాడంబరంతో అనేక యుద్ధవ్యూహాలతో భూమి దద్దరిల్లేటట్లుగా ఎదురులేనట్టి చతురంగ బలసమన్వితులై అతిశయించి, ఆటోపంతో కూడిన మహాతీవ్ర వేగంతో తమతో పాటు నడుస్తూ ఉండగా.

విశేషం: తిక్కన వీరరసోదంచితంగా ఈ శార్దూలాన్ని రచించి, తన రసాభ్యుచిత బంధశైలిని స్పష్టం చేశాడు.

ఉ. **'మంచి మగండ వైన నిను మార్కొను వారయి దాడివెట్టి యొ**
క్కించుక శంక లేక ప్రజయెల్లను బెగ్గిలముట్టి యర్థముల్
గొంచు ధరిత్రి గైకొనుటకుం గన లగ్గల మొంది యీతనిం
బంచితి సైన్యయుక్తముగఁ బార్థివ! యిట్లని పల్కి తత్తఱిన్. **432**

ప్రతిపదార్థం: పార్థివ!= ఓ అంబరీష మహారాజా!; మంచి మగండవు+ఐన= గొప్ప వీరుడ వైన; నినున్= నిన్ను; మార్కొనువారు+అయి= ఎదిరించేవారై; దాడి+పెట్టి= దండెత్తివచ్చి; ఒక్క+ఇంచుక శంక లేక= కొంచెమైనా సందేహం లేకుండా; ప్రజ+ఎల్లను= ప్రజలంతా; బెగ్గిలన్ ముట్టి= భయ భ్రాంతు లయ్యేటట్లు ముట్టడించి; అర్థముల్+కొంచున్= ధన మపహరిస్తూ; ధరిత్రి+కైకొనుటకున్= రాజ్యం కైవసం చేసికొనటానికి; కనలు+అగ్గలము+ఒంది= కోపం అతిశయించి (కోపాతిశయంతో); ఈతనిన్= ఈ సుదేవు డనే వాడిని; సైన్యయుక్తముగన్= సైన్యసమేతంగా; పంచితి(వి)= పంపించావు; ఆ+తఱిన్= ఆ సమయంలో; ఇట్లు+అని పల్కితి= ఈ విధంగా పలికావు.

తాత్పర్యం: 'ఓ అంబరీష మహారాజా! గొప్పవీరుడ వైన నిన్ను ఎదిరించే వారై సదముడు, విదముడు, దముడు అనే ముగ్గురు దండెత్తి వచ్చి, ఏ మాత్రం సందేహించక ప్రజలందరినీ భయభ్రాంతులను చేసి ముట్టడించి, బాధించి, ధన మపహరించి రాజ్యం కైవసం చేసికొనటానికి కోపాతిశయంతో నీవు ఈ సుదేవుడిని సైన్యసమేతంగా పంపించావు. ఆ సమయంలో నీవు ఈ విధంగా పలికావు.

మ. **పసగన్ వే చని దోర్బలంబున రణప్రావీణ్యముం జూపి నీ**
వసురానీకముఁ ద్రుంచి భూప్రజలకున్ హర్షంబు గావించి రా
క సుమీ రాక; జయంబు లేక ప్రజ దుఃఖంబొందఁగా రాక నీ
యసువర్గంబుల పోకగా నెఱుఁగు పె క్కాడంగ నిం కేటికిన్? **433**

ప్రతిపదార్థం: నీవు; పసగన్= చాతుర్యంతో; వేఁ= శీఘ్రంగా; చని= యుద్ధానికి వెళ్ళి; దోస్+బలంబునన్= భుజపరాక్రమంతో; రణ-ప్రావీణ్యమున్= యుద్ధనైపుణ్యాన్ని; చూపి; అమర+అనీకమున్= రాక్షససేనను; త్రుంచి= ఖండించి; భూ-ప్రజలకున్= దేశప్రజకు; హర్షంబు= సంతోషం; కావించి= ఒనగూర్చి; రాక-సుమీ-రాక= రావటమే సుమా రావటం; జయంబు-లేక= గెలుపు లేకుండా; ప్రజ= దేశప్రజ; దుఃఖంబు+ఒందఁగాన్ రాక= దుఃఖం పొందేటట్టు రావడం; నీ+అసువర్గంబుల పోవ+కాన్= నీ ప్రాణసముదాయాల; పోవడంగా; ఎఱుఁగు(ము)= తెలిసికో; పెక్కు+ఆడంగన్= ఇంకెందుకు?

తాత్పర్యం: అంబరీషుడు సుదేవుడితో ఇట్లా అన్నాడు: 'ఓయి సుదేవా! నీవు చాతుర్యంతో వెంటనే యుద్ధానికి వెళ్ళి, నీ భుజపరాక్రమంతో యుద్ధనైపుణ్యం చూపి, రాక్షససేనను సంహరించి, దేశప్రజలకు సంతోషం ఒనగూర్చి, తిరిగి రావటమే రావటం. అట్లా కాక గెలుపు లేకుండా ప్రజలు దుఃఖించేటట్లు రావటం అంటే నీ ప్రాణాలు పోవటమే అని తెలిసికొమ్ము. ఇంక పలుమాట లెందుకు?'

మహాస్రగ్ధర:

అనినన్ సంగ్రామ కేళీవ్యసన రసికుఁడై యట్లకాకంచు నిన్ వీ
డ్కొని యీతం డేఁగి తా నప్పు దనుజతతి యాటోపమున్ గూఢచారుం
డను దృష్టిం జూచి తా నిట్లను మనమున 'సైన్యంబు చే టేల? శత్రుం
గొననీ నేలా? పురారిం గొలుతు నతనికిం గోసియిత్తున్ శిరంబున్.' **434**

ప్రతిపదార్థం: అనినన్= అని అంబరీషుడు చెప్పగానే; సంగ్రామకేళీ వ్యసన రసికుఁడు+ఐ= యుద్ధ క్రీడలో మిక్కిలి ఆసక్తి కలిగినవాడై; అట్ల కాక+అంచున్= అట్లాగే కానిమ్మని; నిన్ వీడ్కొని= నీవద్ద సెలవు పుచ్చుకొని; ఈతండు+ఏఁగి= ఈ సుదేవుడు యుద్ధానికి వెళ్ళి; తాను+అపుడు= అతడు ఆ సమయంలో; దనుజతతి+ఆటోపమున్= రాక్షసుల సమూహంయొక్క సంభ్రమాన్ని; గూఢచారుండు+అనుదృష్టిన్+చూచి= చారుడు అనుసరించిన దృష్టితో పరిశీలించి; తాన్ మనమునన్ ఇట్లు+అనున్= తాను (ఆ సుదేవుడు) మనసులో ఇట్లా అనుకొన్నాడు; సైన్యంబు చేటు+ఏల?= సైన్యనాశనం దేనికి?; శత్రున్+కొనన్+ఈన్+ఏలా?= శత్రువులు ఈ విజయం పొందేటట్లు చేయటం దేనికి?; పుర+అరిన్+కొలుతున్= శివుడిని పూజిస్తాను; అతనికిన్= ఈశ్వరుడికి; శిరంబున్ కోసి+ఇత్తున్= నా తల నరికి ఇస్తాను (అని భావించాడు).

తాత్పర్యం: అంబరీషుడు యుద్ధానికి వెళ్ళుమని ఆదేశించగా యుద్ధమంటే చెవికోసుకొనే సుదేవుడు అట్లాగేనని నీ వద్ద సెలవు పుచ్చుకొని రాక్షసుల యుద్ధాటోపాన్ని గూఢచారులవలన తెలిసికొని మనసులో ఇట్లా భావించాడు. 'సైన్యవినాశనం దేనికి? శత్రువులకు విజయం చేకూర్చటం దేనికి? కాబట్టి ఈశ్వరుడిని పూజిస్తాను. నా తలను నరికి, శివుడికి ఇస్తాను' అని భావించాడు.

విశేషం: మహాస్రగ్ధరలో ప్రతిపాదంలోనూ వరుసగా స, త, త, న, స, ర, ర, గ - అనే గణాలుంటాయి. 9, 16వ అక్షరాలతో యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

మ. **అని నిశ్చాయకుఁడై రణం బుడిగి సైన్యంబంతయుం గ్రమ్మఱం**
జనగాఁజేసి పరేత భూమికి దృఢోత్సాహంబునం బోయి శం
భునిఁ జిత్తంబున నిల్పి వాలును గళంబుం గూర్చినన్ సత్కృపా
ఘనుఁ డద్దేవుఁడు ముందటన్ నిలిచి ఖడ్గంబుం దొలంగించుచున్. **435**

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; నిశ్చాయకుఁడు+ఐ= నిశ్చయించుకొన్నవాడై; రణంబు+ఉడిగి= యుద్ధాన్ని విరమించి; సైన్యంబు+అంతయున్= సైన్యమంతా; క్రమ్మఱన్+చనఁగాన్+చేసి= వెనుదిరిగి పోయేటట్లు ఆజ్ఞాపించి; పదేత భూమికిన్= శ్మశాన భూమికి; దృఢ+ఉత్సాహంబునన్+పోయి= మిక్కిలి ఉత్సాహంతో వెళ్ళి; శంభునిన్= ఈశ్వరుడిని; చిత్తంబునన్ నిల్పి= మనస్సులో నిల్పుకొని; వాలును= కత్తిని; గళంబున్+కూర్చినన్= కంఠంపై చేర్చుకోగా; సత్+కృపాఘనుఁడు+ఆ+దేవుఁడు= ఉత్తమ దయాధికుడైన ఆ శివుడు; ముందటన్+నిలిచి= తనముందు ప్రత్యక్షమై; ఖడ్గంబున్+తొలంగించుచున్= కత్తిని తొలగిస్తూ.

తాత్పర్యం: సుదేవుడు ఈశ్వరుడినిగూర్చి తపస్సుచేసి తన తలను ఆ దేవుడికి నరికి ఇస్తానని నిశ్చయించుకొని, యుద్ధం వదలి సైన్యాన్నంతటినీ తిరిగిపోయేటట్లు ఆజ్ఞాపించి, తాను మిక్కిలి ఉత్సాహంతో శ్మశానభూమికి వెళ్ళి, ఈశ్వరుడిని మనసులో నిలుపుకొని తన కంఠంపై కత్తిని సంధింపగా, అత్యంత దయామయుడైన ఈశ్వరుడు ప్రత్యక్షమై, అతడి కంఠంనుండి కత్తిని తొలగించాడు.

విశేం: ఈ పద్యంలో జరిగిన విషయాన్ని క్రమంగా చిన్న చిన్న మాటలతో చెప్పి తిక్కన విషయాన్ని స్పష్టంచేశాడు. విషయావగాహనకు ఉపకరించే రీతిలో పద్యాన్ని నడిపి తన పద్యశైలీ నైపుణ్యాన్ని ప్రకటించాడు.

మ. "చనునే సాహస మిట్లు సేయ? నిది కర్జంబే? కతం బేమి? యి
ప్పని? కన్నం గని చక్కఁజాఁగి ధరయున్ ఫాలంబునుం బొంద వం
దనముం జేసి, యితండు నీ పలుకులున్ దైతేయులం దాఁక నొ
ల్లనివాఁడైన తెఱంగుఁ జెప్పెశివు నుల్లం బార్ద్రతం బొందఁగన్. 436

ప్రతిపదార్థం: ఇట్లు సాహసము+చేయన్ చనునే?= ఈ రీతిగా సాహసం చెయ్యటం తగునా?; ఇది కర్జంబే?= ఇది చేయదగిన పనేనా?; ఈ+పనికిన్= ఈ పని చెయ్యటానికి; కతంబు+ఏమి?= కారణ మేమిటి?; అన్నన్+కని= అనగానే చూచి; చక్కన్+చాఁగి= చక్కగా సాగిలపడి; ధరయున్= భూమియు; ఫాలంబునున్= నొసటి భాగమును; తాఁకన్= తాకగా; వందనమున్+చేసి= నమస్కరించి; ఇతండు= ఈ సుదేవుఁడు; నీ పలుకులున్= నీవు (అంబరీషుడు) చెప్పిన మాటలను; దైతేయులన్+తాఁకన్+ఒల్లనివాఁడు+ఐన తెఱంగున్= రాక్షసులను ఎదుర్కొనటం ఇష్టంలేనివాడైన తీరును; శివు+ఉల్లంబు+ఆర్ద్రతన్+పొందఁగన్= శివుడి మనస్సు కరిగేటట్లుగా; చెప్పెన్= వివరించాడు.

తాత్పర్యం: 'ఇంత సాహసకార్యం చేయటం తగునా? ఇది చేయదగినదేనా? ఈ పనికి కారణ మేమిటి? 'అని శివుడు అనగా విని సుదేవుడు శివుడికి సాష్టాంగనమస్కారం చేసి నీవు(అంబరీషుడు) చెప్పిన మాటలను, తాను రాక్షసులను ఎదుర్కొనటానికి ఇష్టపడని అంశాన్ని శివుడి మనసు కరిగేటట్లు వివరించాడు'.

ఉ. ఆ పరమేశ్వరుం డితని కప్పుడు దివ్య రథోత్తమంబునుం
జాపము నస్త్రకోటియుఁ బ్రసన్నత నిచ్చి రణంబునందు నీ
యేపున కోర్వ దేవతల కేనియు దైత్యులకేని రాదు పొ
మ్మే పగఱేని గెల్వుము; మహిం జరణం బిడకుండు మాజిలోన్. 437

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఆ పరమేశ్వరుండు= ఆ శివుడు; ప్రసన్నతన్= దయతో; ఇతనికిన్= ఈ సుదేవుడికి; దివ్యరథ+ఉత్తమంబునున్= దేవతా సంబంధమైన ఉత్తమ రథాన్ని; చాపమున్= వింటిని; అస్త్రకోటియున్= బాణసమూహాన్ని, ఇచ్చి= ప్రసాదించి; రణంబునందున్= యుద్ధంలో; దేవతలకున్+ఏనియున్= దేవతలకైనా; దైత్యులకున్+ఏనిన్= రాక్షసులకైనా; నీ+ఏపునకున్+ఓర్వన్= నీ ధాటికి తట్టుకొనటం; రాదు పొమ్ము= సాధ్యం కాదు పో; ఏ పగఱ+ఏనిన్= ఎట్లాంటి శత్రువులనైనా; గెల్వుము= జయించుము; ఆజిలోన్= యుద్ధంలో; మహిన్+చరణంబు+ఇడక+ఉండుము= భూమిమీద కాలుపెట్టవద్దు (అని చెప్పాడు).

తాత్పర్యం: ఆ సమయంలో పరమేశ్వరుడు సుదేవుడిపై అనుగ్రహంతో దేవతాసంబంధమైన ఉత్తమ రథాన్ని, వింటిని, బాణ సమూహాన్ని ప్రసాదించి యుద్ధంలో దేవతలకుగానీ, రాక్షసులకు గానీ నీ ధాటికి నిలవటం సాధ్యంకాదు. ఏ శత్రువునైనా జయించుము. అయితే ఎట్టి పరిస్థితులలోనూ యుద్ధంలో నేలమీద కాలుమోపకుము.' అని శివుడు హెచ్చరించాడు.

మ. అని వీడ్కొల్పిన నీతఁ డుబ్బు మదిఁ బొంగారంగఁ దే రెక్కి వే
చని దైత్యధ్వజినీ ప్రతాప మహిమోత్సాహంబులం జీరికిం
గొన కుగ్రోద్ధతిఁ దాఁకి పీనుఁగుల పెంగుప్పల్ గొనం జేసె న
య్యనిఁ బైఁ ద్రోచిన నిద్దఱం దునిమె దైత్యాధీశులన్ వ్రేల్మిడిన్. 438

ప్రతిపదార్థం: అని వీడ్కొల్పినన్= అని హెచ్చరించి శివుడు పంపించగా; ఈతఁడు= ఈ సుదేవుడు; ఉబ్బు మదిన్+పొంగారంగన్= ఆనందం మనస్సులో అతిశయించగా; తేరు+ఎక్కి= రథం ఎక్కి; వే చని= వెంటనే వెళ్ళి; దైత్యధ్వజినీ= రాక్షస సైన్యాలయొక్క; ప్రతాప మహిమ+ఉత్సాహంబులన్= పరాక్రమ మాహాత్మ్యమూ, ఉత్సాహాలను; చీరికిన్+కొనక= లెక్కచేయక; ఉగ్ర+ఉద్ధతిన్+తాఁకి= భయంకరమైన అతిశయంతో ఎదుర్కొని; పీనుఁగుల పెన్+కుప్పల్+కొనన్+చేసెన్= శవాలు పెద్ద గుట్టలుగా పడేటట్లు చేశాడు; ఆ+అనిన్= ఆ యుద్ధంలో; పైన్+త్రోచినన్= తనపై దాడిచేసిన; ఇద్దఱన్ దైత్య+అధీశులన్= ఇద్దరు రాక్షసాధిపతులను (సదముడు, దముడు); వ్రేల్మిడిన్= చిటికెలో; తునిమెన్= సంహరించాడు.

తాత్పర్యం: శివుడు అనుగ్రహించి హెచ్చరికతో పంపగా సుదేవుడు అత్యంతానందంతో కూడిన మనస్సుతో రథం ఎక్కి వెంటనే వెళ్ళి, రాక్షససమూహాల పరాక్రమాతిశయోత్సాహాలను లెక్కచేయక మహాభయంకరంగా ఎదుర్కొని వారి శవాలు పెద్ద గుట్టలుగా పడేటట్లు చేశాడు. ఆ యుద్ధంలో తనను ఎదిరించిన రాక్షసాధిపతులైన సదముడు దముడు అనే ఇద్దరినీ చిటికెలో సంహరించాడు.

వ. ఇ వ్విధంబున సదముండును దముండునుం బడినం గని కోపోద్దీపితుండై. 439

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; సదముండును దముండునున్= సదముడు, దముడు అనే రాక్షసరాజులు; పడినన్= యుద్ధభూమిలో మరణించి పడిపోగా; కని= చూచి; కోప+ఉద్దీపితుండు+ఐ= అతిశయించిన కోపం కలవాడై.

తాత్పర్యం: ఈ విధంగా సదముడు దముడు అనే రాక్షస రాజులు యుద్ధంలో మరణించగా చూచి మిక్కిలి కోపంతో విదముడు. (తరువాతి పద్యంతో అన్వయం).

స్రగ్ధర: వీరోదారోగ్రలీలన్ విదముఁడు సమరోర్విన్ బలోల్లాస మొప్పం
జేరెన్ బాహాసముల్లాసిత ఘనరుచిరాసి ప్రభాభాసురుం డై
యా రక్షోనాథుపైఁ బేరలుక మఱపుఁ జేయంగ నీతండు డిగ్గెం
దే రుద్యత్ఖడ్గదీప్తుల్ దెసల నిగుడ దైతేయవీరుల్ చలింపన్. 440

ప్రతిపదార్థం: విదముఁడు= విదము డనే రాక్షసుడు; వీర+ఉదార+ఉగ్రలీలన్= పరాక్రమాతిశయంతో భయంకరమైన రీతిలో; సమర+ఉర్విన్= యుద్ధ భూమిలో; బల+ఉల్లాసము+ఒప్పన్= పరాక్రమోత్సాహాలు ప్రకాశించగా; బాహా సమ్+ఉత్+లాసిత ఘనరుచిర+అసి ప్రభా భాసురుండు+ఐ= భుజాలపై మిక్కిలి ప్రకాశిస్తూ గొప్పదై ఒప్పుతూ ఉన్న ఖడ్గంయొక్క కాంతిచేత వెలుగొందుతున్నవాడై; ఆ రక్షః+నాథు పైన్= ఆ రాక్షసరాజైన విదముడిపై కలిగిన; పేరు+అలుక= అత్యంత కోపం; మఱపున్+చేయంగన్= శివుడి హెచ్చరికను మరిచేటట్లు చేయగా; ఈతండు= ఈ సుదేవుడు; ఉద్యత్= అతిశయితమైన; ఖడ్గదీప్తుల్= ఆయుధాల కాంతులు; దెసలన్ నిగుడన్= అన్ని దిక్కులకు వ్యాపించగా; దైతేయవీరులు= రాక్షస వీరులు; చలింపన్= సంక్షోభించగా; తేరు డిగ్గెన్= రథం మీదనుండి క్రిందికి దిగాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: విదముడనే రాక్షసుడు భయంకరమైన పరాక్రమాతిశయంతో యుద్ధభూమిలో భుజాలమీద ప్రకాశిస్తున్న గొప్పదై ఒప్పుతున్న ఖడ్గకాంతిచేత వెలుగొందుతున్నవాడై కనిపించగా, ఆ రాక్షసరాజుమీది కోపాతిశయంతో సుదేవుడు తన ఖడ్గదీప్తులు అన్ని దిక్కులకు వ్యాపించగా, రాక్షసవీరులు సంక్షోభించే రీతిలో శివుడి హెచ్చరికను (ఎట్టి పరిస్థితులలోనూ రథం దిగి నేలమీద కాలు మోపవద్దు అనే మాటను) మరచిపోయి రథం దిగాడు.

విశేషం: తిక్కన సాధారణంగా చిన్న చిన్న తెలుగు మాటలను మాత్రమే ప్రయోగిస్తూ ఉంటాడు. కాని, రసానుగుణంగా పదప్రయోగం చేయటంలో అందెవేసిన చేయి. యుద్ధంలో వీరోత్సాహ ముట్టిపడేటట్లుగా సంస్కృత భూయిష్ఠమైన రచనచేయటంలో కూడా దిట్ట. అందుకు ఈ పద్యం చక్కటి ఉదాహరణ. 'బాహాసముల్లాసిత ఘన రుచిరాసి ప్రభా భాసురుండై' మొదలైన సమాసాలు ఇందుకు సాక్ష్యం. స్రగ్ధరావృత్తంలో ప్రతిపాదానికీ వరుసగా మ, ర, భ, న, య, య, య అనే గణాలు ఉంటాయి. 8, 15 అక్షరాలతో యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

వ. ఇట్లు విధాతృ వశంబునఁ బాదచారియై. 441

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; విధాతృ వశంబునన్= విధినిర్ణయం ప్రకారం; పాదచారిఐ= యుద్ధభూమిలో నడుస్తున్నవాడై.

తాత్పర్యం: ఈ విధంగా సుదేవుడు విధినిర్ణయం ప్రకారం శివుడి హెచ్చరికను మరచిపోయి యుద్ధభూమిలో నడచి వెళ్తుండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. దనుజుం దాఁకి కృపాణ ఖేలనము చిత్రంబై వెలుంగొందఁ ద
త్తను సంఛేదన కేలిసల్ప నతఁడుం దన్నుం బటుప్రస్ఫుర
ద్ఘన కౌక్షేయక ధారఁ జీరఁ బడియెం దా నాతనిం గూల్చెఁ ద
క్కిన దైత్యావలి విచ్చె నల్గడఁ బరిక్షీణోద్యమత్వంబునన్. 442

ప్రతిపదార్థం: దనుజున్+తాఁకి= రాక్షసుడైన విదముడిని ఎదుర్కొని; కృపాణ ఖేలనము= ఆయుధ క్రీడ చిత్రంబు+ఐ= విచిత్రంగా; వెలుఁగు+ఒందన్= ప్రకాశిస్తూ ఉండగా; తద్+తను సంఛేదన కేలి సల్పన్= ఆ రాక్షసుడి శరీర ఖండనమనే ఆట ఆడగా; అతఁడున్= ఆ రాక్షసుడూ; తన్నున్= తనను (ఆ సుదేవుని); పటు= మిక్కిలి; ప్రస్ఫురత్= ప్రకాశిస్తున్న; ఘన= గొప్పదైన; కౌక్షేయక ధారన్= కత్తి వాదరచేత; చీరన్= చీల్చగా; పడియెన్= పడిపోయాడు; తాను+ఆతనిన్+కూల్చెన్= ఆ సుదేవుడు విదముని పడగొట్టాడు; తక్కిన దైత్య+ఆవలి= మిగిలిన రాక్షస సేనా సమూహం; పరిక్షీణ+ఉద్యమత్వంబునన్= పూర్తిగా నశించి పోయే పూనికతో; నల్గడన్= నాలుగు దిక్కులకూ విచ్చెన్= చెల్లా చెదరై పోయింది.

తాత్పర్యం: సుదేవుడు ఆ రాక్షసుడైన విదముని ఎదుర్కొని తన ఖడ్గనైపుణ్యాన్ని చిత్రవిచిత్రంగా ప్రదర్శించి వెలుగొందుతూ అతడి శరీరాన్ని ఖండించటానికి ప్రయత్నించగా ఆ రాక్షసుడు తనను మిక్కిలి ప్రకాశమానమైన ఖడ్గధారచేత చీల్చగా అదేసమయంలో తానూ ఆ రాక్షసుడిని పడగొట్టి పడిపోయాడు. అప్పుడు మిగిలిన సైన్యం వినాశమౌతామేమో ననే భయంతో అన్ని దిక్కులకూ చెల్లా చెదరైంది.

వ. ఇట్లు నిశ్శేషంబుగాఁ బరవీరులం బరిమార్చిన నీ రాజ్యంబు పూజ్యంబై వెలసె, భూ ప్రజయుం బ్రమోదంబు నొందె; నిత్తెఱంగున నీ సుదేవుండు సకృతవంతుండై యింతటి పదంబున కర్హుం డయ్యె; నేయజ్ఞంబులును సంగ్రామ యజ్ఞంబునకు సదృశంబులు గావు; వినుము! వీర మస్తకరాశి వేదికగా గృపాణ బాణాది సాధనంబులు సమిత్స్రుక్స్రువంబులుగా శోణితం బాజ్యంబుగా మాంసంబు పురోడాశంబుగా వీరవ్రత దీక్షితుండు సమరాధ్వరంబు సలిపి, రుధిరజల పూరయు మస్తిష్క కర్దమయుఁ గేశ శైవాలయు నాంత్రఫేనయు

భేరీ మండూకయు హేతి మీనయు గజకళేబర పులినయు నగు నమర పుణ్యనది నవభృథస్నానంబు సేసి మదీయ లోకంబున సుశ్లోకుండై నిత్యస్థితి నత్యుదాత్తపదవిం బ్రవర్తిల్లుఁ బుణ్యతముం డగుటకుం దనువు దొఱంగ వలయు నని లేదు; తెగువతోడి యనివర్తన గతియ చాలు; నిట్టిది రణాచరణ ప్రభావం; బేనును బ్రబల దైతేయవ్రాత శాతన సుకృతంబునంగాదె యీ దేవేంద్రత్వంబు నొందితి' నని పలికిన నంబరీషుండు సమర శూరుల సమధిక పుణ్యత్వంబు దెలిసి సంభావించె'నని చెప్పి దేవవ్రతుండు వెండియు. 443

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నిః+శేషంబుగాన్= ఏ మాత్రం మిగలకుండా; పరవీరులన్= శత్రువీరులను; పరిమార్చినన్= చంపగా; నీ రాజ్యంబు= నీ సామ్రాజ్యం; పూజ్యంబు+ఐ= మాన్యమై; వెలసెన్= ప్రకాశించింది; భూ ప్రజయున్= నీ రాజ్య ప్రజ; ప్రమోదంబున్+ఒందెన్= సంతోషించింది; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఈ సుదేవుఁడు= ఈ సుదేవుడనే నీ భృత్యుడు; సుకృతవంతుండు+ఐ= పుణ్యాత్ముడై; ఇంతటి పదంబునకున్+అర్హుండు+అయ్యెన్= ఇంత ఉన్నత పదవికి పాత్రుడు అయ్యాడు; ఏ యజ్ఞంబులును= ఏ యజ్ఞ యాగాలు కూడా; సంగ్రామ యజ్ఞంబునకున్= యుద్ధమనే యజ్ఞానికి; సదృశంబులు+కావు= సమానములు కావు; వినుము= విను; వీరమస్తకరాశి వేదికగాన్= వీరుల తలల సమూహమే యజ్ఞ వేదికగా; కృపాణబాణ+ఆది సాధనంబులు= ఖడ్గం, బాణం మొదలైన ఆయుధాలు; సమిత్+స్రుక్+స్రువంబులుగాన్= తగిన యజ్ఞోపకరణం, యజ్ఞ పాత్రలుగా; శోణితంబు+ఆజ్యంబుగాన్= రక్తం నేయిగా; మాంసం; పురోడాశంబుగాన్= యజ్ఞార్హమైన అపూపంగా; వీరవ్రత దీక్షితుండు= వీర వ్రతమే దీక్షగా గలవాడైన వీరుడు; సమర+అధ్వరంబు+చలిపి= యుద్ధమనే యజ్ఞం పరిపూర్తిచేసి; రుధిరజల పూరయున్= రక్తమనే జలంతో నిండినది; మస్తిష్క కర్దమయున్= మెదళ్ళనే బురద కలదీ; కేశశైవాలయున్= వెంట్రుకలనే నాచు కలదీ; ఆంత్ర ఫేనయున్= పేగులనే నురుగు కలదీ; భేరీ మండూకయున్= యుద్ధ భేరీలు అనే కప్పలు కలదీ ; హేతి మీనయున్= ఖడ్గాలనే చేపలు కలదీ ; గజకళేబర పులినయున్= ఏనుగుల మృతకళేబరాలు అనే ఇసుక దిబ్బలు కలదీ; అగు= అయిన; అమరపుణ్యనదిన్= స్వర్గంగలో; అవభృథస్నానంబు+చేసి= యజ్ఞాంత స్నానం చేసి; మదీయలోకంబునన్= నా లోకంలో (స్వర్గలోకంలో); సుశ్లోకుండు+ఐ= బాగా కీర్తించబడిన వాడై; నిత్యస్థితిన్= శాశ్వతరీతి; అతి+ఉదాత్త పదవిన్= మిక్కిలి శ్రేష్ఠమైన పదవిలో; ప్రవర్తిల్లున్= ప్రవర్తిస్తుంటాడు; పుణ్యతముండు+అగుటకున్= పుణ్యశ్రేష్ఠుడు కావటానికి; తనువు+తొఱంగన్ వలయున్+అనిలేదు= శరీరాన్ని వదలిపెట్టాలని లేదు; తెగువతోడి= సాహసంతో; అనివర్తన గతియ చాలు= వెనుదీయకుండా యుద్ధం చెయ్యటమే చాలు; ఇట్టిది= ఇట్లాంటిది; రణ+ఆచరణ ప్రభావం= యుద్ధాచరణం వలన కలిగే ఫలితం; ఏనును= నేనుకూడా; ప్రబలదైతేయ వ్రాతశాతన సుకృతంబునన్+కాదె?= మిక్కిలి బలవంతులైన రాక్షసుల సమూహాలను సంహరించటమనే పుణ్యం వలననే కదా!; ఈ దేవ+ఇంద్రత్వంబున్+ఒందితిన్= ఈ దేవేంద్ర పదవిని పొందగలిగాను; అని పలికినన్= అని చెప్పగా; అంబరీషుండు= అంబరీషుడనే రాజు; సమర శూరుల సమ్+అధిక పుణ్యత్వంబు+తెలిసి= యుద్ధవీరుల అతిశయితమైన పుణ్య భావాన్ని తెలిసికొని; సంభావించెన్= (సుదేవుడిని) గౌరవించాడు; అని చెప్పి= అని ఈ విధంగా తెలియజేసి; దేవవ్రతుండు= భీష్ముడు; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఈ విధంగా నిశ్శేషంగా శత్రువీరులను సంహరించగా నీ రాజ్యం గౌరవప్రదమైనది. నీ ప్రజలంతా సంతోషించారు. ఈ రీతిగా సుదేవుడు పుణ్యాత్ముడై ఇంతటి ఉన్నత పదవికి పాత్రుడయ్యాడు. ఎన్ని యజ్ఞయాగాలైనా యుద్ధయజ్ఞానికి సమానం కావు. వీరుల తలల రాశులే వేదికగా, ఖడ్గబాణాది సాధనాలు యజ్ఞోపకరణాలైన సమిధలు స్రువములు కాగా రక్తమే నేయిగా, మాంసం పురోడాశంగా వీరమనే వ్రతం పూనినవాడు యుద్ధ మనే యజ్ఞాన్ని సల్పి, రక్తమనే జలంతో కూడినది, మెదళ్ళనే బురద గలది, వెంట్రుకలనే పాచి కలదీ, పేగులనే నురుగు గలదీ, యుద్ధభేరీలనే కప్పలు గలదీ, ఖడ్గాలనే చేపలు గలదీ, ఏనుగుల మృతకళేబరాలనే ఇసుక దిబ్బలు గలదీ అయినటువంటి స్వర్గగంగలో యజ్ఞాంతస్నానం చేసి, నా స్వర్గలోకంలో బాగా కీర్తించబడినవాడై శాశ్వతస్థితిలో అత్యుత్తమ పదవిని పొందగలిగాడు. పుణ్యాత్ముడు కావటానికి శరీరం వదలిపెట్టాలని లేదు. యుద్ధంలో సాహసోపేతంగా వెనుదీయకుండా పోరాడటమేచాలు. ఇది యుద్ధాచరణంవలన కలిగే పుణ్యం. నేను కూడా అనేక రాక్షస సమూహాలను సంహరించటం అనే పుణ్యం వలననే కదా ఈ దేవేంద్ర పదవిని

పొందగలిగాను' అని ఇంద్రుడు చెప్పగా అంబరీషుడనే రాజు యుద్ధవీరుల అత్యంత పుణ్యత్వాన్ని తెలిసికొని సుదేవుడిని గౌరవించాడు' అని పైరీతిగా స్పష్టం చేసి, భీష్ముడు ధర్మరాజుతో మళ్ళీ ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: రూపకం.

సమరానివర్తనంబు వలని ఫలము (సం. 12-100-1)

క. **జనకుఁడు ప్రతర్దనునకుం। దనకును రణమైన యపుడు తన యోధులకున్**
విను నాకంబును నరకముఁ। గనుఁగొనుఁ డని చూపి చెప్పెఁ గౌరవముఖ్యా! 444

ప్రతిపదార్థం: కౌరవముఖ్యా!= కురువంశ శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; విను= శ్రద్ధగా ఆలకించుము; జనకుఁడు= జనక మహారాజు; ప్రతర్దనునకున్= ప్రతర్దనుడనే వాడికి; తనకును= తనకూ; రణము+ఐన+అపుడు= యుద్ధం జరిగినప్పుడు; తన యోధులకున్= తన వీరులకు; నాకంబును= స్వర్గాన్ని; నరకమున్= నరకాన్ని; కనుగొనుఁడు+అనిచూపి చెప్పెన్= చూడుండని చూపించి ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! వినుము. జనకమహారాజుకు ప్రతర్దనుడికి యుద్ధం జరిగింది. ఆ సమయంలో జనకుడు తన వీరులకు స్వర్గనరకాలను చూపించి, వాటిని చూడుం డని ఇట్లా అన్నాడు'.

తే. **పుణ్యతమము భోగాస్పదంబును మనోహ। రాంగనా జనబహులంబు నైనయది ర**
ణంబు బిరుదులై చేసిన నరుల నెలవు;। దూరఁ బందలచో టిది దుఃఖమయము. 445

ప్రతిపదార్థం: పుణ్యతమము= అధిక పుణ్యాన్ని కలిగించేది; భోగ+ఆస్పదంబును= సమస్త భోగాలకు నిలయమయినది; మనోహర+అంగనాజన బహులంబున్= అనేక సుందరాంగులతో నిండినది; ఐన+అది= అయిన అది; బిరుదులు+ఐ= వీరులై; రణంబు+చేసిన= యుద్ధం చేసిన; నరుల నెలవు= వీరులకు నిలయం (స్వర్గం); ఇది= ఈ నరకం; దూరన్= ప్రవేశించటానికి; పందలచోటు= పిరికివాళ్ళ నిలయం; దుఃఖమయము= దుఃఖంతో నిండింది.

తాత్పర్యం: 'అధిక పుణ్యాన్ని అందించేది. సమస్తభోగాలకు నిలయమై అనేకమైన సుందరాంగులతో నిండినదీ అయిన అది స్వర్గం. పిరికివాళ్ళు ప్రవేశించేదీ దుఃఖమయమైనదీ అయిన ఇది నరకం' అని జనకుడు తన వీరులతో చెప్పాడు.

వ. **అని తన మాహాత్మ్యంబునం జూపనోపిన యుభయ స్థలంబులుం జూపం జూచి, యేచి యవ్వీరులు దెంపు పొంపిరి వోవం దటీయ నుటికి వైరుల జయించిరి; సమరంబు తెగువ దీప్తలక్ష్మిం గరంబొనర్చుఁ బుణ్యతమ లోకంబు లిచ్చుం గావున శూరుం డధిక పుణ్యోదారుం డని యిట్లు దేవవ్రతుండు ధర్మశూరునకు సమరానివర్తన జనవిశేషం బెఱింగించె నని చెప్పిన విని 'యట మీఁద వారల సంప్రశ్నోత్తరంబులు ప్రవర్తిల్లిన విధంబులు వినిపింపు' మనుటయు.** 446

ప్రతిపదార్థం: అని= అని పలికి; తన మాహాత్మ్యంబునన్+చూపన్+ఓపిన= తన మహిమచేత చూపించగలిగిన; ఉభయస్థలంబులున్= స్వర్గ నరకాలు రెండింటిని; చూపన్+చూచి= చూపెట్టగా చూచి; ఏచి= విజృంభించి; ఆ+వీరులు= ఆ జనకమహారాజు యోధులు; తెంపు= సాహసం; పొంపిరి+పోవన్= అతిశయించగా; తటీయన్+ఉటికి= శత్రువులను తరమటానికి పరుగెత్తి; వైరుల జయించిరి= శత్రువులను ఓడించారు; సమరంబు తెగువ= యుద్ధంలోని సాహసం; దీప్త లక్ష్మిన్= ప్రకాశించే సంపదను; కరంబు+ఒనర్చున్= మిక్కిలి కలిగిస్తుంది; పుణ్యతమ లోకంబుల్+ఇచ్చున్= ఉత్తమ లోకాలను ప్రసాదిస్తుంది; కావునన్= అందువలన; శూరుండు= వీరుడు; అధిక+పుణ్య+ఉదారుండు+అని= మిక్కిలి పుణ్యవంతుడని; ఇట్లు= ఈ విధంగా; దేవవ్రతుండు= భీష్ముడు; ధర్మశూరునకున్= ధర్మరాజునకు; సమరానివర్తన జనవిశేషంబు+ఎఱింగించెన్= వెనుదీయకుండా యుద్ధంలో పాల్గొనే వీరుల విశేషాన్ని తెల్పాడు; అని చెప్పినన్= అని చెప్పగా; విని; అటమీఁదన్= ఆ తరువాత; వారల సంప్రశ్న+ఉత్తరంబులు= వారి ప్రశ్నలూ

సమాధానాలు; ప్రవర్తిల్లిన విధంబులు= జరిగిన తీరులు; వినిపింపుము+అనుటయున్= వినిపించవలసిం దని కోరగా. (జనమేజయుడు వైశం పాయనుడిని కోరగా).

తాత్పర్యం: జనకుడు ఆ విధంగా పలికి తన మహిమచేత స్వర్గ నరకాలను చూపెట్టగా చూచిన అతడిసైన్యం విజృంభించి సాహసంతో శత్రువులను తరమటానికి పరుగెత్తి విజయం సాధించింది. యుద్ధంలోని సాహసం ప్రకాశించే సంపదను ఉత్తమలోకాలను ప్రసాదిస్తుంది. అందువలన వీరుడు మిక్కిలి పుణ్యవంతు' డౌతాడు అని ఈ విధంగా భీష్ముడు ధర్మరాజునకు వెనుదీయకుండా యుద్ధంలో పాల్గొనే వీరుల విశేషాన్ని తెల్పాడు' అని చెప్పగా విన్న జనమేజయుడు వారి ప్రశ్నలూ సమాధానాలు తరువాత ఎట్లా సాగాయో వినిపించవలసిందని వైశంపాయనుడిని కోరాడు.

ఆశ్వాసాంతము

మ. **పరమాయుః పరమార్థసిద్ధి పరమ ప్రావీణ్య సంపాద నా**
దర సంభావిత భక్తలోక! నిగమాంతస్ఫీత హర్మ్యాగ్ర సం
చరణ ప్రౌఢమయూర! చిత్రమహిమా! సర్వాత్మ విజ్ఞాన సం
పరిపాక ప్రకటాకృతీ! శమదమోద్భావాహిత స్వీకృతీ! **447**

ప్రతిపదార్థం: పరమ+ఆయుః= ఉత్కృష్టమైన ఆయుస్సు; పరమ+అర్థసిద్ధి= పురుషార్థాల్లో ఉత్తమమైన మోక్షాన్ని సిద్ధింపజేయటంలోను; పరమ ప్రావీణ్య సంపాదన= శ్రేష్ఠమైన నైపుణ్యాన్ని సమకూర్చటంలోను; ఆదర= ఆసక్తివలన; సంభావిత= గౌరవించబడిన; భక్తలోక!= భక్తుల సమూహం గలవాడా!; నిగమ= వేదాలయొక్క; అంత= చివరి భాగాలైన ఉపనిషత్తులనే; స్ఫీత= ఉన్నతమైన; హర్మ్య+అగ్ర= సౌధం పైభాగాన; సంచరణ= విహరిస్తున్నట్టి; ప్రౌఢమయూర!= నిపుణమైన నెమలి అయినవాడా!; చిత్రమహిమా!= ఆశ్చర్యకరమైన మహిమలు కలవాడా!; సర్వ+ఆత్మ= సమస్తమూ తానే ఆత్మ అయినవాడనే; విజ్ఞాన= పరిజ్ఞానంయొక్క; సమ్+పరిపాక= ఉత్తమ పరిపక్వ స్థితివలననే; ప్రకట+ఆకృతీ!= స్పష్టమయ్యే స్వరూపం కలవాడా!; శమదమ+ఉద్భావాతీహ స్వీకృతీ!= శాంతిదాంతులతో కూడిన హృదయాలు గలవారిలో ఉంచబడినట్టి స్వీకారం కలవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! 'నీ పరమ భక్తులకు పరిపూర్ణమైన ఆయుస్సును పురుషార్థాలలో శ్రేష్ఠమైన మోక్షాన్ని, సమస్త కార్యాచరణచాతుర్యాన్ని ప్రసాదిస్తావు. వేదాలలో ఉపనిషత్తులలో వివిధవిధాలుగా ప్రశంసించబడ్డ నీవు విశిష్టుడవు. నీ విచిత్రమహిమ సామాన్యులకు అవగతం కాదు. అయినా విశ్వమంతా నీవే నని భావించగల విజ్ఞాన ఖనులకు నీ మహిమ స్పష్టమే. అందుకే అట్లాంటి శమదమాది గుణగరిష్ఠులైనవారిని నీవెంతగానో ఆదరిస్తావు.

క. **యమనియమాద్యష్టాంగ। క్రమాభ్యసన నిర్మథిత వికార సుచేతః**
కమలామోద మయాత్మా!। సమతా రాహిత్య శస్య! సర్వనమస్యా. **448**

ప్రతిపదార్థం: యమనియమ+ఆది= యమం నియమం మొదలుకొని అంటే ఆసనం ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణం, ధ్యానం, సమాధి - అనే; అష్ట+అంగ క్రమ+అభ్యసన= ఎనిమిది అంగాలను క్రమంగా అభ్యసించటంవలన; నిర్మథిత వికార= నశింప జేయబడినట్టి మార్పుగల; సుచేతః కమల= మంచి మనస్సనే పద్మానికి; ఆమోదమయ+ఆత్మా!= సుగంధరూపమైన స్వరూపంగలవాడా!; సమతా రాహిత్య శస్య!= సమత్వం అంటే సమభావం లేకపోవుటచే మాత్రము చెప్పదగినవాడా! అయినవాడా! (అంటే భగవంతుడు సమత్వం ఉన్నవాడు, అయితే ప్రజలచేత వారి వారి జ్ఞానాన్నిబట్టి గ్రహించే తీరులో కనిపించే పద్ధతిలో అసమానత్వమున్నవా డని అర్థం); సర్వనమస్యా!= సమస్త వ్యక్తుల నమస్సులను పొందదగినవాడా!

తాత్పర్యం: యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణం, ధ్యానం, సమాధి - అనే అష్టాంగ యోగాభ్యాసం చేయటంవలన పరిశుద్ధమైన మనస్సనే కమలానికి సుగంధమైన స్వరూపం కలవాడా! సమత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కలవాడుగా భగవంతుడు కీర్తించబడతాడు, అయితే భక్తుల మనోవైశిష్ట్యాన్నిబట్టి జ్ఞానాన్ని అనుసరించి తదుచితంగా, అసమానంగా చెప్పదగినవాడా! సర్వులచేత అంటే బ్రహ్మాదులచేత సైతం పూజించబడుతున్నవాడా! హరిహరనాథా!

విశేషం: శస్యమనగా పైరు అనగా భోజ్యం. పరమేశ్వరుడు సమరూపంలో ఉన్నప్పుడు లౌకిక రసానుభూతికి విషయం కాకపోవటంచేత, సమతారాహిత్యంలోనే - అనగా కార్యరూపమైన ప్రపంచరూపం పొందినప్పుడే భోజ్యుడవుతున్నాడని చెప్పవచ్చును.

మాలిని: సమధిక నిరవద్య స్వైరనిత్య ప్రభుత్వా!
విమల మహిమ హేలావిర్భవత్సర్వ సత్త్వా!
నమదమలినచిత్తౌన్నత్య దీవ్యన్మహత్త్వా!
దమమహిత తపస్సద్భావ సంవేద్యతత్త్వా! **449**

ప్రతిపదార్థం: సమధిక= అన్నిటికంటే ఉత్తమమూ; నిరవద్య= దోష రహితమూ; స్వైర= స్వేచ్ఛాయుతమూ; నిత్య= శాశ్వతమూ అయినట్టి; ప్రభుత్వా!= ఆధిపత్యం కలవాడా! (సామర్థ్యం కలవాడా!); విమల= స్వచ్ఛమైన; మహిమ= మాహాత్మ్యం యొక్క; హేలా విలాసంవలన; ఆవిర్భవత్= పుట్టుతున్నట్టి; సర్వసత్త్వా!= సమస్త వస్తు సమూహం కలవాడా!; నమత్= నమస్కరిస్తున్న వారైన; అమలినచిత్త= పరిశుద్ధమైన మనస్సులు గల మహామునుల; ఔన్నత్య= గొప్పదనంవలన; దీవ్యత్= ప్రకాశిస్తున్న; మహత్త్వా!= మహిమాన్వితుడైనవాడా!; దమ= ఇంద్రియ నిగ్రహంతో కూడిన; మహిత= శ్రేష్ఠమైన; తపః= తపస్సుయొక్క; సత్+భావ= సమున్నత భావంవలన; సమ్+వేద్యతత్త్వా!= విస్పష్టంగా తెలియదగ్గ వాస్తవరూపం కలవాడా!

తాత్పర్యం: 'అన్నిటి కంటే ఉత్తమమూ, దోషరహితమూ, స్వేచ్ఛాయుతమూ, శాశ్వతమూ అయినట్టి ఆధిపత్యం కలవాడా! స్వచ్ఛమైన మాహాత్మ్య విలాసంవలన పుట్టుతున్న సమస్త వస్తుసమూహం కలవాడా! పరిశుద్ధాంతః కరణులై నమస్కరిస్తున్న మహర్షుల ఔన్నత్యంవలన ప్రకాశిస్తున్న మహిమాన్వితుడైనవాడా! ఇంద్రియనిగ్రహంతో కూడిన గొప్ప తపస్సుయొక్క ఉనికివలన విస్పష్టంగా విదితమయ్యే వాస్తవరూపం కలవాడా! హరిహరనాథా!

విశేషం: మాలినీవృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, న, మ, య, య అనే గణాలుంటాయి. 9వ అక్షరంతో యతిమైత్రి. ప్రాసనియమం ఉన్నది.

గద్యము:

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర, కొమ్మనా మాత్యపుత్త్ర, బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బైన శ్రీమహాభారతంబున శాంతి పర్వంబునందు ద్వితీయాశ్వాసము

ప్రతిపదార్థం: ఇది= ఇది (ఈ శాంతిపర్వం ద్వితీయాశ్వాసం); శ్రీమత్+ఉభయకవిమిత్త్ర= సంపద్యుక్తమైన ఉభయ కవిమిత్ర బిరుదాంకితుడైన (అంటే సంస్కృతాంధ్ర భాషాకవులకు మిత్రుడైన); కొమ్మన+ఆమాత్యపుత్త్ర= కొమ్మనమంత్రి పుత్రుడైన; బుధ+ఆరాధన విరాజి= విద్వాంసులచేత పూజించబడటంవలన ప్రకాశిస్తున్న; తిక్కన సోమయాజి= యజ్ఞంచేసి సోమయాజి అయిన తిక్కన మహాకవిచేత; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీమహాభారతంబునందున్= శ్రీమహాభారతంలో; శాంతిపర్వంబునందున్= శాంతిపర్వంలో; ద్వితీయ+ఆశ్వాసము= రెండో ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది సంపద్యుక్తమైన ఉభయకవిమిత్రు డనే బిరుదు గల, కొమ్మనమంత్రి పుత్రుడైన విద్వాంసులచేత ఆరాధించబడి ప్రకాశిస్తున్న, తిక్కన సోమయాజిచేత రచించబడిన శ్రీమహాభారతమందలి శాంతిపర్వంలోని ద్వితీయాశ్వాసం.

శాంతిపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - తృతీయాశ్వాసము

శ్రీధుర్యకరణ! సమ్య । గ్బోధాత్మ విహరణ! దివిజ పూజ్యచరణ! యా
రాధకభరణ! నిరాధి । వ్యాధికరణ! సౌమ్యకిరణ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీధుర్యకరణ!= సంపదల భారాన్ని మోసేటట్లు చేసేవాడా!; సమ్యక్+బోధ= జ్ఞానవంతుల; ఆత్మ= మనస్సులలో; విహరణ!= విహరించేవాడా!; దివిజ= దేవతలచేత; పూజ్య= పూజింపదగిన; చరణ!= పాదాలు కలవాడా!; ఆరాధక= పూజించే భక్తులను; భరణ!= పోషించేవాడా!; నిరాధివ్యాధికరణ!= మానసిక శారీరక రోగాలను నివారించగలవాడా!; సౌమ్యకిరణ!= చంద్రుడికిరణములవంటి చల్లని కిరణాలు కలవాడా!; హరిహరనాథా!= హరిహరనాథుడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీవు భక్తులను సుసంపన్నులుగా చేయగల వాడవు. వాళ్ళ హృదయాలలో విహరించేవాడవు. దేవతల పూజలందుకొనే పాదాలు కలవాడవు. భక్తపోషకుడవు. మానసిక, శారీరక వ్యాధులను పారద్రోలేవాడవు తేజస్వంతుడవు.

కాలనిరూపణాదులగు రణోపాయంబుల ప్రకారము (సం. 12-101-2)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నట్లు శూరులు పుణ్యతమ పురుషు లని విని కుంతీనందనాగ్రజుండు గంగానందనునితోఁ 'గాలనిరూపణాదులగు రణోపాయంబులెఱింగింపు' మనుటయు నతండు భరితాదరుండై. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= జనమేజయ మహారాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అట్లు= ఆ రీతిగా; శూరులు= యోధులు; పుణ్యతమ పురుషులు+అని= ఎంతో పుణ్యాత్ములు అని; విని= ఆలకించి; కుంతీనందన+అగ్రజుండు= కుంతీదేవి కుమారులలో పెద్దవాడైన ధర్మరాజు; గంగానందనునితోన్= గంగాదేవి కొడుకైన భీష్ముడితో; కాలనిరూపణ+ఆదులు+అగు= తగిన కాలాన్ని నిరూపించటం మొదలైన; రణ+ఉపాయంబులు= సమర సన్నాహాలకు అనువైన ఎత్తుగడలను; ఎఱింగింపుము= తెలియచెప్పుము; అనుటయున్= అనటంతోనే; అతండు= భీష్ముడు; భరిత+ఆదరుండు+ఐ= ఎంతో ఆనందించినవాడై.

తాత్పర్యం: జనమేజయ మహారాజునకు వైశంపాయన మహర్షి భారతకథ చెప్పటం ప్రారంభించాడు. ధర్మరాజు 'శూరులు ఏ విధంగా పుణ్యాత్ములో' భీష్ముడి వలన విన్నాడు. 'పోరుకు పోవటానికి వీలైన కాలనిరూపణం మొదలైన ఉపాయాలను తెలియచెప్పు'మని అడిగాడు. భీష్ముడు ఎంతో ఆనందంగా చెప్పటం మొదలు పెట్టాడు.

సీ. **'వానయు సీతును వర్జించి మండు వే। సవి గాక మున్న సస్యముల పంట**
లొదవెడు తఱి నెత్తునది శత్రుపయిఁ। బూరి, గట్టియల్ నీళ్ళులుఁ గలుగు తెరువు
గాఁజూచి నడచుట కర్జంబు సిడములుఁ। గంకటంబులును బల్కలును విండ్లు
మొదలగు నాయుధంబులు రథగజహయం। బుల సవరణలు నపూర్వభంగి

తే. **నొప్పి యరిభీకరంబులై యుండవలయు। శంఖ కాహళ పటహనిస్సాణ ముఖము**
లైన తూర్యముల్ మంచివి యైన లెస్స। యధిప విడిదల సమతల మగుట మేలు. **3**

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; వానయున్= వర్షాకాలాన్ని; సీతును= చలికాలాన్ని; వర్జించి= విడిచిపెట్టి; మండు వేసవి= ఎండలు మండేకాలం; కాకమున్న= రాకముందే; సస్యముల పంటలు= పైరుపంటలు; ఒదవెడు తఱిన్= లభించే సమయంలో; శత్రుపయిన్= పగవాళ్ళమీదికి; ఎత్తునది= దండెత్తాలి; పూరి= పచ్చగడ్డి; కట్టియల్= కట్టెలు; నీళ్ళులున్= నీళ్ళును; కలుగు తెరువుగాన్ చూచి= దొరకే మార్గంగా చూచికొని; నడచుట= దండయాత్ర చేయటం; కర్జంబు= కార్యం; సిడములున్= జెండాలూ; కంకటంబులును= కవచాలూ; పల్కలును= డాళ్ళూ; విండ్లు= ధనుస్సులూ; మొదలగు= మొదలైన; ఆయుధంబులు= యుద్ధసాధనాలు; రథగజహయంబుల= రథాల, ఏనుగుల, గుర్రాల; సవరణలున్= వాహనాద్యలంకరణలు; అపూర్వభంగిన్= ఇంతకుముందు లేని రీతిలో కొత్తగా; ఒప్పి= ప్రకాశించి; అరిభీకరంబులు+ఐ= శత్రువులకు జడుపు పుట్టించేవై; ఉండన్ వలయున్= ఉండాలి; శంఖ= శంఖం; కాహళ= బాకా; పటహ= తప్పెట; నిస్సాణ ముఖములు+ఐన= చర్మవాద్యాలు మొదలైన; తూర్యముల్= యుద్ధ వాద్యాలు; మంచివి+ఐన= బాగా మ్రోగేవి అయిన; లెస్స= మంచిది; విడిదల= దండువిడిసే చోటు; సమతలము+అగుట= చదునుగా ఉండటం; మేలు= శ్రేష్ఠం.

తాత్పర్యం: వానలు పడేటప్పుడు, చలితో వణికేటప్పుడు, బాగా ఎండలు కాసేటప్పుడు కాక పంటలు పండేకాలంలో పగవాళ్ళపైకి దండెత్తి పోవాలి. పచ్చికా, కట్టెలూ, నీళ్ళూ దొరికే తోవలో దండును నడిపించుకొని పోవటం మంచిది. శత్రువులు కలవరపడేటట్లు జెండాలూ, కవచాలూ, డాళ్ళూ, ధనుస్సులూ మొదలైన ఆయుధాలను, రథాల ఏనుగుల గుర్రాల వాహనాలను ఇంతకుముందు కనీవినీ ఎరగని రీతిలో అమర్చుకొనాలి. హోరెత్తించే మంచి శంఖాలు, మంచి బాకాలు, మంచి డప్పులు మొదలైన చర్మవాద్యాలు ఉండటం మంచిది. సైన్యం బస చేసేచోటు ఎగుడూ దిగుడూ లేని చదునైన ప్రదేశంగా ఉండాలి.

క. **చరులఁ బనిచి యరుల తెఱం। గరయుచు, వా రెదురు నడచునట్టి దయిన దె**
ప్పరపుందెరువున డప్పిం। బొరసినయెడ విడియుచోటఁ బొడుచు టురవగున్. **4**

ప్రతిపదార్థం: చరులన్= వేగులవాళ్ళను; పనిచి= పంపించి; అరుల తెఱంగు= శత్రువుల నడతను; అరయుచున్= విచారిస్తూ; వారు= ఆ శత్రువులు; ఎదురునడుచునట్టిది+అయిన= ఎదుర్కొలుకు బయలుదేరి ఉంటే; దెప్పరము= సహింపరాని; తెరువునన్= తోవలోనూ; డప్పిన్= అలసటను; పొరసినయెడన్= పొంది ఉన్నప్పుడూ; విడియుచోటన్= సైన్యం బసలోనూ; పొడుచుట= యుద్ధం చేయటం; ఉరవు+అగున్= తగినదవుతుంది.

తాత్పర్యం: చారులను పంపించి విరోధుల మార్గాలను గూర్చి తెలిసికొనాలి. అప్పటికే వాళ్ళు దండెత్తి వస్తుంటే కాలుమోపటానికి వీలులేని త్రోవలలోగానీ, అలసిన సమయాలలోగానీ, దండు విడిసినపుడు గానీ వాళ్ళను చంపటం తగిన పద్ధతి.

ఆ. **నిదురపోవుచోట నీరుదవ్వై వడఁ। బడిన యెడను గూడుదడసి సొలసి**
నపుడుఁ జెదరియున్న యవసరమునఁ బగ। వారిఁ బొడిచి చెఱుపవలయు నధిప! **5**

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; నిదురపోవుచోటన్= పడుకొని నిద్రపోతున్న చోటులో; నీరు= నీళ్ళు; దవ్వై= దూరమై; వడన్+పడినయెడను= ఎండదెబ్బ తగిలిన సమయంలోనూ; కూడు= తిండి; తడసి= ఆలసించి; సొలసినపుడున్= సొమ్మసిల్లినపుడూ; చెదరిఉన్న అవసరమునన్= సేన అటు ఇటు చెల్లాచెదరై ఉన్నప్పుడూ; పగవారిన్= శత్రువులను; పొడిచి= బాధించి; చెఱుప వలయున్= నశింపచేయాలి.

తాత్పర్యం: నిద్రపోతున్నప్పుడూ, నీళ్ళు దరిదాపుల్లో దొరక్క తపిస్తున్నప్పుడూ, తినటానికి తిండిలేక అలసిసొలసినపుడూ, సైన్యం అంతా చెల్లా చెదరైనపుడూ విరోధులను మట్టుబెట్టటం అతి సులభం.

సీ. చెట్టును ఱాయియు మిట్టయుఁ బల్లంబుఁ । గలిగినచోటు గాల్బలము నేల
వినుము నీళ్ళును రొంపియును లేక సమవిశా । లమునైన చోటు గుఱ్ఱముల నేల
కమ్మి గ్రుంగక గదుగదుప రొంపులు గలు । గమి నొప్పుచోటు రథముల నేల
యెడనెడ మ్రాఁకులు మడువులుఁ గల చోటు । కురునాథ! యెఱుఁగుము; కరుల నేల

ఆ. యే బలంబు దనకు నెక్కుడుఁ గలిగె న । బ్బలమునేల పోరుగలను గాఁగ
నినుఁడు సీతుగాలి వెనుకగా మొన నడ । పించి పొడువ సంభవించు జయము. 6

ప్రతిపదార్థం: కురునాథా!= ఓ కౌరవరాజా! వినుము= ఆలకించుము; చెట్టును= మ్రాను; ఱాయియున్= రాయీ; మిట్టయున్= మెరకా; పల్లంబున్= పల్లమూ; కలిగినచోటు= ఉన్న ప్రదేశం; కాల్బలము నేల= కాలినడకన పోయే సైన్యం ఉండే భూమిగాను; నీళ్ళును= జలమును; రొంపియును లేక= బురద లేని; సమవిశాలమున్+ఐన చోటు= చదునుగా విశాలంగా ఉన్న నేల; గుఱ్ఱముల నేల= గుర్రాలు ఉండే స్థలంగానూ; కమ్మి= బండి చక్రం కమ్మి; క్రుంగక= దిగబడిపోకుండా; గదుగదుప రొంపులు= జారుడుగల బురదమట్టి; కలుగమి= ఉండక; ఒప్పుచోటు= తగినచోటు; రథమునేల= రథాలు ఉండే ప్రదేశంగానూ; ఎడనెడన్= అక్కడక్కడ; మ్రాఁకులు= పెద్ద మాకులు; మడువులు= నీటిగుంటలూ; కలచోటు= ఉన్నస్థలం; కరులనేల= ఏనుగులు ఉండే చోటునుగానూ; ఎఱుంగుము= తెలిసికొనుము; ఏ బలంబు= ఏ సైన్యం; తనకున్= తనకు (ఆ రాజునకు); ఎక్కుడు కలిగెన్= అధికంగా ఉండునో; ఆ+బలము నేల= ఆ సైన్యానికి అనువైన భూమిని; పోరుకలను కాఁగన్= యుద్ధభూమిగానూ; ఇనుఁడు= ఎండా; సీతుగాలి= చల్లటి గాలీ; వెనుకగాన్= వెనకబడ్డప్పుడూ అంటే తక్కువగా ఉన్నప్పుడు; మొనన్= సైన్యాన్ని; నడిపించి= తీసికొనివెళ్ళి; పొడువన్= పోరాడగా; జయము= గెలుపు; సంభవించున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఓ కురునాథా! చెట్లూ, రాళ్ళూ, మెరకలూ, పల్లాలూ ఉండే ప్రదేశాన్ని పదాతిసైన్యానికి ఎంచుకొనాలి. నీళ్ళూ, బురదా లేని సమతల ప్రదేశాన్ని గుర్రాల దండుకు వాడుకొనాలి. రథచక్రాల కమ్మీలు దిగబడని బురదమట్టి నేలను రథబలంకొరకు ఉంచుకొనాలి. అక్కడక్కడా చెట్లూ, నీటి గుంటలూ ఉండేచోట గజసేనను నిలబెట్టాలి. రాజు దగ్గర ఏ సేన ఎక్కువగా ఉంటుందో ఆ సేనకు అనువైన భూమిని యుద్ధరంగం చేయాలి. ఎండ, చలిగాలి తక్కువగా ఉన్న రోజులలో దండెత్తితే జయం తప్పక కలుగుతుంది.

చ. పలకలవార లగ్రమునఁ బన్నఁగ విండులవారి ఘోటకం
బులఁ గరులన్ రథంబులను భూవర! వెన్వెనుకం గ్రమంబునన్
నిలిపినఁ గూడి నిల్చిన యనీకమునం గడుమంచి యోధులం
గలయఁగ నెందు నయ్యయి ప్రకారము వారల నిల్ప బల్పగున్. 7

ప్రతిపదార్థం: భూవర!= ఓ రాజా!; పన్నఁగన్= యుద్ధానికి సిద్ధపడగా; పలకలవారలు= డాలు మొదలైన ఆయుధాలను ధరించిన వాళ్ళు; అగ్రమునన్= ముందునా; వెన్వెనుకన్= ఆ వెనుకాల వెనకాలనే; క్రమంబునన్= ఒకటి తరువాత ఒకటిగా; విండులవారిన్= ధనుర్ధారులను; ఘోటకంబులన్= గుర్రాలను; కరులన్= ఏనుగులను; రథంబులను= రథాలను; నిలిపినన్= మోహరింపచేయగా; కూడి నిల్చిన= చేరి నిల్చున్న; అనీకమునన్= సేనయందు; కడున్= మిక్కిలి; మంచి యోధులన్= వీరభటులను; కలయఁగన్= అంతటా; ఎందున్= ఎక్కడైననూ; ఆ+అయి ప్రకారము= ఆయా తీరుల; వారలన్= వాళ్ళనందరినీ; నిల్పన్= ఉంచటం; బల్పు+అగున్= పుష్టిమంతం అవుతుంది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! డాలు మొదలైన ఆయుధసామగ్రిని ధరించినవాళ్ళను సేనలో మొదట నడిపించాలి. ఆ తరువాత విండ్లు ధరించే వాళ్ళనూ, ఆ వెనక గుర్రాలసేననూ, ఆ వెనుకనే గజ బలాన్నీ, ఆ వెనువెనుకనే రథబలాన్నీ నిలబెట్టాలి. వాళ్లల్లో మంచి వీరులను ఏరి అక్కడక్కడా నిలిపినట్లయితే అది మరింత బలాన్ని చేకూరుస్తుంది.

ఆ. బంటు లుత్సహించి పగఱపోయిరి పోయి । రంచుఁ గడఁగి బొబ్బలార్పు లెసఁగ
నతి రయమున నడరు నట్లుగ దొర సము । ద్ధతి యొనర్పవలయుఁ దాఁకుదలల.' 8

ప్రతిపదార్థం: బంటులు= సైనికులు; ఉత్సహించి= విజృంభించి; పగఱ= శత్రువులు; పోయిరి పోయిరి= పారిపోయారు పారిపోయారు; అంచున్= అంటూ; కడఁగి= ప్రయత్నించి (పూనుకొని); బొబ్బలు+ఆర్పులు= పెద్ద అరుపులు; ఎసఁగన్= అతిశయించగా (ఎక్కువ కాగా); అతిరయమునన్= ఎంతో తొందరగా; అడరునట్లుగన్= విజృంభిస్తున్నట్లుగా; తాఁకుదలల= యుద్ధం ప్రారంభంలో; దొర= రాజు; సముద్ధతి= ఎక్కువైన ఉద్ధృతిని (ఆర్భాటాన్ని); ఒనర్పన్ వలయున్= చేయాలి.

తాత్పర్యం: యుద్ధం మొదలుకాగానే శత్రువులకు బెదరు పుట్టేటట్లు భటులు 'శత్రువులు పారిపోయారు పారిపోయారు' అంటూ పెద్దపెట్టున అరుపులూ రంకెలూ వేయాలి. రాజు కూడా అపుడే విజృంభిస్తున్నట్లుగా సముద్ధతి చేయాలి'.

వ. అనుటయుఁ గౌంతేయాగ్రజుండు శాంతనవునితో 'బం ట్లెట్టివారు గావలయు?'నని యడిగిన, నతం డిట్లనియె. 9

ప్రతిపదార్థం: అనుటయున్= అని మాట్లాడగానే; కౌంతేయ+అగ్రజుండు= కుంతి పెద్దకుమారుడు ధర్మరాజు; శాంతనవునితోన్= శంతను పుత్రుడు భీష్మడితో; బంట్లు= యోధులు; ఎట్టివారు, కావలయును= ఎట్లాంటి వాళ్ళను కూర్చుకొనాలి; అని అడిగినన్= అని అడుగగా; అతండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగానే ధర్మరాజు 'యుద్ధ భటులు ఎట్లాంటి వారైతే బాగుంటుంది?' అని అడగగానే భీష్ముడు ఇట్లా చెప్పాడు.

తే. ఏనుఁ గేనుంగుఁ బేర్చిన ట్లెసకమెసఁగు । నంగముల సొంపుఁ, బులికిని సింగమునకుఁ
బుట్టినట్టి యుగ్రతయును గట్టి మెఱయ । వలనుఁ గల యోధవీరులు వలయు ననికి. 10

ప్రతిపదార్థం: ఏనుఁగు= ఏనుగు; ఏనుంగున్= మరో ఏనుగుతో; పేర్చినట్లు= విజృంభించేటట్లు; ఎసకమెసఁగు= ఉప్పొంగు; అంగముల సొంపున్= అవయవ సమృద్ధిని; పులికిని= పులికీ; సింగమునకున్= సింహానికీ; పుట్టినట్టి= జన్మించినట్టి; ఉగ్రతయును= భీకరత్వమూ; గట్టి మెఱయన్= శౌర్యాన్ని ప్రదర్శించే; వలనున్+కల= నేర్పు ఉన్న; యోధవీరులు= వీరులైన బంట్లు; అనికిన్= యుద్ధానికి; వలయున్= కావాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఏనుగు మరో ఏనుగుతో తలపడి విజృంభించేటప్పటి కండబలం, పులికీ సింహానికీ ఉన్నంత భీకరత్వం, తమ పౌరుషాన్ని ప్రదర్శించుకొనగల చాకచక్యం గల బంట్లు యుద్ధంలో అవసరం.

వ. దేశ విశేషంబు లాకర్ణింపుము: గాంధార సింధు సౌవీరులు కతారంబుల సబళంబులం బరిశ్రమంబు గలిగి బలశౌర్య సమగ్రులై సర్వసమరంబులకుఁ జాలియుండుదు; రౌశీనరు లెల్ల కైదువులకు నేర్చి సత్త్వవంతులై యుండుదురు; ప్రాచ్యు లేనిక కయ్యంబునకు నేర్తురు; కపట యోధులై యుండుదురు; యవనులుఁ గాంభోజులును మధుర చుట్ల దేశంబులవారును గుఱ్ఱపు బవరంబులకు నలవడి యుండుదురు; ఘూర్జరులు బద్ధపరుల నడిదంబులం బరిణతులై యుండుదురు; మాళవులు రథంబులు మొదలైన చతురంగ బలంబుల సంగరంబులం జతురులై యొక్కఁ డొక్కండ పెక్కండ్రకైన నోర్చియుండుదురు; గొందఱఁ గొందఱ నిర్దేశించితి; మఱియు ననేకదేశంబులవారు వివిధ ప్రకారంబుల నుండుదు; రయ్యై తెఱంగు లెఱింగి పెనంగించి జయంబు గొనునది' యనిన ధర్మనందనుండు 'జయించు సైన్యంబులం దోఁచు లక్షణంబులు వినవలతు'ననవుడు భీష్ముఁ డతని కిట్లనియె. 11

ప్రతిపదార్థం: దేశవిశేషంబులు= దేశ విశేషాలను గూర్చి; ఆకర్ణింపుము= వినుము; గాంధారసింధు సౌవీరులు= గాంధార సింధు సౌవీరదేశ వీరులు; కతారంబులన్= కత్తులతో; సబళంబులన్= ఈటెలతో; పరిశ్రమంబు+కలిగి= బాగా సాధనచేసి; బలశౌర్య సమగ్రులు+ఐ= పరాక్రమ, పౌరుషశక్తి, సంపన్నులయి; సర్వసమరంబులకున్= ఎన్నిరకాల యుద్ధాలకైనా; చాలి, ఉండుదురు= సమర్థులై ఉంటారు; ఉశీనరులు= ఔశీనరదేశం వాళ్ళు; ఎల్లకైదువులకున్= అన్ని ఆయుధాలను ఉపయోగించటంలో; నేర్చి= పట్టుగలిగి; సత్త్వవంతులు+ఐ= బలిష్ఠులై; ఉండుదురు= ఉంటారు; ప్రాచ్యులు= తూర్పుదేశీయులు; ఏనికకయ్యంబునకున్= గజ యుద్ధంలో; నేర్తురు= ఆరి తేరినవాళ్ళుగాను; కపట యోధులు+ఐ= మోసకారులైన వీరులై; ఉండుదురు= ఉంటారు; యవనులు= యవనదేశస్థులూ; కాంభోజులును= కాంభోజ యోధులూ; మధురచుట్ల దేశంబులవారును= మధుర చుట్టుప్రక్కలప్రాంతం వాళ్ళూ; గుఱ్ఱపుబవరంబులకున్= ఆశ్విక యుద్ధాలకు; అలవడి ఉండుదురు= తగి ఉంటారు; ఘూర్జరులు= ఘూర్జరసేనలు; బద్ధపరులన్= ధనుర్విద్యలోనూ; అడిదంబులన్= కత్తికటారులు తిప్పటంలోనూ; పరిణతులు+ఐ= చేయి తిరిగినవాళ్ళై; ఉండుదురు= ఉంటారు; మాళవులు= మాళవభటులు; రథంబులు= రథాలు మొదలైన; చతురంగబలంబులన్= నాలుగు రకాలైన యుద్ధ సైన్యంతో; సంగరంబులన్= యుద్ధాల్లో; చతురులు+ఐ= నేర్పరులై; ఒక్కఁడొక్కండు= ఒక్కొక్కడే; పెక్కండ్రకున్+ఐనన్= చాలామందిని ఎదుర్కొనటానికైనా; ఓర్చి= తాళ కలిగి; ఉండుదురు= ఉంటారు; కొందఱన్+కొందఱన్= కొద్దిమందిని మాత్రమే; నిర్దేశించితిన్= నిరూపించి చెప్పాను; మఱియున్= ఇంకా; అనేక దేశంబులవారు= ఎన్నో దేశాలవాళ్ళు; వివిధ ప్రకారంబులన్= అనేక విధాలుగా; ఉండుదురు= ఉంటారు; ఆ+ఆ+తెఱంగులు= ఆయా పద్ధతులు; ఎఱింగి= తెలిసికొని; పెనంగించి= పోరాడేటట్లు చేసి; జయంబున్= గెలుపును; కొనునది= చేపట్టాలి; అనినన్= అనగానే; ధర్మనందనుండు= ధర్మరాజు; జయించు= విజయం సాధించే; సైన్యంబులన్= సేనలలో; తోఁచు= కనబడే; లక్షణంబులు= ఆనవాళ్ళను; వినవలతున్= వినాలని ఉన్నది; అనవుడున్= అని అనగానే; భీష్ముఁడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు= ఇట్లా; అనియెన్= మాట్లాడాడు.

తాత్పర్యం: ఇక ఆయాదేశాల వీరభటుల స్వభావాలు ఎట్లా ఉంటాయో చెప్పుతాను వినుము. గాంధార, సింధు, సౌవీర దేశవీరులు కత్తులతో ఈటెలతో బాగా సాధన చేసిన వాళ్ళు. వీళ్ళు ఏ యుద్ధం చేయటానికైనా సంసిద్ధులే. ఔశీనరదేశంవాళ్ళు అన్ని ఆయుధాలను పట్టగలిగే సత్తువ కలవాళ్ళు, పుష్టికలవాళ్ళు. తూర్పుదేశం సేనలు ఏనుగులు ఎక్కిచేసే యుద్ధాలలో ఆరితేరినవాళ్ళు. వీళ్ళు గదాయుద్ధంలోనూ మంచి ఘటికులు. యవనులు, కాంభోజులు, మధుర చుట్టూ ఉన్నదేశాలవాళ్ళు గుఱ్ఱాలనెక్కి చేసే యుద్ధంలో మంచి పట్టుగలవాళ్ళు. ఘూర్జరులు బాణం

విసరటంలో, కత్తులూ, కటారులూ తిప్పటంలో చేయితిరిగినవాళ్ళు. మాళవులు రథ, గజ, అశ్వ, పదాతిదళాల పోరులో పండబారిన వాళ్ళు. ఒక్కొక్కడు వేలమంది పెట్టు. ఇంతదాకా నీకు చాలా కొద్ది మందిని గూర్చి మాత్రమే తెలిపాను. ఇంకా అనేక దేశాలసేనలు ఎన్నో యుద్ధవిధానాలలో మంచి నేర్పరులై ఉంటారు. ఆయా యుద్ధపు మెలకువలు తెలిసికొని ఎదిరించి. విజయాన్ని సాధించాలి' - అని అనగానే ధర్మరాజు 'జయం సాధించే సేన ఏ లక్షణాలతో ఉంటుందో చెప్పు'మనగానే భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

ధర్మజునకు భీష్ముఁడు శకునాపశకునములు దెలుపుట (సం. 12-103-2)

క. సైనికుల మనము లుత్సా । హానూనము లగుచునుండు, హయహేషణముల్
వీనులకును సొగియించు, గ । జానీకము లుబ్బు విజయ మగు సైన్యమునన్. 12

ప్రతిపదార్థం: విజయము+అగు= జయం కలిగే; సైన్యమునన్= సేనలో; సైనికుల= సేనలయొక్క; మనములు= మనస్సులు; ఉత్సాహ= సంతోషంతో; అనూనములు= తక్కువకానివి అంటే మరింత ఆనందించేవి; అగుచున్= అవుతూ; ఉండున్= ఉంటాయి; హయ= గుఱ్ఱాల; హేషణముల్= సకిలింతలు; వీనులకునున్= చెవులకు (వినటానికి); సొగియించున్= ఇంపు కలిగిస్తాయి; గజ+అనీకములు= ఏనుగుల దండు; ఉబ్బున్= విజృంభిస్తుంది.

తాత్పర్యం: జయం లభించే సేన మంచి ఉత్సాహంగా ఉంటుంది. గుఱ్ఱాల సకిలింతలు చెవికి ఇంపుగా వినిపిస్తాయి. ఏనుగుల గుంపు విజృంభిస్తుంది. ఇవి గెలుపునకు సూచకాలు.

క. మృగములుఁ బక్షులు ననులో । మగతిం జరియించు, వెనుక మందానిలుఁ డిం
పుగ వచ్చి మెలఁగుఁ, గడు మే । లగుమాటలు వొడము గెలుచునట్టి బలమునన్. 13

ప్రతిపదార్థం: గెలుచు+అట్టి= జయం ప్రాప్తించే; బలమునన్= సైన్యంలో; మృగములున్= మెకాలూ; పక్షులున్= పిట్టలూ; అనులోమగతిన్= సవ్యం అయిన పోకడలతో; చరియించున్= తిరుగుతాయి; వెనుకన్= తరువాత; మందానిలుఁడు= పిల్లగాలి; ఇంపుగన్= హాయిగా; వచ్చి= తాకి; మెలఁగున్= విసరును; కడుమేలు+అగు= ఎంతో మంచిని కోరే; మాటలు= సల్లాపాలు; పొడమున్= పుట్టుతాయి (వినిపిస్తాయి).

తాత్పర్యం: విజయం చేకూరుతుం దనటానికి గుర్తుగా జంతువులూ పక్షులూ అనుకూలంగా తిరుగుతాయి. చిరుగాలులు వీస్తూ సంతోష పెట్టుతాయి. సైన్యంలోనుండి శుభంకరమైన పల్కులే వినిపిస్తాయి.

క. వెలడు నెడఁ దెలివితో న । గ్నులు వలపల సుడియు శిఖలఁ గొమరగుఁ దూర్యం
బులు గంభీరధ్వనులం । జెలఁగును జయము గొనునట్టి సేనఁ గుమారా!' 14

ప్రతిపదార్థం: కుమారా!= ఓ బిడ్డా!; జయము= గెలుపు; కొనునట్టి= చేపట్టే; సేనన్= సైన్యంలో; వెలడు= బయలుదేరే; ఎడన్= సమయంలో; తెలివితోన్= ప్రకాశంతో (తేజస్సుతో); అగ్నులు= నిప్పులు; వలపల= కుడివైపుగా; సుడియు= తిరిగే (వ్యాపించే); శిఖలన్= మంటలతో; కొమరు+అగున్= ఒప్పుతాయి; తూర్యంబులు గంభీరధ్వనులన్= వాద్యాలు పెనుమ్రోతలతో; చెలఁగున్= మార్మోగుతాయి.

తాత్పర్యం: ఓ బిడ్డా! విజయం పొందే సేన సమరానికి సాగిపోయేటప్పుడు అగ్నిజ్వాలలు ఎఱ్ఱగా కుడివైపుగా మండుతాయి. యుద్ధ భేరీలు ధణధణమంటూ భోరున మ్రోగుతాయి.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అని చెప్పి మఱియు నతఁ డి । ట్లను 'ముట్టిన పగఱసొంపునడఁచుట యొప్పున్
విను కయ్యమునకుఁ గాల్ద్ర । వ్వినఁ బాటిలు దురిత మెట్టి విభునకు నైనన్. 15

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; మఱియున్= మళ్ళీ; అతఁడు= భీష్ముడు; ఇట్లు= ఇట్లా; అనున్= పలికాడు; ముట్టిన= చుట్టుముట్టిన; పగఱ= శత్రువులయొక్క; సొంపున్= పెంపును; అడఁచుట= అణగదొక్కటం (నశింపచేయటం); ఒప్పున్= తగి ఉంటుంది; విను= ఆలకించుము; కయ్యమునకున్+కాల్ద్రవ్వినన్= యుద్ధానికి సిద్ధపడితే; ఎట్టి= ఎంతటి; విభునకున్= దొరకైనా; దురితము= పాపం; పాటిలున్= కలుగుతుంది.

తాత్పర్యం: అని చెప్పి భీష్ముడు తిరిగి ఇట్లా అన్నాడు. 'అయితే ఊరకనే ఎదుర్కొన్న శత్రువుల పొగరు అణచటం మంచిదే. ఇంకొక విషయం కూడా బాగా వినుము. తనకు తానై యుద్ధానికి తలపడితే మాత్రం ఎట్లాంటి రాజుకైనా పాపం చుట్టుకొంటుంది.

క. చెఱువు నడు మవిసినను బెను । వెఱ మెకములు సెదరినను వివేకనిధీ! యు
క్కఱి బహుళసైన్య మఱిముఱిఁ । బఱచిన నాఁగంగ రాదు బలియుర కైనన్. 16

ప్రతిపదార్థం: వివేకనిధీ!= జ్ఞానంగల ధర్మరాజా!; చెఱువు= చెరువుకట్ట; నడుము= నట్టనడిమి భాగం; అవిసినను= గండిపడినా; పెనువెఱన్= మిక్కిలి భయంతో; మెకములు= జంతువులు; చెదరినను= అటూ ఇటూ పారిపోయినా; ఉక్కు+అఱి= శక్తిలేక; బహుళసైన్యము= అధికమైన; అఱిముఱిన్= తత్తరపాటుతో ఎక్కడివక్కడ; పఱచినన్= పరుగులు పెట్టినా; బలియురకున్+ఐనన్= ఎంతటి బలవంతులకైనా; ఆఁగంగన్= ఆపటం; రాదు= కుదరదు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నడిగట్టు తెగిన చెరువునీళ్ళను, బెదరి పారిపోయే క్రూరమృగాలను, యుద్ధం చేసే ఓపికలేక పిరికితనంతో పారిపోయే సైన్యాన్ని అడ్డుకొనటం ఎట్లాంటి మహామహుడికైనా తగదు.

క. విను కొందఱైనఁ గడుఁ దెం । పున మార్కొని కడిమి మీఱి పొంగి యడరినన్
మొన యెంతయైన విఱుగుం; । జనునే కయ్యంబు వొడువ శక్తుల కైనన్. 17

ప్రతిపదార్థం: విను= వినవలసింది; కొందఱు+ఐనన్= కొద్దిమంది అయినా; కడున్+తెంపునన్= ఎంతో సాహసంతో; మార్కొని= ఎదురొడ్డి; కడిమిమీఱి= మించిన పరాక్రమంతో; పొంగి= ఉబ్బి; అడరినన్= విజృంభించగా; మొన= సైన్యం; ఎంత+ఐనన్= ఎంత పాటిదైనా; విఱుగున్= ఓడుతుంది; శక్తులకున్+ఐనన్= ఎంతటి సమర్థుల (నేర్పరుల)కైనా; కయ్యంబు= పోరు; పొడువన్+చనునే?= కలిగించటం తగునా?

తాత్పర్యం: ఒక విషయం వినుము. సైన్యంలో కొద్దిమంది అయినా తెగించి ఎంతో పరాక్రమంతో ఎంతో ఉత్సాహంతో విరుచుకుపడితే ఆ సైన్యం ఎంత పాటిదైనా చెల్లాచెదరైపోతుంది. ఎంత సామర్థ్యం కలవాళ్ళకైనా పోరాడటం సరైన పద్ధతి కాదు. ఎక్కువ సైన్యం ఉంటేనే జయించటం సాధ్యం అనుకొనకూడదు. (ఒకొక్కప్పుడు తక్కువ సైన్యం ఉన్నా జయించవచ్చని భావం).

క. క్షమ మేలగు; నైన నతి । క్షమ దైన్యముఁ దెచ్చు నెదురు గర్వించినఁ గ
య్యము వొడిచి గెలిచి యరిశే । షమునెడ సదయక్షమా విశదుఁ డగు టొప్పున్.' 18

ప్రతిపదార్థం: క్షమ= ఓర్పు; మేలు+అగున్= మంచిదే అవుతుంది; ఐనన్= అయినా; అతిక్షమ= మితిమీరిన సహనం; దైన్యమున్= తక్కువతనాన్ని; తెచ్చున్= తెచ్చిపెట్టుతుంది; ఎదురు= పగవాడు; గర్వించినన్= గర్వపడితే; కయ్యము+పొడిచి= పోరుపెట్టుకొని; గెలిచి= జయించి; అరిశేషము+ఎడన్= మిగిలిన శత్రువుల విషయంలో; సదయ= కరుణతో కూడిన; క్షమావిశదుఁడు+అగుట= ఎంతో ఓర్పు కలిగి ఉండటం; ఒప్పున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: ఓ రాజా! ఓర్పు వహించటం మంచిదే కాని శ్రుతిమించిన సహనం దైన్యానికి త్రోవతీస్తుంది. పగవాడు పొగరుబోతు అయితే యుద్ధంచేసి గెలవాలి. మిగిలిపోయిన శత్రువులపట్ల ఎంతో శాంతి, దయా కనబరచాలి.'

రాజు పగఱయెడ నుండవలయు విధము (సం. 12-104-2)

వ. **అనిన నప్పాండవోత్తముండు 'పుడమిఱేఁడు పగఱయెడ నెట్టివాఁడు గావలయు?'ననవుడు నా భూపతితో భీష్ముండు 'బృహస్పతి దివస్పతి కెఱింగించిన తెఱం గుపదేశించెద' నని యి ట్లనియె.** 19

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన భీష్ముడితో; ఆ+పాండవ+ఉత్తముండు= ఆ పాండవులలో ముఖ్యుడైన ధర్మరాజు; పుడమిఱేఁడు= భూపతి (రాజు); పగఱ+ఎడన్= విరోధులపట్ల; ఎట్టివాఁడు= ఎట్లాంటివాడు; కావలయున్= అయి ఉండాలి; అనవుడున్= అనగానే; ఆ భూపతితోన్= ఆ రాజుతో; భీష్ముండు= భీష్ముడు; బృహస్పతి= దేవతల గురువు; దివస్పతికిన్= స్వర్గానికి రాజైన ఇంద్రుడికి; ఎఱింగించిన= తెలిపిన; తెఱంగు= విధానం; ఉపదేశించెదను= బోధపరుస్తాను; అని= అని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడితో ధర్మరాజు 'రాజు విరోధుల విషయంలో ఎట్లా ప్రవర్తించాలి?' అని అడిగాడు. భీష్ముడు 'ఒకప్పుడు బృహస్పతి ఇంద్రుడికి చెప్పినట్లుగానే నీకూ చెప్పుతాను విను'మని ధర్మరాజుతో ఇట్లా చెప్పటం ప్రారంభించాడు.

చ. **విను మరిఁ జంపనుం జెఱుప వేచుట లెస్స; ప్రతాప భాషణం**
బున వెడ నుల్లికుట్టులను బొంకుల వానిఁ గలంగఁ జేసి రేఁ
చినఁ దన పూఁపు దప్పు నఱసేయని చందము నమ్మి యున్న చా
డ్పును మెఱయంగఁ బల్కుచుఁ గడున్ మది నమ్మకయుండఁ గాఁ దగున్. 20

ప్రతిపదార్థం: వినుము= వినుము; అరిన్= పగవాడిని; చంపనున్= చంపటానికి; చెఱుపన్= పాడు చేయటానికి; వేచుట= ఎదురు చూడటం; లెస్స= మంచిది; ప్రతాప భాషణంబునన్= కరకు మాటలతోనూ; వెడన్= పొల్లుకూతలతోనూ; ఉల్లికుట్టులను= సూటిపోటి మాటలతోనూ; బొంకులన్= అబద్ధాలతోనూ; వానిన్= పగవాడిని; కలంగన్+చేసి= కలవర పెట్టి; రేఁచినన్= రెచ్చిపోగా; తన= తనదైన; పూఁపు= ప్రయత్నం; తప్పున్= చెడిపోతుంది; అఱ చేయని చందమున్= దగా చేయని పద్ధతితో; నమ్మి+ఉన్న= నమ్మకం పెట్టుకొన్న; చాడ్పును= తీరును; మెఱయంగన్= ఒప్పేటట్లు (వ్యక్తమయ్యేటట్లు); పల్కుచున్= మాట్లాడుతూ; కడున్= మిక్కిలి; మదిన్= మనస్సులో; నమ్మక= విశ్వసించకుండా; ఉండఁగాన్+తగున్= ఉండటం మంచిది.

తాత్పర్యం: పగవాడిని తుదముట్టించాలన్నా, పాడుచెయ్యాలన్నా అనువుకొరకు వేచి ఉండాలి. అంతేకాని కరుకుగా మాట్లాడిగాని, వ్యర్థంగా మాటలాడిగానీ, పుల్లవిరుపు మాటలాడిగాని, అబద్ధా లాడిగాని వాళ్ళను కలవరపెట్టకూడదు. అట్లా రెచ్చగొడితే తాను తలపెట్టిన ప్రయత్నాలకు అడ్డుపుల్లలు పడతాయి. వాళ్ళను మోసగించని రీతిలో నమ్మినట్లు మాటలలో కనబరచాలి. కాని, లోపల ఏ మాత్రమూ నమ్మకం పెట్టుకొనకూడదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **అరిపయి వీఁకనెత్తి చనునప్పుడుఁ దేనియ లుట్టు నట్లుగా**
నరపతి వాని వారలు వినం బ్రియమాడుట మేలు; పక్షిఁ దాఁ
దిరముగఁ జేయఁగా మృగము తేఁకువ వాపను వేఁటకాఁడు త
త్స్వరములు సూపికాదె తుదిఁ జంపఁ దెగుం దనబారిఁ బాఱినన్. **21**

ప్రతిపదార్థం: అరిపయిన్= శత్రువుమీదికి; వీఁకన్= పరాక్రమంతో; ఎత్తి= దండెత్తి; చను+అప్పుడున్= వెళ్ళేటప్పుడు; నరపతి= రాజు; వాని వారలు= వాళ్ళవాళ్ళు; వినన్= వినేటట్లు; తేనియలు= తీయదనం; ఉట్టునట్లు+కాన్= ఉట్టిపడేటట్లుగా; ప్రియము= ఇచ్చకాలు; ఆడుట= పలకటం; మేలు= బాగు; వేఁటగాఁడు= బోయ; తనబారిన్= తన గురి (దృష్టి) నుండి; పాఱినన్= తప్పుకొనిపోగా; తాన్= తాను (బోయ); పక్షిన్= పిట్టను; తిరముగన్= స్థిరంగా (కదలకుండేటట్లు); చేయఁగాన్= చేయటానికి; మృగము= జంతువు; తేఁకువ= భయం; పాపను అని= పోగొట్టటానికి; తద్= ఆయా పిట్టలయొక్క, జంతువులయొక్క; స్వరములు= కూతలు(అరుపులు); చూపి= కలిగించి; తుదిన్= చివరకు; చంపన్= ప్రాణం తీయటానికి; తెగున్+కాదె!= సాహసించును కదా!

తాత్పర్యం: తన గురినుండి తప్పించుకొని తన స్థానంలో దిటవుగా ఉన్న పక్షికీ, జంతువుకూ కలిగే భీతిని పోగొట్టటానికి ఆయా పక్షుల జంతువుల కూతలూ అరుపులూ పెట్టించి రప్పించి, చివరకు వాటి ప్రాణాలు తీయటానికి బోయవాడు పూనుకొంటాడు. అట్లాగే పగవాడి మీదికి పోయేటప్పుడు రాజు వాళ్ళ దగ్గరి వాళ్ళు వినేటట్లు తీయగా కమ్మగా ఇచ్చకాలాడి తప్పించుకొన్న శత్రువును రప్పించి చంపటం తగిన వ్యవహారం అనిపించుకొంటుంది.

విశేషం: అలం: నిదర్శనం.

ఉ. **వేమఱు శత్రునిం బరిభవించుట, రిత్తకు రిత్త వైరముం**
దా మదిఁ బెట్టికోలు సుఖతంత్రము గాదు, సుసంధికాలమున్
సీమ దగంగ రూపడఁగఁ జేయుటయున్ వల; దగ్గమైన వాఁ
డేమెయి నైన వధ్యుఁ డను నిట్టి వినిశ్చయ మాత్మఁ గల్గుటన్. **22**

ప్రతిపదార్థం: అగ్గము+ఐనవాఁడు= స్వాధీనుడైనవాడు; ఏమెయిన్+ఐనన్= ఎట్లాగైనా; వధ్యుఁడు= చంపదగినట్టివాడు; అను+ఇట్టి= అనేటి; వినిశ్చయము= గట్టి భావం; ఆత్మన్= తనలో; కల్గుటన్= కలిగి ఉండటం వలన; వేమఱు= మాటిమాటికి; శత్రునిన్= పగవాడిని; పరిభవించుట= అవమాన పరచటం; రిత్తకు రిత్త= నిష్కారణ; వైరమున్= విరోధాన్ని (పగను); తాన్= తానుగా; మదిన్= మనస్సులో; పెట్టికోలు= పెట్టుకొనటం; సుఖతంత్రము+కాదు= క్షేమమైన ఉపాయం కాదు; సుసంధికాలమున్= చక్కగా ఒక ఒప్పందానికి వచ్చే సమయానికి; సీమ= ఎల్లను (సరిహద్దును); తగంగన్= ఒప్పిదంగా; రూపు+అడఁగన్+చేయుటయున్= రూపు మాపుచేయటం; వలదు= ఒప్పదు.

తాత్పర్యం: చేజిక్కిన శత్రువును ఎట్లాగైనా జయించవచ్చనే గట్టి నిర్ణయాన్ని లోపలపెట్టుకొని పగవాడిని అదే పనిగా అవమానించటం, ఎపుడూ పగతో ఉండటం సరైన సంధి కుదుర్చుకొనే సమయంలో, రాజ్యపు సరిహద్దులను నామరూపాలు లేకుండా చేయటం అనేవి తగని పనులు.

క. **కాల విపర్యయమున నర । పాలుఁడు దా మ్రొక్కియైనఁ బగతుఁ గలిసి త**
చ్ఛీలమెఱిఁగి తఱియైనం । గాలునిపురి కనుచునది సుకరముగ వానిన్. **23**

ప్రతిపదార్థం: కాల విపర్యయమునన్= కాలం కలిసిరానపుడు; నరపాలుఁడు= రాజు; తాన్+మ్రొక్కి+ఐనన్= తనకు తానుగా నమస్కరించి అయినా; పగతున్+కలిసి= శత్రువుతో కూడి; తద్+శీలమున్= అతడి నడవడిని; ఎఱింగి= తెలిసికొని; తఱి+ఐనన్= సమయం వచ్చినప్పుడు; వానిన్= ఆ విరోధిని; సుకరముగన్= మిక్కిలి తేలికగా; కాలునిపురికిన్= యమునిపట్టణానికి; అనుచునది= పంపాలి.

తాత్పర్యం: శత్రువునకు కాలం అచ్చివచ్చినప్పుడు తనకు తానుగానే మొక్కుకొని అయినా లొంగిపోవాలి. అతడితో కలిసిపోవాలి. అతడి నడతను పసిగట్టాలి. తనకు కాలం కలిసిరాగానే పగవాడిని చాల అనాయాసంగా చంపాలి.

క. అనదతనంబును, బెడిదపుఁ। దనమును లేకుండఁ బరఁగి దరి యొత్తెడు నే
టినుబోలె నొత్తవలయును। మనుజేంద్రుఁడు మార్తురం గ్రమంబున నధిపా! 24

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా!; మనుజ+ఇంద్రుఁడు= మనుష్యులలో ఉత్తముడైన రాజు; మార్తురన్= విరోధులను; క్రమంబునన్= మెల్లగా; అనదతనంబును= దీనత్వాన్నీ; బెడిదపుఁ దనమును= కరకు తనాన్నీ; లేక ఉండన్= ఏమాత్రం కనపడనీయకుండా; పరఁగి= ఒప్పి; దరి= ఒడ్డును; ఒత్తెడు= ఒరసికొనే; ఏఱును+పోలెన్= నదివలె; ఒత్తవలయును= ఆక్రమించాలి.

తాత్పర్యం: పగవాడిమీద రాజు ఎంతో జాలిపడినట్లుగాని, ఎంతో దురుసుగా ఉన్నట్లుగాని బయటపడకూడదు. ఒడ్డును దాకి మెల్లగా దానిని కోసి విస్తరించే నది మాదిరిగా శత్రువులను మెల్లమెల్లగా ఆక్రమించుకొనాలి.

విశేషం: అలం: ఉపమ.

క. పెక్కండ్రతోడ నీరస। మొక్క తఱిన కొనక తఱఁగి యున్న పగతుతో
నుక్కాడి బంధుభావముఁ। దక్కటి పగఱయెడ వలయుఁ దా నెఱపంగన్. 25

ప్రతిపదార్థం: పెక్కండ్ర తోడన్= చాలా మందితో; ఈరసము= ద్వేషం; ఒక్క తఱిన= ఒకేసారే; కొనక=తెచ్చుకొనక; తఱఁగి+ఉన్న= తగ్గి ఉన్న (బలహీనపడి ఉన్న); పగతుతోన్= శత్రువుతో; ఉక్కాడి= పగగొని; తక్కటి= తక్కిన; పగఱ+ఎడన్= విరోధుల పట్ల; బంధుభావము= చుట్టరికాన్ని; తాన్= తాను; నెఱపంగన్ వలయున్= కనబరచాలి.

తాత్పర్యం: ఒకేసారి ఎక్కువమందిమీద ద్వేషం పెట్టుకొనకూడదు. తగ్గి ఉన్న పగవాడిపై పగబట్టాలి. కాని, మిగతా శత్రువులతో ఆత్మీయంగా మెలగాలి.

కాలకవృక్షీయ మహాముని క్షేమదర్శికిఁ జెప్పిన హితవాక్యములు (సం. 12-105-2)

వ. అనిన శంతనుపుత్రుతో నజాతశత్రుండు 'నిజపరివారదోషంబున నైనను, బరులచేత నేనియు, సంపద సెడుట నాపదం బొరసిన ధరణీశుండు నెవ్వగ నెవ్విధంబునం బాపికొను? నెఱింగింపు'మనుటయుఁ 'దొల్లి కోసల పతియైన క్షేమదర్శి విదేహపతిచేత భూమిఁ గోల్పోయి వగంబొంది, మున్ను దనకు మంత్రియై యుండి తాను రాజ్యంబు సేయుచుండు బరమశాంతి నొంది వనంబునకుం జనిన కాలకవృక్షీయు నాశ్రయించి, యిట్ల యడిగిన నమ్మనుజపతికి నమ్మునిపతి సెప్పిన వాక్యంబులు సెప్పెద విను మని యక్కురుపితామహుం డిట్లనియె. 26

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; శంతను పుత్రుతోన్= భీష్ముడితో; అజాతశత్రుండు= ధర్మరాజు; నిజపరివార= సొంతపరిజనంయొక్క; దోషంబునన్+ఐనన్= తప్పిదంవలన అయితేనేమి; పరులచేతన్+ఏనియున్= ఇతరుల వలన అయితేనేమి;

సంపద= రాజ్యసంపత్తి; చెడుటన్= కోల్పోవటంచేత; ఆపదన్= కష్టాన్ని; పొరసిన= పొందిన; ధరణీ+ఈశుండు= రాజు; నెఱ+వగన్= ఎక్కువ దుఃఖాన్ని; ఏ విధంబునన్= ఎట్లా; పాపికొనునన్?= పోగొట్టుకొంటాడు; ఎఱింగింపుము= తెలియచెప్పుము; అనుటయున్= అనగానే; తొల్లి= ఆనాడు (అపు డెప్పుడో); కోసలపతి+ఐన= కోసలదేశం రాజైన; క్షేమదర్శి= క్షేమదర్శి అనేవాడు; విదేహపతిచేతన్= విదేహదేశపు రాజుచేత; భూమిన్= రాజ్యాన్ని; కోల్పోయి= పోగొట్టుకొని; వగన్+పొంది= విచారించి (బాధపడి); మున్ను= మునుపు; తనకున్= తనకు; మంత్రిఐ+ఉండి= మంత్రిగా ఉండి; తాను రాజ్యంబు చేయుచున్+ఉండన్= తాను పరిపాలిస్తుండగా; పరమ= మిక్కిలి; శాంతిన్+ఒంది= ఓర్పు వహించి; వనంబునకున్= అడవిలోనికి; చనిన= వెళ్ళిన; కాలకవృక్షీయున్= కాలకవృక్షీయుడిని; ఆశ్రయించి= నీడన ఉండి; ఇట్లు= ఇట్లా; అడిగినన్= అడుగగా; ఆ మనుజపతికిన్= ఆ రాజుకు; ఆ+మునిపతి= ఆ మునిరాజు; చెప్పిన= ఆడిన; వాక్యంబులు= మాటలు; చెప్పెదన్= చెప్పుతాను; వినుము+అని= వినవలసినదని; ఆ కురుపితామహుండు= ఆ కురువంశీయుల తాత భీష్ముడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడితో ధర్మరాజు 'సొంత బలగంవలననో ఇతరులవలననో రాజ్యం కూలిపోయి అగచాట్లు పడే రాజు తన బాధను ఎట్లా దిగమింగుకొనాలో చెప్పవలసింది' అనగానే 'కోసలదేశపు రాజు క్షేమదర్శి విదేహదేశపు రాజు చేతిలో రాజ్యాన్ని పోగొట్టుకొని చాలా వెత పొందాడు. ఇంతకు మునుపు తాను పరిపాలించేటప్పుడు మంత్రిగా ఉండి, అడవులలోనికి వెళ్ళిన కాలకవృక్షీయుడి నీడపట్టున చేరి, నీ వడిగినట్లే అడిగాడు. ఆ రాజునకు ఆ ముని చెప్పిన విషయాలే నీకు వినిపిస్తాను. ఆలకించుము అని భీష్ముడు ఇట్లా అన్నాడు.

తే. అర్థవంతుఁడై భోగంబు లనుభవించు । చున్నయప్పుడ యిది యిట్టులుండనేర;
దస్థిరమ; తాను లోనుగానని యెఱుంగు । నతఁడు వగఁబొందఁ డేది యెట్లైన నధిప! 27

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! అర్థవంతుఁడు+ఐ= ధనవంతుడై; భోగంబులు= సుఖాలు; అనుభవించుచున్+ఉన్న+అపుడు+అ= పొందుతున్న సమయంలోనే; అది= ఆ ధనం; ఇట్టులు= ఈ తీరులో; ఉండన్+ఏరదు= ఉండదు; అస్థిరమ= నిలకడలేనిది; తాను= తనకు తానుగా (నాకు నేనుగా); లోనుగాను= లోబడను; అని ఎఱుంగు+అతఁడు= అని తెలిసికొనేవాడు; ఏది ఎట్టు+ఐనన్= ఏది ఎట్లా జరిగినా; వగన్ పొందఁడు= బాధనొందడు (విచారించడు).

తాత్పర్యం: ఓ కోసలరాజా! బాగా డబ్బుండి సమస్త సుఖాలూ అనుభవించేటప్పుడు 'డబ్బు ఎపుడూ ఇట్లాగే ఉండదు. అనిత్యమైనది. దానికి నేను బానిసను కాకూడదు' అని అనుకొనే రాజునకు ఏది ఎట్లా జరిగినా అంటే డబ్బు ఉన్నా పోయినా చీకూ చింతా ఉండదు.

క. కానియటు లుండి నెఱిఁ బడు; । నైన తెఱఁగు దోఁచి మాయమగు; నిబ్భంగిన్
మానసమున కుబ్బు వగయుఁ । దే నోపుం బనులు; బుధుఁడు దేలఁడు రెంటన్. 28

ప్రతిపదార్థం: పనులు= కార్యాలు; కాని అటులు+ఉండి= కావేమో అన్నట్లు ఉండి; నెఱిన్+పడున్= సిద్ధిస్తాయి; ఐన తెఱఁగు తోఁచి= పని ఫలిస్తుందేమో అనేటట్లు కనబడి; మాయము+అగున్= కాకపోవచ్చును; ఈ భంగిన్= ఇట్లా; మానసమునకున్= మనస్సునకు; ఉబ్బున్= సంతోషాన్ని; వగయున్= దుఃఖాన్ని; తేన్+ఓపున్= తెచ్చిపెట్టగలవు; బుధుఁడు= పండితుడు; రెంటన్= సుఖదుఃఖాలు రెంటి విషయంలోనూ; తేలఁడు= పైకి తేలడు.

తాత్పర్యం: ఒకొక్కపని కాదేమో అనిపించి చటుక్కున నెరవేరుతుంది. ఒకొక్కపని అయితీరుతుం దనిపించి కాకపోవచ్చును. పని ఫలిస్తే మనస్సుకు సంతోషాన్నీ, ఫలించనపుడు విచారాన్నీ కలిగిస్తుంది. మంచీ చెడ్డా తెలిసినవాడు మాత్రం ఈ రెంటి విషయంలోనూ ఎక్కడా బయటపడడు.

విశేషం: అలం: యథాసంఖ్యం.

క. జననీజనకులును సుహృ । జ్జనులును దెగునపుడు గావఁ జనమి దెలియదే
ధనములు వారల కంటెనె । మనుజేశ్వర! వగపు వాని మగిడించునొకో! 29

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= రాజా!; జననీ జనకులును= తల్లిదండ్రులును; సుహృద్+జనులును= నేస్తగాండ్రును; తెగు+అపుడు= చచ్చిపోయేటప్పుడు; కావన్+చనమి= కాపాడుకొనలేకపోవటం; తెలియదే?= తెలియదా?; ధనములు= సంపదలు; వారలకంటెన్+ఏ= ఆ తల్లిదండ్రులు మొదలైన వారికంటే ఎక్కువా; వగపు= దుఃఖం; వానిన్= వారిని; మగిడించు+ఒకొ!= మళ్ళిస్తుందా ఏమి? మళ్ళించదు.

తాత్పర్యం: ఓ రాజా! చనిపోతున్న తల్లిదండ్రులను ఆప్తులను కాపాడుకొనలేమని తెలిసినపుడు ధనాన్ని ఎట్లా రక్షించుకొనగలం? డబ్బు వారికంటె గొప్పదా? బాధపడినందువలన వారిని తిరిగిపొందలేం. (అశాశ్వతమైన వాటిని గూర్చి వగచి ప్రయోజనంలే దని పిండితార్థం).

క. గతమునకును వగవ కనా । గతమునకును నోరుదెఱచి కడుఁ గోరక దీ
నతఁ బొందక దైవం బే । గతిఁ బుచ్చిన దానఁ బోదుఁ గా కనవలయున్. 30

ప్రతిపదార్థం: గతమునకును= జరిగిపోయినదానికి; వగవక= విచారించక; అనాగతమునకును= రాబోయే దానినిగూర్చి; నోరు+తెఱచి= ఆశపెట్టుకొని; కడున్+కోరక= ఎక్కువ ఆపేక్షించకుండా; దీనతన్= దీనావస్థను; పొందక= చెందక; దైవంబు= విధి; ఏ గతిన్= ఏ తీరున; పుచ్చినన్= ఆదేశిస్తే; దానన్= దానితో; పోదున్+కాక= నడచుకుంటాను గాక; అనన్ వలయున్= అని అనుకోవాలి.

తాత్పర్యం: అయిపోయినదానిని గూర్చి విచారించి ప్రయోజనం లేదు. కాబోయే వాటిని గూర్చి ఆశ పనికిరాదు. దైన్యాన్ని దరిదాపులకు రానీయరాదు. దైవం ఎట్లా నడిపిస్తే అట్లా నడవక తప్పదు - అనే నిశ్చయానికి రావాలి.

క. వెరవును లావును గలిగిన । పురుషులు లే రెట్లు లోకమున; నెవ్వరికిన్
సిరి శాశ్వతంబె? యని వగఁ । బొరయఁడు ధీరుండు కలిమి పోకకు నధిపా! 31

ప్రతిపదార్థం: అధిపా!= ఓ రాజా!; వెరవును= యుక్తినీ; లావును= శక్తినీ; కల్గిన= కలిగి ఉన్న; పురుషులు= మనుష్యులు; లోకమునన్= ప్రపంచంలో; ఎట్లున్ లేరు= ఎట్లాగైనా ఉండకపోరు; ఏ+వారికిన్= ఎవరికైనా; సిరి= సంపద; శాశ్వతంబె?= నికరమా?; అని= అనుకొని; కలిమి పోకకున్= సిరి తరిగిపోయినందుకు; వగన్= విచారాన్ని; ధీరుండు= ధైర్యం కలవాడు; పొరయఁడు= పొందడు.

తాత్పర్యం: ఓ రాజా! లోకంలోని మానవులంతా శక్తియుక్తులు కలిగినవాళ్ళే. వాళ్ళకంతా ఐశ్వర్యం స్థిరంగా అట్లాగే ఉన్నదా! అనుకొని సంపద పోయినందుకు విచారించకుండా గుండె దిటవు కలవాడు ఏ మాత్రం చింతించడు. (లోకంలోని వాళ్ళంతా ధనాన్ని రాజ్యాన్ని విడిచి వెళ్ళిన వాళ్ళేకదా అని తాత్పర్యం).

క. సారపుసిరి చేటు నరుఁడు । గోరకయే వచ్చునట్లు కోరక యుండన్
శ్రీరాక గలుగు దైవము । కారుణ్యము గలిగెనేని గాఢవివేకా! 32

ప్రతిపదార్థం: గాఢవివేకా!= బుద్ధిమంతుడవైన ఓ కోసలరాజా!; సారపుసిరి= ఎక్కువైన సంపదలు; చేటు= నశించటం; నరుఁడు= మానవుడు; కోరకయే= కోరకుండానే; వచ్చున్= వస్తుంది (కలుగుతుంది); అట్లు= ఆవిధంగా; కోరక+ఉండన్= కోరుకోకుండానే; దైవము= భగవంతుడి; కారుణ్యాము= దయ; కలిగెన్+ఏని= కలిగినట్లైతే; శ్రీరాక= సంపదలు సిద్ధించటం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఓ కోసలరాజా! మనిషి తన సంపదలు సర్వనాశనం కావాలని కోరుకొనకుండానే తుడిచిపెట్టుకుపోతున్నాయి. ధనం పొందాలని ఆశించకుండానే దేవుడిదయవలన వచ్చిపడుతున్నాయి. (డబ్బు రావటం పోవటం అనేది మనిషి చేతిలో లేదని భావం).

క. సిరివిడుచును బురుషుని విను। పురుషుఁడు సిరిఁ దొరఁగు నిది యపూర్వమె ఫల మూ
లరతుండై వాఙ్నియతిం। బొరసియునికి యట్టి చోటఁ బురుషున కమరున్. 33

ప్రతిపదార్థం: విను= వినవలసింది; సిరి= సంపద; పురుషుని= మనిషిని; విడుచును= వదలి పెట్టుతుంది; పురుషుఁడు= మానవుడు; సిరిన్= లక్ష్మిని; తొరఁగున్= విడుచును; ఇది= ఇట్లా జరగటం; అపూర్వమె= కొత్తకాదు కదా!; అట్టిచోటన్= అట్లాంటి సమయాలలో; ఫలమూలరతుండు+ఐ= ప్రయోజనాన్ని ఆశించినవాడై; వాక్+నియతిన్ పొరసి= మాటను కట్టడి చేసికొని; ఉనికి= ఉండటం; పురుషునకున్= మానవుడికి; అమరున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: మనిషి డబ్బును వదలవచ్చును. డబ్బూ మనిషినుండి తొలగిపోవచ్చును. ఇది సర్వసామాన్యమే! ఇట్లాంటిదేమైనా జరిగినప్పుడు మంచి ఫలితాన్ని కోరుకుంటూ మాట్లాడకుండా మౌనంగా ఉండటం ఒప్పిదం అయినపని.

క. కలఁగిన పెద్దమడుపు విను। తెలివిఁ బొరయునట్లు దానధీరుం డ ట్ల
గ్గలము లయిన దురితంబులఁ। గలఁగియుఁ దనయంతఁ దేఱు గౌరవ మొప్పన్.' 34

ప్రతిపదార్థం: విను= ఆలకించవలసింది; కలఁగిన= కలతపడిన; పెద్దమడువు= పెద్దచెరువు; తాన= తనంతట తానుగా; ఎట్లు= ఏ విధంగా; తెలివిన్+పొరయున్= తేరుకుంటుందో; అట్లు= ఆ విధంగా; ధీరుండు= ధైర్యంకలవాడు; అగ్గలములు+అయిన= ఎక్కువగా కలిగిన; దురితంబులన్= పాపాలచేత; కలఁగియున్= కలతపడీ; గౌరవము= ఆదరువు; ఒప్పన్= కలిగే విధంగా; తన+అంతన్= తనకుతానే; తేఱున్= తేరుకుంటాడు.

తాత్పర్యం: పెద్ద మడుగులోని నీళ్ళు కలకబాఱినా మళ్ళీ కాసేపటికి ఎట్లా తేటపడతాయో ఆ విధంగానే గుండె దిటవు కలవాడు తాను చేసిన పాపాలకు కలవరపడినా తనకు తానుగానే తెప్పరిల్లుతాడు.'

విశేషం: అలం: ఉపమ.

వ. అని చెప్పి 'యిది యుపశమన ప్రకారంబు; నీతి యెఱింగించెద; నాకర్ణింపు' మనుటయు నమ్మునివరుతో నమ్మనుజవరుండు 'మహాత్మా! నిన్నుఁజేరి యేను దురితంబులం దొలంగవలదె? యానతి'మ్మనిన నతం డతని కిట్లనియె. 35

ప్రతిపదార్థం: ఇది ఉపశమన ప్రకారంబు= ఇది బాధను నిమ్మళించుకొనే పద్ధతి; అని చెప్పి= అని చెప్పి; నీతి= రాజధర్మాన్ని; ఎఱింగించెదన్= తెలుపుతాను; ఆకర్ణింపుము= వినుము; అనుటయున్= అనటంతోనే; ఆ+మునివరుతోన్= ఆ ముని శ్రేష్ఠుడితో; ఆ+మనుజవరుండు= ఆ రాజు; మహాత్మా!= గొప్పవాడా!; నిన్నున్+చేరి= నిన్ను ఆశ్రయించి; ఏను= నేను; దురితంబులన్= పాపాలనుండి; తొలంగ వలదె?= తప్పుకొనవద్దా?; ఆనతి+ఇమ్ము= ఆజ్ఞాపించవలసింది; అనినన్= అనగానే; అతండు= ఆ కాలకవృక్షీయ ముని; అతనికిన్= ఆ రాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఇది బాధను తగ్గించుకొనే తీరు. నీతిని గూర్చి చెప్పుతాను ఆలకించుము' - అనగానే ఆ మునితో ఆ రాజు 'ఓ మహానుభావా! నీ అండలో పాపాలను కడుక్కునేందుకు ఆదేశించవలసింది' అని అడగగానే ఆ ముని ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'తద్దయు శాంతుఁడై తక్కువ కోర్చి శ । త్రునిఁ గని యొడఁగూడి మనఁగవలయు;
మన్నెరాజుల భూమి మర్దించి సైన్య మ । ల్లన కూర్చి వైరి పైఁ జనఁగవలయుఁ;
బ్రబలునిఁ జేరి యారాధించి యాతని । సేనతోడుగ నరిఁ జెఱుపవలయు;
విషమున మాంత్రిక విధిఁ బంపుపోటున । నలయక రిపుఁ దెగటార్పవలయుఁ;

తే. బొంచి భేదంబొనర్చి కలంచియేని । నంగనలఁ గొని వారి మాయలఁ దగిల్చి
యైన మఱియును బహువిధోపాయములను । దెగువ డింపక పగతు సాధింప వలయు.' 36

ప్రతిపదార్థం: తద్దయున్= మిక్కిలి; శాంతుఁడు+ఐ= శాంతం పొంది; తక్కువకున్= చులకన తనానికి; ఓర్చి= ఓర్చుకొని; శత్రునిన్+కని= విరోధిని చూచి; ఒడన్+కూడి= కలసిమెలసి; మనఁగన్ వలయున్= బ్రతకాలి; మన్నెరాజుల= సామంత రాజుల; భూమిన్= రాజ్యాన్ని; మర్దించి= జయించి; సైన్యమున్= సేనను; అల్లన కూర్చి= మెల్లగా సమకూర్చుకొని; వైరిపైన్= విరోధిపై; చనఁగన్ వలయున్= దండెత్తిపోవాలి; ప్రబలునిన్+చేరి= బలవంతుడి దరిచేరి; ఆరాధించి= సేవించి; ఆతనిసేన తోడుగన్= అతడిసేనల సాయంతో; అరిన్= శత్రువును; చెఱుపన్ వలయున్= నాశనం చేయాలి; విషమునన్= విషంతోనూ; మాంత్రిక విధిన్= గారడీలతోనూ; పంపుపోటునన్= పెట్టుకొన్న పోరుతో; అలయక= శ్రమపడక; రిపున్= శత్రువును; తెగటార్పన్ వలయున్= చంపాలి (నూకలు చెల్లించాలి); పొంచి= వేచి; భేదంబున్+ఒనర్చి= ఒకరి కొకరికి పడకుండా చేసి; కలంచి ఏనిన్= కలతపెట్టి అయినా; అంగనలన్+కొని= స్త్రీలను ఆధారంగా చేసికొని; వారి మాయలన్= (ఆడ)వాళ్ళ కపటాలలో; తగిల్చి+ఐనన్= మోహించేటట్లుచేసి అయినా; మఱియును= మళ్ళీ; బహువిధ= అనేక విధాలైన; ఉపాయములను= విరోధిని లొంగదీసికొనే సాధనాలతో; తెగువ= తెంపు; డింపక= వీడక; పగతున్= పగవాడిని; సాధింపన్వలయున్= పోరుపెట్టుకుంటూ ఉండాలి.

తాత్పర్యం: రాజు ఎంతో శాంతంగా తన తక్కువతనాన్ని ఓర్చుకుంటూ పగవాడితో కలిసిమెలసి బ్రతకాలి. సామంతరాజుల బలగాన్ని సంతరించుకొని, వాళ్ళ ద్వారా శత్రువు మీద కత్తి దూయాలి. బలవంతులను కొలిచి, వాళ్ళ అండతో శత్రుస్థావరాలను ఆక్రమించాలి. విషం పెట్టి అయినా, గారడీ చేసి అయినా, కయ్యానికి కాలుదువ్వి అయినాసరే, పగవాడిని దుంపనాశనం చేయాలి. వాళ్ళలో వాళ్ళకు పుల్లలు పెట్టి అయినా, ఆడవాళ్ళ మాయలలో పడేసి అయినా ఇంకా ఎన్నో రకాల ఉపాయాలతో అయినా పట్టువదలకుండా శత్రువును పడగొట్టాలి.'

వ. అని చెప్పె నని చెప్పి, గాంగేయుండు వెండియుఁ జెప్పు 'నా కౌసల్యుం డధర్మోపాయ విధాయకంబు లగు నుపాయంబులకుం జొరంజాల ననిన నమ్ముని తద్విరోధి యగు విదేహవిభు రావించి యేకాంతంబున నా క్షేమదర్శిం బేర్కొని నీ వతని రాజ్యంబుగొని యున్నవాఁడ వన్నరపతి యొండుమ్మైఁ గార్యంబు సూచుట యొప్పదు సంధిసేయుమని వెరవు కలిమి నొడంబఱిచి యిరువురకును సంధి యొనర్చి నెయ్యంబు చాటించి వీడుకొల్పినఁ గౌసల్యుం డొడ్కొని చని, యతనికిఁ దనకూఁతు నిచ్చి కరితురగాది వివిధ పదార్థంబు లొసంగి విదేహ జనవల్లభుం డవ్వసుమతీవల్లభుని నిజపురంబున కనిచిపుచ్చెఁ; రాజులకు జయాపజయంబు లనుభావ్యంబులు; మదవిషాదంబు లనాదరణీయంబు' లనవుడు ధర్మనందనుండు 'పరిజనంబులయందు గణంబులైయున్నవారిం బరిపాలించు సమ్యక్ప్రకారంబు సెప్పు'మనుటయు నమ్మహీకాంతునకు శాంతనవుం డిట్లనియె. 37

ప్రతిపదార్థం: అని= ఇట్లా; చెప్పెన్= చెప్పాడు; అని చెప్పి= అని కాలకవృక్షీయముని కోసలరాజునకు తెలియచెప్పాడని చెప్పి; గాంగేయుండు= భీష్ముడు; వెండియున్= మళ్ళీ; చెప్పున్= చెప్పటం మొదలుపెట్టాడు; ఆ కౌసల్యుండు= ఆ క్షేమదర్శి; అధర్మ=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అన్యాయాన్ని; విధాయకంబులు+అగు= ఆచరించేవి అయినట్టి; ఉపాయంబులకున్= పన్నుగడలను గురించి; చౌరన్+చాలను= అనుసరించలేను; అనినన్= అనగానే; ఆ+ముని= ఆ కాలకవృక్షీయుడు; తద్+విరోధి+అగు= ఆ రాజు శత్రువు అయిన; విదేహవిభున్= విదేహరాజును; రావించి= రప్పించి; ఏకాంతంబునన్= రహస్యంగా; ఆ క్షేమదర్శిన్= ఆ కోసలరాజును; పేర్కొని= ప్రస్తావించి; నీవు; అతని రాజ్యంబున్= అతడి పాలనా భాగాన్ని; కొని ఉన్నవాఁడవు= ఆక్రమించుకొన్నావు; ఆ+నరపతి= ఆ రాజు; ఒండుమైన్= మరొక కార్యంబు; చూచుట= పని తలపెట్టటం; ఒప్పదు= తగదు; సంధిచేయుము= రాజీచేసికొనుము; అని; వెరవు కలిమిన్= ఉపాయంగా; ఒడంబఱిచి= ఆమోదింపచేసి (ఒప్పించి); ఇరువురకును= ఇద్దరికీ; సంధి ఒనర్చి= పొత్తు కుదిర్చి; నెయ్యంబు=స్నేహాన్ని; పాటించి= కలిగించి; వీడుకొల్పినన్= వీడ్కోలు ఇవ్వగా (సాగనంపగా); కౌసల్యున్= కోసలాధిపతిని;తోడ్కొని= తీసికొని; చని= వెళ్ళి; అతనికిన్= ఆ రాజుకు; తన కూఁతున్= సొంతకూతురిని; ఇచ్చి= వివాహంచేసి; కరి= ఏనుగులు; తురగ+ఆది= గుర్రాలు మొదలైన; వివిధ పదార్థంబులు= అనేక వస్తువులను; ఒసఁగి= ఇచ్చి; విదేహజనవల్లభుండు= విదేహదేశపురాజు; ఆ+వసుమతీ వల్లభునిన్= ఆ రాజును; నిజపురంబునకున్= అతడి సొంత నగరానికి; అనిచిపుచ్చెన్= పంపించాడు; జయ+అపజయంబులు= గెలుపు ఓటములు; అనుభావ్యంబులు= అనుభవించవలసినవే; మద= గర్వం; విషాదంబులు= దుఃఖాలు; అనాదరణీయంబులు= పాటించరానివి; అనవుడున్= అనగానే; ధర్మనందనుండు= ధర్మరాజు; పరిజనంబుల+అందున్= సేవకులలో; గణంబులు+ఐ ఉన్నవారిన్= గుంపుగా కూడి ఉన్నవాళ్ళను; పాలించు= ఏలుకొనే; సమ్యక్ ప్రకారంబు= మంచి తోవను; చెప్పుము= చెప్పవలసింది; అనుటయున్= అనటంతోనే; ఆ+మహీకాంతునకున్= ఆ ధర్మరాజునకు; శాంతనవుండు= భీష్ముడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అట్లా ఆ ముని కోసలరాజుతో శత్రువును తెగటార్చే ఉపాయం తెలిపినా, క్షేమదర్శి 'నేను ఎట్లాంటి అన్యాయానికి ఒడిగట్టను' అనగానే ఆ ముని శత్రురాజైన విదేహరాజును పిలిపించి ఏకాంతంగా క్షేమదర్శిని గూర్చి వివరించి చెప్పి 'రాజా! నీవు క్షేమదర్శి రాజ్యాన్ని స్వాధీనపరచుకున్నావు. ఆ రాజు ఏదో ఒక అడ్డుదారిలో రాజ్యాన్ని తిరిగి సంపాదించుకొనటం తగదు. ఇద్దరూ ఒక ఒప్పందానికి రం'డని యుక్తిగా చెప్పి అంగీకరించేటట్లు చేసి, ఇద్దరికీ పొత్తు కలిపి, స్నేహభావంతో సాగనంపాడు. విదేహరాజు ఆ కోసలరాజుతో వియ్యమంది, అరణంగా ఏనుగులూ, గుర్రాలు మొదలైన ఎన్నో వస్తు వాహనాలను ఇచ్చి, కోసలరాజ్యానికి సాదరంగా పంపాడు. అయినా రాజులకు గెలవటం ఓడటం అనేవి అనుభవించదగినవే. గెలుపొందినపుడు గర్వపడటం, ఓడినప్పుడు బాధపడటం మంచిది కాదు' అనగానే ధర్మరాజు 'పరిజనంలోని గణజనులను ఎట్లా ఏలుకొనాలో ఆ తీరులను విశదం చేయండి' అన్నాడు. అప్పుడు భీష్ముడు ఇట్లా అన్నాడు.

ధర్మరాజునకు భీష్ముండు గణజనులం బాలించు ప్రకారంబు సెప్పుట (సం. 12-108-10)

క. 'విను మర్థార్జకులును గా । ర్యనిపుణ మానసులు నాయుధాజీవులుఁ ద
క్కును గల పనుల జనులుఁ గల । రనఘా! యొక్కిండ్ల వార లైన జనంబుల్. 38

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పుణ్యాత్ముడా!; వినుము= ఆలకించుము; అర్థార్జకులును= డబ్బును వసూలుచేసి కూడబెట్టేవాళ్ళూ; కార్యనిపుణ మానసులున్= పనులను తీర్చిదిద్దే సామర్థ్యం గలవాళ్ళు (మంత్రులు); ఆయుధ+ఆజీవులున్= ఆయుధ ప్రయోగమే జీవనంగా గలవాళ్ళూ (ఆయుధ సైనికులు); తక్కునుగల= మిగతా; పనులన్= పనులను చేసే; జనులున్= పరిజనులూ; ఒక్క ఇండ్ల వారలు+ఐనన్= ఒకే తెగకు చెందిన వాళ్ళైన; జనంబుల్= సామాన్య జనులు; కలరు= ఉంటారు.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! వినుము. కోశాగారం నింపే కోశాధికారులూ, ఎంతో చాకచక్యంగా పనులను చక్కబెట్టే అమాత్యులూ, ఆయుధధారు లైన సైనికులూ, మిగతా పనులు చేసే పరిజనం గణజను లవుతారు. పరిజనులు ఒకే తరగతికి చెందిన సామాన్యులు.

విశేషం: గణము= సమూహం - సేనా విశేషం. 27 ఏనుగులు, 51 గుర్రాలు, 135 పదాతులు కలది.

క. వారు గదాగణములు పతి । వారలతోఁ గలసి మెలఁగువడువున నయ్యై
వారి తెఱఁ గెఱుఁగవలయును । వారికి నెమ్మి గలిగించు వలనొదవుటకున్. 39

ప్రతిపదార్థం: వారు+కదా!= వాళ్ళే కదా!; గణములు= సంఘంలోని జనులు; పతి= రాజు; వారలతోన్+కలసి= వాళ్ళల్లో ఒకడుగా కలసిపోయి; మెలఁగు వడువునన్= మసలుకొనే తీరున; వారికిన్= ఆ గణాలకు; నెమ్మి= శుభం; కలిగించు= ఒనగూర్చే; వలను= ఉపాయం; ఒదవుటకున్= సిద్ధంచేయటానికి; ఆ+ఆ+వారి= ఆయా వాళ్ళ; తెఱఁగు= తీరు; ఎఱుఁగవలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: వాళ్ళనే 'గణజనులు' అంటారు. రాజు వీళ్ళతో కలసి మెలగుతున్నట్లు ఉండాలి. వాళ్ళకు శుభం కలిగించే ఉపాయాన్ని సిద్ధింపచేయటానికి ఆయా వాళ్ళ తీరులను తెలిసికొనాలి.

సీ. కుల మొక్కఁడైనఁ దేఁకువలేక బుద్ధియు । శౌర్యంబుఁ బెంపును సరకుగొనక
యెట్టివారలతోడ నెవ్వరైనను మత్స । రంబు గల్గుదురు గణంబు జనులు
దాన నంతర్భేదమైన శత్రులు వాపి । కొండ్రు గొందఱ నది గ్రొచ్చు రాజ్య
మూలంబుఁ గావున మున్ను భూపాలుండు । వారినందఱఁ దగు వచన రచన

తే. నీగి మన్ననఁ గలఁగంగనీక పొదివి । యధికముగ గణముఖ్యుల నాదరించి
పనులు గొనునది తమలోనఁ బాయకుండఁ । బ్రోవు లెడలిన రాజ్యంబు పొలుపు దప్పు. 40

ప్రతిపదార్థం: గణంబు= సంఘంలోని; జనులు= పరిజనులు; కులము+ఒక్కఁడు+ఐనన్= ఒకే జాతికి చెందిన వాళ్ళైనా; తేఁకువ లేక= ఉచితానుచితాలు తెలిసికొనకుండా; బుద్ధియున్= వివేకాన్ని; శౌర్యంబున్= పరాక్రమాన్ని; పెంపును= గౌరవాన్ని; సరకుగొనక= లెక్క చేయక; ఎట్టి వారలతోడన్= ఎట్లాంటి వాళ్ళతో అయినా; ఎవ్వరు+ఐనను= ఎట్లాంటి వాళ్ళైనా; మత్సరంబు కల్గుదురు= ద్వేషం పెట్టుకొంటారు; దానన్= అందువలన; అంతర్భేదము+ఐనన్= వాళ్ళల్లో వాళ్ళకు మనస్పర్ధలు ఏర్పడితే; శత్రులు= ఎదుటి పక్షంవాళ్ళు; కొందఱన్= కొంతమందిని; పాపికొండ్రు= తమలోకి లాగుకొంటారు; అది= విడిపోవటం అనేది; రాజ్యమూలంబున్= మూలరాజ్యాన్నే; గ్రొచ్చున్= పెకలిస్తుంది; కానన్= కాబట్టి; మున్ను= ముందుగానే; భూపాలుండు= రాజు; వారిన్+అందఱన్= వాళ్ళందరిని; తగు= ఉచితం అయిన; వచనరచనన్= మాటల మూటలతోను (సల్లాపాలతో); ఈగి= దానాలతోనూ; మన్ననన్= ఆదరణలతోనూ; కలగంగన్+ఈక= కలత చెందనీక; పొదివి= పట్టి; అధికముగన్= ఎక్కువగా; గణముఖ్యులన్= సంఘ ప్రధానులను; ఆదరించి= మన్నించి (గౌరవించి); పనులుకొనునది= పనులు తీర్చుకొనాలి; తమలోనన్= తమలో తాము; పాయక+ఉండన్= చీలకుండా; ప్రోవులు= గణాలు; ఎడలినన్= వీడిపోతే; రాజ్యంబు= రాజ్యం; పొలుపుతప్పున్= సొంపే పోతుంది.

తాత్పర్యం: ఈ గణం జనులు ఒక తెగకు చెందిన వాళ్ళే అయినా మంచి చెడ్డలు లేని వాళ్ళై, వాళ్ళ వాళ్ళ తెలివిని పౌరుషాన్ని, గొప్పతనాన్నిగూర్చి లెక్కపెట్టరు. అందువలన ఎట్లాంటి వాళ్ళతో అయినాసరే విరోధం పెట్టుకొంటారు. ఈ కారణంగా లోపల లోపల విభేదాలు వస్తాయి. ఇది ఆసరా చేసికొని శత్రువులు చేరదీస్తారు. గణజనంలో ఇట్లాంటి మనస్పర్థలు ఏర్పడితే మూలగద్దెకే ముప్పు వస్తుంది. కాబట్టి ఇదంతా రాకముందే వాళ్ళందరిని రాజు మంచి మాటలు చెప్పి, దానధర్మాలు చేసి, గౌరవించి ఆదరించాలి. వాళ్ళలో వాళ్ళు విడిపోకుండా చూచుకొంటూ పనులు చక్కదిద్దుకొనాలి. చీలికలు వస్తే మాత్రం (మొదటికే మోసం వస్తుంది) రాజ్యం కుప్పకూలిపోతుంది.

క. ఎక్కార్యములను గణజను । లొక్కటి యై మెలఁగుచున్న నుర్వీశునకున్
మిక్కిలి సిరియగుఁ గావునఁ । దక్కక యరయంగవలయుఁ దగ గణవిధముల్.' 41

ప్రతిపదార్థం: ఏ+కార్యములను= ఏ పనులను గురించి అయినా; గణజనులు= గుంపులోని వాళ్ళు; ఒక్కటి+ఐ= ఒకమాటమీద; మెలఁగుచున్+ఉన్నన్= ఉంటుంటే; ఉర్వీ+ఈశునకున్= రాజునకు; మిక్కిలి= ఎక్కువగా; సిరి+అగున్= సంపదలు కలుగుతాయి; కావునన్= కాబట్టి; తగన్= ఒప్పేటట్లు; గణ విధముల్= సంఘ పరిజనుల పద్ధతులు; తల+కొని= పూనుకొని; అరయంగన్ వలయున్= గమనించుకొనాలి.

తాత్పర్యం: ప్రతి పనిలోనూ గణజనులంతా ఒక్కటిగా ఉంటే ఆ రాజు రాజ్యంలో సిరి తాండవిస్తుంది. కనుక గణవిధానాన్ని పని పెట్టుకొని శ్రద్ధగా పరిశీలించుకొంటూ ఉండాలి'.

ధర్మరాజునకు భీష్ముండు ధర్మసూక్ష్మత తెలం గెఱింగించుట (సం. 12-109-3)

వ. అనుటయు ధర్మజుండు 'ధర్మంబులు బహుశాఖలు గలిగియుండు; నన్నియు ననుష్ఠింపవచ్చునే? యెయ్యది యాచరించి పురుషుం డైహికాముష్మిక సుఖంబులం బొందు?'నని న మందాకినీనందనుం డతని కిట్లనియె. 42

ప్రతిపదార్థం: అనుటయున్= అని మాటాడగానే; ధర్మజుండు= ధర్మరాజు; ధర్మంబులు= పుణ్యాచారాలు; బహుశాఖలు= అనేక విధాలుగా; కలిగి ఉండున్= ఉంటాయి; అన్నియున్= అన్ని; అనుష్ఠింపన్ వచ్చునే?= ఆచరించ వీలవుతుందా?; ఏ+అది= ఏ ధర్మాన్ని; ఆచరించి= చేసి; పురుషుండు= మానవుడు; ఐహిక= ఈ లోకానికి సంబంధించిన; ఆముష్మిక= పై లోకానికి సంబంధించిన; సుఖంబులన్= సౌఖ్యాలను; పొందున్?= అనుభవిస్తాడు?; అనినన్= అనగానే; మందాకినీ నందనుండు= గంగాదేవి పుత్రు డైన భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అని అనటంతోనే ధర్మరాజు 'ధర్మాలు ఎన్నో రూపాలలో ఉన్నాయి కదా! వాటన్నిటిని ఆచరించటం సాధ్యం కాదు. కనుక ఏ ధర్మాన్ని ఆచరిస్తే మానవుడు ఈ లోకంలోనూ పై లోకంలోనూ హాయిగా ఉండగలుగుతాడు?' అని అడగగానే భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

సీ. 'విను తల్లియును దండ్రియును గురుండును సేవ । నీయులు సద్భక్తి నిత్యనిరతి
వారలఁ గొలుచుచు వా రెద్ది సెప్పిన । నది యాచరించుట యధిక ధర్మ;
మాగమత్రయమును నగ్నిత్రయంబు లోక । త్రయంబును దేవతాత్రయంబు
ననువస్తువులు వార లందును జనని గౌ । రవమున నెక్కుడు రాజవర్య!

తే. యీ జగంబున దివమునం బూజ వడయు । మాతృభక్తుండు పితృభక్తి మానసుండు
నట్ల యవ్యయానందసంప్రాపణంబు । గురు పదాబ్జ సమారాధకుండుఁ గాంచు. 43

ప్రతిపదార్థం: రాజవర్య!= రాజులలో కెల్ల గొప్పవాడా!; విను= వినుము; ఆగమత్రయమునున్= ఋగ్యజుస్సామ వేదాలు మూడూ; అగ్నిత్రయంబు= ఆహవనీయ, దాక్షిణాత్య, గార్హపత్యాగ్నులు మూడూ; లోకత్రయంబును= స్వర్గ, మర్త్య, పాతాళలోకాలు మూడూ; దేవతాత్రయంబున్= బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురూ; అను వస్తువులు= అనే పదార్థాల వంటి వారు అయిన; తల్లియును= కన్నతల్లీ; తండ్రియును= తండ్రి; గురుండును= గురువూ; సేవనీయులు= కొలవదగ్గవారు; సత్+భక్తిన్= మేలైన భక్తితో; నిత్యనిరతిన్= ఎంతో ఆసక్తితో; వారలన్= వారందరినీ; కొలుచుచున్= సేవిస్తూ; వారు= వాళ్ళు; ఎద్ది= ఏది; చెప్పినన్= చెప్పినా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అది= ఆ ధర్మాన్ని; ఆచరించుట= ఆచరణలో పెట్టటం; అధిక ధర్మము= గొప్పధర్మం; వారలందును= వారందరిలోకూడా; జనని= తల్లి; గౌరవమునన్= గొప్పతనంలో; ఎక్కుడు= అధికం; ఈ జగంబునన్= ఈ లోకంలోను; దివమునన్= స్వర్గలోకంలోనూ; మాతృభక్తుండు= తల్లిమీద ఆదరం కలవాడు; పితృభక్తి మానసుండు= తండ్రిమీద భక్తి భావం కలవాడు; పూజ పడయున్= ఆదరించబడతాడు; అట్లు= అట్లాగే; గురుపదాబ్జ సమారాధకుండు= గురుపాదసేవకుడు కూడా; అవ్యయ+ఆనంద సంప్రాపణంబున్= బ్రహ్మానంద సంప్రాప్తిని; కాంచున్= పొందుతాడు.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. తల్లీ, తండ్రీ, గురువూ ఈ ముగ్గురూ నిత్యం సేవించవలసినవారు. ఎంతో భక్తితో వాళ్ళకు సేవలందిస్తూ వా రేది చెప్పితే దానిని ఆచరణలో పెట్టటం ఉత్తమ ధర్మం. ఈ ముగ్గురూ వేదత్రయం వంటివారు. త్రేతాగ్నులవంటివారు, ముల్లోకాలవంటివారు, త్రిమూర్తులవంటి వారు, వీరిలో తల్లికే ఎక్కువ గౌరవం. తల్లిదండ్రులమీద అభిమానం కలవాడు ఇహపరలోకాలలో గౌరవించబడతాడు. గురువును సేవించుకొనేవాడు అవ్యయానందాన్ని పొందుతాడు.

వ. అనవుడు నజాతశత్రుండు గంగాపుత్రునితో 'సత్యానృతంబులు జగంబులం బరఁగియుండుఁ బురుషుండు వానియెడ నెబ్భంగివాఁడై ధర్మపరుం డగు?' నని యడిగిన నమ్మహీపతి కమ్మహాత్ముం డిట్లనియె. 44

ప్రతిపదార్థం: అనవుడున్= అనటంతోనే; అజాతశత్రుండు= ధర్మరాజు; గంగాపుత్రునితోన్= భీష్ముడితో; సత్య+అనృతంబులు= నిజం, అబద్ధాలు; జగంబులన్= ముల్లోకాలలో; పరగి ఉండున్= ఒప్పి ఉంటాయి; పురుషుండు= మానవుడు; వానిఎడన్= వాటి విషయంలో; ఏ+భంగి వాఁడై= ఏ విధం అనుసరించేవాడై; వాడు+ఐ= తనకు తానై; ధర్మపరుండు+అగున్?= ధర్మానికి కట్టుబడి ఉంటాడు?; అని+అడిగినన్= అని అడుగగా; ఆ+మహీపతికిన్= ఆ రాజుతో; ఆ మహాత్ముండు= ఆ భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు భీష్ముడిని 'లోకంలో నిజానిజాలు సిద్ధమై ఉన్నాయి కదా! వాటి విషయంలో మనిషి తనకు తానుగా ఏ విధంగా ధర్మానికి బద్ధుడై ఉండాలో చెప్పు'మనగానే భీష్ముడు ఈ విధంగా చెప్పసాగాడు.

సీ. 'సత్యంబు వలుకుట సర్వధర్మములకు । మిక్కిలి; యనృతంబు మేటి పాత
కము; తద్విశేషంబు గలదు చెప్పెద; నొరు । నర్థంబుఁ బ్రాణంబు నపహరింపఁ
జూచు; పాతకులతో సూనృతం బాడుట । పాపంబు బొంకులు వలికి యట్టి
వారి హింసించుట వరధర్మ మిది యొక్కఁ । డేల భూతములకు హితము సేయు

తే. బొంకు లెల్లను ధర్మముల్ భూత బాధ । కంబు లగు నిక్కములు పాతకములు వినుము!
భూతముల దుష్ట శిష్టత్వములు వివేక । సూక్ష్మతా వేద్యములు వానిఁ జూడవలయు. 45

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; సర్వధర్మములకున్= అన్ని పుణ్యాలకంటె; సత్యంబు= నిజం; పలుకుట= చెప్పటం; మిక్కిలి= ఎక్కువ; అనృతంబు= అబద్ధం ఆడటం; మేటిపాతకము= ఎంతో పాపం; తద్= దాని విషయంలో (పాపపుణ్యాల విషయంలో); విశేషంబు= చెప్పుకొనవలసింది; కలదు= ఉన్నది; చెప్పెదన్= చెప్పుతాను; ఒరున్= ఇంకొకడి; అర్థంబున్= సొమ్మును; ప్రాణంబున్= ఉసురును; అపహరింపన్+చూచు= దోచుకొనాలనుకునే; పాతకులతోన్= పాపులతో; సూనృతంబు= నిజాన్ని; ఆడుట= పలకటం; పాపంబు= కీడు; బొంకులు+పలికి= అబద్ధాలు ఆడి; అట్టివారిన్= అట్లాంటి వాళ్ళను; హింసించుట= నొప్పించటం; వరధర్మము= మంచి పుణ్యం; ఇది+ఒక్కఁడు+ఏల= ఇదొక్కటే కాదు; భూతములకున్= జీవులకు; హితము చేయు= మేలుచేసే; బొంకులు= అబద్ధాలు; ఎల్లనుధర్మముల్= అన్నీ ధర్మాలు (అవుతాయి); భూత బాధకంబులు+అగు= జీవులను దుఃఖపెట్టేవి అయిన;

నిక్కములు= నిజాలు; పాతకములు= పాపాలు (అవుతాయి); భూతములన్= ప్రాణులలోని; దుష్టశిష్టత్వముల్= చెడూ, మంచీ; వివేక సూక్ష్మతా; వేద్యములు= అతిసూక్ష్మం (అల్పాల్పం) అయిన బుద్ధివలన తెలిసికొనదగినవి; వానిన్ చూడవలయున్= వాటిని జాగ్రత్తగా చూడాలి.

తాత్పర్యం: అయితే వినుము. ధర్మాలలోకెల్లా ఉత్తమమైన ధర్మం నిజం చెప్పటం. పాపాలలోకెల్ల మహాపాపం అబద్ధాలాడటం. ఈ రెంటి విషయంగా చెప్పుకొనదగ్గది ఒకటి ఉన్నది చెపుతాను. పరాయివాడి సొమ్మునూ, ఉసురునూ దోచుకొనాలనుకొనే పాపులతో నిజం చెప్పటం కన్నా, చేటు మరొకటి ఉండదు. అబద్ధాలు ఆడైనా సరే అటువంటి వారిని బాధించటం ఎంతో న్యాయం. ఇదే కాదు ప్రజలకు మేలు కలిగించే అబద్ధాలన్నీ పుణ్యాలు (ధర్మాలు) అవుతాయి. సాటి జీవులను వేధించే సత్యాలన్నీ పాపా(అధర్మా)లవుతాయి. అందరిలోను ఉన్న మంచీ చెడూ అనేవి అతిసూక్ష్మమైన వివేకంతో తెలిసికొనాలి.

పాపనిస్తరణ ప్రకారము (సం. 12-111-2)

వ. అనినం గౌంతేయాగ్రజుం 'డెట్టివారు దురితంబులు నిస్తరింపనేర్తు?'రని యడిగిన సురనదీసూనుం డిట్లనియె. 46

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; కౌంతేయ+అగ్రజుండు= కుంతి పెద్దకుమారుడు - ధర్మరాజు; ఎట్టివారు= ఎట్లాంటివారు; దురితంబులు= పాపాలు; నిస్తరింపన్+నేర్తురు= నెట్టుకొనగలరు; అని+అడిగినన్= అని అడుగగా; సురనదీసూనుండు= దేవనది పుత్రుడైన భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు చెప్పగానే ధర్మరాజు 'ఎట్లాంటి వారు తమ పాపాలను దాటగలరు?' అనగానే భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

సీ. 'వర్ణాశ్రమాచారవంతులు నవిషయా। సక్తులుఁ బ్రతికారశక్తు లయ్యుఁ
దిట్టాటవడి సైఁచు ధీరు లుదారులు। నతిథి పూజకులు నధ్యయనరతులు
నగ్నిహోత్రపరులు నాజిఁ బిఱిందికి। నడుగు వెట్టక తెగి నడచువారు
సత్యవాదులు సాధుజన పోషకులు సర్వ। దేవతా సములు నై భావ మెందు

తే. నిలిచె నమ్మూర్తి భక్తిమైఁ గొలుచువారు। దురిత దుర్గముల్ నిస్తరింతురు పురాణ
పురుషుఁ డవిచింత్యుఁ డచలుండు పుండరీక। లోచనుండు సద్భక్తులఁ గాచు నధిప! 47

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వర్ణ+ఆశ్రమ+ఆచారవంతులున్= వర్ణాశ్రమ ధర్మాన్ని పాటించేవారు; అవిషయ+ఆసక్తులున్= ఇంద్రియ విషయాల్లో ఆసక్తి కనబరచని వారు; ప్రతికారశక్తులు++అయ్యున్= తిరిగి ఎదుర్కొనగల సామర్థ్యం కలిగి ఉన్నా; తిట్టాట+పడి= నిందలు పొంది; సైఁచు= భరించే; ధీరులు= దిట్టతనం కలవారు; ఉదారులున్= ఔదార్యం కలవారు; అతిథి పూజకులున్= ఇంటికి వచ్చిన వారిని మర్యాదగా చూచేవారు; అధ్యయన= వేదాలు వల్లించటంలో; రతులున్= ఆసక్తి కలవారూ; అగ్నిహోత్రపరులున్= హోమం వేల్చటమంటే ఇష్టపడే వారూ; ఆజిన్= యుద్ధంలో; పిఱిందికిన్= వెనక్కి; అడుగు పెట్టక= తిరగక; తెగి= సాహసించి; నడుచువారు= ముందుకు వెళ్ళేవారు; సత్యవాదులు= అబద్ధాలు ఆడని వారూ; సాధుజన పోషకులు= మంచివారిని పోషించే వారూ; సర్వదేవతాసములును= అంతమంది దేవతలపట్ల సమభావం (సమానత్వం) కలవారునూ; ఐ= అయి; భావము= ఆలోచన; ఎందున్= ఎక్కడ; నిలిచెన్= ఉంటుందో; ఆ+మూర్తిన్= ఆ రూపాన్ని; భక్తిమైన్= భక్తితో; కొలుచువారు= సేవించేవారునూ;

దురిత= పాపాలనే; దుర్గముల్= మిట్టలను; నిస్తరింతురు= దాటగలుగుతారు; పురాణపురుషుఁడు= ఆదిపురుషుడును; అవిచింత్యుఁడు= ఆలోచనల కందనివాడునూ; అచలుండు= శాశ్వతమైన వాడునూ; పుండరీకలోచనుండు= తెల్లతామరలవంటి కళ్ళు కలవాడునూ అయిన విష్ణువు; సద్భక్తులన్= ఉత్తమ భక్తులను; కాచున్= రక్షిస్తాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! వర్ణాశ్రమ ఆచార నియమాలను పాటించేవారు, ఇంద్రియ నిగ్రహం కలవారు, నిందించగా నిందించనివారు, ఉదారగుణం కలవారు, అతిథులను ఆదరించేవారు, వేదాలు వల్లించేవారు, యుద్ధంలో తెగించి పోరాడేవారు, ఏ దేవతల నైనా ఒకేవిధంగా చూస్తూ మనసుకు నచ్చిన రూపాన్ని కొలిచేవారు, పాపం అనే మిట్టలను అనాయాసంగా దాటగలుగుతారు. ఆది పరమేశ్వరుడు, ఆలోచనాతీతుడు, చంచలభావం లేనివాడూ, పద్మాక్షుడు అయిన విష్ణువు భాగవతోత్తముడిని సదా కాపాడుతూనే ఉంటాడు.

క. విను మగ్గోవిందుఁడు సఖుఁ । డును బంధుఁడుఁ గార్యకర్మరుఁడు నై నిన్నుం
గొనియాడుచుండ దురితం । బను పేరును గలదె నీకు ననఘచరిత్రా!. 48

ప్రతిపదార్థం: అనఘ చరిత్రా!= పాపంలేని నడవడి కలవాడా!; వినుము= వినుము; ఆ+గోవిందుఁడు= ఆ కృష్ణుడు; సఖుఁడును= స్నేహితుడును; బంధుఁడు= చుట్టమును; కార్యకర్మరుఁడును+ఐ= పనులలో పోటు బంటూ అయి; నిన్నున్= నిన్ను; కొనియాడుచున్+ఉండన్= ఆదరిస్తూ ఉండగా; నీకున్= నీకు (ధర్మరాజు); దురితంబు+అను= పాపం అనే; పేరును= నామమాత్రం అయినా; కలదె?= ఉంటుందా? ఉండ దని భావం.

తాత్పర్యం: ఓ పుణ్యాత్ముడా! ధర్మరాజా! వినవలసింది. నీకు కృష్ణుడు మిత్రుడు, ఆత్మీయుడు, కార్యశూరుడు. ఇట్లాంటివాడు నిన్ను పొగుడుతూ ఉంటే పాపం అనేది పేరునకైనా సరే నీ దరికి రాదు.

ఆ. ఇంద్రుఁ డజుఁడు విష్ణుఁ డెవ్వాని వైదిక । స్తోత్రములఁ బ్రసాదితునిగఁ జేసి
యెలమిఁ గొలుతు రమ్మహేశ్వరుఁ గొలుచు వా । రెందు నెపుడుఁ గీడు నొంద రధిప! 49

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; ఇంద్రుఁడు= దేవేంద్రుడు; అజుఁడు= బ్రహ్మ; విష్ణుఁడు= విష్ణువు; ఏ+వానిన్= ఎవరిని; వైదికస్తోత్రములన్= వేదమంత్రాలతో; ప్రసాదితునిగన్+చేసి= అలంకరింపబడినవానిగా చేసి; ఎలమిన్= ప్రీతితో; కొలుతురు= సేవింతురో; ఆ+మహేశ్వరున్= ఆ శివుడిని; కొలుచువారు= సేవించేవారు; ఎందున్= ఎక్కడైనా; ఎపుడున్= ఎప్పుడైనా; కీడున్= కష్టాన్ని; ఒందరు= పొందరు.

తాత్పర్యం: ధర్మరాజా! ఎవరిని వేదమంత్రాలతో పూజించి ఇంద్రుడు, బ్రహ్మ, విష్ణువు అలంకరించబడినవానిగా ఆ శివుడిని కొలిచేవారు ఎపుడును ఎక్కడా ఎట్లాంటి ఆపదలూ పొందరు.

క. విను మివ్వాక్యము లెవ్వఁడు । గొనియాడుఁ బఠించు విప్రకోటికిఁ జెప్పున్
జననాథ! వాఁడు దురితం । బను దుర్గము నిస్తరించు నక్లేశమునన్.' 50

ప్రతిపదార్థం: జననాథ!= ఓ రాజా!; వినుము= వినవలసింది; ఈ+వాక్యములు= ఈ వచనాలు; ఎవ్వఁడు= ఎవ్వరు; కొనియాడున్= మెచ్చుకొనునో; పఠించున్= వల్లించునో; విప్రకోటికిన్= బ్రాహ్మణు లకు; చెప్పున్= నేర్పునో; వాఁడు= అట్లాంటివాడు; అ+క్లేశమునన్= ఏమీ కష్టపడకుండా; దురితంబు+అను= పాపం అనే; దుర్గమున్= కొండను; నిస్తరించున్= దాటగలడు.

తాత్పర్యం: ఓ రాజా! వినుము. ఈ పై వాక్యాలను ఎవరైతే మెచ్చుకొంటారో, అదే పనిగా వల్లిస్తారో, బ్రాహ్మణు లందరికీ నేర్పిస్తారో, అట్లాంటివారు ఏ మాత్రం అలసిపోకుండానే పాపం అనే కొండను అవలీలగా దాటుతారు'.

వ. అనిన విని ధర్మనందనుఁడు. 51

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగానే; విని= విని; ధర్మనందనుఁడు= యమధర్మరాజు పుత్రుడైన ధర్మరాజు.

తాత్పర్యం: అని చెప్పగానే ధర్మరాజు.

వ్యాఘ్రగోమాయు సంవాదము (సం. 12-112-2)

క. ‘సౌమ్యు లసౌమ్యుల భంగి న। సౌమ్యులు సౌమ్యుల విధమున జనవర! చిత్తా
గమ్యతఁ దోఁతురు; వారిని। సమ్యఙ్నిశ్చయతఁ గాంచు చందము సెపుమా! 52

ప్రతిపదార్థం: జనవర!= రాజా! సౌమ్యులు= తిన్ననివారు; అసౌమ్యుల భంగిన్= తిన్నగా లేనివారివలె; అసౌమ్యులు= తిన్నగా లేనివారు; సౌమ్యుల విధమునన్= తిన్నని వారుగానూ; చిత్త+అగమ్యతన్= మనస్సుకు తెలియరాని రీతిలో; తోఁతురు= అగుపిస్తారు; వారినిన్= అట్లాంటివారిని; సమ్యక్+నిశ్చయతన్= సరిగ్గా ఇట్లాంటివారు అనే గట్టి నిర్ణయంతో; కాంచు చందమున్= తెలిసికొనే తీరును; చెపుమా!= చెప్పుము.

తాత్పర్యం: ‘ఓ తాతా! సౌమ్యులు అసౌమ్యులుగాను, అసౌమ్యులు సౌమ్యులుగాను కనిపిస్తుంటారు. మనసుకు ఏమీ అంతుబట్టకున్నది. వీరు ఇట్లాంటివారని వేర్పాటుచేసి తెలిసికొనాలంటే సులువైన మార్గం ఏమిటో చెప్పుము.’

వ. అనుటయు నాపగాతనయుం ‘డేతత్ప్రయోజనం బైన వ్యాఘ్రగోమాయు సంవాదం బను నితిహాసంబు గల; దాకర్ణింపు’మని యిట్లనియె. 53

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఆపగా తనయుండు= భీష్ముడు; ఏతద్+ప్రయోజనంబు+ఐన= దీనికి ఉపయోగపడేది అయిన; వ్యాఘ్ర= పులి; గోమాయు= నక్కలనడుమ నడచిన; సంవాదంబు+అను= సంభాషణ వృత్తాంతం కలది అయిన; ఇతిహాసంబు= పరంపరగా వస్తున్న కథ; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= ఆలకించుము; అని+ఇట్లు= అని ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ‘సరిగ్గా నీవడిగిన దానికి పులి నక్కా సంవాద కథ సమాధానమవుతుంది. జాగ్రత్తగా వినుము’ అంటూ భీష్ముడు ఈ విధంగా అన్నాడు.

ఆ. ‘పురిక యనఁగఁ నెగడు పురిఁ బౌరికుం డను। నృపతి క్రూరకర్మనిష్ఠఁ బరఁగు;
నవ్విభుండు సచ్చి యధిప! గోమాయువై। పుట్టెఁ బుట్టెఱుంగు బుద్ధితోడ. 54

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; పురిక+అనఁగన్= పురిక అనే పేరుతో; నెగడు= ప్రసిద్ధికెక్కిన; పురిన్= పట్టణంలో; పౌరికుండు+అను= పౌరికుడనే పేరుగల; నృపతి= రాజు; క్రూరకర్మనిష్ఠన్= కనికరం లేని పనులు చేయటంలో; పరఁగున్= ప్రసిద్ధి చెందాడు; ఆ+విభుండు= ఆ రాజు; చచ్చి= చనిపోయి; పుట్టు+ఎఱుంగు= మునుపటి జన్మ ఎరుకగల; బుద్ధితోడన్= జ్ఞానంతో (తెలివితో); గోమాయువు+ఐ= నక్కగా; పుట్టెన్= పుట్టాడు.

తాత్పర్యం: పురిక అనే నగరాన్ని పౌరికుడు అనే రాజు పాలించేవాడు. అతడు క్రూరకార్యాలు చేయటంలో పేరు పడ్డాడు. కాలవశాన చచ్చిపోయి పూర్వజన్మ జ్ఞాపకాలతో నక్కగా, మరోజన్మ ఎత్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇబ్భంగిం బుట్టిన యా నక్క మహితవ్రతశీలం బయి మాంసంబు దినక, హింస సేయక వనంబునం బతిత ఫలంబులుఁ బత్త్రంబులు నాహారంబులుగా వర్తించుచుండఁ, దోడి నక్క 'లిది యేటి వ్రతంబు? మాంసం బేము దెచ్చియిచ్చెద; ముపయోగించి సుఖివై యుండు' మని ప్రార్థించిన, నమ్మెయికిం జొరక దృఢనిశ్చయంబై యుండె; నంత నొక్కనాఁడు మృగంబుల కెల్ల ముఖ్యంబైన శార్దూలం బత్తెఱం గెఱింగి వచ్చి యగ్గోమాయువుతో నిట్లనియె. 55

ప్రతిపదార్థం: ఈ+భంగిన్= ఈ విధంగా; పుట్టిన= జన్మించిన; ఆ+నక్క= ఆ నక్క; మహిత= గొప్పదైన; వ్రతశీలంబు+అయి= నియమ స్వభావం కలదై; మాంసంబు= మాంసాహారాన్ని; తినక= తీసికొనకుండా; హింస+చేయక= సాటిజీవులను చంపకుండా; వనంబునన్= అడవిలో; పతిత ఫలంబులున్= ముగ్గి రాలిపడ్డ పళ్ళనూ; పత్రంబులున్= ఆకులనూ; ఆహారంబులుగాన్= తింటూ; వర్తించుచున్+ఉండన్= తిరుగుతుండగా; తోడి నక్కలు= సాటినక్కలు; ఇది= ఇది (ఈ కాయగసరులు తినటం); ఏటి వ్రతంబు?= ఏమి నియమం?; మాంసంబున్= మాంసాన్ని; ఏము= మేము; తెచ్చి+ఇచ్చెదము= తీసికొని వస్తాం; ఉపయోగించి= తిని; సుఖివి+ఐ= సంతోషివై; ఉండుము= ఉండాల్సింది; అని= అని; ప్రార్థించినన్= వేడుకొనగా; ఆ+మెయికిన్= ఆ వైనానికి; చొరక= ఒప్పుకొనక; దృఢ నిశ్చయంబు+ఐ= గట్టి అభిప్రాయం కలదై; ఉండెన్= ఉన్నది; అంతన్= అంతలో; ఒక్కనాఁడు= ఒకరోజున; మృగంబులకున్+ఎల్లన్= జంతువులలో కెల్ల; ముఖ్యంబు+ఐన= ప్రధానమైన; శార్దూలంబు= పెద్దపులి; ఆ+తెఱంగున్= ఆ తీరు అంతా; ఎఱింగి వచ్చి= తెలిసికొని వచ్చి; ఆ+గోమాయువుతోన్= ఆ నక్కతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆ రాజు అట్లా నక్కగా రూపం ఎత్తి మాంసం ముట్టుకొననని, సాటి జీవులను చంపనని వ్రతం పట్టింది. అడవిలో రాలిపడ్డ ఫలాలూ ఆకులూ అలములూ తింటూ బ్రతుకుగడుపసాగింది. ఇది చూచిన తోడినక్కలు 'ఇదెక్కడి నియమం? మేమంతా మాంసాన్ని తెచ్చి పెట్టుతాం - హాయిగా తిని సుఖించు'మన్నాయి. అయినా నక్క ఆ మాటలు పట్టించుకొనకూడదనే నిర్ణయించుకొన్నది. అంతలో ఇదంతా ఆ అడవి పులిరాజుకు తెలిసి నక్క దగ్గరకు వచ్చి ఈ విధంగా అన్నది.

క. 'నిను సౌమ్యుఁడ వని యెఱిఁగితి; । ననఘా! ననుఁ జెంది నిలిచి యతుల సుఖము లం
దిన మేలు; నన్నుఁ గ్రూరుం । డను లోకం; బిదియు నుడుప నగు నీశిక్షన్. 56

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పుణ్యాత్ముడా!; నినున్= నిన్ను; సౌమ్యుఁడవు+అని= తిన్ననివాడవని; ఎఱిఁగితిన్= గుర్తించాను; ననున్= నాతో; చెంది= కూడి; నిలిచి= ఉండి; అతుల సుఖములు= సాటిలేని సౌఖ్యాలు; అందినన్= పొందితే; మేలు= మంచిది; లోకంబు= జనం; నన్నున్= నన్ను; క్రూరుండు+అనున్= క్రూరమృగం అని అంటున్నది; ఇదియున్= ఈ వాదును; నీ శిక్షన్= నీ ఉపదేశాలతో; ఉడుపన్+అగున్= పోగొట్టవలసింది.

తాత్పర్యం: 'ఓ పుణ్యవంతుడా! నీవు చాలా మంచివాడ వని విన్నాను. నాతో కలిసి ఉండుము. ఎన్నో సౌఖ్యాలు అనుభవించుము. లోకం నన్ను క్రూరజంతు వనుకొంటున్నది. దానిని నీ ఉపదేశాలతో తరిమిగొట్టుము.

వ. నా తోడి బాంధవంబు సేయు'మనిన నగ్గోమాయు విట్లనియె. 57

ప్రతిపదార్థం: నాతోడి= నాతో; బాంధవంబున్= స్నేహాన్ని; చేయుము= కావించుము; అనినన్= అనగానే; ఆ+గోమాయువు= ఆ నక్క; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: నాతో మిత్రుడిగా ఉండుము' అనగానే ఆ నక్క ఈ విధంగా చెప్పింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ‘నీ వాశ్రయణీయుండవు । గావే! విను భోగపరము గా కున్నది మ
ద్భావం బటు గావున నా । కీ వచనము లింపు సేయ విద్ధగుణాఢ్యా! 58

ప్రతిపదార్థం: ఇద్ధగుణ+ఆఢ్యా!= ప్రకాశించే గుణ సంపదగల ఓ పులిరాజా!; నీవు= నీవు; ఆశ్రయణీయుండవు= అండగొనదగినవాడవు; కావే!= కావా!; విను= వినుము; మత్= నాయొక్క; భావంబు= తలంపు; భోగపరము+కాక+ఉన్నది= సుఖంవైపునకు మళ్ళకున్నది; అటు+కావునన్= కాబట్టి; నాకున్= నాకు; ఈ+వచనములు= ఈ మాటలు; ఇంపు+చేయవు= రుచించవు.

తాత్పర్యం: ‘ఓ గుణవంతుడా! పులిరాజా! నిజానికి నీవు ఆశ్రయించదగ్గవాడవే. కాని, నా మనస్సు సుఖాలమీదికి పోకుండా ఉన్నది. అందువలన నీ మాటలు నాకు నచ్చటం లేదు.

వ. అది యట్లుండె; భోగంబులు గాకున్న నేమి? నీకుం గార్యాకార్యంబులు నా యెఱింగిన తెఱంగున నుపదేశించుచు మైత్రి పాటించియునికి గర్హణీయంబై భవదీయ మూలభృత్యు లసూయ సేసి భేదింతురు; దాన నొప్పమి వచ్చు; నీవు వారలు గలంచినఁ గలంగ కుండుటకును నా బుద్ధి పాటించుటకును సమయంబు సేసి నన్నుమన్నించికొని యుండు; మట్లైన నీకడ వర్తించియుండెద’ ననుటయు నావ్యాఘ్రం బా భంగి నడపంగల యది యై యియ్యకొని. 59

ప్రతిపదార్థం: అది= అది; అట్లు+ఉండెన్= ఆ విషయం అట్లా ఉండనిమ్ము; భోగంబులు= సౌఖ్యాలు; కాక+ఉన్నన్+ఏమి?= పొందకుంటే ఏమి?; నీకున్= నీకు; కార్య+అకార్యంబులు= చేయదగ్గ, చేయకూడని పనులను; నా+ఎఱింగిన తెఱంగునన్= నాకు తెలిసినట్లుగా; ఉపదేశించుచున్= బోధిస్తూ; మైత్రి పాటించి= స్నేహం చేసి; ఉనికి= ఉండటం; గర్హణీయంబు+ఐ= ఆక్షేపించదగినదై; భవదీయ= నీకు సంబంధించిన; మూల భృత్యులు= తాత ముత్తాతలనాటి నుండి వస్తున్న సేవకులు; అసూయ చేసి= ఓర్వ లేక; భేదింతురు= వేరవుతారు; దానన్= అందువలన; ఒప్పమి= వైరం; వచ్చున్= కలుగుతుంది; నీవు= నీవు (పులి); వారలు= ఆ మూలభృత్యులు; కలంచినన్= కలవరపెట్టినా; కలంగక= చలించకుండా; ఉండుటకున్= ఉండటానికీ; నా బుద్ధి= నా ఆలోచనలను; పాటించుటకున్= ఆచరించటానికీ; సమయంబు+చేసి= ప్రతిజ్ఞ చేసి; నన్నున్= నన్ను; మన్నించికొని ఉండుము= గౌరవిస్తూ ఉండుము; అట్లు+ఐనన్= అట్లా అయితేనే; నీ కడన్= నీ దగ్గర; వర్తించి+ఉండెదన్= మసలుకొంటాను; అనుటయున్= అనగానే; ఆ+వ్యాఘ్రంబు= ఆ పులి; ఆ+భంగిన్= అట్లాగే; నడపంగల+అది+ఐ= జరపా లనుకొన్నదై; ఇయ్యకొని= సమ్మతించి.

తాత్పర్యం: అది అట్లా ఉండనిమ్ము, సౌఖ్యాలు అనుభవించకపోతే నేమి? నాకు తెలిసినంత మట్టుకు నీకు మంచీ చెడ్డలు తెలియచెప్పుతూ స్నేహంగా ఉంటాను. మన స్నేహాన్ని నీ మూలభృత్యులు ఓర్వలేక నిందిస్తారు. నిన్ను కలవరపరచి వైరం పెట్టుకుంటారు. అందువలన నీవు వారి మాటలకు చెవి ఒగ్గకుండా నేను చెప్పినట్లు నడచుకొంటేనే నీ దగ్గర ఉంటాను. అట్లాగని బాసచేసి నన్నాదరించుము.’ అనగానే పులి అట్లాగే నడుచుకొంటానని అంగీకరించి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. సంతసంబుతోడ సమయంబు సేసిన । నెలమిఁబొంది నక్క పులికి బుద్ధి
సెప్పికొనుచుఁ దగ వసించెఁ దదీయ ని । కేతనమునఁ బులియుఁ బ్రీతి సలిపె. 60

ప్రతిపదార్థం: సంతసంబుతోడన్= సంతోషంగా; సమయంబు+చేసినన్= ప్రతిజ్ఞచేయగా; ఎలమిన్= ఆనందాన్ని; పొంది= అనుభవించి; నక్క= నక్క; పులికిన్= పెద్ద పులికి; బుద్ధి+చెప్పికొనుచున్= ఉపదేశిస్తూ; తదీయ= పులికి చెందిన; నికేతనమునన్= నివాసస్థానం (గుహ)లో; తగన్= ఒప్పేటట్లుగా; వసించెన్= నివసించింది; పులియున్= పులికూడా; ప్రీతిన్=సంతోషంతో; సలిపెన్= మెలగింది.

తాత్పర్యం: పులి ఎంతో సంతోషంగా బాసచేసింది. దానికి నక్క సంతృప్తిచెందింది. పులికి హితవులు చెపుతూ పులిగుహలోనే ఉండిపోయింది. పులికూడా సంతోషంగా మెలగింది.

వ. కొండొక కాలంబునకు నమ్మృగరాజు మన్నించు విధంబును, నగ్గోమాయువు దదీయ హితాహితంబు లరసి బుద్ధి సాచివ్యంబు సేయు తెఱంగును జూచి చూపోపక యప్పులి మూలభృత్యులు దమలోనం గూడికొని యొక్కనాఁడు. 61

ప్రతిపదార్థం: కొండొక కాలంబునకున్= కొంతకాలానికి; ఆ+మృగరాజు= ఆ పెద్దపులి; మన్నించు విధంబును= ఆదరించే తీరూ; ఆ+గోమాయువు= ఆ నక్క; తదీయ= ఆ పులికి సంబంధించిన; హిత+అహితంబులు= మంచి సెబ్బరలూ; అరసి= విచారించి, తెలిసికొని; బుద్ధి= ఆలోచనతో; సాచివ్యంబు= మంత్రిత్వం; చేయు తెఱంగును= నడిపిన తీరునూ; చూచి= పరిశీలించి; చూపు+ఓపక= చూడలేక; ఆ+పులి= ఆ పెద్దపులి యొక్క; మూలభృత్యులు= తాతముత్తాలనాటి నుండి వస్తున్న సేవకులు; తమలోనన్= వాళ్ళల్లో వాళ్ళు; కూడికొని= గుమికూడి; ఒక్కనాఁడు= ఒకరోజున.

తాత్పర్యం: కొంతకాలం గడిచేసరికి నక్కను పులి ఆప్యాయంగా ఆదరించటమూ, నక్క ఎంతో విచక్షణతో మంత్రిత్వాన్ని నిర్వహించటమూ మూలభృత్యులకు గిట్టలేదు. వాళ్ళంతా అనుకొని ఒకనాడు ఒకచోట సమావేశం అయ్యారు.

క. 'పులి నమలెడు మాంసము వెర। వలవడఁ దా మపహరించి యా నక్కకు ని
మ్ముల నిల్వం గావించిన। నిలయంబున గొందిఁ బెట్టి నేర్పారంగన్. 62

ప్రతిపదార్థం: పులి= పెద్దపులి; నమలెడు= తినే; మాంసమున్= మాంసాన్ని; తాము= ఆ మూలభృత్యులు; వెరవు= ఉపాయం; అలవడన్= ఒప్పగా; అపహరించి= దొంగిలించి; ఆ నక్కకున్= ఆనక్క కొరకు; ఇమ్ములన్= సంతోషంగా; నిల్వన్= నివసించటానికి (ఉండటానికి); కావించిన= ఏర్పాటు చేసిన (సిద్ధంచేసిన); నిలయంబునన్= నివాసంలో (కొండగుహలో); గొందిన్= మూలగా; పెట్టి= దాచిపెట్టి; నేర్పు+ఆరంగన్= గొప్పదిట్ట తనంతో.

తాత్పర్యం: 'ఒకనాడు పెద్దపులి తినే మాంసాన్ని మూలభృత్యులు ఎంతో చాకచక్యంగా ఎత్తుకెళ్ళాయి. నక్క ఉండే కొండగుహలో ఓ మూల దాచిపెట్టాయి. ఎంతో దిట్టతనంతో మసలుకొంటూ ఉండగా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఉన్నంత భక్ష్యపదార్థ పరిరక్షణంబును దానచేయునది గావున నగ్గోమాయు వప్పనికిం జొచ్చి మాంసంబుగానక యెవ్వరేని మ్రుచ్చిలి కొనుటగా నెఱింగినదియై శార్దూలంబున కెఱింగించిన నామ్రుచ్చిమి యప్పులి యరయం దొడంగిన నెప్పటి కపటభృత్యులు గపటోపాయంబు పన్ని. 63

ప్రతిపదార్థం: ఉన్నంతన్= ఉంటున్నంతలో; భక్ష్యపదార్థ= తినుబండారాలను; పరిరక్షణంబు= భద్రపరచటమూ; తాను+అ= తానే; చేయునది+కావునన్= చేస్తుంది కనుక; ఆ+గోమాయువు= ఆ నక్క; ఆ పనికిన్= మాంసాన్ని జాగ్రత్తచేసే పనిమీద; చొచ్చి= వెళ్ళి; మాంసంబు= మాంసం; కానక= కనిపించక; ఎవ్వరేని= ఎవ్వరో; మ్రుచ్చిలి కొనుటగాన్= దొంగతనం చేసిందిగా; ఎఱింగినది+ఐ= తెలిసికొన్నదిఅయి (గమనించినదై); శార్దూలంబునకున్= పెద్దపులికి; ఎఱింగించినన్= తెలుపగా; ఆ మ్రుచ్చిమి= ఆ దొంగతనం గూర్చి; ఆ+పులి= ఆ పెద్దపులి; అరయన్= విచారించటానికి (వెదకటానికి); తొడంగినన్= పూనుకొనగానే; ఎప్పటి కపట భృత్యులు= ఎప్పటివలెనే, మోసగాళ్ళైన సేవకులు; కపట+ఉపాయాన్ని= మాయోపాయాన్ని; పన్ని= పుట్టించి.

తాత్పర్యం: రాజు తినే పదార్థాలను భద్రపరిచే పని నక్కదే. కనుక ఎప్పటివలె మాంసాన్ని దాచబోగా కనిపించలేదు. ఎవరో ఎత్తుకుపోయి ఉంటారని గ్రహించుకొని ఆ సంగతి పులి దృష్టికి తెచ్చింది. పులి వెంటనే వెదకటానికి పురమాయించింది. అది పసికట్టిన కపట సేవకులు కుట్ర పన్నినవారై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. నెమకు పరివార మమ్మాం । సము గను తెఱఁగును ఘటింప శార్దూలము చి
త్తము నక్కవలన విరస । త్వమునొందిన నెఱిఁగి భృత్యతతి యిట్లనియెన్. 64

ప్రతిపదార్థం: ఆ+మాంసమున్= ఆ మాంసాన్ని; నెమకు= వెదకే; పరివారము= సేవకులకు; కను తెఱఁగును= కనపడే విధంగా; ఘటింపన్= చేయగా (కలిగించగా); శార్దూలము= పులి; చిత్తమునన్= మనసులో; నక్కవలన= నక్కమీద; విరసత్వమున్= మైత్రీభేదాన్ని; ఒందినన్= పొందగా; ఎఱిఁగి= తెలిసికొని; భృత్యతతి= సేవకులంతా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: మాంసం వెదకే పరివారానికి అది కంటబడేటట్లు చేశాయి. దానితో పులికి నక్కమీద మనస్సు విరిగిపోయింది. అది కనిపెట్టిన సేవకులు ఈ విధంగా అన్నారు.

ఆ. 'నక్క కేటి వ్రతము? స్రుక్కక యిమ్మాంస । మపహరించినపుడ యబ్బె నేని
నేమి యైనఁ జేయు నిది పాపశీలంబు । గపట ధర్మకంచుకంబు సువ్వె! 65

ప్రతిపదార్థం: నక్కకున్= నక్కకు; ఏటి వ్రతంబు?= ఏమి నియమం?; స్రుక్కక= జంకులేకుండా; ఈ+మాంసమున్= ఈ మాంసాన్ని; అపహరించిన+అపుడ= దొంగలించినపుడే; అబ్బెనేనిన్= దొరికినట్లైతే; ఏమి+ఐనన్+చేయున్= ఇంకా ఏమైనా చేయగలదు; ఇది= ఈ నక్క; పాపశీలంబు= పాపస్వభావం కలది; కపట= మాయదైన; ధర్మకంచుకంబు= ధర్మమనే కవచం కలది; సువ్వె!= సుమా!

తాత్పర్యం: 'నక్కఏమిటి? వ్రతంఏమిటి? నీ మాంసం కాజేసినపుడే చేతికి అందుబాటులో ఉన్నట్లైతే సంకోచించకుండా ఇంకా ఏమైనా చేసేది. ఈ నక్క పాపభావాలు కలది. ధర్మమనే మాయతొడుగు తొడుక్కున్నది సుమా!

క. తా నటె మాంసముఁ దినదటె! । యీ నక్కయు బేలుపెట్టె నిన్నాళ్ళును నీ
యాన మఱుమాట వలుకం । గా నోడితి మిదియ నడపఁ గార్యములయెడన్.' 66

ప్రతిపదార్థం: తాను+అటె= నక్క అట; మాంసమున్= మాంసాన్ని; తినదు+అటె= నమలదట; ఈ నక్కయున్= ఈ నక్క; ఇన్నాళ్ళును= ఇంతకాలమూ; బేలుపెట్టెన్= మోసపుచ్చింది; ఇదియ= ఈ నక్కే; నడపన్= జరుపుతుండగా; కార్యముల+ఎడన్= రాచకార్యాలపట్ల; నీ+ఆనన్= నీ ఆజ్ఞచే; మఱుమాట= మరొకమాట; పలుకంగాన్= చెప్పటానికి; ఓడితిమి= వెరచాము.

తాత్పర్యం: నక్క అట మాంసాహారి కాదట - ఇంతకాలం ఎంత మోసగించింది! ఈ నక్కే అన్ని రాచకార్యాలు చూచుకొంటుంది కదా! అని మేము మీ శాసనానికి కట్టుబడి పల్లెత్తు మాట అనాలంటే భయపడేవారం'.

క. అనుటయు మృగపతి మనమునఁ । గన లడరిన నక్కఁ బట్టఁగాఁ బంచి వధిం
పను బుచ్చె; దాని నంతయు । విని యప్పులితల్లి గరము వెసఁ జనుదెంచెన్. 67

ప్రతిపదార్థం: అనుటయున్= అన్నదే తడవుగా; మృగపతి= పెద్దపులి; మనమునన్= మనస్సున; కనలు+అడరినన్= కోపం ఎక్కువకాగా; నక్కన్= నక్కను; పట్టఁగాన్= బంధించటానికి; పంచి= నియోగించి; వధింపను= చంపేయటానికి; పుచ్చెన్=

ఆజ్ఞాపించింది; దానిన్+అంతయున్= ఇదంతా; విని= ఆలకించి; ఆ+పులి తల్లి= ఆ పెద్దపులి తల్లి; కరము= ఎంతో; వేసన్= తొందరగా; చనుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: ఆ మాటలు చెవిని పడగానే పులి కోపంతో మండిపడుతూ 'నక్కను వెంటనే పట్టుకురండి. చంపండి' అంటూ ఆదేశించింది. ఇదంతా పులి తల్లి విని చప్పున కుమారుడి దగ్గరకు వచ్చింది.

వ. చనుదెంచి యా వ్యాఘ్రవరునితో నిట్లనియె. 68

తాత్పర్యం: వచ్చి, ఆ పులి తల్లి కొడుకుతో ఇట్లా అన్నది.

క. ఇట్టివి కృత్రిమములు గల । వట్టిదె యానక్క? బేల వైతివి భృత్యుల్
పుట్టినకోలెను గుటిలత । లె ట్టెట్టివి సేయ? రకట! యెఱుక గలఁగెనే? 69

ప్రతిపదార్థం: ఇట్టివి= ఇట్లాంటివి; కృత్రిమములు= కల్పితాలు; కలవు= ఉంటాయి; ఆ+నక్క= ఆ నక్క; అట్టిదె?= అట్లాంటిదా?; బేలవు+ఐతివి=వెర్రివాడవయ్యావు; భృత్యుల్= సేవకులు; పుట్టిన కోలెను= పుట్టిననాటినుండి; కుటిలతలు= కపటాలు; ఎట్టు+ఎట్టివి= ఎట్లాంటివి ఎట్లాంటివి; చేయరు= చేయలేదు?; అకట!= అయ్యో! ఎఱుఁక= తెలివి; కలఁగెనే?= కలవర పడిందా?

తాత్పర్యం: ఇట్లాంటి లేనిపోని కల్పితాలు కల్పించటం నక్కకు చేతనవుతుందా! ఎంత మూర్ఖుడివి? సేవకులు పుట్టుకతోనే వంచకులు. ఏమి చేయరు? వీరు ఎన్నైనా చేస్తారు. అయ్యో! నీ తెలివి తెల్లారిపోయిందా!

తే. బుద్ధిమంతునివలన దుర్బుద్ధు లధికు । వలన హీనులు రూపసివలనఁ గొనటి
వా రసూయలు సేయుదు రీరసమున । నింత యెఱుఁగంగవలవదే? యీవు గొడుక! 70

ప్రతిపదార్థం: కొడుక!= కుమారుడా!; బుద్ధిమంతునివలనన్= మంచివాడివలన; దుర్బుద్ధులు= చెడ్డవారు; అధికు వలనన్= గొప్పవాడివలన; హీనులు= అల్పులు; రూపసివలనన్= అందగాడివలన; కొనటివారు= కురూపులు; ఈరసమునన్= ఓర్వలేక; అసూయలు+చేయుదురు= లేనివి అంటగడతారు; ఈవు= నీవు; ఇంత= ఇంతమాత్రం; ఎఱుఁగంగన్+వలవదే?= తెలిసికొనవద్దా?

తాత్పర్యం: ఓ బిడ్డా! మంచివాళ్ళను చూచి చెడ్డవాళ్ళు, గొప్పవాళ్ళను చూచి తక్కువవాళ్ళు, అందగాళ్ళను చూచి అందం లేనివాళ్ళు సహించలేరు. లేనిపోని దోషాలు ఆరోపిస్తారు. ఈ పాటి విషయాలు నీకు నీవు గ్రహించుకొనవద్దా? (ఎదుటివాళ్ళ ఔన్నత్యాన్ని చూచి సహించలేకపోవటం సంస్కారవంతుల పని కాదని భావం).

క. ధర్మ మధర్మము భంగి న । ధర్మము ధర్మంబు మాడ్కిఁ దనయా! తోఁచున్
నిర్మలమతి నరయవలయు । ధార్మికతన కోరువాఁడు తన కేర్పడఁగన్. 71

ప్రతిపదార్థం: తనయా!= ఓ కొడుకా!; ధర్మము= న్యాయం; అధర్మము భంగిన్= అన్యాయంవలె; అధర్మము= అన్యాయం; ధర్మంబు మాడ్కిన్= న్యాయంవలె; తోఁచున్= కనబడుతుంది; ధార్మికతన+కోరువాఁడు= ధర్మాన్నే తెలిసికొనవలెననుకొనేవాడు; నిర్మలమతిన్= తేటగలబుద్ధితో; తనకున్= తనకు తాను; ఏర్పడఁగన్= స్పష్టపడేటట్లు; అరయన్ వలయున్= పరిశీలించుకొనాలి.

తాత్పర్యం: ఓ కొడుకా! ధర్మం అధర్మంవలె, అధర్మం ధర్మంవలె అనిపించవచ్చును. 'ధర్మం ఇదీ' అని తెలిసికొనదలచినవాడు తనకు తేటతెల్లమయ్యేదాకా మంచిమనసుతో ఆలోచించుకొనాలి.

క. వినుమీగోమాయువు వ । చ్చిన యంతటనుండి మనకుఁ జేసిన హితముల్
గనికొన వలవదె? యీతర । మున వాఁ డిటు సేయఁ డను సమూహయు వలదే? 72

ప్రతిపదార్థం: వినుము= విను; ఈ+గోమాయువు= ఈ నక్క; వచ్చిన+అంతటన్+ఉండి= వచ్చినప్పటినుండి; మనకున్= మనకు; చేసిన హితముల్= చేసిన మంచిపనులను; కని కొనవలవదె?= విచారించవద్దా?; ఈ తరమునవాఁడు= ఇట్లాంటి మంచివాడు; ఇటు+చేయఁడు= ఈ విధంగా చేయడు; అను+సమూహయున్= అనే మంచి యోచన; వలదే?= వద్దా?

తాత్పర్యం: ఈ నక్క వచ్చిన దగ్గరినుండి చేసిన ఉపకారాన్ని చూచి అయినా ఇట్లాంటివాడు ఇట్లా చేస్తాడా? అని ఒక్క క్షణం యోచించుకొనవద్దా?

క. హితుఁ డగు మంత్రిం గుటిలుల । యతి కపటోపాయములకు నగపడి చెఱుపన్
మతిఁ దలఁతురె? పతి సుపరీ । క్షితంబు గావింప కొకటి సేయం దగునే?' 73

ప్రతిపదార్థం: హితుఁడు+అగు= మేలుకోరేవాడైన; మంత్రిన్= మంత్రిని; కుటిలుల= మాయగాళ్ళ; అతి కపట+ఉపాయములకున్= మిక్కిలి మాయోపాయాలకు; అగపడి= లోబడిపోయి; చెఱుపన్= చంపటానికి; మతిన్= మనస్సులో; తలఁతురె?= భావిస్తారా? పతి= రాజు; సుపరీక్షితంబు+కావింపక= సరిగ్గా పరిశీలించకుండానే; ఒకటి= కీడు; చేయన్= తలపెట్టటం; తగునే?= ఒప్పునా? ఒప్పుకాదని భావం.

తాత్పర్యం: వంచకుల మాయమాటలలో పడి మన మంచిని కోరే మంత్రిని చంపాలనుకొనటం భావ్యమేనా? రాజైనవాడు వెనుకా ముందూ పరిశీలించుకొనకుండా హానిచేయ పూనుకొనటం సరైన నిర్ణయం కాదు. పరిపాలకుడు ప్రతి పనీ విచారించి అమలు పరచాలి'.

చ. అనవుడు నక్క రాఁబనిచి యప్పులి గౌఁగిటఁ జేర్చి బాష్పము
ల్గనుఁగవఁ గ్రమ్మనుం బలుకులం దగఁ బెద్దయు గారవించిన
'న్వినుము మృగేంద్ర! మున్నటుల నీవు సభన్ నను వీఁడు మంచివాఁ
డని కొనియాడి యిప్టు దెగటార్చితి పెంపును నాదు మానమున్.' 74

ప్రతిపదార్థం: అనవుడున్= తల్లి చెప్పగానే; నక్క= నక్కను; రాన్ పనిచి= పిలిపించి; ఆ+పులి= ఆ పెద్దపులి; కౌఁగిటన్ చేర్చి= ఆలింగనం చేసి; బాష్పముల్= కన్నీరు; కనుఁగవన్= రెండు కళ్ళను; క్రమ్మనున్= కప్పగా; పలుకులన్= మాటలతో; తగన్ పెద్దయున్= ఎంతో ఎక్కువగా; గారవించినన్= గౌరవించగా; మృగ+ఇంద్ర!= మృగరాజా!; వినుము= వినవలసింది; నీవు; మున్ను+అటులన్= ఇంతకు క్రితం ఆ విధంగా; సభన్= కొలువులో; ననున్= నన్ను; వీఁడు= ఇతడు (ఈ నక్క); మంచివాఁడు= యోగ్యుడు; అని కొనియాడి= అని పొగడి; ఇప్డు= ఈనాడు; నాదు మానమున్= నా ఆత్మాభిమానాన్ని; పెంపును= గౌరవాన్ని; తెగటార్చితి(వి)= మంటగలిపావు. (నాశనం చేశావు).

తాత్పర్యం: తల్లి బోధలకు బుద్ధి తెచ్చుకొని పులి నక్కను రమ్మని కబురంపింది. వచ్చిన నక్కను అక్కున చేర్చుకొన్నది. కంటనీరు పెట్టుకొంటూ ఆత్మీయంగా మాట్లాడింది. ఆదరించింది. 'ఓ పులిరాజా! ఒక విషయం వినుము. నీవు ముందు ఒకనాటి సభలో అందరి ఎదుటా నన్ను మంచివాడ వని మెచ్చుకొన్నావు. ఈ రోజున నా అభిమానాన్ని, నా పరువునూ చివరంటా చెరిపేశావు.'

వ. అని పలికి యగ్గోమాయువు వెండియు. 75

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనిపలికి= అని చెప్పి; ఆ+గోమాయువు= ఆ నక్క; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని చెప్పి నక్క మళ్ళీ చెప్పటం మొదలు పెట్టింది.

క. **'నను నీవు పదస్థునిఁగా । ననఘా! చేయంగఁ దలఁచినప్పుడ నీ భృ**
త్యనికాయము కఱపులఁ బడ । కునికియు నా బుద్ధి వినుటయును మఱవమికిన్. **76**

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పుణ్యవంతుడా!; ననున్= నన్ను; నీవు= నీవు; పదస్థునిఁగాన్= పదవి కలవాడినిగా; చేయంగన్= చేయటానికి; తలంచినపుడ= భావించినపుడే; నీ భృత్యనికాయము= నీ పరిజనంయొక్క; కఱపులన్= చెడ్డ బోధనలలో; పడక+ఉనికియున్= చిక్కకుండా ఉండటం; నా బుద్ధిన్= నా అభిప్రాయాన్ని; వినుటయును= చెవిని పెట్టటం; మఱవమికిన్= మరచిపోకుండా ఉండటానికి.

తాత్పర్యం: 'ఓ ధర్మాత్ముడా! నీవు నన్ను అధికారిని చేయాలని నిర్ణయించుకొన్నప్పుడే నీ భృత్యుల దురాలోచనలో తలదూర్చక పోవటమూ నా అభిప్రాయాల ప్రకారం నడచుకొనటమూ మర్చిపోకుండా ఉండేటట్లు ప్రమాణం చేశావు కదా! (తరువాతి వచనంతో అన్వయం).

వ. **బాస సేయవే యట్లుంగాక.** **77**

ప్రతిపదార్థం: బాస+చేయవు+ఏ= ఒట్టుపెట్టుకొనలేదా?; అట్లున్+కాక= అంతేకాకుండా.

తాత్పర్యం: ఒట్టుపెట్టుకొనలేదా? అంతే కాకుండా.

ఆ. **ఎఱిఁగి యైన నెఱుఁగ కేనియు నొక్కని । భంగపెట్టి పిదప సంగతుఁడుగఁ**
జేసికొనుట మేలె సిరిగలవారికి? । నట్టి నిలువువాని కగునె హితము?' **78**

ప్రతిపదార్థం: ఎఱిఁగి+ఐనన్= తెలిసి అయినా; ఎఱుఁగక+ఏనియున్= తెలియకుండా అయినా; ఒక్కనిన్= ఒక్కడిని; భంగపెట్టి= అవమాన పరిచి; పిదపన్= ఆ తరువాత; సంగతుఁడుగన్= నేస్తగాడిగా; చేసికొనుట= చేసుకొనటం; సిరిగలవారికిన్= డబ్బుగలవారికి; మేలె?= మంచిదా?; అట్టినిలువు= అట్టి ఉనికి; వానికిన్= ఉన్నవాడికి; హితము= మేలు; శుభం; అగునె?= కలుగుతుందా?

తాత్పర్యం: తెలిసో తెలియకో మరొకడిని చిన్నబుచ్చి ఆ తరువాత స్నేహితుడిగా చేసికొనటం ధనవంతుడికి మంచిదేనా? అట్లా బ్రతికేవాడికీ (అవమానించబడీ తిరిగి ఉండేవాడికి) మంచి జరుగుతుందా?'

క. **అని పాసి యరణ్యమునకుఁ । జని యనశన దీక్ష నొంది సద్భావ ఖ్యా**
తి నెఱయఁ బరమస్థానం । బున కగ్గోమాయు వరిగెఁ బురుషవరేణ్యా! **79**

ప్రతిపదార్థం: పురుషవరేణ్యా!= ధర్మరాజా! అని= అని; ఆ+గోమాయువు= ఆ నక్క; పాసి= ఆ పులిరాజును విడిచి; అరణ్యమునకున్= అడవులలోకి; చని= వెళ్ళి; అనశనదీక్షన్= నిరాహార వ్రతాన్ని; ఒంది= పొంది; సద్భావఖ్యాతి= మంచివాడనే పొగడ్త; నెఱయన్= వెల్లడి కాగా; పరమస్థానంబునకున్= వైకుంఠానికి; అరిగెన్= వెళ్ళింది.

తాత్పర్యం: ధర్మరాజా! అట్లా పలికి ఆ నక్క పులిని వదలిపెట్టి అడవులలోకి వెళ్ళింది. నిరాహారదీక్ష పూనింది. తన మంచితనంతో పైలోకాలకు చేరుకొన్నది.

వ. **ఈ కథ పూర్వాపరవాక్యంబుల యందలి తాత్పర్యంబు నిరూపించి.** **80**

ప్రతిపదార్థం: ఈ కథ= ఈ పులి నక్కా వృత్తాంతం; పూర్వ+అపర వాక్యంబుల అందలి= ముందూ వెనుకా మాటలలోని; తాత్పర్యమును= ఉద్దేశాన్ని; నిరూపించి= నిశ్చయించి.

తాత్పర్యం: ఈ పులి నక్కా సంవాదంలోని సారాంశాన్ని వివరంగా తెలిపి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **వావిరి మాటలఁ దేలక । భావంబునఁ గీడు మేలుఁ బరికించి యస**
ద్భావుని సద్భావుని నవ । నీవర! యేర్పఱుప నెఱుఁగ నేరఁగ వలయున్.' **81**

ప్రతిపదార్థం: అవనీవర!= ఓ రాజా!; వావిరి మాటలన్= మాయమాటలచేత; తేలక= మోసపోకుండా; భావంబునన్= ఆలోచనలో; కీడు మేలున్= మంచి చెడ్డలను; పరికించి= పరీక్షించి; అసద్భావునిన్= చెడ్డవాడిని; సద్భావునిన్= మంచివాడిని; ఏర్పఱుపన్= వేరు పరచటం; ఎఱుఁగన్ నేరఁగవలయున్= తెలిసికొనే శక్తి కలిగి ఉండాలి.

తాత్పర్యం: ఓ రాజా! రాజయినవాడు ఇతరుల మాయమాటలలో పడి మోసపోకుండా మంచీ చెడ్డా యోచించుకొనాలి. ఇది మంచిది ఇది మంచిది కాదు అని విడివిడిగా తెలిసికొనగల సామర్థ్యం కలిగి ఉండాలి. అపుడే పరిపాలకుడు సరైన నిర్ణయాలు తీసికొనగలుగుతాడు'.

భీష్ముండు ధర్మజునకు సహాయ సంపన్నత్వం బావశ్యకం బగుట సెప్పుట (సం. 12-113-1,2)

వ. **అనినవిని సంతోషించి కౌంతేయాగ్రజుం 'డేమిభంగివర్తనంబున భూపాలుండు సుఖియై యుండు' ననుటయు**
నన్నరపతికిం గురుపితామహుం డిట్లనియె. **82**

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; సంతోషించి= ఆనందపడి; కౌంతేయ+అగ్రజుండు= ధర్మరాజు; ఏమి భంగిన్= ఎట్లాంటి; వర్తనంబునన్= నడతచేత; భూపాలుండు= రాజు; సుఖి+ఐ+ఉండున్?= సుఖిస్తాడు?; అనుటయున్= అని మాటలాడగానే; ఆ+నరపతికిన్= ఆ ధర్మరాజుతో; కురుపితామహుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'రాజు ఎట్లా నడచుకుంటే సుఖపడతాడు' అని ధర్మరాజు కోరగానే భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

సీ. **'ఆలస్యమును నసహాయత్వమును నొప్పు । వవిలేని పతి సుఖియై చరించు;**
విను తొల్లి యొక యుష్ట్ర మనితరసాధ్య త । పంబు సేయఁగ మెచ్చి బ్రహ్మ వచ్చి
యర్థించినది 'యేమి?' యనిన నా లొట్టియ । యొప్ప 'నా మెడ శతయోజన ప్ర
మాణం బగుట కోర్కి వాణీశ!' నావుడు । న ట్లగుంగా కని యతఁడు సనియె;

తే. **నదియు వరగర్వమున సహాయంబు నొల్ల । కలసభావంబుతో నుండి వలచియొక్క**
నాఁడు దన యఱ్ఱుసాఁచి కాననములోన । దీను కొని మేయఁగాఁ బెనువాన వచ్చె. **83**

ప్రతిపదార్థం: ఆలస్యమునున్= మాంద్యమునూ; అసహాయత్వమునున్= ఒకరి తోడ్పాటును ఆశించకపోవటం; ఒప్పవు= తగ్గవికావు; అవి లేని పతి= అవి లేని రాజు; సుఖి+ఐ= భోగిఅయి; చరించున్= తిరుగుతాడు; విను= వినవలసింది; తొల్లి= ఒకప్పుడు; ఒక ఉష్ట్రము= ఒక ఒంటె; అనితరసాధ్య తపంబు= ఇతరు లెవ్వరూ చేయ వీలుకానంతగా తపస్సు; చేయఁగన్= చేయగా; మెచ్చి= పొగడి; బ్రహ్మ వచ్చి= బ్రహ్మ ఎదుటకు వచ్చి; అర్థించినది= కోరుకొనేది; ఏమి+అనిన్= ఏమిటి అని అడుగగా; ఆ లొట్టియ= ఆ ఒంటె; వాణీ+ఈశ!= ఓ బ్రహ్మా!; ఒప్పన్= ఒప్పగా; నామెడ= నా మెడకాయ; శతయోజన ప్రమాణంబు= నూరామడల మేరదాకా;

అగుట= పొడవుకావటం; కోర్కి= ఆశ; నావుడున్= అనగానే; అట్లు= అట్లాగే; అగున్+కాక= నెరవేరుతుంది కాక; అని= అని చెప్పి; అతఁడు= బ్రహ్మ; చనియెన్= తనలోకానికి వెళ్ళిపోయాడు; అదియున్= ఆ ఒంటెకూడా; వరగర్వమునన్= బ్రహ్మవలన కోరిక తీరిందనే అహంకారంతో; సహాయంబున్= సాటివాడి సహకారాన్ని; ఒల్లక= కోరక; అలసభావంబుతోన్= సోమరితనంతో; ఉండి= ఉండి; వలచి= కోరి; ఒక్కనాఁడు= ఒకరోజున తన అఱ్ఱు+చాఁచి= తన మెడను సాగించి; కాననములోనన్= అడవిలో; దీనుకొని= చక్కగా; మేయఁగాన్= మేత తినగా; పెనువాన= పెద్ద వర్షం; వచ్చెన్= కురిసింది.

తాత్పర్యం: ఏమరుపాటు లేకుండా ఎదుటివాడి సాయం కావాలనుకొనే రాజు తప్పక సుఖాలు పొందుతాడు. వెనకటికి ఒక ఒంటె మరెవరికీ అలవికానంత తపస్సుచేసింది. దానికి బ్రహ్మ మెచ్చుకొని ఎదుటపడి 'నీ కేం కావాలో కోరుకో' మ్మన్నాడు. 'నా మెడ నూరామడల దాకా సాగాలని నా కోరిక' అన్నది. బ్రహ్మ 'అట్లాగే అవుతుం'దని చెప్పి వెళ్ళిపోయాడు. వరం పొందిన ఒంటె అహంభావంతో సాటివాడి సాయాన్ని ఆశించక సోమరితనంతో ఉన్నది. ఒకరోజున కావాలని మరీ తన మెడకాయను పొడిగించి అడవిలో చక్కగా మేత మేస్తున్నది. అంతలో పెద్ద గాలివాన వచ్చింది.

క. వచ్చినఁ దన మెడ సాఁగిన । యచ్చటి గుహలోన నుత్తమాంగం బిడి తా
నిచ్చమెయి నిదురపోవఁగ । విచ్చలవిడి నొక్క నక్క వెలఁదియుఁ దానున్. 84

ప్రతిపదార్థం: వచ్చినన్= వాన రాగానే; తనమెడ= తన మెడకాయ; సాగిన= సాగినటువంటి; అచ్చటి= అక్కడి; గుహలోనన్= అక్కడే ఉన్న గుహలో; ఉత్తమాంగంబున్= తలను; ఇడి= ఉంచి (పెట్టి); తాన్= తాను; ఇచ్చమెయిన్= ఇష్టం వచ్చినట్లు; నిదుర+పోవఁగన్= నిద్రించగా; ఒక్క నక్క= ఒక నక్క; వెలఁదియున్= దాని భార్యా (ఆడనక్క); తానున్= తానూ; విచ్చలవిడిన్= స్వేచ్ఛగా.

తాత్పర్యం: వాన పడీ పడంగానే ఆ ఒంటె తన మెడకాయను చాచి ఒక గుహలోనికి తలను పెట్టింది. ఆదమరచి హాయిగా నిద్రపోయింది. అంతలో ఒక నక్క దంపతులు ఎలాంటి అడ్డూ ఆపూ లేకుండా. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. ఆ గుహ సొచ్చెం; జొచ్చి యాఁకటిపెల్లున నాలుందానును నొక్కట నాలొట్టేనుఁగు కుత్తుక కబళించి నెత్తురు గండలు నొండొండ మ్రింగందొడంగిన, నదిమేలుకని ఆ లొట్టియ మెడ పొరల్చునంతకు నా నక్కలు నరంబులు ద్రెవ్వం గఱచిన, నెఱి దప్పి యయ్యుష్ట్రంబు నిర్గత ప్రాణం బయ్యె; నట్టి చందంబు గాక నీ వనాలస్యుండవును సహాయ సంపన్నుండవును నై నెగడు' మనిన నజ్జగతీశుం డతనితో 'శత్రుం డధికుం డైన నల్పబలుం డగు రా జేయోజ నాపద నిస్తరించు?' ననవుడు నతండు 'సముద్రసరిత్సంవాదం బాకర్ణింపుము; దాన నీ యడిగిన యర్థంబు దేటపడియెడు' నని పలికి యిట్లనియె. 85

ప్రతిపదార్థం: ఆ గుహ= ఆ బిలం లోపలకు; చొచ్చెన్= దూరాయి; చొచ్చి= లోనికి వెళ్ళి; ఆఁకటిపెల్లునన్= ఎక్కువ ఆకలితో; ఆలున్+తానున్= పెళ్ళామూ తానూ (ఆ నక్క దంపతులు); ఒక్కటన్= ఒక్కమారుగా; ఆ లొట్టేనుఁగు= ఆ ఒంటె; కుత్తుక= పీకను; కబళించి= పట్టుకొని; నెత్తురున్= రక్తాన్నీ; కండలున్= మాంసపు ముద్దలనూ; ఒండొండన్= ఒకటొకటిగా; మ్రింగన్ తొడంగినన్= తినటం మొదలుపెట్టగా; అది= ఆ ఒంటె; మేలుకని= నిద్రలేచి; ఆ+లొట్టియ మెడ= ఆ ఒంటె మెడకాయను; పొరల్చున్+అంతకున్= అటూ ఇటూ తిప్పుకునేలోగా; ఆ నక్కలు= ఆ జంట నక్కలు; నరంబులు= నాడులు; త్రెవ్వన్= తెగేలా; కఱచినన్= కొరకగా; నెఱి+తప్పి= సత్తువపోయి; ఆ+ఉష్ట్రంబు= ఆ ఒంటె; నిర్గతప్రాణంబు= ప్రాణంపోయింది; అయ్యెన్= అయింది; అట్టి చందంబుగాక= ఆ విధంగా గాక; నీవు= నీవు (ధర్మరాజు); అనాలస్యుండవును= అలస్యం చేయనివాడవుగానూ, సహాయ సంపన్నుండవును= ఇతరుల సాయాన్ని సమకూర్చుకొనే వాడవుగానూ; ఐ= అయి; నెగడుము= నడుచుకొనుము; అనినన్=

అనగానే; ఆ+జగతీ+ఈశుండు= ఆ ధర్మరాజు; అతనితోన్= ఆ భీష్ముడితో; శత్రుండు= పగవాడు; అధికుండు+ఐనన్= ఎక్కువ బలం కలవాడైతే; అల్పబలుండు+అగు రాజు= తక్కువ బలం కల రాజు; ఏ యోజన్= ఏ తీరుగా; ఆపదన్= విపత్తును (కష్టాన్ని); నిస్తరించున్?= దాటగలుగుతాడు?; అనవుడున్= అని అడుగగానే; అతండు= భీష్ముడు; సముద్ర సరిత్+సంవాదంబు= సముద్రం నదుల మధ్య జరిగిన వృత్తాంతాన్ని; ఆకర్ణింపుము= ఆలకించుము; దానన్= అది విన్నందువలన; నీ అడిగిన= నీవు కోరిన; అర్థంబు= ప్రయోజనం; తేటపడియెడున్= స్పష్టం కాగలదు; అని పలికెన్= అని చెప్పాడు.

తాత్పర్యం: గుహలోకి అడుగుపెట్టిన నక్కలు అప్పటికే ఆకలి మండిపోతూ ఉండటం వలన ఒక్క ఉదుటున ఆ ఒంటె పీకను పట్టుకున్నాయి. నెత్తురును త్రాగుతూ, మాంసం ముక్కలను క్రమక్రమంగా మింగుతుండగా దానికి మెలకువ వచ్చింది. అది మెడను తిప్పుకొంటుండగానే ఆ నక్కలు మెడ నరాలు తెగిపడేటట్లు పటుక్కున కొరికాయి. పట్టుతప్పి ప్రాణాలు విడిచింది ఒంటె. అందువలన నీవు జాగరూకుడవై సాటివారి సాయాన్ని అందుకొంటూ నడుచుకొమ్ము' అన్నాడు. అనగానే ధర్మరాజు 'శత్రురాజు అధికబలం గలవాడైతే, అల్పబలంగల రాజు ఆపదలనుండి ఎట్లా గట్టెక్కగలుగుతాడు?' అని ప్రశ్నించాడు. భీష్ముడు 'సముద్రానికీ నదికీ నడుమ సాగిన సంభాషణ వింటే నీకే తెలుస్తుంది' అని ఇట్లా చెప్పనారంభించాడు.

సముద్ర సరిత్సంవాదము (సం. 12-114-2)

తే. **'ఉదధి సుఖగోష్ఠి నున్నప్డు నదులతోడ। 'మీ తటంబుల తరువులు మీరు పొంగి**
తటిమిపాటినఁ గూలు వేతసము లేల। పెటికిపో వవి మీ కేమి ప్రియ మొనర్చె? 86

ప్రతిపదార్థం: ఉదధి= సముద్రం; నదులతోడన్= నదులతో; సుఖగోష్ఠిన్= ఆనంద సల్లాపంలో; ఉన్న+అప్డు= ఉన్న సమయంలో; మీరు= మీరు(నదులు); పొంగి= ఉప్పొంగి; తటిమి= వెంటాడి (ఉరవడితో); పాటినన్= ప్రవహించేటప్పుడు; మీ తటంబుల= మీ ఒడ్డుమీది; తరువులు= చెట్లు; కూలున్= కుప్పకూలి పోతాయి; వేతసములు= నీటి ప్రబ్బలిచెట్లు (తుంగజాతికి చెందిన మొక్కలు); ఏల= ఎందుకు; పెటికిపోవు?= పెళ్ళగించుకొనిపోవు?; అవి= ఆ వేతసాలు; మీకున్= మీకు; ఏమి= ఎట్లాంటి; ప్రియమున్= ప్రీతిని; ఒనర్చెన్= కలిగించాయి?

తాత్పర్యం: సముద్రం నదులతో ఆనందంగా సల్లాపాలు సాగిస్తూ ఇట్లా అడిగింది 'మీరు మంచి ఉరవడితో పొంగిపొర్లి పారేటప్పుడు మీ గట్లమీది చెట్లు కూలిపడిపోతుంటాయికదా! మరి ప్రబ్బలిచెట్లు పడిపోవేమిటి? అవి మీకు ఏమైనా ఒరగపెట్టాయా ఏమిటి? అవి మిమ్మల్ని ఏమైనా సంతృప్తి పరిచాయా ఏమి?'

వ. **వాని నున్మూలింప మీకు శక్యంబు గామిం జేసియో వానికిం జేటు వాటిల్లు; దిది యేమి?' యనవుడు నదులందు గంగ యిట్లనియె. 87**

ప్రతిపదార్థం: వానిన్= ఆ ప్రబ్బలిచెట్లను; ఉన్మూలింపన్= ఊడబెరకటానికి; మీకున్= మీకు; శక్యంబు= సాధ్యం; కామిన్+చేసియో= కాకపోవటం వల్లనో; వానికిన్= ఆ ప్రబ్బలిచెట్లకు; చేటు+పాటిల్లదు= కీడు మూడదు; ఇది+ఏమి?= ఇదేమిటి?; అనవుడున్= అని అడగగానే; నదులందున్ గంగ= నదులలో గంగానది; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: లేక, వాటిని పెల్లగించటం మీవలన కాకపోవటం వలననా? ఏ కారణంగా ఆ ప్రబ్బలిచెట్ల మొదళ్ళు పెకలించబడటం లేదు?' అని అడగగానే గంగానది ఈ విధంగా సమాధానం ఇచ్చింది.

క. ‘బిగు వెడలక నిలిచి పడున్ । నగములు వేతసచయంబు నమ్రంబై పె
ల్లగు మా వేగము గడపి యె । సఁగు బూర్వస్థితిన బ్రదుకు సమకూరంగన్. 88

ప్రతిపదార్థం: నగములు= చెట్లు; బిగువు= బింకం; ఎడలక= వదలక; నిలిచి= నిలబడి ఉండి; పడున్= కూలిపోతాయి; వేతసచయంబు= ప్రబ్బలిచెట్ల సముదాయం; నమ్రంబు+ఐ= వంగి ఉండి; పెల్లు+అగు= ఉప్పొంగే; మా వేగము= మా ప్రవాహవేగాన్ని (మా ఉరవడిని); కడపి= దాటించి (ఉద్ధృతి తగ్గాక); పూర్వస్థితిన్= వెనుకటి వలెనే; బ్రదుకు= సుఖజీవనం; సమకూరంగాన్= కలుగగా; ఎసఁగున్= ఒప్పుతాయి.

తాత్పర్యం: ‘ఓ సముద్రుడా! మా గట్లమీది చెట్లన్నీ తమ బింకం సడలనీయకుండా నిలబడతాయి. అందువలన నీటి వేగాన్ని తట్టుకోలేక నిట్టనిలువునా కూలిపోతుంటాయి. ప్రబ్బలిచెట్లు ఆ విధంగా కాకుండా నీటి వేగాన్నిబట్టి వంగి ఉండి, ఆ ఉరవడి తగ్గాక ఎప్పటివలె సజీవంగా నిలబడి ఉంటాయి.’

వ. అనియె నా ప్రబ్బలిచెట్ల తెఱంగు కనికొని. 89

ప్రతిపదార్థం: అనియెన్= అని గంగ చెప్పింది; ఆ+ప్రబ్బలిచెట్ల= ఆ తుంగజాతివైన ప్రబ్బలిచెట్లయొక్క; తెఱంగు= తీరును; కనికొని= తెలిసికొని.

తాత్పర్యం: అని గంగ సమాధానం చెప్పింది. కనుక ఆ నీటి ప్రబ్బలిచెట్ల తీరును గ్రహించుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అరి నృపాలు పెంపు నాత్మీయశక్తియు । నెఱిఁగి మూర్ఖవృత్తి నెదురుపడక
యుచిత వృత్తి నతని యుద్ధతి మేవడిఁ । గడపి హీనబలుఁడు సెడక నిలుచు. 90

ప్రతిపదార్థం: హీనబలుఁడు= తక్కువ బలంకల రాజు; అరినృపాలు= శత్రు రాజుయొక్క; పెంపున్= ఆధిక్యాన్నీ; ఆత్మీయశక్తియున్= తన లావునూ; ఎఱిఁగి= తెలిసికొని; మూర్ఖవృత్తిన్= మొరటుగా; ఎదురుపడక= ఎదిరించకుండా; ఉచిత వృత్తిన్= తగిన రీతిలో; అతని= పగవాడియొక్క; ఉద్ధతిన్= మిడిసిపాటును (పొగరును); మేవడిన్= ఉపాయంతో; కడపి= అడ్డుకొని; చెడక= పాడవకుండా; నిలుచున్= నిలదొక్కుకొంటాడు.

తాత్పర్యం: బలహీనుడైన రాజు తన బలాన్నీ, ఎదుటివాడి బలాన్నీ అంచనా వేసికొనాలి. మొండిగా పోరుకు దిగకూడదు. పగవాడి మిడిసిపాటును యుక్తిగా తొలగించుకొనాలి (దాటవేయాలి). అపుడే ఆ రాజు ఎట్లాంటి చెరుపూ లేకుండా నిలబడగలుగుతాడు’ (సమయానుకూలంగా పనులు చేసుకొనేవాడికి ఎట్లాంటి ఆపదలు రావని భావం).

వ. అనిన విని యుధిష్ఠిరుండు ‘దగుపదంబులకుఁ గులవంతు లగు పరిజనులు దొరకొనకున్న నరనాథుం డేమి సేయం గలవాఁ? డని యడిగిన నప్పుడమితేనికి భీష్ముం డిట్లనియె. 91

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగానే; విని= విన్నవాడై; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; తగుపదంబులకున్= ఆయా పదవులకు తగ్గ; కులవంతులు+అగు= పెద్ద కులంవారైన; పరిజనులు= సేవకులు; దొరకొనక+ఉన్నన్= దొరకకపోతే; నరనాథుండు= రాజు; ఏమి+చేయన్+కలవాఁడు?= ఏమి చేయగలడు?; అని అడిగినన్= అని ధర్మరాజు అడుగగా; ఆ పుడమితేనికిన్= ఆ ధర్మరాజుతో; భీష్ముండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అదంతా ఆలకించిన ధర్మరాజు 'మంచి కులస్థుడైన సేవకుడు పదవికి తగ్గట్టుగా జతపడకపోతే రాజు ఏం చేయాలి?' అని అడిగాడు. దానికి భీష్ముడు ఈ విధంగా చెప్పటం మొదలు పెట్టాడు.

కుర్కుర నీచత్వముం దెలుపునట్టి యితిహాసము (సం. 12-117-2)

సీ. **'విను మొక్క యితిహాస మనుపమం బగు తపం । బునఁ బేర్చువాఁ డొక్కమునివరేణ్యు**
నాశ్రమంబునఁ దద్దయావిశేషంబున । నఖిల జంతువులును నచట నచట
వసియించి సుఖముండు; వానిలో నొక్క కు । ర్కుర మెప్డు భక్తిమైఁ గొలిచి తిరుగు;
నమ్ముని మెలఁగినయచట నెల్లను । దాను వర్తింప నొక దువ్వు వైరమెత్తి

తే. **కఱవ వచ్చిన నమ్మునికడకుఁ బాఱు । తెంచె నా కుక్క నాతఁడు దీప్త రూప**
మైన దువ్వుఁ గాఁ జేసిన నది గడంగి । కవియ భయమంది పాఱె మున్కవియు దువ్వు. **92**

ప్రతిపదార్థం: ఒక్క+ఇతిహాసము= ఓ వెనుకటి కథను; వినుము= వినుము; అనుపమంబు+అగు= సాటిలేనిదైన (విశేషమైన); తపంబునన్= తపస్సుచేత; పేర్చువాఁడు= అతిశయించేటటువంటి; ఒక్కమునివరేణ్యు= ఒక మునిముఖ్యుడి యొక్క; ఆశ్రమంబునన్= ముని పల్లెలో (తపోవనంలో); తద్= ఆ మునియొక్క; దయా విశేషంబునన్= ఎంతో దయవలన; అఖిల జంతువులునున్= సమస్త ప్రాణులూ; అచటన్+అచటన్= అక్కడక్కడ; వసియించి= నివసించి; సుఖము= హాయిగా (సంతోషంగా); ఉండున్= ఉంటున్నాయి; వానిలోన్= ఉన్నవాటిలో; ఒక కుర్కురము= ఒక కుక్క; ఎప్డున్= ఎల్లప్పుడూ; భక్తిమైన్= ఆరాధనతో (విశ్వాసంతో); కొలిచి= సేవించి; తిరుగున్= మెలగుతూ ఉన్నది; ఆ+ముని= ఆ ఋషి; మెలఁగిన+అచటన్= తిరిగే చోట; ఎల్లను= అంతటా; తాను వర్తింపన్= తాను నడవగా; ఒకదువ్వు= ఒక పెద్దపులి; వైరము+ఎత్తి= పగబట్టి; కఱవన్= చంపటానికి (కరవటానికి); వచ్చినన్= రాగా; ఆ మునికడకున్= ఆ ముని దగ్గరకు; పాఱుతెంచెన్= పరుగుపెట్టింది; ఆ+కుక్కన్= ఆ కుక్కను; ఆతఁడు= ఆ ముని; దీప్తరూపము+ఐన= ప్రకాశించే రూపంగల; దువ్వుగాన్= పెద్దపులిగా; చేసినన్= చేయగా; అది+కడంగి= అది ధైర్యంగా నిలిచి; కవియన్= కలబడగా; మున్= ముందు; కవియున్= పైబడిన; దువ్వు= పెద్దపులి; భయమున్= పిరికితనాన్ని; అంది= పొంది; పాఱెన్= ఉడాయించింది.

తాత్పర్యం: 'దీని గూర్చి ఓ కథ చెప్తుతాను వినుము. పూర్వం ఒక ముని ఎవరూ చేయనలవి కానంతగా తపస్సు చేశాడు. అతగాడు దయాదాక్షిణ్యాలు కలవాడు. అతడి ఆశ్రమంలో అన్ని జంతువులూ హాయిగా చీకూ చింతా లేకుండా బ్రతుకుతుండేవి. వాటిల్లో ఒక కుక్క ఎంతో విశ్వాసంతో ఆ మునిని సేవిస్తూ ఉండేది. ఆ ముని ఎటు వెళ్ళితే అటు వెంబడించి వెళ్ళుతూ ఉండేది. అది చూచి సహించలేక ఒక పులి కుక్కమీద ద్వేషంపెట్టుకొని పంజాతో కొట్టబోయింది. ప్రాణభయంతో ఆ కుక్క ఆ ముని చాటుకుపోయింది. ఆ ముని దానిమీద జాలిపడి, దానికంటె పెద్దదైన పులిగా మార్చాడు. మొదట మీదపడిన అసలు పులి దీనిని చూచి భయపడి పారిపోయింది.

సీ. **అట్లు బెబ్బులి వచ్చి యడరిన బెబ్బులిఁ । గాఁ జేసి గెలిపించెఁ గరుణ మెఱయ,**
నొక మత్తకరిఁ జూచి యోటమై నొదిఁగిన । నుద్ధతకరిఁ జేసి యొసఁగె జయము
సింహంబు దెస భీతిఁజెడి పాఱుతెంచిన । ఘనసింహముగఁ జేసి గర్వమిచ్చె,
శరభంబు ధాటికిఁ జకితమైన నుదగ్ర । శరభంబుఁ జేసి యుత్సాహిఁ జేసె

తే. **నిట్లు దివసక్రమంబున నెక్కుడైన । సత్త్వముగఁ జేయఁగాఁ గుక్క శరభభావ**
మండితంబయి తిరుగుచునుండి పూర్వ । వాసనా నీచమగు మనోవర్తనమున. **93**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; బెబ్బులి= పెద్దపులి; వచ్చి= పైబడి; అదరినన్= చెలరేగగా; కరుణమెఱయన్= దయచూపి; బెబ్బులిఁగాన్+చేసి= పెద్దపులిగా మార్చి; గెలిపించెన్= నెగ్గింపచేశాడు; ఒక మత్తకరిన్= ఒక మదించిన ఏనుగును; చూచి= కాంచి; ఓటమైన్= జంకుతో; ఒదిఁగినన్= దాక్కొనగా (చాటుకురాగా); ఉద్ధతకరిన్= దర్పంగల ఏనుగుగా; చేసి= మారు రూపంచేసి; జయము= గెలుపును; ఒసఁగెన్= కలిగించాడు; సింహంబు దెసన్= సింహం వలన; భీతిఁజెంది= భయంతో; చెడి= వెనుకంజ వేసి; పాఱుతెంచినన్= పరుగుపెట్టి రాగా; ఘన= గొప్పదైన; సింహముఁగన్+చేసి= సింహంగా చేసి; గర్వము= అహంభావాన్ని; ఇచ్చెన్= కలిగించాడు; శరభంబు= మీగండ్ల మెకం (సింహంకంటె బలిష్ఠమైన 8 పాదాలు కల జంతువు); ధాటికిన్= దాడికి; చకితము+ఐనన్= భయపడగా; ఉదగ్ర= భయంకరమైన; శరభంబున్+చేసి= మీగండ్లమెకంగా మార్చి; ఉత్సాహిన్= ఉత్సాహం కలదానినిగా; చేసెన్= చేశాడు; ఇట్లు= ఈ విధంగా; దివసక్రమంబునన్= రోజురోజుకు; ఎక్కుడు+ఐనన్= గొప్పదైన; సత్త్వముగన్+చేయఁగాన్= మృగంగా చేయగా; కుక్క= (ఆ గ్రామసింహం) కుక్క; శరభభావ మండితంబు+అయి= శరభ భావంతో వెలిగిపోతూ; తిరుగుచున్+ఉండి= తిరుగుతూ ఉండి; పూర్వవాసనా= ముందటి జాతి స్మృతితో; నీచము+అగు= తక్కువదైన; మనః+వర్తనమునన్= మనస్సుయొక్క నడవడితో.

తాత్పర్యం: అట్లా ఆ ముని ఆకుక్కను పెద్దపులి వెంబడిస్తే పులిగాను, ఏనుగు వెంటాడితే మదించిన ఏనుగుగానూ, సింహం తరిమితే సింహంగానూ, శరభం దాడిచేస్తే మరింత ఉత్సాహంకల శరభంగానూ మార్చి, ఎప్పటికప్పుడు భయాన్ని పోగొట్టి గెలిపించాడు. ఇట్లా రోజురోజుకూ ఆ కుక్క మరింత బలం పుంజుకొని శరభమృగంగా ఎంతో గర్వంగా తిరుగుతున్నది. అయినా కుక్క ముందటి తన నీచస్వభావాన్ని పోనిచ్చుకొనలేక పోయింది.

వ. ఇట్లని విచారించె. 94

ప్రతిపదార్థం: ఇట్లు+అని= ఈ విధంగా; విచారించెన్= ఆలోచించుకొన్నది.

తాత్పర్యం: ఈ విధంగా ఆలోచించింది.

చ. 'ననుఁ గని యొండు సత్త్వము మనంబున బెగ్గిలి పాఱునప్పు డి
మ్మునివరుఁ డిట్ల పోలెఁ గృప మొక్కలమై శరభంబుఁ గాఁగఁ జే
యునొ తగ దాని నట్లయిన నుద్ధతి నాకుఁ జరింప లేదు గా
వున నితనిన్ వధింతు వెరవున్ బలమున్ సరి నుల్లసిల్లఁగన్.' 95

ప్రతిపదార్థం: ననున్+కని= నన్ను చూచి; ఒండు సత్త్వము= మరొక మృగం; మనంబునన్= లోలోపల; బెగ్గిలి= భయపడి; పాఱు+అప్పుడు= పరుగెత్తేటప్పుడు; ఈ మునివరుఁడు= ఈ మునీశ్వరుడు; ఇట్లు+పోలెన్= ఈ విధంగానే; కృప= దయ; మొక్కలమై= ఎక్కువై; శరభంబున్+కాఁగన్= మీగండ్ల మెకంగా; తగన్= తగునట్లు; దానిన్= ఆ భయపడ్డ జంతువును; చేయునొ= చేస్తాడో? ఏమో?; అట్లు+అయినన్= అట్లా అయితే; నాకున్= నాకు; ఉద్ధతిన్= గర్వంగా; చరింపన్ లేదు= తిరగటానికి వీలవదు; కావునన్= కాబట్టి; వెరవున్= ఉపాయమూ; బలమున్= శక్తీ; సరిన్= సరిసమానంగా; ఉల్లసిల్లఁగన్= ప్రకాశించగా; ఇతనిన్= ఈ మునిని; వధింతున్= చంపుతాను.

తాత్పర్యం: 'శరభరూపంలో ఉన్న నన్ను చూచి మరో మృగం భయపడి పారిపోవచ్చును. ఆ జంతువు మీది జాలితో ఈ ముని దానిని నాకంటె మిన్నగా చేయవచ్చును. అట్లా అయితే నేను గర్వంగా తలఎత్తుకొని తిరగలేను. కాబట్టి అట్లాంటి స్థితి రాకుండా నా యుక్తినీ శక్తినీ కలబోసి ఈ మునిని చంపేయాలి' అనుకుంది.

తే. అను విచారంబు దివ్యబోధాఢ్యుఁ డైన । యమ్మునీశ్వరుఁ డెఱిఁగి 'యీ యధమజాతి
యున్నత స్థితి యెఱుఁగునే? మున్నపోలెఁ । గుక్క యయి యుండుఁ గా!' కన్నఁ గుక్క యయ్యె. 96

ప్రతిపదార్థం: అను= మునిని చంపటం అనే; విచారంబున్= ఆలోచనను; దివ్యబోధ+ఆఢ్యుఁడు+ఐన= దివ్యజ్ఞాన సంపన్నుడైన; ఆ మునీశ్వరుఁడు= ఆ మునివరుడు; ఎఱిఁగి= గ్రహించి; ఈ అధమజాతి= ఇట్లాంటి తక్కువజాతిది; ఉన్నతస్థితి= ఉచ్చదశను; ఎఱుఁగునే?= తెలియునా? (తెలియదని భావం); మున్న పోలెన్= మునుపటివలెనే; కుక్క+అయి= శునక రూపాన్ని పొంది; ఉండున్+కాక= ఉంటుంది కాక; అన్నన్= అని అనగానే; కుక్క+అయ్యెన్= కుక్కగా మారింది.

తాత్పర్యం: ముని దివ్యదృష్టితో కుక్క చెడ్డ తలంపును గ్రహించాడు. 'నీచజాతి కుక్కకు ఉదాత్త స్వభావం తెలియదు. కనుక ముందటి కుక్క రూపాన్ని మళ్ళీ పొందుతుంది కాక' అనగానే శరభరూపంలో ఉన్న కుక్క మామూలు కుక్కగా మారిపోయింది.

వ. కావునం గులహీనులు మాననీయులు గా; రట్లుం గాక విశేషం బాకర్ణింపుము. 97

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; కులహీనులు= తక్కువ కులంవారు; మాననీయులు కారు= గౌరవించదగ్గవారు కారు; అట్లున్+కాక= అట్లా కాకుండా; విశేషంబు= వేరయింది; ఆకర్ణింపుము= ఆలకించుము.

తాత్పర్యం: కాబట్టి తక్కువ జాతివారిని ఎన్నడూ ఎక్కువగా ఆదరించకూడదు. అంతేకాక, మరో విశేషం చెప్పుతాను వినుము.

చ. కుల మని పట్టి చిత్తమునఁ గూరిన కీ డరయంగ లేక య
గ్గలపు విభూతి దుష్టునకుఁ గల్గఁగఁ జేయుట గర్జ మెట్లు భృ
త్యుల మదియున్న రూ పరసి యుత్తమ మధ్యమ హీనరూప మా
త్రలకుఁ దగంగ నయ్యయి పదంబుల నిల్పుట నీతి భర్తకున్. 98

ప్రతిపదార్థం: చిత్తమునన్= మనస్సులోపల; కూరిన= కలిగిన; కీడు= హానిని; అరయంగన్ లేక= కనిపెట్ట లేక; కులము+అని పట్టి= కులం మాత్రమే కారణంగా; అగ్గలము= ఎక్కువైన; విభూతిన్= సంపదను; దుష్టునకున్= చెడ్డనడత కలవాడికి; కల్గఁగన్+చేయుట= పొందింపచేయటం; ఎట్లు+కర్జము?= ఏ విధంగా చేయదగింది?; భృత్యులు= సేవకుల; మది+ఉన్న రూపు= మానసికస్థితిని; అరసి= జాగ్రత్తగా పట్టి చూచి; ఉత్తమ= ఉన్నతులు; మధ్యమ= మధ్యములు; హీనరూప మాత్రలకున్= నీచులు అయిన వారికి; తగంగన్= ఒప్పుగా; ఆ+ఆ+పదంబులన్= ఆయా స్థానాలలో; నిల్పుట= ఉంచటం; భర్తకున్= రాజునకు; నీతి= ధర్మం.

తాత్పర్యం: ఆంతర్యాన్ని తెలిసికొనకుండా కేవలం తన కులంవాడు కదా అని దుష్టుడిని అందలం ఎక్కించకూడదు. సేవకులు ఎట్లాంటివారో చూచుకొని, వారి వారి యోగ్యతలను బట్టి ఉత్తమ, మధ్యమ, అధమ స్థాయి పదవులలో ఉంచటం రాజధర్మం.

క. శౌర్యము సత్యంబును స। త్కార్య జ్ఞానమును భక్తి తాత్పర్యము గాం
భీర్యముఁ గలిగినఁ గురుకుల। వర్య! కులం బేల? సిరికి వాఁ డుక్తుఁ డగున్. 99

ప్రతిపదార్థం: కురుకులవర్య!= కురువంశోత్తమా!; శౌర్యము= పరాక్రమం; సత్యంబును= నిజాయితీ; సత్+కార్యజ్ఞానమును= మంచి చెడుల వివేకాన్ని; భక్తి తాత్పర్యము= సేవాభావం; గాంభీర్యమున్= గుట్టు; కల్గినన్= కలిగి ఉంటే; కులంబు= వంశం; ఏల?= ఎందుకు?; సిరికిన్= ఐశ్వర్యానికి (అధికారానికి); వాఁడు= అట్లాంటివాడు; ఉక్తుఁడు= తగినవాడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: ధర్మరాజా! పరాక్రమం, నిజాయితీ, మంచి చెడుల వివేకం, సేవాభావం, గాంభీర్యం కలవాడు సిరికి యోగ్యుడవుతాడు. అట్లాంటివాడికి కులంతో పని లేదు.

క. **ఇది సిద్ధాంతం బనరా । దుదితయశా! యెట్టులైన నున్నత వంశ్యున్**
విదితగుణుం డగు పురుషు । న్వెదకి నిలుప వలయు మాననీయపదమునన్. **100**

ప్రతిపదార్థం: ఉదితయశా!= ప్రసిద్ధి కెక్కిన కీర్తిమంతుడా!; ఇది= నేను చెప్పినది; సిద్ధాంతంబు= నిర్ణయమైనది; అనరాదు= అనుకోవద్దు; ఎట్టులు+ఐనన్= ఎట్లాగైనా; ఉన్నత వంశున్= గొప్ప కులంవాడిని; విదితగుణుండు+అగు= పేరుపడ్డవాడూ అయిన; పురుషున్= మనిషిని; వెదకి= వెదకి; మాననీయ పదమునన్= గౌరవించదగ్గ స్థానంలో; నిలుప వలయున్= నిలబెట్టాలి,

తాత్పర్యం: ధర్మరాజా! అట్లాగని నీవు దీన్నే పరమ ప్రామాణికం అనుకోవద్దు. ఏ విధంగానైనా మంచిగుణవంతుడిని, మంచి కులవంతుడిని వెదకి మరీ పెద్దపదవిలో నిలపటం చాలా మంచిది.

వ. **అది యెట్లంటేని.** **101**

తాత్పర్యం: అది ఎట్లాగంటే.

ఉ. **ఒక్కటి యేను జెప్పెద మహోగ్రపుఁగేసరి కైనఁ దోడుగా**
నుక్కును లావునుం గలుగు నుజ్జ్వల సత్త్వచయంబుఁ గొన్నఁ గా
కెక్కుడు కృత్యముల్ నడప నెట్లగు నిట్టివి సాలు నంచుఁ దాఁ
గుక్కలఁ గూర్చి చేయఁ దనకుం దలఁపుల్ దలకూడ నేర్చునే? **102**

ప్రతిపదార్థం: ఒక్కటి= ఒక్కమాట; ఏను= నేను; చెప్పెదన్= చెప్తుతాను; మహోగ్రపుఁగేసరికిన్+ఐనన్= గొప్ప బలంకల సింహానికైనా సరే; ఉక్కును= శక్తీ; లావునున్= సామర్థ్యమూ; కలుగు= ఉన్నట్టి; ఉజ్జ్వల సత్త్వచయంబున్= ప్రకాశించే జంతు సమూహాన్ని; తోడుగాన్= సాయంగా; కొన్నన్+కాక= తీసుకుంటేనే కాని; ఎక్కుడు కృత్యముల్= ఎన్నో ఫలితాలు; నడపన్= అందుకోవటానికీ; ఇట్టివి= ఇట్లాంటివి; చాలును= సరిపోతాయి; అంచున్= అనుకొంటూ; తాన్= తాను; (సింహం); కుక్కలన్= కుక్కలను; కూర్చి= కూడబెట్టి; చేయన్= పనులు చేయటానికి; ఎట్లు+అగున్= ఎట్లా అవుతుంది; తనకున్= తన యొక్క (సింహంయొక్క); తలఁపుల్= ఆలోచనలు; తలకూడన్ నేర్చునే?= ఫలిస్తాయా?

తాత్పర్యం: ఇక్క డొకమాట చెప్పుతాను ఆలకించుము. ఎంతో బలంగల సింహం అయినా సరే శక్తిసామర్థ్యాలు ఉండే తమ జాతి సింహాల సహకారంతో ఎన్నో ఫలితాలు సాధిస్తుంది. ఇవి చాల్లే అనుకొని కుక్కలను చుట్టూ చేర్చుకొంటే తా ననుకొన్నవి నెరవేర్చుకొనలేదు.

చ. **వలనుఁ గులంబు లేని పరివారము గోటియు నేల? నేర్పు న**
గ్గలికయు భక్తి పెంపు మదిఁ గల్గి సుహృజ్జన మిశ్రమౌ బలం
బిలువడి గల్గెనేని నిల యెల్లను నేలఁగఁ జాలు వేయు ర
జ్జులు విను రాజు నేర్పరియు శూరుఁడుఁ గావలయుంజుమీ నృపా!' **103**

ప్రతిపదార్థం: నృపా!= ఓ ధర్మరాజా! విను= వినవలసింది; వలనున్= నేర్పూ; కులంబు లేని= ఉన్నత కులంలేని; పరివారము= పరిజనం; కోటియున్+ఏల?= కోట్లకొద్దీ ఎందుకు?; నేర్పున్= జాణతనం; అగ్గలికయున్= శౌర్యమూ; భక్తి= సేవ; పెంపు= గొప్పతనమూ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మదిన్= మనస్సునందు; కల్గి= ఉండి; సుహృద్+జనమిత్రము+ఔ= స్నేహితులతో కలిసిన; బలంబు= బలగం; ఇలువడి కల్గెన్+ఏనిన్= మంచి నడవడి కలిగి ఉంటే; ఇల+ఎల్లనున్= ఈ ప్రపంచాన్నంతా; ఏలఁగన్+చాలున్= పాలించ సరిపోతాడు; వేయురజ్జులు= పనికిమాలిన మాటలు వేలకొద్దీ ఎందుకు?; రాజు= భూపతి; నేర్పరియున్= సమర్థుడూ; శూరుఁడున్= పౌరుషవంతుడూ; కావలయున్+చుమీ!= కావాలిసుమా!

తాత్పర్యం: రాజా! పరిజనానికి నేర్పూ, కులమూ ఉండాలి. అవి లేనివారు కోట్లకొద్దీ ఉన్నా ప్రయోజనం ఉండదు. చాకచక్యం, పౌరుషం, స్వామిభక్తి, గొప్పతనమూ, మనస్సులో కలిగి, స్నేహితుల బలగం, మంచినడతా ఉంటే - ఆ రాజు ఈ ప్రపంచాన్నంతా ఇట్టే ఏలవచ్చును. అనవసరం అయిన మాటలు ఎందుకుగాని ఒకటి వినుము. రాజైనవాడికి జాణతనం, పోటుతనం తప్పనిసరిగా ఉండాలి సుమా!

వ. అని చెప్పి వెండియు. 104

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పి మళ్ళీ (అందుకొన్నాడు).

సీ. 'వినుము మయూరంబు విధమున బహు చిత్ర । భంగులఁ బ్రజ యంతరంగ మాత్మ
వశము సేయుచు, మృదువాక్యముల్ వలుకుచు । మంత్రంబునెడఁ దనమాట వెడల
కునికి శరత్సమయోచిత క్రియ చాడ్పు । గాఁగ ధర్మంబు శిఖా ప్రకార
మొంది తనర్ప, సముల్లాస పక్షమై । యానంబు గైకొంచు నధిక తర స

తే. మున్నతత్వంబు సంశ్రయ యోగ్య మగుటఁ । గాంచుచును దఱివచ్చినఁ గారు కాల
మేఁచు తెఱఁగున నేచుచు నీచ కుటిల । గతులఁ దునుముచు నెగడుట పతికి నీతి. 105

ప్రతిపదార్థం: (ఈ పద్యంలో నెమలి నడత రాజుకు ఆరోపించబడింది) వినుము= వినవలసింది; మయూరంబు విధమునన్= నెమలివలె; బహుచిత్ర భంగులన్= అనేక తీరులైన విచిత్ర ప్రవర్తనలతో; ప్రజ= జనంయొక్క; అంతరంగమున్= మనస్సును; ఆత్మవశము చేయుచున్= లోబరచుకొంటూ; మృదువాక్యముల్= మెత్తని(నొచ్చుకోని) మాటలు (చెవి ఒగ్గి వినా లనిపించే కేకగల నెమలివలె); పలుకుచున్= మాట్లాడుతూ; శరత్సమయ= శరత్కాలానికి; ఉచిత= తగిన; క్రియచాడ్పుకాఁగన్= చేష్టవలె (శరత్కాలంతో కేక పెట్టక గంభీరంగా ఉండే నెమలివలె); మంత్రంబు+ఎడన్= కార్యాలోచనపట్ల; తనమాట= తన వాక్కును; వెడలక= బైటపడనీయకుండా; ఉనికి= ఉండటం; ధర్మంబు= నీతి; శిఖాప్రకారమున్+ఒంది= నెమలి సిగవలె తలమీద పెట్టుకొని; తనర్పన్= ఒప్పుగా; సముల్లాస పక్షమై= ఎంతో ఉత్సాహంతో ఉప్పొంగే సేనతో; యానంబు= దండయాత్రకు (రెక్కల తళతళల గతులు గల నెమలివలె); కైకొంచున్= పూనుకొంటూ; అధికతర సమున్నతత్వంబు= ఎంతో గౌరవం; సంశ్రయ= ఆశ్రయించటానికి; యోగ్యము+అగుటన్= తగిన దనే విషయాన్ని (నెమలివలె); కాంచుచున్= గుర్తిస్తూ; తఱివచ్చినన్= సమయం రాగానే; కారుకాలము= వానకాలంలో; ఏఁచు తెఱఁగునన్= రెచ్చిపోయే నెమలివలె; ఏఁచుచున్= (రాజు) చెలరేగుతూ; నీచ కుటిల గతులన్= నీచులయొక్క వక్రమార్గ పద్ధతులు (దుష్టమైన పాములను ముక్కలు ముక్కలు చేసే నెమలివలె); తునుముచున్= తునాతునకలు చేస్తూ; నెగడుట= ప్రసిద్ధి చెందటం; పతికిన్= రాజునకు; నీతి= ధర్మం.

తాత్పర్యం: 'వింత వింతల రంగుల రచనలుగల నెమలివలె రాజు అనేక రకాలైన నడతలతో ప్రజల హృదయాలను చూరగొనాలి. చెవి కింపు కలిగించే కేక (నెమలి కూత)వలె రాజు ప్రజలతో సౌమ్యంగా నెమ్మదిగా మాట్లాడాలి. వానకాలంలో శరత్కాలంలోను ప్రవర్తించే నెమలివలె రాజు తన మంత్రాంగాన్ని పైకి పొక్కనీయకుండాలి. నెత్తిమీద సిగతో ప్రకాశించే నెమలివలె రాజు ధర్మాన్ని నెత్తిమీద పెట్టుకొనేటట్లు చేయాలి. రెక్కల తళతళలతో నడకలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గల నెమలివలె రాజు ఉత్సాహంతో ఉరకలు పెట్టే సైన్యంతో దండయాత్రకు బయలుదేరాలి. రంగురంగుల వన్నెలతో తన దగ్గరకు రప్పించుకొనే నెమలివలె రాజు ఎంతో పెద్ద ఎత్తున జనం గౌరవంగా తన నీడపట్టున చేరేటట్లు ఉండాలి. వానకాలంలోనే విజృంభించే నెమలివలె రాజు సమయం తెలిసికొని పగవాడిమీద పడిపోవాలి. విషం కక్కే పాములను ముక్కలు చేసే నెమలివలె రాజు తుచ్ఛుల కుట్రలను ఛేదించాలి. ఇదే రాజధర్మం.

విశేషం: అలం: ఉపమ.

క. **కిరణముల భంగిఁ జతురపుఁ। బరిజనముల నెందుఁ జొనిపి పరకృత్యంబుల్**
నిరతంబును గనుఁగొనుచును। దరణి కరణి వెలుఁగు టొప్పు ధరణీశునకున్. **106**

ప్రతిపదార్థం: కిరణముల భంగిన్= కాంతికిరణాలవలె; చతురపు పరిజనములన్= నేర్పరులైన సేవకులను; ఎందున్= ఏ ప్రదేశాలకైనా; చొనిపి= పంపించి; పరకృత్యంబుల్= ఇతరులయొక్క చేతలను; నిరతంబును= ఎల్లప్పుడూ; కనుఁగొనుచును= కనిపెట్టుతూ; తరణి కరణిన్= సూర్యుడివలె; వెలుఁగుట= ప్రకాశించటం; ధరణీశునకున్= రాజునకు; ఒప్పున్= తగును, ఉత్తమం అవుతుంది.

తాత్పర్యం: చిన్నకంతలలోకైనా దూసుకుపోయే కాంతులవలె చాతుర్యంగల పరిజనులను ఎక్కడబడితే అక్కడ ప్రవేశపెట్టాలి. రహస్యంగా ఎదుటివాళ్ళ పనులన్నింటినీ ఎప్పటికప్పుడు చాల మెలకువగా పసికట్టాలి. సూర్యుడివలె వెలగటం రాజుకు తగును.

తే. **అలుక గూరిమి ఫలదంబు లగుచునుండఁ। గృత్యములఁ దా నెఱుంగుచు నిత్యవిధుల**
నాయములును వ్యయంబులు నరసి కోశ। సంపదలు గాంచి యునికి రాజన్య గుణము.' **107**

ప్రతిపదార్థం: అలుక= వైరం; కూరిమి= స్నేహం; ఫలదంబులు= ఫలితాలను ఇచ్చేవి; అగుచున్+ఉండన్= అవుతూ ఉండగా; కృత్యములన్= చేసిన పనులను; తాన్= తనకు తానుగా; ఎఱుంగుచున్= తెలిసికొంటూ; నిత్యవిధులన్= నిత్యం చేయాల్సిన కృత్యాలను; ఆయములును= ఆదాయాలను; వ్యయంబులును= వెచ్చాలను; అరసి= పరిశీలించి చూచి; కోశ= బొక్కసం; సంపదలు= ధనధాన్యాది రూప ఐశ్వర్యాలను; కాంచి= జాగ్రత్తగా చూచి; ఉనికి= ఉండటం; రాజన్యగుణము= రాజ వంశీకుల ధర్మం.

తాత్పర్యం: వైరం, స్నేహం ఎపుడూ మంచో చెడో ఏదో ఒక ఫలితాన్ని అందిస్తూనే ఉంటాయి. తనకు తానుగా చేసిన పనులలోని మంచీచెడ్డా విచారించుకొనాలి. రోజువారీ పనులను ఆదాయవ్యయాలను బొక్కసాన్ని సంపదలను స్వయంగా చూచుకొనటం రాజధర్మం.'

వ. **అనిన విని యుధిష్ఠిరుండు 'రాజులకు దండంబు సర్వసాధారణంబు; తదీయ స్వరూపంబు వినవలతుం జెప్పు' మనిన న న్నరదేవునకు దేవవ్రతుం డిట్లనియె.** **108**

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; రాజులకున్= పాలకులకు; దండంబు= రాజనీతి; సర్వసాధారణంబు= అందరికీ తప్పనిసరి; తదీయ స్వరూపంబు= దాని తీరు; వినవలతున్= వినాలని ఉన్నది; చెప్పుము= చెప్పుము; అనినన్= అనగా; ఆ+నరదేవునకున్= ఆ ధర్మరాజునకు; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అదంతా విన్న తరువాత ధర్మరాజు 'దండించటం రాజులకు సామాన్యమైన విషయం కదా! ఆ దండం తీరుతెన్నులను తెలిసికొనాలని అపేక్షగా ఉన్నది' అనగానే భీష్ముడు చెప్పటం మొదలు పెట్టాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీష్ముఁడు ధర్మరాజునకు దండనీతి ప్రభావం బెఱింగించుట (సం. 12-121-8)

సీ. 'అసితోత్పల చ్ఛాయమై దంష్ట్రికాచతు । ష్టయమును, భుజ చతుష్టయము, జిహ్వి
కలు రెండుఁ, బాదాష్టకంబును, శంకు క । ర్ణములును, బహునయనములుఁ గల్గి
యూర్ధ్వ రోమంబులు నుగ్రారుణాస్యంబుఁ । గపిల జటాజాలకంబు నొప్ప
నసి గదా శక్తి శరాసన ముసల చ । క్ర ప్రాస శర తోమర త్రిశూల

తే. పరశు ముఖ సాధనంబులఁ బాపజనులుఁ । దరతరంబ సంఛేదన తాడనాదు
లైన వివిధ ప్రహతుల నే పడఁచుచును జ । రించు దండంబు సుజనులు ప్రియము నొంద. 109

ప్రతిపదార్థం: అసిత+ఉత్పల= నల్లకలువవంటి; ఛాయమై= శరీరకాంతీ; దంష్ట్రికా చతుష్టయమును= నాలుగు కోరలూ; భుజ చతుష్టయమున్= నాలుగు చేతులూ; జిహ్వికలు రెండున్= రెండు నాలుకలు; పాద+అష్టకంబును= ఎనిమిది పాదాలూ; శంకు కర్ణములును= లెక్కపెట్టలేనన్ని చెవులూ; బహునయనములున్= చాలా కళ్ళూ; కల్గి= ఉండి; ఊర్ధ్వరోమంబులున్= నిక్కబొడుచుకొన్న వెంట్రుకలూ; ఉగ్ర= భయం పుట్టించే; అరుణ+ఆస్యంబున్= ఎర్రటి ముఖమూ; కపిల జటాజాలకంబున్= గోరోజనం రంగున్న జడల సమూహమూ; ఒప్పన్= ఒప్పుతుండగా; అసి= కత్తి; గదా= గద; శక్తి= తోమరం; శరాసన= విల్లు; ముసల= రోకలి; చక్ర= చక్రాయుధం; ప్రాస= ఈటె; శరం= బాణం; తోమరం= చిల్లకోల, 'కొరడా); త్రిశూలం= మూడు కొనలు ఉండే శూలం; పరశు= గొడ్డలి; ముఖ= మొదలైన; సాధనంబులన్= పనిముట్లతో; పాపజనులున్= పాపులను; తరతరంబ= క్రమంగా; సంఛేదన= నరకటం; తాడనం= కొట్టటం; ఆదులు+ఐన= మొదలైన; వివిధ= అనేక రకాలైన; ప్రహతులన్= దండనలతో; ఏపు+అడఁచుచున్= పొగరు అణచివేస్తూ; సుజనులు= మంచి వాళ్ళు; ప్రియమున్= ప్రీతిని (సంతోషాన్ని); ఒందన్= పొందగా; దండంబు= దండనీతి; చరించున్= వర్తిస్తుంది.

తాత్పర్యం: 'దండనీతి మంచివాళ్ళను మెప్పిస్తుంది. చెడ్డవాళ్ళ పొగరును అణచివేస్తుంది. కత్తి, గద, తోమరం, విల్లమ్ములు, రోకలి, చక్రం, ఈటె, చిల్లకోల, త్రిశూలం, గొడ్డలి మొదలైనవి పదకొండు ధర్మనీతికి పనిముట్లు. దాని ఒంటిరంగు నల్లటి నలుపు. దానికి నాలుగు కోరలూ, నాలుగు చేతులూ, ఎనిమిది కాళ్ళూ ఉంటాయి. (అనేకాలైన చెవులూ, కళ్ళూ ఉంటాయి) చూచీ చూడగానే భయపడేటట్లు ఎర్రటి ముఖం, గోరోజనం వన్నెతో ఉండే జడలూ ఉంటాయి. ఇవీ దండం రూపరేఖలు.

సీ. పరుఁ డసంగుఁడు ధర్మపాలుండు ధర్ముండు । విజయుండు శాస్త్రంబు విశసనుండు
గ్రహమక్షరుఁడు ప్రజాగరము దురాసదుఁ । డతి సత్యగుండు నిత్యగుఁడు శాస్త
ప్రాగ్వచనుండు శస్త్రంబు బ్రహ్మము తీక్ష్ణ । వర్ముండు మనువు శివంకరుండు
కౌమారి సుతుఁడు శ్రీగర్భుండు వ్యవహార । తంత్రంబు సంగుప్త మంత్ర మనఁగఁ

తే. బరఁగు పేళుల నొప్పి యధ్వరమయాత్ముఁ । డైన విష్ణుండ దండమై యావహిల్లు
శ్రీసరస్వతి యనునివి శిష్ట దండ । నీతి నామాంతరంబులు నృపవరేణ్య! 110

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= ఉత్తముడ వైన ఓ రాజా!; పరుఁడు= ఉత్తముడూ; అసంగుఁడు= సంసార బంధంలేనివాడూ; ధర్మపాలుండు= నీతిగా పాలించేవాడూ; ధర్ముండు= న్యాయమూర్తీ; విజయుండు= ఓడిపోనివాడూ; శాస్త్రంబు= శిక్షించేవాడూ; విశసనుండు= చంపేవాడూ; గ్రహము= లోకాన్ని ధరించేవాడూ; అక్షరుఁడు= నాశనంలేనివాడూ; ప్రజాగరము= ఎక్కువ జాగరూకుడూ; దురాసదుఁడు= దరిదాపులకు చేరరానివాడూ; అతి సత్యగుండు= ఎంతో సత్యవంతుడూ; నిత్యగుఁడు= ఎప్పటికీ ఒకే విధంగా ఉండేవాడూ; శాస్త= శాసించేవాడూ; ప్రాగ్వచనుండు= వేదవచనాలు వల్లించేవాడూ; శస్త్రంబు= ఆయుధ రూపుడూ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బ్రహ్మము= తత్త్వం; తీక్ష్ణ వర్ముండు= వాడియైన కవచం ధరించినవాడూ; మనువు= మనువూ; శివంకరుండు= మేలుచేసేవాడూ; కౌమారి సుతుఁడు= కుమారస్వామీ; శ్రీగర్భుండు= లక్ష్మి గర్భంలో కలవాడూ; వ్యవహారతంత్రంబు= వ్యవహారం నడిపే ఉపాయం కలవాడూ; సంగుప్త= రక్షకుడు; మంత్రము= మంత్రం; అనఁగన్= అన్నట్లు; పరఁగు= ఒప్పునట్టి; పేళులన్= పేర్లతో; ఒప్పి= చక్కగా ఉండి; అధ్వరమయ+ఆత్ముఁడు+ఐన= యజ్ఞమయ స్వరూపుడైన; విష్ణుఁడు= విష్ణువే; దండమై= దండరూపంగా; ఆవహిల్లున్= ఉంటాడు; శ్రీ= లక్ష్మీ; సరస్వతి= సరస్వతి; అనునివి= అనేవి; శిష్ట= ప్రామాణికులు; దండనీతి= దండనీతికి; నామాంతరంబులు= మారు పేర్లు.

తాత్పర్యం: ధర్మరాజా! యజ్ఞరూపధారి విష్ణువే దండరూపంలో ఉంటాడు. ఇతడిని ఉత్తముడూ, సంసారపు తగులాటం లేనివాడూ, న్యాయపాలకుడూ, ధర్మస్వరూపుడూ, ఎపుడూ గెలిచేవాడూ, దగ్గరకు చేరరానివాడూ, శిక్షించేవాడూ, చంపేవాడూ, లోకధారీ, నాశనంలేనివాడూ, ఎక్కువ జాగరూకుడూ, ఎంతో సత్యవంతుడూ, ఎప్పటికీ ఒకేరకంగా ఉండేవాడూ, శాసించేవాడూ, వేదపురుషుడూ, ఆయుధరూపుడూ, తత్త్వం, తీక్ష్ణ కవచధారీ, మనువూ, శుభంకోరేవాడూ, శివకుమారుడూ, లక్ష్మిని గర్భంలో కలవాడూ, వ్యవహార తంత్రం తెలిసినవాడూ, సంరక్షకుడూ, మంత్రమూ అనే పేర్లతో వ్యవహరిస్తారు. శిష్టదండనీతికి శ్రీ, సరస్వతీ అనేవి మారు పేర్లు.

వ. ధర్మాధర్మంబులు సుఖదుఃఖంబులు నయానయంబులు నర్థానర్థంబులు బలాబలంబులుఁ బ్రమాదాప్రమాదంబులు మొదలైన సకలావస్థలును దండంబున సమ్య గసమ్యక్ప్రకారంబులం గలుగుం గావున సమ్యక్ప్రకారంబుచేత దండంబున రక్షింపంబడిన ప్రజ రాజు నభివృద్ధి నొందించు; నట్లగుట దండంబు రాజునకుం బరాయణంబు. 111

ప్రతిపదార్థం: ధర్మ+అధర్మంబులు= న్యాయాన్యాయాలు; సుఖదుఃఖంబులు= సుఖదుఃఖాలు, నయ+అనయంబులు= నీతి అవినీతులు; అర్థ+అనర్థంబులు= లాభనష్టాలు; బల+అబలంబులున్= శక్తి, అశక్తులూ; ప్రమాద+అప్రమాదంబులు= దయ, నిర్ణయాలూ; మొదలు+ఐన= మొదలుగా గల; సకల అవస్థలును= అన్ని స్థితులూ; దండంబునన్= దండనీతిలో; సమ్యక్+అసమ్యక్ ప్రకారంబులన్= తగిన తగని రీతుల వలన; కల్గున్= కలుగుతాయి; కావునన్= కాబట్టి; సమ్యక్+ప్రకారంబుచేతన్= చక్కటి తీరులో; రక్షింపంబడిన= కాపాడిన; ప్రజ= జనం; రాజు= పాలకుని; అభివృద్ధిన్= పెరుగుదలను (పెంపును); ఒందించున్= కలిగిస్తుంది; అట్లు+అగుటన్= అందుచేత; దండంబు= దండనీతి; రాజునకున్= పాలకుడికి; పరాయణంబు= ఆశ్రయం.

తాత్పర్యం: ధర్మం-అధర్మం, కష్టం-సుఖం, నీతి-అవినీతి, లాభం-నష్టం, శక్తి-అశక్తి, ప్రమత్తత-అప్రమత్తత మొదలైన వాటి మొత్తం వివేచన సమస్తమైన అవస్థలూ దండనీతి బాగుగా పాలించటం పాలించకపోవటంవలన పుట్టాయి. బాగా పాలించిన దండనీతివలన ప్రజలు ఎల్లప్పుడూ రాజు అభివృద్ధినే కోరుకొంటారు. అందువలన రాజు తప్పక దండనీతిని ఆశ్రయించాలి.

క. సత్యప్రకార ధర్మము । నిత్యానుష్ఠేయ; మది సునీత మగుచు నా
దిత్యపతిఁ బ్రీతుఁ జేయఁగ । నత్యున్నతి నెసఁగు నాతఁ డన్నప్రదుఁడై. 112

ప్రతిపదార్థం: సత్యప్రకార ధర్మము= సత్యమార్గంగల ధర్మం; నిత్య అనుష్ఠేయము= ఎల్లప్పుడూ ఆచరించ దగింది; అది= ఆ ధర్మం; సునీతము+అగుచున్= సరైన రాజనీతి అవుతూ; ఆదిత్యపతిన్= దేవేంద్రుడిని; ప్రీతున్+చేయఁగన్= సంతుష్టి పరచగా; ఆతఁడు= ఆ ఇంద్రుడు; అతి+ఉన్నతిన్= ఎంతో గొప్పగా; అన్న ప్రదుఁడు+ఐ= అన్నదాత అయి; ఎసఁగున్= ఒప్పుతాడు.

తాత్పర్యం: సత్య మార్గంలో ధర్మాన్ని ఎప్పుడూ ఆచరించాలి. దాన్ని ఎంతో చక్కగా అమలు పరిస్తే ఇంద్రుడు సంతృప్తి పడతాడు. వానలు కురిపించి అన్నపానాదులు సమకూరుస్తాడు.

వ. దానంజేసి దండంబు ప్రసన్నంబై వెలుంగుఁ; దదీయాభిధానంబులు మఱియునుం గల; వాకర్ణింపుము. 113

ప్రతిపదార్థం: దానన్+చేసి= అందువలన; దండంబు= దండనీతి; ప్రసన్నంబు+ఐ= స్వచ్ఛంగా; వెలుంగున్= ఒప్పుతుంది; తదీయ= దండనీతికి సంబంధించిన; అభిధానంబులు= పేర్లు; మఱియున్= ఇంకా; కలవు= ఉన్నాయి; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అందువలననే దండనీతి ఒప్పుతుంది. ఈ నీతిని తెలిపే పేర్లు ఇంకా కొన్ని ఉన్నాయి. ఆలకించుము.

ఆ. పురుషుఁ డీశ్వరుండు భూతాత్మకుండు జీ । వుండు ప్రాణుఁ డక్షయుండు సత్త్వ
మనఁగ నేడు పేరు లష్టమంబు ప్రజాప । తి యనఁ బరఁగు దండదేవు పేరు. 114

ప్రతిపదార్థం: పురుషుఁడు= పురుషుడు; ఈశ్వరుండు= శివుడూ; భూతాత్మకుండు= భూత స్వరూపుడూ; జీవుండు= జీవుడూ; ప్రాణుఁడు= ప్రాణుడూ; అక్షయుండు= అక్షయుడూ; సత్త్వము= సత్త్వమూ; అనఁగన్= అన్నట్లుగా; ఏడు పేరులు= ఏడు రకాల పేర్లు; అష్టమంబు= ఎనిమిదవది అయిన; దండదేవు పేరు= దండ దేవుడిపేరు; ప్రజాపతి అనన్= ప్రజాపతి అనే పేరుతో; పరఁగున్= ప్రసిద్ధ మవుతుంది.

తాత్పర్యం: పురుషుడూ, ఈశ్వరుడూ, భూతస్వరూపుడూ, జీవుడూ, ప్రాణుడూ, అక్షయుడూ, సత్త్వమూ, ప్రజాపతీ అనే ఎనిమిదీ దండదేవుడి పేర్లు.

వసుహోముఁడు మాంధాతృనకుఁ జెప్పిన దండోత్పత్తి ప్రకారము (సం. 12-122-1)

వ. దండంబు సాక్షాద్దేవుం; డట్లగుటఁ దెలిపెడునది యొక్క యితిహాసంబు గల; దంగదేశాధీశుండు వసుహోముం డను రాజు హిమశైలంబున ముంజపృష్ఠం బనం బ్రసిద్ధం బగు శృంగంబునకు దేవీ సహితంబుగాఁ జని యందు వసియించి మునిగణ పూజితంబగు వృత్తంబున నుదాత్తుండయి యుండ నమ్మహీపతి కడకు మాంధాతృండు సనుదెంచి సవినయంబుగాఁ బ్రణమిల్లిన, నబ్భూవల్లభునకు నతం డర్ఘ్యపాద్యాదులగు నుపచారంబు లాచరించి, 'వచ్చిన పని యేమి?' యని యడిగిన నప్పుడమిఱేఁడు 'సవిస్తరంబుగా దండ ప్రకారంబు వినుటకై నిన్నాశ్రయింప వచ్చితి' ననవుడు నమ్మహాత్ముం డతని కిట్లనియె. 115

ప్రతిపదార్థం: దండంబు= దండనీతి; సాక్షాత్+దేవుండు= ప్రత్యక్ష దైవమే; అట్లు+అగుటన్= అట్లా అవటాన్ని; తెలిపెడు+అది= తెలిపేటటువంటి; ఒక్క ఇతిహాసంబు= ఒక వెనకటి కథ; కలదు= ఉన్నది; అంగదేశ+అధీశుండు= అంగదేశపు రాజు; వసుహోముండు+అను రాజు= వసుహోము డనే పేరుగల రాజు; హిమశైలంబునన్= మంచుకొండమీద; ముంజపృష్ఠంబు+అనన్= ముంజపృష్ఠమని; ప్రసిద్ధంబు+అగు= పేరుపడ్డ; శృంగంబునకున్= పర్వతంపై శిఖరానికి; దేవీసహితంబుగాన్= పట్టపురాణితో కూడా; చని= వెళ్ళి (పోయి); అందున్= ఆ కొండ కొమ్మున; వసియించి= ఉండి; మునిగణపూజితంబు+అగు= మునిజనంచేత గౌరవించదగ్గ; వృత్తంబునన్= నడవడికతో; ఉదాత్తుండు+అయి= గొప్పవాడై; ఉండన్= ఉండగా, ఉన్నట్టి; ఆ+మహీపతి కడకున్= ఆ రాజు దగ్గరకు; మాంధాతృండు= మాంధాత; చనుదెంచి= వచ్చి (చేరి); సవినయంబుగాన్= ఎంతో అణకువగా; ఆ+భూ వల్లభునకున్= ఆ రాజునకు; ప్రణమిల్లినన్= మ్రొక్కగా; అతండు= ఆ వసుహోముడు; అర్ఘ్యపాద్యాదులు+అగు= చేతులు కాళ్ళు కడుగు కొనటానికి నీళ్ళు ఇవ్వటం వంటి; ఉపచారంబులు= సేవలు; ఆచరించి= చేసి; వచ్చినపని= రాకకు కారణం; ఏమి?= ఏమిటి?; అని; అడిగినన్= అడుగగానే; ఆ+పుడమిఱేఁడు= ఆ రాజు; సవిస్తరంబుగాన్= వివరంగా; దండప్రకారంబు= దండనీతి

విధానం; వినుటకున్+ఐ= ఆలకించటానికి; నిన్నున్+ఆశ్రయింపన్= నీ అండకు; వచ్చితిన్= చేరాను; అనవుడున్= అనగానే; ఆ+మహాత్ముండు= ఆ రాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దండం సాక్షాత్తు దైవమే అనటానికి లోగడ జరిగిన కథ ఒకటి చెప్తుతాను వినుము. అంగదేశపు రాజు వసుహోముడు. ఒకసారి అతడు భార్యతోకూడా 'ముంజపృష్ఠ'మనే మంచుకొండ కొమ్ముమీదికి పోయాడు. అక్కడ కొన్నాళ్ళు ఉన్నాడు. తన నడతతో అక్కడి మునుల ఆదరణ పొందాడు. ఒకనాడు మాంధాత ఆ రాజు దగ్గరకు వచ్చి వినయంగా మ్రొక్కాడు. అతడికి రాజు అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి 'ఏమి పనిపడి వచ్చారు?' అని అడిగాడు. 'దండనీతి శాస్త్రాన్ని తుదముట్టా వివరంగా వినాలనే కోరికతో నీ అండ చేరాను' అన్నాడు. ఆ వసుహోముడు మాంధాతతో ఈ విధంగా అన్నాడు.

సీ. **'అజుఁ డధ్వరంబు సేయంగఁ దలంచి ఋ। త్విజు నాత్మసదృశుని వెదకి యెందుఁ**
గానక, తా నొక్క గర్భంబు ధరియించి। వేయేండ్లకును దుమ్మి వెలువరించె;
క్షుతసంభవతఁ జేసి క్షుతుఁడను పేరిట। బరఁగెడు నా ప్రజాపతియు ఋత్వి
జుండుగఁ గ్రతు వొనర్చుచునుండ నంతర్హి। తం బయ్యె వలచు చందమున నడచు

ఆ. **నట్టి దగుట దండ మధిప కార్యాకార్య। తంత్ర భేద మెడలె దానఁజేసి**
మహి గలంగెఁ గడు నమర్యాద వర్తించెఁ;। గమలజుండు విష్ణు కడకుఁ జనియె. **116**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అజుఁడు= బ్రహ్మ; అధ్వరంబు= యాగం; చేయంగన్= చేయటానికి; తలంచి= సంకల్పించి; ఆత్మసదృశునిన్= తనతో తులతూగే; ఋత్విజున్= యాగకర్తను; వెదకి; ఎందున్+కానక= ఎక్కడా తటస్థపడక; తాను= స్వయంగా; ఒక్కగర్భంబు= కడుపును; ధరియించి= పొంది; వేయేండ్లకున్= వేయి సంవత్సరాలకు; తుమ్మి= తుమ్మి; వెలువరించెన్= (కుమారుడిని) బయటపడేశాడు; క్షుతసంభవతన్+చేసి= తుమ్ము వలన పుట్టినవా డవటం వలన; క్షుతుఁడు+అను పేరిటన్= క్షుతుడనే పేరుతో; పరఁగెడు= ఒప్పుతున్నట్టి; ఆ ప్రజాపతియున్= ఆ క్షుత ప్రజాపతిని; ఋత్విజుండుగన్= యజ్ఞపురోహితుడుగా; క్రతువు= యాగం; ఒనర్చుచున్+ఉండఁగన్= చేస్తుండగా; అధిప!= రాజా!; వలచు చందమునన్= కోరినట్లుగా; నడచునట్టిది+అగుటన్= మసలుకొనేది అవటంవలన; దండము= దండనీతి; అంతర్హితంబు+అయ్యెన్= మాయమయింది; దానన్+చేసి= అందువలన; కార్య+అకార్యతంత్ర భేదము= చేయదగింది చేయదగంది అనే తేడా; ఎడలెన్= పోయింది; మహి= భూమి; కలంగెన్= కలతపడింది; కడున్= ఎంతో; అమర్యాద= అగౌరవం; వర్తించెన్= జరిగింది; కమలజుండు= బ్రహ్మ; విష్ణు కడకున్= విష్ణువు దగ్గరకు; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: బ్రహ్మ ఒక యాగం చేయతలపెట్టి తనతో దీటైన ఋత్విజుడికొరకు గాలించాడు. ఎక్కడా అట్లాంటివాడే కంటపడలేదు. తానే స్వయంగా వెయ్యేళ్ళు గర్భం మోసి తుమ్మగా ఆ గర్భం బయటపడింది. తుమ్ము కారణంగా పుట్టినవా డవటం వలన అతడికి క్షుతుడనే పేరు పెట్టారు. ఆ క్షుతప్రజాపతి ఋత్విజుడుగా, బ్రహ్మ యాగం చేస్తున్నాడు. ఆ దండం ఇష్టం వచ్చినట్లు నడచుకొనేది కాబట్టి కనబడకుండా పోయింది. దానివలన ఏ పని చేయవచ్చు? ఏ పని చేయకూడ? దనే జ్ఞానం శూన్యమైనది. అందువలన ప్రజలంతా కలవరపడ్డారు. మర్యాద మంటగలిసింది. బ్రహ్మ విష్ణువును ఆశ్రయించాడు.

క. **చని సంప్రార్థించి, యతని। గొని రుద్రునిఁ గాంచి 'నీ సఖుం డీతఁడు వ**
చ్చిన కార్యము గృపతోడను। విను'మని దండంబు తెఱఁగు వినిపించెఁ దగన్. **117**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; సంప్రార్థించి= వేడుకొని; అతనిన్= విష్ణువును; కొని= తీసికొనివెళ్ళి; రుద్రునిన్= శివుడిని; కాంచి= చూచి; ఈతఁడు= ఇతడు; నీ సఖుండు= నీ మిత్రుడు; వచ్చినకార్యము= వచ్చిన పనిని; కృపతోడను= దయతో; వినుము= వినవలసింది; అని= అని చెప్పి; దండంబు=దండనీతి; తెఱంగు= తీరు; తగన్= ఇంపుగా; వినిపించెన్= వివరించాడు.

తాత్పర్యం: బ్రహ్మ విష్ణువును ప్రార్థించి, అతడిని శివుడి దగ్గరకు తీసికొనిపోయి 'ఇతడు నీ మిత్రుడు. అతడు ఏమి పనిమీద వచ్చాడో చెప్పుతాడు; దయతో వినవలసింది' అంటూ దండనీతి విధానం అంతా చెవికి ఇంపుగా చెప్పాడు.

వ. **అట్లు లోకరక్షకుం డగు పుండరీకాక్షు దండగొని దండాభావంబున జగంబు గలంగు టెఱింగించిన, నవ్విరించి పలుకులు మనస్కరించి మహాదేవుండు నిజప్రభావంబు దండంబుగాఁ గల్పించి దండనీతి కాశ్రయుండై పరఁగుచుండె.** **118**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; లోక రక్షకుండు+అగు= లోకాన్ని కాపాడే పుండరీకాక్షు= విష్ణువుయొక్క; దండగొని= అండకొని; దండ+అభావంబునన్= దండం లేకపోవటంచేత; జగంబు= లోకం; కలంగుట= కలవరపడటం; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+విరించి పలుకులు= ఆ బ్రహ్మ మాటలు; మనస్కరించి= ఇష్టపడి; మహాదేవుండు= శివుడు; నిజప్రభావంబున్= తనదైన మహిమను; దండంబుగాన్= దండంగా; కల్పించి= నిర్మించి (చేసి); దండనీతికిన్= దండనీతికి; ఆశ్రయుండు+ఐ= ఆధారభూతుడై; పరఁగుచున్+ఉండెన్= ఒప్పుతూ ఉన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా విష్ణువును ఆసరాగా చేసికొని బ్రహ్మ దండనీతి మాయమవటంవలన ప్రపంచం ఎట్లా అల్లకల్లోల మయిందో వివరించి చెప్పాడు. ఆ బ్రహ్మమాటలు శివుడికి మనస్కరించాయి. వెంటనే తన మహిమతో దండాన్ని కల్పించాడు. ఆ దండానికి తానే ఆధారం అయ్యాడు.

సీ. **వినుము; ఋగ్వేదాది వేదముల్ నాలుగుఁ । గల్పాదులైన యంగంబు లాఱు,**
బెరసి విద్యలు పది పేర్చు; పురాణంబు । లనియును నొక విద్య యధిప! ధర్మ
విదులు సెప్పెడు శాస్త్ర వితతియంతయు నొక । విద్య; సర్వన్యాయ విస్తరంబు
నొకటి, మీమాంస దానొక్కటి; యిట్టులు । వివరింపఁ బదునాల్గు విద్య లయ్యె

తే. **వైద్య కోదండ గాంధర్వ విద్య, లర్థ । శాస్త్రమగు నీతివిద్య, తత్సహిత వృత్తి**
వెలయఁగాఁ బదునెనిమిది విద్య లభవుఁ । డేర్పరించె జగత్త్రయహితము పొంటె. **119**

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; వినుము= ఆలకించుము; ఋగ్వేదాది వేదముల్= ఋగ్వేదం మొదలైన వేదాలు; నాలుగున్= నాలుగు; కల్ప+ఆదులు+ఐన= కల్పం మొదలైన; అంగంబులు+ఆఱు= వేదాంగాలు ఆరూ; బెరసి= వెరసి (కలసి); విద్యలు పది= పది విద్య లవుతాయి; పేర్చు= అతిశయించిన; పురాణంబులు= పద్దెనిమిది పురాణాలు; అనియునున్= అనియు; ఒక విద్య= ఒక విద్య అవుతుంది; ధర్మ విదులు= ధర్మశాస్త్రం తెలిసినవారు; చెప్పెడు= చెప్పే; శాస్త్ర వితతి+అంతయున్= శాస్త్రాలన్నీ; ఒక విద్య= ఒక విద్య అవుతుంది; సర్వన్యాయ విస్తరంబున్= సమస్త తర్కశాస్త్రం అంతా; ఒకటి= ఒక్కటి అవుతుంది; మీమాంస= పుర్వోత్తర మీమాంసా శాస్త్రం అంతా; తాను ఒక్కటి= తనకు తానే ఒక్కటి; ఇట్టులు= ఈ విధంగా; వివరింపన్= బాగా తెలుపగా; పదునాల్గు విద్యలు= పధ్నాలుగు విద్యలు; అయ్యెన్= అయ్యాయి; వైద్య= వైద్య విద్య; కోదండ= విలువిద్య; గంధర్వవిద్యలు= సంగీత విద్యలు; అర్థశాస్త్రము+అగు నీతి విద్య= అర్థశాస్త్రమైన నీతి విద్య; తత్సహిత= దానితో కూడుకొన్న; వృత్తి= వివరణా; వెలయఁగాన్= ప్రకాశించగా; పదునెనిమిది విద్యలు= పద్దెనిమిది విద్యలు; జగత్త్రయ= ముల్లోకాల; హితము పొంటెన్= మేలు కొరకు; అభవుఁడు= శివుడు; ఏర్పరించెన్= ఏర్పాటు చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వవేదం అనే నాలుగు వేదాలూ, శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం అనే ఆరు వేదాంగాలూ కలిసి మొత్తం పది విద్యలవుతాయి. పురాణం, ధర్మశాస్త్రం, న్యాయశాస్త్రం, పూర్వోత్తరమీమాంసా శాస్త్రంతో చేర్చుకొని మొత్తం పధ్నాలుగు విద్యలు అవుతాయి. వైద్యవిద్య (ఆయుర్వేదం), విలువిద్య (ధనుర్వేదం), సంగీతం (గాంధర్వవేదం), నీతివిద్య (అర్థశాస్త్రం) అనే ఉపవేదాంగాలతో కలిపితే మొత్తంగా పద్ధెనిమిది విద్యలు అవుతాయి. వీటిని శివుడు ముల్లోకాల మేలుకోరి సృష్టించాడు.

వ. ఇట్లు సమకట్టి, దండంబును దండనీతి ప్రపంచంబులయిన యవ్విద్యలను విష్ణు వశగతంబులు సేసె; నాసర్వేశ్వరుం డత్తమ్మిచూలికిఁ దుమ్ము ఘటించి యీ భంగిం బ్రజాపతి ప్రసవంబు గావించె; దండనీతి సమగ్ర రూపమై చెల్లె; నెల్ల జగంబులుం బ్రియంబందె; నరవిందభవుని యాగంబును సుప్రయోగంబై నడచె; విష్ణుండు దండనీతి శాస్త్రంబు సకలంబు నాంగిరసున కిచ్చె; నాంగిరసుం డింద్ర మరీచులకు, మరీచి భృగునకు, భృగుం డనేక మునులకు నిచ్చె; నీక్రమంబున నది జగంబులం బరఁగె; దండంబు జాగరణంబున లోకంబు మర్యాదామహితంబై వర్తిల్లెఁ; గపర్ది శంకరుండు రుద్రుండు భవుండు స్థాణుం డుమాపతి యనుపేళ్ళం బరఁగు నద్దండదేవుని నతులధర్మంబున నయించు భూపాలుం డైహికాముష్మిక సిద్ధులం బొందు. 120

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సమకట్టి= పూనుకొని; దండంబును= దండనీతి శాస్త్రాన్ని; దండనీతి ప్రపంచంబులు+ఐన= దండనీతిని విస్తరింపచేసేవి అయిన; ఆ+విద్యలను= ఆ పద్దెనిమిది విద్యలను; సర్వేశ్వరుండు= ఆ శివుడు; విష్ణువశగతంబులు+చేసెన్= విష్ణుపరం చేశాడు; ఆ తమ్మిచూలికిన్= పద్మంలో పుట్టిన బ్రహ్మకు; తుమ్ము ఘటించి= తుమ్ము కల్పించి; ఈ+భంగిన్= ఈ విధంగా; ప్రజాపతి= క్షుతబ్రహ్మను; ప్రసవంబు కావించెన్= పుట్టించాడు; దండనీతి= దండనీతి; సమగ్రరూపము+ఐ= నిండారిన రూపంతో; చెల్లెన్= చెల్లుబాటయింది; ఎల్లజగంబులున్= సమస్త లోకాలూ; ప్రియంబు= సంతోషాన్ని; అందెన్= పొందాయి; అరవిందభవుని= బ్రహ్మయొక్క; యాగంబును= యాగమూ; సుప్రయోగంబు+ఐ= మంత్ర తంత్రాదులతో; నడచెన్= జరిగింది; విష్ణుండు= విష్ణువు; దండనీతి శాస్త్రంబు= దండనీతి శాస్త్రం; సకలంబున్= మొత్తాన్నీ; ఆంగిరసునికిన్+ఇచ్చెన్= ఆంగిరసుడికి ఇచ్చాడు; ఆంగిరసుడు= ఆ ఆంగిరస మహర్షికి; ఇంద్రమరీచులకున్= ఇంద్రుడికీ, మరీచుడికీ; మరీచి= మరీచి; భృగునకున్= శుక్రాచార్యుడికి; భృగుండు= శుక్రాచార్యుడు; అనేక మునులకున్= ఎంతోమంది మునులకు; ఇచ్చెన్= సమర్పించాడు; ఈ క్రమంబునన్= ఈ రీతిగా; అది= ఆ దండనీతి శాస్త్రం; జగంబులన్= లోకాలన్నిట్లో; పరఁగెన్= ఒప్పింది; దండంబు= దండనీతి; జాగరణంబునన్= ఎచ్చరికతో; లోకంబు= ప్రపంచం; మర్యాదామహితంబు+ఐ= గౌరవంతో ఒప్పినదయి; వర్తిల్లెన్= వ్యవహరించింది; కపర్ది= కపర్దం అనే జటాజూటం కలవాడు; శంకరుండు= సుఖాన్ని కలిగించేవాడూ; రుద్రుండు= శత్రువులను దుఃఖపెట్టేవాడూ; భవుండు= అంతా తానే అయ్యేవాడూ; స్థాణుండు= ప్రళయకాలంలోకూడా ఉండేవాడూ; ఉమాపతి= పార్వతీదేవి భర్త; అనుపేళ్ళన్= అనే ఆరు పేర్లతో; పరఁగు= ఒప్పేటి; ఆ+దండదేవునిన్= ఆ దండదేవుడైన రుద్రుడిని; అతుల ధర్మంబునన్= సాటిలేని ధర్మంతో; నయించు= నడిపే; భూపాలుండు= రాజు; ఐహిక ఆముష్మిక సిద్ధులన్= ఇహలోక పరలోక సంపదలను; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: ఈ విధంగా ప్రయత్నించి దండనీతిని పద్దెనిమిది విద్యలను శివుడు విష్ణువునకు అప్పగించాడు. ఆ బ్రహ్మకు తుమ్ము పుట్టించి క్షుతబ్రహ్మను పుట్టించాడు. దండనీతి ప్రపంచంలో వ్యాపించింది. ప్రపంచం మొత్తం సంతోషించింది. బ్రహ్మదేవుడి యాగం శాస్త్రోక్తంగా జరిగింది. తన అధీనంలో ఉన్న దండనీతి శాస్త్రాన్నంతా విష్ణువు ఆంగిరసుడికీ, అతడు దేవేంద్రుడికీ, మరీచికీ, మరీచి భృగుమహర్షికీ తెలియచెప్పారు. భృగుమహర్షి ఎంతో మంది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మునులకు ఉపదేశించాడు. ఇట్లా ఈ దండనీతి శాస్త్రం అన్ని లోకాలలోకి విస్తరించింది. దండనీతితో లోకం ప్రవర్తించటంవలన మర్యాదతో మెలగింది. కపర్ది, శంకరుడు, రుద్రుడు, శివుడు, స్థాణుడు, ఉమాపతి అనే పేళ్ళతో వ్యవహరించే దండనీతిని ధర్మబద్ధంగా నడిపిన రాజు భూలోకంలోనూ, పై లోకంలోనూ సర్వసంపదలను పొందుతాడు'

క. **అని వసుహోముఁడు సెప్పిన । విని మాంధాతృండు దండ విభవజ్ఞుండై**
యనఘ! మహీపరిపాలన । మొనరించెను నీతిదండయుక్తి వెలయఁగన్. **121**

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; అని= ఈ విధంగా; వసుహోముఁడు= అంగదేశపు రాజు; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; మాంధాతృండు= మాంధాత; దండ విభవజ్ఞుండు+ఐ= దండనీతి వైభవాన్ని తెలిసికొన్న వాడై; నీతి దండయుక్తి= దండనీతి శాస్త్రంతో కూడి; వెలయఁగన్= ప్రకాశించగా; మహీపరిపాలనమున్= భూపరిపాలనాన్ని; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: రాజా! ఈ విధంగా వసుహోముడు మాంధాత చెప్పిన దండనీతి శాస్త్రం విని' ఆ దండనీతి వైభవంతో రాజ్యాన్ని పాలించాడు.

క. **ఈ యాఖ్యానము విని భూ । నాయకుఁ డెవ్వం డిలాజనంబుల నతుల**
న్యాయంబున భావించుఁ జి । రాయుస్స్థిర పుణ్యభాగి యగు నతఁడు నృపా! **122**

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; ఈ ఆఖ్యానమున్= ఈ వృత్తాంతాన్ని; ఎవ్వండు భూనాయకుఁడు= ఏ రాజు; విని= విన్నవాడై; ఇలా జనంబులన్= భూప్రజలను; అతులన్యాయంబునన్= సాటిలేని న్యాయంతో; పాలించున్= ఏలుకొంటాడో; అతఁడు= ఆ రాజు; చిరాయుః= చిరంజీవిగా ఉంటాడు; స్థిరపుణ్యభాగి= తరగని పుణ్యసంపదలు కలిగినవాడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: ఈ కథా వృత్తాంతాన్నంతా విన్న రాజు తన ప్రజలను ధర్మబద్ధంగా పాలిస్తాడు. ఆ రాజు చిరంజీవి అవుతాడు. తరగని పుణ్యసంపదలు అనుభవిస్తాడు'.

భీష్ముఁడు ధర్మరాజునకు ధర్మార్థకామంబుల తెఱం గెఱింగించుట (సం. 12-123-3)

వ. **అనిన విని ధర్మనందనుండు 'ధర్మార్థ కామంబుల నడవడి యె ట్లయిన మేలై చెల్లు?' నని యడిగిన, భీష్ముం డిట్లనుఁ 'దొల్లి యాంగరిష్ఠుం డను నరవరుండు కామందక నాముండైన ముని నిట్లని యడుగ నతం డతనికిఁ జెప్పిన భంగిం జెప్పెద నాకర్ణింపుము.** **123**

ప్రతిపదార్థం: అనినన్= భీష్ముడు పలుకగానే; విని= విని; ధర్మనందనుండు= ధర్మరాజు; ధర్మార్థ కామంబులన్= ధర్మ, అర్థ, కామాల; నడవడి= నడత; ఎట్లు+అయినన్= ఏ విధంగా ఉంటే; మేలు+ఐ= మంచిదై; చెల్లును?= కొనసాగుతుంది?; అని+అడిగినన్= అని అడుగగా; భీష్ముండు= భీష్ముడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; తొల్లి= పూర్వం; ఆంగరిష్ఠుండు= ఆంగరిష్ఠుడనే; నరవరుండు= రాజు; కామందక నాముండు+అయిన= కామందకుడనే పేరుగల; మునిన్= మునిని; ఇట్లు+అని= ఇట్లాగని; అడుగన్= అడగగా; అతండు= ఆ ముని; అతనికిన్= రాజునకు; చెప్పిన భంగిన్= చెప్పినట్లుగానే; చెప్పెదన్= వినిపిస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: 'ధర్మార్థ కామాలతో ఎట్లా నడచుకొంటే మంచిది?' అని ధర్మరాజు అడుగగా, భీష్ముడు 'లోగడ ఆంగరిష్ఠుడనే రాజు కామందకు డనే మునిని ఈ విషయం గూర్చే అడిగాడు. అతడు చెప్పినట్లుగానే నీకూ చెప్పుతాను వినుము.

చ. అనయముఁ బేర్చు కామమున నర్థము ధర్మముఁ గ్రాఁగుఁ గామతం
త్ర నిరతుఁ డైనవాఁడు సుపథప్రతిపన్నుఁడు గాఁడు దుష్టదం
డన మొనరింపఁ డట్టిపతి డాయరు సాధులు నార్యులున్ సుహృ
జ్జనులును; దానఁ జేటు నగుఁ, జావును బాటిలు నెల్ల భంగులన్. 124

ప్రతిపదార్థం: అనయమున్= ఎపుడూ; పేర్చు= పెరిగే; కామమునన్= కోరికవలన; అర్థమున్= అర్థమూ; ధర్మమున్= ధర్మమూ; క్రాఁగున్= హరిస్తాయి; కామతంత్ర నిరతుఁడు+ఐనవాఁడు= కామోపాయంపట్ల ఆసక్తి ఉన్నవాడు; సుపథ ప్రతిపన్నుఁడు= మంచి మార్గాన్ని చేపట్టేవాడు; కాఁడు= కానేరడు; దుష్టదండనమున్= చెడ్డవాళ్ళను శిక్షించటాన్ని; ఒనరింపఁడు= చేయడు; అట్టిపతి= అట్లాంటి రాజును; సాధులున్= మంచివారు; ఆర్యులున్= పెద్దవారు; సుహృద్ జనులున్= స్నేహితులూ; డాయరు= దరిచేరరు; దానన్= అందువలన; ఎల్లభంగులన్= అన్నివిధాలా; చేటున్+అగున్= నాశనం కలుగుతుంది; చావున్= మరణంకూడా; పాటిలున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఓ రాజా! ఎపుడూ భోగం అనుభవించాలనుకొనే రాజునకు ధర్మార్థాలు హరించుకుపోతాయి. కామంలో ఆసక్తిగల రాజు మంచి మార్గంలో ఉండడు. దుష్టులను శిక్షించడు. అట్లాంటి రాజు దగ్గరకు మంచివారు, పెద్దవారు, స్నేహితులు చేరరు. చెడ్డవారే చుట్టూ ఉంటారు. అందువలన అట్లాంటి రాజునకు కీడు కలుగుతుంది. చావూ మూడుతుంది.

ఉ. కావున ధర్మసిద్ధికి ముఖంబగు నర్థమునందు నిష్ఠమై
నేవిధినైన ధర్మరతి యెక్కుడుగా మదిఁ జొన్పుటొప్పుఁ గా
మావిలబుద్ధి గాక యుచితాగత సౌఖ్యము లాచరించుచున్
భూవిభుఁ డెప్డు భూమిసతిఁ బొంది రమింప మహోన్నతుం డగున్.' 125

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ధర్మసిద్ధికిన్= ధర్మం ఫలించటానికి; ముఖంబు+అగు= ముఖ్యమైనది అయిన; అర్థమునందున్= పురుషార్థాలలో ఒకటైన అర్థంలో; నిష్ఠమైన్= శ్రద్ధతో; ఏ విధిన్+ఐనన్= ఎట్లా అయినాసరే; ధర్మరతి= ధర్మం మీద ఆపేక్ష; ఎక్కుడుగాన్= ఎక్కువ అగునట్లుగా; మదిన్+చొన్పుట= మనసులో నాటటం; ఒప్పున్= మంచిది అవుతుంది; కామ+ఆవిల బుద్ధి+కాక= కామంతో కలకబారిన మనస్సుతో కాక; ఉచిత+ఆగతసౌఖ్యములు= తగినట్టుగా వచ్చిన సుఖాలను; ఆచరించుచున్= పొందుతూ; భూ విభుఁడు= రాజు; ఎప్డున్= నిత్యమూ; భూమిసతిన్= భూకాంతను; పొంది= కలసి; రమింపన్= క్రీడించగా; మహా+ఉన్నతుండు+అగున్= గొప్పవా డవుతాడు.

తాత్పర్యం: కనుక, ధర్మం దక్కించుకొనటానికి ఆధారం అర్థం. ఆ అర్థంపట్ల నిష్ఠతో ఎట్లాగైనా ధర్మాపేక్షను విడనాడకూడదు. కామబుద్ధితో కాక లభ్యమైన తగిన సౌఖ్యాలను అనుభవిస్తూ రాజ్యాన్ని ఏలుకునే రాజు గొప్పవాడవుతాడు.

క. అన విని ధర్మతనూజుఁడు । 'జనమ్ము శీలమ్ము నధిక సంస్తుత్యముగాఁ
గొనియాడుఁ; దత్స్వరూపం । బనఘా! వివరింపవే దయారతి నాకున్?' 126

ప్రతిపదార్థం: అనన్= అనగానే; విని= ఆలకించి; ధర్మతనూజుఁడు= ధర్మరాజు; అనఘ!= ఓ పుణ్యవంతుడా!; జనమ్ము= లోకులు; శీలమ్మున్= నడవడిని; అధిక సంస్తుత్యముగాన్= ఎంతో పొగడదగినదిగా; కొనియాడున్= మెచ్చుకుంటారు; నాకున్= నాకు; దయారతిన్= కనికరంతో; తద్+స్వరూపంబున్= దాని కలరూపాన్ని; వివరింపవే?= విశదపరచవా?

తాత్పర్యం: 'లోకం శీలాన్ని ఎంతో మెచ్చుకొంటున్నది కదా! దాని స్వరూపాన్ని విప్పిచెప్పు'మని ధర్మరాజు ప్రార్థించాడు.

వ. అనుటయు నాపగాతనయుండు విను మని యతని కిట్లనియె. 127

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఆపగా తనయుండు= భీష్ముడు; వినుము= ఆలకించుము; అని; అతనికిన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: మళ్ళీ భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పటం మొదలు పెట్టాడు.

క. 'ము న్నింద్రప్రస్థంబున । నున్నతి మెయి ననుజ తనుజయుక్తంబుగ నీ
వున్న తెఱఁగు దుర్యోధను । కన్నులు గమరింప నతఁడు గడు వగ నొందెన్. 128

ప్రతిపదార్థం: మున్ను= పూర్వం; ఇంద్రప్రస్థంబునన్= ఇంద్రప్రస్థ నగరంలో; అనుజ= తమ్ములతోను; తనుజ= కొడుకులతోను; యుక్తంబుగన్= కూడుకొని; ఈవు= నీవు; ఉన్నతిమెయిన్= ఉచ్చస్థితిలో; ఉన్న తెఱఁగు= ఉన్నతీరును (చూచి); దుర్యోధను= సుయోధనుడి; కన్నులు= కళ్ళు; కమరింపన్= ఉడుకెత్తగా; అతఁడు= ఆ దుర్యోధనుడు; కడు వగన్= ఎంతో దుఃఖాన్ని; ఒందెన్= పొందాడు.

తాత్పర్యం: 'నీవు నీ కొడుకులతో తమ్ముళ్ళతో కలిసి ఇంద్రప్రస్థంలో బాగా ఉండే రోజులలో దుర్యోధనుడికి కళ్ళుకుట్టి ఎంతో బాధపడ్డాడు.

వ. భవదీయ సభ యొప్పునకును రాజసూయంబు చెల్లిన యుల్లాసంబునకును న ట్లసహ్యపడి ధృతరాష్ట్రునితో భవద్గృహంబున నిచ్చలుం బదివేవురు భూసురులు పసిండి పళ్ళెరంబులం బాయసాహారంబులు గొనుట మొదలుగాఁగ లక్ష్మి పెంపు పుగ్గడించి తనవగపు దోఁపంబలికిన నతం డతని కిట్లను 'మధురాన్నపాన మణిభూషణ వరవాహనాదులం జేసి యుజ్జ్వలంబై యున్నది గాక నీ యైశ్వర్యం బసదే? పాండవాగ్రజుం డెక్కుడు మెఱసి యునికియుం గలదు; వినుము చెప్పెద. 129

ప్రతిపదార్థం: భవదీయ= నీకు సంబంధించిన; సభ= సమావేశం (మయసభ); ఒప్పునకును= చక్కదనానికి; రాజసూయంబు= రాజసూయ యాగం; చెల్లిన= జరిగిన; ఉల్లాసంబునకునున్= వైభవానికీ; అటు= అట్లా; అసహ్యపడి= ఈర్ష్యపడి; ధృతరాష్ట్రునితోన్= తండ్రితో; భవత్+గృహంబునన్= నీ (ధర్మరాజు) ఇంట్లో; నిచ్చలున్= అనునిత్యం; పదివేవురు= పదివేలమంది; భూసురులు= బ్రాహ్మణులు; పసిండి పళ్ళెరంబులన్= బంగారు పళ్ళెములలో; పాయస+ఆహారంబులు= పరమాన్నం మొదలైన పదార్థాలు; కొనుట= తినటం; మొదలుగాఁగన్= మొదలుపెట్టి; లక్ష్మి పెంపున్= మహా ఐశ్వర్యాన్ని; ఉగ్గడించి= చెప్పి; తనవగపు= తన దుఃఖం; తోఁపన్= కనపడేటట్లు; పల్కినన్= పలుకగా; అతండు= ధృతరాష్ట్రుడు; అతనికిన్= దుర్యోధనుడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; మధుర= కమ్మనైన; అన్నపాన= అన్నపానాదులచేత; మణి= మణులచేత; భూషణ= నగలచేత; వరవాహనాదులన్+చేసి= మంచి వాహనాదులచేత; నీ ఐశ్వర్యంబు= నీ సంపద; ఉజ్జ్వలంబు+ఐ ఉన్నది= ప్రకాశిస్తూ ఉన్నది; అసదు+ఏ= తక్కువా; కాక= కాకపోతే; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; ఎక్కుడు మెఱసి= ఎక్కువగా ఒప్పి; ఉనికియున్= ఉండుట; కలదు= ఉన్నది; చెప్పెదన్= చెబుతాను విను.

తాత్పర్యం: నీ మయసభ అందాన్ని, రాజసూయయాగ ప్రాభవాన్నీ చూచి అసూయపడ్డాడు. ధర్మరాజు ఇంట్లో ఎపుడూ పదివేలమంది బ్రాహ్మణులు బంగారు పళ్ళాలలో పాయసాన్నం తింటుంటారని, ఐశ్వర్యం సంపత్తి అంచనా కట్టుకొని తన దుఃఖాన్ని తండ్రి దగ్గర వెళ్ళబోసుకొన్నాడు. అపుడు ధృతరాష్ట్రుడు 'మధురమైన అన్నపానాలూ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మణులూ, ఆభరణాలూ, మంచి వాహనాదులచేత నీ ఐశ్వర్యం అంతకన్నా తక్కువదేమీ కాదు. కాకపోతే ధర్మరాజు నీకంటె మిన్నగా ఉండటానికి కారణం చెప్పుతాను వినుము.

ఆ. శీలవంతులైన సిరిఁ బొందుదురు ధర్మ। తనయునింటి సిరికి నెన యనంగ
నెక్కు డనఁగ లక్ష్మి యెసకం బెసఁగ నీవు। శీల మలవరింపు చిత్తమునను. 130

ప్రతిపదార్థం: శీలవంతులు+ఐనన్= మంచి నడత కలవారైతే; సిరిన్= ఐశ్వర్యాన్ని; పొందుదురు= పొందుతారు; ధర్మతనయు= ధర్మరాజు యొక్క; ఇంటి సిరికిన్= ఇంటి సంపదకు; ఎన+అనంగన్= సాటేమో అన్నట్లుగా; ఎక్కుడు+అనఁగన్= ఎక్కువేమో అనేటట్లుగా; లక్ష్మి= సంపద; ఎసకంబు+ఎసఁగన్= పెంపొందటానికి; నీవు= నీవు; చిత్తమునను= మనస్సులో; శీలము= మంచి స్వభావాన్ని; అలవరింపు(ము)= సంపాదించుకొమ్ము.

తాత్పర్యం: మంచి ప్రవర్తన కలవారు ఎన్నో సంపదలతో తులతూగుతుంటారు. కనుక ధర్మరాజు దగ్గర శీలం అధికం. ధర్మరాజు ఇంటి సంపదతో సరిసమాన మయ్యేటట్లు అంతకంటే మరింతగా సంపద పెంపొందటానికి నీవు కూడా మంచి స్వభావాన్ని అలవరుచుకొమ్ము.

వ. మాంధాతృండు, నాభాగుండు మొదలయిన మేదినీపతులు శీలంబునం గాదె యీ లోకంబునం బెంపువడసి; రివ్విషయంబునకు నొక్క యితిహాసంబు గల; దాకర్ణింపుము. 131

ప్రతిపదార్థం: మాంధాతృండు= మాంధాత; నాభాగుండు= నాభాగుడు; మొదలయిన= మొదలైన; మేదినీ పతులు= రాజులు; శీలంబునన్= మంచి ప్రవర్తనచేతనే; కాదె?= కాదా?; ఈ లోకంబునన్= ఈ లోకంలో; పెంపు+పడసిరి= ఎంతో మన్నన పొందారు; ఈ+విషయంబునకున్= ఆ సంగతి తెలిసికొనటానికి; ఒక్క ఇతిహాసంబు= పూర్వం జరిగిన కథ ఒకటి; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: మాంధాతా, నాభాగుడు మొదలైన మహారాజులంతా శీలంవలనే లోకంలో గౌరవం పొందారు. దీనిని గురించి జరిగిన కథ ఒకటి చెప్పుతాను వినుము.

క. దనుజవిభుఁడు ప్రహ్లాదుం। డనిమిష పతి రాజ్యలక్ష్మి యతులిత శీలం
బునఁ గొని త్రైలోక్యంబును। దనకు వశగతంబు సేసె ధర్మం బలరన్. 132

ప్రతిపదార్థం: దనుజ విభుఁడు= రాక్షసరాజైన; ప్రహ్లాదుండు= ప్రహ్లాదుడు; అనిమిషపతి= ఇంద్రుడి; రాజ్యలక్ష్మి= రాజ్యాన్ని; అతులిత= సాటిలేని; శీలంబునన్= సత్ప్రవర్తనచేత; కొని= కైవసం చేసికొని; త్రైలోక్యంబును= ముల్లోకాలను; తనకున్= తనకు; ధర్మంబు+అలరన్= న్యాయం ఒప్పేటట్లు; వశగతంబు+చేసెన్= స్వాధీనం చేసికొన్నాడు.

తాత్పర్యం: శీలం మూలంగానే ఒకపుడు ప్రహ్లాదుడు ఇంద్రుడి రాజ్యాన్ని లోబరచుకొన్నాడు. ధర్మబద్ధంగా ముల్లోకాలను తన గుప్పిట్లో పెట్టుకొన్నాడు.

క. దానికి రోసి బృహస్పతి। తో నమరేంద్రుండు మేలు దొరకొను విధమె
ట్లో నావుడు భార్గవునిం। గానఁగఁజను మతఁడు సెప్పఁ గరుణాన్వితుఁడై. 133

ప్రతిపదార్థం: దానికిన్= దానికి; రోసి= ఏవగించుకొని; బృహస్పతితోన్= దేవతల గురువుతో; అమర+ఇంద్రుండు= దేవేంద్రుడు; మేలు= మంచి; దొరకొను విధము= కలిగే తీరు; ఎట్లో= ఎట్లాంటిదో (చెప్పవలసింది); నావుడన్= అనగానే; భార్గవునిన్+కానఁగన్=

శుక్రాచార్యుడిని; దర్శించటానికి; చనుము= వెళ్ళుము; అతఁడు= శుక్రాచార్యుడు; కరుణా+అన్వితుఁడు+ఐ= దయకలవాడై; చెప్పున్= చెపుతాడు.

తాత్పర్యం: దానికి ఇంద్రుడు రోషపడి దేవతలగురువు బృహస్పతి దగ్గరకు వెళ్ళి 'నాకు మేలు జరిగే ఉపాయం చెప్పు' మన్నాడు. బృహస్పతి 'శుక్రాచార్యుడివలన నీ కన్నీ తెలుస్తాయి వెళ్ళుము అతడు ఎంతో దయతో చెప్పుతాడు'.

క. అని గురుఁడు పంప నింద్రుఁడు । సని భార్గవుఁ గాంచి 'మేలు సమకూరు తెఱం
గనఘా! యుపదేశింపవె' । యనినం 'బ్రహ్లాదుఁ జెందు; మతఁ డెఱిఁగించున్. 134

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; గురుఁడు= బృహస్పతి; పంపన్= పంపగా; ఇంద్రుఁడు= దేవేంద్రుడు; చని= వెళ్ళి; భార్గవున్= శుక్రాచార్యుడిని; కాంచి= చూచి; అనఘా!= ఓ పుణ్యాత్ముడా!; మేలు= శుభం; సమకూరు తెఱంగు= సమకూరే ఉపాయాన్ని; ఉపదేశింపవె?= తెలియచెప్పవా?; అనినన్= అనగానే; ప్రహ్లాదున్= ప్రహ్లాదుడిని; చెందుము= చేరి అడుగుము; అతండు= ఆ ప్రహ్లాదుడు; ఎఱిఁగించున్= బోధ పరుస్తాడు.

తాత్పర్యం: ఇంద్రుడు శుక్రాచార్యుడి దగ్గరకు వెళ్ళి 'అయ్యా! నా రాజ్యలక్ష్మిని తిరిగిపొందే ఉపాయాన్ని చెప్పు' మనగానే అతడు 'ప్రహ్లాదుడి దగ్గరకు వెళ్ళటం శ్రేయస్కరం. అంతా అతడే చెప్పుతాడు' అంటాడు.

ఆ. అతని నాశ్రయించి యవ్వెర విప్పించి । కొనిన మేలు వొందు' ననియె భార్గ
వుండు వజ్రి బ్రాహ్మణుం డయి ప్రహ్లాదుఁ । జేరి శిష్యవిధులు సేయుచుండె. 135

ప్రతిపదార్థం: అతనిన్= ఆ ప్రహ్లాదుడిని; ఆశ్రయించి= అండచేరి; ఆ+వెరవు= ఆ ఉపాయాన్ని; ఇప్పించుకొనినన్= పొందగా; మేలు+పొందున్= శుభం కలుగుతుంది (అని); భార్గవుండు= శుక్రాచార్యుడు; అనియెన్= అన్నాడు; వజ్రి= ఇంద్రుడు; బ్రాహ్మణుండు+అయి= బ్రాహ్మణవేషం వేసికొని; ప్రహ్లాదున్+చేరి= ప్రహ్లాదుడి దగ్గరచేరి; శిష్య విధులు= శిష్యులు చేసే పనులు; చేయుచున్+ఉండెన్= చేస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: 'ప్రహ్లాదుడిని ఆశ్రయించి ఆ ఉపాయాన్ని పొందితే నీకు మంచి జరుగుతుం'దని భార్గవుడు చెప్పాడు. ఇంద్రుడు బ్రాహ్మణవేషంతో ప్రహ్లాదుడి శిష్యుడిగా చేరి శుశ్రూషలు చేస్తూ ఉన్నాడు.

వ. అంత నద్దానవేంద్రుండు ప్రసన్నుండై భూసురాకృతి యయిన సురపతితో సంభాషించిన నతండు 'నీకుఁ త్రైలోక్యరాజ్యంబు సంప్రాప్తం బైన కారణం బేమి? యెఱింగింపవే!' యనుటయు. 136

ప్రతిపదార్థం: అంతన్= కొంతకాలం పోయాక; ఆ+దానవ+ఇంద్రుండు= ఆ రాక్షసరాజు ప్రహ్లాదుడు; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహించిన వాడై; భూసుర+ఆకృతి+అయిన= బ్రాహ్మణ వేషంలో ఉన్న; సురపతితోన్= దేవేంద్రుడితో; సంభాషించినన్= మాటాడగా; అతండు= ఇంద్రుడు; నీకున్= నీకు; త్రైలోక్యరాజ్యంబు= ముల్లోకాలు; సంప్రాప్తంబు+ఐన= లభించిన; కారణంబు= హేతువు; ఏమి= ఏమిటో; ఎఱింగింపవే= తెలుపవా; అనుటయున్= అనగానే.

తాత్పర్యం: కొంతకాలం గడిచాక ప్రహ్లాదుడు దేవేంద్రుడి మీద జాలిపడి మాటాడాడు. ఇంద్రుడు 'మూడులోకాలూ మీ ఏలుబడికిందికి ఎట్లా వచ్చాయో తెలిసికొనాలని ఉన్నదని అన్నాడు' - అనగానే (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. దనుజనాథుఁ డిట్టులను 'రాజ నను గర్వ । మున ధరామరులకు మనసు గందఁ
జేయ నెపుడు నే నసూయాదు లమ్మహా । త్ములకు ధనము లిత్తు నెలమితోడ. 137

ప్రతిపదార్థం: దనుజనాథుఁడు= రాక్షసరాజు; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; ఏన్= నేను; రాజును+అను= రాజును అనే; గర్వమునన్= అహంకారంతో; ధరామరులకున్= బ్రాహ్మణులకు; మనసు+కందన్= మనస్సు బాధపడేటట్లు; అసూయా+ఆదులు= ఈర్ష్య మున్నగువాటిని; చేయన్= చేయను; ఆ+మహాత్ములకున్= ఆ పుణ్యాత్ములకు; ఎలమితోడన్= సంతోషంగా; ధనములు= సంపదలు; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: ప్రహ్లాదుడు ఇట్లా అన్నాడు. 'నేను పాలకుడిని అని చెప్పుకోను. అహంకారంతో, ఈర్ష్యపడి బ్రాహ్మణుల మనస్సును నొప్పించను. ఎంతో భక్తితో ఆ మహానుభావులకు ధనం, ద్రవ్యం ఇచ్చి ఆదరిస్తుంటాను.

వ. వారలు మెచ్చునట్టి శీలంబునం బ్రవర్తిల్లుదు; దానంజేసి మహోన్నతుండ నైతి. 138

ప్రతిపదార్థం: వారలు= ఆ బ్రాహ్మణులు; మెచ్చునట్టి= పొగడే; శీలంబునన్= మంచి ప్రవర్తనతో; ప్రవర్తిల్లుదున్= నడచుకుంటాను; దానన్+చేసి= అందువలననే; మహా+ఉన్నతుండన్+ఐతిన్= గొప్పస్థితిమంతుడ నయ్యాను.

తాత్పర్యం: నా నడవడిని బ్రాహ్మణులంతా మెచ్చుకున్నారు. కాబట్టి ఇంతటి గొప్పవాడినయ్యాను'.

క. అనవుడు 'నీ శీలము నా । కనఘా! దయ నొసఁగవే! మహాత్ములఁ దగఁ జెం
దినవారు బ్రదుకవలదే?'। యని దీనత దోఁప ననిమిషాధిపుఁ డడిగెన్. 139

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; అనఘా!= పాపం అంటనివాడా!; నీ శీలము= నీ మంచి నడత; నాకున్= నాకు; దయన్= దయతో; ఒసఁగవే= సమర్పించవా; మహాత్ములన్= పుణ్యాత్ములను; తగన్= చక్కగా; చెందినవారు= పొందినవారు; బ్రదుకన్ వలదే?= జీవించవద్దా?; అని; అనిమిష+అధిపుఁడు= దేవేంద్రుడు; దీనతతోఁపన్= జాలిగొలిపేటట్లు; అడిగెన్= అడిగాడు.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! నీ ధర్మశీలాన్ని నామీద దయతో ఇప్పించవలసింది. అయినా పుణ్యాత్ములను ఆశ్రయించినవారు బాగా బ్రతకవద్దా?' అని ఎంతో దైన్యంతో ఇంద్రుడు అడిగాడు.

క. విని ప్రహ్లాదుఁడు గృప దన । మనమునఁ గదురంగ విప్రమాత్రుఁడు గాఁ డీ
తని భంగిఁ జూడ నను వెఱ । పును బుట్టఁగ నిచ్చె శీలముం బెం పెసఁగన్. 140

ప్రతిపదార్థం: విని= విని; ప్రహ్లాదుఁడు; కృప= దయ; తన మనంబునన్= తన మనస్సులో; కదురంగన్= కలుగగా; ఈతని భంగిన్= ఈతడి తీరును; చూడన్= చూడగా; విప్రమాత్రుఁడు కాఁడు= బ్రాహ్మణుడు మాత్రమే కాడు; అను వెఱపును పుట్టఁగన్= అనే భయంకూడా కలుగగా; పెంపు+ఎసఁగన్= ఎంతో గౌరవంగా; శీలమున్= మంచి నడతను; ఇచ్చెన్= దానం చేశాడు.

తాత్పర్యం: ప్రహ్లాదుడు ఆతడి తీరు చూచి 'ఇతడు బ్రాహ్మణ మాత్రుడు కాడు సుమా!' అనిపించి భయం పుట్టినా, తన శీలాన్ని అతడికి దానం చేశాడు.

తే. పడసి యింద్రుండు శీలసంపన్నుఁ డగుచుఁ । జనియెఁ; దదనంతరంబ యద్దనుజవరుని
తనువునందుండి తేజిష్ఠ తనువిలాసుఁ । డైన పురుషుండు వెడలిన నతఁడు సూచి. 141

ప్రతిపదార్థం: పడసి= శీలాన్ని పొంది; ఇంద్రుండు= దేవేంద్రుడు; శీలసంపన్నుఁడు+అగుచున్= శీలసంపద కలవాడవుతూ; చనియెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాతనే; ఆ దనుజవరుని= ఆ రాక్షసోత్తముడి; తనువునందున్+ఉండి= శరీరంనుండి; తేజిష్ఠ= ఎంతో తేజస్వంతమైన; తను విలాసుఁడు+ఐన= శరీర లావణ్యం కల; పురుషుండు= పురుషాకారం; వెడలినన్= బయటకు రాగా; అతఁడు= ఆ ప్రహ్లాదుడు; చూచి= చూచినవాడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ప్రహ్లాదుడి శీలాన్నిపొంది ఇంద్రుడు వెళ్ళగానే ప్రహ్లాదుడి శరీరంలో నుండి అందంగా మెరిసిపోతున్న పురుషాకారం బయటపడింది. ఆ పురుషుడిని ప్రహ్లాదుడు చూచి.

వ. 'నీ వెవ్వండ?' వన నప్పురుషుం 'దేను శీలంబ; నీ విచ్చిన యవ్విప్రుపాల వసియింపం జనియెద'నని చెప్పి పోయెం; దదనంతరంబ క్రమంబునం దేజోమయ రూపంబులు నిజదేహంబున నుండి నిర్గమింప నద్దానవేశ్వరుం డడుగుచు. 142

ప్రతిపదార్థం: నీవు+ఎవ్వండవు?= నీవు ఎవరివి?; అనన్= అని అడగగానే; ఆ+పురుషుండు= ఆ పురుషుడు; ఏను= నేను; శీలంబన్= శీలాన్ని; నీవు+ఇచ్చిన= నీవు దానంచేసిన; ఆ విప్రుపాలన్= ఆ బ్రాహ్మణుడి దగ్గర; వసియింపన్= ఉండటానికి; చనియెదన్= వెళ్ళుతాను; అని చెప్పి; పోయెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= ఆ పిమ్మట; క్రమంబునన్= వరసపెట్టి; తేజోమయ రూపంబులు= ప్రకాశవంతమైన ఆకారాలు; నిజదేహంబునన్+ఉండి= తన శరీర భాగంనుండి; నిర్గమింపన్= వెళ్ళగా (పోగా); ఆ+దానవ+ఈశ్వరుండు= ఆ రాక్షసరాజు; అడుగుచున్= ప్రశ్నిస్తూ.

తాత్పర్యం: 'నీవు ఎవ్వడ?'వని ప్రహ్లాదుడు అడిగాడు. 'నేను శీలాన్ని నీవు దానం చేసిన బ్రాహ్మణుడి దగ్గరకు వెళ్ళిపోతా'నని చెప్పి వెళ్ళిపోయాడు. అట్లా వరసపెట్టి తేజోమయ రూపాలు ప్రహ్లాదుడి శరీరంనుండి వెళ్ళుతుంటే ప్రహ్లాదుడు వారి పేర్లు అడిగి తెలిసికొన్నాడు.

క. ఉత్తమ ధర్మము సత్యము । వృత్తంబు బలంబు నగుట వినఁబడి బడిఁ ద
చ్చిత్తము విషాద మంద మ । హత్తర మూర్తి యొక వారిజానన వెడలెన్. 143

ప్రతిపదార్థం: ఉత్తమ ధర్మము= మేలైన ధర్మం; సత్యము= నిజం; వృత్తంబు= ప్రవర్తన; బలంబును= బలంకూడా; అగుట= కావటం; వినఁబడి= విన్నవాడై; బడిన్= వెంటనే; తద్+చిత్తము= అతడి మనస్సు; విషాదము= దుఃఖాన్ని; అందన్= పొందగా; మహత్తరమూర్తి= మంచిరూపంగల; ఒక వారిజ+ఆనన= ఒక స్త్రీ; వెడలెన్= బయలుదేరింది.

తాత్పర్యం: ఆ తేజోమయరూపాలు ఉత్తమ ధర్మం, సత్యం, సద్వర్తనం, బలం, కావటం విని ప్రహ్లాదుడు ఎంతో దుఃఖించాడు. అంతలో ఒక మంచి రూపవతి అతడి శరీరంనుండి బయటపడింది.

క. వెడలిన 'నీ వెవ్వత?' వని । యడిగిన నాతనికి నిట్టులను దీనత న
ప్పడఁతి 'సిరి నేను; బలమె । క్కడకు నరుగు నందుఁ బోవఁ గడఁగి వెడలితిన్.' 144

ప్రతిపదార్థం: వెడలినన్= బయటపడగా; నీవు+ఎవ్వతవు= నీవు ఎవ్వరిదానవు; అని+అడిగినన్= అని అడగగా; ఆతనికిన్= ఆతడితో; ఆ పడఁతి= ఆ స్త్రీ; దీనతన్= దైన్యంతో; ఇట్టులు+అనున్= ఈ విధంగా పలికింది; ఏను= నేను; సిరిన్= లక్ష్మిని; బలము= బలం; ఎక్కడకున్+అరుగున్= ఎటు వెళ్ళుతుందో; అందున్+పోవన్= అక్కడకు వెళ్ళటానికి; కడఁగి= పూనుకొని; వెడలితిన్= బయటకు వచ్చాను.

తాత్పర్యం: బయటపడ్డ స్త్రీని చూచి 'నీవు ఎవ్వరిదానవు?' అని అడగగానే ఆ స్త్రీ ఎంతో దైన్యంగా ఈ విధంగా అన్నది: 'నేను సిరిని. బలం ఎక్కడకు పోతుందో నేనూ అక్కడికే పోవా లని బయలుదేరాను'.

చ. అనిన భయంబు నొంది యతఁ డా సతితోఁ బరమేశ్వరీ! మహా
వినయమతిన్ ననుం గొలిచె విప్రవరుం; డతఁ డెవ్వఁ?' డన్న న
వ్వనిత 'సురాధినాథుఁడు భవద్ఘన రాజ్యవిభూతి యింతయుం
గొనుటకు నిన్నుఁ జెందె; నిటు గోల్పడి తీవును నీదు శీలమున్. 145

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; భయంబున్+ఒంది= భయపడి; అతఁడు= ఆ ప్రహ్లాదుడు; ఆ సతితోన్= ఆ కాంతతో; పరమేశ్వరీ!= ఓ దేవీ!; మహావినయమతిన్= ఎంతో అణకువతో; ననున్= నన్ను; విప్రవరుండు= బ్రాహ్మణోత్తముడు; కొలిచెన్= సేవించాడు; అతఁడు; ఎవ్వఁడు?= ఎవరు?; అన్నన్= అనగానే; ఆ+వనిత= ఆ స్త్రీ; సుర+అధినాథుఁడు= దేవేంద్రుడు; భవత్= నీ యొక్క; ఘన= గొప్పదైన; రాజ్యవిభూతి= రాజ్యసంపద; ఇంతయున్= ఇదంతా; కొనుటకున్= తీసికొనటానికి; నిన్నున్+చెందెన్= నిన్ను చేరాడు; ఈవును= నీవు కూడా; నీదు శీలమున్= నీ మంచి నడతను; ఇటు= ఈ విధంగా; కోల్పడితివి= పోగొట్టుకొన్నావు.

తాత్పర్యం: అది విని ప్రహ్లాదుడు భయపడ్డాడు. ఓ దేవీ! ఎంతో వినయంగా నన్ను సేవించిన 'ఆతడు ఎవరు?' అన్నాడు. 'అతడు ఇంద్రుడు. నీ రాజ్యసంపదను కాజేయటానికే నీ దగ్గరకు వచ్చాడు. నీవూ నీ శీలాన్ని అట్లాగే పోగొట్టుకొన్నావు అన్నది ఆ స్త్రీ.

వ. **వినుము చెప్పెద 'శీలంబున ధర్మంబు వెలయు; ధర్మంబున సత్యంబు దొరకొను; సత్యంబున వృత్తంబు సొప్పడు; వృత్తంబున బలంబు వాటిల్లు; బలంబున నేను గలుగుదుం; గావున సమస్తంబునకు మూలంబు శీలం'బని చెప్పి, సిరి పురందరుపాలికి ధర్మాదులతోడఁ గూడంజనియె' ననుటయు దుర్యోధనుండు 'శీలం బెట్టి?' దనిన ధృతరాష్ట్రుం డతని కిట్లనియె.** **146**

ప్రతిపదార్థం: చెప్పెదన్= ఒక్కటి చెప్పుతాను; వినుము= విను; శీలంబునన్= మంచి ప్రవర్తనవలననే; ధర్మంబు= న్యాయం; వెలయున్= ప్రకాశిస్తుంది; ధర్మంబునన్= ధర్మంతో; సత్యంబు= సత్యం; దొరకొనున్= సిద్ధిస్తుంది; సత్యంబునన్= సత్యంతో; వృత్తంబు= నడవడి; చొప్పడున్=ప్రవేశిస్తుంది; వృత్తంబునన్= నడతవలన; బలంబు= శక్తి; పాటిల్లున్= కలుగుతుంది; బలంబునన్= ఆ శక్తితో; నేను= సిరి; కలుగుదున్= ఉంటాను; కావునన్= కాబట్టి; సమస్తంబునకున్= ఈ మొత్తానికి; మూలంబు= కేంద్రబిందువు; శీలంబు= మంచి ప్రవర్తన; అని చెప్పి= అని పలికి; సిరి= సంపద; పురందరుపాలికిన్= ఇంద్రుడి వద్దకు; ధర్మాదులతోడన్= ధర్మం మొదలైన వాటితో; కూడన్+చనియెన్= కలవటానికి వెళ్ళింది; అనుటయున్= అనగానే; దుర్యోధనుండు= దుర్యోధనుడు; శీలంబు= నడత; ఎట్టిది= ఎటువంటిది; అనినన్= అనగానే; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు; అతనికిన్= అతడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అయితే ఒక విషయం చెప్పుతాను వినుము. శీలంవలననే ధర్మం రాణకెక్కుతుంది. ధర్మంవలన సత్యం, ఆ సత్యంవలన ప్రవర్తన, ఆ ప్రవర్తనవలన బలం, ఆ బలంవలన సంపత్తి వెంటనంటి ఉంటాయి. కనుక అన్నిటికీ మూలం శీలమే' అని చెప్పి సిరి ధర్మం మొదలైన వాటితో ఇంద్రుడి దగ్గరకు వెళ్ళిపోయింది, ఇట్లా ధృతరాష్ట్రుడు చెప్పాక దుర్యోధనుడు 'ఇంతకీ శీలం అంటే ఎట్లాంటిది?' అని అడగగానే ధృతరాష్ట్రుడు ఈ విధంగా అన్నాడు.

క. **'ఒలసి మనోవాక్కాయం । బుల ద్రోహాభావ మఖిల భూతముల యెడం**
గలిమి విను శీల; మది మే । లొలయించును దాన నుల్ల మూన్పుము పుత్రా! **147**

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; మనోవాక్కాయంబులన్= మనస్సూ, వాక్కూ, శరీరం ఈ మూడు; ఒలసి= కలసి; అఖిలభూతముల+ఎడన్= అన్ని జీవులపట్ల; ద్రోహ+అభావము= కీడు కూడదనే ఆలోచన; కలిమి= కలిగి ఉండటం; శీలము= మంచినడత; వినుము= వినుము; అది= ఆ శీలం; మేలు= మంచిని; ఒలయించున్= కలిగిస్తుంది; దానన్= ఆ శీలంపట్ల; ఉల్లమున్= మనస్సును; ఊన్పుము= నిలిపి ఉంచుము.

తాత్పర్యం: 'మనసూ, మాటా, శరీరం ఈ మూటిచేత అన్ని ప్రాణులకూ ఎట్లాంటి హాని చేయకుండా ఉండటమే శీలం. ఇది చాలా మేలు కలిగిస్తుంది. దీన్ని మనస్సులో పెట్టుకొమ్ము.

క. పరహితము సిగ్గుపాటుం । బొరయక యుండంగ నెదిరి బోధించుటయున్
నరసముదయంబు వొగడెడు । చరితము శీలమున కంగసంపద వత్సా!' 148

ప్రతిపదార్థం: వత్సా!= బిడ్డా!; పరహితము= ఇతరులకు మేలు చేయటం; సిగ్గుపాటున్= తలవంచుకొనటం; పొరయక= పొందక; ఉండంగన్= ఉండటానికి; ఎదిరి= ఎదుటివాళ్ళకు; బోధించుటయున్= ఉపదేశించటమూ; నర సముదయంబు= ప్రజలంతా; పొగడెడు= మెచ్చుకొనతగిన; చరితము= నడవడి; శీలమునకున్= మంచి ప్రవర్తనకు; అంగసంపద= అవయవ సంపత్తి.

తాత్పర్యం: కుమారా! సాటివాడికి తోడుపడటం, సిగ్గుపాటు పనులు చేయకూడదని ఎదుటివాళ్ళకు తెలియచెప్పటం, జనం ఇష్టపడేటట్లు నడచుకోవటం ఇవి శీలానికి అవయవ సంపదలు'.

క. అనియె నని చెప్పి భీష్ముం । డను ధర్మజుతోడ 'నీకు నది నైజమ యే
నును బోధించితి శీలము । మనమ్మునం దిరము సేయు మనుజాధీశా!' 149

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అని చెప్పి= అని పలికి; భీష్ముండు; ధర్మజుతోడన్= ధర్మరాజుతో; అనున్= ఇట్లా అన్నాడు; మనుజ+అధీశా!= రాజా!; నీకున్= నీకు; అది= ఆ శీలం; నైజము+అ= సహజగుణమే; ఏనును= నేను కూడా; శీలము= శీలాన్ని గూర్చి; బోధించితిన్= తెలియ చెప్పాను; మనమ్మునన్= మనసులో; తిరము చేయు(ము)= నిలకడగా ఉంచుకో.

తాత్పర్యం: అని ధృతరాష్ట్ర డన్నాడని భీష్ముడు ధర్మరాజుతో ఇంకా ఇట్లా అన్నాడు. 'నీకు శీలం జన్మతః అబ్బిన గుణమే. అయినా నేను శీలాన్ని గూర్చి చెప్పాను కదా! ఆ మంచి ప్రవర్తనను మనసులో స్థిరం చేసికొమ్ము.

వ. అనిన విని యజ్జనపతి భీష్మునితో 'నాశ యనునది యనంతయైయుండు నది నిరర్థకయైన నయ్యెడు దుఃఖం బధికం బది దుర్యోధనుం బేర్చి కలిసి యుండం జూచితి; నమ్మహాత్ముండు దేఱక మదీయాశం గుంఠితంబుఁ జేసి నన్ను దుర్బుద్ధిం గావించె; నది విషాదంబు సేయు; నాశ నడంచుట యరిదిగదే!' యనుటయు 'నాశాదోషనిరాసకం బైన యొక్క యితిహాసంబు గలదు; విను'మని య క్కురుసత్తముం డిట్లనియె. 150

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= విని; ఆ+జనపతి= ఆ ధర్మరాజు; భీష్మునితోన్= భీష్ముడితో; ఆశ= కోరిక; అనునది= అనేది; అనంతఐ= అంతుచిక్కనిదై; ఉండును= ఉంటుంది; అది= ఆ కోరిక; నిరర్థక+ఐనన్= ఫలించకపోతే; అయ్యెడు= కలిగే; దుఃఖంబు= బాధ; అధికంబు= ఎక్కువ; అది= ఆ దుఃఖం; దుర్యోధనున్= దుర్యోధనుడిని; పేర్చి= అతిశయించి; కలిసి+ఉండన్= కలిసి ఉండగా; చూచితిన్= చూచాను; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుండు; తేఱక= ఊరడిల్లక; మదీయ+ఆశన్= నా కోరికను; కుంఠితంబున్+చేసి= వ్యర్థంచేసి; నన్నున్= నన్ను; దుర్బుద్ధిన్= చెడ్డ తలంపు కలవాడినిగా; కావించెన్= చేశాడు; అది= అదే; విషాదంబు= దుఃఖాన్ని; చేయున్= కలిగిస్తుంది; ఆశన్= కోరికను; అడంచుట= తొక్కిపెట్టటం; అరిదిగదే= సాధ్యం కాదు కదా; అనుటయున్= అనగానే; ఆశాదోష= కోరిక అనే దోషాన్ని; నిరాసకంబు+ఐన= నిరసించేది అయిన; ఒక్క= ఒక; ఇతిహాసంబు= వెనకటి కథ; కలదు= ఉన్నది; వినుము= వినుము; అని; ఆ+కురుసత్తముండు= ఆ భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ మాటలు విన్న ధర్మరాజు భీష్ముడితో 'తాతా! ఆశకు అంతూ పొంతూ ఉండదు. ఆ ఆశ తీరకపోతే దానికన్న మించిన బాధ కలుగుతుంది. దుర్యోధనుడిని మంచి దారిలో పెట్టాలనీ ఉమ్మడిగా ఉండాలనే చూశాను. ఆ మహానుభావుడు నా ఆశను తీర్చకపోగా నన్ను దుర్బుద్ధిగా చేశాడు. అదే నాకు బాధగా ఉన్నది. ఆశను అణచుకొనటం చాలా కష్టం' అనగానే భీష్ముడు 'ఆశ అనే దోషాన్ని పోగొట్టుకొనేందుకు ఒక కథ ఉన్నది చెప్పుతాను వినుము' అన్నాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు సుమిత్రుఁడను రాజు చరిత్రంబు సెప్పుట (సం. 12-125-8)

సీ. **'హైహయుండు సుమిత్రుఁ డనురాజు వేఁట వో। యిన చోటఁ దనచేత నేటు వడిన**
మృగ మమ్ముతోఁ బాఱఁ దగిలె వెన్వెంటన;। యదియును నొకమరి యగ్గ మయ్యు
నొకమరి దవ్వయ్యు నొకమరి దృష్టి క। గోచరం బయ్యును ఖురపదంబు
లరసి పాఱిన నింతనంతఁ దోఁచియు నాశఁ। బెనుచుచుఁ జని మహావనము సొచ్చె;

ఆ. **నవ్విభుండు డస్సి యచ్చట నొక ముని। పల్లె కేఁగి మునులు ఫలజలములఁ**
దృప్తుఁ జేయ డప్పిదేఱి యున్నెడ ఋష। భాఖ్యుఁ డైన తపసి యతనితోడ. 151

ప్రతిపదార్థం: హైహయుండు= హైహయ వంశానికి చెందిన; సుమిత్రుఁడు+అనురాజు= సుమిత్రుడనే రాజు; వేఁట+పోయినచోటన్= వేటకొరకు వెళ్లిన అడవిలో; తనచేతన్= తన వలన; ఏటు+పడిన= బాణం దెబ్బతిన్న; మృగము= జంతువు; అమ్ముతోన్= బాణంతో; పాఱన్= పారిపోవగా; వెన్వెంటన= వెంటవెంటనే; తగిలెన్= అనుసరించాడు; అదియునున్= ఆ జంతువునూ; ఒకమరి= ఒకసారి; అగ్గము+అయ్యున్= అందుబాటులో ఉంటూ; ఒకమరి= ఒకసారి; దవ్వు+అయ్యున్= దూరం అవుతూ; ఒకమరి= మరోసారి; దృష్టికిన్= కంటికి; అగోచరంబు+అయ్యును= కనపడని దవుతూ; ఖురపదంబులు= కాలిగిట్టల జాడలు; అరసి= తెలిసికొంటూ; పాఱినన్= పరుగెత్తగా; ఇంతన్+అంతన్= దగ్గరగానూ, దూరంగానూ; తోఁచియున్= కంటపడి; ఆశన్= అపేక్షను; పెనుచుచున్= పెంచుతూ; చని= వెళ్ళి; మహావనము= అడవిలోనికి; చొచ్చెన్= చొరబడింది; ఆ+విభుండు= ఆ రాజు; డస్సి= అలసిపోయి; అచ్చటన్= అక్కడ; ఒక మునిపల్లెకున్= ఒక ముని ఆశ్రమానికి; ఏఁగి= వెళ్ళి; మునులు= ఋషులు; ఫలజలములన్= పండ్లచేతా నీటిచేతా; తృప్తున్ చేయన్= సంతుష్టిపరచగా; డప్పి= దప్పికనుండి; తేఱి+ఉన్న+ఎడన్= తెప్పిరిల్లుకొని ఉన్న సమయంలో; ఋషభ+ఆఖ్యుఁడు+ఐన తపసి= ఆ ఋషభుడనే పేరుగల ముని; అతనితోడన్= ఆ రాజుతో.

తాత్పర్యం: 'హైహయ వంశపురాజు సుమిత్రుడు. అతడు ఒకనాడు వేటాడబోయాడు. అక్కడ ఒక జంతువును బాణంతో కొట్టాడు. అది బాణంతో పాటు పారిపోయింది. రాజు దాని వెంటబడ్డాడు. అది చేతి కందినట్లే అందుతూ చాలా దూరం పోయేది. మరి కొంతసేపటికి కంటి కానేది కాదు. కాలిగిట్టలను బట్టి దానిజాడ తెలిసికొంటూ పరుగెత్తగా చిటికెలో కంటపడి ఆశపెడుతూ కారడవిలో కలసిపోయింది. అట్లు ఆ జంతువువెంటపడి బాగా అలసిపోయాడు రాజు. దగ్గరలో ఉన్న ఒక ముని పల్లెకు చేరుకొన్నాడు. ఆ మునులు పళ్ళూ నీళ్ళూ ఇచ్చారు. దప్పిక తీరి తేరుకొన్నాడు. అప్పుడు ఋషభు డనే ముని ఆ రాజుతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **వనమున నెక్కటి నీ 'వే। పనికై చనుదెంచి? తేల పరమవిషాదం**
బునఁ బొందెదె దనిన నాతం। డను నొక మృగ మమ్ముతోడ నరుగఁగ వెనుకన్. 152

ప్రతిపదార్థం: నీవు= నీవు; వనమునన్= అడవిలోనికి; ఏ పనికై= ఏ పనిమీద; ఎక్కటి= ఒక్కడివే; చనుదెంచితి?= వచ్చావు?; పరమవిషాదంబునన్= ఎంతో దుఃఖాన్ని; పొందెదు= పొందుతున్నావు; ఏల?= ఎందుకు?; అనినన్= అనగా; ఆతండు= ఆ

సుమిత్రుడు; అనున్= ఇట్లా అన్నాడు; ఒక మృగము= ఒక జింక; అమ్ముతోడన్= (కొట్టిన) బాణంతో కూడా; అరుగఁగన్= పారిపోగా; వెనుకన్= దాని వెనకాలే.

తాత్పర్యం: 'నీవు ఒంటరిగా అరణ్యంలోకి ఎందుకు వచ్చావు? బాగా దిగులుగా కనిపిస్తున్నావు ఏమిటి? అని చెప్పు' మనగానే రాజు ఇట్లా అన్నాడు. ఒక జంతువు నేను కొట్టిన బాణంతోపాటు పారిపోగా దాని వెనకనే పడి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆసాసల వచ్చితి; నను । గాసింబెట్టి యది యడవిఁ గలసెను; మృగయా
వ్యాసక్తుఁడు వగచుం దన । యేసిన మృగ మనఘ! తప్పియేఁగుటకుఁ గడున్. 153

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; ఆసాసలన్= ఎంతో ఆశపడి; వచ్చితిన్= వచ్చాను; ననున్= నన్ను; గాసిన్+పెట్టి= తిప్పటపెట్టి; అది= ఆ జంతువు; అడవిన్+కలసెన్= అడవిలో కలిసిపోయింది; మృగయా= వేటాడటంలో; వ్యాసక్తుఁడు= మిక్కలి ఆసక్తికలవాడు; తన+ఏసిన= తాను బాణంతో కొట్టిన; మృగము= జంతువు; తప్పి ఏఁగుటకున్= తప్పించుకొని పోతే; కడున్= మిక్కిలి; వగచున్= విలపిస్తాడు.

తాత్పర్యం: ఎంతో ఆశగా దాని వెంబడిపడి వచ్చాను. అది నన్ను నానా తిప్పలుపెట్టి అడవిలో కలసిపోయింది. వేటాడిన జంతువు చేదాటిపోతే ఆ వేటగాడు ఎంతో నొచ్చుకుంటాడు.

వ. ఆశ యింత దుర్నివార యగునే?' యనిన నమ్మునిపతి యమ్మనుజపతి కిట్లనియె. 154

ప్రతిపదార్థం: ఆశ= ఆస; ఇంత+దుర్నివార+అగునే= ఇంత వారించ శక్యం కానిది అవుతుందా; అనినన్= అనగానే; ఆ+మునిపతి= ఆ మునిరాజు; ఆ+మనుజపతికిన్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆశ ఇంత తప్పించుకొనలేనిదా!' అని రాజు అడగగానే ఆ ఋషభముని ఈ విధంగా అన్నాడు.

క. 'విను తీర్థయాత్ర సని యే । ననుత్తమం బైన బదరికాశ్రమమున నొ
క్కనిఁ గాంచితిఁ గృశగాత్రునిఁ । దనుఁ డను పేరింటివానిఁ దాపసవర్యున్. 155

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; ఏను= నేను; తీర్థయాత్ర+చని= పుణ్యతీర్థాలకు వెళ్ళి; అనుత్తమంబు+ఐన= అన్నిట్లోకి శ్రేష్ఠమైనదైన; బదరికా+ఆశ్రమమునన్= బదరికా క్షేత్రంలో; కృశగాత్రునిన్= బక్కచిక్కిన శరీరంగల; తనుఁడు అనుపేరింటి వానిన్= తనుడని పేరుగల; తాపస వర్యున్= గొప్పమునిని; ఒక్కనిన్= ఒకడిని; కాంచితిన్= చూచాను.

తాత్పర్యం: 'రాజా! నేను పూర్వం ఒకప్పుడు తీర్థయాత్రలు చేస్తూ, బదరికాశ్రమంలో తను డనే పేరుగల ఒక తాపసిని చూచాను. బక్కపలచని వాటం అతడిది.

క. కని భక్తిం బ్రణమిల్లుడు । ముని యాతిథ్యం బొనర్ప మోదంబున నా
తని పాల ధర్మఫణితులు । వినుచుండఁగ నొక్కధరణివిభుఁ డేతెంచెన్. 156

ప్రతిపదార్థం: కని= చూచి; భక్తిన్= వినయంతో; ప్రణమిల్లుడున్= మ్రొక్కగా; ముని= ఆ తనుమహర్షి; ఆతిథ్యంబున్= అతిథి సత్కారం; ఒనర్పన్= చేయగా; మోదంబునన్= సంతోషంగా; అతనిపాలన్= ఆ ముని వద్ద; ధర్మఫణితులు= ధర్మవాక్కులు; వినుచున్+ఉండఁగన్= వింటూ ఉండగా; ఒక్క ధరణి విభుఁడు= ఒక రాజు; ఏతెంచెన్= వచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ మునిని చూడగానే నమస్కరించాను. అతడు చక్కటి ఆతిథ్యం ఇచ్చాడు. చాలా సంతోషించాను. అతడి దగ్గర ధర్మోపదేశాలు వింటూ ఉన్నాను. అంతలో ఒక రాజు అక్కడకు వచ్చాడు.

వ. విషాదవివర్ణుం డగుచు సపరివారంబును సదారంబునుగాఁ జనుదెంచి యజ్జనపతి మునిపతిం గాంచిన నతం డతిథిపూజా సత్కారంబులు సేసి యాగమనకారణం బడిగిన నన్నరనాథుండు. 157

ప్రతిపదార్థం: విషాద వివర్ణుండు+అగుచున్= దుఃఖంతో వెలవెలబోతూ; సపరివారంబును= సేవాజనంతోనూ, సదారంబునుగాన్= భార్యతోనూ; చనుదెంచి= వచ్చి; ఆ+జనపతి= ఆ రాజు; మునిపతిన్= మునిశ్రేష్ఠుడిని; కాంచినన్= చూడగా; అతండు= ఆ తాపసి; అతిథి పూజా సత్కారంబులు+చేసి= అర్ఘ్యపాద్యాదులతో అతిథిని ఆదరించి; ఆగమన కారణంబున్= రాకకు కారణాన్ని; అడిగినన్= తెలుపుమని అడుగగా; ఆ నరనాథుండు= ఆ రాజు.

తాత్పర్యం: ఆ రాజుముఖం దుఃఖంతో వెలవెలబోతున్నది. వెంట భార్యా, పరిజనం ఉన్నారు. రాగానే మునిని చూచాడు. మునిరాజు ఆ రాజునకు అతిథి మర్యాదలు చేశాడు. ఎందుకు వచ్చారో తెలుపుమన్నాడు. ఆ రాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. తనయుఁ డొకండ; వాఁడు గుణధాముఁడు; క్రీడనవాంఛ సాంద్రకా
ననమున కేఁగి కాడుపడినం దడవం జనుదెంచి యెందుఁ గా
నను మది యాశ ద్రిప్పికొనినన్ వెగడందుచు వచ్చినాఁడ' న
న్న, నతఁడు వల్కకుండె వదనం బొకయించుక వాంచి చింతతోన్. 158

ప్రతిపదార్థం: తనయుఁడు+ఒకండు+అ= (నాకు) కొడుకు ఒక్కడే; వాఁడు= ఆ కొడుకు; గుణధాముఁడు= గుణవంతుడు; క్రీడన వాంఛన్= ఆడుకొనాలనే కోరికతో; సాంద్ర= దట్టమైన; కాననమునకున్= అడవిలోనికి; ఏఁగి= వెళ్ళి; కాడుపడినన్= కనపడకపోతే; తడవన్= వెదకటానికి; చనుదెంచి= వచ్చి; ఎందున్= ఎక్కడా; కానను= చూడలేకపోయాను; మదిన్= మనసును; ఆశ= అపేక్ష; త్రిప్పికొనినన్= క్షోభపెట్టగా; వెగడు+అందుచున్= తల్లడపడుతూ; వచ్చినాఁడను= వచ్చాను; అన్నన్= అనగానే; అతండు= ఆ ముని; వదనంబు= ముఖాన్ని; ఒక+ఇంచుక= కొంచెంగా; వాంచి= వంచుకొని; చింతతోన్= ఆలోచనతో; పల్కక+ఉండెన్= మారుమాట్లాడకుండా ఉన్నాడు.

తాత్పర్యం: 'నాకు ఒక్కడే కొడుకు. వాడు చాలా బుద్ధిమంతుడు. ఆడుకొనటానికి ఒకనాడు అడవిలోకి వెళ్ళాడు. తిరిగి రాలేదు. నేను వెతకటానికి వచ్చాను. ఎక్కడా కనపడలేదు. ఆశ తీరలేదనే కలవరపాటుతో ఆదుర్దాపడుతూ వచ్చాను' అన్నాడు. అది విని ముని తలవంచుకొని మౌనం వహించాడు.

క. చింతించు నతనితో భూ। కాంతుం డిట్లనియె మఱియు 'గాఢతరాశా
క్రాంతత దుర్లభఫల యగు। టింత యసహ్య మగునయ్య యెడఁద మునీంద్రా! 159

ప్రతిపదార్థం: చింతించు= విచారించే; అతనితోన్= ఆ మునితో; భూకాంతుండు= రాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; మునీంద్రా!= ఓ మునీశ్వరా!; మఱియున్= మళ్ళీ; గాఢతర ఆశా= ఎంతో ఎక్కువైన ఆశచేత; ఆక్రాంతతన్= ఆక్రమించబడటం వలన; దుర్లభ ఫల+అగుటన్= అందని ప్రయోజనం కలది అవటం వలన; ఎడఁద= మనస్సు; ఇంత= ఈపాటి; అసహ్యము+అగునయ్యా= ఓర్చుకోలేనిదవుతుందా!

తాత్పర్యం: మౌనంగా ఉన్న మునితో రాజు మళ్ళీ ఈ విధంగా అన్నాడు: 'బాగా ఆశపడ్డప్పుడు ఆ ఆశ అడియాస అయితే మనసు ఇంత తట్టుకోలేని దవుతుందా!'

వ. అనుటయు నత్తాపసోత్తముం డమ్మహీపతి యాననం బాలోకించి. 160

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఆ+తాపస+ఉత్తముండు= ఆ మునీశ్వరుడు; ఆ మహీపతి= ఆ రాజు; ఆననంబున్= ముఖాన్ని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: రాజు చెప్పగానే ముని అతడి వైపు చూస్తూ - (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఏ నరుఁడు మానసము ధృతి । నూన నుచితవృత్తి నుండు నుదిలగొనక యెం
దైనను నెయ్యది యేనియు । వానికి దుర్లభములేదు వసుధాధీశా! 161

ప్రతిపదార్థం: వసుధాధీశా!= ఓ రాజా!; ఏ నరుఁడు= ఏ మానవుడు; ఉదిలగొనక= చలించక; మానసము= మనస్సులో; ధృతిన్= ధైర్యాన్ని; ఊనన్= పొందగా; ఉచితవృత్తిన్= తగిన ప్రవర్తనతో; ఉండున్= ఉంటాడో; వానికిన్= వాడికి; ఎందున్+ఐనన్= ఎక్కడైనా; ఏ+అది+ఏనియున్= ఏ విషయంగా అయినా; దుర్లభము= పొందలేనిది; లేదు= ఉండదు.

తాత్పర్యం: 'ఓ రాజా! ఎవడైనా ఎక్కడైనా ఏ విషయంగానైనా మనసును దిటవు పరచుకొని తగిన రీతిలో నడచుకొంటే అతడికి లభ్యం కానిది ఉండదు.

క. అర్థాదులగు ఫలంబులు । ప్రార్థించినచోట సిగ్గువఱుపక తగ న
య్యర్థి సులభార్థుఁజేయు కృ । తార్థుఁడు దుర్లభుఁడు దలఁప నఖిల జగములన్. 162

ప్రతిపదార్థం: అర్థ+ఆదులగు= డబ్బు మొదలుగా గల; ఫలంబులు= దానాలు; ప్రార్థించినచోటన్= అడిగినచోట; తగన్= ఒప్పునట్లుగా; ఆ+అర్థిన్= ఆ యాచకుడిని; సిగ్గు+పఱుపక= అవమానించకుండా; సులభ+అర్థున్+చేయు= సులువుగా కోరినది పొందేలా చేసే; కృతార్థుఁడు= ధన్యుడు; తలఁపన్= ఆలోచించగా; అఖిల జగములన్= ఏడేడు లోకాలలోనూ; దుర్లభుఁడు= లభించడు.

తాత్పర్యం: డబ్బు ఆశించే యాచకుడిని చిన్నబుచ్చకుండా కోరుకున్నది సులభంగా పొందేటట్లు సహాయపడే ధన్యుడు అన్ని లోకాలలో వెతికినా దొరకడు'.

వ. అని పలికి పూర్వాచార స్మారకత్వంబున నిట్లనియె. 163

ప్రతిపదార్థం: అని పలికి= అని మాట్లాడి; పూర్వ+ఆచార= మునుపటి నడతను (బ్రతుకు తెరువు); స్మారకత్వంబునన్= గుర్తుకు తెచ్చుకొనటంవలన; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి మునుపటి జీవనసరళి తలపునకు వచ్చి ఇట్లా అన్నాడు.

క. 'వినుము గుణవంతుఁ డొకరుఁడు । ధనవంతుం డైన యొక్క ధరణీనాథుం
దన కూడు సీరకై కాం । చన మడిగి తదీయ బాలిశత్వము పేర్మిన్. 164

ప్రతిపదార్థం: వినుము= వినుము; ఒకరుఁడు గుణవంతుఁడు= ఒక బుద్ధి మంతుడు; ధనవంతుండు+ఐన= బాగా డబ్బుగల; ఒక్క ధరణీనాథున్= ఒక రాజును; తనకూడు చీరకున్+ఐ= తన తిండికీ బట్టకూ; కాంచనమున్= ధనాన్ని; అడిగి= యాచించి; తదీయ= ఆ ధనవంతుడియొక్క; బాలిశత్వము= మూర్ఖత్వం యొక్క; పేర్మిన్= అతిశయం వలన.

తాత్పర్యం: 'ఒక గుణవంతుడు తన తిండికీ బట్టకూ కావలసిన డబ్బును సాయంచేయుమని ఒక ధనవంతుడైన రాజును అడిగాడు. ఆ రాజు అతి మూర్ఖత్వంవలన. (తరువాతి పద్యంతో అన్వయం).

క. విహతాశుండై లజ్జా। మహితం బగు నాశ దొఱఁగు మదితో సకల
స్పృహయును నెవ్వనియందును। వహింప నని యతులమైన వ్రతముం బూనెన్.' 165

ప్రతిపదార్థం: విహత+ఆశుండు+ఐ= నెరవేరని ఆశ కలవాడై; లజ్జా= సిగ్గుచేత, అవమానకరమైన; మహితంబు+అగు+ఆశ= గొప్పదైన ఆశను; తొఱఁగు= వదలుకొనాలనే; మదితోన్= మనస్సుతో; సకల స్పృహయునున్= సమస్త ఆశనూ; ఎవ్వనియందును= ఎవ్వడిని గూర్చి అయినా; వహింపను= తాల్చను; అని; అతులము+ఐన= సాటిలేని; వ్రతమున్= నియమాన్ని; పూనెన్= వహించాడు.

తాత్పర్యం: ఆశ తీరనివాడై లజ్జాకరమైన పేరాసను వదలుకొనాలనుకొన్నాడు. ఎవరినిగూర్చి ఎట్లాంటి కోరికలు కోర నసే వ్రతం పట్టాడు'.

వ. అని చెప్పియప్పార్థివుం దొల్లి తాను ధన మర్థించి యఫలితప్రయత్నుండై తత్కాలజనిత వైరాగ్యంబునం దపస్వి యగుట తేటపఱిచి వెండియు. 166

ప్రతిపదార్థం: అని చెప్పి= అని మాట్లాడి; తొల్లి= ఒకప్పుడు; తాను= తాను; ఆ పార్థివున్= ఆ రాజును; ధనము= డబ్బు; అర్థించి= అడిగి; అఫలితప్రయత్నుండు+ఐ= సిద్ధించని ప్రయత్నం కలవాడై; తద్+కాలజనిత= ఆ సమయంలో కలిగిన; వైరాగ్యంబునన్= విరక్తివలన; తపస్వి+అగుటన్= ముని కావటాన్ని; తేటపఱిచి= స్పష్టంగా తెలిపి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ఒకసారి నేను, ఆ రాజును డబ్బు అడిగినా ఫలితం దక్కలేదు. దానితో విరక్తి కలిగి ముని నయ్యాను.' అంటూ స్పష్టపరిచాడు. మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. ఒడఁబడి యీనివానియెడ నుల్లమునందుఁ గృతఘ్నుతం గడుం
జెడుగగు దుర్వినీతునెడఁ జిత్తము కోర్కికిఁ బట్టు సేసి లే
వడి యగు నీచకాంతయెడ వారక యాసలు సాఁగు నిట్లు పె
క్కెడలను బాఱు నాసగమియెల్లఁ దొఱంగుము సౌఖ్య మొందెదున్.' 167

ప్రతిపదార్థం: ఒడఁబడి= సమ్మతించి; ఈనివాని+ఎడన్= దానం చేయనివాడి విషయంలో; ఉల్లమునందున్= మనస్సులోని; కృతఘ్నుతన్= చేసిన మేలును మరచిపోవటం వలన; కడున్= ఎంతో; చెడుగు+అగు= దుష్టుడైన; దుర్వినీతు+ఎడన్= అవినీతిపరుడి విషయంలోనూ; చిత్తము= మనస్సును; కోర్కికిన్= ఆశకు; పట్టు+చేసి= తావలం చేసి; లేవడి+అగు= పేదరాలైన; నీచ కాంత+ఎడన్= నీచ స్త్రీ పట్లా; వారక= ఎపుడూ; ఆశలు సాఁగున్= కోర్కెలు కొనసాగుతూనే ఉంటాయి; ఇట్లు= ఈ విధంగా; పెక్కు ఎడలన్= అనేక విషయాలలోనూ; పాఱు= పరుగెత్తే; ఆసగమి ఎల్లన్= అన్ని ఆశలను; తొఱంగుము= వదలుకొమ్ము; సౌఖ్యము= సుఖం; ఒందెదున్= పొందుతావు.

తాత్పర్యం: ఇస్తా నని ఇవ్వని వాడిమీద, కృతఘ్నుడైన దుష్టుడిమీద, మనసును ఆశకు వశం చేసిన పేదరాలైన నీచస్త్రీ పట్లా ఆశలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. ఇంకా ఎన్నో విషయాలలో పరుగులు పెట్టే అన్ని ఆశలను వదలుకొమ్ము. సుఖపడతావు'.

వ. అని యాసపజ్జం బోవమి సుఖకరం బగుటం దెలిపి, యవ్వీరద్యుమ్ననకుం గరుణించి, యతని కొడుకు భూరిద్యుమ్నుం దన తపోమహిమ నాకర్షించి వీడుకొలిపె' నని చెప్పి ఋషభుండు సుమిత్రుని చిత్తంబు మృగయాశాయత్తంబు గాకుండునట్లుగా బోధించెఁ; బాండవాగ్రజా! నీవును నివ్వాక్యంబు లాదరించి సుస్థిరుండవై నిరాశత్వంబున సంతాపంబు దక్కి సుఖివి గ'మ్మని పలికిన భీష్మునితో నబ్భూపతి భవదీయ వచనామృతాస్వాదనంబున మనంబు దృప్తి సన; దింకను ధర్మప్రకారంబులు వివరింపు' మనిన నతం డతని కిట్లనియె. 168

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; ఆస పజ్జన్= ఆశ వైపునకు; పోవమి= పోకుండటం (మళ్ళకపోవటం); సుఖకరంబు+అగుటన్= ఎంతో సుఖం కలిగిస్తుందని; తెలిపి= తెలియచెప్పి; ఆ+వీరద్యుమ్ననకున్= ఆ వీరద్యుమ్నుడిని; కరుణించి= కనికరించి; అతనికొడుకు= అతడి కుమారుడైన; భూరిద్యుమ్నున్= భూరిద్యుమ్నుడిని; తన తపోమహిమన్= తన తపశ్శక్తిచే; ఆకర్షించి= రప్పించి; వీడుకొలిపెన్= పంపాడు; అని చెప్పి= అని పలికి; ఋషభుండు= ఋషభ ముని; సుమిత్రుని చిత్తంబు= సుమిత్రుడి మనస్సు; మృగయా+ఆశ= వేటాడాలనే కోరికకు; ఆయత్తంబు+కాక+ఉండునట్లుగాన్= లొంగకుండేటట్లు; బోధించెన్= ఉపదేశించాడు; పాండవ+అగ్రజా!= ఓ ధర్మరాజా!; నీవును= నీవు కూడా; ఈ+వాక్యంబులు= ఈ వాక్కులను; ఆదరించి= మన్నించి; సుస్థిరుండవు+ఐ= దిటవుకలవాడవై; నిరాశత్వంబునన్= అడియాస అయినపుడు; సంతాపంబు దక్కి= బాధను విడిచి; సుఖివి కమ్ము= సుఖం పొందుము; అని పలికినన్= అని చెప్పిన; భీష్మునితోన్= భీష్ముడితో; ఆ+భూపతి= ఆ రాజు; భవదీయ= నీయొక్క; వచన+అమృత= అమృత ప్రాయమైన మాటల; ఆస్వాదనంబునన్= ఆస్వాదించటంచేత; మనంబు= మనస్సు; తృప్తిచనదు= సంతుష్టి పొందదు; ఇంకను= ఇంకా; ధర్మప్రకారంబులు= న్యాయ పద్ధతులు; వివరింపుము= వివరంగా చెప్పవలసినది; అనినన్= అనగానే; భీష్ముండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అట్లా ఆశను చంపుకొంటేనే ఎంతో సుఖం' - అని చెప్పి ఆ వీరద్యుమ్నుడి మీద జాలిపడి తన తపోబలంతో ఆతడి కొడుకు భూరిద్యుమ్నుడిని రప్పించాడు. వీడ్కోలుతో సాగనంపాడు. ఓ ధర్మరాజా! ఇట్లా ఋషభముని సుమిత్రుడి మనస్సు మళ్ళీ వేటమీదకు మళ్ళకుండేటట్లు ఉపదేశించాడు. అట్లాగే నీవు కూడా నా వాక్యాలను చెవినిపెట్టుము. మంచిదిట్టవు కమ్ము. ఆశ నెరవేరకపోయినా బాధపడవద్దు సుఖంగా ఉంటావు' అన్నాడు భీష్ముడు. ధర్మరాజు 'నీ వాగమృతాన్ని చవిచూడటం వలన నా మనస్సుకు ఇంకా తనివి తీరలేదు. ఇంకా కొన్ని ధర్మపద్ధతులను వినాలని ఉన్నది. వివరంగా చెప్పవలసిం'దని అనగానే భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

క. 'తన భూమిఁ బరుల భూమిని । ధనము లుపార్జింపవలయు ధరణీశునకున్
ధనములు మూలము రాజ్యం । బునకును మూలమగు ధర్మమునకు నరేంద్రా! 169

ప్రతిపదార్థం: నరేంద్రా!= ధర్మరాజా!; ధరణీశునకున్= రాజునకు; తన భూమిన్= తన దేశంలోనూ; పరులభూమిని= పరాయి దేశంలోనూ; ధనములు= డబ్బులు; ఉపార్జింపవలయున్= గడించాలి; రాజ్యంబునకును= దొరతనానికి; ధనములు= సంపద; మూలము= ఆధారం; ధర్మమునకున్= పుణ్యానికీ; మూలము+అగున్= కారణం అవుతుంది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! రాజు తన దేశంలోనూ, శత్రుదేశంలోనూ డబ్బును సంపాదించుకొనాలి. ఏలుబడికీ, పుణ్యం పురుషార్థాలకూ మూలం ఆ ధనమే.

క. అది బెట్టిదంపు వెరవున । మృదుభూతో పాయమునను మెయికొనద ప్రజం
బొదువ వలయు నాజ్ఞా సం । పద గల సాకతముతోడఁ బతి యవహితుడై. 170

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అది= ఆ ధనం; బెట్టిదంపు వెరవునన్= కఠినమైన ఉపాయంచేతగానీ; మృదుభూత= సౌమ్యమైన; ఉపాయమునను= పద్ధతిచేతగానీ; మెయికొనదు+అ= లభించదు; పతి= రాజు; అవహితుఁడు+ఐ= సావధానుడై; ఆజ్ఞా సంపద కల= ఆదేశానుకూల మైన; సాకతముతోడన్= ఊరడింపులతో; ప్రజన్= ప్రజలను; పొదువ వలయున్= చేరదీయాలి.

తాత్పర్యం: ఆ ధనం కాఠిన్యంవలనగాని, మృదుస్వభావంవలనగాని లభించకపోతే. రాజు ప్రజలను ఆదేశిస్తూ ఊరడిస్తూ చేరదీయాలి. ధనార్జనవిషయంలో ఎంతో మెలకువగా ఉండాలి.

క. విను బండారము పెరుఁగని । జనపతికి బలంబు మిత్రసంపదయును గ
ల్గునె? బలమిత్రవిహీనున । కొనరునె రాజ్యంబు విభవ మున్నత మగునే? 171

ప్రతిపదార్థం: విను= వినుము; బండారము= బొక్కసం; పెరుగని= పెంపొందని; జనపతికిన్= రాజునకు; బలంబు= సేన; మిత్ర సంపదయును= మిత్రుల సమృద్ధి; కల్గునె?= సమకూరునా?; బలమిత్ర విహీనునకున్= సైన్యం, స్నేహం లేనివాడికి; రాజ్యంబు= ఏలుబడి; ఒనరునె?= కలుగునా?; విభవము= వైభవం; ఉన్నతము+అగునే?= గొప్పది అవుతుందా?

తాత్పర్యం: ధనాగారం పెంపొందని రాజునకు తగినంత సైన్యం ఉండదు. మిత్రుల అండా ఉండదు. బలం మిత్రసంపత్తి లేని ఏలుబడి ఒప్పుకాదు. ఆ రాజ్యవైభవం అంత ఉన్నతంగానూ ఉండదు.

ఉ. కావున నర్థ సంపదలు గల్మియ యింతకు మూలమైన ను
ర్వీవరుఁ డాత్మశక్తి కతిరిక్తము లైన సముద్యమంబులం
దా వెలయం దలంచి సముదగ్రతఁ గైకొను టొప్ప; దవ్విధం
బావిభు తొంటి కల్మికిని హాని యొనర్చు, హరించుఁ బ్రాణముల్. 172

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అర్థ సంపదలు= ధనసంపత్తులు; కల్మియ= కలిగి ఉండటమే; ఇంతకున్= దీని కంతకూ; మూలము+ఐనను= ఆధారం అయినా; ఉర్వీవరుఁడు= రాజు; ఆత్మశక్తికిన్= తన శక్తికి; అతిరిక్తములు+ఐన= మించినవి అయిన; సముద్యమంబులన్= చక్కటి పూనికలతో; తాన్= తాను; వెలయన్ తలంచి= ప్రకాశించాలని భావించి; సముదగ్రతన్= ఎంతో గొప్పగా; కైకొనుట= వశపరచుకొనటం; ఒప్పదు= తగదు; ఆ విధంబు= ఆ పద్ధతి; తొంటి కల్మికిని= మూలసంపదకూ; హాని ఒనర్చున్= చేటు కలిగిస్తుంది. ప్రాణముల్= ప్రాణాలను; హరించున్= తీస్తుంది.

తాత్పర్యం: అర్థ సంపత్తి ఉండటమే దీని అంతకూ మూలం. అయినా, రాజునకు తన శక్తికి మించిన గొప్ప ప్రయత్నాలు తగవు. తాను వెల్గొందాలనీ వాళ్ళను ఎంతో గర్వంగా వశపరచుకొనాలనీ అనుకొనటం మంచి పద్ధతి కాదు. ఈ తరహా తీరు మూలధనానికే ముప్పు తెస్తుంది, ప్రాణాలను తీస్తుంది.

క. తన కొలఁది నుపాయంబులు । పొనరిచి ధనవంతుఁ డగుట భూపగుణము ని
ర్ధనుని నిజ ప్రజయును గై । కొనదు విరోధులును సరకుగొనరు కుమారా! 173

ప్రతిపదార్థం: కుమారా!= బిడ్డా!; తన కొలఁదిన్= తన శక్తికొద్దీ; ఉపాయంబులు= సామదానాది ఉపాయములు; పొనరిచి= కూర్చి (చేసి); ధనవంతుఁడు+అగుట= డబ్బుకూడబెట్టటం; భూపగుణము= రాజధర్మం; నిర్ధనునిన్= డబ్బులేనివాడిని; నిజ ప్రజయును= తన ప్రజ అయినా, కన్న సంతానమైనా; కైకొనదు= లెక్కపెట్టదు; విరోధులును= పగవారూ; సరకు గొనరు= లక్ష్యపెట్టరు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఏ ఉపాయంచేతనైనా తన శాయశక్తులా డబ్బు సంపాదించటం రాజధర్మం. డబ్బు లేనివాడిని తన ప్రజ, (కన్నసంతానమూ) లక్ష్యపెట్టదు. పగవారూ ఆదరించరు.

క. తెరవాటున ముచ్చిమి ను। ద్ధురు లగు క్రూరులకు మూఁక దోరంబగు న
న్వెరవరిదొరల బలంబుగ। ధరణీశుఁడు గూర్చుకొనుట దైన్యము దెచ్చున్. 174

ప్రతిపదార్థం: తెరవాటునన్= దారిదోపిడీ చేత; ముచ్చిమిన్= దొంగతనంచేత; ఉద్ధురులు+అగు= సమర్థులైన; క్రూరులకున్= దుష్టులకు; మూఁక= సేన; తోరంబు+అగున్= అధికంగా ఉన్నది; ఆ+వెరవరి+దొరలన్= దారి దోపిడీలలో; ఆరితేరిన ఆ నాయకులను; ధరణీశుఁడు= రాజు; బలంబుగన్= సైన్యంగా; కూర్చుకొనుట= సమీకరించుకొనటం; దైన్యము= దీనదశను; తెచ్చున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: దారిదోపిడీలు, దొంగతనాలు చేసే దుష్టులకు బలగం ఎక్కువే ఉంటున్నది. దారిదోపిడీ దొరలను రాజు తనసైన్యంలో చేర్చుకుంటే దురవస్థను తెచ్చిపెట్టుకొన్నట్లవుతుంది.

క. అన్యాయంబునఁ బొదలిన। సైన్యముచే సమర జయము సమకూర; దనూ
నన్యాయ పరులు గాంతురు। మాన్యత్వము దస్యులైన మనుజాధీశా! 175

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= రాజా!; అన్యాయంబునన్= ధర్మం పాటించకుండా; పొదలిన= ఉన్న; సైన్యముచేన్= సేనచేత; సమరజయము= పోరులో గెలుపు; సమకూరదు= కలుగదు; దస్యులు+ఐనన్= దొంగలైనా; పగవారైనా; అనూనన్యాయ పరులు= అతి ధర్మపరులు (అయితే); మాన్యత్వము= మన్ననను (గౌరవాన్ని); కాంతురు= పొందుతారు.

తాత్పర్యం: న్యాయాన్ని పట్టించుకొనని సైన్యం యుద్ధంలో గెలుపొందదు. ఓ రాజా! దొంగలైనా, విరోధులైనా, అతిధర్మపరులైతే గౌరవించబడతారు.

వ. ఇట్లగుటకు నుదాహరణం బగు నొక్క యితిహాసంబు గల; దాకర్ణింపుము. 176

ప్రతిపదార్థం: ఇట్లు+అగుటకున్= ఇట్లా అవటానికి; ఉదాహరణంబు+అగు= దృష్టాంత మైన; ఒక+ఇతిహాసంబు= ఒక పూర్వగాథ; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇట్లు జరగటానికి ఉదాహరణగా ఒక పూర్వగాథ ఉన్నది వినుము.

భీష్ముండు ధర్మరాజునకుఁ గాపవ్యోపాఖ్యానము సెప్పుట (సం. 12-91-1)

సీ. అవనీశ! పారియాత్రాచలంబున నుండు। నొక బోయ ధర్మసంయుక్తబుద్ధి
వింట నేర్పరి మృగవితతిప్రకారజ్ఞుఁ। డారణ్య దేశ సంచారశాలి
తల్లికిఁ దండ్రికిఁ దద్దయు భక్తుఁడై। ఫలమూలమధుమాంసములును మేలి
కూడుగూరలు దొరకొల్పి వారికిఁ దృప్తి। యావహించుచు శయనాసనాదు

తే. లగు పదార్థముల్ హృద్యంబులుగ నొనర్చు;। వలయు నాహారములు మునివరుల కిచ్చుఁ;
బగఱఁ దోఁచినఁ బరిమార్చు భండనమున। నొకఁడ వేవురనైన మహోగ్రగతుల. 177

ప్రతిపదార్థం: అవనీ+ఈశ!= ఓ రాజా!; పారియాత్ర+అచలంబునన్= పారియాత్రం అనే కొండమీద; ఉండున్= ఉండేటటువంటి; ధర్మసంయుక్త= న్యాయంతో కూడిన; బుద్ధి= ఆలోచన కలవాడు; వింటన్= విలువిద్యలో; నేర్పరి= ఆరితేరినవాడు; మృగతతి=

ప్రాణకోటియొక్క; ప్రకారజ్ఞుఁడు= పద్ధతి తెలిసినవాడు; ఆరణ్యదేశ= అటవీ ప్రాంతాలలో; సంచారశాలి= తిరిగే స్వభావంగల; ఒక బోయ= ఒక వేటకాడు; ఉండున్= ఉండేవాడు; (అతడు); తల్లికిన్= తల్లికీ, తండ్రికిన్= తండ్రికీ; తద్దయున్= ఎంతో; భక్తుఁడు+ఐ= సేవకుడై; ఫల= పండ్లు; మూల= కందగడ్డలూ; మధు= తేనె; మాంసములును= మాంసంముక్కలూ; మేలికూడు= మంచి అన్నం; కూరలున్= కూరలు; దొరకొల్పి= సమకూర్చి పెట్టి; వారికిన్= వాళ్ళకు; తృప్తి ఆవహించుచున్= సంతృప్తి కలిగింపచేస్తూ; శయన= పడుకొనటానికి; పక్కలూ; ఆసన= కూర్చొనటానికి పీటలూ; ఆదులు= మొదలైన; పదార్థముల్= వస్తువులను; హృద్యంబులుగన్= మనస్సుకు ఇంపు కలిగించేవిగా; ఒనర్చున్= ఏర్పరుస్తాడు; వలయు= కావాల్సిన; ఆహారములు= భోజనాలు; మునివరులకున్= మునిముఖ్యులకు; ఇచ్చున్= సమర్పిస్తాడు; తోఁచినన్= తడితే; పగఱన్= శత్రువులను; భండనమునన్= యుద్ధంలో; మహా+ఉగ్రగతులన్= ఎంతో భయంకరమైన పోకడలతో; ఒకఁడు+అ= ఒక్కడే; వేవురన్+ఐనన్= వేలమంది నైనా; పరిమార్చున్= చంపుతాడు, రూపుమాపుతాడు.

తాత్పర్యం: రాజా! పారియాత్ర పర్వతం మీద ఒక బోయవాడు ఉండేవాడు. అతడు న్యాయపరుడు. విలువిద్యలో మంచి నేర్పరి. జంతువుల తీరు తెన్నులు బాగా ఎరిగినవాడు. అడవులలో తిరగటానికి అలవాటు పడ్డవాడు. తల్లి దండ్రులంటే అతడికి ఎంతో భక్తి. వాళ్ళు తృప్తిపడేటట్లు వాళ్ళకు కావాల్సిన పండ్లూ, కందమూలాలూ, తేనెలు, మాంసం, అన్నం, కూరలు అన్నీ సమకూర్చి పెట్టేవాడు. వాళ్ళు ఇష్టపడేటట్లు పడుకొనటానికి పక్కలూ, కూర్చోవటానికి పీటలూ అన్నీ ఏర్పాటు చేసేవాడు. అక్కడ ఉండే ముని స్వాములందరికీ కావలసిన ఆహార పదార్థాలు అందించేవాడు. పగవా డనిపిస్తే చాలు యుద్ధంలో రుద్రుడై ఒక్కడే వేయిమందిని చంపేవాడు.

క. కాపవ్యం డను పేరను । దీపించిన యతని భూరితేజముఁ గని ర
క్షాపరుఁడు వలయు మనకని । యా పాలమునఁ గల్గు దస్యులందఱుఁ దమలోన్. 178

ప్రతిపదార్థం: కాపవ్యండు+అనుపేరను= కాపవ్యుడనే పేరుతో; దీపించిన= పేరుపొందిన (ప్రకాశిస్తున్న); అతని= ఆ బోయవాడి; భూరి తేజము= గొప్ప పరాక్రమాన్ని; కని= చూచి; ఆ పాలమునన్= ఆ పారియాత్ర పర్వత ప్రాంతాన; కల్గు= ఉండే; దస్యులు+అందఱున్= దొంగలందరూ; మనకున్= మనకందరికీ; రక్షాపరుఁడు= రక్షించేవాడు; వలయున్= కావాలి; అని= అనుకొని; తమలోన్= తమలో తాము.

తాత్పర్యం: బోయవాడి పేరు కాపవ్యుడు. ఆతడి పరాక్రమాన్ని చూచి ఆ కొండమీద ఉండే దొంగలంతా కూడి మనకందరికీ ఒక రక్షకుడు కావాలనుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అతనిఁ దమకు నెల్ల నాధిపత్యము సేయు । వానిఁగా వరించువారు గాఁగ
నిశ్చయించి కూడి నెమ్మిమైఁ జనుదెంచి । కాంచి యిట్టు లనిరి గారవమున. 179

ప్రతిపదార్థం: అతనిన్= ఆ కాపవ్యుడిని; తమకున్+ఎల్లన్= తమకందరికీ; ఆధిపత్యము= పెత్తనం; చేయువానిన్+కాన్= చేసే వాడిగా; వరించువారుకాఁగన్= కోరుకొనువారై; నిశ్చయించి= నిర్ణయించుకొని; కూడి= ఏకమై; నెమ్మిమైన్= సంతోషంతో; చనుదెంచి= వచ్చి; కాంచి= ఆ కాపవ్యుడిని చూచి; గారవమునన్= గౌరవంతో; ఇట్టులు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: తమకు అందరికీ నాయకుడిగా ఉండటానికి కాపవ్యుడిని కోరాలనే నిర్ణయానికి వచ్చి దొంగలంతా కలిసి సంతోషంగా అతడి దగ్గరకు వెళ్ళారు. ఎంతో మర్యాదగా ఈ విధంగా అన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. బలవిక్రమసంపన్నుఁడ వ । లఘుచరిత్రుఁడవు మమ్ము నందఱం బ్రభువై
తలకొని రక్షింపుము; నీ । వలచిన పనిగొనుము పుత్రవర్గముఁ బోలెన్.' 180

ప్రతిపదార్థం: బలవిక్రమ సంపన్నుఁడవు= శక్తి పరాక్రమాల సంపత్తి కలవాడవు; అలఘు చరిత్రుఁడవు= గొప్పనడవడి కలవాడవు అయిన నీవు; ప్రభువు+ఐ= నాయకుడివై; మమ్మున్+అందఱన్= మమ్మల్నందరినీ; పుత్రవర్గమున్+పోలెన్= కన్న కొడుకులవలె; తలకొని= ఒప్పుకొని; రక్షింపుము= కాపాడుము; నీ వలచినపని= నీకు కావాల్సిన పని; కొనుము= చేయించుకొమ్ము.

తాత్పర్యం: నీవు బలపరాక్రమాలు రెండూ నిండుగా ఉన్నవాడివి, దొడ్డనడవడి కలవాడవు. మా అందరికీ నాయకుడివై మమ్మల్ని కన్నకొడుకులవలె కాపాడుకొమ్ము. మాచేత నీకు కావాల్సిన పనులు చేయించుకొమ్ము'.

వ. అనిన విని యతఁడు వారల కిట్లనియె. 181

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; అతఁడు= ఆ కాపవ్యుడు; వారలకున్= దొంగలతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అది విన్న కాపవ్యుడు దొంగలతో ఈ విధంగా చెప్పాడు.

సీ. శిశుజన మునిజన స్త్రీజనంబులఁ । జంపఁగా; దెట్టివాఁడైనఁ గడఁగి మీఁదఁ
గవియక పొడుచుట కల్మషం; బంగనఁ । జెఱపట్టఁ దగదు; విశేష మొకఁడు
వినుఁ; డెల్ల సత్త్వంబులను బెంటిఁ జంపుట । పాపంబు; గోవుల బ్రాహ్మణులను
సంకటపెట్టంగఁ జనదు; తదీయ హి । తము గోరి పూని యుద్ధంబు సేఁత

తే. యధిక పుణ్యంబు సస్యక్రియావిఘాత । మాచరించుట గడుదోష; మవని ప్రజకు
బాధ గావించి కుడిచి శవంబు దొలుచు । పువ్వుగతి నది వొలియంగఁ బొలియు నతఁడు. 182

ప్రతిపదార్థం: శిశుజన= పసిబిడ్డలను; మునిజన= మునులను; స్త్రీ జనంబులన్= స్త్రీలనూ; చంపన్+కాదు= చంపటం తగదు; ఎట్టివాఁడు+ఐనన్= ఎటువంటివాడైనా; కడఁగి= పూనుకొని; మీఁదన్= పైనబడి; కవియక= కలబడకుండా; పొడుచుట= చంపటం; కల్మషంబు= పాపం; అంగనన్= స్త్రీని; చెఱపట్టన్= బలాత్కరించటం; తగదు= కూడదు; ఒకఁడు విశేషము= ప్రత్యేకమైన మరొక విషయాన్ని; వినుఁడు= వినండి; ఎల్లసత్త్వంబులను= అన్ని జంతువులలోను; పెంటిన్= ఆడజంతువును; చంపుట= చంపటం; పాపంబు= పాపం; గోవులన్= ఆవులను; బ్రాహ్మణులను; సంకటపెట్టంగన్= కష్టపెట్టటం; చనదు= ఒప్పదు; తదీయ= ఆ గో బ్రాహ్మణులయొక్క; హితము కోరి= మేలు కోరుకొని; పూని= తలపెట్టి; యుద్ధంబు+చేఁత= యుద్ధం చేయటం; అధిక పుణ్యంబు= ఎక్కువ పుణ్యం; సస్యక్రియా విఘాతమున్= పంట పైరులకు చెరుపు; ఆచరించుట= చేయటం; కడుదోషము= ఎంతో పాపం; అవని ప్రజకున్= నేలమీది జనాన్ని; బాధ కావించి= హింసపెట్టి; కుడిచి= తిని; శవంబు= పీనుగను; తొలుచు= డొల్లచేసే (తినే); పువ్వుగతిన్= పురుగువలె; అది పొలియంగన్= ఆ సంపాదన నశించగానే; అతఁడు= అతడు (ప్రజలను బాధించి పొట్టపోసికొనేవాడు); పొలియున్= నశిస్తాడు.

తాత్పర్యం: 'పసివాళ్ళనూ, మునులనూ, ఆడవాళ్ళనూ చంపకూడదు. మనపై కలబడనివాడి జోలికి పోవటం మహాపాపం. ఆడవాళ్ళను చెరపట్టటం కూడనిపని. ఇంకొక విశేషం కూడా వినండి. క్రూర సాధు జంతువులన్నిట్లో ఆడ జంతువు ప్రాణం తీయకూడదు. ఆవులను, బ్రాహ్మణులను కష్టపెట్టకూడదు. వారి మేలు కోరి యుద్ధం చేస్తే ఎంతో పుణ్యం. పంటపొలాన్ని నాశనం చేయటం ఎంతో పాపం. ప్రజలను బాధించి తన పొట్టనింపుకొనేవాడు శవాన్ని డొలిచే పురుగు శవం నశించగానే తానూ నాశనమైనట్లే ఆ లబ్ధి నశించగానే తానూ నశిస్తాడు.

వ. అని చెప్పి 'మీర లీధర్మాధర్మంబు లెఱింగి నాపంచిన తెఱంగున బ్రదికెదరేని మీకు ముఖ్యుండ నయి సఖ్యంబు సౌఖ్యంబుఁ బెనుప మీ యోగక్షేమంబు లరసెద' ననియె. దానికి వారలందఱు బ్రీతింబొంది, యాతని వశంబున వర్తించి వర్ధిల్లి; రిట్లు కాపవ్యుండు సాధులకు హితం బగునట్లుగా దస్యులం బాపంబులకుం బాపి తానును వారును నిహపర సిద్ధులం బ్రశస్తి వహించె. 183

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; మీరలు= మీరు; ఈ ధర్మ+అధర్మంబులు= ఈ న్యాయాన్యాయాలు; ఎఱింగి= తెలిసికొని; నాపంచిన తెఱంగునన్= నేను చెప్పినట్టు విధంగా; బ్రదికెదరు+ఏని= జీవించేటట్లయితేనే; మీకున్= మీకు; ముఖ్యుండను+అయి= ప్రధాన నాయకుడనై; సఖ్యంబు= స్నేహం; సౌఖ్యంబున్= సుఖమూ; పెనుపన్= పెంపొందేటట్లు; మీ యోగక్షేమంబులు= మీ క్షేమలాభాలు (మంచి చెడ్డలు); అరసెదన్= విచారిస్తాను; అనియెన్= అన్నాడు; దానికిన్= ఈ విషయానికి; వారలు+అందఱున్= వారంతా; ప్రీతిన్+పొంది= సంతోషపడి; ఆతని వశంబునన్= కాపవ్యుడికి విధేయులై; వర్తించి= ఉండి; వర్ధిల్లిరి= వృద్ధిలోకి వచ్చారు; ఇట్లు= ఈ విధంగా; కాపవ్యుండు= బోయవాడు; సాధులకున్= మంచివాళ్ళకు; హితంబు= మేలు; అగునట్లుగాన్= కలిగేట్లు; దస్యులన్= దొంగలను; పాపంబులకున్= పాపపు పనులనుండి; పాపి= తొలగించి; తానును= తానూ (కాపవ్యుడూ); వారును= ఆ దొంగలూ; ఇహ= ఈ లోక సుఖాలు; పర= పరలోక సుఖాలు; సిద్ధులన్= నెరవేరటంవలన; ప్రశస్తిన్= ప్రఖ్యాతిని; వహించెన్= పొందారు.

తాత్పర్యం: మీ రంతా న్యాయాన్యాయాలు తెలిసికొని నేను చెప్పినట్లు బ్రతకండి. మీకు నాయకుడినై మీలో స్నేహ సౌఖ్యాలు పెంచుతాను; మీ మంచి చెడ్డలు కనుక్కొంటుంటాను' అని చెప్పాడు. దీనికి ఆ దొంగలు ఎంతో సంతోషించారు. ఆతడికి లోబడి నడచుకుంటూ బాగా అభివృద్ధిలోకి వచ్చారు. ఇట్లా కాపవ్యుడు మంచివాళ్ళకు మేలు జరిగేటట్లు దొంగలను పాపపు పనులనుండి మళ్ళించాడు. తానూ వాళ్ళూ ఇహపరలోక సౌఖ్యాలు సాధించుకొని ఎంతో పేరు పొందారు.

క. కాపవ్యోపాఖ్యానము । పాపహరము దీని శ్రవణపఠనము లటవీ
వ్యాపార క్షేమంకర । రూపములగు దస్యుమృగవిరోధము లడఁచున్. 184

ప్రతిపదార్థం: కాపవ్య+ఉపాఖ్యానము= కాపవ్యుడి కథ; పాపహరము= పాపాలను పోగొట్టుతుంది; దీని శ్రవణ పఠనములు= ఈ కథ వినటం చదవటం అనేవి; అటవీవ్యాపార= అడవులలో చేసే కార్యాలలో; క్షేమంకర రూపములు= శుభాన్ని చేకూర్చేవి; అగున్= అవుతాయి; దస్యు= దొంగల; మృగ= క్రూరజంతువుల వలన కలిగే; విరోధములు= అడ్డంకులను; అడఁచున్= ఆపుతాయి.

తాత్పర్యం: ఈ కాపవ్యుడి కథ పాపాలను తుడిచివేస్తుంది. దీనిని విన్నా చదివినా అడవులలో చేసే కార్యాలన్నీ శుభప్రదాలవుతాయి. దొంగలవలనా క్రూరమృగాలవలనా కలిగే ఆటంకాలన్నీ తొలగిపోతాయి.

భీష్ముఁడు ధర్మజునకు దీర్ఘదర్శి మొదలగు మత్స్యముల తెఱం గెఱింగించుట (సం. 12-135-1)

వ. అని చెప్పి భీష్ముండు వెండియు నిట్లను 'దీర్ఘదర్శియుఁ బ్రాప్తకాలజ్ఞుండును దీర్ఘసూత్రుండును ననుమత్స్యంబులు మూఁడు జలచర బహుళంబగు నొక్కయేటి మడువునఁ దమలోనం బొందుగలిగి యుండునవి; వేసవిసొచ్చిన దీర్ఘదర్శి దక్కటి రెంటిని గూడం బిలిచి. 185

ప్రతిపదార్థం: అని; భీష్ముండు; చెప్పి= తెలియచెప్పి; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; దీర్ఘదర్శియున్= దీర్ఘదర్శీ (రాబోయేదాన్ని ముందుగా చూసేవాడు); ప్రాప్తకాలజ్ఞుండును= ప్రాప్తకాలజ్ఞుడు (కాలం ప్రాప్తించినపుడు ఉపాయం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తెలిసికొనేవాడు); దీర్ఘసూత్రుండును= దీర్ఘ సూత్రుడు (మెల్లగా పనులు చేసేవాడు); అను మత్స్యంబులు= అనే చేపలు; మూఁడు= మూడును; జలచర= అనేక నీటి ప్రాణులతో; బహుళంబు+అగు= ఎక్కువగా ఉండేటి; ఒక్క+ఏటి మడువునన్= ఒక్కనది మడుగులో; తమలోనన్= తమలోతాము; పొందు కల్గి= పొత్తు పెట్టుకొని; ఉండున్+అవి= ఉండేటటువంటివి; వేసవి+చొచ్చినన్= ఎండాకాలం రాగానే; దీర్ఘదర్శి= దీర్ఘదర్శి అనే చేప; తక్కటి రెంటిని= మిగతా రెండు చేపలను; కూడన్ పిలిచి= కలుద్దాం రమ్మని.

తాత్పర్యం: అని చెప్పి భీష్ముడు మళ్ళీ ఈ విధంగా చెప్పాడు: 'నీటి జంతువులు ఎక్కువగా ఉండే ఒక ఏటి మడుగులో మూడు చేపలు ఉండేవి. అవి దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు అనేవి. ఈ మూడు పరస్పరం ఎంతో స్నేహంగా మెలిగేవి. ఎండాకాలం రాగానే దీర్ఘదర్శి మిగతా రెండు చేపలను కూడగట్టుకొని పిలిచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'మడు వింకఁగఁ బాఱెడు; నీ । రెడ త్రెవ్విన నొండు సోటి కేఁగఁగ రా ది
పృుడు నింకని నీళ్ళులు గల । మడువునకుం బోవవలదె మన కిట్టి యెడన్?' 186

ప్రతిపదార్థం: మడువు= చెరువు; ఇంకఁగన్+పాఱెడు= ఇగిరిపోబోతున్న; నీరు= నీళ్ళు; ఎడత్రెవ్వినన్= ఆగిపోతే; ఒండు చోటికిన్= మరొక చోటుకి; ఏఁగఁగరాదు= వెళ్ళలేం; మనకున్= మనకు; ఇట్టి ఎడన్= బాగా ఇంకిపోని ఈ సమయంలో; ఎపుడున్= ఎప్పటికీ; ఇంకని= అడుగంటని; నీళ్ళులు గల= నీళ్ళు ఉండే; మడువునకున్= చెరువులోకి; పోవవలదె= వెళ్ళవద్దా.

తాత్పర్యం: 'మనం ఉండే చెరువు ఎండిపోతూ ఉన్నది. నీళ్ళు ఇంకిపోతే మరోచోటికి వెళ్ళలేం. ఇట్లాంటి సమయంలోనే ఎపుడూ నీళ్ళు నిండుగా ప్రవహించే చెరువులోకి చేరుకొనటం మంచిది'.

తే. అనినఁ బ్రాప్తకాలజ్ఞుఁ డిట్లనియె 'నేది । ప్రాప్తమయ్యె నక్కార్యంబు భంగి నెఱిఁగి
యప్పటికిఁ దగునట్లు సేయంగవలయు । మానితోపాయవృత్తి నేమఱుట లేక. 187

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ప్రాప్తకాలజ్ఞుఁడు= ప్రాప్తకాలజ్ఞుడనే చేప; అనియెన్= ఇట్లా అన్నాడు; ఏది ప్రాప్తము+అయ్యెన్= ఏది (ఎపుడు) సంప్రాప్తిస్తుందో; ఆ+కార్యంబు+భంగిన్= ఆ పనితీరును; ఎఱిఁగి= తెలిసికొని; అప్పటికిన్= ఆ సమయానికి; తగునట్టు= తగిన విధంగా; ఏమఱుట లేక= ఉపేక్షించక; మానిత= సముచితం అయిన; ఉపాయవృత్తిన్= యుక్తిగల నడవడితో; చేయంగ వలయున్= సాధించుకొనాలి.

తాత్పర్యం: అనగానే ప్రాప్తకాలజ్ఞుడు ఇట్లా అన్నాడు. 'ఏది సంభవిస్తుందో దాని తీరును తెలిసికొనాలి. ఏ మాత్రం ఏమరకుండా అప్పటికప్పుడు దానికి తగినట్లుగా ఎంతో ఉపాయంగా ఆ పనిని సాధించుకొనాలి'.

వ. అనిన నయ్యిరుదెఱంగుల పలుకులు విని దీర్ఘసూత్రుం డిట్లనియె. 188

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; ఆ+ఇరు+తెఱంగుల పలుకులు= ఆ చేపల రెండు తీరుల మాటలను; విని= ఆలకించి; దీర్ఘ సూత్రుండు= దీర్ఘసూత్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దీర్ఘదర్శి ప్రాప్తకాలజ్ఞుల మాటలు ఆలకించి దీర్ఘసూత్రుడు వారితో ఈ విధంగా అన్నాడు.

క. 'జడనిధి చందంబున ని । మ్మడు వొప్పఁగ నిప్పు డేమి మాఁడెనె? యిమ్మై
నడిచిపడ రిత్త నెవ్వగ । లుడుగుఁడు; మఱి చూచికొంద మొయ్యన తఱితోన్.' 189

ప్రతిపదార్థం: ఈ+మడువు= ఈ చెరువు; జడనిధి చందంబునన్= సముద్రంవలె; ఒప్పఁగన్= ఒప్పుతుండగా; ఇపుడు= ఇపుడు; ఈ+మెయిన్= ఈ రీతిగా; అడిచిపడన్= తొందరపడటానికి; మాఁడెనె+ఏమి?= ఎండిపోయెనా ఏమి?; రిత్త= పనికిమాలిన; నెఱ+వగలు= అతి విచారణలు; ఉడుగుఁడు= మానండి; ఒయ్యనన్= మెల్లగా; తఱితోన్= సమయాన్ని బట్టి; మఱి= ఆ తరువాత; చూచికొందము= చూచుకుందాం.

తాత్పర్యం: 'ఇట్లా తొందరపడటానికి ఈ చెరువు ఎండిపోయిందా ఏమి? సముద్రంవలె ఉన్నది. పనికిమాలిన అతి ఆలోచనలను కట్టిపెట్టండి. అవసరాన్నిబట్టి అపుడు చూచుకొందాం'.

క. అనుటయు 'నిది కర్జము గా'। దని పల్కుచు దీర్ఘదర్శి అంబుస్రోతో
జనితాభయ మగు పథమునఁ। జని జొచ్చెం బెద్ద మడువు సమ్మదలీలన్. 190

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఇది= ఈ చెరువులోనే ఉండటం అనేది; కర్జము+కాదు= చేయాల్సిన పనికాదు; అని పల్కుచున్= అని చెప్పుతూ; దీర్ఘదర్శి= దీర్ఘదర్శి అనే చేప; అంబుస్రోతః= నీటి ప్రవాహంవలన; జనిత= పుట్టిన; అభయము+అగు= భయంలేని; పథమునన్= త్రోవలో; చని= వెళ్ళి; సమ్మదలీలన్= సంతోషంతో; పెద్దమడువున్= పెద్ద చెరువును; చొచ్చెన్= ప్రవేశించింది.

తాత్పర్యం: ఇంకా ఈ చెరువులోనే ఉండటం మంచిది కాదనుకొన్నది దీర్ఘదర్శి. నీటి జాలు వెంబడి నిర్భయంగా వెళ్ళి పెద్ద చెరువును సంతోషంగా చేరుకొన్నది.

వ. తక్కిన రెండును నంద నిలిచె; నిట్లు నిలిచిన యమ్మత్స్యద్వయంబునకు భయంబు జనియింపం గతిపయది వసంబులకు. 191

ప్రతిపదార్థం: తక్కిన రెండునున్= మిగతా రెండు చేపలు (దీర్ఘసూత్రుడు, ప్రాప్తకాలజ్ఞుడు); అంద= ముందటి చెరువులోనే; నిలిచెన్= ఉండిపోయాయి; ఇట్లు= ఈ విధంగా; నిలిచిన= ఉన్న; ఆ+మత్స్యద్వయంబునకున్= ఆ రెండు చేపలకు; కతిపయదివసంబులకున్= కొన్ని రోజులు గడువగా; భయంబు= భయం; జనియింపన్= కలుగగా (పుట్టగా)

తాత్పర్యం: దీర్ఘదర్శి కాక మిగతా రెండు చేపలూ ముందటి చెరువులోనే ఉన్నాయి. కొంతకాలానికి వాటికి భయం కలుగగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. పాఱెడు నీ రెడ తెగ్వఁగఁ। దాఱ బెడిద మైన యెండ దనుకఁగ నివురం
బాఱె మడు; వంత వేడుక। కాఱులు జాలరులు సొచ్చి క్రందుకొనంగన్. 192

ప్రతిపదార్థం: పాఱెడు నీరు= పారే నీళ్ళు; ఎడ్రతెవ్వఁగన్= ఆగిపోగా; తాఱన్= అడగగా; బెడిదము+ఐన= వేడెక్కిన; ఎండ= ఎండ; తనుకఁగన్= తాకగా; మడువు= చెరువు; ఇవురన్+పాఱెన్= ఇంకిపోసాగింది; అంతన్= అంతలోనే; వేడుకకాఱులు= కుతూహలం గల; జాలరులు= చేపలు పట్టేవారు; చొచ్చి= దిగి; క్రందు కొనంగన్= కమ్ముకొనగా.

తాత్పర్యం: చెరువులోకి పారే నీళ్ళు ఆగిపోయి తగ్గుముఖం పట్టాయి. మండుటెండలు ముదిరాయి. చెరువులో నీళ్ళు ఇంకిపోసాగాయి. అంతలో చేపలు పట్టే జాలరులు చెరువుచుట్టూ ఉత్సాహంగా కమ్ముకొనగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వెరవున నూఁతల నెత్తెలఁ । గరముల మత్స్యములఁ బట్టి కడు సంతసముం
బొరయుచుఁ ద్రాళ్ళం గ్రువ్వఁగఁ । గర మూహించి మదిఁ బ్రాప్తకాలజ్ఞుండున్. 193

ప్రతిపదార్థం: వెరవునన్= ఉపాయంతో; ఊఁతలన్= చేపలు పట్టే బుట్టలతో; ఎత్తెలన్= చేపలు పట్టే అడ్డువలలతో; కరములన్= విడి చేతులతోనూ; మత్స్యములన్= చేపలను; పట్టి= పట్టుకొని; కడుసంతసమున్= మిక్కిలి సంతోషాన్ని; పొరయుచున్= పొందుతూ; త్రాళ్ళన్= తాళ్ళను; క్రువ్వఁగన్= కూర్చుతుండగా; ప్రాప్తకాలజ్ఞుండున్= ప్రాప్తకాలజ్ఞుడు; మదిన్= మనసులో; కరము+ఊహించి= ఎంతగానో ఆలోచించి.

తాత్పర్యం: చేపలు పట్టే బుట్టలతో, అడ్డు వలలతో, విడి చేతులతో ఎంతో నేర్పుగా జాలరులు చేపలను పట్టుకొన్నారు. ఎంతో సంతోషిస్తూ తాళ్ళను కూర్చుతున్నారు. అంతలో ప్రాప్తకాలజ్ఞుడు మనసులో చాలాసేపు ఆలోచించుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఇందొక త్రాడు గఱచి యే । నొందంగా గ్రుచ్చినట్ల యుండెద; వీ రీ
క్రందుకొనుట మానంగ న మందత । నది యెడల విడిచి మడుపు దఱిసెదన్.' 194

ప్రతిపదార్థం: ఇందున్= ఈ చేపలు కూర్చిన త్రాళ్ళల్లో; ఒకత్రాడు= ఒక తాడును; కఱచి= పళ్ళతో నొక్కిపట్టి; ఏన్= నేను; ఒందంగాన్= చక్కగా గ్రుచ్చిన; అట్ల= గుచ్చినట్లుగానే; ఉండెదన్= ఉంటాను. వీరు= ఈ జాలర్లు; ఈ క్రందుకొనుట= చుట్టూ కమ్ముకొని చేపలు పట్టటం; మానంగన్= ఆపగానే; అమందతన్= ఆలస్యంలేకుండా, వెంటనే; అది= ఆ తాడును; ఎడలవిడిచి= విడిచిపెట్టి, వదలి; మడువు= చెరువును; దఱిసెదన్= చేరుకొంటాను.

తాత్పర్యం: 'చేపలు కూర్చిన తాళ్ళలో చక్కగా గుచ్చిన చేపవలె ఒక తాడును కరచి పట్టుకొంటాను. జాలరులు చేపలు పట్టటం ఆపగానే చటుక్కున ఆ తాడును వదలిపెట్టి మడుగును చేరుకొంటాను.'

క. అని యొక గుదిమీల నడుమ । నెనయంగాఁ దూఱి కఱచి యిరుదొడలఁ ద్రా
డొనరంగ బట్టుకొని గ్రు । చ్చిన చందము దోఁప మూర్ఛఁ జెందిన భంగిన్. 195

ప్రతిపదార్థం: అని= అనుకొని; ఒక గుది= చేపలు గుచ్చిన గుత్తిలోని; మీలనడుమన్= చేపల మధ్యలో; ఎనయంగాన్= పొందికగా; తూఱి= చొరబడి; కఱచి= పళ్ళతో నొక్కిపట్టి; ఇరుదొడలన్= రెండు దవుడలతో; త్రాడు= తాడును; ఒనరంగన్= ఒప్పునట్లుగా; పట్టుకొని= కరచుకొని; గ్రుచ్చిన చందము తోఁపన్= గుచ్చినట్టే అగపడేటట్లు; మూర్ఛన్+చెందిన భంగిన్= సొమ్మసిల్లిన దానివలె.

తాత్పర్యం: అని అనుకొని చేపల గుత్తిలోకి దూరి, రెండు దవుడలతో తాడును కరచి పట్టుకొన్నది. గుచ్చిన చేపలవలె సొమ్మసిల్లిన దానివలె. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. ఉన్నంత వేఁట దీఱి యగ్గుదిగల యతండు. 196

ప్రతిపదార్థం: ఉన్న+అంతన్= ఉండినంతలో; వేఁట తీఱి= చేపలు పట్టటం చాలించి; ఆ+గుది+కల+అతండు= ప్రాప్తకాలజ్ఞుడు ఉండు గుత్తి పట్టుకొన్నవాడు.

తాత్పర్యం: ఉండగా ఆ చేపల గుత్తి పట్టుకున్న జాలరివాడు చేపలు పట్టటం ఆపి. (తరువాతి పద్యంతో అన్వయం)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తెలినీట రొంపివోవం। దొలుచు నెడం ద్రాడు విడిచి దురితంబునకుం
దొలఁగి పొరదప్పి యందొక। జలచర మున్న యెడకేఁగె సంభ్రాంతగతిన్. 197

ప్రతిపదార్థం: తెలినీటన్= తేటనీళ్ళలో; రొంపి+పోవన్= బురద పోయేటట్లు; తొలుచు+ఎడన్= కడిగేటప్పుడు; త్రాడు= తాడును; విడిచి= వదలి; దురితంబునకున్= ఆపదనుంచి; తొలఁగి= తప్పుకొని; పొర+తప్పి= అపాయాన్ని దాటి; సంభ్రాంతగతిన్= తొట్రుపడుతూ; అందున్= అక్కడ; ఒక జలచరము= మరొక చేప; ఉన్న+ఎడన్= ఉన్నచోటికి; ఏఁగెన్= పోయింది.

తాత్పర్యం: మంచి నీళ్ళల్లో బురద పోయేటట్లు జాడించేటప్పుడు తాడును వదలిపెట్టి ఆపదనుండి తప్పించుకొన్నది. ప్రమాదాన్ని దాటి తత్తరపడుతూ అక్కడే మరోచేప ఉన్నచోటికి పోయింది.

క. ముట్టఁబడి దీర్ఘసూత్రుం డిట్ట। ట్టరుగఁగ నుపాయ మేది యొకనిచేఁ
బట్టువడెఁ దనదు డెందము। పట్టు వదలి చకిత వికల భావేంద్రియుఁడై. 198

ప్రతిపదార్థం: ముట్టన్+పడి= చుట్టుముట్టబడి; దీర్ఘసూత్రుండు= దీర్ఘసూత్రుడు; ఇట్టు+అట్టు= ఇటువైపు, అటువైపు; అరుగఁగన్= వెళ్ళటానికి; ఉపాయము+ఏది= ఉపాయం లేనిదై; చకిత= భయపడి; వికల= చెదరిన; భావ= మనోవికారం; ఇంద్రియుఁడు+ఐ= చర్మం మొదలైన జ్ఞానేంద్రియాలు కలవాడై; తనదు డెందము= తన గుండె; పట్టు వదలి= దిటవు సడలి; ఒకనిచేన్= ఒక జాలరిచేత; పట్టుపడెన్= చిక్కింది.

తాత్పర్యం: జాలర్లు చుట్టుముట్టగా దీర్ఘసూత్రుడు ఎటూ పోయే వీలులేక ఉపాయం తట్టక ఒక జాలరి చేతిలో చిక్కింది. అపుడు భయంతో శరీరం స్వాధీనంలో లేదు. గుండె పట్టు తప్పింది.

క. విను దౌదవ్వులఁ గార్యము। గనికొని వలయుపని మున్న కావింపఁగ నే
రనిజడుఁడు దీర్ఘసూత్రుం। డను మత్స్యంబు భంగి నాపద నొందున్. 199

ప్రతిపదార్థం: విను= ధర్మరాజా! వినవలసింది; దౌదవ్వులన్= దూరంలో ఉండగానే (చాలా కాలం ఉండగానే); కార్యము= పనిని; కనికొనివలయున్= తెలిసికొనాలి; పని= పనిని; మున్న= ముందుగానే; కావింపఁగనేరని= చేసికొనలేని; జడుండు= మూర్ఖుడు; దీర్ఘసూత్రుండు+అను= దీర్ఘసూత్రుడనే; ఆ+మత్స్యము+భంగిన్= ఆ చేపవలె; ఆపదన్= విపత్తును; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: దూరదృష్టితో పనిని ముందుగానే తెలిసికొనాలి. అట్లా ముందుగా పనిని చక్కదిద్దుకొనలేని మూర్ఖుడు దీర్ఘసూత్రు డనే చేపవలె ఇబ్బందులు పడతాడు.

తే. అప్పటికిఁ దోఁచినట్టులు దప్పకుండ। ననువుతో ధృతి గల్గి కార్యంబు నడపు
నతఁడు ప్రాప్తకాలజ్ఞాఖ్యు నట్లపోలెఁ। బరమ సంశయ మయ్యెడు బ్రదుకు గాంచు. 200

ప్రతిపదార్థం: అప్పటికిన్= ఆ సమయానికి; తోఁచినట్టులు= తట్టిన విధంగా; తప్పక ఉండన్= తప్పనిసరిగా; అనువుతోన్= ఉపాయంతో; ధృతి+కల్గి= ధైర్యంతో ఉండి; కార్యంబు= పనిని; నడపున్+అతఁడు= జరిపేవాడు; ప్రాప్తకాలజ్ఞ+ఆఖ్యు+అట్లపోలెన్= ప్రాప్తకాలజ్ఞుడివలె; పరమ సంశయము+అయ్యెడు= ఎక్కువ సందేహానికి చోటిచ్చే; బ్రదుకు= జీవనాన్ని; కాంచున్= పొందుతాడు.

తాత్పర్యం: అప్పటికి తట్టినట్లు ఉపాయంతో ధైర్యంగా పనిచేసికొనేవాడు ప్రాప్తకాలజ్ఞుడివలె ఎపుడూ సందేహంతో కూడిన బతుకు బతుకుతాడు.

క. ధుర్యత ననాగతము లగు । కార్యము లూహించి పని తగం జేయు నయా
చార్యుఁడు సౌఖ్యముఁ బొరయును । నార్యస్థితి దీర్ఘదర్శి యను మీను క్రియన్.' 201

ప్రతిపదార్థం: ధుర్యతన్= సమర్థంగా; న+ఆగతములు+అగు+కార్యములు= రాబోయే పనులను; ఊహించి= భావించి; పని= పనిని; తగన్+చేయు= తగినట్లుగా చేసే; నయాచార్యుఁడు= నీతివేత్త; ఆర్యస్థితిన్= మన్నించదగ్గట్లు; దీర్ఘదర్శి+అను= దీర్ఘదర్శి అనే; మీనుక్రియన్= చేపవలె; సౌఖ్యమున్= సుఖాన్ని; పొరయున్= పొందుతాడు.

తాత్పర్యం: రాబోయే పనిని ముందుగా ఊహించుకొని సమర్థంగా ఆ పనిని యుక్తిగా చేసికొనే నీతిమంతుడు దీర్ఘదర్శి అనే చేపవలె సుఖంగా ఉంటాడు'.

పలితరోమశు లను మూషిక మార్జాలంబుల సంవాద ప్రకారము (సం. 12-136-18)

వ. అనిన విని ధర్మనందనుండు 'పెక్కండ్రు పగఱకు నగ్గమై హీనబలుం డైన నరపతి యెప్పరుసున నాపద నిస్తరించువాఁ?' డని యడిగిన నప్పుడమిఱేనితో భీష్ముండు 'మార్జాల మూషిక సంవాదం బను నితిహాసంబు గల; దది నీదగు ప్రశ్నంబునకు సదుత్తరం బగు విను' మని యిట్లనియె. 202

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= విని; ధర్మనందనుండు= ధర్మరాజు; పెక్కండ్రు= ఎక్కువమంది; పగఱకున్= పగవాళ్ళకు; అగ్గము+ఐ= లోబడి; హీనబలుండు+ఐన= బలం తగ్గిన; నరపతి= రాజు; ఏ+పరుసునన్= ఏవిధంగా; ఆపదన్= విపత్తును; నిస్తరించువాఁడు?= దాట గలవాడు?; అని; అడిగినన్= అడగగా; ఆ పుడమిఱేనితోన్= ఆ ధర్మరాజుతో; భీష్ముండు= భీష్ముడు; మార్జాల= పిల్లి; మూషిక= ఎలుక; సంవాదంబు+అను= సంభాషణ మనే; ఇతిహాసంబు= మునుపటి కథ; కలదు= ఉన్నది; అది= ఆ కథ; నీదగు= నీకు సంబంధించిన; ప్రశ్నంబునకున్= అడిగినదానికి; సత్+ఉత్తరంబు+అగున్= మంచి సమాధానం అవుతుంది; వినుము= వినవలసింది; అని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగానే ధర్మరాజు 'ఎంతో మంది శత్రువులచే చిక్కి బలం కోల్పోయిన రాజు ఆ ఆపదనుండి ఎట్లా గట్టెక్కుతాడు?' అని ప్రశ్నించాడు. భీష్ముడు పిల్లి ఎలుకల సంవాదం అనే పూర్వపు కథ వింటే నీ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. ఆలకించు'మంటూ ఈ విధంగా అన్నాడు.

సీ. 'అడవిలో నొక మఱ్ఱియడుగున లాఁగలఁ । బలితుండు నా నొక్క యెలుక యుండు;
నమ్మహీజముమీఁద ననిశంబు రోమశుం । డను పిల్లి వసియించు; నా సమీప
మున సంజకడ నిత్యమును మృగంబుల । కురులొడ్డి వేకువ వచ్చి యొక్క మాలఁ
డగపడ్డ వానిఁ గొంచు జరుగు; నొకప్పు డా । హారంబునకుఁ బిల్లి యచటఁ దిరుగఁ

తే. బోయి యురిఁ బడియుండఁగఁ బొంచిచూచి । భయము దక్కి యచ్చోటన పలితుఁ డెరకుఁ
గ్రుమ్మరఁగఁ జంద్రకుం డను గూబపులుఁగు । హలికుఁ డను ముంగిసయు నింత నంతఁ దోఁచె. 203

ప్రతిపదార్థం: అడవిలోన్= అటవిలో; ఒక మఱ్ఱి= ఒక మఱ్ఱిచెట్టు; అడుగునన్= క్రిందిభాగంలో; లాఁగలన్= కలుగులలో; పలితుండునాన్= పలితుడనే పేరుగల; ఒక్క ఎలుక= ఒక ఎలుక; ఉండున్= ఉండేది; ఆ+మహీజముమీఁదన్= ఆ చెట్టు మీద; అనిశంబున్= ఎపుడూ; రోమశుండు అను పిల్లి= రోమశుడనే పేరుగల పిల్లి; వసియించున్= ఉండేది; ఆ సమీపమునన్= ఆ దగ్గరలోనే; సంజకడన్= సాయంవేళలో; నిత్యమును= ప్రతిదినం; మృగంబులకున్= జంతువులకు; ఉరులు= ఉచ్చులు; ఒడ్డి= పన్ని; వేకువ వచ్చి= తెల్లవారుజామున నే వచ్చి; ఒక్కమాలఁడు= ఒక మాలవాడు; అగపడ్డవానిన్= చిక్కిన వాటిని; కొంచున్+అరుగున్=

తీసికొని పోతుండేవాడు; ఒకప్పుడు= ఒకనాడు; ఆహారంబునకున్= తిండికొరకు; పిల్లి; అచటన్= అక్కడకు; తిరుగన్‌పోయి= తిరగటానికి వెళ్ళి; ఉరిన్+పడి= ఉచ్చులో చిక్కుకొని; ఉండఁగన్= ఉండగా; పలితుఁడు= పలితుడనే ఎలుక; పొంచి చూచి= దాగి ఉండి చూచి; భయము దక్కి= భయం వదలి; ఆ+చోటన్+అ= ఆ చెట్టు దగ్గరలోనే; ఎరకున్= తిండికొరకు; క్రుమ్మరఁగన్= తిరుగుతుండగా; చంద్రకుండు+అను= చంద్రకుడనే; గూబపులుఁగు= గుడ్లగూబా; హలికుఁడు+అను= హలికుడనే; ముంగిసయున్= ముంగిసా; ఇంతన్+అంతన్= ఈలోపల; తోఁచెన్= అగపడ్డాయి.

తాత్పర్యం: ఒక అడవిలో మర్రిచెట్టు క్రింద ఉన్న కలుగులో పలితు డనే ఎలుక ఉండేది. ఆ చెట్టుపైన రోమశుడనే పిల్లి ఉంటూ ఉండేది. ఈ చెట్టుకు దగ్గరలోనే ఒక మాలవాడు అనునిత్యం సాయంకాలం జంతువులకు ఉచ్చులు పన్నేవాడు. ఆ ఉచ్చులో చిక్కుకొన్న వాటిని తెల్లవారగానే వచ్చి తీసికొని వెళ్ళుతుండేవాడు. ఒకనాడు పిల్లి తిండికొరకు వచ్చి ఆ ఉరుల్లో చిక్కుకొన్నది. దీన్ని పొంచి చూచిన ఎలుక నిర్భయంగా తన ఆహారం కొరకు తిరుగాడసాగింది. అంతలో చంద్రకు డనే గుడ్లగూబా, హలికు డనే ముంగిసా ఎలుక కంటబడ్డాయి.

వ. ఎరలకై వచ్చి యిట్లు దోఁచిన నయ్యెలుక యా రెంటి బారికిం దప్పిపోవరామి దలంచి బెగ్గలించియు ధైర్యంబు కలిమిం గార్యం బూహించి యప్పిల్లిం గొండొక సేరం జనుచు దానితో నిట్లనియె. 204

ప్రతిపదార్థం: ఎరలకున్+ఐ= మేతలకై; వచ్చి; ఇట్లు తోఁచినన్= ఇట్లా అగపడగా; ఆ+ఎలుక= ఆ పలితుడు; ఆ రెంటి బారికిన్= ఆ గుడ్లగూబా ముంగిసల ఆపదనుండి; తప్పిపోవరామి= తప్పించుకొని వెళ్ళటానికి వీలు కాదని; తలంచి= తలపోసి; బెగ్గలించియున్= భయపడీ; ధైర్యంబు= దిటవుతనం; కలిమిన్= కలిగి ఉండటంవలన; కార్యంబు= చేయాల్సిన పనిని; ఊహించి= ఆలోచించుకొని; ఆ+పిల్లిన్= ఆ పిల్లిని; కొండొక= కొంచెంగా; చేరన్+చనుచున్= దగ్గరకు వెళ్ళుతూ; దానితోన్= ఆ పిల్లితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: తిండికొరకు వచ్చిన ఎలుకకు గుడ్లగూబా, ముంగిసా కంటబడ్డాయి. వాటి బారినుండి తప్పించుకొని పోయే వీలులేదని గ్రహించుకొన్నది. భయపడింది. ధైర్యం కూడదీసికొన్నది. ఏం చేయాలో ఊహించుకొన్నది. మెల్లగా పిల్లిని సమీపిస్తూ ఈ విధంగా అన్నది.

క. 'ఉరి ద్రెవ్వఁ గొఱికి యిప్పుడ । వెరవారఁగ నీకు నేను విడుగర సేయం
దొరకొనుట నీదు భాగ్యం । బరిత్వము దొఱంగి మైత్రి యలవఱుపు మదిన్. 205

ప్రతిపదార్థం: ఉరి= ఉచ్చును; త్రెవ్వన్= తెగి పోయేటట్లు; కొఱికి= పళ్ళతో కరిచి; ఇప్పుడ= ఇపుడే; వెరవు= నేర్పు; ఆరఁగన్= ఒప్పేటట్లు; నీకున్= నీకు (పిల్లికి); నేను= నేను (ఎలుక); విడుగర= విడుదల; చేయన్+దొరకొనుట= చేయటానికి పూనుకొనటం; నీదు భాగ్యంబు= నీ అదృష్టం; మదిన్= మనసులో; అరిత్వము= పగను; తొఱంగి= మాని; మైత్రిన్= మిత్రభావాన్ని; అలవఱుపు(ము)= నేర్చుకొమ్ము.

తాత్పర్యం: 'ఓ రోమశా! నేను నా నేర్పుతో నీ ఉరులను తెగకొరికి నిన్ను విముక్తుడిని చేస్తాను. నేను ఇట్లా చేయటానికి పూనుకొనటం నీ అదృష్టంగా భావించుము. మనస్సులోపలి పగను మానుకొమ్ము. స్నేహభావాన్ని అలవరుచుకొమ్ము.

క. ముంగికి గూబకు నగపడి । యంగంబులు వడఁకుచున్నయవి నా కిమ్మై
సంగతి గలిగిన నీ యు । త్సంగంబున నుండి భయము దక్కుదు నేనున్.' 206

ప్రతిపదార్థం: ముంగికిన్= ముంగిసకూ; గూబకున్= గుడ్లగూబకు; అగపడి= కంటపడి; ఈ+మైన్= ఈ రీతిగా; అంగంబులు= అవయవాలు; వడఁకుచున్+ఉన్నఅవి= వణకిపోతున్నాయి; నాకున్= నాకు (నీతో); సంగతి= స్నేహం; కల్గినన్= కలిగితే; నీ+ఉత్సంగంబునన్+ఉండి= నీ ఒడిలో ఉండి; నేనున్= నేను; భయము= భయాన్ని; దక్కుదున్= పోగొట్టుకొంటాను.

తాత్పర్యం: ముంగిసా గుడ్లగూబా కంటబడ్డ దగ్గరనుండి నా శరీరం అంతా వణకుతున్నది. నాతో నీవు జట్టుకట్టితే నీ ఒళ్ళో ఉండి భయం పోగొట్టుకొంటాను'.

చ. అనవుడుఁ బిల్లి యిట్టులను 'నార్తశరణ్యుఁడ వయ్యె; దిట్టి నీ
కనఘ! హితంబు సేయ వలదయ్య? జగత్పతిసాక్షిగాఁగ ని
ప్పని దగఁ బూనితిన్; వెఱపుఁ బాచి ననుం గదియంగ రమ్ము; వ
చ్చిన నకులంబు గూబయును జేరఁగ నేరవు నాకు నోడుటన్.' 207

ప్రతిపదార్థం: అనవుడున్= ఎలుక చెప్పగానే; పిల్లి; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నది; ఆర్తశరణ్యుఁడవు= ఆపదలో ఉన్నవాళ్ళను రక్షించేవాడవు; అయ్యెదు= అవుతావు; అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; ఇట్టి= ఇట్లాంటి; నీకున్= నీకు; హితంబు= మేలు; చేయవలదు+అయ్య!= చేయవద్దా!; జగత్పతి సాక్షిగాఁగన్= భగవంతుడి సాక్షిగా; ఈ+పనిన్= నిన్ను కాపాడే పనిని; తగన్= ఒప్పేటట్లు; పూనితిన్= చేయపూనుకొన్నాను; వెఱపున్+పాచి= భయాన్ని వదలి; ననున్= నన్ను; కదియంగన్= నా దరి చేరటానికి; రమ్ము= రావలసింది; వచ్చినన్= అట్లా వస్తే; నకులంబు= ముంగిసా; గూబయును= గుడ్లగూబా; నాకున్= నాకు; ఓడుటన్= భయపడటం వలన; చేరఁగన్+నేరవు= దరిదాపులకు రాలేవు.

తాత్పర్యం: ఎలుకతో పిల్లి ఇట్లా అన్నది. 'నీవు ఆపదలో ఉన్న వాళ్లను ఆదుకునే స్వభావం కలవాడివి. ఓ పుణ్యాత్ముడా! నీకు ఉపకారం చేయాల్సిందే. దేవుడి సాక్షిగా నిన్ను కాపాడాలనుకొన్నాను. భయపడకుండా నా దగ్గరకు రమ్ము. గుడ్లగూబా ముంగిసా నన్ను చూస్తే భయపడతాయి. కాబట్టి దరిదాపులకు రావు. దూరంగా పారిపోతాయి'.

ఆ. అనిన నట్ల యగుట నాత్మ నెఱింగియ । కాదె సంధియైన నాదు బ్రదుకు
నీదు విడుగరయును నిజమగు టూహించి । నిన్నుఁ జెందె బుద్ధి నిశ్చయంబు. 208

ప్రతిపదార్థం: అనినన్= అట్లా అనగానే; అట్లు+అగుటన్= అట్లా అవుతుందని; ఆత్మన్+ఎఱింగియ+కాదె?= మనసులో గ్రహించుకొని కాదా?; సంధి+ఐనన్= పొత్తు కుదిరితే; నా+బ్రదుకున్= నా జీవనం; నీ+విడుగరయును= నీ విడుదలా; నిజము+అగుటన్= నిజం అవుతుందని; ఊహించి= ఆలోచించి; బుద్ధి నిశ్చయంబు= మనస్సులోని నిర్ణయం; నిన్నున్+చెందెన్= నిన్ను పొందింది.

తాత్పర్యం: అట్లా అనగానే ఎలుక, 'అట్లా అవుతుందని గ్రహించుకొనే కదా! నీతో పొత్తు కుదుర్చుకొనాలనుకొన్నాను. దీనివలన నేను బ్రతకటం, నీవు విడుదల అవటం రెండూ తీరతాయని నిర్ణయించుకొనే నిన్ను చేరాను'.

క. అని పలికి పిల్లి పొదిగిట । ననయము నిశ్శంకవృత్తి నయ్యెలుక వసిం
చినఁ జూచి యయ్యులూకం । బును నకులము నచటు వాసి పోయె నిజేచ్ఛన్. 209

ప్రతిపదార్థం: అని పలికి= అని ఎలుక మాట్లాడి; పిల్లి= పిల్లియొక్క; పొదిగిటన్= పొదిగిలిలో (ప్రక్కకు సందిటికి నడిమి భాగంలో); అనయమున్= ఎపుడూ; నిశ్శంకవృత్తిన్= జంకూ గొంకూ లేని నడవడితో; ఆ+ఎలుక= ఆ పలితుడు; వసించినన్= ఉండగా; చూచి; ఆ+ఉలూకంబును= ఆ గుడ్లగూబా; నకులమున్= ముంగిసా; అచటు= ఆ చోటును; పాసి= వదలి; నిజ+ఇచ్ఛన్= తమ ఇష్టానుసారంగా; పోయెన్= పోయాయి.

తాత్పర్యం: అని పలికి ఎలుక ఏమాత్రం సందేహించకుండా పిల్లి పొదిగిట్లో ఉండటం చూచిన ఆ గుడ్లగూబా, ముంగిసా అక్కడినుండి తమ తోవన వెళ్ళిపోయాయి.

క. నకులము నులూకమును బో । కకు సంతస మందియుండి గ్రక్కున నమ్మూ
షిక మయ్యురి చేరులు గొఱు । కక యలసత నల్లనల్లఁ గఱచుచు నుండెన్. 210

ప్రతిపదార్థం: నకులమున్= ముంగిసా (హలికుడు); ఉలూకమును= గుడ్లగూబా (చంద్రకుడు); పోకకున్= వెళ్ళిపోవటానికి; సంతసమున్= సంతోషాన్ని; అంది+ఉండి= పొంది ఉండి; గ్రక్కునన్= చప్పున; ఆ+మూషికము= ఆ ఎలుక; ఆ+ఉరిచేరులు= ఆ ఉచ్చు తాళ్ళను; కొఱుకక= కొరికివేయక; అలసతన్= ఆలస్యంగా; అల్లన్+అల్లన్= మెల్ల మెల్లగా; కఱచుచున్+ఉండెన్= కొరుకుతూ ఉన్నది.

తాత్పర్యం: ముంగిసా, గుడ్లగూబా వెళ్ళిపోవటం చూచి ఎలుక ఎంతో సంతోషించింది. అనుకున్నట్లుగా పిల్లి ఉచ్చులను గబగబ కొరకకుండా మెల్లమెల్లగా కొరుకుతూ జాప్యం చేస్తూ ఉన్నది.

వ. అమ్మెయిఁ బలితుండు గొనకొని యయ్యురిం గొఱుకకుండుట యెఱింగి రోమశుం డిట్లనియె. 211

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ తీరుగా; పలితుండు= ఎలుక; గొనకొని= మొదలుపెట్టి; ఆ+ఉరిన్= ఆ ఉచ్చుతాళ్ళను; కొఱుకక+ఉండుట= కొరక్కుండా ఉండటం; ఎఱింగి= గ్రహించి; రోమశుండు= పిల్లి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆ విధంగా ఎలుక ఉరితాళ్ళను తొందరగా కొరకకపోవటాన్ని పిల్లి పసికట్టి ఎలుకతో ఈ విధంగా అన్నది.

క. 'తగునే యిట్లు? కృతార్థుఁడ । వగు నీ కురి గొఱుక కిట్టు లాలస్యము సేఁ
త గటా! కృతఘ్నతకు నెల । వగు టొప్పునె కొఱుకు కడఁక నద్రోహుఁడవై.' 212

ప్రతిపదార్థం: కృతార్థుడవు+అగు= నెరవేరిన ప్రయోజనం కలవాడవగు; నీకున్= నీకు; ఇట్లు+తగునే?= ఇట్లా ఒప్పుతుందా?; ఉరి కొఱుకక= ఉచ్చులను తెగకొరకకుండా; ఇట్టులు= ఈ తీరున; ఆలస్యము+చేఁత= జాగుచేయటం; కటా!= అయ్యో!; కృతఘ్నతకున్= చేసిన మేలు మరవటమనేదానికి; నెలవు+అగుట= ఉనికి పట్టవటం; ఒప్పునె?= తగుతుందా?; అద్రోహుఁడవై= కీడు చేయాలనే తలంపు లేనివాడవై; కడఁకన్= పట్టుదలతో; కొఱుకు(ము)= కొరకవలసింది.

తాత్పర్యం: నావలన ప్రయోజనం పొందిన నీకు ఇది తగుతుందా? ఉరులను తెగ కొరకకుండా జాప్యం చేయటం ఒప్పుతుందా? చేసిన మేలు మరచిపోవటం న్యాయమా? కీడు తలపెట్టక పట్టుదలపట్టి కొరుకుము'.

చ. అనుటయు నెల్క యిట్టు లను 'నాశ్రితరక్షణశీలు నిన్నుఁ గీ
డునఁ బొరయింతునే? యిది కడుం జెడుగుందన; మేను భీతి నూ
నిన మదితోడ నమ్మమిన నెట్టన యియ్యురిఁద్రెంప నియ్యెడన్
మనమున నెగ్గుగాఁ గొనకు మాలనిఁ గాంచిన యప్డ త్రెంచెదన్. 213

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఎల్క= ఎలుక; ఇట్టులు+అనున్= ఈ విధంగా పలికింది; ఆశ్రిత రక్షణ శీలున్= అండ చేరినవాళ్ళను కాపాడే స్వభావం గల; నిన్నున్= నిన్ను; కీడునన్= ఆపదను; పొరయింతునే?= కలిగిస్తానా?; ఇది= కీడు తలపెట్టటం;

కడున్= ఎంతో; చెడుగుందనము= చెడ్డది; ఏను= నేను; భీతిన్+ఊనిన= భయం పొందిన; మదితోడన్= బుద్ధితో, మనస్సుతో; నమ్మమిన= నమ్మలేకపోవటం వలననే; నెట్టన= వెంటనే; ఈ ఉరిన్= ఈ ఉచ్చును; త్రెంపన్= నుగ్గు చేయను; ఈ+ఎడన్= ఈ సమయంలో; మనమునన్= మనస్సులో; ఎగ్గుగాన్= తప్పుగా ద్రోహంగా (కీడుగా); కొనకు(ము)= తీసికొనకుము; మాలనిన్= మాలవాడిని; కాంచిన+అప్డ= చూచినప్పుడే; త్రెంచెదన్= తెంపుతాను.

తాత్పర్యం: పిల్లి మాటలకు ఎలుక ఇట్లా జవాబిచ్చింది 'ఆశ్రయించినవాళ్ళను కాదనకుండా కాపాడే స్వభావం నీది. అట్లాంటి నీకు ఆపదను కలిగిస్తానా? కీడు తలపెట్టటం మంచిపని కాదు. నా భయంకొద్దీ నిన్ను నేను నమ్మలేక ఉరులు తెంపలేక పోతున్నాను. మనస్సులో తప్పు పట్టవద్దు. మాలవాడిని చూడగానే తాళ్ళను తెగగొరుకుతాను.

క. **ఉరిఁ బాసి యేమి దలఁతో। యరిత్వమున వినుము ప్రబలుఁడైన యతనితో**
వెరవున సంధి యొనర్చియుఁ। గరంబు నమ్మమియ నీతిగాఁ గొండ్రు బుధుల్. **214**

ప్రతిపదార్థం: ఉరిన్ పాసి= ఉచ్చును వదలి; అరిత్వమునన్= శత్రుత్వంతో; ఏమి తలఁతో= ఏం ఆలోచిస్తావో; వినుము= వినవలసింది; బుధుల్= జ్ఞానం కలవారు; ప్రబలుఁడు+ఐన+అతనితోన్= బలవంతుడైన పగవాడితో; వెరవునన్= ఉపాయంగా; సంధి= పొత్తు; ఒనర్చియున్= కుదుర్చుకొని; కరంబు= ఎక్కువ; నమ్మమియ= నమ్మకపోవటమే; బుధుల్= జ్ఞానవంతులు; నీతిగాన్= ధర్మంగా; కొండ్రు= గ్రహిస్తారు.

తాత్పర్యం: నీవు ఉచ్చులనుండి బయటపడి పగవలన ఏం ఆలోచిస్తావో? ఒక మాట వినుము. బలవంతుడైనవాడితో ఎంతో ఉపాయంగా పొత్తు పెట్టుకొన్నా, అతడిమీద ఎక్కువ నమ్మకం ఉంచుకొనటం నీతి కాదంటారు తెలిసినవాళ్ళు.

ఉ. **మాలనిరాక చూచి భయమర్దిత మైన మనంబుతోడ న**
క్కాలమునందు నీకుఁ జనఁగావలయున్ వెస మ్రానిపైకి నా
యాలయముం జొరన్ సమయ; మప్పుడ నాకును గాన యత్తఱి
న్మేలొనరింతు; నమ్ము మిది నిక్కము గర్జము నీ వెఱుంగవే?' **215**

ప్రతిపదార్థం: మాలని రాక చూచి= మాలవాడు రావటం చూచి; భయమర్దితము+ఐన= భయంతో బాధపడుతున్న; మనంబుతోడన్= మనస్సుతో; ఆ+కాలమునందున్= ఆ సమయంలో; నీకున్= నీకు; వెసన్= వెంటనే; మ్రానిపైకిన్= చెట్టుమీదికి; చనఁగాన్+వలయున్= వెళ్ళవలసి ఉంటుంది; నాకును= నాకు కూడా; అప్పుడు+అ= అప్పుడే; నా ఆలయమున్= నా నివాసాన్ని (బొరియను); చొరన్= చేరుకొనటానికి; సమయము= తగిన కాలం; కాన= కాబట్టి; ఆ+తఱిన్= అదే సమయంలో; మేలు= ఉపకారాన్ని; ఒనరింతున్= చేస్తాను; నమ్ముము= విశ్వాసం ఉంచుము; ఇది; నిక్కము= నిజంగా; కర్జము= చేయదగిన పని (అని); నీవు; ఎఱుంగవే?= నీకు తెలియదా?

తాత్పర్యం: మాలవాడి రాకను చూచి నీవు వణికిపోతూ చెట్టుపైకి పోతావు. అదే సమయంలో నేను కలుగులోకి పోతాను. అదుగో అపుడే నీకు ఉపకారం చేస్తాను. ఇదే నిజానికి చేయదగిన పని. నీకు తెలియనిది కాదు కదా!'

క. **అనవుడు నట్లేల తలఁప వినుము భవత్ప్రాణరక్ష వెసఁ జేసితి నే**
ననఘా! నీవును నమ్మెయి నను నాపదఁ బాపవలదె నమ్మి రయమునన్. **216**

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; అనఘా!= ఓ పుణ్యవంతుడా!; అట్లు= ఆ విధంగా; తలఁపన్+ఏల?= అనుకోవటం ఎందుకు?; వినుము= విను; నేన్= నేను; భవత్= నీ యొక్క; ప్రాణరక్ష= ప్రాణాలను కాపాడటం; వెసన్+చేసితిన్= వేగిరపడి చేశాను; నీవును= నీవు కూడా; ఆ+మెయిన్= అట్లాగే ననున్= నన్ను; నమ్మి= విశ్వసించి; రయమునన్= తొందరగా; ఆపదన్= విపత్తును; పాపవలదె?= తొలగించవద్దా!

తాత్పర్యం: ఎలుకతో పిల్లి ఇట్లా బదులు పలికింది. 'ఓ పుణ్యాత్ముడా! అట్లా ఎందుకు ఆలోచిస్తావు. నేను నీ ప్రాణాలను వెంటనే కాపాడాను కదా! నీవూ అట్లాగే నా మీద నమ్మకంతో చప్పున ఆపదను గట్టెక్కించవద్దా'.

ఆ. అనినఁ బిల్లి కిట్టులను నెల్క 'వేగిర । పడకు; ముచితకాలభావ్య మైన
యత్నవిధి గదా సమగ్ర ఫలత్వంబు । నొందు; నొండు దలఁప కూరకుండు.' 217

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగానే; పిల్లికిన్= పిల్లికి; ఎల్క= ఎలుక; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నది; వేగిరపడకుము= తొందరపడకుము; ఉచితకాల= తగిన సమయంలో; భావ్యము+ఐన= ఉచితమయిన; యత్నవిధి+కదా= ప్రయత్నం తీరు కదా; సమగ్ర ఫలత్వంబున్= సంపూర్ణ ఫలసిద్ధిని; ఒందున్= పొందుతుంది; ఒండు= మరొకటి; తలఁపక= తలపోయక; ఊరక+ఉండు= మిన్నకుండుము.

తాత్పర్యం: తొందరపడవద్దు. 'సరైన తరుణంలో చేసిన ప్రయత్నమే సంపూర్ణంగా సఫలమవుతుంది. మరొకటి ఆలోచించకుండా ఊరుకొమ్ము'.

వ. అని యి ట్లపలితుండును రోమశుండును నొండొరులతో మాటలాడుచుండ వేకువ యయ్యె; నట్టి యెడ. 218

ప్రతిపదార్థం: అని యిట్లు= అని ఈ విధంగా; ఆ+పలితుండును= ఆ ఎలుకా; రోమశుండును= ఆ పిల్లీ; ఒండొరులతోన్= ఒకళ్ళతో ఒకళ్ళు; మాటలు+ఆడుచున్+ఉండన్= మాట్లాడుకొంటూ ఉండగా; వేకువ+అయ్యెన్= తెల్లవారింది; అట్టి యెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఇట్లా ఎలుకకు పిల్లికి సంవాదం కొనసాగుతుండగానే తెల్లవారింది. అపుడు.

క. తనతోఁ గొందఱు కుక్కలఁ । గొని యేతేరంగఁ గేలఁ గ్రూర కృపాణం
బును భీకరభంగిగ వెసఁ । జనుదెంచెన్ మాలఁ డధికసంరంభమునన్. 219

ప్రతిపదార్థం: తనతోన్= తనతోపాటు; కొందఱు= కొంతమంది వేటగాళ్ళు; కుక్కలన్ కొని= వేటకుక్కలను తీసికొని; ఏతేరంగన్= రాగా; కేలన్= చేతిలో; క్రూరకృపాణంబును= పదునుగల కత్తి; భీకరభంగిగన్= భయం గొలిపేటట్లుండగా; మాలఁడు= మాలవాడు; అధిక సంరంభమునన్= ఎంతో అడావుడిగా; వెసన్= వేగంగా; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: కొంతమంది వేటగాళ్ళు వేటకుక్కలను వెంట తీసుకొని తనతోరాగా మాలవాడు చేత కరకు కత్తి పట్టుకొని భయం పుట్టేటట్లు తొందరతొందరగా ఎంతో ఆటోపంగా వచ్చాడు.

ఆ. పరిఘనాముఁ డైన పాపాత్ముఁ । గని భయ మడరఁ బిల్లి యిట్టు లనియె
'నేమి సేయువాఁడ? నిదె వచ్చె జముదూత । వోలె సత్వరముగ మాలవాఁడు. 220

ప్రతిపదార్థం: పరిఘ నాముఁడు+ఐన= పరిఘుడనే పేరుగల; పాపాత్మున్= పాపిష్ఠిని; కని= చూచి; భయము+అడరన్= భీతి ఎక్కువ కాగా; పిల్లి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నది; ఇంకన్= ఇంకా; ఏమిచేయువాఁడన్= ఏంచేసేది; జముదూత+పోలెన్= యముడి బంటువలె; మాలవాఁడు; సత్వరముగన్= వేగిరంగా; ఇదె వచ్చెన్= ఇదుగో వస్తున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆతడిపేరు పరిఘుడు. ఈ పాపిష్ఠిని చూచిన పిల్లి 'యమకింకరుడివలె మాలవాడు ఇటే గబగబా వస్తున్నాడు. ఇంక నేను ఏం చేసేది?' అని మరింత భయపడసాగింది.

క. అనిన విని 'యొడ కోడకు'। మనుచుం దెగఁ గొఱికె వేగ మయ్యురిఁ బలితుం
డనయముఁ జకితాత్ముండై। చనియెన్ రోమశుఁడు నవనిజముపైకి వెసన్. 221

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగానే విన్నవాడై; పలితుండు= ఆ ఎలుక; ఒడకు+ఒడకుము; అనుచున్= భయపడకుము భయపడకుము అంటూ; ఆ+ఉరిన్= ఆ ఉచ్చును; వేగము= చకచక; తెగన్ కొఱికెన్= తుక్కుతుక్కుగా తెగిపోయేటట్లు కొరికింది; రోమశుడు= పిల్లి; అనయమున్= ఎంతో; చకిత+ఆత్ముండు+ఐ= కలవరపడ్డదై; అవనిజముపైకిన్= చెట్టుమీదికి; వెసన్= వడివడిగా; చనియెన్= పోయింది.

తాత్పర్యం: ఎలుక అదంతావిన్నది. భయపడకుమని పిల్లితో చెప్పి చకచక ఉచ్చులు కొరికి తెంపేసింది. కలవరపడ్డ మనస్సుతో పిల్లి చకచక చెట్టుమీదకు ఎక్కింది.

చ. ఎలుకయు బొక్కలోపలికి నేఁగి ముదంబునఁ బొంచి చూడ సం
కులముగ నేఁగుదెంచి పరిఘుం డురి నుగ్గగు టెల్లఁ జూచి ని
ష్ఫలతకుఁ జిత్తమెంతయు విషాదము వొందఁగఁ బోయెఁ; బిల్లి య
య్యెలుకకు నిట్లనుం జెవికి నింపగు రీతి నుదాత్త భంగిగన్. 222

ప్రతిపదార్థం: ఎలుకయున్= ఎలుకా; బొక్కలోపలికిన్= కలుగులోకి; ఏఁగి= వెళ్ళి; ముదంబునన్= సంతోషంగా; పొంచిచూడన్= దాగి ఉండి చూస్తుండగా; పరిఘుండు= ఆ మాలవాడు; సంకులముగన్= సందడిగా; ఏఁగుదెంచి= వచ్చి; ఉరి= ఉచ్చు; ఎల్లన్+నుగ్గగుటన్+చూచి= అంతా నజ్జు నజ్జు కావటం చూచి; నిష్ఫలతకున్= ప్రయోజనంలేకపోవటానికి; చిత్తము= మనస్సు; ఎంతయున్= ఎంతో; విషాదము+పొందఁగన్= దుఃఖాన్ని పొందగా; పోయెన్= వెళ్ళిపోయాడు; పిల్లి; ఆ+ఎలుకకున్= ఆ ఎలుకతో; చెవికిన్ ఇంపగు రీతిన్= వినటానికి తియ్యగా ; ఉదాత్తభంగిగన్= గౌరవభావంతో; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఎలుక కలుగులోకి దూరి సంతోషపడుతూ తొంగిచూస్తుండగా పరిఘుడు ఎంతో సందడిచేస్తూ వచ్చాడు. ఉచ్చులన్నీ నుగ్గునుగ్గయి ఉండటం చూచాడు. ఫలం దక్కలేదని ఎంతో బాధపడ్డాడు. వెనుతిరిగి వెళ్ళాడు. అపుడు ఎలుకతో పిల్లి చెవి కింపైన మాటలను ఎంతో గౌరవభావంతో ఇట్లా మాట్లాడింది.

ఆ. 'మేలుసేసి తగిన మిత్త్రునిఁ బడసి త। త్సుచరితముల వచ్చు సుఖము లనుభ
వింపఁ జూచుటుడిగి వేర్పడి యుండుట। యరయ నీతివిదుల తెరువుగాదు. 223

ప్రతిపదార్థం: మేలు+చేసి= ఉపకారం చేసి; తగిన= తగ్గ; మిత్త్రునిన్+పడసి= స్నేహితుడిని పొంది; తద్ సుచరితములన్= ఆతడి మంచి నడవడికలచేత; వచ్చు సుఖములు= కలిగే సౌఖ్యాలు; అనుభవింపన్+చూచుట= సుఖించటం; ఉడిగి= మాని; వేర్పడి+ఉండుట= విడివడి ఉండటం; అరయన్= విచారించగా; నీతి విదుల= నీతి శాస్త్ర వేత్తల; తెరువు+కాదు= పద్ధతి కాదు.

తాత్పర్యం: 'మంచి ఉపకారం చేసి మంచి మిత్రుడిని సంపాదించుకొని అతడి నడతలవలన కలిగే సౌఖ్యాలు అనుభవించకుండా వేరువేరుగా ఉండటం నీతివేత్తల పద్ధతి కాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. అనఘ! భయంబు నొందు టిది యారయ బేలఁదనంబు; నెమ్మిమై
మును నను నమ్మి చెంది భయమోక్షణముం గని నాకుఁ జాల మే
లొనరఁగ జేసి తీవు; దుది నుల్లమునం దగ విశ్వసింప కి
ట్లునికి సుఖంబె? నాదుసిరి కుక్తుఁడ వయ్యెదు రమ్ము ప్రీతితోన్. 224

ప్రతిపదార్థం: అనఘ!= పాప రహితుడా!; భయంబున్= భయాన్ని; ఒందుట= పొందటం; ఇది; ఆరయన్= విచారించగా; బేలఁదనంబు= పిరికితనం; నెమ్మిమైన్= సంతోషంతో; మును= మునుపు; ననున్ నమ్మి= నన్ను నమ్ముకొని; చెంది= చేరి; భయమోక్షణమున్+కని= భయవిమోచనాన్ని పొంది; ఈవు= నీవు; నాకున్= నాకు; చాల మేలు= ఎంతో ఉపకారాన్ని; ఒనరఁగన్= తగ్గట్టుగా; చేసితి= చేశావు; తుదిన్= చివరకు; ఉల్లమునన్= మనస్సునందు; తగన్= ఒప్పేటట్లు; విశ్వసింపక= నమ్మక; ఇట్లు+ఉనికి= ఇట్లా ఉండటం; సుఖంబె?= సంతోషమా?; నాదు సిరికిన్= నా కలిమికి; ఉక్తుఁడవు= తగినవాడివి, యోగ్యుడవు; అయ్యెదు= అవుతావు; ప్రీతితోన్= ప్రేమతో; రమ్ము= రావలసింది.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్ముడా! భయం కలగటం అనేది ఆలోచిస్తే అది పిరికితనమే. సంతోషంగా ముందు నన్ను నమ్మి భయాన్ని పోగొట్టుకొని నాకు మేలు చేశావు. చివరకు నన్ను నమ్మకపోవటం సంతోషమేనా? నీవే నాకలిమిని అనుభవించదగ్గవాడవు. ప్రీతితో రమ్ము.

క. బలవంతు లైన చుట్టం । బులు నేనును నీకు మేలు వొనరింపఁగ ని
మ్ముల మనుట యొప్పదే? ననుఁ । గలిసి మెలఁగు; విడువు శంకఁ; గను మభిమతముల్.' 225

ప్రతిపదార్థం: బలవంతులు+ఐన= ప్రబలులైన (ప్రసిద్ధులైన); చుట్టంబులు= బంధువులు; నేనును= నేనుకూడా; నీకున్= నీకు; మేలు= ఉపకారం; ఒనరింపఁగన్= అందించగా; ఇమ్ములన్= చక్కగా; మనుట= బతకటం; ఒప్పదే= తగదా; ననున్= నన్ను; కలిసి= కూడి; మెలఁగు= మసలుకొమ్ము; శంకన్= సంశయాన్ని; విడువు= వదలుకొమ్ము; అభిమతముల్= ఇష్టమైనవి; కనుము= పొందుము.

తాత్పర్యం: బలవంతులైన చుట్టాలూ నేనూ నీకు మంచి చేస్తాం. నాతో కలిసి మెలసి ఉండుము. చక్కగా బ్రదుకుదాం. సందేహించకుము. నీ కోరికలన్నీ తీర్చుకొమ్ము'.

వ. అనిన విని యప్పలితుండు రోమశునితో 'నీ పలుకు లుచితంబులు; నా మాటలు విను' మని యిట్లనియె. 226

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని; ఆ+పలితుండు= పలితుడనే ఆ ఎలుక; రోమశునితోన్= పిల్లితో; నీ పలుకులు= నీ మాటలు; ఉచితంబులు= న్యాయమైనవే; నా మాటలు= నా వచనాలు; వినుము+అని= ఆలకించుమని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఎలుక పిల్లితో 'నీ వాక్కులు ఉచితమైనవే. నా మాటలు కూడా వినుము' అన్నది.

చ. అరులను మిత్త్రులం దెలియ నారయు టెంతయు సూక్ష్మకృత్య మ
వ్వెర వతి దుర్లభం; బరులు వీ రన నుండియు మిత్త్రభావముం
బొరయుటయున్ సుహృజ్జనుల పోలికి గల్గియు శత్రుతాగుణ
స్ఫురణ యొకప్డు సూపుటయుఁ జాతుము గాదె ధరిత్రి నెల్లెడన్. 227

ప్రతిపదార్థం: అరులను= పగవాళ్ళను; మిత్త్రులన్= స్నేహితులను; తెలియన్+ఆరయుట= స్పష్టంగా కనుక్కోనటం; ఎంతయున్= ఎంతో; సూక్ష్మకృత్యము= అతి సూక్ష్మం అయినపని; ఆ+వెరవు= ఆ ఉపాయం; అతిదుర్లభంబు= పొందటం ఎంతో కష్టం; అరులు= పగవాళ్ళు; వీరు+అనన్+ఉండియున్= వీరే అనదగి ఉన్నా; మిత్త్రభావమున్= స్నేహాన్ని; పొరయుటయున్= పొందటమూ; సుహృద్ జనుల పోలికి+కల్గియున్= మిత్రులవలె ఉంటూ; శత్రుతాగుణ= పగవాడనే భావం; స్ఫురణమున్= తోచటమున్నూ; ఒకప్డు= ఎపుడైనా; చూపుటయున్= ప్రదర్శించటమున్నూ; ధరిత్రిన్= నేలమీద (లోకంలో); ఎల్ల+ఎడన్= అంతటా; చూతుము+కాదె!= చూస్తున్నాం కదా!

తాత్పర్యం: 'వీడు పగవాడు, వీడు నేస్తగాడని తెలిసికొనటం సూక్ష్మమైన విషయమే. ఆ నేర్పు అందరికీ లభించదు. శత్రువులు అనుకొన్నవారు మిత్రులవటం, మిత్రులనుకొన్నవారు శత్రువులవటం లోకంలో అంతటా చూస్తున్నాం కదా!

వ. **కావున నిన్నుఁ బెద్ద గదియుట గర్జంబు గాదు; నీవును మద్వశగతిం బొందుటఁ జూచితేనియు నేమఱంజన; దెట్లంటేని.** **228**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నిన్నున్= నీ గురించి; పెద్ద+కదియుట= మరింత చేరువ అవటం; కర్జంబు కాదు= తగిన పని కాదు; నీవును= నీవు కూడా; మత్+వశగతిన్+పొందుట= నాకు వశమై ఉండటం; చూచితేనియున్= చూస్తే; ఏమఱన్+చనదు= అజాగ్రత్తగా ఉండటం తగదు; ఎట్లంటేని= ఎట్లాగంటే.

తాత్పర్యం: కాబట్టి నిన్ను చేరటం తగదు. నీవు నాకు లోబడి ఉండటం చూచి పరాకుపడటం కూడదు.

క. **బలవద్రిపులు ప్రయోజన । ములకై లోఁబడుట గల్గుఁ బొలముల నేనుం**
గులు దీమంబుల పజ్జఁ ద । గిలి నెట్టన పట్టువడిన క్రియఁ జతురమతీ! **229**

ప్రతిపదార్థం: చతురమతీ!= బుద్ధిమంతుడా!; పొలములన్= అడవులలో; ఏనుంగులు= ఏనుగులు; దీమంబుల పజ్జన్= వేటగాళ్ళు మచ్చిక చేసి ఉంచిన పశువుల వెంటపడి; తగిలి= చిక్కి; నెట్టన= వెంటనే; పట్టువడిన క్రియన్= దొరికిపోయినట్లు; బలవత్+రిపులు= బలవంతులైన శత్రువులు; ప్రయోజనములకున్+ఐ= స్వార్థం కొరకు; లోఁబడుట= వశమవటం; కల్గున్= జరుగుతుంది.

తాత్పర్యం: అడవులలో ఏనుగులు వాటిని పట్టుకొనటంకొరకు ఉంచిన ఎరలవలన చిక్కుకొని లొంగినట్లు పగవాళ్ళు తమ స్వార్థం కొద్దీ లోబడుతుంటారు.

చ. **అరియెడ మిత్త్రభావ మొక యప్పుడు కార్యము పొంటెఁ గల్గిన**
న్వెరవునఁ బాముఁ బట్టునెడ నిక్కము నమ్మక దానివాతికిం
గరము దొలంగఁ జేయునరు కర్జము వట్టి చరించుటొప్పదే!
పొరుగున నుండి నీకు హితముం దగఁ జేసెద నెప్డు పంచినన్. **230**

ప్రతిపదార్థం: కార్యము పొంటెన్= అవసరాల కొరకు; అరిఎడన్= పగవాళ్ళపట్ల; ఒక+అప్పుడు= ఒకసారి; మిత్త్రభావము= మిత్రుడనే భావం; కల్గినన్= కలుగగా; పామున్ పట్టు+ఎడన్= పామును పట్టుకొనేటప్పుడు; నిక్కము= నిజంగా; నమ్మక= నమ్మకం లేకుండానే; దాని వాతికిన్= దాని నోటికి; కరము= చేయి; తొలంగన్+చేయు= తీసివేసే; నరుకర్జము+పట్టి= మనుష్యుడి పనినిసరించి; వెరవునన్= ఉపాయంతో; చరించుట= మెలగటం; ఒప్పదే?= తగదా?; పొరుగునన్= ఇరుగున (ప్రక్కన); ఉండి; ఎపుడు పంచినన్= ఎపుడు కోరినా; నీకున్= నీకు; హితమున్= మేలును; తగన్= ఒప్పిదంగా; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: అవసరాన్నిబట్టి ఒకొక్కప్పుడు శత్రువు మిత్రుడుగా అనిపించవచ్చును. పామును పట్టుకొనేటప్పుడు దానిని నమ్మక దాని నోటినుండి చేయిని తొలగించే మనిషివలె ఉపాయంతో ఉండాలి. నీవు ఎప్పుడు కోరితే అపుడు నీ ప్రక్కనే ఉండి నీకు మేలు చేస్తాను.

మ. **విను! నీ కామిష మేను; నీ యెడఁ గడున్ విశ్వాసముం బూని చే**
రిన నీ చిత్త మొకప్పు డుద్గతవికారీభూతమై దుర్వినో
దనహింసారుచి నొందు; నీ సుతసుహృద్బంధువ్రజంబేని మున్
ననుఁ గన్నన్ వహియింప దాత్మఁ గరుణ; న్మన్నింపు మి ట్లుండెదన్. **231**

ప్రతిపదార్థం: విను= వినుము; ఏను= నేను; నీకున్= నీకు; ఆమిషము= మాంసాహారాన్ని; నీ+ఎడన్= నీ పట్ల; కడున్+విశ్వాసమున్= ఎక్కువ నమ్మకాన్ని; పూని= పొంది; చేరినన్= చేరువగా ఉన్నట్లయితే; ఒకప్పుడు= ఎప్పుడైనా; నీ చిత్తము= నీ మనస్సు; ఉద్గత= బయటపడ్డ; వికారీ భూతమై= మార్పు చెందినదై; దుర్వినోదన= చెడ్డ ఆట అనే; హింసా= హింసయందు; రుచిన్= కోరికను; ఒందున్= పొందుతుంది; నీ సుత= నీ కొడుకుల; సుహృద్= నీ మిత్రుల; బంధు= నీ చుట్టాల; వ్రజంబు+ఏనిన్= సమూహమైనా; మున్= ముందే; ననున్+కన్నన్= నన్ను చూస్తే; సహియింపదు= ఓర్వలేదు; ఆత్మన్= మనస్సులో; కరుణన్= జాలితో; మన్నింపుము= అనుగ్రహించు; ఇట్లు= ఇపు డున్నట్లే; ఉండెదను= ఉంటాను.

తాత్పర్యం: నేను నీకు మాంసాహారాన్ని. నిన్ను నమ్ముకొని నీతో చేరితే ఎపుడో ఒకప్పుడైనా నీ మనస్సు మారవచ్చును. నాపై హింసాభావం కలగవచ్చును. నీ కొడుకులూ నీ స్నేహితులూ చుట్టాలూ నన్ను చూచి ఓర్చుకొనలేకపోవచ్చును. కాబట్టి నామీద కరుణ చూపి, ఆత్మలో మన్నించుము. నేనిట్లాగే ఉంటాను.'

వ. **అని యంత నిలువక.** **232**

తాత్పర్యం: అని పలికి, అంతటితో ఆగక - (తరువాతి పద్యంతో అన్వయం).

క. **'బలుపుటురిఁ జిక్కి పేరా । కలితో రేయెల్ల నున్నకతమున నీకుం**
జలిది వలసి పిలిచెద; విటు । వలయునె? నీ పలుకు నమ్మి వత్తునె చేరన్?' **233**

ప్రతిపదార్థం: బలుపుటురిన్= గట్టి ఉచ్చుల్లో; చిక్కి= చిక్కుకొని; పేరాఁకలితోన్= నకనకలాడే ఆకలితో; రేయి+ఎల్లన్= రాత్రంతా; ఉన్న కతమునన్= ఉన్న కారణంచేత; నీకున్= నీకు; చలిది= చద్ది బువ్వ; వలసి= కావలసి; పిలిచెదవు= పిలుస్తున్నావు; ఇటు+వలయునె?= ఇది నీకు తగినదేనా?; నీ పలుకు= నీ మాట; నమ్మి= నమ్ముకొని; చేరన్ వత్తునె?= దరి చేరుతానా?

తాత్పర్యం: 'రాత్రల్లా గట్టి ఉచ్చులో చిక్కుకొని నకనకలాడుతున్నావు. నీకు చద్దితిండి అవసరమై పిలుస్తున్నావు. ఇది నీకు తగునా? నీ మాట నమ్మి నీ దగ్గరకు వస్తానా?'

ఆ. **అనుడు 'నిట్టు దలఁప నగునె మత్ప్రాణ ర । క్షకుఁడ వైన నిన్ను శత్రుఁ గాఁగఁ**
దలఁతునే? కృతజ్ఞతయుఁ బౌరుషంబును । గలుగ నేను వెఱవ వలవ దనఘ!' **234**

ప్రతిపదార్థం: అనుడున్= అనగానే; అనఘ!= పవిత్రుడా!; ఇట్లు= ఈ విధంగా; తలఁపన్+అగునె?= ఆలోచించటం తగునా?; కృతజ్ఞతయున్= చేసిన మేలు మరచిపోకుండటం; పౌరుషంబును కలుగన్= మగతనం కలిగి ఉండగా; ఏను= నేను; మత్ప్రాణ రక్షకుఁడవు+ఐన= నా ప్రాణాన్ని కాపాడిన; నిన్నున్= నిన్ను; శత్రున్+కాఁగన్= పగవాడిగా; తలఁతునే?= భావిస్తానా?; వెఱవ వలదు= భయపడవద్దు.

తాత్పర్యం: అనగానే పిల్లి 'ఓ పాపరహితుడా! ఈ విధంగా ఆలోచించటం తగదు. నీవు చేసిన మేలును మరిచిపోయేవాడిని కాను నేను. పౌరుషం కృతజ్ఞతా కలిగిన వాడిని. నా ప్రాణాన్ని కాపాడిన నిన్ను విరోధిగా భావిస్తానా? భయపడకుము'.

వ. అనిన రోమశునకుఁ బలితుం డిట్లనియె. 235

ప్రతిపదార్థం: అనినన్= అనగా; రోమశునకున్= పిల్లికి; పలితుండు= ఎలుక; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: అది విన్న ఎలుక పిల్లితో ఈ విధంగా అంది.

క. నీ వలన నేను బ్రదికితి; । నీవును నాకతన మాలనికి నగపడవై;
తీ విధమునఁ గల్గు సుహృ । ద్భావము చాలు; నినుఁ జేరఁ దగ దిట మీఁదన్. 236

ప్రతిపదార్థం: నీ వలనన్= నీవలన; ఏను= నేను; బ్రదికితిన్= ఉసురుతో ఉన్నాను; నీవును= నీవు కూడా; నాకతనన్= నా మూలంగా; మాలనికిన్= మాలవాడికి; అగపడవు+ఐతి(వి)= కంటబడకపోతివి; ఈ విధమునన్= ఈ రీతిగా; కల్గు= పొందిన; సుహృద్భావము= మైత్రి; చాలున్= చాలు; ఇటమీఁదన్= ఇక మీదట; నినున్= నిన్ను; చేరన్+తగదు= సమీపించటం ఒప్పదు.

తాత్పర్యం: 'నీ వలన నేనూ బ్రతికాను. నా వలన నీవూ మాలవాడి కంటబడలేదు. ఈ పాటి స్నేహం చాలును. ఇక ముందు నీ దగ్గరకు రాకూడదు.

వ. ఇవ్విధంబునకు శుక్రవాక్యంబులుం గల; వాకర్ణింపుము. 237

ప్రతిపదార్థం: ఈ+విధమునకున్= ఈ పద్ధతికి; శుక్రవాక్యంబులున్= శుక్రాచార్యుడి వచనాలు; కలవు= ఉన్నాయి; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఈ విధానానికి శుక్రవాక్యాలు ఉన్నాయి. వినుము.

క. బలవంతుఁ డైన శత్రుని । వలనఁ బ్రయోజనము గలిగి వలను కలిమిఁ దాఁ
గలిసియు నది గడచనఁగాఁ । దొలఁగ వలయు; నమ్మెనేనిఁ దుదిఁ గీడొలయున్. 238

ప్రతిపదార్థం: బలవంతుఁడు+ఐన= మంచి సత్తువగల; శత్రునివలనన్= పగవాడివలన; ప్రయోజనము= లాభం; కలిగి= ఉండి; వలను కలిమిన్= ఆనుకూల్యం కలిగి ఉండటం వలన; తాన్+కలిసియున్= తను కలిసి ఉన్నా; అది కడచనఁగాన్= అది దాటి పోగానే; తొలఁగవలయున్= తప్పుకొనాలి; నమ్మెన్+ఏనిన్= నమ్మితే; తుదిన్= చిట్టచివరకు; కీడు= విపత్తును; ఒలయున్= పొందుతాడు.

తాత్పర్యం: బలవంతుడైన శత్రువుతో అవసరం కొద్దీ స్నేహం చేసినా ఆ అవసరం తీరగానే అతడి స్నేహాన్ని వదలుకొనాలి. ఒకవేళ నమ్మితే కడకు ఆపద పాలవక తప్పదు.

ఆ. నమ్మఁ దగనివారి నమ్మక యున్నది, । తగిన వారి నైనఁ దద్ద నమ్మి
యుండఁ దగదు; తన్ను నొరులు నమ్మెడు నట్ల । యుండి యొరుల నమ్మకునికి నీతి. 239

ప్రతిపదార్థం: నమ్మన్ తగనివారిన్= నమ్మకూడని వారిని; నమ్మక+ఉన్నది= నమ్మకుండా ఉండాలి; తగినవారిని+ఐనన్= నమ్మదగ్గ వారినైనా; తద్ద= పెద్దగా; నమ్మి+ఉండన్ తగదు= నమ్మి ఉండకూడదు; తన్నున్= తనను; ఒరులు=

పరాయివాళ్ళు; నమ్మెడు+అట్ల= నమ్మేటట్లు; ఉండి; ఒరులన్= ఇతరులను; నమ్మక+ఉనికి= తాను నమ్మకుండా ఉండటం; నీతి= ధర్మం.

తాత్పర్యం: నమ్మతగని వాళ్ళను నమ్మనేకూడదు. నమ్మదగ్గవాళ్ళనైనా తగినంతగానే నమ్మాలి. ఇతరులు తనను నమ్మేటట్లు నడుచుకొంటూనే తాను వాళ్ళను నమ్మకపోవటం నీతి.

వ. ఇట్టిద బ్రదుకుఁదెరు వగుటం జేసి. 240

ప్రతిపదార్థం: ఇట్టిద= ఇట్లాంటిదే; బ్రదుకుఁదెరువు+అగుటన్+చేసి= జీవనోపాయం అవటం వలన.

తాత్పర్యం: ఇట్లాంటిదే బ్రతికే మార్గం అవటం వలన. (తరువాతి పద్యంతో అన్వయం).

క. నినుబోంట్లను నమ్మక యే। నును బ్రదికెద; ననఘ! నీవునుం గని చండా
లుని యట్టివారి మాయలు। నినుఁ బొందక యుండ బ్రదుకు; నెఱిఁ బొ మ్మింకన్. 241

ప్రతిపదార్థం: నిను బోంట్లను= నీ బోటివాళ్ళను; నమ్మక= విశ్వసించక; ఏనును= నేనూ; బ్రదికెదన్= జీవిస్తాను; అనఘ!= పాపం తాకనివాడా!; నీవునున్= నీవూ; కని= చూచి; చండాలుని అట్టివారి మాయలు= మాలవాడివంటి వాళ్ళ మోసాలు; నినున్+పొందక= నీకు కలుగకుండా; నెఱిన్= నిండుగా; బ్రదుకు= జీవించుము; ఇంకన్= ఇక; పొమ్ము= వెళ్ళుము.

తాత్పర్యం: నీవంటి వారిని నమ్మకుండానే నేనూ బ్రతుకుతాను. నీవు మాలవాడివంటి వారి మాయలలో పడకుండా నిండైన బ్రతుకు బ్రతుకుము. ఇక వెళ్ళుము'.

క. అనిన విని సిగ్గుపడి తన। చనుచోటికిఁ జనియెఁ బిల్లి; సమ్మతిఁ బలితుం
డును వేఱొక తగులాఁగకుఁ। జని సముచిత వర్తనమున సౌఖ్యముఁ బొందెన్. 242

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; పిల్లి; సిగ్గుపడి= లజ్జపడి; తన చనుచోటికిన్= తానుండే తావుకు; సమ్మతిన్= అనుమతితో; చనియెన్= వెళ్ళినది; పలితుండును= ఎలుకా; వేఱొక= మరొక; తగులాఁగకున్= తగినట్టి కలుగులోకి; చని= దూరి; సముచిత వర్తనమునన్= యోగ్యమైన నడవడితో; సౌఖ్యమున్= సుఖాన్ని; పొందెన్= పొందింది.

తాత్పర్యం: అని ఎలుక అనగానే పిల్లి చాల సిగ్గుపడి, ఎలుక అనుమతి తీసికొని తన చోటుకు తాను పోయింది. ఎలుక కూడా మరొక కలుగులోకి దూరి తన చక్కని నడవడితో సౌఖ్యాన్ని పొందింది.

క. బలు పగఱ వలని యాపద। దలఁగుటకును రిపుని హీనతరు నైనఁ దనుం
గలిపికొని బ్రదుకుటకు ని। య్యెలుకయుఁ బిల్లియును వెరవు లెఱిఁగించెఁ దగన్.' 243

ప్రతిపదార్థం: బలు పగఱవలని= బలంగల పగవారివలన కలిగే; ఆపద= విపత్తు; తొలఁగుటకును= తొలగటానికీ; హీన తరున్ రిపుని+ఐనన్= అల్పుడైన శత్రువునైనా; తనున్= తాను; కలిపికొని= చేర్చుకొని; బ్రదుకుటకున్= జీవించటానికి; ఈ ఎలుకయున్= ఈ ఎలుకా; పిల్లియును= పిల్లీ; తగన్= ఒప్పేటట్లు; వెరవులు= ఉపాయాలు; ఎఱిఁగించెన్= తెలిపాయి.

తాత్పర్యం: బలంగల శత్రువులవలన కలిగే ఆపదలను తొలగించుకొనటానికీ అల్పుడైన శత్రువునైనా తనతో కలుపుకొని జీవించటానికి తగిన ఉపాయాన్ని ఎలుకా పిల్లీ తెలిపాయి'.

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు శాంతనవునితో 'నెవ్వనియెడ విశ్వసింపకున్నం జిత్తంబునకు విశ్రామంబు గల్గదు; విశ్వసించిన దురితంబులు దొడరు నట్లగుటంజేసి విశ్వసించుటయు విశ్వసింపకయుండుటయు నను రెంటిలోననుం బరమకర్తవ్యం బెయ్యదియో నిశ్చయింప నేర' ననుటయు నమ్మహీపతి కమ్మహాత్ముం డిట్లనియె 'నీ యర్థంబు' దేటపఱుచునట్టి యితిహాసంబు సెప్పెద నాకర్ణింపుము. 244

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని; కౌంతేయ+అగ్రజుండు= ధర్మరాజు; శాంతనవునితోన్= భీష్ముడితో; ఎవ్వనిఎడన్= ఎవడి పట్లనైనా; విశ్వసింపక+ఉన్నన్= నమ్మక ఉంటే; చిత్తంబునకున్= మనస్సుకు; విశ్రామంబు= ఊరట; కల్గదు= ప్రాప్తించదు; విశ్వసించినన్= నమ్మితే; దురితంబులు= పాపాలు; తొడరున్= కలుగుతాయి; అట్లు+అగుటన్+చేసి= అట్లా అవటంవలన; విశ్వసించుటయున్= నమ్మటం; విశ్వసింపక+ఉండుటయున్= నమ్మకపోవటం; అను రెంటిలోననన్= అనే రెంటిలోపలా; పరమ కర్తవ్యంబు= ఎక్కువ చేయతగ్గది; ఏ+అది+ఓ= ఏదో; నిశ్చయించనేరను= నిర్ణయించలేను; అనుటయున్= అనగానే; ఆ+మహీపతికిన్= ఆ ధర్మరాజుకు; ఆ+మహాత్ముండు= ఆ భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; ఈ అర్థంబున్= ఈ విధానాన్ని; తేటపఱుచు+అట్టి= తెల్లంజేసేటి; ఇతిహాసంబు= పూర్వ కథ; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= ఆలకించుము.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగానే ధర్మరాజు ఇట్లా అడిగాడు. 'ఎవడినీ నమ్మకపోతే మనస్సుకు ఊరట కలుగదు. నమ్మితే పాపాలు సంభవిస్తాయి. నమ్మటం, నమ్మకపోవటం అనే రెంటిలో ఏది ముఖ్యంగా ఆచరించ తగ్గదో ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాను' అనగానే భీష్ముడు 'ఈ విషయాన్ని తేటపరిచే కథ ఒకటి విను చెప్పుతాను' అన్నాడు.

బ్రహ్మదత్తునితోఁ బూజని యను శకుని కైన సంవాద ప్రకారము (సం. 12-137-4, 5)

సీ. బ్రహ్మదత్తుం డనఁ బరఁగిన నరపతి । నగరఁ బూజని యను నామ మొప్పఁ
జతురభాషిణి యొక్క శారిక వర్తించు । నది పిల్లఁ బెట్టి యింపారుపండ్లు
దెచ్చి యర్మిలి దాని కిచ్చుచో మేలేఱి । యధిపపుత్త్రున కిచ్చు; నందుఁ గొన్ని
వాఁడును మచ్చిక వచ్చి యప్పిల్లతోఁ । జర్లాటమాడుచు సంచరించు;

ఆ. నొక్కనాఁడు దాది యొద్ద లేకుండ న । ద్దారకుండు పిల్లతల నొగిల్చి
చంపె; దాని తల్లి సనుదెంచి కని మది । నిట్టులనియె శోక మెసక మెసఁగ. 245

ప్రతిపదార్థం: బ్రహ్మదత్తుండు+అనన్= బ్రహ్మదత్తు డనే పేరుతో; పరఁగిన= ఒప్పేటటువంటి; నరపతి నగరన్= రాజు పట్నంలో; పూజని అనునామము= పూజని అనే పేరు; ఒప్పన్= ఒప్పుతుండగా; చతుర భాషిణి= ఇంపుగా మాట్లాడే; ఒక్క శారిక= ఒక గోరువంక; వర్తించున్= ఉండేది; అది= ఆ గోరువంక; పిల్లన్+పెట్టి= పిల్లను కని (పెట్టి); ఇంపారు పండ్లు= తీయటి పండ్లను; తెచ్చి= తీసికొనివచ్చి; అర్మిలిన్= ప్రేమతో; దానికిన్= తన పిల్లకు; ఇచ్చుచోన్= పెట్టేటప్పుడు; అందున్ కొన్ని= ఆ పళ్ళల్లో కొన్నింటిని; మేలు+ఏఱి= మంచివి ఎంచి; అధిప పుత్త్రునకున్= బ్రహ్మదత్తుడి కొడుకుకి; ఇచ్చున్= పెట్టుతూ ఉండేది; వాఁడును= ఆ రాజకుమారుడు; మచ్చికన్ వచ్చి= చనువుగా వచ్చి; ఆ పిల్లతోన్= ఆ గోరువంక పిల్లతో; చర్లాటము ఆడుచున్= విలాసంగా ఆడుతూ; సంచరించున్= తిరుగుతుండేవాడు; ఒక్కనాఁడు= ఒక రోజున; దాది= దాసి; ఒద్దలేకుండన్= దగ్గర లేనప్పుడు; ఆ+దారకుండు= ఆ పిల్లవాడు; పిల్ల తలన్= గోరువంక పిల్ల తలకాయను; నొగిల్చి= పగులగొట్టి; చంపెన్= ప్రాణాలు తీశాడు; దానితల్లి= ఆ పిల్ల తల్లి పూజని; చనుదెంచి= వచ్చి; కని= చూచి; మదిన్= మనసులో; శోకము= ఏడుపు; ఎసకమెసఁగన్= ఎక్కువ అవగా; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఒకప్పుడు బ్రహ్మదత్తు డనే రాజు ఉండేవాడు. అతడి పట్టణంలో పూజని అనే గోరువంక ఉండేది. అది మంచి మాటకారి. అది ఒక పిల్లను పెట్టింది. ఆ పిల్లకు ప్రతిదినం తీయటి పళ్ళను తెచ్చి పెట్టేది. వాటిల్లో మంచివి ఎంచి రాజుకొడుకుకీ పెట్టేది. వాడూ ఆ పిల్లను మచ్చిక చేసికొని ఆడుకొనేవాడు. ఒకనాడు ఆ పిల్లవాడు దాది దగ్గరలేనప్పుడు ఆ పిట్ట పిల్ల తలను పగులగొట్టి చంపాడు. కాసేపటికి ఆ పిల్ల తల్లి పూజని వచ్చి చూచి విలవిలలాడింది. పెద్దపెట్టున వాపోతూ ఇట్లా అన్నది.

తే. **'అకట! కూడి మెలంగి యే మొకటి యైన । నర్థి నిదియును దానును ననుభవించుఁ**
బట్టి యాడుచునుండు నిప్పాపజాతి । పడుచు సంపునె యిటు దీని మిడుకమిడుక. **246**

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; కూడి మెలంగి= కలసి తిరిగి; ఏమి+ఒక్కటి+ఐనన్= ఏ వస్తువు ఒక్కటిపెట్టినా; అర్థిన్= కోరికచేత; ఇదియును= ఈ గోరువంక పిల్లా; తానునున్= తానూ (రాచబిడ్డా); అనుభవించున్= తింటూ ఉండేవాళ్ళు; పట్టి= పట్టుకొని; ఆడుచున్+ఉండున్= ఆటలాడుతూ ఉండేవాడు; ఈ+పాపజాతిపడుచు= పాపం చేసే రాచకులానికి చెందిన ఈ పిల్లవాడు; దీనిన్= ఈ నా పిల్లను; మిడుక మిడుకన్= సంచరిస్తుండగా; ఇటు+చంపునె?= ఇట్లా చంపుతాడా?

తాత్పర్యం: 'అయ్యో! నా పిల్లా, ఆ రాచబిడ్డా కలసి మెలసి తిరిగేవాళ్ళు. ఏది పెట్టినా అరమరికలు లేకుండా తినేవాళ్ళు. ఆడుకొనేవాళ్ళు. అయినా ఈ పాపి నా పిల్లను పొట్టనపెట్టుకున్నాడు.

ఆ. **రాచకొడుకుగాఁడె రాచవారికి నేటి । పరిచయంబు వేగ కరుణ విడుచు**
హితవు మఱచు రాజు లెందు నమ్మికకుఁ బా । త్రములె సమదమతులు క్రౌర్యరతులు.' **247**

ప్రతిపదార్థం: రాచకొడుకు+కాఁడె= రాజుకొడుకు గదా; రాచవారికిన్= రాజులకు; పరిచయంబులు= స్నేహం; ఏటి= ఎట్లాంటిది; వేగన్= తొందరగా; కరుణన్= జాలిని; విడుచున్= వదలుతారు; హితవు= మేలును; మఱచున్= మరచినట్టి; సమదమతులు= గర్వపోతులు; క్రౌర్యరతులు= కఠినాత్ములు (అయిన); రాజులు; ఎందును= ఎపుడూ; నమ్మికకున్= నమ్మటానికి; పాత్రములె!= తగినవారా!

తాత్పర్యం: రాచబిడ్డ కదా! రాజులకు స్నేహం ఎక్కడిది? వాళ్ళకు జాలి ఉండదు. చేసిన మేలు మరచిపోతారు. గర్వపోతులు. కఠినులు, నమ్మదగ్గవారు కారు.

వ. **అని నిందించి.** **248**

తాత్పర్యం: అని దూషించి - (తరువాతి పద్యంతో అన్వయం).

క. **ఈ పగ దీర్చెద నంచుం । గోపంబున రాజు కొడుకు గ్రుడ్డులు రెండుం**
బోపడునట్లుగ గోళ్ళన్ । వే పెఱికి రయమున గగనవీథికి నెగసెన్. **249**

ప్రతిపదార్థం: ఈ పగ= ఈ కచ్చను; తీర్చెదను+అంచున్= తీర్చుకొంటాను అంటూ; కోపంబునన్= కోపంతో; రాజుకొడుకు= రాజకుమారుడి; గ్రుడ్డులు= కంటి గుడ్లు; రెండున్= రెండూ; పోపడునట్లుగన్= పోయేటట్లు; గోళ్ళన్= గోళ్ళతో; వే పెఱికి= చప్పున ఊడబీకి; రయమునన్= వేగంగా; గగనవీథికిన్= ఆకాశంలోకి; ఎగసెన్= ఎగిరిపోయింది.

తాత్పర్యం: ఈ పగను తీర్చుకొంటాను' అంటూ ఆ గోరువంక తన గోళ్ళతో రాజకుమారుడి రెండు కళ్ళూ ఊడబెరికింది. ఎంతో వేగంగా ఆకాశంలోకి ఎగిరిపోయింది.

వ. ఎగసి యచ్చోట నిలిచి బ్రహ్మదత్తుండు విన నిట్లనియె. 250

ప్రతిపదార్థం: ఎగసి= ఎగిరి; ఆ+చోటన్= ఆకాశంలో; నిలిచి= ఉండి; బ్రహ్మదత్తుండు= బ్రహ్మదత్తుడు; వినన్= వినేటట్లు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: ఆకాశంలోకి ఎగిరి అక్కడినుండి బ్రహ్మదత్తుడు వినేటట్లు ఈ విధంగా పలికింది.

క. 'చేసె నఘము; దత్ఫలముం । జేసేతం గుడిచెఁ గాని శిశువు నెడన్ నా
చేసిన క్రౌర్యము లే; దేఁ । జేసితి మాఱొండు గీడు సెందదు నన్నున్.' 251

ప్రతిపదార్థం: (నీ బిడ్డ) అఘము= పాపం; చేసెన్= చేశాడు; తత్ఫలమున్= ఆ పాప ఫలాన్ని; చేసేతన్= స్వయంగా; కుడిచెన్= అనుభవించాడు; కాని= అంతేకాని; శిశువు+ఎడన్= పిల్లవాడి పట్ల; నా చేసిన= నేను కోరి చేసిన; క్రౌర్యము లేదు= క్రూరత్వం లేదు; ఏన్= నేను; మాఱు= నా బిడ్డను చంపినందుకు బదులుగా; చేసితిన్= చేశాను; ఒండు కీడు= మరే పాపం; నన్నున్ చెందదు= నన్ను పొందదు.

తాత్పర్యం: 'రాజా! నీ బిడ్డ నా బిడ్డను చేజేతులా చంపివేశాడు. దాని ఫలితంగానే కళ్ళు పోగొట్టుకున్నాడు. అంతేకాని నీ కొడుకు పట్ల నేను ఏమీ క్రూరంగా నడచుకొనలేదు. చేసిన దానికి ప్రతీకారం చేశాను. నన్ను ఏ పాపం అంటదు'.

చ. అనవుడు బ్రహ్మదత్తుఁ 'డది యట్టిద; నీ దెసఁ గీడు లేదు; నీ
చనుటకు నా మనం బతివిషాదముఁ బొందెడుఁ; దొంటి యట్ల నె
మ్మిన నిలు 'మన్నఁ బూజని' శమించునె యొండొరుచేతఁ బడ్డ యీ
పెనుపగ నొంచి మాటపస బేల్పడి క్రమ్మఱఁ జేరు టొప్పునే?' 252

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; బ్రహ్మదత్తుఁడు; అది= నీవు చెప్పింది; అట్టిద= అట్లాంటిదే; నీ దెసన్= నీవైపు; కీడు లేదు= పాపం లేదు; నీ చనుటకున్= నీవు వెళ్ళటానికి; నా మనంబు= నా మనస్సు; అతివిషాదమున్= ఎంతో దుఃఖాన్ని; ఒందెడున్= పొందుతున్నది; తొంటి+అట్ల= మునుపటివలెనే; నెమ్మిన్+అ= మిత్రభావంతోనే; నిలుము= ఉండుము; అన్నన్= అనగానే; పూజని= గోరువంక; ఒండొరు చేతన్= ఒకళ్ళ నొకళ్ళం; నొంచి= నొప్పించుకొని; పడ్డ= అనుభవించిన; ఈ+పెనుపగ= ఈ పెద్ద పగ పోతుందా; మాటపసన్= మాటలనేర్పుతో; బేల్పడి= మోసపోయి; క్రమ్మఱన్= తిరిగి; చేరుట= కలిసి ఉండటం; ఒప్పునే?= తగుతుందా?

తాత్పర్యం: అని పూజని చెప్పగానే రాజు 'నీవు అన్నది నిజమే ఈ విషయంగా నీ దోషం ఏమీ లేదు. కాని, నీవు వెళ్ళిపోవటం మాత్రం నా మనస్సుకు ఎంతో బాధగా ఉన్నది. కనుక వెనకటివలెనే స్నేహంగా ఇక్కడే ఉండు' మన్నాడు. దానికి గోరువంక తిరిగి ఈ విధంగా అన్నది. 'ఒకరి నొకరం నొప్పించుకొన్న ఈ పెనుపగ తేలికగా చల్లారిపోదు. అయినా నీ కమ్మని మాటలలో పడి మోసపోయి మళ్ళీకలసి ఉండటం తగినది కాదు'.

వ. అనిన విని యతండు. 253

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; అతండు= బ్రహ్మదత్తుడు.

తాత్పర్యం: అది విన్న బ్రహ్మదత్తుడు - (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **'చేసిన దానికి మాఱుగఁ। జేసినఁ బగయంతతోడఁ జెడుఁ గాక గుణుల్**
డాసిన నమ్మేలు విడిచి। దోసముఁ బట్టుదురె యెట్టి తుచ్ఛులుఁ జతురా! **254**

ప్రతిపదార్థం: చతురా!= నేర్పరీ!; చేసిన దానికిన్= నా బిడ్డ చేసిన కీడుకు; మాఱుగన్+చేసినన్= బదులుగా చేసిన; పగ= కచ్చ; అంతతోడన్= అంతటితోనే; చెడున్+కాక= తీరిపోతుంది కాక; ఎట్టి తుచ్ఛులున్= ఎలాంటి నీచులైనా; గుణుల్= బుద్ధిమంతులు మంచివాళ్ళు; డాసినన్= చేరువైతే; ఆ మేలు విడిచి= ఆ ఉపకారాన్ని వదలిపెట్టి; దోసమున్= తప్పును; పట్టుదురే?= మోపుతారా?

తాత్పర్యం: 'నా బిడ్డ చేసినదానికి ప్రతిగా నీవు కనుగుడ్లు పీకావు. ఆ పగ అంతటితో తీరిపోతున్నది. ఎట్లాంటి నీచులైనా దగ్గరకు చేరిన బుద్ధిమంతుల మేలును మరచి నింద మోపుతారా!'

వ. **అనిన నతనికి శారిక యిట్లనియె.** **255**

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; అతనికిన్= అతడితో; శారిక= పూజని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: అని అనగా బ్రహ్మదత్తుడితో శారిక ఇట్లా అన్నది.

క. **'నెయ్యము సెడినను మాటల। తియ్యఁదనము వట్టి పగ మదిన్ మఱచినఁ జా**
వయ్యెం జేటయ్యెఁ గలఁక। యయ్యె నొకటి మూఁడుఁగాక యది మే లగునే? **256**

ప్రతిపదార్థం: నెయ్యము= స్నేహం; చెడినను= చెడిపోయినా; మాటల= పలుకులలోని; తియ్యఁదనము+పట్టి= మాధుర్యాన్నిబట్టి; పగ= వైరం; మదిన్= మనస్సులో; మఱచినన్= మరచిపోతే; చావు+అయ్యెన్= చావు కలుగుతుంది; చేటు+అయ్యెన్= కీడు మూడుతుంది; కలఁక+అయ్యెన్= కలవరం పుడుతుంది; ఒకటి= వీటిల్లో ఒకటి; మూఁడున్+కాక= కలగవచ్చుకాక; అది= అట్లా కలగటం; మేలు+అగునే?= మంచిది అవుతుందా?

తాత్పర్యం: 'స్నేహం చెడిపోయినా తియ్యటి మాటలలో పడిపోయి ఆ పగను మర్చిపోవచ్చును. కాని, దానివలన చావు కలుగవచ్చును, కలత పుట్టవచ్చును, కీడు పొందవచ్చును. అంతే కాని మంచి జరగదు.

ఆ. **వినుము! నేల దోఁచికొనినను దాయాదు। లైన మాట మాటకేని నాఁడు**
వారి యెడను గీడు వారక చేసినఁ। బగ జనించు నిట్లు భంగు లైదు. **257**

ప్రతిపదార్థం: వినుము= వినుము; నేల దోఁచికొనినను= భూమిని కాజేయాలనుకొన్నా; దాయాదులు+ఐనన్= జ్ఞాతుల (ఆస్తిలో పాలుపంచుకొనే అధికారం ఉండే ఆడవాళ్ళు మగవాళ్ళు) వల్లనైనా; మాటకున్ మాటకున్+ఏనిన్= మాటామాట వచ్చినా; ఆఁడువారి యెడను= ఆడవారివల్లనైనా; కీడు= చెడు; వారకచేసినన్= విడవకుండా చేసినా; పగ= వైరం; జనించున్= పుట్టుతుంది; ఇట్లు= ఇటువంటి పగ; ఐదు భంగులు= అయిదు విధాలు.

తాత్పర్యం: భూమి దురాక్రమణంవలన, దాయాదులవలన, ఆడవారివలన, మాటమాటవచ్చినందువలన, అడ్డూ ఆపూ లేని చెడు తలపెట్టటంవలన పగ పుట్టుతుంది. ఇట్లా ఇది అయిదు తీరులు.

ఆ. **పగయుఁ గల్గెనేని పాయునె గూఢమై। ప్రూన నగ్నియున్న మాడ్కి నుండుఁ**
గాన నమ్మి బేల కాలాంతరంబున। నైనఁ జెడును సందియంబు వలదు. **258**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పగయున్= విరోధం; కల్గెన్+ఏని= కలిగితే; పాయునె?= పోతుందా?; ద్రుమానన్= చెట్టులో; అగ్ని= నిప్పు; గూఢమై ఉన్నమాడ్కిన్= దాగి ఉన్నట్లుగా; ఉండున్= పగ ఉంటుంది; కానన్= కాబట్టి; నమ్మి= నమ్మకొని; బేల= తెలివి తక్కువవాడు; కాలాంతరంబునన్+ఐనన్= కొంతకాలం దాటిపోయాక అయినా; చెడును= చెడిపోతాడు (నశిస్తాడు); సందియంబు= సందేహం; వలదు= వద్దు.

తాత్పర్యం: పగ పుట్టాక ఒక పట్టాన పోదు. ఇది చెట్టులో దాగి ఉండే నిప్పువలె మనస్సులో దాగి ఉంటుంది. కాబట్టి నమ్మకొన్న వెర్రివాడు ఎప్పటికైనా చెడిపోతాడు. ఇందులో ఏమీ సందేహం లేదు.

క. జననీ జనక సహోదర । తనూభవుల సఖుల నమ్మఁ దగ దనినను నె
మ్మనమునఁ బగ గలవారలఁ । జనునే నమ్మంగ విడువు చతురవచనముల్.' 259

ప్రతిపదార్థం: జననీ= తల్లినీ; జనక= తండ్రినీ; సహోదర= తోడబుట్టిన వారినీ; తనూభవులన్= పిల్లలనూ; సఖులన్= నేస్తగాళ్ళనూ; నమ్మన్+తగదు= నమ్మకొనకూడదు; అనినను= అని నీతి శాస్త్రం అంటూ ఉంటే; నెమ్మనమునన్= నిండు మనస్సుతో; పగ కలవారలన్= విరోధులను; నమ్మంగన్ చనునే?= విశ్వసించవచ్చునా?; చతుర వచనముల్= నేర్పు మాటలను; విడువు= మానుకొమ్ము.

తాత్పర్యం: కన్న తల్లిదండ్రులను, తోడబుట్టినవాళ్ళను, కన్న సంతానాన్నీ, స్నేహితులనూ నమ్మకూడదు అంటున్నది నీతిశాస్త్రం. కనుక, మనస్సు నిండా పగపెట్టుకొన్నవాళ్ళను నమ్మవచ్చునా? ఇక నీ చతురోక్తులు చాలించుము.'

వ. అనుటయు బ్రహ్మదత్తుం డిట్లనియె. 260

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; బ్రహ్మదత్తుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగానే బ్రహ్మదత్తుడు ఈ విధంగా అన్నాడు.

క. 'కాలవశంబునఁ గీడు । న్మేలును జనులకును మూఁడు నీకును నాకున్
వాలి యవి సేయ వచ్చునె? । బేలనె యే నంత యేల పెడఁబాయంగన్. 261

ప్రతిపదార్థం: కాలవశంబునన్= కాలానికి లోబడి; కీడున్= చెడును; మేలును= మంచీ; జనులకును= ప్రజలకు; మూఁడున్= కలుగుతుంటాయి; నీకును= నీకూ; నాకున్= నాకూ; వాలి= మితిమించి; అవి= ఆ మంచీ చెడ్డలు; చేయవచ్చునె= చేయకలుగుతాయా?; అంత+ఏల?= అదంతా ఎందుకు?; పెడఁబాయంగన్= వదలిపెట్టి వెళ్ళటానికి; ఏను= నేను; అంత బేలనె?= అంత వెర్రివాడినా?

తాత్పర్యం: 'కాలాన్నిబట్టి జనానికి మంచీ చెడులు కలుగుతుంటాయి. వాటిని దాటి చేయటం మన వశమా? అంతెందుకు? నిన్ను వదలుకొనటానికి నే నేమైనా వెర్రివాడినా?'

వ. అనిన విని శారిక యతని మొగంబు దేఱకొనంజూచి. 262

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగానే విని; శారిక= పూజని అనే గోరువంక; అతని మొగంబు= ఆ బ్రహ్మదత్తుడి ముఖాన్ని; తేఱకొనన్+చూచి= తేరిపార చూచి.

తాత్పర్యం: బ్రహ్మదత్తుడి మాటలు విన్న గోరువంక అతడిని తేరిపార చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'విను చల్లని మాటలలో । మునిఁగి యలుక గుబ్బతిలు సముద్ర జలములో
నన యుండి యాఱ కెప్పుడు । గనగన మను బాడబాగ్ని కరణి నరేంద్రా!' 263

ప్రతిపదార్థం: నరేంద్రా!= రాజా!; విను= ఆలకించుము; చల్లని మాటలలోన్= నీ ఊరడింపు పలుకులలో; మునిఁగి= దాగిన; అలుక= కోపం; సముద్ర జలములోనన= సముద్రం లోపలనే; ఉండి; ఆఱక= చల్లారక; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; గనగనము+అను= కణకణమని మండే; బాడబాగ్ని కరణిన్= బడబానలంవలె; గుబ్బతిలున్= అతిశయిస్తుంది.

తాత్పర్యం: 'నీ చల్లని మాటల మాటున దాగిన కోపం సముద్రంలోపల ఎపుడూ కణకణ మండే బడబాగ్నివలె మండుతూనే ఉంటుంది'.

క. అని పలికి యవిశ్వాసము । మనమున నెలకొల్పి రాజు మాటలకుం దే
లని వెరవుతోడ నా పూ । జని దనకిమ్మైన యెడకుఁ జనియెఁ గుమారా! 264

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; కుమారా!= ధర్మరాజా!; మనమునన్= మనస్సులో; అవిశ్వాసమున్= అపనమ్మకాన్ని; నెలకొల్పి= నిలుపుకొని; రాజు మాటలకున్= బ్రహ్మదత్తుడి మాయమాటలకు; తేలని= బయటపడని; వెరవుతోడన్= ఉపాయంతో; ఆ పూజని= ఆ గోరువంక; తనకున్= తనకు; ఇమ్ము+ఐన ఎడకున్= అనువైన చోటికి; చనియెన్= వెళ్ళింది.

తాత్పర్యం: ధర్మరాజా! ఆ పూజని రాజుపట్ల తనకుగల అపనమ్మకాన్ని బయటపడనీయలేదు. ఆ రాజు మాటలకు లొంగకుండానే ఎంతో ఉపాయంగా తన కనువైన చోటికి వెళ్ళిపోయింది.

వ. అదియునుం గాక. 265

తాత్పర్యం: అంతే కాకుండా.

క. జననాథునకు నవిశ్వా । స నిరూఢత వలయు నెల్ల జనములయందుం
దనుఁ దనసిరిఁ గాచుటకై । యని నీతులు సెప్పుదురు బృహస్పతిముఖ్యుల్. 266

ప్రతిపదార్థం: జననాథునకున్= రాజైనవాడికి; తనున్= తన్నూ; తనసిరిన్= తన సంపత్తినీ; కాచుటకై= కాపాడుకొనటానికి; ఎల్ల జనములఅందున్= జనులందరిపట్ల; అవిశ్వాస నిరూఢత= గట్టిగా నమ్మకపోవటం; వలయున్= ఉండాలి; అని; బృహస్పతి ముఖ్యుల్= బృహస్పతి మొదలైన పెద్దలు; నీతులు= రాజనీతులు; చెప్పుదురు= చెప్తుతుంటారు.

తాత్పర్యం: ప్రజలెవరినీ రాజు గట్టిగా నమ్మకూడదు. అపుడే తననూ, తన సంపత్తినీ సంరక్షించుకొనగలుగుతాడు. అని బృహస్పతివంటి పెద్దలు రాజనీతులు ఉపదేశిస్తుంటారు.

కణికుఁడు శత్రుంజయున కుపదేశించిన హితవచనముల ప్రకారము (సం. 12-138-4)

వ. అవ్వాక్యంబు లాదరింపవలయు నని పల్కి వెండియు భీష్ముండు పాండవాగ్రజుతో 'సౌవీరపతి యగు శత్రుంజయునకు భారద్వాజ వంశవర్యుండైన కణికుం డుపదేశించిన హితవచనంబులు గలవు; వానిం జెప్పెద నాకర్ణింపు మని యిట్లనియె. 267

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ+వాక్యంబులు= ఆ మాటలు; ఆదరింప వలయును= పాటించాలి; అని పల్కి= అని చెప్పి; వెండియున్= మళ్ళీ; భీష్ముండు= భీష్ముడు; పాండవ+అగ్రజుతోన్= పాడవులలో పెద్దవాడైన ధర్మరాజుతో; సౌవీరపతిఅగు= సౌవీర దేశపు రాజయిన; శత్రుంజయునకున్= శత్రుంజయుడికి; భారద్వాజ వంశవర్యుండు+ఐన= భారద్వాజ వంశంలో ఉత్తముడైన; కణికుండు; ఉపదేశించిన= బోధించిన; హితవచనంబులు= మేలు పలుకులు; కలవు= ఉన్నాయి; వానిన్+చెప్పెదన్= వాటిని చెప్పుతాను; ఆకర్ణింపుము+అని= ఆలకించుమని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ నీతిమాటలు ఆదరించు' మంటూ భీష్ముడు ధర్మరాజుతో మళ్ళీ ఈ విధంగా అన్నాడు: 'సౌవీరదేశపు రాజు శత్రుంజయుడికి, భారద్వాజ వంశ శ్రేష్ఠుడైన కణికుడు ఉపదేశించిన నీతి వాక్యాలను చెప్పుతాను ఆలకించుము.

క. **వికచముఖుఁ డగుచు శాత్రవు । లకు హితు లగునట్టి వారలం గని భూపా**
లకుఁ డెడ్డ కత్తెరయు నా । లుక బెల్లమునై మనంబులుం గన వలయున్. **268**

ప్రతిపదార్థం: భూపాలకుఁడు= రాజు; వికచముఖుఁడు+అగుచున్= విప్పారిన మొగం కలవాడవుతూ; శాత్రవులకున్= పగవారికి; హితులు= ఆప్తులు; అగునట్టి వారలన్= అయినట్టి వారిని; కని= కనిపెట్టి చూచి; ఎడ్డ= హృదయం; కత్తెరయున్= కత్తెరవలె కరకుదనమున్నూ; నాలుక బెల్లమును+ఐ= మాటలు తీపిన్నీ కలిగి; మనంబులున్= మనస్సులను; కనవలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: నవ్వు మొగంతో రాజు పగవాళ్ళకు హితులైనవాళ్ళను కనిపెట్టాలి. వాళ్ళతో తీయని మాటలు మాట్లాడుతూ మనసులో కరుగ్గా ఉండాలి. వాళ్ళ మనస్సులను కనుక్కొనాలి.

ఉ. **జ్ఞాతుల నమ్మి తోడుకొని శత్రుల నోర్చి యహీన రాజ్యముం**
బ్రీతి యెలర్పఁ జేకొనిన పిమ్మట సౌఖ్య సమృద్ధి తోషిత
జ్ఞాతినికాయుఁడై మది నజస్రము నమ్మక సర్పసంయుతం
బై తనరారు రమ్య నిలయంబున నున్నటు లుండగాఁ దగున్.' **269**

ప్రతిపదార్థం: జ్ఞాతులన్= దాయాదులను; నమ్మి= నమ్ముకొని (విశ్వసించి); తోడుకొని= వెంట తీసికొని వెళ్ళి; శత్రులన్= పగవాళ్ళను; ఓర్చి= ఓడించి; అహీన రాజ్యమున్= గొప్ప సామ్రాజ్యాన్ని; ప్రీతి ఎలర్పన్= సంతోషంగా; చేకొనిన పిమ్మట= చేజిక్కించుకొన్న తరువాత; సౌఖ్యసమృద్ధి= సుఖపరంపరచేత; తోషిత= సంతోషపెట్టిన; జ్ఞాతినికాయుఁడు+ఐ= దాయాదుల సముదాయం కలవాడై; మదిన్= మనస్సులో; అజస్రము= ఎప్పుడూ; నమ్మక= నమ్మకుండా; సర్పసంయుతంబు+ఐ= పాముతో కూడినదై; తనరారు= శోభిల్లే; రమ్య నిలయంబునన్= చక్కటి మేడలో; ఉన్నటులు= ఉన్న విధంగా; ఉండగాన్+తగున్= ఉండటం ఒప్పుతుంది.

తాత్పర్యం: దాయాదులను నమ్మి, వాళ్ళతోడుగా శత్రువులను జయించాలి. రాజ్యం సంపాదించిన తరువాత వాళ్ళకు సకలసౌఖ్యాలను సమకూర్చి సంతోషింపచేయాలి. కాని, మనస్సులో మాత్రం వాళ్ళను ఎప్పుడూ నమ్మకుండా ఉండాలి. పామున్న భవనంలో ఉన్నట్టు ఎపుడూ 'ఏమరక ఉండాలి'.

వ. **అని మఱియును.** **270**

తాత్పర్యం: అని మాట్లాడి భీష్ముడు మళ్ళీ - (తరువాతి పద్యంతో అన్వయం).

క. **'వినుము తఱి వేచి రిపుమూఁ । పున మోవఁగవలయు సమయముం గనికొని గ్ర**
క్కునఁ గడవ శిలాస్థలి వై । చిన చాడ్పున నేర్పు మెఱయఁ జెఱుచుట యొప్పున్. **271**

ప్రతిపదార్థం: వినుము= వినవలసింది; తఱి వేచి= సమయం చూచి; రిపున్= శత్రువును; మూఁపునన్= భుజం మీద పెట్టుకొని; మోవఁగవలయున్= మొయ్యాలి; సమయమున్= తగిన కాలాన్ని; కనికొని= తెలిసికొని; గ్రక్కునన్= వెంటనే; కడవ= కుండను; శిలాస్థలిన్= రాతినేలమీద; వైచిన చాడ్పునన్= పడేసినట్లు; నేర్పు మెఱయన్= చాకచక్యం కనబరచేటట్లు; చెఱుచుట= నాశనం చెయ్యటం; ఒప్పున్= తగుతుంది.

తాత్పర్యం: సమయాన్నిబట్టి శత్రువును భుజాలమీద ఎక్కించుకొని మొయ్యాలి. సమయం కనిపెట్టి రాతినేలమీద కుండను ఎత్తి బ్రద్దలు కొట్టినట్లు నేర్పుగా శత్రువును నశింపచేయాలి.

క. పానము జూదము వేఁటయు। మానినియును భూపతులకు మధుర వినోద
స్థానము లగు నైనను దగ। వైన విధము దక్కఁ దగుల మాపద దెచ్చున్. 272

ప్రతిపదార్థం: పానము= త్రాగుడు; జూదము= జూదమూ; వేఁటయున్= వేటా; మానినియును= స్త్రీయున్నూ; భూపతులకున్= రాజులకు; మధుర= సొంపైన; వినోదస్థానములు+అగున్= వేడుకలకు ఆటపట్టవుతాయి; ఐనను= అయినా; తగులము= వీటితో సంబంధం; తగవు+ఐన విధము= తగినట్టి రీతిని; తక్కన్= తప్పిపోతే; ఆపద= విపత్తును; తెచ్చున్= తెచ్చిపెట్టుతుంది.

తాత్పర్యం: తాగటం, జూదమాడటం, వేటాడటం, ఆడవాళ్ళను కోరటం - అనేవి రాజవినోదాలకు నెలవులు. వీటితో పొత్తు మేర మీరకూడదు. మేర మీరితే మాత్రం ఆపద తెస్తుంది.

క. విని విననివాఁడ పోలెం,। గని కానని వాఁడపోలెఁ గావలయు విభుం
డొనరింపఁ దలంచిన పని। కనువగు నంతకు నభేద్యుఁడై జనుల యెడన్. 273

ప్రతిపదార్థం: విభుండు= రాజు; ఒనరింపన్+తలంచిన పనికిన్= చేయ తలపెట్టిన కార్యానికి; అనువు+అగునంతకున్= సానుకూలపడే వరకూ; అభేద్యుఁడు+ఐ= తెలిసికొనటానికిశక్యం కానివాడై; జనుల+ఎడన్= ప్రజల పట్ల; విని= విన్నప్పటికీ; విననివాఁడ పోలెన్= విననివాడివలె; కని= చూచి; కాననివాఁడపోలెన్= చూడని వాడివలె; కావలయున్= ఉండాలి.

తాత్పర్యం: రాజు తాను తలపెట్టిన పని సానుకూలపడేదాకా ఎవ్వరూ తనను తెలిసికొనలేనివాడుగా ఉండాలి. ప్రజల విషయంలో విన్నా విననివాడివలె చూచినా చూడనివాడివలె నడచుకొనాలి.

క. ఒల్లని కార్యం బాసల। నల్లన కాలగతిఁ గడపునది కాలముచేఁ
బెల్లొదవు విఘ్నములు భూ। వల్లభునకు నెపము వెట్టవచ్చుం బిదపన్. 274

ప్రతిపదార్థం: భూ వల్లభునకున్= రాజైనవాడికి; ఒల్లని కార్యంబున్= తాను ఇష్టపడని పనిని; ఆసలన్= ఆశలు చూపిస్తూ; అల్లనన్= మెల్లగా; కాలగతిన్= కాలం గడిచేటట్లు; కడపునది= వెళ్ళబుచ్చేది; పిదపన్= ఆ తరువాత; కాలముచేన్= కాలంవలన; పెల్లు ఒదవు= ఎక్కువగా కలిగే; విఘ్నములు= ఆటంకాలను; నెపము= మిషగా; పెట్టవచ్చున్= పెట్టవచ్చును.

తాత్పర్యం: రాజు తనకు ఇష్టంలేని పనిని చేస్తానని ఆశలు చూపిస్తూ కాలం గడపాలి. కాలాంతరంలో ఎదురయ్యే అడ్డంకులను సాకుగా చూపించి ఆ పనికి మొండిచెయ్యి చూపాలి.

తే. బహుళ మగు గర్వమునఁ గార్యభంగియును న। కార్యసరణియు నెఱుఁగక నార్యవృత్తిఁ
గాని తెరువున నడచుచున్నేని గురుని। నైన శాసింపఁగాఁ దగునండ్రు బుధులు. 275

ప్రతిపదార్థం: బహుళము+అగు గర్వమునన్= ఎంతో పొగరుతో; కార్యభంగియునున్= చేయదగ్గ పనితీరూ; అకార్యసరణియున్= చేయతగని పనితీరూ; ఎఱుఁగక= తెలియక; అనార్య వృత్తిన్= శిష్టులు ఒప్పని నడవడిచేత; కాని తెరువునన్= కూడని మార్గంలో; నడచుచున్ ఉన్నన్+ఏని= నడుస్తూ ఉండేటట్లయితే; గురునిన్+ఐనన్= గురువునైనా; శాసింపగాన్ తగును= దండించవచ్చు (అని); బుధులు= పెద్దలు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: ఇది చేయతగ్గపనీ, ఇది చేయకూడని పనీ అని పొగరుబోతుతనంతో తెలిసికొనలేని వాడిని పెద్దలు పోయే మార్గంలో కాక కానిమార్గంలో నడిచేవాడిని గురువైనా సరే తప్పక దండించాలి అంటారు పెద్దలు.

క. **తెగఁ దీర్పక తగ నార్పక । తెగటార్పక కడమ కొంత ద్రిక్కఁగ నున్నన్**
జగతీశ! యప్పునగ్నియుఁ । బగయును గడుఁ బెరుఁగుఁ గీడు వాటిల్లు దుదిన్. **276**

ప్రతిపదార్థం: జగతీ+ఈశ!= రాజా! తెగన్ తీర్పక= మొత్తం చెల్లించకపోతే; అప్పున్= రుణం; తగన్+ఆర్పక= అంతా (తగ్గట్టుగా); చల్లార్చకపోతే; అగ్నియున్= నిప్పు; తెగటార్పక= చంపకపోతే; పగయున్= పగా; కడమ= చివరకు; కొంత త్రిక్కఁగన్+ఉన్నన్= కొద్దిగా మిగులు ఉంటే; కడున్= ఎంతో; పెరుఁగున్= పెంపొందుతుంది; తుదిన్= చిట్టచివరకు; కీడు= చెరుపు; పాటిల్లున్= కలుగుతుంది.

తాత్పర్యం: పూర్తిగా తీర్చని అప్పూ, సాంతం చల్లార్చని అగ్గీ, సమూలంగా నాశనంచేయని పగా, దిగబడి ఉంటే బాగా పెరిగిపోయి చివరకు ఆపద కలిగించక మానదు.

ఆ. **మార్దవమున మృదువు మర్దింపగా వచ్చు । మార్దవమున పర విమర్దనంబుఁ**
జెల్లు మార్దవమునఁ జెల్లనియది లేదు । గాన మృదువ తలఁప ఖరము సువ్వె. **277**

ప్రతిపదార్థం: మార్దవమునన్= మెతకతనంతో; మృదువున్= మెత్తనైనవాడిని; మర్దింపఁగా వచ్చున్= తుడిచివేయవచ్చు; మార్దవమునన్= మెతకతనంచేత; పర విమర్దనంబున్= శత్రు సంహారమూ; చెల్లున్= జరుగుతుంది; మార్దవమునన్= మెతకదనంచేత; చెల్లని అదిలేదు= నెరవేరనిది ఉండదు; కానన్= కాబట్టి; మృదువు+అ= మెత్తదనమే; తలఁపన్= ఆలోచించగా; ఖరము సువ్వె= వాడిఅయినది సుమా.

తాత్పర్యం: మృదుత్వంతో మెత్తనివాడిని తుడిచివేయవచ్చును. మృదుత్వంతో శత్రువులను చంపవచ్చును. మృదుత్వంతో సాధించరానిదంటూ ఉండదు. కాబట్టి మృదుత్వమే అన్నిటిని మించి వాడిఅయినది సుమా!

వ. **అనిన విని యజాతశత్రుండు 'ధర్మంబు నడవక యవగ్రహాది దురితంబులు దుస్తరంబు లయిన నాహారంబులు దొరకొనని యట్టిచో ద్విజాతు లేమిభంగిం బ్రాణంబులు రక్షించుకొను వా?' రనుటయు నాపగానందనుండు 'విశ్వామిత్ర చండాల సంవాదం బను నితిహాసంబు భవత్ప్రశ్నంబునకు నుత్తరంబై యుండు; నాకర్ణింపు' మని యిట్లనియె.** **278**

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; అజాతశత్రుండు= ధర్మరాజు; ధర్మంబు= న్యాయం; నడవక= ప్రవర్తించక; అవగ్రహ+ఆది= కరువు మొదలైన; దురితంబులు= పాపాలు; దుస్తరంబులు= దాటరానివి; అయినన్= అయితే; ఆహారంబులు= తినేతిళ్ళు; దొరకొనని+అట్టిచోన్= దొరకనపుడు; ద్విజాతులు= రెండు పుట్టుకలుగలవారు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు= వీరికి 'ఉపనయనం' రెండో పుట్టుక); ఏమి భంగిన్= ఏ విధంగా; ప్రాణంబులు= ఊపిరులు; రక్షించుకొనువారు= కాపాడుకొనేవారు; అనుటయున్= అనగానే; ఆపగానందనుండు= భీష్ముడు; విశ్వామిత్ర= విశ్వామిత్రుడికీ; చండాల= చండాలుడికీ (జరిగిన); సంవాదంబు=

సంభాషణ; అను= అనే; ఇతిహాసంబు= పరంపరగా చెప్పుకొంటున్న వెనుకటి కథ; భవత్ప్రశ్నంబునకున్= నీవు అడిగిన దానికి; ఉత్తరంబు+ఐ= సమాధానమై; ఉండున్= ఉంటుంది; ఆకర్ణింపుము= వినుము; అని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అదంతా విన్న ధర్మరాజు 'ధర్మం సరిగ్గా నడవకపోతే తప్పించుకొనలేని కరువుకాటకాది పాపాలు కలుగుతాయి. కనుక తిండి దొరకదు. బ్రాహ్మణాదులైన మూడు వర్ణాలూ ఎట్లా మనగల్గుతాయో చెప్పు'మన్నాడు. దానికి భీష్ముడు 'విశ్వామిత్రుడికీ మాలవాడికీ మధ్య నడచిన సంవాద' గాథను వింటే నీవడిగిన సందేహం తీరిపోతుంది. అదే నీ ప్రశ్నకు సరైన సమాధానం' ఆలకించుమంటూ ఇట్లా అన్నాడు:

విశ్వామిత్ర చండాల సంవాదము (సం. 12-139-12)

క. **ఏపారి తొల్లి త్రేతా। ద్వాపరముల సంధి నొక్క వఱపు ధరిత్రీ**
తాపంబుఁ జేసె జనముల। పాపంబున వత్సరములు పండ్రెం డధిపా! **279**

ప్రతిపదార్థం: అధిపా!= ధర్మరాజా!; తొల్లి= మునుపు; త్రేతా ద్వాపరముల సంధిన్= త్రేతా ద్వాపరయుగాలు కూడినపుడు; ఒక్కవఱపు= ఒక కరువు; ఏ పారి= అధికమై; జనముల పాపంబునన్= జనం చేసికొన్న పాపంవలన; వత్సరములు పండ్రెండు= పన్నెండేళ్ళపాటు; ధరిత్రీ= భూమికి; తాపంబున్+చేసెన్= పీడ కలిగించింది.

తాత్పర్యం: ధర్మరాజా! త్రేతా ద్వాపరయుగాల సంధికాలంలో జనం చేసికొన్న పాపంకొద్దీ ఒక కరువు వచ్చింది. ఇది ప్రజలను పన్నేండేళ్ళపాటు పీడించింది.

సీ. **ఏఱులుఁ జెఱువులు నివురఁ గర్షనము లెం। దును జెడఁ, దరులతాదులును గమర,**
భూమియుఁ బసమాల, గోమహిషాది జీ। వధనంబు వొలియ, భూవరులు మేర
దప్పి లోకములోని ధాన్యముల్ గొన, నధ। ర్మం బంతకంతకుఁ బ్రబ్బ నధికు
లనదలఁ జెఱుపంగ, యాగముల్ దేవతా। పూజలు నెడలంగ, భూసుర ప్ర

ఆ. **ముఖములైన వర్ణముల చొప్పు దప్ప, నా। హార రహితజనము లచట నచటఁ**
బడఁగఁ జూడ ఘోర భంగిగాఁ దఱచయ్యె। డొక్కలున్న వారి కెక్క భయము. **280**

ప్రతిపదార్థం: ఏఱులున్= నదులూ; చెఱువులున్= మడుగులూ; ఇవురన్= అడుగంటి పోగా; కర్షనములు= సేద్యాలు; ఎందును= అన్నిచోట్లా; చెడన్= పాడుపడగా; తరులతా+ఆదులును= చెట్లు, తీగలూ మొదలైనవి; కమరన్= ఎండిపోగా; భూమియున్= నేలకూడా; పస తూలన్= సారం పోగా; గో+మహిష+ఆది= ఆవులూ గేదెలూ మొదలైన; జీవధనంబు= పశుసంపద; పొలియన్= చచ్చిపోగా; భూవరులు= రాజులు; మేరదప్పి= మర్యాద మీరి; లోకములోని= రాజ్యంలోని; ధాన్యముల్= వడ్లు, మినుములు, పెసలు మొదలైన ధాన్యాలు; కొనన్= కొల్లకొట్టగా; అధర్మంబు= అవినీతి; అంతకున్+అంతకున్= రాను రాను; ప్రబ్బన్= విస్తరిల్లగా; అధికులు= బలవంతులు; అనదలన్= బలహీనులను; చెఱుపంగన్= బాధపెట్టగా; యాగముల్= యజ్ఞాలు; దేవతా పూజలున్= దేవతార్చనలూ; ఎడలంగన్= దూరం అవుతుండగా; భూసుర ప్రముఖులు+ఐన= బ్రాహ్మణులు మొదలైన; వర్ణముల; చొప్పు=తీరు; తప్పన్= తప్పిపోగా; ఆహార రహిత జనములు= తిండిలేని జనాలు; అచటన్+అచటన్= అక్కడక్కడ; పడఁగన్= పడిపోగా, చచ్చిపోగా; ఉన్నవారికిన్= బ్రతికి ఉన్నవాళ్ళకు; చూడన్= చూడటానికి; భయము ఎక్కన్= భయం కలుగగా; డొక్కలు= పీనుగుల పెంటలు; తఱచు+అయ్యెన్= దట్టంగా పడ్డాయి.

తాత్పర్యం: ఏరులూ, చెరువులూ అడుగుబట్టాయి. సేద్యం అంతా ఆగిపోయింది. చెట్లూ చేమలూ ఎండిపోయాయి. నేలంతా బీడు పడిపోయింది. గొడ్డూ గోదా చచ్చిపోయాయి. రాజులు మర్యాద తప్పి ప్రజలను కొల్లగొట్టుకొంటున్నారు. అధర్మం అంతకంతకు మితిమీరిపోయింది. బలవంతులు బలహీనులను పీడిస్తున్నారు. యజ్ఞయాగాదులూ దేవతార్చనలూ కట్టిపెట్టారు. బ్రాహ్మణాది కులాలవారు తమ కులధర్మాన్ని తప్పారు. తిండీ తిప్పలూ లేని వాళ్ళు ఎక్కడపడితే అక్కడ పడిపోయారు. బతికి ఉన్నవాళ్ళు భయపడేటట్లు ఎంతో దారుణంగా పీనుగుల కుప్పలు పేరుకుపోయాయి.

వ. అట్టి సమయమున. 281

తాత్పర్యం: అట్లాంటి తరుణంలో.

క. మునిపతి విశ్వామిత్రుఁడు । దన యాఁకలి కెందు మెలఁగి ధైర్య మెడలి యో
దన మాంస మూల ఫలములు । జనుల నడిగి యెందుఁ బడయఁ జాలక డప్పిన్. 282

ప్రతిపదార్థం: మునిపతి= మునిరాజు; విశ్వామిత్రుఁడు= విశ్వామిత్ర మహర్షి; తన ఆఁకలికిన్= తన ఆకలికి; ఎందున్ మెలఁగి= ఎక్కడెక్కడో తిరిగి; ధైర్యము+ఎడలి= ధైర్యాన్ని కోల్పోయి; ఓదన= అన్నం; మాంస= మాంసం; మూల= కందమూలాలు; ఫలములు= పండ్లూ; జనులన్= లోకులను, జనాన్ని; అడిగి; ఎందున్= ఎక్కడా; పడయన్+చాలక= పొందలేక; డప్పిన్= దప్పికతో.

తాత్పర్యం: మునులలో చెప్పుకొనదగ్గవాడు విశ్వామిత్రుడు. అతడు ఆకలికి తట్టుకొనలేక ఎక్కడెక్కడో తిరిగాడు. ధైర్యం సడలింది. అన్నం, మాంసం, కందమూలాలూ, పండ్లూ అన్నీ అందరినీ అడిగాడు. ఎక్కడా ఏమీ దొరకలేదు. దప్పికతో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. తూఁగాడుచుం జనువాఁడు. 283

ప్రతిపదార్థం: తూఁగాడుచున్= తూలుతూ; చనువాఁడు= వెళ్ళువాడై.

తాత్పర్యం: తూలుతూ పోతున్నవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. పసరపు టెంప ప్రోవులును, బందుల డొక్కలుఁ, గుక్కపుట్టెలున్
ముసుఁగువడంగ భూమితలముం దఱచారఁగఁ గప్పుచున్ మదిం
బస యొక యింత లేక పెఱప్రాణులనుం బొరిగొంచు నెప్డు దు
ర్వ్యసనతఁ గూరియున్న వెలివాండ్రుర పల్లియఁ జేరి యయ్యెడన్. 284

ప్రతిపదార్థం: పసరము= గొడ్లు; ఎమ్ము+ప్రోవులును= ఎముకల గుట్టలూ; పందుల డొక్కలున్= పందుల పొట్టలూ; కుక్కపుట్టెలున్= కుక్కల తలపెంకులూ (కప్పెరలూ); ముసుఁగు+పడంగన్= కప్పుపడేటట్లు; భూమితలమున్= నేలను; తఱచు+ఆరఁగన్= బాగా దట్టంగా; కప్పుచున్= కప్పుతూ; మదిన్= మనస్సులో; పస= ప్రేమ; ఒక ఇంతలేక= కొంచెం కూడా లేకుండా; పెఱ ప్రాణులనున్= ఇతర జీవకోటిని; పొరి గొంచున్= చంపివేస్తూ; ఎప్డున్= ఎల్లప్పుడూ; దుర్వ్యసనతన్= చెడ్డ అలవాటుతో; కూరి+ఉన్న= దిగబడి ఉన్న; వెలివాండ్రుర పల్లియన్= మాలపల్లెను; చేరి= సమీపించి; ఆ+ఎడన్= ఆ పల్లెలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: గొడ్ల ఎముకల గుట్టలు పడి ఉన్నాయి. పందుల డొక్కలూ, కుక్కల పుర్రెలూ నేలపరపుగా దట్టంగా కప్పివేశాయి. మనసులో కొంచెమైనా ప్రేమ లేకుండా అన్నిరకాల జంతువులను అక్కడివారు చంపేస్తుంటారు. ఇట్లాంటి దుర్వ్యసనంతో కూరుకుపోయిన మాలపల్లెకు విశ్వామిత్రుడు చేరుకొని ఆ పల్లెలో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఆర్తినొంది యిటయట వోవం జాలక నేలం బడియుండి ప్రాణంబులు వోవుట యుపేక్షింపం దగదు ప్రాణరక్షణంబ పరమధర్మం బని వితర్కించి తగునుపాయంబు చింతించువాఁ డప్పుడ చంపి తిత్తొలిచి గాలిగొన వైచిన కుక్కకడిమంబుఁ గనుంగొని. 285

ప్రతిపదార్థం: ఆర్తిన్= ఆకలితో బాధ; ఒంది= పొంది; ఇట,అట పోవన్ చాలక= ఎటూ పోను శక్తిలేక; నేలన్= నేలమీద; పడి ఉండి= సొమ్మసిల్లి; ప్రాణంబులు+పోవుట= ఊపిరిపోవటం; ఉపేక్షింపన్+తగదు= మిన్నక ఉండటం ఒప్పదు; ప్రాణరక్షణంబు+అ= ప్రాణంకాపాడుకోవటమే; పరమ ధర్మంబు= ఉత్తమ న్యాయం; అని; వితర్కించి= తలపోసి; తగన్= తగిన; ఉపాయంబున్= యుక్తిని; చింతించువాఁడు= ఆలోచించుకుంటున్నవాడు; అప్పుడు+అ= అప్పుడే; చంపి= ప్రాణంతీసి; తిత్తి ఒలిచి= తోలుతీసి; గాలిగొన వైచినన్= గాలి తగిలేటట్లు ఆరబెట్టిన; కుక్క కడిమంబున్= కుక్క మాంసాన్ని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: బాధపడుతూ ఇటు అడుగు తీసి అటువేయలేక నేలమీద సొమ్మసిల్లి పడిపోయాడు. 'ఊపిరి పోతుంటే ఊరుకొనకూడదు, అనుకొన్నాడు. 'ప్రాణం నిలబెట్టుకొనటమే ఉత్తమ ధర్మం' అని భావించాడు. దానికి తగ్గ ఉపాయాన్ని ఆలోచించుకొంటూ అపుడే చంపి తోలు తీసి, గాలిలో ఆరబెట్టిన కుక్కమాంసాన్ని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఇది దప్ప నిప్పు డియ్యెడ। నొదవదు ప్రాణంబు గావ నొం డొకఁ; డిదియున్
మది నూహింపఁగ మ్రుచ్చిమి। నొదవించి కొనంగవలసియున్నది నాకున్. 286

ప్రతిపదార్థం: ఇది తప్పన్= ఈ కుక్కమాంసం తప్ప; ఇప్పుడు= ఈ సమయంలో; ఈ+ఎడన్= ఇక్కడ; ప్రాణంబు+కావన్= ప్రాణం రక్షించుకొనటానికి; ఒండొకఁడు= మరొకటి; ఒదవదు= దొరకదు; ఇదియున్= ఈ మాంసం కూడా; మదిన్= మనస్సులో; ఊహింపఁగన్= ఆలోచించుకొనగా; మ్రుచ్చిమిన్= దొంగతనంచేత; ఒదవించి కొనంగవలసి+ఉన్నది= చిక్కించుకొనవలసి ఉన్నది.

తాత్పర్యం: 'ఇపు డిక్కడ ప్రాణం కాపాడుకొనటానికి కుక్కమాంసం తప్ప మరొకటి దొరకదు. ఇదైనా దొంగిలించి దక్కించుకొనవలసిందే.

తే. ప్రాణములు వోవకుండంగఁ బరిహరింప। నొం డుపాయ మెయ్యదియు లేకుండెనేని
మ్రుచ్చిమియు ధర్మ మగు; నధముని ధనంబు। గొనుట యెందును ముఖ్యమై చనుట గలదు. 287

ప్రతిపదార్థం: ప్రాణములు= ఉసురు; పోవక+ఉండంగన్= పోకుండా; పరిహరింపన్= తప్పించుకొనేందుకు అంటే ప్రాణాలు నిలుపుకొనటానికి; ఒండు+ఉపాయము= మరొక సాధనం; ఏ+అదియున్= ఏదీ; లేక+ఉండెనేని= ఉండక పోయినట్లయితే; మ్రుచ్చిమియున్= దొంగతనం కూడా; ధర్మము+అగున్= న్యాయమే అవుతుంది; అధముని= నీచుడి; ధనంబున్+కొనుట= సొమ్మును తీసికొనటం; ఎందును= ఎక్కడైనా; ముఖ్యమై చనుట= ప్రధానమై ఒప్పటం; కలదు= ఉన్నది.

తాత్పర్యం: ప్రాణం పోకుండా తప్పించుకొనేందుకు మరే ఉపాయం లేనపుడు దొంగతనంచేసి ఊపిరి నిలుపుకొనటం ధర్మమే అవుతుంది. అపుడు నీచుడి సొమ్మైనా పుచ్చుకొనటం ప్రశస్తమైనదే అవుతుంది.

వ. కావున చండాలధనంబగు సారమేయ మాంసం బపహరించి ప్రాణహాని పరిహరించి కొందు' నని నిశ్చయించియుండ నర్ధరాత్రం బగుటయుఁ జండాలురెల్ల నిద్రింపనల్లన లేచిచని యమ్మాంసంబు వట్టి తిగిచిన నచ్చేరువ నిద్రించు చండాలుండు విధివశంబున మేలుకని 'నీ వెవ్వండవు? మాంసంబు మ్రుచ్చిలించెదవు? నిద్రవోవంజుమ్ము నిన్నుఁ బొరిగొనియెద' ననుటయు భయపడి గ్రక్కున నమ్మునిపతి 'యేను విశ్వామిత్త్రుండ'నని పలికిన, వాఁడు వినయంబున శయ్య డిగ్గి కరుణం గన్నీ రొలుకం బ్రణమిల్లి కేలు మొగిడ్చి 'మహాత్మా! నీతలం పేమి యని యడిగిన నతండు సాంత్వనవచనంబుల నిట్లనియె. 288

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; చండాల ధనంబు+అగు= చండాలుడి సొమ్ము అయిన; సారమేయ మాంసంబున్= కుక్కమాంసాన్ని; అపహరించి= కాజేసి; ప్రాణహానిన్= ప్రాణానికి వచ్చిన ముప్పును; పరిహరించికొందును= తొలగించుకొంటాను; అని నిశ్చయించి= అని నిర్ణయించుకొని; ఉండన్= ఉండగా; అర్ధరాత్రంబు+అగుటయున్= నడిరేయి అవటంవలన; చండాలురు+ఎల్లన్= చండాలురందరూ; నిద్రింపన్= నిద్రపోగా; అల్లన లేచి= మెల్లగా లేచి; చని= వెళ్ళి; ఆ+మాంసంబున్= ఆ మాంసాన్ని; పట్టి తిగిచినన్= పట్టి లాగగా; ఆ+చేరువన్= ఆ దగ్గరలోనే; నిద్రించు= నిద్రపోయే, కునుకుతీస్తున్న; చండాలుండు= మాలవాడు; విధివశంబునన్= అదృష్టవశాన; మేలుకని= నిద్రలేచి; నీవు; ఎవ్వండవు= ఎవ్వడివి; మాంసంబున్= మాంసాన్ని; మ్రుచ్చిలించెదవు= దొంగిలిస్తున్నావు; నిద్ర+పోవన్+చుమ్ము= నిద్రపోను సుమా; నిన్నున్= నిన్ను; పొరిగొనియెదన్= చంపుతాను; అనుటయున్= అనగానే; భయపడి= భీతి చెంది; గ్రక్కునన్= వెంటనే; ఆ+మునిపతి= ఆ మునిరాజు; ఏను= నేను; విశ్వామిత్త్రుండను= విశ్వామిత్ర మహర్షిని; అని పలికినన్= అని పలుకగానే; వాఁడు= ఆ చండాలుడు; వినయంబునన్= అణకువతో; శయ్యడిగ్గి= మంచం దిగి; కరుణన్= జాలితో; కన్నీరు ఒలుకన్= కంటనీరు కారుస్తూ; ప్రణమిల్లి= మొక్కి; కేలు మొగిడ్చి= చేతులు జోడించి; మహాత్మా!= మహనీయా!; నీతలంపు= నీ ఆలోచన; ఏమి?= ఏమిటి?; అని అడిగినన్= అని అడగగా; అతండు= విశ్వామిత్రుడు; సాంత్వనవచనంబులన్= మెల్లని మాటలతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కాబట్టి 'చండాలుడి సొత్తు అయినా సరే ఈ కుక్కమాంసాన్ని దొంగిలించి చావును తప్పించుకొంటా' నని నిర్ణయించుకొన్నాడు. అప్పటికే అర్ధరాత్రి అయింది. మాలపల్లె అంతా నిద్రలో మునిగిపోయింది. ఆ సమయంలో మెల్లగా లేచి వెళ్ళి ఆ మాంసాన్ని పట్టి గుంజాడు. ఆ పక్కనే కునుకుతీస్తున్న మాలవాడు అనుకోకుండా మేల్కొన్నాడు. 'నీ వెవ్వడివి? మాంసాన్ని దొంగిలిస్తున్నావు. నేను నిద్రపోవటంలేదు సుమా! నిన్ను చంపేస్తాను' అనగానే విశ్వామిత్రముని భయపడ్డాడు. 'నేను విశ్వామిత్రుడిని' అన్నాడు. అది విన్న చండాలుడు ఎంతో వినయంగా మంచం దిగాడు. జాలిపడి కంటతడిపెట్టుకొంటూ చేతులెత్తి మొక్కాడు. 'మహాత్మా! ఇట్లా చేయటంలో నీ ఉద్దేశం ఏమిటి' అన్నాడు. దానికి ఆ ముని నెమ్మదిగా ఇట్లా చెప్పాడు.

చ. 'దరికొను నాఁకలిం దనువిదాహము పుట్టినఁ బ్రాణహానికిం
బరిహరణంబు సేఁత కిది పాపమ యైనను గుక్కనంజుఁడే
భరపడి మ్రుచ్చిలించెద; విభావసుఁ డెంత శుచిత్వ సంపదం
బొరసియు సర్వభక్షకతఁ బొందును; నన్నును జూడు మట్లుగన్.' 289

ప్రతిపదార్థం: దరికొను= మండే; ఆఁకలిన్= ఆకలిచేత; తను విదాహము పుట్టినన్= శరీరం దహించుకుపోతూండగా; ప్రాణహానికిన్= ఊపిరి పోకుండా; పరిహరణంబు+చేఁతకున్= ఆపుకొనాలనే కోరికవలన; ఇది= ఈ కుక్కమాంసం తినటం;

పాపము+ఐనన్= పాతకమే అయినా; ఏన్= నేను; భరపడి= ఒప్పుకొని; కుక్కనంజుఁడు= కుక్కమాంసాన్ని; మ్రుచ్చిలించెదన్= దొంగిలిస్తున్నాను; విభావసుఁడు= అగ్ని; ఎంత శుచిత్వ సంపదన్= ఎంతో పరిశుద్ధమైన సంపత్తిని; పొరసియున్= పొంది ఉన్నా; సర్వభక్షకతన్= అన్నీ తినేవాడి భావాన్ని; పొందును= పొందుతాడు; అట్లుగన్= అట్లాగే; నన్నును= నన్నుకూడా; చూడుము= చూడుము.

తాత్పర్యం: 'ఆకలిమంటతో శరీరం దహించుకుపోతూ ఉన్నది. ప్రాణం నిలుపుకొనాలనే కోరికవలన కుక్కమాంసం తినటం పాపమే అయినా ఇష్టపడే ఈ కుక్కమాంసాన్ని దొంగిలిస్తున్నాను. అగ్ని పావనుడే అయినా అన్నీ తింటుంటాడు కదా! అట్లాగే నన్ను భావించుము'.

వ. అనిన విని చండాలుండు. 290

ప్రతిపదార్థం: అనినన్= అట్లా ఆ ముని చెప్పగా; విని= ఆలకించి; చండాలుండు= మాలవాడు.

తాత్పర్యం: విశ్వామిత్రుడు చెప్పిన మాటలు ఆలకించిన మాలవాడు - (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'కుక్క మృగములలో నెల్లఁ గుత్సితంబు; । దీనిఁ దిని ధర్మమున కేల హాని సేయ?
నొం డుపాయంబు వెదకి కొ మ్ముజ్జ్వలాత్మ!' । యనుడు వానికి ముని యిట్టు లనియె నధిప! 291

ప్రతిపదార్థం: అధిప!= స్వామి!; మృగములలోన్+ఎల్లన్= జంతువులలోకెల్ల; కుక్క; కుత్సితంబు= నీచమైనది; దీనిన్= కుక్కమాంసాన్ని; తిని; ధర్మమునకున్= పుణ్యానికి; హాని+చేయన్+ఏల?= ముప్పు తేవటం ఎందుకు?; ఉజ్జ్వల+ఆత్మ!= మహాత్మా!; ఒండు+ఉపాయంబున్= మరొక ఉపాయం; వెదకి కొమ్ము= వెతుక్కో; అనుడున్= అనగానే; వానికిన్= ఆ చండాలుడితో; ముని= విశ్వామిత్రుడు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'జంతువు లన్నిట్లోకి కుక్క చాలా నీచజంతువు. కుక్కమాంసాన్ని తిని ధర్మానికి ముప్పు కలిగిస్తావు ఎందుకు? మ రేదైనా ఉపాయాన్ని వెదకుము' అనగానే చండాలుడితో విశ్వామిత్రుడు ఈ విధంగా చెప్పాడు.

క. 'విను బ్రహ్మవహ్ని నాకుం । బెను ప్రాపై యుండ నేను వెఱతునె యెట్లై
ననుఁ బోవనీక ప్రాణము । దనువున నిల్పుటయ చూవె ధర్మం బరయన్. 292

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; బ్రహ్మవహ్ని= బ్రహ్మ సంబంధమైన అగ్ని; నాకున్= నాకు; పెను ప్రాపు+ఐ+ఉండన్= పెద్ద అండగా ఉండగా; నేను; వెఱతునె?= భయపడతానా?; అరయన్= విచారించగా; ఎట్లు+ఐననున్= ఎట్లాగైనా; ప్రాణమున్+పోవనీక= ఊపిరిని పోనీయకుండా; తనువునన్= బొందిలో; నిలుపుటయ= ఉంచటమే; ధర్మంబు+చూవె!= న్యాయం సుమా!

తాత్పర్యం: 'బ్రహ్మాగ్ని నాకు పెద్ద అండగా ఉండగా నేను భయపడను. ఎట్లాగైనా ఈ బొందిలో ప్రాణం నిలబెట్టుకొనటమే న్యాయం సుమా!

ఆ. బ్రదికియున్న నేఁ దపంబున విద్యను । బాచికొనఁగ నేర్తుఁ బాతకంబు;
నట్టు లగుట జీవితాధార మైన యీ । నంజుఁ డిప్పు డెట్లు నమల కుడుగ. 293

ప్రతిపదార్థం: బ్రదికి+ఉన్నన్= జీవించి ఉంటే; ఏన్= నేను; పాతకంబున్= ఈ పాపాన్ని; తపంబునన్= తపోబలంవలన; విద్యను= బ్రహ్మజ్ఞానం వలన; పాచికొనఁగన్+నేర్తున్= పోగొట్టుకొంటాను; అట్టులు+అగుటన్= అట్లా అవటంవలన; ఇపుడు= ఇప్పుడు;

జీవిత+ఆధారము+ఐన= బ్రతకటానికి మూలం అయిన; ఈ నంజుడు= ఈ మాంసాన్ని; ఎట్లున్= ఎట్లాగైనా; నమలక= తినక; ఉడుగన్= మానను.

తాత్పర్యం: నేను ప్రాణాలతో ఉంటే ఈ పాపాన్ని తపస్సువలన, జ్ఞానంవలన పోగొట్టుకొనగలను. కనుక ప్రాణాధారం అయిన ఈ మాంసాన్ని తినకుండా ఉండను'.

చ. అనుటయు నంత్యజుండు నగి 'యట్టి విధం బధమంబు గాక నె
ట్టన యది ధర్మమే? కటకటా! మిము బోంట్లకు నిట్లు సేయఁగాఁ
జనునొకొ?' యన్న నమ్ముని 'ప్రశస్తుఁ డగస్త్యుఁడు దైత్యు మాంసముం
దినఁడె? నశించెనే యతని తేజముఁ బెంపును నంతనుండియున్?' 294

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; అంత్యజుండు= కడజాతివాడు; నగి= నవ్వి; అట్టివిధంబు= కుక్కమాంసం తినటం అనేది; అధమంబు+కాక= నీచమైనది కాక; నెట్టన= పైపెచ్చు; అది ధర్మమే?= అది పాడియా?; కటకటా!= అయ్యయ్యో!; మిము బోంట్లకున్= మీవంటివాళ్ళకు; ఇట్లు= ఇట్లా; చేయఁగాన్= చేయటం; చనునొకొ?= తగుతుందా?; అన్నన్= అనగానే; ఆ+ముని= ఆ విశ్వామిత్రుడు; ప్రశస్తుఁడు= పేరుపొందిన; అగస్త్యుఁడు= అగస్త్యమహర్షి; దైత్యు మాంసమున్= రాక్షసుడి మాంసాన్ని; తినఁడె?= తినలేదా?; అంతన్+ఉండియున్= అప్పటినుండి; అతని తేజమున్= అతడి తేజస్సూ; పెంపున్= గౌరవమున్నూ; నశించెనే?= చెడినాయా?

తాత్పర్యం: విశ్వామిత్రుడి మాటలు విన్న చండాలుడు నవ్వి 'అయ్యో! అది నీచమైన పనికాక న్యాయమైనదా! మీ బోటి మునిసాములు ఇట్లా చేయవచ్చా?' అన్నాడు. దానికి ఆ ముని 'ఎన్నో పొగడ్తలు పొందిన అగస్త్యముని రాక్షసమాంసం తినలేదా! ఆనాటినుండి ఆ ముని తేజస్సుకు, గౌరవానికీ ఏమైనా కొరత వచ్చిందా?'

వ. అనవుడు వాఁ డి ట్లనియె. 295

ప్రతిపదార్థం: అనవుడున్= ముని అనగానే; వాఁడు= ఆ చండాలుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: విశ్వామిత్రుడి మాటలు విన్న చండాలుడు ఈ విధంగా అన్నాడు.

క. 'పరహితము సేయఁ బూనిన । పురుషుఁడు పాపంబు సేసి పొందఁడు కీడుం;
బరముని యగు నగస్త్యుఁడు । పరోపకారార్థ కృతి నభవ్యుం డగునే?' 296

ప్రతిపదార్థం: పరహితము= ఇతరులకు మేలు; చేయన్+పూనిన= చేయాలని పూనుకొన్న; పురుషుఁడు= మనిషి; పాపంబుచేసి= పాతకం చేసి; కీడున్= చేటును; పొందఁడు= అనుభవించడు; పరమముని+అగు= మునిముఖ్యు డయిన; అగస్త్యుఁడు= అగస్త్యముని; పరోపకారార్థ కృతిన్= ఇతరుల కొరకు చేసే మేలు పనివలన; అభవ్యుండు= దుష్టుడు; అగునే?= అవుతాడా?

తాత్పర్యం: 'మరొకడికి ఉపకారం చేయాలనుకొన్నవాడు పాపం చేసినా వాడికి ఏ కీడూ అంటకపోగా పరముముని అవుతాడు. లోకోపకారంగా చేసిన పనులవలన అగస్త్యముని దుష్టుడవుతాడా?' (కాదని భావం.)

క. నావుడు మదాత్మ బ్రాహ్మణ । తా విద్వత్తాస్పదంబు; దానికిఁగా నే
నీ విధి యొనరించుట పా । పావేశము లేదు; దీని కడ్డుపడకువే! 297

ప్రతిపదార్థం: నావుడున్= అనగానే; మత్+ఆత్మ= నా దేహం; బ్రాహ్మణతా= బ్రాహ్మణ ధర్మానికీ; విద్వత్తా= బ్రహ్మజ్ఞానానికీ; ఆస్పదంబు= నిలయం; దానికిన్+కాన్= ఆ దేహం కొరకే; నేను; ఈ విధి= ఈ పని; ఒనరించుట= చేయటం; పాప+ఆవేశము లేదు= పాపానికి ప్రవేశం లేదు; దీనికిన్= మాంసం తినటానికి; అడ్డుపడకువే= ఆటంకపెట్టకుమా.

తాత్పర్యం: 'నా దేహం అటు బ్రాహ్మణధర్మానికీ ఇటు బ్రహ్మజ్ఞానానికీ ఆలవాలమైనది. కనుక ఆ దేహంకొరకే నేను ఈ పని చేయాలనుకొన్నాను. ఏ పాపం చొరబారదు. ఈ మాంసం తినటానికి నీవు అడ్డం పడకుము'.

క. **అని ముని పల్కిన నంత్యజుఁ । డను 'మాంసము విడువ నోప కనుటగఁ దలఁపం**
జనునె? భవదీయ తేజో । ధన హానికిఁ గరుణ పుట్టదా యెవ్వరికిన్?' **298**

ప్రతిపదార్థం: అని ముని పల్కినన్= అని విశ్వామిత్రుడు మాటాడగానే; అంత్యజుఁడు= కడజాతివాడు; అనున్= ఇట్లా అన్నాడు; మాంసమున్= మాంసాన్ని; విడువన్= వదలుకొనటానికి; ఓపక= ఇష్టంలేక; అనుటగన్= అన్నట్లుగా; తలఁపన్+చనునే= ఆలోచించటం తగుతుందా; భవదీయ= నీదైన; తేజోధన= తేజస్సంపత్తియొక్క; హానికిన్= నష్టపోవటానికి; ఎవ్వరికిన్= ఎవరికైనా; కరుణ పుట్టదా?= కనికరం కలుగదా?

తాత్పర్యం: విశ్వామిత్రుడితో అంత్యజుడు ఈ విధంగా అన్నాడు. 'మాంసం వదలుకొనటం ఇష్టంలేక ఇట్లా అంటున్నా ననుకొనకుము. నీ తేజస్సంపద నష్టమవుతుంటే ఎవరికైనా జాలిపుట్టదా?'

వ. **అనవుడు గాధినందనుండు.** **299**

ప్రతిపదార్థం: అనవుడున్= చండాలుడు చెప్పగానే; గాధినందనుండు= గాధి కుమారుడైన విశ్వామిత్రుడు.

తాత్పర్యం: అని పలికిన చండాలుడితో విశ్వామిత్రుడు - (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **'కరుణ గలవేని బ్రాణంబు గాచికొనఁగఁ । దలఁచు నాకు నిమ్మాంస మి మ్మలఘుచరిత**
యట్టు లైన ముచ్చిమియు లే దనృతమెడలి । పడయు వస్తువు సేయదు పాతకంబు.' **300**

ప్రతిపదార్థం: అలఘుచరిత!= మహాత్మా!; కరుణ కలవేని= జాలి ఉన్నట్లయితే; ప్రాణంబు+కాచికొనఁగన్= ప్రాణం కాపాడుకొనాలని; తలఁచు= ఆలోచించే; నాకున్= నాకు; ఈ+మాంసము= ఈ కుక్కమాంసాన్ని; ఇమ్ము= ఇవ్వలసినది; అట్టులు+ఐనన్= అట్లా అయితే; ముచ్చిమియున్= దొంగతనమూ; లేదు= ఉండదు; అనృతము= అబద్ధం; ఎడలి= వదలి; పడయు= పొందే; వస్తువు= పదార్థం; పాతకంబు చేయదు= ఎట్లాంటి పాపాన్ని కలిగించదు.

తాత్పర్యం: 'ఓ మహాత్మా! నా మీద నిజంగా జాలికలిగితే బ్రతకాలనుకొంటున్న నాకు ఈ కుక్క మాంసాన్ని ఇవ్వు. అట్లాగైతే నాకు దొంగతనం అంటదు. అబద్ధం ఆడకుండా పొందే వస్తువువలన ఏ పాపం కలగదు'.

వ. **అనిన విని చండాలుం డి ట్లనియె.** **301**

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; చండాలుండు= అంత్యజుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ముని మాటలు విన్న చండాలుడు మళ్ళీ ఈ విధంగా అన్నాడు.

క. **'అతిశయిత పుణ్య దీప్తులు । ప్రతిగ్రహము నీచనరుని పాలం జేయన్**
మతిఁ దలఁపఁ గూడునే? వి । శ్రుతగుణ! యే వెఱతు నింకఁ జూఱచుఱఁ బల్కన్. **302**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అతిశయిత= మీరుతున్న; పుణ్యదీప్తులు= పుణ్యంచేత ప్రకాశించేవారు; ప్రతిగ్రహమున్= దానం పుచ్చుకొనటాన్ని; నీచనరుని పాలన్+చేయన్= అధముడివలన చేయటానికి; మతి= మనస్సులో అయినా; తలఁపన్+కూడునే= మంచి చెడ్డలను ఆలోచించవచ్చునా, ఆలోచించకూడదని భావం; విశ్రుతగుణ!= వాసికెక్కినవాడా!; ఇంకన్= ఇంతకంటే; చుఱచుఱన్= కటువుగా; పల్కన్= మాట్లాడటానికి; వెఱతున్= జంకుతాను.

తాత్పర్యం: 'ఎంతో పుణ్యవంతులైన మీ బోటివారు ఒక అధముడినుండి దానం పుచ్చుకొనాలనే ఆలోచన మనసులోనైనా అనుకొనవచ్చునా? ఓ మహర్షీ! ఇంతకంటె కటువుగా మాట్లాడటానికి జంకుతున్నాను.

వ. నీ వలచిన యట్లు సేయు' మని సారమేయమాంసం బిచ్చినఁ బుచ్చికొని బ్రాణంబులు రక్షించుకొని విశ్వామిత్రుండు సనియె; నింద్రుండు తదనంతరంబ లోకంబుల వడదేఱ వర్షించె; నంత హర్షించి యత్తపస్వివర్యుండు దపోవిశేషంబున దోషంబు నీఁగికొని మనీషిజనస్తుత్యంబగు నిత్యవ్రతంబున విలసిల్లె; నాపత్సమయసమాచారం బిట్టిద' యని చెప్పిన భీష్మునితో భూవల్లభుండు 'ధర్మసూక్ష్మ ప్రకారం బింత దురవగాహం బగునే? యీ యితిహాసం బాకర్ణించుట నాడెందంబు విషాదంబునొందె' ననవుడు నతండు ధర్మంబు బహుశాఖాసమన్వితంబై యుండు; రాజులకు నెల్లతెఱంగులు నెఱంగవలయు; విషాదం బేల?' యనవుడు నజ్జనవిభుండు. 303

ప్రతిపదార్థం: నీ వలచిన+అట్లు= నీకు ఇష్టమైనట్లు; చేయుము= చేయుము; అని; సారమేయ మాంసంబున్= కుక్కమాంసాన్ని; ఇచ్చినన్= ఇవ్వగా; పుచ్చికొని= తీసికొని; ప్రాణంబులు= ప్రాణాలు; రక్షించుకొని= కాపాడుకొని; విశ్వామిత్రుండు= విశ్వామిత్ర ముని; చనియెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబ= ఆ వెంటనే; ఇంద్రుఁడు= ఇంద్రుడు; లోకంబుల= జనుల; వడ+తేఱన్= తాపం తీరగా; వర్షించెన్= వాన కురిపించాడు; అంతన్= ఆ తరువాత; హర్షించి= సంతోషించి; ఆ తపసి వర్యుండు= ఆ ముని శ్రేష్ఠుడు; తపోవిశేషంబునన్= గొప్ప తపస్సుచేత; దోషంబున్= మాంసం తిన్న పాపాన్ని; ఈఁగికొని= పోగొట్టుకొని; మనీషిజన= విద్యావంతులచేత; స్తుత్యంబు+అగు= పొగడదగినదగు; నిత్య వ్రతంబునన్= ఎడతెరిపి లేని తపో నియమాలతో; విలసిల్లెన్= ప్రకాశించాడు; ఆపత్సమయ= విపత్కాలంలో; సమాచారంబు= వృత్తాంతం; ఇట్టిద= ఇట్లాంటిదే; అని చెప్పిన= అని పలికిన; భీష్మునితోన్= భీష్ముడితో; భూవల్లభుండు= ధర్మరాజు; ధర్మసూక్ష్మ ప్రకారంబు= ధర్మంయొక్క సరైన తీరు; ఇంత దురవగాహంబు= ఇంత దుర్బోధమైన; అగునే?= అవుతుందా?; ఈ ఇతిహాసంబు= ఈ కథను; ఆకర్ణించుటన్= వినటంవలన; నా డెందంబు= నా హృదయం; విషాదంబున్= దుఃఖాన్ని; ఒందెన్= పొందింది; అనవుడున్= అనగానే; ధర్మంబు= న్యాయం; బహుశాఖా సమన్వితంబు+ఐ= అనేక విభాగాలతో కూడుకొన్నదై; ఉండున్= ఉంటుంది; రాజులకున్= రాజులకు; ఎల్ల తెఱంగులు= అన్ని ధర్మ విధాలూ; ఎరుంగవలయున్= తెలియాలి; విషాదంబు= చింత; ఏల?= ఎందుకు?; అని బోధించినన్= అని ఉపదేశించగా; ఆ+జనవిభుండు= ఆ ధర్మరాజు.

తాత్పర్యం: నీకు నచ్చినట్లు చేసికొమ్ము' అంటూ ఆ చండాలుడు కుక్కమాంసాన్ని ఇచ్చాడు. దానిని పుచ్చుకొని విశ్వామిత్రుడు ప్రాణాలు కాపాడుకొని వెళ్ళిపోయాడు. ఆ వెంటనే ఇంద్రుడు ప్రజలందరి తాపం తీరేటట్లు వాన కురిపించాడు. ఆ తరువాత విశ్వామిత్రుడు తన తపోమహిమతో పాపం పోగొట్టుకొన్నాడు. విద్యావంతులంతా మెచ్చుకొనేటట్లు నిత్యవ్రతాలు చేశాడు. ఆపత్కాలంలోని సంగతి ఇట్లాంటిది - అన్నాడు భీష్ముడు. ధర్మరాజు 'సరైన ధర్మంతీరు తెలిసికొనటం ఇంతకష్టమా? ఈ తాతలనాటి కథ విన్న దగ్గరనుండి నాకు చాలా విచారంగా ఉన్నది, అన్నాడు. భీష్ముడు 'ధర్మం ఎన్నో శాఖలతో ఎన్నో తీరులలో ఉంటుంది. వాటన్నిటినీ రాజు తప్పక తెలిసికొనాలి. దానిని గూర్చి చింత ఎందుకు?' అన్నాడు. అప్పుడు ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీష్ముఁడు ధర్మజునకు శరణాగత రక్షణ సుకృతం బెఱింగించుట (సం. 12-141-4)

క. 'శరణాగతసంరక్షణ। పరులకు సమకూరు నెట్టి పాటి ఫలము? ని
ర్భరకరుణాకర! పరమా। దరమున నెఱిఁగింపు నాకు దాని తెఱంగున్. 304

ప్రతిపదార్థం: నిర్భరకరుణా+ఆకర!= నిలువెల్ల జాలికలవాడా!; శరణాగత= శరణన్న వాడిని; సంరక్షణపరులకున్= ఆదుకునే తత్త్వం కలవారికి; ఎట్టిపాటి= ఎంతమేర; ఫలము= ప్రయోజనం; సమకూరున్= కలుగుతుంది; నాకున్= నాకు; దాని తెఱంగున్= దాని తీరును; పరమ ఆదరమునన్= ఎంతో దయతో; ఎఱిఁగింపు= తెలియచెప్పుము.

తాత్పర్యం: 'ఓ భీష్ముడా! శరణన్నవారిని ఆదుకొనాలి అనుకొనేవారికి ఏ పాటి ఫలితం దక్కుతుంది? దాని తీరంతా నాకు దయతో చెప్పుము'.

ఆ. అనిన భీష్ముఁ డిట్టులను 'ముచుకుందుండు। నాఁగఁ బరఁగు ధరణినాయకుండు
దనుజమంత్రిచేత వినినది యొక కథ। యఖిలపాపహరణ మాచరించు. 305

ప్రతిపదార్థం: అనినన్= అని ధర్మరాజు అనగానే; భీష్ముఁడు; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; ముచుకుందుండు నాఁగన్= ముచుకుందు డనే పేరుతో; పరఁగు= ఒప్పే; ధరణి నాయకుండు= రాజు; దనుజ మంత్రిచేతన్= రాక్షసుల మంత్రి శుక్రాచార్యుడివలన; వినినది= ఆలకించినట్టిది; ఒక కథ= ఒకానొక ఇతిహాసం; అఖిల పాపహరణమున్= సమస్త పాపాలను పోగొట్టటం; ఆచరించున్= చేస్తుంది.

తాత్పర్యం: ధర్మరాజుతో భీష్ముడు ఇట్లా చెప్పటం మొదలుపెట్టాడు: 'వెనుకటికి ముచుకుందు డనే రాజు, రాక్షసమంత్రి శుక్రాచార్యుడు చెప్పగా విన్న కథ ఒకటి ఉన్నది. ఆ కథ పాపాలన్నిటిని పోగొట్టుతుంది.

వ. అయ్యితిహాసంబు సెప్పెద; దాన నీ యడిగిన యర్థంబు దెలియు; నవహితుండ వై యాకర్ణింపుము.306

ప్రతిపదార్థం: ఆ+ఇతిహాసంబు= ఆ వెనుకటికతను; చెప్పెదన్= చెప్పుతాను; దానన్= ఆ కథ వినటంవలన; నీ+అడిగిన= నీవు కోరిన; అర్థంబు= ప్రయోజనం; తెలియున్= తెలుస్తుంది; అవహితుండవు+ఐ= మనస్సు పెట్టినవాడవై; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ కథంతా చెప్పుతాను. అది నీవు కోరిన ఫలితాన్ని తెలుపుతుంది. మనస్సుపెట్టి వినుము.

సీ. పాపాత్ముఁ డొకబోయ పక్షుల వధియించి। తినియును బె క్కమ్మికొనియు నదియ
బ్రదుకుగా దానికి బహుసాధనంబులు। సవరించుకొని మహాటవిఁ జరింప
నొకనాఁడు పెనువానయును గాలియును ముట్టి। సకలజీవులకు నాశంబు పుట్టు
నట్టిదియై కానయంతయు జలమయం। బైన బెగ్గిలి యన్నరాధముండు

తే. వేగ వఱ్ఱోడి యెల్లను వెడలి మిఱుత। నొక వనస్పతి జొంపమై యున్న దానిఁ
జెంది రాతిరి యగుటయు శిలయ సెజ్జ। గాఁగ శీతార్తుఁడై యుండెఁ గౌరవేంద్ర! 307

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= ధర్మరాజా!; పాప+ఆత్ముఁడు= పాపస్వభావంగల; ఒక బోయ= ఒక బోయవాడు; పక్షులన్= పిట్టలను; వధియించి= చంపి; తినియును= తినీ; పెక్కు+అమ్మికొనియున్= చాలా అమ్ముకొనీ; అదియ= పిట్టలను చంపితినటమే, అమ్ముకోవటమే; బ్రదుకుగాన్= బతుకు తెరువుగా; దానికిన్= ఆ బతుకు తెరువుకు; బహుసాధనంబులు= అనేకమైన పనిముట్లను; సవరించుకొని= కూర్చుకొని; మహా+అటవిన్= పెద్ద అడవిలో; చరింపన్= తిరుగుతుండగా; ఒకనాఁడు= ఒకరోజు; పెనువానయును=

పెద్ద వానా; గాలియును= గాలీ; ముట్టి= తాకి; సకల జీవులకున్= సమస్తమైన జీవరాశికి; నాశంబు పుట్టునట్టిది+ఐ= విపత్తు కలిగించేదై; కాన+అంతయున్= అడవి అంతా; జలమయంబు+ఐనన్= నీటిమయం కాగా; బెగ్గిలి= బెదరి; ఆ+నరాధముండు= నీచుడైన ఆ బోయవాడు; వేగన్= వడిగా; వట్టు+ఓడి= వాన ఉరవడినంతటినీ; వెడలి= దాటి; మిఱుతన్= మెరకమీద; ఒక వనస్పతి= ఒక చెట్టు; జొంపము+ఐ ఉన్నదానిన్= గుబురుగా ఉన్నదానిని; చెంది= చేరి; రాతిరి+అగుటయున్= చీకటి పడటంవలన; శిలయ= బండరాయే; సెజ్జ కాఁగన్= పడక కాగా; శీత+ఆర్తుఁడు+ఐ= చలికి బాధపడుతూ; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: పాపభావాలుగల ఒక బోయవాడు ఉండేవాడు. అతడు పిట్టలను పట్టి కొన్నిటితో పొట్టపోసుకొంటూ ఎక్కువగా అమ్ముకొంటూ బ్రతికేవాడు. అందువలన పిట్టలను పట్టుకొనే పనిముట్లను సమకూర్చుకొని అడవిలో తిరుగుతుండగా ఒకనాడు పెద్ద గాలీవానా వచ్చింది. ఆ వానవలన అన్ని రకాల జీవాలకూ ముప్పు ముంచుకొచ్చేటట్లు అడవంతా నీటిమయమైంది. ఆ బోయవాడు బెదరిపోయాడు. వాన ఉరవడిని తట్టుకొని మెరక చేరాడు. గుబురుగా ఉన్న చెట్టు క్రిందికి చేరాడు. రాత్రి అవటంవలన అక్కడే రాతి బండమీద చలిగాలికి గడగడ వణుకుతూ పడుకొన్నాడు.

క. **ఆ లుబ్ధకుఁ డత్తరువర। మాలోకించి కడు భక్తి ననియె 'నిచటి భూ**
తాలిం గొలిచెదఁ గరుణా। శీలత ననుఁ గాచుటకు విశిష్ట వినీతిన్.' 308

ప్రతిపదార్థం: ఆ లుబ్దకుఁడు= ఆ బోయవాడు; ఆ+తరువరమున్= గుబురుగా ఉన్న ఆ పెద్ద చెట్టును; ఆలోకించి= చూచి; కడుభక్తిన్= ఎక్కువైన ఆరాధనా భావంతో; అనియెన్= అన్నాడు; కరుణాశీలతన్= జాలిస్వభావంతో; ననున్= నన్ను; కాచుటకున్= రక్షించటానికి; ఇచటి భూతాలిన్= ఈ అడవిలోని ప్రాణికోటిని; విశిష్ట వినీతిన్= మిక్కిలి వినయంతో; కొలిచెదన్= సేవిస్తాను.

తాత్పర్యం: (ఆ బోయవాడు) గుబురుగా ఉన్న ఆ పెద్ద చెట్టును చూచి ఎంతో భక్తితో ఇట్లా అన్నాడు: 'నా మీద కనికరం చూపి నన్ను కాపాడటానికి ఈ అడవిలోని జంతువులన్నింటిని ఎంతో వినయంగా సేవిస్తాను'.

వ. **అని యి ట్లప్పక్షిధ్వంసకుండు శయనంబు ప్రాపించియుండ నమ్మహీరుహంబు కోటరంబున వసియించియుండునది యొక్కకపోతంబు దనవల్లభ యెటయేని మేఁతకుం బోయి రాక తడసిన శోకించి. 309**

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; ఆ+పక్షిధ్వంసకుండు= పిట్టలను చంపే బోయవాడు; శయనంబు= రాతిపడకను; ప్రాపించి+ఉండన్= పొంది ఉండగా; ఆ+మహీరుహంబు= ఆ చెట్టుయొక్క; కోటరంబునన్= తొర్రలో; వసియించి+ఉండునది= కాపురం ఉండే; ఒక కపోతంబు= ఒక పావురం; తన వల్లభ= తన భార్య; ఎట+ఏని= ఎక్కడకేని; మేఁతకున్ పోయి= తిండి కొరకు పోయి; రాక= రాకుండా; తడసినన్= ఆలసించగా; శోకించి= దుఃఖించి.

తాత్పర్యం: అనుకొంటూ బోయవాడు రాతిమీద పడుకొన్నాడు. ఆ చెట్టు మీదే ఒక తొర్రలో ఒక పావురం కాపురం ఉన్నది. ఆ పావురం మేతకు పోయిన తన భార్య ఎంతకూ రాలేదని విచారిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **ఎచట నున్నది యొక్కొ యింత ప్రొ? ద్దొకచోట। నుండునే ననుఁ బాసి యుజ్జ్వలాంగి?**
యమ్మేను లేకున్న నిమ్మేని కలిమి ని। రర్థకం బధికానురాగయుక్త
యగు సతిగుణముల యైహికాముష్మి క। సుఖసాధనంబులు సువ్వె! పతికి
యేకారణంబున నే మయ్యెనో వాన। యేపునఁ దెగియెఁ గానోపు నకట!

తే. నేమి సేయుదు? మందిరం బిపుడు పాడు । వాఱుచున్నది' యనఁగ నప్పలుకు లెల్ల
బోయవలలోన నున్న కపోతి విని మ । నంబు సంతోషపూరమగ్నంబు గాఁగ. 310

ప్రతిపదార్థం: ఉజ్జ్వల+అంగి= మిలమిల మెరిసే శరీరం గల నా భార్య; ఇంత ప్రొద్దు= ఇంతసేపూ; ఎచటన్= ఎక్కడ; ఉన్నది+ఒక్కొ!= ఉన్నదో గదా!; ననున్ పాసి= నన్ను వదలిపెట్టి; ఒక చోటన్+ఉండునే?= ఎక్కడైనా ఉంటుందా?; ఆ మేను= ఆ శరీరం; లేక+ఉన్నన్= లేకపోతే; ఈ మేని కలిమి= ఈ నా దేహసంపద; నిరర్థకంబు= పనికి రానిది అవుతుంది; అధిక+అనురాగయుక్త+అగు= మిక్కిలి ప్రేమతోకూడి ఉండేది అయిన; సతిగుణములన్= భార్య మంచి స్వభావాలే; పతికిన్= పెనిమిటికి; ఐహిక= ఈ లోకంలోనూ; ఆముష్మిక= పరలోకంలోనూ; సుఖసాధనంబులు సువ్వె!= సౌఖ్యానికి ఉపకరించే వస్తువులు సుమా!; ఏ కారణంబునన్= ఏమి నిమిత్తంగా; ఏమి+అయ్యెనో= ఏమైపోయిందో; అకట!= అయ్యో!; వాన ఏపునన్= వాన జోరువలన, జోరువాన వలన; తెగియెన్ కానోపున్= చచ్చిపోయిందేమో; ఏమి చేయుదున్?= ఏమి చేసేది?; ఇపుడు= భార్యలేనప్పుడు; మందిరంబు= ఇల్లు; పాడు పాఱుచున్+ఉన్నది= పాడుపడి పోయినట్టున్నది; అనినన్= అనగానే; ఆ పలుకులు+ఎల్లన్= ఆ మాటలన్నీ; బోయవలలోనన్= బోయవాడి వలలో; ఉన్న= చిక్కి ఉన్న; కపోతి= పెంటి పావురం; విని; మనంబు= మనస్సు; సంతోష పూరమగ్నంబు+కాఁగన్= సంతోషంతో నిండుగా మునిగి పోగా.

తాత్పర్యం: 'నా భార్య ఇంతసేపూ ఎక్కడుందో, నన్ను వదలి ఎక్కడా ఉండదు. ఆమె లేని నా బ్రతుకు ఎందుకూ పనికిరాదు. అనురాగవతి అయిన భార్య సుగుణాలే మగడికి ఇహపరలోకాల్లో సుఖసాధనాలు. ఏ కారణంగా ఏమైపోయిందో ఏమో! కుండపోతగా వానపడటంవలన చచ్చిపోయిందేమో! నేను ఏమి చేసేది? ఆమె లేని నా ఇల్లు పాడుపడిపోయినట్లున్నది' అని అంటున్న పావురం మాటలన్నీ పెంటి విన్నది. పట్టలేనంత సంతోషంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పతి మదికి నింత యెక్కిన । యతివ గదా పుణ్యవతి; ప్రియాలాపము లీ
గతి వినఁ గాంచిఁ జన్మము । గృతకృత్యం బయ్యె నాకు; గెలిచితి జమునిన్.' 311

ప్రతిపదార్థం: పతి మదికిన్= పెనిమిటి మనస్సుకు; ఇంత ఎక్కిన= ఇంత ఇష్టమైన; అతివ కదా= స్త్రీయే కదా; పుణ్యవతి= పుణ్యాత్మురాలు; ప్రియ+ఆలాపములు= పెనిమిటి మాటలు; ఈ గతిన్= ఇట్లా; వినన్ కాంచితిన్= విన గలిగాను; నాకున్= నాకు; జన్మము= పుట్టుక; కృతకృత్యంబు+అయ్యెన్= ధన్యమైనది; జమునిన్= యముడిని; గెలిచితిన్= జయించాను.

తాత్పర్యం: 'పెనిమిటి మెప్పుపొందిన స్త్రీ ఎంతో పుణ్యవంతురాలు. నన్ను గురించి నా మగడి మాటలు చెవులారా వినగలిగాను. నా జన్మ ధన్యమైనది. యముడిని గెలిచాను'.

వ. అని యుల్లంబునన యుగ్గడించి పతికిం దన తెఱంగెఱింగించి, 'విధి కృతంబునకు వగవంబని లే' దని మఱియు నిట్లనియె. 312

ప్రతిపదార్థం: అని; ఉల్లంబునన్+అ= మనస్సులోనే; ఉగ్గడించి= చెప్పుకొని; పతికిన్= పెనిమిటికి; తన తెఱంగున్= తాను ఉన్న తీరును; ఎఱింగించి= తెలిపి; విధి కృతంబునకున్= బ్రహ్మ చేష్టకు; వగవన్= విచారించటం వలన; పనిలేదు= ప్రయోజనం లేదు; అని; మఱియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పింది.

తాత్పర్యం: అని మనస్సులో అనుకొంటూ తన ఉనికిని తన పెనిమిటికి తెలిపింది. 'బ్రహ్మ చేష్టకు విచారించి ప్రయోజనం లేదు' అని చెప్పుతూ మళ్ళీ ఇట్లా అన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. 'శరణము సొచ్చినం దగఁ బ్రసన్నతఁ గైకొని రక్షణంబు సా
దరముగఁ జేయు టత్యధిక ధర్మముగా బుధకోటి సెప్పు; నీ
వరసి మహార్తు వీని శరణాగతు నోపినభంగి నాపదం
బొరయకయుండఁజేయుము ప్రభూతపు సీతునఁ గొంకు వోయెడున్. 313

ప్రతిపదార్థం: శరణము+చొచ్చినన్= శరణాగతి పొందగా; తగన్= ఒప్పగా; ప్రసన్నతన్= దయతో; కైకొని= అంగీకరించి; రక్షణంబు= ఆశ్రయం; సాదరముగన్= గౌరవంగా; చేయుట= ఆచరించటం; అత్యధిక ధర్మముగాన్= గొప్ప పుణ్యకార్యంగా; బుధకోటి= పండితులు; చెప్పున్= చెప్పుతారు; నీవు; అరసి= విచారించి; మహా+ఆర్తున్= గొప్ప బాధలో ఉన్న; శరణాగతున్= అండ కోరుతున్న; వీనిన్= ఈ బోయవాడిని; ఓపిన భంగిన్= తగినంతలో; ఆపదన్+పొరయక+ఉండన్= ఇక్కట్టు పాలు కాకుండా; చేయుము= చూడుము; ప్రభూతపుసీతునన్= ఎక్కువ అవుతున్న; చలివలన; కొంకుపోయెడున్= కొంకరలు పోతున్నాడు.

తాత్పర్యం: 'ఆదుకొనుమంటూ ఆశ్రయించినవాడిని కనికరంతో ఆదరించి ఆదుకొనటంకన్న మించిన పుణ్యం మరొకటి ఉండదంటారు పెద్దలు. గాలివానలో చలికి వణకిపోతున్న ఈ బోయవాడిని నీకు చేతనయినంతలో కాపాడుము'.

క. అని యేర్పడ భాషిం। చిన విని శోకము డిగ్గ విడిచి విహగము గరుణం
దనజాతి సెప్పి తగ ని। ట్లనియె మనుజభాషణముల నా లుబ్ధకుతోన్. 314

ప్రతిపదార్థం: అని; ఏర్పడన్= తేటతెల్లంగా; భాషించినన్= పెంటి పలుకగా; విని= ఆలకించి; శోకమున్= భార్య ఏమై పోయిందో అనే దుఃఖాన్ని; డిగ్గ విడిచి= వదలిపెట్టి; విహగము= ఆ మగపావురం; కరుణన్= జాలితో; తన జాతిన్= తన (పావురం) తెగను; ఆ+లుబ్ధకుతోన్= ఆ బోయవాడితో; చెప్పి; మనుజ భాషణములన్= మానవుల మాటలతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: పెంటి మాటలు స్పష్టంగా మగపావురం చెవిని బడ్డాయి. భార్య ఏమయిందో అనే విచారాన్ని అది వదలిపెట్టింది. బోయవాడిమీద జాలిపడింది. తాను పావురాన్నని చెప్పుకొన్నది. మానవుల మాటలతో అతడితో ఇట్లా అన్నది.

క. 'ఓ యన్న! డస్సినాఁడవు। మా యింటికి నతిథి వైతి; మసలక నీకుం
జేయవలయు నాతిథ్యం;। బేయది భవదీప్సితార్థ మెఱిఁగింపు తగన్.' 315

ప్రతిపదార్థం: ఓ అన్న!= ఓ బోయన్న!; డస్సినాఁడవు= అలసిపోయి ఉన్నావు; మా ఇంటికిన్= మా మందిరానికి; అతిథివి+ఐతి(వి)= అతిథివయ్యావు (అతిథి= రాత్రి మాత్రం ఉండిపోయేవాడు, అకస్మాత్తుగ అన్నంవేళకు వచ్చినవాడు); మసలక= జాగుచేయకుండా; నీకున్= నీకు; ఆతిథ్యంబు= విందును; ఏ+అది= ఎట్లాంటిది; చేయవలయున్= చేయాలి; భవత్+ఈప్సిత= నీవు కోరుకున్న; అర్థమున్= వస్తువును; తగన్= తగినట్లుగా; ఎఱిఁగింపు(ము)= తెలియచెప్పుము.

తాత్పర్యం: 'ఓ అన్నా! నీవు చాలా బడలికతో ఉన్నావు. మా ఇంటికి వచ్చిన అతిథివి నీవు. నీకు ఆలస్యంలేకుండా వెంటనే అతిథి విందు చేయాలి. నీకు కావలసిన వేహో తెలియచెప్పవలసింది'.

చ. అనవుడు నుల్ల మెంతయుఁ బ్రియంబు వహింపఁగఁ బక్షివైరి 'సీ
తున సకలాంగకంబులుఁ బ్రతున్నము లయ్యెడుఁ; దీనిఁ బాపవే!'
యనిన విహంగమంబు రయమారఁగ నచ్చటి పుల్లలెల్ల ము
క్కునగొని తెచ్చి ప్రోవిడి యకుంఠిత మైన దయాగుణంబునన్. 316

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనవుడున్= అని మగ పావురం పలుకగానే; ఉల్లము= మనస్సు; ఎంతయున్= ఎంతో; ప్రియంబు= సంతోషం; వహింపఁగన్= పొందగా; పక్షివైరి= పిట్టల విరోధి అయిన బోయవాడు; సీతునన్= చలివలన; సకల+అంగకంబులున్= అన్ని అవయవాలు; ప్రతున్నములు= సలుపుపెట్టబడ్డవి; అయ్యెడున్= అవుతున్నాయి; దీనిన్= ఈ చలిని; పాపవే= పోగొట్టవా; అనినన్= అనగానే; విహంగమంబు= ఆ మగ పావురం; అకుంఠితము+ఐన= మొక్కవోనిదైన; దయాగుణంబునన్= జాలిస్వభావంతో; రయము+ఆరఁగన్= ఎక్కువ వేగంగా, గబగబా; అచ్చటి పుల్లలు+ఎల్లన్= అక్కడి చిదుగు లన్నింటిని; ముక్కునన్= ముక్కుతో; కొనితెచ్చి= కరచితెచ్చి; ప్రోవిడి= కుప్పపోసి.

తాత్పర్యం: ఆ గువ్వ పలుకులు విన్నాడు బోయవాడు. సంతోషించాడు. 'ఈ చలికి నా అవయవాలు తీపు పెడుతున్నాయి. కనుక ఈ చలిని పోగొట్టవలసింది' అని అడిగాడు. ఆ పావురం జాలిపడి గబగబా అక్కడి చిదుగులన్ని ఏరి ముక్కుతో కరచి తెచ్చి పోగుపెట్టి. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఆ పొంతపల్లియకు రయంబునం జని పుల్లతల సంగతంబైన యింగలంబు. 317

ప్రతిపదార్థం: ఆ పొంత పల్లియకున్= ఆ ప్రక్కనే ఉన్న పల్లెకు; రయంబునన్= గబగబా; చని= వెళ్ళి, పుల్లతల= చిదుగు చివరన; సంగతంబు+ఐన= కూడి ఉన్నట్టి; ఇంగలంబు= అగ్గిని.

తాత్పర్యం: ఆ పక్కనే ఉన్న పల్లెకు గబగబా పోయింది. చిదుగు చివరన అంటుకొని ఉన్న నిప్పును. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కొని వచ్చి పుల్ల ప్రోవునఁ। దనుకంగాఁ జేసి నెమ్మి దళుకొత్తఁగ ని
ట్లను బోయతోడ 'మే నీ। యనలంబునఁ గాఁచికొనుటకై లె' మ్మనఘా! 318

ప్రతిపదార్థం: కొనివచ్చి= తీసికొని వచ్చి; పుల్లప్రోవునన్= చిదుగుల కుప్పయందు; తనుకంగాన్ చేసి= (రాజుకొనేటట్లు చేసి)మండింప చేసి; నెమ్మి= సంతోషం; తళుకు ఒత్తఁగన్= ప్రకాశించగా; బోయతోడన్= బోయవాడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది; అనఘా!= పుణ్యాత్ముడా!; మేను= ఒంటిని; ఈ అనలంబునన్= ఈ నిప్పుచేత; కాఁచికొనుటకున్+ఐ= చలికాపు కాచుకొనటానికి; లెమ్ము= లేచిరమ్ము.

తాత్పర్యం: తీసికొనివచ్చి పోగేసిన పుల్లలన్నీ ముట్టుకునేటట్లు చేసింది. ఎంతో సంతోషపడుతూ బోయవాడిని చలికాచుకొనటానికి మంట దగ్గరకు రమ్మని పిలిచింది.

చ. అనవుడు వాఁడు గువ్వహృదయం బలరం దనయంగకంబు ల
య్యనలశిఖాకలాపమున నల్లన యల్లన కాఁచి శీత బా
ధన ముడుగంగఁ జేయఁగఁ బదంపడి యాఁకలి చాలఁ దోఁచెఁ; దోఁ
చిన నెఱిఁగించె గువ్వ కది సేయ నుపాయము లేక యాత్మలోన్. 319

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; వాఁడు= ఆ బోయవాడు; గువ్వ= అడవి పావురం; హృదయంబు= మనస్సు; అలరన్= సంతోషించేటట్లు; తన+అంగకంబులు= తన అవయవాలన్నీ; ఆ+అనల శిఖా= ఆ నిప్పుల మంటల; కలాపమునన్= సముదాయంచేత; అల్లన అల్లన= మెల్లమెల్లగా; కాఁచి= కాపుపెట్టుకొని; శీత బాధనము= చలి బాధ; ఉడుగంగన్+చేయఁగన్= తీర్చుకొనగా; పదంపడి= వెంటనే; ఆఁకలి; చాలన్+తోఁచెన్= బాగా అనిపించింది; తోఁచినన్= ఆకలి అనిపించగానే; గువ్వకున్= ఆ పావురానికి; ఎఱిఁగించెన్= తెలిపాడు; అది+చేయన్= ఆకలి తీర్చటానికి; ఉపాయము లేక= మార్గం కనపడక; ఆత్మలోన్= తనలో.

తాత్పర్యం: గువ్వ సంతోషించేటట్లు ఆ బోయవాడు ఆ మంటలో మెల్లమెల్లగా తన ఒంటిని కాచుకొని చలిబాధ తీర్చుకొన్నాడు. అంతలో ఆకలిగా అనిపించింది. పావురంతో అదే చెప్పాడు. ఆ గువ్వకు అతడి ఆకలి తీర్చే మార్గం ఏమి తోచలేదు. తనలో తాను. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. **వగచి వెలవెలంబాఱి తలంచికొని వాని కిట్లనియె.** **320**

ప్రతిపదార్థం: వగచి= విచారించి; వెల వెలన్+పాఱి= తెల తెల బోయి; తలంచికొని= స్మరించి; వానికిన్= ఆ బోయవాడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: దుఃఖించి వెలవెలపోతూ తలచుకొంటూ ఆ బోయవాడితో ఇట్లా చెప్పింది.

తే. **ఖగములకు జీవనం బనఁ గలదె సంగ్ర। హించినట్టిది యాఁకలి కేమియైన**
మాకు దొరకొన్నఁ దిందుముగాక!; యైన। నీవు డస్సితి వాతిథ్యనియతి వలయు. **321**

ప్రతిపదార్థం: ఖగములకున్= పిట్టలకు; జీవనంబు= బతకడానికి కావలసిన తిండి మొదలైనవి; సంగ్రహించినట్టిది= కూడబెట్టుకొన్నట్టిది; అనన్ కలదె= అనేది ఉన్నదా (ఉండదని భావం); ఆఁకలికిన్= ఆకలికి; ఏమి+ఐనన్= ఏదైనా; మాకు దొరకొన్నన్= మాకు లభిస్తే; తిందుము+కాక= తింటాం కాక; ఐనన్= అయినప్పటికీ; నీవు; డస్సితి(వి)= అలసిపోయావు; ఆతిథ్యనియతి= అతిథి నియమం; వలయున్= తప్పనిసరిగా చేయాలి.

తాత్పర్యం: పిట్టల బతుకుల్లో తిండిని కూడబెట్టుకొనటం అనేది ఉండదు. ఆకలికి దొరికింది ఏదైనా తింటాం. అయితే నీవు బాగా అలసిపోయి ఉన్నావు. తప్పనిసరిగా నీ ఆకలి తీర్చాలి.

కపోతంబు దన శరీరమును బోయ కాహారంబుగా నిచ్చుట (సం. 12-142, 143)

వ. **నా శరీరం బాహారంబుగా నిచ్చెదఁ గొనుము.’** **322**

ప్రతిపదార్థం: నా శరీరంబున్= నా ఒంటిని; ఆహారంబుగాన్= తినటానికి గాను; ఇచ్చెదన్= సమర్పిస్తాను; కొనుము= తీసికొమ్ము’.

తాత్పర్యం: నా శరీరాన్ని నీకు ఆహారంగా అర్పిస్తాను. తీసికొమ్ము’.

క. **అని పలికి యగ్ని వలగొని। తన దేహము దానిలోనఁ దడయక యిడినం**
గని బోయ విస్మయంబున। మనమూనఁగఁ గొంతసేపు మ్రాన్పడి యుండెన్. **323**

ప్రతిపదార్థం: అని పలికి= అని మాట్లాడి; అగ్నిన్ వలగొని= మంట చుట్టూ తిరిగి; దానిలోనన్= ఆ నిప్పుల మంటల్లో; తడయక= జాగుచేయకుండా; తన దేహము= తన శరీరం; ఇడినన్= పడవేయగా; కని= చూచి; బోయ= బోయవాడు; మనము= మనస్సు; విస్మయంబునన్= ఆశ్చర్యంలో; ఊనఁగన్= తగుల్కొనగా; కొంతసేపు= కొద్దిసేపు; మ్రాన్పడి+ఉండెన్= కొయ్యబారిపోయి ఉన్నాడు.

తాత్పర్యం: అని గువ్వ చెప్పి వెంటనే మంటచుట్టూ తిరిగి ఆ నిప్పుల మంటల్లో పడిపోయింది. అది చూచి బోయవాడు నివ్వెరపోయాడు. కొంచెంసేపు కొయ్యబారి పోయినట్లు ఉండిపోయాడు.

వ. **పదంపడి.** **324**

తాత్పర్యం: ఆ తరువాత - (తరువాతి పద్యంతో అన్వయం).

మ. 'కలదే యిమ్మెయి పౌరుషంబు జగతిం గారుణ్య మేపార ని
ప్పులుఁ గి ట్లిచ్చునె మేను? నాదు చరితంబుల్ నిందకుం బట్టులై
తలఁపన్ వచ్చిన నింత కీ డగునె యేతత్క్రూరతా ఘోర చే
ష్టలు మానంగలవాఁడఁ; బక్షి గురువై సంధించె సద్బోధమున్.' 325

ప్రతిపదార్థం: జగతిన్= లోకంలో; ఈ+మెయి పౌరుషంబు= ఈ రీతి సాహసం; కలదే= ఉన్నదా; కారుణ్యము= దయ; ఏపారన్= ఎక్కువ కాగా; ఈ+పులుఁగు= ఈ గువ్వ; ఇట్లు= ఇట్లా; మేనున్= శరీరాన్ని; ఇచ్చునె?= ఇస్తుందా?; నా+చరితంబుల్= నా నడవళ్ళు; నిందకున్= దూషణకు; పట్టులు+ఐ= నెలవులై; తలఁపన్+వచ్చినన్= ఆలోచించగా; ఇంతకీడు= ఇంత పాటి ఆపదను; అగునె= తెచ్చిపెట్టుతుందా; ఏతద్= ఇట్లాంటి; క్రూరతా ఘోరచేష్టలు= దయలేని భయంకరమైన చేతలు; మానన్+కలవాఁడన్= నిలిపివేస్తాను; పక్షి= గువ్వ; గురువై= బోధకుడై; సద్బోధమున్= మంచి తెలివిని; సంధించెన్= పొందించింది.

తాత్పర్యం: 'లోకంలో ఇట్లాంటి సాహసం, పురుష ధర్మం ఎక్కడైనా ఉంటుందా? బాగా జాలిపడి ఈ గువ్వ ఈ తీరున తనను అర్పించుకొంటుందా? నా నడవడి ఈ లోకంలో నిందలపాలయింది. ఆలోచించగా నా నడవడి ఇంతటి విపత్తును కలిగిస్తుందా? ఇక ఇట్లాంటి దయాదాక్షిణ్యాలు లేని ఘోరపు పనులు చేయను. ఈ పిట్ట నాకు గురువై మంచి తెలివిని తెప్పించింది'.

వ. అని యంతరంగంబున వైరాగ్యంబు నిరంతరం బగుటయు నంత నిలువక. 326

ప్రతిపదార్థం: అని; అంతరంగంబునన్= మనస్సులో; వైరాగ్యంబు= విరక్తి; నిరంతరంబు= ఎడతెగనిది; అగుటయున్= కావటంవలన; అంతన్= అక్కడ; నిలువక= ఉండలేక.

తాత్పర్యం: అని మనస్సులో వీడని విరక్తిని పొందాడు. అందువలన అక్కడ ఉండలేక. (తరువాతి పద్యంతో అన్వయం).

మ. 'ఇది యి ట్లాలిని బంధులం దొఱఁగి తా నీ యగ్నిలోఁ గూలె నొ
ప్పిదమై యుండఁగ నిట్టి తెంప యెలయం బెంపారు వైరాగ్య సం
పద పాపంబుల నెల్లఁ ద్రుంపఁగ మహాప్రస్థానపుణ్యత్వ మొం
దెద నే నిప్పుడ' యంచు మానసము శాంతిం బొంద నిర్మోహుఁడై. 327

ప్రతిపదార్థం: ఇది= ఈ గువ్వ; ఇట్లు= ఈ విధంగా; ఆలిని= భార్యను; బంధులన్= చుట్టపక్కాలను; తొఱఁగి= వదలి, విడిచి; ఒప్పిదమై+ఉండఁగన్= యోగ్యమై ఉండగా; తాను= తనకు తానుగా; ఈ అగ్నిలోన్= ఈ నిప్పుల్లోకి; కూలెన్= పడిపోయింది; ఇట్టి= ఇట్లాంటి; తెంపు+అ= తెగువయే; ఎలయన్= కలుగగా; పెంపారు= ఎక్కువవుతున్న; వైరాగ్య సంపదన్= విరక్తి సంపత్తిచేత; పాపంబులన్+ఎల్లన్= పాపాలన్నిటిని; త్రుంపఁగన్= పోగొట్టుకొనటానికి; నేను; ఇప్పుడు+అ= ఇప్పుడే; మహాప్రస్థాన= లోకాంతర యాత్ర అనే; పుణ్యత్వమున్= ధర్మాన్ని; ఒందెదన్= పొందుతాను; అంచున్= అంటూ; మానసము= మనస్సు; శాంతిన్+పొందన్= ఊరట పొందగా; నిర్మోహుఁడు+ఐ= మమకారం లేనివాడై.

తాత్పర్యం: ఈ పావురం ఇట్లా తనవారి నందరిని వదలుకొని తనకు తానుగా ఈ నిప్పుల్లోకి దూకింది. ఇట్లాంటి తెగువతనంతో కూడా పాపం పోగొట్టుకొని వైరాగ్యభావంతో ఇప్పుడే దేహయాత్ర చాలిస్తాను. పుణ్యాత్ముడ నవుతాను' అని మనసులో ఊరటపొందాడు. మమకారం లేనివాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వలలోన నున్న పులుఁగుల। వెలువడఁగా విడిచి వలయు వెండియుఁ దనకుం
గల పక్షి నిహతిసాధన। ములు నచటనె యుండఁ బోయె బోయ నియతుఁడై. 328

ప్రతిపదార్థం: బోయ= బోయవాడు; వలలోనన్= వలలోపల; ఉన్న= ఉన్నట్టి; పులుఁగులన్= పిట్టలను; వెలు పడఁగాన్= బయటపడేటట్లు; విడిచి= వదలి; వలయున్= వలా; వెండియున్= ఇంకా; తనకున్ కల= తనకున్నట్టి; పక్షినిహతిసాధనములున్= పిట్టలను చంపే పరికరాలను; అచటనె+ఉండన్= అక్కడే ఉండగా; నియతుఁడు+ఐ= నియమం కలవాడై; పోయెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ బోయవాడు వలలో పట్టి ఉంచిన పిట్టల నన్నిటిని బయటకు వదలిపెట్టాడు. పిట్టలను పట్టి చంపే వలనూ పనిముట్లనూ అక్కడే ఉంచేశాడు. నియమం పూని పోయాడు.

ఆ. అక్కపోతి నాథుఁ డగ్నిలోఁ బడుటకు। శోకవహ్నిఁ జిత్త మాకులముగ
నెలుఁగు రాలుపడఁగ నిట్లని పలవించె। నశ్రుజలతరంగితాస్య యగుచు. 329

ప్రతిపదార్థం: ఆ+కపోతి= ఆ పెంటిపావురం; నాథుఁడు= తన పెనిమిటి; అగ్నిలోన్= నిప్పుల్లో; పడుటకున్= పడినందుకు; శోకవహ్నిన్= దుఃఖాగ్నిచేత; చిత్తము= మనస్సు; ఆకులముగన్= వ్యాకులపాటు చెందగ; ఎలుఁగు= గొంతు; రాలుపడఁగన్= వణకిపోగా; అశ్రుజల తరంగిత= పొంగిపొర్లుతున్న కన్నీరుగల; ఆస్య+అగుచున్= ముఖం కలదవుతూ; ఇట్లు+అని= ఈ విధంగా అని; పలవించెన్= ఏడ్చింది.

తాత్పర్యం: బోయవాడి తిండికొరకు నిప్పుల్లో పడ్డ తన పెనిమిటిని గూర్చిన దుఃఖంతో పెంటి మనస్సు కలవరపడింది. గొంతు వణకిపోయింది. కన్నీరు మున్నీరుగా ఏడ్చింది.

క. 'నా యాఁకలి కోర్వ వెపుడు। వేయైనను నేఁ గొనంగ వెండి యనుభవిం
తాయాసపడుటఁ గనుఁగొని। నోయుదు ననుఁ బాసి యిటు సనుట దగ వగునే?' 330

ప్రతిపదార్థం: ఎపుడున్= ఎల్లప్పుడూ; నా+ఆఁకలికిన్= నా ఆకలికి; ఓర్వవు= తాళలేవు; వేయి+ఐనను= ఏది ఏమైనా; నేన్ కొనంగన్= నేను తినగా; వెండి= ఆ తరువాత; అనుభవింతు(వు)= నీవు తినేవాడివి; ఆయాసపడుటన్= కష్టపడటాన్ని; కనుఁగొని= చూచి; నోయుదు(వు)= నొచ్చుకునేవాడివి; ననున్ పాసి= నన్ను వీడి; ఇటు+చనుట= ఇట్లా వెళ్ళటం; తగవు+అగునే?= న్యాయం అవుతుందా?

తాత్పర్యం: 'నాకు ఆకలి వేస్తే నీవు ఎపుడూ తట్టుకొనలేకపోయేవాడివి. ఆరునూరైనా నూరు ఆరైనా నేను తిన్న తరువాతనే తినేవాడివి. నేను కష్టపడటం చూచి నొచ్చుకొనేవాడివి. అట్లాంటి నీవు నన్ను వదలిపెట్టి ఇట్లా వెళ్ళటం ధర్మమేనా?'

వ. అని వెండియు. 331

తాత్పర్యం: అని మళ్ళీ.

సీ. 'ఇగురు జొంపంబుల నింపారు విరులను। బలుపైన పొదల క్రేవలకుఁ దార్చి,
సెలయేఱులందలి తెలినీటఁ దనువు సొం। పెలసిన గిరుల తెప్పలకుఁ జేర్చి,
మావిమ్రోకల నెలదీవలఁ జెన్నొందు। తోటలకడ నలితోడఁ జెంది,
యలరు నెత్తమ్ముల కలిమిఁ జెల్వగు డిగ్గి। యల తీరభూముల నల్లఁ బొంది,

తే. నన్ను మనమునఁ దేల్చి యానంద మొందఁ । గేలి సలిపెడు నీ దగు లీల మఱవ
నావశంబె ప్రాణేశ! ప్రాణంబు లిపుడ । నిన్న కూర్చి యేతెంతు నీ సన్న కడకు. 332

ప్రతిపదార్థం: ఇగురు= చిగురుటాకులు; జొంపంబులన్= గుత్తులచేత; ఇంపారు= అందమైన; విరులను= పూలచేత; బలుపు+ఐన= గుబురుగాగల; పొదల క్రేవలకున్= గుబుళ్ళ పక్కలకు; తార్చి= చేర్చి; సెలయేఱులందలి= కొండకాలవలలోని; తెలినీటన్= తేట నీళ్ళల్లో; తనువు= ఒళ్ళు; సొంపు ఎలసినన్= అందం పొందగా; గిరుల తెప్పలకున్= కొండలమిట్ట నేలల మీదకు; చేర్చి= పొందించి; మావిమ్రోకలన్= లేత మామిడి చెట్ల చేత; ఎల+తీవలన్= లేత తీగలచేత; చెన్ను+ఒందు= అందంగా చక్కగా ఉండే; తోఁటలకడన్= తోపుల దగ్గర; నలితోడన్= ఉత్సాహంతో; చెంది= చేరి; అలరు= విరబూసిన; నెత్తమ్ముల+కలిమిన్= పెద్ద తామరలు ఉండటంవలన; చెల్వగు= అందమైన; డిగ్గియల= దిగుడు బావుల; తీరభూములన్= గట్టులను; అల్లన్‌పొంది= మెల్లగా చేరి; నన్నున్= నన్ను; మనమునన్= హృదయంలో; ఆనందము= సంతోషం; ఒందన్= పొందేటట్లు; తేల్చి= ముంచెత్తించి (ఓలలాడించి); కేలిసలిపెడు= క్రీడించే; నీదగు లీల= నీదైన విలాసం; మఱవన్= మర్చిపోవటం; నా వశంబె!= నా తరమా!; ప్రాణేశ!= ప్రాణనాథా!; ప్రాణంబులు= నా ఊపిరులు; నిన్ను కూర్చి= నీతో చేర్చి; ఇపుడ= ఇప్పుడే; నీ చన్నకడకున్= నీవు పోయిన దగ్గరకు; ఏతెంతున్= వస్తాను.

తాత్పర్యం: చిగురుటాకుల గుత్తులతో, పూలతో, గుబురుగా ఉండే పొదలమాటుకు చేర్చేవాడివి. కొండకాలవలలోని తేటనీళ్ళల్లో ఒంటివన్నె ఇనుమడించగా కొండల మెరకలమీదకు తీసికొని వెళ్ళేవాడివి. లేత మామిడిచెట్లతో, లేత తీగలతో చూడచక్కగా ఉండే తోపులలోకి ఉత్సాహంగా చేర్చేవాడివి. బాగా విచ్చుకొన్న తామరపూలతో అందంగా కనిపించే దిగుడుబావుల గట్లమీదకు మెల్లగా చేర్చి ఆనందంలో ముంచెత్తించి క్రీడించేవాడివి. నీ లీలలు మర్చిపోవటం నా వల్లకాదు. ఓ నాథా! ఇపుడే నా ప్రాణాలు తీసికొని నిన్ను చేరుకుంటాను.

వ. అట్లుంగాక. 333

తాత్పర్యం: అంతే కాకుండా.

క. తేని యనుమరణమునఁ దన । మేను విడిచినట్టి కాంత మేలిపదవికిం
దాను నతండును నరిగి య । నూన స్థిరసుఖము లందుచుండుట విందున్.' 334

ప్రతిపదార్థం: తేని అను మరణమునన్= పెనిమిటితో సహగమనంచేత; తన మేనున్= తన తనువును; విడిచినట్టి= చాలించినట్టి; కాంత= వనిత; తానున్= తానూ (భార్య); అతండునున్= పెనిమిటీ; మేలిపదవికిన్= ఉన్నత దశకు; అరిగి= వెళ్ళి; అనూన= తక్కువ కానట్టి; స్థిర= నిలకడ కలిగినట్టి; సుఖములు= భోగాలు, సౌఖ్యాలు; అందుచున్+ఉండుట= పొందుతూ ఉండటం; విందున్= విన్నాను.

తాత్పర్యం: పెనిమిటితోపాటు చితిపొంది చనిపోయిన స్త్రీ అతడితోపాటు ఉత్తమ గతులు పొందుతుందనీ, నిలకడగా అంతులేని భోగాలు అనుభవిస్తుందనీ పెద్దలు చెప్పుతుండగా విన్నాను'.

క. అని పలికి యపుడ యనలము । ఘనముగ దరికొల్పి మది వికాసముఁ బొందం
దన వల్లభుఁ దలఁచుచు వల । గొని లీలం జొచ్చి యతనిఁ గూడం జనియెన్. 335

ప్రతిపదార్థం: అని పలికి= అని మాట్లాడి; అపుడు+అ= ఆ వెంటనే; అనలమున్= నిప్పును; ఘనముగన్= బాగా; దరికొల్పి= రాజుకునేటట్లు చేసి; మది= మనస్సు; వికాసమున్ పొందన్= సంతోషించగా; తనవల్లభున్= తన పెనిమిటిని; తలఁచుచున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తలపోసికొంటూ; వలగొని= నిప్పుచుట్టూ ప్రదక్షిణంచేసి; లీలన్= విలాసంగా; చొచ్చి= అగ్గిలోకి దూకి; అతనిన్= పెనిమిటిని; కూడన్= కలియటానికి; చనియెన్= వెళ్ళింది.

తాత్పర్యం: అని మాట్లాడి ఆ వెంటనే నిప్పును బాగా రగులుకొల్పింది. తన పెనిమిటిని తలచుకొంటూ ఆ నిప్పుచుట్టూ తిరిగింది. అతడిని చేరుకొనటానికి ఆనందంగా నిప్పుల్లోకి ఉరికింది.

క. స్ఫురిత విమానము మీఁద న। మరతతి వేష్టింప రత్నమయ భూషణ సుం
దర దివ్యమూర్తి వెలిఁగెడు। వరునిఁ గలిసి పరమ సౌఖ్య వైభవ మెసఁగన్. 336

ప్రతిపదార్థం: స్ఫురిత= ప్రకాశించే; విమానము మీఁదన్= విమానంపై; అమర తతి= దేవతా సమూహం; వేష్టింపన్= చుట్టుకొనగా; రత్నమయ భూషణ= రత్నాలు పొదిగిన నగలచేత; సుందర= మనోహరమైన; దివ్యమూర్తిన్= దేవతా రూపంతో; వెలిఁగెడు= శోభిల్లే; వరునిన్= పెనిమిటిని; కలిసి= కూడి; పరమ సౌఖ్య వైభవము= గొప్ప సుఖసంపత్తి; ఎసఁగన్= ఎక్కువ అవగా.

తాత్పర్యం: దేవతాగణం చుట్టూ ఉండగా రత్నాభరణాలతో మనోహరరూపుడై చక్కటి విమానంమీద దేవత్వంతో ఒప్పే పెనిమిటిని కలుసుకొన్నది. ఎనలేని సుఖసంపదలతో తులతూగుతుండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. లీల మూరిఁబో నచ్చరలేమ పిండు। బలసి యభివందనము సేయఁ బొలిచె నిట్లు
సనిన పక్షియుగ్మంబు వర్తనము దోఁచెఁ। బుణ్యవర్తనుఁ డగుట నా బోయ కపుడు. 337

ప్రతిపదార్థం: లీల= విలాసం; మూరిన్ పోన్= అతిశయించగా; అచ్చరలేమ పిండు= దేవతా స్త్రీల సముదాయం; బలసి= కమ్ముకొని; అభివందనము చేయన్= మొక్కుతుండగా; పొలిచెన్= ఒప్పింది; ఇట్లు= ఇట్లా; చనిన= పై లోకాలకు వెళ్ళిన; పక్షియుగ్మంబు= పావురం పిట్టల జంట; వర్తనము= నడవడి; ఆ బోయకున్= ఆ బోయవాడికి; పుణ్య వర్తనుఁడు+అగుటన్= పవిత్రమైన నడవడి కలవా డవటంవలన; అపుడు తోఁచెన్= అప్పుడే తట్టింది.

తాత్పర్యం: విలాసం ఎక్కువ కాగా, దేవతాస్త్రీలంతా చుట్టూ గుమిగూడి అభినందించటంవలన ఒప్పిదంగా ఉన్నది (కనబడింది). ఇట్లా పై లోకాలకు పోయిన రెండు పిట్టల నడవడి, పవిత్రంగా జీవిస్తున్న బోయవాడికి అపుడే తెలిసింది.

వ. తోఁచిన నతండు. 338

ప్రతిపదార్థం: తోచినన్= తట్టిన వెంటనే; అతండు= ఆ బోయవాడు.

తాత్పర్యం: అట్లా తట్టిన వెంటనే ఆ బోయవాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఏనును ని ట్లగుదు' ననుచు। నూనిన కౌతూహలమున నుల్లము వొదలన్
మే నెల్ల ముండ్లు సింపఁగఁ। గానఁ దఱిసి గళిత రక్త కలితాకృతియై. 339

ప్రతిపదార్థం: ఏనునున్= నేను కూడా; ఇట్లు+అగుదున్= ఇట్లా పుణ్యలోకాలను పొందినవాడను అవుతాను; అనుచున్= అనుకుంటూ; ఊనిన= పొందిన; కౌతూహలమునన్= ఉత్సాహంతో; ఉల్లము= మనస్సు; పొదలన్= ఒప్పగా; మేను+ఎల్లన్= ఒళ్ళంతా; ముండ్లు చింపఁగన్= ముళ్ళు చీరుకోగా; కానన్+తఱిసి= అడవిలోకి కాలిడి; గళిత= కారుతున్న; రక్తకలిత= రక్తంతో కూడుకొన్న; ఆకృతి ఐ= రూపు కలవాడై.

తాత్పర్యం: నేనూ అట్లాగే పుణ్యలోకాలు పొందుతాను అనుకుంటూ ఎంతో ఉత్సాహంతో మనస్సు పొంగిపోగా ఆతడు అడవిలోకి చొరబడ్డాడు. ఒళ్ళంతా ముళ్ళతో చీరుకొనిపోయింది. రక్తం కారుతున్న రూపంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **అరుగుచుండు వాఁ డొకచో దవానలంబు । గట్టెదిరి కాననం బెల్ల ముట్టి మండ**
సంప్రమోదితచిత్తుఁడై చక్కఁ జొచ్చి । యొడలు దొఱఁగి దేవత్వంబు వడసి యొప్పె. 340

ప్రతిపదార్థం: అరుగుచున్+ఉండువాఁడు= వెళ్ళుతున్నవాడల్లా; ఒకచోన్= ఒకచోట; దవ+అనలంబు= కార్చిచ్చు; కడు+ఎదిరి= ఎట్ట ఎదుట ఉన్న; కాననంబు+ఎల్లన్= అడవంతటిని; ముట్టి= ముట్టుకొని; అంటుకొని; మండన్= కాలుతూ ఉండగా; సంప్రమోదిత చిత్తుఁడు+ఐ= గొప్ప ఉత్సాహం పొందిన మనస్సు కలవాడై; చక్కన్+చొచ్చి= తిన్నగా మంటలలో దూకి; ఒడలు తొఱఁగి= తనువు చాలించి; దేవత్వంబు+పడసి= అమరత్వాన్ని పొంది; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: పోతూ ఉండగా ఒక చోట తన ఎదుటనే కార్చిచ్చు అలముకొని అడవి అంతా మండిపోతూ ఉన్నది. అది చూచి బోయ ఎంతో సంతోషించాడు. తాను ఆ దావాగ్నిలో పడి ప్రాణం వదిలాడు. దేవతారూపాన్ని పొందాడు.

ఉ. **ఈ యితిహాస మర్థిమెయి నెజ్జనముల్ వినినం బఠించినం**
బాయు నుదాత్త గోహనన పాతకమైనను భూరిసౌఖ్యముల్
వేయి విధంబులం బొరయు విన్ము తగన్ శరణార్థిఁ దోషితుం
జేయనివాఁడు కల్మషముఁ జెందు నొకప్పడుఁ బాయ దేమిటన్. 341

ప్రతిపదార్థం: ఈ+ఇతిహాసమున్= ఈ వెనుకటి కథను; అర్థిమెయిన్= ఆసక్తితో; ఏ+జనముల్= ఎట్లాంటి జనం అయినా; వినినన్= విన్నా; పఠించినన్= చదివినా; ఉదాత్త గోహనన= గొప్పదైన గోవును చంపాడనే; పాతకము+ఐనను= పాపం అయినా; పాయును= పోతుంది; భూరిసౌఖ్యముల్= గొప్ప సుఖాలు; వేయి విధంబులన్= అనేక రకాలుగా; పొరయున్= పొందుతాడు; విన్ము= వినుము; తగన్= ఒప్పుగా; శరణార్థిన్= శరణన్నవాడిని; తోషితున్+చేయనివాఁడు= సంతోషపెట్టలేనివాడు; కల్మషమున్+చెందున్= పాపం పొందుతాడు; ఏమిటన్= దేనిచేతనైనా; ఒకప్పుడున్= ఎప్పటికీ; పాయదు= (పాపం) నశించదు.

తాత్పర్యం: ఈ కథనంతా ఎవ్వడైనా ఆసక్తిగా విన్నా చదివినా గోవును చంపిన మహాపాపం అయినా పోతుంది. అన్ని విధాలా సుఖంగా ఉంటాడు. కాని, శరణన్నవాడిని ఆదుకోనివాడు మాత్రం పాపం అనుభవిస్తాడు. అతడి పాపం ఏ విధంగానూ ఎన్నటికీ పోదు.'

వ. **అని యిట్లు శరణాగత రక్షణ ఫలవిశేష ప్రకటనం బగు లుబ్ధ కపోతాఖ్యానంబు సెప్పిన విని యప్పితామహుని మీఁదం బ్రీతి వినయ విస్తారవిలోకనం బెలయ నప్పాండవాగ్రజుండు.** 342

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఇట్లా; శరణాగత= శరణు కోరినవాడిని; రక్షణ= కాపాడేవాళ్ళకు; ఫలవిశేష= విశిష్ట ప్రయోజనాన్ని; ప్రకటనంబు+అగు= తెలిపేది అయిన; లుబ్ధ కపోత= బోయ, పావురం అనే పేరుగల; ఆఖ్యానంబు= కథను; చెప్పినన్+విని= చెప్పగా విన్నవాడై; ఆ+పితామహుని మీఁదన్= తాత భీష్ముడిమీద; ప్రీతి= సంతోషం; వినయ= అణకువ; విస్తార= విస్తరిల్లిన; విలోకనంబు= చూపు; ఎలయన్= ప్రసరించగా; ఆ+పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడు ధర్మరాజు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని శరణన్న వాడిని ఆదుకొనేవాడికి కలిగే పుణ్యాన్ని తెలిపే 'బోయ - పావురం' కథ చెప్పాడు భీష్ముడు. అది విన్న ధర్మరాజు తాత భీష్ముడిపై ప్రీతి, అణకువా కలగలిసిన చూపులు సారిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పాపంబు బుద్ధిపూర్వ । వ్యాపారము గాక తొడరినప్పుడు మనుజుం
దేపాట దానినంతయుఁ । బాపికొనంజాలు సుజనబాంధవ! చెపుమా!' 343

ప్రతిపదార్థం: సుజన బాంధవ!= మంచివాళ్ళకు నేస్తమా!; పాపంబు= పాపం; బుద్ధిపూర్వ వ్యాపారము+కాక= తెలిసి చేసింది కాకుండా; తొడరిన+అప్పుడు= కలిగేటప్పుడు; మనుజుండు= మనిషి; ఏ పాటన్= ఏ విధంగా; దానిన్+అంతయున్= ఆ పాపాన్నంతా; పాపికొనన్+చాలున్= పోగొట్టుకొనగలుగుతాడు; చెపుమా!= చెప్పుము'.

తాత్పర్యం: 'సజ్జనులకు నేస్తమా! తెలియకుండా చేసిన పాపాన్ని ఎట్లా పోగొట్టుకొనాలో తెలుపుము'.

వ. అని యడిగిన నయ్యార్యవర్యుం డా ధరణీభరణధుర్యునకు నిట్లనియెఁ: 'దొల్లి పరీక్షిత్తనయుం డగు జనమేజయుం డను మహారాజు దన కబుద్ధిపూర్వకబ్రహ్మహత్య వాటిల్లినం దత్కిల్బిషంబు వాపికొనియె; నది పురాణకథయై మునులవలన వినంబడు; నత్తెఱం గెఱింగించెద; నాకర్ణింపుము. 344

ప్రతిపదార్థం: అని; అడిగినన్= అడుగగా; ఆ+ఆర్యవర్యుండు= పెద్దలలో పెద్ద అయిన భీష్ముడు; ఆ ధరణీభరణ ధుర్యునకున్= భూభారాన్ని మోసే ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; తొల్లి= మునుపు; పరీక్షిత్+తనయుండు+అగు=పరీక్షిత్తుడి కొడుకు అయిన; జనమేజయుండు+అను మహారాజు= జనమేజయుడనే మహారాజు; తనకున్= తనకు; అబుద్ధి పూర్వక= తెలియక చేసిన; బ్రహ్మహత్య= బ్రాహ్మణుడిని చంపాడనే పాతకం; పాటిల్లినన్= కలుగగా; తద్+కిల్బిషంబున్= ఆ పాపాన్ని; పాపికొనియెన్= పోగొట్టుకొన్నాడు; అది= ఆ బ్రహ్మహత్యాపాపం పోగొట్టుకొనటం; పురాణ కథఐ= చాలాకాలం నాటి కథగా; మునులవలనన్= ఋషుల వలన; వినంబడున్= ఆలకించబడుతుంది; ఆ+తెఱంగున్= ఆ విధానాన్ని; ఎఱింగించెదన్= తెలుపుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని అడిగిన ధర్మరాజుతో ఆ మహానుభావుడైన భీష్ముడు ఇట్లా చెప్పాడు: 'పరీక్షిన్మహారాజు కొడుకు జనమేజయుడు. ఇతడు మునుపు తనకు తెలియకుండానే చుట్టుకొన్న బ్రహ్మహత్యాపాతకాన్ని పోగొట్టుకొన్నాడు. అదే పురాణాలలో ఒక కథ అయింది. దానినే ముని లంతా వినిపిస్తుంటారు. అది చెప్పుతాను వినుము'.

క. పాపంబు దొడరుటయు నా । భూపాలకుఁ బ్రజయు విడిచె; భూసురులును నిం
దాపాత్రంబుగఁ జేసిరి; । తాపము మదిఁ గదిరి యతఁడు దల్లడ మందెన్. 345

ప్రతిపదార్థం: పాపంబు= బ్రహ్మహత్యా పాతకం; తొడరుటయున్= కలుగగానే; ఆ+భూపాలకున్= ఆ జనమేజయుడిని; ప్రజయు= జనమే; విడిచెన్= వదలిపెట్టారు; భూసురులును= బ్రాహ్మణులూ; నిందాపాత్రంబుగన్= తిట్టదగ్గవాడినిగా; చేసిరి= చేశారు; అతఁడు= ఆ జనమేజయుడు; మదిన్= మనస్సులో; తాపము కదిరి= దుఃఖాన్ని పొంది; తల్లడము+అందెన్= బాధపడ్డాడు.

తాత్పర్యం: బ్రహ్మహత్యాపాపం చుట్టుకొనగానే ఆ రాజును ప్రజలూ పట్టించుకొనలేదు. బ్రాహ్మణులు దోషివన్నారు. దానికి జనమేజయుడు లోలోపల కుమిలిపోయాడు.

తే. **అట్లు జనమేజయుఁడు వగ నారఁగూరి । పురము వెడలి యొక్కరుఁడును బోయి కాన**
నాంతరము సొచ్చి శౌనకుం డను మునీంద్రు । నాశ్రమము రోసికొని చని యమ్మహాత్ము. 346

ప్రతిపదార్థం: అట్లు= అట్లా; జనమేజయుఁడు= జనమేజయుడు; వగన్= దుఃఖాన్ని; ఆరఁగూరి= ఎక్కువగా పొంది; పురము= పట్టణంనుండి; వెడలి= బయటపడి; ఒక్కరుఁడును= ఒంటరిగా; పోయి= వెళ్ళి; కానన+అంతరము= అడవిలోపలికి; చొచ్చి= దూరి; శౌనకుండు+అను= శౌనకు డనే; మునీంద్రు నాశ్రమమున్= మునీశ్వరుడి పర్ణశాలను; రోసికొని= వెతుక్కొని; చని= పోయి; ఆ+మహాత్మున్= ఆ మహానుభావుడిని.

తాత్పర్యం: జనమేజయుడు చాలా దుఃఖించి పట్నంనుండి బయటపడ్డాడు. ఒంటరిగా నట్టడవిలోకి చొరబడ్డాడు. ఆ అడవిలో శౌనకముని కుటీరాన్ని వెతుక్కుంటూ వెళ్ళాడు. ఆ మహాత్ముడిని. (తరువాతి వచనంతో అన్వయం).

వ. **కాంచి దండప్రణామం బాచరించి సవినయంబుగఁ గరంబులు మొగిచి నిల్చినం జూచి యతండు. 347**

ప్రతిపదార్థం: కాంచి= చూచి; దండప్రణాంబులు+ఆచరించి= సాగిలపడి మ్రొక్కి; సవినయంబుగన్= అణకువతో; కరంబులు= చేతులు; మొగిచి= మోడ్చి; నిల్చినన్= నిలబడగా; చూచి= కని; అతండు= ఆ శౌనకముని.

తాత్పర్యం: ఆ శౌనకమునిని చూచి సాగిలపడి మ్రొక్కాడు. చేతులు జోడించి నిలబడ్డాడు. అది చూచి ముని. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **'పెనుఁ బొల వల్చుచున్న యది పీనుఁగుఁ జూచినయట్టు లయ్యెడున్**
నినుఁ గనుఁగొన్న నీ యెడకు నీ విది యేటికి వచ్చె? దెక్కడేఁ
జనుము; శిరంబు క్రిందుగ నజస్రము వ్రేలఁగలాఁడ వీ భవం
బున తుదిఁ గ్రూరకాకచయముల్ దొలువన్ నరకాధివాసివై.' 348

ప్రతిపదార్థం: పెనుపొల వల్చుచున్+ఉన్నయది= ఎంతో నీచుకంపు కొట్టుతున్నది; నినున్= నిన్ను; కనుఁగొన్నన్= చూస్తుంటే; పీనుఁగున్= పీనుగును; చూచిన+అట్టులు= చూచినట్లుగా; అయ్యెడున్= అవుతుంది; ఈ+ఎడకున్= ఇక్కడకు; నీవు= నీవు; ఇది= ఇట్లా; ఏటికిన్ వచ్చెదు?= ఎందుకు వచ్చావు?; ఎక్కడేన్= ఎక్కడికైనా; చనుము= వెళ్ళుము; ఈ భవంబునన్= ఈ జన్మలోనే; క్రూరకాక చయముల్= బొంతకాకుల మూకలు; తొలువన్= తూట్లు తూట్లుగ పొడుస్తుండగా; తుదిన్= చివరకు; నరక అధివాసివి+ఐ= నరకంలో ఉండే వాడివై; అజస్రమున్= ఎప్పుడూ; శిరంబు క్రిందుగన్= తలక్రిందుగా; వ్రేలన్+కలాఁడవు= వేలాడుతూ ఉంటావు.

తాత్పర్యం: నీ వద్ద ఎంతో నీచు వాసన వస్తున్నది. నిన్ను చూస్తుంటే పీనుగును చూసినట్లున్నది. నీవు ఇక్కడికి ఎందుకు వచ్చావు? మరెక్కడికైనా వెళ్ళిపొమ్ము'. బొంతకాకులు తూట్లు పొడుస్తూ ఉండగా తలకిందుగా వేలాడుతుంటావు. (ఈ పుట్టుకలోనే నరకం అనుభవిస్తావు).

చ. **అనుటయు 'గర్వకర్వుఁ డగునట్టి దురాత్మునిఁ బూజితవ్రతుల్**
గని యిటు లంట యుక్త మటుగాన కదా భవదీయ పాదవం
దన మొనరించి మీవలన దారుణపాపము వాచికొందు నే
నను మది వచ్చినాఁడ సదయంబగు చూడ్కిఁ బరిగ్రహింపవే!' 349

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; గర్హకున్= నిందించటానికి; అర్హుఁడు+అగు+అట్టి= తగినట్టి; దురాత్మునిన్= పాపిష్ఠివాడిని; పూజిత వ్రతుల్= గౌరవించతగ్గ నియమాలు కల మీవంటి వారు; కని= చూచి; ఇటులు= ఇట్లా; అంట= అనటం (దూషించటం); యుక్తము= తగినదే; అటుగాన కదా= అందువలనే (అట్లాంటి నిందితుడిని కావటంవలననే) కదా; భవదీయ= మీ పాదవందనము+ఒనరించి= కాళ్ళకు మొక్కి; మీవలనన్= మీ కారణంగా; దారుణపాపము= సహించలేని పాపాన్ని; పాచికొందున్= పోగొట్టుకొంటాను; అను మదిన్= అన్న కోరికతో; నేన్= నేను; వచ్చినవాఁడన్= వచ్చాను; సదయంబు+అగు= కనికరం గల; చూడ్కిన్= చూపుతో; పరిగ్రహింపవే= స్వీకరించవా.

తాత్పర్యం: నేను దూషించదగ్గవాడినే. మీబోటి గౌరవార్హులు ఇట్లా నిందించటమూ భావ్యమే. అందువలననే కదా మీ కాళ్ళకు మ్రొక్కుకొని ఈ దారుణమైన పాపాన్ని పోగొట్టుకొనాలని ఆశపడి వచ్చాను. నా మీది దయతో నన్ను స్వీకరించండి'.

వ. అనిన విని కరుణాయత్తచిత్తుం డగు నత్తపోధనసత్తముం డిట్లనియె. 350

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని; కరుణా+ఆయత్త+చిత్తుండు+అగు= దయకు లోబడ్డ మనస్సు కలవాడయిన; ఆ+తపోధన సత్తముండు= ఆ ముని వర్యుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగానే ఆ శౌనకముని జాలిపడి అతడితో ఇట్లా అన్నాడు.

క. విను కొంద అల్పబుద్ధులు । నను నెంతయు ధిక్కరింప నవ్వఁగ వారిం
గొనక బుధులైన విప్రులు । ననిమిషులును మెచ్చుచుండ' ననియెద నీతోన్. 351

ప్రతిపదార్థం: విను= వినుము; కొందఱు= కొంతమంది; అల్పబుద్ధులు= తెలివి తక్కువ వాళ్ళు; ననున్= నన్ను; ఎంతయున్= ఎంతో; ధిక్కరింపన్= తిరస్కరించగా; నవ్వఁగన్= గేలిచేయగా; వారిన్= అట్లాంటి వాళ్ళను; కొనక= లెక్కపెట్టక; బుధులు+ఐన= పండితు లైన; విప్రులున్= బ్రాహ్మణులూ; అనిమిషులును= దేవతలూ; మెచ్చుచున్+ఉండన్= ఆహా అంటూ ఉండగా; నీతోన్= నీతో; అనియెదన్= అంటాను.

తాత్పర్యం: కొంతమంది తెలివితక్కువవాళ్ళు నన్ను కాదని గేలిచేసినా, అట్లాంటి వాళ్ళను లెక్కపెట్టను. పండితులైన బ్రాహ్మణులూ, దేవతలూ మెచ్చుకొనేటట్లు నేను నీతో చెప్పుతాను వినుము.

క. హీనప్రజ్ఞుఁ డకార్యము । లైనవి సేసి తుది వగచు నతులప్రజ్ఞా
సానుమదారూఢుఁడు వగ । నూనఁడు దురిత మను వఱితి కోడక యునికిన్. 352

ప్రతిపదార్థం: హీన ప్రజ్ఞుఁడు= అల్పబుద్ధి కలవాడు; అకార్యములు+ఐనవి+చేసి= చేయకూడని పనులను చేసి; తుదిన్= చివరకు; వగచున్= పశ్చాత్తాప పడతాడు; అతుల ప్రజ్ఞా= సాటిలేని తెలివితో; సానుమత్+ఆరూఢుఁడు= కొండెక్కినవాడు (ఉన్నతికి పోయేవాడు); దురితము+అను= పాపం అనే; వఱితికిన్= వరదకు; ఓడక ఉనికిన్= భయపడకుండా ఉండటానికి; వగన్= విచారాన్ని; ఊనఁడు= పొందడు.

తాత్పర్యం: తెలివితక్కువవాడు చేయకూడని పనులు చేసి చివరకు విచారిస్తాడు. ఎక్కడలేని తెలివితో ఉన్నతుడయ్యేవాడు మాత్రం పాపం అనే వరదకు వెరవడు, విచారించడు.

వ. ప్రజ్ఞాకార్యంబు లైనవి యనుష్ఠింపవలయు; వానిఁ జెప్పెద; నీకుం బాపంబునెడ ననుతాపంబు గలిగె ధర్మ ప్రవణుండ వైతే?' యనుటయు నమ్మనుజనాథుండు. 353

ప్రతిపదార్థం: ప్రజ్ఞాకార్యంబులు+ఐనవి= తెలివిగా చేసే పనులు; అనుష్ఠింప వలయున్= ఆచరించాలి; వానిన్= వాటిని; నీకున్= నీకు; చెప్పెదన్= చెప్పుతాను; పాపంబు+ఎడన్= (చేసిన) పాపం విషయంలో; అనుతాపంబు+కలిగి= పశ్చాత్తాపం పొంది; ధర్మ ప్రవణుండవు+ఐతే?= ధర్మంపట్ల ఆసక్తికలవాడవు అయ్యావా?; అనుటయున్= అని అనగానే; ఆ మనుజనాథుండు= ఆ జనమేజయమహారాజు.

తాత్పర్యం: తెలివిగా పనులు చక్కబెట్టుకోవాలి. వాటిగురించి నీకు చెప్పుతాను. అసలు నీవు చేసిన పాపాలకు పశ్చాత్తాపపడుతున్నావా? నీకు ధర్మంపట్ల ఆసక్తి కలిగిందా?' అని ముని అడుగగానే ఆ జనమేజయుడు.

క. 'తాపసవర! తీవ్రం బగు । పాపాగ్నిజ్వాల చయము పాలుపడి పరీ
తాపము నొందుచు ధర్మ । వ్యాపార జలాభిలాషి నై యున్నాఁడన్. 354

ప్రతిపదార్థం: తాపసవర!= మునీశ్వర!; తీవ్రంబు+అగు= ఎక్కువ అవుతున్న; పాప+అగ్నిజ్వాల చయము= పాపం అనే మంటల సముదాయంలో; పాలుపడి= చిక్కుకొని; పరీతాపమున్= సంతాపాన్ని; ఒందుచున్= పొందుతూ; ధర్మవ్యాపార= పుణ్యకర్మలనే; జల= పవిత్రమైన నీటిని; అభిలాషిని+ఐ= కోరుకొంటున్నవాడనై; ఉన్నాఁడన్= ఉన్నాడను.

తాత్పర్యం: 'ఓ మునివర్య! తీవ్రమైన పాపపు మంటలలో చిక్కుకొని ఎంతో తపిస్తున్నాను. పుణ్యకార్యాలనే పవిత్రజలంతో ఆ మంటలను చల్లార్చుకొనాలని అనుకొంటున్నాను.

వ. భవదీయ కృప నాశ్రయింప వచ్చితి; నన్ను రక్షింపవే!' యనవుడు నమ్మునీంద్రుండు. 355

ప్రతిపదార్థం: భవదీయ= మీ; కృపన్= దయను; ఆశ్రయింపన్= అండకోరటానికి; వచ్చితిన్= వచ్చాను; నన్నున్= నన్ను; రక్షింపవే= కాపాడవా; అనవుడున్= జనమేజయుడు అనగానే; ఆ+ముని+ఇంద్రుండు= ఆ శౌనకముని.

తాత్పర్యం: నీ దయకొరకు నిన్ను ఆశ్రయించాను. నన్ను ఆదుకొనవలసినది' అని జనమేజయుడు అనగానే ఆ శౌనకమునివర్యుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'భీతి యొకటి గోరుటయును । నీ తలఁపులలోన దీని కిది గతమనఁగా
నే తెరువును గలుగదు మ । చ్చేతోగతి ధర్మవృత్తిఁ జిక్కుట దక్కన్. 356

ప్రతిపదార్థం: భీతి= భయం (వెరపు); ఒకటి కోరుటయున్= ఒకటి కోరుతుండగా; మత్+చేతఃగతి= నా మనస్సుపోకడ; ధర్మవృత్తిన్= పుణ్యవ్యాపారంలో; చిక్కుట తక్కన్= పట్టుపడి ఉండటం తప్ప; దీనికిన్= దీనికి; ఇది; కతము+అనఁగాన్= కారణం అనటానికి; ఏ తెరువును= ఏ ఉపాయమున్నూ; నీ తలఁపులలోనన్= నీ ఊహలలో; కలుగదు= పుట్టదు.

తాత్పర్యం: 'నీవు నీ భయంకొద్దీ ఒకదానిని కోరుకొంటున్నావు. అందువలన దీనికి ఇది కారణం అనే ఉపాయమే నీ ఆలోచనలకు అందదు. నాకు తట్టిన పుణ్యకార్యం ఆచరించాలి తప్ప.

క. ఆతురత నీవు నా కడ । కేతెంచిన దానఁ జేసి యెలసిన ధర్మ
ద్యోతన కౌతూహలమున । నీతోఁ బడవలసె; వినుము నిశ్చలమతివై. 357

ప్రతిపదార్థం: ఆతురతన్= తొందరపాటుతో; నీవు; నా కడకున్= నా దగ్గరకు; ఏతెంచినదానన్+చేసి= వచ్చినందువలన; ఎలసిన= అలముకొన్న; ధర్మద్యోతన= ధర్మం తోచినందువలన కలిగిన; కౌతూహలమునన్= ఉబలాటంతో; నీతోన్= నీతో; పడవలసెన్= అనుభవించవలసి వస్తుంది; నిశ్చలమతివి+ఐ= నిలకడగల బుద్ధికలవాడవై; విను= వినుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నీ ఆతురతకొద్దీ నీవు నా దగ్గరకు వచ్చావు కాబట్టి, నాకు ధర్మమార్గం తట్టినందువలన కలిగిన ఉబలాటంకొద్దీ నీతో పడవలసి వచ్చింది. నిలుకడగా వినుము.

క. **భూవిబుధుల కెయ్యది హిత । మావిధమున నడచువాఁడవగునది ద్రోహా**
భావంబు ప్రతిజ్ఞాతం । బై వెలయఁగవలయు నీకు నా జాతియెడన్.' **358**

ప్రతిపదార్థం: భూవిబుధులకున్= బ్రాహ్మణులకు; ఎయ్యది= ఏది; హితము= మేలో; ఆ విధమునన్= అట్లాగున; నడచువాఁడవు= ప్రవర్తించేవాడవు; అగునది= కావాలి; నీకున్= నీకు; ఆ జాతి+ఎడన్= ఆ బ్రాహ్మణుల కులంపట్ల; ద్రోహ+అభావంబు= కీడు తలపెట్టనని; ప్రతిజ్ఞాతంబు+ఐ= ఒట్టుపెట్టుకున్నవాడవై; వెలయఁగవలయున్= ప్రసిద్ధి కెక్కాలి.

తాత్పర్యం: బ్రాహ్మణజాతికి మంచి కలిగేటట్లు నడచుకొమ్ము. వాళ్ళకు ఎప్పుడూ అపకారం తలపెట్టనని ఒట్టు వేసుకొమ్ము. నలుగురి మెప్పులు అందుకొమ్ము.'

చ. **అనవుడు 'ధర్మవృత్తము మదాత్మకు నైజము; దోషవృత్తికిన్**
మునివర! యేను భీతుఁడ; సముజ్జ్వల విప్రకులంబు నాకు మ
న్ననలకుఁ బాత్ర; మెవ్విధమునం దెగి ద్రోహము దానియందు నా
మనము దలంప; దింతకును మాన్య భవచ్చరణంబు లంటెదన్.' **359**

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; మునివర!= మునిసత్తమా!; మత్+ఆత్మకున్= నా మటుకు నాకు; ధర్మవృత్తము= పుణ్యాజీవనం; నైజము= సహజం; దోషవృత్తికిన్= పాపపు నడతకు; ఏను=నేను; భీతుఁడన్= భయస్థుడిని; సముజ్జ్వల=వెలిగిపోతున్న; విప్రకులంబు= బ్రాహ్మణ జాతి; నాకున్= నా; మన్ననలకున్= ఆదరణలకు; పాత్రము= తగినది; ఏ విధమునన్= ఎట్లాగైనా; నా మనము= నా మనస్సు; దాని యందున్= ఆ బ్రాహ్మణుల కులమందు; తెగి= సాహసించి; ద్రోహము= కీడు కలిగించాలని; తలంపదు= ఆలోచించదు, తలపోయదు; ఇంతకును= ఈ సమస్తానికీ; మాన్య= మన్నించదగ్గ; భవత్+చరణంబులు= మీ పాదాలను; అంటెదన్= తాకుతాను.

తాత్పర్యం: 'ఓ శౌనకమునివర్యా! ధర్మంగా నడచుకొనటం నాకు పుట్టుకతో వచ్చింది. పాపపు బ్రతుకంటే నాకు వణకు. బ్రాహ్మణజాతి ఎప్పుడూ నా ఆదరణకు తగినది. తెగించి ఎప్పుడూ నా మనస్సు ఆ జాతికి కీడు తలపెట్టదు. ఈ సమస్తానికీ సాక్ష్యంగా నీ పాదాలు తాకి ఒట్టుపెట్టుకొంటాను.'

వ. **అనుచుఁ దదీయ పాదస్పర్శనంబు సేసి యవ్విధంబునం గృతశపథుం డగుటయుఁ గరుణాగోచరంబగు చిత్తంబుతో నత్తపోధనవర్యుం డాదరమేదురావలోకనం బా భూపాలుని మీఁద నొలయ నిట్లను: 'నట్లేనిం జెప్పెద నవహితుండ వయి యాకర్ణింపుము.** **360**

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; తదీయపాద= ఆ ముని పాదాలను; స్పర్శనంబు చేసి= తాకి; ఆ+విధంబునన్= ఆ రీతిగా; కృత= చేసిన; శపథుండు+అగుటయున్= ఒట్టుపెట్టుకొన్నవాడవుగా; కరుణాగోచరంబు+అగు= దయకు లోబడ్డ; చిత్తంబుతోన్= మనస్సుతో; ఆ+తపోధనవర్యుండు= ఆ మునివరుడు కౌశికుడు; ఆదరమేదుర= ఎంతో మర్యాదతో కూడిన; అవలోకనంబు= చూపు; ఆ భూపాలుని మీఁదన్= ఆ జనమేజయ రాజుమీద; ఒలయన్= ప్రసరించగా; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అట్లు+ఏనిన్= అట్లాగైతే (బ్రాహ్మణులకు కీడు తలపెట్టనట్లయితే); చెప్పెదన్= చెప్పుతాను; అవహితుండవు+అయి= సావధానుడవై; ఆకర్ణింపుము= ఆలకించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ ముని కాళ్ళు పట్టుకొని అట్లా శపథంచేశాడు. ఆ ముని మనస్సు జాలిపడింది. ఆ జనమేజయుడిని ఎంతో ఆదరంగా చూచి ఇట్లా అన్నాడు. అట్లా బ్రాహ్మణజాతికి కీడు తలపెట్టనన్నావు కనుక చెప్పుతాను. సావధానంగా వినుము.

సీ. శ్రీమంతుఁడును బలశ్రేష్ఠుండు నగు రాజు । భోగంబు దర్పంబుఁ బోవ విడిచి,
ధర్మంబు గైకొని, తపమును దానంబు । నధ్యయనంబును యాగవిధులు
నాచరింపఁగఁ జూచి యచ్చెరువడి యను । గ్రహము సేయదె భూతరాజి? యతని
కధిప! యయాతివాక్యము నర్థ మెఱిఁగింతు । వినుము! సరస్వతియును దృషద్వ
తే. తియును నను పుణ్యనదులందుఁ దిరిగి తీర్థ । సేవ సేయుచు నధ్యయనావధాన
దాననిర్ధూతరాగత్వదయలు గలిగి । పరఁగఁ బాపకళంకలేపంబు వాయు. 361

ప్రతిపదార్థం: శ్రీమంతుఁడును= ధనవంతుడునూ; బలశ్రేష్ఠుండును+అగు= మేటి బలశాలిన్నీ అయిన; రాజు= ప్రభువు; భోగంబున్= సౌఖ్యాన్నీ; దర్పంబున్= పొగరునూ; పోవవిడిచి= వదలగొట్టుకొని; ధర్మంబు= న్యాయం; కైకొని= పాటించి; తపమును= తపస్సునూ; దానంబున్= దానాన్నీ; అధ్యయనంబును= వేదం వల్లించటాన్ని; యాగవిధులును= యజ్ఞకర్మలను; ఆచరింపఁగన్= చేయగా; చూచి; అచ్చెరువడి= ఆశ్చర్యపడి; భూతరాజి= ప్రాణికోటి; అతనికిన్= అతడికి (రాజుకు); అనుగ్రహము+చేయదె?= దయచూపదా; అధిప!= రాజా!; యయాతి వాక్యమున్= యయాతి మాటనూ; అర్థమున్= దాని అర్థాన్నీ; ఎఱిఁగింతున్= తెలుపుతాను; వినుము= వినవలసింది; సరస్వతియును= సరస్వతీనదీ; దృషద్వతియునున్= దృషద్వతీనదీ; అనుపుణ్యనదులందున్= అనే పవిత్ర నదులలో; తిరిగి= తిరుగాడి (సంచరించి); తీర్థసేవ చేయుచున్= పుణ్యక్షేత్రాలను సేవిస్తూ (దర్శించుకొంటూ); అధ్యయన= వేదాలు చదవటంలో; అవధాన= ఏకాగ్రత, దాన= దానం; నిర్ధూత రాగత్వ దయలు= వదలిన మమకారమూ, కనికరమూ; కలిగి= ఉండి; పరఁగన్= ఒప్పగా; పాప= పాపం అనే; కళంకలేపంబు= మకిలి పూత; పాయున్= వీడిపోతుంది.

తాత్పర్యం: సంపన్నుడూ, ధీరుడూ అయిన రాజు భోగాన్నీ అహంభావాన్నీ వదలగొట్టుకొనాలి. ధర్మాన్ని పాటించాలి. తపస్సు, దానం, వేదాధ్యయనం, యాగాదికర్మలూ ఆచరించాలి. అప్పుడు ప్రాణికోటి అంతా రాజుమీద దయచూపుతుంది. ఈ విషయంగా యయాతి మాట ఒకటి ఉన్నది. దాని అర్థాన్ని విడమరచి చెప్పుతాను వినుము. సరస్వతి, దృషద్వతివంటి పవిత్ర నదులను సేవించాలి. పుణ్యక్షేత్రాలలో నడయాడాలి. మమకారం వదులుకొనాలి. అధ్యయనమునందే ఏకాగ్రత, దానం, దయలు కలిగి మమకారం లేక ఉండాలి. అపుడు పాపం అనే మకిలి మరక తుడిచిపెట్టుకొనిపోతుంది.

వ. అదియునుంగాక యొక్క పరమస్మృతి సెప్పెద వినుము. 362

ప్రతిపదార్థం: అదియున్+కాక= అంతేకాకుండా; ఒక్క= ఒకటి; పరమస్మృతి= మేలైన ధర్మశాస్త్రం; చెప్పెదన్= చెప్పుతాను; వినుము.

తాత్పర్యం: అంతేకాదు ఒక ధర్మశాస్త్రం చెప్పుతాను వినుము.

చ. దురితము సేసి తాపమునఁ దూలిన నిం కిటు సేయ నన్మతిం
బొరసిన ధర్మ సంచరణ బుద్ధియ మేలని యూఁదినం గ్రియా
పరుఁ డయి మేలుసేసినను బాదము పాదముగాఁ గ్రమంబునన్
విరియు సమస్తముం దదభివిష్టకళంకము నిర్భయంబుగన్. 363

ప్రతిపదార్థం: దురితము+చేసి= పాపం చేసి; తాపమునన్= పశ్చాత్తాపంతో; తూలినన్= దుఃఖించినా; ఇంకన్= ఇకమీదట; ఇటు+చేయన్= ఇట్లాంటి పాపం చేయను; అను మతిన్= అనే బుద్ధిని; పొరసినన్= పొందినా; ధర్మ సంచరణ బుద్ధియ= ధర్మంతో మెలగాలనే ఆలోచనే; మేలు+అని= మంచిదనీ; ఊఁదినన్= అవలంబించినా; క్రియాపరుఁడు+అయి= పుణ్యకార్యాలలో ఆసక్తి కలవాడై; మేలు చేసినను= ఉపకారం చేసినా; తద్+అభివిష్ట= దానిని పొందిన; కళంకము= మకిలి; సమస్తమున్= అంతా; పాదముపాదముగాన్= అంశం అంశంగా; క్రమంబునన్= వరుసగా; నిర్భయంబుగన్= ఏ జడుపు లేకుండా; విరియున్= తొలగుతుంది.

తాత్పర్యం: పాపంచేసి పరితపించినా, ఇకమీదట ఇట్లాంటి పాపాలకు ఒడిగట్టను అనుకున్నా, న్యాయంగా మెలగటం ఉత్తమం అని నిర్ణయించుకొన్నా, పుణ్యం పొందాలని అపేక్షపడి ఉపకారం చేసినా - వీటిల్లో ఏ అంశంవలననైనా పాపపంకిలం క్రమక్రమంగా తుడిచిపెట్టుకొనిపోతుంది. ఇందులో ఏమీ భయపడాల్సింది లేదు.

చ. నరవర! వాసవుం డడిగినన్ గురుఁ డిట్లని చెప్పె బుద్ధితోఁ
బొరయని పాతకంబులు సబుద్ధికపుణ్యములన్ నశించు నం
బరమునఁ బట్టినట్టి మలపంకము గారములోన నద్దఁగా
విరిసిన యట్లు నమ్ము మిది వేదము సెప్పిన నేనుఁ జెప్పితిన్. 364

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; వాసవుండు= ఇంద్రుడు; అడిగినన్= అడుగగా; గురుఁడు= బృహస్పతి; ఇట్లు+అని= ఇట్లాగని; చెప్పెన్= చెప్పాడు; బుద్ధితోన్= ఆలోచనతో; పొరయని= పొందని; పాతకంబులు= పాపాలూ; సబుద్ధిక= బుద్ధి పూర్వకంగా చేసిన; పుణ్యములన్= ధర్మాలవలన; అంబరమునన్= బట్టమీద; పట్టినట్టి= అంటుకొన్నట్టి; మలపంకము= మురికి అనే బురద; కారములోనన్= చౌటి మట్టిలో; అద్దఁగాన్= ముంచగా; విరిసిన+అట్లు= వదులునట్లుగా; నశించున్= పోతాయి; నమ్ముము= విశ్వసించుము; ఇది= ఈ విషయం; వేదము+చెప్పినన్= వేదం చెప్పగా; నేనున్= నేనూ; చెప్పితిన్= చెప్పాను.

తాత్పర్యం: ఓ జనమేజయా! ఇంద్రుడు అడిగిన విషయాన్ని బృహస్పతి ఇట్లా చెప్పాడు. బట్టకుపట్టి ఉన్న మురికి చవుడు కారంలో ముంచినపుడు వదలిపోయినట్లుగా చెయ్యాలని చేయని పాపాలు బుద్ధిపూర్వకంగా చేసిన పుణ్యాలవలన పోతాయి. ఈ సంగతి వేదం చెప్పింది. అదే నేను బోధించాను. నన్ను నమ్ముము'.

విశేషం: అలం: ఉపమ.

కృత్వా పాపం పూర్వమబుద్ధి పూర్వమ్
పుణ్యాని చేత్కురుతే బుద్ధి పూర్వమ్ -శాం-152-34

వ. అని యిట్లు బహుప్రకారంబులం గారుణికోత్తముం డగు నత్తాపసోత్తముం డా భూవరు బోధించి, తీర్థసేవాది పునశ్చరణంబులం బరిపూతాత్ముం గావించి,యశ్వమేధంబు సేయించిన నుజ్జ్వలుండయి యజ్జనమేజయుండు నిజరాజ్యంబు పరిపాలనంబు సేసె' నని చెప్పి వెండియు. 365

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఇట్లా; బహుప్రకారంబులన్= అనేక విధాల; కారుణిక+ఉత్తముండు+అగు= గొప్ప జాలికలవాడైన; ఆ+తాపస+ఉత్తముండు= ఆ మునిశ్రేష్ఠుడు; ఆ భూవరున్= ఆ రాజును; బోధించి= మేలుకొలిపి; తీర్థసేవ= పుణ్యక్షేత్రాలు సేవించటం; ఆది= మొదలైనవి; పునశ్చరణంబులు= మాటి మాటికి ఆచరించటంవలన; పరిపూత+ఆత్మున్= మరింత పవిత్రమైన మనస్సు కలవాడినిగా; కావించి= చేసి; అశ్వమేధంబు= అశ్వమేధయాగం; చేయించినన్= చేయించగా; ఉజ్జ్వలుండు+అయి= ప్రకాశించినవాడై; ఆ+జనమేజయుండు= ఆ జనమేజయ మహారాజు; నిజ రాజ్యంబు= తనదేశాన్ని; పరిపాలనంబు+చేసెన్= ఏలాడు; అని చెప్పి= అని పలికి; వెండియున్= మళ్ళీ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సతతి పాపం నుదతే కర్మశీల:

వాసోయథా మలినం క్షారయుక్తమ్

తాత్పర్యం: జాలిగుండెగల ఆ ముని ఇట్లా ఎన్నో విధాల ఆ జనమేజయుడిని మేలుకొలిపి, ఎన్నో తీర్థయాత్రలు చేయించి, పుణ్యవంతుడిని చేశాడు. అశ్వమేధయాగం చేయించాడు. అట్లా వెలుగొందిన ఆ జనమేజయుడు తన రాజ్యాన్ని ఏలుకొన్నాడు' అని చెప్పి మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

భీష్ముఁడు ధర్మజునకు గృధ్రజంబుకోపాఖ్యానము సెప్పుట (సం. 12-149-1)

సీ. గాంగేయుఁ డిట్లనుఁ గౌంతేయపూర్వజు । నకు 'విదిశాపట్టణమున నొక్క

బాలుండు మృతుఁ డైన బంధులు ప్రేతభూ । మికిఁ గొనిపోయి యమేయశోక

వివశాత్ములై పలవింపఁగా గ్రద్ద యొ । క్కటి వచ్చి మీర లిక్కడ భయంబు

దక్కి యేడ్చుచునుండఁ దగ; దిదె క్రుంకెడుఁ । బ్రొద్దు రాక్షసులును భూతములుఁ బి

తే. శాచములు వ్రచ్చి తిన నిపు డేచి వచ్చు; । జనన మరణముల్ వింతలె? చన్న శిశువు

తోన యందఱుఁ జనుటకుఁ బూనియుండు । వారలే? పొండు పీనుంగు వైచి వేగ. 366

ప్రతిపదార్థం: గాంగేయుఁడు= భీష్ముడు; కౌంతేయ పూర్వజునకున్= కుంతీ సంతానంలో ముందు పుట్టిన ధర్మరాజుకు; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; విదిశాపట్టణమునన్= విదిశానగరంలో; ఒక్కబాలుండు= ఒక పిల్లవాడు; మృతుఁడు+ఐనన్= చచ్చిపోగా; బంధులు= చుట్టాలు; ప్రేత భూమికిన్= వల్లకాటికి; కొనిపోయి= తీసుకొనిపోయి; అమేయశోక= పట్టరాని దుఃఖంతో; వివశ+ఆత్ములు+ఐ= ఒంటిమీద తెలివి తప్పినవారై; పలవింపఁగాన్= విలపించగా; గ్రద్ద= గద్ద; ఒక్కటి వచ్చి= ఒకటి వచ్చి; మీరలు= మీరు; ఇక్కడన్= ఈ వల్లకాట్లో; భయంబు+తక్కి= భయం వదలి; ఏడ్చుచున్+ఉండన్= ఏడుస్తూ ఉండటం; తగదు= కూడదు; ఇదె= ఇపుడే; పొద్దు= సూర్యుడు; క్రుంకెడున్= కనుమరుగు అవుతున్నాడు; రాక్షసులును= రక్కసులు; భూతములున్= భూతాలూ; పిశాచములున్= పిశాచాలూ; వ్రచ్చి= పీనుగును చీల్చి; తినన్= తినటానికి; ఇపుడు= ఈ సమయంలో; ఏచివచ్చున్= చెలరేగి వస్తాయి; జనన మరణముల్= పుట్టటం, గిట్టటం; వింతలె?= కొత్తవా?; చన్న= పోయిన; శిశువుతోన= బిడ్డతోనే; అందఱున్= అంతమందీ; చనుటకున్= చచ్చిపోవటానికి; పూని+ఉండువారలే?= పట్టుదలగా ఉన్నారా?; పీనుంగున్= పీనుగును; వైచి= పాతిపెట్టి; పొండు= వెళ్ళండి.

తాత్పర్యం: ధర్మరాజుతో భీష్ము డిట్లా అన్నాడు. విదిశాపట్టణంలో ఒక పిల్లవాడు చచ్చిపోయాడు. వాడిని అతడి చుట్టాలు వల్లకాటికి తీసికొనిపోయారు. వారంతా పట్టలేనంత దుఃఖంతో ఒంటిమీద తెలివితప్పి గోడు గోడుమని ఏడుస్తున్నారు. ఒక గద్ద వచ్చి మీరు ఈ వల్లకాటిలో భయపడకుండా ఏడుస్తూ ఉండటం మంచిదికాదు. చీకటి పడుతున్నది. ఈ సమయంలో రాక్షసులూ, భూతాలూ, పిశాచాలూ పీనుగులను చీల్చుకొని తినటానికి చెలరేగి వస్తాయి. చావుపుట్టుకలు ఇంతకుమునుపు లేనివా ఏమి? చచ్చిపోయిన బిడ్డతో మీరంతా పోవటానికి సిద్ధపడుతున్నారా? తొందరగా పీనుగును పాతేసి వెళ్ళండి.

క. తెగిపోయినవా రేడ్చిన । మగుడుదురే? వెఱ్ఱులార! మానుఁడు మీరుం

దెగుదురు తడసిన' నావుడు । నగు నట్టిద కర్జ' మనుచు నందఱు భీతిన్. 367

ప్రతిపదార్థం: ఏడ్చినన్= ఏడిస్తే; తెగిపోయినవారు= చచ్చిపోయినవారు; మగుడుదురే?= తిరిగివస్తారా?; వెఱ్ఱులార!= పిచ్చివాళ్ళలారా!; మానుఁడు= మానుకొనండి; తడసినన్= ఆలస్యం చేస్తే; మీరున్= మీరూ; తెగుదురు= చచ్చిపోతారు; నావుడున్= గద్ద అనగానే; అట్టిద కర్జము= అట్లాంటిపనే; అగును= జరుగుతుంది; అనుచున్= అంటూ; అందఱున్= అంతమంది; భీతిన్= భయంతో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: చచ్చిపోయినవారు ఎంత ఏడ్చినా తిరిగిరారు. పిచ్చిగా ఏడవటం మానుకొనండి. జాగు చేశారంటే మీరూ చావగలరు' అన్నది గద్ద. అక్కడకు వచ్చిన చుట్టాలంతా అట్లాగే జరుగుతుందేమో అనుకొంటూ భయపడి. (తరువాతి వచనంతో అన్వయం).

వ. శవంబు విడిచి పోవంజూచిన, నొక నక్క బొక్కలోనుండి వెడలి వారలతోడ నిట్లనియె. 368

ప్రతిపదార్థం: శవంబున్= పీనుగును; విడచి= వదలి; పోవన్+చూచినన్= వెళ్ళబోగా; ఒక నక్క; బొక్కలోనుండి= బొరియలోనుండి; వెడలి= బయటకు వచ్చి; వారలతోడన్= వాళ్ళతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: పీనుగును విడిచిపెట్టిపోవాలనుకొంటున్నప్పుడు కలుగులోనుండి అపుడే వెలుపలికి వస్తున్న నక్క ఇట్లా అన్నది.

సీ. 'గ్రద్ధ మాటల కేల కడు భీతిఁ బొందితి । రక్కటా! బాలుని నబ్జవదను
నిటు వైచి పోవఁ గా క్కెట్లాడె నేడ్వుఁడు । శోకంబు వోవ నిచ్చోటఁ గొంత
ప్రొ ద్దంతలో విధి క్రూరుండు గాకున్నఁ । బ్రాణంబు గ్రమ్మఱ రాక గల్గు
నో యెఱుంగుదురే; యినుండును నస్తాద్రిఁ । జేరఁడు; వెఱవక మీరు నిలువుఁ'

తే. డనిన వారును మనమున నాసపుట్టి । మగిడి వచ్చిన గ్రద్ద 'యిమ్మందబుద్ధి
యైన నక్కమాటలు విననగునె? వికృత । మయ్యెఁ బీనుంగు; వచ్చునే యసువు లింక? 369

ప్రతిపదార్థం: గ్రద్ద మాటలకున్= గద్ద పలుకులకు; కడుభీతిన్= మిక్కిలి భయాన్ని; పొందితిరి+ఏల?= పొందారు ఎందుకు?; అక్కట!= అయ్యో!; అబ్జవదనున్= పద్మంవలె విప్పారిన ముఖంగల; బాలునిన్= పిల్లవాడిని; ఇటు వైచి= ఇట్లా పాతిపెట్టి; పోవఁగాన్= వెళ్ళటానికి; కాళ్ళు+ఎట్లాడెన్?=కాళ్ళెట్లావచ్చాయి?; కొంతప్రొద్దు=కొంతసేపు; శోకంబుపోవన్=దుఃఖంపోయేటట్లు; ఇచ్చోటన్=ఈ ఒలుకుల్లోనే(శ్మశానంలోనే); ఏడ్వుఁడు= ఏడ్వండి; అంతలోన్= అంతట్లోకి; విధి= బ్రహ్మ; క్రూరుండు= కసాయి గుండె కలవాడు; కాక+ఉన్నన్= కాకుంటే; ప్రాణంబు= ఊపిరి; క్రమ్మఱన్= తిరిగి; రాక కల్గునో!= రావటం జరుగుతుందేమో!; ఎఱుంగుదురే?= మీకు తెలుసునా?; ఇనుండునున్= సూర్యుడు కూడా; అస్త+అద్రిన్+చేరఁడు= క్రుంకలేదు; వెఱవక= భయపడకుండా; మీరు; నిలువుఁడు= ఆగండి; అనినన్= అని నక్క పలకగానే; వారును= వారూ; (పీనుగు చుట్టాలు); మనమునన్= మనస్సులో; ఆసపుట్టి= ఆశ కలిగి; మగిడి వచ్చినన్= తిరిగి రాగా; గ్రద్ద= గద్ద; ఈ మందబుద్ధిఐన= మందమతి అయిన; నక్కమాటలు= నక్క పలుకులు; వినన్+అగునె?= వినవచ్చునా?; పీనుంగు= పీనుగు వికృతము+అయ్యెన్= వికారం పొందింది; అసువులు= ప్రాణాలు; ఇంకన్= ఇంకా; వచ్చునే?= వస్తాయా?

తాత్పర్యం: 'గద్దమాటలకు అంత భయపడటం దేనికి' అయ్యో! చక్కటి పిల్లవాడిని ఇక్కడ పాతిపెట్టి పోవటానికి మీకు కాళ్ళెట్లావచ్చాయి? మీ కడుపుశోకం తీరిపోయేదాకా ఈ వల్లకాటిలోనే కాసేపు ఏడ్వండి. అంతలో బ్రహ్మ దయ ఉంటే ఈ పిల్లవాడు ఊపిరి మళ్ళీ పోసుకొంటాడేమో? మీ రేమి ఎరుగుదురు? ఇంకా సరిగ్గా పొద్దుగ్రుంకనూ లేదు. మీరు భయపడకుండా ఉండండి' అని నక్క చెప్పింది. అప్పుడు అక్కడ ఉన్నవాళ్ళకు ఆశ పుట్టింది. తిరిగివచ్చారు. గ్రద్ద వాళ్ళను చూచి 'ఈ మందమతి నక్కమాటలు వినవచ్చా? పీనుగు రూపం చెడింది. పోయిన ప్రాణాలు మళ్ళీ వస్తాయా ఏమి?

క. కడు బెట్టిదుండు కాలుఁడు; । మిడుక మిడుక నపహరించు; మీరీ యాసల్
విడువుఁడు; బాలునికి సుగతిఁ । బడయుఁడు దానాదు లైన బహుధర్మములన్. 370

ప్రతిపదార్థం: కాలుఁడు= యముడు; కడుబెట్టిదుండు= కటికవాడు; మిడుక మిడుకన్= పరితపిస్తుండగా; అపహరించున్= (ప్రాణాలు) ఎత్తుకొనిపోతాడు; మీరు; ఈ ఆసల్= ప్రాణాలు తిరిగి వస్తాయి అనే ఆశలు; విడువుఁడు= వదులుకొనండి; దాన+ఆదులు+ఐన= దానం చేయటం మొదలైన; బహుధర్మములన్= అనేక పుణ్యాలచేత; బాలునికిన్= ఈ పిల్లవాడికి; సుగతిన్= ఉత్తమ గతిని; పడయుఁడు= కలిగించండి.

తాత్పర్యం: యముడు చాలా కటికగుండెవాడు. కుయ్యో మొర్రోమని బాధపడుతుండగా ప్రాణాలు తీసికొని వెళ్ళిపోతాడు. మీ పిల్లవాడు ప్రాణాలతో తిరిగి వస్తాడనే ఆశలు పెట్టుకొనకండి. దానధర్మాలు చేసి ఆ పిల్లవాడికి పుణ్యగతులు కలిగించండి'.

వ. అని పలికిన నా గృధ్రంబు వచనంబు లాక్షేపించి యజ్జంబుకంబు వారల నుద్దేశించి. 371

ప్రతిపదార్థం: అని పలికినన్= అని మాటలాడిన; ఆ గృధ్రంబు= ఆ గద్ద; వచనంబులు= మాటలు; ఆక్షేపించి= తోసి రాజని; ఆ జంబుకంబు= ఆ నక్క; వారలన్+ఉద్దేశించి= పీనుగు చుట్టాలను గూర్చి.

తాత్పర్యం: అని చెప్పిన గద్ద మాటలను నక్క కాదని తోసిపుచ్చింది. ఆ పిల్లవాడి చుట్టాలతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'క్రూరంబు గృధ్ర మిట్టి కు । మారకునిం జూచి చూచి మసలకపోవన్
మీ రె ట్లోర్చెదరో క । న్నీ రిటు నునుబోటులకును నిలువ కొలికెడున్. 372

ప్రతిపదార్థం: గృధ్రము= గద్ద; క్రూరంబు= కటికది; ఇట్టి కుమారకునిన్= ఇట్లాంటి బిడ్డను; చూచి చూచి= చూస్తూ చూస్తూ; మసలక= ఉండకుండా; పోవన్= వెళ్ళటానికి; మీరు; ఎట్లు+ఓర్చెదరో= ఎట్లా తట్టుకుంటారో; ఇటు= ఇట్లా; నునుబోటులకును= నా బోటి జంతువులకే; కన్నీరు= కళ్ళనీళ్ళు; నిలువక= ఆగక; ఒలికెడున్= కారుతున్నాయి.

తాత్పర్యం: 'గద్దది రాతిగుండె. మీరు ఇట్లాంటి బిడ్డను చూస్తూ చూస్తూ వదలివెళ్ళటానికి ఎట్లా తట్టుకుంటారో. నావంటి వాళ్ళకే కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి.

క. దయమాలి పోవ నేటికిఁ? । బ్రయత్నమునఁ బొదువ దైవబలమున మీకుం
బ్రియ మెసఁగ బ్రదుకు బ్రదుకం । డయినను మఱి పోవరాదె?' యని చెప్పుటయున్. 373

ప్రతిపదార్థం: దయమాలి= పిల్లవాడి మీద జాలిలేకుండా; పోవన్= వెళ్ళటం; ఏటికిన్?= ఎందులకు?; ప్రయత్నమునన్= వదలని పట్టుదలతో; పొదువన్= తలపడగా; దైవ బలమునన్= దైవశక్తిచేత; మీకున్= మీకు; ప్రియము+ఎసఁగన్= సంతోషం కలుగగా; బ్రదుకున్= బ్రతుకుతాడు; బ్రదుకండు అయినను= బతకకపోతే; మఱి= ఆ తరువాత; పోవరాదె?= వెళ్ళరాదా?; అని చెప్పుటయున్= అని నక్క చెప్పగానే.

తాత్పర్యం: నిర్దయుగా పోవటం ఎందుకు? పంతంపట్టి తలపడండి. దైవం కలసివస్తే మీరంతా సంతోషించేటట్లు ఆ పిల్లవాడు లేచి వస్తాడు. అట్లా కాకపోతే అప్పుడే పోవచ్చును' అని చెప్పగానే.

వ. గ్రద్ధ యిట్లనియె. 374

ప్రతిపదార్థం: గ్రద్ద= గద్ద; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: గద్ద ఈ విధంగా చెప్పింది.

ఆ. ఏను బుట్టివేయు నిన్నూఱు మున్నూఱు । గలవు వత్సరములు గాన నెందు
బాలు యౌవనస్థుఁ బ్రౌఢుని వృద్ధునిఁ । జచ్చిపోయి మగిడి వచ్చువాని. 375

ప్రతిపదార్థం: ఏను= నేను; పుట్టి= ఈ పుట్టుక పుట్టి; వేయున్+ఇన్నూఱు మున్నూరు= పదిహేనువందల; వత్సరములు= ఏళ్ళు; కలవు= అవుతుంది; చచ్చిపోయి= ప్రాణం పోయి; మగిడి= తిరిగి; వచ్చువానిన్= వచ్చేవాడిని; బాలున్= పసివాడిని; యౌవనస్థున్= కుర్రవాడిని; ప్రౌఢునిన్= వయస్సు వచ్చినవాడిని; వృద్ధునిన్= ముసలివాడిని; ఎందున్= ఎక్కడా; కానను= చూడలేదు.

తాత్పర్యం: 'నేను పుట్టి 1500ల ఏళ్ళయింది. ఇంత సుదీర్ఘకాలంలోనూ చచ్చి తిరిగి బతికివచ్చిన పసివాడినిగానీ, కుర్రవాడినిగానీ, వయసు వచ్చినవాడినిగానీ, ముసలివాడినిగానీ ఎక్కడా చూడలేదు.

క. ఒకటి గలదు; వత్తురు వే । తొక గర్భంబునకు మృతులు నుక్కివమౌ న
క్కకు నేటి బుద్ధి పీనుఁగు । నకు బ్రదుకటె! కలుగు నిట్టి నవ్వులు గలవే? 376

ప్రతిపదార్థం: ఒకటి కలదు= ఒకసంగతి ఉన్నది; మృతులు= చచ్చినవారు; వేఱొక గర్భంబునకున్= మరొకరి కడుపులోకి; వత్తురు= వస్తారు; ఉక్కివము+ఔ= మాయలమారి అయిన; నక్కకున్= నక్కకు, ఏటి బుద్ధి?= ఇదేమి ఆలోచన?; పీనుఁగునకున్= పీనుగునకు; బ్రదుకు= ప్రాణం; కలుగునటె!= వస్తుందా!; ఇట్టి= ఇట్లాంటి; నవ్వులు= వింతలు; కలవే?= ఉన్నాయా?

తాత్పర్యం: ఒక సంగతి ఉన్నది. చచ్చిపోయినవారు మరోజన్మ ఎత్తుతారు. జిత్తులమారి నక్కకు ఇదేమి బుద్ధి? పీనుగు ఎక్కడైనా తిరిగి బ్రతుకుతుందా? ఇట్లాంటి వింత లున్నాయా?'

సీ. అనవుడు నెగవెక్కి యా బిడ్డవైచి పో । యెడు వారలకు నడ్డపడుచు నక్క
'వినుఁడు రాఘవుఁడు నేర్పున బ్రదికింపఁడే । మృతుఁడైన భూసుర సుతుని మగుడ?
సృంజయు కొడుకు సచ్చిన నారదుఁడు ప్రభా । వంబునఁ గ్రమ్మఱ వానిఁ దేఁడె?
యట్టుల యొక సిద్ధుఁ డమరుండు మీ యేడ్పు । లాలించి దయ బాలు నసువు లొసఁగె

ఆ. నేని మేల కాదె! యిది యేల పోయెద?' । రనిన వారు మగిడి యరుగుదెంచి
శిశువు శవము చుట్టుఁ జేరి పెల్లేడ్చిరి । పనవిపనవి యంత నినుడుఁ గ్రుంకె. 377

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; ఎగ వెక్కి= పైకి ఎక్కిళ్ళుపెట్టి ఏడ్చి; ఆ బిడ్డన్= ఆ పిల్లవాడిని; వైచి= పాతిపెట్టి; పోయెడు వారలకున్= వెళ్ళేవాళ్ళకు; నక్క; అడ్డపడుచున్= అడ్డంగా వస్తూ; వినుఁడు= ఆలకించండి; మృతుఁడు+ఐన= చచ్చిపోయిన; భూసుర సుతునిన్= బాపడి కొడుకును; రాఘవుఁడు= రాముడు; మగుడన్= తిరిగి; నేర్పునన్= సామర్థ్యంతో; బ్రదికింపఁడే= ప్రాణం పోయలేదా; సృంజయు కొడుకు= సృంజయుడి కుమారుడు; చచ్చినన్= చనిపోగా; నారదుఁడు= నారదుడు; ప్రభావంబునన్= తన మహిమచేత; క్రమ్మఱన్= తిరిగి; వానిన్+తేఁడె?= వాడిని తేలేదా?; అట్టుల= ఆ విధంగానే; సిద్ధుఁడు= అణిమాది సిద్ధులు కల; ఒక అమరుండు= ఒక దివ్య పురుషుడు; మీ ఏడ్పులు= మీరు పెట్టే శోకాలు; ఆలించి= విని; దయన్= జాలితో; బాలు= బాలుడి; అసువులు= ప్రాణాలు; ఒసఁగెన్+ఏని= ఇస్తే; ఇది= మళ్ళీ ఊపిరాడటం; మేల కాదె?= మంచిదే కదా?; పోయెదరు ఏల?= వెళ్ళిపోతారు ఎందుకు?; అనినన్= అనగానే; వారు= వారు (పీనుగ చుట్ట పక్కాలు); మగిడి= వెనక్కి తిరిగి; అరుగుదెంచి= వచ్చి; శిశువు= ఆ పిల్లవాడి; శవము చుట్టున్= పీనుగు చుట్టూ; చేరి= పొంది; పనవి పనవి= తలచుకొని తలచుకొని; పెల్లు= పెద్ద పెట్టున; ఏడ్చిరి= రాగాలు తీశారు; అంతన్= అంతలో; ఇనుఁడున్= సూర్యుడూ; క్రుంకెన్= అస్తమించాడు.

తాత్పర్యం: గ్రద్ద అట్లా అనగానే పైకి వెక్కి వెక్కి ఏడుస్తూ ఆ పిల్లవాడిని అక్కడే పాతిపెట్టి వెళ్ళబోతున్న వాళ్ళకు నక్క అడ్డుపడింది. ఒక్కమాట వినండి అన్నది.'మునుపు రఘురాముడు ప్రాణంపోయిన బాపడి కొడుకును నేర్పుగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బ్రతికించలేదా? నారదుడు తన మహిమ చూపి సృంజయుడనే రాజుకుమారుడికి ప్రాణాలు పోయలేదా? ఆ విధంగానే ఒక సిద్ధుడైన దివ్యపురుషుడు మీ శోకాలు చెవినిబడి మీ పిల్లవాడికి ఊపిరి పోయవచ్చును. ఇది మీకు మంచిదే కదా! వెళ్ళిపోతారేం?' అనగానే ఆ పీనుగు చుట్టపక్కాలు వెనక్కి తిరిగి వచ్చి ఆ పీనుగుచుట్టూ చేరి పేరు పేరున చెప్పుకొంటూ పెద్ద పెట్టున రాగాలు పెట్టి ఏడ్చారు. అంతలో సూర్యుడు అస్తమించాడు.

వ. ఆ గృధ్రంబును జంబుకంబును నాఁకలిచేత వందురుచుండి తాన తాన బాలశవంబు నాహారంబు గొనుటకై యివ్విధంబునం దమ తమ పల్కునేర్పున నజ్జనంబుఁ గ్రమ్మఱించెఁ; బ్రొద్దు గ్రుంకినం దా నచ్చోట నిలువనేరదు గావున గ్రద్ద యటమున్న వారు వోవునట్టి తెఱంగు మాటలాడె; రాత్రియైనం దనకు మేలుగావున నక్కవారలు దడయుటకుం దగిన చందంబుఁ జెప్పె; నది వాని తెఱంగు ప్రేతవనవిహారనిరతుం డగు శంకరుండు కరుణాకింకరుండు నగుట నప్పుడు. 378

ప్రతిపదార్థం: ఆ గృధ్రంబును= ఆ గ్రద్దా; జంబుకంబునున్= నక్కా; ఆఁకలిచేత= ఆకలితో; వందురుచున్+ఉండి= నకనకలాడుతూ; తాన తాన= దేనికి అదే; బాలశవంబున్= పిల్లవాడి పీనుగును; ఆహారంబు+కొనుటకై= తినటానికి; ఈ విధంబునన్= ఈ తీరున; తమ తమ= వారి వారి; పల్కునేర్పునన్= మాటకారితనంతో; ఆ+జనంబున్= ఆ పిల్లవాడి చుట్టాలను; క్రమ్మఱించెన్= మళ్ళించాయి; ప్రొద్దు క్రుంకినన్= చీకటి పడితే; గద్ద; తాను; ఆ చోటన్= ఆ వల్లకాట్లో; నిలువనేరదు= ఉండలేదు; కావునన్= కాబట్టి; అట మున్న= అంతకుముందే (చీకటి పడకముందే); వారు= వారు; పోవునట్టి తెఱంగు= వెళ్ళేవిధంగా; మాటలు+ఆడెన్= మాటలాడింది; రాత్రి+ఐనన్= చీకటి పడితే; నక్క; తనకు; మేలు కావునన్= మంచిది కాబట్టి; వారలు= వారు; తడయుటకున్= జాగు చేయటానికి; తగిన చందంబున్= తగ్గట్టుగా; చెప్పెన్= చెప్పింది; అది= అట్లా చెప్పటం; వాని తెఱంగు= వాటి నైజం; ప్రేతవన= శ్మశానవాటికలో; విహార= విహరించటంలో; నిరతుండు+అగు= ఆసక్తికలవాడైన; శంకరుండు= శివుడు; కరుణాకింకరుఁడు= దయకు అధీనమైనవాడు; అగుటన్= అవటం వలన; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ గద్దా నక్కా ఆకలికి నకనకలాడుతూ దేని మట్టుకు అది ఆ పిల్లవాడి పీనుగును పీక్కుతినాలని ఇట్లా తమ మాటకారితనం చూపాయి. ఆ పీనుగు చుట్టాలను వెనుకకు మళ్ళించాయి. చీకటిపడితే గ్రద్ద ఉండలేదు కాబట్టి చీకటి పడకముందే వారు తిరిగి వెళ్ళేటట్లు మాట్లాడింది. రాత్రి అయితే నక్కకు మేలు కాబట్టి వారు ఆలస్యం చేయటానికి అనువుగా చెప్పింది. ఇట్లా చెప్పటం ఆ జంతువుల స్వభావం. ఒలుకులలో విహరించాలనే అపేక్షకల దయాళువైన శివుడు ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అట్లు పనవియేడ్చు నజ్జనంబులకుఁ బ్ర । త్యక్షమై 'వరంబు లడుగుఁ' డనిన
సంప్రమోద భక్తి సంభ్రమ భరితులై । చక్క నవనిఁ జాఁగి మ్రొక్కి వారు. 379

ప్రతిపదార్థం: అట్లు= అట్లా; పనవి= తలచుకొని; ఏడ్చు= దుఃఖించే ; ఆ+జనంబులకున్= ఆ జనానికి; ప్రత్యక్షము+ఐ= ఎదుటపడి; వరంబులు= కోరికలు; అడుగుఁడు= కోరండి; అనినన్= అనగానే; సంప్రమోద= పట్టరానంత సంతోషంతోనూ; భక్తి= ఆరాధనతోనూ; సంభ్రమ= తొట్రుపాటుతోనూ; భరితులు+ఐ= నిండినవారై; చక్కన్= చక్కగా; అవనిన్= నేలమీద; చాఁగి= సాగిలపడి; మ్రొక్కి= మొక్కి; వారు= ఆ పీనుగు చుట్టాలు.

తాత్పర్యం: తలచుకొని తలచుకొని ఏడుస్తున్న అక్కడి వారి ఎదుటకు వచ్చి 'మీకేం కావాలో కోరుకొనండి' అనగానే

ఎంతో సంతోషించారు. భక్తి సంభ్రమాలలో తేలిపోతూ నేలమీద సాగిలపడి మొక్కి, వారు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. బాల మరణ శోకంబునఁ । దేలకయుండంగఁ గావు దేవోత్తమ! నీ
వాలించిన బ్రదికితిమి ద । యాళుహృదయ! పార్వతీప్రియా! చంద్రధరా! 380

ప్రతిపదార్థం: దయాళుహృదయ!= జాలిగుండె కలవాడా!; పార్వతీప్రియా!= గౌరీపతీ!; చంద్రధరా!= చంద్రుడిని తలమీద పెట్టుకొన్నవాడా!; దేవోత్తమ!= దేవతలలో శ్రేష్ఠుడా శివుడా!; నీవు; ఆలించినన్= మా మొర ఆలకించినట్లైతే; బ్రదికితిమి= మేం బతికిపోయినట్టే; బాలమరణ= పిల్లవాడి చావువలన కలిగిన; శోకంబునన్= ఏడ్పులో; తేలక+ఉండంగన్= మునిగి పోకుండేటట్లు; కావు= రక్షించుము.

తాత్పర్యం: 'ఓ శివుడా! నీవు జాలిగుండె కలవాడవు. నెలవంకను నెత్తిన పెట్టుకొన్నవాడవు. పార్వతీపతివి. దేవతలలో ఉన్నతుడివి. ఈ పిల్లవాడి చావు అనే దుఃఖంలో మునిగిపోకుండా మమ్మల్ని రక్షించుము. నీవు మా మొర వింటే మేము బ్రతికిపోయినట్టే'.

వ. అనుచు లేచి నిలుచుటయు శివుం డా శిశుప్రాణంబు లొసంగి 'వీఁడు శతాయుస్సంపన్నుం డగువాఁ'డని యానతిచ్చి, యాగృధ్ర జంబుకంబులకు నాఁకలి యెన్నండును లేకయుండం బ్రసాదించి యంతర్హితుండయ్యె; సంతోషంబున నంతరంగంబులు నంగంబులుం బొదల నజ్జనంబులు బాలునెత్తికొని పలుమఱుం జూచుచు, గౌఁగిలించుచుం జనిరి. గృధ్రంబును జంబుకంబును ముదంబునం బొంగుచుం బోయి తమ తమ కులంబులలోఁ బ్రభూతంబులై ప్రవర్తిల్లె; నార్త జనబాష్ప ప్రమార్జనంబు ప్రభువులకుం గర్తవ్యం బగుటకును నిజకార్యార్థులగు కపటుల నేర్పు మాటల తెరువు లెఱింగికొనుటకును నుదాహరణం బైన యీ గృధ్ర జంబుకోపాఖ్యానంబు. 381

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; లేచి నిలుచుటయున్= వారు లేచి నిలబడగా; శివుండు= శివుడు; ఆశిశు ప్రాణంబులు= ఆ పిల్లవాడి ప్రాణాలు; ఒసంగి= ఇచ్చి; వీఁడు= ఈ పిల్లవాడు; శత= నూరేళ్ళు; ఆయుః+సంపన్నుండు= ఆయుస్సంపద కలవాడు; అగువాఁడు= అవుతాడు; అని; ఆనతి+ఇచ్చి= దయతో చెప్పి; ఆ గృధ్రజంబుకంబులకున్= ఆ గద్ద, నక్కలకు; ఆఁకలి= ఆకలి; ఎన్నండును= ఎప్పటికీ; లేక+ఉండన్= కలగకుండేటట్లు; ప్రసాదించి= కనికరించి; అంతర్హితుండు+అయ్యెన్= కనుమరుగయ్యాడు; ఆ+జనంబులు= ఆ బాలుడి చుట్టాలు; సంతోషంబునన్= సంతోషంతో; అంతరంగంబులున్= మనస్సులున్నూ; అంగంబులున్= శరీరాలున్నూ; పొదలన్= ఉప్పొంగగా; బాలున్= పిల్లవాడిని; ఎత్తికొని= చంకన బెట్టుకొని; పలుమఱున్+చూచుచున్= అదేపనిగా చూచుకొంటూ; చనిరి= వెళ్ళారు; గృధ్రంబును= గద్దా; జంబుకంబును= నక్కా; ముదంబునన్= సంతోషంతో; పొంగుచున్+పోయి= ఉబుకుతూపోయి; తమతమ= వారి వారి; కులంబులలోన్= జాతులలో ప్రభూతంబులై= ముఖ్యులై; ప్రవర్తిల్లెన్= తిరుగాడాయి; ఆర్తజన= బాధలలో ఉన్నవాళ్ళ; బాష్ప= కన్నీటిని; ప్రమార్జనంబు= తుడవటం; ప్రభువులకున్= రాజులకు; కర్తవ్యంబు= చేయవలసినపని; అగుటకున్= అవటానికీ; నిజకార్య+అర్థులు+అగు= తమవైన పనులు చక్కబెట్టుకొనేవారైన; కపటుల= మాయగాళ్ళయొక్క; నేర్పుమాటల= మాటల చాతుర్యం; తెరువులు= తెన్నులు; ఎఱింగికొనుటకునున్= తెలిసికొనటానికిన్నీ; ఉదాహరణంబు+ఐన= మచ్చువంటిదైన; ఈ గృధ్ర జంబుక+ఉపాఖ్యానంబున్= ఈ గద్దా నక్కా కథను.

తాత్పర్యం: అంటూ వాళ్ళు లేచి నిలబడ్డారు. శివుడు ఆ పిల్లవాడికి ప్రాణంపోసి 'వీడు నిండుగా నూరేళ్ళు బతుకుతాడు' అని చెప్పాడు. ఆ గద్ద నక్కలను కనికరించి ఎన్నటికీ ఆకలి లేకుండేటట్లు చేసి కనుమరుగయ్యాడు.

చెప్పలేనంత సంతోషంతో ఆ పిల్లవాడి చుట్టాలు ఆ పిల్లవాడిని ఎత్తుకొని పదే పదే చూచుకొంటూ కౌగిలించుకొంటూ వెళ్ళారు. గద్దా, నక్కా పట్టలేనంత సంతోషంతో ఉప్పొంగిపోతూ తమ తమ కులంలో మిన్నలయ్యాయి. కష్టాలలో ఉన్నవాళ్ళ కన్నీరు తుడవటం రాజులు చేయాల్సిన పని అనీ, కడుపే కైలాసం అనుకొని తమ పనులు చక్కబెట్టుకొనే మాయగాళ్ళ మాటకారితనాన్ని తెలిసికొనటానికిన్నీ, మాదిరివంటి ఈ గద్దా నక్క కథను. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినినఁ బఠించిన వ్రాసినఁ। గొనియాడిన దురితపీడకుం దొలఁగి నరుం
డనుపమధర్మములకు భా। జన మగు; నాయుః ప్రవృద్ధి సంపద నొందున్.' 382

ప్రతిపదార్థం: వినినన్= విన్నా; పఠించినన్= చదివినా; వ్రాసినన్= రాసినా; కొనియాడినన్= పొగడినా; దురిత పీడకున్= పాపం వలన కలిగే బాధకు; తొలఁగి= దూరమై; నరుండు= మనిషి; అనుపమ= సాటిలేని; ధర్మములకున్= పుణ్యాలకు; భాజనము+అగున్= పాత్ర మవుతాడు; ఆయుః ప్రవృద్ధి= ఆయువు పెరగటాన్నీ; సంపదన్= ఐశ్వర్యాన్నీ; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: ఈ కథ విన్నా, చదివినా, వ్రాసినా, మెచ్చుకొన్నా, ఆ మనిషికి పాపపు పీడ కలుగదు. ఎంతో పుణ్యం వస్తుంది. జీవితకాలం పెరుగుతుంది. సంపత్తీ కలుగుతుంది'.

భీష్ముఁడు ధర్మజునకుఁ బవనశాల్మలీతరు సంవాదంబులు సెప్పుట (సం. 12-150-1)

సీ. అని వినతుం డగు నా ధర్మసుతునకు। ముదమునఁ జెప్పి భీష్ముండు మఱియు
నిట్లను నిది యొక్క యితిహాస మధిప! యా। కర్ణింపు: హిమవన్నగంబునందుఁ
గల దొక్క బూరువు; గడుఁ బెద్ద కాలంబు। ముదురు శాఖాశోభి మూలదృఢము
నారదముని యొక్కనాఁ డత్తరువు పొంతఁ। జనిచని వేడ్క నిట్లనియె: 'నెమ్మి

తే. బూరువా! యింతపఱపును బొడవుఁ। గల్గి నీవు మృగపక్షిసంశ్రయణీయ మగుచు
నునికి గని ప్రీతి నడిగెద ననిలుచేతఁ। బడు నొకప్పుడు తరులు నీ పడమి యెట్లు. 383

ప్రతిపదార్థం: అని; వినతుండు+అగు= వినయంకల; ఆ ధర్మసుతునకున్= ఆ ధర్మరాజుకు; భీష్ముండు= భీష్ముడు; ముదమునన్= సంతోషంతో; చెప్పి; మఱియున్= మళ్ళీ; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అధిప!= ధర్మరాజా!; ఇది= ఈ చెప్పబోయేది; ఒక్క+ఇతిహాసము= ఒక వెనుకటి కథ; ఆకర్ణింపు= వినుము; హిమవత్+నగంబునందున్= హిమాలయపర్వతంమీద; కడున్+పెద్ద కాలంబు= ఎన్నో ఏళ్ళనాటిది; ముదురు= బాగా చేవదేలినది; శాఖాశోభి= కొమ్మలతో అందంగా ఉన్నది; మూలదృఢము= గట్టి బోదెకలది అయిన; ఒక్కబూరువు= ఒక బూరుగుచెట్టు; కలదు= ఉన్నది; ఒక్కనాఁడు= ఒక దినం; నారదముని= నారద మహర్షి; ఆ తరువు పొంతన్= ఆ చెట్టు చెంతకు; చని చని= చేరి; వేడ్కన్= ఉబలాటంతో; నెమ్మిన్= ఆదరంగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; బూరువా!= ఓ బూరుగా!; ఇంత పఱుపును= ఇంత విశాలమునూ; పొడవున్= ఎత్తునూ; కల్గి= ఉండి; నీవు= నీవు; మృగ= జంతువులకు; పక్షి= పిట్టలకు; సంశ్రయణీయము+అగుచున్= ఆశ్రయించదగ్గ దానివి అవుతూ; ఉనికి= ఉండటం; కని= చూచి; ప్రీతిన్= సంతోషంతో; అడిగెదన్= అడుగుతాను; అనిలుచేతన్= గాలితాకిడికి; తరులు= చెట్లు; ఒక్కప్పుడు= ఒక్కసారైనా; పడున్= కూలతాయి; నీ= నీవు; పడమి= పడకుండటం; ఎట్లు?= ఎట్లా?

తాత్పర్యం: అని వినయశీలుడైన ధర్మరాజుకు భీష్ముడు సంతోషంగా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు: 'ధర్మరాజా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ చెప్పబోయేది ఒక పురాణగాథ. వినుము హిమాలయాలమీద ఒక బూరుగుచెట్టు ఉండేది. అది చాలా ముదురు చెట్టు. కొమ్మలతో విస్తరించి ఒప్పిదంగా ఉండేది. దాని బోదె చాల గట్టిది. ఒకనాడు నారదముని ఆ చెట్టు దగ్గరకు వెళ్ళి కుతూహలంతో ఇట్లా అన్నాడు. 'ఓ బూరుగు చెట్టా! ఇంత వైశాల్యం, ఇంత ఎత్తూ ఉన్న నీవు జంతువులకూ, పిట్టలకూ, ఆశ్రయం ఇస్తున్నావు. ఇది చూచి సంతోషంతో అడుగుతున్నాను. గాలి తాకిడికి చెట్లు ఒకసారి కాకపోతే ఒకసారైనా కూలిపోతాయి కదా! నీవు కూలకపోవటానికి కారణం ఏమిటి?

క. పవనునకును నీకును బాం। ధవము గలదొ? యతఁడు నిన్ను దయ రక్షింపన్
సవినయవృత్తిని బ్రతికితొ?। చెవులకు నింపెసఁగ నిజము సెప్పుము నాకున్. 384

ప్రతిపదార్థం: అతఁడు= ఆ గాలిదేవుడు; నిన్నున్= నిన్ను; దయన్= జాలితో; రక్షింపన్= కాపాడటానికి; పవనునకును= గాలికినీ; నీకును= నీకూ; బాంధవము= చుట్టరికం; కలదొ?= ఉన్నదా?; సవినయ వృత్తిని= అణకువగల నడవడితో; బ్రతికితి+ఒ?= బతికావా?; చెవులకున్= చెవులకు; ఇంపు+ఎసఁగన్= హితవు కలిగేటట్లు; నాకున్= నాకు; నిజము= ఉన్నది ఉన్నట్లు; చెప్పుము= వచించుము.

తాత్పర్యం: గాలిదేవుడు నిన్ను కాపాడటానికి మీ ఇద్దరికీ చుట్టరికం కలిసిందా? అణకువగా మెలగటంవలన బ్రతికిపోయావా? ఉన్నది ఉన్నట్లుగా నాకు వినాలనిపించేటట్లు చెప్పుము'.

క. అనిన విని బూరు విట్లను। 'ననిలుని బల మస్మదీయమైన బలముతో
నెనగా దేర్పడ; విను పదు। నెనిమిది యగు నంశమునకు నెనయ దరయఁగన్. 385

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని; బూరువు= బూరుగు చెట్టు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నది; అనిలుని బలము= గాలిసత్తువ; అస్మదీయము+ఐన= నాదైన; బలముతోన్= బలిమితో; ఎన గాదు= సాటి కాదు; ఏర్పడన్= స్పష్టంగా; విను= వినుము; అరయఁగన్= ఆలోచించగా; పదునెనిమిది+అగు+అంశమునకున్= పద్దెనిమిదవ భాగానికీ; ఎనయదు= (గాలి బలం) సరిపోలదు.

తాత్పర్యం: నారదమునితో బూరుగు చెట్టు ఇట్లా అన్నది. 'గాలిదేవుడి సత్తువ నా సత్తువతో సాటి రాదు. ఇంకా చెప్పాలంటే నా బలంలో 18వ వంతుకు కూడ సరితూగదు'.

వ. అని పలుకుటయు నమ్మునీంద్రుండు. 386

ప్రతిపదార్థం: అని; పలుకుటయున్= పలకగానే; ఆ+మునీంద్రుండు= ఆ నారదుడు.

తాత్పర్యం: అన్న బూరుగుచెట్టుతో నారదముని - (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'అమ్మచెల్ల! యిట్టు లనకుము గొండలు। లోనుగాఁగ బవనుచే నపాస్త
మహిమ గలుగు టెఱుఁగుమా భూతముల చేష్టి। తములు వాయువశగతములు గావె? 387

ప్రతిపదార్థం: అమ్మచెల్ల!= అయ్యో!; ఇట్టులు= ఇట్లా; అనకుము= చెప్పకుము; పవనుచేన్= గాలిచేత; కొండలు లోనుగాఁగన్= పర్వతాలు మొదలుగాగలవి; అపాస్త= పోగొట్టబడ్డ; మహిమ కలుగుట= మహాత్మ్యం కలవిగా; ఎఱుఁగుమా!= తెలిసికొనుమా!; భూతముల= అన్ని ప్రాణుల; చేష్టితములు= నడకలు; వాయువశగతములు కావె?= గాలి దేవుడికి లోబడి నడచుకొనేవి కావా?

తాత్పర్యం: 'ఔరా! ఇట్లా మాట్లాడకుము. గాలిచేత కొండలు కూడా కొట్టుకుపోతాయని తెలిసికొమ్ము. సమస్త జీవరాశి నడకలన్నీ గాలిదేవుడి కింద ఉండేవి కావా?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **అనుటయుఁ 'బెలుచని యెలుఁగున । ఘనమూల ప్రబలశాఖికా దుర్జయు న**
న్నును దాఁకిన నతని ప్రభం । జనుఁ డను నామంబునకు నసత్యత వచ్చున్.' **388**

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; పెలుచని+ఎలుఁగునన్= పెద్దగొంతుతో; ఘనమూల= పెద్ద బోదె; ప్రబలశాఖికా= దిట్టమైన కొమ్మలూ కలిగి; దుర్జయున్= గెలవరాని; నన్నును= నన్నూ; తాఁకినన్= ఎదుర్కొంటే; అతని= ఆ గాలికిగల; ప్రభంజనుఁడు+అను నామంబునకున్= ప్రభంజనుడు (అతి తేలికగా విరగ్గొట్టేవాడు) అనే పేరుకు; అసత్యత= అబద్ధం; వచ్చున్= వస్తుంది.

తాత్పర్యం: అనగానే ఆ బూరుగుచెట్టు పెద్ద గొంతుతో 'పెద్ద బోదె, పెద్ద పెద్ద కొమ్మలూ ఉండి ఎదిరించ శక్యంకాని నాతో ఢీకొంటే అతడి కున్న ప్రభంజను డనే పేరు అబద్ధం అవుతుంది సుమా!'

వ. **అని గర్వంపు మాట లాడిన యా శాల్మలిం జూచి సురమునిప్రవరుండు.** **389**

ప్రతిపదార్థం: అని; గర్వము+మాటలు= పొగరుబోతు పలుకులు; ఆడిన= పలికిన; ఆ శాల్మలిన్= ఆ బూరుగుచెట్టును; చూచి= కని; సురముని ప్రవరుండు= దేవమునులలో మేటి అయిన నారదుడు.

తాత్పర్యం: అని పొగరుగా మాటలాడిన ఆ బూరుగుచెట్టును చూచి దేవముని నారదముని. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **'మఱవకయుండు నీ బిరుదు మాటలు నీ విటు లంట మారుతుం**
డెఱిఁగెడు నెట్లు నంచు వెస నేఁగి సమస్తముఁ జెప్ప నాతఁ డే
డ్తెఱఁ జనుదెంచి నీ వటు కడిందిమగండవు; నిన్నుఁ దాకినం
జెఱుతటె పేరు? బూరుగ నశించితిగా కిటఁ బల్కు లేటికిన్?' **390**

ప్రతిపదార్థం: నీ బిరుదు మాటలు= నీ బీరపు పలుకులు; మఱవక+ఉండు= మర్చిపోకుము; నీవు= నీవు; ఇటులు= ఇట్లా; అంట= అనటం; ఎట్లున్= ఎట్లాగైనా; మారుతుండు= గాలిదేవుడు+ఎఱిఁగెడున్= తెలిసికొనగలుగుతాడు; అంచున్= అంటూ; వెసన్= తొందరగా; ఏఁగి= వెళ్ళి; సమస్తమున్= అంతా; చెప్పన్= చెప్పగా; ఆతఁడు= ఆ గాలిదేవుడు; ఏడ్తెఱన్= విజృంభణంతో; చనుదెంచి= వచ్చి; బూరుగ= ఓ బూరుగా; నీవు= నీవు; అటు= అట్లా; కడిందిమ= గొప్ప; మగండవు= శూరుడివి; నిన్నున్= నిన్ను; తాఁకినన్= ఎదుర్కొంటే; పేరు= నా పేరును; చెఱుతటె= మాపివేస్తానన్నావుట; ఇటన్= ఇక్కడ; పల్కులు= మాటలు; ఏటికిన్?= ఎందుకు?; నశించితి+కాక= రూపుమాసిపోతావు గాక.

తాత్పర్యం: 'నీవు బింకంగా పలికిన మాటలు మర్చిపోకుము. నీవు ఇట్లా అన్నావని గాలిదేవుడు ఎట్లాగైనా తెలిసికొంటాడు' అంటూ నారదుడు వెళ్ళిపోయాడు. అదంతా ఆ వెంటనే గాలిదేవుడి చెవిని వేశాడు. గాలిదేవుడూ విజృంభించి వచ్చాడు. 'నీవు మహామొనగాడివా? నీ జోలికి వస్తే నా పేరు చెరిపేస్తానన్నావుట? నీవు చెడిపోతావు సుమా! ఇట్లాంటి మాటలు ఎందుకంటావు?'

మ. **అని కోపంబునఁ బల్క నప్పవనుతో నా భూరుహం 'బింత పె**
ల్చన నీ వాడెదు నంత తక్కువనె? బేలా! లోకసామాన్య వృ
క్షనికాయంబును నన్ను నొక్కటిగ నిచ్చం జూచితే?' యన్న న
ల్లని న వ్వొప్పఁగ నా సమీరణుఁడు హేలాస్ఫారుఁ డై యిట్లనున్. **391**

ప్రతిపదార్థం: అని; కోపంబునన్= రోషంతో; పల్కన్= మాట్లాడగా; ఆ+పవనుతోన్= ఆ గాలిదేవుడితో; ఆ+భూరుహంబు= ఆ బూరుగు చెట్టు (భూమిలో పుట్టేది భూరుహము); బేలా!= తెలివితక్కువవాడా!; ఇంత= ఇంత; పెల్చన= గట్టిగా; నీవు= నీవు; ఆడెదవు= మాట్లాడుతున్నావు; అంత తక్కువనె?= అంత చవటనా?; లోకసామాన్య= లోకంలో సాధారణం అయిన; వృక్షనికాయంబును= చెట్లన్నిటినీ; నన్నున్= నన్ను; ఒక్కటిగన్= ఒక్కటిగా; ఇచ్చన్= మనస్సులో; చూచితే?= ఎంచావా?; అన్నన్= అనగానే; అల్లని= మెల్లని; నవ్వు; ఒప్పగన్= ప్రకాశించగా; ఆ సమీరణుఁడు= ఆ గాలిదేవుడు; హేలాస్ఫారుఁడు+ఐ= పెద్దగా లెక్కపెట్టనివాడై; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని రోషంగా గాలిదేవుడు మాట్లాడాడు. అతడితో ఆ బూరుగుచెట్టు ఇట్లా అన్నది. 'ఓ వెర్రివాడా! నీవు ఇంత గట్టిగా మాట్లాడుతున్నావు. నేను నీవు అన్నంత బలహీనుడనా? లోకంలోని మిగతా చెట్లవలె నన్నూ ఎంచకుము' అని అనగానే ఆ గాలిదేవుడూ ఆ మాటలను పెద్దగా లెక్కపెట్టకుండా మెల్లగా నవ్వుతూ ఈ విధంగా అన్నాడు.

క. 'ఒకనాఁ డజుండు నీ నీ। డకు డబ్బా టరుగుదెంచుటయు నమ్మే లా
త్మకు వ్రేగై మన్నించిన। మెకమెక పడితిట్ల పలుకుమీ తగరేపున్.' 392

ప్రతిపదార్థం: ఒకనాఁడు= ఒక దినం; అజుండు= బ్రహ్మ; నీ నీడకున్= నీ నీడపట్టుకు; డబ్బాటు= అనుకొనకుండా; అరుగుదెంచుటయున్= రావటమున్నూ; ఆ+మేలు= ఆ నీ ఉపకారం; ఆత్మకున్= మనస్సుకు; వ్రేగై= బరువై; మన్నించినన్= (నిన్ను) ఆదరించగా; మెకమెక పడితి(వి)= మిడిసి పడ్డావు; తగన్= ఒప్పేటట్లు; రేపున్= మరునాడు కూడా; ఇట్ల పలుకుమీ!= ఇట్లానే మాట్లాడు సుమా!

తాత్పర్యం: 'ఒకనాడు బ్రహ్మ అనుకొనకుండా నీ నీడపట్టుకు వచ్చాడు. ఆ ఉపకారం ఎంతో బరువుగా అనిపించి నిన్ను ఆదరించాడు. అందుకు నీవు మిడిసిపడ్డావు. రేపుకూడా ఇట్లాగే మాట్లాడుము'.

వ. అని పలికి బలుమొగంబుతోడం బోయిన నబ్బూరువు దలంకి. 393

ప్రతిపదార్థం: అని పలికి= అని మాట్లాడి; బలుమొగంబుతోడన్= కోపంతో; పోయినన్= గాలి వెళ్ళగా; ఆ బూరువు= ఆ బూరుగు చెట్టు; తలంకి= బెదరిపోయి.

తాత్పర్యం: అని మాట్లాడి గాలిదేవుడు కోపంగా వెళ్ళిపోయాడు. ఆ బూరుగు చెట్టు భయపడి - (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'మనుగడ దప్పు నొక్కొ! మునిమాటలు గైకొన నైతి; నా బలం
బన నది యెంత? యుగ్రత మహాబలురాకకు నోర్వఁ జాల; నా
తని నొక భంగి గెల్తు'నని తాఁ దలపోసి హరించె నాకులుం
గొనలును జొంపముల్ నిడుదకొమ్మలు రే యగుడున్ రయంబునన్. 394

ప్రతిపదార్థం: మనుగడ= నా ఉనికి; తప్పున్+ఒక్కొ!= కోల్పోతానో ఏమో!; ముని మాటలు= నారదముని వాక్కులు; కైకొనన్+ఐతిన్= లెక్కపెట్టకపోయాను; నా బలంబు= నా సత్తువ; అనన్= అనగా; అది+ఎంత?= అది ఎంతపాటిది?; ఉగ్రతన్= హోరుతో వచ్చే; మహాబలురాకకున్= గాలిదేవుడి రాకకు; ఓర్వఁజాలన్= తట్టుకొనలేను; ఆతనిన్= ఆ గాలిదేవుడిని; ఒక భంగిన్=

ఒక విధంగా అయితే; గెల్తున్= జయించగలుగుతాను (అని); అని= అని; తాన్= తాను; తలపోసి= ఆలోచించి; రే+అగుడున్= రాత్రి కాగానే; తాన్= తనకు తానుగా; రయంబునన్= తొందరగా; ఆకులున్= ఆకులను; కొనలును= చిన్న కొమ్మలను; జొంపముల్= ఆకులు మొదలగు వాటి గుబుర్లన్నీ; నిడుదకొమ్మలు= పొడవాటి కొమ్మలను; హరించెన్= విరిచేసికొన్నది.

తాత్పర్యం: నా ఉనికిని కోల్పోతానో ఏమో? నారదముని మాటలు చెవిని పెట్టకపోయాను. నా సత్తువ ఏపాటిది? హోరుమని వచ్చే గాలిదేవుడి రాకను నేను తట్టుకొనలేను. కాని, ఆతడిని ఒక విధంగా అయితే ఓడించగల నని ఆలోచించుకొన్నది. చీకటిపడిన తరువాత ఆకులను, కొమ్మలను, రెమ్మలను, గుబుర్లను, పొడవాటి కొమ్మలను తనకు తానే విరుచుకొన్నది.

వ. అట్లు తన్నుం దాన విఱుచుకొని యున్నంత వేగుటయు. 395

ప్రతిపదార్థం: అట్లు= అట్లా; తన్నున్ తాన= తనను తానే; విఱుచుకొని= త్రుంచుకొని; ఉన్నంతన్= ఉండగా; వేగుటయున్= తెల్లవారగా.

తాత్పర్యం: అట్లా తనకు తానే ఊడ్చుకొని మోడుగా ఉండగా తెల్లగ తెల్లవారింది.

చ. ప్రతినకు నీడుగా భయదభంగిఁ బ్రభంజనుఁ డేఁగుదెంచి యా
క్షితిరుహముం గనుంగొని 'యిసీ! యిది నా పని నీవ చేసి తీ
ధృతి మతి సంతసింపు మిట తేజముఁ బొందుము నీదు బాంధవ
ప్రతతికి నివ్విధంబు సదుపాయము మే లెఱిఁగింపు పెంపునన్.' 396

ప్రతిపదార్థం: ప్రతినకున్= శపథానికి; ఈడుగాన్= దీటుగా; భయద భంగిన్= భయం గొలిపేటట్లు; ప్రభంజనుఁడు= గాలిదేవుడు; ఏఁగుదెంచి= వచ్చి; ఆక్షితిరుహమున్= ఆ బూరుగుచెట్టును; కనుంగొని= చూచి; ఇసీ= ఛీ; ఇది= ఈ మోడురూపం; నా పని= నేను చేయాల్సిన పని; నీవ= నీవే; చేసితి(వి)= చేసికొన్నావు; ఈ ధృతిన్= ఇంతటి దిట్టతనంచేత; మతిన్= మనస్సులో; సంతసింపుము= సంతోషించుము; ఇట= ఈ పని చేసికొన్నందువలన; తేజమున్+పొందుము= వెలుగు వెలుగుము; నీదు బాంధవ ప్రతతికిన్= నీ చుట్ట పక్కాలందరికీ; ఈ+విధంబు= ఇది (ఈ మోడు బారటం అనేది); సదుపాయము= తగినసాధనం; మేలు= మంచిది అని; పెంపునన్= ఇంపుగా; ఎఱిగింపు(ము)= చాటి చెప్పుము.

తాత్పర్యం: తన ప్రతిజ్ఞకు దీటుగా భయంకరంగా గాలిదేవుడు రానే వచ్చాడు. ఆ బూరుగుచెట్టును చూచాడు. 'ఛీ! నేను చేయాల్సిన పనిని నీవే చేసికొన్నావు. ఇంతటి ధైర్యం చేశానని నీకు నీవే సంతోషపడుము. నీ చుట్ట పక్కాలందరికీ ఇదే తగిన సాధనం అనీ, మంచిపని అనీ చాటిచెప్పుము'.

వ. అని యుల్లసంబాడి సముల్లసద్గతి నా సదాగతి సనియెఁ; నట్లు శాల్మలి పవనుచేత భంగంబు నొంది వగం గుందెఁ; బ్రబలునితోడ దుర్బలుండు దొడరి మత్సరగ్రస్తుం డయిన నపాస్తవిభవుం డగు నని తెల్పు నప్పవన శాల్మలీ సంవాదంబు పుణ్యప్రదం బయిన యుపాఖ్యానం బని చెప్పిన. 397

ప్రతిపదార్థం: అని ఉల్లసంబు+ఆడి= అని ఎత్తి పొడుపు మాటలు పలికి; సముల్లసత్+గతిన్= మిక్కిలి సంతోషించిన గమనంతో; ఆ సదాగతి= ఆ గాలిదేవుడు; చనియెన్= వెళ్ళాడు; అట్లు= అట్లా; శాల్మలి= బూరుగు చెట్టు; పవను చేతన్= గాలిచేత;

భంగంబున్+ఒంది= అవమానపడి; వగన్= దుఃఖంతో; కుందెన్= కుంగిపోయింది; ప్రబలుతోడన్= మంచి బలవంతుడితో; దుర్బలుండు= బలహీనుడు; తొడరి= తలపడి; మత్సరగ్రస్తుండు+అయినన్= పగబట్టిన వాడయినట్లయితే; అపాస్త= కోల్పోయిన; విభవుండు+అగున్= సంపన్ను డవుతాడు; అని; పుణ్యప్రదంబు+అయిన= పుణ్యం ఇచ్చేటటువంటిది అయిన; ఆ పవన శాల్మలీ సంవాదంబు= ఆ గాలీ - బూరుగు చెట్టూ వాదులాట అనే; ఉపాఖ్యానంబు= కథ; తెల్పును= బోధిస్తుంది.

తాత్పర్యం: అని ఎత్తి పొడిచి, సంతోషంగా వీస్తూ గాలిదేవుడు వెళ్ళాడు. అట్లా ఆ బూరుగుచెట్టు గాలిదేవుడిచేత అవమానం పొందిన దుఃఖంతో కుమిలిపోయింది. మహాబలవంతుడితో బలహీనుడు తలపడి పగపెట్టుకొంటే తన వైభవాన్ని కోల్పోతాడు - అని పుణ్యదాయకం అయిన ఈ గాలీ-బూరుగు చెట్టు అనే కథ తెలుపుతుంది' అని చెప్పగానే - (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. పాండవాగ్రజుండు 'పాపంబునకు నధి । ష్ఠాన మెద్ది భరతసత్తమాగ్ర
గణ్య! దాని నెఱుఁగఁగాఁ జెప్పు' మనుడు నా । తనికి భీష్ముఁ డిట్టు లనియెఁ బ్రీతి. 398

ప్రతిపదార్థం: పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; భరతసత్తమ+అగ్రగణ్య!= భరతవంశపు ఉత్తములలో మొదటగ ఎన్నదగ్గ ఓ తాత!; పాపంబునకున్= పాపానికి; అధిష్ఠానము= మూలం; ఎద్ది?= ఏది?; దానిన్= దానిని; ఎఱుఁగఁగాన్= తెలిసేటట్లుగా; చెప్పుము= చెప్పుము; అనుడున్= అనగానే; ఆతనికిన్= ఆ ధర్మరాజుకు; భీష్ముఁడు= భీష్ముడు; ప్రీతిన్= సంతోషంతో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు, 'భరతవంశంలోని ఉత్తములలో మొదట ఎంచదగ్గ భీష్ముడా! పాపానికి మూలం ఏది? ఆ పాపం ఉండే స్థానమేదో తెలియచెప్పుము' అనగానే భీష్ముడు సంతోషంగా ఈ విధంగా చెప్పాడు.

సీ. 'వినుము పాపముల కెల్లను నధిష్ఠానంబు । లోభంబ; యది గామలోలతయును
గ్రోధంబు మత్సర ద్రోహంబులును బర । ధన దార వాంఛలు దైన్యపాటు
వ్రీడాక్షమాసత్య విముఖ భావంబును । గలిగించి ధర్మంబు గలఁచి నరునిఁ
బ్రయి మాలి యేమిటి కయినను గర్హించు । వానిఁగా సమకట్టుఁ గాన లుబ్ధ

ఆ. జనులఁ దొఱఁగి లోభ మను తిరిం బడని స । త్యవ్రతులను బరమధార్మికులను
బాపభీతమతులఁ బనిగొను లోభంబుఁ । జెంద నీకు నీదు చిత్త వృత్తి.' 399

ప్రతిపదార్థం: వినుము= వినుము; పాపములకున్+ఎల్లన్= అన్ని పాపాలకూ; అధిష్ఠానంబు= మూలం; లోభంబ= పేరాసయే; అది= ఆ పేరాస; కామలోలతయును= నిలకడతనం లేని కోరికలూ; క్రోధంబున్= కోపాన్ని; మత్సర ద్రోహంబులును= పగనూ హింసాతత్వాన్నీ; పరధన= మరొకరి ఆస్తిపట్ల; దార= మరొకరి పెళ్ళాం పట్ల; వాంఛలున్= కోరికలునూ; దైన్యపాటు= దీనత్వమున్నూ; వ్రీడా= సిగ్గుపట్ల; క్షమా= ఓర్పుపట్ల; సత్య= నిజంపట్ల; విముఖభావంబును= ఏవగింపునూ; కల్గించి= పుట్టించి; ధర్మంబు= న్యాయాన్ని; కలఁచి= (కలుషితంచేసి) చెరచి; నరునిన్= మానవుడిని; ప్రయిమాలి= నిందను లక్ష్యపెట్టకుండా; ఏమిటికిన్+అయినన్= ఎందుకయినా; గర్హించువానిఁగన్= పేరాసపడే వాడినిగా; సమకట్టున్= సిద్ధం చేస్తుంది; కానన్= కాబట్టి; లుబ్ధజనులన్= ఆశగలవారిని; తొఱఁగి= వదలి; లోభము+అను= పేరాస అనే; తిరిన్= సుడిలో; పడని= చిక్కుకోని; సత్య వ్రతులను= సత్యమే వ్రతంగా కలిగినవాళ్ళను; పరమధార్మికులను= మిక్కిలి పుణ్యాత్ములను; పాపభీతమతులన్= పాపం అంటేనే వణకిపోయే వారిని; పనిగొను=

నడిపే; లోభంబున్= పేరాసను; నీదు చిత్త వృత్తిన్= నీ మనోవ్యాపారాన్ని; చెంద నీకు= పొందనీయకు, అంటనీయకు.

తాత్పర్యం: 'ధర్మరాజా! పాపాలన్నిటికీ తావలం పేరాసే. అది కోరికలపట్ల నిలకడలేనితనాన్నీ, కోపాన్నీ, పగనూ, హింసాభావాన్నీ, మరొకరి ఆస్తి, మరొకరి పెళ్ళాంపట్ల కోరికనూ దీనత్వాన్నీ, సిగ్గు, ఓర్పు నిజాలపట్ల ఏవగింపునీ పుట్టిస్తుంది. న్యాయాన్ని చెరుస్తుంది. నిందలను లెక్కపెట్టకుండా ప్రతిదానికీ అత్యాశపడే వాడినిగా మనిషిని తయారు చేస్తుంది. కాబట్టి లోభులను విడిచిపెట్టాలి. లోభం అనే సుడిగుండంలో చిక్కుకొనని సత్యవ్రతులను, పుణ్యాత్ములను, పాపభీతులను వశంచేసికొనే లోభాన్ని నీ మనస్సును పొందనీయకుము'.

వ. అనిన విని యజాతశత్రుం 'డజ్ఞానం బాపదలకును దుర్గతికిని మూలం బని విందు; దాని తెఱం గెఱింగింపు' మనిన నాపగాతనయుం డమ్మనుజపతి కిట్లనియె. 400

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన; విని= ఆలకించి; అజాతశత్రుండు= పుట్టని పగవారుగల ధర్మరాజు; అజ్ఞానంబు= తెలియనితనం; ఆపదలకును= విపత్తులకు; దుర్గతికిని= చెడ్డనడతకూ; మూలంబు= ఆధారం; అని విందున్= అని వింటాను; దాని తెఱంగున్= దాని స్వభావాన్ని; ఎఱింగింపుము= తెలియ చెప్పుము; అనినన్= అనగానే; ఆపగాతనయుండు= భీష్ముడు; ఆ మనుజపతికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని ధర్మరాజు 'విపత్తులకూ, చెడునడతకూ అజ్ఞానమే ఆధారం అని విన్నాను. ఆ అజ్ఞానం తీరు తెన్నులను తెలుపుము' అనగానే భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

క. 'రోషము శోకము రాగ। ద్వేషము లభిమాన దర్ప వేగాలస్యా
శ్లేషము లజ్ఞాన మని మ। నీషి జనము సెప్పు మాననీయచరిత్రా! 401

ప్రతిపదార్థం: మాననీయ చరిత్రా!= మన్నించ దగ్గ నడవడి కలవాడా!; రోషము= కోపం; శోకము= దుఃఖం; రాగద్వేషములు= ప్రేమా పగలూ; అభిమాన= అహంకారం; దర్ప= పొగరూ; వేగ= తొందరపాటు; ఆలస్య= మందకొడితనం; శ్లేషములు= వీటి కలయికలు; అజ్ఞానము+అని= తెలియనితనం అని; మనీషి జనము= పండిత లోకం; చెప్పున్= చెప్తుతుంది.

తాత్పర్యం: 'కోపమూ, దుఃఖం, ప్రేమా, పగా, అహంకారం, గర్వం, తొందరపాటు, మందకొడితనం. వీటి సంపర్కమే అజ్ఞానం అని పండితులంతా చెప్తుతారు.

క. విను లోభము నజ్ఞానం। బును సదృశ ఫలప్రదములు; పుట్టును లోభం
బున నజ్ఞానము గావున। జననాయక! లోభముడుగ సౌఖ్యము లొందున్.' 402

ప్రతిపదార్థం: జననాయక!= రాజా!; వినుము= వినుము; లోభమున్= పేరాసా; అజ్ఞానంబును= తెలియని తనమూ; సదృశ ఫల ప్రదములు= సమాన ప్రయోజనాలను ఇచ్చేవే; లోభంబునన్= పేరాసచేత; అజ్ఞానము= అవివేకం; పుట్టును= పుట్టుతుంది; కావునన్= కాబట్టి; లోభము= పేరాస; ఉడుగన్= వదలగా; సౌఖ్యములు= భోగాలు; ఒందున్= పొందుతాయి.

తాత్పర్యం: పేరాసపడటం, తెలివి లేకపోవటం - ఈ రెండూ సమాన ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. లోభంవలన అజ్ఞానం పుట్టుతుంది. కాబట్టి ధర్మరాజా! లోభం వదలుకొంటే భోగాలు కలుగుతాయి'.

ఆ. అనిన ధర్మపుత్రుఁ 'డనఘ! ధర్మంబు నా। నా ప్రకారగతి వినంగఁబడు; మ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దీయ చిత్తమునకుఁ దేటపడంగ వి। శిష్ట ధర్మ మెద్ది సెప్పు' మనుడు. 403

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ధర్మపుత్త్రుఁడు= ధర్మరాజు; అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; ధర్మంబు= న్యాయం; నానా ప్రకారగతిన్= అనేక రకాలైన; విధానాలతో; వినంగబడున్= వినబడుతుంది (వాటిల్లో); విశిష్ట ధర్మము= ప్రధానమైన న్యాయం; ఎద్ది= ఏది; మదీయ చిత్తమునకున్= నా మనస్సుకు; తేటపడంగన్= తేటతెల్లమయ్యేటట్లు; చెప్పుము= చెప్పుము; అనుడున్= అనగానే.

తాత్పర్యం: భీష్ముడితో ధర్మరాజు ఇట్లా అన్నాడు. 'ఓ పుణ్యాత్ముడా! న్యాయాన్ని అనేకవిధాలుగా వింటుంటాం. వాటిల్లో ఉత్తమ ధర్మం ఏదో నాకు బాగా విశదమయ్యేటట్లు చెప్పవలసింది' అనగానే. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. ప్రియంబంది భీష్ముఁ డతనికి నిట్లనియె. 404

ప్రతిపదార్థం: ప్రియంబు+అంది= సంతోషాన్ని పొంది; భీష్ముఁడు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సంతోషంగా భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు దమంబు ప్రభావం బెఱింగించుట (సం.12-154-6)

క. 'తమతమ కలవడు విజ్ఞా। నముల తెరువు లాదరించి నానాగతులన్
సుమతులు ధర్మము తెలిపిరి;। దమము పరాయణము ధీరతమ! యన్నిటికిన్. 405

ప్రతిపదార్థం: ధీరతమ!= ధైర్యవంతులలో మేటి అయిన రాజా!; సుమతులు= పండితులు; తమతమకున్= వారి వారికి; అలవడు= అబ్బేటటువంటి; విజ్ఞానముల= ఆయా శాస్త్రాదుల జ్ఞానాల; తెరువులు= విధానాలు; ఆదరించి= మన్నించి; నానాగతులన్= ఎన్నో తీరులలో; ధర్మము= ధర్మాన్ని; తెలిపిరి= విశదపరిచారు; అన్నిటికిన్= అన్ని ధర్మాలకు; దమము= ఇంద్రియనిగ్రహం; పరాయణము= ఉత్తమమైన ఆశ్రయం.

తాత్పర్యం: 'ధైర్యవంతులలో మేటివైన ధర్మరాజా! పండితులు తాము తెలిసికొన్న శాస్త్రజ్ఞానాన్నిబట్టి ఎన్నో విధాలుగా ధర్మాన్ని గూర్చి తెలిపారు. ఈ ధర్మాలన్నిట్లోకి దమం ఉత్తమమైనది.

తే. దమము నిశ్రేయసము, పుణ్యతమము, ధర్మ। సార; మది వెలిగా ధర్మసంచయంబు
సిద్ధి పొందునె? దమముతో బుద్ధిపొందు। గనినఁ బొందని యున్నతుల్ గలవె? యధిప! 406

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; దమము= ఇంద్రియ నిగ్రహం; నిశ్రేయసము= ముక్తిదాయకం; పుణ్యతమము= గొప్ప పుణ్యం; ధర్మసారము= ధర్మాలలోని నిగ్గు; అది వెలిగాన్= ఆ దమం లేకుండా; ధర్మసంచయంబు= పుణ్యాలమూట; సిద్ధి పొందునె?= సాధ్యమవుతుందా?; దమముతోన్= ఇంద్రియ నిగ్రహంతో; బుద్ధి= జ్ఞానం; పొందు కనినన్= కూడుకొంటే; పొందని+ఉన్నతుల్= కలగని మీది దశలు; కలవె?= ఉంటాయా?

తాత్పర్యం: దమము ముక్తిదాయకం. గొప్ప పుణ్యం. ఇది ధర్మాలలోని నిగ్గు. ఇది లేకుండా పుణ్యాలమూట దొరుకుతుందా? దమానికి జ్ఞానం తోడైతే అందుకోలేని ఉన్నతదశ లుంటాయా? (ఉండవు.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. దమముం గడచిన సద్ధ । ర్మము లేదని వింటు; నాశ్రమము లన్నిటికిన్
దమవంతుఁడు గామముఁ గ్రో । ధము లోభము మత్సరంబు దర్పము గెల్చున్. 407

ప్రతిపదార్థం: ఆశ్రమములు+అన్నిటికిన్= బ్రహ్మచర్య, గృహస్థ, సన్న్యాస, వానప్రస్థాది ఆశ్రమాలన్నిటికీ; దమమున్= ఇంద్రియ నిగ్రహాన్ని; కడచిన= మించిన; సద్ధర్మము= మంచి ధర్మం; లేదని విందున్= లేదని విన్నాను; దమవంతుఁడు= నిగ్రహం కలవాడు; కామమున్= కోరికనూ; క్రోధమున్= కోపాన్నీ; లోభమున్= పేరాసనూ; మత్సరంబున్= పగనూ; దర్పమున్= మదాన్నీ; గెల్చున్= జయిస్తాడు.

తాత్పర్యం: ఆశ్రమాలు నాలుగింటిలో ఇంద్రియనిగ్రహాన్ని మించిన మంచి ధర్మం లేదని విన్నాను. ఇంద్రియ నిగ్రహం కలవాడు కామ క్రోధ లోభ మద మాత్సర్యాలను జయిస్తాడు.

క. శీలంబు మైత్రి కరుణ య । లోలుపభావము తితిక్ష లోనగు మునిలో
కాలంబనీయ సద్గుణ । జాలంబు దమంబు రూపసంపద యధిపా! 408

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; దమంబు= ఇంద్రియ నిగ్రహం; శీలంబు= నడవడి; మైత్రి= చెలిమి; కరుణ= జాలి; అలోలుపభావము= పేరాస లేకపోవటం; తితిక్ష= ఓరిమి; లోనగు= మొదలైన; మునిలోక= మునులు మొత్తం; ఆలంబనీయ= ఆశ్రయించదగ్గ; సద్గుణ= మంచిస్వభావాల; జాలంబు= సమూహం; రూపసంపద= ఆకార సంపత్తి.

తాత్పర్యం: ఓ రాజా! ఈ దమము, నడవడి, చెలిమి, జాలి, పేరాస లేకపోవటం, ఓర్పు మొదలైన మునులందరిని ఆశ్రయించి ఉన్న మేలుగుణాల సమూహానికి ఊత. రూపసంపత్తి.

క. గుహయందు నిహిత మనియెడు । మహనీయ బ్రహ్మపదము మహిత దమత్వో
పహితుం డగువానికి స । న్నిహితం బని చెప్పుదురు మనీషిజనంబుల్.' 409

ప్రతిపదార్థం: గుహయందున్= హృదయంలో; నిహితము= దాచి ఉంచబడినది; అనియెడు= అనేటి; మహనీయ బ్రహ్మపదము= పరమబ్రహ్మపదం; మహితదమత్వ= పూజించదగ్గ ఇంద్రియ నిగ్రహంతో; ఉపహితుండు+అగు వానికిన్= కూడి ఉన్నవాడికి; సన్నిహితంబు= చేరువగా ఉంటుంది; అని; మనీషిజనంబుల్= పండితులు; చెప్పుదురు= చెప్తుతారు.

తాత్పర్యం: పరమబ్రహ్మపదం హృదయంలో దాగి ఉన్నదంటారు. అది ఇంద్రియనిగ్రహం కలవాడికి మరింత దగ్గరవుతుందంటారు పండితులు'.

వ. అని విశదంబుగా వివరించె. 410

ప్రతిపదార్థం: అని= అని; విశదంబుగాన్= వివరంగా; వివరించెన్= తెల్లం చేశాడు.

తాత్పర్యం: అని విశదపరిచాడు.

ఆ. అట్లు దమము మహిమ యాదరంబున విని, । యమృతసేవ సేసినట్ల పోలె
హర్షమయ మనస్కుఁడై భీష్ము నడిగె నా । ధర్మనందనుండు తపము విధము. 411

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; దమము మహిమ= ఇంద్రియ నిగ్రహం యొక్క; గొప్పతనాన్ని; ఆదరంబునన్= మన్ననతో; విని= ఆలకించి; అమృతసేవ= అమృతపానం; చేసినట్లపోలె= చేసినట్లుగానే; హర్షమయ= ఆనందంతో నిండిన; మనస్కుఁడు+ఐ=

మనస్సు కలవాడై; ఆ ధర్మనందనుండు= ఆ యమధర్మరాజు కొడుకు ధర్మరాజు; భీష్మన్= భీష్ముడిని; తపము విధమున్= తపస్సు తీరును; అడిగెన్= అడిగాడు.

తాత్పర్యం: అట్లా దమం ప్రభావాన్ని ఎంతో గౌరవంగా విన్న ధర్మరాజు అమృతం త్రాగినంతగా ఆనందించాడు. తపస్సు తీరునూ తెల్పుమని భీష్ముడిని అడిగాడు.

వ. అడిగిన నతం డతని కిట్లనియె. 412

ప్రతిపదార్థం: అడిగినన్= అడుగగా; అతండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

భీష్ముఁడు ధర్మరాజునకుఁ దపంబు విధము సెప్పుట (సం. 12-155-1)

క. తపము నిదానము ధర్మ। ప్రపంచమున కెల్ల; దానిఁ గ్రమమున వ్రతతం
త్రపరాయణు లొనరింతు ర। ధిప! ఫలమూలాంబువృత్తిఁ దృప్తిఁ బొరయుచున్. 413

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ధర్మ ప్రపంచమునకున్+ఎల్లన్= ధర్మం తీరులలో కెల్లా; తపము= తపస్సు; నిదానము= మూలకారణం; దానిన్= ఆ తపస్సును; వ్రత తంత్ర పరాయణులు= వ్రతాలు చేయాలనే కోరికగలవారు; ఫల= పళ్ళూ; మూల= కందమూలాలు తిని; అంబు= నీళ్ళుత్రాగే; వృత్తిన్= బతకటంవలన; తృప్తిన్= తనివిని; పొరయుచున్= పొందుతూ; క్రమమునన్= వరసగా; దానిన్= ఆ తపస్సును; ఒనరింతురు= చేస్తారు.

తాత్పర్యం: 'రాజా! ధర్మాలన్నిటికీ తపస్సే మూలం. వ్రతాలు శ్రద్ధగా చేయాలనుకొనే వారు పళ్ళూ కందమూలాలు తింటూ నీళ్ళు తాగుతూ తృప్తిగా బ్రతుకుతుంటారు. క్రమం తప్పకుండా తపస్సు చేస్తుంటారు.

క. విను మశన నిగ్రహము దప। మను నభిధానంబు గల మహాధర్మము త
ద్ధనవంతు చిత్తవశగతిఁ। జను నఖిల స్థావరములు జంగమతతులున్. 414

ప్రతిపదార్థం: వినుము= వినుము; అశన నిగ్రహము= మితమైన తిండి; తపము= తపస్సు; అను+అభిధానంబు+కల= అనేపేరుగల; మహాధర్మము= గొప్ప పుణ్యం; అఖిల స్థావరములు= కదలకుండా ఉండే పుట్టలూ చెట్లూ మొదలగునవన్నీ; జంగమ తతులున్= కదిలేవన్నీ; తద్+ధనవంతు= ఆ తపస్సంపన్నుడి; చిత్తవశగతిన్= మనస్సుకులోబడి; చనున్= నడచుకొంటాయి.

తాత్పర్యం: ఆహారనియమమే తపస్సు. అదే మహాధర్మం. ఆ తపస్సంపన్నుడి ఇష్టప్రకారం సమస్త చరాచరవస్తు సముదాయమూ నడచుకొంటుంది.

తే. పంచవిధవృత్తులగు మహాపాతకములు। లోనుగాఁ గిల్బిషము లెల్ల లుంఠితంబు
లగుఁ దపంబున సత్యశౌచాదు లొలయు। నఖిలసిద్ధులు నఱచేత నావహిల్లు. 415

ప్రతిపదార్థం: తపంబునన్= తపస్సుచేత; పంచవిధ వృత్తులు+అగు= ఐదు రకాలైన; మహాపాతకములు= గొప్ప పాపాలు; లోనుగాన్= మొదలుగా గల; కిల్బిషములు+ఎల్లన్= దోషాలన్నీ; లుంఠితంబులు+అగున్= పటాపంచలయిపోతాయి; సత్యశౌచాదులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిజాయితీ, శుచి మొదలైనవి; ఒలయున్= పొందుతాయి; అఖిలసిద్ధులున్= అన్ని ప్రయోజనాలు; అఱచేతన్+ఆవహిల్లున్= సులభంగా అందుబాటులోకి వస్తాయి.

తాత్పర్యం: తపస్సువలన పంచ మహాపాతకాలు మొదలైన పాపాలన్నీ పటాపంచలవుతాయి. సత్యం, శుచి మొదలైనవి అలవడతాయి. సమస్త కార్యసిద్ధులూ అందుబాటులోకి వస్తాయి'.

వ. అనిన విని 'దేవ పితృ భూదేవగణంబులు సత్యంబు ప్రశంసించుఁ దదీయ స్వరూపంబును నది దొరకొను తెఱంగును నెఱింగింపు'మని యడిగిన నజాతశత్రునకు శంతనుపుత్త్రుం డిట్లనియె. 416

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; దేవ= దేవతలు; పితృ= పితృదేవతల; భూదేవ= బ్రాహ్మణుల; గణంబులు= సమూహాలు; సత్యంబున్= సత్యాన్ని; ప్రశంసించున్= పొగడుతాయి; తదీయ స్వరూపంబునున్= ఆ సత్యస్వభావాన్నీ; అది= ఆ సత్యం; దొరకొను తెఱంగునున్= పొందే విధానాన్నీ; ఎఱింగింపుము= తెలియచెప్పుము; అని అడిగినన్= అని అడుగగా; అజాత శత్రునకున్= ధర్మరాజుకు; శంతను పుత్త్రుండు= శంతను మహారాజు కొడుకు భీష్ముడు; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అవన్నీ విన్న ధర్మరాజు 'దేవతలూ, పితృదేవతలూ బ్రాహ్మణులూ మొదలైన వారంతా సత్యాన్ని మెచ్చుకొంటారు. దాని స్వరూపాన్నీ, దానిని అవలంబించే తీరునూ చెప్పుము' అన్నాడు. అపుడు భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

భీష్ముఁడు ధర్మరాజుకు సత్య స్వరూపాదులు సెప్పుట (సం. 12-156-3)

క. సమతయు దమముఁ దితిక్షయు । నమత్సరము హ్రీయు ధృతియు ననసూయార్య
త్వములు నహింసా దాన । క్షమా యజన సూనృతములు సత్యము మూర్తుల్. 417

ప్రతిపదార్థం: సమతయున్= సర్వభూతాలపట్ల సమభావమున్నూ; దమమున్= ఇంద్రియ నిగ్రహమున్నూ; తితిక్షయున్= ఓర్పూ; అమత్సరమున్= పగలేకపోవటమున్నూ; హ్రీయున్= సిగ్గూ; ధృతియున్= ధైర్యమూ; అనసూయ= సద్గుణాలపట్ల ఈర్ష్యలేకపోవటం; ఆర్యత్వములున్= జీవకోటికి శుభం కలిగించటం; అహింసా= హింస చేయకపోవటం; దాన= ఇవ్వటం; క్షమా= ఓర్పు; యజన= యాగం చేయటం; సూనృతములు= నిజాయితీ; సత్యము మూర్తుల్= సత్యంయొక్క రూపాలు.

తాత్పర్యం: అన్ని ప్రాణులపట్ల సమత, ఇంద్రియ నిగ్రహం, ఓర్పు, పగలేకపోవటం, సిగ్గు, ధైర్యం, ఈర్ష్యలేకపోవటం, ప్రాణులకు మేలు చేయటం, హింసకు ఒడిగట్టకపోవటం యాగం చేయటం దానం, ఓర్మి, నిజాయితి - ఇవీ సత్యం స్వరూపాలు.

క. సత్యాకృతు లగు గుణములు । నిత్యానుష్ఠిత సమగ్ర నిర్మలయోగ
స్థిత్యభిముఖునకు సులభము । లత్యంత సుఖప్రదంబు లవి కార్యంబుల్. 418

ప్రతిపదార్థం: సత్య+ఆకృతులు+అగు= సత్యం రూపాలైన; గుణములు= పదమూడు స్వభావాలు; నిత్య+అనుష్ఠిత= ఎల్లప్పుడూ ఆచరించే; సమగ్ర= సంపూర్తిగా; నిర్మల= పవిత్రమైన; యోగస్థితి= ధ్యానదశకు; అభిముఖునకున్= అనుకూలుడైనటువంటి వాడికి; సులభములు= తేలికగా దొరికేవి; అత్యంత సుఖప్రదంబులు= ఎంతో సుఖాన్నిస్తాయి; అవి= ఆ సత్యాకృతి గుణాలు; కార్యంబుల్= చేయాల్సినవి.

తాత్పపర్యం: సత్యం రూపాలైన గుణాలు ఎల్లప్పుడూ ఆచరించే సంపూర్ణ ధ్యానస్థితికల యోగికి తేలికగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అబ్బుతాయి. అవి ఎంతో సుఖాన్ని ఇస్తాయి. కాబట్టి ఆ గుణాలను ఆచరించాలి.

చ. కుదురు సమస్త ధర్మములకున్ విను సత్యము; యోగమోక్ష స
త్పదములు సత్యకార్యములు; పాప మసత్యముకంటె నొండు లే
దు; దలఁప నశ్వమేధములు దొమ్మిది నూఱులు వెండి నూఱునై
యొదవిన నీడు గావు భరతోత్తమ! సత్యముతోడ నారయన్. 419

ప్రతిపదార్థం: భరత+ఉత్తమ!= భరతవంశీకులలో ఉన్నతుడా!; విను= వినుము; సత్యము= సత్యం; సమస్త ధర్మములకున్= అన్ని ధర్మాలకు; కుదురు= ఆధారం, ఆలవాలం; యోగమోక్ష సత్పదములు= యోగం, మోక్షం అనే పుణ్యస్థానాలు; సత్యకార్యములు= సత్యంవలన నెరవేరే పనులు; తలఁపన్= ఆలోచించగా; అసత్యము కంటెన్= అబద్ధంకంటె; పాపము= కీడు; ఒండు లేదు= మరొకటి ఉండదు; ఆరయన్= విచారించగా; అశ్వమేధములు= అశ్వమేధయాగాలు; తొమ్మిది నూఱులు= తొమ్మిది వందలు; వెండి= మళ్ళీ; నూఱును+ఐ= వందయై; ఒదవినన్= చేస్తే; సత్యముతోడన్= ఒక్క సత్యంతో; ఈడు+కావు= సాటిరావు.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. సత్యం అన్ని ధర్మాలకూ పాదువంటిది. యోగమోక్షాలనే పుణ్యస్థానాలు సత్యంవలనే ఒనగూడుతాయి. అబద్ధాన్ని మించిన కీడు మరొకటి ఉండదు. ఆలోచిస్తే ఒక్క సత్యంతో వెయ్యి అశ్వమేధయాగాలు చేసిన ఫలం కూడా సాటిరాదు'.

వ. అనిన విని ధర్మతనయుం 'డరిషడ్వర్గం బేమిట నుదయించు? నెట్లు సమయు? నెఱింగింపవే? యనుటయు ననిమిష నదీనందనుండు ధర్మనందనున కిట్లనియె. 420

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; ధర్మతనయుండు= ధర్మరాజు; అరిషడ్వర్గంబు= అంతశ్శత్రు జాతికి చెందిన కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే ఆరూ; ఏమిటన్= దేనివలన; ఉదయించున్?= పుట్టుతాయి?; ఎట్లు= ఎట్లా; సమయున్?= సమసిపోతాయి?; ఎఱింగింపవే= తెలుపవా; అనుటయున్= అనగానే; అనిమిష నదీనందనుండు= దేవనది అయిన గంగానది కొడుకు భీష్ముడు; ధర్మనందనునకున్= ధర్మరాజుతో; ఇట్లు= ఇట్లా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అది విన్న ధర్మరాజు 'కామ క్రోధాది అరిషడ్వర్గాలు దేనివలన పుట్టుతాయో, దేనివలన గిట్టుతాయో తెలుపుము' అని అడిగాడు. భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పటం మొదలు పెట్టాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు అరిషడ్వర్గాదులు దెలుపుట (సం. 12-157-3,4)

సీ. 'మనుజేంద్ర! సంకల్పమునఁ బుట్టుఁ గామంబు । రూపఱు దేహ నిరూపణమునఁ
బరులదోషంబునఁ బ్రభవించుఁ గ్రోధము । క్షీణక్షమాయుక్తిఁ జేసి పొలియు
భూతాస్థిరత్వంబు బుద్ధిఁ గానమి లోభ । మనఘ! జనించుఁ గాంచిన నడంగు
నజ్ఞానమున మోహమావహిల్లు నధర్మ । లేపవర్జనమున లేక తక్కుఁ

తే. గులమునను విద్యధనమునఁ గలుగు మదము । మరలి వాని పెంపూహింప మ్రందిపోవు
సాత్త్వికుఁడు గామిఁ బొడము మాత్సర్య మదియుఁ । జెడుఁ గురూత్తమ సాధు సంసేవనమున. 421

ప్రతిపదార్థం: అనఘ= పుణ్యవంతుడా!; మనుజ+ఇంద్ర!= రాజా!; సంకల్పమునన్= మనోభావనచేతనే; కామంబు= కోరిక; పుట్టున్= కలుగుతుంది; దేహనిరూపణమునన్= దాని స్వరూపాన్ని తెలిసికొంటే; రూపు+అఱున్= నశించిపోతుంది; క్రోధము= రోషం; పరుల దోషంబునన్= ఇతరులు చేసిన తప్పువలన; ప్రభవించున్= పుట్టుతుంది; అక్షీణ= తగ్గని; క్షమాయుక్తిన్+చేసి= ఓర్పు కలిగి

ఉండటంవలన; పొలియున్= పోతుంది; లోభము= అత్యాశ; భూత+అస్థిరత్వంబు= జీవులు ఎప్పుడూ ఉండేవి కావనే; బుద్ధిన్+కానమి= తెలిసికొనలేకపోవటం వలన; జనించున్= కలుగుతుంది; కాంచినన్= ఆ జ్ఞానం ఉంటే; అడంగున్= అణగారి పోతుంది; మోహము= మోహం; అజ్ఞానమునన్= అవివేకంవలన; ఆవహిల్లున్= కలుగుతుంది; అధర్మ= అధర్మం అనే; లేప వర్జనమునన్= పూతను తొలగించటంవలన; లేక తక్కున్= రూపు మాసిపోతుంది; కులమునను= కులంవలన; విద్య= చదువువలన; ధనమునన్= ధనంవలన; మదము= పొగరు; కల్గున్= కలుగుతుంది; మరలి= తిరిగి; వాని పెంపు= వాటి పెరుగుదలను; ఊహింపన్= తలపోయగా; గ్రుందిపోవున్= దిగిపోతుంది; కురు+ఉత్తమ!= కురువంశంలో శ్రేష్ఠుడా!; సాత్త్వికుఁడు+కామిన్= సత్త్వగుణం లేని వాడవటంవలన; మాత్సర్యము= ద్వేషం; పొడమున్= పుట్టుతుంది; అదియున్= అదికూడా; సాధు సంసేవనమునన్= మంచివాళ్ళను కొలవటంవలన; చెడున్= పోతుంది.

తాత్పర్యం: 'రాజా! మనోభావంవలన కామం పుట్టుతుంది. దాని రూపం ఇట్లాంటిది అని తెలిసికొనగలిగితే ఆ కోరిక పోతుంది. ఇతరులు చేసిన తప్పువలన కోపం వస్తుంది. తరగని ఓర్పువలన అది తగ్గిపోతుంది. ప్రాణికోటి శాశ్వతం కాదు అనే తెలివి లేకపోవటంవలన లోభం పుట్టుతుంది. ఆ తెలివి పొందితే అది పోతుంది. అవివేకంవలన మోహం కలుగుతుంది. అధర్మం జోలికి పోకుంటే అది నశిస్తుంది. కులం, చదువూ, సంపదలవలన గర్వం ఏర్పడుతుంది. వాటి పెంపుదలను తలపోస్తే అదే దూరమవుతుంది. సాత్త్వికగుణం కొరవడటంవలన పగ పుట్టుతుంది. మంచివాళ్ళను సేవించటంవలన అది తొలగుతుంది.

క. ఈ యాఱింటను సకలా । పాయంబులు మానవులకుఁ బాటిలు; వీనిం
బాయంగ జడియనోపిన । ధీయుతునకు శుభము సద్గతియు సమకూరున్. 422

ప్రతిపదార్థం: ఈ+ఆఱింటను= ఈ ఆరింటివలన; సకల= అన్ని; అపాయంబులు= చెరుపులు; మానవులకున్= మనుష్యులకు; పాటిలున్= కలుగుతాయి; వీనిన్= ఈ కామాదులు ఆరింటిని; పాయంగన్= వదులుకొనటానికి; జడియన్+ఓపిన= భయపెట్టజాలిన; ధీయుతునకున్= బుద్ధిమంతుడికి; శుభము= మేలు; సద్గతియున్= ఉత్తమలోకమున్నూ; సమకూరున్= కలుగుతాయి.

తాత్పర్యం: కామం మొదలైన ఈ అరిషడ్వర్గాలవలన మనుష్యులకు అన్ని రకాల చెరుపులు కలుగుతుంటాయి. వీటిని వదలగొట్టుకొనేటట్లు జడుపు పుట్టించగల బుద్ధిమంతుడికి మంచి జరుగుతుంది. ఉత్తమ లోకం సిద్ధిస్తుంది.

క. ఇవి దోఁడేళుల భంగిం । గవియుఁ బురుషు ధైర్యహానిఁ గనికొని; ధైర్యం
బవలంబించిన నరుఁ జే । రవు; వీనికి నిదియ తెఱఁగు రాజవరేణ్యా! 423

ప్రతిపదార్థం: రాజవరేణ్యా!= రాజోత్తమా! ఇవి= ఈ ఆరూ; ధైర్య= దిట్టతనం; హానిన్+కనికొని= తగ్గిపోవటం చూసి; తోఁడేళుల భంగిన్= తోడేళ్ళవలె; కవియున్= చుట్టుముట్టుతాయి; ధైర్యంబున్= తెగువతనాన్ని; అవలంబించిన= ఊతచేసికొన్న; నరున్= మానవుడిని; చేరవు= పొందవు; దీనికిన్= ఈ అరిషడ్వర్గానికి; ఇదియ= ఇదే; తెఱఁగు= పద్ధతి.

తాత్పర్యం: ధర్మరాజా! మనిషిలో ధైర్యం కొరవడిం దనిపిస్తే చాలు - ఈ ఆరూ కూడా తోడేళ్ళవలె కలబడతాయి. ధైర్యవంతుల దరిదాపులకు మాత్రం రావు. ఇదీ వీటి సంగతి.

తే. అధిప! యివి ధార్తరాష్ట్రులయందుఁ జాలఁ । గలిగియుండు; నీ బుద్ధి నొక్కండుఁ జొరదు;
సారధీరతా సంప దుదారమతివి । గాన యింకను నిర్జింతు వీని నెల్ల. 424

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఇవి= ఈ అరిషడ్వర్గాలు; ధార్తరాష్ట్రులయందున్= ధృతరాష్ట్రుడి సంతానంలో; చాలన్= ఎక్కువగా; కలిగి+ఉండున్= పొంది ఉన్నాయి; నీ బుద్ధిన్= నీ మతిలో; ఒక్కండున్= ఒక్కటి అయినా; చొరదు= దూరదు; సార= మేటి అయిన; ధీరతాసంపద్= దిటవు అనే సంపదచే; ఉదారమతివి= గొప్ప బుద్ధి కలవాడవు; కాన= కాబట్టి; ఇంకను= ఇకపై; వీనిన్+ఎల్లన్= కామక్రోధాది శత్రువులు ఆరింటినీ; నిర్జింతు(వు)= జయిస్తావు.

తాత్పర్యం: ధర్మరాజా! ధృతరాష్ట్రుడి కొడుకులలో ఈ ఆరుగుణాలూ ఎక్కువ. వీటిలో ఏ ఒక్కటీ నీలో చొరబడదు. నీవు ధైర్యసంపదచేత గొప్పబుద్ధిమంతుడవు. కాబట్టి నీవు ఈ ఆరింటిని గెలుస్తావు.

వ. అని వెండియు. 425

తాత్పర్యం: అని మళ్ళీ భీష్ముడు.

క. హింసావిహారి యైన నృ। శంసుం డీ యాఱుఁ గలుగు జనుకంటెను గీ
డంసప్రదేశలలితో। త్తంసీ కరణోపలాల్య ధరణీ వలయా! 426

ప్రతిపదార్థం: అంసప్రదేశ= భుజాలపై; లలిత= మనోహరమై ఉన్న; ఉత్తంసీకరణ= సిగబంతి చేయటం చేత; ఉపలాల్య= లాలించబడుతున్న; ధరణీవలయా!= భూమండలం కలవాడా!; హింసావిహారి+ఐన= ఎపుడూ హింసతో ప్రవర్తించే; నృశంసుండు= క్రూరుడు; ఈ ఆఱున్+కలుగు= ఈ కామక్రోధాదులు ఆరూ ఉన్న; జనుకంటెను= మనిషికంటె; కీడు= చెడ్డవాడు.

తాత్పర్యం: భుజాలమీద మనోహరమైన సిగబంతిగా లాలించబడుతున్న భూమండలం గల ధర్మరాజా! హింసా ప్రవృత్తితో బ్రతికేవాడు ఈ ఆరు గుణాలు కలవారిని మించిన చెడ్డవాడు.

క. మే లనుభవించుఁ జుట్టము। లాలోకింపంగఁ గుజనుఁ డదియు నృశంసా
శీలమ; పంచి కుడుచు నతఁ। డే లోకంబుననుఁ బేర్మి యెసఁగ సుఖించున్.' 427

ప్రతిపదార్థం: కుజనుఁడు= చెడ్డవాడు; చుట్టములు= బంధువులు; ఆలోకింపంగన్= చూస్తుండగా; మేలు+అనుభవించున్= హాయిగా బ్రతుకుతాడు; అదియున్= అట్లా సుఖించటం కూడా; నృశంసాశీలము+అ= క్రూరస్వభావమే; పంచి= నలుగురికీ పెట్టి; కుడుచు+అతఁడు= తాను తినేవాడు; ఏలోకంబుననున్= ఏ లోకంలో అయినా; పేర్మిఎసఁగన్= మరింత గౌరవం పెరగగా; సుఖించున్= సుఖపడతాడు.

తాత్పర్యం: ఇట్లాంటి పాపాత్ముడు చుట్టూ చుట్టాలు చూస్తుండగానే, తాను ఒక్కడే హాయిగా బ్రతుకుతాడు. అట్లా సుఖించటం కూడా క్రూరస్వభావమే. ఉన్నంతలో నలుగురికీ పెట్టి తానూ తినేవాడు ఇహలోకంలో అయినా పరలోకంలో అయినా మరింత గౌరవం పొందుతాడు, సుఖపడతాడు'.

వ. అని చెప్పి వెండియు. 428

ప్రతిపదార్థం: అని= అని; చెప్పి= పలికి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ.

ఆ. 'విను కుటుంబ భృత్యజన జీవనంబుఁ ద్రి। వర్షములకుఁ గల్గువాఁడు నధిక
మొదవినట్టి యతఁడు నుర్వీశ! యర్హులు। మాననీయ సోమ పానమునకు. 429

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ!= రాజా!; విను= వినుము; కుటుంబ భృత్యజన= కుటుంబమూ, సేవకులా; జీవనంబున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జరుగుబాటు; త్రివర్షములకున్= మూడేళ్ళదాకా; కల్గువాఁడును= ఉన్నవాడూ; అధికము= అంతకంటె ఎక్కువ; ఒదవిన+అట్టి+అతఁడును= కలిగినవాడూ; మాననీయ= గౌరవించదగ్గ; సోమ పానమునకున్= యాగం చేసి తాగే సోమపానానికి; అర్హులు= తగ్గవారు.

తాత్పర్యం: 'కుటుంబీకుల, సేవకుల జరుగుబాటుకొరకు మూడేళ్లపాటు సరిపడేటంతగాని, అంతకంటె మించిన స్థితిమంతుడు కాని యాగం చేసి త్రాగే సోమపానానికి అర్హుడు.

క. క్రతువు లొనరించు భూసుర। తతికిఁ గ్రియాశేష యోగదానాదులు దు
ర్గతిఁ గొఱఁత వడిన ధరణీ। పతి నెఱపఁగవలయు వానిఁ బరికించి తగన్. 430

ప్రతిపదార్థం: క్రతువులు= యాగాలు; ఒనరించు= చేసే; భూసురతతికిన్= బ్రాహ్మణుల వర్గానికి; క్రియా శేష= పూర్తికాకుండా మిగిలిపోయిన పనులను; యోగ= సంబంధించిన; దానాదులు= దానం మొదలైనవి; దుర్గతిన్= బీదతనంచేత; కొఱఁతవడినన్= లోటువస్తే; వానిన్= వాటిని (ఆ లోటును); పరికించి= పట్టిచూచి; తగన్= ఒప్పేటట్లు; ధరణీపతి= రాజు; నెఱపఁగ వలయున్= ఆచరించాలి (పూర్తిచేయాలి).

తాత్పర్యం: పూర్తికాకుండా నిలిచిపోయిన బ్రాహ్మణుల యాగక్రియలకు సంబంధించిన దానాదుల విషయంలోనూ, బీదరికంవలన లోటు కలిగితేనూ రాజు దానికి తగ్గట్టుగా ఆలోచించి ఆ యాగక్రియలు పూర్తిచేయాలి.

క. ధనధాన్య పశు సమగ్రుం। డనఁ బరఁగెడునట్టి వైశ్యుఁ డధ్వరముం జే
యనినాఁడు బ్రాహ్మణాధ్వర। మునకు నతని సొమ్ము రాజు పుచ్చి యిడఁదగున్. 431

ప్రతిపదార్థం: ధనధాన్య పశు= ధనధాన్యాలచేతను, పశుసంపదచేతను; సమగ్రుండు+అనన్= సంపూర్ణుడు అనేటట్లు; పరఁగెడు+అట్టి= ఒప్పేటటువంటి; వైశ్యుఁడు= కోమటివాడు; అధ్వరమున్= యాగాన్ని; చేయనినాఁడు= చేయనప్పుడు; అతని సొమ్మున్= ఆ వైశ్యుడి ధనాన్ని; పుచ్చి= గ్రహించి; రాజు= ప్రభువు; బ్రాహ్మణ+అధ్వరమునకున్= బ్రాహ్మణులు చేసే యాగానికి; ఇడన్= ఇవ్వటం; తగున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: ధనం, ధాన్యం, పశుసంపద దండిగా ఉన్న కోమటి యాగం తలపెట్టకపోతే ఆ సొమ్మునంతా రాజు గ్రహించి బ్రాహ్మణులయాగానికి దానం చేయవచ్చును.

క. కుడువక పెట్టక శూద్రుఁడు। కడునెక్కుడు గూర్చినట్టి కనకముఁ గొలుచుం
బుడమిపతి ధర్మకృతులకు। నిడునది సగము గొని మేదినీశ్వరవర్యా! 432

ప్రతిపదార్థం: మేదినీ+ఈశ్వర వర్యా!= రాజులలో ఉత్తముడా!; శూద్రుఁడు= శూద్రజాతివాడు; కుడువక= తాను తినక; పెట్టక= ఇంకొకరికి ఇవ్వక; కడున్+ఎక్కుడు= ఎంతో ఎక్కువగా; కూర్చిన+అట్టి= కూడబెట్టుకొన్నట్టి; కనకమున్= బంగారాన్నీ; కొలుచున్= ధాన్యాన్నీ; పుడమిపతి= రాజు; సగము+కొని= సగం తీసుకొని; ధర్మకృతులకున్= పుణ్యకార్యాలకు; ఇడునది= ఇవ్వాలి.

తాత్పర్యం: రాజా! శూద్రజాతివాడు తాను తినక, వేరొకరికి పెట్టక, బాగా ఎక్కువగా బంగారాన్నీ ధాన్యాన్నీ పోగేసినట్లైతే వాటిల్లో సగం రాజు పుచ్చుకొని పుణ్యకార్యాలకు వాడాలి.

క. విను విప్రులు పేద లగుట। మనుజేంద్రుఁడు బుద్ధిలేమి మాతాపితృ భా
వన నతఁడు వారిఁ బ్రోచినఁ। గను మేలున కెల్ల గలదె కౌరవనాథా! 433

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ధర్మరాజా!; విను= వినుము; విప్రులు= బ్రాహ్మణులు; పేదలు+అగుట= బీదవారు అవటం అనేది; మనుజ+ఇంద్రుఁడు= మనుష్యులలో ఉత్తముడైన రాజు; బుద్ధిలేమిన్= తెలివిలేనివాడవటంవలననే; అతఁడు= రాజు; వారిన్= వారిని; మాతా పితృభావనన్= తల్లిదండ్రులవలె అనుకొని; ప్రోచినన్= కాపాడితే; కను= పొందే; మేలునకున్= మంచికి; ఎల్లకలదె?= మేర ఉన్నదా?

తాత్పర్యం: ధర్మరాజా! బ్రాహ్మణులు పేదవాళ్ళుగా ఉన్నారంటే అది రాజు తెలివిమాలినతనమే. రాజు వాళ్ళను తల్లిదండ్రులవలె చూచుకొని కాపాడుకొనాలి. అపుడు రాజునకు కలిగే మేలునకు హద్దు ఉండదు.

క. ఆమద్రవ్యము మణియును । రామయు శుచు లగుటఁ గాదె రామారత్నా
రామత దగవగు దుష్కుల । మై మెచ్చమి దోఁచెనేని ననిరి మునీంద్రుల్. 434

ప్రతిపదార్థం: మునీంద్రుల్= మునిముఖ్యులు; ఆమద్రవ్యమున్= పెద్దల పేర్లు చెప్పి పితృకర్మలలో బ్రాహ్మణులకిచ్చే స్వయం పాకము; మణియును= రత్నమును; రామయున్= స్త్రీయునూ; శుచులు+అగుటన్+కాదె= పవిత్రం అవటం వలననే కదా; దుష్కులము+ఐ= నీచకులపుదని; రామారత్న= ఉత్తమ స్త్రీ; మెచ్చమితోఁచెన్+ఏనిన్= నచ్చనట్లుగా అనిపించినా; ఆరామత= క్రీడించటం; తగవు+అగున్= న్యాయమే అవుతుంది; అనిరి= అని అన్నారు.

తాత్పర్యం: పొత్తర్లలో బ్రాహ్మణులకిచ్చే స్వయంపాకం, మణీ, స్త్రీ - ఈ మూడు పవిత్రమైనవే. నీచకులందయినా ఉత్తమ స్త్రీ నచ్చనట్లుగా అనిపించినా సంగమించటం ధర్మమే అవుతుందంటారు మునులు.

క. అమృతము విద్యయుఁ బరమహి । తము సేయుటఁ బుచ్చికొంద్రు దానిని దానిన్
సుమతులు విషము వలన నై । న మహీశ్వర! నీచమగు జనముచే నైనన్. 435

ప్రతిపదార్థం: మహీ+ఈశ్వర!= రాజా!; అమృతమున్= అమృతమూ; విద్యయున్= చదువూ; పరమహితము+చేయుటన్= గొప్పమేలు కలిగించటంవలన; సుమతులు= బుద్ధిమంతులు; దానిని= ఆ అమృతాన్ని; విషమువలన నైనన్= గరళంవలన అయినా; పుచ్చికొంద్రు= గ్రహిస్తారు; దానిన్= ఆ విద్యను; నీచము+అగు+జనముచేన్+ఐనన్= అధముల దగ్గర నుండైనా; పుచ్చికొంద్రు= గ్రహిస్తారు.

తాత్పర్యం: ధర్మరాజా! అమృతం, విద్యా - రెండూ పరోపకారం చేస్తాయి. కాబట్టి బుద్ధిమంతులు విషంలోనుండి పుట్టిందైనా అమృతాన్నీ, నీచుల దగ్గరనుండైనా చదువునూ గ్రహిస్తారు.

క. భూపాలక! విను పంచమ । హాపాతకకరులుఁ బతితు లక్కీడులఁ బ్రా
ణాపాయాంత ప్రతికృతిఁ । బాపుదు; రత్యధిక పుణ్యపరతను బాయున్. 436

ప్రతిపదార్థం: భూపాలక!= రాజా!; విను= వినుము; పంచ మహాపాతక కరులున్= పంచ మహా పాపాలు చేసేవారూ; పతితులున్= పాపాత్ములూ; ఆ+కీడులన్= ఆ పాపాలను; ప్రాణ+అపాయ+ అంత ప్రతికృతిన్= ప్రాణాలను విడవడమనే చివరి ప్రతిక్రియచేత; పాపుదురు= పోగొట్టుకుంటారు; (అక్కీడులు); అతి+అధిక పుణ్య పరతను= పుణ్యం చేయటంలో ఎక్కువ ఆసక్తిచేతను; పాయును= పోతాయి.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. పంచ మహాపాపాలు చేసేవారూ, పతితులూ, తమ ఆ కీళ్ళను ప్రాణత్యాగంచేత పోగొట్టుకుంటారు. ఆ కీడులు పుణ్యాసక్తి మిక్కిలి ఎక్కువ కావటంచేత కూడా పోతాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పంచమహాపాతకాలు: స్వర్ణస్తేయం, సురాపానం, బ్రహ్మహత్య, గురుదారగమనం, ఆ పాపాలు చేసేవాళ్ళతో స్నేహం చేయటం.

క. యానాసనాన్నపాన వి। ధానాదులఁ బతితు బెరసి తాఁ బతితుఁ డగున్;
మానవుఁడు దపోముఖ ధ। ర్మానుష్ఠానములఁ బాచు న క్కిల్బిషమున్. 437

ప్రతిపదార్థం: మానవుఁడు= మనిషి; యాన= ప్రయాణించేటప్పుడు; ఆసన= కూర్చున్నప్పుడు; అన్న= తిండి తినేటప్పుడు; పాన= నీళ్ళు తాగేటప్పుడు; విధాన+ఆదులన్= మొదలైన తీరులలో; పతితున్= పాపాత్ముడితో; బెరసి= కూడి; తాన్= తాను; పతితుఁడు+అగున్= పాపాత్ము డవుతాడు; ఆ+కిల్బిషమున్= అట్లా వచ్చిన పాపాన్ని; తపోముఖ ధర్మానుష్ఠానములన్= తపస్సు మొదలుగా గల సత్కార్యాలు ఆచరించటంచేత; పాచున్= పోగొట్టుకొంటాడు.

తాత్పర్యం: మనిషి పాపాత్ముడితోపాటు ప్రయాణించినా, కలిసి కూర్చున్నా, ఒకే తడవ తిన్నా, దప్పిక తీర్చుకొన్నా, పతితుడవుతాడు. ఆ పాపాన్ని తపస్సు మొదలైన మంచిపనులద్వారా వదలించుకొంటాడు.

క. అనృతము పాతక మగు; నై। నను వనితల యెడను, బెండ్లి, నవ్వున మృతి వ
చ్చిన సర్వధనముఁ జెడు చో, । విను మది పాపంబు గాదు విమలచరిత్రా! 438

ప్రతిపదార్థం: విమల చరిత్రా!= మచ్చలేని నడవడి కలవాడా!; అనృతము= అబద్ధం చెప్పటం; పాతకము+అగున్= పాపం అవుతుంది; ఐనను= అయినా; వినుము= విను; వనితల ఎడను= ఆడవాళ్ళ విషయంలోనూ; పెండ్లి= పెళ్ళి విషయంలోనూ; నవ్వునన్= నవ్వులాటలోనూ; మృతివచ్చినన్= చావు మూడినప్పుడూ; సర్వధనమున్= ధనమంతా (సర్వస్వం); చెడుచోన్= కోల్పోతుంటే; అది= అబద్ధం చెప్పటం; పాపంబు+కాదు= దోషం కాదు.

తాత్పర్యం: ధర్మరాజా! అబద్ధం ఆడటం పాపమే. అయితే ఆడవాళ్ళ విషయంలోనూ, పెళ్ళిళ్ళప్పుడూ, పరిహాసాలప్పుడూ, చావు కలిగినప్పుడూ, సర్వస్వం కోల్పోతుంటేనూ అబద్ధం చెప్పటం పాప మేమీ కాదు.

క. ఏ పాపమేని లేనిది। కాపురుషత నొకనిమీఁదఁ గలిగించిన న
ప్పాపము సేసినవాఁ డగు। నా పొలువ యనంగ విందు మార్యులచేతన్. 439

ప్రతిపదార్థం: ఏ పాపము+ఏని లేనిది= ఏ పాపమూ లేకపోయినా; ఒకని మీఁదన్= మరియొకనిపై; కాపురుషతన్= చెడ్డవాడనే భావాన్ని; కలిగించినన్= మోపితే; ఆ పొలువ= ఆ దుర్మార్గుడు; ఆ+పాపము చేసినవాఁడు+అగున్= ఆ పాపాన్ని చేసినవా డవుతాడు. అనంగన్= అని; ఆర్యులచేతన్= పెద్దలవలన; విందుము= వింటాము.

తాత్పర్యం: ఏ పాపమూ చేయకపోయినా మరియొకనిపై కుత్సిత పురుషుడనే నిందను మోపితే, ఆ దుర్మార్గుడు ఆ పాపం చేసినవాడవుతాడని పెద్దలనగా వింటాము.

ఆ. తల్లిఁ దండ్రిఁ బాయఁ దగ ద కారణమునఁ। బాసెనేని వాఁడు పతితుఁ డాస
నంబు సెజ్జ భోజనము చీర వటుకుమా। రులకుఁ బ్రీతి నొసఁగఁ బొలియుఁ గీడు. 440

ప్రతిపదార్థం: తల్లిన్ తండ్రిన్= తల్లినీ తండ్రినీ; అకారణమునన్= ఊరకనే; పాయన్+తగదు= వదలి ఉండటం మంచిదికాదు; పాసెన్+ఏని= విడిచినట్లైతే; వాఁడు= వాడు; పతితుఁడు= పాపాత్ముడు; వటుకుమారులకున్= బ్రహ్మచారులకు; ఆసనంబు= పీటా; సెజ్జ= పక్కా; భోజనము= తిండీ; చీర= బట్టా; ఒసఁగన్= ఇవ్వగా; కీడు= ఆ దోషం; పొలియున్= పోతుంది.

తాత్పర్యం: సరైన కారణం ఏమీ లేకుండా తల్లిదండ్రులను కాదని వెళ్ళేవాడు పాపాత్ముడు అవుతాడు. బ్రహ్మచారులకు పీటా, పక్కా, కూడూ, గుడ్డా ఇస్తే ఆ పాపం తొలగిపోతుంది.'

వ. అనియె; నట్టియెడం గృపాణరణ నిపుణుండగు నకులుండు సకలాస్త్రశస్త్ర సారవిశారదుండైన యబ్భాగీరథీసుతునకు సవినయంబుగాఁ బ్రణమిల్లి 'ధను వుత్తమాయుధం బని చెప్పుదు; రది సర్వజన సమ్మతంబు; ధనువునకు బాణంబులకు వైకల్యంబు వాటిల్లినయెడం బరవీరప్రహరణంబునకు నాత్మత్రాణంబునకుం గృపాణంబు మేలని యుండుదు; నా తలంపెట్టిదియో తెలిసికొనవలయుఁ; దత్ప్రభవ ప్రభావంబులుం దదీయ పూర్వాచార్యునిం జెప్పవే' యని యడిగిన. 441

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అట్టి యెడన్= అట్లాంటప్పుడు; కృపాణరణ= కత్తిపోరులో; నిపుణుండు+అగు= మేటి అయిన; నకులుండు= నకులుడు; సకల= సమస్తమైన; అస్త్ర= మంత్రపూత బాణాల; శస్త్ర= ఆయుధాల ప్రయోగంలో; సారవిశారదుండు+ఐన= బాగా తెలిసిఉన్నవాడైన; ఆ+భాగీరథీసుతునకున్= ఆ భీష్ముడికి; సవినయంబుగాన్= అణకువతో; ప్రణమిల్లి= మ్రొక్కి; ధనువు= విల్లు; ఉత్తమ+ఆయుధంబు+అని= మేలైన సాధనం అని; చెప్పుదురు= చెప్పుతారు; అది= అట్లా చెప్పటం; సర్వజన సమ్మతంబు= అందరికీ అంగీకారమే; ధనువునకున్= వింటికీ; బాణంబులకున్= బాణాలకూ; వైకల్యంబు= విరిగిపోవటం; పాటిల్లిన ఎడన్= కలిగినట్లయితే; పరవీర= పగవారి పోటుగాళ్ళని; ప్రహరణంబునకున్= దెబ్బ కొట్టటానికీ; ఆత్మత్రాణంబునకున్= తనను తాను కాపాడుకొనటానికీ; కృపాణంబు= కత్తి; మేలు= మంచిది; అని; ఉండుదున్= తలంచాను; నా తలంపు= నా ఆలోచన; ఎట్టిదియో= ఎలాంటిదో; తెలిసికొనవలయున్= తెలుసుకొనాలి; తత్ప్రభవ= కత్తి పుట్టుక; ప్రభావంబులున్= మహిమలు; తదీయ= దానికి సంబంధించిన పూర్వాచార్యునిన్= మొదటి గురువునీ; చెప్పవే= చెప్పవా; అని; అడిగినన్= అడుగగా.

తాత్పర్యం: అట్లా చెప్పిన తరువాత కత్తిపోరులో కుశలుడైన నకులుడు, మంత్రపూత బాణప్రయోగంలోనూ, ఆయుధాల ప్రయోగంలోనూ, చేయి తిరిగినవాడైన భీష్ముడికి ఎంతో వినయంగా మొక్కాడు. 'అన్నిట్లోకి మేలైన సాధనం 'ధనుస్సు' అని అంతా అంటారు. విల్లూ బాణం విరిగిపోతే శత్రువీరులను చెండాడటానికీ, తనను తాను కాపాడుకొనటానికి కత్తి మేలు - అనే నా ఊహ ఎంతపాటిదో తెలిసికొనాలని ఉన్నది. కత్తిపుట్టుకా దాని మహిమా, దాని తొలి ఉపదేశకుడినీ చెప్పు'మని అడగగా.

భీష్ముఁడు నకులునకు ఖడ్గ ప్రభావంబు తెలియం గెఱింగించుట (సం. 12-160-9)

సీ. అతనికి నాతఁ డిట్లను 'బ్రహ్మ జగములు । సృజియించి భూతసంసృష్టి సేయ
దివిజమర్త్యాది జంతువు లమ్మహాత్ము వి । ధించిన తెరువులఁ దిరిగి బ్రదుకు
చుండ దైత్యులు సముద్దండత నన్యాయ । వర్తులై సురమునివ్రాతములకు
బాధ లొనర్ప నప్పరమేష్ఠి హిమశైల । తటమున వేయువత్సరము లధిక

తే. నియతిమెయిఁ దప మొనరించి నిష్ఠఁ గ్రతువు । సేసె నయ్యగ్నిఁ బుట్టె నశేష లోక
భీతికర మగు నుగ్రంపుభూత మొకటి । ప్రాంశుకృష్ణమై దంష్ట్రలు ప్రజ్వరిల్ల. 442

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ నకులుడికి; ఆతఁడు= భీష్ముడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; బ్రహ్మ= బ్రహ్మదేవుడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జగములు= లోకాలను; సృజియించి= పుట్టించి; భూతసంసృష్టి+చేయన్= ప్రాణులను పుట్టించగా; దివిజ= దేవతలూ; మర్త్య= మనుష్యులూ; ఆది= మొదలుగా గల; జంతువులు= ప్రాణులు; ఆ+మహాత్ము= ఆ బ్రహ్మదేవుడు; విధించిన= ఏర్పరచిన; తెరువులన్= తెన్నులలో; తిరిగి= సంచరించి; బ్రదుకుచున్+ఉండన్= జీవిస్తుండగా; దైత్యులు= రాక్షసులు; సముద్దండతన్= పెద్ద ఎత్తున; అన్యాయవర్తులు+ఐ= న్యాయం తప్పినవారై; సుర ముని వ్రాతములకున్= దేవతల, మునుల సమూహానికి; బాధలు+ఒనర్పన్= పీడించగా; ఆ+పరమేష్ఠి= ఆ బ్రహ్మదేవుడు; హిమశైల తటమునన్= మంచుకొండ చరియల్లో; వేయువత్సరములు= వేయ్యేళ్ళు; అధికనియతి మెయిన్= ఎంతో నియమంతో; తపమున్= తపస్సును; ఒనరించి= చేసి; నిష్ఠన్= ఎడతెగని శ్రద్ధతో; క్రతువు చేసెన్= యాగం చేశాడు; అశేషలోక= అన్ని లోకాలకూ; భీతికరము+అగు= అదురు పుట్టించే; ఉగ్రభూతము+ఒకటి= భయంకరమైన ఒక భూతం; ప్రాంశుకృష్ణము+ఐ= పొడవాటి నల్లటి; దంష్ట్రలు= కోరలు; ప్రజ్వరిల్లన్= ఒప్పగా; ఆ+అగ్నిన్= ఆ నిప్పులోనుండి; పుట్టెన్= పైకి వచ్చింది.

తాత్పర్యం: ఆ నకులుడితో భీష్ముడు ఇట్లా అన్నాడు. బ్రహ్మ లోకాలనూ, జంతుజాలాన్నీ పుట్టించాడు. దేవతలూ మనుష్యులూ మొదలుగాగల ప్రాణులన్నీ బ్రహ్మదేవుడు నియమించినట్టుగా బ్రతుకుతున్నాయి. రాక్షసులు న్యాయం తప్పి దేవతలను మునులను పీడించటం ఎక్కువైంది. అందువలన మంచుకొండచరియలలో బ్రహ్మదేవుడు వెయ్యేళ్లపాటు తపస్సు చేశాడు. ఆ తరువాత నిష్ఠగా యాగం చేశాడు. ఆ అగ్నిగుండంలోనుండి మొత్తం ప్రపంచానికి అదురుపుట్టేటట్లు ఒక పెద్ద భూతం పైకి వచ్చింది. ఆ భూతం పొడవాటి నల్లటి కోరలతో ఉన్నది.

ఆ. అప్పు డినుఁడు మాసె, ననిలుండు సుడివడి । వీచె, నుల్క లురలె, వెఱఁ దలంకు
సురల మునులఁ జూచి సరసిజభవుఁ 'డిది । నాదుమతమ యొండు గాదు వినుఁడు. 443

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఇనుఁడు= సూర్యుడు; మాసెన్= మసకబారాడు; అనిలుండు= గాలి; సుడివడి= సుళ్ళు చుట్టుకొని; వీచెన్= విసరింది; ఉల్కలు= నిప్పురవ్వలు; ఉరలెన్= రాలిపడ్డాయి; వెఱన్= భయంతో; తలంకు= వణకుతున్న; సురలన్= దేవతలను; మునులన్= ఋషులను; చూచి; సరసిజభవుఁడు= బ్రహ్మ; ఇది= ఈ పెనుభూతం; నాదుమతము+అ= నా తలపే; ఒండు+కాదు= మరొకటి కాదు; వినుఁడు= ఆలకించండి.

తాత్పర్యం: ఈ భూతం పుట్టిన సమయంలో సూర్యుడు మసకబారాడు, సుడిగాలి విసురుగా కొట్టింది, నిప్పురవ్వలు రాలిపడ్డాయి, దేవతలూ, మునులూ భయంతో వణకిపోతున్నారు. అది చూచి బ్రహ్మదేవుడు 'దీనిని నేనే పుట్టించాను. మరొకటి కాదు. వినండి.

వ. ఇది రాక్షస నాశంబునకుం దోఁచిన యుత్పాతంబు; లోకంబుల రక్షింపను రాక్షసుల వధియింపను సాధనంబుగా ఖడ్గంబుఁ గల్పించితి నని పలుక, నా భూతం బారూపంబు విడిచి ఖడ్గాకృతి గైకొని తన మెఱుంగులు దిక్కులు దీటుకొనం బొల్చిన. 444

ప్రతిపదార్థం: ఇది= ఈ పెద్ద భూతం; రాక్షస నాశంబునకున్= రాక్షసుల చేటుకొరకు; తోఁచిన= పుట్టిన; ఉత్పాతంబు= అరిష్టం; లోకంబులన్= లోకాలన్నిటినీ; రక్షింపను= కాపాడటానికీ; రాక్షసులన్= రక్కసులను; వధియింపను= చంపటానికీ; సాధనంబుగాన్= పనిముట్టుగా; ఖడ్గంబున్= కత్తిని; కల్పించితిని= పుట్టించాను; అని పలుకన్= అని చెప్పగా; ఆ భూతంబు= ఆ భూతం; ఆ రూపంబున్= ఆ ఆకారాన్ని; విడి= వదలి; ఖడ్గాకృతి= కత్తి రూపాన్ని; కైకొని= పొంది; తన మెఱుంగులు= తన కాంతులు; దిక్కులు దీటుకొనన్= అంతటా ప్రసరించేటట్లు; పొల్చినన్= కనబడగా.

తాత్పర్యం: ఈ భూతం రాక్షసుల చావుకొరకు పుట్టిన ఉపద్రవం. లోకాలను ఆదుకొనటానికీ, రాక్షసులను చంపటానికీ తగ్గ పనిముట్టు ఈ కత్తి. అందుకే దీనిని కల్పించాను' అనగానే ఆ భూతం కత్తి రూపం ఎత్తింది. తన కాంతులు నాలుగు దిక్కులకూ విరజిమ్ముతూ కనబడగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **కమలాసనుండు నిజ చి । త్తము భక్తి మయంబు సేసి తలఁచె; హరుని ఫా**
లము కంటి మంటతో న । య్యమరవరదుఁ డేగుదెంచె నచటికి నెమ్మిన్. 445

ప్రతిపదార్థం: కమలాసనుండు= బ్రహ్మ; నిజచిత్తము= తన మనస్సును; భక్తిమయంబు+చేసి= భక్తిపూరితంచేసి, హరునిన్= శివుడిని; తలఁచెన్= స్మరించాడు; ఆ అమరవరదుఁడు= దేవతలు కోరింది ఇచ్చే శివుడు; ఫాలము= నుదుటిలోని; కంటి మంటతోన్= కంటి సెగతో; అచటికిన్= అక్కడకు (బ్రహ్మ ఉన్నచోటుకు); నెమ్మిన్= ప్రీతితో; అరుగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు తన మనస్సును భక్తి పూరితం చేసి శివుడిని ధ్యానించాడు. అప్పుడు దేవతల కోరికలు తీర్చే శివుడు నుదుటి కంటి మంటతో బ్రహ్మ ఎదుటకు ప్రీతితో వచ్చాడు.

ఉ. **వచ్చినఁ దత్పదాంబురుహవందనపూర్వముగాఁగఁ బద్మజుం**
డిచ్చెఁ గృపాణ; మవ్విభుఁ డహీన సముద్యమలీలఁ గ్రాలుచుం
బుచ్చికొనంగ నా సభ యపూర్వ మనఃప్రమదంబుతోడి పే
రచ్చెరువాటు నొందె నటు లయ్యసిఁ గైకొని మేను వెంచుచున్. 446

ప్రతిపదార్థం: వచ్చినన్= రాగా; తద్= ఆ శివుడి; పద+అంబురుహ= పాద పద్మాలకు; వందన పూర్వము+కాఁగన్= మొక్కటంతో పాటుగా; పద్మజుండు= బ్రహ్మ; కృపాణమున్= కత్తిని; ఇచ్చెన్= ఇచ్చాడు; ఆ విభుఁడు= ఆ శివుడు; అహీన= ఎంతో; సముద్యమలీలన్= పెద్ద ఎత్తున; క్రాలుచున్= వెలిగిపోతూ; పుచ్చికొనంగన్= తీసికొనగా; ఆ సభ= ఆ కొలువు; అపూర్వ= ఇంతకుమునుపు ఎన్నడూ లేని; మనఃప్రమదంబుతోడి= సంతోషించిన మనస్సుతో; పేరు+అచ్చెరువాటున్= ఎంతో వింతను; ఒందెన్= పొందింది; అటులు= అట్లా; ఆ+అసిన్= ఆ కత్తిని; కైకొని= చేతపట్టుకొని; మేను పెంచుచున్= ఒంటిని పెద్దది చేస్తూ.

తాత్పర్యం: అట్లా అగపడగానే ఆ బ్రహ్మ శివుడికి మొక్కాడు. కత్తిని చేతిలో పెట్టాడు. ఆ శివుడూ ఎంతో ఉన్నతంగా వెలిగిపోతూ ఆ కత్తిని తీసికొన్నాడు. ఆ సభ కూడా ఎపుడూ లేనంత ఇదిగా సంతోషపడింది. వింతపడింది. అట్లా ఆ కత్తిని చేతపుచ్చుకొన్న ఆ శివుడు తన ఆకారాన్ని పెంచుతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **హరుఁడు బెట్టుగ నవ్వి పెల్లార్చుటయును । విని సముద్ధతరయమున దనుజకోటి**
మునుగఁ బఱతెంచి తాఁకిన మునుముకొని వ । ధించి యిల యెల్ల నెత్తుట ముంచె నతఁడు. 447

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు, బెట్టుగన్= బిగ్గరగా; నవ్వి; పెల్లు+ఆర్చుటయును= ఉత్సాహంకొద్దీ పెద్దపెద్దగా కేకలు పెట్టగా; విని= ఆలకించి; దనుజకోటి= రాక్షసులమూక; సముద్ధత రయమునన్= ఎంతో వేగంగా; మునుగన్= ముందుగా; పఱతెంచి= పరుగెత్తి వచ్చి; తాఁకినన్= ఎదుర్కొనగా; అతఁడు= శివుడు; మునుముకొని= వరసపెట్టి; వధించి= చంపి; ఇల+ఎల్లన్= నేలనంతా; నెత్తుటన్= రక్తంతో; ముంచెన్= తడిపాడు.

తాత్పర్యం: శివుడు ఫకాలున నవ్వి పెద్దగా బొబ్బలు పెట్టాడు. ఆ కేకలు రాక్షసుల చెవిన బడ్డాయి. ఆ వెంటనే

రాక్షసులమూక పరుగుపెట్టి వచ్చి ముందుగా ఎదుర్కొనగా శివుడు కత్తితో కలియబడ్డాడు. వరసపెట్టి నరికి నేలనంతా నెత్తురుమయం చేశాడు.

ఉ. దైత్యుల నిట్లు గీటడఁచి ధర్మము నిల్పి ప్రసన్నమూర్తి సాం
గత్యము నొంది యప్పరమకారుణికుండు త్రిలోకరక్షణౌ
దాత్త్యమునన్ వెలుంగు హరిఁ దద్దయు వేడుకఁ బిల్వఁ బంచి సం
ప్రీత్యభిరాముఁ డై యొసఁగెఁ బెంపుగ నమ్మహనీయఖడ్గమున్. 448

ప్రతిపదార్థం: అప్పరమకారుణికుండు= గొప్పజాలి చూపే ఆ శివుడు; దైత్యులన్= రాక్షసులను; ఇట్లు= ఇట్లా; గీటు+అడఁచి చంపి; ధర్మము నిల్పి= ధర్మాన్ని నిలబెట్టి; ప్రసన్నమూర్తి= శాంతాకారంతో; సాంగత్యమున్+ఒంది= చేరికపొంది; త్రిలోక రక్షణ= ముల్లోకా (స్వర్గం, భూలోకం, పాతాళం)లను కాపాడే; ఔదాత్త్యమునన్= గొప్పతనంచేత; వెలుంగు= ఒప్పే; హరిన్= విష్ణువును; తద్దయున్ వేడుకన్= ఎంతో ఉత్సాహంతో; పిల్వన్+పంచి= రప్పించి; సంప్రీతి= సంతోషంతో; అభిరాముఁడు+ఐ= ఒప్పేవాడై; ఆ+మహనీయ ఖడ్గమున్= ఆ గొప్పకత్తిని; పెంపుగన్= గౌరవంగా; ఒసఁగెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: అట్లా ఆ శివుడు రాక్షసులను చంపి ధర్మం నిలబెట్టాడు. ప్రసన్ను డయ్యాడు. స్వర్గ, మర్త్య, పాతాళలోకాలను ఎంతో బాగా కాపాడే విష్ణువును వేడుకపడి పిలిపించాడు. ఎంతో సంతోషంగా ఆ గొప్ప కత్తిని అతడి చేతికి ఇచ్చాడు.

వ. అ ట్లొసంగినం గైకొని దుష్టదమనం బాచరించుచు నుండెడు నవ్విష్ణుండు మహాస్త్రరూపంబగు నయ్యాయుధంబు పదంపడి మరీచి కొసంగె; మరీచి భార్గవునకు, భార్గవుం డనేకమునులకు, మును లింద్రునకు, నింద్రుండు లోకపాలురకు నొసంగెఁ;గ్రమంబున మనుప్రభృతులైన మానవేంద్రులు వడసి నిజసంతతి కినిచ్చుచు వచ్చి; రందు దుష్యంతుండు భరతున కిచ్చె; నా భరతవంశంబునందు ఖడ్గ సంప్రదాయంబు గలిగి వచ్చె; నొక ముని యనుగ్రహింప ద్రోణుం డధిగమించి కృపున కిచ్చెఁ; గృపునిచేత మీ రేవురుం బడసితిరి; విశేషించి యీ విద్యయం దత్యంతాదరణవంతుండ వగుటంజేసి దీనివలన వెలసితివి నిస్త్రింశంబునకు నక్షత్రంబు గృత్తికయగ్నియధిదేవత గురుండు రుద్రుం' డని చెప్పివెండియు నిట్లను 'నసి విశసనంబు ఖడ్గంబు తీక్ష్ణధారంబు దురాసదంబు శ్రీగర్భంబు విజయంబు ధర్మపాలనంబన నెనిమిది పూజ్యనామంబులం బరఁగి కృపాణంబు ప్రహరణంబులోనం బ్రధానంబై నెగడుచుండు. 449

ప్రతిపదార్థం: అట్లు= అట్లా; ఒసంగినన్= ఇవ్వగా; కైకొని= పుచ్చుకొని; దుష్టదమనంబు= చెడ్డవాళ్ళను చంపటం; ఆచరించుచున్+ఉండెడు= చేస్తూండే; ఆ+విష్ణుండు= ఆ విష్ణువు; మహా+అస్త్రరూపంబు+అగు= గొప్ప అస్త్రం వంటిది అయిన; ఆ+ఆయుధంబున్= ఆ కత్తిని; పదంపడి= ఆ తరువాత; మరీచికిన్= మరీచిమునికి; ఒసంగెన్= ఇచ్చాడు; మరీచి= మరీచి ముని; భార్గవునకున్= పరశురాముడికి; భార్గవుండు= పరశురాముడు; అనేకమునులకున్= చాలామంది ఋషులకు; మునులు= ఆ మునులు; ఇంద్రునకున్= ఇంద్రుడికీ; ఇంద్రుండు= ఆ ఇంద్రుడు; లోకపాలురకున్= దిక్పాలకులకు; ఒసంగెన్= ఇచ్చాడు; క్రమంబునన్= వరసగా; మనుప్రభృతులు+ఐన= మనువు మొదలైన; మానవేంద్రులు= రాజులు; పడసి= పొంది; నిజసంతతికిన్= తమ వంశీకులకు; ఇచ్చుచున్+వచ్చిరి= ఇచ్చుకుంటూ వచ్చారు; అందున్= వాళ్ళల్లో; దుష్యంతుఁడు= దుష్యంత మహారాజు; భరతునకున్= భరతుడికి; ఇచ్చెన్= ఇచ్చాడు; ఆ భరతవంశంబునందున్= ఆ భరతకులంలో; ఖడ్గ సంప్రదాయంబు= కత్తి ఇచ్చుకొనే ఆచారం; కలిగి వచ్చెన్= ఉంటూ ఉంది; ఒక ముని= ఒక ఋషి; అనుగ్రహింపన్= దయ చూపగా; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు;

అధిగమించి= పొంది; కృపునకున్+ఇచ్చెన్= కృపుడికి ఇచ్చాడు; కృపునిచేతన్= కృపుడివలన; మీరు ఏవురున్= మీ ఐదు మంది; పడసితిరి= పొందారు, విశేషించి= మీదు మిక్కిలి; ఈ విద్యయందున్= ఈ కత్తి విద్యలో; అత్యంత ఆదరణవంతుండవు+అగుటన్+చేసి= ఎక్కువ గౌరవం కలవాడవు కాబట్టి; దీని వలనన్= ఈ విద్యవలన; వెలసితివి= ప్రకాశించావు; నిస్త్రింశంబునకున్= కత్తికి; నక్షత్రంబు= నక్షత్రం; కృత్తిక; అగ్ని= అగ్గి; అధిదేవత= కాపాడే దేవత; గురుండు= ఉపదేశకుడు; రుద్రుండు= శివుడు; అని చెప్పి; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; అసి= కత్తి; విశసనంబు= చంపేది; ఖడ్గంబు= నరికేది; తీక్ష్ణధారంబు= మంచి పదునుతో ఉండేది; దురాసదంబు= ఎదిరించలేనిది; శ్రీగర్భంబు= లోపల సిరులు కలది; విజయంబు= గెలుపు కలిగించేది; ధర్మపాలనంబు= ధర్మాన్ని కాపాడేది; అనన్= అనేటట్లు; ఎనిమిది పూజ్యనామంబులన్= కొల్వదగ్గ ఎనిమిది పేర్ల చేతా; పరఁగి= ఒప్పి; కృపాణంబు= కత్తి; ప్రహరణంబులలోనన్= ఆయుధాలలో; ప్రధానంబు+ఐ= ముఖ్యమై; నెగడుచుండున్= ప్రసిద్ధి కెక్కింది.

తాత్పర్యం: చెడ్డవాళ్ళను రూపుమాపే విష్ణువు ఆ కత్తిని శివుడు ఇవ్వగానే అందుకొన్నాడు. ఆ గొప్ప కత్తిని ఆ తరువాత విష్ణువు మరీచికి ఇచ్చాడు. మరీచి పరశురాముడికీ, పరశురాముడు మునులకూ, ఆ మునులు ఇంద్రుడికీ, ఇంద్రుడు దిక్పాలకులకు ఇచ్చారు; వరసగా మనువు మొదలైన రాజులు తమ సంతానానికి ఇస్తూ వచ్చారు. వాళ్ళల్లో దుష్యంతుడు భరతుడికి ఇచ్చాడు. ఆ భరతకులంలో కత్తిని ఇచ్చుకొనే ఆచారం ఏర్పడింది. దాన్ని ఓ ముని దయవలన ద్రోణుడు సంపాదించాడు. ఆ ద్రోణుడు కృపుడికి ఇచ్చాడు. అతడినుండి మీ ఐదుమందీ పొందారు. ఈ కత్తి విద్యను నీవు మన్నించినవాడ వవటం వలన పేరుపొందావు; ఈ కత్తికి నక్షత్రం కృత్తిక. కాపాడే దేవత అగ్ని. గురువు శివుడు. అని చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు. అసి, విశసనం, ఖడ్గం, తీక్ష్ణ ధారం, దురాసదం, శ్రీగర్భం, విజయం, ధర్మపాలనం - అనే ఎనిమిది మారుపేర్లతో వాడుక పడింది. ఆయుధా లన్నిట్లోకి ముఖ్యమైందిగా పేరు పడింది.

క. సుమహిత మగు నీ ఖడ్గా । గమమగు పుణ్యకథ వినగఁ గాంచిన పురుషుం
డమితయశంబును నధిక । ప్రమదంబును సద్గతియును బడయుఁ గుమారా!' 450

ప్రతిపదార్థం: కుమారా!= బాబూ నకులుడా!; ఈ ఖడ్గ+ఆగమము= ఈ కత్తి రాకకు సంబంధించినది; అగు= అయిన; పుణ్యకథ= పుణ్యం కలిగించే కథ; సుమహితము+అగున్= దివ్యమైనదవుతుంది; వినఁగన్+కాంచిన= విన్న; పురుషుండు= మనిషి; అమితయశంబును= ఎంతో కీర్తినీ; అధిక ప్రమదంబును= ఎంతో సంతోషాన్ని; సద్గతియున్= ఉత్తమలోకాన్నీ (స్వర్గాన్ని); పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: ఖడ్గవిద్యా సంబంధం అయిన (ఖడ్గవేశం అనదగిన) ఈ పుణ్యకథ దివ్యమైనది. ఈ కథను విన్నవాడు ఎంతో కీర్తిమంతు డవుతాడు. సంతోషంగా ఉంటాడు. పుణ్యలోకాలు పొందుతాడు'.

క. అని యిట్లు నకులునకు భీ । ష్ముని చెప్పిన కథ సుచిత్తమున విని కుంతీ
తనయాగ్రజుండు పురికిం । జనియెడు ప్రా ద్దగుడు వినయ సంభృతుఁ డగుచున్. 451

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఇట్లా; నకులునకున్= నకులుడికి; భీష్ముని చెప్పిన కథ= భీష్ముడు చెప్పిన కథ; సుచిత్తమునన్= మంచి మనస్సుతో; విని= ఆలకించి; కుంతీతనయ+అగ్రజుండు= కుంతీకుమారులలో మొదటివాడు ధర్మరాజు; పురికిన్= పట్టణానికి; చనియెడు= వెళ్ళే; ప్రొద్దు+అగుడున్= వేళ కాగా; వినయసంభృతుఁడు+అగుచున్= అణకువ కలవాడవుతూ.

తాత్పర్యం: ఇట్లా నకులుడికి భీష్ముడు తాత చెప్పిన కథ అంతా ధర్మరాజు మనస్సు పెట్టి విన్నాడు. హస్తినాపురం వెళ్ళే వేళ కావటంతో ఎంతో అణకువగా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. సముచితంబుగా నమ్మహాత్ముని వీడ్కొని చని, యోగ్యవర్తనంబు లాచరించి, వినోదగోష్ఠి నుండి విదురునిం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దమ్ముల నుపలక్షించి ధర్మార్థకామంబులయం దుత్తమమధ్యమాధమత్వ నిరూపణంబు సేయుఁడు చూత' మని పల్కిన నవ్విభునకు విదురుం డిట్లనియె. 452

ప్రతిపదార్థం: సముచితంబుగాన్= తగ్గట్లుగా; ఆ+మహాత్మునిన్= ఆ భీష్ముడిని; వీడ్కొని= పోయి వస్తానని చెప్పి; చని= వెళ్ళి; యోగ్యవర్తనంబులు= చేయాల్సిన పనులు; ఆచరించి= చేసి; వినోదగోష్ఠిన్= ఆనంద సల్లాపాలతో; ఉండి; విదురునిన్= విదురుడిని; తమ్ములన్= తమ్ములను; ఉపలక్షించి= చూచి; ధర్మార్థకామంబులయందున్= ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలలో; ఉత్తమ, మధ్యమ, అధమత్వం= ఎక్కువది. నడిమిది, తక్కువది ఏదో; నిరూపణంబు+చేయుఁడు= తీర్పు ఇవ్వండి; చూతము+అని= చూద్దాం అని; పల్కినన్= అడుగగా; ఆ+విభునకున్= ఆ ధర్మరాజుతో; విదురుండు= విదురుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్మడికి వెళ్ళివస్తా నని చెప్పి ఇంటికిపోయి చేయవలసినపనులన్నీ చేశాడు. ఆనందసల్లాపాలతో విదురుడినీ తమ్ముళ్ళనూ చూచి ధర్మార్థ కామాలలో ఏది ఎక్కువదో, ఏది నడిమిదో, ఏది తక్కువదో తీర్పు ఇవ్వండి చూద్దాం' అన్నాడు. విదురుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

ధర్మజునితో విదురాదులు ధర్మార్థ కామంబుల తారతమ్యంబు సెప్పుట (సం. 12-161-4)

క. 'విను ధర్మంబున ధనమగు, । ధనమున సిద్ధించుఁ గామతంత్రం, బటు గా
వున మధ్యమంబు నధమము । ధన కామము; లుత్తమంబు ధర్మం బధిపా!' 453

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; విను(ము)= ఆలకించుము; ధర్మంబునన్= ధర్మంవలన; ధనము= ధనం; అగును= కలుగుతుంది; ధనమునన్= ధనంవలన; కామతంత్రంబు= కామంతంతు; సిద్ధించున్= ఫలిస్తుంది; అటు కావునన్= అందువలన; ధనము= ధనం; మధ్యమంబు= రెంటినడిమిది; కామము= కామం; అధమము= తక్కువది; ధర్మంబు= ధర్మం; ఉత్తమంబు= మేలైనది.

తాత్పర్యం: ధర్మాన్నిబట్టి ధనం, ధనంవలన కామంతంతూ కలుగుతుంది. కాబట్టి ధనం నడిమిది. ధర్మం మేలైనది. కామం నీచమైంది'.

చ. అనవుడుఁ బార్థు డిట్టులను 'నర్థము మూలము ధర్మకామవ
ర్తనములు; కట్లు గాకయు విరక్తతనొంది జటాదిధారణం
బునఁ జరియించువారికిని భూవర! యర్థము దేహకృత్య సా
ధన మసురేజ్య కణ్వులును దానిన మేలని పూని చెప్పరే. 454

ప్రతిపదార్థం: అనవుడున్= అనగానే; పార్థుఁడు= అర్జునుడు; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; ధర్మకామవర్తనములకున్= ధర్మం యొక్క, కామంయొక్క ఉనికికి; అర్థము= ధనం; మూలము= ఆధారం; అట్లు+కాకయున్= అట్లా కాకుండా; విరక్తతన్= వైరాగ్యాన్ని; ఒంది= పొంది; జట+ఆదిధారణంబునన్= జడలు మొదలైనవి ధరించి; చరియించువారికిని= తిరిగేవారికీ; భూవర!= రాజా!; అర్థము= ధనం; దేహకృత్యసాధనము= శరీరంచేత చేయదగ్గదానికి ఉపకరణం; అసురేజ్య= రాక్షస గురువగు శుక్రుడూ; కణ్వులును= కణ్వమునీ; దానిన= ధనాన్నే; మేలు+అని= మంచిది అని; పూని= పనిగట్టుకొని; చెప్పరే= చెప్పలేదా.

తాత్పర్యం: అర్జునుడు ఇట్లా అన్నాడు. 'ధర్మకామాల స్థితికి మూలం ధనమే. అట్లాకాకుండా విరక్తిపొంది జటలతో తిరిగే సన్న్యాసుల దేహయాత్రకు పనిముట్టు ధనం. శుక్రుడూ, కణ్వమునీ పనిగట్టుకొని ధనం మేలని చెప్పలేదా?

వ. కావున నర్థంబు ప్రధానం' బనుటయు నకుల సహదేవు లేకవాక్యత నిట్లనిరి. 455

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అర్థంబు= ధనం; ప్రధానంబు= ముఖ్యమయినది; అనుటయున్= అనగానే; నకుల సహదేవులు= నకులుడూ, సహదేవుడూ; ఏకవాక్యతన్= ఒకేమాటగా; ఇట్లు+అనిరి= ఇట్లా చెప్పారు.

తాత్పర్యం: కాబట్టి ధనం ముఖ్యం' అనగానే నకుల సహదేవు లిద్దరూ ఒక్కసారిగా ఇట్లా అన్నారు.

తే. **అర్థ ధర్మంబు లితరేతరాశ్రయములు। గాన వానిలో నొకఁ డూఁదు మానవేంద్రు**
జగము పోకులఁ బుచ్చు నసంభృతార్థుఁ। డైన వానికిఁ గామమ ప్రాప్యమరయ. **456**

ప్రతిపదార్థం: అర్థధర్మంబులు= అర్థం, ధర్మం; ఇతర+ఇతర= ఒకదానికొకటి; ఆశ్రయములు= ఆధారపడి ఉన్నాయి; కానన్= కాబట్టి; వానిలోన్= ఆ రెంటిలో; ఒకఁడు+ఊఁదు= ఒకదాన్నే పట్టుకొని ఉండే; మానవ+ఇంద్రున్= రాజును; పోకులన్+పుచ్చును= నాశనం చేస్తుంది; అసంభృత+అర్థుఁడు+ఐనవానికిన్= పుష్కలంగా ధనంలేనివాడికి; అరయన్= విచారించగా; కామము= కామం; అప్రాప్యము= పొందరానిది.

తాత్పర్యం: ధర్మార్థాలు రెండూ ఒక దానిమీద మరొకటి ఆధారపడి ఉంటాయి. కాబట్టి ఆ రెంటిలో ఏదో ఒకటి అవలంబించే రాజునకు చేటు కలుగుతుంది. చేతినిండా డబ్బు లేనివాడికి కామం అందనిది.

క. **తమలో సరి ధర్మము న। ర్థము నర్థంబునకుఁ గామతంత్రము ఫలరూ**
పము గావున నప్పురుషా। ర్థమునుం గొనియాడవలయు ధరణీనాథా!' **457**

ప్రతిపదార్థం: ధరణీనాథా!= రాజా!; ధర్మమున్= ధర్మమూ; అర్థమున్= అర్థమూ; తమలో సరి= వాటికి అవేసాటి; కామతంత్రము= కామంతంతు; అర్థంబునకున్= ధనానికి; ఫలరూపము= ఫలంవంటిది; కావునన్= కాబట్టి; ఆ పురుషార్థమునున్= ఆ ధర్మాన్ని; కొనియాడవలయున్= పొగడాలి.

తాత్పర్యం: ధర్మరాజా! ధర్మానికి అర్థం, అర్థానికి ధర్మం సరిసాటి. ధనానికి ఫలరూపంవంటిది కామంతంతు. కాబట్టి ధర్మం అనే పురుషార్థం అన్నిటికంటె ఉత్తమమైనది'.

వ. **అనిన విని పవననందనుం డిట్లనియె.** **458**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; పవన నందనుండు= భీముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అది విన్న భీముడు ఇట్లా అన్నాడు.

క. **'దధిసారము చందంబున। నధిపా! ధర్మార్థ సారమగు కామరసం**
బధమ మను తలఁపు సుఖసం। విధానబాహ్య మని నీ వివేకమ యెఱుఁగున్. **459**

ప్రతిపదార్థం: అధిపా!= ధర్మరాజా!; దధిసారము చందంబునన్= పెరుగులోని వెన్నవలె; ధర్మ+అర్థ= ధర్మం అర్థం అనే రెండు పురుషార్థాల; సారము+అగు= నిగ్గు అయిన; కామరసంబు= కామసారం; అధమము+అను= నీచమైనది అనే; తలఁపు= భావన; సుఖసంవిధాన= సుఖవర్తనానికి; బాహ్యము= వెలుపలిది, వెలియైనది; అని; నీ వివేకము+అ= నీ తెలివే; ఎఱుఁగున్= తెలియును.

తాత్పర్యం: పెరుగులో సారంగా ఉండే వెన్నవలె ధర్మార్థాలలో కామరసం సారంగా ఉంటుంది. అది చాలా నీచమైనదనే భావన, సుఖంగా బ్రతకటానికి వెలి అయిందని నీ తెలివే నీకు తేటపరుస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విను మళి యలరునఁ దేనియఁ । గొనుగతి నత్యంత సుఖము గొననగుఁ; గామం
బున నధిక సుఖము లొందని । జను సిరి తాఁ గొల్చులేని సస్యమ కాదే! 460

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; అళి= తుమ్మెద; అలరునన్= పువ్వులోని; తేనియన్= తేనెను; కొనుగతిన్= ఆరగించే విధంగా; అత్యంత సుఖము= ఎంతో హాయిని; కొనన్+అగున్= పొందవచ్చును; కామంబునన్= కామంవలన; అధిక సుఖములు= ఎక్కువ సౌఖ్యాలు; తాన్+ఒందని= తాను అనుభవించని; జనుసిరి= మనిషి సంపద; కొల్చులేని= తాలుగింజలు గల (ధాన్యంలేని); సస్యమ కాదే= పైరువంటిదే కదా.

తాత్పర్యం: విను తుమ్మెద పువ్వులోని తేనెను ఆరగించినట్లు మనిషి ఎక్కువ సౌఖ్యం పొందాలి. కామంవలన మరింత సౌఖ్యం పొందనివాడి సొత్తు చచ్చుగింజలు గల పంటవలె ఎందుకూ పనికిరాని దవుతుంది.

తే. అనఘ! ధర్మార్థకామంబు లందు నొకట । నర్థిఁ దగిలిన మానవుం డధముఁ; డొకటి
మాని వర్తించు నాతఁడు మధ్యముండు; । నడపు నన్నింటి నుత్తమనాయకుండు.' 461

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యవంతుడా!; ధర్మ+అర్థ+కామంబులందున్= ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాలలో; ఒకటన్= ఒకదాన్నే; అర్థిన్= కోరికతో; తగిలిన= ఆశ్రయించిన; మానవుండు= మనిషి; అధముఁడు= నీచుడు; ఒకటి మాని= మూడిట్లో ఒకటి వదులుకొని (రెంటిని ఆశ్రయించి); వర్తించు+ఆతఁడు= సంచరించేవాడు; మధ్యముండు= నడిమివాడు; ఉత్తమ నాయకుండు= మేలైనవాడు; అన్నింటిన్= ధర్మార్థ కామాలు మూడిటినీ; నడపున్= ఆచరిస్తాడు.

తాత్పర్యం: పుణ్యవంతుడా! ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాలలో ఒక్కటి అవలంబించేవాడు అధముడు. ఒకటి కాక రెంటిని ఆచరించేవాడు నడిమివాడు; మూటినీ నడిపేవాడు ఉత్తముడు'.

క. అని యిట్లందఱుఁ జెప్పఁగ । విని చిఱునవ్వున ముఖారవిందము చెలువం
బినుమడిగా ధర్మజుఁ డి । ట్లను వారలఁ గలయఁ జూచి యాదర మెసఁగన్. 462

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఇట్లా; అందఱున్= అంతమంది; చెప్పఁగన్= తెలుపగా; విని= ఆలకించి; చిఱునవ్వునన్= పిన్న నవ్వుతో; ముఖారవిందము= మొగం అనే కమలం; చెలువంబు= సొగసు; ఇనుమడిగాన్= రెండింతలు కాగా; ధర్మజుఁడు= ధర్మరాజు; వారలన్= వారిని; కలయన్+చూచి= పారచూచి; ఆదరము= ప్రేమ; ఎసఁగన్= మరింత కలుగగా.

తాత్పర్యం: అంటూ అంతమంది చెప్పగా విన్నాడు. ధర్మరాజు ముఖంలో అందం రెండింతలయింది. చిరునవ్వు నవ్వుతూ వాళ్ళను కలయచూశాడు. మరింత ప్రేమతో. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. ఏ నడిగిన తెఱంగునకు విదురుని వాక్యంబు సిద్ధాంతంబు; దక్కటివారి వచనంబులు నొక్కక్కమెయి నాదరణీయంబు; లదియట్లుండె; నా మతంబు వినుండు. 463

ప్రతిపదార్థం: ఏను= నేను; అడిగిన= తెఱంగునకున్= ప్రశ్నించిన విధానానికి; విదురుని వాక్యంబు= విదురుడి మాట; సిద్ధాంతంబు= తుదిమాట; తక్కటివారి= మిగతావారి; వచనంబులున్= మాటలూ; ఒక్కొక్క మెయిన్= ఒక్కొక్క తీరుగా; ఆదరణీయంబులు= మన్నించదగ్గవి; అది అట్లు+ఉండెన్= అది అట్లా ఉండనిండు; నా మతంబు= నా అభిప్రాయం; వినుండు= ఆలకించండి.

తాత్పర్యం: నే నడిగినదానికి విదురుడి మాటే ప్రమాణం. మిగతావారి మాటలు ఒక్కొక్కరీతిగా ఆచరించదగ్గవి. అది అట్లా ఉండనిండు. నా అభిప్రాయమూ వినండి.

**క. భూతములు జరామరణో । పేతంబులు గాన మోక్ష మెదఁ గోరుట మేఁ;
లాతతవర్గ త్రయ సం । జాత మనోదుఃఖభారసహుఁ డగు కంటెన్. 464**

ప్రతిపదార్థం: భూతములు= ప్రాణికోటి; జరా= ముసలితనంతోనూ; మరణ= చావుతోనూ; ఉపేతంబులు= కూడినవి; కానన్= కాబట్టి; ఆతత= విస్తరించి ఉన్న; వర్గత్రయజాత= ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాల వలన; సంజాత= పుట్టిన; మనో దుఃఖభార= మనస్సులో పుట్టే బాధల బరువులను; సహుఁడు+అగుకంటెన్= ఓర్చుకొని ఉండటం కంటె; ఎదన్= మనస్సులో; మోక్షమున్+కోరుట= ముక్తిని కోరుకొనటం; మేలు= మంచిది.

తాత్పర్యం: ప్రాణికోటికి అంతా చావు, ముసలితనం తప్పదు. విస్తరించి ఉన్న ధర్మార్థ కామాలు మానసిక వేదనలు కలిగిస్తాయి. వాటిని ఓర్చుకొని ఉండటంకంటె ముక్తిని కోరుకొనటం మంచిది.

వ. అది గోరిన దొరకొనునే? యందు మేని. 465

ప్రతిపదార్థం: అది= ఆ మోక్షం; కోరినన్= కావాలనుకొంటే; దొరకొనునే?= లభిస్తుందా?; అందుము+ఏని= అనుకొనేటట్లయితే.

తాత్పర్యం: మనం కోరుకొన్నంత మాత్రాన మోక్షం దొరుకుతుంది అనుకొంటె. (తరువాతి పద్యంతో అన్వయం).

**క. మనమున ధర్మము నర్థం । బును గామముఁ గీలుకొనక పొరపొచ్చెములై
చన సుఖదుఃఖంబుల మద । మును దైన్యముఁ బొందకునికి మోక్షకర మగున్.' 466**

ప్రతిపదార్థం: మనమునన్= కోరికలేనివారి మనస్సులో; ధర్మమున్= ధర్మమూ; అర్థంబును= అర్థమూ; కామమున్= కామమూ; కీలుకొనక= నాటుకొనకుండా; పొరపొచ్చెములై చనన్= కపటములై చరించు; సుఖ దుఃఖంబులన్= సుఖదుఃఖాలతో; మదమును= పొగరున్నూ; దైన్యమున్= దీనత్వాన్నీ; పొందక+ఉనికి= పొందకుండటం; మోక్షకరము+అగున్= ముక్తిదాయక మవుతుంది.

తాత్పర్యం: మనస్సులో ధర్మార్థ కామాలను నాటుకో నివ్వకూడదు. సుఖదుఃఖాలు అంటీ అంటకుండా వస్తూ పోతూ ఉంటాయి. కాబట్టి సుఖంచేత పొగరూ, దుఃఖంచేత దీనత్వం పొందకపోతే మోక్షం పొందినట్టే'.

వ. అనిన విని వారలందఱు నభినందించిరి; మఱునాఁడు నదీనందనుం గొలిచియుండి ధర్మనందనుండు 'నరపతులకు వలయు వారును, వలవని వారును నెట్టెట్టి వా?' రని యడిగిన నమ్మహాత్ముం డమ్మహీపతి కిట్లనియె. 467

ప్రతిపదార్థం: అనినన్= అనగానే; విని= ఆలకించి; వారలు+అందఱున్= వారంతా; అభినందించిరి= పొగిడారు. మఱునాఁడు= మరుసటినాడు; నదీనందనున్= భీష్ముడిని; కొలిచి+ఉండి; సేవించి; ధర్మనందనుండు= ధర్మరాజు; నరపతులకున్= రాజులకు; వలయువారును= కావలసినవారూ; వలవని వారును= అక్కరలేని వారూ; ఎట్టి+ఎట్టివారు+అని= ఎట్లాంటివారని; అడిగినన్= అడుగగా; ఆ+మహాత్ముండు= ఆ భీష్ముడు; ఆ+మహీపతికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మరాజు మాటలు విని వారంతా అతడిని ఎంతో మెచ్చుకొన్నారు. ఆ మరునాడు ధర్మరాజు భీష్ముడిని సేవించాడు. 'రాజునకు కావలసినవారు, అక్కరలేనివారు ఎట్లాంటి వారై ఉంటారో చెప్పు'మని అడిగాడు. భీష్ముడు ఇట్లా చెప్పాడు.

**ఉ. తాలిమిఁ బేర్చువారలును, ధర్మవిధిజ్ఞులు, సత్యవంతులున్,
లోలత లేనివారు, మదలోభ నిరర్థక కోపహీనులు**

నీలల సమేతులుం బలుకనేర్చుట కార్యము కాన్పు పెంపుమైఁ
జాలుట గల్గు భృత్యులును సంపద సేయుదు రాత్మభర్తకున్. 468

ప్రతిపదార్థం: తాలిమిన్= ఓర్పుచేత; పేర్చువారలును= మీరినవారూ; ధర్మవిధిజ్ఞులు= ధర్మం తెలిసిన వారున్నూ; సత్యవంతులున్= సత్యం మాట్లాడే వారూ; లోలతలేనివారున్= నిలకడ గలవారూ; మద= పొగరును; లోభ= పేరాశయూ; నిరర్థక కోపహీనులున్= ఊరకే కోపమునూ లేనివారు; శీలసమేతులున్= మంచి నడవడి కలవారూ; పలుక నేర్చుట= మాటకారితనం ఉండే; కార్యముకాన్పు= పనులమీద శ్రద్ధ ఉండే; పెంపుమైన్+చాలుట= ఎక్కువ ఆనుకూల్యం; కల్గు= ఉండే; భృత్యులును= పరిజనులూ; ఆత్మభర్తకున్= తమసామికి; సంపద+చేయుదురు= ఐశ్వర్యాన్ని కలిగిస్తారు.

తాత్పర్యం: ఓర్పు కలవారూ, ధర్మశాస్త్రాలు ఎరిగినవారూ, సత్యవంతులూ, చపలబుద్ధిలేనివారూ, పొగరుగానీ, పేరాశగానీ, కోపంగానీ లేనివారూ, చక్కటి నడవడి కలవారూ, మాటకారితనం, పనులలో శ్రద్ధ ఎంతో ఆనుకూల్యం ఉండే సేవకులు తమ యజమానికి సకల సంపదలు పొందిస్తారు.

ఉ. క్రూరుఁడు లోభియున్ శఠుఁడు గొండియుఁడున్ జడుడుం గృతఘ్నుఁడున్
నేరనివాఁడు బొంకరియు నిందకు నోర్చు నతండుఁ బందయున్
ధీరతలేమి దుర్నయ మతివ్యసనత్వముఁ గల్గు వారలుం
జేరువ నున్కి భూపతికిఁ జెట్ట యొనర్చు నరేశ్వరోత్తమా! 469

ప్రతిపదార్థం: నరేశ్వర+ఉత్తమా!= రాజులలోకెల్ల ఉత్తముడా!; క్రూరుఁడు= కనికరం లేనివాడు; లోభియున్= దురాశాపరుడూ; శఠుఁడున్= మూఢుడూ; కొండియుఁడున్= చాడీలు చెప్పేవాడు; జడుఁడున్= మందకొడిగా ఉండేవాడు; కృతఘ్నుఁడున్= చేసిన మేలు మరచిపోయేవాడు; నేరనివాఁడు= తెలివితేటలు లేనివాడు; బొంకరియున్= అబద్ధాలాడేవాడు; నిందకున్+ఓర్చు+అతండున్= నిందలు పడేవాడూ; పందయున్= పిరికివాడూ; ధీరతలేమి= సాహసం లేనివాడూ; దుర్నయమూ= దుర్నీతీ; అతివ్యసనత్వమున్= మితిమీరిన చెడు అలవాట్లు; కల్గువారలున్= కలవారున్నూ; చేరువన్= దగ్గరగా; ఉన్కి= ఉండటం; భూపతికిన్= రాజునకు; చెట్ట= కీడు; ఒనర్చున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: క్రూరుడూ, పేరాశపరుడూ, మూర్ఖుడూ, చాడీలు చెప్పేవాడూ, మందగొడి, చేసిన మేలు మర్చిపోయేవాడూ, తెలివి మాలినవాడూ, అబద్ధాలాడేవాడూ, నిందపడేవాడూ, పిరికివాడూ, తెగింపు లేనివాడూ, నీతిమాలినవాడూ, మితిమించిన చెడు అలవాట్లు కలవాడూ రాజునకు దగ్గరగా ఉంటే ఆపద ముంచుకొస్తుంది.

క. ఒప్పని గుణములఁ బరఁగెడు । నిప్పురుషాధములలోన నెల్లఁ గృతఘ్నుం
డొప్పఁడు గడు; నిట్లగుటం । జెప్పెడు నితిహాస మొకటి సెప్పెద నధిపా! 470

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; ఒప్పని గుణములన్= కాని స్వభావాలచేత; పరఁగెడు= నడచుకునేటి; ఈ+పురుషాధములలోనన్+ఎల్లన్= ఈ నీచులందరిలో; కృతఘ్నుండు= చేసినమేలు మరిచేవాడు; కడున్= ఎక్కువగా; ఒప్పఁడు= తగడు; ఇట్లు+అగుటన్= ఇట్లా అవటాన్ని; చెప్పెడు= చెప్పే; ఇతిహాసము= మునుపటి కథ; ఒకటి; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: తగని స్వభావం గల నీచులలోకెల్లా చేసిన మేలు మరిచిపోయేవాడు ఎక్కువ తగనివాడు. దీనిని చెప్పే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాతకాలంనాటి కథ ఒకటి చెప్తుతాను వినుము.

వ. అది కాశ్యపగౌతమాఖ్యానంబనం బెద్దల గోష్ఠిం బ్రవర్తిల్లు. 471

ప్రతిపదార్థం: అది= ఆ కథ; కాశ్యపగౌతమ+ఆఖ్యానంబు+అనన్= కాశ్యప గౌతముల కథ అనే పేరుతో; పెద్దల గోష్ఠిన్= పెద్దల సల్లాపాలలో; ప్రవర్తిల్లున్= ఉంటుంది.

తాత్పర్యం: ఆ కథ కాశ్యపగౌతమాఖ్యానం అనే పేరుతో పెద్దల వాడుకలో ఉన్నది.

భీష్ముఁడు ధర్మజునకు నాడీజంఘుడి చరిత్రంబు సెప్పుట (సం.12-162-281)

చ. 'విను మొక బ్రాహ్మణుండు కులవృత్తము పెంపుఁ దొఱంగి బోయదా
నినొకత నాలిఁ జేసికొని, నెమ్మిఁ గిరాతులఁ గూడి వేఁటకుం
జనుఁ దిను మాంస మద్దురితసక్తుఁడు భోగపరుండు గావునన్
ధనము ఘటింపఁగాఁ దగు విధం బని చూచి వణిగ్జనంబుతోన్. 472

ప్రతిపదార్థం: వినుము= విను; ఒక బ్రాహ్మణుండు= ఒక బ్రాహ్మణుడు; కులవృత్తము= కులవృత్తి; పెంపున్= గౌరవాన్ని; తొఱంగి= విడిచిపెట్టి; బోయదానిన్+ఒకతన్= ఒక బోయతను; ఆలిన్+చేసికొని= పెళ్ళాంగా ఉంచుకొని; నెమ్మిన్= సంతోషంతో; కిరాతులన్+కూడి= బోయవారితో కలిసి; వేఁటకున్+చనున్= వేటాడటానికి వెళ్ళుతాడు; మాంసమున్= మాంసాన్ని; తినున్= తింటాడు; ఆ+దురితసక్తుఁడు= పాపాన్ని కూడబెట్టుకొన్న ఆ పాపి; భోగపరుండు= సుఖాన్ని మరిగాడు; కావునన్= కాబట్టి; ధనము= సంపత్తి; ఘటింపఁగాన్= కూడబెట్టుకొనటానికి; తగు విధంబు+అని= సరైన తీరు అని; చూచి= అనుకొని; వణిక్+జనంబుతోన్= వర్తకుల గుంపుతో.

తాత్పర్యం: వెనుకటికి ఓ బాపడు, తన తాతముత్తాతలనాటి నుండి వస్తున్న కులవృత్తి గౌరవాన్ని వదులుకొని ఒక బోయదాన్ని పెళ్ళాడాడు. బోయవారితో కలిసిపోయి వేటాడే వాడు, మాంసం తినేవాడు. ఆ పాపాలపుట్ట బాగా సుఖాలకు మరిగి డబ్బు సంపాదించటానికి తగిన పద్ధతి ఇది అనుకొన్నాడు. వర్తకుల గుంపుతో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. చెలిమిసేసి కొందఱు గోమట్లు బేహారంబు వెంట దేశాంతరంబునకుం జనఁ దానును వారితోడం గూడి పోవం బోవ గిరిగహన దుర్గమస్థలంబున నొక్క వనగజంబు. 473

ప్రతిపదార్థం: చెలిమి+చేసి= నేస్తంకట్టి; కొందఱు+కోమట్లు= కొంతమంది వైశ్యులు; బేహారంబు+వెంటన్= వర్తకం కొరకు; దేశాంతరంబునకున్= మరొక రాజ్యానికి; చనన్= పోగా; తానును= తాను (బ్రాహ్మణుడు) కూడా; వారితోడన్ కూడి= వారితో కలిసి; పోవన్ పోవన్= పోగా పోగా; గిరి= కొండలలో; గహన= అడవులలో; దుర్గమ= పోవటానికి వీలులేకుండా ఉన్న; స్థలంబునన్= ప్రాంతంలో; ఒక్క వనగజంబు= ఒక అడవి ఏనుగు.

తాత్పర్యం: అందులో కొంతమంది కోమట్లు వ్యాపారం నిమిత్తం మరొకదేశానికి పోగా బ్రాహ్మణుడు వారితో కలిసి పోయాడు. అట్లా పోతుండగా కొండల్లో కోనల్లో ఒక అడవి ఏనుగు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. సాతులోని కుతికి జనముల నున్మద । లీల నేలఁ బెట్టి కాలఁ జమరఁ
జొచ్చుటయును భీతివిచ్చి నల్దిక్కులఁ । బఱచి రెల్లవారుఁ బటు రయమున. 474

ప్రతిపదార్థం: సాతులోనికిన్+ఉఱికి= వర్తకజనసమూహంమీద పడి; జనములన్= జనాన్ని; ఉన్మదలీలన్= వెర్రెత్తినట్లు; నేలన్+పెట్టి= నేలమీద పడేసి; కాలన్= కాలితో; చమరన్= తొక్కి చంపటం; చొచ్చుటయును= మొదలుపెట్టగా; భీతిన్= భయంతో; విచ్చి= విడివడి; ఎల్లవారున్= అంతమంది; పటురయమునన్= గబగబా; నల్దిక్కులన్= నాలుగు మూలలకు; పఱచిరి= పరుగెత్తిపోయారు.

తాత్పర్యం: ఆ బిడారులోని జనాన్ని పిచ్చెత్తినట్టు నేలమీదపడేసి కాలితో తొక్కి చంపటం మొదలు పెట్టింది. ఆ గుంపంతా బెదరిపోయి తలో దిక్కుకు చెల్లాచెద రయింది.

క. ఆయనయుఁ గాందిశీకుం। డై యుత్తర దిక్కు వాఱె నతి దూరముగా;
నా యెడ నొక మార్గము గని। పోయెను దాను నట పోవఁ బోవం గెలనన్. 475

ప్రతిపదార్థం: ఆయనయున్= ఆ బ్రాహ్మణుడూ; కాందిశీకుండు+ఐ= జడిసిపోయి తోవా తెన్నూ తెలియకుండా పరుగెత్తినవాడై; ఉత్తరదిక్కు= ఉత్తరం వైపునకు; అతిదూరముగాన్= చాలా దూరంగా; పాఱెన్= పరుగుతీశాడు; ఆ+ఎడన్= అపుడు; ఒక మార్గము+కని= ఒక తోవ చూచి; పోయెన్= వెళ్ళాడు; తానున్= ఆ బ్రాహ్మణుడు; అట= అక్కడి నుండి; పోవన్ పోవన్= పోగా పోగా; కెలనన్= ప్రక్కనే.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణుడూ భయంకొద్దీ దిక్కుతోచక పరుగెత్తాడు. ఉత్తరం వైపుగా చాలా దూరం పోయి ఒక దోవ చూచాడు. అతడు ఆ త్రోవలో వెళ్ళగా ఆ ప్రక్కనే. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. పొదల తఱచున జొంపమై పొడవుఁ బఱపుఁ। గలిగి వట్రువఁదనమునఁ జెలువు మిగిలి
యున్న వటభూరుహముఁ గని యుల్ల మచట। నిలువఁ గోరిన నామ్రాని నీడఁ జేరి. 476

ప్రతిపదార్థం: పొదల తఱచునన్= చిత్తొత్తుగా ఉన్న తుప్పలతో; జొంపమై= జీబుగా ఉండి; పొడవున్= ఎత్తూ; పఱపున్= వెడల్పూ; కలిగి= ఉండి; వట్రువ+తనమునన్= గుండ్రంగా ఉండటంచేత; చెలువు మిగిలి= అందగించి; ఉన్న; వట భూరుహమున్= ఒక మర్రిచెట్టును; కని= చూచి; ఉల్లము= మనస్సు; అచటన్= ఆ చెట్టు దగ్గర; నిలువన్+కోరినన్= ఉండాలనిపించగా; ఆమ్రాని నీడన్+చేరి= ఆ మర్రినీడకు పోయి.

తాత్పర్యం: దట్టంగా ఉన్న డొంకలమధ్య గుబురుగా ఉన్న ఓ మర్రిచెట్టును చూచాడు. అది చాలా ఎత్తుగా బాగా వెడల్పుగా ఎంతో గుండ్రంగా అందంగా ఉన్నది. అక్కడ కాసేపు నిలబడా లనిపించి ఆ చెట్టుక్రిందకు పోగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వనలతల కుసుమగంధము। గొని సుడివడు గాడ్పు డప్పిఁ గొండొక దేర్పం
దనుపార నచటఁ గూర్చుం। డె నతం డట్లుండ నచ్చటికి లలితగతిన్. 477

ప్రతిపదార్థం: వనలతల= అడవి తీగెల; కుసుమ గంధము= పూలసువాసన; కొని= గ్రహించి; సుడివడు= చుట్టుకొంటున్న; గాడ్పు= గాలి; డప్పిన్= అలసటను; కొండొక తేర్పన్= కొద్దిగా ఊరట కలిగించగా; అతండు= ఆ బ్రాహ్మణుడు; తనుపారన్= తృప్తిగా; అచటన్= ఆ మర్రినీడన; కూర్చుండెను= చతికిలపడ్డాడు; అట్లు+ఉండన్= అట్లా కూర్చుని ఉండగా; అచ్చటికిన్= ఆ చెట్టుదగ్గరకు; లలితగతిన్= అందంగా నడుచుకుంటూ.

తాత్పర్యం: అడవిపూలవాసనను ఇముడ్చుకొన్న సుడిగాలి అతడి అలసటను కొంచెం పోగొట్టింది. ఆ బ్రాహ్మణుడు తనివితీరా ఆ చెట్టు నీడన కూర్చున్నాడు. అంతలో అక్కడికి చక్కగా నడుచుకుంటూ. (తరువాతి వచనంతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అన్వయం).

వ. ఒక్క మహాబకంబు వచ్చె; నది పద్మభవునకుం బ్రసాద పాత్రం బగుచు నాడీజంఘుండును రాజధర్ముండు నను పేళ్ళం బరఁగు; నాకొక్కెరకు నమ్మఱ్ఱి నివాసంబై యుండు నప్పక్షి యట్లేతెంచి యవ్విప్రునిం గాంచి ప్రియంబు దలకొను చూడ్కి నాదరించి. 478

ప్రతిపదార్థం: ఒక్కమహాబకంబు= ఒక పెద్ద కొంగ; వచ్చెన్= వచ్చింది; అది= ఆ కొక్కెర; పద్మభవునకున్= బ్రహ్మకు; ప్రసాద పాత్రంబు+అగుచున్= దయకు నోచుకున్నదవుతూ; నాడీజంఘుండును= నాడీజంఘుడు; రాజధర్ముండున్= రాజధర్ముడు; అనుపేళ్ళన్+పరఁగు= అనే పేర్లతో ఒప్పే; ఆ కొక్కెరకున్= ఆ కొంగకు; ఆ+మఱ్ఱి= ఆ మఱ్ఱిచెట్టు; నివాసంబు+ఐ+ఉండున్= కాపురంగా ఉన్నది; ఆ పక్షి= ఆ కొంగ; అట్లు+ఏతెంచి= అట్లా వచ్చి; ఆ విప్రునిన్+కాంచి= ఆ బ్రాహ్మణుడిని చూచి; ప్రియంబు తలకొను= ఇష్టం తెలిపే; చూడ్కిన్= చూపుతో; ఆదరించి= ఆదరణ చూపి.

తాత్పర్యం: ఒక పెద్ద కొంగ వచ్చింది. ఆ కొంగ బ్రహ్మదయను నోచుకొన్నది. నాడీజంఘుడు, రాజధర్ముడూ అనేవి ఆ కొక్కెర పేర్లు. ఆ మఱ్ఱిచెట్టు మీదే ఆ కొంగ ఉండేది. ఆ కొంగ అట్లా వచ్చి బ్రాహ్మణుడిని చూచింది. ప్రేమతో ఆదరించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఎందుండి యేమి పనికై । యెందుల కరిగెదవు భూసురేశ్వర! ప్రీతిం
బొందితి నినుఁ గని; తగియెడు । విందవయితి నాకు; నీదు విధముం జెపుమా!' 479

ప్రతిపదార్థం: భూసుర+ఈశ్వర!= ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా!; ఎందున్+ఉండి= ఎక్కడినుండి; ఏమిపనికై= ఏం పనిమీద; ఎందులకున్= ఎక్కడకు; అరిగెదవు?= వెళ్ళుతున్నావు?; నినున్+కని= నిన్ను చూచి; ప్రీతిన్= సంతోషాన్ని; పొందితిన్= అనుభవించాను; నాకున్= నాకు; తగియెడు= తగ్గ; విందవు+అయితి= అతిథివి అయ్యావు; నీదు విధమున్= నీ తీరును; చెపుమా!= చెప్పవలసినది.

తాత్పర్యం: 'ఓ బ్రాహ్మణోత్తమా! ఎక్కడినుండి ఎక్కడికి ఏం పనిమీద వెళ్ళుతున్నావు? నిన్ను చూచి సంతోషించాను. నాకు తగ్గ అతిథివి. నీ సంగతులు తెలియజెప్పుము'.

వ. అని యడిగిన నతం 'డేను మధ్యదేశీయుండ' గౌతముండ నొక్క మహనీయ చరిత్రుని పుత్త్రుండ; నాలస్యంబున వేదాధ్యయనాది విప్రకర్మ విరహితుండ నయి కామలోలత్వంబున బోయత యిల్లాలుగా బోయలం గలిసియుండి, పేదటికంబునకు నలసి బేహారంబు వెంట నొక్కసాతుం గూడి పరదేశంబున కరుగుచోట గిరి గహన దుర్గమ ప్రదేశంబున. 480

ప్రతిపదార్థం: అని అడిగినన్= అని అడుగగా; అతండు= ఆ బ్రాహ్మణుడు; ఏను= నేను; మధ్యదేశీయుండన్= మధ్యదేశ నివాసిని; గౌతముండన్= గౌతముడు అనే వాడిని; ఒక్క మహనీయ చరిత్రుని= మంచినడవడికలవాడి; పుత్త్రుండన్= కొడుకును; ఆలస్యంబునన్= సోమరితనంవలన; వేద+అధ్యయన+ఆది= వేదం వల్లించటం మొదలైన; విప్రకర్మ= బ్రాహ్మణ కర్మలు; విరహితుండను+అయి= మానివేసిన వాడినై; కామలోలత్వంబునన్= కామంమీద తృష్ణతో; బోయత= బోయకాంత; ఇల్లాలుగాన్= పెళ్ళాంగా; బోయలన్= బోయవాళ్ళతో; కలిసి+ఉండి= కూడి ఉండి; పేదటికంబునకున్= పేదతనానికి; అలసి= వేసారి; బేహారంబు వెంటన్= వ్యాపారం వెంబడి; ఒక్కసాతున్+కూడి= ఒక వర్తకులగుంపుతో కలసి; పరదేశంబునకున్= మరొక రాజ్యానికి; అరుగుచోటన్= వెళ్ళే ప్రదేశంలో; గిరి= కొండలవలన; గహన= అడవులవలనా; దుర్గమ= కాలుపెట్టలేని; ప్రదేశంబున= తావులో.

తాత్పర్యం: అని అడుగగా 'నాది మధ్యదేశం. నా పేరు గౌతముడు. నేను ఉత్తమ బ్రాహ్మణుడి కొడుకును. నేను

సోమరిపోతునై వేదాలు వల్లించటం వంటి మా జాతికర్మలను మానివేశాను. కామంలో పడి ఒక బోయదాన్ని పెళ్ళాడాను. బీదరికంతో విసిగిపోయి వర్తకం వెంబడి ఒక బిడారుతో కలిసి మరో దేశానికి వెళ్ళుతున్నాను. కాలుతీసి కాలుపెట్టలేనంత దట్టంగా ఉన్న కొండలలో అడవులలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వనకరియొక్కటి యా సా। తునకుఁ గవిసి జనచయంబుఁ ద్రుంపఁ దొడఁగుడున్
వినుమెల్లవారునుం గను। కనిఁ బఱచిరి భీతి నేను గాననభూమిన్. 481

ప్రతిపదార్థం: వనకరి= అడవి ఏనుగు; ఒక్కటి; ఆ సాతునకున్= ఆ వర్తకుల గుంపుమీదికి; కవిసి= ఉరికి; జనచయంబున్= గుంపును; త్రుంపన్= చంపటానికి; తొడఁగుడున్=మొదలు పెట్టగా; వినుము= వినుము; ఎల్లవారునున్= ఆ జనమంతా; కనుకనిన్= తత్తరపాటుతో; పఱచిరి= పారిపోయారు; ఏను= నేనూ; భీతిన్= భయంతో; కానన భూమిన్= అడవిలో.

తాత్పర్యం: ఒక అడవి ఏనుగు ఆ బిడారుమీద పడి చంపబోయింది. ఆ గుంపులోని వారంతా తత్తరపడి పరుగెత్తారు. నేనూ భయపడి అడవిలో. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. పఱచి దిక్కు దప్పి భాగ్యంబు కల్మి నీ। దైన నిలయమునకు నరుగుదేరఁ
గంటి' ననిన 'మేలుగాక! నీ దారిద్ర్య। మపనయింతుఁ; జింత యపనయింపు. 482

ప్రతిపదార్థం: పఱచి= పరుగెత్తి; దిక్కు తప్పి= దారి తప్పి; అరుగుదేరన్= రాగా; భాగ్యంబు కల్మి= అదృష్టంకొద్దీ; నీదైన= నీకు సంబంధించినది అయిన; నిలయమునకున్= తావలాన్ని; కంటిన్= చూచాను; అనినన్= అనగానే; మేలు+కాక= (కొంగ) మంచి జరుగుగాక; నీ దారిద్ర్యమున్= నీ లేమిని; అపనయింతున్= పోగొట్టుతాను; చింత= దుఃఖాన్ని; అపనయింపు(ము)= వదలిపెట్టుము.

తాత్పర్యం: పరుగెత్తి త్రోవ తప్పాను. నా అదృష్టంకొద్దీ నీవు ఉండే ఈ మర్రిని చూచాను.' అనగానే ఆ కొంగ, 'మంచిదే నీ బీదతనాన్ని పోగొట్టుతాను. నీవు బాధపడకుము.

వ. అంతకు నియ్యాతిథ్యంబుఁ గయికొను' మని రుచిమంతంబులగు మందాకినీ మీనంబులు సుపక్వంబులు సేసి, మధురంబు లగు వన్యఫలంబులు దెచ్చి తృప్తియగునట్లుగా నతనికి నాహారవిధి యొనర్చి, రాత్రి యగుటయుం బల్లవ పుష్పసాంద్రం బగు శయనంబు గల్పించి యబ్బకపతి యద్ధరణీసురుని తోడి సముచిత సల్లాపంబులను సుఖనిద్రను నా రాత్రి గడపి వేగుటయు, నవ్విప్రు నాలోకించి. 483

ప్రతిపదార్థం: అంతకున్= అంతలోపల; ఈ ఆతిథ్యంబున్= ఈ నా అతిథిసేవను; కయికొనుము+అని= పొందుమని; రుచిమంతంబులు+అగు= చవులూరించే; మందాకినీ= గంగానదిలోని; మీనంబులు= చేపలను; సుపక్వంబులు+చేసి= బాగా నిప్పులమీద కాల్చి; మధురంబులు+అగు= తీయటి; వన్యఫలంబులు= అడవి పళ్ళు; తెచ్చి= తీసికొని వచ్చి; తృప్తి+అగునట్లుగాన్= తనివితీరేటట్లు; అతనికిన్= బ్రాహ్మణుడికి; ఆహారవిధి= భోజన కార్యక్రమం; ఒనర్చి= చేసి (ముగించి); రాత్రి అగుటయున్= పొద్దుపోవటంవలన; పల్లవ= చిగురుటాకులతో; పుష్ప= పూలతో; సాంద్రంబు+అగు= ఒత్తుగా పరచిన; శయనంబు= పడకను; కల్పించి= కూర్చి, ఏర్పరచి; ఆ+బకపతి= ఆ కొంగలరాజు రాజధర్ముడు; ఆ+ధరణీసురునితోన్= ఆ బ్రాహ్మణుడితో; సముచిత= తగిన; సల్లాపంబులనున్= సంభాషణలతోనూ; సుఖనిద్రనున్= ఆదమరచిన నిద్రతోనూ; ఆ+రాత్రి= ఆ రేయి; కడపి= వెళ్ళబుచ్చి; వేగుటయున్= తెల్లగా తెల్లవారగానే; ఆ+విప్రున్= ఆ బ్రాహ్మణుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: తన ఆతిథ్యాన్ని అందుకొనుమన్నది. మంచిరుచిగా ఉండే గంగానదిలోని చేపలను కాల్చి తెచ్చింది. తీయటి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అడవిపళ్ళు పెట్టింది. అతిథి బ్రాహ్మణుడు తృప్తి పడేటట్లు భోజనం పెట్టింది. పొద్దు పోవటంతో చిగురుటాకులతోనూ, పూలతోనూ, ఒత్తుగా పక్కను సిద్ధం చేసింది. ఆ కొంగలరాజు ఆ బ్రాహ్మణుడు ముచ్చటలతోనూ హాయి అయిన నిద్రతోనూ ఆ రాత్రి గడిపారు. తెల్లవారగానే ఆ బ్రాహ్మణుడిని చూచి కొంగ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'విను! మిత్రుండును రజతముఁ। గనకము బుద్ధియును నాల్గుకారణములు మ
ర్త్యుని దారిద్ర్యము వాయుట। కని దేవగురుండు సెప్పె నన్నిటిలోనన్. 484

ప్రతిపదార్థం: విను= వినుము; మిత్రుండును= చెలిమికాడూ; రజతమున్= వెండీ; కనకమున్= బంగారమున్నూ; బుద్ధియును= ఆలోచనా; మర్త్యుని= మనిషి; దారిద్ర్యము= లేమితనం; పాయుటకున్= పోగొట్టటానికి; నాల్గు కారణములు= నాలుగు హేతువులు; అని; దేవగురుండు= బృహస్పతి; చెప్పెన్= చెప్పాడు; అన్నిటిలోనన్= ఈ నాలుగింటిలో.

తాత్పర్యం: 'వినుము. మనిషి పేదరికం పోవటానికి స్నేహితుడూ, వెండీ, బంగారమూ, ఆలోచనా అనే నాలుగింటిని కారణాలుగా దేవగురువు బృహస్పతి చెప్పాడు. వీటి అన్నింటిలోనూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. మిత్రుం డెక్కుడు కాశ్యప। పుత్త్రుఁడనగు నేను నీకు భూసురవర! స
న్మైత్రి యనుష్ఠించెద నటె। పాత్రము గాకుండుదే యపార శ్రీకిన్. 485

ప్రతిపదార్థం: భూసురవర!= బ్రాహ్మణోత్తముడా!; మిత్రుండు= స్నేహితుడు; ఎక్కుడు= దొడ్డవాడు; కాశ్యప పుత్రుఁడను+అగు= కశ్యపుడి కొడుకునైన; నేను= నేను (నాడీజంఘుడిని); నీకున్= నీతో; సన్మైత్రి= మంచి స్నేహం; అనుష్ఠించెదను+అటె= చేస్తున్నవాడిని అవుతుండగా; అపార శ్రీకిన్= అంతులేని సిరులకు; పాత్రము+కాకుండుదే= తగినవాడివి కాకపోతావా!

తాత్పర్యం: ఓ బాపనయ్యా! మిత్రుడు గొప్పవాడు. కశ్యపుడి సంతానంలోని వాడనైన నేను నీతో చెలిమి చేస్తూ ఉంటే అంతులేని సిరిసంపదలకు యోగ్యుడివి కాకుండా పోతావా?

తే. నా సఖుండు విరూపాక్ష నామధేయుఁ। డతని పురము మధువ్రజ; మదియు మూఁడు
యోజనము లిచ్చటికి; దాని కుల్ల తెరువు। వట్టి వేచని యాదైత్యభర్తఁ గనుము. 486

ప్రతిపదార్థం: విరూపాక్ష నామధేయుఁడు= విరూపాక్షుడనే పేరుగలవాడు; నా సఖుండు= నా చెలిమికాడు; అతని పురము= అతడి పట్టణం; మధు వ్రజము= మధు వ్రజం; అదియున్= ఆ పట్టణం కూడా; ఇచ్చటికిన్= ఇక్కడకు; మూఁడు యోజనములు= మూడామడల దూరం; దానికిన్= మధు వ్రజానికి; ఉల్ల తెరువుపట్టి= అంతదూరం అంత దగ్గరా కానీ తోవను బట్టి; వేచని= వడిగా వెళ్ళి; ఆ దైత్యభర్తన్= ఆ రాక్షస రాజును; కనుము= చూడుము.

తాత్పర్యం: నాకు విరూపాక్షుడనే మిత్రు డొకడు ఉన్నాడు. మధువ్రజం అతడిపట్టణం. అది ఇక్కడకు మూడామడల దూరంలో ఉంటుంది. దానికి మరీ దూరం మరీ దగ్గర కాని త్రోవ వెంబడే గబగబా వెళ్ళుము. ఆ రాక్షసరాజును ఆశ్రయించుము.

క. కాంచి యతనితో నేఁ బు। త్తెంచితినని చెప్పు; మతఁ డతిప్రీతుండై
కాంచనమును రత్నంబులు। నంచితుఁగాఁ జేసి యిచ్చు నప్పుడ నీకున్.' 487

ప్రతిపదార్థం: కాంచి= చూచి; అతనితోన్= ఆ విరూపాక్షుడితో; ఏన్= నేను; పుత్తెంచితిని+అని= పంపించాను అని; చెప్పుము= చెప్పుము; అతఁడు= ఆ రక్కసిదొర; అతి ప్రీతుండు+ఐ= ఎంతో సంతోషించినవాడై; కాంచనమును= బంగారమూ; రత్నంబులున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మణులూ; అంచితుఁగాన్+చేసి= గౌరవించినవాడిగా చేసి; నీకున్= నీకు; అప్పుడ= అప్పటికప్పుడే; ఇచ్చున్= ఇస్తాడు.

తాత్పర్యం: విరూపాక్షుడిని చూచి అతడితో నేను పంపించినట్లు చెప్పుము. అతడు ఎంతో సంతోషిస్తాడు. బంగారం, మణులూ ఇచ్చి నిన్ను సత్కరిస్తాడు'.

క. అని యప్పురి దెస సెప్పినఁ। జని యాతం డతనిఁ గాంచి సముచిత భంగిన్
వినిపించె రాజధర్ముఁన। కనుగలమగు సఖుఁడ ననియు నతని పనుపునన్. 488

ప్రతిపదార్థం: అని= అని; ఆ+పురిదెస= ఆ పట్టణం పోయే దిక్కును; చెప్పినన్= తెలుపగా; చని= వెళ్ళి; ఆతండు= ఆ బ్రాహ్మణుడు; అతనిన్= ఆ రక్కసి దొరను; కాంచి= చూచి; సముచిత భంగిన్= తగిన రీతిలో; రాజధర్మునకున్= నాడీజంఘుడికి; అనుగలము+అగు= అనుకూలుడనైన; సఖుఁడన్= మిత్రుడిని; అనియున్= అని కూడా; వినిపించెన్= చెప్పాడు; అతని పనుపునన్= నాడీజంఘుడు పంపటంవలన.

తాత్పర్యం: అంటూ ఆ కొంగ మధువ్రజం పోయే దిక్కును చెప్పింది. ఆ దారివెంబడి వెళ్ళి ఆ బ్రాహ్మణుడు విరూపాక్షుడిని చూచాడు. నేను నాడీజంఘుడికి ఆప్తమిత్రుడిని అని చెప్పాడు. అతడు పంపబట్టి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అరుగుదెంచితి ననియు, ధనార్థిననియు, । నిట్లు వినిపించుటయు, రాక్షసేశ్వరుండు
దేఱకొనఁజూచి, యాత్మ నిప్పాఱుఁ డధముఁ। డగుట దోఁచుచు నున్నది; యడుగ వలయు. 489

ప్రతిపదార్థం: అరుగుదెంచితిని= వచ్చాను; అనియున్= అనీ; ధన+అర్థిన్+అనియున్= ధనాన్ని కోరివచ్చాననీ; ఇట్లు= ఇట్లా; వినిపించుటయున్= చెప్పగానే; రాక్షస+ఈశ్వరుండు= రాక్షసరాజు; తేఱకొనన్+చూచి= తేరిపార చూచి; ఆత్మన్= మనస్సులో; ఈ+పాఱుఁడు= ఈ బ్రాహ్మణుడు, అధముఁడు+అగుటన్= నీచుడు అని; తోఁచుచున్+ఉన్నది= అనిపిస్తున్నది; అడుగవలయున్= అడిగి చూడాలి.

తాత్పర్యం: డబ్బుకోరి వచ్చాను' అని బ్రాహ్మణుడు చెప్పగానే విరూపాక్షుడు అతడిని తేరిపార చూచాడు. లోలోపల 'ఈ బ్రాహ్మణుడు నీచుడుగా అనిపిస్తున్నాడు. సంగతేమిటో అడిగి తెలిసికొనాలి.'

వ. అని తలంచి. 490

తాత్పర్యం: అని అనుకొని.

క. 'కులమును విద్యయు వృత్తముఁ। గల రూ పెఱిఁగింపు' మనినఁ గలఁగక తన్నుం
దెలియంగఁ జెప్పె విప్రుం। డలఘుం డగు నసురపతియు నవికృతుఁ డగుచున్. 491

ప్రతిపదార్థం: కులమును= వంశాన్నీ; విద్యయున్= చదువునూ; వృత్తమున్= నడతనూ; కలరూపు= ఉన్నదున్నట్లుగా; ఎఱిఁగింపుము= తెలుపుము; అనినన్= అని అడగగానే; విప్రుండు= బ్రాహ్మణుడు; కలఁగక= కలతచెందక; తన్నున్= తన సంగతిని; తెలియంగన్ చెప్పెను= ఎరుకపరిచాడు; అలఘుండు+అగున్= గొప్పవాడవటంవలన; అసురపతియున్= రాక్షసరాజు విరూపాక్షుడు కూడా; అవికృతుఁడు+అగుచున్= ఎట్లాంటి (శారీరక, మానసిక) వికారాలకు లోనుకానివాడవుతూ.

తాత్పర్యం: 'నీ వంశం, నీ చదువు, నీ నడవడి ఉన్నదున్నట్లుగా చెప్పుము' అని అడిగాడు. అందుకు ఆ బ్రాహ్మణుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏ మాత్రం జంకలేదు. తన సంగతి అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. అపుడు విరూపాక్షుడు కూడా ఎట్లాంటి (మానసిక, శారీరక) వికారాలకు లోబడనివాడవుతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఇతఁ డెట్టిఁ డైన నేమగు? । నతనికి సఖుఁ డట్టె బకమహత్తర సఖ్యం
బితనిం బాత్రముఁ జేయదె! । యితనికిఁ దృప్తి యగునట్టు లిత్తు ధనంబుల్.' 492

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ బాపడు; ఎట్టిఁడు+ఐనన్= ఎట్లాంటివాడైనా; ఏమి+అగున్?= ఏమవుతుంది?; అతనికిన్= అతడికి (రాజధర్ముడికి); సఖుఁడు+అట్టె= స్నేహితుడట; బక= కొంగ; మహత్తర సఖ్యంబు= గొప్ప చెలిమి; ఇతనిన్= ఈ బ్రాహ్మణుడిని; పాత్రమున్= యోగ్యుడిని; చేయదె!= చేస్తుంది కదా!; ఇతనికిన్= ఇతడికి; ధనంబుల్= సిరులు; తృప్తి+అగునట్టులు= కరువుతీరా; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: ఈ బ్రాహ్మణుడు ఎట్లాంటివాడైతే ఏమిలే. నాడీజంఘుడితో స్నేహమే ఈ బ్రాహ్మణుడి యోగ్యతను తెలుపుతుంది. కాబట్టి ఇతడికి కరువుతీరా ధనం ఇస్తాను'.

వ. అని నిశ్చయించి యతనికి నాహార సంఛాదనంబులు సమీచీనంబుగా నిర్వర్తింపఁ దగువారి నియోగించి, మఱునాఁడు కార్తికపౌర్ణమాసియైన భూసుర సహస్రంబులు దన గృహంబునం బసిండిపళ్ళెరంబుల భోజనంబులు సేయను, బహుళ దక్షిణలు ప్రతిగ్రహింపనుం గల నైమిత్తిక క్రియానుష్ఠానంబులు గలిగిన నమ్మహాజనంబులలోఁ గలిపి యత్యంతాదరంబున. 493

ప్రతిపదార్థం: అని; నిశ్చయించి= నిర్ణయించి; అతనికిన్= ఆ బాపడికి; ఆహార= తిండీ; సంఛాదనంబులు= మంచి బట్టలూ; సమీచీనంబుగాన్= తగ్గట్టుగా; నిర్వర్తింపన్+తగువారిన్= సిద్ధం చేయగలవాళ్ళను; నియోగించి= నియమించి; మఱునాఁడు= మర్నాడు; కార్తికపౌర్ణమాసి+ఐనన్= కార్తీక పౌర్ణమి కాగా; తన గృహంబునన్= తన (విరూపాక్షుడి) ఇంట్లో; భూసుర సహస్రంబులు= వేలకొద్ది బ్రాహ్మణులు; పసిఁడి పళ్ళెరంబులన్= బంగారు పళ్ళాల్లో; భోజనంబులు+చేయను= తినటానికీ; బహుళదక్షిణలు= చాలా కానుకలు; ప్రతిగ్రహింపనున్+కల= పుచ్చుకొనగల; నైమిత్తిక క్రియ= ఏదో ఒక కారణం పెట్టి చేసే కర్మల; అనుష్ఠానంబులు+కలిగినన్= ఆచరించవలసి ఉండగా; ఆ మహాజనంబులలోన్+కలిపి= వేలకొద్ది వచ్చిన బ్రాహ్మణులతోపాటు; అత్యంత+ఆదరంబునన్= ఎక్కువగా మన్నించి.

తాత్పర్యం: అని నిర్ణయించుకొని ఆ బ్రాహ్మణుడికి అవసరానికి తగ్గట్టుగా తిండీ, బట్టలూ సమకూర్చిపెట్టటానికి కొంతమందిని నియమించాడు. ఆ మరునాడు కార్తీకపౌర్ణమి. విరూపాక్షుడు తన ఇంట్లో వేలకొద్ది బ్రాహ్మణులు బంగారు పళ్ళాలలో భోజనాలు ఆరగించటానికీ, కానుకలు ఎక్కువగా పుచ్చుకొనటానికీ అనువుగా గల కర్మలు ఆచరించాడు. ఆ మహాజనంతోపాటు ఎంతో ఆదరణతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. మహనీయ బహుళపూజా । సహితంబుగ భోజనంబు సంతృప్తిగ న
మ్మహితాత్ముండు నడపి దు । ర్వహ భారముగాఁగ గనకరాశియు మణులున్. 494

ప్రతిపదార్థం: మహిత+ఆత్ముండు= దొడ్డ మనస్సు కలవాడు; మహనీయ= గొప్పవైన; బహుళపూజా సహితంబుగన్= అనేకమైన సేవలతో కూడా; భోజనంబు= తిండిని; సంతృప్తిగన్= తుష్టిగా; నడపి= జరిపి; దుర్వహ= మోయలేనంత; భారముకాఁగన్= బరువు అయ్యేటట్లు; కనకరాశియున్= బంగారం ముద్దా; మణులున్= రత్నాలు.

తాత్పర్యం: దొడ్డమనస్సుగల ఆ విరూపాక్షుడు ఆ బ్రాహ్మణుడికి ఎన్నో సేవలు చేశాడు. కడుపునిండా కమ్మని తిండి పెట్టాడు. మొయ్యలేనంత బంగారం, రత్నాలు ఇచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. కుడిచిన పళ్ళెరంబును నకుంఠిత హర్షముతోడ నిచ్చినం
గడుముదమంది యెత్తికొని గాఢభరంబున మార్చి మోవఁగా
మెడయును వీఁపు మూఁపులును మిక్కిలి నొవ్వనఁ గొంకు వోవ నె
క్కుడు వెస నేఁగుదెంచెఁ గని కొక్కెర సమ్మదమంద మఱ్ఱికిన్. 495

ప్రతిపదార్థం: కుడిచిన పళ్ళెరంబునున్= తిన్న బంగారు పళ్ళాన్నికూడా; అకుంఠిత= మొక్కవోని; హర్షముతోడన్= సంతోషంతో; ఇచ్చినన్= ఇవ్వగా; కడు ముదమున్+అంది= ఎంతో సంతోషించి; ఎత్తుకొని= తీసికొని; గాఢభరంబునన్= బరువు ఎక్కువ అవటంచేత; మార్చి= అటుదిటూ, ఇటుది అటూ మార్చుకొని; మోవఁగాన్= మొయ్యగా; మెడయును= మెడకాయా; వీఁపు= వీపూ; మూఁపులును= భూజాలూ; మిక్కిలి నొవ్వనన్= ఎక్కువ నొప్పివలన; కొంకుపోవన్= కొంకరలుపోగా; కొక్కెర= కొంగ; కని= చూచి; సమ్మదము+అందన్= సంతోషించగా; ఎక్కుడు వెసన్= తొందర తొందరగా; మఱ్ఱికిన్= మఱ్ఱిచెట్టు దగ్గరకు; ఏగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: తిన్న బంగారు పళ్ళాన్ని కూడా మనసారా ఇచ్చాడు. బ్రాహ్మణుడు ఆనందంగా దాన్నీ పుచ్చుకొన్నాడు. బరువు ఎక్కువ అవటంతో భుజాలూ చేతులూ మార్చుకొంటూ మోస్తున్నాడు. బరువువలన మెడా, వీపూ, రెక్కలూ చాలా నొప్పిపెట్టాయి. ఆ నొప్పివలన వంగిపోతున్నాడు. గబగబా అంగలువేస్తూ నాడీజంఘుడు ఉండే మఱ్ఱి చెట్టును చేరుకొన్నాడు. అతడిని చూచి కొంగ సంతోషించింది.

తే. అట్లు సంతోషమునఁ దేలి యతని డప్పి । వోవ బకవల్లభుఁడు పక్షపుటయుగమున
నల్ల వీచి యాహార సమర్పణంబు । సేసి నిసి యైన, సుఖనిద్ర సేయుచుండ. 496

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; సంతోషమునన్= ఆనందంతో; తేలి= తృప్తిపడి; బకవల్లభుఁడు= కొంగలరాజు నాడీజంఘుడు; పక్షపుటయుగమునన్= దొప్పల్లాంటి రెండు రెక్కలచేతా; అతని= ఆ బ్రాహ్మణుడి; డప్పి= అలుపు; పోవన్= పోయేటట్లు; అల్లన్ వీచి= మెల్లగా విసరి; ఆహార సమర్పణంబు+చేసి= తిండిపెట్టి; నిసి+ఐనన్= రాత్రి కాగా; సుఖనిద్ర చేయుచున్+ఉండఁగాన్= హాయిగా కునుకు తీస్తుండగా.

తాత్పర్యం: అట్లా వచ్చిన బ్రాహ్మణుడిని చూచి కొంగ తృప్తిపడింది. దొప్పలవంటి తన రెండు రెక్కలతో మెల్లగా విసరి అతడి బడలిక పోగొట్టింది. ఆకలి తీర్చింది. రాత్రి అయింది. ఆదమరిచి నిద్రపోతుండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

నాడీజంఘుఁడు దుష్టబ్రాహ్మణునిచే మృతుండై, మరల జీవించుట (సం.12-166-2,3)

వ. ఆ దుర్బ్రాహ్మణుండు దనరేపటి పయనంబునకు నాహారంబు చింతించి 'యిమ్మహాబకంబు శరీరంబు గ్రొవ్వియున్నది; దీనియందు మాంసంబు సాలం గల; దిది యేమఱి నిద్రవోయెడుఁ; జావనడిచి చెండికొని పోయెదంగాక!' యని పాపనిశ్చయుండై చీర సక్కంగట్టికొని యొక్క కాష్ఠంబు గర యుగంబునం జిక్క నమర్చికొని. 497

ప్రతిపదార్థం: ఆ దుర్బ్రాహ్మణుండు= ఆ చెడ్డ బ్రాహ్మణుడు; తన= తన; రేపటి= మర్నాటి; పయనంబునకున్= ప్రయాణానికి; ఆహారంబు= తిండిని గురించి; చింతించి= ఆలోచించి; ఈ+మహాబకంబు= ఈ పెద్ద కొంగ; శరీరంబు= ఒళ్ళు; క్రొవ్వి+ఉన్నది=

బలిసి ఉన్నది; దీనియందు= కొంగ ఒంట్లో; మాంసంబు= కండ; చాలన్+కలదు= ఎక్కువగా ఉన్నది; ఇది= ఈ కొంగ; ఏమఱి= మైమరచి; నిద్రపోయెడున్= కునుకుతీస్తున్నది; చావన్+అడిచి= చావమోది; చెండి= చంపి ముక్కలు ముక్కలు చేసికొని; కొని పోయెదన్+కాక= ఎత్తుకెళ్ళుతాను; అని= అని; పాపనిశ్చయుండు+ఐ= చెడ్డగా తలపోసినవాడై; చీర= బట్ట; చక్కన్+కట్టికొని= బాగా బిర్రుగా లాగి కట్టుకొని; ఒక్కకాష్ఠంబున్= ఒక బడితను; కరయుగంబునన్= రెండు చేతులలో; చిక్కన్= గట్టిగా; అమర్చికొని= పొందికగా పెట్టుకొని.

తాత్పర్యం: ఆ పాడు బాపడు మర్నాటి ప్రయాణంలో తిండిని గురించి ఆలోచించాడు. ఈ కొంగ ఒళ్ళు బాగా కొవ్వి కండపట్టి ఉన్నది. ఇది ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నది. దీన్ని చావమోది మాంసాన్ని ముక్కలు ముక్కలు చేసి పట్టుకుపోవాలని దుర్మార్గంగా ఆలోచించాడు. బట్టను లాగి బిగించి కట్టుకొని రెండు చేతులతోనూ కర్రను బాగా గట్టిగా పట్టుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అందంద మెడయుఁ దలయు న । మందాటోపమునఁ బెక్కు మాఱు లడిచి చావుం
దెలియఁ జూచి యలరెడు । డెందముతో నీఁకలన్నిటిని వెస నూడ్చెన్. 498

ప్రతిపదార్థం: అందందన్= అప్పటికప్పుడే; మెడయున్= మెడకాయా; తలయున్= తలకాయా; అమంద ఆటోపమునన్= గొప్ప తొందరపాటుతో; పెక్కుమాఱులు= పలుసార్లు; అడిచి= బాది(కొట్టి); చావున్= ప్రాణం పోవటాన్ని; తెలియన్+చూచి= నిక్కం చేసుకొని; అలరెడు= ఆనందించే; డెందముతోన్= మనస్సుతో; ఈఁకలన్నిటిని= అన్ని ఈకలను; వెసన్= తొందరగా; ఊడ్చెన్= ఊడ పెరికివేశాడు.

తాత్పర్యం: అప్పటికప్పుడే మెడమీదా తలమీదా దబదబా చితకబాదాడు. ప్రాణంపోయిందని రూఢి చేసికొన్నాడు. ఈకలన్నీ గబగబా పెరికేశాడు.

తే. ఊడ్చి బొందువు వ్రచ్చి ప్రేవురివి నంజు । డంతయును బుచ్చి పొదుకగా నమరఁ గట్టి
కొనుచు వేగుఁ బోకగుటయుఁ జనియె; నట్టి । సమయమున మేలుకని దనుజప్రభుండు. 499

ప్రతిపదార్థం: ఊడ్చి= ఈకలు పెరికి; బొందువు= పీక; వ్రచ్చి= చీల్చి; ప్రేవు+ఉరివి= పేగులు బయటకు లాగి; నంజుఁడు+అంతయును= మాంసాన్ని అంతా; పుచ్చి= వేరుచేసి; పొదుకగాన్= మూటగా; అమరన్+కట్టికొనుచున్= పొందికగా కట్టుకొంటూ; వేఁగు బోకగుటయున్= తెల్లవారగా; అట్టి సమయమునన్= అపుడు; దనుజ ప్రభుండు= రాక్షసరాజు; మేలుకని= నిద్రనుండి లేచి.

తాత్పర్యం: ఈకలన్నీ పెరికేశాడు. పీకను చీల్చాడు; పేగులు బయటకులాగి మాంసాన్ని పొందికగా మూటకట్టుకొన్నాడు. అంతలో తెల్లవారగా విరూపాక్షుడు నిద్రనుండి లేచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పొల వలచె నేమి గీడొకొ । కలిగెడు!' నని తలఁచి మనసు గలఁగఁగఁ దనవా
రలతోడ నుగ్గడించుచుఁ । జలియించుచునుండఁ బ్రొద్దు జామెక్కుటయున్. 500

ప్రతిపదార్థం: పొలవలచెన్= నీచుకంపు కొడుతున్నది; ఏమి కీడు= ఏమి ఆపద; కలిగెడున్+ఒకొ= రానున్నదో; అని తలఁచి= అని తలపోసి; మనసు= మనస్సు; కలఁగఁగన్= కలత చెందగా; తనవారలతోడన్= తన వారితో (రాక్షసులతో); ఉగ్గడించుచున్= చెప్తుతూ; చలియించుచున్+ఉండన్= వణకుతూ ఉండగా; ప్రొద్దుజాము ఎక్కుటయున్= జాము పొద్దెక్కగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మాంసం కంపు కొడుతున్నది. ఏం ముప్పు ముంచుకొస్తుందో ఏమో! మనస్సులో కలతగా ఉన్నది' అని తన వారితో చెప్తుతూ భయంతో వణకిపోతున్నాడు. జాము పొద్దెక్కగా.

వ. రాజధర్మునిం దలంచి. 501

ప్రతిపదార్థం: రాజధర్మునిన్= రాజధర్ముడిని; తలంచి= తలచుకొని.

తాత్పర్యం: రాజధర్ముడిని గుర్తుకు తెచ్చుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. నిచ్చలు వచ్చు రేపకడ నెయ్య మెలర్పఁగ మత్సఖుండు; నేఁ
డిచ్చటి కేల రాఁడు? గుణహీనత విప్రునియందుఁ గల్మి నా
యిచ్చఁ దలంచితిం; దులువ యేమి దలంచెనొ? యక్కటా! మదిం
బొచ్చెము లేదు నమ్ము బకపుంగవుఁ; డెట్లగు నొక్కొ దైవమా! 502

ప్రతిపదార్థం: నెయ్యము= స్నేహం; ఎలర్పఁగన్= పెంపొందగా; మత్+సఖుండు= నా నేస్తగాడు; రేపకడన్= పొద్దున్నే; నిచ్చలున్= ప్రతినిత్యమూ; వచ్చున్= వస్తాడు; నేఁడు= ఈనాడు; ఇచ్చటికిన్= నా దగ్గరకు; ఏల రాడు?= ఎందుకురాలేదో; విప్రుని+అందున్= బాపనయ్యలో; గుణహీనత= నీచస్వభావం; కల్మిన్= ఉండటం; నా+ఇచ్చన్= నా మనస్సులో; తలంచితిన్= అనుకొన్నాను; తులువ= తుంటరి; ఏమి తలంచెనొ= ఏం తలపెట్టాడో; అకటా!= అయ్యో!; దైవమా!= దేవుడా!; బక పుంగవుఁడు= బకోత్తముడు; ఎట్లు+అగున్+ఒక్కొ= ఏమవుతాడో ఏమో; మదిన్= మనస్సులో; పొచ్చెము లేదు= కల్మషం ఉండదు; నమ్ము= నామాట నమ్ము.

తాత్పర్యం: నా మిత్రుడు ప్రతినిత్యం పొద్దున్నే వచ్చేవాడు. ఇవాళ ఎందుకు రాలేదో ఏమో! బ్రాహ్మణుడు నీచుడని అపుడే అనుకొన్నాను. ఈ తుచ్ఛుడు ఏం తలపెట్టాడో ఏమో? అయ్యో! దైవమా! నాడీజంఘుడు ఏం కానున్నాడో ఏమో? ఏమీ కల్మషం ఎరగనివాడు. అందరినీ నమ్ముతాడు'.

క. అని తూరవగచి యారయఁ। బనిచెం బనిగఱపి భటులఁ బలువుర వారుం
జని బకము దొక్క యేర్పడఁ। గని యతనికిఁ జెప్పి పుచ్చి కడు వేగమునన్. 503

ప్రతిపదార్థం: అని= అని; తూరవగచి= విచారించి; పలువురన్= చాలా మంది; భటులన్= సేవకులను; పని+కఱపి= పురమాయించి; ఆరయన్= కొంగను వెదకటానికి; పనిచెన్= పంపాడు; వారున్= ఆ సేవకులున్నూ; చని= వెళ్ళి; బకము= కొంగ; డొక్క= ఎముకల గూడు; ఏర్పడన్+కని= కళ్ళారా చూచి; కడువేగమునన్= ఆ వెనువెంటనే; అతనికిన్= రక్కసి దొరకు; చెప్పిపుచ్చి= కబురుపెట్టి.

తాత్పర్యం: లోతుగా ఆలోచించాడు. తన పరివారానికి కొంగను వెదకండని పురమాయించాడు. ఆ పరిజనం వెళ్ళి వెదకి, కొంగ డొక్కను గుర్తు పట్టి వెంటనే ఆ సంగతి రాజునకు కబురు పంపి. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. అవ్విప్రుని చొప్పువట్టి. 504

ప్రతిపదార్థం: ఆ+విప్రుని= ఆ బ్రాహ్మణుడి; చొప్పు+పట్టి= జాడను తెలిసికొని.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణుడు ఎటువైపుగా వెళ్ళాడో ఏమిటో తెలిసికొని. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. పరిమెయిఁ బాఱి వానిఁగని పట్టి వడిం బెడగేలు గట్టి తె
చ్చి రసురభర్త సూచి 'యిటు సేరఁగఁ దేవల దీ కృతఘ్నునిం;
బొరిగొని వే తినుం' డనినఁ బోకడ మాలిన వార మయ్య! యి
ద్దురిత శరీరముం దినఁగ దోసము మా' కని వార లొల్లమిన్. 505

ప్రతిపదార్థం: పరిమెయిన్= బాగా వేగంగా; పాఱి= పరుగెత్తి; వానిన్= ఆ బ్రాహ్మణుడిని; కనిపెట్టి= వెదకి పట్టుకొని; వడిన్= వేగిరంగా; పెడ కేలు కట్టి= చేతులు వెనక్కి విరిచికట్టి; తెచ్చిరి= రాజువద్దకు తీసికొనివచ్చారు; అసురభర్త= రాక్షసరాజు విరూపాక్షుడు; చూచి= కని; ఈ కృతఘ్నునిన్= చేసిన మేలు మరచి చంపిన ఈ బాపనయ్యను; ఇటు+చేరఁగన్= ఇట్లా నా దరిదాపులకు; తేవలదు= తీసికొని రావద్దు; పొరిగొని= చంపి; వే తినుండు= వెంటనే తినండి; అనినన్= అనగానే; ఈ దురిత శరీరమున్= ఈ పాపి బొందిని; తినఁగన్= నమలటానికి; పోకడ మాలిన వారము+అయ్య= నీతిలేని వాళ్ళమా; మాకు= మాకు; దోసము= పాపం; అని= అని; వారలు= ఆ సేవకులు; ఒల్లమిన్= ఇష్టపడకపోవటం వలన.

తాత్పర్యం: వడి వడిగా పరుగెత్తి ఆ బ్రాహ్మణుడిని వెదకి పట్టుకొన్నారు. వెంటనే రెక్కలు విరిచికట్టి రాజు ముందుకు తెచ్చారు. విరూపాక్షుడు 'ఇతడు చేసినమేలు మరచినవాడు, వీడిని నా చాయలకు తేకండి, వీడిని వెంటనే చంపి తినండి' అని సేవకులతో చెప్పాడు. ఆ మాటలు విన్న భటులు 'ఈ పాపిష్ఠి శరీరాన్ని తినటానికి మేమంత నీతిలేని వాళ్ళమా? ఇట్లాంటివి తింటే మాకు పాపం అంటుకుంటుంది' - అని ఇష్టపడకపోవటంవలన.

వ. అతండు. 506

తాత్పర్యం: ఆ విరూపాక్షుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'తినుఁడు తినకుఁ; డొం డేమై । నను జేయుఁడు; వీని నేల నా ముందటికిం
గొని వచ్చితి?' రని పలికిన । దనుజులు పురి వెడలఁ దెచ్చి తద్గాత్రంబున్. 507

ప్రతిపదార్థం: తినుఁడు= తింటే తినండి; తినకుఁడు= తినకపోతే మానండి; ఒండు+ఏమైనను= మరేమైనా మీ ఇష్టం వచ్చినట్లు; చేయుఁడు= చేయండి; వీనిన్= ఈ కృతఘ్నుడిని; నా ముందటికిన్= నా ఎదుటకు; ఏల?= ఎందుకు?; కొనివచ్చితిరి?= తీసికొని వచ్చారు?; అని పలికినన్= అని అనగా; దనుజులు= రాక్షసులు; పురి= పట్నం (మధువ్రజం); వెడలన్= వెలుపలికి; తెచ్చి= తీసికొని వచ్చి; తద్+గాత్రంబున్= ఆ బ్రాహ్మణుడి శరీరాన్ని.

తాత్పర్యం: 'తింటే తినండి లేకపోతే మానెయ్యండి. ఏం చేసినా సరే. ఈ కృతఘ్నుడిని నా ఎదుటికి ఎందుకు తెచ్చారు?' అని రాజు అనగానే ఆ రాక్షసులు మధువ్రజం వెలుపలికి తీసికొనివెళ్ళి అతడి శరీరాన్ని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వెడ గోఁతల నెత్తు రొలుక । బడఁ ద్రోచిన వచ్చి కుక్క పదుపు వెనుకకున్
జడిసెఁ గబళింప నొల్లక । కడుపులు నకనకఁ బడంగఁ గౌరవముఖ్యా!' 508

ప్రతిపదార్థం: కౌరవముఖ్యా!= ధర్మరాజా!; వెడ= చిన్న చిన్న కండలుగా; కోఁతలన్= కోసిన గాయాలనుండి; నెత్తురు+ఒలుకన్= రక్తం కారుతుండగా; పడన్+త్రోచినన్= పడనెట్టగా; కడుపులు= డొక్కలు; నకనకపడంగన్= ఆకలి నొప్పితో; కుక్కపదుపు= కుక్కలమంద; వచ్చి= వచ్చిపడి; కబళింపన్= ఆ పాపి శరీరాన్ని తినటానికి; ఒల్లక= ఇష్టపడక; వెనుకకున్= వెనక్కి; జడిసెన్= మళ్ళింది.

తాత్పర్యం: రాజా! చిన్న చిన్న కండలుగా కోసిన గాయాలనుండి రక్తం చిందుతూ ఉండగా పడదోశారు. అంతలో ఆ పాపిశరీరాన్ని తినటానికి నకనకలాడుతున్న కడుపులతో కుక్కలమంద వచ్చిపడింది. అంత ఆకలితోనూ అవి ఆ పాపాత్ముడి శరీరాన్ని ముట్టకుండానే వెనక్కి తిరిగి వెళ్ళిపోయాయి'.

వ. అని చెప్పి భీష్ముండు. 509

ప్రతిపదార్థం: అని= అని; చెప్పి= పలికి; భీష్ముండు= భీష్ముడు.

తాత్పర్యం: అని చెప్పి భీష్ముడు - (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'విను మది యట్టిద; కుక్కలుఁ। దినగా రోయుం గృతఘ్ను దేహము మాంసం
బని చెప్ప నాగమంబులు। మనుజేశ్వర! తెల్లమయ్యె మన కిచ్చోటన్.' 510

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= ధర్మరాజా!; వినుము= వినుము; అది= ఆ తినకపోవటం; అట్టిద= అట్లాంటిదే; కృతఘ్ను దేహము= చేసిన మేలును మరిచేవాడి శరీరం; మాంసంబు= కండను; కుక్కలు; తినఁగాన్= తినటానికి; రోయున్= రోత పడతాయి; అని; ఆగమంబులు= వేదాలు; చెప్పన్= పలుకగా; మనకున్= మనక్కూడా; ఇచ్చోటన్= ఇక్కడనే ఈ విషయంగా; తెల్లము+అయ్యెన్= తేట పడింది, విశదపడింది.

తాత్పర్యం: వినుము - అది అటువంటిదే. కృతఘ్నుడి మాంసాన్ని కుక్కలు కూడా ముట్టవు, రోతపడతాయి' అని వేదాలే ఘోషిస్తున్నాయి. ఆ విషయం ఈ కథవలన మనకూ తేటతెల్లమయింది కదా!'

వ. అని పలికి వెండియు నిట్లనియె. 511

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్= భీష్ముడు ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ భీష్ముడు ఇట్లా అన్నాడు.

క. పురపురఁ బొక్కుచు బకపతి। కరంకముం దేరఁ బనిచి గారవమున నె
య్యురుఁ దాను నగ్ని యిచ్చి య। సురపతి యున్నంత వచ్చె సురపతి నెమ్మిన్. 512

ప్రతిపదార్థం: పురపురన్+పొక్కుచున్= ఎంతో ఏడుస్తూ; బకపతి= నాడీ జంఘుడి; కరంకమున్= డొక్కను; తేరన్= తేవటానికి; పనిచి= పంపించి; నెయ్యురున్= స్నేహితులున్నూ; తానున్= తానూ (విరూపాక్షుడూ); గారవమునన్= గౌరవంతో; అగ్ని+ఇచ్చి= తలకొరివి పెట్టి; అసురపతి= రాక్షస రాజు; ఉన్నంతన్= ఉండటంతో; నెమ్మిన్= ప్రేమతో; సురపతి= దేవేంద్రుడు; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: విలవిల ఏడుస్తూ నాడీజంఘుడి డొక్కను తెప్పించాడు. స్నేహితులతో కలిసి, తాను గౌరవంగా తలకొరివి పెట్టాడు. అపుడు దేవేంద్రుడు వచ్చాడు.

క. కని యతఁడు సంభ్రమంబును। వినయంబును బెరయ గారవించి యడిగె నా
తని 'రాజధర్ము నీవే'। యని దైన్యము దోఁప వగచి యశ్రులు దొరఁగన్. 513

ప్రతిపదార్థం: కని= ఇంద్రుడిని చూచి; అతఁడు= విరూపాక్షుడు; సంభ్రమంబును= తత్తరపాటున్నూ; వినయంబును= అణకువా; బెరయన్= కూడుకోగా; గారవించి= గౌరవించి; దైన్యము= దీనత్వం; తోఁపన్= అవుపడగా; వగచి= దుఃఖించి; అశ్రులు= కన్నీరు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తొరఁగన్= రాలగా; రాజధర్మున్= రాజధర్ముడిని; ఈవే= తిరిగి బ్రతికించవా; అని; అతనిన్= ఇంద్రుడిని; అడిగెన్= అడిగాడు.

తాత్పర్యం: ఇంద్రుడిని చూచాడు విరూపాక్షుడు. అతడిలో తత్తరపాటు వినయం కలగలుపుగా దీనత్వం తోపగా, విలవిల ఏడుస్తూ 'నా రాజధర్ముడిని తిరిగి బ్రతికించవా' అంటూ వేడుకొన్నాడు.

వ. అడిగిన నమరవిభుండు 'నీ సఖుండు చతుర్ముఖునకు సఖుం డగుట యెఱుంగవే? వానికి వగవనేల? యవ్వారిజాసనుండు దనపాలికి ననుదినంబు వాఁడు వచ్చుటం గోరుచుండుం గావున. 514

ప్రతిపదార్థం: అడిగినన్= ప్రార్థించగా; అమర విభుండు= దేవేంద్రుడు; నీ సఖుండు= నీ చెలికాడు; చతుర్ముఖునకున్= బ్రహ్మకు; సఖుండు+అగుట= స్నేహితుడవటం; ఎఱుంగవే?= తెలియదా?; వానికిన్= నాడీజంఘుడి కొరకు; వగవన్+ఏల?= ఏడ్వటం ఎందుకు?; ఆ+వారిజ+ఆసనుండు= ఆ బ్రహ్మ; తనపాలికిన్= తన వద్దకు; అనుదినంబు= ప్రతినిత్యం; వాఁడు వచ్చుటన్= నాడీ జంఘుడి రాకను; కోరుచున్+ఉండున్= కోరుతూ ఉంటాడు; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: విరూపాక్షుడి ప్రార్థన విన్న ఇంద్రుడు 'నీ చెలికాడు నాడీజంఘుడు బ్రహ్మకూ స్నేహితుడని నీకింతవరకూ తెలియదా? అతడి గురించి ఏడవటం ఎందుకు? అతడు ప్రతినిత్యమూ తన దగ్గరకు రావాలని బ్రహ్మకోరుకుంటాడు. కాబట్టి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. పలుమాఱును రామికి ను । త్తలపడియెను; దాన నిట్టి దశ నతఁ డొందెం;
జెలి యగుట నితని డొక్కకు । నలఘువిథిన్ వహ్ని యిచ్చి తది మేల కదా! 515

ప్రతిపదార్థం: పలుమాఱును= తరుచుగా; రామికిన్= రానందుకు; ఉత్తలపడియెను= బాధపడుతుండేవాడు; దానన్= అందువలననే; అతఁడు= నాడీజంఘుడు; ఇట్టిదశన్= పైలోకాన్ని; ఒందెన్= పొందాడు; చెలి+అగుటన్= స్నేహితుడు అవటంవలన; ఇతని డొక్కకున్= ఈ కొంగ ఎముకల గూడుకు; అలఘు విధిన్= గొప్పగా; వహ్ని+ఇచ్చితి=(వి) తలకొరివి పెట్టావు; అదిమేలకదా!= అది మంచిది కదా!

తాత్పర్యం: తరచూ రానందుకు బ్రహ్మ విచారించేవాడు. అతడికి ఇట్లాంటి దశ పట్టిందంటే అతడి స్నేహితుడవటంవలననే నీ స్నేహితుడవటంవలన నీవు ఈ కొంగకు తలకొరివి పెట్టావు. అది చాలా మంచి పనికదా!

వ. అ ట్లగ్నిసంస్కారంబు సేసి నీవు వచ్చిన యనంతరంబ తచ్చితాసమీపంబున. 516

ప్రతిపదార్థం: అట్లు= ఆ రీతిగా; అగ్నిసంస్కారంబు+చేసి= దహన సంస్కారం చేసి; నీవు= నీవు; వచ్చిన+అనంతరంబ= వచ్చిన వెంటనే; తద్+చితా సమీపంబునన్= ఆ కాటినిప్పు దగ్గరలో.

తాత్పర్యం: అట్లా దహన సంస్కారం ముగించిన నీవు ఇట్లా వచ్చావో లేదో ఆ వెంటనే ఆ చితిమంట దగ్గరలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కడు నర్మిలిఁ గ్రేపుం జను । గుడుపఁ దొడఁగె నొక్క సురభి గుఱుపా ల్బెరయం
బడు వత్స వక్త్ర ఫేనము । సుడిగాలిం దూలిపడియె సొదపై ననఘా! 517

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; ఒక్కసురభి= ఒక ఆవు; కడున్= మిక్కిలి; అర్మిలిన్= ప్రేమచేత; క్రేపున్= దూడను; చనుకుడుపన్= పాలు ఇవ్వటానికి; తొడఁగెన్= మొదలుపెట్టింది; కుఱుపాల్= చిన్న చేపువలన; బెరయన్‌పడు= చిందిపడే; వత్స=

దూడ; వక్త్రఫేనము= నోటి నురగ తుంపర; సుడిగాలిన్= సుడిగాలిచేత; సొదపైన్= చితి మీదికి; తూలిపడియెన్= చెదరిపడింది.

తాత్పర్యం: ఒక ఆవు తన దూడకు ఎంతో ప్రేమగా పాలిస్తుండగా చిన్న పాలచేపు రాగానే దూడ నోటినుండి నురగ తుంపర జారిపడింది. అది సుడిగాలికి ఎగిరి చితిమీద పడింది.

వ. దానంజేసి యన్నాడీజంఘుండు సంజీవితుం డయి యెప్పటియట్ల యొప్పెడు నాకారంబుతో నరుగుదెంచుచున్నవాఁ; డి ట్లగుటకుం గారణంబును నద్దేవుని దివ్యచిత్తంబు మహానుభావంబ.' 518

ప్రతిపదార్థం: దానన్+చేసి= నురగ పడటంవలన; ఆ+నాడీజంఘుండు= ఆ రాజధర్ముడు; సంజీవితుండు+అయి= మళ్ళీ బతికినవాడై; ఎప్పటి+అట్ల= ఎప్పటిమాదిరిగానే; ఒప్పెడున్= శోభిల్లే; ఆకారంబుతోన్= రూపంతో; అరుగుదెంచుచున్+ఉన్నవాఁడు= వస్తూ ఉన్నాడు; ఇట్లు+అగుటకున్= ఇట్లా జరగటానికి (తిరిగి బతికి రావటానికి); కారణంబు= నిమిత్తం, మిష; ఆ+దేవుని= ఆ బ్రహ్మదేవుడి; దివ్యచిత్తంబు= లోకాతీతమైన దయా; మహాను భావంబ= మహిమే.

తాత్పర్యం: ఆ నురగ పడిందో లేదో నాడీజంఘుడు తిరిగి బ్రతికాడు. మునుపటి మాదిరిగానే అదే రూపంతో వస్తూ ఉన్నాడు. ఇట్లా జరిగిందీ అంటే అది ఆ బ్రహ్మదేవుడి లోకాతీతమైన దయామహిమే!'

క. అని చెప్పె నంత బకపతి । సనుదెంచెను దనుజపతికి సమ్మద మెసఁగన్
మును వాసవుఁ డజువాక్యము । నన పాశ నిబద్ధుఁ జేసినాఁ డవ్విప్రున్. 519

ప్రతిపదార్థం: అని= అని; చెప్పెన్= చెప్పాడు; అంతన్= అంతలో; బకపతి= కొంగలరాజు నాడీజంఘుడు; దనుజపతికిన్= రాక్షస రాజు విరూపాక్షుడికి; సమ్మదము= ఆనందం; ఎసఁగన్= ఎక్కువయ్యేటట్లు; చనుదెంచెన్= వచ్చాడు; మును= కొంగ రాకముందే; వాసవుఁడు= దేవేంద్రుడు; అజువాక్యముననన= బ్రహ్మమాటమీద; ఆ+విప్రున్= ఆ బ్రాహ్మణుడిని; పాశనిబద్ధున్= తాళ్ళతో కట్టినవాడిగా; చేసినాఁడు= చేశాడు.

తాత్పర్యం: అని ఇంద్రుడు చెప్పగానే కొంగలరాజు రానేవచ్చాడు. అతడి రాకకు విరూపాక్షుడు మరింత సంతోషించాడు. అంతకు మునుపే ఇంద్రుడు బ్రహ్మ మాట ప్రకారం ఆ బ్రాహ్మణుడిని తాళ్ళతో కట్టించాడు.

క. ఆ నాడీజంఘుండును । దాని నెఱిఁగి భూసురునకుఁ దనకతమున న
ద్దీనదశయగుట కోర్వక । వాని విడుపు గోరి వేఁడె వరముగ నింద్రున్. 520

ప్రతిపదార్థం: దానిని= బ్రాహ్మణుడిని కట్టేశాడని; ఎఱిఁగి= తెలిసికొని; ఆ నాడీజంఘుండును= ఆ కొంగ; భూసురునకున్= ఆ బ్రాహ్మణుడికి; తన కతమునన్= తనకారణంగా; ఆ+దీనదశ+అగుటకున్= ఆ దైన్యస్థితి కలిగినందుకు; ఓర్వక= సహించలేక; వాని విడుపున్= ఆ బ్రాహ్మణుడి విడుదలను; కోరి= కోరుకొని; ఇంద్రున్= ఇంద్రుడిని; వరముగన్= వరంగా; వేఁడెన్= ప్రార్థించాడు.

తాత్పర్యం: ఆ రాజధర్ముడు, బ్రాహ్మణుడికి తనవలన కలిగిన దురవస్థకు తట్టుకొనలేకపోయాడు. అతడిని విడిపించుమని ఇంద్రుడిని వరం అడిగాడు.

చ. అతఁడును దివ్యబోధమున నా సమయంబున బ్రహ్మ సత్కృపా
న్వితుఁ డగు టేర్పడం గని వినీతతముం డగు రాజధర్ము వాం
ఛిత మొనరించె విప్రునకుఁ జేర్చిరి తెచ్చినవారు తద్ధన
ప్రతతియు దైత్యనాయకుఁడు పంప బకాధిపుఁ బ్రస్తుతించుచున్. 521

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అతఁడును= ఆ ఇంద్రుడూ; ఆ సమయంబునన్= వరం అడిగేటప్పుడు; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; సత్కృపా+అన్వితుఁడు+అగుట= మంచి దయతో కూడినవాడవటం; దివ్యబోధనమునన్= అతీంద్రియ జ్ఞానంచేత; ఏర్పడన్+కని= తెల్లంగా తెలిసికొని; వినీతతముండు+అగు= ఎక్కువ వినయవంతుడైన; రాజధర్ము= కొంగ; వాంఛితమున్= కోరికను; ఒనరించెన్= తీర్చాడు; దైత్యనాయకుఁడు= రాక్షసరాజు విరూపాక్షుడు; పంపన్= పంపగా; తద్= ఆ బ్రాహ్మణుడి; ధనప్రతతియున్= ధనం మొత్తాన్ని; తెచ్చినవారు= తీసికొని వచ్చినవారు (రాక్షసులు); విప్రునకున్= బ్రాహ్మణుడికే; చేర్చిరి= తిరిగి చేరవేశారు; బకాధిపున్= కొంగలరాజు నాడీజంఘుడిని; ప్రస్తుతించుచున్= పొగడుతూ.

తాత్పర్యం: ఈ వరం ఇవ్వటంలో బ్రహ్మదేవుడి దయ ఉన్నదని ఇంద్రుడు దివ్యజ్ఞానంతో తెలిసికొన్నాడు. వెంటనే బ్రాహ్మణుడిని విడిచిపెట్టి, కొంగ కోరిక తీర్చాడు. రాక్షసరాజు ఆజ్ఞతో బ్రాహ్మణధనాన్ని తెచ్చినవారు తిరిగి అతడికి ముద్రశుద్ధిగా ముట్టచెప్పారు. నాడీజంఘుడిని కొనియాడుతూ. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అవ్విప్రుండు ధనసంచయంబు మోచికొని మరలి మరలి చూచుచు సంభ్రమంబునం బోయెఁ; దదనంతరంబ. 522

ప్రతిపదార్థం: ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ధన సంచయంబున్= ధనం మొత్తాన్ని; మోచికొని= మోస్తూ; మరలి మరలి చూచుచున్= మళ్ళీ మళ్ళీ తిరిగి చూస్తూ; సంభ్రమంబునన్= తత్తరపాటుతో; పోయెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబ= ఆ తరువాత.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణుడు ధనం మూటను మోసుకొంటూ వెనక్కి తిరిగి చూస్తూ తత్తరపడుతూ పోయాడు. ఆ తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సురపతియుఁ ద్రివిష్టపమున । కరిగె; బకాధీశుఁడును నిజాలయమునకున్
గరిమంబు మెఱయఁ జనియెం । బరితుష్టుం డగుచు దైత్యపాలుం డనుపన్.' 523

ప్రతిపదార్థం: సురపతియున్= ఇంద్రుడూ; త్రివిష్టపమునకున్= దేవలోకానికి; అరిగెన్= వెళ్ళాడు; బక+అధీశుఁడును= కొంగలరాజూనూ; దైత్యపాలుండు= రాక్షసరాజు; పరితుష్టుండు+అగుచున్= బాగా సంతోషించినవాడవుతూ; అనుపన్= పంపగా; గరిమంబు= గొప్పతనం; మెఱయన్= ఒప్పగా; నిజ+ఆలయమునకున్= తా నుండే తావుకు; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఇంద్రుడూ స్వర్గలోకానికి వెళ్ళిపోయాడు. విరూపాక్షుడు ఆ బకరాజు రాజధర్ముడిని సంతోషంగా సాగనంపాడు. అతడూ గొప్పగా తానుండే మర్రిచెట్టును చేరుకొన్నాడు'.

క. అని చెప్పి తాత యిట్లను । మనుమనితో నాదరమున మఱియును 'బ్రహ్మ
ఘ్నునకును నిష్కృతి గలుగును; । వినుము కృతఘ్నునకు లేదు విమలచరిత్రా! 524

ప్రతిపదార్థం: అని చెప్పి; తాత= భీష్మయ్య తాత; మనుమనితోన్= మనుమడైన ధర్మరాజుతో; మఱియును= మళ్ళీ; ఆదరమునన్= ఆపేక్షతో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; విమల చరిత్రా!= మచ్చలేని నడతకలవాడా!; బ్రహ్మఘ్నునకును= బ్రాహ్మణుడిని చంపినవాడికైనా; నిష్కృతి= పాపవిముక్తి; కలుగును= కలుగుతుంది; కృతఘ్నునకున్= చేసిన మేలు మరిచేవాడికి; లేదు= ఉండదు; వినుము= వినుము.

తాత్పర్యం: భీష్ముడు మనుమడికి కాశ్యప గౌతమోపాఖ్యానం అంతా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు. 'ధర్మరాజా! బాపనవాడిని చంపినవాడికైనా పాపనిష్కృతి ఉంటుంది కాని చేసిన మేలు మరచిపోయినవాడికి మాత్రం పాపవిముక్తి

ఉండదు.

క. ఆరయ మిత్త్ర ద్రోహము । దారుణమగు పాతకము గృతఘ్నత కంటెన్;
వైరము గొని విడువవలయు । నా రెండు దెఱఁగుల వారి నాప్తుల నైనన్. 525

ప్రతిపదార్థం: ఆరయన్= విచారించగా; మిత్త్రద్రోహము= స్నేహితుడికి కీడు తలపెట్టటం; కృతఘ్నతకంటెన్= చేసిన మేలు మరిచినదానికంటే; దారుణము+అగు= భయంకరమైన; పాతకము= పాపం; ఆ రెండు+తెఱంగులవారిన్= ఈ రెండు రకాల (మిత్రద్రోహులు - కృతఘ్నులు) వారిని; ఆప్తులనైనన్=క్షేమం కోరేవారైనప్పటికీ; వైరము కొని= విరోధం పెట్టుకొని; విడువ వలయున్= వదలిపెట్టాలి.

తాత్పర్యం: నిజానికి ఆలోచిస్తే స్నేహితుడికి కీడు తలపెట్టటం, చేసిన మేలు మరచిపోవటం కన్నా మించిన మహాపాపం. ఈ రెండు రకాల వారు మన మంచికోరుకునేవారైనా సరే - వైరం పెట్టుకొని వారిని వదలుకొనటం మంచిది.

క. మిత్త్రుం డైహికములు నా । ముత్త్రికములు నైన భద్రములు దలకొలుపున్;
మిత్త్ర ధనంబులలోనను । మిత్త్రుఁడ యెక్కుడనుమాట మెత్తురు ప్రాజ్ఞుల్. 526

ప్రతిపదార్థం: మిత్త్రుండు= చెలిమికాడు; ఐహికములున్= ఈ లోకానికి సంబంధించినవీ; ఆముత్త్రికములును+ఐన= పై లోకానికి సంబంధించినవి అయిన; భద్రములు= శుభాలు; తలకొలుపున్= కలిగిస్తాడు; మిత్ర ధనంబులలోనను= మిత్రుడూ, ధనం అనే రెంటిలోకూడా; మిత్త్రుఁడ= నేస్తగాడే; ఎక్కుడు= ఎక్కువ; అనుమాటన్= అనే వాక్కును; ప్రాజ్ఞుల్= పెద్దలు; మెత్తురు= మెచ్చుకొంటారు.

తాత్పర్యం: స్నేహితుడు ఇహపరలోక సౌఖ్యాలు రెంటినీ సమకూర్చగలడు. మిత్రుడూ, ధనం - ఈ రెంటిలో మిత్రుడే మిన్న - అంటూ మెచ్చుకుంటారు పెద్దలు.

క. ఉత్తమ కులజుఁడు సుగుణా । యత్తుఁడు సస్నేహమతియు నగు మిత్త్రునకుం
చిత్తమెలర్చు తెఱంగునఁ । బొత్తు మనఁగవలయు శుభము పొందవలసినన్.' 527

ప్రతిపదార్థం: శుభము=మేలు; పొందవలసినన్= కలగాలంటే; ఉత్తమ కులజుఁడు= ఉన్నత వంశంలో పుట్టినవాడూ; సుగుణ+ఆయత్తుఁడు= మంచి గుణాలకు వశమైనవాడూ; సస్నేహమతియున్= స్నేహాన్నికోరే బుద్ధికలవాడూ; అగు= అయినట్టి; మిత్త్రునకున్= స్నేహితుడికి; చిత్తము= మనస్సు; ఎలర్చు తెఱంగునన్= అలరించేటట్లు; పొత్తు= కలసి మెలసి; మనఁగవలయున్= నడచుకొనాలి.

తాత్పర్యం: ఎవరైనా మేలు పొందాలంటే మంచికులంలో పుట్టినవాడూ, సుగుణాలు కలవాడూ, మంచి స్నేహం కావాలనుకొనేవాడూ అయిన స్నేహితుడితో పొత్తు పెట్టుకొనాలి. అతడు నొచ్చుకోని రీతిలో నడచుకొనాలి'.

వ. అని యిట్లు కృతఘ్నతయు మిత్త్రద్రోహంబును నధిక పాతకంబు లగుటయు సన్మిత్త్రుఁ బాటించుట శుభంబు చేయుటయు భీష్ముండు భీమాగ్రజునకుం జెప్పె' ననిన విని 'యయ్యుత్తమ పురుషుల యడుగుటలును, నుత్తరం బిచ్చుటలును నింత లెస్సలై చెల్లెడునే? యటమీఁదఁ జెల్లిన తెఱంగు లెఱింగింపు' మనుటయు. 528

ప్రతిపదార్థం: అని= అని; ఇట్లు= ఇట్లా; కృతఘ్నతయున్= చేసిన మేలు మరిచిపోవటమున్నూ; మిత్త్రద్రోహంబునున్= స్నేహితుడికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కీడు తలపెట్టటమున్నూ; అధికపాతకంబులు= మహాపాపాలు; అగుటయున్= అవటంవలన; సన్మిత్త్రున్= మంచి స్నేహితుడిని; పాటించుట= పొందటం; శుభంబు చేయుటయున్= మేలు చేయటమున్నూ; భీష్ముండు= భీష్ముడు; భీమ+అగ్రజునకున్= భీముడికంటె ముందు పుట్టిన ధర్మరాజుకు; చెప్పెన్= చెప్పాడు; అనినన్= అని వైశంపాయనుడు చెప్పగా; విని= జనమేజయుడు ఆలకించి; ఆ ఉత్తమ పురుషుల= మగవారిలో మొనగాళ్ళైన ధర్మరాజు భీష్ముల; అడుగుటలును= ప్రశ్నించటాలు; ఉత్తరంబు ఇచ్చుటలునున్= జవాబు చెప్పటాలు; ఇంత లెస్సలై= ఇంతటి మేలు కలవై; చెల్లెడునే= సాగుబాటవుతున్నాయా; అటమీఁదన్= ఆ పైన అవి; చెల్లిన తెఱంగులు= చలామణి అయిన తీరులు; ఎఱిఁగింపుము= తెలియ చెప్పుము; అనుటయున్= అనగానే.

తాత్పర్యం: చేసిన మేలు మరచిపోవటం, మిత్రుడికి కీడు తలపెట్టటం - అనేవి రెండూ మహాపాపాలు. అందుచేత మంచి మిత్రుడిని సంపాదించటం మేలుచేయటం - అనేవాటిని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు. ధర్మరాజు అడగగానే భీష్ముడు చెప్పిన విషయాలు లోకంలో మంచివిగా చలామణి అవుతున్నాయా? అయితే ఆ చెల్లుబాటయిన తీరులూ తెలియచెప్పవలసింది.

ఆశ్వాసాంతము

చ. **స్మయభయ దర్పిత క్షుభిత సామజమర్దన రక్షణ క్రియా**
శ్రయణ విలాస భాసుర భుజా! చరణ ప్రణతామర వ్రజా!
జయ విభవ ప్రభుత్వ ధనసంప దుదాత్త చరిత్ర కీర్త్యుపా
నయన కృతార్థ సేవక జనా! మునిసంభృత యోగపూజనా! **529**

ప్రతిపదార్థం: స్మయ= కండకావరంతో; దర్పిత= పొగరెక్కిన; సామజ= ఏనుగు (గజాసురుడు)ను; మర్దన= చంపటం; భయ= వెఱపుతో; క్షుభిత= కలతచెందిన; సామజ= ఏనుగు (గజరాజు)ను; రక్షణ= కాపాడటం అనే; క్రియా= వ్యాపారాన్ని; ఆశ్రయణ= ఆశ్రయించటం అనే; విలాస= లీలతో; భాసుర= ప్రకాశిస్తున్న; భుజా!= చేతులు కలవాడా!; చరణ= కాళ్ళకు; ప్రణత= మొక్కుతుండే; అమర= దేవతల; వ్రజా!= సముదాయం కలవాడా!; జయ= గెలుపునూ; విభవ= వైభవాన్నీ; ప్రభుత్వ= సామర్థ్యాన్నీ; ధన= సిరినీ; సంపద్= ఐశ్వర్యాన్నీ; ఉదాత్త చరిత్ర= గొప్పనడవడినీ; కీర్తి= కీర్తినీ; ఉపానయన= పొందించటం చేత; కృతార్థ= కృతకృత్యులైన; సేవక జనా!= పరిచారకులు కలవాడా!; ముని సంభృత= ఋషులు పోషించిన; యోగ= ధ్యానంతో; పూజనా= కొలిచేవాడా!

తాత్పర్యం: పొగరుబోతు అయిన గజాసురుడిని చంపి, చెడును తుదముట్టించటం, భయంతో కలతపడ్డ గజరాజుని కాపాడి మంచిని నిలబెట్టటం వంటి చేతలను విలాసంగా చేసి చూపే చేతులు కలవాడా! దేవతలంతా ఎపుడూ మ్రొక్కుకొంటూ ఉండే పాదాలు కలవాడా! విజయాన్నీ, వైభవాన్నీ, సామర్థ్యాన్నీ, సిరులనూ. ఐశ్వర్యాన్నీ, మంచి శీలాన్ని, కీర్తినీ సమకూర్చి పెట్టటం వలన ధన్యులైన పరిచారక వర్గం కలవాడా! ధ్యానంతో కొలిచే ఋషులు కలవాడా!

క. **తరణి శశినేత్ర! జగదుప । కరణీయ చరిత్ర! బోధగాత్ర! తపస్సం**
భరితశమ ముని మనోజ్ఞా! । భరణీయ ప్రాజ్ఞ! విశ్వభార విధిజ్ఞా! **530**

ప్రతిపదార్థం: తరణి= సూర్యుడూ; శశి= చంద్రుడూ; నేత్ర= కన్నులుగా కలవాడా!; జగత్= లోక ప్రవృత్తికి; ఉపకరణీయ= ఉపకరించే వాటిచేత; చరిత్ర!= నడవడికలవాడా!; బోధ= జ్ఞానమే; గాత్ర!= శరీరంగా కలవాడా!; తపస్= తపస్సుచే; సంభరిత=

నిండిన; శమ= అంతరింద్రియ నిగ్రహంకల; ముని= ఋషులకు; మనోజ్ఞా!= మనోహరమైనవాడా!; భరణీయ= పోషించదగ్గ; ప్రాజ్ఞ= వివేకులు కలవాడా!; విశ్వభార= ప్రపంచభారాన్నీ; విధి= బ్రహ్మను (బ్రహ్మతత్త్వాన్ని); జ్ఞా!= తెలిసినవాడా!, విశ్వభార విధానాన్ని తెలిసినవాడా!

తాత్పర్యం: సూర్యచంద్రులు కన్నులుగా కలవాడా! లోకపు వృత్తికి ఉపయోగించే నడవడి కలవాడా! జ్ఞానమే ఆకారంగా తాల్చినవాడా! తపోనిధులూ, నిగ్రహవంతులూ అయిన మునులకు మనోహరమైనవాడా! పోషించదగ్గ వివేకులు కలవాడా! ప్రపంచ భారాన్నీ, బ్రహ్మతత్త్వాన్నీ తెలిసినవాడా! ప్రపంచభారం వహించే విధానం తెలిసినవాడా!

మాలిని:

> **వరద చరణ లీలా! వైకృతాగమ్య శీలా!**
> **విరతి నిరతి సేవ్యా! వేదవిద్యా విభావ్యా!**
> **నిరవధిక విభూతీ! నిశ్చయాతీతరీతీ!**
> **భరిత కరుణ దృష్టీ! భక్తమాధ్వీక వృష్టీ!** **531**

ప్రతిపదార్థం: వరద= కోరికలను తీర్చేటటువంటి; చరణ= పాదాల; లీలా!= విలాసం కలవాడా!; వైకృత= మనోవికారులచేత; అగమ్య= తెలిసికొనరాని; శీలా!= మంచి నడతకలవాడా!; విరతి= విరాగంపట్ల; నిరతి= ఎక్కువ ఆసక్తి కలవారిచేత; సేవ్యా!= పూజించదగినవాడా!; వేద= శ్రుతుల; విద్యా= విజ్ఞానంతోనే; విభావ్యా!= తెలుసుకోదగినవాడా!; నిరవధిక= మేరలేని; విభూతీ!= ఐశ్వర్యం కలవాడా!; నిశ్చయ+అతీత= నిర్ధారించ వీలుకాని; రీతీ!= తీరు కలవాడా!; భరితకరుణ= దయతో నిండిన; దృష్టీ!= చూపులు కలవాడా!; భక్త= భక్తులకు; మాధ్వీక వృష్టీ!= ద్రాక్షావర్ష రూపమైనవాడా!

తాత్పర్యం: భక్తుల కోరికలు తీర్చే పాదలీలలు కలవాడా! మనోవికారులు తెలిసికొనలేని మంచి నడత కలవాడా! విరాగులచేత కొల్వబడేవాడా!; వేదవిజ్ఞానంతోనే తెలియబడేవాడా! అపారమైన ఐశ్వర్యం కలవాడా! నిర్ధారించవీలుకాని తీరు కలవాడా! దయగల చూపులు కలవాడా! భక్తులపాలిట ద్రాక్షావర్ష రూపమైనవాడా! హరిహరనాథా!

విశేషం: మాలిని వృత్తంలో ప్రతిపాదంలోనూ న, న, మ, య, య అనే గణాలుంటాయి. 9వ అక్షరం యతి స్థానం. ప్రాస నియమం ఉన్నది.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కనసోమయాజి ప్రణీతం బైన శ్రీ మహాభారతంబున శాంతిపర్వంబునందు తృతీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది మంగళకరమైన ఉభయకవిమిత్రుడనే బిరుదం కలవాడూ, కొమ్మనామాత్యుడి కుమారుడూ, పండితుల ఆరాధనలచేత ప్రకాశించేవాడూ (పండితులను ఆరాధించటంచేత ప్రకాశించేవాడూ) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలోని శాంతిపర్వంలో మూడవ ఆశ్వాసం.

శాంతిపర్వంలోని మూడవ ఆశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము

(మొదటి భాగం)

గద్యపద్య ప్రథమపాద సూచి

పద్యము	పుట
అ	
అంగనాజనమ్ములకు	20
అంటి మట్టియెడ నింద్ర	106
అంతకు నియ్యాతిథ్యంబు	490
అంత నద్దానవేంద్రుండు	387
అంత నాభిషేచనిక	151
అంత నిక్కడ	192
అంతశ్చరమారుతములు	182
అందంద మెడయుఁ దలయు	494
అందు	282
అంబరీషుండు నానా	329
అంబుదంబులు గేశంబు	183
అకట! కూడి మెలంగి	420
అక్కపోతినాథుఁ డగ్నిలో	443
అక్కాలంబునందు	198
అక్కుమారుండు నిజ	107
అచల భక్తినిత్యంబు	215
అజుఁ డధ్వరంబు	380
అటరాముఁ డెఱిఁగి	200
అటవీదేశములందు	161
అటుగాక కర్మగతి	28
అట్టి దశఁ బుట్టు రుద్రుని	291
అట్టి పురవరంబునందు	314
అట్టి యవసరమున	111
అట్టియెడ	16
అట్టియెడఁ జూడం	142

పద్యము	పుట
అట్టివి దైవకృతంబులు	85
అట్టి సమయమున	429
అట్లగ్ని సంస్కారంబు	499
అట్లింద్రుండు ప్రత్యక్షం	265
అట్లుంగాక	18
అట్లుంగాక	60
అట్లుంగాక	444
అట్లు కాముబారిం	103
అట్లు జనమేజయుఁడు	448
అట్లు తన్నుందాన	464
అట్లు దండ ప్రణామంబులు	265
అట్లు దమము మహిమ	468
అట్లు నియోగుల	308
అట్లు పనవి యేడ్చు	458
అట్లు బెబ్బులి వచ్చి	371
అట్లు లోకరక్షకుం	381
అట్లు సంతోషమున	494
అట్లు సంయమివర	224
అట్లు హరిఁ బ్రస్తుతించి	192
అట్లెఱింగి	202
అట్లొసంగినం గైకొని	480
అడలున రాజధర్మ	29
అడలెదఁ బొందఁగా	79
అడవి గోవులకై కాల్చు	122
అడవిలో నొక మఱ్ఱి	407
అడవుల మీరున్న	68

పద్యము	పుట
అడిగిన నతండతని	468
అడిగిన నమర విభుండు	498
అడుగుటయు నమ్మహీ	328
అతండు	496
అతండును గురునకు	12
అతఁడును దివ్యబోధ	500
అతఁడును మందహాస	272
అతఁడు సమిత్కుశాభి	201
అతఁ డొడఁబడి	270
అతనిఁ దమకు నెల్ల	400
అతని కిట్టు లనియె	295
అతనికి నాతఁడిట్లను	477
అతనికి నీపయిం గరుణ	135
అతని నాశ్రయించి	387
అతని మేను కుంతి	7
అతని వీడ్కొని సంప్రీతి	109
అతిథి పితృదేవతా	130
అతిథుల దీనకోటుల	268
అతిశయిత పుణ్య	434
అదికారణంబుగా ధరణి	205
అది కాశ్యప గౌతమాఖ్యానం	486
అది గోరిన దొరకొనునే	484
అది బెట్టిదంపు వెరవున	397
అది యట్లుండె భోగంబులు	361
అదియునుంగాక	264
అదియునుంగాక	424

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అదియునుంగాక యొక్క	452
అదియును బుద్ధిమంతులు	236
అదియును వినవలతు	247
అది యెట్లంటేని	305
అది యెట్లంటేని	374
అది యెకఁడేల వేద	267
అది రత్నరుచుల	177
అధికతపంబున నగ్ని	96
అధిప త్రైవర్ణికుల	260
అధిప! నారదు చెలియలి	100
అధిప! పరశురాము	14
అధిప! మీతల్లి యుల్లంబు	53
అధిప! యివి ధార్తరాష్ట్ర	472
అధ్యయన దానయజ్ఞంబు	259
అధ్వరంబు కంటె నధికంబు	303
అనఘచరిత! యిట్లు	65
అనఘ! ధర్మార్థ కామంబు	483
అనఘ నాలుగువర్ణము	257
అనఘ! నీదు బుద్ధి	233
అనఘ! నీరు వట్టు	218
అనఘ! భయంబు నొందు	414
అనఘ! యనేక దోష	297
అనఘ! యినుఁ ఢింక	216
అనఘ! శ్రేయస్సునకు	227
అనదతనంబును	348
అనధీయానుం డితఁ	244
అనయముఁ బేర్చు కామ	384
అనలము శమించు	174
అన విని ధర్మితనూజుఁడు	384
అన విని ధర్మసూనుఁడు	231
అన విని యమ్మనుజేశ్వరుఁడు	328
అనవుడుఁ బార్థుఁడిట్టులను	482
అనవుడుఁ బిల్లి యిట్టు	409
అనవుడు గాధినందనుండు	434
అనవుడు ధర్మవృత్తము	451
అనవుడు నక్క రాఁబనిచి	365
అనవుడు నజాకశత్రుండు	356
అనవుడు నట్లేల	411
అనవుడు నీశీలము	388
అనవుడు నుల్ల మెంతయు	439
అనవుడు నెగవెక్కి	457
అనవుడు బ్రహ్మదత్తు	421
అనవుడు భయసంభ్రమ	146
అనవుడు వాఁ డిట్లనియె	433
అనవుడు వాఁడు గువ్వ	440
అనవుడు సాంసారిక	265
అని కోపంబునఁ బల్క	462
అని గర్వంపుమాట	462
అని గురుఁడు పంప	387
అని చెప్పి	310
అని చెప్పి తాత యిట్లను	501
అని చెప్పి దేవేంద్రుండు	267
అని చెప్పిన యప్పుండరీ	100
అని చెప్పి నిజేచ్ఛ	155
అని చెప్పి పురోహితుని	291
అని చెప్పి భీష్ముండు	312
అని చెప్పి భీష్ముండు	497
అని చెప్పి భీష్ముండు వెండియు	402
అని చెప్పి భీష్ముం డేను	246
అని చెప్పి మఱియు నత	345
అని చెప్పి మఱియు నిట్ల	68
అని చెప్పి మీర లీధర్మ	402
అని చెప్పి యప్పార్థివుం	396
అని చెప్పి యిది యుప	351
అని చెప్పి యేను నీకు	133
అని చెప్పి యేనును	109
అని చెప్పి వెండియు	127
అని చెప్పి వెండియు	284
అని చెప్పి వెండియు	304
అని చెప్పి వెండియు	327
అని చెప్పి వెండియు	375
అని చెప్పి వెండియు	473
అని చెప్పి వైశంపాయ	192
అని చెప్పె నంత బకపతి	499
అని చెప్పె ననిచెప్పి	352
అని చెప్పె నప్పుడు	33
అని తన మహాత్మ్యంబునం	336
అని తన వచనంబులం	323
అని తలంచి	492
అని తూర వగచి యూరయ	496
అనిన	303
అనిన ధర్మపుత్రుడు	466
అనిన గౌంతేయాగ్రజు	357
అనిన బాంచాలితో	44
అనిన సంగ్రామకేళీ	331
అనినఁ బిల్లి కిట్టులను	412
అనినఁ బ్రాప్త కాలుజ్ఞు	403
అనిన నచ్యుతుండు	87
అనిన నజాతశత్రుం	112
అనిన నట్ల యగుట	409
అనిన నతనికి శారిక	422
అనిన నప్పాండవోత్తముండు	346
అనిన నయ్యిరు దెఱంగుల	403
అనిన నా ధర్మతనయుతో	287
అనిన భయంబునొంది	389
అనిన భీష్ముఁ డిట్టులను	436
అనిన రోమశునకు	417
అనిన విని కరుణాయత్త	449
అనిన విని కౌంతేయా	309
అనిన విని కౌంతేయా	419
అనిన విని చండాలుండు	432
అనిన విని చండాలుం డిట్ల	434
అనిన విని జనమేజయుం	224
అనిన విని దేవపిత్రు	469
అనిన విని దేవస్థానం	56

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనిన విని ధర్మతనయుం	49
అనిన విని ధర్మతనయుం	302
అనిన విని ధర్మతనయుండరి	471
అనిన విని ధర్మనందనుండు	295
అనిన విని ధర్మనందనుండు	383
అనిన విని ధర్మనందనుండు	407
అనిన విని ధర్మనందనుఁడు	359
అనిన విని నిర్విణ్ణ	59
అనిన విని పవన	483
అనిన విని పాండవా	313
అనిన విని పాండవా	316
అనిన విని పౌలస్త్యుండు	294
అనిన విని ప్రీతి ధర్మ	282
అనిన విని బూరు విట్లను	461
అనిన విని యంకిలి	118
అనిన విని యజాత	268
అనిన విని యజాత	328
అనిన విని యజాత	427
అనిన విని యజాత	466
అనిన విని యజ్జనపతి	391
అనిన విని యజ్జనవిభుం	4
అనిన విని యతండు	421
అనిన విని యతఁడు	401
అనిన విని యప్పలితుండు	414
అనిన విని యమ్మునిపతి	113
అనిన విని యవ్విప్రు	146
అనిన విని యుధిష్ఠిరుండు	370
అనిన విని యుధిష్ఠిరుండు	376
అనిన విని యోడకోడకు	413
అనిన విని వార లందఱు	485
అనిన విని వారలు	254
అనిన విని వారి రావించి	208
అనిన విని వాసుదేవునకు	230
అనిన విని శారిక	423
అనిన విని శోక	19
అనిన విని సంతోషించి	367
అనిన విని సిగ్గువడి	418
అనిన శంతనుపుత్రుతో	348
అని నిందించి	420
అని నిశ్చయకుఁడై రణం	331
అని పలికి పిల్లి	409
అని పలికిన నాగ్రధంబు	456
అని పలికిన నాపృథ్వీపతి	101
అని పలికి పాండవా	213
అని పలికి పురందరుం	266
అని పలికి పూర్వాచార	395
అని పలికి బంధుమరణ	80
అని పలికి బలు	463
అని పలికి మఱి పలుక	51
అని పలికి మఱియు	314
అని పలికి మునీంద్రా!	8
అని పలికి యగ్గోమాయువు	365
అని పలికి యగ్ని	441
అని పలికి యద్దేవి	206
అని పలికి యపుడ	444
అని పలికి యప్పారా	82
అని పలికి యవిశ్వాసము	424
అని పలికి యిట్లనియె	43
అని పలికి యెందేని	204
అని పలికి విష్ణు విశ్వాత్మ	161
అని పలికి వెండియు	88
అని పలికి వెండియు నిట్ల	497
అని పలికి సఖ్యంబుచేసి	301
అని పలికె నని చెప్పి	191
అని పలుకు జనకు	51
అని పలుకుటయు నమ్మునీం	461
అని పలుకు పార్థు	47
అని పాసి యరణ్యము	366
అని మరుత్తుండను	241
అని మఱియు ననేక	215
అని మఱియును	159
అని మఱియును	425
అని ముట్టనాడి	39
అని ముని పల్కిన	434
అనిమిషాసురయుద్ధ	94
అనిమిషులున్ విభీతు	320
అని యంత నిలువక	42
అని యంత నిలువక	416
అని యంతరంగంబున	442
అని యడిగిన నతం	489
అని యడిగిన నప్పుడమి	282
అని యడిగిన నమ్మహీ	225
అని యడిగిన నయ్యార్య	447
అని యడిగిన నాతం	82
అని యడిగిన నాదేవ	258
అని యత్తెఱంగున	325
అని యప్పూరి దెస సెప్పిన	491
అని యాస పజ్జం బోవమి	397
అని యిట్లందఱుఁ జెప్పఁగ	484
అని యిట్లతుల స్తోత్రం	191
అని యిట్లప్పక్షి ధ్వంస	437
అని యిట్లప్పులితుండును	412
అని యిట్లు కృతఘ్నుతయు	502
అని యిట్లు చెప్పి యపాత్ర	131
అని యిట్లు ధర్మనంద	172
అని యిట్లు నకులునకు	481
అని యిట్లు బహుప్రకారం	453
అని యిట్లు బృహస్పతి	276
అని యిట్లు శరణాగత	446
అని యిట్లు సల్లాపంబు	209
అని యిట్లు సెప్పిన వాక్య	321
అని యుల్లంబునన	438
అని యుల్లసంబాడి సముల్ల	464
అని యూఁది పలికి	65
అని యూఱడిల్లఁబలికిన	107

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనియె నట్టియెడం	476
అనియె నని చెప్పి భీష్ముం	391
అనియె నా ప్రబ్బలి	370
అనియె నాసేనజితుం	75
అనియె నిట్లు దమ్ములం	38
అనియె మఱియు	58
అని యెఱింగించి	88
అని యేర్పడ భాషించిన	439
అనియొక గుదిమీల	405
అని వసుహోముఁడు	383
అని వాయుదేవుఁడిట్ల	287
అని వినతుండగు నా	460
అని విశదంబుగా వివరించె	468
అని వీడ్కొల్పిన నీత	333
అని వెండియు	43
అని వెండియు	130
అని వెండియు	211
అని వెండియు	295
అని వెండియు	443
అని వెండియు	472
అనుచుఁ దదీయపాద	451
అనుచు లేచి నిలుచుటయు	459
అనుటయుం గౌంతేయా	272
అనుటయుం దెలిసి	86
అనుటయుఁ గౌంతేయా	114
అనుటయుఁ గౌంతేయా	342
అనుటయుఁ బెలుచని	461
అనుటయు ధనదుండు	293
అనుటయు ధర్మజుండు	306
అనుటయు ధర్మజుండు	355
అనుటయు ధర్మతనయుం	311
అనుటయు నంత్యజుండు	433
అనుటయు నచ్యుతుండు	194
అనుటయు నచ్యుతుండు	226
అనుటయు నట్లకాక	11
అనుటయు నతనితో	230
అనుటయు నత్తాపసో	395
అనుటయు నమ్మహా	300
అనుటయు నమ్మునివరుం	72
అనుటయు నవ్వచనం	19
అనుటయు నాపగా	359
అనుటయు నాపగా	385
అనుటయు నాపగేయుఁడు	234
అనుటయు నిది కర్జము	404
అనుటయు నెట్టివాఁడైన	284
అనుటయు నెల్క	410
అనుటయు బ్రహ్మదత్తుం	423
అనుటయు మృగపతి	363
అనుడు నిట్టు దలఁప	416
అనుమని రని పలికి	145
అనుమానింపకు తోడ	117
అను విచారంబు దివ్య	372
అనుష్ఠించి ద్రోణాచార్య	157
అనృతము పాతకమగు	476
అనృతోపచారకలనం	125
అన్న పతితుఁడైన	121
అన్నరనాథుండు నడచి	141
అన్నరపాలుఁడు దానున్	265
అన్నలుఁ దమ్ములుఁ గలుగుట	305
అన్యాయంబునఁ బొదలిన	399
అప్పటికిఁ దోఁచినట్టులు	406
అప్పరుసునఁ బెరిఁగిన	208
అప్పుడినుఁడు మాసె	478
అప్పుడు చిత్తంబుత్తమ	153
అప్పుడు దొడంగి యంత	5
అమర గరుడ గంధర్వ	288
అమల భవదీయ	159
అమృతమథనమున	186
అమృతమయు ఋగ్యజు	179
అమృతము విద్యయు	475
అమ్మచెల్ల! యిట్టులన	461
అమ్మహాత్ముని సాత్యకి	156
అమ్మహీపతి పూజ్యరాజ్యం	52
అమ్ముగ్ధ యతని కిట్లనియె	197
అమ్మెయిఁ బలితుండు	410
అయ్యితిహాసంబు సెప్పెద	436
అయ్యుత్తమొత్తమునకు	136
అరణి నగ్ని వొడము	180
అరదము వన్నినా	222
అరయఁగ రాజధర్మము	232
అరయుం దప్పు కృతం	284
అరయుటఁ బ్రజ వర్ధిం	317
అరి నృపాలు పెంపు	370
అరిపయిఁ బోయి వాని	327
అరిపయి వీఁకనెత్తి	347
అరి మిగులఁగొనుట	315
అరి యాఱవపాలు	69
అరియెడ మిత్రభావ	415
అరివధము పాపమని	114
అరివీరుల ఘోరంబగు	46
అరుగుచుండు వాఁడొక	446
అరుగుదెంచితి నవియు	492
అరులకడ నిజ భూమి	278
అరులను మిత్రులం	414
అర్జును పలుకు సత్యంబు	61
అర్థధర్మంబు లితరేత	482
అర్థములు బంధువులుఁ	82
అర్థవంతుఁడై భోగంబు	349
అర్థసిద్ధికంటె నరయ	322
అర్థాదులగు ఫలంబులు	395
అర్థి విశ్వావసుండాదిగా	93
అలుక గూరిమి ఫల	376
అల్పకాల భోగ్యమైన	77
అల్లఁదనంబున యనువు	102

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అవధరింపుము	47
అవనీశ పారి యాత్రా	399
అవనీశ! యశ్వమేధము	123
అవలేపంబునఁ గర్తవ్య	241
అవహిత మతియై	235
అవు బేహారముఁ గృషి	315
అవ్వాక్యంబు లాదరింప	424
అవ్విధంబున నేను నల్లుండు	106
అవ్విప్రుండు ధనసంచ	500
అవ్విప్రుని చొప్పువట్టి	496
అశ్వమేధయాగంబున	203
అసితోత్పలచ్ఛాయమై	377
ఆ	
ఆకర్ణింపుము	264
ఆగమోక్త కర్మమాచ	119
ఆ గుహసొచ్చెం జొచ్చి	368
ఆ గృధ్రంబును జంబుకం	458
ఆతఁడు దుర్యోధనునకు	6
ఆతురత నీవు నా కడ	450
ఆదటఁ బూర్వశాస్త్రి	55
ఆదిత్యమరుద్వసు	185
ఆదిత్యు నుదయాస్తమయ	119
ఆదిమ పురుషుఁడు వగుట	160
ఆ దివిజాపగాతనయు	192
ఆ దుర్జనుండు కర్జం	22
ఆ దుర్బ్రాహ్మణుండు దన	494
ఆ నాడీజంఘుడును	500
ఆ నృపుల వంశముల	208
ఆ పనికిఁ గీడు రోయుచు	317
ఆ పరమేశ్వరుం డితని	332
ఆ పొంతపల్లియకు	440
ఆ భృగునందనుం డచ్చు	195
ఆమద్రవ్యము మణి	474
ఆయతికాఁడు వలయు	306

పద్యము	పుట
ఆయతి కిమ్మెయిఁ	318
ఆయనయుఁ గాంది	487
ఆ యను దన పుత్రుఁడవుట	5
ఆ యుపాయముల్ మూఁటి	325
ఆరయ మిత్త్రద్రోహము	501
ఆ రాక్షసుఁ గనుఁగొని	147
ఆ రాజు నగ్నిదేవుఁడు	199
ఆ రాజునట్ల చేసి మహా	309
ఆ రాజనట్ల చేసి మహా	309
ఆ రాత్రి యవ్విభుని	307
ఆరామాదిక నిజ సం	277
ఆరోగ్యము గల యుత్తము	289
ఆర్తినొంది యిటయట	430
ఆలస్యమును నసహా	367
ఆలును బిడ్డలు బంధులు	130
ఆ లుబ్ధకుఁ డత్తరువర	437
ఆశ యింత దుర్నివార	393
ఆశ్రమధర్మంబు లాకర్ణిం	260
ఆ సభలోఁ బడినట్టి	48
ఆ సమయంబున నక్కఁడం	177
ఆసాసల వచ్చితి నను	393
ఆస్తికతా శ్రద్ధావినయం	128
ఇ	
ఇంత నిర్బంధమేటికి	136
ఇందొక త్రాడు గఱచి	405
ఇంద్రుఁ డజుఁడు విష్ణు	358
ఇగురు జొంపంబుల	443
ఇచ్చిన నగ్నిదేవుం డాహా	199
ఇచ్చు కృప	116
ఇట్టిద బ్రదుకుఁ	418
ఇట్టివి కృత్రిమములు	364
ఇట్లగుటం దెలుపునది	299
ఇట్లగుటకు నుదాహరణం	399
ఇట్లనంగఁ దగునె	80
ఇట్టని విచారించె	372

పద్యము	పుట
ఇట్లుత్తముండైన విప్రుం	32
ఇట్లుదయించిన సుధా	220
ఇట్లు నారదుండును	105
ఇట్లు నితాంత కాంతి	140
ఇట్లు నిశ్శేషంబుగా	334
ఇట్లు పతివ్రతయై	104
ఇట్లు పెల్లయిన మ్రోఁతను	144
ఇట్లు ప్రీతుండై యజాత	148
ఇట్లు మహనీయ ప్రభుత్వ	255
ఇట్లు మహాతేజోధనుం	20
ఇట్లు విధాతృవశంబున	334
ఇట్లు శిష్టజనము	145
ఇట్లు సకలబాంధవ	158
ఇట్లు సేసి పరమకృపా	202
ఇతఁ డెట్టిఁడైన నేమగు	492
ఇది కల్మష సామాన్య	119
ఇది తదీయ	10
ఇది దప్పినిప్పు డియ్యెడ	430
ఇది ధర్మవిరోధంబు	54
ఇది మదీయ ధ్యానంబు	174
ఇది యిట్లాలిని బంధులం	442
ఇది రాక్షస నాశనం	478
ఇది సిద్ధాంతంబన	374
ఇనుము ఊత నీర	237
ఇబ్భంగిం బుట్టిఁ యానక్క	360
ఇమ్మహాపాతకంబు లే	67
ఇరువది వేవురు పరి	97
ఇల నీకై కొన్న తెఱఁగు	46
ఇవి దోఁడేళులభంగి	472
ఇవి మీయన్న వోయిన	14
ఇవ్విధంబు గాక క్రొవ్వి	70
ఇవ్విధంబునకు శుక్ర	417
ఇవ్విధంబున విక్రమించు	16
ఇవ్విధంబున సదముం	333

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఈ	
ఈఁగకాలి యంత యేనియు	298
ఈ కథ పూర్వాపర	367
ఈ గతియెఱింగి చేసిన	302
ఈఁగియును బ్రియవచన	310
ఈ తాల్మిలేదు బ్రాహ్మణ	13
ఈ నాలుగాశ్రమములకు	263
ఈ పగ దీర్చెద	420
ఈ భంగియైనం	319
ఈ మూఁడు వర్ణములకును	260
ఈ యర్థంబునం దైల	290
ఈ యాఖ్యానము విని	383
ఈ యాఱింటను	472
ఈ యితిహాస మర్థి	446
ఈ రెండవదానంబులు	17
ఈ వాక్యంబులం	289
ఈ వాక్యంబులు రెండుఁ	237
ఈ సర్వజనంబుల	137
ఉ	
ఉచిత దండవృత్తి	42
ఉచిత సల్లాపంబుల	111
ఉత్తమ కులజుఁడు	502
ఉత్తమ ధర్మము సత్యము	389
ఉత్తరాయణంబు వేచి	176
ఉదధి సుఖగోష్ఠి	369
ఉన్నంత భక్ష్య	362
ఉన్నంత వేఁట దీఱి	405
ఉపరమముం	182
ఉరగాదులవలని	255
ఉరిఁ బాసియేమి	411
ఉరిద్రవ్వఁ గొఱికి	408
ఊ	
ఊడ్చి బొండువు వ్రచ్చి	495

పద్యము	పుట
ఎందుండి యేమి	489
ఎందునుం జరియించు	200
ఎక్కటెక్కటి పోరి	17
ఎక్కార్యములను గణ	355
ఎక్కువ తక్కువ మాటలు	305
ఎగసి యచ్చోట నిలిచి	421
ఎచయనున్నవి యొక్కొ	437
ఎచ్చోనైనను నిల్చు	262
ఎరలకై వచ్చి యిట్లు	408
ఎలుకయు బొక్క	413
ఎవ్వఁడు పుట్టిన	229
ఎఱిఁగియైన నెఱుఁగ	366
ఏ	
ఏడు దీవులయందు	91
ఏనడిగిన తెఱంగు	484
ఏ నరుఁడు మానసము	395
ఏనుంగు హజ్జలో నెల్ల	264
ఏనుఁ గేనుంగుఁ	342
ఏనును నిట్లగుదు	445
ఏను బుట్టివేయు	457
ఏను బోయిన కొండొక	109
ఏ పాపమేని లేనిది	476
ఏపారి తొల్లి త్రేతా	428
ఏఱులుఁ జెఱువులు	428
ఏవాని బంధుమిత్రులు	25
ఒ	
ఒండొరులకు రక్షకులై	248
ఒకటి గలదు వత్తురు	457
ఒకటి దెసను దృష్ణ	51
ఒకఁడు పంద్రెండు	180
ఒకనాఁ డజుండు	463
ఒకరునికి నలిగి యాతని	274

పద్యము	పుట
ఒక్కటి యేను జెప్పెద	374
ఒక్క మహాబకంబు	488
ఒడఁబడి యానివాని	396
ఒప్పుకున్నను నాత్మ	114
ఒలసి మనోవాక్కాయ	390
ఒల్లనికార్యం బాసల	426
ఓ	
ఓయన్న డస్సినాఁడవు	439
ఓర్వక పెక్కండ్రు	95
ఓహో యిట్టివిగలవే	23
క	
కడపితే రాత్రిసులభ	170
కడిదిఁ మగండు కుంభజుఁడు	79
కడు నమ్మి యునికియును	243
కడు నర్మిలిఁ	499
కడు బెట్టిదుండు కాలుఁడు	455
కని భక్తిం బ్రణమిల్లుడు	393
కని యతఁడు సంభ్రమంబు	498
కపటద్యూతమునం	48
కపటము లేక వైభవము	244
కమలంబులుఁ దొవలు	73
కమలాసనుండు నిజ	478
కయ్యమునకు వలదు	278
కరుణగలవేనిఁ బ్రాణంబు	434
కర్ణుసుత్సంగ	12
కర్తయును భర్తయును	214
కర్మఫలం బీశ్వరుని	114
కర్మము మేలు నా విగత	58
కలఁగిన పెద్ద మడువు	351
కలఁడు జహ్నుండనఁగాఁ	195
కలదే యిమ్మెయి పౌరుషంబు	442
కలలోనఁ జరమధాతు	121

పద్యము	పుట
కలహంబుల్ దమలోన	325
కలికాల చలిత ధర్మము	188
కలిగె లేకుండె నిట్లలఘు	154
కలిమియు చుట్టలఁ జేర్చుం	25
కల్లు ద్రావిన పాతకం	124
కల్లు ద్రావుట గురుపత్నిఁ	66
కాంచనాలంకార కాంతంబు	90
కాంచి దండప్రణామం	448
కాంచి యతనితోనేఁ	491
కాని చెయిదములు సేయక	32
కాని యటులుండి నెఱి	349
కాపవ్యం డను పేరను	400
కాపవ్యోపాఖ్యానము	402
కామము గ్రోధమున్	58
కామ భోగముల్	50
కాయలఁ బండ్ల నీళులను	45
కాలప్రభావం బిట్టిది	283
కాలమున ఘటింపఁగా	73
కాలవశంబునఁ గీడు	423
కాల విపర్యయమున	347
కావున	42
కావున	70
కావున	297
కావునం గర్మహీనత్వం	31
కావునం గులహీనులు	373
కావునఁ గామ రోషములు	267
కావున గృహస్థ ధర్మం	35
కావున చండాల	431
కావున ధర్మసిద్ధి	384
కావున నర్థసంపదలు	398
కావున నర్థసంపదలు	398
కావున నర్థంబు	482
కావున నర్థోపార్జనంబును	25
కావున నాకు దొరకొన్న	28
కావున నిట్లు సేసితి	228

పద్యము	పుట
కావున నిన్నుఁ బెద్ద	415
కావున నెవ్వగ నొందం	81
కావున నెవ్వగల్ విడుపు	86
కావున భృత్యులయెడ	240
కావున మేలు సేయదె	271
కావున వర్ణాశ్రమముల	299
కావున విను పాత్రము	133
కావున సకలజన	76
కావున సిద్ధ్యసిద్ధుల	59
కాళింగుఁ డాత్మీయకన్యా	15
కిరణముల భంగి	376
కుక్క మృగములలోనెల్ల	432
కుడిచిన పళ్ళెరంబును	493
కుడువక పెట్టక శూద్రుఁడు	474
కుదురు సమస్త ధర్మములకున్	470
కురుపితామహుండు	134
కురువంశ ధురంధరుఁడగు	218
కులమని పట్టి చిత్తమున	373
కులము శీలంబు హిత	312
కులమును విద్యయు	492
కుల మొక్కఁడైనఁ దేఁకువ	354
కృష్ణుండు మా మీఁద	4
కేవల నిష్కర్మత	31
కొండొక కాలంబునకు	362
కొందఱు బ్రాహ్మణుల్	32
కొడుకు లేనిచోటఁ గూఁతు	117
కొని వచ్చి పుల్లప్రోవునఁ	440
కోట యేమఱ కెప్డు	279
కోపంబు లేమి సత్యా	258
కోరి తోఁటవాఁడు కుసుమ	285
కౌరవులు దమ దురితమున	44
కౌరవులు సేయు నవమతి	7
క్రతువు లొనరించు	473
క్రమమునఁ గామము	248
క్రమమునసైన శాత్రవుల	70
క్రూరంబు గృధ్రమిట్టి	456

పద్యము	పుట
క్రూరుండగు కొడుకుం	197
క్రూరుఁడు లోభియున్	486
క్షత్రమునకుఁ బుట్టఁగాఁ	290
క్షత్రాత్ముఁ గొలుతు దశరథ	187
క్షత్త్రియ ధర్మ నిష్ఠా	59
క్షత్రియులకుఁ బ్రజా	112
క్షమ మేలగు నైన నతి	345
క్షరము నక్షరమును నీవ	172
క్షరము లైన భూతసంఘం	188
క్షితి నెందుం జరియించి	194
ఖ	
ఖగములకు జీవనం	441
గ	
గంగ యెవ్వనిఁ దన గర్భంబు	173
గతమునకును వగవ	350
గరదుని గృహదాహకు	41
గర్భంబుల నున్నయర్భ	203
గాంగేయుడిట్లనుఁ గౌంతేయ	454
గాండివి నొవ్వఁ బల్కితిటు	7
గురుతల్పగుండు రణమున	125
గురుతల్పగు భ్రూణహనున్	238
గురులను బంధుమిత్రుల	230
గురువునకు మాఱుపల్కుటఁ	125
గురు శుశ్రూషయు	261
గురుసంరక్షణమునకును	121
గుహయందు నిహిత	468
గోవిందుం డనిశంబు	3
గోవులను ఘోటకంబులఁ	36
గ్రద్ద మాటలకేల కడు	455
గ్రద్ద యిట్లనియె	456
గ్రస్తుండను పేర	13

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఘ	
ఘనభుజ విక్రమోన్నతుఁడు	4
చ	
చని యద్దేవునిం గని	249
చని సంప్రార్థించి యతని	380
చనుదెంచి యా వ్యాఘ్రవరుని	364
చనునే సాహసమిట్లు	332
చరణనాభిశీర్షంబులు	183
చరులఁబనిచి యరుల	340
చలిపందిరి చందంబున	53
చలిపందిరులును సత్రం	158
చారచక్షుఁడై కనునెల్ల	274
చాలుదురు వారు నృపతికి	306
చింతించు నతనితో	394
చెట్టును ఱాయియు మిట్టయుఁ	341
చెప్పినట్లు యేను జేసెద	64
చెఱువు నడు మవిసినను	345
చెలిమి చేసి కొందఱు	487
చేసిన దానికి మాఱుగఁ	422
చేసె నఘము దత్ఫలముం	421
చొరకున్న నజ్జనంబు	270
చోరులచేఁ జెడకుండ	315
చ్యవనుఁడు మార్కండేయుం	135
జ	
జడనిధి చందంబున	403
జతనంబున నర్థము	35
జనకుఁడు ప్రతర్దనునకుం	336
జనకుఁడుఁబోలె నర్మిలి	279
జనకుని వచనంబులు	50
జనన జరామరణ గ్రాహ	85
జనన మాదిగఁ బాక	94
జననముఁ దెల్పియేఁ బిలువ	19
జననాథ! నీవు సెప్పిన	52
జననాథునకు నవిశ్వాస	424
జననీజనక సహోదర	423
జననీజనకులును	350
జననుత నీవునుం దగ	68
జనమేజయనృప యంతకు	223
జన సంపూజ్య పదార	78
జను లొక్క తఱిఁ దొల్లి	269
జమదగ్ని సర్వవిద్యా	198
జీవిత సంశయవేళను	120
జ్ఞాతి నాశనమునఁ గాదె	26
జ్ఞాతివధ మట్లు సేసియు	154
జ్ఞాతుల నందఱుఁ జంపితి	21
జ్ఞాతుల నమ్మి తోడుకొని	425
జ్ఞానపరుడుఁ బౌర జాన	309
త	
తక్కిన మూఁడాశ్రమములు	34
తక్కిన రెండును నంద	404
తగునే యిట్లు?	410
తత్త్వబోధంబు గలుగు	54
తత్సంతతి జాతులెల్లను	255
తత్సమీపమునకు	224
తద్దయుశాంతుఁడై తక్కువ	352
తథ్యములైనను దలఁప	38
తన కడకు వచ్చి మొగమోడని	312
తనకీడు వైదికపు	242
తనకుం దోడ్పడి యని	327
తనకు మేలొనరించు	304
తన కొలఁది నుపాయంబులు	398
తనతోఁ గొందఱు గుక్కల	412
తన ధన మిదియని	273
తన భటులు గలఁగి	324
తన భూమిఁ బరులభూమిని	397
తనయుఁ డొకండ వాఁడు	170
తనయులనైను నమ్మిన	313
తనయొడ లెరవనినను	86
తనవారు పెద్ద సేయని	271
తనుఁ దాన తొలుత గెలువన్	276
తను హీనుం డని యెఱుఁగక	278
తపంబుల దానంబుల	122
తపమునకు విద్యకును	190
తపము నిదానము ధర్మ	469
తమతమ కలవడు	467
తమలో సరి ధర్మము	483
తమలోనఁ బొందుగల	290
తమ్ములును విప్రవరులును	137
తరణి వొడిచి తమము	233
తరణి శశాంకులతేజ	273
తరణి శశినేత్ర! జగదుప	503
తల్లిదండ్రిఁ బాయఁదగ	476
తా నటె మాంసముఁ దినదటె	363
తానున్ భార్యయు నేఁగుఁ	262
తాపసవర! తీవ్రంబగు	450
తారు గొందఱకు బాధకు	74
తాలిమిఁబేర్చువారలును	485
తినుఁడు తినకుఁ డొండేమైనను	497
తురగియు నుష్ట్రియు ఖరియు	129
తూఁగాడుచుం జనువాఁడు	429
తెగఁదీర్పక తననార్పక	427
తెగిపోయిన వారేడ్చిన	454
తెరవాయున ముచ్చిమి	399
తెలినీట రొంపివోవం	406
తేఁకువలేక మెలంగితిమి	159
తొడలపై నర్మిలి నిడికొని	77
తొల్లి తాన దాఁచెదల్లి	6
తొల్లి మాంధాతృఁడను మహీ	88
తొల్లి సృంజయుఁడను మహీ	264
తోఁచిన నతండు	445
త్రిభువన వ్యాప్త విక్రముం	170
త్రైవిద్యులగు మహాత్ములు	53

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ద	
దండంబున సకలజన	45
దండంబు సాక్షాద్దేవుం	379
దండార్హులైనవారల	42
దండించుట దానును	311
దక్షుండై తిటు బ్రహ్మశక్తిన	293
దక్షుఁడై భూపతిదండ	44
దధిసారము చందంబున	483
దనుజనాథుఁ డిట్టులను	387
దనుజవిభుఁడు ప్రహ్లాదం	386
దనుజుం దాఁకి కృపాణ	334
దమముం గడచిన సద్ధర్మ	467
దమమునిశ్రేయసము	467
దమమును సత్యముం	212
దమియింపఁ దగినవార	317
దయఁ బ్రజ రక్షించుటకు	285
దయమాలి పోవనేటికిఁ	456
దరికొను నాఁకలిం దను	431
దాంతియు విజితాత్మత్వము	236
దానంజేసి యన్నాడీజంఘుండు	499
దానవిధి యరయ	132
దానాధ్యయన యజనము	298
దానికి రోసి బృహస్పతి	386
దాని శుక్రుండు సహస్రాధ్యాయ	250
దారుకుఁడు వన్నితెచ్చిన	223
దిగ్విజయంబునం దేజస్వి	142
దినమునవెల్ల నుష్ణకర	220
దివంబుననుండి దండ	257
దివికిం జనినను నెవ్వని	76
దుఃఖంబుఁ బొమ్మని త్రోవ	72
దుఃఖంబు సుఖమును దోడివ	82
దురమునఁ గైదువుఁగొని	120
దురితములఁ జెఱుప	160
దురితము సేసి తాపము	452
దుర్గంబు లనేక	238
దుర్జయ విక్రమోజ్జ్వలుఁడు	198
దుర్జయులగు విరోధుల	48
దుర్మతు లామిష గతమగు	50
దూరమున నైదు మడువులు	193
దేవతల్ వేదవిధి	34
దేవ! భవత్ప్రసాదమునఁ	226
దేవభూదేవ పూజావిశేష	138
దేవర దివ్యచిత్తంబున	227
దేవా! వైశంపాయనుండు	1
దేవా! వైశంపాయనుండు	167
దేవా! వైశంపాయనుండు	339
దేశ విశేషంబు లాకర్ణింపు	343
దైత్యుల నిట్లు గీటడఁచి	479
ద్విరదంబుల నరదంబులఁ	140
ధ	
ధన దారాదికముల	244
ధనధాన్యంబులు కూర్చు	260
ధనధాన్య పశుసమగ్రం	474
ధన మపహరించుటయు	243
ధనమునకై ధర్మము	322
ధనములకు ధాన్యములకు	316
ధనము లుత్కృష్టంబు	56
ధనము సవరించినఁ	318
ధరణియును ఋక్షములఁ	209
ధరణి యొందాఁక నుండు	228
ధరణీశా! నృపధర్మ	266
ధరణీసుర విత్తము	120
ధరణీసురుస్వర్ణము	125
ధర్మంబు పెరుఁగు వైదిక	282
ధర్మజునకు నీ చెప్పెడు	228
ధర్మపథంబున ధరణి	24
ధర్మప్రవృత్తి యయ్యును	323
ధర్మ మధర్మముభంగి	364
ధర్మమార్గ	66
ధర్మమునకు సిరికిఁ	320
ధర్మరతులు నర్థ	243
ధర్మవిదులు రాజు	233
ధర్మాధర్మంబులు సుఖ	378
ధాత నిన్ను నేమి ధర్మంబు	81
ధుర్యత ననాగతములగు	407
ధృతరాష్ట్రుండు దనూజు	22
న	
నకులము నులూకమును	410
నకుల సహదేవ నయ	9
నక్కకేటి వ్రతము?	363
నగుచుఁ బర్వతుండు	105
ననుఁ గని యొండు సత్త్వము	372
నను నీవు పదస్థుని	366
నన్నుం గృతకృత్యునిం	162
నన్ను మనమునఁ	444
నమ్మఁ దగనివారి	417
నమ్మమి మృత్యువు పెద్దయు	303
నరపతి ధర్మోపేక్షా	283
నరరూపంబునఁ బరఁగెడు	40
నరవర! వాసవుం	453
నరవర సరసాన్నంబులఁ	83
నఱకఁదగని మ్రాను	126
నఱకుట యర్థముఁ	312
నవమగు రథమున	139
నాకును నీకు నేటికి	294
నాతోడి బాంధవంబు	360
నాయం దచట నచట	206
నాయట్లు వడిన యంగన	43
నారదుఁడు మదనబాణా	102
నారసింహవపు రుదార	186
నారాయణ పరములు	190

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
నాలుగు వర్ణంబులకును	214
నావుడు మదాత్మబ్రాహ్మణ	433
నా శరీరం బాహారంబు	441
నా సుఖుండు విరూపాక్ష	491
నిచ్చలు వచ్చు రేపకడ	495
నిజదారైకపరత్వముం	261
నిజధర్మవర్తియగు	263
నిదురపోవుచోట నీరు	340
నిను బోంట్లను నమ్మక	418
నిను సోముఁడవని	360
నిన్నొత్తి చెప్పుటకు	298
నియతిమెయి నెవ్వఁడింద్రియ	275
నిరూపించి యిట్లనియె	171
నిశ్చయించి సముచిత	65
నీకుం బాపంబునకుం	116
నీకు మున్నోలె నవ్యాకుల	210
నీవ చుట్టంబుఁ బక్కంబు	37
నీవడవి కరుగ	30
నీవడిగిన పూర్వవృత్తాంతం	208
నీవలచిన యట్లుసేయు	435
నీవలన నేను బ్రదికితి	417
నీ వార్య బోధితుండవు	62
నీ వాశ్రయణీయుండవు	361
నీవు తపోవిశేషమహ	213
నీవు దక్కంగ మందాకినీ	226
నీవున్ ధర్మవిరోధులైన	118
నీవు బ్రాహ్మణుండవని	14
నీవు సమస్త ధర్మ	47
నీ వెవ్వండ వన నప్పురుషుం	389
నృపతి పరోహితు	292
నృపధర్మము లన్నియు	234
నృపులు గారెవారు?	203
నృపునందు విధి	41
నెమకు పరివారమమ్మా	363
నెయ్యము సెడినను	422

పద్యము	పుట
నేమపుఁదెర	27
నేరక చేర నొక్కనిన	40
నేర్పరి పెక్కువిధంబుల	116
న్యాయశాస్త్ర	69
ప	
పంచవిధ వృత్తులగు	469
పంచాత్మకంబైన పవనం	171
పగయుఁ గల్గనేని	422
పగవాఁడు బలములఁ	326
పట్టినఁ బ్రబలుండగు	299
పడసి యింద్రుండుశీల	388
పతి మదికి నింతయెక్కిన	438
పతులు మృతులైనఁ	72
పదంపడి	441
పదపడి విప్రులు	205
పనివడి త్రవ్వి కూపము	29
పను లేము సేయఁగా	49
పరదారగమనదోష	126
పరనారీ గమనాది	320
పరపురుష సంగమంబు	126
పరపు లోఁతునుగల	313
పరమ నియతిమై	299
పరమమగు యశము	227
పరమాయుః పరమార్థ	337
పరమేశ పుణ్యసుబ్రహ్మణ్య	189
పరశురాముఁ డనఁగ	187
పరహితము సిగ్గుపాటుం	391
పరహితము సేయఁబూని	433
పరిఘనాముఁ డైన	412
పరిమెయిఁ బాటి వానిఁ	496
పరిశుద్ధిలేని కుత్సిత	289
పరిమాసంబునఁ దేలి	240
పరుఁ డసంగుఁడు ధర్మ	377
పరుల వధింపక యెవ్వఁడు	35

పద్యము	పుట
పరసఁదనము మెయి	285
పఱచి దిక్కుదప్పి	489
పలకలవార లగ్రమునఁ	341
పలుమాఱును రామికి	498
పవనునకును నీకును	461
పసగన్ వే చనిదోర్బలంబు	330
పసరపు టెంప ప్రోవు	429
పాండవాగ్రజుండు పాపంబు	465
పాడియు నాడియు బ్రదుకు	131
పాణిగ్రహణానంతరంబ	103
పానము జూదము వేటయు	426
పాపంబు దొడరుటయు	447
పాపంబు బుద్ధిపూర్వ	447
పాపంబులుంబోలెనుండి	120
పాపాత్ముఁడొక బోయ	436
పాటెడు నీరెడ త్రెవ్వఁగఁ	404
పుడమి యేలుట డిగ్గ	52
పుణ్యకర్మముల్ సేయుచు	127
పుణ్యతమము భోగా	336
పునుకఁ గుక్కతిత్తిఁ	132
పరపురఁ బొక్కుచు	498
పురిక యనఁగఁ నెగడు	359
పురుషవ్యాఘ్ర మనంబు	87
పురుషుఁ డీశ్వరుండు	379
పులగముఁ బాయస	130
పులి గూనల దినుచందము	317
పులినమలెడు మాంసము	362
పుష్టగోలక్ష	124
పూర్వవంశ్యుల	92
పెక్కంద్రతోడ నీరస	348
పెనుఁ బొల	448
పేదమనసగుట	40
పేదలకును	42
పొదల తఱచున	488
పొదలు	80

పద్యము	పుట
పొనరిచి యాడెడు	243
పొలవలచె	495
పో రుడుగను	70
ప్రకృతి పురుషయోగీ!	165
ప్రకృతి లేడింటి నెఱి	236
ప్రజ్ఞాకార్యంబు	449
ప్రతినకు నీడుగా	464
ప్రభువుల నుపచారంబుల	318
ప్రయతు లగు	161
ప్రసన్నుండ	172
ప్రాణములు వోవకుండఁగఁ	430
ప్రాణహాని దప్పించుచోఁ	121
ప్రాయోపవేశమున	80
ప్రియంబంది భీష్ముం డతని	467
ప్రియమున ధర్మనందనుఁడు	303
ప్రేమ సంప్రీతివినయ	156
ఫలములయెడ బ్రహ్మార్పణ	31
బ	
బంటు లుత్సహించి పగఱ	342
బలఁగముగల భూపాలుఁడు	305
బలవంతుఁడైడన శత్రుని	417
బలవంతులైన చుట్టం	414
బలవద్రిపులు ప్రయోజన	415
బలవిక్రమ సందపన్నుఁడ	401
బలుపగఱ వలని యాపద	418
బలుపుటురిఁ జిక్కి పేరాకలితో	416
బహుబంధు మరణ శోక	87
బహురత్నమయ ఘన	162
బహుళమగు గర్వమునఁ	426
బాల మరణ శోకంబునఁ	459
బావలు మఱఁదులు ననుచు	159
బాసనేయవే యట్టుంగాక	366
బాహాగర్వము సూపఁగోరి	330

పద్యము	పుట
బాహుదానవియం	67
బిగువెడలక నిలిచి	370
బుద్ధిమంతునివలన	364
బ్రదికియున్ననేఁ దపంబు	432
బ్రహ్మక్షత్త్రము లొంది	289
బ్రహ్మతేజోనిహతి నిట్లు	147
బ్రహ్మదత్తుండనఁ బరఁగిన	419
బ్రహ్మవిద్వేషంబుఁ బరికించి	99
బ్రహ్మశక్తిఁ బేర్చి రాజు	292
బ్రహ్మణ క్షతసంత్రాణ	255
బ్రహ్మణానుజ్ఞతోఁ గూడ	157
బ్రాహ్మణునకు దమము	258
భ	
భక్తాంభోరుహ బాలసూర్య	164
భక్తియు నార్జవము	215
భల్లంబుల్ పరఁగించి	16
భవదీయ కృపనాశ్రయింప	450
భవదీయసభ యొప్పు	385
భవదుఃఖ భరనిరాస	165
భావమున నమ్మెయికి	109
భీతి యొకటి గోరుట	450
భీష్ముం డాభీమాగ్రజం	231
భీష్ముపాలికిం బోదము	193
భువన భయంకరంబు	3
భూతంబుల సంసరణ	211
భూతముల మ్రింగి లోక	183
భూతములు జరామరణోపేతం	484
భూత వృద్ధులు ధనలాభములు	319
భూపాలక! విను పంచ	475
భూరమణుఁడు కాలము	282
భూవిబుధుల కెయ్యది	451
భూవి స్తారము నాక్రమించి	71
భోగములఁ బాషి నిందా	30
భ్రాతమహాత్ముఁడు గర్ణ్ణం	78

పద్యము	పుట
మ	
మంగళ ప్రకారంబున	221
మంగళము విష్ణుదేవుఁడు	189
మంచి మగండవైన నిను	330
మంజు పాఠకరవమును	221
మడువింకఁగఁ బాటెడు	403
మణిహేమ పర్యంకమహి	169
మత్తుఁ బ్రమత్తుని విషయా	278
మత్ప్రసాదంబున నీదృశ	219
మదమును రాగమున్	49
మనకేటి రాజ్యమొండొక	21
మనఁ జను నుప్పు నువ్వులును	301
మనమున ధర్మమునర్థం	485
మన్ననకున్ మదింప	304
మనుగడ దప్పు	463
మనుజులు సేయ నెవ్వరు	113
మనుజేంద్ర! సంకల్పమునఁ	471
మరల గాంగేయుకడకు	137
మఱవకయుండు నీ బిరుదు	462
మఱవవచ్చునె నా కభిమన్యు	76
మఱియు జననమరణం	73
మఱియును	141
మఱియు బృహస్పతి	245
మఱియు రాజునకు	280
మఱియు విదుర యుయుత్సు	163
మఱునాఁడు కల్యంబునం	138
మహనీయ బహుళపూజా	493
మాంధాతృండు నాభాగుండు	386
మాతృ పితృ దారపుత్ర	85
మాన లోభములఁ గామ	253
మానుషీక్షీరంబు నీనిన	129
మార్దవమున మృదువు	427
మాఱుకొన్నవారి నీఱు	149

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
మాలని రాక చూచి భయ	41
మాసర్త్యయ నాబ్దమయో	184
మితభోజియై వివిక్త	127
మిత్రుం డెక్కుడు కాశ్యప	490
మిత్రుం డైహికములు నా	501
మిత్రుం చేఁతలన్ సుఖము	81
మిట్టు పల్లంబునై మెలఁగ	99
మీనయి తా నతలగతం	185
ముంగికి గూబకు నగపడి	408
ముట్టఁబడి దీర్ఘసూత్రుం	406
మునిదత్తమగు మంత్రమున	9
మునిదివిజాదిక లోకము	184
మునిపతి వాశ్వామిత్రుడు	429
మున్నింద్రప్రస్థంబున	385
మూఢతమబుద్ధు లగు	75
మూలబలమున సంతుష్టంబై	323
మృగములుఁ బక్షులు	344
మృతిఁబొంది రాక్షసుండై	13
మృదు మధుర వాక్యముల	310
మేది నీపతి యతిమృదు	239
మేలనుభవించుఁ జుట్టము	473
మేలు దనకుఁ గోరు	235
మేలు వేఱ తలంపనేల	215
మేలుసేసి తగినమిత్రుని	413
మొనదీర్చు వెరవు	313
మ్రుచ్చిమియును ఱంకు	300
మ్రుచ్చుల మూఢత్వమునం	108
మ్రొక్కివేఁడెద	146
య	
యజనము దానకర్మము	259
యదువంశంబున వాసు	188
యమనియమాద్యష్టాంగ	33
యాగములును భోగములు	274
యానాసనాన్నపాన	475

పద్యము	పుట
యుచితవర్తన	101
యౌవనంబున దప	92
యజ్ఞపరిశిష్ట	57
ర	
రక్ష ప్రజగోడు	36
రక్షః పిశాచగుహ్యక	288
రథగమనరవంబు	223
రయంబున రాజసన్నిధి	64
రసగంధాద్యనుభవములు	287
రాచకూఁతుమీఁద రాగంబు	103
రాచకొడుకు గాఁడె	420
రాజటె రాగహీనుఁడటె	211
రాజధర్మునిం దలంచి	495
రాజధర్మోపాత్తంబై	61
రాజనామమునకు భాజనం	247
రాజునకుఁ బ్రజ శరీరము	276
రాజు నుత్తమగుణ	268
రాజు మూడు భాగముల	283
రాజ్యలాభ లోభ	78
రాముం డుద్ధతరోషపావక	202
రోషము శోకము రాగ	466
ఱ	
ఱేని యమమరణమునఁ	444
ల	
లక్షభార్యల నుపలాలించి	96
లాభంబు ధర్మముఖ్యము	322
లావులు వెరవులుఁ దాల్మిలుఁ	143
లీలమూరిఁబో నచ్చర	445
లోకపాలాత్ములరు మీరు	266
లోకమునఁ గలుగు భూసుర	158
లోకములు లోకధర్మంబు	273
లోపలరాఁజుచుఁ	305

పద్యము	పుట
వ	
వందిజనులుఁ బాఠకులుం	141
వగచి వెలవెలంబాఱి	441
వచ్చినఁ దన మెడ సాఁగిన	368
వచ్చినఁ దత్పదాంబురుహ	479
వచ్చి ముట్టి కయ్యమిచ్చిన	201
వచ్చి యరుణకమలం	67
వడముడియును నీవు	55
వదన బాహూరుపదము	184
వనకరి యొక్కటి	489
వనమున నెక్కటి నీవే	392
వనలతల కుసుమగంధము	488
వరద చరణలీలా!	503
వర్ణముల నాశ్రమంబుల	76
వర్ణములు నాశ్రమంబులు	263
వర్ణాశ్రమాచారవంతులు	357
వలదు శంకింప నింద్రుని	107
వల నధికంబుగాఁ గలుగు	83
వలనుఁ గులంబులేని	374
వలయునేని యధిప!	118
వలలోననున్న పులుఁగుల	443
వసువులందును బెద్దవు	212
వాఁడియగు నలుక	29
వాఁడును మలమూత్ర	108
వాగ్విభుఁడవైన నీ	217
వానయు సీతును వర్జించి	340
వానింజూచి యాబుషులు	252
వానినునూ్మలింప మీకు	369
వామన రూపంబున	187
వారల పెద్దలు నాకై	207
వారలు మెచ్చునట్టి	388
వారాహ రూపమున	186
వారి యాశ్రమముల	63

పద్యము	పుట
వారు గదాగణములు	253
వారునుం దత్సమయ	253
వాని గాని యట్టివనిత	126
వావిరిమాటలఁ దేలక	367
వాహనాసన శయ్యా	271
వికచముఖుఁడగుచు	425
విడువు ముమ్మలికంబు	115
విద్వత్సమూహంబు	150
విననఁ బఱించిన	460
విని ప్రహ్లాదుఁడు గృప	388
విని వారు దెలిసి మరలం	33
విని విననివాఁడపోలెం	426
విని సృంజయుండును	111
విను కర్షకులును	316
విను కాలిన కొఱవి	252
విను కుటుంబ భృత్య	473
విను కొంద ఱల్పబుద్ధులు	449
విను కొందఱనఁ గడు	345
విను గర్భిణి ప్రజ	240
విను చల్లని మాటలలో	424
విను చిల్లియుడిన	327
విను జనమేజయ	191
వినుఁడీ సుఖమును	75
వినుఁడు! ధర్మార్థ	252
విను తల్లియును దండ్రి	355
విను తీర్థయాత్ర సని	393
విను తొల్లి కృతయుగం	247
విను దౌదవ్వులఁ గార్యము	406
విను ధర్మంబున ధనమగు	482
విను ధర్మమునకు	320
విను! నీకామిష మేను	416
విను నృప! రాజ్యామిషముం	245
విను నృప! సమ్రాట్టు	275
విను! పర్జన్యుఁడు భూతము	295
విను పశుహింసాకృత	46
విను బండారము పెరుఁగని	398
విను బ్రహ్మవహ్ని నాకుం	432
విను మగ్గోవిందుఁడు	358
విను మట్టి మంత్రి	304
విను మది యట్టిద	497
విను మరిఁ జంపనుం	346
విను మర్థార్జకులును	353
విను మశననిగ్రహము	469
వినుమళి యలరునఁ	483
విను మారాజు సమస్త	292
విను మాస్తికతా శ్రద్ధా	127
విను! మిత్త్రుండును	490
విను మివ్వాక్యము లెవ్వఁడు	358
విను మీగోమాయువు	365
వినుము	66
వినుము	269
వినుము ఋగ్వేదాది	381
వినుము కర్మము దెల్పుచు	122
వినుము గుణవంతు	395
వినుము చెప్పెద శీలంబు	390
వినుము! తన్ను గెలుచు	277
వినుము తమోమయం	35
వినుము తఱివేచి	425
వినుము దివస్పతి	58
విను ముద్యోగము రెంటి	235
వినుము నరేంద్ర విప్రుఁ	18
వినుము నరేంద్ర సర్వ	145
వినుము! నేల దోఁచికొని	422
వినుము! ప్రజ్ఞాధిరూఢుఁడై	51
వినుము పాపముల కెల్లను	465
వినుము మయూరంబు	375
వినుము మహాభూతము	222
వినుము వివిధ సుఖము	297
వినుము విశేషించి జనన	291
విను మొక బ్రాహ్మణుండు	486
విను మొక్క యితిహాస	371
విను లోభమునజ్ఞానం	466
విను విప్రులు పేదలగుట	474
విను శంఖుండును	63
విను సకల భూతముల	219
విను సురతోఁ గూడఁగ	129
విప్రుని దండించు నెడలునుం	238
విప్రుల కధ్యయన ప్రదానా	230
విభుఁడు లేకున్న జనములు	273
విభుని సకలధర్మ	283
విమల జ్ఞానులు శమమును	56
వివిధోత్పాతంబులకున్	288
విశేషించి పురోహితుం	286
విశ్వసృజులను మునులచే	181
విషాద వివర్ణుండగుచు	394
విషానల సదృశంబులగు	217
విష్ణుఁజూడ నీవు వేడుక	265
విష్ణుమయ మగ్ని	190
విహతాశుండై లజ్జా	396
వీని నన్నింటి రిత్తవో విడిచి	36
వీరె వసువులు విమానంబులతో	216
వీరోదారోగ్రలీలన్ విదముఁడు	333
వీర్యవంతములగు వివిధ	152
వెడ గోఁడలనెత్తురొలుక	497
వెడలిన నీవెవ్వతవని	389
వెడలి సమరంబు	293
వెడవెడ నప్పలుకుల	27
వెనుఁబడు చిత్తవృత్తియును	103
వెరవును లావును గలిగిన	350
వెరవున నూఁతల	405
వెలడు నెడఁ దెలివితో	344
వెలివెలి వస్తువుల్ విడిచె	37
వేదంబులు నిట్లుసెప్పు	26
వేమఱు శత్రునిం	347
వేయేల? సంభవించునె	212

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
వైదికధర్మచారి జన	43
వైరివధంబు నీకును	60
వ్యవహారశుద్ధి సర్వ	311
వ్రతచర్యయు భాగ్యం	143
వ్రతసమన్విత భూసురా!	10
వ్యాకులతఁబొంది రూపఱు	232
శ	
శంతనుసూను గౌరవము	175
శంతను నందనుఁడపర	225
శతశృంగుం డనియోడి	329
శరణముసొచ్చినం దగ	439
శరణాగతసంరక్షణ	436
శరణాగతుండ భక్తుఁడ	190
శరణాగతుఁ గాచియు	328
శరతల్పంబునఁ బొల్చు	224
శరతల్పగతుం డతఁడే	174
శరభ సింహోత్యుగ్ర	98
శరముల వలనను	218
శవంబు విడిచిపోవం	455
శాంత మనస్కుఁడైన	135
శాంతుఁడు గాకని నాయుధ	238
శాపప్రాప్తికి నోర్చి	104
శాపము గారణముగ	200
శిలఁ ద్రెంపఁబోయి	237
శిల చేవ్రమాను దెప్పగ	132
శివ! నారాయణ! యచ్యుత!	217
శిశుజన మునిజన	401
శీలంబు మైత్రి కరుణ	468
శీలవంతులైన సిరి	386
శుచియును హంసుండు	178
శుక్రమతంబునం బంచమో	325
శోకాగ్నిదనికిన	39
శౌర్యము సత్యంబును	373
శ్రద్ధ వలయు మిథ్య	302
శ్రీధుర్యకరణ	339
శ్రీమంతుఁడును బల	452
శ్రీ శుచితాధృతి కరణ	167
శ్రీ సంక్రామణ నిపుణ	1
శ్రుతి వాక్యంబులు కర్మ	54
శ్రుతివిహిత కర్మజాత	28
ష	
షండునకు బిడ్డనిచ్చిన	132
స	
సంగరంబునం జంపుట	71
సంతతోత్సాహవంతుఁడై	245
సంతసంబుతోడ	361
సంవర్తుఁడను మహా	89
సకలధర్మ ప్రకారంబు	225
సకలవర్ణ ధర్మసంకర	242
సత్యంబు వలుకుట	356
సత్యప్రకార ధర్మము	378
సత్యాకృతులగు గుణ	470
సద్వంశ జన్మంబు	84
సన్మార్గమున రాజ్య	90
సమతయు దమము	470
సమధిక నిరవద్య	338
సమరము సాహసం బధిక	324
సముచితంబుగా నమ్మహా	481
సరిగా నెన్నుదు రార్యులు	24
సర్వమునందును దానున్	185
సాంగ వేదవేదియగు	284
సాతులోని కుటికి	487
సారథ్యంబు వహింప	139
సారపుసిరి చేటు	350
సారహీనములగు సంసార	27
సిరి విడుచును బురుషుని	351
సుద్యుమ్నుండను ధరణీ	62
సుమతిఁ ద్రైవర్ణికులకు	263
సుమహితమగు నీ	481
సురగురుఁడును శుక్రుం	44
సురతటినీ పుణ్యతమో	134
సురపతియుఁ ద్రివిష్ట	500
సురపతి విభవము	254
సురపితృకోట్లం	180
సురలును నసురులు	211
సువ్యక్త క్షేత్రంబున	181
సృంజయుం డుజ్జ్వలశ్రీ	110
సైనికుల మనములు	349
సౌమ్యు లసౌమ్యులభంగి	359
స్తవరాజం బనఁగ ముని	191
స్థల ముఖ్యములయ్యెడు	315
స్ఫురితవిమానము	445
స్మయభయ దర్పితక్షుభిత	502
హ	
హర సురపతిమయ	18
హరిఫాలంబునఁ బుట్టి	256
హరియుఁ బరాశరాత్మ	112
హరి సహస్ర శీర్ష	179
హరుఁడును సర్వమేధ	57
హరుఁడు బెట్టుగ నవ్వి	479
హరునివలనఁ బడసి	250
హర్మ్యములనుండి పణ్య	142
హల ముసల ధరుని	187
హింసాదోషంబు	35
హింసావిహారియైన	473
హితుఁడగు మంత్రి	365
హీనప్రజ్ఞుఁ డకార్యము	449
హైహయుండు	392

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 13

శాంతిపర్వము

(రెండవ భాగం 4,5,6 ఆశ్వాసములు)

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డా॥ ఆకురాతి పున్నారావు

డా॥ సముద్రాల లక్ష్మణయ్య

డా॥ బేతవోలు రామబ్రహ్మం

ప్రధాన సంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITHRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATHAM

With Commentary
Shanti parvamu of Tikkana Somayaji
Vol. XIII.
Part - II (4,5,6 Cantos)

Commentary by
Dr. Aakurathi Punna Rao - 4th Canto
Dr. Samudrala Lakshmanaiah - 5th Canto
Dr. Bethavolu Ramabrahmam - 6rd Canto

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Publications Series No.612
First Edition : 2005
First Re-print : 2006

Revised Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by

Sri. M.G. Gopal, I.A.S.

Executive Officer,

T.T.Devasthanams,

Tirupati - 517 507

D.T.P. Type Setting

Editor-In-Chief Office

T.T.D. Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్పైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,

దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

కవిత్రయ ఆంధ్రమహాభారతంలో శాంతిపర్వం ఒక ప్రముఖ పర్వం. మహాభారత యుద్ధం సమాప్తి అయిన తర్వాత పాండవులు తమకు మిగిలిన దానిని, తాము గెలిచిన దానిని, బేరీజువేసుకొనేఘట్టం. దుర్యోధనుడు తన దుర్గుణసహితంగా, అంతమొందిన తరువాత గెలిచింది ధర్మమే అయినా, ధర్మజునికి వైరాగ్యం ముంచుకొచ్చింది. దాన్ని తొలగించి రాజ్యపరిపాలనా రంగంలో ఆయన ఆసక్తి కనపరిచేటట్టు సహోదరులు నచ్చజెప్పడమేగాక, కృష్ణుడు, వ్యాసుడు మార్గదర్శనం చేయడం అనేవి ఒక ఎత్తు. అయితే ఆ తరువాత భీష్ముడు దీర్ఘంగా ఉపదేశించే రాజధర్మం, ఆపద్ధర్మం, మోక్షధర్మాలు, ధర్మజునికి శేషజీవిత మార్గదర్శక సూత్రాలు మరోఎత్తు అయినాయి. అవే పాఠకులకు ధర్మప్రబోధాలయినాయి. భీష్ముడిలాంటి భక్తుడు, నీతిశాస్త్రకోవిదుడు తత్త్వం తెలిసినవాడు, కురువృద్ధుడై సమాజాన్ని చూసినవాడు, ఇక్కడ ధర్మసూక్ష్మాలను చెప్పడం అవశ్య మాచరణీయంగా కనబడుతుంది.

శాంతిపర్వంలో నేరుగా ధర్మ వివరణం, ధర్మనిరూపణం, వీటికి ఆలంబనంగా వేరువేరు ఉపకథలు వస్తాయి. అయితే దీనినంతటిని సంగ్రహంగాను, స్వారస్యంగాను మొదటిసారిగా తెలుగులో తెలియపరచిన తిక్కన.

ఆరు ఆశ్వాసాల శాంతిపర్వానికి ఆరుగురు విద్వాంసులు వ్యాఖ్యానాన్ని సమకూర్చారు. డా॥ యస్. గంగప్ప, డా॥ దావులూరి కృష్ణకుమారి, డా॥ ఆకురాతి పున్నారావు, డా॥ బేతవోలు రామబ్రహ్మం. ఈ నలుగురు మహాభారత ఘట్టాలను విద్యార్థులకు బోధించి పేరుపొందినవారు. మహాభారతానికి ప్రధాన సంపాదకులు డా॥ జి.వి.సుబ్రహ్మణ్యం గారు, ఎడిటోరియల్ సెల్ సభ్యులు శ్రీ సముద్రాల లక్ష్మణయ్య. వీరిరువురు కూడ శాంతి పర్వానికి వ్యాఖ్యానాన్ని సమకూర్చారు. అందువల్ల శాంతిపర్వానికి న్యాయము, వ్యాఖ్యానానికి గుణాధిక్యము కలిగింది. వీరికి దేవస్థానం తరపున కృతజ్ఞతలు.

శాంతిపర్వాన్ని రెండు సంపుటాలుగా ప్రచురిస్తున్నాము. మొదటి మూడు ఆశ్వాసాల్ని ఒక సంపుటంగాను, తర్వాతి మూడు ఆశ్వాసాల్ని రెండవ సంపుటంగాను ముద్రించి మీ ముందు ఉంచుతున్నాం. ఈ గ్రంథం మొదటి సంపుటం.

ఇక మిగిలినది పర్వషట్కం. కూడ త్వరలో వెలువరించేందుకు కృషి నిరంతరాయంగా జరుగుతున్నది. ఎప్పటిలాగా ఈ పుస్తకాలను కూడ వేంకటేశ్వరస్వామి ప్రసాదంగా ప్రీతితో చదువరులు స్వీకరిస్తారని భావిస్తున్నాము.

కార్యనిర్వహణాధికారి
తి.తి. దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీవేంకటేశ్వరస్వామి వారి దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమ స్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన ''పోతన'' పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు ''వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత'' గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 -' 83 విద్యావత్సరాన్ని ''నన్నయ సంవత్సరం'' గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్లవేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జులై11 తేదీన హైదరాబాదు బాలాజి భవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం:

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అర సున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దివాకర్లవేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొకపర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్పురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్లవేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ" కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిక్రమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగాపర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది. ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీమధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జులై3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన:

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్దారెడ్డి గారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ నివేదిక సారాంశం:

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు	**ప్రొ।। ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ।।కె. సర్వోత్తమరావు	**శ్రీడి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్**

సలహాసంఘం

ఆచార్య తూమాటిదొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా।।రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీకాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నందూరి రామకృష్ణమాచార్య	**శ్రీములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం:

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిని అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జులై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీడి. నాగసిద్దారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు:

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీస్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలో ని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం:

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక వ్యావహారిక భాషలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్లకొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పంద్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి, విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి''.

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాష్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదక మండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంపాదక మండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు — శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య — డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
డా॥ కె.జె. కృష్ణమూర్తి — డా॥ కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే. — డా॥ బిరుదురాజు రామరాజు
అన్నమాచార్య ప్రాజెక్ట్‌డైరెక్టర్, తి.తి.దే. — డా॥ ఎం. కులశేఖరరావు
ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి, తి.తి.దే. — డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
డా॥ ఎం. బుద్దన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్‌ఆఫీస్' లో పై రెండు మండలుల లోని సభ్యులయొక్క సంయుక్తసమావేశం నిర్వహింపబడింది. ఈసమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటాలన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆయా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్త పాత్రను నిర్వహిస్తున్నారు. ఆక్రమంలో ప్రథమ సంపుటం-ఆదిపర్వం (రెండుభాగాలు), ద్వితీయ సంపుటం-సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి. సుబ్బారావుగారి తరువాత కార్యనిర్వహణాధికారి అయిన డా॥ పి.కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్. గారు వచ్చిన తత్క్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణను గురించి ఆసక్తితో గమనిస్తూ అన్ని విధాల సహకరించి ఆది సభా పర్వాల విడుదలకు ఏర్పాటుచేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాల నిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈబృహత్ ప్రణాళిక వ్యాఖ్యా సహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. అప్పట్లో తీవ్రతరం అయిన ప్రయత్నంతో గోదావరి పుష్కరాల సమయానికి ఆరణ్యపర్వం (2భాగాలు), విరాటపర్వం విడుదల అయ్యాయి. తర్వాత శ్రీ అజేయ కల్లంగారు కార్యనిర్వహణాధికారిగా విచ్చేసిన వెనువెంటనే ఈ మహాభారత వ్యాఖ్యాన సహిత ప్రచురణ ప్రణాళికను మరింత వేగిరపరచి కృష్ణాపుష్కరాల లోపల యుద్ధపంచకాన్ని విడుదల చేయాలనీ, 2004 సంవత్సరం చివరకు మిగిలిన పర్వాష్టకము వెలుగు చూడాలనీ నిర్ణయించడం జరిగింది. 2004 కృష్ణాపుష్కరాలసమయంలో ఉద్యోగ, భీష్మ, ద్రోణపర్వాలు వెలువడ్డాయి. కర్ణపర్వం ఒకసంపుటంగాను, తరువాతి పర్వాలైన శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు మూడింటిని కలిపి ఒకే సంపుటంగా ముద్రించుటకు సిద్ధం చేయడం జరిగింది. మిగిలిన పర్వాలన్నిటిని వీలైనంత తొందరగా విడుదల చేయడానికి సర్వయత్నాలు సాగుతున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారత' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తృమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. లోగడ తి.తి. దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వున్న శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహానికి కృతజ్ఞతాభివందనాలు. ఈమహాగ్రంథం వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ.ఎ.పి.వి.ఎన్. శర్మ ఐ.ఏ.ఎస్., గారిప్రోత్సాహక పర్యవేక్షణకుకైమోడ్పులు. తి.తి.దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి సాహిత్యప్రియులూ ఐన శ్రీ ఎన్. ముక్తేశ్వరరావు, ఐ.ఏ.ఎస్., గారు మరింత ప్రోత్సాహం ఇచ్చి ప్రాజెక్టు పనిని వేగవంతం చేస్తున్నారు. వారికి వందనములు.

సంబంధిత విభాగాధిపతిగా, సలహామండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన డా॥పి. రంగారావు, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి-వారికి మరియు ఈప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగా సహాయ సహకారాలందించిన తదితర అధికారిగణానికి నమస్సులు. ఈప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధానపాత్ర వహించిన-వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదక మండలి, సలహా మండలి) విద్యావేత్తలకు, ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారికి - నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి.దేవస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడంలో వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్ కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానిక పండితవర్యుల ఉప సంఘం (ఎడిటోరియల్ సెల్) నిర్మాణానికి సిఫారసు చేస్తే దేవస్థానం ఆమేరకు **పండితవరేణ్యులు డా॥ కె. సర్వోత్తమరావు, శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీముదివర్తి కొండమాచార్యులు** గారలతో ఎడిటోరియల్‌సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈసెల్ ఉపకారం అద్వితీయమై మరువరానిది. వర్క్‌షాపువలె నిర్వహింపబడుతున్న కవిత్రయ మహాభారత యజ్ఞంలో వీరు పాలుపంచుకుంటున్నారు. ఆకారణంగానే తక్కిన పర్వాలను త్వరితంగా గుణాత్మకంగా వెలువరించగలుగుతున్నాం.

"సప్తగిరి" సంపాదకులుగా, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి అమరులయ్యేవరకూ ప్రముఖ పాత్ర వహించిన కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమండలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్-ఎడిటర్లు డాక్టర్ కె. రాధారమణ, డాక్టర్ అల్లాడి సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్-ఎడిటర్ శ్రీ బి.ఎన్. శ్రీనివాసన్ గారికి, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్ది పాఠకులకు తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయాధికారి శ్రీ ఐ. పార్వతీశ్వర రావు గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీవేంకటేశ్వరస్వామి వారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ఎన్.ఎస్. రామమూర్తి

కన్వీనర్

సంపాదకుడు - సప్తగిరి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి

అధ్యక్షులు

శ్రీ ఎ.పి.వి.ఎన్.శర్మ ఐ.ఎ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకులు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం,

సంపాదక మండలి సభ్యులు

శ్రీపొత్తూరి వెంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆచార్య ఎం. బుద్ధన్న

డా॥ పి. రంగారావు, పౌరసంబంధాధికారి (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ మేడసాని మోహన్, డైరెక్టర్ అన్నమాచార్య ప్రాజెక్టు, (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద, కార్యదర్శి, ధర్మప్రచార పరిషత్తు (ఎక్స్ అఫిషియో సభ్యులు)

కన్వీనర్

డా॥ ఎన్.ఎస్.రామమూర్తి,

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు

పేర్లు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా 1,2
4. డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్న శాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	అను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	అను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	అను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది.	–	ఆదిపర్వం
సభా.	–	సభాపర్వం
ఆర.	–	ఆరణ్యపర్వం
విరా.	–	విరాటపర్వం
ఉద్యో.	–	ఉద్యోగపర్వం
భీష్మ.	–	భీష్మపర్వం
ద్రోణ.	–	ద్రోణపర్వం
కర్ణ.	–	కర్ణపర్వం
శల్య.	–	శల్యపర్వం
సౌప్తి.	–	సౌప్తికపర్వం
స్త్రీ.	–	స్త్రీ పర్వం
శాంతి.	–	శాంతిపర్వం
అను.	–	అనుశాసవికపర్వం
అశ్వ.	–	అశ్వమేధపర్వం
ఆశ్ర.	–	ఆశ్రమవాసపర్వం
మౌస.	–	మౌసలపర్వం
మహా.	–	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	–	స్వర్గారోహణపర్వం
సం.	–	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	–	సంస్కృత మహాభారతము
అను.	–	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	–	ప్రధాన సంపాదకుడు

క.	–	కందపద్యం
వ.	–	వచనం
ఆ .	–	ఆటవెలది
తే.	–	తేటగీతి
సీ.	–	సీసం
ఉ.	–	ఉత్పలమాల
చ.	–	చంపకమాల
మ.	–	మత్తేభ విక్రీడితం
శా.	–	శార్దూల విక్రీడితం
ఆశ్వా.	–	ఆశ్వాసం
క్రీ.శ.	–	క్రీస్తుశకం
య.	–	యగణం
మ.	–	మగణం
త.	–	తగణం
ర.	–	రగణం
జ.	–	జగణం
భ.	–	భగణం
న.	–	నగణం
స.	–	సగణం
ల.	–	లఘువు
గ.	–	గురువు
అలం.	–	అలంకారం
సం.	–	సంవత్సరం
మొ.	–	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శాంతిపర్వ కథాసారం

(రెండవ భాగం)

ప్రశ్నోత్తర మాలిక:

భీష్ముడు : ధర్మరాజా! నాకు తెలిసిన విధంగా ప్రజ్ఞను కలిగించే వాక్యాలను ఇంతవరకూ బోధించాను. ఇంకా ఏమి వినాలని కోరుకొంటున్నావు? (4.2)

ధర్మరాజు ప్రశ్న54: పితామహా! ఇంతవరకు రాజ ధర్మాలు వివరంగా చెప్పావు. కృతజ్ఞుడను. సకల భూప్రజలకూ పరమ హితాన్ని కలిగించే ఉత్తమ ధర్మం ఏది? 4.3,4)

భీష్ముడు : ధర్మం అనేక విధాలుగా విస్తరిల్లి ఉంటుంది. అది ఎన్ని విధాలుగా ఉన్నా ఆచరణయోగ్యమే. ప్రతిధర్మం ఫలితాన్ని పొందింపచేస్తుంది. ధర్మతత్వం తెలిసినవాడు మాత్రం ముక్తినిచ్చేదే ఉత్తమ ధర్మమంటాడు. ఇది ఇష్టం, అది అనిష్టం అని హృదయంలో భావించకుండా ఉండటమే మోక్షాన్ని కలిగించే ధర్మం. ఈ అంశాన్ని తెలిపే ఇతిహాసం ఒకటి ఉన్నది. అది 'సేనజిత్ విప్రసంవాదం'. అందులో పుత్రశోకార్తుడయిన సేనజిత్తనేరాజుకు ఒక విప్రుడు చెప్పిన బోధ గమనించదగింది. దానిసార మేమంటే - సృష్టిలో పుట్టినవారంతా గిట్టటం సహజం. కాబట్టి నీ కొడు కొక్కడే చనిపోయినట్లు శోకించటం శోచనీయం. పితృపుత్రాది బంధుసంబంధం నదిలో కలిసి కొట్టుకొనిపోయే రెండు కొయ్యలవంటిది. అవి కొంతదూరం కలిసి సాగి ఆపైన విడిపోతాయి. మానవ సంబంధాలూ అంతే. కాబట్టి బంధువులు ముక్తిప్రాప్తికి కారణం కానే కాదు. సుఖదుఃఖాలు శరీరానికే, ఆత్మరూపుడైన నరుడికి కావు. కర్మఫలం అందరూ అనుభవించవలసిందే. అయితే, తృష్ణను త్యాగం చేస్తే కర్మఫలాన్ని అనుభవించటం నివారించవచ్చును. పింగళ అనే వేశ్య ప్రియుడికొరకు వేచి వేచి విసిగివేసారి చివరకు ఆశవలననే ఆ దుఃఖం ఏర్పడిందని తెలిసికొని, ఇంద్రియాలను జయించి తృష్ణారాహిత్యాన్ని సాధించటమే ముక్తిహేతువైన ధర్మమని తలంచింది. సేనజిత్తు ఆ సత్యం తెలిసికొని శోకవిముక్తు డయ్యాడు.

ప్రశ్న 55 : జీవరాశులు నశించిపోయే కాలం ఏర్పడినప్పుడు ప్రజలు ఏం చేయాలి? (4.20)

ఉత్తరం : నీ ప్రశ్నకు తగిన సమాధానం 'పితాపుత్ర సంవాద'మనే ఇతిహాసంవలన తెలుస్తుంది. మేధావి అనే బ్రాహ్మణుడికి ఒక కొడుకున్నాడు. అతడు తండ్రిని ఇటువంటి ప్రశ్ననే అడిగాడు. వారిరువురి నడుమ చర్చసాగింది. దాని సార మిది-కొందరు చతురాశ్రమాలను నిర్వహించి ప్రశాంతంగా జీవిస్తూ మోక్షాన్ని పొందవచ్చునంటారు. కాని, మానవుడు పుట్టిన క్షణంనుండి మృత్యువు వెంటాడుతూనే ఉంటుంది. అడవిలో నిద్రపోతున్న వాడిని పులి కబళించినట్లు మానవుడిని మృత్యువు మ్రింగివేస్తుంది. కాబట్టి మానవుడు కాలానికి అధీనుడే కాని అతడికి కాలం అధీనం కాదు. కాలం ముందు ప్రాణులన్నీ సమానులే. సత్యమే అమృతం, మోహమే మృత్యువు. ఈ జ్ఞానంతో సంసారబంధాలను త్రెంచుకొనాలి. అప్పుడు సుఖదుఃఖాలు రెండూ సమానమే ఔతాయి. శాంతి చేకూరుతుంది. హింసతో కూడిన యజ్ఞం అహంకారం కలిగిస్తుంది. వాఙ్మానస నియమరూపమైన యజ్ఞం వలన అవ్యయానందం కలుగుతుంది. కాబట్టి మనోవికారహేతువైన అరిషడ్వర్గాన్ని త్యజించి ఏకాంతంలో నిశ్చలమనస్కుడై ఆత్మాన్వేషణం చేసికొనటమే శాంతికి మార్గం. కాబట్టి ధర్మరాజా! సత్యప్రవర్తనలోనూ, ధర్మ నిర్వహణంలోనూ నేర్పరివి కమ్ము.

ప్రశ్న 56 : లోకంలో ధనవంతులు, పేదవారు అని రెండు తెగలుగా జనులు కనిపిస్తుంటారు. వారిలో సుఖు లెవ్వరు? దుఃఖు లెవ్వరు? (4.32)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉత్తరం : శాంతి కాముకుడైన శమ్యాకుడు అనే బ్రాహ్మణుడు సంసారాన్ని త్యజించి కటకటపడుతూ నా వద్దకు వచ్చాడు. అతడితో జరిగిన ప్రసంగంలో కొన్ని విశేషాలు నీ సందేహానికి సమాధానాలు ఔతాయి. వాటి సారాంశమిది - కలిమి లేములను ఒక త్రాసులో పెట్టి తూస్తే కలిమికంటే లేమివైపే త్రాసు ముల్లు మొగ్గింది. ధనవంతుడు తన సంపద కారణంగా అనుక్షణం మృత్యుముఖంలో ఉన్నట్లు భయపడుతూ ఉంటాడు. ధనం నిరంతర దుఃఖాన్ని కలిగిస్తుంది. కాబట్టి ధనాశను వదలితే సుఖం ప్రాప్తిస్తుంది. పేదవాడు నిర్భయంగా ఉండగలడు. ఆత్మాధీనమైన జీవితం ఆనందదాయకం.

ప్రశ్న 57 : ధనతృష్ణకు లోనైనవాడు ఎప్పుడు ఏ విధంగా సుఖం పొందుతాడు? (4.39)

ఉత్తరం : ధనం సంపాదించి సంపాదించి విసుగుపుట్టి దానిని చాలించినప్పుడు మనిషికి సుఖం లభిస్తుంది. ఈ అంశాన్ని తెలిపే మంకి అనే బ్రాహ్మణుడి చరిత్ర వినదగింది. దాని తాత్పర్యం తెలియదగింది. సుఖప్రాప్తికి ధనం మూలం కావచ్చును. అయితే, ఆ ధనం కోరినంతనే సిద్ధించదు. దానికై యత్నించాలి, యత్నించినా సిద్ధిస్తుందని నమ్మకం లేదు - సిద్ధిస్తే సిద్ధించవచ్చును. లేకుంటే లేకపోవచ్చును. సిద్ధించినా ఆ ధనంతోపాటు ఎన్నో వెతలు వెన్నంటి ఉంటాయి. ధనం సిద్ధించకపోవటం మరణంతో సమానం. కాబట్టి ధనతృష్ణనే త్యజించటం మంచిది. ఇచ్ఛానిరసనమే సుఖం. కామతిరస్కారంవలన లోభాదులు ఉండవు. శాంతి దాంతి సత్య క్షమా భూతదయలు కలుగుతాయి.

ప్రశ్న 58 : నరుడు ఏమి చేస్తే అతడిశోకం నశిస్తుంది? ఏ మార్గాన అతడు మోక్షాన్ని పొందగలడు? (4.54)

ఉత్తరం : అజగర చరిత్రమనే ఇతిహాసం ఈ ప్రశ్నలకు సమాధానం ఔతుంది. అజగరుడు అనే బ్రాహ్మణుడు ప్రహ్లాదుడనే రాక్షసరాజుకు శమసాధన ప్రకారాన్ని ఉపదేశించాడు. మానవుడికి మేలు కావాలని కోరకుండా ఉండటం, కీడు దాపురించినప్పుడు జాలిపడినా దానినుండి విముక్తుడు కావాలి. మేలు కీడులను సమంగా చూస్తూ సాక్షీభూతంగా ఉండే చిత్తంతో ఆ రెండింటియందు ఉపేక్ష వహించి జీవించాలి. శాంతికి అదే మార్గం.

ప్రశ్న 59 : బంధువుల కలిమి, కర్మం, ధనం, బుద్ధిబలం - అనే ఈ నాలుగింటిలో దేనివలన నరుడికి గొప్పకీర్తి కలుగుతుంది? (4.67)

ఉత్తరం : ప్రజ్ఞయే ప్రతిష్ఠ, లాభం, స్వర్గం; ప్రజ్ఞయే ముక్తి. ప్రజ్ఞకు సాధ్యంకాని పనులు లేవు. కాశ్యపుడనే బ్రాహ్మణుడికీ నక్కరూపంలో వచ్చిన ఇంద్రుడికీ జరిగిన సంవాదం ఉదాహరణం. దానివలన అన్ని విధాలా ప్రజ్ఞయే ఉత్తమాశ్రయ మని స్పష్టమౌతుంది.

ప్రశ్న 60 : నరుడు దానం, తపస్సు, పెద్దలసేవ, అనేక యజ్ఞాలూ చేస్తుంటాడు. అవి ఎట్లా పరిణతిపొంది అతడిని చెందుతాయి? (4. 70)

ఉత్తరం : నరుడు చేసిన పాపపుణ్యాలు అతడిని నీడవలె వెన్నంటి ఉంటూ, అతడు చనిపోతే అతడిని అనుసరించి పరలోకాలకు వెళ్ళుతాయి. ఫలితార్థ మేమంటే నరుడు బ్రతికినా, చనిపోయినా అతడు చేసిన పాపపుణ్యాలు తమ ప్రభావాన్ని నెరపుతూ ఉంటాయి.

ప్రశ్న 61 : భూతసృష్టి ఎవ్వడివలన ఏవిధంగా జరిగింది? (4. 80)

ఉత్తరం : పూర్వం భరద్వాజఋషి ఇటువంటి అంశంతోపాటు మరికొన్ని అంశాలు అడుగగా భృగుమహర్షి వివరించాడు. వాటిని తెలిసికొంటే ఈ అనుమానం తీరుతుంది. నారాయణుడు అవ్యయుడు, అనంతుడు. అతడు మనసులో సృష్టిసంకల్పం చేశాడు. తనలోని వెయ్యోవంతుతో అవ్యక్తుడనే వాడిని సృష్టించాడు. అతడు జరామరణాలు లేనివాడు, సాటిలేనివాడు. అతడివలన మహత్తత్త్వం (ప్రకృతి) కలిగింది. దివ్యతేజోమయమైన పద్మాన్ని ఒకదానిని ప్రభవింపజేశాడు. అందులోనుండి బ్రహ్మ ఉద్భవించాడు. ఆ బ్రహ్మ సంకల్పంవలన ఆకాశం పుట్టింది. దీని నుండి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నీరూ, నీటినుండి నిప్పూ, గాలీ జన్మించాయి. ఆ తరువాత నిప్పుగాలుల కలయికతో భూమి పుట్టింది. బ్రహ్మకు సర్వభూతాలూ శరీర భాగాలే. ఆయన శరీరానికి పర్వతాలు ఎముకలు, భూమి క్రొవ్వూమాంసమూ, సముద్రాలు నెత్తురు, ఆకాశం పొట్ట, గాలి ఊర్పు, అగ్ని తేజస్సు, నదులు రక్తవాహికలైన నరాలు, సూర్యచంద్రులు కన్నులు, ఊర్ధ్వలోకం శిరస్సు, పాతాళం పాదాలు, దిక్కులు చేతులు - ఇట్లా అంతం లేని శరీరం కలవాడు నారాయణుడు. సృష్టి జంగమ స్థావరాత్మకం. జగన్మూర్తి అయిన విష్ణువునుండి పంచభూతాలు జన్మించాయి. కాబట్టి అవి కూడా విష్ణువువలెనే అనంతాలు. సృష్టిలో చేష్టలు, శబ్దాలు, ద్రవాలు, వేడిమి, గట్టిదనం అనే గుణాలు వరుసగా వాయువు, ఆకాశం, జలం, అగ్ని, భూమి అనే పంచభూతాల వలన కలుగుతాయి. స్థావరాలలో కూడా పంచభూతాత్మక చైతన్యం ఉన్నది. పంచభూతాలకు గంధాది లక్షణా లున్నాయి. వాటిని మానవులు క్రమంగా ఇంద్రియాలద్వారా, వాటిని నియంత్రించే మనస్సుద్వారా, గ్రహించి అనుభవిస్తారు. జీవుడు అనుభోక్త. సుఖదుఃఖాలు అతడియందే ప్రతిఫలిస్తాయి. అతడిని పురుషుడనీ, క్షేత్రజ్ఞుడనీ అంటారు. జీవుడికంటె ఆత్మ భిన్నమయింది. క్షేత్ర క్షేత్రజ్ఞతత్త్వం, సత్త్వరజస్తమోగుణాలు అనే ఈ మానవ స్వభావ వికారాలకు మిక్కిలి దూరమై, ఈ జన్మపరంపరాచక్రాన తగుల్కొనకుండా ఆత్మ మోక్షాన్ని చేరుకొంటుంది. పండితుడు ఆధ్యాత్మ చింతనతో, నిర్మల మతితో కేవలుడైన పురుషుడిని అన్వేషించి, దర్శించి, అతడియందే తన మనస్సును లగ్నంచేసి, ఇతరమైనది దేనినీ చూడక, కేవల ప్రశాంతితో సుఖాలనన్నిటిని మించిన ఆ పరమసుఖాన్ని పొందుతాడు. (ఈ సందర్భంలోనే భరద్వాజుడి కోరికపై భృగుమహర్షి వినిపించిన వర్ణాశ్రమధర్మాలను గురించి, భూలోక స్వర్గలోకాలను గురించి భీష్ముడు ధర్మరాజుకు వినిపించాడు).

ప్రశ్న 62 : ఆచారవిధులను వివరించి చెప్పుము. (4. 116)

ఉత్తరం : మంచి చెడు నడతలు సజ్జన దుర్జనులకు సమానమే. ఉదాహరణకు రాజమార్గంలో, సభలో, పశువులమందలో మలమూత్ర విసర్జన చేయకుండటం, శుచిగా ఆచమించి నిలకడగా నీట మునగటం, సంధ్యావేళలలో సూర్యుడికి అర్ఘ్య మిచ్చి పూజించటం, సూర్యుడు పొడిచేటప్పుడు, క్రుంకేటప్పుడు నిద్రపోకుండ ఉండటం, పాద్యఅర్ఘ్య స్నానాదికాలు ముగిసిన పిదప భుజించటం, అన్నాన్ని నిందించకుండటం, తడికాళ్ళతో నిద్రకు ఉపక్రమించకుండ ఉండటం - అనేవి సదాచారాలని నారదుడు చెప్పాడు. ఇతర స్త్రీని వివస్త్రగా ఉన్నప్పుడు చూడరాదు. స్వీయమలాన్ని చూడకూడదు, స్వీయ పాపాన్ని దాచిపెట్టరాదు. సంభోగక్రియను గుప్తంగా ఉంచాలి గాని ప్రకటనం చేయరాదు. - ఇటువంటి ఆచారాలు దురాచారాలకు దూరంగా ఉంచుతాయి. గురువులను సేవించటం, బ్రాహ్మణులను కీర్తించటం నరుడికి ఆయుస్సును పెంచుతాయి.

ప్రశ్న 63 : తాతా! నేను అధ్యాత్మ విద్యను గురించి వినాలని కోరుతున్నాను. చెప్పుము. (4.120)

ఉత్తరం : కడలికెరటాలవలె జీవాత్మ పుట్టుతూ గిట్టుతూ ఉంటుంది. భూమి, నీరు, కాంతి, గాలి, ఆకాశం అనేవి పంచ భూతాలు. వాటి స్వభావాలైన వాసన, ద్రవం, తేజస్సు, చలనం, శబ్దం - అనేవి ఇంద్రియాల ద్వారాగ్రహింపునకువస్తాయి. చెవి, ముక్కు, నోరు, తోలు, కన్ను - అనేవి ఈ ఇంద్రియాలు. వాసనాది పంచభూతాల గుణాలు అనుభవా నికి రావటానికి ఆ సాధనాలకు పెద్ద ఆధారభూమి మనస్సు. ఆ మనస్సు ద్వారానే విషయజ్ఞానం మానవుడిలో ప్రవృత్తిని రేకెత్తించి ఈ జననమరణ చక్రంలో పడవేసి త్రిప్పుతుంటుంది. ఆ చక్రభ్రమణం నుండి బయటపడాలంట్కేముందుగా ఇంద్రియాలను మళ్ళించి మనస్సుతో వాటిని చేరిస్తే, బుద్ధిని లోలోననే అణచివేయవచ్చును. ఆ విధంగా పురుషుడు అంతర్ముఖుడైనప్పుడు అతడిలో బుద్ధి గోచరించని స్థితికలుగుతుంది. ఆత్మజీవంతోచేరి భూతాత్ముడనీ, శరీర తత్త్వం తెలిసి క్షేత్రజ్ఞుడనీ, శరీరం తాను కానని తెలిసి పురుషుడనీ, పరమేశ్వరుడనీ, బుద్ధికి ఎడంగా నిలిచి 'బుద్ధిసాక్షి అనీ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తత్త్వ దర్శనంతో జనన రహితుడనే పిలువబడుతూ ఉంటాడు. 'ఆత్మ' పరమేశ్వరుడైనప్పుడు అతడు విశ్వమయుడు. సృష్టి అంతా అతడిలో గోచరించేదే. అదే సృష్టి తిరిగి ఆత్ముడికి ఇంద్రియానుభవం ద్వారా గోచరిస్తున్నదంటే తాత్పర్యం- అదంతా మాయవలన స్వప్నసదృశమైన మిథ్య తప్ప అన్యం కాదు. మాయకారణంగానే 'ఆత్మ' తనను తాను కాంచలేక, మోసానికి గురి అయి పరమాత్మకు వెలి అయి అలమటిస్తుంది. మిథ్యాజ్ఞానమే మాయ. మాయకు మానవుడిలోని గుణత్రయం శరీరం. కాబట్టి మాయాతత్త్వం గ్రహించి, మొదట తమస్సును, ఆ పిదప రజస్సును వదలివేయాలి. అప్పుడు ఆత్మ శుద్ధసత్త్వరూపంతో వెలుగుతూ ఉంటుంది. అటు తరువాత ఆ సత్త్వాన్ని కూడా తొలగించుకొనాలి. అపుడు కేవలం జ్ఞానం - విమలబోధ - కలిగి ఆత్మపరమాత్మగా ఔతాడు. గుణత్రయ రాహిత్యమే కైవల్యం. పరిశీలిస్తే సత్త్వగుణం సుఖమయం. రజస్సు నిరంతర దుఃఖనిలయం, తమస్సు జ్ఞానమాంద్య రూపం. అయితే సమతాదృష్టితో ఆయాగుణాలను, వాటి స్వభావాలను దూరంచేయగలిగితే మాయను పోద్రోలినట్లే. గుణత్రయ రాహిత్యమే మాయానాశనం. ఇది ఆధ్యాత్మపద్ధతి.

ఆధ్యాత్మవిద్యకు ఉపకరించే యోగవిద్యను తెలియటం అవసరం. మనస్సు చలించకుండా, ఏకాగ్రమై నిలిచి ఉండాలి అంటే దృఢ నిశ్చయం అవసరం. మబ్బులో మెరుపువలె, తామరాకుపై నీటి బిందువువలె మనస్సులో ఆలోచన సహజంగా ఉంటుంది. మనస్సు ప్రసరించే తీరూ, గాలి వీచే పద్ధతీ ఒకటే. గాలి కారణంగానే మనస్సు చలిస్తుంది కాబట్టి శరీరంలోని వాయువును మనోనిగ్రహం కొరకు నియమించాలి. వాయు నిగ్రహణం సులభం కాదు. అది క్రమక్రమంగా సాగాలి. స్థిరమైన సంకల్పంతో యమ నియమాదులైన ఎనిమిది సాధనాలతో వాయు నిరోధానికై యత్నించాలి. ఆ ప్రయత్నంలో ముందుగా ఆలోచనలు కరిగిపోతాయి. తరువాత సందేహం కలుగుతుంది. ఆ పిదప జ్ఞానం వాయువును క్రమబద్ధం చేయగలుగుతుంది. క్రమబద్ధమైన వాయువు శరీరాంతర్గతనాడులలో ప్రయాణం చేసి శరీరంలోని బ్రహ్మస్థానాన్ని చేరుకొంటుంది. అపుడు మనస్సు నిశ్చలమై, శాంతిపూర్ణమై బ్రహ్మానందాన్ని అందుకొంటుంది. ఆ తరువాత ఆనందంలో లీనమై పోతుంది.

ప్రశ్న 64 : జపం చేసే విధానాన్ని, జపం చేసేవారు పొందే ఫలితాన్ని తెలుపుము. (4. 129)

ఉత్తరం : సాధకుడు శుచిగా దర్భలు పరిచిన సమతలంమీద ఆసీనుడై జ్ఞానకర్మేంద్రియాలను అన్యవిషయాలతో సక్తం కాకుండా నిగ్రహించి, ఏకాగ్రచిత్తుడై, మాత్సర్యం, గర్వం, దర్పం, దంభం - వీటిని తొలగించుకొని జపం చేయటానికి ఉద్యుక్తుడు కావాలి. జపవిధానాన్ని సరిగా పాటిస్తే మోక్షం కలుగుతుంది. అనుమానం లేదు. అదే జపంలో శౌచాది లక్షణాలు లోపిస్తే నరకం కూడా ప్రాప్తించవచ్చును. దీనిని వివరించే కౌశికుడు, ధర్మదేవత, యమధర్మరాజు, కాలపురుషుడు, మృత్యుదేవత - వీరందరి నడుమ జరిగిన సంవాదం తెలియదగింది. కౌశికుడికీ ఇక్ష్వాకు మహారాజుకూ జరిగిన సంవాదం ఉపకరిస్తుంది. వీటి తాత్పర్య మేమిటంటే - జపశీలురూ, యోగులూ ఇద్దరూ పుణ్యగతులు పొందుతారు. అయితే జపశీలురు భారరహితంగా పైకెగసే శక్తి కలిగి యోగులకంటె మిన్నగా ఉంటారు.

ప్రశ్న 65 : నిరతిశయ జ్ఞానయోగ విధాన్ని వివరించుము. (4. 171)

ఉత్తరం : ఈ ప్రశ్నకు సమాధానంగా 'మను బృహస్పతి సంవాదం' అనే ఇతిహాసం ఉపయోగపడుతుంది. జ్ఞానయోగం మానసిక ప్రక్రియ. అందువలన మనస్సు కలత దేరి, కల్మషానికి దూరమై నిర్మలంగా ఉన్నప్పుడు పురుషుడుఆత్మజ్ఞుడు కాగలడు. ఆత్మజ్ఞానం పొందగలడు. మురికినీటిలో రూపం కనపడనట్లు కలత చెందిన మనస్సుతోఆత్మజ్ఞానం పొందలేరు. తేరిన నీటిలో రూపుకానబడినట్లు నిర్మలమైన మనస్సుతో ఆత్మజ్ఞానం పొందగలరు. ఇంద్రియనిగ్రహం వలననే మనస్సు నిర్మలమౌతుంది. పాపాలు నశిస్తే జ్ఞానం కలిగి, మెరుగుటద్దంవలె ప్రకాశిస్తూ ఉంటుంది. అపుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శరీరంలోని ఆత్మ తనను తాను దానిలో చూచుకొనగలుగుతుంది. జ్ఞానం ఆత్మలో ఐక్యమౌతుంది. సమ్యగ్జ్ఞానం పొందాలంటే మాయను జయించాలి. ఆత్మను మాయ ఆవరించి ఉంటుంది. గుణత్రయం మూడు పురులుగా కలిసి ఆత్మను చుట్టుకొని ఉంటుంది. ఆ పురిని వైరాగ్యమనే కొడవలితో తెగవేయాలి. మనస్సూ, బుద్ధీ, జ్ఞానమూ నరుడినుండి తొలగిపోతే తప్ప అతడికి శాశ్వతం, సర్వవ్యాపి అయిన జ్ఞానతత్త్వం అయిన పరమేశ్వర స్వరూపం గోచరించదు. ఆ పరతత్త్వం గొప్పవెలుగు. ఆ వెలుగు అమృతం, అచ్యుతం, అమలం, అమేయం, అవ్యయం, అనంతం. దానిని యమనియమాది సాధన సంపత్తితో ప్రశాంతచిత్తం ద్వారా గ్రహించవచ్చును. అప్పుడే ఆ పరతత్త్వం మానవుడి అనుభవానికి అందుతుంది.

ప్రశ్న 66 : మహనీయుడైన శ్రీకృష్ణుడి మాహాత్మ్యాన్ని వినిపించుము. (4.203)

ఉత్తరం : నే నిదివరలో నారద జామదగ్న్య మార్కండేయ వ్యాస వాల్మీకి ప్రభృతి మునీంద్రులు చెప్పగా వినిన విశేషాలను చెప్పుతాను. శ్రీకృష్ణుడు ప్రభవిష్ణుడైన విష్ణుడు. అతడే తన దివ్యశక్తితో తానూ కర్మనిర్వహణ నైపుణ్యంతో వినోదించాలనే సంకల్పంతో ఈ సృష్టికి మూలపదార్థాలైన పంచభూతాలను కల్పించాడు. నీటిపై భద్రమైన శయ్యమీద (శేషతల్పంమీద) పరుండి ఉండగా నాభినుండి ఒక పద్మం పుట్టింది. దాని నుండి బ్రహ్మ పుట్టాడు. అతడికి ఏడుగురు మానస పుత్రులు కలిగారు. వారు వరుసగా మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు. వారిలో మరీచికి కశ్యప ప్రజాపతి జన్మించాడు. ఆ కశ్యపుడివలన దేవతలు, రాక్షసులు, గరుడులు, నాగులు మొదలైన జాతులు జనించాయి. ఆ కశ్యపుడికే సూర్యుడు జన్మించగా, అత్రికి చంద్రుడు కలిగి, ఆ సూర్యచంద్రు లిద్దరూ క్షత్రియ వంశాలకు మూలపురుషు లయ్యారు. ఆ వంశాలకు చెందిన రాజులు పలువురు పెక్కు దేశాలు పాలించారు. భిన్న భిన్న కాలాలలో భిన్న భిన్న దేశాలలో ఆ క్షత్రియ వంశాలు అనేక శాఖోపశాఖలుగా వర్ధిల్లాయి. శ్రీకృష్ణుడు తనకు కావలసి వచ్చినప్పుడు వారిలో వారికి సంభవించే యుద్ధాలను నిమిత్తమాత్రంగా గ్రహించి వివిధ క్షత్రియ వంశాలను నశింపజేస్తూ ఉంటాడు. ఆ దేవుడు శ్రీకృష్ణరూపంతో పాటుగా బలరామ, మన్మథ, అనిరుద్ధ రూపాలను ధరించి, ఈ జగత్తును భరిస్తూ వినోదం కొరకు జన్మలెత్తి ఆటలాడుకొంటాడు. (శ్రీకృష్ణుడివైపు చూపిస్తూ) ఈ జగత్పతిని సామాన్య మానవుడిగా చూడటం అజ్ఞానం. శ్రీకృష్ణుడు భక్తపరాధీనుడు కాబట్టి ఉత్తములకు ఆరాధనాభాజనమయ్యాడు. నరులకు కావలసిన భోగభాగ్యాలను గాని, ముక్తినిగాని, కేవలం తన కరుణా కటాక్షమాత్రాన ఈయగలడు.

ప్రశ్న 67 : పితామహా! మానవుడు ఎవరిని స్మరిస్తే పరమాత్మను పొందుతాడు? ఏ మార్గాన దైవధ్యానం కలుగుతుంది? (4.207)

ఉత్తరం : నేను ఇదివరలో ఈ అంశంమీద నారద మహర్షివలన వినిన విశేషాలను తెలియపరుస్తాను. విష్ణువును ధ్యానించినవారు ముందుగా గొప్పభక్తిని, నిష్కల్మషమైన శ్రద్ధను, ఆపైన ఇంద్రియ నిగ్రహాన్ని అలవరుచుకొనాలి. ఈ మూడు లక్షణాలూ విష్ణుధ్యానానికి సమకారకాలు. పాపరహితుడికి ఈ మూడు గుణాలూ అలవడతాయి. పాపనాశనానికి విష్ణువు మెచ్చిన పద్ధతి నియమపూర్వకంగా నిరంతర విష్ణుస్మరణం అనే అనుస్మృతి. 'ఓం నమో వాసుదేవాయ' వంటి మంత్రాలను నిశ్చల మనస్సుతో జపించాలి. ఆ తరువాత అనుస్మృతిని (విష్ణునామ సహస్రం) పఠించాలి. దానివలన ధర్మార్థకామమోక్షాలను సాధించే సామర్థ్యం కలుగుతుంది. విష్ణుదేవుడు అనుస్మృతిని నారదుడికి బోధించాడు (విష్ణు సహస్రనామ మని ప్రసిద్ధి చెందిన అనుస్మృతిని భీష్ముడు ధర్మరాజుకు వినిపించాడు). అనుస్మృతిని చదివినవారికీ, విన్నవారికీ, నమస్కరించినవారికీ పుణ్యగతి ముక్తి కలుగుతుంది. వేలకొద్ది అశ్వమేధయాగాలు చేసికూడా పొందలేని పరమపదాన్ని అనుస్మృతిని భక్తితో సేవించటంవలన సులభంగా పొందవచ్చును.

ప్రశ్న 68 : పితామహా! నాకు మోక్షమార్గాన్ని ఉపదేశించుము. (4. 260)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉత్తరం : దీనిని బోధించే 'వ్వార్ష్ణేయాధ్యాత్మము' అనే ఇతిహాసం ఉన్నది. దానిని విన్నుము. వార్ష్ణేయుడనే ఉత్తముడు మోక్షమార్గాన్ని ఉపదేశించుమన్న శిష్యుడికి దానిని వివరించాడు. దాని తాత్పర్యం ఇది. కాలచక్రం అవధిలేకుండా తిరుగుతూ ఉంటుంది. దాని భ్రమణంలో సృష్టులూ ప్రళయాలూ ఏర్పడుతూ ఉంటాయి. ప్రళయాంతంలో పరమాత్మ మాత్రం నిత్యుడై నిలిచి మరల లోకాలనూ భూతాలనూ సృష్టిస్తాడు. ఋషులూ మునులూ పునస్సృష్టిలో పునరుద్భవించినప్పుడు వేదాలనూ శాస్త్రాలనూ తిరిగి పొందారు. వారు మేధావులై లోకాలన్నీ ఆచరించదగిన నియమ నిబంధనలను స్పష్టంగా తెలియపరచారు. మహర్షులు నిర్మించిన న్యాయాది శాస్త్రసముదాయాన్ని తెలిసికొన్నా, ఆచరించినా బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. ఆ శాస్త్రజ్ఞానమంతా ఒక్క విష్ణువునందు నిలిచి ఉంటుంది. మునీంద్రు లా జ్ఞానాన్ని వారి శిష్య పరంపరకు బోధించి లోకంలో వ్యాప్తిపొందించారు. పురుషుడితో కూడి ఉండటంవలన ప్రకృతి చైతన్యశక్తిని వహిస్తుంది. చైతన్యంనుండి బుద్ధి, దానినుండి అహంకారం పుట్టుతాయి. అహంకారం ఆత్మను చేరుతుంది. అహంకారంవలన ఆకారం, ఆకారంవలన వాయువు, వాయువువలన తేజస్సు, తేజస్సువలన నీరు, నీటివలన భూమి - పుట్టి పంచభూతా లేర్పడ్డాయి. అహంకారమే భూతపంచకానికి మూలం. బుద్ధికి మహత్తని పేరు ఉన్నది. ఈ శరీరం తొమ్మిది ద్వారాలున్న పుణ్యపురం. ఈ పురాన ఆ పరమాత్మ ఊహాతీతమైన వ్యాప్తశక్తితో నిండి, అన్ని భావాలనూ, స్వభావాలనూ, గుణాలనూ పొంది శయనించి ఉన్నాడు. అందువలననే ఆ పరమాత్మను 'పురుషుడు' అని అంటారు. ఆ పురుషుడు అమరుడు, అవ్యయుడు, అజరుడు, అమేయుడు, అమలస్వభావుడు. చెట్టులో నిప్పువలె దేహంలో పురుషుడు ఉంటాడు. కట్టెల రాపిడివలన నిప్పు రాజుకొనేటట్లు యోగవిద్యాభ్యాసం వలన పురుషుడు తేజోరూపుడుగా బోధపడతాడు. ఆ తేజస్సు జ్ఞానంతో నిండి ఉంటుంది. ఆ జ్ఞానమయ తేజస్సు సర్వ భూతాలను ఆశ్రయించి ఉంటుంది. కాబట్టి శ్రవణ, దర్శన, భాషణాదుల నది నిర్వహిస్తుంది. ఆ తేజోరూప పరమాత్మనుండే సృష్టి, స్థితి, లయాలు జరుగుతూ ఉంటాయి. దేహస్థుడైన పురుషుడు అన్నింటికీ సాక్షీ భూతుడుగా ఉంటాడు.

కాలచక్రానికి బుద్ధి మొదలైన వికృతులు ఏడు అంచులు. అవ్యక్తం దాని కేంద్రస్థానం. జ్ఞాన కర్మేంద్రియాలూ పదహారు వికారాలూ వలయాలు. ఆత్మ దానిని అధిష్ఠించి ఉంటాడు. అది నిరంతర భ్రమణం కలిగింది. దానిని తత్త్వశోధన దృష్టితో దర్శించాలి. ఈ సంసారం ఒక అరణ్యం వంటిది. సంసారంలో పడి జీవించటం అంటే అడవిబాటలో నడవటం. సంసార పరిభ్రమణంలో సుఖశాంతు లుండవు. లౌకికమైన తెలివి తేటలు విజ్ఞానమనీ, ఆధ్యాత్మికమైన తెలివితేటలు జ్ఞానమనీ విజ్ఞు లంటారు. అహంకారం జీవుల సకల కార్యాలకూ మూలం. ఆయా కార్యాలవలన పాపపుణ్యాలు కలుగుతాయి. వాటి అనుభవం కొరకు ప్రాణి దేహం ధరించి, జనన మరణ చక్రాన పడి క్రిందికీ, మీదికీ తిరుగుతుంటాడు. ఈ జనన మరణ చక్రానికి మూలం ఆశాలత. దానికి ప్రాకుడు కొయ్య స్త్రీ. ఈ సత్యం తెలిసి ఆశను త్రెంచివేయాలి. సృష్టిలోని ప్రాణికోటిలో మానవులు శ్రేష్ఠులు. వారిలో బ్రాహ్మణులు, వారిలో మంత్రవేత్తలు, వారికంటె జ్ఞానులు ఉత్తములు. మానవుడికి నిజమైన నేత్రం జ్ఞానం. అజ్ఞాని గ్రుడ్డివాడితో సమానుడు. జ్ఞానార్జనకు ముందు నరుడు ధర్మాన్ని ఆచరించాలి. సంకల్ప వికల్పాలకు మనసులో తావీయకుండా సాధన చేయాలి. ఇంద్రియనిగ్రహం మనోనిగ్రహానికి ప్రాతిపదిక. అట్టి ఇంద్రియ నిగ్రహం జ్ఞానార్జనకు, తద్వారా మోక్షప్రాప్తికీ హేతు వవుతుంది. నరుడు మాటలో, మనసులో, పనిలో శౌచాన్ని పాటిస్తూ, అహంకారాన్ని విడనాడి, శాంతస్వభావుడై ఉన్నప్పుడు, అతడిలో కోర్కెలు సన్నగిల్లి అంతరించిపోతాయి. ఆ స్థితిలో లోకంలోని ప్రాణిసమూహా న్నంతటినీ అతడు కరుణతో ఆదరించగలుగుతాడు. పవిత్రజీవనం, అహంకార రహితశీలం, కోర్కెలకు దూరమైన మనస్సు - ఈ మూడింటికి తోడుగా భూతదయ కలిగి ఉన్నవాడికి జ్ఞానం కలిగి తీరుతుంది.

మానవుడు తనలోని జ్ఞానాన్నే వంటచెరకుగా వాడుకొంటూ, విజ్ఞానాగ్ని రగుల్కొనేటట్లు చేసి ప్రజ్వలింపజేయ గలిగితే అతడికి జరామరణాలకూ, ఇతర లౌకిక దుఃఖపరంపరలకూ దూరమైన అమృతత్వస్థితి కలుగుతుంది. అతడు ధ్రువమైన మోక్షస్థితిని చేరుకొంటాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లోకంలో వ్యక్తం, అవ్యక్తం - అని పదార్థాలు రెండు విధాలు. వ్యక్తమంటే మృత్యువు, అవ్యక్తమంటే అమృతం- అని విష్ణువు చెప్పాడు. అది తెలిస్తేనే ముక్తికి దారి కనపడేది. అవ్యక్త మనబడే మూలప్రకృతి ముల్లోకాలకూ ఆలంబనమైనది. దానియందే లోకాలు జన్మించి, పెరిగి, లయమౌతాయి. ఆ అవ్యక్తం నివృత్తి లక్షణం కలది. నివృత్తి మార్గం సాటిలేని మేటి ధర్మమని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

నివృత్తి అంటే సంసారంనుండి మరలటం. దీనికి విరుద్ధమైనది ప్రవృత్తి - అంటే సంసారంలో పాల్గొనటం. దేహస్థుడైన ఆత్మ ప్రాకృతికాలైన త్రిగుణాలతో చుట్టబడి ఉంటాడు. కట్టుకొన్నచీరవలె ఒకటి, పైన వేసికొన్న వస్త్రంవలె మరొకటీ, తలకు గట్టిగా చుట్టుకొన్న గుడ్డవలె ఇంకొకటి నిండుగా క్రమ్ముకొంటాయి. త్రిగుణాలు చుట్టుకొని ఉండటంచేత ఆత్మ నిజస్వరూపం కానరాకుండా ఉంటుంది. త్రిగుణాతీతమైన మరొక గుణమున్నది. అదే పరబ్రహ్మతత్త్వం.

బ్రహ్మచర్యం, అహింస అనేవి రెండూ గొప్ప ధర్మాలు. ఆ రెండింటిని ఆచరించటమే ఉత్తమ తపస్సు. ఆ తపస్సు చేసేవారికి నిర్మలజ్ఞానం కలుగుతుంది. ఆ జ్ఞాననేత్రంతో అతడు ఈ లోకపు అంతర్బహిస్స్వరూపాలను సరిగా చక్కగా చూడగలడు. తపస్సు సంసారంనుండి మనస్సును మరల్చటానికి ఔషధంవలె ఉపయోగపడుతుంది. తృష్ణాలతను త్రెంచటానికి కొడవలివలె పనిచేస్తుంది. ధర్మరాజా! నీవు కూడా ఆ శిష్యుడివలెనే జ్ఞానివై నీ జన్మను చరితార్థం చేసికొమ్ము.

ప్రశ్న 69 : మిథిలాధీశుడైన జనక మహారాజు ఏ కర్మవలన ముక్తిని పొందగలిగాడు. (4.338)

ఉత్తరం : జనకరాజుకు నూర్గురు ఆచార్యు లుండేవారు. వారు ఒక్కొక్కరు ఒక్కొక్క పద్ధతిలో ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అతడికి బోధిస్తూ ఉండేవారు. జనకుడు అందరిపద్ధతులనూ గౌరవిస్తూ ఉండేవాడు. ఒకసారి పంచశిఖుడు (కాపిలేయుడు) అతడి సభకు వచ్చాడు. వాదులో ఆచార్యశతకాన్ని ఓడించాడు. జనకుడు అతడిని ఆశ్రయించి ముక్తిమార్గాన్ని బోధించు మని కోరాడు. అతడు ఉపదేశించాడు. అతడి వాక్యాల సారాంశ మిది - గుణత్రయాన్ని ఆత్మతత్త్వంలో లీనం చేయాలి. అప్పు డవి సముద్రంలో కలిసిపోయే నదులవలె తమ ఉనికి లేకుండా పోతాయి. నరుడు మనస్సును సుఖదుఃఖాలవెంట పరుగెత్తనీయకుండా అంతర్ముఖంగా త్రిప్పుకొని, ఆత్మలో చేర్చాలి. అప్పుడు నీళ్ళలో వేసిన ఉప్పువలె ఆత్మలో మనస్సు కలిసిపోతుంది. కుబుసం వదలిన పాము విలాసంగా కనపడేవిధంగా కర్మసంపర్కం వదలిన ఆత్మ స్వయం ప్రకాశమైన జ్ఞానంతో ప్రజ్వలిస్తుంది. ఈ వాక్యాలను విని జనకుడు విరక్తుడై మిథిలానగరం తగలపడిపోతున్నా తాను దుఃఖానికి దూరంగా నిలిచి స్థితప్రజ్ఞు డయ్యాడు. ఈ కథ విన్నవారికి కూడా ముక్తి కలుగుతుంది.

ప్రశ్న 70 : ఎట్టివాడు సుఖంతోనూ, శుభంతోనూ కూడి నిర్భయుడై జీవించగలడు. (4. 361)

ఉత్తరం : దమ సంపన్నుడు సుఖంతోనూ, శుభంతోనూ నిర్భయంగా జీవించగలడు. దమం సద్గుణాలరాశి, శౌచాదులు సద్గుణాలు. అతడు జ్ఞాని అయి సౌమ్యాకారంతో వెలుగొందుతాడు.

ప్రశ్న 71 : వ్రతస్థులు ఒక్కొకసారి భోజనాలు చేస్తూ ఉంటారు. వారికి వ్రతభంగం కలుగదా. (4. 365)

ఉత్తరం : ఉపవాస వ్రతంలో ఉన్నవారు వేదోక్తాలైన భోజనాలు బ్రాహ్మణుల నిర్దేశానుసారం చేయటంలో తప్పు లేదు. మోక్షార్థి అయినవాడు సదా ఉపవాసిగా, బ్రహ్మచారిగా, అమాంసభోజిగా, అతిథిశేషభోక్తగా, అమృతాశిగా, నిద్రపోనివాడుగా ఉండాలి. వ్రతదీక్షితులు కూడా పలురకాలు. రోజుకు రెండు పూటలు మాత్రం భోజనం చేస్తూ మధ్యమధ్య ఏమీ భోజనం చేయనివాడు సదుపవాసి, ఋతుకాలాన మాత్రం ధర్మపత్నితో సంగమించే సచ్ఛీలుడు సదాబ్రహ్మచారి,

మాంసాహారాన్ని దేవతలకు, పితరులకు, అతిథులకు వండి వడ్డించి పిదప తాను తినేవాడు అమాంసభోజి. పంక్తిభోజనంలో అతిథులతో కలిసి ఆరగించేవాడు విఘసాశనుడు. సేవకులందరూ భుజించిన తరువాత మాత్రమే తాను భుజించే పుణ్యాత్ముడు అమృతాశి. పగటిపూట నిద్రపోనివాడు అస్వప్నుడు. ఇటువంటివారి వ్రతాలన్నీ దేహబాధకాలే.

ప్రశ్న 72 : కర్మలు, సంస్కారవశాన నరుడికి మంచి చెడులు కలిగిస్తూ ఉంటాయి. కాగా, ఆ కర్మలకు అర్హు డౌతాడో కాడో నిర్ణయించలేకుండా ఉన్నాను. నాకు స్పష్టంగా తెలుపుము. (4.369)

ఉత్తరం : ఈ ప్రశ్నకు సమాధానం ఇంద్రప్రహ్లాద సంవాద శ్రవణమే. ఆ సంవాద సారాంశ మిది: సంపదలు యత్నించి ఆర్జించకున్నా అవి తమంత తాముగా వచ్చిపడతాయి. ప్రయత్నించి ఆర్జించి తెచ్చి ఉంచితే ఊరక నశించిపోతాయి. అట్లాగే శుభాశుభాలు, కష్టనష్టాలు, సుఖసంతోషాలు మానవుడిని ముంచెత్తుతుంటాయి. వీటి కన్నిటికీ 'నేను కర్తను' అని అనుకొనటం నరుడి అజ్ఞానం. వీటన్నిటికి కారణం 'విధి'. ఏ లాభమూ ఏర్పడకుండా చేస్తున్న ఆ కర్త తాను కర్త ననుకొనటంలేదు. అట్లని నరుడు కర్త కావటం లేదు. కర్తృత్వభావం అహంకార మూలం. నిరహంకారి కర్మఫలాన్ని కోరడు. కర్త విధికాబట్టి, ఆ విధి చేసే కర్మలను ఉపేక్షాభావంతో ఊరకనే చూస్తూ ఉంటాడు. అట్టివాడు శాంతి, దాంతి, ప్రజ్ఞానిధి అయి ఉంటాడు. నిష్కపటమైన ప్రవృత్తి, దయాగుణం, తాను దేహం కాదు, ఆత్మను అనే భావం, పరాకు లేకుండా జాగరూకతతో వ్యవహరించటం, వృద్ధసేవానురక్తి - అనే గుణాలు నరుడికి శుభాన్ని కలిగిస్తాయి. ఇక జ్ఞానం, శాంతి అనేవి కాలపరిపాకంతో క్రమంగా తమంతతామే నరుడిలో చోటుచేసికొంటాయి.

ప్రశ్న 73 : రాజు సంపదను ఏ కారణంవలన కోల్పోతాడు. (4. 385)

ఉత్తరం : దీనికి సమాధానంగా పూర్వం ప్రవర్తిల్లిన ఇంద్ర బలి సంవాద మనే ఇతిహాసం తెలిసికొనతగింది. దాని సారాంశ మిది- ఒకసారి దివ్యలోకసంపదలు కోల్పోయి విచారంతో కాలం గడుపుతూ, గాడిద రూపంతో కొన్ని క్రంతలలో తిరుగుతూ ఉన్న బలి చక్రవర్తిని ఇంద్రుడు బ్రహ్మదేవుడి సాయంతో కనుగొని ఆతడి వద్దకు వెళ్ళి, 'రాజ్యవైభవాన్నంతా కోల్పోయి దీన దశలో ఉన్న తరుణంలో పూర్వసంపదను తలచుకొంటూ దుఃఖిస్తూ ఉంటావా?' ఉండవా? అని అడిగాడు. బలి ఇట్లా అన్నాడు. 'మేలు జరిగినా, కీడు వాటిల్లినా, సుఖం కలిగినా, దుఃఖంపైకొన్నా నేను సమభావంతో స్థిరంగా ఉంటాను. నా మీద వాటి ప్రభావం ఉండదు. నా చిత్తంలో అహంకారం లేదు. విధాత చేతలకు ఎవరూ అతీతులు కారని నమ్ముతాను' అని పలికిన తరువాత అతడి శరీరంలో నుండి శ్రీ, భూతి, లక్ష్మి - అనే పేర్లుగల వనితారూపం ఒకటి బలి శరీరంనుండి వెడలి ఇంద్రుడిని ఆశ్రయించింది. సత్యం, ధర్మం, దమం, దానం అనే గుణాలు క్రమంగా బలియందు లోపించటంవలన ఆ రాక్షస ప్రభువునుండి తాను వైదొలగాననీ, వజ్రాయుధంతో బలిని చంపకుండ నిగ్రహాన్ని ప్రకటించిన ఇంద్రుడిని చేరాననీ ఆ శ్రీ లక్ష్మి సమాధానం చెప్పింది. సంపదలు తొలగటానికి నరుడి ఉత్తమ గుణాలు లోపించటం కారణమనీ, కలగటానికి ఉత్తమగుణాలే కారణమనీ ఈ ఇతిహాస తాత్పర్యం.

ఇటువంటిదే ఇంద్ర, నముచి సంవాదం కూడా. సంపదలు నశించినా వగవకుండా నిశ్చలంగా ఉన్న రాక్షసరాజు నముచి. అతడి వద్దకు ఇంద్రుడు వెళ్ళి అతడి నిశ్చింతమైన చిత్తానికి కారణమడిగాడు. 'నాకీ విధంగా కావలసి ఉన్నది-అయింది, అని గట్టి నిర్ణయంతో ఉండటంతో నాకు సుఖదుఃఖాలు, సంపత్తి విపత్తులవంటి కృత్యాలు అంటవు. కాబట్టి నాకు భయముండదు. నే నెవరికీ భయపడను. మేలు కీడులు కోరుకొంటే వచ్చేవి కావు. వద్దంటే వెళ్ళేవీ కావు. అందువలన వాటివలన చింత వ్యర్థం'. దేవేంద్రు డాతని మాటలను మెచ్చుకొన్నాడు.

ప్రశ్న 74 : ఏదైనా దుర్దశ మానవుడికి కలిగినప్పుడు అతడు ఏ విధంగా ప్రవర్తిస్తే మేలౌతుంది. (4.418)

ఉత్తరం : దురవస్థలన్నింటికీ ధైర్యమే ఔషధం. ధైర్యం ఆరోగ్యాన్నీ, సిరిసంపదలనూ, కీర్తినీ, ఔన్నత్యాన్నీ పెంచుతుంది. ధైర్యవంతుడు కాలగతిని గుర్తించి వర్తించాలి. దానిని బోధించే ఇంద్రబలి సంవాదం తెలియటం మంచిది. దాని సారాంశ మిది - జీవితంలో సుఖదుఃఖాలు క్రమంగా ఒకదాని తరువాత మరొకటిగా మానవులను చెందుతూ ఉంటాయి. ఈ క్రమం తప్పించరానిది. కాబట్టి నరుడు ధైర్యంతో మెలగుతూ, సుఖం కలిగినప్పుడు గర్వాన్నీ, దుఃఖం కలిగినప్పుడు విషాదాన్నీ ప్రకటించకుండా నిగ్రహించుకొనవలసి ఉంటుంది. నరుడి మహార్దశకు గాని, దుర్దశకుగాని దైవ మొకడే కారణం కాని ఇతరు లెవ్వరూ కాజాలరు. దైవాన్నీ కాలమని కొందరంటారు. కాలప్రవర్తన దేనికీ అందనిది. అది దేనికీ లొంగదు. యజ్ఞాలూ వ్రతాలూ కాలగతిని మార్చలేవు. కాలతత్త్వం తెలిసినవాడు ధైర్యంతో ఉంటాడు. కాలం ఒక నదివలె నిరంతర ప్రవాహశీలి. నది ప్రవాహవేగంతో కొండను కోసివేసి ముందుకు సాగినట్లే కాలం తన గమనంతో నరుడిని లోగొని అణచి వేస్తుంది. నరుడు ముందుగా ఈ తత్త్వాన్ని అంతర్ముఖుడై దర్శించాలి. ఆ తరువాత తపస్సు చేయాలి. జిజ్ఞాసతో కాలతత్త్వాన్ని అన్వేషించాలి. కాలతత్త్వజ్ఞానం మనశ్శాంతిని కలిగిస్తుంది. తాను దేహం కాదనీ ఆత్మననీ తెలిసికొంటే మానవుడు అశాంతికి దూరమౌతాడు. తృప్తినీ, ఆనందాన్నీ పొందుతాడు.

ప్రశ్న 75 : జీవుడు దేనివలన వృద్ధిపొందుతాడు? దేనివలన నశిస్తాడు. (5.3)

ఉత్తరం : ఈ విషయం వివరించ గలిగింది 'శ్రీ శక్రసంవాదం' - అనే ఇతిహాసం. నారదుడు లోకసంచారం చేస్తూ గంగానదిలో స్నానం చేయటానికి వెళ్ళి, అక్కడే స్నానం చేసి వ్రతనిష్ఠలో ఉన్న ఇంద్రుడిని చూచి అతడితో సంభాషణ చేస్తూ ఉన్నాడు. అంతలో ఆకాశంనుండి ఉదయసూర్యకాంతితో ఒక కాంతిరాశివలె దిగివచ్చి లక్ష్మీదేవి ఇంద్రుడితో ఇట్లా అన్నది. 'నన్ను శ్రీ, లక్ష్మి, భూతి అని అంటారు. నేను పూర్వం రాక్షసులు స్వాహా, స్వధా, మతి, శ్రద్ధ, ధృతి, స్మృతి, మేధ అనే గుణాలుండటం వలన వారివద్ద ఉండేదాన్ని. ఇప్పుడు వారివద్ద ఆ గుణాలు లోపించాయి. దానం, అధ్యయనం, అతిథిపూజ మొదలైన సద్గుణాలను కోల్పోయారు. నీవు సత్యధర్మాలలో ఆసక్తి కలిగి ఉండటంచేత నీ వద్ద నివసించాలని వచ్చాను. బుద్ధి, ధృతి, నీతి, శ్రద్ధ, సన్నతి, క్షమ, శాంతి మొదలైన గుణాలు కల దేవతలచెంత నిలిచి ఉంటాను'. ఇంద్రుడు లక్ష్మీసహితుడై అమరావతికి వెళ్ళాడు. ఈ కథ విన్నా, చదివినా సంపదలు కలుగుతాయి.

ప్రశ్న 76 : ప్రజలకు ఏ రకమైన ఆచారంవలన, ఏ విధమైన శీలంవలన, ఏ చదువువలన ముక్తి దొరకుతుంది. (5. 18)

ఉత్తరం : ఈ ప్రశ్నకు సమాధానం 'దేవతల జైగీషవ్య సంవాదం' వింటే తెలుస్తుంది. దేవలుడు ఇదే ప్రశ్నను అడుగగా జైగీషవ్యుడు సమాధానం చెప్పాడు. దాని సారాంశం ఇది - అంతరింద్రియ నిగ్రహం కలవాడు తనకు అవమానం జరిగితే అమృతం త్రాగినట్లుగా తృప్తి పొందుతాడు. సమ్మానం జరిగితే విషం త్రాగినట్లు ఉద్వేగం పొందుతాడు. సమ్మానం కావాలని కోరడు; అవమానం జరిగితే కలత చెందడు. ఆత్మతత్త్వజ్ఞుడికి తనవారనీ, పెరవారనీ భేదం ఉండదు. జ్ఞాన కర్మేంద్రియాలను జయించినవాడు శాంతి పొందుతాడు. శాంతివలన శాశ్వత సుఖం కలుగుతుంది.

ప్రశ్న 77 : సమస్త జనులకు, సకల ప్రాణులకు ప్రియమైనవాడు ఎవడు. (5. 28)

ఉత్తరం : ఉగ్రసేన శ్రీకృష్ణ సంవాదం వింటే ఈ ప్రశ్నకు సమాధానం తెలుస్తుంది. సర్వజనులకు ప్రీతిని గలిగించే వారిలో నారదుడు పేర్కొనదగినవాడు. నారదుడిలో శాస్త్రజ్ఞానం, సదాచారం అధికంగా ఉన్నాయి. అతడి హృదయంలో అహంకారం ఇసుమంతైనా లేదు. ఉత్తమశీలం, నిర్వికారచిత్తం, మాత్సర్య గర్వ మద రాహిత్యం అతడి ఉత్తమ గుణాలు. తపస్సు, తేజస్సు, బుద్ధి, వినయం, నీతి చాలా ప్రసిద్ధి చెందాయి. ధీరత్వం, మాటల మాధుర్యం సహజలక్షణాలు. శఠత్వం, దీనత్వం, కోపం, లోభం - అనే దుర్గుణాలకు దూరంగా ఉంటాడు. ఇటువంటి గుణాలన్నా, అటువంటి గుణాలు కలవాడన్నా అందరూ ఇష్టపడతారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రశ్న 78 : కాలంయొక్క అవయవాలకు చెందిన విభాగాలనూ, కృతాదియుగాల ప్రమాణాలనూ తెలియజెప్పుము. (5.33)

ఉత్తరం : ఒకసారి వేదవ్యాసుడు తన కొడుకైన శుక మహర్షికి ఈ వివరాలు చెప్పాడు. అన్ని కాలాలకూ, భూతాలకూ ఆధారంగా ఒక తేజశ్శక్తి ఉన్నట్లు, అన్ని పనులూ అదే చేస్తున్నట్లూ అనిపిస్తుంది. కాని, ఆ శక్తి ఏ క్రియాకలాపాలతో సంబంధం లేనిదిగానే తోస్తుంది. కనురెప్పపాటు నిమేషం. 18 నిమేషాలు= ఒక కాష్ఠ; 30 కాష్ఠలు= ఒక కళ; 360 కళలు= ఒక ముహూర్తం; 30 ముహూర్తాలు= ఒక అహోరాత్రం; 30 అహోరాత్రాలు= ఒక మాసం; 2 మాసాలు= ఒక ఋతువు; 6 ఋతువులు= ఒక సంవత్సరం; 3 ఋతువులు= ఒక అయనం; అయనాలు రెండు= ఉత్తరాయణం, దక్షిణాయనం. యోగులు ఉత్తరాయణాన్ని 'అగ్ని' అనీ, దక్షిణాయనాన్ని 'ధూమ' మనీ అంటారు. అంతేకాదు. వరుసగా వాటిని శుక్లమనీ, కృష్ణమనీ కూడా పిలుస్తారు. ఒక మానవమాసం= ఒక పితరుల దినం; ఒక సంవత్సరం= ఒక దేవతలకు దినం; మానవకాల విభాగంలో కృతయుగానికి 1728000, త్రేతాయుగానికి 1296000, ద్వాపరయుగానికి 864000, కలియుగానికి 432000 సంవత్సరాలు ఉంటాయి. యుగాల ఆద్యంత భాగాలను యుగసంధ్యలంటారు. ఇట్లాగే దేవమానాలు కూడా లెక్కించవచ్చును. కృతాదులైన నాలుగు యుగాలూ కలిస్తే ఒక మహాయుగం. అటువంటి వెయ్యి మహాయుగాలు బ్రహ్మకు ఒక పగటికాలం. రాత్రి కాలం కూడా అంతే. బ్రహ్మ రాత్రివేళ నిద్రిస్తాడు. ఆ సమయంలో లోకాలకు ప్రళయం. ప్రభాతం కాగానే మేలుకొంటాడు. పునస్సృష్టి సాగిస్తాడు. సృష్టిక్రమం ఇట్లాగే సాగిపోతుంది.

బ్రహ్మతత్త్వంనుండి మహత్తత్త్వం, దాని నుండి మనస్సు, దానినుండి ఆకాశం, ఆకాశంనుండి వాయువు, దానినుండి అగ్ని, దాని నుండి జలం, జలంనుండి పృథ్వి క్రమంగా పుట్టుతున్నాయి. మునులు వీటిని పురుషులు అని పిలుస్తారు. ఈ సప్తరూపాలకూ మూలం బ్రహ్మమే. బ్రహ్మము శబ్ద బ్రహ్మమనీ, పరబ్రహ్మమనీ రెండు రకాలు. శబ్ద బ్రహ్మాన్ని భజించటంలో ఆసక్తి కలవాడు పరబ్రహ్మను పొందుతాడు. పరబ్రహ్మం తాను నిష్క్రియారూపమై కూడా ప్రకృతి ప్రభావంతో శబలత్వం పొంది భూతాలను సృష్టిస్తుంది. వాటి లయం తరువాత కూడా బ్రహ్మం శుద్ధబోధ స్వరూపమై నిలుస్తుంది.

దానం అన్ని వర్ణాలవారికీ సాధారణ ధర్మం. దానం, అధ్యయనం, యజ్ఞం చేయటంవలన పాపాలు నశిస్తాయి. సంసార మనే నదిని దాటటానికి ప్రజ్ఞ అనే నావ తోడ్పడుతుంది. కామక్రోధాదులవలన ప్రజ్ఞకు భంగం కలిగితే నదిలో మునిగిపోవటం జరుగుతుంది. మనం అనుష్ఠించే కార్యాలతో ఒక్కొక్కసారి ధర్మకార్యం అధర్మంగా అధర్మం ధర్మంగా తోస్తుంది. కాబట్టి మానవుడు ధర్మశాస్త్రాలను పరిశీలించి ధర్మగమన మెట్లాంటిదో గుర్తించాలి. సదాచారమే చక్రపుటంచుగా, ప్రాణమే కాడిగా, అపానమే ఇరుసుగా, సిగ్గే ఆచ్ఛాదనగా, ఉపాయాపాయాలే నొగలుగా, ఘ్రాణేంద్రియ శ్రవణేంద్రియాలు గుర్రాలుగా, జ్ఞానమే సారథిగా, సర్వతంత్రమే కొరడాగా, త్యాగమే పగ్గాలుగా సాగే యోగమనే రథాన్ని ఎక్కి ఉపాయశాలి అయిన ఆత్మ అనే రథికుడు మోక్షపదం చేరుకొనగలడు. ఇది యోగపద్ధతి.

నిస్సారమైన సంసారానికి ముఖ్యకారణం మమకారమే. మనస్సును ఇంద్రియాల విషయాలనుండి మరలించి ఆత్మయందు లగ్నం చేయటంవలన మమకారాన్ని జయించవచ్చును. సాంఖ్యులకైనా, యోగులకైనా మమకారత్యాగం సమాన ధర్మం. యజ్ఞక్రియ, ప్రజ్ఞాతిశయం, యోగం, సాంఖ్యం - ఇవన్నీ బ్రహ్మపదప్రాప్తికి తోడ్పడే సాధనాలే. అంతేకాక తపస్సు, ఇంద్రియ నిగ్రహం, రాగలోభ నివారణచాతుర్యం, దృఢమైన విద్యకల పుణ్యాత్ముడు తప్పక బ్రహ్మపదాన్ని పొందుతాడు. జీవుడు ప్రయత్నిస్తే మనస్సును నిగ్రహించగలడు. నిగ్రహించబడిన మనస్సు ఇంద్రియాలను నియమించగలదు. అప్పుడు శబ్దాదులైన విషయాలు తొలగిపోతాయి. అప్పుడు అభిలషించిన బ్రహ్మ ప్రాప్తి రూపమైన మోక్షం సిద్ధిస్తుంది. అట్టి పండితుడికి సమదృష్టి ఏర్పడుతుంది. పండితుడు క్షరాక్షర రూపమైనబ్రహ్మమును

తెలిసికొంటాడు. మృత్యురూపమైనది క్షరం. అమృతరూపమైనది అక్షరం. తొమ్మిది ద్వారాలు గల శరీరమనేనగరంలో హంసుడనే ఆత్మ భాసిస్తున్నాడు. యోగులు ఆ ఆత్మనే అక్షరుడనీ, ఆత్మ అనీ అంటారు. వైరాగ్యంతో అక్షరతత్త్వాన్ని గ్రహించవచ్చును. మనస్సునూ, ఇంద్రియాలనూ నిగ్రహించుకొనిన వివేకి దోషరహితుడై పొగ లేని అగ్నివలెవెలుగొందుతాడు. యోగి సమలోష్టకాంచనుడై సమాధిగతుడై శబ్దబ్రహ్మాన్ని అతిక్రమిస్తాడు, పరమాత్ముడిని దర్శిస్తాడు.

కర్మమార్గం ప్రవృత్తి అనీ, కర్మ రహిత మార్గం (కర్మత్యాగం) నివృత్తి అనీ విజ్ఞులు చెప్పుతారు. ప్రవృత్తి బంధాన్నీ, నివృత్తి మోక్షాన్నీ కలిగిస్తాయి. ఏకరేఖా మాత్రుడైన చంద్రుడితో సమానుడు జీవుడు. జీవుడి అజ్ఞానం చంద్రుడి కృష్ణపక్షంతో సమానమైనది. కృష్ణపక్షం గడచిపోతే చంద్రుడు పరిపూర్ణతను సంతరించుకొని భాసిస్తాడు. అట్లాగే అజ్ఞానమనే కర్మమార్గం గడిస్తే జీవుడు జ్ఞానానంద పరిపూర్ణుడై వెలుగొందుతాడు. నాలుగు ఆశ్రమాలకు చెందినవారు శాస్త్రం విధించిన కర్మలను ఆచరించటం ద్వారా సిద్ధిపొందుతారు. ఇది నాలుగు మెట్ల నిచ్చెన వంటిది. ఇది సులభమార్గం కూడా. జీవుడు అంతర్యాగం వలన విగతపాపుడౌతాడు. ఆత్మప్రాప్తి కోరేవాడు సంకల్పాల నన్నిటినీ వదలి మనస్సును సత్త్వగుణంతో లీనం చేయాలి. సత్త్వసక్తమైన మనస్సు ఆత్మనిగ్రహాన్ని కలిగిస్తుంది. ఆత్మ నిగ్రహం వలన మోక్షపదవి లభిస్తుంది. సర్వవేద సారరూపమైనది అధ్యాత్మ విద్య. దానిని దానం చేయటం భూదానం కంటె గొప్పది. ఇంద్రియనిగ్రహం ధర్మాలలో కెల్ల ఉత్తమ ధర్మం.

జీవుడిని సంసారంలో బంధించే బంధనా లన్నింటిలోనూ కామం బలమైనది. ఆ కామాన్ని వదలితే ఆత్మ పూర్ణచంద్రుడివలె ప్రకాశిస్తుంది. 'ఆత్మ' అనే ధనం 'తనది' అనుకొనకున్నా ప్రీతిని కలిగిస్తుంది. 'ఆత్మ' అనే భోజనం తినకున్నా తృప్తి నిస్తుంది. 'ఆత్మ' అనే దానితో భౌతికస్పర్శ లేకున్నా బలం కలిగిస్తుంది. ఆ ఆత్మతత్త్వాన్ని చూడటమే వేదార్థాలను గ్రహించటం. సూర్యుడి బింబం నీళ్ళలో ప్రతిబింబిస్తుంది. అట్లాగే ఆత్మ బుద్ధిలో ప్రతిబింబరూపంలో వ్యక్తమౌతుంది. సత్త్వగుణ ప్రధానులు ఆత్మను యథాతథంగా చూడగలరు. సూర్యుడికి రేయుంబవళ్ళు లేనట్లుగానే శుద్ధజ్ఞాన స్వరూపుడికి వివేకావివేకాలంటూ ఉండవు. శమప్రధానుడైన యోగికి ఇంద్రియా లున్నా, అవి లేకున్నా మనోలయ రూపమైన సమాధి దృఢంగానే ఉంటుందని శాండిల్య మహర్షి శిష్యులకు బోధించిన ప్రబోధం తెలియదగింది.

కామమనే వృక్షం మోహమనే బీజంనుండి మొలకెత్తుతుంది. అజ్ఞానమే దానికి ఆధారమైన వేళ్ళు. ప్రమాదమనే నీటితో ఆ చెట్టు పెరుగుతుంది. అసహనమే దాని ఆకులు. అది చాల విచిత్రంగా ఉంటుంది. మానమనే కాండంతో బలపడి ఆ వృక్షం పైకి ఎదుగుతుంది. శోకమే కొమ్మలుగా, అనేక చింతలే రెమ్మలుగా, పూర్వకర్మవాసనలే చేవగా పెరిగిన ఆ వృక్షం ఆశలనే తీగలతో చుట్టబడుతుంది. లోభులు ఆ చెట్టు పండ్ల కాశించి ఎక్కి, తుదకు పతనమైపోతారు. ఆత్మజ్ఞుడైన పండితుడు త్యాగమనే కత్తితో ఆ చెట్టును తెగనరికి దుఃఖాలకు దూరమౌతాడు.

ఈ శరీరమే ఒక నగరం, బుద్ధి దానికి ప్రభువు. సమస్త విషయాలను చింతించే చిత్తం అక్కడ మంత్రి పదవిలో కొనసాగుతూ ఉంటుంది. శబ్దాదులైన అయిదు విషయాలూ పురోహిత వర్గమై ప్రవర్తిస్తాయి. శ్రోత్రం మొదలైన ఇంద్రియాలే అక్కడి పుర ప్రజలు. ఇట్లా ఉండే ఆ నగరానికి రజస్తమోగుణాలనే దుష్ట శత్రువులు కీడు కలిగిస్తుంటారు. బుద్ధి వివేకాన్ని కోల్పోతే చిత్తంతో విభేదించి రజస్తమోగుణాలకు లొంగిపోయి నశిస్తుంది. అట్లా కాక మనస్సుతో ఏకమై కర్తవ్య మేదో గ్రహించి వ్యవహరిస్తే రజస్తమస్సులను రూపుమాపి రాజ్యభోగం అక్షయంగా అనుభవించగలుగుతుంది.

ప్రశ్న 79 : కార్యబలమూ, వీర్యబలమూ, మనోబలమూ కలిగిన ఉత్తమ భూపాలురు చాలమంది కురుక్షేత్ర యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఒక్కరు కూడా తమ ప్రాణాలను నిలుపుకొనలేకపోయారు. మృత్యువంటే ఏమిటి? అది ఎట్లా పుట్టింది? ఎట్లా ప్రాణులను చంపుతుంది. (5. 201)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉత్తరం : పుత్రుడిని కోల్పోయి శోకమగ్నుడైన అకంపను డనేరాజుకు నారదుడు చెప్పిన మృత్యుదేవత కథ నీ అనుమానం తీరుస్తుంది. పూర్వం బ్రహ్మదేవుడు లోకాలను సృష్టించాడు. జీవ సంతతి విస్తృతంగా పెరిగి పోయింది. భూభారం పెరిగింది. బ్రహ్మ ఆ స్థితిని గమనించి తీవ్రంగా ఆలోచించగా తీవ్రమైన వేడిమి కలిగి మహాగ్ని ప్రభవించి లోకాలను కాల్చివేయటం ప్రారంభమయింది. శివుడు బ్రహ్మను శాంతింపచేసి జీవసంతతిని తగ్గించటానికి ఉపాయం సూచించాడు. అప్పుడు బ్రహ్మదేవుడి అరుణ నేత్రాలనుండి ప్రకాశవంతమైన శరీరావయవాలతో ఒక స్త్రీ జన్మించింది. 'జీవులను విచక్షణారహితంగా చంపు'మని ఆమెను బ్రహ్మ ఆదేశించాడు. ఆమె ఆ దారుణకార్యానికి అంగీకరించక ధేనుకాశ్రమానికి వెళ్ళి తీవ్రమైన తపస్సు చేయ నారంభించింది. బ్రహ్మ ప్రత్యక్షమై ప్రజాసంహారమే ఆమె ధర్మమనీ, ఆమె కన్నీరు అనేక రోగాల రూపంలో జీవులను బాధిస్తాయనీ, మానవులు వాటితో మరణిస్తారనీ, ఆ పనిలో ఆమె నిమిత్తమాత్రంగానే ఉండగలదనీ, ఎటువంటి పాప మంటదనీ వర మిచ్చాడు. అంగీకరించకపోతే బ్రహ్మ శపిస్తాడేమో అని మృత్యుదేవత సమ్మతించింది. మరణ సమయంలో ప్రాణులు దేహాలను వదలి పూర్వకర్మానుసారంగా దేవాదిరూపాలనూ, ఆ తరువాత మానవాది జన్మాలనూ పొందుతున్నారు.

ప్రశ్న 80 : సజ్జనులు ధర్మానికి భయపడుతూ ఉంటారు. అటువంటి ధర్మం యొక్క పద్ధతిని నిరూపించుము. (5. 216, 217)

ఉత్తరం : వేదాలపై భక్తి, స్మృతులపై విశ్వాసం, సదాచారం - అనేవి మూడూ ధర్మానికి అందమైన ఆకారాలు. కొందరు ధనంకూడా ధర్మానికి నాలుగవ ఆకారమని అంటారు. అసత్యం పలకకుండా ఉండటం, ధనాన్ని ఆశించకుండా ఉండటం మేలైన ధర్మం. శాస్త్రవిరుద్ధమైన ధర్మం చేయటం చవిటినేలలో విత్తనం విత్తటం వంటిది. ఈ వాస్తవాన్ని తెలిసి మెలగితే ఇహపరసుఖాలు కలుగుతాయి. ధర్మస్వరూపం చాల సూక్ష్మమైనది. ధర్మాలు బహువిధాలుగా ఉంటాయి. వాటి సారభూతమైన ధర్మాన్ని పేర్కొంటాను. ఇతరులు ఏమేమి చేస్తే తన మనస్సునకు అప్రియంగా ఉంటుందో,ఆ పనులను తాను ఇతరులకు చేయకుండా ఉండటమే అన్ని ధర్మమార్గాలకూ ఉత్తమమైన ఆలంబనంగా ఉన్నది.

ప్రశ్న 81 : తాతా! ధర్మస్వరూపం ఇంత చక్కగా ఉంటుందా? సదాచారం ధర్మస్వరూపమని పేర్కొన్నావు. ఉత్తమాచారం ఎట్లాంటిదో తెలియజెప్పుము. (5.221)

ఉత్తరం : వేదాలు అనేక విధాలుగా ఆచారాలను చెప్పుతున్నాయి. ఆలోచించి చూడగా సకలహితకరమైన ఆచారం వేరొకటి ఉంటుందా? మహాత్ములైనవారు ఏ ఆచారాన్ని పాటిస్తారో, దానిని తక్కినవారు పాటించాలి. పూర్వం జాజలి అనే మునికీ, తులాధారుడనే వైశ్య శ్రేష్ఠుడికీ నడుమ నడచిన సంవాదమనే ఇతిహాసం సదాచారరూపధర్మాన్ని వివరిస్తుంది. సంవాద సారాంశ మిది - ఎవడు సత్యమే యజ్ఞమని భావించి సత్యాన్ని పాటిస్తూ సదా తృప్తి పొంది ఉంటాడో అతడిపట్ల దేవతలు కూడా సంతృప్తి పొందుతారు. ఎవడు ధర్మంలో రమిస్తాడో, సదా ధర్మానికి మిత్రుడై ఉంటాడో, బుద్ధితో అసంగత్వాన్ని పాటిస్తాడో, అట్లా పాటించి నిర్మలహృదయు డౌతాడో, అట్లాంటివాడికి కర్మరాహిత్యంవలన కలిగే ఆనందం తప్పక సిద్ధిస్తుంది. కర్తవ్య మని భావించి చేసేకర్మ పవిత్రమైనది, కార్యసిద్ధికి హేతువౌతుంది. ప్రయోజనాకాంక్షతో చేసే పని ఉత్తమం కాదు. మాత్సర్యం, స్పర్ధ అనే దుర్గుణాలు సద్ధర్మాన్ని నశింపజేస్తాయి. సద్ధర్మం నశిస్తే మానవుడు పూర్తిగా నశిస్తాడు. అందువలన శ్రద్ధతో సదాచారాన్ని పాటించేవాడు దేవతల దయకు పాత్రుడౌతాడు. శ్రద్ధ లేనివాడికి దాన స్వభావం ఉండదు. అందువలననే 'దానం చేసేవాడు శ్రేష్ఠుడు' అని బ్రహ్మదేవుడు చెప్పాడు. శ్రద్ధ కలవాడి మనసులో మాత్సర్యాది దోషాలు నిలబడలేవు. మానవుడు తనకు విధ్యుక్తమైన ఏ కర్మకలదో, ఆ కర్మను చక్కగా అనుష్ఠించటం మేలు. అతడు కర్మల పట్ల నివృత్తిని పొంది శ్రద్ధతో కర్మసన్న్యాస పద్ధతిని పాటించటానికి తగిన నేర్పుకూడా ఉండాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రశ్న 82 : కార్యసమీక్ష దీర్ఘకాలం చేసి నిర్ణయం తీసికొనవలెనా? లేక సత్వరంగా నిర్ణయం తీసికొనవలెనా. (5. 260)

ఉత్తరం : పనిచేసేటప్పుడు త్వరపడకుండా చక్కగా చాలకాలం ఆలోచించి చేస్తే ఓటమి కలుగదు, విజయం సిద్ధిస్తుంది. కార్యవిమర్శలో సహనం అవసరం. దీనికి మేధాతిథి పుత్రుడైన చిరకారి కథ చక్కని ఉదాహరణం. ఒక కార్యం చేయవలసి వచ్చినప్పుడు చాలకాలం ఆలోచించి ధీరత్వంతో మంచి చెడ్డలు నిర్ణయించుకొని ఆ పని నిర్వర్తించాలి. ఆయా పనులను నిర్వహించేటప్పుడు ఆలోచించి చేసేవాడిని ఆర్యుడనీ, తొందరపడేవాడిని అనార్యుడనీ పెద్దలు పేర్కొంటారు.

ప్రశ్న 83 : ప్రజలను శిక్షించే పద్ధతి ఎట్లాంటిది. (5. 293)

ఉత్తరం : పూర్వం ద్యుమత్సేనుడికీ అతడి పుత్రుడు సత్యవంతుడికీ నడుమ జరిగిన సంభాషణం దీనికి ఉపకరిస్తుంది. చంపదగిన తప్పు చేసినవాడిని చంపటమే కర్తవ్యం. రాజుకు దుర్మార్గుడిపట్ల పక్షపాతం పనికిరాదు. రాజు స్వయంగా వినీతుడై తన మంత్రులనూ, కుమారులనూ, సేవకులనూ క్రమంగా వినయవంతులనుగా చేసి ప్రజలను రక్షించాలి. బ్రాహ్మణులు అన్ని విధాలా అహింసనే పాటించాలి. ప్రజాపాలకుడైన భూపతికి ఆ విధమైన అహింస తగదు. అతడు ప్రజలపట్ల దయ కలిగి ఉండాలి. వారికి ఏ విధమైన అపకారమూ కలుగకుండా చూడాలి. అట్లా ప్రజలను కాపాడటమే రాజుకు అహింస ఔతుంది.

ప్రశ్న 84 : మానవుడికి అవశ్యకర్తవ్యం గృహస్థ ధర్మమా? సన్న్యాస ధర్మమా? (5. 300)

ఉత్తరం : ఆ రెండు ధర్మాలూ గౌరవించదగినవే. దీనిని నిరూపించే కపిలగో సంవాదమనే ఇతిహాసం వినదగింది. దాని సారాంశ మిది - బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం - అనే నాలుగు ఆశ్రమాలూ ఆత్మప్రాప్తికి సాధనాలే కాబట్టి దేవయానా లౌతున్నాయి. ఆ మార్గాలలో నడవటం గృహస్థులకు కర్తవ్యం. వారు వేదవిహిత మార్గంలో నడవటం శ్రేయస్కరం. గృహం సమస్తకార్యాలకూ, వాటి ఫలాలకూ నిధివంటిది. ప్రాణులపై దయ, అహంకార రాహిత్యం కల నిర్మలచిత్తుడైన గృహస్థుడు దృఢమైన ఆత్మనిష్ఠతో వేదవిహిత ఆచారాలనూ, కర్మలనూ ఆచరించి పుణ్యాత్ముడౌతాడు. బాగా ఆలోచించి చూస్తే - నాలుగు ఆశ్రమాలలోనూ ఏ ఆశ్రమమూ సేవించదగనిది కాదు. అందువలన అంతఃకరణశుద్ధి కలిగి ఏ ఆశ్రమంలో ఉన్నా ఆత్మజ్ఞుడైన పండితులు సంసార సాగరాన్ని దాటగలరు. ముముక్షువయిన సాధకుడు ముందుగా కర్మఫల త్యాగం చేయాలి. ఆ తరువాత మనస్సును నిగ్రహించాలి. ఆపైన సదా సంతోషంతో ఉండాలి. ఇవి ఒకదానికంటె ఒకటి ఉత్తమ గతులు. సాధకుడు తప్పక ఈ మూడింటినీ పొందాలి.

ప్రశ్న 85 : వేదాలలో ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలు ప్రశస్తమై ఉన్నాయి. వీటిలో ఏది లభిస్తే గొప్పగా ఉంటుంది? (5. 340)

ఉత్తరం : ఈ అంశం కుండధారుడి వృత్తాంతమనే ఇతిహాసం నారద ప్రవర్తితమైన ఇతిహాసం వింటే విశదమౌతుంది. దాని సారాంశ మిది - ఉచితమైన హింస అహింసకు భంగ కరం కాదు. యజ్ఞం పేరుతో తగని హింస ఎప్పుడూ చేయరాదు.

ప్రశ్న 86 : పురుషుడు దేనివలన పాపకార్యాలు చేయటానికి పూనుకొంటాడు? పుణ్యకార్యాలకు కారణ మేది? దేనివలన పుణ్యపాపాలు రెండూ అంటకుండా ఉండగలడు? మోక్షం ఎట్లా పొందుతాడు. (5.363)

ఉత్తరం : శబ్దస్పర్శ రూపరస గంధాలు అనే విషయాలమీద కోరిక లోభమోహాలను కలిగిస్తుంది. చిత్తం లోభమోహాలకు లోనైతే ధర్మానికి లోపం కలుగుతుంది. ధర్మం లోపించగానే పాపకార్యాలు చేయాలనే తలంపులు కలుగుతాయి. అందువలన తెలివితో ఈ కీడు లన్నిటినీ ఊహించి, వాటి జోలికి పోక సజ్జనులగోష్ఠిలో కాలం గడపితే విషయాలపై

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆసక్తి నశిస్తుంది. దానివలన ధర్మబుద్ధి ఉదయిస్తుంది. ధర్మకార్యాలు క్రమంగా ఆచరిస్తూ ఆపైన అపాయం లేని ఉపాయంతో ముక్తిపొందుతాడు. అపాయం లేని ఉపాయం ఇట్లా ఉంటుంది. ఓరిమితో కోపాన్నీ, సంకల్పించకుండా ఉండటంతో కామాన్నీ, సత్త్వగుణాభ్యాసంతో నిద్రనూ, దృఢమైన ధైర్యంతో రాగద్వేషాలనూ, జాగరూకతతో భయాన్నీ, జ్ఞాన వైరాగ్యాదులతో మోహభ్రాంతులనూ, హితమూ, మితమూ, కాలం తప్పకుండా తీసికొనే భోజనంతో రోగాలనూ, ఉపద్రవాలనూ, క్షేత్రజ్ఞస్వరూపుడైన జీవుడిని చూడటంద్వారా ప్రాణచేష్టనూ, కడపట నిస్సారాలని గ్రహించటంతో శబ్దాది విషయాలనూ, నిత్యసంతుష్టితో లోభాన్నీ, దయతో అధర్మాన్నీ, తగిన సమీక్షణ విధానంతో కర్మను కడకు నెట్టటం నేర్చుకొనటమే ముక్తికి బాట.

ప్రశ్న 87 : తృష్ణను నశింపచేసే ఉపాయం తెలుపుము. (5.372)

ఉత్తరం : ఈ ప్రశ్నకు ఉత్తరం జనక మాండవ్య సంవాదం వింటే తెలుస్తుంది. దాని సారాంశ మిది. దొరకిన దానిని అనుభవిస్తూ, దొరకనిదానికి చింతపడి దుఃఖించకుండా పరిపూర్ణుడై ఎవడు ఉంటాడో అతడి మనస్సులోనికి తృష్ణ ప్రవేశించనేరదు.

ప్రశ్న 88 : సమస్త ప్రాణులకూ భయం కలిగిస్తూ కాలం గడుస్తుండగా పురుషుడు ఏమి చేస్తే శ్రేయస్సు కలుగుతుంది. (5.380)

ఉత్తరం : మానవ శరీరంలోనే మృత్యువు, అమృతత్వం - అనేవి రెండూ ఉన్నాయి. సంసార వ్యామోహమే మృత్యువు. తత్త్వజ్ఞానమే అమృతత్వం. యోగాన్ని అనుష్ఠించటం, తపస్సు చేయటం, విషయాసక్తిని త్యజించటం - అనేవి హితకరమైన మార్గాలు. వీటితో సమానమైన దుఃఖం మరొకటి లేదు.

ప్రశ్న 89 : ఏ విధమైన శీలం కలవాడు మోక్షపదాన్ని పొందుతాడు? (5. 390)

ఉత్తరం : మితాహారం స్వీకరిస్తూ, ఇంద్రియానీకాన్ని జయించి మోక్షం కొరకై శాస్త్రాలలో చెప్పబడిన ఉత్తమ ధర్మాలను అనుష్ఠించేవాడికి బ్రహ్మానందం తంగెడి జున్నువలె సులభ సాధ్యమై ఉంటుంది. మోక్షధర్మాలు తెలియజెప్పే హారీతగీత, వృత్రగీత తెలియదగినవి. వాటి సారాంశ మిది - సంపద, పేదరికం అనేవి కాలానికి అధీనమై ఉంటాయి. అవి జ్ఞానం లేని మూఢులకు మదాన్ని, దీనత్వాన్నీ కలిగిస్తాయి. తద్ద్వారా సుఖానికీ, దుఃఖానికీ హేతువు లౌతాయి. సంపదలు శాశ్వతం కావని తెలిసికొన్న జ్ఞానికి అవి ఉన్నా, లేకున్నా ఎట్లాంటి వికారమూ కలుగదు. పుణ్యకార్యాలచేత జీవుడు మాలిన్యం వీడి పవిత్రు డౌతాడు. పుణ్యకార్యాలు చేసేవారు ఉత్తమ వర్ణాన్ని పొందుతారు. విష్ణుధ్యానం గింజలేని పండువలె ఉత్తమ స్థితిని కలిగిస్తుంది.

ప్రశ్న 90 : జ్వరం ఎట్లా పుట్టింది. (5.436)

ఉత్తరం : దక్షయజ్ఞాన్ని ధ్వంసంచేసే సందర్భంలో శివుడి ఫాలభాగంలో కోపంవలన పుట్టిన చెమట బిందు వొకటి భూమిపై పడింది. అక్కడ పెద్దమంట చెలరేగింది. ఆ మంటలో నుండి ఒక పురుషుడు ఎర్రని నేత్రాలు, నల్లనిచూపు, ఊర్ధ్వముఖమైన రోమాలూ గల భయంకరాకారుడు జన్మించాడు. అతడే జ్వరుడు. శివుడు జ్వరానికి నానారూపాలు కల్పించాడు - ఏనుగులకు తలనొప్పిగా, పాములకు కుబుసంగా, గోవులకు గిట్టలలో నొప్పిగా, లేళ్ళకు తమరూపు చూడలేనితనంగా, గుర్రాలకు పార్శ్వభాగంలో శోషణంగా, నెమళ్ళకు ఈకలు ఊడిపోవటంగా, కోకిలకు నేత్రవ్యాధిగా, చిలుకలకు వెక్కిళ్ళుగా, మేకలకు మనోభ్రాంతిగా, పులులకు శ్రమగా, మానవులకు చావుపుట్టుకలు మొదలైన సందర్భాలలో కలిగే దుఃఖంగా పెక్కురూపాలుగా ఉంటుంది. జ్వరం శివుడి తేజస్సు. అందువలన అందరికీ నమస్కరించదగింది. జ్వరకథ వింటే పుణ్యం కూడా.

ప్రశ్న 91 : శాస్త్రతత్త్వం తెలియనివాడు ఏమి చేస్తాడు. (5.446)

ఉత్తరం : గురువులను పూజించటం, వృద్ధులను సేవించటం, విద్యను వినటం - అనేవి తప్పక చేయదగిన పనులు. నారద గాలవ సంవాదం ఈ విషయాలను వివరిస్తుంది. మనుజుడు పాపహేతువులైన పనులన్నీ వదలాలి. యథాశక్తి పవిత్ర

చిత్తంతో పుణ్యకార్యాలు మాత్రమే చేయాలి. సదా సజ్జనసాంగత్యంలోనే గడపాలి. సత్ప్రవర్తన వలన చిత్తదోషం తొలగి జ్ఞానోదయ మౌతుంది.

ప్రశ్న 92 : నా వంటివాడు కాలపాశాన్ని ఎట్లా ఛేదించగలడు. (5. 457)

ఉత్తరం : పూర్వం అరిష్టనేమి మహర్షిని సగరుడు అనే నృపాలుడు ఇదే ప్రశ్నను అడిగాడు. అప్పుడు అరిష్టనేమి సగరుడికి చెప్పిన శాంతి వచనాలు వింటే మనస్సుకు శాంతి కలుగుతుంది. వాటి సారాన్ని ఇట్లా గ్రహించవచ్చును. సమస్త భూమండలాన్నీ పరిపాలించిన మహారాజులు సైతం కాలం చెల్లగానే నేల కొరిగిపోతున్నారు. చూపు మొదలైన ఇంద్రియ శక్తులు ఉడిగిపోగానే శరీరం చెడిపోతున్నది. దీనిని చక్కగా భావించి సంసారం యొక్క నిస్సారతను గమనించగలవాడు మోక్షలక్ష్మిని చేపట్టగలడు.

ప్రశ్న 93 : ధర్మవిద్వేషపరులైన దానవులకు మంత్రి అయిన శుక్రుడికి శుక్రత్వమహిమ ఎట్లా కలిగింది. (5.468)

ఉత్తరం : శుక్రుడు యోగబలంతో కుబేరుడిని వంచించి అతడి ధనం అపహరించాడు. కుబేరు డా సంగతి శివుడికి నివేదించాడు. మహేశ్వరుడు కోపించి త్రిశూలంతో శుక్రుడిపైకి విజృంభించాడు. అతడు పరుగెత్తి పొదలమాటున దాగి ఉన్నాడు. కాని, అతడి శరీరంలో కంపం మొదలు కావటంతో శివుడిచేతికి చిక్కాడు. శివుడు ఆతడిని మ్రింగాడు. కడుపులో పరుగెత్తుతూ మహేశ్వరుడికి ఇబ్బంది కలిగించగా ఆయన తన శరీర ద్వారాలన్నీ మూసి పురుషాంగం మాత్రం తెరిచి ఉంచాడు. పార్వతి ప్రార్థనను మన్నించి శుక్రుడిని తేజస్వంతుడిని చేసి శిశ్నం నుండి బయటకు పంపి శుక్రుడనే పేరు పెట్టాడు.

ప్రశ్న 94 : తాతా! నీ వాక్యామృతం ఇంకా వినాలని ఉన్నది. సద్ధర్మాన్ని తెలుపుము. (5. 476)

ఉత్తరం : సద్ధర్మాన్ని బోధించే 'పరాశరగీత' వినదగింది. దాని తాత్పర్య మిది - పాపరహితుడైన మానవుడు శ్రేష్ఠమైన తెలివి అనే పగ్గాలతో ఇంద్రియాలనే గుర్రాలతో లాగబడే కోరిక లనే రథాన్ని అపమార్గంలో పోనీయకుండా నిగ్రహిస్తాడు. దుష్టకార్యాలు చేయటం మురికినీటిలో స్నానంచేయటం వంటిది. పుణ్యకార్యాలు చేయటం మంచినీటి స్నానం వంటిది. వేదాలను చదవటంతో ఋషిఋణాన్నీ, యజ్ఞాలు చేయటంతో దేవతల ఋణాన్నీ. పూజాది సత్కారాలతో అతిథిఋణాన్నీ. పితృకర్మతో పితరుల ఋణాన్నీ, చక్కని పాలనతో రంజింపచేయటం ద్వారా ప్రజల ఋణాన్నీ తీర్చాలి. విష్ణుస్తోత్రం, తపస్సు, ధర్మాచరణం - అనేవి మనస్సులో గొప్ప జ్ఞానాన్ని కలిగిస్తాయి; అయోగ్యులను యోగ్యులుగా మారుస్తాయి. ఎంతటి దుర్జనుడైనా సజ్జన సాంగత్యంతో పవిత్రుడౌతాడు. అధిక లాభం కలిగించేదైనా ఆ పని పాపంతో కూడుకొంటే చేయవద్దు. స్వల్పలాభం కలిగించేవైనా పుణ్యకార్యాలను తప్పక చేయాలి. అందువలన ఇహపరసుఖాలు కలుగుతాయి. నాలుగు వర్ణాలకు సంబంధించిన మానవులు వారి వారి వర్ణ ధర్మాలను ఆచరించటం ఉత్తమం. ఆయా ధర్మాలలో నేర్పు సంపాదించి తపస్సును ఆశ్రయించినప్పుడే ధర్మార్థ కామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాలు సిద్ధిస్తాయి. మనుష్యులకు అజ్ఞానం కంటె విరోధి మరొకటి లేదు. ఫలాకాంక్ష లేకుండ సత్కర్మలు చేస్తే నిత్యుడౌతాడు. దేనితోనూ సంగం లేకుండా ఉండటం మేలు. సుజ్ఞానం సుగతి. తపస్సువలన నాశనం ఉండదు. ఇది తెలియటమే వేదార్థసారం. సూర్యుడిని కాంతి ఎట్లా వదలిపెట్టదో అట్లా ధీరుడిని జ్ఞానలక్ష్మి ఎప్పుడూ వీడిపోదు.

ప్రశ్న 95 : దమం, సత్యం, క్షమ - అనేవి సద్గుణాలుగా పెద్దలు కీర్తిస్తారు. మంచి గుణాలుగా వాటికి ఎందుకు పేరు వచ్చింది. (5.540)

ఉత్తరం : 'హంసగీత' ఈ ప్రశ్నకు తగిన సమాధానం. బంగారు హంసగా విహరిస్తున్న బ్రహ్మ సాధ్యులకు చెప్పిన విశేషాలలో కొన్ని గమనించదగినవి. వేదసారాంశం సత్యం. సత్యసారరూపం దమం. దమసారాంశం ముక్తి. సత్త్వాదులను

పాటించేవారికి మోక్షం కరతలామలకం. ఎవడు మనస్సునూ, మాటనూ అపమార్గంలో పోనీయకుండా రక్షిస్తాడో అతడిచేతిలోనే వేదం, తపస్సు, త్యాగం ఉంటాయని మునులు చెప్పారు. సత్యం, ఓర్పు, దమం - అనేవి మూడూ శాశ్వతమైన మోక్షాన్ని చేరుకొనటానికి నిచ్చెన మెట్లవంటివి. అవి సజ్జన సాంగత్యంవలన కలుగుతాయి. ఆత్మజ్ఞాన సంపన్నుడైన పండితుడు ఒక్కడే తనలో తాను ఆనందిస్తాడు. పెక్కురకు ప్రీతి కలిగిస్తాడు. అందరూ అతడిని గౌరవిస్తారు. బ్రాహ్మణుడు వేదాధ్యయనం చేయటం వలన దేవత్వం పొందుతాడు. ఉపవాసాది పుణ్యకర్మలు చేయటంతో సాధువుగా ప్రశస్తి పొందుతాడు. నింద్యమైన శీలం కలవాడు దుర్జనుడుగా పిలువబడుతాడు. శౌచం పాటించకపోవటంవలన మరణభీతితో దీనుడౌతాడు.

ప్రశ్న 96 : సాంఖ్య యోగ శాస్త్రాల తారతమ్యాలను, వాటి స్వరూపాలను ఎరిగించుము. (5. 571)

ఉత్తరం : సాంఖ్యులూ, యోగులూ తమతమ మార్గాలే మేలైనవని కారణాలు నిరూపిస్తూ ప్రకటిస్తారు. కాని, నా దృష్టికి ఆ రెండు మార్గాలూ ఒక్కటే. యోగులు ప్రత్యక్ష ప్రమాణాన్ని హేతువును విశ్వసిస్తారు. సాంఖ్యులు శాస్త్ర ప్రమాణాన్ని అంగీకరిస్తారు. ఈ రెండు మార్గాలకూ గమ్యం ఒక్కటే. శాస్త్రంలో ఈ రెండూ వేరైనా ప్రాణులపట్ల హితం, మంచి నియమాలు పాటించటం, శౌచం అనేవి రెండు మార్గాలలోనూ నియతమైన కార్యాలే.

ప్రశ్న 97 : భూతదయ, సద్వ్రతధారణం, శౌచం - అనే గుణాలు సమానం కాగా సాంఖ్యయోగాలకు దర్శనం ఎట్లా వేరయింది. (5. 575)

ఉత్తరం: రాగం, మోహం, దీర్ఘ స్నేహం, కామం, క్రోధం అనే దుర్గుణాలను, తద్విరుద్ధమైన సద్గుణాలతో తొలగిస్తే యోగులకు ఆత్మోన్నతి లభిస్తుంది. పెద్దచేప వలను చించుకొని, బలిష్ఠమైన మృగం ఉరిని ఛేదించుకొని బయటపడతాయి. అట్లే యోగి స్థిరసంకల్పంతో యోగోపాయాలను నిరోధించే పాపాలను తొలగించుకొని సన్మార్గంలో సంచరిస్తాడు. విలుకాడు తదేకచిత్తుడై ఎట్లా లక్ష్యాన్ని చక్కగా ఛేదిస్తాడో, అట్లాగే యోగనిపుణుడు మోక్షలక్ష్యాన్ని సాధిస్తాడు. కత్తి వాదరపై నడకవంటి యోగనియమం ఎవడికి వశమై ఉంటుందో అతడికి సాధించలేని కార్యం ఉండదు.

కపిలాది మహామునులు చెప్పిన సాంఖ్యం ఇట్లా ఉన్నది - ఆత్మకు రెండు రూపాలు ఉన్నాయి. అందులో ఒకటి శబ్దస్పర్శాది విషయాలను శ్రోత్రం, త్వక్కు మొదలైన ఇంద్రియాల ద్వారా అనుభవిస్తూ ఉంటుంది. మరొక ఆత్మ విషయాలతో పొత్తులేకుండా తటస్థంగా ఉండి భాసిస్తూ ఉంటుంది. వాయువు ఒక్కటే కాని, దానికి చెందిన భేదాలు ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం అని ఐదు విధాలుగా ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే క్రమంగా పవనగమనం నిరోధించబడుతుంది. ఈ నిరోధమనే సుకృతం జీవుడిలోని అంతరాత్మను దర్శింపజేస్తుంది. జీవుడు చేసే కర్మలలో కూడా తేడాలున్నాయి. పుణ్యపాప మిశ్రకర్మలవలన మానవుడై జన్మిస్తాడు. బుద్ధిమంతుడు కర్మజాలంలో తగులుపడకుండా ముక్తి కోరి అందుకై ప్రయత్నిస్తాడు. వేయిమందిలో ఏ ఒక్కడో తన శరీరదోషాలను గ్రహించి, వాటిని త్యజించి మోక్షం సాధిస్తాడు.

ప్రశ్న 98 : దేహదోషాలంటే ఏవి. (5. 610)

ఉత్తరం : కామం, క్రోధం, భయం, నిద్ర, నిశ్శ్వాసం - అనేవి దేహగతమైన దోషాలు. వీటిని తొలగించుకొనే విధానం కూడా ఉన్నది. కోపానికి ఓర్పు, కామానికి సంకల్పరాహిత్యం, భయానికి ఏమరుపాటు లేకుండటం, నిద్రకు సత్త్వగుణ సేవనం, శ్వాసకు అల్పాహార స్వీకరణం - శత్రువులు. ఇంకా పెక్కు దోషాలను తొలగించుకొనే ఉపాయాలు ఎన్నో ఉన్నాయి. వివేకవంతుడు వాటి మార్గాలను తెలిసికొని చేపట్టి దోషాలను నిర్మూలిస్తాడు. ఈ లోకాలు విష్ణుమాయా ప్రభావంవలన కలుగుతున్నాయి. పండితుడు వీటిని గోడమీది బొమ్మలవలె, నీటిమీద నురుగువలె, బుడగలవలె భావించి మోక్షమార్గాన్ని మాత్రమే అన్వేషిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రశ్న 99 : ఆత్మ పరమపదం పొందే ప్రకారం? (5. 613)

ఉత్తరం : వెలుపలి స్పర్శలు అనబడే విషయ సుఖాలను తపస్సు అనే కర్రతో తొలగనెట్టి సాంఖ్య విధానాన్ని ఓడగా గ్రహించిన ఆర్యుడు ప్రజ్ఞ అనే పడవ నడిపే చుక్కానివాడి నైపుణ్యంతో సంసారమనే సముద్రాన్ని దాటుకొంటాడు. ఆ సముద్రం దుఃఖమనే నీటితోనూ, వ్యాధిమరణాలనే మొసళ్ళతోనూ, భయ మనే పాములతోనూ, హింస అనే ప్రవాహంతోనూ, విషయాసక్తి అనే బురదతోనూ, ఆశలు అనే సుడులతోనూ, సుఖసంతోషాలనే రత్నాలతోనూ, సత్యమనే గట్టుతోనూ కూడి ఉంటుంది. ఆ సముద్రాన్ని దాటిన పుణ్యాత్ముడిని సూర్యుడు తన కిరణాలతో మోసికొని పోతాడు. పిదప తామరతూడులోని దారమంతటి సూక్ష్మమైన దారిలో ప్రవేశించి అతడు పయనిస్తూ ఉండగా మిక్కిలి సూక్ష్మమైనవాడూ, చల్లనివాడూ, మంచివాసన కలవాడూ, సుఖకరమైన స్పర్శకలవాడూ, సప్తవాయువులలో శ్రేష్ఠుడైనవాడూ అయిన ప్రవహుడనే పవనుడు అతడికి ఎదురుగా పోయి, అతడిని ఆకాశంయొక్క పరమగతిని చేరేటట్లు చేస్తాడు. ఆకాశం రజస్సుయొక్క పరమగతిని, రజస్సు సత్త్వం యొక్క పరమగతినీ, సత్త్వం నారాయణుడినీ క్రమంగా చేరేటట్లు చేస్తాయి. నారాయణుడు ఆ పుణ్యాత్ముడిని చివరకు పరమాత్మతో చేరుస్తాడు. అతడు పరతత్త్వంలో లీనమై అమృతస్వరూపుడై శాశ్వతస్థితిని పొందుతాడు.

ప్రశ్న 100 : ఆ రీతిగా అమృత స్వరూపుడై నిత్యుడైన మహాత్ముడు తన పూర్వ స్థితిని తలుస్తాడా? తలంచకుండానే ఉంటాడా. (5.613)

ఉత్తరం : ధర్మరాజా! నీవు మంచి గహనమైన ప్రశ్నను చక్కగా అడిగావు. ఎంతటి ప్రజ్ఞావంతుడైనా సందేహించే విషయ మిది. కపిలమత మిది - ఇంద్రియాలు పురుషుడిని తెలియజాలవు. అవి మనస్సులో ఉంటాయి. కాబట్టి పురుషుడు మనస్సుతోడి సంబంధం వలన ఇంద్రియాలను తెలిసికొంటాడు. పురుషుడు ముక్తిని పొందినా పొందకపోయినా ఇంద్రియాలను తెలిసికొనట మనేది సమానమే. ఆత్మజ్ఞాన సంపన్నుడై అమృత స్వరూపుడైన పురుషుడు విషంలేని పాములవలె చేష్టలు లేక పడి ఉన్న ఇంద్రియాలను తెలిసికొన్నా, తెలియకపోయినా జరిగే దేమీ లేదు. అందువలన అతడి కేవిధమైన బాధలూ లేవు. ముక్తుడైన పురుషుడు ఇంద్రియాలను వర్జించినప్పుడు అవి సాగరంలోని నురుగువలె, నీటి బుడగలవలె విచ్ఛిన్నమై పోతాయి. ఈ స్థితిని పొందట మనేది ఈశ్వర విభూతి అయి ఉన్నది. అది ముక్తి పొందిన ఆత్మకు కూడా అన్వయిస్తుంది.

పరమాత్ముడైన నారాయణుడిని పొందిన జీవుడికి పునర్జన్మ లేదు. పునరావృత్తి లేని శ్రేష్ఠమైన ఈ దశనే మోక్ష మంటారు. మోక్షదశకంటె మించిన దశ మరేమీ లేదు. ఇది శ్రీమన్నారాయణ ప్రణీతమైన అక్షరమోక్షాన్ని ప్రదర్శించే పద్ధతి.

ప్రశ్న 101 : ప్రజ్ఞానిధివైన తాతా! నీవు చెప్పిన 'అక్షర' మనేది ఎటువంటిది? 'క్షర' మేది? (6.2)

ఉత్తరం : ధర్మరాజా! నీ వడిగిన విశేషం 'వసిష్ఠజనక సంవాద' మనే ఉత్తమ ఇతిహాసం వింటే తేటపడుతుంది. దాని తాత్పర్యం వినుము. కరచరణాది అవయవాలు కలిగి ఉండీ, ఆదీ, అంతం, క్షయం, వృద్ధి అనేవి లేనిదైన తత్త్వాన్ని 'అక్షరం' అంటారు పండితులు. దాని నుండి ఇరవై నాలుగు క్షరతత్త్వాలు ఆవిర్భవించాయి. క్షరతత్త్వం విక్రియను పొందుతుంది. దానిని ప్రకృతి అనీ, ప్రధానమనీ, అవ్యక్తమనీ పిలుస్తారు. ఆ విక్రియనుండి 'మహత్' అనే తత్త్వం ఆవిర్భవిస్తుంది. ఇరవైనాలుగు తత్త్వాలు ఇవి - ప్రకృతి, మహత్తు, అహంకారం, పంచభూతాలూ, పంచగుణాలూ, అయిదు జానేంద్రియాలూ, అయిదు కర్మేంద్రియాలూ, మనస్సు, కలిసి మొత్తం ఇరవైనాలుగు. ఈ ఇరవైనాలుగు తత్త్వాలూ విజ్ఞానానికి అందుతాయి. ఇరవై అయిదవ అక్షరమైన పరమతత్త్వం విజ్ఞానానికి గోచరం కాదు. దానికి నాశం లేదు; మృతి లేదు. సత్త్వరజస్తమోగుణాలను అనుసరించటం వలన జన్మపరంపరలోనికి జారిపోయిన ఆ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అక్షరతత్త్వం తనను తాను తెలిసికొనలేక, అవే తాను అనుకొని వాటిలో నివాసం సాగిస్తూ ఉంటుంది. అక్షరానికి స్వతస్సిద్ధంగా ఏ రంగూ లేదు. కాని సత్త్వరజస్తమోగుణాలను అనుసరించటంవలన మార్పులకు లోనవుతుంది. అహంకారగుణం ఈ వికారాలకు కారణం. నిర్వికారస్థితిలో అక్షరతత్త్వం ప్రదీప్తమౌతుంది.

స్త్రీ పురుష సంబంధం వంటిదే ప్రకృతి పురుషుల పరస్పరాకర్షణ. అదే సమస్త ప్రాణికోటికీ జన్మహేతువు. వేదాలు ఇదే చెప్పుతున్నాయి. విత్తనంనుండి విత్తనమూ, దేహంనుండి దేహమూ, ఇంద్రియాలనుండి ఇంద్రియాలూ; మనస్సునుండి మనస్సూ - ఇట్లా జన్మిస్తూ ఉంటాయి. ఆత్మకు బీజం లేదు. దేహం ఉండదు. మనస్సు లేదు. ఆత్మ అనేది నిర్గుణం. అందుచేత దానికి భవబంధాలూ, భవదుఃఖాలూ, కర్మాచరణలూ - ఇట్లాంటివి ఏమీ ఉండవు. గుణాలు ప్రకృతివే కాని పరమాత్మవి కావు.

జీవుడిని అక్షరమనీ, ప్రకృతిని క్షరమనీ అంటారు. కొందరు ఈ రెంటినీ 'క్షరములు' అన్నారు. మరికొందరు 'అక్షరములు' అన్నారు. ఆద్యంతాలు లేకపోవటం, ఈశ్వర తత్త్వాన్ని కలిగి ఉండటం - ఇత్యాదులు జీవుడికీ, ప్రకృతికీ ఉన్న సాదృశ్యాలు. మహదహంకారాది ప్రకృతి గుణాలను పొందినప్పుడు పురుషుడు (జీవుడు) తనను తాను ప్రకృతిగా భావిస్తాడు కనుక అతడిని 'క్షరము' అని కూడా అనవచ్చును. ఈ ప్రకృతి పురుషుడిని పొందినప్పుడు గుణవికార రహితంగా ఉంటుంది కాబట్టి అప్పుడు దానిని నిర్గుణమనీ, అక్షరమనీ కూడా వ్యవహరించవచ్చును. ఎన్ని రూపాలలో ఈ ప్రకృతి విజృంభించినా మమకారం, అహంకారం అనేవి రెండే దీని మూల తత్త్వాలు. ఇవి రెండూ పరిహరించగలిగితే ఇంక ఈ ప్రకృతి పురుషుడిని ఏమీ చేయలేదు. నశించే ప్రకృతిని విడిచి పెట్టిన పురుషుడు (ఇరవై అయిదవ తత్త్వం) అక్షరు డనబడతాడు. తన కేవలత్వాన్ని గుర్తించి జీవుడు తనను తాను పరతత్త్వంగా దర్శించి తల్లీనుడౌతాడు. అదే నిరామయమూ అనంతమూ అయిన పదం సుమా!

ధర్మరాజా! మొట్టమొదటగా ఈ తత్త్వ రహస్యాన్ని బ్రహ్మదేవుడు వసిష్ఠుడికి తెలియజేశాడు. వసిష్ఠుడు నారదుడికి, నారదుడు నాకు ఉపదేశించాడు. నేను నీకు జనక వసిష్ఠుల సంభాషణగా బోధించాను. ఈ జ్ఞానాన్ని అలవరచుకొమ్ము. పరమానందాన్ని పొందుము.

ప్రశ్న 102 : ధర్మాధర్మాల విచారం లేనిదీ, సంశయాల నన్నింటినీ పోగొట్టేదీ, చావు పుట్టుకలు లేనిదీ, శుచిశుభ్రతలు కలిగిందీ, శాశ్వతమైనదీ, మార్పు లేనిదీ, 'పరము' అని పిలువబడేదీ, దుఃఖాన్ని పోగొట్టేదీ - అయినట్టి తత్త్వాన్ని బోధించుము. (6.79)

ఉత్తరం : నీ ప్రశ్నల కన్నింటికి సమాధానం ఇవ్వగలిగింది యాజ్ఞవల్క్య జనకరాజ సంవాద ప్రకారేతిహాసం. దాని సారాన్ని గ్రహించాలి. ఇంద్రియ మహిమలన్నీ మనస్సు చేతిలోనే ఉంటాయి. కాబట్టి మనస్సు విషయాసక్తి నుండి వెనుకకు మళ్ళితే ఇంద్రియాలు అన్నీ దానితోపాటే వెనక్కు మళ్ళుతాయి. కాని, ఇంద్రియాలు వెనకకు మళ్ళినా వాటితో పాటు మనస్సుకూడా వెనుకకు మళ్ళుతుందని చెప్పలేము. మళ్ళదుకూడా. విషయ తృష్ణలోనే సంచరిస్తూ ఉంటుంది. కాబట్టి ఇంద్రియ నిగ్రహంతోపాటు మనోనిగ్రహం కూడా అత్యవసరం. ఒక దీపంనుండి అనేక దీపాలు వ్యాప్తి చెందినట్లు ఈ ప్రకృతి అనేది గుణరూపాలను వ్యాప్తిపొందిస్తుంది. జీవాత్ముడు ప్రబుద్ధుడైతే ప్రకృతి వెంటబడిపోక శాశ్వతమైన అచ్యుతపదాన్ని పొంది అక్షరుడైపోతాడు. పురుషుడి యథార్థ రూపాన్ని గ్రహించగలిగిన జ్ఞానం ప్రకృతికి లేదు. కాని, ప్రకృతిని తెలిసికొన గలిగిన జ్ఞానం పురుషుడికి ఉన్నది. అంతే కాదు. పురుషుడు నిశ్చల దృష్టితో చూచి తనకంటె పరతత్త్వం మరొకటి లేదని కూడా గ్రహించగలడు.

సాంఖ్యంతో సాటివచ్చే జ్ఞానంకానీ, యోగంతో సాటివచ్చే బలంకానీ ఇంక ఎక్కడా - ఏ వేదశాస్త్రాలలోనూ కనిపించవు. మూర్ఖుడు ఈ రెండింటినీ వేరువేరు శాస్త్రాలుగా భావిస్తాడేమో కాని నేను మాత్రం ఒక్కటిగానే చూస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరిపూర్ణజ్ఞాని అయిన యోగి నిశ్చల దీపంవలె ఉంటాడు. తేనెకుండ నెత్తిమీద పెట్టుకొని ఏమరుపాటు లేకుండా మెట్టులు ఎక్కినట్లు యోగి తన ఆత్మానందరసం చిందిపోకుండా గమ్యం చేరుకొంటాడు. జనన మృత్యుభయాలతో యోగ సాంఖ్యాలను ఆశ్రయించిన యతీశ్వరులు నిర్మమత్వస్థితిలో పరతత్త్వ సాన్నిధ్యాన్ని, సుస్థిరంగా అనుభవిస్తారు. జీవాత్మ పరమాత్మల ఏకత్వ మహిమను ఎరుక పరచటమే విజ్ఞానం (విద్య) చేసే పని. దానిని పొందటమే ముక్తికి మార్గం. మరి వేరే మార్గాలు లేనే లేవే. కాబట్టి ధర్మరాజా! దానియందు శ్రద్ధ కలిగి సజ్జనులు గర్హించే శోక మోహాలను త్యజించి సుఖివి కమ్ము.

ప్రశ్న 103 : గృహస్థ ధర్మాన్ని వదలకుండా మోక్షం పొందవచ్చునా? (6.169)

ఉత్తరం : ఈ అంశాన్ని వివరించే 'జనకసులభా సంవాదం' అనే ఇతిహాసాన్ని తెలిసికొనాలి. దాని సారాన్ని ఈ విధంగా గ్రహించవచ్చును. పంచశిఖుడనే ముని జనకరాజుకు సాంఖ్యయోగాలనూ, రాజ్యపాలనాన్నీ బోధిస్తూ ఆ మూడింటా ముక్తి పొందే మార్గాలు చెప్పాడు. ముక్తికి వైరాగ్యమే మూలం. వైరాగ్యానికి జ్ఞానమే ఆధారం. కాబట్టి జ్ఞానంవలన కలిగిన విరక్తి సుఖదుఃఖాలూ, రాగద్వేషాల వంటి ద్వంద్వాలకు అతీతంగా ఉంటుంది. కాబట్టి సంసారంలో ఉండికూడా నిస్సంగుడిగా గృహస్థుడు ఉండగలడు. గృహస్థాశ్రమం వద్దు అని ద్వేషించటం కూడా ఒక సంగమే. రాగమే కాదు ద్వేషం కూడా పనికిరాదు. జ్ఞానంవలన మాత్రమే ముక్తి లభిస్తుంది.

ప్రశ్న 104 : శుకుడికి వైరాగ్యం ఎట్లా కలిగింది? (6.221)

ఉత్తరం : జీవితం బుద్బుద మని భావించకుండ పామరజనులతో కలిసి తిరుగుతున్న శుకుడిని చూచి వ్యాసుడు ఇట్లా బోధించాడు. 'నురుగుతో చేసిన పంజరంవంటిది ఈ శరీరం. ఇందులో ఒక పిట్టవలె ప్రాణం ఉంటుంది. దీనిని మరచి తిరగటం తగదు. కాలం తెలియకుండా ముందుకుసాగుతుంది. ఆయుర్దాయం ముగుస్తుంది. హంస ఎగిరిపోతుంది. సంసారం ఒక సముద్రం. చంచలమైన ఇంద్రియాలే నీళ్ళు. అరిషడ్వర్గమే మొసళ్ళు. దీనిని దాటటానికి ధైర్యం ఒక్కటే తెప్ప. దానితో తరించుము. కామాది సౌఖ్యాలతో తృప్తుడై జీవుడు ఏమరితే గొర్రెను ఎత్తుకొనిపోయే పులివలె మృత్యువు తన్నుకొనిపోతుంది. నీవు అట్లాంటి మూఢుడవు కావద్దు. మానవజన్మ బహుదుర్లభం. దాన్ని ఒక సోపానంగా చేసికొని నిచ్చెన ఎక్కి, మోక్షపదం అందుకొనాలి. భోగాలు విడిచిపెట్టి, నిస్సంగుడై, నిర్మలాంతరంగుడై నరుడు ఇంటిలో ఉండికూడా తపస్సు చేసి సంసార సముద్రాన్ని తేలికగా దాటుతాడు. భార్యపట్ల వ్యామోహం (ఆపేక్ష) అనేది కష్టాలకు ప్రారంభం. ఇహంలోనూ, పరంలోనూ అది అంతులేని క్లేశాలను కల్పిస్తుంది. అందుచేత తెలివిగలవారెవ్వరూ భార్యాపేక్షకు పూనుకోరు, కష్టాలలో కూరుకోరు. భోగదానాలు లేని ధన మెందుకు? శత్రువులను సంహరించలేని పరాక్రమ మెందుకు? ధర్మాచరణానికి పూనుకొనని జ్ఞానం ఎందుకు? జితేంద్రియుడు కాకపోతే ఆత్మ జ్ఞాన సాధన మెందుకు?' ఈ మాటలు విన్న శుకుడికి ముక్తిమార్గం తెలిసింది. ఆత్మ జ్ఞానం గాలిసోకని దీపంవలె నిశ్చలంగా వెలిగింది. అతడు తండ్రిని వదలి వెళ్ళిపోయాడు.

ప్రశ్న 105 : వ్యాసమహర్షి పుత్రుడైన శుకుడి జన్మవృత్తాంతం, అతడు సిద్ధుడైన విధం నాకు తెలియచెప్పుము. (6.246)

ఉత్తరం : మేరుపర్వత సానువులలో కర్ణికారవనం ఉన్నది. అందులో వేదవ్యాసుడు పుత్రార్థి అయి తపస్సు చేశాడు. పార్వతీపరమేశ్వరు లక్కడకు వచ్చి, పంచభూతాలతో సమానమైన శక్తి యుక్తులు కలిగిన పుత్రుడిని వరంగా ప్రసాదించి అంతర్ధానమయ్యారు. ఒకనాడు వ్యాసుడు అరణిని మథిస్తూ ఉండగా ఘృతాచి కనపడింది. ఆమెపై కలిగిన కామభావంవలన వ్యాసుడికి వీర్యస్ఖలనం అయి అరణిలోపడి ప్రకాశించింది. అందులోనుండి తేజస్వి అయిన శుకుడు పుట్టాడు. ఆ బాలుడికి గంగాదేవి స్నానం చేయించింది. ఆకాశంనుండి కృష్ణాజినం, దండం వచ్చి పడ్డాయి. పూలవాన కురిసింది. దేవ దుందుభులు మ్రోగాయి.పార్వతీపరమేశ్వరులు శుకుడికి ఉపనయనం చేశారు.

దేవేంద్రుడు కమండలం ఇచ్చాడు. దేవతలు దివ్యవస్త్రాలు సమర్పించారు. వేదశాస్త్రాలు శుకుడిని పొందాయి. శుకుడు బృహస్పతిని గురువుగా వరించాడు. 'మోక్షాన్ని ఇచ్చేది ఏది?' అనే జిజ్ఞాస ఆతడిలో మొదలయింది. తండ్రిని మోక్షవిద్యను బోధించుమని కోరాడు. ఆయన జనకమహారాజును అడుగుమని చెప్పాడు. శుకుడు కాలినడకతో మిథిలానగరానికి చేరాడు. శాంతచిత్తుడైన శుకుడు జనకుడి అభిమానాన్ని పొందాడు. ఆ రాజిచ్చిన అతిథి సత్కారాలను నిరాసక్తతతో శుకుడు గ్రహించాడు. మరునాడు ఉదయం శుకుడు 'ముక్తిని దేనితో పొందవచ్చును?' అని జనకరాజును కోరాడు.

బ్రహ్మజ్ఞానం పుట్టుకతో వచ్చినవాడు కాని, అభ్యాస వశంతో పొందినవాడు కానీ చతుర్విధాశ్రమాల వరుసలో ప్రయాణంచేసి చివరకు ముక్తిపొందుతాడు. పూర్వ జన్మ సంస్కారం వలన ముక్తిహేతువులు సిద్ధిస్తే బ్రహ్మచర్యంలోనే జీవన్ముక్తుడౌతాడు. జ్యోతిస్స్వరూపమైన పరతత్త్వం ప్రతి వ్యక్తికీ ఆత్మలోనే ఉంటుంది. ఏకాగ్రత సాధించిన యోగి ఆ జ్యోతిని తనలోనే తాను దర్శించగలుగుతాడు. ఇతరులవలన తనకూ, తనవలన ఇతరులకూ ఏ విధమైన భయమూ లేని నిర్భయస్థితి అలవడినప్పుడు ద్వంద్వాతీత స్థితిని పొంది పరమాత్మను సాధకుడు చూడగలుగుతాడు. జనకుడి మాటలు శుకుని అనుమానాలను తీర్చాయి.

శుకుడు వాయుమార్గంలో పయనించి హిమవత్పర్వతంలోని వ్యాసాశ్రమానికి చేరాడు. వేదప్రచారంకొరకు శిష్యులు వివిధ ప్రదేశాలకు పోగా శుకుడూ, వ్యాసుడూ మాత్రమే ఆశ్రమంలో ఉంటున్నారు. ఒకనాడు నారదుడు వచ్చి తండ్రి కొడుకుల నడుమ వేదాధ్యయన వ్రతం నిరంతరంగా సాగాలని కోరాడు. వేదాధ్యయనం సాగింది. ఒకనాడు పెనుగాలి వీచింది. వాయు భూతతత్త్వాన్ని వ్యాసుడు శుకుడికి బోధించాడు. వ్యాసుడు స్నానానికి వెళ్ళినప్పుడు శుకుడు 'మానవుడికి హితమైనదేది?' అని అడుగగా నారదుడు ఇట్లా చెప్పాడు. 'సత్యమే తపస్సు. జ్ఞానమే కన్ను, త్యాగమే సుఖం, రాగమే దుఃఖం; నరుడు మోక్షం కొరకు ప్రయత్నించకుండా సంసారబంధాలలో తగుల్కొంటే మరో జన్మలో కూడా ముక్తి సాధ్యం కాదు. బంధుమిత్రుల పట్ల వ్యామోహితుడైనవాడు ఊబిలో దిగబడిన ఏనుగువలె హింసకు గురిఔతాడు. భోగలాలసుడు వలలో చిక్కుకొన్న మృగంవలె, చేపవలె గిలగిలలాడతాడు. అహింసను అలవరచుకొని అధర్మాన్ని వదలాలి. సంకల్పాలను త్యజించి ధర్మాన్ని వదలించుకొనాలి. బుద్ధిబలంతో సత్యాసత్యాలను తొలగించుకొనాలి' అని నారదుడు చెప్పగా శుకుడు సూర్యుడి దయవలన యోగసిద్ధి పొందుతానని బయలుదేరాడు. వ్యాసుడు వారించినా ఆగక కైలాస పర్వతానికి వెళ్ళి సూర్యుడి అనుగ్రహాన్ని పొందాడు. తాను యోగసిద్ధిని పొందినట్లు నారదుడికి తెలిపి, గరుత్మంతుడివలె ఎగురుతూ ఆకాశమార్గాన బయలుదేరాడు. సిద్ధులూ, సాధ్యులూ, మహర్షులూ ఆ యోగసిద్ధిని చూచి ఆశ్చర్యపోయారు. వ్యాసుడు పుత్రవ్యామోహంతో బయలుదేరాడు. శుకుడు మార్గమధ్యంలో ఉన్న మృగాలనూ, పక్షులనూ, పర్వతాలనూ, నదులనూ, కొలకులనూ, గుట్టలనూ, తీగలనూ చూచి 'మా తండ్రి నా వెంట వస్తూ నా పేరుతో పిలుస్తూ ఉంటే మీరు 'ఓ' అని బదులు పలకాలి సుమా!' అనగానే అవి అందుకు అంగీకరించాయి. శుకుడు త్రిగుణాలను త్యజించి ఉత్తరంగా వెళ్ళుతుండగా ఒక మహాపర్వత శిఖరాలు రెండు అడ్డంగా ఉన్నా, వాటిని తన గమనవేగంతో భగ్నంచేస్తూ సాగిపోయాడు. దేవతలు అతడిపై పూలవాన కురిపించారు.

శుకుడు గంగానదిపై తక్కువ ఎత్తులో పోతూ ఉండగా క్రింద ఉన్న గంగానదిలో అప్సరసలు దిగంబరంగా జలక్రీడ లాడుతున్నారు. వారంతా శుకుడిని చూచారు. కాని, ఏ వికారమూ పొందలేదు. శంకించలేదు. సిగ్గుపడలేదు. ఎప్పటివలె జలక్రీడలు సాగించారు. ఆ సమయంలో వ్యాసుడు తన కుమారుడి వెనుక గొప్ప యోగవిద్యవలన లభించిన గమనాన్ని స్వీకరించి వెంటబడ్డాడు. అప్పటికి ఆ శుకుడు వాయుమార్గం దాటి పంచభూతాలకూ అంతర్యామి అయ్యాడు. అప్పుడు వ్యాసుడు పిలిచేసరికి శుకుడికి తెలిసింది. అత డిప్పుడు సర్వభూతాత్మకుడుగా

మారిపోయాడు. కాబట్టి రూపం కనపడదు. అయినా వ్యాసుడికి వినిపించేటట్లు 'ఓ' అనే ధ్వని ఆకాశమంతటా వ్యాపించి మారుమ్రోగేటట్లు చేశాడు. వ్యాసుడు ఆశ్చర్యపోయి తన కుమారుడి అనంతమైన మహిమను తెలిసికొన్నాడు. అదే పర్వతశిఖరంమీద అట్లాగే నిలబడిపోయాడు. ఆ వ్యాసుడిని చూచి అప్సరసలు సిగ్గు ఎక్కువ కాగా అందరూ బట్టలు కట్టుకొన్నారు. దివ్యజ్ఞానం కలిగిన ఆ వ్యాసుడు - తన కుమారుడు అదే దారిలో వెళ్ళినప్పుడు వారికి శంక లేదన్న నిజాన్ని గ్రహించి, కుమారుడి విముక్త స్థితిని, తన ఆసక్త స్థితినీ గ్రహించి కుమారుడి ఔన్నత్యానికి సంతోషించాడు. తన స్థితికి సిగ్గుపడ్డాడు. అట్లా దిగులు పడుతున్న వ్యాసుడి వద్దకు గంగాధరుడు వచ్చాడు. మునులూ, సిద్ధులూ, దేవతలూ ఆ దేవుడివెంట వచ్చారు. శంకరుడు తాను ముందు వ్యాసుడికి 'పంచభూత సమవీర్యుడిని కొడుకుగా అనుగ్రహించిన' అంశాన్ని జ్ఞాపకంచేసి, విచారించవలసిన అవసరం లేదని ఓదార్చాడు. శుకుడి కీర్తి ప్రపంచం ఉన్నంతకాలం నిత్యంగా ఉంటుందని ప్రకటించాడు. వ్యాసుడు కోరితే శుకుడి నీడ అతడిని అనుసరిస్తుందని పేర్కొని, శివుడు అంతర్ధానమయ్యాడు. ఇది ఉత్తమ ఇతిహాసం. దీనిని విన్నా, చదివినా దీర్ఘాయుర్దాయాదులు కలుగుతాయి. సకలాభ్యుదయాలు సిద్ధిస్తాయి.

ప్రశ్న 106 : నాలుగు ఆశ్రమాలలోనూ ఉండేవాళ్ళు కొలిచే దైవం ఏది? (6.344)

ఉత్తరం : దీనికి తగినది నారద నారాయణ సంవాదం. దాని సార మిది - సర్వాశ్రమాలవారు కొలిచే దైవం విష్ణువు. బదరికాశ్రమంలో నివసిస్తున్న నరనారాయణులలో నారాయణ ముని వద్దకు వెళ్ళి నారదుడు నారాయణ మూల రూపాన్ని గురించి తెలిసికొన దలచాడు. ఆ తత్త్వాన్ని దర్శించదలచాడు. నారాయణుడు నారదుడిని అనుగ్రహించి ఏకాగ్రచిత్తుడిగా చేసి గగనమార్గంలో మేరు పర్వతంమీద క్షీరసముద్రపు టుత్తర తీరంలో ఉన్న శ్వేతద్వీపంలో నిరాహారులై, జితేంద్రియులై, చెమట పట్టనివారై, పరిమళయుతమైన ధవళదేహాలతో ఉన్న పురుషుల వద్దకు చేర్చాడు. తదేక దీక్షతో అనేక సంవత్సరాలు తపస్సు చేస్తే, అప్పటికి విష్ణుమూర్తి దర్శనం లభిస్తుంది. నారదుడు ఆ శ్వేతద్వీప వాసులను దర్శించి, సేవిస్తూ తానుకూడా తపస్సుకు పూనుకొన్నాడు. అతడికి విష్ణుమూర్తి ప్రత్యక్షమయ్యాడు. ఆయన తెలుపూ, నలుపూ, పసుపూ, ఎరుపూ, గోరోచనమూ, ఆకుపచ్చ రంగులలో ఉన్నాడు. సహస్ర శిరస్సులూ, సహస్రబాహువులూ, సహస్ర పాదాలూ ఉన్నాయి. హోమవేదికా, కమండలువూ, స్రుక్కూ, స్రువమూ, అగ్నీ - వీటన్నిటినీ ధరించి ఉన్నాడు. ఓం కారాన్ని ఉచ్చరిస్తున్నాడు. గాయత్రీమంత్రాన్ని జపిస్తున్నాడు. ఇట్లా అత్యద్భుతమైన దివ్యరూపంతో స్వామి ప్రత్యక్షమయ్యాడు. నారదుడి కన్నులకు కనిపించాడు. స్వామికి మునీంద్రుడు నమస్కరించాడు. స్వామి అతడిని అనుగ్రహించి ఇట్లా నారాయణతత్త్వాన్ని వివరించాడు. దాని సార మిది -

'క్షేత్రజ్ఞుడూ, జీవుడూ, వాసుదేవుడూ, సంకర్షణుడూ - అందరూ ఒక్కటే. అంతా నేనే. వాసుదేవుడే మనస్సు, అదే ప్రద్యుమ్నం. అహంకారమే సంకర్షణుడు. అదే అనిరుద్ధం. ఇరవైనాలుగు తత్త్వాలకూ ప్రభువైన ఇరవై అయిదవ తత్త్వం నేనే. నన్ను అందుకే పంచవింశకుడు అంటారు. పరమపురుషుడిని నేనే. నా కన్నా పరమైనది మరొకటి లేదు. ఏకాగ్రచిత్తులైన యోగీశ్వరులు ఎవరిని దర్శించి నిత్యానందస్థితిని పొందుతారో ఆ పరమాత్మగా, ఆ వాసుదేవుడిగా, ఆ నిష్కలుడిగా, ఆ సాటిలేనివాడిగా నన్ను తెలిసికొనటం నీకు ఆత్మహితం'.

'ఈ సృష్టిలోని సకల ప్రాణికోటిలో అంతర్గతంగా ఉన్న ధాతుశక్తి నా కన్న భిన్నమైనది కాదు. నాలోనే ఉన్నది. అది నా మొత్తం. జీవశక్తి అనేది సర్వత్ర పరివ్యాప్తం కాకపోతే చేష్టలూ, చైతన్యాలూ ఉండవు. జీవుడు వేరు, శరీరం వేరు. ఈ వాస్తవాన్ని గ్రహించటం అత్యవసరం. ఎవడైనా జీవుడిని చూచానని అంటే అదంతా మాయ. ఆ మాయావిలాసానికి సృష్టికర్తను నేనే. జీవుడు నాకంటె భిన్నుడు కాడు. నాలోనే కలిసి ఉంటాడు. ఈ సత్యాన్ని గ్రహించటం అవసరం. భక్తిమయమైన సాధనతో ఎవడు నన్ను ఆశ్రయిస్తాడో వాడికి విముక్తిని అనుగ్రహిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆదిత్యులూ, మరుత్తులూ, వసువులూ, రుద్రులూ మొదలైన దేవగణాలూ, బ్రహ్మదేవుడూ, చతుర్వేదాలూ ఆయాగౌరవాలను పొందటం నా వలననే. బ్రహ్మదేవుడిని నేనే సృష్టించాను. ప్రపంచభారాన్ని అప్పగించాను. నేనే నివృత్తి మార్గం చేపట్టాను. ఏకాంతంగా గడుపుతాను. మధ్యస్థుడుగా ఉంటూ బ్రహ్మాదులకు అవసరాన్ని బట్టి దివ్యమూ, భవ్యమూ అయిన సహాయం చేస్తుంటాను. కొన్ని కొన్ని సమయాలలో లోకహితం కొరకు జన్మకర్మలను పూనుతూ ఉంటాను. వరాహరూపం తాల్చి హిరణ్యాక్షుడిని, నరసింహరూపం ధరించి హిరణ్యకశిపుడినీ, భృగువంశంలో పరశురాముడనై పుట్టి క్షత్రియ లోకాన్నంతటినీ, దశరథ రాముడిగా జన్మించి రావణుడినీ సంహరిస్తాను. యాదవకులంలో కృష్ణుడినై పుట్టి అర్జునుడి సహాయంతో భూభారాన్ని తొలగిస్తాను. నేను పూర్వం నరనారాయణులనే పేర్లతో రెండు రూపాలతో, ఋషిత్వంతో వెలసి జగద్రక్షణాన్ని చేస్తున్నాను. ఈ మూర్తులే తరువాత లీలామానుషరూపాలతో తమ కార్యాలను నిర్వహిస్తుండగా కంసుడు, కాలయవనుడు, మురుడు, నరకుడు, బాణుడు మొదలైన కంటకులను రూపుమాపుతాను. అందులో బాణాసురుడిని రక్షిస్తానని పూనుకొని శివుడు కుమారస్వామితో కలిసి అడ్డగించగా ఆ మహాత్ముడిని జయించటానికి బాణుడిని అవమానించాను. ఇంతకు ముందు మత్స్య కూర్మభావాలను పొంది దేవగణాలకు మేలు చేశాను. ఇంకా ధర్మరక్షణం కొరకు ఏయే పనులు చేయాలో వాటిని తప్పక నిర్వహిస్తాను. నా కర్తవ్యాలు పూర్తి కాగానే నా మూల ప్రకృతిని మరల పొందుతాను. ఈ శ్వేతద్వీప వాసులు ఏకాగ్రచిత్తంతో నన్నే స్మరిస్తారు. నీవు కూడా ఏకాగ్రచిత్తుడవు కావటంచేత నా తీరునంతా నీకు తెలిపాను'.

ఈ విష్ణు సందేశాన్ని విన్న నారదుడు బదరికాశ్రమానికి వెళ్ళి, నరనారాయణుల కీ వృత్తాంతం తెలిపి, మిగిలిన మహర్షులందరికీ నారాయణోపదేశాన్ని కర్ణరసాయనంగా అందించాడు. ఆ తరువాత బ్రహ్మ లోకంలో దీని ప్రచారం చేశాడు. ఇది వేదసారం, యోగసారం, సాంఖ్యసారం. ధర్మరాజా! ఇంతవరకూ నీవు విన్న ఉపాఖ్యానాలు ఏవీ దీనికి సరిపోవు. దీనిని శ్రద్ధగా చదివినా, వినినా, అట్టివారికి దీర్ఘాయురారోగ్య సంపదలు సమకూరుతాయి.' (భీష్మ భాషణం విని పాండుపుత్రులు దీనిని వింటూ, పఠిస్తూ, భక్తితో విష్ణుమూర్తిని స్తుతిస్తూ కాలం గడిపారు) (6.395)

* * *

ఇంతవరకు ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు భీష్ముడు సమాధానాలు చెప్పాడు. ఇకపై జనమేజయు డడిగిన ప్రశ్నలకు వ్యాసశిష్యుడైన వైశంపాయనుడు ఉత్తరాలు చెప్పాడు.

వైశంపాయనుడు : వ్యాసుడు పై ఉపాఖ్యానాన్ని భక్తితో జపిస్తూ ఆకాశమార్గాన ప్రయాణం చేసి క్షీరసముద్రానికి వెళ్ళుతుంటాడు.
ప్రశ్న 107 : నిత్యమూ విష్ణుమూర్తిని దర్శించాలనీ, ఉత్తమ పూజలు ఆచరించాలనీ కుతూహల పడుతుండేవాడు.

జనమేజయుడు : వైశంపాయనా! నీవు మోక్షం అత్యంత సుఖకరమని చెప్పుతావు. కాని లోకులందరూ భౌతిక విషయాలమీదనే
ఉత్తరం : అధికాసక్తి చూపుతారు. దేవతలు కూడా మోక్షాన్ని కోరక హవ్యభోజన ప్రియులై వర్తిస్తూ ఉంటారు. వా రట్లా ఉండటానికి గల కారణమేమిటి? (6.398)

వైశంపాయనుడు: వ్యాసమహర్షి కూడా ఈ ప్రపంచ స్వభావాన్ని తెలిసికొనటానికి విష్ణువును గూర్చి తపస్సు చేశాడు. నారాయణుడి దయవలన ఆ మహర్షికి దివ్యజ్ఞానం, దివ్యదృష్టీ సిద్ధించాయి. విష్ణుదేవుడి దివ్య వాక్కులవలన బ్రహ్మదేవుడు ముజ్జగాలకూ గురువనీ, ఆయన నిర్దేశించిన కర్తవ్యం వేద ప్రతిపాదితమే అనీ, విష్ణువూ అందులోనే చరిస్తాడనీ, వేదవిహితమైన యజ్ఞం కర్తవ్యమనీ, అందులో విష్ణువునకు భాగం కల్పించాలనీ, స్పష్టమయింది. బ్రహ్మదేవుడి ఆజ్ఞప్రకారం వైష్ణవ మనే యజ్ఞం దేవతలూ, మునులూ చేశారు. అందులో విష్ణువునకు భాగం కలిగించారు. విష్ణువు సంతోషించి వారిని కృతార్థులను చేశాడు. విష్ణువు హయగ్రీవరూపం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాల్చి బ్రహ్మను అనుగ్రహించి అతడిని యజ్ఞాల కన్నిటికీ సృష్టికర్తగా, గురువుగా, అధికారిగా చేశాడు. అతడి కర్తవ్యభారాన్ని హయగ్రీవుడు గ్రహించాడు. అజ, విశ్వరూప, అమర, అమరాధినాథ, ఆద్య, వేదవేద్య, ఆత్మవేద్య, ఈశాన, అవ్యయ, తపఃఫలాత్మ - అనే విశేషణాలు ఆయా లక్షణాలను బట్టి విష్ణుమూర్తికి ఏర్పడ్డాయి. అట్టి విష్ణుమూర్తిని సేవించటం అందరి కర్తవ్యం. వ్యాసప్రోక్తమైన ఈ వృత్తాంతం వింటే సర్వ శుభాలూ, సుఖాలూ కలుగుతాయి.

ప్రశ్న 108 : గూఢములైన విష్ణునామాల నిరుక్తులను తెలియపరచండి. (6.418)

ఉత్తరం : పూర్వం అర్జునుడు ఇదే ప్రశ్న అడుగగా కృష్ణుడు నిజనామాల నిరుక్తులను తెలియపరిచాడు. వాటిని వినుము- అని నారాయణాది నామాల వ్యుత్పత్తులను చెప్పాడు. (వివరాలకు చూడండి. 6.421 - 440). ధర్మరక్షణార్థం జన్మించిన విష్ణువుకు ధర్మరాజు అనే పేరు వచ్చింది. గంధమాదన పర్వతంమీద విష్ణువు తపస్సు చేస్తున్నప్పుడు దక్షప్రజాపతి యాగం చేస్తున్నాడు. ఆ యాగానికి శివుడు కోపించాడు. దానికి యజ్ఞం భయంతో హడలిపోయి నా వక్షః స్థలాన్ని ఆశ్రయించింది. ఆ కారణంవలన నా ఉరస్స్థల రోమాలు ముంజగడ్డివలె మారాయి. యజ్ఞాన్ని వెన్నంటి వస్తున్న శివుడు విష్ణువుతో కలియబడ్డాడు. శివుడు గొడ్డలిరూపంలోని బాణాన్ని ప్రయోగించాడు. విష్ణువు పరశురూపంలోని బాణాన్ని ఖండించాడు. అందువలన 'ఖండపరశువు' అనే పేరు విష్ణువుకు సిద్ధించింది.

శివకేశవుల మధ్య ఏర్పడిన ఆ యుద్ధంలో ఎవరు గెలిచారో చెప్పమని అర్జునుడు అడిగాడు. శ్రీకృష్ణ డిట్లా చెప్పాడు. శివకేశవుల యుద్ధం భయంకరమై లోకాలకు సంక్షోభం కలిగించింది. బ్రహ్మాది దేవతలు రణరంగానికి వచ్చి వారిరువురిని స్తుతించి, శివకేశవాభేదాన్ని స్మరించారు. వేదవేద్యమూ, అద్వంద్వమూ, నిర్గుణమూ, అమూర్తమూ అయిన మూలతత్త్వం ఒకటే అయినా, లోకం కొరకని రెండు రూపాలు ధరించి శివకేశవు లనబడుతున్నారు కాని, నిజానికి శివకేశవులకు భేదం లేదు - అని బ్రహ్మాదులు కీర్తించారు. శివకేశవులు తమ మైత్రి చిహ్నాలను ధరించారు. శ్రీవత్సం త్రిశూలానికి ప్రతీక. శివుడి కంఠంపై నీలిమ విష్ణువుచేతి ముద్ర. ఈశానుడూ, అభవుడూ, అమృతుడూ అయిన శివరూపాలుకూడా ఆరాధ్యాలే. హరిహరాత్మకుడైన కృష్ణుడు రక్షించాడు కాబట్టి కురుసంగ్రామంలో అర్జునుడికి విజయం లభించింది. కృష్ణుడుగా విష్ణువు నొగలెక్కి రక్షించాడు. అగ్రభాగంలో శూలపాణిగా రుద్రుడు సంచరిస్తూ అర్జునుడికంటె ముందే శత్రువులను సంహరించాడు.

ప్రశ్న 109 : నరనారాయణ నారద సల్లాప ప్రకారం వినిపించుము. (6. 463)

ఉత్తరం : నరనారాయణు లడుగగా నారదు డీ క్రింది విశేషాలు చెప్పాడు. వాటి సార మిది - శ్వేతద్వీపం అనేది శాంతి స్వరూపం. అందులో సూర్యచంద్రకాంతులు కానీ, వాయుప్రసారం కానీ ఉండవు. విష్ణువుకు ఇష్టులైన ఏకాగ్రచిత్తులే అందులో ఉంటారు. నారదుడు బదరికాశ్రమంలో ఏకాగ్రచిత్తుడై వేయి దివ్యసంవత్సరాలు తపస్సు చేసి హిమవత్పర్వతంలోని తన ఆశ్రమం చేరి మునులచేత సేవించబడుతూ ఉన్నాడు. జనమేజయా! నీవు కూడా విష్ణుమూర్తినే ఆశ్రయించుము. విష్ణుభక్తి నిన్ను ముల్లోకాలలోనూ మహోన్నతుడిని చేస్తుంది. అందరికీ శ్రీవిష్ణువే ఆత్మ. విష్ణువును ద్వేషిస్తే తమ ఆత్మలను తామే ద్వేషించుకొన్నట్లే ఔతుంది. వ్యాసుడినే సాక్షాత్తు నారాయణుడిగా తెలిసికొనుము.

ప్రశ్న 110 : విష్ణువు హయగ్రీవరూపం ఎందుకు ధరించాడు? (6.478)

ఉత్తరం : ప్రళయకాలంలో విష్ణువు యోగనిద్రలో మునిగి, జగత్తులను మరలా సృష్టించాలని సంకల్పించాడు. వెంటనే అహంకారం ఆవిర్భవించింది. దానికి బ్రహ్మ అనే పేరు ఏర్పడింది. బ్రహ్మ నాలుగు వేదాలను సృష్టించాడు. విష్ణువునుండి వెలువడిన త్రిగుణాలలో సత్త్వగుణంలో బ్రహ్మ ఉండిపోయాడు. రజస్తమోగుణాల నుండి మధు కైటభు లనే రాక్షసులు పుట్టారు. వారు నాలుగు వేదాలనూ అపహరించుకొనిపోయి కట్టగా కట్టి పాతాళంలో

పారవేశారు. వేద రక్షణకై బ్రహ్మదేవుడు విష్ణువును స్తుతించాడు. ఆయన హయగ్రీవరూపంతో వేదాన్వేషణం చేసి పాతాళంనుండి వేదాలను ఉద్ధరించి బ్రహ్మకు అందించాడు. మధుకైటభులు విష్ణువుపై దండెత్తారు. ఆతడు ఆ వేదకంటకులను సంహరించాడు. వివిధావతారాలను ధరించిన విష్ణుమూర్తి తత్త్వం బహువిచిత్రంగా ఉంటుంది. గుణవంతుడూ, గుణరహితుడూ, గుణస్రష్ట, గుణహర్తా, గుణనిబద్ధుడూ, గుణవిముక్తుడూ - అన్నీ ఆయనే. వేదాలూ, యజ్ఞాలూ, సకల పుణ్యకార్యాలూ, పంచభూతాలూ - అన్నీ నారాయణ స్వరూపాలే.

ప్రశ్న 111 : ఐకాంతికత్వం అంటే ఏమిటి? (6.493)

ఉత్తరం : ఐకాంతికత్వం సాంఖ్యయోగశాస్త్రాల సారం. శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించిన గీతలోని సారం తెలియదగింది. ఏకాంతిక ధర్మానికి అహింసయే మూలం. ఆ ధర్మంలోనే హరి సంప్రీతుడౌతాడు. హరి అన్నా క్షేత్రజ్ఞుడన్నా ఒకడే. విష్ణువు చతుర్వ్యూహాలలో దర్శనమిస్తాడు. విష్ణువు ప్రథమ వ్యూహం వాసుదేవావతారం. ద్వితీయవ్యూహం సంకర్షణుడు. తృతీయవ్యూహం ప్రద్యుమ్నుడు. చతుర్థవ్యూహం అనిరుద్ధుడు. విష్ణువు ఇంద్రియాలకు గోచరం కాడు. అద్వితీయమైన భక్తివలననే అతడు సాధ్యుడు. భక్తి కుదరాలంటే తపస్సూ, ఇంద్రియ నిగ్రహం ఉండాలి. శాంతిపట్ల ప్రగాఢమైన నిష్ఠకల వ్యక్తికి ఏకాంతిక ధర్మం కరతలామలకం. అది చింతలన్నింటిని తొలగిస్తుంది.

ప్రశ్న 112 : ఉత్తమ వ్రతమైన ఐకాంతిక ధర్మాన్ని వదలి ప్రజలు ఏవేవో ధర్మాలను ఎందుకు పాటిస్తున్నారు? (6.504)

ఉత్తరం : లోక ప్రవృత్తి త్రిగుణాత్మకం. సాత్త్విక గుణసంపన్నులే ఐకాంతిక వ్రతాన్ని పాటిస్తారు. వారిది నివృత్తి ధర్మం. మిగిలిన వారిది ప్రవృత్తి ధర్మం. ఐకాంతిక జనులు ఎల్లప్పుడూ విష్ణుహృదయంలోనే ఉంటారు. వారికీ హరికీ భేదమే లేదు. గురువైన వ్యాసమహర్షి చెప్పగా మేము విన్నాము. నీవు కూడా ఈ పవిత్ర ధర్మాన్ని ఆచరించి పవిత్రుడవు కమ్ము.

ప్రశ్న 113 : సాంఖ్యమనీ, యోగశాస్త్రమనీ, పాశుపతమనీ - ఇట్లా జ్ఞాన మార్గాలు రకరకాలుగా ఉన్నాయి. వీటి నిష్ఠ లెటువంటివి? వీటి ప్రవర్తకులు ఎవరు? (6.512, 513)

ఉత్తరం : ముందుగా వ్యాసమహర్షికి నమస్కరిస్తున్నాను. ఆయనే లోకాలకన్నిటికీ ఉపదేశకుడు. వేదాలకు నిధి. భారతాధ్యయన కారకుడు. వేదశాస్త్రాలన్నింటికీ పరమగమ్యం, ఆశ్రయం శ్రీమన్నారాయణుడే. ఆయన జ్ఞాన స్వరూపుడు. ఆయనను అందుకొనటానికి శాస్త్రనిష్ఠ అవసరం. వేదాల ఉపదేశకుడు అపాంతరతముడనే పేరుకల వేదవ్యాసుడు; సాంఖ్యానికి కపిలుడు; యోగానికి హిరణ్యగర్భుడు; పాశుపతానికి శివుడు; పాంచరాత్రానికి విష్ణువూ ప్రవర్తకులు. పాంచరాత్రం వైష్ణవం అనబడుతుంది.

ప్రశ్న 114 : వేదవ్యాసుడు పరాశరపుత్రు డని ప్రసిద్ధి. ఆయనకు నారాయణ పుత్రు డనే ప్రఖ్యాతి ఎట్లా ఏర్పడింది? (6.517)

ఉత్తరం : ఆదికాలంలో శ్రీమన్నారాయణుడు ప్రజాసృష్టిచేయటం కొరకు నాభికమలంనుండి బ్రహ్మను సృష్టించాడు. ఆయన సకల భూతాలనూ సృష్టించాడు. బ్రహ్మముఖంనుండి వేదాలు ప్రసరించాయి. ఆ వేదాలకు మేలు చేయటం కొరకు అపాంతరతముడనే పేరుగల ఒక మహాజ్ఞానిని పుత్రుడిగా పొందాడు. అతడిని ఏకాగ్రతతో వేదాలను అధ్యయనం చేయు' మనీ, 'వాటిని అందంగా విభజించు'మనీ ఆజ్ఞాపించాడు. అపాంతరతము డాపని చేశాడు. దానికి విష్ణువు సంతోషించి 'నీవు నాకు పుత్రుడవై మన్వంతరాలన్నింటిలోనూ అత్యధికంగా ప్రకాశించుము. నీకు మరికొన్ని జన్మలు లభిస్తాయి. నా కథలూ, ముల్లోకాలలో ఆచరించవలసిన ఆశలూ, అఖిల ధర్మాలూ మనస్సులో దర్శించి త్రికాలజ్ఞుడవై మహర్షులలోకెల్లా ఉత్తముడుగా విరాజిల్లుము. భవిష్యత్కాలంలో నీవు పరాశరుడికి పుత్రుడుగా పుట్టి ప్రకాశిస్తావు. నీ వలన జన్మించిన వారే కురుసామ్రాజ్యాన్ని పరిపాలిస్తారు. ఆ రాజులు పరస్పర రోషాలతో యుద్ధానికి దిగుతారు. వంశ వినాశనం ఔతుంది. కాలదోషంవలన వేదాలు సంకీర్ణమౌతాయి. వాటిని నీ బుద్ధి వైభవంతో మరల నాలుగుగా విభజిస్తావు. దేవతలకూ, ఋషులకూ ఆనందం కలిగిస్తావు.ధర్మసందేహాలన్నీ నీ వాక్కులతో తీరుతాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిన్ను అఖిల సంశయవిచ్ఛేదకు డనీ, పుణ్యాత్ము డనీ, లోకహితవాణి అనీ ప్రజలు కీర్తిస్తారు. నీవు విరాగివి కాలేవు. కాని, ఒక విరాగి నీకు కుమారుడుగా జన్మిస్తాడు. శాస్త్రాలనూ, ఆగమాలనూ, అనుసరించే బుద్ధితోపాటు నీ అంతరంగంలో సాంఖ్యయోగాలు కూడా వికసిస్తాయి' - అని చెప్పి నారాయణుడు అంతర్ధానుడైనాడు. అట్లా పరాశరపుత్రుడు ఆదినుండి నారాయణపుత్రుడే.

*   *   *

ధర్మరాజు ప్రశ్న 115 : తాతా! రాజనీతి మొదలుకొని అన్ని ధర్మాలూ చెప్పావు. వీటిలో ఏది ఉత్తమ ధర్మమో చెప్పుము. (6.543)

భీష్ముడు : ధర్మశాస్త్రాలలో చెప్పే తంత్రాలన్నీ పనికివచ్చేవే. ఒక్కటికూడా పనికిరానిది లేదు. ఎవరికి నచ్చిన ధర్మశాస్త్రాన్ని వారు అనుసరిస్తారు. అదే వారి కోరికలు పండటానికి దోహదం చేస్తుంది. తమకు తగిన ధర్మాలను అనుసరించేవారిని లోకంలో ఎంతమందిని మనం చూడటం లేదు? త్రిలోక సంచారి అయిన నారదుడిని ఒకసారి ఇంద్రుడు 'నారదా! నీవు తిరిగిన చోటులలో ఏదైనా అద్భుతం చూచావా?' అని అడుగగా మహాపద్మనగరంలో వసించే భృగుడనే విప్రుడి కథ చెప్పాడు. (6.546) ఈ పుణ్యోపాఖ్యాన సారంవలన తెలియదగిన అంశాలు : (1) బ్రహ్మచర్యం ద్వారా కొందరూ, గృహస్థధర్మాచరణం ద్వారా కొందరూ, తపస్సుతో కొందరూ, నిష్కర్మత్వంతో కొందరూ, యజ్ఞాలద్వారా కొందరూ, దానధర్మాల ద్వారా కొందరూ ఆత్మదర్శనం పొందుతూ ఉంటారు. తల్లిదండ్రులను సేవించి కొందరూ, భక్తితో కొందరూ, సచ్ఛీలంతో కొందరూ, శాంతస్వభావంతో కొందరూ, ఇంద్రియ నిగ్రహంతో కొందరూ, సత్యవాక్య నియమంతో కొందరూ, అహింసావ్రతంతో కొందరూ - ఇట్లా ప్రజలు వేరే వేరే మార్గాలలో ముక్తి పదం పొందుతారు. (2) గురువుపట్ల భక్తి శిష్యులకు వ్రతం. వేదతత్పరత బ్రాహ్మణులకు వ్రతం. లోకరక్షణ రాజులకు వ్రతం. న్యాయంగా ధనం సంపాదించటం వైశ్యులకు వ్రతం. పై మూడు వర్గాలవారినీ సేవించటం శూద్రులకు వ్రతం. రాజాజ్ఞను శిరసావహించటం భటులకు వ్రతం. సర్వాశ్రమాలవారికీ ఉపకారం అందించే గృహస్థాశ్రమం మీద ప్రేమ అందరికీ వ్రతం. వైరాగ్యబుద్ధి యోగికి వ్రతం. పాతివ్రత్యం భార్యకు వ్రతం. (3) మౌనంవలన జ్ఞానమూ, దానంవలన అభ్యుదయమూ, ఆశలు తీర్చినందువలన నరకాలు తప్పిపోయిన సుఖమూ లభిస్తాయని పెద్దలు చెప్పుతారు. (4)క్రోధం కారణంగానే కార్తవీర్యార్జునుడు పరశురాముడి చేతిలో మరణించాడు. క్రోధం కారణంగానే దశకంఠుడు దశరథరాముడి చేతిలో సమసిపోయాడు. ఇంకా చాలా మంది కోపంవలన దెబ్బతిన్నవారు ఉన్నారు. కాబట్టి కోపాన్ని వదలుకొనటం ఎవరికైనా ఎప్పటికైనా మేలు. (5)అద్భుతాల కన్నింటికీ నిలయం సూర్యుడే. అతడినుండే సకల ప్రాణికోటీ జన్మిస్తున్నదంటే ఇంతకంటె ఆశ్చర్యం ఏమి ఉంటుంది? వాలఖిల్యాది ఋషులూ, సిద్ధులూ, దేవతలూ - అందరూ సూర్యుడి కిరణాలలోనే - చెట్టు కొమ్మమీద పిట్ట లున్నట్లు - నివసిస్తూ ఉంటారు. ఇది అద్భుతం కాదా! సూర్యగోళం నుండి వెలువడే వాయువు గోళం మధ్యలో ఉండే దట్టమైన కాంతితో కలిసి వర్షం కురుస్తుంది. ప్రపంచంలో ఎక్కడయినా ఇట్లాంటి అద్భుతాలు ఉన్నాయా? సూర్యుడే వర్షాలు కురిపిస్తాడు. మళ్ళీ అతడే తన కిరణాలతో నీటినంతటినీ వెనుకకు లాగికొంటాడు. సూర్యుడివలననే విత్తనాలు భూమిలో మొలకెత్తుతున్నాయి. పరాత్పరుడైన శ్రీమన్నారాయణుడు సూర్యమండలంలోనే ప్రకాశిస్తుంటాడు. ఇంతకంటె ఆశ్చర్య మేముంది? (6) ఉంఛవృత్తి ఉత్తమోత్తమ వ్రతం. ఉంఛవృత్తితో జీవించేవాడూ, నిశ్చలమైన మనస్సు కలవాడూ, నిష్ఠతోకూడిన నియమాలు కలవాడూ, కందమూలఫలోదక మారుతాలు మాత్రమే ఆహారంగా స్వీకరించేవాడూ, నిరాకాంక్షుడూ, సర్వభూతహితం కోరేవాడూ, మునీశ్వరుడూ అయిన మహానుభావుడు పరమాత్మతో అద్వైత సిద్ధి పొందుతాడు. ఇది అత్యద్భుతం. సర్వసమతా దృష్టి తత్త్వదర్శనం. (7) సమస్త భూతాలపట్ల సమదృష్టి, ఆదృష్టితో కూడిన నిష్కామత్వం ధర్మాలలో కెల్ల ఉత్తమ ధర్మం. నిరతిశయానందానికి అది నిలయం.

జి.వి. సుబ్రహ్మణ్యం

ప్రధాన సంపాదకుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము

రెండవ భాగము

విషయసూచిక

చతుర్థాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
భీష్ముఁడు ధర్మజునకు సర్వోత్తమం బగు ధర్మంబు సెప్పుట	12 - 168 - 2	505
మేధావి యను బ్రాహ్మణకుమారుఁడు దన తండ్రితోఁ జేసిన సంవాదము	12 - 169 - 2	513
భీష్ముఁడు ధర్మజునకు మంకి యను బ్రాహ్మణుని చరిత్రంబు సెప్పుట	12 - 171 - 4	521
అజగరచరితవ్రతము	12 - 172 - 2, 3	526
భీష్ముఁడు ధర్మరాజునకుఁ బృథివ్యాది భూతోత్పత్తి క్రమం బెఱింగించుట	12 - 175 - 5	536
భృగుమహాముని భరద్వాజునకుం జెప్పిన వర్ణాశ్రమాచారక్రమము	12 - 181 - 1	543
భీష్ముఁడు ధర్మజునకు నాచారవిధి యెఱింగించుట	12 - 186 - 2	550
ధర్మజునకు భీష్ముఁడు యోగప్రకారంబు సెప్పుట	12 - 188 - 1	555
యమకాలమృత్యుభూసురేక్ష్వాకుల సంవాదము	12 - 189 - 6	556
కౌశికునకు నిక్ష్వాకుమహారాజునకు నయిన సంవాదము	12 - 192 - 2, 3	561
కౌశికేక్ష్వాకులు బ్రహ్మపదప్రాప్తు లగుట	12 - 193 - 18	572
మను బృహస్పతి సంవాదము	12 - 194 - 2	575
బృహస్పతి మనువున కుపదేశించిన మాయాప్రకారము	12 - 198 - 1, 2	582
భీష్ముఁడు ధర్మజునకు విష్ణుమంత్ర ప్రభావంబు తెఱం గెఱింగించుట	12 - 200 - 3	590
భీష్ముండు ధర్మజున కధ్యాత్మ విద్యాప్రకారం బెఱింగించుట	12 - 203 - 1, 2	611
భీష్ముఁడు ధర్మజునకుఁ గాలచక్రప్రభావం బెఱింగించుట	12 - 204 - 7, 8	617
భీష్ముఁడు ధర్మజునకు స్వప్నాద్యవస్థల తెఱం గెఱింగించుట	12 - 209 - 1, 2	631

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పంచశిఖుం డను విప్రుండు జనకునకుఁ దత్త్వోపదేశంబు సేయుట	12 - 211 - 6, 8	639
ఇంద్ర ప్రహ్లాద సంవాద ప్రకారము	12 - 212 - 3	647
ఇంద్ర బలిచక్రవర్తి సంవాద ప్రకారము	12 - 216 - 2	654
ఇంద్ర నముచి సంవాద ప్రకారము	12 - 219 - 1, 2	662
ఇంద్ర బలి సంవాద ప్రకారము	12 - 220 - 6	665

పంచమాశ్వాసము

శ్రీ శక్ర సంవాద ప్రకారము	12 - 221 - 3	679
దేవల జైగీషవ్య సంవాద ప్రకారము	12 - 222 - 34	685
ఉగ్రసేన శ్రీకృష్ణ సంవాద ప్రకారము	12 - 223 - 23	688
వ్యాసుఁడు శుకునకుఁ జెప్పిన కాలావయవ నిరూపణము	12 - 224 - 6	690
చతుర్యుగ సంవత్సర పరిమితి ప్రకారము	12 - 224 - 18	692
దానగుణంబు సర్వవర్ణ సామాన్యంబుగా నిరూపించుట	12 - 226 - 14, 15	703
వ్యాసుఁడు శుకున కుపదేశించిన పరబ్రహ్మ ప్రాప్తిసాధన ప్రకారము	12 - 231 - 3	710
బ్రహ్మచర్యంబు బ్రహ్మవిద్యాప్రాప్తికి ముఖ్యకారణంబని చెప్పుట	12 - 234 - 12	718
వ్యాసుఁడు శుకున కుపదేశించిన యంతర్యాగ ప్రకారము	12 - 237 - 27, 28	724
ఇంద్రియనిగ్రహం బుత్తమ ధర్మంబుగ నిరూపించుట	12 - 242 - 1, 2	734
భీష్ముఁడు ధర్మరాజునకు మృత్యుదేవత తెఱం గెఱింగించుట	12 - 148 - 7	742
జాజలి తులాధారుల సంవాద ప్రకారము	12 - 252 - 1	750
తులాధారుఁడు జాజలికిం జెప్పిన బ్రహ్మగీతలు	12 - 256 - 7	758
చిరకారి యను మునికుమారుని చరిత్ర	12 - 258 - 2	762
కపిల గో సంవాద ప్రకారము	12 - 260 - 5	773
కపిలుఁడు స్యూమరశ్మికి వేదంబులు ముఖ్యప్రమాణంబులుగాఁ జెప్పుట	12 - 262 - 14, 1	782
కుండధారుం డను దేవానుచరుని వృత్తాంతము	12 - 263 - 2	787
నారద ప్రవర్తితం బగు నితిహాసము	12 - 264 - 2	792
భీష్ముఁడు ధర్మజునకు ముక్తిమార్గము దెల్పుట	12 - 268 - 2	793

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జనకరాజ మాండవ్య మహామునుల సంవాద ప్రకారము	12 - 268 - 3	797
పితాపుత్ర సంవాదము	--------------	799
హారీతుండు విద్వజ్జనుల కుపదేశించిన తత్త్వప్రకారము	12 - 269 - 2	804
వృత్రగీత	12 - 270 - 13	806
ఇంద్రవృత్రాసురుల యుద్ధప్రకారము	12 - 272 - 7	813
దక్షముఖ ధ్వంసంబు నప్పుడు శివునివలన జ్వరం బుద్భవించిన ప్రకారము	12 - 274 - 4	819
శాస్త్రతత్త్వం బెఱుంగని వాఁడు సేయవలసిన విధము	12 - 276 - 3	822
అరిష్టనేమి యను ముని సగరున కుపదేశించిన ధర్మప్రకారము	12 - 277 - 2	826
శుక్రనామంబు భార్గవునకుం గలిగిన విధము	12 - 278 - 4	829
జనకునకుఁ బరాశరముని యుపదేశించిన ధర్మప్రకారము	12 - 279 - 3	832
జనకునకుఁ బరాశరముని వివరించిన హింసాహింసల ప్రకారము	12 - 280 - 12	843
హంసగీత	12 - 288 - 1, 2	850
భీష్ముఁడు ధర్మజునకు యోగతంత్రప్రకారము చెప్పుట	12 - 289 - 2	859
భీష్ముఁడు ధర్మజునకు సాంఖ్యస్వరూప నిరూపణంబు సేయుట	12 - 290 - 3	867
ఆత్మ పరమపదంబుఁ బ్రాపించెడు ప్రకారము	12 - 290 - 80, 81	873

షష్ఠాశ్వాసము

భీష్ముని ధర్మజుండు ప్రశంసించి యక్షరక్షరంబుల నడుగుట	12 - 291 - 1	883
వసిష్ఠ జనకరాజ సంవాద ప్రకారము	12 - 291 - 7	886
వసిష్ఠుఁడు జనకున కక్షరక్షర తత్త్వంబుల తెఱం గెఱింగించుట	12 - 291 - 13	893
విద్యావిద్యల ప్రకార నిరూపణము	12 - 295 - 1	899
యాజ్ఞవల్క్య జనకరాజ సంవాద ప్రకారము	12 - 298 - 3	910
అధ్యాత్మాధిభూతాధిదైవత ప్రకారము	12 - 301 - 1	914
యాజ్ఞవల్క్యుఁడు జనకునితో మరణసూచకంబులఁ జెప్పుట	12 - 305 - 7	925
విశ్వావసునకు యాజ్ఞవల్క్యుఁ డుపదేశించిన తత్త్వ ప్రకారము	12 - 306 - 30	930
భీష్ముఁడు ధర్మరాజునకు జనక సులభా సంవాదంబు సెప్పుట	12 - 308 - 3	941

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జనకుని ప్రశ్నంబులకు సులభ ప్రత్యుత్తరంబు లిచ్చుట	12 - 308 - 95, 96	948
వేదవ్యాసుఁడు శుకున కుపదేశించిన వైరాగ్య ప్రకారము	12 - 309 - 2	958
భీష్ముఁడు ధర్మరాజునకు శుకుని జన్మప్రకారంబు సెప్పుట	12 - 310 - 1	966
జనకుఁడు శుకున కుపదేశించిన మోక్షధర్మ ప్రకారము	12 - 313 - 9	976
శుకుఁడు హిమవంతంబున నున్న వ్యాసునియొద్దకు వచ్చుట	12 - 314 - 2	982
నారదుఁడు శుకున కుపదేశించిన తత్త్వప్రకారము	12 - 316 - 5	990
వ్యాసుఁడు వెనుకొన శుకుఁడు యోగమార్గంబున నదృశ్యుం డగుట	12 - 320 - 2, 3	997
భీష్ముఁడు ధర్మజునకు నారదనారాయణ సంవాదంబు సెప్పుట	12 - 321 - 7	1003
ఏకతద్వితత్రితులు బృహస్పతికి విష్ణుదేవుమహిమ సెప్పుట	12 - 323 - 19	1010
శ్వేతద్వీపవాసి యగు నారాయణుండు నారదున కుపదేశించిన తత్త్వము	12 - 326 - 10, 11	1016
విష్ణుఁ డదృశ్యరూపంబున బ్రహ్మాదిదేవతల కుపదేశించిన హితప్రకారము	12 - 327 - 47,48,49	1026
భగవన్నామ నిర్వచన ప్రకారము	12 - 318 - 3	1032
శివకేశవుల పరస్పర కోప ప్రసాదముల విధము	12 - 309 - 2	1041
నరనారాయణ నారద సల్లాప ప్రకారము	12 - 331 - 36	1045
హయగ్రీవదేవ మాహాత్మ్యాభివర్ణనము	12 - 335 - 9, 10	1050
వైశంపాయనుఁడు జనమేజయున కేకాంతికధర్మ మెఱింగించుట	12 - 336 - 8	1056
వేదవ్యాసునకు నారాయణనందనత్వంబు గలిగిన ప్రకారము	12 - 336 - 24	1063
ఇంద్రునకు నారదుడు సెప్పిన భృగునామక విప్రుని చరిత్రము	12 - 340 - 4, 5	1071
భృగుం డను విప్రుండు పద్మం డను సర్పరాజుం గనవచ్చుట	12 - 343 - 2	1077
పద్ముఁ డను సర్పరాజు భృగు డను విప్రుం గానవచ్చుట	12 - 349 - 2, 3	1087
ఉంఛవృత్తిమహిమ	12 - 350 - 8	1091

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - చతుర్థాశ్వాసము

శ్రీశ్రిత వక్షస్థల! గౌ । రీశ్రిత వామాంగ! సుభగ రేఖా సంప
త్త్యశ్రాన్త తనూలలిత! స । మాశ్రిత జన నిత్య ఫలిత! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: హరిహరనాథా!= హరిహరనాథుడా!; శ్రీ= లక్ష్మిచేత; శ్రిత= ఆశ్రయించబడిన; వక్షస్థల!= రొమ్ము భాగం కలవాడా!; గౌరీ= పార్వతిచేత; శ్రిత= ఆశ్రయించబడిన; వామ+అంగ!= ఎడమ శరీరం కలవాడా!; సుభగ= ఇంపైన; రేఖా= (సౌందర్య) రేఖల; సంపత్తి= సంపదచేత; అశ్రాన్త= వాడిపోని; తనూ= శరీరముచే; లలిత= సుకుమారమైనవాడా!; సమ్+ఆశ్రిత జన= బాగుగా ఆశ్రయించిన (శరణుజొచ్చిన) జనులకు; నిత్య= ఎల్లప్పుడు; ఫలిత!= ఫలితమైన (ప్రయోజనకరమైన)వాడా!; హరిహరనాథా!= హరిహరనాథుడా!

తాత్పర్యం: వక్షస్స్థలాన లక్ష్మిని, వామభాగాన గౌరిని ధరించి ఇంపైన రేఖాసంపదలతో శరీర సౌకుమార్యం వాడని వాడా! ఆశ్రితజనులకు నిత్యమూ ఫలితాలు అందించేవాడా! హరిహరనాథ దేవా!

విశేషం: కావ్యాలను అంకితం చేసినవారు, అంటే కవులు, తమ కావ్యస్వీకర్త లను అంకితం గ్రహించినవారిని సంబోధించిన తరువాతే ఆశ్వాస ప్రారంభంగాని, ఆశ్వాస సమాప్తిగాని చేయాలి. కావ్యమంతటిని ఆ స్వీకర్తకు వినిపిస్తున్నట్లుగా పేరుపెట్టి పిలిచి ఆ తరువాత కథా ప్రారంభం చేస్తారు కవులు.

భీష్ముఁడు ధర్మజునకు సర్వోత్తమంబగు ధర్మంబు సెప్పుట (సం. 12-168-2)

వ. **దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నట్లు బహు ప్రకారంబుల శాంతనవుండు వివరింప రాజధర్మంబులు విని ధర్మనందనుండు దమ్ములుం దానును బ్రియం బందె; నమ్మందాకినీ నందనుం డతనితో 'నా యెఱింగిన తెఱంగునం బ్రజ్ఞాకరంబులగు వాక్యప్రకరంబు లుపన్యసించితి; నింకనేమి విన నిచ్ఛ సేసెద?' వనిన నా దేవవ్రతునకు నన్నరదేవోత్తముండు వినయం బెసఁగ వినతుండై.** 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయనుడు అనే పేరుగల వ్యాస శిష్యుడయిన ఋషి; జనమేజయునకున్= జనమేజయుడు అనే మహారాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అట్లు= ఆ విధంగా; బహు ప్రకారంబులన్= అనేక విధాలుగా; శాంతనవుండు= శంతనుడి తనయుడు - భీష్ముడు; వివరింపన్= వివరంగా చెప్పగా; రాజధర్మంబులు= రాజుయొక్క విధులు; విని= ఆలకించి; ధర్మనందనుండు= ధర్ముడి (యముడి) తనయుడు ధర్మరాజు; తమ్ములున్+తానును= తమ్ములూ, తానూ; ప్రియంబు+అందెన్= ప్రీతిని పొందాడు; ఆ+మందాకినీ నందనుండు= ఆ గంగానది తనయుడు - భీష్ముడు; అతనితోన్= ఆ ధర్మరాజుతో; నా+ఎఱింగిన తెఱంగునన్= నేను తెలిసికొన్న విధంగా; ప్రజ్ఞాకరంబులు+అగు= బుద్ధిని కలిగించెడి; వాక్యప్రకరంబులు= మాటల సమూహాలను; ఉపన్యసించితిన్= తెలియ బలికాను; ఇంకన్= ఇంకా; ఏమి వినన్+ఇచ్ఛ+చేసెదవు?= ఏమి వినటానికి కోరుచున్నావు?; అనినన్= అనగా; ఆ దేవవ్రతునకున్= ఆ దేవవ్రతుడు అనే పేరుగల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీష్మునికి; ఆ+నరదేవ+ఉత్తముండు= ఆ రాజులలో శ్రేష్ఠుడు; వినయంబు+ఎసఁగన్= అణకువ కనుపించగా; వినతుండు+ఐ= నమస్కరించినవాడై.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! పూర్వకథ అనంతరం మళ్ళీ ఆ వైశంపాయన ఋషి తన ఎదుటగల జనమేజయ మహారాజుతో ఇట్లా అన్నాడు. ఆ విధంగా అనేక విధాలయిన రాజధర్మాలను భీష్మ పితామహుడు వివరించి చెప్పగా, ధర్మరాజూ, అతని తమ్ములూ విని సంతోషించారు. తరువాత మళ్ళీ ఆ తాతగారు మనుమడితో 'నాకు తెలిసినంతవరకు ప్రజ్ఞను పెంచే మాటలు అనేకం నీకు వినిపించాను. ఇంకా ఏమి వినటానికి ఉత్సహిస్తున్నావు?' అని అన్నాడు. దానికి బదులుగా ఆ ధర్మరాజు అణకువతో నమస్కరించి తిరిగి తన కోరికను ఇట్లా పేర్కొంటున్నాడు.

క. **'రాజోచిత ధర్మంబుల । యోజ విశదభంగిఁ జెప్పి తుజ్జ్వల విసర**
తేజోధన! నాకు సకల । భూజన పరమ హిత ధర్మముం దెలుపు దయన్. 3

ప్రతిపదార్థం: ఉత్+జ్వల విసరత్+తేజస్+ధన!= బాగుగా ప్రకాశించే, వ్యాపించే, కాంతియే ధనంగా కలవాడా!; రాజ+ఉచిత ధర్మంబుల(న్)= రాజులకు తగిన ధర్మాలను; ఓజన్= క్రమంగా; విశదభంగిన్= స్పష్టమైన రీతిలో; చెప్పితి(వి)= పలికితివి; నాకున్= రాజునైన నాకు; సకల భూజన పరమహిత ధర్మమున్= ఎల్ల పుడమి జనులకు మిక్కిలి మేలు అయిన ధర్మమును; దయన్= దయతో; తెలుపు(ము)= తెలియజెప్పుము.

తాత్పర్యం: ఉజ్జ్వలమై వ్యాపించే తేజస్సుతో వెలుగుతున్న ఓ పితామహా! ఇంతవరకు రాజునైన నాకు రాజోచితధర్మాలు స్పష్టంగా క్రమంగా వినిపించావు. ఇపుడు నేను ఈ సకల భూజనులకూ గొప్ప మేలు కలిగించగల ధర్మమేదో, దానిని తెలిసికొనాలి అనుకొంటున్నాను. దయతో దానిని తెలియజెప్పుము.

క. **ఉత్తమ మెయ్యది?' నావుడు । నత్తటినీ నందనుఁడు సమాదర సమ్య**
క్చిత్తుఁ డగుచు నక్కురు భూ । పోత్తమునకు నిట్టు లనియె నుర్వీనాథా! 4

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= ఓ రాజా!; ఉత్తమము+ఏ+అది= శ్రేష్ఠము ఏది?; నావుడున్= అనిన అనంతరం; ఆ+తటినీ నందనుఁడు= ఆ నదీతనయుడు భీష్ముడు; సమ్+ఆదర సమ్యక్+చిత్తుఁడు+అగుచున్= మంచి ఆదరంతో తిన్ననైన మనస్సు కలవాడై; ఆ+కురుభూప+ఉత్తమునకున్= ఆ కురురాజులలో శ్రేష్ఠునకు - ధర్మరాజునకు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఏది సర్వోత్తమ ధర్మం?' అనే ధర్మజుడి ప్రశ్న విన్న వెంటనే ఆ గంగాతనయుడైన భీష్ముడు మంచి ఆదరంతో తన మనస్సును తేటపరచుకొని ఆ కురురాజశ్రేష్ఠుడితో ఇట్లా అన్నాడు. ఓ రాజా!

తే. **'విను మనేక విధంబుల విస్తరిల్లు । ధర్మములయం దొకండును దలఁప నిష్ఫ**
లంబు లే; దాత్మ మోక్షావలంబి యైన । ధర్మ ముత్తమ మండ్రు తత్త్వజ్ఞు లధిప! 5

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; వినుము= ఆలకింపుము; అనేకవిధంబులన్= అనేక పద్ధతులతో; విస్తరిల్లు= వ్యాపించే; ధర్మములలఅందున్= విధి నిషేధ రూపమైన ఆచార వ్యవహారాలలో; ఒకండును= ఒక్కటికూడా; తలఁపన్= ఆలోచించగా; నిష్ఫలంబు లేదు= ఫలితంలేనిది లేదు; తత్త్వజ్ఞులు= ధర్మముల స్వరూప స్వభావాలు తెలిసినవారు; ఆత్మమోక్ష+అవలంబి+ఐన ధర్మము= తన మోక్షంకొరకు అవలంబించిన ధర్మం; ఉత్తమము+అండ్రు= శ్రేష్ఠం అంటారు.

తాత్పర్యం: 'రాజా! వినుము. ధర్మం అనేక విధాలుగా విస్తరిల్లి ఉన్నది. దానిలో ఎంతగా వైవిధ్యమున్నా, మరెంతగా విస్తృతి ఉన్నా, మొత్తంమీద సర్వమూ ఆచరణయోగ్యమే. దానిలో ఒక్కటి కూడా ఫలితం సాధించలేనిది లేదు. కాని, ధర్మతత్త్వం తెలిసినవారు మాత్రం తమకు ముక్తిని ప్రసాదించగలదే శ్రేష్ఠధర్మమని పలుకుతారు.

విశేషం: ధర్మాలు సమయ సందర్భాలనుబట్టి దేశకాలాలనుబట్టి అనేక విధాలుగా ఉంటూ ఉంటాయి. కొన్ని సందర్భాలలో వాటిలో భేదాలు, మరికొన్ని సందర్భాలలో సాదృశ్యాలూ కనిపించవచ్చును. ఏది ఎట్లా ఉన్నా ధర్మమన్న ప్రతిదీ ఆచరణకు ఉద్దిష్టమైనదే. ఆచరిస్తే తప్పక ఫలితాన్ని అందించేదే. నిష్ప్రయోజనమైన ధర్మం ఉండదు. అయితే ఆ ప్రయోజనాలలో హెచ్చు తగ్గులు ఉండవచ్చును. ఆ దృష్టితో చూచినప్పుడు అన్ని ప్రయోజనాలకు చివరిదైన మోక్షమనే దాన్ని ఒసగగల ధర్మమే శ్రేష్ఠం.

క. ప్రియములు నప్రియములును హృ । దయమునఁ బొరయమియ మోక్షదంబగు ధర్మం
బయమహితా! తద్బోధ వి । షయ మగు నితిహాసముం బ్రసన్నాకృతిగన్. 6

ప్రతిపదార్థం: అయమహితా!= శుభములచే మహనీయుడా!; ప్రియములున్= ఇష్టములును; అప్రియములును= అనిష్టములును; హృదయమునన్= మనస్సునందు; పొరయమి+అ= కలుగకుండుటయే; మోక్షదంబు+అగు= మోక్షమును ఇచ్చేది అయిన; ధర్మంబు= ధర్మం - విధినిషేధరూపమైన ఆచారం; తద్+బోధ విషయము+అగున్= ఆ జ్ఞానము గోచరించెడిదగు; ఇతిహాసమున్= పూర్వచరిత్రను; ప్రసన్న+ఆకృతిగన్= స్పష్టమైన రూపం కలిగేటట్లుగా.

తాత్పర్యం: ఓ రాజా! ఇష్టానిష్టాలను హృదయంలో కలుగకుండా చూడగలగటమే మోక్షప్రదమయిన ధర్మం. శుభకరమైన కార్యాల యెడ ప్రీతిగల ఓ ధర్మనందనా! ప్రియాప్రియాలు మనస్సులో కలుగకుండా జీవించటం ఎట్లా సాధ్యమో, ఎప్పుడు అటువంటి మానసిక స్థైర్యం మానవుడికి సిద్ధిస్తుందో తెలియజేసే పూర్వకథ ఒకటి స్పష్టంగా వినిపిస్తాను.

విశేషం: చెప్పటానికి సులభంగా ఉన్నదిగాని, ఈ ధర్మం ఆచరణలో అత్యధిక జనులకు అసాధ్యం. శుభాశుభాలు, ప్రియాప్రియాలు, సుఖదుఃఖాలు వంటి ద్వంద్వాలు సృష్టిలో జీవరాశులన్నిటికి వలె మానవునకూ సంక్రమిస్తాయి. అయితే జ్ఞానబలంగల విశిష్ట మానవుడు మాత్రం ఈ ద్వంద్వాలకు అతీతంగా తన మనస్సును నిలుపగలుగుతాడు.

వ. చెప్పెద నాకర్ణింపుము. సేనజితుం డనురాజు పుత్త్రశోకార్తుం డయి యున్నయెడఁ దదాప్తుండగు విప్రుం డతని కిట్లనియె. 7

ప్రతిపదార్థం: చెప్పెదన్= పలికెదను; ఆకర్ణింపుము= వినుము; సేనజితుండు+అనురాజు= సేనజితుడు అనే పేరుగల రాజు; పుత్త్రశోక+ఆర్తుండు+అయి= కొడుకు ఎడబాటువలన దుఃఖంతో బాధనొందినవాడై; ఉన్న+ఎడన్= ఉన్న సమయాన; తద్+ఆప్తుండు+అగు= అతడి స్నేహితుడయిన; విప్రుండు= బ్రాహ్మణుడు; అతనికిన్= ఆ రాజునకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సేనజితుడనే రాజు పుత్రమరణంతో కలిగిన శోకంతో ఆర్తిగొని ఉన్న సమయాన అతడి స్నేహితుడైన ఒక బ్రాహ్మణుడు, ఆతడికి ఇట్లా హితబోధ చేశాడు.

క. 'ఇది యేమి? శోకమున వం । దెదు? పుట్టిన వారి కెల్లఁ దెరు వారయఁగా
నిదియె; భవత్సుతుఁ డొకనికె? । వదలు వనట; మూఢునట్ల వనరం దగునే?' 8

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇది+ఏమి?= ఈ స్థితి ఎందుకు?; శోకమునన్= ఎడబాటువలన దుఃఖంతో; వందెదు?= చింతించెదవు?; పుట్టినవారికి+ఎల్లన్= పుట్టినట్టి అందరికీ; తెరువు= పద్ధతి, గతి; ఆరయఁగాన్= పరిశీలిస్తే; ఇదియె= ఇదే; భవత్+సుతుఁడు+ఒకనికె?= నీ కొడుకు ఒక్కనికేనా?; వనట= దుఃఖం; వదలు= విడువుము; మూఢు+అట్ల= తెలివిలేనివాడివలె; వనరన్= దుఃఖించగా; తగునే?= తగునా?

తాత్పర్యం: శోకంతో విలపించటం ఏమిటిది? ఈ సృష్టిలో పుట్టిన ఎల్లవారికీ తప్పనిసరి గతి ఇది - ఆలోచించి చూస్తే అటువంటప్పుడు ఈ గతి నీ కొడుకుకు ఒక్కడికే ఈ భూమిమీద జరిగినట్లు బాధపడటం మూఢత్వమౌతుంది. దుఃఖించటం మానుము. దుఃఖం ఈ సందర్భాన యుక్తమా! ఆలోచించుము.'

వ. అనిన విని యజ్ఞనపతి 'నీ వేమిటంజేసి వగపు వారిం?' తనవుడు నతం డతని కిట్లనియె. 9

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+జనపతి= ఆ రాజు; నీవు+ఏమిటన్+చేసి= నీవు ఏ పద్ధతితో; వగపు= దుఃఖం; వారింతు(వు)?= తొలగింతువు?; అనవుడున్= అనిన వెంటనే; అతండు= ఆ విప్రుడు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ రాజునకు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: సేనజితుడు ఆ విప్రుడి మాటల తీరుచూచి ఆశ్చర్యపడి అతడిని ప్రశ్నించాడు. 'నీవు ఏ విధంగా ఈ శోకాన్ని తొలగించుకొన్నావు? మరణమెంత సహజమో, శోకమూ అంతే సహజం ఈ రాజు దృష్టిలో. కాబట్టి నీకు ఈ శోక బాధ ఎట్లా తప్పింది?' అని ప్రశ్నించాడు. దానికి ఆ విప్రుడి సమాధాన మిది.

క. 'కదియుం గాష్ఠముఁ గాష్ఠము । నదిలో మఱికొంత సేపునకుఁ బాయును నె
మ్మది నట్లుగఁ దలఁపఁగ వల । వదె పితృ పుత్రాది బంధు వర్గము నధిపా! 10

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; నదిలోన్= నదియందు; కాష్ఠమున్= కర్రను; కాష్ఠము= కర్ర; కదియున్= సమీపిస్తుంది; మఱికొంత సేపునకున్= మరల కొంత సమయం తరువాత; పాయును= విడిపోతుంది; నెఱ+మదిన్= నిండుమనసులో; పితృపుత్ర+ఆదిబంధు వర్గమున్= తండ్రి కొడుకు మొదలైన బంధువుల సమూహమును అట్లుగన్= ఆ విధంగా; తలఁపఁగన్= ఆలోచించగా; వలవదు+ఎ?= వద్దా?; (అట్లు తలపవద్దా?)

తాత్పర్యం: 'రాజా! నది ప్రవహిస్తూ ఉండగా, ఆ ప్రవాహంలో ఒక కర్రను మరొక కర్ర చేరుకొంటుంది. ఆ చేరిక ఆ ప్రవాహవేగం అనుమతించినంతవరకే. కొంతసేపటికి ఆ చేరిన కర్రలు రెండూ విడిపోతాయి. కలయిక ఎంత సహజంగా జరిగిందో, ఎడబాటూ అంతే సహజంగా జరుగుతుంది. నిండు మనస్సుతో భూమిమీద సంబంధ బాంధవ్యాలను కూడా అవి తండ్రి కొడుకులకు చెందినవైనా, ఆలుమగలకు చెందినవైనా అట్లాగే ఆ ప్రవాహంలోని కర్రల కలయికవలెనే చూడాలి. కలయికలూ ఎడబాటులూ యాదృచ్ఛికంగా మన ప్రమేయం లేకుండా జరిగిపోతాయి.

విశేషం: ఇక్కడ నదీప్రవాహం కాలం. కాలంకూడా నిరంతరం గమనశీలమై, ఆగకుండా సాగిపోతూనే ఉంటుంది. కాలప్రవాహంలో కాష్ఠాలు అంటే కట్టెలు ఈ జీవులు. కాష్ఠమనేమాట శరీరాన్ని దాని అశాశ్వతత్వాన్ని స్ఫురింపజేయటానికి వాడబడింది. నదిలో కర్రలవలెనే కాలగమనంలో తండ్రి కొడుకులు కలిసికొంటారు. ఆ కలయికకు వారి ప్రమేయం లేదు. కర్రలు నదిలో తాము కావాలని కలవవు. అట్లాగే సంబంధ బాంధవ్యాలుకూడా కాల ప్రవాహంలో యాదృచ్ఛికంగా జరిగేవే కాబట్టి వాటికోసం శోకించరాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తనకుం దా నెర వనినను । విను బంధులు సతమె? య న్వివేకంబున నే
జనులపయిఁ జేయ నర్మిలి । నను వగ వొంద దది కారణముగ నరేంద్రా! 11

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= నరులకు అధిపతి - రాజా!; వినుము= ఆలకించుము; తనకున్= తనకు (ఎల్లవారికి, నీకు, నాకు, ఇతరునకు); తాన్= తాను; ఎరవు= అన్యము; అనినను= అనగా; బంధులు= చుట్టములు; సతమె?= శాశ్వతమా?; అన్+వివేకంబునన్= అనే పరిజ్ఞానంలో; నే= నేను; జనులపయిన్= ఇతర జనులమీద; అర్మిలిన్= ప్రేమను; చేయను= చేయను; అది కారణముగన్= ఆ కారణంచేత; ననున్= నన్ను; వగ= దుఃఖము; పొందదు= చేరదు.

తాత్పర్యం: రాజా! వినుము. నాలో ఒక గట్టి జ్ఞానం ఉన్నది. అదేమిటంటే మానవుడికి ఎవనికయినా, తనకు తానే అన్యం. శాశ్వతం కాదు. అటువంటప్పుడు తనవారు, తన సంతానం, బంధువులు ముక్తిప్రాప్తికి కారణం కానేకారు. ఈ వివేకంతో నేను నాకు భిన్నులయిన జనులమీద ప్రేమను పెంచుకోను. ప్రేమ లేనప్పుడు వియోగంవలన శోకమూ ఏర్పడదు. కాబట్టి నన్ను ఏ దుఃఖమూ దరిచేరదు.

విశేషం: మానవుడికి మనస్సే సుఖదుఃఖాలను అనుభవానికి తెస్తుంది. ఈ అర్థాన్నే 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః'అనే ఉపనిషత్సూక్తి వివరిస్తుంది. జ్ఞానాజ్ఞానాలు మనస్సునకు చెందినవే. కాబట్టి మనస్సులో ఇతరజనులయెడ వారు ఎవరైనా సరే స్వసంతానమైనా బంధువులైనా ప్రేమే ఏర్పడకుండా నిగ్రహించుకొనగలిగితే వారితో ఎడబాటు కలిగినప్పుడు శోకమూ కలుగదు. దానికి 'తనకు తానే మార్గము' అనే జ్ఞానం మూలంగా నిలుస్తుంది. ఆ మూలజ్ఞానాన్ని మనస్సున నిల్పుకొనగలిగితే ముక్తి సులభం.

క. నరనాథ! సుఖము దుఃఖముఁ । బరువడిమెయిఁ బొరయుఁ గాక! పన్నుగ నరునిం
బొరయునె యం దొక్కటి? యవి । పొరసిన వల దూఁద మోదమును ఖేదంబున్. 12

ప్రతిపదార్థం: నరనాథ!= మానవులకు అధిపతీ! ఓ రాజా!; సుఖము దుఃఖమున్= సుఖంగాని, దుఃఖంగాని; పరువడిమెయిన్= క్రమంతో; పొరయున్+కాక= కలుగును కాక; పన్నుగన్= ఒప్పుగా; నరునిన్= మానవుడిని; పొరయునె?= పొందునా?; అందున్= ఆ రెంటిలో, సుఖదుఃఖములలో; ఒక్కటి= ఒక్కటైనా పొందునా? (పొందలేడని తాత్పర్యం); అవి= ఆ సుఖదుఃఖాలు; పొరసినన్= కలిగితే; మోదమును= సంతోషమును; ఖేదంబున్= సంతాపమును; ఊఁదన్= వహించగా; వలవదు= కూడదు.

తాత్పర్యం: రాజా! వివేచించి చూస్తే మానవుడికి లోకాన సుఖదుఃఖాలు క్రమంగా కలుగుతాయి. అంతే కాని సుఖదుఃఖాలలో ఏ ఒక్కటీ నరుడిని తాకదు. కాబట్టి సుఖదుఃఖాలు పొందినపుడు సంతోషాన్నిగాని, సంతాపాన్నిగాని పొందకుండా ఉండాలి.

విశేషం: ఈ పద్యానికి మూలం:

> సుఖస్యానన్తరం దుఃఖం దుఃఖస్యానన్తరం సుఖమ్,
> సుఖ దుఃఖే మనుష్యాణాం చక్రవ త్పరివర్తతః.
> సుఖా త్త్వం దుఃఖ మాపన్నః పునరాపత్స్యసే సుఖమ్,
> న నిత్యం లభతే దుఃఖం న నిత్యం లభతే సుఖమ్.

క. ఇది నాయది యను నూఁత । న్మది నెయ్యది పట్టుకొల్పినను వాసితమై
తుదిఁ జేటునొంది వానికి । నది శోకము నావహించు నత్యంతంబున్. 13

ప్రతిపదార్థం: ఇది= ఈ పదార్థం; నా+అది= నాది; అను= అనెడి; ఊఁతన్= అండను; మదిన్= మనస్సునందు; ఏ+అది= ఏది; పట్టుకొల్పినను= నెలకొల్పినా; వాసితమై= వాసన కలిగినదై; తుదిన్= చివరకు; చేటును+ఒంది= నాశనాన్ని పొంది; వానికిన్= దానిని మనస్సున నెలకొల్పుకొన్నవానికి; అది= ఆ పదార్థం; శోకమున్= ఎడబాటు వలన దుఃఖమును; అతి+అంతంబున్= అత్యధికంగా; ఆవహించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: మానవుడు 'ఇది నాది' అనే భావంతో ఏ పదార్థాన్ని తన మనస్సులో నిలుపుకొంటాడో - ఆ పదార్థం, అది చేతనమైనా అచేతనమైనా అనేక వాసనలను భావనాజనితమైన సంస్కారాలను అతడి మనస్సులో కలిగిస్తుంది. ఆ తరువాత అది నశిస్తుంది - సహజంగానే. అపుడు ఆ మానవుడు అత్యధికంగా శోకించక తప్పదు.

విశేషం: ఈ పద్యంలో 'వాసితము' అనే పదం ప్రయుక్తమై ఉన్నది. దానికి అర్థం తెలిసికొని ఉన్నాం. వాసన అనేమాట పారమార్థిక చర్చలో సామాన్యం. ఆత్మ ఈ వాసనల కారణంగానే పునః జన్మిస్తుందని కొందరి విశ్వాసం. ఈ వాసనలనే కొందరు సంస్కారాలు అంటారు. పూర్వజన్మవాసన. సంస్కారం అంటూ ఈ రెండు పదాలూ పర్యాయాలుగానే వాడుతున్నాం. ఈ వాసనలు, సంస్కారాలు మనస్సు నంటుకొంటాయి. దానికి హేతువు 'ఇది నాయది అను ఊఁత'. ఇది నాది అనే గాఢమైన భావన మనస్సున నెలకొన్నప్పుడు, ఆ పదార్థం నశించినా, ఆ వాసనలు మనస్సును వీడవు. కర్పూరం తొలగినా, అది కట్టిన గుడ్డ గుబాళిస్తూనే ఉంటుంది కదా! మనస్సూ అంతే. ఆ కారణంగానే ఆయా పదార్థాల నాశనం, అనివార్యమై జరిగినప్పుడు మానవుడు తల్లడిల్లిపోతాడు.

క. వినుము, పురాతన జన్మం । బునఁ జేసిన యట్టి కర్మముల ఫలములు ప్రా
జ్ఞునినైనఁ బొందు వానికి । మనుజేశ్వర! మందు ధైర్యమహిమయ చుమ్మీ. **14**

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= మానవులకు అధిపతీ! రాజా!; వినుము= ఆలకించుము; పురాతన జన్మంబునన్= పూర్వజన్మలో; చేసిన+అట్టి కర్మముల ఫలములు= చేసినటువంటి కర్మల ఫలితాలు; ప్రాజ్ఞునిన్+ఐనన్= పండితుడినికూడా; పొందున్= చెందును; దానికిన్= ఆ కర్మల ఫలితములకు; మందు= నివారణౌషధం; ధైర్యమహిమ+అ= ధీరత్వపు గొప్పతనమే; చుమ్మీ= (చూడుమీ) సుమీ.

తాత్పర్యం: రాజా! వినుము. పూర్వజన్మలో చేసిన కర్మల ఫలితాలు మిగిలి ఉంటే, అవి తప్పక ఈ జన్మలో నరుడిని చేరుతాయి. ఈ కర్మఫలాల అనుభవం విషయంలో పామరుడైనా, పండితుడైనా ఒక్కటే. పండితుడికి మినహాయింపు లేదు. 'అయితే మరి, ఆ కర్మ ఫలితాల అనుభవానికి నివారణౌషధమే లేదా!' అంటావా? ఉంది గొప్ప ధీరత్వంతో వాటిని స్వీకరించటమే ఆ నివారణమార్గం.

విశేషం: కర్మఫలానుభవానికి నివారణ మార్గం లేదు. ధైర్యంగా అంగీకరించి అనుభవించటమే ఎంత పండితుడైనా చేయవలసిన పని. కారణకార్య సంబంధాన్ని ఎవరూ ఆపలేరు. కారణం కర్మ అయితే కార్యం ఫలితం. గంటకొట్టి శబ్దం రాకుండా నిరోధించలేము. చేసిన పనికి ఫలితం అనుభవించవలసిందే.

క. పరమ సుఖము తృష్ణ యుడుగు । టరయఁగ ని ట్లగుట పింగళాలాపములం
బరిబోధితమగు ధరణీ । శ్వర! చెప్పెదఁ దెలియ వినుము వాని తెఱంగున్. **15**

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= భూమికి అధిపతివైన రాజా!; అరయఁగన్= పరిశీలించగా; తృష్ణ+ఉడుగుట= అత్యాశను విడుచుట; పరమసుఖము= మిక్కిలి సుఖం; ఇట్లు+అగుట= ఈ విధంగా అగుట (తృష్ణ ఉడుగుట); పింగళా+ఆలాపములన్= పింగళ అనే వేశ్యయొక్క మాటలచేత; పరిబోధితము+అగున్= బాగుగా తెలియబడింది అగును; చెప్పెదన్= చెప్పుతాను; తెలియన్= తెలిసేటట్లుగా; వాని తెఱంగున్= ఆ మాటల విధమును; వినుము= ఆలకించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజా! పరిశీలించిచూస్తే గొప్ప సుఖ మనేది వాంఛను వదలిపెట్టటంలోనే ఉన్నది. అ దెట్లాగు? అంటావా? ఈ సత్యం పింగళ అనే వేశ్య స్వానుభవంతో పలికిన పలుకులలో వ్యక్తమై అర్థమవుతుంది. తెలియజెప్పుతాను-వినుము.

విశేషం: తృష్ణ అనే మాట బౌద్ధవాఙ్మయంలో ప్రచురంగా కనిపిస్తుంది. ఆశించి దొరకలేదని దుఃఖించటం కంటె అసలు ఆశనే వదలుకుంటే అదే ఆనందమనే భావన ప్రథమంగా బౌద్ధంనుండి వెలువడి ఉండవచ్చును అనే వాదమూ ఉన్నది.

వ. పింగళయను వేశ్య దన కూర్చువాని రాక వార్చి పెద్దయుం బ్రొద్దు వోవునంతకు నుండి వాఁడు రాకుండుటయును. 16

ప్రతిపదార్థం: పింగళ+అను వేశ్య= పింగళ అనే పేరుగల వెలయాలు; తన కూర్చువాని రాక= తనకు ఇష్టుడగు వాని రాకను; వార్చి= ఎదురుచూచి; పెద్దయును+ప్రొద్దు= ఎక్కువ కాలం; పోవునంతకున్= కడచునంతవరకు; ఉండి= నిలిచి; వాఁడు= ఆ ఇష్టుడైనవాడు; రాక+ఉండుటయును= రాకుండా ఉండగా.

తాత్పర్యం: పింగళ అనే వేశ్య తన ప్రియుడికొరకు ఎదురుచూస్తూ చాలా సమయం గడిపింది. అయినా అతడు రాలేదు. అప్పుడు ఆ వేశ్య ఆత్మగతంగా ఇట్లా తలపోసింది.

ఆ. 'ఏను వేఁదు అగుడు వాని నివ్వేదుఱ । పట్టఁ జదురుగలదె! భ్రాంతి దొఱఁగి
యొంటి కంబ మొప్పు నింటి వాకిలులు దొ । మ్మిదియు నెఱయమూసి నిదురవోదు. 17

ప్రతిపదార్థం: ఏను= నేను; వేఁదుఱు+అగుడున్= వెర్రిని అయిన వెంటనే; వానిన్= అతడిని (తాను ఎదురుచూచే ప్రియుడిని); ఈ+వేదుఱు+అ= ఈ వెర్రియే; పట్టన్= పట్టుకొనే; చదురు= రీతి; కలదె?= ఉన్నదా?; భ్రాంతిన్= భ్రమను; తొఱఁగి= విడిచి; ఒంటికంబము= ఒక స్తంభం; ఒప్పు= తగు; ఇంటి వాకిళులు= ఇంటియొక్క వాకిళ్ళు - ద్వారములు; తొమ్మిదియున్= తొమ్మిదింటిని; నెఱయన్ మూసి= నిండుగా మూసివేసి; నిదుర+పోదున్= నిద్రపోతాను.

తాత్పర్యం: 'నేను నా ప్రియుడి కొరకు పిచ్చిదాన్ని అయ్యాను. అయితే నాకీ పిచ్చిపట్టిన వెంటనే నా ప్రియుడికీ ఈ పిచ్చి పట్టే వీలుందా! లేదు. కాబట్టి ఈ భ్రమను వదలుకొని ఒంటి కంబంతో ఒప్పి ఉన్న ఈ నా (శరీరమనే) ఇంటిలోని తొమ్మిది వాకిళ్ళూ బాగా మూసికొని నిద్రపోతాను.

విశేషం: పింగళ వేశ్య. ప్రియుడికోసం పరితపిస్తూ వెర్రిదై నిరీక్షించింది. ఇంకా నిరీక్షించింది. ఎంతసేపో నిరీక్షించింది. అపుడు ఆమె మనస్సులో ఈ భావం కలిగింది. 'నాకు పట్టిన ఈ వెర్రి వాడే కావాలి, రావాలి అనే పిచ్చితనం నాకు కలిగినట్టే వాడికీ కలుగుతున్నది అని నియమం లేదు. అయినా నేను నిరీక్షిస్తున్నాను. ఇది భ్రాంతి. లేనిదానిని ఉన్నట్లుగ తలచి, మేల్కొని ఉండటం మానుకుంటాను. నే నుండే ఈ ఇంటి వాకిలేగాకుండా నిజమైన నేను (ఆత్మ) ఉండే ఈ దేహమనే, ఇంటి వాకిళ్ళు తొమ్మిదీ (నవరంధ్రాలు - కళ్ళు, ముక్కులు, చెవులు మొ॥నవి) గట్టిగా మూసేసి నిద్రిస్తాను - ప్రశాంతంగా అని ఇంకా ఆ వేశ్య తన తలంపును ఇట్లా కొనసాగిస్తున్నది.

క. పొంతకు వచ్చిన వానిన । కాంతునిగాఁ గొనుచు నొరునిఁ గాంక్షింపక యే
నెంతయు నూఱడి మనమునఁ । జింత యొకఁడు లేకయున్నఁ జెందు సుఖంబుల్. 18

ప్రతిపదార్థం: పొంతకున్= చెంతకు; వచ్చినవానిని+అ= చేరిన వ్యక్తినే; కాంతునిగాన్= ప్రియుడిగా; కొనుచున్= స్వీకరిస్తూ; ఒరునిన్= ఇతరుని; కాంక్షింపక= కోరక; ఏను= నేను; ఎంతయున్= ఎంతగానో, ఎక్కువగా; ఊఱడి= తృప్తిచెంది; మనమునన్= మనస్సునందు; చింత+ఒకఁడున్= దిగులు ఒక్కటికూడా; లేక+ఉన్నన్= లేకుండా ఉన్నట్లయితే; సుఖంబుల్= సుఖాలు; చెందున్= కలుగుతాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: చెంతకు చేరినవాడే ప్రియుడు అనుకొని ఇతరుడిపై కోరికమాని, తృప్తితో మనస్సున ఏ దిగులూ లేకుండా ఉంటే సుఖాలు నన్ను చేరుకొంటాయి.

విశేషం: సుఖపడాలంటే మనిషికి రెండు గుణాలు ఉండాలి. 1). తృప్తి; 2). నిగ్రహం. ఇక్కడ చేరినవాడే ప్రియుడు అనుకొనటం తృప్తి. మనస్సున చింతలేమి నిగ్రహం. ఆ వేశ్య తలపులు ఇంకా ఈ విధంగా కొనసాగినాయి.

క. ఆశయ యింద్రియ జయము వి । నాశముఁ బొందించుఁ గావునం దొఱఁగెద నే
నాశను; సౌఖ్యము నిచ్చు ని । రాశయ' యని పలికి యట్టిదై నిద్రించెన్.' 19

ప్రతిపదార్థం: ఆశ+అ= ఆశయే; ఇంద్రియ జయమున్= ఇంద్రియముల గెలుపును; వినాశమున్= చేటును; పొందించున్= కలిగించును; కావునన్= కాబట్టి, నేను; ఆశను= కోరికను; తొఱఁగెదన్= విడిచెదను; నిర్+ఆశ+అ= ఆశ లేకుండుటయే; సౌఖ్యమున్= సుఖమును; ఇచ్చున్= ఈయగలదు; అని; పలికి= చెప్పి; అట్టిదై= ఆ విధంగలదై, ఆశ ఉడిగినదై; నిద్రించెన్= నిద్రపోయింది.

తాత్పర్యం: ఆలోచించిచూస్తే ఆశే ఇంద్రియలోలుని చేసి మనిషిని క్రుంగదీస్తుంది. మనిషి ఓటమి పాలు కావటానికి కోరికే కారణం. మనిషి వినాశానికీ ఆశ ఒక్కటే హేతువు. కాబట్టి నేను ఆశను వదలుకొని ఇంద్రియాలను జయించి, వినాశానికి దూరంగా సుఖంగా జీవిస్తాను. సౌఖ్యప్రదాయి నిరాశ ఒక్కటే' అని పలికి, పలుకునకు తగిన మనః ప్రవృత్తితో శాంతంగా నిద్రించింది - పింగళ.'

విశేషం: ఆశా నిరాశలు రెండింటి కేంద్రమూ మనస్సు ఒకటే. కాబట్టి దాన్ని నిగ్రహించటమే సౌఖ్యానికి సోపానం.

వ. అని విప్రుం డుపదేశించిన వాక్యంబులం గలంకదేఱి సేనజిత్తు సుఖి యయ్యె.; నీవును నందలి తాత్పర్యం బను సంధించి శాంతినొందు మని చెప్పినఁ గుంతీ తనయాగ్రజుండు శాంతనవుతో 'భూతక్షయావహంబగు కాలం బతిక్రాంతం బగుచున్నయది; యట్లుండ జనంబుల కెయ్యది కర్తవ్యంబు లుపదేశింపు' మనిన నమ్మనుజపతిం బ్రీతిం గనుంగొని 'యమ్మహితాత్ముండు పితాపుత్ర సంవాదంబను నితిహాసంబు గల దాకర్ణింపుము; దాన నీ యడిగినయది దేటపడు' నని పలికి యిట్లనియె. 20

ప్రతిపదార్థం: అని= పలికి; విప్రుండు= బ్రాహ్మణుడు; ఉపదేశించిన వాక్యంబులన్= బోధించిన మాటలతో; కలంక+తేఱి= కలత తొలగి; సేనజిత్తు= సేనజితుడనే రాజు; సుఖి+అయ్యెన్= సుఖం కలవాడైనాడు; నీవునున్= నీవుకూడా; అందలి= ఆ ఉపదేశము నందలి; తాత్పర్యంబు= నిజమైన అర్థమును; అనుసంధించి= గ్రహించి; శాంతిని+ఒందుము= శాంతిని పొందుము; అని చెప్పినన్= అని పలుకగా; కుంతీ తనయ+అగ్రజుండు= కుంతికుమారులలో మొదట జన్మించినవాడు - ధర్మరాజు; శాంతనవుతోన్= శంతనుడి తనయుడితో, భీష్ముడితో; భూతక్షయ+ఆవహంబు+అగు= జీవులకు నాశనం కలిగించెడిదగు; కాలంబు= యుగాంతరమైన కాలము; అతిక్రాంతంబు= జరిగిపోయేదిగా; అగుచున్న+అది= ఔతున్నది; అట్లు+ఉండన్= ఆ విధంగా ఉన్నప్పుడు; జనంబులకున్= ప్రజలకు; ఏ+అది= ఏది; కర్తవ్యంబు= చేయవలసినది; ఉపదేశింపుము= బోధించుము; అనినన్= పలుకగా; ఆ+మనుజపతిన్= ఆ మానవుల అధిపతిని రాజును; ప్రీతిన్= ప్రేమతో; కనుంగొని= చూచి; ఆ+మహిత+ఆత్ముండు= ఆ గొప్ప ఆత్మకలవాడు - భీష్ముడు; పితాపుత్ర సంవాదంబు+అను= తండ్రీకొడుకుల సంవాదం అనే; ఇతిహాసంబు= పూర్వచరిత్ర; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= వినుము; దానన్= దానివలన; నీ+అడిగిన+అది= నీవు అడిగిన అంశం; తేటపడున్= స్పష్టపడుతుంది, తెలియును; అని పలికి= అని చెప్పి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఈ విధంగా పింగళావృత్తాంతాన్ని విప్రుడిద్వారా విన్న సేనజిత్తు మనస్సు కలత తీరి సుఖంగా జీవించాడు. నీవు కూడా ఆ కథలోని అంతరార్థాన్ని గ్రహించి మనఃక్లేశం మాని శాంతితో జీవించుము - అని తాత మనుమడికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెప్పాడు. తరువాత ధర్మరాజు భీష్ముడిని ఇట్లా ప్రశ్నించాడు. 'జీవరాశులు నశించిపోయే కాలం దాపురించింది. ఈ పరిస్థితులలో ప్రజలు ఏమి చేయాలి? బోధించుము.' ఆ ప్రశ్నతో ఆ మహాత్ముడైన భీష్ముడు ఆ రాజును ప్రేమతో చూస్తూ 'తండ్రీ కొడుకుల సంవాదం' అనే పూర్వకథ ఒకటి ఉన్నది వినుము. దాని వలన నీ ప్రశ్నకు సమాధానం తెలుస్తుంది' అని ఇట్లా అన్నాడు.

మేధావియను బ్రాహ్మణకుమారుఁడు దన తండ్రితోఁ జేసిన సంవాదము (సం. 12-169-2)

సీ. 'వేదవిదుం డగు విప్రనందనుఁడు మే । ధావి నామకుఁడు మేధావివరుఁడు
సత్సమయంబున జనకుతో 'నాయువు । జనులకు వేగంబ చనుచునుండు;
దీనిపైఁ గనువెట్టి ధీరత దలకొల్పి । మేలు వాటిల్ల నెమ్మెయిఁ జరించు
వా రొకో?' యనవుడు వానికి ని ట్లనుఁ । దండ్రి 'యాలును నపత్యంబు గలుగు

ఆ. తెఱఁగు నడపి యజ్ఞతృప్తనిర్జరుఁ డయి । శమము నొంది కాననమున కేఁగి
సౌమ్యవృత్తి ముక్తి సాధించి మృత్యువు । నలఘునియతి గెలువవలయు ననఘ! 21

ప్రతిపదార్థం: వేదవిదుండు+అగు= వేదముల నెరిగినవాడైన; విప్రనందనుఁడు= బ్రాహ్మణ కుమారుడు; మేధావి వరుఁడు= తెలివిగల వారిలో శ్రేష్ఠుడు; మేధావి నామకుఁడు= మేధావి అను పేరుకలవాడు; సత్ సమయంబున(న్)= మంచి (అనువైన) కాలమునందు; జనకుతోన్= తండ్రితో; ఆయువు= బ్రతికి ఉండేకాలము; జనులకున్= ప్రజలకు; వేగంబు+అ= త్వరగానే; చనుచున్+ఉండున్= కడచిపోతూ ఉంటుంది; దీనిపైన్= ఈ అంశంమీద; కను+పెట్టి= కన్ను ఉంచి (చూపు నిలిపి); ధీరత= ధైర్యం; తలకొల్పి= నెలకొల్పి; మేలు= మంచి; పాటిల్లన్= కలుగునట్లుగా; ఏ+మెయిన్= ఏ విధంగా; చరించువారు+ఒకో!= ప్రవర్తిస్తారో (నడచుకొనవలసినవారో); అనవుడున్= అనిన వెంటనే; వానికిన్= ఆ కుమారునికి (మేధావికి); తండ్రి= అతని తండ్రి; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికెను; అనఘ!= పాపరహితుడా!; ఆలును= భార్యయు; అపత్యంబు= బిడ్డ; కలుగు తెఱఁగు= కలిగే విధం; నడపి= ఏర్పరచి; యజ్ఞతృప్త నిర్జరుఁడు+అయి= యాగాలతో తృప్తిపరచబడిన దేవతలు కలవాడై; శమమున్= శాంతిని; ఒంది= పొంది; కాననమునకున్= అడవికి; ఏఁగి= వెళ్ళి; సౌమ్యవృత్తిన్= మృదువైన నడతతో; ముక్తి= మోక్షం; సాధించి= వశపరచుకొని; మృత్యువున్= మరణాన్ని; అలఘు నియతిన్= గొప్ప నియమంతో; గెలువన్+వలయున్= జయించాలి.

తాత్పర్యం: మేధావి అనే పేరుగల బ్రాహ్మణకుమారు డొకడు ఉన్నాడు. అతడు వేదాలు తెలిసినవాడు. మేధావులలో శ్రేష్ఠుడు. అతడు ఒకనాడు మంచి సమయంలో తన తండ్రిని ఇట్లా ప్రశ్నించాడు. 'లోకంలో ప్రజలకు ఆయువు త్వరత్వరగా గడచిపోతూ ఉంటుంది. ఆ విషయం తెలిసికొని వారు ఏ పద్ధతిలో ఏ మార్గాన చరించి మేలు పొందగలుగుతారు?' ఆ ప్రశ్నకు అతడి తండ్రి ఇచ్చిన సమాధాన మిది. 'ఓ పాపరహితుడా! పెండ్లిచేసికొని భార్యను పొంది, సంతతిని కని, యజ్ఞాలతో దేవతలను తృప్తిపరచి ఆ తరువాత శాంతిని పొంది, సంసారాన్ని చాలించి, అడవికి వెళ్ళి ప్రశాంతజీవనం సాగిస్తూ మోక్షాన్ని సాధించాలి. ఆ విధంగా మృత్యువును మానవుడు గెలువగలడు' అని.

విశేషం: తనయుడి ప్రశ్న, దానికి తండ్రి ఇచ్చిన సమాధానం రెండూ మానవజీవన ప్రయోజనానికి సంబంధించినవి. నశ్వరమైన ఈ దేహంద్వారా అనశ్వరమైన శాశ్వతసౌఖ్యప్రదాయకమైన ముక్తిని పొందే మార్గమేమిటి? - అనేది ప్రశ్న. దాని సమాధానం సంప్రదాయబద్ధంగా ముందు గృహస్థ స్థితినీ, ఆ తరువాత వానప్రస్థ ఆశ్రమాన్ని ముగించి, అనంతరం ముక్తిని పొందాలి - అని ఈ గతానుగతికమైన సమాధానాన్ని ఆ మేధావి స్వీకరించే స్థితిలో లేడు. అందువలన అతడు తండ్రితో తిరిగి ఇట్లా సంవదిస్తున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని మేధావి తండ్రి కి ట్లనియె. 22

ప్రతిపదార్థం: అనినన్= (తండ్రి) పలుకగా; విని= ఆలకించి; మేధావి= ఆ పేరు గల బ్రాహ్మణ కుమారుడు; తండ్రికిన్; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: ఆ తండ్రి సమాధానం విన్న తనయుడు మేధావి తిరిగి తన తండ్రితో ఇట్లా అన్నాడు.

సీ. 'నిక్కమ కాలంబు నీకుఁ గొంత గలట్లు । వలికెదు; నీవు గర్భంబు సొచ్చి
నప్పటి నుండియు నన్వేషణము సేయుఁ । గొనిపోవుటకు మృత్యు వని యెఱుంగు;
మివిరెడు నీటి మీనవు గావె? దారపు । త్రాదిసక్తుండగు నతనిఁ గాన
నమున సుప్తుండైన నరుఁ బులి గొనిపోవు । నట్టులు సూ మృత్యు వపహరించుఁ;

తే. జేసినది సేయుచున్నది సేయవలయు । నది యనంగల కార్యంబులందుఁ దగులు
వాని మృత్యు వేపునఁ దన వశముఁ జేయుఁ । గాన కాలంబు నేమనఁ గాదు తండ్రి! 23

ప్రతిపదార్థం: తండ్రి!= ఓ జనకా!; నిక్కము+అ= నిజముగానే; కాలంబు= ఆయువు; నీకున్ (ప్రతి మానవుడికి) కొంత+కల+అట్లు= కొంత ఉన్న విధంగా; పలికెదు= మాట్లాడుతున్నావు; మృత్యువు= మరణం; నీవు (ప్రతి మనిషి - ప్రాణి) గర్భంబు+చొచ్చిన+అప్పటి నుండియున్= కడుపున ప్రవేశించిన వేళనుండి కూడా; కొనిపోవుటకున్= తీసికొనివెళ్ళుటకు; అన్వేషణము+చేయున్= వెదకుట చేయును; అని; ఎఱుంగుము= తెలిసికొనుము; ఇవిరెడు= ఇంకిపోయెడి; నీటి= నీటి యందలి; మీనవు+కాదె?= చేపవు కావా?; దారపుత్ర+ఆది సక్తుండు+అగు+అతనిన్= భార్య, కొడుకు మొదలగు వారియెడ ఆసక్తుడయ్యే వాడిని; కాననమునన్= అడవిలో; సుప్తుండు+అయిన నరున్= నిద్రించిన మనిషిని; పులి; కొనిపోవు+అట్టులు= తీసికొనిపోవు విధంగా; మృత్యువు= మరణము; అపహరించున్ సూ= దొంగిలించును (కొనిపోవును) సుమా!; చేసినది= చేసివేసినది (భూతకాలికం); చేయుచున్నది= చేస్తూ ఉన్నది (వర్తమాన కాలికం); చేయన్ వలయునది= చేయవలసి ఉన్నది (భవిష్యత్కాలికం); అనన్+కలకార్యంబులందున్= అని మూడు విధాల ఉన్న పనులలో; తగులువానిన్= ఆసక్తుడయినవాడిని; మృత్యువు= మరణం; ఏపునన్= బలంతో; తన వశమున్= తనకు లోబడినవాడినిగా; చేయున్= చేస్తుంది; కానన్= కావున; కాలంబున్= కాలాన్ని; ఏమి+అనన్+కాదు= ఏమీ అనటానికి (వీలు) కాదు.

తాత్పర్యం: 'తండ్రీ! నిజంగా కాలం కొంత నీ అధీనంలో ఉన్నట్లు పలుకుతున్నావు. కాని, మానవుడు తల్లి కడుపున పడిన మరుక్షణం నుండే మృత్యువు అతడిని వెన్నంటి వేటాడుతూ తీసికొనిపోవటానికి యత్నిస్తూ ఉంటుంది. అని తెలిసికొమ్ము. ఇగిరిపోయే నీటిలోని చేపవు నీవు. నీ జీవితం నీ అధీనంలో లేదు. ఆలుబిడ్డలు అంటూ తాపత్రయ పడే మనిషిని మృత్యువు అడవిలో ఆదమరిచి నిద్రించే నరుని పులి కొనిపోయే అంత సులభంగా అపహరిస్తుంది. మానవుడికి జీవితంలో మూడు విధాలయిన కార్యాలుంటాయి - 1). చేసినది - ఇది భూతకాలానికి చెందినది; 2). చేస్తూ ఉన్నది - ఇది వర్తమాన కాలానికి చెందినది; 3) చేయవలసి ఉన్నది - ఇది భవిష్యత్కాలానికి చెందినది - ఈ మూడు కార్యాలలో మనిషి నిమగ్నుడై ఉంటాడు. అయితే ఈ మూడూ ఒక కాలం యొక్క మూడు అంశాలే. ఈ మూటిలో మనిషి ఉన్నా, మృత్యువు నిర్దయగా అతడిని కబళిస్తుంది. కాబట్టి కాలాన్ని మనిషి ఏమీ చేయజాలడు, ఏమీ అనజాలడు, కాలానికి మనిషి అధీనుడే గాని మనిషికి కాలం అధీనం కాదు.

విశేషం: తండ్రి సమాధానం పరంపరాగతమైన సాంప్రదాయకమైన రీతిలో ఉన్నది. దానిని తనయుడు ప్రశ్నించాడు. తొలుత గార్హస్థ్యం, ఆ పిదప వానప్రస్థం, తరువాత మోక్షం అన్నాడు తండ్రి. ఆ క్రమం తప్పకుండా సాగిపోతుంది - అనే ధైర్యం, కాలమహిమ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తెలిస్తే నిలువదు అంటున్నాడు తనయుడు. నిన్ను తీరికగా నీ కార్యక్రమ నిర్వహణకై విడిచిపుచ్చి ఊరుకోదు కాలం. అది అజేయమూ, అప్రతివిధేయమూ అయినది. ప్రాణుల జీవితమంతా కేవలం కాలాధీనమే. అయినపుడు ఆలుబిడ్డలు, యజ్ఞనిర్వహణం వంటి ఈ సాంప్రదాయిక పథాన మోక్షాన్వేషణ చేయటంకంటె వేరే మార్గాన్ని కనుగొనవలసిన అవసరం ఉన్నదని బోధ కలిగే విధంగా తనయుడు తన వాదాన్ని కొనసాగిస్తున్నాడు.

క. **భీరుఁడు శూరుఁడు జడుఁడు వి । శారదుఁ డబలాత్మకుండు సబలుండన లే**
దేరినయిన మృత్యువు దు । ర్వారంబై యపహరించు వైదికవర్యా! **24**

ప్రతిపదార్థం: వైదికవర్యా!= వేదం చదివినవారిలో శ్రేష్ఠుడా!; భీరుఁడు= పిరికివాడు; శూరుఁడు= శౌర్యవంతుడు; జడుఁడు= చలనంలేనివాడు (అజ్ఞాని); విశారదుఁడు= ప్రవీణుడు; అబల+ఆత్మకుండు= బలహీనమైన శరీరం కలవాడు; సబలుండు= బలంతో కూడినవాడు; అనన్= అనుటకు; లేదు= (వీలు) ఉండదు; ఏరిని+అయినన్= ఎవరినైనా; మృత్యువు= మరణం; దుర్వారంబు+అయి= అడ్డులేనిదై; అపహరించున్= కొనిపోవును.

తాత్పర్యం: మృత్యువు ఎదురులేని బలంకలది. దాని ముందు అందరూ సమానులే. అది పిరికివాడినీ, నిర్భయుడినీ, అజ్ఞానినీ, విజ్ఞానినీ, అబలుడినీ, సబలుడినీ - అందరినీ ఒకే విధంగా కబళిస్తుంది. కాలం ముందు ప్రాణులన్నీ సమానులే.

విశేషం: జీవితంలో మనిషి గుణగణాలకూ అజ్ఞానవిజ్ఞానాలకూ బలదౌర్జన్యాలకూ, ఇతరులముందు అంటే తోడి మానవులలో, ప్రాణులలో విలువ ఉండవచ్చునుగాని, మృత్యు రూపమైన కాలం ముందు సర్వమానవులూ సమానులే. వారు భీరువులయినా శూరులైనా దాని ముందు తలవంచవలసినదే. కాల మహిమ అప్రతివిధేయం.

క. **విను సంసృతి మృత్యువు ప । ట్టనఘా! నిస్సంగవృత్తి యమరగృహము నె**
ట్టన ని ట్లగుటం గనికొని । తునుముము సంసారరజ్జు దురితవిదూరా! **25**

ప్రతిపదార్థం: దురిత విదూరా!= పాపానికి మిక్కిలి ఎడమైనవాడా! వినుము; సంసృతి= సంసారం; మృత్యువు పట్టు= మరణమునకు నిలయం; అనఘా!= పాపరహితుడా!; నిస్+సంగవృత్తి= ఆసక్తి లేకుండా జీవించటం; అమరగృహము= దేవతలఇల్లు (స్వర్గం); నెట్టనన్= చక్కగా; ఇట్లు+అగుటన్= ఈ విధంగా ఉండుటను; కనికొని= గ్రహించి; సంసార రజ్జున్= సంసారము అనే త్రాటిని; తునుముము= తెగవేయుము.

తాత్పర్యం: పాపకార్యాలకు దూరంగా జీవించే ఓ తండ్రీ! వినుము. ఆలోచిస్తే ఈ సంసారం మరణానికి ఆటపట్టు. దీనికి వ్యతిరేకంగా, అనాసక్తంగా కోరిక లేకుండా జీవించటం స్వర్గం. ఈ జ్ఞానంతో నీ సంసారమనే త్రాటిని తెంచుకొమ్ము.

విశేషం: మన వేదాంత గ్రంథాలు సంసారాన్ని ఘోర సముద్రంగా చిత్రించాయి. నిజానికి మోక్షమంటే కుటుంబజంబాలం నుండి బయటపడటమే అన్నట్లు పేర్కొంటాయి. ఈ పద్యమూ ఆ భావాన్నే తలపింపజేస్తుంది. ఆసక్తితోడి జీవితమే సంసారం. అది మృత్యుమార్గమట! దానికి వ్యతిరిక్తమైన అనాసక్త జీవితం స్వర్గద్వారమట!

క. **అమృతము మృత్యువు నన స । త్యము మోహము గాన విను మహాత్మా! యే స**
త్యమునన మృత్యువు గెల్చెద । సమసుఖదుఃఖుండ నగుచు శాంతిపరుఁడనై. **26**

ప్రతిపదార్థం: మహాత్మా!= గొప్ప మనస్సు కలవాడా!; వినుము; అమృతము= చావులేమి; మృత్యువున్= చావు; అనన్= అనగా; సత్యము= నిజం; మోహము= భ్రాంతి; కానన్= కావున; ఏన్= నేను; సమ సుఖదుఃఖుండన్+అగుచున్= సమానమైన సుఖమూ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుఃఖమూ కలవాడనై; శాంతిపరుఁడను+ఐ= శాంతియందు ఆసక్తుడనై సత్యమునన్+అ= సత్యంతోడనే; మృత్యువున్=మరణాన్ని; గెల్చెదన్= జయిస్తాను;

తాత్పర్యం: మహాత్మా! పరికించి చూస్తే సత్యమే అమృతం - మరణరాహిత్యం. మోహమే మృత్యువు - చావు. కాబట్టి అమృతం-మృత్యువు అనేవి జ్ఞానసంబంధి సాంకేతికాంశాలు మాత్రమే. నేను సత్యం ద్వారా మృత్యు విజేతనయ్యాను. ఆ తరువాత సుఖదుఃఖాలు రెండూ నాకు సమానమే అవుతాయి. కేవలం శాంతి మాత్రం నాకు మిగులుతుంది.

విశేషం: అమృతం అనేది మనిషికి అనాదిగా ఉన్న గొప్ప కోరిక. ప్రతిప్రాణికీ మృతి తప్పనిసరి. ఆ తప్పనిదానిని తప్పించుకొనటమే అమృతం. దానికొరకే మానవాన్వేషణ నిరంతరంగా కొనసాగుతూ వస్తూ ఉన్నది. ఆ కొనసాగే దశలో ఒకనాడు మనిషి అమృతమంటే ఏమనుకున్నాడో ఈ పద్యం వివరిస్తుంది. సత్యమే అమృతమట! సత్యానికి వ్యతిరిక్తమైనది మోహం; అదే మృత్యువట! కాబట్టి సత్యమార్గాన మోహం నుండి బయటపడితే అమృతాన్ని అందుకొన్నట్లే! అపుడు లోకాన దుఃఖమూ, అశాంతీ ఉండవు - కనీసం ఆ మహామానవుడి దృష్టిలో. మనిషికి సంతతి ఒక విధంగా కొనసాగింపే కాబట్టి సంతానం ద్వారా చావులేమి (అమృతత్వం) సాధ్యమేకదా! అని వాదిస్తావేమో అది సరికాదంటున్నాడు - (క్రింది పద్యంలో)

తే. **నాకుఁ బ్రజ గతి నిచ్చు ననంగవల వ; । దేన ప్రజనయి పొడమెదఁ గాన యేను**
నన్నుఁ గనుచున్న నది మోక్షణంబు సేయు । నాశపడ; నట్టులగుటఁ బ్రజాభియుక్తి. **27**

ప్రతిపదార్థం: నాకున్= మానవుడికి; ప్రజ= సంతతి; గతిన్+ఇచ్చున్= మోక్షాన్ని ఇస్తుంది; అనంగన్+వలవదు= అనటం వద్దు; ఏను+అ= నేనే; ప్రజన్+అయి= సంతతినై; పొడమెదన్= పుట్టుతాను; కాన= కావున; ఏను= నేను; నన్నున్ కనుచున్నన్= కంటుండగా (ప్రసవిస్తుండగా); అది= ఆ సంతతి; మోక్షణంబు+చేయు+ఆశపడను= మోక్షం కలిగించేందుకు ఆశపడను (మోక్షం కలిగిస్తుందని ఆశించలేను); అట్టులు+అగుటన్= ఆ విధంగా ఆశించటం; ప్రజా+అభియుక్తి= సంతతిమీద (వ్యాజ్యం - నేరం మోపటం.)

తాత్పర్యం: 'సంతతిద్వారా అమృతత్వం, అదే మోక్షం' అని అనుకొంటే అది చెల్లదు. ఎందుకంటే, నేనే సంతతిగా పుట్టటం జరుగుతుంది తప్ప వేరుగాదు. నన్ను నేను జన్మింపజేసికొంటూ ఆ సంతతినుండి మోక్షాన్ని ఆశించటం ఉచితం కాదు. పైగా ఆ విధంగా ఆశించటం సంతతిమీద నేరం మోపటం అవుతుంది. సంతతి ప్రయోజనం ఆత్మమోక్షమే అనటం సంతానం మీద అభియోగం నెరపటమే.

విశేషం: సంతతి మోక్షదాయకం కాజాలదు. ఎందుకంటే 'ఆత్మా వై పుత్రనామాసి' అంటూ తానే తనకు జన్మనిచ్చుకొంటున్నాడు తప్ప వేరుకాదు. సంతానం మోక్షహేతువని అనుకొని సంతతినుండి ముక్తికై నిరీక్షించటం ఒక విధంగా సంతతిపై వ్యాజ్యం నెరపటం వంటిది. ఒకవేళ యజ్ఞం ద్వారా ముక్తి లభిస్తుందేమో అనే సందేహాన్ని తీరుస్తూ క్రింది పద్యాన్ని ప్రారంభిస్తున్నాడు.

క. **విను పశుయజ్ఞము హింసన । మనంతఫలదంబు గా; దహంకృతిసహితం**
బనఘా! వాఙ్మనసనియమ । మను యాగం బిచ్చు నవ్యయానందంబున్. **28**

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా!; విను= ఆలకించుము; పశుయజ్ఞము= పశువులతో చేసే యాగం; హింసనము= హింస; అనంతఫలదంబు= అంతంలేని ఫలితాన్ని ఇచ్చేది; కాదు= కాజాలదు; అహంకృతి సహితంబు= అహంకారంతో కూడింది; వాక్+మనస నియమము= మాటను మనస్సును నిగ్రహించటం; అను యాగంబు= అనే యజ్ఞం; అవ్యయ+ఆనందంబున్= నశించని ఆనందాన్ని; ఇచ్చున్= కలిగిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ తండ్రీ! ఆలకించుము. పశువులతో యజ్ఞం చేసి మోక్షాన్ని పొందలేవు. పైగా అది హింస. అందువలన గొప్ప ప్రయోజనాన్ని ఫలితాన్ని యజ్ఞ నిర్వహణంద్వారా అందుకొనలేవు. యజ్ఞనిర్వహణలో అహంకారం వ్యక్తమవుతుంది. ఆలోచించి చూస్తే కొత్త యజ్ఞం ఒకటుంది. అది మాటను, మనసును నిగ్రహించుకొనటం. ఈ వాఙ్మనసనియమరూపమైన యజ్ఞం ద్వారా శాశ్వతానందం కొత్తగా లభిస్తుంది.

విశేషం: పరంపరగా కొనసాగుతూ వస్తున్న యజ్ఞం హింస తప్ప అన్యం కాదు. హింస అనంతఫలితాలను ఇవ్వలేదు. పైగా అది అహంకార సూచనగా కూడా కనిపిస్తుంది. నిజమైన యజ్ఞమంటే వాక్కునూ మనస్సునూ నిగ్రహించుకొనటమే. నిగ్రహం ద్వారానే శాశ్వతానందం లభిస్తుంది. ఇది కొత్త యజ్ఞం. ఇక వాదాన్ని ముగిస్తూ.

వ. కావున నీవును. 29

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నీవును= నీవు కూడా.

తాత్పర్యం: కాబట్టి నీవు కూడా.

క. కామ క్రోధాద్యములగు । నీ మానస వికృతు లుడిపి యేకాంత గుహా
రాముఁడవై నిను వెదకుట । సూ మేఁ; లొండెల్ల నుడుగు సులభవివేకా!' 30

ప్రతిపదార్థం: సులభవివేకా!= సుఖంగా లభించే వివేకం కలవాడా!; కామక్రోధ+ఆద్యములు+అగు= కామం, క్రోధం మొదలైన; ఈ మానస వికృతులు= ఈ మనస్సునకు చెందిన వికారాలను; ఉడిపి= మాన్పి; ఏక+అంత గుహా+ఆరాముడవు+ఐ= ఏకాంతమైన గుహయందు ఆనందించువాడవు అయి; నినున్= (నీలోని) నిన్ను; వెదకుట= పరికించి తెలిసికొనుట; మేలు= ఉత్తమము; సూ= సుమా; ఒండు+ఎల్లన్= ఇతరమంతయును; ఉడుగుము= త్యజించుము, విసర్జించుము.

తాత్పర్యం: నీవు అమృతార్థివైతే నీ మానసవికారాలయిన కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం - అనే దుర్గుణాలను విసర్జించుము. ఏకాంత ప్రదేశాన నిశ్చల మనస్కుఁడవై నిన్ను నీవు అన్వేషించుకొమ్ము. అదే మేలు. ఇతర వ్యవహారాలు అన్నిటినీ త్యజించుము.'

విశేషం: ఇక్కడ సులభవివేకా! - అని సంబోధించాడు. వివేకం అందరికీ సులభం కాదు. కొందరి కయితే అది ఎప్పటికీ దుర్లభమే. సంస్కారం కారణంగా కొందరికి వివేకం వెంటనే కలుగుతుంది. ఇక్కడ తనయుడు తండ్రి స్వభావాన్ని గుర్తించి, వెంటనే వివేకంతో తాను తెల్పిన జ్ఞానమార్గాన పయనించి ఆత్మజ్ఞతతో ముక్తిని పొందుమంటున్నాడు. ముక్తిప్రాప్తికి వికారరహిత మనస్సు అవసరమనీ, ఏకాంతవాసమూ అభిలషణీయమనీ తనయుడి కథనం.

ఈ ఇతిహాసమే విలక్షణంగా ఆలోచింపజేసేదిగా ఉన్నది. తండ్రి శ్రోత తనయుడు ఉపదేష్ట. తండ్రి సంప్రదాయవాది ఆనాటికి, తనయుడు ప్రయోగవాది. ప్రయోగానిది సంప్రదాయం మీద పైచేయిగా నిరూపితం కావటం మంచిలక్షణం. లేకుంటే మానవ ప్రగతి ఆగిపోతుంది మరి!

క. అని పుత్త్రుం డుపదేశిం । చిన జనకుం డట్లు చేసి చెందె సుఖంబున్
మనుజేంద్ర! యవ్విధము గని । కొని యూఁదుము సత్యధర్మ కుశలత్వంబున్.' 31

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పుత్త్రుండు= కొడుకు; ఉపదేశించినన్= బోధించగా; జనకుండు= తండ్రి; అట్లు+అ= ఆ విధంగానే; చేసి; సుఖంబున్= సౌఖ్యాన్ని; చెందెన్= పొందాడు; మనుజ+ఇంద్ర!= నరులకు అధిపతీ!; ఆ+విధము= ఆ పద్ధతిని; కని కొని= పొంది; సత్యధర్మ కుశలత్వంబున్= సత్యమందును, ధర్మమందును నేర్పరితనమును; ఊఁదుము= వహించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా కొడుకు ఉపదేశించగా తండ్రి కొడుకు ఉపదేశాన్ని గ్రహించి, ఆ విధంగానే చేసి శాశ్వత సౌఖ్యాన్ని అందుకొన్నాడు. కాబట్టి ఓ రాజా! (ధర్మనందనా!) నీవూ ఆ మేధావి ఉపదేశాన్ని అర్థం చేసికొని ఆచరించి సత్యప్రవర్తనలోనూ, ధర్మ నిర్వహణంలోనూ నేర్పరివి కమ్ము.'

వ. అని చెప్పిన విని యజాతశత్రుండు శంతనుపుత్రునితో 'జగంబున ధనవంతులు నధనులుం గలిగి యుండుదురు. వారలలోన సుఖు లెవ్వరు? దుఃఖు లెవ్వ?'రని యడిగిన నక్కురుపితామహుండు 'శమ్యాకుం డను నొక్క శాంతిపరాయణ బ్రాహ్మణుండు సంసారంబు వదలవిడిచి కూడు సీరకు నవసియుండునట్టివాఁడు; దొల్లి నాకడకు వచ్చి గోష్ఠీప్రసంగంబున నుపదేశించిన వచనంబులు గలవు. వాని వినుమవి భవత్ప్రశ్నంబునకు నుత్తరంబులై యుండు' నని పలికి యిట్లనియె. 32

ప్రతిపదార్థం: అని= పైవిధంగా; చెప్పినన్= పలుకగా; విని= ఆలకించి; అజాతశత్రుండు= (పుట్టని శత్రువులు కలవాడు) ధర్మరాజు; శంతను పుత్రునితోన్= శంతనుడి కొడుకు భీష్ముడితో; జగంబునన్= లోకమందు; ధనవంతులున్= ధనం కలవారు; అధనులును= ధనంలేనివారును; కలిగి+ఉండుదురు= ఉంటున్నారు; వారలలోనన్= అట్టి ఆ ఇరుతెగలవారిలో; సుఖులు+ఎవ్వరు?= సుఖం కలవారు ఎవరు?; దుఃఖులు+ఎవ్వరు?= దుఃఖం కలవారు ఎవరు?; అని; అడిగినన్= ప్రశ్నించగా; ఆ+కురుపితామహుండు= ఆ కురువంశపు తాత(గారు); శమ్యాకుండు+అను నొక్క శాంతి పరాయణ బ్రాహ్మణుండు= శమ్యాకుడు అనే పేరుగల ఒక శాంతిని ఆశించే బ్రాహ్మణుడు; సంసారంబు= కుటుంబం; వదలన్+విడిచి= తొలగేటట్లు త్యజించి; కూడు+చీరకున్= కూటికి గుడ్డకు కూడా; నవసి+ఉండునట్టివాఁడు= కొరవడి ఉండేవాడు; తొల్లి= ముందు; నా కడకున్= నా దగ్గరకు; వచ్చి= ఏతెంచి; గోష్ఠీ ప్రసంగంబునన్= చర్చా సందర్భంలో; ఉపదేశించిన= బోధించిన; వచనంబులు= మాటలు; కలవు= ఉన్నవి; వానిన్= ఆ మాటలను; వినుము= ఆలకించుము; అవి= ఆ మాటలు; భవత్ ప్రశ్నంబునకున్= నీ ప్రశ్నకు, ఉత్తరంబులు+ఐ= సమాధానాలై; ఉండున్= ఉంటాయి; అని; పలికి= చెప్పి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ మేధావి వృత్తాంతం విన్న తరువాత ధర్మరాజు భీష్ముడిని ఇట్లా ప్రశ్నించాడు: 'లోకంలో ధనవంతులు, నిర్ధనులు అని రెండు విధాలుగా జనులు కనిపిస్తుంటారు. వారిలో సుఖవంతు లెవరు? దుఃఖభాజను లెవరు?' అనగా దానికి ఆ కురువంశపితామహుడు ఇట్లా సమాధాన మిచ్చాడు. శమ్యాకుడు అనే శాంతికాముకుడైన బ్రాహ్మణుడు ఒకడు కుటుంబాన్ని త్యజించి కూడుగుడ్డకు కూడా కటకటపడుతూ పూర్వ మొకనాడు నా దగ్గరకు వచ్చి నాతో గోష్ఠినెరపుతూ ప్రసంగవశాన పలికిన పలుకులు కొన్ని ఉన్నాయి. ఆ పలుకులలో నీ ప్రశ్నకు సమాధానాలు దొరుకుతాయి' అంటూ ఇట్లా చెప్పాడు.

విశేషం: లోకంలో ధనమే సుఖశాంతులకు మూలమనే గట్టి అభిప్రాయ మొకటి ప్రాచీనకాలంనుండి పాతుకుపోయి ఉన్నది. ఆ అభిప్రాయంలోని సత్యాసత్యాలను తెలియజెప్పటానికి ఉద్దిష్టమైన దీ వృత్తాంతం.

తే. 'ధనము కలిమియు లేమియుఁ ద్రాసునందు । నిలిపి యెత్తంగ ములు సూపె నిర్ధనత్వ
మెక్కుడై; దాని దిక్కున నెట్టులన్న । వినుము గుణదోషముల భంగి విస్తరింతు. 33

ప్రతిపదార్థం: ధనము కలిమియున్= డబ్బు కలిగి ఉండటం; లేమియున్= (ధనం) లేకుండటం; త్రాసునందున్= కాటాలో; నిలిపి= ఉంచి; ఎత్తంగన్= పైకి లేపగా; నిర్ధనత్వము= డబ్బులేమి; ఎక్కుడు+ఐ= అధికమై; దాని దిక్కునన్= ఆ లేమి వైపునకు; ములు+చూపెన్= ముల్లు (త్రాసులోని భారాన్ని నిర్ణయించే పరికరం) జరిగినది - త్రాసు వంగింది; ఎట్టులు+అన్నన్= ఏ విధంగా అనినచో; వినుము= ఆలకించుము; గుణదోషముల భంగి= గుణాల దోషాల తీరు; విస్తరింతున్= వివరిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కలిమి, లేమి - అనే ఈ రెంటిలో ఏది సుఖకరమైనది? అనే ప్రశ్నకు సమాధానంకొరకు ఆ రెంటిలో ఏది ఉత్తమమో నిర్ణయించటం కొరకు ఆ రెంటిని త్రాసులో పెట్టి తూచగా త్రాసులోని ముల్లు లేమివైపునకే మొగ్గింది. లేమి కలిమి కన్నా ఎట్లా ఉత్తమం? అంటావా? వినుము. ఆ రెండింటిలోగల గుణదోషాలను వివరిస్తాను.

విశేషం: చూచేవాడినిబట్టి చూడబడే వస్తువు అనేక విధాలుగా అగుపిస్తుంది. చూచే వ్యక్తి సామాన్యుడయినప్పుడు చూడబడే వస్తువూ సామాన్య రీతిలోనే గోచరిస్తుంది. అట్లా కాకుండా అసామాన్యుడైనప్పుడు ఆ వస్తువూ అసామాన్యంగా కొత్తగా భాసించే వీలున్నది. ఇక్కడ అదే జరిగినది.

క. ధనము గలవాఁడు మృత్యు వ । దనమున నున్నట్లు భయము దన చిత్తమునం
దనుకగ నుల్లల నుడుకును । విను శిఖి చోరాదిముఖ్య విషయాపదకున్. 34

ప్రతిపదార్థం: ధనము కలవాఁడు= ధనవంతుడు; మృత్యువదనమునన్= మరణం యొక్క నోటియందు; ఉన్నట్లు= ఉన్న విధంగా; భయము= భీతి; తన చిత్తమునన్= మనస్సునందు; తనుకగన్= తాకగా; శిఖి చోర+అది ముఖ్య విషయ+ఆపదకున్= అగ్ని, దొంగలు మున్నగు ముఖ్య వస్తువుల వలన విపత్తుకు; ఉల్లలన్= ఉల్ ఉల్ అంటూ (ఉడికేటప్పుడు వచ్చే ధ్వని); ఉడుకును= తాపంపొందును; విను= ఆలకించుము.

తాత్పర్యం: ధనవంతుడు ధనం కారణంగానే మృత్యుముఖంలో ఉన్నట్టుగా నిత్యం భయభ్రాంతులకు లోనౌతూ నిప్పువలననో, దొంగలవలననో, కాకపోతే మరొక విధంగానో తన డబ్బు ఎప్పుడు నశిస్తుందో అనే తల్లడపాటుతో సుఖశాంతులకు దూరమై జీవనం సాగిస్తూ ఉంటాడు.

విశేషం: నరుడు సుఖశాంతుల కోసమే ధనార్జన చేస్తాడు. ప్రారంభదశలో ధనంవలన సుఖమూ, తద్వారా శాంతీ లభిస్తాయి. అయితే ఈ ఆర్జనాపరమైన ఆశ పెరిగిపోతూ ధనం కూడా అమితంగా ఒనగూడినప్పుడు వ్యతిరేక ఫలితాలు వస్తాయి. అంటే ఆ ధనమే నరుడి సుఖశాంతులకు హానికరంగా పరిణమిస్తుంది.

క. కోపంబును లోభంబును । నేపారి మనంబు గలఁప నెప్పుడుఁ జింతా
తాపంబు నొందు సధనుం । డాపదగా కవ్విధము సుఖావహమగునే? 35

ప్రతిపదార్థం: సధనుండు= ధనంతోఉన్నవాడు; కోపంబును= కోపమూ; లోభంబునున్= పేరాసయు; ఏపారి= పెరిగి; మనంబు= మనస్సు; కలఁపన్= కలచివేయగా; ఎప్పుడున్= ఎల్లప్పుడు; చింతా తాపంబున్= దిగులువలన కలిగే, ఉడుకును; ఒందున్= పొందుతాడు; ఆ+విధము= ఆ పద్ధతి; ఆపద+కాక= దుఃఖకర పరిస్థితి కాక; సుఖ+ఆవహము+అగునే?= సుఖాన్ని కలిగించేది అవుతుందా? (కాదు).

తాత్పర్యం: డబ్బు కారణంగా నరుడు కోపానికీ, అత్యాశకు లోనై ముందు మనస్సు పాడుచేసికొంటాడు. మనస్సు నిరంతరం కలతతో ఉన్నప్పుడు దిగులూ విచారం తప్పవు. ఈ స్థితి, దుఃఖం కాకుండా సుఖమా?

విశేషం: సుఖశాంతులు అనేవి మనస్సుకు చెందిన అనుభవాలు. డబ్బు పెరిగినప్పుడు మానవసంబంధాలలో మార్పులు వస్తాయి. కోపతాపాలు అధికమౌతాయి. పైగా ఈ ధనం కూడే కొద్దీ లోభమూ పెరుగుతూ ఉంటుంది సాధారణంగా. దానితో మనస్సు కలత చెంది వేదనలు మిగులుతాయి. ఇది ధనవంతుడి స్థితి. దీనిని సుఖమని ఒప్పుకోలేము.

ఇక నిర్ధనుడి స్థితిగతులను వివరిస్తున్నాడు.

క. ఎచ్చోటనైన నధనుఁడు । విచ్చలవిడి నుండు; లేదు వెఱ పించుకయుం;
బొచ్చెపుఁజందం బొల్లఁడు; । మెచ్చరె సురలైనఁ? బలుకు మృదువై యుండున్. 36

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అధనుఁడు= డబ్బులేనివాడు; ఏ+చోటన్+ఐనన్= ఏ స్థలంలోనైనా; విచ్చలవిడిన్= అధిక స్వేచ్ఛతో; ఉండున్= నిలుచును; వెఱపు+ఇంచుకయున్= భయం కొంచెం కూడా; లేదు= ఉండదు; పొచ్చెము+చందంబు= కపటపద్ధతి; ఒల్లఁడు= అంగీకరించడు; పలుకు= మాట; మృదువు+ఐ= మెత్తనిదై; ఉండున్= ఉంటుంది; సురలైనన్= దేవతలయిననూ; మెచ్చరె?= పొగడరా?

తాత్పర్యం: నిర్ధనుడు ఎక్కడైనా స్వేచ్ఛగా ఉండగలడు. కొంచెం కూడా భయముండదు. కపటప్రవర్తన అంగీకరించడు. మాట మృదువుగా ఉండటంతో జనప్రియుడుగా మారే వీలుంటుంది. ఇన్ని సుగుణా లున్నప్పుడు దేవతలైనా ఆ నిర్ధనుడిని మెచ్చుకోవలసిందే!

విశేషం: ధనాశలేని కారణాన జీవితంలో కపటప్రవృత్తికి అవసరం ఉండదు. మాటలో మార్దవంవలన బ్రతుకు సుఖమయంగా ఉంటుంది.

క. లోకము చందము గనికొని । యీ కానఁగ నగు ధనాదు లెల్లను గాల
వ్యాకులతఁ బొందఁ గలయవి । గాకుండమి యెఱిఁగి విడుపు గడుఁ జదు రెందున్. 37

ప్రతిపదార్థం: లోకము చందమున్= లోకము యొక్క తీరు తెన్నులు; కనికొని= గ్రహించి; ఈ కానఁగన్+అగు= ఈ కనిపించే; ధన+ఆదులు+ఎల్లను= డబ్బు మొదలైనవి అన్నీ; కాలవ్యాకులతన్= కాలంవలన నాశనమును; పొందన్+కల+అవి+కాక+ఉండమి= చెందేవికాకుండా ఉండలేని స్థితి (చెందే తీరవలసిన స్థితిని); ఎఱిఁగి= గ్రహించి; విడుపు= ఎడబాటు-ధనంనుండి; ఎందున్= ఎక్కడైనా; కడున్= మిక్కిలి; చదురు= నేర్పు.

తాత్పర్యం: లోకంలోని తీరు తెన్నులు గ్రహించి, మన ఈ కన్నులకు అగుపించే డబ్బాదస్కం మొత్తం చివరకు కాలప్రభావాన నశించక తప్పనివే అనే జ్ఞానంతో డబ్బునుండి ముక్తి పొందటం ఎప్పుడైనా ఎక్కడైనా నేర్పరితనమే.

విశేషం: సృష్టిలో పుట్టిన ప్రతిదీ గిట్టేదే. కాలం దేనినీ మిగల్చదు. అటువంటప్పుడు మనిషీ నశిస్తున్నాడు. ఇది లోకస్థితి. ఈ చందం గమనించి నరు డార్జించే డబ్బుకూ కాలంచేతిలో నాశనం తప్పదు అనే జ్ఞానం కలిగి డబ్బుకు దూరంగా జీవించటం నేర్పు. చివరకు పిండితార్థ ప్రతిపాదకంగా ఒక పద్యం.

క. ధనవత్త్వము దుఃఖకరం । బని కని తత్కాంక్ష విడుచు నతని కధనతా
జనితాత్మాధీనత్వం । బనుపమ సౌఖ్యంబు సేయు నక్షీణముగన్.' 38

ప్రతిపదార్థం: ధనవత్త్వము= డబ్బుగలవాడితనం; దుఃఖకరంబు+అని= దుఃఖాన్ని కలిగించేది అని; కని= తెలిసి; తద్ కాంక్ష= ఆ కోరిక; విడుచు+అతనికిన్= వదలేవానికి; అధనతా జనిత+ఆత్మ+అధీనత్వంబు= నిర్ధనత్వం వలన కలిగిన తనకు (తాను)లోబడిన తనం; అక్షీణముగన్= నశించకుండా; అనుపమ= సాటిలేని; సౌఖ్యంబు+చేయున్= సుఖం కలిగిస్తుంది.

తాత్పర్యం: నరుడు డబ్బుకలిగి ఉండటం దుఃఖహేతువు - అనే జ్ఞానం కలిగి, డబ్బు మీది కోరికను విడిచిపెట్టినప్పుడు ఆ లేమి కారణంగా తన అధీనంలో తాను ఉండగలడు. ఈ ఆత్మాధీనత్వ మనేది ధనవంతుడికి అసాధ్యం. ముందుగా అతడు ధనానికి అధీనుడైతే తప్ప ఆ ధనవత్త్వం కొనసాగదు మరి! కాగా ఈ ఆత్మాధీనత్వ మనే ఒక్క లక్షణంవలన సాటిలేని సుఖశాంతులు మనిషి పొందగలుగుతాడు.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇక్కడి ఆత్మాధీనత్వమనే ఈ లక్షణం నరులలో చాలా అరుదుగా కనిపిస్తుంది. ప్రయోజనాకాంక్షిగా ఉన్న ప్రతివాడూ ఆత్మాధీనత్వాన్ని తనకు తాను అధిపతిగా ఉండగలిగినతనాన్ని వదులుకోవలసినవాడే. ప్రయోజనాలన్నీ లోకాన సామాన్యంగా ధనానికి ప్రతిరూపాలే. కాబట్టి ధనాశ వదలితే ఇక వదిలించుకొనవలసింది ఏదీ మిగులదు.

భీష్ముఁడు ధర్మజునకు మంకి యను బ్రాహ్మణుని చరిత్రంబు సెప్పుట (సం ॥ 12-171-4)

వ. అని చెప్పె ననిన విని ధర్మతనయుండు పితామహుతో 'ధన తృష్ణాభిభూతుండగు పురుషుం డేమిట సుఖియగు?' ననుటయు నయ్యమరనదీనందనుండు 'ధనార్జనంబుతోడి విసువుటం బుట్టిన విడుపున సుఖంబు గలుగు నయ్యర్థంబుఁ దెలిపెడునది యొక్క యితిహాసంబు గలదు విను'మని యిట్లనియె.39

ప్రతిపదార్థం: అని= పై విధంగా; చెప్పెన్= శమ్యాకుడు పలికాడు; అనినన్= అనగా; విని= ఆలకించి; ధర్మతనయుండు= ధర్మరాజు; పితామహుతోన్= తాతతో; ధనతృష్ణా+అభిభూతుండు+అగు= డబ్బుమీది పేరాసచేత (ఆక్రమించబడిన); పురుషుండు= నరుడు; ఏమిటన్= దేనితో; సుఖి+అగున్= సుఖం కలవాడు ఔతాడు?; అనుటయున్= అనగా; ఆ+అమర నదీనందనుండు= ఆ దేవతల నది (గంగా) కొడుకు (భీష్ముడు); ధన+ఆర్జనంబుతోడి విసువుటన్= డబ్బు సంపాదించటంతో (కలిగే) విసుగుదల వలన; పుట్టిన= కలిగిన; విడుపునన్= ఎడబాటుతో; సుఖంబు+కలుగున్= సౌఖ్యం సిద్ధిస్తుంది; ఆ+అర్థంబున్= ఆ విషయమును; తెలిపెడు+అది= తెలియజేసేది; ఒక్క= ఒక; ఇతిహాసంబు= జరిగిన కథ; కలదు= ఉన్నది; వినుము= ఆలకించుము; అని; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: ఈ విధంగా శమ్యాక వచనాలు విన్న తరువాత, ధర్మరాజు మరొక ప్రశ్న తన తాతకు వేశాడు. 'డబ్బుమీద పేరాసకు లోనైనవాడు ఎప్పుడు ఏ విధంగా సుఖం పొందుతాడు?' అనేది ఆ ప్రశ్న. దానికి తాతగారి సమాధానం చాలా సూటిగా ఉన్నది. 'ఏమీ లేదు! ధనార్జనలో విసిగివేసారి దానినుండి ముక్తిని (ఎడబాటు) పొందినపుడే వాడి కిక సుఖం లభిస్తుంది. ఈ అంశాన్ని తెలిపే కథ ఒకటి ఉన్నది వినుము.' అంటూ ఇట్లా అన్నాడు.

విశేషం: ఆశ వేరు, పేరాస వేరు. ఆశ అవసరమే, పేరాశ - తృష్ణ మనిషిని దుఃఖంలో ముంచుతుంది. తృష్ణ అంటే దాహం, అది తీరని దాహం. దానినుండి విడివడటమే సుఖం.

సీ. మంకి నాఁ బరఁగు బ్రాహ్మణుఁడు ధనేచ్ఛమై । వర్తించు శిక్షింపవలయునట్టి
గుజ్జుదోయిని జట్టిగొని ప్రీతి లంకించి । యుండ లంకియతోన గండు మీఱి
పాటె నక్కోడియల్ పడియున్న గనపలొ । ట్టేనుంగు పై నది యెగసి పఱవ
నుభయ పార్శ్వంబుల నురిపోసిన ట్లవి । వ్రేలి చచ్చినఁ జూచి విప్రుఁ డడలి

తే. 'రత్నములుఁ బోని వత్సతరంబు లకట! । వ్రేలుచున్నవి లొట్టేన్గు వెంటఁ దవిలి'
యనుచు నిర్వేద మొంది యిట్లనియెఁ దన్నుఁ । గరుణతోడఁ గనుంగొను నరులతోడ. 40

ప్రతిపదార్థం: మంకినాన్= మంకి అనగా; పరఁగు= ఉండు; బ్రాహ్మణుఁడు= విప్రుడు; ధన+ఇచ్ఛమైన్= డబ్బుమీది కోర్కెతో; వర్తించున్= ప్రవర్తిస్తాడు; శిక్షింపన్+వలయు+అట్టి= (పనిపాటులు) నేర్పవలసినట్టి; గుజ్జుదోయిని= కోడెల జంటను; జట్టిన్+కొని= అమ్మకంలో కొని; ప్రీతిన్= ప్రేమతో; లంకించి+ఉండన్= (ఒకదానితో మరొకటి) జతచేసి ఉండగా - కట్టుత్రాటితో కట్టివేసిఉండగా; లంకియతోన= కట్టు త్రాటితోనే; ఆ+కోడియల్= ఆ కోడెదూడలు; గండు మీఱి= సామర్థ్యం హెచ్చి; పడి+ఉన్న= పడుకొనిఉన్న; గనప= పెద్ద; లొట్టె+ఏనుంగుపై= ఒంటెపై - మీదుగా; పాటెన్= పరుగెత్తింది; అది= ఆ ఒంటె; ఎగసి= లేచి; పఱవన్= పరుగెత్తగా; ఉభయపార్శ్వంబులన్= (దాని) రెండువైపులా; ఉరిపోసినట్లు= ఉరివేసినట్లుగా; అవి= ఆ కోడెలు రెండు; వ్రేలి= వ్రేలాడి; చచ్చినన్= చావగా; చూచి= కని; విప్రుఁడు= బ్రాహ్మణుడు; అడలి= భయపడి;రత్నములున్+పోని= రత్నాలవంటి; వత్సతరంబులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కోడెదూడలు; అకట!= అయ్యో!; లొట్టి+ఏన్గు వెంటన్= ఒంటెవెంట తగుల్కొని; వ్రేలుచున్నవి= వ్రేలాడుతున్నాయి; అనుచున్= అనుకొంటూ; నిర్వేదము+ఒంది= విరక్తి చెంది; తన్నున్= తనను; కరుణతోడన్= దయతో; కనుంగొను నరులతోడన్= చూచే మనుష్యులతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: మంకి అనే పేరుగల బ్రాహ్మణు డొకడు ధనాశతో జీవిస్తూ ఉండేవాడు. ధనార్జనకొరకే, అతడు పనిపాటులు నేర్పవలసిన కోడెదూడలను కొని, రెంటిని ఒకే తాటితో (మెడలకు) కట్టి ఉంచాడు. ఆ దూడలు చురుకుపుట్టి హఠాత్తుగా రెండూ కలిసి పరుగెత్తుతూ త్రోవలో పడుకొని ఉన్న పెద్ద ఒంటెమీదుగా ఒంటెకు అటు ఒకటి ఇటు ఒకటిగా దాటబోయాయి. వాటి అలజడికి ఆ ఒంటె కూడా పైకి లేచి పరుగెత్తటం మొదలు పెట్టింది. ఆ ఎత్తైన ఒంటెకు ఇరువైపులా ఈ కోడెల జంట మెడకున్న పలుపుత్రాటితో పైకి లేచింది. మెడకున్న పలుపే ఉరికాగా కోడెలు రెండూ చచ్చి వ్రేలాడాయి. క్షణాలలో ఇదంతా జరిగిపోవటంతో ఆ మంకి విప్రుడు 'అయ్యో! రత్నాలవంటి కోడెలు క్షణంలో శవాలుగా మారిపోయి ఒంటెకు అటూ ఇటూ వ్రేలాడుతున్నాయే!' అని మనస్సున నిర్వేదం పుట్టగా, తనను దయతో జాలితో చూస్తున్న జనాన్ని ఉద్దేశించి ఇట్లా అన్నాడు.

విశేషం: నరుడు వాంఛించింది ధనాన్ని, సిద్ధించింది అతడికి పెద్ద నష్టం. దీనిలో అతడి ప్రమేయ మేమీ లేదు. అంతా దైవనిర్ణయమే.

తె. సారమతిఁ బరికింపంగఁ బౌరుషంబు । కంటె దైవంబు ముఖ్యంబు గార్యసిద్ధి;
కెచట నేనియుఁ బౌరుష మెసకమెసఁగె । నేని యది దైవదత్తంబ యింత నిజము. 41

ప్రతిపదార్థం: సారమతిన్= శ్రేష్ఠమైన బుద్ధితో; పరికింపఁగన్= పరీక్షించగా; కార్యసిద్ధికిన్= పని నెరవేరటానికి; పౌరుషంబు కంటెన్= పురుష ప్రయత్నంకంటె; దైవంబు= భాగ్యం, అదృష్టం; ముఖ్యంబు= ప్రధానం; ఎచటన్+ఏనియున్= ఎక్కడైనా; పౌరుషము= పురుషకారము; ఎసకము+ఎసఁగెన్+ఏని= ప్రకాశించినదేని; అది= అట్లవటం; దైవదత్తంబు+అ= భాగ్యంచేత ఈయబడిందే; ఇంత= ఇది; నిజము= సత్యం.

తాత్పర్యం: తొందరపాటు, పక్షపాతం లేకుండా శ్రేష్ఠమైన బుద్ధితో ఆలోచించి చూస్తే కార్యసిద్ధి జరగాలంటే మానవ యత్నంకంటే దైవబలమే ముఖ్యం. ఎక్కడయినా ఎప్పుడయినా మానవయత్నం ఫలించినట్లు కనిపించినా నిజానికి అది దైవానుగ్రహమే తప్ప అన్యం కాదు.

విశేషం: నరుడు కరణం, దైవం కర్త. (కరణం= ఉపకరణం పనిముట్టు. కర్త= చేసేవాడు.)

వ. కావున. 42

తాత్పర్యం: కాబట్టి. (కార్యసిద్ధికి మానవయత్నంకంటే దైవబలమే ప్రధానం కాబట్టి.)

క. మనమునకు సుఖము గోరెడు । జనులకు నర్థక్రియా విశారద భంగుల్
పొనుపడ విడిచి భరము లే । కునికియ యూహించి చూడ నుర వెబ్భంగిన్.' 43

ప్రతిపదార్థం: మనమునకున్= మనస్సుకు; సుఖము+కోరెడు జనులకున్= సౌఖ్యం కాంక్షించే నరులకు; అర్థక్రియా విశారద భంగుల్= వ్యవహారాలలో, చేష్టలలో సమర్థమైన తీరులను (గొప్ప యత్నాలను); పొనుపడన్= తగ్గించి; విడిచి= వదలి; భరము లేక+ఉనికి+అ= భారము (బరువు) లేకుండా ఉండటమే; ఊహించి చూడన్= ఆలోచించి చూస్తే; ఏ+భంగిన్= ఏ విధంగానైనా; ఉరవు= శ్రేష్ఠం, ఉచితం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సుఖమే పరమార్థమైనపుడు ఆ సుఖం దైవదత్తం తప్ప పురుషప్రయత్నం వలన సాధ్యంకాదని తెలిపోయినప్పుడు, నరుడు తన సర్వకార్యక్రమాలను, చేష్టలను, నైపుణ్యాలను పక్కకుపెట్టి, భారమంతా దైవం మీదే మోపి, తాను బరువు తీరి ఏ భారం మీదవేసికొనకుండా ఉండటమే ఉచితం.'

విశేషం: చేసినా చేయకపోయినా ఒకటే, అనే స్థితిలో పెద్దగా ప్రయత్నం చేయకపోవటమే ఉచితం. మనస్సు భారం లేకుండా తేలికగా ఉంటుంది. దైవదత్తమైనది నరుడిని చేరి తీరుతుంది.

వ. **అని పలికి యుద్దామంబైన కామంబు విడుపువడకున్నఁ జిత్తంబునకు నిర్వృతి గలుగునే? యను విచారంబు పుట్టి తదీయోత్సారణం బూహించి యా చిత్తధర్మంబు నుద్దేశించి.** **44**

ప్రతిదార్థం: అని= పై విధంగా; పలికి= చెప్పి; ఉద్దామంబు+ఐన= తీవ్రమైన; కామంబు= కోరిక; విడుపు+పడక+ఉన్నన్= వదలిపోకున్నచో; చిత్తంబునకున్= మనస్సునకు; నిర్వృతి= ఆహ్లాదం; కలుగునే?= ఏర్పడునా?; అను విచారంబు= అనే ఆలోచన; పుట్టి= కలిగి; తదీయ+ఉత్సారణంబు= దాని తొలగింపు; ఊహించి= యోచించి; ఆ+చిత్త ధర్మంబును= ఆ మనస్సుయొక్క స్వభావమును; ఉద్దేశించి= లక్షించి, లక్ష్యంగా ఉంచుకొని.

తాత్పర్యం: మనస్సుకు ఆహ్లాదం కలగాలంటే తప్పకుండా అది కోర్కెల తీవ్రతతో నిండి ఉండకూడదు. కోర్కెల తీవ్రతను మనస్సునుండి తోసివేయాలంటే ఏమి చేయాలి? - అనే ఆలోచనతో ఆ మంకి బ్రాహ్మణుడు తన మనస్సును గుర్తించి దానితో ఇట్లా ప్రసంగించబోతున్నాడు.

విశేషం: 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అనేది ఉపనిషద్ వాక్యం. సుఖ దుఃఖాలు మనోధర్మాలు. కాగా మనస్సును స్వాధీనపరచుకొంటె సుఖదుఃఖాలూ స్వాయత్తమైనట్లే!

క. **'నీ మూలం బే నెఱిఁగితిఁ । గామము! సంకల్పమునన కలిగెదు సంక**
ల్పామర్శరహితమగు చే । తోముద్రం దాల్తు నేను దుది యది నీకున్. **45**

ప్రతిపదార్థం: కామమ!= ఓ కోరికా!; నీ మూలంబు= నీ కారణము; ఏన్= నేను; ఎఱిఁగితిన్= తెలిసికొన్నాను; కామమ!= ఓ కోరికా!; సంకల్పమునన్+అ= భావనచేతనే; కలిగెదు= పుట్టెదవు; సంకల్ప+ఆమర్శ రహితము+అగు= భావన స్పర్శ లేనిదగు; చేతస్+ముద్రన్= మనస్సుయొక్క స్థితిని; నేను; తాల్తున్= ధరిస్తాను - వహించెదను; అది= ఆ మనోముద్ర; నీకున్= (కామమునకు); తుది= చివర సమాప్తి నాశనం.

తాత్పర్యం: మంకి తన మనస్సుతో ప్రసంగిస్తున్నాడు: 'ఓ కోరికా! నీ మూలాన్ని కనుగొన్నాను. నీవు సంకల్పం నుండి జన్మిస్తున్నావు. కాబట్టి నేను సంకల్ప స్పర్శ ఉండని మనోముద్రను వహించి నిన్ను నశింపజేస్తాను.'

విశేషం: మనస్సును సంకల్పరహితంగా చేయగలిగితే ముక్తి సిద్ధించినట్లే.

వ. **అని కామం బనునది గోర్కి గావునఁ గోర్కి యొప్పమి దేటపఱుపం దలంచి.** **46**

ప్రతిపదార్థం: అని= అని పలికి; కామంబు+అనునది= కామము అని పిలువబడేది; కోర్కి+కావున్= కోరిక కాబట్టి; కోర్కి+ఒప్పమి= కోర్కెయొక్క అనౌచిత్యము - తగనితనము; తేటపఱుపన్= స్పష్టపడేటట్లుగా చేయటానికి; తలంచి= ఆలోచించి.

తాత్పర్యం: కోర్కె ఏ విధంగా అనుచితమో స్పష్టపరచే అభిప్రాయంతో తన ఆలోచనను కొనసాగిస్తున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **సొమ్ము గోరినయంతన సుఖము గలుగ; । దది యుపార్జింపఁగా సిద్ధియగుట నిజమె?**
కలిగెనేని యనేక చింతల నొనర్చుఁ । జెడుట చావుతోఁ దుల్య మయ్యిడుమ యేల? **47**

ప్రతిపదార్థం: సొమ్ము= ధనమును; కోరిన+అంతన్+అ= కోరినంతనే; సుఖము= సౌఖ్యం; కలుగదు= పుట్టదు; అది= ఆ సొమ్ము; ఉప+ఆర్జింపఁగాన్= సాధించగా ; సిద్ధి+అగుట= నెరవేరుట; నిజము+ఎ?= సత్యమా? (సందేహము); కలిగెను+ఏని= సిద్ధించెనేని; అనేకచింతలన్= పెక్కు వెతలను; ఒనర్చున్= ఒనగూర్చును - తెచ్చిపెట్టును; చెడుట= సిద్ధింపకుండటం; చావుతోన్= మరణంతో; తుల్యము= సమానము; ఆ+ఇడుమ+ఏల?= ఆ కష్టం ఎందుకు?

తాత్పర్యం: సుఖప్రాప్తికి ధనం మూలం గావచ్చును. అయితే ఆ ధనం కోరినంతనే సిద్ధించదు. దానికై యత్నించాలి. యత్నిస్తే సిద్ధిస్తుందని నిశ్చయముండదు. సిద్ధిస్తే సిద్ధించవచ్చును. లేకుంటే లేకపోవచ్చును. అయితే సిద్ధిస్తే, ఆ ధనంతోపాటు ఎన్నో వెతలూ వెన్నంటి ఉంటాయి. అసలు సిద్ధించలేదంటే ఆ ఓటమి చావుతో సమానం. కాబట్టి ముందూవెనుకా అటూ ఇటూ అన్నివైపులా దుఃఖాలనే కలిగించే సొమ్ముకై సంకల్పించటమెందుకు?

విశేషం: కేవలం కోర్కెతో సుఖం లేదు. నిజమే. అది అందరికీ తెలిసిందే. ఇక్కడ మంకి చెప్పదలచిందేమిటంటే కోర్కెను నెరవేర్చుకోవటంలోనూ నిజంగా సుఖం ఉండదని, పైగా యత్నించి ఓడితే ఆ ఓటమి మరణం వంటిది. నిజమే మరి!

వ. **ఇచ్ఛా నిరసనంబు సుఖం'బని వెండియు.** **48**

ప్రతిపదార్థం: ఇచ్ఛా నిరసనంబు= కోర్కెను తిరస్కరించటం; సుఖంబు+అని= సంతోషమని; వెండియున్= మరియు.

తాత్పర్యం: కోర్కెను తిరస్కరించటంలోనే నిజమైన సుఖమున్నది. కోర్కెలు లేని మనస్సు ముక్తమే - అనుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **'శోకశ్రమ తృష్ణలకున్ । నీ కలిమియ యొలమగుట నీ కగపడు వాఁ**
డే కర్తవ్యము గానం । డో కామమ! నిన్ను దొఱఁగి యుండెద సుఖినై. **49**

ప్రతిపదార్థం: ఓ కామమ!= ఓ కోరికా!; శోక శ్రమ తృష్ణలకున్= ఇష్టనాశనంవలన దుఃఖానికి, అలసటకు, పేరాసకు - ఈ మూడిటికీ; నీ కలిమి+అ= (నీవు ఉండుటే) నీ ఉనికియే; ఓలము+అగుటన్= రహస్య స్థావరం కాబట్టి; నీకున్; అగపడువాఁడు= గోచరించేవాడు-నీ పాలిటబడినవాడు; ఏ కర్తవ్యము= ఏ చేయవలసిన పనినీ; కానండు= చూడడు; నిన్నున్; తొఱఁగి= వదలి; సుఖినై= సుఖం కలవాడనై; ఉండెదన్= జీవిస్తాను.

తాత్పర్యం: (మంకి ఇంకా కామంతోనే మాట్లాడుతున్నాడు.) 'ఓ కామమా! లోకంలో ఇష్టనాశనంవలన కలిగే దుఃఖానికి, ధనార్జనకై పడే శ్రమకీ, ఆర్జితమైన దానితో తృప్తిపడక ఇంకా ఇంకా ఆర్జించాలనే తపనకీ నీవే మూలస్థానానివి. నీవు ఆవహించిన వాడిని మరేదీ పట్టదు. కాబట్టి నిన్ను విడవటంలోనే సుఖం లభిస్తుంది.

విశేషం: శోకమూ దుఃఖమే అయినా, రెంటికీ భేదం ఉన్నది. ఇష్టజనం ఎడబాటువలన కలిగే దుఃఖం శోకం. ఆశ ముదిరితే తృష్ణగా మారుతుంది. ఆశ లేకుండా జీవించటం ఎట్లా సాధ్యమనిపిస్తుంది గాని, తృష్ణతో బ్రదకటం మాత్రం దురంతమైన అనుభవం.

క. **నీ వాస పఱుప ధనములు । గావించెదఁ బో వినాశకముల నుడుపఁగా**
నీ వశమె? కాన నీ చెడు । టే వగపుం దేదు పెనుపదే దైన్యంబున్? **50**

ప్రతిపదార్థం: నీవు= (కామాన్ని ఉద్దేశించిన పలుకు) ఓ కామమా! నీవు; ఆస పఱుపన్= ఆశపెట్టగా; ధనములు= సంపదలు; కావించెదన్+పో= సంపాదించితిని పో; వినాశకములన్= చేటులను; ఉడుపన్+కాన్= నశింపజేయటం; నీ వశము+ఎ?= నీ అధీనమా? (నీకు సాధ్యమా) కాదు; కానన్= కావున; నీ చెడుట= నీ యొక్క నశింపు; ఏ వగపున్+తేదు= ఏ దుఃఖాన్ని కలిగించదు; ఏ దైన్యంబున్= ఏ దీనత్వాన్ని, దిక్కులేనితనాన్ని; పెనుపదు= పెంచదు.

తాత్పర్యం: నీవు ఆశపెట్టిన కారణాన, తీవ్రంగా కష్టించి సొమ్ము ఆర్జించినా అనంతరం దాపురించే కష్టపరంపర దానిని దాచటానికి రక్షించటానికి పడవలసిన పాట్లు మిగిలే ఉంటాయి. ఈ కామం, ఆ కష్టపరంపర నుండి చేటులనుండి నరుడిని రక్షించలేదు. కాబట్టి నిన్ను నిరసించటంవలన ఏ దుఃఖమూ ఏర్పడదు. కొత్తగా ఏ దుర్దశా, దైన్యమూ ఆవహించదు.

విశేషం: కామానికి తల ఒగ్గితే ఒక దుఃఖం అదనంగా నరుని చేరటం తప్ప సుఖముండదు. దుఃఖంనుండి దుఃఖాన్ని చేరుకొనటంకంటె అసలు ఆ కామాన్నే త్రోసిరాజంటే సుఖంగా ఉండవచ్చును.

చ. **సులభమొ దుర్లభంబొ యని చూడ నెఱుంగవు గన్నదానిపై**
నలముదు కామమా! యిడుమ లందఁగఁ జేయుదు నిండు టేమిటం
గలుగదు నీకు నీతెఱఁ గగాధ రసాతల భంగి నీవు స
న్పొలమునఁ బోవకుండ నినుఁ బుచ్చెద బచ్చెన రూపు పోకలన్. **51**

ప్రతిపదార్థం: కామమా!= ఓ కోరికా!; సులభమొ= సుఖంగా లభించేదో; దుర్లభంబొ= దుఃఖంతో లభించేదో; అని చూడన్+ఎఱుంగవు= అని గమనించటం తెలియవు; కన్నదానిపైన్= చూచిన దానిమీద; అలముదు(వు)= చుట్టుకొందువు; ఇడుమలు+అందఁగన్+చేయుదు(వు)= కష్టములు పొందేటట్లు చేస్తావు; నీకున్; ఏమిటన్= దేనితోడనూ; నిండుట= పూర్తి కావటం; కలుగదు= ఉండదు; నీ తెఱఁగు= నీ పద్ధతి; అగాధ రసాతలభంగి= లోతైన పాతాళం వంటిది; నీవు చన్+పొలమునన్= నీవు వెళ్ళే చోట; పోవక+ఉండన్= వెళ్ళకుండ; నినున్= నిన్ను; బచ్చెనరూపు పోకలన్= రంగు (తోడి) ఆకారపు రీతులలో; పుచ్చెదన్= పెరికెదను, తొలగిస్తాను.

తాత్పర్యం: ఓ కామమా! నీ దృష్టి నీదిగాని, నీ కన్నుపడిన వస్తువు సులభమో కాదో నీవు పట్టించుకొనవు. అమాంతంగా దానిని ఆక్రమించి స్వాధీనపరచుకొనాలని చూస్తావు. ఆ విధంగా నరుడిని కష్టాలపాలు చేస్తావు. అగాధమైన పాతాళ లోకంవలె నీవు ఎన్ని కబళించినా నిండవు. ఇంకా పూర్తి కావలసింది మిగిలే ఉంటుంది. కాబట్టి నీవు వెళ్ళేదారిలో వెళ్ళకుండా, నీకు దూరంగా ఉండి, నిన్ను రంగుతో ఏర్పడిన ఆకారాన్ని తొలగించినట్లు తొలగించి రూపుమాపుతాను.

విశేషం: కామం పూరించే కొద్దీ మళ్ళీ ప్రకోపిస్తూనే ఉంటుంది. అందువలననే అంటారు పెద్దలు "న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి" అని. కామం కోర్కెల అనుభవాలతో ఎప్పటికీ తీరదని పై మాట తాత్పర్యం. రంగుతో ఒక ఆకారాన్ని ఏర్పరచినపుడు తిరిగి ఆ ఆకారాన్ని రూపుమాపటమూ సంకల్ప బలమున్నప్పుడు సాధ్యమే. కామాన్ని ఆ విధంగా నశింపజేస్తాడట మంకి. స్థిర సంకల్పు డతడు.

తే. **ధనము చేటున విసివి నామనము నిన్ను। నెడలవిడిచెనో కామమ! యేను శాంతి**
దాంతి సత్యక్షమాభూతదయలఁ జెంది। నాఁడ; లోభాదు లందవు నన్ను నింక. **52**

ప్రతిపదార్థం: ఓ కామమా!= ఓ కోరికా!; ధనము చేటునన్= సొమ్ము నాశనంతో (కోడెదూడల చావు); విసివి= విసిగి, అలసటచెంది; నా మనము= నా మనస్సు; నిన్నున్; ఎడలన్ విడిచెన్= తొలగ వదలింది; ఏను= నేను; శాంతి దాంతి సత్యక్షమా భూతదయలన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కోపం లేమిని, కర్మేంద్రియ నిగ్రహాన్ని, నిజమును, ఓర్పును, ప్రాణులయెడ కరుణను - ఈ అన్నిటిని; చెందినాఁడన్= పొందినవాడను; ఇంకన్= ఇకమీదట; నన్నున్; లోభ+ఆదులు= లోభం మొదలైనవి; అందవు= పొందవు.

తాత్పర్యం: ఓ కామమా! నీవెంట పరుగెత్తి దైవం ప్రతికూలించిన కారణాన ధననాశనం పొంది, విసిగి వేసారి ఉన్న నేను నిన్ను సంపూర్ణంగా తిరస్కరించాను. కామతిరస్కారంతో నాలోని కోపం నశించింది. ఇంద్రియ నిగ్రహం కలిగింది. ఓర్పు నెలకొన్నది. ప్రాణులయెడ కరుణ పాదుకొన్నది. కాబట్టి ఇకపై నన్ను నీ తోబుట్టువులైన లోభము యొక్క గుణాలు కూడా స్పృశించలేవు.

విశేషం: కామమొక్కటి తొలగిపోతే మిగిలిన చెడుగులన్నీ స్వయంగా దూరీకరించబడతాయి. కామమే సర్వదోషాలకూ నిలయం.

తే. **కామ సుఖ దివ్య సుఖములు కాంక్ష దొఱఁగు । మేలి షోడశాంశంబునఁ బోలలేవు**
గాన కామమ! నిను శత్రు కరణిఁ జంపి । బ్రహ్మపురమున నుండెద రాజుఁ బోలె.' **53**

ప్రతిపదార్థం: కామమ!= ఓ కోరికా!; కామ సుఖ దివ్య సుఖములు= కోర్కెవలన సౌఖ్యం, దేవలోక సౌఖ్యము ఈ రెండు సౌఖ్యాలు; కాంక్ష+తొఱఁగు మేలి షోడశాంశంబునన్= కోర్కెను విడవటం (అనే సుఖం) యొక్క గొప్ప పదహారవ భాగంతో; పోల లేవు= సరితూగలేవు; కానన్= కావున; నిను= నిన్ను; శత్రుకరణిన్= పగవాడినివలె; చంపి= నశింపచేసి; బ్రహ్మపురమునన్= పరబ్రహ్మ నగరాన; రాజు+పోలెన్= రాజువలె; ఉండెదన్= వసిస్తాను.

తాత్పర్యం: కోర్కెలు ఈడేరటంవలన కలిగే సుఖం, స్వర్గంలో లభించే సుఖం - ఈ రెండు సుఖాలూ పోల్చిచూచినపుడు నిన్ను త్యజించటంవలన కలిగే సుఖం ముందు దిగదుడుపే. కాబట్టి నిన్ను శత్రువువలె చంపి, పరబ్రహ్మయొక్క నగరంలో రాజువలె జీవిస్తాను.'

విశేషం: కాంక్షలు అనేకం. ఒకటి తరువాత మరొకటి అట్లా పుట్టుకొస్తూనే ఉంటాయి పదులు వందల సంఖ్యలో అవి. కాని కాంక్షాపరిత్యాగం ఒకటే. అది అద్వితీయం. అంటే రెండోది లేనిది అని అర్థం. కాబట్టి విలువలో కూడా ఆ వ్యత్యాసముండక తప్పదు మరి! అందుకే మంకి చివరకు నిష్కర్షగా కాంక్షాపరిత్యాగసుఖం ముందు మిగిలిన సుఖాలన్నీ అత్యల్పాలు అని ప్రకటించాడు అనుభవపూర్వకంగా.

అజగరచరిత వ్రతము (సం. 12-172-2,3)

వ. **అని పలికి యివ్విధంబునం గోడెలు సచ్చినం బుట్టిన నిర్వేదంబున సకలకామంబులం బరిత్యజించి దేవసముండై యుండె'నని చెప్పిన విని పాండవాగ్రజుం 'డేమి వర్తనంబున నరుండు వీత శోకుం డగుచుఁ జరించు? నెద్దానం జేసి పరమగతి వడయు?' ననుటయు ననిమిషనదీనందనుం డజగరచరితంబను నితిహాసంబు వినుము దాన నీ యడిగిన యర్థంబు దేటపడు. దానిం జెప్పెద; నజగర నామధేయుం డగు నొక్కబ్రాహ్మణునిఁ బ్రహ్లాదుండు శమప్రకారం బుపదేశింపుమని యభ్యర్థించిన నతం డతని కిట్లనియె.** **54**

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికి= చెప్పి; ఈ+విధంబునన్= ఈ పద్ధతిలో; కోడెలు= కోడెదూడలు; చచ్చినన్= చనిపోగా; పుట్టిన నిర్వేదంబునన్= కలిగిన రోతతోడి దుఃఖంతో; సకల కామంబులన్= ఎల్లకోర్కెలను; పరిత్యజించి= దిగవిడిచి; దేవసముండు+ఐ= దేవతతో సమానమైనవాడై; ఉండెన్= నివసించాడు; అని చెప్పినన్= అని పలుకగా; విని= ఆలకించి; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; ఏమి వర్తనంబునన్= ఏ ప్రవర్తనతో, నడతతో; నరుండు= మానవుడు; వీతశోకుండు+అగుచున్= నశించిన శోకంగలవాడుగా; చరించున్?= నడచును?; ఏ+దానన్+చేసి= దేనివలన; పరమగతి= పరమపదము, మోక్షం; పడయున్= పొందుతాడు?; అనుటయున్= అనగా; అనిమిష నదీ నందనుండు= దేవనది తనయుడు భీష్ముడు; అజగర

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చరితంబు+అను= అజగర చరితం అనే పేరుగల; ఇతిహాసంబు= చరిత్ర, జరిగిన కథ; వినుము= ఆలకించుము; దానన్= దానివలన; నీ అడిగిన+అర్థంబు= నీవు ప్రశ్నించిన విషయం; తేటపడున్= స్పష్టపడుతుంది; దానిన్+చెప్పెదన్= దానిని పలుకుతాను; అజగర నామధేయుండు+అగు= అజగరుడు అనే పేరుగలవాడగు; ఒక్క బ్రాహ్మణునిన్= ఒక విప్రుడిని; ప్రహ్లాదుండు= ప్రహ్లాదుడనే రాక్షసరాజు; శమప్రకారంబు= శాంతి పద్ధతి; ఉపదేశింపుము= బోధించుము; అని; అభి+అర్థించినన్= ప్రార్థించగా; అతండు= ఆ అజగరుడు; అతనికిన్= ఆ ప్రహ్లాదుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా దైవవశాన కోడెదూడలు హఠాత్తుగా మరణించగా మంకి ధనాశమీద విరక్తి కలిగి, కామాన్నే మొత్తంగా పరిత్యజించి, సుఖంగా దేవసమానంగా జీవించాడు' అని భీష్ముడు పలుకగా విని ధర్మజుడు - 'నరుడు ఏమి చేస్తే అతడి శోకం నశిస్తుంది? ఏ మార్గాన అతడు మోక్షాన్ని పొందగలడు?' అని ప్రశ్నించాడు. సమాధానంగా భీష్ముడు అజగర చరిత్ర అనే ఇతిహాసం అతడి ప్రశ్నలకు సమాధానం కాగలదని ఆ ఇతిహాసాన్ని వివరించటం ప్రారంభించాడు. రాక్షసరాజయిన ప్రహ్లాదుడు అజగరుడనే పేరుగల బ్రాహ్మణుడిని సమీపించి, తనకు శాంతి పద్ధతిని ఉపదేశించు మనగా, ఆ అజగరుడు ప్రహ్లాదుడితో ఇట్లా అన్నాడు.

క. 'అనిమిత్తము భూతంబుల । జననం బవి రూపు సెడుట సంపన్నములై
యునికి విషాదము మోదం । బును జేయఁగ లే వనిత్యములుగ నెఱిఁగినన్. 55

ప్రతిపదార్థం: అనిత్యములుగన్= శాశ్వతమైనవి కానివిగా- అశాశ్వతాలుగా; ఎఱిఁగినన్= తెలిసికొంటే; భూతంబుల జననంబు= ప్రాణుల పుట్టుక; అనిమిత్తము= నిష్కారణం; అవి= ఆ ప్రాణులు; రూపు+చెడుట= నశించటం; సంపన్నములై+ఉనికి= సంపదలతో కూడినవై ఉండుట (క్రమంగా); విషాదమున్= దుఃఖమును; మోదంబును= సంతోషమును; చేయఁగన్+లేవు= కలిగింపజాలవు.

తాత్పర్యం: 'సృష్టిలో ప్రాణిజాలం పుట్టుక నిష్కారణంగా జరుగుతుంది. అవి సమృద్ధితో ఉండటంగాని, లేక నశించిపోవటంగాని నరుడికి (అతడూ ఒక ప్రాణి మాత్రుడు) మోదాన్నో, ఖేదాన్నో కలిగించవలసిన పని లేదు. ఎందుకంటే ప్రాణులు శాశ్వతమైనవి కావు. నశింపు వాటి సహజలక్షణం.

విశేషం: భూతము అంటే ప్రాణి - పుట్టుక కలిగినది. పుట్టుక ఉన్నప్పుడు గిట్టుట తప్పదు. జన్మం, మరణం - ఈ రెండూ ఒక వస్తువుయొక్క మొదలు, తుది వంటివి. తప్పనిసరిగా ఉండేవి. కాబట్టి అపరిహార్యమైన అంశాన శోకించటం ఏల? అని అజగరుడి బోధ.

తే. వరదఁ గాష్ఠముల్ గూడిన వడువు బంధు । సంగమం బవి వాసిన చాడ్పు తద్వి
యోగ మింత సూచిన వాని నుమ్మలికము । వొరయనేరదు దానవవరతనూజ! 56

ప్రతిపదార్థం: దానవ వర తనూజ!= దనుజ రాజకుమారా!; వరదన్= వరదలో, ప్రవాహంలో; కాష్ఠముల్+కూడిన వడువు= కట్టెలు దగ్గరైన విధంగా; బంధు సంగమంబు= బాంధవుల కలయిక; అవి= ఆ కట్టెలు; పాసిన చాడ్పు= విడిపోయిన విధం; తద్+వియోగము= ఆ బంధువుల ఎడబాటు; ఇంత+చూచినవానిన్= ఈ విధంగా గ్రహించిన నరుడిని; ఉమ్మలికము= దుఃఖము; పొరయన్+నేరదు= పొందజాలదు.

తాత్పర్యం: రాక్షస రాజకుమారా! ప్రవాహం సాగిపోతూ ఉన్నపుడు అందులో అపుడపుడు కొన్ని కట్టెలు తేలుతూ వచ్చి, ఒకదానితో ఒకటి కలుస్తుంటాయి. సృష్టిలో చుట్టాల, బంధువుల కలయిక కూడా అటువంటిదే. ప్రవాహంలో ఆ కట్టెల కలయిక, కట్టెల ఇష్టంమీద ఆధారపడి జరగలేదు. అవి విడిపోవటంకూడా వాటితో నిమిత్తం లేకుండానే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జరిగిపోతుంది. అదంతా ప్రవాహ వేగం, దిశ - వంటి వాటిమీద ఆధారపడి జరిగిపోతూ ఉంటుంది. అట్లాగే బంధువుల కలయికలూ, ఎడబాటులూ లోకంలో జరుగుతూ ఉంటాయి. ఆ కలయికలకు గాని, ఎడబాటుకు గాని నరుడి ప్రమేయం ఉండదు. ఈ విధంగా సృష్టిలోని మానవుల సంబంధ బాంధవ్యాల యథార్థస్థితిని గ్రహించినవాడిని దుఃఖం దరిచేరలేదు.

విశేషం: అలం: ఉపమ. మన ప్రమేయంలేకుండా సృష్టిధర్మాలుగా జరిగిపోయేవాటికి మన ప్రమేయాన్ని ఆపాదించుకొని వేదనలు పడటం తత్త్వ దర్శనం లేకపోవటంవలన జరుగుతుంది. ఇక్కడ అజగరుడు ప్రహ్లాదుడికి తత్త్వదర్శనం కల్పిస్తున్నాడు.

వ. ఈ తెఱంగు లే నెఱుంగుదు; నాదెసఁ బ్రశాంతిం గనికాదె నీవు శమోపదేశం బర్థించితివి. వినుము. 57

ప్రతిపదార్థం: ఈ తెఱంగులు= ఈ పద్ధతులు - పైన తెలిపినవి; ఏను= నేను; ఎఱుంగుదున్= తెలియుదును; నా దెసన్= నా యందు; ప్రశాంతిన్= అధికమైన శాంతిని; కని= చూచి; నీవు; శమ+ఉపదేశంబు= శాంతి కొరకైన బోధ; అర్థించితివి కాదె!= యాచించావు కదా!

తాత్పర్యం: నేను వివరించినట్లుగా మానవుల సంబంధబాంధవ్యాల తత్త్వం నేను గ్రహించాను. కాబట్టే నాలో ఇంతటి ప్రశాంతి నెలకొన్నది. దానిని చూచే కదా నీవు నా దరిచేరావు - శాంతి బోధకొరకు! కాబట్టి వినుము.

విశేషం: వాఙ్మయంనుండి గ్రహించటంవేరు, అనుభవంనుండి తెలిసికొనటం వేరు. అజగరుడి వివేకం అనుభవజన్యమైనది. కాబట్టే అతడు అంతగా ప్రశాంతుడు.

క. మే లర్థింపను గీడును । జాలింబడి తొలఁగఁ ద్రోవ సరిఁ దూష్ణీం భా
వాలంబిమనస్కుఁడనై । యాలంబుగఁ జేసి నడతు నయ్యిరుదెఱఁగున్. 58

ప్రతిపదార్థం: మేలు= క్షేమము; అర్థింపను= కోరను; కీడునున్= చేటువలన; జాలిన్+పడి= మనస్సునందు కష్టం చెంది; తొలఁగన్+త్రోవన్= తొలగునట్లు త్రోసివేయగా (కీడును); సరిన్= సమానంగా; తూష్ణీంభావ+ఆలంబిమనస్కుఁడను+ఐ= ఊరక ఉండుటను అవలంబించిన మనస్సుకలవాడనై; ఆ+ఇరుతెఱఁగున్= ఆ రెండు పద్ధతులను; ఆలంబుగన్= ఉపేక్షగ; చేసి= మార్చివేసి; నడతున్= ప్రవర్తింతును.

తాత్పర్యం: మేలు కావాలి అని కోరను, కీడు దాపురిస్తే దుఃఖించి దానినుండి బయటపడటానికి యత్నిస్తాను. మేలు కీళ్ళు రెండిటినీ సరిసమానంగా చూస్తూ (ఊరక, సాక్షిగా చూచే) మనస్సులో ఆ రెంటియెడ ఉపేక్ష వహించి జీవిస్తుంటాను.

విశేషం: నరునికి మేలుగాని కీడుగాని కలిగినప్పుడు అతడి ప్రవృత్తి భిన్నంగా ఉంటుంది. అయితే సృష్టితత్త్వ దర్శనంచేసి ప్రాణుల సంబంధాల అంతరార్థం అవగతమైన మనస్సును మోదంగాని, ఖేదంగాని స్పృశింపలేదు. అజగరుడు ఆ స్థితిలో తాను అనుభోక్తగా కాకుండా సాక్షిగా జరిగే దానిని చూచేవాడుగా మాత్రం జీవయాత్ర సాగిస్తున్నాడు.

క. సరసాన్నము పిణ్యాకము । సరిగాఁగ భుజింతు మృదుల శయ్యా తలమున్
ధరణియు శయనరుచికి నా । కరయంగా నొక్కరూప! యసురప్రవరా! 59

ప్రతిపదార్థం: అసుర ప్రవరా!= రాక్షస శ్రేష్ఠా!; సరస+అన్నము= రుచికరమైన ఆహారము; పిణ్యాకము= తెలికపిండి; సరిగాఁగన్= సమానముగా; భుజింతున్= తినెదను; మృదులశయ్యా తలమున్= మెత్తనైన పడక ప్రదేశము; ధరణియున్= భూమీ; శయన రుచికిన్= పడక (కొరకైన) కోర్కెకు, నాకున్; అరయంగాన్= పరిశీలింపగా; ఒక్కరూపు+అ!= ఒకటే! సమానమే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ రాక్షసరాజా! నా జీవన సరళిని వివరిస్తున్నాను. నాకు రుచిగల ఆహారమైనా, రుచిహీనమైన తెలికపిండి అయినా సమానంగానే ఉంటాయి. రెంటినీ సమభావంతో భుజిస్తాను. అట్లాగే మెత్తని పడకైనా, గట్టి భూభాగమైనా పరుండటానికి నాకు సమానంగానే ఉంటాయి. రెండు చోట్లా సమమైన ఆదరంతో శయనిస్తాను.

విశేషం: ఆహార నిద్రలు శరీరమాత్రరక్షణానికి ఉద్దిష్టాలని గ్రహించి, ఆత్మజ్ఞుడు వాటికి ప్రాముఖ్యాన్ని ఇవ్వడు. తాను శరీరమాత్రుడను గాననే జ్ఞానం కారణంగా ఆ ఉపేక్షాభావం అతడిలో నెలకొంటుంది. ఇక వస్త్రధారణపై తన పద్ధతిని వివరిస్తున్నాడు - అజగరుడు.

ఆ. నారచీరయేనిఁ జారు చీనాంబరం । బైనఁ గట్టికొనినయపుడు హృదయ
మొప్ప దొప్పు ననక యుండు రూపాదుల । నలమికొనవు చక్షురాదికములు.' 60

ప్రతిపదార్థం: నారచీర+ఏనిన్= చెట్టుపట్టగాని; చారు చీన+అంబరంబు+ఐనన్= అందమైన చీనాంబరము (వెలగల పట్టువస్త్రము) అయినా; కట్టికొనిన+అపుడు= ధరించినపుడు; హృదయము= మనస్సు; ఒప్పదు= అంగీకరించదు(అంతేకాక); ఒప్పున్= అంగీకరించును; అనక= అనకుండా; ఉండున్= (ఒకటిగా) ఉంటుంది; చక్షుస్+ఆదికములు= కన్ను మొదలయినవి (ఇంద్రియములు- చెవి ముక్కు మొదలగునవి); రూప+ఆదులన్= ఆకారము మొదలయిన వానిని, అలమికొనవు= వ్యాపించవు.

తాత్పర్యం: వస్త్రధారణ విషయంలో మానసంరక్షణమే ధ్యేయం కాబట్టి, దానికి మించి నేను గుడ్డలకు ప్రాముఖ్యమీయను అని చెట్టుపట్టగాని, చీనాంబరంగాని - రెంటిని సమభావంతోనే ధరిస్తాను. నారచీర కట్టినపుడు మనస్సు అంగీకరించకపోవటం, చీనాంబరం కట్టినపుడు మనస్సు ఆహ్లాదపడటం ఉండవు. నాకు రెండూ సమానమే. ఎందుకంటే నా కన్నులు మొదలైన ఇంద్రియాలు ఆకారంమొదలైన విషయాలను పట్టించుకొనవు.'

విశేషం: ఇంద్రియాలు అజగరుని అధీనంలో ఉన్నాయిగాని అజగరుడు ఇంద్రియాల అధీనంలో లేడు. కాబట్టి ఉపేక్ష, సమభావం సాధ్యమైనాయి.

వ. అని వెండియు. 61

తాత్పర్యం: అని చెప్పి ఇంకా.

ఆ. చలనమేది పుట్టుఁ జావునుం బిరువెట్టి । యామిషార్థిజనుల నపహసించు
చెలిమితోడ లేమికలిమి వాటింపని । రమణ నునికి యజగరవ్రతంబు. 62

ప్రతిపదార్థం: చలనము+ఏది= కదలిక (లేకుండ) నశించి; పుట్టున్+చావునున్= పుట్టుకను, చావునూ; పిరు+పెట్టి= నిరాదరణచేసి (వెనుకకు నెట్టి); ఆమిష+అర్థిజనులన్= (మాంసమును) కోరెడి ప్రజలను; అపహసించు= పరిహసించే; చెలిమితోడన్= స్నేహంతో (ఆహారంలో రుచులు భోగాలు కోరేవారిని చూచి నవ్వగలిగిన స్థితిలో); లేమి, కలిమి= దారిద్ర్యం, సంపద - రెంటినీ; పాటింపని= ఆదరించని, రమణన్= పద్ధతితో; ఉనికి= ఉండటం; అజగర వ్రతంబు= అజగరుడి జీవన విధానం.

తాత్పర్యం: కదలిక లేకుండా ఒకచోట పడి ఉండి, చావుపుట్టుకలను పట్టించుకొనకుండా భోగభాగ్యాలు ఆశించి ప్రాకులాడే జనసామాన్యాన్ని చూచి నవ్వుకొంటూ, కలిమిలేములు రెండింటినీ సమానంగా చూస్తూ, జీవనం కొనసాగించటం అజగరవ్రతమౌతుంది.

విశేషం: అజగరం అంటే కొండచిలువ. పెద్దగా కదలిక లేకుండా పడి ఉండే పెద్దపాము. దేహధారణకొరకు తినటం తరువాత నిద్రించటం దాని పద్ధతి అంటారు. అదే విధంగా కామత్యాగం చేసిన యోగి శరీరధారణమాత్రం కొరకే ఆహారం స్వీకరిస్తూ మిగిలిన ప్రాపంచికవిషయాలలో అనాసక్తుడై ఉంటాడు. అతడే అజగవరవ్రతుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. అనియతంబు లైన యాహార విహరణ । శయనముల విధాతృ సంప్రయుక్త
భంగిఁ బరఁగు నంతరంగ నిర్భార వ । ర్తనము కలిమి యజగరవ్రతంబు. 63

ప్రతిపదార్థం: అనియతంబులు+ఐన= నియమించబడినవిగాని; ఆహార విహరణ శయనములన్= తినటం, తిరుగటం, పరుండటంతో; విధాతృ సంప్రయుక్త భంగిన్= బ్రహ్మచేత చక్కగా ప్రయోగించబడిన విధంగా (బ్రహ్మ నిర్దేశానుకూలంగా); పరఁగు= ఒప్పు; అంతర్+అంగ నిర్+భార వర్తనము= మనస్సున బరువులేని (బాధ్యతలేని) ప్రవృత్తి; కలిమి= కలిగి ఉండటం; అజగరవ్రతంబు= అజగరవ్రతం.

తాత్పర్యం: నియమ నిబంధనలకు లోనుగాకుండా భుజిస్తూ, సంచరిస్తూ, శయనిస్తూ, బ్రహ్మనిర్దేశాన్ని పాటిస్తూ అంతరంగాన ఏ బరువు బాధ్యతలూ లేకుండా ఉండటం అజగరవ్రతం.

విశేషం: సామాన్యులకు ఆహారవిహారాదులలో నియమనిబంధనలు తప్పవు. అజగరవ్రతుడు అసామాన్యుడు, అలౌకికుడు, అంతర్ముఖుడు. కాబట్టి అతడికి లోకమర్యాదలు పాటించవలసిన అవసర ముండదు. కేవలం బ్రహ్మనిర్దేశానికి తప్ప ఇతరానికీ అతడు బద్ధుడుకాడు. బ్రహ్మనిర్దేశం ప్రాణికి అవశ్యం అనుసరణీయం. అజగరుడూ జీవించి ఉన్నంత కాలం ప్రాణి మాత్రుడే!

ఆ. నిత్య తృప్తి శౌచనిరతి తాల్మి సమత్వ । మారఁ గలిగి చిత్ సుఖానుభవము
ప్రచుర మగుట యజగరవ్రత మిది విను । యజ్ఞదుర్లభంబు ప్రాజ్ఞభూమి.' 64

ప్రతిపదార్థం: నిత్య తృప్తి= ఎల్లప్పుడూ తనివినొందటం; శౌచనిరతి= శుభ్రతయెడ ఆసక్తి; తాల్మి= ఓర్పు; సమత్వము= సమానత్వం; ఆరన్+కలిగి= నిండుగా ఉండి; చిత్ సుఖ+అనుభవము= చిదానందానుభూతి; ప్రచురము+అగుట= అధికమవటం; అజగరవ్రతము+ఇది= ఇదీ అజగరవ్రతమంటే; విను= ఆలకించుము (ఇది); యజ్ఞ దుర్ లభంబు= యాగంవలన (దుఃఖంతో లభించేది) లభించనిది; ప్రాజ్ఞభూమి= పండితుల స్థలం.

తాత్పర్యం: నిత్యతృప్తి, శుభ్రత, ఓరిమి, సమభావం - ఈ లక్షణాలను నిండుగా కలిగి ఉండి, చిదానందానుభవం పొందుతూ ఉండటం అజగరవ్రతం. ఇది యజ్ఞంవలన లభించేదిగాదు. యజ్ఞనిర్వహణం కంటె గొప్పదైన వ్రతమిది. వ్రతమంటే జీవనం. ఈ జీవనవిధానం పండితమాత్ర స్వీకార్యం. అన్యులకు ఇది ఆచరణయోగ్యం కాజాలదు'.

విశేషం: ఇంద్రియాలు ప్రాపంచికవిషయాలనుండి మరలి, అంతర్ముఖాలైనపుడు మనస్సు ఏకాగ్రమౌతుంది. అదే చిత్ సుఖం లేక చిదానందం. ఆ ఆనందమయ జీవనం కారణంగానే అజగరుడు లౌకిక విషయాలయెడ అనాసక్తుడై తూష్ణీంభావంతో ఉంటున్నాడు.

వ. ఇది శమప్రకారం బనియె' నని చెప్పి భీష్ముండు. 65

ప్రతిపదార్థం: ఇది= ఈ పై బోధించింది; శమప్రకారంబు= శాంతి పద్ధతి; అనియెన్= అన్నాడు; అని; చెప్పి= పలికి; భీష్ముండు= పితామహుడు.

తాత్పర్యం: శాంతికి మార్గమిది - అజగరవ్రత ఆచరణమే - అని అజగరుడు పలికా' డని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు. మళ్ళీ భీష్ముడు ఇట్లా ప్రసంగించాడు.

క. 'అజగర చరితము దనకును । నిజముగ నలవఱుప నేర్చు నిర్మలమతికిన్
వృజిన భయ మన్యు శోకము । లజేయములు గావు, మోక్ష మాయత్తమగున్.' 66

ప్రతిపదార్థం: అజగర చరితము= అజగరవ్రతము (అజగరుడి వంటి నడత); తనకును= తనకు కూడా; నిజముగన్= సత్యంగా; అలవఱుపన్= అలవాటుచేసికొనుటకు; నేర్చు= నేర్చిన; నిర్మలమతికిన్= మలినంలేని బుద్ధిగలవానికి; వృజిన భయమన్యు శోకములు= పాపం, భీతి, కోపం, బంధునాశంవలన దుఃఖాలు; అజేయములు= జయించవీలుగానివి; కావు= కాజాలవు; మోక్షము= ముక్తి; ఆయత్తము+అగున్= అధీనం అవుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'అజగరుడి నడతను ఆచరించగల నరుడికి పాపం, భీతి, కోపం, శోకంవంటి మానసిక క్షోభలు నిర్వేదాన్ని కలిగించలేవు. వాటిని అతడు జయించగలడు. ఆపైన ముక్తీ అతడికి లభిస్తుంది.'

విశేషం: జీవన్ముక్తుడే అజగరవ్రతాన్ని నిజంగా ఆచరించగలడు. పద్యంలోని 'నిజముగన్' అనే క్రియావిశేషణం అందుకే ప్రయుక్తమైనది. సుఖదుఃఖాది ద్వంద్వాలకు అతీతంగా జీవించగలగటమంటే ముక్తిని అందుకొనటమే.

వ. అనిన విని యజాతశత్రుండు 'బంధుమత్త్వ కర్మవిత్త ప్రజ్ఞలయం దెయ్యది నరునకు సుప్రతిష్ఠం జేయు?' నని యడిగిన నాపగాతనయుం డతని కిట్లనియె. 67

ప్రతిపదార్థం: అనిన(న్)= అనగా; విని= ఆలకించి; అజాతశత్రుండు= పుట్టని శత్రువులు కలవాడు - ధర్మరాజు; బంధుమత్త్వ కర్మ విత్త ప్రజ్ఞలఅందున్= బంధువులు కలిగి ఉండటం, కర్మం, ధనం, బుద్ధిబలం అన్నింటిలో; ఏ+అది= ఏది; నరునకున్= మానవుడికి; సుప్రతిష్ఠన్= మంచికీర్తిని; చేయున్?= కలిగిస్తుంది?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; ఆపగాతనయుండు= నదీసుతుడు- భీష్ముడు; అతనికిన్= ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అజగరవచనాలను, ఆపైన భీష్ముడి పలుకులను ఆలకించిన ధర్మరాజు తిరిగి భీష్ముడిని ఇట్లా ప్రశ్నించాడు; 'బంధువుల కలిమి, కర్మం, ధనం, బుద్ధిబలం అనే ఈ నాలుగింటిలో దేనివలన నరుడికి గొప్ప కీర్తి కలుగుతుంది?' అని. ఆ ప్రశ్నకు సమాధానంగా భీష్ముడు ధర్మజుడితో ఇట్లా అన్నాడు.

క. 'ప్రజ్ఞయ ప్రతిష్ఠ, లాభము । ప్రజ్ఞయ, నాకం బనంగఁ బ్రజ్ఞయ చువ్వే,
ప్రజ్ఞయ కైవల్యంబును, । ప్రజ్ఞాసాధ్యములు గాని పనులుం గలవే? 68

ప్రతిపదార్థం: 'ప్రజ్ఞ+అ= బుద్ధియే; ప్రతిష్ఠ= కీర్తి; లాభము= ప్రాప్తి, ఆదాయం; ప్రజ్ఞ+అ= బుద్ధియే; నాకంబు= స్వర్గము; అనంగన్= అనగా; ప్రజ్ఞ+అ= బుద్ధియే; చువ్వే= సుమా!; ప్రజ్ఞ+అ= బుద్ధియే; కైవల్యంబును= మోక్షంకూడా; ప్రజ్ఞాసాధ్యములు+కాని= ప్రజ్ఞతో సాధించనలవిగాని; పనులున్= పనులుకూడా; కలవు+ఏ?= ఉన్నవా? (లేవు).

తాత్పర్యం: ప్రజ్ఞ ఒక్కటే కీర్తికరం, అదే ఆదాయం. నిజానికి స్వర్గమన్నా బుద్ధే కదా! ఇంతెందుకు? చివరకు ముక్తి కూడా ప్రజ్ఞయే తప్ప అన్యం కాదు. బుద్ధివలన సాధ్యంకాని పనులు లేవు.

విశేషం: జీవితాన సర్వాంతర్యామి ప్రజ్ఞ. జీవనంలోని సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, సర్వజీవనవ్యాపారాలూ ప్రజ్ఞాజనితాలే. కాబట్టి ప్రజ్ఞ కీర్తికర మనటం నిశ్చయం.

వ. బలి ప్రహ్లాద మంకి ప్రభృతులు ప్రజ్ఞన కాదె సమాధాన సంపన్నులయిరి; కాశ్యప నామధేయుం డగు ధరణీ సురోత్తముం డొక్క యుద్ధత పురుషుని రథంబు దాఁకి పడి తదవమానదూయమాన మానసుండై యసుపరిత్యాగ పరవ్యవసాయుం డగుటయు నింద్రుండు సృగాలరూపంబున నమ్మహాద్విజుని పాలికి వచ్చి ప్రజ్ఞాసంబోధకం బగు సంవాదంబునం జిత్తప్రసాదంబు కావించె నని విందు; మెల్లభంగులఁ బ్రజ్ఞ యుత్తమాధికారం' బనిన విని ధర్మతనయుండు. 69

ప్రతిపదార్థం: బలిప్రహ్లాద మంకి ప్రభృతులు= బలిచక్రవర్తి, ప్రహ్లాద కుమారుడు, మంకి బ్రాహ్మణుడు మొదలైనవారు; ప్రజ్ఞన కాదు+ఎ!= ప్రజ్ఞవలననే కదా!; సమాధాన సంపన్నులు= సమాధానమును పొందినవారు; అయిరి?= కాగలిగారు?; కాశ్యప నామధేయుండు+అగు= కాశ్యపుడను పేరుగలవాడైన; ధరణీసుర+ఉత్తముండు= బ్రాహ్మణశ్రేష్ఠుడు; ఒక్క+ఉద్ధత పురుషుని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రథంబు= ఒక గర్వితుడైన నరుడి (రథము) తేరు; తాఁకి= తగిలి; పడి= క్రిందపడి; తద్+అవమాన దూయమాన మానసుండు+ఐ= అవమానంవలన బాధచెందే మనస్సు కలవాడై; అసు పరిత్యాగపర వ్యవసాయుండు+అగుటయున్= ప్రాణాన్ని వదలుటయందు ఆసక్తమైన ప్రయత్నం కలవాడు కాగా; ఇంద్రుండు= దేవేంద్రుడు దేవతలరాజు; సృగాలరూపంబునన్= నక్క ఆకారంలో; ఆ+మహాద్విజుని పాలికిన్= ఆ గొప్ప బ్రాహ్మణుని చెంతకు; వచ్చి; ప్రజ్ఞా సంబోధకంబు+అగు= బుద్ధికి ఉపదేశించెడిదైన; సంవాదంబునన్= సల్లాపంతో, మంచి పలుకుతో, ప్రసంగంతో; చిత్త ప్రసాదంబు= మనస్సుయొక్క ప్రసన్నతను; కావించెన్= కలిగించాడు; అని విందుము= అని వింటాం; ఎల్లభంగులన్= అన్ని విధాలా; ప్రజ్ఞ= బుద్ధి; ఉత్తమ+అధికారంబు= శ్రేష్ఠమైన ఆశ్రయము; అనినన్= అనగా; విని= ఆలకించి; ధర్మతనయుండు.

తాత్పర్యం: బలి, ప్రహ్లాదుడు, మంకి మొదలైనవారు ప్రజ్ఞవలననే సమాధానాన్ని పొందారు. కాశ్యపుడు అనే పేరుగల బ్రాహ్మణోత్తముడు ఒక గర్వితుడి రథం తగిలి పడిపోయాడు. దానిని అవమానంగా భావించి బాధపడి ప్రాణత్యాగానికి ప్రయత్నించాడు. ఇంద్రుడు నక్కరూపంలో ఆ బ్రాహ్మణుడి వద్దకు వచ్చి, ప్రజ్ఞను గురించిన ప్రబోధాన్ని చేసే సంభాషణవలన మనశ్శాంతిని కలిగించాడు - అని వింటాం. అన్ని విధాలా ప్రజ్ఞయే ఉత్తమాశ్రయం' అనగా విని ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'నరవర! దానముఁ దపమును । గురుశుశ్రూషయును యజ్ఞకోటియు నెట్లై
పరిణతిఁ బొందం గలయవి । పురుషున? కత్తెఱఁగు దెల్లముగ వినవలతున్.' 70

ప్రతిపదార్థం: నరవర!= మానవులలో శ్రేష్ఠుడా!; పురుషునకున్= నరునకు; దానమున్= ఇచ్చుట - ఈవి; తపమును= తపస్సు; గురుశుశ్రూషయు= పెద్దల సేవా; యజ్ఞ కోటియున్= యజ్ఞసమూహమూ; ఎట్లు+ఐ= ఏ విధంగా; పరిణతిన్= మార్పును ఫలితరూపమైన మార్పును; పొందన్+కల+అవి= పొందగలవు; ఆ+తెఱఁగు= ఆ పద్ధతి; తెల్లముగన్= స్పష్టంగా; వినన్+వలతున్= వినుటకు ఇచ్ఛగిస్తాను.

తాత్పర్యం: 'ఓమానవ శ్రేష్ఠా! నరుడు దానం, తపస్సు, పెద్దలసేవ, యజ్ఞాలవలె చేస్తుంటాడు. అయితే అతడు చేసిన ఈ పనులన్నీ ఏ విధంగా మార్పు చెందుతాయి? వాటి పర్యవసానం ఆ నరునికి ఎట్లా చెందుతుంది? వాటి ఫలితాన్ని అతడు ఎట్లా అందుకొంటాడు? స్పష్టంగా వినటానికి కుతూహలపడుతున్నాను'.

విశేషం: కార్యకారణ సిద్ధాంతం ప్రకారం పని జరిగినపుడు ఫలితం ఉండాలి. కాని, నిజజీవితాలలో దానం మొదలైన కార్యాలు నిర్వహించబడినా, వాటి ఫలితాలు కొన్ని సందర్భాలలో వెంటనే బయల్పడక, రూపాంతరం చెంది కనిపిస్తాయనే విశ్వాసం ఆధారంగా ఈ ప్రశ్న వేయబడినట్లు ఉన్నది.

వ. అనుటయు దేవవ్రతుం డన్నరదేవోత్తమున కిట్లనియె. 'మేలు లనుబంధించు మేలులట్ల కీళ్ళును ననుస్యూతంబులయి తొడరు నాకర్ణింపుము. 71

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; దేవవ్రతుండు= భీష్ముడు (నిజమైన నామమిది); ఆ+నరదేవ+ఉత్తమునకున్= ఆ రాజశ్రేష్ఠుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లు పలికాడు; మేలులు= క్షేమాలు, శుభాలు; మేలుల(న్)= శుభాలను; అనుబంధించు(న్)= అనుసరించును; అట్లు+అ= ఆ విధంగానే; కీళ్ళును= కీళ్ళుకూడా; అనుస్యూతంబులు+ఐ= అనుసరించేవై; తొడరున్= కలుగుతాయి; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ధర్మజుని ప్రశ్న విన్న వెంటనే భీష్ముడు 'లోకంలో మేళ్ళు, కీళ్ళు అనేవి ఒకదానిని మరొకటి వెన్నంటి వస్తున్నట్లుగా వరుసగా శుభం వెంట శుభమూ, అశుభం వెంట అశుభమూ ఎడం లేకుండా వచ్చి పడుతూ ఉంటాయి. వినుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: నరుడి పనుల పరిణతిని గూర్చి ప్రశ్నిస్తే శుభాశుభాలు అనుస్యూతంగా వెన్నంటి వస్తుంటా యని సమాధానం. వాటి పరిణామరీతి అట్లా అనిపిస్తుందన్నమాట.

క. కఱవుపయిఁ గఱవు వొరయుచు । వెఱపు పయిన్ వెఱపుఁ దోప విడువని యిడుమం
దొఱఁగమిపైఁ బురుషుఁ డిడుమఁ । దొఱఁగమిఁ జేడ్పడుచు నడచు దుష్కర్మములన్.' 72

ప్రతిపదార్థం: కఱవుపయిన్= కాటకంమీద; కఱవు= కాటకం - క్షామం; పొరయుచు(న్)= కలుగుతూ; వెఱపు పయిన్= భీతిమీద; వెఱపున్+తోఁప(న్)= భీతి ఏర్పడగా; విడువని= తొలగని; ఇడుమన్= కష్టమును; తొఱఁగమిపైన్= తొలగకపోవటం మీద; పురుషుఁడు= నరుడు; ఇడుమన్= కష్టమును; తొఱఁగమిన్= తొలగకపోవటం వలన; చేడ్పడుచు(న్)= చేటు పడుతూ - కష్టపడుతూ; దుస్+కర్మములన్= చెడు పనులతో; నడచున్= ప్రవర్తిస్తాడు.

తాత్పర్యం: మానవలోకంలో కరవు కాటకాలు ఒకదాని మీద ఒకటి వచ్చిపడినట్లుగా వరుసగా వస్తుంటాయి. అట్లాగే భయం మీద భయం వెన్నంటి మనిషిని క్రుంగదీస్తుంది. చేటుమీద చేటు, కీడుమీద కీడు పరుగు పరుగున వచ్చిపడినట్లుగా మనిషిని క్రమ్ముకొంటాయి. ఈ స్థితిలో నరుడు ఒక కీడునుండి మరొక కీడును ఎదుర్కొంటూ, చెడుపనుల బారిన పడి చెడుగై మిగులుతాడు'.

విశేషం: నరుడిలో పరిసరాలకు అనుగుణంగా స్పందించే లక్షణం ఉన్నది. బహుశః దానివలననే కావచ్చును - అతడు చెడుగులలో చెడుగుగా మారిపోవటం జరుగుతుంటుంది.

వ. అని మఱియును. 73

తాత్పర్యం: అని చెప్పి ఇంకా (ఇట్లా అంటున్నాడు).

ఆ. 'ఉత్సవంబుమీఁద నుత్సవ మందుచు । సుఖముమీఁద సుఖము సొప్పడంగఁ
బుణ్యపదము మీఁదఁ బుణ్య పదంబున । కరుగు నరుఁడు సుకృతియైన నధిప! 74

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నరుఁడు= మానవుడు; సుకృతి+ఐనన్= పుణ్యవంతుడైతే; ఉత్సవంబు మీఁద(న్)= మేలుమీద; ఉత్సవము+అందుచు(న్)= మేలును పొందుతూ; సుఖముమీఁద(న్)= సౌఖ్యంమీద; సుఖము= సౌఖ్యం; చొప్పడంగన్= చోటుచేసికొనగా; పుణ్యపదము మీఁదన్= ధర్మమార్గంమీదుగా; పుణ్యపదంబునకున్= ఉత్తమ లోకానికి; అరుగున్= వెళ్ళుతాడు.

తాత్పర్యం: నరుడు ధర్మాత్ముడై పుణ్యంచేసి ఉంటే అతడు మేలుమీద మేలు అందుకుంటూ సుఖం మీద సుఖం పొందుతూ ధర్మమార్గాన, పుణ్యలోకం చేరుకుంటాడు.

విశేషం: నరుడిని ధర్మం మరొక ధర్మానికి నడిపించి అతడికి శుభపరంపర ఒనగూడేటట్లు చేస్తుంది. అదే అధర్మమయితే వ్యతిరేకదిశలో సాగి, ఫలితాలూ వ్యతిరిక్తంగానే ఉంటాయి.

క. పులుఁగులలోఁ బూత్యండక । ములు సారములైన ధాన్యములలోనం బొ
ల్లులు బోలెను జూవె మను । ష్యులలో ధర్మరహితాత్ము లుర్వీనాథా! 75

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= రాజా! మనుష్యులలోన్= నరులలో; ధర్మరహిత+ఆత్ములు= ధర్మంలేని ఆత్మకలవారు ఉంటారు, పులుఁగులలోన్= పక్షులలో; పూతి+అండకములు= చెడ్డ కంపుగల చిన్న గ్రుడ్లు (పిల్లలుగాని చెడుగ్రుడ్లు); సారములైన ధాన్యములలోనన్= గట్టి ధాన్యపుగింజలలో; పొల్లులు+పోలెన్= తాలులువలెను (తాలు గింజలు); చూవె!= సుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజా! నరులలో పాపాత్ములు ఎట్లా ఉంటూంటారంటే పక్షులలో చెడిన గ్రుడ్లవలె, గట్టి ధాన్యరాశిలో తాలుగింజలవలె సారహీనంగా ఉంటూంటారు. వారి ఉనికి రాశికే గాని వాసికి గాదు.

క. చనినఁ జను నున్న నుండు । న్మనుజుఁ డొకటి సేయఁ జేయు నరనాయక! తో
డన తగిలి నీడవోలెను । విను చేసిన కీడు మేలు విడువవు వానిన్. 76

ప్రతిపదార్థం: నరనాయక!= ఓ రాజా!; మనుజుఁడు= నరుడు; చేసిన= ఒనర్చిన; కీడు= పాపం; మేలు= పుణ్యం; చనినన్= (నరుడు) వెళ్ళిపోతే; చనున్= (తానుకూడా పాపంగాని, పుణ్యంగాని) వెళ్ళిపోతుంది (పరలోకానికి); ఉన్నన్= (జీవించి) ఉన్న యెడల; ఉండున్= (నిలిచి) ఉంటుంది; ఒకటి+చేయన్= ఒకదానిని చేస్తే; చేయున్= (తాను కూడా బదులు) చేస్తుంది; నీడ+పోలెను= నీడవలె; తోడన్+అ= తోడనే, వెంటనే; తగిలి= తగుల్కొని, వెన్నంటి; వానిన్= ఆ చేసిన నరుడిని; విడువవు= వదలవు.

తాత్పర్యం: రాజా! నరుడు చేసిన పాపపుణ్యాలు అతడిని నీడవలె వెన్నంటి ఉంటూ, అతడు చనిపోతే అవీ అతడిని అనుసరించి పరలోకాలకు వెళ్ళుతాయి. అతడు జీవించి ఉంటే అవీ అతనితోపాటే జీవిస్తూ, అతడు చేసే ప్రతిపనిమీదా తమ ప్రాభవాన్ని నెరపుతూ ఉంటాయి. ఫలితార్థ మేమిటంటే, నరుడు బ్రతికినా, చనిపోయినా అతడు చేసిన పాపపుణ్యాలు మాత్రం అతడిని వదలవు. వెన్నంటి ఉంటూనే ఉంటాయి. తమ ప్రభావం చూపుతూనే ఉంటాయి.

విశేషం: అలం: ఉపమ. పాపపుణ్యాలు మానవజీవితంలో అవిభాజ్యాలుగా కొనసాగుతూ తమ ప్రభావాన్ని తత్కర్తపైన నెరపుతుంటాయి. కర్మసిద్ధాంతానికి కూడా పాపపుణ్యాలే మూలమంటారు. పని ఉన్నప్పుడు దాని ఫలితం తప్పదు మరి!

క. సమయం బైనను గుసుమ ఫ । లము లెట్టులు దోఁచుఁ దరువులం దటితోఁ గ
ర్మములం బొడమున్ సుఖదుః । ఖము లట్టుల నిష్ప్రయత్న కలితోద్భూతిన్. 77

ప్రతిపదార్థం: తరువులన్= చెట్లయందు; సమయంబు+ఐనను= తరుణం, ఋతువు వచ్చినప్పుడు; కుసుమ ఫలములు= పువ్వులు పండ్లు; ఎట్టులు= ఏ విధంగా; తోఁచున్= కనిపించునో; అట్టుల(న్)= ఆ విధంగా; తటితోన్= సమయంతో; కర్మములన్= పుణ్య పాపకర్మలయందు; సుఖదుఃఖములు= సౌఖ్యాలు, కష్టాలూ; నిస్+ప్రయత్నకలిత+ఉద్భూతిన్= ప్రయత్నరహితంగా కలిగిన పుట్టుకతో; పొడమున్= ఏర్పడుతాయి.

తాత్పర్యం: ఋతువులకు అనుగుణంగా చెట్లలో చిగుళ్ళూ, పూలూ, పండ్లూ ఏర్పడినట్లే నరుడు చేసిన పుణ్య పాప కర్మలు కూడా పరిపక్వమై, సమయం వచ్చినప్పుడు అకారణంగా పుట్టుకొచ్చినట్లుగా సుఖదుఃఖాలను కలిగిస్తాయి.

విశేషం: అలం: ఉపమ. చెట్లు కుసుమించి ఫలించటం సహజలక్షణం. దానికి ఇతర ప్రమేయం ఉండదు. అట్లాగే మానవుడు చేసిన కర్మకూడా తప్పక ఫలిస్తుంది. అయితే సమయం సమాసన్నం కావాలి. కర్మ నరుడిని వదలదు - ఎక్కడైనా.

క. తెలిసికొనఁ బడయ రొరు లా । ర్యుల పోయెడి తెరవు లరసియును జదలం బ
క్షులు నీళ్ళలోన మీనం । బులు వోయెడు త్రోవ లెఱుఁగఁ బోలునె? యధిపా! 78

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; ఒరులు= ఇతరులు; ఆర్యుల పోయెడి తెరువులు= పూజ్యులు నడిచే త్రోవలు; అరసియును= చూచికూడా; తెలిసికొనన్+పడయరు= గ్రహింపలేరు - ఎట్లంటే; చదలన్= ఆకాశాన; పక్షులు= పిట్టలు; నీళ్ళలోన(న్)= నీళ్ళయందు; మీనంబులు= చేపలు; పోయెడు త్రోవలు= వెళ్ళేదారులు; ఎఱుఁగన్+పోలునె?= తెలియనగునా? (తెలియలేమనుట).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: లోకాన ఆర్యజనులు ఎపుడూ ధర్మమార్గాన చరిస్తూ ఋజువర్తనులై ఉంటారు. వారిని చూచి కూడా ఇతరులు వారి ధర్మప్రవృత్తిని, ఆర్జవాన్ని తెలిసికొనలేరు. అది తమ చేతగాని పనిగా వారు భావిస్తారు. అదెట్లంటే ఆకాశాన పిట్టలూ, నీళ్ళల్లో చేపలూ సంచరిస్తూ ఉంటాయి గాని వాటి సంచారవిధానం ఇతరులకు అర్థమవుతుందా? (కాదు).

విశేషం: లోకాన మంచివారున్నంత మాత్రాన చెడ్డవారు లేకుండా పోరు. మంచివారిని చూచి చెడ్డవారు అందరూ మారరు. చెడ్డవారికి, అధిక సంఖ్యాకులకు వారిలోకమే వారిది. మంచిని వారు గ్రహించలేరు.

క. **ఐనను గాఢ నిరూపణ। మానసుఁడై యార్యజనుల మహిత వచనముల్**
వీనుల నినుచుచు ధర్మము। లైనవి సేయంగఁ దప్ప కగుఁ దత్ఫలముల్.' **79**

ప్రతిపదార్థం: ఐనను= పైన చెప్పినట్లు ఆర్యజనుల ప్రవృత్తి ఇతరులకు సులభగ్రాహ్యం కాకపోయినా (నరుడు); గాఢ నిరూపణ మానసుఁడు+ఐ= గట్టిగా చూడటంలో మనస్సు కలవాడై; ఆర్యజనుల= పూజ్యమానవుల; మహిత వచనముల్= గొప్ప మాటలు; వీనులన్= చెవులయందు; నినుచుచున్= ఉంచుతూ; ధర్మములు+ఐనవి= పుణ్యములైనవి; చేయంగన్= చేసినట్లయిన; తద్+ఫలముల్= వాటి ఫలితాలు; తప్పక+అగున్= తప్పక కలుగుతాయి.

తాత్పర్యం: ఆర్యజనులు ఇతరులకు సులభంగా అర్థం కాకపోయినా ఇతరులు నిరుత్సాహపడకుండా ఆర్యుల గొప్ప మాటలు వింటూ, గట్టిగా చూపు నిలిపే మనస్తత్త్వం కలిగి, ధర్మకార్యాలు నిర్వహిస్తే ఆ ధర్మం ఫలితాన్ని తప్పకుండా ఇస్తుంది.

విశేషం: ఇక్కడ 'గాఢ నిరూపణ మానసత్వం' చాలా ముఖ్యమైనది. విధి నిర్వహణకు ఆ స్వభావమే మూలం. అది 'అగాఢంగా' ఉంటే విధి నిర్వహణం అసమాప్తంగానే ఉండిపోతుంది'.

వ. **అనిన విని కౌంతేయాగ్రజుండు శాంతనవునితో 'భూతసృష్టి యెవ్వానివలన నెబ్బంగినైనయది? యెఱింగింపు' మనవుడు నతం 'డిదియును మఱియునుం గొన్ని యర్థంబులు భరద్వాజుం డడిగిన భృగుండు సెప్పె నప్పరిపాటి యుపన్యసించెద నాకర్ణింపు' మని యతని కిట్లనియె.** **80**

ప్రతిపదార్థం: అనిన(న్)= అనగా; విని= ఆలకించి; కౌంతేయ+అగ్రజుండు= కుంతీతనయులలో పెద్దవాడైన ధర్మరాజు; శాంతనవునితోన్= శంతనుడి తనయుడైన భీష్ముడితో; భూత సృష్టి= ప్రాణుల పుట్టుక; ఏ+వాని వలనన్= ఎవడి వలన; ఏ+భంగిన్= ఏ విధంగా; ఐన+అది= అయినది; ఎఱింగింపుము= తెలియజేయుము; అనవుడున్= అనినవెంటనే; అతండు= ఆ భీష్ముడు; ఇదియును= ఈ విషయమును; మఱియున్= ఇంకను; కొన్ని+అర్థంబులు= కొన్ని విషయములు, ఇతర విషయములు; భరద్వాజుండు= భరద్వాజ మహర్షి; అడిగిన(న్)= ప్రశ్నించగా; భృగుండు+చెప్పెన్= భృగుమహర్షి చెప్పాడు; ఆ+పరిపాటి= ఆ క్రమం; ఉపన్యసించెదన్= ప్రసంగిస్తాను; ఆకర్ణింపుము= వినుము; అని; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ ధర్మరాజుతో ఇట్లా పలికాడు.

తాత్పర్యం: నరుడి పాపపుణ్య పరిపాక క్రమాన్ని గురించి పితామహుడినుండి గ్రహించిన ధర్మజుడు అనంతరం 'సృష్టిని ఎవరు ఏ విధంగా కలిగించారు తెలుపు'మని అర్థించాడు. దానికి బదులుగా భీష్ముడు 'నీ వడిగిన దానితోపాటుగా మరికొన్ని ఇతర అంశాలు కూడా, ముందు భరద్వాజ ఋషి కోరికపై భృగుమహర్షి వివరించి ఉన్నాడు. వాటిని క్రమంగా వివరిస్తాను విను'మని ప్రారంభించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బృథివ్యాది భూతోత్పత్తిక్రమం బెఱింగించుట (సం. 12-175-5)

సీ. 'కైలాసశైలశిఖరమునఁ దేజో వి । రాజితు భృగు భరద్వాజుఁ డధిక
వినయంబుమైఁ జేరి, 'మునినాథ! భూత సృ । ష్టి ప్రకారము నాకుఁ జెప్పు' మనిన
నమ్మహితాత్ముఁ డిట్లను 'విను నారాయ । ణుం డవ్యయుం డనంతుండు భూత
సృజనంబు దలఁచి మున్ సృజియించెఁ దనదు స । హస్రాంశకమున నవ్యక్తుఁ డనఁగ

తే. మనసునన యజరామరు ననుపమాను । నతనివలన మహత్తత్త్వ మావహిల్లె;
నతఁడు దివ్యతేజోమయం బైన పద్మ । మొకటి గలిగింప బ్రహ్మ యం దుద్భవించె. 81

ప్రతిపదార్థం: కైలాస శైలశిఖరమునన్= కైలాస పర్వతపు పైభాగాన; తేజస్+విరాజితున్= కాంతితో ప్రకాశించెడు; భృగున్= భృగు మహర్షిని; భరద్వాజుఁడు= భరద్వాజ ఋషి; అధిక వినయంబు మైన్= ఎక్కువ అణకువతో; చేరి= సమీపించి; మునినాథ!= ఋషులలో శ్రేష్ఠుడా!; భూతసృష్టి ప్రకారము= ప్రాణుల జన్మవిధానం; నాకున్, చెప్పుము, అనినన్; ఆ+మహిత+ఆత్ముఁడు= ఆ గొప్ప ఆత్మకలవాడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అనెను; విను= ఆలకించుము; నారాయణుండు= విష్ణువు; అవ్యయుండు= నాశనం లేనివాడు; అనంతుండు= అంతం లేనివాడు; భూత సృజనంబు= భూమి మొదలైన ఐదు మూల పదార్థాల పుట్టుకను; తలఁచి= తలంచి; మున్= ముందు; తనదు= తనయొక్క; సహస్ర+అంశకమునన్= వెయ్యోభాగంతో; అవ్యక్తుఁడు+అనఁగన్= అవ్యక్తుడు (వ్యక్తం (స్పష్టం) కానివాడు) అనే; అజరామరున్= ముదిమి, మరణం లేనివాడిని; న+ఉపమానున్= పోలికలేనివాడిని; మనసునన్+అ= మనస్సునందే; సృజియించెన్= సృష్టించాడు; అతనివలనన్= ఆ అవ్యక్తుడి వలన; మహత్+తత్త్వము= (బుద్ధి తత్త్వం) గొప్ప ప్రకృతి; ఆవహిల్లెన్= కలిగింది; అతఁడు= ఆ అవ్యక్తుడు; దివ్యతేజస్+మయంబు+ఐన= దేవసంబంధమైన కాంతి నిండిన; పద్మము+ఒకటి= తామరపువ్వు నొకదానిని; కలిగింపన్= పుట్టించగా; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; అందున్= ఆ పద్మమందు; ఉద్భవించెన్= పుట్టాడు.

తాత్పర్యం: కైలాస పర్వతశిఖరంమీద తేజస్సు నిండిన భృగుమహర్షిని భరద్వాజముని గొప్ప వినయగుణంతో దరిచేరి, 'ఓ ఋషిశ్రేష్ఠా! భూమి మొదలయిన పంచభూతాలు, ఇతర ప్రాణులు ఏర్పడిన విధానం తెలుపు'మని అర్థించాడు. భృగువు అతడితో అన్నాడు 'విష్ణువు నాశనం, అంతం లేనివాడు. అతడు మనస్సులో సృష్టిని నిర్మించదలచి ముందుగా తనలోని వెయ్యోవంతుతో అవ్యక్తుడనే వాడిని పుట్టించాడు. ఆ అవ్యక్తుడు జరామరణాలు లేనివాడు, సాటిలేనివాడు. అతడివలన ప్రకృతితత్త్వం కలిగింది. అతడు దివ్యకాంతితో నిండిన పద్మమొకటి కలిగించాడు. ఆ పద్మంనుండి బ్రహ్మ పుట్టాడు.

తే. అతని తలఁపునఁ బ్రభవించె నాకసంబు; । దానియందు జలంబు లుద్భవము నొందె;
సలిలమున నగ్ని మారుత జనన మొనరె; । ననల పవన యోగమున మేదిని జనించె. 82

ప్రతిపదార్థం: అతని తలఁపునన్= ఆ బ్రహ్మదేవుడి ఆలోచనతో; ఆకసంబు= ఆకాశం; ప్రభవించెన్= పుట్టింది; దానిఅందున్= ఆ ఆకాశంలో; జలంబులు= నీళ్ళు; ఉద్భవమున్+ఒందెన్= పుట్టుకను పొందాయి; సలిలమునన్= నీటిలో; అగ్ని మారుత జననము= నిప్పు, గాలుల పుట్టుక; ఒనరెన్= కలిగింది; అనల పవన యోగమునన్= అగ్ని, గాలుల కలయికతో; మేదిని= భూమి; జనించె(న్)= కలిగింది.

తాత్పర్యం: ఆ బ్రహ్మదేవుడి సంకల్పంవలన ఆకాశం, ఆకాశంనుండి నీరు, నీటినుండి నిప్పు, గాలి జన్మించాయి. ఆ తరువాత నిప్పు గాలుల కలయికతో భూమి పుట్టింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఆబ్రహ్మ యఖిల భూతాత్మకుం డెట్లనిన నతనికి శైలంబు లస్థులు; మేదిని మేదోమాంసంబులు; సముద్రంబులు రుధిరం; బాకాశం బుదరంబు; పవనుండు నిశ్వాసం; బగ్ని తేజంబు; సరిత్తులు సిరలు; రవిచంద్రులు నయనంబు; లూర్ధ్వలోకంబు శిరంబు; పాతాళంబు పాదంబులు; దిశలు బాహువు; లి ట్లనంతాత్మకుం డగువాఁడు విష్ణుం డిత్తెఱంగున విశ్వంబు విష్ణునివలనం గలిగెననిన విని భరద్వాజుం డాకాశాది భూతంబు లేనింటి ప్రమాణంబులు నడిగిన భృగుం డవి యనంతంబులు దేవతలకుం గొలఁది వెట్టరాకుండు నొక్కచోటు నిరూపించి యీ భూతం బింతటనుండి యట లేదనరాదు పంచభూతంబులు నిరవధికంబు లది యెత్తెఱం గనిన విష్ణునకు గౌణంబై యనంతుం డను నామంబుగలదు గాదె! విష్ణుండు జగన్మూర్తి విష్ణు తనుభూతంబయిన మహాభూత పంచకం బప్రమేయంబుగాక తక్కునే?' యని యెఱింగించిన. 83

ప్రతిపదార్థం: ఆ బ్రహ్మ= ఆ బ్రహ్మదేవుడు; అఖిల భూత+ఆత్మకుండు= ఎల్లభూతముల (భూమి, నీరు మొదలగువాని) స్వరూపమైనవాడు; ఎట్లు+అనినన్= అదెట్లు అంటే; అతనికి(న్)= ఆ బ్రహ్మకు; శైలంబులు= కొండలు; అస్థులు= ఎముకలు; మేదిని= భూమి; మేదస్+మాంసంబులు= కొవ్వు మాంసమును; సముద్రంబులు= సముద్రాలు; రుధిరంబు= రక్తం; ఆకాశంబు= ఆకాశం; ఉదరంబు= పొట్ట; పవనుండు= గాలి; నిశ్వాసంబు= ఊరుపు; అగ్ని= నిప్పు; తేజంబు= కాంతి; సరిత్తులు= నదులు; సిరలు= రక్తవాహికలు; రవిచంద్రులు= సూర్యచంద్రులు; నయనంబులు= కన్నులు; ఊర్ధ్వలోకంబు= పై లోకాలు; శిరంబు= తల; పాతాళంబు= పాతాళలోకము; పాదంబులు= అడుగులు; దిశలు= దిక్కులు; బాహువులు= చేతులు; ఇట్లు= ఈ విధంగా; అనంత+ఆత్మకుండు+అగు+వాఁడు= అంతంలేని శరీరం కలవాడగు వాడు; విష్ణుండు= విష్ణుమూర్తి; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; విశ్వంబు= లోకం; విష్ణునివలనన్= విష్ణువువలన; కలిగెన్= పుట్టింది; అనినన్; విని; భరద్వాజుండు= ఆ పేరుగల ఋషి- ప్రస్తుత అంశానికి శ్రోత; ఆకాశ+ఆది భూతంబులు+ఏనింటి ప్రమాణంబులున్= ఆకాశం మొదలయిన భూతాలు ఐదింటి కొలతలును; అడిగినన్= ప్రశ్నించగా; భృగుడు= భృగుమహర్షి; అవి= భూతాల ప్రమాణాలు; అనంతంబులు= చివరలు లేనివి; దేవతలకున్= సురలకుకూడా; కొలఁది+పెట్టరాకుండున్= కొలత పెట్టటానికి వీలులేకుండా ఉంటాయి; ఒక్కచోటు= ఒక్క స్థలం; నిరూపించి= చూపించి; ఈ భూతంబు= ఈ (ఫలానా) భూతం (భూమి మొదలగునవి); ఇంతటన్= ఇంతవరకు; ఉండి= కలిగి; అటన్= అక్కడ; లేదు+అనరాదు= లేదు అనటానికి (వీలు)గాదు; పంచభూతంబులు= ఐదు భూతాలు (భూమి, నీరు, వెలుతురు, గాలి, ఆకాశం); నిర్+అవధికంబులు= హద్దులు లేనివి; అది= హద్దులు లేకుండటం; ఏ+తెఱంగు?= ఏ విధము?; అనినన్= అన్నచో; విష్ణునకున్= విష్ణుమూర్తికి; గౌణంబు+ఐ= గుణసంబంధమైనదై; అనంతుఁడు+అను= అనంతుడనే; నామంబు= పేరు; కలదు= ఉన్నది; కాదె!= కాదా!; విష్ణుండు= నారాయణుడు; జగత్+మూర్తి= లోకమే ఆకారంగా కలవాడు; విష్ణు తనూభూతంబు+అయిన= విష్ణువు శరీరంనుండి పుట్టిన; మహాభూత పంచకంబు= గొప్పభూతములు ఐదు; అప్రమేయములు= కొలువరానివి; కాక= కాకుండా; తక్కునే?= పోయేది అగునా?; అని; ఎఱింగించిన(న్)= తెలియజేయగా.

తాత్పర్యం: ఆ బ్రహ్మ ఎల్లభూతాలూ అంటే భూమి మొదలయినవి ఇతరాలు కూడా తన శరీరంగా ధరించి ఉంటాడు. అదెట్లాగంటే ఆ బ్రహ్మశరీరానికి సృష్టిలోని పర్వతాలు ఎముకలు, భూమి కొవ్వూ మాంసమూ, సముద్రాలు నెత్తురు, ఆకాశం పొట్ట, గాలి ఊర్పు, నిప్పు వెలుతురు, నదులు రక్తవాహికలయిన నరాలు, ఈ విధంగా సూర్యచంద్రులు కళ్ళు, పై లోకం తల, పాతాళలోకం కాళ్ళ అడుగులు, దిక్కులు చేతులు - ఇట్లాఅంతంలేని శరీరంగలవాడు నారాయణుడు. ఈ విధంగా ఈ లోకం నారాయణుడివలన పుట్టింది' అనగా విని శ్రోత అయిన భరద్వాజుడు భృగుమహర్షిని ప్రశ్నించాడు 'ఆకాశం మొదలయిన గొప్ప మూలపదార్థాలు ఐదు కలవు కదా! వాటి కొలతలు ఎంత?' అని. దానికి ఆ మహర్షి 'అవి గొప్పవి, తుదిలేనివి, సురలు కూడా వాటి హద్దులు నిర్ణయించలేకపోయారు. ఒక చోటును చూపి ఈ భూతం (పదార్థం) ఇంతవరకు కలదు, అక్కడ లేదు అనరాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పంచభూతాలు హద్దులు లేనివి. వస్తువు ఒకటి ఉన్నదన్న తరువాత దాని కొలతలు లేవు అనట మెట్లంటావా? సమాధాన మిది. విష్ణువును అతడి గుణాన్ని స్వభావాన్నిబట్టి అనంతు డంటారు. జగన్మూర్తి అయిన విష్ణువునుండి జన్మించినవి కాబట్టి పంచభూతాలు కూడా విష్ణుడివలెనే అనంతాలు' అని తెలియజేయగా.

విశేషం: ఇక్కడ విజ్ఞాన వికాసాలకు మూలభూతమైన తార్కిక దృష్టి ఉన్నది. 'పంచమహాభూతాల కొలత లేమి?' అని భరద్వాజు డడిగితే, భృగువు 'వాటి పరిమాణం కొలతల కందనిది' అని అంటూ తన మాటను సమర్థించుకొనటానికి ఒక తర్కాన్ని ఆవిష్కరించాడు. ఈ పంచమహాభూతాలు కార్యాలు, కర్త నారాయణుడు. అతడు అనంతుడు. కాబట్టి కారణగతమైన అనంతత్వం కార్యంలోనూ ప్రతిఫలించింది. కాబట్టి ఇక్కడ కారణకార్య సంబంధం వ్యక్తమైనదన్నమాట.

సీ. **విని భరద్వాజుండు 'మునినాథ! పుష్కరం । బునఁ బుట్టె నన్నప్డ పుష్కరంబు**
బ్రహ్మకు నాదినాఁ బట్టయ్యె నెట్టొకో?' । నావుడు 'విష్ణుమానసభవుండు
బ్రహ్మ యాద్యుఁడు పుష్కరము దదాసన రూప । ముగఁ గల్పితంబయ్యె మున్ను పిదప
నను నిశ్చయంబు లే కునికిఁ బద్మజుఁ డన । వలసియు నుండు నయ్యలఘుతేజుఁ

తే. **బద్మ మది భూతధాత్రి యప్పద్మమునకు । గగన మూర్ధితమగు మేరునగము రుచిర**
చారుకర్ణిక యందుండి సకల జంతు । సృజన ధుర్యత్వమహిమ నయ్యజుఁడు వెలుఁగు. 84

ప్రతిపదార్థం: విని= ఆలకించి; భరద్వాజుండు= భరద్వాజముని; మునినాథ!= ఋషుల రాజా! ఓ భృగూ!; పుష్కరంబునన్= పద్మమునందు; పుట్టెన్+అన్న+అప్డు+అ= పుట్టెను అన్నప్పుడే; పుష్కరంబు= పద్మం; బ్రహ్మకున్= బ్రహ్మదేవుడికి కూడా; ఆదినాన్= మొదటి దనగా; పట్టు+అయ్యెన్= స్థానమైనది; ఎట్టు+ఒకో?= ఎట్లో?; నావుడున్= అనినవెంటనే; విష్ణుమానసభవుండు= విష్ణువు మనస్సునుండి పుట్టినవాడు; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; ఆద్యుఁడు= మొదటివాడు; పుష్కరము= పద్మం; తద్+ఆసన రూపముగన్= ఆతని పీఠము ఆకారంగా; కల్పితంబు+అయ్యెన్= నిర్మించబడినది అయినది; మున్ను పిదపన్= ముందు వెనుక; అను నిశ్చయంబు లేక+ఉనికిన్= అనే నిర్ణయం లేకుండటంవలన; పద్మజుఁడు= పద్మం నుండి పుట్టినవాడు; అనన్+వలసి+ఉండున్= అనవలసి ఉంటుంది; ఆ+అలఘు తేజున్= ఆ గొప్పకాంతిగల వాడిని; పద్మము+అది= ఆ తామరపువ్వు; భూతధాత్రి= (ప్రాణులను పెంచెడిది) భూమి; ఆ+పద్మమునకున్= ఆ తామర పువ్వునకు; గగనమూర్ధితము+అగు= ఆకాశం తలగా గల; మేరునగము= మేరు పర్వతం; రుచిరచారు కర్ణిక= ప్రకాశించెడి సుందరమైన దుద్దు (పువ్వులోని నడిమి భాగం); అందున్+ఉండి= ఆ తామరదుద్దు నుండి; సకల జంతు సృజన ధుర్యత్వమహిమన్= ఎల్ల ప్రాణుల సృజించే భారం వహించే గొప్పతనంతో; ఆ+అజుండు= ఆ బ్రహ్మ; వెలుఁగు(న్)= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: భృగుమహర్షి కథనాన్ని విన్న భరద్వాజుడు 'ఓ ఋషిశ్రేష్ఠా! బ్రహ్మదేవుడు పద్మంనుండి పుట్టాడు - అని అన్నప్పుడు, ఆ పద్మం బ్రహ్మకు ముందు పుట్టినదైనట్లు కాదా?' అని ప్రశ్నించాడు. దానికి భృగువు సమాధానమిది: - 'బ్రహ్మ విష్ణుమానస పుత్రుడు, కాబట్టి బ్రహ్మ మొదటివాడు. తరువాత ఆ బ్రహ్మకు పీఠంగా పద్మం నిర్మించబడింది. అయితే ఈ కార్యక్రమం జరిగినప్పుడు ముందూ - వెనుకా అనే నిర్ణయం లేదు కాబట్టి బ్రహ్మను పద్మజుడు (పద్మం నుండి పుట్టినవాడు) అనీ అనవలసి ఉంటుంది. ఇంతకూ ఆ పద్మం ఏమి టనుకొంటున్నావు! అది భూమి. దానికి ఆకాశమే శీర్షంగా గల మేరుపర్వతం అందమైన కర్ణిక. అక్కడనుండి ఆ బ్రహ్మదేవుడు సకల చరాచర జంతుసమూహాన్ని సృజించే భారాన్ని వహిస్తూ ప్రకాశిస్తున్నాడు.

విశేషం: పై వచనంలో బ్రహ్మ స్వరూపాన్ని ఆవిష్కరిస్తూ అక్కడ మేదిని బ్రహ్మశరీరంలోని మేదోమాంసమని వివరించబడింది. ఇక్కడేమో బ్రహ్మదేవుని ఆసనంగా నిర్మితమైన పద్మమే భూతధాత్రిగా భూమిగా చెప్పబడుతూ ఉన్నది. దీనిని బట్టి మనం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గ్రహించవలసినదేమిటంటే ప్రాచీనతమకాలాన నరుడు ఈ సృష్టి ఏర్పడినవిధానాన్ని గూర్చి అనేక ఆలోచనలు చేసి ఉన్నాడు. వాటిలో కొన్ని తర్కసహమైనవిగా ఉన్నవి అనుకొన్నవి, ఇక్కడ చోటుచేసికొనటం జరిగింది.

వ. అని భృగుండు సెప్పిన విని భరద్వాజుండు 'భూతంబు లై దగుట యేమిట?' నని యడిగిన నతం డతని కి ట్లనియె. 85

ప్రతిపదార్థం: అని= పైవిధంగా; భృగుండు= భృగుముని; చెప్పినన్= పలుకగా; విని= ఆలకించి; భరద్వాజుండు= భరద్వాజ ఋషి; భూతంబులు= మహా పదార్థాలు; ఐదు+అగుట+ఏమిటన్?= ఐదు కావటం దేనివలన? (ఎక్కువ తక్కువలు ఏల లేవు?); అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతండు= ఆ భృగువు; అతనికిన్= ఆ భరద్వాజమునికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భృగువచనం విన్న భరద్వాజుడు ప్రశ్నించాడు. 'మహాపదార్థాలు భూతాలు ఐదే దేనివలన అయినట్లు? ఏ కారణాన అవి అయిదుగా రూపుదాల్చినవి?' అని. దానికి సమాధానం మహాజ్ఞాని అయిన భృగువు ఇట్లా ఇస్తున్నాడు.

క. వాయువు చేష్టా రూపము, । మ్రోయునెడ నభంబు, ద్రవము మునివర! జల మూ
ష్మాయిత మనలము; గారి । న్యాయితము ధరిత్రి; యిట్టు లైదు దెఱంగుల్. 86

ప్రతిపదార్థం: మునివర!= ఓ ఋషిశ్రేష్ఠా! భరద్వాజా!; చేష్టా రూపము= చైతన్యరూపం; వాయువు= గాలి; మ్రోయునెడన్= శబ్దించే చోట; నభంబు= ఆకాశం; ద్రవము= స్రవించేది, పారునది; జలము= నీరు; ఊష్మాయితము= వేడిమి చెందింది; అనలము= నిప్పు; కాఠిన్యాయితము= గట్టితనం చెందినది; ధరిత్రి= భూమి; ఇట్టులు= ఈ విధంగా; ఐదు తెఱంగుల్= ఐదు విధాలు.

తాత్పర్యం: సృష్టిలో చేష్టలు, శబ్దాలు, స్రావాలు, వేడిమి, గట్టితనం ఏర్పడటానికై పంచమహాభూతాలు ఆవిష్కరించబడ్డాయి. చేష్టలు వాయురూపాన, శబ్దాలు ఆకాశం ద్వారా, స్రావాలు నీటివలన, వేడిమి నిప్పు నుండి, గట్టితనం భూమివలన కలిగాయి. కాబట్టి పంచభూతాల అవసరం ఆ విధంగా ఏర్పడినది.

విశేషం: ఇక్కడకూడా శ్రోతలోని తార్కిక దృష్టి వ్యక్తమైనది. ఆదిలో అయిదు భూతాలే ఎందుకు ఏర్పడవలసి వచ్చినది? అనేది మౌలిక ప్రశ్న. దానికి సంతృప్తికరమైన సమాధానం భృగువు అందించాడు.

వ. ఈ యయిదింటనకాదె జంగమంబులు స్థావరంబులు నైనయవి!' యనుటయు భరద్వాజుండు 'స్థావరంబుల యందు భూతగుణంబు లేమిటం గంటి?' మని యడిగిన భృగుం డిట్లనియె. 87

ప్రతిపదార్థం: ఈ+అయిదింటన్+అ= ఈ ఐదింటివలననే; కాదె= కదా; జంగమంబులు= తిరుగాడెడివి; స్థావరంబులున్= కదలనివి; ఐన+అవి!= కలిగినవి!; అనుటయున్= అనగా; భరద్వాజుండు= భరద్వాజముని; స్థావరంబులఅందున్= నిలిచి ఉండువాటియందు; భూతగుణంబులు= పంచభూతాల లక్షణములు; ఏమిటన్= ఏ విధంగా; కంటిమి?= చూచితిమి?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; భృగుండు= భృగుమహర్షి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ పంచభూతాలకారణంగానే సృష్టిలో కనిపించే రెండు విధాలయిన పదార్థాలు 1. తిరుగాడేవి, 2. నిలిచి ఉండేవి (క్రమంగా జంగమాలు, స్థావరాలు) ఏర్పడ్డాయి. సృష్టి సర్వస్వమూ ఈ జంగమ స్థావరాత్మకమే.' అని భృగువు పలికితే భరద్వాజుడు మళ్ళీ ప్రశ్నిస్తున్నాడు - 'పంచభూతాల లక్షణాలు స్థావరాలలో ఎట్లా గమనించగలం?' అని. దానికి భృగువు సమాధానం ఇట్లా ఇచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'అశని నిర్ఘోషంబు నాకర్ణనము లేక । వికృతి నెట్టులు వొందు వృక్ష? మాక
సముశక్తి సూవె శ్రోత్రము నిదాఘంబు సోఁ । కునవాడుఁ జోఁ కెఱుంగుట సమీర
శక్తి మార్గముఁ గని చాఁగెడుఁ గనుట తే । జశ్శక్తి పాదపసంజ్ఞఁ బరఁగుఁ
బాదజిహ్వలఁ గొని బానంబు సేయుట । జలశక్తి జిహ్వ నైజంబు లైన

తే. కుసుమ ధూపాది గంధముల్ గొనుట నెలమిఁ । దాల్చు నని చెప్పుఁ దరువు వేదంబు ఘ్రాణ
ముర్విశక్తి యి ట్లయిదును నుల్లసిలుట । ననఘ! భూజంబు పంచభూతాత్మకంబు. 88

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా!; అశని నిర్ఘోషంబున్= పిడుగు శబ్దమును; ఆకర్ణనము లేక= వినటంలేకుండా; వృక్షము= చెట్టు; వికృతిని= వికారమును, మార్పును; ఎట్టులు+పొందున్?= ఏ విధంగా చెందుతుంది?; ఆకసము శక్తి+చూవె= ఆకాశం యొక్క శక్తి సుమా!; శ్రోత్రము= చెవి; వృక్షము= చెట్టు; నిదాఘంబు సోఁకునన్= వేడిమి తాకిడివలన; వాడున్= వాడిపోతుంది; చోఁకు+ఎఱుంగుట= స్పర్శ (తాకు) తెలిసికొనటం; సమీరశక్తిన్= గాలి ప్రభావంవలన; వృక్షము; మార్గమున్+కని= దారిని చూచి; చాఁగెడున్= సాగుతుంది; కనుట= చూడటం; తేజస్+శక్తిన్= వెలుతురు ప్రభావంవలన; వృక్షము; పాదప సంజ్ఞన్= పాదపము అనే పేరుతో; పరఁగున్= ఒప్పుతుంది; పాదజిహ్వలన్= వేళ్ళు అనే నాల్కలతో; కొని= స్వీకరించి; పానంబు+చేయుట= త్రాగుట చేయటం - త్రాగటం; జలశక్తిన్= నీటి ప్రభావంవలన; జిహ్వ నైజంబులు= నాల్క స్వభావాలు; ఐనన్= కాగా, ఈ విధంగా నాలుగు భూత లక్షణాలు నిరూపితాలు కాగా; కుసుమ ధూప+ఆది గంధముల్= పూవులు, పొగలు మొదలైన వాటి వాసనలు; కొనుటన్= స్వీకరించటం; తరువు= చెట్టు; ఎలమిన్= బాగుగా; తాల్చును+అని= వహించును, ధరించును అని; వేదంబు= వేదం; చెప్పున్= పలుకును; ఘ్రాణము= వాసన చూచే ఇంద్రియం, ముక్కు; ఉర్విశక్తిన్= భూమిశక్తివలన; ఇట్లు= ఈ విధంగా; అయిదును= ఐదు భూతముల లక్షణాలను; ఉల్లసిలుటన్= ప్రకాశిస్తూ ఉండటంవలన; భూజంబు= చెట్టు (భూమినుండి పుట్టినది); పంచభూత+ఆత్మకంబు= ఐదు భూతాల స్వరూపం గలది.

తాత్పర్యం: పాపరహితుడవయిన ఓ భరద్వాజా! స్థావరమైన చెట్టులో పంచభూతాల లక్షణాలు ఎట్లా వ్యక్తమౌతున్నాయో చూడుము. చెట్టు పిడుగుపాటుకు వికృతిని పొందుతుంది. పిడుగు శబ్దాన్ని వినకుండా వికారాన్ని ఎట్లా చెందుతుంది? కాబట్టి శబ్దాన్ని గ్రహిస్తున్నదంటే దానికి ఆకాశలక్షణమైన శ్రవణేంద్రియం చెవి ఉన్నట్లే. వేడిమి సోకితే వాడిపోతుంది. స్పర్శను గ్రహించటమంటే వాయువు లక్షణాన్ని ధరించినట్లే. దారి చూచుకొని సాగుతుంది, పెరుగుతుంది. చూచుట అనే క్రియ తేజశ్శక్తికి చెందింది కాబట్టి వెలుతురు గ్రహించే నేత్రమున్నట్లే. చెట్టును పాదపం అంటారు. అనగా పాదజిహ్వలతో, వేళ్ళ రూపంలోని నాలుకలతో పానం చేస్తుంది. ఇక్కడ జలశక్తిని ధరించినట్లు కాగా, చెట్టు, పూవులు, పొగలు మొదలైనవాటి వాసనలు గ్రహిస్తుంది - అని వేదం పలుకుతున్నది. కాగా చెట్టు ఆఘ్రాణిస్తున్నట్లే. ఇది భూమి లక్షణం. ఈ విధంగా స్థావరమైన వృక్షంలో కూడా ప్రాథమికాలయిన పంచభూతాల లక్షణాలు గోచరిస్తున్నాయి కాబట్టి చెట్టు పంచభూతాత్మక మైనదిగా అంగీకరించవలసిందే.

విశేషం: తరువులో ఘ్రాణలక్షణం తప్ప మిగిలిన అన్ని లక్షణాలూ సహజంగానే ప్రత్యక్ష ప్రమాణాలతోనే నిరూపితమైనాయి. ఘ్రాణలక్షణం - వాసన చూచే గుణం దగ్గరకు వచ్చేసరికి ప్రత్యక్షప్రమాణం చాలదు. అందుకని అక్కడ వేదాన్ని ప్రమాణంగా చూపాడు భారతకర్త. వేదప్రామాణ్యాన్ని అంగీకరించకపోతే ఆస్తిక్యమే దెబ్బతింటుంది కాబట్టి అది తిరుగులేని ప్రమాణ మన్నమాట.

వ. శైలాదుల యందు నిట్ల యూహింపఁ బెఱ భంగులం గలిగియుండుఁ; బంచభూతాత్మకంబు గాని భూతంబు
లేదనుట వేదనిశ్చయం' బనిన విని భరద్వాజుండు. 89

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: శైల+ఆదులయందున్= కొండలు మొదలయినవాటియందును; ఇట్లు+అ= ఈ విధంగానే; ఊహింపన్= ఆలోచించగా; పెఱభంగులన్= ఇతర విధాలను, పద్ధతులను; కలిగి+ఉండున్= వహించి ఉండును; పంచభూత+ఆత్మకంబు+కాని= పంచభూతాలతో ఏర్పడినది కాని; భూతంబు= (కలిగినది) వస్తువు, ప్రాణి, పదార్థం; లేదు+అనుట= లేదనటం; వేదనిశ్చయంబు= వేదంయొక్క నిర్ణయం; అనినన్= అనగా; విని= ఆలకించి; భరద్వాజుండు= భరద్వాజ ముని.

తాత్పర్యం: కొండలు మొదలైనవాటిలో కూడా ఇదే విధంగా ఆలోచించగా, పంచభూతాలలో ఏర్పడని ప్రాణి లేదన్నది వేదం నిర్ణయించిన విషయం' అనగా విన్న భరద్వాజుడు.

విశేషం: ఇక్కడ పూర్వ లక్షణాన్ని చెలరేగకుండా చేసే ఉద్దేశంతోనే భృగువు 'ఇది వేద నిశ్చయంబు' అని చివరిమాటగా పలికినట్లున్నాడు.

క. **'భూముఖ్యం బగు భూత । గ్రామంబు గుణంబు లైన గంధాదులఁ దే**
జోమహిత యనుభవించుట । యేమెయి? నెద్దాని కావహిల్లుచునుండున్.' **90**

ప్రతిపదార్థం: తేజస్+మహిత!= గొప్పతేజస్సుగలవాడా!; భూముఖ్యంబు+అగు= భూమి మొదలైన; భూతగ్రామంబు గుణంబులు+ఐన= భూతాల సమూహం యొక్క స్వభావాలైన; గంధ+ఆదులన్= వాసన మొదలైనవాటిని; అనుభవించుట= పొందటం; ఏమెయిన్= ఏ విధంగా; ఏ+దానికిన్= దేనికి; ఆవహిల్లుచున్+ఉండున్?= కలుగుతూ ఉంటుంది?

తాత్పర్యం: 'ఓ తేజస్వీ! భూమి మొదలయిన పంచభూతాలకు గంధం మొదలయిన లక్షణాలున్నాయి. ఆలక్షణాలను, స్వభావాలను ఏ విధంగా ఎవరు అనుభవిస్తారు? ఆ అనుభవం అనేది ఏ క్రమంలో ఎవరికి చెందుతుంది'.

విశేషం: సృష్టి అంతా పంచభూతాత్మకం. ఇతరమైన దేదీ లేదు. అయినప్పుడు అనుభోక్తా, అనుభుక్తమూ రెండూ సాంకేతికంగా ఒకటే. అందుకని అనుభవాన్ని గురించిన క్రమపరిణామాన్ని వివరించవలసి వచ్చింది.

తే. **అనిన భృగుఁ డిట్టులను 'విషయములు నింద్రి । యములు మనసును గ్రమసాధనములు గాఁగ**
నంతరాత్మ ప్రదర్శి యై యనుభవించి । తత్కృతము లగు మోదఖేదములఁ బొందు. **91**

ప్రతిపదార్థం: అనినన్= భరద్వాజుడు అనగా; భృగుఁడు= భృగుమహర్షి; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నాడు; విషయములున్= పదార్థాలును; ఇంద్రియములున్= కన్నులు మొదలైన ఇంద్రియాలూ; మనసును= మనస్సు; క్రమసాధనములు+కాఁగన్= వరుసగా ఉపకరణాలు అవుతుండగా; అంతర్+ఆత్మ= లోపలి జీవుడు; ప్రదర్శి+ఐ= చూచేవాడై; అనుభవించి= అనుభవాన్ని పొంది; తద్+కృతములు+అగు= ఆ అనుభవముచేత చేయబడిన (కలిగిన); మోదఖేదములన్= సుఖదుఃఖాలను; పొందున్= చెందును.

తాత్పర్యం: భృగువు సమాధానమిది - 'పదార్థాలు, వాటిని గ్రహించే ఇంద్రియాలు, ఇంద్రియాలను నియంత్రించే మనస్సూ - ఈ మూడూ వరుసగా అనుభవక్రియకు సాధనాలు. అనుభోక్త లోపలి జీవుడు. అతడే అంతరాత్మ. అతడు పై మూడింటిని చూస్తూ పంచభూతాల స్వభావాలను అనుభవిస్తాడు. అనుభవించి, తత్ఫలితంగా సుఖాన్నో లేక దుఃఖాన్నో పొందుతాడు. కాబట్టి అనుభోక్త అంతరాత్మ. అతడి క్రింద మనస్సు, దాని అధీనంలో ఇంద్రియాలు, ఇంద్రియాల దగ్గర పదార్థాలు - ఇదీ క్రమం క్రిందినుండి చూస్తే.

విశేషం: ఇక్కడ వివరించిన వాటిలో విషయాలు - పదార్థాలు, ఇంద్రియాలు కనిపించేవి రెండు. మనస్సు, అంతరాత్మ కనిపించనివి రెండు. కనిపించకపోయినా వస్తువులుండవచ్చు - అనేది మన అనుభవంలోని విషయమే. మనస్సు ఉనికిని గ్రహించవచ్చును. మనం చూస్తూకూడా ఒక్కొక్కసారి ఎదుటి వస్తువును గ్రహించలేము. కారణం మనస్సు అక్కడ లేక. కాబట్టి ఇంద్రియాలతోపాటుగా మనస్సుకూడా అనుభవానికి అవసరమే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అప్పురుషుండు. 92

తాత్పర్యం: ఆ మానవుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: భారతీయ వేదాంత శాస్త్రాలలో ఈ పురుషశబ్దానికి ఒక ప్రత్యేకత ఉన్నది. ప్రకృతి, పురుషుడు వంటి వాడుకలో పురుష శబ్దాన్ని పర్యాయశబ్దాలతో ప్రయోగించరు. అట్లాగే పురుషోత్తముడంటే విష్ణువు. నరోత్తముడంటే ఆ అర్థం రాదుమరి! పురుషసూక్తమనే వాడుక తప్ప మానవ సూక్తంవంటి మాటలు లేవు. ఆ దృష్టిలో ఇక్కడి పురుష శబ్దం అంతరాత్మకు పర్యాయంగా ప్రయుక్తమైనట్లు ఉన్నది.

క. క్షేత్రజ్ఞుం డనఁగ నిఖిల। గాత్ర వ్యాప్తత్వమహిమ గలిగి సమీరా
సూత్రణమున జీవుండును। గోత్రమునై సర్వవర్తకుం డగుచుండున్. 93

ప్రతిపదార్థం: క్షేత్రజ్ఞుండు+అనఁగన్= క్షేత్రజ్ఞ డనే పేరుతో; నిఖిలగాత్రవ్యాప్తత్వ మహిమ+కలిగి= మొత్తం శరీరంలో వ్యాపించి ఉండెడి గొప్పతనం వహించి; సమీర+ఆసూత్రణమునన్= (ప్రాణం) గాలి యొక్క ప్రవేశం వలన; జీవుండును= ప్రాణమూ; గోత్రమును+ఐ= వంశమునూ అయి; సర్వవర్తకుండు+అగుచున్+ఉండున్= అన్నింటా ఉండెడివాడు అవుతూ ఉంటాడు.

తాత్పర్యం: సృష్టిలోని ఖేదమోదాలకు పాత్రమై ఉండే ఆ పురుషుడు క్షేత్రజ్ఞుడనే సంజ్ఞతో శరీరమంతా నిండి ఉండే గొప్పతనం కలిగి, ప్రాణవాయువుతో కలిసి ఉండటంవలన జీవుడని పిలువబడుతూ తానే వంశం కూడా అయి అన్నింటా వ్యాపించి ఉంటాడు.

విశేషం: క్షేత్రమంటే శరీరం; క్షేత్రజ్ఞుడు అంటే జీవాత్మ - క్షేత్రాన్ని ఎరిగినవాడు అని అర్థం. ప్రాణమనే వాయువుతో ఉండటంవలన ప్రాణికి - జీవుడు; అయితే అంతమాత్రమే కాకుండా వంశలక్షణమూ జీవలక్షణమూ ధరించి సర్వవ్యాపకుడై కూడా ఉంటాడు.

క. అగు నీతత్త్వము సత్త్వా। దిగుణత్రయ వికృతి కత్యతీతంబై పూ
ర్వ గురుత్వంబునకుం జన। విగతత్వంబునకు నెలవు విమలవిచారా! 94

ప్రతిపదార్థం: విమలవిచారా!= నిర్మలమైన ఆలోచన కలవాడా!; ఈ తత్త్వము= ఈ క్షేత్రత్వం; సత్త్వ+ఆది గుణత్రయ వికృతికి(న్)= సత్త్వం మొదలైన త్రిగుణాల వికారానికి; అతి+అతీతంబు+ఐ= మిక్కిలిగా గడచిపోయినదై, దూరమైనదై; పూర్వగురుత్వంబునకున్= మొదటి గొప్పతనానికి; చనన్= వెళ్ళుటకు, చేరుటకు; విగతత్వంబునకు(న్)= బొత్తిగా పోయిన తనమునకు, మిక్కిలి లేమికి; నెలవు= స్థానం.

తాత్పర్యం: ఈ క్షేత్ర క్షేత్రజ్ఞతత్వం, సత్వరజస్తమోగుణాలు - అనే ఈ మానవస్వభావ వికారాలకు మిక్కిలి దూరమై ఆత్మ ఈ జన్మపరంపరల చక్రాన తగుల్కొనక, ముందున్న కైవల్యానికి నిలయమైనది.

విశేషం: ఈ క్షేత్రజ్ఞతత్త్వం ప్రకారం ఆత్మ స్వతఃముక్తం; ఆనందమయం; అయినా జన్మ పరంపరలు అనే చక్రాన తగుల్కొని పరిభ్రమిస్తూ తనను తాను మరచి వ్యవహరిస్తూ, చివరకు తన నెలవును - కైవల్యాన్ని చేరుకొంటుంది.

ఆ. బుధుఁడు సూక్ష్మ విమల బుద్ధి నప్పురుషుని। నరసి కాంచి యతని యంద మనసు
దిగ్గ విడిచి, యెగ్గు లగ్గును బొందక। శుద్ధశాంతిఁ బరమసుఖము పొందు. 95

ప్రతిపదార్థం: బుధుఁడు= పండితుడు; సూక్ష్మవిమల బుద్ధిన్= ఆధ్యాత్మమయిన నిర్మలమైన తెలివితో; ఆ+పురుషునిన్= ఆ క్షేత్రజ్ఞుడిని; అరసి= వెదకి; కాంచి= చూచి; అతనియందున్+అ= ఆ క్షేత్రజ్ఞుడి యందే; మనస్సు= హృదయము; దిగ్గ విడిచి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దిగవిడిచి, వదలిపెట్టి; ఎగ్గు(న్)+లగ్గును= కీడును, మేలును; పొందక= చెందక; శుద్ధశాంతిన్= పరిశుభ్రమైన శాంతితో; పరమ సుఖము= గొప్ప సంతోషం; పొందున్= చెందుతాడు.

తాత్పర్యం: పండితుడు అధ్యాత్మచింతనతో, నిర్మలమతితో కేవలుడైన ఆ పురుషుడిని అన్వేషించి, దర్శించి ఆతడి యందే తన మనస్సును లగ్నంచేసి, ఇతరమైన దేనినీ చూడక, కేవలప్రశాంతితో సుఖాలనన్నిటిని మించిన ఆ పరమసుఖాన్ని పొందుతాడు.

విశేషం: పండితుడు క్షేత్రజ్ఞదర్శనంతో పరమసుఖాన్ని పొందగలడు - అంటే పరిశేషన్యాయంతో అపండితుడు దానికి విరుద్ధంగా గతానుగతికంగా జన్మచక్రంలో పడి తిరుగుతూనే ఉంటాడని కూడా అర్థం.

వ. అని వెండియు. 96

తాత్పర్యం: అని పలికి మరలా. (తరువాతి పద్యంతో అన్వయం).

భృగుమహాముని భరద్వాజునకుం జెప్పిన వర్ణాశ్రమాచారక్రమము (సం. 12-181-1)

సీ. 'ఆగమ సత్యధర్మాచార తపముల । కునికి పట్టులుగాఁగ వనజభవుఁడు
గలిగించె మును బ్రాహ్మణుల మఱి కల్పించె । నృప వైశ్య శూద్రుల నిర్మలాత్మ
బ్రాహ్మణాదికముగఁ బరఁగు నన్నాలుగు । జాతుల యుజ్జ్వలచ్ఛాయ లోలి
సొంపారుఁ దెలుపును గెంపును బసుపు చా । యయుఁ గప్పు నయ్యు నండ్రాంద్ర వర్యు

ఆ. లాత్మకర్మ మెడలి యనులోమ వృత్తి నె । జ్జాతి సొచ్చు నన్యజాతి పనికి
దాని కట్టిభంగి దలకొనుఁ బెక్కులు । పనులఁ జేసి జారతనము వచ్చు. 97

ప్రతిపదార్థం: నిర్మల+ఆత్మ!= మలినంలేని ఆత్మకలవాడా! భరద్వాజా!; వనజభవుఁడు= బ్రహ్మదేవుడు; ఆగమ సత్యధర్మాచార తపములకున్= వేదాలకు, సత్యానికి, ధర్మానికి, ఆచారానికి, తపస్సునకు - ఈ అన్నిటికి; ఉనికి పట్టులుగాఁగన్= స్థానాలు అయ్యేటట్లుగా; మును= ముందుగా; బ్రాహ్మణులన్= బ్రాహ్మణజాతిని; కలిగించె(న్)= పుట్టించాడు; మఱి= తరువాత; నృప వైశ్య శూద్రులన్= క్షత్రియ వైశ్య శూద్రులను; కల్పించె(న్)= పుట్టించాడు; బ్రాహ్మణ+ఆదికముగన్= బ్రాహ్మణులు మొదలుగా; పరఁగు= ఒప్పు; ఆ+నాలుగు జాతుల= ఆ నాలుగు వర్ణాల; ఉత్+జ్వల+ఛాయలు= బాగుగా ప్రకాశించే మేని రంగులు; ఓలి(న్)= క్రమంగా; సొంపు+ఆరు= విలసిల్లునటువంటి; తెలుపును= తెల్లదనమూ; కెంపును= ఎఱ్ఱదనము; పసుపుచాయయున్= పసుపు (పచ్చని) రంగూ; కప్పున్= నల్లదనమూ; ఐ= అయి; అని; ఆర్యులు= పెద్దలు; అందురు= అంటారు; ఆత్మకర్మము= తనపని; అనులోమవృత్తిన్= ఆరోహణ క్రమానుగతమైన బ్రతుకు దెరువును; ఎడలి= విడిచి; ఏ+జాతి= ఏ వర్ణము; అన్యజాతిపనికిన్= ఇతర వర్ణపు వృత్తికి; చొచ్చున్= ప్రవేశిస్తుందో; దానికిన్= ఆ జాతికి; అట్టి భంగి= ఆ పద్ధతి; తలకొనున్= కలుగుతుంది; పెక్కులు పనులన్+చేసి= అనేకములయిన పనులవలన; జారతనము= వ్యభిచారం, రంకుతనం; వచ్చున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఓ నిర్మలాత్మా! భరద్వాజా! బ్రహ్మదేవుడు మొదటగా వేదాలకూ, సత్యధర్మ ఆచారాలకూ, తపస్సులకూ నెలవులుగా ఉంటారని బ్రాహ్మణులను సృజించాడు. తరువాత క్షత్రియ వైశ్య శూద్రులను పుట్టించాడు. బ్రాహ్మణులు మొదలు శూద్రుల వరకు గల నాలుగు వర్ణాలవారి మేని రంగులు క్రమంగా తెలుపు, ఎరుపు, పసుపు, నలుపు- (అంటారు ఆర్యులు.) ఈ నాలుగు వర్ణాలవారిలో ఏ జాతి వారయినా, తమ వృత్తులు వదలి అన్యుల వృత్తులు స్వీకరిస్తే వారికి ఆ వృత్తి ఏర్పడుతుంది. అయితే అటువంటి ప్రవర్తనవలన లోకాన రంకుతనం కలుగుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. సిత రక్త పీత నీలము । లతులమతీ! మొదలు దొడఁగి యంతంతకు హీ
నతఁ దాల్చుఁ గాన యెఱిఁగిం । చితి నీ పరిపాటిఁ గర్మశీలతకొఱకున్.' 98

ప్రతిపదార్థం: అతులమతీ!= సాటిలేని బుద్ధిగలవాడా!; సిత రక్త పీత నీలములు= తెలుపు, ఎరుపు, పసుపు, నలుపు; మొదలు+తొడఁగి= మొదలుకొని; అంతకున్+అంతకున్= అంతకంతకు క్రిందికి పోయేకొలదీ; హీనతన్= తక్కువ తనమును; తాల్చున్= ధరించును; కాన= కావున; కర్మశీలత కొఱకున్= కర్మల స్వభావాల కొరకు; ఈ పరిపాటిని= ఈ క్రమాన్ని; ఎఱిఁగించితిన్= తెలిపాను.

తాత్పర్యం: ఓ భరద్వాజా! తెలుపు ఎరుపు పసుపు నలుపు లనే ఈ వర్ణాలు మొదటినుండి క్రిందికి వచ్చే కొలది తక్కువతనాన్ని వహిస్తాయి. తెలుపుకంటె ఎరుపు తక్కువ, అంటే బ్రాహ్మణుడికంటె క్షత్రియుడు హీనుడు. ఈ విధంగా ఈ వర్ణాలలో హెచ్చు తగ్గుల క్రమాన్ని ఆయా వర్ణాల స్వభావాల ఎరుకకొరకు నీకు తెలియజేశాను'.

విశేషం: వర్ణం అనేమాటకు రంగు అని అర్థం. మొట్టమొదట ఈ వర్ణభేదం మానవశరీర వర్ణాల కారణంగానే ఏర్పడి, అనంతరం పెద్దకాలానికి కులంగా స్థిరపడిపోయి ఉంటుంది. గ్రంథం ప్రాచీనం కాబట్టి ఆ మొదటి లక్షణాలు గ్రంథస్థాలుగా నిలిచాయి.

వ. అని మఱియును. 99

ప్రతిపదార్థం: అని= పలికి; మఱియును= ఇంకను.

తాత్పర్యం: అని పలికి ఇంకా ఇట్లా ప్రసంగిస్తున్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సత్యమ బ్రహ్మము దపమును । సత్యమ ప్రజలను సృజించు సత్యము లోక
స్థిత్యాధానముఁ జేయును । సత్యం బనృతంబుచేత సంపిహిత మగున్. 100

ప్రతిపదార్థం: సత్యము+అ= సత్యమే; బ్రహ్మము= వేదం; తపమును= తపశ్చర్య కూడా; సత్యమ= సత్యమే; ప్రజలన్= జనులను; సృజించు(న్)= పుట్టిస్తుంది; సత్యమ= సత్యమే; లోకస్థితి+ఆధానమున్= జగత్తుయొక్క ఉనికిని స్థాపించుటను; చేయున్= చేస్తుంది; సత్యంబు= సత్యం; అనృతంబుచేత(న్)+అసత్యంచేత; సంపిహితము= బాగుగా కప్పబడింది; అగున్= అవును.

తాత్పర్యం: సత్యమే వేదం, సత్యమే తపస్సు, సత్యవ్రతాన్ని పాటిస్తే తపస్సు చేసినట్లే. సృష్టిలో ప్రజాసంతతిని సత్యమే సృష్టిస్తున్నది. లోకం నిలిచి ఉండటానికి సత్యమే కారణం. ఈ విధంగా లోక సృష్టికి, లోకస్థితికి ఆధారమైన ఈ సత్యం అసత్యం వలన కప్పబడిపోతుంది.

విశేషం: సత్యశబ్ద వ్యుత్పత్తి గ్రహించదగింది. 'సత్'కి చెందింది సత్యం. ఈ 'సత్' అనే శబ్దం వేదాంత పరిభాషలో ఎక్కువసార్లు వస్తుంటుంది. సత్= ఉనికి; సత్తా అనే సంస్కృతశబ్దం కూడా ఇటువంటిదే. 'సత్'కి వ్యతిరిక్తం 'అసత్'. అసత్తునుండి సత్తుకు చేరుకోవాలని ఉపనిషత్తుల ఉద్ఘోష.

వ. అట్లుంగాక ధర్మాధర్మంబు లనఁ బ్రకాశతమంబు లన బోధాజ్ఞానంబు లన స్వర్గ నరకంబు లన సుఖదుఃఖంబు లనఁ బరఁగు బుధజన వ్యావహారిక శబ్దంబులకు నర్థంబులై సత్యానృతంబులు ప్రవర్తిల్లుం గావున. 101

ప్రతిపదార్థం: అట్లున్+కాక= ఆ విధంగానే కాకుండా; ధర్మ+అధర్మంబులు+అనన్= పుణ్యం పాపం అనగా; ప్రకాశ తమంబులు+అనన్= కాంతి, చీకటి అనగా; బోధ+అజ్ఞానంబులు+అనన్= జ్ఞానం అజ్ఞానం అనగా; స్వర్గ నరకంబులు+అనన్= పుణ్యలోకం పాపలోకం అనగా; సుఖదుఃఖంబులు+అనన్= సంతోషం, ఏడుపు అనగా; పరఁగు= ఒప్పెడు; బుధజన వ్యావహారిక శబ్దంబులకున్= పండిత జనుల పలుకులలోని పదాలకు; అర్థంబులై= శబ్దార్థాలై తెలియపరచే శబ్దాలై; సత్య+అనృతంబులు= సత్యం అసత్యం అనేవి; ప్రవర్తిల్లున్= ప్రవర్తిస్తాయి; కావున(న్)= కాబట్టి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: లోకాధారమైన సత్యం అసత్యంచేత కప్పబడటమే కాదు, లోకంలో పుణ్యాపాపా లని, వెలుతురు చీక ట్లని, జ్ఞాన అజ్ఞానా లని, పుణ్యలోక పాపలోకా లని, సుఖదుఃఖా లని, ఆర్యులు వ్యవహరించే మాటల కర్థాలు కూడా క్రమంగా సత్య అసత్యాలే. అంటే సత్యమంటే ధర్మం, కాంతి, జ్ఞానం, స్వర్గం సుఖం - అని అర్థాలు. ఆ విధంగానే అసత్యమంటే పాపం, చీకటి, తెలివి తక్కువతనం, నరకం, దుఃఖం - అని గ్రహించాలి. లోకంలోని మంచిమొత్తం సత్యం, చెడుగంతా అసత్యం - ఇదీ ఫలితార్థం.

క. అనఘా! దుఃఖాత్మకమగు । నన్నృతం బడఁగించుటకుఁ బ్రయత్నమున సుధీ
జను లాచరింతు రనిశం । బును మోహవిఘాతి నియమములు నిష్ఠమెయిన్. 102

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; సుధీజనులు= పండితులు; దుఃఖ+ఆత్మకము+అగు= దుఃఖస్వరూపమైన; న+ఋతంబు= అసత్యం; అడఁగించుటకు(న్)= అణచుటకు; ప్రయత్నమున(న్)= గొప్ప యత్నంతో; అనిశంబును= ఎల్లప్పుడును; మోహవిఘాతి నియమములు= మానసిక విభ్రాంతిని చంపు కట్టుబాట్లు; నిష్ఠమెయిన్= దీక్షతో; ఆచరింతురు= ఆచరణలో పెట్టుతారు.

తాత్పర్యం: పాపమెరుగని ఓ భరద్వాజా! దుఃఖస్వరూపమైన ఈ అసత్యాన్ని అణచగోరి, పండితులు గొప్ప యత్నంతో పొరపాట్లను తొలగించే కట్టుబాట్లను ఎప్పుడూ దీక్షతో ఆచరిస్తూ ఉంటారు.

విశేషం: సత్యాసత్యాలు యథార్థంగా ఉన్నవి ఉన్నట్లుగా కనిపిస్తే నరులు సామాన్యంగా సత్యాన్నే ఎన్నుకొంటారు. అయితే అసత్యం సత్యంవలె భ్రాంతి కలిగిస్తుంది. ఆ భ్రాంతిని నిర్మూలించే ప్రయత్నం సుధీజనులే చేయాలి. సామాన్యులకు అది అలవిమాలిన పని.

క. ఒలయు జరావ్యాధి ప్రభృ । తులు శారీరములు గాఢ తోదక శోకా
దులు మానసములు; దుఃఖం । బులు రెండు విధముల నిట్లు పురుషు నలంచున్. 103

ప్రతిపదార్థం: ఒలయు= కలిగెడు; జరావ్యాధి ప్రభృతులు= ముసలితనం, రోగం మొదలైనవి; శారీరములు= ఒడలికి, శరీరానికి చెందినవి; గాఢ తోదక= బాధించే; శోక+ఆదులు= గట్టి (మానసిక) బాధ, బంధునాశంవలన దుఃఖం మొదలయినవి; మానసములు= మనస్సునకు చెందినవి; దుఃఖంబులు= బాధలు; రెండు విధములన్= రెండు రీతులలో; ఇట్లు= ఈ విధంగా; పురుషున్= మానవుడిని; నలంచున్= బాధిస్తాయి.

తాత్పర్యం: మానవజీవితంలో దాపురించే బాధలు రెండు విధాలుగా ఉంటాయి. ఒకటి శారీరక దుఃఖాలు, ముసలితనం, రోగం మొదలైనవి. రెండు - మానసిక బాధలు, బంధునాశం మొదలైనవాటి వల్ల కలిగేవి

క. శారీర మానసములగు । నీ రెండు విధములు దన్ను నేఁపక యుండం
గోరికొని నియమములఁ బ్రతి । కారం బొనరింపఁగా సుఖం బొందు నరున్. 104

ప్రతిపదార్థం: శారీర మానసములు+అగు= శరీరానికి, మనస్సునకు చెందినవైన; ఈ రెండు విధములు= పైన తెలిపిన రెండు రకాలయిన రోగాలు; తన్ను(న్)= తనను (నరుడిని); ఏఁపక+ఉండన్= బాధించకుండా ఉండుటను; కోరికొని= తనకై అభిలషించి; నియమములన్= కట్టుబాట్లతో; ప్రతికారంబు+ఒనరింపఁగాన్= ప్రతిక్రియ చేస్తే; నరున్= మానవుడిని; సుఖంబు+ఒందున్= క్షేమం పొందుతుంది.

తాత్పర్యం: శారీరకంగా, మానసికంగా దాపురించే రోగాలను శారీరకమైన మానసికమైన నియమ నిష్ఠలతో నియంత్రించ గలిగితే అవి నరుడిని బాధించవు. అట్టి ఆ నరుడు సుఖిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పద్యంలోని 'తన్ను నేఁపక యుండంగోరికొని' అనే మాటలు గమనించదగ్గవి. కోరుట వేరు, కోరుకొనుట వేరు. కోరుకొనుట అంటే తనకొరకు కోరటం. అంటే గట్టిగా సంకల్పించుకొని ఆ సంకల్పబలంతో ఒక నిర్ణయానికి రావటం. అట్లా గట్టి నిర్ణయం జరిగితే దుఃఖనివారణ సాధ్యమే నంటున్నాడు భృగువు.

క. వినుదుఃఖంబులఁ దెగఁ దోఁ। చిన పురుషుఁడు సౌఖ్య సక్తచిత్తుఁడు గా కా
రిన వైరాగ్యముఁ జెందిన। ననుపమ మగు పరమపదము నమ్మెయి సేర్చున్?' 105

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; దుఃఖంబులన్= శారీరక మానసిక వ్యాధి - ఆధులను; తెగన్+తోఁచిన పురుషుఁడు= ఛేదించి నెట్టివేసిన నరుడు; సౌఖ్యసక్త చిత్తుఁడు= సుఖమునందు తగుల్కొన్న మనస్సు కలవాడు; కాక= కాకుండా; ఆరిన వైరాగ్యమున్= శాంతించిన విరాగి తనమును-విషయవాంఛలు లేకుండుటను; చెందినన్= పొందినచో; న+ఉపమము+అగు= సాటిలేనిదగు; పరమ పదమున్= గొప్పస్థానాన్ని, మోక్షాన్ని; ఆ+మెయిన్= ఆ విధముగా; చేర్చున్= పొందించును.

తాత్పర్యం: పైన వివరించినట్లుగా సంకల్పబలంతో, స్థిరనిశ్చయంతో వ్యాధి - ఆధులను దూరీకరించుకొన్న నరుడు ఆ జయంతో, మళ్ళీ సుఖసంతోషాల వెంటబడిన సామాన్యనరుడివలె ప్రవర్తించకుండా, విషయవాంఛలు శాంతించినవాడై ప్రశాంతమైన వైరాగ్యాన్ని స్వీకరించాలి. అపుడు ఆ వైరాగ్యమార్గం అతడిని ముక్తికి చేర్చుతుంది'.

విశేషం: ఆధివ్యాధుల నిరోధంతో నరుడి మనశ్శరీరాలు రెండూ పరిశుభ్రపడి కాంతిమంతములౌతాయి. అయితే ఆ స్థితిలో నరుడు మళ్ళీ పాతత్రోవలో ప్రపంచ సుఖాల వెంటబడి పరుగెత్తితే ప్రయోజనముండదు. కథ మళ్ళీ మొదటికి వచ్చినట్లే. అందువలన మనశ్శరీరారోగ్యాలు ఉజ్జ్వలంగా ఉన్నపుడు ప్రశాంతచిత్తుడై విరాగిగా బ్రతకగలిగితే మోక్షాన్ని చేరుకోగలుగుతాడు నరుడు.

వ. అనిన విని భరద్వాజుం 'డాశ్రమధర్మ ప్రకారంబులు సువ్యక్తంబులుగా నెఱింగింపు' మనుటయు భృగుం డిట్లనియె. 106

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; భరద్వాజుండు= భరద్వాజ ముని; ఆశ్రమ ధర్మ ప్రకారంబులు= బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సంన్యాస ఆశ్రమముల యొక్క నీతి నియమాలు; సువ్యక్తంబులుగాన్= బాగుగా స్పష్టపడే విధంగా; ఎఱింగింపుము= తెలియజేయుము; అనుటయున్= అనగా; భృగుండు= భృగుమహర్షి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా దుఃఖనివారణ మార్గాన్ని భృగువునుండి గ్రహించిన భరద్వాజుడు 'ఆశ్రమధర్మాలు - బ్రహ్మచారిగా, గృహస్థుడుగా, వానప్రస్థుడుగా, సంన్యాసిగా నరుడు ఆచరించవలసిన ధర్మాలను సుస్పష్టంగా తెలుపు'మనగా, సరి అని ఆ భృగుమహర్షి భరద్వాజుడిని ఉద్దేశించి ఈ విధంగా పలికాడు.

సీ. గురునకు భక్తుఁడై పరమాదరమున వే। దాభ్యాస మెప్పుడు నాచరించు
చును, శౌచశీలత వినయంబు త్రిషవణ। స్నానంబు భాస్కరానలసపర్య
పాటించుచుండుట బ్రహ్మచారికి వృత్తి;। ధనధాన్యములు గర్హితములు గాని
తెరువునఁ బడసి యతిథిపూజ మున్నుగా। నన్నపానాది భోగానుభవముఁ

తే. బొందువాఁడు గృహస్థుండు; గందమూల। శాక ఫలము లాహారంబు శయ్యభూమి
వననివాసికి నిస్సంగవర్తనమున। భిక్ష బ్రదుకుగ యతి శాంతిఁ బేర్చియుండు. 107

ప్రతిపదార్థం: బ్రహ్మచారికిన్= బ్రహ్మచర్యం - విద్యార్థిత్వం అనే ఆశ్రమంలో ఉన్నవాడికి; గురునకున్= చదువు నేర్పే అధ్యాపకుడికి; భక్తుఁడు+ఐ= శ్రద్ధకలవాడై; పరమ+ఆదరమున(న్)= గొప్ప అభిమానంతో; వేద+అభ్యాసము= వేదములను అభ్యసించుట-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నేర్చుకొనుట; ఎప్పుడున్= ఎల్లప్పుడు; ఆచరించుచున్= చేయుచు; శౌచశీలత= శుభ్రతతోడి స్వభావం; వినయంబు= అణకువ; త్రి+సవన= మూడు హోమములయందు; స్నానంబు= స్నానము చేయుట; భాస్కర+అనల సపర్య= సూర్యుడి, అగ్ని సేవను; పాటించుచుండుట= క్రమంగా చేస్తూఉండటం; వృత్తి= ధర్మం - బ్రహ్మచారికి పై విధులు పాటించటం ధర్మమనుట; ధనధాన్యములు= డబ్బు, గింజలు; గర్హితములు+కాని= నిందితముకాని; తెరువునన్= పద్ధతియందు; పడసి= పొంది; అతిథిపూజ= అతిథుల - భోజనసమయానికి ఇంటికి వచ్చిన వ్యక్తుల సత్కారం; మున్ను+కాన్= మొదట జరుగుచున్నట్లుగా; అన్నపాన+ఆది భోగ+అనుభవమున్= భోజనం, పానీయం మొదలగు భోగములను అనుభవించటాన్ని; పొందువాఁడు= స్వీకరించేవాడు; గృహస్థుండు= గేస్తు - గృహస్థ ఆశ్రమంలో ఉన్నవాడు; వననివాసికిన్= వానప్రస్థ ఆశ్రమంలో ఉన్నవాడికి; కందమూల శాకఫలములు= గడ్డలు, దుంపలు, కూరలు, పండ్లు; ఆహారంబు= భోజనం; శయ్య= పడక; భూమి= నేల; యతి= సన్న్యాసి; నిస్+సంగవర్తనమున(న్)= ఆసక్తిలేని ప్రవృత్తితో; భిక్ష= బిచ్చం; బ్రతుకుగన్= జీవనంగా; బ్రతుకు దెరువుగా; శాంతిన్= శాంతితో; పేర్చి+ఉండున్= అతిశయించి ఉండును.

తాత్పర్యం: బ్రహ్మచర్యం నాలుగు ఆశ్రమాలలో మొదటిది. బ్రహ్మచారి గురుభక్తి కలిగి, వేదాభ్యాసం నిరంతరం చేస్తూ ఉండాలి. శుభ్రత పాటించే గుణంతో అణకువతో మూడు (ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం) హోమాలు చేసే సమయంలో స్నానం చేస్తూ సూర్యుడిని అగ్నిని క్రమం తప్పక ఆరాధిస్తూ ఉండాలి. ఇదీ బ్రాహ్మణధర్మం. మూడు పూటలా హోమం చేయాలి వటువు. ధనధాన్యాలు నిందారహితంగా ధర్మమార్గాన పొంది ముందుగా అతిథి సత్కారంచేసి, ఆ పిదప భోజనపానీయాదులు స్వీకరిస్తూ ఉండటం గృహస్థుడి ధర్మం. వానప్రస్థ ఆశ్రమానికి ఆహారం కందమూలాలు, కూరలు, పండ్లు మాత్రమే. అతడికి పడక నేలమీద. ఇక చివరి ఆశ్రమం సన్న్యాసం. సన్న్యాసి అనాసక్త ప్రవృత్తితో బిచ్చమే జీవనంగా శాంతితో వెలుగుతూ ఉంటాడు.

విశేషం: మానవ జీవనకాలాన్ని నాలుగుగా విభజించి - బాల్యంలో, యౌవనంలో, ముదిమి మొదటి దశలో, అనంతరదశలో చేయదగిన పనులను క్రమంగా నిర్దేశించటమే ఈ ఆశ్రమధర్మ వివరణం. జీవనవిధానంలో ఒక క్రమపరిణతి వ్యక్తమౌతుంది.

క. ఫలకాంక్షి గాక నియతిం । జలిపిన నీయఖిల కర్మజాతంబును ని
ర్మల మోక్షపదముఁ జేర్చుట । గలుగు నవశ్యంబుఁ బుణ్యకరణప్రవణా!' 108

ప్రతిపదార్థం: పుణ్య కరణ ప్రవణా!= ధర్మం చేయటంలో ఆసక్తికలవాడా! - ఓ భరద్వాజా!; ఈ అఖిల కర్మజాతంబును= ఈ పైన వివరించిన మొత్తం ధర్మముల సమూహాన్ని; నియతిన్= నియమంతో; ఫలకాంక్షి గాక= ఫలాన్ని కోరేవాడు కాకుండా; చలిపినన్= చేసినచో; నిర్మల మోక్ష పదమున్= మలినంలేని ముక్తి స్థానాన్ని; అవశ్యము= తప్పక; చేర్చుట కలుగున్= పొందించటం జరుగుతుంది.

తాత్పర్యం: ధర్మాచరణ పరాయణుడవైన ఓ భరద్వాజా! పైన వివరించిన ఆశ్రమ ధర్మాలు నాలుగింటిని క్రమంగా నియమంతో ప్రయోజన కాంక్షతో కాకుండా ఆచరిస్తే తప్పకుండా ముక్తిపదం లభిస్తుంది'.

విశేషం: ఆశ్రమధర్మం నిర్వహణం సామాన్యంగానే చేయవచ్చును. అయితే ఆ చేయుటకు భృగువు ఒక క్రియావిశేషణంగా వాడాడు. 'ఫలకాంక్షిగాక' అని. ప్రయోజన కాంక్షతో గాక, సహజంగా ఆ ఆచరణ జరగాలి. అపుడే ముక్తి మరి!

వ. అనిన విని భరద్వాజుండు 'పరలోకంబున నొండు గలదం; డ్రీ లోకంబునకును నాలోకంబునకును విశేషం బెట్టిది? యెఱింగింపవే?' యని యడిగిన భృగుం డతని కిట్లనియె. 109

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; భరద్వాజుండు= భరద్వాజముని; పరలోకంబు+అన(న్)= ఇతరలోకం అనగా; ఒండు= ఒకటి; కలదు+అండ్రు= ఉన్నది అంటారు; ఈ లోకంబునకును= ఈ మన లోకానికీ; ఆ లోకంబునకును=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ పరలోకానికీ; విశేషంబు+ఎట్టిది= భేదం ఏ విధమైనది; ఎఱింగింపవే?= తెలియజేయవా?; అని; అడిగినన్= ప్రశ్నించగా; భృగుండు= భృగుమహర్షి; అతనికిన్= ఆ భరద్వాజుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: భృగుమహర్షి మాటలు విన్న భరద్వాజుడు 'పరలోకమని, మరొక లోకం ఉన్నది అంటారు. ఆ లోకానికీ ఈ లోకానికీ భేద మేమిటి? తెలుపు'మన్నాడు.

క. ఇది కర్మభూమి భోగా । స్పద; మా లోకంబు ధర్మపరులకు సులభం;
బది సత్యశౌచ సౌజ । న్య దయాదులు లేనివారి కప్రాప్య మగున్. 110

ప్రతిపదార్థం: ఇది= ఈ ఇహలోకం; కర్మభూమి= కర్మలకు పనిపాటులకు ఉద్దిష్టమైన నేల; ఆ లోకంబు= ఆ పరలోకం; భోగ+ఆస్పదము= సుఖ అనుభవాలకు నిలయము; అది= ఆ పరలోకం; ధర్మపరులకున్= ధర్మ ఆచరణ పరాయణులకు; సులభంబు= సుఖంగా దొరికేది; సత్యశౌచ సౌజన్య దయా+ఆదులు= నిజం చెప్పటం, పరిశుభ్రత, మంచితనం, కరుణ మొదలైన గుణాలు; లేనివారికిన్= కలుగనివారికి; అప్రాప్యము+అగున్= పొందరానిది ఔతుంది.

తాత్పర్యం: ఈ లోకం కర్మభూమి. ఇక్కడ నరుడు కర్మలు చేస్తాడు. కేవలం కర్మాచరణకే ఉద్దిష్టమైనది ఈ లోకం. పరలోకం కర్మల ఫలితాల అనుభవాలకు నిలయమైనది. కాబట్టి అది భోగభూమి అనవచ్చును. అయితే ఆ భోగభూమిలో ప్రవేశం ధర్మాచరణ పరులయిన నరులకే పరిమితం. సత్యవ్రతపాలన, శుభ్రత పాటించటం, మంచితనంతో వ్యవహరించటం, దయగలిగి ఉండటం మొదలైన మంచి లక్షణాలు లేనివారు ఆ పరలోకాన్ని పొందలేరు.

విశేషం: ప్రాక్తన కాలాన, నరుడు లోకవ్యవహారనిర్వహణమంతా కార్యకారణ సంబంధబద్ధమై ఉన్నదని భావించి, ఆ భావనకు విరుద్ధమైన సంఘటనలను గమనించినపుడు ఈ కర్మభూమి భోగభూమి - ఆలోచన కలిగి ఉండాలి. ఒక విధంగా ఈ ఆలోచన కూడా కార్యకారణ శృంఖలను, జగద్వ్యవహారాలహేతుబద్ధతను సమర్థించటానికి ఉద్దిష్టమైనదే.

క. ఈ లోకము దుఃఖబహుళ, । మా లోకము భూరిసుఖ నిరంతర; మం దే
జాలియును లేక యొండొరు । తో లెస్సగఁ బొంది యుండుదురు జను లనఘా! 111

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా!; ఈ లోకము= ఈ ఇహలోకం; దుఃఖబహుళము= కష్టాలతో నిండినది -ఎక్కువ కష్టనష్టాలకు పాత్రమైనది; ఆ లోకము= ఆ పరలోకం; భూరిసుఖ నిరంతరము= గొప్ప సౌఖ్యాలతో నిండినది; అందున్= ఆ పరలోకాన; ఏ జాలియును= ఏ చింతయు; లేక= ఉండక; జనులు= ప్రజలు; ఒండు+ఒరుతోన్= పరస్పరం - ఒకరితో ఒకరు; లెస్సగన్= బాగుగా; పొంది+ఉండుదురు= పొందిక, కూడిక కలిగి ఉంటారు.

తాత్పర్యం: ఈ లోకం కష్టనష్టాలకు చీకు చింతలకు ఆలవాలమై ఉండగా, ఆ లోకం దీనికి విరుద్ధంగా కేవలం సుఖాలకూ, క్షేమాలకూ, శుభాలకూ నిలయం. అక్కడి జనులకు ఏ ఖేదమూ ఉండదు. అందరూ పరస్పరం కలిసి మెలసి సుఖమయమైన జీవనం సాగిస్తూంటారు.

తే. హస్తి మశకాంతరము గల దరసి చూడ । వాస గృహ శయనాసన వసన గంధ
మాల్య తౌర్యత్రికారామ మానినీజ । నాది సుఖసాధనములకు నందు నిందు. 112

ప్రతిపదార్థం: అందున్= ఆలోకంలోనూ; ఇందున్= ఈ లోకంలోనూ; వాసగృహ= ఉండే ఇళ్ళు; శయన= పడకలు; ఆసన= పీటలు - కూర్చొనుటకు ఉపయోగించే పరికరాలు; వసన= గుడ్డలు; గంధ= (మంచి) వాసనలు; మాల్య= పూల దండలు; తౌర్యత్రిక= సంగీత నృత్యవాద్యము లను మూడు; ఆరామ= ఉద్యానవనాలు; మానినీ జన+ఆది= స్త్రీజనం మొదలైన; సుఖసాధనములకున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సౌఖ్యమును కలిగించే పరికరాలకు; అరసి చూడన్= పరిశీలించి చూడగా; హస్తి మశక+అంతరము= ఏనుగు, దోమల భేదం; కలదు= ఉన్నది.

తాత్పర్యం: ఇహలోక సుఖాలను పరలోక సుఖాలతో పోల్చిచూస్తే దోమకూ, ఏనుగుకూ ఉన్నంత భేదం కనిపిస్తుంది. నరుడికి సుఖసాధనాలయిన నివాసగృహాలు, పడకలు, ఆసనాలు, బట్టలు, సుగంధ ద్రవ్యాలు, పూలమాలికలు, సంగీత నృత్యవాద్యాలు, ఉద్యాన వనాలు, స్త్రీలు - ఈ అన్నింటా ఆ భేదం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పరలోక సుఖం ఏనుగైతే (హస్తి), ఇహలోక సుఖం దోమ (మశకం). కాబట్టి పరలోక సుఖమే ఉత్కృష్టమైనది.

విశేషం: నరుడి జీవితాన తృప్తి ముఖ్యం. అది అనుభూతిద్వారానే కాక, ఆశ ద్వారా కూడా లభిస్తుంది. రాబోయే సుఖాలకై నిరీక్షణలో కూడా తృప్తి నిక్షిప్తమై ఉంటుంది. పరలోక సుఖానుభవం ఆ విధమైన తృప్తిని కలిగిస్తూ నరుడిని శాంతింపజేస్తుంది.

వ. అని వెండియు. 113

తాత్పర్యం: అని చెప్పి ఇంకా.

క. 'ఇవి పుణ్యలోక విషయ। వ్యవసిత వచనంబు లధమమగు లోకము ధ
ర్మవిదూరజనులు వొందుదు। రవిరత బహుదుఃఖ నిలయ మది విప్రవరా! 114

ప్రతిపదార్థం: విప్రవరా!= బ్రాహ్మణ శ్రేష్ఠా!; ఇవి= ఈ పైన చెప్పినవి; పుణ్యలోక విషయ వ్యవసిత వచనంబులు= ధర్మలోకాలకు చెందిన నిశ్చితాలైన మాటలు; అధమము+అగు లోకము= హీనమైన లోకమును; ధర్మవిదూరజనులు= పుణ్యానికి ఎడమైన ప్రజలు; పొందుతారు= చెందుదురు; అది= ఆ తక్కువలోకం; అవిరత బహు దుఃఖ నిలయము= ఎల్లప్పుడు ఎక్కువగా దుఃఖాలకు స్థానం.

తాత్పర్యం: 'భరద్వాజా! ఇపుడు నేను వివరించినవి పుణ్యలోక సంబంధాలైన విషయాలు. కాని, వాటికి విరుద్ధంగా పాపలోకం కూడా ఉన్నది. ఆ లోకానికి ధర్మానికి, నీతికి, మంచికి దూరమై జీవించే జనులు చేరుతారు. ఆ లోకం ఎప్పుడూ ఎక్కువ దుఃఖాలకు స్థానంగా నిలుస్తుంది.

విశేషం: నరుడి మానసిక తృప్తికి, శాంతికి పుణ్యలోక స్థితి ఎంత అవసరమో, పాపలోకపు ఉనికీ అంతే అవసరం. ఈ లోకాన దుష్కర్మల అకృత్యాల, పాపాల ఫలితాలు పొందకుండానే గతించినవారు, తప్పించుకొనవీలులేకుండా అక్కడ మరొక అధమలోకం ఉండాలి మరి! కర్మఫలితం అనివార్యంగా నరుడికి చెందాలి - అని నరుడు నమ్మినపుడు ఈ లోకాలసృష్టి దేవుడికి తప్పదు.

క. విను మమకార వివర్జిత। మనస్కులకుఁ బుణ్యపాపమార్గంబులు లే
మిని లోకంబులఁ ద్రిమ్మర। రనఘా! పొందుదురు శాశ్వతానందంబున్.' 115

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా! భరద్వాజా!; విను= ఆలకించుము; మమకార వివర్జిత మనస్కులకున్= నాది అనే భావం వదలిన మనస్సులు కలవారికి; పుణ్య పాప మార్గంబులు= ధర్మ అధర్మ గతులు; లేమిని(న్)= లేకుండుటవలన; లోకంబులన్= లోకాలలో, ఈ పుణ్యపాపలోకాలలో; త్రిమ్మరరు= తిరుగాడరు; శాశ్వత+ఆనందంబున్= నిత్యమైన సుఖాన్ని; పొందుదురు= పొందుతారు.

తాత్పర్యం: భరద్వాజా! 'నాది' అనే అభిమానం, మోహం లేనివారు ఈ పుణ్యపాపమార్గాన ప్రయాణించరు. వారి త్రోవ వేరు. వారికి ఈ స్వర్గనరక లోకాలలో తిరుగాడే అవసరం రాదు. వారు నిత్యనిర్మల కేవల ఆనందాన్ని అందుకొంటారు'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'మమకారం' అనే ఒక్క దినుసును దూరీకరించగలిగితే నరుడు కేవలుడుగా మిగులుతాడు. కేవలుడి భావమే కైవల్యం, మోక్షం.

వ. అని చెప్పి భృగుండు బ్రహ్మవిహితంబులగు ధర్మంబులు సంక్షేపరూపంబున నెఱింగించితి' ననిన భరద్వాజుండు ప్రముదితాత్ముం డగుచు నమ్మహాత్ముం బ్రశంసించి వినతుండై వీడ్కొనియె; నతనిచేత విన్నంతవట్టును నీకుం జెప్పితి; నీ వింక నెయ్యది వినవల తనుటయు ననిమిషనదీనందనుతో ధర్మనందనుం 'డాచార విధి విను వాంఛ నా మనంబునం బేర్చియుండు' ననవుడు నతం డతని కిట్లనియె. 116

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; భృగుండు= భృగుమహర్షి; బ్రహ్మవిహితంబులు+అగు= బ్రహ్మచేత చేయబడినవి అగు; ధర్మంబులు= విధులు; సంక్షేప రూపంబునన్= కుదించిన రీతిలో; ఎఱింగించితిన్= తెలిపితిని; అనినన్= అనగా; భరద్వాజుండు= భరద్వాజముని; ప్రముదిత+ఆత్ముండు+అగుచున్= సంతుష్టమైన మనస్సు కలవాడు ఔతూ; ఆ+మహా+ఆత్మున్= ఆ గొప్ప హృదయం కలవాడిని - భృగుమహర్షిని; ప్రశంసించి= పొగడి; వినతుండు+ఐ= నమస్కరించినవాడై; వీడ్కొనియెన్=వెడలి పోయాడు; అతనిచేతన్= ఆ భరద్వాజుడి నుండి; విన్న+అంత+పట్టును= విన్న అంత విషయాన్ని; నీకున్= ధర్మరాజువైన నీకు; చెప్పితిన్= చెప్పాను; నీవు; ఇంకన్= మరియును; ఏ+అది= ఏది; వినన్+వలతు(వు)?= వినుటకు ఇష్టపడతావు?; అనుటయున్= అనగా; అనిమిషనదీనందనుతోన్= గంగానదీ పుత్రుడైన భీష్ముడితో; ధర్మనందనుండు= ధర్మరాజు; ఆచారవిధిన్= ఆచార నియమాలను; విను వాంఛ= ఆలకించే కోర్కె; నా మనంబునన్= నా మనస్సులో; పేర్చి= అతిశయించి; ఉండున్= ఉన్నది; అనవుడున్= అనిన వెంటనే; అతండు= ఆ భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మజునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ ప్రకారంగా భృగుమహర్షి బ్రహ్మ విధించిన ధర్మాలను సంక్షిప్తంగా నీకు తెలియజేశాను'. అని భరద్వాజుడితో అనగా, భరద్వాజుడు సంతోషించి, భృగువును స్తుతించి నమస్కరించి వెడలిపోయాడు. 'ఆ భరద్వాజుడి నుండి నేను విన్నంతవరకు ఆ ధర్మవిశేషాలను నీకు వినిపించాను. నీవు ఇంకా ఏమి వినాలని ఇష్టపడుతున్నావు?' అని భీష్ముడు ధర్మజుడితో అనగా, ధర్మరాజు తనకు ఆచారవిధులను వినాలనే కోరిక ఎక్కువగా ఉన్నదన్నాడు. దానికి బదులుగా భీష్ముడు ఆచారవిధిని ఇట్లా వినిపించాడు.

భీష్ముఁడు ధర్మజునకు నాచారవిధి యెఱింగించుట (సం. 12-186-2)

సీ. 'సజ్జనులం దురాచారవంతుల దురా । చారంబు గష్టత్వకారి యట్లు
గావున నాచారగతి వింట గడు లెస్స; । రాజమార్గంబున రచ్చ మంద
మూత్రపురీష విమోక్షంబు సేయమి, । శౌచియై వార్చి నిష్ఠను జలంబు
సొచ్చుట, సంధ్యల సూర్యు సేవించుట, । యర్కోదయాస్తమయముల నిద్ర

తే. వోవకుండుట, పంచార్ద్రభావ మొంది । కుడుచు టన్నంబు దెగడమి, తడిపదములు
గలుగ నిదురకుఁ జొరమి సత్కర్మవేది । నారదుఁడు వివరించె నాచారములుగ. 117

ప్రతిపదార్థం: సత్+జనులన్= మంచి ప్రజలలో; దుర్+ఆచారవంతులన్= చెడ్డ నడవడి గలిగిన వారిలో; దుర్+ఆచారంబు= చెడునడత; కష్టత్వకారి= దుఃఖాన్ని కలిగిస్తుంది; అట్లు+కావునన్= ఆ విధం కాబట్టి; ఆచారగతిన్= నడవడితీరును, ఆచారముల విధాన్ని; వింట= వినుట; కడు లెస్స= మిక్కిలి మంచిది; రాజమార్గంబునన్= రాజవీథిలో; రచ్చన్= సభయందు; మందన్= పశువుల సమూహంలో; మూత్ర పురీష విమోక్షంబు+చేయమి= మూత్రం మలం విడవకుండటం; శౌచి+ఐ= శుచిత్వం, శుభ్రత గల వాడై; వార్చి= ఆచమించి, ఆచమనము (నీటిని నోటినుంచి ఉమియుట) చేసి; నిష్ఠను= నిలుకడతో; జలంబు+చొచ్చుట=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నీట ప్రవేశించుట; సంధ్యలన్= సంధ్య వేళలందు; సూర్యు సేవించుట= సూర్యదేవుని పూజించటం (అర్ఘ్యమివ్వటం); అర్క+ఉదయ+అస్తమయములన్= సూర్యుడి పొడుపు క్రుంకు (సమయా)లలో; నిద్ర+పోవక+ఉండటం= నిద్రపోకుండా ఉండటం; పంచ+ఆర్ద్ర భావము= ఐదు తడిసినతనములు, పాద్య, అర్ఘ్య. స్నాన, ఆచమనీయ, నిర్మాల్యములు ఈ అన్నింటా జలస్పర్శ; ఒంది= పొంది; కుడుచుట= భుజించటం; అన్నంబు+తెగడమి= తినుదానిని తిట్టకుండటం; తడిపదములు+కలుగన్= తడిసిన కాళ్ళు ఉండగా; నిదురకున్= నిద్రకు చొరమి= ఉపక్రమించకుండటం; సత్+కర్మవేది= మంచి పనులు తెలిసిన; నారదుఁడు= నారదమహర్షి; ఆచారములుగన్= నడతలుగా; వివరించెన్= విశదపరచాడు.

తాత్పర్యం: చెడునడత అనేది సజ్జనులనూ, దుర్జనులనూ ఇరువురినీ కష్టపెట్టుతుంది. కాబట్టి నడతను గురించి వినటం మిక్కిలి మంచిది. రాజమార్గంలో, సభలో, పశువుల మందలో మలమూత్రవిసర్జన చేయకుండటం, శుచిగా ఆచమించి నిలకడగా నీటమునగటం, సంధ్యవేళలలో సూర్యుడికి అర్ఘ్యమిచ్చి పూజించటం, సూర్యుడు పొడిచేటప్పుడు, క్రుంకేటప్పుడు నిద్రపోకుండ ఉండటం, పాద్య అర్ఘ్యస్నానాదికాలు ముగిసిన పిదప భుజించటం, అన్నాన్ని నిందించకుండటం, తడి కాళ్ళతో నిద్రకు ఉపక్రమించకుండటం - ఇవి ఆచారాలని సత్కర్మలు తెలిసినవాడైన నారదుడు వివరించాడు.

విశేషం: ఆచారం ధర్మానికి మూలం. కాబట్టే 'ఆచార ప్రభవో ధర్మః' అనే సూక్తి ఏర్పడింది. ఇది అనూచానంగా పరంపరగా మానవసమూహంలో ఒక తరం నుండి మరొక తరానికి వారసత్వంవలె అందుతూ ఉంటుంది. అయితే ఈ సుదీర్ఘ కాలవాహినిలో కొన్ని ఆచారాలు కాలంచెల్లి అసందర్భాలుగా అసంగతాలుగా కూడా మారుతూ ఉంటాయి. వివేకి అయిన నరుడు కాలానుగుణమైన మార్పుతో ఆచారాన్ని స్వీకరించాలి.

తే. ఉదయమగు సూర్యుఁ గనుఁగొను టొప్ప; దన్య । వనిత నగ్నమై యుండంగ వలదు చూడఁ;
దన పురీషంబు సూచుట ధరణినాథ! । కీడు; నిజపాపగుప్తి యకృత్య మరయ. 118

ప్రతిపదార్థం: ధరణినాథ!= ఓ రాజా!; ఉదయము+అగు సూర్యున్= పొడిచే సూర్యుడిని; కనుఁగొనుట= చూడటం; ఒప్పదు= కూడదు; అన్యవనిత= ఇతర స్త్రీ; నగ్న+ఐ= వివస్త్ర అయి; ఉండంగన్= ఉన్నప్పుడు; చూడన్+వలదు= చూడటం తగదు; తన పురీషంబు+చూచుట= తన మలమును చూడటం; కీడు= చెడు; నిజపాపగుప్తి= తన పాపాన్ని దాచటం; అరయన్= పరిశీలించగా; అకృత్యము= చేయరానిది.

తాత్పర్యం: రాజా! ఉదయించే సూర్యుడిని చూడరాదు. ఇతరస్త్రీ వివస్త్రగా ఉన్నప్పుడు చూడకూడదు. అట్లాగే తన మలాన్ని తాను చూస్తే కీడు కలుగుతుంది. ఈ మూడూ చూడరానివి. ఇక తన పాపాన్ని తాను దాచిపెట్టటం చేయదగ్గ పని కాదు - ఆలోచిస్తే.

విశేషం: ఇక్కడ చూడరానివి మూడు; చేయరానిది ఒకటి చెప్పాడు భీష్ముడు. అయితే చివరిది 'నిజపాపగుప్తి' వాస్తవానికి నిజపాపం చూడవలసినది తప్పకుండా తానే గాక ఇతరులూ దాన్ని చూచే వీలు కల్పించాలి - అనే భావాన్ని ఆ మాటలో ఇమిడ్చినట్లున్నాడు వక్త. అంటే చూడరానివి మూడు అని చెప్తుతూ, తప్పకుండా చూడవలసినది మాత్రం స్వకీయ పాపప్రవృత్తి అని సూచిస్తున్నాడువక్త.

క. సురతంబు గుప్తమగుటయు, । గురుశుశ్రూషయును, బ్రహ్మకుల భజనము నా
యురవాప్తిఁ జేయు లక్ష్మీ । కరంబులగు నూర్ధ్వలోక గతుల నొనర్చున్.' 119

ప్రతిపదార్థం: సురతంబు= సంభోగ క్రియ; గుప్తము+అగుటయున్= దాచబడినదిగా ఉండటం; గురుశుశ్రూషయును= గురువుల, పెద్దల, విద్యాదాతల సేవా; బ్రహ్మకుల భజనము= బ్రాహ్మణులను కీర్తించటం; ఆయుః+అవ+ఆప్తిన్= ఆయుస్సును (జీవన కాలమును) పొందుటను; చేయున్= కలిగించును; లక్ష్మీకరంబులు+అగు= సంపదను కలిగించెడు; ఊర్ధ్వలోక గతులన్= పై లోకముల చేరికలను; ఒనర్చున్= చేయును, ఒనగూర్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సంభోగక్రియను గుప్తంగా ఉంచటం, గురువును సేవించటం, బ్రాహ్మణులను కీర్తించటం నరుడి ఆయుస్సు పెంచుతాయి. పైగా వీటివలన నరుడు సంపత్కరమైన పై లోకాలకు కూడా చేరుకొనగలుగుతాడు.'

విశేషం: 'శుశ్రూష' అనే మాటకు అసలైన అర్థం - 'శ్రోతుమ్: ఇచ్ఛా' వినుటకు కోరిక అని. భాషలకు లిపులులేనపుడు కూడా విద్యాభ్యాసం కొనసాగేది. అపుడు విద్యార్థి గురుడిచెంత జేరి, ఆయన మాటలను విని విద్య గరచేవాడు. ఆనాడు కేవల శ్రవణేంద్రియ మొక్కటే, నోటికి తోడుగా విద్యార్జనలో ఉపయోగపడేది. కంటి ఉపయోగం లిపుల ఆవిర్భావం తరువాత వచ్చినది. కాగా ఈ 'శుశ్రూష' ఆ నాటిది. ఆ నాడు విద్యార్థి వినికిడి ద్వారానే విద్యను ఆర్జించేవాడు. అపుడు దగ్గరచేరి (గురువుకు) విన కోరిక గలిగి ఉండటం విద్యార్థి లక్షణం. క్రమంగా ఆ లక్షణం గురుసన్నిధిలో గురుసేవా నిర్వహణం చేసే విద్యార్థి లక్షణంగా పరిణమించి, చివరకు గురుసేవకు పర్యాయపదంగా 'శుశ్రూష' స్థిరపడినది.

వ. అనిన విని యుధిష్ఠిరుం 'డధ్యాత్మ విద్య వినవలతుం జెప్పవే'యనిన నతనికి దేవవ్రతుం డిట్లనియె. 120

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అధి+ఆత్మవిద్య= ఆత్మకు చెందిన వేదాంత జ్ఞానం; వినన్+వలతున్= వినగోరెదను; చెప్పవే?+అనినన్= చెప్పుము అనగా; అతనికి(న్)= ఆ ధర్మరాజుకు; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆచారవిధులు విన్న ధర్మరాజు, అనంతరం తాను ఆధ్యాత్మవిద్యను గూర్చి వినగోరుతున్నట్లు తెలుపగా భీష్ముడు ఈ విధంగా అన్నాడు.

సీ. 'జలధి తరంగల చాడ్పునఁ బొడముచు । నడఁగుచు నుండు భూతాత్మునందు
భూమి ప్రభృతిభూతములు వాని గుణములు । గంధాదు లింద్రియ గ్రాహ్యకోటి
యనఘ! శ్రోత్రం బాదియగు నింద్రియశ్రేణి । దర్వియుఁ బోలె సాధనత నొందు
మనసింద్రియములకుఁ బెనుఁ బ్రాపు బుద్ధి త । న్ముఖమున నిశ్చయంబునకుఁ దేరఁ

తే. బురుషుఁ డవ్విషయంబులఁ బొందు నిట్లు । గాకయుండ నింద్రియములఁ గ్రమ్మఱించి
మనసుతోఁ గూర్చి బుద్ధిలోనన యడంప । బుద్ధి నిర్విషయస్థితిఁ బురుషు నొందు. 121

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా!; జలధి తరంగల చాడ్పునన్= సముద్రపు అలల మాదిరిగా; పొడముచున్= పుట్టుతూ; అడఁగుచున్= సమసిపోతూ; ఉండు= ఉన్న; భూత+ఆత్మునందున్= జీవాత్ముడియందు; భూమిప్రభృతి భూతములు= భూమి మొదలైన పంచభూతాలు (నీరు, వెలుతురు, గాలి, ఆకాశం, భూమి= 5); వాని గుణములు= ఆ భూతముల స్వభావాలు; గంధ+ఆదులు= వాసన మొదలయినవి; ఇంద్రియ గ్రాహ్యకోటి= ఇంద్రియములచేత గ్రహించదగిన సమూహం; శ్రోత్రంబు+ఆది+అగు= చెవి మొదలైన; ఇంద్రియశ్రేణి= ఇంద్రియాల వరుస; దర్వియున్+పోలెన్= తెడ్డువలె; సాధనతన్+ఒందున్= పరికరత్వమును పొందును; మనసు= మనస్సు; ఇంద్రియములకున్= చెవి మొదలగు ఇంద్రియాలకు; పెను+ప్రాపు= గొప్ప ఆధారం; బుద్ధి= తెలివి; తద్+ముఖమునన్= దాని (మనస్సు) ద్వారా; నిశ్చయంబునకున్= నిర్ణయానికి; తేరన్= చేరగా; పురుషుఁడు= నరుడు; ఆ+విషయంబులన్= ఆయా వస్తువులను, జ్ఞానములను; పొందున్= చెందుతాడు; ఇట్లు+కాక+ఉండన్= ఈ విధంగా కాకుండా ఉండేటట్లు; ఇంద్రియములన్= ఇంద్రియాలను (కన్ను, ముక్కు, చెవి, తోలు, నోరు); క్రమ్మఱించి= మరల్చి; మనస్సుతోన్+కూర్చి= మనస్సుతో కలిపి; బుద్ధిన్= తెలివిని; లోనన్+అ= లోపలనే; అడంపన్= అణచగా; బుద్ధినిర్విషయస్థితి= బుద్ధికి (జ్ఞానమునకు) లోనుకాని - గోచరించని దశ; పురుషున్= నరుడిని; ఒందు(న్)= చెందును.

తాత్పర్యం: జీవాత్మ, కడలి కెరటాలవలె పుట్టుతూ గిట్టుతూ ఉంటుంది. భూమి, నీరు, కాంతి, గాలి, ఆకాశం అనేవి పంచభూతాలు. వాటి స్వభావాలయిన వాసన, ద్రవం, తేజస్సు, చలనం, శబ్దం - అనేవి ఇంద్రియాల ద్వారా గ్రహింపునకు వస్తాయి. చెవి, ముక్కు, నోరు, తోలు, కన్ను - అనే ఈ ఇంద్రియాలు వాసనాది పంచభూతాల గుణాలు అనుభవానికి రావటానికి తెడ్డువలె ఉపకరణాలుగా పనిచేస్తాయి. అయితే ఈ ఉపకరణాల ద్వారా అనుభవం కలగటానికి ఆ సాధనాలకు పెద్ద ఆధారభూమి మనస్సు. ఆ మనస్సుద్వారానే విషయజ్ఞానం - అనుభవం నరుడిని చేరుకొంటుంది. ఈ విధంగా ప్రాపంచిక విషయజ్ఞానం మానవుడిలో ప్రవృత్తిని రేకెత్తించి ఈ జననమరణ చక్రంలో పడవేసి త్రిప్పుతుంటుంది. ఆ చక్రభ్రమణం నుండి బయటపడాలంటే ముందుగా ఇంద్రియాలను మళ్ళించి మనస్సుతో వాటిని చేర్చితే, బుద్ధిని (తెలివిడి) లోలోననే అణచివేయవచ్చును. ఆ విధంగా పురుషుడు అంతర్ముఖుడైనపుడు అతడిలో బుద్ధి గోచరించని స్థితి కలుగుతుంది.

విశేషం: ఇంద్రియనిగ్రహం ద్వారా మనస్సును స్వాధీనపరచుకొని ప్రాపంచిక విషయపరాఙ్ముఖుడై పురుషుడు తరిస్తాడు.

క. విను మాత్ముఁడు క్షేత్రజ్ఞుం । డన భూతాత్ముఁ డనఁ బురుషుఁ డనఁ బరమేశుం
డన బుద్ధిసాక్షి యనఁగా । జననరహితుఁ డనఁగఁ బరఁగు శాంతిప్రవణా! 122

ప్రతిపదార్థం: శాంతిప్రవణా!= శాంతియందు ఆసక్తుడా! - శాంతిని కాంక్షించే ఓ ధర్మరాజా!; వినుము= ఆలకించుము; ఆత్ముఁడు= ఆత్మ; క్షేత్రజ్ఞుండు+అనన్= క్షేత్రజ్ఞుడు అనే పేరుతో; భూతాత్ముఁడు+అనన్= భూతాత్ముడు అనే పేరున; పురుషుఁడు+అనన్= పురుషనామంతో; పరమ+ఈశుండు+అనన్= పరమేశ్వరుడు అనే పేరుతో; బుద్ధి సాక్షి+అనఁగన్= బుద్ధిసాక్షి అనే పేరుతో; జనన రహితుఁడు+అనన్= పుట్టుకలేనివాడు అనగా; పరఁగున్= ఒప్పును.

తాత్పర్యం: ఆత్మ జీవంతో చేరి భూతాత్ముడనీ, శరీరతత్త్వం తెలిసి క్షేత్రజ్ఞుడనీ, శరీరం తాను గానని తెలిసి పురుషుడనీ, పరమేశ్వరుడనీ, బుద్ధికి ఎడంగా నిలిచి 'బుద్ధిసాక్షి' అనీ, తత్త్వదర్శనంతో జననరహితుడనీ పిలువబడుతూ ఉంటాడు.

విశేషం: 'ఆత్మ' పరమాత్మగా, నరుడు ఈశ్వరుడుగా పరిణతిచెందే దశలను స్ఫురింపజేస్తూ ఆత్మకు గల ఇతర వ్యపదేశాలను-పేర్లను వివరించాడు.

క. తనయంద తోఁచు విషయము । లనుభవగోచరము లగుట యవి మాయాసం
జనిత స్వప్నంబై యా । త్మునికిం దను గాన లేమి మోసము దెచ్చున్. 123

ప్రతిపదార్థం: తనయందున్+అ= తనలోనే; తోఁచు= గోచరించే; విషయములు= వస్తువులు, జ్ఞానములు మొదలైనవి; అనుభవ గోచరములు+అగుట= ఇంద్రియాల ద్వారా తెలియరావటం; అవి= ఆ విషయాలు; మాయాసంజనిత స్వప్నంబు+ఐ= మాయవలన కలిగిన కలఅయి; ఆత్మునికిన్= ఆత్మకు; తను= తనను; కానలేమి= చూడలేకపోవటం; మోసము+తెచ్చున్= వంచనను కలిగిస్తుంది.

తాత్పర్యం: 'ఆత్మ' పరమేశ్వరు డయినపుడు అతడు విశ్వమయుడు. సృష్టి అంతా అతడిలో గోచరించేదే. అదే సృష్టి తిరిగి ఆత్ముడికి ఇంద్రియానుభవం ద్వారా గోచరిస్తున్న దంటే అర్థం అదంతా మాయవలన స్వప్నసదృశమైన అయథార్థం మిథ్య తప్ప అన్యంగాదు. మాయ కారణంగానే 'ఆత్మ' తనను తాను కాంచలేక, మోసానికి గురిఅయి పరమాత్మకు వెలియై అలమటిస్తున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పరిణతప్రజ్ఞుడైన ధూర్జటి మహాకవి కూడా 'అంతా మిథ్య తలంచి చూచినన్' అంటాడు శ్రీకాళహస్తీశ్వర శతకంలో. జ్ఞాన నేత్రం ద్వారా చూస్తే ఈ మిథ్యావాదం గోచరిస్తుందంటారు తత్త్వజ్ఞులు.

క. విను గుణములు మాయకు నొడ । లని యెఱిఁగి, తమోరజస్సు లడఁచి, సుసత్త్వం
బున నిలిచి సద్వివేకం । బున నదియుం ద్రోచి విమల బోధాత్ముఁ డగున్. 124

ప్రతిపదార్థం: గుణములు= త్రిగుణాలు - సత్త్వం, రజస్సు, తమము అనేవి; మాయకున్= మిథ్యాజ్ఞానానికి; ఒడలు+అని= శరీరం అని; ఎఱిఁగి= తెలిసి; తమస్+రజస్సులు= తమోగుణాలను, రజోగుణాలను; అడఁచి= నశింపజేసి; సుసత్త్వంబునన్= మంచి సత్త్వగుణమునందు; నిలిచి= స్థిరపడి; సత్+వివేకంబునన్= మంచి జ్ఞానంతో; అదియున్= ఆ సత్త్వగుణాన్ని కూడా; త్రోచి= తొలగించి; విమల బోధ+ఆత్ముఁడు+అగున్= నిర్మలమైన జ్ఞానంగల ఆత్మకలవాడు ఔతాడు; విను(ము)= ఆలకించుము.

తాత్పర్యం: మిథ్యాజ్ఞానమే మాయ. మాయకు నరుడిలోని గుణత్రయం (సత్త్వరజస్తమములు) శరీరం. కాబట్టి మాయ తత్త్వం గ్రహించి, మొదట తమస్సును, ఆ పిదప రజస్సును వదలివేయాలి. అపుడు ఆత్మ శుద్ధసత్త్వరూపంతో వెలుగుతూ ఉంటుంది. అటు తరువాత ఆ సత్త్వాన్ని కూడా తొలగించుకొనాలి. అపుడు కేవలం జ్ఞానం - విమల బోధ కలిగి ఆత్మ పరమాత్మగా పరిణమిస్తుంది.

విశేషం: గుణత్రయ రాహిత్యమే కైవల్యం.

తే. అరసి చూడ సత్త్వంబు సుఖాత్మకంబు । సాంద్రదుఃఖమయంబు రజస్సు, బోధ
మాంద్యమూర్తి తమస్సు, సమత్వ మూఁది । యీ యవస్థలఁ బొరయమి మాయపోక. 125

ప్రతిపదార్థం: అరసి చూడన్= పరీక్షించిచూస్తే; సత్త్వంబు= సత్త్వం అనే గుణం; సుఖ+ఆత్మకంబు= సుఖం ఆత్మగా గలది, సుఖమయమైనది; రజస్సు= రజోగుణం; సాంద్ర దుఃఖమయంబు= దట్టమైన దుఃఖంతో నిండినది; తమస్సు= తమోగుణం; బోధ మాంద్యమూర్తి= జ్ఞానమందత ఆకారంగా గలది - మందజ్ఞానం తమస్సు లక్షణం; సమత్వము+ఊఁది= సమభావం వహించి; ఈ+అవస్థలన్= పైన వివరించిన దశలను, స్థితులను; పొరయమి= పొందకుండటం; మాయ పోక= మాయ నశించటం.

తాత్పర్యం: పరీక్షించి చూస్తే సత్త్వగుణం సుఖమయమైనది. రజస్సు నిరంతర దుఃఖనిలయం. ఇక చివరిదైన తమస్సు జ్ఞాన మాంద్యరూపంతో దర్శనమిస్తుంది. అయితే సమతాదృష్టితో ఆయా గుణాలను, వాటి స్వభావాలను దూరీకరించగలిగితే మాయను పోద్రోలినట్లే. గుణత్రయరాహిత్యమే మాయానాశనం'.

వ. అని యధ్యాత్మప్రకారంబు నిర్దేశించి భీష్ముండు వెండియు 'యోగంబు సెప్పెద నాకర్ణింపు'మని యమ్మనుజపతి కిట్లనియె. 126

ప్రతిపదార్థం: అని= పై విధంగా పలికి; అధి+ఆత్మ ప్రకారంబు= ఆత్మకు సంబంధించిన విధానాన్ని; నిర్దేశించి= తెలియజెప్పి; భీష్ముండు; వెండియున్= మరలా; యోగంబు= యోగవిద్యను; చెప్పెదన్= తెలుపుతాను; ఆకర్ణింపుము= వినుము; అని; ఆ+మనుజ పతికిన్= రాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అధ్యాత్మవిద్యను వివరించిన భీష్మపితామహుడు, అనంతరం 'అధ్యాత్మవిద్యకు ఉపకరించే యోగవిద్యను వివరిస్తాను విను'మని ధర్మజుడితో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మజునకు భీష్ముఁడు యోగప్రకారంబు సెప్పుట (సం. 12-188-1)

సీ. తెలివొంది మనసు నిశ్చలవృత్తి నేకాగ్ర। మై యున్కి గోరి నిష్ఠాతిశయము
కలిమి కృత్యంబు మేఘంబున మెఱుఁగును। నలిన పత్రంబున సలిలకణముఁ
బోలె మంతవ్యంబు పొంతఁ జరించు మ। నంబు దానికిఁ బవనంబు గతియ
గతిగాన హితము మారుత ధారణము పవ। మానంబు గ్రమమునఁ గాని నిలువ

ఆ. దలయ విసువఁగాదు తలకొని యమ నియ। మాదు లెనిమిదియును నభ్యసింపఁ
గా విచార మొలయుఁ గలుగు వితర్కంబు। మఱి వివేక మనిలు నెఱికిఁదెచ్చు. 127

ప్రతిపదార్థం: మనసు= హృదయం; తెలివి+ఒంది= జ్ఞానం పొంది; నిశ్చల వృత్తిన్= చలనంలేని నడతతో; ఏక+అగ్రమై= ఒక విషయమున లగ్నమైనదై; ఉన్కి= ఉండటాన్ని; కోరి= అభిలషించి; నిష్ఠా+అతిశయము కలిమి= నిశ్చయపు ఆధిక్యం ఉండటం; కృత్యము= చేయవలసినది; మేఘంబునన్= మబ్బునందు; మెఱుఁగును= మెరుపూ; నలిన పత్రంబునన్= తామర ఆకున; సలిలకణమున్+పోలెన్= నీటిబిందువువలె; మంతవ్యంబు పొంతన్= ఆలోచన దగ్గర; మనంబు= మనస్సు; చరించున్= తిరుగుతూ; దానికిన్= ఆ మనస్సునకు; పవనంబు గతియ= గాలియొక్క నడకయే; గతి= నడక; కాన= కావున; మారుత ధారణము= గాలిని ధరించటం, నియమించటం; హితము= మేలు; పవమానంబు= గాలి; క్రమంబునన్+కాని= (ఒక) వరుసలోగాని; నిలువదు= ఆగదు, నియమించబడదు; అలయన్= ఆయాసపడుటకు; విసువన్= విసుగుచెందుటకు; కాదు= కాదు; తలకొని= సంకల్పించి; యమ నియమ+ఆదులు+ఎనిమిదియును= యమము, నియమము మొదలగు ఎనిమిదింటిని; అభ్యసింపఁగాన్= నేర్వగా; విచారము= ఆలోచన; ఒలయున్= కరగును; వితర్కంబు= సంశయం; కలుగున్= ఏర్పడును; మఱి= పిదప; వివేకము= జ్ఞానం; అనిలున్= గాలిని; నెఱికిన్+తెచ్చున్= వరుసకు, క్రమమునకు తెస్తుంది.

తాత్పర్యం: మనస్సు చలించకుండా, ఏకాగ్రమై నిలిచి ఉండాలి అంటే గట్టి నిశ్చయం అవసరం. మబ్బులో మెరుపువలె, తామరాకున నీటి బిందువువలె మనస్సులో ఆలోచన సహజంగా ఉంటుంది. మనస్సు ప్రసరించే తీరు, గాలి వీచే పద్ధతీ ఒకటే. గాలి కారణంగానే మనస్సు చలిస్తుంది. కాబట్టి ఆ వాయువును (మన శరీరంలోని దానిని) నివారించాలి - మనోనిగ్రహం కొరకు. వాయువును నిగ్రహించటం సులభంకాదు. అది క్రమక్రమంగా సాగాలి. ఆయాసపడటంగాని, విసుగు చెందటంగాని కుదరదు - వాయునిరోధ ప్రయత్నంలో. స్థిరమైన సంకల్పంతో యమనియమాదులైన ఎనిమిది సాధనాలతో వాయు నిరోధానికై యత్నించాలి. ఆ ప్రయత్నంలో ముందుగా ఆలోచనలు కరిగిపోతాయి. తరువాత సందేహం కలుగుతుంది. ఆ పిదప జ్ఞానం వాయువును క్రమబద్ధం చేయగలుగుతుంది.

విశేషం: మనశ్చాంచల్యానికి వాయువు శరీరాంతర్గతమైనది కారణం కాబట్టి మనస్సు నిగ్రహించదలిస్తే వాయునిరోధం తప్పనిసరి. దానికి యమ నియమాది సాధన అనివార్యం.

క. విను మంతర్నాడిం జనఁ। బనుపడి పవనంబు బ్రహ్మపద మొందఁగ శాం
తి నిరూఢమైన చిత్తము। గను నానందంబునంద కలియుం బిదపన్.' 128

ప్రతిపదార్థం: పవనంబు= గాలి; అంతర్+నాడిన్+చనన్= లోపలి నాడి (వాయు ప్రయాణమార్గం) గుండా వెళ్ళగా; పనుపడి= అలవాటు పడి; బ్రహ్మపదము+ఒందఁగన్= బ్రహ్మస్థానమును పొందగా; శాంతినిరూఢమైన చిత్తము= శాంతిని బాగుగా వహించిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనస్సు; ఆనందంబున్+కనున్= ఆనందమును - బ్రహ్మానందమును పొందుతుంది; అందున్+అ= ఆ ఆనందమందే; పిదపన్= ఆ తరువాత; కలియున్= లీనమగును; విను(ము)= ఆలకించుము.

తాత్పర్యం: క్రమబద్ధమైన వాయువు శరీరాంతర్గతనాడులగుండా ప్రయాణంచేస్తూ శరీరంలోని బ్రహ్మస్థానాన్ని చేరుకొంటుంది. అపుడు మనస్సు నిశ్చలమై శాంతిపూర్ణమై బ్రహ్మానందాన్ని అందుకొంటుంది. ఆ తరువాత ఆ ఆనందంలోనే లీనమైపోతుంది'.

విశేషం: బ్రహ్మానందానికి శాంతి, శాంతికి నిశ్చలమనస్కత, నిశ్చలమనస్కతకు పవనగతి నిరోధం, తన్నిరోధానికి యమనియమాది అష్టవిధసాధన, తత్సాధన ప్రారంభానికి స్థిరసంకల్పం కావాలి.

వ. అనిన విని కురుపతి కురుపితామహునితో 'జపవిధి ప్రకారంబును, జపశీలురగువారు పోవుగతియును నెఱింగింపవే?' యనుటయు నమ్మహీవిభునకు నమ్మహాత్ముం డిట్లనియె. 'జప్యంబు విషయంబుగా యమకాలమృత్యు భూసురేక్ష్వాకులకు సంవాదంబు ప్రవర్తించె; నయ్యితిహాసంబునుం జెప్పెద; మున్ను నా యెఱింగిన తెఱంగునుం జెప్పెద; నాకర్ణింపుము.' 129

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; కురుపతి= కురువులరాజు ధర్మజుడు; కురుపితామహునితోన్= కురువంశపు తాతతో; జపవిధి ప్రకారంబును= జపమును చేసే పద్ధతిని; జపశీలురు+అగువారు= జపంచేసే స్వభావం కలవారు; పోవుగతియున్= పొందే ఫలితమును; ఎఱింగింపవు+ఏ?= తెలియజేయవా?; అనుటయున్= అనగా; ఆ+మహీవిభునకున్= ఆ రాజునకు; ఆ+మహా+ఆత్ముండు= ఆ గొప్ప మనస్సుగలవాడు - భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; జప్యంబు= జపం చేయదగినది; విషయంబుగాన్= శీర్షికగా, చర్చా అంశంగా; యమకాల మృత్యు భూసుర+ఇక్ష్వాకులకున్= యమధర్మరాజునకు; కాలపురుషునకు, మృత్యుదేవతకు, బ్రాహ్మణుడికి, ఇక్ష్వాకు వంశరాజునకు; సంవాదంబు= మంచి ప్రసంగం; ప్రవర్తించెన్= జరిగింది; ఆ+ఇతిహాసంబునున్= ఆ చరిత్రను; చెప్పెదన్= పలికెదను; మున్ను= ముందుగా; నా+ఎఱింగిన తెఱంగునున్= నేను గ్రహించిన విధమును కూడా; చెప్పెదన్= పలికెదను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీష్ముడితో 'జపంచేసే విధానాన్నీ, జపంచేసేవారు పొందే ఫలితాన్నీ తెలుపుము' అని కోరగా ఆయనతో భీష్ముడు ఇట్లా అన్నాడు: 'జపించదగిన అంశాన్ని గురించి యమధర్మరాజుకూ, కాలపురుషుడికీ, మృత్యుదేవతకూ, బ్రాహ్మణుడికీ, ఇక్ష్వాకువంశరాజుకూ సంవాదం జరిగింది. ఆ ఇతిహాసాన్ని వినిపిస్తాను. ముందుగా నాకు తెలిసింది చెప్తాను వినుము!

యమ కాల మృత్యు భూసురేక్ష్వాకుల సంవాదము (సం. 12-189-6)

సీ. వేదాంతవిదు లనుమోదించు నట్టిది । జపకర్మ మత్యంత శౌచశాలి
యై కుశాస్తీర్ణ సమావనీతలమునఁ । గుశముష్టి సేకొని విశదచిత్త
వృత్తి నింద్రియములు విషయసక్తంబులు । గాకుండ నిలిపి తదేకపరత
మత్సరాహంకార మాన దంభాపగ । మంబును బ్రహ్మచర్యంబుఁ గలిగి

తే. జపము సెల్లించు పురుషుండు సర్వలోక । విజయ నిస్స్పృహ మగు జపవిధి విశోక
హర్ష రాగాదికంబును నవ్యయంబు । నైన పదముఁ బొందించు నృపాగ్రగణ్య! 130

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నృప+అగ్రగణ్య!= రాజులలో మొదట లెక్కించదగినవాడా! ధర్మరాజా!; జపకర్మము= జపవిధి, జపం చేయటం; వేద+అంత విదులు= వేదాంత విద్యను ఎరిగినవారు; అనుమోదించునట్టిది= ఆమోదించేది, సంతోషంతో అంగీకరించేది; అతి+అంత శౌచశాలి+ఐ= చాలా ఎక్కువ శుభ్రతతో ప్రకాశించేవాడై; కుశ+ఆస్తీర్ణ సమ+అవనీతలమునన్= దర్భలచేత వ్యాప్తమైన, మిట్టపల్లాలులేని, భూమి ప్రదేశాన; కుశముష్టిన్= దర్భల పిడికిలిని; చేకొని= స్వీకరించి; విశదచిత్త వృత్తిన్= నిర్మలమైన మనస్సు యొక్క నడతతో; ఇంద్రియములు= జ్ఞాన, కర్మ ఇంద్రియాలను పదింటిని; విషయ సక్తంబులు+కాక+ఉండన్= విషయములయందు తగుల్కొన్నవి కాకుండేటట్లుగా; నిలిపి= స్థిరీకరించి; తద్+ఏకపరతన్= ఆ ఒక్కదానిఅందలి ఆసక్తితో; మత్సర+అహంకార మాన దంభ+ అపగమంబును= ఓర్వలేనితనం, గర్వం, అభిమానం, ఆటోపాల తొలగింపును; బ్రహ్మచర్యంబున్= బ్రహ్మచర్య వ్రతాన్ని; కలిగి= వహించి; పురుషుండు= నరుడు; జపము= జపించటాన్ని, నామ మంత్ర ఉచ్చారణం చేయటాన్ని; చెల్లించున్= నిర్వహిస్తాడు; సర్వలోక విజయ నిస్పృహము+అగు= ఎల్లలోకాల గెలుపునందును ఆశలేనిది అగు; జపవిధి= జపవిధానం, జపం నిర్వర్తించటం; విశోక హర్షరాగ+ఆదికంబునున్= గతించిన, నశించిన శోకం, సంతోషం, ప్రేమ మున్నగు భావాలు గలదియు; న+వ్యయంబును= నాశంలేనిదియు; ఐన= అగునట్టి; పదమున్= స్థానాన్ని, కైవల్యాన్ని; పొందించున్= సిద్ధింపజేస్తుంది.

తాత్పర్యం: ఓ రాజశ్రేష్ఠా! ధర్మరాజా! జపవిధిని వేదాంతవేత్తలు ఆమోదిస్తారు. దానికి పూర్వరంగ మిది. అత్యధిక శుభ్రతతో వెలుగొందుతూ, దర్భలతో వ్యాప్తమై పూతమైన ఒక సమతలంపై పిడికెడు దర్భల ధరించి ఆసీనుడై జ్ఞానేంద్రియాలనూ, కర్మేంద్రియాలనూ అన్యవిషయాలలో సక్తంగాకుండా నిగ్రహించి, ఏకాగ్రచిత్తుడై, మాత్సర్యం, గర్వం, దర్పం, దంభం - వీటిని తొలగించుకొని, జపంచేయటానికి ఉద్యుక్తుడు కావాలి పురుషుడు. ఆ విధంగా జపవిధిని నిర్వహిస్తాడు నరుడు. ఆ విధంగా నిష్ఠాభరితంగా నిర్వర్తితమైన జపం ఎల్లలోకాల గెలుపును కూడా కోరనిదిగా మారి - సుఖదుఃఖాలకు, రాగద్వేషాలకు అతీతమైన శాశ్వతమైన స్థానాన్ని - మోక్షాన్ని ప్రసాదిస్తుంది.

విశేషం: ఇంద్రియాలు - జ్ఞాన కర్మభేదంతో మొత్తం పదిగా అధ్యాత్మవిధులు లెక్కిస్తారు. జ్ఞానేంద్రియాలు 1- కన్ను, ముక్కు, చెవి, త్వక్కు, నోరు; కర్మేంద్రియాలు 5 - వాక్, పాణి, పాద, పాయూపస్థలు. ఈ పదింటిపై అదుపు సాధించినవాడే జితేంద్రియుడు.

క. శౌచాది గుణము లెడలుట । నీచత్వము వాటిలంగ నిశ్చలమతి దు
ష్టాచరితమైన జపవిధి । నా చెప్పిన సుగతి లేదు నరకముఁ దెచ్చున్.' 131

ప్రతిపదార్థం: శౌచ+ఆది గుణములు= శుభ్రత మొదలైన గుణాలు; ఎడలుట= వెలి కావటంవలన; నీచత్వము= తక్కువతనం; పాటిలంగన్= కలిగే విధంగా; నిశ్చలమతిన్= చలనం లేని బుద్ధితో; దుష్ట+ఆచరితము+ఐన= చెడుగా నిర్వహించబడినదైన; జపవిధిన్= జపవిధానం, జపం చేయడంవలన; నా చెప్పిన= నేను పలికిన; సుగతి= మోక్షం; లేదు= ఉండదు, కలుగదు; నరకమున్+తెచ్చున్= నరకలోకాన్ని పొందించును.

తాత్పర్యం: జపవిధానం సరిగా ఆచరితమైతే మోక్షప్రదాయి. సందేహంలేదు. అయితే అదే జపం శౌచం మొదలయిన లక్షణాలు లోపించి నైచ్యానికి పాల్పడే రీతిలో చెడుగా ఆచరించబడితే మాత్రం దానివలన ముక్తి రాదు - సరిగదా నరకం వస్తుంది'.

విశేషం: లక్ష్యం, మార్గం - రెండూ ఉన్నతంగా పరిశుభ్రంగా ఉండాలి. ఉన్నప్పుడే ఫలితమూ ఆనందప్రదమౌతుంది. కానినాడు చివరకు మిగిలేది దుఃఖమే.

వ. అని చెప్పి వెండియు నిట్లనియె. 132

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని; చెప్పి= పలికి; వెండియున్= మరియును; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని పలికి, ఇంకా ఈ విధంగా చెప్పాడు.

సీ. 'వేద వేదాంగ సంవేది గౌశికుఁ డను । ధరణీసురుఁడు సంహితాజపంబు
విహితశీలతఁ జేయ వేయి వత్సరములు । సనిన సావిత్రి యమ్మునివరునకుఁ
బొడసూపి తనుఁ జెప్పఁ గడుభక్తితో నతం । డెఱఁగిన 'నిచ్చెద నిష్ట' మడుగు
మనిన నాతండు జపాతినిష్ఠయ కోర । నది యిచ్చి, దేవి 'నీ కత్యుదాత్త

తే. గతియు నగు; ధర్మ మర్థి నీకడకు వచ్చు; । యముఁడు గాలుండు మృత్యువు నరుగుదెంతు
రనఘ! నీకును వారికి నావహిల్లు । వాద' మని చెప్పి చనియె భూవరవరేణ్య! **133**

ప్రతిపదార్థం: భూవర వరేణ్య!= రాజశ్రేష్ఠా! ఓ ధర్మరాజా!; కౌశికుఁడు+అను= కౌశికుడు అనేపేరుగల; ధరణీసురుఁడు= బ్రాహ్మణుడు; వేద వేద+అంగసంవేది= వేదాలను, వేద అంగాలయిన శిక్ష, వ్యాకరణం మొదలయిన ఆరు శాస్త్రాలను బాగుగా ఎరిగినవాడు; సంహితాజపంబున్= వేద జపమును; విహిత శీలతన్= విధించబడిన స్వభావంతో; చేయన్= ఒనరింపగా; వేయి వత్సరములు= వేయి ఏండ్లు; చనినన్= కడవగా; సావిత్రి= మంత్ర అధిదేవత; ఆ+ముని వరునకున్= ఆ ముని శ్రేష్ఠుడికి; పొడ+చూపి= కనిపించి; తనున్= తనను; చెప్పన్= తెలియజెప్పగా; కడు భక్తితోన్= అధిక భక్తితో; అతండు= ఆ కౌశికుడు; ఎఱఁగినన్= నమస్కరించగా; ఇచ్చెదన్+ఇష్టము+అడుగుము= ఇస్తాను కోరిన దానిని అడుగుము; అనినన్+అనగా (సావిత్రి); అతండు= ఆ కౌశికుడు; జప+అతినిష్ఠ+అ= జపంలో ఎక్కువ శ్రద్ధయే; కోరన్= కోరుకొనగా; అది= దానిని ఆ జపాతినిష్ఠనే; ఇచ్చి= ఒసగి; దేవి= సావిత్రీదేవి; నీకున్= జపకర్మకే అంకితమైన నీకు; అతి+ఉత్+ఆత్త గతియున్= మిక్కిలి గొప్పపదముకూడ; అగున్= కలుగును; ధర్మము= ధర్మదేవత; అర్థిన్= కోరికతో; నీ కడకున్= నీ వద్దకు; వచ్చున్= చేరును; యముఁడున్= యమధర్మరాజు కూడా; కాలుండున్= కాలపురుషుడును; మృత్యువున్= మరణదేవతకూడా; అరుగుదెంతురు= వస్తారు; అనఘ!= ఓ పాపరహితుడవైన కౌశికా!; నీకును; వారికిన్= ఆ వచ్చినవారికిని; వాదము= సంవాదం, చర్చ; ఆవహిల్లును= కలుగుతుంది; అని; చెప్పి= పలికి; చనియెన్= వెళ్ళింది.

తాత్పర్యం: వేదాలు, వేదభాగాలయిన శాస్త్రాలు తెలిసిన కౌశికుడనే బ్రాహ్మణుడు జపాన్ని చేయవలసిన విధంగా చేసేవాడు. ఆ బ్రాహ్మణుడు ఆ విధంగా జపకర్మను నిష్ఠతో వేయి వత్సరాలు చేయగా, ఆ జపానికి అధిదేవత అయిన సావిత్రీదేవి ఆయనకు ప్రత్యక్షమై, తనను తాను పరిచయం చేసికొన్నది. ఆ బ్రాహ్మణుడు ఆ దేవికి నమస్కరించాడు. ఆ దేవి ఆ జపతత్పరుడిని, నీ అభీష్టం నెరవేరుస్తాను కోరుకొ'మ్మని అడిగింది. దానికి ఆయన ఆ జపకర్మలోని నిష్ఠనే వరంగా అర్థించాడు. అతడి శ్రద్ధకు సంతసించిన ఆ దేవి ఆ వరాన్ని ప్రసాదించి, 'నీకు మిక్కిలి గొప్ప స్థానం కలుగుతుంది. ధర్మదేవత, యమధర్మరాజు, కాలపురుషుడు, మృత్యుదేవత - వీరందరూ నీ దగ్గరకు వచ్చి, నీతో సంభాషణ నెరపి సంవాదం చేస్తారు' అని కూడా ఆతడికి తెలియజేసి అంతర్హిత అయింది.

విశేషం: వేదాలు నాలుగు: ఋక్కు, యజుస్సు, సామము, అథర్వము. వేద అంగాలు ఆరు: శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, జ్యోతిషం, నిరుక్తం, కల్పం. వీటినే షట్ శాస్త్రాలు అని కూడా వ్యవహరిస్తారు. జపకర్మకే అంకితుడైన ఆ కౌశికుడి వృత్తాంతాన్ని వివరిస్తున్నాడు భీష్ముడు.

క. ధరణీసురుఁడును జప త । త్పరుఁడై దివ్యాబ్దములు శతంబు గడపె న
ప్పురుషవరు కడకు ధర్మము । పరమప్రీతిఁ జనుదెంచెఁ బౌరవముఖ్యా! **134**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశ శ్రేష్ఠా!-ధర్మరాజా!; ధరణీ సురుఁడును= బ్రాహ్మణుడుకూడా-ఆ కౌశికుడు; జపతత్పరుఁడు+ఐ= జపకర్మయందు ఆసక్తుడై; దివ్య+అబ్దములు= దేవలోక సంవత్సరాలు; శతంబు= నూరు; కడపెన్= గడపాడు; ఆ+పురుషవరు కడకున్= ఆ నరశ్రేష్ఠుడి దగ్గరకు; ధర్మము= ధర్మదేవత; పరమప్రీతిన్= ఎక్కువ ప్రేమతో; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఆ కౌశిక బ్రాహ్మణుడు దేవీవరలబ్ధమైన తీవ్రనిష్ఠతో జపకర్మను నిర్వహిస్తూ నూరు దేవలోక సంవత్సరాలు గడిపాడు. అపుడు ఎక్కువ మక్కువతో ధర్మదేవత ఆ కౌశికుడి చెంతకు చనుదెంచింది.

విశేషం: అర్థి అయినవాడు దేవతలను తాను ఆశ్రయిస్తాడు, అర్థి కాని తపశ్శీలుడిని దేవతలే ఆశ్రయిస్తారు. అర్థిత్వానికి అనర్థిత్వానికి అంత భేదం ఉన్నది.

తే. **అట్లు సాకారమై వచ్చి యతనితోడ । 'నీ జపంబున సిద్ధించె నిరతిశయము**
లైన పుణ్యలోకములు; నీ వందుఁ జనుము । తనువుఁ జిత్తంబు విడిచి యుత్సవ మెలర్ప.' **135**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; స+ఆకారము+ఐ= ఆకృతి కలిగినదై; వచ్చి= చేరి; అతనితోడన్= ఆ బ్రాహ్మణుడితో; నీ జపంబునన్= నీ జపకర్మవలన; నిర్+అతిశయములు= అధికమైనవి లేనివి; ఐన; పుణ్యలోకములు= ధర్మాచరణంవలన లభించే ఊర్ధ్వలోకాలు; సిద్ధించెన్= లభించాయి; నీవు; అందున్= ఆ లోకాలకు; ఉత్సవము+ఎలర్పన్= సంతోషం అతిశయిల్లగా; తనువున్= దేహాన్ని; చిత్తంబు= మనస్సును; విడిచి= వదలి; చనుము= వెళ్ళుము.

తాత్పర్యం: స్వతః ఆకారంలేని ధర్మం ఈ కౌశికుడి కారణాన ఆకారం ధరించి వచ్చి, 'ఓ కౌశికా! నీ జపకర్మ ఫలితంగా తమను మించినవి లేని గొప్ప పుణ్యలోకాలు నీకు లభించినవి. సంతోషంతో నీ విక, నీ శరీరాన్ని మనస్సును విడిచి ఆ లోకాలకు చేరుకొమ్ము'. అన్నది.

వ. **అనిన విని యమ్ముని ధర్మంబున కిట్లనియె.** **136**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+ముని= ఆ కౌశిక ఋషి; ధర్మంబునకున్= ధర్మదేవతకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అనగా విని ఆ కౌశిక ఋషి ఈ విధంగా అన్నాడు.

క. **'తనువు దొఱఁగి సను లోకము । లనఘా! యే నొల్ల మేల యైనను దుఃఖం**
బున కోర్చి నా తపంబున । కనుగుణమై యుండ దీని నగునె తొఱంగన్?' **137**

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా!; ఏను= నేను; తనువు= శరీరం; తొఱఁగి= విడిచి; చనులోకములు= వెళ్ళేడి (ఊర్ధ్వ) లోకాలు; మేలు+అ+ఐనను= శ్రేష్ఠమైనవే అయినా; ఒల్లన్= అంగీకరించను; దీనిన్= ఈ శరీరాన్ని; దుఃఖంబునకున్= కష్టానికి; ఓర్చి= సహించి; నా తపంబునకున్= నేను చేసే జపరూపమైన తపస్సునకు; అనుగుణమై= అనుకూలమై; ఉండన్= ఉండగా, నిలిచి ఉండగా; తొఱంగన్= విడుచుటకు; అగునె?= అర్హం, ఉచితము, అగునా? (కాదు).

తాత్పర్యం: 'పాపస్పర్శలేని ఓ ధర్మమా! ఊర్ధ్వలోకాలు ఉత్తమమైనవే అయినప్పటికీ నేను ఈ నా శరీరాన్ని దిగవిడిచి వెళ్ళవలసి వస్తే, ఆ లోకాలను అంగీకరించజాలను. ఎందుకంటే ఈ శరీరం నా జపకర్మకు - అది దుఃఖకరమే అయినా సహించి అనుగుణంగా ఉంటున్నది. అటువంటి ఈ అనుకూలదేహాన్ని విడిచిపుచ్చి వెళ్ళటం ఉచితమా?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: కౌశికుడికి ఊర్ధ్వలోక గమనం అనిష్టంగాదు. అతడికి ఇష్టంగానిది - ఇంతకాలం తన తపశ్చర్యకు సాధనమైన శరీరాన్ని దిగవిడిచి పోవటం.

వ. అనుటయు ధర్మంబు. 138

ప్రతిపదార్థం: అనుటయున్= కౌశికుడు ఆ విధంగా పలుకగా; ధర్మంబు= సాకారమైన ధర్మం- (ఇట్లా ప్రతిభాషించింది).

తాత్పర్యం: దీనికి ధర్మదేవత ఇట్లా సమాధానం ఇచ్చింది.

క. 'ఒడ లెట్లు విడువవలదే? । కడు రమ్యము నాక మింత గానవొకో?' నా
వుడు 'మేను వెలిగ నటవో । నొడఁబడ' నని పలికె బ్రాహ్మణోత్తముఁ డధిపా! 139

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధర్మరాజా ఒడలు= శరీరం; ఎట్లున్= ఏ విధంగానైనా; విడువన్‌వలదు+ఏ?= వదలివేయవద్దా?; నాకము= స్వర్గం; కడు రమ్యము= మిక్కిలి సుందరం; ఇంత= ఈ మాత్రం; కానవు+ఒకో?= గమనించలేవా?; నావుడున్= అన్నవెంటనే; బ్రాహ్మణ+ఉత్తముఁడు= బ్రాహ్మణ శ్రేష్ఠుడయిన ఆ కౌశికుడు; మేను= శరీరం; వెలిగన్= వెలుపలగాగా - వెంటరాకుండ నిలువగా; అటన్= ఆ స్వర్గానికి; పోన్+ఒడఁబడన్= వెళ్ళుటకు అంగీకరించను; అని; పలికెన్= అన్నాడు;

తాత్పర్యం: 'ఏ విధంగానైనా ఎప్పటికైనా శరీర పరిత్యాగం తప్పదు కదా! స్వర్గలోకం ఎంతో అందమైనది. ఈ మాత్రం గ్రహించలేవా? కౌశికా!' అని ధర్మమంటే, శరీరాన్ని విడిచి ఆ లోకాలకు వెళ్ళటానికి తాను అంగీకరించనని భూసురుడు సమాధానం చెప్పాడు ధర్మరాజా!

వ. అని పలికిన ధర్మం బతనితో 'నీ వొడలు విడువనొల్లవుపో యమకాల మృత్యువులు వీరె వచ్చిరి; చూడు' మనియె; నయ్యవసరంబున వారలు వచ్చి యమ్మహీసురవరు ముందఱ నిలిచి, తమ్ముం బేర్కొని; రాతని నుద్దేశించి యముండు నీ జపంబు ఫలంబు సిద్ధించె' ననియుఁ, గాలుండు 'నీకు నాకలోకారోహణంబునకుం గాలంబైనం దోఁచితి' ననియును మృత్యువు 'కాలచోదితనై నిన్ను నేఁడు గొనిపో వచ్చితి' ననియుం బలుకుటయు, నమ్మాటలు గీటునం బుచ్చుచు వారల వదనంబులు విలోకించి సవినయ వ్యాహృత స్వాగతుండయి యవ్విప్రుం'డేను మీకు నెప్పని సేయువాఁడ?' నని పలికె; నట్టి యెడఁ దీర్థయాత్రా పరుండైన యిక్ష్వాకుం డచ్చటికి నేతెంచి వార లందరకుం బ్రణతుండై బ్రాహ్మణుం డతిథిగా నిరూపించి యాదర భరితుండై. 140

ప్రతిపదార్థం: అని పై విధంగా; పలికినన్= చెప్పగా; ధర్మంబు= సాకారమైన ధర్మదేవత; అతనితోన్= ఆ కౌశికుడితో; నీవు; ఒడలు= శరీరం; విడువన్= వదలుటకు; ఒల్లవుపో= అంగీకరించవు పోనిమ్ము; యమకాల మృత్యువులు= యమధర్మరాజు, కాలపురుషుడు, మృత్యుదేవత, ఈ ముప్పురు; వీరె= వీరలె (ఈ కనుపించేవారే అని చూపుతూ); వచ్చిరి= నిన్ను చేరారు; చూడుము+అనియెన్= చూడుము అనెను; ఆ+అవసరంబునన్= ఆ సమయాన; వారలు= ఆ ముప్పురు; వచ్చి= చేరి; ఆ+మహీసురవరు ముందఱన్= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడి ఎదుట; నిలిచి= నిలువబడి; తమ్మున్= తమను; పేర్కొనిరి= తెలుపు కొన్నారు; ఆతనిన్+ఉద్దేశించి= ఆ కౌశికుడితో; యముఁడు= యమధర్మరాజు; నీ జపంబు ఫలంబు= నీవు చేసే జపకర్మయొక్క ఫలితం; సిద్ధించెన్+అనియున్= ఫలించింది అనీ; కాలుండు= కాలపురుషుడు; నీకున్; నాకలోక+ఆరోహణంబునకున్= స్వర్గలోకమున కెక్కుట కొరకు; కాలంబు+ఐనన్= సమయము కాగా; తోఁచితిన్+అనియును= కనిపించాను అనీ; మృత్యువు= మరణదేవత; కాలచోదితను+ఐ= కాలుడిచేత ప్రేరేపించబడినదాననై; నిన్నున్; నేఁడు= ఈ దినం; కొనిపోవన్+వచ్చితిన్+అనియున్= తీసికొనిపోవటానికి చేరాను అనీ; పలుకుటయున్= అనగా; ఆ+మాటలు= ఆ పలుకులు, ఆ ముగ్గురి వాక్కులు; గీటునన్+పుచ్చుచున్=

తిరస్కారానికి లోనుచేస్తూ; వారల వదనంబులు= ఆ ముగ్గురి మొగాలు; విలోకించి= చూచి; సవినయ వ్యాహృత స్వాగతుండు+అయి= అణకువతో పలికిన స్వాగతవచనం కలవాడై - వారికి స్వాగతం పలికి; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఏను= నేను; మీకున్= మీ ముగ్గురకు; ఏ+పని= ఏ కార్యం; చేయువాఁడను?= చేయగలవాడను?; అని; పలికెన్= అన్నాడు; అట్టిఎడన్= అట్టి సమయాన; తీర్థయాత్రాపరుండు+ఐన= తీర్థయాత్రలలో ఆసక్తుడయిన; ఇక్ష్వాకుండు= ఇక్ష్వాకుడు అనే మహారాజు; అచ్చటికిన్+ఏతెంచి= ఆ స్థలానికి వచ్చి; వారలు+అందఱకున్= ఆ అందరకు, నల్వురకు కూడా; ప్ర+నతుండు+ఐనన్= బాగా నమస్కరించినవాడు కాగా; బ్రాహ్మణుండు= ఆ నల్వురిలోని కౌశికుడు; అతిథిన్+కాన్= అతిథిత్వమునకు అర్హుడిగా (రాజును); నిరూపించి= గ్రహించి; ఆదరభరితుండు+ఐ= గౌరవంతో నిండినవాడై.

తాత్పర్యం: 'కౌశిక ధర్మదేవతల సంవాదంలో ధర్మదేవత కౌశికుడితో 'నీవు శరీర త్యాగం చేయవు సరే! అరుగో యముడు, అతడి వెంట కాలపురుషుడు, అతడి వెంట మృత్యువు - ముగ్గురూ వచ్చారు చూడుము' అన్నది. ఆ సమయాన ఆ ముగ్గురూ అక్కడకు చేరి, తమను తాము పరిచయం చేసికొని, ఆ కౌశికుడి ముందు నిలిచారు. ముందుగా యముడు 'నీ జపఫలితం సిద్ధించిన'దని పలుకగా, అనంతరం కాలుడు 'నీవు స్వర్గాన్ని అధిరోహించవలసిన సమయం సమీపించి నేను వచ్చా'నని తెల్పాడు. చివరగా మృత్యువు తాను కాలునిచే ప్రేరణబొంది కౌశికుడిని తీసికొని వెళ్ళుటకు వచ్చినట్లు తెలియపరచినది. అయితే ఆ ముగ్గురి మాటలనూ తిరస్కరిస్తూ ఆ బ్రాహ్మణుడు వారి ముఖాలు చూచి అణకువతో అందరకూ స్వాగతం పలికి 'నేను మీకు ఏ పని చేసి పెట్టగలను?' అని విన్నవించుకొన్నాడు. సరిగా అదే సమయాన తీర్థయాత్రలు చేస్తూ ఇక్ష్వాకుమహారాజు ఆ ప్రదేశానికి ఏతెంచి ఆ నల్గురికీ నమస్కరించాడు. వారిలో కౌశికుడు ఆ రాజును అతిథిగా భావించి గౌరవంతో అతడిని ఉద్దేశించి ఇట్లా అన్నాడు.

విశేషం: నరుడికి అతని వృత్తి - ప్రవృత్తి విశ్వాసాన్ని కలిగిస్తాయి. దాన్నే ఆత్మవిశ్వాసం అంటారు. అది సమృద్ధిగా సక్రమంగా ఉన్నప్పుడు ఎదుటి వ్యక్తి ప్రాముఖ్యం ముందు తలవంచవలసిన అవసరం ఉండదు. ఇక్కడ కౌశికుడిలో ఆ ఆత్మవిశ్వాసమే-జపనిష్ఠాతత్పరతవలన సిద్ధించిన విశ్వాసమే అతడిని యమకాలమృత్యువులముందు నిర్భయంగా నిలబెట్టగలిగినది. వారిమాటను సరకు చేయకపోయినా కౌశికుడు కుశలంగా ఉండగలిగాడంటే కారణం వృత్తిపరంగా సిద్ధించిన అజేయమైన ఆత్మప్రత్యయం. అదే ఆత్మశక్తి.

కౌశికునకు నిక్ష్వాకుమహారాజునకు నయిన సంవాదము (సం. 12-192-2, 3)

క. 'నా కలిమితోడ నిచ్చెద । నీ కెయ్యది యిష్ట?' మనిన నృపతి 'నృపులు దా
నైకపరులు గొనువారలె? । యే కామ్యములయిన నిత్తు నీ వడుగు తగన్.' 141

ప్రతిపదార్థం: నా కలిమితోడన్= నా సంపదనుబట్టి; ఇచ్చెదన్= ఇస్తాను; నీకున్= అతిథివి అయిన నీకు; ఏ+అది= ఏది; ఇష్టము?= కోరబడినది?; అనినన్= అనగా; నృపతి= ఇక్ష్వాకు మహారాజు; నృపులు= రాజులు; దాన+ఏకపరులు= ఇవ్వటంలో మాత్రమే ఆసక్తులు; కొనువారలు+ఎ?= గ్రహించేవారా?; ఏ కామ్యములు+అయినన్= ఏ కోరికలయినను; ఇత్తున్= తీరుస్తాను; నీవు= బ్రాహ్మణుడవైన నీవు; తగన్= ఉచితంగా; అడుగు= అర్థించుము.

తాత్పర్యం: అతిథిపట్ల గౌరవంతో కౌశికుడు ఇక్ష్వాకువును ఉద్దేశించి, 'నాకున్న దాని కనుగుణంగా ఇవ్వగలను. నీ అభీష్టమేమిటి?' అని అన్నాడు. ఆ మాటకు బదులుగా ఆ రాజు విప్రుడితో 'రాజులు దానశీలురు, దానకర్తలు గాని, దానగ్రహీతలు కాగలరా?' అని, 'నీవు అర్థించుము, నీ కామ్యాలు తీరుస్తాను' అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: కొత్తగా ఇల్లు చేరినవాడు తెలియనివాడైనా అతిథి. అతిథిని దేవుడిగా భావించి పూజించుమని మన ఆమ్నాయాల నిర్దేశం. 'అతిథి దేవో భవ' అనే మాట అదే. కౌశికుడు ఆ దృష్టితోనే కొత్తగా వచ్చినవాడిని అతిథిగా భావించి సత్కరించబోయాడు- అభీష్టార్థ ప్రదానంతో.

వ. అనిన విని విప్రుం డవ్విభున కిట్లనియె. 142

ప్రతిపదార్థం: అనినన్= ఇక్ష్వాకుడు పలుకగా; విని= ఆలకించి; విప్రుండు= బ్రాహ్మణుడు - కౌశికుడు; ఆ+విభునకున్= ఆ రాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇక్ష్వాకుమహారాజు అట్లు అనగా విని, బ్రాహ్మణుడు ఈ విధంగా అన్నాడు.

క. 'కొనువారు ప్రవృత్తులు గా । క నివృత్తులు గొందురయ్య? కామ్యంబులు నా
మనమున లేే; వే నేమియుఁ । గొన; నిత్తున కాన యధిప! కోరుము తగఁగన్. 143

ప్రతిపదార్థం: అధిప!= ఓ ఇక్ష్వాకు మహారాజా!; కొనువారు= (దానం) గ్రహించేవారు; ప్రవృత్తులు+కాక= ప్రవృత్తి మార్గంలో ఉన్నవారు కాకుండా; నివృత్తులు= నివృత్తి మార్గంలో ఉన్నవారు; కొందురు+అయ్య= (దానం) స్వీకరిస్తారటయ్యా?; కామ్యంబులు= కోరికలు; నా మనమునన్= నా మనస్సునందు; లేవు= ఉన్నవి కావు; ఏను= నేను; ఏమియున్= దేనినీ; కొనన్= గ్రహించను; ఇత్తును+అ= ఇస్తాను తప్పక; కాన= కావున; తగఁగన్= ఉచితంగా, అర్హంగా; కోరుము= అర్థించుము.

తాత్పర్యం: సంసారచక్రాన బడి వివిధ క్రియలలో ప్రవర్తించేవారు దానాలు స్వీకరిస్తారు తప్ప, సంసారాన్ని దూరంగా నివృత్తిమార్గాన ప్రాపంచిక విషయాలనుండి మరల్చి జీవించేవారు దానం గ్రహిస్తారా? నా మనస్సున ఏ కోరికలూ లేవు. కాగా నేను కోరను, కాని ఈయగలవాడను. తప్పక ఇస్తాను నీవే తగినట్లు కోరుకొమ్ము.

విశేషం: ప్రవృత్తి × నివృత్తి. ప్రాపంచిక విషయాల జోలికి వెళ్ళి, వాటిలో తలదూర్చి, వివిధ ఆలోచనలలో క్రియలలో పాల్గొనటం ప్రవృత్తి. ఇది జనసామాన్య జీవనవిధానం. దీనికి విరుద్ధంగా ప్రాపంచిక విషయాలనుండి ఇంద్రియాలనూ, మనస్సునూ మరల్చి, నిగ్రహించి, ఆత్మజ్ఞానం కొరకు యత్నించటం నివృత్తి. ఇక్కడ బ్రాహ్మణుడు నివృత్తుడు. క్షత్రియుడు ప్రవృత్తుడు.

వ. పూజారూపంబున నిచ్చిన యది యతిథి గైకొనుట యెగ్గుగా' దనుటయు నమ్మనుజపతి 'నీ విచ్చువాఁడవయేని నీ సకల జపంబు ఫలంబును ని' మ్మనిన నమ్మహీదేవుండు. 144

ప్రతిపదార్థం: పూజారూపంబునన్= సత్కారరూపాన్ని; ఇచ్చిన+అది= ఈబడినది; అతిథి= ఆగంతకుడు; కైకొనుట= స్వీకరించటం; ఎగ్గు+కాదు= కీడు కాదు; అనుటయున్= అన్న తరువాత; ఆ+మనుజపతి= ఆ రాజు; నీవు; ఇచ్చువాఁడవు+అ+ఏని= ఇచ్చేవాడివే అయితే; నీ సకల జపంబు ఫలంబును= నీ మొత్తం జపముయొక్క ఫలితాన్ని; ఇమ్ము= ఇచ్చివేయుము; అనినన్= అనగా; ఆ+మహీదేవుండు= ఆ బ్రాహ్మణుడు.

తాత్పర్యం: సత్కారరూపాన (యాచనకు బదులుగా కాకుండా) ఇచ్చినది స్వీకరిస్తే స్వీకర్తకు ఏ కీడూ ఉండదు' అని కౌశికుడు పలికాడు. కౌశికుడి నిర్బంధంతో ఆ రాజు 'నీవు కేవలం దాతవే అయితే, నీ మొత్తం జపఫలితం నాకిమ్మ' అన్నాడు. దానికి బదులుగా ఆ బ్రాహ్మణుడు (ఇట్లా అన్నాడు).

విశేషం: దానాలు రెండు విధాలుగా ఉండవచ్చును. అర్థించిన తరువాత ఇచ్చేది లోకంలో ప్రసిద్ధమైన దానం. అర్థనతో నిమిత్తం లేకుండా గౌరవపురస్సరంగా పూజోపహారంగా ఇచ్చేది అసామాన్య దానం. దీనిలో గ్రహీతకు, దాన స్వీకర్తకు ఏ ప్రమేయమూ ఉండదు కాబట్టి ఏ కీడూ ఒనగూడే వీలులేదు. ప్రయోజనకాంక్షతో చేసే దానాలు స్వీకరించేవారికి అటువంటి అభయం ఉండ దంటారు పెద్దలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'జపఫలమున సగ మిచ్చెద । నృప! యంతయు నైనఁ గొనుము నీ' వనవుడు 'న
జ్జపము ఫలం బెయ్యది?' యని । నృపుఁ డడిగిన నాతఁ 'డేను నిరపేక్షుండన్.' 145

ప్రతిపదార్థం: నృప!= రాజా!; జపఫలమునన్= జపం ఫలితంలో; సగము+ఇచ్చెదన్= సగపాలు ఇస్తాను; అంతయున్+ఐనన్= అంతటినైననూ; నీవు; కొనుము= తీసికొనుము; అనవుడున్= అన్నవెంటనే; ఆ+జపము ఫలంబు= ఆ నీ జపముయొక్క ఫలితం; ఏ+అది?= ఏది, ఏ విధమైనది?; అని; నృపుఁడు= రాజు; అడిగినన్= ప్రశ్నించగా; ఆతఁడు= ఆ కౌశికుడు; ఏను= నేను; నిర్+ఆపేక్షుండన్= కోరిక లేనివాడను.

తాత్పర్యం: 'నీ సకల జపంబు ఫలంబును ఇమ్ము' అన్న ఇక్ష్వాకుమహారాజునకు కౌశికుడి సమాధానమిది - 'జపఫలితంలో సగమిస్తాను రాజా! మొత్తం ఫలితం కావాలి - అన్నా తీసికొమ్ము' అని. దానికి రాజు 'ఇంతకూ ఈ నీ జపఫలితం ఏమిటి?' అని ప్రశ్నించాడు. కౌశికుడి సమాధానం - 'నేను కోరికలు లేనివాడిని' అంటూ ప్రారంభించి కొనసాగిస్తున్నాడు.

విశేషం: రాజు కౌశికుడి నిర్బంధదాతృత్వానికి విసిగినట్లుగా కౌశికుడి జపఫలితం మొత్తం ఇమ్మన్నాడు. విప్రుడు తనమాట మొదట సగమిస్తానని, మళ్ళీ అంతా అయినా తీసికొనుమన్నాడు. ఈ విధంగా ఇక్కడి దాత, గ్రహీత, ఇరువురూ ఒకింత భావావేశంతో వ్యవహరిస్తున్నట్లు తోస్తున్నది.

క. కావున ఫల మిట్టిది యని । భావింప; నెఱుంగ నొరులఁ బనివడి యడుగన్;
నీ వాఫలంబు గొను మది । దా వినఁబడుఁ బిదప ధర్మతత్త్వజ్ఞులచేన్.' 146

ప్రతిపదార్థం: కావున= (కోరికలు లేనివాడను) కాబట్టి; ఫలము= (జపముయొక్క) ఫలితం); ఇట్టిది+అని= ఈ విధమైనది అని; భావింపన్= ఊహించగా; ఎఱుంగన్= తెలియను; ఒరులన్= ఇతరులను; పని+పడి= పనిగట్టుకొని, ప్రయత్నపూర్వకంగా; అడుగన్= ప్రశ్నించను; నీవు; ఆ ఫలంబు= ఆ నా జపఫలితం; కొనుము= గ్రహించుము; అది= ఆ ఫలితమెట్టిదో - అను నీ ప్రశ్నకు సమాధానం; తాన్= స్వయంగా; పిదపన్= అనంతరం; ధర్మతత్త్వజ్ఞులచేన్= ధర్మ స్వభావం ఎరిగినవారిచేత; వినఁబడున్= వినవచ్చును.

తాత్పర్యం: నేను నిరపేక్షకుడను కాబట్టి నా కా జపఫలితపు స్వరూపస్వభాలను గురించిన భావనే కలుగలేదు. ఆ కారణాననే నేను ఇతరు లెవరినీ పనిగట్టుకొని జపఫలిత మేమిటి? - అని అడిగి తెలిసికొనలేదు, ఫలిత మిట్టిది అని తెలియకున్నా దాన్ని స్వీకరించుము. ఆ తరువాత ధర్మతత్త్వవేత్తలు ఆ జపఫలిత మిట్టిది, ఇంతటిది - అని వివరిస్తారు'.

విశేషం: మొదటి నుండి ఈ దాత గ్రహీతలలో సౌముఖ్యం కొరవడినట్లుగా అనిపిస్తుంది. ఇపుడు అదేమిటో తెలియకుండానే దానిని గ్రహించమంటున్నాడు దాత. మరి గ్రహీత ఏ విధంగా స్పందిస్తాడో చూడాలి. గ్రహీత అయినా, తొలుత కోరినపుడు లేని సంశయాన్ని అనంతరం దానసమయాన వెలువరించటం ఎందుకో? మొత్తంమీద దానస్వీకారం చేసేటప్పుడు ముందు వెనుకలు చూడవలసిన అవసరం ఎంతో ఉన్నట్లుగా వీరి వ్యవహారశైలిని బట్టి మనం గ్రహించాలి.

వ. అనుటయు నయ్యినతనయుండు 'ఫలం బిట్టి దని యెఱుఁగ వేనిం గొననొల్ల' ననవుడు నతం డితని కిట్లనియె. 147

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా, అన్న తరువాత; ఆ+ఇనతనయుండు= ఆ సూర్యవంశపు ఇక్ష్వాకు మహారాజు; ఫలంబు+ఇట్టిది+అని= ఫలితం ఇటువంటిది అని; ఎఱుంగవు+ఏనిన్= తెలియవేని; కొనన్+ఒల్లన్= తీసికొనుటకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంగీకరించను; అనవుడున్= అన్న పిదప; అతండు= ఆ కౌశికుడు; ఇతనిని= ఈ ఇక్ష్వాకుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కౌశికుని సమాధానం విన్న ఇక్ష్వాకుడు ఫలితం తెలియరాని దానిని తాను స్వీకరించటానికి అంగీకరించ నన్నాడు. తరువాత ఆ కౌశికుడు ఇక్ష్వాకుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'నీ వడిగి తేను నిచ్చితి । భూవల్లభ! యింక సత్యమున కూనము గా
దే వరియింపమి?' నావుడు । నా వసుధాధీశుఁ డద్ధరామరవరుతోన్. 148

ప్రతిపదార్థం: భూవల్లభ!= ఓ రాజా!; నీవు= అర్థివైన నీవు; అడిగితి(వి)= అర్థించావు; ఏను= నేను; ఇచ్చితిన్= ఇచ్చాను; ఇంకన్= ఇకమీదట, ఇంత జరిగిన తరువాత; వరియింపమి= ఇష్టపడకుండుట (దానస్వీకారానికి); సత్యమునకున్= సత్యవ్రతానికి; ఊనము+కాదే?= తక్కువ - కొరతకాదా?; నావుడున్= అన్న తరువాత; ఆ+వసుధా+అధి+ఈశుఁడు= ఆ భూమికి అధిపతియైన ఇక్ష్వాకుడు; ఆ+ధరా+అమర వరుతోన్= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడితో.

తాత్పర్యం: కౌశికుడు ఇక్ష్వాకుడి తిరస్కారాన్ని తప్పుపట్టుతున్నాడు. 'ఓ రాజా! నీవు అడిగావు. నేను ఇచ్చాను. ఈ అడుగుట, ఇచ్చుట అనే ఈ రెండు క్రియలు జరిగిపోయిన తరువాత ఈ దశలో నీవు - నే నొల్లను అనుట సత్యవ్రత పాలనకు హానికరం కాదా? అట్లా తిరస్కరించటం సత్యానికి కొరత గావించటం కాదా?' అన్నాడు కౌశికుడు. దానికి బదులుగా ఆ మహారాజు ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడితో ఇట్లా పలికాడు.

వ. 'రాజులకు యుద్ధంబు సుకర్మంబు గావున నీతో వివాదయుద్ధంబు సేసితి' ననిన నతండు 'నీవేమి సేసితేమి? యది యట్లుండనిమ్ము.' 149

ప్రతిపదార్థం: రాజులకున్= క్షత్రియులకు; యుద్ధంబు= కయ్యం; సుకర్మంబు= మంచిపని, చేయదగింది; కావునన్= కాబట్టి; నీతోన్= పండితుడవైన నీతో; వివాద యుద్ధంబు= తగవులాడుట అనే కయ్యం; చేసితిన్= చేశాను; అనినన్= అనగా; అతండు= ఆ కౌశికుడు; నీవు; ఏమి+చేసితి(వి)+ఏమి= ఏ దానిని చేశావో ఏమిటో; అది= ఆ చేసింది; అట్లు+ఉండన్+ఇమ్ము= ఆ విధంగానే చేసినది చేసినట్లుగానే ఉండనిమ్ము.

తాత్పర్యం: కౌశికుడి ప్రశ్నకు రాజు సమాధాన మిది: తాను క్షత్రియుడు కాబట్టి క్షత్రియులకు యుద్ధం చేయదగ్గపని కాబట్టి తాను కౌశికునితో తగవులాడుట అనే కయ్యాన్ని చేశాడు. ఈ సమాధానానికి ఆ కౌశికుడి ప్రతివచనమిది: 'నీవు ఏమి చేశావో ఏమో, అది అట్లా ఉండనిమ్ము'.

విశేషం: బ్రాహ్మణ కౌశికుడు, క్షత్రియ ఇక్ష్వాకువు - ఇరువురూ ధర్మకర్మతత్పరులే. ఇరువురకూ పరస్పర గౌరవాదరభావాలు ఉన్నవి. అయినా దానప్రదానం, దానస్వీకారం అనే విషయంమీద వివాద పడుతున్నారు. ఎవరికి తోచిన రీతిలో వారు తమ ధోరణిని సమర్థించుకొనజూస్తున్నారు. క్షత్రియధర్మం ప్రకారం కయ్యం కార్యమే కాబట్టి వాఙ్మయమైన కయ్యం చేశా నంటున్నాడు రాజు.

క. విను మిచ్చెద నని యీమియుఁ, । గొనియెద నని పలికి పిదపఁ గొనకునికియు, న
త్యనృతంబులు సత్యవ్రత । మునకుం దొలగంగ మనకు భూవర! తగునే? 150

ప్రతిపదార్థం: భూవర!= ఓ రాజా!; వినుము= ఆలకించుము; ఇచ్చెదను+అని= ఇస్తాను అని పలికి; ఈమియున్= ఈయకుండుటా; కొనియెదను+అని= తీసికొంటాను అని; పలికి= చెప్పి; పిదపన్= ఆ తరువాత; కొనక+ఉనికియున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తీసికొనకుండా ఉండటం; అతి+అనృతంబులు= మిక్కిలి అసత్యాలు; మనకున్= గొప్ప రాజువైన నీకు, మంచి బ్రాహ్మణుడనైన నాకు ఇద్దరికీ; సత్యవ్రతమునకున్+తొలఁగంగన్= సత్యమును పాటించుటనుండి తప్పుకొనుట; తగునే?= ఉచితమా?

తాత్పర్యం: ఓ రాజా! నీవేదో వివాదయుద్ధం చేశాను అంటున్నావు. అయితే ఇది వినుము. ఇస్తానని ఈయకుండటం, తీసికొంటానని తీసికొనకుండా ఉండటం - ఈ రెండు పనులూ మిక్కిలి అసత్యాలు. సద్బ్రాహ్మణుడ నైన నేనూ, క్షత్రియుడవైన నీవూ - ఇద్దరం ఈ విధంగా సత్యవ్రతపాలనకు దూరంగా జరిగిపోవటం తగునా?

విశేషం: 'తగునా?' అనేమాట ఈ పద్యంలో సార్థకం. 'తగు' అనే మాటనుండే 'తగవు' - వ్యవహారంలో 'తగువు' వచ్చాయి. ఉచితమగు అనే అర్థంలో ఈ మాటను ప్రయోగిస్తాం. వాదవివాదాలలో వాక్ప్రాగల్భ్యానికి పోయి, ఉచితానుచితాలు మరచే ప్రమాదముంది. ఆ ప్రమాదపుటంచున నిలబడి ఉన్నామని కౌశికుడి హెచ్చరిక.

క. సత్యమ తపమును యజ్ఞము, । సత్యమ వేదంబు దాంతిశాంతులు నగుటన్
సత్యము దొఱఁగుట నిర్మల । నిత్యానుష్ఠానములును నిష్ఫలము లగున్.' 151

ప్రతిపదార్థం: సత్యము+అ= సత్యమే; తపమును= తపస్సు; యజ్ఞము= యాగం కూడా; సత్యము+అ= సత్యమొక్కటే; వేదంబు= వేదం, జ్ఞానం; దాంతి శాంతులున్= దమనం, నిగ్రహం, కామక్రోధలోభ మోహ మదమాత్సర్యాలు లేకుండటం; అగుటన్= కాబట్టి; సత్యము= సత్యమునే; తొఱఁగుట= విడుచుట; నిర్మల నిత్య+అనుష్ఠానములును= మలినంలేని, ఎప్పుడూ చేసే కర్మకాండలు, జపహోమపూజాదులు కూడా; నిస్+ఫలములు+అగున్= ఫలం, ప్రయోజనం లేనివి ఔతాయి.

తాత్పర్యం: సత్యం సర్వోన్నతమైనది. సత్యవ్రతపాలన చేస్తే తపస్సు చేసినట్లే, యజ్ఞంచేసినట్లే, వేదం తెలిసినట్లే. సత్యవ్రతపాలనే నరుడిలో నిగ్రహాన్ని, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే అరిషడ్వర్గాన్ని జయించగల శాంతినీ కలిగిస్తుంది. అటువంటి సకలధర్మాచరణకు మూలకందమైన సత్యాన్ని విడిచిపెడితే ఇక జపహోమ పూజాపురస్కారాలవంటి నిత్యానుష్ఠానాలూ నిష్ఫలమే అవుతాయి'.

విశేషం: నేల విడిచి సాముచేయలేనట్లే, సత్యవ్రతపాలనలేక మిగిలిన సకల ధర్మకార్య నిర్వహణమూ అసాధ్యమే. కాదని మొక్కుబడిగా, గుడ్డిగా ఇతర సత్కార్యాలూ, ధర్మకార్యాలూ నిర్వహించినా, సత్యవ్రత మొక్కటి లేనప్పుడు మిగిలినవన్నీ నిష్ఫలాలే! ఎందుకంటే సర్వధర్మమూలమూ సత్యమే కాబట్టి.

వ. అనిన విని ధర్మంబు వారల నుద్దేశించి యమాదులు విన 'వీరికి వివాదంబు వలదు. విప్రుండు దానఫలంబును రాజు సత్యఫలంబును బొందువా' రనియె. నట్టియెడ నాకంబు నరాకృతి దాల్చి వచ్చి తన్నెఱింగించి యయ్యిరువుర నాలోకించి 'వాదేల? మీరిద్దఱుం దుల్యఫలప్రాప్తుల రయ్యెద రిట్లు సేయుం'డని పలికె నవ్విభుం 'డట్లేని నితండును నా యిచ్చునది గొనవలయు? ననుటయు నమ్ముని 'యేను దపస్స్వాధ్యాయనిరతుండం బరిగ్రహవిధి యందు విరతుండ.' 152

ప్రతిపదార్థం: అనినన్= కౌశికుడు అట్లు పలుకగా; విని= ఆలకించి; ధర్మంబు= ధర్మాధిదేవత; వారలన్= ఆ కౌశిక, ఇక్ష్వాకులను; ఉద్దేశించి= లక్ష్యముగాజేసి; యమ+ఆదులు= యముడు మొదలగువారు; వినన్= వినునట్లుగా; వీరికిన్= ఈ ఇరువురకు; వివాదంబు= తగవు; వలదు= అక్కరలేదు; విప్రుండు= బ్రాహ్మణుడు - కౌశికుడు; దానఫలంబును= దానము యొక్క ఫలితమును; రాజు= క్షత్రియుడు - ఇక్ష్వాకువు; సత్యఫలంబును= సత్యవ్రతపాలనయొక్క ఫలితమును; పొందువారు+అనియెన్= చేకొనువారు అని పలికెను; అట్టి+ఎడన్= ఆ సమయాన; నాకంబు= స్వర్గము; నర+ఆకృతి= నరుని ఆకారము; తాల్చి= ధరించి; వచ్చి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేరి; తన్నున్= తనను; ఎఱింగించి= తెలియపరచి; ఆ+ఇరువురన్= ఆ ఇద్దరినీ; ఆలోకించి= చూచి; వాదు+ఏల?= వాదము, తగవు ఎందుకు?; మీరు+ఇద్దరున్= మీరు ఇరువురూ; తుల్యఫల ప్రాప్తులరు+అయ్యెదరు= సమానమైన ఫలితమును పొందువారు కాగలరు; ఇట్లు= ఈ విధంగా; చేయుండు+అని= చేయండి అని; పలికెన్= చెప్పెను; ఆ+విభుండు= ఆ రాజు; అట్లు+ఏని= అట్లయితే; ఇతండును= ఈ బ్రాహ్మణుడు కూడా; నా+ఇచ్చునది= నేను ఇచ్చేది; కొనన్+వలయున్= గ్రహించవలెను; అనుటయున్= అన్న పిదప; ఆ+ముని= ఆ ఋషి, కౌశికుడు; ఏను= నేను; తపస్+స్వ+అధ్యాయ నిరతుండను= తపస్సునందు, చదువునందు ఆసక్తుడను; పరిగ్రహణవిధియందున్= (దానమును) స్వీకరించు పనియందు; విరతుండన్= విరక్తుడను, అనాసక్తుడను.

తాత్పర్యం: కౌశికుడి పలుకు లాలకించిన ధర్మదేవత ఆ వివాదగ్రస్తులను ఇరువురనూ ఉద్దేశించి యముడు, కాలుడు, మృత్యువు వింటుండగా - వీరికి ఈ తగవులాట వద్దనీ, బ్రాహ్మణుడు దానఫలితాన్ని, క్షత్రియుడు సత్యవ్రత ఫలితాన్ని పొందగలరని పలికాడు. ఆ సమయాన స్వర్గం మానవరూపంలో అక్కడికి వచ్చి తనను తాను తెలియపరచుకొని, ఆ ఇద్దరినీ చూచి 'మీకు తగ వేల? మీరిద్దరూ సమానంగా ఫలితాలను పొందగల'రని చెప్పి ఈ విధంగా చేయు'మన్నది. ఆ రాజు 'అట్లాగయితే ఈ బ్రాహ్మణుడు కూడా నేనిచ్చే దానాన్ని స్వీకరించాలి' అనగా, ఆ విప్రుడు తాను తపస్సు, అధ్యయనం - ఈ రెంటియందే ఆసక్తుడననీ, దానపరిగ్రహణంలో విరక్తుడననీ తన అభ్యంతరాన్ని తెలిపాడు.

క. అనవుడు నరనాథుఁడు 'నా । కును నీకును సరియ కాఁగఁ గోరెద సత్క
ర్మ నిరూఢి మత్సుకృతఫల । మనఘా! కొనవే? యనుగ్రహంబు దలిర్పన్.' 153

ప్రతిపదార్థం: అనవుడున్= అన్న తరువాత; నరనాథుఁడు= రాజు - ఇక్ష్వాకుడు; నాకును= క్షత్రియుడనైన నాకూ; నీకును= బ్రాహ్మణుడవైన నీకూ; సరి+అ+కాఁగన్= సమానమే అయ్యేటట్లుగా; కోరెదన్= కోరుకొందును; అనఘా!= ఓ పాపరహితుడా! కౌశికుడా!; సత్కర్మనిరూఢిన్= మంచిపనియందలి నిర్ధారణతో; మత్ సుకృతఫలము= నా పుణ్యఫలితము; అనుగ్రహము= దయ; తలిర్పన్= వ్యక్తమగునట్లుగా; కొనవే?= తీసికొనవా? - గ్రహించవా?

తాత్పర్యం: కౌశికుడి అభ్యంతరాన్ని విన్న రాజు కౌశికుడి నుద్దేశించి 'ఓ పాపరహితుడా! నేను నాకూ నీకూ సమత్వం చెడకుండా జాగ్రత్తగా కోరబోతున్నాను. నీవూ మంచిపని అనే నిర్ధారణతో నా పుణ్యఫలాన్ని దయతో దానంగా స్వీకరించుము'. (అని ప్రార్థించాడు.)

విశేషం: రాజు దానగ్రహీతగా, విప్రుడు దానకర్తగా మిగలటం క్షత్రియ ధర్మపరిపాలకుడైన ఇక్ష్వాకునకు మింగుడు పడటంలేదు. అందుకే అతడు బ్రతిమిలాడైనా ఆ విప్రుడిని దానగ్రహీతగా మార్చటానికి యత్నిస్తున్నాడు.

వ. అని ప్రార్థించె నప్పుడు వికృతవేషులగు పురుషు లిరువురు దమలో వివాదంబు సేయుచు వచ్చి 'యవ్విభుండు మనల శాసింప నొడయం' డనుచు నిక్ష్వాకు ముందఱ నిలిచిరి. వారి తెఱంగు వినుము. 154

ప్రతిపదార్థం: అని= పై విధంగా; ప్రార్థించెన్= వేడుకొనెను; అప్పుడు= ఆ సమయాన; వికృత వేషులు+అగు= వికారమైన దుస్తులు, నగలు గలవారగు; పురుషులు= నరులు; ఇరువురు= ఇద్దరు; తమలోన్= పరస్పరం; వివాదంబు+చేయుచున్= వాదులాడుకొంటూ; వచ్చి= చేరి; ఆ+విభుండు= ఆ రాజు; మనలన్= మన ఇరువురను; శాసింపన్= ఆజ్ఞాపించగా; ఒడయండు= అధిపతి; అనుచున్= అని పలుకుతూ; ఇక్ష్వాకు ముందఱన్= ఇక్ష్వాకు మహారాజు ఎదుట; నిలిచిరి= ఆగారు; వారి తెఱంగు= వారి విధం; వినుము= ఆలకించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజు విప్రుడిని తాను స్వీకరించే దానానికి బదులుగా అతడూ తననుండి దానాన్ని స్వీకరించవలెనని వేడుకొంటూ ఉన్న సమయాన ఇరువురు నరులు వికృతమైన దుస్తులూ నగలూ ధరించి పరస్పరం వాదులాడుకొంటూ ఆ రాజును చూచి 'ఆఁ! ఈ రాజు మనకు శాసకుడు' అంటూ అతడి చెంతకు చేరి ఎదుట నిలబడ్డారు. వారి కథ ఇది.

విశేషం: ఇక్కడ కౌశిక ఇక్ష్వాకు లిరువురూ సమానమైన వాదబలంతో తర్కవితర్కాలతో వివాదంలో మునిగి ఉన్నారు. వారికి జ్ఞానోదయం కావాలి - అంటే మాటలతో సరిగాదని తేలిపోయింది. కాబట్టి ఒక విచిత్రసంఘటన ద్వారా వారివివాదాన్ని పరిష్కార మార్గంవైపు మరలించబోతున్నాడు వక్త.

తే. **ఒకఁడు గోదాన మొనరింప నొక్కరుండు। తత్ఫలము వేఁడఁ బ్రీతి నాతండు నొసఁగఁ**
గొనినవాఁ డిది దక్కువ దనకు నని త। లంచి యుత్తమ గోయుగళంబు విలిచి. 155

ప్రతిపదార్థం: ఒకఁడు= ఆ ఇరువురిలో ఒకడు; గోదానము+ఒనరింపన్= ఆవును దానం చేయగా; ఒక్కరుండు= మరొకడు; తద్+ఫలము= ఆ గోదాన ఫలితాన్ని; వేఁడన్= అర్థించగా; ప్రీతిన్= ప్రేమతో; ఆతండున్= ఆ గోదాన కర్తకూడా; ఒసఁగన్= ఈయగా; కొనినవాఁడు= స్వీకరించినవాడు; ఇది= ఈ ఫలితం; తనకున్= స్వీకరించిన తనకు; తక్కువ= చాలినది కాదు; అని; తలంచి= ఆలోచించి, ఉత్తమ గోయుగళంబు= మంచి ఆవుల జంటను; విలిచి= కొని.

తాత్పర్యం: వారిలో ఆ తగవులాడుకొనువారిలో ఒకడు గోదానం చేశాడు. మరొకడు ఆ గోదానఫలితం తన కిమ్మన్నాడు. దానకర్త ప్రేమతో దానఫలాన్ని ఆ అర్థికి ధారపోసి ఇచ్చాడు. అయితే ఆ అర్థి తనకు ఆ ఫలితం చాలినదికాదు అనే భావనతో తాను మంచి ఆవుల జంటను కొన్నాడు. (బహుశః దానం కొరకే కావచ్చు.)

వ. **సత్ పాత్ర దానక్రియ నిర్వర్తించి తత్ఫలంబు మున్ను దనకు గోదాన ఫలం బిచ్చిన యతని కిచ్చువాఁ డయిన నతండు గొనువాఁ డయి యుండి కొనక యెడసేసి తిరుగం దిరుగ నప్పుడు ముట్టం బట్టిన వాదు పుట్టిన వచ్చినవారై; రత్తెఱం గెల్ల నుక్తి ప్రత్యుక్తుల నప్పుడమిరేనికి నేర్పడం జెప్పి; రట్లు సెప్ప వినిన యవ్విభుతోడఁ దొలుత నొసంగినవాఁ 'డితం డడిగిన నెమ్మిం బ్రతిగ్రహింపఁగా నొసంగితిఁ బ్రతిగ్రహంబొల్లని నన్ను నితండు నిర్బంధింపం దగునే?' యని చెప్పినఁ బిదపటి యాతం 'డితండు గొనియెద నని యొడంబడి కొనమి పాతకం బగుట కర్మకాండవిదు లెల్ల నెఱుంగుదు' రనవుడుఁ గౌశికుం డిక్ష్వాకు నుద్దేశించి 'వింటె? యప్పురుషుని వచనంబు'లని పలికి వెండియు. 156**

ప్రతిపదార్థం: సత్ పాత్ర దానక్రియ= మంచి అర్హునకు దానమిచ్చుటను; నిర్వర్తించి= చేసి; తద్+ఫలంబు= ఆ దానఫలితాన్ని; మున్ను= పూర్వం; తనకున్; గోదాన ఫలంబు= గోవును దానం చేయగా లభించిన ఫలితమును; ఇచ్చిన+అతనికిన్= తనకిచ్చినవాడికి; ఇచ్చువాఁడు+అయినన్= (తాను) దానం ఇచ్చేవాడు కాగా; అతండు= ఆ తనకు ఇచ్చినవాడు; కొనువాఁడు+ అయి+ఉండి= తీసికొనబోయేవాడయి ఉండి; కొనక= తీసికొనకుండా; ఎడ+చేసి= దూరంచేసి; తిరుగన్+తిరుగన్= తిరుగగా తిరుగగా; అప్పుడు= ఆ సమయాన; ముట్టన్+పట్టినన్= నిర్బంధముగా పట్టుకోగా; వాదుపుట్టినన్= (ఇద్దరికీ) తగవులాట పుట్టగా; వచ్చినవారు+ఐరి= చేరినవారైనారు; ఆ+తెఱంగు+ఎల్లన్= ఆ పద్ధతి మొత్తం; ఉక్తి+ప్రతి+ఉక్తులన్= మాట, (దానికి) బదులు మాటలతో; ఆ+పుడమిరేనికిన్= ఆ రాజునకు; ఏర్పడన్= స్పష్టంగా; చెప్పిరి= తెలిపిరి; అట్లు= ఆ విధంగా; చెప్పన్= చెప్పగా; వినిన ఆ+విభునితోడన్= విన్న ఆ రాజుతో; తొలుతన్+ఒసంగినవాఁడు= మొదట ఇచ్చినవాడు; ఇతండు= ఇతడు (రెండవవాడిని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉద్దేశించి); అడిగినన్= అర్థింపగా; నెమ్మిన్= ప్రీతితో; ప్రతిగ్రహింపఁగాన్= స్వీకరించటానికి; ఒసంగితిన్= ఇచ్చాను; ప్రతిగ్రహంబు= దాన స్వీకారం; ఒల్లని నన్నున్= అంగీకరించని నన్ను; ఇతండు= నా దానఫలితమును ప్రతిగ్రహించిన ఈ ఎదుటి నరుడు; నిర్బంధింపన్+తగునే?= బలవంత పెట్టటం ఉచితమా?; అని చెప్పినన్= అని పలుకగా; పిదపటి+ఆతండు= తరువాతివాడు (మొదట గోదాన ఫలగ్రహీత); ఇతండు= ఈ నరుడు; కొనియెదన్+అని= తీసికొంటాను (గోదాన ఫలితాన్ని) అని; ఒడంబడి= అంగీకరించి; కొనమి= గ్రహించకుండటం; పాతకంబు+అగుట= పాపము అగుట; కర్మకాండవిదులు+ఎల్లన్= కర్మకాండలు, యజ్ఞాలు, హోమాలు, జపాలు, తపాలు, వ్రతాలు మొదలయిన పనుల పద్ధతులు తెలిసినవారు అందరూ; ఎఱుంగుదురు= తెలియుదురు; అనవుడున్= అన్న తరువాత; కౌశికుండు= కౌశిక బ్రాహ్మణుడు; ఇక్ష్వాకుని+ఉద్దేశించి= ఇక్ష్వాకు మహారాజును గురించి; ఆ+పురుషుని వచనంబులు= ఆ నరుడి మాటలు; వింటే?= విన్నావా?; అని; పలికి= చెప్పి; వెండియున్= మరలా.

తాత్పర్యం: గోదాన ఫలగ్రహీత, గోదాన ఫలంగా తనకు లభించినది అల్పమని భావించి తాను స్వయంగా రెండు ఆవులను కొని, అర్హుడిని ఎన్నుకొని ఆ ఆవుల జంటను అతడికి దానం చేసి, ఆ దానఫలాన్ని తనకు ముందు గోదానఫలాన్ని అర్పించినవాడికి ఈయబోగా అతడు స్వీకరిస్తానని అంగీకరించి, తరువాత స్వీకరించక తప్పించుకొని తిరుగసాగాడు. ఆ తప్పించుక తిరుగాడేవాడిని ఒకనాడు ఆ ఈయదలచినవాడు గట్టిగా పట్టుకొని, గోదాన ఫలాన్ని స్వీకరించుమని నిర్బంధించగా వారిద్దరికీ వాదు పుట్టి, దానిని తీర్చుమని ఈ ఇక్ష్వాకు మహారాజును ఆశ్రయించారు. వారిద్దరూ రాజు దగ్గర తమవృత్తాంతాన్ని జరిగినదాన్ని జరిగినట్లుగా విన్నవించుకొనగా ఆ రాజు వారి వివాదచరిత్రను మొత్తాన్ని విన్నాడు. అపుడు ఆ ఇరువురిలో మొదటివాడు రాజుతో 'ఈతడు అర్థిస్తే, నా గోదానఫలాన్ని తీసికొమ్మని అర్పించాను. నాకు మళ్ళీ ప్రతిగ్రహించే అభిప్రాయం లేదు. అయినపుడు ఈతడు నన్ను నిర్బంధించవచ్చునా?' అని అన్నాడు. ఇక రెండవవాడు 'ఇతడు తీసికొంటాను అని అంగీకరించి, తరువాత ఆ గోదానఫలాన్ని తీసికొనకపోవటం పాపమే అవుతుంది - అని కర్మకాండ తెలిసిన వారందరూ ఎరిగిన విషయమే.' అన్నాడు. ఆ సమయాన కౌశికుడు రాజు నుద్దేశించి 'రాజా! విన్నావా ఆ నరుడి మాటలు?' అని పలికి, ఇంకా ఈ విధంగా అనబోతూ ఉన్నాడు.

విశేషం: వాస్తవానికి ఇది కౌశిక ఇక్ష్వాకుల వివాదాన్ని పరిష్కరించే ఆశయంతో కల్పితమైన కథ. వీరి వివాదపు పోలికలే ఇపుడా ఇరువురు పురుషుల (గోదానఫల గ్రహణప్రతిగ్రహణ సంబంధులు) వాదులోనూ ఉన్నాయి. కాబట్టి ఇక్కడి పరిష్కారమే అక్కడి పరిష్కారం కూడా.

క. 'నృప! నీవు మదీయంబగు । జపము ఫలం బడిగి; తేను సమ్మతి నీఁగా
విపరీత ఫణితు లాడిన । శపియింతుఁ జుమీ! యెఱుంగఁ జాటితి నీకున్.' 157

ప్రతిపదార్థం: నృప!= రాజా!; నీవు; మదీయంబు+అగు= నాకు చెందినదగు; జపము ఫలంబు= జపముయొక్క ఫలితమును; అడిగితి(వి)= అర్థించావు; ఏను= నేను; సమ్మతిన్= అంగీకారంతో; ఈఁగాన్= ఈయగా; విపరీత ఫణితులు= వ్యతిరేకమైన మాటలు; ఆడినన్= పలికినచో; శపియింతున్+చుమీ= శపిస్తాను సుమా!; నీకున్= విపరీతపు మాటలాడే నీకు; ఎఱుంగన్= తెలిసేటట్లుగా; చాటితిన్= ప్రకటించాను.

తాత్పర్యం: 'ఓ రాజా! ఇక్ష్వాకూ! నీవు నా జపఫలితం మొత్తమిమ్మని అర్థించావు. నేను అంగీకారంతో ఈయబోతే ఇపుడు ఏవో వ్యతిరేకమైన మాటలు పలుకుతున్నావు. నీకు ఇదే చాటుతున్నాను - నీవు నా జపఫలాన్ని గ్రహించకపోతే నిన్ను నేను శపిస్తాను సుమా!'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇక్కడ 'విపరీతఫణితులు' అనే మాట నేటి మనవ్యవహారంలోవలె 'ఎక్కువ' అనే అర్థంలో వాడబడలేదు. 'వాడు విపరీతంగా కొట్టాడు' వంటి వ్యవహారంలో 'విపరీత' శబ్దాన్ని ఎక్కువ అనే అర్థంలోనే వాడుతున్నాం. కాని, ఆ మాటకు నిజమైన అర్థం వ్యతిరేకం అని. సుఖం × దుఃఖం. ఇక్కడ నీవు గ్రహించుమంటే నీవూ గ్రహించుమని అనటం వ్యతిరేక భాషితమన్నమాట.

తే. అనిన నాతఁడు భయమంది యాత్మలోన। 'నొరుల యీగికి నకట చే యొడ్డకుండు
నట్టి నా కిది వలసెనే!' యనుచుఁ గరము। సాఁచె నవ్విప్రు దెసకు నిశ్చయముతోడ. 158

ప్రతిపదార్థం: అనినన్= అనిన పిదప; ఆతఁడు= ఆ ఇక్ష్వాకు మహారాజు; భయము+అంది= భయపడి; ఆత్మలోనన్= మనస్సులో, తనలో; ఒరుల+ఈగికిన్= ఇతరుల దానమునకు; చేయి+ఒడ్డక+ఉండునట్టి నాకున్= చేయి చాచక ఉండే నాకు; అకట!= అయ్యో!; ఇది= ఈ దాన పరిగ్రహణం; వలసెనే!= చేయవలసి వచ్చెనే!; అనుచున్= పలుకుతూ; ఆ+విప్రుదెసకున్= ఆ బ్రాహ్మణుడి వైపునకు; నిశ్చయముతోడన్= గట్టితలంపుతో; కరము= చేయి (దాన స్వీకారం కొరకు); చాఁచెన్= సారించాడు.

తాత్పర్యం: కౌశికుడి శాపప్రకటనతో ఆ రాజు భయపడి తనలో 'అయ్యో! ఇతరుల దానానికి ఏనాడూ చేయి చాచి ఎరుగని నాకు ఈనాడు ఇతడి నుండి దానప్రతిగ్రహణం కొరకు చేయి చాచవలసివచ్చెనే' అని అనుకొంటూ ఆ బ్రాహ్మణుడివైపు స్థిరసంకల్పంతో తన చేతిని చాచాడు - దాన మిమ్మని.

విశేషం: దాతచేయి పైనా, గ్రహీత చేయిక్రిందా ఉండటం దానక్రియలో తప్పనిసరి. దాత దానాన్ని ప్రకటించి, దానిని తాను వదలుకొంటున్నట్లు గుర్తుగా జలధారను (గ్రహీతచేతిలో) పోసి, ఆ దత్తమైనదానియెడ తన అధికారాన్ని త్యజిస్తాడు. 'నీళ్ళు వదలుట' అంటే స్వత్వాన్ని, అధికారాన్ని వదలటమే - అనే అర్థం - ఈ దానక్రియలోని ఈ ప్రక్రియనుబట్టే వచ్చి ఉంటుంది.

వ. అతండు 'ననేక వర్షంబులు సేసిన జపఫలంబంతయు నీకిచ్చితి' ననుచు ధారవోసిన నమ్మహీసురువరు నాననం బాలోకించి భూపాలుండు 'నా కరంబున జలంబులు వడియె మనకు నిద్దఱకును సత్కర్మ సమత్వంబు గలుగవలదే? నాయదియైన యాగఫలం బేనును నీ కిచ్చెదఁ గైకొను'మని పలికె. నట్టియెడ వికృతవేషులగు నప్పురుషు లిరువురు నన్నరనాథు నుద్దేశించి 'యేము కామక్రోధులము. ధర్మయమాదులచేతను మాచేతను మీరిద్దఱుం బరీక్షితులరైతి రింతియ కాని యిచ్చుటయుఁ గొనుటయును నివి దైవాచరితంబులు మీకుం బనిగా' దని పలికిన విని యవ్విప్రుండు భూవిభునితో నిట్లనియె. 159

ప్రతిపదార్థం: అతండున్= ఆ కౌశికుడును; అనేక వర్షంబులు= పెక్కు ఏళ్ళు; చేసిన= ఒనర్చిన; జపఫలంబు+అంతయున్= జపముయొక్క ఫలితం మొత్తమును; నీకున్= అర్థివి అయిన నీకు; ఇచ్చితిన్+అనుచున్= దానం చేశాను అంటూ; ధార+పోసినన్= (నీటి చాలును) ధారను విడువగా; ఆ+మహీసురవరు+ఆననంబు= ఆ బ్రాహ్మణుడి మొగము; ఆలోకించి= చూచి; భూపాలుండు= రాజు; నా కరంబునన్= నా చేతియందు; జలంబులు= నీళ్ళు; పడియెన్= పడినవి; మనకున్+ఇద్దఱకును= మన ఇద్దరకూ; సత్+కర్మసమత్వంబు= పుణ్యం సమానమై ఉండటం; కలుగన్+వలదే?= కలుగవద్దా?; నా+అది+అయిన= నాదైన - నాకు చెందిన; యాగఫలంబు= యజ్ఞఫలితము; ఏనును= నేను కూడా; నీకున్+ఇచ్చెదన్= నీకు అర్పిస్తాను; కైకొనుము= తీసికొనుము- స్వీకరింపుము; అని; పలికెన్= అనెను; అట్టి+ఎడన్= ఆ సమయాన; వికృత వేషులు+అగు= వికారమైన గుడ్డలు నగలు మొదలగునవి గల; ఆ+పురుషులు+ఇరువురున్= ఆ నరులు ఇద్దరును; ఆ+నరనాథున్= ఆ రాజును; ఉద్దేశించి= గురించి - లక్ష్యంగాచేసి; ఏము= మేము; కామక్రోధులము= కామం (కోరిక) క్రోధం (కోపం) అనే దుర్గుణాలందు; ధర్మయమ+ఆదులచేతను= ధర్మదేవత, యమధర్మరాజు మొదలైన వారిచేతను; మాచేతను= కామక్రోధులమైన మా ఇరువురిచేతను; మీరు+ఇద్దఱున్= మీరలు ఇరువురూ; పరి+ఈక్షితులరు+ఐతిరి= పరిశోధితులు అయ్యారు; ఇంతి+అ+కాని= ఇంతేకాని; ఇచ్చుటయున్= దానమును; కొనుటయున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్వీకారమును; ఇవి= ఈ రెండు క్రియలూ; దైవ+ఆచరితంబులు= దైవంచేత చేయబడినవి; మీకున్+పని+కాదు+అని= మీకు పనులు కావు అని; పలికినన్= చెప్పగా; విని= ఆలకించి; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; భూ విభునితోన్= రాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: రాజు దానస్వీకారం కొరకు చేయిచాచి నిలబడగా బ్రాహ్మణుడు 'పెక్కుఏండ్లు చేసిన జపఫలితం మొత్తం నీకిచ్చా'నంటూ, తనచేతి నీటిని రాజుచేతిలో ధారగా పోశాడు. అప్పుడు రాజు ఆ బ్రాహ్మణుడి మొగం చూచి, 'నాచేతిలో నీళ్ళు పడ్డాయి. నేను దానం తీసికొన్నాను. మరి మన ఇరువురి పుణ్యం సమానంగా ఉండవద్దా? కాబట్టి నేను చేసిన యజ్ఞపు ఫలితాన్ని నేనూ నీ కిస్తాను తీసికొమ్ము' అన్నాడు. ఆ సమయాన ఆ వికృతవేషులయిన నరులిద్దరూ ఆ రాజును ఉద్దేశించి - తాము కామక్రోధాలనే నరుడి అంతశ్శత్రువులు ఆర్గురిలో తొలి ఇద్దరమనీ, తామూ, ధర్మదేవత, యమధర్మరాజు, కాలపురుషుడు, మృత్యు దేవతా -ఈ అందరూ కలిసి ఆ కౌశిక ఇక్ష్వాకులను ఇద్దరినీ పరీక్షించామనీ తెలిపి, ఇదంతా పరీక్షకొరకు సంఘటిల్లినదే తప్ప నిజానికి దానప్రతిగ్రహణాలు అనేవిదైవం చేసే చేష్టితాలు గాని, మానవక్రియలు కాబోవని పలికారు. ఆ పలుకులు విని, కౌశికుడు ఆ రాజుతోఇట్లా అన్నాడు.

విశేషం: దాత చేసే దానాన్ని గ్రహించేవాడు ఆ దానంతోపాటు దాత దుష్కృత్యాల ఫలితాన్నీ తీసికొనవలసి ఉంటుందని ఒక విశ్వాసం. ఎక్కువ దానాలు పాపపరిహారం కొరకే ఉద్దిష్టమైనాయి. మరి పాపం పరిహృతం కావటం ఎట్లు? దాతనుండి గ్రహీతకు అవి సంక్రమిస్తాయని విశ్వసించేవారు. అందుకనే ఈ దానధర్మాలు స్వీకరించకుండా ఉండటం మంచి గొప్ప లక్షణంగా 'అపరిగ్రహ' వ్రతంగా భావించేవారు. దానగ్రహీతలు జపతప ఉపవాసాది క్రియలతో ఆ సంక్రాంతమైన పాపాలనుండి విముక్తులయ్యేవారట!

ఆ. 'శ్రద్ధయును బలంబు జపవిధియందు సా । విత్రి నాకు నిచ్చె వేఱజపము
నాచరింపఁ దగునె? యైనను నిందఱ । యెదుర నీవు గోరి తివ్విధంబు. 160

ప్రతిపదార్థం: సావిత్రి= జపాధిదేవత; నాకున్= జపశీలినయిన నాకు; జపవిధియందున్= జపం అనే పనిలో; శ్రద్ధయును= ఎక్కువ ఆదరమూ; బలంబున్= శక్తీ; ఇచ్చెన్= ఇచ్చింది; వేఱు+అ= వేరుగా, విడిగా; జపమున్= జపక్రియను; ఆచరింపన్= చేయటం; తగును+ఎ?= ఉచితమా? - కాదు; ఐనను= కాకపోయినా; ఇందఱ+ఎదురన్= ఇంత మంది ఎదుట, ధర్మయమకాల ప్రముఖుల ముందర; నీవు= నా దానమును స్వీకరించినట్టి నీవు; ఈ+విధంబు= ఈ పద్ధతిగా (పుణ్యాలు సమానాలు కావాలి అంటూ); కోరితి(వి)= అర్థించావు.

తాత్పర్యం: 'నేను జపాధిదేవత సావిత్రీదేవినుండి శ్రద్ధను, శక్తిని జపనిర్వహణ కొరకు దానంగా స్వీకరించి ఉన్నాను. ఇక ఇపుడు వేరుగా జపక్రియ చేయవలసిన పనీ లేదు. నా కోరికలు, యాచనలు, అక్కరలు ఏవైనా ఉంటే, అవి అన్నీ జపంకొరకు ఉద్దిష్టమైనవే. ఆ జపం అవసరమే తీరిన నాకు దానగ్రహణ అవసరమూ ఉండదు. అయినా ఇందరు పెద్దలముందర నీవు మన పుణ్యాలు సమానంగా ఉండవద్దా? - అంటూ నాకు దానమీయ సంకల్పించి అర్థించావు.

విశేషం: లోకంలో కూడా ఎన్నో మొండిగా ఆగిపోయిన పనులు కూడా, కొందరు ప్రముఖుల సమ్ముఖాన ఇట్టే జరిగిపోతూ ఉండటం మనం గమనిస్తాం. అట్లాగే ఇక్కడ కూడా. ఎప్పటినుండో తిరస్కృతమౌతూ వస్తున్న రాజు కోరిక అతడికి అభీష్టమయిన క్రియ, ఇపుడు ఈ ఎదుట పెద్దదేవతల సమక్షాన తీరబోతున్నట్లుగా అనిపిస్తున్నది. కొందరు పెద్దల సమ్ముఖమూ ప్రయోజనకారి మరి!

క. కావునఁ బ్రార్థన సెఱుపం । గా వెఱచెద నట్ల కాక! గైకొంటి ధరి
త్రీవల్లభ! నీ సుకృతం । బే వెంటం దిగిచె నరుగు మీ వగ్గతికిన్.' 161

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ప్ర+అర్థన= గొప్ప కోరిక; చెఱుపన్+కాన్= భంగపరచుటకు; వెఱచెదన్= భయపడతాను; అట్లు+అ= అట్లే, నీవన్నట్లే; కాక!= అగుగాక!; ధరిత్రీవల్లభ!= ఓ రాజా!; నీ సుకృతంబు= నీ పుణ్యం; కైకొంటిన్= స్వీకరించాను; ఈవు= నీవు; ఏ వెంటన్= ఏ మార్గము(న); తిగిచెన్= లాగెనో, ఆకర్షించెనో; ఆ+గతికిన్= ఆ మార్గాన; అరుగుము= వెళ్ళుము.

తాత్పర్యం: ఓ రాజా! నా అవసరంతో నిమిత్తంలేకుండా ఇందరి ఎదుట అర్థించిన నీ కోరికను భంగపరచటానికి వెరచి, నీ పుణ్యాన్ని నేను గ్రహించాను. ఇక నీవు నీకు అభీష్టమైన మార్గాన వెళ్ళుము'. (అన్నాడు కౌశికుడు.)

విశేషం: మొత్తం మీద బ్రాహ్మణ క్షత్రియు లిరువురూ తమతమ అభీష్టాలను నెరవేర్చుకొనగలిగారు. ఒకరు ఆలోచన మెదడు, మరొకరు శక్తి - నిర్వహణ. ఈ రెండూ ఘర్షణపడటం దేశానికి మేలుకాదు. ఘర్షణవైపుగా పయనించినా చివరకు సమన్వయపూర్వకంగా ముగియటమే మేధాభుజశక్తులకు ఉచితం.

వ. **అనియె నయ్యిరువుర సత్కర్మనిష్ఠావిశేషంబునం బ్రీతులయి బ్రహ్మాదిదేవతలు వారల మీఁదం బుష్పవృష్టి గురియించుచు నయ్యెడకు నరుగుదెంచి యభినందించిరి; దేవతూర్యంబులు మొరయ నప్సరోగణంబు లాడుచుం బాడుచు నుల్లసిల్లె; నయ్యవసరంబునఁ గౌశికు నిక్ష్వాకు నుద్దేశించి నాకం బిట్లనియె.162**

ప్రతిపదార్థం: అనియెన్= అనెను; ఆ+ఇరువుర సత్+కర్మనిష్ఠా విశేషంబునన్= ఆ ఇద్దరి మంచి పనులయెడ (గల) శ్రద్ధాతిశయానికి; ప్రీతులు+అయి= సంతసించినవారై; బ్రహ్మ+ఆది దేవతలు= బ్రహ్మ మొదలగు సురలు; వారల మీఁదన్= ఆ ఇద్దరి మీదా; పుష్ప వృష్టి= పూలవాన; కురియించుచున్= కురిసేటట్లు చేస్తూ; ఆ+ఎడకున్= ఆ స్థలానికి; అరుగు+తెంచి= వచ్చి; అభినందించిరి= ప్రశంసించారు; దేవతూర్యంబులు= దేవతల వాద్యాలు; మొరయన్= మ్రోగగా; అప్సరస్+గణంబులు= అప్సరసల సమూహాలు; ఆడుచున్= నాట్యం చేస్తూ; పాడుచున్= గానం చేస్తూ; ఉల్లసిల్లెన్= ఒప్పారాయి; ఆ+అవసరంబునన్= ఆ సమయాన; కౌశికున్+ఇక్ష్వాకున్+ఉద్దేశించి= కౌశికుడినీ, ఇక్ష్వాకువునూ గురించి; నాకంబు= స్వర్గం; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణ క్షత్రియు లిద్దరూ ధర్మపుణ్యకార్య నిర్వహణంలో కనబరచిన అరుదైన శ్రద్ధాసక్తులకు బ్రహ్మ మొదలైన దేవతలు సంతోషించి, వారిమీద పూలవాన కురిపిస్తూ అక్కడకు వచ్చి, వారిని అభినందించారు. దేవతల వాద్యాలు మ్రోగాయి. అప్సరసలు వేడుకగా ఆడారు, పాడారు కూడా. ఆ సమయాన స్వర్గం (మానవాకారంతో వారిచెంతనే ఉన్నది ఇంతవరకు) ఆ కౌశికుడినీ, ఇక్ష్వాకువునూ ఉద్దేశించి ఇట్లా అన్నది.

తే. **'అనఘులార! సంసిద్ధుల రయితి రింకఁ। దడయనేటికి? నిర్మలోదాత్తగతికి**
నుత్సహింతురుగా' కన్న మత్సరాది । బంధకంబులఁ బోఁ ద్రోచి బ్రాహ్మణుండు. 163

ప్రతిపదార్థం: అనఘులార!= ఓ పాపరహితులారా!; సంసిద్ధులరు+అయితిరి= మంచి సిద్ధిని పొందినవారు అయ్యారు; ఇంకన్= ఇకపై; తడయన్= ఆలసించటం, జాగుచేయటం; ఏటికిన్?= ఎందుకు?; నిర్మల+ఉదాత్తగతికిన్= మలినంలేని గొప్ప గమనానికి-మహాప్రస్థానానికి; ఉత్సహింతురు గాక!= ఉత్సాహం చూపుదురు గాక! - తొందర పడెదరు గాక!; అన్నన్= అనగా; బ్రాహ్మణుండు= కౌశికుడు; మత్సర+ఆది బంధకంబులన్= ఈర్ష్య మొదలైన ముడులను; బంధాలను; పోన్+త్రోసి= తొలగ నెట్టి.

తాత్పర్యం: 'ఓ పాపరహితులారా! మీరిద్దరూ గొప్ప సిద్ధిని పొందారు. ఇక ఆలసించటం ఎందుకు? మహాప్రస్థానానికి-నిర్మలమైన చిట్టచివరి గొప్ప ప్రయాణానికి ఆయత్తం కండి' అని స్వర్గం పలికినవెంటనే బ్రాహ్మణుడు తన ఈర్ష్యాది బంధనాలు తెగనరికికొని, అంతిమయాత్రకు ఉద్యుక్తుడయ్యాడు.

వ. **ధర్మయమాదులను నాదిత్య సంఘంబును సవినయ ప్రణామ సహితంబుగా నామంత్రితులం జేసి.164**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధర్మయమ+ఆదులను= ధర్మదేవత, యముడు మొదలైన వారిని; ఆదిత్యసంఘంబును= దేవ సమూహమును, తమను అభినందింప వచ్చిన వారిని; సవినయ ప్రణామ సహితంబుగాన్= అణకువతో కూడిన నమస్కారాలతో కూడినట్లుగా; ఆమంత్రితులన్+చేసి= వీడ్కొనేవారినిగా చేసి.

తాత్పర్యం: తమను పరీక్షించిన ధర్మదేవతనూ, తదనుయాయులయిన యమకాల మృత్యుదేవతలనూ, తమను అభినందించిన దేవగణాన్నీ అణకువతో నమస్కరిస్తూ వీడ్కొలిపాడు.

కౌశికేక్ష్వాకులు బ్రహ్మపదప్రాప్తు లగుట (సం. 12-193-18)

క. వాయువుల నియతవృత్తి మ। నో యంత్రణ బొమలనడుమ నూల్కొల్పి విచే
ష్టాయిత శరీరుఁడై మూ। ర్ధా యోజితములుగఁ జేసి యత్తలఁ జేర్చెన్. 165

ప్రతిపదార్థం: వాయువులన్= శరీరంలోని గాలులను, ప్రాణ, అపాన, సమానములను; నియతవృత్తిన్= స్థిరమైన వర్తనతో; మనస్+యంత్రణన్= మనస్సును నిగ్రహించటంవలన; బొమల నడుమన్= కనుబొమ్మల మధ్యభాగాన; నూల్కొల్పి= నిల్పి; విచేష్టాయిత శరీరుఁడు+ఐ= చేష్టలు ఉడిగిన దేహం కలవాడై; మూర్ధ+ఆయోజితములుగన్+చేసి= శీర్షమునకు (తలకు) చేర్చబడినవిగా చేసి (గాలులను); ఆ+తలన్= ఆ తలను, తలయందు, కొనభాగాన; చేర్చెన్= చేర్చాడు.

తాత్పర్యం: శరీరంలోని వాయువులను (హృదయాన ప్రాణం, గుదమున అపానం, నాభియందు సమానం) స్థిరమైన నడకతో కనుబొమల నడుమకు తెచ్చి (యోగం ద్వారా), మనస్సును అదుపుచేసి, చేష్టలు ఉడిగిన శరీరంతో, ఆ వాయువులను శీర్షానికి చేర్చి, అక్కడినుండి శీర్షం అగ్రభాగానికి కొనిపోయాడు కౌశికుడు. (యోగవిద్య ద్వారా శరీరపరిత్యాగం చేస్తున్నాడు అన్నమాట. శీర్షాగ్ర భాగం నుండి వాయువులు బ్రహ్మరంధ్రాన్ని ఛేదించుకొని బయటపడతాయి. అదే శరీరపరిత్యాగం.)

వ. అప్పుడు తదీయ బ్రహ్మరంధ్రోద్గతుండును మహాజ్యోతిర్జ్వాలాకృతియుం బ్రాదేశ మాత్రుండును నగు పురుషు నెదుర్కొని పరమేష్ఠి సమాధానంబున 'వచ్చితే?' యని పలికి వెండియు. 166

ప్రతిపదార్థం: అప్పుడు= కౌశికుడు శరీరాంతర్గత వాయువులను శిరస్సు అగ్ర భాగానికి చేర్చినప్పుడు; తదీయ బ్రహ్మ రంధ్ర+ఉద్గతుండును= అతడిదైన బ్రహ్మరంధ్రం, మాడుపట్టునుండి పైకెగసినవాడూ; మహాజ్యోతిర్+జ్వాలా+ఆకృతియున్= గొప్ప కాంతియొక్క శిఖ ఆకారం వంటి ఆకారం కలవాడూ; ప్రాదేశ మాత్రుండును= లొడితెడు - చూపుడు వ్రేలిని బొటనవ్రేలిని చాచిపట్టిన కొలత మాత్రం కలవాడు; అగు పురుషున్= అయిన నరుడిని; పరమేష్ఠి= బ్రహ్మదేవుడు; ఎదుర్కొని= ఎదురుగా వచ్చి; సమ్+ఆధానంబున్= అంగీకారంతో; వచ్చితి+ఏ?= వచ్చావా?; అని; పలికి= మాట్లాడి; వెండియున్= మరియును.

తాత్పర్యం: శరీరాంతర్గతవాయువు శిరస్సును చేరి బ్రహ్మరంధ్రంగుండా బయల్వెడలగా, వెంటనే ఆ రంధ్రంనుండి గొప్ప కాంతిశిఖరంవంటి ఆకారంతో లొడితెడు కొలతగల పురుషుడు (ఆత్మ) బయటికి వచ్చాడు. ఆ వచ్చినవాడిని బ్రహ్మదేవుడు ఎదురేగి అంగీకార పూర్వకంగా 'వచ్చావు కదా!' అని పలకరించి, ఇంకా ఇట్లా ప్రసంగించాడు.

విశేషం: శరీరం కంటే భిన్నంగా ఆత్మ ఉన్నదని నమ్మేవారు, ఆ ఆత్మ రూపురేఖల గురించిన వివరాలూ ఇచ్చారు. అవే ఇక్కడ చెప్పబడ్డాయి. ఆత్మ కొలత - లొడితెడు. ఆకారం; జ్యోతిశ్శిఖ - వెలుగుకొన; దానికే పురుషనామం కూడా ఉంటుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **జాపకులకు యోగులకును సమము పుణ్య । గతివిశేషంబు ప్రత్యక్ష కలితమందు**
జాపకులు నిర్భరోత్థానశక్తి నధికు । లనుచు వక్త్రంబు విచ్చి రమ్మనియె నధిప! 167

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; జాపకులకున్= జపం చేసేవారికీ; యోగులకును= యోగంచేసేవారికీ; పుణ్యగతివిశేషంబు= పుణ్యంవలన కలిగే విశేషగతులు - గొప్ప పదాలు; సమము+అ= సమానమే; ప్రతి+అక్షకలితము= కన్నుల ఎదుట (ప్రత్యక్షంగా) నిరూపితం; అందున్= ఆ ఇరువురిలో; జాపకులు= జపశీలురు; నిర్భర+ఉత్థాన శక్తిన్= భారరహితంగా పైకెగసే శక్తితో; అధికులు= యోగులకంటె మిన్న అయినవారు; అనుచున్= అంటూ; వక్త్రంబు విచ్చి= నోరు తెరచి; రమ్ము+అనియెన్= 'రా' అన్నాడు.

తాత్పర్యం: బ్రహ్మ జపశీలురకూ యోగులకూ గల సామ్య, ఆధిక్యాలను వివరిస్తున్నాడు కౌశికుడికి. శరీరపరిత్యాగ అనంతరం జపశీలురూ, యోగులూ ఇద్దరూ సమానమైన పుణ్యగతులనే పొందుతారు. అక్కడ భేదం లేదు. అయితే జపశీలురు భారరహితంగా పైకెగసే శక్తికలిగి, యోగులకంటె మిన్నగా నిలుస్తారు. అని అంటూ, 'కౌశికా రమ్మ' అంటూ తన నోటిని తెరిచాడు బ్రహ్మదేవుడు.

వ. **అనుటయు. 168**

తాత్పర్యం: అనిన పిదప.

తే. **బ్రహ్మరంధ్ర నిర్గతుఁడైన బ్రాహ్మణుండు । బ్రహ్మవదనంబు సొచ్చె భూపతియు నట్ల**
వెడలి తద్వక్త్ర మెప్పటి వికసనంబుఁ । బొంద నందుఁ బ్రవేశించె భూపవర్య! 169

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజశ్రేష్ఠా! ఓ ధర్మరాజా!; బ్రహ్మరంధ్ర నిర్+గతుఁడు+అయిన= బ్రహ్మరంధ్రంనుండి బయల్వెడలిన; బ్రాహ్మణుండు= కౌశికుడు; బ్రహ్మవదనంబు= బ్రహ్మనోరు; చొచ్చెన్= ప్రవేశించాడు; భూపతియున్= రాజుకూడా-ఇక్ష్వాకు మహారాజు కూడా; అట్లు+అ= అట్లే, ఆ విధంగానే, కౌశికునివలెనే; వెడలి= బయటికి (శరీరంనుండి) వచ్చి; తద్+వక్త్రము= అతడి- ఆ బ్రహ్మనోరు; ఎప్పటి వికసనంబు= ఎప్పటివలె తెరచికొనుటను; పొందన్= చెందగా - తెరచికొనగా; అందున్= ఆ నోటిలో; ప్రవేశించెన్= చొరబడ్డాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడి మాట ననుసరించి బ్రాహ్మణుడు ముందుగా బ్రహ్మనోట దూరి, అతడిలో ఐక్యమయ్యాడు. ఆ తరువాత ఇక్ష్వాకుమహారాజుకూడా కౌశికుడివలెనే శరీరాన్ని విడిచి, అతడివలెనే బ్రహ్మనోట దూరి బ్రహ్మైక్యం పొందాడు. ఈ విధంగా చివరకు ఇరువురూ బ్రహ్మలో లీనమయ్యారు.

విశేషం: జనవ్యవహారంలో కూడా 'బ్రహ్మైక్యం కావటం' వంటి మాటలు ఉన్నాయి. ఆ విధానమే వివరించినట్లయినది ఇక్కడ.

క. **దేవత లచ్చెరువడి య । ద్దేవుని నయ్యిరువురను నుతించి రజుఁడు సం**
భావించె ధర్మమును నవ । నీవర! యప్పరమ విభుఁడు నిరుపమలీలన్. 170

ప్రతిపదార్థం: అవనీవర!= ఓ రాజా!; దేవతలు= సురలు; అచ్చెరువడి= ఆశ్చర్యపడి; ఆ+దేవునిన్= ఆ బ్రహ్మదేవుడినీ; ఆ+ఇరువురను= ఆ బ్రాహ్మణ క్షత్రియులిద్దరినీ; నుతించిరి= పొగడిరి; అజుఁడు= బ్రహ్మదేవుడు; ధర్మమును= ధర్మదేవతను; సంభావించెన్= గౌరవించాడు; ఆ+పరమ విభుఁడు= ఆ గొప్ప దొర బ్రహ్మదేవుడు; నిర్+ఉపమలీలన్= పోలికలేని రీతిలో. (అనంతర వాక్యానికి అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ నరులిద్దరూ బ్రహ్మైక్యం కావటమన్న మొత్తం ప్రక్రియను చూచిన దేవతలు ఆశ్చర్యపోయారు. ఆ బ్రహ్మదేవుడినీ, ఆయనలో లీనమైపోయిన కౌశిక ఇక్ష్వాకువులనూ వారు ప్రస్తుతించారు. అనంతరం బ్రహ్మదేవుడు ధర్మదేవతను - ఈ కార్యక్రమసర్వస్వానికీ ఆదిని నిలిచి నడిపించినదానిని గౌరవపురస్సరంగా వీడ్కొన్నాడు.

వ. తదనంతరంబ యంతర్హితుం డయ్యెఁ; దక్కినవారును నిజస్థానంబుల కరిగిరి; జాపక ప్రకారంబును దదీయ సుగతి విశేషంబులు నెఱింగించితి; నీ వింక నెయ్యది వినవల తనవుడు నాపగాసుతునితోడం గుంతీతనయాగ్రజుండు 'నిరతిశయ జ్ఞానయోగంబు విధంబు వినువాంఛ నాకుం గలదు. సెప్పవే!' యనిన నప్పురుషుం డప్పౌరవోత్తమున కిట్లనియె. 'మను బృహస్పతి సంవాదం బను నితిహాసంబుగల దది నీయడిగిన యర్థంబునకు బోధకంబయి యుండు నాకర్ణింపుము. మను వాత్మీయగురుం డగు దేవగురునకుం బ్రణమిల్లి యిట్లనియె. 171

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= దానివెంటనే - ధర్మదేవతను వీడ్కొనిన వెంటనే; అంతర్హితుండు= మాయమైనవాడు; అయ్యెన్= ఆయెను; తక్కినవారును= మిగిలినవారు కూడా - ధర్మము, యముడు, కాలం, మృత్యువు, స్వర్గం, కామం, క్రోధం అనే వారు కూడా; నిజస్థానంబులకున్= తమ స్థానాలకు; అరిగిరి= వెళ్ళారు; జాపక ప్రకారంబును= జపం చేసేవారి పద్ధతీ; తదీయ సుగతి విశేషంబులున్= వారి ముక్తి వివరాలూ; ఎఱింగించితిన్= తెలిపాను; నీవు; ఇంకన్= ఇంకనూ; ఏ+అది= ఏది; వినన్+వలతు(వు)?+అనవుడున్= వినుటకు ఇష్టపడెదవు?-అన్న పిదప; ఆపగాసుతునితోడన్= నది కుమారుడైన భీష్ముడితో; కుంతీతనయ+అగ్రజుండు= కుంతి కుమారులలో పెద్దవాడు ధర్మరాజు; నిర్+అతిశయ జ్ఞానయోగంబు విధంబు= మించుటలేని (తానే అన్నింటిని మించినదైన) జ్ఞానయోగముయొక్క పద్ధతిని; వినువాంఛ= వినే కోరిక; నాకున్= ధర్మరాజునైన నాకు; కలదు= ఉన్నది; చెప్పవు+ఏ?= చెప్పవా?; అనినన్= అనగా; ఆ+పురుషుండు= ఆ నరుడు - భీష్ముడు; ఆ+పౌరవ+ఉత్తమునకున్= ఆ పురువంశ రాజశ్రేష్ఠుడైన ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; మను బృహస్పతి సంవాదంబు+అను= మను బృహస్పతి సంవాదం అనే పేరుగల; ఇతిహాసంబు= (జరిగిన) చరిత్ర; కలదు= ఉన్నది; అది= ఆ సంవాదం; నీ+అడిగిన+అర్థంబునకున్= నీవు ప్రశ్నించిన జ్ఞానయోగానికి; బోధకంబు+అయి= తెలియజెప్పునదిగా; ఉండున్= ఉండగలదు; ఆకర్ణింపుము= వినుము; మనువు= ధర్మశాస్త్రకర్త అయిన మానవుల ఆదిపురుషుడు; ఆత్మీయగురుండు+అగు= తనకు గురువయిన; దేవగురునకున్= దేవతల గురువైన బృహస్పతికి; ప్రణమిల్లి= నమస్కరించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు ధర్మదేవతకు వీడ్కోలుపలికి, వెంటనే పోలికలేని రీతిలో మాయమైపోయాడు. మిగిలినవారూ తమ తమ స్థానాలకు చేరుకొన్నారు. ఈ విధంగా జపం చేసేవారి పద్ధతీ వారు పొందే ముక్తివిశేషాలు నీకు తెలియపరిచాను. ఇంకా ఏమి వినాలని అభిలషిస్తున్నావు? - అని భీష్ముడు తన మనుమడైన ధర్మరాజును ప్రశ్నించాడు. దానికి బదులుగా ధర్మరాజు తాను జ్ఞానయోగాన్ని - సర్వయోగాలనూ అతిక్రమించిన దానిని వినటానికి ఉవ్విళ్ళూరుతున్నట్లు చెప్పాడు. ఆ మాటకు ఆయన ధర్మరాజుతో 'మను బృహస్పతి సంవాదం' అనే పేరుతో ఒక ఇతిహాసం ఉన్నది. అది నీ ప్రశ్నకు సమాధానంగా ఉపయోగపడుతుంది. వినుము.' అంటూ మను బృహస్పతి సంవాదాన్ని వివరించబోతున్నాడు.

విశేషం: 'యోగము' అనే మాట 'యుజ్' ధాతువునుండి పుట్టినది. దానికి కలుపుట అని అర్థం. వేదాంత పరిభాషలో ఈ యోగశబ్దం ఎక్కువగా వాడబడుతూ ఉంటుంది. దేవుడిని, ముక్తిని పొందే మార్గాలలో కర్మయోగం, జ్ఞానయోగం, భక్తియోగం అనే మూడు మార్గాలు సుప్రసిద్ధాలు. కర్మల - యజ్ఞజపతపః ప్రభృతులద్వారా చేరితే కర్మయోగం; భక్తి - భజన - సేవ - కైంకర్యంద్వారా చేరితే భక్తి యోగం; జ్ఞానం - తెలివి - వివేకం ద్వారా, కేవలం బుద్ధివికాసంద్వారా చేరితే జ్ఞానయోగం. ఈ మూడింటిలో జ్ఞానయోగం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దుష్కరమనీ, దుర్గ్రహమని, ఒక పట్టాన అర్థం కానిది అని అంటారు తాత్త్వికులు. దానిని మిగిలిన రెండింటినీ మించిన దానినిగా కూడా పరిగణిస్తారు వారు. అందుకనే ఇక్కడ జ్ఞానయోగ శబ్దానికి నిరతిశయ అనే విశేషణం వాడబడినది.

'ఇతి+హ+ఆస' అనేది ఇతిహాస శబ్ద వ్యుత్పత్తి. దానికి 'అని కదా ఉండెను' అని అర్థం. ఎపుడో జరిగిన సంఘటనను పరంపరగా యథాతథంగా చెప్పుకొచ్చే పద్ధతిలో ఈ శబ్దం రూపుదాల్చినది. జరిగిన సంఘటన కాబట్టి దీనిని చరిత్ర శబ్దానికి పర్యాయంగా కూడా వాడటం జరుగుతున్నది. భారతంలో ఎన్నో ఇతిహాసాలను మనం ఇంతవరకు వింటూ వస్తున్నాం.

మను బృహస్పతి సంవాదము (సం. 12-194-2)

సీ. 'జ్ఞానయోగము కృపాసంపన్న బుద్ధి నా । కెఱిఁగింపవే!' యన్న నెలమి నాతఁ
డతని కిట్లను 'ననఘ! సత్కర్మ యో । గ శ్రద్ధ దానికిఁ గారణం బ
నిష్టంబు ద్రోవను నిష్టంబు దేరను । నరుఁడు కర్మాచరణం బొనర్చు
నెయ్యవి సుఖము లొక్కింత కాలమునకు । నవియు దుఃఖంబులై యావహిల్లు;

ఆ. నింత యెఱిఁగి ఫలమునెడ నిరపేక్షుఁడౌ । నతఁడు సౌఖ్యదుఃఖయమముఁ ద్రోచి
కామముఖ్య విపదకంపిత జ్ఞాన వి । శేషబుద్ధిఁ బరమసిద్ధిఁ బొందు.' 172

ప్రతిపదార్థం: జ్ఞాన యోగము= జ్ఞానం ద్వారా దేవుడి ముక్తిని చేరే మార్గం; కృపా సంపన్న బుద్ధిన్= దయతో కూడిన బుద్ధితో; నాకున్= జ్ఞానార్థినైన నాకు; ఎఱిగింపవు+ఏ?= తెలియజేయవా?; అన్నన్= అనగా; ఎలమిన్= ప్రీతితో; అతఁడు= ఆ బృహస్పతి; అతనికిన్= ఆ మనువునకు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; అనఘ!= ఓ పాపరహితుడా!; సత్+కర్మయోగశ్రద్ధ= మంచి కర్మయోగమునందలి శ్రద్ధ; దానికిన్= ఆ జ్ఞానయోగానికి; కారణంబు= హేతువు - కలుగుటకు మూలం; అనిష్టంబు= ఇష్టము కానిది; త్రోవను; త్రోసివేయుటకు; ఇష్టంబు= కోరబడినది; తేరను= తెచ్చుటకు; నరుఁడు= మానవుడు; కర్మ+ఆచరణంబు= పనులను చేయటానికి; ఒనర్చున్= చేయును; ఒక్క+ఇంతకాలమునకున్= అతి స్వల్ప సమయమునకు; ఏ+అవి= ఏవి; సుఖములు= సౌఖ్యాలు - ఆనందమును కలిగించునవో; అవి+అ= అవియే - ఆ సుఖములే; దుఃఖంబులు+ఐ= బాధలై - కష్టములై; ఆవహిల్లును= కలుగును - పరిణమించును; ఇంత= ఈ మాత్రం; ఎఱిఁగి= తెలిసి; ఫలము+ఎడన్= ప్రయోజనం దెస; నిర్+అపేక్షుఁడౌ= అనాసక్తుడౌ- కోరికలేనివాడగు అతఁడు= వాడు; సౌఖ్య దుఃఖమయమున్= సుఖం-దుఃఖం అనే జంటను-ద్వంద్వమును; త్రోచి= తొలగించుకొని; కామ= కోరిక; ముఖ్య= మొదలగు; విపద్= ఆపదలనుండి; అకంపిత= చలించని, కదలని; జ్ఞాన విశేష బుద్ధిన్= గొప్ప జ్ఞానంతోడి బుద్ధితో; పరమసిద్ధిన్= గొప్ప సిద్ధిని, ముక్తిని; పొందున్= చెందును.

తాత్పర్యం: 'మనువు తన గురువైన బృహస్పతికి నమస్కరించి, 'కృపతో నాకు జ్ఞానయోగాన్ని, జ్ఞానంద్వారా ముక్తిని పొందే మార్గాన్ని తెలుపవా?' అని ప్రార్థించాడు. బృహస్పతి తెలుపుతున్నాడు. 'ఓ పాపరహితుడవైన మనూ! జ్ఞానయోగానికి మూలం మంచి కర్మయోగమే. అనిష్టాన్ని తొలగించుకొనటానికి, ఇష్టాన్ని అందుకొనటానికి మానవుడు కర్మ చేస్తాడు. ఏవి సుఖాలుగా అందుతాయో, అవే అనంతరకాలాన దుఃఖాలుగా పరిణమిస్తాయి. ఈ మాత్రం తెలిసికొని ఏ నరుడు తాను చేసే కర్మను ఫలం ఆశించకుండా తన విధిగా మాత్రమే చేస్తాడో - అతడు సుఖదుఃఖ ద్వంద్వాన్ని త్రోసేసి కామక్రోధాది అరిషడ్వర్గంనుండి వాటిల్లే విపత్తులనుండి చెదరని గొప్ప జ్ఞానంద్వారా గొప్ప సిద్ధిని ముక్తిని పొందుతాడు'.

విశేషం: మన తాత్త్వికులు నరుడికి అంతశ్శత్రువులు ఆరుగురు ఉన్నారని అంటారు. ఆ ఆరుగురు శత్రువులకూటమిని వారు 'అరిషడ్వర్గము' అని వ్యవహరిస్తారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు - ఆ ఆరుగురు విరోధులట! ఇవి నరుడిలోని భావాలు కాక భావావేశాలు. ఇవే నరుడిని ముక్తికి దూరంగా ఉంచుతాయని, వీటి విజయమే ముక్తికి సోపానమని బోధిస్తారు. ఇక్కడ 'కామముఖ్య' విపత్తులు ఆ అరిషడ్వర్గం వలన ఏర్పడేవే. జ్ఞానం కలగాలి - అంటే అరిషడ్వర్గ విదూరుడు కావాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని వెండియు. 173

తాత్పర్యం: అని చెప్పి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'అసమాలంబ మశబ్దము । రసగంధ స్పర్శరూప రహితం బగుటం
బ్రసరించు నింద్రియములకు । వసంబుగా దొందఁ బరమవస్తువు పుత్రా! 174

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; పరమవస్తువు= గొప్ప పదార్థం-బ్రహ్మతత్త్వం - పరమాత్మతత్త్వం; అసమ+ఆలంబము= సాటిలేని ఆధారము-ప్రాపు; అశబ్దము= శబ్దరహితమైనది ఆకాశ లక్షణం లేనిది; రసగంధరూప రహితంబు= రసం,గంధం,రూపం-ఇవి లేనిది; అగుటన్= అగుటవలన; ప్రసరించు= పనిచేసెడి; ఇంద్రియములకున్= కన్ను ముక్కు వంటి జ్ఞానేంద్రియాలకు; ఒందన్= పొందగా, పొందుటకు; వసంబు+కాదు= శక్యం కాదు.

తాత్పర్యం: 'కుమారా! పరబ్రహ్మతత్త్వం సాటిలేనిది, పోల్చి చెప్పటానికి వీలులేనిది, ఆత్మ ఉనికికి ఆధార భూతమైనది-మూలమైనది. అయితే దానిలో పాంచభౌతికమైన-ఐదు మూలపదార్థాలకు చెందిన లక్షణాలు-శబ్దంగాని, ద్రవంగాని, వాసనగాని, స్పర్శగాని, ఆకారంగాని ఏవీ ఉండవు. అందువలన దానిని చెవి, నోరు, ముక్కు, చర్మం, కన్ను-అనే ఈ ఇంద్రియాలు గ్రహించలేవు.

విశేషం: పరతత్త్వం పంచభూతాలతో ఏర్పడినదిగాదు. కాబట్టి నరుడి జ్ఞానేంద్రియాలకు అది అలభ్యం. దాని ఉనికి, ప్రకృతికి-పాంచభౌతికమైన దానికి వెలుపల. అందుకనే దాన్ని గ్రహించటం సులభం కాదు.

క. స్త్రీపుం నపుంసకత్వము । లా పరతత్త్వమున లేమి నది విను తత్త
ద్వ్యాపారాపేతంబయి । దీపించుచునుండు బోధదేహత్వమునన్. 175

ప్రతిపదార్థం: విను; ఆ పరతత్త్వమునన్= ఆ పరబ్రహ్మస్వభావంలో; స్త్రీ పుం నపుంసకత్వములు= ఆడతనం, మగతనం, ఆ రెండూగాని పేడితనములు; లేమిన్= లేకపోవటంవలన; అది= ఆ పరబ్రహ్మం; తద్+తద్+వ్యాపార+అప+ఇతంబు+అయి= ఆయా పనులనుండి - ఆడ, మగ, పేడిపనులనుండి తొలగినదై; బోధదేహత్వమునన్= జ్ఞానం అనే శరీరం (కలిగిన తనం)తో; దీపించుచున్= ప్రకాశిస్తూ; ఉండున్= నిలిచి ఉంటుంది.

తాత్పర్యం: ఆ పరమవస్తువులో ఆడ, మగ, పేడి స్వభావాలు లేవు. ఈ స్వభావాలన్నీ ప్రకృతిలోనివి. అది ప్రకృతికి అతీతం కాబట్టి, ఆయా పనులకు, అంటే ఆడ, మగ, పేడి పనులకు దూరంగా 'జ్ఞానం' అనే దేహంతో వెలుగుతూ ఉంటుంది.

విశేషం: వస్తువును గుర్తించటానికి ఆకారం ముఖ్యం. ఆకారం లేని వస్తువు గోచరించదు. పరబ్రహ్మ నిరాకారమే అయినా, దాని తత్త్వాన్ని వ్యక్తీకరించటానికి, దానికి ఒక ఆకారమున్నట్లు ఉత్ప్రేక్షించి చెప్పుతున్నాడు బృహస్పతి - స్పష్టమైన అవగాహనకొరకు. అట్లా చెప్పక తప్పదు మరి!

తే. వెలు గుచుండెడి దీపంబు వేఱ వస్తు । వులఁ బ్రకాశింపఁజేయున ట్లలఘునిత్య
బోధన జ్యోతి యింద్రియంబులను మాన । సమును దన ప్రభ విగతజాడ్యములఁ జేయు. 176

ప్రతిపదార్థం: అలఘు నిత్య బోధన జ్యోతి= గొప్ప శాశ్వతమైన జ్ఞానమనే వెలుతురు; ఇంద్రియంబులను= కన్ను, ముక్కు మొదలైనవాటిని; మానసమును= మనస్సును; తన ప్రభన్= తన వెలుగుతో; వెలుగుచుండెడి దీపంబు= ప్రకాశించే దీపం; వేఱ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వస్తువులన్= ఇతర పదార్థాలను; ప్రకాశింపన్+చేయు+అట్లు= కనుపించేటట్లు చేసే విధంగా; విగత జాడ్యములన్+చేయున్= తొలగిన మాంద్యం కలవాటినిగా చేయును.

తాత్పర్యం: ఈ జ్ఞానజ్యోతి గొప్పది, శాశ్వతమైనది. అది తన కాంతితో ఇంద్రియాలను మనస్సునూ వెలిగే దీపం ఇతర వస్తువులను ప్రకాశింపజేసేటట్లుగా - చైతన్యంతో కదిలేటట్లుగా చేస్తుంది. ఇంద్రియాలలోని, మనస్సులోని మాంద్యాన్ని తొలగిస్తుంది.

విశేషం: అలం: ఉపమ. ప్రకాశానికి దీపం కారణమైనట్లుగా నరుడిలోని చేతనాశక్తికి జ్ఞానజ్యోతి మూలం. అదే ఇంద్రియాలనూ, మనస్సునూ నడుపుతుంది.

క. విను పురుషున కింద్రియములు। మనంబు గలిగించుఁ గ్రియల మనుజేశునకుం
దన తన తెఱఁగునఁ గార్యము। లనేకములు సూపు సచివు లట్టుల వత్సా!' 177

ప్రతిపదార్థం: వత్సా!= బిడ్డా!; విను= ఆలకించుము; మనుజ+ఈశునకున్= రాజునకు; తన తన తెఱఁగునన్= తన తన ధోరణిలో; అనేకములు= పెక్కులు; కార్యములు= పనులు; చూపు= చూపెట్టే; సచివులు+అట్టులన్= మంత్రులవలె; పురుషునకున్= ఆత్మకు; ఇంద్రియములు= కన్ను ముక్కు మొదలైన ఇంద్రియాలూ; మనంబు= మనస్సు; క్రియలన్= పనులను; కలిగించున్= ఏర్పరచును, కలిగేటట్లు చేస్తాయి.

తాత్పర్యం: బిడ్డా! మానవుడు కార్యోన్ముఖుడు కావటానికి అతడి ఇంద్రియాలూ మనస్సూ కారణాలుగా గ్రహించుము. రాజునకు మంత్రులు - ఆతడు నిర్వహించవలసిన విధులను ఎరుకపరచే విధంగా ఇంద్రియాలూ, మనస్సూ నరుడికి ఏయే పనులు ఎపుడెపుడు చేయాలో తెలియపరుస్తాయి.

విశేషం: పురుషుడు ఆత్మ. అతడు అధిపతి; ఇంద్రియాలూ మనస్సూ అతని ఉపకరణాలు. అతడికి లోబడి ప్రవర్తించి, అతడి చెప్పుచేతలలో నిలువవలసి ఉన్నది'. అలంకారం: ఉపమ.

వ. అని మఱియును. 178

తాత్పర్యం: అని ఇంకా (ఈ విధంగా అన్నాడు.)

చ. 'అనలము దోఁచునే తరువునందుఁ గుఠారముఖంబు లైన సా
ధనములఁ ద్రెవ్వ? సజ్జనహితా! తగఁ ద్రచ్చినఁ గాక; యట్ల యి
త్తనువు నలంగఁ జేసి పరతత్త్వముఁ గాంతు మనంగ రాదు; వి
న్ననువున నాగమోక్తమథనం బొనరించినఁ గాని యారయన్. 179

ప్రతిపదార్థం: సత్+జనహితా!= మంచిజనులకు మిత్రుడా! ఓ మనూ!; తరువునందున్= చెట్టునందు; తగన్= ఉచితంగా, తగునట్లుగా - చేయవలసిన రీతిలో; త్రచ్చినన్+కాక= మథిస్తే తప్ప; కుఠారముఖంబులు+ఐన= గండ్రగొడ్డలి మొదలైన; సాధనంబులన్= పరికరాలతో; త్రెవ్వన్= పెకలించినట్లయితే; అనలము= నిప్పు; తోఁచును+ఏ?= కనుపించునా? (కనుపించదు); అట్లు+అ= అట్లే ఆ విధంగానే; ఈ తనువున్= ఈ శరీరమును; విన్న+అనువునన్= నేర్పుతో; ఆగమ+ఉక్త మథనంబు= వేదంలో చెప్పబడ్డ; త్రచ్చుటను= తరచి తరచి చూడటం; ఒనరించినన్+కాని= చేస్తే తప్ప; అరయన్= పరిశీలించగా; నలంగన్+చేసి= నలగునట్లుగా చేసి - బాధపెట్టి; పరతత్త్వమున్= పరమమైన జ్ఞానమును; కాంతుము= పొందెదము; అనంగన్+రాదు= అనుటకు (వీలు) కాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'సజ్జనమైత్రిని నెరపే ఓ మనూ! చెట్టులో నిప్పు నిక్షిప్తమై ఉన్నట్లుగా ఈ శరీరంలో పరతత్త్వం గుప్తంగా ఉన్నది. దానిని తగినట్లుగా పద్ధతి తెలిసి గ్రహించాలి తప్ప, తోచినట్లుగా చేస్తే ప్రయోజనం ఉండదు. కర్రలో నిక్షిప్తమై ఉన్న నిప్పును కర్రను కర్రతో మథిస్తే కనిపిస్తుందే తప్ప గొడ్డలితో నరికితేను, పెకలిస్తేనూ కనిపిస్తుందా? ఆ విధంగానే ఈ శరీరంలో దాగి ఉన్న పరతత్త్వాన్ని వేరొక విధానంతో తరచి తరచి చూచి గ్రహించాలి తప్ప, శరీరాన్ని బాధించి, హింసించి గ్రహించలేము.

విశేషం: అలం: నిదర్శనం. ఒక క్రొత్త విషయం గ్రహింపునకు రావటానికి ముందు మళ్ళీ మళ్ళీ ప్రయత్నించవలసిరావచ్చును. మనస్సులో లోపల తరచి తరచి చూడవలసిరావచ్చును. ఈ లోపల తరచి చూచే ప్రక్రియనే 'అంతర్మథనం' అంటుంటాం. దీనికి 'లోపల త్రచ్చుట' అని శబ్దార్థం. ఈ పద్యంలో కూడా 'మథనం' అనే శబ్దమే ప్రయుక్తమై, ఆ అర్థాన్నే స్ఫురింపజేస్తున్నది.

క. డెందమున కింద్రియములకు । నొందఁ గ రాకున్న లేకయున్నే తత్త్వం
బెందు? నపరభాగంబునఁ । బొందవు చూడ్కు లది లేకపోవునె? సుమతీ! 180

ప్రతిపదార్థం: సుమతీ!= మంచి బుద్ధికలవాడా! - మనూ!; డెందమునకున్= మనస్సునకూ; ఇంద్రియములకున్= కన్ను, ముక్కు మున్నగు ఇంద్రియాలకూ; ఒందఁగన్+రాక+ఉన్నన్= పొందరాకుంటే; తత్త్వంబు= ఆ పరతత్త్వం; లేక+ఉన్నే= లేకుండాఉంటుందా?- లేకుండా పోతుందా? (పోదు); చూడ్కులు= చూపులు; అపరభాగంబునన్= ఆవలివైపున, వస్తువునకు వెనుక వైపునకు; పొందవు= చేరవు, అంతమాత్రాన; అది= ఆ ఆవలి భాగం వస్తువుయొక్క వెనుక భాగం; లేకపోవును+ఎ?= లేకుండా పోతుందా? (పోదు).

తాత్పర్యం: ఓ సుమతీ! మనూ! ఆలోచించి చూడుము. మనస్సునకూ, ఇంద్రియాలకూ అందనంతమాత్రాన, ఈ శరీరంలో ఆ పరతత్త్వంలేదు అనటం యుక్తిసహం కాదు. ఎందుకంటే, మన చూపులు వస్తువుయొక్క ఎదుటి భాగాన్నే చూడగలవు తప్ప, అవతలి వెనుకవైపును చూడలేవు. అంతమాత్రాన ఆ వస్తువునకు ఆవలివైపు లేదు అనగలమా? అన్నంతమాత్రాన, అది లేకుండా పోతుందా?

విశేషం: అలం: నిదర్శన.

క. వల యురి యోదము గాలము । గలిగి గదా మృగము పక్షి గజము ఝషము ద
క్షులు వట్టుదు! రట్టుల తద్। జ్ఞులు విజ్ఞానంబుకలిమిఁ జూతురు పురుషున్. 181

ప్రతిపదార్థం: దక్షులు= సమర్థులు; వల= జంతువులను పట్టటానికి ఉపయోగించే త్రాటితో చేసిన సాధనం-వాగురు; ఉరి= ఉచ్చు- కంఠమును బిగించి చంపే సాధనం; ఓదము= ఏనుగును పట్టుటకై త్రవ్విన గుంట (పైకి నేలమట్టంగా కనిపిస్తూ లోన పల్లం గలిగింది); గాలము= చేపలను పట్టే సాధనం - త్రాడు కర్రలతో చివరను ఎరగల్గిన సాధనం (వీటిని అన్నిటిని); కలిగి= సంపాదించి (క్రమంగా); మృగము= పశువును; పక్షి= పులుగును; గజము= ఏనుగును; ఝషము= చేపను; పట్టుదురు కదా!= పట్టుకొంటారు కదా!; అట్టులు+అ= ఆ విధంగానే; తద్+జ్ఞులు= తత్త్వం తెలిసినవారు; విజ్ఞానంబు కలిమిన్= ఎక్కువ జ్ఞానం కలిగి ఉండటంతో; పురుషున్= పరతత్త్వమును, పరమాత్మను; చూతురు= చూస్తారు.

తాత్పర్యం: పరతత్త్వాన్ని వెదికి గ్రహించాలి - అనే సంకల్పమున్నప్పుడు, దానికి అర్హమైన ప్రయత్నం ఉండాలి. అది ఎట్లంటే, నరుడు పశువును బంధించాలంటే వలను, పక్షిని పట్టుకొనాలంటే ఉచ్చును, ఏనుగును పట్టాలంటే పై భాగాన గ్రాసం మొలచిన, లోపల శూన్యంగా ఉన్న గుంటను (ఓదము), చేపను పట్టాలంటే గాలాన్ని సాధనంగా గ్రహిస్తున్నాడు. సరైన సాధనం లేకపోతే లక్ష్యాన్ని సాధించలేడు. అదే విధంగా పరతత్త్వాకారమైన పరమపురుషుడిని దర్శించగలగాలి - అంటే తప్పకుండా నరుడికి జ్ఞానసంపత్తి కావాలి - అని తత్త్వం తెలిసినవారు పలుకుతారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: యథాసంఖ్యం, ఉపమ. కార్యసిద్ధికి కర్త అవసరం ఎంత ఉన్నా, కరణం - క్రియాసిద్ధికి ఎక్కువ ఉపకరించే సాధనం కూడా తప్పనిసరి. కరణం లేకుండా కార్యాన్ని సాధించలేము. పరతత్త్వగ్రహణానికి జ్ఞానయోగం తప్పనిసరైన సాధనం. సాధనం లేకుండా సాధ్యం చేరజాలము.

క. పా మెఱుఁగుఁ బాము కాళులు; । ధీమంతుం డెఱుఁగ నేర్చు ధీసాక్షిత్వ
శ్రీమంతుఁ బరమపురుషుని । ధీ మల నిర్మోచనంబు తెఱఁగు నెఱిఁగినన్. 182

ప్రతిపదార్థం: పాము= పాము; పాము కాళులు= పాముయొక్క కాళ్ళను; ఎఱుఁగున్= తెలియును; (అట్లే) ధీమంతుండు= బుద్ధిమంతుడు; ధీసాక్షిత్వ శ్రీమంతున్= బుద్ధికి సాక్షితనం అనే సంపదగల - బుద్ధికి సాక్షీభూతుడై నిలిచే; పరమపురుషుని(న్)= పరతత్త్వమును, పరబ్రహ్మమును; ధీమల నిర్మోచనంబు తెఱఁగున్= బుద్ధియొక్క మురికిని వదిలించే మార్గమును; ఎఱిఁగినన్= గ్రహించినచో; ఎఱుఁగన్+నేర్చున్= తెలిసికొనగలడు.

తాత్పర్యం: పాము కాళ్ళు పామే గ్రహించగలుగుతుంది. (నిజానికి పాముకు కాళ్ళు ఉన్నట్లు కనిపించవు. కాని నడుస్తుంది కాబట్టి కాళ్ళు ఉన్నట్లే, అయితే ఇతరులకు తెలియవు. పాముకే ఆ ఎరుక - తెలివి ఉంటుంది.)అదే విధంగా, బుద్ధిమంతుడే - జ్ఞానవంతుడే బుద్ధికి సాక్షిగా నిలిచే ఆ పరవస్తువును గ్రహించగలుగుతాడు. ఆ విధంగా గ్రహించగలగాలంటే అతడు (ఆ బుద్ధిమంతుడు) బుద్ధిలోని మురికిని వదిలించే మార్గం తెలిసినవాడై ఉండాలి.

విశేషం: అలంకారం: నిదర్శన. వాస్తవానికి జ్ఞానోదయమనేది వైయక్తికమైన సాధన ద్వారా ఎవరికి వారు పొందవలసినది. అక్కడ బయటివారి ప్రమేయం పరిమితం. కర్మలను ఒకే విధంగా నిర్వహింపజేసినట్లుగా జ్ఞానాన్ని ఒకే విధంగా కలిగించలేము.

క. కలుగుం దోఁపమి యమవసఁ । గలుగునె యంతటన? యమృతకరునకు నాశం
బలఘుతర వస్తువునకుం । గలదె యభావంబు మనసు గానని కలుచన్? 183

ప్రతిపదార్థం: అమవసన్= అమావాస్యనాడు; తోఁపమి= కన్పింపకుండటం; కలుగున్= జరుగును (అమృతకరునకు); అంతటన్+అ= అంతమాత్రాన; అమృతకరునకున్= చంద్రుడికి; నాశంబు కలుగునె?;= లోపం (కనబడకపోవటం) ఏర్పడుతుందా?; మనసు= (నరుడి) మనస్సు; కానని కలుచన్= చూడ(లే)ని దోషాన; అలఘుతర వస్తువునకున్= మిక్కిలి గొప్ప (పరమమైన) పదార్థమునకు- పరతత్త్వానికి; అభావంబు= లేకపోవటం - ఉండకపోవటం - లేమి; కలదు+ఎ?= ఉన్నదా? (లేదు.)

తాత్పర్యం: అమావాస్యనాడు చంద్రుడు కనిపించడు. అంతమాత్రాన చంద్రుడు లేడు అనగలమా? ఆ మాత్రానికే చంద్రుడి ఉనికికి భంగం కలుగుతుందా? కేవలం నరుడి మనస్సు చూడలేని దోషం కారణంగా ఆ పరతత్త్వమే లేదని ఆ మహావస్తువునకే అభావాన్ని (లేనితనాన్ని) ఆపాదించటం కూడదు.

విశేషం: అలం: నిదర్శన. గ్రహించటం అనే క్రియ ఇక్కడ మనస్సునకు చెందింది. మనస్సు గ్రహించలేకపోతే అది దాని దోషమే తప్ప, అవతలి వస్తువుయొక్క లేమిని తెలపటం కాబోదు.

క. రవిబింబము రాహువు పయిఁ । గవిసినఁ బాసినను దోఁపకయుఁ దోఁచియు నుం
డు విధమ యజ్ఞానంబున । యవిరతి విరతుల యధీనుఁ డగు టాత్మునకున్. 184

ప్రతిపదార్థం: ఆత్మునకున్= పరమాత్ముడికి; అజ్ఞానంబునన్= జ్ఞానంలేకపోవటంవలన; అవిరతి విరతుల+అధీనుఁడు+అగుట= ఉండటం, ఉండకపోవటాలకు లోబడినవాడగుట (ఎట్లంటే); రవిబింబము= సూర్యబింబం; రాహువు= రాహుగ్రహం; పయిన్+కవిసినన్= పైబడినపుడు; పాసినను= విడిచినపుడూ; తోఁపకయున్= కనిపించక; తోఁచియున్= కనిపిస్తూ; ఉండు విధము+అ= ఉండే విధమే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సూర్యబింబాన్ని రాహువు కప్పివేసినప్పుడు అది కనిపించదు. రాహుగ్రహం విడిచిపెట్టినప్పుడు అది కనిపిస్తుంది. ఇక్కడ సూర్యబింబం ఎప్పుడూ ఉన్నది. అది కనిపించటం, కనిపించకపోవట మన్నది దానిని కప్పిన రాహువువలన జరుగుతున్నది. అదే విధంగా అజ్ఞానం కప్పివేసినప్పుడు ఆత్మ కనిపించదు. అది విడిచినపుడు కనిపిస్తుంది. అంతే తప్ప, ఆత్మ శాశ్వతమైనది. ఎప్పుడూ ఉండేదే.

విశేషం: తత్త్వదర్శనం, సమ్యగ్దర్శనం అనే మాటలు మనం వింటుంటాం. కేవల దర్శనం వేరు. కనిపించేది నిజం కావలసిన పనిలేదు. ఆ విషయం మనకు దూరపు కొండలు మొదలైన చోట్ల తెలుస్తూనే ఉన్నది. అందుకనే తత్త్వదర్శనం, సమ్యగ్దర్శనం కావాలి. నిజమైన దాన్ని చూడటమే అది. ఆ తత్త్వదర్శనానికి ఆటంకాన్ని ఉపమానపూర్వకంగా వివరించాడు వక్త. అలంకారం- నిదర్శన.

క. **విను మానస ప్రసన్నతఁ । దనుఁ గను పురుషుండు గలుషతం గానఁడు దే**
టిన నీట రూపు సూడఁగ । ననువై కలఁక నది లేని యట్టుల పోలెన్. **185**

ప్రతిపదార్థం: తేటిన నీటన్= మురికిని వదలిన నీటిలో; రూపు= ఆకారం; చూడఁగన్= చూడటానికి; అనువు+ఐ= వీలయి; కలఁకన్= మురికియందు (మురికినీటిలో); అది= ఆ 'చూడగ'ననువు - చూచుటకు వీలు; లేని+అట్టుల పోలెన్= లేనట్లుగా; పురుషుండు= ఆత్ముడు; మానస ప్రసన్నతన్= మనస్సుయొక్క నిష్కల్మషత్వమునందు, మనస్సు కలతలేక నిర్మలంగా ఉన్నప్పుడు; తనున్= తనను; కనున్= చూస్తాడు; కలుషతన్= కల్మషత్వమున, కలత చెందినప్పుడు; కానఁడు= చూడలేడు; విను= ఆలించుము.

తాత్పర్యం: జ్ఞానయోగం మానసిక ప్రక్రియ. ఆత్మజ్ఞత, అనాత్మజ్ఞత - రెండూ మానసిక చర్యలే. అందువలన మనస్సు కలతదేరి, కల్మషానికి దూరమై, నిర్మలంగా ఉన్నప్పుడు పురుషుడు ఆత్మజ్ఞుడు కాగలడు. తనను తాను గ్రహించగలడు. అయితే అదే మనస్సు కలతతో, క్షుభితమై ఉన్నప్పుడు మాత్రం అతడు ఆత్మజ్ఞానాన్ని పొందలేడు. అనాత్మజ్ఞుడుగా, అజ్ఞానిగా మిగిలిపోతాడు. అది ఎట్లంటే, తేరిన నీటిలో రూపు కనిపిస్తుందిగాని, మురికి నీట కనిపించదు కదా!.

విశేషం: అలం: ఉపమ.

తే. **ఇంద్రియంబులు దమ యిచ్చ నిట్టునట్టుఁ । దిరిగె నేనియు దుఃఖముల్ దెచ్చు నవియ**
కట్టువడి సుఖ మొనరించుఁ గాన యాత్మఁ । గావ వలయు నింద్రియచోరగణము వలన. **186**

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు= జ్ఞానేంద్రియాలు ఐదు - కర్మేంద్రియాలు ఐదు - వెరసి పది ఇంద్రియాలు: కన్ను ముక్కు మొదలయినవి, కాలు, చేయి లోనయినవి - రెండు విధాలయినవి; తమ ఇచ్చన్= తమ తమ కోరికతో; ఇట్టున్+అట్టున్= ఇట్లా, అట్లా-ఎట్లా కావాలంటే అట్లా అదుపు ఆజ్ఞా లేకుండా; తిరిగెన్+ఏనియున్= తిరిగితే-వాటి వాటి పనులలో మునిగిపోతే; దుఃఖముల్+తెచ్చున్= కష్టాలను తోడ్కొని వస్తాయి; అవి+అ= అవే ఆ ఇంద్రియాలే; కట్టు+పడి= (ఆత్మ) ఆజ్ఞకు లోబడి; సుఖము+ఒనరించున్= సంతోషం కలిగిస్తాయి; కానన్= కాబట్టి; ఆత్మన్= ఆత్మను; ఇంద్రియ చోర గణమువలనన్= ఇంద్రియాలు అనే దొంగలముఠా నుండి; కావన్+వలయున్= రక్షించాలి.

తాత్పర్యం: ఇంద్రియాలు (నరుడి) అదుపు ఆజ్ఞలలో ఉండక, స్వేచ్ఛగా నిరాటంకంగా తమతమ పనులు తాము చేసికొంటూ పోతే చివరకు దుఃఖాలు కష్టాలు, వెతలు, వేదనలూ తప్పవు. అయితే అవే ఇంద్రియాలు నిగృహీతాలై- అదుపు చేయబడినవై సంచరిస్తే సుఖాలూ, సంతోషాలూ, శాంతి సౌభాగ్యాలూ కలిగిస్తాయి. అందువలన ఆత్మను ఇంద్రియాలు - అనే దొంగల ముఠాబారిన పడకుండా రక్షించుకొనాలి.

విశేషం: అలం: కావ్యలింగం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పాప క్షయమున బోధం। బాపాదింపఁబడి మెఱుఁగుటద్దము కరణిం
జూపునకు వచ్చుఁ దనుఁ దా। నా పురుషుఁడు గాంచు పనికినై తన్మయతన్. 187

ప్రతిపదార్థం: పాపక్షయమునన్= పాపం, చెడుపనులు, ఊహలు నశించటంవలన; బోధంబు= జ్ఞానం; ఆపాదింపఁబడి= సంపాదించబడి (కలిగి); మెఱుఁగు+అద్దము కరణిన్= మెరిసే (నిర్మలమైన అద్దంవలె; ఆ పురుషుఁడు= ఆ పరమాత్మ (నరుడిలో అంతర్లీనంగా ఉన్నవాడు); తనున్= తనను; తాన్= తాను; కాంచు పనికిన్+ఐ= దర్శించే కార్యం కొరకై చూచేటందుకై; తద్+మయతన్= ఆ పరమాత్మతో ఐక్యమొందినదై; చూపునకున్+వచ్చున్= (కంటి) చూడ్కికి వీలౌతుంది - అగుపడుతుంది.

తాత్పర్యం: పాపాలు నశిస్తే జ్ఞానం కలిగి, మెరుగుటద్దంవలె ప్రకాశిస్తూ ఉంటుంది. అపుడు ఈ శరీరంలోని ఆత్మ తనను తాను దానిలో చూచుకొనగలుగుతుంది - జ్ఞానం ఆత్మలో ఐక్యమౌతుంది.

విశేషం: అలం: ఉపమ. పాపపుణ్యాలు రెండూ కర్మజన్యాలు - కర్మలవలన ఏర్పడేవి. కర్మలు ఇంద్రియజన్యాలు - ఇంద్రియాలద్వారా జరిగేవి. కాబట్టి పాపక్షయం కావాలంటే నరుడి క్రియలు నిష్కల్మషాలు కావా లన్నమాట. ఆ స్థితి ఇంద్రియనిగ్రహానికి తార్కాణం.

తే. ధ్యానయోగ నిశ్చల మగు నంతరంగ। మెడలవిడుచు గుణంబుల నిద్ధశాంత
మైన నిర్గుణవస్తువునందుఁ గలయుఁ। బరమపద మది; దానికిఁ బరము లేదు.' 188

ప్రతిపదార్థం: ధ్యాన యోగ నిశ్చలము+అగు= ధ్యానయోగంతో చలనం లేనిదైన; అంతర్+అంగము= లోపలి అవయవం, మనస్సు; గుణంబులన్= తమస్సు, రజస్సు, సత్త్వం - అనేమూడు సహజగుణాలను - స్వభావాలను; ఎడలన్+విడుచున్= దూరంగా వదలును; (తరువాత) ఇద్ధ శాంతము+ఐన= దీప్తమైనది - ప్రకాశించేదీ శాంతిని పొందినదీ అయిన; నిర్+గుణ వస్తువునందున్= గుణ రహితమైన (పరమాత్మ) పదార్థమున; కలయున్= చేరుతుంది; అది= ఆ కలయిక; పరమ పదము= శ్రేష్ఠమైన స్థితి; దానికిన్= ఆ స్థితికంటె; పరము= అవతలిది - శ్రేష్ఠమైనది; లేదు= ఉండదు.

తాత్పర్యం: నరుడి లోపలి అవయవమే అంతరంగం. అది సహజంగా చలనశీలి. అయితే ధ్యానయోగం ద్వారా ఆ అంతరవయవాన్ని - మనస్సును వశపరచుకొని, దాని చలనాన్ని నిరోధించగలిగితే అపు డది నరుడి స్వభావాలైన తమస్సు, రజస్సు సత్త్వం - అనే గుణాలు మూడింటినీ విడిచిపెట్టి, తాను పరతత్త్వంలో శాంతమై దీపించే ఆ పరమాత్మలో లీనమైపోతుంది. అదే పరమపదం. దానిని మించిన దేదీ లేదు'.

విశేషం: మనస్సు నిశ్చలత్వాన్ని పొందటమంటే పరమాత్మలో లీనమవటంకంటె వేరుగాదు. ఆ నిశ్చలత్వం ధ్యానంద్వారా సాధ్యమంటున్నాడు బృహస్పతి. అనంతర వృత్తాంతాన్ని వివరిస్తున్నాడు - మరొక ప్రసంగానికి ముందుమాట పలుకుతున్నాడు వక్త.

వ. అని పలికి సమ్యగ్జ్ఞానంబునకు మాయ మాటు గావున దాని మొఱంగు తెఱంగు దేటపఱుపం దలంచి యిట్లనియె. 189

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; సమ్యక్+జ్ఞానంబునకున్= సరియైన తెలివికి (జ్ఞానయోగానికి); మాయ= అవిద్య; మాటు+కావునన్= చాటు కాబట్టి; దాని మొఱంగు తెఱంగు= దాని వంచన పద్ధతి - మోసగించే తీరు; తేటపఱుపన్+తలంచి= స్పష్టపరిచేటందుకు యోచించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: జ్ఞానయోగ ప్రసంగ మిది. జ్ఞానం ఆభాస రూపాన కూడా ఉండవచ్చును. అపు డది జ్ఞానం కాజాలదు. అందుకని మంచి జ్ఞానం పొందాలంటే దానికి ముందుగా జ్ఞానాన్ని దాచే లక్షణంగల మాయను గురించి వివరించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మాయ నరుడిని వంచించే తీరుతెన్నులు తేటగా తెలియజెప్పాలని బృహస్పతి సంకల్పించి, మనువుతో ఇట్లా ప్రసంగించాడు.

బృహస్పతి మనువున కుపదేశించిన మాయాప్రకారము (సం. 12-198-1,2)

క. 'విను మాయావిధ మిట్టిది। యని యారయ వెరవుగలుగ దవనిం జరణం
బనఘా! మోపని జంతువు। సను చొ ప్పరయంగ రాని చందం బొందున్. 190

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా! మనూ!; విను= ఆలకించుము; మాయావిధము= మాయయొక్క - అవిద్యయొక్క పద్ధతి; ఇట్టిది+అని= ఈ విధమైనది అని; ఆరయన్= పరిశీలింపగా; వెరవు= ఉపాయము; కలుగదు= లేదు; అవనిన్= భూమిని; చరణంబు= కాలు; మోపని= ఆనించని; జంతువు+చను చొప్పు= మృగం వెళ్ళే తీరు; అరయంగన్+రాని= చూడరాని; చందంబు= పద్ధతి, ఒందున్= పొందుతుంది.

తాత్పర్యం: 'మాయ ఈ తీరున ఉంటుంది, ఇట్లా సంచరిస్తుంది - అనటానికి, అని తేల్చి చెప్పటానికి మార్గమే- ఉపాయమే లేదు. భూమిమీద కాలుమోపని జంతువు నడకను ఏమని ఎంతగా వర్ణించగలమో ఈ మాయ తీరుతెన్నులనూ ఆ విధంగా, అంతగా వివరించగలం.

విశేషం: అలం: ఉపమ. మాయ లీలలు వర్ణనాతీతమైనవి. అనుభవైకవేద్యాలే తప్ప అవి ప్రకటనలకు అనువైనవీ లోబడినవీ కావుమరి!

క. గుణమూర్తి మాయ దానిని। గణుతించెద నన్నఁ దెగడు; గ్రాహ్యత్వంబున్
గుణములఁ బెడఁబాపంగా। గణనాతీతమగు వెలుఁగు గనుఁ దాన తనున్. 191

ప్రతిపదార్థం: మాయ= అవిద్య; గుణమూర్తి= గుణములు (తమస్సు, రజస్సు, సత్త్వములు) ఆకారంగా కలది; దానిని= ఆ మాయను; గణుతించెదను+అన్నన్= లెక్కిస్తాను అనినచో- లెక్కలోనికి తీసికొనబోతే; గ్రాహ్యత్వంబున్= గ్రహించదగిన తనమును; తెగడున్= తిరస్కరిస్తుంది (మాయ కర్త); గుణములన్= ఆ మూడు గుణాలను; పెడన్+పాపన్+కాన్= పెడగా - ప్రక్కగా తొలగించినచో; తనున్= తన్ను; తాను+అ= తానే; గణన+అతీతము+అగు వెలుఁగు= లెక్కకు మించినదైన కాంతిని; కనున్= చూస్తుంది, పొందుతుంది.

తాత్పర్యం: మాయ లీలలు వర్ణనకు లొంగనివే అయినా, దానికి ఆకారమున్నది. నరుడిలోని మూడు గుణాలు- తమస్సు, రజస్సు, సత్త్వము అనేవే దాని శరీరం. వాస్తవాన్ని గుర్తించి దానిని పరిగణనలోనికి తీసికొందామనుకొంటే వీలుపడదు. ఎందుకంటే తనను ఇతరులు గ్రహించటాన్ని అది అంగీకరించదు. ఫలితంగా మనం దానిని గ్రహించలేము. అయితే ఆ మూడు గుణాలను దూరంగా నెట్టివేయగలిగితే లెక్కకురాని గొప్పవెలుగును చూడవచ్చును.

విశేషం: 'మాయ' విడిగా ప్రత్యేకంగా ఉండదు. అది నరుడిని అంటికొని అతడిలో భాగంగానే ఉంటుంది. అతడి భావంలో, భాషలో, పనిలో కనిపిస్తూ ఉంటుంది. దానినుండి బయటపడటమంటే, మూడు గుణాలనుండి ముక్తి పొందటమే.

తే. వినుము నృప! సత్త్వమును రజస్సును దమస్సు। ననఁగ గుణములు ముప్పిరిగొనుచు నాత్మఁ
జుట్టుకొను నొండుమొయిఁ దెగ విట్టలముగ। నొలయు వైరాగ్య మను కొడవలిన కాని.' 192

ప్రతిపదార్థం: నృప!= ఓ రాజా!; వినుము= ఆలకించుము; సత్త్వమును= ఆ పేరుగల ఒక గుణమూ (ఇది తెల్లనిదనీ, మిగిలిన రెండు గుణాలకంటే ఉత్తమమనీ తాత్త్వికులు పల్కుతారు); రజస్సును= ఆ పేరుగల మరొక గుణమూ (ఇది ఎర్రనిదనీ, చివరి దానికంటే మంచిదనీ వారే అంటారు); తమస్సున్= ఆ పేరుగల చివరి మూడవ గుణమూ (ఇది నల్లనిదనీ, మిగిలిన రెండింటికంటె

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తక్కువదనీ వారే చెప్పుతారు); అన(గన్= అనే; గుణములు= మానవ స్వభావాలు; ముప్పిరికొనుచున్= మూడు పరస్పరం పెనవేసికొంటూ; ఆత్మన్= ఆత్మను పురుషుడిని; చుట్టుకొనున్= ఆవరించుకొంటాయి; ఇట్టలముగన్= ఎక్కువగా; ఒలయు= అతిశయించే; వైరాగ్యము+అను కొడవలిని+అ= విరాగితనం, కోరికలు లేని తనం అనే కొడవలితో; కాని= తప్ప; ఒండు మెయిన్= ఒక విధంగా; మరొక విధంగా; తెగవు= తెగిపోవు - నశించవు - ఆ మూడు గుణాలు అనే తాళ్ళు.

తాత్పర్యం: ఓ రాజా! మనూ! వినుము. ఆత్మను మాయ ఆవరించి ఉన్నది. ఎట్లంటే, సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలు మూడు పురులుగా కలిసి ఆత్మను చుట్టుకొని ఉన్నాయి. ఆ ముప్పిరి (మూడు పురులు) తెగవేయాలంటే గొప్ప వైరాగ్యమనే కొడవలి కావాలి. దానితో తప్ప ఇతర విధాల ఆ మాయను తెగటార్చజాలము'.

విశేషం: అలం: రూపకం.

వ. అని నిర్దేశించి వెండియు. 193

ప్రతిపదార్థం: అని= పై విధంగా; నిర్దేశించి= ఉపదేశించి; వెండియున్= మరలా.

తాత్పర్యం: అని ఉపదేశించి మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'మణిమయములు(గనకమయములు రజతమ । యములు మఱియు మృణ్మయాదికములు
నైన పెక్కుపూసలందు(ద్రాడున్నట్లు । భూతకోటియందు(బురుషు(డుండు. 194

ప్రతిపదార్థం: మణి మయములు= మణులతో, విలువైన రాళ్ళతో చేయబడినవి; కనక మయములు= బంగారంతో ఏర్పడినవి; రజత మయములు= వెండితో నిండినవి; మఱియున్= ఇంకను; మృత్+మయ+ఆదికములున్= మట్టితోడివీ మొదలైనవి; ఐన= అగు; పెక్కు= బహువిధములయిన; పూసలందున్= పూసలలో; త్రాడు+ఉన్న+అట్లు= (మధ్యన) త్రాడు (ఆధారంగా) ఉన్న విధాన; భూతకోటియందున్= జీవ సమూహమునందు; పురుష(డు= ఆత్ముడు; ఉండున్= నివసిస్తాడు.

తాత్పర్యం: హారాలు అనేక విధాలుగా ఉంటాయి. మణిహారాలు, బంగారు గొలుసులు, వెండి హారాలు, మట్టివీ-గొలుసులు రకరకాల ఆకారాలలో రంగులలో బరువులలో ఉంటాయి. అయితే ఈ అన్నింటా ఒకటి సామాన్యంగా సమానంగా ఉంటూనే ఉంటుంది. అది దారం- సూత్రం. ఈ మణులూ, బంగారాలూ, వెండులూ, మట్టీ గొలుసుగా ఏర్పడటానికి ఒక ఆధారం ఆ దారం - తాడు. అది లేకుండా ఇవి తమ తమ ఆకారాలతో ఉండలేవు. అదే విధంగా సృష్టిలోని జీవరాసులు అన్నింటా ఆత్మ సంధానకర్తగా ఉంటుంది. ఆత్మ లేకుండా జీవులకు ఉనికి లేదు, మనికీ ఉండదు.

విశేషం: అలం: ఉపమ. హారం రూపుదాల్చటానికి సూత్రం కారణం. జీవుల ఆకారచేష్టలు అన్నిటికీ ఆత్మ ఆధారం. సూత్రం లేకుండా హారమూ, ఆత్మ లేకుండా జీవులూ ఉండటానికి వీలులేదు.

క. ఏకరసమయ క్షేత్ర మ । నేకౌషధి రసమయం బయినయట్లు సుమీ
యేకవిధమైన బుద్ధి య । నేకము లగు కర్మములమెయిం బోక నృపా! 195

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా! మనూ!; ఏకరసమయ క్షేత్రము= ఒక ద్రవం (నీరు)తోడి భూమి - పొలము; అనేక+ఓషధి రసమయంబు+అయిన+అట్లు= పెక్కు ఔషధ ద్రవాలతోడిది అయిన చందాన; ఏక విధము+ఐన బుద్ధి= ఒకే తీరు గల తెలివి-మతి; అనేకములు+అగు= పెక్కులైన; కర్మముల మెయిన్= పనులతో పనులవెంట; పోక= పోవటం; సుమీ!= సుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మాయ తనను తాను వ్యక్తపరచుకొనే తీరు నరుడి కర్మలలో కనిపిస్తుంది. ఆ కర్మలు బుద్ధిద్వారా జరుగుతాయి. బుద్ధి ఒకటే అయినా, అది నిర్వహించే కర్మలు కొల్లలు. ఆ విధంగా ఒక్క బుద్ధి పెక్కు కర్మల వెంటపడి, వాటిని నెరవేర్చుకుంటూ పోయే తీరును బృహస్పతి ఒక పోలికతో తెలియపరుస్తున్నాడు. పొలాన ఒక ద్రవమే ఉంటుంది. ఆ ద్రవం నీరే. అయితే ఆ నీటిద్వారా ఏర్పడే చెట్లుచేమల ద్రవాలు అనేకం. ఇక్కడ ఏక రసంతోడి పొలం అనేక ఓషధుల చెట్లుచేమల రసాలను ఏర్పరచినట్లుగా నరుడి ఒకే బుద్ధి పెక్కులైన అతడి కర్మలకు కారణంగా అవి కొనసాగటానికి ఆధారంగా నిలుస్తున్నది.

విశేషం: అలం: ఉపమ.

ఆ. జలము పృథివికంటె, జలముకంటెను దేజ, । మంతకంటె వాయు, వాకసంబు
దానికంటెఁ బెద్ద; వాని కెల్లను బెద్ద । మనసు; బుద్ధి పెద్ద మనసుకంటె. 196

ప్రతిపదార్థం: పృథివికంటెన్= భూమికంటె; జలము= నీరు; జలముకంటెను= నీటికంటె కూడా; తేజము= కాంతి; అంతకంటె= ఆ కాంతికంటె; వాయువు= గాలి; దానికంటెన్= ఆ గాలికంటె; ఆకసంబు= ఆకాశం; పెద్ద= పెద్దది, ఘనమైనది, విశాలమైనది; వానికి+ఎల్లను= ఆ అన్నిటికంటెను; మనసు= నరుడిలోని మనస్సు; పెద్ద= పెద్దది; మనసుకంటెన్= ఆ ఎక్కువ పెద్దదైన మనసుకంటెకూడా; బుద్ధి= నరుడి మతి - తెలివితేటల నెలవు; పెద్ద= పెద్దది, గొప్పది.

తాత్పర్యం: సృష్టిలో మూలద్రవ్యాలు ఐదు ఉన్నాయని - అవి నేల, నీరు, కాంతి, గాలి, ఆకాశాలని తాత్త్వికులు పలుకుతారు. ఆ అయిదూ సృష్టిలో మిగిలిన అన్నిటికంటె పెద్దవే. అయినా, వాటిలో మళ్ళీ తారతమ్యాలు, హెచ్చుతగ్గులు ఉన్నాయి. నేలకంటె నీరూ, నీటికంటె కాంతీ, కాంతికంటె గాలీ, గాలికంటె ఆకాశం - ఒక దానిని మించి ఒకటి పెద్దవి. అయితే ఈ మిక్కిలి పెద్దవైన పంచభూతాలకంటె కూడా పెద్దదైనది నరుడిలోని మనస్సు. ఆ మనస్సుకంటె పెద్దది ఈ బుద్ధి. ఇదీ నరుడిలోని భాగమే.

విశేషం: కనిపించే పంచభూతాలు ఒకదానిని ఒకటి మించి పెద్దవిగా ఉండగా, అసలు దృష్టికే అందని మనస్సూ, బుద్ధీ వాటికంటె పెద్దవి కావటం విచిత్రం. మళ్ళీ ఆ మనోబుద్ధులు రెండింటిలో బుద్ధి మనస్సును మించింది కావటమూ విశేషమే.

తే. ధరణి మొదలయిన పంచభూతములకంటె । మనసుకంటెను బుద్ధికంటెను మహత్త
రంబు గాలంబు; గాలతత్త్వంబు మిగిలి । యుండు విభుఁ డిజ్జగంబుల కొడయుఁ డతఁడు. 197

ప్రతిపదార్థం: ధరణి మొదలయిన= భూమి మొదలుగా గల; పంచభూతములకంటెన్= ఐదు మూల పదార్థాలకంటె (నేల, నీరు, కాంతి, గాలి, ఆకాశాలు); మనసుకంటెను= మనస్సు అనే జీవుల అంతరంగం - లోపలి అవయవాలకంటె; బుద్ధికంటెను= మతి అనే, జీవుల కర్మశీలతకు కారణమైన తెలివికంటె; కాలంబు= కాలం - క్షణాలు, నిమిషాలు, గంటలు, దినాలు, నెలలు, సంవత్సరాల రూపాన తెలియవచ్చే ప్రొద్దు; మహత్+తరంబు= ఎక్కువ పెద్దది; విభుఁడు= ప్రభువు, దేవుడు; కాలతత్త్వంబు= కాలము యొక్క స్వభావమును, పెద్దరికమును; మిగిలి+ఉండున్= మించి ఉంటాడు; అతఁడు= ఆ ప్రభువు; ఈ+జగంబులకున్= ఈ లోకాలకు; ఒడయుఁడు= అధిపతి.

తాత్పర్యం: (సృష్టిలో పెద్దవి, ఇంకా పెద్దవీ, వాటికంటెకూడా పెద్దవీ అయిన పదార్థాలను క్రమంగా చెప్పుకొంటూ వచ్చే బృహస్పతి ఇపుడు అన్ని విధాలయిన పెద్దరికాలనూ చివరగా ప్రకటిస్తున్నాడు.) పంచభూతాలకంటె మనస్సు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనస్సుకంటె బుద్ధీ పెద్దవి కాగా, ఈ అన్నిటినీ మించిన పెద్దరికం కాలానిది. అయితే అద్దానినికూడా మించినవాడు దేవుడు. అతడు సర్వోన్నతుడూ. సర్వాతిశాయీ అయిన ప్రభుడే ఈ లోకాలన్నిటికీ అధిపతి.

విశేషం: సృష్టిలో పెద్దరికాలు, చిన్నరికాలు సర్వసామాన్యం. అయితే దేవుడు మాత్రం అన్నింటికంటే, అందరికంటే గొప్పవాడు, పెద్దవాడు. అతడితో ఈ పెద్దరికాలను గూర్చిన వాదం సమసిపోతుంది. అతడిని మించిన పెద్దతనం ఇక లేదు. అందువలననే అతడు ఈ లోకాలకు ఏలిక.

క. ఆదియు మధ్యము నంతము । నా దేవేశునకు లేమి నవ్యయుఁ డతఁ డీ
వేదములకు నానావిధ । వాదములకుఁ జేరుగడ భవక్షేపి నృపా! 198

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా! - మనూ!; ఆ దేవ+ఈశునకున్= ఆ దేవతల అధిపతికి; ఆదియున్= మొదలూ; మధ్యమున్= నడుమూ; అంతమున్= చివరా; లేమిన్= లేకపోవటంచేత; అతఁడు= ఆ దేవేశుడు; అవ్యయుఁడు= నాశనం లేనివాడు; వేదములకున్= ఋక్, యజుస్, సామ, అథర్వములనే నాలుగు వేదాలకూ; నానావిధవాదములకున్= అనేక విధములయిన - దేవుడి ఉనికికి, ఆత్మ ఉనికికీ చెందిన పెక్కు మతాలకు - అభిప్రాయాలకు; చేరుగడ= శరణం - ఆధారం; భవక్షేపి= సంసారమును తిరస్కరించేవాడు.

తాత్పర్యం: ఓ రాజా! మనూ! నేను చెప్పిన ఆ దేవదేవుడు ఆది మధ్య అంతరహితుడు. కాబట్టి నాశనం లేనివాడతడు. అంతే కాదు, ఆతడే లోకంలోని జ్ఞానవిజ్ఞానఖనులని భావించబడే నాలుగువేదాలకూ, ఆత్మ - అనాత్మ, ఆస్తిక - నాస్తిక, మతాలకూ ఆధారభూతమై వెలుగొందేవాడు. సంసారాన్ని దూరీకరించే శక్తిని ఇచ్చేవాడూ అతడే.

విశేషం: ఒక వస్తువునకు 'ఆది' ఉంటే తప్పక 'అంతమూ' ఉంటుంది. ఉండక తప్పదు. జన్మ మరణాలు ఆ విధంగా జీవికి ఆది - అంతాలు. ఆ రెండూ ఉన్నపుడు 'మధ్యమూ' ఉన్నట్లే. ఇవన్నీ సృష్టమైన ఏర్పరచబడ్డ పదార్థాల లక్షణాలు. ఇక్కడ దేవేశుడిగా వర్ణితమైన శక్తి - సృష్టము - కల్పితం కాదు. సృష్టికి - కల్పనకు హేతువు. కాబట్టి అక్కడ మొదట - తుద పుట్టుక - చావు వంటి పరిభాషలు చెల్లవు. ఆ చెల్లనితనమే అవ్యయత్వమంటే. అది ఎప్పటికీ ఉంటుంది. మారకుండా ఉంటుంది.

క. అనుభవము మ్రింగు శాంతిం । గనునది నిర్భేద సత్ప్రకాశం బది దా
విను తలఁపునకును బలుకున । కు నగమ్యము, గర్మముల కగోచర మనఘా! 199

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా!; విను= ఆలకించుము ఓ మనూ!; (అతఁడు= పరతత్త్వం) అనుభవమున్= ప్రత్యక్షం మొదలైన జ్ఞానమును; మ్రింగున్= లోగొంటుంది - తనలో ఇముడ్చుకొంటుంది; శాంతిన్= శాంతిని, శమమును, నిశ్చలమైన స్థితిని; కనున్= పొందుతుంది; అది= ఆ శాంతి; నిర్ భేద సత్ ప్రకాశంబు= భేదంలేని మంచి వెలుగు; తాన్= తాను, ఆ శాంతి; తలఁపునకును= ఆలోచనకూ; పలుకునకున్= మాటకూ - భాషకూ; అగమ్యము= పొందరానిది; కర్మములకున్= పనులకు; అగోచరము= కనిపించనిది.

తాత్పర్యం: (ఆ పరత్వతత్త్వాన్ని అవాఙ్మానసగోచరమంటూనే వివరించటానికి యత్నించారు మన తాత్త్వికులు. ఇక్కడి భావాలు అట్లాంటివే. ఆ దేవేశుడే పరతత్త్వం.) ఆ పరతత్త్వం ప్రపంచంలో మనం జ్ఞానమని అనుకొనే సర్వాన్ని లోగొంటుంది. తరువాత శాంతిని పొందుతుంది. ఆ శాంతి భేదంలేని మంచి గొప్ప వెలుగు. నిజానికి ఆ శాంతిని వర్ణించి చెప్పటం అసాధ్యం. ఎందుకంటే అది ఆలోచనకూ, భాషకూ అందదు. ఇతర కర్మలద్వారా కూడా దానిని పొందలేము.

విశేషం: వర్ణనకు అలవిగాదు - అనటమూ ఒక వర్ణనమే. వర్ణనకు భాష ఆధారం. భాషకు ఆలోచన - భావం మూలం. భావానికీ భాషకూ అందనిది కర్మలకూ చిక్కదు. అయినా మనిషి మానడు. దానిని తెలియచెప్పటానికి యత్నిస్తూనే ఉంటాడు. భావం,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భాష, కర్మ - అనేవి క్రమంగా ఒకదానికంటె ఒకటి స్థూలమైనవి. విలోమక్రమంలోనయితే అవి క్రమంగా ఒక దానికంటె ఒకటి సూక్ష్మమయినవి. వీటినే మనం మనస్సు, వాక్కు, కర్మ అని అంటాం.

క. మనసు గొని, మనసు బుద్ధిం। గొని, బుద్ధిని దర్శనంబు గొని, దర్శనమున్
విను క్రమమున నొదిఁగించినఁ। గను బుధుఁ డక్షరుని విష్ణు ఘనబోధమయున్. 200

ప్రతిపదార్థం: మనసు= మనస్సును; కొని= గ్రహించి - లోగొని; మనసున్= మనస్సును; బుద్ధిన్+కొని= బుద్ధిని లోగొని-లోబరచుకొని; బుద్ధిని= బుద్ధినీ - మతినీ; దర్శనంబు+కొని= చూపును - జ్ఞానమును లోగొని; దర్శనమున్= చూపును - జ్ఞానమును; క్రమమునన్= వరుసగా, ఒకటొకటిగా; ఒదిఁగించినన్= తొలగిస్తే, లీనము చేసికొన్నచో; విను= ఆలకించుము ఓ మనూ!; బుధుఁడు= పండితుడు; అక్షరునిన్= నాశనంలేనివాడిని; ఘనబోధమయున్= గొప్ప జ్ఞానమయమైనవాడిని; విష్ణున్= విష్ణువును - పరతత్త్వ స్వరూపమును; కనున్= చూస్తాడు, పొందుతాడు.

తాత్పర్యం: మనస్సూ, బుద్ధీ, (లోక) జ్ఞానమూ - ఈ మూడూ నరుడినుండి తొలగిపోతే తప్ప, అతడికి ఆ శాశ్వత సర్వవ్యాపి జ్ఞానమయతత్త్వం, పరమేశ్వర స్వరూపం గోచరించదు. అయితే ఆ మూడూ త్రిపుటి తొలగే మార్గ మేది? తత్త్వజ్ఞులకు అది సులభమే - ఎట్లంటే మనస్సుతోనే మనస్సును లోబరచుకొనాలి, తరువాత తొలగించుకొనాలి, బుద్ధితోనే బుద్ధిని లోగొని అనంతరం లీనం చేయాలి. అటు తరువాత జ్ఞానాన్ని పరతత్త్వేతరమైన తెలివితేటలు- అన్నిటినీ జ్ఞానం (పారమార్థికమైనది) తోనే వశపరచుకొని పిదప ఒదగజేయాలి-తొలగించుకొనాలి. ఈ విధంగా పరతత్త్వాన్ని అందుకొనాలి.

విశేషం: మనస్సుతో మనస్సును గ్రహించట మేమిటి? సరిగా ఉండని మనస్సును సరైన మనస్సుతో లోబరచుకొనాలి. అట్లాగే సమ్యక్ సంకల్పంతో బుద్ధితో దుర్బుద్ధిని, సమ్యక్ దృష్టితో ఇతర దృష్టినీ లోగొనాలి. ఇట్లా మనస్సు, బుద్ధి, దృష్టి-మూడూ సరిగా సమీచీనంగా సాగితే పరతత్త్వప్రాప్తి జరుగుతుంది.

క. అమృతం బచ్యుత మమలం। బమేయ మవ్యయ మనంత మవ్వెలుఁగు యమా
ద్యముల నలవడిన చిత్తము। శమాతిరేకమునఁ బొంద సంవేద్య మగున్. 201

ప్రతిపదార్థం: ఆ+వెలుఁగు= ఆ పరతత్త్వం; అమృతంబు= మరణం లేనిది; అచ్యుతము= చ్యుతి, భ్రంశం, జారుడు లేనిది; అమలంబు= మురికి లేనిది; అమేయము= కొలత లేనిది; అవ్యయము= నాశం లేనిది; అనంతము= చివర లేనిది; యమ+ఆద్యములన్= యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధ్యానము, ధారణములను; అలవడిన= అభ్యసించిన; చిత్తము= మనస్సు; శమ+అతిరేకమునన్= శాంతి (యొక్క) ఆధిక్యంతో; పొందన్= గ్రహించగా-అందుకొనగా (ఆ వెలుగు); సంవేద్యము+అగున్= బాగుగా తెలియదగినది ఔతుంది.

తాత్పర్యం: ఆ పరతత్త్వం గొప్ప వెలుగు. ఆ వెలుగు మృతి లేనిది; చ్యుతి లేనిది; మలినం లేనిది, కొలత లేనిది; నాశం లేనిది; చివర లేనిది, దానిని యమనియమాది సాధన సంపత్తితో ప్రశాంతమై నిలిచిన చిత్తంద్వారా గ్రహించవచ్చును. అప్పుడే ఆ పరతత్త్వం నరుడి అనుభవానికి అందుతుంది.

విశేషం: ఈ పరతత్త్వం అవాఙ్మానస గోచరమంటూ మన తాత్త్వికులు వర్ణిస్తుంటారు; వదలరు. వర్ణన ఊహ ద్వారా కూడా చేయవచ్చును. అయితే అనుభవం, ఊహ రెండూ ఒకటి కావలసిన అగత్యముండదు. ఊహను మరచి ఒక విషయం అనుభవానికి వచ్చినప్పుడు ఆ అనుభూతి విశేషాన్ని ఎట్లాగైనా వ్యక్తపరచి తీరవలసిందే అన్న పట్టుదలతో చేసిన వర్ణన కావచ్చును ఇది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **అని గురుఁ డుపదేశించిన । విని మనువు గృతార్థుఁ డయ్యె విద్వన్నుత! నీ**
వును నలవరింపుమీ మన । మున నివ్వాక్యముల యర్థముం దత్పరతన్.' **202**

ప్రతిపదార్థం: విద్వత్+నుత!= పండితులచే పొగడబడినవాడా! - ఓ ధర్మరాజా!; అని= పై ప్రకారంగా; గురుఁడు= బృహస్పతి; ఉపదేశించినన్= జ్ఞానబోధ చేయగా; విని= ఆలకించి; మనువు= మను మహారాజు; కృత+అర్థుఁడు+అయ్యెన్= నెరవేరిన ప్రయోజనం కలవాడు అయ్యెను; నీవును= నీవుకూడా; మనమునన్= మనస్సులో; ఈ+వాక్యముల+అర్థమున్= ఈ బృహస్పతి మాటల సారాన్ని; తత్పరతన్= దానియందలి శ్రద్ధతో; అలవరింపుము+ఈ= అలవాటు చేసికొమ్ము-మననం ద్వారా గ్రహించి, అభ్యసించటానికి యత్నించుము.

తాత్పర్యం: పండిత ప్రశంసలు అందుకొన్న ఓ ధర్మరాజా! ఈ విధంగా బృహస్పతి మనువునకు ఉపదేశించగా విని ఆ మనువు కృతార్థుడైనాడు. అతడి ప్రయోజనం సిద్ధించింది. నీవూ ఈ బృహస్పతి మాటల అర్థాన్ని శ్రద్ధతో గ్రహించి, మనస్సులో మననం చేసి, ఆ పరతత్త్వప్రాప్తికై మనస్సును అభ్యాసమార్గాన ఉంచి యత్నించుము'.

విశేషం: ఉపదేశం వాఙ్మాత్రంగా మిగిలిపోతే నిష్ప్రయోజనమే. దానికి ఆచరణ ముఖ్యం. ఆచరణ మనస్సున కెక్కితేగాని కుదరదు. అందుకనే 'తత్పరత'తో గ్రహించి, మనస్సును జ్ఞానమార్గానికి అలవరచుకొ మ్మనే సూచన అవసరమైనది.

వ. **అనిన విని పరమహర్షంబునం బాండవాగ్రజుండు పితామహుం బ్రశంసించి 'మహాత్మా! మహనీయుండగు కృష్ణుని మాహాత్మ్యంబు వినవలతుం జెప్పవే?' యని యడిగిన నతం డమ్మహీపతితో 'నారద జామదగ్న్య మార్కండేయ వ్యాస వాల్మీకి ప్రభృతి మునీంద్రులు సెప్ప వినిన తెఱం గెఱింగించెద నాకర్ణింపు' మని యిట్లనియె.** **203**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; పాండవ+అగ్రజుండు= పాండవుల అన్న ధర్మజుడు; పరమహర్షంబునన్= గొప్ప సంతోషంతో; పితామహున్= తాతను భీష్ముడిని; ప్రశంసించి= పొగడి; మహా+ఆత్మా!= గొప్ప మనస్సు కలవాడా!; మహనీయుండు+అగు= పూజించవలసినవాడవగు; కృష్ణుని మాహాత్మ్యంబు= కృష్ణుడి గొప్పతనం; వినన్+వలతున్= వినగోరెదను; చెప్పవే?+అని+అడిగినన్= చెప్పవా? అని వేడగా; అతండు= ఆ భీష్ముడు; ఆ+మహీపతితోన్= ఆ రాజు అయిన ధర్మరాజుతో; నారద జామదగ్న్య మార్కండేయ వ్యాస వాల్మీకి ప్రభృతి ముని+ఇంద్రులు= నారదుడు, జామదగ్న్యుడు, మార్కండేయుడు, వ్యాసుడు, వాల్మీకి మొదలైన మునిశ్రేష్ఠులు; చెప్పన్= పలుకగా; వినిన తెఱంగు= విన్న విధం; ఎఱింగించెదన్= తెలుపుతాను; ఆకర్ణింపుము= వినుము; అని= అని పలికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: బృహస్పతి మనువుకొరకు చేసిన మాయను గురించిన ఉపదేశాన్ని విన్న ధర్మరాజు ఎంతో సంతసించి, తన తాతను మెచ్చుకొని, మళ్ళీ ఇట్లా అర్థించాడు. 'మహాత్మా! నాకు పూజ్యుడైన కృష్ణపరమాత్మ గొప్పదనం వినాలని కోరిక ఉన్నది. చెప్పవే?' అని, దానికి భీష్ముడు 'నారదాది మహామునులు స్వయంగా చెప్పగా విన్న విధాన మిది. నీవూ విను'మంటూ కృష్ణమాహాత్మ్యాన్ని వినిపించటం ప్రారంభించాడు.

విశేషం: భారతకథలో భీష్ముడు శ్రీకృష్ణభక్తుడిగా కనిపిస్తాడు. కాబట్టి కృష్ణతత్త్వ వర్ణన తాను చేస్తే అందులో భక్తి ప్రపత్తుల ఆధిక్యం గోచరించవచ్చును. అందువలన తాను ప్రస్తుతం వివరించబోయేది తాను నారదాది మహామునులనుండి విన్నది మాత్రమే అంటూ తన తాటస్థ్యాన్ని నిరూపించుకొన్నాడు పితామహుడు.

క. **'కృష్ణుఁడు ప్రభవిష్ణుం డగు । విష్ణుం; డనిలాగ్నితోయవియదిలలఁ గ్రియా**
నిష్ణాతత్వ వినోదన । తృష్ణం గల్పించెఁ దనదు దివ్యవిభూతిన్. **204**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కృష్ణుఁడు= నల్లనయ్య; ప్రభవిష్ణుండు+అగు= ప్రభావవంతుడైన; విష్ణుండు= విష్ణువు; తనదు దివ్యవిభూతిన్= తన లోకాతీతమైన ఐశ్వర్యంతో, శక్తితో; అనిల+అగ్ని తోయ వియత్+ఇలలన్= గాలి నిప్పు నీరు ఆకాశం నేలలను (పంచభూతాలను); క్రియా నిష్ణాతత్వ వినోదన తృష్ణన్= పనులలోని నేర్పరితనంతో వినోదించే ఆశతో; కల్పించెన్= చేసెను.

తాత్పర్యం: కృష్ణుడు ప్రభావశాలి అయిన విష్ణువే. అతడే తన దివ్యశక్తితో తానూ కర్మనిర్వహణ నైపుణ్యంతో వినోదించాలనే ఆశతో ఈ సృష్టికి మూలపదార్థాలైన పంచభూతాలను - గాలి నిప్పు నీరు ఆకాశం నేల అనేవాటిని కల్పించాడు.

తే. **అట్లు కల్పించి జలములయందు భవ్య । తల్పగతుఁ డైన నాభిఁ బద్మంబు దోఁచె;**
నం దజుఁడు పుట్టి సృజియించె నందనుల మ । నంబునన సప్తసంఖ్యుల నరవరేణ్య! **205**

ప్రతిపదార్థం: నరవరేణ్య!= ఓ రాజా!; అట్లు= ఆ విధంగా; కల్పించి= చేసి, పంచభూతాల సృష్టిచేసి; జలముల అందున్= నీళ్ళలో; భవ్య తల్పగతుఁడు+ఐనన్= శుభమైన పడకను చేరినవాడు కాగా - పరుండి ఉండగా; నాభిన్= బొడ్డునందు; పద్మంబు+తోఁచెన్= తామరపువ్వు పుట్టింది; అందున్= ఆ పువ్వునందు; అజుండు= బ్రహ్మ; పుట్టి= కలిగి; మనంబునన్+అ= మనస్సులోపలనే; సప్తసంఖ్యులన్= ఏడుగురు; నందనులన్= కుమారులను; సృజియించెన్= పుట్టించాడు.

తాత్పర్యం: ఆ విధంగా పంచభూతసృష్టిచేసి, నీటిలో శుభకరమైన పడకమీద పరుండి ఉండగా (విష్ణువు కర్త) విష్ణువు బొడ్డున తామరపువ్వు పుట్టింది. దానినుండి బ్రహ్మ పుట్టాడు. ఆ బ్రహ్మ మనస్సులోనే ఏడుగురు కుమారులను కన్నాడు. (వీరినే బ్రహ్మమానసపుత్రులు అంటారు.)

వ. **మరీచియు నత్రియు నంగిరసుండును బులస్త్యుండును బులహుండును గ్రతువును దక్షుండు ననం బరఁగువారలయందు మరీచికిం గశ్యపప్రజాపతి జన్మించె; అతనివలన సురాసుర గరుడ నాగాదిజాతి సంభవంబునుం గలిగె; నతనికి సూర్యుండును నత్రికి సోముండును నుదయించి, రాజవంశంబులకుఁ గవాటస్థులైరి; సూర్య సోమాన్వయ జాతులైన నృపతు లనేకు లనేక దేశంబు లేలిరి; దేశకాల విశేషంబుల నృపకులంబులు బహుశాఖంబులై వర్ధిల్లువాని నెల్లం దన వలసిన యప్పుడు విష్ణుండు పరస్పర విరోధజనిత సంగ్రామంబులు నిమిత్తమాత్రంబులుగాఁ గల విశేషప్రకారంబుల నుపసంహరించుచు నద్దేవుండు వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధాత్మకంబు లగు చతుర్విధ దివ్యస్వరూపంబులు గలిగి జగద్భరణం బాచరించుచు నిట్లు లీలా జన్మంబులం బొంది క్రీడ సలుపు నని కృష్ణునిం జూపి 'ఈ భూతేశ్వరు మానుషసామాన్య దృష్టిం జూచుట యజ్ఞానంబు గృష్ణుండు భక్తపరతంత్రతం జేసి యుత్కృష్ట చరితుల యారాధనంబునకు భాజనంబయి భోగమోక్షంబులు గరుణామయ కటాక్షంబుల నొసంగు' ననినం బ్రీతుండై భీష్మునకుం బ్రణమిల్లి యుధిష్ఠిరుండు.** **206**

ప్రతిపదార్థం: మరీచియున్= మరీచీ; అత్రియున్= అత్రీ; అంగిరసుండును= అంగిరసుడూ; పులస్త్యుండును= పులస్త్యుడూ; పులహుండును= పులహుడూ; క్రతువును= క్రతువూ; దక్షుండును= దక్షుడూ; అనన్+పరఁగువారలఅందున్= అనగా వర్ధిల్లే ఆ బ్రహ్మమానస పుత్రులలో; మరీచికిన్= మొదటివాడు మరీచికి; కశ్యప ప్రజాపతి= కశ్యపబ్రహ్మ; జన్మించెన్= పుట్టాడు; అతని వలనన్= ఆ కశ్యపబ్రహ్మవలన; సుర+అసుర గరుడ నాగ+ఆది జాతి సంభవంబునన్= దేవతలు రాక్షసులు గరుడులు నాగులు మొదలగు జాతుల పుట్టుక కూడా; కలిగెన్= జరిగినది; అతనికిన్= ఆ కశ్యపబ్రహ్మకు; సూర్యుండును= సూర్యభగవానుడూ; అత్రికిన్= అత్రికి; సోముండును= చంద్రుడును; ఉదయించి= పుట్టి; రాజవంశంబులకున్= క్షత్రియుల వంశాలకు; కూటస్థులు+ఐరి=

మూల పురుషులు అయినారు; సూర్య సోమ+అన్వయ జాతులు+ఐన= సూర్యుడి, చంద్రుడి వంశాలలో పుట్టినవారైన; నృపతులు+అనేకులు= రాజులు పెక్కండ్రు; అనేక దేశంబులు+ఏలిరి= పెక్కు దేశాలను పాలించారు; దేశకాల విశేషంబులన్= దేశముయొక్క, కాలముయొక్క భేదముల యందు - భిన్న భిన్న దేశాలలో - భిన్న భిన్న కాలాలలో; నృపకులంబులు= రాజవంశాలు; బహుశాఖంబులు+ఐ= పెక్కు తెగలు కలవిగా; వర్తిల్లున్= ఉంటాయి; వానిని+ఎల్లన్= ఆ వంశాలను అన్నిటిని; విష్ణుఁడు= కృష్ణుడు; తన వలసిన+అప్పుడు= తనకు కావలిసిన సమయాన; పరస్పర విరోధ జనిత సంగ్రామంబులు= అన్యోన్యం కలహించటంవలన కలిగిన యుద్ధాలు; నిమిత్త మాత్రంబులుగాన్= కారణ మాత్రాలుగా అగునట్లు - ఆ నెపంతో; కల విశేష ప్రకారంబులన్= ఉన్న వివిధ రీతులలో; ఉపసంహరించున్= ముగించును - నశింపజేయును; ఆ+దేవుండు= ఆ శ్రీకృష్ణ దేవుడు; వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న+అనిరుద్ధ+ఆత్మకంబులు+అగు= కృష్ణుడు (వసుదేవుడి కొడుకు), బలరాముడు, మన్మథుడు, మన్మథ తనయుడు-అనేవారి శరీరాలు కలవి అగు; చతుర్విధ దివ్యస్వరూపంబులు= నాలుగు విధాలయిన లోకోత్తర ఆకారాలు; కలిగి= ధరించి; జగత్+భరణంబు= లోకాన్ని భరించటం; ఆచరించుచున్= చేస్తూ; ఇట్లు= ఈ విధంగా; లీలాజన్మంబులన్= వినోదం కొరకైన పుట్టుకలను; పొంది= వహించి; క్రీడ+చలుపున్= ఆట ఆడును; అని= అని పలికి; కృష్ణునిన్+చూపి= శ్రీకృష్ణుడిని చూపి; ఈ+భూత+ఈశ్వరున్= ఈ ప్రాణుల అధిపతిని; మానుష సామాన్య దృష్టిన్= నరుల సాధారణమైన చూపుతో; చూచుట= కనుగొనటం; అజ్ఞానంబు= తెలివిలేని తనం; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; భక్తపరతంత్రతన్+చేసి= భక్తులకు సేవకుడగుటచేత; ఉత్కృష్ట చరితుల+ఆరాధనంబునకున్= గొప్ప నడతలుగలవారి పూజనానికి; భాజనంబు+అయి= పాత్రమై; భోగ మోక్షంబులు= సుఖానుభవం, మోక్షం అనే రెండూ; కరుణామయ కటాక్షంబులన్= దయామయమైన క్రీగంటి చూపుతో; ఒసంగున్= ఇస్తాడు; అనినన్= అని పలుకగా; ప్రీతుండు+ఐ= సంతసించినవాడై; భీష్మునకున్= భీష్మాచార్యుడికి; ప్రణమిల్లి= నమస్కరించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు.

తాత్పర్యం: బ్రహ్మమానస పుత్రులు ఏడుగురు. వారు వరుసగా మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు. వారిలో మరీచికి కశ్యప ప్రజాపతి జన్మించాడు. ఆ కశ్యపుడివలన దేవతలు, రాక్షసులు, గరుడులు, నాగులు మొదలైన జాతులు జనించాయి. ఆ కశ్యపుడికే సూర్యుడు జన్మించగా, అత్రికి చంద్రుడు కలిగి, ఆ సూర్యచంద్రులిద్దరూ క్షత్రియవంశాలకు మూల పురుషులయ్యారు. ఆ సూర్యచంద్ర వంశాలకు చెందిన రాజులు పలువురు పెక్కుదేశాలు ఏలారు. భిన్నభిన్న కాలాలలో భిన్నభిన్న దేశాలలో ఈ క్షత్రియవంశాలు అనేక శాఖోపశాఖలుగా వర్ధిల్లాయి. ఈ నానావిధ క్షత్రియవంశాలను, శ్రీకృష్ణుడు తనకు కావలసినపుడు వారిలో వారికి సంభవించే యుద్ధాలను నిమిత్తమాత్రంగా గ్రహించి, నశింపజేస్తూ ఉంటాడు. ఆ దేవుడు శ్రీకృష్ణరూపంతోపాటుగా బలరామ, మన్మథ, అనిరుద్ధ రూపాలను ధరించి ఈ జగత్తును భరిస్తూ వినోదంకొరకు జన్మలెత్తి ఆటలాడుకొంటూంటాడు' - అని భీష్ముడు పలుకుతూ ఎదుటనున్న శ్రీకృష్ణుడిని చూపి 'ఈ జగత్పతిని సామాన్య మానవుడిగా చూడటం అజ్ఞానం. శ్రీకృష్ణుడు భక్తులకు సేవకుడు కాబట్టి గొప్ప నడతగలవారికి ఆరాధనాభాజనమైనవాడు. నరులకు కావలసిన భోగభాగ్యాలనుగాని, ముక్తినిగాని కేవలం తన కరుణాకటాక్షమాత్రాన ఈయగలవాడు' అని పలుకగా ధర్మరాజు సంతసించి, పితామహుడికి నమస్కరించి. (మళ్ళీ ఈ విధంగా ప్రశ్నించాడు).

క. **'మునిజన వినుత చరిత్రా! । మనుజుం డెవ్వనిఁ దలంచి మహనీయ నిరం**
జన సిద్ధిఁ బొందఁ గను? నే । యనువు దలఁపు నలవరించు?' నని యడుగుటయున్. **207**

ప్రతిపదార్థం: మునిజన వినుత చరిత్రా!= ఋషిజనులచేత పొగడబడ్డ నడతగలవాడా! ఓ పితామహా!; మనుజుండు= నరుడు; ఎవ్వనిన్= ఏ వాడిని; తలంచి= చింతించి; మహనీయ నిరంజన సిద్ధిన్= గొప్పదైన పరమాత్మయొక్క ప్రాప్తిని; పొందన్+కనున్?= పొందగలుగును?; ఏ+అనువు= ఏ ఉపాయం; తలఁపున్+అలవరించున్= చింతనను మననమును అలవడజేయును?; అని+అడుగుటయున్= అని ప్రశ్నించిన పిదప.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'మునులు కొనియాడదగ్గ నడతగల ఓ పితామహా! ఏ వాడిని స్మరించి నరుడు గొప్పదైన పరమాత్మ స్థితిని పొందగలడు? ఏ మార్గాన దైవధ్యానం అలవడుతుంది?'

భీష్ముఁడు ధర్మజునకు విష్ణుమంత్రప్రభావంబు తెలం గెఱింగించుట (సం. 12-200-3)

వ. ఆ ధర్మతనయుతోడ నద్దేవవ్రతుం డిట్లను; 'నారదునిచేత వినిన తెఱంగు వివరించెద నాకర్ణింపుము. 208

ప్రతిపదార్థం: ఆ ధర్మతనయుతోడన్= ఆ ధర్మరాజుతో; ఆ+దేవవ్రతుండు= ఆ భీష్ముడు (దేవవ్రతుడు - భీష్ముడి మొదటి నామం); ఇట్లు+అనున్= ఈ విధంగా పలికాడు; నారదునిచేతన్= నారదమునినుండి; వినిన తెఱంగు= విన్న విధం; వివరించెదన్= వివరంగా, విస్తారంగా, చెప్పెదను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: 'నీ ప్రశ్నకు సమాధానం నేను పూర్వం నారదమునీంద్రుడి నుండి విని ఉన్నాను. దానిని నీకు వివరిస్తాను విను'మన్నాడు భీష్ముడు.

తే. పరము నక్షరు విష్ణునిఁ బ్రస్తుతించి । నారద మునీంద్రుఁ డంజలి నమితమైన
మస్తకముఁ జేర్చి భక్తిసమగ్రచిత్త । వృత్తి నల్లన యిట్లని విన్నవించె. 209

ప్రతిపదార్థం: పరమున్= శ్రేష్ఠుడిని; అక్షరున్= నాశనంలేనివాడిని; విష్ణునిన్= విష్ణువును; ప్రస్తుతించి= పొగడి; నారదముని+ఇంద్రుఁడు= నారదుడనే మునిశ్రేష్ఠుడు; అంజలి= దోసిలి; నమితము+ఐన= వంగినదైన; మస్తకమున్= తలను; చేర్చి= ఉంచి; భక్తి సమగ్ర చిత్తవృత్తిన్= భక్తితో పరిపూర్ణమైన మనస్సుయొక్క వర్తనతో; అల్లన= మెల్లగా; ఇట్లు+అని= ఈ విధంగా; విన్నవించెన్= విజ్ఞప్తిచేశాడు.

తాత్పర్యం: సర్వశ్రేష్ఠుడూ, నాశరహితుడూ అయిన విష్ణుమూర్తిని నారదమునీంద్రుడు స్తుతించి, వంచిన శిరస్సున అంజలిని నిలిపి, భక్తిప్రపత్తులతో, పరిపూర్ణమైన మనస్సుతో మెల్లగా విన్నవించాడు. (ఈ విధంగా చెప్పబోయేది ఆ ముని విన్నపం.)

విశేషం: అర్థి - యాచకుడు, దాతను దరిచేరేటప్పుడు ఎట్లా ఏ భంగిమలో ఉండాలో అతడి మానసిక స్థితి ఏ తీరున ఉంటే కార్యసిద్ధి జరిగే వీలున్నదో ఈ పద్యం వివరిస్తున్నది.

క. 'దేవా! మోక్షార్థి జనము । లే వెరవున నిన్నుఁ దలఁతు? రే జప్యము సం
భావింతురు? నా కానతి । యీవే? భక్తపరతంత్ర! యేర్పడఁ గరుణన్. 210

ప్రతిపదార్థం: దేవా!= ఓ ప్రభూ! భక్త పరతంత్ర! భక్తులకు లొంగినవాడా!; మోక్ష+అర్థి జనములు= ముక్తిని యాచించే ప్రజలు; ఏ వెరవునన్= ఏ పద్ధతితో; నిన్నున్= మోక్షదాతవైన నిన్ను; తలఁతురు?= చింతిస్తారు?; ఏ జప్యము= ఏ జపం కొరకైన మంత్రాన్ని (జపింప దగిన దానిని); సంభావింతురు?= గౌరవిస్తారు; స్వీకరిస్తారు?; నాకున్= అర్థినైన నాకు; ఆనతి+ఈవే= ఆజ్ఞ ఈయవా?, తెలుపవా?

తాత్పర్యం: 'భక్తులకు లొంగే ఓ ప్రభూ! ముక్తిగోరే జనులు నిన్ను ఏ విధాన తలచుకొంటారు? (అంటే) నిన్ను ఏమని స్మరిస్తుంటారు వారు? వారు జపించే మంత్రమేది? దయతో నాకు ఆనతి ఈయవా ప్రభూ!' అని దీనంగా అర్థించాడు నారదుడు.

తే. అనిన నద్దేవముని పలు కాదరించి । వరదుఁ డగు విష్ణుఁ డిట్లనుఁ బరమభక్తి
నిర్మల శ్రద్ధ యింద్రియనిగ్రహంబు । మన్మయ ధ్యానమునకు నమాత్యకోటి. 211

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= (నారదుడు ఆ విధంగా) అన్న తరువాత; ఆ+దేవముని పలుకు= ఆ దేవఋషి మాట - అర్థన; ఆదరించి= మన్నించి; వరదుండు+అగు విష్ణుఁడు= వరము లిచ్చే విష్ణుమూర్తి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; మత్+మయ ధ్యానమునకున్= (నా విష్ణుమయమైన) నాతో నిండిన ధ్యానమునకు - స్థిరమైన తలపునకు; పరమభక్తి= గొప్ప భక్తిభావం; నిర్మల శ్రద్ధ= స్వచ్ఛమైన శ్రద్ధ - ఆదరం; ఇంద్రియ నిగ్రహంబు= ఇంద్రియాల అణచివేత - కన్ను నోరు వంటి ఇంద్రియాలను లోబరచుకొనటం అనే ఈ లక్షణాలు మూడూ; అమాత్యకోటి= మంత్రిమండలి - ఉపకారకాలు.

తాత్పర్యం: నారదుడి అభ్యర్థనకు సమాధానంగా వరదుడైన విష్ణుమూర్తి ఇట్లా అన్నాడు. 'నన్ను ధ్యానించదలచినవారు ముందుగా గొప్పభక్తిని, నిష్కల్మషమైన శ్రద్ధను, ఆపై ఇంద్రియ నిగ్రహాన్ని అలవరచుకొవాలి. ఈ మూడు లక్షణాలూ విష్ణుధ్యానపరుడికి ఉండవలసినవి. విష్ణుధ్యానక్రియకు అవి సహకారకాలు.

విశేషం: అమాత్యుల ద్వారా రాజును చేరినట్లు, భక్తి శ్రద్ధ నిగ్రహాలద్వారా విష్ణుధ్యానాన్ని అందుకొనవచ్చును. ధ్యానమనే గమ్యం చేరటానికి ఈ మూడూ అనుసరించవలసిన మార్గాలు.

క. విను, వీతకల్మషున కవి । పనుపడుఁ; గల్మషము లెల్లఁ బాపఁగ నా మె
చ్చిన యట్టి పరమసాధన । మనుస్మృతి జపించునది నియతిమెయి దానిన్. 212

ప్రతిపదార్థం: విను= ఓ నారదా! ఆలకించుము; వీత కల్మషునకున్= తొలగిన పాపం కలవాడికి; అవి= ఆ మూడు లక్షణాలు- భక్తి శ్రద్ధా నిగ్రహాలు; పనుపడున్= అలవాటు అగును; కల్మషములు+ఎల్లన్= పాపాలు అన్నిటిని; పాపఁగన్= తొలగించటానికి; నా మెచ్చిన+అట్టి పరమ సాధనము= నేను మెచ్చుకొన్న గొప్ప ఉపకరణం; అనుస్మృతి= అనుసరించి స్మరించుట - మరల మరల తలంచటం; దానిన్= ఆ అనుస్మృతిని; నియతిమెయిన్= నియమ పూర్వకంగా; జపించునది= జపం చేయవలసింది.

తాత్పర్యం: (విష్ణుధ్యాన మలవడాలంటే భక్తి, శ్రద్ధ, నిగ్రహం కావాలని వివరించిన దేవుడు ఇపుడు అవి ఆ సద్గుణాలు ఎట్లా కలుగుతాయో వివరిస్తున్నాడు.) పాపరహితుడికి ఆ మూడు గుణాలూ అలవడతాయి. మరి ఆ పాపపరిహార మార్గమేది? - అంటే పాపాలు అన్నీ నశింపజేయటానికి విష్ణువు నంతటి దేవుడు మెచ్చిన పద్ధతి- అనుస్మృతి - మరల మరల తలచటం నిరంతరమననం. నియమపూర్వకంగా అనుస్మృతిని పాటించాలి- అనుస్మృతినే జపించాలి.

విశేషం: ఈ 'అనుస్మృతి' ఒక ఆరాధన ప్రక్రియగా కనిపిస్తున్నది. దేవుడి దయను పొందటానికి భక్తుడు చేసే నిరంతరస్మరణ ఇది. దీనికి ఒక ఆకారంకూడా ఏర్పడి ప్రచురితమైనట్లు ఈ సందర్భాన్నిబట్టి గమనించవచ్చును.

తే. ప్రణవ పూర్వకమగు నమః పదము పొంత । షడ్గుణైశ్వర్య వాచక సర్వవసన
నిర్వచన శబ్దములు గ్రమనిష్ఠ మెయిఁ జ । తుర్థిఁ గూర్పంగ మంత్రంబు తోఁచు బెరసి. 213

ప్రతిపదార్థం: ప్రణవ పూర్వకము+అగు= ఓంకారం ముందు గలదైన; నమః+పదము పొంతన్= 'నమః' అనే పదం దగ్గర; షట్+గుణ+ఐశ్వర్యవాచక సర్వవసన నిర్వచన శబ్దములు= ఆరుగుణాలను ఈశ్వర స్వభావాలను చెప్పెడి శబ్దాలు (మాహాత్మ్యం, ధైర్యం, యశస్సు, శ్రీ జ్ఞానం, వైరాగ్యం) మొత్తం గృహవాచకశబ్దాలు, (మొత్తం) నిందారహిత శబ్దాలు - ఈ మూడు విధాలయిన శబ్దజాలాన్ని (1. ఈశ్వర వాచకాలు, 2.వసన గృహవాచకాలు, 3. నిర్వచన వాచకాలు); క్రమనిష్ఠ మెయిన్= వరుసగా నిలుకడతో; చతుర్థిన్= నాలుగవ విభక్తిని కొఱకు, కై అనే ప్రత్యయాలను, (సంస్కృతంలో మంత్రాలు చతుర్థి అంతాలుగా ఓం వాసుదేవాయనమః- అన్నట్లుగా ఉంటాయి) మంత్రాలు తెలుగున ఉండవు కాబట్టి ఇక్కడ సంస్కృత చతుర్థిని - జే) అనే దానిని గ్రహించాలి; కూర్పంగన్= చేర్పగా; బెరసి= కలిగి, ఏర్పడి; మంత్రంబు= జనయోగ్యమైన మంత్రం; తోఁచున్= సిద్ధిస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓంకారాన్ని ముందునిల్పి, అనంతరం నమశ్శబ్దాన్ని జోడించి, ఆ తరువాత ఈశ్వర స్వభావాలయిన మాహాత్మ్యం, ధైర్యం, యశస్సు మొదలయిన గుణాలను తెలిపే శబ్దాలను క్రమంగా శ్రద్ధతో చేర్చుకొంటూ, ఆ శబ్దాలకు చతుర్థీవిభక్తిని కలిపితే "ఓం నమో వాసుదేవాయ" "ఓం నమో మహాయశసే" వంటి మంత్రాలు రూపుదిద్దుకొంటాయి.

విశేషం: దేవుడు సర్వాత్మకుడు కాబట్టి సృష్టిలోని సర్వశబ్దాలూ దేవవాచకాలుగా చెల్లుతాయి. విష్ణు సహస్రనామం మొదలయిన చోట్ల ఈ సూత్రం అన్వయిస్తుంది.

క. **తొలి తొలి యిమ్మంత్రము ని । శ్చల మానసుఁడై జపించి జపియింపంగా**
వలయు; ననుస్మృతి దానం । గలుగుఁ జతుర్వర్గ సాధకత పురుషునకున్.' **214**

ప్రతిపదార్థం: తొలి తొలి= ముందు ముందు - మొట్టమొదట; ఈ+మంత్రము= ఈ పైన చెప్పిన మంత్రమును; నిస్+చలమానసుఁడు+ఐ= చలనంలేని మనస్సుగలవాడై (నరుడు); జపించి= జపము చేసి (అనంతరం); అనుస్మృతిన్= అనుస్మృతిని - ఆ పేరగల స్తోత్రమును; జపియింపంగాన్+వలయున్= జపించవలయును; దానన్= దానివలన - అట్లు చేయుటవలన; పురుషునకున్= నరుడికి; చతుర్ వర్గ సాధకత= నాలుగు వర్గాలను, ధర్మ అర్థ కామ మోక్షములను సాధించేవాడి తనం - సాధించే సామర్థ్యం; కలుగున్= ఏర్పడుతుంది.

తాత్పర్యం: పైన చెప్పిన మంత్రాన్ని మున్ముందు నిశ్చలమనస్కుడై నరుడు జపించాలి. ఆ తరువాత 'అనుస్మృతి' పేరగల స్తోత్రాన్ని జపించాలి. అట్లా చేస్తే - ముందుగా మంత్రజపమూ, పిదప అనుస్మృతి స్తోత్రపఠనమూ చేస్తే నరుడికి ధర్మ - అర్థ - కామ - మోక్షాలను సాధించే సామర్థ్యం కలుగుతుంది'.

విశేషం: చిత్తానికి చంచలత్వం సహజలక్షణం. నీటికి ప్రవహించటం, నిప్పునకు పైకెగయటం ఎట్లాంటిదో మనస్సుకు చాంచల్యం అటువంటిది. ఆ చాంచల్యాన్ని నిరోధించగలిగితే ఆధ్యాత్మవిద్యలో సగభాగాన్ని అనుభవానికి తెచ్చుకొన్నట్లే. పూజాపురస్కారాలు, జపతపః ప్రభృతులూ - అన్నీ ఆ లక్ష్యంవైపు - మనశ్చాంచల్య నిరోధంవైపు సాగే సాధనాలే.

క. **అని మఱియు 'దయ ననుస్మృతి । యనుపేరం గలుగుదాని నమ్మునిపతి కి**
ట్లని చెప్పె నచ్యుతుఁడు నిజ । మనఃప్రియం బైన యట్టి మహితస్తవమున్. **215**

ప్రతిపదార్థం: అని= అని పలికి; మఱియున్= ఇంకనూ; దయన్= దయతో; ఆ+మునిపతికిన్= ఆ మునిరాజునకు - నారదుడికి; అనుస్మృతి అనుపేరన్= అనుస్మృతి అనే పేరుతో; కలుగుదానిన్= ఉన్నదానిని; అచ్యుతుఁడు= చ్యుతుడు కానివాడు - విష్ణువు; నిజమనః ప్రియంబు+ఐన+అట్టి మహిత స్తవమున్= తన మనస్సునకు ప్రియమైన ఆ గొప్ప స్తోత్రాన్ని - అనుస్మృతిని; ఇట్లు+అని చెప్పెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: మంత్ర జపం తరువాత అనుస్మృతిని జపించుమన్న భగవంతుడు, దయతో ఆ నారదమునీంద్రుడికి తన మనస్సుకు ప్రీతిపాత్రమైనదీ, గొప్ప శక్తిమంతమయినదీ అయిన 'అనుస్మృతి'ని ఇట్లని చెప్పటం ప్రారంభించాడు.

సీ. **'అవ్యక్తు శాశ్వతు నఖిల ప్రభవ భూమి । భక్తివత్సలు విష్ణుఁ బరమపురుషు**
నక్షయుఁ బ్రాంజలియై యాశ్రయించెదఁ । బుండరీకాక్షుని భువనసాక్షి
నిత్యుఁ బురాణు వర్ణించెదఁ బరు సహ । స్రాక్షు నక్షరుని లోకైకనాథు
భవ్యుఁ గొల్చెద భూతభవ్య భవత్ప్రభు । సర్వతోముఖు భూతసంప్రవర్తి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. **నమృతు నచ్యుతుని ననంతు హృషీకేశు। రవిసహస్రనిభు హిరణ్యగర్భు**
నబ్జనాభు సత్యు నాద్యంతరహితు భూ। గర్భుఁ బ్రభువు భక్తిగమ్యుఁ దలఁతు. 216

ప్రతిపదార్థం: అవ్యక్తున్= ప్రకటంకాని వాడిని; శాశ్వతున్= నిత్యమైన వాడిని; అఖిల ప్రభవ భూమిన్= అన్నింటి పుట్టుకకు ఆధారమైన వాడిని; భక్తవత్సలున్= భక్తులయెడల ప్రేమ గలవాడిని; విష్ణున్= వ్యాపకుడిని - విశ్వమును వ్యాపించి ఉండేవాడిని; పరమపురుషున్= గొప్ప పురుషుడిని; అక్షయున్= నాశనములేనివాడిని; ప్ర+అంజలి+ఐ= దోసిలి పట్టినవాడినై; ఆశ్రయించెదన్= శరణు జొత్తును; పుండరీక+అక్షునిన్= తెల్లదామరలవంటి కన్నులు గలవాడిని; భువనసాక్షిన్= లోకాలకు సాక్షిఅయినవాడిని; నిత్యున్= శాశ్వతమైన వాడిని - నిరంతరం ఉండేవాడిని; పురాణున్= ప్రాచీనుడిని; వర్ణించెదన్= కొనియాడుతాను; పరున్= పరమాత్మను; సహస్ర+అక్షున్= వేయి కన్నులు గలవాడిని; అక్షరునిన్= నాశంలేనివాడిని; లోక+ఏకనాథున్= జగత్తునకు ఒకడే అధిపతి అయినవాడిని; భవ్యున్= శుభకరమైనవాడిని; కొల్చెదన్= సేవించెదను; భూత భవ్య భవత్+ప్రభున్= జరిగిన, జరగగల, జరుగుచున్న కాలాలకు త్రికాలాలకు అధిపతిని; సర్వతః+ముఖున్= అన్ని వైపులా మోము - చూపుగలవానిని; భూత సంప్రవర్తిన్= ప్రాణులను ప్రవర్తింపజేసేవాడిని; అమృతున్= మృతి - మరణం లేనివాడిని; అచ్యుతునిన్= చ్యుతి - జారుట - నాశములేనివాడిని; అనంతున్= అంతము- చివరలేనివాడిని; హృషీక+ఈశున్= ఇంద్రియాలకు అధిపతిని; రవి సహస్ర నిభున్= వేయి సూర్యుల వంటివాడిని; హిరణ్యగర్భున్= బంగారు కడుపు గలవాడిని; అబ్జనాభున్= పద్మం బొడ్డునగలవాడిని; సత్యున్= నిజమైన వాడిని; ఆది+అంతరహితున్= మొదలు తుదిలేనివాడిని; భూగర్భున్= పుడమి కడుపువాడిని; ప్రభువున్= అధిపతిని; భక్తిగమ్యున్= భక్తిచేత చేరదగినవాడిని; తలఁతున్= తలుస్తాను - ధ్యానిస్తాను.

తాత్పర్యం: (ఇది అనుస్మృతి.) నిరంతర స్మరణరూపమైన స్తుతి. దేవుడి లీలలను, ఆకారాలను, చేష్టలను వర్ణించే స్తోత్రం. కనబడనివాడిని, ఎప్పుడూ ఉండేవాడిని, అన్నింటి పుట్టుకకు ఆస్పదమైనవాడిని, భక్తులయెడ ప్రీతి గలవాడిని, విశ్వమంతా వ్యాపించి ఉండేవాడిని, గొప్ప పురుషుడిని, నాశంలేనివాడిని దోసిలి ఒగ్గి సేవిస్తాను - ఆశ్రయిస్తాను. తెల్లతామరలవంటి కన్నులు గలవానిని, లోకాలను (సాక్షిగా) చూస్తుండేవాడిని, ఎప్పుడూ నిలిచి ఉండేవాడిని, ప్రాతవాడిని వర్ణిస్తాను - కొనియాడుతాను. పరమాత్మ స్వరూపుడిని, వేయి కన్నుల వేల్పును, జారుట - నశింపులేనివాడిని, లోకాలకు తానొక్కడే అధినాథుడైనవాడిని, మంగళకరుడిని సేవిస్తాను. జరిగిన, జరగబోయే జరుగుతున్న మూడు కాలాలకూ అధిపతి అయినవాడిని, అన్నింటా ఉండేవాడిని, ప్రాణుల ప్రవృత్తికి కారణమైన వాడిని, మృతిచ్యుతి లేనివాడిని, తుదలేనివాడిని, ఇంద్రియాలకు అధీశుడిని, వేయి సూర్యులతో సమానుడిని, బంగరు కడుపుగలవాడిని, పద్మము నాభిని గలవాడిని, సత్యమైనవాడిని, మొదలు తుదిలేనివాడిని, పుడమి కడుపుగా గలవాడిని, అధిపతిని, భక్తితో చేరదగ్గవాడిని స్మరిస్తాను, ధ్యానిస్తాను.

విశేషం: విష్ణు సహస్రనామ శ్రవణం చేసేవారికి ఈ పదాలూ, ఇట్లాంటి పదాలూ జ్ఞప్తికి వస్తాయి. అంతా తానే అయి, తాను ఏమీ కాని తత్త్వాన్ని ఏ విధంగా వర్ణించినా చెల్లుతుంది. సహస్రనామాలంటే - సరిగా వేయి పేర్లని అర్థంగాదు. అన్ని పేర్లూ ఆయనవే. అన్నీ అందరూ అంతా తానే అయిన దేవుడికి పేరు గాని దేముంటుంది? సహస్ర శబ్దానికి తాత్పర్యార్థం అనంతమని లెక్కకు మిక్కిలి- అని ఇది వ్యవహారంలోనూ ఉన్నదే - 'వేయి చెప్పు నేను విననుు' - వంటి మాటలలో 'వేయి' కూడా ఇటువంటిదే.

తే. **అచలు సూక్ష్ము వరేణ్యు సహస్రశీర్షు। నభయకారి నశీర్షు నారాయణుని స**
నాతనుని యోగమూర్తి లోకాతిరిక్తు। ధ్రువుని నీశ్వరు హరి భక్తితోడఁ గొలుతు. 217

ప్రతిపదార్థం: అచలున్= చలించని - కదలనివాడిని; సూక్ష్మున్= స్థూల దృష్టికి అందనివాడిని వరేణ్యున్= శ్రేష్ఠుడిని; సహస్రశీర్షున్= వేయి తలలవాడిని; అభయకారిన్= భయంలేమిని చేసేవాడిని - అభయమిచ్చేవాడిని; అశీర్షున్= తలలేనివాడిని; నారాయణునిన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విష్ణువును; సనాతమునిన్= సదాతనుని; యోగమూర్తిన్= యోగమే ఆకారంగా గలవాడిని; లోక+అతిరిక్తున్= లోకాలకు మించిన వాడిని; ధ్రువునిన్= శాశ్వతుడిని; ఈశ్వరున్= అధిపతిని; హరిన్= శ్రీహరిని; భక్తితోడన్= భక్తితో; కొలుతున్= సేవిస్తాను.

తాత్పర్యం: స్థిరమైనవాడిని, ఆధ్యాత్మమైనవాడిని, సర్వశ్రేష్ఠుడిని, వేయితలలతో అభయమిచ్చేవాడిని, మొదలు లేనివాడిని, విష్ణువును, ప్రాచీనుడిని, యోగవిద్య ఆకారంగా గలవాడిని, లోకాలకు వెలిగా ఉన్నతంగా ఉండేవాడిని, శాశ్వతుడిని, అధీశ్వరుడిని అయిన హరిని భక్తితో సేవిస్తాను.

విశేషం: సహస్రశీర్షుడూ ఆయనే - అశీర్షుడూ ఆయనే. ఆయనకు విశేషంగా వాడదగని పద మేదీ ఉండదు. సర్వమయుడూ ఆయనే సర్వాతీతుడూ ఆయనే మరి! అందుకనే ఆయన 'సూక్ష్ముడు'.

క. ఎవ్వఁడు సచరాచర గురుఁ, । డెవ్వని నాభీసరోజ మీనె విధాతన్,
నివ్వటిలు జగములన్నియు । నెవ్వనిచే నమ్ముకుందు నెప్పుడుఁ గొలుతున్. 218

ప్రతిపదార్థం: ఏ+వాఁడు= ఏ దేవుడు; సచర+అచర గురుఁడు= కదిలేవాటికి, కదలనివాటికి, అన్నిటికి పెద్ద - ఏలిక; ఎవ్వడి నాభీ సరోజము= ఏ దేవుని బొడ్డున తామరపూవు; విధాతన్= బ్రహ్మదేవుడిని; ఈనెన్= కనెనో; జగములు+అన్నియున్= లోకాలు అన్నీ; ఎవ్వనిచేన్= ఏ దేవుడిచేత - ఎవడికారణంగా; నివ్వటిలున్= కలుగునో; ఆ+ముకుందున్= ఆ విష్ణువును; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; కొలుతున్= సేవిస్తాను.

తాత్పర్యం: సృష్టిలో అనంతమైన భేదాలున్నా, మొత్తం సృష్టిని రెండే రెండు విధాలుగా - భాగాలుగా - భేదాలుగా చేయవచ్చును. ఒకటి కదిలేవి, రెండు కదలనివి. ఈ రెండింటికీ అధిపతి ఆ విష్ణువే. ఆ దేవుని బొడ్డు తామరనుండే సకలసృష్టికీ కర్త బ్రహ్మ పుట్టుకొచ్చాడు. ఆ దేవుడివలననే ఎల్లలోకాలూ ఏర్పడుతున్నాయి - కాగా అట్టి దేవుడిని సదా సేవిస్తాను.

తే. స్థావరములు జంగమములు ధాత లోను । గాఁగఁ బ్రళయంబు నొందిన కాలమునను
నిలుచు నెవ్వఁ డొకండ యానిత్యసత్య । లలితు శార్ఙ్గిఁ బ్రపన్నుఁ గాఁ గొలుతు నియతి. 219

ప్రతిపదార్థం: స్థావరములు= చలనంలేనివి; జంగమములు= తిరిగేడివి; ధాత లోనుగాఁగన్= బ్రహ్మ లోనైనది (సర్వమును); ప్రళయంబున్+ఒందిన కాలమునను= వినాశనం పొందిన సమయాన; ఎవ్వఁడు+ఒకండు+అ= ఏవాడు ఒకడే; నిలుచున్= నశించక నిలబడి ఉంటాడో; ఆ నిత్య సత్య లలితున్= అట్టి నిత్యమైన నిజమైన సుకుమారుడిని; శార్ఙ్గిన్= విష్ణువును; ప్రపన్నుగాన్= శరణుకోరిన వాడినిగా (నేను); నియతిన్= నియమంతో; కొలుతున్= సేవిస్తాను.

తాత్పర్యం: సృష్టిలోని లోకాలన్నిటికీ ప్రళయం - చివరి వినాశం - తప్పదు. అపుడు సృష్టిలో సర్వస్వమూ కదిలేవీ కదలనివీ, బ్రహ్మ మొదలు పిపీలిక (చీమ) వరకు లయమై పోయినా, ఏ ఒక్కడు మాత్రం నశించక నిలిచి ఉంటాడో, ఆ శాశ్వతుడిని, సత్యుడిని, సుకుమారుడిని, శ్రీ మహావిష్ణువును శరణు కోరుతూ నియమంతో సేవిస్తాను.

విశేషం: పుట్టినది ఏదైనా గిట్టక మానదు. బ్రహ్మ పుట్టినవాడేగాబట్టి ప్రళయకాలాన ఆయనకూ గిట్టుట తప్పదు. ఇక్కడ బ్రహ్మకూడా లయమౌతాడని చెప్పటంలో తాత్పర్యమేమిటంటే నిజానికి ఆయనే సకలసృష్టికర్త. ఆయనే నశిస్తే ఆయన సృష్టివిషయంలో చెప్పవలసిన పనిలేదు.

క. కాలముఁ బర్జన్యుండును । నేలయు సస్యంబుఁ గ్రియయు నిష్క్రియయును ధ
ర్మాలోకమునై మహిమన్ । లీల సలుపు వాసుదేవునిం బ్రణుతింతున్. 220

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కాలమున్= క్షణాలూ, గంటలూ, దినాలూ - మాసాలు - వత్సరాల రూపంలో ఉండే కాలమూ; పర్జన్యుండును= మేఘుడును - పంటలకు అధిదేవతయూ; నేలయున్= భూమీ - పంటలకు ఆధారం; సస్యంబున్= పంటా; క్రియయున్= పంటకు-ఇతరానికి హేతువయిన పనీ; నిష్క్రియయును= పని లేకుండుటా; ధర్మ+ఆలోకమును+ఐ= ధర్మం యొక్క వెలుతురు కూడా (తాను) అయి; మహిమన్= గొప్పదనముతో; లీల+చలుపు= వినోదం చేసే; వాసుదేవునిన్= వసుదేవుడి తనయుడిని- శ్రీకృష్ణుడిని; ప్ర+నుతింతున్= కీర్తిస్తాను.

తాత్పర్యం: శ్రీకృష్ణతత్వం మహిమోపేతం. వాసుదేవుడే సృష్టిలో కాలం. అతడే పంటలు పండించే మేఘుడు కూడా. పంటలకు ఆధారమైన నేలా ఆతడే. అంతేకాదు స్వయానపంటకూడా తానే. ఆ పంటకు కావలసిన పనిపాటలూ శ్రీకృష్ణుడే! అంతేకాదు ఏ పనీ లేని స్థితీ శ్రీకృష్ణతత్త్వమే. చివరకు ధర్మానికి వెలుతురూ శ్రీకృష్ణుడే, ఇట్లా అంతా తానే అయి, తన మహిమతో సృష్టివినోదాన్ని నెరపే వాసుదేవుడిని కొనియాడుతాను.

విశేషం: భగవతత్త్వానికి, భగవల్లీలకు వెలి అయిన దేదీ సృష్టిలో లేదు. అంతా భగవన్మయ మీ సృష్టి.

క. **అనలునకు రవికిని శశాం । కునకును గ్రహ తారకములకును దేజం బె**
వ్వనివలన నావహిల్లెడు । ననుపాధిక తేజుఁ గొల్తు నవ్విశ్వాత్మున్. **221**

ప్రతిపదార్థం: అనలునకున్= అగ్నికి; రవికిని= సూర్యుడికీ; శశ+అంకునకును= కుందేలు గుర్తుగా కలవాడికి - చంద్రుడికీ; గ్రహ తారకములకును= (ఆకాశంలోని ప్రకాశించే) గ్రహాలకూ, చుక్కలకూ; ఎవ్వనివలనన్= ఏ దేవుడివలన; తేజంబు= కాంతి; ఆవహిల్లెడున్= కలుగునో; న+ఉపాధిక తేజున్= కారణం లేకయే తేజస్సు కలవాడిని; ఆ+విశ్వ+ఆత్మున్= ఆ విశ్వమే శరీరంగా కలవాడిని; కొల్తున్= సేవిస్తాను.

తాత్పర్యం: సృష్టిలో సూర్యచంద్రులూ, అగ్నీ, గ్రహాలూ, నక్షత్రాలూ - ఇవన్నీ తేజస్సులు చిమ్ముతూ వెలగటానికి ఏ సహజతేజస్సు కారణమో, ఆ విశ్వమయుడిని సేవిస్తాను.

విశేషం: సృష్టిలో తేజస్సమూహమంతా సోపాధికమే - సకారణమే - భగవత్తేజస్సు కారణంగా ఆ తేజస్సులు జ్వలిస్తున్నాయి. కాని, భగవత్స్వరూపమైన తేజస్సు మాత్రం సహజం. ఇతర తేజస్సులకు అది కారణమే కాని, దానికి కారణం మరిలేదు. అదే 'అనుపాధిక తేజము'. దేవుడు తేజోరూపుడనుట.

తే. **నాలుగింటను వెండియు నాలుగింటఁ । రెంట నైదింట మఱియును రెంట వేల్చి**
యజ్ఞశీలు రారాధించునట్టి విష్ణుఁ । డిష్టదాయి ప్రసన్నుఁ డయ్యెడును నాకు. **222**

ప్రతిపదార్థం: నాలుగింటను= నాలుగు అక్షరాలతో - 'ఆశ్రావయ' అనే మంత్రంతో (దీనిలో నాలుగు అక్షరాలున్నాయి); వెండియున్= మరలా; నాలుగింటన్= నాల్గు అక్షరాలతో -'అస్తుశ్రౌషట్' అనే మంత్రంతో (దీనిలోనూ నాలుగు అక్షరాలే); రెంటన్= రెండు అక్షరాలతో- 'వషట్' అనే మంత్రంతో (రెండు వర్ణాలు గలది); ఐదింటన్= ఐదు వర్ణాలతో -'యే యజామహే' అనే మంత్రంతో (ఐదు అక్షరాలు); మఱియును= ఇంకనూ; రెంటన్= రెండు వర్ణాలతో - 'వషట్' మంత్రంతో; వేల్చి= అర్చించి - యజనం చేసి; యజ్ఞశీలురు= యజ్ఞాలు (చేసే) స్వభావం కలవారు; ఆరాధించునట్టి= సేవించునట్టి; విష్ణుఁడు= విష్ణుదేవుడు; ఇష్టదాయి= ఇష్టమును ఇచ్చేవాడు; నాకున్= ఈ అనుస్మృతిని పలికే నాకు; ప్రసన్నుఁడు+అయ్యెడును= అనుగ్రహం గలిగినవాడు అగుగాక! నన్ను అనుగ్రహించు గావుత!

తాత్పర్యం: యజ్ఞనిర్వహణంలో మంత్ర పూర్వకంగా దేవతలను తృప్తి పరచటం జరుగుతుంది. అట్టిచో విష్ణుదేవుడికి ప్రియమైన మంత్రాలను సంఖ్యానిర్దేశంతో తెల్పుతూ ఆయా మంత్రాలతో యాజులు ఆరాధిస్తే ఇష్టాలు ఒనగూర్చే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విష్ణుదేవుడు నా యెడకూడా ప్రసన్నుడౌగాక - అని భక్తుడు వేడుకొంటున్నాడు. ఇక విష్ణుప్రీతికి పాత్రమైన మంత్రాలు 'ఆశ్రావయ' 'అస్తుశ్రౌషట్', 'యేయజామహే', ' వషట్' అనేవి.

విశేషం:. యజ్ఞశబ్దానికి మొదటి అర్థం 'పూజ'. అనంతరం అది ఒక పెద్ద 'క్రతువు'గా రూపొందింది.

ఆ. యజ్ఞధరుఁడు పంచయజ్ఞుండు లక్ష్మికి । నునికిపట్టు యోగమునకు నెలవు
సర్వమునకు నిష్టసదనంబుగా నొప్పు । వాని నాశ్రయింతు వరదుఁ బరము. 223

ప్రతిపదార్థం: యజ్ఞధరుఁడు= యజ్ఞమును ధరించినవాడు; పంచయజ్ఞుఁడు= ఐదు యజ్ఞములు - వేదపఠనం, వైశ్వదేవం, అతిథిపూజ, పితృతర్పణం, భూతబలి కలవాడు; లక్ష్మికిన్= సిరికి; ఉనికిపట్టు= నివాస స్థానం; యోగమునకున్= యోగ విద్యకు; నెలవు= తావు - ఆవాసము; సర్వమునకున్= అంతటికీ; ఇష్టసదనంబు గాన్= ప్రియమైన ఇల్లుగా - అన్నిటికీ ఆస్పదమైనవాడుగా; ఒప్పు= వెలుగు; వానిన్= అతడిని - ఆ దేవుడిని; వరదున్= వరాలు ఇచ్చేవాడిని; పరమున్= పరమాత్మను; ఆశ్రయింతున్= శరణు పొందుతాను.

తాత్పర్యం: విష్ణుమూర్తి యజ్ఞధారి - యజ్ఞగర్భుడు, వేదపఠనం మొదలైన ఐదు యజ్ఞాల స్వరూపం తాల్చినవాడు. లక్ష్మికి నివాసమైనవాడు, యోగానికీ, ఇంకా ఎన్నింటికో ఉత్తమమైన, కోరదగిన అన్నింటికీ ఆస్పదమైనవాడు, వరాలకు దాత - పరమాత్మ; అతడిని ఆశ్రయిస్తాను.

క. అగమనునిం బాంథు నఖిల । జగద్భరణపరు నమూర్తి సాగరనిభ బో
ధ గరిష్ఠుఁ బంచకాల । జ్ఞు గుణాత్మకు నిర్గుణత్వ శోభితుఁ గొలుతున్. 224

ప్రతిపదార్థం: అగమనునిన్= గమనం-నడకలేనివాడిని; పాంథున్= బాటసారిని (నడిచేవాడిని); అఖిల జగత్+భరణపరున్= మొత్తం లోకమును భరించటంలో ఆసక్తుడిని - భరించేవాడిని; అమూర్తిన్= ఆకారం లేనివాడిని; సాగరనిభ బోధ గరిష్ఠున్= సముద్రంతో సమానమైన జ్ఞానంతో మిక్కిలి గొప్పవాడిని; పంచకాలజ్ఞున్= ఐదు కాలాలను ఎరిగిన వాడిని; గుణ+ఆత్మకున్= గుణములు ఆత్మయందు కలవాడిని; నిర్గుణత్వ శోభితున్= గుణరహితతత్త్వంతో ప్రకాశించేవాడిని; కొలుతున్= సేవిస్తాను.

తాత్పర్యం: భగవల్లీలలు విచిత్రంగా ఉంటాయి. వాటిలో వైరుధ్యాలు గోచరిస్తాయి - స్థూలదృష్టికి, దేవుడు నడక లేనివాడయి కూడా గమనశీలిగా పాంథుడిగా భాసిస్తాడు. లోకాలు మొత్తం మోస్తూ కూడా తాను ఆకారమే లేకుండా ఉంటాడు. సముద్రమంత తెలివితో అందరికంటె గొప్పవాడు. ఐదు కాలాలూ తెలిసినవాడు. (ప్రాతఃకాలం, సంగమకాలం, మధ్యాహ్నకాలం, అపరాహ్ణకాలం, సాయంకాలాలు ఆయనకు తెలుసును.) ఎట్లంటే - స్వయంగా ఆయన కాలస్వరూపుడు మరి! గుణగణాలకు నిలయమైనవాడూ ఆయనే - నిర్గుణుడూ ఆయనే. అటువంటి గొప్పదేవుడిని సేవిస్తాను.

విశేషం: భగవద్వర్ణనలోని విరోధాలన్నీ నిజానికి ఆభాసమాత్రాలు. వాస్తవాలు కావు. స్థూల దృష్టికి విరోధం. సూక్ష్మదృష్టికి ఆభాసం- అయథార్థం.

క. వ్యక్తమునకుఁ బ్రభవం బ । వ్యక్తం బాతత్త్వమునకు నవల యను వచో
యుక్తికిఁ బరాయణం బగు । భక్తపరాధీను భవ్య భావ్యు నుతింతున్. 225

ప్రతిపదార్థం: వ్యక్తమునకున్= వ్యక్తమైన - ప్రకటితమైన - కనిపించేదానికి; ప్రభవంబు= కారణం; అవ్యక్తంబు= వ్యక్తం కానిది; ఆ తత్త్వమునకున్= ఆ అవ్యక్తతత్త్వానికి కూడా; అవల= అటువైపు - ఆవలితనము; అను వచస్+యుక్తికిన్= అనే మాట తీరునకు;

పరాయణంబు+అగు= ఆశ్రయమైన; భక్తపర+అధీనున్= భక్తులకు లోబడినవాడిని; భవ్యభావ్యున్= శుభమునకై భావించదగ్గవాడిని; నుతింతున్= స్తుతిస్తాను.

తాత్పర్యం: సృష్టి వ్యక్తరూపం; దానికి మూలం అవ్యక్తం - వ్యక్తంకానిది. అయితే ఆ అవ్యక్తానికి కూడా అందక దానికి ఆవల ఉండేది విష్ణుతత్త్వం. అంత గంభీరమైనది అది. అట్టి సర్వోన్నతతత్త్వానికి ఆశ్రయమైనవాడు అయినా భక్తులకు మాత్రం బానిస అయిన ఆ దేవుడు శుభకామనగల ఎల్లవారికీ భావింపదగ్గ, సేవింపదగ్గవాడు. అతడిని స్తుతిస్తాను.

విశేషం: విజ్ఞానశాస్త్రం, తత్త్వశాస్త్రం కలిసే స్థలాలు అక్కడక్కడా అపుడపుడు తటస్థపడుతుంటాయి. ఇక్కడ అది జరిగినట్లుంది. అవ్యక్తం నుండి వ్యక్తం ఉద్భవిస్తుం దంటుంది తత్త్వశాస్త్రం. దీనితో వైజ్ఞానికులు విభేదించరు. ఎందుకంటే అవ్యక్తం శూన్యం కాదు కాబట్టి.

క. **జ్ఞాన ధ్యాన పరాయణు। లైన మహాత్ములు జితేంద్రియత్వ మహితు లె**
వ్వానిం బొందిన మరలరు। వాని శరణుఁ జొచ్చి బ్రదుకువాఁడ సుకృతినై. 226

ప్రతిపదార్థం: జ్ఞాన ధ్యాన పరాయణులు+ఐన= జ్ఞానంలో, ధ్యానంలో (మాత్రం) ఆసక్తులయిన; మహా+ఆత్ములు= గొప్ప ఆత్మలు కలవారు; జిత+ఇంద్రియత్వ మహితులు= ఇంద్రియాలను జయించినతనంతో పూజ్యులు; ఏ వానిన్= ఏ దేవుడిని; పొందినన్= చేరినచో; మరలరు= తిరిగిరారో; వానిన్= అట్టి దేవుడిని; శరణు+చొచ్చి= శరణు - ఆశ్రయం పొంది; సుకృతిని+ఐ= పుణ్యాత్ముడనై; బ్రదుకువాఁడన్= జీవిస్తాను.

తాత్పర్యం: లోకంలో అసాధారణు లయిన మహాత్ము లున్నారు. వారికి జ్ఞానం, ధ్యానం - ఈ రెండే నిత్యకృత్యాలు. వారు ఇంద్రియాలను జయించి, పూజలందుకొనే గొప్పవారు. అట్టి మహాత్ములు ఏ దేవుడిని చేరి పునర్జన్మ లేకుండా ముక్తిని పొందుతారో - ఆ గొప్ప దేవుడిని - విష్ణుమూర్తిని పుణ్యాత్ముడనై ఆశ్రయించి జీవిస్తాను.

విశేషం: ఈ దేశాన వేదాంతులు కోరే చివరి దశ మోక్షం. ఆ మాటకు అర్థం ఎడబాటు - విడివడుట అని. ఎడబాటు దేనినుండి? జన్మ పరంపర నుండి. పునర్జన్మ లేకుండా ఉండగలగటమే ముక్తి. అది ఇక్కడి పురుషప్రయోజనాలలోకూడా చివరిది, గొప్పది.

క. **లోకం బంతయు నెవ్వం। డేకాంశంబునన నిర్వహించుచు నగ్రా**
హ్యాకారుండై వెలుఁగు ద। యాకరు నప్పద్మనాభు నభివర్ణింతున్. 227

ప్రతిపదార్థం: ఎవ్వండు= ఏ దేవుడు; లోకంబు+అంతయున్= జగత్తు మొత్తాన్ని; ఏక+అంశంబునన్+అ= (తన) ఒక అంశం-భాగంతోనే; నిర్వహించుచున్= మోస్తూ - జరిపిస్తూ; అగ్రాహ్య+ఆకారుండు+ఐ= గ్రహించనలవిగాని స్వరూపం కలవాడై; వెలుఁగు= ప్రకాశించునో; దయాకరున్= దయను చేసే (చూపే)వాడిని; ఆ+పద్మనాభున్= పద్మం బొడ్డునగలవాడిని - విష్ణువును; అభివర్ణింతున్= బాగా పొగడుతాను.

తాత్పర్యం: ఈ కనిపించే లోకం చాలా పెద్దది. ఇంత పెద్ద లోకాన్నంతటినీ తనలోని ఒక చిన్న అంశతోనే నడుపుతూ, తాను మాత్రం అగుపించకుండా, తన ఆకారాన్ని గ్రహించటానికి వీలులేనిదానినిగా అమర్చుకొన్న ఆ తేజోమయుడిని, దయాశాలిని - విష్ణుమూర్తిని అభివర్ణిస్తాను.

తే. **అయిదు దెఱఁగులఁ బ్రకృతిఁ బంచాననముల। ననుభవించు క్షేత్రజ్ఞు సత్త్వాది గుణ చ**
యంబు లీల భుజించు మహత్త్వ కలితు। సంశ్రయింతు మదాత్మ ప్రసక్తిఁ గోరి. 228

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అయిదు తెఱఁగులన్+ప్రకృతిన్= ఐదు విధాలయిన మూల సృష్టిని; పంచ+ఆననములన్= ఐదు ముఖాలతో; అనుభవించు క్షేత్రజ్ఞున్= చవిచూచే ఆత్మ స్వరూపుడిని; సత్త్వ+ఆది గుణచయంబున్= సత్త్వం మొదలయిన గుణాల సమూహాన్ని; లీలన్= వినోదంగా, విలాసంగా; భుజించు= భక్షించు - మ్రింగివేయు; మహత్త్వ కలితున్= గొప్పతనంతోకూడిన వాడిని; మత్+ఆత్మ ప్రసక్తిన్+కోరి= నా ఆత్మయొక్క చొరబాటును అభిలషించి; సంశ్రయింతున్= ఆశ్రయిస్తాను.

తాత్పర్యం: సృష్టికికర్త దేవుడు; దానికి భోక్త కూడా ఆయనే. తుదకు వినాశకర్త కూడా ఆయనే. పంచభూతాలతోడి ఈ ప్రకృతిని దేవుడు తన ఐదు ముఖాలతో అనుభవిస్తూ క్షేత్రజ్ఞుడుగా వెలుగుతున్నాడు. సృష్టిలోని జీవజాలాల ప్రవృత్తులకు కారణభూతాలైన సత్త్వరజస్తమోగుణాలను చివరకు ఆయనే తనలో లీనం చేసికొంటున్నాడు. అట్టి గొప్పతనంతో కూడిన భగవంతుడిని నా ఆత్మ ఏకాగ్రతకొరకు ఆశ్రయిస్తాను.

విశేషం: మన ఆరాధనలు, పూజలు, పురస్కారాలు - అన్నీ చిత్త ఏకాగ్రతకొరకు ఉద్దిష్టమైనవి. మనస్సు ఏకాగ్రమైతే, నరుడు నారాయణుడు కావచ్చునని మన తాత్త్వికుల బోధ.

క. మతి గల సాంఖ్యులు, యోగా । న్వితులు నగుమహాత్ము లెవ్వనిం గని పున రా
గతిలేని సుగతి వడయుదు । రతర్క్య వైభవునిఁ దలఁతు నప్పరమాత్మున్. 229

ప్రతిపదార్థం: మతిగల= బుద్ధిగల; సాంఖ్యులు= సాంఖ్యయోగులు - పంచభూతాలు - వాటి పంచ గుణాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారం, ప్రకృతి, జీవుడు మున్నగు ఇరవై ఐదు తత్త్వాలతోడి పరమాత్మ ధ్యానమును చేసేవారు; యోగ+అన్వితులున్= యోగవిద్యతో కూడినవారూ; అగు మహా+ఆత్ములు= ఐన గొప్ప మనస్సులు కలవారు; ఎవ్వనిన్+కని= ఏ దేవుడిని చూచి (పొంది); పునః+ఆగతి లేని= మరలి రావటం లేని; సుగతి+పడయుదురు= మోక్షాన్ని పొందుతారో; ఆ+పరమ+ఆత్మున్= ఆ పరమాత్మ - పరబ్రహ్మ స్వరూపుడిని; అతర్క్య వైభవునిన్= ఊహించరాని విభవం - సంపత్తి గలవాడిని; తలఁతున్= స్మరిస్తాను.

తాత్పర్యం: బుద్ధిమంతులైన సాంఖ్యయోగులూ, ఇతర యోగవిద్యాప్రవీణులూ అయిన మహాత్ములు ఏ దేవుడిని చేరిన పిదప, ఇక మరలిరాని ముక్తిని - పునర్జన్మ రాహిత్యాన్ని పొందుతారో, ఆ పరబ్రహ్మ స్వరూపుడిని, ఊహకందని గొప్ప వైభవముగల ఆ దేవదేవుడిని స్మరిస్తాను.

విశేషం: సాంఖ్యమనేది ఒక యోగానికి పేరు. సంఖ్యా శబ్ద నిష్పన్నం సాంఖ్యం. ఈ యోగవిద్య సంఖ్యమీద ఏర్పడినట్లుగా ఉంటుంది. పంచభూతాలు - పంచగుణాలు, పంచ ఇంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, మనో బుద్ధి అహంకార ప్రకృతి జీవులు ఐదు- ఇట్లా ఈ 5×5= 25 తత్త్వాలతోడి శాస్త్రమిది. మనకున్న దర్శనాలలో ఒక ముఖ్యమైనది.

క. ఇనునడుమ వెలుంగుచు సో । ముని మధ్యమునం జలత్వముం బొందని ని
ప్పున వెలయు దీప్తి యగు వా । ని నిరంజను నంతరాత్మునిం బాటింతున్. 230

ప్రతిపదార్థం: ఇను నడుమన్= సూర్యుడి మధ్యభాగాన; వెలుంగుచున్= ప్రకాశిస్తూ; సోముని మధ్యమునన్= చంద్రుడి నడిమి భాగాన; జలత్వమున్+పొందని= నీటితనమును చెందనివానిని; నిప్పునన్= అగ్నియందు; వెలయు= వెలిగే; దీప్తి+అగువానిన్= కాంతి - ప్రకాశము అయినవాడిని; నిరంజనున్= పరమాత్మను; అంతర్+ఆత్మునిన్= లోపలి (నరుడిని) ఆత్మయైనవాడిని; పాటింతున్= (స్మరిస్తాను) గౌరవిస్తాను.

తాత్పర్యం: విష్ణుతత్త్వం తేజోమయం. విష్ణువు సూర్యుడి నడుమ వెలుగుతుంటాడు. చంద్రుడిలో కూడా విష్ణుడు నడుమ నిలిచి, ఆ చల్లదనానికి నీరుగాకుండా నిలిచి ఉంటాడు. నిప్పులోని వెలుగూ వైష్ణవమే. ఈ విధంగా సర్వ తేజస్సులకూ తేజస్సుగా నిలిచిన అంతరాత్మస్వరూపుడైన ఆ పరమాత్మను గౌరవిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: సృష్టమైనదేదీ సూర్యచంద్ర అగ్నులలో నిలిచి ఉండలేదు. స్రష్టకే (సృష్టిని చేసేవాడు బ్రహ్మ) స్రష్ట గాబట్టి విష్ణువు ఆ మూడు మహాతేజస్సుల నడుమ నిలిచి ఉన్నాడు.

క. సోమార్కాగ్నిమయముఁ దా । రామయమును నిత్య సుస్థిరంబును నగు తే
జోమయతత్త్వము నాత్మా । రామత్వంబున నిరంతరంబును జూతున్. 231

ప్రతిపదార్థం: సోమ+అర్క+అగ్ని మయమున్=చంద్రుడు, సూర్యుడు, అగ్నితో నిండినదానిని; తారామయమును= నక్షత్రాలతో నిండినదియు; నిత్య సుస్థిరంబును+అగు= ఎల్లప్పుడూ గట్టిగా నిలిచి ఉండేదీ అగు; తేజస్+మయతత్త్వము= కాంతితో నిండిన బ్రహ్మమును; ఆత్మ+ఆరామత్వంబునన్= ఆత్మయందే విహరించే శీలంతో; నిర్+అంతరంబును= ఎడం లేకుండా - ఎల్లప్పుడూ; చూతున్= చూస్తాను.

తాత్పర్యం: విష్ణుతత్త్వం తేజోమయం. చంద్రుడిలో, సూర్యుడిలో, అగ్నిలో ఉన్నది విష్ణువే. నక్షత్రాలలోని వెలుగూ వైష్ణవమే - విష్ణువునకు చెందినదే. ఈ వైష్ణవతేజస్సు నిత్యమైనది, సుస్థిరమైనది కూడా. ఇట్టి ఈ కాంతిమయ తత్త్వాన్ని అంతర్దృష్టితో ఆత్మలోనే నిరంతరం దర్శిస్తుంటాను.

విశేషం: ఈ దైవతత్త్వం ఎవరెన్ని విధాల వర్ణించి చెప్పినా, చివరకు అనుభవైకవేద్యమే. ఎందుకంటే, మాటలకు ఆలోచనలకు ఎంత విస్తృతి ఉన్నా కాని, పరిమితులూ, పరిధులూ ఉన్నాయి. అవి (వాక్కు, మనస్సు) చెల్లని చోటులు లోకానుభవంలోనే మనకు ఎదురవుతుంటాయి. ఉదా: 'బెల్లం తియ్యగా ఉంటుంది'. 'తియ్యగా' అంటే ఏమిటి? తియ్యన ఒక రకంగా గుర్తించగలమే గాని, ఎదుటివానికి స్వానుభవానికి దూరంగా ఎరుకపరచగలమా? ఈ స్వల్ప విషయమే ఇట్లా ఉంటే, దైవతత్త్వం మహా దొడ్డది - దాని విషయం వేరే చెప్పాలా? అయినా నరుడి ప్రయత్నాలు దైవతత్త్వవర్ణనలో కొనసాగుతూనే ఉన్నాయి.

క. గుణములకు నాదియై ని । ర్గుణమ్ములకు నాద్యుఁడగు నరూపుని లక్ష్మీ
ప్రణయవరు నజుని సూక్ష్ముని । బ్రణుతింతుఁ బ్రసన్నుఁగాఁ బరము సర్వగతున్. 232

ప్రతిపదార్థం: గుణములకున్= (సృష్టిలోని) వస్తువులలోని ధర్మములకు; ఆది+ఐ= మొదలై; నిర్+గుణమ్ములకున్= గుణముల లేమికి కూడా; ఆద్యుఁడు+అగు= మొదటివాడగు; అరూపునిన్= రూపంలేని వాడిని; లక్ష్మీ ప్రణయవరున్= లక్ష్మీదేవి ప్రేమను పొందినవాడిని; అజునిన్= పుట్టుకలేనివాడిని; సూక్ష్మనిన్= ఆధ్యాత్మమైన వానిని; పరమున్= పరమాత్మను; సర్వగతున్= అంతటా ఉండేవాడిని; ప్రసన్నున్+కాన్= అనుగ్రహించేవాడగుటకు; ప్ర+నుతింతున్= బాగుగా పొగడుతాను.

తాత్పర్యం: విష్ణుతత్త్వం విచిత్రంగా ఉంటుంది. విష్ణువు సృష్టిలోని వస్తుగత గుణగణాలు అన్నిటికీ మొదటివాడు. అయినా స్వయంగా గుణాతీతుడుగా గుణరహితుడుగా కూడా ఉంటాడు. ఆయనకు స్వరూపమే లేదు - అంతటా అన్నిటా ఉండేవాడికి ఒక్క స్వరూపం ఎట్లా ఉంటుంది మరి! అయినా విష్ణువు శ్రీలక్ష్మీప్రణయాన్ని అందుకొన్నవాడు- అంటే సాకారుడన్నమాట. నిరాకారుడూ అతడే; సాకారుడూ అతడే. విష్ణువు పుట్టుక లేనివాడు, ఆధ్యాత్మికమైన ఉనికి కలవాడు. అంతా వ్యాపించి ఉండేవాడు విష్ణువు. పరమాత్ము డతడు. అట్టి దేవుడిని అనుగ్రహం కొరకు నుతిస్తాను.

విశేషం: గుణాలు వ్యక్తినిష్ఠాలు - వ్యక్తిలో ఉండేవి. వ్యక్తి ఆత్మకు నిలయం. ఆత్మ పరమాత్మకు రూపాంతరం. కాబట్టి గుణాలకు ఆద్యుడే దేవుడు. పరమాత్మ సర్వవ్యాపకమైనది. సర్వప్రాణిగతమైనది కూడా. కాబట్టి ఈ సర్వగతత్త్వమున్నచోట ఏకవ్యక్తి గుణాల ఉనికి అసంభవం. కాగా నిర్గుణుడూ ఆయనే. ఈ విధంగా తర్కసహాయంతో ఈ విశేషణాలను సమర్థించుకొనాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **కలయంగ నెల్లయెడలం। దలలును లోచనములును వదనములు నగు ని**
ర్మలు నిర్వికారు నిన్నుం। గొలిచెద సర్వైకసాక్షి గోవింద హరీ! **233**

ప్రతిపదార్థం: గోవింద!= ఓ విష్ణుమూర్తీ!; హరీ!= ఓ నారాయణా!; కలయంగన్= బాగుగా; ఎల్ల+ఎడలన్= అన్ని ప్రదేశాలలో; తలలును= శిరస్సులూ; లోచనములును= కన్నులూ; వదనములున్= మోములూ; అగు నిర్మలున్= కల మలినరహితుడిని; నిర్‌వికారున్= వికారాలు లేనివాడిని; సర్వ+ఏక సాక్షిన్= అన్నింటికీ ఒక్కడే సాక్షిఅయినవాడిని; నిన్నున్= నిన్ను హరిని; కొలిచెదన్= సేవిస్తాను.

తాత్పర్యం: ఓ శ్రీహరీ! నీది విశ్వరూపం. అన్ని ఎడలా నీ శీర్షాలే, నీ లోచనాలే, నీ ముఖాలే, అయినా మలిన మంటని వాడవు. సృష్టి నిజానికి వికృతిమయం. కాని, నీవు వికృతులు లేనివాడవు. సృష్టిసర్వస్వానికి ఏకసాక్షిగా నిలిచే నిన్ను సేవిస్తాను దేవా!

క. **నిను నెఱుఁగకున్న సంసా। ర నిమగ్నత వోదు; గోచరము గావు మనం**
బునకు నఖిలేంద్రియములకు। నను నేమనువాఁడ నిఁక నారాయణుఁడా! **234**

ప్రతిపదార్థం: నారాయణుఁడా!= ఓ నారాయణస్వామీ!; నినున్= సర్వవ్యాపకుడవైన నిన్ను; ఎఱుఁగక+ఉన్నన్= తెలియకుండా ఉంటే; సంసార నిమగ్నత= సంసారమున (కుటుంబమున) మునిగి ఉండటం; పోదు= తొలగదు; (నీవు) మనంబునకున్= మనస్సునకు గాని; అఖిల+ఇంద్రియములకున్= ఎల్ల ఇంద్రియాలకూ - కన్ను ముక్కు వంటివాటికి; గోచరము కావు= కనిపించవు-తెలియవు; ఇంకన్= ఇకమీదట - ఈ స్థితి ఇట్లా కొనసాగగా; ననున్= శక్తిహీనుడనైన నన్ను; ఏమి+అనువాఁడన్= ఏమి నిందించుకొంటాను? (నన్ను నేను ఏమని నిందించుకొనేది దేవా!)

తాత్పర్యం: దేవా! నీ తత్త్వం గ్రహిస్తే తప్ప ఈ సంసారబంధం విడిపోదు. నీ వేమో ఎల్ల ఇంద్రియాలకు కాదు కదా, మనస్సుకూ కనిపించవు, తెలియరావు. ఇక నన్ను నేను ఏమనుకోవాలి? (నన్ను నేను ఏమని అనాలి!)

విశేషం: దైవజ్ఞానం లోకజ్ఞానంకంటె భిన్నమైనది. లోకజ్ఞానానికి ఇంద్రియాలూ, మనస్సు చాలు. కాని, దైవజ్ఞాన - అవాప్తికి ఈ రెండూ యథాతథంగా - ఉన్నవి ఉన్నట్లుగా పనికిరావు. అందుకనే 'నీవు గోచరించనందుకు నన్ను నేను ఏమనాలి?' అని నిర్వేదం వెలువరిస్తున్నాడు భక్తుడు.

క. **రోషముఁ గామము రాగ। ద్వేషములును లేక భక్తి తిరమై యేకా**
శ్లేషిణిగాఁ గొలుతు రవి। శ్లేష మనోనిలయ వృత్తి సిద్ధులు నిన్నున్. **235**

ప్రతిపదార్థం: సిద్ధులు= సిద్ధిపొందినవారు; రోషమున్= కోపమూ; కామమున్= కోరికా; రాగద్వేషములును= ప్రేమా, పగా ఇవన్నీ; లేక= ఉండకుండా; భక్తి= భజనభావం; తిరము+ఐ= స్థిరమై; ఏక+ఆశ్లేషిణి+కాన్= ఒకటే (తాను) సంసక్త మౌనట్లుగా; అవిశ్లేష మనస్+నిలయ వృత్తిన్= విడిపోని మనస్సు అనే ఇంట ఉండటంవలన; నిన్నున్= పరమాత్మవైన నిన్ను; కొలుతురు= సేవిస్తారు.

తాత్పర్యం: సిద్ధిని - వాంఛితార్థాన్ని పొందినవారు మాత్రం నిన్ను చూడగలుగుతున్నారు. కొలువ గలుగుతున్నారు. వారు కోపం, కోరిక, ప్రేమ, పగ వంటి వికృత భావాలను విడిచిపెట్టి, కేవలం భక్తినే ఆశ్రయించి, నిరంతరం ఆ భావంనుండి బయటపడక, వారి మనస్సులనే ఇళ్ళలో కాపురముండే నిన్ను చూడగలుగుతున్నారు, సేవిస్తున్నారు.

విశేషం: దైవతత్త్వ దర్శనానికి అనేక మార్గాలు ఉన్నాయి. వాటిలో భక్తి మార్గం సుగమం. అందరికీ అందుకొనదగ్గది. దాన్ని వివరించాడు ఇక్కడ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఫలములు గోరక కర్మం । బులు నడపుచు వాని విమలబోధాగ్నిహతిం
బొలియించుచు నిర్ద్వంద్వత । నెలకొను నేకాంతిజనులు నినుఁ గంద్రు హరీ! 236

ప్రతిపదార్థం: హరీ!= ఓ విష్ణూ!; ఫలములు= ఫలితాలు; కోరక= ఇచ్ఛగించక; కర్మంబులు= పనులు; నడపుచు(న్)= నిర్వహిస్తూ; వానిన్= ఆ ఫలితాలను - పనులవలన ఒనగూడే ప్రయోజనాలను; విమల బోధ+అగ్నిహతిన్= నిర్మలమైన జ్ఞానం అనే నిప్పు తాకిడితో; పొలియించుచున్= నశింపజేస్తూ; నిర్ద్వంద్వత= ద్వంద్వములు - సుఖదుఃఖములు, మంచి చెడులు, ప్రేమ, ద్వేషం వంటి సహజములైన జంటలు లేకుండటం; నెలకొను= స్థిరపడిన - ఏర్పడిన; ఏక+అంతిజనులు= చిత్త ఏకాగ్రతగలవారు; నినున్= సర్వవ్యాపివయిన నిన్ను; కంద్రు= చూస్తారు.

తాత్పర్యం: ఓ విష్ణూ! నీ విశ్వరూప సందర్శనం కావాలంటే నరులు వారి నడతలు, ఆలోచనలు మార్చుకొనాలి. ఫలితాలు ఆశించకుండా పనులు నిర్వహించుకుంటూ పోయి, తుదకు ఆ కర్మఫలాలను నిర్మలజ్ఞానమనే నిప్పు తాకుతో హరించివేసికొని, సుఖదుఃఖాలు, ప్రేమద్వేషాలువంటి ద్వంద్వాలకు అతీతంగా ఏకాగ్రచిత్తులై నిలువగలిగిన ఘనులే నిన్ను దర్శించగలరు.

విశేషం: మనవేదాంత పరిభాషలో ముక్తి, మోక్షం అనే మాటలకు జన్మరాహిత్యం తాత్పర్యం. తిరిగి పుట్టకపోవటమే - జన్మచక్రం నుండి బయటపడటమే ముక్తి. పునర్జన్మలకు వాసనలు మూలమంటారు. ఆ వాసనలు కర్మఫలాలనుండి, వాటికై పడే తాపత్రయాల నుండి ఏర్పడుతాయట. అందుకని ఫలంతో ప్రమేయంలేకుండా, అసలు ఆ కోరికే లేకుండా కర్మనిర్వహణం చేయాలని మన వేదాంతశాస్త్రం బోధిస్తుంది. కోరిక లేకపోతే వాసన ఉండదు. వాసన లేక జన్మ లేదు. అలంకారం - రూపకం.

క. దేహస్థు నదేహు నఖిల । దేహిసమున్ నిన్ను భక్తిఁ దెలుతురు దురిత
వ్యూహమ్ముఁ బుణ్యచయము న । మోహత నిరసించు యోగిముఖ్యులు కృష్ణా! 237

ప్రతిపదార్థం: కృష్ణా!= ఓ కృష్ణమూర్తీ! దేవా!; దేహస్థున్= దేహంలో ఉన్నవాడిని; అదేహున్= దేహంలేనివాడిని; అఖిల దేహిసమున్= అందరు దేహధారులకు - అన్ని ప్రాణులకు సమానుడయిన వాడిని; నిన్నున్= విశ్వరూపివైన నిన్ను; దురిత వ్యూహమ్మున్= పాపముల సమూహమును; పుణ్యచయమున్= పుణ్యాల ప్రోగును; అమోహతన్= మోహం (తీవ్రకాంక్ష) లేనితనంతో; నిరసించు= తిరస్కరించే; యోగిముఖ్యులు= శ్రేష్ఠులయిన యోగులు; భక్తిన్= భక్తి భావంతో; తెలుతురు= మ్రొక్కుదురు.

తాత్పర్యం: విష్ణువు దేహాన ఉన్నవాడు, కాని, దేహం (స్వయంగా) లేనివాడు. ఎల్ల జీవజాలమూ ఆ దేవుడికి సమానమే. అట్టి ఆ దేవుడిని తెలియగలవారు - గ్రహించగలవారు మాత్రం యోగిశ్రేష్ఠులు. వారు పాపాలనూ పుణ్యాలనూ రెంటినీ తిరస్కరించి, కేవలం భక్తితో ఆ దేవదేవుడికి నమస్కరిస్తారు.

విశేషం: ముక్తిసాధనలో తొలుత పాపపరిహారం కర్తవ్యం. తరువాత పుణ్యాసంచయనం కార్యం. ఆ తరువాత, పాపపుణ్య ద్వంద్వ తిరస్కారం ఆచరణీయం.

చ. ప్రకృతియు, బుద్ధ్యహంకృతులు, భావము, భూతచయంబు, నింద్రియ
ప్రకరముఁ గేశవా! భవదుపాశ్రయ భాసిత వర్తనంబు; లా
సకలమునందు నీవును బ్రసన్నత ని; ల్తవి నీకు, నీవు వా
నికి నిలువంగఁ బట్టగుట నిక్కముగా నిటులై వెలుంగవే? 238

ప్రతిపదార్థం: కేశవా!= ఓ విష్ణూ!; ప్రకృతియున్= స్వభావమును; బుద్ధి+అహంకృతులున్= బుద్ధి, అహంకారం అనేవీ; భావమున్= మనస్సూ; భూతచయంబున్= ప్రాణికోటి; ఇంద్రియ ప్రకరమున్= ఇంద్రియాల - కన్ను ముక్కు లోనగు జ్ఞానేంద్రియాల, కాలు చేయి లోనగు కర్మేంద్రియాల సమూహమూ; భవత్+ఉప+ఆశ్రయ భాసిత వర్తనములు= నీ ప్రాపువలన ప్రకాశించే (కలిగే) ప్రవృత్తులు గలవి; ఆ సకలమునందున్= ఆ అన్నింటియందు - ప్రకృతి మొదలు ఇంద్రియాల వరకు గల ఎల్లవానియందును; నీవును= నీవు కూడా; ప్రసన్నతన్= అనుగ్రహంతో; నిల్తు(వు)= నిలుస్తావు - ఉండెదవు; అవి= ఆ అన్నీ - ప్రకృతి మొదలు ఇంద్రియాలవరకు గల మొత్తం; నీకున్= నీకూ; నీవు= విష్ణుడవైన నీవు; వానికిన్= ఆ అన్నింటికీ; నిలువంగన్= నిలుచుటకు- ఉండటానికి - ప్రవర్తించటానికి; పట్టు+అగుటన్= ఆధారమవటంవలన; నిక్కముగాన్= నిజంగా; ఇటులు+ఐ= ఈ విధంగా అయి; వెలుంగవే?= ప్రకాశించవా? - ప్రకాశిస్తావు కదా!

తాత్పర్యం: ఓ విష్ణూ! ఈ కనుపించే ప్రకృతి, కనుపించని బుద్ధి, అహంకారం, మనస్సు సృష్టిలోని ప్రాణిలోకం, జ్ఞాన, కర్మ ఇంద్రియాలు, ఇవన్నీ నీ ప్రాపుతో నీ అదుపాజ్ఞలకు లోబడి ప్రవర్తించేవే! నిజానికి ఆ అన్నింటియందు ప్రసన్నుడవై నీవే నివసిస్తూ ఉంటావు. అవి నీకూ, నీవు వాటికీ పరస్పరం ఆధార - ఆధేయ భావం కలిగి ఉండటం వాస్తవం. ఈ విధంగా సృష్టిలోని అన్నింటా నీవు, నీలో సృష్టి సర్వస్వం - ఒదిగి ఉండటం విచిత్రం! అంతా నీవై ప్రకాశిస్తున్నావు దేవా!

విశేషం: తత్త్వదర్శనం జరిగితే, ద్రష్ట, దృష్టి, దృశ్యమూ మూడు ఒకటే అని భారతీయవేదాంతం ప్రకటిస్తుంది. ఆత్మ పరమాత్మ అనీ, దానికే పరబ్రహ్మ నామాంతరమనీ కొన్ని భారతీయదర్శనాల ప్రబోధం.

క. ఏకత్వం బన్యత్వ మ । నేకత్వము గలుగు నీ మహిమ చందం బా
లోకింప నిపుణులగు సు । శ్లోకులకుం బరమపదము సులభము శార్ఙ్గీ! 239

ప్రతిపదార్థం: శార్ఙ్గీ!= ఓ విష్ణూ!; ఏకత్వంబు= ఒంటితనం - ఒకటిగా ఉండటం; అన్యత్వము= పెరతనం - మరొకటిగా ఉండటం; అనేకత్వము= పెక్కుతనం - ఎక్కువగా - ఒకటికంటె అధికంగా ఉండటం; కలుగు= ఉన్న; నీ మహిమ చందంబు= నీ గొప్పదనపు తీరు; ఆలోకింపన్= చూచుటకు; నిపుణులు+అగు= నేర్పరులగు; సుశ్లోకులకున్= మంచి కీర్తిగల వారికి; పరమపదము= మోక్షం; సులభము= సుఖంగా లభించేది.

తాత్పర్యం: (ఇపుడు విష్ణుతత్త్వంలోని మరొక విశేషాన్ని వర్ణిస్తున్నాడు.) విష్ణువు ఏకత్వ మహిమ గలిగినవాడు. తాను తప్ప మరేదీ లేనివాడు. అతడే అన్యత్వ మహిమ గలవాడు కూడా - తాను ఇతరుడు కూడా కాగలడు. ఈ రెండింటితో - ఏకత్వ అన్యత్వాలతో విరాజిల్లే విష్ణుదేవుడు అనేకత్వంగలవాడూ అయినాడు. ఈ గొప్పదనపు తీరు చూడగల ఉత్తమనరులు కైవల్యాన్ని సులభంగా అందుకొనగలరు.

విశేషం: వస్తువు ఒకటే అయి, ఒకటిగా అగుపడటం వింత కాదు. అది స్వత్వాన్ని కోల్పోయి, అన్యంగా అగుపించటం, అంతటితో ఆగక, అనేకంగా కూడా కనిపించటం తప్పక మహిమగా గుర్తించవలసిందే. అయితే ఆ గుర్తింపు పొందగలిగినవారు ముక్తిని పొందటానికి అర్హులే అయి ఉంటారట!

తే. అచరములును జరంబులు నైన భూత । సముదయంబులు మణులు సూత్రమున నున్న
కరణి నీ యంద యున్నవి గాన సమత । నేక భక్తి నేఁ గోరెద నిమ్ము దేవ! 240

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దేవా!= ఓ విష్ణూ!; అచరములును= తిరుగాడనివీ; చరంబులును+ఐన= తిరుగాడెడివీ అయిన; భూత సముదయంబులు= ప్రాణుల సమూహాలు; నీ+అందున్+అ= నీయందే' - నీ లోపలే; మణులు= రత్నాలు; సూత్రమునన్= దారమందు; ఉన్న కరణిన్= ఉన్న విధంగా; ఉన్నవి= కలవు; కాన= కావున; సమతన్= సమభావాన్నీ; ఏకభక్తిన్= కేవలం భక్తిని, అనన్య భక్తిని; కోరెదన్= కాంక్షిస్తాను; ఇమ్ము= ఒసగుము.

తాత్పర్యం: దేవా! సూత్రంలో మణులు నిలిచి ఉన్నట్లుగా, నీలో ఈ సృష్టిలోని చరాచర ప్రాణికోటి ఇమిడి ఉన్నది. కాబట్టి నీకు అవతల మరేమీ లేదు. నీవు కానిది ఏదీ లేదు. అందువలన నిన్ను నేను సమభావాన్నీ, కేవలం భక్తినీ అర్థిస్తున్నాను. నా అభ్యర్థనను ఈడేర్చుము ప్రభూ!

విశేషం: అలం: ఉపమ.

క. **హేతురహితుఁడవు, కర్తవు, । భూతస్రష్టవు, సమస్తభోక్త, వతత్త్వం**
బై తత్త్వము నగుదు జగ । న్నేతవు కూటస్థుఁడవును నీవ ముకుందా! 241

ప్రతిపదార్థం: ముకుందా!= ఓ విష్ణూ!; హేతురహితుఁడవు= కారణం లేనివాడవు; కర్తవు= చేసేవాడవు; భూత స్రష్టవు= ప్రాణులను సృజించేవాడవు; సమస్త భోక్తవు= ఎల్లవాటిని భుజించేవాడివి; అతత్త్వంబు+ఐ= తత్త్వంగానిదై; తత్త్వమును+అగుదు(వు)= తత్త్వమూ అవుతావు; జగత్+నేతవు= లోకానికి అధిపతివి; కూటస్థుఁడవును= పరమాత్మవు కూడా; నీవు+అ!= నీవే!

తాత్పర్యం: ఓ విష్ణూ! నీ మహిమ ఊహ కందదు. అన్నిటికి కారణమవైన నీకు కారణం లేదు. అన్నిటికీ నీవే కర్తవు. ప్రాణుల, భూమి నీరు వెలుగు గాలి ఆకాశాల సృష్టి చేసినవాడవు నీవే. అట్లాగే ఆ అన్నిటి భోక్తవూ నీవు. తత్త్వానివీ, అతత్త్వానివీ, సత్యానివీ, అసత్యానివీ నీవే! జగత్తుకు అధిపతివి నీవు. తుదకు పరమాత్మవూ నీవే దేవా!

విశేషం: తత్త్వ శబ్దాన్ని మనం సాధారణంగా ఆంగ్లంలోని 'ఫిలాసఫీ' అనే మాటకు బదులుగా వాడుతున్నాం. వ్యుత్పత్తి దృష్టితో చూస్తే ఈ రెండు శబ్దాలకూ పోలికే లేదు. తత్త్వశబ్దం 'తద్' అనే ప్రాతిపదిక మీద భావార్థంలో 'త్వ' ప్రత్యయం చేర్చగా ఏర్పడినట్టిది. దానికి ఉన్న అర్థం 'దాని తనము' అని. ఈ తత్త్వశబ్దాన్ని సత్యార్థంలోనూ, స్వభావార్థంలోనూ కూడా వాడుతున్నాం. ఇక ఆంగ్లంలోని 'ఫిలాసఫీ' కి జ్ఞానాన్వేషణమని స్థూలంగా అర్థం చెప్పవచ్చును. ఇక్కడ తత్త్వశబ్దం సత్యార్థంలోనే ప్రయుక్తమైనది.

సీ. **ద్వేష్యంబుఁ బ్రియ మను వేర్పాటు లేదు, భూ । తములయం దెల్లను సముఁడ నాకు**
భూతసంయోగంబు బుద్ధ్యహంకార యు । క్తియు గుణత్రయసంగతియును లేవు
ప్రారంభణంబు ధర్మాధర్మములు నింద్రి । యముల పొందును విషయాభిరతియుఁ
బరిహృతంబులు జరామరణమోక్షార్థి నై । శరణంబు వేఁడెదఁ గరుణ నాదు

తే. **ఘ్రాణజిహ్వలు మహి నుదకమున దృక్కు । త్వక్కు దేజంబునందును వాయువునను**
శ్రోత్ర మాకాశమునఁ గ్రమసూత్రితముగఁ । బొందఁ జేసి గోవింద! యానంద మిమ్ము. 242

ప్రతిపదార్థం: గోవింద!= ఓ కృష్ణా!; (నాకు) ద్వేష్యంబు= ద్వేషించ దగ్గది; ప్రియము= ఇష్టమైనది; అను వేర్పాటు= అనే భేదం; లేదు= ఉండదు; భూతముల అందున్+ఎల్లన్= అన్ని ప్రాణులయందును; సముఁడన్= సమానమైన భావంకలవాడను - హెచ్చుతగ్గు భావాలు లేనివాడను; నాకున్= విష్ణు భక్తుడనైన నాకు; భూత సంయోగంబు= పంచభూతాలతో - కలయిక; బుద్ధి+అహంకార యుక్తియున్= బుద్ధి (మతి) 'నేను' అనే భావం, అభిమానం - వీటితోడి కలయిక; గుణత్రయ సంగతియును= సత్త్వరజ స్తమస్సు లనే మూడు గుణాల కూడిక; లేవు= ఉండవు; ప్ర+ఆరంభణంబు= ప్రయత్నం - కర్మం - పని; ధర్మ+అధర్మములున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పుణ్యాపాపాలూ; ఇంద్రియముల పొందు= జ్ఞాన కర్మ ఇంద్రియాలతోడి పొత్తు; విషయ+అభిరతియున్= ప్రాపంచిక లౌకిక అంశాలపట్ల ప్రీతీ; - (ఇవన్నీ) పరిహృతంబులు= పరిహరించబడినవి - తొలగించబడినవి; జరా మరణ మోక్ష+అర్థిన్+ఐ= ముసలితనం, చావులనుండి ముక్తిని కోరేవాడనై; శరణంబు వేఁడెదన్= శరణు అర్థిస్తున్నాను; కరుణన్= దయతో; నాదు ఘ్రాణ జిహ్వలు= నా ముక్కు నాల్కలు; (క్రమంగా) మహిన్= నేలయందు; ఉదకమునన్= నీటియందు; దృక్కు, త్వక్కు= చూపు, చర్మం (క్రమంగా); తేజంబునందును= కాంతిలోనూ; వాయువునను= గాలిలోను; శ్రోత్రము= చెవి; ఆకాశమునన్= ఆకసమున; క్రమసూత్రితముగన్= వరుసగా ఏర్పరచబడినట్లుగా; పొందున్+చేసి= చేరేటట్లు చేసి; ఆనందము+ఇమ్ము= ఆహ్లాదాన్ని ఒసగుము.

తాత్పర్యం: ఓ విష్ణుమూర్తీ! ఈ సృష్టిలో నాకు పగకు గాని ప్రేమకుగాని, పాత్రమైన దేదీ లేదు. నేను సకల ప్రాణులయెడ సమభావం కలవాడను. నాకు సృష్టిలోని పంచభూతాలతో పొత్తు లేదు. బుద్ధి, అహంకారం, సత్త్వరజస్తమోగుణాలూ లేవు. నాకు కర్మకోసం ప్రయత్నంగాని, పుణ్యాపాపాలుగాని, ఇంద్రియాలతోడి పొత్తుగాని లేవు. లౌకికవిషయాలయెడ ఆసక్తీ లేదు. అన్నిటినీ వదలించుకొని, ఇప్పుడు నేను జరామరణాలనుండి విడుదలకొరకు నిన్ను వేడుకొంటూ నీ శరణు కోరి నీ దరి చేరాను. దయతో నా ముక్కు నాల్కలు నేలలో నీటిలో, చూపు చర్మాలు కాంతిలో గాలిలో, చెవి ఆకాశంలో, వరుసగా క్రమం తప్పకుండా లీనంచేసి, నాకు నిరంతరానందాన్ని ప్రసాదించుము దేవా!

విశేషం: ఇక్కడ మోక్షార్థి లక్షణాలన్నీ ఉదాహృతాలై ఉన్నాయి. అతడు రాగద్వేషాలకు, పుణ్యాపాపాలకూ అతీతుడు. లౌకిక మానవ లక్షణాలన్నీ పరిహరించుకొన్నవాడు. సర్వసంస్కారాలకూ, సకల వాసనలకూ విదూరుడు.

సీ. **ఇల జలంబుల జలంబులు, శిఖి శిఖి, వాయు । వున వాయు, వంబరంబునను నంబ**
రంబు, చిత్తమునఁ జిత్తం, బహంకృతి నహం । కృతి, బుద్ధిఁ దగ నొదిఁగించి యింత
వట్టును గూడ నవ్యక్తంబుఁ జేర్చి య । వ్యక్తంబు నిజభంగి యైనఁ ద్రిగుణ
సామ్యవ్యవస్థితి సడిసన్నఁ గారణ । భూత తన్మాత్రలు పొడువకుండఁ

తే. **దొలఁగఁ బెట్టుట దొరకొనవలయు దానఁ । బరమమున కేవలము నగు పదము గలిగి**
యేన నీ వను నైక్యంపు టెఱుక వొడముఁ । గాత గమనాగమనములు గ్రాఁగి పోవ. 243

ప్రతిపదార్థం: ఇలన్= భూమిపై; జలంబులన్= నీళ్ళయందు; జలంబులు= నీళ్ళు; శిఖిన్= నిప్పునందు; శిఖి= నిప్పు; వాయువునన్= గాలియందు; వాయువు= గాలి; అంబరంబునను= ఆకాశమునందు; అంబరంబు= ఆకాశం; చిత్తమునన్= మనస్సునందు; చిత్తంబు= మనస్సు; అహంకృతిన్= అహంకారమునందు; అహంకృతి= అహంకారం; బుద్ధిన్= బుద్ధిని (బుద్ధియందు); తగన్= సరిగా; ఒదిఁగించి= ఇమిడేటట్లు చేసి - తొలగేటట్లుచేసి; ఇంతవట్టును+కూడన్= ఈ అంతటినీ; అవ్యక్తంబున్= మూల ప్రకృతిని; చేర్చి= చెందించి; అవ్యక్తంబు= మూల ప్రకృతి; నిజభంగి+ఐనన్= స్వత్వ పద్ధతి - స్థితిని చెందగా; త్రిగుణసామ్య వ్యవస్థితి=మూడు గుణాల - సత్త్వరజస్తమస్సుల సమానత్వ స్థితి; సడిసన్నన్= సద్దుమణగగా; కారణభూత తన్మాత్రలు= (జగత్తు పుట్టుకకు) మూలమైన శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే ఐదును; పొడువకుండన్= క్రమ్మకుండగా - ఏర్పడకుండా; తొలఁగన్+పెట్టుట= ప్రక్కకు నెట్టటం; దొరకొనవలయున్= మొదలు పెట్టాలి; దానన్= అందువలన; పరమమును= ఉత్తమగతి; కేవలమున్+అగు పదము= ఒకటే అగు స్థానం - కైవల్య పదం; కలిగి= ఏర్పడి; ఏను+అ= నేనే; నీవు+అను= నీవు అనే; ఐక్యము+ఎఱుక= ఒకతనమునకు (ఆత్మ పరమాత్మల ఏకత్వం) చెందిన జ్ఞానం; గమన+ఆగమనములు= రాకపోకలు - లోకానికి రావటం (జన్మ) లోకంనుండి పోవటం (చావు) అనే రెండు క్రియలు; క్రాఁగిపోవన్= నశించి పోయేటట్లుగా; పొడమున్+కాతన్= కల్గుగావుత.

తాత్పర్యం: సృష్టి పంచభూతాలతో నేల, నీరు, వెలుగు (కాంతి), గాలి, ఆకాశం - అనే ఐదు మూల పదార్థాలతో ఏర్పడినది. కాబట్టి సృష్టిలో భాగమైన నరుడూ పంచభూతాత్మకమైనవాడే. కాబట్టి అతడి శరీరంలోని ఆయా మూల

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పదార్థాలకు చెందిన అవయవాలన్నీ ఆయా మూలప్రకృతిలో లీనమైపోవాలి. 'జలాలలో జలాలు' ఒదిగించటం అంటే నీటిలో నాలుకను లీనంచేయటం; అట్లాగే నిప్పులో నిప్పును కలుపుట అంటే, నిప్పులో చూపును ఉంచటం, గాలిలో గాలి - గాలిలో చర్మం; ఆకాశాన ఆకాశం - ఆకాశాన చెవి; ఈ విధంగా పంచేంద్రియాలనూ పంచ భూతాలలో లీనం చేయాలి. ఆ తరువాత నరుడిలో మనస్సున్నది. దానిని మనస్సుననే అణచివేయాలి. అట్లాగే (నరుడి) అహంకారాన్నికూడా అహంకారంలో లీనంచేయాలి. బుద్ధిని బుద్ధిలో కలపాలి - నశింపజేయాలి- ఈ విధంగా ముందు పాంచభౌతిక ధర్మాలను, ఆ పిదప - మనస్సు, బుద్ధి, అహంకారాలనూ నశింపజేయాలి. ఈ సామగ్రినంతటినీ మూలప్రకృతిలోనికి చేర్చాలి. ఆ మూలప్రకృతికి అవ్యక్త మని పేరు. అది తన నిజస్థితిని తాను చెందిన తరువాత, సత్త్వ రజస్తమోగుణాలూ నశిస్తాయి. అటు తరువాత, జగత్తు ఆవిర్భావానికి ఆదికారణా లయిన పంచతన్మాత్రలు - రూప రస గంధ స్పర్శ శబ్దాలు ఏర్పడకుండా పక్కకు నెట్టటానికి మొదలు పెట్టాలి. ఈ విధంగా ఈ పాంచభౌతిక స్థితినుండే మనోబుద్ధి అహంకారాలనుండీ, పంచతన్మాత్రలనుండి బయటపడ్డ ఆత్మకు సర్వోన్నతమూ, సర్వశ్రేష్ఠమూ అయిన కైవల్యపదం అందుతుంది. ఆ పదంలో ఉండగా, 'నేనే నీవు' అనే ఆత్మజ్ఞానం కలుగుతుంది. అపు డిక జనన మరణాలు అనే ఈ లోకాన జీవకోటికి సంభవించే రాకపోకలు (రాక - జన్మ, పోక - మరణం) నశిస్తాయి.

విశేషం: ఇక్కడ పంచభూతాత్మకుడయిన పురుషుడు, కైవల్యపదం చేరే దారి చూపబడింది. ఆ మార్గాన అక్కడక్కడ మజిలీలు, మార్పులు జరుగుతుంటా యని కూడా తెలియవచ్చింది. ఇది పరమాత్మకు అభిముఖంగా ఆత్మ సాగించే ప్రయాణపు వివరాల సూచిక.

క. హరియం దేనును నాయం । దరయంగా హరియుఁ గలము; హరి నాకును నా
హరి కేను ననశ్వరులము । హరిప్రసాదోదయము మహత్తర మహిమన్. 244

ప్రతిపదార్థం: హరియందున్= విష్ణువునందు; ఏనును= నేనూ; నాఅందున్= నాలో; అరయంగాన్= పరిశీలించగా; హరియున్= విష్ణువూ; కలము= ఉన్నాము; హరి= విష్ణువు; నాకును= నరుడనైన నాకూ; ఆ హరికిన్= ఆ నారాయణుడికీ; ఏనును= నరుడనైన నేనూ; అనశ్వరులము= నశించే స్వభావం లేనివారం; మహత్తర మహిమన్= మిక్కిలి గొప్పతనంతో; హరిప్రసాద+ఉదయము= విష్ణువు యొక్క అనుగ్రహపు పుట్టుక (కలుగుతుంది).

తాత్పర్యం: నరుడికి నారాయణుడికీ భేదం లేని స్థితి కలిగింది. నారాయణుడిలో నేను ఉన్నాను. నాలో నారాయణుడు ఉన్నాడు. నా కొరకు నారాయణుడూ, నారాయణుడికొరకూ నేనూ నశించకుండా ఉంటాం. గొప్ప మహిమతో మాత్రమే విష్ణువు అనుగ్రహం కలుగుతుంది. మానవ ప్రయత్నాలకు అన్నిటికీ అతడిలోని బుద్ధి చైతన్యాలే కారణం. కాగా ఆ రెండు, ఏ ప్రయత్నం చేసి, ఏమి సాధించాలో సూచిస్తున్నాడు.

తే. బుద్ధియును బ్రాణమును నిన్నుఁ బొరయఁ జేయఁ । జాలు భక్తి నా కొసఁగుము జలధిశయన!
పూర్వ కర్మఫలంబులు పొందుఁగాక!; । యవి ఋణంబులు గడతేఱుటై సుఖింతు. 245

ప్రతిపదార్థం: జలధిశయన!= సముద్రాన పరుండేవాడా - ఓ విష్ణూ!; బుద్ధియును= తెలివీ; ప్రాణమును= ఊపిరీ; నిన్నున్+ పొరయన్+చేయన్+చాలు= నిన్ను పొందజేయగల; భక్తి= భక్తి భావం - కొలిచే, సేవించే స్వభావం; నాకున్= నరుడనైన నాకు; ఒసఁగుము= ఇమ్ము; (అట్లే) పూర్వకర్మఫలంబులు= ప్రాచీన (జన్మలలోని) కర్మఫలితాలు; పొందున్+కాక!= చెందునుగాక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నన్ను చేరుకోనిమ్ము; అవి= ఆ కర్మఫలాలు (చేరుట); ఋణంబులు= అప్పులు; కడతేఱుట+ఐ= తీరుట కాగా; సుఖింతున్= సుఖపడెదను.

తాత్పర్యం: సముద్రాన శయనించే ఓ స్వామీ! బుద్ధినీ, చైతన్యాన్నీ నిన్ను పొందుటకుగల కేవలభక్తినీ నాకు ప్రదానం చేయుము. నా ధీశక్తినీ, చేతనాశక్తినీ, నిన్ను చేరే మార్గాన్ని నిర్దేశించగల భక్తిభావంవైపు మళ్ళించుము. అదే విధంగా, నా పూర్వజన్మల కర్మల ఫలితాలు నన్ను చేరుకొనేటట్లు చూడుము. అవి ఆ విధంగా నన్ను చేరితే, ఆ ఫలితాల నన్నిటినీ అనుభవించి, నేను ఋణవిముక్తుడనైనట్లుగా ఆనందిస్తాను.

విశేషం: కర్మ, ఫలం అనేవి కారణకార్యాలు. కర్మకు ఫలితం ఈనాడు కాకున్నా మరొకనాడు పొంది తీరవలసిందే. అది అనివార్యం. లోకన్యాయం - అప్పు తీర్చటంవలె కర్మఫలమూ అనుభోక్తవ్యమే.

తే. నిన్ను నెప్పుడుఁ దలఁచెద; నన్ను నీవు। వత్సలుఁడ వయి వీఁడు నావాఁ డనంగ
వలయుఁ జుమ్మయ్య! మఱవక వాసుదేవ!। దేవ దేవ! మునీశ్వర భావనీయ! 246

ప్రతిపదార్థం: వాసుదేవ!= వసుదేవుడి తనయుడా!; దేవదేవ!= దేవతలకు దేవుడైనవాడా!; ముని+ఈశ్వర భావనీయ!= మునిశ్రేష్ఠులచేత భావించదగ్గ, స్మరించదగ్గవాడా!; నిన్నున్= జగన్నేతవైన నిన్ను; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; తలఁచెదన్= స్మరిస్తాను; నన్నున్= నీ భక్తుడనైన నన్ను; నీవు= నా ఆరాధ్యదైవ మయిన నీవు; వత్సలుఁడవు+అయి= దయకలవాడవై; మఱవక= మరచిపోక; అయ్య= స్వామీ!; వీఁడు= ఈ నరుడు; నా వాఁడు+అనంగన్+వలయున్+చుమ్ము= నా వాడు అనవలె సుమా!

తాత్పర్యం: ఓ వసుదేవ తనయా! దేవసమూహానికి దేవుడా! మునీశ్వరుల భావనలలో నిలిచే స్వామీ! నేను నిన్ను అన్ని కాలాలలో స్మరిస్తుంటాను. నీవూ నాపై దయ గలిగి 'వీడు నావాడు' అనాలి సుమా! మరవవద్దు.

క. తనుఁ దనయంద నిలిపి పే। రనువున బుద్ధికడ వెలుఁగు నచ్యుతుని సనా
తను నగ్రాహ్యునిఁ జిన్మయు। ననుస్మరించునది యపునరావృత్తికినై. 247

ప్రతిపదార్థం: తనున్= తనను; తనయందున్+అ= తనయందే; నిలిపి= ఉంచి; పేరు+అనువునన్= గొప్పనేర్పుతో; బుద్ధికడన్= బుద్ధిచెంత; వెలుఁగు+అచ్యుతునిన్= ప్రకాశించే విష్ణువును; సనాతనున్= శాశ్వతుడైనవాడిని; అగ్రాహ్యునిన్= గ్రహించరానివాడిని- తెలియరానివాడిని - పట్టుకొనరానివాడిని; చిత్+మయున్= జ్ఞానమయుడిని - జ్ఞానాకారుని; అపునర్+ఆవృత్తికిన్+ఐ= మరల రావటం (లోకంలోనికి) (పుట్టుక) లేకుండటానికై - జన్మరాహిత్యమునకై; అనుస్మరించునది= అనుస్మృతిని - నిరంతరస్మరణను చేయాలి.

తాత్పర్యం: తనలో తాను ఉంటూ, గొప్పనేర్పుతో బుద్ధికి సమీపాన వెలిగే శ్రీ మహావిష్ణువును, శాశ్వతమైనవాడిని, తెలియరాని, పట్టుకొనరానివాడిని, జ్ఞానమయుడిని జన్మరాహిత్యంకొరకు (అనుస్మరించాలి. అనుస్మృతి ద్వారా నిరంతరం ఉచ్చరిస్తూ స్మరణను గావించాలి. జపించాలి.)

విశేషం: ధ్యానానికిగాని, జపానికిగాని, పూజకుగాని, పురస్కారానికిగాని నరుడిలో ఏకాగ్రత అవసరం. ఏకాగ్రత ఏ సాధనలోనైనా అవసరమైన మానసిక స్థితి.

క. పరమాత్ముని నారాయణుఁ। జిరంతనుని భక్తశేముషీనిష్ఠా స్వీ
కరణైకాయనుని నమ। స్కరణంబునఁ దలఁతు నతుల షడ్విధభూతిన్.' 248

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పరమ+ఆత్మునిన్= గొప్ప ఆత్మగలవాడిని, పరమాత్మ స్వరూపుడిని; నారాయణున్= విష్ణువును; చిరంతనునిన్= శాశ్వతమైనవాడిని; భక్తశేముషీనిష్ఠా స్వీకరణ+ఏక+అయనునిన్= భక్తుడి బుద్ధి నిలకడ (ఏకాగ్రత)ను స్వీకరించటం ఒక మార్గంగా గలవాడిని - భక్తుడి బుద్ధి నిలుకడను ఒక చోటుగా చేసికొన్నవాడిని; అతులషట్+విధ భూతిన్= సాటి లేని ఆరు విధాలయిన ఐశ్వర్యాలుకలవాడిని; నమస్+కరణంబునన్= నమస్కారంతో; తలఁతున్= స్మరిస్తాను.

తాత్పర్యం: పరమాత్మ స్వరూపుడిని, నారాయణమూర్తిని, శాశ్వతుడిని, భక్తుల ఏకాగ్రచిత్తం ద్వారా చేరదగ్గ ఉనికి గలవాడిని, ఆరువిధా లయిన ఐశ్వర్యాలతో భక్తుల ననుగ్రహించే దేవుడిని నమస్కరిస్తూ స్మరిస్తాను'.

తే. **అని జపించి సర్వావస్థలందు నను వి । శిష్టభక్తి ననుస్మరించిన యతండు**
సకల పాపంబులను బాసి శాంతి నొంది । యవ్యయానంద పదమున నతిశయిల్లు. **249**

ప్రతిపదార్థం: అని= పై ప్రకారంగా; జపించి= జపం చేసి; సర్వ+అవస్థలందున్= అన్ని స్థితులలోను - దశలలోను; ననున్= పరమాత్మనైన నన్ను; విశిష్టభక్తిన్= అతిశయించిన భక్తితో; అనుస్మరించిన+అతఁడు= అనుస్మృతి చేసిన - నిరంతర స్మరణం చేసినవాడు; సకలపాపంబులను= ఎల్ల కల్మషములను; పాసి= వదలి; శాంతిని+ఒంది= శాంతిని పొంది; అవ్యయ+ఆనందపదమునన్= నశించని ఆనందమయమైన చోటున; అతిశయిల్లున్= విలసిల్లును.

తాత్పర్యం: పైన నిర్దేశించిన తీరున అన్ని స్థితిగతులలో, దశలలో మిక్కిలి భక్తితో ఈ అనుస్మృతిని జపించినవాడు ఎల్ల పాపాలనుండి ముక్తుడౌతాడు. తరువాత శాంతిని పొంది శాశ్వతానందమయ మైన స్థితిని - ముక్తిని పొంది అతిశయిస్తాడు.

విశేషం: ముక్తిప్రాప్తికి ముందు పాపపరిహారం ఒక తప్పనిసరైన అంశమన్నమాట.

తే. **వైష్ణవియుఁ గల్మషవ్రజధ్వంసినియును । నైన యీ యనుస్మృతి ప్రాజ్ఞుఁ డైన నజ్ఞుఁ**
డైన నెవ్వాఁడు పఠియించు యజ్ఞదాన । సమయముల వాఁడు తత్ఫలశతము వడయు. **250**

ప్రతిపదార్థం: వైష్ణవియున్= విష్ణుసంబంధీ; కల్మషవ్రజ ధ్వంసినియును= పాప సమూహాల నశింపజేసేదీ; ఐన+ఈ+అనుస్మృతి= అగు ఈ అనుస్మృతి స్తోత్రం; ప్రాజ్ఞుఁడు+ఐనన్= మహాపండితుడైనా; అజ్ఞుఁడు+ఐనన్= అజ్ఞాని - పామరుడైనా; యజ్ఞదాన సమయములన్= యజ్ఞ నిర్వహణ సమయంలో, దానంచేసే కాలంలో; ఏ+వాఁడు= ఏ నరుడు; పఠియించున్= చదువునో; వాఁడు= ఆ నరుడు; తద్+ఫలశతము+పడయున్= వాని ఆ యజ్ఞము యొక్క దానము యొక్క ఫలితాల నూటిని - నూరు ఫలితాలను పొందుతాడు.

తాత్పర్యం: ఈ అనుస్మృతి స్తోత్రం విష్ణుసంబంధి. పాపపుంజాన్ని ధ్వంసం చేస్తుంది. మహా పండితుడుగాని, పామరుడుగాని - ఎవడైనా ఈ అనుస్మృతిని యజ్ఞసమయానగాని, దానంచేసే టప్పుడుగాని, పఠిస్తే అతడికి ఆ యజ్ఞఫలంగాని, దానం ఫలంగాని నూరింతలు లభిస్తుంది.

విశేషం: యజ్ఞం చేయడం, దానంచేయడం గొప్పపనులు. వ్యయప్రయాసలు కొల్లలుగా వాటి నిర్వహణలో ఎదురౌతాయి. అటువంటి యజ్ఞఫలితాలు, దాన ఫలితాలూ నూరురెట్లు అధికంగా లభించాలంటే మాత్రం కేవలం అనుస్మృతి పఠనం చాలును. అంతటిది దాని మహిమ!

క. **సురపితృపూజలఁ బావక । పరిచర్యలయందు నన్ను భక్తిఁ దలఁచుచుం**
బరమనియతి నివ్వాక్యో । త్కరముఁ బఠించిన యతండు గనుఁ బుణ్యగతిన్. **251**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సురపితృపూజలన్= దేవతల, పితరుల, పితృదేవతల పూజాసందర్భాలలో; పావక పరిచర్యలయందున్= అగ్ని సేవలయందు, అగ్ని కార్యాలలో, హోమాలు, యజ్ఞాలలో; నన్నున్= శ్రీ మహావిష్ణువునైన నన్ను; భక్తిన్= భక్తితో; తలఁచుచున్= స్మరిస్తూ; పరమనియతిన్= గొప్ప నియమంతో; ఈ+వాక్య+ఉత్క్రమున్= ఈ మాటల (స్తోత్రంలోనివి) ప్రోగును; పఠించిన+అతఁడు= చదివినవాడు; పుణ్యగతిన్= పుణ్యసిద్ధిని; కనున్= పొందుతాడు.

తాత్పర్యం: ఈ అనుస్మృతిని దేవతాపూజలలో, వ్రతాలలో, పితృదేవతల తర్పణ సమయాలలో, అగ్నికార్యాలలో విష్ణుభక్తితో, నియమపాలనతో, ఎవరు చదువుతారో, వారు పుణ్యసముపార్జన చేయగలుగుతారు.

విశేషం: ఇక్కడ కూడా ఆయా పూజావ్రతాదుల ఫలితాలు సిద్ధించిన తరువాత, అదనంగా పుణ్యార్జనకు ఈ అనుస్మృతి పఠనం కారణమౌతుంది.

క. వినుపించునది యనుస్మృతి । నను భక్తిం గొలుచు బహుజనముల కమావా
స్యను బున్నమ బారసిని స । వినయంబుగ దానవెల్ల విభవము గలుగున్. 252

ప్రతిపదార్థం: ననున్= విష్ణువునైన నన్ను; భక్తిన్= భక్తితో; కొలుచు బహుజనములకున్= సేవించే పెక్కు ప్రజలకు; అమావాస్యను= అమావాస్యనాడు; పున్నమన్= పున్నమినాడు; బారసిని= ద్వాదశినాడు; సవినయంబుగన్= వినయంతో - అణకువతో; అనుస్మృతిన్= ఈ అనుస్మృతి స్తోత్రమును; వినిపించునది= వినిపించాలి; దానన్= అట్లు వినిపించటంవలన; ఎల్ల విభవము= సర్వసంపద; కలుగున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: ఈ అనుస్మృతి స్తోత్రాన్ని సామాన్యులయిన జనసమూహాలకు, నన్ను భక్తితో సేవించేవారికి, అమావాస్య, పున్నమి, ద్వాదశి తిథులలో వినిపించాలి. ఈ మూడు తిథులు ఈ అనుస్మృతి శ్రవణానికి యోగ్యమైనవి. అట్లా వినిపించటంవలన, వినుటవలన సకలసంపదలు సిద్ధిస్తాయి.

విశేషం: ఈ దేశాన వివేకం మాట ఎట్లా ఉన్నా, విద్య అక్షర రూపమైనది, అందరికీ అందుబాటులో ఉండేది గాదు. స్వయంగా చదువలేని ఆ అధికసంఖ్యాకజనుల పుణ్యాన్ని ఉద్దేశించి, ఈ 'వినిపించే' కార్యక్రమం వివరించబడినది.

క. జనము లనుస్మృతిఁ జదువఁగ । విని మ్రొక్కిన యంత్యజునకు విశ్రుతగతి గ
ల్గు నవిన సద్భక్తి జపిం । చిన యుత్తమజాతిజునకుఁ జెప్పఁగ నేలా? 253

ప్రతిపదార్థం: జనములు= భక్తజనులు; అనుస్మృతిన్= అనుస్మృతి స్తోత్రాన్ని; చదువఁగన్= పఠిస్తూ ఉండగా; విని= ఆలకించి; మ్రొక్కిన= నమస్కరించిన; అంత్యజునకున్= చివరి కులమువాడికి; విశ్రుతగతి= పుణ్యగతి; కల్గున్+అనినన్= సిద్ధిస్తుందనగా; సత్+భక్తిన్= మంచిభక్తితో; జపించిన= జపంచేసిన; ఉత్తమ జాతిజునకున్= శ్రేష్ఠకులంలో పుట్టినవాడికి (కలిగే పుణ్యగతిని గూర్చి); చెప్పఁగన్+ఏలా?= చెప్పటం ఎందుకు? (అనవసరం అని తాత్పర్యం. ఎంతో గొప్ప ఫలితం తప్పకుండా సిద్ధిస్తుంది అని భావం.)

తాత్పర్యం: ఈ అనుస్మృతి పఠన శ్రవణ మహిమ గొప్పది. భక్తజనులు పఠిస్తుండగా, ఈ అనుస్మృతిని విని నమస్కరించిన చండాలుడికే పుణ్యగతి గలుగుతుంది. అటువంటప్పుడు, ఇక ఈ అనుస్మృతిని భక్తితో జపించే ఉత్తమజాతి నరుడికి కలిగే ఫలితాన్ని గురించి వేరే చెప్పటమెందుకు? (తప్పక గొప్ప ఫలితాన్ని వారికి అందిస్తుంది- ఈ అనుస్మృతి పఠనం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: కావ్యార్థాపత్తి. సంస్కృతంలో 'కైముతిక' న్యాయమని ఒకటుంది. 'కిమ్+ఉత' అనే శబ్దాలతో ఏర్పడ్డది ఆ న్యాయం. ఇది లోకవ్యవహార జన్యమయినమాట. జనవ్యవహారంలోని "పెద్ద ఏనుగులనే పరుగెత్తించే ఆ గాలివేగంలో ఇక దోమల సంగతి చెప్పేదేమిటి?" - వంటి మాటలు ఈ న్యాయానికి మూలం. 'కిమ్+ఉత' అంటే 'ఇంకేమిటి?' (చెప్పేది) అని తాత్పర్యం. ఈ పద్యంలోని 'చెప్పగనేలా?' అనే మాట అట్టిది. అంత్యజుడికే పుణ్యగతి కల్గుతుంటే ఇక అగ్రజుడి సంగతి చెప్పగనేలా? - అని కైముతికన్యాయం అన్వితమై ఉన్నది.

ఆ. అఖిల కర్మఫలము నంతవంతంబు మ । ద్భక్తులకు ననంతపదము గలుగు
నట్టు లగుటఁ దలపు మమర మునీంద్ర! ని । న్నది మదీయపదమహార్థిఁ జేయు. 254

ప్రతిపదార్థం: అమరముని+ఇంద్ర!= దేవఋషిశ్రేష్ఠా!; అఖిల కర్మ ఫలమున్= మొత్తం కర్మయొక్క ఫలితం కూడా; అంతవంతంబు= చివర - తుది కలిగినది - ముగిసిపోయేది; మత్+భక్తులకున్= నా భక్తులకు; అనంత పదము= చివర తుదిలేని స్థానం - ముగిసిపోని ప్రయోజనం - ముక్తి; కలుగున్= సిద్ధించును; అట్టులు+అగుటన్= ఆ విధంగా అగుటను నా భక్తులకు మాత్రం అనంతపదప్రాప్తి జరుగుటను; తలఁపుము= స్మరించుము; అది= ఆ స్మరణం; నిన్నున్= దేవర్షివైన నిన్ను; మదీయ పదమహా+అర్థిన్+చేయున్= నాకు చెందిన స్థానానికి, నా సాన్నిధ్యానికి గొప్ప యాచకుడినిగా చేస్తుంది-నా సాన్నిధ్యాన్ని కోరు కుంటావు.

తాత్పర్యం: ఓ దేవమునీ! లోకాన ఎల్ల కర్మల ఫలితాలూ చివరకు ముగిసిపోయేవే! అయితే నా భక్తులకు మాత్రం ఈ అనుస్మృతి జపకర్మవలన ఫలితం ముగింపులేని పదమును-ముక్తిని కలిగిస్తుంది. ఆ విషయం నీవు స్మరించుకొంటే, నీవూ నా సాన్నిధ్యాన్ని కోరే పరమభక్తుడవుగా మారిపోతావు.

క. జ్ఞానము గేవలకృప న । జ్ఞానికి నుపదేశ విధిఁ బ్రజనితము సేయం
గా నది సకలధరిత్రీ । దానంబునకంటె నధికతరఫలద మగున్. 255

ప్రతిపదార్థం: కేవలకృపన్= ఒక్కదయతో - దయతో మాత్రమే; అజ్ఞానికిన్= జ్ఞానం లేనివాడికి; జ్ఞానము= జ్ఞానం - దేవుడిని-ముక్తిని గురించిన తెలివిని; ఉపదేశ విధిన్= బోధించటంతో; ప్రజనితము+చేయంగాన్= కలిగినదిగా చేయగా, కల్గించగా, కలిగించినచో; అది= ఆ ఉపదేశ క్రియ; సకలధరిత్రీదానంబునకంటెన్= భూమినంతా దానంచేయటం కంటె; అధికతర ఫలదము+ అగున్= ఎక్కువ ఫలితం ఇచ్చునది ఔతుంది.

తాత్పర్యం: కేవలం దయతో అజ్ఞానికి జ్ఞానాన్ని బోధించి, అతడిలో దేవునిగూర్చిన మోక్షాన్ని గూర్చిన, తెలివితేటలను ఏర్పరచగలిగితే. ఆ జ్ఞానబోధ గొప్ప దానంగా పరిణమిస్తుంది. ఆ విధంగా జ్ఞానదానం చేస్తే, ఆ దానంవలన ఫలితం, మొత్తం నేలను దానం చేయగా వచ్చే ఫలితాన్ని మించి ఉంటుంది.

విశేషం: అట్లా కాకుండా వ్యావహారికార్థంలోనయినా, జ్ఞానం ఇతర సకలకార్యకలాపాలకు మూలం. కాబట్టి జ్ఞానదానం ఇతర దానాలను మించినదే.

క. కావున నీకేఁ జెప్పిన । యీ విధ మంతయును శుద్ధహృదయులకుఁ గృపా
శ్రీ వెలయఁ జెప్పుమీ! పు । ణ్యావహశీలురకు సులభమగు సర్వంబున్. 256

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి - జ్ఞానదానం అన్ని దానాలకంటె మిన్న కాబట్టి; నీకున్= నా భక్తుడవైన నీకు; ఏన్= నేను; చెప్పిన+ఈ విధము+అంతయును= తెలిపిన ఈ విధానం సర్వమూ; శుద్ధహృదయులకున్= నిర్మలమైన హృదయం కలవారికి; కృపాశ్రీ వెలయన్= దయ అనే సంపద స్పష్టపడగా; చెప్పుమీ!= ఎరిగింపుమా!; పుణ్య+ఆవహశీలురకున్= ధర్మమును స్వీకరించే స్వభావంగలవారికి; సర్వంబున్= అంతయూ; సులభము+అగున్= సుఖంగా పొందదగింది అవును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: జ్ఞానదానం సర్వదానాలనూ అతిశయిస్తుంది కాబట్టి ఓ దేవమునీ! నేను నీకు ఉపదేశించిన ఈ అనుస్మృతి జపవిధిని మొత్తాన్ని, పవిత్ర హృదయులయిన భక్తులకు నీలోని దయాగుణం ప్రకటితమయ్యే విధంగా తిరిగి బోధించుము. ధర్మస్వభావంగల వారికి అంతా సులభసాధ్యమే అవుతుంది.

తే. **అశ్వమేధ సహస్రంబు లాచరించి । పడయరాని మహోన్నత పదము నస్మ**
దీయ భక్తిరసైక పరాయణుండు । వడయనేర్చు సుకరముగ బ్రహ్మపుత్ర! **257**

ప్రతిపదార్థం: బ్రహ్మపుత్ర!= బ్రహ్మతనయుడా! - నారదమహర్షీ!; అశ్వమేధ సహస్రంబులు= అశ్వమేధం అనే యజ్ఞాలు వేలు; అచరించి= చేసి; పడయన్+రాని= పొందరాని; మహా+ఉన్నత పదమున్= గొప్ప ఉత్తమ స్థితిని; అస్మదీయ భక్తిరస+ఏకపరాయణుండు= నా భక్తిభావమున మాత్రము ఆసక్తుడైనవాడు; సుకరముగన్= సులభంగా; పడయన్+నేర్చున్= పొందగలడు.

తాత్పర్యం: ఓ బ్రహ్మమానసపుత్రా! నారదమహర్షీ! వేలకొలదిగా అశ్వమేధయజ్ఞాలు చేసి కూడా పొందజాలని పరమపదాన్ని, కేవలం నా భక్తియందు ఆసక్తుడైన నరుడు సులభంగా అందుకొనగలుగుతాడు.

విశేషం: యజ్ఞ నిర్వహణం కంటె చిత్తశుద్ధిగల విష్ణుభక్తి మిన్న.

సీ. **అని చెప్పె నిట్టు లయ్యనిమిష మునిపతి । యడుగంగ శంభుఁ డెయ్యది సమాద**
రంబున నెఱిఁగించె రాజవంశోత్తమ! । తెల్లంబుగా నది యెల్ల నీకుఁ
జెప్పితి; నేకాగ్రచిత్తుండవై పర । మాత్ము న న్నారదునట్ల భక్తి
సంభృత శ్రద్ధానుషంగ తాత్పర్యంబు । తోఁ దలంపుము కృతార్థుండ వగుదు;

తే. **పరమ వరద రహస్యానుభావ పూజ్య । మానమూర్తి యనుస్మృతి దీనిజపము**
బుద్ధిఁ బెనుచు, దుఃఖంబులఁ బోవఁ ద్రోచు, । బంధములఁ బాపు, నిత్యశుభంబు నొసఁగు.' **258**

ప్రతిపదార్థం: అని= పై విధంగా; చెప్పెన్= ఉపదేశించాడు (ఈ మాట పూర్వపద్యంతో అన్వయిస్తుంది); రాజవంశ+ఉత్తమ!= క్షత్రియ కులంలో శ్రేష్ఠుడా! ఓ ధర్మరాజా!; ఇట్టులు= ఈ విధంగా; ఆ+అనిమిష మునిపతి= ఆ దేవముని శ్రేష్ఠుడు - నారదుడు; అడుగంగన్= అర్థించగా; శంభుఁడు= శివుడు; సమ్+ఆదరంబునన్= మంచి ప్రేమభావంతో; ఏ+అది= ఏది; ఎఱిఁగించెన్= తెలియజేశాడో; అది+ఎల్లన్= అది అంతా; తెల్లంబుగాన్= స్పష్టంగా; నీకున్= చెప్పకోరిన నీకు; చెప్పితిన్= తెలియజేశాను; ఏక+అగ్ర చిత్తుండవు+అయి= లగ్నమయిన మనస్సు కలవాడవయి; ఆ+నారదుని+అట్లు+అ= ఆ నారదుడివలెనే; పరమాత్మున్= పరబ్రహ్మమును; భక్తి సంభృత శ్రద్ధా+అనుషంగ తాత్పర్యంబుతోన్= భక్తితో నిండిన శ్రద్ధతో కూడిన ఆసక్తితో; తలంపుము= స్మరించుము, ధ్యానించుము; కృత+అర్థుండవు+అగుదు(వు)= నెరవేరిన ప్రయోజనం కలవాడవు కాగలవు; పరమ= గొప్ప; వరద= వరాలిచ్చెడి; రహస్య+అనుభావ= గోప్యమైన శక్తిగల; పూజ్య= ఆరాధనకు అర్హమైన; మాన= గౌరవంగల; మూర్తి= స్వరూపంకలది; అనుస్మృతి= అనుస్మృతి స్తోత్రము; దీని జపము= ఈ అనుస్మృతియొక్క జపం; బుద్ధిన్+పెనుచున్= తెలివిని పెంచును; దుఃఖములన్+పోవన్+త్రోచున్= కష్టములను వెడలగొట్టుతుంది; బంధములన్+పాపున్= (భవ) బంధాలను, సంసారపు ముడులను తొలగిస్తుంది; నిత్యశుభమున్+ఒసఁగున్= ఎల్లప్పుడూ శుభాన్ని కలిగిస్తుంది.

తాత్పర్యం: క్షత్రియవంశశ్రేష్ఠుడవైన ఓ ధర్మనందనా! ఆ దేవర్షి నారదుడు అర్థించగా, భగవంతుడైన విష్ణుమూర్తి దేనిని ఆదరంతో తెలియజేశాడో, ఆ అనుస్మృతిని స్పష్టంగా నీకు ఎరుకపరిచాను. నీవు కూడా నారదమహర్షివలె ఏకాగ్రచిత్తంతో, భక్తి భరితమైన శ్రద్ధాసక్తులతో ఆ పరమాత్ముడిని అనుస్మరించుకొనుము. నీ కోరిక ఈడేరుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ అనుస్మృతి గొప్ప స్తోత్రమంత్రం. వరాలను ఈయగల శక్తిగలది. గోప్యమైన సామర్థ్యం గలది. ఆరాధనకు అర్హమైన రీతిలో జపించటానికి వీలైన ఆకారంతో ఉన్నది. దీనిని జపిస్తే నరుడి బుద్ధి పెరుగుతుంది, దుఃఖాలు తొలగిపోతాయి, సంసారబంధాలు తెగిపోతాయి. నిరంతరం శుభం కలుగుతుంది'.

క. అని భీష్ముం డుపదేశిం। చిన విని యానందభరిత చిత్తుండై పాం
డు నృపాత్మజుఁ డప్పుణ్యా। త్మునకుం బ్రణమిల్లె వినయమునఁ దనువొప్పన్. 259

ప్రతిపదార్థం: అని= పై విధంగా; భీష్ముండు= భీష్మపితామహుడు; ఉపదేశించినన్= బోధించగా; పాండు నృప+ఆత్మజుఁడు= పాండురాజు కొడుకు - ధర్మరాజు; విని= ఆలకించి; ఆనందభరిత చిత్తుండు+ఐ= ఆనందంతో నిండిన మనస్సుకలవాడై; వినయమునన్= అణకువతో; తనువు+ఒప్పన్= శరీరం ప్రకాశించగా; ఆ+పుణ్య+ఆత్మునకున్= ఆ ధర్మస్వరూపుడికి - సర్వధర్మవేత్త అయిన పితామహుడికి; ప్రణమిల్లెన్= నమస్కరించాడు.

తాత్పర్యం: ఈ విధంగా విష్ణుదేవప్రోక్తమైన అనుస్మృతిని, దాని మహిమను ధర్మస్వరూపుడైన భీష్ముడు ఉపదేశించగా, ఆలకించిన ధర్మరాజు ఆనందభరిత మనస్కుడై, వినయంతో వంగి భీష్మాచార్యుడికి నమస్కరించాడు.

విశేషం: నమశ్శబ్దం 'నమ' ధాతు జనితం. దానికి 'వంగుట' అర్థం. వినయాన్ని తెల్పుతూ వంగడమే నమస్కారం. అయితే అనుష్ఠానంలో, ఆచరణలో వంగడంతో పనిలేకుండానే చేతుల జోడింపుకై ఈ నమశ్శబ్దం పరిమితమై పోయింది.

వ. ఇట్లు ప్రణామంబు సేసి యాధరణీవరుండు గురుపితామహుతో 'మోక్షమార్గ బోధన ప్రపంచం బుపదేశింపవే?' యని యడిగిన నతండు వార్ష్ణేయాధ్యాత్మం బను నితిహాసంబుగల 'దా తంత్రంబు నీ యడిగినదియై యుండు' నని పలికి 'వినుము వార్ష్ణేయ నామధేయుం డగువాఁడు. 260

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ప్రణామంబు+చేసి= నమస్కారంచేసి; ఆ ధరణీవరుండు= ఆ రాజు - ధర్మరాజు; కురుపితామహుతోన్= కురువంశపు తాతతో - భీష్ముడితో; మోక్షమార్గ బోధన ప్రపంచంబు= ముక్తిమార్గంయొక్క జ్ఞాన విస్తృతి- ముక్తిని చేరే దానిని గూర్చిన అధిక జ్ఞానం; ఉపదేశింపవే?+అని= బోధించవే? అని; అడిగినన్= అర్థించగా; అతఁడు= ఆ భీష్ముడు; వార్ష్ణేయ+అధి+ఆత్మంబు+అను+ఇతిహాసంబు= వార్ష్ణేయాధ్యాత్మం అనే వృత్తాంతము; కలదు= ఉన్నది; ఆ తంత్రంబు= ఆ విషయం; నీ+అడిగినది+ఐ+ఉండున్= నీవు అర్థించినదై ఉంటుంది - నీ కోరికకు సమాధానంగా ఉంటుంది; అని పలికి= అని చెప్పి; వినుము= ఆలకించుము; వార్ష్ణేయ నామధేయుండు+అగువాఁడు= వార్ష్ణేయుడు అనే పేరుగలవాడైన ఒకడు.

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా వినయంతో భీష్ముడికి నమస్కరించి, తనకు మోక్షమార్గాన్ని ఉపదేశించుమని అర్థించాడు. అప్పుడు ఆ పితామహుడు, 'వార్ష్ణేయాధ్యాత్మము' అనే ఇతిహాసమొకటి ఉన్నది. అది నీ ప్రశ్నకు కోరికకు సమాధానంగా ఉపయుక్తమౌతుంది. విను' మంటూ ప్రారంభించాడు.

భీష్ముండు ధర్మజున కధ్యాత్మ విద్యా ప్రకారం బెఱింగించుట (సం. 12-203-1,2)

క. మానితముని యొకఁడు సుఖా। సీనుండై యున్న నతని శిష్యుఁడు వినయం
బూని నిలిచి 'మోక్షము తెరు। వానతి యీవే దయామయా! నా'కనుచున్. 261

ప్రతిపదార్థం: (వార్ష్ణేయ నామధేయుడైన) మానితముని+ఒకఁడు= గౌరవించబడ్డ ఋషి ఒకరు; సుఖ+ఆసీనుండు+ఐ= సుఖంగా కూర్చున్నవాడై; ఉన్నన్= ఉండగా; అతని శిష్యుఁడు= ఆ ఋషి శిష్యుడు; వినయంబు+ఊని= అణకువతో; నిలిచి= నిలబడి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దయామయా!= దయతో నిండినవాడా!; నాకు= నీ శిష్యుడనైన నాకు; మోక్షము తెరువు= ముక్తియొక్క మార్గం; ఆనతి+ఈవే?= (తెలియ జెప్పవా) ఆజ్ఞ ఈయవా? - సాధికారంగా వక్కాణించవా?; అనుచున్= అంటూ.

తాత్పర్యం: వార్ష్ణేయుడు అనే పేరుగల గౌరవాస్పదముని ఒకడు సుఖంగా కూర్చొని ఉన్నప్పుడు, అతడి శిష్యుడొకడు అణకువతో లేచి నిలబడి, 'ఓ దయామూర్తీ! గురుదేవా! నాకు మోక్షమార్గాన్ని ఉపదేశించవా?' అని అంటూ. (తరువాతి వచనంతో అన్వయం).

వ. పాదములకుం బ్రణమిల్లినఁ బ్రబోధమహితాత్ముం డగు నమ్మహాత్ముండు. 262

ప్రతిపదార్థం: పాదములకున్= కాళ్ళకు; ప్రణమిల్లినన్= నమస్కరించగా; ప్రబోధమహిత+ఆత్ముండు+అగు= గొప్పజ్ఞానంతో పూజ్యమైన మనస్సుకలవాడగు; ఆ+మహా+ఆత్ముండు= ఆ గొప్పముని.

తాత్పర్యం: ఆ శిష్యుడు మోక్షానికి మార్గదర్శనం చేయుమంటూ ఆ వార్ష్ణేయముని కాళ్ళకు నమస్కరించాడు. గొప్పజ్ఞాన నిధియైన ఆ మునీశ్వరుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'భక్తి గలవు నాకుఁ బ్రజ్ఞాన ఘనుఁడ; వ । ట్లవుట నీవు యోగ్యుఁడవు కుమార!
సదుపదేశమునకు సమవధానుండవై । వినుము నాదువాక్యవృత్తి తెఱఁగు.' 263

ప్రతిపదార్థం: కుమార!= పుత్రా!; నాకున్= నా యెడ; భక్తి+కలవు= భక్తి కలవాడవు; ప్రజ్ఞాన ఘనుఁడవు= ఎక్కువ జ్ఞానంతో గొప్పవాడవు (శరీరంతో కాదు); అట్లు+అగుటన్= ఆ విధంగా అగుటవలన - నీకు భక్తి, జ్ఞానం రెండూ ఉండటంవలన; సత్+ఉపదేశమునకున్= మంచి ఉపదేశానికి - జ్ఞానబోధనకు; యోగ్యుఁడవు= అర్హుడవు; సమ్+అవధానుండవు+ఐ= మంచి ఏకాగ్రత కలవాడవై; నాదు వాక్యవృత్తి తెఱఁగు= నా యొక్క మాటల భావాల తీరు - నా మాటల తాత్పర్యం; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: కుమారా! నీవు నా యెడ భక్తిగలవాడవు, జ్ఞానసంపన్నుడవు కూడా. కాబట్టి నీవు మంచి జ్ఞానబోధకు అర్హమైనవాడవు, ఏకాగ్రచిత్తంతో నేను చెప్పేమాటల భావాలను గ్రహించుము'.

విశేషం: విద్యార్థికి గురుడియెడ భక్తి, జ్ఞానమంటే ఆసక్తి - రెండూ కావాలి. అతడే జ్ఞానదానానికి యోగ్యుడు.

వ. అని పలికి యిట్లనియె. 264

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికి= చెప్పి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని, ఈ విధంగా చెప్పాడు.

తే. 'కాలచక్రంబు నిరవధికంబు; దీని । సర్గములుఁ బ్రళయంబులుఁ జనుచునుండుఁ;
బ్రళయమునఁ బరమాత్ముఁడు ప్రకృతిఁ బొంది । యఖిలమును సృజియించుఁ గల్పాదియందు. 265

ప్రతిపదార్థం: కాలచక్రంబు= కాలం అనే చక్రం; నిర్+అవధికంబు= అవధి హద్దు - ఎల్ల లేనిది; దీని సర్గములున్+ప్రళయంబులున్= ఈ కాలచక్రం యొక్క సృష్టులు - పుట్టుకలు, నాశనములు కూడా; చనుచున్+ఉండున్= వెళ్ళుతూ - నడుస్తూ ఉంటాయి- సృష్టిలయాలు జరుగుతుంటాయి; పరమ+ఆత్ముఁడు= పరమాత్మ అనేవాడు - చావు పుట్టుకలు లేనివాడు; ప్రళయమునన్= ప్రళయ- వినాశకాలాన; ప్రకృతిన్+పొంది= స్వభావం చెంది; కల్ప+ఆదియందున్= సృష్టి ఆది - మొదలునందు; అఖిలమును= అంతటిని; సృజియించున్= పుట్టిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ కాల మనేది చక్రం వంటిది. గుండ్రంగా తిరుగుతూ ఉంటుంది. దీనికి అవధిలేదు, అంతంలేదు. ఈ కాలచక్రభ్రమణంలోనే సృష్టులూ ప్రళయాలూ ఏర్పడుతూ ఉంటాయి. ప్రళయకాలంలో పరమాత్మ మాత్రం స్వభావంతో నిలిచి, మళ్ళీ సృష్టిప్రారంభాన అంతటిని అన్నిలోకాలను - భూతాలను కల్పిస్తూ ఉంటాడు.

విశేషం: సృష్టి అంతా నష్టమౌతుంది ప్రళయాన. పరమాత్మ సృష్టి వస్తువు కాదు కాబట్టి తనకు నష్టి ఉండదు.

తే. **భూతజాలంబుతో మునిపుంగవులును । దోఁచి మును ప్రళయంబునఁ దోఁ పడంగి**
చనిన సర్వవేదంబులు శాస్త్రములును । బడసి రద్దేవు దివ్యానుభావమునను. **266**

ప్రతిపదార్థం: మును= పూర్వం; భూతజాలంబుతోన్= ప్రాణులసమూహాలతో; మునిపుంగవులును= ఋషిశ్రేష్ఠులు కూడా; తోఁచి= కలిగి; ప్రళయమునన్= ప్రళయకాలాన - సర్వమూ నశించే సమయాన; తోఁపు+అడంగి= తోచుట - కలుగుట - పుట్టుట నశించి; చనినన్= పోగా; ఆ+దేవు దివ్య+అనుభావమునను= ఆ దేవుడి యొక్క (విష్ణువుయొక్క) దివ్య శక్తివలన; సర్వవేదంబులు= ఎల్ల వేదాలూ; శాస్త్రములును= ఎల్ల శాస్త్రాలూ; పడసిరి= పొందారు.

తాత్పర్యం: పూర్వం ఋషులూ మునులూ కూడా ఇతర ప్రాణసమూహాలతోపాటే సృష్టి ఆదిలో పుట్టారు. అయితే ప్రళయకాలాన ఇతర సృష్టితోపాటు వారూ నశించారు. అయితే ఆ దేవుడి దివ్యశక్తివలన ఎల్లవేదాలూ అన్ని శాస్త్రాలూ తిరిగి పొందారు వారు.

క. **న్యాయా ద్యనేక తంత్రము । లా యంచితమతు లొనర్చి యఖిల జనాను**
ష్ఠేయాచారములుఁ బరి । జ్ఞేయములుగ విశదభంగిఁ జేసిరి పుత్రా! **267**

ప్రతిపదార్థం: పుత్రా!= ఓ కుమారా! శిష్యా!; ఆ+అంచితమతులు= ఆ ఒప్పిన బుద్ధిగలవారు; న్యాయ+ఆది+అనేక తంత్రములు= న్యాయము మొదలైన పెక్కు శాస్త్రాలు; ఒనర్చి= చేసి; అఖిలజన+అనుష్ఠేయ+ఆచారములు= ఎల్ల జనులు అనుష్ఠించవలసిన ఆచారములను - ప్రవర్తనకు చెందిన నియమ నిబంధనలను; విశదభంగిన్= స్పష్టమైన రీతిలో; పరిజ్ఞేయములుగన్+చేసిరి= బాగుగా తెలియదగినవిగా చేశారు.

తాత్పర్యం: ఆ మునిపుంగవులు ఆ దేవుడినుండి వేదాలు శాస్త్రాలు పొందిన తరువాత తమ మంచి బుద్ధులతో న్యాయం మొదలైన అనేక శాస్త్రాలను నిర్మించి లోకంలోని ఎల్లజనులూ ఆచరించదగ్గ నియమ నిబంధనలు స్పష్టంగా తెలియపరిచారు.

క. **అవి వినఁగ నెఱుఁగఁ జేయను । నవుఁ బరమబ్రహ్మబోధ; మమరులకు ముని**
ప్రవరులకును దుర్లభ మ । య్యవగతము జనార్దనునక యలవడియుండున్. **268**

ప్రతిపదార్థం: అవి= ఆ న్యాయాది శాస్త్రాలు; వినఁగన్= వింటే; ఎఱుఁగన్= తెలిస్తే; చేయను= చేస్తే; పరమబ్రహ్మబోధము= పరబ్రహ్మను గూర్చిన జ్ఞానం; అవున్= కలుగుతుంది; ఆ+అవగతము= ఆ (శాస్త్రాల) పరిజ్ఞానం; అమరులకున్= దేవతలకూ; ముని ప్రవరులకును= ఋషిశ్రేష్ఠులకూ; దుర్లభము= సులభంకాదు; జన+అర్దనునకున్+అ= విష్ణువునకు మాత్రం; అలవడి+ఉండున్= అలవాటయి (తెలిసినదై) ఉంటుంది.

తాత్పర్యం: ఆ మునిపుంగవులు రచించి ఇచ్చిన న్యాయాదిశాస్త్ర సముచ్చయాన్ని విన్నా, తెలిసికొన్నా, ఆచరించినా పరబ్రహ్మజ్ఞానం కలుగుతుంది. అయితే ఆ శాస్త్రాల పరిజ్ఞానం మాత్రం దేవతలకుగాని, ఋషులకుగాని సులభం కాదు. ఒక్క విష్ణువుకు మాత్రం వాటినిగూర్చిన పరిజ్ఞానం అలవడి ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. సకల దుఃఖ భేషజం బగు నత్తెరు । వప్పురాణపురుషు నగ్గలంపుఁ
గరుణ నతనివలనఁ గనిరి మునీంద్రులు । గ్రమముతోడ నర్హగమ్య మయ్యె. 269

ప్రతిపదార్థం: సకల దుఃఖ భేషజంబు+అగు= ఎల్ల దుఃఖాలకూ మందైన; ఆ+తెరువు= ఆ పద్ధతి (ఆ న్యాయాది శాస్త్రాల పరిజ్ఞానం); ఆ+పురాణ పురుషు+అగ్గలము+కరుణన్= ఆ ప్రాచీన పురుషుడిని (విష్ణుదేవుడి) మిక్కుటమైన దయతో; ముని+ఇంద్రులు= మునిశ్రేష్ఠులు; కనిరి= పొందారు; క్రమముతోడన్= ఆ మునీంద్రుల వరుసతో - వారి నుండి, వారి శిష్య సంతతికి, వారినుండి వారి సంతతికి - ఇట్లా; అర్హగమ్యము+అయ్యెన్= తగినవారికి పొందదగ్గది అయింది (ఆ పరిజ్ఞానం).

తాత్పర్యం: దుఃఖాలన్నిటికీ ఔషధమైన ఆ శాస్త్రపరిజ్ఞానం, ఆ పురుషోత్తముడి అగ్గలమైన దయవలన మునీంద్రులు పొందగలిగారు. ఆ తరువాత ఆ మునీంద్రులనుండి వారి శిష్యసంతతికి, వారినుండి వారి శిష్యపరంపరకు - ఇట్లా ఆ పరిజ్ఞానం అర్హులకు లభిస్తూ వస్తున్నది.

క. చైతన్యశక్తిఁ బురుష స । మేతత్వవిశేషమున వహించుఁ బ్రకృతి; త
జ్జాత యగును బుద్ధి; తదు । ద్భూత మహంకార; మదియుఁ బొరయుం జిత్తున్. 270

ప్రతిపదార్థం: ప్రకృతి= ప్రకృతి - గాలి, ఆకాశం మొదలయిన మొదటి సృష్టి; పురుష సమేతత్వ విశేషమునన్= పురుషుడితో కూడుకొన్న అతిశయంతో - (పురుషుడితో కూడికతో); చైతన్యశక్తిన్= చేతనా శక్తిని - కదిలే - కదిలించేశక్తిని; వహించున్= ధరించును; తద్+జాత= దాని నుండి (ఆ ప్రకృతి పురుషుల కలయిక నుండి) పుట్టినది; బుద్ధి= బుద్ధి అనే మూల పదార్థం (తెలివి); అగును= అవుతుంది; అహంకారము= అహంకారం - 'నేను' అనే భావం; తద్+ఉత్+భూతము= దాని నుండి పుట్టినది; అదియున్= ఆ అహంకారం; చిత్తున్= చైతన్య రూపమైన ఆత్మను; పొరయున్= పొందును.

తాత్పర్యం: పురుష సమ్మేళనం కారణంగా ప్రకృతి చైతన్యాన్ని పొందుతుంది. చైతన్యజన్యమైనది బుద్ధి. బుద్ధి నుండి అహంకారం పుట్టింది. ఆ అహంకారం ఆత్మను చేరుతుంది.

క. కలిగె విను మహంకారము । వలన నభము, దానఁ జేసి వాయువు, గ్రమసం
కలిత జననములఁ దేజము । జలము నిలయుఁ దత్తదాత్త జన్యత్వమునన్. 271

ప్రతిపదార్థం: వినుము= ఓ శిష్యా! - ఆలకించుము; అహంకారమువలనన్= 'అహంకారం' అనే మూలపదార్థంవలన; నభము కలిగెన్= ఆకాశం పుట్టింది; దానన్+చేసి= దాని (ఆకాశం)వలన; వాయువు= గాలి; క్రమ సంకలిత జననములన్= క్రమంగా - వరుసగా జరిగిన జన్మలలో; తేజము= కాంతి; జలము= నీరు; ఇలయున్= భూమీ; తద్+తద్+ఆత్త జన్యత్వమునన్= (ఒకదాని నుండి ఒకటి) పొందబడ్డ పుట్టుకతో కలిగినవి.

తాత్పర్యం: శిష్యా వినుము. అహంకారం వలన ఆకాశం, ఆకాశంవలన వాయువు, వాయువువలన తేజస్సు, తేజస్సువలన నీరు, నీటివలన భూమి - ఇట్లా ఒకదాని నుండి ఒకటి కలుగుతూ పంచభూతాలు ఏర్పడ్డాయి. అహంకారమే ఈ భూతపంచకానికి మూలం.

వ. బుద్ధికి మహ త్తను తత్త్వనిర్దేశంబును గలిగియుండు. 272

ప్రతిపదార్థం: బుద్ధికిన్= బుద్ధి అనే మూలపదార్థానికి; మహత్తు+అను= 'మహత్తు' అనే; తత్త్వ నిర్దేశంబును= తాత్త్వికమైన - వేదాంతపరమైన; నిర్దేశంబును= పేరు కూడా; కలిగి+ఉండున్= ఏర్పడి ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: బుద్ధి అనే మూలపదార్థానికి మహత్తు అనే తాత్త్వికమైన పేరు కూడా ఏర్పడి ఉన్నది.

క. వికృతులు మహదాదిక స । ప్తక ముభయ విధేంద్రియములు పదియు విషయ పం
చకమును మనసును గూడఁగ । వికారషోడశక మిది వివేకాభ్యర్థీ! 273

ప్రతిపదార్థం: వివేక+అభ్యర్థీ!= జ్ఞానాన్ని కోరేవాడా!; మహత్+ఆదిక సప్తకము= మహత్తు (బుద్ధి) మొదలగు ఏడు; వికృతులు= వికారములు - ప్రకృతికి భిన్నమైనవి; ఉభయవిధ+ఇంద్రియములు= రెండు విధాలయిన (జ్ఞానకర్మ భేదంతో రెండుగా ఉన్న) ఇంద్రియాలు - కన్ను కాలు మొదలయినవి; పదియున్= పదీ; విషయపంచకమును= విషయాలు - పంచేంద్రియాలకు గోచరించేవి- (శబ్దస్పర్శ రూపరస గంధాలు) ఐదూ; మనసును+కూడఁగన్= మనస్సును కలిపితే; ఇది ఈ పదార్థ సముదాయమంతా; వికారషోడశకము= వికృతుల పదియారు - పదహారు వికృతులు.

తాత్పర్యం: బుద్ధి (మహత్తు) మొదలయిన ఏడింటినీ తత్త్వశాస్త్రంలో వికృతులు అంటారు - జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు - వెరసి పదీ ఇంద్రియాలు. విషయాలు జ్ఞానేంద్రియాలకు, గోచరించే పదార్థాలు ఐదు, ఈ పదిహేనుకు తోడుగా మనస్సును కలిపి లెక్కిస్తే మొత్తం ఈ పదహారూ వికారాలు అనబడుతాయి.

క. ఈ సర్వము దేహత్వా । భాసిత; మిది దేహియైన పరమాత్ముని వి
న్యాసమునకుఁ గా నొదవి యు । పాసించుం గరణరూపమై యా కర్తన్. 274

ప్రతిపదార్థం: ఈ సర్వము= ఈ పదార్థాల మొత్తం; దేహత్వ+ఆభాసితము= శరీరత్వంగా అగుపించే; ఇది= ఈ ఆభాస; దేహి+ఐన= దేహంగల శరీరం దాల్చిన; పరమ+ఆత్ముని= పరబ్రహ్మయొక్క; విన్యాసమునకున్+కాన్= ఉనికికొరకు; ఒదవి= ఏర్పడి; కరణరూపము+ఐ= సాధన రూపంగా (పనిముట్టువలె); ఆ కర్తన్= ఆ చేసేవాడిని - పరమాత్మను; ఉపాసించున్= సేవిస్తుంది.

తాత్పర్యం: పైన వివరించిన ప్రకృతులు, వికృతులు - అన్నీ ఆ పరమాత్మ నివాసంకొరకు శరీరంవలె అగుపిస్తూ, ఈ అన్నింటికీ ఆదికర్త అయిన ఆ పరమాత్మకే సాధనాల రూపంగా ఉపకరిస్తూ, అతడినే సేవిస్తుంటాయి.

విశేషం: భాసం వేరు 'ఆభాస' వేరు. భాసమంటే కాంతి. అది నిజం. 'ఆభాస' అంటే అగుపించటం నిజం కానిది. ఉన్నట్లు అగుపిస్తుంది- ఉండదు. 'రసాభాస' మొదలయిన వ్యవహారంలోనిది ఇదే. ఇక్కడ శరీరం కూడా ఆభాస మాత్రం.

తే. పుత్ర! వినుము నవద్వార పుణ్యపురము । నం దచింత్య సంవ్యాపకుఁ డై శయించు
నీ సమస్త భావంబుల నెనసి యట్టు । లగుటఁ బురుషుండు నాఁ జను నవ్విభుండు. 275

ప్రతిపదార్థం: పుత్ర!= కుమారా!; వినుము= ఆలకించుము; నవద్వార పుణ్యపురమునందున్= తొమ్మిది వాకిళ్ళుగల పుణ్యనగరంలో (శరీరంలో); ఆ+విభుండు= ఆ ప్రభువు - పరమాత్మ; అచింత్య సంవ్యాపకుఁడు+ఐ= ఊహించరాని వ్యాప్తిగలవాడై; ఈ సమస్త భావంబులన్= ఈ అన్ని తత్త్వాలను గుణాలను; ఎనసి= పొంది; శయించున్= పరుండి ఉంటాడు; అట్టులు+అగుటన్= అట్లు ఆ శరీరాన పరుండుటవలన; పురుషుండు నాన్+చనున్= 'పురుషుడు' (పురమున శయనించేవాడు) అనబడతాడు.

తాత్పర్యం: కుమారా! వినుము. ఈ శరీరం తొమ్మిది ద్వారాలున్న పుణ్యపురం. ఈ పురాన ఆ పరమాత్మ ఊహాతీతమైన వ్యాప్తిశక్తితో నిండి, అన్ని భావాలను, స్వభావాలను, గుణాలను పొంది, శయనించి ఉన్నాడు. అందువలననే ఆ పరమాత్మను 'పురుషుడు' అంటారు. అంటే పురాన శయనించేవాడని ఆ పదానికి వ్యుత్పత్తి- "పురి శేతే" - ఇతి పురుషః.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇక్కడ విద్యార్థిని - శిష్యుడిని గురువు 'పుత్రా!' అంటున్నాడు. ప్రాచీనకాలాన గురుకులాలు విద్యాసంతతికి నిలయాలుగా ఉండేవి. వంశసంతతివలెనే విద్యాపరమైన సంతాన పరంపర కొనసాగుతుండేది. అందువలన ఆనాటి శిష్యులు గురువులకు పుత్రులే!

క. అమరుం డవ్యయుఁ డజరుం । డమేయుఁ డమలస్వభావుఁ డప్పురుషుఁడు దే
హమున మహీజమునం దన । లమున్న గతి నుండు మథనలక్ష్యం డగుచున్. 276

ప్రతిపదార్థం: ఆ+పురుషుఁడు= ఆ పరమాత్మ స్వరూపుడై శరీరంలో కాపురముండే నరుడు; అమరుఁడు= మరణం లేనివాడు; అవ్యయుఁడు= నాశనం లేనివాడు; అజరుండు= ముసలితనం లేనివాడు; అమేయుఁడు= కొలువరానివాడు; అమలస్వభావుఁడు= నిర్మల స్వభావం కలవాడు; దేహమునన్= శరీరాన; మహీజమునందున్= చెట్టునందు; అనలము+ఉన్నగతిన్= నిప్పు ఉన్న విధంగా; మథన లక్ష్యుండు+అగుచున్= తరచుటచేత గుర్తించదగినవాడై; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: ఆ పురుషుడు నిజానికి మరణం, నాశనం, ముసలితనం, కొలతలు, మలినాలు - ఇవేవీ లేనివాడు. నరుడికి ఇవన్నీ ఉన్నట్లు మనం చూస్తున్నాం. ఇదంతా ఆభాసమాత్రమే. దేహాన ఆ పురుషు డున్న తీరు ఎటువంటి దంటే, చెట్టులో నిప్పు దాగి ఉన్నట్లే. చూస్తే కనిపించని నిప్పు చెట్టును మథిస్తే కనిపిస్తుంది. బహిరింద్రియాల ద్వారా తెలియరాని ఆ పరమాత్మస్వరూపు డైన ఆ పురుషుడు, యోగమథనంద్వారా కనిపిస్తాడు. ఆత్మజ్ఞానానికి అంతర్మథనం అవసరం.

విశేషం: అలం: ఉపమ.

ఆ. వినుము! యోగమథనమునఁ దోఁచు నత్తేజ; । మది ప్రబోధసాంద్ర, మఖిల భూత
గణసమాశ్రయంబు గావున శ్రవణ ద । ర్శన ముఖక్రియాకరంబు దాన. 277

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ఆ+తేజము= ఆ పరమాత్మ స్వరూపమైన కాంతి; యోగమథనమునన్= యోగం ద్వారా త్రచ్చుటతో; తోచున్= కనిపించును; ఆ+తేజము= ఆ పరమాత్మ స్వరూపమైన కాంతి; అది= ఆ కాంతి; ప్రబోధ సాంద్రము= ప్రజ్ఞానంతో - గొప్పజ్ఞానంతో దట్టమైనది; అఖిల భూతగణ సమ్+ఆశ్రయంబు= ఎల్లప్రాణుల సమూహాలకూ ఆధారమైనది; కావునన్= కాబట్టి; శ్రవణ దర్శన ముఖ క్రియాకరంబు= వినటం, చూడటం మొదలైన పనులచేసేది; దానన్= దానియందే (ఈ చివరి పదం అనంతర పద్యంతో అన్వయిస్తుంది).

తాత్పర్యం: యోగవిద్యాభ్యాసంతో మథిస్తే కనిపించే ఆ పరమాత్మ స్వరూపుడైన పురుషుడు తేజోరూపాన ఉంటాడు. తేజస్సే అతడు. ఆ తేజస్సు జ్ఞానంతో నిండి ఉంటుంది. ఆ జ్ఞానమయతేజస్సు సకలప్రాణిసామాన్యంగా అన్నింటికీ ఆధారంగా వెలుగుతుంటుంది. అన్ని ప్రాణులలో ఉంటుంది కాబట్టి-వినటం, చూడటం మొదలయిన పనులన్నిటినీ నిర్వహిస్తుంది కూడా.

క. భూతము లవ్యక్తంబున । జాతములగు; నంద పెరుఁగు సమయుఁ; దదీయ
స్ఫీతత్వమునన పురుషుం । డే తద్విధ సాక్షితాసమిద్ధుఁడు వత్సా! 278

ప్రతిపదార్థం: వత్సా!= బిడ్డా! కుమారా! (దానన్= ఆ తేజస్సునందే); భూతములు= ప్రాణులు; అవ్యక్తంబునన్= మూలప్రకృతినుండి; జాతములు+అగున్= కలిగినవి అవుతున్నాయి; అందున్+అ= దానియందే - ఆ తేజస్సునందే; పెరుఁగున్= పెద్దవౌతాయి; తదీయ స్ఫీతత్వమునన= దాని ఆధిక్యమునందే; సమయున్= నశిస్తాయి; పురుషుఁడు= పరమాత్మరూపుడై తేజోమయంగా ప్రాణులలో ఉండేవాడు; ఏతద్+విధ సాక్షితా సమ్+ఇద్ధుఁడు= ఈ విధమైన సాక్షిత్వంతో వెలుగొందేవాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ తేజోరూప పరమాత్మనుండే ఈ సృష్టిలో ప్రాణిలోకమంతా పుట్టుతుంది. ఆ తేజస్సునందే పెరుగుతుంది. చివరకు ఆ తేజస్సమృద్ధిలోనే సమసిపోతుంది. ఈ సృష్టిస్థితిలయలు మూడూ జరుగుతుండగా, ఆ అన్నింటికీ సాక్షీభూతుడుగా దేహస్థుడైన పురుషుడు మిగులుతున్నాడు.

భీష్ముఁడు ధర్మజునకుఁ గాలచక్రప్రభావం బెఱింగించుట (సం. 12-204-7,8)

ఆ. వ్యక్త సప్తధార మవ్యక్త నాభంబు। షోడశకవికార సుపరిమండ
లంబు ధ్రువ మధిష్ఠితం బాత్మచేతఁ జ। క్రంబు దిరుగుచుండుఁ గాలవశత. 279

ప్రతిపదార్థం: వ్యక్త సప్తధారము= వెల్లడిఅయిన ఏడు అంచులు గలది (బుద్ధి మొదలైన ఏడు వికృతులు కాలచక్రానికి అంచులు); అవ్యక్తనాభంబు= మూలప్రకృతి నాభిగా (బొడ్డుగా)గలది; షోడశకవికార సుపరిమండలంబు= పదహారు వికారాలు - జ్ఞాన కర్మ ఇంద్రియాలు లోనైనవి మంచి వలయాలుగా గలిగినది; ధ్రువము= శాశ్వతమైనది; ఆత్మచేతన్= ఆత్మచేత; అధిష్ఠితము= అధిష్ఠించబడినది - కూర్చొనబడినది, అయిన; చక్రంబు= చక్రం - గుండ్రంగా తిరిగే గుండ్రని వస్తువు; కాలవశతన్= కాలవశంవలన - కాలమహిమవలన - కాలానికి లోబడి; తిరుగుచుండున్= పరిభ్రమిస్తుంటుంది.

తాత్పర్యం: కాలం ఒక చక్రం. దానికి బుద్ధి మొదలయిన వికృతులు ఏడూ అంచులు. ఆ అంచులు కనిపిస్తూ ఉంటాయి. దాని నాభి - కేంద్రస్థానం - అవ్యక్తం. అంటే మూలప్రకృతి కేంద్రంగా కలది కాలచక్రం. ఆ చక్రానికి జ్ఞానకర్మ ఇంద్రియాలు పదహారు వికారాలూ వలయాలు. ఆ చక్రంమీద ఆత్మ అధిష్ఠితుడై ఉన్నాడు. అది శాశ్వతమైనది. భ్రమణశీలం కలది. గుండ్రంగా తిరుగుతుంటుంది.

విశేషం: కొన్ని సంఘటనలు సృష్టిలో ఒక నియమం ప్రకారం మళ్ళీ మళ్ళీ జరుగుతున్నట్లు కనిపించినపుడు, ఆది మానవుడు ఆ ఆవృత్తిని చక్రభ్రమణంతో పోల్చికొని ఉండవచ్చును. ఉదా: ఋతువులు, పగళ్ళు రాత్రులు, ఉదయాలూ సాయంకాలాలూ. అటు తరువాత ఆ ఊహాచక్రానికి ఇతర అవయవాలు అమర్చి, ఒక సంపూర్ణ దృశ్యాన్ని నిర్మించుకొని గ్రంథస్థం చేశా డతడు.

క. ఈ చక్రంబున సకల చ। రాచరమయ మైన లోక మవశానిష్ఠా
గోచరమై చరియించుట। సూచికొనన్ వలయుఁ దత్త్వశోధన దృష్టిన్. 280

ప్రతిపదార్థం: ఈ చక్రంబునన్= ఈ కాలచక్రంలోపల; సకల చర+ఆచరమయము+ఐన లోకము= మొత్తము కదిలే, కదలని వాటితోడిదైన జగత్తు; అవశ+అనిష్ఠా గోచరము+ఐ= వశంగాని, నిలకడలేని స్థితి కలదై; చరియించుట= తిరుగుతుండటం; తత్త్వశోధన దృష్టిన్= సత్యమును వెదకే చూపుతో; చూచికొనవలయున్= చూచుకొనాలి.

తాత్పర్యం: ఆ కాలచక్రమహిమను చూచి గ్రహించవలసిందే. ఆ చక్రంలోనే ఈ సకల చరాచరమయిన జగత్తంతా వశం తప్పి, నిలకడలేక నిలిచి తిరుగుతూ ఉన్నది. సత్యశోధన దృష్టితో - ఆంతరమైన జ్ఞానదృష్టితో ఈ దృశ్యాన్ని దర్శించవలసి ఉంటుంది.

తే. పొందు సత్త్వరజస్తమంబులు విశుద్ధు। నంతరాత్మఁ బాంసువ్రాత మనిలుఁ జెందు
నట్లు సద్వివేకమునఁ దదంతరంబు। బుధుఁడు గాంచి యగ్గుణములఁ బొరయకుండు. 281

ప్రతిపదార్థం: పాంసువ్రాతము= దుమ్ము ప్రోవు; అనిలున్+చెందునట్లు= గాలిని చేరేవిధంగా; సత్త్వరజస్+తమంబులు= సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలు; విశుద్ధున్= పరిశుభ్రమైన; అంతర్+ఆత్మున్= లోపలి ఆత్మను - పరమాత్మను; పొందున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేరును; బుధుఁడు= పండితుడు; సత్+వివేకమునన్= మంచి జ్ఞానంతో; తద్+అంతరంబు= వాటి భేదం; కాంచి= చూచి - గ్రహించి; ఆ+గుణములన్= ఆ మూడు గుణాలను; పొరయక+ఉండున్= పొందకుండా ఉంటాడు.

తాత్పర్యం: దుమ్ము, ధూళి పోగులుగా నిర్మలవాయువులో కలిసినట్లుగా, సత్త్వము, రజస్సు, తమము అనే త్రిగుణాలు విశుద్ధమైన అంతరాత్మలో చేరుతున్నాయి. పండితుడైనవాడు మంచివివేకంతో ఆ గుణాల భేదాలు గ్రహించి, వాటికి దూరంగా ఉంటాడు. ఆ గుణాలు తనను అంటుకొననివ్వడు.

విశేషం: అలం: ఉపమ. విద్యవలన వివేకం కలగవచ్చును. అయితే ఈ విద్య ఉన్న ప్రతిచోటా వివేకం ఉండాలనే నియమం లేనట్లుగా లోకవృత్తాంత పరిశీలన వలన గ్రహించవచ్చును. కాబట్టి "విద్యచే భూషితుండయి వెలయుచున్నఁ దొడరి వర్జింపనగుఁ జుమీ దుర్జనుండు'' వంటి సూక్తులు పుట్టాయి. వివేకం విషయంలో అటువంటివి ఏమీ వినిపించవు. కాగా వివేకం విద్యను మించినది.

క. వేదాంతవిదుఁడు దుర్లభుఁ । డాదరము ప్రవృత్తి లక్షణాన్వితమగు ధ
ర్మోదయమందు కలుగు నది । లే దరయ నివృత్తి సౌఖ్య లీనత్వమునన్. 282

ప్రతిపదార్థం: వేదాంతవిదుఁడు= వేదాంతం - తత్త్వం తెలిసినవాడు; దుర్లభుఁడు= కష్టంతో లభించేవాడు - అరుదుగా దొరికేవాడు; ఆదరము= అభిమానం; ప్రవృత్తి లక్షణ+అన్వితము+అగున్= ప్రవర్తించటం అనే గురుతుతో కూడినది అగును - ప్రవృత్తికి కారణ మగును; అందున్+అ= దానియందే - ఆ ప్రవృత్తియందే; ధర్మ+ఉదయము= పుణ్యపు పుట్టుక; కలుగున్= ఏర్పడుతుంది; అరయన్= పరిశీలించగా; నివృత్తి సౌఖ్యలీనత్వమునన్= నివృత్తి (ప్రవృత్తికి వ్యతిరిక్తమైనది)వలన సౌఖ్యమున మగ్నమగుటలో; అది= ఆ ధర్మోదయం - పుణ్యం కలగటం; లేదు= ఉండదు.

తాత్పర్యం: భూమిమీద తత్త్వవేత్త అరుదుగా లభిస్తాడు. తత్త్వవేత్తలు కానివారిలో ప్రకృతి సహజలక్షణాలు ఉంటాయి. వారు సత్త్వరజస్తమోగుణాలు గలవారై ఉంటారు. వారిలో ఉండే ఆదరం - అంటే వస్తువులయెడ, వ్యక్తులయెడ ఉండే అభిమానం వారిని లోకవ్యవహారాలలో ప్రవర్తించేటట్లు చేస్తుంది. ఆ ప్రకృతి లక్షణం ఒక విధంగా ఉత్తమమే. ఎందుకంటే ప్రవృత్తిమార్గంలో ఉన్నపుడే నరుడు పుణ్యాన్ని ఆర్జించగలడు. ప్రవృత్తిమార్గానికి భిన్నమైనది నివృత్తిమార్గం-అంటే లోకవ్యవహారాలకు దూరంగా వాటినుండి మరలి ఉండటం. ఆ విధంగా అంతర్ముఖుడై ఉన్న నరుడికి పుణ్యార్జన చేసే వీలు ఉండదు.

క. ఆర్యులుఁ బ్రవృత్తి లక్షణ । కార్యంబులచేతఁ జేసి గ్రాహ్యము నగు త
ద్ధుర్యత్వ మందు విడువర । నార్యములగు మదనమద భయక్రోధాదుల్. 283

ప్రతిపదార్థం: ఆర్యులున్= పూజ్యులు కూడా - మంచివారును; ప్రవృత్తి లక్షణ కార్యంబులచేతన్+చేసి= ప్రవృత్తికి గుర్తు అయిన క్రియల కారణాన; గ్రాహ్యమున్+అగు= గ్రహింపదగ్గదే అయిన; తద్+ధుర్యత్వమందున్= ఆ కార్యభారం వహించేవాని తనంలో- కార్యభారం వహించే సందర్భాన; అనార్యములు+అగు= మంచివి కానివి అగు; మదన+మద భయక్రోధ+ఆదుల్= మన్మథ (వికారం), మదం, భయం, క్రోధం, మొదలైనవాటిని; విడువరు= వదలిపెట్టరు.

తాత్పర్యం: నరులు పూజ్యులే అయినా, వారు ప్రవృత్తిమార్గాన పయనిస్తున్నపుడు వివిధ విధినిషేధాలను పాటిస్తూ పెక్కుకార్యాలు నిర్వహిస్తూ ఉండవలసి వస్తుంది. ఆయా కార్యభారాలను వహించే సందర్భాలలో వారు, చెడ్డవి అని తెలిసికూడా మన్మథవికారాలను గాని, మత్తునుగాని, భయక్రోధాది భావాలను గాని విడిచిపెట్టలేరు. అవి వారి కార్యభారవహనసమయాన తప్పక కావలసివస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. వినుము దేహాభిమానికి వీని నెల్లఁ । దొలఁగ దొరకొన దెంత శాంతునకునైనఁ
గాన ఏమిట దేహాభిమాన మెడలు । నట్టి చూ పభ్యసించు వేదాంతవిదుఁడు. 284

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ఎంత శాంతునకున్+ఐనన్= ఎంతగా శాంతిని పొందినవానికైనా; దేహ+అభిమానికిన్= శరీరంపట్ల ప్రేమగలవాడికి; వీనిని+ఎల్లన్= వీటిని అన్నింటిని - మదన మదభయ క్రోధాదులను; తొలఁగన్+దొరకొనదు= విడువ వీల్పడదు; కాన= కాబట్టి; వేదాంత విదుఁడు= తత్త్వవేత్త; ఏమిటన్= దేనిచేత; దేహ+అభిమానము= శరీరం పైన ఆదరం; ఎడలున్= తొలగునో; అట్టి చూపు= ఆ విధమైన (శరీరాభిమానాన్ని దూరంచేసే) చూడ్కి; అభ్యసించున్= నేర్చుకొంటాడు.

తాత్పర్యం: ఎంత శాంతిని వహించినవాడైనా, శరీరంమీద అభిమానం ఉన్నంత కాలం, అతడు ఈ పరిత్యాజ్యాలయిన మదనమదభయక్రోధాది దుర్లక్షణాలను విడిచిపెట్టలేడు. కారణం శరీరాభిమానమే. కాబట్టి తత్త్వవేత్త అయినవాడు, ముందుగా దేనిద్వారా ఈ దేహాభిమానం తొలగించవచ్చునో - ఆ పద్ధతిని అలవరచుకొనాలి. ఆ విధమైన చూపు అతడిలో రావాలి.

ఆ. అడవి సొచ్చి యంతకంతకు నవులకు । నతికుతూహలమున నరిగి యరిగి
చూచుచుండునట్లు సూవె సంసార కా । ననము నందుఁ దిరుగు జనుల నడపు. 285

ప్రతిపదార్థం: సంసార కాననమునందున్= కుటుంబము అనే అడవిలో; తిరుగు= సంచరించు; జనుల నడపు= ప్రజల నడత; అడవి+చొచ్చి= అరణ్యాన ప్రవేశించి; అంతకున్+అంతకున్= అంతకంటె, అంతకంటె; అవులకున్= ఆవల ప్రదేశానికి - అవతలి స్థలానికి; అతికుతూహలమునన్= ఎక్కువ ఉత్కంఠతో; అరిగి+అరిగి= నడచి నడచి; చూచుచున్+ఉండునట్లు+చూవె!= చూస్తూ ఉండునట్లు సుమా!

తాత్పర్యం: ఈ సంసారం ఒక అరణ్యం. సంసారాన పడి జీవించటమంటే - అడవిలో పడి నడవటం. అడవిలోపడి నడచేవాడు. ఒకచోట ఆగక, అంత కంతకు పైపైకి నడిచివెళ్ళుతూ ఉత్కంఠతో ఆయా దృశ్యాలను' చెట్లు చేమల, పక్షులు సరీసృపాల, సాధు క్రూరజంతువుల వింత వింత తీరుతెన్నులను చూస్తూ తిరుగుతూనే ఉంటాడు. ఈ లోకాన సంసారీ అంతే. సంసారంలో ఒక దశనుండి మరొక దశకు, ఒక స్థితినుండి మరొక స్థితికి చేరుకొంటూ నిరంతరం పరిభ్రమిస్తూ విస్తుపోతూనే ఉంటాడు. అతడికి నిజమైన సుఖమూ శాంతీ లభించవు.

విశేషం: అలం: రూపకానుప్రాణితోపమ.

క. విను తెవు లుడుపఁగ భేషజ । మునకుం దలకొనిన చందమున మది సత్యం
బును శౌచము శమమును దమ । మును నెలకొలుపంగవలయు మోహచ్యుతికిన్. 286

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; తెవులు= రోగం; ఉడుపఁగన్=పోగొట్టుకొనటానికై; భేషజమునకున్= మందుకొరకు; తలకొనిన చందమునన్= ప్రయత్నించిన విధాన; మదిన్= మనస్సునందు; సత్యంబును= సత్యవ్రతం - నిజం చెప్పటం - చెప్పింది చెయ్యడంవంటి నియమపాలన; శౌచము= శుచిత్వం - పరిశుభ్రత; శమమును= శాంతిని; దమమును= దాంతిని - ఇంద్రియ నిగ్రహాన్ని; మోహ చ్యుతికిన్= శరీరంమీది వ్యామోహం జారిపోవటానికి; నెలకొలుపంగన్+వలయున్= ఏర్పరచుకొనాలిస్థాపించుకొనాలి.

తాత్పర్యం: రోగం పోవటానికి మందు కావాలి. మందుకొరకు యత్నించి పొందవలసి ఉంటుంది. ఆ విధంగానే శరీరంమీది వ్యామోహమూ ఒక రోగమే. దానిని పారద్రోలాలంటే నరుడు తన మనస్సులో సత్యాన్ని, పరిశుభ్రతను, నిగ్రహాన్ని, శాంతిని నెలకొల్పుకొనాలి. ఈ సద్గుణాలన్నీ భేషజంవలె పనిచేసి, నరుడికి శరీరాభిమానం నుండి ముక్తిని ప్రసాదిస్తాయి.

విశేషం: అలం: ఉపమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. భూమి మొదలుగఁ గల భూతములకు నింద్రి । యముల కన్నింటికిని సత్త్వ మాదియైన
గుణములకు నెల్ల జగములకును దదీశ్వ । రునకు నరయ నహంకార మునికిపట్టు. 287

ప్రతిపదార్థం: భూమి మొదలుగన్+కల= భూమి మొదలయిన; భూతములకున్= మూలపదార్థాలకు - నీరు, తేజస్సు, గాలి, ఆకాశాలకు; ఇంద్రియములకున్+అన్నిటికినిన్= కన్ను, ముక్కు, లోనైన ఇంద్రియాలన్నింటికీ; సత్త్వము+ఆది+ఐన= సత్త్వం మొదలయిన; గుణములకున్= రజస్సు తమస్సు అనే ప్రాథమికమైన గుణములకు; ఎల్ల జగములకును= అన్నిలోకాలకూ; తద్+ఈశ్వరునకున్= ఆ లోకాల అధిపతులకూ; అరయన్= ఆలోచించగా; అహంకారము= 'నేను అనే భావం' అహంకారం; ఉనికిపట్టు= నివాసస్థలం.

తాత్పర్యం: ఈ సర్వసృష్టి పంచభూతాత్మకం. అయితే ఆ పంచభూతాలకూ, ప్రాణులకున్న ఇంద్రియాలకూ, ప్రాథమికమైన సత్త్వరజస్తమోగుణాలు మూడింటికీ - ఇంతెందుకు ఎల్లలోకాలకూ, ఆ లోకాలను ఏలే అధిపతులకూ ఆవాసస్థానం అహంకారం. ఒక్క అహంకారంవలన ఈ లోకాలు, ప్రాంతాలు లోకేశ్వరులూ ఈ సర్వమూ ప్రవర్తిల్లుతున్నవి. అన్నిటికీ మూలం అహంకారం.

తే. స్మృతియు సంప్రీతియును బ్రసన్నతయు మఱియు । నీదృశములును సత్త్వగుణోదితములు
రాగలోభ రోషాదులు రాజసములు । దర్పశోక ప్రముఖములు దామసములు. 288

ప్రతిపదార్థం: స్మృతియున్= స్మరణం - తలచుట; సంప్రీతియును= మంచి సంతోషం; ప్రసన్నతయున్= కలతలేకుండా ఉండటం; మఱియున్= ఇంకను; ఈదృశములును= ఇటువంటివీ; సత్త్వగుణ+ఉదితములు= సత్త్వం అనే గుణం వలన కలిగినవి; రాగలోభ రోష+ఆదులు= ఆసక్తి, పేరాస, క్రోధం మొదలయినవి; రాజసములు= రజోగుణ సంబంధులు; దర్ప శోక ప్రముఖములు= పొగరు, ఏడుపు మొదలయినవి; తామసములు= తమోగుణ సంబంధి లక్షణాలు.

తాత్పర్యం: స్మరణం, సంతోషం, కల్మషరాహిత్యం ఇంకా ఇటువంటి సల్లక్షణాలు సత్త్వగుణంవలన కలిగేవి. ఆసక్తి, పేరాస, క్రోధం మొదలయిన లక్షణాలు రజోగుణంవలన ఏర్పడేవి. పొగరు, ఏడ్పు మొదలయినవి చివరిదైన తమోగుణం నుండి కలుగుతాయి.

క. జ్ఞానమునకు నగ్గుణసం । తానం బడ్డంబుగాన తత్ప్రతిహతికై
పూని మును సాత్త్వికముననను । మానస మూన్పంగ వలయు మహనీయధృతిన్. 289

ప్రతిపదార్థం: జ్ఞానమునకున్= ముక్తి సంబంధమైన తెలివికి; ఆ+గుణ సంతానంబు= ఆ (మూడు) గుణాల సమూహం; అడ్డంబు= అవరోధం; కాన= కాబట్టి; తద్+ప్రతిహతికై= దాని (ఆ అడ్డం) తొలగింపునకై ప్రతిక్రియకొరకు; మును= ముందుగా; పూని= యత్నించి; మానసము= మనస్సు; మహనీయ ధృతిన్= ఆరాధించదగ్గ ధైర్యంతో; సాత్త్వికముననను= సాత్త్విక గుణమునందు; ఊన్పంగన్+వలయున్= నిలుపవలెను.

తాత్పర్యం: లౌకికమైన తెలివితేటలు విజ్ఞానమనీ, అలౌకికమైన ఆధ్యాత్మమైన తెలివితేటలు జ్ఞానమని విజ్ఞులంటారు. ఆ జ్ఞానం కలుగటానికి ఈ సత్త్వరజస్తమోగుణాలు అడ్డంగా ఉంటాయి. ఆ అడ్డు తొలగించుకొనాలంటే ముందుగా ఆ గుణాలలో ఉత్తమమైన సత్త్వగుణాన్ని మనస్సున ప్రయత్నపూర్వకంగా ప్రతిష్ఠించుకొనాలి. ఆ విధంగా మనస్సును సత్త్వగుణంతో నింపాలంటే నరుడికి ఇతరులు ఆరాధించదగ్గ గొప్ప ధైర్యబల ముండాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: సంసారంలో ఉంటూ సత్త్వగుణాన్ని మనస్సున నిల్పి వ్యవహరించగలగటం, నిజంగా ఎంతో ఆరాధనాభాజనమైన ధైర్యం ఉంటే గాని కుదరదు. ఎందుకంటే చుట్టూ విరుద్ధవాతావరణం ఉంటుంది. ఏ పాటిగా పూనిక తప్పినా రజస్సునకో, తమస్సునకో జారిపోయే ప్రమాదముంటుంది. అందుకనే 'పూని', 'మహనీయధృతి' అంటూ నొక్కిచెప్పవలసి వచ్చింది.

క. వినుసాత్త్వికములు మది నెల । కొని రాజసతామసములకును వినతత్వం
బొనరించుఁ బదంపడి స । త్వనిరూఢత బోధసంపదకు హేతు వగున్. 290

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; సాత్త్వికములు= సత్త్వగుణ సంబంధి లక్షణాలు; మదిన్= మనస్సును; నెలకొని= పాదుకొని; రాజస తామసములకును= రజస్తమోగుణాలకు చెందిన లక్షణాలకు కూడా; వినతత్వంబు= లొంగిపోయినతనమును; ఒనరించున్= కలిగిస్తాయి; పదంపడి= ఇంకను; సత్త్వనిరూఢత= సత్త్వగుణం గట్టిగా నెలకొని ఉండటం; బోధ సంపదకున్= జ్ఞానసంపత్తికి; హేతువు+అగున్= కారణమగును.

తాత్పర్యం: మనసున సత్త్వగుణసంబంధమైన లక్షణాలు నెలకొన్నట్లయితే - అవి ఇతర రాజసమైన, తామసమైన లక్షణాలు వీగిపోయేటట్లు చేయగలవు. పైగా మనస్సు సత్త్వగుణ సంభరితమై ఉండటం జ్ఞానావిర్భావానికి కారణంగా కూడా పరిణమిస్తుంది.

తే. క్రియ లహంకారమునఁ గల్గుఁ గ్రియలవలన । దేహసంబంధ మెడలక తిరుగవలయు
జన్మపర్యాయములయందు జన్మ మనఁగ । మిళితనవశుక్లశోణితకలితవృత్తి. 291

ప్రతిపదార్థం: అహంకారమునన్= అహంకారం - నేను అనే భావం వలన; క్రియలు= కార్యాలు - పనులు; కల్గున్= ఏర్పడతాయి; క్రియలవలనన్= పనుల కారణాన; దేహసంబంధము= శరీరంతోడి చుట్టరికం; ఎడలక= తొలగక; జన్మపర్యాయములఅందున్= పుట్టుకల క్రమంలో; తిరుగన్+వలయున్= తిరుగవలసి ఉంటుంది; జన్మము+అనఁగన్= పుట్టుక అంటే; మిళిత నవ శుక్ల శోణిత కలిత వృత్తి= కలిసిన కొత్త ఇంద్రియ రక్తములతోడి బ్రతుకు - ఇంద్రియరక్తములు కొత్త కొత్తగా కలుస్తుంటే, పుట్టుతూ ఉండాలి.

తాత్పర్యం: అహంకారం సకల లోకాలకే కాక లోకేశ్వరులకూ ఉనికిపట్టని గ్రహించి ఉన్నాం. ఆ అహంకారమే జీవుల సకల కార్యాలకూ మూలం. ఆ కార్యనిర్వహణం జరుగుతున్నంతవరకు, ఆ కార్యకలాపాల ఫలితాలుగా పాపపుణ్యాలు కలుగుతూనే ఉంటాయి. ఆ పాపపుణ్యాల అనుభవంకొరకు ప్రాణి దేహం ధరించి, జననమరణ చక్రానపడి, క్రిందికీ మీదికీ తిరుగుతుండటం తప్పనిసరి. ఇంతకూ జననమంటే, పురుషుడి శుక్లం, స్త్రీ శోణితాల కలయికతో రూపుదిద్దుకొనటమే.

ఆ. మూత్రమునఁ బురీషమున నూనుచును గర్భ । మునఁ బ్రవర్ధనమ్ముఁ బొంది వెడలి
సంతతానుబంధ సంసార దుఃఖ ని । ర్మగ్నుఁ డగుచు నుండు మానవుండు. 292

ప్రతిపదార్థం: మానవుండు= నరుడు; మూత్రమునన్= నీరుడితో; పురీషమునన్= మలంతో; ఊనుచును= ఆనుచు-అంటుకొంటూ; గర్భమునన్= కడుపునందు; ప్రవర్ధనమ్మున్+పొంది= పెరుగుటను 'చెంది' - పెరిగి; వెడలి= బయటపడి; సంతత+అనుబంధ సంసార దుఃఖ నిర్మగ్నుఁడు= ఎల్లప్పుడు వెన్నంటి ఉండే సంసారమనే దుఃఖాన మునిగినవాడై; అగుచున్= ఔతూ; ఉండున్= జీవిస్తాడు.

తాత్పర్యం: నరుడి జన్మ దుఃఖమయమేగాదు, రోతగొల్పునది కూడా. మలమూత్రాల నడుమ గర్భాన పెరిగి, బయటపడి, ఇక అప్పటినుండి నిరంతరం సంసారంతో బద్ధుడైపోయి, తొలుత శిశువుగా, తనయుడుగా దానిలో చేరిన తాను చివరకు ముదుసలిగా తాతగా మారేంతవరకు దుఃఖంలో కూరుకొనిపోతున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: తాత్త్విక దృష్టితో చూచినపుడు సాంసారిక జీవనం కేవలం గతానుగతికంగానే కాక, సారహీనంగా దుఃఖమయంగా కూడా కనిపిస్తుంది.

క. **ఇంతకు మూలము దృష్ణా । తంతులతయ వత్స! వినుము దానికి నడరం**
గాంతాజనంబు దొలు ప్రాఁ । కింత యెఱిఁగి తృష్ణ తొఱఁగు టిచ్చు విముక్తిన్. **293**

ప్రతిపదార్థం: వత్స!= బిడ్డా! ధర్మనందనా!; ఇంతకున్= ఈ అంతటికిని; మూలము= హేతువు; తృష్ణాతంతులత+అ= పేరాస అనే తీగే; వినుము= ఆలకించుము; దానికిన్= ఆ తీగకు; అడరన్= అతిశయించగా; కాంతాజనంబు= స్త్రీజనం; తొలుప్రాఁకు= పాకుడు కొరకు నిలువుగా కొట్టిన కొయ్య - ఆలంబనం - ఊతం; ఇంత+ఎఱిఁగి= ఈ విధం గ్రహించి; తృష్ణ+తొఱఁగుట= పేరాసను వదలటం; విముక్తిన్= మోక్షమును - సంసారబంధమునుండి ఎడబాటును; ఇచ్చున్= ఒసగును.

తాత్పర్యం: ఈ నిరంతర సంసారబంధానికి, ఎడతెరపి లేక తిరిగే జనన మరణ చక్రానికి ఏకైక మూలం ఆశ అనే తీగ. ఆ ఆశాలత ఎగబ్రాకటానికి పాకుడు కొయ్యగా సంసారంలోని స్త్రీజనం ఉపయోగపడుతున్నది. ఈ నిజం తెలిసి, ఆశను విడిచిపుచ్చగలిగితే, సంసారబంధం నుండి, జనన మరణ చక్రభ్రమణం నుండి బయట పడవచ్చును.

విశేషం: అలం: రూపకం.

క. **జ్ఞానాజ్ఞానంబులకుం । దాన యుపాశ్రయము బుద్ధి తత్త్వాహంకా**
రానూన లక్షణాఢ్యం । బైన యెఱుక దాని జీవుఁ డని చెప్పు శ్రుతుల్. **294**

ప్రతిపదార్థం: బుద్ధి= నరుడి మతి; జ్ఞాన+అజ్ఞానంబులకున్= జ్ఞానానికీ, అజ్ఞానానికీ - రెండింటికీ; తాను+అ= తానే; ఉప+ఆశ్రయము= ఆలంబనం - ఆధారం; తత్త్వ+అహంకార+అనూన లక్షణ+ఆఢ్యంబు+ఐన= సత్యం అహంకారం (నేను అనే భావం) అనే గొప్ప లక్షణాలతో సంపన్నమైన (కూడిన); ఎఱుక= పరిజ్ఞానం - తెలివి; దానిన్= ఆ ఎరుకను; శ్రుతుల్= వేదాలు; జీవుఁడు+అని చెప్పున్= జీవి అని పేర్కొంటాయి.

తాత్పర్యం: (ఇక్కడ బుద్ధినీ, జీవుడినీ విడివిడిగా వాటి లక్షణాలతో ప్రదర్శిస్తున్నాడు.) బుద్ధి జ్ఞానానికి, అజ్ఞానానికి - రెండింటికీ ఆధారం. బుద్ధివేరు, జీవుడు వేరు. ఇక జీవుడి లక్షణాలు ఏమిటంటే - అతడే తత్త్వం, సృష్టిలోని చిట్టచివరి సత్యం; అతడే అహంకారం కూడా. ఈ అహంకారం కారణంగానే అహంకారలక్షణంతో ఉన్నన్నాళ్ళు సంసారయాత్ర సాగిస్తున్నాడు జీవుడు. అతడే తత్త్వలక్షణసంపన్నుడైతే ముక్తుడైపోతాడు.

ఆ. **అతఁడు కాలకలిత మైన కర్మమున సం । సార వర్తనంబు సల్పుచుండు**
స్వప్న సంప్రవృత్తి సలిపెడు నరుమాడ్కి । నింద్రియములతోడ నెనయ బెరసి. **295**

ప్రతిపదార్థం: అతఁడు= ఆ జీవుడు; కాలకలితము+ఐన= కాలంచేత సంపాదితమైన - కూడబెట్టబడిన; కర్మమునన్= కర్మవలన; సంసార వర్తనంబు= కుటుంబ జీవనం; స్వప్న సంప్రవృత్తి= కలలో ప్రవర్తనను; చలిపెడు= చేసెడు; నరుమాడ్కిన్= మానవుడివలె; ఇంద్రియములతోడన్= జ్ఞాన కర్మ ఇంద్రియాలతో; ఎనయన్+బెరసి= కలయవ్యాపించి; చలుపుచున్+ఉండున్= చేస్తూ ఉంటాడు.

తాత్పర్యం: ఆ జీవుడు కాలసంపాదితమైన కర్మ కారణాన సంసారం చేస్తూ ఉంటాడు. సంసారంలోని వివిధ కార్యాలు నిర్వహిస్తూ ఉంటాడు. అయితే నిజానికి తత్త్వరూపుడైన అతడు సంసారి కాజాలడు. అయినా కర్మవశాన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంసారజీవనం తప్పదు. అందువలన జీవుడు చేసే ఈ సాంసారిక ప్రవర్తనలు ఎట్లాంటి వంటే కలలో నరుడు చేసే క్రియలవంటివి. క్రియల నిర్వహణకు ఇంద్రియాల తోడ్పాటు తప్పదు కాబట్టి, ఆయా ఇంద్రియాలతో కలిసి ఆయా కర్మలు స్వప్నంలోవలె చేస్తూ ఉంటాడు అతడు.

విశేషం: అలం: ఉపమ.

క. రాగ పరిలిప్తమానస । యోగంబున నింద్రియంబు లుల్లసితము లై
భోగు లగుట యుడిపిన నప । రాగత సంసార దుర్విరామము సేయున్. 296

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు= జ్ఞాన - కర్మ ఇంద్రియాలు; రాగపరిలిప్తమానస యోగంబునన్= అనురాగంతో పూయబడిన మనస్సు యొక్క కలయికతో; ఉత్+లసితములు+ఐ= బాగా ఆడబడినవై (క్రీడించినవై); భోగులు+అగుట= భోగించునవిగా అగుట(ను); ఉడిపినన్= మాన్పినచో; అపరాగత= తొలగిన అనురాగం; సంసార దుర్+విరామము= సంసారముయొక్క చెడు ముగింపును; చేయున్= కలిగించును.

తాత్పర్యం: నరుడి ఇంద్రియాలు అనురాగపు పుంత కలిగిన మనస్సుతో కలిసి భోగాలలో ప్రవర్తిస్తూ, భోగులుగా అనుభోక్తలుగా మారుతున్నాయి. వాటి ఆ భోగలాలసను మాన్పగలిగితే, నరుడిలో అపరాగత్వం - అనురాగరాహిత్యం - అనురాగం తొలగిపోవటం ఏర్పడుతుంది. ఆ అపరాగత్వం వలన సంసారం నుండి విముక్తి పొందవచ్చును.

క. పురుషు లఖిల భూతములను । బురుషులలో భూమిసురులు భూమిసురులయం
దరయంగ మంత్రవేదులు । వరు లధికులు బోధయుతులు వారలకంటెన్. 297

ప్రతిపదార్థం: అఖిల భూతములను= ఎల్ల ప్రాణులలో; పురుషులు= నరులు; పురుషులలోన్= నరులలో; భూమిసురులు= బ్రాహ్మణులు; భూమిసురులఅందున్= బ్రాహ్మణులలో; అరయంగన్= పరిశీలిస్తే; మంత్రవేదులు= మంత్రం తెలిసినవారు - వేదం చదివినవారు; వరులు= శ్రేష్ఠులు; వారలకంటెన్= ఆ మంత్రవేత్తలకంటె; బోధయుతులు= జ్ఞానవంతులు; అధికులు= ఎక్కువైనవారు - ఉత్తములు.

తాత్పర్యం: సృష్టిలోని ప్రాణిజాతు లన్నింటా మానవులు శ్రేష్ఠులు. మానవులలో బ్రాహ్మణులు ఉత్తములు. బ్రాహ్మణులలో మంత్రవేత్తలు అధికులు. వారికంటెను జ్ఞానవంతులు ఉత్తములు. (సృష్టిలో సర్వోన్నతమూ, సర్వోత్కృష్టమూ అయిన పదార్థం జ్ఞానమన్నమాట.)

క. జ్ఞానంబు దృష్టి నరునకుఁ । గాన నయనహీను నడపు కరణి యగుటఁ బ్ర
జ్ఞాన విహీనుని నడవడి । దీని నెఱుఁగ వలయు నెఱుక దెచ్చికొనంగన్. 298

ప్రతిపదార్థం: నరునకున్= మానవుడికి; దృష్టి= చూపు; జ్ఞానంబు= జ్ఞానం - (తెలివి); కాన= కావున; ప్రజ్ఞాన విహీనునిన్= నడవడి- జ్ఞానం లేనివాడి నడత; నయన హీను నడపు కరణి+అగుటన్= కన్నులు లేనివాడి నడత వంటిది అగుటచేత; ఎఱుక+తెచ్చికొనంగన్= జ్ఞానం సంపాదించటానికి; దీనిన్= ఈ విషయమును - జ్ఞానహీనుడు నయనహీనుడను విషయమును; ఎఱుఁగన్+వలయున్= తెలిసికొనవలెను.

తాత్పర్యం: మానవుడికి నిజమైన చూపు జ్ఞానమే గాని, కన్ను కాదు. కాబట్టి జ్ఞానహీనుడి నడత గుడ్డివాడి నడకవంటిది. జ్ఞానార్థిఅయినవాడు జ్ఞానార్జనకు ముందుగా ఈ విషయాన్ని గ్రహించాలి.

విశేషం: అలం: ఉపమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. క్షమయును సత్యంబును శౌ । చమును సుధర్మములు! బ్రహ్మచర్యం బత్యు
త్తమ ధర్మము; వానికిఁ జి । త్తము నలవఱుపంగవలయు ధైర్యము పేర్మిన్. 299

ప్రతిపదార్థం: క్షమయును= ఓర్పూ; సత్యంబును= సత్యవ్రతమూ - సత్యం చెప్పడం, సత్యంగా ప్రవర్తించటం; శౌచమును= శుచిత్వము - శుభ్రత - శారీరక మానసిక పరిశుద్ధత - ఈ మూడూ; సుధర్మములు= మంచి ధర్మాలు; బ్రహ్మచర్యంబు= బ్రహ్మచారి తనం - గార్హస్థ్యానికి ముందు ఆచరించే ధర్మం; అతి+ఉత్తమ ధర్మము= మిక్కిలి శ్రేష్ఠమైన ధర్మం; వానికిన్= ఆ ధర్మాల - క్షమా, సత్య శౌచ బ్రహ్మచర్య ధర్మాలకొరకు - వాటి ఆచరణకై; ధైర్యము పేర్మిన్= ధైర్యము - ధీరుడి స్వభావంయొక్క అతిశయంతో; చిత్తమున్= మనస్సును; అలవఱుపంగన్+వలయున్= అలవాటు చేయాలి.

తాత్పర్యం: జ్ఞానార్జనకు ముందు నరుడు ధర్మాధర్మవివేకంతో ధర్మాన్ని ఆచరించాలి. ధర్మాలలో ఓర్పు, సత్యం, బహిరంతశ్శుభ్రత ఉత్తమమైనవి. ఆ తరువాత బ్రహ్మచర్యం అతిశ్రేష్ఠధర్మం. ఈ ధర్మాలయెడ మనస్సును అనుకూలంగా మలచటానికి నరుడిలో గొప్ప ధైర్యం కావాలి. మనస్సును ఈ ధర్మాల ఆచరణకు క్రమంగా అలవాటు చేయాలి.

విశేషం: సద్ధర్మాచరణకు ధైర్యం తప్పనిసరి. సామాన్యులు ధర్మాన్ని సాధారణంగా ఆచరిస్తూనే ఉంటారు. కాని, పరీక్షా సమయాలలో కీలకమైన సన్నివేశాలలో ధైర్యశాలి తప్ప ఇతరులు ధర్మానికి కట్టుబడి ఉండలేరు.

క. పరిహాసము భాషణమును । నిరీక్షణము లోనుగాఁగ నింద్యంబులు సుం
దరులయెడ దీని కేమని । చొరఁదగ దట్లైన మనసు సొత్తురు సుదతుల్. 300

ప్రతిపదార్థం: సుందరుల ఎడన్= అందమైన వనితలతోడి వ్యవహార సందర్భాన; పరిహాసము= గేలి; భాషణము= మాట్లాడుట; నిర్+ఈక్షణము= ఎదురుచూడటం; లోనుగాఁగన్= లోనైనవి (క్రియలు-చేష్టలు); నింద్యములు= నిందించదగ్గవి - పరిహరించదగ్గవి; దీనికిన్= ఈ మాత్రపు చిన్న పనికి; ఏమి+అని= (తప్పు) ఏమిటి అని; చొరన్+తగదు= ప్రవేశించకూడదు; అట్లు+అయినన్= అట్లు (ఏమీలేదులే అనికొని చొరబడి) పోతే పోయినచో; సుదతుల్= స్త్రీలు; మనసు+చొత్తురు= మనస్సున (నరుడి) ప్రవేశిస్తారు.

తాత్పర్యం: సౌందర్యవతులయిన వనితలయెడ బ్రహ్మచారి అతిజాగరూకుడై మెలగాలి. వారితో పరిహాసం, సంభాషణం, వారికొరకు ఎదురుచూపు లోనైన చేష్టలు కూడవు. ఆఁ, దీనికేమైనది! దీనిలో తప్పు ఏమిటి? అన్న భావంతో వారిలోనికి చొచ్చుకుపోతే, వారు బ్రహ్మచారి మనస్సులోనికి ప్రవేశిస్తారు.

విశేషం: ఈ జాగరూకత, రోగం కలిగిన తరువాత ఔషధసేవనం కంటె, ముందుగానే అసలు రోగ ఆవిర్భావమే లేకుండా చూచుకొనే అభిప్రాయంతో తీసికొనవలసినది.

క. విను మాంసాస్థిమయం బని । వనితాంగము సద్వివేక వైభవమునఁ గాం
చిన నందు మది దగులు; దా । పనికిని నాడీ విశుద్ధి ప్రాపగుఁ బుత్రా! 301

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; విను= ఆలకించుము; వనితా+అంగము= స్త్రీ శరీరం; మాంస+అస్థిమయంబు+అని= మాంసంతో, ఎముకలతో నిండినది అని; సత్+వివేకవైభవమునన్= మంచి విచక్షణా జ్ఞానంతో; కాంచినన్= చూస్తే; మది= మనస్సు; తగులదు= చిక్కుకొనదు - స్త్రీయెడ; ఆ పనికిని= ఆ క్రియకు - ఆ విధంగా చూడటానికి; నాడీ విశుద్ధి= నాడుల - శరీరంలోని రక్తాన్ని ధరించి శరీరమంతా ప్రాకి ఉండే నరాల వంటివాటి విశుద్ధత్వం - వాటి పరిశుభ్రత; ప్రాపు+అగు(న్)= ఆధారమౌతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వనితల శరీరనిర్మాణాన్ని గమనించి, వాస్తవాన్ని గుర్తిస్తే వారియెడ ఆకర్షణ కలుగదు. మాంసపుటెముకల మూట తప్ప అన్యంగాదు ఆ శరీరము అనే మంచి వివేకంతో స్త్రీని దర్శిస్తే, బ్రహ్మచారి మనస్సు స్త్రీని స్పృశించదు. అయితే ఆ దృష్టి ఏర్పడాలంటే, ముందుగా అతడికి శరీరనిర్మాణంలో ప్రధాన భాగాలయిన నాడుల పరిశుద్ధత ఆలంబనంగా ఉండగలదు.

క. శారీరస్థితికిఁ బ్రథమ। కారణమై యుండు నాడికాదశకము; సం
చారిక లగు నింద్రియముల। కారయ నాడికలు మఱియు నై దమలమతీ! 302

ప్రతిపదార్థం: అమలమతీ!= నిర్మలమైన బుద్ధి కలవాడా! - ధర్మరాజా!; శారీర స్థితికిన్= శరీరముయొక్క ఉనికికి; నాడికా దశకము= నాడుల పది - పది నాడులు; ప్రథమ కారణము+ఐ= మొదటి కారణమై; ఉండున్= కలవు; ఆరయన్= పరిశీలించగా; సంచారికలు+అగు= సంచారశీలములయిన - తిరుగాడే స్వభావంగల; ఇంద్రియములకు - పంచజ్ఞాన ఇంద్రియాలకు; మఱియున్= ఇంకను; ఐదు నాడికలు= ఐదు నాడులు (కలవు).

తాత్పర్యం: ఓ నిర్మలబుద్ధీ! ధర్మరాజా! శరీరనిర్మాణంలో ఆదికారణాలుగా పదినాడులు ఉన్నాయి. సంచరించే స్వభావంగల జ్ఞానేంద్రియాలకు అదనంగా మరి ఐదు నాడికలు ఉన్నాయి. మొత్తం ఈ పదిహేను నాడులూ శరీరాన్ని నిలుపుతున్నాయి, నడుపుతున్నాయి కూడా.

విశేషం: యోగవిద్యాభ్యాసంలో ఈ నాడీపరిజ్ఞానం ఆవశ్యకంగా భావిస్తారు. ఇంద్రియనిగ్రహం నాడీపరిజ్ఞానంతో ముడిపడి ఉన్నట్లు భావిస్తారు.

తే. స్థూల భంగులు పదియును సూక్ష్మభంగు। లైదు నివి; వీనికంటె నత్యంత సూక్ష్మ
భంగి హృదయంబు నడుముగాఁ బరఁగియున్న। నాడియది సర్వగత యగుఁ జూడఁ జూడ. 303

ప్రతిపదార్థం: స్థూలభంగులు= బలసిన (పెద్ద) విధముగలవి - పెద్దవి; పదియును= పదీ - పైన చెప్పినవి; సూక్ష్మభంగులు= సన్నని విధం గలవి - వెదికితేగాని కనిపించనివి; ఐదును= ఐదూ (ఇంద్రియాలకు చెందినవి); ఇవి= ఈ పై వివరించబడినవి; వీనికంటెన్= ఈ పదిహేనింటికంటె; అతి+అంత+సూక్ష్మ భంగి= మిక్కిలి సన్నమైన విధంగలది; హృదయంబు= మనస్సు; నడుముగాన్+పరఁగి+ఉన్న= మధ్యభాగంగా ఒప్పే; నాడి+ఆది= ఆ నాడి - ఆ ప్రసిద్ధమైన నాడి; చూడన్+చూడన్= చూడగా చూడగా; సర్వగత+అగున్= అంతటను ఉండేది - శరీరమంతా వ్యాపించి ఉండేది ఔతుంది.

తాత్పర్యం: శరీరనిర్మాణానికి ప్రథమకారణాలుగా పేర్కొనబడ్డ నాడులు పది - స్థూలమైనవి. ఆ తరువాత పంచేంద్రియాలకు ఆధారమైన నాడికలు (చిన్న నాడులు) ఐదూ సూక్ష్మమైనవి. చూచినంత మాత్రాన కనిపించేవి కావు అవి. ఈ రెండు విధాలయిన నాడులు - స్థూలసూక్ష్మ రూపాలలో ఉండేవి కాకుండా, మరొక అతిసూక్ష్మనాడి ఉన్నది. దానికి మనస్సు మధ్యభాగంగా ఉంటుంది. ఆ అతిసూక్ష్మనాడి హృదయగతమైనది. దానిని చూస్తూ చూస్తూ పోతే అది అంతటా వ్యాపించి, అంతా తానే అయి ఉంటుంది.

క. ఆ చూపు మరిగి చిత్తం। బే చవికిం బోదు; పోయె నేని మరలుపన్
గోచరమగు వెలిచవులం। బాచిన లోచవిన నిలిచి పరమాత్మఁ గనున్. 304

ప్రతిపదార్థం: ఆ చూపు= (పైన వివరించిన) హృదయగతనాడిపై చూపు - అంతర్ దృష్టి; మరిగి= అలవాటుపడి; చిత్తంబు= మనస్సు; ఏచవికిన్= ఏ రుచికొరకూ; పోదు= వెళ్ళదు; పోయెను+ఏని= (ఒకవేళ) వెళ్ళినట్లయితే; మరలుపన్= మరలించగా-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిరిగి అంతర్ దృష్టివైపునకు త్రిప్పగా; గోచరము+అగు= అనుభూతాలయిన; వెలిచవులన్= బయట రుచులను; పాచినన్= విసర్జించగా - వదలివేసిన పిదప; లోచవిని+అ= లోపలి రుచియందే; నిలిచి= నిలబడి - స్థిరమై; పరమ+ఆత్మన్= పరబ్రహ్మ స్వరూపమైన దానిని; కనున్= చూస్తుంది.

తాత్పర్యం: హృదయం మధ్యభాగంగా కలిగి, సర్వాంతర్యామిగా ఉండే ఆ సూక్ష్మతమ నాడిపై దృష్టి నిలిపిన చిత్తం ఇక దేనినీ కోరక, దేనినీ పట్టించుకొనక ఆ అంతర్ దృష్టితో అట్లాగే ఉండిపోతుంది. ఇతర అంశాలజోలికి పోదు. ఒకవేళ పోయినా, దానిని తిరిగి మరలించి యథాపూర్వస్థితిలో నిల్పినపుడు ఆ చిత్తం తన అనుభవానికి వచ్చిన వెలిచవులను విసర్జించి, సూక్ష్మతమ నాడిపై దృష్టి నిలిపి, అనుభవించిన లోచవిని తిరిగి స్వీకరించి, దానియందే నిలిచి పరమాత్మను చూడగలుగుతుంది.

క. ఆ విధము శుక్లగతి గను । భావమునకుఁ గాని పట్టువడదు; వినుము! శు
క్లావేశము సంకల్పజ । మావాసము శుక్లమునకు నఖిలాంగకముల్. 305

ప్రతిపదార్థం: ఆ విధము= ఆ పరమాత్మను కనగల్గిన 'లోచవి'; శుక్లగతి+కను భావమునకున్+కాని= ఇంద్రియపు పోక(ను) పొందే స్థితికిగాని; పట్టు+పడదు= అలవడదు - అనుభవానికి రాదు; వినుము= ఆలకించుము; శుక్ల+ఆవేశము= ఇంద్రియపు ప్రవేశం; సంకల్పజము= ఆలోచనవలన పుట్టేది; అఖిల+అంగకముల్= ఎల్ల అవయవములు; శుక్లమునకున్= ఇంద్రియానికి; ఆవాసము= నివాసం - ఉనికిపట్టు.

తాత్పర్యం: ఆ విధంగా 'లోచవి'తో పరమాత్మను దర్శించగలగటం నరుడిలో ఇంద్రియపు పోకడ ఏర్పడేనాటికిగాని అలవడదు. ఇంద్రియపు ఉద్రేకమనేది సంకల్పంవలన జనిస్తుంది. నరుడి సకల అవయవాలూ శుక్లానికి ఉనికిపట్టులే-ఉత్పత్తి హేతువులే.

క. అరయఁగ సంస్పర్శనమునన । తిరుగుడువడు శుక్ల మనుట తెఱఁగే? సంక
ల్పరతింగలదే? చోఁకెడఁ । జరింపకుండంగ వలయు సంకల్పంబుల్. 306

ప్రతిపదార్థం: అరయఁగన్= పరిశీలించగా; శుక్లము= ఇంద్రియం; సంస్పర్శనమునను+అ= బాగా తాకటంవలననే; తిరుగుడు+పడున్= స్థలనమౌతుంది; అనుట= అనటం - అట్లా అనటం; తెఱఁగు+ఏ?= పద్ధతా? తగునా? (తగదు); సంకల్పరతిన్= ఊహయందలి రతియందు; చోఁకు= స్పర్శ; కలదు+ఏ?= ఉన్నదా?; సంకల్పంబుల్= ఊహలు; ఎడన్+చరింపక+ఉండంగన్+వలయున్= హృదయంలో తిరుగాడక ఉండాలి.

తాత్పర్యం: పరిశీలిస్తే స్పర్శవలననే ఇంద్రియస్థలనం జరుగుతుంది - అనే మాట సరిగా కనబడదు. ఎందుకంటే నరుడు ఊహాలోకంలో విహరిస్తూ కేవలం సంకల్పమాత్రాన రతిసుఖానుభూతిని ఇంద్రియస్థలనంద్వారా పొందుతున్నాడు. మరి అక్కడ ఆ సంకల్పమాత్ర రతిలో స్పర్శకు తావేది? కాబట్టి నరుడి ఎడదలో సంకల్పాలు తిరుగాడకుండా ఉండాలి.

తే. అత్రిముని యింద్ర దైవత్య మని జనులకుఁ । దెలిపె; నది కారణముగ నింద్రియ మనంగఁ
బరఁగుఁ జావె నృబీజంబు పరమ మెల్ల । ధాతువుల కది విను పుత్ర! దాని విధము. 307

ప్రతిపదార్థం: పుత్ర!= కుమార!; అత్రిముని= అత్రి అనే పేరుగల ఋషి; నృబీజంబు= నరుడి విత్తనమును - శుక్లమును; ఇంద్ర దైవత్యము= ఇంద్రదేవతకు చెందింది; అని జనులకున్= అని ప్రజలకు; తెలిపెన్= ఎరుకపరచాడు; అది= ఆ తెల్పటం;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కారణముగన్= హేతువుగా; ఇంద్రియము+అనంగన్= ఇంద్రియం అనగా; పరఁగున్+చూవె!= ఒప్పును సుమా!; అది= ఆ ఇంద్రియం; ఎల్ల ధాతువులకున్= అన్ని మూలపదార్థాలకంటె (మానవ శరీర నిర్మాణ మూలపదార్థాలు); పరమము= గొప్పది - శ్రేష్ఠము; దాని విధము= ఆ ఇంద్రియపు వైనం; విను= ఆలకించుము.

తాత్పర్యం: కుమారా! ధర్మరాజా! వినుము. పూర్వం అత్రిముని నరుడిలో ఈ బీజాన్ని ఇంద్రదేవతకు చెందినదానినిగా జనులకు తెలియజేశాడు. అప్పటినుండి ఈ శుక్లాన్ని ఇంద్రియమని వ్యవహరిస్తున్నారు. ఈ ఇంద్రియం నరుడి శరీరంలోని మూలపదార్థాలు అన్నింటికంటె శ్రేష్ఠమైనది.

ఆ. శుక్లమునకు మనసు సూక్ష్మరూపము; మనో । బలము నిల్వరింపఁ బక్వబుద్ధి
యోపుఁ; దరుణవృద్ధు లోప రజ్ఞాన దౌ । ర్బల్య మూఢ వికలభావు లగుట. 308

ప్రతిపదార్థం: శుక్లమునకున్= ఇంద్రియానికి; మనస్సు= చిత్తం; సూక్ష్మరూపము= అతిగా సన్నని చిన్నని ఆకారం; మనస్+ బలము= చిత్తముయొక్క శక్తిని; నిల్వరింపన్= నిగ్రహించటానికి - అదుపు చేయటానికి; పక్వబుద్ధి= పండిన మతిగలవాడు - వివేకవంతుడు; ఓపున్= సమర్థుడగును - చాలును; తరుణ వృద్ధులు= యువకులు, ముదుసలులు; అజ్ఞాన దౌర్బల్య మూఢవికల భావులు+అగుటన్= (క్రమంగా) జ్ఞానం లేకపోవటంచేత (యువకులు) బలం చాలకపోవటంచేత (ముదుసలులు) తెలియని కలతచెందిన భావాలు కలవారు కాబట్టి; ఓపరు= సమర్థులు కారు - చాలరు (మనస్సును నిల్వరించటానికి).

తాత్పర్యం: ఈ ఇంద్రియానికి సూక్ష్మరూపం మనస్సే. కాబట్టి ఇంద్రియ నిగ్రహమంటే మనోనిగ్రహమనే గ్రహించాలి. మనశ్శక్తిని నిల్వరించాలి - అంటే పరిపక్వమైన బుద్ధిగల వివేకవంతులకే అది సాధ్యమౌతుంది. ఇతరులకు, యువకులకుగాని వృద్ధులకుగాని మనోబలాన్ని నిగ్రహించే శక్తి చాలదు. ఎందుకంటే యువకులు అజ్ఞానంవలన తెలియని భావాలతో ఉంటారు. ముదుసలులు దౌర్బల్యంవలన కలతచెందిన భావాలతో ఉంటారు. యువకులు అజ్ఞానమూఢులు కాగా, వృద్ధులు దౌర్బల్యవికలులు. కాబట్టి యౌవనవార్ధక్యాల నడిమి దశలోనివారే మనస్సును నిగ్రహించగలరు.

క. కావున శుక్ల స్థితికిం । గావించినయట్టి పుణ్యకర్మము లగు స
త్సేవిత యమనియమాదుల । త్రోవ సొరఁగవలయు విషయ దూరాత్మకుఁడై. 309

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి - ఇంద్రియ నిగ్రహం అవశ్య ఆచరణీయం కాబట్టి; శుక్ల స్థితికిన్= ఇంద్రియపు నిలకడకు; కావించిన+అట్టి= ఏర్పరచినట్టి; పుణ్యకర్మములు+అగు= ధర్మకార్యములయిన; సత్+సేవిత యమ నియమ+ఆదుల త్రోవ= మంచివారిచేత ఆచరించబడ్డ యమము, నియమము మొదలయిన ఎనిమిది నియములయొక్క దారిని; విషయదూర+ఆత్మకుఁడు+ఐ= విషయాలకు - కన్ను ముక్కు లోనైనవాటికి తెలియవచ్చేవానికి, ఎడమైన మనస్సుగలవాడై; చొరఁగన్+వలయున్= ప్రవేశించాలి.

తాత్పర్యం: ఇంద్రియనిగ్రహం జ్ఞానార్జనకు, తద్వారా మోక్షప్రాప్తికీ కారణం కాబట్టి వీర్యపు నిలకడకొరకు ఏర్పరచబడ్డవీ, సజ్జనులు ఆచరించేవీ అయిన యమనియమాది ఎనిమిది నియమాలూ నరుడు పాటించాలి. జ్ఞానేంద్రియాలకు గోచరించే విషయాలకు దూరంగా మనస్సును కట్టడిచేసి, ఈ యమనియమాదుల మార్గాన ప్రవేశించాలి. అపుడు మనో నిగ్రహం, తద్వారా శుక్లస్థితి చేకూరే వీలుంది.

క. అరయఁగ విషయము లెంతయు । దురంతములు; వానియందుఁ దొడరినఁ జేటుం
బొరయుదురు దొడరకున్నం । బరమపదవి యమ్మహానుభావులకు నగున్. 310

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అరయఁగన్= పరిశీలించగా; విషయములు= పంచజ్ఞానేంద్రియాలకు గోచరించే అంశాలు - పదార్థాలు;ఎంతయున్= అమితంగా - అధికంగా; దుర్+అంతములు= దుఃఖం, చెడు అంతాన గలవి - చివరకు దుఃఖాన్ని, చెడును కలిగించేవి;వానియందున్= ఆ విషయాలలో (విషయ సుఖాలలో); తొడరినన్= లగ్నమైనచో; చేటున్= కీడును; పొరయుదురు= పొందుదురు; తొడరక+ఉన్నన్= లగ్నం కాకుండా ఉన్నచో; ఆ+మహా+అనుభావులకున్= అట్టి తొడరని గొప్పశక్తి సంపన్నులకు; పరమపదవి= గొప్పస్థితి - ముక్తి; అగున్= కలుగును.

తాత్పర్యం: పరిశీలనగా చూస్తే జ్ఞానేంద్రియాలద్వారా మనస్సును చేరే విషయాలు, చాలా దుఃఖాన్ని, కీడును చివరకు మిగిల్చేవిగా ఉంటాయి. కాబట్టి ఆ విషయాలలో తగుల్కొంటే (ఆ విషయసుఖాలకు లోనైతే) చివరకు చేటు కలుగకమానదు. అట్లా కాకుండా ఆ విషయాలకు దూరంగా ఉండి, విషయ సుఖాలకు లోనుగాని మహానుభావులు పరమపదాన్ని (ముక్తిని) అందుకొనగలుగుతారు.

క. **జననము జరయును మరణం । బును మొదలుగఁ గలుగు దుఃఖములు లోకమునం**
గనుఁగొని బుధుండు మోక్షం । బున కుద్యోగించు నియతిఁ బూతహృదయుఁ డై. **311**

ప్రతిపదార్థం: బుధుండు= పండితుడు - బుద్ధిమంతుడు; లోకంబునన్= జగత్తులో; జననము= పుట్టుక; జరయును= ముసలితనమూ; మరణంబును= చావూ; మొదలుగన్+కలుగు దుఃఖములు= మొదలైన ఎపుడూ ఉండే దుఃఖాలను; కనుఁగొని= చూచి; నియతిన్= నియమంతో - నిగ్రహంతో; పూత హృదయుఁడు+ఐ= పవిత్రమైన మనస్సు కలవాడై; మోక్షంబునకున్= ముక్తికొరకు; ఉద్యోగించున్= ప్రయత్నిస్తాడు.

తాత్పర్యం: లోకవ్యవహారాన్ని పరిశలించిన పండితుడు, లోకంలో నిరంతరం ఎపుడూ ఆగకుండా జరిగిపోయే పుట్టుకలూ, చావులూ, మీదపడే ముసలితనం మొదలైన దుఃఖపరంపరను చూచి, నియమపాలనతో మనస్సునుపవిత్రీకరించుకొని ఈ జగత్తునకు, దానిలోని దుఃఖసమూహానికీ దూరంగా పోయే ఉద్దేశంతో మోక్షంకొరకుప్రయత్నిస్తాడు.

విశేషం: గతానుగతమైన జీవనం చేయటం పామరుడి లక్షణం. పరిశీలించి ఉత్తమ మార్గాన బ్రతకటం పండితుడి లక్షణం.

తే. **వాఙ్మనః కాయములు శౌచవంతములుగఁ । జేసికొని యనహంకారశీల శాంత**
బుద్ధియై నిరపేక్షతఁ బొంది యఖిల । భూతదయ గల్గి మెలఁగంగ బోధ మొందు. **312**

ప్రతిపదార్థం: వాక్+మనస్+కాయములు= మాట, మనస్సు, శరీరం - ఈ మూడూ; శౌచవంతములుగన్= శుభ్రతతో కూడినవిగా; చేసికొని= కావించుకొని; న+అహంకారశీల శాంత బుద్ధి+ఐ= అహంకారంలేని - 'నేను' అనే గర్వంలేని స్వభావంతో శాంతించిన బుద్ధిగలవాడై; నిర్+అప+ఈక్షతన్= కోరికలేనివాడితనమును - కోరికలు లేని స్థితిని; పొంది= చెంది; అఖిల భూతదయ= ఎల్ల ప్రాణులయెడ జాలి - కరుణ; కల్గి= ఉండి - వహించి; మెలఁగంగన్= ప్రవర్తిస్తే - జీవిస్తే; బోధము= జ్ఞానం; ఒందున్= చెందును.

తాత్పర్యం: నరుడు మాటలో, మనస్సులో, పనిలో పరిశుభ్రతను పాటిస్తూ, సహజమైన అహంకారభావాన్ని విడనాడి శాంత స్వభావుడై ఉన్నపుడు, అతడిలో కోర్కెలు సన్నగిల్లి, అంతరించిపోతాయి. ఆ స్థితిలో లోకంలోని ప్రాణి సమూహమంతటినీ అతడు కరుణతో ఆదరించగలుగుతాడు. పరిశుభ్రమైన జీవనం, అహంకారం లేని శీలం, కోర్కెలకు దూరమైన మనస్సూ - ఈ మూడిటికి తోడుగా భూతదయ కలిగి ఉన్నవాడికి జ్ఞానం కలిగితీరుతుంది.

క. **మనసును వాక్కును గాయం । బు నియంత్రితములుగఁ జేసి పొందుదురు ధనం**
బునకై ముచ్చులు దానిం । గనుఁగొనఁ గావలదె మోక్షకాంక్షికి? వత్సా! **313**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వత్సా!= బిడ్డా! ధర్మసుతా!; మ్రుచ్చులు= దొంగలు - అధ్యాత్మ విద్యలోనివారు; మనసును= చిత్తమును; వాక్కును= మాటను; కాయంబున్= శరీరాన్ని; ధనంబునకై= ధనంకొరకు - ధనార్జనకై; నియంత్రితములుగన్+చేసి= నియమించబడిన - నిగ్రహించబడిన వాటినిగా చేసి; దానిన్= ఆ ధనాన్ని; పొందుదురు= అందుకొంటారు; మోక్షకాంక్షికిన్= ముక్తిని కోరేవాడికి; కనుఁగొనఁగాన్+వలదే?= చూడవద్దా? (ఆ విషయం).

తాత్పర్యం: అన్ని విద్యలనువలెనే ఈ ఆధ్యాత్మవిద్యనూ దుర్వినియోగంచేసే దొంగలున్నారు. అట్టివారిని ముక్తిని కోరేవాడు గమనించాలి. ఆ మునిమ్రుచ్చులు ధనంకొరకు, మనోవాక్కాయాలను నియంత్రించికొని, తత్ప్రదర్శనద్వారా దాన్ని ఆర్జించి ఆధ్యాత్మవిద్యా కాలుష్యానికి కారకులవుతున్నారు. ఈ విధమైన దురుపయోగం నుండి ఆధ్యాత్మవిద్య రక్షితం కావాలి.

ఆ. బుద్ధిఁ గొని మనంబు వోనీక నిలిపి మ । నోభియుక్తి నింద్రియముల నాఁగి
విషయసమితి నెడల విడిచిన వానికి । ననిమిషులు ప్రసన్ను లగుదు రనఘ! 314

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; బుద్ధిన్+కొని= మతినిపట్టి - నిగ్రహించి; మనంబు= మనస్సును; పోన్+ఈక= పోనీయక-దానిని నిలిపి; మనస్+అభియుక్తిన్= చిత్తముయొక్క పూనికతో; ఇంద్రియములన్= కన్ను ముక్కు లోనైన జ్ఞానేంద్రియాలను; ఆఁగి= అడ్డగించి- నిగ్రహించి; విషయసమితిన్= విషయ (వాసనల) సమూహాన్ని - లౌకిక ప్రవృత్తులను; ఎడలన్+విడిచినవానికిన్= దూరాన వదలిన వాడికి; అనిమిషులు= రెప్పపాటులేనివారు - దేవతలు; ప్రసన్నులు+అగుదురు= అనుగ్రహించినవారు అవుతారు.

తాత్పర్యం: ఓ పాపరహితుడ వైన ధర్మరాజా! బుద్ధిని అదుపులో ఉంచుకొని, మనస్సును నిగ్రహించుకొని, పూనికతో ఇంద్రియాలను నిరోధించి, తద్ద్వారా విషయవాసనలను విడిచిపుచ్చిన వాడిని దేవతలు అనుగ్రహిస్తారు.

క. విను దేవతాప్రసాదం । బున నిర్మల యోగతంత్రములు పనుపడు న
య్యనువున నిశ్చలమతి ని । ల్చునది శిథిలితాన్నపాన సుఖతృష్ణుం డై. 315

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; దేవతా ప్రసాదంబునన్= దేవతల అనుగ్రహంవలన; నిర్మల యోగ తంత్రములు= స్వచ్ఛమైన యోగకార్యాలు; పనుపడున్= అలవాటౌతాయి; ఆ+అనువునన్= ఆ సౌకర్యంతో - ఆ ఉపాయముతో; నిశ్చలమతిన్= చలనంలేని బుద్ధితో; శిథిలిత+అన్నపాన సుఖతృష్ణుండు+ఐ= తినటం తాగటం సుఖములయెడ సడలిన ఆశగలవాడై- అన్నపానాలయెడ, సుఖాలయెడ ఆశ సన్నగిల్లినవాడై; నిల్చునది= నిలబడాలి.

తాత్పర్యం: దేవతల అనుగ్రహంవలన మలినరహితమైన యోగకార్యాలు నరుడికి అలవడుతాయి. ఆ యోగవిద్యల సహాయంతో నిశ్చలబుద్ధితో అన్నపానాలు, ఇతర సుఖాలయెడ ఆసక్తి సన్నగిల్లి, ఏకాగ్రతతో నరుడు నిలబడాలి.

క. శాక కణ మూల ఫల పి । ణ్యాకాదుల భైక్షమైన యన్నంబున ని
శ్శోకత నాఁకలివుచ్చుచు । లోకాలోకంబున నచలుఁడు గావలయున్. 316

ప్రతిపదార్థం: శాక కణ మూల ఫల పిణ్యాక+ఆదులు= కూరలు, నూకలు, కందములు (భూమిలోపల పెరిగే ఆహారాలు), పండ్లు, తెలికపిండులు మొదలయిన వాటియొక్క; భైక్షము+ఐన= బిచ్చంగా వచ్చిన; అన్నంబునన్= ఆహారంతో; నిస్+శోకతన్= దుఃఖంలేని భావంతో; ఆఁకలి+పుచ్చుచున్= ఆకలిని తీర్చుకుంటూ; లోక+ఆలోకంబునన్= జగత్తునుచూచుటలో - పరిశీలించుటలో (నరుడు); అచలుఁడు= చలనంలేనివాడు - స్థాణువు - స్థిరమైనవాడు; కాన్+వలయును= కావలెను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అన్నపానాలమీద, సుఖసంతోషాలమీద ఆశ సన్నగిల్లిన తరువాత, సాధకుడు భిక్షగా దొరకిన ఆహారం అది ఏదైనా - కూర నారగాని, నూకలుగాని, కందమూలాలుగాని, పండ్లుగాని, తెలికపిండివంటి పదార్థాలుగాని, దుఃఖంలేకుండా స్వీకరించి, ఆకలి తీర్చుకొంటూ, జగత్తును పరీక్షిస్తూ అచలుడై నిలవాలి. తన సాధననుండి చలించక స్థాణువువలె నిలబడాలి.

క. జ్ఞానమ యింధనముగ వి। జ్ఞానాగ్నిం బ్రబలఁజేయ జరయు మరణమున్
నానావిధ దుఃఖంబులు। లేని యమృత మక్షరంబు లెస్సై తోఁచున్. 317

ప్రతిపదార్థం: జ్ఞానము+అ= జ్ఞానమే; ఇంధనముగన్= వంట కట్టెగా - నిప్పు రగిల్చే సాధనంగా; విజ్ఞాన+అగ్నిన్= విజ్ఞానం - అధికమైన జ్ఞానం అనే నిప్పును; ప్రబలన్+చేయన్= పెరిగేటట్లు చేస్తే; జరయున్= ముసలితనమూ; మరణమున్= చావూ; నానా విధ దుఃఖంబులు= అనేక విధాలయిన ఇతర దుఃఖాలూ; లేని= ఉండని - కలగని; అమృతము= మరణరహితమైన; అక్షరంబు= జారుడులేని స్థితి - ముక్తి; లెస్స+ఐ= బాగై - బాగుగా; తోఁచున్= గోచరిస్తుంది.

తాత్పర్యం: నరుడు తనలోని జ్ఞానాన్నే వంటచెరకుగా వాడుకొంటూ, విజ్ఞానాగ్ని రగుల్కొనేటట్లు చేసి ప్రజ్వలింపచేయగలిగితే అతడికి జరామరణాలకు, ఇతర లౌకిక దుఃఖపరంపరలకూ దూరమైన అమృతత్వసిద్ధి కలుగుతుంది. అతడు ధ్రువమైన మోక్షస్థితిని చేరుకొంటాడు.

క. విని నిద్రాదోషంబునఁ। గను కలల రజస్తమో వికారంబులచే
మనసు దిరుఁగఁబడఁగాఁ గఱ। చినవి మఱచి యపుడు దుష్టశీలుండ యగున్. 318

ప్రతిపదార్థం: విని= ఆలకించి - ఇతరుల ప్రసంగాలలోని విషయాలు చెవిని వేసికొని; నిద్రాదోషంబునన్= నిద్ర అనే దోషంవలన - (సాధకుడు మితిమీరి నిద్రించటం తప్పు కాబట్టి అది దోషం); కను కలలన్= (నిద్రలో) చూచే కలలలో; రజస్+తమస్+వికారంబులచేన్= రజోగుణంయొక్క, తమోగుణంయొక్క వికృతులవలన; మనసు= చిత్తం; తిరుగన్+పడఁగాన్= తిరుగబడగా - వ్యత్యస్తం కాగా- సాధన నుండి మరలినది కాగా; కఱచినవి= నేర్చినవి - అప్పటివరకు శ్రద్ధగా అలవరచుకొన్న సాధనలు; మఱచి= మరలిపోయి; అపుడు+అ= అప్పుడే - ఆ క్షణమే; దుష్టశీలుండు+అ= దుర్మార్గమైన స్వభావం గలవాడుగా; అగున్= ఔతాడు.

తాత్పర్యం: సాధకుడు సాధనదశలో ఉండగా నిత్యజాగరూకత అవసరం. అతడి భాషణం, శ్రవణం - ఇవన్నీ నిర్దుష్టంగా విషయవిదూరంగా పవిత్రంగా ఉండాలి. విషయాలకు సమీపంగా వెళ్ళి లౌకిక ఆసక్తితో కూడని విషయాలను వింటే, అవి అతడికి నిద్రలో అవే కలలుగా కనిపించి, అతడి చిత్తాన రజస్తమోగుణాలను ప్రకోపింపజేస్తాయి. ఆ కారణంగా సాధకుడి చిత్తం తిరుగబడి, సాధననుండి వెనుకకు మరలుతుంది. అంతవరకు అలవడిన సాధనలను మరచి, వెంటనే సాధకుడు దుర్మార్గాన పడిపోయి దుష్టశీలుడుగా మారిపోవచ్చును.

వ. అది యోగి కొప్పదు గావున. 319

ప్రతిపదార్థం: అది= సాధననుండి జారి, దుష్టుడుగా మారటం; యోగికిన్= యోగవిద్యాభ్యాసికి; ఒప్పదు= కూడదు- తగదు; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: సాధన దశలో మధ్యలో యోగభ్రష్టుడై నశించటం తగదు కాబట్టి, సాధకుడైనవాడు ఏమి చెయ్యాలంటే. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వినుతజ్ఞానాభ్యాసం । బున సమధిక జాగరత్వముం బడసి సకృ
జ్జనితం బగు నిద్రాభర । మునుఁ బొందును యోగి యదియుఁ బోఁ ద్రోచుఁ దుదిన్.' 320

ప్రతిపదార్థం: యోగి= యోగమును అనుష్ఠించేవాడు; వినుతజ్ఞాన+అభ్యాసంబునన్= పొగడబడ్డ జ్ఞానార్జనయందు - ఆ సమయాన; సమ్+అధిక జాగరత్వమున్+పడసి= మిక్కిలి మెలకువను పొంది - మేల్కొని ఉంటూ; సకృత్+జనితంబు+అగు= స్వల్పంగా కలిగినదైన; నిద్రాభరమును= నిద్దురయొక్క మోతను - నిద్రాభారాన్ని; పొందును= చెందుతాడు; (పిదప); అదియున్= దానిని కూడా ఆ సకృత్తుగా కలిగే నిద్రను కూడా; తుదిన్= చివరకు; త్రోచున్= త్రోసివేస్తాడు.

తాత్పర్యం: జ్ఞానార్జనకై యోగాభ్యాసం చేపట్టిన సమయాన సాధకుడు ఎక్కువ మెలకువతో ఉంటాడు. ఎక్కువ కాలం మేల్కొని ఉంటూ, ఎపుడో ఒకసారి మాత్రం నిద్రాభారానికి లొంగిపోతాడు. ఈ స్థితి అభ్యాస దశలోనే. చివరకు ఆ కొద్దిపాటి నిద్రను కూడా దూరీకరించి, నిత్యజాగరూకు డౌతాడు యోగి'.

వ. అని వెండియు. 321

ప్రతిపదార్థం: అని= పై ప్రకారంగా వివరించి; వెండియున్= మరలా.

తాత్పర్యం: ఇట్లా పలికి, మళ్ళీ (ఇట్లా అన్నాడు).

భీష్ముఁడు ధర్మజునకు స్వప్నాద్యవస్థల తెఱం గెఱింగించుట (సం. 12-209-1, 2)

క. 'విలయం బింద్రియములకుం । గలుగఁగ విషయానుభవము గలిగిన భంగిన్
మెలఁగును స్వప్నంబున మెయి । గల యట్టుల దేహి భావగతి యెయ్యదియో. 322

ప్రతిపదార్థం: ఇంద్రియములకున్= కన్ను, ముక్కు వంటి ఇంద్రియాలకు; విలయంబు= విశ్రాంతిని (పనిచేయకపోవటం); కలుగఁగన్= (నిద్రలో) ఏర్పడగా; దేహి= దేహంగలవాడు - దేహస్థుడు - ఆత్మ; విషయ+అనుభవము= విషయములయొక్క, దృశ్యాలు, నాదాలు మొదలయినవాటియొక్క అనుభూతి; కలిగిన భంగిన్= కలిగినట్లుగా; స్వప్నంబునన్= కలయందు; మెయి+కల+అట్టులన్= శరీరం ఉన్నప్పటివలె - మేల్కొని శరీరం తన పనులు తాను చేస్తున్నపుడు వలె; మెలఁగును= ప్రవర్తిస్తాడు; భావగతి= మనస్సుయొక్క పోకడ; ఏ+అదియో!= ఏదో, ఏమిటో!

తాత్పర్యం: 'నిద్రాస్థితిలో ఇంద్రియాలు విశ్రాంతిచెంది, ప్రవర్తించటం మానివేసిన తరువాత ఆత్మ స్వప్నంలో విషయానుభూతిని పొందుతున్నాడు. మేల్కొని ఉన్నప్పటివలె అతడి అనుభవం ఇంద్రియాలద్వారానే అవుతున్నది. మనస్సు పోకడ ఎటువంటిదో! ఏమిటో!

విశేషం: అనుభూతి ఇంద్రియ మాత్రజన్యం. ఇంద్రియాలు నిజానికి నిద్రావస్థలో విశ్రమించి ఉంటాయి. అయినా స్వప్నాన, బాహ్య జగత్తులోవలె మేల్కొని ఉన్నప్పటివలె క్రియలు, స్పర్శలు, ధ్వనులు - అన్నీ అనుభూత మౌతాయి. కాబట్టి మనస్సు గతి ఏమిటో అని ఆశ్చర్యపడటం సబబే.

క. అని యి ట్లొలయు వితర్కం । బునెడ హృషీకేశుఁ డైన పురుషోత్తము ద
ర్శనమును గ్రమమున నెఱిఁగిన । ముని వర్గము శిష్యవర్గమున్ బోధించున్. 323

ప్రతిపదార్థం: అని= పై విధంగా; ఇట్లు+ఒలయు= ఈ ప్రకారం కలిగే; వితర్కంబు+ఎడన్= సందేహం విషయంలో; హృషీక+ఈశుఁడు+ఐన= ఇంద్రియాలకు అధిపతి అయిన; పురుష+ఉత్తము= శ్రేష్ఠమానవుడి - శ్రీ విష్ణువుయొక్క; దర్శనమును=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చూపును - జ్ఞానమును; క్రమమునన్= వరుసగా విద్యా సంతతిద్వారా; ఎఱింగిన= గ్రహించిన; మునివర్గము= ఋషి సంఘం; శిష్యవర్గమున్= (తమ) శిష్యుల సమూహమును; బోధించున్= ఉపదేశిస్తుంది.

తాత్పర్యం: ఇంద్రియాలు విశ్రాంతిలో ఉన్నప్పుడు కూడా ఇంద్రియక్రియలు స్వప్నాన జరిగిపోవటం ఏ విధంగా సంభవం? - అనే సంశయానికి సమాధానంగా ఋషీశ్వరులు, ఇంద్రియాలకు అధీశ్వరుడైన విష్ణుమూర్తినుండి జ్ఞానాన్ని పొంది, ఆ జ్ఞానజ్యోతిని విద్యాసంతతిద్వారా అనగా శిష్యపరంపర ద్వారా అందిస్తూ వస్తున్నారు.

క. శ్రమమున నింద్రియములు లీ । నము లగునది నిద్ర కలయనం దత్సంస్కా
రము మిథ్యావిషయ ప్రా । ప్తమగుట యప్పుడును దేహి దా సాక్షి యగున్. 324

ప్రతిపదార్థం: శ్రమమునన్= శ్రమ - అలసటవలన; ఇంద్రియములు= జ్ఞాన, కర్మ ఇంద్రియాలు; లీనములు+అగున్= దాగినవి-విరమించినవి ఔతాయి; అది= ఆ ప్రక్రియ; నిద్ర= నిద్దుర (ఔతుంది); కల+అనన్= కల అనగా; తద్+సంస్కారము= వాటి - ఆ ఇంద్రియాలయొక్క పూర్వానుభవపు తలపు; మిథ్యావిషయ ప్రాప్తము+అగుట= అసత్యమైన విషయాలతో లభించటం; అప్పుడును= ఆ స్థితియందుకూడా; దేహి= దేహం కలవాడు - ఆత్మ; తాన్= తాను; సాక్షి+అగున్= జరుగునది చూచువాడిగా (అవును) ఉంటాడు.

తాత్పర్యం: అలసట కారణాన ఇంద్రియాలు విశ్రాంతితో ఆగిపోవటం నిద్ర. మరి కల అనగా ఆ ఇంద్రియాల పూర్వానుభవం మిథ్యావిషయంగా వచ్చిచేరటం. ఆ సమయంలో కూడా దేహి ఆ కలలో జరిగే దానిని అంతటినీ చూచే సాక్షిగా మిగిలి ఉంటాడు.

తే. అనిలముఖ దోషములను సత్త్వాదిగుణ వి । కారముల జాగరంబునఁ గలుగునట్టి
తోఁపు బెరయంగఁ గల యయి తోఁచు; నది శు । భాశుభములకు సూచక మనియుఁ గలదు. 325

ప్రతిపదార్థం: జాగరంబునన్= మేల్కొని ఉన్నప్పుడు; అనిలముఖ దోషములను= గాలి మొదలైన దోషాలవలన; సత్త్వ+ఆది గుణ వికారములన్= సత్త్వం మొదలైన గుణాలయొక్క వికృతులవలన; కలుగు+అట్టి తోఁపు= కలిగే తలంపు; బెరయంగన్= చేరగా- వచ్చి చేరగా; కల+అయి= కలగా మారి; తోఁచున్= గోచరిస్తుంది; అది= ఆ కల; శుభ+అశుభములకున్= మంచి చెడులకు (రాబోవువాటికి); సూచకము= సూచిక - ప్రకాశకం - ముందుగా తెలిపేది; అనియున్= అని కూడా; కలదు= ఉన్నది.

తాత్పర్యం: జాగ్రదవస్థలో గాలి, మొదలయిన దోషాలవలనగాని, సత్త్వరజస్తమోగుణాల వికారాలవలన గాని కలిగే తలంపే, నిద్రలో కలగా వచ్చి చేరుతుంది. ఆ కల శుభాశుభాలకు సూచకమని అనటం కూడా ఉన్నది.

విశేషం: ఆధునికులు, మానసికశాస్త్ర అధ్యయనం తరువాత కనుగొన్నామని చెప్పే విషయాలకు సన్నిహితంగా ప్రాచీనులు కలకు ఇచ్చిన నిర్వచనం ఉన్నది.

క. స్వాపావస్థం బ్రకృతి క । దీపిత వాటిల్లు నపుడుఁ దెలి వెడలక తా
దీపించుఁ బురుషుఁ డిమ్మెయి । చూపు ప్రబోధంబు పరమసూక్ష్మత పుత్రా! 326

ప్రతిపదార్థం: పుత్రా!= బిడ్డా!; స్వాప+అవస్థన్= నిద్రావస్థలో; ప్రకృతికిన్= స్వభావానికి; అదీపిత= కాంతిలేని స్థితి-ప్రకాశంలేకపోవుట; పాటిల్లున్= కలుగుతుంది- ఏర్పడుతుంది; అపుడున్= ఆ సమయంలో కూడా - ప్రకృతి దీపించకుండా ఉన్నప్పుడు కూడా; పురుషుఁడు= దేహి అయిన ఆత్మ; తెలివి+ఎడలక= తెలివి నశించకుండా; తాన్= తాను; దీపించున్= ప్రకాశిస్తాడు; ఈ+మెయిన్= ఈ విధంగా; పరమ సూక్ష్మతన్= మిక్కిలి సూక్ష్మత్వంతో - చాలా సూక్ష్మమార్గాన; ప్రబోధంబు= ప్రజ్ఞానం - గొప్ప తెలివిని (పురుషుడు) చూపున్= ప్రదర్శిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నిద్రావస్థలో నరుడి స్వభావం ప్రకాశరహితంగా ఉంటుంది. అయితే దేహస్థుడైన పురుషుడు మాత్రం, తాను ప్రకాశాన్ని కోల్పోకుండా మేల్కొనే ఉంటూ, ఈ విధంగా మిక్కిలి సూక్ష్మమార్గాన తన ప్రబోధాన్ని ప్రకటిస్తున్నాడు.

తే. తెలియ మేల్కని యుండుట, గలలు, నిద్ర । యను నవస్థాత్రయంబును, నవులఁబెట్టఁ
జాలు విజ్ఞాననిర్మల సత్యబోధ । రూప నిర్భరానందస్వరూపుఁ డనఘ! 327

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా!; తెలియన్= గ్రహించగా; మేల్కని+ఉండుట= మేల్కొని ఉండటం - జాగ్రదవస్థ; కలలు= స్వప్నాలు - స్వప్నావస్థ; నిద్ర= నిద్దుర పోవటం - నిద్రావస్థ; అను+అవస్థాత్రయంబును= అనే మూడు స్థితులనూ కూడా; అవులన్+పెట్టన్+చాలు= ఆవల పెట్టగల; విజ్ఞాన= విశేషమైన జ్ఞానం; నిర్మల= మలినంలేని; సత్యబోధరూప= నిజమైన ఎరుక అనే ఆకారంతో; నిర్భర= పరిపూర్ణ; ఆనంద స్వరూపుఁడు= ఆనందమే స్వరూపంగా కలవాడు ('పురుషుడు' అని పూర్వపద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఓ పాపరహితుడా! నరుడి జీవన సర్వస్వమూ మూడు అవస్థలతో నిండి ఉన్నది. జాగ్రదవస్థ, స్వప్నావస్థ, నిద్రావస్థ - ఆ మూడు. నిజానికి దేహస్థుడైన ఆ పురుషుడు ఈ మూడు అవస్థలను ఆవలకు నెట్టి, స్వయంగా నిర్మలమూ సత్యమూ అయిన జ్ఞానాన్ని అకారంగా స్వీకరించి, పరిపూర్ణానందమయుడుగా ఉండగలవాడే.

విశేషం: పై పద్యాన 'బోధరూప. . . ఆనంద స్వరూపుడు' అనే మాట కొంత దురవగాహంగా అనిపించవచ్చును. 'బోధ', 'ఆనందం' రెండూ 'రూప' స్వరూపాలు'గా రూపింపబడటం వలన ఆ స్థితి కలుగవచ్చును. అయితే బోధ - జ్ఞానమే. ఆనందం. ఆనందమే ఆత్మస్వరూపమని సమన్వయించుకొనాలి.

తే. వ్యక్త మవ్యక్తమును రెండు నవగతములు । గాక మోక్షంబు మార్గంబు గానరాదు;
వ్యక్త మది మృత్యు వవ్యక్త మమృత మనియె । నతుల విజ్ఞాన ఘనుఁడు నారాయణుండు. 328

ప్రతిపదార్థం: వ్యక్తము= గోచరించేది; అవ్యక్తమును= మూల ప్రకృతి; రెండున్= ఈ రెండూ; అవగతములు+కాక= తెలిసినవిగాక - తెలియకుండా; మోక్షమార్గంబు= ముక్తికి దారి; కానన్+రాదు= కనబడదు; వ్యక్తము+అది= ఆ వ్యక్తమనేది - గోచరించే సర్వస్వమూ; మృత్యువు= మరణం - చావు - చావుకు లోనైనది; అవ్యక్తము= మూలప్రకృతి; అమృతము= మరణంలేనిది - చావనిది (అని); అతుల విజ్ఞాన ఘనుఁడు= పోలికలేని విశేషజ్ఞానంతో గొప్పవాడు అయిన; నారాయణుండు= విష్ణువు; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: జగాన వ్యక్తం, అవ్యక్తం అని పదార్థాలు రెండు ఉన్నాయి. అవి తెలిస్తే తప్ప ముక్తికి దారి కనపడదు. వ్యక్తమంటే చావు; అవ్యక్తమంటే అమృతం - అని విజ్ఞానఘనుడైన విష్ణువు పలికాడు.

విశేషం: వ్యక్తమంటే గోచరించేది. గోచరించేది సర్వమూ సృష్టపదార్థమే. సృష్టిని పొందిన దేదైనా నష్టికి లోను గావలసిందే, అవ్యక్తమంటే అగోచరం; అసృష్టం - సృష్టి లేనిదానికి నష్టి ఉండదు. అదే అమృతత్వమంటే.

క. అనఘా! విను మవ్యక్తం । బనునది త్రైలోక్యమునకు నాధారము; దా
ని నివృత్తి లక్షణం బగు । ననుపమ ధర్మ మని చాటు నాగమఫణితుల్. 329

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపరహితుడా!; వినుము= ఆలకించుము; అవ్యక్తంబు+అనునది= అవ్యక్తమనేది - మూలప్రకృతి అనేది; త్రైలోక్యమునకున్= ముల్లోకాలకూ; ఆధారము= ఆలంబనం; దాని నివృత్తి లక్షణంబు= ఆ అవ్యక్తముయొక్క 'నివృత్తి' అనే లక్షణం; అ+ఉపమ ధర్మము= సాటిలేని ధర్మం - ఆచరించదగ్గ నియమం; అగున్+అని= ఔతుందని; ఆగమ ఫణితుల్= శాస్త్రాల వాక్యాలు; చాటున్= ప్రకటిస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ పాపరహితుడా! వినుము. అవ్యక్తమనబడే మూలప్రకృతి ముల్లోకాలకూ ఆలంబనమైనది. దానినుండే లోకాలన్నీ జన్మించి, దానిలోనే పెరిగి, చివరకు దానియందే లయమౌతున్నాయి. ఆ అవ్యక్తం నివృత్తి లక్షణం కలది. ఆ నివృత్తిమార్గం సాటిలేని గొప్ప ధర్మమని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

తే. వినుము బ్రహ్మోదితంబు ప్రవృత్తిధర్మ । మది గతాగతవ్యాప్తుల నావహించు
బ్రహ్మమండ్రు; నివృత్తిధర్మంబు నమ్మ । హాశ్రయము మోక్షదం బను నాగమములు. 330

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ప్రవృత్తి ధర్మము= ప్రవర్తన స్వరూపమైన ధర్మం; బ్రహ్మ+ఉదితంబు= బ్రహ్మనుండి పుట్టినది; అది= ఆ ప్రవర్తన ధర్మం; గత+అగత వ్యాప్తులన్= గతంయొక్క (కడచిన దాని), అగతంయొక్క (కడవని దాని) ప్రసరణలను - (భూత భవిష్యత్తుల) వ్యాప్తులను; ఆవహించు= కలిగించే; బ్రహ్మము+అండ్రు= బ్రహ్మ అంటారు. భూత భవిష్యత్కాలాలకు వ్యాపించి ఉంటుంది - ప్రవృత్తి ధర్మం, ప్రవర్తన, వర్తమానకాలాన జరుగుతున్నా, దాని మూలాలు భూతాన, అవశేషాలు. భవిష్యత్తున ఉండవచ్చుననుట; నివృత్తి ధర్మంబున్= నివృత్తి రూపమైన ధర్మం; ఆ+మహా+ఆశ్రయము= ఆ గొప్ప ఆధారం - ఆ నివృత్తిధర్మం; మోక్షదంబు= మోక్షమును ఇచ్చేది (అని); ఆగమములు= శాస్త్రాలు; అనున్= పలుకుతాయి.

తాత్పర్యం: పైన తెలిపిన నివృత్తిమార్గానికి వ్యతిరిక్తమైనది ప్రవృత్తి మార్గం. నివృత్తి అంటే మరలడం - సంసారంనుండి. ప్రవృత్తి అంటే పాల్గొనటం - సంసారంలో. ప్రవృత్తిమార్గం బ్రహ్మనుండి పుట్టినది. ఈ ప్రవృత్తిమార్గం నిజానికి ప్రస్తుతకాలానికి చెందినట్లుగా కనిపిస్తున్నా, అది భూతభవిష్యత్కాలాలకూ వ్యాపించి ఉండే లక్షణం గలది. ఎందుకంటే ప్రవర్తన - ప్రవృత్తి అనగా కర్మలు చేయటమే, చేసిన కర్మల ఫలితాలు ముందు వెనుకలుగా అనుభవానికి రావచ్చును. ముందుగా అనుభవానికి రావటమంటే భూతకాలాన సంచితమై ఉన్నది వస్తున్నట్లుగా అర్థం చేసికొనాలి. అట్లాగే వెనుకగా అనుభవానికి రావటమంటే భవిష్యత్కాలాన రావటానికై దాచబడినదై అనంతరజన్మలో రాబోయేదిగా అర్థం చేసికొనాలి. ఈ విధంగా వర్తమానకాలానికే చెందినట్లున్నా, భూతభవిష్యత్తులకు కూడా వ్యాపించి ఉండే బ్రహ్మస్వరూపమే ప్రవృత్తిమార్గమని విజ్ఞులంటారు. జగత్తంతా బ్రహ్మవిలాసమే - వాస్తవానికి. అయితే నివృత్తిమార్గాన్ని మోక్షాన్ని ఈయగల దానినిగా శాస్త్రాలు పేర్కొంటున్నాయి.

క. కట్టిన చీరయునుం, బైఁ । బెట్టిన చీరయును, మౌళి బిగి యారంగాఁ
జుట్టిన చీరయుఁ బోలెను । నెట్టన పొదివినది దేహిని గుణత్రయమున్. 331

ప్రతిపదార్థం: గుణత్రయమున్= గుణాలు మూడు - సత్త్వము, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలూ; దేహిని= దేహం కలవానిని; కట్టిన చీరయున్= కట్టుకొన్న వస్త్రంవలె (ఒకటి); పైన్+పెట్టిన చీరయును= శరీరంమీద వేసికొన్న వస్త్రంవలె (మరొకటి రెండోది); మౌళిన్= తలను; బిగి+ఆరంగాన్= బిగువు స్పష్టపడే విధంగా; చుట్టిన చీరయున్+పోలెను= చుట్టిన వస్త్రంవలెనూ (మూడోది); నెట్టనన్= నిండుగా; పొదివినది= కమ్ముకొన్నది.

తాత్పర్యం: దేహస్థుడు ఆత్మ. అతడిని ప్రాకృతికాలయిన సత్త్వరజస్తమో గుణాలు మూడూ, కట్టుకొన్న చీరవలె ఒకటీ, పైన వేసికొన్న వస్త్రంవలె మరొకటీ, తలకు గట్టిగా చుట్టుకొన్న గుడ్డవలె ఇంకొకటీ, నిండుగా కమ్ముకొన్నాయి. ఆత్మ నిజస్వరూపం కానరాకుండా, ఈ క్రొత్త బాహ్యరూపాన్ని ఈ గుణాలు మూడూ కలిగించా యన్నమాట.

క. విను సత్త్వరజస్తమముల । పెనఁకువ కవుల వెలుఁగొందు పెంపు గలుగు తు
ర్య నిరంజనతత్త్వము పర । మనఘా! యది భావనీయ మను వేదంబుల్. 332

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పాపంలేనివాడా!; విను= ఆలకించుము; సత్త్వరజస్+తమముల పెనఁకువకున్= సత్త్వం (తెల్లనిది) రజస్సు (ఎర్రనిది); తమముల= తమస్సు (నల్లనిది)ల మేళనమునకు; అవులన్= ఆవల - అవతల; వెలుఁగు+ఒందు= ప్రకాశించే; పెంపు+కలుగు= గొప్పదనం ఉన్న; తుర్య= నాలుగవ; నిరంజన తత్త్వము= పరబ్రహ్మతత్త్వం; పరము= ముఖ్యం; వేదంబుల్= వేదాలు; అది= ఆ పరబ్రహ్మతత్త్వం; భావనీయము+అనున్= భావించవలసినది - అంటాయి.

తాత్పర్యం: దేహిని కమ్ముకొని ఉన్న ఈ మూడు - సత్త్వరజస్తమోగుణాల కలయికకు అవతల వెలుగొందే నాల్గో తత్త్వం ఒకటిఉన్నది. అదియే పరబ్రహ్మతత్త్వం. ఆ పరబ్రహ్మతత్త్వాన్నే భావించవలసి ఉన్నదని వేదాలు పలుకుతున్నాయి.

విశేషం: పరబ్రహ్మతత్త్వమనేది దృష్టికి గోచరించేదికాదు. మనసా భావించి గ్రహించవలసినది. అందువలననే దానిని జ్ఞానానందమయ మని యోగులు గుర్తించారు.

క. **వాకును మనసును గాయము । నేకాయన వృత్తి శౌచ మెడలని తపముం**
జేకొనునది యది బోధ । శ్రీకి ఘృతంబునకు వెన్నక్రియ జనక మగున్. **333**

ప్రతిపదార్థం: వాకును= మాటా; మనసును= మనస్సూ; కాయమున్= దేహమూ; ఏక+అయన వృత్తిన్= ఒకే పోకడగల నడతతో; శౌచము+ఎడలని= శుభ్రత నశించని; తపమున్= తపస్సును; చేకొనునది= ఆచరించాలి; అది= ఆ తపస్సు; బోధశ్రీకిన్= జ్ఞాన సంపత్తికి; ఘృతంబునకున్= నేతికి; వెన్నక్రియన్= వెన్నవలె; జనకము= కారకం - కలిగించేది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: వాచా మనసా కర్మణా ఒకే ప్రవృత్తితో - మాటలో, ఆలోచనలో, క్రియలో ఏకత్వం పాటిస్తూ, ఆలోచించినదే చెప్తుతూ, చెప్పినదే చేస్తూ, పరిశుభ్రత కొరవడని తపస్సును ఆచరించాలి. ఆ ప్రవృత్తీ, ఆ తపస్సూ, జ్ఞానసంపత్తి ఏర్పడటానికి, నేయి కలగటానికి వెన్నవలె ఆధారమౌతాయి.

విశేషం: వెన్నకు రూపాంతరమే నేయి. త్రికరణ శుద్ధి (మనోవాక్కాయాలు - మూడు త్రికరణాలు) తోడి నిర్మల తపశ్చరణమే జ్ఞానానికి పూర్వరూపం.

తే. **బ్రహ్మచర్య మహింస నాఁ బరఁగు పరమ । ధర్మములు రెండు సువ్వె యుత్తమ తపంబు;**
దానిఁ గలవాఁడు నిర్మల జ్ఞానయోగ । వంతుఁడై చూడనేర్చు సర్వంబు ననఘ! **334**

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా!; బ్రహ్మచర్యము= బ్రహ్మమందు - యోగమునందు - వేదాధ్యయనమందు చరించటం; అహింస= హింస చేయకుండటం; నాన్= అనగా; పరఁగు= చెలగెడు; పరమధర్మములు= గొప్పధర్మాలు; రెండు+చువ్వె= రెండు సుమా!; ఉత్తమ తపంబు= శ్రేష్ఠ తపస్సు; దానిన్= ఆ తపస్సును - బ్రహ్మచర్య వ్రతపాలన, హింసమాని జీవించటం - ఈ రెండింటిని; కలవాఁడు= కలిగినవాడు; నిర్మల జ్ఞాన యోగవంతుఁడు+ఐ= మలిన రహితమైన జ్ఞానమూ, యోగమూ కలవాడై; సర్వంబున్= అంతటిని - జగత్తు లోపలి బయటి వాటిని మొత్తమును; చూడన్+నేర్చున్= చూడగలుగుతాడు.

తాత్పర్యం: బ్రహ్మచర్యం, అహింస అనేవి రెండూ గొప్ప ధర్మాలు. ఆ రెండింటిని ఆచరించటమే ఉత్తమ తపస్సు. ఆ తపస్సు చేసేవాడికి నిర్మలజ్ఞానం కలుగుతుంది. ఆ జ్ఞాననేత్రంతో అతడు ఈ లోకపు అంతర్బహి స్స్వరూపాలను సరిగా చక్కగా చూడగలడు.

విశేషం: సంస్కృతంలో 'బ్రహ్మన్' శబ్దానికి 'తత్త్వ తపోవేద యోగాదులు' అర్థంగా ఉన్నాయి. అయితే వ్యవహారంలో 'బ్రహ్మచారి' అనేమాట, సంసారానికి దూరంగా ఆధ్యాత్మవిద్య అభ్యసించేవారికి - వాచకంగా స్థిరపడింది. బ్రహ్మచారి ప్రవృత్తే బ్రహ్మచర్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇక్కడి అర్థం కూడా వ్యవహారంలో ఉన్నదే. ప్రాచీనకాలాన అధ్యయనశీలురైన బాలురు గురుకులాలలో చేరి, చదువులు కొనసాగించేవారు. కాబట్టి బ్రహ్మచారి పదం, చదువుకొనే బాలుడు అనే అర్థానికీ వాచకమే. సబ్రహ్మచారి - తోడ చదువుకొనేవాడు.

క. ఆతత సంసారము తృ। ష్ణాతంతు స్యూతిబంధనంబున దృఢమై
చేతస్సంగతిఁ బాయమి। కాతెఱఁగు తపంబు పుత్ర! యౌషధము సుమీ! 335

ప్రతిపదార్థం: పుత్ర!= కుమారా!; ఆతత సంసారము= విశాలమైన (ఈ) సంసారం; తృష్ణాతంతు స్యూతి బంధనంబునన్= ఆశ అనే దారపు కుట్టు ముడితో; దృఢము+ఐ= గట్టిదై; చేతస్+సంగతిన్= మనస్సు యొక్క పొత్తును; పాయమికిన్= వదలకుండటానికి; విడువక ఉండటానికి; ఔషధము= మందు; ఆ తెఱఁగు తపంబు= ఆ విధమైన తపస్సు; చుమీ!= సుమా!

తాత్పర్యం: కుమారా! కనిపించే ఈ సువిశాల సంసారం, ఆశాతంతువుల కుట్టుడు ముడులతో గట్టిపడి, మనస్సును విడిచిపెట్టదు. మానవుడిని వదలదు. అందువలన ఈ తపశ్చర్య అవసరమైనది. ఈ తపస్సు ఆ సంసారం నుండి మనస్సును మరల్చడానికి ఔషధంవలె ఉపయోగపడుతుంది.

విశేషం: తంతువులు ఒకదానితో ఒకటి పెనవేసుకొని గట్టిపడి బంధనంగా మారుతాయి. ఆశలు కూడా అంతే. ఒక ఆశకు మరొక ఆశ ఆలంబనం. ఈ ఆశాసంతతి పరస్పరం సమ్మిశ్రితమై సంసారాన్ని దృఢతరంగా మారుస్తాయి. (ఆశ= తంతువు.)

క. వికసిత తృష్ణాలతికకు। న కుటిలమగు తపము దాత్రమై నఱకంగా
వికృతులఁ బ్రకృతినిఁ బురుషుని। నకలంక జ్ఞాన దృష్టి నవలోకించున్. 336

ప్రతిపదార్థం: వికసిత తృష్ణాలతికకున్= వికసించిన ఆశ అనే తీగకు; అకుటిలము+అగు= వంకర లేనిది అగు; తపము= తపస్సు; దాత్రము+ఐ= కొడవలి అయి; నఱకంగాన్= నరకగా-ఖండించగా (అపుడు); వికృతులన్= వికారాలను; ప్రకృతినిన్= స్వభావాన్ని-స్వభావరూపమైన ప్రకృతిని; పురుషునిన్= ఆత్మస్వరూపుడైన పురుషుడిని; అకలంక జ్ఞాన దృష్టిన్= మరక లేని, జ్ఞానమనే చూపుతో; అవలోకించున్= చూస్తాడు.

తాత్పర్యం: లోకంలోని జీవనవ్యవహారాన తృష్ణ ఒక తీగ. అది బహుభంగుల ప్రవర్ధమానమై వికసించి, నరుడిని ఆకర్షిస్తుంది. తనలో ఇముడ్చుకొంటుంది. అతడిచుట్టూ జిగిబిగిగా అల్లుకొని, బంధించివేస్తుంది. ఆ అల్లికనుండి బయటపడాలంటే - బ్రహ్మచర్యం, అహింస అనే ధర్మాల ఆచరణ రూపమైన తపశ్చర్య అనే కొడవలి కావాలి. ఆ తపోరూపదాత్రంతో తృష్ణారూప లతికాబంధాన్ని తెగనరకవచ్చును. తృష్ణ తెగిపడిన వెంటనే నరుడిలో, నిర్మల జ్ఞానమనే క్రొత్త చూడ్కి ఏర్పడుతుంది. ఆ క్రొత్త చూపుతో అతడు తనలోని తనవెలుపలి వికృతులనూ, ప్రకృతినీ చూడగలడు. అంతేగాదు - తన అంతరాత్మరూపుడైన 'పురుషుడిని' కూడా అపుడే గుర్తించగలడు.

విశేషం: అలం: రూపకం.

క. అని యమ్ముని పలుదెఱఁగులఁ। దను బోధించినఁ గృతార్థతం బొందెఁ దపో
ధనుఁ డా శిష్యుండు నీవును। గనికొను మేతద్వచో నికాయార్థంబుల్.' 337

ప్రతిపదార్థం: అని= పై ప్రకారంగా; ఆ+ముని= ఆ ఋషి; పలు+తెఱఁగులన్= అనేక విధాలుగా; తనున్= తనను; బోధించినన్= ఉపదేశించగా - తెలియపరచగా; తపస్+ధనుఁడు= తపస్సే ధనంగా కలవాడు అయిన; ఆ శిష్యుఁడు= ఆ అతడి శిష్యుడు; కృత+అర్థతన్+పొందెన్= నెరవేరిన ప్రయోజనం కలవానితనమును చెందాడు - ప్రయోజనం నెరవేరినవాడైనాడు; నీవును= నీవు కూడా (ఓ ధర్మరాజా! నీవూ); ఏతద్+వచస్+నికాయ+అర్థంబుల్= ఈ మాటల ప్రోగుల అర్థాలను; కనికొనుము= గ్రహించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ విధంగా ఆ ముని నానావిధాలుగా తన శిష్యుడికి జ్ఞానబోధ చేయగా, తపోమాత్రధనుడైన ఆ శిష్యుడూ కృతార్థుడైనాడు. ఓ ధర్మరాజా! నీవు కూడా ఆ మునిమాటల అర్థతాత్పర్యాలను గ్రహించి, నీ జన్మను చరితార్థం చేసికొమ్ము'.

తే. అనిన విని ప్రీతుఁడై పాండవాగ్రజన్ముఁ । డాపగాసూనుతో 'మిథిలాధినాథుఁ
డైన జనకుండు మోక్షంబు ననఘ! యేమి । కృత్యమునఁ గాంచె?' నది యెఱిఁగింపు మనుడు. 338

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; ప్రీతుఁడు+ఐ= ప్రీతి చెందినవాడై; పాండవ+అగ్రజన్ముఁడు= పాండవులలో మొదట పుట్టినవాడు - ధర్మరాజు; ఆపగాసూనుతోన్= నదీతనయునితో - భీష్మునితో; అనఘ!= పాపంలేనివాడా!; మిథిలా+అధినాథుఁడు+ఐన= మిథిలానగరానికి అధిపతిఅయిన; జనకుండు= జనకమహారాజు; మోక్షంబున్= ముక్తిని; ఏమి కృత్యమునన్= ఏ కర్మవలన; కాంచెన్?= పొందాడు?; అది= ఆ విషయం; ఎఱిఁగింపుము= తెలుపుము; అనుడున్= అన్నవెంటనే.

తాత్పర్యం: పై ప్రకారంగా భీష్ముడు పలుకగా విని ఆనందించిన ధర్మజుడు తిరిగి భీష్మాచార్యుడితో 'ఓ పాపంలేని పితామహా! మిథిలానగరాధీశ్వరుడు జనకమహారాజు ఏ కర్మవలన ముక్తిని పొందగలిగాడు? ఆ విషయం ఎఱిగించుము' అన్నాడు. ఆ తరువాత.

వ. అతం డతని కిట్లనియెఁ 'దత్సంబంధియైన యితిహాసంబు సెప్పెద. 339

ప్రతిపదార్థం: అతండు= ఆ భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; తద్+సంబంధి+ఐన= దానికి చెందిన; ఇతిహాసంబు= చరితమును; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: ధర్మజుడి ప్రశ్నకు సమాధానంగా భీష్ముడు 'దానికి సంబంధించిన చరితాన్ని చెప్పుతాను' (అంటూ తన ప్రసంగాన్ని కొనసాగించాడు.)

క. విను మాచార్యులు నూర్వురు । జనకనృపాలునకు; వారు సతతంబును న
జ్జనపతి వినిపింతురు త । త్త్వ నిరూపక శాస్త్రమును పృథగ్విధములుగన్. 340

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ఆచార్యులు= గురువులు; జనక నృపాలునకున్= జనక రాజునకు; నూర్వురు= వందమంది; వారు= ఆ నూరుగురు; సతతంబునున్= ఎల్లప్పుడునూ; ఆ+జనపతిన్= ఆ రాజుకు; తత్త్వ నిరూపక శాస్త్రమును= సత్యమును నిరూపించే శాస్త్రమును; పృథక్+విధములుగన్= వేరు వేరు తీరులుగా; వినిపింతురు= వినిపిస్తారు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆలకించుము. ఆ జనకరాజుకు నూర్గురు ఆచార్యులున్నారు. వారు సత్యనిరూపక పరమాత్మస్వరూపమైన శాస్త్రాన్ని ఆయనకు వినిపించేవారు. అయితే వారు ఆ శాస్త్రార్థాలను వేరు వేరు విధాలుగా వివరించేవారు.

విశేషం: సత్య మొక్కటైనపుడు, దానిని గూర్చి కథనమూ ఒకటిగా ఉంటే సమస్యలుండవు. కాని మానవ స్వభావం విచిత్రం. ఒకే అంశాన్ని బహుభంగుల వివరించటం మొదటినుండి మానవ చరిత్రలో ఉన్నదే. అందువల్లనే "ఏకం సత్ విప్రా బహుధా వదన్తి" వంటి ఉపనిషద్వాక్యం పుట్టి ఉంటుంది.

క. ఏవాఁ డెమ్మెయిఁ జెప్పిన । నా వసుధాధిపుఁడు దాని ననుమోదించున్
భావము సంతోషశ్రీ । భావిత మగుచుండఁ గురునృపాలప్రవరా! 341

ప్రతిపదార్థం: కురునృపాల ప్రవరా!= కురురాజులలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; ఆ వసుధా+అధిపుఁడు= ఆ రాజు; ఏవాఁడు= ఎవడు; ఏ మెయిన్= ఏ విధంగా; చెప్పినన్= ఉపదేశించినా; దానిన్= ఆ ఉపదిష్టాంశాన్ని; భావము= మనస్సు; సంతోషశ్రీ భావితము+అగుచున్+ఉండన్= ఆనందసంపదతో ప్రభావితం కాగా; అనుమోదించున్= అనుగుణంగా ఆమోదిస్తాడు.

తాత్పర్యం: ఆ నూర్వురు ఆచార్యులలో ఎవరు దేనిని ఏ విధంగా ఉపదేశిస్తే, ఆ మహారాజు దానిని ఆ విధంగానే మనస్సు సంతోషంతో నిండిపోగా, అనుమోదిస్తూ ఉండేవాడు.

విశేషం: (ఉపదేష్ట అభిప్రాయాన్ని శిష్యుడు యథాతథంగా గౌరవించి ఆమోదిస్తూ ఉండేవాడన్నమాట.) బోధితుడికి (శిష్యునకు) బోధకుడితో అభిప్రాయభేదమనే భావనే ఉత్పన్నం కాని తీరున అక్కడ బోధన జరిగినది. ఈ జనకుడి జ్ఞానార్జన విధానం సమన్వయమార్గానికి సర్వధర్మసమానత్వ భావనకు మార్గదర్శకంగా భాసిస్తున్నది. బహుశః సమన్వయ విధానం ఆర్షధర్మాన కలదనే వాదంలోని సారాంశమదే కావచ్చును.

వ. **అట్టియెడఁ దత్త్వజ్ఞానఘనుండును నిర్ద్వంద్వుండును సంశయరహితుండును నగు పంచశిఖుండను మునివరుండు మహిం దిరుగుచుండి మిథిలకుం జనుదెంచె; నతండు కపిలాభిధాన యగు గురుకుటుంబిని చన్ను గుడిచి పెరిఁగిన వాఁ డగుటం గాపిలేయుండు నననంబరఁగు; నమ్మహాత్ముండు హేతుమద్వాక్య విశేషంబుల నయ్యాచార్యుల నూర్వుర నయ్యుర్వీపతి సన్నిధిన నిరుత్తరులంజేసిన, నాతం డతని విశేషజ్ఞత యెఱింగి వారల విడిచి తన్నుం బ్రబోధించుటకై ప్రార్థించి యతనికిం బ్రణతుఁ డైన నమ్మాననీయుం డనూన దయాయత్తచిత్తుండు గావున నా భూవల్లభునకు మోక్షోపాధి బోధప్రదంబులగు వాక్యంబు లిట్లని యుపదేశించె.** **342**

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయాన; తత్త్వజ్ఞాన ఘనుండును= సత్యజ్ఞానంవలన గొప్పవాడును; నిర్+ద్వంద్వుండును= రెండవవాడును లేనివాడును - ఒంటరి (జ్ఞానంలోను, జీవితంలోను); సంశయరహితుండును= సందేహం లేనివాడును; అగు= అయిన; పంచశిఖుండు+అను= పంచశిఖుడు అనే పేరుగల (ఐదు శిఖలు - జడలు గలవాడని వ్యుత్పత్తి. పేర్లకు వ్యుత్పత్తి ఉండబనిలేదు గాని తెలియవచ్చినంత తెల్పుట ఇది); మునివరుండు= ఋషిశ్రేష్ఠుడు; మహిన్= భూమిపై; తిరుగుచున్+ఉండి= తిరుగాడుతూ ఉండి; మిథిలకున్= మిథిలానగరానికి; చనుదెంచెన్= వచ్చాడు; అతండు= ఆ పంచశిఖుడు; కపిల+అభిధాన+అగు= కపిల అనే పేరుగల; గురుకుటుంబిని చన్ను= గురుపత్నియొక్క రొమ్ము; కుడిచి పెరిఁగినవాఁడు+అగుటన్= త్రాగి పెరిగినవాడు కావటంవలన; కాపిలేయుండును+అనన్= కపిలాతనయుడు అనగా (గూడ); పరఁగున్= ఒప్పును; ఆ+మహా+ఆత్ముండు= ఆ గొప్ప ఆత్మగలవాడు-పంచశిఖుడు; హేతుమత్+వాక్యవిశేషంబులన్= కారణాలతో కూడిన విశిష్టవాక్యాలతో; ఆ+ఆచార్యులన్= ఆ గురువులు; నూర్వురన్= వందమందినీ; ఆ+ఉర్వీపతి సత్+నిధిని+అ= ఆ రాజు దగ్గరనే; నిర్+ఉత్తరులన్= సమాధానం లేనివారినిగా; చేసినన్= చేయగా; ఆతండు= ఆ రాజు జనకుడు; అతని విశేషజ్ఞత= ఆ పంచశిఖుని విశిష్టజ్ఞానము (కలిగియున్నతనమును); ఎఱింగి= గ్రహించి; వారలన్= ఆ నూర్వురు ఆచార్యులను; విడిచి= వదలి; తన్నున్= తనను (రాజును) ప్రబోధించుటకై= ఉపదేశించటానికై; ప్రార్థించి= యాచించి; ఆతనికిన్= ఆ పంచశిఖుడికి; ప్ర+నతుండు+ఐనన్= నమస్కరించినవాడు కాగా; ఆ+మహనీయుండు= ఆ పూజ్యుడు; న+ఊనదయా+ఆయత్త చిత్తుండు= తక్కువగాని దయకు లొంగిన మనస్సు కలవాడు; కావునన్= కాబట్టి; ఆ భూవల్లభునకున్= ఆ రాజునకు; మోక్ష+ఉపాధి బోధ ప్రదంబులు+అగు= ముక్తికి కారణమైన జ్ఞానాన్ని ఇచ్చెడివి అయిన; వాక్యంబులు= మాటలు; ఇట్లు+అని= ఈ విధంగా; ఉపదేశించెన్= బోధించాడు.

తాత్పర్యం: ఆ విధంగా జనకరాజు నూర్వురు ఆచార్యులనుండి భిన్నభిన్న విధాలయిన ఆధ్యాత్మవిద్యాబోధనలు వింటూ, సంతోషిస్తూ, ఆ అందరి అభిప్రాయాలనూ గౌరవిస్తూవస్తున్న సమయాన పంచశిఖుడనే విప్రుడొకడు ఆయన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆస్థానాన ప్రవేశించాడు. అతడు సత్యజ్ఞానంతో గొప్పవాడు, ఒంటరి. సంశయాలు తీరినవాడు, భూమిపై సంచరిస్తూ యాదృచ్ఛికంగా మిథిలానగరప్రవేశం చేసి, రాజును చూచాడు. అతడిని కాపిలేయుడు అని కూడా అంటారు. ఎందుకంటే అతడు కపిల అనే గురుపత్ని చన్నుగుడిచి పెరిగినవాడు. ఆ మహాత్ముడు జనకుడి ఆస్థానాన, రాజు సన్నిధిలోనే తన హేతుపూర్వక వాక్యవిన్యాసాలతో జనకుడి నూర్వురు ఆచార్యులనూ వాదంలో జయించి వారిని నిరుత్తరులను చేశాడు. ఆ జనకుడు ఆ పంచశిఖుడి విశేషపరిజ్ఞానాన్ని గ్రహించి, తన గురుశతాన్ని విడిచి, అతడిని ఆశ్రయించి, తనకు తత్త్వోపదేశం చేయుమని అర్థిస్తూ ప్రణమిల్లాడు. ఆతడు కూడా గొప్పదయకు లొంగిన మనస్సుతో ఆ రాజునకు మోక్షానికి కారణమైన జ్ఞానాన్ని ఈయగల మాటలను ఈ విధంగా ఉపదేశించటం ప్రారంభించాడు.

పంచశిఖుండను విప్రుండు జనకునకుఁ దత్త్వోపదేశంబు సేయుట (సం. 12-211-6,8)

ఆ. విను మవిద్య గామమునకుఁ గామము గర్మ । మునకుఁ బుట్టఁబట్టు లనఘ! యింత
వట్టుఁ గారణముగ వచ్చుఁ బునర్జన్మ । మండ్రు తత్త్వవేదు లైన మునులు. 343

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా! జనకమహారాజా!; వినుము= ఆలకించుము; అవిద్య= మాయ (అజ్ఞానం); కామమునకున్= కోరికకు; కామము= కోరిక; కర్మమునకున్= క్రియకు - ప్రవృత్తికి - పనికి; పుట్టన్+పట్టులు= పుట్టుటకు స్థానాలు; ఇంతవట్టున్= ఇంతవరకు - ఈపై తెల్పినవి; కారణముగన్= హేతువుగా; పునర్+జన్మ= మరల పుట్టుట; వచ్చున్= కలుగుతుంది (అని); తత్త్వవేదులు+అయిన మునులు= సత్యము నెరిగినవారైన ఋషులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పాపంలేని ఓ జనక మహారాజా! వినుము. మాయ కోరికకు కారణం, ఆ కోరిక కర్మకు కారణం, కర్మ పాపపుణ్యాలకు మూలం. ఆ పాపపుణ్యాల అనుభవంకొరకు ప్రాణికి పునర్జన్మ అవసరమౌతుంది. ఈ విషయం తత్త్వవేత్తలైన మునులు చెప్పుతారు.

ఆ. ఒలసి లోభమోహములు దోషసంసేవ । నం బొనర్పఁగా ఘనత్వగాఢ
యగు నవిద్య భూమియై బహుకర్మ బీ । జముల కంకురాది శక్తు లొసఁగు. 344

ప్రతిపదార్థం: అవిద్య= మాయ; ఒలసి= అతిశయించి; లోభమోహములు= పేరాస, అపజ్ఞానములు (ఒకదానిని మరొకటిగా గ్రహించటం); దోష సంసేవనంబు= తప్పుల యొక్క ఉపాసనం - గౌరవంతో పరిచర్యచేయటం; ఒనర్పఁగాన్= చేయగా; ఘనత్వగాఢ+అగున్= గట్టిదనంతో దిట్టయైనది అగును - గట్టిపడును; బహుకర్మబీజములకున్= అనేక కర్మలు అనే విత్తనములకు; భూమి+ఐ= ఆధారమై - క్షేత్రమై; అంకుర+ఆది శక్తులు= మొలకెత్తటం మున్నగు సామర్థ్యాలను; ఒసఁగున్= ఇచ్చును.

తాత్పర్యం: మాయ పేరాస, అపజ్ఞానం చేసే తప్పులు కారణంగా బలపడి దట్టంగా రూపుదాలుస్తుంది. ఆ తరువాత అదే అనేక కర్మలు అనే విత్తనాలకు పొలంగా మారి, ఆ కర్మబీజాలు మొలకెత్తటం, మారాకు తొడగటం పెరగటం పుష్టించటం, ఫలించటంవంటి వివిధశక్తులతో విస్తరించటానికీ కారణమౌతుంది. మాయకు లోభమోహాలు దోహదపడగా, అదే బహుకర్మలకు ఆధారం భూమిగా మారి, నరుడిని జననమరణ చక్రాన పడవేసి తిప్పుతుంటుంది- అని ఫలితార్థం.

క. ప్రియములు నప్రియములును హృ । దయమును జిక్కువడఁ దివ్వఁ దత్తదనేక
క్రియలకుఁ జొచ్చు నరుఁడు మేన్ । వ్రయమగు టెఱుగఁడు వితత జరావ్యాధులచేన్. 345

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నరుఁడు= మానవుడు; హృదయమును= మనస్సును; ప్రియములున్= ఇష్టమైన విషయాలు; అప్రియములును= అనిష్టమైన విషయములును; చిక్కు+పడన్+తివ్వన్= (కలిసి) చిక్కుపడేటట్లు లాగగా; తద్+తద్+అనేక క్రియలకున్= ఆయా పెక్కు కర్మలకు; చొచ్చున్= ప్రవేశించును - పాల్పడును; వితత జరావ్యాధులచేన్= విరివిఅయిన ముసలితనం, రోగాలతో; మేన్= దేహం; వ్రయము+అగుట= నశించుట; ఎఱుఁగఁడు= గ్రహించడు.

తాత్పర్యం: మనస్సు ఇష్టానిష్టాలతో చిక్కువడి అటూ ఇటూ లాగుతూ ఉండగా నరుడు ఆయా కర్మలు అనేకాలు చేయ మొదలుపెడతాడు. చేస్తూ జీవిస్తూ ఉంటాడే తప్ప అతడికి తన శరీరం జరావ్యాధులకు లోనై క్రుంగి నశించబోయే విషయం బోధపడదు.

క. ధనములు బంధులు భోగము । లనియెడు నస్థిరము లెల్ల నాత్మ కెరవు సే
సిన శాంతి యలవడును మన । మున శాంతిశ్రీ సమృద్ధి మోక్షము నిచ్చున్.' 346

ప్రతిపదార్థం: ధనములు= సంపదలు; బంధులు= చుట్టపక్కాలు; భోగములు= అనుభవాలు (క్రియల ఫలితాలు); అనియెడు+అస్థిరములు+ ఎల్లన్= అనే మూడు విధాలయిన అశాశ్వత విషయాలను అన్నింటిని; ఆత్మకున్= జీవుడికి; ఎరవు+చేసినన్= వేరు చేస్తే; మనమునన్= మనస్సునందు; శాంతి+అలవడును= శాంతి అలవాటు అవుతుంది - ఏర్పడుతుంది; శాంతిశ్రీ సమృద్ధి= శాంతి అనే సంపద యొక్క పెంపు; మోక్షమును+ఇచ్చున్= ముక్తిని కలిగిస్తుంది.

తాత్పర్యం: నరుడు సంపదలు చుట్టపక్కాలు అనుభవాలు - అనే ఈ అశాశ్వత విషయాలు అన్నిటినీ జీవుడికి దూరంగా ఉంచగలిగితే అతడి మనస్సులో శాంతి ఏర్పడుతుంది. మిగిలిన సంపదలు సమృద్ధులు నశించగా ఏర్పడిన ఈ శాంతిసంపద పెరిగి, తుదకు అతడికి ముక్తిని చేకూర్చి పెట్టుతుంది.

వ. అనిన విని జనకజనవల్లభుం డమ్మునివల్లభునితోడ. 347

ప్రతిపదార్థం: అనినన్= అని పంచశిఖముని పలుకగా; విని= ఆలకించి; జనక జనవల్లభుండు= జనకరాజు; ఆ+ముని వల్లభునితోడన్= ఆ మునిరాజుతో.

తాత్పర్యం: పంచశిఖప్రవచనాన్ని ఆలకించిన జనకరాజు ఆ మునిరాజుతో (ఇట్లా అన్నాడు).

క. 'కేవల వైరాగ్యము మో । క్షావహ మగునేని యట్టులైన విరక్తిన్
భావమున నరుఁడు దాల్చెడిఁ । బో వాఁ డవ్యయ పదంబుఁ బొందునె? యనుడున్. 348

ప్రతిపదార్థం: కేవల వైరాగ్యము= వైరాగ్య మొక్కటే; మోక్ష+ఆవహము+అగును+ఏని= ముక్తిని కలిగించేది అయినచో; అట్టులు+ఐనన్= అట్లా అయితే; నరుఁడు= మనుజుడు; భావమునన్= మనస్సునందు; విరక్తిన్= వైరాగ్యమును; తాల్చెడిన్+పో= ధరించును పో - ధరించుననుకొమ్ము; వాఁడు= ఆ విరాగి - ఆ విరక్తిని దాల్చినవాడు; అవ్యయపదంబున్= నశించని స్థానమును- ముక్తిని; పొందును+ఎ?= చెందునా?; అనుడున్= అన్న వెంటనే.

తాత్పర్యం: కేవలం వైరాగ్య మొక్కటే ముక్తిని కలిగించగలిగితే నరుడు తన మనస్సున ఆ వైరాగ్యాన్ని వహించాడు- అనుకొమ్ము. అపుడు అతడు ముక్తిని పొందుతాడా? అని ప్రశ్నించిన వెంటనే.

వ. అవ్విప్రవరుం డతని కిట్లనియె. 349

ప్రతిపదార్థం: ఆ+విప్రవరుండు= ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడు - ఆ పంచశిఖముని; అతనికిన్= ఆ జనక రాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజు ప్రశ్నకు విప్రుడు ఇట్లా సమాధానం చెప్పాడు.

క. విను నృప! హర్షంబు ప్రియం । బనూన సుఖయుక్తి నిర్భరానందము శాం
తినిరూఢి యనఁగ మనమునఁ । బనిగొనునవి సాత్త్వికాఖ్య భావంబు లగున్. 350

ప్రతిపదార్థం: నృప!= ఓ రాజా!; విను= ఆలకించుము; హర్షంబు= సంతోషం; ప్రియంబు= ప్రీతి; న+ఊన సుఖయుక్తి= తక్కువగాని-గొప్పదైన సుఖముయొక్క కలయిక; నిర్భర+ఆనందము= నిండైన ఆనందము; శాంతినిరూఢి= శాంతియొక్క గట్టితనం; అనఁగన్= అనగా; మనమునన్= మనస్సునందు; పని+కొనునవి= నియోగించేవి - సంచరించెడివి; సాత్త్విక+ఆఖ్య భావంబులు+అగున్= సాత్త్వికాలు - అనే పేరుగల భావాలు అవుతాయి.

తాత్పర్యం: ఓ రాజా! వినుము, సంతోషం, ప్రీతి, గొప్పసుఖంతోడి ఆనందం, నిశ్చలశాంతీ మనస్సును ఏలేవి సాత్త్వికాలు అనే ఈ భావాలు. సత్త్వగుణంవలన కలిగే భావ పరంపర ఇది.

క. పరితాప మనభితోషము । నరేశ్వరా! శోచనము జనవ్యాపారా
దర మక్షమ యనియెడు నివి । యరయంగా రాజసంబు లగు భావంబుల్. 351

ప్రతిపదార్థం: నర+ఈశ్వరా!= ఓ రాజా!; పరితాపము= సంతాపం-దుఃఖం; న+అభితోషము= సంతోషంలేమి; శోచనము= ఏడ్పుట; జనవ్యాపార+ఆదరము= జనుల కర్మలయందు ప్రేమ-అభిమానము; అక్షమ= ఓర్వలేని తనం-అసూయ; అనియెడు+ఇవి= అనే ఇవి-ఈ భావాలు (మనో వికారాలు); అరయంగాన్= పరిశీలించగా; రాజసంబులు+అగు= రజోగుణసంబంధులు అగు; భావంబుల్= మనోభావాలు.

తాత్పర్యం: సంతాపం చెందటం, అవకాశమున్నా సంతోషించకుండా ఉండటం, ఏడుపు, జనుల క్రియలలో అభిమానం ప్రదర్శించటం, ఓర్వలేనితనం - ఈ భావాలు రజోగుణంవలన కలిగేవి.

క. తలఁపులు గ్రందుగఁ బొడముట । గల గను టేమఱుట భ్రమము గదురుట జాడ్యం
బలసత యను నీ భావం । బులు దామసకోటి యండ్రు బుధులు నరేంద్రా! 352

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ఓ రాజా! జనకా!; తలఁపులు= ఆలోచనలు; క్రందుగన్= (అతిశయంగా) ఉపద్రవంగా; పొడముట= కల్గటం; కల+కనుట= కలగాంచటం; ఏమఱుట= ప్రమాదపడటం - పొరబడటం; భ్రమము= భ్రాంతి - ఒకదానిని మరొకటిగా తలచుట; కదురుట= విజృంభించటం; జాడ్యంబు= జడత్వం - చురుకులేనితనం; అలసత= ఆలస్యం - సోమరితనం; అను+ఈ భావంబులు= అనే ఈ భావాల వరుస; బుధులు= పండితులు; తామసకోటి= తమోగుణ సంబంధిఅయిన (భావ) సమూహం; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ఓ జనక రాజా! ఇపుడు తామసభావాలు వివరిస్తున్నాను. ఉపద్రవరూప ఆలోచనలు కలుగుతూ ఉండటం, కలలు రావటం, ఏమరుపాటు ఒకదానిని మరొకటిగా గ్రహిస్తూ వ్యవహరించటం, చురుకుదనం లేకుండా మందగించి ఉండటం, సోమరితనం - అనే ఈ మనోవికారాలన్నీ తమోగుణజన్యాలు - అని పండితులు పలుకుతారు.

క. కారణము గలిగియును ని । ష్కారణ కలితంబులయ్యు జనియించు ధరి
త్రీరమణ! మూఁడు దెఱఁగులు । నారయ నివి యస్థిరంబులై తిరుగఁబడున్. 353

ప్రతిపదార్థం: ధరిత్రీరమణ!= రాజా!; మూఁడు తెఱఁగులు= మూడు విధాలు - సత్త్వ రజస్తమోజనిత భావాలు మూడు; కారణము+కలిగియును= కారణం ఉండీ; నిః+కారణ కలితంబులు+అయ్యున్= కారణం లేకా (కారణములేమితో కూడినవై

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కూడా); జనియించున్= కలుగుతాయి; ఆరయన్= పరిశీలించగా; ఇవి= ఈ మూడు విధాలయిన భావాలు; అస్థిరంబులు+ఐ= స్థిరం కానివై - చంచలములై; తిరుఁగన్+పడున్= తిరగబడతాయి - తారుమారౌతాయి.

తాత్పర్యం: ఓ రాజా! ఈ సత్త్వరజస్తమోగుణ జన్యాలయిన మూడు విధాల భావాలూ ఒకసారి కారణం ఉండి కలగవచ్చును. ఒక్కొక్కసారి నిష్కారణంగానే పొటమరించవచ్చును. ఈ భావపరంపర స్థిరంగా నిలువదు. చంచలంగా మారుతుంటుంది. ఒక్కొక్కసారి ఈ మనోవికారాలు తిరగబడతాయి కూడా.

చ. **జనవర! సౌఖ్యముం బొరసి సాత్త్వికభావ సముద్గమంబు సు**
మ్మనియును దుఃఖముల్ గదిరినప్పుడు రాజసభావభంగి సు
మ్మనియు జడత్వసంగసమయంబునఁ దామసభావవృత్తి సు
మ్మనియును ద్రోచి వానఁ బడ కాత్మరతిన్ నిలు పిచ్చు మోక్షమున్. **354**

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; సౌఖ్యమున్+పొరసి= సుఖాన్ని పొంది; సాత్త్వికభావ సమ్+ఉత్+గమంబు= సత్త్వగుణ సంబంధి భావాల మంచి పుట్టుక; సుమ్ము+అనియును= సుమా అనీ; దుఃఖముల్+కదిరిన+అప్పుడు= దుఃఖాలు - దుఃఖమయమైన భావాలు పైకొన్నపుడు; రాజసభావ భంగి= రజోగుణసంబంధి భావాలతీరు; సుమ్ము+అనియును= సుమా అనీ; జడత్వ సంగసమయంబునన్= జాడ్యంతోడి కలయిక కలిగినపుడు; తామసభావవృత్తి= తమోగుణ సంబంధి భావాల ప్రవృత్తి; సుమ్ము+అనియున్= సుమా అనీ; త్రోచి= ప్రక్కకు నెట్టి - ఆ భావాల జోరులో పడి కొట్టుకొనిపోకుండా - వాటిని నెట్టివేసి; వానన్= ఆ భావాలలో; పడక= పడిపోకుండా; ఆత్మరతిన్ నిలుపు= తనయందు (తాను) సంతోషించటం - బహిఃకారణాలతో పనిలేకుండా - తనలో తాను సంతసించుటయందు నిల్పుట; మోక్షమున్= ముక్తిని; ఇచ్చున్= ఇస్తుంది.

తాత్పర్యం: ఓ రాజా! నరుడు తాను సౌఖ్యాన్ని చవిచూస్తున్నప్పుడు అది సత్త్వగుణ సంజనితమైన భావాలవలన కలిగినట్లూ, దుఃఖాన్ని అనుభవిస్తున్నప్పుడు అది రజోగుణం కారణంగా ఏర్పడినట్లూ, జడత్వంతో స్తబ్దంగా సోమరితనం పైబడినప్పుడు అది తమోగుణ ఫలితమయినట్లూ గ్రహించి, ఆయా భావాలనూ, వాటి ఫలితా లయిన సుఖదుఃఖ జడత్వాలనూ విడిచిపుచ్చి, తనలో తాను ఆనందించే స్థైర్యాన్ని అందుకొనగలగాలి. అపుడే ముక్తి లభిస్తుంది. ఆ ఆత్మరతి స్థైర్యమే ముక్తిని ఈయగలదు.

వ. **ఇవ్వెరవునకు వైరాగ్యంబు మూలం బని చెప్పి వెండియు.** **355**

ప్రతిపదార్థం: ఈ+వెరవునకున్= ఈ పద్ధతికి; వైరాగ్యంబు= విరక్తి; మూలంబు+అని= కారణం అని; వెండియున్= మరియును.

తాత్పర్యం: ఈ ఆత్మరతి స్థైర్యసిద్ధికి కారణం విరక్తి ఒక్కటే - అని పలికి, ఇంకనూ. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **వినుము సత్త్వాదిగుణముల ననఘ! యాత్మ । తత్త్వమున లీనములఁ జేయఁ దన్మయత్వ**
దర్శనము దాన నవి మహోదధి నడంగు । నేఱు లట్టుల రూపఱు వేఱులేక. **356**

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా! జనకరాజా!; వినుము= ఆలకించుము; సత్త్వ+ఆదిగుణములన్= సత్త్వం మొదలైన గుణములను - రజస్తమోగుణాలను కూడా; ఆత్మతత్త్వమునన్= ఆత్మయొక్క జీవుడి యొక్క తత్త్వమునందు - స్వభావమునందు - సహజసత్త్వస్థితియందు; లీనములన్+చేయన్= లయించిన - కలిసిపోయిన వానినిగా చేయగా; తద్+మయత్వ దర్శనము= దానిలో - ఆ ఆత్మలో భాగమైపోయిన స్థితి అగుపడుట (జరుగును); దానన్= ఆ ఆత్మయందు; అవి= ఆ సత్త్వ గుణాలు; మహా+ఉదధిన్= పెద్ద సముద్రాన; అడంగు= లయమైపోయే; ఏఱులు+అట్టులు+అ= కాల్వలవలెనే; వేఱులేక= విడిగా ఉండక; రూపు+అఱున్= రూపు నశించును - ఆకారం లేకుండా ఆ ఆత్మలో అంతర్భవిస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ పాప మెరుగని పాలకుడా! జనకమహారాజా! వినుము. సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణాలు మూడింటినీ ఆత్మతత్త్వంలో - జీవుడి నిజస్వభావాన లీనం చేయాలి. అపుడు అవి ఆత్మలో కలిసిపోయి, విడిగా ఉండక - సముద్రాన కలిసిపోయే ఏరులవలె నిరాకారంగా సొంతమైన ఉనికిలేకుండా అయిపోతాయి.

విశేషం: అలం: ఉపమ.

తే. **నరుఁడు సుఖదుఃఖములవెంటఁ బొరయ నీక । మలచి యాత్మునిఁ జేర్చిన మానసంబు**
లీనమగు నంద జలములలోన నిడిన । లవణకణము చందమ్మున నవనినాథ! 357

ప్రతిపదార్థం: అవనినాథ!= ఓ రాజా!; నరుఁడు= మానవుడు (కర్త); మానసంబు= మనస్సు (కర్మ); సుఖదుఃఖములవెంటన్= సంతోషం సంతాపములవెంట; పొరయన్+ఈక= వెడలనీయకుండా - వాటితో పాటుగా పడిపోకుండా; మలచి= త్రిప్పి - అంతర్ముఖంచేసి; ఆత్మునిన్= జీవాత్ముడిని; చేర్చినన్= పొందించినట్లయితే - కలిపినట్లయితే; అందున్+అ= దానియందే - ఆ ఆత్మయందే; జలములలోనన్ - నీళ్ళలో; ఇడిన= వేసిన - ఉంచిన; లవణకణము చందమ్మునన్= ఉప్పుగల్లు విధాన; లీనము+అగున్= లీనమై - కలిసినదై పోవును.

తాత్పర్యం: ఓ రాజా! నరుడు తన మనస్సును లౌకికా లయిన సుఖదుఃఖాల వెంటబడిపోకుండా అంతర్ముఖంగా త్రిప్పివేసి, ఆత్మలో చేర్చగలగాలి. ఆ విధంగా ఆత్మలో చేర్చబడ్డ మనస్సు ఆ ఆత్మలోనే నీళ్ళను చేర్చిన ఉప్పుగల్లువలె కలిసిపోయి తన ఆకారాన్ని కోల్పోతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. **తోలు దిగవిడిచి నాగము । లీలఁ బొలుచు మాడ్కిఁ గర్మలేపముఁ దనతోఁ**
గీలుకొననీక వెలుఁగు ని । రాలంబన బోధఘనుఁడు రాజవరేణ్యా! 358

ప్రతిపదార్థం: రాజవరేణ్యా!= ఓ రాజశ్రేష్ఠా!; నాగము= పాము; తోలు= చర్మం (కుబుసం); దిగవిడిచి= తీసివేసికొని; లీలన్+పొలుచు మాడ్కిన్= విలాసంతో ఒప్పినవిధాన; నిర్+ఆలంబన బోధఘనుఁడు= ఆధారంలేని (స్వతః ప్రకాశమానమైన) జ్ఞానంతో గొప్పవాడైనవాడు (నరుడు) కర్మలేపమున్= కర్మం అనే పూతను (ఒంటికి రాసుకొనే ద్రవం); తనతోన్= తనతో; కీలుకొనన్+ఈక= ముడిపడనీయకుండా - అంటుకొనకుండా; వెలుంగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: ఓ రాజశ్రేష్ఠా! కుబుసం విడిచిన పాము విలాసంగా ప్రకాశిస్తుంది. ఆ విధంగానే, కర్మసంపర్కం వదలిన ఆత్మ, నిరాధారమై స్వతఃప్రకాశవంతమైన జ్ఞానంతో ప్రజ్వలిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

వ. **అని బోధించె; నిట్లు పంచశిఖునిచేత బోధితుండై కాదె! జనకుండు దన పురంబైన మిథిల గాలునప్పుడు దుఃఖంబులం బొరయమింజేసి తన కేమియుం గాలదని పలికెం గౌంతేయాగ్రజా! యాకర్ణింపుము.359**

ప్రతిపదార్థం: అని= పై ప్రకారంగా; బోధించెన్= ఉపదేశించెను; ఇట్లు+ ఈ విధంగా; పంచశిఖునిచేతన్= పంచశిఖుడనే ఋషిశ్రేష్ఠుడిచేత; బోధితుండు+ఐ= ఉపదిష్టుడై - ఉపదేశించబడినవాడై; కాదె= కదా!; జనకుండు= జనక మహారాజు; తన పురంబు+ఐన= తన పట్టణమైన; మిథిల= మిథిలా నగరం; కాలునప్పుడు= కాలిపోయే సమయాన; దుఃఖంబులన్= పరితాపాలను-ఖేదములను; పొరయమిన్+చేసి= పొందకపోవటంవలన; తనకున్+ఏమియున్+కాలదు= (నిర్లిప్తుడైన) తనను ఏమీ దహించదు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అని పలికెన్= అని అన్నాడు; కౌంతేయ+అగ్రజా!= కుంతీనందనులలో మొదట పుట్టినవాడా! ధర్మరాజా!; ఆకర్ణింపుము= వినుము, (ఈ చివరిమాట అనంతర వాక్యంతో అన్వయిస్తుంది.)

తాత్పర్యం: పై ప్రకారం పంచశిఖమహర్షి జనకమహారాజునకు ఉపదేశించాడు. ఆ పంచశిఖుడి బోధ జనకుడిపై తన ప్రభావం నెరపి, అతడిని నిజంగానే విరక్తుడిని చేసింది. అందువలననే జనకుడు తన నగరం మిథిల కాలిపోతూ ఉంటే, తాను దుఃఖానికి దూరంగా నిలిచి తన కేమీ కాల్పు అంటదని పలికాడు.

క. అమలం బగు నీ యితిహా । సము భక్తిఁ బఠించినం బ్రశాంతి యొలసి దుః
ఖములం దొలఁగి మనుష్యుం । డమృతత్వావాప్తి మహితుండై వెలుఁగొందున్.' 360

ప్రతిపదార్థం: మనుష్యుండు= నరుడు; అమలంబు+అగు= మలినంలేనిదైన; ఈ ఇతిహాసము= ఈ వృత్తాంతం; భక్తిన్= భక్తితో; పఠించినన్= చదివితే; ప్రశాంతి= మిక్కిలి శాంతి; ఒలసి= కలిగి; దుఃఖములన్+తొలఁగి= ఖేదాలను వదలి; అమృతత్వ+అవాప్తి మహితుఁడు+ఐ= మృత్యువులేనితనం లభించటంతో పూజ్యుడై; వెలుఁగు+ఒందున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: నిర్మలమైన ఈ వృత్తాంతాన్ని భక్తితో పఠిస్తే, నరుడికి మనశ్శాంతి ప్రాప్తిస్తుంది. దుఃఖాలు తొలగిపోతాయి. తుదకు మరణంలేని ముక్తిని కూడా పొంది పూజ్యుడై అతడు లోకాన వెలుగొందుతాడు'.

వ. అనిన విని ధర్మతనయుండు దేవవ్రతుతో 'నెట్టివాఁడు సుఖియును మంగళవంతుండును నిర్భయుండునునై వర్తించు?' నని యడిగిన నప్పుడమిఱేని కప్పురుషవరుం డిట్లను 'దమసంపన్నునకు నీ చెప్పిన చందంబుగలుగు నాకర్ణింపుము. 361

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; ధర్మతనయుండు= ధర్మరాజు; దేవవ్రతుతోన్= భీష్ముడితో; ఎట్టివాఁడు= ఏ విధమైన నరుడు; సుఖియును= సుఖంకలవాడూ; మంగళవంతుండును= శుభంకలవాడూ; నిర్+భయుండును= భయంలేనివాడూ; ఐ వర్తించున్= అయి ప్రవర్తిస్తాడు - జీవిస్తాడు; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; ఆ+పుడమిఱేనికిన్= ఆ రాజునకు; ఆ+పురుషవరుండు= ఆ నరశ్రేష్ఠుడు - భీష్ముడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; దమసంపన్నునకున్= ఇంద్రియనిగ్రహం కలవాడికి; నీ చెప్పిన చందంబు= నీవు పలికిన విధం - సుఖం శుభం కలిగి నిర్భయంగా జీవించగల లక్షణం; కలుగున్= ఉంటుంది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: పితామహుడి పలుకులు విన్న ధర్మరాజు మరొక ప్రశ్న అడిగాడు. 'ఎట్టివాడు సుఖంతోనూ, శుభంతోనూ కూడి నిర్భయుడై జీవించగలడు?' అని. ఆ ప్రశ్నకు భీష్ముడు ధర్మజుడితో, 'దాంతి - ఇంద్రియ నిగ్రహం కలవాడు నీ ప్రశ్నకు సమాధానంగా నిలుస్తాడు. విను మంటూ తన ప్రవచనాన్ని కొనసాగించాడు.

తే. సర్వవర్ణాశ్రమములకు శమము దమముఁ । గలిగియునికి విశిష్ట ప్రకార మగుట
బ్రాహ్మణునకు విశేషించి రాజవర్య! । దమసమాహిత వృత్తి పెద్దయును వలయు. 362

ప్రతిపదార్థం: రాజవర్య!= ఓ రాజశ్రేష్ఠా!; సర్వ వర్ణ+ఆశ్రమములకున్= ఎల్ల వర్ణములకు - బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు; ఎల్ల ఆశ్రమములకు - బ్రహ్మచర్య, గృహస్థ వానప్రస్థ సన్న్యాస ఆశ్రమవాసులకు; శమము= శాంతి; దమము= నిగ్రహం; కలిగి+ఉనికి= కలిగి ఉండటం; విశిష్ట ప్రకారము+అగుటన్= విశేషంతో కూడిన పద్ధతి కాబట్టి; విశేషించి= అధికంగా; బ్రాహ్మణునకున్= బ్రాహ్మణవర్ణజునకు; దమసమాహిత వృత్తి= దమంతో - నిగ్రహంతో సమాధానసహితమైన నడత; పెద్దయును= ఎక్కువగా; వలయున్= కావాలి.

తాత్పర్యం: లోకంలో అన్ని వర్ణాలవారికీ, అన్ని ఆశ్రమాలవారికీ శాంతి, దాంతి కలిగి ఉండటం విశిష్ట పద్ధతి. విశేషించి బ్రాహ్మణులకు దాంతితోడి జీవనవిధానం ఎక్కువగా కావలసి ఉంటుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. దమంబు సద్గుణంబులరాశి; యవి యెయ్యవి? యంటేని. 363

ప్రతిపదార్థం: దమంబు= నిగ్రహంబు; సత్+గుణంబుల రాశి= మంచి గుణాల ప్రోవు; అవి= ఆ సద్గుణాలు; ఏ+అవి?= ఏవి? అంటి(వి)+ఏని= అంటివేని - అంటే.

తాత్పర్యం: దమ మొక్కటి సద్గుణాల ప్రోవు. ఆ సద్గుణాలు ఏమిటి? - అంటావా? (వినుము.)

సీ. శౌచ, మక్రోధంబు, సంతోష, మార్జవ, । మనసూయ, విగతదైన్యత్వవృత్తి,
యప్రమాదంబు, దురభిమానరాహిత్య, । మతివాదవర్జన, మఖిలభూత
దయ, గురుపూజ, నిందాస్తుతి ప్రవణతా । త్యాగం, బపైశునత్వంబు, సాధు
జనసంగమం, బమృషాభాషణంబు, ని । స్పృహత, యహింస, సుశీలభావ,

తే. మింద్రియగ్రామజయ మివి యెల్ల దమము । నాకృతులు; వీనిఁ గల పుణ్యుఁ డభయుఁ డైహి
కములవలనను నాముష్మికముల వలన । శాంతిమంగళ నిధి బోధ సౌమ్యమూర్తి.' 364

ప్రతిపదార్థం: శౌచము= శుచిత్వం - పరిశుభ్రత; అక్రోధము= కోపం లేకుండటం; సంతోషము= ఆనందం; ఆర్జవము= ఋజుభావం - కపటంలేమి; న+అసూయ) అనసూయ= అసూయ - ఈర్ష్యలేకుండటం; విగత దైన్యత్వ వృత్తి= పోయిన దీనత్వంతోడి జీవనం- దైన్యంలేని బ్రదుకు; అప్రమాదంబు= పరాకు లేకుండటం; దుర్+అభిమాన రాహిత్యము= చెడు అభిమానం లేకుండటం; అతివాద వర్జనము= ఎక్కువ మాట్లాడటం మానటం; అఖిలభూతదయ= ఎల్లప్రాణులయెడ దయ; గురుపూజ= పెద్దలయెడ గౌరవం; నిందాస్తుతి ప్రవణతా త్యాగంబు= నిందయందుగాని, స్తోత్రమునందుగాని ఆసక్తుడై ఉండటాన్ని వదలటం - ఎక్కువగా తెగడటం పొగడటం రెండూ మానటం; అపైశునత్వంబు= కొండెములు చెప్పే గుణం లేకుండటం; సాధుజన సంగమంబు= సజ్జనుల తోడి కలయిక; అమృషాభాషణంబు= అబద్ధములాడకుండటం; నిస్పృహత= ఆశ లేకుండటం; అహింస= హింస లేకుండటం; సుశీల భావము= మంచి సహజ స్వభావం; ఇంద్రియ గ్రామజయము= ఇంద్రియాల సమూహమును జయించటం; ఇవి+ఎల్లన్= ఇవి అన్నీ; దమము+ఆకృతులు= దమముయొక్క ఆకారాలు - స్వరూపాలు; వీనిన్= ఈ సద్గుణాలను; కల పుణ్యుఁడు= కలిగిన ధన్యజీవి; ఐహికముల వలనను= ఇహలోకానికి చెందిన విషయాల నుండిగాని; ఆముష్మికముల వలనను= పరలోకానికి చెందిన విషయాలనుండి గాని; అభయుఁడు= భయంలేనివాడు; శాంతి మంగళ నిధి= శాంతికీ, శుభానికీ స్థానమైనవాడు; బోధసౌమ్యమూర్తి= జ్ఞానంవలన ప్రశాంతమైన ఆకారం కలవాడు.

తాత్పర్యం: దమము అనే ఒక్క లక్షణంలో ఎన్నో సద్గుణాలు ఇమిడిపోతాయి. ఆ సద్గుణాలు ఇవి: పరిశుభ్రత- బయటి లోపలి మలినాలు తొలగించుకొనటం, కోపంలేకుండా, కపటమూ అసూయా లేకుండా దైన్యానికి దూరంగా జీవించటం, పరాకుపడటం దురభిమానం అధికప్రసంగం - వీటిని త్యజించటం, ఎల్ల ప్రాణులయెడ దయ, పెద్దలయెడ గౌరవం కలిగి ఉండటం, నిందించటం స్తుతించటంలలో నిమగ్నుడు కాకపోవటం, కొండెములు చెప్పకుండా ఉండటం, సజ్జనసాంగత్యం చేయటం, అబద్ధాలు ఆడకుండటం, ఆశలకు లోనుగాక, హింసకు పాల్పడక, మంచి శీలం కలిగి ఉండటం, ఇంద్రియాలను జయించటం - ఇవన్నీ వాస్తవానికి దమముయొక్క రూపాంతరాలే. ఈ లక్షణాలు గల ధన్యజీవికి ఇహలోక విషయాలవలనగాని, పరలోక విషయాల వలనగాని ఎట్టి భయమూ ఉండదు, ఏర్పడదు. అతడు శాంతికీ శుభానికీ నిలయమైనవాడు. జ్ఞానంవలన సౌమ్యమైన ఆకారంతో వెలుగొందేవాడు'.

విశేషం: దమధాతుజన్యమైన కృదన్త రూపమిది. ఆ ధాతువునకు అణచుట అని అర్థం. ఇంద్రియాలను అణచుట దమమౌతుంది. ఇంద్రియ విజయమొకటి సిద్ధిస్తే సకల సద్గుణాలూ లభించినట్లే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనినం బితామహునితోఁ బాండవేయాగ్రజుండు 'వ్రతస్థు లొక్కొక్కయెడ భోజనంబులు సేయుదురు. వారలకు వ్రతహానిలేకుండునే?' యని యడిగిన నతనితో నతండు. 365

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; పితామహునితోన్= తాతతో; పాండవేయ+అగ్రజుండు= పాండుతనయులలో పెద్దవాడు-ధర్మరాజు; వ్రతస్థులు= వ్రతంలో ఉన్నవారు; ఒక్క+ఒక్క+ఎడన్= ఒక్కొక్కచోట, ఒక్కొక్క సమయాన; భోజనంబులు+చేయుదురు= భుజించుటలు చేస్తారు; వారలకున్= ఆ విధంగా వ్రతంలో ఉండీ భోజనాలు చేసేవారలకు; వ్రతహాని= వ్రత భంగం; లేక+ఉండును+ఏ?= లేకుండా ఉంటుందా?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతనితోన్= ఆ ధర్మజుడితో; అతండు= ఆ భీష్ముడు (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ధర్మరాజు 'దమవంతుడు సకల సద్గుణరాశి' అని భీష్ముడినుండి విన్న పిదప, పితామహుడిని 'వ్రత నిర్వహణంలో ఉండి కూడా కొందరు అపుడపుడు అక్కడక్కడ భోజనాలు చేస్తూ ఉంటారు. వారికి వ్రతభంగం వాటిల్లదా?' అని ప్రశ్నించగా, దానికి సమాధానంగా భీష్ముడు ఇట్లా అన్నాడు.

తే. 'వినుము విప్రకామార్థ భోజనములోను । గాఁగఁ గలుగు వేదోక్త ప్రకార భోజ
నములు వ్రతహాని సేయవు నరవరేణ్య!' । యని నిరూపించి పలికి యిట్లనియె మఱియు. 366

ప్రతిపదార్థం: నరవరేణ్య!= ఓ రాజా!; వినుము= ఆలకించుము; విప్రకామ+అర్థభోజనము= బ్రాహ్మణుడి కోరికయే ప్రయోజనంగా గల భోజనం - గృహస్థుడి కోర్కెతీర్చడానికై చేసే భోజనం; లోనుగాఁగన్= లోనైన - మొదలయిన; కలుగువేద+ఉక్త ప్రకార భోజనములు= ఉన్న, వేదంలో చెప్పబడ్డ విధానంగల భోజనాలు - వేదానుమతమైన భోజనాలూ; వ్రతహాని+చేయవు= వ్రతభంగం చేయవు - కలిగించవు; అని= అంటూ; నిరూపించి= నిరూపణ చూపి; పలికి= చెప్పి; మఱియున్= ఇంకనూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'విప్రుల కోరికమేర చేసే భోజనాలూ, ఇంకా ఇటువంటివే అయిన వేదోక్తాలయిన భోజనాలూ వ్రతస్థులు చేసినా, వాటివలన వ్రతహాని జరుగదు' అని గట్టిగా ప్రకటించి, భీష్ముడు ఇంకా ఈ విధంగా ప్రవచించాడు.

వ. 'సదోపవాసియు, సదాబ్రహ్మచారియు, నమాంసభోజియు, విఘసాశనుండును, నమృతాశియు, నస్వప్నుండునుం గావలయుఁ దత్స్వరూపంబు లెట్టి వంటేని. 367

ప్రతిపదార్థం: సదా+ఉపవాసియున్= ఎల్లప్పుడూ ఉపవసించేవాడూ; సదాబ్రహ్మచారియున్= ఎల్లప్పుడూ బ్రహ్మచర్య వ్రతం పాటించేవాడూ; అమాంస భోజియున్= మాంసం భుజించనివాడూ; విఘస+అశనుండును= దేవతల అతిథుల భుక్తశేషాన్ని తినేవాడూ; అమృత+ఆశియును= అమృతమును తినేవాడూ; అస్వప్నుఁడునున్= నిదురలేనివాడునూ; కావలయున్= కావాలి (నరుడు-సాధకుడు); తద్+స్వరూపంబులు+ఎట్టివి?= వారి ఆకారాలు ఏవిధమైనవి; అంటి(వి)+ఏనిన్= అంటివేని - అన్నచో.

తాత్పర్యం: మోక్షార్థియైన సాధకుడు, సదా ఉపవాసిగా బ్రహ్మచారిగా ఉండాలి. మాంసాన్ని భుజించనివాడుగా, దేవతల అతిథుల భుక్తశేషాన్ని భుజించేవాడుగా, అమృతాన్ని భుజించేవాడుగా కూడా ఉండాలి. నిదురపోనివాడుగా కూడా ఉండాలి. వీరి స్వరూపాలు ఏ విధంగా ఉంటాయి? అని అడుగబోతున్నావా? (వినుము).

సీ. 'ఇరు ప్రొద్దు గుడుచుచు నెడనెడఁ గుడవక । యుండునాతండు సదోపవాసి;
ఋతుకాలమున నాత్మసతియంద రతిసల్పు । భవ్యశీలుఁడు సదా బ్రహ్మచారి;
దేవ పితృతిథి పూజావిధులం దిడి । మఱి నంజు పురుషుఁ డమాంస భోజి;
దనయట్లు పంక్తివారును భుజింప భుజించు । నంచితాత్ముఁడు విఘసాశనుండు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **భృత్య వర్గంబు గుడిచిన పిదపఁ గుడుచు । నాతఁ డమృతాశి; దివసంబునందు నిదుర**
వోని పుణ్యుఁడస్వప్నుఁ; డిప్పాలములగు మ । హాధిక వ్రతములు దేహ బాధకములు.' **368**

ప్రతిపదార్థం: ఇరుప్రొద్దు= రెండు పూటల; కుడుచుచున్= తింటూ; ఎడన్+ఎడన్= మధ్య మధ్య; కుడువక= తినక; ఉండు+ఆతండు= ఉండేవాడు; సదా+ఉపవాసి= నిత్యోపవాసి - ఎప్పుడూ ఉపవసించేవాడే; ఋతుకాలమునన్= ఋతుమతి అయినపుడు; ఆత్మసతియందున్= తన భార్యయందు; రతి+చల్పు= సంభోగించేసే; భవ్యశీలుఁడు= ఉత్తమ స్వభావంకలవాడు; సదాబ్రహ్మచారి= నిత్యబ్రహ్మచారి; దేవ పితృ+అతిథి పూజా విధులందున్= దేవతల పితరుల అతిథుల పూజాకార్యాలలో; ఇడి= ఉంచి; మఱి= తరువాత; నంజు పురుషుఁడు= తినే నరుడు; అమాంస భోజి= మాంసం భుజించనివాడు; తన+అట్లు= తనవలెనే; పంక్తివారును= బంతిలోనివారూ - తనతో కూర్చొని భుజించేవారుకూడా; భుజింపన్= తినగా; భుజించు+అంచిత+ఆత్ముఁడు= తినే మంచి మనస్సు కలవాడు; విఘస+అశనుండు= దేవభుక్తశేషాన్ని భుజించేవాడు; భృత్యవర్గంబు= సేవకుల సమూహం; కుడిచిన పిదపన్= తిన్న తరువాత; కుడుచు+ఆతఁడు= తినేవాడు; అమృతాశి= అమృతం భుజించేవాడు; దివసంబునందున్= పగటివేళ; నిదుర+పోని పుణ్యుఁడు= నిద్రపోని ధన్యుడు; అస్వప్నుఁడు= నిద్రపోనివాడు; ఈ+పాలములు+అగు= అ విధాలయిన; మహా+అధిక వ్రతములు= గొప్ప పెద్ద వ్రతాలు; దేహబాధకములు= శరీరాన్ని బాధించేవి.

తాత్పర్యం: రోజుకు రెండు పూటల మాత్రం భోజనంచేస్తూ మధ్యమధ్య ఏమీ తిననివాడు సదోపవాసి, ఋతుకాలాన మాత్రం ధర్మపత్నితో సంగమించే సచ్ఛీలుడు సదాబ్రహ్మచారి, దేవతల పితరుల అతిథులకొరకు వండి వడ్డించి ఆ పిదప మాత్రం భుజించేవాడు అమాంసభోజి. తనతో తన పంక్తిని వారు కూడా ఆరగిస్తుండే వారివలెనే సమానంగా మాత్రమే భుజించేవాడు విఘసాశనుడు - భుక్తశేషభోజి. సేవకులందరూ భుజించిన తరువాత మాత్రమే తాను భుజించే పుణ్యాత్ముడు అమృతాశి. పగటిపూట నిద్రపోనివాడు అస్వప్నుడు - నిద్రపోనివాడు ఇటువంటివారి మహా వ్రతాలన్నీ శరీరబాధకాలే'.

ఇంద్ర ప్రహ్లాద సంవాద ప్రకారము (సం. 12-212-3)

వ. **అనిన విని కౌంతేయాగ్రజుండు శాంతనవునితోడఁ 'గర్మంబులు సంస్కారయోగంబున శుభాశుభంబులం బురుషుం బొందించు వానికిం గర్త యప్పురుషుండ యగుట గాకుండుట నిశ్చయింపరాకుండు. నాకేర్పడం జెప్పవే?' యనుటయు నప్పుణ్యుం డక్కురువరేణ్యున కిట్లను 'నింద్ర ప్రహ్లాద సంవాద సమాకర్ణనంబున నది దేటపడు నాకర్ణింపుము. సత్త్వస్థుండును, సంయమనిరతుండును, ననహంకారుండును, నమర్షక్రోధ దూరుండును, దుల్యనిందాస్తుతియును, సమలోష్టకాంచనుండును, నారాయణధ్యాన పరాయణుండును నగు ప్రహ్లాదుం డొక్కయెడ నొక్కరుండ యాసీనుండై యుండ నింద్రుం డతని యంతరంగం బారయ వేఁడి చేరంబోయి.** **369**

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; కౌంతేయ+అగ్రజుండు= కుంతీకుమారులలో పెద్దవాడు - ధర్మజుడు; శాంతనవునితోడన్= శంతనుడి కుమారుడితో - భీష్ముడితో; కర్మంబులు= కర్మలు-నరులు చేసే అన్ని పనులూ; సంస్కారయోగంబునన్= పూర్వానుభవపు కలయికతో; శుభ+అశుభంబులన్= మంచిచెడులను; పురుషున్= నరుని; పొందించున్= ప్రాప్తింపజేస్తాయి - పొందజేస్తాయి; వానికిన్= ఆ కర్మలకు; కర్త= చేసేవాడు; ఆ+పురుషుండు+అ= ఆ నరుడే; అగుట+కాక+ఉండుట= కావటం, కాకపోవటం; నిశ్చయింపన్+రాక+ఉండున్= నిర్ణయించ (వీలు) కాకుండా ఉంటుంది; నాకున్= సందేహంతో ఉన్న నాకు; ఏర్పడన్+చెప్పవే?= స్పష్టంగా తెల్పవా?; అనుటయున్= అన్న తరువాత; ఆ+పుణ్యుండు= ఆ పుణ్యాత్ముడు- భీష్ముడు; ఆ+కురువరేణ్యునకున్= ఆ ధర్మరాజునకు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; ఇంద్రప్రహ్లాద సంవాద సమ్+ఆకర్ణనంబునన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇంద్రుడి ప్రహ్లాదుడి సంభాషణమును బాగుగా వినటంవలన; అది= నీ వడిగిన సందేహం; తేటపడున్= స్పష్టపడుతుంది; ఆకర్ణింపుము= వినుము; సత్త్వస్థుండును= సత్త్వగుణమున ఉన్నవాడును; సంయమ నిరతుండును= నిగ్రహమునందు ఆసక్తుడును; న+అహంకారుండును= అహంకార రహితుడును; అమర్షక్రోధ దూరుండును= అసహనం తీవ్ర కోపములకు దూరమైనవాడును; తుల్యనిందాస్తుతియును= సమానమైన తెగడుట పొగడుటలు గలవాడును; సమలోష్టకాంచనుండును= సమానమైన మట్టిగడ్డ, బంగారం కలవాడును; నారాయణధ్యాన పరాయణుండును= విష్ణుమూర్తిని ధ్యానించటంలో ఆసక్తుడైనవాడూ; అగు= అయిన; ప్రహ్లాదుండు= ప్రహ్లాదుడు - హిరణ్యకశిపుడి తనయుడు; ఒక్క+ఎడన్= ఒకచోట; ఒక్కరుండు+అ= ఒక్కడే; ఆసీనుండు+ఐ+ఉండన్= కూర్చొన్నవాడై ఉండగా; ఇంద్రుండు= ఇంద్రుడనే దేవతలరాజు; అతని+అంతర్+అంగంబు= ఆ ప్రహ్లాదుడి మనస్సును; ఆరయన్= పరిశీలించుటకు; వేఁడి= అర్థించి; చేరన్+పోయి= సమీపించి.

తాత్పర్యం: ఆ విధంగా ధర్మసూక్ష్మాలు పితామహుడినుండి విన్న తరువాత, ధర్మరాజు భీష్ముడిని ఒక జటిల ప్రశ్నవేశాడు. 'కర్మలు, సంస్కారవశాన నరుడికి మంచిచెడులు కలిగిస్తూ ఉంటాయి. అయినప్పుడు ఆ కర్మలకు కర్త నరు డౌనో కాడో నిర్ణయించలేకుండా ఉన్నాను. నాకు స్పష్టంగా నిస్సందేహంగా తెలుపవా?' అని అర్థించాడు. దానికి బదులుగా భీష్ముడు ధర్మజుడితో 'ఇంద్రప్రహ్లాద సంభాషణమనే వృత్తాంతాన్ని వింటే నీ సందేహం తీరుతుంది. విను'మంటూ ఆ వృత్తాంతాన్ని వివరించటం ప్రారంభించాడు. 'సత్త్వగుణంలో నిలిచి ఉన్నవాడూ, నిగ్రహశీలుడూ, అహంకార రహితుడూ అసహనాన్ని క్రోధాన్ని దూరీకరించినవాడూ, తెగడ్తలను పొగడ్తలను సమంగా భావించేవాడూ, మట్టిబెడ్డను బంగారాన్ని ఒకటిగా చూచేవాడు, విష్ణుమూర్తిధ్యానమగ్నుడూ అయిన ప్రహ్లాదుడు ఒకచోట ఒంటరిగా కూర్చొని ఉండగా, ఇంద్రుడు అతడి మనస్సును పరిశీలించి పరీక్షించే సంకల్పంతో, కోరి అతడిని చేరి.

క. 'సంపద లేమికి మది శో । కింపవు; శత్రువుల చేతికిని లోనగు టూ
హింపవు; నీ కూరకునికి । పెంపని పాటించె; దిట్టి బేలవు గదవే!' 370

ప్రతిపదార్థం: సంపద లేమికిన్= సంపత్తి లేకపోవటానికి; మదిన్= మనస్సున; శోకింపవు= ఏడ్వవు; శత్రువులచేతికిని= విరోధుల చేతికి కూడా; లోను+అగుట= లొంగిపోవటం; ఊహింపవు= తలంచవు; ఊరక+ఉనికి= నిష్క్రియగా - ఏ పనీ పాటూ లేకుండా ఉండుట; నీకున్= ఒంటరివైన నీకు; పెంపు+అని= ఎక్కువ అని - మేలని; పాటించెదు= గ్రహిస్తావు; ఇట్టి బేలవు+కదవే!= ఇంతటి వెర్రివాడవు అయినావే!

తాత్పర్యం: 'సంపదలు లేవు నీకు. అయినా దుఃఖించవు, శత్రువులచేతికి లొంగిపోతానని, అయినా ఆలోచించవు. ఉపేక్షాభావంతో ఊరక ఉండటమే నీకు మేలని గ్రహిస్తావు. ఇంత అమాయకుడవు అయినా వేమిటి? ఈ నిష్క్రియత్వ మెందుకు?'

వ. అనిన విని హిరణ్యకశిపునందనుం డప్పురందరున కిట్లనియె. 371

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; హిరణ్య కశిపు నందనుండు= హిరణ్యకశిపుడి తనయుడు - ప్రహ్లాదుడు; ఆ+పురందరునకున్= ఆ ఇంద్రుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దీనికి ప్రహ్లాదుడు ఇంద్రుడికి ఈ విధంగా ప్రత్యుత్తర మిచ్చాడు.

ఆ. 'కలిమిలేమి యనఁగఁగల వొకరెం డవి । యత్నగౌరవము వియత్నతయును
గలుగ వచ్చు ననుట గాదది సూ బేల । తనము వినుము తెలియ ననిమిషేంద్ర! 372

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనిమిష+ఇంద్ర!= దేవతల రాజా!; తెలియన్= తెలియునట్లుగా; వినుము= ఆలకించుము; కలిమిలేమి+అనఁగన్= కలుగుట, కలుగకుండుట అనే; ఒక రెండు= ఒక రెండు (క్రియలు); కలవు= ఉన్నవి; అవి= ఆ కలిమిలేములు (ఏవి? అంటే); యత్నగౌరవము వియత్నతయును= ప్రయత్నమనే బరువు, ప్రయత్నంలేకుండటం (అంతేగాని సంపద - దారిద్ర్యం కావు - కలిమిలేములకు అర్థాలు); కలుగన్= ప్రయత్నముంటే; వచ్చును+అనుట= (కలిమి) సిద్ధిస్తుంది అనటం; కాదు= కుదురదు- చెల్లదు; అది= యత్నిస్తే వస్తుంది అనుట; బేలతనము సూ= అమాయకత్వం - మౌఢ్యము సుమా!

తాత్పర్యం: ఓ దేవతలరాజా! కలిమిలేముల గురించి ప్రసంగించావు. అది సరిగాదు. నిజానికి కలిమి, లేమి- అనేవి రెండూ లోకాన ఉన్నాయి. కలిమి - ఉండుట - ప్రయత్నముండుట; లేమి - లేకుండుట - ప్రయత్నం లేకుండుట- అనేవే అవి. అయితే యత్న మున్నంత మాత్రాన సంపద సిద్ధిస్తుంది అనటానికి వీలులేదు. ఆ విధంగా అనటమే బేలతన మౌతుంది సుమా!

విశేషం: ఇంద్రుడు ప్రహ్లాదుడిని 'బేలవు - తెలియని మూఢుడవు లేక అమాయకుడవు' అంటే, ప్రహ్లాదుడు తిరిగి ఇంద్రుడిని అదే పదం ప్రయోగించి బోధిస్తూ అతడి మౌఢ్యాన్ని అతడికి ఎరుకపరుస్తున్నట్లున్నాడు. 'నిజమైన బేలతనం నీదే సుమా!' అని హెచ్చరిస్తున్నాడు.

క. తేరక యుండఁగఁ జేరుం । దేరంగాఁ బొలియు విధి యధీనంబులు గా
కారయ విత్తంబులు పురు । షారంభాయత్తములె? మహా బుద్ధినిధీ! 373

ప్రతిపదార్థం: మహాబుద్ధినిధీ!= గొప్ప ధీశక్తికి నిధానమైనవాడా! ఇంద్రా!; విత్తంబులు= సంపదలు; తేరక+ఉండఁగన్= తేకుండా- తీసికొనిరాకుండా ఉంటే; చేరున్= కూడతాయి; తేరంగాన్= తేగా, తీసికొనిరాగా; పొలియున్= నశిస్తాయి; ఆరయన్= పరిశీలించగా; విధి+అధీనంబులు+కాక= విధికి లొంగినవిగాకుండా; పురుష+ఆరంభ+ఆయత్తములు+ఎ?= పురుష ప్రయత్నానికిలొంగేనా?

తాత్పర్యం: ఓ మహాధీశాలీ! ఇంద్రా! సంపదలు యత్నించి ఆర్జించకున్నా తమంత తాముగా వచ్చి పడతాయి. ప్రయత్నించి సమార్జించి తెచ్చి ఉంచితే ఊరక నశించిపోతాయి. కాబట్టి పరిశీలించి చూస్తే అవి విధికి లొంగి ఉండేవేగాని నరుడి ప్రయత్నానికి లొంగినవి మాత్రం కావు.

క. శత్రుజనులు చెఱుచుటయును, । మిత్రులు బ్రతికించుటయును మిన్నక యాప
త్పాత్రతయును సంపదయు వి । ధాతృఁడు సంధించుఁ జూవె తఱితోఁ బురుషున్. 374

ప్రతిపదార్థం: శత్రుజనులు= విరోధి నరులు; చెఱుచుటయున్= చెడునట్లు చేయటం - నశింపజేయటం; మిత్రులు=స్నేహితులు; బ్రతికించుటయును= బ్రతికేటట్లు చేయటం - క్షేమాలు కలిగించటం; మిన్నక= ఊరక- అనుకొనకుండా - నిష్కారణంగా; ఆపద్+ పాత్రతయును= ఆపదలకు కష్టనష్టాలకు పాత్రమవటం; సంపదయును= (ఊరకనే) సంపత్తి కలగటం - ఇవి అన్నీ; తఱితోన్= సమయంతో - కాలంతో; పురుషున్= నరుడిని; విధాతృఁడు= చేసేవాడు- బ్రహ్మదేవుడు; సంధించున్+చూచె!= కలుపుతాడుసుమా!

తాత్పర్యం: జీవితంలో నరుడికి అనేక ఆనంద ఖేదకర సంఘటనలు ఎదురౌతూ ఉంటాయి. మిత్రులు శుభాలు గలిగిస్తుంటే, శత్రువులు నాశనాలు కలిగిస్తూ ఉంటారు. ఒక్కొక్కసారి ఊరకనే తన ప్రమేయ మేమీ లేకుండానే నరుడిమీద కష్టనష్టాలు వచ్చి పడతాయి. ఆ విధంగానే సుఖసంతోషాలూ హఠాత్తుగా మానవుడిని ముంచెత్తుతుంటాయి. ఇవన్నీ ఈ విధంగా ఎందుకు జరుగుతున్నాయి? ఎవరు జరిపిస్తారు? ఆయా సహాయం సమీపించినపుడు స్వయంగా విధాతే నరుడికి ఆయా ఖేదమోదాలతో, ఆపత్సంపదలతో, పరాజయవిజయాలతో సంధానం కుదురుస్తూ ఉంటాడు. ఇదంతా ఆయన ఆడించే ఆట తప్ప అన్యం కాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ పద్యంలో ప్రాసమైత్రి విశేషం గమనించదగినది. సంయుక్తాక్షరమైన 'త్ర'కును, 'తృ'కును ప్రాసమైత్రి చెల్లింపబడినది. ఇది 'సంయుతాసంయుతప్రాసము. రేఫ లకారములతో ఏర్పడినప్పుడే చెల్లుతుంది. 'పాఁడి ద్రచ్చుఁగ నిమ్ము నా తండ్రి కృష్ణ వేఁడుకొనియెద నందాఁకఁ బండ్లు దినుము.'

ఆ. **భావములు నిజస్వభావంబునన తోఁచు । నడఁగునట్లు గాన యస్థిరతకు**
నెలవు లని యెఱుంగ నేర్చిన భావంబు । లందుఁ దగులు నెట్లు డెంద మనఘ! **375**

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా -సురేంద్రా!; భావములు= అభిప్రాయాలు - మనోవికారాలు; నిజస్వభావమునను+అ= తన స్వభావమునందే; తోఁచున్= పుట్టుతాయి; అడఁగున్= నశిస్తాయి; అట్లు+కానన్= ఆ విధము కాబట్టి (భావాలు); అస్థిరతకున్= చంచలత్వానికి - నిలకడలేనితనానికి; నెలవులు+అ= స్థానాలు అని; ఎఱుంగ నేర్చినన్= తెలిసికొనగలిగితే; డెందము= మనస్సు; భావంబులందున్= భావాలలో - మనస్సులో నుండే కలిగే అభిప్రాయాలలో; ఎట్లు= ఏ విధంగా; తగులున్= తగుల్కొంటుంది?- చిక్కుకొంటుంది? (తగుల్కొనదు.)

తాత్పర్యం: కర్మలకు పూర్వరూపాలయిన భావాలు నరుడి స్వభావం లోపలినుండి పుట్టుకొస్తున్నాయి. మళ్ళీ ఆ స్వభావంలోనే కలిసి నశించిపోతున్నాయి. కాబట్టి ఈ మనోవికారరూపమైన భావాలకు నిలకడ ఉండదు. అవి చంచలత్వానికి నెలవులు. ఈ విషయం గ్రహించగలిగితే, ఇక నరుడి మనస్సు భావాలలో ఎందుకుతగుల్కొంటుంది? ఆ గ్రహింపు లేకపోవటం వలననే మనస్సు, భావాలు ఆడించినట్లు ఆడుతున్నది గాని, లేకపోతే, మనస్సు నిగ్రహంతో ఉండగలుగుతుంది.

ఆ. **ఏను గర్త ననుట యెఱుఁగమి దాఁ గర్త । యేని నేమి ఫలము నెడలకుండ**
నఖిలకర్మములును నాచరించుచు నున్న । వాఁడె కాన కర్తగాఁడు దాను.' **376**

ప్రతిపదార్థం: ఏను= నేను; కర్తను+అనుట= చేసేవాడను అనటం; ఎఱుఁగమి= అజ్ఞానం; తాన్= తాను (నరుడు); కర్త+ఏనిన్= చేసేవాడైతే; ఏమిఫలమున్= ఏ ఫలితమూ - ఏ ప్రయోజనమూ; ఎడలకుండన్= క్రింద పడకుండా - ఏర్పడకుండానే; అఖిల కర్మములును= ఎల్ల కర్మలను (విడువకుండా); ఆచరించుచున్+ఉన్నవాఁడు+ఎ= చేస్తూ ఉన్నవాడే (అయినాడు నరుడు); కాన= కాబట్టి పై కారణంవలన; తాను= నరుడు; కర్త+కాఁడు= చేసేవాడు కాడు; (అనగా చేసేవాడు విధాతే గాని, నరుడుకాదు.)

తాత్పర్యం: నేను కర్తను-అని అనటం అజ్ఞానం. నిజంగా తాను కర్త అయితే ఏ లాభమూ ఏర్పడకుండానే అన్ని పనులనూ చేస్తున్నవాడే కాబట్టి, ఈ కారణంవలన చేసేది అంతా విధాతే అవుతాడు. అంతేగాని నరుడు కానేరడు'

వ. **అని పలికి వెండియు.** **377**

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికి= చెప్పి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ఆ విధంగా ప్రవచించి, మళ్ళీ (ఆ అంశాన్నే వివరిస్తున్నాడు.)

క. **'అనఘా! విధివిహితంబుం । దన చేఁతఁగఁ దలఁప ఫలము దగులు నహంకా**
ర నిరూఢున కనహం కా । రునకది లేమి ఫలయుక్తిఁ ద్రోవం జాలున్. **378**

ప్రతిపదార్థం: అనఘా! ఓ పాపరహితుడవైన దేవేంద్రా!; అహంకార నిరూఢునకున్= అంహకారమున గట్టిపడినవాడికి - అహంకారం గలవాడికి; విధివిహితంబు= విధియొక్క పనిని; తనచేఁతఁగన్= తన పనిగా; తలఁపన్= తలచగా; ఫలము+తగులున్= ఫలితం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అంటుకొనును; న+అహంకారునకున్= అహంకారం లేనివాడికి; అది= తనచేతగా భావించటం; లేమిన్= లేకపోవటంవలన; ఫలయుక్తిన్= ఫలితము యొక్క కలయికను - చేరికను; త్రోవన్+చాలున్= (అతడు) త్రోసివేయగలుగును.

తాత్పర్యం: ఓ పాప మెరుగని దేవేంద్రా! నరుడు అహంకారిగా జీవించేటప్పుడు, విధిచేష్టితాన్ని కూడా, తన చేతగానే (పనిగానే) భావించి ఆ కర్మఫలితంలో తగుల్కొంటాడు. ఆ తగుల్కొనటానికి అతడి అహంకారమే మూలం. అయితే అహంకారానికి లొంగని నరుడు మాత్రం విధిచేతను తనదిగా భావించడు కాబట్టి, అతడికి ఆ కర్మఫలితాన్ని త్రోసివేసే శక్తి ఉంటుంది. ఆ శక్తి అతడి అనహంకార శీలంవలన లభించింది.

విశేషం: ప్రహ్లాదుడి బోధన ప్రకారం చేష్టితాలు - కర్మలు అన్నీ విధి చేసేవే. అయితే అహంకారి నరుడు తనను కర్తగా భావించుకొని ఫలితాలూ అనుభవిస్తాడు. అనహంకారుడైన నరుడు మాత్రం తద్విరుద్ధంగా కర్తృత్వంతోపాటు ఫలితాన్ని త్రోసి రాజంటాడు.

క. **విను విధికృత్యము లూరక । కనుఁగొనుచును సిద్ధ్యసిద్ధికల్పిత సుఖదుః**
ఖ నిరూఢిఁ బొందకుండఁగ । మనముం దొలఁగించు వెరవు మహనీయ మగున్. **379**

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; విధి కృత్యములు= విధి (చేసే) పనులు; ఊరక= ఉపేక్షాభావంతో, పట్టించుకొనకుండా; కనుఁగొనుచును= చూస్తూ; సిద్ధి+అసిద్ధి కల్పిత సుఖదుఃఖ నిరూఢిన్= నెరవేరటం, నెరవేరకపోవటం వలన (కలిగే) సంతోష ఖేదాల గట్టిదనమును - ఆ సుఖదుఃఖాలను; పొందక+ఉండఁగన్= చెందకుండా ఉండేటట్లుగా; మనమున్= మనస్సును; తొలగించు వెరవు= ప్రక్కకు నెట్టు ఉపాయం; మహనీయము+అగున్= గొప్పది ఔతుంది.

తాత్పర్యం: కర్త విధి కాబట్టి, ఆ విధి చేసే కర్మలను ఉపేక్షాభావంతో ఊరకనే చూస్తూ ఉండాలి. ఆ కర్మలు సిద్ధించినపుడు సుఖాన్నీ, సిద్ధించనపుడు దుఃఖాన్నీ పొందకుండా ఉండటంకొరకు నరుడు తన మనస్సును విషయాలనుండి తొలగించే ఉపాయం కనుగొనాలి. ఆ విధమైన ఉపాయం గొప్పది.

క. **కావున భూతానిత్యత । భావించుట యెపుడుఁ గలిగి బంధచ్ఛేద**
ప్రావీణ్యము సంపరితో । షావహముగ నున్నవాఁడ నమరప్రవరా! **380**

ప్రతిపదార్థం: అమర ప్రవరా!= సురశ్రేష్ఠా! దేవేంద్రా!; కావున= కాబట్టి; మనస్సును విషయాల నుండి తొలగించేఉపాయం ఎరిగినవాడను కాబట్టి; ఎపుడున్= ఎల్లప్పుడూ; భూత+అనిత్యతన్= ప్రాణుల అశాశ్వతత్వాన్ని - నశించే స్వభావాన్ని; భావించుట= తలంచటం; కలిగి= ఉండి; బంధచ్ఛేద ప్రావీణ్యము= (భవ) బంధాలను ఛేదించే నేర్పు; సంపరితోష+ఆవహముగన్= మంచిదీ, అధికమైనదీ అయిన ఆనందాన్ని కలిగించేది కాగా; (ఆ నేర్పు కర్త) ఉన్నవాఁడన్= ఉన్నాను - జీవిస్తున్నాను.

తాత్పర్యం: ఓ దేవతల రాజా! నేను మనస్సులో ఎపుడూ సృష్టిలోని ప్రాణి సంఘాల అశాశ్వతత్వాన్ని భావిస్తూ ఉంటాను. ఆ భావన నాలో భవబంధాలను ఛేదించే నేర్పు కలిగించింది. ఆ నేర్పు నాలో నిరంతరమూ అపరిమితమూ అయిన ఆనందాన్ని ఆవిర్భవింపజేస్తూ ఉండగా, నేను ఇట్లా నిలిచి ఉన్నాను.

క. **దాంతుఁడుఁ బ్రజ్ఞావంతుఁడు । శాంతుఁడు నగువాని మానసం బాయాస**
శ్రాంతముగా దెమ్మెయి ని । శ్చింతుఁడనై యుండుదును విశిష్ట విచారా!' **381**

ప్రతిపదార్థం: విశిష్ట విచారా!= విశేషించిన ఆలోచనలు కలవాడా! సురేంద్రా!; దాంతుఁడున్= దమము కలవాడు(ఇంద్రియ నిగ్రహం కలవాడు); ప్రజ్ఞావంతుఁడున్= జ్ఞానం కలవాడు; శాంతుఁడున్= శాంతిని పొందినవాడు; అగువాని మానసంబు= అయిన నరుడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చిత్తం; ఏ+మెయిన్= ఏ విధంగానూ; ఆయాస శ్రాంతము+కాదు= శ్రమతో - పరితాపంతో అలసినది కాదు (కాగా); నిస్+చింతుఁడను+ఐ= చింతలు లేనివాడనై; ఉండుదును= ఉంటాను.

తాత్పర్యం: విశిష్ట ఆలోచనలు గల ఓ దేవతలరాజా! నరుడు దాంతి, శాంతి, ప్రజ్ఞ కలిగినవాడైనపుడు అతడి చిత్తం ఏ విధంగానూ ఆయాసంతో అలసిపోదు. నేను అట్టివాడను కాబట్టి ఈ విధంగా చింతారహితంగా ఉండగలుగుతున్నాను'.

క. అనవుడు ననిమిషపతి 'యే । యనువున నీ శాంతి నీకు నగపడియె మహా
జనపూజ్య!' చెప్పవే? నా । కని యడిగిన నిట్టులనియె నతఁ డాతనితోన్. 382

ప్రతిపదార్థం: అనవుడున్= అన్న తరువాత; అనిమిషపతి= రెప్పపాటులేనివారి (దేవతల) నేత - ఇంద్రుడు; ఏ+అనువునన్= ఏ ఉపాయంతో; ఈ శాంతి= ఈ విధమైన ప్రశాంతి; నీకున్+అగపడియెన్= నీకు కనిపించినది? - లభించినది?; మహాజనపూజ్య!= గొప్పజనంచేత పూజింప దగ్గవాడా! ప్రహ్లాదా!; నాకున్= అర్థించే నాకు; చెప్పవే;= తెలుపవా?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతఁడు= ఆ ప్రహ్లాదుడు; ఆతనితోన్= ఆ ఇంద్రుడితో; ఇట్టులు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: ప్రహ్లాదుడు తన నిశ్చింతతను నిరూపించి తెలుపగా విన్న దేవేంద్రుడు 'ఏ ఉపాయంతో నీకు ఈ ప్రశాంతి లభించింది? ఓ మహాజనపూజ్యా! ప్రహ్లాదా! అర్థినైన నాకు తెలుపవా?' అని వేడగా, ప్రహ్లాదుడు ఇంద్రుడితో ఇట్లా అన్నాడు.

తే. 'ఆర్జవంబు ప్రసన్నత యాత్మవత్త్వ । మప్రమాదంబు వృద్ధసేవాభినిరతి
మేలుసేయుఁ బ్రజ్ఞాశాంతిశాలి యగుట । కాలపాకంబుతోఁ దాన కలుగు ననఘ!' 383

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా! ఇంద్రుడా!; ఆర్జవంబు= ఋజుభావం - నిష్కాపట్యం; ప్రసన్నత= దయగలతనం; ఆత్మవత్త్వము= ఆత్మను కలిగిన తనం; అప్రమాదంబు= పరాకులేనితనం; వృద్ధసేవా+అభినిరతి= పెద్దలను సేవించుటలో మంచి ఆసక్తి - ఈ గుణాలు; మేలు+చేయున్= శ్రేయస్సును కలిగిస్తాయి; ప్రజ్ఞాశాంతిశాలి+అగుట= జ్ఞానంతో శాంతితో ప్రకాశించేవాడు కావటం; కాలపాకంబుతోన్= కాలం పరిపక్వం కావటంతో; తాను+అ= తానే - స్వయంగా; కలుగున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: 'నిష్కపట మైన ప్రవృత్తి, దయాగుణం, తాను శరీరంగాదు - ఆత్మను అనే భావం, పరాకులేకుండా జాగరూకతతో వ్యవహరించటం, పెద్దల పరిచర్యలలో నిజమైన ఆసక్తి - ఈ సద్గుణాలు నరుడికి శుభాన్ని కలిగిస్తాయి. ఇక జ్ఞానం, శాంతి అనేవి, కాలపరిపాకంతో క్రమంగా తమంత తామే నరుడిలో చోటుచేసికొంటాయి.

విశేషం: నరుడిలో జ్ఞానం, శాంతి సద్యోజాతాలుగా ఏర్పడేవిగావు. అవి కలగటానికి నిజంగా కాలపరిపాకమూ అవసరమే. ఆ రెండూ పరిణతమైన మానవలక్షణాలు. పరిణతి అనేది తప్పనిసరిగా కాలంతో ముడిపడి ఉన్నదే! తొందరపడితే కలిగేవి కావవి. పైగా ఒక విధంగా స్వయంభువులు - తమంతట తాము పొడచూపేవి.

క. అనిన విని విస్మయము నె । మ్మనమునఁ దలుకొత్తగా నమరపతి యభివం
దన మొనరించి పొగడుచుం । జనియె నిజావాసమునకు జగతీనాథా!' 384

ప్రతిపదార్థం: జగతీనాథా!= ఓ ధర్మరాజా!; అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; అమరపతి= దేవతలరాజు; నెఱు+మనమునన్= నిండుమనస్సునందు; విస్మయము= ఆశ్చర్యం; తళుకు+ఒత్తగాన్= మెరవగా, ప్రకాశించగా; అభివందనము+ఒనరించి= నమస్కారం చేసి; పొగడుచున్= స్తుతిస్తూ (ప్రహ్లాదుడిని); నిజ+ఆవాసమునకున్= తన నివాసానికి; చనియెన్= పోయాడు.

తాత్పర్యం: ఇంద్రుడు ప్రహ్లాదుడి ఆ ప్రవచనాన్ని ఆలకించి, మనస్సున విస్మయం పొడమగా, వినమ్రతతో అతడికి నమస్కరించి, తన నివాసానికి చేరాడు. ధర్మరాజా! ఇదీ ఇంద్రప్రహ్లాద సంవాదం'.

వ. **అని చెప్పిన విని యప్పాండవాగ్రజుండు 'భూపాలునకు లక్ష్మీభ్రంశం బేమిటఁ గలుగు?' ననుటయు నయ్యాపగా నందనుం డతని కిట్లనియె. 385**

ప్రతిపదార్థం: అని= పై విధంగా; చెప్పినన్= పలుకగా; విని= ఆలకించి; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ పాండవులలో పెద్దవాడు- ధర్మజుడు; భూపాలునకున్= రాజుకునకు; లక్ష్మీభ్రంశంబు= సిరి జారిపోవటం; ఏమిటన్= ఏ కారణాన; కలుగున్?= జరుగును?; అనుటయున్= అన్న పిదప; ఆ+ఆపగానందనుండు= ఆ నదీతనయుడు - భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇంద్రప్రహ్లాద సంవాదప్రకారాన్ని ఆలకించిన ధర్మరాజు పితామహుడితో 'రాజు సిరిని ఏ కారణాన కోల్పోతాడు?' అని ప్రశ్నించాడు. దానికి బదులుగా భీష్ముడు ధర్మజుడితో ఇట్లా పలికాడు.

తే. **'వాసవునకును బలికి సంవాద మనఘ! । కలిగె నయ్యితిహాసంబు గర్ణగోచ**
రంబు సేయుము నీ దగు ప్రశ్నమునకు । నుత్తరం బిది సెప్పెదఁ జిత్తమలర. 386

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పాపరహితుడా!; వాసవునకును= ఇంద్రుడికీ; బలికిన్= బలిచక్రవర్తికీ; సంవాదము= సంభాషణం; కలిగెన్= ఏర్పడింది; ఆ+ఇతిహాసంబు= ఆ వృత్తాంతం; కర్ణగోచరంబు+చేయుము= (నీ) చెవిని పడేటట్లు చేయుము; నీది+అగు= నీయొక్క; ప్రశ్నమునకున్= ప్రశ్నకు; అది= ఆ ఇంద్ర బలిసంవాదం; ఉత్తరంబు= సమాధానం; చిత్తము= మనస్సు; అలరన్= సంతోషించగా; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: 'మున్ను దేవేంద్రుడికి బలిచక్రవర్తికీ సంవాద మొకటి జరిగింది. ఆ సంవాదప్రకారాన్ని నీవు ఆలకించుము. అది నీ ప్రశ్నకు సమాధానంగా సరిపోతుంది. నేను నీ మనస్సు సంతోషించే విధంగా ఆ వృత్తాంతాన్ని వినిపిస్తాను.

సీ. **ఇంద్రుఁ డబ్జజు కడ కేతెంచి వినతుఁడై । 'బలి మహాసంపద వెలుఁగుచుండె;**
నితని నిప్పుడు గాన; మాతఁ డెచ్చో నున్న । వాఁడొకో!' యనుడు నవ్వారిజాస
నుండు 'నీతలఁ పొప్పకుండుట యెఱిఁగితి; । నైనను జెప్పెద నన్నృతవాది
గాకుండుమీ యుష్ట్రఖర గోహయంబుల । యందులో నొక్కటి చంద మొంది

తే. **యడఁగి యున్నాడు వధియించు టనుచితంబు । వాని నని పల్కె నటు సేయువాఁడఁ' గాను**
మాటవెట్టుదుఁ గన్నచో మాననీయ । వాక్య'యని వీడుకొనియె నవ్వాసవుండు. 387

ప్రతిపదార్థం: ఇంద్రుఁడు= దేవతలరాజు; అబ్జజుకడకున్= బ్రహ్మదేవుడి దగ్గరకు; ఏతెంచి= వచ్చి; వినతుఁడు+ఐ= నమస్కరించినవాడై; బలి= బలిచక్రవర్తి; మహాసంపదన్= గొప్ప సంపత్తితో; వెలుఁగుచున్+ఉండెన్= ప్రకాశిస్తూ ఉన్నాడు; ఇతనినిన్= ఈ బలిని; ఇప్పుడు= ఈ దినాలలో; కానము= చూడము; ఆతఁడు= ఆ బలి; ఎచ్చోన్= ఏ చోట; ఉన్నవాఁడు+ఒకో!= ఉన్నాడో కదా!; అనుడున్= అన్న తరువాత; ఆ+వారిజాసనుండు= ఆ పద్మాసనుడు - బ్రహ్మ; నీ తలఁపు= నీ ఆలోచన; ఒప్పక+ఉండుట= తగక ఉండటం; ఎఱిఁగితిన్= గ్రహించాను; ఐనను= అయినా - గ్రహించినా; చెప్పెదన్= తెలుపుతాను; న+ఋతవాది= అసత్యం పలికేవాడు; కాక+ఉండుము+ఈ= కాకుండా నిలువుము; ఉష్ట్రఖర గోహయంబుల అందులోన్= ఒంటె, గాడిద, ఆవు, గుర్రముల లోపల; ఒక్కటి చందము= ఒక్కదాని విధం (ఆకారం); ఒంది= పొంది; అడఁగి+ఉన్నాడు= దాగి ఉన్నాడు; వానిన్= అతడిని; వధియించుట= చంపటం; న+ఉచితము= తగినది కాదు; అని పల్కెన్= అని చెప్పాడు; అటు= ఆ విధంగా; చేయువాఁడన్+కాను= చేసేవాడను కాను; మాననీయవాక్య!= గౌరవించవలసిన మాటగలవాడా!; కన్నచోన్= (బలిని)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చూస్తే; మాట+పెట్టుదున్= మాట ఇత్తును - భాషణం చేస్తాను; అని= అని పలికి; ఆ+వాసవుండు= ఆ ఇంద్రుడు; వీడుకొనియెన్= విడిచిపోయాడు.

తాత్పర్యం: దేవేంద్రుడు బ్రహ్మదేవుడివద్దకు చేరి, నమస్కరించి, 'బలి మహాసంపదతో వెలుగుతూ ఉండేవాడు. ఇపుడు అతడు కనిపించడేమిటి? ఎక్కడ ఉన్నాడో కదా!' అని ప్రశ్నించాడు. దానికి బదులుగా బ్రహ్మ, 'నీ ఆలోచన అనుచితంగా ఉన్నదని నేను గ్రహించాను. అయినా నీకు చెప్పుతాను. అయితే నీవు మాత్రం అసత్యవాదివి కాకుమీ, ఒంటె, గాడిద, ఆవు, గుర్రములలో ఏదో ఒక దాని ఆకారం పొంది అతడు ఇపుడు దాగి ఉంటున్నాడు. అట్టి అతడిని చంపుట తగనిపని' అని పలికాడు. ఇంద్రుడు తాను ఆ విధంగా చేసేవాడను కానని పలుకుతూ, 'ఓ మన్నించదగ్గ మాటలు గల దేవా! నేను బలిని చూస్తే భాషణం మాత్రం చేస్తాను' అని పలికి వీడ్కొనినాడు.

వ. వీడ్కొని చని జగతిం జరియించి యొక్కచోట ఖరరూపంబున సంప్రీతుం డయి యున్న యబ్బలిం గని బలారాతి యిట్లనియె. 388

ప్రతిపదార్థం: వీడ్కొని= వీడ్కోలు పలికి; చని= వెళ్ళి; జగతిన్= లోకాన; చరియించి= తిరిగి; ఒక్కచోటన్= ఒక స్థలాన; ఖరరూపంబునన్= గాడిద ఆకారంతో; సంప్రీతుండు+అయి= బాగుగా సంతసించినవాడై; ఉన్న+ఆ+బలిన్= ఉండిన ఆ బలిచక్రవర్తిని; కని= చూచి; బల+ఆరాతి= ఇంద్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ ఇంద్రుడు వెదకగా ఒకచోట గాడిద రూపంలో సంతుష్టుడైన బలి కనిపించాడు. ఆ బలితో ఇంద్రుడు ఇట్లా అన్నాడు.

ఇంద్ర బలిచక్రవర్తి సంవాదప్రకారము (సం. 12-216-2)

క. 'ఏనుఁగులు సుట్టిరాఁ బే । రేనుఁగుపై మణిమయంపుటెల్లులు మెఱయం
గా నీ వే తెంతువు మముఁ । గానికిఁ గొన వప్పు డిపుడు గాడిదవైతే! 389

ప్రతిపదార్థం: ఏనుఁగులు= పట్టపుటేనుగులు; చుట్టిరాన్= చుట్టూ చేరిరాగా; పేరు+ఏనుఁగుపైన్= పెద్ద ఏనుగుమీద; మణిమయము+ఎల్లులు= మణులతో నిండిన గొడుగులు; మెఱయంగాన్= ప్రకాశించగా; అప్పుడు= నీవు రాజ్య మేలినప్పుడు; నీవు= చక్రవర్తివైన నీవు; ఏతెంతువు= వచ్చెదవు - వస్తూ ఉంటివి; మమున్= దేవతలమైన మమ్ము; కానికిన్= కానీకి కూడా- అత్యల్పమైన నాణెమునకు సమానంగా కూడా; కొనవు= గ్రహించవు; ఇపుడు= ఈ సమయాన; గాడిదవు+ఐతి(వి)+ఏ!= గాడిదవుగా అయ్యావా!

తాత్పర్యం: 'ఓ బలిచక్రవర్తీ! ఒకనాడు నీవు చుట్టూ పట్టపుటేనుగులు రాగా, ఒక మహాగజము నధిరోహించి, మణిమయ ఛత్రచామరాలు వెలుగులు చిమ్ముతూ ఉండగా ఏతెంచేవాడవు. ఆనాడు దేవలోకనివాసులమైన మేము నీకు 'కానీ' కి కొరగాలేదు. అట్టి ఉజ్జ్వలమైన భూతకాలవైభవంగల నీవు ఈనాడు ఈవిధంగా గాడిదగా అయి ఉన్నావా!

క. కనకమయయూప మొప్పఁగ । ననూన విభవమున నీవు యాగం బొనరిం
చిన యొప్పును నిప్పటి నీ । యునికియునుం జూచి నాకు నుమ్మల మయ్యెన్. 390

ప్రతిపదార్థం: నీవు= బలిచక్రవర్తివైన నీవు; కనకమయ యూపము= బంగారపు కట్టుగొయ్య (యజ్ఞసమయాన పశువును కట్టివేసే కొయ్యపేరు యూపము); ఒప్పఁగన్= ప్రకాశించగా; న+ఊన విభవమునన్= అల్పంగాని గొప్పదైన సంపదతో; యాగంబు= యజ్ఞం; ఒనరించిన+ఒప్పును= చేసిన గొప్పదనమును; ఇప్పటి నీ+ఉనికియునున్= ఈ నాటి నీ స్థితినీ; చూచి= (కన్నులారా) కాంచి; నాకున్= దేవతల రాజైన నాకు; ఉమ్మలము+అయ్యెన్= సంతాపము కలిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆనాడు చక్రవర్తిగా నీవు బంగారు యూపస్తంభంతో గొప్పవైభవం వ్యక్తం కాగా యజ్ఞం నిర్వహించిన ఉజ్జ్వల సంఘటననూ, ఇప్పటి నీ శోచనీయమైన స్థితినీ చూచి నాకు శోకం కలుగుతున్నది.

విశేషం: నరు డెవడైనా, ఒకడి జీవనంలోనే ఊహకందని గొప్ప వ్యత్యాసాలను చూడటం తటస్థిస్తే, అతడిలో భావోద్వేగం సానుభూతి రూపాన తప్పక వ్యక్తమై తీరుతుంది. గౌతమ బుద్ధుడి జీవనంలోని పెద్ద వ్యత్యాసాలే అతడియెడ లోకానికి మొదట కలిగిన అనంత సానుభూతికీ, అనంతర కాలాన ఏర్పడిన ఆదరాభిమానాలకూ మూలమని అనటంలో ఔచిత్యమున్నది.

ఆ. **ఉముక దినుచు నిట్టులుండి నీ తొల్లింటి । లీలఁ దలఁచి యుమ్మలింతొ? లేదొ?**
యున్నరూపు సెప్ప వన్న! గార్దభరూప । దారుణైకనిపుణ! దానవేంద్ర! **391**

ప్రతిపదార్థం: గార్దభరూప దారుణ+ఏక నిపుణ!= గాడిద ఆకారంతో భయంకరుడవైన ఒక్క నేర్పరీ! (ఇతరు లెవరూ ఇంతటి స్థితికి చేరినవారు లేరనుట); దానవ+ఇంద్ర!= రాక్షసుల రాజా! ఓ బలిచక్రవర్తీ!; ఉముక= ఊక - వడ్లమీది పొట్టు; తినుచున్= తింటూ; ఇట్టులు+ఉండి= ఈ విధంగా నీచంగా ఉండి; నీ తొల్లింటి లీలన్= నీ యొక్క పూర్వ వైభవాన్ని; తలఁచి= స్మరించి; ఉమ్మలింతు+ఒ?= శోకిస్తావా?; లేదు+ఒ?= లేదో? - శోకించవో?; ఉన్నరూపు= ఉన్న వాస్తవం - నిజం; చెప్పవు+అన్న= తెలియజేయవయ్యా!.

తాత్పర్యం: గాడిద రూపంతో దారుణంగా కనిపించే ఒకే ఒక్క నేర్పరీ! రాక్షసరాజా! నేడు ఊక తింటూ జీవిస్తున్న నీవు, నీ తొల్లిటి వైభవాన్ని తలచుకొని శోకిస్తూ ఉంటావా? ఉండవా? ఉన్న వాస్తవం యథార్థంగా చెప్పవయ్యా!'

విశేషం: బలిని సంబోధించిన తీరు గమనించవలసి ఉన్నది. 'గార్దభరూపదారుణ' - ఇంతవరకు సామాన్యమే. తరువాతి పదమే విలక్షణము - 'ఏకనిపుణ!' - బలికి ఆధ్యాత్మవిద్యావేత్తలలో పెద్ద పీట ఉన్న వైనాన్ని సూచిస్తున్న దీ పదం.

సీ. **అన విని బలి దేవతాధీశుతో 'నీకు । నా విభవంబు గానంగ రాదు;**
గుప్తమై యున్నది గుహయందు; నా కిచ్చ । వుట్టిన నిప్పుడ పొలిచి తోఁచు;
నది యటులుండె; నీ వధికుండ వల్పుల । యెదుర రజ్జులు వల్కుటేటి పెంపు?
పొమ్ము దుశ్చ్యవన! నీ పోయెడు తెరు' వన్న । నాతండు నవ్వుచు నతనిఁ జూచి

ఆ. **మున్ను పల్కినట్ల కన్నోటలేక ప । ల్కుటయు, నతఁడు 'భూతకోటి మంచు**
వోలెఁ దోఁచు విరియు; బుద్ధిమంతులు దాని । కిచ్చ వగవ; రింత యెఱుఁగ వెట్లు?' **392**

ప్రతిపదార్థం: అనన్+విని= అనగా విని; బలి= బలిచక్రవర్తి; దేవతా+అధి+ఈశుతోన్= దేవతల అధిపతితో - ఇంద్రుడితో; నీకున్= దేవేంద్రుడవైన నీకు; నా విభవంబు= నా సంపద; కానంగన్+రాదు= చూడరాదు - అగుపడదు; గుహయందున్= కొండబిలమునందు; గుప్తము+ఐ= దాచబడ్డదై; ఉన్నది= కలదు; నాకున్+ఇచ్చ+పుట్టినన్= నాకు కోర్కె కలిగినప్పుడు; ఇప్పుడు+అ= ఇప్పుడే; పొలిచి= సమీపించి; తోఁచున్= అగుపిస్తుంది; అది= ఆ విషయం-నా సంపద విషయం; అటుల+ఉండెన్= అట్లుండనీ - ఆ ప్రక్కన ఉండనిమ్ము; నీవు+అధికుండవు= నీవు పెద్దవాడవు; అల్పుల+ఎదురన్= పిన్నల - చిన్నవారి ఎదుట; రజ్జులు+పల్కుట= వ్యర్థభాషణములు ఆడుట; ఏటి పెంపు?= ఏ విధమైన పెద్దరికం?; దుశ్చ్యవన= ఓ ఇంద్రుడా!; నీ పోయెడు తెరువు= నీవు వెళ్ళేదారిన; పొమ్ము= వెడలుము; అన్నన్= అనగా; ఆతండు= ఆ ఇంద్రుడు; నవ్వుచున్= నవ్వుతూ; అతనిన్+చూచి= ఆ బలిని చూచి; మున్ను= ముందు; పలికినట్లు+అ= అన్న విధంగానే; కన్నోట లేక= జంకులేకుండా; పల్కుటయున్= (అనుట జరిగిన) అన్న తరువాత; అతండు= ఆ బలి; భూతకోటి= ప్రాణి సమూహము; మంచు+పోలెన్= మంచువలె; తోఁచున్= కనిపించును; విరియున్= తొలగును - నశించును; బుద్ధిమంతులు= తెలివిగలవారు; దానికిన్= ఆ ప్రాణికోటి పుట్టి చచ్చుటకు; ఇచ్చన్+వగవరు= మదిలో శోకించరు; ఇంత= ఈ మాత్రము; ఎట్లు ఎఱుఁగవు= ఏల గ్రహించవు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఇంద్రుని ప్రశ్న విన్న బలి 'దేవేంద్రా! నీకు నా విభవం కనిపించదు. కొండగుహలో దాచబడి ఉన్నది. నాకు కోర్కెగల్గినప్పుడే కనిపిస్తుంది. సరి అది అట్లా ఉండనిమ్ము, నీవు గొప్పవాడవు. అల్పుల దగ్గర వ్యర్థభాషణాలు చేయటం ఏమి గొప్పతనం? నీవు వెళ్ళవలసిన దారిలో వెళ్ళిపొమ్ము' అన్నాడు. మొదట బలి ఇంద్రుడి ప్రశ్నను లక్ష్యపెట్టకుండా సమాధానం చెప్పాడు. అయితే ఇంద్రుడు బలిని వదలలేదు. అతడు నవ్వుతూ బలిని చూచి, పూర్వం ప్రశ్నించినట్లే మళ్ళీ ఏ జంకూ లేకుండా ప్రశ్నించాడు. అపుడు బలి 'ఈ కనిపించే ప్రాణికోటి అంతా మంచువలె కనిపిస్తుంది. మంచువలెనే తొలగిపోతుంది. బుద్ధిమంతులైన నరులు ప్రాణికోటి చావు పుట్టుకలకొరకు శోకించరు. ఈ మాత్రం ఎరుగ వేమిటి?' అన్నాడు.

విశేషం: ఇక్కడ బలి బుద్ధిమంతుడు. అతడు ఇంద్రుడి తొలిమాటలు వ్యర్థభాషితాలుగా తోచగా ఉబుసుపోక కోపం ఆడిన పల్కులుగా తలచి, పట్టించుకోలేదు. అందుకనే ఇంద్రుడిని తనదారిన తనను పొమ్మన్నాడు. అయితే ఇంద్రుడు నిశ్చలంగా నిలిచి నవ్వుతూ మళ్ళీ అదే ప్రశ్నవేసేసరికి, అతడి జిజ్ఞాస (తెలిసికొనాలనే కోరిక) మీద బలికి విశ్వాసమేర్పడి, సమాధానం చెప్పటం ప్రారంభించాడు. దుశ్చ్యవనుఁడు= ఇంద్రుఁడు; తన వజ్రాయుధమునకు సాధ్యుఁడు కాని చ్యవనముని వంటివాఁడు.

వ. అని వెండియు విరోచననందనుండు. 393

ప్రతిపదార్థం: అని= అని పలికి; విరోచన నందనుండు= విరోచనుడి కొడుకైన బలి; వెండియున్= మరలా ఇట్లా అంటున్నాడు.

తాత్పర్యం: అని బలి మరలా (ఈ విధంగా కొనసాగించాడు.) (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పొరి నర్థంబు ననర్థము । మరణము జీవితము సుఖ సమాగమమును దు
స్తర దుఃఖసంగమంబును । దొరకొన నే నెపుడు సమత తోడన నిలుతున్. 394

ప్రతిపదార్థం: పొరిన్= క్రమంగా; అర్థంబున్= ధనం; అనర్థము= కీడు; మరణము= చావు; జీవితము= బ్రదుకు; సుఖసమ్+ఆగమమును= సుఖం బాగుగా రావటం; దుస్+తర దుఃఖ సంగమంబును= దాటరాని (దుఃఖంతో దాటవలసిన) దుఃఖం యొక్క కూడికా; దొరకొనన్= కలుగగా; నేను= బలిని అయిన నేను; ఎపుడున్= సదా ఎల్లవేళలా - సుఖంలో దుఃఖంలో, జీవితంలో, మరణంలో, అర్థంలో, అనర్థంలో; సమతతోడన్+అ= సమభావంతోనే; నిలుతున్= నిలుస్తాను.

తాత్పర్యం: దేవేంద్రా! లోకాన క్రమంగా ప్రాణికోటికి మేలు కీళ్ళు, బ్రదుకులు చావులు, సుఖానుభవాలు, దుఃఖపీడనలు వచ్చి పడుతూ ఉంటాయి. నేను మాత్రం ఎప్పుడూ మేలు జరిగినా, కీడు వాటిల్లినా, సుఖం కలిగినా, దుఃఖం పైకొన్నా, సమభావంతో నిలిచి ఉంటాను. నా మీద ఆ మేలుకీడుల ప్రభావ మేదీ ప్రసరించదు.

చ. బలమును నొప్పు బుద్ధియును బ్రౌఢతయుం గలవారు లేనివా
ర లనక యొక్కభంగిఁ దఱి రాకయ చూచి హరించుచుండు వి
చ్చలవిడిఁ గాలుఁ; డట్లగుట సారమతిం గని యున్నవాఁడ; ను
మ్మలికయు నుబ్బు నాదుమది మందున కైనను లేదు వాసవా! 395

ప్రతిపదార్థం: వాసవా!= ఇంద్రా!; కాలుఁడు= యమధర్మరాజు; బలమును= శరీర బలమూ; ఒప్పు బుద్ధియును= తీరైన తెలివీ; ప్రౌఢతయున్= ప్రాగల్భ్యమూ, సమర్థతా; కలవారు= ఉన్నవారు - ఈ గుణాలన్నీ ఉన్నవారు; లేనివారలు= ఉండనివారు; అనక= అనకుండా; ఒక్కభంగిన్= ఒకే విధంగా; తఱిరాక+అ= సమయం, కాలం వచ్చుటయే - పోగాలం సమీపించుటే; చూచి= గమనించి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విచ్చలవిడిన్= స్వేచ్ఛగా - అడ్డూ ఆపూ లేకుండా; హరించుచున్+ఉండున్= సంహరిస్తూ ఉంటాడు; అట్లు+అగుటన్= ఆ విధంగా జరుగుటను; సారమతిన్= గట్టి బుద్ధితో; కని+ఉన్నవాఁడన్= చూచి ఉన్నాను; నాదు మదిన్= నా మనస్సునందు; ఉమ్మలికయున్= దుఃఖమును; ఉబ్బును= సంతోషమును; మందునకున్+ఐనను= మందుకోసం కూడా - కొంచెం కూడా; లేదు= ఉండదు;

తాత్పర్యం: ఇంద్రా! లోకాన నరులలో శరీరబలం, బుద్ధి, వివేకం, పనులలో ఎంతో సామర్థ్యం కలవారున్నారు. అవి ఏవీ లేనివారూ పుష్కలంగానే ఉన్నారు. కాని కాలుడు మాత్రం కాలం సమీపించినప్పుడు ఆ ఇరుతెగలవారినీ స్వేచ్ఛగా తిరుగులేకుండా హరించివేస్తూనే ఉన్నాడు. కాలుడి దగ్గర బలవివేకసామర్థ్యాలేవీ కొరగావటంలేదు. అట్లా జరగడాన్ని నేను గట్టి తెలివితో గమనించి ఉన్నాను. కాబట్టి నా చిత్తాన ఉమ్మలిక ఉండదు. ఉబ్బూ ఉండదు- ఏ కొంచెంగానైనా.

ఉ. గాడిద రూపు దాల్చి యుముకల్ దినుచుండఁగఁ జూచి యుల్లసం
బాడెదు శక్ర! శాంతిసమయం బగుటన్ వినుమింకఁ గొన్ని నీ
వాడిన నాదు చిత్తమున నల్క యొకింతయుఁ బుట్ట దిట్లు నీ
వాడితె మున్ను? ని న్నెఱుఁగనా? వలదా నను నీ వెఱుంగఁగన్? 396

ప్రతిపదార్థం: శక్ర!= దేవేంద్రా!; గాడిదరూపు+తాల్చి= గార్దభ ఆకారం ధరించి; ఉముకల్= ఊకలు; తినుచున్+ఉండఁగన్= తింటూ ఉండగా; చూచి= కనుగొని; ఉల్లసంబు+ఆడెదు= పరిహాసం పల్కుతావు; వినుము= ఆలకించుము; శాంతి సమయంబు+అగుటన్= సత్త్వరజస్తమోగుణాలు శాంతించిన కాలం కాబట్టి; నీవు= పరిహసించే నీవు; ఇంకన్+కొన్ని ఆడినన్= ఇంకా కొన్ని పరిహాసాలు - ఎకసక్కెములు పలికినా; నాదు చిత్తమునన్= నా మనస్సున; అల్క+ఒక+ఇంతయున్= కోపం కొంచెం కూడా; పుట్టదు= కలుగదు; మున్ను= పూర్వం, నేను ఏలే సమయాన; నీవు= ఇంద్రుడవైన నీవు; ఇట్లు= ఈ విధంగా పరిహాసంగా; ఆడితి(వి)+ఎ?= పలికితివా?; నిన్నున్+ఎఱుఁగనా?= దేవతల రాజువైన నిన్ను ఎరుగనా!; నన్నున్= బలిచక్రవర్తినైన నన్ను నీవు; ఎఱుఁగన్+వలదా?= ఎరుగవద్దా?

తాత్పర్యం: ఇంద్రా! ఇపుడు గార్దభాకారం ధరించి ఊక మేస్తున్న నన్ను చూచి, ఎకసక్కెములు ఆడుతున్నావు. త్రిగుణాలు శాంతించి ఉన్నవాడను కాబట్టి, నీవు ఇంకా మరికొన్ని పరిహాసాలు పలికినా నా చిత్తాన అలుక అంకురించదు. ముందు నేను చక్రవర్తిగా లోకమేలేటప్పుడు నీవు నాతో ఇట్లా పలికావా? నిన్ను నేను ఎరుగనా? మరి, నీవూ నన్ను ఎరిగి ప్రవర్తించవద్దా?

క. ఎలమియు వాడుటయును దన । వలచిన యట్టివె యెఱుంగవా? విధి చరితం
బులు బలవంతంబు లగుట । వలదె? వివేకంబు పెద్దవారికి నింద్రా! 397

ప్రతిపదార్థం: ఇంద్రా!దేవేంద్రా!; ఎలమియున్= వికాసమూ - వృద్ధీ; వాడుటయును= వినాశమూ; తన వలచిన+అట్టివె?= తాను (విధి) అనుకొన్న కోరిన అటువంటివే?; విధి చరితంబులు= విధియొక్క నడతలు; ఎఱుంగవా?= తెలియవా? గ్రహించలేవా?; బలవంతంబులు= బలము గలిగినవి (విధి చరితములు); అగుటన్= కాగా, అందువలన; పెద్దవారికిన్= పెద్దలైన వారికి (నీ వంటివారికి); వివేకంబు= మంచిచెడు గ్రహించే తెలివి; వలదె?= వద్దా? ఉండవద్దా?

తాత్పర్యం: ఓ దేవతల రాజా! విధి కోర్కెనుబట్టి ప్రాణుల జీవితాలలో వికాసంగాని, వినాశంగాని జరుగుతుంటుంది. విధి చేష్టలు బలీయాలు. ఆ విషయం నీ వెరుగవా! పెద్దవారికి వివేకం - మంచిచెడు వింగడించి చూచే తెలివి ఉండవద్దా?

క. ఇటు గర్వించుట నీచత; । యెట వోయెదొ పొమ్ము; మానుమీ వలవని త్రు
ళ్ళుట; వజ్రము నీవును బిడి । కిటి తాఁకున నొఁగు దేను కినిసితినేనిన్. 398

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇటు= ఈ విధంగా; గర్వించుట= గర్వం వహించటం; నీచత= నైచ్యం - నీచుడి స్వభావం; ఎట= ఎక్కడకు; పోయెదో= పోతావో; పొమ్ము= వెడలుము; వలవని త్రుళ్ళుట= కూడని మిడిసిపాటు; మానుమీ= మానుకొనుము; ఏను= నేను; కినిసితిని+ఏనిన్= అలిగితినా; కోపగించితినా; వజ్రము= నీ వజ్రాయుధం; నీవును= నీవుకూడా; పిడికిటి తాఁకునన్= (నా) చేతి పిడికిలియొక్క దెబ్బకు; ఒఱగుదు= పడతావు.

తాత్పర్యం: ఇతరుల దైన్యాన్నిచూచి ఎకసక్కెములాడటం నీచస్వభావం. నీవు ఎటుపోతున్నావో పొమ్ము. ఈ తగని మిడిసిపాటు మానుకొమ్ము. నేను కోపగించానంటే, నీవూ నీ వజ్రాయుధమూ నా చేతి పిడికిటి వేటుకే నేలకు ఒరిగి పోవలసివస్తుంది.

క. ఇది మేలపు మాట సుమీ! । మది నుద్ధతి లేదు నాకు; మహితాశ్చర్యా
స్పదమగు విధాతృ చెయ్దిం । దుది నీవును దుస్సుపోదు; త్రుళ్ళు టుడుగుమీ. 399

ప్రతిపదార్థం: ఇది= ఈ చివరిమాట; మేలము+మాటచుమీ!= పరిహాసపు పలుకు సుమా!; నాకున్= స్థిరప్రజ్ఞుడనైన నాకు; మదిన్= చిత్తమునందు; ఉద్ధతి లేదు= పొగరు ఉండదు; మహిత+ఆశ్చర్య+ఆస్పదము+అగు= గొప్పదీ ఆశ్చర్యానికి స్థానమైనదీ అయిన; విధాతృ చెయ్దిన్= విధియొక్క చేత (పని) వలన; తుదిన్= చివరకు; నీవును= దేవరాజువైన నీవు కూడా; తుస్సు+పోదు= భంగపడతావు; (కాబట్టి) త్రుళ్ళుట= మిడిసిపడటం; ఉడుగుమీ!= మానుము!

తాత్పర్యం: (బలి ప్రసంగంలో 'నేను కినిసితినేనిన్ నీవును వజ్రము పిడికిటి తాఁకున నొఱగుదు' అని ఒక మాట పల్కి ఉన్నాడు. అది నిజానికి ఔద్ధత్యాన్ని తెలియజేసే పలుకు. కాబట్టి ఆ మాటను తాను వాస్తవార్థంలో వాడలేదన్నాడు) ఇది పరిహాసవచనం మాత్రమే! నాకు చిత్తాన అహంకారం లేదు. గొప్ప అచ్చెరువుకు ఆస్పదమైన విధాత చేతలకు ఎవరూ అతీతులుగారు. చివరకు నీవు కూడా విధిచేతిలో భంగపడతావు. కాబట్టి త్రుళ్ళిపడటం మానుకొమ్ము.

వ. శాంతుఁడ వగు' మని పలికె; నట్టియెడ నవ్విరోచన నందను శరీరంబున నుండి సురూపయు సుగౌరయు నగు నొక్కమగువ నిర్గమించినం గని కౌశికుండు విస్మయ వికసితాక్షుం డగుచు నతనితో 'నివ్వనిత యెవ్వత?'యనిన నాతం 'డే నెఱుంగ నీవ యీ యమ నడుగు' మనుటయు నయ్యనిమిషపతి యమ్ముద్దియ మొగంబు గనుంగొని 'మాకు నిన్నెఱింగింపు' మనవుడు నద్దేవి యతనితోడ. 400

ప్రతిపదార్థం: శాంతుఁడవు+అగుము= శాంతించినవాడవు కమ్ము; అని పలికెన్= అని చెప్పాడు; అట్టి+ఎడన్= ఆ సమయాన; ఆ+విరోచన నందను శరీరంబున నుండి= ఆ విరోచనుడి కుమారుడైన బలియొక్క దేహంనుండి; సురూపయున్= మంచి ఆకారం కలిగినదీ; సుగౌరయున్= మంచి తెల్లనైనదియు; అగు+ఒక్క మగువ= అయిన ఒక వనిత; నిర్గమించినన్= బయటకు వెడలగా; కని= చూచి; కౌశికుండు= ఇంద్రుడు; విస్మయవికసిత+అక్షుండు+అగుచున్= అచ్చెరువుతో విప్పారిన కన్నులు గలవాడు అవుతూ; అతనితోన్= ఆ బలితో; ఈ+వనిత= ఈ స్త్రీ; ఎవ్వత?= ఎవరు?; అనినన్= అనగా; ఆతండు= ఆ బలి; ఏను+ఎఱుంగన్= నేను ఎరుగను; నీవు+అ= నీవే; ఈ+అమన్= ఈ అమ్మను, వనితను; అడుగుము= ప్రశ్నించుము; అనుటయున్= అన్న తరువాత; ఆ+అనిమిషపతి= ఆ దేవతలరాజు; ఆ+ముద్దియ మొగంబు= ఆ ముద్దరాలి ముఖం; కనుంగొని= చూచి; మాకున్= ఇంద్రదేవులమైన మాకు (రాచరికపు బహువచనం); నిన్నున్+ఎఱింగింపుము= నిన్ను తెలియపరచికొనుము; అనవుడున్= అన్న పిదప; ఆ+దేవి= ఆ దేవత; అతనితోడన్= ఆ ఇంద్రుడితో.

తాత్పర్యం: శాంతిని వహించుము ఇంద్రా!' అని బలి పలికాడు. ఆ సమయాన ఆ రాక్షసరాజు శరీరంనుండి ఒక వనిత మంచి ఆకారంతో, మంచి తెల్లదనంతో ప్రకాశిస్తూ బయటకు వెడలినది. ఆ దృశ్యం చూచిన ఇంద్రదేవుడు

అచ్చెరువుతో కన్నులు పెద్దవి కాగా, బలితో 'ఎవ్వరీమె?' అని ప్రశ్నించాడు. బలి తనకూ తెలియదంటూ 'నీవే ఈ వనితను అడిగి తెలిసికొ'మ్మన్నాడు. ఇంద్రుడు ఆ ముద్దరాలి మొగం చూచి 'మాకు నిన్ను ఎరిగించుకొ' మ్మని పలికాడు. దానికి బదులుగా ఆ దేవత ఆ ఇంద్రదేవుడితో.

విశేషం: లోక వ్యవహారాన 'అతడికి దశ తిరిగింది. ఇతడికి మహర్దశ వదలింది' వంటి మాటలు వింటూ ఉంటాం. ఆ మాటలలోని దశలు జ్యోతిష శాస్త్రాన్నిబట్టి లెక్కించి చెప్పేవి గావచ్చును. ఊరకే మనిషి స్థితిగతులను చూచి పలికేవీ కావచ్చును. ఇక్కడ బలి దశ మారింది. ఆ మార్పును భౌతికంగా సంభవిస్తున్నట్లుగా చిత్రిస్తూ వ్యాఖ్యానిస్తున్నాడు భారతకర్త. నరుడిలో సిరి ప్రవేశించటం నిర్గమించటం జరుగుతున్నట్లుగా నిరూపిస్తున్నాడు. ధర్మజుడి ప్రశ్న ఈ అంశానికి చెందినదే.

క. 'శ్రీయును భూతియు లక్ష్మియు । నా యభిధానములు మీరు న న్నెఱుఁగమి పె
ద్దే? యింద్ర! యెజ్జగంబుల । నే యుగములయందు నెఱుఁగ రెవ్వరు ననినన్.' 401

ప్రతిపదార్థం: ఇంద్ర!= ఓ ఇంద్రదేవా!; శ్రీయును= శ్రీ అనేదీ; భూతియును= భూతి అనేదీ; లక్ష్మియున్= లక్ష్మి అనేదీ; నా+అభిధానములు= నా పేరులు; మీరు= ఇంద్రబలులు - మీరు ఇరువురు; నన్నున్+ఎఱుఁగమి= నన్ను గ్రహించలేకపోవటం; పెద్ద+ఏ?= ఆశ్చర్యమా? (కాదు); ఏ+జగంబులన్= ఏ లోకాలలోనైనా; ఏ యుగములయందున్= ఏ యుగాలలోనైనా; ఎవ్వరున్= ఎట్టివారూ; ఎఱుఁగరు= తెలియరు; అనినన్= అనగా.

తాత్పర్యం: 'ఓ ఇంద్రదేవా! నా పేరులు మూడున్నాయి - శ్రీ, భూతి, లక్ష్మి అని. ఇక మీరు (ఇంద్రబలులు) ఇద్దరూ నన్ను ఎరుగకపోవటం విచిత్ర మేమీ కాదు. ఏ లోకాలలోనూ, ఏ యుగాలలోనూ, ఏ ఒక్కరూ నన్ను ఎరుగరు' అన్నది ఆ దేవి.

క. అనవుడు నతండు 'నీ వీ । దనుజేశ్వరుఁ బాయుటకుఁ గతం బేమి యొకో!'
యనిన విని లక్ష్మి 'సత్యం । బును ధర్మము దమము దానమును నా యిక్కల్. 402

ప్రతిపదార్థం: అనవుడున్= అన్న వెంటనే; అతండు= ఆ ఇంద్రుడు; నీవు+ఈ దనుజ+ఈశ్వరున్= నీవు ఈ రాక్షసరాజును; పాయుటకున్= విడుచుటకు; కతంబు+ఏమి+ఒకో!= కారణం ఏమిటో కదా!; అనినన్= అనగా; విని= ఆలకించి; లక్ష్మి= లక్ష్మీదేవి; సత్యంబును= నిజమూ; ధర్మము= న్యాయం - పుణ్యం; దమము= నిగ్రహం; దానమును= ఇచ్చుటా - ఈ నాలుగు గుణాలూ; నా+ఇక్కల్= నా నెలవులు - స్థానాలు.

తాత్పర్యం: ఇంద్రుడు శ్రీదేవిని 'నీవీ రాక్షసరాజును విడిచి వెడలుటకు కారణమేమిటి?' అని అడిగాడు. ఆ ప్రశ్న విన్న లక్ష్మి 'సత్యం, ధర్మం, దమం, దానం - అనే గుణాలు నాకు నెలవులు. అవి ఎక్కడ ఉంటే నేనూ అక్కడే ఉంటాను.

విశేషం: ఇది మహాభారతంలో లక్ష్మీదేవి పలుకు. ఆమె సత్యధర్మాలు, దాంతి దానాలూ తన నెలవులంటున్నది. అనంతరకాలాన వెలసిన కావ్యాలలో లక్ష్మి దూషితగా దుష్టవర్తనగా వర్ణితమై కనిపిస్తూ ఉన్నది (కాదంబరి కావ్యాన). అది కాలవ్యత్యాసం కావచ్చు.

క. అవి గలిగి పరాక్రమయుతుఁ । డవు పురుషునిపాల నిలుతు నమరాధిప! యా
దివిజారి దొల్లి యట్టిఁడ । యవినీతత నిపుడు బ్రాహ్మణాసూయ మెయిన్. 403

ప్రతిపదార్థం: అవి= ఆ నాలుగు గుణాలు; కలిగి= ఉండి; పరాక్రమయుతుఁడు+అవు= ప్రతాపంతో కూడినవాడైన; పురుషుని పాలన్= నరుడి దగ్గర; నిలుతున్= ఉండెదను; అమర+అధిప!= దేవతలరాజా!; ఆ దివిజ+అరి= ఆ దేవతల శత్రువు; అట్టిఁడు+అ=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అట్టివాడే - ఆ గుణాలూ- పరాక్రమమూ గలవాడే; ఇపుడు= ప్రస్తుత కాలాన; అవినీతతన్= అవినయంతో - వినయం లేనివానితనంతో; బ్రాహ్మణ+అసూయ మెయిన్= బ్రాహ్మణులయెడ ఓర్వలేనితనంతో.

తాత్పర్యం: ఓ దేవరాజా! ఆ నాలుగు గుణాలూ ఉండి, ప్రతాపవంతుడు కూడా అయిన పురుషుడిదగ్గర నేను నిలిచి ఉంటాను. ఆ బలిచక్రవర్తి పూర్వకాలాన అట్టివాడే. కాని, ప్రస్తుతకాలాన అతడు అవినయంతో, బ్రాహ్మణుల పట్ల, బ్రహ్మవిద్యాసంపన్నులయెడ అసూయతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తొల్లిటి సచ్చారిత్రము । లెల్లను దిగవిడిచెఁ గాన యీతనికడ నే
నొల్ల నిలువ, వచ్చెద సుర । వల్లభ! నీ పాల నెలమి వసియింపంగన్. 404

ప్రతిపదార్థం: సురవల్లభ!= ఓ దేవతలరాజా!; తొల్లిటి= పూర్వపు; సత్+చారిత్రములు+ఎల్లను= మంచి నడతలను అన్నింటిని; దిగన్+విడిచెన్= దిగిపోయేటట్లు - వెడలిపోయే విధంగా వదలివేశాడు; కాన= కాబట్టి; ఈతని కడన్= ఈ బలి దగ్గర; నేన్+నిలువన్+ఒల్లన్= నేను నిలుచుటకు ఇష్టపడను; నీ పాలన్= నీ దగ్గర; ఎలమిన్= సంతోషంతో; వసియింపంగన్= నివసించటానికై; వచ్చెదన్= వస్తాను.

తాత్పర్యం: పూర్వపు ఆ మంచి నడతలు అన్నిటినీ ఈ బలి వదలివేశాడు. కాబట్టి ఇకపై ఈతడి దగ్గర ఉండనొల్లను. ఓ దేవరాజా! నీ దగ్గర సంతోషంతో నివసించటానికై వస్తాను.

ఆ. ఆ గుణములు మఱియు నాగమోదిత సమా । చారములును గలిమిఁ గోరి యింద్ర!
నిన్నుఁ బొంది యేను నిల్చెద; నేమిట । నేమఱంగ వలవ దెపుడు నీవు.' 405

ప్రతిపదార్థం: ఇంద్ర!= ఓ దేవరాజా!; ఆ గుణములు= ఆ నేను చెప్పిన గుణగణాలూ; మఱియున్= ఇంకను; ఆగమ+ఉదిత సమ్+ఆచారములును= శాస్త్ర విహితమైన మంచి ధర్మాలును; కలిమిన్= ఉండటంవలన; నిన్నున్= నిన్ను; కోరి= ఇష్టపడి; పొంది= చెంది; ఏను=నేను; నిల్చెదన్= నిలుస్తాను - పోకుండా - నిలకడగా ఉంటాను; నీవు= దేవరాజువైన నీవు; ఎపుడున్= ఏ సమయానైనా; ఏమిటన్= ఏ విషయానైనా; ఏమఱంగన్+వలవదు= ఏమరి ఉండవద్దు- ప్రాల్మాలికతో పరాకుతో వ్యవహరించవద్దు.

తాత్పర్యం: ఇంద్రదేవా! నీలో నేను నుడివిన ఆ గుణాలతోపాటుగా, అదనంగా వేదశాస్త్ర విహితాలైన ధర్మాలను ఆచరించే సల్లక్షణం కూడా ఉన్నది. అందువలన నేను నిన్ను కోరి వరించి వచ్చి, నీ వద్ద నిలిచి ఉంటాను. అయితే నీవు కూడా ఎపుడూ ఏ విషయంలోనూ పరాకుపడకుండా నిత్యజాగరూకుడవై ఉండవలెను'.

విశేషం: లక్ష్మీనివాస మన్నది కొన్ని నియమ నిబంధనలకు లోబడి జరుగుతుంది. ఆ నియమనిబంధనలు పాటించినచోట శ్రీ తాండవిస్తుంది. వాటిని పారద్రోలిన చోటును సిరి దిగవిడిచి వెళ్ళుతుంది.

వ. అని పలికె నిట్లు లక్ష్మి చేతం బరిత్యక్తుండైన బలి యాఖండలు నాలోకించి. 406

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికెన్= చెప్పింది; ఇట్లు= ఈ ప్రకారంగా; లక్ష్మిచేతన్= శ్రీదేవి చేత; పరిత్యక్తుండు+ఐన బలి= విడువబడ్డ బలి; ఆఖండలున్= ఇంద్రుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: లక్ష్మి ఆ విధంగా పలికిన తరువాత, సిరి తొలగిన ఆ బలి ఇంద్రుడిని చూచి ఇట్లా. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'అయనవశంబునఁ దేజో । వియుక్తుఁ డై రవి ప్రతాపవిరహితుఁ డగు నా
క్రియఁ బొనుఁగుపడినఁ బొంగకు; । జయింతు నిను దేవదనుజ సంగర మగుడున్. 407

ప్రతిపదార్థం: రవి= సూర్యుడు; అయనవశంబునన్= ప్రయాణ (ఉత్తర - దక్షిణ దిక్కులకు ప్రయాణించటం) కారణాన; తేజస్+వియుక్తుఁడు+ఐ= కాంతిని వీడినవాడై; ప్రతాప విరహితుండు= వేడిమి లేనివాడు; అగున్= అవును; ఆ క్రియన్= ఆ విధంగా (నేను); పొనుఁగుపడినన్= నిస్తేజం కాగా - ప్రతాపం చెడగా; పొంగకు= సంతసించకు - ఉబ్బిపోకుము; దేవదనుజ సంగరము= దేవతల రాక్షసుల యుద్ధం; అగుడున్= అయినపుడు; నినున్= నిన్ను; జయింతున్= గెలుస్తాను.

తాత్పర్యం: 'సూర్యుడు తన ప్రయాణం కారణంగా తేజస్సు చెడి, వేడిమిని కోల్పోతాడు. ఆ విధంగా నేనూ ప్రస్తుతం నిస్తేజంగా ప్రతాపం తగ్గి ఉన్నానని ఉబ్బిపోకుము; దేవాసుర సంగ్రామం జరిగినప్పుడు నిన్ను నేను గెలుస్తాను'.

వ. అనుటయు మహేంద్రుండు. 408

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; మహా+ఇంద్రుండు= ఇంద్రదేవుడు.

తాత్పర్యం: అని బలి అనగా, దేవేంద్రుడు.

క. 'అది యట్టులుండె నీతోఁ । బదరం బని లేదు నాకుఁ బద్మభవుని మా
ట దలంపవలయు నీపై । భిదురం బిడ దనుజనాథ! ప్రియ మందు మెదన్.' 409

ప్రతిపదార్థం: దనుజనాథ!= రాక్షసరాజా!; అది= నీవు నన్ను జయించబోయే విషయం; అట్టులు+ఉండెన్= ఆ విధంగా ఉండనిమ్ము - ఒక ప్రక్కన ఉండనిమ్ము; నీతోన్= బలివైన నీతో; పదరన్= వాగగా - వ్యర్థభాషణ చేయగా; పని లేదు= అవసరం లేదు; నాకున్= దేవరాజునైన నాకు; పద్మభవునిమాట= బ్రహ్మదేవుడి పలుకు - వధించటం ఉచితం కాదు అనేది; తలంపన్+వలయున్= స్మరించవలసి ఉన్నది; నీపైన్= నీ మీద; భిదురంబు= వజ్రాయుధం; ఇడన్= వేయను - ప్రయోగించను; ఎదన్= మనస్సున; ప్రియము+అందుము= ప్రీతిని పొందుము.

తాత్పర్యం: 'సరి, భవిష్యత్తులో నీవు నన్ను గెలిచే విషయం అట్లా ఉండనిమ్ము. ప్రస్తుతం నేను నీతో వ్యర్థప్రసంగం చేయ పనిలేదు. నేను బ్రహ్మదేవుడికిచ్చిన మాటను పాటించవలసి ఉన్నది. ఓ రాక్షసరాజా! నీ మీద నేను వజ్రాయుధాన్ని వేయను. నీవు మనస్సున ప్రీతిని వహించుము'.

క. అనిన విని యొండు పలుకక । దనుజాధీశ్వరుఁడు వోయె దక్షిణ దిశకుం;
జనియె నుదఙ్ముఖుఁడై దివి । కనిమిష నాథుండు గౌరవాన్వయముఖ్యా! 410

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; విని= ఆలకించి; కౌరవ+అన్వయ ముఖ్యా!= ధర్మరాజా!; దనుజ+అధి+ఈశ్వరుండు= రాక్షసుల అధిపతి - బలి; ఒండు+పలుకక= ఒకటీ అనక - నిశ్శబ్దంగా; దక్షిణదిశకున్= దక్షిణదిక్కునకు; పోయెన్= పోయాడు; అనిమిష నాథుండు= రెప్పపాటులేనివారి రాజు - దేవేంద్రుడు; ఉదక్+ముఖుఁడు+ఐ= ఉత్తరమునకు ముఖంకలవాడై - ఉత్తర దిశగా; దివికిన్= స్వర్గానికి; చనియెన్= వెళ్ళెను.

తాత్పర్యం: ఇంద్రుడి ఆ మాటలు ఆలకించిన బలి, మరి మారుమాటాడకుండా, దక్షిణదిశకు వెడలిపోయాడు. ఇంద్రుడు కూడా ఉత్తరాభిముఖంగా కదలి, స్వర్గానికి వెళ్ళిపోయాడు ధర్మరాజా!' (అని భీష్ముడు ఈ వృత్తాంతాన్ని ముగించాడు.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని చెప్పి యనిమిషనదీనందనుండు వెండియుఁ బాండవాగ్రజున కిట్లను 'నింద్ర నముచి సంవాదం బను నితిహాసంబు హృదయప్రసాదకరంబు; దాని నాకర్ణింపుము. 411

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; అనిమిష నదీ నందనుండు= దేవతల నది కొడుకు - భీష్ముడు; వెండియున్= ఇంకను; పాండవ+అగ్రజునకున్= పాండవులలో మొదటివాడితో - ధర్మరాజుతో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; ఇంద్ర నముచి సంవాదంబు+అను= ఇంద్ర నముచుల సంవాదం అనే పేరుగల; ఇతిహాసంబు= వృత్తాంతం - జరిగిన కథ; హృదయ ప్రసాదకరంబు= మనస్సున నిర్మలత్వమును కలిగించేది; దానిని= ఆ ఇతిహాసాన్ని; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇంద్ర బలి సంవాదాన్ని వినిపించిన భీష్ముడు ధర్మరాజుతో 'ఇంద్ర - నముచి సంవాదం అనే మరొక ఇతిహాసమున్నది. అది మనస్సున కలతదీర్చి ఊరట కలిగిస్తుంది. దానిని విను'మంటూ ప్రారంభించాడు.

ఇంద్ర నముచి సంవాద ప్రకారము (సం. 12-219-1,2)

సీ. 'సిరిఁ బాసియును నొక్క చింతయు లేక వీ। చుల క్రం దడంగిన జలధివోలె
నముచి యేకాంతస్థలమున నుండఁగ నింద్రుఁ। డచటికి నేతెంచి యతనిఁ జూచి
'పేదవడ్డాఁడవు ప్రియజనంబును బరి। వారంబు లే దియ్యవస్థ కెంత
వగచెదవో దానవశ్రేష్ఠ!' నావుడు। నాతండు 'వగపు నిరర్థకంబు

తే. వలయు వస్తువు వగచిన వచ్చునయ్య?। రామి యొక్కటియే శరీరంబు నెదయుఁ
దాపమునఁ బొందు వగపున ధర్మ మేదు;। నింత యెఱుఁగుదు వగవ నే నేమిటికిని. 412

ప్రతిపదార్థం: నముచి= ఆ పేరుగల ఒక రాక్షసుడు; సిరిన్+పాసియును= లక్ష్మిని కోల్పోయికూడా; ఒక్క చింతయున్ లేక= ఒక విచారమూ లేకుండా; వీచుల క్రందు= అలల అలజడి; అడంగిన= అణగిన - మానిన; జలధి+పోలెన్= సముద్రంవలె; ఏక+అంతస్థలమునన్= ఒంటరి ప్రదేశాన - ఇతరు లెవరూ లేనిచోట; ఉండంగన్= వసించగా; ఇంద్రుఁడు= దేవతల రాజు; అచటికిన్+ఏతెంచి= ఆ చోటికి వచ్చి; అతనిన్+చూచి= ఆ నముచి దానవుడిని కనుగొని; పేద+పడ్డాఁడవు= పేదపడినవాడవు - లేనివాడ వైనావు; ప్రియజనంబును= ఇష్టమైన బంధుమిత్రులును; పరివారంబు= బలగం; లేదు; ఈ+అవస్థకున్= ఈ స్థితికి; ఎంత వగచెదవో?= ఎంతగా దుఃఖిస్తావో?; దానవశ్రేష్ఠ!= రాక్షసులలో ఉత్తముడా!; నావుడున్= అన్న వెంటనే; ఆతండు= ఆ నముచి; వగపు= దుఃఖం; నిర్+అర్థకంబు= నిష్ప్రయోజనం - వ్యర్థం; వలయువస్తువు= కావలసిన పదార్థం; వగచినన్= దుఃఖిస్తే; వచ్చును+అయ్య?= వస్తుందటయ్యా? (రాదు) పైగా; రామి= రాకపోవటం; ఒక్కటి+ఏ= ఒక్కటైనా; శరీరంబున్= దేహమూ; ఎదయున్= మనస్సూ; తాపమునన్= బాధవలన; పొందు= పొందే; వగపునన్= దుఃఖంవలన; ధర్మము+ఏదున్= ధర్మం నశిస్తుంది; ఇంత= ఇది అంతా; ఎఱుఁగుదున్= గ్రహించాను; నేను= జ్ఞానినైన నేను; ఏమిటికిని= దేనికి కూడా; వగవను= దుఃఖించను.

తాత్పర్యం: నముచి అనే రాక్షసుడు సంపదలు నశించిపోయినా, చీకూచింతా లేకుండా అలల సందడి మానిన సముద్రుడివలె నిశ్చలంగా ఒక ఏకాంతస్థలాన ఆసీనుడై ఉండగా అక్కడికి ఇంద్రుడు చేరి అతడి అవస్థను చూచి, 'ఓ రాక్షసరాజా! పేదవాడివై ఉన్నావు; బంధుమిత్రులుగాని ఇతర పరివారాలుగాని లేరు. ఈ హీనస్థితికి ఎంతగా దుఃఖిస్తున్నావో కదా!' అని ఓదార్చబోయాడు. అయితే నముచి మాత్రం 'వగపు నిష్ప్రయోజనం, వగచినంతమాత్రాన వలసిన పదార్థం వస్తుందటయ్యా? రాకపోవటమేకాక, శరీరానికీ మనస్సుకూ సంతాపం కూడా ఆ వగపువలన కలుగుతుంది. అంతేగాదు, వగపువలన ధర్మహానీ కలుగుతుంది. ఇదంతా గ్రహించినవాడను కాబట్టి నేను దేనికీ దుఃఖించను'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ.

తే. **సకలభూతంబులకును శాసకుఁడు గలఁడు । గాదె! యొక్కరుఁ డాతని కల్పనమునఁ**
బ్రాప్తమైనది నీళులు పల్లమునకు । వచ్చు క్రియఁ దాన వచ్చు గీర్వాణముఖ్య! **413**

ప్రతిపదార్థం: గీర్వాణముఖ్య!= దేవతలరాజా!; సకలభూతంబులకును= ఎల్లప్రాణులకును; శాసకుఁడు= ఏలిక - అధిపతి; కలఁడు+కాదె!= ఉన్నాడు కదా!; ఒక్కరుఁడు= ఒకడు; ఆతని కల్పనమునన్= ఆ శాసకుడి ఏర్పాటువలన; ప్రాప్తము+ఐనది; లభించినట్టిది; నీళులు= నీరములు; పల్లమునకున్= పల్లమైన ప్రదేశానికి; వచ్చుక్రియన్= వచ్చే విధంగా; తాను+అ= తానే - స్వయంగా; వచ్చున్= చేరును.

తాత్పర్యం: ఓ దేవతలరాజా! సృష్టిలో ఎల్లప్రాణులకూ ఏలిక ఒక డున్నాడు కదా! అతడి ఏర్పాటు ప్రకారం ఏ ప్రాణికి ఏది ఎప్పుడు లభించాలో, ఆ ప్రాణికి అది అప్పుడు, నీళ్ళు పల్లానికి ప్రాకివచ్చినంత సులభంగా ప్రయత్న రహితంగా వచ్చి చేరుతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. **ఇది నా కయ్యెం; గాఁగల । యది యై యను గాఢనిశ్చయం బెవ్వని నె**
మ్మదిఁ గలుగు నుబ్బు వగ సం । పద యాపద గలుగ వట్టి భవ్యున కింద్రా! **414**

ప్రతిపదార్థం: ఇంద్రా!= ఓ దేవరాజా!; ఎవ్వని నెఱ+మదిన్= ఏ నరుడి నిండు మనస్సులో; కాఁగల+అది+ఐ= కావలసి ఉన్నదై- ఏర్పడి ఉన్నదై; ఇది= ఈ పని- సంఘటన; నాకున్+అయ్యెన్= నాకు అయింది- జరిగింది; అను గాఢ నిశ్చయంబు= అనే గట్టి నిర్ణయం; కలుగున్= ఉండునో; అట్టి భవ్యునకున్= అట్టి శుభకరుడికి - యోగ్యుడికి; ఉబ్బు= సంతోషాతిరేకం; వగ= దుఃఖం; సంపద= కలిమి - సంపత్తి; ఆపద= విపత్తు - కష్టము; కలుగవు= ఉండవు - ఏర్పడవు.

తాత్పర్యం: ఇది ఈ విధంగా కావలసి ఉన్నదే, నాకు అయినది నాకు జరిగినది, ఇది జరగవలసి ఉండే జరిగింది. అనే గట్టి నిశ్చయంగల యోగ్యుడికి ఇక ఆనందం, దుఃఖం, సంపత్తి విపత్తివంటి ద్వంద్వాలు ఉండవు.

క. **ధైర్యంబున వీర్యంబున । శౌర్యంబునఁ బ్రజ్ఞఁ బడయఁ జాలునె నరుఁ డె**
క్కార్యము నప్రాప్యమయిన? । నార్యుం డది యెఱుఁగుఁ గాన యడలఁడు శక్రా! **415**

ప్రతిపదార్థం: శక్రా!= ఓ ఇంద్రుడా!; నరుఁడు= మానవుడు; ఏ+కార్యమున్= ఏ పనినైనా; అప్రాప్యము+అయినన్= పొందరానిది అయితే; ధైర్యంబునన్= ధీరగుణంతో; వీర్యంబునన్= వీరభావంతో; శౌర్యంబునన్= శూరభావంతో - ధైర్యపరాక్రమాలతో; ప్రజ్ఞన్= బుద్ధిబలంతో; పడయున్+చాలునె?= పొందగలడా? (పొందలేడు); ఆర్యుండు= సజ్జనుడు; అది= ఆ విషయం; ఎఱుఁగున్+కానన్= తెలియును కాబట్టి; అడలఁడు= భయపడడు.

తాత్పర్యం: ఓ దేవరాజా! ఒక కార్యం అలభ్యమని దైవం నిర్ణయించి ఉంటే, ఇక దానిని నరుడు తన ధైర్య శౌర్యాలతోగాని, పరాక్రమశక్తితోగాని, కాదంటే బుద్ధిబలంతోగాని పొందగలడా? పొందనే లేడు. ఆ విషయం సుజనుడు గ్రహించి ఉంటాడు కాబట్టి, అతడికి భయ ముండదు. అత డెవరికీ భయపడడు.

తే. **మేలుఁ గీడును నరుఁ బొందుఁ గాలముల న । వశ్యమును వానిఁ గోరిన వచ్చుటయును**
వినుము త్రోచినఁ బోవుటయును సురేంద్ర! । కలదె వానికిఁ? గావున వలదు చింత.' **416**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సుర+ఇంద్ర!= దేవతలరాజా!; మేలున్+కీడును= శుభమూ, అశుభమూ; కాలములన్= ఆయా సమయాలలో; అవశ్యమును= తప్పకుండ; నరున్= మానవుడిని; పొందున్= చెందుతాయి; వానిన్= ఆ మేలు కీళ్ళను; కోరినన్+వచ్చుటయును= కోరితే రావటమూ; త్రోచినన్+పోవుటయును= త్రోసివేస్తే పోవటమూ; వానికిన్= ఆ మేలు కీడులకు; కలదు+ఎ?= ఉన్నదా? (లేదు); కావున= కాబట్టి; చింత వలదు= విచారం - వగపు వద్దు; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: ఓ దేవరాజా! జీవితంలో మేలు, కీడు అనేవి కాలవశాన తప్పకుండా నరుడిని చేరేవే తప్ప, కోరితే వచ్చేవీ, త్రోసివేస్తే తొలగి పోయేవీ అవుతాయా? కావు. కాబట్టి ఆ మేలు, కీడుల విషయమై చింతించటం పనికిరాదు. వినుము'.

క. అని యిట్లు నముచి పలికిన । విని మెచ్చుచు దివికి నమరవిభుఁ డరిగెం; బా
వనచరిత! యింకనెయ్యది । వినవల తనవుడును భరితవినయుండగుచున్. 417

ప్రతిపదార్థం: పావన చరిత!= పవిత్రమైన నడతగల ఓ ధర్మరాజా!;అని= పై విధంగా; ఇట్లు= ఈ ప్రకారం; నముచి= నముచిదనుజుడు; పలికినన్= చెప్పగా; విని= ఆలకించి; మెచ్చుచున్= మెచ్చుకొంటూ; అమరవిభుఁడు= దేవేంద్రుడు; దివికిన్ అరిగెన్= స్వర్గానికి వెళ్ళాడు; ఇంకన్= ఇంకనూ; ఏ+అది= ఏది; వినన్+వలతు(వు)?= వినటానికి కోరుతున్నావు?; అనవుడున్= (అని భీష్ముడు) అన్న తరువాత; భరిత వినయుండు+అగుచున్= నిండిన వినయము కలవాడు అవుతూ.

తాత్పర్యం: ఈ ప్రకారంగా నముచి పలుకగా విన్న దేవేంద్రుడు నముచి పలుకులను మెచ్చికొంటూ తాను స్వర్గానికి వెడలిపోయాడు. ఓ పవిత్రచరిత్రగల ధర్మరాజా! నీవు ఇకపై ఏమి వినాలని నిరీక్షిస్తున్నావు - అని భీష్ముడు అనగా అణకువతో నిండినవాడై (ధర్మరాజు).

క. ఆ నరపతి శాంతనవుని । తో నిట్లను 'నెద్దియేని దుర్దశ యైనన్
మానవుఁ డెట్టిఁ డగుట మే । లానతియీవే? దయామయా! తేటపడన్.' 418

ప్రతిపదార్థం: ఆ నరపతి= ఆ రాజు - ఆ ధర్మరాజు; శాంతనవునితోన్= శంతను తనయుడితో - భీష్ముడితో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; ఎద్ది+ఏని= ఏదైనా; దుర్+దశ+ఐనన్= చెడ్డ అవస్థ కలిగితే; మానవుఁడు= నరుడు; ఎట్టిఁడు+అగుట= ఎటువంటివాడు కావటం - ఏ విధంగా ప్రవర్తించటం; మేలు?= ఉత్తమం?; దయామయా!= దయతో నిండిన ఓ భీష్మాచార్యా!; తేటపడన్= స్పష్టంగా; ఆనతి+ఈవే?= సెలవీయవా? - ఉపదేశించవా?

తాత్పర్యం: ధర్మరాజు పితామహుడితో 'ఏదైనా చెడ్డ అవస్థ నరుడికి కలిగినపుడు అతడు ఎట్లాంటివాడు కావాలి? ఏ విధంగా ప్రవర్తించి ఆ దుర్దశను దాటగలగాలి? ఆజ్ఞాపించు'మని అర్థించాడు.

వ. అని యడిగిన నయ్యుధిష్ఠిరునకు బుధశ్రేష్ఠుం డిట్లనియె. 419

ప్రతిపదార్థం: అని+అడిగినన్= ధర్మరాజు ఆ విధంగా అడగగా; ఆ+యుధిష్ఠిరునకున్= ఆ ధర్మరాజునకు; బుధశ్రేష్ఠుండు= పండిత ఉత్తముడు - భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని ధర్మరాజు అడుగగా భీష్ముడు ధర్మజుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'ఏ విధమున దుర్దశలకు । భూవర! ధైర్యంబ మందు; భూరిధృతిమెయిం
జేవ గలుగు దృఢనిశ్చయ । భావము నెవ్వగలఁ దొట్రువడ దెబ్బంగిన్. 420

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భూవర!= ఓ రాజా!; ఏ విధమునన్= ఏ ప్రకారంగానైనా; దుర్+దశలకున్= దురవస్థలకు - చెడు స్థితిగతులకు; ధైర్యంబు+అ= ధైర్యమే ధీర స్వభావమే; మందు= ఔషధం - ప్రతీకారం; భూరి ధృతిమెయిన్= గొప్ప ధైర్యంతో; చేవ+కలుగు= బలంగల; దృఢనిశ్చయ భావము= గట్టి నిర్ణయంగల మనస్సు; ఏ భంగిన్= ఏ విధంగానూ; నెఱ+వగలన్= నిండు దుఃఖాలతో; తొట్రు+పడదు= చలించదు - కదలిపోదు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! దురవస్థలు ఏ విధమైనవైనా ఆ అన్నిటికీ ఒక్క ధైర్యమే ఔషధం. గొప్ప ధైర్యంతో చేవగల గట్టి నిర్ణయం తీసికొన్న మనస్సు ఎటువంటి నిండు శోకాలలోనైనా, దుఃఖాలలోనైనా చలించకుండా నిలుస్తుంది. ఆ కష్టనష్టాలను అతిక్రమిస్తుంది.

క. **ధృతి యారోగ్యము నొసఁగును; । ధృతి యుజ్జ్వలలక్ష్మిఁ దెచ్చు; ధృతి గీర్తి సము**
న్నతిఁ జేయుఁ; గాలగత్యవ । గతి గలిగినఁ గలుగు ధృతి వికారవిదూరా! **421**

ప్రతిపదార్థం: వికారవిదూరా!= వికృతులకు - మానసిక బలహీనతలకు మిక్కిలి దూరమైనవాడా! - ధర్మరాజా!; ధృతి= ధైర్యం; ఆరోగ్యమున్= రోగంలేని శరీరస్థితిని; ఒసఁగును= ఇస్తుంది; ధృతి= ధైర్యం; ఉత్+జ్వల లక్ష్మిన్= ప్రకాశించే సిరిని; తెచ్చున్= తీసికొనివస్తుంది; ధృతి= ధైర్యం; కీర్తి సమ్+ఉన్నతిన్= యశస్సుయొక్క మంచి ఔన్నత్యమును - పెరుగుదలను; చేయున్= కలిగిస్తుంది; కాలగతి+అవగతి= కాలముయొక్క నడకను గూర్చిన జ్ఞానం; కలిగినన్= ఏర్పడితే; ధృతి= ధీరగుణం; కలుగున్= ఏర్పడుతుంది.

తాత్పర్యం: మనోవికృతులకు దూరమైన ఓ ధర్మరాజా! ధైర్యం ఆరోగ్యాన్ని ఇస్తుంది. ధీరగుణం ప్రకాశించే సిరులు కురిపిస్తుంది. ధీరస్వభావం యశస్సును ఉన్నతంగా పెంచుతుంది. అయితే ఆ ధైర్యం కలగాలి - అంటే నరుడికి కాలపునడకను గూర్చిన జ్ఞానం ముందు కలగాలి.

విశేషం: ధైర్యం మానసిక లక్షణం. ఆరోగ్యం శరీర సంబంధి. అయినా ఆ మనోలక్షణం శరీరాన ఆరోగ్యాన్ని కలిగిస్తుంది అంటున్నాడు భారతకర్త. నిజమే మనఃప్రభావం శరీరంమీద పడటం సహజమైన వాస్తవమైన, విషయం. ఆధునిక వైద్యశాస్త్రమూ ఈ అంశాన్ని అంగీకరిస్తుందని తద్జ్ఞుల కథనం.

ఇంద్ర బలి సంవాద ప్రకారము (సం. 12-220-6)

వ. **ఏ తద్విషయం బైన యది యొక్కటి యింద్ర బలి సంవాదం బను నితిహాసంబు గల; దాకర్ణింపుము. దేవాసురులకు సమరంబు సెల్లిన నందు విష్ణుని మహానుభావంబున దేవతలకు గెలుపై రుద్రాదిత్య మరుద్వసు గంధర్వ సిద్ధాదులు పరివేష్టింప నింద్రుం డైరావతారూఢుండై లీలం ద్రైలోక్యంబును జరించుచుండి యొకప్పుడు సముద్రోపాంతంబున నొక్క గిరిగహ్వరంబున యంగణంబున వైరోచనుం డగు బలిం గని చేరం జని యద్దనుజపతి దన్నుం జూచి నిస్సంభ్రముండును వైమనస్యరహితుండును నై యునికి నిరూపించి, యతనితో నిట్లనియె.** **422**

ప్రతిపదార్థం: ఏతద్+విషయంబు+ఐన+అది= ఈ విషయానికి చెందింది; ఒక్కటి= ఒక; ఇంద్రబలి సంవాదంబు+అను= ఇంద్రుడి యొక్క బలియొక్క సంభాషణం అనే; ఇతిహాసంబు= వృత్తాంతం; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= వినుము; దేవ+అసురులకున్= దేవతలకు రాక్షసులకును; సమరంబు= యుద్ధం; చెల్లినన్= ముగియగా; అందున్= ఆ యుద్ధాన; విష్ణుని మహా+అనుభావంబునన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నారాయణుడి గొప్పతనం వలన; దేవతలకున్= సురలకు; గెలుపు+ఐ= జయం కలిగి; రుద్ర+ఆదిత్య మరుత్+వసు గంధర్వ సిద్ధ+ఆదులు= రుద్రులు, ఆదిత్యులు, మరుత్తులు, వసువులు, గంధర్వులు, సిద్ధులు మొదలయినవారు (వీరందరూ దేవజాతి విశేషాలు); పరివేష్టింపన్= చుట్టిరాగా; ఇంద్రుండు= దేవరాజు; ఐరావత+ఆరూఢుండు+ఐ= ఐరావతమును (తెల్లని ఏనుగు - ఇంద్రుడి వాహనం) ఎక్కినవాడై; లీలన్= విలాసంగా; త్రైలోక్యంబును= ముల్లోకాలను; చరించుచున్+ఉండి= తిరుగుతూ ఉండి; ఒకప్పుడు= ఒక సమయాన; సముద్ర+ఉప+అంతంబునన్= సముద్రపు సమీపాన; ఒక్క గిరిగహ్వరంబునన్= ఒక కొండగుహలో; అంగణంబునన్= ముంగిలియందు; వైరోచనుండు+అగు= విరోచనుడి తనయుడగు; బలిన్= బలి (చక్రవర్తి)ని; కని= చూచి; చేరన్+చని= సమీపించి; ఆ+దనుజపతి= ఆ రాక్షసరాజు; తన్నున్+చూచి= తనను కనుగొని; నిస్+సంభ్రముండును= తొట్రుపాటు లేనివాడును; వైమనస్య రహితుండును= మనస్సు చెడినవానితనంలేనివాడును; ఐ+ఉనికి= అయి ఉండటం; నిరూపించి= గట్టిగా గ్రహించి; అతనితోన్= ఆ బలితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విషయానికి చెందిన వృత్తాంత మొకటి ఇంద్ర బలి సంవాదం అనే పేరుతో ఉన్నది. దానిని వినుము. దేవాసురులకు యుద్ధం ముగిసిపోగా, దానిలో నారాయణుడి ప్రాభవంతో దేవతలకు గెలుపు కలిగింది. అనంతరం ఇంద్రుడు దేవతాపరివారమైన రుద్రులు, ఆదిత్యులు, మరుత్తులు, వసువులు, గంధర్వులు, సిద్ధులు మొదలయినవారు చుట్టిరాగా ఐరావతాన్ని అధిరోహించి విలాసంగా మూడులోకాలూ సంచరిస్తూ ఒకనాడు సముద్రపు సమీపంలో, ఒక కొండ గుహ ముంగిట విరోచనుడి తనయుడైన బలిని చూచాడు. చూచి, అతడి దగ్గరకువెళ్ళి, ఆ రాక్షసరాజు తనను చూచి ఏ పాటి తొట్రుపాటూ, మనస్సులో కలతా లేనివాడై ఉండటం గమనించి, అతడితో ఇట్లా అన్నాడు.

క. 'హీనస్థానమున విభవ । హీనత నిట్లుండి రిపుల యెలమిఁ గనియు నీ
మానసమున శోకింపమి । దానవకులనాథ! యెవ్విధంబునఁ గలిగెన్? 423

ప్రతిపదార్థం: దానవకులనాథ!= ఓ రాక్షసవంశరాజా! - బలీ!; హీనస్థానమునన్= హీనమగుచోట; విభవహీనతన్= ఐశ్వర్యపు లేమితో; ఇట్లు+ఉండి= ఈ విధంగా జీవిస్తూ; రిపుల+ఎలమిన్= శత్రువుల అభివృద్ధిని; కనియున్= చూచికూడా; నీ మానసమునన్= నీ మనస్సునందు; శోకింపమి= దుఃఖింపకుండటం; ఏ+విధంబునన్= ఏ ప్రకారంతో - ఏ పద్ధతితో; కలిగెన్?= ఏర్పడింది?

తాత్పర్యం: ఓ రాక్షసరాజా! తక్కువస్థితిలో ఉన్నావు, ఐశ్వర్యం కోల్పోయి ఉన్నావు, శత్రువుల వికాసాన్ని చూచావు. అయినా నీ మనస్సులో శోకం కలుగలేదు. ఎందువలన? ఇది - ఈ నిర్వికారస్థితి నీకు ఏ విధంగా సిద్ధించింది?

ఆ. శౌర్యముననొ వృద్ధసంసేవ వలననొ । తపముననొ యుదాత్తతా నిరూఢి
గలిగి మమ్ము సరకుగాఁ గొన కున్నాఁడ । వేమి కతము? దీని నెఱుఁగఁ జెపుమ!' 424

ప్రతిపదార్థం: శౌర్యముననొ= శూరగుణంవలననో; వృద్ధసంసేవవలనన్+ఒ= పెద్దల పరిచర్య వలననో; తపమునన్+ఒ= తపస్సు వలననో; ఉదాత్తతా నిరూఢి+కలిగి= గొప్పదనపు గట్టితనం కలిగి; మమ్మున్= దేవతల రాజులమైన మమ్ము కూడా; సరకుగాన్+కొనక+ఉన్నాఁడవు= లక్ష్యపెట్టకుండా ఉన్నావు; కతము ఏమి?= కారణం ఏమిటి? దీనిన్= ఈ కారణాన్ని; ఎఱుఁగన్+చెపుము+అ!= తెలిసేటట్లుగా పలుకవే!

తాత్పర్యం: ఓ బలీ! నీవు శూరభావంవలననో, కాక పెద్దల పరిచర్యల ఫలితంగానో, అటుకాక తపశ్శక్తివలననో ఉదాత్తతను సంపాదించి, నీ ఎదుట నిలిచిన దేవేంద్రులమైన మమ్ము సరకుజేయక ఉన్నావు. కారణ మేమిటి? విశదంగా వివరించుము'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఉదాత్తత అనే గొప్ప లక్షణం మొత్తం వ్యక్తిత్వానికి సంబంధించింది. నరుడి చూపులో, మాటలో, ప్రవృత్తిలో, క్రియలో ప్రతి కదలికలోనూ అది వ్యక్తమౌతూ ఉంటుంది. ఆ ఉదాత్తతవలననే సామాన్యులు మాన్యులుగా, వక్తలు ప్రవక్తలుగా, పురుషులు పురుషోత్తములుగా మారి మానవ సమాజాలను నడిపించారు.

వ. అనిన విని బలి యతని కిట్లనియె. 425

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; బలి= బలిదానవరాజు; అతనికిన్= ఆ దేవరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇంద్రుడి ప్రశ్నకు బలి ఇట్లా సమాధానం ఇచ్చాడు.

ఆ. 'సరకు సేయ వను చసడ్డమాటలు గొన్ని। యాడినంత నేమియయ్యె నింద్ర!
నీదుశక్తి వింతయే దైవవశమున। నెట్టిపాటివారు నెట్లుఁ గారె? 426

ప్రతిపదార్థం: ఇంద్ర!= ఓయీ ఇంద్రుడా!; సరకు+చేయవు+అనుచున్= లక్ష్యపెట్టవు అంటూ; అసడ్డమాటలు+కొన్ని= అశ్రద్ధ - నిర్లక్ష్య భావంతోడి పలుకులు కొన్ని; ఆడిన+అంతన్= పలికినంత మాత్రాన; ఏమి+అయ్యెన్= ఏమి అయింది? (ఏమీ కాదు); నీదు శక్తి= నీ శక్తి; వింత+ఏ= ఆశ్చర్యకరమా? కాదు; దైవవశమునన్= విధివశాన - విధాత చేష్టలవలన; ఎట్టిపాటివారున్= ఏ విధమైన గొప్పదనం కలవారు కూడా; ఎట్లున్+కారె?= ఏ విధంగానో - ఏ పాటి గొప్పదనమూ లేనివారుగా కారా?

తాత్పర్యం: 'ఓయీ ఇంద్రదేవా! నీవు పలికిన 'సరకుచేయవు' వంటి మాటలు అశ్రద్ధతో నిర్లక్ష్యభావంతో కూడినవి. ఆ పలుకులవలన ప్రయోజన మేమిటి? నీశక్తిసామర్థ్యాలు ఆశ్చర్యకరాలు గావు. అది తెలిసిన విషయమే. విధిచేష్టలవలన ఏపాటివారికైనా అపుడపుడు హైన్యదైన్యాలు తప్పవు.

క. నీవు మును హీనుఁ డగుటయు। నా వలనం గాదు; నీకు నను హీనదశా
భావితునిఁ జేయరా దివి। దైవకృతము; లట్లుగాన ధైర్యము వలయున్. 427

ప్రతిపదార్థం: మును= పూర్వం; నీవు= దేవతల రాజువైన నీవు; హీనుఁడు+అగుటయున్= తక్కువవాడవు కావటం, నేను దండెత్తినపుడు రాజ్యం కోల్పోయి ఇక్కట్లపాలు కావటం; నావలనన్+కాదు= నా శక్తివలన కాదు; (అట్లే); నీకున్= నీకు కూడా; ననున్= రాక్షసరాజునైన నన్ను; హీనదశాభావితునిన్= తక్కువదనమును పొందిన వాడినిగా - రాజ్యభ్రంశాది కష్టాలపాల బడినవాడినిగా; చేయన్+రాదు= చేయ శక్తి చాలదు; ఇవి= ఈ కష్టనష్టాలు - పూర్వం నీకు, ఇపుడు నాకు జరిగినవి; దైవకృత్యములు= విధి చేష్టితములు; అట్లు+కాన= అ ట్లగుటను బట్టి - ఆ కారణాన; ధైర్యము= ధీరలక్షణం; వలయున్= కావలయును.

తాత్పర్యం: ఇంద్రా! పూర్వం నేను దండెత్తివచ్చినప్పుడు నీవు రాజ్యభ్రష్టుడవై హీనతను పొందావు. అయితే నిజానికి అది నావలన జరిగినది కాదు. ఆ విధంగానే నేడు నేను రాజ్యం కోల్పోయి దైన్యంతో ఉన్నట్లు అగుపిస్తున్నాను. ఈ నా స్థితికి నీవు కారణం కాబోవు. ఇవి నీవలనా, నావలనా జరిగే, జరిగిన పనులుకావు. వీటికి కర్త విధి. కాబట్టి, విధి చేష్టలకు తిరుగులేదు - అనే జ్ఞానంతో నరుడు ధైర్యం కలిగి ఉండాలి.

క. విను పర్యాయంబున సుఖ। మును దుఃఖముఁ జెందు జనులఁ బురుషుఁడు ధైర్యం
బున గర్వంబు విషాదం। బు నడంగింపఁ దగునంద్రు బుధు లది వినమే? 428

ప్రతిపదార్థం: విను= ఆలకించుము ఇంద్రా!; జనులన్= నరులను; పర్యాయంబునన్= క్రమంగా - వంతు ప్రకారంగా; సుఖమును= సౌఖ్యమూ; దుఃఖమున్= విషాదమూ; చెందున్= పొందుతాయి; (కాబట్టి) బుధులు= పండితులు; పురుషుఁడు= నరుడు; ధైర్యంబునన్= ధీరగుణంతో; గర్వంబు= పొగరు - పొంగిపోవటం (సుఖం కలిగినపుడు); విషాదంబున్= దుఃఖమును (కష్టం కలిగినపుడు); అడంగింపన్+తగును= అణచటం ఉచితం; అంద్రు= అంటారు; అది= ఆ మాట; వినము+ఏ= వినలేదా?

తాత్పర్యం: ఇంద్రా! ఆలకించుము, జీవితాన సుఖదుఃఖాలు క్రమంగా ఒకదాని తరువాత మరొకటిగా నరులను చెందుతూ ఉంటాయి. ఆ క్రమం తప్పించరానిది. కాబట్టి నరుడు ధైర్యంతో మెలుగుతూ, సుఖం కలిగినప్పుడు గర్వాన్నీ, దుఃఖం కలిగినపుడు విషాదాన్నీ ప్రకటించకుండా అణచుకొనవలసి ఉంటుంది - అని పండితులు పలుకుతారు. మనం ఆ మాట వినలేదా? విన్నాం కదా!

క. చెలులుం జుట్టలును సహా । యులు విభవము పెం పకాలయుక్తి నవస్థం
దొలఁగించుట గలదె? మదిం । దెలిసి మనుము మనికి యిట్టిదియ కా దెపుడున్. 429

ప్రతిపదార్థం: చెలులున్= స్నేహితులూ; చుట్టలును= చుట్టములు పక్కములూ; సహాయులు= తోడ్పడేవారూ; విభవము= సంపద; పెంపు= అభివృద్ధి - ఇవన్నీ; అకాలయుక్తిన్= సరిగాని కాలంతోడి కలయికను; అవస్థన్= దశను - దుర్దశను; తొలఁగించుట= ప్రక్కకు తప్పించటం - దూరీకరించటం; కలదె?= ఉన్నదా? (లేదు); మదిన్= మనస్సునందు; తెలిసి= గ్రహించి; మనుము= జీవించుము; మనికి= జీవితం; ఎపుడున్= ఎల్లప్పుడూ; ఇట్టిది+అ= ఇటువంటిదే - ఒకే విధమైనది; కాదు= కాబోదు.

తాత్పర్యం: నరుడి మహర్దశకుగాని దుర్దశకుగాని దైవమొకటే కారణం గాని ఇతరులెవరూ కాజాలరు. స్నేహితులూ, చుట్టపక్కాలు, సహాయకులూ, సంపదలూ, సమృద్ధులూ - ఇటువంటివి ఎన్ని ఉన్నా, నరుడికి చెడుకాలం దాపురించినపుడు, దుర్దశ ఆవహించబోతున్నపుడు తొలగించజాలవు. ఈ విషయం మనస్సున గ్రహించి నరుడు జీవించాలి. జీవిత మెప్పుడూ ఈ విధంగానే ఏకరీతిలో కొనసాగదని గ్రహించి జీవించుము దేవరాజా!

విశేషం: పురుషకారం దైవం ముందు దిగదుడుపు అనే విషయం గ్రహించాలి నరుడు.

క. నిను నే గెలుచుట కాలము । నన నీవును గాలయుక్తి నను గెలిచితి; గా
వున నశుభమునకు శుభమున । నకు గాలము సూవె కర్త కుశికతనూజా! 430

ప్రతిపదార్థం: కుశిక తనూజా!= ఓ కుశికుడి కుమారుడా! - ఇంద్రుడా!; నినున్= దేవతలరాజు వైన నిన్ను; నేన్= రాక్షసరాజునైన నేను; గెలుచుట= జయించటం; కాలముననన= కాలవశముననే; నీవును= నీవు కూడా; కాలయుక్తిన్= కాలముయొక్క కలయికతో- కాలం కలసిరాగా; ననున్+గెలిచితి(వి)= నన్ను జయించావు; కావునన్= కాబట్టి - మన జయాపజయాలు కాలాధీనాలు కాబట్టి; అశుభమునకున్= కీడునకు; శుభముననకున్= మేలునకును; కర్త - చేయునది; కాలము+చూవె= కాలం సుమా

తాత్పర్యం: పూర్వం దేవేంద్రుడ వైన నిన్ను రాక్షసరాజునైన నేను జయించాను. దానికి కర్త కాలమే తప్ప, నిజానికి నేను కాదు. ఆ విధంగానే నీవూ నన్ను గెలిచావు అనంతరకాలాన. దానికీ కర్త కాలమొక్కటే! నరుడికి వాటిల్లే శుభాశుభాలు రెండింటికీ కాల మొక్కటే కర్త తప్ప నరుడు కాబోడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. నాకు నీకు నేల నాకేశ! శత్రుత్వ । మేరి కైనఁ గలదె యెందుఁ? బాక
మునకుఁ దెచ్చుచుండు జనులఁ గాలము వృక్ష । ఫల విధముగ రజ్జు పలుకు లుడుగు.' 431

ప్రతిపదార్థం: నాక+ఈశ!= స్వర్గాధిపతీ! నాకున్+నీకున్= నాకూ, నీకూ; శత్రుత్వము+ఏల?= వైరం ఎందుకు?; ఎందున్= ఎక్కడనైననూ; ఏరికిన్+ఐనన్= ఎవరికైనా; కలదే?= ఉన్నదా? (శత్రుత్వం); కాలము= కాలం - కాలశక్తి; జనులన్= నరులను; వృక్షఫల విధముగన్= చెట్టుపండు రీతిగా - చెట్టున ఏర్పడిన కాయ పండైన విధాన; పాకమునకున్= పరిణతికి - పండే స్థితికి; తెచ్చుచున్+ఉండున్= తెస్తూ ఉంటుంది; రజ్జు పలుకులు= వ్యర్థ భాషణములు - కొరగాని పలుకులు; ఉడుగు(ము)= మానుము.

తాత్పర్యం: ఓ స్వర్గాధిపతీ! దేవేంద్రా! నీకూ నాకూ విరోధ మెందుకు? నీకూ నాకే కాదు, లోకాన ఎవరికైనా ఎక్కడైనా స్వతస్సిద్ధమైన వైరభావ మున్నదా! లేదు. అంతా కాలమహిమ! కాలమే నరులను పరిణతివైపు ప్రయాణింపజేస్తూ ఉంటుంది. చెట్టున పండిన కాయ పండుగా పరిణతిని కాలక్రమాన పొందినట్లుగానే నరుడూ పరిపాకంవైపు నడుస్తుంటాడు కాలప్రభావంవలన. అంతే తప్ప, నీవూ నేనూ కర్తలమనటం కొరగాని మాట. కాబట్టి వ్యర్థ భాషితాలు మానుము'.

వ. అని చెప్పి యంత నిలువక. 432

ప్రతిపదార్థం: అని= పై విధంగా; చెప్పి= పలికి; అంతన్= అంతటితో; నిలువక= ఆగకుండా (బలి తన హితవచనాలు ముగించి, అంతటితో ఆగకుండా.)

తాత్పర్యం: బలి ఇంకా తన భాషణాన్ని ఇట్లా సాగించాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'కా దిది విక్రమకాలము । లే దిప్పుడు నాకు నలుక లీలాత్మక రో
షాదరము గలిగినను నిను । నీ దగు పరిజనముఁ గూల్పనే పెడసేతన్?' 433

ప్రతిపదార్థం: ఇది= ఇపుడు నేనున్న ఈ సమయం; విక్రమకాలము= విక్రమించు పరాక్రమించే సమయం; కాదు= కాదు; ఇప్పుడు= ఈ సమయాన; నాకున్= నాకు - నీనుండి ఓటమిపొందిన నాకు; అలుక= కోపం; లేదు= కలుగదు; లీలా+ఆత్మక రోష+ఆదరము= వినోదాత్మకమైన - నిజం కాని క్రోధము నందు గౌరవం - ప్రీతి; కలిగినను= (నాలో) పుట్టినా; నినున్= నిన్నూ; నీది+అగు= నీకు చెందిన; పరిజనమున్= సేవక జనులను; పెడ+చేతన్= చేతి వెనుక భాగంతో; కూల్పనే?= నశింపజేయనా?

తాత్పర్యం: 'ఓ దేవేంద్రా! ఇపుడు నే నున్న ఈ కాలం పరాక్రమించటానికి అనువైనది కాదు. నాకు నీపై కోపమూ లేదు. అట్లాకాకుండా వినోదంకోసమైనా నాలో నీయెడ రోషావేశం జనించినా, నిన్నూ నీ తోడి జనాన్నీ నా పెడచేతితోనే కూల్చివేసేవాడను'.

వ. అని పలికి వెండియు. 434

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికి= చెప్పి; వెండియున్= మరియూ.

తాత్పర్యం: ఈ విధంగా పలికిన బలి, ఇంకా చెప్పుతున్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'సరి పెంపునఁ గడునొప్పెదు । సురనాయక! యిపుడు మీఁదఁ జూచెదు నీకుం
బరిభవము దెచ్చుటకునై । కరము వెసన్ వచ్చు చేటుకాలము తెఱఁగున్. 435

ప్రతిపదార్థం: సురనాయక!= ఓ దేవతలరాజా!; సరిపెంపునన్= సమానమైన అభివృద్ధితో; కడున్+ఒప్పెదు= ఎక్కువగా ప్రకాశిస్తున్నావు; ఇపుడు= ఈ కాలాన - ఈ పెంపుగల సమయాన; మీఁదన్+చూచెదు= పైకి చూస్తున్నావు; నీకున్= నీకు కూడా (నాకువలెనే); పరిభవము= అవమానం; తెచ్చుటకున్+ఐ= తేవటంకొరకే; చేటుకాలము తెఱఁగున్= చెడుకాలం యొక్క పద్ధతి - చెడుకాలం; కరము= మిక్కిలి; వెసన్= వేగంగా; వచ్చున్= రాగలదు.

తాత్పర్యం: 'ఓ దేవతలరాజా! నేడు మంచి అభివృద్ధితో ఎంతగానో ఒప్పులకుప్పవై వెలుగుతున్నావు. పైకి చూస్తూ ఉన్నావు. గర్వించి, ఇతరులయెడ అనాదరంతో వెలుగుతున్నావు. కాని, చేటుకాలం నిన్ను అవమానించటంకొరకు మిక్కిలి వేగంతో సమీపించబోతూ ఉన్నది.

తే. ఇంద్రు లెందఱు వో? రింద్రు లేల? బ్రహ్మ । లుండుదురె? తఱితోఁ దెగుచున్న వారు
గాక దానవసంఘంబు గాలవశతఁ । బొందు టేటికి నెగ్గింపఁ? బొమ్ము నీవు. 436

ప్రతిపదార్థం: ఇంద్రులు= దేవతలరాజులు; ఎందరు+పోరు?= ఎంతమంది వెళ్ళిపోరు? - ఎందరో గతించారు; ఇంద్రులు+ఏల?= ఇంద్రులే ఎందుకు?; బ్రహ్మలు= ఇంద్రులకంటె పైవారయిన బ్రహ్మనామక దేవతలు మాత్రం - సృష్టికర్తగా చెల్లేవారు మాత్రం; ఉండుదురె?= ఉంటారా?; తఱితోన్= సమయంతో - కాలంతో; తెగుచున్+ఉన్నవారు+కాక= నశిస్తూ ఉన్నారు తప్ప; దానవసంఘంబు= రాక్షసుల సమాజం; కాలవశతన్= కాలానికి వశం అగుటను; పొందుట= చెందటం - కాలవశత్వాన్ని పొందుటను; ఎగ్గింపన్+ఏటికిన్?= నిందింప నేల?; నీవు= సురేంద్రుడ వైన నీవు; పొమ్ము= వెడలిపొమ్ము - వీడిపొమ్ము.

తాత్పర్యం: కాలప్రవాహంలో ఇంద్రులు ఎందరో గతించారు. ఇంద్రులే ఏమిటి? బ్రహ్మలు మాత్రం నిలుస్తారా? వారూ, తమ కాలం చెల్లిన వెంటనే నశించిపోతున్నారు. ఈ విధంగా కాలంముందు సృష్టికర్తలైన బ్రహ్మలకే స్వతంత్రమైన ఉనికి లేనప్పుడు, ఇక రాక్షససమాజ మేదో కాలానికి లొంగి ఉంటే, ఆ దశను చూచి వారిని నిందించటమెందుకు? ఓ దేవరాజా! నీవు వెళ్ళిపొమ్ము.

క. క్రతువులు సేఁతయు, దేవ । వ్రతములు సల్పుటయు, వృత్తవంతుఁ డగుటయుం
గతమే కాలము ద్రోచుట? । కతర్క్యవర్తనము గాల మది గొనదు సుమీ!' 437

ప్రతిపదార్థం: క్రతువులు= యజ్ఞాలు; చేఁతయున్= చేయటమూ; దేవవ్రతములు= దేవతలకై వ్రతాలు - పూజాపురస్కారాలు; చల్పుటయున్= చేయుటమూ; వృత్తవంతుఁడు+అగుటయున్= చరిత్ర (మంచినడత) కలవాడు కావటం; కాలము+త్రోచుటకున్= కాలం పడవేయుటకు - నెట్టివేయుటకు - హీనదశకు చేర్చుటకు; కతమే?= కారణమా? (కాదు); కాలము= క్షణాలు - గంటలు- దినాలు - వత్సరాలుగా సాగిపోయే సమయం; అతర్క్యవర్తనము= ఊహించరాని ప్రవర్తనంగలది - ఊహ కందని నడతగలది; అది= ఆ కాలం; కొనదు+చుమీ!= గ్రహించదు సుమా! (ఇక్కడ కర్మ పదం లేదు. 'దేనినీ' గ్రహించదు అని అనుకొనాలి).

తాత్పర్యం: యజ్ఞాలూ, వ్రతాలూ నిర్వహించటం, శీలవంతుడై జీవించటం వంటి విషయాలు కాలగతిని మార్చలేవు. కాలగతికి అవి కారణాలు కాజాలవు. కాలప్రవర్తన ఊహ కందనిది. కాలం దేనినీ సరకుగొనదు; అన్నీ దానికి లొంగవలసినవే కాని, అది దేనికీ లొంగేది కాదు'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అని యిట్లాడిన మాటలు । విని దనుజునిఁ జూచి యమరవిభుఁ డుల్లములో
నన సంరంభంబు నుడిపి । కొనుచు నతని కిట్టు లనియెఁ గురువంశవరా! 438

ప్రతిపదార్థం: కురువంశవరా!= కౌరవ వంశాన శ్రేష్ఠుడా! ధర్మరాజా!; అని= పై విధంగా; ఇట్లు+ఆడిన మాటలు= ఈ విధంగా పలికిన పలుకులు; విని= ఆలకించి; దనుజునిన్= రాక్షసుడిని - బలిని; చూచి= కనుగొని; అమరవిభుఁడు= దేవరాజు - ఇంద్రుడు; ఉల్లములోనన్+అ= మనస్సునందే; సంరంభంబును= తొట్రుపాటును; ఉడిపికొనుచున్= పాపుకొంటూ - తొలగించుకొంటూ; అతనికిన్= ఆ బలికి; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా పలికి బలిని చూచి, దేవేంద్రుడు మనసులోనే తన తొట్రుపాటును అణచుకొంటూ ఇట్లా పలికాడు.

విశేషం: బలి మాటలకు ఇంద్రుడు సంరంభం పాలైనట్లు భారతకర్త వాకొంటున్నాడు. ఆ తొట్రుపాటు బలికి గల జ్ఞానసంపత్తిని చూచి కావచ్చును. లేక 'లీలగా ఆగ్రహం కలిగినా నిన్నూ నీ వారిని పెడచేతితో కూలుస్తాను - అన్న అతడి స్థైర్యానికీ కావచ్చు.

క. 'అకట! భవచ్చిత్తము ని । ర్వికారమై భరితధృతి వివేకవినయశాం
తిక మగుచు వెలింగెడు దీ । నికిఁ గారణమైన నిష్ఠ నెఱి యెట్టిదియో!' 439

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; భవత్+చిత్తము= నీ మనస్సు; నిర్+వికారము+ఐ= వికృతులు లేనిదై; భరిత= నిండిన; ధృతి= ధైర్యం; వివేక= తెలివి; వినయ= అణకువ; శాంతికము= శాంతిగలది; అగుచున్= అవుతూ; వెలింగెడున్= ప్రకాశిస్తున్నది; దీనికిన్= ఈ స్థితికి; కారణము+ఐన= హేతువైన; నిష్ఠ= పట్టుదల; నెఱి= ధర్మం; ఎట్టిది+ఓ!= ఏ విధమైనదో!.

తాత్పర్యం: 'ఓ బలీ! నీ మనస్సు వికారాలకు దూరంగా, ధైర్యం, వివేకం, వినయం, శాంతి - అనే ఈ సద్గుణాలకు నిలయంగా వెలుగుతూ ఉన్నది. మరి ఈ నిర్వికారస్థితికీ, సౌశీల్యశాంతులకూ కారణమైన ఆ అభినివేశం ఎటువంటిదో! ఆ ధర్మం ఏ పాటిదో!'

విశేషం: ఇక్కడ ఇంద్ర వచనంలో 'అకట' అనే దుఃఖసూచక పదం కనిపిస్తున్నది. అది నిజంగా నిర్వేదానికి వాచకమే. ఇంద్రుడు ఈ గొప్ప లక్షణాలు తన విరోధిలో ఉండి, తనలో లేకపోవటానికి లోలోన దుఃఖిస్తూ అన్న మాటగా ఉన్నది అది.

క. అనిన నతఁ డతని కిట్లను । 'విను మనిషనాథ! యేను వేఱొకచోటం
గొని వచ్చితినే చిత్తం । బున కవికృతి ధృతి వివేక ముఖ్య గుణంబుల్? 440

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అతఁడు= ఆ బలి; అతనికిన్= ఆ ఇంద్రుడికి; ఇట్లు+అనున్= ఈ విధాన చెప్పాడు; అనిమిషనాథ!= రెప్పపాటులేనివారికి - దేవతలకు రాజా! - ఇంద్రుడా!; వినుము= ఆలకించుము; ఏను= నేను; చిత్తంబునకున్= మనస్సునకు; అవికృతి ధృతి వివేక ముఖ్య గుణంబుల్= వికారం లేకపోవటం, ధైర్యం, జ్ఞానం - మొదలయిన గుణాలను లక్షణాలను; వేఱు+ఒకచోటన్= వేరే ఇతర స్థలంనుండి; కొని= తీసికొని; వచ్చితినే?= వచ్చానా? (కాదు).

తాత్పర్యం: ఇంద్రుడి ప్రశ్న విన్న బలి అతడితో ఇట్లా అన్నాడు. 'ఓ దేవతలరాజా! వినుము. నేను నా చిత్తానగల గుణాలు - నిర్వికారత, ధైర్యం, జ్ఞానం మొదలయిన వాటిని వేరొకచోటునుండి తీసికొని వచ్చానా? కాదు. అవి నాలో స్వతః ఏర్పడినవే.

వ. కాలప్రకారం బెఱుంగుదుం గావునఁ గలంగ కుండుదు. 441

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కాలప్రకారంబు= కాలముయొక్క రీతి - విధానం - ప్రవర్తించే తీరు; ఎఱుంగుదున్= తెలియుదును; కావునన్= కాబట్టి; కలంగక+ఉండుదున్= కలతచెందకుండా ఉంటాను.

తాత్పర్యం: నేను కాలతత్త్వాన్ని, అది ప్రవర్తించే తీరుతెన్నులను గ్రహించినవాడను కాబట్టి, నిర్వికారంగా ధైర్యంతో ఉంటాను.

తే. చెప్పుచున్నాఁడఁ గాలంబుచేత నెల్ల । విధముఁ జొప్పడు జనులకు వినుము కాల
మప్రమాదవర్తన మధిక ప్రమాద । సంగమత్తులు వా రెట్లు భంగపడరు? 442

ప్రతిపదార్థం: చెప్పుచున్+ఉన్నాఁడన్= పలుకుతున్నాను; కాలంబుచేతన్= కాలంవలన; జనులకున్= నరులకు; ఎల్లవిధమున్+చొప్పడున్= అన్ని తీరులూ కలుగుతాయి; వినుము= ఆలకించుము; కాలము= సమయం; అప్రమాద వర్తనము= పరాకులేని ప్రవర్తన - నడవడి కలది; అధిక ప్రమాద సంగమత్తులు= ఎక్కువ పరాకు కలయికతో మదించినవారు; వారు= జనులు; ఎట్లు భంగపడరు?= ఏ విధంగా (కాలంచేతిలో) భంగపాటు చెందకుండా ఉంటారు? ఉండలేరు - తప్పకుండా భంగపడితీరుతారు.

తాత్పర్యం: ఓ దేవేంద్రా! చెప్పుతున్నాను వినుము. కాలంవలననే నరులకు అన్ని తీరులూ, ఎల్ల అవస్థలూ, సకలదశలూ కలుగుతాయి. కాలం ప్రమాదమెరగకుండా జాగరూకతతో ప్రవర్తిస్తూ ఉంటుంది. దాని గమనంలో పరాకుకు స్థానం లేదు. అయినప్పుడు అధికప్రమాదాలలో పడి మత్తులయినవారు కాలంనుండి భంగపడకుండా ఎట్లా తప్పించుకుంటారు? తప్పించుకొనలేరు.

క. కళలుం గాష్ఠలు లోనుగఁ । గల చిదురులఁ గూర్చుకొనుచుఁ గాలంబు జనం
బుల వడ్డికిచ్చు నాతని । వల నలవడఁ బొదివి తనకు వశ్యులఁ జేయున్. 443

ప్రతిపదార్థం: కాలంబు= కాలం; కళలున్= ముప్పై కాష్ఠల భాగాలును - కాలపు చిన్నముక్కలును; కాష్ఠలున్= పద్దెనిమిది రెప్పపాట్ల కాలాలూ - కాలపు మరీ చిన్న ముక్కలును; లోనుగన్= లోపల కాగా; కల చిదురులన్= ఉన్న ముక్కలను; కూర్చుకొనుచున్= చేర్చుకొంటూ; జనంబులన్= జనులను; వడ్డికి+ఇచ్చు+ఆతని వలను= వడ్డీకి (డబ్బు) ఇచ్చేవాడి తీరు; అలవడన్= అలవాటుగా కాగా; పొదివి= వ్యయం చేయక ఉండి; తనకున్= తనకు (కాలానికి); వశ్యులన్+చేయున్= వశమయ్యే వారినిగా చేస్తుంది.

తాత్పర్యం: కాలస్వరూపాన పెద్దముక్క సంవత్సరమైతే, చిన్నముక్క కళ. కళ అంటె ముప్పై కాష్ఠల ప్రమాణంగల కాలం. కాష్ఠమనేది కళకంటె చిన్నదైన కాలపుముక్క. పద్దెనిమిది రెప్పపాట్లకాలం ఒక కాష్ఠ. కాలం ఈ చిన్న, మిక్కిలి చిన్న ముక్కల రూపాన తనను తాను సమకూర్చుకుంటూ, పెరిగి, ఇంకా పెరిగి పెరిగి చివరకు జగత్తునే కబళిస్తుంది. చిన్న చిన్న శకలాల రూపాన పెరిగి పెరిగి పెద్దదయ్యే కాలం ఒక వడ్డీ వ్యాపారివంటిది - వడ్డీవ్యాపారి కూడా చిన్న చిన్న మొత్తాలతో ప్రారంభించి, పెద్ద పెద్ద మిక్కిలి పెద్ద మొత్తానికి అధిపతి అవుతాడు. కాలమూ అంతే. ముందు కాష్ఠలతో అనంతరం కళలతో, నిమిషాలతో, గంటలతో, దినాలతో. . . . అట్లా పెరిగి పెరిగి చివరకు విశ్వంభరగా లోకమంతా తానే అయి సర్వస్వాన్నీ స్వాధీనంచేసికొంటుంది. నరులందరూ ఆ విధంగా చివరకు కాలాధీనులై పోతారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ. కాలం తనను తాను పెంచుకొంటూ పోయే విధానాన్ని తేటతెల్లంగా చెప్పదలచి భారతకర్త ఇక్కడ వడ్డీవ్యాపారిని పోలికగా చూపాడు. ప్రారంభం అల్పంగా ఉండి, పరిసమాప్తి అనూహ్యపరిమాణంలో మిక్కిలి పెద్దదిగా ఉండే విషయాన్ని చెప్పటానికి ఈ పోలిక ఉచితమే. పైగా ఈ పెరుగుదల ఎట్ట ఎదుటే జరుగుతుంటుంది. అయినా నరుడు పట్టించుకొనడు. ఆధ్యాత్మవిషయావగాహనకు లౌకిక ఉపమాన స్వీకారం జరిగింది ఇక్కడ.

క. కాల మడఁగించుఁ జనుఁ గ । ల్లోలిని గిరిఁ ద్రెంచుకరణి లోభక్రోధా
శీలత్వ కామ భయములఁ । దేలు జనుఁడు కాలవృత్తి తెఱఁగు నెఱుఁగునే? 444

ప్రతిపదార్థం: కాలము= సమయం; జనున్= నరుడిని; కల్లోలిని= నది; గిరిన్+త్రెంచు కరణిన్= కొండను కోసే విధంగా; అడఁగించున్= నశింపజేస్తుంది; లోభ క్రోధ+అశీలత్వ కామ భయములన్= పేరాస, రోషం, శీలహీనత, కోరిక, భీతి - ఇన్ని దుర్గుణాలలో; తేలు= పడి కొట్టుకొనే; జనుఁడు= నరుడు; కాలవృత్తి తెఱఁగున్= కాలముయొక్క ప్రవర్తన విధానమును - కాలం ప్రవర్తించే తీరును; ఎఱుఁగునే?= గ్రహించునా? (గ్రహించడు).

తాత్పర్యం: కాలం ఒక నది. అది నిరంతర ప్రవాహశీలి. నది తన ప్రవాహవేగంతో కొండను కోసివేసి, తన దారిని తానూ సాగిపోతుంది. కాలమూ అంతే. తన గమనంతో నరుడిని లోగొని అణచివేస్తుంది. అయితే నరుడు మాత్రం ఈ వాస్తవాన్ని గ్రహించటంలేదు. అతడు తన దుర్గుణవలయంలో పడి కొట్టుకొంటూ ఉన్నాడు. లోభమూ, క్రోధమూ, శీలరాహిత్యమూ, కామమూ - అనే దుర్గుణాలలో చిక్కుకొని, భయవిహ్వలుడై బ్రతుకుతూ కాలప్రవృత్తిని గమనించలేకున్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. ఇంతకు మును సూచితి నతఁ । డెంతయు నొప్పుగొని యుండె; నిది గడుఁ జిత్రం;
బింత వెసఁ జచ్చె ననుఁ దనుఁ । జింతింపఁడు జనుఁడు మూఢచిత్తత్వమునన్. 445

ప్రతిపదార్థం: జనుఁడు= నరుడు; ఇంతకు మును= ఇంతకు పూర్వం; చూచితిన్= చూచాను; అతఁడు= ఆ నరుడు (ఒకానొకడు); ఎంతయున్= ఎంతగానో - ఎక్కువగా; ఒప్పు+కొని= గుణం కలిగి; ఉండెన్= (జీవించి) ఉన్నాడు; ఇది= ఈ విషయం; కడున్+చిత్రంబు= మిక్కిలి విచిత్రం; ఇంత వెసన్= ఇంత వేగంగా; చచ్చెన్= చనిపోయాడు; అనున్= అని పలుకుతారు; మూఢచిత్తత్వమునన్= జ్ఞానహీనమైన మనస్సువలన; తనున్= తనను గురించి; చింతింపఁడు= ఆలోచించడు.

తాత్పర్యం: నరుడు కాలమహిమను గమనించలేక, అపుడపుడు జరిగే హఠాత్ సంఘటనలను చూచి, 'ఇంతకుముందే చూచానే, చాలా బాగా ఉన్నాడు, మరీ విచిత్రంగా ఉన్నది, ఇంత త్వరగా పోయాడే!' అంటూ ఇతరులగూర్చి ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ ఉంటాడు. అతడి చిత్తం వివేకవిహీనం కాబట్టి, ఆ విధంగా తలపోస్తున్నాడు తప్ప నిజానికి ఆ సంఘటన తనకూ ఎంతో దూరాన లేదు. అయితే ఆ ఆలోచనే అతడికి రాదు.

క. విను భావాభావంబులు । గని యత్యుత్తమ తపంబు గైకొను విద్వ
జ్జనుఁడు గనుఁ గాలగతి యె । ల్లను గరతలశోభితామలకముం బోలెన్. 446

ప్రతిపదార్థం: విను= ఆలకించుము ఇంద్రా!; భావ+అభావంబులు= ఉనికి, లేములు - ఉండుట - ఉండకుండుటలు; కని= గ్రహించి; అతి+ఉత్తమ తపంబు= మిక్కిలి శ్రేష్ఠమైన తపస్సు; కైకొను= స్వీకరించే - చేసే; విద్వత్+జనుఁడు= విద్వాంసుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

- జ్ఞాని; కాలగతి+ఎల్లను= కాలముయొక్క పోకడ మొత్తమును; కరతల శోభిత+ఆమలకమున్+పోలెన్= అరచేత శోభించే (కల) ఉసిరిక కాయనువలె; కనున్= చూస్తాడు.

తాత్పర్యం: నరుడు తొలుత అంతర్ముఖుడై (తనలోనికి తాను చూచుకొనేవాడై) భావాన్ని, అభావాన్ని గ్రహించాలి. ఉనికిని, లేమిని తెలిసికొనాలి. అనంతరం మిక్కిలి ఉత్తమరీతిలో తపస్సును ఆచరించాలి - తీవ్రమయిన జిజ్ఞాసతో నిరంతర తపనతో కాలతత్త్వాన్ని అన్వేషించాలి. అపుడు నరుడు విద్వాంసు డౌతాడు. అతడికి కాల ప్రవృత్తి మొత్తమూ అరచేత నుంచుకొన్న ఉసిరికకాయవలె స్పష్టంగా నిస్సందేహంగా గోచరిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

క. కాలగతి గనుట శాంతికి । మూలంబై యంతరంగమున కాత్మమయ
త్వాలంబనంబు నిచ్చుఁ ద । దాలీనుండైన పురుషుఁ డక్షోభ్యుఁ డగున్.' 447

ప్రతిపదార్థం: కాలగతి= కాలపు నడకను; కనుట= చూడటం - గ్రహించటం; శాంతికిన్= మనస్సుయొక్క శాంతికి - వికారాలు లేకుండుటకు; మూలంబు+ఐ= కారణమై; అంతర్+అంగమునకున్= లోపలి అవయవమునకు - మనస్సునకు; ఆత్మమయత్వ+ఆలంబనంబున్= ఆత్మమయత్వం - తాను ఆత్మ తప్ప శరీరం కాదనే తత్త్వం అనే ఆధారమును - ప్రాపును; ఇచ్చున్= ఒసగును; తద్+ఆలీనుండు+ఐన= దానిని అంటి ఉన్నవాడు; పురుషుఁడు= నరుడు; అక్షోభ్యుఁడు+అగున్= క్షోభింప దగనివాడు - క్షోభకు గురికాజాలనివాడు ఔతాడు.

తాత్పర్యం: కాలపు నడకను గ్రహించటం మనశ్శాంతికి కారణమౌతుంది. మనస్సునకు 'తాను ఆత్మగాని, శరీరం కాదు' అనే ఆత్మమయత్వ భావనను బాసటగా అందిస్తుంది. ఆ భావనను అందుకొన్న నరుడు క్షోభకు అతీతుడుగా మారిపోతాడు'.

వ. అనిన విని పాకశాసనుం డతని వివేకపాకంబున కచ్చెరువొంది యభినందించి యతని కిట్లనియె.448

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; పాకశాసనుండు= స్వర్గపాలకుడు - ఇంద్రుడు; అతని వివేకపాకంబునకున్= ఆ బలియొక్క జ్ఞానపరిణతికి - పండిన జ్ఞానానికి; అచ్చెరువు+ఒంది= ఆశ్చర్యం పొంది; అభినందించి= ప్రశంసించి; అతనికిన్= ఆ బలికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇంద్రుడు బలికిగల జ్ఞానపరిపాకానికి చకితుడై, అతడిని మెచ్చుకొని, ఇట్లా అన్నాడు.

ఆ. 'దనుజనాథ! యివ్విధంబునఁ గాల చా । రిత్రవేదివై పవిత్రశీల
యుతుఁడ వైతి; నీవు కృతకృత్యుఁడవు; నీదు । వృత్తి గోరవలయు నుత్తములకు. 449

ప్రతిపదార్థం: దనుజనాథ!= ఓ రాక్షసరాజా!; ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; కాలచారిత్ర వేదివి+ఐ= కాలముయొక్క నడతను గ్రహించినవాడవై; పవిత్రశీల యుతుఁడవు+ఐతి(వి)= పావనమైన స్వభావంగలవాడవు అయినావు; నీవు= జ్ఞానివైన నీవు; కృతకృత్యుండవు= చేయబడిన పనిగలవాడవు - చేయవలసినదానిని చేసినవాడవు - ప్రయోజనం నెరవేరినవాడవు; ఉత్తములకున్= శ్రేష్ఠనరులకు; నీదు వృత్తి= నీ యొక్క ప్రవర్తనం - నడత - జీవనం; కోరవలయున్= కోరుకొనదగింది - అనుకరించదగింది.

తాత్పర్యం: 'ఓ దానవరాజా! బలీ! నీవు కాలపు నడకను - అతిగహనమైన దానిని గ్రహించావు. పావనమైన శీలం కలిగి, నిర్మలజీవనం గడపుతున్నావు. నీవు కృతకృత్యుడవు. నీవు చేయవలసినది ఇక ఏదీ మిగిలిలేదు. నీ నడత, నీ జీవనం ఉత్తమమానవులకు శిరోధార్యమై వెలుగుతున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **లోక మెల్లను నఱచేతిలోన నున్న । యట్లు గనుగొని సత్త్వాదులైన మూఁడు**
గుణములను బాయఁ బెట్టి నిర్గుణత వెలుఁగు । నాత్మఁ గనుచున్నవాఁడ; వే మందు నిన్ను! **450**

ప్రతిపదార్థం: లోకము+ఎల్లను= జగత్తునంతటినీ; అఱచేతిలోనన్= చేతి మధ్యభాగాన - హస్తంలోపల; ఉన్న+అట్లు= ఉన్న విధంగా; కనుఁగొని= చూచి; సత్త్వ+ఆదులు+ఐన= సత్త్వం (రజస్సు తమస్సు అనేవి) మొదలైన; మూఁడు గుణాలను= త్రిగుణాలను; పాయన్+పెట్టి= పోగొట్టి - తొలగించికొని; నిర్+గుణతన్= గుణాలు లేనితనంతో; వెలుఁగు= ప్రకాశించే; ఆత్మన్= అంతరాత్మను; కనుచున్+ఉన్నవాఁడవు= చూస్తూ ఉన్నావు; నిన్నున్= ఇట్టి ఆత్మ దర్శివైన నిన్ను; ఏమి+అందున్!= ఏమని అనేది! - ఏమని పొగడినా తక్కువే! - అంత ఎత్తునకు ఎదిగిపోయావు.

తాత్పర్యం: అరచేతిలో ఉన్న వస్తువును చూచినట్లుగా జగత్తు మొత్తాన్ని చూడగలుగుతున్నావు. నరుడికి జన్మసిద్ధాలయిన సత్త్వరజస్తమోగుణాలను, జన్మచక్రాన బంధించి త్రిప్పే గొప్ప సాధనాలను తొలగించుకొన్నావు. లోపల వెలిగే ఆత్మను - పరమాత్మకు ప్రతిబింబమైన దానిని దర్శిస్తున్నావు. ఇట్టి నిన్ను ఏమని పొగడేది!

క. **కెలనికిఁ జూడఁగ దైన్యా । కలనం బగుచున్న యిపుడు గదిరిన దశయుం**
దొలఁగుం గావుతఁ! గడుమే । లెలసి పరమసుఖముఁ బొందు మిచ్ఛావృత్తిన్.' **451**

ప్రతిపదార్థం: కెలనికిన్= దాపునకు - దగ్గరకు; చూడఁగన్= చూడటానికి; దైన్య+ఆకలనంబు+అగుచున్న= దీనత్వమును కూర్చుతున్న; ఇపుడు+కదిరిన= ఈ సమయాన కలిగిన; దశయును= అవస్థకూడా; తొలఁగున్+కావుతన్= విడిపోవుగాక; కడు మేలు+ఎలసి= గొప్పమేలు కలిగి; ఇచ్ఛావృత్తిన్= కోరికతోడి వర్తనంతో; పరమసుఖమున్+పొందుము= గొప్ప ఆనందమును అందుకొనుము.

తాత్పర్యం: నీవు కృతకృత్యుడ వైనావు, లోకతత్త్వంతోపాటు ఆత్మతత్త్వమూ బోధపడి ఆత్మదర్శనం కూడా చేస్తున్నవాడవు నీవు. అయినా దగ్గరగా చూచినపుడు, భౌతికంగా ఒక దీనదశ నీ చుట్టూ కనిపిస్తున్నది. అది కూడా తొలగిపోయి నీకు గొప్ప మేలు, అంతకంటె గొప్ప ఆనందమూ, నీ కోర్కెకు లోబడి కలుగుగాక!'

క. **అని పలికి యుచితముగ వీ । డ్కొని విభవం బెసఁగ నభ్రకుంజరము పయిన్**
వినువీథిఁ జనియె సురలును । మునులును వేష్టింప భూతములు వినుతింపన్. **452**

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికి= చెప్పి; ఉచితముగన్= తగినట్లుగా; వీడ్కొని= వీడ్కోలు పొంది - విడిచి; విభవంబు+ఎసఁగన్= ఐశ్వర్యం అతిశయించగా; అభ్రకుంజరము పయిన్= ఆకాశపుటేనుగుమీద - ఐరావతంమీద; వినువీథిన్= ఆకాశమార్గాన; సురలును= దేవతలూ; మునులును= ఋషులూ; వేష్టింపన్= చుట్టుకొనగా; భూతములు= ప్రాణులు; వినుతింపన్= ప్రశంసించగా; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: బలిని ఆ విధంగా అభినందించి, అతడికి ఇతోధికమైన శ్రేయస్సును, ఆనందాన్నీ ఆకాంక్షిస్తూ వీడ్కొని, దేవేంద్రుడు తన ఐశ్వర్యం అతిశయించగా ఆకాశపుటేనుగు నెక్కి, ఆకాశమార్గాన అమరులు, ఋషులు పరివేష్టించి రాగా, ప్రాణులు ప్రస్తుతించగా పయనమై పోయాడు.

తే. **అమృతపానంబుఁ జేసిన యంతకంటె । నద్దనుజపతి మధురవాక్యామృతమున**
సంభృతానందుఁడై సురేశ్వరుఁడు దనదు । పురమునకు నేఁగి సుఖముండెఁ గురువరేణ్య!' **453**

ప్రతిపదార్థం: కురువరేణ్యా!= ఓ కురుశ్రేష్ఠుడా! ధర్మరాజా!; సుర+ఈశ్వరుండు= దేవతలరాజు; అమృతపానంబున్=అమృతమును తాగుటను; చేసిన+అంతకంటెన్= చేసినప్పటికంటే కూడా; ఆ+దనుజపతి మధురవాక్య+అమృతమునన్= ఆ రాక్షసరాజు బలి యొక్క తీయని మాటలు అనే అమృతంవలన; సంభృత+ఆనందుఁడు+ఐ= బాగుగా నిండిన ఆనందం కలిగినవాడై; తనదు పురమునకున్= తనయొక్క పట్టణానికి - అమరావతికి; ఏఁగి= వెళ్ళి; సుఖము+ఉండెన్= సుఖంగా ఉన్నాడు.

తాత్పర్యం: బలి సల్పిన సంభాషణం ఇంద్రుడికి అమృతపానంచేసినప్పటికంటె కూడా అధికమైన తృప్తిని, ఆనందాన్ని కలిగించింది. బలి మాటలు ఇంద్రుడి పాలిట అమృతాధికమైన పానీయంగా మారాయి. ఆ దేవేంద్రుడు బలి వాగమృతంతో కలిగిన అనుభూతిని మోసుకొంటూ అమరావతికి చేరి సుఖంగా ఉన్నాడు'.

వ. అని యిట్లు ధర్మతనయునకు భీష్ముండు పునర్భూతంబైన యింద్రబలి సంవాదంబు సెప్పె నని చెప్పిన విని మఱి యేమి సత్కథలు సెల్లెఁ? జెప్పుమని యడుగుటయు. 454

ప్రతిపదార్థం: అని= పై విధంగా; ఇట్లు= ఈ ప్రకారంగా; ధర్మతనయునకున్= ధర్మరాజునకు; భీష్ముండు= భీష్ముడు; పునర్+భూతంబు+ఐన= మరల జరిగినదైన (పూర్వమొకటి జరిగి ఉన్నది); ఇంద్ర బలి సంవాదంబు= ఇంద్రుని బలి సంభాషణం; చెప్పెన్= తెలిపాడు; అని చెప్పినన్= అని పలుకగా (వైశంపాయనుడు కథకుడు); విని= ఆలకించి (జనమేజయుడు శ్రోత); మఱి+ఏమి= ఇంకను ఏ విధమైన; సత్ కథలు= మంచి వృత్తాంతాలు; చెల్లెన్?= జరిగాయి; చెప్పుము+అని+అడుగుటయున్= పలుకుము అని ప్రశ్నించటం జరిగిన తరువాత (అనంతర ఆశ్వాసాన కథాప్రారంభం).

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజునకు అతడి పితామహుడు భీష్ముడు మళ్ళీ రెండవసారి జరిగిన ఇంద్ర బలి సంవాదాన్ని వినిపించాడు - అని భారతామ్నాయానికి కథకుడైన వైశంపాయనుడు శ్రోత అయిన జనమేజయ మహారాజునకు తెలిపాడు. 'ఆ తరువాత ఇంకా ఏ సత్కథలు జరిగెనో చెప్పు'మని భారత ఇతిహాసశ్రోత అయిన జనమేజయుడు ఆ కథకుడిని అర్థించాడు. (ఆ తరువాత కథాక్రమం పంచమాశ్వాస ప్రారంభాన మొదలవుతుంది).

ఆశ్వాసాంతము

చ. పరమమునీంద్ర సంయమనపక్వ వివేకవిభూతి రమ్య! వి
స్తర మహనీయ తార్కిక వచః కలనా నభిగమ్య! దేవతా
సుర పరిరక్షణోన్మథన శోభి కటాక్ష విహార! నిత్య సుం
దర! శుభకాంతిపూర! దురితప్రవిదారణ! వీతకారణా! 455

ప్రతిపదార్థం: పరమ= గొప్ప; ముని+ఇంద్ర= ఋషిశ్రేష్ఠులయొక్క; సంయమన= తపస్సువలన; పక్వ= పండిన; వివేక= జ్ఞానం యొక్క; విభూతి= ఐశ్వర్యంతో; రమ్య!= అందమైనవాడా!; విస్తర= విశాలమైన; మహనీయ= ఘనమైన; తార్కిక వచః+కలనా= తర్కశాస్త్ర సంబంధి వాక్కుల జ్ఞానంచేత; న+అభిగమ్య!= పొందరానివాడా!; దేవతా= సురలయొక్క; అసుర= రాక్షసులయొక్క; పరిరక్షణ= సంరక్షణయందు; ఉన్మథన= రాపిడి - తీవ్రమైన కదలికతో; శోభి= ప్రకాశించే; కటాక్ష= క్రీగంటి చూపుయొక్క; విహార!= ప్రసారం కలవాడా!; నిత్య సుందర!= ఎప్పుడూ అందంగా ఉండేవాడా!; శుభకాంతిపూర!= క్షేమ (కర) ప్రకాశంతో నిండినవాడా!; దురిత ప్రవిదారణ!= పాపమును నశింపజేసేవాడా! (ఖండించేవాడా!); వీతకారణా!= నశించిన- పోయిన కారణం కలవాడా!

తాత్పర్యం: గొప్ప మునీంద్రుల నిగ్రహం వలన పరిపక్వమైన ప్రజ్ఞానసంపత్తితో సుందరంగా భాసించేవాడా! విస్తృతమూ మహనీయమూ అయిన తర్కశాస్త్ర పరిజ్ఞానానికి అందకుండా వెలిగేవాడా! సురాసుర సంరక్షణ శ్రమతో అలసిన అందమైన క్రీగంటిచూపుతో విహరించేవాడా! నిత్యనూతన సౌందర్యంతో, శుభావహమైన తేజస్సుతో,నిండి వెలుగులు చిమ్మేవాడా! చెడును సంహరించేవాడా! అన్నిటికీ స్వయంగా కారణమై ప్రకాశిస్తూ స్వతఃకారణంలేనివాడా!

విశేషం: హరిహరనాథుడు జ్ఞానలభ్యుడే కాని, తర్కప్రాప్యుడు కాడు, ఆయన దయకు మంచి మాత్రమే పాత్రంకాని, సురాసుర విభేదం కాదు.

క. **ఆదిత్యమరుద్వసు రు । ద్రాది సకలదేవతా మయాత్మక! శ్రీ సం**
పాదనవిధావిచక్షణ । పాద సరోజా! మహర్ధిభక్తసమాజా! 456

ప్రతిపదార్థం: ఆదిత్య= సూర్యుడు; మరుత్= మరుత్తులు; వసు= వసువులు; రుద్ర+ఆది= రుద్రులు మొదలైన; సకలదేవతామయ+ ఆత్మక!= ఎల్లరు దేవతలతో నిండిన ఆత్మకలవాడా!, ఆదిత్యులు మొదలయినవారు దేవతలలో భిన్నజాతులు; ఆ అందరి ఆత్మ తానే అయినవాడా! - హరిహరనాథా!; శ్రీ= సంపదను; సంపాదన విధా= సంపాదించే పనియందు; విచక్షణ= నేర్పుగల - సమర్థమైన; పాదసరోజా!= పద్మాలవంటి అడుగులు కలవాడా!; మహా+బుద్ధి భక్త సమాజా!= గొప్ప అభివృద్ధితోడి భక్తుల సమూహం కలవాడా!

తాత్పర్యం: దేవతలలోని విభిన్న జాతులయిన ఆదిత్యులు, మరుత్తులు, వసువులు, రుద్రులు మొదలయిన సకల దేవతలతో నిండిన ఆత్మకలవాడా! ఆ ఎల్లరు దేవతలను ఆత్మయందు ధరించేస్వామీ! సంపదలను సంపాదించిపెట్టే సమర్థతగల పాదపద్మాలు కలవాడా! గొప్ప అభివృద్ధి గల భక్త జనులకు ఆశ్రయ మైనవాడా! భక్తజన సందోహాలకు గొప్ప సమృద్ధులను అందించే దేవుడా!

మాలిని:

అమల హృదయవేద్యా! హవ్యకవ్య ప్రసాద్యా!
శమసుఖమయమూర్తీ! సర్వలోక ప్రవర్తీ!
కమలభవ నిషేవ్యా! కామదూరానుభావ్యా!
యమనియమవికాసీ! వ్యాసచేతో నివాసీ! 457

ప్రతిపదార్థం: అమల హృదయవేద్యా!= నిర్మల మనస్సుతో తెలిసికొనదగినవాడా!; హవ్యకవ్య ప్రసాద్యా!= దేవతల అన్నం (అమృతం)తో, పితృదేవతల అన్నంతో (పిండం) అనుగ్రహింపజేసుకోదగిన వాడా!; శమసుఖమయమూర్తీ!= శాంతి సౌఖ్యాలతో నిండిన ఆకారం కలవాడా!; సర్వలోక ప్రవర్తీ!= ఎల్లలోకాలను ప్రవర్తింపజేసేవాడా!; కమలభవ నిషేవ్యా!= బ్రహ్మచేత సేవింపదగినవాడా!; కామదూర+అనుభావ్యా!= మన్మథుడికి దూరమైన వారిచేత అనుభవించ దగినవాడా! - కామవాసనారహితులకు అగుపించేవాడా!; యమనియమ వికాసీ!= యమంతో, నియమంతో - నిగ్రహంతో, ఆచారంతో వికసించేవాడా!; వ్యాసచేతస్+నివాసీ!= వ్యాసుడి మనస్సున నివసించేవాడా!

తాత్పర్యం: నిర్మల మనస్కులకు (మాత్రం) తెలియదగినవాడా! దేవతల పితరుల అన్నములతో అనుగ్రహింపజేసుకో దగినవాడా! శాంతిసౌఖ్యాలే ఆకారంగా కలవాడా! ఎల్లలోకాలనూ నడిపించేవాడా! బ్రహ్మదేవుడి సేవలు అందుకొనేవాడా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మన్మథదేవుడికి దూరమైనవారికి (మాత్రం) అనుభవానికి వచ్చేవాడా! నిగ్రహాన్ని పాటిస్తూ ఆచారాన్ని అనుసరిస్తూ ఉన్నవారికి ప్రకాశించేవాడా! వ్యాసమహర్షి మనస్సునందు నివసించేవాడా! హరిహరనాథా!

గద్యము:

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కనసోమయాజి ప్రణీతం బైన శ్రీమహాభారతంబున శాంతిపర్వంబునందుఁ జతుర్థాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈ పర్వంలోని ఈ భాగం; శ్రీమత్+ఉభయకవిమిత్ర= శ్రీమంతుడైన - సిరిగల, ఇరువురు కవులకు - సంస్కృతాంధ్ర కవులకు మిత్రుడైన; కొమ్మన+ఆమాత్య పుత్ర= కొమ్మన మంత్రి కుమారుడైన; బుధ+ఆరాధన విరాజి= పండితుల సేవనంవలన ప్రకాశించెడి; తిక్కన సోమయాజి ప్ర+నీతంబు+ఐన= తిక్కన సోమయాజిచేత (సోమయజ్ఞంచేసిన వానిచే) రచించబడిన; శ్రీమహాభారతంబునన్= శుభకరమైన మహా భారతంలో - భారత గ్రంథమున; శాంతిపర్వంబునందున్= శాంతి అనే భాగాన (పర్వము= (చెరకు) గడ - భాగము - ఒక ముక్క); చతుర్థ+ఆశ్వాసము= నాలుగవ ఉపవిభాగం.

తాత్పర్యం: ఇది మంగళకరమైనది. ఉభయకవిమిత్రుడనే బిరుదం కలవాడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, పండితులను సేవించటంవలన ప్రకాశించేవాడూ (పండితులు గౌరవించటంవలన రాజిల్లేవాడూ) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలో శాంతిపర్వంలోని నాలుగవ ఆశ్వాసం.

శాంతిపర్వంలోని నాలుగవ ఆశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - పంచమాశ్వాసము

శ్రీ కరణ నిపుణ చరణ । వ్యాకోచాంభోజ నిత్య వాసముదిత సు
శ్లోకముని చిత్త భృంగ! మ । హాకరుణామిళదపాంగ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= మోక్షమును; కరణ= కలిగించటంలో; నిపుణ= సమర్థములైన; చరణ+వ్యాకోచ+అంభోజ= వికసించిన పద్మాలవంటి పాదాలయందు; నిత్య= నిరంతరమును; వాస= నివసించటంచేత; ముదిత= సంతోషించిన; సుశ్లోక= కీర్తిమంతులైన; ముని= జ్ఞానులయొక్క; చిత్త= మనస్సులకు; భృంగ!= తుమ్మెద అయినవాడా!; మహాకరుణా= గొప్పదయతో; మిళత్= కూడిన; అపాంగ!= క్రీకన్నులుకలవాడా!; హరిహరనాథా!= విష్ణుశంకర స్వరూపుడవైన ఓ ప్రభూ!

తాత్పర్యం: విష్ణుశంకర స్వరూపుడవైన ఓ దేవా! వికసించిన పద్మాలవంటి నీ పాదాలు; సదా నివసించటంచేత సంతోషించిన శ్రీమంతులకు, జ్ఞానులకు మోక్షమును ప్రసాదించటంలో నేర్పుగలవి. అట్టి వారి మనస్సులకు తుమ్మెదవైన ఓ ప్రభూ! గొప్ప దయతో కూడిన క్రీగంటి చూపులు గలవాడా!

విశేషం: అలం: ఉపమ. మునిచిత్త భృంగ అనుచో రూపకం.

శ్రీ శక్ర సంవాద ప్రకారము (సం. 12-221-3)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె నట్లింద్రబలిసంవాద రూపంబునఁ గాలప్రకారంబు విని యుధిష్ఠిరుండు దేవవ్రతునితోడ. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయనుడనే మహర్షి; జనమేజయునకున్= జనమేజయుడనే ఆ రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు; అట్లు= ఆ రీతిగా; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఇంద్రబలి సంవాదరూపంబునన్= ఇంద్రుడికి బలిచక్రవర్తికి జరిగిన సంభాషణ విధానాన్ని అనుసరించి; కాలప్రకారంబు= కాలముయొక్క స్వభావాన్ని; విని= ఆలకించి; దేవవ్రతునితోడన్= భీష్ముడితో.

తాత్పర్యం: హరిహరనాథా! వైశంపాయనమునీంద్రుడు జనమేజయ మహారాజుతో ఇట్లా అన్నాడు: ఆ విధంగా ధర్మరాజు ఇంద్రుడికీ, బలిచక్రవర్తికీ జరిగిన సంవాదపద్ధతి ప్రకారం కాలస్వరూపాన్ని గురించి విని భీష్ముడితో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఏమిట రూపగుఁ? బురుషుం । డేమెయిరూపు సెడు? నాకు నెఱిఁగింపుము తే
జోమహిత! యనిన నతఁ డా । భూమిపతికి నిట్టు లనియె భూపప్రవరా! 3

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తేజోమహిత!= తేజస్సుచేత పూజించబడినవాడా! పురుషుండు= జీవుడు; ఏమిటన్= దేనిచేత; రూపగున్?= వర్ధిల్లును?; ఏమెయిన్= ఏ విధంగా; రూపు చెడున్?= నశించును?; నాకున్; ఎఱిఁగింపుము= ఈ విషయం తెలియజేయుము; అనినన్= అని అడుగగా; ఓ జనమేజయ మహారాజా!; భూపప్రవరా!= రాజ శ్రేష్ఠుడవగు; అతఁడు= ఆ భీష్ముడు; ఆ భూమిపతికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: జీవుడు దేనివలన వృద్ధి పొందుతాడు? దేనివలన నశిస్తాడు? తేజోమాన్యుడ వైన ఓ భీష్మా! నా కీవిషయం బోధపడేటట్లు చెప్పుము' అని అడిగాడు. అప్పుడు భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: ఓ జనమేజయమహారాజా!

వ. 'ఇవ్విషయంబునకు నొక్క యితిహాసంబు శ్రీశక్రసంవాదం బనంగలదు. దానిం జెప్పెద నాకర్ణింపుము. నారదమునీశ్వరుం డెందును నిజేచ్ఛంజరియించుచుండి యొక్కనాఁడు మందాకినికిం జని కృతస్నానుండై. 4

ప్రతిపదార్థం: ఈ+విషయంబునకున్= ఈ అంశాన్ని స్పష్టం చేయటానికి; శ్రీ శక్రసంవాదంబు= లక్ష్మికి ఇంద్రుడికి జరిగిన సంభాషణం; అనన్= అనగా; ఒక్క ఇతిహాసంబు= ఒక పూర్వకథ; కలదు= ఉన్నది; దానిన్= ఆ కథను; చెప్పెదన్= వివరిస్తాను; ఆకర్ణింపుము= వినుము; నారదమునీశ్వరుండు= నారదమహర్షి; ఎందునున్= ఎల్లయెడల; నిజేచ్ఛన్= తన ఇచ్ఛచొప్పున; చరియించుచుండి= తిరుగుచుండి; ఒక్కనాఁడు= ఒకదినం; మందాకినికిన్= ఆకాశగంగానదికి; చని= పోయి; కృతస్నానుండు+ఐ= స్నానం చేసినవాడై.

తాత్పర్యం: ఈ విషయం వివరించటానికి 'శ్రీశక్ర సంవాదం' అనే తొల్లిటికథ ఒకటి ఉన్నది. దానిని చెప్పుతాను వినుము. నారదమునీంద్రుడు ప్రతిచోటా తన యిష్టం వచ్చిన విధంగా తిరుగుతూ ఒకనాడు ఆకాశగంగానదికి వెళ్ళాడు. అక్కడ స్నానం చేసి.

క. ఆ నదియం దాచరిత । స్నానుండై నియతినున్న శక్రుం గని య
చ్చో నయ్యిరువురు సల్లా । పానందముఁ బొందుచుండ నాకాశమునన్. 5

ప్రతిపదార్థం: ఆ నదియందున్= ఆ గంగలో; ఆచరిత స్నానుండు+ఐ= స్నానం చేసినవాడై; నియతిన్= నియమంతో; ఉన్న= వర్తిల్లిన; శక్రున్= ఇంద్రుడిని; కని= చూచి; అచ్చోన్(ఆ+చోటన్)= ఆచోట; ఆ+ఇరువురున్= వారిద్దరును; సల్లాప+ఆనందమున్= సంభాషణం వలన కలిగే సంతోషమును; పొందుచుండన్= అనుభవిస్తుండగా; ఆకాశమునన్= ఆకాశంలో.

తాత్పర్యం: ఆ నదిలోనే స్నానం చేసి వ్రతనిష్ఠతో ఉన్న ఇంద్రుడిని నారదుడు చూచాడు. ఆ పైన, వారిద్దరూ అన్యోన్యం మాట్లాడుకొంటూ ఆనందిస్తున్నారు. ఇంతలోనే ఆకాశంలో.

తే బాలభాను బింబంబు గీడ్పఱుచునట్టి । దీప్తి మండలి దోఁచె; నద్దేవపతియు
మునిపతియుఁ జూచుచుండ గ్రక్కున విమాన । మవతరించి యాసన్నయై యతివ యొర్తు. 6

ప్రతిపదార్థం: బాలభానుబింబంబున్= లేత సూర్యుడి మండలమును; కీడ్పఱుచునట్టి= తక్కువజేసే; దీప్తిమండలి= కాంతిపుంజం; తోఁచెన్= భాసించింది; ఆ+దేవపతియున్= ఆ ఇంద్రుడును; మునిపతియున్= నారదుడును; చూచుచుండన్= చూస్తూ ఉండగానే; గ్రక్కునన్= వడిగా; విమానము= వ్యోమయానమునుండి; అవతరించి= దిగి; అతివ= స్త్రీ; ఒర్తు= ఒకతె; ఆసన్న+ఐ= దగ్గరకువచ్చినదై.

తాత్పర్యం: అప్పుడే ఉదయించిన సూర్యమండలకాంతిని అతిశయించిన ఒక కాంతిరాశి కనిపించింది. ఇంద్రుడు, నారదుడూ చూస్తూ ఉండగానే ఒక వనిత విమానంనుండి దిగి వారిదగ్గరకు వచ్చి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పురుహూతున కభిముఖి యై । కరములు మోడ్చుటయు, నతఁడు గారవమున 'నె
వ్వర వబ్జానన! యెచటికి । నరిగెద, వెందుండి రాక?' యనియె నరేంద్రా! 7

ప్రతిపదార్థం: నరేంద్రా!= రాజా!; పురుహూతునికిన్= ఇంద్రుడికి; అభిముఖిఐ= ఎదురుగా నిల్చినదై; కరములు= చేతులు; మోడ్చుటయున్= చేర్చి నమస్కరించగా; అతఁడు= ఆ ఇంద్రుడు; గారవమునన్= ఆదరముతో; అబ్జానన!= పద్మముఖీ!; ఎవ్వరవు= నీవు ఎవతెవు?; ఎచటికిన్= ఏ చోటికి; అరిగెదవు?= వెళ్ళుతావు?; ఎందుండి= ఎచటనుండి; రాక= వచ్చావు?; అనియెన్= అని అడిగాడు.

తాత్పర్యం: రాజా! ఇంద్రుడికి ఎదురుగా నిల్చి, ఆమె చేతులు మోడ్చి నమస్కరించింది. అతడు ప్రీతితో ఆమెను చూచి 'కమలముఖీ! నీ వెవరవు? ఎక్కడికి పోతున్నావు? ఎక్కడినుండి వచ్చావు?' అని ప్రశ్నించాడు.

సీ. అనవుడు నద్దేవి యాదరభరిత యై । 'బాలార్కబోధిత పద్మజాత
యైనట్టిదాన; శ్రీయన లక్ష్మినా భూతి । యనఁగ వెలుంగుదు ననఘ! యేను
స్వాహాస్వధామతి శ్రద్ధాధృతిస్మృతి । మేధల దనుజుల మెచ్చి వారి
కడనుండి మెచ్చ కిప్పుడు నీకడకు నేఁగు । దెంచితి' ననిన నద్దివిజనాథుఁ

తే. 'డేమికారణమున మెచ్చి? తేకతమున । మెచ్చవైతి దానవుల? నీ మెచ్చుచొప్పు
మాకు నెఱిఁగింపు' మనిన నమ్మాననీయ । వాక్య యిట్లని చెప్పె నవ్వాసవునకు. 8

ప్రతిపదార్థం: అనవుడున్= అత డట్లనగా; ఆ+దేవి= ఆ దివ్యస్త్రీ; ఆదరభరిత+ఐ= ప్రీతితో నిండినదై; అనఘ!= పాపరహితుడా!; ఏను= నేను; బాలార్క= లేతసూర్యుడిచేత; బోధిత=వికసింపచేయబడిన; పద్మ= పద్మమునుండి; జాత ఐనట్టిదానన్= పుట్టినదానను; శ్రీ యనన్= 'శ్రీ' అనియు; లక్ష్మినాన్= 'లక్ష్మి' అనియు; భూతి అనఁగన్= 'భూతి' అనియు; వెలుంగుదున్= ప్రకాశిస్తాను; స్వాహా, స్వధా, మతి, శ్రద్ధ, ధృతి, స్మృతి, మేధ - అనే గుణాలచేత; దనుజులన్= రాక్షసులను; మెచ్చి= అభినందించి; వారికడన్= వారివద్ద; ఉండి= నివసించి; ఇప్పుడు= ఈ సమయమున; మెచ్చక= వారిని సమ్మతించక; నీ కడకున్= నీ సమీపానికి; ఏఁగుదెంచితిన్= వచ్చాను; అనినన్= అనగా; ఆ+దివిజనాథుఁడు= ఆ దేవేంద్రుడు; దానవులన్= రాక్షసులను; ఏమి కారణమునన్= ఏ హేతువుచేత; మెచ్చితి(వి)?= పూర్వం సమ్మతించావు?; ఏకతమునన్= ఏ కారణంచేత; మెచ్చవైతివి= (ఇప్పుడు) సమ్మతించవైతివి?; నీ మెచ్చు చొప్పున్= నీవు అభినందించే విధానాన్ని; మాకున్+ఎఱిఁగింపుము= మాకు తెలియజేయుము; అనినన్= అని అడుగగా; ఆ+మాననీయవాక్య= గౌరవించదగిన మాటలుగల ఆ దేవి; ఆ+వాసవునకున్= ఆ ఇంద్రుడికి; ఇట్లు+అని= ఈ విధంగా; చెప్పెన్= చెప్పింది.

తాత్పర్యం: ఇంద్రుడు అట్లా అడిగేసరికి ఆ దేవి మిక్కిలి ఆదరంతో 'పాపరహితుడ వైన ఓ ఇంద్రా! నేను బాలసూర్యుడి కిరణస్పర్శతో వికసించిన తామరపూవునుండి పుట్టినదాన్ని. 'శ్రీ', 'లక్ష్మి', 'భూతి' అనే పేర్లతో ప్రకాశిస్తూ ఉంటాను. పూర్వం నేను 'స్వాహ, స్వధా, మతి, శ్రద్ధ, ధృతి, స్మృతి, మేధ' అనే గుణా లుండటంవలన రక్కసులను మెచ్చుకొని వారి వద్ద ఉండేదాన్ని. ఇప్పుడు వారిని మెచ్చక నీ చెంతకు వచ్చాను' అని చెప్పింది. అది విని ఇంద్రుడు 'పూర్వం ఎందువలన రాక్షసులను మెచ్చుకొన్నావు? ఇప్పుడు ఏ కారణాన మెచ్చకుండా ఉన్నావు? నీ మెప్పు పొందాలంటే ఎట్లా ఉండాలో మాకు చెప్పుము' అని అడిగాడు. అందుకు గౌరవించదగిన పద్ధతిలో మాటలాడే ఆ దేవి ఇంద్రుడితో ఇట్లా అన్నది:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'స్వాహా, స్వధా' అనే శబ్దాలు దేవతలకు హవిస్సు అర్పించేటప్పుడు వాడబడతాయి. ఇవి ఇక్కడ యాగాలు చేసే స్వభావాన్ని సూచిస్తాయి. 'మతి' మొదలైన శబ్దాలు బుద్ధినీ, శ్రద్ధనూ, ధైర్యాన్నీ, స్మరణశక్తినీ, ప్రజ్ఞనూ క్రమంగా నిర్దేశిస్తున్నాయి. 'స్వాహా' మొదలైన గుణాలు లక్ష్మికి ప్రతిరూపాలైన దేవతలు, అవి ఉన్నచోట లక్ష్మి ఉంటుంది. (చూడు. సంస్కృతభారతం - శాంతి - అధ్యా. 228- శ్లో॥22, 23, 82-84).

క. 'దానాధ్యయనాతిథిస । మ్మానాది విశిష్ట గుణసమగ్రత కలిమిన్
దానవుల నియ్యకొంటిని; । వాని విడిచి గర్వు లగుట వారి విడిచితిన్. 9

ప్రతిపదార్థం: దాన= ఈవి; అధ్యయన= స్వాధ్యాయం; అతిథిసమ్మాన= అతిథులను పూజించటం; ఆది= మొదలైన; విశిష్ట= శ్రేష్ఠమైన; గుణ= గుణాలయొక్క; సమగ్రత= పూర్ణత్వం; కలిమిన్= కలిగిఉండటంచేత; దానవులన్= రాక్షసులను; ఇయ్యకొంటిని= అంగీకరించాను; వానిన్= ఆ గుణాలను; విడిచి= వదలి; గర్వులు= గర్వంకలవారు; అగుటన్= అగుటచేత; వారిన్= ఆ రాక్షసులను; విడిచితిన్= వదలాను.

తాత్పర్యం: 'పూర్వం రాక్షసులు దానం, అధ్యయనం, అతిథిపూజనం మొదలైన సద్గుణాలు నిండుగా కలిగి ఉండేవారు. అందువలన వారిని అప్పుడు అంగీకరించాను. ఇప్పుడు వారు ఆ గుణాలు వదలిపెట్టి గర్వం వహించారు. అందుచేత వారిని వదలిపెట్టాను.

వ. సత్యధర్మపరుండ వగుటంజేసి నీపాల వసియింప రుచివుట్టి వచ్చితి' నని చెప్పి వెండియు. 10

ప్రతిపదార్థం: సత్యధర్మపరుండవు= (నీవు) సత్యమునందు; ధర్మమునందు ఆసక్తి కలవాడవు; అగుటన్+చేసి= అయిన కారణం చేత; నీపాలన్= నీ యొద్ద; వసియింపన్= నివసించటానికి; రుచి= ఆసక్తి; పుట్టి= కలిగి; వచ్చితిన్= అరుదెంచాను; అని చెప్పి= అని వచించి; వెండియున్= మరల.

తాత్పర్యం: నీవు సత్యంలోనూ, ధర్మంలోనూ ఆసక్తి కలిగి ఉన్నావు. అందువలన నీవద్ద నివసించాలన్న కోరిక నాకు కలిగింది. అందుకై వచ్చా'నని లక్ష్మి చెప్పింది. మరల (ఇట్లా పలికింది).

సీ. గురుభక్తి నిరతులు, సురపితృపూజన । పరులును, సత్యసంభాషణులును,
దానశీలురుఁ, బరధన పరదార ప । రాఙ్ముఖచిత్తులు, బ్రాహ్మణ ప్రి
యులు, దివానిద్రా వియుక్తులు, వృద్ధదు । ర్బల దీన యోషిత్కృపారతులును,
శౌచులు, నతిథిభోజనశిష్టభోజులు । నేను మెచ్చు జనంబు; లిట్లుగాక

తే. ధర్మ మెడలి, కామంబు క్రోధంబుఁజాలఁ । గలిగి, గర్వులై బలియు భైక్షంబు నిడక
పరుష వాక్కులఁ గ్రూరంపుఁ జరితములను । మిగిలి వర్తించువారు నా మెచ్చు గారు. 11

ప్రతిపదార్థం: గురుభక్తి నిరతులు= ఆచార్యులయందు భక్తిగలవారు; సురపితృ పూజన పరులును= దేవతలను, పితరులను పూజించటంలో ఆసక్తికలవారు; సత్యసంభాషణులును= సత్యమైన మాటలుకలవారును; దానశీలురు= దానం స్వభావంగా కలవారు; పరధన= ఇతరుల ధనమునందును; పరదార= ఇతరుల కళత్రములందును; పరాఙ్ముఖ= విముఖమైన; చిత్తులు= మనస్సుకలవారు; బ్రాహ్మణప్రియులున్= ద్విజులయందు ప్రీతికలవారును; దివానిద్రా వియుక్తులు= పగటివేళ నిద్రించనివారు; వృద్ధ= ముసలివారు; దుర్బల= బలహీనులు; దీన= దైన్యముగలవారు; యోషిత్= స్త్రీలు - వీరిపట్ల; కృపారతులును= దయ గలవారును; శౌచులు= బాహ్యమున; ఆభ్యంతరమున శుచిపాటించువారు; అతిథిభోజనశిష్టభోజులున్= అతిథులు భుజించగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మిగిలిన అన్నంతినేవారును; ఏను= నేను; మెచ్చు= అభినందించే; జనంబులు= ప్రజలు; ఇట్లుగాక= ఈ రీతిగా ఉండక; ధర్మము+ఎడన్= ధర్మం తప్పి; కామంబు= కోరిక, క్రోధంబు= కోపం; చాలన్= మిక్కిలిగా; కలిగి= వహించి; గర్వులు+ఐ= గర్వం కలవారై; బలియున్= పూజార్హమైన కానుకయు; భైక్షంబు= భిక్షాన్నం; ఇడక= పెట్టక; పరుషవాక్కులన్= కఠినమైన మాటలచేత; క్రూరంపుఁ జరితములను= క్రూరమైన నడవడికలచేతను; మిగిలి= అతిశయించి; వర్తించువారు= మెలగేవారు; నా మెచ్చు గారు= నేను మెచ్చేవారు కారు.

తాత్పర్యం: గురువుల పట్ల భక్తిచూపేవారు, దేవతలను, పితృదేవతలను పూజించేవారు, సత్యం పలికేవారు, దానం చేసేవారు, ఇతరులకు చెందిన ధనం, స్త్రీల పట్ల కోరికలేక విముఖంగా ఉండేవారు, విప్రులపై ప్రీతి కలిగినవారు, పగటిపూట నిద్రించనివారు, వృద్ధులయందూ, బలహీనులయందూ, దీనులయందూ, స్త్రీలయందూ దయచూపేవారూ, బాహ్యంగానూ ఆంతరంగికంగానూ శౌచం పాటించేవారూ, అతిథులై వచ్చినవారు భుజించగా మిగిలినదానిని మాత్రమే భుజించేవారూ అయిన జనులను నేను మెచ్చుకొంటాను. అట్లా కాకుండా ధర్మహీనులై, కామక్రోధాలు ఎక్కువగా కలిగి, గర్వంతో కూడినవారై, పూజార్హమైన కానుకగాని, భిక్షగాని పెట్టకుండా కఠినమైన మాటలు మాట్లాడుతూ, మిక్కిలి క్రూరమైన ప్రవర్తన కలిగి చరించేవారిని నేను మెచ్చను.

విశేషం: సృష్టిలో ప్రాణివర్గం దైవసంపద కలదనీ, అసురసంపద కలదనీ రెండు రకాలుగా ఉంటుంది. ఇక్కడ లక్ష్మి ఇంద్రుడితో దైవసంపద గలవారు తనకు ఇష్టులనీ, అసురప్రవృత్తిగలవారిని తాను ఇష్టపడననీ చెప్పింది. దేవాసురసంపదల వివరణ భగవద్గీతలోని పదునారవ అధ్యాయంలో విపులంగా నిరూపించబడి ఉన్నది.

క. బుద్ధియు ధృతియును నీతియు । శ్రద్ధయు సన్నతియు క్షమయు శాంతియు ననఁగా
వృద్ధశ్రవ! యేడ్వురు మ । ద్వృద్ధి ప్రదదేవతలు శ్రుతిస్మృతికథితల్. **12**

ప్రతిపదార్థం: వృద్ధశ్రవ= ఇంద్రా!; బుద్ధియున్= బుద్ధి, ధృతియున్= ధృతి; నీతియున్= నీతి; శ్రద్ధయున్= శ్రద్ధయు; సన్నతియున్= సన్నతియు; క్షమయున్= క్షమయు; శాంతియున్= శాంతియు; అనగాన్= అని ప్రసిద్ధికెక్కిన; ఏడ్వురు= ఏడుమంది; శ్రుతి స్మృతి కథితల్= శ్రుతులలోనూ స్మృతులలోనూ చెప్పబడినవారు; మద్వృద్ధి ప్రదదేవతలు= నాకు వృద్ధి నిచ్చే దేవతలున్నారు.

తాత్పర్యం: అమరేంద్రా! వేదాలలోనూ, స్మృతులలోనూ చెప్పబడిన ఏడుమంది దేవతలు నాకు వృద్ధి కల్గించేవారు. వారు బుద్ధి, ధృతి, నీతి, శ్రద్ధ, సన్నతి, క్షమ, శాంతి అని వ్యవహరించబడుతున్నారు. (బుద్ధి మొదలైన గుణాలున్న వారి వద్ద లక్ష్మి వృద్ధి బొందుతుందని తాత్పర్యం).

క. అష్టమి యగు దేవత నేఁ । గష్టాత్మత యసురులందుఁ గని విడిచితి మ
త్తుష్టికరచరితు లగుటఁ ద్రి । విష్టప సదుల కడ నిలిచి వెలసెద ననినన్. **13**

ప్రతిపదార్థం: నేన్= నేను; అష్టమిఅగు= ఎనిమిదవ దైన; దేవతన్= దేవతను; అసురులందున్= రాక్షసులందు; కష్టాత్మత= దుష్టస్వభావమును; కని= చూచి; విడిచితిన్= వారిని వదలిపెట్టాను; మత్తుష్టికర= నాకు సంతసం కలిగించే; చరితులు= ప్రవర్తన కలవారు; అగుటన్= కావటంవలన; త్రివిష్టపసదుల కడన్= దేవతలచెంత; నిలిచి= నిలబడి; వెలసెదన్= ప్రకాశిస్తాను; అనినన్= అని చెప్పగా.

తాత్పర్యం: నేను ఎనిమిదవ దేవతను. రాక్షసులలో దుష్టస్వభావాన్ని చూచి వారిని వదలిపెట్టాను. నాకు సంతోషం కలిగించే విధంగా ప్రవర్తించేవారు కావటం వలన దేవతలచెంత నిలబడి ప్రకాశిస్తాను' అని చెప్పగా.

క. అభినందించిరి దేవ । ప్రభుఁడును నారదుఁడు నపుడు పవనంబును సౌ
రభసుఖ సంస్పర్శంబుల । నభిరామం బగుచు వీచె నల్లన యచటన్. **14**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దేవప్రభుఁడునున్= ఇంద్రుడున్నూ; నారదుఁడున్= నాదరమునీంద్రుడున్నూ; అభినందించిరి= (లక్ష్మిని) మెచ్చుకొన్నారు; అచటన్= ఆచోట; అప్పుడు= ఆ సమయంలో; పవనంబునున్= గాలికూడా; సౌరభ= పరిమళంచేత; సుఖ సంస్పర్శంబులన్= సుఖావహమైన స్పర్శచేత అభిరామంబు= మనోహరం; అగుచున్= అవుతూ; అల్లన= మెల్లగా; వీచెన్= ప్రసరించింది.

తాత్పర్యం: లక్ష్మి చెప్పిన మాటలు విని ఇంద్రుడూ, నారదుడూ, ఆమెను మెచ్చుకొన్నారు. ఆ సందర్భంలో అక్కడ గాలి కూడా సువాసనతోనూ, సుఖావహమైన స్పర్శతోనూ కూడి మనోహరమై మెల్లగా వీచింది.

ఆ. **కురిసెఁ బుష్పవృష్టి, మొరసె గీర్వాణ దుం । దుభులు, సిరి వరింప నభినవోజ్జ్వ**
లత్వమొంది దివిజులకు నేత్రపర్వమై । పొలిచి యింద్రుఁ డాత్మపురికి నరిగె. **15**

ప్రతిపదార్థం: పుష్పవృష్టి= పూలవాన; కురిసెన్= కురిసింది; గీర్వాణదుందుభులు= దేవతల భేరులు; మొరసెన్= శబ్దించాయి; సిరి= లక్ష్మి; వరింపన్= వరించేసరికి; అభినవ+ఉజ్జ్వలత్వము= నూతనమైన ప్రకాశమానత్వాన్ని; ఒంది= పొంది; దివిజులకున్= దేవతలకు; నేత్రపర్వము+ఐ= కనులపండువై; పొలిచి= భాసించి; ఇంద్రుఁడు= దేవేంద్రుడు; ఆత్మపురికిన్= తన నగరానికి; అరిగెన్= పోయాడు.

తాత్పర్యం: పిదప పూలవాన కురిసింది. దేవతల నగారామ్రోతలు వ్యాపించాయి. లక్ష్మి తనను వరించగానే నూతన ప్రకాశం పొంది దేవతలకు కన్నులపండువై ఇంద్రుడు తన పట్టణమైన అమరావతికి వెళ్ళాడు.

క. **శతమఖకమలావాసా । ప్రతిమ సమాగమ విశేష బహుమత మగు నీ**
యితిహాసము శ్రుతమైనఁ బ । ఠితమైనను నెఱయ సంఘటించును లక్ష్మిన్. **16**

ప్రతిపదార్థం: శతమఖ= ఇంద్రుడియొక్క; కమల+ఆవాస= లక్ష్మీదేవియొక్కయు; అప్రతిమ= సాటిలేని; సమాగమ విశేష= విశిష్టమైన కలయికచేత; బహుమతము= మిక్కిలి సమ్మానితం; అగు= అవుతున్న; ఈ ఇతిహాసము= ఈ కథ; శ్రుతము+ఐనన్= వినబడినదైననూ; పఠితము+ఐననున్= చదువబడినదైననూ; నెఱయన్= విస్తృతముగా; లక్ష్మిన్= సిరిని; సంఘటించును=కలిగిస్తుంది.

తాత్పర్యం: సాటిలేనిదీ, విశిష్టమైనదీ అయిన ఇంద్రలక్ష్మి సమాగమంవలన ఈ కథ మిక్కిలిగా సంభావించ బడుతున్నది. దీనిని విన్నా, చదివినా సంపద సమృద్ధిగా లభిస్తుంది.

క. **ఇందుల తాత్పర్యము నీ । డెందము నొందించి యతిదృఢీకృతశీలా**
స్పందితుఁడ వగుము; తిరమై । యిందిర నీకడ వసించు నిభపురనాథా!' **17**

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= హస్తినాపట్టణానికి ప్రభుడవైన ఓ ధర్మరాజా!; ఇందుల= ఇందులోని; తాత్పర్యమున్= భావమును; నీ డెందమున్= నీ హృదయాన్ని; ఒందించి= పొందించి; అతిదృఢీకృత= మిక్కిలి గట్టిపరచబడిన; శీల= సత్స్వభావంచేత; అస్పందితుఁడవు= చలనం లేనివాడవు; అగుము= కమ్ము; ఇందిర= లక్ష్మి; తిరమై= స్థిరమై; నీకడన్= నీ చెంత; వసించున్= నివసిస్తుంది.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ ఇతిహాసంలోని రహస్యాన్ని నీ హృదయంలో పదిలపరచుకొమ్ము. తద్వారా దృఢమైన శీలంతో చలనం లేని వాడవు కమ్ము. అట్లా చేస్తే లక్ష్మి స్థిరంగా నీవద్ద నిలిచిపోతుంది'.

క. **అనిన విని ధర్మజుఁడు శాం । తనవునితో జనుల కెవ్విధము నాచారం**
బున నెట్టిపాటి శీలం । బున నే విద్యను మహాత్మ! ముక్తి దొరకొనున్. **18**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ధర్మజుఁడు= ధర్మరాజు; శాంతనవునితోన్= భీష్ముడితో; మహాత్మ!= మహానుభావా!; జనులకున్= ప్రజలకు; ఏ+విధము+ఆచారంబునన్= ఏ విధమైన ఆచారంతో; ఎట్టిపాటిశీలంబునన్= ఏ రకమైన స్వభావంతో; ఏ విద్యనున్= ఏ రకమైన విద్యచేత; ముక్తి= మోక్షం; దొరకొనున్= లభిస్తుంది.

తాత్పర్యం: భీష్ముడు ఆ రీతిగా చెప్పగా విని ధర్మరాజు ఆయనతో ఇట్లా అన్నాడు: 'మహాత్మా! ప్రజలకు ఏ రకమైన ఆచారంవలన, ఏ విధమైన శీలం వలన, ఏ చదువు వలన ముక్తి దొరుకుతుంది?'

క. అనవుడు నతనికి నతఁ డి । ట్లను 'విను మితిహాస మొకటి యది నీ ప్రశ్నం
బున కుత్తర మగు; నేర్పడ । వినిపించెద గాఢతర వివేక నిరూఢా! 19

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; అతనికిన్= ధర్మరాజుకు; అతఁడు= ఆ భీష్ముడు; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; గాఢతర వివేకనిరూఢా!= దృఢమైన వివేకంచేత ప్రసిద్ధమైనవాడా!; ఇతిహాసము+ఒకటి= ఒక పూర్వకథ; వినుము= ఆలకించుము; అది= ఆ కథ; నీ ప్రశ్నంబునకున్= నీ ప్రశ్నకు; ఉత్తరము+అగున్= సమాధానం అవుతుంది; ఏర్పడన్= స్పష్టమయ్యే విధంగా; వినిపించెదన్= ఆలకింపజేస్తాను.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అనేసరికి, భీష్ము డతడితో ఇట్లా అన్నాడు: 'దృఢవివేకం వలన ప్రసిద్ధుడవైనవాడా! ఒక పూర్వకథ వినుము. అది నీ ప్రశ్నకు తగిన సమాధాన మవుతుంది. దాన్ని వినిపిస్తాను'.

దేవల జైగీషవ్య సంవాద ప్రకారము (సం. 12-222-34)

వ. అసితుం డగు దేవలుండు జైగీషవ్యుం డను సంయమితోడ 'నీవృత్తం బెఱింగి కొనవలయు నెఱింగింపవే!' యనిన నమ్మహాత్ముం డమ్మునివరున కిట్లనియె. 20

ప్రతిపదార్థం: అసితుండగు దేవలుండు= అసితుడనే పేరుగల దేవలముని; జైగీషవ్యుండు అను సంయమితోడన్= జైగీషవ్యుడు అనే మునితో; నీ వృత్తంబు= నీ వర్తనాన్ని; ఎఱింగికొనవలయున్= తెలిసికొనాలి; ఎఱింగింపవే= తెలియజేయుమా; అనినన్= అనగా; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; ఆ+మునివరునకున్= ఆ మునిశ్రేష్ఠునకు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: పూర్వం అసితుండనే పేరుగలడైన దేవలముని జైగీషవ్యుడనే మునిని ఇప్పుడు నీ వృత్తాంతాన్ని తెలిసికొనాలని అడిగాడు. అప్పు డా జైగీషవ్యు డతడితో ఇట్లా అన్నాడు:

ఆ. 'శాంతిమంతు లైన సౌమ్యుల కెయ్యది । నిష్ఠ దానియందు నిరతిశయ స
మాదరంబు గలదు నాదుచిత్తంబున । వినుము తద్విధంబు విస్తరింతు. 21

ప్రతిపదార్థం: శాంతిమంతులు+ఐన= శాంతిగలవారగు; సౌమ్యులకున్= ప్రియమైన దర్శనం కలవారికి; ఏ+అది= ఏది; నిష్ఠ= ఆచరింపదగిన ధర్మమో; దానిఅందున్= ఆ ధర్మమునందు; నాదు చిత్తంబునన్= నా హృదయంలో; నిరతిశయ సమాదరంబు= అత్యధికమైన ప్రీతి; కలదు= ఉన్నది; తద్విధంబున్= ఆ ధర్మప్రకారాన్ని; విస్తరింతున్= వివరించి చెప్పుతాను; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: 'శాంతిసంపన్నులై ప్రియదర్శనులైన వారికి ఏది పాటింపదగిన ధర్మంగా ఉన్నదో, ఆ ధర్మంపట్ల నా చిత్తం ఎనలేని ప్రీతి కలిగి ఉన్నది. ఆ ధర్మవిధాన మెట్లాంటిదో వివరిస్తాను వినుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **వినుతించిన నిందించిన । ననఘా! మనమునఁ బ్రియంబు నప్రియమును లే**
కునికియు వ్రేసిన నైనను । గనలు వొడమమియుఁ బ్రబుద్ధగణ్యగుణంబుల్. 22

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; వినుతించినన్= పొగడినా; నిందించినన్= తెగడినా; మనంబునన్= చిత్తంలో; ప్రియంబున్= ప్రీతియు; అప్రియమునున్= అప్రీతియు; లేకునికియున్= లేకుండా ఉండటమున్నూ; వ్రేసినన్+ఐనను= (ఒకరు తనను) కొట్టినప్పటికినీ; కనలు= కోపం; పొడమమియున్= కలగకుండా ఉండటమున్నూ; ప్రబుద్ధ= జ్ఞానంకలవారియొక్క; గణ్య= గణించదగిన; గుణంబుల్= గుణాలుగా ఉన్నవి.

తాత్పర్యం: కిల్బిషంలేని ధర్మరాజా! ఇతరులు తనను పొగడవచ్చును, లేదా తెగడవచ్చును. అట్లా చేసినా చిత్తంలో ప్రీతిగానీ, అప్రీతిగానీ లేకుండా ఉండటం, అట్లాగే పరులు తనను కొట్టినా కోపం లేకుండా ఉండటం, జ్ఞానులైనవారి ఎన్నదగిన గుణాలుగా ఉన్నాయి.

విశేషం: మానావమానాలు, స్తుతినిందలు కల్గినప్పుడు సామాన్యులు పొంగిపోవటమో, లేక క్రుంగిపోవటమో జరుగుతూ ఉంటుంది. తన్నుకొట్టినవారిని తిరిగి కొట్టాలనిపిస్తుంది. కాని స్థితప్రజ్ఞులైనవారు స్తుతి నిందలను సమానంగా భావిస్తారు. వారు త్రిగుణాలకు అతీతంగా ఉంటారు. కాబట్టి తనకు అపకారం చేసినవారికి ప్రతీకారం చేయాలని అనుకోరు.

ఆ. **ఒకటిగోరి దాని కుల్లంబు గందంగ । జాలిఁ బడమి, యేమి సంభవించె**
నేని దానఁ దృప్తి నూనుట దప్పిన । పనికి వగవ కునికి భవ్యగుణము. 23

ప్రతిపదార్థం: ఒకటి= ఒక వస్తువును; కోరి= అభిలషించి; దానికిన్= ఆ వస్తువుకొరకై; ఉల్లంబు= హృదయము; కందంగన్= తపించగా; జాలిన్+పడమి= విచారం పొందకుండా ఉండటం; ఏమి సంభవించెనేనిన్= ఏమి జరిగినా; దానన్= ఆ జరిగినదానివలన; తృప్తిన్ ఊనుట= తృప్తినొందటం; తప్పినపనికిన్= తప్పిపోయిన కార్యానికి; వగవక+ఉనికి= చింతించకుండా వుండటం; భవ్యగుణము= శ్రేష్ఠమైన గుణం.

తాత్పర్యం: ఏదో ఒక వస్తువును కోరుకొని అది లభించకపోవటం వలన హృదయతాపానికి గురి అయి విచారించరాదు. తనకు మంచి జరిగినా, చెడు జరిగినా దానివలన తృప్తినొందాలి. తాను అనుకొన్నట్లు ఒక పని జరగలేదని చింతించకూడదు. ఇవే మేలైన గుణాలు.

క. **హర్షంబును మానంబు న । మర్షము నపరాధమును సమదభావము ను**
త్కర్షాపకర్ష చింతలు । నార్షసమాచారమున నిరస్తగుణంబుల్. 24

ప్రతిపదార్థం: హర్షంబును= సంతోషమూ; మానంబున్= అభిమానమూ; ఆమర్షమున్= అసహనమూ; అపరాధమును= తప్పిదమూ; సమదభావము= మదంతో గూడి ఉండటమూ; ఉత్కర్ష+అపకర్ష చింతలు= ఎక్కువ, తక్కువతనాలను గూర్చిన విచారాలూ; ఆర్షసమాచారమునన్= ఋషులకు చెందిన సమీచీనమైన ఆచారమునందు; నిరస్తగుణంబుల్= నిరసించబడిన గుణాలు అవుతున్నాయి.

తాత్పర్యం: సంతోషం, అభిమానం, అసహనం, అపరాధం, మదించటం, తన గొప్పతనాన్ని గూర్చిగాని, లేక తక్కువతనాన్ని గూర్చిగాని చింతిస్తూ ఉండటమనేవి ఋషులు విధించిన సదాచార పద్ధతిలో నిరసించబడిన గుణాలుగా ఉన్నాయి.

క. **అవమానమునకుఁ దృప్తుం । డవు నమృతము ద్రావినట్ల యంచితసమ్మా**
నవిధికి నుద్వేగముఁ బొం । దు విషంబునఁ బోలె శమరతుఁడు మునినాథా! 25

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మునినాథా!= మునిశ్రేష్ఠా!; శమరతుఁడు= అంతరింద్రియనిగ్రహమునందు తత్పరుడైనవాడు; అవమానమునకున్= (తనకు జరిగే) అవమానంతో కూడిన కార్యానికి; అమృతము+త్రావినట్లు+అ= సుధ నాస్వాదించినట్లే; తృప్తుండు+అవున్= తృప్తిపొందినవాడు ఔతాడు; అంచిత= పూజితమైన; సమ్మానవిధికిన్= సత్కారంతో గూడిన పనికి; విషంబునన్+పోలెన్= విషంచేతవలె; ఉద్వేగమున్+పొందున్= వ్యాకులత్వాన్ని పొందుతాడు.

తాత్పర్యం: మునిశ్రేష్ఠా! అంతరింద్రియ నిగ్రహంకలవాడు తనకు అవమానం జరిగితే అమృతం త్రాగినట్లుగా తృప్తి పొందుతాడు. సమ్మానం జరిగితే విషం త్రాగినప్పుడు పొందినట్లు కలతను పొందుతాడు. సమ్మానం కావాలని కోరడు. అవమానం జరిగితే కలత చెంద డని తాత్పర్యం.

క. **చుట్టము పగ యను భేదం। బెట్టిజనులవలనఁ దగుల దెల్లప్పుడు నె**
ప్పట్టున నద్దానను మదిఁ। బుట్టదు సంతోష హాని బుద్ధాత్మునకున్. 26

ప్రతిపదార్థం: బుద్ధాత్మునకున్= ఆత్మజ్ఞుడైనవాడికి; ఎట్టి జనులవలనన్= ఏ రకమైన ప్రజలవలనగానీ; ఎల్లప్పుడున్= ఏ వేళనైనా; చుట్టము= బంధువు; పగ= శత్రువు; అను భేదంబు= అనే భేదబుద్ధి; తగులదు= కలుగదు; ఏ+పట్టునన్= ఏ పరిస్థితిలో నైనా; ఆ+దానను= ఆ భేదబుద్ధివలన; మదిన్= హృదయంలో; సంతోషహాని= సంతోషానికి చెరుపు; పుట్టదు= సంభవించదు.

తాత్పర్యం: ఆత్మతత్త్వం తెలిసినవాడికి ఏ విధమైన జనులను చూచినా ఎప్పుడైనా వీరు నావారు, వీరు శత్రువులు అనే భేదబుద్ధి పుట్టదు. ఆ భేదభావం లేకపోవటం వలన ఏ పరిస్థితిలోనూ ఆయన చిత్తంలో సంతోషం లోపించదు.

ఆ. **ఇంద్రియముల గెల్చి హృదయంబు శాంతిసు। ఖంబుఁ బొంద నిర్వికార వృత్తి**
యైనవాని పొందు మానితగతి దేవ। తలకుఁ బొంద నరిది ధర్మనిరత!' 27

ప్రతిపదార్థం: ధర్మనిరత!= ధర్మమునందు+ఆసక్తుడైనవాడా!; ఇంద్రియములన్= శ్రోత్రంమొదలైన ఇంద్రియాలను; గెల్చి= జయించి; హృదయంబు= చిత్తం; శాంతిసుఖంబున్= శాంతివలనగలిగిన సుఖమును; పొందన్= చెందగా; నిర్వికారవృత్తి= వికారాలు లేని వర్తనముగలవాడు; ఐనవాని పొందు= అయినటువంటి వాడితో కలయిక; మానితగతిన్= పూజితమైన రీతిలో; దేవతలకున్= సురలకు; పొందన్+అరిది= పొందటానికి దుర్లభమై ఉన్నది.

తాత్పర్యం: ధర్మతత్పరుడవైన మునీంద్రా! శ్రోత్రాదులైన జ్ఞానేంద్రియాలను, పాదాదులైన కర్మేంద్రియాలను జయించిన వాడు హృదయంలో శాంతి పొందుతాడు. శాంతివలన వాడికి శాశ్వతసుఖం కలుగుతుంది. అప్పు డతడిలో ఏ విధమైన వికారాలూ కలగవు. అట్లాంటి వాడితో పూజితమైన పద్ధతిలో చెలిమి సాధించటం దేవతలకు సైతం దుర్లభంగా ఉంటుంది'.

క. **అని చెప్పె ననుడుఁ గుంతీ। తనయాగ్రజుఁ డాత్మ సమ్మదముఁ బొంద నదీ**
తనయునితో 'నెవ్వఁ డఖిల। జన ప్రియుఁడు సకలసత్త్వసమ్మతుఁ?' డనినన్. 28

ప్రతిపదార్థం: అని చెప్పెన్+అనుడున్= ఈ రీతిగా చెప్పాడని అనగా; కుంతీతనయ+అగ్రజుఁడు= ధర్మరాజు; ఆత్మ= చిత్తం; సమ్మదమున్+పొందన్= సంతసించగా; నదీతనయునితోన్= భీష్ముడితో; అఖిలజనప్రియుఁడు= సమస్తజనులకు ప్రియమైనవాడు; సకలసత్త్వసమ్మతుఁడు= సర్వప్రాణులకు ఇష్టమైనవాడు; ఎవ్వఁడు?= ఎవడు?; అనినన్= అని అడుగగా.

తాత్పర్యం: జైగీషవ్యుడు దేవలుడితో ఈ విధంగా చెప్పా'డని భీష్మ డన్నాడు. అది విని ధర్మరాజు సంతోషించాడు. ఆపై భీష్ముడిని 'సమస్త జనులకు, సకల ప్రాణులకు ప్రియమైనవాడు ఎవడు?' అని ప్రశ్నించగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉగ్రసేన శ్రీకృష్ణసంవాద ప్రకారము (సం. 12-223-23)

వ. అమ్మహాత్ముం డమ్మహీపతి కిట్లను. 'నారదుని విషయంబుగా ఉగ్రసేనునకుఁ గేశవునకు సంవాదంబు గలిగె; నది నీ యడిగిన యర్థంబుఁ దేటపఱుచు; దాని నాకర్ణింపుము. 29

ప్రతిపదార్థం: ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; ఆ+మహీపతికిన్= ధర్మరాజునకు; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; నారదుని విషయంబుగాన్= నారదమునికి సంబంధించి; ఉగ్రసేనునకున్= ఉగ్రసేను డనబడే యాదవ విభునకు; కేశవునకున్= కృష్ణుడికి; సంవాదంబు= సంభాషణం; కలిగెన్= సంభవించింది; అది= ఆ సంవాదం; నీ అడిగిన= నీవు ప్రశ్నించిన; అర్థంబున్= విషయాన్ని; తేటపఱుచున్= స్పష్టం చేస్తుంది; దానిన్= ఆ సంవాదాన్ని; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: మహాత్ముడైన భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: 'పూర్వం ఉగ్రసేనుడికీ, కృష్ణుడికీ నారదుడి విషయమై ఒక సంవాదం జరిగింది. ఆ సంవాదం నీవు అడిగిన విషయాన్ని తేటతెల్లం చేస్తుంది. దానిని వివరిస్తాను. వినుము.

క. నరనాథ! యుగ్రసేనుఁడు । హరితో నిట్లనియె 'జనము లభివర్ణన త
త్పరు లగుదురు నారదునెడ; । నరయఁగ నతఁ డంతవాఁడె? యంబుజనాభా!' 30

ప్రతిపదార్థం: నరనాథ!= ధర్మరాజా!; ఉగ్రసేనుఁడు= ఉగ్రసేనవిభుడు; హరితోన్= కృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు; నారదునెడన్= నారదుడిపట్ల; జనములు= ప్రజలు; అభివర్ణన తత్పరులు= కీర్తించటంలో ఆసక్తికలవారు; అగుదురు= అవుతున్నారు అంబుజనాభా!= పద్మం నాభియందు గల కృష్ణా!; అరయఁగన్= ఆలోచించగా; అతఁడు= ఆ నారదుడు; అంతవాఁడె?= అంత గొప్పవాడా?

తాత్పర్యం: ధర్మరాజా! ఉగ్రసేన మహారాజు శ్రీకృష్ణుడిని చూచి 'ప్రజలు నారదుడిని ఎంతో ఘనంగా ప్రశంసిస్తున్నారు. పద్మనాభా! నిజంగా నారదుడు ఆ ప్రశంసకు తగినంత గొప్పవాడేనా?' అని అడిగాడు.

వ. అనుటయు నా కృష్ణుం డగ్గురుమతి కిట్లనియె. 31

ప్రతిపదార్థం: అనుటయున్= అని అడుగగా; ఆ కృష్ణుండు= ఆ మాధవుడు; ఆ+గురుమతికిన్= ఆ దొడ్డబుద్ధిగలవాడితో; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా పలికాడు.

తాత్పర్యం: ఉగ్రసేను డట్లా అడిగేసరికి శ్రీకృష్ణుడు మహామతిఅయిన ఆ రాజుతో ఇట్లా అన్నాడు:

సీ. 'శ్రుతము నాచారంబు నతిశయవంతంబు । లెడ నహంకార మొక్కింతయేని
లేదు, శీలము గడు లెస్స, వేషము నిర్వి । కారం, బమత్సర గర్వమదుఁడు,
జననంబుఁ దపము దేజంబును బుద్ధియు । వినయంబు నయమును విశ్రుతములు,
ధైర్యంబు వచనమాధుర్యంబు శార్యదై । న్య క్రోధలోభ నిరాసకత్వ

ఆ. మోజ యతనియందు నైజంబు; లీర్ష్యయు । నుద్ధతియు నసూయయును నవజ్ఞ
యును నెఱుంగఁ డట్టి మునివరు నారదు । నఖిలజనులుఁ బొగడు టరుదె యధిప!' 32

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అతనిఅందున్= ఆ నారదుడియందు; శ్రుతమున్= విద్యయు; ఆచారంబున్= సత్ప్రవర్తనమూ; అతిశయవంతంబులు= ఆధిక్యం కలిగి ఉన్నాయి; ఎడన్= హృదయంలో; అహంకారము= గర్వం; ఒక్కింత ఏనిన్= లేశమైనా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లేదు= ఉన్నది కాదు; శీలము= స్వభావం; కడున్= మిక్కిలి; లెస్స= మేలైనది; వేషము= వస్త్రాద్యలంకారం; నిర్వికారంబు= వికారం లేనిది; అమత్సరగర్వమదుఁడు= (అతడు) మాత్సర్యం, గర్వం, మదం లేనివాడు; జననంబు= పుట్టుకా; తపము= తపస్సూ; తేజంబును= ప్రకాశమూ; బుద్ధియున్= మతీ; వినయంబున్= అడకువా; నయమును= నీతీ; విశ్రుతములు= ప్రసిద్ధములు; ధైర్యంబు= ధీరత్వం; వచనమాధుర్యంబు= మాటలలోని మధురత్వము; శాఠ్యదైన్య క్రోధ లోభ నిరాసకత్వము= శఠత్వం, దీనత్వం, కోపం, పిసినితనం అను దోషములను నిరసించు స్వభావమును; ఓజ= ఉత్సాహము; అతనియందున్= ఆ నారదునిలో; నైజంబులు= స్వభావసిద్ధములు; ఈర్ష్యయున్= ఓర్వలేనితనము; ఉద్ధతియున్= గర్వం; అసూయయునున్= గుణాలపై దోషదృష్టి; అవజ్ఞయునున్= తెగడికయు; ఎఱుంగఁడు= తెలియనివాడు; అట్టిమునివరున్= అట్లాంటి మునిశ్రేష్ఠుడైన; నారదున్= నారదమునీంద్రుడిని; అఖిలజనులు= సమస్తప్రజలు; పొగడుట= స్తుతించుట; అరుదె?= అబ్బురమా?

తాత్పర్యం: 'రాజా! నారదునిలో శాస్త్రజ్ఞానం, సదాచారం అధికంగా ఉన్నాయి. అతడి హృదయంలో ఇసుమంతైనా అహంకారం లేదు. అతడి శీలం చక్కనిది. వేషంలో ఏ విధమైన వికారమూ లేదు. అతడిలో మాత్సర్యం, గర్వం, మదం అనే దుర్గుణాలు లేవు. అతని పుట్టుక, తపస్సు, తేజస్సు, బుద్ధి, వినయం, నీతి చాలా ప్రసిద్ధి పొందాయి. అతడు ధీరత్వం, మధురమైన మాటలు కలవాడు. శఠత్వం, దీనత్వం, కోపం, లోభం - అనే దుర్గుణాలను అతడు ఈసడించుకొంటాడు. అతడికి ఈర్ష్య, గర్వం, అసూయ, తిరస్కారభావం - అనేవి తెలియవు. అట్లాంటి మునిశ్రేష్ఠుడైన నారదుడిని జనులు కీర్తించటంలో ఆశ్చర్య మేమున్నది?'

వ. అని చెప్పె నగ్గుణంబు లఖిల ప్రియకరంబులు, సకల సత్త్వ సమ్మతంబు' లనిన విని ధర్మతనయుండు శంతను తనయుతోఁ 'గాలావయవ ప్రకారంబులును, యుగప్రమాణంబులును, భూతవిధంబులును నెఱింగింపవే!' యని యడుగుటయు, నతండు 'శుకుం డడుగ వేదవ్యాస మునీశ్వరుండు సెప్పిన యర్థంబులు నీయడిగిన యవియును మఱియు ననేకంబులుఁ గలవు సెప్పెద విను' మని యజ్జనపతి కిట్లనియె. 33

ప్రతిపదార్థం: అని చెప్పెన్= అని వచించాడు; ఆ+గుణంబులు= ఆ గుణాలు; అఖిలప్రియకరంబులు= అందరికీ ప్రియమును కలిగించేవి; సకలసత్త్వసమ్మతంబులు= సమస్త ప్రాణులకు ఇష్టములైనవి; అనినన్+విని= అనగా ఆలకించి; ధర్మతనయుండు= ధర్మజుడు; శంతను తనయుతోన్= భీష్ముడితో; కాలావయవ ప్రకారంబులును= కాలముయొక్క అంగములకు చెందిన విధానాలు; యుగప్రమాణంబులును= కృతయుగాదులైన యుగాలయొక్క కొలతలు; భూతవిధంబులున్= పృథివి మొదలైన పంచభూతాల విధానాలను; ఎఱింగింపవే!= తెలుపవే!; అని అడుగుటయున్= అని ప్రశ్నించగా; అతండు= ఆ భీష్ముడు; శుకుండు+అడుగన్= శుకయోగి ప్రశ్నించగా; వేదవ్యాస మునీశ్వరుండు= వేదవ్యాసుడనే ముని శ్రేష్ఠుడు; చెప్పిన= వచించిన; అర్థంబులు= విషయాలు; నీ అడిగినవియును= నీవు ప్రశ్నించినవియును; మఱియున్= అంతేకాక; అనేకంబులు= పెక్కువిషయాలు; కలవు= ఉన్నాయి; చెప్పెదన్= చెబుతాను; వినుము+అని= ఆలకించుమని; ఆ+జనపతికిన్= ఆ రాజుకు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా కృష్ణుడు ఉగ్రసేనుడితో చెప్పాడు; 'పై జెప్పిన గుణాలు అందరికీ ప్రియమైనవి. సమస్తప్రాణులకూ ఇష్టమైనవి' అని చెప్పేసరికి విని ధర్మరాజు భీష్ముడిని 'కాలము యొక్క అవయవాలకు చెందిన విభాగాలను, కృతాదియుగాల ప్రమాణాలను తెలియజెప్పు' మని అడిగాడు. అప్పుడు భీష్ముడు 'పూర్వం శుకుడు ఈ విషయాలనే వేదవ్యాస మునీశ్వరుడిని అడిగాడు. ఆ మునీంద్రుడు చెప్పిన విషయాలు నీ వడిగినవే కాక ఇంకా ఆయన అనేక విషయాలు తెలియజేశాడు. వాటిని వివరిస్తాను విను' మని ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

క. అనఘుఁ బరాశరసూను స । వినయంబునఁ జేరి భక్తి వినతుం డై త
త్తనయుండు బుద్ధి సంప । ద్ఘనుఁడు శుకుం డిట్టు లనియెఁ గౌరవనాథా! 34

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ధర్మరాజా!; అనఘున్= పాపరహితుడైన; పరాశరసూనున్= వ్యాసుడిని; తత్తనయుండు= అతడి కుమారుడు; బుద్ధి సంపద్ఘనుడు= ప్రజ్ఞావైభవంతో దొడ్డవాడూ అయిన; శుకుండు= శుకయోగి; సవినయంబునన్= వినయంతో; చేరి= సమీపించి; భక్తివినతుండు+ఐ= భక్తితో ప్రణమిల్లినవాడై; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: కౌరవాధిపతివగు ఓ ధర్మరాజా! పాపరహితుడూ, పరాశరుడి పుత్రుడూ అయిన వ్యాసుడిని ఒకసారి అతడి కుమారుడూ, బుద్ధివైభవంలో పెద్దవాడూ అయిన శుకుడు వినయంతో సమీపించాడు. భక్తిభావంతో తండ్రికి నమస్కరించాడు. ఆ పైన ఇట్లా అన్నాడు:

తే. **'కాలవిధములు భూతసంఘప్రకార । ములును లోనుగ నెఱుఁగంగ వలయు వాని**
బహులకారుణ్యసంపద పల్లవింప । నాకు నెఱిఁగింపవే మునినాథవర్య!' **35**

ప్రతిపదార్థం: మునినాథవర్య!= మునీంద్రులలో శ్రేష్ఠుడవైన వాడా!; కాలవిధములు= కాలముయొక్క ప్రకారాలు; భూతసంఘ ప్రకారములును= భూతసమూహాల స్వరూపాలూ; లోనుగన్= మొదలుగ; ఎఱుగంగవలయున్= తెలిసికొనాలి; బహులకారుణ్య సంపద= అత్యధికమైన దయావైభవము; పల్లవింపన్= విస్తరించగా; వానిన్= ఆ విషయాలను; నాకున్+ఎఱిఁగింపవే= నాకు తెలియజేయుమా!

తాత్పర్యం: 'మునిశ్రేష్ఠా! కాలముయొక్క స్వరూపాలను, పంచభూతాల ప్రకారాలు లోనుగా గల విషయాలను తెలిసికొనాలని అనుకొంటున్నాను. మెండైన కృప తొణికిసలాడగా నాకు ఆ విషయాలు తెలియజేయుము!'

వ్యాసుడు శుకునకుఁ జెప్పిన కాలావయవ నిరూపణము (సం. 12-224-6)

వ. **అనిన విని భరితాదరుండై వేదవ్యాస మునీశ్వరుం డమ్మహనీయున కిట్లనియె.** **36**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= విని; వేదవ్యాస ముని+ఈశ్వరుండు= వేదవ్యాసమునివర్యుడు; భరిత+ఆదరుండు+ఐ= నిండినప్రేమకలవాడై; ఆ+మహనీయునకున్= పూజ్యుడైన ఆ శుకుడికి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: శుకు డా విధంగా అడిగేసరికి వేదవ్యాసుడు మిక్కిలి ఆదరంతో పూజనీయుడైన ఆ శుకుడిని చూచి ఇట్లా అన్నాడు.

క. **'కాలములకు భూతములకు । నాలంబనభూత మగు మహామహిమఁ గ్రియా**
లీల వెలింగెడు నప్పర । మాలోకం బెందు నిష్క్రియాత్మక మయ్యెన్. **37**

ప్రతిపదార్థం: కాలమునకున్= రేయింబవళ్ళు మొదలైన కాలాలకు; భూతములకున్= పృథివి మొదలైన భూతాలకు; ఆలంబన భూతము+అగు= ఆధారమైన; మహామహిమన్= గొప్ప ప్రభావంతో; క్రియాలీలన్= కార్యరూపమైన విలాసంతో; వెలింగెడు= తేజరిల్లే; ఆ+పరమాలోకంబు= ఆ పరమతేజ స్వరూపం; ఎందున్= ఏ సందర్భంలో గానీ; నిష్క్రియాత్మకము= క్రియాసంబంధం లేనిదిగా; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: కాలాలకూ, భూతాలకూ ఆధారమైన గొప్ప ప్రభావంతో ఒక తేజశ్శక్తి పైకి అన్నిపనులూ చేస్తున్నట్లు భాసిస్తున్నది. కాని అది ఎప్పుడుగానీ ఏ విధమైన క్రియతోనూ సంబంధం లేనిదిగానే ఉన్నది.

వ. **అది భావనీయంబు.** **38**

ప్రతిపదార్థం: అది= ఆ తేజస్సు; భావనీయంబు= భావించదగి ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ తేజోరూపమైన శక్తి మనస్సులో భావించటానికి యోగ్యమైనదిగా ఉన్నది.

క. **వినుము! నిమేషంబులు పదు । నెనిమిది యగుఁగాష్ఠ; గాష్ఠ లిరువదియుం దో**
డన పదియుం గళ; యఱువది । యును మున్నూఱుఁ గళలై ముహూర్తము నడచున్. 39

ప్రతిపదార్థం: వినుము; పదునెనిమిది= అష్టాదశ సంఖ్యాకాలైన; నిమేషంబులు= నిముసములు; కాష్ఠఅగున్= కాష్ఠఅనబడుతుంది; ఇరువదియున్= ఇరవై; తోడన పదియున్= చేరిన పదియు, మొత్తం ముప్పది; కాష్ఠలు= 'కాష్ఠలు' అనే కాలవిభాగాలు; కళ= కళ అనబడుతుంది; అఱువదియును మున్నూరు కళలు+ఐ= మూడువందలా అరవై కళలు గలదై; ముహూర్తము= ముహూర్తమనే కాలభాగం; నడచున్= ప్రవర్తిస్తుంది.

తాత్పర్యం: ఆ సంగతి వివరిస్తాను వినుము. పదునెన్మిది నిమేషాలు ఒక 'కాష్ఠ' అన్న కాలవిభాగ మవుతుంది. అట్లాంటి ముప్పది కాష్ఠలు ఒక 'కళ' అవుతుంది. మూడువందల అరవై కళలను ఒక ముహూర్తం అంటారు.

తే. **మూఁడు పదులు ముహూర్తముల్ మోహదూర! । యగు నహోరాత్ర; మట్టివి యన్ని గూడ**
మాస; మవి రెండు ఋతు వను మహితసంజ్ఞఁ । బరఁగు; ఋతువు లాఱైన వత్సరము వత్స! 40

ప్రతిపదార్థం: మోహదూర!= మోహానికి దూరమైనవాడా!; వత్స!= కుమారా!; మూఁడుపదుల్= ముప్పదైన; ముహూర్తముల్= ముహూర్తాలనే కాలవిభాగాలు; అహోరాత్రము అగున్= పవలు రేయి అవుతున్నవి; అట్టివి= ఆ అహోరాత్రాలు; అన్ని= అంతే సంఖ్యగలవి, అనగా ముప్పది; కూడన్= కలియగా; మాసము= ఒక నెల ఔతుంది; అవిరెండు= ఆ మాసాలు రెండు చేరిన; ఋతువు+అను= ఋతువు అనబడే, మహితసంజ్ఞన్= శ్రేష్ఠమైన నామంతో; పరఁగున్= ఒప్పుతుంది; ఋతువులు= ఆ ఋతువు లనబడే కాలవిభాగాలు; ఆఱు+ఐనన్= ఆరు కూడితే; వత్సరము= ఒక సంవత్సరం అవుతుంది.

తాత్పర్యం: మోహ మంటని ఓ కుమారా! ముప్పైముహూర్తాలు ఒక అహోరాత్ర మవుతుంది. ముప్పై అహోరాత్రాలు ఒక మాస మవుతుంది. రెండుమాసాలు కలిస్తే ఒక ఋతు వవుతుంది. ఆరు ఋతువులు ఒక సంవత్సరం అవుతుంది.

తే. **అందు మూఁడేసి ఋతువుల కయననామ । కంబు లగు; నుత్తరాఖ్య మొకండు దక్షి**
ణాభిధాన మొక్కటియు గుణాభిరామ! । యవి యహస్సును రాత్రియు ననఁగఁ బరఁగు. 41

ప్రతిపదార్థం: గుణ+అభిరామ!= గుణములచేత మనోహరమైనవాడా!; అందున్= ఆ ఋతువులలో; మూఁడేసి= మూడు మూడైన; ఋతువులకున్= ఋతువులనబడే కాలవిభాగాలకు; అయననామకంబులు= అయనాలనే పేర్లు; అగున్= ఉంటాయి; ఒకండు= ఒకటి; ఉత్తరాఖ్యము= ఉత్తరాయణ మనేది; ఒక్కటియున్= ఇంకొకటి; దక్షిణ+అభిధానము= దక్షిణాయనమనబడేది; అవి= ఆ ఉత్తరదక్షిణాయనాలు; అహస్సును= పవలును; రాత్రియున్= రేయియును; అనఁగన్+పరఁగున్= అని చెప్పగా ఒప్పుతున్నాయి.

తాత్పర్యం: సద్గుణాలచేత శోభిల్లే ఓ కుమారా! ఆ ఋతువులలో మూడేసి ఋతువులను అయన మంటారు. ఒక అయనానికి ఉత్తరాయణన మనీ, మరొక అయనానికి దక్షిణాయన మనీ పేర్లు. ఈ అయనాలు రెండింటినీ అహోరాత్రాలు (రేయింబవళ్ళు) అనికూడా వ్యవహరిస్తారు.

వ. **అది యోగిజనుల నిర్దేశంబు. 42**

ప్రతిపదార్థం: అది= ఆ వ్యవహారం; యోగిజనుల= యోగమార్గంలో ఉన్న జనులయొక్క; నిర్దేశంబు= కథనం.

తాత్పర్యం: యోగులు నిర్దేశించినట్లుగా పై వ్యవహారం కాలానికి ఏర్పడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **అనఘ! యుత్తరదక్షిణాయనము లమ్మ । హాత్మ లగ్నియు ధూమంబు నండ్రు; మఱియు**
వినుము! శుక్లంబుఁ గృష్ణంబు ననుట గలుగు । సుగతి కగతికి హేతువు లగుటఁ జేసి. 43

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఆ+మహాత్ములు= ఆ యోగులు; ఉత్తరదక్షిణ+అయనములు= ఉత్తరాయణ దక్షిణాయనాలను; అగ్నియున్= అగ్నిఅనీ; ధూమంబు= ధూమ మనీ; అండ్రు= అంటారు; మఱియున్= ఇంకను; వినుము; సుగతికిన్= మంచిగతికి; అగతికిన్= దుర్గతికిని; హేతువులు= (ఆ అయనాలు) కారణాలు; అగుటన్+చేసి= కావటంవలన; శుక్లంబు= శుక్లమనీ; కృష్ణంబు= కృష్ణమనీ; అనుట= వ్యవహరించటం; కలుగున్= సంభవిస్తున్నది.

తాత్పర్యం: పాపరహితుడా! యోగులు ఉత్తరాయణాన్ని 'అగ్ని' అనీ, దక్షిణాయనాన్ని 'ధూమ' మనీ కూడా అంటారు. అంతేకాక అందు మొదటిది సుగతి కలిగిస్తుంది కాబట్టి శుక్లమనీ, రెండవది దుర్గతి కలిగిస్తుంది కాబట్టి కృష్ణ మనీ వ్యవహరించటం కూడా కద్దు.

క. **నరుల నెలలు నేఁడులుఁ బితృ । సురులకు దినము లగు నండ్రు సూరులు వరుసం**
బరఁగు కృత త్రేతా ద్వా । పర కలియుగ వత్సరముల భంగిఁ దెలిపెదన్. 44

ప్రతిపదార్థం: సూరులు= విద్వాంసులు; నరుల= మానవులయొక్క; నెలలు= మాసాలు; ఏఁడులు= సంవత్సరాలు; పితృసురులకున్= (క్రమంగా) పితరులకు, దేవతలకు; దినములు+అగున్+అండ్రు= దినము లవుతాయని చెప్పుతారు; వరుసన్= క్రమముగా; పరఁగు= ఒప్పారు; కృత= కృతయుగం యొక్కయు; త్రేతా= త్రేతాయుగం యొక్కయు; ద్వాపర= ద్వాపరయుగం యొక్కయు; కలియుగ= కలియుగం యొక్కయు; వత్సరముల= సంవత్సరాల యొక్క; భంగిన్= ప్రకారాన్ని; తెలిపెదన్= తెలియజేస్తాను.

తాత్పర్యం: విద్వాంసు లైనవారు మానవులకు చెందిన నెలలు పితరులకు దినాలక్రింద లెక్కింపబడతాయనీ, సంవత్సరాలు దేవతలకు దినాలక్రింద పరిగణించబడతాయనీ అంటారు. అంటే మానవులకు ఒక్క నెల అయితే పితరులకు ఒక్క దినమవుతుంది. మానవులకు ఒక్క సంవత్సరమయితే దేవతలకు ఒక్క దినమవుతుందని భావం. ఇక కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం అని క్రమంగా ప్రవర్తించే ఆయా యుగాలకు చెందిన సంవత్సరాల వివరాలు తెలియజేస్తాను.

వ. **ఆకర్ణింపుము.** 45

తాత్పర్యం: వినుము.

చతుర్యుగ సంవత్సర పరిమితి ప్రకారము (సం. 12-224-18)

సీ. **విబుధుల పండ్రెండు వేలేండ్లు సనునంత । నాలుగు యుగములు నోలి నడచుఁ**
గృతయుగమ్మున కందుఁ జతురంశకములుఁ, ద్రే । తకు మూఁడు పాళ్ళును, ద్వాపరంబు
భాగద్వయంబునఁ బర్యవసిత మగుఁ; । గలియుగ మంశ మొక్కటన తీఱు;
నిబ్భంగిపాళ్ళగు నిన్నియుగముల కం । బరయుగ్మ వసువార్ధి పరిమితములు

తే. **ఖద్వయర్తుగుణంబులు గగన యుగళ । వేద నేత్రంబులును నభోద్వితయకరసు**
ధాంశులును వచ్చు మున్నూటయఱువదింటఁ । బెంప మానుషాబ్దంబులై పేర్చి యుండు. 46

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: విబుధుల= దేవతలయొక్క; పండ్రెండు వేలేండ్లు= పండ్రెండువేల సంఖ్యగల సంవత్సరాలు; చనునంతన్= కడచినంతనే; ఓలిన్= క్రమంగా; నాలుగు యుగములు= కృతత్రేతాదులైన నాలుగు యుగాలు; నడచున్= ప్రవర్తిస్తాయి; అందున్= ఆ పండ్రెండువేల సంవత్సరాలలో; కృతయుగమ్మునకున్= కృతయుగానికి; చతురంశకములు= (పదింట) నాలుగుపాళ్ళు; త్రేతకున్= త్రేతాయుగానికి; మూఁడుపాళ్ళును= మూడంశాలును ఔతాయి; ద్వాపరంబు= ద్వాపరయుగం; భాగద్వయంబునన్= రెండుపాళ్ళతో; పర్యవసితము= సమాప్తం; అగున్= ఔతుంది; కలియుగము= నాల్గవయుగం; అంశము+ఒక్కటైనన్= ఒక్కభాగంలోనే; తీఱున్= సమాప్తమవుతుంది; ఈ+భంగిన్= ఈ రీతిగా; పాళ్ళు+అగు= భాగాలు అవుతున్న; ఇన్ని యుగములకున్= ఈ నాలుగు యుగాలకు; అంబరయుగ్మ వసువార్ధి పరిమితములు= నాలుగువేల ఎనిమిది వందల సంవత్సరాల; ఖద్వయర్తు గుణంబులు= మూడువేల ఆరువందలు; గగనయుగళవేద నేత్రంబులును= రెండువేల నాలుగు వందలు; నభోద్వితయకర సుధాంశులును= పండ్రెండువందలును; వచ్చున్= సమకూరుతాయి; మున్నూట యరువదింటన్= మూడువందల అరువది అనే సంఖ్యతో; పెంపన్= గుణించగా; మానుష+అబ్దంబులు+ఐ= మానవులకు చెందిన సంవత్సరాలై; పేర్చి ఉండున్= పెంపొందిఉంటాయి.

తాత్పర్యం: దేవతలకు చెందిన పండ్రెండువేల సంవత్సరాలు గడచేసరికి నాలుగు యుగాలు పూర్తి అవుతాయి. అందులో మొదటిదైన కృతయుగానికి పదింట నాల్గుభాగాలు, త్రేతాయుగానికి మూడుభాగాలు, ద్వాపరయుగానికి రెండుభాగాలు, కలియుగానికి ఒక్కభాగంగా కాలం విభక్తమయింది. 12000 లో పదింట నాల్గవభాగం, 4800, మూడవభాగం 3600, రెండవ భాగం 2400, ఒకభాగం 1200 గా గ్రహించవలసి ఉంటుంది. ఈ సంఖ్యలను క్రమంగా 360తో గుణిస్తే మానుష లోకానికి చెందిన కృతయుగాదుల సంవత్సరాలు సిద్ధిస్తాయి.

విశేషం: అంబరయుగ్మ వసు వార్ధులు అనే పదానికి సంఖ్యా గణన ప్రకారం 4800 అని అర్థం సిద్ధిస్తుంది. అంబరం అంటే ఆకాశం - శూన్యమన్నమాట; యుగ్మమంటే రెండు, అంబరయుగ్మమన్న పదానికి రెండు సున్నలని అర్థం; వసువులు అష్టసంఖ్యాకులు కాబట్టి వసుశబ్దానికి ఎనిమిది అని అర్థం; వార్ధి= సముద్రం - నాల్గు సముద్రాలు ప్రసిద్ధాలు కాన వార్ధి అంటే నాల్గు సంఖ్య అని అర్థం; 'అంకానాం వామతో గతిః' అన్నట్లు అంకెలను ఎడమవైపుకు లెక్కించాలి. ఇట్లా లెక్కిస్తే 4800 అనే సంఖ్య వస్తుంది. తక్కినవిగూడా ఇట్లానే అన్వయించుకోవాలి.

ఖద్వయర్తుగుణంబులు= ఖద్వయం= రెండు సున్నలు, ఋతువులు 6, గుణములు 3= మొత్తం 3600 -

గగనయుగళ వేదనేత్రంబులు= గగనయుగళ= రెండు సున్నలు, వేదాలు= 4, నేత్రాలు 2= మొత్తం 2400 -

నభోద్వితయకర సుధాంశులును= నభోద్వితయం= రెండుసున్నలు, కరములు2 , సుధాంశుడు= చంద్రుడు= ఒకటి - మొత్తం 1200 - వీటిని 360తో పెంచగా వచ్చేసంఖ్యలను గ్రంథకర్తే తరువాత వివరిస్తాడు.

వ. ఇట్లు కృతయుగంబునకుఁ బదియేడు లక్షలు ఇఱువది యెనిమిది వేలును, ద్రేతాయుగంబునకుఁ బండ్రెండు లక్షలుఁ దొంబదియాఱువేలును, ద్వాపరంబునకు నెనిమిది లక్షలు నఱువది నాలుగువేలును, గలియుగంబునకు నాలుగు లక్షలు ముప్పది రెండు వేలును మనుష్య వత్సరంబు లయ్యెఁ; నిందులోన సంధ్యలును, సంధ్యాంశంబులు ననుపేర్లఁ గొంతేసి కాలంబు సెల్లు. 47

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; కృతయుగంబునకున్= కృతయుగానికి; పదియేడులక్షలు ఇరువది ఎనిమిదివేలును= 4800 x 360= 17 28000 సంఖ్యగల సంవత్సరాలు, త్రేతా యుగానికి, పండ్రెండు లక్షలు తొంబదియాఱువేలును= 3600x 360= 12 96000 సంఖ్య గల సంవత్సరాలు, ద్వాపరంబునకున్= ద్వాపరయుగానికి, ఎనిమిదిలక్షలు అఱువదినాలుగు వేలును= 2400 x 360= 864000 సంఖ్యగల సంవత్సరాలును; కలియుగంబునకున్= కలియుగానికి; నాలుగు లక్షలు ముప్పదిరెండువేలును= 1200 x 360= 432000 సంఖ్యగల సంవత్సరాలును; మనుష్యవత్సరంబులు= మానవసంవత్సరాలు; అయ్యెన్= అయ్యాయి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇందులోనన్= ఈ సంవత్సరాలలో; సంధ్యలును= సంధ్యలనియు; సంధ్యాంశంబులున్= సంధ్యాంశములనియు; అనుపేళ్ళన్= అనబడు నామములతో; కొంతేసికాలంబు= కొంతపరిమాణానికి చెందిన సమయం; చెల్లున్= గతిస్తుంది.

తాత్పర్యం: ఇట్లా లెక్కిస్తే మానవలోకానికి చెందిన కాల విభాగంలో కృతయుగానికి 17,28,000, త్రేతాయుగానికి 12,96,000, ద్వాపరయుగానికి 8,64,000, కలియుగానికి 4,32,000 సంవత్సరాలు వస్తాయి. ఇందులో కొంతకాలం సంధ్యలనీ, సంధ్యాంశాలనీ వ్యవహరించబడుతుంది.

క. క్రమమున సంధ్యలు సంధ్యాం । శములు ననం బరఁగు బుత్ర! సకలయుగాద్యం
తములును యుగయుగమునకుం । దమలో నవి సరియ కాలతత్త్వం బరయన్. 48

ప్రతిపదార్థం: పుత్ర!= వత్సా!;; సకలయుగ+ఆద్యంతములును= సమస్తయుగాల మొదటిభాగాలును, చివరిభాగాలును; క్రమమునన్= క్రమంగా; సంధ్యలు= సంధ్యలనీ; సంధ్యాంశములు= సంధ్యాంశాలు; అనన్= అనగా; పరఁగున్= ఒప్పారుతాయి; కాలతత్త్వంబు= కాలస్వభావం; అరయన్= పరిశీలించగా; యుగయుగమునకున్= యుగయుగానికీ; అవి= ఆ సంధ్యాసంధ్యాంశాలు; తమలోన్= తమయందు; సరియ= సమానంగానే ఉంటాయి.

తాత్పర్యం: కుమారా! అన్ని యుగాల ఆద్యంతభాగాలను సంధ్యలనీ, సంధ్యాంశాలనీ అంటారు. కాలతత్త్వాన్ని బట్టి పరిశీలిస్తే యుగయుగానికీ ఈ సంధ్యా సంధ్యాంశాలు సమంగానే ఉంటాయి.

వ. అది యెట్లంటేని దేవసంఖ్యం జెప్పెద. 49

ప్రతిపదార్థం: అది= ఆ వివరం; ఎట్లు+అంటివి+ఏనిన్= ఎట్లా అంటే; దేవసంఖ్యన్= దేవతలకాలమానాన్ని అనుసరించి; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: ఆ సంధ్యలు, సంధ్యాంశాల వివరం ఎట్లా అంటే దేవతల కాలమానానుసారం వివరిస్తాను.

క. నన్నూఱులు మున్నూఱులు । నిన్నూఱులు నూఱులును మహితవర్షము ల
య్యన్ని యుగములకును గ్రమా । సన్నత సంధ్యలను వాని సంధ్యాంశములన్. 50

ప్రతిపదార్థం: ఆ+అన్ని యుగములకునున్= ఆ సమస్త యుగాలకు; సంధ్యలను= సంధ్యాకాలాలలోనూ; వాని సంధ్యా+అంశములన్= ఆ యుగాల సంధ్యాంశముల కాలంలోనూ; క్రమ+ఆసన్నతన్= వరుసగా; నన్నూఱులు= నాల్గువందలు; మున్నూఱులు= మూడువందలు; ఇరు+నూరులు= రెండు వందలు; నూఱులును= ఒక వందసంవత్సరాలును; మహిత వర్షములు= పూజితమైన సంవత్సరాలుగా ఉన్నాయి.

తాత్పర్యం: కృతాది సర్వయుగాలకూ సంధ్యలలోనూ, సంధ్యాంశాలలోనూ క్రమంగా దేవతలకాలమానం ప్రకారం నాలుగువందల సంవత్సరాలూ, మూడువందల సంవత్సరాలూ, రెండువందల సంవత్సరాలూ, వంద సంవత్సరాలూ లెక్కకు వస్తాయి.

విశేషం: వీటిని మానుషకాలానికి అనుగుణంగా లెక్కించటానికి 360 సంఖ్యతో గుణించితే సరిపోతుంది.

వ. ఇట్లు కృతయుగంబునకు సంధ్య లక్షయునలువదినాలుగువేలు, దాని సంధ్యాంశంబు నంతియ; త్రేతకు సంధ్య లక్షయు నెనిమిది వేలు; దాని సంధ్యాంశంబు నంతియ; ద్వాపరంబునకు సంధ్య డెబ్బదిరెండువేలు; దాని సంధ్యాంశంబు నంతియ; కలియుగంబునకు సంధ్య ముప్పదియాఱువేలు; దాని సంధ్యాంశంబు నంతియ; యివి మానుష వత్సరంబులు. 51

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; కృతయుగంబునకున్= కృతయుగానికి; సంధ్య= సంధ్యాకాలం; లక్షయు నలువది నాలుగు వేలు= 1,44,000 సంవత్సరాలు; దాని సంధ్యా+అంశంబున్= ఆ కృతయుగానికి చెందిన సంధ్యాంశకాలం కూడా; అంతియ= అంతే; త్రేతకున్= త్రేతాయుగానికి సంధ్య= సంధ్యాకాలం; లక్షయు నెనిమిదివేలు= 1,08,000 సంవత్సరాలు; దాని సంధ్యా+అంశమున్= ఆ త్రేతాయుగానికి చెందిన సంధ్యాంశకాలం కూడా; అంతియ= అంతే; ద్వాపరంబునకున్= ద్వాపరయుగానికి; సంధ్య= సంధ్యాకాలం; డెబ్బదిరెండువేలు= 72,000 సంవత్సరాలు; దాని సంధ్యా+అంశంబున్= ఆ ద్వాపరయుగానికి చెందిన సంధ్యా+అంశకాలం కూడా; అంతియ= అంతే; కలియుగంబునకున్= కలియుగానికి; సంధ్య= సంధ్యాకాలం; ముప్పది+ఆఱువేలు= 36,000 సంవత్సరాలు; దాని సంధ్యా+అంశంబున్= ఆ కలియుగానికి చెందిన సంధ్యాంశకాలం కూడా; అంతియ= అంతే; ఇవి= ఈ చెప్పినవి; మానుష వత్సరంబులు= మానవలోకానికి చెందిన సంవత్సరాలు.

తాత్పర్యం: (దేవతావత్సరాలను 360తో గుణిస్తే మానుష వత్సరాలు వస్తాయి. ఆ విధంగా గుణించగా) కృతయుగానికి సంధ్య, సంధ్యాంశం - ఒక లక్ష నలభై నాలుగువేల మానుష సంవత్సరాల కాలమవుతుంది. త్రేతాయుగానికి ఒకలక్ష ఎనిమిదివేల సంవత్సరాల సమయ మవుతుంది. ద్వాపరయుగానికి డెబ్భైరెండువేల సంవత్సరాల సమయ మవుతుంది. కలియుగానికి ముప్పదియారువేల సంవత్సరాల కాలం పడుతుంది.

క. **వరుసఁ గృత త్రేతా ద్వా । పర కలియుగములఁ దపంబు భవ్యజ్ఞాన**
స్ఫురణము యజనము దోషా । దరమును మానవులకుం బ్రధానతఁ గలుగున్. **52**

ప్రతిపదార్థం: మానవులకున్= మనుష్యులకు; ప్రధానతన్= ముఖ్యంగా; కృత= కృత యుగంలోనూ; త్రేతా= త్రేతాయుగంలోనూ; ద్వాపర= ద్వాపరయుగంలోనూ; కలియుగములన్= కలియుగంలోనూ; వరుసన్= క్రమంగా; తపంబు= తపస్సు; భవ్యజ్ఞానస్ఫురణము= శ్రేష్ఠమైన జ్ఞానంయొక్క ప్రకాశం; యజనము= యజ్ఞక్రియ; దోషాదరమును= దోషాచరణంపై ప్రీతియు; కలుగున్= సంభవిస్తాయి.

తాత్పర్యం: మనుష్యులకు ముఖ్యంగా కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో శ్రేష్ఠమైన జ్ఞానస్ఫూర్తీ, ద్వాపరయుగంలో యజ్ఞం చేయటం, కలియుగంలో దోషాచరణమూ - స్వభావంగా సంభవిస్తుంటాయి.

క. **న్యాయంబులు, ధర్మంబులు, । నాయువులుఁ, దనూబలములు నంతంతకు వ**
త్సా! యెంతయుఁ దఱుఁగుం ద్రే । తాయుగముఁ దొడంగి మనుజతతి కరయంగన్. **53**

ప్రతిపదార్థం: వత్సా!= కుమారా!; మనుజతతికిన్= మానవసమూహానికి; అరయంగన్= పరిశీలించగా; త్రేతాయుగమున్+తొడంగి= త్రేతాయుగం మొదలుకొని; న్యాయంబులున్= న్యాయవిధానాలు; ధర్మంబులు= ధర్మాచరణలు; ఆయువులున్= జీవన కాలాలు; తనూబలములున్= శరీరబలాలు; అంతంతకున్= అంతకంతకు; ఎంతయున్= మిక్కిలిగా; తఱుఁగున్= తగ్గిపోతాయి.

తాత్పర్యం: కుమారా! పరిశీలించి చూస్తే మానవాళికి త్రేతాయుగంనుండీ న్యాయం, ధర్మం, ఆయువు, శరీర పటుత్వం - ఇవి అంతకంతకూ ఎంతగానో తరిగిపోతాయి.

తే. **ఆ యుగంబులు నాల్గు మహాయుగంబు । నాఁగఁ జనుఁ దత్సహస్రంబు నలువ పగలు**
దాని కొలఁదియ రేయును దీని నెఱుఁగు । ప్రౌఢ జనములు సు మ్మహోరాత్ర విదులు. **54**

ప్రతిపదార్థం: ఆ యుగంబులు నాల్గు= ఆ నాలుగు యుగాలూ; మహాయుగంబునాఁగన్= ఒక మహాయుగం అనగా; చనున్= ప్రవర్తిల్లుతుంది; తత్సహస్రంబు= ఆ మహాయుగాలు వెయ్యి; నలువ పగలు= బ్రహ్మకు ఒక పగటికాలం; రేయును= రాత్రియును; దానికొలఁదియ= అంతే పరిమాణం కలిగిఉంటుంది; దీనిన్= ఈ కాల విభాగాన్ని; ఎఱుఁగు= తెలిసికొను; ప్రౌఢజనములు= వివేకంగల మానవులు; అహోరాత్ర విదులు సుమ్మ!= అహోరాత్రాలను తెలిసికొన్న వారు సుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కృతాదులైన నాలుగు యుగాలూ కలిస్తే ఒక మహాయుగం అవుతుంది. అట్లాంటి వెయ్యి మహాయుగాలు బ్రహ్మకు ఒక పగటి కాల మవుతుంది. రాత్రి కాలం కూడా అంతే. ఈ విధమైన బ్రహ్మ పగలు - రేయి కాలక్రమాన్ని తెలిసికొన్న పండితులే అహోరాత్రవేత్త లనబడతారు.

తే. అతఁడు రాత్రి నిద్రించు; నిద్రావసరమ । ప్రళయ మగు లోకములకు; ప్రభాత మగుడు
మేలుకను; దివమున భూతజాలసృష్టి । పరతఁ బొందుఁబర్యాయ మిప్పాటఁ జెల్లు.' 55

ప్రతిపదార్థం: అతడు= ఆ బ్రహ్మ; రాత్రి= రాత్రివేళ; నిద్రించున్= నిద్రిస్తాడు; నిద్రా+అవసరము= ఆ నిద్రించే సమయమే; లోకములకున్= ప్రపంచాలకు; ప్రళయము+అగున్= విలయకాల మవుతుంది; ప్రభాతము+అగుడున్= తెల్లవారగానే; మేలుకనున్= ఆ బ్రహ్మ మేల్కొంటాడు; దివమునన్= ఆ పగటివేళ; భూతజాలసృష్టిపరతన్= ప్రాణి సమూహాన్ని సృష్టి చేయటంలో ఆసక్తతను; పొందున్= చెందుతాడు; ఈ+పాటన్= ఈ రీతిగా; పర్యాయము= క్రమం; చెల్లున్= ప్రవర్తిస్తుంది.

తాత్పర్యం: ఆ బ్రహ్మ రాత్రివేళ నిద్రిస్తాడు. అతడు నిద్రించేసమయమే లోకాలకు ప్రళయకాలం. ప్రభాతం కాగానే అతడు మేలుకొంటాడు. పగటివేళలో ప్రాణికోట్ల సృష్టికి పూనుకొంటాడు. ఈ క్రమపద్ధతి ఇట్లాగే సాగిపోతూ ఉంటుంది'.

వ. అని వెండియు. 56

ప్రతిపదార్థం: అని= ఇట్లా చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: వ్యాసుడు ఇట్లా చెప్పి మళ్ళీ ఈ రీతిగా అన్నాడు.

తే. 'అనఘ! బ్రహ్మంబు దేజోమయంబు శుక్ల । మగ్రభాసిత మెద్దాని యతుల సార
రసము విశ్వంబు నది యహర్మహితకాల । బుద్ధమై చేయు బహువిధ భూతసృష్టి. 57

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితా!; బ్రహ్మంబు= బ్రహ్మం; తేజోమయంబు= కాంతితో నిండినది; శుక్లము= ధవళమైనది; అగ్రభాసితము= ముందు ప్రకాశించేది; విశ్వంబున్= ప్రపంచం; ఏ+దాని= ఏ దానియొక్క; అతులసారరసము= సాటిలేని సారాంశమో; అది= ఆ బ్రహ్మం; అహర్మహితకాల బుద్ధము+ఐ= అహస్సు అనే పూజ్యమైన కాలంలో మేల్కొంచినదై; బహువిధ భూతసృష్టి= నానావిధాలైన భూతాల సృష్టిని; చేయున్= చేస్తుంది.

తాత్పర్యం: 'పాపరహితుడవైన ఓ శుకా! బ్రహ్మం తేజోమయం, అది శుక్లం. అన్నింటికంటె ముందు ప్రకాశించేది. ఈ విశ్వమంతా ఆ బ్రహ్మముయొక్క సారాంశమే. ఆ బ్రహ్మమే అహఃకాలంలో మేలుకొని నానావిధ భూతసంచయాన్ని సృష్టిస్తుంది.

వ. తత్ప్రకారం బెట్టి దనిన: నమ్మహనీయతత్త్వంబు వలన. 58

ప్రతిపదార్థం: తద్= ఆ బ్రహ్మముయొక్క; ప్రకారంబు= స్వరూపం; ఎట్టిది+అనినన్= ఏ విధమైనది అనగా; ఆ+మహనీయ= ఆ పూజనీయమైన; తత్త్వంబువలనన్= తత్త్వంనుండి.

తాత్పర్యం: ఆ బ్రహ్మస్వరూపం ఎట్లాంటి దంటే - పూజనీయమైన ఆ బ్రహ్మ తత్త్వంనుండి. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. విను! మహన్మనోగగన పవనానల । సలిల భూము లనఁగ సంభవించు
మహిత విభవములు గ్రమంబున నేడు । రూపములు జన్యజనకభావ మొంది. 59

ప్రతిపదార్థం: విను= వినుము; మహత్= మహత్తత్త్వం; మనః= మనస్సు; గగన= ఆకాశం; పవన= వాయువు; అనల= అగ్ని; సలిల= జలం; భూములు= పృథివి; అనఁగన్= అనగా; మహిత విభవములు= పూజితమైన విభవం గలవి అగు; ఏడురూపములు= సప్తరూపాలు; క్రమంబునన్= వరుసగా; జన్యజనకభావము= పుట్టేది, పుట్టించేది అనే భావాన్ని; ఒంది= పొంది; సంభవించున్= కలుగుతాయి.

తాత్పర్యం: మహత్తు, మనస్సు, ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి - అనే ఈ ఏడు రూపాలు గొప్ప వైభవం కలిగి క్రమంగా జన్యజనక భావంతో ఉదయిస్తున్నాయి. అంటే, బ్రహ్మతత్త్వంనుండి మొదట మహత్తత్త్వం పుడుతుంది. దానినుండి మనస్సు, మనస్సునుండి ఆకాశం, ఆకాశంనుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్నినుండి జలం, జలమునుండి పృథ్వి - ఇట్లా క్రమంగా పుట్టుతున్నాయి. మహదాదిక మైన సప్తరూపాలకు మూలం బ్రహ్మమే.

విశేషం: 'ఆత్మన ఆకాశః సంభూతః, ఆకాశా ద్వాయుః వాయో రగ్నిః, అగ్నే రాపః, అద్భ్యః పృథివీ' ఇత్యాది శ్రుతివచనం కూడా పంచభూతాల ఉత్పత్తిక్రమాన్ని ఇట్లాగే వివరించింది.

క. క్రమయుక్తిని శబ్దస్ప । ర్శములును రూపరసగంధ సద్భావములుం
దమ గుణములుగా నాకా । శము మొదలగు భూతములు ప్రశస్తి వహించున్. 60

ప్రతిపదార్థం: ఆకాశము మొదలగు= ఆకాశాదులైన; భూతములు= ఐదు భూతాలు; క్రమయుక్తిని= క్రమయోగంతో; శబ్దస్పర్శములును= శబ్దం, స్పర్శము; రూపరసగంధ సద్భావములన్= రూపం, రసం, గంధం - అనే సత్పదార్థాలు; తమగుణములుకాన్= తమతమ గుణాలుగా; ప్రశస్తిన్= విఖ్యాతిని; వహించున్= కలిగి ఉన్నాయి.

తాత్పర్యం: పంచభూతాలలో క్రమంగా ఆకాశం శబ్దమనే గుణంతోనూ, వాయువు స్పర్శమనే గుణంతోనూ, తేజస్సు రూపమనే గుణంతోనూ, జలం రసమనే గుణంతోనూ, పృథివి గంధమనే గుణంతోనూ ప్రశస్తి వహిస్తున్నాయి.

క. నరనుత! విను మీ సప్త । స్వరూపములు పురుషులండ్రు సంయమివరు; లీ
పురుషులు గూడిన సృష్టికి । వెరవరు లది సంఘటిలదు వేర్పడిరేనిన్. 61

ప్రతిపదార్థం: నరనుత!= మనుజులచేత నుతించబడినవాడా!; వినుము= ఆలకించుము; సంయమివరులు= మునీంద్రులు; ఈ సప్తస్వరూపములు= పై జెప్పబడిన ఏడురూపాలు; పురుషులు+అంద్రు= పురుషులు అని చెప్తున్నారు; ఈ పురుషులు= మహదాది పురుషులు; కూడినన్= కలిసినచో; సృష్టికిన్= సృష్టికార్యం చేయటానికి; వెరవరులు= ఉపాయశాలు లగుతున్నారు; వేర్పడిరేనిన్= కలవకుండా విడివిడిగా ఉంటే; అది= ఆ సృష్టి; సంఘటిలదు= సంభవించదు.

తాత్పర్యం: జనస్తుతుడవైన ఓ శుకా! వినుము. మునీంద్రులు పై చెప్పిన సప్త స్వరూపాలను పురుషులు అని వ్యవహరిస్తున్నారు. వారు తమలో తాము కూడితే సృష్టికార్యం సిద్ధిస్తుంది. కూడకుండా ఉంటే సృష్టి జరగదు.

వ. ఇట్టి మహిమ గలిగి . 62

ప్రతిపదార్థం: ఇట్టి= ఈ విధమైన; మహిమకలిగి= ప్రభావం కలిగి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధమైన ప్రభావంతో కూడి.

క. తేజోరూపము బ్రహ్మము । ప్రాజాపత్యం బనఁగఁ బరగి పురుషుఁ డు
ర్భ్రాజిష్ణు సత్యనిత్యా । వ్యాజమహిమ వెలుఁగుచుండు నకలంకమతిన్. 63

ప్రతిపదార్థం: పురుషుఁడు= పైన పేర్కొనబడిన పురుషుడు; తేజోరూపము= తేజస్స్వరూపం, బ్రహ్మం; ప్రాజాపత్యంబు అనఁగన్= బ్రహ్మమనీ, ప్రాజాపత్యమనీ అనగా; పరఁగి= ఒప్పి; ఉర్భ్రాజిష్ణు సత్యనిత్యావ్యాజమహిమన్= ప్రకాశశీలమైన సత్యం, నిత్యం, వ్యాజరహితం అయిన ప్రభావంతో; అకలంకమతిన్= నిర్మలమైన బుద్ధితో; వెలుఁగుచుండున్= భాసిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: ఆ పురుషుడు తేజోరూపమనీ, బ్రహ్మమనీ, ప్రాజాపత్యమనీ వ్యవహరించబడుతున్నాడు. అంతేకాక నిర్మలమైన మతి గలిగి సదా ప్రకాశించే సత్యమూ, నిత్యమూ అయిన మహిమతో ప్రకాశిస్తూ ఉంటాడు.

క. వ్యాపకుఁడు స్రష్ట బ్రహ్మ ప్ర । జాపతినాఁ బరఁగి నిత్యసత్యాత్మ త్వో
ద్దీపితుఁడై పురుషుఁడు ని । ర్లేపుఁ డనిర్దేశముం గలిగి వెలుఁగొందున్. 64

ప్రతిపదార్థం: పురుషుఁడు= పురుషశబ్దవాచ్యుడైన అతడు; వ్యాపకుడు, స్రష్ట, బ్రహ్మ, ప్రజాపతినాన్= వ్యాపకుడనీ, స్రష్ట అనీ, బ్రహ్మ అనీ, ప్రజాపతి అనీ అనగా; పరఁగి= ఒప్పారి; నిత్య సత్యాత్మత్వ+ఉద్దీపితుఁడు+ఐ= శాశ్వతం, సత్యం అయిన ఆత్మభావంచేత ప్రకాశించినవాడై; నిర్లేపుఁడు= సంగం లేనివాడై; అనిర్దేశమున్= ఇట్టిదని నిర్దేశించటానికి వీలుగాని భావమును; కలిగి= వహించి; వెలుఁగొందున్= ప్రకాశిస్తూ ఉంటాడు.

తాత్పర్యం: ఆ పురుషుడినే వ్యాపకుడనీ, స్రష్ట అనీ, బ్రహ్మ అనీ, ప్రజాపతి అనీ అంటారు. అతడు నిత్యమూ, సత్యమూ అయిన ఆత్మభావంతో ప్రకాశిస్తుంటాడు. మరియు సంగంలేనివాడై, ఏ విధమైన నిర్దేశం లేక వెలుగొందుతూ ఉంటాడు.

క. సురసంయమి గరుడోరగ । నరకిన్నర గిరి సరిద్వన పయోధులఁ ద
త్కరణీయములం జేయుం । బురుషుఁడు దివ్యాంతరంగమునఁ దలఁచి సుతా! 65

ప్రతిపదార్థం: సుతా!= కుమారా!; పురుషుఁడు= పూర్వోక్తుడైన ఆ పురుషుడు; దివ్య+అంతరంగమునన్= దివ్యమైన హృదయంలో; తలఁచి= సంకల్పించి; సుర= దేవతల యందును; సంయమి= మునులయందును; గరుడ= గరుడుల యందును; ఉరగ= పన్నగుల యందును; నర= మానవుల యందును; కిన్నర= కిన్నరుల యందును; గిరి= పర్వతాల యందును; సరిత్= నదులయందును; వన= అరణ్యాల యందును; పయోధులన్= సముద్రాలయందును; తత్కరణీయములన్= ఆయా కార్యాలను; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: కుమారా! ఆ పురుషుడు తన దివ్యమైన హృదయంలో తలచుకొని దేవతలు, ఋషులు, గరుడులు, ఉరగులు, నరులు, కిన్నరులు, పర్వతాలు, నదులు, అడవులు, సాగరాలు - వీటిలో సురాదులు చేయదగిన ఆయా కార్యాలు నిర్వర్తిస్తూ ఉంటాడు.

వ. ఇట్లు గలిగి వర్తిలుచున్న లోకంబులందు. 66

ప్రతిపదార్థం: ఇట్లు గలిగి= ఈ రీతిగా సంభవించి; వర్తిలుచున్న= ప్రవర్తిస్తున్న; లోకంబులందున్= ప్రపంచాలలో.

తాత్పర్యం: ఈ విధంగా సంభవించి నడుస్తున్న లోకాలలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. పౌరుషంబు సూవె ఫలదమందురు కొంద । అనఘ! దైవ మిచ్చు నండ్రు కార్య
ఫలము కొంద ఱెల్ల ఫలము భూతస్వభా । వంబ యండ్రు గొంద అమితతేజ! 67

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; అమితతేజ!= అత్యధిక తేజం కలవాడా!; కొందఱు= కొంతమంది; పౌరుషంబు సూవె= పౌరుషమేకదా; ఫలదము= ఫలమిచ్చేది అని; అందురు= చెప్తుతారు; కొందఱు= మరికొంతమంది; కార్యఫలము= చేసేపనులయొక్క ఫలాన్ని; దైవము= విధి; ఇచ్చునండ్రు= ఇస్తుందంటారు; కొందఱు= ఇంక కొందరు; ఎల్లఫలము= అన్ని ఫలాలూ; భూతస్వభావంబ= ఆయా భూతాల స్వభావమే అని; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పాపరహితుడవు, అధికతేజుడవూ అయిన ఓ శుకా! కొందరు పురుషప్రయత్నమే ఫల మిస్తుందంటారు. మరికొందరు కార్యఫలం ఇచ్చేది దైవమని చెప్తుతారు. ఇంక కొందరు ఫలమంతా ఆయా భూతాల స్వభావమే కాని మరేమీ కాదు అని పేర్కొంటారు.

వ. ఇవి కర్మస్థుల తెఱంగులు; సత్త్వస్థులు సమదర్శను లయి యుండుదురు; విశేషంబు వినుము. 68

ప్రతిపదార్థం: ఇవి= ఈ చెప్పినవి; కర్మస్థుల= కర్మమార్గంలో ఉన్నవారి; తెఱంగులు= పద్ధతులు; సత్త్వస్థులు= సత్త్వంలో ఉన్నవారు; సమదర్శనులు+అయి= సమదృష్టి కలవారయి; ఉండుదురు= ఉంటారు; విశేషంబు= విశిష్టాంశం; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: కర్మమార్గంలో ఉండేవారి పద్ధతు లివి. సత్త్వస్థు లయిన వారు సదా సమదర్శనం కలిగి ఉంటారు. ఇక ఇందులో ఉన్న విశేషం వివరిస్తాను వినుము.

క. శివకరము దపము మేధా । ధవ! సకల జనంబులకును దానికి మూలం
బవిరళ శమదమ సంపద । లవుట నివి మనంబుతోడ నలవడ వలయున్. 69

ప్రతిపదార్థం: మేధాధవ!= బుద్ధిమంతుడా!; సకలజనంబులకును= సమస్త ప్రజలకూ; తపము= తపస్సు; శివకరము= మంగళకరం; దానికిన్= తపస్సుకు; అవిరళ= ఎడతెగని; శమదమ= అంతరింద్రియ నిగ్రహ బాహ్యేంద్రియ నిగ్రహములనెడి; సంపదలు= సిరులు; మూలంబు= కారణం; అవుటన్= కావటంవలన; ఇవి= ఈ శమదమాలు; మనంబు తోడన్= చిత్తంలో; అలవడన్ వలయున్= అలవాటు గావలెను.

తాత్పర్యం: ప్రజ్ఞావంతుడవైన ఓ శుకా! సర్వజనులకూ తపస్సు మంగళకరమైనది. తపస్సుకు మూలం ఎడతెగని శమదమాలే అవుతున్నాయి. అందువలన శమదమాలను మనస్సులో అలవరచుకొనాలి.

వ. స్వాధ్యాయంబు దపంబునకు బలం బిచ్చి తత్ఫలంబు గావించు. 70

ప్రతిపదార్థం: స్వాధ్యాయంబు= వేదాధ్యయనం; తపంబునకున్= తపస్సుకు; బలంబు+ఇచ్చి= బలం ఇచ్చి; తత్ఫలంబున్= ఆ తపస్సుకు అనువైన ఫలాన్ని; కావించున్= ఒడగూరుస్తుంది.

తాత్పర్యం: తపస్సుకు వేదాధ్యయనం బలం చేకూరుస్తుంది. తద్ద్వారా తపస్సుకు రాగల ఫలాన్ని ప్రసాదింపజేస్తుంది.

క. అరయంగా శబ్దంబును । పరంబునన రెండు సూవె బ్రహ్మములు గుణో
త్తర శబ్ద బ్రహ్మ భజన । పరుఁడు పరబ్రహ్మ మహితపదముం బొందున్. 71

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: గుణ+ఉత్తర!= గుణశ్రేష్ఠుడా; అరయంగాన్= పరిశీలించగా; శబ్దంబును, పరంబున్= శబ్దబ్రహ్మము, పరబ్రహ్మము; అనన్= అనగా; బ్రహ్మములు= బ్రహ్మములు; రెండుచూవె!= రెండుగదా!; శబ్దబ్రహ్మ భజనపరుఁడు= శబ్దబ్రహ్మమును సేవించటంలో ఆసక్తి కలిగినవాడు; పరబ్రహ్మమహిత పదమున్= పరబ్రహ్మమనే శ్రేష్ఠమైన స్థానాన్ని; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: గుణశ్రేష్ఠుడవైన ఓ శుకుడా! బ్రహ్మములు శబ్దబ్రహ్మమనీ, పరబ్రహ్మమనీ రెండు రకాలుగా ఉన్నాయి. శబ్దబ్రహ్మను భజించడంలో ఆసక్తిగలవాడు పరబ్రహ్మను పొందుతాడు.

విశేషం: 'ద్వే విద్యే వేతవ్యే తు శబ్దబ్రహ్మ పరంచ యత్ । శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరంబ్రహ్మా ధిగచ్ఛతి॥' అన్న అమృతబిందూపనిషత్తులోని వచనం ఇక్కడ స్మరణీయం. శబ్దబ్రహ్మ పరబ్రహ్మలను రెండు విద్యలు తెలిసికొనాలి. శబ్దబ్రహ్మంలో నిపుణుడైనవాడు పరబ్రహ్మమును పొందుతాడని ఇందలి భావం.

క. పరమబ్రహ్మము భూతో । త్కరముం గలిగించు మ్రింగు; దా నిష్క్రియతా
స్ఫురితం బయ్యును బ్రకృతి । స్ఫురణను శబలత్వ మొంది పురుషవరేణ్యా! 72

ప్రతిపదార్థం: పురుషవరేణ్యా!= పురుషశ్రేష్ఠా!; పరమబ్రహ్మము= పరబ్రహ్మమే; తాన్= తాను; నిష్క్రియతా స్ఫురితంబు= క్రియారాహిత్యంచేత ప్రకాశిస్తూ కూడా; ప్రకృతి స్ఫురణనున్= ప్రకృతి యొక్క స్ఫూర్తిచేత; శబలత్వము= విచిత్రత్వమును; ఒంది= పొంది; భూత+ఉత్కరమున్= భూతముల సమూహాన్ని; కలిగించున్= పుట్టిస్తుంది; మ్రింగున్= సంహరిస్తుంది.

తాత్పర్యం: పురుష వర్యుడవగు ఓ శుకా! పరబ్రహ్మమే తాను ఏ క్రియా లేనిదై కూడా ప్రకృతి ప్రభావంతో శబలత్వం పొంది భూతాలను పుట్టించటం, సంహరించటం చేస్తూ ఉంటుంది.

వ. సృష్టి తెఱంగు మున్నెఱింగించితి; సంహారప్రకారంబు సెప్పెద నాకర్ణింపుము. 73

ప్రతిపదార్థం: మున్ను= పూర్వం; సృష్టి తెఱంగు= సృష్టిక్రమాన్ని; ఎఱింగించితిన్= తెలియజేశాను; సంహారప్రకారంబున్= జగత్తుయొక్క సంహారవిధానాన్ని; చెప్పెదన్= వచిస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ముందు జగత్తుయొక్క సృష్టి విధానం చెప్పాను. ఇప్పుడు సంహారవిధానం ఎట్లాంటిదో వివరిస్తాను. వినుము.

తే. స్థావరములు జంగమములుఁ దన్నుఁ గలయ । విలయ మొందిన ఘటపృష్ఠ విధము దాల్చు;
భూమి నంబువుల్ మ్రింగు; వంబువుల నగ్ని, । యగ్ని ననిలుం, డనిలుఁ ద్రావు నాకసంబు. 74

ప్రతిపదార్థం: స్థావరములు= కదలని కొండలు మొదలైనవి; జంగమములు= సంచరించే ప్రాణులు; తన్నున్= తనను; కలయన్= కూడుకొనగా; విలయము= ప్రళయం; ఒందిన= పొందిన; ఘటపృష్ఠ విధమున్= కుండయొక్క పూర్వ రూపమైన మట్టిరీతిని; తాల్చున్= ధరించును; భూమిన్= అట్టి పృథ్విని; అంబువుల్= జలం; మ్రింగున్= హరించును; అంబువులన్= జలాన్ని; అగ్ని= అనలుడు; అగ్నిన్= అనలుడిని; అనిలుండు= వాయువు; అనిలున్= వాయువును; ఆకసంబు= గగనం; త్రావున్= లయమొనర్చుకొంటాయి.

తాత్పర్యం: స్థావర జంగమా లనబడే సకలమూ భూమిలో కలిసిపోతాయి. అది ఘటస్వరూపం నశించిన పిమ్మట ఘటం తన పూర్వరూపమైన మృత్తికను పొందినట్లు అవుతుంది. ఆ భూమిని జలాలు మ్రింగుతాయి. జలాలను అగ్నీ, అగ్నిని వాయువూ, వాయువును ఆకాశమూ కబళిస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. ఆకసమును మనసు హరియించు, గంధాది । యగు గుణాళితోడ నఖిల భూత
ములును నిట్లు లయముఁ బొందిన గ్రసియించు । మనసు నాత్మగుణము నెనసి విధుఁడు. 75

ప్రతిపదార్థం: ఆకసమును= ఆకాశాన్ని; మనసు= చిత్తం; హరియించున్= లయింపజేస్తుంది; ఇట్లు= ఈ రీతిగా; అఖిలభూతములును= సమస్త భూతాలు; గంధ+ఆదిఅగు= గంధం మొదలైన; గుణ+ఆళితోడన్= గుణాల సమూహంతో కూడా; లయమున్= నాశమును; పొందినన్= పొందగా; విధుఁడు= చంద్రుడు; ఆత్మగుణమున్= తన స్వభావాన్ని; ఎనసి= పొంది; మనసున్= చిత్తమును; గ్రసియించున్= మ్రింగుతాడు.

తాత్పర్యం: మనస్సు ఆకాశాన్ని హరించివేస్తుంది. ఇట్లా సకలభూతాలూ తమ తమ గంధం మొదలైన గుణాలతో కూడ లయమై పోతాయి. తరువాత మనస్సుకు అధిదేవత అయిన చంద్రుడు తన స్వభావం పొంది ఆ మనస్సును కూడా తనలో లయం చేసుకొంటాడు.

క. అతనిఁ బొదువు సంకల్పం । బతుల జ్ఞానంబు దాని నడఁచును విజ్ఞా
నితఁ దద్బలముఁ బురుషదే । హితనుం గాలంబు వరుస నెడలం జేయున్. 76

ప్రతిపదార్థం: సంకల్పంబు= మనోవ్యాపారం; అతనిన్= ఆ చంద్రుడిని; పొదువున్= లయింపజేస్తుంది; అతులజ్ఞానంబు= సాటిలేని జ్ఞానం; దానిన్= ఆ సంకల్పాన్ని; అడఁచును= అణచివేస్తుంది; కాలంబు= కాలాత్మకమైన తత్త్వం; విజ్ఞానితన్= విజ్ఞానిత్వాన్ని; తద్బలమున్= దాని బలాన్ని; పురుషదేహితనున్= పురుషశరీరత్వాన్ని; వరుసన్= క్రమంగా; ఎడలన్+చేయున్= నశింపజేస్తుంది.

తాత్పర్యం: సంకల్పం చంద్రుడిని గ్రసిస్తుంది. నిరుపమానమైన జ్ఞానం సంకల్పాన్ని రూపుమాపుతుంది. కాలం క్రమంగా విజ్ఞానాన్ని, దాని బలాన్నీ, పురుషశరీరత్వాన్నీ హతమారుస్తుంది.

క. కాలం బెడలిన విద్యో । న్మీలిత మగు బోధ మన్యమిశ్రత్వంబుం
దూలించి వెలుఁగుచుండు వి । శాలమతీ! బ్రహ్మ మది ప్రశస్తము శ్రుతులన్. 77

ప్రతిపదార్థం: విశాలమతీ!= విపులమైన బుద్ధికలవాడా!; కాలంబు+ఎడలినన్= కాలం నశించిపోగా; విద్యోన్మీలితము+అగు= విద్యచేత వికసించినదైన; బోధము= జ్ఞానం; అన్యమిశ్రత్వంబున్= ఇతర పదార్థాలతో కలయికను; తూలించి= తొలగించి; వెలుఁగుచుండున్= ప్రకాశిస్తూ ఉంటుంది; అది= అయ్యది; శ్రుతులన్= వేదాలలో; ప్రశస్తము= ప్రసిద్ధమైనది; బ్రహ్మము= బ్రహ్మశబ్దంతో వ్యవహరించబడేది.

తాత్పర్యం: విశాలబుద్ధిగల ఓ శుకుడా! ఆ కాలం కూడా నశిస్తుంది. పిదప విద్యచేత వికాసం పొందిన జ్ఞానం దేనితోనూ కలయిక చెందక శుద్ధబోధస్వరూపమై వెలుగొందుతుంది. అదే బ్రహ్మం. వేదాలతో ప్రశస్తమైన బ్రహ్మ మదే.

క. వినుమీ సంహరణంబును । దన వస మాతత్త్వ మవ్విధంబున దివసం
బును రాత్రియు భూతములకు । జననము విలయమును జేయు సంక్రీడమెయిన్. 78

ప్రతిపదార్థం: వినుము; ఈ సంహరణంబును= ఈ సంహారం కూడా; తన వసము= ఆ బ్రహ్మముయొక్క వశంలో ఉన్నదే; ఆ తత్త్వము= ఆ బ్రహ్మం; ఆ+విధంబునన్= ఆ రీతిగా; దివసంబును= పగలును; రాత్రియున్= రేయియు; భూతములకున్= భూతాలకు; జననమున్= పుట్టుకను; విలయమును= వినాశనాన్ని; సంక్రీడమెయిన్= ఆటవలె; చేయున్= చేస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శుకుడా! వినుము. ఈ సంహారకార్యం కూడా ఆ బ్రహ్మవశంలోనిదే. ఈ ప్రకారంగా ఆ బ్రహ్మం రేయుంబవళ్ళు భూతాలకు వినోదక్రీడవలె జనన మరణాలను చేస్తూ ఉంటుంది'.

వ. అని చెప్పి పారాశర్యుం డార్యవర్యుం డగు శుకునితో వెండియు నిట్లనియె. 79

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; పారాశర్యుండు= వ్యాసుడు; ఆర్యవర్యుండు+అగు= ఆర్యశ్రేష్ఠుడైన; శుకునితోన్= శుకయోగితో; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: వ్యాసు డట్లా చెప్పి ఆర్యశ్రేష్ఠుడైన శుకుడిని చూచి మళ్ళీ ఇట్లా అన్నాడు:

సీ. 'జనియించి విప్రుండు జాతకర్మంబును । జౌలంబు నుపనీతి సంస్కృతియును
బడసి యాచార్యునిపాల నధ్యయనంబు । సేసి, తా నాతనిచే ననుజ్ఞ
గాంచి తక్కటివి మూఁ డంచితాశ్రమముల । యందు నొక్కటి పూననగు గృహస్థ
ధర్మ మాశ్రయ మండ్రు తక్కిన మూఁటికిఁ । గావున నది పూని దైవపైతృ

తే. కంబులైన ఋణంబులఁ గ్రాఁచు; వడుగు । నాఁటి నడవడి ఋషుల ఋణమ్ము దీర్చి
వచ్చి కాన కాషాయపక్వతఁ బ్రశుద్ధిఁ । బొంది మఱి యుత్తమాశ్రమ మొందు టొప్పు. 80

ప్రతిపదార్థం: విప్రుండు= ద్విజుడు; జనియించి= పుట్టి; జాతకర్మంబునున్= పుట్టినపుడు చేసే సంస్కారాన్ని; చౌలంబున్= చూడా కర్మయును; ఉపనీతి సంస్కృతియునున్= ఉపనయన సంస్కారమును; పడసి= పొంది; ఆచార్యునిపాలన్= గురువు చెంత; అధ్యయనంబు చేసి= వేదాధ్యయనం కావించి; తాను= శిష్యుడైన తాను; ఆతనిచేన్= ఆ గురువుచేత; అనుజ్ఞన్= అనుమతిని; కాంచి= పొంది; తక్కటివి= మిగిలినవైన; మూఁడు+అంచిత+ఆశ్రమములఅందున్= పూజితములైన (గార్హస్థ్య వానప్రస్థ సన్న్యాసములనెడు) మూడు ఆశ్రమాలలో; ఒక్కటి= ఒక్క ఆశ్రమాన్ని; పూనన్+అగున్= స్వీకరించదగును; తక్కిన మూఁటికిన్= మిగిలిన బ్రహ్మచర్యం మొదలైన మూడాశ్రమాలకు; గృహస్థ ధర్మము= గృహస్థాశ్రమ రూపమైన ధర్మం; ఆశ్రయము= ఆధారం; అండ్రు= అని పెద్దలు చెప్తుతారు; కావునన్= ఆ కారణంవలన; నాఁటినడవడిన్= బ్రహ్మచర్య కాలం నాటి వేదాధ్యయనాది ప్రవర్తనతో; ఋషులఋణమ్ము= ఋషులకు చెందిన అప్పును; తీర్చివచ్చి= తొలగించుకొని వచ్చి; వడుగు= బ్రహ్మచారి; అది= ఆ గృహస్థాశ్రమం; పూని= వహించి; దైవపైతృకంబులు+ఐన= దేవతలకు, పితరులకు చెందిన; ఋణంబులన్= అప్పులను; క్రాఁచున్= తొలగించుకొంటాడు; కాన= ఆ కారణంవలన; కాషాయపక్వతన్= చిత్తదోషాన్ని శమింపజేయడం ద్వారా; ప్రశుద్ధిన్= మిక్కిలి శుద్ధిని; పొంది= వహించి; మఱి= ఆ పైన; ఉత్తమ+ఆశ్రమము= శ్రేష్ఠమైన ఆశ్రమమును; ఒందుట= పొందుట; ఒప్పున్= సమంజసంగా ఉంటుంది.

తాత్పర్యం: బ్రాహ్మణుడు తాను పుట్టిన తర్వాత జాతకర్మ, చూడాకర్మ, ఉపనయనం మొదలైన సంస్కారాలు పొందాలి. ఆపై ఆచార్యుడి చెంతకు వెళ్ళి వేదాధ్యయనం చేయాలి. పిదప గురుని అనుమతి పొంది గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే మూడు ఆశ్రమాలలో ఏదైనా ఒక ఆశ్రమాన్ని స్వీకరించాలి. బ్రహ్మచర్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే మూడాశ్రమాలకూ ఆధారం గృహస్థాశ్రమం అంటారు. అందుచేత తాను బ్రహ్మచారిగా ఉంటూ వేదాధ్యయనం చేయటం ద్వారా ఋషి ఋణం తీర్చుకొన్నా, బ్రహ్మచారి ఇప్పుడు క్రమపద్ధతిలో గృహస్థాశ్రమం స్వీకరించి దేవఋణాన్ని, పితౄణాన్ని తీర్చుకొనాలి. ఈ రీతిగా క్రమపద్ధతిలో చిత్తదోషం తొలగించుకొని పరిపాకం పొందిన తర్వాతనే ఉత్తమాశ్రమమైన సన్న్యాసం స్వీకరించటం మంచిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: బ్రాహ్మణాది జాతులకు స్మృతులలో జాతకర్మం మొదలైన అనేక సంస్కారాలు విధించబడ్డాయి. ఇక్కడ విప్రులు పాటించవలసిన జీవనవిధానాన్ని బోధిస్తున్నాడు. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనేవి నాలుగు ఆశ్రమాలు. ఇందులో బ్రహ్మచర్యం పాటించినవాడు తక్కిన మూడాశ్రమాలలో తనకు అనువైన ఏ ఆశ్రమాన్నైనా స్వీకరించవచ్చును. కాని క్రమపద్ధతిలో గార్హస్థ్యం స్వీకరించటం మంచిదని వ్యాసుడి అభిప్రాయం. అది తక్కిన ఆశ్రమాలను పోషించేది కదా!

ఋషిఋణం, దేవఋణం, పిత్రూణం మొదలైన ఋణాలు ప్రతి ఒక్కరికీ సహజంగా ఉంటాయి. వేదాధ్యయనంతో ఋషి ఋణాన్నీ, యజ్ఞకర్మతో దేవఋణాన్నీ, శ్రాద్ధాదులతో పితరుల ఋణాన్నీ తీర్చుకొనవచ్చును. ఇందుకు గృహస్థాశ్రమం తగి ఉంటుంది. క్రమపద్ధతిలో పక్వస్థితికి వచ్చిన తర్వాత చివరిదీ, శ్రేష్ఠతమమైనదీ అయిన సన్న్యాసం స్వీకరించాలి. ఇట్లా చేయటం మంచిదని తాత్పర్యం.

తే. **క్రతువుసేఁత సేయించుట, శ్రుతులు గాఢ । నియతిఁ జదువుట, చదివించుటయును, ధనము**
లీగికొనుట షట్కర్మంబు; లింతవట్టు । నర్హకృత్యంబు లండ్రు ధరామరులకు. **81**

ప్రతిపదార్థం: క్రతువు= యజ్ఞం; చేఁత= చేయటం; చేయించుట= ఇతరులచేత అనుష్ఠింప చేయటం; గాఢనియతిన్= దృఢమైన నియమంతో; శ్రుతులు= వేదాలు; చదువుట= అధ్యయనం చేయటం; చదివించుటయును= ఇతరులచేత అధ్యయనం చేయించటం; ధనములు= అర్థసంపదలు; ఈగి= ఇవ్వటం; కొనుట= ఇతరులనుండి స్వీకరించటం; షట్కర్మంబులు= ఆరు కర్మములు; ఇంతవట్టు= ఇంతవరకు; ధరా+అమరులకున్= భూసురులకు; అర్హకృత్యంబులు= తగినపనులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: బ్రాహ్మణులకు యజ్ఞం చేయటం, ఇతరులచేత చేయించటం, అధ్యయనం, అధ్యాపనం, దానం, ప్రతిగ్రహం అనబడే షట్కర్మలు తగిన పనులని పెద్దలు చెప్తుతారు.

దానగుణంబు సర్వవర్ణ సామాన్యంబుగా నిరూపించుట (సం.12-226-14,15)

వ. **దానానుష్ఠానంబు సర్వజాతి సామాన్యం బయిన యుత్తమధర్మంబు; పుణ్యపరులకు దాతవ్యంబుగాని వస్తువు లేదు; కాశ్యుండను రాజు దన ప్రాణంబు లిచ్చి బ్రాహ్మణుప్రాణంబులు గాచె, నౌశీనరుండగు శిబి యాత్మాంగంబుల నౌరస పుత్రునిని బ్రాహ్మణార్థంబుగా నొసంగెఁ; గాశీపతి యగు ప్రతర్దనుండు బ్రాహ్మణునికై నిజనయనంబులిచ్చె; విదేహుండును, జామదగ్న్యుండును, గయుండును నొక్కొక్కతఱి సకల వసుంధరయును బ్రాహ్మణుల కిచ్చిరి; పాంచాల్యుండగు బ్రహ్మదత్తుండు శంఖనిధి విప్రోత్తములకు దానంబుసేసె; మఱియును బ్రాహ్మణులకుఁ బ్రాణ శరీర మణి హిరణ్య కన్యాగవాది ప్రశస్త వస్తువు లనేకు లర్థుల కొసంగిరి; వారలకెల్లను సమకూరిన సద్గతుల విశేషంబులం జెప్పం బెద్దయని వెండియు.** **82**

ప్రతిపదార్థం: దాన+అనుష్ఠానంబు= దానం అనే ఆచరణ; సర్వజాతిసామాన్యంబు+అయిన= అన్ని జాతులకూ సాధారణమైన; ఉత్తమ ధర్మంబు= శ్రేష్ఠధర్మం; పుణ్య పరులకున్= పుణ్యంపై ఆసక్తిగలవారికి; దాతవ్యంబుకాని= ఈరాని; వస్తువు లేదు= పదార్థం లేదు; కాశ్యుండను రాజు= కాశ్య డనబడే నరపతి; తన ప్రాణంబులు= తన అసువులు; ఇచ్చి= ఒసగి; బ్రాహ్మణ ప్రాణంబులు= విప్రుడి యసువులను; కాచెన్= రక్షించాడు; ఔశీనరుండు+అగు= ఉశీనర దేశానికి చెందిన; శిబి= శిబి అనే రాజు; ఆత్మ+ అంగంబులన్= తన అవయవాలను; ఔరస పుత్రునినిన్= తన సొంత కుమారుడిని; బ్రాహ్మణ+అర్థంబుగాన్= బ్రాహ్మణుల కొరకై; ఒసంగెన్= ఇచ్చాడు; కాశీపతిఅగు= కాశీనగరానికి రాజైన; ప్రతర్దనుండు= ప్రతర్దను డనేవాడు; బ్రాహ్మణునకై= విప్రుడికై; నిజనయనంబులు= తన కన్నులు; ఇచ్చెన్= ఇచ్చాడు; విదేహుండును, జామదగ్న్యుండును, గయుండును= జనకుడు, పరశురాముడు, గయుడనువారు; ఒక్కొక్క తఱిన్= ఒక్కొక్క సమయాన; సకలవసుంధరయును= సమస్త భూమియును;

బ్రాహ్మణులకున్= విప్రులకు; ఇచ్చిరి= ఇచ్చారు; పాంచాల్యుండగు= పాంచాలదేశానికి చెందినవాడైన; బ్రహ్మదత్తుండు= ఆ పేరుగల రాజు; విప్ర+ఉత్తములకున్= బ్రాహ్మణోత్తములకు; శంఖనిధి= 'శంఖ' మనే నిధిని; దానంబుచేసెన్= దానంగా ఇచ్చాడు; మఱియును= ఇంకను; అనేకులు= పెక్కుమంది; అర్హులకున్= తగినవారికి; బ్రాహ్మణులకున్= విప్రులకు; ప్రాణ= ప్రాణాలు; శరీర= దేహం; మణి= మణులు; హిరణ్య= స్వర్ణం; కన్యా= కన్యలు; గవాది(గో+ఆది)= గోవులు మొదలైన; ప్రశస్త వస్తువులు= శ్రేష్ఠ పదార్థాలు; ఒసంగిరి= ఇచ్చారు; వారలకున్+ఎల్లను= వారికందరికీ; సమకూరిన= కలిగిన; సద్గతుల విశేషంబులన్= ఉన్న తగతులలోని విశేషాలను; చెప్పన్+పెద్ద అని= వివరించటానికి అలవిగాకున్నదని చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: దాన మనేది అన్ని జాతులకూ సాధారణమైన ఉత్తమధర్మం. పుణ్యాత్ములకు ఈరాని వస్తువు లేదు. పూర్వం కాశ్యుడనే రాజు తన ప్రాణా లిచ్చి బ్రాహ్మణుడి ప్రాణాలను రక్షించాడు. ఉశీనరాధిపతి అయిన శిబి బ్రాహ్మణులకై తన అవయవాలనూ, ఔరసపుత్రుడినీ దానం చేశాడు. కాశిని పాలించే ప్రతర్దనుడనేరాజు తన నేత్రాలు విప్రుడికై దానం చేశాడు. జనకుడు, పరశురాముడు, గయుడు బ్రాహ్మణులకై సమస్త భూమండలాన్ని దానమిచ్చారు. పాంచాలదేశీయుడైన బ్రహ్మదత్తుడు విప్రశ్రేష్ఠులకు శంఖనిధినే దానం చేశాడు. అంతే కాదు. చాలామంది తగిన విప్రులకు ప్రాణాలు, శరీరం, మణులు, బంగారు, కన్యలు, గోవులు మొదలైన శ్రేష్ఠపదార్థాలను దానం చేసి ఉన్నారు. వారి కందరికీ కలిగిన సద్గతులను వివరించటానికి సాధ్యం కాదు' అని చెప్పి వ్యాసుడు మళ్ళీ ఇట్లా అన్నాడు:

క. **'దానాధ్యయన యజనముల । నానావిధపాపములు వినాశముఁ బొందుం**
గాన యవి మేలు హింసా । హీనత ధర్మవిధిలేని యెడఁ గడు వలయున్. 83

ప్రతిపదార్థం: దాన= దానం చేతను; అధ్యయన= వేదాధ్యయనం చేతను; యజనములన్= యజ్ఞాలు చేయటంచేతను; నానావిధపాపములు= పెక్కు రకాలైన పాపాలు; వినాశమున్+పొందున్= నశించిపోతాయి; కాన= అందువలన; అవి= ఆ దానాదులు; మేలు= శ్రేష్ఠమైనవి; ధర్మవిధి లేనిఎడన్= ధర్మవిహిత విధానం లేని చోట; కడున్= మిక్కిలిగా; హింసాహీనత= హింసలేకుండా ఉండటం; వలయున్= ఆవశ్యకమై ఉన్నవి.

తాత్పర్యం: దానం, అధ్యయనం, యజ్ఞం చేయటం అనే కర్మలవలన అనేక విధాల పాపాలు నశిస్తాయి. కాబట్టి వాటి నాచరించటం మేలైన పని. వేదవిహిత ధర్మం కానప్పుడు ఏ ప్రాణులనూ హింసించకుండా ఉండాలి. (వేదం విధించినపుడు ప్రాణిహింస హింస కాదని భావం).

ఆ. **ధూతపాపుఁ డైన పూతాత్మకుండు ల । ఘ్వాశి యగుచు, నింద్రియముల గెల్చి**
మనసులోనఁ గామమును గ్రోధమును జొర । నీక బ్రహ్మపదము నిచ్చఁ గోరు. 84

ప్రతిపదార్థం: ధూతపాపుఁడు+ఐన= తొలగిన పాపాలు కలవాడగు; పూత+ఆత్మకుండు= పవిత్రాత్ముడు; లఘు+ఆశి అగుచున్= మితాహారి అవుతూ; ఇంద్రియములన్= ఇంద్రియాలను; గెల్చి= ఓడించి; మనసులోనన్= చిత్తంలో; కామమును క్రోధమును= కామాన్ని, కోపాన్నీ; చొరన్+ఈక= ప్రవేశించనీయకుండా; ఇచ్చన్= మనస్సులో; బ్రహ్మపదమున్= బ్రహ్మస్థానాన్ని; కోరున్= అభిలషిస్తాడు.

తాత్పర్యం: పాపాల నన్నిటినీ నశింపజేసికొన్న పవిత్రాత్ముడు మితంగా ఆహారం స్వీకరించి, ఇంద్రియాలపై విజయం సాధిస్తాడు. కామక్రోధాలను తన మనస్సులో ప్రవేశింపనీయడు. అట్లా చేసి బ్రహ్మపదవిని ఎదలో అభిలషిస్తాడు.

ఆ. **ఇట్టివాఁడు వెడల నీఁదు నింద్రియజల । మన్యుపంక లోభమయ తటాది**
ఘోరరూప యగు నసార సంసార వి । శాలనదిఁ బ్రశాంతశాలి హృదయ! 85

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇట్టివాఁడు= ఈ విధంగా ప్రవర్తించేవాడు; ఇంద్రియజల= ఇంద్రియా లనే నీటితోనూ; మన్యుపంక= కోపమనే బురదతోనూ; లోభమయతట+ఆది= లోభరూపమైన గట్టు మొదలైన వాటితోనూ; ఘోరరూప+అగు= భయంకర రూపంకలదైన; అసార= సారంలేని; సంసార= సంసారమనెడి; విశాల= విస్తృతమైన; నదిన్= నదిని; వెడలన్+ఈఁదున్= తరిస్తాడు.

తాత్పర్యం: ప్రశాంతమైన చిత్తం కల శుకుడా! పై నే చెప్పిన రీతిగా ప్రవర్తించేవాడు ఇంద్రియాలే నీరుగా, కోపమే బురదగా, లోభమే గట్టుగా - ఇట్లా భీకరంగా ఉన్న సంసార మనే విశాలమైన నదిని తరిస్తాడు.

విశేషం: అలం: రూపకం.

తే. **ఘనతరప్రజ్ఞ యను తెప్ప గలుగువాఁడు । సంసరణనది గడవంగఁ జాలుఁ గాక!**
కామమును గ్రోధమును మదిఁ గలిగి ప్రజ్ఞ । చించునేని నక్కడచుట చిక్కువడదె? 86

ప్రతిపదార్థం: ఘనతరప్రజ్ఞ+అను= గొప్పదైన ప్రజ్ఞ అనే; తెప్ప= నావ; కలుగువాఁడు= కలవాడు; సంసరణనదిన్= సంసారమనే నదిని; కడవంగన్+చాలున్= దాటగలుగుతాడు; కాక= అట్లాకాక; కామమును= కోరికను; క్రోధమును= కోపమును; మదిన్= చిత్తంలో; కలిగి= సంభవించి; ప్రజ్ఞన్= బుద్ధిని; చించున్+ఏనిన్= నశింపజేస్తే; ఆ+కడచుట= ఆ తరించటం అనే కార్యం; చిక్కు+పడదె?= ఇబ్బందికి గురికాదా?

తాత్పర్యం: గొప్ప ప్రజ్ఞ అనే పడవ నధిష్ఠించిన వాడు సంసార మనే నదిని దాటుతాడు. అట్లాకాక కామక్రోధాలవలన ప్రజ్ఞకు భంగం కలిగితే ఆ నదీతరణం చిక్కుపడి నెరవేరకపోతుంది కదా!

క. **గతహర్షభయక్రోధుఁడు । ధృతిమంతుఁడు నప్రమత్తధీమహితుఁడు సం**
శ్రితధర్ముఁడు దాంతుఁడు నగు । నతఁ డవసాదంబు నొందఁ డతులవివేకా! 87

ప్రతిపదార్థం: అతులవివేకా!= సాటిలేని తెలివికలవాడా!; గతహర్షభయక్రోధుఁడు= తొలగిన సంతోషం, భీతి, కోపంకలవాడు; ధృతిమంతుఁడు= ధైర్యంకలవాడు; అప్రమత్త= ఏమరుపాటు లేని; ధీ= బుద్ధిచేత; మహితుఁడు= పూజితుడైనవాడు; సంశ్రితధర్ముఁడు= ఆశ్రయించబడిన ధర్మంకలవాడు; దాంతుఁడు= నిగ్రహంకలవాడు; అగు= అయిన; అతఁడు= ఆ వ్యక్తి; అవసాదంబున్= నాశనాన్ని; ఒందఁడు= పొందడు.

తాత్పర్యం: అనుపమ వివేకంకల శుకుడా! ఎవరికి హర్షం, భయం, కోపం లేవో ఎవడు ధైర్యశాలియో, జాగరూకమైన బుద్ధిగలవాడో, ధర్మా న్నాశ్రయించి ఉంటాడో, ఇంద్రియనిగ్రహం కలిగి ప్రవర్తిస్తాడో, అట్లాంటివాడు నాశం పొందడు.

క. **ధర్మ మధర్మము వోలె న । ధర్మము దా ధర్మవిధి విధంబున దోఁచుం**
గర్మసమితి నొక్కొక యెడ । ధర్మగతి యెఱుంగవలయుఁ దచ్ఛాస్త్రములన్.' 88

ప్రతిపదార్థం: కర్మ సమితిన్= కార్యసమూహంలో; ఒక్కొక ఎడన్= ఒక్కొక్క సందర్భంలో; ధర్మము= ధర్మమైనది; అధర్మముపోలెన్= ధర్మం కాని దానివలెనూ; అధర్మము= ధర్మంకానిది; తాన్= తాను; ధర్మవిధివిధంబునన్= ధర్మకార్యం మాదిరిగానూ; తోఁచున్= భాసిస్తుంది; తద్+శాస్త్రములన్= ఆ ధర్మం నిరూపించే శాస్త్రాలతో; ధర్మగతి= ధర్మవిధానాన్ని; ఎఱుంగన్ వలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: మనం అనుష్ఠించే కార్యాలలో ఒక్కొక్క పట్టున ధర్మకార్యం అధర్మంగా తోస్తుంది. అధర్మకార్యం ధర్మంగా తోస్తుంది. అందుచేత ధర్మశాస్త్రాలను పరీక్షించి ధర్మగమన మెట్లాంటిదో గుర్తించాలి'.

వ. **అని యుపదేశించి మఱియును.** 89

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని= ఈ రీతిగా; ఉపదేశించి= బోధించి; మఱియును= ఇంకను.

తాత్పర్యం: ఇట్లా బోధించి వ్యాసుడు శుకుడితో ఇంకా ఇట్లా అన్నాడు:

క. 'జ్ఞానంబు వడయుటకు వా । జ్మానసములు సునియతములు గావింతురు, స
మ్మానిత శాంతికొఱకు వి । జ్ఞానంబున నాత్మనియతి సల్పుదురు బుధుల్. 90

ప్రతిపదార్థం: బుధుల్= పండితులు; జ్ఞానంబు పడయుటకున్= జ్ఞానం పొందటానికి; వాక్+మానసములు= వాక్కును, మనస్సును; సునియతములు= చక్కగా నియమించబడినవిగా; కావింతురు= చేస్తారు; సమ్మానిత= ఆదరింపబడిన; శాంతికొఱకున్= శాంతిని పొందటానికి; విజ్ఞానంబునన్= విశేష జ్ఞానంతో; ఆత్మనియతిన్= ఆత్మనియమమును; సల్పుదురు= చేస్తారు.

తాత్పర్యం: 'పండితు లైనవారు జ్ఞానసిద్ధిని కోరి వాక్కును, మనస్సునూ నిగ్రహిస్తారు. శాంతి పొందటానికై విశేషజ్ఞానంతో ఆత్మనియమం పాటిస్తారు.

క. ఈ తెరువున వేదవిదుఁడు । వీతామ్నాయుండు ధర్మవేదియుఁ బాప
స్ఫీతుఁడు సరియై కడతు ర । నాతురత జరామరణమహాంభోరాశిన్. 91

ప్రతిపదార్థం: ఈ తెరువునన్= ఈ మార్గంతో; వేదవిదుఁడు= వేదం తెలిసినవాడూ; వీత+ఆమ్నాయుండు= వేదజ్ఞానం లేనివాడూ; ధర్మవేదియున్= ధర్మం తెలిసిన వాడూ; పాపస్ఫీతుఁడు= పాపంచేత వృద్ధిపొందిన వాడూ; సరి+ఐ= సమానులై; అనాతురతన్= ఆతురత లేకుండా; జరామరణ మహా+అంభోరాశిన్= ముసలితనం, చావు అనే మహాసముద్రాన్ని; కడతురు= తరిస్తారు.

తాత్పర్యం: వేదజ్ఞుడైనా, వేదగంధం లేనివాడైనా, ధర్మజ్ఞుడైనా, పాపాత్ముడైనా సరే - పైన చెప్పిన పద్ధతి పాటిస్తే - అందరూ సమంగా జరామరణ ప్రవాహరూపమైన సంసారసముద్రాన్ని కష్టంలేకుండా దాటుతారు.

విశేషం: అలం: రూపకం.

వ. ఆచారనేమియుఁ, బ్రాణయుగంబును, నపానాక్షంబును, హ్రీవరూథంబును, నుపాయాపాయకూబరంబును, ఘ్రాణశ్రవణ వాహనంబును, జ్ఞానసారథికంబును, సర్వతంత్రప్రతోదంబును, ద్యాగరశ్మియు నగు యోగరథంబు నెక్కి వెరవుగలవాఁ డక్షరపదంబు సొరం జనఁజాలు; నా రథికుం డా తంత్రంబు ప్రభావంబునంజేసి.92

ప్రతిపదార్థం: ఆచారనేమియున్= ఆచార మనే చక్రపు టంచు గలదీ; ప్రాణయుగంబును= ప్రాణమనే కాడి గలదీ; అపాన+అక్షంబును= అపానమనే ఇరుసు కలదీ; హ్రీవరూథంబును= సిగ్గు అనే ఆచ్ఛాదనం కలదీ; ఉపాయ+అపాయకూబరంబును= ఉపాయం, అపాయం అనే నొగలు కలదీ; ఘ్రాణశ్రవణ వాహనంబును= ఘ్రాణేంద్రియ శ్రవణేంద్రియాలనే గుర్రాలు కలదీ; జ్ఞానసారథికంబును= జ్ఞాన మనే సారథి కలదియు; సర్వతంత్ర ప్రతోదంబును= సర్వతంత్రమనే జాటీ కలదీ; త్యాగరశ్మియున్= త్యాగమనే పగ్గాలు కలదీ; అగు= అయినట్టి; యోగరథంబున్= యోగమనే రథాన్ని; ఎక్కి= అధిష్ఠించి; వెరవుగలవాఁడు= ఉపాయశాలిఅయినవాడు; అక్షరపదంబున్= క్షరంకాని స్థానాన్ని అనగా మోక్షాన్ని; చొరన్+చనన్+చాలున్= ప్రవేశించగలుగును; ఆ రథికుండు= ఆ రథంలో పయనించినవాడు (ఆత్మ); ఆ తంత్రంబు= ఆ ఉపాయంయొక్క; ప్రభావంబునన్+చేసి= మహిమవలన.

తాత్పర్యం: సదాచారమే చక్రపుటంచుగా, ప్రాణమే కాడిగా, అపానమే ఇరుసుగా, సిగ్గే ఆచ్ఛాదనంగా, ఉపాయాపాయాలే నొగలుగా, ఘ్రాణేంద్రియ శ్రవణేంద్రియాలే గుర్రాలుగా, జ్ఞానమే సారథిగా, సర్వతంత్రమే కొరడాగా, త్యాగమే పగ్గాలుగా సాగే యోగమనే రథాన్ని ఎక్కిన ఉపాయశాలిఅయిన ఆత్మ అనే రథికుడు మోక్షపదం చేరుకొనగలడు. ఆ విధంగా పయనించిన రథికుడు ఆ ఉపాయబలంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: రూపకం.

క. వరుసన ధరణీపవనాం । బరజలతేజముల గెలుచు, బల మెక్కి యహం
కరణంబు ద్రోచు; బుద్ధిం । బరువడి నడఁగించుఁ బ్రకృతి పనిఁ బెడఁబాపున్. 93

ప్రతిపదార్థం: వరుసన= క్రమంగా; బలము+ఎక్కి= బలవంతుడై; ధరణీ= భూమిని; పవన= గాలిని; అంబర= ఆకసాన్నీ; జల= నీటినీ; తేజములన్= తేజస్సును; గెలుచున్= లోబరచుకొంటాడు; అహంకరణంబున్= అహంకారాన్ని; త్రోచున్= కడకునెట్టివేస్తాడు; బుద్ధిన్= మతిని; పరువడిన్= శీఘ్రంగా; అడఁగించున్= నశింపజేస్తాడు; ప్రకృతిపనిన్= ప్రకృతియొక్క చేష్టను; పెడఁబాపున్= తొలగించి వేస్తాడు.

తాత్పర్యం: క్రమంగా బలపడి పృథ్వివ్యాపస్తేజోవాయ్వాకాశాలనే పంచభూతాలపై విజయం సాధిస్తాడు. అంతేకాక అహంకారాన్ని కడకు నెట్టివేస్తాడు. బుద్ధిని నియమిస్తాడు. ప్రకృతి చేష్టలైన కామాదులను అరికట్టుతాడు.

ఆ. భూమిజయము దొడఁగి పురుషుఁ డంతంతకు । వృద్ధిఁ బొంది యోగసిద్ధిఁ బొందుఁ
బొగయు మిడుఁగుఱులును బొనుఁగు లేని శిఖియు । బహులశిఖలు నైన పగిది ననఘ! 94

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; పురుషుఁడు= జీవుడు; భూమిజయముతొడఁగి= పృథ్వీభూతమును జయించిన మొదలుగా; అంతంతకున్= అంతకంతకు; వృద్ధిన్+పొంది= పెరుగుదల నొంది; పొగయున్= ధూమమును; మిడుఁగుఱులును= నిప్పురవ్వలూ; పొనుఁగు లేని= తేజోహీనతలేనట్టి; శిఖియున్= అగ్నియు; బహులశిఖలున్= అనేకజ్వాలలు; ఐన పగిదిన్= అయిన రీతిగా; యోగసిద్ధిన్+పొందున్= యోగముయొక్క పరిపక్వదశను పొందుతాడు.

తాత్పర్యం: పాపరహితుడ వైన ఓ శుకుడా! జీవాత్ముడు పృథ్వీభూతాన్ని జయించిన నాటినుండి క్రమక్రమంగా వృద్ధి పొందుతాడు. అతడు ధూమం, మిణుగురులు, తేజోహీనత లేని అగ్ని అనేక జ్వాలలతో కూడి జ్వలించినట్లే యోగసిద్ధుడై ప్రకాశిస్తాడు.

తే. విను మహంకారజయము పృథ్వీ ముఖంబు । లైనవానిని బుద్ధి ప్రధానమును జ
యించునట్టి సంస్కారంబు నిచ్చు; దాన । నగు మహానుభావంబు సంయమివరులకు. 95

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; అహంకారజయము= అహంకారంపై సాధించిన గెలుపు; పృథ్వీముఖంబులు+ఐన వానిని= భూమి మొదలుగా గల పంచభూతాలను; బుద్ధి= బుద్ధిని; ప్రధానమును= ప్రకృతిని; జయించునట్టి= సాధించునటువంటి; సంస్కారంబున్= సంస్కరణమును; ఇచ్చున్= ఇస్తుంది; దానన్= అందువలన; సంయమివరులకున్= మునిశ్రేష్ఠులకు; మహానుభావంబు= గొప్ప ప్రభావం; అగున్= కల్గుతుంది.

తాత్పర్యం: అహంకారంపై విజయం సాధిస్తే క్రమంగా అది పృథ్వ్యాది పంచభూతాలనూ, బుద్ధినీ, ప్రకృతినీ జయించగల సంస్కారాన్ని ప్రసాదిస్తుంది. అందువలన మునివర్యులకు గొప్పప్రభావం సమకూరుతుంది.

వ. ఇది యోగప్రకారంబు. 96

ప్రతిపదార్థం: ఇది= ఇంతవరకు చెప్పింది; యోగప్రకారంబు= యోగముయొక్క విధానం.

తాత్పర్యం: ఇంతవరకు నిరూపించబడింది యోగపద్ధతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **అనఘ! యింద్రియముల విషయముల మీఁద । నిగుడనీక, మనంబుతో మగుడఁ దిగిచి**
యాత్మఁగూర్చుట సాంఖ్యుల యనువు; సాంఖ్య । యోగములు రెండు నారయ నొక్క తెరువ. **97**

ప్రతిపదార్థం: అనఘ!= కల్మషరహితుడా!; ఇంద్రియములన్= శ్రోత్రాదులైన ఇంద్రియాలను; విషయములమీఁదన్= శబ్దాదులైన విషయాలమీద; నిగుడనీక= ప్రసరింపనీక; మనంబుతోన్= మనస్సుతో; మగుడన్= మరలేటట్లు; తిగిచి= ఆకర్షించి; ఆత్మన్= ఆత్మయందు; కూర్చుట= లగ్నంకావించటం; సాంఖ్యుల అనువు= సాంఖ్యమార్గాన్ని అనుసరించేవారి పద్ధతి; ఆరయన్= పరిశీలించగా; సాంఖ్యయోగములు= సాంఖ్యమార్గం, యోగమార్గం; రెండున్= రెండూ; ఒక్క తెరువు+అ= ఒక్క పద్ధతియే.

తాత్పర్యం: పాపరహితుడా! ఇంద్రియాలను విషయాలపై పోనీయకుండా మనస్సు మరలింపజేసి ఆత్మయందు సంలగ్నం కావించాలి. సాంఖ్యులు ఈ పద్ధతినే పాటిస్తారు. పరిశీలించి చూడగా సాంఖ్యయోగమార్గాలు రెండూ ఒక పద్ధతికి చెందినవే.

విశేషం: భగవద్గీతలో కృష్ణుడు "ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి" అని సాంఖ్యయోగముల ఏకత్వాన్ని ప్రతిపాదించిఉన్నాడు. ఇక్కడ గూడ ఈ విషయమే మరల ప్రస్తావించబడింది.

క. **ఈ రెండు ప్రకారంబుల । వారలకును మమత విడువవలయుట సరి; ని**
స్సారపు సంసారమునకుఁ । గారణము మమత్వ మగుటఁ గవిజనముఖ్యా! **98**

ప్రతిపదార్థం: కవిజనముఖ్యా!= యోగిజనశ్రేష్ఠా!; నిస్సారపు= సారరహితమైన; సంసారమునకున్= సంసారానికి; కారణము= హేతువు; మమత్వము= మమకారం; అగుటన్= కావటంవలన; ఈ రెండు ప్రకారంబుల వారలకును= ఈ ద్వివిధ పద్ధతులు పాటించే వారికి కూడా; మమత= మమకారమును; విడువన్+వలయుట= వదలవలసిన ఆవశ్యకత; సరి= సమమే.

తాత్పర్యం: యోగులలో శ్రేష్ఠుడవైన ఓ శుకుడా! నిస్సారమైన సంసారానికి ముఖ్యకారణం మమకారమే. అందువలన సాంఖ్యాన్ని అనుసరించేవారికైనా, యోగాన్ని పాటించేవారికైనా మమకార పరిత్యాగం సమానమైన ధర్మం.

వ. **భూతతారతమ్యంబులు సెప్పెద నాకర్ణింపుము: జంగమస్థావరంబులయందు జంగమంబులు లెస్స; యవి జరాయువు, నండంబును, నుద్భిదంబును, స్వేదంబును నను జనక విశేషంబుల జనియించి బహుపాదంబులును, ద్విపాదంబులు నైయుండు; నందు మనుష్యులు మేలు; మనుష్యుల యందు జాతిధర్మోపధారకు లెక్కుడు; జాతి ధర్మోపధారకుల యందు విప్రు లుత్తములు; విప్రులయందు వేదజ్ఞు లుదాత్తులు; వేదజ్ఞులయందుం బ్రవచనశీలు రుత్కృష్టులు; ప్రవచన శీలురయం దాత్మజ్ఞులధికులు; వారలు స్వధర్మవిదులు, సత్యసంకల్పులు, నధిభూతాధిదైవ వేదులు నగుదురు. వారలం జావె దేవతలు బ్రాహ్మణు లండ్రు; వా రెల్ల వారికి నమస్కారాద్యుపచారాదరణీయులు; వారికి సరిలేరు; వా రాధారంబుగా సమస్త జగంబులుఁ బ్రవర్తిల్లుచున్నవి' యని చెప్పి య మ్మహాత్ముండు వెండియు.** **99**

ప్రతిపదార్థం: భూతతారతమ్యంబులు= ప్రాణులలోని తరతమభేదాలు; చెప్పెదన్= వివరిస్తాను; ఆకర్ణింపుము= వినుము; జంగమస్థావరంబుల+అందున్= చరాచరములయందు; జంగమంబులు= చరప్రాణులు; లెస్స= మేలు; అవి= ఆప్రాణులు; జరాయువు= మావి; అండంబును= గ్రుడ్డును; ఉద్భిదంబును= భూమిని ఛేదించుకొని పుట్టేదీ; స్వేదంబును= చెమటయును; అను= అనే; జనకవిశేషంబులన్= ఉత్పాదకములైన వస్తు విశేషాలయందు; జనియించి= పుట్టి; బహుపాదంబులును= అనేక చరణాలు కలవి; ద్విపాదంబులున్+ఐ= రెండు చరణాలు కలవియును్నై; ఉండున్= ఉంటాయి; అందున్= ఆ ద్విపాదప్రాణులలో; మనుష్యులు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మానవులు; మేలు= లెస్స; మనుష్యుల+అందున్= మానవులలో; జాతిధర్మ+ఉపధారకులు= జాతియొక్క ధర్మమును పోషించేవారు; ఎక్కుడు= మేలు; జాతిధర్మ+ఉపధారకులయందున్= జాతి ధర్మపోషకులలో; విప్రులు= బ్రాహ్మణులు; ఉత్తములు= శ్రేష్ఠులు; విప్రుల+అందున్= భూసురులలో; వేదజ్ఞులు= వేదం తెలిసినవారు; ఉదాత్తులు= శ్రేష్ఠులు; వేదజ్ఞుల+అందున్= వేదవిదులలో; ప్రవచనశీలురు= వేదపారప్రవచనం చూసేవారు; ఉత్కృష్టులు= శ్రేష్ఠులు; ప్రవచనశీలుర+అందున్= ప్రవచనం చేసేవారియందు; ఆత్మజ్ఞులు= ఆత్మతత్త్వమెరిగినవారు; అధికులు= శ్రేష్ఠులు; వారలు= వారు; సర్వధర్మవిదులు= సమస్త ధర్మాలు తెలిసినవారు; సత్యసంకల్పులు= సత్యమైన సంకల్పంకలవారు; అధి భూతాది దైవవేదులున్= అధిభూతమును; అధిదైవము నెరిగినవారును; అగుదురు= అవుతారు; దేవతలు= సురలు; వారలన్+చూవె= వారలనే కదా!; బ్రాహ్మణులు+అంద్రు= బ్రాహ్మణులు అని చెప్పుతారు; వారు= ఆ బ్రాహ్మణులు; ఎల్లవారికిన్= అందరికీ; నమస్కార+ఆది+ఉపచార+ఆదరణీయులు= నమస్కారం మొదలైన ఉపచారాలచేత ఆదరించదగినవారు; వారికిన్= ఆ బ్రాహ్మణులకు; సరిలేరు= సాటివారు లేరు; వారు= ఆ బ్రాహ్మణులు; ఆధారంబుగాన్; ఆశ్రయంగా; సమస్తజగంబులున్= సర్వలోకాలూ; ప్రవర్తిల్లుచున్నవి= నడుస్తున్నవి; అని చెప్పి= అని వచించి; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; వెండియున్= మరల.

తాత్పర్యం: ప్రాణులలోఉన్న తేడాలు వివరిస్తాను వినుము. చరాచరాలైన రెండు రకాల ప్రాణులలో చరప్రాణులు మేలైనవి. అవి మావి, గ్రుడ్డు, ఉద్భిదము, చెమట అనే ఉత్పాదక పదార్థాలనుండి పుట్టి అనేకపాదాలు గలవి, రెండు పాదాలు గలవిఅయి ఉంటాయి. వాటిలో మానవులు మేలు. మానవులలో జాతిధర్మాన్ని పోషించేవారు శ్రేష్ఠులు. వారిలో విప్రులు మేలైనవారు. విప్రులలో వేదము నెరిగినవారు ముఖ్యులు. వేదం తెలిసినవారిలో వేదార్థప్రవచనం కావించేవారు ఉత్కృష్టమైనవారు. అట్లా ప్రవచనం చేసేవారిలో ఆత్మజ్ఞులైనవారు గొప్పవారు. ఆత్మతత్త్వం తెలిసినవారు, సర్వధర్మవేత్తలు, యథార్థమైన సంకల్పం కలవారు, అధిభూతాధిదైవాలను ఎరిగినవారు అవుతున్నారు. దేవతలు అట్లాంటి వారినే బ్రాహ్మణు లంటారు. ఆ రకమైన బ్రాహ్మణులు అందరికీ ప్రణామాదులచేత ఆదరించదగి ఉన్నారు. వారికి సమానమైన వా రెవరూ లేరు. వారి నాధారం చేసికొనే సమస్త లోకాలూ నడుస్తున్నాయి' అని మళ్ళీ (వేదవ్యాసమునీంద్రుడు ఇట్లా అన్నాడు:)

తే. **'బ్రాహ్మణునకుఁ బ్రధానవర్తనము వినుము! । నిర్మలజ్ఞానయుక్తుఁడై కర్మసమితి**
నలఘునిష్ఠమైఁ జలుపంగ వలయు; దాన । సంశయము లెల్లఁ బాయుఁ, బ్రసాద మొందు. **100**

ప్రతిపదార్థం: బ్రాహ్మణునకున్= పై జెప్పిన లక్షణాలతో విలసిల్లే బ్రాహ్మణుడికి; ప్రధానవర్తనము= ముఖ్యమైన నడవడి; వినుము; నిర్మలజ్ఞానయుక్తుఁడు+ఐ= అతడు నిర్మలమైన జ్ఞానంతో కూడినవాడై; అలఘునిష్ఠమైన్= గొప్ప నిష్ఠతో; కర్మసమితిన్= కర్తవ్యకార్య సమూహాలను; చలుపంగన్ వలయున్= నిర్వహించాలి; దానన్= ఆ విధంగా చేయటంవలన; సంశయములు+ఎల్లన్= సమస్త సందేహాలూ; పాయున్= తొలగుతాయి; ప్రసాదమున్= నైర్మల్యమును; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: 'పూర్వోక్తమైన లక్షణాలతో ఒప్పారే బ్రాహ్మణుడు ఎట్లా ప్రవర్తించాలో చెప్పుతాను వినుము. అతడు నిర్మలజ్ఞానం కలిగి గొప్ప దీక్షతో శ్రద్ధతో కర్తవ్యకర్మలు చేయాలి. అట్లా చేస్తే అతడి సంశయాలన్నీ తొలగిపోతాయి. అతడు మనోనైర్మల్యం పొందుతాడు.

క. **ఇయ్యఖిలము సృజియింపఁగ । నెయ్యది ప్రభు వమ్మహామహిత భూతము పాం**
దయ్యెడి శుభంబు దపమునఁ । జయ్యన సిద్ధించు; నది విసంశయ మనఘా! **101**

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; ఈ+అఖిలమున్= ఈ సమస్త జగత్తును; సృజియింపఁగన్= సృష్టించటానికి; ఏ+అది= ఏది; ప్రభువు= సమర్థమో; ఆ+మహామహిత భూతము పొందు= ఆ మహాపూజ్యమైన భూతంతోడి కలయిక; అయ్యెడి= సంభవించెడి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శుభంబు= మంగళం; తపమునన్= తపస్సుతో; చయ్యనన్= శీఘ్రంగా; సిద్ధించున్= సంభవిస్తుంది; అది= ఆ విషయం; విసంశయము= సంశయంలేనిది.

తాత్పర్యం: ఓ పాపరహితుడవైన శుకుడా! ఈ సమస్త ప్రపంచాన్నీ ఏది సృష్టిస్తున్నదో, ఆ మహాపావనమైన భూతంతో కలయిక అనే శుభం తపస్సుతో వెంటనే సిద్ధిస్తుంది. ఇందులో సందేహం లేదు.

క. మైత్రిం బోలెడు ధర్మము । ధాత్రీ దివిజులకు లేదు; దాని నడపినం
బుత్రా! యేకర్మంబు ప । విత్రతయును వలవ దది వివేకముఁ జేర్చున్.' 102

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; ధాత్రీ దివిజులకున్= భూసురులకు; మైత్రిన్+పోలెడిధర్మము= మిత్రత్వమును పోలిన; ధర్మము; లేదు= లేదు; దానిన్= ఆ మైత్రిని; నడపినన్= నిర్వహిస్తే; ఏకర్మంబు= ఏ కర్మయొక్క; పవిత్రతయును= పావనత్వమును; వలవదు= అక్కరలేదు; అది= ఆ మైత్రి; వివేకమున్= తెలివిని; చేర్చున్= ఘటిస్తుంది.

తాత్పర్యం: కుమారా! భూసురులకు మైత్రివంటి ధర్మం మరొకటి లేదు. మైత్రీధర్మాన్ని చక్కగా నడిపితే ఇతరకర్మల పవిత్రతలు పాటించవలసిన పనిలేదు. ఆ మైత్రి నిత్యానిత్య వివేకాన్ని కలిగిస్తుంది'.

విశేషం: సమస్తప్రాణుల పట్ల సద్భావన కలిగి మిత్రత్వమును పాటించటమే మైత్రి. ఇది శ్రేష్ఠతమ ధర్మం.

వ. అనిన విని శుకుం డా సంయమివరున కిట్లనియె. 103

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; శుకుండు= శుకయోగి; ఆ సంయమివరునకున్= ఆ వ్యాసుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: వ్యాసుడు ఈ రీతిగా చెప్పగా విని శుకుడు ఆ మునిశ్రేష్ఠుడితో మళ్ళీ ఇట్లా అన్నాడు:

వ్యాసుఁడు శుకున కుపదేశించిన పరబ్రహ్మ ప్రాప్తి సాధన ప్రకారము (సం. 12-231-3)

క. 'పరమబ్రహ్మపదము న । ధ్వరముననో, ప్రజ్ఞ పెంపు వలననొ, యోగా
చరణముననొ, సాంఖ్యసమా । దరణముననొ పొందవచ్చుఁ దత్త్వజ్ఞవరా!' 104

ప్రతిపదార్థం: తత్త్వజ్ఞవరా!= తత్త్వం తెలిసిన వారిలో శ్రేష్ఠుడవైనవాడా!; అధ్వరముననో= యజ్ఞంవలననో; ప్రజ్ఞపెంపువలననొ= మతియొక్క అతిశయంవలననో; యోగ+ఆచరణముననొ= యోగము నాచరించటంవలననో; సాంఖ్య సమాదరణముననొ= సాంఖ్యమును చక్కగా ఆచరించటంచేతనో; పరమబ్రహ్మపదమున్= శ్రేష్ఠమైన బ్రహ్మస్థానమును; పొందవచ్చున్?= పొందటానికి వీలవుతుంది?

తాత్పర్యం: 'తత్త్వమునెరిగినవారిలో శ్రేష్ఠుడవైన ఓ మునీశ్వరా! యజ్ఞక్రియవలననా? లేక ప్రజ్ఞాతిశయం వలననా? యోగాన్ని పాటించటం వలననా? సాంఖ్యాన్ని ఆదరించటం వలననా? ఏ విధంగా పరబ్రహ్మ పదమైన మోక్షమును పొందవచ్చును?'

చ. అనుటయు నమ్మునిప్రవరుఁ డాతని కిట్లను 'నీవు పేరు గ్రు
చ్చినయవి యెల్ల మేల; సవిశేషతపంబును, నింద్రియప్రవ
ర్తనముల నిగ్రహించుటయు, రాగము లోభముఁ ద్రోవఁ జాలు నే
ర్పును దృఢవిద్యయుం గలుగు పుణ్యుఁడు వొందఁగనోపు బ్రహ్మమున్. 105

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనుటయున్= అని అడుగగా; ఆ+మునిప్రవరుఁడు= ఆ వ్యాసుడు; ఆతనికిన్= ఆ శుకుడికి; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; నీవు పేరుగ్రుచ్చిన+అవి ఎల్లన్= నీవు పేర్కొన్నవి అన్నియునూ; మేలు= శ్రేయస్సును గలిగించేవే; సవిశేషతపంబును= విశేషంతో కూడిన తపస్సు; ఇంద్రియ ప్రవర్తనములన్= ఇంద్రియాల పోకడలను; నిగ్రహించుటయున్= నియమించటం; రాగమున్= విషయాలపై ప్రీతిని; లోభమున్= లోభమనే దుర్గుణమును; త్రోవన్+చాలు= తొలగింపగల; నేర్పును= చాతుర్యమును; దృఢవిద్యయున్= గట్టి విద్యయును; కలుగు= కలిగియున్నట్టి; పుణ్యుఁడు= పుణ్యాత్ముడు; బ్రహ్మమున్= బ్రహ్మస్థానాన్ని; పొందఁగన్+ఓపున్= పొందగలుగుతాడు.

తాత్పర్యం: అట్లా శుకు డడిగేసరికి వ్యాసమునీంద్రు డతడితో ఇట్లా అన్నాడు: 'నీ విపుడు చెప్పిన యజ్ఞాదులన్నీ బ్రహ్మపదప్రాప్తికి ఉపకరించే శ్రేష్ఠమైన సాధనాలే. అంతేకాక విశిష్టమైన తపస్సు, ఇంద్రియనిగ్రహం, రాగలోభనివారణ మొనర్చే చాతుర్యం, దృఢమైన విద్యకల పుణ్యాత్ముడు తప్పక బ్రహ్మపదాన్ని పొందుతాడు.

క. **వినుమ! యందు నొక విశేషం । బనఘా! బుద్ధీంద్రియంబు లైదును బరముం**
గను వెలుఁగున కడ్డము వా । ని నడంగింపంగ మనసునిపుణత యొప్పున్. **106**

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; అందున్= ఇప్పుడు చెప్పినవాటిలో; ఒక విశేషంబు= ఒక విశేషాంశాన్ని; వినుము= ఆలకించుము; బుద్ధి+ఇంద్రియంబులు= జ్ఞానేంద్రియాలు; ఐదును= అయిదు కూడాను; పరమున్= బ్రహ్మమును; కను వెలుఁగునకున్= చూచే ప్రకాశానికి; అడ్డము= నిరోధకాలై ఉన్నవి; వానిన్= ఆ ఇంద్రియాలను; అడంగింపంగన్= అణచివేయగా; మనసు నిపుణత= చిత్తంయొక్క నేర్పు; ఒప్పున్= భాసిస్తుంది.

తాత్పర్యం: కల్మషరహితుడవైన ఓ శుకుడా! అందులోనూ ఒక విశేషం చెప్పుతాను. వినుము. శ్రోత్రం మొదలైన ఐదు జ్ఞానేంద్రియాలు పరతత్త్వ దర్శనానికి ఆటంకాలుగా ఉంటాయి. వాటిని నిరోధించి వేస్తే బ్రహ్మప్రాప్తి కవసరమైన మనోనైపుణ్యం చక్కగా విరాజిల్లుతుంది.

క. **మనసు నియమింప భూతా । త్మని యత్నం బోపు నియమమునకున్ లోనై**
మన సింద్రియములఁ గుదియిం । చిన శబ్దాదులు దొలంగి సిద్ధి దొరకొనున్. **107**

ప్రతిపదార్థం: భూత+ఆత్మని= జీవుడియొక్క; యత్నంబు= ప్రయత్నం; మనసున్= చిత్తమును; నియమింపన్= నిగ్రహించటానికి; ఓపున్= సమర్థమవుతుంది; మనసు= చిత్తం; నియమమునకున్= నిగ్రహానికి; లోనై= లోబడినదై; ఇంద్రియములన్= శ్రోత్రాదులగు ఇంద్రియాలను; కుదియించినన్= నిగ్రహిస్తే; శబ్దాదులు= శబ్దాదులైన విషయాలు; తొలంగి= తొలగిపోయి; సిద్ధి= మోక్షం; దొరకొనున్= లభిస్తుంది.

తాత్పర్యం: జీవుడు ప్రయత్నిస్తే మనస్సును నిగ్రహించగలడు. నిగ్రహించబడిన మనస్సు ఇంద్రియాలను నియమించగలదు. అపుడు శబ్దాదులైన విషయాలు తొలగిపోతాయి. అంతట అభిలషించిన బ్రహ్మప్రాప్తి రూపమైన మోక్షం సిద్ధిస్తుంది.

ఆ. **కనుట వినుట యాదిగాఁ గల యింద్రియం । బుల కగోచరంబు బుద్ధి; దీన**
రూపుగాఁగఁ దోఁచు రూపశబ్దాది గు । ణత్వరహితమైన తత్త్వ మనఘ! **108**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; బుద్ధి= ప్రజ్ఞ; కనుట వినుట ఆదిగాన్+కల= చూడటం, వినటం మొదలైన; ఇంద్రియములకున్= ఇంద్రియాలకు; అగోచరంబు= గోచరించనిది; దీనన్= ఈ బుద్ధివలననే; రూపశబ్ద+ఆదిగుణత్వరహితము+ఐన= రూపం, శబ్దం మొదలైన గుణాలతో సంబంధం లేని; తత్త్వము= పరతత్త్వం; రూపుకాఁగన్= స్పష్టంగా; తోఁచున్= భాసిస్తుంది.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ శుకుడా! నేత్రం, శ్రోత్రం మొదలైన ఇంద్రియాలకు బుద్ధి గోచరించేదికాదు. బుద్ధివలననే రూపశబ్దాదులైన గుణాలతో ఏ మాత్రం సంబంధము లేని పరతత్త్వం స్పష్టంగా గోచరిస్తుంది.

చ. **వినయము విద్యయుం గలుగు విప్రునియందును, గోవునందు, నొ**
ప్పు నెఱయు హస్తియందు నొక పోఁకకుఁబోవని కుక్కయందు, దా
ని నడఁచి తెచ్చి వండి తిను నీచపుమాలనియందుఁ దుల్యద
ర్శనులు దదంతరాత్ముని నిరంజనునిం గనునట్టి పండితుల్. **109**

ప్రతిపదార్థం: తదంతరాత్మని= విప్రుడు మొదలైనవారి అంతరాత్మయైన; నిరంజనునిన్= పరిశుద్ధమైన పరమాత్మను; కనునట్టి= చూచునట్టి; పండితుల్= పండితులు; వినయము= అణకువ; విద్యయున్= చదువును; కలుగు= కలిగి ఉన్నట్టి; విప్రుని అందున్= బ్రాహ్మణుడియందు; గోవునందున్= ఆవునందు; ఒప్పునెఱయు= చక్కనైన; హస్తి+అందున్= ఏనుగునందు; ఒక పోఁకకున్+పోవని= ఒక నీచమైన పోకకు కూడ కొరగాని; కుక్కయందున్; దానిన్= ఆ కుక్కను; అడఁచి= చంపి; వండి= వంటజేసికొని; తిను నీచపు మాలని+అందున్= భుజించే నీచుడైన శ్వపాకుడి యందు; తుల్యదర్శనులు= సమమైన దర్శనంకలవారు.

తాత్పర్యం: విప్రాదులలో అంతరాత్మఅయిన పరిశుద్ధమైన పరమాత్ముడిని చూచే పండితులు. విద్యావినయ సంపన్నుడైన విప్రుడియందు, గోవునందు, ఏనుగునందు, పోకకు కూడ కొరగాని కుక్కయందు, కుక్కమాంసం వండుకొని తినే చండాలుడియందు సమదృష్టి గల్గువారవుతారు.

విశేషం: భగవద్గీతలో గూడ దీనికి మూలమైన శ్లోకము 'విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని। శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః'॥ అన్నది కలదు.

క. **స్థావరముల జంగమముల । నా విభుఁడు వసించు; నతనియందు నవి నిస**
ర్గావాసత నుండును; ద । ద్భావన మెఱుఁగుట తదైక్యపదముం జేర్చున్. **110**

ప్రతిపదార్థం: స్థావరములన్= స్థిరంగా ఒకచోట ఉండే ప్రాణులలోనూ; జంగమములన్= చరించే ప్రాణులలోనూ; ఆ విభుఁడు= ఆ పరమాత్ముడు; వసించున్= నివసిస్తాడు; అతని+అందున్= ఆ పరమాత్ముడియందు; అవి= ఆ చరాచరాలు; నిసర్గ+ఆవాసతన్= సహజ నివాసంకలవై; ఉండున్= ఉంటాయి; తద్భావనము= అవి అట్లా ఉండటాన్ని; ఎఱుఁగుట= తెలిసికొనుట; తత్+ఐక్యపదమున్= ఆ పరమాత్మతో ఏకమయ్యే స్థితిని; చేర్చున్= చేరుస్తుంది.

తాత్పర్యం: ఆ పరమాత్మ చరాచర ప్రాణులన్నిటిలో ఉన్నాడు. ఆ పరమాత్మలో ఆ ప్రాణులన్నీ ఉన్నవి. ఇట్లా ఒకదానిలో ఒకటి అవి పరస్పరం కలిసి ఉన్నాయని గ్రహించటమే బ్రహ్మపద ప్రాప్తిని సమకూరుస్తుంది.

తే. **క్షరము నక్షరమును ననం గలవు రెండు । మూర్తు; లాత్మ కఖిలభూతములను బూర్వ**
మొలయు మృత మన దివమున నుండు నమృత । మనఁగ నపరంబు రెంటిని గను బుధుండు. **111**

ప్రతిపదార్థం: ఆత్మకున్= ఆత్మ పదార్థానికి; క్షరమున్= క్షరమనీ; అక్షరమునున్= అక్షరమనీ; అనన్= అనగా; రెండుమూర్తులు= రెండు ఆకృతులు; కలవు= ఉన్నాయి; అఖిలభూతములను= సమస్త ప్రాణులలోను; పూర్వము= మొదటిదైన క్షరం; మృతము= మరణశీలం; అనన్= అనగా; ఒలయున్= ఒప్పుతుంది; అపరంబు= మరొకటైన అక్షరం; అమృతము+అనఁగన్= మరణశీలం కానిదనగా; దివమునన్= స్వర్గంలో; ఉండున్= ఉంటుంది; బుధుండు= ఆత్మజ్ఞుడైన పండితుడు; రెంటినిన్= క్షరాక్షరాలను రెండింటినీ; కనున్= చూస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆత్మకు క్షరమనీ, అక్షరమనీ రెండు మూర్తులున్నాయి. క్షరం సమస్త ప్రాణులలోను మృతమన్న పేరుతో ఉంటుంది. రెండవదైన అక్షరం 'అమృత' మనబడి స్వర్లోకంలో ఉంటుంది. పండితుడైనవాడు పై క్షరాక్షరాలను రెండింటినీ వేరు వేరుగా గ్రహిస్తాడు.

విశేషం: నశించిపోయే స్వభావం గలది క్షరము. నాశం లేనిది అక్షరం. స్థూలదేహాదులన్నీ కాలక్రమంలో నశించిపోతాయి కాబట్టి క్షర మనబడుతున్నాయి. అక్షరమైన జీవాత్మ నశించదు. అవిద్యను తొలగించుకొన్నపు డా జీవాత్ముడే పరమాత్ము డవుతాడు. పరమాత్ముడు కూడా అక్షరుడే.

'ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ' ఇత్యాదిగా గీతలో ఈ విషయమే చెప్పబడింది. సర్వభూతాలూ క్షరమనీ, కూటస్థుడు అక్షరుడనీ గీత పేర్కొన్నది. క్షరాక్షరములకు అతీతుడైన పురుషోత్తముడే పరమాత్ముడని వ్యవహరించబడుతున్నాడు.

క. **ఈ లోకంబుల నెల్లం । గాలము పక్వంబు సేయఁగా నెవ్వాఁ డ**
క్కాలము పక్వము సేయం । జాలు నతం డమృతు నజరు సత్యుఁ గనుటకున్. **112**

ప్రతిపదార్థం: ఈ లోకంబులను+ఎల్లన్= ఈ లోకాలనన్నింటినీ; కాలము= కాలమనే తత్త్వం; పక్వంబుచేయఁగాన్= పచనం చేసివేయగా; ఎవ్వాఁడు= ఎవడు; ఆ+కాలమున్= ఆ కాలమును; పక్వము చేయన్= పచనమొనర్ప; అతండు= అట్టివాడు; అమృతున్= మరణశీలుడుకానివాడు; అజరున్= వార్ధకమంటనివాడు అగు; సత్యున్= శాశ్వతుడైన పరమాత్మను; కనుటకున్= చూచుటకు; చాలున్= సమర్థుడవుతాడు.

తాత్పర్యం: కాలం ఈ అన్ని లోకాలను పచనం చేసి వేస్తున్నది. ఆ కాలాన్ని పచనం చేయటంద్వారా ఎవడు జయించగలడో వాడు మాత్రమే జరామరణాలు లేని శాశ్వతుడైన అక్షరపురుషుడిని చూడగలడు.

విశేషం: సమస్త లోకాలూ కాలక్రమంలో నశించి పోతున్నాయి. మరణించేశరీరం తాను కాదని, తనకు మరణం లేదనీ ఎవడు గుర్తిస్తాడో వాడు మాత్రమే కాలానికి లోబడనివాడై కాలాన్ని జయించినవా డవుతాడు. వానికి అక్షరపురుష దర్శనం సిద్ధిస్తుంది.

తే. **విను నవద్వారపురమున వెలుఁగుచుండు । హంసుఁ డతనిన యక్షరుఁ డమృతుఁ డండ్రు**
పరమయోగు లాతత్త్వంబు భంగిఁ గాంచు । యోగ్యసత్క్రియాభ్యాసవైరాగ్యపరుఁడు.' **113**

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; హంసుఁడు= హంసశబ్దవాచ్యుడైన ఆత్మ; నవద్వారపురమునన్= తొమ్మిది ద్వారాలుగల పట్టణమనే శరీరంలో; వెలుఁగుచుండున్= ప్రకాశిస్తూ ఉంటాడు; పరమయోగులు= శ్రేష్ఠులైన యోగులు; అతనిన= ఆ హంసుడినే; అక్షరుఁడు+అమృతుఁడు+అండ్రు= అక్షరుడనీ అమృతుడనీ అంటారు; యోగ్య= తగిన; సత్క్రియా= సత్కార్యాలయొక్క; అభ్యాస= అభ్యాసమునందును; వైరాగ్య= వైరాగ్యమునందును; పరుఁడు= ఆసక్తిగలవాడు; ఆ తత్త్వంబుభంగిన్= ఆ అక్షరతత్త్వపద్ధతిని; కాంచున్= చూస్తాడు.

తాత్పర్యం: శుకా! వినుము. తొమ్మిదిద్వారాలు గల శరీర మనే నగరంలో హంసు డనే ఆత్మ భాసిస్తున్నాడు. శ్రేష్ఠులైన యోగులు ఆ ఆత్మనే అక్షరుడనీ, అమృతుడనీ అంటున్నారు. యోగ్యమైన సాధనాది సత్కార్యాలు ఆచరిస్తూ వైరాగ్య పరుడైనవాడు ఆ అక్షరతత్త్వాన్ని గ్రహించగలడు'.

విశేషం: శరీరానికి రెండు కన్నులు, రెండు చెవులు, రెండు నాసారంధ్రాలు, నోరు, గుదం, మూత్రద్వారం - అని తొమ్మిది ద్వారాలున్నాయి. అందువలన నవద్వారపురంగా శరీరం అభివర్ణించబడుతున్నది. 'నవద్వారేపురే' ఇత్యాదిగా గీతాదులలో ప్రయోగాలు గమనించేది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని చెప్పి యప్పారాశర్యుండు వెండియు. 114

ప్రతిపదార్థం: అని చెప్పి= ఇట్లా పలికి; ఆ+పారాశర్యుండు= వ్యాసుడు; వెండియున్= మరల.

తాత్పర్యం: ఈ రీతిగా చెప్పి పరాశరపుత్రుడైన వ్యాసమునీంద్రుడు మళ్ళీ శుకుడితో ఇట్లా అన్నాడు.

తే. 'అనఘ! విను కామమును గ్రోధమును భయంబు । నిద్రయును లోభమును జాల నిందితములు
యోగిజనులకుఁ గావున నుడుగవలయు । వీని నైదింటి నచలావధాన వృత్తి. 115

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; విను= ఆలకించుము; యోగిజనులకున్= యోగమార్గంలో ఉన్నవారికి; కామమును= కామమూ; క్రోధమును= కోపమూ; భయంబున్= భీతియు; నిద్రయున్= నిద్రించటమూ; లోభమును= పిసినితనమున్నూ; చాలన్= మిక్కిలి; నిందితములు= నిందించబడినవి; కావునన్= అందువలన; అచలావధానవృత్తిన్= నిశ్చలమైన అవధానవ్యాపారంతో; వీనిన్+ఐదింటిన్= ఈ ఐదు దుర్గుణాలను; ఉడుగన్ వలయున్= వదలిపెట్టాలి.

తాత్పర్యం: పాపరహితుడా! ఇంకా చెప్పుతాను వినుము. యోగులైనవారికి కామం, క్రోధం, భయం, నిద్ర, లోభం అనేవి చాలా నిందించదగిన చెడు గుణాలు. కాబట్టి అచంచలమైన అవధానంతో ఈ ఐదు దుర్గుణాలనూ పరిత్యజించాలి.

శా. కామంబుం బెడఁబాచుఁ బండితుఁడు సంకల్పంబు వర్జించి, ని
ద్రామోహంబు నడంచు సత్త్వగుణ చింతన్, లోభముం బ్రాజ్ఞ సే
వాముద్రం దొలఁగించుఁ, గ్రోధము శమవ్యాప్తిన్ మగుడ్చున్ మతి
శ్రీమాన్యా! భయ మప్రమాదమున నిర్జించున్ దృఢస్వాంతుఁడై. 116

ప్రతిపదార్థం: మతిశ్రీమాన్యా!= బుద్ధివైభవంచేత పూజించదగిన వాడా!; పండితుఁడు= బుధుడు; దృఢస్వాంతుఁడు+ఐ= దృఢమైన చిత్తం కలవాడై; సంకల్పంబున్= మనోవ్యాపారాన్ని; వర్జించి= వదలి; కామంబున్= కామాన్ని; పెడఁబాచున్= ఎడబాయజేస్తాడు; సత్త్వగుణచింతన్= సత్త్వమనే గుణాన్ని చింతించటంచేత; నిద్రామోహంబున్= నిద్రఅనే మోహాన్ని; అడంచున్= నశింపజేస్తాడు; ప్రాజ్ఞసేవాముద్రన్= బుద్ధిమంతులైనవారి సేవఅనే ముద్రచేత; లోభమున్= పిసినితనాన్ని; తొలఁగించున్= తొలగింపజేస్తాడు; శమవ్యాప్తిన్= అంతరింద్రియనిగ్రహ వ్యాప్తిచేత; క్రోధమున్= కోపమును; మగుడ్చున్= మరలింపజేస్తాడు; అప్రమాదమునన్= జాగరూకతతో; భయమున్= భీతిని; నిర్జించున్= జయిస్తాడు.

తాత్పర్యం: ధీసంపదచేత పూజింపదగిన ఓ శుకుడా! పండితుడు దృఢచిత్తంతో సంకల్పాన్ని వదలి కామాన్ని వదలించుకొంటాడు, సత్త్వగుణాన్ని చింతించటం ద్వారా నిద్రామోహాన్ని నశింపజేస్తాడు. ప్రాజ్ఞులను సేవించటం వలన లోభాన్ని తొలగించుకొంటాడు. శమంతో కోపాన్ని విసర్జిస్తాడు. ఏమరుపాటు లేనివాడై భయాన్ని జయిస్తాడు.

తే. శిశ్నము నుదరమును ధృతిఁ, జేయుఁ గాలుఁ । జూడ్కిఁ జూడ్కిని వినికిని శుద్ధమాన
సమున మానసవాక్కుల విమలవిద్య । నవహితుండు రక్షించుఁ గులాగ్రగణ్య! 117

ప్రతిపదార్థం: కుల+అగ్రగణ్య!= వంశంలో మొదట గణించదగినవాడా!; అవహితుండు= అవధానంకలవాడు; శిశ్నమున్= పురుషాంగాన్నీ; ఉదరమును= పొట్టనూ; ధృతిన్= ధైర్యంతో; చేయున్+కాలున్= చేతిని, కాలిని; చూడ్కిన్= చూపుతో; చూడ్కిని= చూపును; వినికిని= శ్రవణమును; శుద్ధమానసమునన్= పరిశుద్ధమైన చిత్తంతోనూ; మానసవాక్కులన్= మనస్సును, వాక్కునూ; విమలవిద్యన్= నిర్మలమైన విద్యతోనూ; రక్షించున్= కాపాడుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కులశ్రేష్ఠుడవైన ఓ శుకుడా! జాగరూకుడై ఏమరుపాటులేని వాడు శిశ్నోదరాలను ధీరతతోనూ, హస్తపాదాలను చూపుతోనూ, నేత్ర శ్రవణాలను శుద్ధచిత్తంతోనూ, మనోవాక్కులను నిర్మలమైన విద్యతోనూ కాపాడుకొంటాడు.

వ. మఱియు నొక్కతెఱంగు సెప్పెద. 118

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; ఒక్క తెఱంగున్= ఒక పద్ధతిని; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: ఇంకా ఒక మార్గం వివరిస్తాను.

తే. ఇంద్రియములలో నొక్కటియేనిఁ బట్టు। వడక వెడలిన నా గంటిఁ బ్రజ్ఞ గాఱు
నట్లు కావున మనసు మున్నాఁగి వినికి। యాదియగు నైదుఁ గ్రమమున నాఁగవలయు. 119

ప్రతిపదార్థం: ఇంద్రియములలోన్= ఐదు జ్ఞానేంద్రియాలలోనూ; ఒక్కటి+ఏనిన్= ఒక్కటైనా; పట్టువడక= నిగ్రహించబడక; వెడలినన్= తప్పించుకొనిపోతే; ఆగంటిన్= ఆ రంధ్రంద్వారా; ప్రజ్ఞ= తెలివి; కాఱున్= స్రవించిపోతుంది; అట్లు కావునన్= ఆ విధంగా జరుగుతుంది కాబట్టి; మనసున్= చిత్తమును; మున్ను= ముందు; ఆగి= నిరోధించి; వినికి+ఆది+అగు= శ్రవణం మొదలైన; ఐదున్= పంచేంద్రియాలను; క్రమమునన్= క్రమంగా; ఆఁగవలయున్= నిరోధించాలి.

తాత్పర్యం: ఇంద్రియాలలో ఒక్కటైన నిగ్రహానికి లొంగక తప్పించుకొంటే చాలు, ఆ రంధ్రంద్వారా ప్రజ్ఞ మొత్తం జారిపోతుంది. అందువలన మొదట చిత్తాన్ని నిరోధించాలి. ఆపై శ్రవణాదులైన పంచేంద్రియాలను నిరోధించాలి.

క. మనసును నింద్రియములనుం। దనయం దొదుఁగంగఁ జేయఁ దానుఁ దెలివి నొం
ది నిరంజనత్వ సిద్ధిం। గని యపధూమానలంబు కరణి వెలుంగున్. 120

ప్రతిపదార్థం: మనసును= చిత్తాన్ని; ఇంద్రియములనున్= ఇంద్రియాలనూ; తన+అందున్= ఆత్మలో; ఒదుఁగంగన్+చేయన్= అణగేటట్లు చేయగా; తాను= ఆత్మ; తెలివిన్+ఒంది= వివేకంపొంది; నిరంజనత్వసిద్ధిన్= మాయా దోషరాహిత్యాన్ని; కని= పొంది; అపధూమానలంబు కరణిన్= పొగలేని అగ్నివలె; వెలుంగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: మనస్సునూ, ఇంద్రియాలనూ తనలో నిగ్రహించుకొంటే తాను వివేకి అవుతాడు. ఆపై ఏ విధమైన దోషం లేనివాడై పొగలేని అనలంవలె వెలుగొందుతాడు.

మ. మన సేకాగ్రతఁ బొందఁ జేయ జనసమ్మర్దంబు వర్జించి శూ
న్యనికేతాద్రిగుహా వివిక్త వనదేవాగార ముఖ్యంబు లై
న నివాసంబుల నుండఁగావలయుఁ దన్మన్నించినం గీడు సే
సిన హర్షంబు నమర్షముం హృదయముం జెందింప కక్షోభ్యుఁడై. 121

ప్రతిపదార్థం: తన్= తనను; మన్నించినన్= పూజించినను; కీడు చేసినన్= (తనకు) అపకారం చేసినా; హర్షంబున్= సంతోషమును; అమర్షమున్= కోపమును; హృదయమున్= చిత్తమును; చెందింపక= పొందించకుండా; అక్షోభ్యుఁడు+ఐ= క్షోభింపజేయరానివాడై; మనసున్= చిత్తమును; ఏకాగ్రతన్= ఏకనిష్ఠత్వమును; పొందన్+చేయన్= ఒందించటానికి; జనసమ్మర్దంబున్= ప్రజల సందడిని; వర్జించి= త్యజించి; శూన్య= జనులు లేని; నికేత= గృహాలు; అద్రిగుహా= పర్వతగుహలు; వివిక్త= ఏకాంతములైన; వన= అడవులు; దేవాగార ముఖ్యంబులు+ఐన= దేవాలయాలు మొదలైన; నివాసంబులన్= స్థానాలలో; ఉండఁగాన్ వలయున్= నివసించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఇతరులు తనను సమ్మానించినా, తనకు అపకారం చేసినా సంతోషాన్నీ, కోపాన్నీ పొందకుండా, ఏ విధమైన చిత్తక్షోభకు గురికానివాడై చిత్తమును ఏకాగ్రం చేయటానికి ఒక శూన్యమైన ప్రదేశంలో, కొండగుహలు, విజనములైన అడవులు, దేవాలయాలు మొదలైన ప్రదేశాలలో నివసించాలి.

క. సమదృష్టిని ఱాయియుఁ గన । కముఁ జూచుచు సత్స మాధికలితం బగు వృ
త్తము నడపిన శబ్దబ్ర । హ్మము షణ్మాసముల యోగి యతివర్తించున్. 122

ప్రతిపదార్థం: యోగి= యోగమార్గంలో ఉన్నవాడు; సమదృష్టిని= సమమైన చూపుతో; ఱాయియున్= శిలను; కనకమున్= బంగారాన్ని; చూచుచున్= విలోకిస్తూ; సత్సమాధికలితంబు+అగు= చక్కని సమాధితో కూడిన; వృత్తమున్= వర్తనమును; నడపినన్= నిర్వహించెనేని; షణ్మాసములన్= ఆరుమాసాలలో; శబ్దబ్రహ్మమున్= శబ్దమనే బ్రహ్మాన్ని; అతివర్తించున్= దాటిపోతాడు.

తాత్పర్యం: యోగి 'సమలోష్టాశ్మకాంచనః' అన్నట్లు రాయిని, బంగారాన్ని సమదృష్టితో చూస్తూ సమాధినిష్ఠుడై ఆరుమాసాలు గడపగలిగితే శబ్దబ్రహ్మాన్ని అతిక్రమిస్తాడు.

క. సుత! విను; శబ్దబ్రహ్మము । నతివర్తించి భువనత్రయమునను యోగా
న్వితుఁ డగు ముని గను నజు శా । శ్వతు నచలుఁ బురాణతము నజరుఁ బరమాత్మున్.' 123

ప్రతిపదార్థం: సుత!= కుమారా!; విను= ఆలకించుము; యోగ+అన్వితుఁడు= యోగంతో కూడినవాడు; అగు ముని= ఐన ముని; శబ్దబ్రహ్మమును= శబ్దమనే బ్రహ్మాన్ని; అతివర్తించి= దాటి; భువనత్రయమునను= ముల్లోకాలలోనూ; అజున్= పుట్టుకలేనివాడును; శాశ్వతున్= సత్యమైనవాడును; అచలున్= నిశ్చలమైనవాడును; పురాణతమున్= ప్రాచీనతముడును; అజరున్= వార్ధకం లేనివాడును అయిన; పరమాత్మున్= పరమాత్ముడిని; కనున్= చూస్తాడు.

తాత్పర్యం: పుత్రా! యోగి శబ్దబ్రహ్మాన్ని దాటి మూడు లోకాలలోనూ జననం లేనివాడూ, శాశ్వతుడైనవాడూ, నిశ్చలమైనవాడూ, సనాతనుడూ, ముసలితనం లేనివాడూ అయిన పరమాత్ముడిని దర్శిస్తాడు.

వ. అనిన విని శుకుండు వేదవ్యాసమునీశ్వరునితో నిట్లను 'వేదంబు గర్మంబుల నాచరించుటయుం, బరిత్యజించుటయుం జెప్పు; నివ్విధంబులు పరస్పర విరుద్ధంబులై యున్నయవి; యిం దెద్దాన నెట్టిగతి సిద్ధించు; నేర్పడ? నెఱింగింపవే!' యనుటయు, నతం డతని కిట్లనియె. 124

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆకర్ణించి; శుకుండు= శుకయోగి; వేదవ్యాసమునీశ్వరునితోన్= వేదవ్యాస మునీంద్రుడితో; ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పాడు; వేదంబు= శ్రుతి; కర్మంబులన్= కర్మలను; ఆచరించుటయున్= చేయటాన్ని; పరిత్యజించుటయున్= వదలటాన్ని; చెప్పున్= చెప్పుతున్నది; ఈ+విధంబులు= ఈ రెండు పద్ధతులు; పరస్పర విరుద్ధంబులు+ఐ= అన్యోన్య వ్యతిరేకాలుగా; ఉన్న+అవి= ఉన్నాయి; ఇందున్= ఈ రెండు మార్గాలలో; ఏ+దానన్= దేనివలన; ఎట్టిగతి= ఏ విధమైన ప్రాప్తి; సిద్ధించున్= లభిస్తుంది; ఏర్పడన్= స్పష్టంగా; ఎఱింగింపవే= తెలియజెప్పుమా; అనుటయున్= అనగా; అతండు= ఆ వ్యాసుడు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: వ్యాసు డా రీతిగా చెప్పేసరికి అది విని శుకు డతడితో 'వేదం కర్మలు చేయాలనీ, వదలాలనీ రెండు రకాలుగా చెప్పుతున్నది. ఈ పద్ధతులు రెండూ అన్యోన్యం విరుద్ధంగా ఉన్నాయి. ఇందులో ఏది చేస్తే ఏ గతి లభిస్తుందో స్పష్టంగా తెలియజేయు'మని అడిగాడు. అందుకు వేదవ్యాసు డీ విధంగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. విను ప్రవృత్తి కర్మ మనఘ! నివృత్తి ని । ష్కర్మ మరయ బంధకంబు మోక్ష
ణంబు నగుట బోధనత్వసంపన్నులు । సొరరు కర్మతంత్ర కరణమునకు. 125

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; విను= ఆలకించుము; కర్మము= కర్మమార్గం; ప్రవృత్తి= ప్రవర్తనం; అరయన్= పరిశీలింపగా; నిష్కర్మము= కర్మరాహిత్యం; నివృత్తి= బంధించేది, (రెండవది) మోక్షణంబు= విడుదల కలిగించేది; అగుటన్= కావటంచేత; బోధనత్వ సంపన్నులు= జ్ఞానంకలవారు; కర్మ తంత్ర కరణమునకున్= కర్మవిధానం ఒనర్చటానికి; చొరరు= పూనుకొనరు.

తాత్పర్యం: పాపరహితుడా! విను. కర్మమార్గం ప్రవృత్తి అనీ, కర్మరహితమార్గం నివృత్తి అనీ చెప్పబడుతాయి. ఇందులో మొదటిది బంధం కలిగించేది, రెండవది విడుదల కలిగించేది. అందువలన జ్ఞానసంపన్నులైనవారు కర్మమార్గంలో ప్రవేశించరు.

క. కొందఱు కర్మకరణ మభి । నందింతురు; వారలకు జనన మరణములం
బొందక పోరాదు; మహా । నందముఁ బొందుదురు నిత్య నైష్కర్మ్య పరుల్. 126

ప్రతిపదార్థం: కొందఱు= కొంతమంది; కర్మకరణమున్= కర్మచేయటాన్ని; అభినందింతురు= మెచ్చుకొంటారు; వారలకున్= వారికి; జనన మరణములన్= పుట్టుకను, చావును; పొందకపోరాదు= అనుభవించక పోవటానికి వీలుకాదు; నిత్యనై ష్కర్మ్యపరుల్= సదా నిష్కర్మలయందుండేవారు; మహానందమున్= గొప్ప ఆనందాన్ని; పొందుదురు= పొందుతారు.

తాత్పర్యం: కొందరు కర్మలు చేయటమే మంచిదంటారు. కాని, వారు చావుపుట్టుకలను పొందకుండా తప్పించుకొనలేరు. ఎల్లవేళలా నిష్కర్మతామార్గాన్ని అనుసరించేవారు గొప్ప ఆనందం పొందుతారు.

ఆ. చిత్తశుద్ధి మాత్రఁ జేసెనేనియు నవి । ద్యాత్మకంబ చూవె యరయఁ గర్మ
మది దొఱంగు టంచితాత్మ విద్యాత్మక । ధర్మ మదియ మోక్షదంబు సుమ్ము! 127

ప్రతిపదార్థం: అరయన్= పరిశీలింపగా; కర్మము= కర్మమార్గం; చిత్తశుద్ధిమాత్రన్= మనశ్శుద్ధిని మాత్రం; చేసెన్+ఏనియున్= చేసినప్పటికినీ; అవిద్యాత్మకంబ చూవె!= అవిద్యాస్వరూపమే గదా!; అది= ఆ కర్మను; తొఱంగుట= త్యజించటం; అంచిత+ఆత్మవిద్యా+ఆత్మక ధర్మము= పూజితమైన ఆత్మవిద్యా స్వరూపమైన ధర్మం; అదియ= అదే; మోక్షదంబు సుమ్ము= మోక్షమునిచ్చేది సుమా!

తాత్పర్యం: కర్మ చిత్తశుద్ధిని కలిగించినప్పటికీ, అవిద్యా స్వరూపమైనదే. దానిని వదలిపెట్టటమే ఆత్మవిద్య అయి ఉన్నది. మోక్షమిచ్చేది కూడా ఆ కర్మత్యాగమే.

ఉ. గుమ్మడిపువ్వుఁ దేనియయుఁ గూపము నైందవరేఖకాంతియున్
జు మ్మరయంగఁ గర్మఫల శోభనసంపద; జున్ను నేఱుఁ బూ
ర్ణమ్మగు చంద్రబింబము ననం దగు నిర్మలవిద్య గాఢపా
కమ్ము ఫలోదయం బది యఖండసుఖాత్మ పదంబు పుత్రకా! 128

ప్రతిపదార్థం: పుత్రకా!= కుమారా!; అరయంగన్= పరిశీలించగా; కర్మఫలశోభనసంపద= కర్మకు ప్రయోజనమైన సుందరమైన సంపత్తి; గుమ్మడి పువ్వుతేనియయున్= గుమ్మడిపువ్వులోని మకరందము; కూపమున్= బావియు; ఐందవరేఖ కాంతియున్+చుమ్ము= చంద్రరేఖాకాంతియు నగునుసుమా!; నిర్మలవిద్య= విమలమైన విద్య; జున్నున్= తేనెతెట్టెయు;ఏఱున్= నదియును; పూర్ణమ్ము+అగు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిండైన; చంద్రబింబము+అనన్+తగున్= చంద్రమండలమని చెప్పదగును; అది= ఆ విద్య; గాఢపాకమ్ము= అధికపాకం కలది; ఫలోదయంబు= ఫలమునకు ఉత్పత్తి స్థానమైనది; అఖండసుఖ+ఆత్మపదంబు= ఎడతెగని సుఖస్వరూపస్థానం.

తాత్పర్యం: కుమారా! కర్మమార్గానికి ఫలంగా లభించే శోభనమైన సంపద గుమ్మడిపువ్వు తేనెను, బావిని, చంద్రరేఖాకాంతిని పోలినది. నిర్మలమైన నైష్కర్మ్యమార్గ మనబడే విద్య తేనెతెట్టెను, నదిని, నిండుచంద్రబింబమును పోలినది. అది అధికపరిపాకం కలిగి ఫలానికి మూలమైనదై ఎడతెగని సుఖస్థానమై ఉన్నది.

విశేషం: గుమ్మడి పువ్వులో తేనె అతి స్వల్పంగా ఉంటుంది. తేనె తెట్టెలోని తేనెతో పోల్చినపుడు దాని ప్రయోజనం అతి స్వల్పం. అట్లాగే బావి సంకుచిత ప్రయోజనాలను మాత్రమే కల్గిస్తుంది. అందులోని నీరు స్వల్పం. నదితో పోల్చినపుడు బావివలన మనకు కలిగే లాభం చాలా కొద్దిపాటిది మాత్రమే. చంద్రుడి ఏకరేఖాకాంతి చాలా కొద్దిగా ఉంటుంది. పున్నమినాటి చంద్రుడి కాంతి ఎంతో పెద్దదై బహుళప్రయోజనాన్ని కల్గిస్తుంది. అట్లాగే స్వల్పఫలప్రదమైన కర్మమార్గంకంటే అత్యధిక ఫలప్రదమైన విద్యామార్గం శ్రేష్ఠమని భావం. అలం: రూపకం.

వ. కర్మంబునం గానిది యై విద్యనయ్యెడునట్టితెఱం గెఱింగించెద. 129

ప్రతిపదార్థం: కర్మంబునన్= కర్మమార్గంచేత; కానిది+ఐ= సాధించరానిదై; విద్యన్= విద్యామార్గంచేత; అయ్యెడునట్టి= సాధించదగినట్టి; తెఱంగు= పద్ధతి; ఎఱింగించెదన్= తెలుపుతాను.

తాత్పర్యం: కర్మచేత సాధ్యంకాక విద్యచేత మాత్రమే సాధించదగిన పద్ధతి ఏదో తెలియపరుస్తాను.

క. విను! రేఖామాత్రపుఁ జం । ద్రుని యట్టుల జీవుఁ డతని దుష్పక్షముఁ బో
లిన యజ్ఞానము నపగమ । మున బోధానందసాంద్రపూర్ణతఁ బొలుచున్.' 130

ప్రతిపదార్థం: విను= వినుము; జీవుఁడు= జీవాత్ముడు; రేఖామాత్రపు= ఒక్కరేఖామాత్రమే కల; చంద్రుని అట్టుల= చంద్రుడివంటివాడు; అతని= ఆ చంద్రుడియొక్క; దుష్పక్షమున్+పోలిన= కృష్ణపక్షంవంటిదైన; అజ్ఞానము నపగమమునన్= అజ్ఞానం తొలగిపోవటంచేత; బోధ+ఆనంద= జ్ఞానంచేత గలిగిన ఆనందంయొక్క; సాంద్ర= దట్టమైన; పూర్ణతన్= నిండుదనముచేత; పొలుచున్= భాసిస్తాడు.

తాత్పర్యం: ఏకరేఖామాత్రుడైన చంద్రుడితో సమానుడు జీవుడు. జీవుడి అజ్ఞానం చంద్రుడి కృష్ణపక్షంతో సమానమైనది. కృష్ణపక్షం గడచిపోతే చంద్రుడు పరిపూర్ణతను సంతరించుకొని భాసిస్తాడు. అట్లాగే అజ్ఞానమనే కర్మమార్గం గడిస్తే జీవుడు విద్యానంద పరిపూర్ణుడై వెలుగొందుతాడు'.

విశేషం: అలం: ఉపమ.

బ్రహ్మచర్యంబు బ్రహ్మవిద్యాప్రాప్తికి ముఖ్యకారణంబని చెప్పుట (సం. 12-234-12)

వ. అని చెప్పిన విని 'విద్య యెట్టివారికి నలవడు? నెఱింగింపవే!' యనిన నందనునితో గంధవతీనందనుం డిట్లనియె. 131

ప్రతిపదార్థం: అని చెప్పినన్ విని= ఈ రీతిగా చెప్పగా విని; విద్య= జ్ఞానహేతువైన విద్య; ఎట్టివారికిన్= ఏ రీతిగా ఉన్నవారికి; అలవడున్= అలవాటగును; ఎఱింగింపవే= తెలుపుమా; అనినన్= అని అడిగిన; నందనునితోన్= కుమారుడితో; గంధవతీనందనుండు= (యోజన) మత్స్యగంధి తనయుడైన వ్యాసుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వ్యాసు డట్లా చెప్పగా విని శుకుడు 'విద్య ఎట్లాంటి వారికి లభిస్తుందో చెప్పు'మని తండ్రిని అడిగాడు. అంతట వ్యాసమునీంద్రు డతనితో ఇట్లా అన్నాడు.

తే. బ్రహ్మచర్యసమేతతపంబు విపుల । కాననమున వానప్రస్థ గణము పొంత
నిలిచి చేయుచుఁ బర్ణశాలలకు నుచిత । కాలమునఁ జని యెత్తి భిక్షలు భుజించి. 132

ప్రతిపదార్థం: విపులకాననమునన్= విశాలమైన అడవిలో; వానప్రస్థగణము పొంతన్= వానప్రస్థాశ్రమంలో ఉన్నవారి చెంత; నిలిచి= ఉండి; బ్రహ్మచర్య సమేత తపంబున్= బ్రహ్మచర్యంతో కూడిన తపస్సును; చేయుచున్= చేస్తూ; ఉచితకాలమునన్= తగినసమయంలో; పర్ణశాలలకున్= పర్ణకుటీరాలకు; చని= పోయి; భిక్షలు ఎత్తి= భిక్షలు గ్రహించి; భుజించి= తిని.

తాత్పర్యం: విశాలమైన అరణ్యంలో వానప్రస్థులైనవారు నివసించే చోట ఉండి, బ్రహ్మచర్యంతో సహా తపోనిష్ఠ అనుష్ఠిస్తూ సరి అయిన సమయంలో అక్కడి పర్ణశాలలకు పోయి భిక్ష పరిగ్రహించి భుజిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. నుతియు నమస్కృతియును లే । క తిరిగి, శుభ మశుభమను వగం బొందక, గో
ష్ఠి తెరువు సొరకుండుట సు । వ్రత, మది యధ్యాత్మవిద్యఁ బ్రచురముఁ జేయున్.' 133

ప్రతిపదార్థం: నుతియున్= పొగడ్తయు; నమస్కృతియున్= నమస్కారం; లేక= కలిగిఉండక; తిరిగి= సంచరించి; శుభము+అశుభము+అను వగన్= మంగళం, అమంగళం అనేచింతను; పొందక= చెందక; గోష్ఠితెరువు= పదిమంది కూడిన చోటికిపోయేమార్గం; చొరకుండుట= ప్రవేశించక ఉండటం; సువ్రతము= మంచివ్రతం; అది= ఆ వ్రతం; అధ్యాత్మవిద్యన్= బ్రహ్మవిద్యను; ప్రచురమున్+చేయున్= ఎక్కువ కావిస్తుంది.

తాత్పర్యం: మానావమానాలకు, శుభాశుభాలకు లొంగక ప్రజల కూటములలో చేరక ఉండటం మంచివ్రతం. ఆ వ్రతం వలన అధ్యాత్మవిద్య అభివృద్ధి పొందుతుంది'.

ఆ. అనుడు నతఁడు 'కర్మ మఖిలంబు నీడఁ బో । విడుచు టొప్పదండ్రు వేదవిదులు;
దాని నాదరింపఁ దగదొకో సంయమి । ప్రవర! సందియంబు వాపవలయు.' 134

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; అతఁడు= ఆ శుకుడు; సంయమిప్రవర!= మునిశ్రేష్ఠా!; వేదవిదులు= వేదం తెలిసినవారు; అఖిలంబు కర్మము= సమస్తమైన కర్మను; ఈడన్+పోన్ విడుచుట= వెనుదీయక విడనాడటం; ఒప్పదు+అండ్రు= తగదని చెప్పుతారు; దానిన్= ఆ కర్మమును; (లేక వారిమాటను); ఆదరింపన్+తగదొకో?= సంభావించటం అనుచితమా?; సందియంబు= ఈ సందేహాన్ని; పాపన్ వలయున్= తొలగించాలి.

తాత్పర్యం: వ్యాసు డట్లా చెప్పగా శుకుడు మళ్ళీ ఇట్లా అన్నాడు: 'మునీంద్రా! వేదజ్ఞులు కర్మను పూర్తిగా వదలరా' దని చెప్పుతున్నారు. ఆ కర్మను (లేదా వారిమాటను) ఆదరించకూడదా! ఈ సందేహం నివారించండి'.

వ. అనినం 'గర్మంబు విడువమియు, విడుచుటయుం గలిగియుండుఁ; దదీయయోగ్యతావిశేషంబు లెఱింగించెద. 135

ప్రతిపదార్థం: అనినన్= అనగా; కర్మంబు= కర్మమును; విడువమియున్= వదలకుండా ఉండటమూ; విడుచుటయున్= వదలటమూ; కలిగిఉండున్= ఉండటం కద్దు; తదీయ= ఆ కర్మత్యాగ - అపరిత్యాగాలయొక్క; యోగ్యతావిశేషంబులు= అర్హతను గూర్చిన విశేషాలు; ఎఱింగించెదన్= తెలుపుతాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: శుకు డట్లా అడిగేసరికి వ్యాసు డిట్లా అన్నాడు: 'కర్మను పరిత్యజించటమూ కద్దు. పరిత్యజించకపోవటమూ కద్దు. ఆ త్యాగాత్యాగాల విశేషాలను వివరిస్తాను.

సీ. **విను' మని ముని యిట్టులను 'బ్రహ్మచారి గృ। హస్థ వానప్రస్థ యతులు విహిత**
కర్మ నిష్ఠత సిద్ధిఁగాంతు; రాశ్రమ చతు। ష్కముఁ జతుష్పట్టికా ఘటితమైన
నిఃశ్రేణి తుదిముట్టు నెలవెక్కుటకు నిట్టి। క్రమవర్తనము సుకరంపుమార్గ;
మాయువు మొదలి నాలవపాలు గురుపాల। దాసునియట్లు సంతతముఁ బనులు

తే. **ప్రీతిఁ జేయుచుఁ గుడిచిన పిదపఁ గుడిచి। శయ్యఁ జెందిన నాతని చరణయుగము**
గరయుగంబున నొత్తుచు గలితనిద్రుఁ। డైన నిద్రించు బ్రహ్మచర్యాన్వితుండు. **136**

ప్రతిపదార్థం: వినుము= ఆకర్ణించుము; అని= అనిచెప్పి; ముని= వ్యాసుడు; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నాడు; బ్రహ్మచారి= బ్రహ్మచర్యాశ్రమంలో ఉండేవాడు; గృహస్థ= గృహస్థుడు; వానప్రస్థ= వానప్రస్థుడు; యతులు= సన్న్యాసి అనేవీరు; విహితకర్మనిష్ఠతన్= శాస్త్రంచేత విధించబడిన కర్మలో నిష్ఠకలిగిఉండటం వలన; సిద్ధిన్= సాధనచేత గమ్యమైన ప్రయోజనమును; కాంతురు= పొందుతారు; ఆశ్రమ చతుష్కమున్= నాలుగాశ్రమాలు; చతుష్పట్టికా ఘటితమైన= నాలుగు మెట్లతో సంఘటించబడిన; నిఃశ్రేణి= నిచ్చెన; తుదిముట్టు నెలవు= గమ్యస్థానమైన మోక్షమును; ఎక్కుటకున్= అధిరోహించటానికి; ఇట్లు= ఇటువంటి; క్రమవర్తనము= క్రమమైన పద్ధతి; సుకరంపుమార్గము= సులభమైన త్రోవ; బ్రహ్మచర్య+అన్వితుండు= బ్రహ్మచర్యంతో కూడిన వటువు; ఆయువు మొదలి నాలవపాలు= జీవితకాలమైన ఆయుస్సులో మొదటిదైన నాల్గవ భాగాన్ని; గురుపాలన్= గురుడి చెంత; దాసునిఅట్లు= సేవకుడివలె; సంతతమున్= ఎల్లప్పుడు; ప్రీతిన్= ప్రీతితో; పనులు= కర్మలు; చేయుచున్= ఆచరిస్తూ; కుడిచిన పిదపన్= (గురువు) భుజించిన పిమ్మట; కుడిచి= భుజించి; శయ్యన్+చెందినన్= (గురువు) శయనిస్తే; ఆతని చరణయుగమున్= ఆ గురువు పాదాలు రెండింటిని; కరయుగంబునన్= తన రెండు చేతులలో; ఒత్తుచున్= పిసుకుతూ; కలితనిద్రుఁడు+ఐనన్= అతడు నిద్రించగా; నిద్రించున్= తాను నిద్రపోతాడు.

తాత్పర్యం: నేను చెప్పేది వినుము' అని వ్యాసు డిట్లా అన్నాడు: 'బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్న్యాసి అనే నాలుగాశ్రమాలకు చెందినవారు శాస్త్రం విధించిన కర్మలు ఆచరించటం ద్వారా సిద్ధి పొందుతారు. నాలుగాశ్రమాల పద్ధతి నాలుగు మెట్లతో నిర్మించిన నిచ్చెన వంటిది. చివరి గమ్యమైన మోక్షపదవి నధిష్ఠించటానికి బ్రహ్మచర్యాది క్రమపద్ధతి సులభమైన త్రోవ. బ్రహ్మచారి తన ఆయువులో మొదటి నాల్గవభాగమైన యిరువదైదు సంవత్సరాల కాలం గురువువద్ద భృత్యుడివలె సదా ప్రియంగా కర్మలు చేస్తూ ఉండాలి. గురువు భుజించిన తర్వాత భుజించాలి. గురువు పడుకొన్న పిమ్మట ఆయన రెండు పాదాలనూ తన రెండు చేతులతో ఒత్తాలి. ఆయన నిద్రించిన తర్వాతనే తాను నిద్రించాలి.

విశేషం: 'శతాయుర్వైపురుషః' అన్న ప్రమాణాన్ని అనుసరించి మానవుల ఆయుఃకాలం నూరు సంవత్సరాలై ఉన్నది. దీనిని నాల్గు భాగాలుగా విభజిస్తే ఒక్కొక్క భాగానికి ఇరువైఅయిదు సంవత్సరాలవుతాయి. క్రమపద్ధతిలో ఆశ్రమాలను స్వీకరించేవాడు ఒక్కొక్క భాగంలో ఒక్కొక్క ఆశ్రమం చొప్పున నాలుగాశ్రమాలను పాటించాలి.

క. **రసగంధప్రముఖంబుల। దెస వేడుక లేక గురుమతికి వచ్చిన య**
ట్టిసమయములఁ దగ వేదా।భ్యసనంబులు సేయుచుండు నాతఁడు నియతిన్. **137**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ బ్రహ్మచారి; నియతిన్= నియమంతో; రసగంధప్రముఖంబుల దెసన్= రసం, గంధం మొదలైన విషయాలపై; వేడుక= ఔత్సుక్యం; లేక= కలిగి ఉండక; గురుమతికిన్= ఆచార్యుడి బుద్ధికి; వచ్చిన= తోచిన; అట్టిసమయములన్= ఆ కాలాలలో; తగన్= తగిన రీతిలో; వేద+అభ్యసనంబులు= శ్రుతిసారమును అభ్యసించటాన్ని; చేయుచుండున్= ఆచరిస్తూ ఉంటాడు.

తాత్పర్యం: బ్రహ్మచారి నియమంపాటిస్తూ రసగంధాదులైన విషయాలపై మక్కువ లేనివాడై ఉంటాడు. గురువు బుద్ధికి తోచిన సమయాలలో ఆయన వద్ద వేదాభ్యాసం చేస్తూ ఉంటాడు.

వ. ఇది బ్రహ్మచారి ప్రకారం; బాతం డాశ్రమాంతరగతుం డయి వర్తించు విధంబు సెప్పెద. 138

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పింది; బ్రహ్మచారి ప్రకారంబు= బ్రహ్మచారి పద్ధతి; ఆతండు= ఆ బ్రహ్మచారి; ఆశ్రమ+ అంతరగతుండు+అయి= మరొక ఆశ్రమమైన గృహస్థాశ్రమంలో ప్రవేశించినవాడై; వర్తించు= మెలగే; విధంబు= ప్రకారాన్ని; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: ఇంతవరకూ చెప్పింది బ్రహ్మచారి పద్ధతి. ఆ బ్రహ్మచారి గార్హస్థ్యం స్వీకరించినప్పుడు మెలగే పద్ధతిని వివరిస్తాను.

సీ. సవినయంబునఁ దన శక్తితో గురునకు । దక్షిణ యిచ్చి, యాతండు వనుపఁ
గా సమావర్తనకార్యంబు నడపి వి । వాహమై హవ్యకవ్యముల నతిథి
తోషణ బాంధవ పోషణంబుల సత్య । భాషల నిజదారపరతఁ బుత్ర
సంశిక్షఁ గ్రతువిశేషంబుల నొక యాయు । రంశంబు గడపి గృహస్థ, ధర్మ

తే. వృత్తిఁ గృతకృత్యుఁ డగు నగ్ని విడువ కడవిఁ । బూరిపంటల ఫలమూలములను భిక్షు
పూజ సలుపుచుఁ, బరిశిష్టములు భుజించి । తపము సేఁత వానప్రస్థ ధర్మసరణి. 139

ప్రతిపదార్థం: సవినయంబునన్= వినయంతో; తనశక్తితోన్= తనకున్న శక్తి కొలది; గురునకున్= ఆచార్యుడికి; దక్షిణ ఇచ్చి= దక్షిణగా ఈదగిన ధనం ఇచ్చి; ఆతండు= ఆ గురువు; పనుపఁగాన్= పంపగా; సమావర్తన కార్యంబున్= బ్రహ్మచర్య సమాప్తికి తగినకార్యం; నడపి= నిర్వహించి; వివాహము+ఐ= పెండ్లిచేసికొని; హవ్యకవ్యములన్= దేవతలకు, పితృదేవతలకు ఈదగిన యన్నములతోను; అతిథితోషణ= అతిథులను సంతోషపరచుటతోను; బాంధవపోషణంబులన్= బంధువులను పోషించటంతోను; సత్యభాషలన్= సత్యమైన మాటలతోనూ; నిజదారపరతన్= తన భార్యయందే ఆసక్తిగలవాడై ఉండటంచేతను; పుత్ర సంశిక్షన్= పుత్రులకు మంచి శిక్షణ చేతను; క్రతు విశేషంబులన్= యాగ విశేషాలతోనూ; ఒక ఆయుః+అంశంబున్= తన ఆయుస్సులో నాలుగింట ఒకభాగాన్ని; కడపి= అతిక్రమించి; గృహస్థధర్మవృత్తిన్= గృహస్థుడి యొక్క ధర్మానికి చెందిన వర్తనంచేత; కృతకృత్యుఁడు= చేయదగిన పనులు చేసినవాడు; అగున్= అవుతాడు; అగ్నిన్ విడువక= అగ్నికార్యమును వదలక; అడవిన్= అరణ్యంలో; పూరిపంటలన్= ధాన్యములచేత; ఫలమూలములను= పండ్లు, దుంపలచేత; భిక్షుపూజన్= యతి పూజను;సలుపుచున్= నిర్వహిస్తూ; పరిశిష్టములు= మిగిలినవి; భుజించి= తిని; తపముచేఁత= తపస్సు చేయటం; వానప్రస్థధర్మసరణి= వానప్రస్థాశ్రమంలో ఉన్నవారి ధర్మముయొక్క మార్గమై ఉన్నది.

తాత్పర్యం: బ్రహ్మచారి వినయంతో తనశక్తి కొలది గురువుకు దక్షిణ ఇచ్చుకోవాలి. ఆయన అనుమతి పొంది అధ్యయనానంతరం గృహస్థధర్మాన్ని స్వీకరించటానికి అవసరమైన కార్యాలు నిర్వహించాలి. తరువాత పెండ్లి చేసికొని దేవతలను, పితృదేవతలనూ క్రమంగా హవ్యకవ్యాలలో సంతృప్తి పరచాలి. అతిథులను సంతోషపెట్టాలి.బంధువులను పోషించాలి. సత్యం పలకాలి. తన భార్యయందే అనురక్తుడై ఉండాలి. పుత్రులకు చక్కని శిక్షణ ఇవ్వాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క్రతువులు చేయాలి. ఇట్లా జీవితకాలంలో ఒక పాతిక భాగం గడపి గృహస్థుడి ధర్మం పాటించి అతడు కృతార్థుడవుతాడు. ఆ పిమ్మట అగ్నికార్యం విడువకుండా నిర్వహిస్తూ ధాన్యాలతో, ఫలమూలాలతో సన్న్యాసులను ఆదరిస్తూ వారు తినగా మిగిలిన అన్నాన్ని భుజిస్తూ తపస్సు చేయటం వానప్రస్థులైనవారి ధర్మమార్గం.

క. **వానప్రస్థ ప్రక్రియ । దా నొకపా లాయువునఁ బదంపడి తుది పా**
లైనను సన్న్యాసాను । ష్ఠానమునకుఁ జొచ్చువాఁడు శాంతాత్మకుఁడై. **140**

ప్రతిపదార్థం: పదంపడి= పిమ్మట; తాను= అతడు; ఒకపాలు+ఆయువునన్= ఒకభాగం ఆయుస్సుచేత; వానప్రస్థప్రక్రియన్= వానప్రస్థ వృత్తితో (గడపి); తుదిపాలైనను= శేషించిన నాల్గవపాలు జీవితకాలాన్నైనా; శాంతాత్మకుఁడు+ఐ= శాంతమైన చిత్తంకలవాడై; సన్న్యాస+అనుష్ఠానమునకున్= యతిధర్మాన్ని అనుష్ఠించటానికి; చొచ్చువాఁడు= ప్రవేశించేవాడు అగును.

తాత్పర్యం: ఈ విధంగా జీవితకాలంలో ఒకపాతిక వంతు వానప్రస్థ ధర్మాచరణతో గడపి, ఆ తరువాత మిగిలిన నాల్గవభాగం కాలంలో సన్న్యాసాశ్రమానుగుణమైన ధర్మానుష్ఠానంలో శాంతచిత్తంతో ప్రవేశించాలి.

వ. **ఇ ట్లాయురంశంబులు నాలుగుం జెల్లుట యుత్తమ ధర్మస్వరూపం; బంశత్రయకాలాచరితంబైన యాశ్రమత్రితయంబు ప్రవర్తనంబులఁ గషాయపక్వంబగుటయుఁ జతుర్థాశ్రమంబుఁ జెందుట కృత్యంబు; దాని తెఱం గెఱింగించెద నవహితుండ వై యాకర్ణింపుము.** **141**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ఆయుః+అంశంబులు= ఆయుర్భాగాలు; నాలుగున్+చెల్లుట= నాలుగును గడచుట; ఉత్తమధర్మస్వరూపంబు= శ్రేష్ఠమైనధర్మముయొక్క పద్ధతి; అంశత్రయ= మూడుభాగాలైన; కాల= సమయంలో; ఆచరితంబు+ఐన= చేయబడిన; ఆశ్రమత్రితయంబు= మూడాశ్రమాలయొక్క; ప్రవర్తనంబులన్= ఆయా ఆశ్రమానికి తగిన నడవడికలతో; కషాయపక్వంబు+అగుటయున్= చిత్తం శుద్ధం కావటంతోనే; చతుర్థ+ఆశ్రమంబున్= యత్యాశ్రమమును; చెందుట= స్వీకరించటం; కృత్యంబు= చేయదగింది; దాని తెఱంగు= నాల్గవ ఆశ్రమపద్ధతిని; ఎఱింగించెదన్= తెలుపుతాను; అవహితుండవు+ఐ= అవధానం కలవాడవై; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఈ విధంగా నాలుగు జీవితకాలభాగాలు గడవట మనేది ఉత్తమమైన ధర్మపద్ధతి. మొదటి మూడు కాలాంశాలలో చక్కని ప్రవర్తనలతో గడపిన బ్రహ్మచర్యం మొదలైన మూడాశ్రమాలు క్రమపక్వత పొందాలి. ఆ పిదప నాల్గవదైన సన్న్యాసాశ్రమం స్వీకరించటం ఉచితం. నాల్గవ ఆశ్రమానికి చెందిన పద్ధతి ఎట్లాంటిదో వివరిస్తాను. సావధానంగా వినుము.

సీ. **ఆత్మయం దగ్ని సమారోపణము సేసి । యజన మాంతరముగ నకృతసంధి**
విగ్రహుం డగుచుఁ బరిగ్రహ విముఖుఁడై । ముండుండు ననికేతనుండు వృక్ష
మూలవాసియును గపాలధారుండు నే । కాకియు నక్రోధకామశోకుఁ
డును గాఁగవలయు; భిక్షునకు నిందా స్తుతుల్ । దనయంద యడఁగంగఁ దాను బరుల

తే. **దిక్కు వలుకక దివియెల్లఁ బిక్కటిలఁగఁ । దాన యున్నట్లు గనుచు నేమేనిఁ గుడిచి**
యెద్దియేనియుఁ గట్టి యెందే శయించు । నతని దేవతల్ బ్రాహ్మణుఁ డంద్రు పుత్ర! **142**

ప్రతిపదార్థం: పుత్ర!= కుమారా!; యజనము= యజ్ఞక్రియ; ఆంతరముగన్= ఆంతరంగికం కాగా; ఆత్మయందున్= ఆత్మలో; అగ్నిసమారోపణము చేసి= అగ్నిని చక్కగా ఆరోపింపజేసి; అకృత సంధి విగ్రహుండు+అగుచున్= ఇతరులతో కలయికగాని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కలహంగాని చేయనివాడుగా ఉంటూ; పరిగ్రహవిముఖుఁడు+ఐ= ఇతరులనుండి ధనాదుల స్వీకారానికి విముఖుడై; ముండుండున్= బోడితలవాడును; అనికేతనుండున్= గృహం లేనివాడు; వృక్షమూలవాసియున్= చెట్టుమొదట నివసించేవాడును; కపాలధారుండున్= పెంకును చేబూనినవాడును; ఏకాకియున్= ఒంటరిగా ఉండేవాడును; అక్రోధకామశోకుఁడును= కోపం, కామం, దుఃఖం లేనివాడును; కాఁగన్+వలయున్= కావలెను; భిక్షునకున్= సన్న్యాసికి; నిందాస్తుతుల్= నిందించటం, పొగడటమూ; తనయంద= తనలోనే; అడఁగంగన్= అణగిపోగా; తాను= ఆ సన్న్యాసి; పరులదిక్కు= ఇతరులవైపు; పలుకక= మాట్లాడక; దివి ఎల్లన్= ఆకాశమంతా; పిక్కటిలఁగన్= క్రిక్కిరిసినట్లుగా; తాన= తానే; ఉన్నట్లు= ఉండినట్లు; కనుచున్= చూస్తూ; ఏమేని= ఏదైనా; కుడిచి= తిని; ఎద్దియేనియున్= ఏదైనా; కట్టి= ధరించి; ఎందేన్= ఎక్కడైనా; శయించునతని= శయనించే సన్న్యాసిని; దేవతల్= సురలు; బ్రాహ్మణుఁడు+అండ్రు= బ్రాహ్మణుడని చెప్తుతారు.

తాత్పర్యం: కుమారా! సన్న్యాసాశ్రమం స్వీకరించినవాడు ఆత్మలోనే అగ్ని సమారోపణం కావించి ఆంతరంగికంగా యజనక్రియ నిర్వహించాలి. ఎవరితోనూ పొత్తుగానీ, కలహంకానీ పెట్టుకొనకూడదు. అతడికి పరిగ్రహం తగదు. ముండిత శిరస్కుడై ఒక యింట నివాసం లేక ఏ చెట్టుమొదట్లోనో నివసించాలి. ఘటకపాలం చేతబట్టి ఏకాకిగా సంచరించాలి. కామానికీ, క్రోధానికీ, శోకానికీ గురి కాకూడదు. నిందాస్తుతులను తనలో అణచివేసి ఇతరులతో ఏ వ్యవహారమూ పెట్టుకొనక భూమ్యాకాశాలంతటా తానే వ్యాపించి ఉన్నానని భావిస్తూ, ప్రాప్తమైనది ఏదైనా తిని, ఏదైనా ధరించి, ఎక్కడైనా శయనించే స్వభావంకల ఆ యతిని దేవతలు 'బ్రాహ్మణుడు' అని వ్యవహరిస్తారు.

క. జన నికరములకుఁ దొలఁగును । ఘన భుజగంబులకుఁ బోలెఁ గనుఁ బీనుఁగుఁ గా
వనితం దనుఁ బాటించిన । ననఘా! నరకముగఁ దలఁచు నతఁడు మనమునన్. 143

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; అతఁడు= ఆ సన్న్యాసి; జన నికరములకున్= ప్రజాసమూహాలకు; ఘనభుజంగంబులకున్+పోలెన్= పెద్దపాములకు వలె; తొలఁగును= తొలగిపోతాడు; వనితన్= స్త్రీని; పీనుఁగున్+కాన్= శవంగా; కనున్=భావిస్తాడు; తను= తనను; పాటించినన్= చేరితే; మనమున్= చిత్తంలో; నరకముగన్= నరకంగా; తలఁచున్= భావిస్తాడు.

తాత్పర్యం: పాపరహితుడా! ఆ యతి పాములు తొలగినట్లు ప్రజల గుంపులను చూస్తే దూరంగా తొలగిపోతాడు. స్త్రీని శవంగా భావిస్తాడు. ఆ స్త్రీ తనను పాటిస్తే అది నరకంగా చిత్తంలో భావిస్తాడు.

తే. అతనివలన భూతములకు నభయ మగుట । భూతముల దెస నభయంబ యాతనికిని
బుత్ర! యీగు లెల్లవియును భూతములకు । నభయ మిచ్చుటఁ బోలవం డ్రార్యజనులు. 144

ప్రతిపదార్థం: పుత్ర!= కుమారా!; అతనివలనన్= ఆ యతివలన; భూతములకున్= ప్రాణులకు; అభయము+అగుటన్= భయం లేదు కాబట్టి; ఆతనికిని= ఆ యతికి కూడ; భూతములదెసన్= ప్రాణులవలన; అభయంబు+అ= భయమన్నది లేదు; ఆర్యజనులు= పెద్దలు; ఈగు లెల్లవియును= సమస్తదానాలు; భూతములకున్= ప్రాణులకు; అభయము+ఇచ్చుటన్= నిర్భయత్వం ఒసంగుటను; పోలవు+అండ్రు= సరిపోల వని చెప్తుతారు.

తాత్పర్యం: కుమారా! సన్న్యాసివలన ప్రాణులకు భయం లేదు కాబట్టి ప్రాణులవలన అతడికి కూడా భయంలేదు. ఆర్యులైనవారు అన్నిదానాలు ప్రాణుల కిచ్చే అభయ ప్రదానానికి సరిపోల వని చెప్తుతారు.

ఆ. జంతుపదము లెల్ల దంతిపదంబులో । నడఁగు క్రియ నహింసయందు సకల
ధర్మములు నడంగుఁ గర్మ సంత్యాగికి । నైన భూతదయ సమర్థగుణము. 145

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: జంతుపదములు+ఎల్లన్= జంతువుల అడుగులన్నీ; దంతిపదంబులోన్= ఏనుగు అడుగులో; అడఁగుక్రియన్= అణగునట్లు; అహింస+అందున్= 'అహింస' అనే ధర్మమందు; సకలధర్మములు= సమస్త ధర్మాలు; అడంగున్= అణగిపోతాయి; కర్మసంత్యాగికిన్+ఐనన్= కర్మములు పరిత్యజించినవాడికి సైతం; భూతదయ= ప్రాణులపట్ల చూపే కరుణ; సమర్థ్యగుణము= ఉచితమైన గుణం.

తాత్పర్యం: లోకంలోని జంతువుల అడుగులన్నీ ఏనుగు అడుగులో లీనమైపోతాయి. అట్లే సమస్త ధర్మాలు 'అహింస' అనే ధర్మంలో లీనమైపోతాయి. కాబట్టి కర్మపరిత్యాగం చేసిన వానికి కూడా భూతదయ చాలా ఉచితమైన గుణంగా భాసిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

వ. కావున. 146

తాత్పర్యం: అందువలన.

క. జగముల కెల్ల శరణ్యుం। డగుచు నమృతసిక్తమైన యట్టి మనసుతో
విగతాఖిలలేపస్థితి। గగనము నట్లుండు నతఁడు గణనాధికుఁడై.' 147

ప్రతిపదార్థం: అతఁడు= ఆ యతి; జగములకున్+ఎల్లన్= లోకాలకన్నిటికీ; శరణ్యుండు+అగుచున్= శరణొందదగినవాడు అవుతూ; అమృతసిక్తము+ఐన అట్టి= అమృతంతో తడుపబడినదైనట్టి; మనసుతోన్= చిత్తంతో; గణనాధికుఁడు+ఐ= ఇట్టివాడని ఊహించుటకు వీలుగానివాడై; విగత+అఖిల లేపస్థితిన్= తొలగిన సమస్త సంగముయొక్క స్థితిచేత; గగనముఅట్లు= ఆకాశంవలె; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: ఆ సన్న్యాసి లోకాల కన్నిటికీ శరణ్యమై ఉంటాడు. అతడి చిత్తం అమృతంతో తడిపినట్లు చల్లగా, శ్రేయోదాయకంగా ఉంటుంది. అతడు దేనినీ అంటక 'ఇట్టివాడు' అని ఊహించరానివాడై ఆకాశంవలె ఉంటాడు'.

విశేషం: అలం: ఉపమ.

వ. అని చెప్పి యప్పరాశరనందనుండు వెండియు నిట్లనియె. 148

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; ఆ+పరాశర నందనుండు= ఆ వ్యాసుడు; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి వ్యాసుడు మళ్ళీ ఈ విధంగా అన్నాడు:

వ్యాసుఁడు శుకున కుపదేశించిన యంతర్యాగ ప్రకారము (సం. 12-237-27, 28)

తే. హృదయవేదికయందు సమిద్ధమూర్తి। వెలుఁగుచుండు తేజమునందు వేల్చుఁ బ్రాణ
ములను యాజి య ట్లంతరమున నొనర్చు। యాగమున వీతకల్మషుఁడై వెలుంగు. 149

ప్రతిపదార్థం: యాజి= యాగం చేసేవాడు; హృదయవేదిక+అందున్= హృదయ మనే యజ్ఞవేదిమీద; సమిద్ధమూర్తిన్= ఉజ్జ్వలమైన ఆకారంతో; వెలుఁగుచుండు= ప్రకాశించే; తేజమునందున్= తేజస్సులో; ప్రాణములను= అసువులను; వేల్చున్= హోమించును; అట్లు= ఆ రీతిగా; అంతరమునన్= ఆంతరంగికంగా; ఒనర్చు= చేసే; యాగమునన్= యాగంచేత; వీతకల్మషుఁడు+ఐ= తొలగిన పాపం కలవాడై; వెలుంగున్= భాసిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అంతర్యాగం చేసే వాడు తన హృదయమనే యజ్ఞవేదికపై ధగధగ ప్రకాశించే తేజస్సులో ప్రాణాలను వేలుస్తాడు. అట్లా ఆంతరంగా చేసే యాగంవలన అతడు విగతపాపుడై భాసిస్తాడు.

క. విను! మాత్మతీర్థ సంసే । వనము తెఱంగెఱుఁగునట్టి వానికిఁ దిరుగం
జనవలయునె పెఱచోటుల । కని చెప్పుదు రాశ్రితులకు నధ్యాత్మవిదుల్. 150

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ఆత్మతీర్థ= 'ఆత్మ' అనే తీర్థముయొక్క; సంసేవనము తెఱంగు= సేవించే తీరును; ఎఱుఁగునట్టివానికిన్= తెలిసినవాడికి; పెఱచోటులకున్= ఇతర ప్రదేశాలకు; తిరుగన్+చనన్ వలయునె అని= తిరుగటానికి పోవలెనా? అని; అధ్యాత్మవిదుల్= ఆధ్యాత్మికతత్త్వ మెరిగినవారు; ఆశ్రితులకున్= తమనాశ్రయించినవారికి; చెప్పుదురు= చెప్పుతారు.

తాత్పర్యం: ఆధ్యాత్మిక తత్త్వవేత్తలైన పెద్దలు తమను ఆశ్రయించినవారితో - 'ఆత్మ' అనే తీర్థాన్ని ఎట్లా సేవించాలో తెలిసినవారికి ఇతర ప్రదేశాలలో తీర్థాటనం చేయవలసిన పనిలేదని చెప్పుతారు.

తే. అవనిఁ బొందదు దివమున నప్రమేయ । మండజంబు హిరణ్మయ మండమధ్య
మున వెలుంగు నుజ్జ్వలపక్ష ఘనత; దాని । నెఱుఁగు సంతత యోగసమేతుఁ డనఘ! 151

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; హిరణ్మయము= స్వర్ణరూపమైన; అండజంబు= పక్షి; అవనిన్= భూమిని; పొందదు= చేరదు; దివమునన్= ఆకాశమందు; అప్రమేయము= గోచరింపచేసికొనటానికి వీలుకాదు; అండమధ్యమునన్= గ్రుడ్డుయొక్క మధ్యభాగంలో; ఉజ్జ్వలపక్ష ఘనతన్= మిక్కిలిగా ప్రకాశించే రెక్కల గొప్పతనంతో; వెలుంగున్= ప్రకాశిస్తుంది; దానిన్= ఆ పక్షిని; సంతతయోగ సమేతుఁడు= సదా యోగంతో కూడినవాడు; ఎఱుఁగున్= తెలిసికొంటాడు.

తాత్పర్యం: కల్మషరహితుడ వైన ఓ శుక్రుడా! ఆత్మ అనే ఒక చిన్మయమైన పక్షి ఉన్నది. అది భూమిని స్పృశించదు. ఆకాశంలో ఏ ప్రమాణానికీ గోచరం కాదు. అది పిండమనే గ్రుడ్డు మధ్యలో ఉజ్జ్వలమైన కాలమనే రెక్కలతో ప్రకాశిస్తూ ఉంటుంది. యోగశక్తి కలవాడు మాత్రమే దానిని గ్రహించగలడు.

విశేషం: ప్రత్యగాత్మ ప్రమాణగోచరం కాదు. అది చిన్మయమైనది. అది మాయామయమైన హృదయాకాశంలో ఎగురుతూ ఉంటుంది. మోదప్రమోదాలనే వృత్తివిశేషాలను కూడా దాని రెక్కలుగా చెప్పవచ్చు. "అథ య దిద మస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకం వేశ్మదహరోऽస్మిన్నంతరాకాశ స్తస్మిన్యదంతస్త దన్వేష్టవ్యమ్" అన్న శ్రుతిని ఇక్కడ అనుసంధించుకొనాలి.

క. విను మాఱంచులుఁ బండ్రెం । డనుపమధారలును నై నిజాస్యము విశ్వం
బును బొదువఁ దిరుగు కాలం । బను చక్రము దురవబోధ మది యడఁగు గుహన్. 152

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; కాలంబు+అను= కాలమనే; చక్రము= ఆయుధవిశేషం, (బండికల్లు); ఆఱు+అంచులు= ఋతువులనే ఆరు అంచులును; పండ్రెండు= పదియు రెండు సంఖ్యగల; అనుపమ ధారలునునై= సాటిలేని తీక్ష్ణమైన అంచులను గలిగినదై; నిజాస్యము= తన ముఖం; విశ్వంబును= ప్రపంచమును; పొదువన్= వ్యాపించగా; తిరుగున్= పరిభ్రమించును; దురవబోధము= గ్రహించుటకు శక్యంకానిదగు; అది= ఆ చక్రం; గుహన్= హృదయమనే గుహలో; అడఁగున్= అణగిపోతుంది.

తాత్పర్యం: కాలమనే చక్రానికి వసంతం మొదలైన ఆరు ఋతువులు అంచులుగా ఉన్నాయి. చైత్రం మొదలైన పన్నెండు మాసాలు తీక్ష్ణమైన ధారలుగా ఉన్నాయి. దాని ముఖం విశ్వమంతా వ్యాపించి ఉన్నది. గ్రహించశక్యం కాని ఆ కాలచక్రం బుద్ధిగుహలో అణగి ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలంకారం: రూపకం.

ఆ. మనసు నింద్రియములఁ బనిగొని పురుషుండు । ప్రచురశిక్షలేని రథ్యసమితి
నడపు రథికు మాడ్కి నడవడి నవి యీడ్చి । నట్టులైన నశుభ మావహిల్లు. 153

ప్రతిపదార్థం: పురుషుండు= జీవుడు; మనసున్= చిత్తమును; ఇంద్రియములన్= శ్రోత్రం మొదలైన ఇంద్రియాలను; పనిగొని= నియోగించి; ప్రచురశిక్ష= దృఢమైన శిక్షణ; లేని= అలవడని; రథ్యసమితిన్= గుర్రాల సముదాయమును; నడపు= నడపింపచేసే; రథికు మాడ్కిన్= రథస్థుడివలె; నడవడిన్= ప్రవర్తనతో; అవి= ఆ ఇంద్రియాలు; ఈడ్చినట్టులు+ఐనన్= లాగినట్లు జరిగితే; అశుభము= అమంగళం; ఆవహిల్లున్= సంభవిస్తుంది.

తాత్పర్యం: రథమును లాగే గుర్రాలకు చక్కని శిక్షణ ఉండాలి. అట్లా లేని పక్షంలో అవి స్వేచ్ఛగా రథాన్ని లాగితే ప్రమాదం కలుగుతుంది. అట్లే జీవుడు మనస్సును, ఇంద్రియాలను నియోగించేటప్పుడు నిగ్రహించకుండా వాటి మార్గంలో వాటిని పోనిస్తే అశుభానికి గురి అవుతాడు.

విశేషం: "యస్త్వవిజ్ఞానవాన్ భవత్యయుక్తేన మనసా సదా । తస్యేంద్రియాణ్యవశ్యాని దుష్టాశ్వాఇవ సారథేః ॥" అను కఠశ్రుతిని ఇక్కడ అనుసంధించుకొనాలి. నిగ్రహంలేని చిత్తం కలవాడైన అవివేకి యొక్క ఇంద్రియాలు సారథియొక్క దుష్టాశ్వాలవలె వశం తప్పి ప్రవర్తిస్తాయి అని పై శ్రుతి తాత్పర్యం. అలంకారం: ఉపమ.

క. తనకు మహిత ప్రసాదం । బొనరక యున్నేనిఁ గీళ్లు లొలయు; నది దృఢ
త్వనిరూఢమైనఁ జేకుఱు । ననంత పదసిద్ధి; దాని కనువెఱిఁగింతున్. 154

ప్రతిపదార్థం: మహితప్రసాదంబు= శ్రేష్ఠమైన ఆత్మనిగ్రహం; తనకున్= సాధకుడికి; ఒనరక ఉన్నేనిన్= కలుగక ఉన్నచో; కీళ్లులు= కష్టాలు; ఒలయున్= సంభవిస్తాయి; అది= ఆత్మనిగ్రహం; దృఢత్వనిరూఢము+ఐనన్= దృఢపడితే; అనంతపదసిద్ధి= అంతంలేని ఉన్నత పదప్రాప్తి; చేకుఱున్= కలుగుతుంది; దానికిన్= ఆ పద ప్రాప్తికి; అనువు= ఉపాయం; ఎఱిఁగింతున్= తెలియజేస్తాను.

తాత్పర్యం: మోక్షప్రాప్తికై సాధన చేసే సాధకుడికి ఆత్మనిగ్రహం చాలా ముఖ్యం. అది సిద్ధించక పోతే కష్టాలు సంభవిస్తాయి. ఆత్మనిగ్రహం దృఢంగా సిద్ధిస్తే అంతంలేని మోక్షపదవి లభిస్తుంది. ఆ పదవిని సాధించే ఉపాయం చెప్పుతాను వినుము.

తే. సర్వసంకల్పరహితుఁడై సత్త్వమున వి । నిశ్చలంబుగఁ జిత్తంబు నిలుపవలయు
సత్త్వసక్త చిత్తంబు ప్రసాద మొసఁగు । దానఁ గాలంబు నడపు టుత్తమవిధంబు. 155

ప్రతిపదార్థం: సర్వసంకల్పరహితుఁడు+ఐ= సమస్తములైన సంకల్పాలు లేనివాడై; చిత్తంబున్= మనస్సును; సత్త్వమునన్= సత్త్వగుణంలో; వినిశ్చలంబుగన్= చలనం లేనట్లుగా; నిలుపన్ వలయున్= నిలపాలి; సత్త్వసక్త చిత్తంబు= సత్త్వగుణంలో ఆసక్తమైన మనస్సు ప్రసాదము= ఆత్మనిగ్రహమును; ఒసంగున్= ఇస్తుంది; దానన్= ఆ నిగ్రహంతో; కాలంబు నడపుట= కాలం గడపటం; ఉత్తమ విధంబు= మేలైన పద్ధతి.

తాత్పర్యం: ఆత్మప్రాప్తిని కోరేవాడు అన్ని సంకల్పాలూ వదలి మనస్సును సత్త్వగుణంతో సంసక్తం చేయాలి. సత్త్వగుణంలో నిలబడ్డ మనస్సు ఆత్మనిగ్రహాన్ని సమకూరుస్తుంది. అట్లాంటి నిగ్రహంతో కాలయాపన చేయటం మేలైన విధానం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వినుము నివాతస్థానం । బునఁ గం పనరహిత దీపము వెలింగెడు చా
డ్పున నంతరాత్మ వెలుఁగుచు । నునికి ప్రసాదంబు భంగి యుత్తమధిషణా! ॥ 156

ప్రతిపదార్థం: ఉత్తమధిషణా= ఉత్తమమైన బుద్ధిగలవాడా!; వినుము= ఆలకించుము; నివాతస్థానంబునన్= గాలిలేనిచోట; కంపనరహిత దీపము= కదలికలేని దివ్వె; వెలింగెడు చాడ్పునన్= ప్రకాశించే విధంగా; అంతరాత్మ= లోపలి ఆత్మ; వెలుంగుచున్+ఉనికి= ప్రకాశిస్తూ ఉండటం; ప్రసాదంబు భంగి= ప్రసాదం యొక్క పద్ధతి.

తాత్పర్యం: శ్రేష్ఠమైన బుద్ధి కలవాడా! వినుము. గాలి లేని చోట పెట్టిన దీపం కదలకుండా ప్రకాశిస్తుంది. ఆ రీతిగా ప్రసాదమంటే అంతరాత్మ చాంచల్యం లేకుండా నిగ్రహించబడి భాసించటమే.

విశేషం: అలం: ఉపమ.

క. విను తత్ప్రసాదవంతుఁడు । దనయందు నిరంజనముగఁ ద న్ననిశంబుం
గనుఁగొనుచు నియతి నియతా । శనుఁడై యుండుట యొనర్చు శాశ్వతపదమున్. 157

ప్రతిపదార్థం: విను= వినుము; తద్+ప్రసాదవంతుడు= ఆ ప్రసాదం కలవాడు; తన+అందున్= తనలో; నిరంజనముగన్= మాలిన్యరహితంగా; తన్నున్= తనను; అనిశంబున్= ఎల్లవేళలా; కనుఁగొనుచున్= చూస్తూ; నియతిన్= నియమంతో; నియత+అశనుఁడు+ఐ= నియమించబడిన మితాహారం గలవాడై; ఉండుట= ప్రవర్తించటం; శాశ్వత పదమున్= శాశ్వతమైన స్థానాన్ని; ఒనర్చున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: ఆ రీతిగా అచంచలమైన అంతరాత్మ కలవాడు తనలో తనను సదా మాయామాలిన్యం లేనివాడినిగా చూస్తాడు. నియమంకలిగి ఉంటాడు. హితమితాహారంతో జీవిస్తాడు. అట్లా ఉంటే శాశ్వత పదమైన మోక్షం లభిస్తుంది.

తే. అతులవేదాంతశాస్త్ర మహాంబురాశిఁ । ద్రచ్చి పుచ్చిన నవనీత మిచ్చితిని స
మాదరంబునఁ గైకొను మనుసరించు । నిర్మలాత్మ తపస్వికి నీవు నొసఁగు. 158

ప్రతిపదార్థం: అతుల= సాటిలేని; వేదాంతశాస్త్ర= వేదాంతశాస్త్రమనే; మహా+అంబురాశిన్= గొప్ప సాగరాన్ని; త్రచ్చి= తరచి; పుచ్చిన= గ్రహించిన; నవనీతము= వెన్న; ఇచ్చితిని= ఇచ్చాను; సమాదరంబునన్= ప్రీతితో; కైకొనుము= స్వీకరించుము; అనుసరించు= (ఈ వేదాంతమార్గాన్ని) అనుసరించి ప్రవర్తించుము; నీవున్= నీవు కూడ; నిర్మల+ఆత్మ తపస్వికిన్= నిర్మలహృదయుడైన తపోనిష్ఠుడికి; ఒసఁగు= ఇమ్ము.

తాత్పర్యం: శుకా! సాటిలేని వేదాంతశాస్త్రమనే మహాసముద్రాన్ని మథించి పుచ్చుకొన్న సారమైన నవనీతాన్ని నీ కిప్పుడు నేను ఇచ్చాను. నీవు దీనిని ప్రీతితో స్వీకరించుము. దీన్ని అనుసరించి నడచుకొమ్ము. నిర్మలచిత్తుడైన తపోనిధికి నీవు దీన్ని ప్రసాదించుము.

విశేషం: అలంకారం: రూపకం.

ఆ. సకల రత్నపూర్ణ సర్వవసుంధరా । చక్రదాన విధియు సరి యనంగ
రాదు విశ్వవేదరాశి సారాధ్యాత్మ । విద్య యిచ్చుటకు వివేకధుర్య!' 159

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వివేకధుర్య!= వివేకమనే భారం వహించే వాడా!; విశ్వ= సమస్తమైన; వేదరాశి= వేదసముచ్చయం యొక్క; సార= సారమైన; అధ్యాత్మవిద్య= బ్రహ్మవిద్యను; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; సకల= సమస్తమైన; రత్నపూర్ణ= రత్నాలతో నిండిన; సర్వ= సకలమైన; వసుంధరా చక్రదాన విధియున్= భూమిని దానం చేసే విధానం కూడా; సరి= సాటి; అనంగన్‌రాదు= అని చెప్పటానికి వీలుగాదు.

తాత్పర్యం: వివేకశాలీ! అన్ని వేదాల సారమైనది అధ్యాత్మవిద్య. దానిని దానం చేయటంతో సమస్తరత్న పూర్ణమైన భూమిని దానం చేసే విధికూడా సాటిరాజాలదు. బ్రహ్మవిద్య శ్రేష్ఠాతిశ్రేష్ఠమైన దని తాత్పర్యం'.

విశేషం: గీతలో భగవంతుడు 'అధ్యాత్మ విద్యా విద్యానాం' 'విద్యలలో నేను ఆధ్యాత్మవిద్యను' - అని చెప్పి అధ్యాత్మ విద్యా ప్రాశస్త్యాన్ని ప్రకటించాడు. ఇతర వస్తువుల వలన కలిగే సౌఖ్యం అల్పం. ఆత్మవిద్య అనల్పమైన ఆత్మసుఖాన్ని ప్రసాదిస్తుంది. కాబట్టి అధ్యాత్మవిద్యా ప్రదానం అన్ని దానాలకంటె మేలైనదని గ్రహించాలి.

వ. అని యుపదేశించి 'యింక నేమి వినవల?' తనిన శుకుండు 'దీనికంటె వినవలయునది గలదె? దీనిన సుదృఢంబుగా ననుగ్రహింపవే!' యనుటయు ననుకంపావిధేయుం డగు సాత్యవతేయుం డతని కిట్లనియె. 160

ప్రతిపదార్థం: అని ఉపదేశించి= ఈ విధంగా ఉపదేశం కావించి; ఇంకను= దీనికంటె అధికంగా; ఏమి వినన్ వలతు(వు)?= ఏమి వినవలెనని కోరుతున్నావు?; అనినన్= అని ప్రశ్నించే సరికి; శుకుండు= శుకయోగి; దీనికంటెన్= ఇంతకంటెను; వినవలయునది= వినదగింది; కలదె?= ఉన్నదా?; దీనిన్+అ= దీనినే; సుదృఢంబుగాన్= గట్టిగా నాకు బోధపడేటట్లు; అనుగ్రహింపవే= అనుగ్రహించుము; అనుటయున్= అనగా; అనుకంపా విధేయుండు+అగు= దయకు విధేయుడైన; సాత్యవతేయుండు= వ్యాసుడు; అతనికిన్= శుకుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: వ్యాసు డారీతిగా ఉపదేశించి 'ఇంకా ఏమి వినగోరుతున్నావు?' అని ప్రశ్నించాడు. శుకుడు 'దీనికంటె వినవలసిం దేముంది? ఈ విషయమే ఇంకా నా మనసులో దృఢంగా నాటుకొనేటట్లు బోధించుము' అని అడిగాడు. అప్పుడు దయావిధేయుడైన వ్యాసమహర్షి ఆ శుకుడిని చూచి ఇట్లా అన్నాడు.

క. భూతంబులఁ బచరించుచు । భూతాత్ముఁడు వానిఁ దన విభూతి నడంచున్.
భూతాహరణంబు నిజ । ద్యోతనము దదీయవృత్తి దుర్దశ పుత్రా! 161

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; భూత+ఆత్ముఁడు= భూతస్వరూపుడైన పరమాత్ముడు; భూతంబులన్= పంచభూతాలను; పచరించుచున్= ప్రవర్తింపజేస్తూ; వానిన్= ఆ భూతములను; తన విభూతిన్= తన విభూతిలో; అడంచున్= లీనంగావిస్తాడు; భూత+ఆహరణంబు= భూతాలను హరించటం; నిజద్యోతనము= తనను ప్రకాశింపజేయటం; తదీయవృత్తి= ఆ పరమాత్మయొక్క భూతాహరణమనే వర్తనం; దుర్దశ= (భూతాలకు) దుఃస్థితిగా ఉన్నది.

తాత్పర్యం: కుమారా! పరమాత్ముడు పంచభూతాలను, (ఆ భూతజన్యమైన చరాచరప్రాణికోట్లను) సృష్టికాలంలో ప్రవర్తింపజేస్తాడు. ప్రళయకాలంలో మళ్ళీ వాటిని తనలో విలీనం చేసికొంటాడు. ఈ రీతిగా సృష్టి స్థితి సంహారాత్మకమైన చర్య పరమాత్మవృత్తిగా జరిగిపోతున్నది. అతడి భూతాహరణ మనే చర్య భూతాలకు దుర్దశ.

క. అవయవము లెట్లు కూర్మము । నివిడించును లోని కడఁచు నెఱి నట్టుల భూ
తవితతి భూతాత్ముండును । బ్రవర్తన నివర్తనముల పాల్పడఁజేయున్. 162

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కూర్మము= తాబేలు; ఎట్లు= ఏ రీతిగా; అవయవములు= అంగాలు; నివిడించును= వెలుపలికి దోపజేయునో; నెఱిన్= క్రమంగా; లోనికిన్= లోపలికి; అడఁచున్= ఉపసంహరించుకొనునో; అట్టులన్= అదే రీతిగా; భూత+ఆత్ముండును= భూతస్వరూపుడైన పరమాత్మకూడ; భూతవితతిన్= భూతసంతతిని; ప్రవర్తన నివర్తనముల= సృష్టి సంహారములయొక్క; పాల్పడన్= వశమమయ్యేటట్లుగా; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: తాబేలు తన అవయవాలనెట్లా వెలికి చూపి మరల లోనికి ముడచుకొంటుందో అట్లాగే సకల భూతస్వరూపుడైన పరమాత్ముడు భూతాలను సృష్టించి మళ్ళీ తనలోనికి ఉపసంహరించుకొంటూ ఉంటాడు.

విశేషం: అలం: ఉపమ.

క. మాయాశబలుం డై యటు । సేయకపోరామి భూతసృష్టి యొనర్చున్
మాయఁ బెడఁబాప భూత ని । కాయాభావ మగు నదియ కవిజనముఖ్యా! 163

ప్రతిపదార్థం: కవిజనముఖ్యా!= యోగిజనులలో శ్రేష్ఠుడైనవాడా; మాయాశబలుండు+ఐ= (పరమాత్ముడు) మాయతో కూడినవాడై; అటు= ఆ రీతిగా; చేయకపోరామిన్= చేయకుండా ఉండటానికి వీలు లేకపోవటం వలన; భూతసృష్టి= భూతాలను ప్రవర్తింపజేయటాన్ని; ఒనర్చున్= చేస్తాడు; మాయన్= అవ్యక్తమైన ఆ మాయాశక్తిని; పెడఁబాపన్= వదలించగా; అదియ= అదే; భూతనికాయాభావము+అగున్= భూతసమూహాలయొక్క లేమి అవుతుంది.

తాత్పర్యం: యోగిజన శ్రేష్ఠుడవగు ఓ శుకుడా! పరమాత్ముడు మాయతో కూడినప్పుడే సృష్టి ప్రారంభమవుతుంది. అతడు మాయాయుక్తుడైన వేళలో భూతాలను సృష్టించకుండా ఉండలేడు కాబట్టి భూతసృష్టి జరుగుతున్నది. మళ్ళీ మాయను వదలగానే, ఆ స్థితి భూతాల అభావాన్ని సూచిస్తుంది. అంటే పరమాత్మ మాయావియోగం చెందినప్పుడు సృష్టి లేకుండా పోతుంది. భూతాల ఉనికి నశిస్తుంది.

తే. గగన పవనతేజో జలక్ష్మాగుణములు । సూవె శబ్దాదికంబును శ్రోత్రముఖ్య
కంబునై చెల్లు విషయచయంబు నింద్రి । యవ్రజంబును సర్వంబు నడఁచు శమము. 164

ప్రతిపదార్థం: గగనపవన తేజోజలక్ష్మాగుణములు= ఆకాశం, వాయువు, తేజస్సు, జలం, భూమి వీని గుణాలు; శబ్ద+ఆదికంబును= శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే ఐదు విషయాలును; శ్రోత్రముఖ్యకంబును= శ్రోత్రం, త్వక్కు, చక్షువు, జిహ్వా, ఘ్రాణం అనే ఐదు జ్ఞానేంద్రియాలును; ఐ చెల్లుచూవె!= అయిప్రవర్తిస్తుంది కదా!; శమము= మనోనిగ్రహం; విషయచయంబున్= శబ్దాదివిషయసంచయమును; ఇంద్రియవ్రజంబును= శ్రోత్రంమొదలైన ఇంద్రియ సమూహాన్ని; సర్వంబున్= సమస్తమును; అడఁచున్= శమింపజేస్తుంది.

తాత్పర్యం: శ్రోత్రం, శబ్దం ఆకాశముయొక్క గుణాలు. త్వక్కు, స్పర్శం, వాయువు యొక్క గుణాలు. జిహ్వా, రసం జలముయొక్క గుణాలు. ఘ్రాణం, గంధం పృథివీ భూతము యొక్క గుణాలు. ఈ రీతిగా పంచభూతాలనుండి పంచజ్ఞానేంద్రియాలు, పంచ విషయాలు జనించాయి. మనస్సును నిగ్రహించిన యోగి పూర్ణంగా ఇంద్రియాలను, విషయాలను నియమించగలుగుతాడు. కాబట్టి మనోనిగ్రహం ప్రధానమని భావం.

క. విను మై దింద్రియములకును । మనంబు షష్ఠంబు; సప్తమత్వము బుద్ధిం
బనుగొను; భవ్యక్షేత్ర । జ్ఞునియం దష్టమత గల్గు సుగుణాభరణా! 165

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సుగుణ+ఆభరణా!= సద్గుణాలనే ఆభరణాలుగా కలవాడా!; వినుము= ఆలకించుము; ఐదు+ఇంద్రియములకును= శ్రోత్రము మొదలైన పంచజ్ఞానేంద్రియాలకు; మనంబు= మనస్సు; షష్ఠంబు= ఆరవది; సప్తమత్వము= ఏడవదన్నభావం; బుద్ధిన్= బుద్ధియందు; పనుగొనున్= కలుగుతుంది; భవ్యక్షేత్రజ్ఞుని అందున్= శ్రేష్ఠుడైన జీవుడియందు; అష్టమత= ఎనిమిదవదన్న భావం; కల్గున్= సంభవిస్తుంది.

తాత్పర్యం: సుగుణాలంకారుడవగు ఓ శుకా! శ్రోత్రం మొదలైన ఐదుజ్ఞానేంద్రియాలు కలవు కదా! మనస్సు ఆరవది. బుద్ధి ఏడవదవుతుంది. క్షేత్రజ్ఞుడు అనే జీవుడు ఎనిమిదవవాడుగా పరిగణింపబడుతున్నాడు.

విశేషం: క్షేత్రమనగా శరీరము. క్షేత్రమును తెలిసినవాడు ఎవడో, వాడు క్షేత్రజ్ఞుడు. "ఇదం శరీరం కౌన్తేయ ! క్షేత్రమి త్యభిధీయతే, ఏత ద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః; అని క్షేత్రజ్ఞ లక్షణము భగవద్గీతలో వివరించబడింది.

తే. **తలఁచు మనమందు నిశ్చయదశ యొనర్చు । బుద్ధి సర్వైక సాక్షిత్వమున వెలుంగు**
నంతరాత్ముండు క్షేత్రజ్ఞుఁ డనఁగ వాని । మెఱపు సత్త్వాదిగుణములై మెఱయు వత్స! **166**

ప్రతిపదార్థం: వత్స!= కుమారా!; తలఁచు= సంకల్ప వికల్పములు గావించునట్టి; మనమందున్= మనస్సునందు; బుద్ధి= అంతఃకరణ చతుష్టయంలో రెండవదైన బుద్ధి; నిశ్చయదశ యొనర్చున్= నిశ్చయావస్థను నిర్వహిస్తుంది; అంతరాత్ముండు= అంతరాత్మయగు; క్షేత్రజ్ఞుఁడు= జీవుడు; సర్వైకసాక్షిత్వమునన్= అంతటికీ ముఖ్యమైన సాక్షీభావంతో; వెలుంగున్= ప్రకాశించును; వాని మెఱపు= వాడి ప్రకాశం; సత్త్వాదిగుణములు+ఐ= సత్త్వం మొదలైన గుణాలుగానై; మెఱయున్= ప్రకాశిస్తుంది.

తాత్పర్యం: కుమారా! మనస్సు సంకల్ప వికల్పాలుచేస్తూ ఉంటుంది. ఆ దశలో నిశ్చయం చేసేది బుద్ధి. అంతరాత్ముడైన వాడు క్షేత్రజ్ఞుడనబడి అంతటికీ ఏకైక సాక్షిగా ప్రకాశిస్తూ ఉంటాడు. సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణాలు రూపంతో ప్రకాశించే ఆ క్షేత్రజ్ఞుడి ప్రకాశమే.

విశేషం: క్షేత్రజ్ఞుడనగా జీవుడని కొందరు, పరమాత్ముడని కొందరు వివరించి ఉన్నారు. అవిద్య తొలగి జీవత్వము నశించినపుడు జీవుడే పరమాత్ముడుగా భాసిస్తాడని అద్వైతవేదాంతము చెప్పుతున్నది. ద్వైతులు పరమాత్మకంటె జీవుడు వేరుగా ఉండునని నిర్ణయించారు.

తే. **స్వస్థతయు దుఃస్థతయు జడత్వమును గ్రమవి । గణన సత్త్వరజస్తమోగుణము లవి స**
మీరితములగు టడఁగుట యింద్రియంబు । లడరు టొదుఁగుట బుద్ధి కృత్యములు పుత్ర! **167**

ప్రతిపదార్థం: పుత్ర!= కుమారా!; స్వస్థతయున్= హాయిగా ఉండి సుఖించే స్వభావం; దుఃస్థతయున్= దుఃఖానికి గురి యయి బాధపడే లక్షణం; జడత్వమును= బుద్ధి మాంద్యమున్ను; క్రమవిగణనన్= క్రమంగా; సత్త్వరజస్తమోగుణములు= సత్త్వగుణం, రజోగుణం, తమోగుణము లగును; అవి= ఆ గుణాలు; సమీరితములు+అగుట= ప్రేరితములు కావటం; అడఁగుట= శమించటం; ఇంద్రియంబులు= ఇంద్రియాలు; అడరుట= ప్రేరణ పొందటం; ఒదుఁగుట= శమించటం; బుద్ధికృత్యములు= బుద్ధిచేసే పనులు.

తాత్పర్యం: కుమారా! ప్రసన్నచిత్తుడై సుఖించటం సత్త్వగుణస్వభావం. దుఃఖంతో పరితపించటం రజోగుణ లక్షణం. అలసుడై బుద్ధిమాంద్యం కలిగి ఉండటం తమోగుణ లక్షణం. ఆయా గుణాలు, తదనుగుణంగా ఆయా ఇంద్రియాలు ప్రేరణ పొందటం, తర్వాత శమించటం అనేవి బుద్ధివలన కలిగే పనులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: సత్త్వం, రజస్సు, తమస్సు అనే త్రిగుణాలు ప్రకృతి సంభవాలు. అవి జీవుడిని దేహంలో బంధిస్తాయి. వీటి లక్షణాలు భగవద్గీతలోని పదునాల్గవ అధ్యాయంలో విపులంగా నిరూపించబడ్డాయి.

సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత ।

జ్ఞాన మావృత్య తు తమః ప్రమాదే సంజయ త్యుత! (గీత - 14-9) ఇత్యాదిగా సత్త్వం సుఖహేతువనీ, కర్మకారణమైన రజస్సు దుఃఖహేతువనీ, తమస్సు ప్రమాదహేతువనీ భగవద్గీత వివరించింది.

తే. అనఘ! యింద్రియములు విషయములు మనసు । బుద్ధియును నాత్మయును గ్రమంబునన యెక్కు
డాత్మ బుద్ధి యనంగ నల్పాంతరంపు । వస్తువులు బుద్ధి యిన్నింట విస్తరిలుట. 168

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఇంద్రియములు= శ్రోత్రం మొదలైన ఇంద్రియాలు; విషయములు= శబ్దం మొదలైన విషయాలు; మనసు= చిత్తం; బుద్ధియును= బుద్ధీ; ఆత్మయును= ఆత్మా - ఇవి; క్రమంబునన్+అ= క్రమంగానే; ఎక్కుడు= ఒకదానికంటె ఒకటి శ్రేష్ఠమైనవి.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ శుకుడా! ఇంద్రియాలకంటె విషయాలు, విషయాలకంటె చిత్తం, చిత్తంకంటె బుద్ధి, బుద్ధికంటె ఆత్మ - క్రమక్రమంగా శ్రేష్ఠములైనవి. ఆత్మకూ, బుద్ధికీ పెద్ద తేడా లేదు. బుద్ధి అన్నింటిలోనూ వ్యాపించి ఉంటుంది. కాబట్టి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇంద్రియేభ్యః పరా హ్యర్థా । అర్థేభ్యశ్చ పరం మనః ।
మనసశ్చ పరా బుద్ధిః । యో బుద్ధేః పరతస్తు సః ॥ (కఠశ్రుతి -1-3-10)

అనే శ్రుతి కూడ పైపద్యంలో చెప్పిన రీతిగా ఇంద్రియాదులు ఒకదానికంటె ఒకటి శ్రేష్ఠమైనవని నిరూపించింది.

క. కనుఁ గన్నై వినుఁ జెవియై । కొనుఁ జవి జిహ్వ యయి మూరుకొను నాసికయై,
తనువై స్పర్శము గైకొను । ననవద్యా! బుద్ధి యాత్మయంద నిలుచుచున్. 169

ప్రతిపదార్థం: అనవద్యా!= దోషరహితుడా!; బుద్ధి= అంతఃకరణచతుష్టయంలో రెండవదగు బుద్ధి; ఆత్మ+అంద= క్షేత్రజ్ఞుడైన అంతరాత్మయందే; నిలుచుచున్= నిలుస్తూ; కన్ను+ఐ= నేత్రమై; కనున్= చూస్తుంది; చెవి+ఐ= శ్రోత్రమై; వినున్= వింటుంది; జిహ్వ+అయి= నాలుకై; చవిన్= రసమును; కొనున్= గ్రహిస్తుంది; నాసిక+ఐ= ఘ్రాణమై; మూరుకొనున్= వాసన చూస్తుంది; తనువు+ఐ= శరీరమై; స్పర్శమున్= తాకిడిని; కైకొనున్= స్వీకరిస్తుంది.

తాత్పర్యం: దోషరహితుడవైన ఓ శుకా! సర్వవ్యాపిని అయిన బుద్ధి ఆత్మలో ఉంటూ నేత్రమై రూపాన్ని చూస్తుంది. చెవిగా మారి శబ్దాన్ని వింటుంది. నాలుకగా రూపొంది రసాన్ని గ్రహిస్తుంది. ముక్కై గంధాన్ని ఆఘ్రాణిస్తుంది. శరీరంలోని చర్మమై స్పర్శను స్వీకరిస్తుంది.

క. ప్రీతిం గడుఁ బొదలు విషా । దాతురతన్ స్రుక్కుఁ దద్ద్వయము లేక సమ
త్వాతిశయంబున నిలుచును । నేతృత్వంబునను బుద్ధి నెఱపు గుణములన్. 170

ప్రతిపదార్థం: బుద్ధి= అంతటా వ్యాపించిన ఈ బుద్ధి; ప్రీతిన్= సంతోషంతో; కడున్= మిక్కిలిగా; పొదలున్= ప్రవర్తిస్తుంది; విషాదాతురతన్= దుఃఖపీడితత్వంతో; స్రుక్కున్= వగజెందుతుంది; తద్ద్వయములేక= ఆ సంతోష విషాదాలు రెండూ లేక; సమత్వాతిశయంబునన్= సమభావముయొక్క అతిశయమునందు; నిలుచును= స్థిరపడుతుంది; నేతృత్వంబునను= నాయకత్వగుణముచేత; గుణములను= సత్త్వాదిగుణాలను; నెఱపున్= వ్యాపింపజేస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: బుద్ధి ఒక సమయంలో సంతోషాతిశయంతో ఉప్పొంగిపోతుంది. ఇంకొక సమయంలో దుఃఖంతో క్రుంగిపోతుంది. సంతోషవిషాదాలు రెండూ లేక సమభావంతో ఉంటూ ఒక్కొక్క సారి స్థైర్యం వహించి ఉంటుంది. గుణాలకు తాను నాయకత్వం పూని వాటిని తన యిచ్ఛవచ్చినట్లు ప్రవర్తింప జేస్తుంది.

ఆ. తత్స్వభావ మెఱిఁగి తా నింద్రియాది స । ప్తకము వెంటఁ బోక తన్నుఁ గనుచు,
నున్న వానిఁ బొందనోపునె దుఃఖదై । న్యంబు సుఖమదంబు నప్రమత్త! 171

ప్రతిపదార్థం: అప్రమత్త!= ఏమరుపాటు లేనివాడా!; తత్స్వభావము= ఆ బుద్ధియొక్క స్వభావమును; ఎఱిఁగి= గ్రహించి; తాను= సాధకుడు; ఇంద్రియాది సప్తకము వెంటన్= ఇంద్రియాలు మొదలైన యేడింటి వెనుక; పోక= పోకుండా; తన్నున్= తనను; కనుచున్= చూస్తూ; ఉన్నవానిన్= ఉన్నట్టి వానిని; దుఃఖదైన్యంబు= దుఃఖమనే దీనత్వం గానీ; సుఖమదంబు= సుఖమనే గర్వంగానీ; పొందన్+ఓపునె?= చేరగలవా?

తాత్పర్యం: జాగరూకుడవైన ఓ శుకుడా! పైన చెప్పిన రీతిగా ఉండే బుద్ధియొక్క స్వభావాన్ని గ్రహించి సాధకుడైన మానవుడు పంచేంద్రియాలు, మనస్సు, బుద్ధి - వీటిని అనుసరించరాదు. తనలో తనను చూచుకొంటూ బాహ్యపదార్థాలపై భ్రాంతి వదలి ఉండాలి. అట్లా ఉన్నవాడిని సుఖదుఃఖాలు చెనకలేవు. అంటే అతడికి దుఃఖంవలన దీనత్వమూ, సుఖం వలన మదమూ కలుగవు. (సుఖదుఃఖాలకు అతీతమైన స్థితిలో అత డుంటా డని భావం).

ఆ. జలములందు నిలిచి జలపక్షి మునుఁగదు; । మేడిపండు మశకపీడఁ బొరయ;
దట్ల విషయసమితియందుఁ దానది దన । యందు నుండి వికృతి నొంద దాత్మ.' 172

ప్రతిపదార్థం: జలపక్షి= నీటిపక్షి; జలములందున్= నీళ్ళలో; నిలిచి= నిలబడి; మునుఁగదు= మునిగిపోదు; మేడిపండు= అత్తిపండు; మశకపీడన్= దోమబాధను; పొరయదు= పొందదు; అట్ల= అదే రీతిగా; ఆత్మ= క్షేత్రజ్ఞుడైన అంతరాత్మ; విషయసమితి+అందున్= శబ్దాదివిషయసముదాయ మందును; అది= ఆ విషయ సమూహం; తన+అందున్= ఆ యాత్మలోనూ; ఉండున్= ఉంటుంది; వికృతిన్= వికారమును; ఒందదు= పొందదు.

తాత్పర్యం: నీటిపక్షి నీటిలోఉన్నా మునిగిపోదు. అత్తిపండులో ఎన్ని పురుగులున్నా వాటివలన ఆ పండు బాధింపబడదు. అదే రీతిగా ఆత్మ విషయాలలో ఉన్నా, ఆత్మలో విషయాలున్నా - ఆత్మకు వికారం కలుగదు.

విశేషం: అలం: ఉపమ.

వ. అని చెప్పి మఱియును. 173

ప్రతిపదార్థం: అని= ఈ రీతిగా; చెప్పి= వచించి; మఱియును= మరల.

తాత్పర్యం: వ్యాసుడు శుకుడితో ఈ రీతిగా చెప్పాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'విను మూర్ణనాభి తంతువు । జనియింపఁగఁ జేసినట్లు సత్త్వగుణము సం
జనకం బగు నది పురుషుఁడు । గనుట యుదాసీనతన వికారము గలదే? 174

ప్రతిపదార్థం: వినుము= ఆకర్ణించుము; ఊర్ణనాభి= సాలెపురుగు; తంతువున్= దారమును; జనియింపఁగన్+చేసినట్లు= సృష్టించినట్లే; సత్త్వగుణము= సత్త్వమనే గుణం; సంజనకంబు+అగున్= జ్ఞానాదులకు కారణమవుతుంది; అది= ఆ స్థితిని; పురుషుఁడు= ఆత్మ; కనుట= చూడటం; ఉదాసీనతన్+అ= ఔదాసీన్యంతోనే; వికారము= వికృతి; కలదే?= ఉన్నదా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సాలెపురుగు తనలోనుండి దారమును సృష్టించినట్లే సత్త్వాదిగుణాలు జ్ఞానసుఖ దుఃఖాదులు కలిగిస్తున్నాయి. పురుషుడు ఉదాసీనుడై ఈ స్థితిని చూస్తూ ఉంటాడు. అందువలన అతడికి వికారం కలగదు.

విశేషం: 'సత్త్వము గుణసంజనకంబగు' అను పాఠాంతరము కలదు. ఆ పాఠమును స్వీకరిస్తే 'గుణ' శబ్దానికి విషయాలు అని అర్థం చెప్పాలి. సత్త్వాదిగుణాలు విషయాలను కలిగిస్తుంటాయి అని భావం. సాలెపురుగు దారాన్ని తనలోనుండే సృష్టిస్తుంది. అందుకై బాహ్య పదార్థాలను గ్రహించదు. అట్లే సత్త్వాదులు విషయాలకు అభిన్న నిమిత్తోపాదాన కారణాలవుతున్నాయని తెలిసికొనాలి.

ఆ. ఆదినిధనరహితుఁ డగు నిరంజనుఁ జెంది । గుణము లెడల విడిచి, క్రోధలోభ
ములకుఁ జొరవ యీని ముని హృదయగ్రంథి । విరియ నడఁచి మోక్ష విభవ మొందు. 175

ప్రతిపదార్థం: ఆది నిధన రహితుఁడు+అగు= మొదలు తుదిలేని (జననమరణాలు లేని); నిరంజనున్= పరమాత్మను; చెంది= పొంది; గుణములు= సత్త్వాదిగుణాలను; ఎడలన్ విడిచి= తొలగిపొయ్యేటట్లు వదలిపెట్టి; క్రోధలోభములకున్= కోపానికీ లోభానికీ; చొరవ ఈని= అవకాశం ఇవ్వని; ముని= మౌని; హృదయగ్రంథిన్= చిత్త గ్రంథిని; విరియన్+అడఁచి= నశింపజేసి; మోక్షవిభవము= ముక్తి సంపదను; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: పరమాత్మ ఆద్యంతాలు (జనన మరణాలు) లేనిది. అట్టి దాని నాశ్రయించి సత్త్వాది గుణాలను వదలి, కోపలోభాలను త్యజించిన ముని తన హృదయంలోని కామాదులకు జన్మస్థానమైన ముడిని నశింపజేసి మోక్షవైభవం పొందుతాడు.

క. శమసంపద బ్రాహ్మణ జ । న్మమునకు సామగ్ర్య మవ్వినయసారము చి
త్తమున కలవడ్డ మునికి భ । యము శోకము మదము హర్ష మనునివి గలవే? 176

ప్రతిపదార్థం: బ్రాహ్మణ జన్మమునకున్= విప్రుడియొక్క పుట్టుకకు; శమసంపద= ఆత్మనిగ్రహమనే ఐశ్వర్యం; సామగ్ర్యము= సర్వస్వమై ఉన్నది; ఆ+వినయసారము= ఆ వినయముయొక్క బలిమి; చిత్తమునకున్= మనస్సుకు; అలవడ్డ= అలవడిన; మునికిన్= మౌనికి; భయము= భీతి; శోకము= దుఃఖం; మదము= గర్వం; హర్షము= సంతోషం; అనునివి= అనబడేవి; కలవే?= ఉన్నవా?

తాత్పర్యం: బ్రాహ్మణుడై పుట్టినవాడికి ఆత్మనిగ్రహమనే సంపత్తే సర్వస్వం. అట్టి వినయబలం హృదయానికి అలవడిన మునీంద్రుడికి భయం, శోకం, మదం, సంతోషం అనేవి లేవు.

క. శమనిరతియు నాత్మ జ్ఞా । నముఁ జువ్వే బుధ లక్షణంబులు పర్యా
ప్తము లివి రెండు నరయ మో । క్షము సాధించుటకు వేఱ కల్పన లేలా?' 177

ప్రతిపదార్థం: శమనిరతియున్= చిత్త నిగ్రహంలో ఆసక్తియు; ఆత్మజ్ఞానమున్= ఆత్మను గూర్చిన తెలివియూ; బుధ లక్షణంబులు చువ్వే= ఆత్మజ్ఞుడైనవాని లక్షణములై ఉన్నవి; అరయన్= పరిశీలించగా; ఇవి రెండు= ఈ చెప్పిన రెండు లక్షణాలును; మోక్షమున్= ముక్తిని; సాధించుటకున్= వశం చేసికొనటానికి; పర్యాప్తములు= చాలిఉన్నవి; వేఱ= అన్యములైన; కల్పనలు+ఏలా?= సాధనములు ఎందుకు?

తాత్పర్యం: చిత్తనిగ్రహం, ఆత్మజ్ఞానం - అనేవి ప్రబుద్ధుడైన వాడి లక్షణములై ఉన్నవి. మోక్షం సాధించటానికి ఈ రెండు లక్షణాలే చాలి ఉన్నవి. వేరే సాధనలకై ప్రయాసపడ నవసరం లేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. **అనిన విని శుకుండు 'ధర్మంబుల కెల్లఁ బరమంబయిన ధర్మం బెఱింగింపవే!' యనుటయు వాత్సల్యపరాయణుం డగు నబ్బాదరాయణుండు 'సనాతనంబును, మునిసత్తమ సంస్తుత్యంబును నగునుత్తమ ధర్మంబు సెప్పెద; నేకాగ్రచిత్తుండ వయి యాకర్ణింపు'మని పలికి యిట్లనియె.** **178**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆకర్ణించి; శుకుండు= శుకయోగి; ధర్మంబులకున్+ఎల్లన్= సమస్త ధర్మాలలోను; పరమంబు= శ్రేష్ఠం; అయిన ధర్మంబు= ఐన ధర్మాన్ని; ఎఱింగింపవే= తెలుపవే; అనుటయున్= అనేసరికి; వాత్సల్యపరాయణుండు+అగు= పుత్రస్నేహపరుడైన; ఆ+బాదరాయణుండు= ఆ వ్యాసుడు; సనాతనంబును= పురాతన మైనదీ; మునిసత్తమసంస్తుత్యంబును+అగు= మునిశ్రేష్ఠులచేత స్తుతించదగినదీ అయిన; ఉత్తమధర్మంబున్= శ్రేష్ఠధర్మమును; చెప్పెదన్= వివరిస్తాను; ఏక+అగ్రచిత్తుండవు+అయి= సమాహిత మనస్సు గలవాడవై; ఆకర్ణింపుము+అని= వినుమని; పలికి= చెప్పి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా వచించాడు.

తాత్పర్యం: ఈ విధంగా వ్యాసుడు చెప్పగా విని శుకయోగీంద్రుడు 'అన్ని ధర్మాలలోనూ శ్రేష్ఠమైన ధర్మ మేదో తెలియచెప్పు' మని అడిగాడు. అంతట పుత్రస్నేహపరుడైన ఆ పారాశర్యుడు 'పురాతనమూ, మునులచేత శ్లాఘ్యమూ అయిన శ్రేష్ఠధర్మాన్ని వివరిస్తాను, ఏకాగ్రమైన మనస్సుతో వినుము అని చెప్పి ఇట్లా అన్నాడు:

ఇంద్రియనిగ్రహం బుత్తమ ధర్మంబుగ నిరూపించుట (సం. 12-242-1,2)

తే. **'ఎల్లకడలకు వెలువడు నింద్రియముల । బాలపుత్రులఁ దండ్రియుఁ బోలె నాఁగు**
మవియు మనమును నిశ్చలైకాగ్రభావ । మొందు టుత్తమ తప మది యుజ్జ్వలాత్మ! **179**

ప్రతిపదార్థం: ఉజ్జ్వల+ఆత్మ!= ప్రకాశమానమైన బుద్ధిగలవాడా!; ఎల్లకడలకున్= అన్ని దిశలకు; వెలువడు= ప్రసరిస్తున్న; ఇంద్రియములన్= శ్రోత్రం మొదలైన ఇంద్రియాలను; బాలపుత్రులన్= బాలురైన కుమారులను; తండ్రియున్+పోలెన్= తండ్రివలె; ఆఁగుము= నిగ్రహించుము; అవియున్= ఆ ఇంద్రియములు; మనమును= చిత్తమును; నిశ్చల+ఏక+అగ్రభావము+ఒందుట= కదలికలేని ఏకాగ్రతను పొందటం; అది ఉత్తమతపము= అది శ్రేష్ఠమైన తపస్సు.

తాత్పర్యం: ఉజ్జ్వలమైన బుద్ధిగలవాడా! అన్ని దిక్కులకూ పరుగిడే చిన్న పిల్లలను తండ్రి ఏ విధంగా పట్టి నిలవేస్తాడో, అట్లాగే అన్ని దిశలకూ ప్రసరించే శ్రోత్రాదులైన ఇంద్రియాలను నిగ్రహించుము. ఆ ఇంద్రియాలూ, మనస్సూ కదలిక లేనివై ఏకాగ్రత్వం పొందటమనేదే మేలైన తపస్సు అవుతుంది.

క. **అది ధర్మంబుల కెల్లం । దుది యగు ధర్మంబు; మనసుతో దానిఁ దగం**
గుదియించి మేధతోడం । గదియింపుము నియతిఁ బుత్ర! కడుగాఢముగన్. **180**

ప్రతిపదార్థం: పుత్ర!= కుమారా!; అది= ఆ ఇంద్రియనిగ్రహం; ధర్మంబులకున్+ఎల్లన్= సమస్త ధర్మాలలోను; తుదిఅగు= చివరిదగు (శ్రేష్ఠమగు); ధర్మంబు= ధర్మం; మనసుతోన్= చిత్తంతో; దానిన్= ఆ ధర్మమును; తగన్= చక్కగా; కుదియించి= సంలగ్నం చేసి; నియతిన్= నియమంతో; కడు గాఢముగన్= మిక్కిలి గట్టిగా; మేధతోడన్= బుద్ధితో; కదియింపుము= చేర్చుము.

తాత్పర్యం: కుమారా! ఆ ఇంద్రియసంయమనం ధర్మాలలో కెల్లా మేలైన ధర్మం. నీ మనస్సుతో ఆ ధర్మాన్ని సంసక్తం కావించుము. నియమంతో గట్టిగా దానిని బుద్ధితో చేర్చుము.

తే. **ఇంద్రియంబుల నాఱింటి నిట్లు విషయ । ములకు నొలయక యుండంగ నిలువరించి'**
తలఁపు లుడిగి, తేనియఁ బ్రమదమున నాను । భంగిఁ దృప్తుఁడవై యుందు పరముఁ గాంతు.' **181**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆఱింటిన్= ఆరైన; ఇంద్రియములన్= మనస్సుతో కూడిన జ్ఞానేంద్రియాలను; విషయములకున్= శబ్దాదులైన విషయాలకు; ఒలయక ఉండంగన్= చేరకుండా ఉండేటట్లు; నిలువరించి= నిలిపి; తలఁపులు= సంకల్పాలు; ఉడిగి= వదలి; ప్రమదమునన్= సంతోషంతో; తేనియన్= మకరందాన్ని; ఆనుభంగిన్= త్రాగేటట్లు; తృప్తుడవై ఉందు= తృప్తి పొందిన వాడవై ఉంటావు; పరమున్= బ్రహ్మమును; కాంతు= చూస్తావు.

తాత్పర్యం: నీవు శ్రోత్రం మొదలగు ఐదు జ్ఞానేంద్రియాలను, మనస్సును శబ్దాది విషయాలవైపు పోనీయకుండా నిలుపుము. సంకల్పాలు వదలు. అట్లా చేస్తే సంతోషంతో తేనె నాస్వాదించేవిధంగా తృప్తి పొందుతావు. పరతత్త్వమును సాక్షాత్కరించుకొంటావు'.

వ. అని వెండియు. 182

ప్రతిపదార్థం: అని= ఇట్లు చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: ఈ రీతిగా చెప్పి వ్యాసుడు మళ్ళీ (ఈ క్రింది విధంగా అన్నాడు.)

చ. 'తన కుసుమంబులన్ ఫలవితానము మూర్కొన నాన మ్రాను నే
రని క్రియఁ గాన నేరదు పరం బగు తత్త్వము నైజభంగి వి
న్ననువున నంతరాత్మ గను నైష్ఠికతం గను; మింతవట్టుఁ బా
మెనసిన తోలు వాయుక్రియ నీవు దొఱంగుదు పాపపుంజమున్. 183

ప్రతిపదార్థం: మ్రాను= చెట్టు; తన కుసుమంబులన్= తన పూలను; ఫలవితానమున్= పండ్ల సమూహాన్ని; మూర్కొనన్= ఆఘ్రాణించటానికీ; ఆనన్= ఆస్వాదించటానికీ; నేరని క్రియన్= అభ్యసించనట్లే; పరంబు+అగు= శ్రేష్ఠమైన; తత్త్వము= బ్రహ్మతత్త్వం; నైజభంగిన్= తానుగా తన స్వరూపాన్ని; కానన్ నేరదు= గ్రహించజాలదు; విన్ననువునన్= నేర్పుతో; అంతరాత్మన్= పరమాత్మను; కను నైష్ఠికతన్= చూచేనిష్ఠా పరత్వమును; ఇంతవట్టు= ఇంతమాత్రం; కనుము= పొందుము; పాము= సర్పం; ఎనసిన= తనను పొందిన; తోలు= చర్మమును; పాయుక్రియన్= వదలిపెట్టే రీతిగా; నీవు పాపపుంజమున్= నీవు పాపసమూహాన్ని; తొఱంగుదు= వర్జిస్తావు.

తాత్పర్యం: వృక్షం తన పూలను తాను వాసన చూడలేదు. తన పండ్లను తాను ఆస్వాదించజాలదు. అట్లాగే తత్త్వం తనకు తానుగా తన స్వరూపమును గ్రహించలేదు. నీవు నేర్పుతో అంతరాత్మను సాక్షాత్కరించుకొనేందుకు చాలినంత నిష్ఠాపరత్వమును పొందుము. అట్లా చేస్తే పాము కుబుసాన్ని వర్జించినట్లు నీవు పాపసంచయాన్ని వర్జిస్తావు.

విశేషం: అలంకారం: ఉపమ.

వ. ఇవ్విధంబున శాంతి నొంది యవ్యక్త సంభవయు, సంకల్పకూలయుఁ, గ్రోధపంకయు, నింద్రియగ్రాహయుఁ, గామభుజంగయు, మోహ తృణచ్ఛన్నయు, సంసారసాగర గామినియు నై ఘోరప్రకార యగుచు నకృతాత్ములకుం గడవరాని యట్టి లోభవాహిని సత్యతీర్థంబున నుత్తరించి. 184

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; శాంతిన్+ఒంది= శమమును పొంది; అవ్యక్త సంభవయున్= తెలియరాని పుట్టుక గలదియు; సంకల్పకూలయున్= తలపు లనే గట్టుకలదియు; క్రోధపంకయున్= కోపమనే బురద కలదియు; ఇంద్రియగ్రాహయున్= ఇంద్రియాలనే మొసళ్ళు గలదియు; కామభుజంగయున్= కోరికలనే పాములు గలదియు; మోహతృణచ్ఛన్నయున్= మోహమనే గడ్డితో కప్పబడినదియు; సంసారసాగరగామినియున్+ఐ= సంసార మనే సముద్రంలో ప్రవేశించేదియునై; ఘోరప్రకార= భయంకర

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విధానంగలది; అగుచున్= అవుతూ; అకృత+ఆత్ములకున్= వివేకంలేని వారికి; కడవన్‌రాని అట్టి= దాటవీలుగానిదైన; లోభవాహిని= లోభ మనే నదిని; సత్యతీర్థంబునన్= సత్యమనే ఉపాయంతో; ఉత్తరించి= దాటి.

తాత్పర్యం: ఈ చెప్పిన పద్ధతిలో అంతరాత్మను సాక్షాత్కరించుకొని శాంతిని పొందాలి. లోభ మనేది ఎక్కడ ఎప్పుడు ఎట్లా పుట్టిందో తెలియదు. సంకల్పాలే దానికి గట్లు. క్రోధమే దానిలోని బురద. ఇంద్రియాలే అందలి మొసళ్ళు. కోరికలే అందులో పాములు. అది మోహమనే గడ్డితో కప్పబడి ఉంటుంది. సంసారసాగరంలో ప్రవేశిస్తుంది. అట్లా భయంకరంగా ఉన్న ఆ నదిని వివేకంలేని వారు దాటలేరు. సత్యమనే ఉపాయంతో దానిని దాటాలి. అట్లా దాటి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలంకారం: రూపకం.

క. **సుత! నీవు సుప్రసన్నా । త్మతఁ బొంది నగాగ్రగతుఁడు మహివారలఁ జూ**
చుతెఱంగున నీ భూత । ప్రతతిం గనుఁగొనుచునుండు పరితృప్తుఁడవై. **185**

ప్రతిపదార్థం: సుత!= కుమారా!; నీవు సుప్రసన్న+ఆత్మతన్= నీవు నిర్మలాత్మత్వమును; పొంది= చెంది; నగ+అగ్రగతుఁడు= కొండకొననున్నవాడు; మహివారలన్= భూమిపైన ఉన్నవారిని; చూచుతెఱంగునన్= చూచేవిధంగా; ఈ భూతప్రతతిన్= ఈ ప్రాణిసమూహాన్ని; కనుఁగొనుచున్= చూస్తూ; పరితృప్తుఁడవు+ఐ ఉండు= తృప్తి పొందినవాడవై ఉండుము.

తాత్పర్యం: కుమారా! నీవు పై రీతిగా లోభమనేనదిని దాటి నిర్మలాత్మతను పొందుము. కొండపై నున్న వాడు భూమిమీద నున్నవారినెట్లా చూస్తాడో, అట్లాగే ఈ ప్రాణులను దర్శించుము. అట్లా చూచి సంతృప్తి వహించి ఉండిపొమ్ము.

విశేషం: అలం:

క. **శాంతము ధర్మప్రచయం । బంతటికి విశిష్ట మిమ్మహావిద్య మదీ**
యాంతఃకరణము సాక్షిగ । నెంతయు సంప్రీతి నీకు నిచ్చితిఁ బుత్రా!' **186**

ప్రతిపదార్థం: ధర్మప్రచయంబు= ధర్మవర్గం; అంతటికిన్= మొత్తానికి; విశిష్టము= శ్రేష్ఠం; పుత్రా!= కుమారా!; మదీయ+అంతఃకరణము= నా అంతరింద్రియం; సాక్షిగన్= సాక్ష్యం వహించేది కాగా; ఎంతయున్= మిక్కిలి; సంప్రీతిన్= ప్రేమతో; ఈ+మహావిద్య= ఈ గొప్పదైన ఆధ్యాత్మిక విద్యను; నీకున్+ఇచ్చితిన్= నీకు ఇచ్చాను.

తాత్పర్యం: వత్సా! నే నిప్పుడు నీకు చెప్పిన ధర్మాలన్నిటిలోనూ ఇంద్రియనిగ్రహ రూపమైన శాంత మనే ధర్మం మిక్కిలి విశిష్టమైనది. నా అంతఃకరణం సాక్షిగా నీకు నేను ఎంతో ప్రేమతో ఈ శ్రేష్ఠమైన బ్రహ్మవిద్యను బోధించాను'.

వ. **అని యి ట్లుపదేశించి పరమసంవిదేకాయనుండగు కృష్ణద్వైపాయనుండు కృతార్థీభూత చేతస్కుండగు నందను ప్రతిపత్తికి నభినందన విశేషంబుగా నధ్యాత్మవిద్యా విలాస విషయంబులగు వాక్యంబులు మఱియు ననుగ్రహించె; వానిం జెప్పెద.** **187**

ప్రతిపదార్థం: అని యిట్లు+ఉపదేశించి= అని ఈ రీతిగా బోధించి; పరమసంవిదేకాయనుండు+అగు= బ్రహ్మజ్ఞానానికి ముఖ్యస్థానమైన; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; కృతార్థీభూత చేతస్కుండు+అగు= కృతకృత్యమైన మనస్సు గలవాడైన;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నందను= కుమారుని యొక్క; ప్రతిపత్తికిన్= తెలివికి; అభినందన విశేషంబుగాన్= మెచ్చుకొనే పద్ధతిగా; మఱియున్= మరలకూడా; అధ్యాత్మవిద్యావిలాస విషయంబులు+అగు= బ్రహ్మవిద్యా విలాసానికి సంబంధించినవైన; వాక్యంబులు= మాటలు; అనుగ్రహించెన్= ప్రసాదించాడు; వానిన్= ఆ మాటలను; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: బ్రహ్మజ్ఞానైక నిలయుడైన వ్యాసమహర్షి ఈ విధంగా ఉపదేశించేసరికి శుకుడు కృతకృత్యతతో ధన్యుడయ్యాడు. అతడి తెలివిని అభినందిస్తూ వ్యాసుడు మళ్ళీ అతడికి ఆత్మవిద్యను వివరించే కొన్ని మాటలు చెప్పాడు. ఆ మాటలు చెప్పుతాను.

క. 'వేదములుఁ దదంగములు స । మాదరమునఁ జదివినను సుయజమానత్వా
పాదకుఁ డైనను బ్రాహ్మణ । తాదశ దక్కునె ప్రశాంతిఁ దక్కఁ గుమారా! 188

ప్రతిపదార్థం: కుమారా!= పుత్రా!; ప్రశాంతిన్+తక్కన్= ప్రశమంచేత తప్ప; వేదములు= శ్రుతులు; తదంగములు= వేదాంగములు; సమాదరమునన్= ప్రీతితో; చదివినను= పఠించినను; సుయజమానత్వ+ఆపాదకుఁడు+ఐనను= మంచి యజ్ఞకర్తృత్వం పొందినవాడైనా; బ్రాహ్మణతాదశ= బ్రాహ్మణత్వస్థితి; తక్కునె?= లభిస్తుందా?

తాత్పర్యం: వత్సా! బ్రాహ్మణత్వం అనేది ప్రశాంతిచేత మాత్రమే ప్రాప్తిస్తుంది. నాలుగువేదాలు, ఆరువేదాంగాలు (శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం - అనేవి) చదివినా సిద్ధించదు. అట్లే యజ్ఞాలు చేసి మంచి యజమానుడుగా పేరు పొందినప్పటికీ బ్రాహ్మణత్వ స్థితి లభించదు.

క. ఒరులకుఁ దా వెఱవక తన । కొరులు వెఱవకుండునట్టి యొప్పెడు సమతం
దిరమైన నడవడిం గల । పరిణతచిత్తుండు సూవె బ్రాహ్మణుఁ డనఘా! 189

ప్రతిపదార్థం: అనఘా!= కల్మషరహితుడా!; ఒరులకున్= పరులకు; తాన్= తాను; వెఱవక= భయపడక; తనకున్+ఒరులు= తనకు పరులు; వెఱవక= భీతిల్లక; ఉండునట్టి= ఉన్నట్టి; ఒప్పెడు= విరాజిల్లెడు; సమతన్= సమభావంతో; తిరము+ఐన= స్థిరమైన; నడవడిన్= ప్రవర్తనను; కల= కలిగి ఉండు; పరిణతచిత్తుండు= పరిపక్వమైన మనస్సు కలవాడు; బ్రాహ్మణుఁడు సూవె!= విప్రుడగునుగదా!

తాత్పర్యం: పాపరహితుడా! ఎవడు ఇతరులకు తాను భయపడడో, ఎవరివలన ఇతరులు భీతిచెందరో, అట్టి సమదృష్టితో స్థిరమైన ప్రవర్తన కలిగిఉండే పరిపక్వమైన హృదయం కలవాడే బ్రాహ్మణు డనబడతాడు.

విశేషం: యస్మాన్నోద్విజతే లోకో । లోకా న్నోద్విజతే చ యః
హర్షామర్షభయోద్వేగైః । ముక్తో య స్స చ మే ప్రియః ॥ (గీత-12-15)

అని భగవంతుడి మాట. లోకం ఎవరినుండి ఉద్వేగం పొందదో, ఎవరు లోకంనుండి ఉద్వేగం పొందరో, హర్షమూ, అమర్షమూ, భయమూ, ఉద్వేగమూ ఎవరికి లేవో వాడే నాకు ప్రీతిపాత్రుడని శ్రీకృష్ణుడు చెప్పాడు. ఈ స్థితికూడా బ్రాహ్మణత్వమును వ్యక్తం చేస్తున్నదని గుర్తించాలి.

తే. బంధనంబులలో నెల్లఁ బరమబంధ । నంబు గామంబు; దద్వర్జనమున నాత్మ
యభ్రపటలంబు వాసిన యమృతకిరణ । పూర్ణమండలమును బోలెఁ బొలుచు ననఘ! 190

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; బంధనంబులలోన్+ఎల్లన్= సమస్త బంధనాలలోనూ; కామంబు= కోరిక; పరమబంధనంబు= దృఢమైన బంధనం; తద్వర్జనమునన్= ఆ కామమును విడవటంచేత; ఆత్మ= ప్రత్యగాత్మ; అభ్రపటలంబున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మేఘసమూహాన్ని; పాసిన= విడిచిన; అమృతకిరణపూర్ణ మండలమునున్+పోలెన్= చంద్రుడియొక్క సంపూర్ణబింబంవలె; పొలుచున్= భాసిస్తుంది.

తాత్పర్యం: పాపరహితుడా! జీవుడిని సంసారంలో బంధించే బంధనాలన్నింటిలోనూ కామమనే బంధనం మిక్కిలి గట్టిది. ఆ కామాన్ని వదలితే మబ్బులను విడిచిన పూర్ణచంద్రుడివలె ఆత్మ ప్రకాశిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

క. **పరతత్త్వోపాసన త । త్పరుఁడై సంక్షీణకామభావత నున్నం**
బురుషు సుఖ మొందు వృద్ధిం । బొరయుచు వపు వమృతకిరణుఁ బొందినమాడ్కిన్. **191**

ప్రతిపదార్థం: వపువు= శరీరం; వృద్ధిన్= పెంపుదలను; పొరయుచున్= పొందుచు; అమృతకిరణున్= చంద్రుడిని; పొందినమాడ్కిన్= పొందినరీతిగా; పరతత్త్వ+ఉపాసన తత్పరుఁడు+ఐ= బ్రహ్మతత్త్వమును ఉపాసించటంలో ఆసక్తిగలవాడై; సంక్షీణ కామభావతన్= క్షీణించిన కామభావం కలవానితనంతో; ఉన్నన్= ఉంటే; పురుషున్= జీవుడిని; సుఖము+ఒందున్= సుఖం పొందుతుంది.

తాత్పర్యం: శ్రేష్ఠమైన బ్రహ్మతత్త్వాన్ని ఉపాసిస్తూ కామభావాలను క్షయింపజేసికొనాలి. అట్లా ఉంటే పురుషుడిని శుక్లపక్షంలో నిత్యమూ శరీరాభివృద్ధి చంద్రుడిని పొందినట్లే శాశ్వతసుఖం పొందుతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. **పొరిఁ బొరి భూతముల గుణో । త్కర మవిశేషాన్వితముగఁ గనుఁగొను సంవి**
త్పర దుఃఖంబు సుఖముచే । విరియుఁ దరణిచేతఁ దమము విరిసిన భంగిన్. **192**

ప్రతిపదార్థం: తరణిచేతన్= సూర్యుడిచేత; తమము= చీకటి; విరిసినభంగిన్= విడిపోయినట్లు; పొరిన్+పొరిన్= మిక్కిలిగా; భూతముల= ప్రాణులయొక్క; గుణోత్కరము= గుణసమూహమును; అ+విశేషాన్వితముగన్= భేదంలేకుండా; కనుఁగొను= చూచునట్టి; సంవిత్పరు దుఃఖంబు= జ్ఞాననిష్ఠుని దుఃఖం; సుఖముచేన్= సుఖం కారణంగా; విరియున్= నశిస్తుంది.

తాత్పర్యం: ప్రాణులలోని గుణాల నన్నిటినీ అభేదదృష్టితో చూచే జ్ఞాననిష్ఠుడి దుఃఖం చీకటి, సూర్యుడిచేత నశించినట్లు సుఖాతిశయంచేత నశిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

ఆ. **తనది యనక యేమి ధనమునఁ బ్రియమందు, । నెద్ది గుడువకుండ నెసఁగుఁ దృప్తి,**
యిచ్చఁ బొందులేక యెయ్యది బలమిచ్చు, । దానిఁ గనుట శ్రుతుల తలఁపు గనుట. **193**

ప్రతిపదార్థం: తనది అనక= ఇది నాది అని అనుకొనకుండానే; ఏమి ధనమునన్= ఎట్టిధనంతో; ప్రియము+అందున్= ప్రీతినొందునో; ఎద్ది= ఏది; కుడువక+ఉండన్= తినకుండానే; తృప్తి= తనివి; ఎసఁగున్= అతిశయించునో; ఇచ్చన్= ఇచ్ఛతో; పొందులేక= కలయిక లేకయే; ఎయ్యది= ఏది; బలము+ఇచ్చున్= బలిమినిస్తుందో; దానిన్= అట్టి ఆత్మతత్త్వమును; కనుట= చూడటం; శ్రుతుల తలఁపున్= వేదాభిప్రాయాన్ని; కనుట= చూడటం (అగును).

తాత్పర్యం: 'ఆత్మ' అనే ధనం 'తనది' అనుకొనకున్నా ప్రీతిని కల్గిస్తుంది. 'ఆత్మ' అనే భోజనం తినకున్నా తృప్తినిస్తుంది. 'ఆత్మ' అనే దానితో భౌతికస్పర్శ లేకున్నా బలం కలుగుతుంది. ఆ ఆత్మతత్త్వాన్ని చూడటమే వేదార్థాలను గ్రహించటం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ధనం, భోజనం మొదలైన పదార్థాలు ప్రీతి, తృప్తి మొదలైనవాటిని కలిగిస్తాయి. కాని ఎక్కడో ఎవరివద్దనో ఉన్న ధనంవలన తనకు ప్రీతి కలుగదు. ఎవడో అన్నం భుజిస్తే తనకు తనివి కలగదు. 'ఆత్మ'భోజనం అట్లాంటిది కాదు. దానిని తనది అనుకొనకున్నా, భుజించకున్నా ప్రీతినీ, తృప్తినీ కలిగిస్తుంది. ఆత్మభావనతో కలిగే బలం చాలా గొప్పది. అందువలన ఆత్మతత్త్వప్రాప్తికై ప్రయత్నించాలి. ఆత్మలాభమే వేదతత్త్వాన్ని గ్రహించి ఆచరించినందుకు నిక్కమైన నిదర్శనం.

క. పరిపాటిఁ గర్మ మెడలఁగ । వరుస గుణము లడఁగ విషయవర్గము పొందుం
బొరయక యుండెడు బ్రాహ్మణు । జరయును మృత్యువును బొరయఁజాలవు వత్సా! 194

ప్రతిపదార్థం: వత్సా!= కుమారా!; పరిపాటిన్= క్రమంగా; కర్మము+ఎడలఁగన్= కర్మము తొలగగా; వరుసన్= క్రమంగా; గుణములు= సత్త్వం మొదలైన గుణాలు; అడఁగన్= నశించగా; విషయవర్గము పొందున్= శబ్దాది విషయాలతోడి కలయికను; పొరయక ఉండెడు= పొందకుండా ఉండేటి; బ్రాహ్మణున్= విప్రుని; జరయును= ముసలితనమును; మృత్యువును= మరణమును; పొరయన్+చాలవు= పొందలేవు.

తాత్పర్యం: కుమారా! కర్మబంధమూ, సత్త్వాది గుణాలూ, శబ్దాది విషయాలూ క్రమక్రమంగా తొలగిపోయిన విప్రుడికి వార్ధకమూ, మరణమూ కలుగవు.

విశేషం: శరీరభావంతో ఉండేవాడికి ఆ శరీరానికి కలిగే ముసలితనం, మరణం మొదలైన దోషాలు కూడా ఆపాదిస్తాయి. కాని, 'తాను శరీరంకాదు, శుద్ధబుద్ధముక్తమైన ఆత్మను' అని గ్రహించిన బ్రాహ్మణుడికి వార్ధకాది దోషా లంటవని భావం.

తే. అనఘ! దేహంబుకంటె వేఱయిన దేహి । సూక్ష్మరూపము శాస్త్రోక్త సుకృతములఁ బ్ర
శాంతజనములు గాంతురు సాధనముల । నాదరింపరు దర్శనానంతరమున. 195

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; శాస్త్ర+ఉక్తసుకృతములన్= శాస్త్రాలలో చెప్పబడిన పుణ్యకర్మలచేత; ప్రశాంతజనములు= ప్రశాంతినొందిన జనులు; దేహంబుకంటెన్= శరీరంకంటె; వేఱు+అయిన= భిన్నమయిన; దేహి= ఆత్మయొక్క; సూక్ష్మరూపంబున్= సూక్ష్మమైన రూపును; కాంతురు= చూస్తారు; దర్శన+అనంతరమునన్= అట్లా చూచిన తర్వాత; సాధనములన్= వేరే ఉపాయాలను; ఆదరింపరు= గణించరు.

తాత్పర్యం: కల్మషరహితుడా! శాస్త్రాలలో చెప్పబడిన పుణ్యకర్మలచేత ప్రశాంతి నొందిన జనులు మాత్రమే శరీరం కంటె భిన్నమైన శరీరి, అనగా ఆత్మయొక్క సూక్ష్మస్వరూపాన్ని గ్రహించగలరు. అట్లా అవ్యక్తాత్మ స్వరూపాన్ని గ్రహించిన తర్వాత వారు వేరే సాధనాలను లెక్కచేయరు.

క. ఇనురూపము జలములఁ దోఁ । చిన క్రియ బుద్ధిఁ బ్రతిబింబసిద్ధత వెలుఁగొం
దిన యాత్మను బరమార్థతఁ । గను సత్త్వస్థులకు నిజము గానంగ నగున్. 196

ప్రతిపదార్థం: ఇనురూపము= సూర్యుడిరూపం; జలములన్= నీటిలో; తోఁచినక్రియన్= కనబడిన విధంగా; బుద్ధిన్= బుద్ధి యందు; ప్రతిబింబసిద్ధతన్= ప్రతిబింబంగా కావటంతో; వెలుఁగు+ఒందిన= ప్రకాశించిన; ఆత్మను= క్షేత్రజ్ఞుడిని; పరమార్థతన్= యథార్థంగా; కను= చూచే; సత్త్వస్థులకున్= సత్త్వగుణంలో ఉండేవారికి; నిజము= సత్యం; కానంగన్+అగున్= చూడటానికి వీలవుతుంది.

తాత్పర్యం: సూర్యుడి స్వరూపం నీళ్ళలో ప్రతిబింబంగా భాసిస్తుంది. అట్లాగే ఆత్మ బుద్ధిలో ప్రతిబింబరూపంతో వ్యక్తమవుతుంది. సత్త్వగుణ ప్రధానులైనవారు ఆత్మను యథాతథంగా చూడగలరు. అట్లాంటివారికి మాత్రమే సత్యం భాసిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలంకారం: ఉపమ.

క. **అనఘ! దివసంబు రాత్రియు । ననునవి భానునకు లేని యట్టులు సతతం**
బును బరమయోగయుతుఁ డగు । మునికి వివేకావివేకములు లేకుండున్. 197

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; భానునకున్= సూర్యుడికి; దివసంబు= పగలు; రాత్రియున్= రేయియు; అనునవి= అనేవి; లేని అట్టులు= లేనట్లే; సతతంబును= ఎల్లవేళలా; పరమ యోగయుతుఁడు+అగు= శ్రేష్ఠమైన యోగంతో కూడినవాడైన; మునికిన్= మౌనికి; వివేక+అవివేకములు= జ్ఞానాజ్ఞానాలు; లేక+ఉండున్= లేకుండా ఉంటాయి.

తాత్పర్యం: పాపరహితుడా! సూర్యుడికి రేయింబవళ్ళు అనేవి లేవు. అట్లే సదా పరమయోగం పాటించే మునీంద్రుడికి వివేకం, అవివేకం అనేవి లేవు. సదా అతడు శుద్ధ జ్ఞానస్వరూపుడై ఉంటాడు కాబట్టి ఇది వివేకం కలిగిన స్థితి, ఇది వివేకం లేని స్థితి అనేవి అతడికి లేవని తాత్పర్యం.

విశేషం: అలంకారం: ఉపమ.

క. **కరణంబులు దొడరిన ని । ష్కరణత నున్నను శమంబు గల యోగికి సు**
స్థిర మగు సమాధి యని ముని । వర శాండిల్యుండు శిష్యవరులకుఁ జెప్పెన్. 198

ప్రతిపదార్థం: మునివర= మునిశ్రేష్ఠుడా!; శాండిల్యుండు= శాండిల్యుడు; కరణంబులు= ఇంద్రియాలు; తొడరినన్= కలిగిఉన్నా; నిష్కరణతన్= ఇంద్రియరహితస్థితితో; ఉన్నను= ఉన్నా; శమంబు= శాంతం; కల= కల్గిన; యోగికిన్= యోగశీలుడికి; సమాధి= చిత్తలయం; సుస్థిరము+అగున్+అని= ధృడమౌతుందని; శిష్యవరులకున్= శిష్యశ్రేష్ఠులకు; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: శమప్రధానుడైన యోగికి ఇంద్రియాలున్నా, అవి లేకున్నా మనోలయ రూపమైన సమాధి దృఢంగానే ఉంటుందని శాండిల్యమహర్షి తన శిష్యులకు బోధించాడు.

సీ. **విను మోహబీజ సంజనితంబు గామద్రు । మంబు ప్రమాదజలంబు దనకుఁ**
బరిషేచనంబుగఁ బెరుఁగు నజ్ఞాన స్థి । రాధారకలితమై యందసూయ
పత్త్ర సంపద యది చిత్ర తరంబు మా । నస్కంధ దృఢత నున్నతి వహించు
శోక శాఖంబు ననేక చింతోప శా । ఖంబు బురాకృత కర్మ సార

తే. **ఘనముఁ దృష్ణాలతా పరిగతము నగుచుఁ । బొలుచుఁ దత్ఫలములకు లుబ్ధులు గడంగి**
ప్రాఁకి పడుదురు విడుపు శస్త్రముగ నది వి । ఖండితము సేసి బుధుఁడు దుఃఖములఁ దొఱఁగు. 199

ప్రతిపదార్థం: విను= ఆకర్ణించు; మోహబీజసంజనితంబు= మోహమనే విత్తనంనుండి మొలకెత్తినదైన; కామద్రుమంబు= కామ మనే చెట్టు; అజ్ఞానస్థిర+ఆధారకలితము+ఐ= అజ్ఞానమనే గట్టి వేళ్ళతో కూడినదై; ప్రమాదజలంబు= ఏమరుపాటు అనేనీరు; తనకున్ పరిషేచనంబుగన్= తనకు నీరుకట్టుగా; పెరుఁగున్= వృద్ధిపొందుతుంది; అందున్= ఆ వృక్షమునందు; అసూయ= ఇతరుల ఉత్కర్షను సహింపమి అనే దుర్గుణం; పత్త్రసంపద= ఆకుల సంపత్తి(గాఉన్నది); అది= ఆ ఆకుల సంపద; చిత్రతరంబు= మిక్కిలి చిత్రమైనది; మానస్కంధదృఢతన్= అభిమానమనే బోదె యొక్క దార్ఢ్యంతో; ఉన్నతిన్= (ఆచెట్టు) ఔన్నత్యమును;వహించున్= పొందుతుంది; శోకశాఖంబు= శోకమనే కొమ్మలు కలది; అనేక చింతా+ఉపశాఖంబు= పెక్కు చింతలనే రెమ్మలుగలది; పురాకృత కర్మ సారఘనము= పూర్వం చేసిన కర్మల బలమే చేవగా కలది; తృష్ణాలతాపరిగతమున్= ఆశ అనే తీగలతో చుట్టబడింది;అగుచున్ = అవుతూ; పొలుచున్= భాసిస్తుంది; లుబ్ధులు= లోభగుణం కలవారు; తత్ఫలములకున్= ఆ చెట్టుకు సంబంధించిన పండ్లకు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కడంగి= ప్రయత్నించి; ప్రాఁకి= ఎగబ్రాకి; పడుదురు= పతనం చెందుతారు; బుధుఁడు= పండితుడు (ఆత్మజ్ఞానం కలవాడు); విడుపు= త్యాగం; శస్త్రముగన్= ఖడ్గంగా; అది= ఆ చెట్టును; విఖండితము చేసి= తెగనరికి; దుఃఖములన్= శోకాలను; తొఱఁగున్= విడిచిపెడతాడు.

తాత్పర్యం: శుకుడా! వినుము. కామమనే వృక్షం మోహమనే బీజంనుండి మొలుస్తుంది. ఏమరుపాటు అనే నీటితో పెరుగుతుంది. అజ్ఞానమే దాని స్థిరమైన ఆధారపువేళ్ళు; అసూయే దానికి ఆకులు. అది చాలా చిత్రంగా ఉంటుంది. మానమనే కాండంతో దృఢపడి ఆ వృక్షం పైకెదుగుతుంది. శోకమే కొమ్మలుగా, అనేకచింతలే రెమ్మలుగా, పూర్వం చేసిన కర్మలబలమే చేవగా పెరిగిన ఆ చెట్టు ఆశలనే తీగెలతో చుట్టబడుతుంది. లోభులు ఆ చెట్టు పండ్ల కాశించి ఎక్కి తుదకు పతనమై పోతారు. ఆత్మజ్ఞుడైన పండితుడు త్యాగమనే కత్తితో ఆ చెట్టును తెగనరికి దుఃఖాలకు దూరమవుతాడు.

విశేషం: అలం: రూపకం

సీ. **పురము శరీరంబు; బుద్ధి తత్స్వామిని; । సర్వార్థచింతన సచివపదవి**
నడచుచు నుండు మనంబు శబ్దాద్యంబు । లై చెల్లు విషయంబులైదుఁ దగు పు
రోహితవర్గంబు శ్రోత్రాదులగు నింద్రి । యంబులు పౌరజనంబు; లిట్లు
పరఁగెడు రాజ్యంబు పరిభోగమునకు దూ । షకులైన దొరలు రజస్తమములు

తే. **వారి కఱపులఁ బడు బుద్ధి నేరకుండి । మనసుతోడ వేర్పడినఁ దానును మనంబు**
నేకముఖతఁ గార్యము సూచునేని దుష్టు । లడఁగుదురు భోగ మవ్యయ మగుఁ గుమార!' 200

ప్రతిపదార్థం: కుమార!= పుత్రా!; శరీరంబు= దేహం; పురము= పట్టణం; బుద్ధి= అంతఃకరణ చతుష్టయంలో రెండవదైన బుద్ధి; తత్స్వామిని= ఆ నగరానికి యజమానురాలు; మనంబు= మనస్సు; సర్వార్థచింతన= సమస్త పదార్థాలను గూర్చిన ఆలోచనతో; సచివ పదవిన్= మంత్రిస్థానంలో; నడచుచున్+ఉండున్= ప్రవర్తిస్తూ ఉంటుంది; శబ్ద+ఆద్యంబులు+ఐ= శబ్దం మొదలుగాగలవై; చెల్లు= ప్రవర్తిల్లే; విషయంబులు= విషయాలు; ఐదున్= ఐదును; తగు= తగిన; పురోహితవర్గంబు= పురోహితులయొక్క సమూహం; శ్రోత్ర+ఆదులు+అగు= చెవి మొదలైన; ఇంద్రియంబులు= జ్ఞానేంద్రియాలు; పౌరజనంబులు= పురప్రజలు; ఇట్లు= ఈ రీతిగా; పరఁగెడు= ప్రవర్తిల్లెడు; రాజ్యంబుపరిభోగమునకున్= రాజ్యముయొక్క అనుభవానికి; రజస్తమములు= రజోగుణ తమోగుణాలు; దూషకులు+ఐన= దూషించే స్వభావంగల; దొరలు= ప్రభువులు; నేరక+ఉండి= నేర్పు చాలక ఉన్నదై; బుద్ధి= మతి; మనసుతోడన్= చిత్తంతో; వేర్పడిన= విభిన్నమయినచో; వారికఱపులన్+పడున్= రజస్తమోగుణాల శిక్షణకు లోనవుతుంది; తానును= (అట్లు వారికి లోబడక) బుద్ధియును; మనంబును= చిత్తమును; ఏకముఖతన్= ఏకాభిప్రాయంతో; కార్యము= చేయదగినపనిని; చూచునేని= గమనించిన పక్షంలో; దుష్టులు= దుర్జనులు; అడఁగుదురు= నశించిపోతారు; భోగము= సుఖానుభవం; అవ్యయము+అగున్= అక్షయం అవుతుంది.

తాత్పర్యం: పుత్రా! ఈ శరీరమే ఒక నగరం. బుద్ధి దానికి ప్రభువు. సమస్త విషయాలనూ చింతించే చిత్తం అక్కడ మంత్రి పదవిలో కొనసాగుతూ ఉంటుంది. శబ్దాదులైన ఐదు విషయాలూ పురోహితవర్గమై ప్రవర్తిస్తాయి శ్రోత్రం మొదలైన ఇంద్రియాలే అక్కడి పురప్రజలు. ఇట్లా ఉండే ఈ రాజ్యాన్ని రజస్తమో గుణాలనే దుష్టులైన దొరలు అనుభవిస్తూ ఉంటారు. బుద్ధి తనకు వివేకం చాలనిదై చిత్తంతో విభేదించి రజస్తమోగుణాల శిక్షణలకు లోనై నశిస్తుంది. అట్లాకాక మనస్సుతో ఏకమై అది కర్తవ్యమేదో గ్రహించి ప్రవర్తిస్తే దుర్జనులైన రజస్తమోగుణాలు పొడవడగిపోతాయి. రాజ్యభోగం అక్షయ మవుతుంది'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: రూపకం.

వ. **అని చెప్పెననిన విని పాండవాగ్రజుండు భీష్మునితోఁ 'గార్యబలంబును, వీర్యబలంబును, మనోబలంబునుం గలుగు నుత్తమక్షితిపతు లనేకు లీకయ్యంబున మృతులైరి. నిజప్రాణంబునకు నొక్కరుండు నొడయండు లేక తక్కె; మృత్యువనునది యెయ్యది? యేమిటం గలిగె? నెట్లు ప్రజల సంహరించు? నెఱింగింపవే!' యనుటయు నతం డిట్లనియె.** **201**

ప్రతిపదార్థం: అని చెప్పెన్= అని చెప్పాడు; అనినన్= అనగా; విని= ఆలకించి; పాండవ+అగ్రజుండు= ధర్మజుడు; భీష్మునితోన్= శాంతనవుడితో; కార్యబలంబును= చేయదగిన పనులకు తగిన బలమూ; వీర్యబలంబును= పరాక్రమబలమూ; మనోబలంబును= చిత్తబలమూ; కలుగు= కలిగిఉన్న; ఉత్తమక్షితిపతులు= శ్రేష్ఠులైన రాజులు; అనేకులు= చాలమంది; ఈ కయ్యంబునన్= ఈ యుద్ధంలో; మృతులు+ఐరి= చనిపోయారు; ఒక్కరుండున్= ఒకడుకూడ; నిజప్రాణంబునకున్= తన ప్రాణానికి; ఒడయండు= ప్రభువు; లేక తక్కెన్= లేకపోయాడు; మృత్యువు+అనునది= చావు అనేది; ఏ+అది?= ఏది?; ఏమిటన్= దేనినుండి; కలిగెన్= సంభవించింది?; ఎట్లు= ఏ రీతిగా; ప్రజలన్= జనులను; సంహరించున్= చంపుతుంది?; ఎఱింగింపవే= తెలుపుమా; అనుటయున్= అని అడుగగా; అతండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా వ్యాసుడు శుకుడితో చెప్పాడని భీష్ము డన్నాడు. అప్పుడు ధర్మరాజు భీష్ముడితో - 'కార్యబలమూ, వీర్యబలమూ, మనోబలమూ గల్గిన చాలామంది ఉత్తములైన భూపాలకులు ఈ యుద్ధంలో అసువులు కోల్పోయారు. వీరిలో ఒక్కడు కూడా తన ప్రాణాలకు ప్రభువు కాలేకపోయాడు. మృత్యువంటే ఏమిటి? అది దేనినుండి సంభవించింది? అది ఏ రీతిగా ప్రజలను చంపుతుంది? తెలియజెప్పుమని అడిగాడు. అపుడు భీష్ము డతడితో ఇట్లా అన్నాడు:

భీష్ముఁడు ధర్మరాజునకు మృత్యుదేవత తెఱం గెఱింగించుట (సం. 12-248-7)

సీ. **విను మకంపనుఁ డను మనుజేంద్రుఁ డాత్మజుఁ । డాహవంబున మృతుఁ డైన, వగపు**
గదురంగనుండి నారదు నలవోక వ । చ్చిన వానిఁ గని సవిశేషభక్తి
యుతముగా నాతిథ్య మొనరించి తన వగ । పెఱిఁగించుటయు, నమ్మునీశ్వరుండు
గరుణ శోకనిరాసకారణం బైన యా । ఖ్యాన మొక్కటి సెప్పె; దాని తెఱఁగు

తే. **దేటపడునట్లుగాఁ బరిపాటి తోడ । నఖిలమును నెఱింగించెద నవహితుండ**
వై వినంగ నీ వడిగిన యర్థమునకు । బోధకం బగు నది కురుభూపవర్య! **202**

ప్రతిపదార్థం: కురుభూపవర్య!= కౌరవరాజోత్తమా!; వినుము; అకంపనుఁడు+అను= అకంపనుడనబడే; మనుజ+ఇంద్రుఁడు= రాజు; ఆహవంబునన్= యుద్ధంలో; ఆత్మజుఁడు= పుత్రుడు; మృతుఁడు+ఐనన్= చనిపోగా; వగపు= దుఃఖం; కదురంగన్+ఉండి= కలుగగా ఉండినవాడై; అలవోకన్= స్వేచ్ఛగా; వచ్చినవానిన్= వచ్చినవాడైన; నారదున్= నారదమునిని; కని= చూచి; సవిశేషభక్తి యుతముగాన్= అత్యధిక భక్తితో కూడిన పద్ధతిలో; ఆతిథ్యము= అతిథి సత్కారం; ఒనరించి= చేసి; తన వగపు= తన దుఃఖమును; ఎఱిఁగించుటయున్= తెలియజెప్పగా; ఆ+ముని+ఈశ్వరుండు= ఆ నారదుడు; కరుణన్= దయతో; శోకనిరాసకారణంబు+ఐన=దుఃఖ నివారణహేతువైన; ఆఖ్యానము= కథ; ఒక్కటిచెప్పెన్= ఒకటి వచించాడు;పరిపాటితోడన్= క్రమంగా; దానితెఱఁగు=ఆ కథా పద్ధతి; అఖిలమును= సర్వమును; తేటపడునట్లుగాన్= స్పష్టమయ్యేవిధంగా; ఎఱిఁగించెదన్= తెలియపరుస్తాను; అవహితుండవు+ఐ=

అవధానం కలవాడవై; వినంగన్= వింటే; అది= ఆ కథ; నీ అడిగిన= నీవు ప్రశ్నించిన; అర్థమునకున్= విషయానికి; బోధకంబు+ అగున్= బోధించేది అవుతుంది.

తాత్పర్యం: కురురాజవర్యా! వినుము. పూర్వం అకంపనుడనే ఒక రాజుండేవాడు. అతడి కుమారుడు యుద్ధంలో మరణించాడు. ఆ రాజు దుఃఖాక్రాంతుడయ్యాడు. అట్లా ఉండగా నారదముని స్వేచ్ఛగా సంచరిస్తూ అప్పుడు అక్కడికి వచ్చాడు. అతడిని చూచి రాజు మిక్కిలి భక్తితో అతిథి సత్కారం కావించాడు. తర్వాత తన దుఃఖాన్ని గూర్చి ఆ మునికి తెలియపరచాడు. ఆ మునీంద్రుడు అది విని దయతో అతడికి దుఃఖాన్ని తొలగింపజేసే కథ ఒకటి చెప్పాడు. నేను ఆ కథనంతా స్పష్టంగానూ, క్రమంగానూ నీకు వివరిస్తాను. అవధానంతో వినుము. అది వింటే నీ వడిగిన ప్రశ్నకు సమాధానం తెలియవస్తుంది.

వ. అజుండు జగంబులు సృజియింప జంతుసంతానంబు వెరిఁగి సమ్మర్దం బధికంబై యూర్పు వోవని యట్లయిన నద్దేవుండు సంకటపడి సంహారప్రకారంబు విచారింపం దదీయ చిత్తంబు కార్యదాహంబున మహాదహనుండు జనియించి జగంబులు దహింపం జొచ్చిన. 203

ప్రతిపదార్థం: అజుండు= బ్రహ్మ; జగంబులు= లోకాలు; సృజియింపన్= సృష్టించగా; జంతుసంతానంబు= ప్రాణిసంతతి; పెరిఁగి= వృద్ధిపొంది; సమ్మర్దంబు= ఒత్తిడి; అధికంబు+ఐ= ఎక్కువై; ఊర్పు పోవని అట్లు+అయినన్= ఊపిరాడని ప్రకారంగా కాగా; ఆ+దేవుండు= ఆ బ్రహ్మదేవుడు; సంకటపడి= కష్టపడి; సంహారప్రకారంబున్= ప్రాణులను సంహరించే విధానాన్ని; విచారింపన్= ఆలోచించగా; తదీయచిత్తంబు= అతడి మనస్సుయొక్క; కార్యదాహంబునన్= కార్యార్థమయిన తాపమునందు; మహాదహనుండు= గొప్ప అగ్ని; జనియించి= పుట్టి; జగంబులు= లోకాలు; దహింపన్+చొచ్చినన్= కాల్చటానికి ప్రారంభించగా.

తాత్పర్యం: పూర్వం బ్రహ్మదేవుడు లోకాలు సృష్టించాడు. అంతట ప్రాణుల సంతానం ఎక్కువగా పెరిగిపోయింది. సమ్మర్దం ఎక్కువయింది. ఊపిరి పీల్చుకొనటానికి కూడా వీలులేని విధంగా పరిస్థితి ఏర్పడింది. అప్పుడు ఆ దేవుడు చింతించి ప్రాణిలోకాన్ని ఎట్లా సంహరించటమా అని యోచించసాగాడు. అతడి చిత్తంలో కార్యాన్ని గూర్చిన తీవ్రమైన ఆలోచన వలన వేడిమి జనించింది. అందుండి మహాగ్ని ప్రభవించింది. అది లోకాలను కాల్చివేయటానికి పూనుకొన్నది.

తే. త్రినయనుఁడు వచ్చి యాతనిఁ దేర్చె; నాతఁ। డాతెఱం గెఱిఁగించి యయ్యగ్ని నుడిపె;
నపుడు పుట్టెఁ దదీయేంద్రియవ్రజమున। నొక్క యంగన రక్తాక్షి యుజ్జ్వలాంగి. 204

ప్రతిపదార్థం: త్రినయనుఁడు= మూడుకన్నులుగల శివుడు; వచ్చి= ఏతెంచి; ఆతనిన్= బ్రహ్మదేవుడిని; తేర్చెన్= శాంతింపజేశాడు; ఆతఁడు= ఆ శివుడు; ఆ తెఱంగు= ప్రాణులను సంహరించే పద్ధతిని; ఎఱిఁగించి= తెలియజెప్పి; ఆ+అగ్నిన్= ఆ దహనుడిని; ఉడిపెన్= చల్లార్చాడు; అప్పుడు= ఆ సమయంలో; తదీయ+ఇంద్రియవ్రజమునన్= ఆ బ్రహ్మయొక్క ఇంద్రియ సమూహమునందు; రక్త+అక్షి= ఎర్రని కన్నులు గలది; ఉజ్జ్వల+అంగి= ప్రకాశించే అవయవాలు గలదైన; ఒక్క అంగన= ఒక స్త్రీ; పుట్టెన్= జనించింది.

తాత్పర్యం: ఆ సమయంలో శివుడక్కడికి వచ్చాడు. బ్రహ్మను శాంతింపజేశాడు. అతడికి పెరిగిపోయిన జంతు సంతతిని ఎట్లా సంహారం చేయాలో, ఆ పద్ధతి తెలియచెప్పి ఆ యగ్నిని శమింపజేశాడు. అప్పుడు ఎర్రని కన్నులతోనూ, భాసమానమైన అవయవాలతోనూ ఒప్పే ఒక స్త్రీ బ్రహ్మదేవుడి ఇంద్రియాలనుండి ఉద్భవించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. పుట్టి దక్షిణాభిముఖియై పోవం గని కమలసంభవుండు పిలిచి 'మృత్యువ! ప్రజలఁ బ్రబల దుర్బలభేదంబు లేక సంహరింపు' మనుటయు నవ్వనిత వనటం గన్నీరొలుక 'నీ కుద్భవించి క్రూరకర్మంబు సేయుదునే? ధర్మకార్యంబునకుం బనుపు'మని పలికిన నయ్యశ్రుబిందువులు దోయిటంబట్టి యద్దేవుం డమ్ముద్దియతో 'నిదియపనిగా నుదయించినదానవు; నీవు ప్రజాసంహారంబు సేయవలయు' ననవుడు నాబాల గాలిం దూలు తీవయుంబోలెఁ గంపంబు నొందుచు. 205

ప్రతిపదార్థం: పుట్టి= ఉద్భవించి; దక్షిణా+అభిముఖి ఐ= దక్షిణదిశ కెదురైన ముఖంకలదై; పోవన్= పోతుండగా; కని= చూచి; కమలసంభవుండు= బ్రహ్మ; పిలిచి= ఆహ్వానించి; మృత్యువ!= ఓ మృత్యుదేవతా!; ప్రజలన్= జనులను; ప్రబలదుర్బల భేదంబు లేక= బలవంతుడు, దుర్బలుడు అనే తేడా లేకుండా; సంహరింపుము= చంపుము; అనుటయున్= అనగా; ఆ+వనిత= ఆ అంగన; వనటన్= దుఃఖంతో; కన్నీరు= బాష్పజలం; ఒలుకన్= ప్రసరించగా; నీకున్+ఉద్భవించి= నీకు పుట్టి; క్రూరకర్మంబు= క్రూరమైన కార్యం; చేయుదునే?= అనుష్ఠింతునా; ధర్మకార్యంబునకున్= పుణ్యకార్యానికి; పనుపుము+అని= నియోగింపుమని; పలికినన్= చెప్పగా; ఆ+దేవుండు= ఆ బ్రహ్మ; ఆ+అశ్రుబిందువులు= ఆ కన్నీటి బిందువులు; దోయిటన్= దోసిలితో; పట్టి= పట్టుకొని; ఆ+ముద్దియతోన్= ఆ వనితతో; ఇదియ= ఇదే; పనిగా= కార్యముగా; ఉదయించినదానవు= పుట్టినదానవు; నీవు ప్రజాసంహారంబు= నీవు జంతుసంహారము; చేయన్ వలయున్= చేయాలి; అనవుడున్= అనగా; ఆ బాల= ఆ బాలిక; గాలిన్+తూలు= వాయువుతో చలించే; తీవయున్+పోలెన్= లతవలె; కంపంబున్+ఒందుచున్= వణకిపోతూ.

తాత్పర్యం: ఆ రీతిగా పుట్టి దక్షిణదిక్కు కెదురుగా పోసాగింది. అది చూచి బ్రహ్మ 'ఓ మృత్యుదేవతా! నీవు ప్రాణులను ఇది బలమైనది, ఇది బలం లేనిది అన్న భేదం లేకుండా చంపుము' అని చెప్పాడు. అందుకు ఆ స్త్రీ దుఃఖిస్తూ కంటనీరు పెట్టి 'దేవా! నీకు పుట్టి నేను ఈ సంహారమనే క్రూరకార్యం ఎట్లా చేసేది? నన్ను ధర్మకార్యానికి నియోగించుము' అని అడిగింది. బ్రహ్మ ఆమె కన్నీటి బిందువులను అంజలితో పట్టుకొని ఆమెతో 'నీవు ఇందుకే జన్మించావు. కాబట్టి ప్రజాసంహారకార్యం తప్పక చేయాలి' అన్నాడు. అందు కా బాలిక గాలికి చలించే తీగవలె వణకిపోతూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ.

క. 'మనుజుల హరించి బాంధవ । జనమున శోకంబుఁ జూడఁ జాలుదునె? తపం
బున కేఁగెద సదయంబుగ । ననుజ్ఞ సేయంగవలయు' నని ప్రణమిల్లెన్. 206

ప్రతిపదార్థం: మనుజులన్= మానవులను; హరించి= చంపి; బాంధవజనమునన్= వారి బంధుజనులలో; శోకంబున్= దుఃఖమును; చూడన్+చాలుదునె?= చూడగలనా?; తపంబునకున్= తపస్సు చేయటానికి; ఏఁగెదన్= పోతాను; సదయంబుగన్= కృపతో; అనుజ్ఞ చేయంగన్ వలయున్= అనుమతించాలి; అని ప్రణమిల్లెన్= అని నమస్కరించింది.

తాత్పర్యం: 'మానవుల ప్రాణాలు హరించి వారి బంధువులలో శోకం నేను చూడగలనా? తపస్సు చేయటానికి పోతాను. దయతో నాకు అనుమతి ఇమ్ము' అని నమస్కారం చేసింది.

వ. దానికి నరవిందసంభవుండు మందస్మితంబుతో 'ని ట్లేలగు? జంతుసంహారంబు నీ కవశ్యకర్తవ్యంబు; దానిం జేయమి సువ్వేయధర్మం' బని నిర్బంధించిన నూరకుండి యన్నాతి పదంపడి యల్లన సురిఁగి ధేనుకాశ్రమంబున కరిగి యత్యంత దీర్ఘకాలంబు ఘోరతపంబు సేసి, కౌశికి గంగ నందయను నదులకుం బోయి వాయు వాహారంబుగా నతిదుష్కరవ్రతంబు లనేక వర్షంబు లాచరించి హిమశిఖరి శిఖరంబునకుం జని చతురానన ప్రీతికరం బగు నిష్ఠాతిశయంబున సంయమంబు దాల్చియుండ నద్దేవుండు. 207

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దానికిన్= అందుకు; అరవిందసంభవుండు= బ్రహ్మ; మందస్మితంబుతోన్= చిరునవ్వుతో; ఇట్లు+ఏల+అగున్?= ఈ విధంగా ఎందుకు జరుగుతుంది?; జంతుసంహారంబు= ప్రాణుల సంహరించటం; నీకున్+అవశ్యకర్తవ్యంబు= నీకు తప్పక చేయదగినపని; దానిన్= ఆ కార్యాన్ని; చేయమి= చేయకపోవటం; అధర్మంబు సువ్వె= అధర్మంగదా!; అని నిర్బంధించినన్= అని పట్టువిడక చెప్పేసరికి; ఊరక+ఉండి= మారుమాటలాడకుండా ఉండి; ఆ+నాతి= ఆ స్త్రీ; పదంపడి= ఆపైన; అల్లన= మెల్లగా; సురిఁగి= అదృశమై చని; ధేనుక+ఆశ్రమంబునకున్= ధేనుకనామకమైన ఆశ్రమానికి; అరిగి= వెళ్ళి; అత్యంత దీర్ఘకాలంబు= చాలకాలం; ఘోరతపంబుచేసి= తీవ్రమైన తపస్సు చేసి; కౌశికి, గంగ, నంద అను నదులకున్= కౌశికి మొదలైన ఏరులకు; పోయి= వెళ్ళి; వాయువు+ఆహారముగాన్= గాలినే భోజనంగా; అనేకవర్షంబులు= పెక్కు సంవత్సరాలు; అతి దుష్కర వ్రతంబులు= మిక్కిలి కష్టమైన వ్రతాలను; ఆచరించి= చేసి; హిమశిఖరిశిఖరంబునకున్= హిమవత్పర్వతాగ్రానికి; చని= వెళ్ళి; చతుః+ఆనన ప్రీతికరంబు+అగు= బ్రహ్మకు ప్రీతి కల్గించే; నిష్ఠా+అతిశయంబునన్= నిష్ఠాగరిష్ఠతతో; సంయమంబు= నియమాన్ని; తాల్చి ఉండన్= వహించి ఉండగా; ఆ+దేవుండు= ఆ బ్రహ్మదేవుడు;

తాత్పర్యం: అందుకు బ్రహ్మ చిరునవ్వు నవ్వి 'ఇట్లా ఎందుకు జరుగుతుంది? నీకు జంతువులను సంహరించటం చేయదగిన పని. ఆ పని చేయకపోతేనే అధర్మం' అని నిర్బంధించాడు. ఆమె అందు కేమీ బదులు చెప్పక ఊరుకొన్నది. పిదప మెల్లగా అక్కడినుండి మాయమైపోయి ధేనుకాశ్రమం చేరింది. అక్కడ చాలా కాలం తీవ్ర తపోనిష్ఠ కొనసాగించింది. అక్కడినుండి కౌశికి, గంగ, నంద అనే నదులకు వెళ్ళింది. ఆ నదీతీరాలలో గాలినే ఆహారంగా స్వీకరిస్తూ అనేక సంవత్సరాలు మిక్కిలి దుష్కరమైన వ్రతాలు చేసింది. ఆ పై హిమవత్పర్వత శిఖరం చేరి బ్రహ్మకు ప్రీతికరమైన నిష్ఠతో నిగ్రహం దాల్చి ఉండింది. అప్పుడు ఆ బ్రహ్మదేవుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **సన్నిధిసేసి తపముమెయి । నున్నఁ బ్రయోజనము గలదె? యుడుగుము పుత్త్రీ!'**
యన్న 'శరణంబు వేఁడెద । నన్ను దయం గావు' మనియె నాతి యతనితోన్. **208**

ప్రతిపదార్థం: సన్నిధిచేసి= సమీపానికి వచ్చి; పుత్త్రీ!= కుమారీ!; తపముమెయిన్= తపస్సుతో; ఉన్నన్= ఉంటే; ప్రయోజనము= కార్యం; కలదె?= ఉన్నదా?; ఉడుగుము= మానుము; అన్నన్= అనగా; నాతి= వనిత; అతనితోన్= ఆ బ్రహ్మతో; శరణంబు వేఁడెదన్= శరణు కోరుతాను; నన్నున్ దయన్= నన్ను దయతో; కావుము+అనియెన్= రక్షించు మని అన్నది.

తాత్పర్యం: (బ్రహ్మ) ఆమె సమీపానికి వచ్చి 'బిడ్డా! ఈ విధంగా తపస్సు చేస్తూ ఉంటే నీకు కలిగే ప్రయోజన మేమి? ఈ తపోనిష్ఠ వదలిపెట్టుము' అని చెప్పాడు. అందు కామె బ్రహ్మతో "దేవా! నిన్ను శరణు వేడుతున్నాను. నన్ను దయతో రక్షించుము' అని చెప్పింది.

వ. **అనిన విని యమ్మహాత్ముండు.** **209**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆకర్ణించి; ఆ+మహాత్ముండు= ఆ బ్రహ్మ.

తాత్పర్యం: ఆమె అట్లా అనగా విని మహాత్ముడైన చతుర్ముఖుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **'ప్రజల హరియించు టిది నీకు పరమధర్మ । మేను బొంకెదనే? దీని నెల్ల భంగి**
నాచరింపన వలయు; మత్ప్రార్థనంబు । భగ్న మొనరించు టొప్పదు పద్మనయన! **210**

ప్రతిపదార్థం: పద్మనయన!= కమలనేత్రా!; ప్రజలన్= జనులను; హరియించుట= సంహరించటం; ఇది= అనే ఈ పని; నీకున్ పరమధర్మము= నీకు శ్రేష్ఠమైన ధర్మం; ఏను= నేను; బొంకెదనే?= అసత్యం పలుకుతానా!; దీనిన్= ఈ ప్రజాసంహారాన్ని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎల్లభంగిన్= ఎన్ని విధాలనైనా; ఆచరింపన వలయున్= చేసేతీరాలి; మత్ప్రార్థనంబు= నా వేడికోలు; భగ్నము+ఒనరించుట= వమ్ముచేయటం; ఒప్పదు= తగదు.

తాత్పర్యం: పద్మాలవంటి నేత్రాలు కలదానా! ప్రజాసంహారం కావించటమే నీకు మేలైన ధర్మం. నేను నీతో అసత్య మాడుతానా? ఈ పనిని నీవు అన్నివిధాలా చేసే తీరాలి. నా కోరికను నెరవేర్చకుండా వమ్ముచేయటం నీకు ఉచితం కాదు.

వ. మఱియు నొక్క విశేషంబు సెప్పెద; నీయశ్రుజలంబు లే నంజలిపుటంబునం బట్టు టెఱుంగుదు గాదె? యవి నానావ్యాధిరూపంబుల మానవుల బాధించుఁ; గామ క్రోధంబులు వానికిం దోడుపడు; వారు దానన తెగుదురు; నీవు నిమిత్తమాత్రం; బింతియ; నీకు వరం బిచ్చెద. 211

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; ఒక్కవిశేషంబు= ఒక విశిష్టవిషయాన్ని; చెప్పెదన్= చెప్పుతాను; ఏను= నేను; నీ అశ్రుజలంబులు= నీ కన్నీరు; అంజలిపుటంబునన్= దోయిట; పట్టుట= గ్రహించటం; ఎఱుంగుదుకాదె?= తెలియుదువుగదా!; అవి= ఆ కన్నీళ్ళు; నానావ్యాధిరూపంబులన్= అనేక రోగరూపాలతో; మానవులన్= మనుజులను; బాధించున్= పీడిస్తాయి; కామక్రోధంబులు= కోరిక, కోపం అనేవి; వానికిన్= ఆ కన్నీటికి; తోడుపడున్= సాయపడతాయి; వారు= ఆ మానవులు; దానన= దానివల్లనే; తెగుదురు= మరణిస్తారు; నీవు నిమిత్తమాత్రంబు= నీవు కారణంమాత్రమే; ఇంతియ= ఇంతే; నీకున్ వరంబు+ఇచ్చెదన్= నీకు విశేషించి ఒక వరంకూడా ఇస్తాను.

తాత్పర్యం: ఇంకా ఒక విశేషాంశం చెప్పుతాను. నీ కన్నీటిబిందువులను నేను నా దోసిట పట్టుకొనటం నీకు తెలుసుగదా! ఆ కన్నీరు అనేకరోగాల రూపాలతో మనుష్యులను బాధిస్తాయి. కామక్రోధాలనే దుర్గుణాలు ఆ పనిలో ఆ కన్నీటికి సాయం చేస్తాయి. ఆ మానవులు వాటితోనే మరణిస్తారు. నీవు ఈ పనిలో నిమిత్తమాత్రంగానే ఉంటావు. ఇంతే. నీకు విశేషించి ఒక వరం కూడా ఇస్తాను.

తే. పురుషుఁడును నంగనయును నపుంసకుండు । నగుము పుత్త్రిక! పురుషుని నంగనను న
పుంసకుని జంపువేళలఁ బొందకుండు । పాపమును నిది ధర్మమై పరఁగు నీకు.' 212

ప్రతిపదార్థం: పుత్త్రిక!= కుమారీ!; పురుషుఁడును= మగవాడుగానూ; అంగనయును= స్త్రీగానూ; నపుంసకుండును= పేడివిగానూ; అగుము= కమ్ము; పురుషునిన్= మగవాడిని; అంగనను= స్త్రీని; నపుంసకునిన్= పేడివాడిని; చంపువేళలన్= సంహరించే సమయంలో; పాపమును= కల్మషాన్ని; పొందకుండు= చెందకుండా ఉంటుంది; ఇది= ఈ సంహారం; నీకున్ ధర్మము+ఐ పరఁగున్= నీకు ధర్మకార్యమై విలసిల్లుతుంది.

తాత్పర్యం: కుమారీ! నీవు పురుషుడుగా, స్త్రీగా, నపుంసకుడిగా కమ్ము. అట్లయినప్పుడు నీవు మగవాడిని, ఆడుదానిని, పేడివానిని చంపేసమయంలో నీకు పాపమంటదు. అంతేకాక నీకది కర్తవ్యమైన ధర్మంగా కూడా పరిణమిస్తుంది.

వ. అని పలుకుటయు నప్పొలంతి శాపంబునకు వెఱచియు, నది యట్టిద కాక యను తలంపు దోఁచియుఁ, బ్రజాసంహారంబు సేయు నధికారంబు పూనె; మృత్యుదేవత ప్రాణాపహారిణి యగుఁ బ్రాణిజాలంబు దేహంబులం బాసి దేవాదిభావంబులం బొందుచు మగుడ మనుష్యత్వంబు నొందుచుండు. 213

ప్రతిపదార్థం: అని పలుకుటయున్= అని చెప్పగానే; ఆ+పొలంతి= ఆ వనిత; శాపంబునకున్= బ్రహ్మ శాపానికి; వెఱచియున్= భయపడి కూడా; అది= ఆ కార్యం; అట్టిద కాక= అట్టిదేఅగుగాక; అను= అనునట్టి; తలంపు= భావన; తోఁచియున్= కలిగియు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రజాసంహారంబున్= జనులను చంపటాన్ని; చేయు అధికారంబు= నిర్వహించే ప్రక్రియను; పూనెన్= వహించింది; మృత్యుదేవత= మరణదేవత; ప్రాణ+అపహారిణి= ప్రాణాలను అపహరించేది; అగున్= అవుతుంది; ప్రాణిజాలంబు= జంతుసంతతి; దేహంబులన్= శరీరాలను; పాసి= వదలి; దేవ+ఆదిభావంబులన్= దేవతలు మొదలైన స్వరూపాలను; పొందుచున్= చెందుతూ; మగుడన్= మరల; మనుష్యత్వంబున్= మానవత్వాన్ని; ఒందుచున్+ఉండున్= పొందుతూ ఉంటుంది.

తాత్పర్యం: బ్రహ్మ ఆ విధంగా చెప్పగానే ఆ వనిత అతడి మాట వినకపోతే అతడు శపిస్తాడేమో అని భయపడింది. తన కర్తవ్యం అట్టిదే అగునుగాక అనే ఊహకూడా ఆమెకు సంభవించింది. అందువలన ఆమె జనసంహారమనే అధికారాన్ని వహించింది. ఆ మృత్యుదేవతే ప్రజలప్రాణాలను అపహరించేదిగా ఉన్నది. ప్రాణుల సమూహం మరణకాలంలో శరీరాలు వదలి పూర్వకర్మానుసారంగా దేవాదిస్వరూపాలు పొందుతుంది. మళ్ళీ మానవత్వం ఆ ప్రాణులకు కలుగుతూ ఉంటుంది.

తే. భీమనాదుండు భీముఁ డుద్దాముఁ డప్ర । తర్క్యతేజోమయుఁడు జగత్ప్రాణుఁ డొడలు
మనుపఁ జెఱుపంగ నొడయండు చనుట మగుడ । నరుగుదెంచుట వింతగా దతని కెందు.' 214

ప్రతిపదార్థం: జగత్ప్రాణుఁడు= వాయుదేవుడు; భీమనాదుండు= భయంకరమైన శబ్దం కలవాడు; భీముఁడు= భీకరుడు; ఉద్దాముఁడు= స్వతంత్రుడు; అప్రతర్క్యతేజోమయుఁడు= ఊహకందని తేజస్స్వరూపం కలవాడై; ఒడలు= శరీరమును; మనుపన్= కాపాడటానికి;చెఱుపంగన్= నశింపజేయటానికి; ఒడయండు= ప్రభువు; అతనికిన్= ఆ వాయువునకు; ఎందున్= ఎక్కడనైనా; చనుట= పోవటం; మగుడన్= మరల; అరుగుదెంచుట= రావటం; వింతకాదు= ఆశ్చర్యం కాదు.

తాత్పర్యం: జగత్తునకు ప్రాణస్వరూపుడైన వాయువు భీకరమైన ధ్వని కలిగి ఉంటాడు. అతడు భయంకరుడు; కట్టుబాటులేనివాడు, ఊహించరాని తేజస్సు కలవాడు. అతడే శరీరాన్ని రక్షించటానికీ, నశింపజేయటానికీ సమర్థుడైన ప్రభువు. ఎక్కడికైనా అతడు పోవటం, మళ్ళీ రావటం అనేది వింతకాదు'.

వ. అనినం 'దొల్లియు నిది వింటి; నాఁ డత్యంత శోకాక్రాంతుండ నగుట న వ్వినికి రిత్తవోయె; నేఁ డీ యుపాఖ్యానంబున యర్థంబు పరిజ్ఞాతం బయ్యె.' 215

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; తొల్లియున్= పూర్వంకూడా; ఇది= ఈ విషయాన్ని; వింటిన్= విన్నాను; నాఁడు= ఆ దినం; అత్యంతశోక+ఆక్రాంతుండను= మిక్కిలి దుఃఖంచేత పీడితుడను; అగుటన్= కావటంవలన; ఆ+వినికి= ఆ వినటం; రిత్తపోయెన్= వ్యర్థమయింది; నేఁడు= ఈ దినం; ఈ ఉపాఖ్యానంబున= ఈ కథలోని; అర్థంబు= మృత్యువిషయం; పరిజ్ఞాతంబు= తెలిసింది; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: భీష్ము డట్లా చెప్పేసరికి ధర్మజుడు 'ముందుకూడా ఇది విన్నాను. కాని, ఆ దినాన మిక్కిలిగా దుఃఖపీడితుడను కావటం వలన ఆ విన్నది వ్యర్థమయింది. నేడు నీవు చెప్పిన ఈ కథలో విషయం నాకు బోధ పడింది'.

క. అని పలికి యధిప! కుంతీ । తన యాగ్రజుఁ డిట్టు లనుఁ బితామహుతో 'స
జ్జనకోటి ధర్మమునకును । మనమున వెఱచు; నది యింత మాన్యం బగునే? 216

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అని పలికి= అని చెప్పి; కుంతీ తనయ+అగ్రజుఁడు= కుంతీపుత్రులలో పెద్దవాడైన ధర్మరాజు; పితామహుతోన్= భీష్ముడితో; ఇట్టులు+అనున్= ఈ రీతిగా అన్నాడు: సజ్జనకోటి= సుజనులయొక్క సమూహం; ధర్మమునకున్= ధర్మానికి; మనమునన్= చిత్తంలో; వెఱచున్= భయపడుతుంది; అది= ఆ ధర్మం; ఇంత మాన్యంబు= ఇంతగా పూజింపదగింది; అగునే?= అవునా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: జనమేజయమహారాజా! ధర్మరాజు ఈ రీతిగా చెప్పి భీష్ముడితో మళ్ళీ ఇట్లా అన్నాడు: 'సజ్జనులైన వారు తమ మనస్సులో ధర్మానికి భయపడుతున్నారు. ఆ ధర్మం ఇంతగా పూజింపదగినంత గొప్పదా?

వ. ధర్మంబు తెఱం గిట్టిదని నిరూపించి యనుగ్రహింపుము.' 217

ప్రతిపదార్థం: ధర్మంబు తెఱంగు= ధర్మంయొక్క తీరు; ఇట్టిది+అని= ఈ విధంగా ఉన్నదని; నిరూపించి= వివరించి; అనుగ్రహింపుము= అనుగ్రహం చూపుము.

తాత్పర్యం: ఆ ధర్మముయొక్క పద్ధతి ఇట్లాంటిదని ప్రతిపాదించి నన్ను అనుగ్రహించుము'.

సీ. అనుటయు నతఁ డిట్టు లనియె 'వేదంబుల । మీఁది భక్తియు దృఢస్మృతియు సమ్య
గాచారమును రుచిరాకారములు ధర్మ । మునకుఁ గొందఱు బుధజనము లర్థ
మగుఁ జతుర్థాకార మం; ద్రయినను బాడి । దప్పియు బొంకియు ధనము గూర్చు
టెల్ల పాపములకు నెక్కుడు; బొంకమి । పరుల సొమ్ముల కాసపడమి సర్వ

ఆ. ధర్మములకు నధికతరములు విధివిహి । తంబు గాని యట్టి ధర్మ మనఘ!
చవుట నిడిన విత్తు చాడ్పున రూపించి । చేయ నిహపరములఁ జెందు సుఖము. 218

ప్రతిపదార్థం: అనుటయున్= (ధర్మరాజు) అట్లు అనగా; అతఁడు= భీష్ముడు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; అనఘ!= పాపరహితుడా!; ధర్మమునకున్= ధర్మానికి; వేదంబులమీఁది భక్తియున్= వేదముల యందు భక్తినీ దృఢస్మృతియున్= గట్టిస్మృతియును; సమ్యగాచారమును= చక్కని ఆచరణమును; రుచిర+ఆకారములు= అందమైన(మూడు) స్వరూపాలు; కొందఱు బుధజనములు= పండితులు కొందరు; అర్థము= ధనం; చతుర్థ+ఆకారము= నాల్గవస్వరూపం; అగున్ అంద్రు= అగునని చెప్తుతారు; అయినను= ఐనప్పటికి; పాడితప్పియున్= న్యాయం దప్పియును; బొంకియున్= అసత్య మాడియు; ధనమున్+కూర్చుట= అర్థము నార్జించటం; ఎల్లపాపములకున్= సమస్త పాపాలకు; ఎక్కుడు= అధికమైనది; బొంకమి= అసత్యం పలుకకుండా ఉండటం; పరులసొమ్ములకున్= ఇతరుల ధనములకు; ఆస పడమి= ఆశపడకుండా ఉండటం; సర్వధర్మములకున్= అన్ని ధర్మాలకూ; అధికతరములు= ఎక్కువయినవి; విధివిహితంబుకాని= శాస్త్రోక్తం కానట్టి; అట్టి ధర్మము= అటువంటి ధర్మం; చవుటన్= చవిటినేలలో; ఇడిన= ఉంచిన; విత్తుచాడ్పునన్= విత్తనమువంటిదని; రూపించి= నిరూపించి; చేయన్= అనుష్ఠించగా; ఇహపరములన్= ఈ లోకంలోనూ, పరలోకంలోనూ; సుఖము చెందున్= సుఖం పొందుతాడు.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అనగానే భీష్ము డతడితో ఈ రీతిగా చెప్పాడు: 'అనఘా! వేదాలపై భక్తీ, స్మృతులపై గట్టి విశ్వాసం, మంచి ఆచారం అనేవి మూడూ ధర్మానికి సుందరమైన ఆకారాలు. కొందరు పండితులు ధనం ధర్మానికి నాల్గవ ఆకారమంటారు. ఐనా న్యాయం తప్పి, అసత్యం పలికి ధనం సంపాదించటం పాపాలన్నింటిలోకీ ఎక్కువపాపం. అసత్యం పలకకుండా ఉండటం, ఇతరుల ధనాన్ని ఆశించకుండటం అన్ని ధర్మాలలోనూ మేలైన ధర్మాలు. శాస్త్రవిరుద్ధమైన ధర్మం చేయటం చవిటి నేలలో విత్తిన విత్తనం వలె నిష్ప్రయోజనమవుతుంది. ఇది గ్రహించి ప్రవర్తిస్తే ఇహలోక పరలోకాలలో సుఖం లభిస్తుంది.

వ. ధర్మంబు తెఱంగు సూక్ష్మంబు; ధర్మంబులు బహువిధంబు; లట్లు గావున ధర్మసర్వస్వ నైజస్వరూప నిరూపణంబు సేసి కరతలామలకంబుగాఁ బలికెద నాకర్ణింపుము. 219

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధర్మంబు తెఱంగు= ధర్మంయొక్క పద్ధతి; సూక్ష్మంబు= అధ్యాత్మమైన (అగోచరమైనది); ధర్మంబులు= ధర్మాలు; బహువిధంబులు= అనేక విధాలు; అట్లు కావునన్= ఆ కారణంవలన; ధర్మసర్వస్వ నైజస్వరూపనిరూపణంబు= సర్వధర్మసారమైన నిజస్వరూపంయొక్క ప్రతిపాదనమును; చేసి= ఒనర్చి; కరతల+ఆమలకంబుగాన్= చేతిలోని ఉసిరిక కాయవలె స్పష్టమయ్యేటట్లు; పలికెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ధర్మస్వరూపం చాలా సూక్ష్మమై అగోచరంగా ఉంటుంది. ధర్మాలు నానావిధాలుగా ఉంటాయి. అందువలన అన్ని ధర్మాలకూ సారభూతమైనది ధర్మనిజ స్వరూపజ్ఞానం. ఆ స్వరూపాన్ని నిరూపించి అరచేతిలోని ఉసిరికకాయవలె స్పష్టమయ్యేటట్లు వివరిస్తాను వినుము.

క. ఒరు లేమేమి యొనర్చిన । నరవర! యప్రియము తన మనంబున కగుఁ దా
నొరులకు నవి సేయకునికి । పరాయణము పరమధర్మపథముల కెల్లన్.' 220

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; ఒరులు= పరులు; ఏమి+ఏమి+ఒనర్చినన్= ఏ యే పనిచేస్తే; తన మనంబునకున్= తన చిత్తానికి; అప్రియము అగున్= అనిష్టం అగునో; అవి= ఆ పనులు; తాను ఒరులకున్= తాను పరులకు; చేయక+ఉనికి= చేయకుండా ఉండటం; పరమధర్మపథములకున్+ఎల్లన్= శ్రేష్ఠమైన ధర్మమార్గా లన్నింటికీ; పరాయణము= ఉత్తమమైన ఆశ్రయం.

తాత్పర్యం: రాజా! ఇతరులు ఏమేమి చేస్తే తన మనస్సునకు అప్రియంగా ఉంటుందో, ఆ పనులను తాను ఇతరులకు చేయకుండా ఉండటమే అన్ని ధర్మమార్గాలకూ ఉత్తమమైన ఆలంబనంగా ఉన్నది'. ('ధర్మపదములకు' అన్న పాఠమునకు 'ధర్మస్థానాలకు' అని అర్థం చెప్పుకొనాలి).

వ. అని చెప్పినం బ్రీతుండై తాతకుం బ్రణమిల్లి పాండవాగ్రజుండు 'ధర్మస్వరూప నిరూపణం బింత యొప్పునే!' యని యభివర్ణించి 'యాగ్రహంబున నేమేనియు నడుగుచున్నవానింగా నన్నుం దలంప వలదు; వలవని యట్టిది యడుగం దెలిసికొనుటకై వలయునది యడుగుదు; నట్లుంగాక యడిగిన దానిన యడుగుటయుం గలుగుఁ; గృప నాదరింపుము. సమ్యగాచారంబు ధర్మప్రకారంబని నిర్దేశించితి; వుత్తమాచార ప్రకారం బెఱింగింపవే' యనుటయు నమ్మనుజపతికి నమ్మహితాత్ముం డిట్లనియె. 221

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని వచించగా; ప్రీతుండు+ఐ= సంతసించినవాడై; తాతకున్= పితామహుడైన భీష్ముడికి; ప్రణమిల్లి= నమస్కరించి; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; ధర్మస్వరూపనిరూపణంబు= ధర్మానికి చెందిన నిజరూపంయొక్క ప్రతిపాదనం; ఇంత ఒప్పునే= ఇంతగా ఒప్పిదమగునే; అని అభివర్ణించి= అభినందన పూర్వకంగా పల్కి; నన్నున్= నన్ను; ఆగ్రహంబునన్= కోపంతో; ఏమి+ఏనియున్= ఏదేదో; అడుగుచున్నవానింగాన్= ప్రశ్నించేవాడనుగా; తలంపన్ వలదు= అనుకొనవద్దు; వలవనిఅట్టిది= అనావశ్యకమైనదానిని; అడుగన్= ప్రశ్నించను; వలయునది= ఆవశ్యకమైనది; తెలిసికొనుటకై= బోధపరచుకొనటానికై; అడుగుదున్= ప్రశ్నిస్తాను; అట్లున్+కాక= అట్లేకాకుండా; అడిగినదానినిన్= ప్రశ్నించిన విషయాన్ని; అడుగుటయున్= మరల ప్రశ్నించటం; కలుగున్= సంభవిస్తుంది; కృపన్= దయతో; ఆదరింపుము= మన్నించుము; సమ్యగాచారంబు= మంచి ఆచారం; ధర్మ+ఆకారంబు+అని= ధర్మంయొక్క స్వరూపమని; నిర్దేశించితి(వి)= చెప్పావు; ఉత్తమ+ఆచార ప్రకారంబు= మేలైన ఆచారముయొక్క విధానాన్ని; ఎఱింగింపవే= తెలుపుమా; అనుటయున్= అని అనేసరికి; ఆ+మనుజపతికిన్= ఆ రాజునకు; ఆ+మహిత+ఆత్ముండు= ఆ మహాత్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: భీష్ము డావిధంగా చెప్పేసరికి ధర్మరాజు సంతుష్టు డయ్యాడు. తాతకు నమస్కరించాడు. 'ధర్మస్వరూప నిరూపణం ఇంత చక్కగా ఉన్నదే!' అని ఆ నిరూపణాన్ని మెచ్చుకొన్నాడు. తరువాత భీష్ముడిని చూచి ' నేనేదో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పట్టుదలతో అడుగుతున్నానని భావించవద్దు. అవసరం లేనిదాని నడగను. తెలిసికొనాలన్న అంశాన్ని అడుగుతాను. అంతేకాదు. ఒక్కొక్క సారి జిజ్ఞాసతో అడిగిన విషయాన్నే మళ్ళీ అడుగుతుంటాను. దయతో నన్ను మన్నించి అనుగ్రహించుము. నీవు ధర్మస్వరూపాన్ని నిరూపిస్తూ సదాచారం ధర్మముయొక్క స్వరూపమని చెప్పావు. ఉత్తమమైన ఆచారం ఎట్లాంటిదో నాకు తెలియజెప్పుము' అని అడిగాడు. అప్పుడు ఆ ధర్మరాజుతో మహాత్ముడైన భీష్ముడు ఇట్లా అన్నాడు:

తే. **'వేద మాచారములఁ జెప్పు వివిధగతుల; । సకలహిత మగునట్టి యాచార మరయ**
ననఘ! వేఱొండు గలదె? మహాత్ము లెద్ది । యాచరింతురు దానిఁ జేయంగవలయు.' 222

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; వేదము= శ్రుతి; వివిధగతులన్= అనేకవిధాల; ఆచారములన్= ఆచరణాలను; చెప్పున్= వచిస్తుంది; సకలహితము+అగునట్టి= అందరికీ హితమైనట్టి; ఆచారము= ఆచరణం; వేఱొకటి= మరొకటి; అరయన్= పరిశీలించగా; కలదె?= ఉన్నదా?; మహాత్ములు= పెద్దలు; ఎద్ది= దేనిని; ఆచరింతురు= చేస్తారో; దానిన్= ఆ కార్యమును; చేయంగన్ వలయున్= అనుష్ఠించాలి.

తాత్పర్యం: 'పాపరహితా! వేదం వివిధాచారాలను నిరూపిస్తున్నది. పరిశీలించి చూస్తే అందరికీ హితకరమైన సదాచారం వేరే ఏమున్నది? మహాత్ములైన వారు ఏ ఆచారాన్ని పాటిస్తారో, దానినే తక్కినవారు పాటించాలి.

వ. **అని పలికి 'తొల్లి జాజలి యను మునికిఁ దులాధారుండను వణిగ్వరునితో సంవాదంబు గలిగె; నది యితిహాసరూపంబునఁ జెల్లు; నేతద్విషయంబయి యుండు దానిం జెప్పెద; నాకర్ణింపుము.** 223

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; తొల్లి= పూర్వం; జాజలిఅను మునికిన్= 'జాజలి' అనే మౌనికీ; తులాధారుఁడు+అను వణిగ్వరునితోన్= తులాధారుడనే వైశ్య ప్రముఖుడితో; సంవాదంబు= సంభాషణ; కలిగెన్= ప్రవర్తిల్లింది; అది= ఆ సంవాదం; ఇతిహాసరూపంబునన్= ఇతిహాసంగా; చెల్లున్= ప్రవర్తిల్లుతున్నది; ఏతద్విషయంబయి= ఈ సదాచారరూపమైన ధర్మాన్ని విషయంగా కలిగినదై; ఉండున్= ఉంటున్నది; దానిన్= ఆ సంవాదాన్ని; చెప్పెదన్= వివరిస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని వచించి భీష్ముడు ఇట్లా అన్నాడు: 'పూర్వం 'జాజలి' అనే మునికీ, తులాధారుడనే వైశ్య శ్రేష్ఠుడితో ఒక సంవాదం జరిగింది. అది ఇతిహాసరూపంలో ఉన్నది. అది నీ వడిగిన సదాచారరూపమైన ధర్మాన్ని వివరిస్తుంది. ఆ సంవాదాన్ని వివరిస్తాను వినుము.

జాజలి తులాధారుల సంవాదప్రకారము (సం. 12-252-1)

సీ. **చలనంబు లేక జాజలి తపోనిష్ఠ నా । సీనుఁడై యుండఁ బిచ్చికలు గూఁడు**
గావించెఁ దన్మస్తకంబున; నమ్మిథు । నము గారణముగ నండములు గలిగి
పిల్లలై వర్తించి యెల్లెడ కెరగొన । నరుగుచు మరలుచు నవియు నవియు
నగ్గూఁట వసియింప, నతఁడు దయాళుఁ డై । వానిఁ జోపక యుండి వత్స! తనదు

తే. **నియతి కెద మెచ్చి యీధర్మనిష్ఠ యెందుఁ । గలదె? యనుటయు మ్రోసె నాకాశవాణి;**
ధర్మపరుఁ డైన యత్తులాధారుఁ డింత । యాడఁ డిట్లాడ నే లని యద్భుతముగ. 224

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వత్స!= కుమారా!; జాజలి= జాజలి అనేముని; చలనంబు లేక= కదలిక లేకుండా; తపోనిష్ఠన్= తపస్సుకు చెందిన పూనికతో; ఆసీనుఁడు+ఐ+ఉండన్= కూర్చొనిఉండగా; పిచ్చికలు= ఊరపిచ్చుకలు; తన్మస్తకంబునన్= అతడితలమీద; గూఁడు= పక్షిగృహం; కావించెన్= నిర్మించాయి; ఆ+మిథునము= ఆ పక్షులజంట; కారణముగన్= హేతువుగా; అండములు= గ్రుడ్లు; కలిగి= సంభవించి; పిల్లలు+ఐ= శిశువులై; వర్తించి= ఉండి; ఎల్లెడకున్= అన్నిచోట్లకు; ఎరగొనన్= ఆహారం స్వీకరించటానికి; అరుగుచున్= పోతూ; మరలుచున్= తిరిగివస్తూ; అవియున్= ఆ పిచ్చుకలజంటయు; అవియు= వాని పిల్లలును; ఆగూఁటన్= ఆ గూడునందు; వసియింపన్= నివసిస్తూ ఉండగా; అతఁడు= ఆ జాజలి; దయాళుఁడు+ఐ= దయగలవాడై; వానిన్= ఆ పక్షులను; చోపకఉండి= తరుమక ఉండి; తనదు= తనయొక్క; నియతికిన్= నియమానికి; ఎదన్= హృదయంలో; మెచ్చి= అభినందించి; ఈ ధర్మనిష్ఠ= ఈ ధర్మస్థితి; ఎందున్= ఎక్కడైనా; కలదె?= ఉన్నదా?; అనుటయున్= అనగానే; ఆకాశవాణి= గగనవాణి; ధర్మపరుఁడు+ఐన= ధర్మమునందు ఆసక్తుడైన; ఆ+తులాధారుఁడు= ఆ తులాధారుడనేవాడు; ఇంత ఆడఁడు= ఇంతగా మాట్లాడడు; ఇట్లు+ఆడన్+ఏల?= ఈ రీతిగా చెప్పటం ఎందుకు?; అని అద్భుతముగన్= అని ఆశ్చర్యకరంగా; మ్రోసెన్= ధ్వనించింది.

తాత్పర్యం: కుమారా! జాజలి అనే ముని కదలిక లేకుండా తపఃస్థితిలో ఆసీనుడై ఉన్నాడు. పిచ్చుకలు అతడి తలపై గూడు నిర్మించాయి. అందులో గ్రుడ్లు కూడా పెట్టాయి. ఆ గ్రుడ్లు పొదిగి పిల్లలయ్యాయి. పెద్ద పిచ్చుకలు, వాటి పిల్లలూ కలిసి ఆహారం కొరకై అన్నిచోట్లకూ పోతూ వస్తూ ఆ గూటిలో నివసించసాగాయి. ఆ జాజలి దయతో ఆ పక్షులను తరిమివేయకుండా ఉండి తన నియమానికి తానే మెచ్చుకొని 'ఇంతటి ధర్మనిష్ఠ ఎక్కడైనా ఉంటుందా?' అని అనుకొన్నాడు. అప్పుడు ఆకాశవాణి 'మహాధర్మాత్ముడైన తులాధారుడు ఈ విధంగా ఎప్పుడూ మాట్లాడి ఎరుగడు. ఈ విధంగా నిన్ను నీవు గొప్పగా మెచ్చుకొంటూ మాట్లాడటం ఎందుకు?' అని అతడిని ఆక్షేపిస్తూ ఆశ్చర్యకరంగా ధ్వనించింది.

వ. అట్లు మ్రోసిన విని వెఱఁగుపడి యత్తులాధారుం గాన వలయు నని తలంచినం 'దులాధారుండు వారాణసీపురంబున నున్నవాఁ' డను వాక్యంబును నంబరంబున వీతెంచె; నమ్మునియును మత్సరభరితుఁ డగుచు నప్పురంబునకుం బోయి జనసంపూజ్య వాణిజ్యంబునం బ్రవర్తిల్లు నతనిం గాంచిన నతండు సముచితసత్కారం బాచరించి యిట్లనియె. 225

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; మ్రోసినన్= ధ్వనించగా; విని= ఆలకించి; వెఱఁగుపడి= ఆశ్చర్యమొంది; ఆ+తులాధారున్= ఆ తులాధారుడనే వాడిని; కానన్ వలయును+అని= చూడాలని; తలంచినన్= సంకల్పించగా; తులాధారుండు= తులాధారుడనేపేరుగల వైశ్యుడు; వారాణసీపురంబునన్= కాశీనగరంలో; ఉన్నవాఁడు= ఉన్నాడు; అను వాక్యంబునున్= అనేమాటకూడ; అంబరంబునన్= ఆకాశంలో; వీతెంచెన్= ఉదయించింది; ఆ+మునియును= ఆ జాజలి కూడా; మత్సరభరితుండు+అగుచున్= మచ్చరం గలవాడై; ఆ+పురంబునకున్= ఆ నగరానికి; పోయి= వెళ్ళి; జనసంపూజ్య వాణిజ్యంబునన్= ప్రజలచేత పూజించదగిన వ్యాపారకృత్యమునందు; ప్రవర్తిల్లు= వ్యవహరిస్తున్న; అతనిన్= ఆ తులాధారుడిని; కాంచినన్= చూడగా; అతండు= ఆ తులాధారుడు; సముచిత సత్కారంబు= తగిన మర్యాద; ఆచరించి= చేసి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: ఆ ధ్వని విని జాజలి ఆశ్చర్యం పొందాడు. 'ఆ తులాధారుడిని చూడా లనుకొన్నాడు. ఇంతలో 'అతడు కాశిలో ఉంటాడు' అనే వాక్యం ఆకాశంనుండి వినిపించింది. ఆ ముని మాత్సర్యంతో కూడినవాడై కాశికి పోయాడు. అక్కడ ప్రజామాన్యమైన వ్యాపారంలో ఉన్న తులాధారుడిని చూచాడు. అంతట ఆ తులాధారు డతడికి తగిన సత్కారం చేసి ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **'పిచ్చికలు గూఁడు శిరమునఁ బెట్టి తారుఁ । బిల్లలును సుఖలీల వర్తిల్లుచుండఁ**
జిత్తవికృతి లే కెట్టులు సేయుదయ్య । తపము? సంభావనీయవర్తనుఁడ వీవు.' **226**

ప్రతిపదార్థం: పిచ్చికలు= ఊరబిచ్చికలు; శిరమునన్= తలపై; గూఁడుపెట్టి= గృహం కట్టి; తారున్= తామును; పిల్లలును= శిశువులును; సుఖలీలన్= హాయిగా; వర్తిల్లుచుండన్= బ్రదుకుతుండగా; చిత్తవికృతి= మనోవికారము; లేక= కలుగకుండా; ఎట్టులు= ఎట్లా; తపముచేయుదు+అయ్య!= తపస్సు చేస్తున్నావయ్యా!; ఈవు= నీవు; సంభావనీయవర్తనుఁడవు= గౌరవింపదగిన ప్రవర్తన కలవాడవు.

తాత్పర్యం: 'అయ్యా! పిచ్చికలు నీ తలమీద గూడు కట్టుకొని అక్కడ తామూ, తమ పిల్లలూ కలిసి హాయిగా జీవిస్తూఉండగా నీవు ఏ మాత్రం మనోవికారం లేకుండా ఎట్లా తపస్సు చేస్తున్నావు? నీ ప్రవర్తన చాలా గౌరవించదగింది.'

వ. **అనినఁ దదీయబోధంబునకు విస్మయంబందుచు విప్రోత్తముండు 'నీవు వణిగ్వర్తనంబున నుండ నెవ్విధం బగు ధర్మంబున నివ్విశేషంబు గలిగె?' ననవుడు నతం డతని కిట్లనియె.** **227**

ప్రతిపదార్థం: అనినన్ = అని చెప్పగా; విప్రోత్తముండు= బ్రాహ్మణశ్రేష్ఠుడు; తదీయ బోధంబునకున్= అతడి జ్ఞానానికి; విస్మయంబు+అందుచున్= ఆశ్చర్యపడుతూ; నీవు వణిగ్వర్తనంబునన్= నీవు వ్యాపారవృత్తిలో; ఉండన్= ఉండగా; ఏ+విధంబు+అగు= ఏ విధమైన; ధర్మంబునన్= ధర్మంచేత; ఈ+విశేషము= ఈ త్రైకాలికజ్ఞాన విశేషం; కలిగెన్?= సంభవించింది?; అనవుడున్= అని అడుగగా; అతండు= ఆ తులాధారుడు; అతనికిన్= ఆ జాజలికి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: తులాధారు డట్లా అనేసరికి బ్రాహ్మణశ్రేష్ఠుడైన జాజలి అతడి జ్ఞానానికి ఆశ్చర్యపడ్డాడు. 'నీవు వ్యాపారవృత్తిలో ఉన్నావుగదా! నీ కేవిధంగా ఇట్లాంటి జ్ఞానాతిశయం కలిగింది?' అని ప్రశ్నించాడు. అప్పుడు తులాధారు డతడితో ఇట్లా అన్నాడు:

సీ. **'విలుచుట నమ్ముట నొలయదు వంచన । యర్హలాభంబున యనుభవింతు;**
సరి సిద్ధ్యసిద్ధులు; సమలోష్టకాంచన । మై యుండు మనసు; నిందాభినుతులు
హింసయు నాత్మ ప్రశంసయు లేవు; భూ । తంబులయం దెల్ల దయ ఘటిల్లు;
నభయదక్షిణ మగు నంచిత సత్య యా । గము సెల్లుఁ; గోర భోగమును యశము;

తే. **నెవ్వరికి మేలు సేసిన నింత సేసి । నాఁడ ననుబుద్ధి మమత యెన్నండు నాకుఁ**
గలుగ దేమిట నేనియు వలపునొల్ల । మియును బుట్టదు; నిక్క మింతయు మహాత్మ! **228**

ప్రతిపదార్థం: మహాత్మ!= గొప్ప మనసు కలవాడా!; విలుచుటన్= కొనటంలోనూ; అమ్ముటన్= విక్రయంలోనూ; వంచన= మోసం; ఒలయదు= కలుగదు; అర్హలాభంబున= తగిన లాభాన్నే; అనుభవింతున్= అనుభవిస్తాను; సిద్ధి+అసిద్ధులు= లాభనష్టాలు; సరి= సమానం; మనసు= చిత్తం; సమలోష్టకాంచనము+ఐ= మట్టి పెళ్ళయందును, బంగారునందును సమభావంకలదై; ఉండున్= ఉంటుంది; నిందా+అభినుతులు= తెగడ్త, పొగడ్తలు; హింసయున్= బాధించుటయు; ఆత్మప్రశంసయున్= నన్ను నేను పొగడుకొనటం; లేవు= ఉన్నవి కావు; భూతంబులయందున్+ఎల్లన్= సమస్త ప్రాణులలోనూ; దయ= కరుణ; ఘటిల్లున్= కల్గును; అభయదక్షిణము+అగు= నిర్భయత్వమే దక్షిణగా గలిగినదైన; అంచితసత్యయాగము= మానితమైన సత్యమనే యాగం; చెల్లున్= ప్రవర్తిల్లుతుంది; భోగమును= సుఖమును; యశమున్= కీర్తిని; కోరన్= వాంఛించను; ఎవ్వరికిన్= ఎట్లాంటివారికి; మేలుచేసినన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉపకారం చేసినను; ఇంత సేసినాఁడన్= నేను ఇంత ఉపకారం చేశాను; అను బుద్ధి= అనే తలపు; మమత= మమకారం; ఎన్నండున్= ఎప్పుడును; నాకున్ కలుగదు= నాకు సంభవించదు; ఏమిటన్+ఏనియున్= దేనియందైనను; వలపున్= రాగమును; ఒల్లమియును= ద్వేషమును; పుట్టదు= కలుగదు; ఇంతయున్= ఇదంతా; నిక్కము= నిజము.

తాత్పర్యం: 'మహాత్మా! నేను వ్యాపారవృత్తిలో క్రయవిక్రయాలు చేసేటప్పుడు మోసముండదు. తగిన లాభాన్నే అనుభవిస్తాను కాని ఎక్కువ లాభాన్ని కోరను. లాభాలాభాల పట్ల సమభావం కలిగి ఉంటాను. నా చిత్తం మట్టిపెళ్ళను, బంగారాన్నీ సమంగానే చూస్తుంది. స్తుతినిందలు, హింసించటం, నన్ను నేను పొగడుకొనటం అనేవి నాకు లేవు. అన్ని ప్రాణులపట్లా దయగలిగి ఉంటాను. నేను పాటించే సత్యమనే యాగానికి అభయమే దక్షిణగా ఉంటుంది. (నేను సత్యప్రవర్తనతో ఉంటాను గాన నాకు భయంలేదు). మితిమీరిన సుఖాలనూ, కీర్తినీ కోరను. ఎవరికి ఎట్లాంటి ఉపకారం చేసినా సరే, ఇంత చేసినానన్న తలపు నాలో పుట్టదు. నాకు ఎప్పుడూ మమకారం లేదు. దేనిమీదగానీ నేను రాగద్వేషాలు కలిగిఉండను. నేను చెప్పినదంతా సత్యం.

విశేషం: తులాధారుడు 'నేను ఎవరికి ఉపకారం చేసినా, ఇంత చేశాను అని భావించను' అని జాజలికి చెప్పాడు. జాజలి పిచ్చుకలకు తాను చేసిన మేలును భావించుకొని తనను తాను ప్రశంసించుకొన్నాడు. తులాధారుడిలో ఆత్మప్రశంస లేదు. కాన వీరిరువురి ప్రవర్తనలో కల భేదం స్పష్టం.

క. **లోకం బెల్లను నేఁ జి। త్రాకారము గాఁగఁ జూతు; నట్లగుట మనం**
బేకార్యములం దగులదు। కోకనద దళాంబుబిందుగుణ మొనరంగన్. **229**

ప్రతిపదార్థం: నేన్= నేను; లోకంబు+ఎల్లను= సమస్తలోకాన్నీ; చిత్రాకారము+కాఁగన్= చిత్రంలోని బొమ్మనువలె; చూతున్= చూస్తాను; అట్లు+అగుటన్= ఆ విధంగా చూడటంవలన; కోకనదదళ+అంబుబిందుగుణము= చెంగల్వ రేకుమీది నీటిబొట్టుయొక్క స్వభావం; ఒనరంగన్= కలుగగా; మనంబు= నా చిత్తం; ఏకార్యములన్= ఏ పనులలోనూ; తగులదు= సంలగ్నం కాదు.

తాత్పర్యం: నేను ఈ లోకాన్నంతటినీ చిత్రంలోని బొమ్మను చూచినట్లే చూస్తాను. అందువలన నా మనస్సు కలువరేకును నీరంటనట్లే దేనినీ అంటుకొనకుండా నిస్సంగస్థితిలో ఉంటుంది'.

వ. **అనిన విని జాజలి తులాధారున కిట్లనియె.** **230**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; జాజలి= జాజలిముని; తులాధారునకున్+ఇట్లు+అనియెన్= తులాధారుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ మాట విని తులాధారుడితో మళ్ళీ జాజలిమునీంద్రుడు ఈ రీతిగా చెప్పాడు.

తే. **'తపములును యజ్ఞములు నీవు ధర్మములుగఁ। బలుకవైతివి యార్యసంభావనీయ**
పదములగు కర్మములలోనఁ బరిగణింపఁ। బడవొకో వేదశాస్త్రతత్పరులచేత.' **231**

ప్రతిపదార్థం: నీవు= తులాధారుడవైన నీవు; తపములును= తపస్సులును; యజ్ఞములు= యాగకర్మలు; ధర్మములుగన్= ధర్మకార్యాలుగా; పలుకవైతివి= చెప్పవైతివి; వేదశాస్త్ర తత్పరులచేతన్= వేదములయందును, శాస్త్రముల యందును ఆసక్తులైన వారిచేత; ఆర్యసంభావనీయ పదములు+అగు= మహనీయులచే గౌరవింప దగిన స్థానములుగల; కర్మములలోనన్= కార్యాలలో; పరిగణింపన్+పడవు+ఒకో= (తపోయజ్ఞాలు) లెక్కించబడటం లేదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నీవు ఇప్పుడు పేర్కొన్న కర్మలలో తపస్సులు, యజ్ఞాలు ధర్మకార్యాలని చెప్పవైతివి. వేదాలలో, శాస్త్రాలలో నిష్ణాతులైన పెద్దలు తపస్సు మొదలైన కార్యాలను ఆర్యులు గౌరవించే సత్కర్మలలో లెక్కిస్తున్నారు గదా! అట్లాంటప్పుడు నీ వెందుకు ఆ కార్యాలను పేర్కొనలేదు?'

చ. **అనవుడు నాతఁ డిట్లను 'నహంకృతి యుక్తముఁ గామసంశ్రితం**
బును నగునేని నట్టి తపమున్, ఫలకాంక్ష యొనర్చు యజ్ఞమున్,
ఘనతరలోభవృత్తి యను కాన్పున మెచ్చదు దేవకోటి; వా
న నగు గతాగతంపు భ్రమణంబులు గీళ్ళులు గాక మేలులే? **232**

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆతఁడు= తులాధారుడు; ఇట్లు+అనున్= ఈ రీతిగా అన్నాడు; అహంకృతియుక్తమున్= అహంకారంతో కూడింది; కామసంశ్రితంబును= కోరికలకు నెలవైనదీ; అగున్+ఏనిన్= అయితే; అట్టి తపమున్= అట్లాంటి తపస్సున్ను; ఫలకాంక్ష= ఫలాపేక్షతో; ఒనర్చు= చేసేటి; యజ్ఞమున్= యజ్ఞకర్మయును; దేవకోటి= దేవతాసమూహం; ఘనతరలోభవృత్తి= పెద్దదైన లోభవర్తనము; అను కాన్పున= అనేది కన్పించటంచేత; మెచ్చదు= అభినందించదు; వానన్= అట్టి తపోయజ్ఞాలవలన; అగు= సంభవించే; గత+ఆగతంపు భ్రమణంబులు= రాకపోకలతోకూడిన త్రిప్పటలు, కీళ్ళులుగాక= ఉపద్రవాలుగాక; మేలులే?= శుభాలా?

తాత్పర్యం: జాజలి అట్లా అనగా తులాధారుడు ఇట్లా అన్నాడు: 'అహంకారం, కోరిక- వీటితో కూడిన తపస్సు, ఫలంమీది కోరికతో చేసే యజ్ఞమూ ప్రయోజనకారులు కావు. ఆ రెండింటిలోనూ పెద్ద లోభితనం కన్పిస్తుంది. అందువలన దేవతలు ఆ తపోయజ్ఞాలను మెచ్చరు. అంతేకాక వాటివలన ఇహలోక పరలోకాల మధ్య సాగే రాకపోకలకు చెందిన త్రిప్పటలు అపకారం కలిగిస్తాయే కాని మేలు కల్గించవు.

ఆ. **నిత్యతృప్తుఁ డైన సత్యయజ్ఞుని యెడ । దేవతలును నధిక తృప్తు లగుదు;**
రమరతృప్తివలన నవ్యయానందంబు । సంఘటిల్లుఁ జూవె సంయమీంద్ర! **233**

ప్రతిపదార్థం: సంయమి+ఇంద్ర!= మునీంద్రా!; నిత్యతృప్తుఁడు+ఐన= సదా తృప్తికలిగి ఉండునట్టి; సత్యయజ్ఞుని ఎడన్= సత్యమునే యజ్ఞంగా కలవాడిపట్ల; దేవతలును= సురలుకూడ; అధికతృప్తులు= మిక్కిలి తృప్తి పొందినవారు; అగుదురు= అవుతారు; అమరతృప్తివలనన్= దేవతలయొక్క తృప్తి కారణంగా; అవ్యయ+ఆనందంబు= తరుగు లేని ఆనందం; సంఘటిల్లున్+చూవె= కలుగుతుంది కదా!

తాత్పర్యం: మునీంద్రా! ఎవడు సత్యమే యజ్ఞమని భావించి సత్యాన్ని పాటిస్తూ సదా తృప్తి పొంది ఉంటాడో, అతడిపట్ల దేవతలుకూడా సంతృప్తి వహిస్తారు. దేవతాతృప్తివలన తిరుగులేని ఆనందం కలుగుతుంది'.

తే. **అనిన జాజలి 'యట్లేని నసఘ! నీవు । కర్మ ముడుగమి కెయ్యది కారణంబు?**
మాకు నెఱిఁగింపు' మనుటయు మహితబోధుఁ । డగు తులాధారుఁ డిట్లను నతనితోడ. **234**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; జాజలి= జాజలిముని; అనఘ!= పాపరహితుడా!; అట్లు+ఏనిన్= అట్లా ఐతే; నీవు కర్మము+ఉడుగమికిన్= నీవు కర్మను వదలకుండా ఉండటానికి; కారణంబు= హేతువు; ఏ+అది?= ఏది?; మాకున్+ఎఱిఁగింపుము= మాకు తెలుపుము; అనుటయున్= అనేసరికి; మహితబోధుఁడు+అగు= శ్రేష్ఠమైన జ్ఞానంకలవాడైన; తులాధారుఁడు= తులాధారుడనే వైశ్యుడు; అతనితోడన్= ఆ జాజలితో; ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తులాధారు డట్లా అనగానే జాజలి అతడితో 'అనఘా! అట్లైతే నీవు కర్మ వదలకుండా ఉండటానికి కారణమేమి? మాకు తెలియజెప్పుము' అని అన్నాడు. అప్పుడు శ్రేష్ఠజ్ఞాన సంపన్నుడైన తులాధారుడు అతడితో ఈ విధంగా చెప్పాడు.

క. 'ధర్మారాముఁడు సంతత । ధర్మసఖుఁడునై యసంగతా నిష్ఠ మతిన్
నిర్మలుఁడగు వానికి ని । ష్కర్మత్వానందసిద్ధి గలుగు మునీంద్రా! 235

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= మౌనివర్యా!; ధర్మారాముఁడు= ధర్మంలో రమించేవాడు; సంతతధర్మ సఖుఁడున్+ఐ= సదా ధర్మంతో మైత్రిచేసేవాడై; మతిన్= బుద్ధిలో; అసంగతానిష్ఠన్= నిస్సంగత్వనిష్ఠచేత; నిర్మలుఁడు+అగువానికిన్= మాలిన్య రహితుడైనవాడికి; నిష్కర్మత్వ+ఆనందసిద్ధి= అకర్మణతవలన కలిగే ఆనందప్రాప్తి; కలుగున్= సంభవిస్తుంది.

తాత్పర్యం: 'మునిశ్రేష్ఠా! ఎవడు ధర్మంలో రమిస్తాడో, సదా ధర్మానికి మిత్రుడై ఉంటాడో, బుద్ధిలో అసంగత్వాన్ని పాటిస్తాడో, అట్లా పాటించి నిర్మల హృదయు డవుతాడో, అట్లాంటివాడికి కర్మరహితత్వం వలన కలిగే ఆనందం తప్పక సిద్ధిస్తుంది.

ఆ. నగములెల్లఁ బుణ్యనగములు, నదులెల్లఁ । బుణ్యనదులు వినుము భూసురాగ్ర
గణ్య! యకలుషం బకర్దమం బనఁజాలు । నాత్మ తీర్థమెఱుఁగు నకలుషునకు. 236

ప్రతిపదార్థం: భూసుర+అగ్రగణ్య!= విప్రులలో మొదట లెక్కించదగినవాడా!; వినుము= ఆలకించుము; అకలుషంబు= కాలుష్యం లేని; అకర్దమంబు= బురద లేనిది; అనన్+చాలు= అనగలిగినట్టి; ఆత్మతీర్థము= ఆత్మఅనే తీర్థాన్ని; ఎఱుఁగు= తెలిసికొన్న; అకలుషునకున్= పాపరహితుడికి; నగములు+ఎల్లన్= కొండలన్నీ; పుణ్యనగములు= పవిత్రమైన కొండలు; నదులు+ఎల్లన్= అన్ని ఏరులూ; పుణ్యనదులు= పవిత్రమైన ఏరులు.

తాత్పర్యం: విప్రోత్తమా! వినుము. ఏ విధమైన కాలుష్యం, పంకం లేని 'ఆత్మ' అనే తీర్థాన్ని తెలిసికొన్న పవిత్రాత్ముడికి లోకంలో ఉన్న కొండలన్నీ పావనమైన కొండలే. నదులన్నీ పావనమైన నదులే. అతడు పవిత్రాత్ముడు కాబట్టిఅతడికి సర్వమూ పవిత్రమే అవుతుంది. (అందుచేత పవిత్రప్రదేశాలకై అతడు విశేషించి వెదకవలసిన పని లేదని భావం).

క. కారణములవలనఁ గృత । ప్రారంభంబైన కర్మ మంచితగతికిం
గారణమే కర్తవ్య । త్వారబ్ధ క్రియలయట్టు లనఘచరిత్రా!' 237

ప్రతిపదార్థం: అనఘచరిత్రా!= దోషరహితమైన వర్తనం కలవాడా!; కర్తవ్యత్వ+ఆరబ్ధ క్రియల అట్టులు= ఇది చేయదగినది అన్న ఉద్దేశంతో ప్రారంభించిన కర్మలవలె; కారణములవలనన్= ఏవో కారణాలచేత; కృతప్రారంభంబు+ఐన= ప్రారంభించబడిన; కర్మము= పని; అంచితగతికిన్= పూజితమైన స్థితికి; కారణమే?= నిమిత్తమా? (కాదనుట)

తాత్పర్యం: పవిత్రచరిత్రా! 'ఇది నావంతు కర్తవ్యం కాన నేనీపని చేసి తీరతాను' అన్న ఉద్దేశంతో చేసే కర్మ పూజ్యమైన గొప్పసిద్ధికి హేతువు అవుతుంది. అంతేకాని ఏదో ప్రయోజనాన్ని కాంక్షించి, ఇతరకారణాలవలన చేసే పని ఆ విధమైన మహోన్నత గతికి కారణం ఎట్లా అవుతుంది?' (కాజాలదని భావం).

వ. అని చెప్పి యంత నిలువక. 238

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; అంతన్= అంతటితో; నిలువక= ఆగక.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తులాధారుడు ఆ రీతిగా చెప్పి, దానితో నిలువక మళ్ళీ ఇట్లా అన్నాడు:

క. 'విను మంచివారిచే నై । నను నితరుల చేతనేని నా యెఱిఁగిన యీ
యను వొప్పదొ మేలో యను । ననుమానము వాపుదమె మహాధర్మనిధీ! 239

ప్రతిపదార్థం: మహాధర్మనిధీ!= గొప్ప ధర్మానికి తావలమైనవాడా!; విను= ఆలకించు; నా ఎఱిఁగిన= నేను తెలిసికొన్న; ఈ+ అనువు= ఈ ధర్మపద్ధతి; ఒప్పదొ?= తగదో?; మేలో= తగినదో; అను అనుమానము= అనే సందేహం; మంచివారిచేన్+ఐనను= సజ్జనులచేతగానీ; ఇతరులచేతన్+ఏనిన్= పరులచేతగాని; పాపుదమె= తీర్చుకొందమా!

తాత్పర్యం: 'ధర్మాత్మా! వినుము. నాకు తెలిసిన ఈ ధర్మప్రకారం సరిఅయినదో కాదో అనే సందేహాన్ని సజ్జనుల ద్వారానైనా, లేక తదితరులచేత గానీ తీర్చుకొందామా!

వ. అప్పని మనచేత నయ్యెడి; నీవు దండ్రివోలెం బెనిచిన మరగి నీతో నరుగుదెంచి నీశిరంబు చక్కటిచదలం జేరువం బొలయు నిప్పులుఁ గులం బిలిచి కరంబుల ధరియించి యుపలాలింపుమా!' యనుటయు జాజలి వానిం బిలిచిన నవి దివిన నిలిచి యతనితో నిట్లనియె. 240

ప్రతిపదార్థం: ఆ+పని= ఆ కార్యం; మనచేతన్= మనవలన; అయ్యెడిన్= కాగలదు; నీవు తండ్రి+పోలెన్= నీవు జనకుడివలె; పెనిచిన= పెంచిన; మరగి= అలవాటుపడి; నీతోన్+అరుగుదెంచి= నీతోకూడా వచ్చి; నీ శిరంబు చక్కటి చదలన్= నీ తలకు సూటిగా ఆకాశమునందు; చేరువన్= సమీపంబున; పొలయు= తిరుగుతున్న; ఈ+పులుఁగులన్= ఈ పిచ్చికలను; పిలిచి= ఆహ్వానించి; కరంబులన్= చేతులలో; ధరియించి= ఉంచుకొని; ఉపలాలింపుమా!= బుజ్జగించుమా!; అనుటయున్= అనగా; జాజలి= జాజలిముని; వానిన్= ఆ పక్షులను; పిలిచినన్= ఆహ్వానించగా; అవి= ఆ పక్షులు; దివిన్+అం= ఆకాశంలోనే; నిలిచి= నిలబడి; అతనితోన్= ఆ జాజలితో; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాయి.

తాత్పర్యం: అట్లా సంశయం తొలగించుకొనే పని మనమే చేసికొనవచ్చును. నీవీ పిచ్చుకలను తండ్రివలె పెంచావు. నీతో అవి మచ్చిక పడి ఉన్నాయి. నీ తలమీద నేరుగా ఆకాశంలో సమీపం లోనే ఎగురుతూ ఉన్నాయి. వాటిని పిలిచి నీ చేతిపై ఉంచుకొని బుజ్జగించుము' అని చెప్పాడు. తులాధారు డట్లా అనగానే జాజలి ఆ పక్షులను పిలిచాడు. అవి అతడి చేతిమీదికి రాకుండానే ఆకాశంలోనే నిలబడి జాజలిని చూచి ఇట్లా అన్నాయి.

చ. 'మునివర! ధర్మదేవత మమున్ బనుపన్ నిను నారయంగ వ
చ్చిన భటసంఘు మేము; విను చెప్పెద మీసు గలంక పోరితం
బను నివి మత్సరంబు గల యట్టిమనంబునఁ బుట్టు; హింస వీ
నన జనియించు; సంయమిజనంబు విమత్సరమైన మేలగున్. 241

ప్రతిపదార్థం: మునివర!= మునిశ్రేష్ఠా!; ఏము= మేము; ధర్మదేవత= ధర్మానికి అధిష్ఠానమైన దేవత; మమున్= మమ్ములను; పనుపన్= పంపగా; నినున్+ఆరయంగన్= నిన్ను పరీక్షించటానికి; వచ్చిన= ఏతెంచిన; భటసంఘము= సేవకవర్గం; చెప్పెదము= వచింతుము; విను= వినుము; మత్సరంబు+కలయట్టి= మాత్సర్యం గలిగినట్టి; మనంబునన్= చిత్తంలో; ఈసు= ఈర్ష్య; కలంక= మనఃక్షోభం; పోరితంబు+అనునివి= కలహం అనే ఇవి; పుట్టున్= కలుగుతాయి; వీనన= వీటినుండే; హింస= హింసించటం; జనియించున్= కలుగుతుంది; సంయమిజనంబు= మునిజనం; విమత్సరము+ఐనన్= మాత్సర్యం లేనిదైతే; మేలు+అగున్= శుభం కలుగుతుంది.

తాత్పర్యం: 'మునివర్యా! నిన్ను పరీక్షించటానికి ధర్మదేవత పంపిస్తే మేము వచ్చాము. మేము ఆ ధర్మదేవతకు చెందిన సేవకులం. ఇప్పుడు నీకు కలిగిన సంశయం తొలగేటట్లు విషయం చెప్పుతాము, వినుము. ఎవడి హృదయంలో మాత్సర్యదోషం ఉంటుందో, వాడిలో ఈర్ష్య, కలంక, కలహం అనే దుర్గుణాలు కలుగుతాయి. వీటివలననే హింస కూడా కలుగుతుంది. అందువలన మునివృత్తిలో ఉన్నవారు పూర్తిగా మాత్సర్యదోషాన్ని హృదయంనుండి తొలగించుకొంటేనే మేలు కలుగుతుంది.

తే. స్పర్ధ సద్ధర్మమునకు నాశని సుధర్మ । నాశమునఁ జేసి నరుఁడు వినష్టభావ
మొందుఁ గావున సంస్పర్ధ యుడుగవలయు । నిర్మలశ్రద్ధ గైకొని నిపుణుఁ డనఘ! 242

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; స్పర్ధ= పోటీ; సద్ధర్మమునకున్= మంచి ధర్మానికి; నాశని= వినాశకారి; సుధర్మనాశమునన్+చేసి= మంచి ధర్మం వినాశం పొందటంవలన; నరుఁడు= మానవుడు; వినష్టభావము= విశేషంగా నశించే భావాన్ని; ఒందున్= పొందుతాడు; కావునన్= అందువలన; నిపుణుఁడు= నేర్పు కలవాడు; నిర్మలశ్రద్ధన్= విమలమైన శ్రద్ధతో; కైకొని= స్వీకరించి; సంస్పర్ధన్= పోటీని; ఉడుగన్ వలయున్= వర్జించాలి.

తాత్పర్యం: పాపరహితా! స్పర్ధ అనే దుర్గుణం మంచిధర్మాన్ని నశింపజేస్తుంది. మంచిధర్మం నశిస్తే మనుజుడు పూర్తిగా వినాశానికి గురి అవుతాడు. అందువలన తెలివైన నేర్పరి నిర్మలమైన శ్రద్ధగలవాడై స్పర్ధ అనే దుర్గుణాన్ని వదలాలి.

క. శ్రద్ధ ఋషితనయ! సాత్త్వికి । బోద్ధ వ్యావాప్తి శుభముఁ బొనరించు మన
శ్శుద్ధిస్వరూప దానిఁ బ్ర । బుద్ధుఁడు పాటించుఁజూవె పురుషాత్మికఁగన్. 243

ప్రతిపదార్థం: ఋషితనయ!= మునికుమారా!; సాత్త్వికి= సత్త్వగుణం వలన కలిగిన; శ్రద్ధ= ఆసక్తి; బోద్ధవ్య+అవాప్తిన్= తెలిసికొనదగిన దానిని పొందటంచేత; శుభమున్= మంగళమును; పొనరించు= కలిగించునట్టి; మనశ్శుద్ధి స్వరూప= చిత్తనైర్మల్యస్వరూపమైనది; దానిన్= ఆ శ్రద్ధను; ప్రబుద్ధుఁడు= తెలివైనవాడు (ఆత్మజ్ఞుడు); పురుషాత్మికఁగన్= పురుషస్వరూపిణిగా; పాటించున్+చూవె!= అనుసరించునుగదా!

తాత్పర్యం: మునికుమారా! సత్త్వగుణంవలన జనించిన శ్రద్ధ మనం తెలిసికొనదగిన దానిని తెలియజేస్తుంది. తద్ద్వారా శుభం కలగజేస్తుంది. చిత్తశుద్ధే శ్రద్ధకు స్వరూపం. అందువలన తత్త్వజ్ఞుడు శ్రద్ధను పురుష స్వరూపిణిగా భావించి అనుసరిస్తాడు.

విశేషం: 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్' అని గీత - శ్రద్ధావంతుడు జ్ఞానం పొందుతాడని చెప్పింది. శాస్త్రమునందు గురువాక్యమునందు ఇది సత్యమనే బుద్ధితో నిశ్చయానికి రావటమే శ్రద్ధ. దానివలన ఆత్మతత్త్వం లభిస్తుందని శంకరులు వివేకచూడామణిలో వివరించారు.

"శాస్త్రస్య గురువాక్యస్య సత్యబుద్ధ్యావధారణా।
సా శ్రద్ధా కథితా సద్భిర్యయా వ స్తూపలభ్యతే॥ " (వివేకచూడామణి).

క. అమరులు విమలశ్రద్ధా । సమేతములు గాని తాపసత్వముఁ గ్రతుమ
త్త్వము గైకొన రా సువిశే । షముగలిగిన మెత్తు రది ప్రశస్తం బనఘా! 244

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; అమరులు= దేవతలు; విమలశ్రద్ధాసమేతములు కాని= నిర్మలమైన శ్రద్ధతో కూడని; తాపసత్వమున్= మునిత్వమును; క్రతుమత్త్వమున్= యాజకత్వమును; కైకొనరు= అంగీకరించరు; ఆ సువిశేషము= ఆ విశిష్టమైన శ్రద్ధ; కలిగినన్= ఉంటే; మెత్తురు= అభినందిస్తారు; అది= ఆ శ్రద్ధ; ప్రశస్తంబు= ఉత్తమం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ జాజలీ! దేవతలు నిర్మలమైన శ్రద్ధ లేని తపసితనమునూ, యాజకత్వాన్నీ అంగీకరించరు. శ్రద్ధతో కూడి ఉంటే వాటిని వారు మెచ్చుకొని అంగీకరిస్తారు. కాబట్టి శ్రద్ధ అనేది చాలా ప్రశస్తమైన గుణం.

క. వినుము మునివర! వాగ్వృత్తియు । మనః ప్రవర్తనముఁ గాచు మహితశ్రద్ధా
ధనసంపద; శ్రద్ధ యనం । జనునది జీవాత్మ సుప్రసన్నత సుమ్మీ!' 245

ప్రతిపదార్థం: మునివర!= మునిశ్రేష్ఠా!; విను= వినుము; మహిత శ్రద్ధాధనసంపద= పూజ్యమైన 'శ్రద్ధ' అనే అర్థసంపత్తి; వాక్+వృత్తియున్= వాక్కుల యొక్క వ్యాపారమునూ; మనఃప్రవర్తనమున్= చిత్తముయొక్క నడవడికనూ; కాచున్= కాపాడుతుంది; శ్రద్ధ= శ్రద్ధ; అనన్+చనునది= అనబడేది; జీవాత్మ సుప్రసన్నత సుమ్మీ!= ప్రత్యగాత్మ యొక్క ప్రసన్నత్వమే సుమా!

తాత్పర్యం: మునివర్యా! వినుము. మానితమైన 'శ్రద్ధ' అనే ధనసంపద మన మాటలను, మనస్సును చెడుదారిలో పోనీకుండా కాపాడుతుంది. 'శ్రద్ధ' అనేది జీవాత్మయొక్క మంచి ప్రసన్నతాగుణమే సుమా!'

తులాధారుఁడు జాజలికిం చెప్పిన బ్రహ్మగీతలు (సం. 12-256-7)

వ. అని మఱియు నిట్లను 'బ్రహ్మగీత లను వాక్యంబు లాకర్ణింపుము. 246

ప్రతిపదార్థం: అని= ఇట్లు చెప్పి; మఱియు= ఇంకను; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; బ్రహ్మగీతలు+అను= బ్రహ్మగీతలు అనబడే వాక్యంబులు= మాటలు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ పక్షులు ఆ విధంగా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాయి. 'బ్రహ్మగీతలు అనే మాటలు వినుము.'

క. యాగంబునందు శ్రద్ధా । యోగముగల యశుచి శ్రద్ధ యొనరని శుచి పు
ణ్యాగమసంపదఁ దుల్యులు । గా గణుతించిరి నిరూపకత నమరవరుల్. 247

ప్రతిపదార్థం: అమరవరుల్= దేవతాశ్రేష్ఠులు; యాగంబునందున్= యజనకర్మ చేసేటప్పుడు; శ్రద్ధాయోగముకల= శ్రద్ధాసమేతుడైన; అశుచి= శుచిలేనివాడు; శ్రద్ధఒనరని= శ్రద్ధలేని; శుచి= శుచిగలవాడు; పుణ్య+ఆగమసంపదన్= పుణ్యంయొక్క రాక అనే సంపద విషయంలో; నిరూపకతన్= నిరూపించటంలో; తుల్యులుగాన్= సమానులుగా; గణుతించిరి= లెక్కించారు.

తాత్పర్యం: దేవతలు శుచిలేకున్నా యాగం చేసేటప్పుడు శ్రద్ధ గలవాడినీ, శుచి ఉండినా శ్రద్ధలేని వాడినీ పరిశీలించి నిరూపిస్తూ వీరిరువురికీ పుణ్యం సంపాదించటంలో సమానత్వమే ఉంటుందని నిర్ణయించారు. (శౌచంలేని దోషాన్ని శ్రద్ధ తొలగిస్తుందని భావం).

క. విను! మజుఁడు శ్రద్ధ యతిపా । వని, యది గలవాఁడు గౌరవశ్రేష్ఠుం; డా
తని యన్నము భోజ్యతరం । బని నిర్దేశించె నెల్ల యమరులు వినఁగన్. 248

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; అజుఁడు= బ్రహ్మ; శ్రద్ధ అతిపావని= శ్రద్ధ చాలా పవిత్రమైనది; అది కలవాఁడు= శ్రద్ధావంతుడు; గౌరవశ్రేష్ఠుఁడు= గౌరవంచేత ఉత్కృష్టుడు; ఆతని అన్నము= అతడు పెట్టే భోజనం; భోజ్యతరంబు+అని= తినదగిన వాటిలో మేలైనదని; ఎల్లఅమరులు= దేవతలందరూ; వినఁగన్= వింటూ ఉండగా; నిర్దేశించెన్= చెప్పాడు.

తాత్పర్యం: వినుము. పూర్వం బ్రహ్మదేవుడు దేవతలందరూ వింటూ ఉండగా 'శ్రద్ధ చాలా పవిత్రమైనది. శ్రద్ధగల మనుజుడు గౌరవంవలన ఉత్కృష్టు డవుతున్నాడు. అతడి అన్నం భుజించటానికి యుక్తతరమైనది' అని చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. వారక వడ్డి కిచ్చి కుడువన్ వెరవారిన దానశీలు నె
వ్వారికిఁ జేయుఁ జూపక ధ్రువంబుగ లోభగుణంబ పట్టి ని
స్సారత నుండు వేదవిదు సామ్యముఁ జేర్చి రమర్త్యులందు న
వ్వారిజసూతి దాని యగువాఁ డధికుం డనియెన్ హవిర్విధిన్. 249

ప్రతిపదార్థం: అమర్త్యులు= సురలు; వారక= ఉడుగక; వడ్డికిన్= వృద్ధికి; ఇచ్చి= ఒసంగి; కుడువన్= అనుభవించటానికి; వెరవారిన= యుక్తిపరుడైన; దానశీలున్= దానంచేసే స్వభావంగలవాడిని; ఏ+వారికిన్= ఎవరికిన్ని; చేయున్+చూపక= హస్తం కూడా చూపకుండా; ధ్రువంబుగన్= స్థిరంగా; లోభగుణంబు= పిసినితనం అనే గుణాన్నే; పట్టి= అవలంబించి; నిస్సారతన్= సారహీనతతో; ఉండు= మెలగునట్టి; వేదవిదు= వేదజ్ఞుడితో; సామ్యమున్+చేర్చిరి= పోలిక చెప్పారు; అందున్= వారిలో; ఆ+వారిజసూతి= ఆ బ్రహ్మ; హవిర్విధిన్= యాగకర్మలో; దాని అగువాఁడు= దానం చేసేవాడు; అధికుండు= గొప్పవాడు; అనియెన్= అని చెప్పాడు.

తాత్పర్యం: వడ్డీవ్యాపారం చేసి తాను అనుభవిస్తూ తగిన సమయంలో దానంకూడా చేసేవాడినీ, ఎవరికీ ఏమీ ఇవ్వకుండా లోభి అయిన వేదాభ్యాసపరుడినీ - సమానమని దేవతలు చేర్చి పలికారు. వారిద్దరిలోనూ యజ్ఞకర్మలో దానం చేసేవాడు శ్రేష్ఠుడని బ్రహ్మదేవుడు చెప్పాడు.

ఆ. దానగుణము శ్రద్ధ లేనివానికి లేదు । గాన యివ్విధమునఁ గమలభవుఁడు
నిశ్చయించె; నీవు నిర్మలశ్రద్ధాభి । పూతమతివి గమ్ము పుణ్యచరిత! 250

ప్రతిపదార్థం: పుణ్యచరిత!= పవిత్రమైన నడవడి కలవాడా!; శ్రద్ధలేనివానికిన్= శ్రద్ధావిరహితుడికి; దానగుణము= దానంచేయాలనే స్వభావం; లేదు= ఉన్నదికాదు; కాన= కాబట్టి; కమలభవుఁడు= బ్రహ్మ; ఈ+విధమునన్= ఈరీతిగా; నిశ్చయించెన్= నిర్ణయించాడు; నీవు నిర్మలశ్రద్ధా+అభిపూతమతివి= నీవు విమలమైన శ్రద్ధచేత పవిత్రమైన బుద్ధికలవాడవుగా; కమ్ము= అగుము.

తాత్పర్యం: పావనమైన చరిత్రం కల ఓ జాజలీ! 'శ్రద్ధ' అనే గుణం లేనివాడికి దానం చేయాలనే స్వభావం ఉండదు. అందువలననే బ్రహ్మదేవుడు 'దానం చేసేవాడే శ్రేష్ఠుడు' అని నిర్ణయించి చెప్పాడు. నీవు శ్రద్ధయొక్క గొప్పతనాన్ని గుర్తించి నీబుద్ధిని నిర్మలమైన శ్రద్ధతో పవిత్రంగా చేసికొమ్ము.

ఆ. వినుము శ్రద్ధ గలుగు మనుజుండు పాపంబుఁ । దొలఁగఁ ద్రోవనేర్చుఁ; దోలు డిగ్గ
నూడ్వ వెరవు గలుగు నురగంబు చాడ్పునఁ । గాన మేలు శ్రద్దధానుఁ డగుట.' 251

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; శ్రద్ధకలుగు= శ్రద్ధకలిగినటువంటి; మనుజుండు= మానవుడు; తోలు= కుబుసం; డిగ్గన్+ఊడ్వన్= తొలగించుకొనటానికి; వెరవుకలుగు= ఉపాయం గలిగినట్టి; ఉరగంబు చాడ్పునన్= పామువలె; పాపంబున్= పాపాన్ని; తొలఁగన్+త్రోవ నేర్చున్= తొలగేటట్లు త్రోసి వేయటానికి శక్తికలవాడవుతాడు; కాన= కాబట్టి; శ్రద్దధానుఁడు+అగుట= శ్రద్ధగలవాడు కావటం; మేలు= శుభకరం.

తాత్పర్యం: ఇంకను వినుము. అనాయాసంగా కుబుసాన్ని తొలగించుకొనే పామువలె శ్రద్ధావంతుడైన మానవుడు పాపమును తొలగించుకొంటాడు. అందువలన మానవుడు శ్రద్ధావంతుడు కావటం శుభప్రదం.

వ. అని వెండియు. 252

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; వెండియున్= మరల.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఇట్లా చెప్పి మళ్ళీ (ఆ పక్షులు ఈ రీతిగా అన్నాయి.)

ఆ. 'మత్సరాది చిత్తమాలిన్యములు శ్రద్ధ । గల మనంబునందు నిలువనేర'
వనినఁ దేఱి యిట్టులనియె జాజలి తులా । ధారుతోడ నిభృతిఁ గౌరవేంద్ర! 253

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= ధర్మరాజా! శ్రద్ధగల= శ్రద్ధకలిగినట్టి; మనంబునందున్= చిత్తంలో; మత్సర+ఆది చిత్త మాలిన్యములు= మాత్సర్యం మొదలైన మనోదోషాలు; నిలువన్ నేరవు= నిలబడజాలవు; అనినన్= అని చెప్పగా; తేఱి= తేరుకొని; జాజలి= జాజలిముని; నిభృతిన్= నిబ్బరంగా; తులాధారుతోడన్= తులాధారుడనే వ్యాపారితో; ఇట్టులు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! శ్రద్ధగలవాడి మనస్సులో మత్సరం మొదలైన దోషాలు నిలబడలేవు, అని ఆ పిచ్చుకలు జాజలితో చెప్పాయి. అది విని జాజలి తేరుకొన్నాడు. తరువాత తులాధారుడిని చూచి సవినయంగా ఇట్లా అన్నాడు:

క. మునులవలనఁ దత్త్వం బే । వినకుండుటఁ జేసి యిట్టివిధము గలిగె నా
కనఘా! నీ వాక్యంబుల । మనంబు దెలివొందె శాంతి మరగెద నింకన్.' 254

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; మునులవలనన్= తాపసులనుండి; ఏన్= నేను; తత్త్వంబు= తత్త్వార్థమును; వినకుండుటన్+చేసి= ఆలకించకపోవటంవలన; నాకున్= జాజలినైన నాకు; ఇట్టివిధము= ఈ రీతి; కలిగెన్= సంభవించింది; నీ వాక్యంబులన్= నీవు చెప్పిన మాటలచేత; మనంబు= చిత్తం; తెలివి+ఒందెన్= తెలివిపొందింది; ఇంకన్= ఇటుపైన; శాంతిన్= శమమును; మరగెదన్= అభ్యసిస్తాను.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ తులాధారా! పూర్వం నేను మునులవద్ద తత్త్వం వినలేదు. అందువలన నా కిట్టి 'ఆత్మశ్లాఘాపరత్వం' అనే అవినయదోషం సంభవించింది. నీ ఉపదేశవచనాల వలన నా మనస్సు కిప్పుడు తెలివిగలిగింది. ఇక మీద నేను శాంతిమార్గంలో నడుస్తాను'.

వ. అనిన నభినందించి తులాధారుండు. 255

ప్రతిపదార్థం: అనినన్= జాజలి అట్లా అనగా; తులాధారుండు= తులాధారుడనే వైశ్యుడు; అభినందించి= మెచ్చి.

తాత్పర్యం: జాజలి అట్లా అనేసరికి తులాధారుడు (పశ్చాత్తాపంతో కూడిన అతడి మాటలు విని) అతడిని అభినందించి - (తరువాతి పద్యంతో అన్వయం).

క. తన తన తెరువునఁ గర్మం । బనుష్ఠితం బైన మేల యనఘ! నివృత్తిం
గని శ్రద్ధ గూర్పఁగా నే । ర్పెనయంగా వలయు దాని యెడయం దతఁడున్. 256

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; తన తన తెరువునన్= తనకు తనకు చెందిన మార్గంలో; కర్మంబు= పని; అనుష్ఠితంబు+ఐనన్= చేయబడితే; మేలు+అ= శుభమే; దాని ఎడ అందున్= ఆ కర్మ వ్యవహారంలో; అతఁడున్= ఆ కర్మానుష్ఠానపరుడు; నివృత్తిన్+కని= నివర్తనమును పొంది; శ్రద్ధన్+కూర్పఁగాన్= శ్రద్ధను సంఘటించటానికి; నేర్పు= చాతుర్యం; ఎనయంగావలయున్= పొందాలి.

తాత్పర్యం: పాపరహితుడా! మానవుడు తనకు విధ్యుక్తమైన ఏ కర్మకలదో, ఆ కర్మను చక్కగా అనుష్ఠించటం మేలు. మరియు అతడు ఆ కర్మపట్ల నివృత్తిని పొంది శ్రద్ధతో కర్మసన్న్యాస పద్ధతిని పాటించటానికి తగిన నేర్పుకూడా కలిగి ఉండాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. అట్లకాక యని ప్రియంబుమై వీడ్కొని । జాజలియును జనియె రాజవర్య!
యిహపరముల నెసకమెసఁగ సౌఖ్యము తులా । ధారుఁడును సమున్నతత్వ మొందె. 257

ప్రతిపదార్థం: రాజవర్య!= రాజశ్రేష్ఠా!; జాజలియును= జాజలిమునీంద్రుడును; అట్లకాక!= అట్లేఅగునుగాక!; అని ప్రియంబుమైన్= అని ప్రీతితో; వీడ్కొని= పోయివస్తానని చెప్పి వదలి; చనియెన్= వెళ్ళాడు; తులాధారుఁడును= తులాధారుడుకూడా; ఇహపరములన్= ఈ లోకంలోను, పరలోకంలోను; సౌఖ్యము= సుఖం; ఎసకమెసఁగన్= అతిశయించగా; సమున్నతత్వము= గొప్పతనమును; ఒందెన్= పొందాడు.

తాత్పర్యం: నృపశ్రేష్ఠుడవగు ఓ ధర్మరాజా! తులాధారు డట్లా చెప్పేసరికి జాజలి 'అట్లే అగుగాక!' అని చెప్పి ప్రీతితో వీడ్కోలు వడసి వెళ్ళిపోయాడు. తులాధారుడు సైతం ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖం పెంపొందగా మహోన్నతస్థితిని పొందాడు.

క. ఆ వణిజుఁడు ధర్మస్థితి । దేవతలును మెచ్చునట్లు దెలియఁగఁ బలికెన్
నీ వీ వాక్యము లన్నిట । భావం బలవఱిచి కసటు వాపుము వత్సా!' 258

ప్రతిపదార్థం: వత్సా!= పుత్రా!; ఆ వణిజుఁడు= ఆ వర్తకుడు; దేవతలును= అమరులుకూడా; మెచ్చునట్లు= అభినందించేటట్లు; ధర్మస్థితి= ధర్మంయొక్క పద్ధతిని; తెలియఁగన్+పలికెన్= తెలిసేటట్లు చెప్పాడు; ఈ వాక్యములు+అన్నిటన్= తులాధారుడు వచించిన మాటలన్నిటిలోను; భావంబు= అభిప్రాయం; అలవఱిచి= అలవడజేసి; నీవు కసటు= నీవు మాలిన్యమును; పాపుము= తొలగించు కొనుము.

తాత్పర్యం: కుమారా! తులాధారుడు దేవతలు సైతం మెచ్చుకొనే విధంగా, ధర్మపద్ధతిని గూర్చి స్పష్టంగా వివరించాడు. నీవు అతడు జెప్పిన మాటలన్నిటిలోనూ నీ భావాన్ని సమన్వయింపజేసి నీ హృదయంలోని మాలిన్యాన్ని తొలగించుకొమ్ము'.

వ. అని చెప్పినం బ్రమదంబు నొంది. 259

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని వచించగా; ప్రమదంబు= సంతోషం; ఒంది= పొంది.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పేసరికి సంతోషం పొంది (తరువాతి పద్యంతో అన్వయం).

క. సురసరిదాత్మజుతోఁ గురు । నరపాలోత్తముఁడు వినయనమ్రుం డగుచున్
'జిరమో కార్యసమీక్ష య । చిరమో వలయునది కరుణఁ జెప్పు' మనవుడున్. 260

ప్రతిపదార్థం: కురునరపాల+ఉత్తముఁడు= ధర్మరాజు; వినయనమ్రుండు+అగుచున్= వినయంతో వంగి నమస్కరించేవాడై; సురసరిదాత్మజుతోన్= గంగానదీ పుత్రుడైన భీష్ముడితో; కార్యసమీక్ష= కార్యముయొక్క పరిశీలన; వలయునది= ఆవశ్యకమైనది; చిరమో= బహుకాలమో; అచిరమో= అల్పకాలమో; కరుణన్= కృపతో; చెప్పుము= వివరించుము; అనవుడున్= అనగా.

తాత్పర్యం: కౌరవాధిపతి అగు ధర్మజుడు వినయంతో ప్రణమిల్లి భీష్ముడితో 'కార్యాలను సమీక్షించటంలో అవసరమైనది బహుదీర్ఘ సమయమా? లేక అత్యల్పసమయమా?' (చాలకాలం ఆలోచించి కార్యం నెరవేర్చవలెనా? లేక త్వరపడి నిర్ణయం చేయవలెనా?) దయచేసి ఈ సంగతి వివరించు'మని అడిగాడు. అట్లా అడిగేసరికి - (తరువాతి వచనంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అతం డతని కిట్లనియె: **261**

ప్రతిపదార్థం: అతండు= ఆ భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: భీష్ము డప్పుడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు:

క. 'త్వరితము సేయక కార్యము । చిరంతన విమర్శనముగఁ జేసి యొనర్పన్
ధరణీశ్వర! యోటువడఁడు । పురుషుఁడు; సిద్ధియును వానిఁ బొందు దృఢముగన్. **262**

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= రాజా!; పురుషుఁడు= మనుజుడు; కార్యము= పని; త్వరితము చేయక= వేగిరం చేయక; చిరంతన విమర్శనముగన్ చేసి= చాలకాలం పరామర్శతో కూడినదిగా; ఒనర్పన్= చేస్తే; ఓటు పడఁడు= ఓడిపోడు; వానిన్= ఆ రీతిగా చేసేవాడిని; సిద్ధియును= ఫలప్రాప్తికూడా; దృఢముగన్= నిశ్చయంగా; పొందున్= చేరుతుంది.

తాత్పర్యం: 'రాజా! పనిచేసేటప్పుడు త్వరపడరాదు. తొందరపడకుండా చక్కగా చాలాకాలం ఆలోచించి చేస్తే ఓటమి కలుగదు. అంతేకాక అట్లా చేసేవాడికి తప్పకుండా ఆ కార్యంలో విజయం కూడా సిద్ధిస్తుంది.

క. తాలిమి లేని జనంబులు । మేలెఱుఁగక యట్టివాని మీఁదను జాడ్యం
బాలస్యం బిది యని దో । షాలోచన మాచరింతు; రది మతి యగునే? **263**

ప్రతిపదార్థం: తాలిమి లేని= ఓర్పు లేని; జనంబులు= ప్రజలు; మేలు+ఎఱుఁగక= శ్రేష్ఠమైనది తెలియక; అట్టివానిమీఁదను= ఆ విధంగా ఆలోచించి నిదానంగా పనులు చేసేవాడిపై; ఇది జాడ్యంబు= ఇది జడత్వం; ఆలస్యంబు+అని= అలసత్వం అని; దోష+ఆలోచనము= దొసగులను గూర్చిన చింతన; ఆచరింతురు= చేస్తారు; అది= అట్లా చేయటం; మతి అగునే?= తెలివి ఔతుందా?

తాత్పర్యం: ఏ మాత్రం సహనంలేనివారు మంచి ఏదో తెలియజాలరు. వారు చక్కగా ఆలోచించి కార్యాలు నిర్వర్తించేవాడిని చూచి 'వీడు జడుడు, అలసుడు' అని నిందిస్తారు. అది బుద్ధిమంతుల లక్షణం కాదు'.

వ. అని చెప్పి వెండియు నిట్లను 'నీవడిగిన యర్థంబు మేధాతిథి యను మునిసుతుండు చిరకారి యనువాని వృత్తాంతంబు వినినం దెలియు; దానిం జెప్పెద. **264**

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; వెండియున్= మరల; ఇట్లనున్= ఈ విధంగా అన్నాడు; నీవు+అడిగిన= నీవు ప్రశ్నించిన; అర్థంబు= విషయం; మేధాతిథిఅను మునిసుతుండు= మేధాతిథి అనబడే మునియొక్క పుత్రుడు; చిరకారి అనువాని= చిరకారి అనబడే వాడియొక్క; వృత్తాంతంబున్= చరిత్రను; వినినన్= ఆలకిస్తే; తెలియున్= తేటపడుతుంది; దానిన్= ఆ చరిత్రను; చెప్పెదన్= వివరిస్తాను.

తాత్పర్యం: భీష్ము డారీతిగా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు: 'ఇప్పుడు నీ వడిగిన విషయం మేధాతిథి అనే తాపసుడి కుమారుడు 'చిరకారి' అనే వాడి చరిత్ర వింటే స్పష్టమవుతుంది. ఆ కథ వివరిస్తాను వినుము.

చిరకారియను మునికుమారుని చరిత్ర (సం. 12-258-2)

క. అతఁడు చిరకాల సువిచా । రితంబుగాఁ జేసి యాచరించుం గురుభూ
పతివర్య! యెద్దియును నది । గతముగఁ జిరకారి నామకంబునఁ బరఁగున్. **265**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కురుభూపతివర్య!= కౌరవరాజశ్రేష్ఠా!; అతఁడు= ఆ మేధాతిథి కుమారుడు; ఎద్దియును= ఏ పని ఐనను; చిరకాల సువిచారితంబుగాన్+చేసి= చాలాకాలం చక్కగా ఆలోచనతో కూడినదిగా కావించి; ఆచరించున్= అనుష్ఠించును; అది కతముగన్= అదికారణంగా; చిరకారినామకంబునన్= చిరకారి అనే పేరుతో; పరఁగున్= ప్రవర్తిల్లుతాడు.

తాత్పర్యం: ధర్మరాజా! ఆ మేధాతిథిపుత్రుడు ఏ పనినీ తొందరపడి చేయడు. చక్కగా ఆలోచించి చాలాకాలం తర్వాత ఆ పని నెరవేరుస్తాడు. అందువలననే ప్రజ లతడిని 'చిరకారి' అని వ్యవహరించారు.

సీ. **విను మొక్క కారణంబున ముని పత్నిపైఁ। గోపించి చంప నక్కొడుకుఁ బనిచి**
యెటయేని వెడలి పోవుటయును, బనులెల్లఁ। జిరవిచారముతోడఁ జేయుఁ గాన
యచ్చిరకారి యిట్లని విచారించె 'జ। నకు పంపుసేఁత మానంగరాదు,
తల్లిఁ జంపుటయును తగదు; తండ్రి తలంపుఁ। దప్పింతుఁ గాకని తలఁతునేనిఁ

తే. **గల్మషంబండ్రు దాని సత్కర్మవిదులు;। మాతృరక్ష గర్తవ్య మెమ్మాడ్కినైనఁ;**
బుత్ర భావ మస్వాతంత్ర్యమునకు నెలవు;। పాప మడఁగింప నెవ్వల నోపు నొక్కొ! 266

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ముని= మేధాతిథిఅనే మౌని; ఒక్కకారణంబునన్= ఏదో ఒక కారణం చేత; పత్నిపైన్= భార్యమీద; కోపించి= కోపపడి; చంపన్= (ఆమెను) చంపటానికై; ఆ+కొడుకున్= ఆ కుమారుడిని; పనిచి= నియోగించి; ఎటఏనిన్= ఎచ్చటికో; వెడలిపోవుటయున్= బయలుదేరి పోగా; ఆ+చిరకారి= ఆ చిరకారి అనేవాడు; పనులు+ఎల్లన్= కార్యాలన్నీ; చిరవిచారముతోడన్= దీర్ఘకాలపుటాలోచనతోగూడ; చేయున్+కాన= చేస్తాడు కాబట్టి; ఇట్లు+అని= ఈ రీతిగా; విచారించెన్= చింతించాడు; జనకుపంపుసేఁత= తండ్రి ఆదేశాన్ని నిర్వర్తించటం; మానంగన్ రాదు= నిలుపతగదు; తల్లిన్= అమ్మను; చంపుటయును= హతమార్చుటకూడా; తగదు= ఉచితంకాదు; తండ్రి తలంపు= జనకుడి సంకల్పాన్ని; తప్పింతున్+కాక+అని= తొలగింతునుగాక అని; తలఁతునేనిన్= భావించెదనేని; దానిన్= అట్లు చేయటాన్ని; సత్కర్మవిదులు= మంచికార్యాలను గురించి తెలిసిన పెద్దలు; కల్మషంబు+అండ్రు= పాప మంటారు; ఏ+మాడ్కిన్+ఐనన్= ఏ రీతిగా నైనా; మాతృరక్ష= తల్లిని కాపాడటం; కర్తవ్యం= చేయదగినది; పుత్రభావము= పుత్రత్వం; అస్వాతంత్ర్యమునకున్= స్వతంత్రత లేమికి; నెలవు= ఆశ్రయం; పాపము= ఈ కల్మషమును; అడఁగింపన్= నశింపజేయుటకు; ఏ+వలను= ఏ ఉపాయం; ఓపును+ఒక్కొ!= సమర్థమైన దొకో!

తాత్పర్యం: ధర్మజా! వినుము. మేధాతిథి ఏదో ఒక కారణాన భార్యపై కోపించాడు. కొడుకును పిలిచి ఆమెను చంపుమని ఆదేశించి వెంటనే అత డెక్కడికో వెళ్ళిపోయాడు. మునికుమారుడైన చిరకారి తాను చేసే పనులన్నీ చాలాసేపు ఆలోచించి చేసే లక్షణం కలవాడు. అందువలన అత డిట్లా ఆలోచించాడు; 'మాతండ్రి ఆజ్ఞను పాటించకుండా ఉండటానికి వీలుగాదు. అట్లని తల్లిని చంపటం కూడా యుక్తం కాదు. తండ్రియొక్క ఆలోచన తప్పించటానికి ప్రయత్నిద్దా మనుకొంటే సత్కర్మవేత్తలైన పెద్దలు అట్లా చేయటం పాపమంటారు. తల్లినెట్లాగైనా కాపాడాలి. ఏ విధంగా చూచినా తల్లిదండ్రులమధ్య ఈ 'పుత్రత్వం' అనేది స్వేచ్ఛలేనిదిగా ఉన్నది. ఈ పాపాన్ని తొలగించజాలినది ఏదైనా ఉపాయమున్నదా?

క. **జననీ వధంబు సేసిన। ననుమానమె నరక మగుట యని యుడిగితిఁ బో,**
జనకావమాన మొనరిం। చిన వానికి నరకమున వసింపఁగ వలదే. 267

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: జననీవధంబున్= మాతృహత్యను; చేసినన్= చేస్తే; నరకము+అగుట= నరకలోకప్రాప్తి; అనుమానమె? అని= సందేహమా? అని; ఉడిగితిన్‌పో= వర్జించితినిపో; జనక+అవమానము= తండ్రియొక్క తిరస్కారమును; ఒనరించినవానికిన్= చేసినవాడికి; నరకమునన్= నరకలోకమునందు; వసింపఁగ వలదే?= నివసించవలసిరాదా?

తాత్పర్యం: తల్లిని చంపితే నరకం వస్తుందని భావించి మాతృహత్యను వర్జిస్తాననుకో, అప్పుడు పితృాజ్ఞ ధిక్కరించిన దోషం రాదా? ఆ దోషం వలన నరకప్రాప్తి తప్పుతుందా?

తే. **తల్లి ధాత్రిక బీజంబు తండ్రి వెట్టు । వంశధరణార్థముగ; నిది వారి భంగి;**
యేను బొత్తులవాఁడ; నయ్యిరువురకును । వీరలం దిప్పు డెవ్వరి విడుచువాఁడ?' **268**

ప్రతిపదార్థం: వంశధరణ+అర్థముగన్= వంశాన్ని నిలపటానికి; తల్లి; ధాత్రిక= నేల; తండ్రి= జనకుడు; బీజంబుపెట్టున్= విత్తనం నాటుతాడు; ఇది= ఈ రీతిగా చేయటం; వారి భంగి= జననీజనకుల పద్ధతి; ఏను= నేను; ఆ+ఇరువురకును= ఆ ఇద్దరికీ; పొత్తులవాఁడన్= ఉమ్మడిగా సంబంధించినవాడను; వీరలందున్= వీరిరువురిలో; ఇప్పుడు= ఈ సమయంలో; ఎవ్వరిన్= ఎవరిని; విడుచువాఁడన్?= వదలగలను?

తాత్పర్యం: వంశము నిల్పటానికి గాను తల్లి నేలకాగా, తండ్రి అందులో బీజావాపం చేస్తాడు. ఇది వారి పద్ధతి. నేను తల్లి దండ్రులిద్దరికీ సంబంధించినవాడను. ఈ క్లిష్టపరిస్థితిలో ఈ ఇరువురిలో నే నిప్పు డెవరిని వదలిపెట్టగలను?'

విశేషం: ధాత్రిక అనే పాఠానికి 'భస్త్రిక' అనే పాఠాంతరం ఉన్నది. 'ధాత్రిక' పాఠమే సమంజసం.

వ. **అని విచారించి తలంచుకొని.** **269**

ప్రతిపదార్థం: అని విచారించి= అని చింతించి; తలంచుకొని= భావించుకొని.

తాత్పర్యం: చిరకారి ఈ రీతిగా చింతించి తలచుకొన్నవాడై - (తరువాతి పద్యంతో అన్వయం).

క. **'జనకుఁడ యేనై జన్మిం । చినవాఁడను; జనకు పంపు సేసినఁ బాయుం**
దనయుని పాపము లనియును । వినియుండుదుఁ; దలఁపు లింక వేయును నేలా? **270**

ప్రతిపదార్థం: జనకుఁడు+అ = తండ్రియే; ఏనై= నేనై; జన్మించిన వాఁడను= పుట్టినవాడను; తనయుని పాపములు= కుమారుడి పాపాలు; జనకుని పంపు= తండ్రి ఆజ్ఞను; చేసినన్= నెరవేరిస్తే; పాయున్= తొలగుతాయి; అనియును= అనికూడా; వినియుండుదున్= ఆలకించిఉన్నాను; ఇంకన్= ఇకపై; తలపుఁలు= సంకల్పాలు; వేయునున్+ఏలా?= వేయి ఎందుకు?

తాత్పర్యం: తండ్రియే నేనై పుట్టాను. జనకుడి ఆజ్ఞ నెరవేరిస్తే కుమారుడి పాపాలన్నీ నశిస్తాయని కూడా విని ఉన్నాను. ఇంక లేనిపోని వేయి ఊహలు ఎందుకు?

విశేషం: "ఆత్మా వై పుత్రనామాసి" అనేశ్రుతి ననుసరించి తండ్రియే కుమారుడై జన్మిస్తాడని గ్రహించాలి.

క. **జనకుఁడు దపమును ధర్మం । బును విద్యయుఁ బరమదైవమును గావున నా**
తనికిఁ బ్రియంబగు పని సే । సిన దేవత లెల్లఁ బ్రీతిఁ జెందుట గల్గున్. **271**

ప్రతిపదార్థం: జనకుఁడు= తండ్రి; తపమును= తపస్సున్నూ; ధర్మంబును= శాస్త్రోక్త ధర్మమున్నూ; విద్యయున్= చదువున్నూ; పరమదైవమును= శ్రేష్ఠమైన దైవమున్నూ; కావునన్= కాబట్టి; ఆతనికిన్= తండ్రికి; ప్రియంబు+అగు= ప్రీతిపాత్రమైన; పని= కార్యం; చేసినన్= చేస్తే; దేవతలు+ఎల్లన్= దేవతలందరూ; ప్రీతిన్+చెందుట= సంతోషపడటం; కల్గున్= ఔతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తపస్సు, ధర్మం, విద్య, శ్రేష్ఠమైన దైవం - ఇవన్నీ తండ్రియే. అందువలన తండ్రికి ప్రీతి గలిగించే పని నెరవేరిస్తే దేవతలందరూ ప్రీతి పొందుతారు'.

వ. అని వితర్కించియుఁ దల్లి తెఱంగుఁ దలంచి. 272

ప్రతిపదార్థం: అని వితర్కించియున్= అని విశేషంగా ఆలోచించికూడా; తల్లి తెఱంగున్= మాతృస్థితిని; తలంచి= చింతించి.

తాత్పర్యం: ఈ విధంగా తండ్రిని గూర్చి విశేషంగా చిరకారి విచారించాడు. తదుపరి తల్లియొక్క స్థితిని గూర్చి ఆలోచించి (మళ్ళీ ఇట్లా అనుకొన్నాడు) - (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'కరచరణాది సంఘటితకాయము సంజననంబు వహ్నిపు
ట్టరణికిఁ బోలెఁ దల్లి దెసనైనది గాదొకొ! యట్లుఁగాక దు
ర్భరమగు గర్భఖేదమును బట్టికినై నిజదేహచింతపై
భర మొకయింతలేక పడుపాటులు నక్కట! యెక్కు డింతకున్. 273

ప్రతిపదార్థం: వహ్నిపుట్టు= అగ్నియొక్క పుట్టుక; అరణికిన్+పోలెన్= త్రచ్చుటచేత నిప్పును గలిగించే కొయ్యకువలె; కరచరణాది సంఘటితకాయము సంజననంబు= చేతులు, కాళ్ళు మొదలైన అవయవాలతో కూడిన శరీరం యొక్క పుట్టుక; తల్లిదెసన్= జననియందు; ఐనది కాదొకొ!= జరిగినది కాదా!; అట్లున్‌కాక= అట్లు కావటమే కాక; దుర్భరము+అగు= భరించరాని; గర్భ ఖేదమును= పురిటి నొప్పుల వలన కలిగే బాధ; నిజదేహచింతపైన్= తన శరీరానికి చెందిన విచారంమీద; ఒక ఇంత= ఇసుమంత కూడా; భరములేక= బరువులేక; పట్టికినై= బిడ్డకొరకై; పడుపాటులున్= పడే కష్టాలు కూడ; ఇంతకున్= స్వశరీరచింత కంటె; ఎక్కుడు= ఎక్కువ; అక్కట!= అయ్యో!

తాత్పర్యం: అగ్ని అరణిని మథించటం వలన అందులో పుట్టుతుంది. అట్లాగే చేతులు, కాళ్ళు మొదలైన అంగాలతో కూడిన ఈ శరీరం తల్లినుండే జనిస్తుంది. అంతేకాదు సహించశక్యంకాని గర్భధారణ క్లేశం, తన శరీరంయొక్క బాగోగులు చూచుకొనకుండ బిడ్డకై పడే పలు కష్టాలు అయ్యో! తల్లికే ఎంతో ఎక్కువగా ఉంటాయి.

ఆ. వచ్చిపోయి చూచువాఁడు గా కిడుమలఁ । బడునె తల్లిపోలెఁ బట్టితోడఁ
దండ్రి చెప్పు నిట్లు ధర్మశాస్త్రంబులు । నంబ గౌరవమున నధిక యగుట. 274

ప్రతిపదార్థం: తండ్రి= జనకుడు; వచ్చిపోయి చూచువాఁడుకాక= వస్తూ పోతూ చూస్తూఉండే వాడేకాక; పట్టితోడన్= బిడ్డతో; తల్లిపోలెన్= జననివలె; ఇడుమలన్+పడునె?= కష్టాలు పడుతాడా?; ధర్మశాస్త్రంబులున్= ధర్మశాస్త్రాలు కూడా; అంబ= తల్లి; గౌరవమునన్= గురుత్వమునందు; అధిక అగుటన్= (తండ్రికంటె) గొప్పది కావటాన్ని; ఇట్లు= ఇదే రీతిగా; చెప్పున్= చెప్పుతున్నవి.

తాత్పర్యం: తండ్రి బిడ్డవద్దకు రాకపోకలు సాగిస్తూ చూస్తూ ఉంటాడు. అంతేకాని తల్లివలె బిడ్డవిషయాన్ని గాఢంగా పట్టించుకొని బాధపడడు. ధర్మశాస్త్రాలు కూడా తండ్రికంటె తల్లి గౌరవంలో గొప్పది అని ఇట్లాగే చెప్పుతున్నాయి.

విశేషం: "ఉపాధ్యాయాన్ దశాచార్యః । ఆచార్యాణాం శతం పితా ।
సహస్రం తు పితౄన్ మాతా । గౌరవే ణాతిరిచ్యతే ॥

అని మన్వాది ధర్మశాస్త్రాలు చెప్పుతున్నాయి. అంటే పదిమంది ఉపాధ్యాయులకంటె ఒక ఆచార్యుడు, నూరుమంది ఆచార్యులకంటె ఒక తండ్రి, వెయ్యిమంది తండ్రులకంటె ఒక తల్లి గౌరవంలో గొప్పవారుగా ఉన్నారని భావం. అందుకే వేదంకూడా 'మాతృదేవో భవ' అని తల్లినే మొదటి దైవంగా భావించుమని బోధించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. బాలుఁ డైనఁ గొడుకు ప్రౌఢుఁ డైనను వృద్ధుఁ । డైన నొక్క విధమ యర్మిలియును
నరయు భరముఁ దల్లి కా పదార్థంబు జ । గంబు కలిమికెల్లఁ గారణంబు. 275

ప్రతిపదార్థం: కొడుకు= పుత్రుడు; బాలుఁడైనన్= పిల్లవాడైనా; ప్రౌఢుఁడు+ఐనను= యుక్తవయస్సు కలవాడైనా; వృద్ధుఁడు+ఐనన్= ముసలివాడైనా; అర్మిలియును= ప్రేమయు; అరయు భరము= కాపాడే బాధ్యత; తల్లికిన్= జననికి; ఒక్క విధము+అ= ఒకేరీతిగా ఉంటుంది; ఆ పదార్థంబు= 'తల్లి' అనే ఆ వస్తువు; జగంబు కలిమికిన్+ఎల్లన్= సర్వ ప్రపంచపుటునికికీ; కారణంబు= నిమిత్తం.

తాత్పర్యం: కన్నకొడుకు చిన్న వయస్సులోఉన్నా, యుక్తవయస్సు కలవాడైనా; వృద్ధుడైనా తల్లికి వాడిమీద ప్రేమ, అతడిని రక్షించే బాధ్యత ఒకేరీతిగా ఉంటాయి. 'తల్లి' అనే వస్తువే ఈ లోకానికంతటికీ మూలకారణం.

ఆ. క్షుద్ర జంతువులకు గురులకు నెమ్మెయిఁ । దలఁప నొక్కరూప తల్లి వలయు
నూఱడిల్లఁ గలదె యొండుసోటుల సువ । స్తువు నివాసమైన చోటఁ గాక! 276

ప్రతిపదార్థం: క్షుద్రజంతువులకున్= నీచ జంతువులకూ; గురులకున్= పెద్దవారికీ; ఏ+మెయిన్= ఏ రీతిగానైనా; తలఁపన్= ఆలోచించగా; తల్లి= మాత; ఒక్కరూప వలయున్= ఒకే విధంగా అవసరమై ఉన్నది; సువస్తువు= మంచి వస్తువు; నివాసము+ఐన= నివసించెడి; చోటన్+కాక= ప్రదేశంలో కాక; ఒండుచోటులన్= వేరే చోట్ల; ఊఱడిల్లన్+కలదె?= ఉపశమించటానికున్నదా?

తాత్పర్యం: నీచ ప్రాణులకైనా, ఉత్తమప్రాణులకైనా ఏ రీతిగా ఆలోచించి చూచినా తల్లి ఒకే రీతిగా అవసరమై ఉన్నది. తల్లివంటి సత్పదార్థం ఉన్నచోట సుఖంగా ఉండగలంగాని, అది లేనిచోట ఉపశాంతితో జీవించటం సాధ్యమా?

క. అప్పుడ యసమర్థుం డగు । నప్పుడ దుఃఖియగు శూన్యమై తోఁచు జగం
బప్పుడ మాతృవియోగం । బెప్పుడు వాటిల్లె నపుడ యెంతయుఁ దూలున్. 277

ప్రతిపదార్థం: మాతృవియోగంబు= తల్లితో ఎడబాటు; ఎప్పుడు= ఏ కాలంలో; పాటిల్లెన్= కల్గెనో; అప్పుడు+అ= అప్పుడే; అసమర్థుండు+అగున్= శక్తిలేనివాడౌతాడు; అప్పుడు+అ= ఆ కాలంలో; దుఃఖి+అగున్= దుఃఖం పొందినవాడౌతాడు; అప్పుడు+అ= అప్పుడే; జగంబు= లోకం; శూన్యము+ఐ= లేనిదై; తోఁచున్= భావనకు వస్తుంది; అపుడు+అ= అప్పుడే; ఎంతయున్= మిక్కిలిగా; తూలున్= చలించిపోతుంది.

తాత్పర్యం: ఎవడికి తల్లితో ఎప్పుడు వియోగం కలుగుతుందో, వాడు అప్పుడే అన్ని విధాలా అశక్తు డవుతాడు. అప్పుడే దుఃఖితు డవుతాడు. అతడికి లోకమంతా శూన్యమై తోస్తుంది. అప్పుడు వాడు చలించిపోతాడు.

క. కలవాఁడు లేనివాఁడు స । బలుఁ డబలుఁడు మూఢబుద్ధి ప్రౌఢుం డనఁగా
వల; దెవ్వరికైన జనని । కలిమియ యత్యంతసౌఖ్యకరమై యుండున్. 278

ప్రతిపదార్థం: కలవాఁడు= సంపన్నుడు; లేనివాఁడు= పేదవాడు; సబలుఁడు= బలవంతుడు; అబలుఁడు= బలహీనుడు; మూఢబుద్ధి= తెలివిలేనివాడు; ప్రౌఢుండు= బుద్ధిమంతుడు; అనఁగాన్ వలదు= అని చెప్పవద్దు; ఎవ్వరికైనన్= ఎట్టివారికైనాసరే; జనని కలిమియ= తల్లి ఉండటమే; సౌఖ్యకరము+ఐ= సుఖము కలిగించేదై; ఉండున్= ఉంటుంది.

తాత్పర్యం: వాడు ధనికుడు కావచ్చును, లేక పేదవాడు కావచ్చును. బలవంతుడు కావచ్చును, లేదా బలహీనుడు కావచ్చును. మూర్ఖుడు కావచ్చును, లేదా బుద్ధిమంతుడు కావచ్చును. వాడూ వీడూ అనవలసిన పని లేదు. ఎవడికైనా తల్లి జీవించి ఉండటమే సుఖహేతువై ఉంటుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. ఇట్టి జనని వధించుట యెల్లభంగి। నధికపాప పయోరాశియందు ముంచు;
దీని నెఱుఁగండె పసులవాఁ డైన? వధకు। నేల తెంపు వాటిలుఁ? జేతు లెట్టులాడు?' 279

ప్రతిపదార్థం: ఇట్టి జననిన్= ఇట్లాంటి తల్లిని; వధించుట= చంపటం; ఎల్లభంగిన్= అన్నివిధాలా; అధికపాప పయోరాశి అందున్= గొప్ప 'పాప' మనే సాగరంలో; ముంచున్= ముంచివేస్తుంది; పసులవాఁడు+ఐన= పశువులు మేపుకొనేవాడైనా; దీనిన్= ఈ విషయాన్ని; ఎఱుఁగండు+ఎ?= తెలియడా?; వధకున్= తల్లిని చంపటానికి; తెంపు= సాహసం; ఏల పాటిలున్= ఎట్లా సంభవిస్తుంది?; చేతులు= కరములు; ఎట్టులు+ఆడున్?= ఎట్లా పనిచేస్తాయి?

తాత్పర్యం: ఇట్లాంటి పూజ్యురాలైన తల్లిని వధించటం అన్ని రీతులా మహాపాపమనే సముద్రంలో ముంచివేస్తుంది. ఈ సంగతి పసులకాపరికి కూడా తెలిసిందే. తల్లిని చంపటానికి సాహస మెట్లా కల్గుతుంది? చేతు లెట్లా ఆడుతాయి?'

వ. అని యిట్లు పెక్కు భంగుల నూహించుచుఁ జిరకారి యగుట నతండు శీఘ్రకారి గాక యుండం దడవెంతయేనియుం గలిగె నంతకుం దదీయ జనకుండు. 280

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ రీతిగా; అతండు= ఆ మునికుమారుడు; పెక్కుభంగులన్= అనేక విధాల; ఊహించుచున్= తర్కిస్తూ; చిరకారి అగుటన్= 'చిరకారి' (ఆలసించి చేసేవాడు) కావటంచేత; శీఘ్రకారి కాకఉండన్= తొందరపడి పనిచేసేవాడు కాకుండా ఉండగా; ఎంతఏనియున్= ఎంతో; తడవు= ఆలస్యం; కలిగెన్= అయింది; అంతకున్= ఆ సమయానికి; తదీయ జనకుండు= అతడి తండ్రి.

తాత్పర్యం: చిరకారి ఈ రీతిగా అనేక విధాల ఆలోచిస్తూ ఉండిపోయాడు. సహజంగా అతడు బహుకాలం చింతించి పనిచేసేవాడు కావటం వలన తొందరపడలేదు. ఇట్లా చాలా సమయం జరిగిపోయింది. అప్పటికి అతడి తండ్రి మేధాతిథి - (తరువాతి పద్యంతో అన్వయం).

క. వెడపనికి నాలిఁ జంపం। గొడుకుఁ బనిచి వచ్చినాఁడ గ్రూరత్వమునం
గడవంబడునొకొ పని?' యని। కడువేసఁ జనుదెంచె నశ్రుకణములు దొరఁగన్. 281

ప్రతిపదార్థం: క్రూరత్వమునన్= కఠినమైన స్వభావంతో; వెడపనికిన్= చిన్న పనికి; ఆలిన్= భార్యను; చంపన్= చంపటానికై; కొడుకున్= కుమారుడిని; పనిచి= ఆదేశించి; వచ్చినాఁడన్= వచ్చాను; పని= ఆ క్రూరమైన కర్మ; కడవన్+పడున్+ఒకొ అని=జరిగిపోయి ఉంటుందా అని; అశ్రుకణములు= కన్నీటి బొట్లు; తొరఁగన్= జారగా; కడున్‌వేసన్= మిక్కిలి త్వరగా; చనుదెంచెన్=వచ్చాడు;

తాత్పర్యం: ఇంచుక పనికి కోపించి క్రూరుడనై భార్యను చంపుమని పుత్రుడి నాజ్ఞాపించి వచ్చాను. కుమారుడు ఆ పనిచేసి ఉంటాడేమో! అని కన్నీరు కారుస్తూ వడివడిగా తిరిగి వచ్చాడు.

వ. అట్లు సనుదెంచునప్పుడు. 282

ప్రతిపదార్థం: అట్ల= ఆ రీతిగా; చనుదెంచు+అప్పుడు= వచ్చేటప్పుడు.

తాత్పర్యం: అట్లా అతడు వచ్చేటప్పుడు.

క. 'చిరకారి యెట్లునుం దన। చిరకారితఁ జూపుఁ గాక శీఘ్రపుఁ జేతన్
దురటిల్లఁ జేయునే నను?। వెరవరి వాఁ డిట్టి పనికి వేగిరపడునే?' 283

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: చిరకారి= నా కుమారుడగు చిరకారి; ఎట్లునున్= ఏ విధంగానైనా; తన చిరకారితన్= తనయొక్క చిరకారిత్వమును; అనగా ఆలస్యంగా పనిచేసే లక్షణం; చూపున్+కాక= ప్రదర్శిస్తాడుగాక; శీఘ్రము+చేఁతన్= త్వరతో కూడిన పనిచేత; ననున్= నన్ను; దురటిల్లన్+చేయునే?= వగచేటట్లు చేస్తాడా?; వాఁడు= అతడు; వెరవరి= ఉపాయశాలి; ఇట్టిపనికిన్= ఈ విధమైన పనికి; వేగిరపడునే?= తొందరపడతాడా?

తాత్పర్యం: 'నా పుత్రుడు చిరకారి ఏ రీతిగానైనా చాలాకాలం ఆలోచించి పనిచేసే తన సహజ స్వభావాన్నే ప్రదర్శిస్తాడు. కాని త్వరపడి పనిచేసి నన్ను దుఃఖింపజేస్తాడా? వాడు చాలా ఉపాయం కలవాడు. అందువలన ఇట్లాంటి క్రూరమైన పనికి తొందరపడతాడా? (పడ డని భావం).

వ. అని పుత్రునుద్దేశించి. 284

ప్రతిపదార్థం: అని= ఈ రీతిగా భావించి; పుత్రున్+ఉద్దేశించి= కుమారుడితో.

తాత్పర్యం: ఇట్లా భావించి కుమారుడితో (మళ్ళీ ఇట్లా అనుకొన్నాడు).

చ. 'చిరముగ గర్భవాసమునఁ జెందితి పుత్ర చిరంబుగాఁగ ని
న్నరసె గదయ్య తల్లి; యనయంబును నేఁబనుపంగఁ బూనియుం
జిరమగునట్టి యిత్తెఱఁగుసేఁత దలంచితయేని సత్కృపా
పర! చిరకారి నాబరఁగు భాసితనామము సార్థకం బగున్. 285

ప్రతిపదార్థం: సత్కృపాపర!= మంచిదయగలవాడా!; పుత్ర!= కుమారా!; చిరముగన్= చాలాకాలంగా; గర్భవాసమునన్+చెందితి(వి)= తల్లియొక్క ఉదరవాసం చేశావు; తల్లి= మాత; చిరంబు+కాఁగన్= చాలాకాలంగా; నిన్నున్+అరసెన్+కదయ్య= నిన్ను కాపాడింది గదా నాయనా!; నేను= నేను; అనయంబును= నీతివిరహితమైన పనిని; పనుపంగన్= చేయుమని నిన్ను నియోగించగా; పూనియున్= పూనుకొని కూడా; చిరము+అగునట్టి= చాలాకాలం కొనసాగినట్టి; ఇత్తెఱఁగు చేఁత= ఈ పద్ధతిగా చేయటం; తలంచితి+అ+ఏనిన్= సంకల్పించితివా; చిరకారి+అనన్= చిరకారి అనగా; పరఁగు= ప్రవర్తిల్లే; భాసితనామము= ప్రకాశితమైన నీ పేరు; సార్థకంబు+అగున్= ప్రయోజనంతో కూడిన దవుతుంది.

తాత్పర్యం: కరుణాపరుడవైన ఓ కుమారా! నీవు చాలాకాలం నీతల్లి గర్భంలో ఉన్నావు. నిన్ను ఎంతోకాలం నీ తల్లి పోషించింది. నేను నిన్ను అవినీతి పరమైన కార్యం చేయటానికి పురికొల్పాను. ఐనా చాలాకాలం నీతల్లి నీకై చేసిన సేవలను తలంచుకొన్నావంటే 'చిరకారి' అనే నీ పేరు సార్థకమవుతుంది. (నీవు తొందర పడి నీ తల్లి వధకు పూనుకొనవు అని భావం).

ఆ. నాకు నా తపంబునకు నింద రాకుండ, । దురితభయము నిన్నుఁ బొరయకుండ
నెమ్మిఁ జేసి తన్న నీ చిరకారిత । సకల భూతములును సంస్తుతింప. 286

ప్రతిపదార్థం: నాకున్= మేధాతిథినైన నాకూ; నా తపంబునకున్= నా తపస్సుకూ; నింద= అపవాదు; రాకుండన్= కలగకుండ; నిన్నున్= నా కుమారుడవైన నిన్ను; దురితభయము= పాపభీతి; పొరయకుండన్= అంటకుండా; నీ చిరకారితన్= నీయొక్క చిరకారిత్వాన్ని; సకలభూతములును= సమస్త ప్రాణులును; సంస్తుతింపన్= పొగడగా; నెమ్మిన్= ప్రీతితో; చేసితి(వి)+అన్న!= చేసితివా బాబూ!

తాత్పర్యం: బాబూ! నాకూ, నే నింతకాలం చేసిన తపస్సుకూ నింద కలుగకుండానూ, నా కుమారుడ వైన నీకు 'తల్లిని చంపినందుకు కలిగే పాపభీతి అంటకుండానూ, సమస్త ప్రాణులూ నీ 'చిరకారిత్వ' మనే లక్షణాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్తుతింపగానూ, నీతల్లిపట్ల ప్రీతి నెఱపితివా? (నీ చిరకారిత నెమ్మి జేసితన్న?= నీ చిరకారిత్వ మనే ధర్మాన్ని ప్రీతితో నెరవేర్చావా నాయనా!' అని కూడా అన్వయించుకొనవచ్చును).

వ. అనుచుం జనుదెంచి నివాసంబు ప్రవేశించినం గని చిరకారి నిజకరంబున నున్న వధసాధనంబు డిగ్గ విడిచి యగ్గౌతమవంశవర్యు చరణంబులు శిరంబు సోఁకఁ బ్రణామంబు సేసెం; బత్నియుం జాఁగి మ్రొక్కె; నయ్యిరువుర నెత్తి శోకబాష్పంబు లానందాశ్రువులుగా నమ్మునివరుండు దనయుని గాఢాలింగనంబును, మూర్ధఘ్రాణంబునుం జేసి దీవనలం బొగడ్తల నభినందించి దానును వారును సుఖాసీను లై యుండి యిట్లనియె. 287

ప్రతిపదార్థం: అనుచున్= అని అనుకొంటూ; చనుదెంచి= వచ్చి; నివాసంబున్= గృహంలో; ప్రవేశించినన్= ప్రవేశించేసరికి; కని= చూచి; చిరకారి= అతడికుమారుడైన చిరకారి; నిజకరంబునన్+ఉన్న= తన చేతిలో ఉన్నట్టి; వధసాధనంబు= చంపటానికి సాధనమైన దానిని(కత్తిని); డిగ్గన్ విడిచి= వదలిపెట్టి; ఆ+గౌతమవంశవర్యు చరణంబులు= ఆ గౌతమవంశ శ్రేష్ఠుడైన మేధాతిథి పాదాలు; శిరంబుసోఁకన్= తలతాకేటట్లుగా; ప్రణామంబుచేసెన్= నమస్కరించాడు; పత్నియున్= భార్యకూడ; చాఁగిమ్రొక్కెన్= సాగిలబడి నమస్కరించింది; ఆ+మునివరుండు= ఆ మునిశ్రేష్ఠుడు; ఆ+ఇరువురన్= వారిద్దరినీ; ఎత్తి= పైకి లేవనెత్తి; శోకబాష్పంబులు= దుఃఖాశ్రువులు; ఆనంద+అశ్రువులుగాన్= సంతోషబాష్పాలు కాగా; తనయునిన్= కుమారుడిని; గాఢ+ఆలింగనంబును= గట్టి కౌగిలింతను; మూర్ధఘ్రాణంబునున్= శిరస్సు మూర్కొనుటను; చేసి= కావించి; దీనివలనన్= ఆశీర్వాదాలచేతనూ; పొగడ్తలన్= స్తుతులచేతనూ; అభినందించి= మెచ్చి; తానును= మేధాతిథి అయిన తానును; వారును= ఆ భార్యాపుత్రులును; సుఖాసీనులు+ఐ ఉండి= హాయిగా కూర్చున్నవారై ఉండి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ రీతిగా అనుకొంటూ వచ్చి మేధాతిథి తన ఇల్లు ప్రవేశించాడు. అతడిని చూచి చిరకారి తన చేతనున్న ఖడ్గాన్ని వదలిపెట్టాడు. ఆపై తండ్రి పాదాలు శిరస్సుసోకేటట్లు నమస్కరించాడు. మునిపత్ని కూడా ఆయనకు ప్రణమిల్లింది. ఆ మునీంద్రుడు ఆ యిద్దరినీ ఎత్తి తన దుఃఖబాష్పాలు ఆనందబాష్పాలు కాగా కుమారుడిని గట్టిగా కౌగిలించుకొన్నాడు. అతడి శిరసు మూర్కొన్నాడు. ఆశీర్వచనాలతోనూ, పొగడితలతోనూ అతడిని మెచ్చుకొన్నాడు. తరువాత మునీశ్వరుడూ, అతడి భార్యా, కుమారుడూ సుఖాసీనులై ఉన్నారు. అప్పుడు మేధాతిథి ఇట్లా అన్నాడు:

క. 'కార్యవిచారము చిరముగ । ధైర్యముతో నడపవలయుఁ; దత్తత్క్రియలం
దార్యుఁ డనార్యుఁడు వీఁ డని । యార్యులు సేయుదురు నిశ్చయమును; దిరముగన్. 288

ప్రతిపదార్థం: కార్యవిచారమున్= కార్యంయొక్క సమీక్షను; చిరముగన్= చిరకాలంగా; ధైర్యముతోన్= ధీరత్వంతో; నడపన్ వలయున్= నిర్వహించాలి; ఆర్యులు= పెద్దలు; తత్తత్క్రియల+అందున్= ఆయా కర్మలయందు; వీఁడు ఆర్యుఁడు= ఇతడు ఆర్యవృత్తి గలవాడు; అనార్యుఁడు అని= ఇతడు అనార్యవృత్తికలవాడు అని; తిరముగన్= స్థిరంగా; నిశ్చయమును= నిర్ణయాన్ని; చేయుదురు= చేస్తారు.

తాత్పర్యం: ఒక కార్యం చేయవలసి వచ్చినపుడు చాలాకాలం ఆలోచించి ధీరత్వంతో మంచి చెడ్డలు నిర్ణయించు కొని ఆ పని నెరవేర్చాలి. ఆయాపనులను నిర్వహించేటపుడు ఆలోచించి చేసేవాడిని ఆర్యుడనీ, తొందరపడేవాడిని అనార్యుడనీ పెద్దలైనవారు స్థిరంగా నిర్ణయిస్తారు.

క. మిత్రత్వము శత్రుత్వముఁ । బాత్రతయు నపాత్రతయును బరికించు సుచా
రిత్రుఁడు చిరతరగణనా । సూత్రితముగ దాన నెల్ల శుభములు నొందున్.' 289

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: చిరతరగణనా సూత్రితముగన్= చాలాకాలం సమీక్షతో కూడినట్లుగా; మిత్రత్వమున్= మైత్రిని; శత్రుత్వమున్= శత్రుభావాన్ని; పాత్రతయున్= యోగ్యతయును; అపాత్రతయును= అయోగ్యతయును; పరికించు= పరిశీలించే; సుచారిత్రుఁడు= మంచి నడవడి కలవాడు; దానన్= అట్లా చేయటంవలన; ఎల్లశుభములన్= సమస్త కల్యాణాలను; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: తొందరపడక చాలాసేపు విచారించి 'ఇతడు మిత్రుడు, ఇతడు శత్రువు, ఇతడు యోగ్యుడు, ఇతడు అయోగ్యుడు' అని పరిశీలించి ఆచరించే సచ్చరిత్రుడు - సమస్తమైన శుభాలనూ పొందుతాడు'.

వ. అని నిర్దేశించె; న ట్లా చిరకారి చిరకారిత్వంబు సఫలత్వంబు నొంది వినుతింబొందె. 290

ప్రతిపదార్థం: అని నిర్దేశించెన్= అని చెప్పాడు; అట్లు= ఆ రీతిగా; ఆ చిరకారి చిరకారిత్వంబు= ఆ మునికుమారుడి చిరకారితాలక్షణం; సఫలత్వంబున్= సాఫల్యాన్ని; ఒంది= పొంది; వినుతిన్+పొందెన్= పొగడ్తకెక్కాడు.

తాత్పర్యం: అని మేధాతిథి వచించాడు. ఈ రీతిగా 'చిరకారి' నామకుడయిన ఆ ముని కుమారుడి చిరకారిత్వం సఫలమయింది. అతడు తన చిరకారిత్వం వలన శ్లాఘాపాత్రుడయ్యాడు.

క. కావునఁ గురువంశోత్తమ! । నీవును సదసత్ప్రకార నిశ్చయము చిరం
బై వఱలఁ జేయుమీ! యది । గావించుం జిరము లైన కార్యఫలములన్. 291

ప్రతిపదార్థం: కురువంశ+ఉత్తమ!= కౌరవకులశ్రేష్ఠా!; కావునన్= అందువలన; నీవునున్= నీవుకూడ; సదసత్ప్రకారనిశ్చయము= మంచి చెడుల పద్ధతియొక్క నిర్ణయమును; చిరంబై= దీర్ఘకాలమున చేయబడునదై; వఱలన్= ఒప్పేటట్లు; చేయుమీ!= ఒనరింపుమా!; అది= ఆ విధంగా చేసిన నిశ్చయము; చిరములు+ఐన= శాశ్వతాలైన; కార్యఫలములన్= కార్యప్రయోజనాలను; కావించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: కురువంశోత్తముడవైన ఓ ధర్మరాజా! అందువలన నీవు కూడా కార్యం చేయవలసి వచ్చినపుడు మంచి చెడులను చక్కగా ఆలోచించి తొందరపాటు లేక నిర్వర్తించుము. అట్లా చేసిన కార్యం యొక్క నిర్ణయం శాశ్వత ఫలాలను ప్రసాదిస్తుంది.

క. విను మచిరవృత్తిఁ జేసిన । పని కర్తకు నావహించుఁ బశ్చాత్తాపం
బనఘా! చిరభావితశు । ద్ధి నిరూపణకృతము శుభముఁ దేజముఁ దెచ్చున్.' 292

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; వినుము= ఆలకించుము; అచిరవృత్తిన్= తొందరపాటుతో; చేసిన= నిర్వర్తించిన; పని= కర్మం; కర్తకున్= చేసినవాడికి; పశ్చాత్తాపంబు= అనుతాపం; ఆవహించున్= కలిగిస్తుంది; చిరభావిత శుద్ధి నిరూపణకృతము= చాలాకాలం భావింపబడి శుద్ధిని నిరూపించటం చేత చేయబడిన పని; శుభమున్= భద్రమును; తేజమున్= కాంతిని; తెచ్చున్= లభింపజేస్తుంది.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ యుధిష్ఠిరా! వినుము. తొందరపడి ఒకడు పనిచేస్తే - ఆ పని చేసినవాడికి తరువాత పశ్చాత్తాపం కలిగిస్తుంది. అట్లాకాక చక్కగా చాలాకాలం ఆలోచించి దోషం లేదని నిర్ణయించుకొని చేసిన పని కర్తకు కల్యాణాన్నీ, ప్రకాశాన్నీ తెచ్చిపెట్టుతుంది.

వ. అనిన విని ధర్మపుత్త్రుండు 'ప్రజల శిక్షించు వెరవెట్టి' దని యడిగిన నాపగానందనుండు 'దొల్లి ద్యుమత్సేనుం డను రాజునకు నిజతనూజుం డగు సత్యవంతుతోడ సంవాదంబు గలిగె నది నీయడిగిన యర్థంబునకుం బ్రకాశకం బగుఁ; జెప్పెద నాకర్ణింపుము'; వా రిద్దఱుం బ్రజాశిక్ష తెఱంగు మాటలాడు సమయంబున. 293

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ధర్మపుత్రుండు= ధర్మజుడు; ప్రజలన్= జనులను; శిక్షించు వెరవు= శిక్షించే పద్ధతి; ఎట్టిది+అని అడిగినన్= ఏ విధమైనదని ప్రశ్నింపగా; ఆపగానందనుండు= గంగాసుతుడైన భీష్ముడు; తొల్లి= పూర్వం; ద్యుమత్సేనుండు+అను రాజునకున్= ద్యుమత్సేనుడనే నృపుడికి; నిజ తనూజుండు+అగు= తన కుమారుడైన; సత్యవంతుతోడన్= సత్యవంతుడనేవాడితో; సంవాదంబు= సంభాషణ; కలిగెన్= జరిగింది; అది= ఆ సంవాదం; నీ అడిగిన అర్థంబునకున్= నీవు ప్రశ్నించిన విషయానికి; ప్రకాశకంబు+అగున్= నిరూపించేదవుతుంది; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము; వారిద్దఱున్= ద్యుమత్సేన సత్యవంతు లనువా రిరువురు; ప్రజాశిక్ష తెఱంగు= ప్రజల శిక్షించే పద్ధతిని గూర్చి; మాటలాడు సమయంబునన్= సంభాషించుకొనే కాలమందు;

తాత్పర్యం: భీష్ము డావిధంగా చెప్పగా విని ధర్మరాజు 'ప్రజలను శిక్షించే పద్ధతి ఎట్లాంటిది?' అని మళ్ళీ ప్రశ్నించాడు. అప్పుడు భీష్ము డిట్లా అన్నాడు: 'పూర్వం ద్యుమత్సేనుడనే రా జుండేవాడు. అతడి కుమారుడు సత్యవంతుడు. వా రిరువురి మధ్య ఒక సంవాదం జరిగింది. ఆ సంవాదం నీ విపుడు నన్ను అడిగిన ప్రశ్నను వివరిస్తుంది. దానిని చెప్పుతాను వినుము. వారిరువురూ ప్రజలను శిక్షించే విధానాన్ని గురించి మాట్లాడుకొనే సమయంలో.

సీ. **వధము ధర్మంబుగా బుధులు సెప్పుదు రని । యనుశాసనము సేయు జనకుతోడ**
సత్యవంతుఁడు 'హింస కృత్యకర్మంబగు । నేని యకృత్య మిం కేది?' యనుడు
'మ్రుచ్చులు ప్రల్లదుల్ సచ్చువారల యట్లు । గాకున్న బాధలు లోకమునకుఁ
బుట్టవె?' యనిన నబ్భూపతి యమ్మాట । కతఁడు 'సంపుటదక్క నన్యదండ

తే. **విధిన శిక్ష సెల్లించుట వెరవుగాదె?' । నావుడును బతి 'య ట్లేల నడచు? దృష్టి**
దండ వాగ్దండ ధనదండ తనువికార । దండములు సేయునది తప్పు దర మెఱింగి. **294**

ప్రతిపదార్థం: బుధులు= పండితులు; వధమున్= చంపటాన్ని; ధర్మంబుగాన్= ధర్మకార్యంగా; చెప్పుదురు+అని= వచిస్తారని; అనుశాసనమున్ చేయు= ఆజ్ఞ చేయునట్టి; జనకుతోడన్= తండ్రితో; సత్యవంతుఁడు= అతడి కుమారుడగు సత్యవంతుడు; హింస= చంపటం; కృత్యకర్మంబు+అగున్+ఏనిన్= చేయదగిన పని ఐతే; ఇంకన్ అకృత్యము ఏది?= ఇంక చేయరాని పని ఏమున్నది?; అనుడున్= అనగా; ఆ+భూపతి= ఆ రాజు; మ్రుచ్చులు= దొంగలు; ప్రల్లదుల్= దుష్టులు; చచ్చువారల= చచ్చేవారే; అట్లు కాకున్నన్= అట్లా కానిచో; లోకమునకున్= ప్రపంచానికి; బాధలు= కష్టాలు; పుట్టవె?= కలుగవా?; అనినన్= అని చెప్పగా; ఆ+మాటకున్= ఆ పలుకునకు; అతఁడు= ఆ సత్యవంతుడు; చంపుటతక్కన్= వధించటం వినా; అన్యదండవిధిన్+అ= మరొక శిక్షాప్రకారంతోనే; శిక్ష చెల్లించుట= దండించటం; వెరవు గాదె!= యుక్తం కాదా!; నావుడును= అనగా; పతి= రాజు; అట్లు= ఆ రీతిగా; ఏల= ఎందుకు; నడచున్?= జరుగుతుంది?; తప్పు దరమున్= అపరాధంయొక్క ప్రమాణమును; ఎఱింగి= తెలిసికొని; దృష్టి దండ= చూపుతో శిక్షయు; వాగ్దండ= మాటలతో శిక్షించటం; ధనదండ= ధనాన్ని గ్రహించటం అనే శిక్షయు; తనువికారదండములు= శరీరానికి వికృతికలిగించటం అనే శిక్షలు; చేయునది= చేయాలి.

తాత్పర్యం: ద్యుమత్సేనుడు నేరం చేసినవారిని వధించటం ధర్మమని పండితులు చెప్పుతారని ఆనతి ఇచ్చాడు. అది విని అతడి కుమారుడు సత్యవంతుడు 'చంపటమే ధర్మమైతే ఇంక చేయరాని అధర్మ కార్య మేముంటుంది?' అని ప్రశ్నించాడు. అందుకు రాజు "దొంగలు, దుర్జనులు వధార్హులే, లేకపోతే లోకానికి వారివలన బాధలు తప్పవు' అని చెప్పాడు. అందుకు సత్యవంతుడు 'చంపటమనే శిక్షను వదలి మరొక దండనవిధానంతో శిక్షించటం ఉచితం కదా?' - అని అడిగాడు. అందుకు రాజు 'అట్లా ఎందుకు జరుగుతుంది? తప్పు చేసినవాడిని దండించేటప్పుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చేసిన తప్పు ఏ పాటిదో గమనించి అందుకు తగినట్లు చురచుర చూడటమనే శిక్షగాని, తీవ్రమైన మాటలతో మందలించటం అనే శిక్షగాని, డబ్బు వసూలు చేయటమనే శిక్షగానీ, లేక శరీరంలోని అవయవాలను వికృతం చేయటమనే శిక్షగానీ విధించాలి' అని చెప్పాడు.

క. వినుచంపఁ దగిన తప్పున । కనఘా! చంపుటయు వలయు; నాప్తుఁడు బంధుం
డనుజుఁడు దనుజుఁడు ననుమ । న్ననయును దుష్టునెడ రాజునకుఁ బాప మగున్. 295

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; విను= ఆలకించుము; చంపన్+తగిన తప్పునకున్= వధార్హమయిన నేరానికి; చంపుటయున్= వధించటమూ; వలయున్= అవసరమౌతుంది; రాజునకున్= ప్రభువుకు; దుష్టునెడన్= దుర్జనుడి పట్ల; ఆప్తుఁడు= కావలసినవాడు; బంధుండు= చుట్టం; అనుజుఁడు= సోదరుఁడు; తనుజుఁడు= కుమారుడు; అను మన్ననయున్= అనే ఆదరం కూడా; పాపము+అగున్= కిల్బిష మవుతుంది.

తాత్పర్యం: పాపరహితుడవగు ఓ కుమారా! చెప్పుతాను వినుము. చంపదగిన తప్పుచేసినవాడిని చంపటమే కర్తవ్యం. రాజైనవాడికి దుర్మార్గుడి పట్ల 'వీడు నాకు కావలసినవాడు, చుట్టం, తమ్ముడు, కుమారుడు' అనే పక్షపాతంకూడా పాపమే అవుతుంది సుమా!

తే. తాను మున్ను వినీతుఁడై తనదు మంత్రి । వరులఁ బుత్రుల భృత్యుల వరుసతోడ
వినయవంతులఁ జేసి భూవిభుఁడు ప్రజకు । రక్షణము సేయ నిహముఁ బరంబుఁ గల్గు. 296

ప్రతిపదార్థం: భూవిభుఁడు= రాజు; మున్ను= ముందు; తాను వినీతుఁడు+ఐ= తాను వినయం కలవాడై; తనదు= తనయొక్క; మంత్రివరులన్= అమాత్యముఖ్యులను; పుత్రులన్= కుమారులను; భృత్యులన్= సేవకులను; వరుసతోడన్= క్రమంగా; వినయవంతులన్+చేసి= వినీతులుగా ఒనర్చి; ప్రజకున్= జనులకు; రక్షణము చేయన్= కాపుదల చేయగా; ఇహమున్+పరంబున్= ఇహలోకపరలోక సుఖాలు రెండూ; కల్గున్= సంభవిస్తాయి.

తాత్పర్యం: రాజైనవాడు తాను ముందు వినయంగల వాడుగా ఉండాలి. తదుపరి తన మంత్రులను, కుమారులను, సేవకులనూ క్రమంగా వినయపరులను చేయాలి. అట్లా చేసి ప్రజలను రక్షించే భూపతి ఇహలోక సుఖాన్నీ, పరలోక సౌఖ్యాన్నీ చూరగొంటాడు.

క. దోష మరసి కామంబును । రోషంబును లేక తగిన రూపునఁ జేయం
బోషక మగు ధర్మమునకు । వైషమ్యవిహీనమైన వధము గుమారా! 297

ప్రతిపదార్థం: కుమారా!= పుత్రా!; దోషము+అరసి= తప్పును పరీక్షించి; కామంబును= కోరికనూ; రోషంబును= క్రోధాన్ని; లేక= కలిగిఉండక; తగిన రూపునన్= ఉచితమైన పద్ధతిలో; చేయన్= ఆచరించగా; వైషమ్యవిహీనము+ఐన= పక్షపాతరహితమైన; వధము= చంపటం; ధర్మమునకున్= ధర్మాచరణానికి; పోషకము+అగున్= పోషించేదిగా అవుతుంది.

తాత్పర్యం: పుత్రా! తప్పుచేసినవాడి తప్పును చక్కగా పరీక్షించాలి. కామక్రోధాలు వదలి ఉచితమైన పద్ధతిలో ఏ విధమైన పక్షపాతమూ లేకుండా వధార్హమైన నేరానికే మరణదండన విధించాలి. అట్లా చేస్తే అది ధర్మాన్ని పోషించే శిక్షగా అవుతుంది.

క. చంపఁగఁ జూచియు లోభము । పెంపునఁ గ్రోధమునఁ గామపీడను మది శం
కింపక దుష్టులు గీడొన । రింపఁగఁ జూడమె కలంక రేఁగు నహింసన్. 298

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దుష్టులు= దుర్జనులు; చంపఁగన్= వధించగా; చూచియున్= చూచికూడా; లోభము పెంపునన్= ఎక్కువ ఆశతోనూ; క్రోధమునన్= కోపంతోనూ; కామపీడను= కోరికవలన కలిగే ఒత్తిడివలన; మదిన్= మనసులో; శంకింపక= సందేహించక; కీడు+ఒనరింపఁగన్= అపకారం చేస్తుండగా; చూడమె= మనం చూస్తున్నాముకదా!; అహింసన్= హింస లేకపోవటం చేత; కలంక రేఁగున్= అస్తవ్యస్తమైన స్థితి విజృంభిస్తుంది.

తాత్పర్యం: దుర్మార్గులు నేరం చేసినవారు వధించబడటం చూస్తూనే ఉంటారు. కాని, కామం, క్రోధం, లోభం అనే దుర్గుణాలు మితిమీరటం వలన మదిలో ఏ విధమైన సందేహం లేకుండా ఇతరులకు తీవ్రమైన అపకారం చేస్తూనే ఉంటారు. ఇది మనం చూస్తూనే ఉన్నాంకదా! కాబట్టి మరణదండన విధించకుండా రాజు పూర్తిగా అహింసాపద్ధతిని పాటిస్తే లోకంలో ఎంతో అరాజకం ప్రబలిపోతుంది.

విశేషం: మానవులు కామక్రోధలోభాలకు గురిఅయి అకృత్యాలు చేసి నరకం పాలవుతారు. భగవద్గీతలో - ఈ విషయమే - "త్రివిధం నరకస్యేదం ద్వారం నాశన మాత్మనః, కామః క్రోధశ్చ లోభశ్చ తస్మా దేతత్త్రయం త్యజేత్" అని చెప్పబడింది. అరిషడ్వర్గాలనబడే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలలో మొదటివి మూడూ ఎంతగా మానవుడిని అకృత్యాలకు ప్రేరేపిస్తాయో ఇక్కడ ద్యుమత్సేనుడు నిరూపించాడు.

ఆ. **విను మహింస విప్రజనులకు నెల్ల భం। గులను వలయుఁ బ్రజలవలనఁ గరుణ**
గలిగి వారిఁ గీడు గదురక యుండంగఁ। గాపు పతి కహింసకత్వ మనఘ!' **299**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; వినుము= ఆలకించుము; విప్రజనులకున్= బ్రాహ్మణులకు; ఎల్లభంగులనున్= అన్నివిధాలా; అహింస= హింసలేమి; వలయున్= ఆవశ్యకమై ఉన్నది; పతికిన్= రాజునకు; ప్రజలవలనన్= జనులపట్ల; కరుణకలిగి= దయగలిగి; వారిన్= ఆ ప్రజలను; కీడు= అపకారం; కదురక ఉండంగన్= తాకకఉండేటట్లుగా; కాపు= రక్షించటం; అహింసకత్వము= హింసకుడు కాకుండా ఉండట మవుతుంది.

తాత్పర్యం: పాపరహితుడవైన సత్యవంతుడా! వినుము. బ్రాహ్మణులైనవారు అన్నివిధాలా అహింసనే పాటించాలి. ప్రజాపాలకుడైన భూపతికి ఆ విధమైన అహింస తగదు. అతడు ప్రజలపట్ల దయగలిగి ఉండాలి. వారికి ఏ విధమైన అపకారం కలుగకుండా చూడాలి.అట్లా ప్రజలను కాపాడటమే రాజైన వానికి అహింస అవుతుంది'.

కపిల గో సంవాద ప్రకారము (సం. 12-260-5)

వ. **అనియె నని చెప్పిన విని యజాతశత్రుండు తాతతో 'నవశ్యకర్తవ్యంబు గృహస్థధర్మంబో పరిత్యాగంబో నిరూపించి చెప్పవే' యనిన నతండు 'రెండును మాననీయ ధర్మంబులు; కపిలగోసంవాదంబను నితిహాసంబు వినుము; దాన నీవితర్కంబు వినిశ్చయ దశంబొందు, నని పలికి యిట్లనుఁ 'గపిలుం డను సంయమిసత్తముం డుత్తమాకృతియు భీతిరహితయు నహుషసంభావితయు నగు నొక్కగోవుం గాంచి 'నీవు వేదస్వరూపవు గావే' యని పలికె నమ్మాట వేదంబుల వలని యాదరంబు లేమింజేసి వెడలినదిగా నూహించి యప్పుడు గెలన నున్న స్యూమరశ్మి యనుముని సూక్ష్మరూపంబున నగ్గోవు నందుఁ బ్రవేశించి.** **300**

ప్రతిపదార్థం: అనియెన్+అని= అని చెప్పానని; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; అజాతశత్రుండు= ధర్మరాజు; తాతతోన్= భీష్ముడితో; అవశ్యకర్తవ్యంబు= తప్పక చేయదగినిది; గృహస్థధర్మంబో= గృహస్థుడికి సంబంధించిన ధర్మమో; పరిత్యాగంబో= సన్న్యాసమో; నిరూపించి= నిరూపణంచేసి; చెప్పవే= చెప్పుము; అనినన్= అనగా; అతండు= ఆ భీష్ముడు; రెండును=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గృహస్థసన్న్యాసములు రెండును; మాననీయ ధర్మంబులు+అ= పూజించదగిన ధర్మాలే; కపిలగోసంవాదంబు+అను= కపిలగోసంవాదంఅనే; ఇతిహాసంబు= పూర్వకథను; వినుము= ఆలకించుము; దానన్= అది వినటంవలన; నీ వితర్కంబు= నీసందేహం; వినిశ్చయదశన్= నిర్ణయస్థితిని; పొందున్+అని= పొందగలదని; పలికి= చెప్పి; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; కపిలుండు+అను= కపిలనామకుడైన; సంయమిసత్తముండు= మునిశ్రేష్ఠుడు; ఉత్తమ+ఆకృతియున్= మేలైన ఆకారం కలదీ; భీతిరహితయున్= భయంలేనిదీ; నహుష సంభావితయున్= నహుషుడిచేత సమ్మానించబడినదీ అయిన; ఒక్కగోవున్= ఒక ఆవును; కాంచి= చూచి; నీవు వేదస్వరూపవు కావే= నీవు శ్రుతి స్వరూపిణివి అగుదువుగదా!; అని పలికెన్= అని చెప్పాడు; ఆ+మాట= ఆ పలుకు; వేదంబుల వలని= వేదములవలన; ఆదరంబు= గౌరవం; లేమిన్+చేసి= లేకపోవటంవలన; వెడలినదిగాన్= పుట్టిందిగా; ఊహించి= తర్కించి; అప్పుడు= ఆ సమయంలో; కెలనన్+ఉన్న= సమీపంలో ఉన్న; స్యూమరశ్మి అనుముని= స్యూమరశ్మి అనే మౌని; సూక్ష్మరూపంబునన్= సూక్ష్మమైన రూపంతో; ఆ+గోవునందున్= ఆ ఆవులో; ప్రవేశించి= చొచ్చి.

తాత్పర్యం: అని ద్యుమత్సేనుడనే రాజు చెప్పాడు' అని భీష్ముడు అన్నాడు. అది విని ధర్మరాజు భీష్ముడితో 'గృహస్థధర్మ సన్న్యాస ధర్మాలలో తప్పక ఆచరించదగిన ధర్మమేదో నిర్ధారణ చేసి చెప్పు'మన్నాడు. అప్పుడు భీష్ముడు, 'పై రెండు ధర్మాలూ గౌరవించదగినవే. దీనిని నిరూపించే కపిలగోసంవాద మనే ఒక ఇతిహాసం ఉన్నది. దానిని వినిపిస్తాను, వినుము. అది వింటే నీ సందేహం తొలగిపోతుంది' అని చెప్పి ఇట్లా అన్నాడు: 'కపిలు డనే మునివర్యుడు శ్రేష్ఠమైన ఆకారం కలదీ, నిర్భయమైనదీ, నహుషుడిచేత పోషించబడినదీ, అయిన ఒక ధేనువును చూచి, నీవు వేదస్వరూపిణివిగదా అన్నాడు. ఆ ప్రక్కనే ఉన్న స్యూమరశ్మి అనే ముని కపిలుడి మాట వేదాలపై గౌరవం లేకపోవటం వలన వెలువడిందని ఊహించాడు. వెంటనే అతడు సూక్ష్మాకృతితో ఆ గోవులో ప్రవేశించాడు. అట్లా ప్రవేశించి -(తరువాతి పద్యంతో అన్వయం).

క. వేదములు డాంబికత్వా । పాదనములు గాఁగ యతులు వలుకుదు; రవి స
ర్వాదరణీయంబులు నీ । కాదరపాత్రములు గావొ?' యని పలుకుటయున్. 301

ప్రతిపదార్థం: యతులు= సన్న్యాసులు; వేదములు= శ్రుతులు; డాంబికత్వ+ఆపాదనములు కాఁగన్= డాంబికతను కలుగజేసేవిగా; పలుకుదురు= చెప్పుతారు; అవి= ఆ వేదాలు; సర్వ+ఆదరణీయంబులు= అందరికీ ఆదరించదగినవి; నీకున్+ఆదరపాత్రములు= నీకు గౌరవయోగ్యాలు; కావొ?= కావా?; అని పలుకుటయున్= అని చెప్పగా.

తాత్పర్యం: 'పరివ్రాజకులు వేదాలు డంబం కలిగిస్తాయని అంటారు. అవి అందరికీ ఆదరింపదగి ఉన్నాయి. నీకు ఆదరించదగినవి కావా?' అని కపిలుడితో గోవులో ప్రవేశించిన స్యూమరశ్మి అన్నాడు. అట్లా అనేసరికి - (తరువాతి పద్యంతో అన్వయం).

వ. అగ్గోవున కతం డిట్లనియె. 302

ప్రతిపదార్థం: ఆ+గోవునకున్= ఆ ఆవుతో; అతండు= కపిలుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అప్పుడు ఆ గోవుతో కపిలు డిట్లా అన్నాడు:

క. 'వేదములవలన నాకు న । నాదరమును నాదరమ్ము నను రెండును లే;
వేది గతంబుగ నడిగితొ । నీదు తలం పెఱుఁగునట్టి నేరిమి గలదే. 303

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వేదములవలనన్= వేదాలపట్ల; నాకున్= నాకు; అనాదరమును= గౌరవం లేకుండటం కాని; ఆదరమ్మును= మన్ననకాని; అను రెండును లేవు= అనే రెండు భావాలూ లేవు; ఏది కతంబుగన్= ఏది కారణంగా; అడిగితొ= నీవు అడిగినావో; నీదు తలంపు= నీ అభిప్రాయాన్ని; ఎఱుఁగునట్టి= తెలిసికొనేటటువంటి; నేరిమి= నేర్పు; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: 'అయ్యా! వేదాల విషయంలో నాకు ఆదరమూ లేదు. అనాదరమూ లేదు. నీవు ఎందు కిట్లా అడిగావో నాకు తెలియదు. నీ అభిప్రాయాన్ని గ్రహించే నేర్పరిని కాను.

వ. అయినను నా యెఱింగినంత సెప్పెద నాకర్ణింపుము; బ్రహ్మచర్య గృహస్థ ధర్మ వానప్రస్థ వృత్తి పరివ్రజనంబు లను నాలుగాశ్రమంబులు దేవయానంబుల; యత్తెరువుల నడచుట సంసారులకుఁ గర్తవ్యంబు గావున. 304

ప్రతిపదార్థం: అయినను= అయినప్పటికీ; నా ఎఱింగినంత= నేను గ్రహించినంత వరకు; చెప్పెదన్= వివరిస్తాను; ఆకర్ణింపుము= వినుము; బ్రహ్మచర్య గృహస్థధర్మ వానప్రస్థవృత్తి పరివ్రజనంబులు+అను= బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థ వర్తనం, సన్న్యసనం అనే; నాలుగు ఆశ్రమంబులు= చతురాశ్రమాలు; దేవయానంబులు+అ= ఆత్మప్రాప్తిహేతువులైన దేవయాన మార్గాలే; ఆ+ తెరువులన్= ఆ మార్గాలలో; నడచుట= చరించటం; సంసారులకున్= సంసారంలో ఉండేవారికి; కర్తవ్యంబు= అనుష్ఠించదగింది; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: అయినప్పటికీ నాకు తెలిసినంత వరకూ నీ వడిగిన విషయం చెప్పుతాను. వినుము. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే నాలుగు ఆశ్రమాలూ ఆత్మప్రాప్తికి సాధనాలే కాబట్టి, దేవయానా లనబడు తున్నాయి. ఆ మార్గాలలో నడవటం సంసారులైన వారికి ఆచరణీయంగా ఉన్నది. అందువలన - (తరువాతి పద్యంతో అన్వయం).

క. వారలకు వేదవిహితా। చారంబులు వలయు నది ప్రశస్తము హింసా
ప్రారంభ మాచరించుట। యారయఁగా మేలొ కీడొ యంచితమూర్తీ!' 305

ప్రతిపదార్థం: అంచితమూర్తీ!= పావనమూర్తీ!; వారలకున్= ఆ సంసారులకు; వేదవిహిత+ఆచారంబులు= వేదంచేత విధించబడిన ఆచారాలు; వలయున్= అవసరమై ఉన్నవి; అది= ఆ పద్ధతి; ప్రశస్తము= శ్రేష్ఠం; హింసాప్రారంభము= హింసాప్రయత్నం; ఆచరించటం= చేయటం; ఆరయఁగాన్= పరిశీలించగా; మేలొ= శుభమో; కీడొ= అశుభమో!

తాత్పర్యం: ఓ పవిత్రమూర్తీ! వేదం విధించిన ఆచారాలు సంసారులైన వారికి ఆవశ్యకమయి ఉన్నాయి. వేదవిహిత పద్ధతిలో నడవటం శ్రేష్ఠమైనది. అయితే యజ్ఞాలలో హింసకు పూనుకొనటం శుభప్రదమో, అశుభప్రదమో నీవే చెప్పుము'.

వ. అనుటయు స్యూమరశ్మి యతని కిట్లనియె. 306

ప్రతిపదార్థం: అనుటయున్= అని కపిలుడు చెప్పగా; స్యూమరశ్మి= గోవులోఉన్న స్యూమరశ్మి; అతనికిన్= కపిలుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: కపిలు డట్లా అడిగేసరికి గోవులో ప్రవేశించి ఉన్న స్యూమరశ్మి అతడితో ఇట్లా అన్నాడు:

క. 'అలఘుమతిని యజ్ఞార్థం। బులుగాఁ బశువులను ధాన్యములఁ గల్పించెన్
జలజభవుం; డదిగాకయుఁ। దలకొని యజ్ఞంబు లతఁడు దాఁ జేయఁడొకో!' 307

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: జలజభవుండు= బ్రహ్మ; అలఘుమతినిన్= గొప్పబుద్ధితో; పశువులనున్= జంతువులనూ; ధాన్యములన్= కొలుచులూ; కల్పించెన్= సృష్టించాడు; అది కాకయున్= అంతేకాక; అతఁడు= ఆ బ్రహ్మ; తాన్= తాను; తలకొని= పూనుకొని; యజ్ఞంబులు= యాగాలు; చేయఁడు+ఒకో!= చేయటం లేదా!

తాత్పర్యం: బ్రహ్మ గొప్ప ఆలోచనతో యజ్ఞంకొరకే పశువులను, ధాన్యాలను సృష్టించాడు. అంతే కాదు. అతడు తాను పూనుకొని యజ్ఞాలు చేశాడు కదా!

క. విను మజ్ఞునకును బ్రాజ్ఞున । కును గలయది దివ్యసుఖము గోరుట దివ్య
త్వనిరూఢి యాగకరణం । బునఁ దక్కఁగ నొంటఁ గలుగఁ బోలునె చెపుమా! 308

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; దివ్యసుఖము= దేవలోకానికి చెందిన సుఖాన్ని; కోరుట= అభిలషించటం; అజ్ఞునకునున్= జ్ఞానహీనుడికి; ప్రాజ్ఞునకును= జ్ఞానవంతునికిని; కలయది= ఉన్నదే; యాగకరణంబునన్+తక్కఁగన్= యజ్ఞంచేస్తే తప్ప; ఒంటన్= మరొకవిధంగా; దివ్యత్వనిరూఢి= దేవత్వసిద్ధి; కలుగన్+పోలునె?= సిద్ధిస్తుందా?; చెపుమా!= వివరించుమా!

తాత్పర్యం: ఇంకా వినుము. జ్ఞానవంతుడు, జ్ఞానహీనుడూ ఇద్దరూ దివ్యసుఖం అభిలషిస్తారు. యజ్ఞంచేస్తే తప్ప దేవలోకసుఖహేతువైన దివ్యత్వప్రాప్తి కలుగదు. మరొకరీతిగా కలుగుతుందేమో నీవే చెప్పుము.

క. అమలిన గృహస్థ ధర్మో త్తమముం గల్మషహరంబు దైవతసంభా
వ్యము నైన యజ్ఞ కర్తృ । త్వము మునివర! హింస గాఁగ దలఁపం దగునే? 309

ప్రతిపదార్థం: మునివర!= మునిశ్రేష్ఠా!; అమలినగృహస్థ ధర్మోత్తమమున్= నిష్కల్మషమైన శ్రేష్ఠమైన గృహస్థధర్మమూ; కల్మషహరంబున్= పాపహరమూ; దైవతసంభావ్యమున్= దేవతలచేత సమ్మానించదగిందీ; ఐన= అయినట్టి; యజ్ఞకర్తృత్వము= యాజకత్వం; హింసకాఁగన్= హింసాకృత్యంగా; తలఁపన్+తగునే= భావించటం యుక్తమా?

తాత్పర్యం: ఓ మునీంద్రా! యజ్ఞం చేయటమనేది కల్మషరహితమూ, శ్రేష్ఠతమమూ అయిన గృహస్థధర్మం. అది పాపాన్ని హరిస్తుంది. దేవతలుకూడా ఆ పనిని గౌరవిస్తారు. అట్టిదానిని హింస అని భావించటం యుక్తమా?'

చ. అనుటయు నిట్లనుం గపిలుఁ 'డాత్మ సుఖైక పరాయణుండు మె
చ్చునె పెఱసౌఖ్యకోటి గతశోకుఁ డకాముఁడ సంగశీలుఁ డా
తని కవియెల్ల నేటికి మదప్రదలోకము లొల్లమిన్ సనా
తన మగు మోక్షముం గొఱలి తా విడుచున్ గృహధర్మవర్గమున్.' 310

ప్రతిపదార్థం: అనుటయున్= స్యూమరశ్మి అట్లా అనగా; కపిలుఁడు= కపిలమునీంద్రుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; ఆత్మసుఖ+ఏక పరాయణుండు= ఒక్క ఆత్మసుఖం మీదనే ఆసక్తి కలవాడు; పెఱసౌఖ్యకోటిన్= ఇతరాలైన అనేక సుఖాలను; మెచ్చునె?= అభినందిస్తాడా?; గతశోకుఁడు= శోకం తొలగిన వాడు; అకాముఁడు= కోరికలేనివాడు; అసంగశీలుఁడు= సంగం లేనివాడు అయిన; ఆతనికిన్= అతడికి; అవిఎల్లన్= ఆ ఇతర సుఖాలన్నీ; ఏటికిన్?= ఎందుకు?; తాన్= తాను; మదప్రద లోకములు= ఇంద్రియసుఖమిచ్చే లోకాలను; ఒల్లమిన్= అభిలషించకపోవటంవలన; సనాతనము+అగు= శాశ్వతమైన; మోక్షమున్= ముక్తిని; కొఱలి= పొంది; గృహధర్మవర్గమున్= గృహస్థులకు చెందిన ధర్మాల సముదాయాన్ని; విడుచున్= వదలుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: స్యూమరశ్మి అట్లా చెప్పేసరికి అతడితో కపిలముని ఇట్లా అన్నాడు: 'ఆత్మసుఖాన్ని మాత్రమే కోరేవాడు ఇతర సుఖాలను కోరడు. అతడు శోకరహితుడు, కామరహితుడు, సంగరహితుడు. అట్లాంటివాడికి ఆ పరలోకసుఖాలతో పనేమి? అతడు సుఖప్రదమైన స్వర్గాదిలోకాలను అభిలషించడు కాబట్టి శాశ్వతమైన మోక్షం పొంది గృహస్థధర్మాలను వర్జిస్తాడు'.

వ. అనిన విని స్యూమరశ్మి యా సిద్ధప్రవరున కిట్లనియె. 311

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; స్యూమరశ్మి= స్యూమరశ్మి అనే ముని; ఆ సిద్ధ ప్రవరునకున్= ఆ కపిలుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కపిలు డట్లా చెప్పగా విని స్యూమరశ్మి సిద్ధశ్రేష్ఠుడైన ఆ కపిలుడితో ఇట్లా అన్నాడు:

ఆ. ప్రజలు దల్లిఁ జెందు పగిది గృహస్థ ధ । ర్మంబు నెల్ల యాశ్రమములుఁ జేరి
కాదె జీవనంబు గావించుకొను గృహ । యుక్తుఁ డోషధులకు నొడయుఁ డగుట. 312

ప్రతిపదార్థం: గృహయుక్తుఁడు= గృహస్థుడు; ఓషధులకున్= సస్యములకు; ఒడయుఁడు+అగుటన్= ప్రభువు కావటంవలన; ప్రజలు= బిడ్డలు; తల్లిన్+చెందుపగిదిన్= తల్లిని చేరేటట్లు; ఎల్ల ఆశ్రమములు= అన్ని ఆశ్రమాలూ; గృహస్థధర్మంబున్= గృహస్థాశ్రమాన్ని; చేరి= ఆశ్రయించి; జీవనంబు= బ్రతుకు; కావించుకొనున్ కాదె= నిర్వహించుకొంటాయి గదా!

తాత్పర్యం: గృహస్థుడు ఫలమునిచ్చి వెంటనే నశించిపోయే సస్యాదులైన ఓషధులకు ప్రభువు. అందువలన బిడ్డలు తల్లిని చేరినట్లే ఇతర ఆశ్రమాలకు చెందిన వారు తమకు పోషకుడైన గృహస్థుడిని ఆశ్రయించి జీవిస్తున్నారు.

క. విను మోక్షము గార్హస్థ్యం । బునఁ గాదని యెన్నఁ డెచటఁ బురుషుం డెవ్వం
డు నిరూపించి పలికె? స । ర్వనిధానము గృహము వేదవాక్యఫలజ్ఞా! 313

ప్రతిపదార్థం: వేదవాక్యఫలజ్ఞా!= శ్రుతివచనాల ఫలం ఎఱిగిన కపిలమహర్షీ!; విను= ఆలకించుము; గార్హస్థ్యంబునన్= గృహస్థాశ్రమంతో; మోక్షము= ముక్తి; కాదని= సిద్ధించదని; ఎన్నఁడున్= ఎప్పుడు; ఎచటన్= ఎక్కడ; పురుషుండు+ఎవ్వండు= ఏ పురుషుడు; నిరూపించి= నిర్ధారణ చేసి; పలికెన్?= చెప్పెను?; గృహము= ఇల్లు; సర్వనిధానము= అన్నిటికీ నిధి అయినది.

తాత్పర్యం: ఓ శ్రుతివచన ఫలాన్ని ఎరిగిన మునీంద్రా! గృహస్థాశ్రమం వలన ముక్తి సిద్ధించ దని ఎవడు, ఎప్పుడు, ఎక్కడ నిరూపణ చేసి చెప్పాడు? గృహం సమస్త కార్యాలకూ, వాటి ఫలాలకూ నిధిఅయినది కదా!

క. అలసులు ధనహీనులు నై । సొలసి క్రియలు విడుతు; రది విసూత్రత; దానం
గలదే సద్గతి? వేదం । బులు విడిచి యఘంబుపరతఁ బోవరె తండ్రీ! 314

ప్రతిపదార్థం: తండ్రీ!= నాయనా!; అలసులు= సోమరులు; ధనహీనులును+ఐ= దరిద్రులుఅయి; సొలసి= వెనుదీసి; క్రియలు= కర్మలు; విడుతురు= వర్జిస్తారు; అది= అట్లా వర్జించటం; విసూత్రత= విగతసూత్రత్వమవుతుంది; దానన్= దానివలన; సద్గతి=మంచిగతి; కలదే?= ఉన్నదా?; వేదంబులు= శ్రుతులు; విడిచి= వర్జించి; అఘంబుపరతన్=పాపపరత్వంతో;పోవరె?=పోరా?

తాత్పర్యం: తండ్రీ! సోమరులై దరిద్రులైనవారు వెనుక అడుగువేసి వేదవిహితకర్మలు విడిచివేస్తారు అది తెగిన దారంవలె ఆలంబనం లేని స్థితిగా పరిణమిస్తుంది. దానివలన సద్గతి నశిస్తుంది. ఇట్లా వేదాలు వర్జించినవారు పాపానికి అగ్గమై నశించి పోకుండా ఉంటారా?

క. విదితము గర్భాధానము । మొదలుగ శ్రుతికలితమంత్రములు నిర్మల సం
పద లెల్లను బ్రాహ్మణునకు । నొదవించుట దగునె శ్రుతుల నొల్లక యుండన్.' 315

ప్రతిపదార్థం: బ్రాహ్మణునకున్= విప్రునకు; గర్భాధానము మొదలుగన్= గర్భంలో బీజావాపం మొదలుకొని; శ్రుతికలితమంత్రములు= వేదంలో విధించబడిన మంత్రాలు; నిర్మలసంపదలు+ఎల్లను= విమలమైన సమస్త సంపదలను; ఒదవించుట= కలిగించటం; విదితము= తేటతెల్లం; శ్రుతులన్= వేదాలను; ఒల్లకఉండన్= అంగీకరించకుండటం; తగునె?= ఉచితమా?

తాత్పర్యం: గర్భాధానం మొదలైన సంస్కారం గల్గించే వేదవిహితమంత్రాలు బ్రాహ్మణుడికి సమస్త సంపదలను కలిగించటం లోక ప్రసిద్ధమే. వేదాలను అంగీకరించకుండటం ఉచితమౌతుందా?'

ఆ. అనినఁ గపిలుఁ డిట్టు లని వివరించు 'నా । చారములను దేవ సమితి నెల్ల
భూమిసురులు దృప్తిఁ బొందింతు; రమృత మా । నంగఁ బ్రీతి నిచ్చు భంగి యొలయ. 316

ప్రతిపదార్థం: అనినన్= స్యూమరశ్మి అట్లా అనగా; కపిలుఁడు= కపిలమహాముని; ఇట్టులు+అని= ఈ రీతిగా; వివరించున్= చెప్పాడు; భూమిసురులు= బ్రాహ్మణులు; ఆనంగన్= త్రాగటానికి; ప్రీతిన్= ప్రియంగా; అమృతము+ఇచ్చు భంగి= అమృతమొసంగే పద్ధతి; ఒలయన్= కలుగగా; ఆచారములను= ఆచారాలతో; దేవసమితిన్+ఎల్లన్= దేవతల సమూహమంతటిని; తృప్తిన్+పొందింతురు= తనివి నొందిస్తారు.

తాత్పర్యం: స్యూమరశ్మి అట్లా చేప్పేసరికి కపిలు డీ రీతిగా తన అభిప్రాయం వివరించాడు. 'విప్రులు దేవతలనందరినీ అమృతం ద్రావించినరీతిగా వేదవిహితాలైన ఆచారాలతో తృప్తి పొందింపజేస్తారు.

వ. అది యట్లుండె వినుము చెప్పెద. 317

ప్రతిపదార్థం: అది= అట్లా చేయటం; అట్లు+ఉండెన్= ఆ రీతిగా ఉండనిమ్ము; చెప్పెదన్= ఇంకను విశేషాలు చెప్పుతాను; వినుము.

తాత్పర్యం: విప్రులు పాటించే ఆచారాలు అట్లా ఉన్నాయి. ఇంకా వినదగిన విశేషాలు వివరిస్తాను వినుము.

క. పాణి యుపస్థం బుదరము । వాణి యనఁగ మూయరాని వాకి ళ్ళివి; గీ
ర్వాణులకు వీని బుధుఁడు పు । రాణపురుషరక్షకై తిరంబుగ మూయున్. 318

ప్రతిపదార్థం: పాణి= చేయి; ఉపస్థంబు= గుహ్యేంద్రియం; ఉదరము= పొట్ట; వాణి= వాక్కు; అనఁగన్= అనగా; గీర్వాణులకున్= దేవతలకు (కూడ); మూయన్ రాని= మూయటానికి వీలుకాని; వాకిళ్ళు+ఇవి= ద్వారాలివి; బుధుఁడు= పండితుడు; పురాణపురుష రక్షకై= పరమాత్మ పరిరక్షణకుగాను; వీనిన్= ఈ ద్వారాలను; తిరంబుగన్= గట్టిగా; మూయున్= బంధిస్తాడు.

తాత్పర్యం: దేవతలకు సైతం చేయి, గుహ్యేంద్రియం, పొట్ట, వాక్కు అనే వాకిళ్ళు నాలుగూ మూయరానివై ఉన్నాయి. ఆత్మజ్ఞుడైన పండితుడు తనలోని పరమాత్మను పరిరక్షించటానికై ఈ నాలుగు ద్వారాలనూ గట్టిగా మూసివేస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **పుచ్చికొనఁడు ముందటఁ బైడిప్రోక యున్న; । నలుక నొడమియుఁ బొడువను నడువఁ దొడఁగ;**
డట్టి యా నైష్ఠికుని చేత నడఁగకున్నె । పాణి యనియెడు వాకిలి బంధురముగ. 319

ప్రతిపదార్థం: ముందటన్= ఎదురుగా; పైడిప్రోక= బంగారుప్రోగు; ఉన్నన్= ఉండినప్పటికీ; పుచ్చికొనఁడు= స్వీకరించడు; అలుక= కోపం; పొడమియున్= కలిగినా; పొడువనున్= పొడవటానికి; అడువన్= కొట్టటానికి; తొడఁగడు= ప్రయత్నించడు; అట్టి= అటువంటి; ఆ నైష్ఠికునిచేతన్= ఆ నిష్ఠగలవాడిచేత; పాణి అనియెడు= చేయి అనే; వాకిలి= ద్వారం; బంధురముగన్= ఒప్పిదంగా; అడఁగక+ఉన్నె?= మూయబడక ఉంటుందా?

తాత్పర్యం: ఆత్మజ్ఞుడు ఎదురుగా స్వర్ణరాశి పడిఉన్నా పరిగ్రహించడు. కోపం వచ్చినా ఎదుటివారిని పొడవటం, కొట్టటం చేయడు. అట్లాంటి నిష్ఠాగరిష్టుడు 'చేయి' అనే వాకిలిని చక్కగా మూసినవాడవుతాడు.

క. **ఏ విధము కాంతనైనన్ । దా విహరణమునకు నెపుడుఁ దార్పఁడు తనయం**
దావిష్టము భార్యావ్రత । మావెర వడ్డం బుపస్థ మనువాకిటికిన్. 320

ప్రతిపదార్థం: తాన్= తాను; ఏ విధము కాంతన్+ఐనన్= ఎట్లాంటి స్త్రీనైనా; విహరణమునకున్= విహారానికి; తార్పఁడు= కదియించడు; భార్యావ్రతము= పరస్త్రీవర్జనాత్మకమైన పత్నీవ్రతం; తన+అందున్= తనలో; ఆవిష్టము= ప్రవేశించిఉంటుంది; ఆ వెరవు= ఆ పద్ధతి; ఉపస్థము+అను= గుహ్యేంద్రియ మనే; వాకిటికిన్= ద్వారానికి; అడ్డంబు= నిరోధమై ఉన్నది.

తాత్పర్యం: ఆత్మజ్ఞుడైన పండితుడు ఎట్లాంటి స్త్రీనైనా తనతో విహరించటానికి పురికొల్పడు తాను తన భార్యతో తప్ప ఇతర స్త్రీలతో రమించడు. ఈ పద్ధతి 'ఉపస్థ' మనే ద్వారాన్ని బంధిస్తుంది.

క. **తనుయాత్రకుఁగా నశనము । గొనుఁ; బూర్ణముగాఁ గొనండు; గోరఁడు లౌల్యం**
బున రాని దాని; నమ్మెయి । ముని యుదరద్వార మోపి మూసెన కాదే? 321

ప్రతిపదార్థం: అశనము= ఆహారం; తనుయాత్రకుగాన్= శరీరనిర్వహణానికై; కొనున్= స్వీకరిస్తాడు; పూర్ణముగాన్= పొట్టనిండుగా; కొనండు= తినడు స్వీకరించడు; లౌల్యంబునన్= చాపల్యంతో; రానిదానిన్= తనకు ప్రాప్తించనిదానిని; కోరఁడు= అభిలషించడు; ఆ+మెయిన్= ఆ రీతిగా; ముని= సంయమి; ఉదరద్వారము= 'పొట్ట' అనెడి వాకిలిని; మూసెన్+అ కాదే= బంధించెనే కదా!

తాత్పర్యం: ఆత్మతత్త్వజ్ఞుడైన మునీంద్రుడు శరీరధారణకు ఎంత అవసరమో అంతే ఆహారం పరిగ్రహిస్తాడు. అంతేకాని పొట్టనిండా తినడు. తన కేది ప్రాప్తమో దానితో తృప్తి వహిస్తాడే కాని రానిదానిపై చాపల్యంతో అభిలాష చూపడు. ఆ రీతిగా ఉన్న ముని ఉదరమనే ద్వారాన్ని బంధించినట్లే కదా!

క. **పలుకఁ డసత్యము, దూఱం । బలుకఁడు, బెట్టిదముగాఁగఁ బలుకఁడు, వాదం**
బులకుఁ జొరఁడు వాణి యనం । గలవాకిలి యట్టి బుధుఁడు గప్పం జాలున్. 322

ప్రతిపదార్థం: అసత్యము= కల్లమాట; పలుకఁడు= చెప్పడు; దూఱన్= ఇతరులను నిందించటానికై; పలుకఁడు= మాటలాడడు; బెట్టిదముకాఁగన్= ఉద్ధతంగా; పలుకఁడు= మాట్లాడడు; వాదంబులకున్= వాగ్వివాదాలకు; చొరఁడు= ప్రవేశించడు; అట్టిబుధుఁడు= అట్లా ఉండే పండితుడు; వాణిఅనన్+కల= 'వాక్కు' అనగా కల; వాకిలి= ద్వారం; కప్పన్+చాలున్= బంధించగలుగును.

తాత్పర్యం: పండితుడు అబద్ధం చెప్పడు, పరనింద చేయడు, క్రూరంగా పరుషవచనాలు పలుకడు, ఇతరులతో తగవులకు పోడు. అట్లా ఉండేవాడు 'వాక్కు' అనే వాకిలిని బంధించగలడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **ద్వారములు నాల్గు మూయంగ దక్షుఁడైన । వాఁడ చూవె బ్రాహ్మణుఁ; డట్టివాని కేల**
తపములును యజనంబులు దానములును । వ్రతములును వేదకింకరత్వంబు దొడఁకు. **323**

ప్రతిపదార్థం: నాల్గు ద్వారములు= నాలుగు వాకిళ్ళు; మూయంగన్= బంధించటానికి; దక్షుఁడు+ఐనవాఁడు+అ= సమర్థుడైనవాడే; బ్రాహ్మణుఁడు= విప్రుడు; చూవె= సుమా!; అట్టివానికిన్= అట్లాంటివాడికి; తపములును= తపస్సులున్నూ; యజనంబులు= యజ్ఞకరణములున్నూ; దానములును= వితరణములున్నూ; వ్రతములును= వ్రతాలున్నూ; వేదకింకరత్వంబు తొడఁకు= వేదదాస్యంతోడి సంబంధము; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: పై చెప్పిన పాణి, ఉపస్థం, ఉదరం, వాణి అనే నాలుగు ద్వారాలూ మూయగలిగే నైపుణ్యం కలవాడే బ్రాహ్మణు డనబడతాడు. అట్లాంటివాడికి తపస్సులు, యాగక్రియలు, దానాలు, వ్రతాలు అక్కరలేదు. వాడు వేదాలకు దాస్యం చేయవలసిన అవసరం కూడా లేదు.

విశేషం: ఇక్కడ జిహ్వ, ఉపస్థం మొదలైన వాటిని నిగ్రహించగల ఉత్తమగుణ సంపన్నుడే బ్రాహ్మణుడని చెప్పుట జరిగింది. అంతే కాని జాతిచేత బ్రాహ్మణుడైన వాడు పేర్కొన బడలేదని గ్రహించాలి.

తే. **ద్వంద్వములు లేక పేర్మికి వ్రస్సి పడక । ప్రకృతి వికృతులఁ గనుచుండు బ్రాహ్మణత్వ**
శాలి యా సదాచారంబు సలుపలేని । వాఁడు ఫలకాంక్షియై కర్మవశతఁ బొందు. **324**

ప్రతిపదార్థం: బ్రాహ్మణత్వశాలి= (పై పద్యంలో చెప్పిన) బ్రాహ్మణత్వమనే ధర్మంకలవాడు; ద్వంద్వములు లేక= శీతోష్ణాలు, సుఖదుఃఖాలు ఇత్యాదిగాగల ద్వంద్వాలు లేనివాడై; పేర్మికిన్= గౌరవానికి; వ్రస్సిపడక= ఆరాటపడక; ప్రకృతివికృతులన్= ప్రకృతి వికారాలను; కనుచుండున్= చూస్తూ ఉంటాడు; ఆ సదాచారంబు= ఆ సత్ప్రవర్తన; సలుపలేనివాఁడు= అనుష్ఠింపజాలనివాడు; ఫలకాంక్షి+ఐ= ఫలితాలమీది అపేక్ష గలవాడై; కర్మవశతన్= కర్మకు అధీనుడు కావటం; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: పై జెప్పిన నాలుగు ద్వారాలూ మూయటమనే బ్రాహ్మణధర్మంతో ఒప్పారేవాడే శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వాలకు లొంగడు. ప్రతిష్ఠకై ప్రాకులాడడు. ప్రకృతిరూపమైన బ్రహ్మాన్నీ, వికృతిరూపమైన దైవతాన్నీ తటస్థుడై చూస్తూ ఉంటాడు. అట్లాంటి బ్రాహ్మణ్యాన్ని అనుష్ఠింపజాలనివాడే ఫలాన్ని అపేక్షించి కర్మల కధీనుడౌతాడు.

వ. **అని నిర్దేశించిన గోవునం దడంగియునికి దక్కి సన్నిహితుండై స్యూమరశ్మి తన పేరు సెప్పి 'యేను ధర్మనిర్ణయం బెఱింగికొనవలసి గోవిలీనుండనై పలుకుచుండితిఁ గాని యొండుగాదు. మహాత్మా! ని న్నాశ్రయించితి. వేదంబులు ప్రమాణంబు లగుట యూఁది వర్ణాశ్రమ విహితాచారంబులు నడపుటయుం, బరిత్యాగంబునుం గల దెయ్యది యత్యంత విధేయంబు సువ్యక్తంబుగా నెఱింగింపవే. నీవు ధర్మసూక్ష్మత్వదర్శి; వేను శుశ్రూషకుండ; న న్ననుశాసింపు'మనవుడుఁ గపిలుండు ప్రీతుండై యతని కిట్లనియె.** **325**

ప్రతిపదార్థం: అని నిర్దేశించినన్= అని కపిలుడు చెప్పగా; స్యూమరశ్మి= స్యూమరశ్మి అనే ముని; గోవునందున్= ఆవునందు; అడంగిఉనికి= అడగిఉండటాన్ని; తక్కి= వర్జించి; సన్నిహితుండు+ఐ= సమీపానికి వచ్చినవాడై; తన పేరుచెప్పి= తన నామం పేర్కొని; ఏను= నేను; ధర్మనిర్ణయంబు= ధర్మనిశ్చయం; ఎఱింగికొనవలసి= తెలిసికొనవలసి; గోవిలీనుండను+ఐ= ఆవునందు దాగినవాడనై; పలుకుచుండితిన్= మాటాడుతూ ఉన్నాను; కాని= అంతేకాని; ఒండుకాదు= మరేమీ కాదు; మహాత్మా!= మహా బుద్ధిగలవాడా!; నిన్నున్+ఆశ్రయించితిన్= నిన్ను అండగొన్నాను; వేదంబులు= శ్రుతులు; ప్రమాణంబులు+అగుట= జ్ఞానకారణాలు కావటం; ఊఁది= గ్రహించి; వర్ణాశ్రమ విహిత+ఆచారంబులు= వర్ణాలకు, ఆశ్రమాలకు విధింపబడిన ఆచారాలు; నడపుటయున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిర్వహించటమూ; పరిత్యాగంబునున్= వదలిపెట్టటమున్నూ; కలది= ఉన్నది; ఏ+అది= ఏది?; అత్యంత విధేయంబు= మిక్కిలిగా చేయదగినదో; సువ్యక్తంబుగాన్= స్పష్టంగా; ఎఱింగింపవే!= తెలుపుమా!; నీవు= కపిలమునివైన నీవు; ధర్మసూక్ష్మత్వదర్శివి= ధర్మాలలోని సూక్ష్మభావాన్ని చూచేవాడవు; ఏను= నేను; శుశ్రూషకుండన్= సేవకుడను (వినగోరేవాడను); నన్నున్+అనుశాసింపుము= నన్ను ఆజ్ఞాపించుము; అనవుడున్= అనగా; కపిలుండు= కపిలముని; ప్రీతుండు+ఐ= ప్రీతి పొందినవాడై; అతనికిన్= ఆ స్యూమరశ్మికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కపిలముని అట్లా చెప్పేసరికి స్యూమరశ్మి ధేనువులో దాగి ఉండటాన్ని వర్జించి అతడికి సమీపంగా వచ్చాడు. తన పేరు చెప్పి ఇట్లా అన్నాడు: ‘ నేను ధర్మనిశ్చయం గ్రహించదలచి ఈ గోవులో దాగి మాటలాడానే కాని మరేమీ కాదు. ఓ మహాత్మా! నేను నిన్ను ఆశ్రయించాను. వేదాలు ప్రమాణాలు అన్న సంగతి గ్రహించిన తర్వాత ఆ వేదాలలో విధించిన బ్రాహ్మణాది వర్ణాలకూ, బ్రహ్మచర్యాద్యాశ్రమాలకూ తగిన ఆచారాలను నిర్వహించటమూ కద్దు. పరిత్యజించటమూ కద్దు. ఈ రెండు పద్ధతులలో ఏది మిక్కిలిగా అనుష్ఠించదగిందో స్పష్టంగా తెలియజెప్పుము. నీవు ధర్మాలలోని సూక్ష్మాంశాలను తెలిసినవాడవు. నేను వినాలన్న కోరికతో వచ్చిన సేవకుడను. నాకు ఈ రహస్యం బోధించి నన్ను శాసించుము’. అత డట్లా అనగానే కపిలుడు అతడిపట్ల ప్రీతిపొంది ఇట్లా చెప్పాడు:

క. జ్ఞానంబు నాశ్రయించిన। వానికి నే పనులఁ గీడు వాటిల్లదు; ప్ర
జ్ఞానరహితుండు గామా। ధీనత మెయిఁ గర్మసమితి ద్రిప్పునఁ జిక్కున్. 326

ప్రతిపదార్థం: జ్ఞానంబున్= జ్ఞానయోగాన్ని; ఆశ్రయించినవానికిన్= అండగాకొన్నవాడికి; ఏ పనులన్= ఏ కార్యాలలోనూ; కీడు= అశుభం; పాటిల్లదు= కలుగదు; ప్రజ్ఞానరహితుండు= ప్రకృష్టమైన జ్ఞానం లేనివాడు; కామ+అధీనతమెయిన్= కోరికలకు వశపడుటవలన; కర్మసమితి త్రిప్పునన్= కర్మసమూహాల పరిభ్రమణంలో; చిక్కున్= తగులుకొంటాడు.

తాత్పర్యం: ‘జ్ఞానాన్ని ఆశ్రయించినవాడు ఏ పనిచేసినా వాడికి కీడు కలుగదు. జ్ఞానం లేనివాడు కోరికలకు దాసుడై కర్మలలో తగులుకొంటాడు. ఆ కర్మల చక్రభ్రమణంలోబడి తిరుగుతూ ఉంటాడు.

క. అనహంకారుఁడు నక్రో। ధనుఁడు నతృష్ణుండు నై నతఁడు శుభ మశుభం
బను భేదముఁ బొరయఁడు; విడు। పున సమతాసుఖమయత్వముం గనుచుండున్. 327

ప్రతిపదార్థం: అనహంకారుఁడున్= అహంకారంలేనివాడు; అక్రోధనుఁడున్= కోపంలేనివాడు; అతృష్ణుండున్= ఆశ లేనివాడూ; ఐన+అతఁడు= అయినవాడు; శుభము+అశుభంబు+అను= మేలు కీడు అనే; భేదమున్= తేడాను; పొరయఁడు= పొందడు; విడుపునన్= త్యాగంచేత; సమతాసుఖమయత్వమున్= సమభావంచేత కలిగే సుఖస్థితిని; కనుచుండున్= చూస్తూ ఉంటాడు.

తాత్పర్యం: అహంకారం, కోపం, ఆశ లేనివాడు శుభాశుభాలనే భేదదృష్టి పొందడు. అతడు త్యాగం కలిగి సర్వత్రా సమభావంతో సుఖస్వరూపాన్నే దర్శిస్తూ ఉంటాడు.

క. విను మెఱుక గలర మీరె। ల్లను నేకాత్మత్వసిద్ధి లాభం బెందే
ని నొకని కలవడు నాతం। డనుమానింపఁ డఖిల క్రియలుఁ బోఁ ద్రోచున్.’ 328

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; మీరు+ఎల్లనున్= మీరు అందరున్నూ; ఎఱుకగలర= తెలివిగలవారే; ఎందున్+ఏనిన్= ఎక్కడో ఒక్కచోట; ఒకనికిన్= ఒక్కడికి; ఏక+ఆత్మత్వసిద్ధిలాభంబు= ఒకే ఒక ఆత్మ ఉన్నదనే భావప్రాప్తి; అలవడున్= సిద్ధిస్తుంది;

ఆతండు= ఆ సిద్ధి కలిగినవాడు; అనుమానింపఁడు= సందేహించడు; అఖిలక్రియలున్= సమస్తమైన పనులూ; పోన్ద్రోచున్= తొలగద్రోస్తాడు.

తాత్పర్యం: వినుము. మీరందరూ జ్ఞానం కలవారే, ఐనా ఎక్కడో ఒకానొకడికి మాత్రమే సర్వత్రా ఏకాత్మభావనాప్రాప్తి కలుగుతుంది. అది కలిగినవాడి కీ సందేహా లుండవు. అతడు సర్వకర్మలూ అనాయాసంగా కడకు నెట్టివేస్తాడు.

వ. అనిన విని స్యూమరశ్మి య మ్మునివరున కిట్లనియె. 329

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; స్యూమరశ్మి= స్యూమరశ్మి యనేవాడు; ఆ+మునివరునకున్= ఆ మునిశ్రేష్ఠుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కపిలు డట్లా చెప్పగా విని స్యూమరశ్మి ఆ మునీంద్రుడితో ఈ రీతిగా చెప్పాడు.

ఆ. వేదశాస్త్రసరణి విడుచు టున్మార్గవ । ర్తనము; మోక్షపదము రాదు దాన
ననఁగ విందు; నంచితాత్మ వేదంబులఁ । గైకొనమియ కీడు నాకుఁ జూడ. 330

ప్రతిపదార్థం: అంచిత+ఆత్మ!= పూజితాత్మా!; వేదశాస్త్రసరణి= వేదాలు, శాస్త్రాలు విధించిన త్రోవ; విడుచుట= వీడటం; ఉన్మార్గవర్తనము= తప్పుత్రోవలో నడవటమే; దానన్= అందువలన; మోక్షపదము= ముక్తిస్థానం; రాదు= సిద్ధించదు; అనఁగన్= అని చెప్పగా; విందున్= విని ఉన్నాను; నాకున్+చూడన్= నా పరిశీలనలో; వేదంబులన్= శ్రుతులను; కైకొనమి+అ= స్వీకరింపకుండటమే; కీడు= అశుభం.

తాత్పర్యం: పవిత్రాత్మా! వేదాలు, శాస్త్రాలు విధించిన త్రోవ వదలటం తప్పుదారిలో చరించటమే. అట్లా చేయటంవలన ముక్తి సిద్ధించదని నేను విన్నాను. పరిశీలించి చూడగా వేదాలను అంగీకరించకుండా ఉండటమే కీడుగా నాకు తోస్తున్నది.

వ. నా మనంబు సందియంబుఁ బాపవే' యనినం గపిలుం డమ్మహాద్విజునితో 'వేదంబుల నేల కై కొనకుండ వచ్చు? నవియ చూవె లోకంబులకుం బ్రమాణంబు'లని పలికి యిట్లనియె. 331

ప్రతిపదార్థం: నా మనంబు సందియంబు= నా మనస్సులోని సందేహాన్ని; పాపవే= తొలగించుమా; అనినన్= అనగా; కపిలుండు= కపిలముని; ఆ+మహాద్విజునితోన్= ఆ గొప్పవిప్రుడితో; వేదంబులన్= శ్రుతులను; ఏల= ఎందుకు; కైకొనక+ఉండవచ్చున్?= స్వీకరించక ఉండవచ్చును?; అవి+అ= ఆ వేదములే; చూవె!= సుమా!; లోకంబులకున్= జగత్తులకు; ప్రమాణంబులు= కొలమానాలు, ఆదర్శాలు; అని పలికి= అని చెప్పి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: నా మనస్సులోని సందేహం తొలగించు'మని స్యూమరశ్మి అనేసరికి కపిలుడు ఆ మహాబ్రాహ్మణుడితో 'వేదాలను ఎందుకు అంగీకరించకుండా ఉండాలి? అవే కదా లోకాలకు ప్రమాణాలుగా ఉన్నాయి' అని చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు:

కపిలుఁడు స్యూమరశ్మికి వేదంబులు ముఖ్యప్రమాణంబులుగాఁ జెప్పుట (సం. 12-262-14,1)

క. 'అరయంగా శబ్దంబును । బరంబు నన రెండు సూవె బ్రహ్మములు; గుణో
త్తర! శబ్దబ్రహ్మ భజన । పరుఁడు పరబ్రహ్మ మహిత పదమున్ బొందున్. 332

ప్రతిపదార్థం: గుణ+ఉత్తర!= గుణశ్రేష్ఠుడా!; అరయంగాన్= పరిశీలించగా; శబ్దంబును= శబ్దమనీ; పరంబును= పరమనీ; అనన్= అనగా; రెండు= ఇవి రెండూ; బ్రహ్మములు= బ్రహ్మ శబ్దంచేత చెప్పబడతాయి; చూవె= సుమా!; శబ్దబ్రహ్మ భజనపరుఁడు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శబ్దబ్రహ్మమును సేవించటంలో ఆసక్తుడైనవాడు; పరబ్రహ్మమహిత పదమున్= పరబ్రహ్మ మనే శ్రేష్ఠమైన మోక్షస్థానాన్ని; పొందున్= చేరుకొంటాడు.

తాత్పర్యం: గుణశ్రేష్ఠుడవైన ఓ స్యూమరశ్మీ! బ్రహ్మములు రెండు. అవి శబ్దబ్రహ్మమనీ, పరబ్రహ్మమనీ పేర్కొనబడుతున్నాయి. అందులో శబ్దబ్రహ్మాన్ని భజించి నిష్ణాతుడైనవాడు పరబ్రహ్మపదవి అనే మోక్షస్థానం చేరుకొంటాడు.

విశేషం: పై పద్యంలో 'గుణోత్తర' అనే పదాన్ని శబ్దబ్రహ్మశబ్దానికి విశేషణంగా అన్వయించి గుణాలచేత శ్రేష్ఠమైన శబ్దబ్రహ్మాన్ని భజించేవాడు అని కూడ అర్థం చెప్పవచ్చును. ఈ పద్యానికి మూలమైన సంస్కృత శ్లోకం

"ద్వే బ్రహ్మణీ వేదితవ్యే శబ్దబ్రహ్మ పరం చ యత్ । శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరం బ్రహ్మాధిగచ్ఛతి ॥"

అని అమృతబిందూపనిషత్తులో

"ద్వే విద్యే వేదితవ్యే తు శబ్దబ్రహ్మ పరం చ యత్ । శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరం బ్రహ్మాధిగచ్ఛతి॥"

అని కొద్దిపాటి మార్పుతో కనిపిస్తున్నది.

శబ్దబ్రహ్మ విద్యను అపరావిద్య అనీ, పరబ్రహ్మ బోధకవిద్యను పరావిద్య అనీ ఉపనిషత్తులు పేర్కొన్నాయి. మొదట అపరావిద్యలో కృషి చేసి నిష్ణాతుడైన వాడు అనగా ఆరితేరినవాడు పరావిద్యలో ప్రావీణ్యం పొందగలడని ఉపనిషత్తుల అభిప్రాయం.

**క. మనమున నెద్దియుఁ గోరం । డనసూయయు శమము దమము నతులజ్ఞానం
బును గల గృహపతి ధర్మం । బని నడపును వేదచోదితాచారములన్. 333**

ప్రతిపదార్థం: అనసూయయున్= అసూయ లేకపోవటమూ; శమమున్= అంతరింద్రియనిగ్రహమూ; దమమున్= బాహ్యేంద్రియ నిగ్రహమూ; అతులజ్ఞానంబును కల= సాటిలేని జ్ఞానమూ కలిగినట్టి; గృహపతి= గృహస్థుడు; మనమునన్= చిత్తంలో; ఎద్దియున్= ఏది కూడా; కోరండు= అభిలషించడు; వేదచోదిత+ఆచారములన్= వేదంచేత విధించబడిన ఆచారాలను; ధర్మంబు+అని= ఇవి చేయదగిన ధర్మాలని; నడపును= నిర్వహిస్తాడు.

తాత్పర్యం: అసూయ వదలి అంతరింద్రియాలపైనా, బాహ్యేంద్రియాలపైనా నిగ్రహం సాధించిన జ్ఞానసంపన్నుడైన గృహస్థుడు మనస్సులో ఏదీ అభిలషించడు. అతడు వేదం విధించిన సదాచారాలను కర్తవ్యధర్మాలన్న బుద్ధితో శ్రద్ధగా నిర్వహిస్తాడు.

**క. భూతదయయు ననహంకా । రాతిశయముఁ గలుగు విమలుఁ డప్రాయశ్చి
త్తాతురుఁడు సూవె! విధులు సు । నీతములైనను దృఢాత్మనిష్ఠ కతమునన్. 334**

ప్రతిపదార్థం: భూతదయయున్= ప్రాణికోట్లపై కరుణ; అనహంకార+అతిశయమున్= అహంకారం లేమి; కలుగు= కలిగినట్టి; విమలుఁడు= నిర్మలస్వభావుడు; విధులు= వేదవిహితాచారాలు; సునీతములు+ఐనను= చక్కగా అనుష్ఠించబడినప్పటికి; దృఢ+ ఆత్మనిష్ఠ= గట్టి ఆత్మస్థితి; కతమునన్= కారణాన; అప్రాయశ్చిత్తాతురుఁడు= ప్రాయశ్చిత్తంచేత ఆతురుడు కానివాడు; చూవె!= సుమా!

తాత్పర్యం: ప్రాణులపై దయ, అహంకారం బొత్తిగా లేకపోవటం కల నిర్మలచిత్తుడైన గృహస్థుడు దృఢమైన ఆత్మనిష్ఠ కలిగి ఉంటాడు. అందువలన అతడు వేదం విధించిన ఆచారాలు, కర్మలు చేస్తున్నా ప్రాయశ్చిత్తం చేయవలసిన పనిలేదు.(ఆత్మనిష్ఠవలన అతడిలోని దోషాలు తొలగిపోతాయి కాబట్టి ప్రాయశ్చిత్తం అక్కరలేదనిభావం.).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వినుశాంతులైన విప్రులు । మనుజేంద్రులు గృహమునంద మహితవ్రత సం
జనిత పరిజ్ఞాన నిరం । జనులై పడయుదురు సూవె శాశ్వతపదమున్. 335

ప్రతిపదార్థం: విను= వినుము; శాంతులు+ఐన= నిగ్రహపరులైన; విప్రులు= బ్రాహ్మణులు; మనుజ+ఇంద్రులు= రాజులు; గృహమునందు+అ= ఇంటియందే; మహితవ్రతసంజనిత పరిజ్ఞాన నిరంజనులు+ఐ= శ్రేష్ఠమైన వ్రతంచేత కలిగిన పరిజ్ఞానంచేత దోషం లేనివారై; శాశ్వతపదమున్= ముక్తిని; పడయుదురు= పొందుతారు; చూవె!= సుమా!

తాత్పర్యం: ఇంకా వినుము. ఇంద్రియనిగ్రహపరులైన విప్రులు, నృపులు గృహస్థాశ్రమంలోనే చక్కని వ్రతాలు ఆచరించి అందువలన కలిగిన జ్ఞానం వలన దోషం శమించినవారై శాశ్వతమైన మోక్షస్థానం పొందుతారు.

తే. బ్రహ్మచర్యాదు లగు నాల్గుఁ బాదమహిమ । గాఁగఁ బరఁగెడు ధర్మ మొక్కటియ చూవె!
యెవ్వఁ డెందు వర్తించిన నేమి? సకల । కర్మఫలరూపకత్వ మొక్కటియ కాదె! 336

ప్రతిపదార్థం: బ్రహ్మచర్య+ఆదులు+అగు= బ్రహ్మచర్యం మొదలైనవి; నాల్గున్= నాలుగు ఆశ్రమాలు కూడా; పాదమహిమకాఁగన్= పాదప్రభావం పొందగా; పరఁగెడు= విలసిల్లే; ధర్మము= ధర్మం; ఒక్కటియచూవె!= ఒక్కటే సుమా!; ఎవ్వఁడు= ఏ వ్యక్తి; ఎందు= ఏ ఆశ్రమంలో; వర్తించినన్+ఏమి= ప్రవర్తించినా ఏమి; సకలకర్మఫలరూపకత్వము= సమస్త కర్మల ఫలాన్ని రూపించే ధర్మం; ఒక్కటియ కాదె!= ఒక్కటే కదా!

తాత్పర్యం: ధర్మానికి బ్రహ్మచర్యం మొదలైన నాలుగాశ్రమాలు నాలుగుపాదాలుగా ఉన్నాయి. ఆ నాలుగుపాదాలపై నిలిచి ఉన్న ధర్మం ఒక్కటే. అందుచేత ఎవడు ఏ ఆశ్రమంలో ఉంటే నేమి? సమస్త కర్మల ఫలాలను రూపింపజేసే ధర్మస్వరూపం ఒక్కటే కదా! (సర్వకర్మల ఫలస్వరూపం ఒకటే కదా!)

క. సంతోషామృత సుఖిత । స్వాంతుం డగు నేని నట్టివాఁడు గృహంబుం
గాంతారదేశమును నొ । క్కంతగ నిశ్చింతవృత్తి నక్షోభ్యుఁ డగున్. 337

ప్రతిపదార్థం: సంతోష+అమృత సుఖితస్వాంతుండు= సంతసమనే అమృతంచేత సుఖించిన చిత్తం కలవాడు; అగున్+ఏనిన్= అయితే; అట్టివాఁడు= అట్లాంటి మనుజుడు; గృహంబున్= ఇంటిని; కాంతారదేశమునున్= అడవిప్రదేశాన్నీ; ఒక్కంతగన్= ఒకే విధంగా (భావించి); నిశ్చింతవృత్తి= చింతలేని వర్తనముతో; అక్షోభ్యుఁడు+అగున్= క్షోభింపజేయటానికి వీలుకాని వాడౌతాడు.

తాత్పర్యం: ఎవడు సంతోషమనే అమృతంతో సుఖించే చిత్తం కలిగి ఉంటాడో అట్లాంటివాడు ఇంటినీ, అడవినీ ఒకే రకంగా భావించగలవా డవుతాడు. వాడికి చింతలు ఉండవు. అందువలన దేనికీ కలత చెందడు.

క. విను తృష్ణారాహిత్యం । బున నాలవు నాశ్రమంబుఁ బొందుదురు మహా
జను; లది యుపనిషదుక్తం । బనక యవైదిక మనంగ నగునే నీకున్? 338

ప్రతిపదార్థం: విను= వినుము; మహాజనులు= గొప్పవారు; తృష్ణారాహిత్యంబునన్= ఆశలేమిచేత; నాలవు= నాల్గవదైన; ఆశ్రమంబున్= సన్న్యాసాశ్రమాన్ని; పొందుదురు= చెందుతారు; అది= ఆ పద్ధతి; ఉపనిషద్+ఉక్తంబు+అనక= ఉపనిషత్తులచేత ప్రతిపాదించబడినదని చెప్పక; అవైదికము+అనంగన్= వేదవిరుద్ధ మైనదని చెప్పగా; నీకున్+అగునే?= నీకు తగునా?

తాత్పర్యం: మహాత్ములు ఆశను పూర్తిగా వర్జించి నాలుగవదైన సన్న్యాసాశ్రమం స్వీకరిస్తారు. అది ఉపనిషత్తులు ప్రతిపాదించిన పద్ధతి. అట్లా భావించక అది వేదవిహితమైనది కాదు అని నీవు చెప్పవచ్చునా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. జ్ఞానము ధర్మమున కధి। ష్ఠానము మూలంబు పరమసంతోషము భ
వ్యానూనత్యాగము రూ। పానందము ప్రాఁకు దాని కను వేదంబుల్. 339

ప్రతిపదార్థం: వేదంబుల్= శ్రుతులు; ధర్మమునకున్= యతిధర్మానికి; అధిష్ఠానము= ఆశ్రయం; జ్ఞానము= జ్ఞాననిష్ఠ; దానికిన్= ఆ ధర్మానికి; పరమసంతోషము= ఆనందం; మూలంబు= మొదలు; భవ్య+అనూనత్యాగము= శ్రేష్ఠమైన మహాత్యాగం; రూపు= స్వరూపం; ఆనందము= ఆత్మానందం; ప్రాఁకు= ఆలంబనం; అనున్= అని చెప్పుతున్నవి.

తాత్పర్యం: వేదాలు యతిధర్మాని కధిష్ఠానం జ్ఞానమనీ, దానికి అత్యంతసంతోషస్థితే మొదలనీ, మహాత్యాగమే స్వరూపమనీ, ఆనందమే పట్టుగొమ్మ అనీ చెప్పుతున్నాయి.

క. ఏదియుఁ దలఁప నసేవ్యము। గా దాశ్రమసమితిలోనఁ గావున శుచులై
యేదాన నున్న సంసా। రోదధి యాదరికిఁ బోవ నోపుదురు బుధుల్. 340

ప్రతిపదార్థం: ఆశ్రమసమితిలోనన్= బ్రహ్మచర్యం మొదలైన నాలుగు ఆశ్రమాలలోనూ; ఏదియున్= ఏ ఆశ్రమం కూడా; తలఁపన్= భావించగా; అసేవ్యము కాదు= సేవించదగనిది కాదు; కావునన్= అందుచేత; శుచులు+ఐ= శుద్ధాంతఃకరణం కలవారై; ఏ దానన్+ఉన్నన్= ఏ ఆశ్రమంలో ఉన్నా; బుధుల్= పండితులు; సంసారోదధి= సంసారసాగరం యొక్క; ఆ దరికిన్= ఆవలి గట్టుకు; పోవన్= పోవటానికి; ఓపుదురు= సమర్థు లవుతారు.

తాత్పర్యం: బాగా ఆలోచించి చూస్తే నాలుగు ఆశ్రమాలలోనూ ఏ ఆశ్రమమూ సేవించదగనిది కాదు. అందువలన అంతఃకరణశుద్ధి కలిగి ఏ ఆశ్రమంలో ఉన్నా ఆత్మజ్ఞులైన పండితులు సంసారసాగరతీరం చేరగలరు.

క. సంతోషంబున నేగతి। శాంతాత్మున కొదవు దాని సద్గతిగా వే
దాంతవిదులు గొనియాడుదు;। రింత నిజము; దీని నీవు నెఱుఁగు మనింద్యా! 341

ప్రతిపదార్థం: అనింద్యా!= నిందించదగనివాడా!; శాంత+ఆత్మునకున్= శమించిన చిత్తంకలవాడికి; సంతోషంబునన్= సంతసం చేత; ఏ గతి= ఏ ప్రాప్తి; ఒదవున్= కలుగునో; దానిన్= ఆ గతిని; వేదాంత విదులు= వేదాంతం తెలిసిన వారు; సద్గతిగాన్= మంచిగతిగా; కొనియాడుదురు= పొగడుదురు; ఇంత నిజము= ఇంతా సత్యం; నీవున్= నీవుకూడ; దీనిన్= ఈ విషయాన్ని; ఎఱుఁగుము= తెలిసికొనుము.

తాత్పర్యం: పవిత్రుడవైన ఓ స్యూమరశ్మీ! శాంతచిత్తుడైన వాడికి సంతోషం కారణంగా ఏ గతి లభిస్తుందో, ఆ గతినే సద్గతి అని వేదాంతవేత్తలైన పెద్దలు శ్లాఘిస్తారు. ఇది సత్యం. నీవు కూడా ఈ సత్యాన్ని గ్రహించుము.

తే. వేద తాత్పర్య మారసి వేదితవ్య। మెఱుఁగు వారలు వేదజ్ఞు; లిట్లు గాని
వారు వేదపాఠకులు; సర్వంబు నరయ। వేద పరినిష్ఠితము సూవె విప్రవర్య! 342

ప్రతిపదార్థం: విప్రవర్య!= బ్రాహ్మణశ్రేష్ఠా!; వేద తాత్పర్యము= శ్రుతియొక్క భావాన్ని; ఆరసి= పరిశీలించి; వేదితవ్యము= తెలిసికొన దగిన తత్త్వాన్ని; ఎఱుఁగువారలు= తెలిసికొనేవారు; వేదజ్ఞులు= వేదం తెలిసినవారు; ఇట్లు కానివారు= ఈ రీతిగా తెలిసికొననివారు; వేదపాఠకులు= వేదం చదివేవారు; అరయన్= పరిశీలించగా; సర్వంబున్= సమస్తమూ; వేదపరినిష్ఠితము= వేదంలో నిహితం; చూవె!= సుమా!

తాత్పర్యం: విప్రశ్రేష్ఠా! ఎవరు వేదభావాన్ని గ్రహించి తెలియదగిన తత్త్వం తెలిసికొంటారో వారే వేదం తెలిసినవా రవుతారు. అట్లా కానివారు వట్టి వేదపాఠకులు మాత్రమే. వారికి వేదరహస్యం తెలియదు. పరిశీలించి చూచేవారికి వేదంలోనే అంతా నిక్షిప్తమైనట్లు గోచరిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **త్యాగ మొక నెలవు; శమసం । యోగం బుత్తరము దాని; కూర్ధ్వము సంతో**
షాగమము; మోక్షలాభో । ద్యోగికి నివి గమ్యభూము లుత్తమధిషణా!' **343**

ప్రతిపదార్థం: ఉత్తమధిషణా!= శ్రేష్ఠమైన బుద్ధి కలవాడా!; త్యాగము= కర్మఫలాన్ని త్యజించటం; ఒక నెలవు= ఒక స్థానం; దానికిన్= ఆ త్యాగానికంటె; శమసంయోగము= అంతరింద్రియ నిగ్రహం; ఉత్తరము= శ్రేష్ఠం; సంతోషాగమము= సంతుష్టి పొందటం; ఊర్ధ్వము= దానికంటె ఉన్నతమైనది; మోక్షలాభ+ఉద్యోగికిన్= ముక్తిప్రాప్తికై ప్రయత్నించే వాడికి; ఇవి= ఈ మూడూ; గమ్యభూములు= చేరదగిన స్థానాలు.

తాత్పర్యం: శ్రేష్ఠమతీ! మోక్షం కావాలని ప్రయత్నించే సాధకుడు ముందు కర్మఫలత్యాగం చేయాలి. ఆ తరువాత మనస్సును నిగ్రహించాలి. ఆ పైన సదా సంతోషంతో ఉండాలి. ఇవి ఒక దానికంటె ఒకటి ఉన్నతమైన గతులు. సాధకుడు తప్పక ఈ మూడింటినీ పొందాలి'.

వ. **అని యి ట్లుపదేశించి.** **344**

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ రీతిగా; ఉపదేశించి= ప్రబోధించి.

తాత్పర్యం: కపిలుడు స్యూమరశ్మికి పైన చెప్పిన విధంగా ఉపదేశించాడు. తరువాత.

సీ. **'వేదితవ్యంబన విదితంబు నా ఋతం । బనఁగ సత్యంబన నతిశయిల్లి,**
సంభృతస్థావర జంగమం బనఁగ స । ర్వాత్మకంబన శుభం బనఁగ వెలసి,
యవ్యక్త మనఁగ బ్రహ్మంబునా నుత్తర । మనఁగ శివంబన వినుతి కెక్కి,
ప్రభవం బనంగ నవ్యయ మన శాంతి నాఁ । దేజంబు నా నెందుఁ దేజరిల్లి,

తే. **క్షమ యనంగ నంబర మనఁగా ధ్రువంబు । నా ననామయ మన నొప్పి లీనరూప**
బుద్ధి సంప్రాప్య మగు తత్త్వమునకు వేద । మానిత బ్రాహ్మణులకు నమస్కరింతు.' **345**

ప్రతిపదార్థం: వేదితవ్యంబు+అనన్= వేదితవ్యమనీ (తెలిసికొనదగిన దనీ); విదితంబునాన్= విదితమనీ (తెలియబడినదనీ); ఋతంబు+అనఁగన్= ఋతమనీ; సత్యంబు+అనన్= సత్యం అనీ; అతిశయిల్లి= శోభిల్లి; సంభృత స్థావర జంగమంబు+అనఁగన్= చరాచరములను భరించినదనీ; సర్వాత్మకంబు+అనన్= సర్వ స్వరూపమనీ, అన్నిటికీ ఆత్మస్థానీయమనీ; శుభంబు+అనఁగన్= శుభమనీ; వెలసి= అలరారి; అవ్యక్తము+అనఁగన్= అవ్యక్తమనీ; బ్రహ్మంబునాన్= బ్రహ్మమనీ; ఉత్తరము+అనఁగన్= ఉత్తరమనీ; శివంబు+అనన్= శివమనీ; వినుతికిన్+ఎక్కి= ప్రసిద్ధి పొంది; ప్రభవంబు+అనఁగన్= ప్రభవమనీ (ఉత్పత్తి స్థానమనీ); అవ్యయము+అనన్= అవ్యయ మని (వ్యయం కానిదనీ); శాంతినాన్= శాంతి అనీ; తేజంబునాన్= తేజమనీ; ఎందున్= అంతటా; తేజరిల్లి= ప్రకాశించి; క్షమఅనఁగన్= క్షమ అనీ, (భూమి అనీ); అంబరంబు+అనఁగాన్= అంబరమనీ (ఆకాశమనీ); ధ్రువంబునాన్= ధ్రువమనీ (స్థిరమైనదనీ); అనామయమనన్= అనామయమనగా (జాడ్యం లేనిదనగా); ఒప్పి= భాసించి; లీనరూప బుద్ధిసంప్రాప్యము+అగు= లయమైన రూపం కల బుద్ధిచేత ప్రాపింపదగిన; తత్త్వమునకున్= పరతత్త్వానికి; వేదమానిత బ్రాహ్మణులకున్= వేదజ్ఞానంచేత పూజించబడిన విప్రులకూ; నమస్కరింతున్= ప్రణమిల్లుతాను.

తాత్పర్యం: వేదితవ్యమూ, విదితమూ, ఋతమూ, సత్యమూ, సంభృతస్థావరజంగమమూ (చరాచర జగత్తును భరించేది), సర్వాత్మకమూ, శుభమూ, అవ్యక్తమూ, బ్రహ్మమూ, ఉత్తరమూ, శివమూ, ప్రభవమూ, అవ్యయమూ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శాంతీ, తేజమూ, క్షమా, అంబరమూ, ధ్రువమూ, అనామయమూ - అని వ్యవహరించబడుతూ లయించిన రూపం కల బుద్ధికి మాత్రమే గోచరమవుతున్న పరతత్త్వానికీ, వేద విజ్ఞానంతో పూజితులైన విప్రులకూ నేను నమస్కరిస్తాను.

వ. అని పలుకుటయు స్యూమరశ్మి ప్రీతుఁడగుచుఁ గపిలునిం బ్రశంసించె; నియ్యితిహాసంబు తాత్పర్యంబు నీవుం గనికొను'మని చెప్పినం దద్దయుఁ బ్రియంబంది ధర్మనందనుండు 'ధర్మార్థకామంబులు మూఁడును వేదశంసితంబులు; వీనిలో నెద్దాని లాభంబున విశేషంబు గలిగియుండు నెఱింగింపవే !' యనిన గాంగేయుండు గుండధారుం డనువాఁడు నిజభక్తున కుపకారంబు సేసిన ప్రకారం బితిహాస రూపంబునం బ్రవర్తిల్లునది భవత్ప్రశ్నంబునకు నుత్తరంబై యుండు; వినుము చెప్పెద'నని యప్పుడమిఱేని కిట్లనియె.346

ప్రతిపదార్థం: అని పలుకుటయున్= అని చెప్పేసరికి; స్యూమరశ్మి ప్రీతుండు+అగుచున్= స్యూమరశ్మిఅనే ముని సంతుష్టుడై; కపిలునిన్= కపిలుడిని; ప్రశంసించెన్= అభినందించాడు; ఈ+ఇతిహాసంబు+తాత్పర్యంబున్= ఈ ఇతిహాసంయొక్క భావాన్ని; నీవున్= నీవు కూడా; కనికొనుము= గ్రహించుము; అని చెప్పినన్= అని భీష్ముడు చెప్పగా; ధర్మనందనుండు= ధర్మరాజు; తద్దయున్= మిక్కిలిగా; ప్రియంబు+అంది= సంతోషించి; ధర్మ+అర్థకామంబులు మూఁడునున్= ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలూ; వేదశంసితంబులు= వేదాలచేత ప్రశంసింపబడి ఉన్నాయి; వీనిలోన్= ఈ మూడింటిలోనూ; ఏ+దాని లాభంబునన్= దేని ప్రాప్తివలన; విశేషంబు= అతిశయం; కలిగి+ఉండున్= లభిస్తుంది; ఎఱింగింపవే= చెప్పుమా; అనినన్= అని అడుగగా; గాంగేయుండు= భీష్ముడు; కుండధారుండు+అనువాఁడు= కుండధారుడనేవాడు; నిజభక్తునకున్= తన భక్తుడికి; ఉపకారంబు చేసిన ప్రకారంబు= ఉపకరించిన పద్ధతి; ఇతిహాసరూపంబునన్= పూర్వకథారూపంతో; ప్రవర్తిల్లున్= ఉంటున్నది; అది= ఆ కథ; భవత్ప్రశ్నంబునకున్= నీ ప్రశ్నకు; ఉత్తరంబు+ఐ ఉండున్= సమాధానమై ఉన్నది; వినుము= ఆలకించుము; చెప్పెదన్+అని= చెప్పుతాను అని; ఆ+పుడమిఱేనికిన్= ఆ రాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని కపిలమునీంద్రుడు చెప్పేసరికి స్యూమరశ్మి సంతసించి కపిలమునిని ప్రశంసించాడు. ఈ కథలోని భావం నీవు కూడా గ్రహించుము అని భీష్ముడు చెప్పాడు. అందుకు ధర్మరాజు ఎంతో సంతోషించాడు. ఆయన మళ్ళీ 'వేదాలలో ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలు ప్రశస్తమై ఉన్నాయి. ఆ మూడిటిలోనూ ఏది లభిస్తే గొప్పగా ఉంటుంది? ఈ సంగతి తెలియజెప్పుము' అని ప్రశ్నించాడు. అప్పుడు భీష్ముడు ' పూర్వం కుండధారుడు అనేవాడు తన భక్తుడికి ఉపకరించిన విధానం ఒక ఇతిహాసరూపంలో ఉన్నది. అది నీ ప్రశ్నకు సమాధానంగా ఉంటుంది; దానిని చెప్పుతాను విను'మని ఆ ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

కుండధారుం డను దేవానుచరుని వృత్తాంతము (సం. 12-263-2)

సీ. 'యజ్ఞార్థ మొక్క బ్రాహ్మణుఁడు ధనార్థియై। తపము సేయఁగఁ గుండధారుఁ డనఁగఁ
బరఁగెడు దేవానుచరుఁ డచ్చటికి వచ్చి। 'యభిలాష మేరూప' మనుడు 'నర్థ
సిద్ధిఁ గోరెద'నని చెప్పినఁ బ్రీతి నా। తఁడు మాణిభద్రుని ధనదభృత్యు
నియతిఁ దలంప సన్నిధి సేసె నయ్యక్షుఁ;। డతఁడు 'మదాశ్రితుం డైన యితని

తే. ధనసమగ్రునిఁ జేయవే' యనిన 'నెంత। ధనము వలసిన నిచ్చెద' ననియె మాణి
భద్రుఁ డమ్మహాత్ముఁడు మర్త్యభావ మస్థి। రత్వదూషిత మను విచారంబు పుట్టి! 347

ప్రతిపదార్థం: ఒక్క బ్రాహ్మణుఁడు= ఒక విప్రుడు; యజ్ఞ+అర్థము= యజ్ఞంకొరకై; ధనార్థి+ఐ= ధనంకోరినవాడై; తపము చేయఁగన్= తపస్సు చేయుగా; కుండధారుఁడు+అనఁగన్= కుండధారుడు అనే పేరుతో; పరఁగెడు= ప్రవర్తిల్లెడు; దేవ+అనుచరుఁడు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దేవసేవకుడు; అచ్చటికిన్= ఆ చోటికి; వచ్చి= ఏతెంచి; అభిలాషము= కోరిక; ఏ రూపము?= ఎట్టిది?; అనుడున్= అనగా; అర్థసిద్ధిన్= ధనప్రాప్తిని; కోరెదను+అని= అభిలషిస్తున్నానని; చెప్పినన్= చెప్పగా; ఆతఁడు= ఆ కుండధారుడు; ప్రీతిన్= ప్రీతితో; నియతిన్= నియమపూర్వకంగా; ధనదభృత్యున్= కుబేరుడి బంటు అయిన; మాణిభద్రునిన్= మాణిభద్రుడనేవాడిని; తలంపన్= స్మరించగా; ఆ+యక్షుఁడు= ఆ యక్షుడు; సన్నిధిచేసెన్= సమీపించాడు; అతఁడు= ఆ కుండధారుడు; మదాశ్రితుండు+ఐన= నన్నాశ్రయించిన వాడైన; ఇతనిన్= ఈ బ్రాహ్మణుడిని; ధనసమగ్రునిన్= ధనంచేత సంపూర్ణుడిగా; చేయవే= చేయుమా; అనినన్= అనగా; మాణిభద్రుఁడు= మాణిభద్రుడనే ఆ యక్షుడు; ఎంతధనము= ఎంత విత్తం; వలసినన్= కావలసినను; ఇచ్చెదన్= ఇస్తాను; అనియెన్= అన్నాడు; ఆ+మహాత్ముఁడు= మహనీయుడైన ఆ కుండధారుడు; మర్త్యభావము= మరణించే స్వభావంకల మానవత్వం; అస్థిరత్వ దూషితము= శాశ్వతం కాకపోవటంచేత దూషించబడింది; అను విచారంబు= అనే ఆలోచన; పుట్టి= కలిగి.

తాత్పర్యం: ఒక విప్రుడు యజ్ఞం చేయాలన్న తలంపుతో ధన మభిలషించి తపస్సు చేశాడు. కుండధారుడనే దేవసేవకు డొకడు అతడు తపస్సు చేస్తున్న చోటికి వచ్చాడు. వచ్చి 'నీ కోరిక ఏమి?' అని ప్రశ్నించాడు. ఆ బ్రాహ్మణుడు ధనం కొరకై తపస్సు చేస్తున్నా నన్నాడు. అప్పుడు ఆ కుండధారుడు నియమపూర్వకంగా కుబేరుడి బంటైన మాణిభద్రుడనే యక్షుడిని తలచాడు. ఆ యక్షుడు వెంటనే అక్కడ ప్రత్యక్షమయ్యాడు. అప్పు డా కుండధారుడు 'ఈ విప్రుడు నన్ను ఆశ్రయించి ఉన్నాడు. ఇతడిని మిక్కిలి ధనవంతుడిని చేయుము' అని అర్థించాడు. అంతట మాణిభద్రుడు 'ఇతడు ఎంత ధనం కావలె నని కోరినా ఇస్తాను' అని చెప్పాడు. ఇంతలో కుండధారుడు 'మానవుడు మరణశీలుడు. మానవత్వం స్థిరమైనది కాదు' అన్న ఆలోచన కలిగినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ధన మేటికి? నీ విప్రుని। మన మొలయఁగ వలయు ధర్మమార్గంబున; దా
నన సర్వసంపదలు నగు'। నని నిశ్చయ మొంది వినయ మతిశయ మందన్. 348

ప్రతిపదార్థం: ధనము= అర్థం; ఏటికిన్?= ఎందుకు?; ఈ విప్రుని= ఈ బ్రాహ్మణుడియొక్క; మనము= చిత్తం; ధర్మమార్గంబునన్= ధర్మపు త్రోవలో; ఒలయఁగన్ వలయున్= ప్రవేశించాలి; దానన్+అ= అట్లా చేయటం వలననే; సర్వసంపదలున్= సమస్తమైన సిరులూ; అగునని= కలుగుతాయి అని; నిశ్చయము+ఒంది= నిర్ణయించుకొని; వినయము= అడకువ; అతిశయము+అందన్= అతిశయిల్లగా.

తాత్పర్యం: 'డబ్బు ఎందుకు? ఈ భూసురుడి చిత్తం ధర్మమార్గంలో ప్రవర్తించాలి. అట్లా ప్రవర్తిస్తే ఇతడికి సమస్తమైన సంపదలూ సిద్ధిస్తాయి' అని నిశ్చయించుకొని మిక్కిలి వినయంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. యక్షవరునితోడ నవ్విచారము మృదు। వచన రచనఁ జెప్ప వాఁడు దాని
కాత్మఁ బ్రీతిఁ బొంది యనుమతి సేయంగ। నధికభక్తి నిరతుఁడై యతండు. 349

ప్రతిపదార్థం: యక్షవరునితోడన్= యక్షశ్రేష్ఠుడితో; ఆ+విచారము= ఆ ఆలోచన; మృదువచన రచనన్= మెత్తని మాటలతో; చెప్పన్= చెప్పేసరికి; వాఁడు= ఆ యక్షుడు; దానికిన్= అందుకు; ఆత్మన్= మనస్సులో; ప్రీతిన్= సంతోషం; పొంది= చెంది; అనుమతి చేయంగన్= అనుమతించగా; అతండు= ఆ కుండధారుడు; అధికభక్తి నిరతుఁడు+ఐ= మిక్కిలి భక్తితత్పరుడై.

తాత్పర్యం: కుండధారుడు యక్షునితో తన అభిప్రాయాన్ని మెత్తని పలుకులతో వివరించాడు. అందు కా యక్షుడు మనస్సులో ఎంతో సంతోషించి అనుమతించాడు. అప్పు డా కుండధారుడు అత్యంతభక్తి గలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. దేవతలను బ్రార్థించిన । నావసుధామరుని చిత్త మా ప్రొద్ద తప
స్సేవనతత్పర మగుడున్ । దేవానుచరునకు నిట్లనియె నతఁ డధిపా! 350

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; దేవతలనున్= సురలను; ప్రార్థించినన్= వేడగా; ఆ ప్రొద్దు+అ= ఆ దినమే; ఆ వసుధా+అమరుని చిత్తము= ఆ విప్రుడిమనస్సు; తపస్సేవనతత్పరము= తపం చేయటంలో ఆసక్తమైనది; అగుడున్= కాగా; అతఁడు= ఆ బ్రాహ్మణుడు; దేవ+అనుచరునకున్= దేవసేవకుడైన కుండధారుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజా! దేవతల నుద్దేశించి ధర్మమార్గంలో ఆ విప్రుడు ప్రవర్తించేటట్లు అనుగ్రహించుమని కుండధారుడు ప్రార్థించాడు. అట్లా ప్రార్థించగానే ఆ దినమే ఆ బ్రాహ్మణుడి మనస్సు తపస్సులో సంలగ్నమయింది. అప్పు డా బ్రాహ్మణుడు కుండధారుడితో ఇట్లా అన్నాడు:

క. 'అనఘా! భవదీయదయన్ । మనంబు దెలివొందె నిపుడు నా; కే నొల్లన్
ధనము తపంబ యొనర్పఁగ । ననుజ్ఞ సేయంగవలయు నాదరణమునన్.' 351

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; ఇప్పుడు= ఇప్పుడు; భవదీయదయన్= నీ కృపచేత; నాకున్= ధనం కోరిన నాకు; మనంబు= చిత్తం; తెలివి+ఒందెన్= వివేకం కలదయింది; ఏన్= నేను; ధనము= విత్తం; ఒల్లన్= అభిలషించను; ఆదరణమునన్= ప్రీతితో; తపంబు+అ= తపస్సే; ఒనర్పఁగన్= చేయటానికి; అనుజ్ఞచేయంగన్ వలయున్= అనుమతించాలి.

తాత్పర్యం: పాపరహితుడ వైన ఓ కుండధారుడా! ఇంత వరకూ ధనాన్ని అభిలషిస్తూ ఉండిన నాకు ఇప్పుడు నీ దయవలన చిత్తం వివేకవంత మయింది. ఇంక నాకు ధనమక్కరలేదు. ప్రీతితో తపస్సునే చేయటానికి నన్ను అనుమతించుము'.

ఆ. అనిన 'నట్లకాక యాచరింపుము ధర్మ' । మనుచు నరిగె నిర్జరానుచరుఁడు
భూసురుండు మూలములును బత్రములు నా । హారములుగఁ జేసె నధికతపము. 352

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; నిర్జర+అనుచరుఁడు= దేవానుచరుడైన కుండధారుడు; అట్లకాక= అట్లే అగుగాక!; ధర్మమున్= ధర్మమును; ఆచరింపుము= చేయుము; అనుచున్= అంటూ; అరిగెన్= పోయాడు; భూసురుండు= బ్రాహ్మణుడు; మూలములును= కందమూలాలు; పత్రములున్= ఆకులునూ; ఆహారములుగన్= భోజనాలుకాగా; అధికతపమున్= తీవ్రమైన తపస్సు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణు డా విధంగా చెప్పేసరికి కుండధారుడు 'అట్లే కానిమ్ము; ధర్మం ఆచరించుము' అంటూ స్వస్థానానికి వెళ్ళిపోయాడు. బ్రాహ్మణుడు దుంపలూ, ఆకులూ ఆహారంగా స్వీకరిస్తూ కఠిన తపస్సుచేశాడు.

క. క్రమమున జల పవనము లశ । నములుగఁ గొని తపము సేసినం గాయముఁ జి
త్తము మానుషంబు లగు చం । దములు విడిచి దివ్యమహిమధామము లయ్యెన్. 353

ప్రతిపదార్థం: క్రమమునన్= క్రమంగా; జలపవనములు= నీరు గాలి; అశనములుగన్= ఆహారాలుగా; కొని= గ్రహించి; తపముచేసినన్= తపస్సు చేయగా; కాయము= శరీరం; చిత్తము= మనస్సు; మానుషంబులు+అగు= మనుష్య సంబంధం కలవి అగు; చందములు= విధానాలు; విడిచి= వదలి; దివ్యమహిమధామములు= దివ్యమైన ప్రభావానికి నెలవులుగా; అయ్యెన్= ఐనవి;

తాత్పర్యం: ఆ విప్రుడు క్రమంగా కందపత్రాలు కూడా వదలి నీటిని గాలిని మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ తపస్సు చేశాడు. అందువలన అతడి శరీరమూ, మనస్సూ మనుష్యత్వాన్ని వదలి దివ్యప్రభావానికి నెలవులై విలసిల్లాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్లు సిద్ధుం డగుటయు. 354

ప్రతిపదార్థం: అట్లు= ఆ రీతిగా; సిద్ధుండు= తపస్సుచేత సిద్ధిపొందినవాడు; అగుటయున్= కాగా.

తాత్పర్యం: ఆ విప్రు డారీతిగా తపస్సుచేత సిద్ధి పొందగా.

క. నను నెవ్వ రాశ్రయించిన । ధన మొసఁగుదు, రాజ్యమిత్తుఁ; దద్దురితములం
దునుముదు; నను నగ్గలికలు । మనమున జనియింపఁజొచ్చె మనుజాధీశా! 355

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= రాజా!; ననున్= నన్ను; ఎవ్వరు= ఎట్టివారు; ఆశ్రయించినన్= ఆశ్రయించినను; ధనమున్= విత్తమును; ఒసఁగుదున్= ఇస్తాను; రాజ్యమున్= రాజ్యాన్ని; (పరిపాలించదగిన దేశాన్ని) ఇత్తున్= ఇస్తాను; తద్దురితములన్= ఆశ్రయించినవారి పాపాలను; తునుముదున్= సంహరిస్తాను; అను అగ్గలికలు= అనే ఉత్సాహాతిశయాలు; మనమునన్= చిత్తంలో; జనియింపన్+చొచ్చెన్= కలుగసాగాయి.

తాత్పర్యం: రాజా! ఆ బ్రాహ్మణుడికి తపఃప్రభావం వలన 'న న్నెవ్వ రాశ్రయించినా వలసినంత ధనమిస్తాను. రాజ్యం ఇస్తాను. వారి పాపాలను పోగొట్టుతాను' అనే ఉత్సాహాతిశయం అతడి మనస్సులో కలుగసాగింది.

వ. అవ్విధంబున మహానుభావుండై. 356

ప్రతిపదార్థం: ఆ+విధంబునన్= ఆ రీతిగా; మహానుభావుండు+ఐ= గొప్పప్రభావం కలవాడై.

తాత్పర్యం: ఆ రీతిగా అతడు గొప్ప ప్రభావం కలిగినవాడై.

తే. ఆతఁ డతిభక్తిఁ దలఁచె దేవానుచరుని; । నపుడ యక్కుండధారుండు నరుగుదెంచె;
నరుగుదెంచిన నతఁడు నిజానుభావ । జనితగంధ పుష్పములఁ బూజన మొనర్చి. 357

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ బ్రాహ్మణుడు; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; దేవ+అనుచరునిన్= దేవసేవకుడైనకుండధారుడిని; తలఁచెన్= స్మరించాడు; అపుడు+అ= తలపగానే; ఆ+కుండధారుండును= ఆ కుండధారుడుకూడ; అరుగుదెంచెన్= వచ్చాడు; అరుగుదెంచినన్= అతడు రాగా; అతఁడు= ఆ విప్రుడు; నిజ+అనుభావజనిత గంధపుష్పములన్= తన తపఃప్రభావంచేత సృష్టించబడిన గంధంచేతను, పూలచేతను; పూజనము= అర్చన; ఒనర్చి= చేసి.

తాత్పర్యం: ఆ బ్రాహ్మణుడు అత్యంతభక్తియుక్తుడై దేవసేవకుడిని తలచాడు. అతడు అట్లా తలచగానే కుండధారుడు అతడి యెదుట ప్రత్యక్షమయ్యాడు. అతడు రాగానే ఈ విప్రుడు అతడిని తన తపోమహిమచేత సృష్టించబడిన గంధంతోనూ, పూలతోనూ పూజించాడు. పూజించిన పిదప. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. చక్కఁగఁ జాగి మ్రొక్కుటయుఁ జయ్యన నెత్తి మనం బెలర్పఁగా
నక్కునఁజేర్చి యిట్లనియె నద్దివిజానుచరుండు 'శంక దాఁ
దక్కి ధనంబుఁ గామమును ధర్మముతోఁ గలయంగ నెన్నునే
యక్కట! యిట్లు వేదమని యప్పురుషార్థమునూఁద మే లగున్.' 358

ప్రతిపదార్థం: చక్కఁగన్= సాష్టాంగంగా; చాగిమ్రొక్కుటయున్= సాగిలబడి నమస్కరించగానే; ఆ+దివిజ+అనుచరుండు= ఆ కుండధారుడు; చయ్యనన్= వెంటనే; ఎత్తి= బ్రాహ్మణుడిని పైకి లేవదీసి; మనంబు+ఎలర్పఁగాన్= చిత్తం సంతోషించగా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అక్కునన్+చేర్చి= వక్షమున (కౌగిట) చేర్చుకొని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; అక్కట!= ఔరా!; వేదము= శ్రుతి; తాన్= తాను; శంక దక్కి= సంశయం వీడి; ధనంబున్= అర్థమును; కామమును= కామ పురుషార్థాన్నీ; ధర్మముతోన్= ధర్మమనే మొదటి పురుషార్థంతో; కలయంగన్= కలియగా; ఎన్నునే?= ప్రశంసించునా?; అవి= ఆ అర్థకామాలు; ఆ+పురుషార్థమున్= ఆ ధర్మమనే ముఖ్యపురుషార్థాన్ని, ఊఁదన్= ఆధారంగా చేసికొన్నపుడు; మేలు+అగున్= శ్రేయస్సు కలుగుతుంది.

తాత్పర్యం: విప్రుడు కుండధారుడికి పూజానంతరం సాష్టాంగనమస్కారం చేశాడు. కుండధారు డందుకు సంతసించి వెనువెంటనే అతడిని లేవనెత్తి కౌగిలించుకొని ఇట్లా అన్నాడు: 'వేదం శంకలేక ధర్మంతో సమానంగా అర్థ కామాలను పరిగణించగలదా? ఔరా! అర్థకామాలు ధర్మాన్ని మించకుండా ఉన్నంతవరకే శ్రేయోదాయకా లవుతాయి'.

విశేషం: ధర్మం ముఖ్య పురుషార్థం. అర్థకామాలు సైతం పురుషార్థాలే. కాని ధర్మాన్ని అనుసరించి అర్థ కామాలను అనుభవించాలి. ధర్మవిరుద్ధమైన అర్థకామాలు శ్రేయస్సు కల్గించవు. శ్రీకృష్ణభగవానుడు గీతలో 'ధర్మావిరుద్ధః కామోఽస్మి భూతేషు' - నేను ప్రాణులలో ధర్మానికి విరుద్ధం కాని కామమునై ఉన్నాను అని చెప్పాడు. అందువలన అర్థకామాలకంటె ధర్మమే ప్రధానమని కుండధారు డిక్కడ విశదం చేశాడని గ్రహించాలి.

వ. అని ధర్మం బగ్గించి. 359

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; ధర్మంబు= ధర్మాన్ని; అగ్గించి= ప్రశంసించి.

తాత్పర్యం: కుండధారు డట్లా చెప్పి ధర్మాన్ని అర్థకామాలకంటె శ్రేష్ఠమైనదని వినుతించాడు. తరువాత.

క. 'ఆ సుకృతముఁ గడయెయ్యి మ । హాసత్త్వా యోగసేవ నారామత ను
ద్భాసితుఁడ వగుచు నిష్ఠా । వ్యాసంగ విహారి వగు మనామయలీలన్.' 360

ప్రతిపదార్థం: మహాసత్త్వా!= గొప్ప సత్త్వముగల ఓ విప్రుడా!; ఆ సుకృతమున్= ఆ ధర్మాన్ని; కడయెయ్యి= పారం ముట్టి; యోగసేవ నారామతన్= యోగమును సేవించటంచేత రమిస్తూ; ఉద్భాసితుఁడవు+అగుచున్= ప్రకాశమానుడవవుతూ; అనామయ లీలన్= ఉపద్రవం లేని పద్ధతితో; నిష్ఠావ్యాసంగ విహారివి= ఆత్మనిష్ఠా సంబంధంతో విహరించేవాడవుగా; అగుము= కమ్ము.

తాత్పర్యం: 'మహాసత్త్వుడ వగు ఓ భూసురుడా! నీవు పురుషార్థాలలో శ్రేష్ఠమైన ఆ ధర్మాన్ని ఆచరించుము. యోగాన్ని సేవిస్తూ క్రీడించుము. దానిద్వారా భాసించే ఏ ఉపద్రవమూ లేని పద్ధతిలో ఇట్లా ఆత్మనిష్ఠుడవై స్వేచ్ఛగా విహరించుము.

క. అని యతఁడు నిజనివాసం । బున కరిగెను విప్రవరుఁడు మునిజనములు పూ
జనము లొనరింప ఖేచరు । లనుమోదింప విహరించె నప్రతిహతుఁడై.' 361

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; అతఁడు= ఆ కుండధారుడు; నిజనివాసంబునకున్= తన స్థానానికి; అరిగెను= వెళ్ళాడు; విప్రవరుఁడు = బ్రాహ్మణశ్రేష్ఠుడు; మునిజనములు= మునుల సమూహాలు; పూజనములు+ఒనరింపన్= తనను అర్చించగా; ఖేచరులు= ఆకాశచారులు; అనుమోదింపన్= అభినందించగా; అప్రతిహతుఁడు+ఐ= ఎదురులేని వాడై; విహరించెన్=సంచరించాడు.

తాత్పర్యం: కుండధారు డట్లా చెప్పి తన స్థానానికి వెళ్ళాడు. ఈ బ్రాహ్మణుడు మునులు తనను పూజిస్తుండగా, తన ప్రవృత్తిని ఖేచరులైన దేవతావిశేషాలు అనుమోదించగా, ఎదురులేకుండా యోగమార్గంలో విహరించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నారద ప్రవర్తితం బగు నితిహాసము (సం. 12-264-2)

వ. అని చెప్పి యప్పురుషవరుం డప్పాండవాగ్రజుతో వెండియు నిట్లను 'నొక్క ధర్మసూక్ష్మత సెప్పెద నాకర్ణింపు; ముంఛవృత్తి యగు విప్రుం డొక్కరుండు భార్యాసహితుండై వనంబున నుండి యజ్ఞాచరణంబునకుం దొడంగి యహింసాపరుం డగుటం బశువిధి యుడిగి ఫలమూలంబుల హవిస్తంత్రంబు నడపం జూచె; నది విహితాచారంబు గామి యెఱింగియు శాపభయంబునం దత్పత్ని యమ్మహీసురవరు నెదుర నిలిచియుం బలుకకుండెఁ; బాకశాసనాదులు హవిర్భాగంబులు గొనం గడంగమి నగ్నియుం బచనశక్తిం దొఱంగె; నట్టియెడ నా సమీపంబునం దిరుగు హరిణంబు మనుష్య వచనంబులం దత్పత్ని దూఱి యమ్మహీసురవరు నెదుర నిలిచి తన్ను హింసించి యాగంబు సెల్లింపు మనిన, నతండట్లు సేయంబొ మ్మనవుడుఁ గొన్ని యడుగులు వోయి మగిడి యాకృష్ణమృగంబు 'నా యిచ్చు దివ్యదృష్టిం గనుంగొను; మేను చెప్పినట్లు సేసిన ని న్నభినందించువారై యప్సరఃకాంతలును గంధర్వులును వీరె విమానంబుల నేతెంచిన వా'రనుటయు నవ్విప్రుండు విలోకించి దివ్యత్వసిద్ధికై దాని హింసించువాఁ డగుటయు; దానం దదీయతపంబునకు నుత్పాతంబులు పుట్టె; నేణరూపంబున వర్తించు నా ధర్మదేవత యా భూదేవునకు సన్నిధి సేసి నీయజ్ఞశ్రద్ధకు సంతోషించి ధర్మసూక్ష్మత్వంబు దెలుప వచ్చితి; నర్థంబగు హింసావిశేషం బహింసావ్రతహానింజేయదు; క్రతువు గదాయని యనర్థహింస కర్తవ్యంబుగా దని నిర్దేశించి తత్పత్నీసమాధానంబునం దపశ్శక్తి ప్రత్యాసత్తియుం జేసి యాగవిశేషవిధానంబు వరప్రదానంబున నిర్వహించె; నయ్యితిహాసంబు నారదప్రవర్తితంబని చెప్పిన నప్పుడమితేఁడు ప్రీతుండై. 362

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; ఆ+పురుషవరుండు= ఆ పురుషశ్రేష్ఠుడైన భీష్ముడు; ఆ+పాండవ+అగ్రజుతోన్= పాండవులలో పెద్దవాడైన ఆ ధర్మజుడితో; వెండియున్= మరల; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; ఒక్కధర్మసూక్ష్మతన్= ఒక ధర్మరహస్యాన్ని; చెప్పెదన్= వివరిస్తాను; ఆకర్ణింపుము= వినుము; ఉంఛవృత్తిఅగు= రాలిన గింజల నేరుకొని తినే వర్తనం కలిగిన; విప్రుండు= బ్రాహ్మణుడు; ఒక్కరుండు= ఒకడు; భార్యాసహితుండు+ఐ= భార్యతో కూడినవాడై; వనంబునన్= అడవిలో; ఉండి= వసించి; యజ్ఞ+ఆచరణంబునకున్= యజ్ఞం చేయటానికి; తొడంగి= పూనుకొని; అహింసాపరుండు+అగుటన్= అహింసావ్రతం పాటించే వాడు కావటంవలన; పశువిధిన్= పశుహింసా రూపమైన విధానాన్ని; ఉడిగి= వర్జించి; ఫలమూలంబులన్= పండ్లచేతను; దుంపల చేతను; హవిస్తంత్రంబు= హవిర్విధానాన్ని; నడపన్= నిర్వర్తించటానికి; చూచెన్= ఆలోచించాడు; అది= ఆ పద్ధతి; విహిత+ఆచారంబు= శాస్త్రం విధించిన ఆచారం; కామి= కాకుండటం; ఎఱింగియున్= తెలిసికూడా; తత్పత్ని= అతడి భార్య; శాపభయంబునన్= శాపంవలని భీతిచే; ఆ+మహీసురవరు+ఎదురన్= ఆ బ్రాహ్మణుడి ఎదుట; నిలిచియున్= నిలబడికూడా; పలుకక+ఉండెన్= ఏమీ మారు చెప్పజాలక పోయింది; పాకశాసన+ఆదులు= ఇంద్రాదులైన దేవతలు; హవిర్భాగంబులు= యజ్ఞాగ్నిలో వేల్చబడిన హవిస్సుయొక్క పాళ్ళను; కొనన్= గ్రహించటానికి; కడంగమిన్= ప్రయత్నించక పోవటం వలన; అగ్నియున్= అగ్నికూడ; పచన శక్తిన్= పాకంచేసే సామర్థ్యాన్ని; తొఱంగెన్= కోల్పోయాడు; అట్టిఎడన్= ఆ సందర్భంలో; ఆ సమీపంబునన్= ఆ చెంతనే; తిరుగు= సంచరించే; హరిణంబు= లేడి; మనుష్యవచనంబులన్= మానవుల భాషతో; తత్పత్నిన్= ఆయన భార్యను; దూఱి= నిందించి; ఆ+మహీసురవరుఎదురన్= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడి ఎదుట; నిలిచి= నిలబడి; తన్నున్ హింసించి= తనను వధించి; యాగంబు చెల్లింపుము= యజ్ఞం పూర్తిచేయుము; అనినన్= అని చెప్పగా; అతండు= ఆ బ్రాహ్మణుడు; అట్లు= ఆ రీతిగా; చేయన్+పొమ్ము= చేయనుపో; అనవుడున్= అనగా; ఆ కృష్ణమృగంబు= ఆ నల్లలేడి; కొన్నియడుగులు= కొంతదూరం; పోయి= వెళ్ళి; మగిడి= తిరిగివచ్చి; నా ఇచ్చు= నేను ఇచ్చెడి; దివ్యదృష్టిన్= దివ్యదృష్టితో; కనుంగొనుము= చూడుము; ఏను= నేను; చెప్పినట్లు= వచించిన రీతిగా; చేసినన్= ఆచరిస్తే; నిన్నున్+అభినందించువారై= నిన్ను మెచ్చుకొనేవారై; అప్సరఃకాంతలును= అప్సరఃస్త్రీలును;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గంధర్వులును= గానంచేసే గంధర్వులు కూడ; వీరె= ఈ కనిపించేవారే; విమానంబులన్= విమానాలమీద; ఏతెంచినవారు= వచ్చారు; అనుటయున్= అనగా; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; విలోకించి= చూచి; దివ్యత్వసిద్ధికై= దివ్యత్వంయొక్క ప్రాప్తికై; దానిన్= ఆ కృష్ణమృగాన్ని; హింసించువాఁడు= చంపేవాడు; అగుటయున్= కాగా; దానన్= దానివలన; తదీయతపంబునకున్= వాని తపస్సుకు; ఉత్పాతంబులు= ఉపద్రవాలు; పుట్టెన్= కలిగాయి; ఏణరూపంబునన్= జింకరూపంతో; వర్తించు= మెలగుతున్న; ఆ ధర్మదేవత= ధర్మమునకు అధిష్ఠానమైన ఆ దేవత; ఆ భూదేవునకున్= ఆ విప్రుడికి; సన్నిధిచేసి= ప్రత్యక్షమై; నీయజ్ఞశ్రద్ధకున్= యజ్ఞమునందు నీకు గల ఆస్తిక్యబుద్ధికి; సంతోషించి= సంతసించి; ధర్మసూక్ష్మత్వంబు= ధర్మంలోని సూక్ష్మతను; తెలుపన్= తెలియజేయటానికై; వచ్చితిన్= ఏతెంచాను; అర్హంబు+అగు= తగిన; హింసావిశేషంబు= హింసావిధానం; అహింసావ్రతహానిన్= అహింసావ్రతానికి చేటును; చేయదు= కల్గించదు; క్రతువు కదా అని= యజ్ఞం కదా అన్న బుద్ధితో; అనర్హహింస= తగని హింసాప్రక్రియ; కర్తవ్యంబు కాదు= చేయదగినది కాదు; అని నిర్దేశించి= అని చెప్పి; తత్పత్నీసమాధానంబునన్= అతడి భార్యను సమాధానపరచటమూ; తపశ్శక్తి ప్రత్యాసత్తియున్= తపోమహిమ సాంగత్యమూ; చేసి= ఆచరించి; వరప్రదానంబునన్= వరాన్ని ప్రసాదించటంతో; యాగవిశేషవిధానంబున్= యజ్ఞవిశేష విధిని; నిర్వహించెన్= నిర్వర్తింపజేసింది; ఆ+ఇతిహాసంబు= ఆ పూర్వగాథ; నారదప్రవర్తితంబు+అని= నారదమునిచే ప్రవర్తింపజేయబడిందని; చెప్పినన్= వచించగా; ఆ+పుడమిఱేఁడు= ఆ రాజు; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై.

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజుతో పై విధంగా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు: 'ఒక ధర్మరహస్యం చెప్పుతాను వినుము. రాలిన గింజలను ఏరుకొని తినటమనే ఉంఛవర్తనంతో జీవించే బ్రాహ్మణు డొకడు భార్యతో సహా అడవిలో ఉండేవాడు. అతడు యజ్ఞం చేయటానికి ప్రయత్నించాడు. కాని, అహింసావ్రతాన్ని పాటించేవాడు కావటంవలన పశువులను హింసించటం తగదని ఫలమూలాలతో హవిర్విధానం నిర్వర్తింపజూచాడు. అది శాస్త్రవిహిత పద్ధతి కాదని తెలిసికూడా అతడి భార్య అతడి ఎదుట నిలబడి శపిస్తాడన్న భయంతో ఏమీ చెప్పకుండా ఉండిపోయింది. ఇంద్రాది దేవతలు ఆ యజ్ఞంలో హవిస్సులను స్వీకరించడానికి రాలేదు. అగ్ని కూడా హవిస్సులను పచనం చేసే శక్తి కోల్పోయాడు. ఆ పరిస్థితిలో ఆ సమీపప్రాంతంలో సంచరించే జింక ఒకటి మానవవచనాలతో అతడి భార్యను నిందించి, ఆ బ్రాహ్మణుడి ఎదుట నిలబడి 'నన్ను చంపి యాగం పూర్తిచేయి' అని చెప్పింది. అయినా అతడు 'నేనట్లా చేయనుపో' అని నిరాకరించాడు. ఆ కృష్ణహరిణం కొన్ని అడుగులు పోయి మరల తిరిగివచ్చి 'నేనిచ్చే దివ్యదృష్టితో చూడు. నేను చెప్పినట్లు చేస్తే నిన్ను మెచ్చుకొనటానికై ఇదిగో అచ్చరలు, గంధర్వులు విమానాలెక్కి వచ్చి ఉన్నారు చూడుము' అని చెప్పింది. ఆ విప్రుడు వారిని చూచి దివ్యత్వప్రాప్తి నభిలషించి ఆ లేడిని హింసించటానికి ఉద్యుక్తుడయ్యాడు. ఆ హింసవలన అతడి తపస్సుకు ఉత్పాతాలు కలిగాయి. అపుడు జింకరూపంలో ఉన్న ఆ ధర్మదేవత అతడికి నిజరూపంలో ప్రత్యక్షమై 'నేను నీ యజ్ఞశ్రద్ధకు సంతసించాను. నీకు ధర్మసూక్ష్మం చెప్పటానికై వచ్చాను. ఉచితమైన హింస అహింసకు భంగకరం కాదు. యజ్ఞం పేరుతో తగని హింస ఎన్నడూ చేయరాదు' అని చెప్పింది. తరువాత అతడి భార్యను సమాధానపరచింది. అతడి తపశ్శక్తికి లోటులేకుండా చేసింది. వరమిచ్చి అతడి యాగం నిర్వహించబడేటట్లు అనుగ్రహించింది. ఈ కథను నారదమహర్షి లోకంలో ప్రవర్తింపజేశాడు అని భీష్ముడు చెప్పాడు. అందుకు ధర్మజుడు ప్రీతి పొంది. (తరువాతి పద్యంతో అన్వయం).

భీష్ముఁడు ధర్మజునకు ముక్తిమార్గము దెల్పుట (సం. 12-265-2)

క. 'పురుషుం డేమిటఁ బాపా । చరణమునకుఁ జొచ్చు? ధర్మచర్యకు మూలం
బరయఁగ నెయ్యది? రెంటిం । బొరయం డెద్దాన? నెట్లు వొందును ముక్తిన్?' 363

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పురుషుండు= మానవుడు; ఏమిటన్= దేనివలన; పాపాచరణమునకున్= పాపంచేయటానికి; చొచ్చున్= ప్రారంభిస్తాడు; అరయఁగన్= పరిశీలించగా; ధర్మచర్యకున్= ధర్మాచరణకు; మూలంబు= కారణం; ఎయ్యది?= ఏది?; ఏ+దానన్= దేనివలన; రెంటిన్= పుణ్యపాపాలను రెండింటినీ; పొరయఁడు= పొందడు; ముక్తిన్= మోక్షాన్ని; ఎట్లు= ఎట్లా; పొందున్= పొందుతాడు?

తాత్పర్యం: పురుషుడు దేనివలన పాపకార్యాలు చేయటానికి పూనుకొంటాడు? పుణ్యకార్యాలకు కారణ మేది? దేనివలన పుణ్యపాపాలు రెండూ అంటకుండా ఉండగలడు? మోక్షం ఎట్లా పొందుతాడు?

వ. అని యడిగిన నతనికి భీష్ముం డిట్లనియె. 364

ప్రతిపదార్థం: అని అడిగినన్= అని ప్రశ్నించగా; అతనికిన్= ఆ ధర్మరాజుకు; భీష్ముండు= పితామహుడు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ రీతిగా ధర్మరాజు ప్రశ్నించాడు. అది విని భీష్ముడు ధర్మజుడితో ఇట్లా అన్నాడు:

సీ. 'గంధరసాదుల కాంక్ష లోభము మోహ । మును దెచ్చు; నద్దోషమునకు మనసు
లోనైన ధర్మవిలోపంబు వాటిల్లు; । దానఁ బాపము సేయు తలఁపు లొదవు;
బ్రజ్ఞ నక్కీడులు భావించి సద్గోష్ఠిఁ । బరఁగంగ విషయతత్పరత మాను;
నది ధర్మబుద్ధికి నాలవాలం బగు; । ధర్మాచరణములఁ దనివి సనక
తే. హృద్గత ద్వంద్వముల నెల్ల నెడల విడుచు । ననఘ! యనపాయ మగు నుపాయమున ముక్తి
వడయుఁ బదపడి; యేను నీయడిగినంత । వట్టుఁ దెలిపితి ధర్మనిర్వాహి వగుము.' 365

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; గంధరసాదులకాంక్ష= గంధం, రసం మొదలైన విషయాలమీది కోరిక; లోభమున్= లోభాన్నీ; మోహమున్= మోహాన్నీ; తెచ్చున్= తీసికొని వస్తుంది; మనసు= చిత్తం; ఆ+దోషమునకున్= ఆ దోషానికి; లోనైనన్= లోబడితే; ధర్మవిలోపంబు= ధర్మానికి హాని; పాటిల్లున్= కలుగుతుంది; దానన్= దానివలన; పాపము చేయు= పాపకార్యాలు చేసే; తలఁపులు= సంకల్పాలు; ఒదవున్= సంభవిస్తాయి; ప్రజ్ఞన్= ప్రతిభతో; ఆ+కీడులు= ఆ దోషాలు; భావించి= ఊహించి; సద్గోష్ఠిన్= సజ్జనుల గోష్ఠిలో; పరఁగంగన్= ప్రవర్తిల్లితే; విషయతత్పరత= విషయాలపై ఆసక్తి; మానున్= తొలగిపోతుంది; అది= ఆ పద్ధతి; ధర్మబుద్ధికిన్= ధర్మంచేయాలనే బుద్ధికి; ఆలవాలంబు= పాదు; అగున్= అవుతుంది; ధర్మ+ఆచరణములన్= ధర్మకార్యాలు చేయటం వలన; తనివి చనక= తృప్తి పొందక; హృద్గతద్వంద్వములన్+ఎల్లన్= హృదయంలో ఉన్న సుఖదుఃఖాది ద్వంద్వాల నన్నింటినీ; ఎడలన్ విడుచున్= వర్జిస్తాడు; పదపడి= పిదప; అనపాయము+అగు= అపాయంలేని; ఉపాయమునన్= ఉపాయంతో; ముక్తిన్= మోక్షమును; పడయున్= పొందుతాడు; ఏను= నేను; నీఅడిగినంతవట్టు= నీవు ప్రశ్నించినంతవరకు; తెలిపితిన్= తెలియజేశాను; ధర్మనిర్వాహివి= ధర్మకార్యాలు నెరవేర్చేవాడవు; అగుము= కమ్ము.

తాత్పర్యం: 'శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే విషయాలమీది కోరిక లోభ మోహాలు కలిగిస్తుంది. చిత్తం లోభమోహాలకు లోనైతే ధర్మానికి లోపం కలుగుతుంది. ధర్మం లోపించగానే పాపకార్యాలు చేయాలనే తలపులు కలుగుతాయి. అందువలన తెలివితో ఈ కీడులన్నిటినీ ఊహించి వాటిజోలికి పోక సజ్జనుల గోష్ఠిలో కాలం గడిపితే విషయాలపై ఆసక్తి నశిస్తుంది. దానివలన ధర్మబుద్ధి ఉదయిస్తుంది. ధర్మకార్యాలు క్రమంగా ఆచరిస్తూ పోతే హృదయంలోని రాగద్వేషాలు, సుఖదుఃఖాలు మొదలైన ద్వంద్వాలు తొలగిపోతాయి. ఆపైన అపాయం లేని ఉపాయంతో ముక్తి పొందుతాడు. నీవు అడిగినంతవరకూ విషయాలు నీకు తెలియజేశాను. నీవు ధర్మాన్ని ఆచరించుము'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. అనుడు నసపాయ మగు నుపాయం బనంగఁ। జెప్పి తొక్కటి; మోక్షంబుఁ జెందుతెఱఁగు
దానిఁ దెలియంగ నెఱిఁగింపవే నరేంద్ర। ముఖ్య!' యనియె నక్కురువంశముఖ్యుఁ డధిప! 366

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అనుడున్= భీష్ముడట్లా అనగానే; ఆ+కురువంశముఖ్యుఁడు= ఆ కౌరవవంశానికి ప్రధానుడైన ధర్మరాజు; నరేంద్రముఖ్యా!= రాజశ్రేష్ఠా!; అనపాయము+అగు= అపాయం లేనిదైన; ఉపాయంబు+అనంగన్= ఉపాయం అనగా; మోక్షంబున్= ముక్తిని; చెందు= పొందు; తెఱఁగు= మార్గం; ఒక్కటి= ఒకదానిని; చెప్పితి(వి)= చెప్పితివి; దానిన్= ఆ ఉపాయాన్ని; తెలియంగన్= తెలిసేవిధంగా; ఎఱిఁగింపవే= తెలియజేయుమా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! భీష్ముడట్లా అనేసరికి ధర్మరాజు భీష్ముడితో 'రాజవర్యా! అపాయంలేని ఉపాయం అంటూ మోక్షం పొందే మార్గమొక్కటి చెప్పావు. దానిని విపులంగా తెలియజెప్పుము' అని ప్రార్థించాడు.

వ. అనుటయు నమ్మహీకాంతునకు శాంతనవుం డిట్లనియె. 367

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+మహీకాంతునకున్= ఆ ధర్మరాజునకు; శాంతనవుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మజుడు ఆ విధంగా ప్రార్థించగానే భీష్ము డతడితో ఈ రీతిగా అన్నాడు:

క. 'వినుము ఘటము సేయుట సా। ధనములు లేకున్న నగునె ధరణిప! పూర్వాం
బునిధికిఁ జను మార్గ మపర। వనరాశికిఁ జనునె? వెరవు వలయుం దెలియన్. 368

ప్రతిపదార్థం: ధరణిప!= రాజా!; వినుము= ఆలకించుము; ఘటమున్= కుండను; చేయుట= నిర్మించటం; సాధనములు లేకున్నన్= పరికరాలు లేకపోతే; అగునె?= జరుగునా?; పూర్వాంబునిధికిన్= తూర్పు సముద్రానికి; చనుమార్గము= పోయేదారి; అపరవనరాశికిన్= పశ్చిమసాగరానికి; చనునె?= పోతుందా?; వెరవు= ఉపాయం; తెలియన్+వలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: 'ధర్మరాజా! వినుము. తగు సాధనాలు లేకుంటే కుమ్మరి కుండ చేయగలడా? తూర్పు సాగరానికి పోయేదారి ఎప్పుడైనా పడమటి సముద్రానికి పోతుందా? అందువలన ఏ పనికైనా తగిన ఉపాయాన్ని తప్పక తెలిసికొనాలి.

విశేషం: అలం: దృష్టాంతం.

వ. అడిగి మేలు సేసి తాకర్ణింపుము. 369

ప్రతిపదార్థం: అడిగి= ప్రశ్నించి; మేలు= మంచి; చేసితి(వి)= చేశావు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: మోక్షానికి 'అపాయం లేని ఉపాయమేది?' అని అడిగి మంచి పని చేశావు. చెప్పుతాను వినుము.

సీ. క్షమఁ గ్రోధ, మకృత సంకల్పతఁ గామంబు,। చిరనిద్ర సత్త్వసంసేవనమున
గాఢధైర్యమున రాగద్వేషములు, భయ। మప్రమాదమున, మోహంబు భ్రమము
వినివర్తనాభ్యాసమున రోగములు నుప। ద్రవములు హితము మితంబు గాల
యోజితంబును నగు భోజనంబున జీవ। సందర్శనమున నిశ్వాస మఖిల

తే. విషయములు నంతవిరసతా వేక్షణమున। నిత్యసంతోషమున లోభనిరతి కృప న
ధర్మ ముచిత కృతావేక్ష ధర్మ మవులఁ। ద్రోవనేర్చుట ముక్తికిఁ ద్రోవ యధిప! 370

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; క్షమన్= ఓర్పుతో; క్రోధము= కోపాన్ని; అకృతసంకల్పతన్= సంకల్పం చేయకుండా ఉండటంవలన; కామంబు= కోరికను; సత్త్వసంసేవనమునన్= సాత్త్వికగుణాభ్యాస్యంతో; చిరనిద్ర= నిడుపైన నిద్దురను ; గాఢధైర్యమునన్= దృఢమైన ధీరత్వంతో; రాగద్వేషములు= ఆసక్తి ద్వేషాలను; అప్రమాదమునన్= ఏమరుపాటు లేకుండా ఉండటంతో; భయము= భీతిని; వినివర్తన+అభ్యాసమునన్= తొలగద్రోయటమనే అభ్యాసంతో; మోహంబు భ్రమము= వ్యామోహభ్రాంతులను; హితము= మేలు చేసేది; మితంబున్= పరిమితమైనది; కాలయోజితంబునున్= తగిన కాలంలో స్వీకరించబడేది; అగు= అయిన; భోజనంబునన్= ఆహారంచేత; రోగములు= వ్యాధులను; ఉపద్రవములు= బాధలను; జీవసందర్శనమునన్= క్షేత్రజ్ఞుడనబడే జీవుడిని చూడటంచేత; నిశ్శ్వాసము= ప్రాణచేష్టను; అంత విరసతావేక్షణమునన్= కడపట రసహీనత్వమును చూచుటచే; విషయములు= శబ్దము మొదలైన విషయాలను; నిత్యసంతోషమునన్= సదా సంతోషముగా నుండుటచే; లోభనిరతి= లోభతత్పరతను; కృపన్= కరుణతో; అధర్మము= ధర్మంయొక్క లేమిని; ఉచితకృతావేక్ష= తగిన రీతిలో చేయబడిన సమీక్షణంచేత; కర్మము= కర్మను; అవులన్+త్రోవనేర్చుట= కడకునెట్టటం అభ్యసించటమే; ముక్తికిన్= మోక్షానికి; త్రోవ= మార్గం.

తాత్పర్యం: రాజా! ఓరిమితో కోపాన్నీ, సంకల్పించకుండా ఉండటంతో కామాన్నీ, సత్త్వగుణాభ్యాసంతో నిద్రనూ, దృఢమైన ధైర్యంతో రాగద్వేషాలనూ, జాగరూకతతో భయాన్నీ, జ్ఞానవైరాగ్యాదులతో క్రమంగా తొలగించటం నేర్చుకొనటం ద్వారా మోహభ్రాంతులనూ, హితమూ, మితమూ, తగినకాలంలో గ్రహింపబడేదీ అయిన భోజనంతో రోగాలనూ, ఉపద్రవాలనూ, క్షేత్రజ్ఞస్వరూపుడైన జీవుడిని చూడటంద్వారా ప్రాణచేష్టనూ, కడపట నిస్సారములని గ్రహించటంతో శబ్దాది విషయాలనూ, నిత్యసంతుష్టితో లోభాన్నీ, దయతో అధర్మాన్నీ, తగిన సమీక్షణ విధానంతో కర్మనూ కడకు నెట్టటం నేర్చుకొనటమే ముక్తికి బాట అవుతున్నది.

తే. **తాను గ్రోధాదు లెడలించుఁగాని ముక్తిఁ । దెచ్చి యీ; దొకభంగి ముక్తికిఁ బథంబు**
నగుట ననపాయ మగు నుపాయం బనంగ । వలసె నీ నేర్పు పే రిందువంశవర్య! **371**

ప్రతిపదార్థం: ఇందువంశవర్య!= చంద్రవంశ శ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా!; తాను= ఈ ఉపాయం; క్రోధాదులు= కోపం మొదలైన దుర్గుణాలను; ఎడలించున్+కాని= తొలగిస్తుందికాని; ముక్తిన్= మోక్షాన్ని; తెచ్చి+ఈదు= తీసికొనివచ్చి ఈయదు; ఒక భంగిన్= ఒక విధంగా; ముక్తికిన్= మోక్షానికి; పథంబున్= దారియు; అగుటన్= కావటంవలన; ఈ నేర్పుపేరు= ఈ చాతుర్యం యొక్క నామం; అనపాయము+అగు= అపాయంలేని; ఉపాయము+అనంగన్+వలసెన్= ఉపాయమని చెప్పవలసి వచ్చింది.

తాత్పర్యం: చంద్రవంశశ్రేష్ఠా! పై జెప్పిన ఉపాయం ముక్తికి ఆటంకం కల్గించే కామక్రోధాదులను తొలగిస్తుంది కాని తాను ముక్తిని తెచ్చి సమర్పించదు. ఒక విధంగా అది మోక్షానికి తెరువు కావటం వలననే ఆ నేర్పును అపాయంలేని ఉపాయమని చెప్పటమయింది.

చ. **అనుడు నజాతశత్రుఁ 'డిటు లన్నలు దమ్ములు లోనుగాఁగఁ దృ**
ష్ణ నఖిలబంధుకోటులనుఁ జంపెడు తెం పొలసెన్ మహాత్మ! యే
యనువునఁ దృష్ణ త్రోపువడునట్టి సమంచితచిత్త ధర్మముం
బనుపఱుపంగ జాలు కలభాషణ పంక్తి ననుగ్రహింపవే!' **372**

ప్రతిపదార్థం: అనుడున్= అని భీష్ము డనగా; అజాతశత్రుఁడు= ధర్మజుడు; మహాత్మ!= మహానుభావా!; ఇటులు= ఇట్లా; అన్నలు తమ్ములు లోనుగాఁగన్= అగ్రజులు అనుజులు మొదలైనవారిని; తృష్ణన్= ఆశతో; అఖిలబంధుకోటులనున్= సమస్త బంధుసమూహాలను; చంపెడు= వధించే; తెంపు= సాహసం; ఒలసెన్= సంభవించింది; తృష్ణ= ఆశ; ఏ యనువునన్= ఏ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉపాయంతో; త్రోవువడున్= తొలగిపోవునో; అట్టి= అటువంటి; సమంచిత చిత్త ధర్మమున్= పూజితమైన మనోధర్మాన్ని; పనుపఱుపంగన్+చాలు= అభ్యసింపజేయగా నేర్పునట్టి; కలభాషణపంక్తిన్= మధురమైన మాటలపరంపరను; అనుగ్రహింపవే!= ప్రసాదించుమా!

తాత్పర్యం: భీష్ముడట్లా అనగానే ధర్మరాజు 'ఓ మహాత్మా! ఆశ వలన సోదరులు మొదలైన సమస్త బంధుసమూహాలనూ వధించే సాహసం సంభవించింది. ఈ ఆశ ఎట్లా తొలగిపోతుందో, ఆ మానితమైన మనోధర్మాన్ని అలవడజేసే మధురవచనాలు వినిపించుము'.

క. అనుటయు దేవవ్రతుఁ డ । మ్మనుజపతికి నిట్టు లనియె 'మాండవ్యునితో
జనకుఁడు సెప్పిన మాటలు । విను; మవి తృష్ణ నడఁగించు వెరవు నొనర్చున్. 373

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; దేవవ్రతుఁడు= భీష్ముడు; ఆ+మనుజపతికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్టులు+అనియెన్= ఇలా అన్నాడు; జనకుఁడు= జనక భూపాలుడు; మాండవ్యునితోన్= మాండవ్యుడనే మునితో; చెప్పిన= వచించిన; మాటలు= పలుకులు; వినుము= ఆలకించు; అవి= ఆ మాటలు; తృష్ణన్= ఆశను; అడఁగించు= నశింపజేయు; వెరవున్= ఉపాయమును; ఒనర్చున్= చేయును.

తాత్పర్యం: ధర్మజు డట్లా అనేసరికి భీష్మ డతడితో ఇట్లా అన్నాడు: 'పూర్వం జనకుడు మాండవ్యుడనే మునితో చెప్పిన మాటలు చెప్తుతాను, వినుము. ఆ మాటలు తృష్ణను నశింపజేసే ఉపాయం తెలుపుతాయి.

జనకరాజ మాండవ్య మహామునులసంవాద ప్రకారము (సం. 12-268-3)

వ. జనకుని కడకు మాండవ్యుండు వచ్చి వితృష్ణత్వశిక్షఁ గోరిన న మ్మేదినీశ్వరుం డాదరభరితుండై. 374

ప్రతిపదార్థం: మాండవ్యుండు= మాండవ్యమహాముని; జనకుని కడకున్= జనకనరేంద్రుడి సమీపానికి; వచ్చి= ఏతెంచి; వితృష్ణత్వశిక్షన్= ఆశ లేమిలో శిక్షణను; కోరినన్= అడుగగా; ఆ+మేదినీ+ఈశ్వరుండు= ఆ రాజు; ఆదరభరితుండు+ఐ= ప్రీతితో కూడినవాడై.

తాత్పర్యం: మాండవ్యముని ఒకసారి జనకభూపాలుడి కడకు వచ్చాడు. వచ్చి ఆశ లేకుండా ఉండటానికై తగిన శిక్షణ నిమ్మని అర్థించాడు. అప్పు డా భూపాలకుడు అతడిపట్ల ఆదరం కలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'అర్థముల్ దుఃఖదోషాకరంబులు విను । మేమిటిపై నాశ లేమిఁ జేసి
పొరయవు నను దుఃఖములు మునినాయక! । మిథిల గాలంగ నేమియును నాకుఁ
గాలని య ట్లుండెఁ; గామసుఖంబును । దివ్య సుఖంబునుఁ దృష్ణ విడుచు
సుఖముఁ బోలునె? యర్థసులభత తోడన । గోవుతోఁ బెరిఁగెడు కొమ్ములట్లు
తే. తృష్ణ దానును పెరుఁగుఁ; దదీయ శక్తి । మమత గలుగు మా బంధులు మా ధనములు
మా నివాసంబు లనమి మమత్వ మెదఁ ది । రంబు గాకున్న నింకుఁ దృష్ణాంబురాశి. 375

ప్రతిపదార్థం: మునినాయక!= మునిశ్రేష్ఠా!; వినుము= ఆలకించుము; అర్థముల్= సంపదలు; దుఃఖదోష+ఆకరంబులు= దుఃఖమనే దోషానికి నిలయాలు; ఏమిటిపైన్= దేనిమీదా; ఆశ= తృష్ణ; లేమిన్+చేసి= లేకపోవటంవలన; ననున్= నన్ను; దుఃఖములు=బాధలు; పొరయవు= అంటవు; మిథిల= మిథిలానగరం; కాలంగన్= దహింపబడగా; ఏమియునున్= ఏదీకూడా; నాకున్= నా చిత్తానికి; కాలనిఅట్లు+ఉండెన్= కాలకుండా ఉన్నట్లే ఉన్నది; కామసుఖంబునున్= కామానుభవం వలన కలిగే సుఖమూ; దివ్య సుఖంబునున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దేవలోకసుఖమూ; తృష్ణ విడుచుసుఖమున్= ఆశ విడనాడటం వలన కలిగే సుఖాన్ని; పోలునె?= పోలగలవా?; గోవుతోన్= ఆవుతోగూడ; పెరిఁగెడు= వృద్ధిపొందే; కొమ్ములట్లు= కొమ్ములలాగా; అర్థసులభతతోడనన్+అ= అనాయాసంగా ధనప్రాప్తి కాగానే; తృష్ణ= ఆశ; తానునున్= తానుగూడ; పెరుఁగున్= వృద్ధి పొందుతుంది; తదీయశక్తిన్= ఆశకు సంబంధించిన సామర్థ్యం వలన; మమత= మమకారం; కలుగున్= కలుగుతుంది; కలుగు= సంభవించే; మాబంధులు= మా చుట్టాలు; మా ధనములు= మా సంపదలు; మా నివాసంబులు= మా ఇళ్ళు; అనమిన్= అనకపోవటం వలన; మమత్వము= మమకారం; ఎదన్= హృదయంలో; తిరంబుగాక+ఉన్నన్= స్థిరపడకపోతే; తృష్ణా+అంబురాశి= ఆశ అనే సముద్రం; ఇంకున్= ఎండిపోతుంది.

తాత్పర్యం: మునీశ్వరా! చెప్పుతాను వినుము. సంపదలు దుఃఖనిలయాలు. నాకు దేనిపైనా ఆశలేదు. అందువలననే మిథిలానగరం తగలబడుతున్నా నాకు ఏమీ తగులబడినట్లు లేదు. కామసుఖమూ, దివ్యసుఖమూ ఆశలేమిచేత కలిగే సుఖానికి ఈడు కావు. అర్థం అనాయాసంగా లభించగానే గోవుతో కూడా కొమ్ములు పెరిగినట్లే ఆశ కూడా పెరిగిపోతుంది. ఆశాప్రభావం వలన కలిగే మమకారం పెరిగి పోతుంది. వీరు మా చుట్టాలు, అవి మా సంపదలు, ఇవి మా నెలవులు - అనే మమకారం తొలగితే తృష్ణ అనే సాగరం ఎండిపోతుంది.

విశేషం: అలం: ఉపమ, రూపకం.

క. **దొరకొన్న ననుభవించుచు । దొరకొనమికిఁ జింతనొంది దురపిల్లక ని**
ర్భరుఁడై యున్ననుఁ దృష్ణకుఁ । జొరవచ్చునె యతని మనసు సువ్రతశీలా! **376**

ప్రతిపదార్థం: సువ్రతశీలా!= మంచివ్రతం స్వభావంగా కలవాడా!; దొరకొన్నన్= లభిస్తే; అనుభవించుచున్= అనుభవిస్తూ; దొరకొనమికిన్= లభించనిదానికి; చింతన్+ఒంది= విచారంపొంది; దురపిల్లక= దుఃఖించక; నిర్భరుఁడు+ఐ= పూర్ణచిత్తుడై; ఉన్ననున్= ఉంటే; అతని మనసు= అతడి చిత్తం; తృష్ణకున్= ఆశకు; చొరన్ వచ్చునె?= ప్రవేశించవీలగునా?

తాత్పర్యం: సద్వ్రతమే స్వభావంగా గల ఓ మాండవ్యమునీంద్రా! దొరకినదానిని అనుభవిస్తూ, దొరకనిదానికి చింతపడి దుఃఖించకుండా పరిపూర్ణుడై ఎవడు ఉంటాడో, అతడి మనస్సులోనికి తృష్ణ ప్రవేశించనేరదు.

తే. **విడువరాదు దుర్మతులకు నొడలు ముదియఁ । దాను ముదియదు ప్రాణాంతమైన రోగ**
మనఘ! తృష్ణ వర్జితకాముఁడై నతండు । దానిఁ బోఁద్రోచి సౌఖ్యసాంద్రత్వ మొందు. **377**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; తృష్ణ= ఆశ; దుర్మతులకున్= దుర్బుద్ధులైనవారికి; విడువన్+రాదు= వదలటానికి వీలుకాదు; ఒడలు= శరీరం; ముదియన్= ముదిసిపోగా; తాను= ఆశ; ముదియదు= వృద్ధత్వం పొందదు; (అది) ప్రాణాంతమైన= ప్రాణవినాశకమైనట్టి; రోగము= వ్యాధి; వర్జితకాముఁడు+ఐన+అతండు= కోరికలు వదలినవాడు; దానిన్= ఆ తృష్ణను; పోఁద్రోచి= కడకు నెట్టివైచి; సౌఖ్యసాంద్రత్వము= సుఖాధిక్యమును; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ మునిశ్రేష్ఠా! దుర్మతులైనవారు తృష్ణను విడువలేరు. శరీరం ముసలితనం పొందినా ఆశమాత్రం ముదిమి పొందదు. అది ప్రాణాలు తీసే రోగం. ఎవడు తాను విముఖుడై తృష్ణను పరిహరిస్తాడో, అతడు అత్యధిక సుఖం పొందుతాడు.

క. **శోక ప్రమదాది ద్వం । ద్వాకులుఁ డవుఁ గాక శాంతి నంతఃకరణ**
శ్రీకిఁ బరిరక్ష సేయుము; । నీకు వితృష్ణత్వసౌఖ్యనిత్యత గలుగున్.' **378**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: శోకప్రమద+ఆది ద్వంద్వ+ఆకులుఁడవు= దుఃఖం, సుఖం మొదలైన ద్వంద్వాలచేత వ్యాకులపడినవాడవు; కాక= కాకుండా; శాంతిన్= శమంతో; అంతఃకరణశ్రీకిన్= మనోబుద్ధ్యాదులతో కూడిన అంతఃకరణలక్ష్మికి; పరిరక్ష= కాపుదల; చేయుము= ఒనర్చుము; నీకున్= మాండవ్యుడవగు నీకు; వితృష్ణసౌఖ్యనిత్యత= ఆశ లేమివలన కలిగే సౌఖ్యస్థిరత్వం; కలుగున్= సంభవిస్తుంది.

తాత్పర్యం: మునీంద్రా! నీవు సుఖదుఃఖాది ద్వంద్వాలకు వ్యాకులత చెందవద్దు. నిగ్రహంతో మనోబుద్ధ్యాదులతో కూడిన అంతఃకరణసంపదను కాపాడుకొమ్ము. అట్లా చేస్తే నీకు ఆశలేమివలన నిత్యసుఖం లభిస్తుంది'.

క. అని చెప్పిన నమ్ముని య । మ్మనుజపతిం బ్రస్తుతించి మనము ప్రశాంతిం
బనుపడఁగఁ బ్రీతి వీడ్కొని । చని వర్తిల్లెను వితృష్ణసరణిఁ గుమారా! 379

ప్రతిపదార్థం: కుమారా!= ధర్మరాజా!; అని చెప్పినన్= జనకుడు ఆ రీతిగా చెప్పేసరికి; ఆ+ముని= ఆ మాండవ్యుడు; ఆ+మనుజపతిన్= ఆ రాజును; ప్రస్తుతించి= ప్రశంసించి; మనము= చిత్తం; ప్రశాంతిన్+పనుపడఁగన్= ప్రశాంతిని పొందగా; ప్రీతిన్= సంతోషంతో; వీడ్కొని చని= పోయివస్తానని చెప్పి వదలిపోయి; వితృష్ణ సరణిన్= ఆశారహిత మార్గంలో; వర్తిల్లెను= చరించాడు.

తాత్పర్యం: ధర్మపుత్రా! జనకుడట్లా బోధించే సరికి ఆ మాండవ్యుడు ఆ రాజును ప్రస్తుతించాడు. అతడి చిత్తం శాంతి పొందింది. ఆపై రాజును వీడ్కొని ఆ మాండవ్యమునీంద్రుడు ఆశారహితమైన పథంలో సంచరించాడు.

పితాపుత్రసంవాదము

వ. అనిన విని ధర్మనందనుండు శంతనునందనుతో 'సర్వభూతభయావహంబగుచుం గాలం బతిక్రమించుచుండఁ బురుషుం డెద్ది యాచరించుట మేలు? దీని మున్న నడిగి విన్నవాఁడ; నిది పెద్దయు వినవలయునది గావున నడిగెదం జెప్పవే!' యనుటయు, నమ్మహాత్ముం డీ యర్థంబు దెలియుటకు ముంద రేను జెప్పిన పితాపుత్ర సంవాదం బను నితిహాసంబు లెస్స; యందుఁగొన్ని వాక్యంబు లప్పుడు సెప్పనియవి యునుం గలవు; చెప్పెద విను; మధ్యయనపరుం డగు నొక్క బ్రాహ్మణపుత్రుం డన్వర్థనామధేయుండు మేధావి యనువాఁడు దండ్రి కభిముఖుండై. 380

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ధర్మనందనుండు= ధర్మజుడు; శంతనునందనుతోన్= భీష్ముడితో; సర్వభూతభయావహంబు+అగుచున్= సమస్త ప్రాణులకు భీతికలిగిస్తూ; కాలంబు= సమయం; అతిక్రమించుచుండన్= గడుస్తూ ఉండగా; పురుషుఁడు= జీవుడు; ఎద్ది= ఏది; ఆచరించుట= చేయటం; మేలు= శుభం; దీనిన్= ఈ విషయాన్ని; మున్నున్= ముందుకూడా; అడిగి= ప్రశ్నించి; విన్నవాఁడన్= ఆలకించినవాడను; ఇది= ఈ సంగతి; పెద్దయున్= మిక్కిలిగా; వినన్‌వలయునది= వినదగింది; కావునన్= కాబట్టి; అడిగెదన్= ప్రశ్నిస్తున్నాను; చెప్పవే= వివరింపుమా; అనుటయున్= అనగా; ఆ+మహాత్ముండు= ఆ భీష్ముడు; ఈ అర్థంబు= ఈ విషయం; తెలియుటకున్= గ్రహించటానికి; ముందర= ముందు; ఏను= నేను; చెప్పిన= వచించిన; పితాపుత్రసంవాదంబు+అను= తండ్రికొడుకుల సంవాదమనే; ఇతిహాసంబు= పూర్వగాథ; లెస్స= బాగైనది; అందున్= దానిలో; కొన్ని వాక్యంబులు= కొన్నిమాటలు; అప్పుడు= ఆ కాలమున; చెప్పనియవియునున్= చెప్పనివి కూడ; కలవు= ఉన్నవి; చెప్పెదన్+వినుము= వివరిస్తాను వినుము; అధ్యయనపరుండు= విద్యాభ్యాసంలో ఆసక్తుడైనవాడు; ఒక్క బ్రాహ్మణపుత్రుండు= ఒక విప్రసుతుడు; అన్వర్థనామధేయుండు= సార్థకమైన పేరు గలవాడు; మేధావిఅనువాఁడు= 'మేధావి' అనబడేవాడు; తండ్రికిన్= జనకుడికి; అభిముఖుండు+ఐ= ఎదురుమొగంతో ఉన్నవాడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: భీష్ము డట్లా చెప్పగా విని ధర్మరాజు అతడితో 'సమస్త ప్రాణులకూ భయంకలిగిస్తూ కాలం గడుస్తుండగా పురుషుడు ఏమి చేస్తే శ్రేయస్సు కలుగుతుంది? ఈ విషయం ఇంతకుముందు కూడా విన్నాను. అయినా ఇది మిక్కిలిగా వినదగిన విషయం. అందువలన మళ్ళీ అడుగుతున్నాను చెప్పు'మన్నాడు. అప్పుడు మహనీయుడైన ఆ పితామహుడు ఈ విషయం గ్రహించేముందు నేను పూర్వం చెప్పిన పితాపుత్రసంవాదం అనే ఇతిహాసం చాలా మేలైనది. అందులో కొన్ని మాటలు నేను నీకు అప్పుడు చెప్పనివి కూడా ఉన్నాయి. ఇప్పు డవి చెప్తాను వినుము. విద్యాభ్యాసపరుడైన ఒక విప్రకుమారు డుండేవాడు. వాడు 'మేధావి' అనే సార్థకనామధేయం కలిగి మిక్కిలి తెలివితో ప్రవర్తించేవాడు. వాడు తండ్రి ఎదుట నిలిచి. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'ఆయువు దఱుఁగు నంతంతకు ధీరుఁ డె । య్యది సేయువాఁ?' డన్న నతఁడు 'బ్రహ్మ
చర్యంబు వేదాభ్యసనమును సంతాన । సంపాదనంబు యజ్ఞప్రవర్త
నంబును జేసి వానప్రస్థధర్మంబు । నడపి యాచరితసన్న్యాసుఁ డగుట
కృత్యం' బనుడు 'జరామృత్యువుల్ జననమా । దిగ వెను తగులంగ దిగులు లేమి

తే. మీను వలదన్నుఁ బొదువుట గాన కిష్ట । వృత్తి విహరించుచుండెడు విధమ కాదె!
యెల్లి సేసెద ననక మే లిపుడ చేయు । మనఘ! వార్చునె మృత్యువు జనుల పనుల.' 381

ప్రతిపదార్థం: ధీరుఁడు= ధైర్యం కలవాడు; ఆయువు= జీవితకాలం; తఱుఁగున్+అంతంతకున్= ఆరోజు కారోజు తరిగిపోతూ ఉండగా; ఏ+అది= ఏమి; చేయువాఁడు+అన్నన్= చేయాలి అని అడుగగా; అతఁడు= అతడి తండ్రి; బ్రహ్మచర్యంబున్= బ్రహ్మచారియొక్క ధర్మమును; వేద+అభ్యసనమునున్= వేదాలను చదవటం; సంతానసంపాదనంబున్= సంతతిని పొందటం; యజ్ఞప్రవర్తనంబునున్= యజ్ఞాచరణం; చేసి= అనుష్ఠించి; వానప్రస్థధర్మంబున్= వానప్రస్థుడియొక్క ధర్మాన్నీ; నడపి= నిర్వహించి; ఆచరితసన్న్యాసుఁడు+అగుట= అనుష్ఠింపబడిన సన్న్యాసం కలవాడు కావటం; కృత్యంబు= చేయదగినపని; అనుడున్= అనగా; జననము+ఆదిగన్= పుట్టింది మొదలుగా; జరామృత్యువుల్= ముసలితనం; మరణం; వెనుతగులంగన్= వెంబడించగా; దిగులు లేమి= విచారం లేకుండా ఉండటం; మీను= చేప; వల= జాలము; తన్నున్= తనను; పొదువుటన్= ఆక్రమించటం; కానక= చూడక; ఇష్టవృత్తిన్= ఇచ్చవచ్చిన చొప్పున; విహరించుచుండెడు= తిరుగుతుండే; విధమకాదె!= పద్ధతేకదా!; మేలు= మంచిపని; ఎల్లి= రేపు; చేసెదను+అనక= చేస్తాను అనకుండా; ఇపుడు+అ= ఇప్పుడే; చేయుము= అనుష్ఠించుము; అనఘ!= పాపరహితుడా!; మృత్యువు= చావు; జనుల= ప్రజలయొక్క; పనులన్= కార్యాలను; వార్చునె?= ప్రతీక్షించునా?

తాత్పర్యం: 'ధీరుడైన మనుజుడు నిత్యమూ ఆయుస్సు తరిగిపోతూ పోతూ ఉండగా ఏమి చేయాలి?' అని ప్రశ్నించాడు. తండ్రి అతడితో 'బ్రహ్మచర్యం, వేదాధ్యయనం, సంతానం పొందటం, యజ్ఞనిర్వహణం చేసి ఆపై వానప్రస్థధర్మం నిర్వర్తించి సన్న్యాసవృత్తిని అవలంబించటం చేయదగినపని' అని చెప్పాడు. అప్పుడు కుమారుడు 'పాపరహితుడవైన ఓ తండ్రీ! పుట్టినది మొదలు ముదిమి, మరణం వెంటబడతాయి. అప్పుడు విచారం లేకుండా ఉండటం; వల తన్ను ఆక్రమించినపుడు దానిని చూడకుండా చేప ఇచ్చవచ్చినట్లు విహరించినట్లే కదా! అందువలన చేయాలనుకొన్న సత్కార్యం రేపటికి వాయిదా వేయకుండా ఇప్పుడే పూర్తిచేయుము. ప్రజల పనులు పూర్తి అయ్యేంతవరకు మృత్యువు తన పని చేయకుండా ఎదురుచూస్తూ ఉంటుందా?'

విశేషం: అలం: ఉపమ.

వ. అని పలికి పుత్రుండు వెండియు. **382**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; పుత్రుండు= కుమారుడు; వెండియున్= మరల.

తాత్పర్యం: అట్లా చెప్పి ఆ విప్రకుమారుడు మరల. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ‘కృత మిది యకృతం బిది యిది । కృతాకృతంబనుచు నరుఁడు కింకర్తవ్య
త్వతిరోహితాత్మహిత సం । స్మృతియైనఁ గృతాంతుఁ డతనిఁ జేర్చుఁ దనపురిన్. 383

ప్రతిపదార్థం: ఇది= ఇది; కృతము= చేయబడింది; ఇది= ఇది; అకృతంబు= చేయబడనిది; ఇది; కృత+అకృతంబు= చేసీ చేయనిది (అసంపూర్ణంగా చేయబడింది); అనుచున్= అని భావిస్తూ; నరుఁడు= మనుజుడు; కింకర్తవ్యతిరోహితాత్మహితసంస్మృతి= ఏమి చేయాలి అనే సందేహంతో కప్పబడిన ఆత్మహితముయొక్క స్మరణకలవాడు; ఐనన్= ఐతే; కృత+అంతుఁడు= యముడు; అతనిన్= అట్టివాడిని; తన పురిన్= తన నగరాన్ని; చేర్చున్= పొందిస్తాడు.

తాత్పర్యం: ఏ మనుజుడు ఇది చేశాను, ఇది చేయలేదు, ఇది చేసీ చేయకుండా ఉన్నాను అని తలంచుకొంటూ ఏమి చేయాలో తోచనిస్థితిలో పడి ఆత్మహితం మరచి ఉంటాడో అట్టివాడిని యముడు తన నగరానికి తీసికొనిపోతాడు.

క. అనఘా! మృత్యువు నమృతం । బును దేహమునంద కలవు; మోహము మృత్యు
త్వనిరూఢ మున్నరూపుం । గనుటమృతత్వోపహితము గాఁగ నెఱుఁగుమీ. 384

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; మృత్యువు= మరణం; అమృతంబునున్= మరణరాహిత్యస్థితీ; దేహమునందు+అ= శరీరమునందే; కలవు= ఉన్నాయి; మోహము= సంసారం మీది వ్యామోహం; మృత్యుత్వ నిరూఢము= మరణ ధర్మంచేత ప్రసిద్ధమైనది; ఉన్న రూపున్= యథార్థమైన తత్త్వమును; కనుట= చూడటం; అమృతత్వోపహితముకాఁగన్= అమృతత్వంతో కూడిందిగా; ఎఱుఁగుమీ!= తెలిసికొనుమా!

తాత్పర్యం: పాపరహితుడ వగు ఓ జనకా! ఈ శరీరంలోనే మృత్యువు, అమృతత్వం అనేవి రెండూ ఉన్నాయి. సంసార వ్యామోహమే మృత్యువు. తత్త్వజ్ఞానమే అమృతత్వం. ఈ విషయం చక్కగా గ్రహించుము.

క. ననుబోఁటికిఁ బశుయజ్ఞం । బున హింసకుఁ డగుట దగునె భూసురవర! హిం
సనరహితమైన శాంతి య । జనమున బ్రహ్మాధ్వరంబు సలిపెద నియతిన్. 385

ప్రతిపదార్థం: భూసురవర!= విప్రశ్రేష్ఠా!; ననుబోఁటికిన్= నావంటి వాడికి; పశుయజ్ఞంబునన్= పశువులను వధించి చేసే యజ్ఞంతో; హింసకుఁడు+అగుట= హింసించేవాడు కావటం; తగునె?= ఉచితమా?; హింసన రహితము+ఐన= హింసలేని; శాంతియజనమునన్= శాంతియజ్ఞంతో; నియతిన్= నియమపూర్వకంగా; బ్రహ్మాధ్వరంబు= బ్రహ్మయజ్ఞమును; సలిపెదన్= చేస్తాను.

తాత్పర్యం: విప్రవర్యా! నా వంటివాడికి పశువులను చంపి చేసే ద్రవ్యయజ్ఞం తగదు. హింసా సంబంధంలేని శాంతియజ్ఞంతో నేను నియమంగా బ్రహ్మయజ్ఞం చేస్తాను.

విశేషం: యజ్ఞాలు అనేక విధాలుగా ఉన్నాయి. వేదంలోని కర్మకాండలో పశువధతో కూడిన అనేకయజ్ఞాలు నిరూపించబడి ఉన్నాయి. అయితే అవి అంత ప్రశస్తమైనవి కావు. గీతలో శ్రీకృష్ణుడు “శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః” అని చెప్పాడు. అంటే ద్రవ్యమయమైన యజ్ఞం కంటె జ్ఞానయజ్ఞం శ్రేయస్కరమని అర్థం. అందువలన మోక్షార్థులు జ్ఞానయజ్ఞం అనుష్ఠిస్తారే కాని ద్రవ్యయజ్ఞాలు చేయరు. ఇక్కడ మేధావి జ్ఞానయజ్ఞ మనబడే బ్రహ్మయజ్ఞమే ప్రశస్తమని వివరించాడు. సర్వేంద్రియ నిగ్రహంతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కూడిందే తపోమయమూ, యోగమయమూ అయిన శాంతియజ్ఞం. అందువలన జ్ఞానప్రాప్తి కల్గుతుంది. ఆ విధానాన్నే బ్రహ్మయజ్ఞమని వ్యవహరిస్తారు. గీతలో ఈ యజ్ఞాల స్వరూపం విపులంగా నిరూపించబడి ఉన్నది. ఆధునిక కాలంలో కర్మకాండలో చెప్పినట్లు ద్రవ్యయజ్ఞాలు చేసేవారు అరుదైపోయారు. ఇప్పుడు కూడా జ్ఞానయజ్ఞం ప్రశస్తమై ఉన్నది.

క. యోగంబుఁ దపంబుఁ బరి । త్యాగంబును గాక యొండు లగునె హితంబుల్?
రాగము సరి దుఃఖంబును । ద్యాగముఁ బోలెడి సుఖంబు నరయం గలవే? 386

ప్రతిపదార్థం: యోగంబున్= యోగానుష్ఠానము; తపంబున్= తపస్సు; పరిత్యాగంబునున్= సంగం త్యజించటమూ; కాక= ఇవికాక; ఒండులు= ఇతర మార్గాలు; హితంబుల్= శ్రేయస్కరాలు; అగునె?= అవుతాయా?; రాగముసరి= విషయాసక్తితో సమానమైన; దుఃఖంబునున్= బాధయు; త్యాగమున్+పోలెడి= విషయాసక్తిని వదలటంతో సమానమైన; సుఖంబున్= ప్రమోదమును; అరయన్= పరిశీలించగా; కలవే?= ఉన్నవా?

తాత్పర్యం: యోగాన్ని అనుష్ఠించటం, తపస్సు చేయటం, విషయాసక్తిని త్యజించటం - అనేవి హితకరమైన మార్గాలు. వీటితో సమానమైన శ్రేయోమార్గాలు మరి లేవు. అట్లాగే విషయాసక్తితో సదృశమైన దుఃఖం మరొకటి లేదు. త్యాగాన్ని పోలిన సుఖం కూడా లేదు.

క. ప్రజ యేన కాన నన్నుం । బ్రజ సుగతికిఁ బుచ్చునని భరంపడి కోరం
బ్రజ విడిచెద నా యందది । యజేయమును నవ్యయంబు నగు పద మిచ్చున్. 387

ప్రతిపదార్థం: ఏను+అ= నేనే; ప్రజ= జనించిన సంతానమై ఉన్నాను; కానన్= అందుచేత; నన్నున్= నన్ను; ప్రజ= సంతతి; సుగతికిన్= సద్గతికి; పుచ్చున్+అని= పంపుతుందని; భరంపడి= అతిశయించి; కోరన్= అభిలషించను; ప్రజన్= సంతతిని; విడిచెదన్= వదలివేస్తాను; అది= ఆ త్యాగం; నాయందున్= నాలో; అజేయమునున్= జయించరానిదీ; అవ్యయంబున్= వ్యయం కానిదీ; అగుపదమున్= అయినస్థానాన్ని; ఇచ్చున్= ఇస్తుంది.

తాత్పర్యం: తండ్రీ! నేను నీకు సంతతినై ఉన్నాను. నాకు కలిగిన మరొక సంతతి నా సుగతికి హేతువవుతుందని నేను భావించటం లేదు. అందువలన నేను సంతతికొఱకై అభిలషించను. సంతతిని వదలివేస్తాను. (గృహస్థధర్మం స్వీకరించను అని భావం). ఆ త్యాగం నాకు జయించరాని, తరుగులేని మహోన్నతస్థితికి హేతువవుతుంది.

ఉ. కావున లోకసంక్షయము గన్గొని యెల్లెడ నిర్మముండ వై
నీవును శాంతియున్ సమత నిష్ఠయుఁ బూని గుహాప్రవేశ సం
భావన నాత్మదర్శన విభాసివి గమ్మనినం దదీయ వి
ద్యావచనంబులం జనకుఁ డట్టిఁడ యై వెలిఁగెం గృతార్థతన్. 388

ప్రతిపదార్థం: కావునన్= అందుచేత; నీవును= నీవుకూడ; లోకసంక్షయమున్= లోకంయొక్క వినాశాన్ని; కన్గొని= చూచి; ఎల్ల+ఎడన్= అన్ని విషయాలలోనూ; నిర్మముండవు+ఐ= మమకారం లేనివాడవై; శాంతియున్= శమము; సమత= సమభావం; నిష్ఠయున్= ఆత్మనిష్ఠ కూడా; పూని= వహించి; గుహాప్రవేశసంభావనన్= బుద్ధిగుహలో చొరబారుట అనే సంభావనచే (ఏకాంతమైన కొండగుహలో ప్రవేశించటం అనియు చెప్పవచ్చును.); ఆత్మదర్శన విభాసివి= ఆత్మను చూడటంచేత ప్రకాశించేవాడివి; కమ్ము= అగుము; అనినన్= అని చెప్పగా; తదీయ విద్యావచనంబులన్= అతడి బ్రహ్మవిద్యామయాలైన మాటలచేత; జనకుఁడు= తండ్రి; అట్టిఁడ+ఐ= అట్లాంటివాడుగానే రూపొంది; కృతార్థతన్= కృతకృత్యతతో; వెలిఁగెన్= ప్రకాశించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అందువలన లోకం శాశ్వతం కాదని గ్రహించి నీవు దేనిమీదా మమకారం పెట్టుకొనవద్దు. శాంతి, సమభావం, ఆత్మనిష్ఠ కలిగి ఉండుము. నీ బుద్ధిగుహలోనికి ప్రవేశించి అందు నిగూఢంగా ఉన్న ఆత్మను చూడుము. (ఏకాంతమైన కొండగుహలో జేరి ఆత్మ దర్శనపరుడివి కమ్ము)' అని కుమారుడు తండ్రికి బోధించాడు. అతడు చెప్పిన బ్రహ్మవిద్యా ప్రబోధకాలైన మాటలు విని తండ్రి ఆ రీతిగా అనుష్ఠించి కృతార్థుడై వెలుగొందాడు.

క. నరనాథ! యమృతమగు ను । న్నరూపు గను దీవు మరగు నా చెప్పిన యి
ప్పరమేతిహాస వాక్యో । త్కరంబు నర్థంబు చిత్తగత మగుచుండన్. 389

ప్రతిపదార్థం: నరనాథ!= రాజా!; నా చెప్పిన= నేను వచించిన; ఈ+పరమ+ఇతిహాస వాక్య+ఉత్కరంబు= ఈ శ్రేష్ఠమైన పూర్వగాథకు చెందిన వచనసమూహంయొక్క; అర్థంబు= శబ్దార్థం; చిత్తగతము= మనసుకెక్కింది; అగుచుండన్= అవుతూ ఉండగా; ఈవు= నీవు; అమృతము+అగు= మరణరహితమైన; ఉన్నరూపు= యథార్థతత్త్వమును; కనుదు= చూస్తావు; మరగు= దానిని ఆశించుము.

తాత్పర్యం: రాజా! నే నిప్పుడు చెప్పిన గాథకు చెందిన వాక్యాల అర్థం నీ మనస్సున కెక్కగా నీవు కూడా అమృతమైన ఆ పరతత్త్వస్వరూపాన్ని చూడగలవు. అభ్యాసంతో దాని నాశించుము'.

వ. అనిన విని యుధిష్ఠిరుం 'డెవ్విధంబు శీలంబు గలవాఁడు బ్రహ్మపదంబు నొందు?' నని యడిగిన భీష్ముం డత్యాదరంబున. 390

ప్రతిపదార్థం: అనినన్= భీష్ము డట్లా చెప్పగా; విని= ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; ఏ+విధంబు= ఎట్టిదైన; శీలంబు గలవాఁడు= స్వభావం కలవాడు; బ్రహ్మపదంబున్= మోక్షస్థానమును; ఒందున్?= పొందుతాడు?; అని అడిగినన్= అని ప్రశ్నించగా; భీష్ముండు= భీష్ముడు; అతి+ఆదరంబునన్= మిక్కిలి ప్రీతితో.

తాత్పర్యం: భీష్ము డారీతిగా చెప్పగా విని ధర్మరాజు 'ఏ విధమైన స్వభావం కలవాడు మోక్షం పొందగలడో వివరించు' మని మళ్ళీ ప్రశ్నించాడు. భీష్ముడు అతడిపట్ల మిక్కిలి ప్రీతిగలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. 'అధిప! లఘ్వాశియై యింద్రియప్రపంచ । జయము గలిగి మోక్షార్థోక్త సారధర్మ
నిరతి నుండెడి వానికిఁ బరమ మగు ప । దంబు తంగేటిజున్ను చందంబు నొందు.' 391

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; లఘు+ఆశి+ఐ= మితంగా భుజించేవాడై; ఇంద్రియప్రపంచజయము= శ్రోత్రం మొదలైన ఇంద్రియ సమూహంపై విజయాన్ని; కలిగి= కలిగి ఉండి; మోక్ష+అర్థ+ఉక్త సారధర్మనిరతిన్= మోక్షం కొరకై చెప్పబడిన శ్రేష్ఠధర్మాలపై ఆసక్తితో; ఉండెడివానికిన్= ఉండేవాడికి; పరమము+అగు= శ్రేష్ఠమైన; పదంబు= బ్రహ్మపదం; తంగేటిజున్ను చందంబున్= తంగేడుచెట్టు లోని తేనెతెట్టెవలె అందుబాటులో ఉండే విధాన్ని; ఒందున్= పొందును.

తాత్పర్యం: 'రాజా! మితాహారం స్వీకరిస్తూ ఇంద్రియానీకాన్ని జయించి మోక్షం కొరకై శాస్త్రాలలో చెప్పబడిన ఉత్తమ ధర్మాలను అనుష్ఠించేవాడికి బ్రహ్మపదం తంగేటిజున్నువలె సులభసాధ్యమై ఉంటుంది'.

విశేషం: తంగేడుచెట్టు మిక్కిలి ఎత్తుగా పెరగదు. దానిలోని తేనెతెట్టెను సులభంగా ఎవ్వరైనా గ్రహించి అనుభవించవచ్చును. అలంకారం ఉపమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి మఱియు నిట్లను 'హారీతగీతి యను వాక్యసంచయం బాకర్ణింపుము. దాన మోక్ష ధర్మంబులు దేటపడుం జెప్పెద హారీతుం డను మునివరుండు విద్వజ్జనంబులు దనవలనం బ్రవ్రజనంబు సమీచీన ప్రకారంబుగా నెఱుంగ నపేక్షించిన. 392

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; మఱియున్= మరలకూడ; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు!; 'హారీతగీతి' యను= 'హారీతగీత యనబడే; వాక్యసంచయంబున్= వచనసమూహమును; ఆకర్ణింపుము= విను; దానన్= దానివలన; మోక్షధర్మంబులు= ముక్తిపొందుటకనువైన ధర్మాలు; తేటపడున్= స్పష్టమవుతాయి; చెప్పెదన్= చెపుతాను; హారీతుండను మునివరుండు= 'హారీతు' డనే మునిశ్రేష్ఠుడు; విద్వజ్జనంబులు= పండితజనులు; తనవలనన్= తననుండి; ప్రవ్రజనంబు= సన్న్యాస పద్ధతిని; సమీచీన ప్రకారంబుగాన్= చక్కని రీతిలో; ఎఱుంగన్= తెలుసుకొనటానికి; అపేక్షించినన్= కోరగా.

తాత్పర్యం: భీష్ముడు ధర్మజుడితో అట్లా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు. 'హారీతగీత' అనబడే కొన్ని మాటలున్నాయి. అవి వినుము. వాటిద్వారా మోక్షధర్మాలు స్పష్టమయ్యేటట్లు చెప్పుతాను. పూర్వం హారీతుడనే ఒక మునిశ్రేష్ఠుడి నుండి పండితులు సన్న్యాసవిధానం చక్కగా తెలిసికొనాలని అపేక్షించారు. అట్లా వారు అపేక్షించగా. (తరువాతి పద్యంతో అన్వయం).

హారీతుండు విద్వజ్జనుల కుపదేశించిన తత్త్వప్రకారము (సం. 12-269-2)

సీ. వారి కి ట్లనియె 'నిష్ఠారంభమతి నిలు । వెడలి కోర్కుల కెల్ల విముఖుఁ డగుచు
జనములకీడు వాక్చక్షుర్మనోవర్త । నములఁ గూర్పక మైత్రి సమతఁ గరుణ
గలిగి, నిందాప్రశంసల ఖేదమును నుబ్బు । లేక పాడింటను నేకతంపు
గుడి మ్రాని పొంతను గుహలోన నుండుచు । దంపకములకు వంటకములకును

తే. భోజనములకుఁ దఱియైన ప్రొద్దు గడపి । భిక్ష గొనుఁ బ్రీతి మన్నన పెద్దవెట్టు
నట్టియెడఁ దక్కి క్రొత్తగా నరుగు యతి ని । రంతరంబు నాత్మారాముఁ డై చరించు. 393

ప్రతిపదార్థం: వారికిన్= ఆ పండిత జనులకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; యతి= సన్న్యాసి; నిష్ఠా+ఆరంభమతిన్= ఆత్మనిష్ఠాప్రయత్నం గల బుద్ధితో; ఇలు వెడలి= గృహంనుండి వెలికివచ్చి; కోర్కులకున్+ఎల్లన్= సమస్తములైన కోరికలకూ; విముఖుఁడు+అగుచున్= పరాఙ్ముఖుడవుతూ; జనముల= ప్రజలయొక్క; కీడున్= అపకారమును; వాక్చక్షుర్మనోవర్తనములన్= మాటలు, చూపులు, మనస్సు వీటినడతలలో; కూర్పక= సంధించక; మైత్రి= మిత్రభావం; సమత= సమభావం; కరుణ= దయ; కలిగి= కలిగి ఉండి; నిందాప్రశంసలన్= తెగడిక - పొగడికలలో; ఖేదమును= దుఃఖాన్నీ; ఉబ్బున్= పొంగటమూ; లేక= లేనివాడై; పాడింటనున్= పాడుపడిన ఇంటిలో; ఏకతంపుగుడిన్= ఏకాంతమైన ఆలయంలో; మ్రానిపొంతను= చెట్టుచెంతను; గుహలోనన్= కొండబిలంలో; ఉండుచున్= ఉంటూ; దంపకములకున్= దంచటానికీ; వంటకములకున్= వండటానికీ; భోజనములకున్= భుజించటానికీ; తఱిఐన ప్రొద్దు= అనువైన కాలం; కడపి= దాటనిచ్చి; భిక్షన్+కొనున్= భిక్షగ్రహిస్తాడు; ప్రీతిన్= ప్రియంతో; మన్ననన్= గారవంతో; పెద్దపెట్టునట్టి ఎడన్= అధికంగా భిక్షపెట్టే చోటును; తక్కి= వర్జించి; క్రొత్తగాన్= నూతనంగా; అరుగున్= పోతాడు; నిరంతరంబున్= ఎల్లవేళల; ఆత్మారాముఁడు+ఐ= తనలో తాను క్రీడించేవాడై; చరించున్= తిరుగుతాడు.

తాత్పర్యం: హారీతుడు పండితులతో ఇట్లా అన్నాడు: 'ఆత్మనిష్ఠలో ఉద్యుక్తమైన బుద్ధిగలవాడై సన్న్యాసి ఇల్లు వదలాలి. కోర్కెలు కలిగి ఉండకూడదు. తన మాటలలో, చూపులలో, చిత్తంలో ప్రజలకు ఏ విధమైన కీడూ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తలపెట్టరాదు. మిత్రత్వం, సమత్వం, దయ కలిగి ఉండాలి. స్తుతినిందలకు పొంగటం, క్రుంగటం లేకుండా ఉండాలి. పాడుపడిన ఇంటిలోనో, ఏకాంతమైన చోట గుడిలోనో, చెట్టునీడనో, లేక కొండగుహలోనో ఉండాలి. దంచటం, వండటం, భోజనం పనులు పూర్తి అయేసమయంవరకూ వేచిఉండి భిక్షకు పోవాలి. తనపై ఎక్కువ ప్రీతి, గౌరవం చూపుతూ మితిమించి భిక్షపెట్టే వారున్నచోటు వదలి క్రొత్తచోటికి వెళ్ళాలి. సదా ఆత్మయందే రతి గలిగి చరించాలి.

తే. **అనిన వారు కృతార్థులై యతనిఁ బ్రస్తు । తించి రని చెప్పె విని నరదేవవరుఁడు**

దేవతటినీ తనూజుతో 'భావశుద్ధి । కలిమి యొప్పుఁగదే!' యని పలికి మఱియు. **394**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; వారు= ఆ పండితులు; కృతార్థులు+ఐ= ధన్యులై; అతనిన్= ఆ హారీతుడిని; ప్రస్తుతించిరి+అని= పొగిడారని; చెప్పెన్= చెప్పాడు; విని= ఆలకించి; నరదేవవరుఁడు= రాజశ్రేష్ఠుడైన ధర్మపుత్రుడు; దేవతటినీ తనూజుతోన్= గంగాపుత్రుడితో; భావశుద్ధి కలిమి= చిత్తశుద్ధి కలిగి ఉండటం; ఒప్పున్+కదే అని= శోభిస్తుంది కదా అని; పలికి= చెప్పి; మఱియున్= ఇంకనూ.

తాత్పర్యం: ఇట్లా హారీతముని చెప్పేసరికి ఆ విద్వజ్జనులు కృతకృత్యులై అతడిని పొగిడారు' అని భీష్ముడు చెప్పాడు. అది విని ధర్మరాజు భీష్ముడితో 'ఔరా! భావశుద్ధి కలిగి ఉండటం ఎంత శోభావహమైనది?' అని పలికి మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **రాజభావంబు తొడుసునఁ గ్రచ్చుకొన్న । మనసుతో నుండ కెన్నఁడో మరలి యింద్రి**

యముల నిర్జించి సత్త్వాదు లవులఁ ద్రోచి । యేను శాంతిసుఖంబున కెలయు టనఘ!' **395**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఏను= నేను; రాజభావంబు తొడుసునన్= రాజత్వంయొక్క సంబంధంచేత; క్రచ్చుకొన్న= చుట్టుకొని ఉన్న; మనసుతోన్= చిత్తంతో; ఉండక= వర్తించక; మరలి= ఈ స్థితినుండి తొలగి; ఇంద్రియములన్= శ్రోత్రం మొదలైన ఇంద్రియాలను; నిర్జించి= జయించి; సత్త్వాదులు= సత్త్వంమొదలైన త్రిగుణాలను; అవులన్+త్రోచి= కడకునెట్టి; శాంతిసుఖంబునకున్= శాంతిచేత కలిగే ఆత్మసుఖానికి; ఎలయుట= చేరటం; ఎన్నఁడో!= ఎప్పుడో కదా!

తాత్పర్యం: కిల్బిషరహితుడవైన ఓ పితామహా! నేను రాజత్వం అనే సంబంధంతో చుట్టుకొన్న చిత్తాన్ని వదలి ఇంద్రియాలను జయించి సత్త్వం, రజస్సు, తమస్సు అనే త్రిగుణాలను దాటి శాంతివలన కలిగే ఆత్మసుఖాన్ని చూరగొనేది ఏనాటికో కదా!'

చ. **అనుటయు నాతఁ డిట్టు లను నక్కురుభర్తకు 'వేగ మేటికిన్**

ఘనభుజ? యెల్లచందములుఁ గాలముతోడివ చుమ్ము; వర్ణధ

ర్మనిరతి చిత్తపాకము గ్రమంబునఁ దెచ్చుఁ గషాయపక్వతన్

బనుపడ కర్వుఁ డేలగు నృపాలకుమారుఁడు సన్న్యసింపఁగన్? **396**

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; ఆతఁడు= ఆ భీష్ముడు; ఆ+కురుభర్తకున్= కౌరవనాథుడైన ఆ ధర్మరాజుకు; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; ఘనభుజ!= మహాబాహూ!; వేగము= త్వర; ఏటికిన్?= ఎందుకు?; ఎల్లచందములు=అన్ని ప్రకారాలు; కాలముతోడివి+అ+చుమ్ము!= కాలానుసారాలే సుమా!; వర్ణధర్మనిరతి= బ్రాహ్మణాదివర్ణాలయొక్కధర్మాలలోదృఢమైనఆసక్తి;క్రమంబునన్=క్రమంగా;చిత్తపాకమున్=మనఃపరిపాకాన్ని;తెచ్చున్=తీసికొనివస్తుంది;నృపాలకుమారుఁడు=రాకుమారుడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కషాయపక్వతన్= చిత్తదోషాన్ని శమింపజేయటాన్ని; పనుపడక= వాడుక పడకుండా; సన్న్యసింపఁగన్= సన్న్యాసధర్మాన్ని స్వీకరించటానికి; అర్హుఁడు= తగినవాడు; ఏల+అగున్?= ఎట్లా ఔతాడు?

తాత్పర్యం: ధర్మసుతుడు అట్లా అనేసరికి భీష్ముడు అతడితో ఇట్లా అన్నాడు: 'మహాబాహుడవైన ఓ ధర్మరాజా! అన్ని విధానాలూ కాలానుగుణంగానే ఉంటాయి సుమా! వర్ణాలకు చెందిన ధర్మాలపై ఆసక్తి క్రమంగా మనస్సుకు పరిపక్వత తెస్తుంది. రాజపుత్రుడైనవాడు చిత్తదోషాన్ని శమింపజేయకుండా సన్న్యసించటానికి ఎట్లా అర్హుడు ఔతాడు?'

విశేషం: **'కషాయం చిత్తదోషం పాచయిత్వా విశ్లథం కృత్వా'** అని నీలకంఠ వ్యాఖ్య - కషాయ శబ్దానికి చిత్తదోషమని భావం.

వ. **ఇవ్విషయంబున వృత్రగీత యను నితిహాసంబు గలదు వినుము. వృత్రుండు భండనంబునం బడిన నెత్తికొనిపోయి పెట్టుకొని యున్న యెడ నయ్యవస్థ నొందియు విషాదంబు లేకయున్న యద్దనుజవిభునితో శుక్రుండు 'వైరిహృతవిభవుండవైన నీకు మనోవ్యథ లేమికిఁ గతంబేమి?' యని యడిగిన నతం డతని కిట్లనియె.** **397**

ప్రతిపదార్థం: ఈ+విషయంబునన్= ఈ విషయంలో; వృత్రగీత అను= 'వృత్రగీత' అనే; ఇతిహాసంబు= పూర్వగాథ; కలదు= ఉన్నది; వినుము= ఆలకించుము; వృత్రుండు= వృత్రాసురుడు; భండనంబునన్= యుద్ధంలో; పడినన్= పడగా; ఎత్తికొనిపోయి= లేవనెత్తికొని వెళ్ళి; పెట్టుకొని ఉన్న ఎడన్= ఉంచుకొని ఉండగా; ఆ+అవస్థన్= ఆ స్థితిని; ఒందియున్= పొందికూడా; విషాదము లేక ఉన్న= దుఃఖము లేకున్న; ఆ+దనుజవిభునితోన్= ఆ రాక్షస ప్రభువుతో; శుక్రుండు= శుక్రాచార్యుడు; వైరిహృతవిభవుండవు+ఐన= శత్రువులచేత అపహరించబడిన సంపదకలవాడవగు; నీకున్= వృత్రుడవైన నీకు; మనోవ్యథ= చిత్తబాధ; లేమికిన్= లేకుండుటకు; కతంబు+ఏమి?= కారణమేమి?; అని అడిగినన్= అని ప్రశ్నించగా; అతండు= ఆ వృత్రుడు; అతనికిన్= ఆ శుక్రుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విషయానికి సంబంధించినది 'వృత్రగీత' అనే ఇతిహాసం ఒకటి ఉన్నది. వినుము. వృత్రాసురుడు యుద్ధంలో పడిపోగా అనుచరులు అతడిని లేవనెత్తుకొనిపోయి పెట్టుకొని ఉన్నారు. అట్టి దురవస్థ పొంది కూడా వృత్రుడు ఏ విధమైన విషాదం లేకుండా ఉన్నాడు. అప్పుడు గురువైన శుక్రుడు ఆ రాక్షసరాజుతో 'శత్రువులు నీ సంపదను హరించినా నీకు చిత్తబాధ లేకుండా ఉండటానికి కారణమేమి?' అని ప్రశ్నించాడు. అప్పుడు అతడితో వృత్రాసురుడు ఈ రీతిగా చెప్పాడు.

వృత్రగీత (సం. 12-270-13)

తే. **కలిమియును లేమియును విను కాలవశగ । తములు; బోధవిహీనుల దర్ప దైన్య**
కలితసుఖదుఃఖములఁ బెట్టుఁగాక యర్థ । ముల యనిత్యత యెఱిఁగినఁ గలదె వికృతి? **398**

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; కలిమియును= సంపదయు; లేమియును= పేదరికమును; కాలవశగతములు= కాలానికి అధీనాలు; (అవి), బోధవిహీనులన్= జ్ఞానం లేనివారిని; దర్పదైన్యకలిత సుఖదుఃఖములన్= గర్వం, దీనత్వంతో కూడిన సుఖంలోనూ, దుఃఖంలోనూ; పెట్టుఁగాక= ఉంచును గాక; అర్థముల= సంపదలయొక్క; అనిత్యత= అశాశ్వతత్వం; ఎఱిఁగినన్= తెలుసుకొంటే; వికృతి= వికారం; కలదు+ఏ?= ఉన్నదా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సంపద, పేదరికం అనేవి కాలానికి అధీనమై ఉంటాయి. అవి జ్ఞానంలేని మూఢులకు మదాన్నీ, దీనత్వాన్నీ కల్గిస్తాయి. తద్ద్వారా వారి సుఖానికీ, దుఃఖానికీ హేతువు లవుతాయి. అంతేకాని సంపదలు శాశ్వతం కావు అని తెలిసికొన్న జ్ఞానికి అవి ఉన్నా, లేకున్నా ఎట్లాంటి వికారమూ కలుగదు.

వ. అర్థంబుల యస్థిరత్వంబ కా దాకర్ణింపుము. 399

ప్రతిపదార్థం: అర్థంబుల= సంపదలయొక్క; అస్థిరత్వంబ కాదు= అశాశ్వతమే కాదు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: సంపదలయొక్క అశాశ్వత్వమే కాదు. ఇంకా వినుము.

క. దైవతమానుష తిర్య । గ్భావంబులఁ బొందుచును వికారిణియై భూ
తావలి దిరిగిన వెంటన । వే విధములఁ దిరుగుఁ గర్మవివశత్వమునన్. 400

ప్రతిపదార్థం: భూత+ఆవలి= ప్రాణులయొక్క సమూహం; దైవతమానుషతిర్యగ్భావంబులన్= దేవత్వం, మనుష్యత్వం, పశుత్వం అనే భావాలను; పొందుచును= పొందుతూ; కర్మవివశత్వమునన్= కర్మకు అధీనం కావటం వలన; వికారిణి+ఐ= వికారం కలదై; తిరిగిన వెంటన్+అ= పోయిన మార్గంలోనే; వేవిధములన్= వెయ్యి విధాలుగా; తిరుగున్= సంచరిస్తుంది.

తాత్పర్యం: ప్రాణుల బృందం దేవతలుగా, మనుష్యులుగా, పశుపక్ష్యాదులుగా జన్మిస్తూ కర్మకు లొంగి వికారం పొంది సంచరించిన మార్గంలోనే మరల మరల వేయివిధాల సంచరిస్తూ ఉంటుంది.

క. ఏ నిది యంతయు నెఱుఁగుదుఁ । గాన వగపు నుబ్బు నాకుఁ గలుగ' వనుడు ని
మ్మాన విహీనపు మాటలు । దానవకులనాథ! నీకుఁ దగునే యాడన్.' 401

ప్రతిపదార్థం: ఏను= నేను; ఇదిఅంతయున్= దీనినంతటినీ; ఎఱుఁగుదున్= తెలిసికొని ఉన్నాను; కాన= కావున; వగపు= విచారం; ఉబ్బు= సంతసం; నాకున్+కలుగవు= నాకు సంభవించవు; అనుడున్= అనగా; దానవకులనాథ!= రాక్షసకుల రాజా!; ఈ+మానవిహీనపు మాటలు= అభిమానంలేని ఈ పలుకులు; నీకున్ ఆడన్+తగునే?= నీకు చెప్పదగినవా?

తాత్పర్యం: ఈ విషయమంతా నాకు తెలుసు. అందువలన ఏది ఏమైనా నాకు సుఖదుఃఖాలు కలుగవు' అని వృత్రు డన్నాడు. అది విని 'రాక్షసవంశాధిపా! మానం లేని ఈ మాటలు చెప్పటం నీకు ఉచితమా?'

వ. అని యతని మనశ్శుద్ధి యెఱుంగుటకునై భార్గవుండు. 402

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; భార్గవుండు= శుక్రుడు; అతని మనశ్శుద్ధిన్= ఆ వృత్రాసురుడి చిత్తశుద్ధిని; ఎఱుంగుటకున్+ఐ= తెలిసికొనటానికై.

తాత్పర్యం: అని చెప్పి శుక్రాచార్యుడు ఆ వృత్రుడి చిత్తశుద్ధి ఎట్లాంటిదో తెలిసికొనటానికై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అనయము నీసుపొనర్చిన । విని యతనికి నిట్టు లనియె వృత్రుఁడు 'విజయం
బునకు నయి తపము సేయనె । మును? తత్సుకృతమునఁ గొననె మూఁడు జగములున్? 403

ప్రతిపదార్థం: అనయమున్= మిక్కిలి; ఈసు+పొనర్చినన్= ఈర్ష్య ప్రదర్శించగా; విని= ఆలకించి; వృత్రుఁడు= వృత్రాసురుడు; అతనికిన్= ఆ శుక్రుడికి; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు; మును= పూర్వం; విజయంబునకున్+అయి= యుద్ధంలో విజయం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పొందటానికై; తపము చేయనె?= తపస్సు చేసినవాడనుగానా?; తత్సుకృతమునన్= ఆ తపస్సు అనే పుణ్యంచేత; మూఁడు జగములున్= త్రిలోకాలనూ; కొననె?= చేకొన్నానుకదా!

తాత్పర్యం: అత్యంతం ఆ మాటలతో శుక్రుడు ఈర్ష్య ప్రదర్శించగా అతడి మాటలు విని వృత్రుడు ఇట్లా సమాధానం చెప్పాడు. 'నేను పూర్వం యుద్ధంలో విజయం పొందటానికై తపస్సు చేయలేదా? ఆ తపఃప్రభావంవలన కలిగిన పుణ్యంతో ముల్లోకాలకూ ప్రభువును కాలేదా?

క. **ఆ యైశ్వర్యము గ్రమ్మఱ । మాయుటకుం గారణంబు మాన్యచరిత! లే**
దే యొక దుష్కృత; మది యిటు । సేయుం గాకేమి? యేల చింతింపంగన్? 404

ప్రతిపదార్థం: మాన్యచరిత!= పూజ్యచరిత్రుడా!; క్రమ్మఱన్= మరల; ఆ+ఐశ్వర్యము= ఆ సంపద; మాయుటకున్= తొలగి పోవటానికి; కారణంబు= హేతువు; ఒక దుష్కృతంబు= ఒక పాపం; లేదే?= లేదా?; అది= ఆ పాపం; ఇటు= ఇట్లు; చేయున్+కాక+ఏమి= ఒనర్చునుగాక ఏమి?; చింతింపంగన్+ఏల?= విచారించట మెందుకు?

తాత్పర్యం: పూజ్యచరిత్రుడవైన ఓ ఆచార్యా! పూర్వం అనుభవించిన ఆ సంపద ఇప్పుడు తొలగింది. దీనికి కారణమన్న పాపం లేకుండునా? ఆ పాపం ఇట్లా చేస్తుంది. చేస్తే చేయనీ! ఇందుకై విచారించటం ఎందుకు?

క. **విను మనఘ! యింక సుకృతం । బునకుం జొర దుష్కృతంబు పొంతకుఁ బోనే**
ననుపము నచ్యుతు నవ్యయు । ననంతుఁ జెందెద ననామయత నవ్విష్ణున్. 405

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; వినుము= ఆకర్ణించుము; ఏను= నేను; ఇంకన్= ఇకమీదట; సుకృతంబునకున్= పుణ్యానికి; చొరన్= ప్రవేశింపను; దుష్కృతంబు పొంతకున్= పాపం చెంతకును; పోను= చనను; అనుపమున్= సాటిలేనివాడిని; అచ్యుతున్= భక్తరక్షణంలో జారుపాటు లేనివాడిని; అవ్యయున్= వ్యయం లేనివాడిని; అనంతున్= అంతం లేనివాడిని; ఆ+విష్ణున్= ఆ విష్ణుదేవుడిని; అనామయతన్= బెడదలేకుండా; చెందెదన్= పొందుతాను.

తాత్పర్యం: పాపరహితుడవయిన ఓ ఆచార్యా! వినుము. ఇంకమీద నేను పాపపుణ్యాల వంకకు పోను. తనకు సాటి లేనివాడూ, చ్యుతి లేనివాడూ, వ్యయం లేనివాడూ, శాశ్వతుడూ, తుది లేనివాడూ, సర్వవ్యాపకుడూ అయిన విష్ణుదేవుడిని ఏ చిక్కులు లేని పద్ధతిలో ఆశ్రయిస్తాను.

చ. **అనిమిషనాథుతోడి యనియప్పుడు గంటి ననంతు నాద్యు వి**
ష్ణుని నలవోకఁ దన్మహిమ సువ్రత! నా కెఱిఁగింపు; కర్మసం
జనితవిశేషతం గలుగు చాయలలోపల నెద్ది యవ్విభుం
గనుటకు నర్హ మయ్యెఱుక గల్గఁగఁ జేయుము నాదు బుద్ధికిన్.' 406

ప్రతిపదార్థం: సువ్రత!= మంచి వ్రతంకలవాడా!; అనిమిషనాథుతోడి= ఇంద్రుడితోడి; అని అప్పుడు= యుద్ధసమయంలో; అనంతున్= అంతంలేనివాడిని; ఆద్యున్= అంతటికీ మొదటివాడైన వాడిని; విష్ణునిన్= సర్వవ్యాపకుడైన వాడిని; అలవోకన్= లీలగా; కంటిన్= చూచాను; తన్మహిమన్= ఆ విష్ణుదేవుడి ప్రభావం; నాకున్+ఎఱిఁగింపు= నాకు తెలియజెప్పుము; కర్మసంజనిత విశేషతన్= కర్మం వలన కలిగే విశేషప్రక్రియలచేత; కలుగు= సంభవించే; చాయలలోపలన్= జాడలలో, (వర్ణాలలో); ఎద్ది= ఏది; ఆ+విభున్= ఆ విష్ణుదేవుడిని; కనుటకున్= చూడటానికి; అర్హము= తగినదో; ఆ+ఎఱుకన్= ఆ తెలివిని; నాదు బుద్ధికిన్= నా మతికి; కల్గఁగన్+చేయుము= కలిగించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సద్వ్రతశీలుడవైన ఓ శుక్రాచార్యా! నేను ఇంద్రుడితో సంగరం చేసినప్పుడు లీలగా అనంతుడూ, ఆద్యుడూ అయిన విష్ణువును చూచాను. ఆయన మహిమ నాకు తెలియచెప్పుము. కర్మలవలన పెక్కు వర్ణాలు (జీవావస్థలు) ఏర్పడతాయి. అందులో ఏ వర్ణం ఆ దేవుడిని చూడటానికి మిక్కిలిగా తగి ఉన్నదో నా బుద్ధికి గోచరించేటట్లు వివరించుము.

ఆ. అనిన 'నట్లకాక వినుము చెప్పెద'నని । యసురగురుఁడు పలుకు నవసరమున
నచటి కరుగుదెంచె నఖిల మునీంద్ర స । మ్మాన్యుఁ డగు సనత్కుమారుఁ డధిప! 407

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అనినన్= అని వృత్రుడు అడుగగా; అసురగురుఁడు= రాక్షసుల గురువైన శుక్రుడు; అట్లకాక= అట్లే అగుగాక!; చెప్పెదన్= చెప్తుతాను; వినుము అని= ఆలకించుము అని; పలుకు+అవసరమునన్= చెప్పే సమయంలో; అఖిలముని+ఇంద్ర సమ్మాన్యుఁడు+అగు= సమస్త మునివర్యులచేత పూజించదగినవాడైన; సనత్కుమారుఁడు= సనత్కుమారుడనే బ్రహ్మమానసపుత్రుడు; అచటికిన్= ఆ చోటికి; అరుగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ విధంగా వృత్రుడు ప్రశ్నించగానే రక్కసులకు ఆచార్యుడైన శుక్రుడు 'అట్లాగే విష్ణుడి మహిమను విశదీకరిస్తాను, వినుము' అని అన్నాడు. అత డట్లా అంటూ ఉండగానే అక్కడికి మునిశ్రేష్ఠులందరి చేతను పూజించదగిన బ్రహ్మమానసపుత్రుడు సనత్కుమారుడు వచ్చాడు.

వ. వచ్చి యభిపూజితుండై సమున్నతాసనంబున నున్న యమ్మహాత్మునితో శుక్రుండు 'విష్ణుని మాహాత్మ్యంబును వర్ణవిశేషంబులు నిద్దానవేంద్రునకు నెఱింగింపవే!' యనిన నతండు ప్రసన్నవదనుం డగుచు నిట్లనియె.408

ప్రతిపదార్థం: వచ్చి= ఏతెంచి; అభిపూజితుండు+ఐ= అన్నివిధాలా పూజించబడినవాడై; సమున్నత+ఆసనంబునన్= ఎత్తైన పీఠిక పై; ఉన్న= కూర్చున్న; ఆ+మహాత్మునితోడన్= ఆ మహనీయుడితో; శుక్రుండు= శుక్రాచార్యుడు; విష్ణుని మాహాత్మ్యంబును= వెన్నుడి మహిమనూ; వర్ణవిశేషంబులన్= రంగులలోని తేడాలనూ; ఈ+దానవేంద్రునకున్= ఈ రాక్షసరాజుకు; ఎఱింగింపవే= తెలియజెప్పవా; అనినన్= అని అడుగగా; అతండు= ఆ సనత్కుమారుడు; ప్రసన్న వదనుండు+అగుచున్= అనుగ్రహపూర్ణమైన ముఖం కలవాడై; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ రీతిగా వచ్చిన సనత్కుమారుడికి రక్కసులరేడు పూజాదులు కావించాడు. ఆపై ఉన్నతాసనంపై ఆ మునీంద్రుడు కూర్చున్నాడు. శుక్రుడు ఆయనతో 'ఈ వృత్రాసురుడికి విష్ణుదేవుడి మాహాత్మ్యాన్నీ, వర్ణవిశేషాలనూ తెలియజెప్పు'మని అర్థించాడు. అప్పుడు ప్రసన్నమైన ముఖంతో సనత్కుమారుడు ఇట్లా చెప్పాడు.

ఆ. 'వినుము దనుజనాథ! విష్ణునియం దఖి । లంబుఁ గలుగు నిలుచు లయముఁ బొందు;
నతనిభక్తి నింద్రియ జయంబునను బోలె । దానధర్మవిధులఁ గానరాదు. 409

ప్రతిపదార్థం: దనుజనాథ!= రక్కసులరేడా!; వినుము= ఆలకించుము; విష్ణుని+అందున్=వెన్నునిలో; అఖిలంబున్= సమస్తమున్నూ; కలుగున్= ఉదయిస్తుంది; నిలుచున్= నిలిచి ఉంటుంది; లయమున్+పొందున్= లయిస్తుంది; అతనిన్= ఆ దేవుడిని; భక్తిన్= భక్తిచేతా; ఇంద్రియజయంబుననున్+పోలెన్= ఇంద్రియాలను నిగ్రహించటంచేత వలె; దానధర్మవిధులన్= త్యాగం, ధర్మం మొదలైన విధానాలచేత; కానన్ రాదు= చూడటానికి సాధ్యంకాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాక్షసరాజా! వినుము. విష్ణుడిలోనే ఈ సమస్త చరాచరాత్మక జగత్తూ ఉదయిస్తుంది. అతడిలోనే నిలిచి ఉంటుంది. చివరికి ఆ దేవుడిలోనే లీనమవుతుంది. భక్తితోనూ, ఇంద్రియవిజయంతోనూ ఆ దేవుడిని సందర్శించవచ్చును గాని, దానం, ధర్మకార్యాలు మొదలైన వాటిద్వారా చూడటానికి సాధ్యంకాదు.

వ. అవి ప్రయోజన పడుటయుం గలిగి యుండు; నదియునుం జెప్పెద; మున్ను విష్ణుని మహిమ యాకర్ణింపుము. 410

ప్రతిపదార్థం: అవి= ఆ దాన ధర్మాదులు; ప్రయోజనపడుటయున్= అక్కరకు రావటం; కలిగిఉండున్= సంభవిస్తుంది;అదియున్= ఆ విషయం కూడ; చెప్పెదన్= వివరిస్తాను; మున్ను= ముందు; విష్ణునిమహిమ= వెన్నుని ప్రభావం; ఆకర్ణింపుము= విను.

తాత్పర్యం: ఆ దానాది ధర్మకార్యాలు కూడా ప్రయోజనం కలిగియే ఉన్నాయి. దానిని కూడా చెప్పుతాను. ముందుగా విష్ణుడి ప్రభావ మెటువంటిదో చెప్పుతాను వినుము.

తే. ధరణి పాదంబు లతనికి శిరము దివము । దిశలు బాహు లతఁడు సర్వదేవమయుఁడు
భూతవిక్షేప సంహారములు దదీయ । మానసస్వైరలీలలు దానవేంద్ర! 411

ప్రతిపదార్థం: దానవేంద్ర!= రాక్షసరాజా!; అతనికిన్= ఆ విష్ణువునకు; ధరణి= భూమి; పాదంబులు= కాళ్ళు; దివము= ఆకాశం (స్వర్గం); శిరము= తల; దిశలు= దిక్కులు; బాహులు= చేతులు; అతఁడు= ఆ విష్ణువు; సర్వదేవమయుఁడు= సకల దేవతాస్వరూపుడు; భూతవిక్షేపసంహారములు= ప్రాణుల సృష్టి మరియు సంహారాలు; తదీయ మానసస్వైరలీలలు= ఆ దేవుడి చిత్తముయొక్క స్వేచ్ఛావిలాసాలు.

తాత్పర్యం: రాక్షసనాథా! విష్ణువుకు భూమి - పాదాలు, ఆకాశం (స్వర్గం) - తల, దిక్కులు - భుజాలు. ఆ దేవుడు సర్వదేవతాస్వరూపుడై ఉన్నాడు. ప్రాణులను సృష్టించటం, సంహరించట మనేవి ఆయన చిత్తంలో సంభవించే స్వేచ్ఛాలీలావిలాసాలు.

వ. వినుము జీవావస్థలు ఛాయలై యుండుఁ గృష్ణంబును, ధూమ్రంబును, హరితంబును, హారిద్రంబును, రక్తంబును, శుక్లంబును నైనవి యాఱుగల వద్దశా విశేషంబులు. 412

ప్రతిపదార్థం: వినుము= ఆకర్ణించుము; జీవ+అవస్థలు= కర్మవిశేషంవలన కలిగే జీవుల దశలు; ఛాయలు= వర్ణాలు; ఐ+ఉండున్= అయి ఉంటాయి; ఆ+దశావిశేషంబులు= ఆ అవస్థాభేదాలు; కృష్ణంబునున్= నలుపును; ధూమ్రంబునున్= నలుపుమించిన ఎరుపును; హరితంబునున్= ఆకుపచ్చరంగును; హారిద్రంబునున్= పసుపువర్ణమును; రక్తంబునున్= ఎరుపును; శుక్లంబునున్= తెలుపును; ఐనవి= అయి ఉన్నవి, ఆఱు= ఆరుసంఖ్య గలవి; కలవు= ఉన్నాయి.

తాత్పర్యం: వివరిస్తాను వినుము. కర్మవిశేషం వలన జీవులకు అవస్థాభేదాలు కలుగుతాయి. అవి వర్ణాలుగా రూపొంది ఉంటాయి. అట్టి భేదాలు ఆరున్నాయి. అవి క్రమంగా నలుపు, నలుపుమించి కలసిన ఎరుపు, ఆకుపచ్చరంగు, పసుపురంగు, ఎరుపు, తెలుపు అనబడతాయి.

తే. అనఘ! విష్ణువిహారంబు లైన విషమ । వివిధ విక్షేప సంహారవృత్తులందు
భ్రమణ మొందెడి జీవుని బహుళకర్మ । ముల వశంబున నాతనిఁ బొందుచుండు. 413

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; విష్ణువిహారంబులు+ఐన= విష్ణుదేవుడి విహరణా లైనటువంటి; వివిధ విక్షేపసంహార వృత్తులందున్= నానావిధాలైన సృష్టి సంహారవ్యాపారాలలో; భ్రమణము= తిరుగుటను; ఒందెడి= పొందెడి; జీవుని= జీవాత్మయొక్క; బహుళకర్మముల వశంబునన్= అనేక కర్మలవలన; ఆతనిన్= ఆ జీవుడిని; పొందుచుండున్= (పై చెప్పిన దశావిశేషాలు) ప్రాప్తిస్తూ ఉంటాయి.

తాత్పర్యం: పాపరహితుడవైన వృత్రాసురుడా! నానావిధాలైన సృష్టిసంహారాలు విష్ణువు విహారవిలాసాలై ఉన్నాయి. జీవుడు వాటిలో పరిభ్రమిస్తూ ఉంటాడు. అతడి కర్మల ఫలితంగా పైన పేర్కొన్న ఆరు అవస్థాభేదాలు అతడిని పొందుతూ ఉంటాయి.

తే. **తన్ను నుత్తమ మధ్యమాధమము లైన । ఛాయ లొందంగఁ బ్రచుర పర్యాయవృత్తి**
జీవుఁ డమరత్వ ముఖ్యనానావిధముల । నొంది యెక్కుచు డిగ్గుచు నుండుఁ జూవె. **414**

ప్రతిపదార్థం: జీవుఁడు= జీవాత్ముడు; తన్నున్= తనను; ఉత్తమ మధ్యమ+అధమములు+ఐన= శ్రేష్ఠం, మధ్యమం, నీచం అయిన; ఛాయలు= వర్ణాలు; ప్రచురపర్యాయవృత్తిన్= ఆధిక్యక్రమవర్తన ననుసరించి; ఒందఁగన్= పొందగా; అమరత్వ ముఖ్యనానావిధములన్= దేవత్వం మొదలైన అనేక స్థితులను; ఒంది= పొంది; ఎక్కుచున్= పైకిపోతూ; డిగ్గుచున్= క్రిందికివస్తూ; ఉండున్+చూవె!= ఉంటాడు సుమా!

తాత్పర్యం: జీవుడిని ఉత్తమం, మధ్యమం, నీచం అనే దశాభేదాలు క్రమానుగుణంగా పొందుతూ ఉంటాయి. దానిని బట్టి అతడు దేవత్వం, మనుష్యత్వం, మొదలైన అవస్థలు పొంది పైకీ, క్రిందికీ పరిభ్రమిస్తూ ఉంటాడు సుమా!

క. **మే లొనరింపఁగ దొరకొను । మేలిమి గలచాయ కీడు మెయికొని చేయన్**
లోలత్వరహిత! చాయకుఁ । జాలం గీడ్పాటు వోలయు చందము వచ్చున్. **415**

ప్రతిపదార్థం: లోలత్వరహిత!= చాంచల్యం లేనివాడా!; మేలు+ఒనరింపఁగన్= మంచిపని చేయగా; మేలిమికల= శ్రేష్ఠమైన; చాయ= వర్ణం; దొరకొనున్= సంభవిస్తుంది; మెయికొని= పూనుకొని; కీడు= అపకారం; చేయన్= చేయగా; చాయకున్= వర్ణానికి; చాలన్= మిక్కిలి; కీడ్పాటు+పోలయు= చేటు ఘటిల్లే; చందము వచ్చున్= పద్ధతి సంభవిస్తుంది.

తాత్పర్యం: చాపల్యం లేని వృత్రుడా! ఎవడు ఇతరులకు మేలు చేస్తాడో వాడికి మంచి వర్ణం సిద్ధిస్తుంది. అట్లా కాక ఇతరులకు అపకారం చేసేవాడికి వచ్చే వర్ణం కూడా అధమమై ఉంటుంది.

వ. **కావునన్.** **416**

తాత్పర్యం: కాబట్టి.

క. **రసకర్మజ్ఞుఁడు దారము । పసిండి సేఁతకుఁ బ్రయత్నపరుఁడై శుద్ధ**
త్వసమగ్రము సేయుక్రియ । న్విసువక పరిశుద్ధి జీవునికిఁ జేయు టురున్. **417**

ప్రతిపదార్థం: రసకర్మజ్ఞుఁడు= రసవాదక్రియ తెలిసినవాడు; దారమున్= సూత్రమును; పసిండిసేఁతకున్= బంగారుగా చేయటానికి; ప్రయత్నపరుఁడు+ఐ= ఉద్యమం చేసేవాడై; శుద్ధత్వసమగ్రము= నైర్మల్య సంపన్నం; చేయు క్రియన్= చేసేటట్లు; విసువక= విసుగు చెందక; జీవునికిన్= జీవాత్ముడికి; పరిశుద్ధిన్+చేయుట= నిర్మలత్వం ఆపాదించటం; ఉరున్= తగి ఉంటుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రసవాదక్రియా కలాపం తెలిసినవాడు దారాన్ని బంగారుగా మార్చటానికి ప్రయత్నిస్తూ దానికి శుద్ధిగల్గించి నట్లే జీవుడికి శ్రేయస్సు కలిగించటానికై మలవిక్షేపాది దోషాలు లేకుండా చేయటం ఉచిత మవుతుంది.

క. విను కుసుమంబుల వాసిం । చిన నొప్పని కంపు విడిచి చెందును సౌర
భ్య నిరూఢిం దిలలట్టుల । యనఘా! సుకృతముల జీవుఁ డకలంకుఁ డగున్. 418

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; విను= ఆలకించుము; తిలలు= నువ్వులు; కుసుమంబులన్= పువ్వులలో; వాసించినన్= ఉంచితే, వాసెన కట్టుకట్టితే; ఒప్పని కంపున్= దుర్గంధమును; విడిచి= వదలి; సౌరభ్యనిరూఢిన్= సువాసనా ప్రశస్తిని; చెందును= పొందుతాయి; అట్టుల= అట్లే; జీవుఁడు= జీవాత్ముడు; సుకృతములన్= పుణ్యకార్యాలచేత; అకలంకుఁడు+అగున్= మాలిన్యం లేనివాడవుతాడు.

తాత్పర్యం: పాపంలేనివాడా! నువ్వులను మంచిగంధంగల పూలలో వాసెన కట్టు కట్టితే దుర్గంధం వదలి సుగంధం కలవిగా అవుతాయి. అట్లే పుణ్యకార్యాలచేత జీవుడు మాలిన్యం వీడి పవిత్రుడవుతాడు.

విశేషం: అలం: ఉపమ.

క. అంతంతకు సత్కర్మము । లెంతయుఁ బెనుపొంద జీవుఁ డెక్కుడు చాయన్
జింతా కలుషము వాయఁగ । సంతోషామృతము నాని సంశుద్ధుఁ డగున్. 419

ప్రతిపదార్థం: జీవుఁడు= జీవాత్ముడు; అంతకున్+అంతకున్= అంతకంతకు; సత్కర్మములు= సుకృతాలు; ఎంతయున్= మిక్కిలిగా; పెనుపొందన్= వృద్ధిపొందగా; ఎక్కుడు చాయన్= మేలైన వర్ణంతో; చింతాకలుషము= వగపు అనే కాలుష్యం; పాయఁగన్= తొలగిపోగా; సంతోష+అమృతమున్= హర్షమనే సుధను; ఆని= త్రాగి; సంశుద్ధుడు+అగున్= పరిశుద్ధ డవుతాడు.

తాత్పర్యం: ఎంతకెంతకు జీవుడు పుణ్యకార్యాలు చేస్తాడో, అంతకంతకు మేలైన వర్ణాన్ని అతడు పొందుతాడు. దానివలన అతడి దుఃఖం తొలగుతుంది. సంతోషసుధను ఆస్వాదించి అతడు నిర్మలు డవుతాడు.

వ. ఎక్కుడు చాయ శుక్లత్వంబు. 420

ప్రతిపదార్థం: ఎక్కుడు చాయ= శ్రేష్ఠవర్ణం; శుక్లత్వంబు= తెలుపు.

తాత్పర్యం: పైన నిర్దేశించిన ఆరు రంగులలో తెలుపు మేలైన వర్ణం.

క. జీవుఁడు శుక్లచ్ఛాయా । భావితుఁడైనపుడు విష్ణు భావించుటకున్
దా వెరవరి యగుఁ దద్గత । భావ మొసఁగు గుఱుము లేని పండగునెలవున్.' 421

ప్రతిపదార్థం: జీవుఁడు= జీవాత్మ; శుక్లచ్ఛాయాభావితుఁడు+ఐనపుడు= ధవళవర్ణవాసితుడైన సమయంలో; విష్ణున్= వెన్నుని; భావించుటకున్= ధ్యానించటానికి; తాన్= తాను; వెరవరి+అగున్= ఉపాయశాలి అవుతాడు; తద్గతభావము= విష్ణుడి యందు సక్తమైన ధ్యానం; గుఱుము లేని= గింజలేని; పండు+అగు= ఫలమైన; నెలవున్= స్థానమును; ఒసఁగున్= ఇస్తుంది.

తాత్పర్యం: జీవుడు ఎప్పుడు శుక్లవర్ణ వాసితమైన చిత్తవృత్తి గలవాడవుతాడో, అప్పు డతడు విష్ణువు నందు ధ్యానం కలిగినవాడవుతాడు. విష్ణుధ్యానం గింజలేని పండువంటి ఉత్తమస్థితిని కలిగిస్తుంది. (పండులో గింజగల భాగం వదలి తక్కిన భాగమునే అనుభవిస్తారు. గింజలేని పండు మొత్తం ఆనందజనకమై ఉంటుందని భావం)'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'గురుము' అనే పదానికి 'గుఱుతు' అనే పాఠాంతరం ఉన్నది. 'గురుతు లేని పండు' అన్న పాఠానికి మచ్చలేని ఫలమని అర్థం.

వ. అనిన విని వృత్రుం 'డదీనంబులు, నమృతస్వరూపంబులు నగు భవదీయ వచనంబులు వినికింజేసి విశుద్ధుండనైతి' నని పలికి ప్రాణంబులు విడిచి విష్ణునిం బొందె' నని చెప్పుటయు, నప్పాండవేయాగ్రజుండు 'వృత్రుని విజ్ఞానంబును, విష్ణుభక్తియు నింత యొప్పునే?' యని యగ్గించి, 'యతండును, నాఖండలుండును భండనంబు సేసిన తెఱం గెఱింగింపవే' యనుటయు ననిమిషనదీనందనుం డతని కిట్లనియె. 422

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆకర్ణించి; వృత్రుండు= వృత్రాసురుడు; అదీనంబులు= దైన్యంలేనివి; అమృత స్వరూపంబులున్= సుధాసదృశములు; అగు= అయిన; భవదీయవచనంబులు= నీమాటలు; వినికిన్+చేసి= వినటంవలన; విశుద్ధుండన్+ఐతిన్+అని= పరిశుద్ధుడనయ్యాను అని; పలికి= వచించి; ప్రాణంబులు= అసువులు; విడిచి= వదలి; విష్ణునిన్= వెన్నుని; పొందెన్= చేరాడు; అని చెప్పుటయున్= అని చెప్పగా; ఆ+పాండవేయ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడైన ఆ ధర్మజుడు; వృత్రుని= వృత్రాసురుడియొక్క; విజ్ఞానంబును= విశేషజ్ఞానమూ; విష్ణుభక్తియున్= మాధవుడిపై గల భక్తియు; ఇంత ఒప్పునే?= ఇంతగా భాసించిందా?; అని+అగ్గించి= అని ప్రశంసించి; అతండునున్= ఆ వృత్రుడూ; ఆఖండలుండును= ఇంద్రుడూ; భండనంబు చేసిన= యుద్ధంచేసిన; తెఱంగు= పద్ధతి; ఎఱింగింపవే అనుటయున్= తెలుపుమనగానే; అనిమిషనదీనందనుండు= దేవనదీపుత్రుడు- భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మజుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: సనత్కుమారుడు అట్లా చెప్పగా విని వృత్రాసురుడు 'ధైర్యం కలిగించేవీ, అమృతతుల్యములూ అయిన నీ మాటలు విని 'నేను పరిశుద్ధుడ నయ్యాను' అని చెప్పి ప్రాణాలు వదలి విష్ణు సన్నిధి చేరుకొన్నాడు' అని భీష్ముడు చెప్పగా విని ధర్మజుడు 'వృత్రాసురుడి విజ్ఞానమూ, విష్ణుభక్తీ ఇంతగా రాణించాయే' అని ప్రశంసించాడు. తరువాత 'వృత్రుడు, ఇంద్రుడు ఎట్లా యుద్ధం చేశారో తెలుపు' మని ప్రశ్నించాడు. అప్పుడు భీష్ము డతడితో ఇట్లా అన్నాడు:

ఇంద్రవృత్రాసురుల యుద్ధప్రకారము (సం. 12-272-7)

సీ. 'ఇంద్రుఁ డుజ్జ్వలరథం బెక్కి దేవానీక । సహితుఁడై వృత్రుపైఁ జన నతండు
దనుజసైన్యముఁగొని తాఁకెఁ; దత్సంగర । మవ్వాసవునకు భయం బొనర్చెఁ;
బర్వత ప్రతిమరూపమున నయ్యసుర యు । గ్రతఁ జూచి వడఁకు దైవతకులేంద్రు
నద్దానవుండు మాయాబలంబున మోహి । తునిఁ జేయ సొగయుడు ముని సమాజ

తే. సంస్తుతముగ రథంతరసామశక్తిఁ । జేసి యమ్మూర్ఛదేర్చి వసిష్ఠుఁ డతని
తోడ నజుఁడును హరియు రుద్రుండుఁ బోరు । గనుఁగొనంగ వచ్చినవారు గడఁగు మనుడు. 423

ప్రతిపదార్థం: ఇంద్రుఁడు= వాసవుడు; ఉజ్జ్వలరథంబున్= ప్రకాశించే అరదాన్ని; ఎక్కి= అధిష్ఠించి; దేవానీకసహితుఁడు+ఐ= దేవసైన్యంతో కూడినవాడై; వృత్రుపైన్= వృత్రాసురుడిమీదికి; చనన్= దండెత్తిపోగా; అతండు= ఆ వృత్రుడు; దనుజసైన్యమున్ +కొని= రాక్షససైన్యాన్ని వెంటకొని; తాఁకెన్= ఎదుర్కొన్నాడు; తత్సంగరము= ఆ యుద్ధం; ఆ+వాసవునకున్= ఆ ఇంద్రుడికి; భయంబు+ఒనర్చెన్= భీతి కలిగించింది; ఆ+అసుర+ఉగ్రతన్= ఆ రక్కసుడి ఉగ్రత్వమును; పర్వతప్రతిమరూపమునన్= కొండవంటి రూపుతో; చూచి= విలోకించి; వడఁకు= చలిస్తున్న; దైవతకుల+ఇంద్రున్= దేవతల సమూహానికి ప్రభువైన ఇంద్రుడిని; ఆ+దానవుండు= ఆ రాక్షసుడు; మాయాబలంబునన్= మాయయొక్క బలంతో; మోహితునిన్+చేయన్= మోహగ్రస్తుడిని చేయగా; సొగయుడున్= (ఇంద్రుడు) మూర్ఛిల్లగా; వసిష్ఠుఁడు= వసిష్ఠమహర్షి; ముని సమాజసంస్తుతముగన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మునుల సమూహం స్తుతించేటట్లు; రథంతరసామశక్తిన్+చేసి= రథంతరమనే సామ మంత్రంయొక్క ప్రభావంచేత; ఆ+ మూర్ఛన్+తేర్చి= సొమ్మనుండి తేరుకొనేటట్లు చేసి; అతనితోడన్= ఆ ఇంద్రుడితో; అజుఁడును= బ్రహ్మయు; హరియున్= విష్ణువును; రుద్రుండున్= శివుడును; పోరు= యుద్ధమును; కనుఁగొనంగన్ వచ్చినవారు= చూడటానికి వచ్చారు; కడఁగుము= ఉద్యమించుము; అనుడున్= అని చెప్పగా.

తాత్పర్యం: ఇంద్రుడు ప్రకాశించే రథం అధిష్ఠించి దేవతాసైన్యంతో సహా వృత్రుడిపైకి సమరానికి వెళ్ళాడు. వృత్రుడు రాక్షససైన్యంతో సహా ఇంద్రుడిని మార్కొని యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఆ యుద్ధం ఇంద్రుడికి భీతి కల్గించింది. పర్వతాకారుడై భయంకరంగా ఉన్న వృత్రాసురుడి ఉగ్రరూపం చూచి ఇంద్రుడు గడగడ వణకసాగాడు. అప్పుడా రాక్షసరాజు అతడిని మాయాశక్తితో మూర్ఛితుడిని చేశాడు. అంతట వసిష్ఠుడు మునులు తనను పొగడుతుండగా రథంతరసామ మంత్రాల ప్రభావంతో ఇంద్రుడిని మూర్ఛనుండి తేరుకొనేటట్లు చేశాడు. తరువాత అతడితో 'బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు ఈ యుద్ధం చూడాలని వచ్చారు. సన్నద్ధుడవు కమ్ము!' అని చెప్పి యుద్ధానికి పురికొల్పాడు.

చ. అతఁడు గడంగ దేవగురుఁ డప్డు మునీంద్రులుఁ దాను నమ్మరు
త్పతి విజయంబు గోరి హరుఁ బ్రార్థన సేయఁ దదీయతేజ ము
ద్ధత చటులజ్వరం బగుచు దైత్యపతిం బొదివెన్ సురేశ్వరో
ద్ధృతకులిశంబుఁ బొందె హరి దత్సమయంబునఁ గౌరవేశ్వరా! 424

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= కౌరవులకు నాథుడవైన ధర్మరాజా!; అతఁడు= ఆ ఇంద్రుడు; కడంగన్= యుద్ధానికి ఉద్యమించగా; అప్డు= ఆ సమయాన; దేవగురుఁడు= బృహస్పతి; ముని+ఇంద్రులు= మునిశ్రేష్ఠులు; తానున్= తానుకూడ; ఆ+ మరుత్పతి విజయంబున్= ఆ దేవేంద్రుడి జయాన్ని; కోరి= అభిలషించి; హరున్= రుద్రుడిని; ప్రార్థన చేయన్= ప్రార్థించగా; తదీయతేజము= ఈ రుద్రుడి యొక్క తేజస్సు; ఉద్ధతచటుల జ్వరంబు+అగుచున్= గర్వితమై చలించే జ్వరమవుతూ; దైత్యపతిన్= రాక్షసరాజును; పొదివెన్= ఆక్రమించింది; తత్సమయంబునన్= అప్పుడు; హరి= విష్ణువు; సుర+ఈశ్వరోద్యత కులిశంబున్=ఇంద్రుడు పైకెత్తిన వజ్రాయుధాన్ని; పొందెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: ధర్మరాజా! వసిష్ఠుడి ప్రేరణతో ఇంద్రుడు యుద్ధానికి తలపడ్డాడు. అప్పుడు బృహస్పతి మునులతో కూడి తాను ఇంద్రుడి విజయార్థమై ఈశ్వరుడిని ప్రార్థించాడు. ఆ శంకరుడి తేజస్సు మహోద్ధతమై చలించే జ్వరంగా రూపొంది వృత్రుడిని ఆక్రమించింది. ఆ కాలంలోనే విష్ణువు ఇంద్రుడు పైకెత్తిన వజ్రాయుధాన్ని ప్రవేశించాడు.

తే. ఇంద్రునకు రుద్రుఁ డత్తఱి నిట్టు లనియె । ననఘ! యఱువది వేలు దివ్యాబ్దములు మ
హాతపం బొనరించె నీయసుర; వీని । కొసఁగెఁ బద్మజుఁ డధికమహోగ్రబలము. 425

ప్రతిపదార్థం: అత్తఱిన్= ఆ సమయంలో; రుద్రుఁడు= శివుడు; ఇంద్రునకున్= వాసవుడికి; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు; అనఘ!= పాపరహితుడా!; ఈ యసుర= ఈ రాక్షసుడు; అఱువదివేలు దివ్య+అబ్దములు= అరవైవేల దివ్యసంవత్సరాలు; మహాతపంబు+ఒనరించెన్= గొప్ప తపస్సు చేశాడు; పద్మజుఁడు= బ్రహ్మ; వీనికిన్= ఈ రక్కసుడికి; అధికమహా+ఉగ్రబలమున్= ఎక్కుడైన భయంకరబలాన్ని; ఒసంగెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: అప్పుడు రుద్రుడు ఇంద్రుడితో ఇట్లా అన్నాడు: 'పాపరహితుడా! ఈ రాక్షసుడు అరవైవేల దివ్యసంవత్సరాలు తీవ్రతపస్సు చేశాడు. బ్రహ్మ వీడికి భయంకరమైన మహాబలం ప్రసాదించాడు'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అని చెప్పి 'యబ్బలము నా । ఘనతేజముచేత నడఁగు గడఁగు' మనుడు న
య్యనిమిషనాథుఁడు వజ్రం । బున వైవ నతండు పడియె మునిగణ మలరన్. 426

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; ఆ+బలము= ఆ సత్తువ; నా ఘనతేజముచేతన్= నాయొక్క గొప్ప తేజస్సుచేత; అడఁగున్= నశిస్తుంది; కడఁగుము= ప్రయత్నించుము; అనుడున్= అనగా; ఆ+అనిమిషనాథుఁడు= ఆ దేవప్రభువు; వజ్రంబునన్= వజ్రాయుధంతో; వైవన్= వేయగా; మునిగణము= మునిబృందం; అలరన్= సంతసించగా; అతండు= ఆ రాక్షసుడు; పడియెన్= నేలకూలాడు.

తాత్పర్యం: రుద్రుడు ఆ రీతిగా పలికి 'వాడి బలము గొప్పదైన నా తేజస్సుచేత నశిస్తుంది, కాబట్టి ప్రయత్నించుము' అని ఇంద్రుడిని పురికొల్పాడు. అంతట ఇంద్రుడు వజ్రాయుధంతో వాడిని కొట్టాడు. ముని సమూహం సంతోషించగా ఆ దెబ్బకు ఆ రాక్షసుడు నేలకూలాడు.

క. సుర లార్చిరి, తూర్యంబులు । మొరసె ననేకంబు; లపుడు మోదమున మునుల్
హరిహరులం గీర్తించిరి, । సురేంద్రు నగ్గించి రధికశుభవాక్యములన్. 427

ప్రతిపదార్థం: సురలు= దేవతలు; ఆర్చిరి= అరచారు; అనేకంబులు తూర్యంబులు= పెక్కు వాద్యాలు; మొరసెన్= మ్రోగాయి; అపుడు= ఆ సమయంలో; మునుల్= మౌనులు; మోదమునన్= సంతోషంతో; హరిహరులన్= విష్ణువునూ, రుద్రుడినీ; కీర్తించిరి= స్తుతించారు; అధిక శుభవాక్యములన్= అనేక మంగళవచనాలతో; సురేంద్రున్= దేవేంద్రుడిని; అగ్గించిరి= ప్రశంసించారు.

తాత్పర్యం: వృత్రాసురుడు పడిపోగానే దేవతలు ఆనందంతో అరచారు. పెక్కువాద్య విశేషాలు మ్రోగాయి. మునులు సంతసంతో హరినీ, హరుడినీ వినుతించారు. అనేక మంగళవాక్యాలతో దేవేంద్రుడిని పొగడారు.

క. విను విష్ణుని సంస్పర్శం । బున నప్పుడ చూవె కసటు వోయిన నతనిం
గనుటయు శాంతిం బొందుట । యును గురువర! కలిగె వృత్రు నుల్లంబునకున్.' 428

ప్రతిపదార్థం: కురువర!= కౌరవశ్రేష్ఠా!; విను= ఆలకించుము; విష్ణుని సంస్పర్శంబునన్= విష్ణుదేవుడు తాకటంతో; అప్పుడ చూవె!= అప్పుడే సుమా!; కసటు= మాలిన్యం; పోయినన్= తొలగిపోగా; అతనిన్= ఆ విష్ణుడిని; కనుటయున్= చూడటమూ; వృత్రుఉల్లంబునకున్= వృత్రాసురుడి హృదయానికి; శాంతిన్+పొందుటయునున్= శమించటమున్నూ; కలిగెన్= సంభవించాయి.

తాత్పర్యం: కురుశ్రేష్ఠా! వెన్నుని స్పర్శతో అప్పుడే వృత్రుడి హృదయగతమైన మాలిన్యం తొలగిపోయింది. అప్పుడతడు విష్ణుదేవుడిని చూచాడు. అతడి చిత్తానికి శాంతి కూడా అప్పుడు కల్గింది'.

వ. అని పలికి భీష్ముండు వెండియు నవ్విభున కిట్లను నట్లు వృత్రుని జయించి. 429

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; భీష్ముండు= భీష్ముడు; వెండియున్= మరల; ఆ+విభునకున్= ఆ రాజుకు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అట్లు= ఆ విధంగా; వృత్రునిన్= వృత్రాసురుడిని; జయించి= ఓడించి.

తాత్పర్యం: భీష్ము డీ రీతిగా చెప్పి మరల ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: అట్లా వృత్రుడిని యుద్ధంలో పరాజితుడిని చేసి. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. హరునకు మ్రొక్కి 'మీ కరుణ నార్తి దొఱంగి యనూన సౌఖ్యముం
బొరసితి' నంచు వీడుకొని పోయె మహేంద్రుఁడు బ్రహ్మహత్య యా
సురపతి నప్డు వెన్కొనియెఁ జొచ్చె బిసాంతర మాతఁ డందునుం
బరిగొని యుగ్రవృత్తి నది పట్టెఁ జలంబున నమ్మహాత్మునిన్. 430

ప్రతిపదార్థం: మహేంద్రుఁడు= దేవేంద్రుడు; హరునకున్= రుద్రుడికి; మ్రొక్కి= నమస్కరించి; మీ కరుణన్= మీ దయచేత; ఆర్తిన్= బాధను; తొఱంగి= త్యజించి; అనూన సౌఖ్యమున్= అధికసుఖాన్ని; పొరసితిన్+అంచున్= పొందాను అంటూ; వీడుకొని పోయెన్= పోయివస్తానని వెళ్ళిపోయాడు; అప్డు= అప్పుడు; బ్రహ్మహత్య= బ్రహ్మహత్యాదోషం; ఆ సురపతిన్= ఆ ఇంద్రుడిని; వెన్కొనియెన్= వెంబడించింది; ఆతఁడు= ఆ ఇంద్రుడు; బిస+అంతరమున్= తామరతూడులోపల; చొచ్చెన్= ప్రవేశించాడు; అది= ఆ దోషము; అందునున్= ఆ తామర తూడులోగూడ; పరిగొని= చుట్టుముట్టి; ఉగ్రవృత్తిన్= భీకరవర్తనంతో; చలంబునన్= మాత్సర్యంతో; ఆ+మహాత్మునిన్= ఆ ఇంద్రుడిని; పట్టెన్= గ్రహించింది.

తాత్పర్యం: అంతట ఇంద్రుడు శివుడికి ప్రణమిల్లాడు. 'మీ దయవలన పీడ తొలగి మహాసౌఖ్యం పొందాను' అని చెప్పుతూ పోయివస్తానని వెళ్ళాడు. అప్పుడు బ్రహ్మహత్యాదోషం ఆ ఇంద్రుడిని వెంబడించింది. దానికి భయపడి అతడు తామరతూడులో ప్రవేశించాడు. అది మాత్సర్యంతో వెంబడించి అక్కడ కూడా భయంకరంగా అతడిని చుట్టుముట్టి ఆక్రమించింది.

ఆ. బ్రహ్మహత్య దన్నుఁ బట్టిన నమరేంద్రుఁ । డజుని కడకు నేఁగి ప్రార్థనంబు
చేసి 'దీనిఁ బాయఁజేయవే' యన నతం । డది దొలంగఁ జేయుననువు దలఁచి. 431

ప్రతిపదార్థం: బ్రహ్మహత్య= బ్రహ్మహత్య అనే దోషం; తన్నున్= తనను; పట్టినన్= ఆక్రమించగా; అమరేంద్రుఁడు= దేవేంద్రుడు; అజుని కడకున్= బ్రహ్మవద్దకు; ఏఁగి= పోయి; ప్రార్థనంబుచేసి= ప్రార్థించి; దీనిన్= ఈ బ్రహ్మహత్యను; పాయన్+చేయవే+అనన్= తొలగించవే అనగా; అతండు= ఆ బ్రహ్మ; అది= ఆ దోషమును; తొలంగన్+చేయు= తొలగించే; అనువున్= ఉపాయాన్ని; తలఁచి= భావించి.

తాత్పర్యం: ఇంద్రుడు బ్రహ్మహత్యాదోషం తనను పట్టుకొనటంతో బ్రహ్మ దగ్గరకు వెళ్ళాడు. ఆయనను ప్రార్థించి ఈ దోషం తొలగేటట్లు చేయుమన్నాడు. బ్రహ్మ ఆ దోషం తొలగించే ఉపాయం ఆలోచించాడు. తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. అగ్నినోషధివృక్షతృణంబులను వనితా జనంబులను జలంబులను దలంపున రావించి వృత్రునివలన వాసవునకుం బాటిల్లిన బ్రహ్మహత్య చతుర్భాగంబులు సేసితి. మీర లొక్కొక్క పాలు గై కొనుండని పనిచెఁ; బనిచిన వారు 'దేవా! నీ పంపు సేసెదము; మాకు నిష్కృతి యెట్టిది? దాని నీదివ్య చిత్తంబున నవధరింపవలయు' నని పలికిన నగ్ని కిని నోషధివృక్షతృణంబులకును, వనితాజనంబులకును, జలంబులకును వరంబులుగాఁ గ్రమంబున నీవు ప్రజ్వలింపక హవిఃప్రదానంబు సేయు వానియందును, మీకుఁ బర్వంబుల భేదనచ్ఛేదనంబు లాచరించువానియందును, మీరు రజస్వలలై యుండ మీతో సురతంబు సలుపువాని యందును, మీలో మల మూత్ర శ్లేష్మంబులు విడుచువాని యందును మీ మీ కడనున్న బ్రహ్మహత్య ప్రవేశింపఁ గలయది' యని నిర్దేశించిన దానికిం బ్రియం బంది, యగ్ని ప్రముఖంబులు శతమఖు బ్రహ్మహత్య పాళ్ళు ధరియించి; రిట్లు విరించి ప్రసాదంబునం గల్మషంబు దొఱంగి యాఖండలుండు దదనుమతి నశ్వమేధంబు సేసి నాక సామ్రాజ్యంబున సర్వలోక పూజ్యత్వంబు నొంది వెలింగె' నని చెప్పి వెండియు నిట్లనియె. 432

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అగ్నిన్= అగ్నిదేవుడిని; ఓషధివృక్షతృణంబులనున్= అరటిమొదలైన ఓషధులను, చెట్లను, గడ్డిమొక్కలను; వనితాజనంబులను= స్త్రీలను; జలంబులను= నీటిని; తలంపునన్= సంకల్పంతో; రావించి= వచ్చేటట్లు చేసి; వృత్రునివలనన్= వృత్రాసురుడివలన; వాసవునకున్= ఇంద్రుడికి; పాటిల్లిన= కల్గిన; బ్రహ్మహత్యన్= బ్రహ్మహత్యాదోషాన్ని; చతుర్భాగంబులు= నాలుగుపాళ్ళు; చేసితిన్= చేశాను; మీరలు= మీరు; ఒక్కొక్క పాలు= ఒక్కొక్క భాగం; కైకొనుండు+అని= స్వీకరించండి అని; పనిచెన్= నియోగించాడు; పనిచినన్= నియోగించేసరికి; వారు= అగ్ని మున్నగువారు; దేవా!= ప్రభూ!; నీపంపు= నీయాజ్ఞ; చేసెదము= నిర్వర్తిస్తాం; మాకున్= అట్లా నిర్వర్తించిన అగ్న్యాదులమైన మాకు; నిష్కృతి= ప్రాయశ్చిత్తం; ఎట్టిది= ఎట్లాంటిది?; దానిన్= ఆ ప్రాయశ్చిత్తాన్ని; నీ దివ్యచిత్తంబునన్= నీ దివ్యమానసంలో; అవధరింపన్ వలయున్+అని= భావించవలెను అని; పలికినన్= చెప్పగా; అగ్నికినిన్= అనలమునకు; ఓషధివృక్షతృణంబులకున్= ఓషధులకు, చెట్లకు, గడ్డికిని; వనితాజనంబులకునున్= స్త్రీలకు; జలంబులకును= నీటికిని; క్రమంబునన్= వరుసగా; వరంబులుగాన్= దేవతలిచ్చే కోరికలుగా; నీవు= అగ్నివైన నీవు; ప్రజ్వలింపక= మండక; హవిఃప్రదానంబు చేయువాని+అందునున్= హవిస్సును వేల్చువాడి యందు; మీకున్= ఓషధివృక్షాదులగు మీకు; పర్వకాలంబులన్= పండుగదినాలలో; భేదన చ్ఛేదనంబులు= పెళ్ళగించటం, నరకటం చేసేవాడియందు; మీరు= స్త్రీజనమైన మీరు; రజస్వలలై ఉండన్= ముట్టుగలవారై ఉండగా; మీతోన్ సురతంబు= మీతో రతి; సలుపువానియందును= చేసేవాడియందు; మీలోన్= జలమైన మీలో; మలమూత్రశ్లేష్మంబులు= మలం, మూత్రం, తెమడ వీటిని; విడుచువానియందును= వదలిపెట్టేవాడియందు; మీమీ కడన్= మీమీ వద్ద; ఉన్నబ్రహ్మహత్య= ఉన్నట్టి బ్రహ్మహత్యాదోషం; ప్రవేశింపన్ కలయది= దూరగలదు; అని నిర్దేశించినన్= అని చెప్పగా; దానికిన్= ఆ మాటకు; ప్రియంబు+అంది= సంతోషపడి; అగ్నిప్రముఖంబులు= అగ్ని మొదలగు వారు; శతమఖు= ఇంద్రుడియొక్క; బ్రహ్మహత్యపాళ్ళు= బ్రహ్మహత్యాదోషపు విభాగాలను; ధరియించిరి= పూనారు; ఇట్లు= ఈ రీతిగా; విరించి ప్రసాదంబునన్= బ్రహ్మఅనుగ్రహంతో; కల్మషంబు= పాపం; తొఱంగి= వీడి; ఆఖండలుండు= ఇంద్రుడు; తదనుమతిన్= బ్రహ్మయొక్క సమ్మతితో; అశ్వమేధంబు= అశ్వమేధమనే యజ్ఞం; చేసి= నిర్వహించి; నాక సామ్రాజ్యంబునన్= స్వర్గ సామ్రాజ్యంలో; సర్వలోకపూజ్యత్వంబును= సమస్తలోకాలచేత పూజించబడుటను; ఒంది= పొంది; వెలింగెన్= ప్రకాశించాడు; అని చెప్పి= అని పలికి; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: బ్రహ్మ అగ్నిదేవుడిని, ఓషధులను, చెట్లను, గడ్డిమొక్కలను, స్త్రీలను, నీటిని తన సంకల్పశక్తితో వచ్చేటట్లు చేశాడు. 'ఇంద్రుడికి కలిగిన బ్రహ్మహత్యాదోషాన్ని నేను నాలుగు భాగాలు చేశాను. మీరు ఒక్కొక్క భాగం స్వీకరించాలి' అని ఆదేశించాడు. అందుకు అగ్న్యాదులు 'ప్రభూ! నీ ఆన పాటిస్తాము. అయితే దానివలన కలిగే పాపానికి మాకు ప్రాయశ్చిత్తమేది? దానిని నీ మనస్సులో నిశ్చయించి చెప్పు' మని అన్నారు. అప్పుడు విధాత అగ్నికి, ఓషధి వృక్షతృణాలకూ, స్త్రీలకూ, నీటికీ క్రమంగా ఈ క్రింది రీతిగా వరాలు ఇచ్చాడు. 'నీవు మండకున్నప్పుడు హవిస్సు నీలో వేల్చేవాడిలో నీలోని దోషం ప్రవేశిస్తుంది' అని అగ్నికి వరమిచ్చాడు. 'పండుగకాలంలో మిమ్ములను భగ్నంచేసి, నరికి, పెకలించేవారిలో మీలోని దోషం చేరుతుంది' అని ఓషధి వృక్షతృణాలకు వరమిచ్చాడు. 'మీరు రజస్వలలై ఉన్నపుడు మీతో రతిచేసే వాడిలోనికి మీ దోషం ప్రవేశిస్తుం' దని స్త్రీలకు వరం ఇచ్చాడు. 'మీలో మలమూత్రాలు, కళ్ళెలు వదలిపెట్టే వాడిని మీలోని దోషం వెన్నంటుతుంది' అని నీటికి వరమిచ్చాడు. అందుకు అగ్ని మున్నగువారు సంతోషించారు. ఇంద్రుడి బ్రహ్మహత్యాదోషాన్ని వారు ధరించారు. ఇట్లా బ్రహ్మ అనుగ్రహంతో ఇంద్రుడు పాపం వీడి ఆయన సమ్మతితో అశ్వమేధయాగం చేశాడు. స్వర్గరాజ్యంలో సమస్తలోకపూజ్యుడై వెలుగొందాడు' అని చెప్పి మరల భీష్ముడు ధర్మరాజుతో ఈ రీతిగా అన్నాడు:

తే. **ఒదవు వృత్రురక్తమున బుద్బుదము లెసఁగి। పుట్టకొక్కులై యవి జనభోజ్యభావ**
మొంది విప్రాదికద్విజ యోగ్యతాభి। పన్నములు గావు ధర్మసంపన్నచరిత! **433**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధర్మసంపన్నచరిత!= ధర్మంతో కూడిన శీలంకల ఓ ధర్మరాజా!; ఒదవు= ఉదయించిన; వృత్రురక్తమునన్= వృత్రాసురుడి నెత్తుటిలో; బుద్బుదములు= బుడగలు; ఎసఁగి= వృద్ధిపొంది; పుట్టకొక్కులు+ఐ= పుట్టగొడుగులుగా రూపొంది; అవి= ఆ పుట్టగొడుగులు; జనభోజ్యభావము+ఒంది= ప్రజలకు తినదగినవై; విప్రాదికద్విజ= బ్రాహ్మణులు మున్నగు ద్విజులకు; యోగ్యతాభిపన్నములు= భోజనయోగ్యతతో గూడినవి; కావు= కావు.

తాత్పర్యం: 'ధర్మాత్మా! వృత్రుని శరీరంనుండి కారిన నెత్తురునుండి బుడగలు పుట్టాయి. అవి పుట్టకొక్కులయ్యాయి. ప్రజలకు ఆహారపదార్థంగా కూడ రూపొందాయి. అయితే రాక్షస రక్తజములు కావటం వలన బ్రాహ్మణులు మొదలైన ద్విజులు భుజించటానికి అవి తగని వయ్యాయి.

క. ఆ వాసవు చందంబున । నీవును శత్రుజయకీర్తనీయుఁడ వగుచున్
భూవిబుధుల కెపుడుఁ బ్రమో । దావహుఁడవు గమ్ము. భారతాన్వయముఖ్యా! 434

ప్రతిపదార్థం: భారత+అన్వయముఖ్యా!= భరతవంశశ్రేష్ఠా!; ఆ వాసవుచందంబునన్= ఆ ఇంద్రుడివలె; నీవును= నీవుకూడ; శత్రుజయకీర్తనీయుఁడవు+అగుచున్= రిపులను జయించటంచేత కీర్తించదగినవాడ వవుతూ; భూవిబుధులకున్= భూసురులకు; ఎప్పుడున్= ఎల్లవేళల; ప్రమోద+ఆవహుఁడవు కమ్ము= సంతోషం కలిగించేవాడవు కమ్ము.

తాత్పర్యం: భరతవంశముఖ్యుడవైన ఓ ధర్మపుత్రా! ఆ ఇంద్రుడివలె నీవు కూడా శత్రువులను జయించి కీర్తి పొందుము. బ్రాహ్మణులకు సదా సంతోషం కలిగించుము.

తే. పర్వములయందు విప్రసభను సభక్తి । కంబుగా నెవ్వఁ డీశక్రకథఁ బఠించు
వానిఁ బాపము లొందవు, మాననీయ । ధర్మములయందు రతుఁడగు ధర్మతనయ!' 435

ప్రతిపదార్థం: ధర్మతనయ!= ధర్మపుత్రా!; ఎవ్వఁడు= ఎవడు; పర్వముల+అందున్= పండుగదినాలలో; విప్రసభను= బ్రాహ్మణుల సభలో; ఈ శక్రకథన్= ఈ ఇంద్రుడి చరిత్రమును; సభక్తికంబుగాన్= భక్తితో కూడి; పఠించున్= చదువునో; వానిన్= అతడిని; పాపములు= కిల్బిషాలు; ఒందవు= పొందవు; మాననీయ ధర్మముల+అందున్= పూజ్యములైన ధర్మాలయందు; రతుఁడు+అగున్= (అతడు) ఆసక్తిగల వాడవుతాడు.

తాత్పర్యం: ధర్మజా! ఎవడు పర్వదినాలలో ఈ ఇంద్రుడి కథను భక్తితో బ్రాహ్మణుల సభలో చదువుతాడో, వాడికి పాపా లంటవు. వాడు మాన్యమైన ధర్మాలలో ఆసక్తి కలవా డవుతాడు'.

వ. అనిన నతండు ప్రీతుండై 'వృత్రుండు జ్వరంబుచేతం బొదువంబడియె నని వింటి; దాని జననంబును దత్ప్రకారంబును నెఱిఁగింపవే' యనుటయు భీష్ముం డా భూపతి కిట్లనియె. 436

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అతండు= ఆ ధర్మసుతుడు; ప్రీతుండు+ఐ= ప్రీతినొందినవాడై; వృత్రుండు= వృత్రాసురుడు; జ్వరంబుచేతన్= జ్వరంచేత; పొదువంబడియెన్+అని= ఆక్రమించబడ్డాడని; వింటిన్= విన్నాను; దాని జననంబును= ఆ జ్వరముయొక్క పుట్టుకయును; తత్ప్రకారంబునున్= దాని స్వభావమును; ఎఱిఁగింపవే= తెలుపుమా; అనుటయున్= అనగా; భీష్ముండు= గాంగేయుడు; ఆ భూపతికిన్= ఆ రాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు అట్లా చెప్పగా విని ధర్మరాజు ప్రీతి పొందాడు. 'వృత్రుడిని జ్వరం ఆక్రమించింది అని విన్నాను. ఆ జ్వరం ఎట్లా పుట్టింది? దాని విధానం ఏమిటి? తెలియజేయు' మని మళ్ళీ అడిగాడు. అప్పుడు భీష్ముడు ఇట్లా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దక్షమఖధ్వంసంబు నప్పుడు శివునివలన జ్వరం బుద్భవించిన ప్రకారము (సం. 12-274-4)

సీ. రజతాచలంబున రత్నతటంబున । నంబికాసహితుఁడై హరుఁడు పేర్మి
నమరమునీంద్ర యక్షాదులు గొలువంగ । నుండు; నట్లుండంగ నొక్కనాఁడు
దేవర్షికోటు లతిప్రమదంబునం । జనఁ జూచి 'వీ రేమిపనికి నెచటి
కరిగెద?' రని పతి నడిగె భవాని; యా । తఁడు 'దక్షుచేయు నధ్వరమునందుఁ

తే. దమహవిర్భాగములు గొనుదాని' కనినఁ । 'బొలఁతి నీ వేల పో?' వను పలుకు పలికె;
'నాకు మును భాగపరికల్పనంబు లేమి । నతఁడు బిలువఁ; డేనును బోవ' ననియె భవుఁడు. 437

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు; అంబికాసహితుఁడు+ఐ= సతీదేవితో కూడినవాడై; రజత+అచలంబునన్= కైలాసగిరిపై; రత్నతటంబునన్= రత్నసానువునందు; పేర్మిన్= అతిశయంగా; అమరముని+ఇంద్ర యక్ష+ఆదులు= దేవతలు, మునివర్యులు, యక్షులు మొదలైనవారు; కొలువంగన్+ఉండున్= సేవించగా ఉంటాడు; అట్లు+ఉండంగన్= అట్లా ఉండగా; ఒక్కనాఁడు= ఒక్కదినం; భవాని= సతీదేవి; దేవర్షికోటులు= దేవతలు, ఋషిసమూహాలు; అతిప్రమదంబునన్= మిక్కిలి సంతోషంతో; చనన్= పోగా; చూచి= విలోకించి; వీరు= ఈ దేవర్షులు; ఏమిపనికిన్= ఏ కార్యానికి; ఎచటికిన్= ఎక్కడికి; అరిగెదరు?= పోతున్నారు?; అని పతిన్+అడిగెన్= అని భర్తను ప్రశ్నించింది; ఆతఁడు= ఆ శివుడు; దక్షు చేయు= దక్షప్రజాపతి చేసే; అధ్వరము+అందున్= యజ్ఞంలో; తమ హవిర్భాగములు= తమకు చెందిన వేల్చిన ద్రవ్యపు పాళ్ళను; కొనుదానికిన్+అనినన్= స్వీకరించటానికని చెప్పగా; పొలఁతి= పార్వతి; నీవు+ఏల పోవు?= నీవెందుకు పోవటం లేదు?; అను పలుకు= అనుమాట; పలికెన్= అన్నది; భవుఁడు= శివుడు; నాకున్= శివుడనైన నాకు; మును= ముందు; భాగపరికల్పనంబు= పాలు కల్పించటం; లేమిన్= లేకుండటంవలన; అతఁడు= ఆ దక్షుడు; పిలువఁడు= నన్ను ఆహ్వానించడు; ఏనును= నేనుకూడ; పోవన్+అనియెన్= పోనన్నాడు.

తాత్పర్యం: శివుడు వెండికొండపై సతీదేవితో కూడి ఉన్నాడు. దేవతలు, మునివర్యులు, యక్షులు మొదలైనవారు ఆ దేవుడిని సేవిస్తూ ఉన్నారు. ఒక్క దినాన దేవర్షి సమూహం చాలా సంతోషంతో బయలుదేరి వెళ్ళుతూ ఉండటం చూచి అంబిక 'వీరు ఎక్కడికి ఏమి పనిమీద పోతున్నారు?' అని భర్తను అడిగింది. అందుకు భవుడు 'దక్షుడు చేసే యాగంలో తమ తమ హవిర్భాగాలు గ్రహించటానికి వీరు పయనమయ్యారు' అని చెప్పాడు. అప్పుడు భవాని 'అయితే నీ వెందుకు పోవటం లేదు?' అని ప్రశ్నించింది. దానికి శివుడు నాకు ముందుభాగం పెట్టలేదు. అందువలన అతడు నన్ను పిలువలేదు. నేనుకూడా పోవటం లేదు' అని చెప్పాడు.

క. తన పతికి భాగకల్పన । మొనరింపఁడు దక్షుఁ డని మహోగ్రపుఁ గోపం
బున బొమలు ముడివడఁగ న । వ్వనిత పలుకు మాని యుండె వసుధాధీశా! 438

ప్రతిపదార్థం: వసుధాధీశా!= రాజా!; దక్షుఁడు= దక్షప్రజాపతి; తన పతికిన్= తన భర్తకు; భాగకల్పనము= పాలు కల్పించటం; ఒనరింపఁడు= చేయడు; అని= అని తలచి; మహా+ఉగ్రపు= మిక్కిలి భయంకరమైన; కోపంబునన్= క్రోధంతో; బొమలు; ముడిపడఁగన్= వక్రత్వం పొందగా; ఆ+వనిత= ఆ భవాని; పలుకు మాని= మాట్లాడటం మాని; ఉండెన్= ఉండింది.

తాత్పర్యం: ధర్మరాజా! దక్షుడు తన భర్తకు యజ్ఞంలో భాగం కల్పించలేదని సతీదేవి మిక్కిలి కోపంతో కనుబొమలు ముడివడగా మాట్లాడటం మాని మౌనంగా ఉండిపోయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. దేవిచిత్త మెఱింగి దేవుండు ప్రమథసం। ఘంబులు దాను నా క్రతువు సెఱుప
నరిగె; యజ్ఞాంగంబు లన్నింటిఁ బ్రమథులు। గాసి సేయుచును రక్తములు సల్లి
యార్పంగ మృగరూపమై గగనంబున। కెగసె; నధ్వరము మున్నీశునుదుట
నలుకఁ బుట్టిన ఘర్మజల కణ మిలఁ బడ్డఁ। బెనుమంట లెగసిన జనితుఁ డయ్యె

ఆ. నందుఁ బురుషుఁ డొకరుఁ డరుణ నేత్రకము నీ। లంబు నూర్ధ్వరోమకంబు ఘోర
భంగికంబు నైన యంగంబుతో సప్త। తంతుదాహి యగుచు ధరణినాథ! 439

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; దేవుండు= భవుడు; దేవిచిత్తము+ఎఱింగి= భవాని మనస్సు తెలిసికొని; ప్రమథసంఘంబులు= ప్రమథసమూహాలు; తానును= తానుకూడ; ఆ క్రతువు= ఆ యజ్ఞాన్ని; చెఱుపన్= చెడగొట్టటానికి; అరిగెన్= పోయాడు; ప్రమథులు= శివభటులు; యజ్ఞ+అంగంబులు+అన్నింటన్= యజ్ఞానికి చెందిన అవయవాలన్నింటిలోనూ; గాసి చేయుచును= చీకాకు పరుస్తూ; రక్తములు+చల్లి= నెత్తురులు చల్లి; ఆర్పంగన్= ఆర్పివేయగా; అధ్వరము= యజ్ఞం; మృగరూపమై= జింక రూపుగలదై; గగనంబునకున్= ఆకసానికి; ఎగసెన్= ఎగిరిపోయింది; మున్ను= ముందు; ఈశునుదుటన్= శివుడి ఫాల భాగంలో; అలుకన్= కోపంతో; పుట్టిన= ఉదయించిన; ఘర్మజలకణము= చెమటబొట్టు; ఇలన్= భూమిపై; పడ్డన్= పడగా; పెనుమంటలు= పెద్దజ్వాలలు; ఎగసినన్= పైకి లేవగా; అందున్= ఆ జ్వాలలలో; అరుణనేత్రకము= ఎర్రని కనులుకలది; నీలంబు= నల్లనిది; ఊర్ధ్వరోమకంబు= పైకి మొనచూపిన వెంట్రుకలు కలది; ఘోరభంగికంబు= భయంకరమైన ఆకృతికలదియు; ఐన+అంగంబుతోన్= అయినట్టి శరీరంతో; సప్తతంతుదాహి= యజ్ఞాన్ని కాల్చివేసేవాడు; అగుచున్= అవుతూ; పురుషుఁడు+ఒకరుఁడు= ఒక పురుషుడు; జనితుఁడు+అయ్యెన్= పుట్టాడు.

తాత్పర్యం: రాజా! అప్పుడు భవానీదేవి చిత్తం గ్రహించి భవుడు ప్రమథగణాలతో కూడా తాను దక్షయజ్ఞాన్ని నాశనం చేయటానికై వెళ్ళాడు. అక్కడ శివభటులు యజ్ఞాంగాలను చీకాకు జేసి రక్తం చల్లి అగ్నిహోత్రాన్ని ఆర్పివేశారు. అంతట యజ్ఞం మృగరూపంతో ఆకాశాని కెగిరిపోయింది. ఈశ్వరుడి ఫాలభాగంలో కోపంవలన పుట్టిన చెమట బిందువొకటి భూమిపై పడింది. వెంటనే అక్కడ పెద్దమంటలు ఏర్పడ్డాయి. ఆ మంటలలో ఒక పురుషుడు ఎర్రని నేత్రాలు, నల్లనిరూపు, ఊర్ధ్వముఖమైన రోమాలు గల భయంకరమైన ఆకృతితో జన్మించాడు.

క. సురలు మునులు భయమునఁ బఱ। చిరి నలుగడ; బ్రహ్మ వచ్చి శివుఁ గని వినయో
త్తరముగ మ్రొక్కుచు 'నమరులు। పరికల్పించెదరు నీకు భాగము భక్తిన్. 440

ప్రతిపదార్థం: సురలు= దేవతలు; మునులు= మౌనులు; భయమునన్= భీతితో; నలుగడ= నాలుగు దెసలకు; పఱచిరి= పరుగెత్తారు; బ్రహ్మ= అజుడు; వచ్చి= ఏతెంచి; శివున్= భవుడిని; కని= చూచి; వినయ+ఉత్తరముగన్= వినయప్రధానంగా; మ్రొక్కుచున్= నమస్కరిస్తూ; అమరులు= సురలు; నీకున్= శివుడ వగు నీకు; భక్తిన్= భక్తితో; భాగము= పాలు; పరికల్పించెదరు= ఏర్పాటు చేస్తారు.

తాత్పర్యం: అట్లా జరుగగానే దేవతలు, ఋషులు భయంతో నలుదిక్కులకు పారిపోయారు. అపుడు బ్రహ్మదేవుడు అక్కడికి వచ్చి శివుడిని చూచి వినయభరితుడై నమస్కరిస్తూ 'దేవతలు నీకు యజ్ఞంలో భక్తితో భాగం కల్పిస్తారు.

వ. స్వామీ! కోపం బుపసంహరింపుము.' 441

ప్రతిపదార్థం: స్వామీ!= ప్రభూ!; కోపంబు= క్రోధాన్ని; ఉపసంహరింపుము= మరలించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: స్వామీ! కోపం మళ్ళించుకొమ్ము'.

క. **నావుడు నల్ల నగుచు న । ద్దేవుఁడు గరుణించి మునుల దేవతలను సం**
భావింప భాగకల్పన । గావించిరి వార లా జగత్ప్రభువునకున్. **442**

ప్రతిపదార్థం: నావుడున్= అనగా; ఆ+దేవుఁడు= ఆ శివుడు; అల్లనగుచున్= మందహాసం చేస్తూ; కరుణించి= దయచూపి; మునులన్= మౌనులను; దేవతలను= సురలను; సంభావింపన్= గౌరవించగా; వారలు= ఆ మునులు, దేవతలు; ఆ జగత్ప్రభువునకున్= ఆ జగదీశ్వరుడికి; భాగకల్పన= పాలు కల్పించటం; కావించిరి= చేశారు.

తాత్పర్యం: బ్రహ్మ అట్లా అనగానే ఆ శివుడు దయతో మందహాసం చేస్తూ మునులనూ దేవతలనూ సంభావించాడు. వారు జగన్నాథుడైన ఆ దేవుడికి యజ్ఞంలో భాగం కల్పించారు.

వ. **అప్పరమేశ్వరుండు సుప్రసన్నుండై యనిమిషులకు మునిగణంబులకు నానందం బొసంగె; శతానందుం డయ్యిందుశేఖరునితో 'దేవా! నీనుదుటి చెమటం బుట్టిన యప్పురుషుండు జ్వరంబను నామంబున బ్రశస్తుండయి యెందునుం జరియించు; నీ జ్వరం బేకముఖత్వంబునం బృథివికి దుర్భరంబగు బహువిధంబుగా సృజియింపవే' యనుడు నగ్గిరీశుండు కరులకు శిరస్తాపనంబును, భుజంగంబులకు నిర్మోకంబును, గోవులకు ఖురాంతర్బాధనంబును, మృగంబులకు నైజస్వరూపదర్శన ప్రత్యవరోధనంబును, దురగంబులకుఁ బార్శ్వశోషణంబును, మయూరంబులకుఁ బత్త్రోద్భేదనంబును, గోకిలంబులకు నేత్రరోగంబును, శుకంబులకు హిక్కయు, నజంబులకుఁ జిత్తభ్రమణంబును, శార్దూలంబులకు శ్రమంబును, మనుష్యులకు జననమరణాదుల యెడ వేదనావేశంబునుంగా విభాగించె; నివి జ్వరప్రకారంబు. జ్వరంబు మాహేశ్వరతేజంబు గావున సర్వజనంబులకు నమస్కార్యంబును, మాననీయంబునై యుండు.** **443**

ప్రతిపదార్థం: ఆ+పరమేశ్వరుండు= ఆ శివుడు; సుప్రసన్నుండు+ఐ= అత్యంతానుగ్రహంకలవాడై; అనిమిషులకున్= దేవతలకు; మునిగణంబులకున్= ముని బృందానికి; ఆనందంబు+ఒసంగెన్= సంతోషం కలిగించాడు; శతానందుండు= బ్రహ్మ; ఆ+ఇందుశేఖరునితోన్= ఆ చంద్రశేఖరుడితో; దేవా!= ప్రభూ!; నీ నుదుటి చెమటన్= నీ నొసలి స్వేదమునందు; పుట్టిన= జనించిన; ఆ+పురుషుండు= ఆ పురుషుడు; జ్వరంబు+అను= జ్వరం అనే; నామంబునన్= పేరుతో; ప్రశస్తుండు+అయి= ప్రసిద్ధుడై; ఎందునున్= ప్రతిచోటా; చరియించున్= తిరుగుతాడు; ఈ జ్వరంబు= ఇట్టి జ్వరం; ఏకముఖత్వంబునన్= ఒకే రూపుతో; పృథివికిన్= భూమికి; దుర్భరంబు+అగున్= భరించరాని దవుతుంది; బహువిధంబుగాన్= నానాముఖాలుగా; సృజియింపవే= సృష్టించుమా; అనుడున్= అని చెప్పగా; ఆ+గిరీశుండు= ఆ శివుడు; కరులకున్= ఏనుగులకు; శిరస్తాపనంబును= తల నొప్పియును; భుజంగంబులకున్= పాములకు; నిర్మోకంబునున్= కుబుసమును; గోవులకున్= ధేనువులకు; ఖురాంతర్బాధనంబునున్= గిట్టలలో నొప్పియును; మృగంబులకున్= జింకలకు; నైజస్వరూపదర్శనప్రత్యవరోధనంబునున్= తమస్వరూపాన్ని చూడటంలో ఆటంకమును; తురగంబులకున్= గుర్రాలకు; పార్శ్వశోషణంబునున్= ప్రక్కలు శుష్కించుటయును; మయూరంబులకున్= నెమళ్ళకు; పత్త్రోద్భేదనంబును= ఈకలు ఊడుటయును; కోకిలంబులకున్= కోయిలలకు; నేత్రరోగంబును= కంటివ్యాధియును; శుకంబులకున్= చిలుకలకు; హిక్కయున్= ఎక్కిళ్ళును; అజంబులకున్= మేకలకు; చిత్తభ్రమణంబును= మనస్సు భ్రమించుటయును; శార్దూలంబులకున్= పులులకు; శ్రమంబును= శ్రాంతియును; మనుష్యులకున్= మానవులకు; జనన మరణ+ఆదులయెడన్= పుట్టుక, చావు మొదలైన సందర్భాలలో; వేదనా+ఆవేశంబునున్+కాన్= దుఃఖావేశమును కాగా; విభాగించెన్= విభజించాడు; ఇవి= ఈ చెప్పినవి; జ్వరప్రకారంబు= జ్వరముయొక్క స్వరూపం; జ్వరంబు= జ్వరం; మహేశ్వరతేజంబు+అగున్= శివసంబంధమైన

తేజస్సు; కావునన్= అందువలన; సర్వజనంబులకున్= సమస్తప్రజలకు; నమస్కార్యంబునున్= నమస్కరించదగినదియును; మాననీయంబును= పూజించదగినదియును; ఐ+ఉండున్= అయి ఉన్నది.

తాత్పర్యం: ఆ శివుడు వారిపట్ల అనుగ్రహపరుడై దేవతలకు, మునులకూ ఆనందం కలిగించాడు. బ్రహ్మదేవుడు ఆ చంద్రశేఖరుడితో 'దేవా! నీ నొసటి చెమట నుండి పుట్టిన పురుషుడు 'జ్వరం' అనే పేరుతో ప్రసిద్ధుడవుతాడు. అతడు సర్వత్రా సంచరిస్తాడు. ఆ జ్వరం ఏకరూపమై ఉంటే భూమి భరించలేదు. అందువలన దానిని నానా రూపాలుగా సృష్టించుము' అని చెప్పాడు. అప్పుడు శంకరుడు ఆ జ్వరాన్ని ఏనుగులకు తలనొప్పిగా, పాములకు కుబుసంగా, గోవులకు గిట్టలలో నొప్పిగా, లేళ్ళకు తమరూపు చూచేదానికి ఆటంకంగా, గుర్రాలకు పార్శ్వభాగంలో శోషణంగా, నెమళ్ళకు ఈకలు ఊడిపోవటంగా, కోకిలలకు నేత్రవ్యాధిగా, చిలుకలకు వెక్కిళ్ళుగా, మేకలకు మనోభ్రాంతిగా, పులులకు శ్రమగా, మానవులకు చావుపుట్టుకలు మొదలైన సందర్భాలలో దుఃఖంగా విభజించాడు. ఇది జ్వరస్వరూపం. జ్వరం శివుడి తేజస్సు. అందుచేత అది అందరికీ నమస్కరించదగింది, సమ్మానించదగిందిగాఉన్నది.

క. జ్వరకథ వినినఁ బఠించినఁ । బురుషుం డారోగ్యసిద్ధిఁ బొదలుం; దేజః
స్ఫురణముఁ జిత్తసమాధియు । దొరకొనుఁ; గోర్కులు ఫలించు; దురితము లడఁగున్.' 444

ప్రతిపదార్థం: జ్వరకథ= జ్వరచరిత్ర; వినినన్= విన్నా; పఠించినన్= చదివినా; పురుషుఁడు= మనుజుడు; ఆరోగ్యసిద్ధిన్= ఆరోగ్య ప్రాప్తితో; పొదలున్= శోభిల్లుతాడు; తేజస్స్ఫురణమున్= తేజస్సుయొక్క దీప్తియును; చిత్తసమాధియున్= మనోనిగ్రహమును; దొరకొనున్= లభిస్తుంది; కోర్కులు= అభిలాషలు; ఫలించున్= ఫలిస్తాయి; దురితములు= పాపాలు; అడఁగున్= నశిస్తాయి.

తాత్పర్యం: జ్వరముయొక్క ఈ చరిత్రను విన్నా, చదివినా పురుషుడు ఆరోగ్యం పొందుతాడు. అతడికి తేజస్సూ, చిత్తనిగ్రహమూ సిద్ధిస్తాయి. కోర్కెలు తీరుతాయి. పాపాలు తొలగిపోతాయి'.

క. అని చెప్పి యమరతటినీ । తనూభవుం డాదరమున ధర్మసుతునితో
'ననఘా! నీ విం కెయ్యది । వినవల?' తనవుడు నతండు వినయానతుఁడై. 445

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; అమరతటినీ తనూభవుండు= గంగాసుతుడు; ఆదరమునన్= ప్రీతితో; ధర్మసుతునితోన్= ధర్మపుత్రుడితో; అనఘా!= పాపరహితుడా!; నీవు+ఇంకన్= నీవు ఇంకమీదట; ఏ+అది= ఏది; వినవలతు(వు)?= వినగోరుతున్నావు?; అనవుడున్= అనగా; అతండు= ధర్మజుడు; వినయ+ఆనతుఁడు+ఐ= వినయంతో ప్రణమిల్లినవాడై.

తాత్పర్యం: ఈ విధంగా చెప్పి భీష్ముడు ప్రీతితో ధర్మజుడిని చూచి 'అనఘా! నీ వింకా ఏమి వినాలనుకొంటున్నావు?' అని ప్రశ్నించాడు. అంతట ధర్మరాజు వినయంతో భీష్ముడికి నమస్కరించి. (తరువాతి పద్యంతో అన్వయం).

శాస్త్రతత్త్వం బెఱుంగని వాఁడు సేయవలసిన విధము (సం. 12-276-3)

తే. 'శాస్త్రతత్త్వ మెఱుంగక సంశయాత్ముఁ । డగుచుఁ బరమార్థ మిట్టిది యనఁగలేని
యట్టివాఁ డేమి కర్మంబు నాచరించు । వాఁడు సెప్పవె ధర్మప్రవర్తనజ్ఞ!' 446

ప్రతిపదార్థం: ధర్మప్రవర్తనజ్ఞ!= ధర్మంయొక్క ప్రవృత్తిని తెలిసిన ఓ పితామహా!; శాస్త్రతత్త్వమున్= శాస్త్రముయొక్క నిజ స్వరూపాన్ని; ఎఱుంగక= తెలియక; సంశయ+ఆత్ముఁడు+అగుచున్= సందేహంతో కూడిన మనస్సు కలవాడవుతూ; పరమార్థము=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముఖ్యార్థం; ఇట్టిది= ఇటువంటిది; అనఁగన్ లేని అట్టివాఁడు= అనజాలని మనుజుడు; ఏమి కర్మంబున్= ఏ పనిని; ఆచరించువాఁడు= చేయువాడు; చెప్పవె!= వివరించుమా!

తాత్పర్యం: 'ధర్మప్రవృత్తిని గ్రహించిన పితామహా! శాస్త్రతత్త్వం ఏమిటో తెలియక సందేహించేవాడు ఇదమిత్థమని పరమార్థం గ్రహించజాలడు. అట్లాంటివాడు ఏ పని చేస్తాడో వివరించుము.

వ. **అని యడిగిన నమ్మహామతి యతని కిట్లను 'గురుపూజయు వృద్ధోపసేవనంబును విద్యాశ్రవణంబు నవశ్యకర్తవ్యంబులు; మఱియునుం జేయవలయునవి నారద గాలవ సంవాదంబు వినినం దెలియు; వినుము చెప్పెద; నారదు నాశ్రయించి గాలవుండు.** **447**

ప్రతిపదార్థం: అని అడిగినన్= అని ప్రశ్నించగా; ఆ+మహామతి= ఆ మహాబుద్ధి అయిన భీష్ముడు; అతనికిన్= ధర్మజుడికి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; గురుపూజయున్= ఆచార్యులను అర్చించటమూ; వృద్ధ+ఉపసేవనంబును= పెద్దలను సేవించటమూ; విద్యాశ్రవణంబున్= విద్యను వినటమూ; అవశ్యకర్తవ్యంబులు= తప్పక చేయదగినవి; మఱియునున్= ఇంకను; చేయవలయునవి= అనుష్ఠించవలసినవి; నారద గాలవ సంవాదంబున్= నారదగాలవమునుల సంభాషణమును; వినినన్= వింటే; తెలియున్= తెలుస్తుంది; చెప్పెదన్= వివరిస్తాను; వినుము= ఆకర్ణించుము; గాలవుండు= గాలవుడను ముని; నారదున్+ఆశ్రయించి= నారదుడిని చేరి.

తాత్పర్యం: ధర్మజుడు అట్లా అడిగేసరికి మహాబుద్ధిమంతు డయిన భీష్ము డతడితో ఇట్లా అన్నాడు: 'గురువులను పూజించటం, వృద్ధులను సేవించటం, విద్యను వినటం తప్పక చేయదగిన పనులు. ఇంకా చేయదగినవి నారదగాలవుల మధ్య జరిగిన సంవాదం వింటే తెలియవస్తాయి. ఆ సంవాదం చెప్పుతాను, వినుము. గాలవుడు నారదమునిని ఆశ్రయించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **నానా శాస్త్రంబుల న । ర్థానేకత్వంబు గనుచు నప్రాప్త సువి**
జ్ఞానపరినిష్ఠ మగు మ । న్మానసముం దేర్పవే సమగ్రవివేకా!' **448**

ప్రతిపదార్థం: సమగ్రవివేకా!= పూర్ణవివేకం కలవాడా!; నానా శాస్త్రంబులన్= వివిధ శాస్త్రాలలో; అర్థ+అనేకత్వంబున్= విషయాల బాహుళ్యాన్ని; కనుచున్= చూస్తూ; అప్రాప్తసువిజ్ఞాన పరినిష్ఠము+అగు= పొందబడని మంచి విజ్ఞానమునందు నిష్ఠను పొందనిదైన; మన్మానసమున్= నా చిత్తాన్ని; తేర్పవే!= ప్రసన్నత పొందించుమా!

తాత్పర్యం: పూర్ణవివేకం కల ఓ నారదమునీంద్రా! నేను అనేక శాస్త్రాలు చూచాను. అందులోని నానా విషయాలు నా దృష్టికి వచ్చాయి. కాని, మంచి విజ్ఞానంలో నా మనస్సు నిలుకడ పొందలేదు. ఇట్లాంటి నా చిత్తం ప్రసన్నమయ్యేటట్లు నాకు బోధచేయుము'.

వ. **అని యభ్యర్థించిన నద్దేవముని యమ్మహాద్విజున కిట్లనియె.** **449**

ప్రతిపదార్థం: అని+అభ్యర్థించినన్= అని కోరగా; ఆ+దేవముని= ఆ నారదముని; ఆ+మహాద్విజునకున్= ఆ మహాబ్రాహ్మణుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: గాలవుడు ఆ రీతిగా అడిగేసరికి నారదమునీంద్రుడు ఆ మహావిప్రుడిని చూచి ఇట్లా చెప్పాడు.

క. **చతురాశ్రమముల వృత్త । స్థితులు పరీక్షించి యందుఁ జెందఁదలఁచి త**
ద్గతి సూక్ష్మదృష్టిఁ గనుఁగొని । సతతంబుఁ ద్రివర్గచరిత సౌమ్యుం డగుచున్. **450**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: చతురాశ్రమముల వృత్తస్థితులు= బ్రహ్మచర్యం మొదలైన నాల్గు ఆశ్రమాల వర్తనాలు, పరిస్థితులు; పరీక్షించి= పరికించి; అందున్= ఆ ఆశ్రమాలలో; చెందన్+తలఁచి= ప్రవేశించటానికి సంకల్పించి; తద్గతిన్= వాటి పోకడను; సూక్ష్మదృష్టిన్= సూక్ష్మమైన చూపుతో; కనుఁగొని= చూచి; సతతంబున్= ఎల్లవేళలా; త్రివర్గచరితన్= ధర్మాదులైన త్రివర్గాల నడతతో; సౌమ్యుండు+అగుచున్= శోభిల్లిన వాడు అవుతూ.

తాత్పర్యం: బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే నాలుగాశ్రమాల పరిస్థితులనూ పరికించాలి. అందులో ప్రవేశించదలచినవాడు వాటి పోకడను సూక్ష్మదృష్టితో చూడాలి. సదా ధర్మార్థకామాల నడవడికలో సౌమ్యభావం కలిగి ఉంటూ (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **పాపకర్మంబు లెల్లనుఁ బాయఁ బెట్టి। పుణ్యకృత్యంబు లగువానిఁ బురుషుఁ డోపి**
నట్లు శుద్ధమనస్కుఁడై యాచరించు। వాఁడు సజ్జనసంగతి వలయు నెపుడు. **451**

ప్రతిపదార్థం: పురుషుఁడు= మానవుడు; పాపకర్మంబులు+ఎల్లనున్= పాపపు పనులన్నింటినీ; పాయన్+పెట్టి= త్యజించి; పుణ్యకృత్యంబులు+అగువానిన్= పుణ్యకార్యములైన వాటిని; ఓపినట్లు= శక్తి ననుసరించి; శుద్ధమనస్కుఁడు+ఐ= నిర్మలమైన చిత్తం కలవాడై; ఆచరించువాఁడు= చేసేవాడు కావాలి; ఎపుడున్= ఎల్లవేళలా; సజ్జనసంగతి= సాధుజనులతోడి పొత్తు; వలయున్= ఆవశ్యకమై ఉన్నది.

తాత్పర్యం: మనుజుడు పాపానికి హేతువులైన పను లన్నిటినీ వదలాలి. యథాశక్తి పవిత్రమైన చిత్తంతో పుణ్యకార్యాలు మాత్రమే చేయాలి. సదా సజ్జనులతో సాంగత్యం కలిగి ఉండాలి.

విశేషం: దుర్జనులతో సాంగత్యం వలన దుష్టసంస్కారాలు కలుగుతాయి. అందుచేత పాపకర్మల పట్ల ప్రవృత్తి కలుగుతుంది. పుణ్యకార్యాలు మాత్రమే చేయాలంటే అందుకు తగిన సంస్కారం సజ్జన సాంగత్యంతో సిద్ధిస్తుంది. అందుకే సజ్జనసంగతి అవసరమని చెప్పటమయింది.

క. **విను సర్వభూతముల యం। దును మార్దవయుక్తుఁడై మధుర వాగ్వృత్తిం**
బనుపడఁగవలయు; నార్జవ। మనూనముగ దేవపితృసమర్చకుఁ డగుచున్. **452**

ప్రతిపదార్థం: విను= వినుము; ఆర్జవము= ఋజుత్వం; అనూనముగన్= వెలితిలేనిది కాగా; దేవపితృసమర్చకుఁడు+అగుచున్= దేవతలకు, పితృదేవతలకు పూజలు చేసేవాడవుతూ; సర్వభూతముల+అందునున్= సమస్తప్రాణులందును; మార్దవయుక్తుఁడు+ఐ= మెత్తదనంతో కూడినవాడై; మధురవాగ్వృత్తిన్= తియ్యని వాగ్వ్యాపారమునందు; పనుపడఁగన్ వలయున్= వాడుక పడాలి.

తాత్పర్యం: ఇంకా వినుము. పురుషుడు కపటవృత్తిని వదలి ఋజుత్వాన్ని పూర్ణంగా కలిగి ఉండాలి. దేవతలనూ, పితృదేవతలనూ శాస్త్రోక్తవిధి ప్రకారం పూజించాలి. ఎల్లప్రాణుల పట్లా కాఠిన్యం వదలి మెత్తదనంతో వ్యవహరించాలి. మధురమైన మాటలకు అలవాటు పడాలి.

క. **అనహంకారము, నప్రా। ర్థనమును విషయములఁ బెద్ద దగులమియును మే;**
లనఘా! పరునిందించుట। దను వర్ణించుకొను టనుచితము లెయ్యెడలన్. **453**

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; అనహంకారమున్= అహంకారం లేకుండా ఉండటం; అప్రార్థనమును= యాచనలేకుండా ఉండటం; విషయములన్= శబ్దం, స్పర్శం మొదలైన విషయ సుఖాలలో; పెద్ద= మిక్కిలిగా; తగులమియును= ఆసక్తుడు కాకుండా ఉండటమూ; మేలు= శ్రేయస్కరం; ఏ+ఎడలన్= ఏ సందర్భంలోనైనా; పరున్= ఇతరుడిని; నిందించుట= తూలనాడటమూ; తనున్= తనను; వర్ణించుకొనుట= శ్లాఘించుకొనటమూ; అనుచితములు= తగని పనులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కల్మషరహితుడవైన ఓ గాలవమునీంద్రా! పురుషుడికి అహంకారం పనికిరాదు. యాచన కూడదు. అట్లాగే శబ్దస్పర్శ రూపరసగంధా లనే విషయాలలో అపరిమితమైన ఆసక్తి తగదు. అహంకారాది దోషాలు లేకుండా ఉంటే మేలు కలుగుతుంది. ఎప్పుడైనా సరే ఇతరులను నిందించటం, తనను తాను పొగడుకొనటమనేవి తగవు.

క. విను మలసుండును గర్వియు । ననర్థభాషియును మత్సరాలీఢుఁడుఁ గ్రో
ధనుఁడును గా వలవదు శ । క్త్యనురూపతఁ జేయవలయు నాతిథ్యంబున్. 454

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; అలసుండును= సోమరియు; గర్వియున్= గర్వం కలవాడూ; అనర్థభాషియును= అర్థరహితంగా మాట్లాడేవాడును; మత్సర+ఆలీఢుఁడున్= మచ్చరంచేత స్పృశించబడినవాడునూ; క్రోధనుఁడునున్= కోపం కలవాడును; కావలవదు= కాదగదు; ఆతిథ్యంబున్= అతిథిసత్కారాన్ని; శక్త్యనురూపతన్= శక్తికి తగినట్లుగా; చేయన్ వలయున్= ఆచరించాలి.

తాత్పర్యం: గాలవా! ఇంకా వినుము. మనుజుడు సోమరిపోతు, గర్వగ్రస్తుడు, నిష్ప్రయోజనంగా ఏదేదో మాటలాడేవాడు, మాత్సర్యదోషం కలవాడు, కోపశాలి కారాదు. అతిథులకు తన శక్తిననుసరించి సత్కారం చేయాలి. (శక్తికి మించిగాని, శక్తికి తక్కువగాకాని ఆతిథ్యం చేయదగదని భావం).

క. వేదాధ్యయనంబుఁ దదం । గాదరణము యజ్ఞవిధిసమారంభము ధా
త్రీదైవత సమ్మానము । నే దేశమునందుఁ గలుగు నిర వది నిలువన్. 455

ప్రతిపదార్థం: ఏ దేశమునందున్= ఏ భూ భాగములో; వేద+అధ్యయనంబున్= వేదాలు చదవటమును; తదంగ+ఆదరణమున్= వేదాల అంగాలను ఆదరించటమూ; యజ్ఞవిధి సమారంభమున్= యజ్ఞకార్యప్రయత్నమున్ను; ధాత్రీదైవత సమ్మానమున్= భూసురసత్కారమున్ను; కలుగున్= ఉండునో; అది= ఆ దేశం; నిలువన్= నివసించటానికి; ఇరవు= (తగిన) స్థానం.

తాత్పర్యం: వేదాధ్యయనం, వేదాంగాలైన శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం - అనే ఆరు శాస్త్రాలపట్ల ప్రీతి, యజ్ఞాచరణం, బ్రాహ్మణసమ్మానమూ - ఏ దేశంలో ఉంటాయో, ఆ దేశమే నివసించటానికి తగిన ప్రదేశమవుతుంది.

క. ఇత్తెఱఁగునఁ బురుషుం డ । త్యుత్తమ చరితముల నడచుచుండఁగఁ బాయుం
జిత్తంబుకలఁక బోధో । త్పత్తికి నది మూల మగు నధర్మవిదూరా!' 456

ప్రతిపదార్థం: అధర్మవిదూరా!= అధర్మానికి మిక్కిలి దూరంగా ఉన్నవాడా!; ఈ+తెఱఁగునన్= ఈ రీతిగా; పురుషుండు= మనుజుడు; అత్యుత్తమచరితములన్= మిక్కిలి శ్రేష్ఠమైన ప్రవర్తనలతో; నడచుచుండఁగన్= చరిస్తూ ఉంటే; చిత్తంబుకలఁక= మనస్సులోని మాలిన్యం; పాయున్= తొలగుతుంది; అది= అట్లా చిత్తమాలిన్యం తొలగటం; బోధ+ఉత్పత్తికిన్= జ్ఞానం కలగటానికి; మూలము+అగున్= కారణమవుతుంది.

తాత్పర్యం: అధర్మప్రవృత్తిలేని ఓ గాలవమునీ! ఈ రీతిగా మనుష్యుడు పవిత్రమైన నడవడిక కలిగి ప్రవర్తిస్తే అతడి చిత్తదోషం పరిహరించబడుతుంది. ఆ దోషం తొలగగానే అతడికి జ్ఞానోదయ మవుతుంది'.

క. అని చెప్పె ననుడుఁ గుంతీ । తనయాగ్రజుఁ డమరతటిని తనయునితో ని
ట్లనుఁ 'గాలపాశసంఛే । దనమును ననుబోఁటి యెవ్విధంబునఁ జేయున్?' 457

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని చెప్పెన్= అని వచించాడు; అనుడున్= అనగా; కుంతీతనయ+అగ్రజుఁడు= కుంతిపుత్రులలో పెద్దవాడైన ధర్మజుడు; అమరతటిని తనయునితోన్= గంగాసుతుడైన భీష్ముడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; ననుబోఁటి= నావంటివాడు; ఏ+విధంబునన్= ఏ రీతిగా; కాలపాశసంఛేదనమునున్= కాలమనే త్రాడును తెగకోయటాన్ని; చేయున్?= చేస్తాడు?

తాత్పర్యం: అని నారదుడు గాలవుడితో చెప్పాడని భీష్ముడు ధర్మజుడితో చెప్పాడు. అప్పుడు ధర్మసుతుడు భీష్ముడితో మళ్ళీ ఇట్లా అన్నాడు: 'నావంటి వాడు కాలపాశాన్ని ఎట్లా ఛేదించగలడు?'

వ. అని యడిగిన నతం డతని కిట్లనియె. **458**

ప్రతిపదార్థం: అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతండు= ఆ భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మజు డట్లా ప్రశ్నించగా భీష్ముడు అతడితో ఇట్లా అన్నాడు:

అరిష్టనేమి యను ముని సగరున కుపదేశించిన ధర్మప్రకారము (సం. 12-277-2)

ఆ. 'విను మరిష్టనేమి యను ముని నడిగె నీ। యడిగినట్ల సగరుఁ; డమ్మహాత్ముఁ
డన్నరేంద్రునకుఁ బ్రియంబునఁ జెప్పిన। సౌమ్యవాక్యములు ప్రశాంతిఁ జేయు. **459**

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; సగరుఁడు= సగరచక్రవర్తి; అరిష్టనేమి అను మునిన్= 'అరిష్టనేమి' అనే ఋషిని; నీ+అడిగినట్లు+అ= నీవు ప్రశ్నించినట్లే; అడిగెన్= ప్రశ్నించాడు; ఆ+మహాత్ముఁడు= ఆ అరిష్టనేమి; ఆ+నరేంద్రునకున్= ఆ రాజుకు; ప్రియంబునన్= ప్రీతితో; చెప్పిన= వచించిన; సౌమ్యవాక్యములు= తిన్నని మాటలు; ప్రశాంతిన్+చేయున్= ప్రకృష్టమైన శాంతిని కలిగిస్తాయి.

తాత్పర్యం: 'ధర్మజా! వినుము. నీవు నన్ను ఇప్పు డడిగిన రీతిగానే పూర్వం సగరుడనే నృపాలుడు అరిష్టనేమి అనే మునీంద్రుడిని ప్రశ్నించాడు. ఆ ముని ఆ రాజుకు ప్రీతితో అపుడు చెప్పిన శాంతవచనాలు వింటే మనస్సుకు శాంతి కలుగుతుంది.

వ. వానిం జెప్పెద నవహితుండవై వినుము. సగరుం బ్రబోధించుటకు నరిష్టనేమి యిట్లను. ధనధాన్య పశుకళత్ర పుత్రాదుల సందడింబడి డెందం బాకులంబగునేని ముక్తిమార్గంబు దుర్గమంబై యుండు. **460**

ప్రతిపదార్థం: వానిన్= ఆ వచనాలను; చెప్పెదన్= చెప్పుతాను; అవహితుండవు+ఐ= అవధానం కలవాడవై; వినుము= ఆలకించుము; అరిష్టనేమి= అరిష్టనేమి అనే మునీంద్రుడు; సగరున్= సగరచక్రవర్తిని; ప్రబోధించుటకున్= చక్కగా బోధించటానికి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; ధనధాన్య పశుకళత్ర పుత్రాదులు= ధనం, ధాన్యం, పశువులు, భార్య, బిడ్డలు మొదలైనవారి; సందడిన్= సమూహపు ఒత్తిడిలో; పడి= లగ్నమై; డెందంబు= హృదయం; ఆకులంబు+అగునేనిన్= వ్యాకులత చెందినట్లైతే; ముక్తిమార్గంబు= మోక్షపుదారి; దుర్గమంబు+ఐ+ఉండున్= పోగూడనిదై ఉంటుంది.

తాత్పర్యం: ధర్మజా! ఆ మాటలు చెప్పుతాను, సావధానంగా వినుము. సగరనృపుడిని ప్రబుద్ధుడిని చేయటానికై అరిష్టనేమి ఇలా అన్నాడు: 'ధనం, ధాన్యం, పశువులు, భార్య, పుత్రులు మొదలైన జనసమూహపు టొత్తిడిలో తగులుకొని చిత్తం వ్యాకులత్వం పొందితే మోక్షమార్గం త్రొక్కరానిదై పోతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **వృద్ధ కళత్రంబు బుద్ధిమత్పుత్రుల । విడిచి నిర్భరత వివిక్త దేశ**
మునకుఁ బోవలయు; సపుత్త్రుం డపుత్రకుం । డను విశేషంబు లే; దతులశాంతి
వైరాగ్యములు గలవానికి విను నృప । వర్య! బంధులఁబ్రోవవలదె యను త
లంపున సంసారలంపటుం డగువాఁడు । బేల; దా మృత్యువుపాలు వడిన

ఆ. **యపుడవారి నరయ నబ్బునే యద్దశఁ । దలఁచి ముక్తి గోరఁదగదె యట్లుఁ**
గాక తనకు వారు గలుగుదురే యప్పు । డదియుఁ దలఁపవలయు నదియ కాదె! 461

ప్రతిపదార్థం: నృపవర్య!= రాజశ్రేష్ఠా!; విను= ఆలకించుము; వృద్ధకళత్రంబున్= ముసలిదైన భార్యను; బుద్ధిమత్పుత్రులన్= బుద్ధిమంతులైన కుమారులను; విడిచి= వదలి; నిర్భరతన్= నిబ్బరంతో; వివిక్త దేశమునకున్= జనశూన్యమైన చోటికి; పోవలయున్= వెళ్ళవలెను; అతులశాంతి వైరాగ్యములు= సాటిలేని శమము, విరక్తి; కలవానికిన్= కల్గినవాడికి; సపుత్రకుండు= పుత్రులు కలవాడు; అపుత్రకుండు= పుత్రులు లేనివాడు; అనువిశేషంబు= అనే భేదం; లేదు= ఉన్నదికాదు; బంధులన్= చుట్టాలను; ప్రోవన్ వలదె?= రక్షింపవద్దా?; అను తలంపునన్= అనే సంకల్పంతో; సంసారలంపటుండు+అగువాఁడు= సంసారంలో మిక్కిలిగా ఆసక్తుడైనవాడు; బేల= మూఢుడు; తాన్= తాను; మృత్యువుపాలుపడినన్= మరణిస్తే; అప్పుడు= ఆ సమయంలో; వారిన్= ఆ బంధువులను; అరయన్ వచ్చునే?= కాపాడనగునా?; ఆ+దశన్= ఆ స్థితిని; తలఁచి= భావించి; ముక్తి= మోక్షం; కోరన్+తగదె?= అభిలషింపదగదా?; అట్లున్+కాక= అట్లా కాకున్న; అప్పుడు= తాను మరణించే సమయాన; తనకున్ వారు కలుగుదురే?= తన విషయంలో బంధువులు సాయపడతారా?; అదియున్= ఆ విషయంకూడ; తలఁపన్ వలయునదియ కాదె!= ఆలోచించదగిందే కదా!

తాత్పర్యం: రాజేంద్రా! వినుము. మనుజుడు వార్ధకదశలో ఉన్న భార్యను, బుద్ధిమంతులైన పుత్రులనూ వదలి నిబ్బరంగా ఏకాంతప్రదేశానికి పోవాలి. శాంతి, వైరాగ్యం కలవాడు తప్పక అట్లా పోతాడు, కాని అతడు బిడ్డలు కలవాడా? లేక లేనివాడా అనే తేడా లేదు. బిడ్డలున్నా విడిచి విరక్తుడు విజనస్థలానికి వెళ్ళుతాడు. సంసారంలో పూర్తిగా మునిగిపోయిన వాడు ఈ బంధువులను నేను రక్షించవద్దా? - అనే తలంపు కలిగి ఉంటాడు. అట్లాంటి వాడు మూర్ఖుడు. ఒకవేళ తాను మరణించాడనుకో, అపుడు వారి నతడు కాపాడగలడా? ఆ స్థితిని ఊహించి ముందే ముక్తి కోరుకొనాలి. బంధువులను వదలకుండా ఉన్నా, తనకు మరణం ఆసన్నమైనపుడు వారు తనను కాపాడగలరా? లేక ముక్తిని ఈయగలరా? ఈ సంగతి కూడా ఆలోచించదగిన అంశమే కదా!

తే. **భూతముల పుట్టుఁ జేష్టయుఁ బొలియుటయును । జూచునేర్పు గలుగువాఁడు సూడనేర్చు**
మోక్షమార్గంబు చిత్తంబు మూఢమైన । సక్తుఁడగు లోకగతి నెట్లు ముక్తి గలుగు? 462

ప్రతిపదార్థం: భూతముల పుట్టున్= ప్రాణుల పుట్టుకనూ; చేష్టయున్= అవి చేసే కర్మలూ; పొలియుటయునున్= తుదకు అవి మరణించటాన్నీ; చూచునేర్పు కలుగువాఁడు= పరిశీలించే చాతుర్యం కల బుద్ధిమంతుడు; మోక్షమార్గంబున్= ముక్తిపథాన్ని; చూడనేర్చున్= కనుగొనగలడు; చిత్తంబు= మనసు; మూఢమైనన్= మోహగ్రస్తమైతే; లోకగతిన్= లోకప్రవృత్తిలో; సక్తుఁడు+అగున్= ఆసక్తి కలవా డవుతాడు; ముక్తి= మోక్షం; ఎట్లు కలుగున్?= ఎట్లా సంభవిస్తుంది?

తాత్పర్యం: నిత్యం ప్రాణులు పుట్టి, కర్మలు చేసి, గిట్టుతూ ఉన్నాయి. దీనిని చక్కగా గమనించినవాడు మోక్షకాంక్షతో శ్రేయోమార్గంలో పయనిస్తాడు. ఎవడి చిత్తం సంసారవ్యామోహానికి లొంగిపోయిందో వాడు లోకప్రవృత్తిలో తగులుకొని ప్రేయోమార్గంలో పడిపోతాడు. ఇక వాడికి మోక్షం ఎట్లా కలుగుతుంది?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అనఘ! దురన్నము శాల్యో। దనమును భూమియును మృదుల తల్పము నజిన
మ్మును సురుచిరచీనాంబర। మును సరి యెవ్వనికి నతఁడు ముక్తిం బడయున్. 463

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఎవ్వనికిన్= ఏ మనుజుడికి; దురన్నమున్= దుష్టాన్నమును; శాల్యోదనమునున్= మేలైన వరి అన్నమున్నూ; భూమియును= కటికనేలయు; మృదులతల్పమున్= మెత్తని శయ్యయు; అజినమ్మునున్= జింకచర్మమును; సురుచిర చీనాంబరమునున్= అందమైన పట్టువస్త్రమును; సరి= సమానమో; అతఁడు= అట్లాంటివాడు; ముక్తిన్= మోక్షమును; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ రాజా! ఎవడు దుష్టాన్నమునూ, మేలైన మృష్టాన్నాన్నీ, కటికనేలనూ, మెత్తని హంసతూలికాతల్పాన్నీ, జింకచర్మాన్నీ, అందమైన పట్టు పీతాంబరాన్నీ సమదృష్టితో చూస్తాడో వాడు ముక్తి పొందుతాడు.

తే. నేలయెల్లను నేలిన నృపుల పుట్టు। నీఁగిపోకయుఁ జూపాదిగాఁగఁ గలుగు
శక్తు లెడలినఁ జెడు మేని చందమును ద। లంప నేర్చునతఁడు మోక్షలక్ష్మిఁ జెందు. 464

ప్రతిపదార్థం: నేల+ఎల్లనున్= సమస్త భూమండలాన్నీ; ఏలిన= పాలించిన; నృపుల పుట్టున్= రాజుల జన్మయు; ఈఁగిపోకయున్= వెనుకకొరగి పోవటమున్నూ; చూపు+ఆది కాఁగన్+కలుగు= చూపు మొదలుగాగల; శక్తులు= సామర్థ్యాలు; ఎడలినన్= తొలగిపోగా; చెడు= చెడిపోతున్న; మేనిచందమునున్= శరీరస్థితిని; తలంపన్ నేర్చునతఁడు= భావించగల వాడు; మోక్షలక్ష్మిన్= మోక్షశ్రీని; చెందున్= పొందుతాడు.

తాత్పర్యం: సమస్త భూమండలాన్నీ పరిపాలించిన మహారాజులు సైతం కాలం చెల్లగానే నేలకొరగి పోతున్నారు. చూపు మొదలైన ఇంద్రియశక్తులు ఉడిగిపోగానే శరీరం చెడిపోతున్నది. దీనిని చక్కగా భావించి సంసారముయొక్క నిస్సారతను గమనించగలవాడు మోక్షలక్ష్మిని చేపట్టగలడు.

క. ధనయోగము దుర్లభమని। యును గ్లేశము సులభ మనియు నూహించుచు నె
మ్మనమున మర్త్యత్వము గీ। డని యెఱుఁగు నతండు గను మహానందంబున్. 465

ప్రతిపదార్థం: ధనయోగము= అర్థప్రాప్తి; దుర్లభము+అనియునున్= పొంద శక్యం కానిదనీ; క్లేశము= దుఃఖం; సులభము+అనియున్= అనాయాసంగా పొందబడునదనీ; ఊహించుచున్= భావిస్తూ; నెమ్మనమునన్= చిత్తంలో; మర్త్యత్వము= మనుష్యత్వం; కీడు+అని= అశుభమనీ; ఎఱుఁగు అతండు= తెలిసికొనే వాడు; మహానందంబున్= మోక్షానందాన్ని; కనున్= పొందుతాడు.

తాత్పర్యం: ఈ లోకంలో సుఖజీవనాని కవసరమైన ధనాన్ని సంపాదించటం సులభమైన విషయం కాదు. ఏ ప్రయత్నం చేయకుండానే వచ్చేవి క్లేశాలు అని భావించాలి. ఈ భావనవలన మానవత్వం శుభప్రదం కాదన్న సత్యం తెలియవస్తుంది. అట్లా గ్రహించినవాడు మోక్షం పొంది నిరతిశయానందాన్ని అందుకొంటాడు.

క. కావున గృహస్థవృత్తి। న్నీవతిలోలుఁడవు గాక నెఱిఁ జేయుము ర
క్షావిధి ధరణీప్రజకుం। గైవల్యము దాన నీకుఁ గలుగుం జులుకన్.' 466

ప్రతిపదార్థం: కావునన్= అందువలన; నీవు గృహస్థవృత్తిన్= నీవు గృహస్థుడికి చెందిన వర్తనంలో; అతిలోలుఁడవు కాక= మిక్కిలి ఆసక్తికలవాడవు కాకుండా; నెఱిన్= క్రమంగా; ధరణీప్రజకున్= భూమిలోని జనులకు; రక్షావిధిన్= రక్షణకార్యాన్ని; చేయుము= ఆచరించుము; దానన్= దానివలన; కైవల్యము= ముక్తి; చులుకన్= అనాయాసంగా; నీకున్+కలుగున్= నీకు సిద్ధిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అందుచేత నీవు గృహస్థులకు చెందిన నడతలో లంపటుడవు కావద్దు. క్రమంగా జనానీకాన్ని నీ విధ్యుక్తధర్మం పాటించి పరిపాలించుము. అందువలన నీకు కష్టం లేకుండా మోక్షం సిద్ధిస్తుంది'.

క. అని బోధించిన సగరుం। డనయముఁ దెలివొంది నియతుఁడై ప్రజ రక్షిం
చె నరేంద్ర! నీవుఁ దద్వ। ర్తనమున నెగడుము జనాభిరంజన మొప్పన్.' 467

ప్రతిపదార్థం: నరేంద్ర!= రాజా!; అని బోధించినన్= అరిష్టనేమి ఈ రీతిగా బోధించగా; సగరుండు= సగరు డనే భూపాలకుడు; అనయమున్= మిక్కిలి; తెలివి+ఒంది= వివేకం పొంది; నియతుఁడు+ఐ= నియమం కలవాడై; ప్రజన్= జనులను; రక్షించెన్= కాపాడాడు; నీవున్= నీవు కూడ; తద్వర్తనమునన్= అట్టి ప్రవర్తనతో; జన+అభిరంజనము= ప్రజారంజనం; ఒప్పన్= విలసిల్లగా; నెగడుము= వర్ధిల్లుము.

తాత్పర్యం: అరిష్టనేమి అట్లా ప్రబోధించేసరికి సగరచక్రవర్తి ప్రబోధితుడయ్యాడు. నియమవంతుడై ప్రజాపాలన కొనసాగించాడు. ధర్మరాజా! నీవు కూడా అతడివలె వర్తించి ప్రజలు రంజిల్లేటట్లుగా రాజ్యపాలన చేసి వర్ధిల్లుము.

తే. అనినఁ బ్రియమంది పాండవేయాగ్రజుండు। 'ధర్మ విద్వేషపరులగు దానవులకు
మంత్రియై యుండు శుక్రత్వ మహిమ యెట్లు। గలిగె భార్గవునకుఁ బుణ్యగణ్యచరిత!' 468

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; పాండవేయ+అగ్రజుండు= ధర్మజుడు; ప్రియము+అంది= ప్రీతినొంది; పుణ్యగణ్యచరిత్ర!= పుణ్యంచే గణనీయమైన శీలంకలవాడా!; భార్గవునకున్= శుక్రుడికి; ధర్మవిద్వేషపరులు+అగు= ధర్మాన్ని ద్వేషించేవారయిన; దానవులకున్= రక్కసులకు; మంత్రి+ఐ+ఉండు= అమాత్యుడై ఉండునట్టి; శుక్రత్వ మహిమ= శుక్రత్వప్రభావం; ఎట్లు= ఎట్లా; కలిగెన్?= సంభవించింది?

తాత్పర్యం: భీష్ముడు ఆ విధంగా చెప్పగా విని ధర్మరాజు ప్రీతి పొందాడు. మళ్ళీ భీష్ముడితో ఇలా అన్నాడు: 'పుణ్యంతో ప్రసిద్ధి పొందిన సచ్చరిత్రగల ఓ పితామహా! రాక్షసులు ధర్మాన్ని ద్వేషించేవారుకదా! వారికి మంత్రిగా మనగలిగే 'శుక్రత్వం' అనే మహిమ భార్గవుడికి ఎట్లా కలిగింది?'

శుక్రనామంబు భార్గవునకుం గలిగిన విధము (సం. 12-278-4)

చ. అనవుడు భీష్ముఁ డిట్లనియె 'నాతఁడు యోగబలంబు పెంపునన్
ధనదుని మోసపుచ్చి తదుదాత్త ధనం బవలీలఁ గొన్న నె
మ్మనమున నొచ్చి చెప్పెఁ బురమర్దనుతోడ; నతండు దానికిం
గనలున నమ్మహేశ్వరుఁడు గన్నుల నిప్పులు రాలుచుండఁగన్. 469

ప్రతిపదార్థం: అనవుడున్= అని ప్రశ్నించగా; భీష్ముఁడు= పితామహుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; ఆతఁడు= ఆ భార్గవుడు; యోగబలంబు పెంపునన్= యోగానికి చెందిన బలాతిశయంతో; ధనదునిన్= కుబేరుడిని; మోసపుచ్చి= వంచించి; తదుదాత్త ధనంబున్= ఆ కుబేరుడి శ్రేష్ఠమైన సంపదను; అవలీలన్= అనాయాసంగా; కొన్నన్= గ్రహించగా; అతండు= ఆ కుబేరుడు; నెమ్మనమునన్= హృదయంలో; నొచ్చి= బాధపడి; పురమర్దనుతోడన్= శివుడితో; చెప్పెన్= చెప్పాడు; దానికిన్= అందుకు; కనలునన్= కోపంతో; మహేశ్వరుఁడు= శివుడు; కన్నులన్= నేత్రాలలో; నిప్పులు= అగ్నికణాలు; రాలుచుండఁగన్= జారిపడుతూ ఉండగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మరాజు అట్లా ప్రశ్నించేసరికి భీష్ము డతడితో ఇట్లా అన్నాడు: 'భార్గవుడు గొప్ప యోగబలం ప్రదర్శించి కుబేరుడిని వంచించాడు. అతడి ధనం అనాయాసంగా అపహరించాడు. అందుకు కుబేరుడు చిత్తంలో చాలా నొచ్చుకొని తన మిత్రుడూ, త్రిపురాసుర సంహారకర్తా అయిన శివుడితో జరిగిన సంగతి చెప్పాడు. అది వినగానే శివుడికి కోపం వచ్చింది. ఆగ్రహాతిశయం వలన అతడి కన్నులనుండి నిప్పులు రాలాయి. అట్లా రాలుతూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **శూల ముగ్రత నెత్తి 'యెచ్చోట నున్న । వాఁడు భార్గవుఁ?' డనుచు దుర్వారకోప**
వివశుఁ డగుటయు? నాతఁడు వెఱచి చాల । దూరముగఁ బోయి తుప్పలఁ దూలియుండె. **470**

ప్రతిపదార్థం: ఉగ్రతన్= భయంకరత్వంతో; శూలమున్= శూలాయుధాన్ని; ఎత్తి= చేపట్టి; భార్గవుఁడు= శుక్రుడు; ఏ+చోటన్= ఎక్కడ; ఉన్నవాఁడు+అనుచున్= ఉన్నాడంటూ; దుర్వారకోప వివశుఁడు+అగుటయు= వారించరాని కోపంచేత వశంతప్పినవాడు కాగానే; ఆతఁడు= ఆ భార్గవుడు; చాలన్= మిక్కిలి; వెఱచి= భయపడి; దూరముగన్+పోయి= దూరంగా వెళ్ళి; తుప్పలన్= చిన్న పొదలలో; తూలిఉండెన్= నక్కి ఉన్నాడు.

తాత్పర్యం: శివుడు భీకరంగా శూలాయుధం పైకెత్తి 'భార్గవుడు ఎక్కడ ఉన్నాడు?' అంటూ అత్యధిక కోపంతో వివశుడైనాడు. అది చూచి చాలా భయపడి భార్గవుడు పరుగెత్తి దూరంగాపోయి చిన్న పొదలలో ఒదిగి ఉన్నాడు.

క. **అమ్మెయి నిలుచుటకునుఁ జి । త్త మ్మోర్వమిఁ దల్లడంబు దనికినఁ గడు వే**
గమ్మునఁ ద్రిపురహరుని హ । స్తమ్మునఁ జొప్పడియెఁ గని యతఁడు వెస మ్రింగెన్. **471**

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ రీతిగా; నిలుచుటకునున్= నిలిచి ఉండటానికి; చిత్తము= మనస్సు; ఓర్వమిన్= ఓర్చుకొనకపోవటం వలన; తల్లడంబు= వణకు; తనికినన్= పుట్టగా; కడువేగమ్మునన్= మిక్కిలి వేగంతో; త్రిపురహరుని= శివుడియొక్క; హస్తమునన్= చేతిలో; చొప్పడియెన్= దొరికిపోయాడు; అతఁడు= ఆ శివుడు; కని= చూచి; వెసన్= శీఘ్రంగా; మ్రింగెన్= కబళించాడు.

తాత్పర్యం: అట్లా పొదలలో దాగి ఉండటానికి అతడి చిత్తం ఓర్చుకొనలేకపోయింది. శరీరంలో కంపం కలిగింది. వెంటనే అతడు శివుడి చేతికి దొరికిపోయాడు. అది చూచి శివు డతడిని అప్పుడే మ్రింగివేశాడు.

ఆ. **కడుపులోన నుండి కలగొనఁ బాఱెడు । విబుధవైరిగురుఁడు వెడలకుండు**
నట్లుగాఁగఁ దెరువులన్నియు మూసి శి । శ్నంబు మూయ కంగజన్మరిపుఁడు. **472**

ప్రతిపదార్థం: కడుపులోనన్+ఉండి= ఉదరములోనుండి; కలగొనన్+పాఱెడు= కలతజెంది పరుగిడుతున్న (నలువైపులకు పరుగిడుతున్న); విబుధవైరిగురుఁడు= దేవతలకు శత్రువులగు రాక్షసులకు ఆచార్యుడైన శుక్రుడు; వెడలక+ఉండునట్లు కాఁగన్= వెలుపలికి చనక ఉండేటట్లుగా; అంగజన్మరిపుఁడు= మన్మథుడి శత్రుడగు శివుడు; తెరువులు+అన్నియున్= దారులన్నీ; మూసి= బంధించి; శిశ్నంబున్= పురుషాంగమును; మూయక= బంధించక.

తాత్పర్యం: అట్లా మ్రింగి తన కడుపులో ఉంటూ కలత చెందేటట్లు ఇటూ అటూ పరుగిడుతున్న భార్గవుడు పారిపోకుండా ఉండేటట్లు శివుడు దారులన్నీ మూసివేశాడు. కాని పురుషాంగద్వారం మాత్రం మూయకుండా తెరచి ఉంచాడు.

క. **వెడలు మని తెరువు సూపిన । వెడలెను భృగునందనుండు; వెండియుఁ గోపం**
బడరఁగ నాతనిఁ గనుఁగొని । యెడు రుద్రునిఁ జూచి దేవి యిట్లనియె నృపా! **473**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; వెడలుము= వెడలిపొమ్ము; అని తెరువు+చూపినన్= అని దారి చూపగా; భృగునందనుండు= భార్గవుడు; వెడలెను= శిశ్నద్వారం నుండి వెలుపలికి వచ్చాడు; వెండియున్= మరలకూడ; కోపంబు+అడరఁగన్= క్రోధం ప్రసరించగా; ఆతనిన్= ఆ భార్గవుడిని; కనుఁగొనియెడు= చూస్తూ ఉన్న; రుద్రునిన్= శివుడిని; చూచి= విలోకించి; దేవి= పార్వతి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ధర్మరాజా! అట్లా శివుడు శిశ్నద్వారం మాత్రం మూయక ఆ దారినుండి బయటికి పొమ్మని భార్గవుడికి దారి చూపాడు. అత డా దారినుండి వెలికి వచ్చాడు. ఇంకా శివుడి కోపం చల్లారలేదు. అతడివైపు కినుకతో చూస్తూనే ఉన్నాడు. అప్పుడు పార్వతీదేవి శివుడితో ఇట్లా అన్నది.

క. 'నీ కడుపున జన్మించుట । నాకుం గొడుకయ్యె నితఁడు; నా సుతునకు సు
శ్లోకా! యలుగం దగునే । నీకు? సుఖిం జేయు మీతనిం గృపతోడన్.' 474

ప్రతిపదార్థం: సుశ్లోకా!= మంచి కీర్తి కలవాడా!; ఇతఁడు= ఈ భార్గవుడు; నీ కడుపునన్= నీ ఉదరంలో; జన్మించుటన్= పుట్టటంతో; నాకున్+కొడుకు+అయ్యెన్= నాకూ పుత్రుడయ్యాడు; నా సుతునకున్= నా కుమారుడికై; నీకున్ అలుగన్+తగునే?= నీకు కోపింపతగునా?; ఈతనిన్= ఇతడిని; కృపతోడన్= దయతో; సుఖిన్+చేయుము= ఆనందింపజేయుము.

తాత్పర్యం: 'సుకీర్తీ! ఈ భృగుపుత్రుడు నీ కడుపునుండి పుట్టటం వలన నాకూ కొడుకయ్యాడు. నా కొడుకుపట్ల నీవు కోపించటం యుక్తమా? అందుచేత దయతో ఇతడిని సుఖవంతుడిని చేయుము'.

తే. అనినఁ దేజస్విఁ జేసి చంద్రార్ధ మౌళి । శిశ్నమున నిర్గమించుటఁ జేసి యితఁడు
శుక్రుఁ డనుపేర వర్తించు; సుదతి! నీకుఁ । బ్రియ మొనర్చితి ననియె సంప్రీతితోడ. 475

ప్రతిపదార్థం: అనినన్= అనగా; చంద్రార్ధమౌళి= చంద్రశేఖరుడు శివుడు; సంప్రీతితోడన్= మిక్కిలి ప్రీతితో; తేజస్విన్= తేజోవంతుడిగా; చేసి= ఒనర్చి; సుదతి!= పార్వతీ!; శిశ్నమునన్= మగగురిద్వారా; నిర్గమించుటన్+చేసి= బయలువెడలటం వలన; ఇతఁడు= ఈ భృగునందనుడు; శుక్రుఁడు+అనుపేరన్= శుక్రుడనే నామంతో; వర్తించున్= ప్రవర్తిస్తాడు; నీకున్= పార్వతివగు నీకు; ప్రియము+ఒనర్చితిన్= ప్రియం చేశాను; అనియెన్= అని చెప్పాడు.

తాత్పర్యం: పార్వతీదేవి అట్లా ప్రార్థించగానే శివుడు ప్రీతి పొందాడు. భార్గవుడిని తేజోవంతుడిగా చేశాడు. తరువాత పార్వతిని చూచి 'సుదతీ! వీడు నా శిశ్నమునుండి బయలువెడలినాడు. కాన 'శుక్రుడు' అనే పేరుతో వర్తిస్తాడు. నీకు ప్రియమైన కార్యం చేశా' నని చెప్పాడు.

తే. 'అనఘ! యిది భార్గవుఁడు శుక్రుఁడైన తెఱఁగు' । నావుడును ధర్మజుఁడు శాంతనవునితోడ
'నీదు వాక్యామృతమున నా నెమ్మనంబు । తృప్తి సనదు; సద్ధర్మంబుఁ దెలుపు' మనియె. 476

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఇది= ఇప్పుడు చెప్పింది; భార్గవుఁడు= భృగుపుత్రుడు; శుక్రుఁడైన తెఱఁగు= శుక్రుడుగా రూపొందిన విధానం; నావుడున్= అని చెప్పగా; ధర్మజుఁడు= ధర్మపుత్రుడు; శాంతనవునితోడన్= భీష్ముడితో; నీదు వాక్య+అమృతమునన్= నీ వచనమనే సుధతో; నా నెమ్మనంబు= నా చిత్తము; తృప్తి చనదు= తృప్తి చెందదు; సద్ధర్మంబున్= మంచిధర్మాన్ని; తెలుపుము+అనియెన్= తెలియజెప్పుమన్నాడు.

తాత్పర్యం: పాపరహితు డవగు ఓ ధర్మపుత్రా! ఇప్పుడు నేను చెప్పింది భార్గవుడు శుక్రుడుగా రూపొందిన కథాక్రమం అని భీష్మ డన్నాడు. అప్పుడు ధర్మసుతుడు శంతనుసుతుడైన భీష్ముడిని చూచి 'నీ వాక్యామృతం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఎంత గ్రోలినా నామనస్సు తృప్తి పొందటం లేదు. ఇంకా నాకు మంచి మంచి ధర్మాలు బోధించు' మని అర్థించాడు.

వ. అనవుడు నమ్మహానుభావుం డమ్మహీనాథుతోఁ 'బరాశర గీతా శ్రవణ ప్రవణుండ వగు'మది ధర్మప్రబోధకం బగునని పలికి యిట్లనియె. 477

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ఆ+మహానుభావుండు= ఆ మహాత్ముడైన భీష్ముడు; ఆ+మహీనాథుతోన్= ఆ రాజుతో; పరాశరగీతా శ్రవణ ప్రవణుండవు= పరాశరముని చెప్పిన గీతను వినటంలో ఆసక్తుడవు; అగుము= కమ్ము; అది= ఆ శ్రవణం; (లేక ఆ గీత); ధర్మప్రబోధకంబు+అగున్+అని= ధర్మమును చక్కగా బోధించేది అవుతుందని; పలికి= చెప్పి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధర్మజుడట్లా అర్థించగా మహానుభావుడైన భీష్ముడు ఆ రాజును చూచి 'నీవు పరాశరమహర్షి గీతను వినుము. అది ధర్మాన్ని చక్కగా బోధిస్తుంది' అని చెప్పి ఇట్లా పలికాడు.

జనకునకుఁ బరాశరముని యుపదేశించిన ధర్మప్రకారము (సం. 12-279-3)

సీ. జనకభూపతి యడిగినఁ బరాశరముని । ధర్మసంబోధనతా నిరూఢి
నిట్లని యెఱిఁగించె 'నిహపరసౌఖ్యముల్ । ధర్మకార్యములని తలఁచి నరుఁడు
ఫలము బీజంబునం బడయునట్టుల ధర్మ । మున సౌఖ్యసంసిద్ధిఁ బొందవలయు;
సుకృత దుష్కృతములు సుఖమును దుఃఖంబుఁ । గుడువఁ జేయక నరు విడువ వధిప!

తే. వాఙ్మనోదృష్టి కలితప్రవర్తనములఁ । గాయ చేష్టితములను నన్యాయపథముఁ
బొరయనీకున్న సత్పథనిరతి గలుగు । సత్యశమదమాహింసలు సత్పథములు. 478

ప్రతిపదార్థం: జనకభూపతి= జనకభూపాలుడు; అడిగినన్= ప్రశ్నించగా; పరాశరముని= పరాశరుడనే సంయమి; ధర్మసంబోధనతానిరూఢిన్= ధర్మమును చక్కగా బోధించుటంలోని నైపుణ్యంతో; ఇట్లు+అని= ఈ రీతిగా; ఎఱిఁగించెన్= తెలియపరచాడు; అధిప!= రాజా!; ఇహపరసౌఖ్యముల్= ఈ లోకంలోనూ; పరలోకంలోనూ కలిగే సుఖములు; ధర్మకార్యములు= ధర్మం కారణంగా కలిగే కార్యాలు; అని తలఁచి= అని భావించి; నరుఁడు= మనుజుడు; బీజంబునన్= విత్తనముతో; ఫలమున్= పండును; పడయునట్టుల= పొందునట్లు; ధర్మమునన్= ధర్మముతో; సౌఖ్యసంసిద్ధిన్= సుఖప్రాప్తిని; పొందవలయున్= చెందవలెను; సుకృత దుష్కృతములు= పుణ్యపాపములు; సుఖమునున్= సౌఖ్యమును; దుఃఖమున్= క్లేశమును; కుడువన్+చేయక= అనుభవించేటట్లు చేయకుండ; నరున్= మనుజుడిని; విడువవు= వదలవు; వాఙ్మనోదృష్టి కలిత ప్రవర్తనములన్= మాటలు, మనస్సు, చూపు - వీటితో కూడిన ప్రవృత్తులయందును; కాయచేష్టితములను= శరీరముతో చేయు పనులలోనూ; అన్యాయపథమున్= అధర్మమార్గం; పొరయనీక+ఉన్నన్= పొందనీయకుండా ఉన్నచో; సత్పథనిరతి= సన్మార్గంపై ఆసక్తి; కలుగున్= సంభవిస్తుంది; సత్యశమదమా హింసలు= సత్యము, అంతరింద్రియ నిగ్రహం; బాహ్యేంద్రియనిగ్రహం, అహింస- అనేవి; సత్పథములు= మంచిమార్గాలు.

తాత్పర్యం: జనకుడు పరాశరమునిని సద్ధర్మతత్త్వమును గురించి ప్రశ్నించాడు. ఆ ముని ధర్మప్రబోధమందలి నైపుణ్యంతో ఇట్లా చెప్పాడు. 'రాజా! మానవుడు ఇహలోక సుఖాలూ, పరలోక సుఖాలూ ధర్మమూలకాలే అని భావించాలి. విత్తనంవేసి తద్ద్వారా ఫలం పొందే విధంగానే ధర్మ మాచరించి సుఖం పొందాలి. పుణ్యం సుఖాన్నీ, పాపం దుఃఖాన్నీ మానవుడిచేత అనుభవింపజేయకుండా వదలవు. వాక్కులోగాని, మనస్సులోగాని, చూపులోగానీ,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శరీరంతో చేసే పనులలో గాని అన్యాయం అంటనీయకుండా ఉండగలిగితే సన్మార్గంపై ఆసక్తి కలుగుతుంది. సత్యం, అంతరింద్రియాలను నిగ్రహించటం, బాహ్యేంద్రియాలను నిగ్రహించటం, హింసలేకుండా ఉండట మనేవే సన్మార్గా లనబడుతాయి.

క. అనఘుం డింద్రియహయభృత । మనోరథ రథంబు నాఁగు మహితజ్ఞాన
త్వనిరూఢ రశ్మిశక్తిని । జనపాలక! దుష్పథమునఁ జనకుండంగన్. 479

ప్రతిపదార్థం: జనపాలక!= రాజా!; అనఘుండు= పాపరహితుడు; మహితజ్ఞానత్వ నిరూఢరశ్మి శక్తినిన్= శ్రేష్ఠజ్ఞానత్వమనే ప్రసిద్ధమైన పగ్గాలబలంతో; ఇంద్రియహయభృత మనోరథరథంబున్= ఇంద్రియాలనే గుర్రాలచేత భరించబడిన కోరికలనే రథాన్ని; దుష్పథమునన్= దుర్మార్గంలో; చనకుండంగన్= పోకుండా ఉండేటట్లు; ఆఁగున్= అరికట్టుతాడు.

తాత్పర్యం: రాజా! పాపరహితుడైన మనుజుడు శ్రేష్ఠమైన తెలివి అనే పగ్గాలతో ఇంద్రియాలనే గుర్రాలతో లాగబడే కోరిక లనే రథాన్ని అపమార్గంలో పోనీయకుండా నిగ్రహిస్తాడు.

విశేషం: అలం: రూపకం. శ్రోత్రం మొదలైన ఇంద్రియాలు అనే గుర్రాలు కోరికలనే రథాన్ని లాగుతున్నాయి. జ్ఞాని అయినవాడు తన జ్ఞానమనే పగ్గంతో ఇంద్రియాలను అరికట్టాలి. లేకపోతే ఇంద్రియాలు విషయాసక్తితో రథాన్ని అపమార్గంలోకి ఈడ్చుకుపోతాయి. అట్లా జరిగితే రథం గమ్యం చేరక ప్రమాదానికి లోనవుతుంది. ఇంద్రియ నిగ్రహంతో మానవుడు అధర్మమార్గంలో ప్రవేశించకుండా ఉండాలని భావం. కోరిక అనే రథం పరమాత్మవైపు పయనించాలి గాని, విషయాలవైపు పోకూడదు. కఠోపనిషత్తులో శరీరం రథంతోనూ, ఆత్మ రథికుడితోనూ, బుద్ధి సారథితోనూ, మనస్సు పగ్గంతోనూ, ఇంద్రియాలు గుర్రాలతోనూ, విషయాలు అపమార్గాలతోనూ రూపించబడ్డాయి. అక్కడి రూపకాలంకార ప్రక్రియే కొంత మార్పుతో ఇక్కడ అనుసరించబడింది.

ఆ. పడయరాని యాయు వొడలికిఁ గలిగినఁ । బాపకృతుల దానిఁ బదటఁ గలుప
నగునె పుణ్యవిధిసమాచరణములఁ గై । సేయవలయుఁ గాక చెలువు మిగుల. 480

ప్రతిపదార్థం: ఒడలికిన్= శరీరానికి; పడయన్ రాని= పొందరాని; ఆయువు= జీవితకాలము; కలిగినన్= లభిస్తే; దానిన్= దానిని; చెలువు= శోభ; మిగులన్= అతిశయించగా; పుణ్యవిధి సమాచరణములన్= పుణ్యకార్యముల నాచరించుటలతో; కైసేయవలయున్+కాక!= అలంకరింపవలెనుగాక!; పాపకృతులన్= పాపకార్యాలతో; పదటన్+కలుపన్+అగునె?= బూడిదలో కలపటం యుక్తమా?

తాత్పర్యం: శరీరానికి దుర్లభమైన ఆయువు దొరికినప్పుడు దానిని పాపపు పనులతో బూడిదపాలు చేయటం తగునా? అట్లా కాక శోభ అతిశయించేటట్లు ఆ శరీరాన్ని పుణ్యకార్యాలు చేయటంతో అలంకరించటం తగును. పవిత్రకార్యాలతో శరీరం శోభావహమవుతుంది. పాపకార్యాలతో చివరకు దానిని బూడిదపాలు చేయటం తగదని తాత్పర్యం.

క. దురితంబులు దొడరు నహిత । కరణంబున మేలు వడయఁగాఁ గోరుట భూ
వర! దుస్సలిలస్నానా । దరము తెఱఁగు సూవె యెవ్విధంబునఁదలఁపన్. 481

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; దురితంబులు= పాపాలు; తొడరు= విజృంభించునట్టి; అహితకరణంబునన్= హితములుగాని కార్యములు చేయటంవలన; మేలు= శ్రేయస్సును; పడయన్+కాన్+కోరుట= పొందాలని అభిలషించటం; ఏ+విధంబునన్= ఏ రీతిగా; తలఁపన్= ఆలోచించినా; దుస్సలిలస్నాన+ఆదరము తెఱఁగు= చెడునీటిలో స్నానము చేయుటయందలి ప్రీతివంటిది; చూవె= చూడుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజా! పాపకారణమైన దుష్టకార్యాలు చేసి శ్రేయస్సు పొందాలని కోరటం ఏ విధంగా ఆలోచించినా మురికినీటిలో స్నానం చేయటం వంటిదే. శుభ్రమైన నీటిలోనే స్నానం చేయాలి. అట్లాకాక మురికినీటిలో స్నానం చేస్తే శుభ్రత కలగదు. (అట్లాగే శ్రేయస్సు కోరేవాడు పుణ్యం కల్గించే పనులు చేయాలి కాని పాపం కలిగించే పనులు చేస్తే మేలు కలగదని తాత్పర్యం).

విశేషం: అలంకారం: ఉపమ.

క. **సమదర్శియై యఖిల భూ । తములను దనయట్ల కాఁగఁదలఁచుచు నెవ్వం**
డమలన్యాయపరుండగు । నమరు లతని వందనీయుఁ డంద్రు నరేంద్రా! 482

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా!; ఎవ్వండు= ఎవడు; సమదర్శి+ఐ= సమానమైన దృష్టికలవాడై; అఖిలభూతములనున్= సర్వప్రాణులను; తన యట్ల కాఁగన్= తనవంటివే అయినట్లుగా; తలఁచుచున్= భావిస్తూ; అమలన్యాయపరుండు+అగున్= నిర్మలమైన న్యాయమునందు నిరతుడవుతాడో; అతనిన్= అట్టివాడిని; అమరులు= దేవతలు; వందనీయుఁడు= నమస్కరించదగినవాడు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: రాజా! ఎవడు సమదృష్టి కలిగి సమస్త ప్రాణికోటినీ తనవంటిదే అని భావిస్తూ నిర్మలమైన న్యాయాన్ని పాటిస్తాడో, అతడిని దేవతలు నమస్కరణీయుడు అని చెబుతారు.

క. **ధన మించుకేని ధర్మం । బునఁ బడసినయట్టి దైన భూవర! పాత్రం**
బున నిడిన నది మహాఫల । జనకంబగు నంద్రు వేదసంవేదిజనుల్. 483

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; వేదసంవేదిజనుల్= వేదాలు చక్కగా ఎరిగినవారు; ధనము= అర్థం; ఇంచుక+ఏనిన్= కొద్దిపాటిదైనా; ధర్మంబునన్= ధర్మమార్గంతో; పడసిన అట్టిది+ఐనన్= ఆర్జించినట్టిదైతే; పాత్రంబునన్= తగినవాడియందు; ఇడినన్= ఉంచితే; అది= ఆ ధనం; మహాఫలజనకంబు= గొప్ప ఫలాన్ని కలిగించేది; అగున్+అంద్రు= అవుతుందని అంటారు.

తాత్పర్యం: రాజా! వేదాలను చక్కగా గ్రహించినవారు ధనం కొద్దిగానైనా ధర్మంగా ఆర్జించబడి ఉండి, దానిని తగినవారికి దానం చేస్తే, అది గొప్ప ఫలం కలిగిస్తుందంటారు.

తే. **మునుల ఋణ మధ్యయనమున, ననిమిషుల ఋ । ణంబు క్రతువున; నతిథిఋణంబు పూజఁ**
దీర్చునది శ్రాద్ధమునఁ బితృదేవతల ఋ । ణంబు, నరుల ఋణము రంజన వ్రతమున. 484

ప్రతిపదార్థం: అధ్యయనమునన్= వేదాధ్యయనంతో; మునుల ఋణమున్= ఋషిఋణాన్నీ; క్రతువునన్= యజ్ఞంతో; అనిమిషుల ఋణంబున్= దేవతల ఋణాన్నీ; పూజన్= సమ్మానసత్కారాదులతో; అతిథిఋణంబున్= అతిథులై వచ్చినవారి ఋణాన్నీ; శ్రాద్ధమునన్= పితృకర్మతో; పితృదేవతల ఋణంబున్= పితరుల ఋణాన్నీ; రంజనవ్రతమునన్= రంజింపజేయటం అనే వ్రతంతో; నరుల ఋణమున్= ప్రజల ఋణాన్నీ; తీర్చునది= తీర్చుకోవాలి.

తాత్పర్యం: వేదాలు చదవటంతో ఋషిఋణాన్నీ, యజ్ఞాలు చేయటంతో దేవతల ఋణాన్నీ, పూజాది సత్కారాలతో అతిథి ఋణాన్నీ, పితృకర్మతో పితరుల ఋణాన్నీ, చక్కని పాలనతో రంజింపజేయటం ద్వారా ప్రజల ఋణాన్నీ తీర్చుకోవాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. నారద పర్వత దేవల । భారద్వాజాదు లైన పరమమునులు ధ
ర్మారంభంబునఁ బడసిరి । గారవ మట్లగుట ధర్మకరణము వలయున్. 485

ప్రతిపదార్థం: నారద పర్వత దేవల భారద్వాజాదులు+ఐన= నారదుడు, పర్వతుడు, దేవలుడు, భారద్వాజుడు మొదలైన; పరమమనులు= శ్రేష్ఠమునులు; ధర్మ+ఆరంభంబునన్= ధర్మకార్యారంభంతో; గారవమున్= గౌరవమును; పడసిరి= పొందారు; అట్లు+అగుటన్= అట్లా కావటం వలన; ధర్మకరణము= ధర్మంయొక్క ఆచరణ; వలయున్= కావాలి.

తాత్పర్యం: నారదుడు, పర్వతుడు, దేవలుడు, భారద్వాజుడు మొదలైన మహామునీంద్రులు పూర్వం ధర్మకార్యాలు చేసి గౌరవానికి పాత్రులయ్యారు. అందువలన ధర్మకార్యాలు తప్పక చేయాలి.

క. విను మర్హుఁడగు ననర్హుం । డనఘా! విష్ణుస్తుతిక్రియం దపమున ధ
ర్మనిరూఢి నివి మనంబున । ఘన పరిబోధంబుఁ గూర్చుఁ గావున నధిపా! 486

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; అధిపా!= రాజా!; వినుము= ఆలకించుము; అనర్హుండు= అయోగ్యుడైన జనుడు; విష్ణుస్తుతిక్రియన్= విష్ణుదేవుడి స్తోత్రం చేయటమనే కర్మచేతను; తపమునన్= తపస్సుచేతను; ధర్మనిరూఢిన్= ధర్మప్రసిద్ధి చేతను; ఇవి= విష్ణుస్తుతి మొదలైనవి; మనంబునన్= చిత్తమునందు; ఘన పరిబోధంబున్= గొప్ప జ్ఞానమును; కూర్చున్+కావునన్= కలిగిస్తాయి కాబట్టి; అర్హుఁడు+అగున్= యోగ్యుడవుతాడు.

తాత్పర్యం: రాజా! విష్ణుస్తోత్రం, తపస్సు, ధర్మాచరణం అనేవి మనస్సులో గొప్ప జ్ఞానం కలిగిస్తాయి. అందువలన అయోగ్యుడైనవాడు స్తోత్రం, తపస్సు, ధర్మం ఆచరిస్తే యోగ్యుడుగా రూపొందుతాడు.

ఆ. ఆహితాగ్నిఁ బుణ్యుఁ డను శ్రుతి జననియు । జనకుఁడును గురుండు సద్గతియును,
దేజమును బలంబు ధృతియును బుద్ధియు । నగ్ని యగుటఁ జేసి యమలచరిత. 487

ప్రతిపదార్థం: అమలచరిత!= నిర్మలచరిత్రం కల ఓ జనకమహారాజా!; జననియున్= తల్లియును; జనకుఁడునున్= తండ్రియును; గురుండున్= ఆచార్యుడును; సద్గతియునున్= మంచి గతియును; తేజమునున్= తేజస్సున్ను; బలంబున్= బలమున్ను; ధృతియునున్= ధైర్యమున్ను; బుద్ధియున్= మతియున్ను; అగ్ని అగుటన్+చేసి= అగ్నియే కావటం వలన; శ్రుతి= వేదం; ఆహితాగ్నిన్= అగ్నిహోత్రమునుంచుకొని ఉన్నవాడిని; పుణ్యుఁడు+అనున్= పుణ్యాత్ముడని అంటున్నది.

తాత్పర్యం: నిర్మలచరిత్రుడవైన ఓ జనకమహారాజా! తల్లి, తండ్రి, గురువు, మంచిగతి, తేజస్సు, బలం, ధృతి, బుద్ధి - ఇవన్నీ అగ్నియే. అందువల్లనే వేదం అగ్నిహోత్రము నుంచుకొన్నవాడు పుణ్యాత్ముడు అని చెప్పింది.

తే. సుజనసంగతి కర్తవ్య కుజనుఁడైన । దాన నిర్మలుఁ డయ్యెడుఁ గాన వినుము
శూద్రజాతి భూదేవ శుశ్రూషఁగాదె । యిహముఁ బరమునుఁ బడయుట మహితవృత్తి. 488

ప్రతిపదార్థం: వినుము= ఆకర్ణించుము; కుజనుఁడు+ఐనన్= దుర్జనుడైనప్పటికీ; దానన్= ఆ సజ్జన సాంగత్యంచేత; నిర్మలుఁడు= పవిత్రుడు; అయ్యెడున్+కానన్= ఔతాడుకాబట్టి; సుజనసంగతి= సజ్జనులతోడి పొత్తు; కర్తవ్య= చేయదగినది; శూద్రజాతి= శూద్రవర్ణము; భూదేవ శుశ్రూషన్+కాదె= భూసురుల సేవచేతకదా; మహితవృత్తిన్= పూజితమైన వర్తనంతో; ఇహమున్= ఈ లోకమును; పరమునున్= పరలోకమును; పడయుట= పొందటం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజా! విను. ఎంతటి దుర్జనుడైనా సజ్జనసాంగత్యంతో పవిత్రు డవుతాడు. అందువలన సజ్జనసాంగత్యం అవశ్యం చేయదగింది. శూద్రకులం భూసురకులాన్ని సేవించి వారి సాంగత్యంతో గదా ఇహపరలోక సుఖాలను పొందుతున్నది!

క. అనఘా! మర్త్యుల జీవన । మనిత్యమని యెఱిఁగి సుఖమునప్పుడు దుఃఖం
బున యపుడు ధర్మ మేమఱ । కునికియ యెజ్జాతికైన నుర వూహింపన్. 489

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితా!; ఊహింపన్= ఆలోచించగా; మర్త్యుల జీవనము= మానవుల బ్రదుకు; అనిత్యము+అని= అశాశ్వతమని; ఎఱిఁగి= తెలిసికొని; సుఖమునప్పుడున్= సుఖసమయంలోగానీ; దుఃఖంబున+అపుడున్= దుఃఖసమయంలో గానీ; ధర్మము+అ= ధర్మమును; ఏమఱక+ఉనికి= ఏమరిల్లక ఉండటమే; ఏ+జాతికిన్+ఐనన్= ఏ జాతిలో పుట్టినవాడికైనా; ఉరవు= ఉచితం.

తాత్పర్యం: పాపరహితుడా! మానవజీవితం శాశ్వతం కాదని తెలిసికొని సుఖకాలంలో గానీ, దుఃఖకాలంలో కానీ ధర్మంపట్ల ఏమరుపాటు లేకుండా ఉండటమే ఏ జాతివారైనా పాటించవలసిన ఉచిత పద్ధతి.

తే. పాప మించుక దొడరిన పనియు నెట్టి । ఫలము గలిగిన వల దల్ప ఫల విధాయి
యైన పుణ్యమిశ్రితకార్య మాచరించు । నది; శివంబగు దాన నిహమ్ముఁ బరము. 490

ప్రతిపదార్థం: ఇంచుక= కొంచెం; పాపము= కిల్బిషం; తొడరిన= కలిగిన; పనియున్= కార్యమును; ఎట్టిఫలముగల్గినన్= ఎట్లాంటి ప్రయోజనం సిద్ధించినా; వలదు= చేయవద్దు; అల్పఫలవిధాయి= కొంచెం ప్రయోజనం కలిగించేది; ఐన= అయినట్టి; పుణ్యమిశ్రితకార్యమున్= పుణ్యంతో కూడిన పనిని; ఆచరించునది= చేయునది; దానన్= దానిచేత; ఇహమ్మున్= ఈ లోకమును; పరమున్= పరలోకమును; శివంబు+అగున్= శుభప్రద మవుతుంది.

తాత్పర్యం: ఎంత ఫలం దానివలన కలుగుతున్నా ఆ పని కొంచెం పాపంతో కూడి ఉంటే, చేయవద్దు. ఫలం కొంచెమే అయినా పుణ్యంతో కూడిన పని తప్పక చేయాలి. దానివలన ఇహపరలోకాలలో శుభం కలుగుతుంది.

తే. యజ్ఞపరుఁడు రక్షకుఁడు నుపార్జకుండు । విప్రశుశ్రూషకుఁడు గాని విప్రరాజ
వైశ్యశూద్రులు దక్కటివాని నెట్టి । ధర్మములఁ జేసిరేని నధర్మపరుల. 491

ప్రతిపదార్థం: యజ్ఞపరుఁడు= యజ్ఞంచేయడంలో ఆసక్తి కలవాడు; రక్షకుఁడు= రాజ్యరక్షణ ఒనరించేవాడు; ఉపార్జకుండు= ధనం సంపాదించేవాడు; విప్రశుశ్రూషకుఁడు= బ్రాహ్మణసేవకుడు; కాని= కానట్టి; విప్రరాజ వైశ్యశూద్రులు= బ్రాహ్మణక్షత్రియవైశ్య శూద్రులు; తక్కటివానిన్= పై జెప్పినవాడికంటె అన్యములైన; ఎట్టిధర్మములన్= ఎట్టి ధర్మకార్యాలను; చేసిరేనిన్= చేసినప్పటికీ; అధర్మపరులు+అ= ధర్మపరులు కానివారే.

తాత్పర్యం: యజ్ఞంచేయని విప్రుడు, రక్షణ చేయని క్షత్రియుడు, తన వృత్తిలో ధనమార్జించని వైశ్యుడు, బ్రాహ్మణ సేవ చేయని శూద్రుడు - వీరు తదితరమైన ఎట్టి ధర్మకార్యాలు చేసినా, అధర్మపరులే కాని ధర్మపరులు కారు.

ఆ. ధర్మలబ్ధమైన ధనము పాతికయేని । బహుళఫలము నిచ్చుఁ; బాపవృత్తు
పార్జితంబు కోటియైన నిష్ఫలమండ్రు । దానశాస్త్ర విదులు మానవేంద్ర! 492

ప్రతిపదార్థం: మానవ+ఇంద్ర!= రాజా!; దానశాస్త్రవిదులు= దానశాస్త్రం తెలిసినవారు; ధర్మలబ్ధము+ఐన= ధర్మకార్యాలు చేయటంతో దొరకిన; ధనము= అర్థం; పాతికఏనిన్= నాలుగవవంతైనా(కొంచెమైనా); బహుళఫలమున్+ఇచ్చున్= ఎక్కువ ఫలాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రసాదిస్తుంది; పాపవృత్తి+ఉపార్జితంబు= పాపపు పనిచేత సంపాదించబడినదైన ధనం; కోటి ఐనన్= కోటిసంఖ్యగలదైనా (అత్యధికమైనను); నిష్ఫలము+అంద్రు= ప్రయోజనం లేనిదని చెప్పుతారు.

తాత్పర్యం: రాజా! దానశాస్త్రం పరిశోధించిన విద్వాంసులు ధర్మపద్ధతిలో ఆర్జించిన ధనం కొద్దిపాటిదైనా బహుప్రయోజనకారి అనీ, అధర్మపద్ధతిలో ఆర్జించిన విత్తం కోటి అయినా (అత్యధికమైనా) నిష్ప్రయోజనమనీ చెప్పుతారు.

క. నృపధర్మ వైశ్యధర్మము । లపాపకర్మములు జీవనాభావము పా
లుపడిన బ్రాహ్మణునకు నర । కపాతమగు శూద్రకర్మ కర్తృత్వమునన్. 493

ప్రతిపదార్థం: జీవనాభావము= జీవించటానికి లేమి అనగా పేదరికంయొక్క; పాలుపడిన= వశమైన; బ్రాహ్మణునకున్= విప్రుడికి; నృపధర్మవైశ్య ధర్మములు= రాజవృత్తి, వైశ్యవృత్తి అనే రెండు వృత్తులును; అపాపకర్మములు= పాపంలేని పనులు; శూద్రకర్మ కర్తృత్వమునన్= శూద్రుడి పనికి పూనుకొనటంచేత; నరకపాతము+అగున్= నరకంలో పడటం సంభవిస్తుంది.

తాత్పర్యం: ఒకవేళ బ్రాహ్మణుడు జీవించటానికి లేక పేదరికం పాలు పడితే రాజులకు, వైశ్యులకు విధించబడిన వృత్తి నాశ్రయించి జీవించవచ్చును. దానివలన పాపమంటదు. కాని, అట్టి విప్రుడు శూద్రవృత్తి అయిన సేవాభావాన్ని అంగీకరిస్తే నరకంలో పడిపోతాడు.

క. రాజునకును ధర్మము శ । స్త్రాజీవిక యొకఁడ; వైశ్యుఁ డాపద యైనన్
రాజవర! మధువు మాంసముఁ । దాఁ జట్టి యిడంగఁ బొందు దౌర్గత్యంబున్. 494

ప్రతిపదార్థం: రాజవర!= నృపవర్యా!; రాజునకునున్= నృపుడికి; శస్త్రాజీవిక+ఒకఁడు+అ= శస్త్రమును చేపట్టి జీవించుటొక్కటే; ధర్మము= కర్తవ్యధర్మమై ఉన్నది; వైశ్యుఁడు= తృతీయవర్ణంవాడు; ఆపద ఐనన్= కష్టం సంభవించినపుడు; తాన్= తాను; మధువున్= కల్లును; మాంసమున్= మాంసాన్ని; చట్టిన్= పాత్రలో; ఇడంగన్= పెట్టినచో; దౌర్గత్యంబున్= దుర్గతిని; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: రాజశ్రేష్ఠా! శస్త్రము నాశ్రయించిన జీవిక ఒకటే క్షత్రియుడికి ధర్మం. వైశ్యుడు తనకు కష్టం వచ్చినప్పుడు తన ధర్మం వదలి మధుమాంససేవనం చేస్తే దుర్గతి పాలవుతాడు.

క. జనవర! కృషిఁ బశుపాలన । మున నేనియు బ్రదుకు ధర్మముగ నార్యులు శూ
ద్రునకు విధింతురు జీవన । వినాశమున వాన వృత్తి వినిహత గామిన్. 495

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; శూద్రునకున్= నాలుగవవర్ణం వానికి; ఆర్యులు= పెద్దలు; జీవనవినాశమునన్= బ్రదుకుతెరువు నశించునపుడు; వానన్= కృషి మొదలగు వాటిచేత; వృత్తి= తన వర్తనం; వినిహత+కామిన్= చెడిపోదు కాబట్టి; కృషిన్= వ్యవసాయం చేతను; పశుపాలనమునన్+ఏనియున్= పశురక్షచేతనైనను; బ్రదుకు= జీవనం; ధర్మముగన్= చేయదగిన ధర్మంగా; విధింతురు= నియమిస్తారు.

తాత్పర్యం: రాజా! శూద్రుడు బ్రదుకుతెరువు నశించినప్పుడు వ్యవసాయం చేసి, పశువులను పాలించి జీవించవచ్చును. అది ధర్మమని పెద్దలు చెప్పుతారు. దానివలన ఆ స్థితిలో శూద్రవృత్తికి చేటు లేదు కాబట్టి వా రట్లా నియమం చేశారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. వినుతొల్లి ధర్మవర్తనము లసహ్యంబు । లైన దానవులు మహాగ్రహమున
నరులయం దెలసిన నరవర! వారలు । దర్పరోషముల నధర్మవృత్తిఁ
దగిలినఁ గలఁగె వేదములును గ్రతువులు । సురలు విషణ్ణులై పురహరునకు
నంతయు నెఱిఁగింప, నతఁడు త్రిశూలంబుఁ । బనుప దైత్యావిష్టభావ మడఁచె;

తే. నది మహామునుల్ మృడునిఁ బ్రజాభిరక్ష । ణమునకై నిల్ప శ్రుతులు జన్నములుఁ దొంటి
చందమునఁ జెల్లె నమరులు సంతసింప । ననఘ! నీవునుఁ బాలింపు మట్ల ప్రజల.' 496

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; విను= ఆలకించుము; తొల్లి= పూర్వం; ధర్మవర్తనములు= ధర్మాచరణములు; అసహ్యములు+ఐనన్= సహించరానివి కాగా; దానవులు= రక్కసులు; మహా+ఆగ్రహమునన్= పెద్దకోపావేశంతో; నరులఅందున్= మానవులందు; ఎలసినన్= ప్రవేశించగా; వారలు= ఆ మనుష్యులు; దర్పరోషములన్= గర్వంతోనూ, రోషంతోనూ; అధర్మవృత్తిన్= ధర్మ విరుద్ధమైన వర్తనాన్ని; తగిలినన్= ఆశ్రయించగా; వేదములును= శ్రుతులును; క్రతువులు= యజ్ఞాలు; కలఁగెన్= కలతపొందాయి; సురలు= దేవతలు; విషణ్ణులు+ఐ= దుఃఖం పొందినవారై; అంతయున్= జరిగిన వృత్తాంతం అంతటినీ; పురహరునకున్= శివుడికి; ఎఱిఁగింపన్= తెలుపగా; అతఁడు= ఆ శివుడు; త్రిశూలంబున్= త్రిశూలమనే ఆయుధాన్ని; పనుపన్= పంపగా; అది= ఆ త్రిశూలం; దైత్యావిష్టభావమున్= రాక్షసులచేత ఆవేశింపబడిన భావాన్ని; అడఁచెన్= సంహరించింది; మహామునుల్= గొప్పమునులు; మృడునిన్= శివుడిని; ప్రజాభిరక్షణమునకై= జనులను కాపాడటంకొరకై; నిల్పన్= నిలుపగా; అమరులు= దేవతలు; సంతసింపన్= ముదమొందగా; శ్రుతులు= వేదాలు; జన్నములు= యజ్ఞాలు; తొంటిచందమునన్= మునుపటివలె; చెల్లెన్= కొనసాగాయి; అనఘ!= పాపరహితుడవైన ఓ జనకమహారాజా!; నీవునున్= నీవుకూడ; అట్ల= అదే విధంగా; ప్రజలన్= జనులను; పాలింపుము= రక్షింపుము.

తాత్పర్యం: రాజా! వినుము. పూర్వం రాక్షసులు ధర్మకార్యాలు తమకు సహింపరానివయ్యేసరికి పెద్ద ఆగ్రహం పూని మానవులలో ప్రవేశించారు. ఆ మానవులు అందువలన గర్వరోషాలు పూని అధర్మకార్యాలలో నిమగ్నులయ్యారు. అప్పుడు వేదాలు, యజ్ఞాలు కలతజెందాయి. దేవతలు విషాదగ్రస్తులై ఈ వృత్తాంతమంతా శివుడికి తెలియజేశారు. శివుడు త్రిశూలాన్ని ప్రయోగించాడు. ఆ త్రిశూలం మానవులలోని రాక్షసావేశాన్ని నశింపజేసింది. అప్పుడు మహర్షులు శివుడిని ప్రజారక్షకుడిగా నిలిపారు. అంతట వేదాలు, యజ్ఞాలు పూర్వంవలెనే కొనసాగాయి. దేవతలు అందుకు సంతోషించారు. పాపరహితుడా! నీవు కూడా అట్లాగే ప్రజలను పాలించుము'.

క. అని చెప్పి తపము పెంపును । వినిపించుట కిట్టు లనియె విద్యాధరస
న్ముని దేవతాగణంబులు । వినుత తపంబునన మహిత విభవముఁ బొందెన్. 497

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; తపము పెంపునున్= తపస్సుయొక్క మహిమను; వినిపించుటకున్= వినిపింపజేయటానికై; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు; విద్యాధర= విద్యాధరులు; సన్మునిదేవతా గణంబులు= శ్రేష్ఠులైన మునులు, దేవతలయొక్క సమూహాలు; వినుతతపంబునన్= ప్రశస్తమైన తపస్సుతోనే; మహితవిభవమున్= పూజ్యమైన వైభవాన్ని; పొందెన్= చెందాయి.

తాత్పర్యం: పరాశరముని ఇట్లా చెప్పి తపోమహిమను జనకుడికి వినిపించాలనుకొని మళ్ళీ ఇట్లా అన్నాడు: 'విద్యాధరులు, ఉత్తమమునులు, దేవతలయొక్క బృందాలు పూర్వం గణుతించదగిన తపస్సు చేయటంవలననే శ్రేష్ఠమైన వైభవమును పొందారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **కమలభవుండు దాఁ దపము కల్మిన కాదె సృజించె నెల్ల లో**
కములను; నాదిరాజు లధికంబగు పెంపు వహించుటెల్ల ను
త్తమ తప మాచరించుటన; తద్దయు సౌఖ్యకరంబులైన భో
జ్యములును గంధమాల్యములు శయ్యలు భవ్యతపఃప్రభూతముల్. **498**

ప్రతిపదార్థం: కమలభవుండు= బ్రహ్మ; తాన్= తాను; ఎల్లలోకములనున్= సమస్తమైన లోకాలనూ; తపము కల్మినకాదె= తపస్సు కలిగిఉండటం వలననేకదా!; సృజించెన్= సృష్టించాడు; ఆదిరాజులు= మొదటిభూపాలకులు; అధికంబు+అగు= దొడ్డదైన; పెంపున్= గొప్పతనాన్ని; వహించుట+ఎల్లన్= కల్గి ఉండటమంతా; ఉత్తమతపమున్= శ్రేష్ఠమైన తపస్సును; ఆచరించుటన్= చేయటంవలననే; తద్దయున్= అత్యధికంగా; సౌఖ్యకరంబులు+ఐన= సుఖం కలిగించేవి అగు; భోజ్యములునున్= భుజించదగిన పదార్థాలును; గంధమాల్యములు= సుగంధద్రవ్యాలు, మాలికలు; శయ్యలు= పాన్పులు; భవ్యతపఃప్రభూతముల్= శ్రేష్ఠమైన తపస్సునుండి కలిగినవే.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు తాను తపస్సు చేయటం వలననే సమస్త లోకాలనూ సృష్టించాడు. ఆదికాలానికి చెందిన రాజులు గొప్ప ప్రభావం కలిగి ఉండటంకూడా శ్రేష్ఠమైన తపస్సు చేయటం వలననే. పెద్దగా మనకు సుఖం కలిగించే ఆహారపదార్థాలు, గంధం, పూలమాలలు, పడుకలు - ఇవన్నీ గొప్ప తపస్సుకు ఫలంగా మనకు కలిగినవే.

తే. **దారధనమిత్ర పుత్రకాద్యంబు లగు ప । దార్థముల సంగమునఁ జిత్త మలఁతఁ బొంది**
విసివినప్పుడు నిర్మల విపుల తపము । గారణంబగు నుపశాంతి కలిమి కనఘ! **499**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; చిత్తము= మనస్సు; దారధనమిత్ర పుత్రక+ఆద్యంబులు+అగు= భార్య, ధనం, మిత్రులు, పుత్రులు మొదలైనట్టి; పదార్థముల సంగమునన్= వస్తువుల కలయికతో; అలఁతన్= అలసటను; పొంది= చెంది; విసివినప్పుడు= విసుగు పొందిన సమయంలో; ఉపశాంతి కలిమికిన్= ప్రశాంతి కలిగిఉండటానికి; నిర్మలవిపులతపము= విమలమూ, దీర్ఘమూ అయిన తపస్సు; కారణంబు+అగున్= హేతు వవుతుంది.

తాత్పర్యం: కల్మషంలేని ఓ రాజా! భార్య, విత్తం, మిత్రులు, పుత్రులు మొదలైన వారి పొత్తుతో మనస్సు విసిగి వేసారినప్పుడు దానికి ఉపశమనం కావాలంటే అది నిర్మలమూ, తీవ్రమూ అయిన తపస్సు నుండి మాత్రమేసిద్ధిస్తుంది.

క. **విను! లోభము సంతోషం । బును దుఃఖసుఖ ప్రదములు పురుషున కవి సం**
జనితములగుట తపము లే । కునికిని గలుగుటను జూవె యుర్వీనాథా! **500**

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= భూనాథా!; విను= ఆలకించుము; పురుషునకున్= మనుజుడికి; లోభమున్= పిసినితనమును; సంతోషంబును= హర్షమున్నూ; దుఃఖసుఖప్రదములు= దుఃఖాన్నీ, సుఖాన్నీ కలిగించేవి; అవి= ఆ లోభసంతోషాలు; సంజనితములు+అగుట= కలగటం; తపములేక+ఉనికినిన్= తపస్సు లేకుండుటను; కలుగుటను జూవె= వలననే సుమా!

తాత్పర్యం: రాజా! ఇంకా చెప్పుతాను వినుము. మానవుడికి లోభం దుఃఖాన్ని కలిగిస్తుంది. సంతోషం సుఖాన్ని కలిగిస్తుంది. లోభమూ, సంతోషమూ తపస్సు లేకపోవటంవలననే సంభవిస్తాయి. పరిశీలించి చూడుము.

తే. **అనఘ! సుఖదుఃఖములు వచ్చినపుడు మద వి । షాదములు లేక సంప్రాప్తసముపభోగ**
రతుఁడు నప్రాప్యవాంఛా నిరాసకుండు । నగుట సారతపోరూప మండ్రు బుధులు. **501**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; బుధులు= పండితులు; సుఖదుఃఖములు= హర్షవిషాదాలు; వచ్చినపుడు= సంభవించిన సమయంలో; మదవిషాదములు లేక= పొంగటం, క్రుంగటం లేకుండా; సంప్రాప్త సముపభోగరతుఁడున్= లభించిన భోగాలలో ఆసక్తి కలవాడును; అప్రాప్యవాంఛా నిరాసకుండున్= లభ్యంకాని కోరికలను త్యజించేవాడును; అగుట= కావటం; సారతపోరూపము+అంద్రు= శ్రేష్ఠతపస్సుయొక్క రూపు అని పలుకుతారు.

తాత్పర్యం: కిల్బిషరహితుడవైన ఓ రాజా! సుఖం వచ్చినపుడు పొంగిపోక, దుఃఖం వచ్చినపుడు క్రుంగిపోక, తాముగా వచ్చి చేరిన భోగా లనుభవిస్తూ, లభించనివాటికి సంబంధించిన కోరికలను దూరం చేసికొనటమే శ్రేష్ఠమైన తపస్సుయొక్క లక్షణమని పండితులు చెప్పుతారు.

క. వరధర్మము నర్థంబును । సరసంబగు విషయ సుఖము సద్గతియుఁ దపః
పరిపాకమునన కలుగున్ । నరునకుఁ దత్త ద్విధాత్త నైపుణుఁ డైనన్.' 502

ప్రతిపదార్థం: నరునకున్= మనుజుడికి; తత్తద్విధా+ఆత్తనైపుణుఁడు+ఐనన్= ఆయా విధాలలో పొందబడిన నేర్పు గలవాడైతే; వరధర్మమున్= శ్రేష్ఠమైన ధర్మమూ; అర్థంబునున్= విత్తమూ; సరసంబు+అగు= రసవంతమైన; విషయసుఖమున్= శబ్దాది విషయాలవలన కలిగే కామ సౌఖ్యమూ; సద్గతియున్= ఉత్తమగతియూ; తపఃపరిపాకమునన్+అ= తపస్సు పండటం చేతనే; కలుగున్= సంభవిస్తాయి.

తాత్పర్యం: మానవుడు ఆయా విధానాలలో నేర్పు సంపాదిస్తే తపస్సు పక్వదశకు వచ్చినప్పుడే ధర్మం, అర్థం, విషయసుఖంతో కూడిన కామం, ఉత్తమగతి అయిన మోక్షం అనే చతుర్విధ పురుషార్థాలు సిద్ధిస్తాయి'.

వ. అనిన విని జనకుండు వర్ణంబుల యుత్కర్షాపకర్షత్వంబులకు మూలం బెయ్యది దానిని, దాన పుత్త్రుండై జన్మించునం;ద్రదియు విసంశయం బగుట నెఱింగింపవే' యనుటయుం బరాశరుం డతని కిట్లనియె.503

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; జనకుండు= జనకభూపాలుడు; వర్ణంబుల= బ్రాహ్మణాదిజాతులయొక్క; ఉత్కర్ష+అపకర్షత్వంబులకున్= ఎక్కువ - తక్కువతనాలకు; మూలంబు= కారణం; ఏ+అది?= ఏది?; దానిని= ఆ విషయాన్ని; తాన్+అ= తానే; పుత్త్రుండు+ఐ= కుమారుడై; జన్మించున్= పుట్టుతాడు; అంద్రు= అని అంటారు; అదియున్= ఆ విషయమును; విసంశయంబు+అగుట= సందేహం తొలగునట్లుగా; ఎఱింగింపవే= తెలుపుమా; అనుటయున్= అని అడిగేసరికి; పరాశరుండు= పరాశరముని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పరాశరుడట్లా చెప్పగా విని జనకమహారాజు 'బ్రాహ్మణక్షత్రియాదులైన వర్ణాలకు గొప్పతనం, తక్కువతనం కలగటానికి కారణ మేమి? ఆ విషయాన్నీ, తానే కుమారుడై జన్మిస్తాడని అంటారు. ఆ సంగతినీ సందేహం తీరేటట్లు నాకు తెలియజెప్పుము' అని అడిగాడు. అప్పుడు పరాశరముని జనకమహారాజుతో ఇట్లా చెప్పాడు:

తే. 'పద్మభవముఖ బాహూరుపాదసంభ । వములు గాన భూసురరాజవైశ్యశూద్ర
భావములు తారతమ్య సంప్రాప్తి నొందె । జనన దేశగుణంబుల మనుజనాథ! 504

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; భూసురరాజ వైశ్యశూద్రభావములు= బ్రాహ్మణత్వం, క్షత్రియత్వం, వైశ్యత్వం, శూద్రత్వం అనేవి; పద్మభవముఖ బాహు+ఊరు పాదసంభవములు కానన్= బ్రహ్మయొక్క వదనం, బాహువులు, తొడలు, కాళ్ళు - ఉత్పత్తి స్థానాలుగా కలవి కావున; జనన దేశగుణంబులన్= పుట్టినచోట్ల యొక్క గుణాలనుబట్టి; తారతమ్య సంప్రాప్తిన్= తరతమ భావంయొక్క ప్రాప్తిని; ఒందెన్= పొందాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజా! బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు క్రమంగా బ్రహ్మదేవుడియొక్క ముఖం, బాహువులు, తొడలు, పాదాలు అనే చోట్లనుండి పుట్టారు. పుట్టినచోటుయొక్క భేదాలను బట్టి బ్రాహ్మణాది వర్ణాలు ఉత్కర్షభావాన్నీ, అపకర్షభావాన్నీ పొందాయి.

విశేషం: బ్రాహ్మణాది వర్ణాలపుట్టుక పురుషసూక్తం ఆధారంగా ఇక్కడ వర్ణించబడింది. పురుషసూక్తానికి వివరణ ఇచ్చేవారు పలురకాల అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. సమాజస్వరూపాన్ని విరాట్పురుషుడి స్వరూపంతో పోల్చటం జరిగిందే కాని మానవుల పుట్టుకలో స్థానభేదాలున్నాయని చెప్పటం సమంజసం కాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ పుట్టినచోటే భేదాలకు కారణమని స్పష్టంగా పేర్కొనటం గమనార్హం. పుట్టుకతోనే మానవులలో ఒకరిని ఎక్కువగా, మరొకరిని తక్కువగా భావించటమనేది భారతకాలం నుండీ వస్తున్న సంప్రదాయ మని గుర్తించవలసి ఉంటుంది.

క. తాన సుతుఁ డగుట దెలియం। గానగు; ముని లాత్మ వీర్య కలనం బెచ్చో
నైనం జేయఁగ ముని భా। వానూనత ఋశ్యశృంగుఁ డాదిగఁ గనుటన్.' 505

ప్రతిపదార్థం: మునులు= మహర్షులు; ఆత్మవీర్యకలనంబు= తమ శుక్రమును ఉంచుటను; ఏ+చోన్+ఐనన్= ఏ చోటనైనా; చేయఁగన్= చేయగా; మునిభావానూనతన్= మునిత్వంయొక్క సమగ్రత్వాన్ని; ఋశ్యశృంగుఁడు+ఆదిగన్= ఋశ్యశృంగుడు మొదలుగా; కనుటన్= పొందుటచేత; తాన్+అ= తానే; సుతుఁడు+అగుట= పుత్రుడు కావటం; తెలియంగాన్+అగున్= తెలిసికొనవచ్చును.

తాత్పర్యం: మునులు తమ వీర్యాన్ని ఎక్కడ నిక్షిప్తం చేసినా అక్కడ సమగ్రమైన మునిత్వం కల్గినవారు జన్మిస్తున్నారు. ఈ సంగతిని ఋశ్యశృంగుడు మొదలైనవారిలో చూడవచ్చును. అందువలన 'ఆత్మా వై పుత్ర నామాసి' అన్నట్లు తానే పుత్రుడై జన్మిస్తున్నాడని తెలిసికొనవచ్చును'.

విశేషం: ఋశ్యశృంగుడు విభాండకుడనే మునియొక్క పుత్రుడు. విభాండకుడు నదిలో స్నానం చేస్తూ ఊర్వశిని చూచాడు. అతడి వీర్యం అప్పుడు నదిలో పడింది. ఒక ఆడమృగం ఆ నీటిని త్రాగింది. నీటితోపాటు విభాండకుని శుక్లం కూడా మృగముయొక్క గర్భంలో ప్రవేశించింది. ఆ మృగానికి పుట్టిన కుమారుడే ఋశ్యశృంగుడు. దీనినిబట్టి ఋషుల తేజస్సు ఎక్కడ పడినా అక్కడ ఋషికుమారులే పుట్టుతున్నారని తెలియరావటం వలన తండ్రి తానే తనయుడై జన్మిస్తున్నాడని గ్రహించవచ్చును.

ఆ. అనిన జనకుఁ డిట్టులను 'వినినవి యైన। వలయుఁ దెలియ వినఁగ వర్ణధర్మ
సమితిఁ గల విశేషసాధారణత్వంబు। లేర్పరించి చెప్పవే మునీంద్ర!' 506

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; జనకుఁడు= జనకచక్రవర్తి; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; ముని+ఇంద్ర!= మునివర్యా!; వినినవి ఐనన్= ముందు విన్నవే ఐనప్పటికీ; తెలియన్= స్పష్టంగా తెలిసికొనటానికి; వినఁగన్ వలయున్= మళ్ళీ వినాలి; వర్ణధర్మసమితిన్= బ్రాహ్మణాదివర్ణాలయొక్క ధర్మసముచ్చయంలో; కల= ఉన్నట్టి; విశేషసాధారణత్వంబులు= విశేషభావమూ, సామాన్యభావమూ; ఏర్పరించి= విభజించి; చెప్పవే= విశదీకరించుమా!

తాత్పర్యం: పరాశరు డట్లా చెప్పగా జనకుడు మళ్ళీ ఈ రీతిగా అన్నాడు: 'మునివర్యా! పూర్వం విన్న విషయాలే స్పష్టంగా గ్రహించాలంటే మళ్ళీ మళ్ళీ వినవలసి ఉంటుంది. బ్రాహ్మణక్షత్రియాది వర్ణాలలో ఉన్న సాధారణ ధర్మాలు, విశేషధర్మాలు చక్కగా విభజించి నాకు వివరించుము.'

వ. అనుటయుఁ బరాశరుం డిట్టు లనియె. 507

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; పరాశరుండు= పరాశరముని; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: జనకు డట్లా ప్రశ్నించగా పరాశరుడిట్లా చెప్పాడు.

సీ. **'వినుము ప్రతిగ్రహంబును యాజనంబును । నధ్యాపనమును ధరామరులకుఁ,**
బ్రజరక్ష నృపునకుఁ, బశుపాలనము గృషి । వాణిజ్య మనునివి వణిజులకును,
శూద్రజనులకు శుశ్రూషయు శ్రుతులు వి । శేషధర్మములుగఁ జెప్పు సత్య
శౌచంబులును నహింసయు ననసూయయు । శ్రాద్ధంబు నతిథిపూజనము నాత్మ

తే. **దారపరతయు సర్వసాధారణంబు । లనఘ! వీనను నిజవృత్తులను సమస్త**
జాతులును నిహపరసౌఖ్యసంపదలకు । నాస్పదములగు; నింద్యంబు లన్యవిధులు. **508**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; వినుము= ఆలకించుము; శ్రుతులు= వేదాలు; ధరామరులకున్= విప్రులకు; ప్రతిగ్రహంబునున్= పుచ్చుకొనటమును; యాజనంబునున్= యజింపజేయటమును; అధ్యాపనమునున్= చదివించటమును; నృపునకున్= రాజుకు; ప్రజరక్ష= జనరక్షణమును; వణిజులకునున్= వైశ్యులకు; పశుపాలనమున్= పశురక్షణమును; కృషి= వ్యవసాయమును; వాణిజ్యమునున్= వ్యాపారమును; అను+ఇవి= ఈ చెప్పినవృత్తులు; శూద్రజనులకున్= శూద్రప్రజలకు; శుశ్రూషయున్= సేవయును; విశేషధర్మములుగన్= విశిష్టమైన ధర్మాలుగా; చెప్పున్= వచించును; సత్యశౌచంబులునున్= సత్యాన్నీ, శుచినీ పాటించటం; అహింసయున్= హింసలేమి; అనసూయయున్= అసూయ లేకుండా ఉండటం; శ్రాద్ధంబున్= పితృకర్మయు; అతిథిపూజనమున్= అతిథులను సమ్మానించటమూ; ఆత్మదారపరతయున్= తన భార్యయందే తత్పరుడై ఉండటమూ; సర్వసాధారణంబులు= అన్ని వర్ణాలకూ సమానమైన ధర్మాలు; వీననున్= ఈ సామాన్యధర్మాల చేతను; నిజవృత్తులనున్= తమ తమ విశిష్టధర్మాలకు చెందిన వర్తనాల చేతను; సమస్తజాతులును= సర్వవర్ణాలూ; ఇహపరసౌఖ్యసంపదలకున్= ఈ లోకానికీ, పరలోకానికీ చెందిన సుఖవిభవాలకు; ఆస్పదములు+అగున్= స్థానాలు అవుతాయి; అన్యవిధులు= తదితరవృత్తులు; నింద్యంబులు= నిందించదగినవి.

తాత్పర్యం: 'పాపరహితుడా! నీవడిగిన విషయాలు వివరిస్తాను వినుము. బ్రాహ్మణులకు దానం పుచ్చుకొనటం, యజ్ఞం చేయించటం, వేదం చదివించటం విశేషధర్మాలు. రాజుకు ప్రజారక్షణమూ, వైశ్యులకు పశురక్షణ, వ్యవసాయం, వ్యాపారం, శూద్రులకు సేవావృత్తి - ఇవి విశేషాధర్మాలని వేదాలు చెప్తున్నాయి. సత్యం, శౌచం, అహింస, అసూయలేమి, పితృకర్మ, అతిథిపూజ, తన భార్యతో మాత్రమే సంగమం కలిగి ఉండటం అనేవి సర్వవర్ణాలకూ సాధారణధర్మాలు. ఈ సామాన్యధర్మాలనూ, పై జెప్పిన విశేషధర్మాలనూ పాటిస్తే అన్ని జాతులూ ఇహలోకంలోనూ, పరలోకంలోనూ సుఖం పొందుతాయి. ఇక్కడ జెప్పినట్లు కాక ఇతర ధర్మాలు పాటించటం తగదు. అవి నిందించదగినవి.

విశేషం: ఇక్కడ విప్రులకు దానం పుచ్చుకొనటం, యాగం చేయించటం, వేదం చదివించటం అనే మూడు విశేషధర్మాలు చెప్పటమయింది. వీటితోపాటు దానం చేయటం, యాగం చేయటం, వేదం చదవటం అనేవి కూడా ఉన్నాయి. ఇవి అన్నీ కలిస్తే షట్కర్మ లనబడుతాయి. అవే దానం, ప్రతిగ్రహం, యజనం, యాజనం, అధ్యయనం, అధ్యాపనం అని పేర్కొనబడ్డాయి.

క. **భూవర! నాకుం జూడం । గా విష్ణుఁడు దైవ; మట్లు గావున నతనిన్**
భావించు టెల్ల వారికిఁ । గావించును మోక్షమయసుఖము లన్నింటన్.' **509**

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; నాకున్+చూడంగాన్= నేను పరిశీలించగా; విష్ణుఁడు= వెన్నుడు; దైవము= దేవుడు; అట్లు కావునన్= అట్లాకావటంవలన; అన్నింటన్= అన్ని విషయాలలోనూ; అతనిన్= ఆ విష్ణువును; భావించుట= తలచటం; ఎల్లవారికిన్= అందరికీ; మోక్షమయ సుఖములు= ముక్తిమయమైన సౌఖ్యాలు; కావించును= కలిగిస్తాడు'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజా! నా దృష్టిలో విష్ణువే పరదైవతము. అందువలన అందరూ అన్నివిషయాలలోనూ ఆ దేవుడిని తలంచటం మంచిది. అట్లా చేస్తే మోక్షాత్మక సుఖం సిద్ధిస్తుంది'.

క. అనిన విని జనక భూవిభుఁ । డనఘ! యహింసనములైన యవి యెయ్యవి? య
ప్పను లెఱుఁగ జెప్పవే నా' । కనుడు నతని కిట్టులనియె నమ్ముని యధిపా! 510

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; అనినన్= అని చెప్పగా; విని= ఆకర్ణించి; జనకభూవిభుఁడు= జనకమహారాజు; అనఘ!= పాపరహితుడా!; అహింసనములు+ఐన అవి= హింసారహితములైనవి; ఎయ్యవి?= ఏవి?; ఆ+పనులు= ఆ కార్యాలు; నాకున్= జనకుడనైన నాకు; ఎఱుఁగన్+చెప్పవే= తెలియజెప్పుమా; అనుడున్= అనగా; ఆ+ముని= ఆ పరాశరుడు; అతనికిన్= జనకుడికి; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజా! పరాశరమునీంద్రుడు ఆ రీతిగా చెప్పేసరికి విని జనకుడు 'అనఘా! హింసారహితాలైన పనులేవి? ఆ పనులు ఏవో నాకు విశదపరచుము' అని మళ్ళీ ప్రశ్నించాడు. అప్పుడు ఆ పరాశరు డా రాజుతో ఈ విధంగా చెప్పాడు.

జనకునకుఁ బరాశరముని వివరించిన హింసాహింసల ప్రకారము (సం. 12-280-12)

ఆ. 'శమము దమము లేమి జనులకు హింస నొ । నర్చుఁ గాన ధరణినాథ! విను మ
హింస శమదమములు హృదయంబునకు నెప్డు । నలవడంగఁ జేత యండ్రు బుధులు.' 511

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; వినుము= ఆలకింపుము; శమము= అంతరింద్రియ నిగ్రహం; దమము= బాహ్యేంద్రియ నిగ్రహం; లేమి= లేకపోవటం; జనులకున్= ప్రజలకు; హింసన్= పీడను; ఒనర్చున్+కానన్= కలిగిస్తుంది కాబట్టి; బుధులు= పండితులు; హృదయంబునకున్= చిత్తానికి; ఎప్డున్= ఎల్లవేళలా; శమదమములు= అంతరింద్రియ, బాహ్యేంద్రియ నిగ్రహాలు; అలవడంగన్+చేత= అలవాటు చేయటం; అహింస అండ్రు= 'అహింస' అని చెప్పుతారు.

తాత్పర్యం: 'రాజా! నీ వడిగిన విషయం వివరిస్తాను. వినుము. మనోనిగ్రహమనే శమమూ, బాహ్యేంద్రియ నిగ్రహమనే దమమూ లేకపోతే జనులకు హింస కలుగుతుంది. అందువలననే పెద్దలు చిత్తానికి శమదమాలు అలవాటు చేయటమే అహింస అంటారు'.

వ. అని చెప్పి వెండియుం బరాశరమునీశ్వరుం డిట్లనియె. 512

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; వెండియున్= మరల; పరాశరమునీశ్వరుండు= పరాశరమునివర్యుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ రీతిగా చెప్పి మళ్ళీ పరాశరముని జనకుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'దురమున జయము గొనుటకై । నరపతులకు వలయు హింసనం బెట్లును; ద
త్పరిహరణ స్థానములును । ధరణీశ్వర! కలవు సెప్పెదను విను వానిన్. 513

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వర!= రాజా!; నరపతులకున్= రాజులకు; దురమునన్= యుద్ధంలో; జయమున్= గెలుపును; కొనుటకై= స్వీకరించటానికై; ఎట్లునున్= ఎట్లైనా; హింసనంబు= హింసించటం; వలయున్= ఆవశ్యకమై ఉన్నది; తత్పరిహరణ స్థానములునున్= ఆ హింసను పరిహరించే చోట్లు కూడ; కలవు= ఉన్నాయి; వానిన్= ఆ చోట్లను; చెప్పెదను= వివరిస్తాను; విను= వినుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'రాజా! యుద్ధభూమిలో గెలుపు పొందటానికై రాజులు ఎట్లాగూ హింస చేయక తప్పదు. అయితే ఆ హింస కలగకుండా నివారించే స్థానాలు కూడా కొన్ని ఉన్నాయి. వాటిని వివరిస్తాను. వినుము.

క. పడినం బాఱినఁ గైదువు । వడినను వాహనము వడినఁ బార్థివముఖ్యా!
పొడువఁదగదు శత్రుని నె । య్యెడల నహింసనముఁ బోల వే సుకృతములున్. 514

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= రాజశ్రేష్ఠా!; పడినన్= శత్రువు క్రింద పడిపోయినా; పాఱినన్= పరుగిడినా; కైదువు= ఆయుధం; పడినను= క్రిందపడిపోయినా; వాహనము= గుర్రం వంటి వాహనం; పడినన్= పడిపోయినా; శత్రునిన్= పగవాడిని; పొడువన్+తగదు= కొట్టకూడదు; ఏ+ఎడలన్= ఏ సందర్భంలోనైనా; ఏ సుకృతములున్= ఏ పుణ్యాలునూ; అహింసనమున్+పోలవు= హింసలేమికి సరిరావు.

తాత్పర్యం: రాజవర్యా! యుద్ధరంగములో శత్రువు క్రిందపడిపోయినపుడు, పారిపోయినపుడు, అతడిచేతిలోని ఆయుధం జారిపోయినప్పుడు, అతడి వాహనం పడిపోయినపుడు అతడిని ప్రహరించకూడదు. ఎప్పుడైనాసరే, ఏ పుణ్యకార్యాలైనా అహింసకు సాటిరావు.

క. న్యాయమున సంగరంబుం । జేయఁగ శస్త్రాగ్ని దన్నుఁ జెందిన దానం
గాయంబు విడుచు పురుషుఁడు । వేయేటికి మోక్షలక్ష్మి విభుఁ డగు నధిపా! 515

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; న్యాయమునన్= క్రమం తప్పక; సంగరంబున్= యుద్ధమును; చేయఁగన్= నిర్వహించగా; శస్త్రాగ్ని= ఆయుధాగ్ని; తన్నున్= తనను; చెందినన్= తాకితే; దానన్= దానివలన; కాయంబున్= శరీరమును; విడుచు పురుషుఁడు= త్యజించే మనుజుడు; వేయి+ఏటికిన్?= వేయిమాట లేల?; మోక్షలక్ష్మివిభుఁడు+అగున్= ముక్తిరమకు భర్త అవుతాడు.

తాత్పర్యం: రాజా! వేయిమాట లెందుకు? న్యాయంగా యుద్ధంచేసే సమయంలో శత్రువు ప్రయోగించిన శస్త్రానలం సోకి మరణించే పురుషుడు మోక్షలక్ష్మికి మగడవుతాడు.

క. తనతోఁ దుల్యుం డైనను । మనుజాధిప! యధికబల సమగ్రత్వము గ
ల్గిన నని శత్రుని వధియిం । చిన నరపతి పుణ్యలోక సిద్ధిం బొందున్.' 516

ప్రతిపదార్థం: మనుజ+అధిప!= రాజా!; అనిన్= యుద్ధంలో; తనతోన్+తుల్యుండు+ఐనను= తనతో సమానుడైనా; అధికబల సమగ్రత్వమున్= ఎక్కువ బలసంపూర్ణతను; కల్గినన్= కలిగిఉన్నా; శత్రుని= అట్టిపగవాడిని; వధియించిన= చంపిన; నరపతి= రాజు; పుణ్యలోకసిద్ధిన్= పుణ్యలోకప్రాప్తిని; పొందున్= చెందుతాడు.

తాత్పర్యం: యుద్ధభూమిలో ఏ భూపాలుడు తనతో బలంలో సమానుడూ, లేక తనకంటె ఎక్కువబలం కలవాడూ అయిన పగవాడిని చంపుతాడో, అతడు పుణ్యలోకాలకు పోతాడు'.

విశేషం: యుద్ధంలో చనిపోయినవాడు మోక్షం పొందుతాడని పూర్వపద్యంలో చెప్పబడింది. ఇక్కడ చంపినవాడు కూడా పుణ్యలోకాలకు పోతాడని చెప్పటమయింది. అయితే తనకంటె బలహీనుడైనవాడిని చంపితే సుగతి కలగదని ఈ పద్యాన్నిబట్టి గ్రహించాలి.

వ. అని మఱియును. 517

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; మఱియును= ఇంకను.

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ పరాశరముని ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'భూతంబులు నింద్రియ సం । ఘాతము సత్త్వాదిగుణనికాయముఁ గాయం
బైతోఁచు టెఱిఁగినను ధ । ర్మేతరకృత్యములు సేయునే నరుఁ డనఘా! 518

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; భూతంబులున్= పంచభూతాలును; ఇంద్రియసంఘాతమున్= ఇంద్రియాల సమూహమును; సత్త్వాదిగుణనికాయమున్= సత్త్వం మొదలైన గుణాల సంచయమును; కాయంబు+ఐ= శరీరమై; తోఁచుట= ప్రకాశించటం; ఎఱిఁగినను= తెలిసికొన్నచో; నరుఁడు= మానవుడు; ధర్మేతర కృత్యములు= అధర్మకార్యాలు; చేయునే?= చేస్తాడా?

తాత్పర్యం: పాపరహితుడా! పృథివ్యాదులైన ఐదుభూతాలు, శ్రోత్రం మొదలైన ఇంద్రియాల సమూహం, సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలూ శరీరంగా రూపొందుతాయి అన్న విషయం తెలిస్తే మానవుడు అధర్మకార్యాలు చేయగలడా?

క. జాతుఁడు మృతుఁ డగుట ధ్రువము; । భూతోల్లాసము లనిత్యములు; విను సద్యః
పాతి యగు శరీరంబున । కై తొలఁగునె ధర్మపథము నార్యుం డనఘా! 519

ప్రతిపదార్థం: అనఘా!= కిల్బిషంలేనివాడా!; విను= ఆలకించుము; జాతుఁడు= పుట్టినవాడు; మృతుఁడు+అగుట= చచ్చుట; ధ్రువము= నిక్కం; భూత+ఉల్లాసములు= ప్రాణుల విలాసాలు; అనిత్యములు= అశాశ్వతాలు; ఆర్యుండు= పూజ్యుడు; సద్యఃపాతి అగు= వెంటనే పడిపోయే; శరీరంబునకై= దేహంకొరకై; ధర్మపథమున్= ధర్మమార్గాన్ని; తొలఁగునె?= విడుచునా?

తాత్పర్యం: జనకా! ఇంకా చెప్పుతాను వినుము. పుట్టినవాడు మరణించటం తథ్యం. ప్రాణులకు సంబంధించిన ఉల్లాసాలన్నీ అశాశ్వతాలు. పూజ్యుడైన మానవుడు త్రుటిలో నశించిపోయే ఈ శరీరంకొరకై ధర్మమార్గం వీడి చరిస్తాడా?

తే. ఉత్తరాయణమును సంగరోత్సవాది । కారణంబులుఁ గలుగు సత్కర్మపరుని
మరణమునకు దుష్కాలంబు గరళరజ్జు । జలముఖములుఁ బాటిలు దుష్టచరితుమృతికి. 520

ప్రతిపదార్థం: సత్కర్మపరుని మరణమునకున్= సత్కార్యాలు చేసేవాడి చావుకు; ఉత్తర+అయనమును= ఉత్తరాయణ కాలమున్నూ; సంగర+ఉత్సవాదికారణంబులున్= యుద్ధోత్సవం మొదలైన హేతువులున్నూ; కలుగున్= సంభవిస్తాయి; దుష్టచరితు మృతికిన్= దుర్జనుడి మరణానికి; దుష్కాలంబున్= చెడుకాలం; గరళరజ్జుజలముఖములున్= విషం, త్రాడు, నీరు మొదలైనవి; పాటిలున్= సంభవిస్తాయి.

తాత్పర్యం: సత్కార్యాలు చేసే సజ్జనుడికి మరణం ఉత్తరాయణ పుణ్యకాలంలోనూ, యుద్ధం మొదలైన సంఘటనల వలననూ కలుగుతుంది. దుష్కార్యపరుడైన దుష్టుడు దుష్టకాలంలో (దక్షిణాయనంలోనే) మరణిస్తాడు. వాడి చావుకు విషం, ఉరిత్రాడు, జలం మొదలైనవి హేతువు లవుతాయి.

క. మానవులకుఁ దలఁపఁగ న । జ్ఞానమునట్టి పగ లేద; దసంగతకృత్యా
ధీనుండై రూపు సెడును । దానం గావున నుదాత్త ధర్మవిధిజ్ఞా! 521

ప్రతిపదార్థం: ఉదాత్తధర్మవిధిజ్ఞా!= శ్రేష్ఠమైన ధర్మవిధిని తెలిసినవాడా!; దానన్= అజ్ఞానంవలన; అసంగతకృత్యాధీనుండు+ఐ= అనుచితాలైన కార్యములకు వశమైనవాడై; రూపుచెడును కావునన్= నశిస్తాడు కాబట్టి; తలఁపఁగన్= ఊహించగా; మానవులకున్= మనుజులకు; అజ్ఞానమునట్టి= అజ్ఞానమువంటి; పగ= శత్రువు; లేదు= లేదు.

తాత్పర్యం: మేలైన ధర్మప్రకారమును తెలిసిన ఓ జనకమహారాజా! అజ్ఞానంవలన మానవుడు అనుచితకార్యాలకు పాల్పడి నశించిపోతాడు. అందువలన మనుష్యులకు అజ్ఞానంవంటి విరోధి మరొకడు లేడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మానుషజన్మము మే; లతి । హీనపు జాతిని జనించె నేనియు నన్యం
బైన జననంబు కంటెను । దాన సుగతివడయ నగుట దత్త్వప్రవణా! 522

ప్రతిపదార్థం: తత్త్వప్రవణా!= తత్త్వమునందు ఆసక్తుడైన వాడా!; దానన్= మానవజన్మచేత; సుగతిన్= సద్గతిని; పడయన్+అగుటన్= పొందవచ్చును కాబట్టి; అన్యంబు+ఐన= ఇతరమైన; జననంబుకంటెను= జన్మకంటె; అతిహీనపుజాతినిన్= మిగుల తక్కువ కులంలో; జనించెన్+ఏనియున్= పుట్టినను; మానుషజన్మము= మనుష్యుడియొక్క పుట్టుక; మేలు= శ్రేష్ఠం.

తాత్పర్యం: యథార్థతత్త్వమునందు ఆసక్తి గల ఓ రాజా! ఎంత తక్కువ కులంలో పుట్టినా, ఇతర జన్మలకంటె మానవుడై జన్మించటమే మేలు. ఎందుకంటే మానవజన్మవలన సద్గతిని పొందవచ్చును గదా!'

క. దానములఁ బుణ్యతీర్థ । స్నానంబుల నతిథిపూజనంబులను ఫలా
దాన నిరతుండు గా కీ । మానుష్యము గారవించు మతి నిత్యుఁడగున్.' 523

ప్రతిపదార్థం: దానములన్= దానాలివ్వటంలోనూ; పుణ్యతీర్థస్నానంబులన్= పవిత్రతీర్థాలలో స్నానం చేయటంలోనూ; అతిథిపూజనంబులనున్= అతిథులను పూజించుటలోనూ; ఫలాదాననిరతుండు కాక= ఫలాన్ని పొందటంలో ఆసక్తిగలవాడుకాక; ఈ మానుష్యమున్= ఈ మనుష్యత్వమును; గారవించుమతిన్= గౌరవించే బుద్ధిచేత; నిత్యుఁడు+అగున్= శాశ్వతుడవుతున్నాడు.

తాత్పర్యం: దానాలు, పుణ్యతీర్థాలలో స్నానాలు, అతిథి సమ్మానాలు చేసినప్పుడు వాటివలన కలిగే ఫలాన్ని ఆశించకుండా ఉండాలి. అట్లా ఉంటూ ఈ మనుష్యజన్మమును ఎవడు గౌరవిస్తాడో, వాడు శాశ్వతస్థానం పొందుతాడు. (ఫలాకాంక్ష లేకుండా సత్కర్మలు చేస్తే శాశ్వతస్థితి లభిస్తుం' దని తాత్పర్యం).

వ. అనిన విని జనక జనేశ్వరుండు పరాశరమునీశ్వరునితో 'మే లెయ్యది? పరమగతి యెయ్యది? కృతంబైన నెద్దానికి నాశంబు లేకుండు? నెఱింగింపవే' యనవుడు నమ్మహీపతి కమ్మహాత్ముం డిట్లనియె. 524

ప్రతిపదార్థం: అనినన్= పరాశరు డట్లా చెప్పగా; విని= ఆకర్ణించి; జనకజనేశ్వరుండు= జనకరాజు; పరాశరముని+ఈశ్వరునితోన్= పరాశరమునీంద్రుడితో; ఏ+అది= ఏది; మేలు= భద్రమైనది; ఏ+అది= ఏది; పరమగతి= శ్రేష్ఠమైన గతి; కృతంబు+ఐనన్= చేయబడితే; ఏ+దానికిన్= దేనికి; నాశంబులేకుండున్= వినాశం లేకుండా ఉంటుందో; ఎఱింగింపవే!= తెలుపుమా!; అనవుడున్= అనగా; ఆ+మహీపతికిన్= ఆ రాజుకు; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అట్లా చెప్పగా విని జనకుడు పరాశరుడితో 'ఏది మేలు? ఏది సుగతి? ఏ పని చేస్తే దానికి వినాశం లేకుండా శాశ్వతంగా ఉంటుంది? ఈ విషయాలు నాకు తెలియపరచు' మని అడిగాడు. అప్పుడు ఆ రాజును చూచి ఆ ముని ఇట్లా పలికాడు.

ఆ. ' అరయ మే లసంగ; మంచితజ్ఞానంబు । పరమగతి, మహాతపంబు చేటు
లేని కృత్య; మిట్లుగా నెఱుంగుట సర్వ । వేదవాక్య తత్త్వవిత్త్వ మనఘ! 525

ప్రతిపదార్థం: అనఘ!= కిల్బిషరహితుడా!; అరయన్= పరిశీలించిచూడగా; అసంగము= సంగం లేకుండా ఉండటం; మేలు= భద్రం; అంచితజ్ఞానంబు= పూజితమైన జ్ఞానం; పరమగతి= శ్రేష్ఠమైన గతి; మహాతపంబు= గొప్ప తపస్సు; చేటులేని= చెడిపోని; కృత్యము= కార్యం; ఇట్లుగాన్= ఈ రీతిగా; ఎఱుంగుట= గ్రహించటం; సర్వవేదవాక్య తత్త్వవిత్త్వము= సమస్త వేదవచనాల తత్త్వాన్ని తెలియటం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'అనఘా! దేనితోనూ సంగం లేకుండా ఉండటం మేలు. మంచి జ్ఞానం కలిగిఉండటం పరమమైన గతి. గొప్ప తపస్సు అనుష్ఠిస్తే దానికెప్పుడూ నాశముండదు. ఇట్లా తెలిసికొనటమే సర్వవేదవచనాల యథార్థభావాన్ని గ్రహించటం అవుతుంది.'

వ. అని చెప్పి వెండియు. 526

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: ఇట్లా పలికి పరాశరుడు మళ్ళీ ఈ రీతిగా చెప్పాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. విను సుమతి విషయములయం । దునికి గలిగె నేనిఁ బొందఁ డుదకంబులఁ బొం
దని బిసరుహపత్త్రము చా । డ్పున నది విజ్ఞానఫలము భూపవరేణ్యా! 527

ప్రతిపదార్థం: భూపవరేణ్యా!= రాజవర్యా!; విను= ఆలకించు; సుమతి= బుద్ధిమంతుడు; విషయముల+అందున్= శబ్దంమొదలైన విషయాలలో; ఉనికి కలిగెన్+ఏనిన్= ఉన్నను; ఉదకంబులన్= నీళ్ళను; పొందని= అంటని; బిసురహపత్రము చాడ్పునన్= తామరాకువలె; పొందఁడు= అంటడు; అది= అట్లా అంటనితనం; విజ్ఞానఫలము= విజ్ఞానముయొక్క ప్రయోజనం.

తాత్పర్యం: 'రాజశ్రేష్ఠా! వినుము. నీళ్ళలో ఉన్నా తామరాకునకు నీరంటదు. అట్లాగే బుద్ధిగలవాడు శబ్దస్పర్శాది విషయాలలో ఉన్నా అవి అంటకుండా ఉంటాడు. అట్లా అసంగంగా ఉండటమే విజ్ఞానం గలిగిఉన్నందుకు ఫలమవుతుంది.

విశేషం: అలంకారం: ఉపమ.

తే. అనఘ! మూఢాత్ము చిత్తంబునందు విషయ । జాల మత్యంత గాఢసంసక్తి నొందు
లక్కరసము దండాదుల జిక్కఁబట్టు । చందమున దీనిఁ గనుట ప్రశాంతికరము. 528

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; మూఢాత్ముచిత్తంబునందున్= మూర్ఖుడి మనస్సులో; విషయజాలము= శబ్దం మొదలుగా గల విషయ సమూహం; లక్కరసము= లక్కద్రవము; దండాదులన్= కట్టె మొదలైనవాటిని; చిక్కఁబట్టు చందమునన్= అంటబట్టుకొనే రీతిగా; అత్యంతగాఢసంసక్తిన్= మిక్కిలి దృఢమైన సంయోగాన్ని; పొందున్= పొందుతుంది; దీనిన్= ఈ పరిస్థితిని; కనుట= గ్రహించటం; ప్రశాంతి కరము= ప్రశాంతిని కలిగిస్తుంది.

తాత్పర్యం: జనకమహారాజా! లక్కరసం ఏ విధంగా దండం మొదలైన పదార్థాలను గట్టిగా పట్టుకొంటుందో అట్లాగే మూఢుని హృదయంలో శబ్దస్పర్శాదులైన విషయజాలం మిక్కిలి దృఢంగా అంటుకొనిపోతుంది. ఈ సంగతిని గమనించి జాగ్రత్తపడటం వలన శాంతి కలుగుతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. ఇనరుచిఁ బాషాణము ర । శ్మి నిరూఢం బైనయట్ల చిత్తము సద్భా
వనమున సదాత్మకం బగు । ననామయ స్థితికి మూల మది మనుజేంద్రా! 529

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్రా!= రాజా; పాషాణము= రాయి (సూర్యకాంతమణి); ఇనరుచిన్= సూర్యకాంతిచేత; రశ్మినిరూఢంబు= కిరణాలతో సంబద్ధం; ఐన+అట్ల= అయిన విధంగా; చిత్తము= మనస్సు; సద్భావనమునన్= మంచిని లేక సత్స్వరూపాన్ని భావించటంచేత; సదాత్మకంబు= మంచితనమే స్వరూపముగా కలది, సత్స్వరూపం; అగున్= అవుతుంది; అది= అట్లాకావటం;

అనామయ స్థితికిన్= శుభస్థితికి; మూలము= కారణం.

తాత్పర్యం: రాజా! సూర్యకాంత శిల సూర్యుడి కాంతిలో సూర్యకిరణాలతో సంబద్ధమవుతుంది. అదే రీతిగా మనస్సు మంచిని భావిస్తే మంచిదిగానే రూపొందుతుంది. లేదా సత్యస్వరూపుడైన పరమాత్మను భావిస్తే సత్స్వరూపం గానే పరిణమిస్తుంది. అట్లా పరిణమించి నప్పుడే ఏ ఉపద్రవమూ లేని శుభస్థితి సిద్ధిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

క. ఆరయఁ గదళీగర్భా । సారము సంసార; మిట్టిచంద మెఱిఁగినం
జేరవు జనన మరణములు; । గారించును దీని భంగిఁ గానక యున్నన్. 530

ప్రతిపదార్థం: ఆరయన్= పరిశీలించగా; సంసారము= గృహస్థజీవనం; కదళీగర్భాసారము= అరటిపొట్టవలె నిస్సారం; ఇట్టిచందమున్= ఈ రీతిని; ఎఱిఁగినన్= తెలిసికొంటే; జనన మరణములు= చావు పుట్టుకలు; చేరవు= దరికిరావు; దీనిభంగిన్= ఈ సంసారస్థితిని; కానక ఉన్నన్= గ్రహించకుంటే; కారించును= బాధిస్తాయి.

తాత్పర్యం: పరిశీలించి చూస్తే అరటి కంబంపొట్టవలె సంసారం సారహీనమై కనిపిస్తుంది. ఈ సంగతి గ్రహించిన వాడు చావుపుట్టుకలనుండి విముక్తు డౌతాడు. అది గ్రహించకపోతే జననమరణాలు అతడిని బాధిస్తాయి.

విశేషం: అలం: ఉపమ.

క. ఒరుల పనికిఁగా నిజహిత । విరహితుఁ డగునట్లు గాదె వివిధేంద్రియకా
ర్యరతుండై యాత్మసము । ద్ధరణంబును జేయకునికి ధరణీనాథా! 531

ప్రతిపదార్థం: ధరణీనాథా!= రాజా!; వివిధ+ఇంద్రియకార్యరతుండు+ఐ= నానావిధాలయిన ఇంద్రియాల పనులలో ఆసక్తుడై; ఆత్మసముద్ధరణంబునున్= తనను ఉద్ధరించు కొనుటను; చేయక+ఉనికి= చేయకుండా ఉండటం; ఒరులపనికిగాన్= ఇతరుల కార్యం కొరకై; నిజహితవిరహితుఁడు= తన+శ్రేయస్సుచేత విడువబడినవాడు; అగునట్లు కాదె= అయినట్లే కదా!

తాత్పర్యం: భూపతీ! మానవుడు పలురకాల ఇంద్రియకార్యాలలో నిమగ్నుడై తనను తాను ఉద్ధరించుకొనకపోవటం ఇతరుల పనికై తన శ్రేయస్సును పోగొట్టుకొన్నట్లే కదా!

క. తన గృహమున నభ్యాసం । బున మెలఁగెడు నంధు చందమున సంసారం
బునఁ దిరుగు మూఢుఁ డెఱుఁగఁడు । వినుతం బగుమోక్షపదము విమలవివేకా! 532

ప్రతిపదార్థం: విమలవివేకా!= నిర్మలమైన వివేకం కలవాడా!; తన గృహమునన్= తన ఇంటిలో; అభ్యాసంబునన్= అలవాటువలన; మెలఁగెడు= ప్రవర్తించెడు; అంధుచందమునన్= గ్రుడ్డివాడివలె; సంసారంబునన్= కుటుంబజీవనమునందు; తిరుగుమూఢుఁడు= చరించే మూర్ఖుడు; వినుతంబు+అగు= ప్రశస్తమైన; మోక్షపదమున్= ముక్తిస్థానమును; ఎఱుఁగఁడు= గ్రహించడు.

తాత్పర్యం: శుద్ధ వివేకంకల ఓ జనకమహారాజా! గ్రుడ్డివాడు అలవాటు చొప్పున తన ఇంటిలో ఇటు అటు సంచరించినట్లే జనన మరణాత్మకమైన సంసారంలో పరిభ్రమించే మూర్ఖుడు ప్రశస్తమైన మోక్షస్థితిని గ్రహించలేడు.

విశేషం: అలం: ఉపమ.

క. వినుము! మృణాళంబున నం । టిన రొంపి జలంబులం గడిగినను బెడఁబా

సిన క్రియ విమల జ్ఞానం । బున సంసారంబు వాయుఁ బురుషు నరేంద్రా! 533

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా!; వినుము= ఆలకించుము; మృణాళంబునన్= తామరతూడునందు; అంటిన= తగులువడిన; రొంపి= బురద; జలంబులన్= నీటిచేత; కడిగినను= శుభ్రం చేస్తే; పెడన్+పాసినక్రియన్= తొలగిపోయిన రీతిగా; విమలజ్ఞానంబునన్= నిర్మలమైన జ్ఞానంచేత; పురుషున్= మనుజుడిని; సంసారంబు= భవం; పాయున్= విడిచిపోతుంది.

తాత్పర్యం: రాజా! వినుము. తామరతూడుకు తగులుకొన్న బురద నీటితో కడిగితే తొలగిపోతుంది. అదే మాదిరిగా మానవుడికి అంటిన సంసారం నిర్మలజ్ఞానం కలిగితే వీడిపోతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. నరనాయక! శిశ్నోదర । పరాయణుం డగుచు నొండు పరికింపని దు
ర్నరుఁ డెలుకఁ బిల్లి వొదివిన । పరుసున జర వొదువ ముక్తిఁ బడయక పొలియున్. 534

ప్రతిపదార్థం: నరనాయక!= నరనాథా!; శిశ్నోదరపరాయణుండు+అగుచున్= గుహ్యేంద్రియమునందును, కుక్షియందును ఆసక్తుడవుతూ; ఒండు= మరొకటి; పరికింపని= పరిశీలించని; దుర్నరుఁడు= దుష్టమానవుడు; ఎలుకన్= మూషికమును; పిల్లిపొదివిన పరుసునన్= పిల్లి పట్టుకొన్న రీతిగా; జర= ముసలితనం; పొదువన్= ఆక్రమించగా; ముక్తిన్= మోక్షమును; పడయక= పొందక; పొలియున్= నశిస్తాడు.

తాత్పర్యం: రాజా! గుహ్యేంద్రియాన్నీ, కుక్షినీ తృప్తి పరచటంలోనే నిమగ్నుడై మరొక విషయం పరిశీలింపని దుష్టమనుజుడు పిల్లి ఎలుకను పట్టినట్లు తనను వార్ధక్యం పైకొనగా మోక్షం పొందలేక నశిస్తాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. వ్రేఁగు పెద్దైన నోడ వారిధిఁ దరింప । లేని భంగి మనోభవాలీఢవృత్తి
యగుచునుండు జీవుండు భవాబ్ధియుత్త । రింపలేఁ డిది నిజము గరిష్ఠచరిత! 535

ప్రతిపదార్థం: గరిష్ఠచరిత= శ్రేష్ఠమైన చరిత్రం కలవాడా!; ఓడ= పడవ; వ్రేఁగు= భారం; పెద్ద+ఐనన్= అధికమైతే; వారిధిన్= సముద్రాన్ని; తరింప లేని భంగిన్= దాటలేని రీతిగా; మనోభవాలీఢవృత్తి= మన్మథుడిచేత ఆక్రమించబడిన వ్యాపారం కలవాడు; అగుచున్+ఉండు= అవుతున్న; జీవుండు= జీవుడు; భవ+అబ్ధి= సంసారసాగరం; ఉత్తరింపలేఁడు= దాటలేడు; ఇది నిజము= ఇది సత్యం.

తాత్పర్యం: పవిత్రచరిత్రుడవైన ఓ రాజా! బరువు ఎక్కువైతే పడవ సముద్రం దాటలేదు. అదే రీతిగా కామావేశం అధికమైన జీవుడు సంసారసముద్రాన్ని దాటజాలడు. ఇది నిజం.

విశేషం: అలం: ఉపమ

క. పడియెడు దుఃఖము లరయం । గడుఁబెక్కల్పములు గను సుఖంబులు వీనం
బడయఁగ నగుమే లెయ్యది? । విడుప యురవు శుభము పొందు విద్యాప్రవణా! 536

ప్రతిపదార్థం: విద్యాప్రవణా!= విద్యయందు ఆసక్తుడైనవాడా!; అరయన్= పరిశీలించగా; పడియెడు= అనుభవించెడు; దుఃఖములు= క్లేశములు; పెక్కు= అధికములు; కను సుఖంబులు= అనుభవించే సుఖాలు; అల్పములు= స్వల్పములు; వీనన్=

కామతృష్ణమొదలైన ఈ దుర్గుణాలచేత; పడయఁగన్+అగు= అనుభవించే; మేలు= భద్రం; ఏ+అది= ఏది?; విడుపు+అ= త్యాగమే; ఉరవు= ఉచితమైనది; శుభముపొందు= మంచి మిత్రము.

తాత్పర్యం: గుహ్యేంద్రియతృప్తి, కుక్షింభరిత్వము అనే ఈ దుర్గుణాలవలన అనుభవానికి వచ్చే కష్టాలు ఎక్కువగా ఉంటాయి. సుఖాలు చాలా స్వల్పం. అందువలన వీటివలన కలిగే మే లేమున్నది? ఈ దుర్గుణాలను పరిత్యజించటమే ఉచితమైన కర్తవ్యం. ఆ పరిత్యాగమే మనకు కలగనున్న శుభానికి మిత్రము. (శుభం కల్గిస్తుందని భావం.)

క. మిత్రులు భార్యలు భ్రాతలుఁ। బుత్రులు నిజకార్యపరులు బోధము సు మ్మా
త్మత్రాణమునకు మూలము। ధాత్రీపతివర్య! యెవ్విధంబునఁ జూడన్. 537

ప్రతిపదార్థం: ధాత్రీపతివర్య!= రాజశ్రేష్ఠా!; ఏ+విధంబునన్+చూడన్= ఏ రీతిగా పరిశీలించినా; మిత్రులున్= స్నేహితులును; భార్యలున్= పెండ్లాములు; భ్రాతలున్= సోదరులును; పుత్రులున్= కుమారులును; నిజకార్యపరులు= తమ కార్యమునందు ఆసక్తులు; ఆత్మత్రాణమునకున్= తన రక్షణకు; మూలము= హేతువు; బోధముసుమ్ము= జ్ఞానంసుమా!

తాత్పర్యం: రాజేంద్రా! ఎట్లా ఆలోచించి చూచినా లోకంలో మిత్రులు, భార్యలు, సోదరులు, కుమారులు తమతమ పనులు సాధించుకొవటంలోనే నిమగ్నులై ఉంటారు. తనను తాను రక్షించుకొనటానికి జ్ఞానమొక్కటే సాధనం సుమా! తక్కినవారు తన రక్షణకు ఉపయోగపడరు.

ఆ. ధీరుఁడై యభేదదృష్టియ పాటించు। చుండునట్టి పురుషు నొక్కమాటు
విడువ దర్కునంశు విభవంబు చాడ్పున। బోధలక్ష్మి పెంపు భూపవర్య! 538

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజశ్రేష్ఠా!; అర్కున్= సూర్యుడిని; అంశువిభవంబు చాడ్పునన్= కాంతివైభవం వలె; ధీరుఁడు+ఐ= ధైర్యంకలవాడై; అభేదదృష్టి+అ= భేదంలేని చూపునే; పాటించుచుండునట్టి పురుషున్= శీలించునట్టి మానవుడిని; బోధలక్ష్మిపెంపు= జ్ఞానలక్ష్మియొక్క అతిశయం; ఒక్కమాటున్= ఒక్కసారికూడ; విడువదు= వదలదు.

తాత్పర్యం: రాజవర్యా! కాంతివైభవం సూర్యుడిని ఎప్పుడూ వదలిపెట్టి ఉండదు. అదే రీతిగా భేదభావం లేని ధీర పురుషుడిని జ్ఞానలక్ష్మి ఎప్పుడూ త్యజించదు.

విశేషం: అలం: ఉపమ.

క. అని యిట్లు పెక్కుభంగుల। మునివరుఁడు పరాశరుం డమోఘ ప్రజ్ఞా
ఘనత యొలయంగఁ జెప్పిన। జనకుఁడు ముదమందె భరత సంతతివర్యా! 539

ప్రతిపదార్థం: భరతసంతతివర్యా!= భరత సంతతిలో శ్రేష్ఠా!; ఇట్లు+అని= ఈ రీతిగా; మునివరుఁడు= మునిశ్రేష్ఠుడు; పరాశరుండు= పరాశరుడు; అమోఘప్రజ్ఞాఘనత= వ్యర్థంకాని బుద్ధియొక్క అతిశయం; ఒలయంగన్= ప్రసరించగా; పెక్కుభంగులన్= అనేకరీతులుగా; చెప్పినన్= చెప్పగా; జనకుఁడు= జనకమహారాజు; ముదము+అందెన్= సంతోషించాడు.

తాత్పర్యం: భారతవర్యా! మునిశ్రేష్ఠుడైన పరాశరుడు ఈ రీతిగా అనేకవిధాల అమోఘమైన ప్రజ్ఞతో చెప్పేసరికి జనకచక్రవర్తి సంతోషించాడు.

హంసగీత (సం. 12-288-1,2)

సీ. అనిన ధర్మసుతుండు హర్షమ్ము దనదు చి। త్తమున నిండార శాంతనవుతోడ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

' దమమును సత్యంబు క్షమయును నెల్లెడ । వినుతింపఁబడు నార్యజనులచేత;
నవి యంత లెస్సలే?' యనవుడు నతనికి । నతఁడిట్టులను 'విను హంసగీత;
యది యుత్తరంబగు నధిప! నీ ప్రశ్నంబు । నకు; దానిఁ జెప్పెద నలినభవుఁడు
తే. పసిఁడి రాయంచయై కేళిపరత నొంది । తిరుగ నొక్కెడ సాధ్యు లద్దేవుఁ గాంచి
పక్షివర! నీవు విద్యలఁ బ్రౌఢుఁడగుట । సెప్పఁగా విందు మాశ్రయించెదము నిన్ను. 540

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ధర్మసుతుండు= ధర్మరాజు; తనదు చిత్తమునన్= తన మనస్సులో; హర్షమ్ము= సంతోషం; నిండారన్= నిండగా; శాంతనవుతోడన్= భీష్మునితో; దమమును= బాహ్యేంద్రియనిగ్రహమును; సత్యంబు= సత్యపరిపాలనము; క్షమయును= ఓర్పును; ఆర్యజనుల చేతన్= పెద్దలచేత; ఎల్లెడన్= అన్నిచోట్లా; వినుతింపఁబడున్= ప్రస్తుతింపబడుతుంది; అవి= దమము మొదలైన ఆ గుణాలు; అంత లెస్సలే?= అంతశ్రేష్ఠములైనవా?; అనవుడున్= అనగా; అతనికిన్= ఆ ధర్మరాజుకు; అతఁడు= భీష్ముడు; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు; అధిప!= రాజా!; హంసగీత విను= 'హంసగీత' అన్న ఉపదేశభాగాన్ని ఆలకించుము; అది= ఆ గీత; నీ ప్రశ్నంబునకున్= నీవడిగిన ప్రశ్నకు; ఉత్తరంబు+అగున్= సమాధాన మవుతుంది; దానిన్= ఆ హంసగీతను; చెప్పెదన్= పలుకుతాను; నలినభవుఁడు= పద్మజుడైన బ్రహ్మ; పసిఁడిరాయంచ ఐ= బంగారు రాజహంసఅయి; కేళిపరతన్= క్రీడాపరత్వమును; ఒంది= పొంది; తిరుగన్= సంచరించగా; సాధ్యులు= సాధ్యులనబడే దేవతావిశేషాలు; ఒక్క+ఎడన్= ఒకచోట; ఆ+దేవున్= ఆ బ్రహ్మను; కాంచి= చూచి; పక్షివర!= పక్షిశ్రేష్ఠా!; విద్యలన్= విద్యలలో; నీవు ప్రౌఢుఁడు+అగుట= నిపుణుడవగుట; చెప్పఁగాన్+విందుము= చెప్పుతుండగా వింటున్నాము; నిన్నున్= విద్యానిపుణుడవగు నిన్ను; ఆశ్రయించెదము= ఆశ్రయంగా పొందుతాము.

తాత్పర్యం: అని భీష్ముడు పై విధంగా చెప్పేసరికి ధర్మరాజు చిత్తం సంతోషంతో నిండిపోయింది. అప్పుడు అతడు మరల భీష్ముడితో 'దమము, సత్యము, ఓర్పు - అనే సద్గుణాలు ప్రతిచోటా పెద్దలచేత కీర్తించబడుతున్నాయి. అవి అంత మంచి గుణాలా?' అని ప్రశ్నించాడు. అప్పుడు భీష్ము డతడితో 'రాజా! 'హంసగీత' అనే గీత వినుము. అది నీ ప్రశ్నకు తగిన సమాధానంగా ఉన్నది. దానిని చెప్పుతాను. బ్రహ్మదేవుడు బంగారు రాజహంస రూపం పొంది స్వేచ్ఛగా క్రీడిస్తూ సంచరిస్తూ ఉండగా, ఒకచోట సాధ్యులు ఆ దేవుడిని చూచారు. చూచి 'పక్షివర్యా! నీవు విద్యలలో నిపుణుడ వని అనేకులు చెప్పగా విన్నాము. నిన్ను మేము ఆశ్రయిస్తున్నాము.'

వ. ' ఏము సాధ్యుల' మని పలికి సవినయంబుగా నిట్లనిరి. 541

ప్రతిపదార్థం: ఏము సాధ్యులము= మేము 'సాధ్యులు' అనబడే దేవతావర్గానికి చెందినవారము; అని పలికి= అని చెప్పి; సవినయంబుగాన్= వినయంతో; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: 'మేము సాధ్యులు అనబడే దేవతావర్గపు వారము' అని చెప్పి మళ్ళీ వారు వినయంతో బ్రహ్మ నుద్దేశించి ఇట్లా అన్నారు.

తే. ' ఉత్తమం బెద్ది? నీ చిత్త మొలయు నెందుఁ? । బురుషుఁ డెయ్యది గల్గినఁ బొందు నఖిల
కర్మబంధ మోక్షము? నట్టి ధర్మ మెఱుఁగఁ । జెప్పవే కరుణాలత చిగురులొత్త.' 542

ప్రతిపదార్థం: కరుణాలత= 'దయ' అనే తీగ; చిగురులు+ఒత్తన్= అంకురించగా; ఎద్ది= ఏది; ఉత్తమంబు= శ్రేష్ఠతమమైనది; నీ చిత్తము= నీ హృదయం; ఎందున్= దేనిలో; ఒలయున్= ప్రసరిస్తుంది?; పురుషుఁడు= మనుజుడు; ఏ+అది= ఏది; కల్గినన్= కలిగిఉంటే; అఖిలకర్మబంధమోక్షమున్= సమస్తకర్మబంధాలనుండి విడుదలను; పొందున్= చెందుతాడు; అట్టి ధర్మమున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అటువంటి ధర్మాన్ని; ఎఱుఁగన్+చెప్పవే= తెలియచెప్పుమా.

తాత్పర్యం: 'ఈ లోకంలో ఉత్తమమైన దేది? నీ మనస్సు దేనిలో లీనమవుతుంది? ఏది కలిగి ఉంటే పురుషుడు అన్నివిధాలైన కర్మబంధాలనుండి విడివడతాడు? అట్లాంటి ప్రశస్తధర్మాన్ని మాకు దయామయమైన చిత్తంతో వివరించుము.'

వ. అని యడిగిన నాదరించి యయ్యంచ వారల కిట్లనియె. 543

ప్రతిపదార్థం: అని+అడిగినన్= సాధ్యులట్లా ప్రశ్నించగా; ఆ+అంచ= ఆ రాజహంస; ఆదరించి= సంభావించి; వారలకున్= వారికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: ఆ సాధ్యులట్లా తనను ప్రశ్నించగా హంస వారిపై ఆదరం చూపి వారితో ఇట్లా అన్నది.

క. ' క్షమయును దమమును సత్యము । నమేయ మహిమాస్పదంబు లన విందుము ధ
ర్మములం దెల్లను నభివ । ర్ణ్యము; లవి హృద్గ్రంథిభేదన ప్రౌఢంబుల్.' 544

ప్రతిపదార్థం: క్షమయును= ఓర్పును; దమమును= బాహ్యేంద్రియ నిగ్రహమును; సత్యమున్= సత్యవచనమున్ను; అమేయమహిమ+ఆస్పదంబులు+అనన్= అపరిమితమైన ప్రభావానికి స్థానాలనగా; విందుము= వింటున్నాము; అవి; ధర్మములందున్+ఎల్లనున్= సమస్త ధర్మాలలోనూ; అభివర్ణ్యములు= కీర్తించదగినవి; హృద్గ్రంథిభేదనప్రౌఢంబుల్= హృదయంలోని ముడులను భేదించటంలో సమర్థములు.

తాత్పర్యం: 'ఓర్పు, దమము, సత్యము అనే ఈ మూడు సద్గుణాలు అపరిమితమహిమ కలిగి ఉన్నాయని వింటున్నాము. అవి సమస్త ధర్మాలలోనూ కీర్తించదగినవై ఉన్నాయి. అవి హృదయంలోని వాసనామయములై అవిద్యవలన ఏర్పడిన గ్రంథులను భేదించటంలో చాలా సమర్థములై ఉన్నాయి.'

విశేషం: పూర్వజన్మలో చేసిన కర్మల వలన కలిగిన మాలిన్యం హృదయంలో వాసనారూపంలో ముడివడి ఉంటుంది. ఈ ముడులే హృదయగ్రంథులు అనబడతాయి. ఈ శరీరమే నేను, ఇది నా ధనం, నేను సుఖవంతుడిని, దుఃఖవంతుడిని' ఇత్యాది భావనలే. అవిద్యామూలంగా ఏర్పడే గ్రంథులు. క్షమ మొదలైన సద్గుణాల వలన ఈ ముడులు విడిపోతాయి.

వ. అని చెప్పి వెండియు. 545

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: ఆ హంస అట్లా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నది.

క. ' పరమర్మ భేదులును నయ । విరహితములు ధర్మకార్య విముఖంబులు ని
ష్ఠురములు నగు మాటలు స । త్పురుషుం డాడఁ డవి సత్యములు గా కునికిన్. 546

ప్రతిపదార్థం: అవి= ఈ చెప్పబోయేవి; సత్యములు= నిజాలు; కాక+ఉనికిన్= కాకుండా ఉండటంవలన; సత్పురుషుండు= సజ్జనుడు; పరమర్మ భేదులునున్= ఇతరుల జీవస్థానాలను భేదించేవీ; నయవిరహితములున్= నీతిలేనివీ; ధర్మకార్య విముఖంబులున్= ధర్మంతో కూడిన పనులకు విరుద్ధాలును; నిష్ఠురములున్+అగు= కఠినములునైన; మాటలు= వాక్యాలు; ఆడఁడు= పలుకడు.

తాత్పర్యం: ఇతరుల మర్మాలను భేదించేవీ, నీతికి దూరమైనవీ, ధర్మకార్యాలకు అనుకూలం కానివీ, కఠినములైనవీ అయిన వాక్యాలు సత్యాలు కాజాలవు. అందువలన సజ్జనుడు అట్టిమాటలు చెప్పడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. జనములు దను నవమానిం । చిన నిందించినను మాఱుసేయక సైరిం
చిన శాంతాత్ముఁడు వారల । మును చేసిన యట్టి సుకృతముల నాఁచికొనున్. 547

ప్రతిపదార్థం: జనములు= ప్రజలు; తనున్= తనను; అవమానించినన్= పరాభవించినా; నిందించినన్= తిట్టినా; మాఱుచేయక= ప్రతీకారం చేయక; సైరించిన= సహించిన; శాంత+ఆత్ముఁడు= శాంతచిత్తుడు; వారల= వారియొక్క; మునుచేసినఅట్టి= పూర్వం కావించినట్టి; సుకృతములన్= పుణ్యాలను; ఆఁచికొనున్= అపహరించుకొంటాడు.

తాత్పర్యం: ఎవడు జనులు తనను అవమానించినా, తిట్టినా బదులు చేయకుండా సహించుకొంటాడో, అట్టి శాంతమనస్కుడు తనను అవమానించినవారు పూర్వం చేసిన పుణ్యాలను అపహరించుకొంటాడు.

క. కీడాడిన మేలాడుచుఁ । దాడన మొనరించి రేని దరహాసముతో
నీడం బోదును గ్రోధో । త్పీడ వొరయ దెప్పుడును మదీయహృదయమున్. 548

ప్రతిపదార్థం: కీడు+ఆడినన్= నిందించినా; మేలు+ఆడుచున్= శుభం పలుకుతూ; తాడనము= కొట్టటం; ఒనరించిరేనిన్= చేసినను; దరహాసమునన్= చిరునగవుతో; ఈడన్+పోదును= వెనుదీస్తాను; ఎప్పుడునున్= ఏ వేళనూ; మదీయహృదయమున్= నా చిత్తాన్ని; క్రోధ+ఉత్పీడ= కోపముయొక్క+ఒత్తిడి; పొరయదు= పొందదు.

తాత్పర్యం: న న్నెవరైనా నిందిస్తే నేను వారిపట్ల శుభమే పలుకుతాను కాని అశుభం పలకను. ఎవరైనా కొట్టినా చిరునవ్వుతో వెనుదీస్తాను గాని మారు కొట్టటానికి ప్రయత్నించను. ఎప్పుడూ నా హృదయంలో కోపం పొడసూపదు.

తే. వేదసారంబు సత్యంబు; వినుఁడు! సత్య । సారమూర్తి దమము; దమసార మనఘు
లార! మోక్ష; మీ పరిపాటి గారవమున । నాదరించు జనంబుల కందు ముక్తి. 549

ప్రతిపదార్థం: అనఘులార!= పాపరహితులారా!; వినుఁడు= ఆలకించండి!; వేదసారంబు= శ్రుతియొక్క సారం; సత్యంబు= సత్యవచనం; సత్యసారమూర్తి= సత్యంయొక్క సారమైన రూపం; దమము= బాహ్యేంద్రియ నిగ్రహం; దమసారము= ఇంద్రియనిగ్రహము యొక్క సారాంశం; మోక్షము= విడుదల; ఈ పరిపాటిన్= ఈ పద్ధతిని; గారవంబునన్= ప్రేమతో; ఆదరించు జనంబులకున్= గౌరవించే ప్రజలకు; ముక్తి= మోక్షం; అందున్= లభిస్తుంది.

తాత్పర్యం: పాపరహితులైన సాధ్యులారా! వినండి. వేదము యొక్క సారాంశం సత్యం. సత్యంయొక్క సారరూపం దమము, దమము యొక్క సారాంశం ముక్తి. ఈ ప్రకారం సత్యాదులను పాటించేవారికి మోక్షం కరతలామలక మవుతుంది.

క. దమమునఁ గర్మేంద్రియముల । శమియింపఁగఁ జేత యది నిసర్గగుణంబై
రమియించు నెప్పురుషు చి । త్తము దాన నతండు సర్వధర్మకరుఁ డగున్. 550

ప్రతిపదార్థం: దమమునన్= ఇంద్రియ నిగ్రహంతో; కర్మేంద్రియములన్= వాక్కు మొదలైన కర్మేంద్రియాలను; శమియింపఁగన్+చేఁత= శాంతింప జేయటం; అది= అది; నిసర్గగుణంబై= సహజస్వభావమై; ఏ+పురుషు చిత్తమున్= ఏ మనుజుడి మనస్సును; రమియించున్= రమింపజేస్తుందో; అతండు= ఆ మనుజుడు; దానన్= ఆ చిత్తంచేత; సర్వధర్మకరుఁడు+అగున్= సమస్త ధర్మాలు చేసినవా డవుతాడు.

తాత్పర్యం: బాహ్యేంద్రియ నిగ్రహాత్మకమైన దమంతో వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ అనే ఐదు కర్మేంద్రియాలను శాంతింప జేయటమనేది సహజగుణమై ఎవడి మనస్సును రమింపజేస్తుందో, దానివలన అతడు సమస్తమైన ధర్మాలు చేసినవాడవుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఆ తెఱఁ గఘములఁ బాచును । బాతకములు వాయ మొగులు వాసిన సంప్ర
ద్యోతితుఁ డగు నమృతాంశుని । భాతి వెలుఁగు నాత్మమోక్షపద మది సుండీ! 551

ప్రతిపదార్థం: ఆ+తెఱఁగు= ఆ పద్ధతి; అఘములన్= పాపాలను; పాచును= తొలగిస్తుంది; పాతకములు= పాపాలు; పాయన్= తొలగగా; మొగులు పాసినన్= మబ్బు తొలగిన; సంప్రద్యోతితుఁడు+అగు= చక్కగా ప్రకాశించేవాడైన; అమృతాంశుని భాతిన్= చంద్రుడివలె; ఆత్మ వెలుఁగున్= ఆత్మ ప్రకాశిస్తుంది; అది= ఆ ఆత్మప్రకాశమే; మోక్షపదము సుండీ!= మోక్షస్థానం సుమా!

తాత్పర్యం: ఆ రీతిగా ఇంద్రియాలను నిగ్రహించటమనే పద్ధతి పాపాలు నశింపచేస్తుంది. పాపాలు పోతే మబ్బు తొలగితే చంద్రుడు ప్రకాశించునట్లు ఆత్మ ప్రకాశిస్తుంది. అదే మోక్షం.

విశేషం: అలంకారం: ఉపమ.

క. మనసును వాక్కును రక్షం । బనుపడు నెవ్వనికి శ్రుతి తపస్త్యాగము లా
తని చేతిలోని వగునని । మునిజనములచేత విందుము నిరంతరమున్. 552

ప్రతిపదార్థం: ఎవ్వనికిన్= ఏ మనుజుడికి; మనసునున్= చిత్తమును; వాక్కునున్= మాటయు; రక్షన్+పనుపడున్= రక్షణకు అలవాటుపడునో; శ్రుతితపస్త్యాగములు= వేదము, తపస్సు, దానము అనేవి; ఆతనిచేతిలోనివి+అగున్+అని= అతడి చేతికి లభ్యము లవుతా యని; నిరంతరమున్= ఎల్లవేళలా; మునిజనములచేతన్= ఋషులచేత; విందుము= వింటాము.

తాత్పర్యం: ఎవడు మనస్సును, మాటను అపమార్గంలో పోనీయకుండా రక్షిస్తాడో, అతడి చేతిలోనే వేదం, తపస్సు, త్యాగం ఉంటాయని సదా మునులు చెప్పగా వింటున్నాము.

క. పలుకు వడినతనిఁ బాపం । బులు విడుచుం బలికినతనిఁ బొందును బాపం
బులు నొరుపాపము దనపై । నొలయింపఁగనేల నింద యుడిగినఁ గాదే. 553

ప్రతిపదార్థం: పలుకువడినతనిన్= నిందపడినవాడిని; పాపంబులు= పాతకాలు; విడుచున్= వదలుతాయి; పలికినతనిన్= నిందించినవాడిని; పాపంబులు= పాతకాలు; పొందును= చేరుతాయి; ఒరుపాపమున్= ఇతరుని పాతకమును; తనపైన్= తనమీద; ఒలయింపఁగన్+ఏల= వ్యాపింపచేయుట మెందుకు?; నింద యుడిగినన్= నిందించటం వదలితే; కాదే?= జరుగదా? (ఉచితం గాదా)

తాత్పర్యం: ఎవడు ఊరక ఇతరులచేత నిందించబడతాడో, వాడిని పాపాలు విడిచిపెడతాయి. ఎవడు ఊరక ఇతరుడిని నిందిస్తాడో, వాడిని పాపాలు చుట్టుకొంటాయి. అందువలన ఇతరులను నిందించి వారి పాపం తనపై వేసికొనటం ఎందుకు? నిందించటం పూర్తిగా వదలి పెట్టితే మంచిదికదా!

క. కుపితుఁ డగువాని వ్రతమును । జపమును దేవార్చనంబు శ్రాద్ధక్రియయుం
దపమును దానము యజనము । నపగతములు గాఁగఁజేయు నంతకుఁ డలుకన్. 554

ప్రతిపదార్థం: అంతకుఁడు= యముడు; అలుకన్= కోపంతో; కుపితుఁడు+అగువాని వ్రతమును= కోపించినవాడియొక్క వ్రతమూ; జపమును= జపమూ; దేవార్చనంబు= దేవపూజ; శ్రాద్ధక్రియయున్= పితృకర్మ; తపమును= తపస్సు; దానము= ఈవి; యజనము= యాగక్రియ; అపగతములు+కాఁగన్+చేయున్= తొలగేటట్లు చేస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఎవడు కోపం కలిగిఉంటాడో, వాడి వ్రతం, జపం, దేవపూజ, పితృకర్మ, తపస్సు, దానం, యాగక్రియ - వీటన్నిటినీ కోపంతో యముడు నశింపజేస్తాడు.

చ. పలుకక యుండుకంటెఁ దగఁ బల్కుట మేలు; వినుండు! సత్యముం
బలుకుట ధర్మమార్గమునఁ బల్కుట సర్వజన ప్రియంబుగాఁ
బలుకుట యోలి నెక్కుడగు భంగులు; వీని నెఱింగి యొండుమైఁ
బలుకక నాల్గుచందములఁ బల్కఁగ మెత్తురు వాని దేవతల్. 555

ప్రతిపదార్థం: వినుండు= ఆలకించండి!; పలుకకఉండు కంటెన్= మాటలాడక ఉండటంకన్నా; తగన్= తగురీతిగా; పల్కుట= మాటలాడటం; మేలు= శ్రేయస్కరం; సత్యమున్= నిజమును; పలుకుట= వచించటం; ధర్మమార్గమునన్= ధర్మపద్ధతిలో; పల్కుట= వచించటం; సర్వజనప్రియంబుగాన్= సమస్త ప్రజలకు ప్రీతికలిగేటట్లుగా; పలుకుట= వచించటం; ఓలిన్= వరుసగా; ఎక్కుడు+అగుభంగులు= ఎక్కువఅయిన పద్ధతులు; వీనిన్= ఈ పద్ధతులను; ఎఱింగి= తెలిసికొని; ఒండుమైన్= మరొకరీతిగా; పలుకక= వచించక; నాల్గుచందములన్= నాల్గువిధాల; పల్కఁగన్= వచించగా; వానిన్= అట్లు వచించేవాడిని; దేవతల్= సురలు; మెత్తురు= అభినందిస్తారు.

తాత్పర్యం: వినండి! మాటలాడకుండా మౌనం వహించటంకంటె తగినట్లు మాటలాడటం మేలు. సత్యంగా మాటలాడటం, ధర్మపద్ధతిలో మాటలాడటం, సకలజనులకు ప్రీతిగా మాటలాడటం క్రమంగా శ్రేష్ఠమైన పద్ధతులు. ఇట్లా మాట్లాడేపద్ధతులు గ్రహించి మరొక విధంగా మాటలాడక పై జెప్పినట్లు నాలుగువిధాల మాటలాడేవాడిని దేవతలు అభినందిస్తారు.

క. సత్యక్షమాదమంబులు । నిత్యపదంబునకు నెక్కు నిచ్చెన; యవి సం
గత్యనుగతములు సత్సాం । గత్యం బటు గాన ముఖ్యకార్యము సుండీ!' 556

ప్రతిపదార్థం: సత్య క్షమా దమంబులు= సత్యం, ఓర్పు, ఇంద్రియనిగ్రహం అనేవి; నిత్యపదంబునకున్= శాశ్వతమైన స్థానానికి; ఎక్కునిచ్చెన= ఎక్కటానికి తగిన సాధనము; అవి= సత్యం మొదలైనవి; సంగత్యనుగతములు= సాంగత్యమును అనుసరించి వచ్చేవి; అటుకానన్= అందువలన; సత్సాంగత్యంబు= సజ్జనులతోడి పొత్తు; ముఖ్యకార్యము= ప్రధానంగా చేయదగింది; చుండీ!= సుమా!

తాత్పర్యం: సత్యం, ఓర్పు, బాహ్యేంద్రియ నిగ్రహం అనేవి మూడూ శాశ్వతమైన మోక్షస్థానం అధిష్ఠించటానికి ఉపకరించే నిచ్చెనవంటివి. అవి సాంగత్యమునుబట్టి వస్తాయి. ఆ కారణాన సజ్జనసాంగత్యం ముఖ్యమైన కర్తవ్యమని గమనించండి!'

విశేషం: అలంకారం: రూపకం.

వ. అని సత్య క్షమా దమ ప్రకారవిషయంబు లైన వాక్యంబులు సెప్పిన విని కృతార్థులై సాధ్యులు సంతోషించి వెండియు హంసంబున కిట్లనిరి. 557

ప్రతిపదార్థం: అని= ఈ రీతిగా; సత్య క్షమా దమ ప్రకారవిషయంబులు+ఐన= సత్యం, ఓర్పు, ఇంద్రియనిగ్రహం వీటి స్వభావం విషయంగా గల్గిన; వాక్యంబులు= మాటలు; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; కృతార్థులు+ఐ= కృతకృత్యులై; సాధ్యులు సంతోషించి= సాధ్యులు హర్షించి; వెండియున్= మరల; హంసంబునకున్= అంచతో; ఇట్లు+అనిరి= ఈ రీతిగా అన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: హంస ఈ ప్రకారంగా సత్యం, క్షమ, దమం అనే గుణాలస్వభావాన్ని వివరించే మాటలు చెప్పింది. అది విని ధన్యులై సాధ్యులు సంతోషించారు. మళ్ళీ హంసతో వారు ఇట్లా అన్నారు.

క. **'ఏమిట లోకం బావృత? । మేమిటఁ దా వెలుఁగకుండు? నేమిట మిత్ర**
స్తోమంబు విడుచుఁ దనుఁ గా । దేమిట మోక్షంబు? మాకు నెఱిఁగింపు దయన్.' **558**

ప్రతిపదార్థం: లోకంబు= ప్రపంచం; ఏమిటన్= దేనిచేత; ఆవృతము= ఆవరింపబడింది; ఏమిటన్= దేనివలన; తాన్= తాను; వెలుఁగకుండున్= ప్రకాశించకుండా ఉంటుంది; ఏమిటన్= దేనిచేత; తనున్= తనను; మిత్రస్తోమంబు= మిత్రులసమూహం; విడుచున్= వదలును; ఏమిటన్= దేనివలన; మోక్షంబు= ముక్తి; కాదు= సిద్ధించదు; దయన్= కృపతో; మాకున్ ఎఱిఁగింపు= మాకు తెలియజెప్పుము.

తాత్పర్యం: 'ఈ లోకం దేనిచేత కప్పబడి ఉన్నది? ఒకడు తాను దేనివలన ప్రకాశించకుండా ఉంటాడు? దేనిచేత మిత్రులు తనను వదలిపోతారు? దేనిచేత మోక్షం కలుగదు? ఈ విషయాలు కృపతో మాకు తెలియపరచుము.'

వ. **అనుటయు.** **559**

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా.

తాత్పర్యం: అని సాధ్యులు ప్రశ్నింపగా.

ఉ. **ఆనతవైరి! యిట్టులను హంసము వారలతోడ 'లోక మ**
జ్ఞానముచేత నావృతము సంభృతమత్సరుఁడైన వే ఽగుం
దాను బ్రకాశసంపదకుఁ దన్ విడుచుం దెగి మిత్రకోటిలో
భానుగతిన్ విమోక్షపద మందదు సంగముకల్మి నెమ్మెయిన్.' **560**

ప్రతిపదార్థం: ఆనతవైరి!= అవనతులైన శత్రువులు కలవాడా!; హంసము= మరాళం; వారలతోడన్= వారితో; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నది; లోకము= ప్రపంచం; అజ్ఞానము చేతన్= జ్ఞానంలేమిచేత; ఆవృతము= కప్పబడింది; తాను= తాను; సంభృతమత్సరుఁడు+ఐనన్= మచ్చరముచేత నిండినవాడైతే; ప్రకాశసంపదకున్ వేఱు+అగున్= కాంతి సంపదకు భిన్నమవుతాడు; లోభానుగతిన్= లోభమును అనుసరించటం చేత; తెగి= సాహసించి; మిత్రకోటి= మిత్రులబృందం; తన్+విడుచున్= తనను వదలును; ఏ+మెయిన్= ఏ రీతిగానైనా; సంగముకల్మిన్= సంసర్గం కలిగి ఉండటంచేత; విమోక్షపదము= విముక్తి స్థానం; అందదు= లభించదు.

తాత్పర్యం: శత్రుంజయుడవైన ఓ ధర్మరాజా! అప్పుడు హంస వారితో ఇట్లా అన్నది: 'ఈ లోకం అవివేకంచేత ఆవరించబడిఉన్నది. మానవుడు మాత్సర్యం కలవాడైతే లోకంలో ప్రకాశించకుండా పోతాడు. లోభి అయినవాడిని మిత్రబృందం వదలిపోతుంది. ఏ రీతిగానైనా లోకసంసర్గం కలిగిఉన్న వాడికి మోక్షం లభించదు.'

వ. **అనిన వారు మరాళంబున కిట్లనిరి.** **561**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; వారు= ఆ సాధ్యులు; మరాళంబునకున్= హంసకు; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: హంస అట్లా చెప్పేసరికి సాధ్యులు మళ్ళీ దానితో ఇట్లా అన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ' ఎవ్వఁడు రమించు నొక్కఁడ, । యెవ్వఁడు పెక్కండ్రఁ బ్రీతి నెసఁగఁగఁజేయున్,
నివ్వటిలు నెవ్వనికి బల । మెవ్వఁడు కలహంబు వెంట కెంతయుఁ దొలఁగున్.' 562

ప్రతిపదార్థం: ఎవ్వఁడు= ఎవడు; ఒక్కఁడ రమించున్= ఒకడే క్రీడిస్తాడు; ఎవ్వఁడు= ఎవడు; పెక్కండ్రన్= పెక్కుమందిని; ప్రీతిన్= ప్రీతితో; ఎసఁగఁగన్+చేయున్= అతిశయించునట్లు చేస్తాడు; ఎవ్వనికిన్= ఎవనికి; బలము= సత్తువ; నివ్వటిలున్= కలుగుతుంది; ఎవ్వఁడు= ఎవడు; ఎంతయున్= మిక్కిలిగా; కలహంబు వెంటకున్= జగడపు త్రోవకు; తొలఁగున్= దూరంగా పోతాడు.

తాత్పర్యం: ఒక్కడే తనలో తాను రమించేవా డెవడు? చాలామందికి ప్రీతి కల్గించేవా డెవడు? ఎవనికి బలం కలుగుతుంది? ఎవడు కలహపు త్రోవకు దూరంగా తొలగిపోతాడు?'

వ. అని యడిగిన హంస యిట్లనియె. 563

ప్రతిపదార్థం: అని యడిగినన్= అని ప్రశ్నించగా; హంస= మరాళం; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అని సాధ్యులు అడిగేసరికి హంసవారితో ఇట్లా చెప్పింది.

క. ' ప్రాజ్ఞుఁడు రమించు నొక్కఁడ; । ప్రాజ్ఞుఁడు పెక్కండ్రఁ బ్రీతిఁ బరఁగఁగఁ జేయున్;
బ్రాజ్ఞుఁడు బలవంతుం డగుఁ; । బ్రాజ్ఞుఁడు కలహమునఁ దొట్టుపడక తొలంగున్. 564

ప్రతిపదార్థం: ప్రాజ్ఞుఁడు= పండితుడు; ఒక్కఁడ= ఒకడే; రమించున్= క్రీడిస్తాడు; ప్రాజ్ఞుఁడు= పండితుడు; పెక్కండ్రన్= చాలామందిని; ప్రీతిన్= ప్రీతితో; పరఁగఁగన్+చేయున్= ప్రవర్తిల్లునట్లు చేస్తాడు; ప్రాజ్ఞుఁడు= పండితుడు; బలవంతుండు+అగున్= బలంకలవాడవుతాడు; ప్రాజ్ఞుఁడు= పండితుడు; కలహమునన్= జగడంలో; తొట్టుపడక= తగులువడక; తొలంగున్= దూరంగా పోతాడు.

తాత్పర్యం: ఆత్మజ్ఞానసంపన్నుడైన పండితుడు ఒక్కడే తనలోతాను ఆనందిస్తాడు, ఎక్కువమంది జనులలో ప్రీతి కలిగిస్తాడు. బలం కలవా డవుతాడు. అట్టి పండితుడు ఎవరితోనూ జగడానికి పోక తొలగిపోతాడు.

వ. అని చెప్పిన రాయంచతో సాధ్యు లిట్లనిరి. 565

ప్రతిపదార్థం: అని చెప్పిన= అని వచించిన; రాయంచతోన్= రాజహంసతో; సాధ్యులు+ఇట్లు+అనిరి= సాధ్యు లీరీతిగా అన్నారు.

తాత్పర్యం: ఈ రీతిగా చెప్పిన హంసను చూచి సాధ్యులు మరల ఇట్లా చెప్పారు.

తే. ' విప్రుఁడేమిట దేవత్వవిభవ మొందు? । నేమి కతమున సాధుత్వ మెసకమెసఁగు?
నతని కెద్ది యసాధుత్వ మావహించు? । మానుషుం డగు నెద్దాన? మహితమూర్తి! 566

ప్రతిపదార్థం: మహితమూర్తి!= పూజ్యమైన ఆకృతిగల ఓ హంసా!; విప్రుఁడు= బ్రాహ్మణుడు; ఏమిటన్= దేనిచేత; దేవత్వవిభవమున్= అమరత్వ వైభవాన్ని; ఒందున్= పొందుతాడు; అతనికిన్= ఆ విప్రుడికి; ఏమి కతమునన్= ఏ కారణాన; సాధుత్వము= సజ్జనత్వం; ఎసకమెసఁగున్?= మిక్కిలి అతిశయిస్తుంది?; ఎద్ది= ఏది; అసాధుత్వమున్= దుర్జనత్వమును; ఆవహించున్= కలిగిస్తుంది?; ఏ+దానన్= దేనివలన; మానుషుండు+అగున్?= కేవలమనుష్యు డవుతాడు?

తాత్పర్యం: 'దివ్యాకృతి గల ఓ హంసమా! బ్రాహ్మణుడు దేనిచేత దేవతావైభవం పొంది రాణిస్తాడు? ఏ కారణంతో అతడు సాధుపురుషుడుగా ప్రశస్తి పొందుతాడు? అతడిని సాధుత్వం లేనివాడినిగా చేసేది ఏది? దేనివలన అతడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కేవలం మనుష్యు డవుతాడు?'

చ. అనుటయు హంస మిట్టులను 'నధ్యయనంబున దేవభావముం
గను; వ్రతవృత్తి సాధువనఁగాఁ జరియించు; జనం బసాధు నాఁ
జనుఁ బరివాదశీలమున; శౌచవిహీనత మృత్యుభీతి వొం
దిన మదిలోన నెక్కొనిన దీనత విప్రుఁడు మానుషుం డగున్.' 567

ప్రతిపదార్థం: అనుటయున్= అని అడుగగా; హంసము= మరాళం; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నది; విప్రుఁడు= ద్విజుడు; అధ్యయనంబునన్= వేదం చదువటంచేత; దేవభావమున్+కనున్= దేవత్వం పొందుతాడు; వ్రతవృత్తిన్= పుణ్యకర్మపు వర్తనంచేత; సాధువు అనఁగాన్= సజ్జనుడనగా; చరియించున్= ప్రవర్తిల్లుతాడు; పరివాదశీలమునన్= నిందాశీలంచేత; జనంబు= ప్రజ; అసాధునాన్+చనున్= దుర్జనుడనగా అట్లే అయిపోతాడు; శౌచవిహీనతన్= శుచిత్వం లేకపోవటం వలన; మృత్యుభీతిన్= మరణభయమును; పొందిన మదిలోనన్= చెందిన హృదయములో; నెక్కొనిన= పాదుకొన్న; దీనతన్= దీనత్వముచేత; మానుషుండు+అగున్= మనుష్యుడు అవుతాడు.

తాత్పర్యం: సాధ్యు లట్లా ప్రశ్నించగా హంస ఇట్లా అన్నది - 'బ్రాహ్మణుడు వేదాధ్యయనం చేయటంతో దేవత్వం పొందుతాడు. ఉపవాసాది పుణ్యకర్మలు చేయటంతో సాధువుగా ప్రశస్తి పొందుతాడు. నింద్యమైన శీలం కలవాడైతే ప్రజ లతడిని దుర్జనుడు అని వ్యవహరిస్తారు. శౌచం పాటించకపోవటం వలన, మరణభీతితో దీనత్వం పొందటం వలన అతడు కేవలం మనుష్యుడుగా రూపొందుతాడు.'

క. అని పలికి సాధ్యులకుఁ దన । తను విభవము సూపి సమ్మదంబున వారల్
దనుఁగొలువ నిజనివాసం । బున కేఁగె నజుండు నగవు మొగమున నెఱయన్. 568

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; అజుండు= బ్రహ్మ; సాధ్యులకున్= సాధ్యులనబడే ఆ దేవతావర్గాలకు; తన తనువిభవమున్= తన శరీరవైభవాన్ని; చూపి= ప్రదర్శించి; వారల్= వారు; సమ్మదంబునన్= సంతసంతో; తనున్+కొలువన్= తనను ఆరాధించగా; నగవు= నవ్వు; మొగంబునన్= వదనమందు; నెఱయన్= వ్యాపించగా; నిజనివాసంబునకున్= తన నెలవుకు; ఏఁగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: హంస రూపంతో ఉన్న బ్రహ్మదేవుడు అట్లా చెప్పి సాధ్యులకు తన నిజమైన శరీరవైభవం చూపాడు. వా రందుకు చాలా సంతోషించి ఆయనను సేవించారు. పిమ్మట ముఖంలో నవ్వు దీపిస్తూ ఉండగా బ్రహ్మ తన నెలవైన సత్యలోకానికి వెళ్ళాడు.

వ. అని చెప్పి భీష్ముండు. 569

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; భీష్ముండు= భీష్ముడు

తాత్పర్యం: అట్లా ధర్మజుడితో వచించి భీష్ముడు మళ్ళీ ఈ క్రింది రీతిగా అన్నాడు.

ఉ. ' సాదరవృత్తి సాధ్యులఁ బ్రహర్ష సమేతులఁ జేయఁ బూని సం
వాదము సేసె దేవముని వంద్యుఁ డజుం; డిది సేయు నాయురు
త్పాదన మిచ్చు సంతతశుభంబులు గీర్తి యొనర్చుఁ బుత్రపా
త్రోదయ మావహించు భరతోత్తమ! తన్ వినినన్ బఠించినన్.' 570

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దేవమునివంద్యుఁడు= దేవతలచేతను; మునులచేతను నమస్కరించదగినవాడైన; అజుడు= బ్రహ్మ; సాదరవృత్తిన్= ఆదరంతో కూడిన వర్తనతో; సాధ్యులన్= సాధ్యులను; ప్రహర్షసమేతులన్= సంతోషంతో గూడినవారినిగా; చేయన్+పూని= చేయ నారంభించి; సంవాదమున్+చేసెన్= సంభాషించాడు; భరత+ఉత్తమ!= భరతవంశములో శ్రేష్ఠుడా!; ఇది= ఈ సంవాదం; తన్= తనను; వినినన్= విన్నా; పఠించినన్= చదివినా; ఆయురుత్పాదనమున్= ఆయువు యొక్క పుట్టుకను; చేయున్= కలిగిస్తుంది; సంతత శుభంబులు= ఎడతెగని మంగళాలను; ఇచ్చున్= ప్రసాదిస్తుంది; కీర్తి+ఒనర్చున్= యశస్సు కలిగిస్తుంది; పుత్రపౌత్ర+ఉదయమున్= కొడుకుల, మనుమల ఉద్భవమును; ఆవహించున్= కలుగజేస్తుంది.

తాత్పర్యం: భరతకులశ్రేష్ఠుడవైన ఓ ధర్మరాజా! దేవతలకు, మునులకూ నమస్కరణీయుడైన బ్రహ్మ ఆదరంతో సాధ్యులకు సంతోషం కలిగించటానికై వారితో 'హంసగీత' అనే ఈ సంవాదం చేశాడు. ఈ గీతను విన్నా, చదివినా, దీర్ఘాయువు కలుగుతుంది. ఎడతెగని శుభాలు సంభవిస్తాయి. కీర్తి చేకూరుతుంది. పుత్రులు, మనుమలు తామరతంపరగా ఉదయించి వంశం వర్ధిల్లుతుంది.'

వ. అనిన విని ధర్మనందనుండు శంతనునందనుతో 'సాంఖ్యయోగంబుల తారతమ్యంబులుం దత్స్వరూపం బులు నెఱింగింపవే' యనుటయు, నమ్మహీపతికి నమ్మహాత్ముం డిట్లనియె. 571

ప్రతిపదార్థం: అనినన్ విని= అని చెప్పగా ఆకర్ణించి; ధర్మనందనుండు= ధర్మజుడు; శంతనునందనుతోన్= శంతనుడి కుమారుడైన భీష్ముడితో; సాంఖ్యయోగంబుల తారతమ్యంబులున్= సాంఖ్యశాస్త్ర, యోగశాస్త్రములయొక్క తరతమ భేదాలను; తత్స్వరూపంబులున్= ఆ శాస్త్రాల నిజరూపాలను; ఎఱింగింపవే= తెలుపుమా; అనుటయున్= అని అడుగగా; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు; ఆ+మహాత్ముండు= ఆ భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ము డట్లా చెప్పేసరికి విని ధర్మరాజు అతడితో 'సాంఖ్యశాస్త్రం, యోగశాస్త్రం -ఈ రెండింటియొక్క భేదాలు, వాటి స్వరూపాలు తెలియజెప్పుము' అని అడిగాడు. అంతట ఆ నరపాలుడితో భీష్ముడు ఈ రీతిగా చెప్పాడు.

భీష్ముఁడు ధర్మజునకు యోగతంత్రప్రకారము చెప్పుట (సం. 12-289-2)

క. తెలుపుదురు సాంఖ్యులును యో । గులుఁ దమతమ తెఱఁగు మేలగుట కారణసం
కలితముగ నాకుఁ జూడఁగ । నలఘుగుణా! యొక్క రూప యయ్యిరు దెఱఁగున్. 572

ప్రతిపదార్థం: అలఘుగుణా!= గొప్ప గుణాలు గలవాడా!; సాంఖ్యులునున్= సాంఖ్య మార్గం అనుసరించేవారూ; యోగులున్= యోగమార్గం అవలంబించేవారూ; కారణసంకలితముగన్= హేతువులతో కూడ; తమ తమ తెఱఁగులు= తమ తమ పద్ధతులు; మేలు+అగుట= శ్రేష్ఠంకావటం; తెలుపుదురు= చెప్పుతారు; నాకున్+చూడఁగన్= నేను పరిశీలింపగా; ఆ+ఇరుదెఱఁగున్= ఆ రెండు విధాలత్రోవయును; ఒక్కరూప= ఒకే విధమైనది.

తాత్పర్యం: 'శ్రేష్ఠగుణుడవైన ఓ ధర్మజా! సాంఖ్యులు, యోగులు తమ తమ మార్గాలే మేలైనవని కారణాలు నిరూపిస్తూ ప్రకటిస్తారు. కాని నా దృష్టికి ఆ రెండు మార్గాలూ ఒక్కటే.

క. ప్రత్యక్షహేతువాదులు । సత్యపరా! యోగపరులు సాంఖ్యులు శాస్త్రా
ర్థాత్యంతనైపుణులు స । ద్గత్యాకలనంబు సరియ తదుభయమునకున్. 573

ప్రతిపదార్థం: సత్యపరా!= సత్యపరాయణా!; యోగపరులు= యోగులు; ప్రత్యక్షహేతువాదులు= ప్రత్యక్షాన్నే ప్రామాణ్యహేతువని వాదించేవారు; సాంఖ్యులు= సాంఖ్యమార్గం అనుసరించేవారు; శాస్త్రార్థాత్యంతనైపుణులు= శాస్త్ర ప్రతిపాదితమైన విషయములందు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మిక్కిలి సామర్థ్యం కలవారు; తదుభయమునకున్= ఆ రెంటికీ; సద్గత్యాకలనంబు= ఉన్నతమైన గతి చేకూరటం; సరి+అ= సమానమే.

తాత్పర్యం: సత్యనిష్ఠుడవైన ఓ ధర్మపుత్రా! యోగులు ప్రత్యక్ష మొక్కటే ప్రమాణహేతువని వాదిస్తారు. సాంఖ్యులు శాస్త్ర ప్రతిపాదితమైన అర్థాలలో విశ్వాసం కలిగి అవే ప్రమాణమని నిరూపిస్తారు. అయినా ఈ రెండుమార్గాలవారూ చివరికి పొందే లక్ష్యం ఒక్కటే.

క. ఆ తెరువులు రెంటికి వే । త్తై తోఁచుట దర్శనంబునంద నరేంద్రా!
భూతహితము సద్వ్రతచ । ర్యాతిశయము శౌచమును నియతకృత్యంబుల్.' 574

ప్రతిపదార్థం: నరేంద్రా!= రాజా!; ఆ తెరువులు= ఆ మార్గాలు; రెంటికిన్= రెండింటికి; వేత్తైతోఁచుట= విభిన్నములై భాసించటం; దర్శనంబునంద= శాస్త్రమునందే; భూతహితము= ప్రాణులకు మేలు చేయటం; సద్వ్రతచర్యాతిశయము= మంచి నియమాలను ఎక్కువగా పాటించటం; శౌచమును= శుచిత్వం; నియతకృత్యంబుల్= రెండు మార్గాలకూ తప్పనిసరిగా సంబద్ధమైన కార్యాలు.

తాత్పర్యం: రాజా! సాంఖ్యయోగాల మార్గాలు రెండూ విభిన్నమై కనిపించటమనేది కేవలం శాస్త్రమునందు మాత్రమే. ప్రాణులపట్ల హితం, మంచి నియమాలు పాటించటం, శౌచం ఈ రెండుమార్గాలకూ నియతమైన కార్యాలే.'

విశేషం: **సాంఖ్యయోగౌ పృథగ్బాలాః । ప్రవదన్తి న పండితాః**
ఏకమప్యాస్థిత స్సమ్యక్ । ఉభయో ర్విందతే ఫలమ్ ॥ (గీత - 5-4)
యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం । తద్యోగై రపి గమ్యతే ।
ఏకం సాంఖ్యం చ యోగం చ । యః పశ్యతి స పశ్యతి ॥ (గీత - 5-5)

అని శ్రీకృష్ణుడు గీతలో ప్రతిపాదించి ఉన్నాడు. 'అవివేకులు మాత్రమే సాంఖ్యమూ, యోగమూ వేరువేరని చెప్తుతారు. ఈ రెండింటిలో దేని ననుష్ఠించినా ఫలప్రాప్తి కలుగుతుంది. సాంఖ్యులు పొందే స్థానాన్నే యోగులు కూడా పొందుతారు. అందువలన సాంఖ్యయోగాలను రెంటినీ ఒక్కటిగా చూచేవాడు యథార్థదర్శి' అన్న గీతాచార్యుడి అభిప్రాయం ఇక్కడ భీష్ముడు చెప్పిన మాటలతో సరిపడుతున్నది.

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'భూతదయయును, సద్వ్రతధారణంబును, శౌచంబును దుల్యంబులై సాంఖ్యయోగంబులకు దర్శనంబు వేఱగుట యెట్లు? వివరింపవే' యనుటయు, నన్నరదేవునకు దేవవ్రతుం డిట్లనియె. 575

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; సాంఖ్యయోగంబులకున్= సాంఖ్యానికీ, యోగానికీ; భూతదయయునున్= ప్రాణులపట్ల కృపయు; సద్వ్రతధారణంబునున్= మంచినియమాలు పాటించటమూ; శౌచంబునున్= శుచిత్వమూ; తుల్యంబులు+ఐ= సమానములై; దర్శనంబు= శాస్త్రం; వేఱు+అగుట= భిన్నమవటం; ఎట్లు= ఎట్లా; వివరింపవే= విశదీకరింపుమా; అనుటయున్= అని అడుగగా; ఆ+నరదేవునకున్= ఆ రాజుకు; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు చెప్పింది విని ధర్మరాజు 'సాంఖ్యయోగమార్గాలు రెండింటికీ భూతదయ, వ్రతనిర్వహణ, శుచిత్వం అనేవి సమానాలై ఉండగా శాస్త్రం మాత్రం ఎట్లా వేరుగా ఉంటుంది? ఈ సంగతి వివరించుము' అని అర్థించాడు. అప్పుడు భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ' యోగులకు యోగబలమున । రాగము మోహంబునుం జిరస్నేహముఁగా
మాగమముఁ గ్రోధము గుణా । యోగము వరుసఁ బెడఁబాప నున్నతి యొలయున్. 576

ప్రతిపదార్థం: యోగబలమునన్= యోగము యొక్క సామర్థ్యంతో; రాగమున్= విషయముల మీది అనురాగాన్నీ; మోహంబునున్= అజ్ఞానాన్నీ; చిరస్నేహమున్= దీర్ఘకాలికమైన ప్రీతిని; కామ+ఆగమమున్= అభిలాష యొక్క ఉత్పత్తినీ; క్రోధమున్= కోపాన్నీ; వరుసన్= క్రమంగా; గుణ+ఆ యోగము= పై దోషాలకు విరుద్ధాలైన సద్గుణాలతోడి కలయిక; పెడన్+పాపన్= తొలగించగా; యోగులకున్= యోగమార్గంలో ఉన్నవారికి; ఉన్నతి= ఔన్నత్యం; ఒలయున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: రాగం, మోహం, దీర్ఘకాలికమైన స్నేహం, కామం, క్రోధం అనే దుర్గుణాలు ఆత్మోన్నతిని నిరోధించేవి. యోగబలంతో పై దోషాలను తద్విరుద్ధమైన సద్గుణాలతో తొలగిస్తే యోగులకు ఆత్మోన్నతి లభిస్తుంది.

విశేషం: పద్యంలో 'గుణాయోగము' అన్న పదాన్ని ద్వితీయాంతంగా గ్రహిస్తే, రాగాదులతోపాటు త్రిగుణాలతోడి ఆ యోగాన్ని (కలయికను) కూడా యోగబలంతో తొలగిస్తే - అని అర్థం చెప్పాలి.

చ. ఘనఝుషమున్ సముద్ధతమృగంబును జాలము వ్రచ్చి వాగురా
వినిహతిఁ జేసి యిష్టపదవిం జను చాడ్పున యోగతంత్రరో
ధనమగు లోభ జాత దురితవ్రజముం బెడఁబాచి సత్పథం
బునఁ జరియించు యోగి సుఖమూర్తిత సుస్థితగా వహించుచున్. 577

ప్రతిపదార్థం: ఘనఝుషమున్= పెద్ద చేపయున్నూ; సముద్ధతమృగంబును= బలిష్ఠమై గర్వించిన జంతువున్నూ; జాలమున్= వలను; వ్రచ్చి= చించి; వాగురావినిహతిన్+చేసి= ఉరిని ఛేదించి; ఇష్టపదవిన్= ఇచ్ఛవచ్చిన త్రోవలో; చనుచాడ్పునన్= పోయేటట్లు; యోగి= యోగం శీలించేవాడు; సుఖమూర్తితన్= సుఖస్వరూపాన్ని; సుస్థితగాన్= దృఢంగా ఉండేటట్లు; వహించుచున్= కలిగిఉంటూ; యోగతంత్ర రోధనము+అగు= యోగంయొక్క ఉపాయాలను అడ్డగించినదైన; లోభజాతదురితవ్రజమున్= లోభంనుండి కలిగిన పాపసంచయాన్ని; పెడన్+పాచి= తొలగద్రోసి; సత్పథంబునన్= సన్మార్గంలో; చరియించున్= సంచరిస్తాడు.

తాత్పర్యం: పెద్దచేప వలను చించుకొని, బలిష్ఠమైన మృగము ఉరిని ఛేదించుకొని ఇచ్ఛవచ్చిన దారిలో వెళ్ళిపోతాయి. అట్లే యోగి దృఢమైన సుఖస్వరూపంలో ఉంటూ యోగోపాయాలను నిరోధించే పాపాలను తొలగించుకొని సన్మార్గంలో సంచరిస్తాడు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. యోగబలము లేని యొకభంగి యోగి బల్ । ద్రోపు లేని మీను నేపు లేని
మృగము వలయు నురియుఁ దెగిపోవ నుఱుకంగ । లేనియట్ల భవములోన నడఁగు. 578

ప్రతిపదార్థం: యోగబలము లేని= యోగశక్తి చాలని; ఒక భంగియోగి= ఒక మాదిరి యోగి; బల్ద్రోపులేని మీనున్= పెద్దగా దూసుకొని పోయేశక్తి లేని చేప; ఏపు లేని మృగమున్= విజృంభించే శక్తిలేని జంతువు; వలయున్= జాలమును; ఉరియున్= పాశమును; తెగిపోవన్= తెగిపోయేటట్లుగా; ఉఱుకంగలేని+అట్ల= పరుగెత్తలేని మాదిరిగా; భవములోనన్= సంసారంలో; అడఁగున్= అణగిపోతాడు.

తాత్పర్యం: బలాధిక్యంతో విజృంభించి ముందుకు దూసుకొని పోలేని చేప వలను ఛేదించలేదు. అట్లే శక్తి చాలని మృగం ఉరిని తెగజేసి ముందుకు పోలేదు. అవి రెండూ పాశం క్రింద తగులువడతాయి. అదే రీతిగా యోగబలం చాలని యోగి పాపపాశాలను ఛేదించలేక సంసారంలోనే నిబద్ధుడైపోతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ.

ఆ. అల్పమైన యగ్ని యడఁగు నింధనములు । మీఁద వైవ బలము మిగులలేని
యోగమట్లు తనకు నురునట్టి దానన । సాదమొందు సకలజనమనోజ్ఞ! 579

ప్రతిపదార్థం: సకలజనమనోజ్ఞ!= సమస్త ప్రజలకు మనోహరమైనవాడా!; అల్పమైన= కొద్దిపాటిదైన; అగ్ని= నిప్పు; ఇంధనములు= కట్టెలు; మీఁదవైవన్= పైనవేయగా; అడఁగున్= ఆరిపోతుంది; అట్ల= అదే మాదిరిగా; బలము మిగులలేని= శక్తి చాలని; యోగము= యోగానుష్ఠానం; తనకున్+ఉరునట్టి దానన్+అ= తనకు తగిన దానితోనే; సాదము+ఒందున్= అణగారిపోతుంది

తాత్పర్యం: సకల జనులకు హృదయంగముడవైన ధర్మసుతా! కొద్దిపాటి నిప్పు కట్టెలు పైన పడవేస్తే ఆరిపోతుంది. అదే రీతిగా బలహీనమైన యోగం కూడా తన కనుకూలమైన దానితోనే అణగారిపోతుంది. కట్టెలు అగ్నికి అనుకూలమైనప్పటికీ నిప్పు తక్కువై కట్టెలెక్కువైతే నిప్పు శమించిపోతుంది. (అదే రీతిగా అనుకూలమైన యోగసాధనలే యోగానికి బలం లేనప్పుడు దానిని శమింపజేస్తాయని తాత్పర్యం).

విశేషం: అలం: ఉపమ.

ఆ. ఇద్ధమైన యగ్ని ఇంధన సంపద । నతిశయిల్లు నట్టు లధికబలస
మగ్రసారయోగ మహిమయు నంతంత । కగ్గలించు వ్రతము లగ్గలింప. 580

ప్రతిపదార్థం: ఇద్ధము+ఐన= దీపించిన; అగ్ని= అనలం; ఇంధనసంపదన్= కట్టెల సమృద్ధిచేత; అతిశయిల్లునట్టులు= ఎక్కువగా మండే విధంగా; అధికబలసమగ్రసారయోగ మహిమయున్= ఎక్కువ బలంతో సమగ్రమైన శ్రేష్ఠయోగ ప్రభావం కూడ; వ్రతములు= నియమాలు; అగ్గలింపన్= ఎక్కువ కాగా; అంతంతకున్= అంతకంతకు; అగ్గలించున్= అతిశయిస్తుంది.

తాత్పర్యం: బాగా జ్వలించిన అగ్ని ఎక్కువగా వంటచెరకు అందిస్తే ఇంకా ఎక్కువగా మండుతుంది. అదే రీతిగా శక్తిమంతమైన యోగంయొక్క ప్రభావం ఎంతకెంతకు నియమసాధనలు ఎక్కువవుతాయో, అంతకంతకు అతిశయమై రాణిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

క. స్రోతోవేగము పటుగతి । వీతబలుం దిగుచునట్లు విషయము లీడ్చుం
జేతోబలసంభృత యో । గాతిశయుఁడు గాని వాని నంచితచరితా! 581

ప్రతిపదార్థం: అంచితచరితా= పూజ్యమైన చరిత్రం కలవాడా!; స్రోతోవేగము= ప్రవాహంయొక్క వేగం; పటుగతిన్= పటిష్ఠమైన నడకతో; వీతబలున్= తొలగినబలం కలవాడిని; తిగుచునట్లు= లాగివేసేటట్లు; చేతోబలసంభృతయోగాతిశయుఁడు= మనోబలంతో నిండిన యోగదృఢత్వం కలవాడు; కానివానిన్= కానట్టి యోగిని; విషయములు= శబ్దం మొదలైన విషయాలు; ఈడ్చున్= లాగివేస్తాయి.

తాత్పర్యం: మాన్యచరిత్రుడవగు ఓ ధర్మరాజా! బలంగా ముందుకు సాగిపోయే ప్రవాహవేగం బలహీనుడిని లాగివేస్తుంది. అట్లాగే మనోబలంతో కూడిన యోగశక్తి లేనివాడిని శబ్దస్పర్శాది విషయాలు తమవైపునకు లాగివేస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ.

క. **నది రయము వారణేంద్రుఁడు । గుదియించిన యట్ల పోలెఁ గురువర! దైన్యా**
స్పదమగు విషయోల్లాసముఁ । గుదియించును యోగసిద్ధి గురుహృద్బలుఁడున్. 582

ప్రతిపదార్థం: కురువర!= కురుశ్రేష్ఠా!; వారణ+ఇంద్రుఁడు= గజేంద్రుడు; నదిరయమున్= నదీవేగాన్ని; కుదియించిన అట్ల పోలెన్= అడ్డగించేటట్లే; యోగసిద్ధి గురుహృద్బలుఁడున్= యోగంయొక్క సిద్ధిచేత గొప్పదైన మనోబలం కలవాడుకూడా; దైన్యాస్పదము+అగు= దీనత్వానికి నెలవైన; విషయ+ఉల్లాసమున్= శబ్దాదివిషయాల విలాసాన్ని; కుదియించును= అడ్డగిస్తాడు.

తాత్పర్యం: కురువర్యా! మదించిన ఏనుగు నదీప్రవాహ వేగాన్ని తగ్గించినట్లే యోగసిద్ధితో మనోబలం సంపాదించుకొన్న యోగివర్యుడు దీనత్వం కలిగించే విషయాల ఉరవడిని తగ్గించివేస్తాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. **కుపితుఁడగు నంతకుండును గ్రోధఘోర । మృత్యువును నైన నియమసమృద్ధయోగ**
బలునిదెస వోవఁ జాల రప్రతిహతముగ । నెందుఁ జరియించు నతఁడు నరేంద్రముఖ్య! 583

ప్రతిపదార్థం: నరేంద్రముఖ్య!= రాజశ్రేష్ఠా!; కుపితుఁడు+అగు= కోపించినవాడైన; అంతకుండును= యముడు అయినా; క్రోధఘోరమృత్యువునున్+ఐనన్= కోపంచేత భయంకరమైన మృత్యుదేవత ఐనా; నియమసమృద్ధ యోగబలుని దెసన్= నియమాలతో సమగ్రమైన యోగబలం కలవాడివైపు; పోవన్+చాలరు= పోలేరు; అతఁడు= ఆ యోగి; అప్రతిహతముగన్= ఎదురులేకుండ; ఎందున్+చరియించున్= ఎక్కడనైనా తిరుగగలడు.

తాత్పర్యం: నృపశ్రేష్ఠా! కోపించిన యముడుగానీ, కోపభీకరమైన మృత్యువుగానీ దృఢనియమాలను పాలించి యోగశక్తి పరిపూర్ణుడైన యోగిచెంతకు పోలేరు. అట్లాంటి యోగీంద్రుడు ఎదురులేనివాడై ఎక్కడనైనా తిరుగుతాడు.

క. **భోగంబుఁ దపముఁ బోరిఁబోరి । రాగవిరాగతల హృదయరంగమునకుఁ గే**
ళీగతులఁ దెచ్చి యార్చుచు । యోగి యనుభవించుఁ దగిలియుండం డెందున్. 584

ప్రతిపదార్థం: యోగి= యోగశీలుడు; పొరిన్+పొరిన్= మాటిమాటికి; భోగంబున్= విషయానుభవాన్ని; తపమున్= తపస్సును; రాగవిరాగతలన్= రక్తినీ, విరక్తినీ; హృదయరంగమునకున్= చిత్తం అనే రంగస్థలానికి; కేళీగతులన్= క్రీడాగమనాలతో; తెచ్చి= తీసికొనివచ్చి; ఆర్చుచున్= ఆడిస్తూ; అనుభవించున్= అనుభవిస్తాడు; ఎందున్= దేనిలోనూ; తగిలిఉండడు= ఆసక్తుడై ఉండడు.

తాత్పర్యం: యోగాభ్యాసపరుడైనవాడు మాటిమాటికీ తన హృదయమనే రంగస్థలం మీదికి విషయసుఖానుభవాన్నీ, తపస్సునూ, రాగాన్నీ, విరాగాన్నీ సవిలాసంగా తీసికొనివచ్చి ఆడిస్తూ ఉంటాడు. ఎందులోనూ తగులువడకుండా తాను ఆ క్రీడారసాన్ని అనుభవిస్తాడు.

విశేషం: అలం: రూపకం.

క. **జగతీవర! యోగస్థూ । లగతులు సెప్పితి వినం గలదు సూక్ష్మవిధం**
బగుమార్గ ప్రచయము ద । న్నిగదన మవధానమున వినిన మతి దేఁటున్. 585

ప్రతిపదార్థం: జగతీవర!= భూవరా!; యోగస్థూల గతులు= యోగంయొక్క స్థూలమైన విధానాలు; చెప్పితిన్= వివరించాను; సూక్ష్మవిధంబు+అగు= సూక్ష్మపద్ధతిగల; మార్గప్రచయము= విధానాల సముదాయం; వినంగలదు= వినటానికి మిగిలిఉన్నది;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తన్నిగదనమున్= ఆ చెప్పటాన్ని; అవధానమునన్= హెచ్చరికతో; వినినన్= వింటే; మతి= బుద్ధి; తేజున్= ప్రసన్నతపొందుతుంది.

తాత్పర్యం: రాజా! యోగానికి చెందిన స్థూలమైన విషయాలు ఇంతవరకూ చెప్పాను. ఇంకా సూక్ష్మ విషయాలైన కొన్ని యోగవిధానాలు వినవలసి ఉన్నాయి. వాటి వివరణ సావధానంగా వింటే బుద్ధి నిర్మలమవుతుంది.

క. **ఏమిగతి లక్ష్యభేదముఁ । దా మేలుగఁ జేయు ధన్వి తత్పరుఁడై యో**
గామల చిత్తుఁడు మోక్షం । బామెయి సాధించువాఁ డహంకృతిదూరా! **586**

ప్రతిపదార్థం: అహంకృతిదూరా!= అహంకారం లేనివాడా!; ధన్వి= విలుకాడు; ఏమిగతిన్= ఎట్లు; తత్పరుఁడు+ఐ= దానియందాసక్తుడై; తాన్= తాను; లక్ష్యభేదమున్= గురిని ఛేదించటాన్ని; మేలుగన్= బాగా; చేయున్= చేస్తాడో; ఆ+మెయిన్= అదేరీతిగా; యోగ+అమలచిత్తుఁడు= యోగముచే నిర్మలమైన హృదయం కలవాడు; మోక్షంబు= ముక్తిని; సాధించువాఁడు= సంపాదిస్తాడు.

తాత్పర్యం: అహంకారంలేని ఓ ధర్మరాజా! విలుకాడు తదేకచిత్తుడై ఎట్లా లక్ష్యాన్ని చక్కగా ఛేదిస్తాడో, అట్లాగే యోగనిపుణుడు మోక్షలక్ష్యాన్ని సాధిస్తాడు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. **నేతికుండ మోచి యే తెఱఁగున సోబ । నాలు వ్రాఁకు నైపుణంబు గలుగు**
పురుషుఁడట్ల యోగపరిణతుండును నాత్మ । నేమఱక విముక్తి కెక్క వలయు. **587**

ప్రతిపదార్థం: నైపుణంబు గలుగు= నేర్పుగల; పురుషుఁడు= మనుజుడు; నేతికుండ= నేతితో నింపిన కుండను; మోచి= వహించి; ఏ+తెఱఁగునన్= ఏ రీతిగా; సోబనాలు= మెట్లు; ప్రాఁకున్= ఎక్కుతాడో; అట్ల= ఆ రీతిగానే; యోగపరిణతుండునున్= యోగనిపుణుడుకూడ; ఆత్మన్+ఏమఱక= ఆత్మవిషయంలో మరుపులేకుండా; విముక్తికిన్= మోక్షానికి; ఎక్కన్‌వలయున్= ఎగబ్రాకాలి.

తాత్పర్యం: నేర్పుగల పురుషుడు నెత్తిపై నేతికుండ మోసికొని ఎట్లా మెట్లు ఎక్కిపోతాడో, అట్లాగే యోగనిపుణత గలవాడు కూడ ఆత్మను మరువకుండా మోక్షసౌధాన్ని అధిష్ఠించాలి.

విశేషం: అలం: ఉపమ.

తే. **రథికునకుఁ గలమరికి సారథియుఁ గర్ణ । ధారుఁడును బోలె నాత్మకుఁ దాను సుపథ**
వర్తనైకవిధాయి గావలయు యోగ । ధారణా నిశ్చలుం డగు ధీరు డధిప! **588**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; రథికునకున్= రథమునధిష్ఠించిన వాడికిని; కలమరికిన్= ఓడనెక్కిపోయేవాడికిని; సారథియున్= రథంనడిపేవాడును; కర్ణధారుఁడును పోలెన్= చుక్కానిపట్టేవాడివలె; యోగధారణానిశ్చలుండు+అగు= యోగమును ధరించుటలో చలనములేనివాడైన; ధీరుఁడు= ధైర్యముగలవాడు; తాను= తాను; ఆత్మకున్= తన ఆత్మకు; (తనకు); సుపథవర్తనైక విధాయి= మంచి మార్గమున ప్రవర్తించుటను మాత్రమే కల్పించువాడు; కావలయున్= కావాలి.

తాత్పర్యం: రాజా! రథమెక్కి పోయేవాడిని సారథివలె, పడవ ఎక్కి పయనించే వాడిని చుక్కాని పట్టేవాడివలె యోగధారణలో నిశ్చలస్థితిని పొందిన ధీరచిత్తుడు తన ఆత్మను మంచి మార్గంలోనే నడిపించాలి.

విశేషం: అలం: ఉపమ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **శిరమును నాభియు హృదయము । నురమును గర్ణములుఁ బార్శ్వయుగళము నాత్మా**
దరణీయస్థానము ల । య్యిరవులఁ గనుయోగి యాత్మ నిభపురనాథా!' **589**

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= హస్తినానగరరాజా!; శిరమును= తలను; నాభియున్= బొడ్డును; హృదయమున్= హృదయాన్ని; ఉరమును= వక్షమును; కర్ణములున్= చెవులు; పార్శ్వయుగళమున్= రెండు ప్రక్కలును; ఆత్మాదరణీయస్థానములు= ఆత్మకు ఆదరించదగిన ప్రదేశాలు; యోగి= యోగశీలుడు; ఆ+ఇరవులన్= ఆ స్థానాలలో; ఆత్మన్ కనున్= ఆత్మను చూస్తాడు.

తాత్పర్యం: హస్తినాపుర ప్రభుడవైన ఓ ధర్మపుత్రా! శరీరంలో తల, బొడ్డు, హృదయం, వక్షం, చెవులు, ఇరుప్రక్కలు - ఆత్మకు ఆదరించదగిన నెలవులై ఉన్నాయి. యోగి అయినవాడు ఆ స్థానాలలో తన ఆత్మను సందర్శిస్తాడు.'

వ. **అనిన నజాతశత్రుం డాపగాపుత్రునితో నిట్లనియె.** **590**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అజాతశత్రుండు= ధర్మరాజు; ఆపగా పుత్రునితోన్= భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ము డట్లా చెప్పగా ధర్మజుడు అతడితో ఇట్లా అన్నాడు:

తే. **' యోగి యెట్టి యాహారంబు లుడుగవలయు? । నాతఁ డెబ్బంగి భోజ్యంబు లనుభవించి**
బలము వడయువాఁ?డిది నాకుఁ దెలియఁజెప్ప । వే జనస్తవనీయసమిద్ధబుద్ధి! **591**

ప్రతిపదార్థం: జన స్తవనీయ సమిద్ధ బుద్ధి!= జనులచేత స్తుతించదగిన తేజోవంతమైన బుద్ధికలవాడా!; యోగి= యోగశీలుడు; ఎట్టి= ఎటువంటి; ఆహారంబులు= భోజనాలు; ఉడుగన్ వలయున్?= వర్జించాలి?; ఆతఁడు= ఆ యోగి; ఏ+భంగిభోజ్యంబులు= ఎట్లాంటి ఆహారపదార్థాలను; అనుభవించి= భుజించి; బలము+పడయువాఁడు?= బలం పొందుతాడు; ఇది= ఈ విషయం; నాకున్+తెలియన్=చెప్పవే!= నాకు ఎఱుగజేయుమా!

తాత్పర్యం: 'ప్రజాస్తుతికి పాత్రమై దీపించే బుద్ధిగల ఓ పితామహా! యోగి ఎట్లాంటి ఆహారాలు వర్జించాలి? అతడు ఎటువంటి ఆహారాలు తింటే బలం పుంజుకొంటాడు? ఈ విషయం నాకు వివరించుము.'

సీ. **అనవుడు నతనితో నతఁడు 'సుస్నిగ్ధంబు । లైన యాహారముల్ మానువాఁడు**
యోగి; నీరసముల నుదకంబులను జాల । నాఁకలి పుచ్చుచు నవియు నుదర
మధికపూర్ణంబగు నట్లుగాఁ గొనక వ । ర్తించుట బలము వర్ధింపఁజేయు'
నని చెప్పి వెండియు ననుఁ 'గామమును గ్రోధ । మును నిద్రయును దృష్ణయును భయంబు

తే. **రతియు నరతియుఁ బవనంబుగతియు నుడిపి । ధారణా నిశ్చలుం డయి తన్నుఁ దాన**
కనుచునుండెడు యోగి దుర్గంపుఁజోటు । వెడల నరిగి సుఖస్థానవిభవ మొందు. **592**

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; అతనితోన్= ఆ ధర్మజుడితో; అతఁడు= భీష్ముడు; యోగి= యోగాభ్యాసపరుడు; సుస్నిగ్ధంబులు+ఐన= నూనెగల్గి చిక్కనైన; ఆహారముల్= భోజనాలు; మానువాఁడు= వదలేవాడు; నీరసములన్= సరసములు కానట్టి పదార్థాలతోనూ; ఉదకంబులనున్= నీటితోను; చాలన్= మిక్కిలిగా; ఆఁకలి పుచ్చుచున్= ఆకలి తీర్చుకొంటూ; అవియున్= అవికూడా; ఉదరము= పొట్ట; అధికపూర్ణంబు+అగునట్లుగాన్= మిక్కిలి నిండేటట్లుగా; కొనక= గ్రహించక; వర్తించుట= ఉండటం; బలమున్= సత్తువను; వర్ధిల్లన్+చేయున్= వృద్ధిపొందిస్తుంది; అని చెప్పి= అని పలికి; వెండియున్= మరల; అనున్= ఇట్లా అన్నాడు; కామమునున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కోరికనూ; క్రోధమునున్= కోపాన్నీ; నిద్రయునున్= నిద్రనూ; తృష్ణయునున్= ఆశనూ; భయంబున్= భీతినీ; రతియున్= రాగాన్నీ; అరతియున్= రాగంలేమినీ; పవనంబుగతియున్= శ్వాసగమనాన్నీ; ఉడిపి= ఉడిగించి; ధారణా నిశ్చలుండు+అయి= యోగమును ధరించటంలో కదలికలేనివాడై; తన్నున్= తనను; తాన= తానే; కనుచున్+ఉండెడు యోగి= చూస్తూ ఉండే యోగి; దుర్గంపుఁజోటున్= చొరరాని ప్రదేశాన్ని; వెడలన్+అరిగి= అతిక్రమించిపోయి; సుఖస్థానవిభవమున్= ఆనందపదముయొక్క వైభవాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అడుగగా అతడితో భీష్ముడు ఇట్లా అన్నాడు: 'యోగి నూనెగల చిక్కనైన ఆహారపదార్థాలు వర్జించాలి. రసవత్తరములు కాని పదార్థాలతో, నీటితో ఆకలి తీర్చుకొనాలి. అవికూడా పొట్టనిండేటట్లు ఎక్కువగా తీసికొనరాదు. అట్లా ఉంటే బలం పెంపొందుతుంది' - ఈ రీతిగా చెప్పి భీష్ముడు మళ్ళీ ఇట్లా అన్నాడు: - 'కామాన్నీ, క్రోధాన్నీ, నిద్రనూ, ఆశనూ, భయాన్నీ, అభిరుచినీ, అభిరుచిలేనితనాన్నీ, శ్వాసగమనాన్నీ ఉడిగించాలి. యోగధారణలో నిశ్చలత కలిగి తనలో తనను చూచుకొంటూ రమించే యోగి దుర్గమప్రదేశాలను నిర్గమించి నిత్యసుఖానికి నెలవైన ధామం చేరుకొంటాడు.

క. **జనవర! యసిధారావ్రత । మనఁదగియెడు ధారణానియతి పనుపడు నె**
వ్వని చిత్తంబున నా యో । గనిరూఢున కరిది యైన కార్యముఁ గలదే. **593**

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; ఎవ్వనిచిత్తంబునన్= ఎవడి హృదయంలో; అసిధారావ్రతము= కత్తివాదరపై నడక; అనన్+తగియెడు= అని చెప్పదగిన; ధారణానియతి= ధారణయొక్క నియమం; పనుపడున్= అలవడుతుందో; ఆ యోగనిరూఢునకున్= అట్టి యోగసిద్ధుడికి; అరిది+ఐన కార్యమున్= అశక్యమైన పని; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: రాజా! కత్తి వాదరపై నడక అనదగిన యోగధారణా నియమం ఎవడి చిత్తంలో స్థిరమై ఉంటుందో అట్లాంటి యోగనిపుణుడు సాధించరాని కార్యమేమున్నది?

క. **యోగనిరూఢుఁడు సంగ । త్యాగానందైకరతుఁ; డతనికి జనన సం**
యోగము మృతిదైన్యంబును । భోగాభోగ సుఖదుఃఖములు లే వధిపా! **594**

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; యోగనిరూఢుఁడు= యోగమునందు సిద్ధిపొందినవాడు; సంగత్యాగ+ఆనందైకరతుఁడు= పొత్తును విడుచుటచేత కలిగే ఆనందమునందే ఆసక్తుడు; అతనికిన్= అట్టి యోగికి; జననసంయోగమున్= పుట్టుకతోపొత్తు; మృతిదైన్యంబునున్= మరణభీతిచేతకలిగే దీనత్వమూ; భోగ+అభోగసుఖదుఃఖములు= భోగంచేత కలిగే సుఖమూ; భోగం లేకపోవటంచేత కలిగే దుఃఖమూ; లేవు= ఉండవు.

తాత్పర్యం: రాజా! యోగసిద్ధి పొందినవాడు సంగాన్ని వదలిపెట్టటం వలన కలిగే సంతోషంలోనే ఆసక్తి కలిగి ఉంటాడు. అతడికి పుట్టుకతో సంయోగం, మరణంతో దీనత్వం లేవు. భోగంవలన సుఖించటం, భోగం లేకపోతే దుఃఖించటం అనేవి అతడి కుండవు.

క. **అతనికి సరిత్సముద్ర । క్షితిభృ ద్ద్వీపములు గేలికిం బట్టులు దా**
మతిఁ దలఁచెనేనిఁ బరిశాం । తత నున్నను గుడియు గుహయుఁ దగుమందిరముల్. **595**

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ యోగికి; సరిత్సముద్రక్షితిభృద్ద్వీపములు= నదులు, సముద్రాలు, కొండలు, దీవులు; కేళికిన్= క్రీడకు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పట్టులు= నెలవులు; తాన్= తాను; మతిన్= చిత్తమునందు; తలఁచెన్+ఏనిన్= తలంచినచో; పరిశాంతతన్+ఉన్ననున్= శాంతంగా ఉన్నా; గుడియున్= దేవాలయమూ; గుహయున్= కొండబిలమూ; తగుమందిరముల్= తగిన గృహాలు.

తాత్పర్యం: యోగనిపుణుడికి నదులూ, సాగరాలూ, కొండలూ, దీవులూ క్రీడాస్థానా లవుతాయి. అతడు తలచుకొంటే, ప్రశాంతంగా ఉంటే గుడి, పర్వతగుహ తగిన నివాసగృహాలుగా రూపొందుతాయి.

క. విముఖుం డగుటయుఁ గీళులు । దమయంతన చెందు జనులఁ దా వారలకున్
సుముఖుం డగుటయు శుభములు । సమకూరును శివునియట్ల చరితము లెల్లన్.' 596

ప్రతిపదార్థం: తాన్= తాను; విముఖుండు= ప్రతికూలుడు; అగుటయున్= కాగానే; తమ+అంతన= తమకుతామే; కీళులు= అశుభములు; జనులన్= ప్రజలను; చెందున్= పొందుతాయి; వారలకున్= ఆ జనులకు; సుముఖుండు+అగుటయున్= అనుకూలుడు కాగానే; శుభములు= మంగళాలు; సమకూరును= కలుగును; చరితములు+ఎల్లన్= నడవడికలన్నీ; శివుని+అట్ల= శంకరుడి వంటివే అవుతాయి.

తాత్పర్యం: యోగి ప్రజలకు విముఖుడుగా ఉంటే వాళ్ళకు అశుభాలు తమకు తామే కలుగుతాయి. అతడు వారికి సుముఖుడైతే శుభాలు ప్రాప్తిస్తాయి. యోగియొక్క పోకడలన్నీ శంకరుడి పోకడలను పోలి ఉంటాయి.'

విశేషం: అలం: ఉపమ.

వ. అని చెప్పి వెండియు. 597

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: భీష్ము డీరీతిగా పలికి మళ్ళీ ఈ విధంగా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ' యోగతంత్రంబు సకలశాస్త్రోదితంబు । విను విశేషించి లోకైక విభుఁడు సెప్పె
దీని నారాయణుఁడు; మునిమాననీయ । మిది మనంబునఁ దెలిసికొ మ్మిద్ధచరిత!' 598

ప్రతిపదార్థం: ఇద్ధచరిత= ఉజ్జ్వలమైన శీలం కలవాడా!; విను= ఆలకించుము; యోగతంత్రంబు= యోగంయొక్క సిద్ధాంతం; సకలశాస్త్ర+ఉదితంబు= సమస్తశాస్త్రాలలో చెప్పబడింది; విశేషించి= అతిశయించి; దీనిన్= ఈ యోగశాస్త్రాన్ని; లోకైకవిభుఁడు= ప్రపంచానికి ముఖ్యప్రభువైన; నారాయణుఁడు= మాధవుడు; చెప్పెన్= వచించాడు; ఇది= ఈ సిద్ధాంతం; మునిమాననీయము= మునులచేత పూజించదగినది; మనంబునన్= నీ చిత్తంలో; తెలిసికొమ్ము= గ్రహించుకొనుము.

తాత్పర్యం: 'ఉజ్జ్వలచరిత్రుడవైన ఓ ధర్మరాజా! వినుము. ఇప్పుడు నేను వివరించిన యోగసిద్ధాంతం సకలశాస్త్రాలలో చెప్పబడి ఉన్నది. విశేషించి దీనిని జగదేకప్రభువైన నారాయణుడు చెప్పాడు. దీనిని మునులు గౌరవిస్తున్నారు. కాబట్టి నీవు నీ మనస్సులో దీనిని చక్కగా గ్రహించుము.'

వ. అనిన విని ధర్మతనయుండు 'యోగతంత్రప్రకారంబు భవత్ప్రసాదంబునం బ్రబుద్ధంబయ్యె; సాంఖ్యస్వరూపం బెట్టిది యెఱింగింపవే' యని యడిగిన, నతనికి దేవవ్రతుం డిట్లనుఁ 'గపిలాది మహాముని దర్శితంబైన మార్గంబున వివరించెద. 599

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆకర్ణించి; ధర్మతనయుండు= ధర్మపుత్రుడు; యోగతంత్రప్రకారంబు= యోగసిద్ధాంత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విధానం; భవత్ప్రసాదంబునన్= నీ అనుగ్రహంచేత; ప్రబుద్ధంబు+అయ్యెన్= తెలియబడింది; సాంఖ్యస్వరూపంబు= సాంఖ్యశాస్త్రవిధానం; ఎఱింగింపవే= తెలుపుమా; అని అడిగినన్= అని ప్రశ్నించగా; అతనికిన్= ఆ ధర్మసుతుడికి; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; కపిల+ఆదిమహాముని దర్శితంబు+ఐన= కపిలుడు మొదలైన పెద్ద మునులు చూపిన; మార్గంబునన్= పద్ధతిలో; వివరించెదన్= విశదీకరిస్తాను.

తాత్పర్యం: భీష్ముడట్లా చెప్పగా విని ధర్మరాజు 'నీ అనుగ్రహం వలన నేను యోగశాస్త్ర మెట్లాంటిదో చక్కగా తెలిసికొనగలిగాను. ఇక సాంఖ్యశాస్త్ర స్వరూపం ఎట్లాంటిదో నాకు తెలియజెప్పుము' అని అడిగాడు. అప్పు డతడితో భీష్ముడు ఇట్లా చెప్పాడు. 'నేను నీకు కపిలుడు మొదలైన మహా మునులు చెప్పిన పద్ధతి ననుసరించి సాంఖ్యశాస్త్రాన్ని విశదీకరిస్తాను.'

భీష్ముఁడు ధర్మరాజునకు సాంఖ్యస్వరూప నిరూపణంబు సేయుట (సం. 12-290-3)

సీ. ' వినుము దృఢజ్ఞానమున విషయంబుల । భంగి లెస్సగ నారయంగ వలయు;
నవియుఁ దిర్యఙ్మనుష్యామర పితృసిద్ధ । గరుడ గంధర్వ కిన్నరుల యందు
వేఱచందంబులై విలసిల్లు; శ్రుతివాక్య । దృష్టంబులగు దానఁ దెలియ నరయు
పరిచయంబున భేదపరబోధమేమిటి । కనరాదు; తోఁచిన యప్పు డవియు

తే. దురితకరముల యని వానిఁ దొడరకుండ । వలదె లెస్సగ నెఱిఁగిన వచ్చుఁ దొలఁగ
నేమఱమి దక్క నొండొకం డేల చోర । జనులఁ జిట్లంగ నడఁచుట కనఘచరిత! 600

ప్రతిపదార్థం: అనఘచరిత!= దురితంలేని చరిత్రం కలవాడా!; వినుము= ఆలకించుము; దృఢజ్ఞానమునన్= గట్టి తెలివితో; విషయంబులభంగిన్= (గ్రహించదగిన) ఆయా అంశాల పద్ధతిని; లెస్సగన్= బాగుగా; ఆరయంగన్+వలయున్= పరిశీలించాలి; అవియున్= ఆ విషయాలుకూడా; తిర్యఙ్మనుష్యామర పితృసిద్ధ గరుడ గంధర్వకిన్నరుల+అందున్= పశుపక్ష్యాదులు, మానవులు, దేవతలు, పితరులు, సిద్ధులు, గరుడులు, గంధర్వులు, కిన్నరులనబడే వీరిలో; వేఱచందంబులు+ఐ= వేరువేరు విధములై; విలసిల్లున్= ప్రకాశిస్తాయి; శ్రుతివాక్య దృష్టంబులు+అగున్= (అవి) వేదవచనములచేత తెలియబడునవి అవుతున్నాయి; దానన్= దానివలన; తెలియన్+అరయు= తెలిసికొనటానికై అన్వేషించుము; పరిచయంబునన్= ఎఱుకలో; భేదపరబోధము= భేదంతో సంబంధపడిన జ్ఞానం; ఏమిటికిన్= ఎందుకు; అనన్ రాదు= అని చెప్పతగదు; తోఁచిన అప్పుడు= ఉదయించినప్పుడు; అవియున్= ఆ విషయాలుకూడా; దురితకరముల+అని= పాపహేతువులే అని; వానిన్= ఆ విషయాలను; తొడరక+ఉండన్ వలదె?= అంటకుండా ఉండవద్దా?; లెస్సగన్= బాగుగా; ఎఱిఁగినన్= గ్రహిస్తే; తొలఁగన్ వచ్చున్= తొలగిపోవచ్చు; చోరజనులన్= దొంగలను; చిట్లంగన్+అడఁచుటకున్= కొట్టి అణచేటందుకు; ఏమఱమిదక్కన్= జాగరూకత తప్ప; ఒండు+ఒకండు+ఏల?= మరొకటి ఎందుకు?

తాత్పర్యం: 'పవిత్రవర్తనుడవైన ధర్మపుత్రా! వినుము. గ్రహించదగిన విషయాల నన్నింటినీ దృఢమైన వివేకంతో గ్రహించాలి. పశుపక్ష్యాదులు, మానవులు, దేవతలు, పితరులు, సిద్ధులు, గరుడులు, గంధర్వులు, కిన్నరులు - వీరికి చెందిన విషయాలు పరస్పర భిన్నంగా ఉంటాయి. వేదవాక్యాలలో వాటిని చూడవచ్చును. నీవు కూడా వాటిని ఆ విధంగా తెలిసికొనటానికై ప్రయత్నించుము. పశుపక్ష్యాదులు, మానవులు మొదలైన వారికి చెందిన భిన్నభిన్న విషయాలను గ్రహించవలసిన అవసర మేమున్నది? అని చెప్పకూడదు. ఆయా పరిస్థితులు మనకు కలిగినపుడు అవికూడ పాపహేతువులే అని తెలిసికొని వాటిని అంటకుండా ఉండాలి కదా! అవి చక్కగా తెలిసి ఉంటే వాటినుండి బయటపడవచ్చును. దొంగలను ఒడలు పగలగొట్టి తరిమివేయాలంటే ఏమరుపాటు లేకుండా ఉండటం తప్ప

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మరొక ఉపాయంతో ప్రయోజనమేముంది? అందువలన దోషభూయిష్ఠమైన ఆయా విషయాలకు దూరంగా ఉండాలంటే వాటిని గూర్చిన పరిజ్ఞానం అవసరమే. (ఇందులో ఏమరుపాటు పనికిరాదని భావం).

విశేషం: తిర్యక్కులు, మానవులు మొదలైన వారికి చెందిన విషయాలన్నీ దోషాలతో కూడినవే. అవి శాశ్వతాలు కాక రాకపోకలు గలిగి ఉండటం వలననే దోషభూయిష్ఠాలవుతున్నాయి. ఆ దోషస్వరూపం చక్కగా తెలిస్తే వాటిని వర్జించి చివరికి జీవుడు మోక్షం పొందుతాడు. అందువలన వేదవాక్యాల సాయంతో వాటిని గ్రహించాలని తాత్పర్యం. ఆ విషయాలలో కొన్ని గుణాలు కలిగించవచ్చును. అయినా వాటికి కూడా రాకపోకలుంటాయి. అందువలన వాటికి శాశ్వతత్వం లేదు కాబట్టి అవికూడా దోషాలే అని భావించాలని ఈ ఘట్టంలో సంస్కృతభారతానికి వ్యాఖ్యవ్రాసిన నీలకంఠుడు వివరించాడు. (చూడు - ఓరియంటల్ బుక్స్ రీప్రింట్ కార్పొరేషన్ వారి - శాంతిపర్వం - ద్వితీయముద్రణ, 602 పుట).

చ. **తలఁపఁగ నాయు వింతియకదా యని సౌఖ్యము దుఃఖముం బొరిం**
గలుగవె కాలవృత్తి నని, కర్మము లిట్లని వేదచోదనం
బుల బహుభంగు లిట్టివని బుద్ధికి సత్త్వరజస్తమోగుణం
బులకుఁ బ్రవర్తనంబు లివి పొమ్మని కాంచుట చాల మే లగున్. **601**

ప్రతిపదార్థం: తలఁపఁగన్= ఊహించగా; ఆయువు= జీవితకాలం; ఇంతియకదా అని= ఇంతేకదా అనీ; సౌఖ్యమున్= సుఖమూ; దుఃఖమున్= దుఃఖమూ; కాలవృత్తిన్= కాలవర్తనచేత; పొరిన్= క్రమంగా; కలుగవె అని= సంభవించవా అనీ; కర్మములు+ఇట్లు+అని= పనులు ఇట్లాంటివి అనీ; వేదచోదనంబుల బహుభంగులు= శ్రుతిచేసేప్రేరణలయొక్క వివిధ పద్ధతులు; ఇట్టివి+అని= ఈ విధమైనవనీ; బుద్ధికిన్= బుద్ధి అనే అంతఃకరణవృత్తికి; సత్త్వరజస్తమోగుణంబులకున్= సత్త్వం, రజస్సు, తమస్సు అనే త్రిగుణాలకు; ప్రవర్తనంబులు= పోకడలు; ఇవిపొమ్ము+అని= ఇవియే సుమా! అనీ; కాంచుట= గ్రహించటం; చాలమేలు+అగున్= మిక్కిలి శ్రేయస్సు అవుతుంది.

తాత్పర్యం: ఆయువు ఇంతేకదా! అనీ, సుఖమూ, దుఃఖమూ క్రమంగా వస్తూఉంటాయి అనీ, మనం చేయదగిన కర్మ లట్లాంటివి అనీ, వేదం విధించే నానా విధులు ఈ రీతిగా ఉన్నాయనీ, బుద్ధియొక్క ప్రవృత్తీ, సత్త్వరజస్తమోగుణాల ప్రవృత్తులూ ఇవే సుమా! అనీ గ్రహించటం ఎంతో శ్రేయోదాయక మవుతుంది. ఇవి తెలిసికొనటంవలన మానవుడు ప్రవృత్తిమార్గం వదలి క్రమంగా నివృత్తిమార్గంలో ప్రవేశించి శ్రేయస్సు పొందుతా డని భావం.

సీ. **ఇంద్రియార్థంబుల నేనింట నై దింద్రి । యములును గోష్ఠంబునందు వహ్ని,**
పవనుండు బయలను, బావకునందుఁ దో । యములును భూమి దోయముల బలము
గౌశికునందును గ్రాంతి యుపేంద్రుని । యందును నర్థంబునందు లోభ
మును దమస్సున బుద్ధియును రజస్సునఁ దమ । స్సును సత్త్వమున రజస్సును గరంబు

ఆ. **దగులు సత్త్వ మాత్మఁదగులు; నాత్ముండు నా । రాయణుఁడు మహేశుఁ డనఁగ బరఁగు**
పరముఁ దగులు నతఁడు పరము మోక్షంబునఁ । దగులు, మోక్ష మెందుఁ దగుల దధిప! **602**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఇంద్రియ+అర్థంబుల+ఏనింటన్= శబ్దం మొదలైన ఐదువిషయాలలో; ఐదు+ఇంద్రియములునున్= శ్రోత్రంమొదలైన ఇంద్రియాలు ఐదును; కోష్ఠంబునందున్= గర్భమునందు; వహ్ని= అగ్ని; బయలనున్= ఆకాశమున;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పవనుండున్= వాయువును; పావకునందున్= అగ్నియందు; తోయములును= జలములును; తోయములన్= జలాలలో; భూమి= పృథివియు; కౌశికునందునున్= ఇంద్రుడియందు; బలమున్= హస్తేంద్రియమును; ఉపేంద్రునియందునున్= విష్ణువునందు; క్రాంతి= పాదవిక్షేపమును (కాలుముందుకు చాచుట); అర్థంబునందున్= ధనమునందు; లోభమునున్= పిసినితనమును; తమస్సునన్= తమోగుణమునందు; బుద్ధియునున్= బుద్ధియు; రజస్సునన్= రజోగుణమునందు; తమస్సును= తమోగుణమును; సత్త్వమునన్= సత్త్వగుణమునందు; రజస్సును= రజోగుణమును; కరంబున్= మిక్కిలిగా; తగులున్= తగులువడిఉంటాయి; సత్త్వము= సత్త్వగుణము; ఆత్మన్= జీవునియందు; తగులున్= తగులుకొనిఉంటుంది; ఆత్ముండు= జీవుడు, నారాయణుడు మహేశుఁడు+అనఁగన్+పరఁగు= నారాయణుడు, మహేశ్వరుడు అనగా ప్రసిద్ధుడైన; పరమున్= శ్రేష్ఠుడైనదేవుని; తగులున్= తగులుకొని ఉంటాడు; అతఁడు= ఆ దేవుడు; పరము= శ్రేష్ఠమైన; మోక్షంబునన్= మోక్షమునందు; తగులున్= ఆసక్తుడై ఉంటాడు; మోక్షము= ముక్తి; ఎందున్= దేనిలోనూ; తగులదు= తగులుకొనదు.

తాత్పర్యం: రాజా! శ్రోత్రం, త్వక్కు, చక్షువు, జిహ్వ, ఘ్రాణం అనే ఐదు జ్ఞానేంద్రియాలు క్రమంగా శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే ఐదు విషయాలలోనూ, అగ్ని ఉదరంలోనూ, వాయువు ఆకాశంలోనూ, జలం అగ్నిలోనూ, భూమి జలమందునూ, హస్తేంద్రియం ఇంద్రుడియందునూ, పాదవిక్షేపం (కాలు చాచటం) వామనుడైన విష్ణుని యందునూ, లోభం ధనంలోనూ, బుద్ధి తమోగుణంలోనూ, తమోగుణం రజోగుణంలోనూ, రజోగుణం సత్త్వగుణంలోనూ మిక్కిలిగా తగులువడివున్నాయి. సత్త్వగుణం జీవాత్ముడితో సంబద్ధమై ఉన్నది. త్వంపదార్థమైన జీవుడు నారాయణుడూ, మహేశ్వరుడూ అనబడే దేవుడిలో తగులువడిఉన్నాడు. ఆ దేవుడు శ్రేష్ఠమైన మోక్షంలో సక్తుడై ఉన్నాడు. తత్పదార్థమైన మోక్షం ఎందులోనూ తగులువడక స్వతంత్రమై ఉన్నది.

క. ప్రకృతి పదాఱు వికారము । లకు నాశ్రయ మాత్మ కది నెలవు; విను మాత్ముం
డకుటిల తేజోరూపతఁ । బ్రకృతియు వికృతియును గాక ప్రస్ఫురితుఁ డగున్. 603

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; ప్రకృతి= త్రిగుణాలసామ్యావస్థ అయిన ప్రకృతి; పదాఱు వికారములకున్= పదునారు వికారాలకు; ఆశ్రయము= ఆధారం; ఆత్మకున్= ఆత్మకు; అది= ఆ ప్రకృతి; నెలవు= స్థానం; ఆత్ముండు= ఆత్మ; అకుటిలతేజోరూపతన్= స్వచ్ఛమైన తేజస్సు యొక్క రూపంకలవా డవటంచేత; ప్రకృతియున్= గుణసామ్యావస్థయు; వికృతియునున్+కాక= వికారమున్ను కాక; ప్రస్ఫురితుఁడు+అగున్= భాసించినవాడవుతాడు.

తాత్పర్యం: సత్త్వం మొదలైన మూడు గుణాల సామ్యావస్థ అయిన ప్రకృతి పదునారు వికారాలకు ఆలంబనమై ఉన్నది. ఆత్మకు ఆ ప్రకృతే ఆశ్రయస్థానం. ఆత్మ స్వచ్ఛమైన తేజోరూపం కలిగి ఉన్నది. అది ప్రకృతి వికృతులలో ఏదీ కాక భాసిస్తూ ఉన్నది.

విశేషం: సత్త్వరజస్తమోగుణాల కలయికతో కూడిన సామ్యావస్థకు ప్రకృతి అని పేరు. ఈ ప్రకృతే ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, మనస్సు, పంచభూతాలు (పృథివి, జలం, తేజస్సు, వాయువు, ఆకాశం) - అనే పదారు వికారాలకు ఆశ్రయమై ఉన్నది. సంస్కృత భారతానికి వ్యాఖ్య రచించిన నీలకంఠుడు, స్వప్నశరీరం పదునారు కార్యాలతో ఆవృతమై ఉన్నదనీ, ప్రాణం మొదలు నామం వరకూ గల 'ప్రాణాచ్ఛ్రద్ధాం' ఇత్యాది వేదమంత్రంలో చెప్పబడిన ప్రాణాదుల పదునారు కార్యాలనూ వివరించాడు. అందలి విశేషాలు ఆ వ్యాఖ్యలో చూడవచ్చును.

తే. ఆత్మునకు రెండు రూపంబు లనఘ! కలవు । విషయసంగతి నొక్కటి విస్తరిల్లుఁ,
దదుపభోగంబు లేక మధ్యస్థభావ । మొంది యొక్కఁడు వెలుఁగుచు నుండుఁ జూవె! 604

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; ఆత్మునకున్= ఆత్మకు; రెండు రూపంబులు= రెండు ఆకారాలు; కలవు= ఉన్నాయి; ఒక్కటి= అందులో ఒకటి; విషయసంగతిన్= శబ్దాదులైన విషయాల కలయికతో; విస్తరిల్లున్= వ్యాపించి ఉన్నది; ఒక్కఁడు= మరొక ఆత్మ; తదుపభోగంబు లేక= ఆ విషయాల యొక్క అనుభవం లేకుండా; మధ్యస్థభావమున్+ఒంది= తటస్థస్వరూపం పొంది; వెలుఁగుచున్+ఉండున్= ప్రకాశిస్తూ ఉంటుంది; చూవె!= సుమా!.

తాత్పర్యం: అనఘా! ఆత్మకు రెండు రూపాలు ఉన్నాయి. అందులో ఒకటి శబ్దస్పర్శాది విషయాలను శ్రోత్రం, త్వక్కు మొదలైన ఇంద్రియాలద్వారా అనుభవిస్తూ ఉంటుంది. మరొక ఆత్మ విషయాలతోడి పొత్తు లేకుండా తటస్థంగా ఉండి భాసిస్తూ ఉంటుంది.

విశేషం: ఆత్మ ఒక్కటే అయినా అవిద్యా (అజ్ఞానం) ప్రభావం వలన ఆత్మ నిజస్వరూపాన్ని మరచిపోయి కామకర్మాదులకు లోనై జన్మలెత్తి విషయసుఖాలను అనుభవిస్తూ ఉంటుంది. ఇది అవిద్య ఉన్నంతవరకూ ఇట్లాగే ప్రవర్తిస్తుంది. అవిద్య తొలగిననాడు ఆత్మ పరమాత్మగా భాసిస్తుంది. పరమాత్మకు సుఖదుఃఖాలు, విషయాలతోడి పొత్తు లేవు. అవిద్యకు లోనైనవాడు జీవాత్మ. అవిద్యను నశింపజేసికొన్న నాడు అతడే పరమాత్మగా ప్రకాశిస్తాడు. ఈ జీవాత్మ - పరమాత్మలనే ఇక్కడ ఆత్మయొక్క రెండురూపాలుగా పేర్కొనటమయిందని గ్రహించాలి.

క. పవనం బేకము, ప్రాణా । ది విభేదము లైదు, విను! తదీయంబులు వా
ని విధంబు లరయ నిశ్చల । మవు నది; యాసుకృత మంతరాత్మునిఁ జూపున్. 605

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; పవనంబు= వాయువు; ఏకము= ఒక్కటి; తదీయంబులు= దానికి చెందినవి; ప్రాణాదివిభేదములు+ఐదు= ప్రాణం మొదలైన భేదాలు ఐదు; వాని విధంబులు= ప్రాణాదివాయువుల యొక్క స్వరూపాలను; అరయన్= పరిశీలించగా; అది= ఆ వాయువు; నిశ్చలము+అవున్= కదలిక లేనిదవుతుంది; ఆ సుకృతము= ఆ పుణ్యము; అంతః+ఆత్మునిన్= పరమాత్ముడిని; చూపున్= దర్శింపజేస్తుంది.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము. వాయువు ఒక్కటే. కాని దానికి చెందిన భేదాలు ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం అని ఐదు విధాలుగా ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే క్రమంగా పవనగమనం నిరోధించబడుతుంది. ఈ నిరోధమనే సుకృతం జీవుడిలోని అంతరాత్మను దర్శింపజేస్తుంది.

విశేషం: వాయువు ఒక్కటైనా స్థానభేదాన్ని బట్టి అది ఐదు విధాలుగా రూపొందింది. హృదయంలో ఉన్నవాయువు ప్రాణమనబడుతుంది. గుదస్థానంలో ఉన్నది అపానం. నాభిప్రదేశంలో ఉండేది సమానవాయువు. కంఠస్థలంలో ఉన్న దానిని ఉదానమంటారు. వ్యానమనేది సర్వశరీరంలోనూ వ్యాపించిఉంటుంది. వాయుగమనాన్ని పరిశీలిస్తూ ప్రాణాయామాది క్రియలు ఆచరిస్తే వాయు నిరోధం జరుగుతుంది. తద్వారా అంతరాత్మను చూడవచ్చును. వాయుచలనాన్ని అరికట్టటం ద్వారా మనస్సును నిరోధించవచ్చు. మనస్సు నిశ్చలమైతే పరమాత్మ దర్శనం కలుగుతుంది.

క. విను! గర్భవాస దుఃఖం । బును జన్మవ్యథయు బాల్యము విమూఢత్వం
బును రాగక్లేశ జరా । జనితకృపణతలును జూపు, సంగముఁ బాపున్. 606

ప్రతిపదార్థం: విను= ఆలకించుము, (ఆ సుకృతం); గర్భవాసదుఃఖంబును= మాతృగర్భంలో నివసించటానికి చెందిన దుఃఖాన్ని; జన్మవ్యథయున్= పుట్టుకకు సంబంధించిన బాధను; బాల్యము విమూఢత్వంబునున్= పసితనంలోని మూర్ఖత్వాన్నీ; రాగక్లేశ జరాజనిత కృపణతలును= విషయాసక్తి లోని కష్టాన్నీ; ముసలితనంలో జనించే దీనత్వాన్నీ; చూపున్= దర్శింపజేస్తుంది; సంగమున్= వాటి సాంగత్యాన్ని; పాపున్= తొలగిస్తుంది.

తాత్పర్యం: ధర్మజా! వినుము. పైన చెప్పిన సుకృతం మానవులకు మాతృగర్భవాసంలోని క్లేశాన్నీ, పుట్టుకలోని బాధనూ, బాలుడుగా ఉండేటప్పుడుండే మూఢత్వాన్నీ, విషయాసక్తిలోని క్లేశాన్నీ, వార్ధకంలోని దీనావస్థనూ స్పష్టంగా తెలియజేస్తుంది. అవి తెలియటం వలన వాటిని వదలించుకొనాలని మానవుడు ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నం అతడికి సంసారం తోడి పొత్తును తొలగిస్తుంది.

ఉ. చెందుచునుండుఁ బుణ్యములు సేసి సురత్వము, మధ్యకర్ముఁడై
యొందు నరత్వమున్, దురితయోగమునం బశుకీటభావమున్
బొందు, సుఖంబు దుఃఖమును బొందఁగ జీవుఁడు దీనిభేదశ
క్తిం దెలియంగ నేర్చినమతిం గల యాతఁడు గోరు మోక్షమున్. 607

ప్రతిపదార్థం: జీవుఁడు= జీవాత్మ; సుఖంబున్= సౌఖ్యాన్నీ; దుఃఖమునున్= దుఃఖాన్నీ; పొందఁగన్= అనుభవించటానికై; పుణ్యములు= సుకృతములు; చేసి= ఆచరించి; సురత్వమున్= దేవత్వాన్ని; చెందుచున్+ఉండున్= పొందుతూ ఉంటాడు; మధ్యకర్ముఁడు+ఐ= సుకృతమూ - దుష్కృతమూ కాని మధ్యమరూపాలైన సామాన్యకర్మలు గలవాడై; నరత్వమున్= మానవత్వాన్నీ; ఒందున్= పొందుతాడు; దురితయోగమునన్= పాపంతోడి పొత్తున; పశుకీటభావమున్= జంతుత్వాన్ని, పురుగురూపాన్నీ; పొందున్= చెందుతాడు; దీని భేదశక్తిన్= కర్మయొక్క భేదసామర్థ్యాన్ని; తెలియంగన్= గ్రహించగా; నేర్చినమతిన్= నేర్పుగలబుద్ధిని; కల+ఆతఁడు= కలిగినట్టివాడు; మోక్షమున్= ముక్తిని; కోరున్= అభిలషిస్తాడు.

తాత్పర్యం: జీవుడు సుఖదుఃఖాలు పొందటానికై పుణ్యకార్యాలు చేసి అమరత్వం పొందుతాడు. పుణ్యాతిశయమూ, పాపాతిశయమూ లేని నడిమిరకపు పనులు చేసి మానవుడై జన్మిస్తాడు. పాపం ఎక్కువైనపుడు పశువుగానో, పురుగుగానో ఉద్భవిస్తాడు. జీవుడు చేసే కర్మలలో ఇన్ని తేడా లున్నాయి. ఈ కర్మయొక్క భేదసామర్థ్యాన్ని గ్రహించనేర్చిన బుద్ధిమంతుడు మాత్రం కర్మజాలంలో తగులువడకుండా ముక్తి కోరి అందుకై ప్రయత్నిస్తాడు.

క. క్షయవృద్ధులఁ జంద్రుఁడు న । బ్ధియు లోనుగఁ బొందుచుండఁ దెలియఁడు బంధు
క్షయమునకు వగచు నజ్ఞుం । డయమహితా! దీని నెఱుఁగు టమలతఁ దెచ్చున్. 608

ప్రతిపదార్థం: అయమహితా!= శుభకర్మలచేత పూజించబడినవాడా!; చంద్రుఁడున్= చందమామయు; అబ్ధియున్= సముద్రుడును; లోనుగన్= లోనుగా గలవారు; క్షయవృద్ధులన్= నాశాన్నీ, వృద్ధినీ; పొందుచున్+ఉండన్= పొందుతూ ఉండగా; అజ్ఞుండు= జ్ఞానహీనుడు; తెలియఁడు= ఈ సంగతి గ్రహించడు; బంధుక్షయమునకున్= చుట్టాల వినాశానికి; వగచున్= దుఃఖిస్తాడు; దీనిన్= ఈ విషయాన్ని; ఎఱుఁగుట= గ్రహించటం; అమలతన్+తెచ్చున్= నిర్మలత్వాన్ని సమకూరుస్తుంది.

తాత్పర్యం: పవిత్రకర్మలచేత పూజితుడవైన ఓ ధర్మరాజా! చంద్రుడు, సముద్రం మొదలైన గొప్ప గొప్ప పదార్థాలు హాని, వృద్ధులు పొందుతున్నాయి. అయినా వివేకం లేనివాడు క్షయవృద్ధులు తప్పవన్న విషయం గుర్తించడు. తన బంధువులు మరణిస్తే దుఃఖిస్తాడు. హాని, వృద్ధి అనే ద్వంద్వాలు సృష్టిలో సహజాలు అని గ్రహించగలిగితే చిత్తం నిర్మల మవుతుంది.

క. తన దేహము దోషములం । గని వేవురలో నొకండు గలుగు విముక్తిం
గను పని కుద్యోగించుట । కనఘా! పెక్కండ్రు లే రహంకృతికతనన్.' 609

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; వేవురలోన్= వెయ్యిమందిలో; ఒకండు= ఒక్కడు; తన దేహము దోషములన్= తన శరీరంలోని దోషాలను; కని= చూచి; విముక్తిన్= మోక్షమును; కను పనికిన్= చూచే కార్యానికి; ఉద్యోగించుటకున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రయత్నించటానికి; కలుగున్= ఉంటాడు; అహ్హంకృతికతనన్= అహంకారకారణంచేత; పెక్కండ్రు లేరు= ఎక్కువమంది లేరు.

తాత్పర్యం: అనఘా! వెయ్యిమందిలో ఒక్కడు మాత్రమే తన శరీరానికి చెందిన దోషాలు గ్రహించి మోక్షం కొరకై ప్రయత్నించేవా డుంటాడు. అహంకారం కారణంగా చాలామంది మోక్షప్రయత్నం చేసేవారు లేరు.'

విశేషం: "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే" అన్న భగవద్గీతావాక్యం అభిప్రాయం ఇదే.

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'దేహదోషంబు లెవ్వి? యెఱింగింపవే' యనుటయు, ననిమిషనదీనందనుం డతని కిట్లనియె. 610

ప్రతిపదార్థం: అనిన విని= అని చెప్పగా ఆలకించి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; దేహదోషంబులు= శరీరదోషాలు; ఎవ్వి= ఏవి; ఎఱింగింపవే= తెలుపుమా; అనుటయున్= అని అడుగగా; అనిమిషనదీనందనుండు= దేవనదీపుత్రుడైన భీష్ముడు; అతనికిన్= ధర్మజుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్మ్మ డట్లా చెప్పగా విని ధర్మరాజు 'శరీరంలోని దోషాలు ఏవి? నాకు తెలియపరచుము' అని అడిగాడు. అప్పుడు భీష్మ డతడితో ఈ రీతిగా చెప్పాడు.

క. విను! కామముఁ గ్రోధము భయ । మును నిద్రయు నిశ్శ్వసనము భూవర! దేహం
బునఁ గల దోషము; లీ యై । దును బాపెడి తెఱఁగు సెప్పుదుం దెలియంగన్. 611

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; విను= ఆలకించుము; కామమున్= కోరిక; క్రోధమున్= కోపం; భయమును= భీతి; నిద్రయున్= నిద్దుర; నిశ్శ్వసనమున్= నిట్టూర్పు; దేహంబునన్= శరీరమునందు; కల దోషములు= ఉన్న దోషాలు; ఈ ఐదునున్= ఈ ఐదురకాలైన దోషగుణాలను; పాపెడి తెఱఁగు= తొలగించే విధానాన్ని; తెలియంగన్= తెలిసేటట్లుగా; చెప్పుదున్= చెప్పుతాను.

తాత్పర్యం: 'రాజా! వినుము. కామం, క్రోధం, భయం, నిద్ర, నిశ్శ్వాసం అనేవి దేహగతమైన దోషాలు. ఈ ఐదు దోషాలను తొలగించుకొనే విధానం కూడా వివరిస్తాను.

సీ. క్షమ క్రోధమునకు, సంకల్ప వర్జనము గా । మమునకు, నప్రమాదము భయంబు
నకు, సత్త్వసంసేవనము నిద్రకును, లఘు । భోజిత నిశ్వాసమునకు వైరు
లని చెప్పి, వెండియు నను ననేకములగు । దోషముల్ దొలఁగంగఁ ద్రోచువెరవు
లును బెక్కు లవి గనికొను వివేకము గల । పురుషుండు దన్మార్గ పరిచయమున

తే. విష్ణుమాయను దోఁచు నీ విష్టపములు । భిత్తి చిత్రంబు విధమున ఫేనభంగి
బుద్బుదాకృతిగాఁ గను బుధుఁడు; దీని । సరకు సేయక మోక్షంబు తెరువు వెదకు. 612

ప్రతిపదార్థం: క్రోధమునకున్= కోపానికి; క్షమ= ఓర్పు; కామమునకున్= కోరికకు; సంకల్పవర్జనము= సంకల్పించటాన్ని విడవటం; భయంబునకున్= భయానికి; అప్రమాదము= ఏమరుపాటు లేకుండటం; నిద్రకునున్= నిద్దురకు; సత్త్వసంసేవనము= సత్త్వగుణమును సేవించటం; నిశ్వాసమునకున్= నిట్టూర్పునకు; లఘుభోజిత= అల్పభోజనం చేయటం; వైరులు+అని= శత్రువులని; చెప్పి= వచించి; వెండియున్= మరల; అనున్= చెప్పాడు; అనేకములు+అగు= పెక్కులయిన; దోషముల్= దోషాలు; తొలఁగంగన్+త్రోచు= తొలగజేసేటటువంటి; వెరవులును= ఉపాయాలుకూడ; పెక్కులు= అనేకాలు; వివేకముకల= తెలివిగల; పురుషుండు= మానవుడు; తన్మార్గ పరిచయమునన్= ఆ ఉపాయాల యొక్క త్రోవలతోడి పరిచయంతో; అవి కనికొనున్= వాటిని ఎరింగి గ్రహిస్తాడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విష్ణుమాయను= విష్ణుమాయచేత; తోఁచు= ఉదయించే; ఈ విష్టపములు= ఈ లోకాలు; భిత్తిచిత్రవిధంబునన్= గోడమీది బొమ్మలవలె; ఫేనభంగిన్= నురుగురీతిగానూ; బుద్బుద+ఆకృతిగాన్= నీటి బుడగవంటి రూపుగలవిగానూ; కను= చూచు; బుధుఁడు= పండితుడు; దీనిన్= ఈ లోకాన్ని; సరకుచేయక= లక్ష్యపెట్టక; మోక్షంబు తెరువు= ముక్తియొక్క మార్గమును; వెదకున్= అన్వేషిస్తాడు.

తాత్పర్యం: కోపానికి ఓర్పు, కామానికి సంకల్పించకుండా ఉండటమూ, భయానికి ఏమరుపాటు లేకుండటమూ, నిద్రకు సత్త్వగుణాన్ని సేవించటమూ, శ్వాసకు అల్పాహారస్వీకరణమూ శత్రువులు' - అని భీష్ముడు చెప్పాడు. మళ్ళీ ఇట్లా అన్నాడు. ఇంకా పెక్కు దోషాలను తొలగించుకొనే ఉపాయాలు కూడా అనేకం ఉన్నాయి. వివేకవంతుడు వాటిమార్గాలను తెలిసికొని చేపట్టి దోషాలను నిర్మూలిస్తాడు. ఈ లోకాలు విష్ణుమాయా ప్రభావం వలన కలుగుతున్నాయి. పండితుడు వీటిని గోడమీది బొమ్మలుగా, నురుగులవలె, నీటి బుడగలతీరుగా చూస్తాడు. అతడు వీటిని లక్ష్యపెట్టడు. మోక్షమార్గాన్ని మాత్రమే అన్వేషిస్తాడు.

ఆత్మ పరమపదంబుఁ బ్రాపించెడు ప్రకారము (సం. 12-290-80, 81)

వ. ఇది సాంఖ్యప్రకారంబు బహిస్స్పర్శంబులు తపోదండంబునం దొలంగం జడిసి యానపాత్రరూపంబుగా దీని నవలంబించిన యార్యుండు ప్రజ్ఞాకర్ణధార సామర్థ్యంబున దుఃఖోదకంబును వ్యాధిమృత్యు మహాగ్రాహంబును భయోరగంబును హింసావేగంబును రాగపంకంబును దృష్ణావర్తంబును నానాప్రీతిరత్నంబును సత్యతీరంబును నగు సంసారసాగరంబు నుత్తరించు నా సుకృతి నట సూర్యుండు తన రశ్ముల వహించి నడపు పద్మతంతు సన్నిభంబైన మార్గంబు ప్రవేశించి చనంజన సూక్ష్ముండును శీతలుండును సుగంధియు సుఖస్పర్శుండును సప్తమారుత శ్రేష్ఠుండును నగు పవనుం డెదుర్కొని నభఃపరమగతిం జేర్చు; నభంబు రజః పరమగతిని రజస్సు సత్త్వపరమగతిని, సత్త్వంబు నారాయణుని, నారాయణుండు పరమంబునం జేర్ప నందుం గలిసి తన్మయుండై యమృతత్వ నిత్యుండగు'నని చెప్పిన విని పాండవాగ్రజుం'డ ట్లమృత స్వరూపశాశ్వతుండగు నమ్మహాత్ముండు దన పూర్వవృత్తంబు దలంచునో తలంపకుండునో దాని నిశ్చయం బతిగహనంబు; మోక్షంబు దలంచి పరమజ్ఞానమగ్నుం డగుటం బురుషున కెద్ది దశయో యను వితర్కంబున నది ప్రవృత్తి ధర్మంబున కంటె మేలనరాకున్నది; యీ రెండు దెఱంగులుం దెలుప నీవకాక యీలోకంబున నొరులు గలరే?' యనుటయు నజ్జనపతికి జాహ్నవీనందనుం డిట్లనియె. 613

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పినది; సాంఖ్యప్రకారంబు= సాంఖ్యముయొక్క విధానం; తపోదండంబునన్= తపస్సు అనే కర్రతో; బహిస్స్పర్శంబులు= వెలుపలి తాకిడులు; తొలంగన్ జడిసి= తొలగద్రోచి; దీనిన్= ఈ సాంఖ్యవిధిని; యానపాత్రరూపంబుగాన్= ఓడయొక్క రూపంగా; అవలంబించిన= గ్రహించిన; ఆర్యుండు= పూజ్యుడు; ప్రజ్ఞాకర్ణధార సామర్థ్యంబునన్= తెలివిఅనే ఓడ నడిపేవాడి నైపుణ్యంతో; దుఃఖోదకంబునున్= దుఃఖమనే నీరు కలదీ; వ్యాధిమృత్యుమహాగ్రాహంబునున్= రోగాలు, మరణం అనే గొప్ప మొసళ్ళు గలదీ; భయ+ఉరగంబునున్= భయం అనే సర్పాలు కలదీ; హింసావేగంబునున్= హింస అనే ప్రవాహం కలదీ; రాగపంకంబునున్= విషయాసక్తి అనే బురదకలదీ; తృష్ణా+ఆవర్తంబునున్= ఆశ అనే సుడిగుండం కలదీ; నానాప్రీతి రత్నంబునున్= పలురకాల సంతోషాలు అనే రత్నాలు గలదీ; సత్యతీరంబునున్+అగు= సత్యమనే గట్టు గలదీ అయిన; సంసారసాగరంబున్= సంసారమనే సముద్రాన్ని; ఉత్తరించున్= దాటుతాడు; అటన్= అచ్చట; సూర్యుండు= సూర్యుడు; ఆ సుకృతిన్= ఆ పుణ్యాత్ముడిని; తన రశ్ములన్= తన కిరణాలచేత; వహించి= మోసి; నడపున్= కొనిపోతాడు; పద్మతంతు సన్నిభంబు+ఐన= తామరతూడు దారంతో సమానమైన; మార్గంబు ప్రవేశించి= త్రోవలో చొచ్చి; చనన్+చనన్= పోగా పోగా; సూక్ష్ముండునున్= అణుస్వరూపుడూ; శీతలుండునున్= చల్లనివాడూ; సుగంధియున్= మంచివాసనకలవాడూ; సుఖస్పర్శుండునున్= హాయిగొలిపే స్పర్శకలవాడూ; సప్తమారుతశ్రేష్ఠుండునున్= ఏడు వాయువులలో మేలైనవాడూ; అగు= అయినట్టి; పవనుండు= ప్రవాహమనెడు వాయువు; ఎదుర్కొని= అభిముఖమైపోయి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నభఃపరమగతిన్= ఆకాశముయొక్క శ్రేష్ఠగతిని; చేర్చున్= చేరుస్తాడు; నభంబు= ఆకాశం; రజఃపరమగతినిన్= రజస్సుయొక్క శ్రేష్ఠగతిని; రజస్సు= రజోగుణం; సత్త్వపరమగతినిన్= సత్త్వంయొక్క శ్రేష్ఠమైన గతిని; సత్త్వంబు= సత్త్వగుణం; నారాయణునిన్= విష్ణుదేవుడిని; నారాయణుండు= విష్ణువు; పరమంబునన్= పరమాత్మయందు; చేర్పన్= చేర్చగా; అందున్+కలిసి= ఆ పరమాత్మతో కూడి; తన్మయుండు+ఐ= పరమాత్మ స్వరూపుడై; అమృతత్వ నిత్యుండు= అమరణ ధర్మప్రాప్తిచేత శాశ్వతుడు; అగునని చెప్పినన్= అవుతాడని చెప్పగా; విని= ఆకర్ణించి; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; అట్లు= ఆ రీతిగా; అమృతస్వరూపశాశ్వతుండు+అగు= అమరణ ధర్మస్వరూపంచేత నిత్యుడైన; ఆ+మహాత్ముండు= ఆ సుకృతాత్ముడు; తన పూర్వవృత్తంబున్= తన మునుపటి వృత్తాంతాన్ని; తలంచునో= భావిస్తాడో; తలంపక+ఉండునో= భావించకే ఉంటాడో; దాని నిశ్చయంబు= దానికి సంబంధించిన నిర్ణయం; అతిగహనంబు= మిక్కిలి సూక్ష్మమవటంవలన ఎరుగరానిది; మోక్షంబున్= ముక్తిని; తలంచి= భావించి; పరమజ్ఞానమగ్నుండు+అగుటన్= శ్రేష్ఠజ్ఞానంలో లీనుడు కావటం వలన; పురుషునకున్= జీవుడికి; ఎద్ది= ఏది; దశయో= అవస్థయో; అను వితర్కంబునన్= అన్న సందేహముచేత; అది= ఆ స్థితి; ప్రవృత్తి ధర్మంబున కంటెన్= లోకప్రవర్తనకు సంబంధించిన ధర్మానికంటె; మేలు+అనరాక+ఉన్నది= శ్రేష్ఠమైనదని చెప్పరాక ఉన్నది; ఈ రెండు తెఱంగులున్= ఈ రెండు మార్గాలూ; తెలుపన్= వ్యక్తం చేయటానికి; నీవకాక= నీవే తప్ప; ఈ లోకంబునన్= ఈ జగత్తులో; ఒరులు= ఇతరులు; కలరే?= ఉన్నారా?; అనుటయున్= అని చెప్పగా; ఆ+జనపతికిన్= ఆ రాజుకు; జాహ్నవీనందనుండు= గంగాసుతుడైన భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇంతవరకూ చెప్పింది సాంఖ్యులు అనుసరించే విధానం. వెలుపలి స్పర్శలు అనబడే విషయసుఖాలను తపస్సు అనే కఱ్ఱతో తొలగనెట్టి ఈ సాంఖ్యవిధానాన్ని ఓడగా గ్రహించిన ఆర్యుడు ప్రజ్ఞ అనే పడవ నడిపే చుక్కాని వాడి నైపుణ్యంతో సంసారమనే సముద్రాన్ని దాటుకొంటాడు. ఆ సముద్రం దుఃఖమనే నీటితోనూ, వ్యాధులు, మరణమనే మొసళ్ళతోనూ, భయమనే పాములతోనూ, హింస అనే ప్రవాహంతోనూ, విషయాసక్తి అనే బురదతోనూ, ఆశలు అనే సుడులతోనూ, పెక్కు సంతోషాలు అనే రత్నాలతోనూ, సత్యమనే గట్టుతోనూ కూడి ఉంటుంది. ఆ సముద్రాన్ని దాటిన పుణ్యాత్ముడిని సూర్యుడు తన కిరణాలతో మోసికొనిపోతాడు. పిదప తామరతూడులోని దారమంతటి సూక్ష్మమైన దారిలో ప్రవేశించి అతడు పయనిస్తూ ఉండగా మిక్కిలి సూక్ష్మమైనవాడూ, చల్లనివాడూ, మంచివాసనకలవాడూ, సుఖమైన స్పర్శకలవాడూ, ఏడు విధాలైన వాయువులలో శ్రేష్ఠుడూ అయిన ప్రవహుడనే పవనుడు అతడి కెదురుగా పోయి అతడిని ఆకాశంయొక్క పరమగతిని చేరేటట్లు చేస్తాడు. ఆకాశం రజస్సుయొక్క పరమగతినీ, రజస్సు సత్త్వంయొక్క పరమగతినీ, సత్త్వం నారాయణుడినీ క్రమంగా చేరేటట్లు చేస్తాయి. నారాయణుడు ఆ పుణ్యాత్ముడిని కడకు పరమాత్మతో చేరుస్తాడు. ఆ పరతత్త్వంతో కలిసి అతడు తన్మయుడై అమృతత్వదశను పొంది శాశ్వతస్థితి కలవాడవుతాడు' ఇట్లా భీష్ముడు చెప్పగా విని ధర్మజుడు 'ఆ రీతిగా అమృతస్వరూపుడై నిత్యుడైన మహాత్ముడు తన పూర్వస్థితిని తలుస్తాడా? తలంచకుండానే ఉంటాడా? ఈ విషయానికి సంబంధించిన నిర్ణయం అగోచరమై ఉన్నది. మోక్షాన్ని భావించి అందుకై పరమజ్ఞానంలో లీనమైనవాడు కావటంతో ఆ పురుషుడి అప్పటి స్థితి ఎట్లాంటిదో అంతుబట్టటం లేదు. ఈ సంశయం ఉండటం వలన ఆ స్థితి ఈ లోక ప్రవృత్తిధర్మం కంటె మేలైనది అని నిర్ణయించి చెప్పటానికి వీలుకాకుండా ఉన్నది. అతడు ఆ స్థితిలో తన పూర్వస్థితిని తలుస్తాడా? తలంచడా? అనే ఈ రెండు మార్గాలనూ ఇదమిత్థమని తెలపటానికి ఈ లోకంలో నీవు తప్ప మరెవరూ లేరు' అని అన్నాడు. అప్పుడు ధర్మరాజుతో భీష్ము డీరీతిగా చెప్పాడు.

విశేషం: అలం: రూపకం, ఉపమ. ఆకాశం యొక్క పరమగతి అంటే హార్దాకాశమని గ్రహించాలి. అట్లాగే రజస్సుయొక్క పరమగతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అహంకారమనీ, సత్త్వముయొక్క పరమగతి మహత్తత్త్వమనీ, దాని పరమగతి నారాయణుడనీ, నారాయణుడి పరమగతి ఉపాధిరహితమైన చిన్మాత్రస్వరూపమనీ గ్రహించాలి. ఆ స్వరూపం పొందితేనే అమృతత్త్వం సిద్ధిస్తుంది. (చూడు - నీలకంఠ పండితుని 'భారతభావదీప' మనే సంస్కృతభారతవ్యాఖ్య - ఓరియంటల్ బుక్స్ రీప్రింటింగ్ కార్పొరేషన్‌వారి ప్రచురణ - శాంతిపర్వం - ద్వితీయముద్రణ - 606వ పుట).

క. అడిగితి లెస్సగఁ బ్రశ్నము । గడుసంకట; మెట్టి యెఱుక గలవారలు నె
ప్పుడు సంశయించు చో టిది; । దడయక యుత్తరము సెప్పెదం దేటపడన్. 614

ప్రతిపదార్థం: లెస్సగన్= బాగుగా; కడుసంకటమున్= మిక్కిలి సూక్ష్మమైన; ప్రశ్నమున్= ప్రశ్నను; అడిగితి(వి)= అడిగావు; ఇది= ఇయ్యది; ఎప్పుడున్= ఎల్లవేళలా; ఎట్టిఎఱుక గలవారలున్= ఎట్లాంటి విజ్ఞానం గలిగినవారైనా; సంశయించుచోటు= సందేహించే స్థానం; తడయక= ఆలసించక; తేటపడన్= స్పష్టమయ్యేటట్లుగా; ఉత్తరమున్= సమాధానాన్ని; చెప్పెదన్= చెప్తాను.

తాత్పర్యం: 'నీవు చాలా గహనమైన ప్రశ్నను చక్కగా అడిగావు. ఎంత తెలివైన వారైనా సందేహించే విషయ మిది. వెంటనే ఇది స్పష్టంగా బోధపడేటట్లు వివరిస్తాను.

వ. కపిల దర్శన విదులగు మునీంద్రుల పరమమతం బిది; యవహితుండవై యాకర్ణింపుము. 615

ప్రతిపదార్థం: ఇది= నేనిప్పుడు చెప్పేది; కపిల దర్శనవిదులు+అగు= కపిలమహర్షి చెప్పిన సాంఖ్యశాస్త్రము నెరింగినవారైన; ముని+ఇంద్రుల= మునిశ్రేష్ఠులయొక్క; పరమమతంబు= శ్రేష్ఠమైన అభిప్రాయం; అవహితుండవు+ఐ= అవధానంకలవాడవై; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: కపిలమహర్షి చెప్పిన సాంఖ్యశాస్త్రమును తెలిసికొన్న మునివర్యుల శ్రేష్ఠమైన మత మిది. దీనిని సావధానంగా వినుము.

సీ. పురుషుని నింద్రియంబు లెఱుఁగ; వవి మనస్ । స్థములు గావున మనస్సంగమమునఁ
గనువాని నతఁడు ముక్తత్వంబు లేని య । ప్పుడుఁ గల్గినను నది పురుషునందు
సమమ నిర్విషభుజంగములట్ల నిశ్చేష్ట । నున్న యింద్రియములఁ గన్నఁ గాన
కున్నను నేమి యయ్యుదిత విజ్ఞానామృ । తస్వరూపునకు నాతండు దొఱఁగఁ

తే. గాష్ఠకుడ్యకుసూలాదికముల చంద । మొందునట్టు గాకయు నింద్రియోత్కరంబు
శరధిఫేననిభం బయి విరియు నవ్వి । భూతి యీశ్వరుతెఱఁ గాత్మఁ బొందకున్నె? 616

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు= శ్రోత్రం మొదలైన ఇంద్రియాలు; పురుషునిన్= ఆత్మను; ఎఱుఁగవు= తెలియనేరవు; అవి= ఆ ఇంద్రియాలు; మనస్స్థములు గావునన్= మనస్సులో ఉండేవి కాబట్టి; వానిన్= ఆ ఇంద్రియాలను; అతఁడు= ఆ పురుషుడు; కనున్= చూస్తాడు; అది= ఆ చూడటం; ముక్తత్వంబు లేని అప్పుడున్= ముక్తి కలగని దశలోనూ; కల్గిననున్= ముక్తి కలిగిన అవస్థలోనూ; పురుషునందున్= ఆత్మయందు; సమము+అ= సమానమే; ఆ+ఉదితవిజ్ఞాన+అమృత స్వరూపునకున్= ఉదయించిన విజ్ఞానంచేత అమరణధర్మమునొందిన స్వరూపంగల ఆ పురుషుడికి; నిర్విషభుజంగములట్ల= విషంలేని పాములవలె; నిశ్చేష్టన్= చేష్టారహితత్వంతో; ఉన్న= ఉన్నట్టి; ఇంద్రియములన్= ఇంద్రియాలను; కన్నన్= చూచినా; కానకున్ననున్= చూడక ఉండినా; ఏమి?= ఏమవుతుంది?; ఆతండు= ఆ పురుషుడు; తొఱఁగన్= విడువగా; ఇంద్రియోత్కరంబు= ఇంద్రియాల సమూహం; కాష్ఠకుడ్యకుసూల+ఆదికముల చందమున్= కొయ్య, గోడ, గాదె మొదలైన పదార్థాల రీతిని; ఒందున్= పొందుతుంది; అట్లు కాకయున్= అట్లాకాక; శరధిఫేన నిభంబు+అయి= సముద్రంలోని నురుగుతో సదృశమై; విరియున్= విచ్ఛిన్నమై పోతుంది;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ+విభూతి= ఆ వైభవం; ఈశ్వరుతెఱఁగు= ఈశ్వరుడి విధానం; ఆత్మన్= ఆత్మను; పొందకున్నె?= పొందక ఉంటుందా?

తాత్పర్యం: శ్రోత్రం, త్వక్కు మొదలైన ఇంద్రియాలు పురుషుడిని తెలియజాలవు. అవి మనస్సులో ఉంటాయి. కాబట్టి పురుషుడు మనస్సుతోడి సంబంధం వలన ఇంద్రియాలను తెలిసికొంటాడు. పురుషుడు ముక్తిపొందినా, పొందకుండినా ఇంద్రియాలను తెలిసికొనటమనేది సమానమే. ఆత్మజ్ఞానసంపన్నుడై అమృతస్వరూపుడైన పురుషుడు విషం లేని పాములవలె చేష్టలు లేక పడిఉన్న ఇంద్రియాలను తెలిసికొన్నా, తెలిసికొనకున్నా జరిగే దేమీలేదు. అందువలన అతడి కేవిధమైన బాధలూ లేవు. ముక్తి నొందిన పురుషుడు ఇంద్రియాలను వర్జించినప్పుడు ఆ ఇంద్రియాలు కొయ్య, గోడ, గాదెలవలె జడంగా పడి ఉంటాయి. లేదా సాగరంలోని నురుగువలె విచ్ఛిన్నమై పోతాయి. ఇంద్రియాలు ఈ స్థితిని పొందటమనేది ఈశ్వరుడి విభూతిఅయి ఉన్నది. అది ముక్తి పొందిన ఆత్మకు కూడా అన్వయిస్తుంది.

విశేషం: అలం: ఉపమ. ముక్తుడు కానివాడు ఇంద్రియాలను గ్రహించజాలినట్లే ముక్తుడైనవాడు కూడ ఇంద్రియాలను గ్రహించగలడు. అయితే ముక్తిపొందిన వాడిని జడప్రాయాలైన ఇంద్రియాలు ఏమీ చలింపజేయలేవు. లేదా అవి నీటిపై నురుగువలె రూపులేనివై పోతాయి. ఈశ్వరు డే విధంగా ఇంద్రియాల ప్రభావానికి లోనుగాడో, అట్లాగే ముక్త పురుషుడు కూడా ఇంద్రియాల ప్రభావానికి ఏ విధంగానూ లోనుగాడని భావం.

క. విను! మింద్రియసహితముగా । మనుజాధిప! బోధపూరమగ్నత్వము గ
ల్గినను దత్సూక్ష్మగతులఁ । గనుఁ బురుషుఁడు గనియు నిర్వికారత నుండున్. 617

ప్రతిపదార్థం: మనుజ+అధిప!= రాజా!; వినుము= ఆలకించుము; ఇంద్రియసహితముగాన్= ఇంద్రియాలతో కూడిఉండేటట్లు; బోధపూరమగ్నత్వము= జ్ఞానప్రవాహంలో మునుగటం; కల్గినను= సంభవించినా; పురుషుఁడు= ముక్తాత్ముడు; తత్సూక్ష్మగతులన్= వాటి సూక్ష్మగమనాలను; కనున్= చూస్తాడు; కనియున్= చూచికూడా; నిర్వికారతన్= వికార రహితస్థితితో; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: రాజా! వినుము. ఒకవేళ పురుషుడు ఇంద్రియాలతో కూడియే పరమజ్ఞానమగ్నుడైతే అతడు వాటి సూక్ష్మమైన పోకడలను చూస్తూ ఉంటాడు. చూచినా తాను వాటివలన కలిగే వికారాలకు లోనుకాడు.

తే. భూతములను గుణంబుల బుద్ధి మనసు । నడఁచికొని జీవుఁ డొందు నారాయణునిఁ ద
దీయమాహాత్మ్యమున మాననీయపరమ । పదము గనుఁగాన నిష్పుణ్యపాపుఁ డతఁడు. 618

ప్రతిపదార్థం: జీవుఁడు= పురుషుడు; భూతములనున్= పంచభూతాలనూ; గుణంబులన్= మూడు గుణాలనూ; బుద్ధిన్= బుద్ధినీ; మనసున్= చిత్తాన్నీ; అడఁచికొని= లయింపజేసికొని; నారాయణునిన్= నారాయణు డనబడే పరమాత్ముడిని; ఒందున్= పొందుతాడు; తదీయ మాహాత్మ్యమునన్= ఆ నారాయణుడి ప్రభావం వలన; మాననీయపరమపదమున్= పూజ్యమైన మోక్షాన్ని; కనున్= చూస్తాడు; కానన్= కావున; అతఁడు= ఆ ముక్తజీవుడు; నిష్పుణ్యపాపుఁడు= పుణ్యపాపాలు లేనివాడవుతాడు.

తాత్పర్యం: జీవుడు పృథివి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశం అనే ఐదు భూతాలనూ, సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడుగుణాలనూ, బుద్ధినీ, మనస్సునూ అణచుకొన్నవాడై నారాయణుడి సన్నిధి చేరుకొంటాడు. ఆ పరమాత్ముడి కృపాప్రభావం వలన మహితమైన పరమపదం పొందుతాడు. అందువలన ఆ స్థితిలో అతడికి పుణ్యం, పాపం అనేవి లేవు. (ఇంద్రియాల పోకడలను చూస్తున్నా అతడికి పుణ్యపాపాల స్పర్శ లేదని తాత్పర్యం.)

క. పునరావర్తనరహితుం । డనఘా! పరమాత్ముఁ జెందినట్టి పురుషుఁ డ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్వినుతావస్థను మోక్షం । బని చెప్పుదు; రంతకంటె నధికము గలదే?' 619

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; పరమాత్మున్= నారాయణుడివి; చెందినట్టి= పొందినట్టి; పురుషుఁడు= జీవుడు; పునరావర్తనరహితుండు= తిరిగి రాకలేనివాడు; ఆ+వినుత+అవస్థను= పునర్జన్మలేని ఆ ప్రశస్తమైన దశను; మోక్షంబు+అని= ముక్తి అని; చెప్పుదురు= అంటారు; అంతకంటెన్= ఆ మోక్షంకంటె; అధికము= గొప్పది; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: పాపరహితుడవైన ఓ ధర్మరాజా! పరమాత్ముడైన నారాయణుడిని పొందినట్టి జీవుడికి పునర్జన్మ లేదు. శ్రేష్ఠమైన పునరావృత్తిలేని ఆ దశనే మోక్షమంటారు. మోక్షావస్థకంటె ఎక్కువ దశ మరేమీ లేదు.

విశేషం: "ఆ బ్రహ్మ భువనాల్లోకాః । పునరావర్తినోऽర్జున!
మా ముపేత్య తు కౌంతేయ । పునర్జన్మ న విద్యతే॥' (గీత - 8-16)

అన్న గీతావాక్యం ఇక్కడ స్మరణీయం. కృష్ణుడు అర్జునుడితో 'అర్జునా! బ్రహ్మలోకం వరకూ పోయిన వారు మళ్ళీ తిరిగి జన్మిస్తారు. కాని నన్ను పొందినవారికి పునర్జన్మ లేదు' అని చెప్పాడు. అందువలన నారాయణుడి సన్నిధి చేరి ఆ పరమాత్ముడి అనుగ్రహానికి పాత్రులైనవారు ముక్తు లవుతా రని గ్రహించాలి.

వ. అని చెప్పి వెండియు. 620

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; వెండియున్= మరల.

తాత్పర్యం: భీష్ముడు ధర్మజుడితో అట్లా చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు.

క. 'గురుని వచనంబు తెఱఁగునఁ । బరమార్థ నిరూపణంబు భంగి నియతిఁ ద
త్పరుఁడై నడపం జాలిన । పురుషునిఁ దడయక ప్రశాంతి వొందు నరేంద్రా! 621

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా!; గురుని వచనంబు తెఱఁగునన్= ఆచార్యుడి ఉపదేశాన్ని అనుసరించి; పరమ+అర్థనిరూపణంబు భంగిన్= పరతత్త్వమును నిరూపించే పద్ధతిని; నియతిన్= నియమంతో; తత్పరుఁడు+ఐ= దానియందే ఆసక్తిగలవాడై; నడపన్+చాలిన= నిర్వహించగలిగినట్టి; పురుషునిన్= మానవుడిని; తడయక= ఆలసించక; ప్రశాంతి= ప్రకృష్టమైన శాంతి పొందున్= పొందుతుంది.

తాత్పర్యం: ధర్మరాజా! గురూపదేశాన్ని అనుసరించి ఎవడు పరతత్త్వ నిరూపణ పద్ధతిని నియమంతో పాటిస్తాడో, అట్లాంటి పురుషుడికి త్వరలో ప్రశాంతి కలుగుతుంది.

చ. జనవర! సాంఖ్య మిట్టిది ప్రజాపతి పూజ్యము బ్రహ్మభావభా
జనత ఘటింప దీనిసరి సమ్యగుపాయము లెందులేవు; నె
మ్మనమున సంశయింపక సమాహితచిత్తత దీనినూఁదు ని
స్తనుఁడగు నమ్మహేశునకుఁ దాఁ దనువిం కిట వేయు నేటికిన్. 622

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; సాంఖ్యము= సాంఖ్యశాస్త్రం; ఇట్టిది= ఇటువంటిది; ప్రజాపతిపూజ్యము= ఇది బ్రహ్మచేత పూజించతగినది; బ్రహ్మభావభాజనతన్= బ్రహ్మత్వయోగ్యతను; ఘటింపన్= కలిగించటానికి; దీని సరి= దీనికి సాటియగు; సమ్యగు పాయములు= మంచి ఉపాయాలు; ఎందున్= ఎక్కడను; లేవు= ఉన్నవికావు; నెమ్మనమునన్= చిత్తమునందు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంశయింపక= సందేహించక; సమాహితచిత్తతన్= సమాధానం పొందిన మనస్సుతో; దీనిన్= ఈ సాంఖ్యవిధానాన్ని; ఊఁదు= అవలంబించుము; తాన్= తాను; నిస్తనుఁడు+అగు= శరీరంలేనివాడైన; ఆ+మహేశునకున్= ఆ పరమేశ్వరుడికి; తనువు= శరీరం; ఇంకన్= ఇకపై; ఇటన్= ఈ విషయంలో; వేయున్ ఏటికిన్?= వెయ్యి మాటలు ఎందుకు?

తాత్పర్యం: రాజా! ఇప్పుడు నేను చెప్పింది సాంఖ్యపద్ధతి. ఇది ప్రజాపతి అయిన బ్రహ్మచేత పూజించదగినదై ఉన్నది. జీవుడు బ్రహ్మత్వం పొందటానికి దీనికి దీటు రాగల మంచి ఉపాయాలు వేరే ఎక్కడా లేవు. నీవు దీని విషయమై మనస్సులో సంశయించవద్దు. మనస్సును సమాధానపరచుకొని ఈ సాంఖ్య పద్ధతిని పాటించుము. ఈ సాంఖ్యం శరీరంలేని పరమేశ్వరుడికి శరీరమై ఉన్నది. ఇంక ఈ విషయమై వెయ్యి మాటలతో ప్రయోజన మేమి?

తే. **వేదశాస్త్ర పురాణ సంవేదితంబు । లైన బహువిధసంపరిజ్ఞానములకు**
నెల్ల నిది సేరుగడ సూవె యేఱులకు స । ముద్రమును బోలె నుపశాంతి భద్రచిత్త! **623**

ప్రతిపదార్థం: ఉపశాంతి భద్రచిత్త!= ఉపశాంతిచే మంగళకరమైన మనస్సు గల ఓ ధర్మరాజా! ఏఱులకున్= నదులకు; సముద్రమును పోలెన్= సాగరంలాగా; వేదశాస్త్రపురాణసంవేదితంబులు+ఐన= శ్రుతులచేత, శాస్త్రాలచేత, పురాణాలచేత తెలియజేయబడినవైన; బహువిధసంపరిజ్ఞానములకున్+ఎల్లన్= అనేకవిధాలైన జ్ఞానాలకన్నింటికిని; ఇది= ఈ సాంఖ్యపద్ధతి; చేరుగడ చూవె= గమ్యం సుమా!

తాత్పర్యం: ప్రశాంతిచేత భద్రమైన హృదయంగల ఓ ధర్మరాజా! నదులకన్నిటికీ సముద్రమే గమ్యమైనట్లు వేదాలు, శాస్త్రాలు, పురాణాలు ప్రతిపాదించే నానావిధ జ్ఞానాలకు ఈ సాంఖ్యపద్ధతి చేరువలోనున్న గమ్యమై ఉన్నది చూడుము.

వ. **యోగులును సాంఖ్యులును జూచువెరవు లాకర్ణించితి కాదె; యిది యిట్లగుటం జేసి దర్శనభేదంబు గల దంటి నదియును నల్పాంతరం; బదియునుంగాక.** **624**

ప్రతిపదార్థం: యోగులునున్= యోగమార్గం అనుసరించే వారూ; సాంఖ్యులునున్= సాంఖ్యపద్ధతిని అనుసరించే వారూ; చూచువెరవులు= చూచేపద్ధతులు; ఆకర్ణించితి(వి) కాదె!= వింటివికదా!; ఇది ఇట్లు+అగుటన్+చేసి= ఇది ఇట్లా ఉంటున్నది కాబట్టి; దర్శనభేదంబు= చూపులో తేడా; కలదు+అంటిన్= ఉన్నదన్నాను; అదియునున్= ఆ భేదం కూడ; అల్ప+అంతరంబు= స్వల్పమైన తేడా గలది; అదియునున్+కాక= అదీకాక.

తాత్పర్యం: ధర్మరాజా! యోగులు, సాంఖ్యులు చూచే పద్ధతిని వింటివికదా! అట్లు ఉండటంవలననే నేను వారిలో దర్శనభేదం ఉన్నదని చెప్పాను. ఆ భేదం చాలా స్వల్పమైనది. అదీకాక.

ఆ. **యోగి చూచుభంగి నుర్వీశ! సాంఖ్యుండుఁ । జూచు; సాంఖ్యుఁ డరయు చొప్పు యోగి**
వరుఁడు నరయుఁ; గాన వారిద్దఱును నొక్క । తెరువువార యండ్రు పరమమునులు. **625**

ప్రతిపదార్థం: ఉర్వీశ!= రాజా!; యోగిచూచుభంగిన్= యోగి చూచునట్లే; సాంఖ్యుండున్+చూచున్= సాంఖ్యపద్ధతిననుసరించువాడు కూడ చూస్తాడు; సాంఖ్యుఁడు+అరయు చొప్పున్= సాంఖ్యుఁడు చూచే విధానమును; యోగివరుడున్= యోగిశ్రేష్ఠుడుకూడ; అరయున్= చూస్తాడు; కానన్= కావున; పరమమునులు= శ్రేష్ఠులైన మౌనులు; వారు+ఇద్దఱును= ఆ ఇద్దరున్నూ; ఒక్కతెరువువార+అండ్రు= ఒక మార్గములోని వారే అని చెప్పుతారు.

తాత్పర్యం: భూపాలా! యోగి చూచే రీతిగానే సాంఖ్యుడు చూస్తాడు. సాంఖ్యుడు చూచునట్లే యోగి చూస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అందువలననే మునివర్యులు వా రిద్దరూ ఒక్కమార్గానికి చెందినవారే అని అంటారు.

విశేషం: **'ఏకం సాంఖ్యం చ యోగం చ । యః పశ్యతి స పశ్యతి!'** (గీత 5-5) అని గీతావచనం. 'సాంఖ్యాన్ని, యోగాన్నీ ఒకటిగానే ఎవడు చూస్తాడో, వాడే నిజంగా చూచేవాడు' అని ఈ వచనానికి అర్థం. దీనివలన సాంఖ్యయోగాలకు పెద్ద భేదం లేదని గ్రహించాలి.

క. వినుఁ! సాంఖ్యమ్మును యోగము । నను పేళుల కాని దీనియం దదియును దా
న నిదియుఁ దోఁచుచునుండుం । గనుఁ దత్త్వవిచారి యొకఁడ కా నీ రెంటిన్. 626

ప్రతిపదార్థం: విను= ఆలకించుము; సాంఖ్యమ్మును= సాంఖ్యమనీ; యోగమున్+అను= యోగమనీ అనే; పేళులు+అ+కాని= పేరులే కాని; దీనిఅందున్= దీనిలో; అదియునున్= అదీ; దానన్= దానిలో; ఇదియున్= ఇదీ; తోఁచుచున్+ఉండున్= కనిపిస్తూ ఉంటాయి; తత్త్వవిచారి= తత్త్వమును విచారించేవాడు; ఈ రెంటిన్= ఈ రెండింటినీ; ఒకఁడకాన్= ఒక్కటిగానే; కనున్= చూస్తాడు.

తాత్పర్యం: రాజా! వినుము. సాంఖ్యమనీ, యోగమనీ పేరులో భేదమే కాని నిజంగా పరిశీలించి చూస్తే సాంఖ్యంలో యోగమూ, యోగంలో సాంఖ్యమూ కనిపిస్తూనే ఉంటాయి. అందువలననే తత్త్వజ్ఞులు సాంఖ్యయోగాలను రెంటినీ ఒక్కటిగానే భావిస్తారు.

క. ఈ తెరువునఁ జరియించుచు । నే తెఱఁగున నైనఁ దప్పెనేనియుఁ బురుషుం
డాతత నాక సుఖము గనుఁ; । దోఁతెంచును మగుడ సద్బుధుల వంశమునన్. 627

ప్రతిపదార్థం: పురుషుండు= జీవుడు; ఈ తెరువునన్= ఈ మార్గంలో; చరియించుచున్= చరిస్తూ; ఏతెఱఁగునన్+ఐనన్= ఏ విధంగానైనా; తప్పెన్+ఏనియున్= మార్గం తప్పితే; ఆతతనాక సుఖమున్= విస్తృతమైన స్వర్గసుఖాన్ని; కనున్= చూస్తాడు; మగుడన్= మరల; సద్బుధుల వంశమునన్= మంచి పండితుల వంశమునందు; తోఁతెంచును= జన్మిస్తాడు.

తాత్పర్యం: జీవుడు ఈ మార్గంలో సంచరిస్తూ ఉంటాడు. ఏ విధంగానైనా అతడు మార్గం తప్పి గమ్యమైన మోక్షం చేరలేకపోతే స్వర్గానికి పోతాడు. అక్కడ సుఖం అనుభవిస్తాడు. మరల మంచి విబుధుల వంశంలో జన్మిస్తాడు.

విశేషం: పైన చెప్పిన యోగాది మార్గాలు మోక్షం చేరటానికి ఉపాయాలు. ఆ మార్గాలలో భద్రంగా పయనించేవాడు గమ్యమైన పరమపదం చేరుకొంటాడు. వాడికి పునర్జన్మ లేదు. అట్లాకాక ఏ కారణంవలననైనా యోగమార్గం నుండి భ్రష్టుడైనవాడు స్వర్గానికి వెళ్ళుతాడు. అక్కడ పుణ్యఫలమైన స్వర్గసుఖాలు అనుభవిస్తాడు. పుణ్యం క్షీణమైన పిమ్మట 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి' (గీత 9-21) అన్నట్లు మళ్ళీ మానవలోకంలో జన్మిస్తాడు. అయితే పూర్వం వీడు యోగభ్రష్టుడు కనుక ఆ ప్రభావంవలన 'శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోऽభిజాయతే' (గీత 6-41) అన్నట్లు శుచిమంతులు, శ్రీమంతులు అయిన మాన్యుల వంశంలో జన్మించి సాంఖ్యయోగం పాటిస్తాడు. యోగసిద్ధి పొందిన పిమ్మట మోక్షం వాడికి సిద్ధిస్తుంది అని భావం.

ఆ. మఱియు నిత్తెఱంగు మనసున నెలసిన । వినుతమోక్షలక్ష్మి విభుత గాంచు
నిట్టి తెరువు సూప నెవ్వరి కలవి నా । రాయణునక కాక యమలచరిత! 628

ప్రతిపదార్థం: అమలచరిత!= విమలచరిత్రుడా!; మఱియున్= ఇంకను; ఈ+తెఱంగు= ఈ పద్ధతి; మనసునన్= చిత్తమునందు; ఎలసినన్= పొందితే; వినుతమోక్షలక్ష్మి విభుతన్= ప్రశస్తమైన మోక్షమనే లక్ష్మియొక్క ప్రభుత్వమును; కాంచున్= పొందుతాడు; నారాయణునకు+అ+కాక= ఒక్క శ్రీమన్నారాయణపరమాత్మకు తప్ప; ఇట్టి తెరువు= ఇట్లాంటి మార్గమును; చూపన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దర్శింపజేయటానికి; ఎవ్వరికిన్+అలవి= ఇతరుల కెవ్వరికి శక్యం?

తాత్పర్యం: పవిత్రచరిత్రుడవైన ఓ ధర్మరాజా! బుధుల వంశంలో పుట్టినవాడు మరల ఆ యోగమార్గాన్ని చిత్తంలో అనుసంధించి నిర్వహించగలిగితే మోక్షలక్ష్మికి ప్రభువు కాగలడు. ఈ మోక్షమార్గాన్ని ఆ యోగులకు ఒక్క శ్రీమన్నారాయణుడు చూపగలడే కాని ఇతరులకు అది సాధ్యమా? (భగవదనుగ్రహం వలననే మోక్షప్రాప్తి కలుగుతుందని భావం).

వ. నారాయణ ప్రణీతంబై యక్షర ప్రదర్శకం బైన యిత్తెఱంగుఁ జిత్తంబున నలవరింపు' మని దేవవ్రతుండు ధర్మనందనునకుం జెప్పెనని యిట్లు వైశంపాయనుండు జనమేజయునకుం జెప్పిన, 'నటమీఁద వర్తించిన విశిష్ట సల్లాపంబులు సెప్పవే' యని యడుగుటయు. 629

ప్రతిపదార్థం: నారాయణప్రణీతంబై= నారాయణుడిచేత ప్రవర్తింపచేయబడినదై; అక్షర ప్రదర్శకంబు+ఐన= క్షరంలేని మోక్షమును చూపించేదగు; ఈ+తెఱంగు= ఈ పద్ధతి; చిత్తంబునన్= మనస్సులో; అలవరింపుము+అని= అభ్యసించుమని; దేవవ్రతుండు= భీష్ముడు; ధర్మనందనునకున్= ధర్మజుడికి; చెప్పెన్+అని= వచించెనని; ఇట్లు= ఈ విధంగా; వైశంపాయనుండు= వ్యాసుడి శిష్యుడైన వైశంపాయనుడు; జనమేజయునకున్= పరీక్షిత్తు పుత్రుడైన జనమేజయ మహారాజునకు; చెప్పినన్= చెప్పగా; అటమీఁదన్= ఆ పైన; వర్తించిన= జరిగిన; విశిష్టసల్లాపంబులు= వినూత్నమైన సంభాషణములు; చెప్పవే= వచించుమా; అని అడుగుటయున్= అని అడుగగా.

తాత్పర్యం: శ్రీమన్నారాయణుడిచేత ప్రవర్తితమై అవ్యయమైన మోక్షాన్ని ప్రదర్శించే ఈ పద్ధతిని నీ చిత్తములో అభ్యసించుము' అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు అని ఈ రీతిగా వ్యాసశిష్యుడయిన వైశంపాయనముని పరీక్షిత్తనయుడైన జనమేజయుడితో చెప్పాడు. ఆ పైన జనమేజయుడు వైశంపాయనుడితో ధర్మజుడికీ, భీష్ముడికీ తరువాత జరిగిన విశిష్టమైన సంభాషణలు వివరించుమని అడిగాడు. అట్లా అడిగేసరికి (తరువాతి ఆశ్వాసంలోని రెండవ పద్యంతో అన్వయం).

ఆశ్వాసాంతము

శా. లీలాస్వీకృతచక్రశూల! వినతాళీరక్షణాలోల! దు
శ్శీల స్వాంతవిదూర! వేదజలదశ్రేణీమయూరా! సమి
త్కేళీఖండిత దైత్య! నిర్జరగణక్షేమక్రియానిత్య! ని
స్త్రైలోక్యత్వ నిరంజనాగ్రవిహృతీ! సంస్థాపకవ్యాహృతీ! 630

ప్రతిపదార్థం: లీలా స్వీకృత చక్రశూల!= విలాసార్థం స్వీకరించబడిన చక్రశూలాలు కలవాడా!; వినతాళీరక్షణాలోల!= ప్రణతులైన భక్తశ్రేణిని రక్షించటంలో ఆసక్తికలవాడా!; దుశ్శీలస్వాంత విదూర!= దుశ్చరిత్రులైనవారి చిత్తములకు దూరమైనవాడా!; వేదజలదశ్రేణీ మయూరా!= వేదాలనెడు మేఘపంక్తికి నెమలివైనవాడా!; సమిత్కేళీఖండితదైత్య= యుద్ధక్రీడలో ఖండించబడిన రాక్షసులు కలవాడా!; నిర్జరగణ క్షేమక్రియానిత్య!= దేవతల బృందానికి క్షేమం కలిగించే కార్యమునందు సదా ప్రవర్తించే వాడా!; నిస్త్రైలోక్యత్వ నిరంజనాగ్ర విహృతీ!= ముల్లోకాల నతిక్రమించి మాయాసంగదోషంలేని వాడవై ఆ లోకాల తుదిని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మాలిని.

> **జపయజన నిషేవ్యా! సంగనిర్ముక్తభావ్యా!**
> **విపుల దురితభేదీ! విశ్వలోకప్రమోదీ !**
> **యపరిమిత విభూతీ! యప్రమాణస్వరీతీ!**
> **యుపనిష దవగమ్యా! యోగభావ్యైకరమ్యా!**

ప్రతిపదార్థం: జపయజననిషేవ్యా!= జపయజ్ఞంచేత సేవించదగినవాడా!; సంగనిర్ముక్తభావ్యా!= సంగంలేని వారిచేత ధ్యానించదగినవాడా!; విపుల దురితభేదీ!= విస్తృతమైన పాపాలను నశింపచేసేవాడా!; విశ్వలోకప్రమోదీ!= సమస్తలోకములను సంతసింపజేసేవాడా!; అపరిమితవిభూతీ!= అనంతమైన ఐశ్వర్యం కలవాడా!; అప్రమాణస్వరీతీ= ప్రమాణంలేని స్వీయపద్ధతికలవాడా!; ఉపనిషదవగమ్యా!= ఉపనిషత్తులచేత తెలియదగిన వాడా!; యోగభావ్యైకరమ్యా!= యోగవిద్యచేత బావించదగిన ముఖ్యమైన రమణీయత్వం కలవాడా!

తాత్పర్యం: జపయజ్ఞంచేత సేవించదగిన ఓ దేవా! సంగంలేని విరాగులచేత ధ్యానించదగినవాడా! అనంతమైన పాపసంచయాన్ని హరించేవాడా! సమస్తలోకాన్నీ ఆనందింపజేసేవాడా! అంతంలేని ఐశ్వర్యం కలవాడా! ప్రమాణాల కందని నిజపద్ధతి కలవాడా! వేదాంత రూపాలైన ఉపనిషత్తులచేత తెలిసికొనదగినవాడా! చిత్తవృత్తి నిరోధరూపమైన యోగవిద్యచేత భావించదగిన ముఖ్యమైన మనోహరత్వం కలవాడా!

విశేషం: 'యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి' (గీత.10-25)అని గీతావచనం. యజ్ఞాలలో భగవంతుడు జపయజ్ఞ స్వరూపుడై ఉన్నాడనటం వలన ద్రవ్యయజ్ఞాలకంటె జపయజ్ఞం శ్రేష్ఠమని భావించాలి. 'నాన్తోస్తి మను దివ్యానాం విభూతీనాం పరంతప!' (గీత.10-40)-'అర్జునా! నా దివ్య విభూతులకు అంతం లేదు' అని శ్రీకృష్ణుడి వచనం. 'అపరిమిత విభూతీ' అన్న ప్రయోగం ఈ సంగతినే తెలియపరుస్తున్నది. ఇది మాలినీ వృత్తం. 'ననమయయ' గణాలు గల మాలిని. 'ననమయయయుతేయం మాలినీ భోగిలోకైః'- అని లక్షణం. 8వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది.

విశేషం: అలం: అంత్యప్రాసం.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బైన శ్రీ మహాభారతంబున శాంతిపర్వంబునందుఁ బంచమాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పినది; శ్రీమదుభయకవిమిత్ర= శ్రీమంతులైన సంస్కృతాంధ్రకవులనే ఇరుతెగలవారికి మిత్రుడును; కొమ్మనామాత్యపుత్త్ర= కొమ్మనమంత్రి కుమారుడును; బుధారాధన విరాజి= పండితులను ఆరాధించటంచేత శోభిల్లేవాడును అగు; తిక్కన సోమయాజి= తిక్కన సోమయాజిచేత; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీ మహాభారతంబునన్= శ్రీ మహాభారతంలో; శాంతిపర్వంబునందున్= శాంతిపర్వంలో; పంచమ+ఆశ్వాసము= ఐదవ ఆశ్వాసం.

తాత్పర్యం: శ్రీ మంతులైన సంస్కృతాంధ్ర కవు లనే ఇరుతెగలవారికి మిత్రుడు, పండితులను ఆరాధించటంచేత విశేషంగా భాసించినవాడు అయిన శ్రీ తిక్కన సోమయాజి రచించిన ఆంధ్రమహాభారతంలోని శాంతిపర్వంలో ఐదవ అశ్వాసం.

శాంతిపర్వంలో పంచమాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - షష్ఠాశ్వాసము

క. **శ్రీ సంధానప్రౌఢ ద । యాసంభృత భక్తమోద! యఖిలజగద్ర**
క్షాసత్తి వినోద! శమా । భ్యాసనిరత నిర్విభేద! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= సంపదలను; సంధాన= సమకూర్చటంలో; ప్రౌఢ= సమర్థమైన; దయా= కరుణచేత; సంభృత= కలిగించబడిన; భక్తమోద= భక్తుల ఆనందం కలవాడా!; (సంపత్కరమైన దయాగుణంతో భక్తులకు ఆనందం కలిగించేవాడా!); అఖిల= సమస్తమైన; జగత్= లోకాలనూ; రక్షా= రక్షించటమనే; ఆసత్తి= ఆసత్తితో-రక్షణభారాన్ని కోరి వహించి నిర్వహించటంతో; వినోద!= ఆనందించేవాడా! (జగద్రక్షణకార్యభారాన్ని ఒక వినోదంగా వహించేవాడా!); శమ+అభ్యాస= అంతరింద్రియ నిగ్రహాన్ని అభ్యసించటంవలన; నిరతనిర్విభేద!= నిరంతరం నిర్విభేద స్థితిని పొందేవాడా! (శమాభ్యాస నిరతమైన నిర్విభేదస్థితి కలవాడా అనికానీ); హరిహరనాథా!= ఓ హరిహరనాథుడా!

తాత్పర్యం: ప్రతి ఆశ్వాసానికీ ఆద్యంతాలలో కృతిపతిని స్తుతించటం తెలుగుకవుల సంప్రదాయం. ఈ కందపద్యంలో తిక్కన హరిహరనాథుడికి మూడు విశిష్టసంబోధనలు కూర్చాడు. ఇహపరాలలో సకల సంపదలనూ భక్తులకు సంధానించటంలో సమర్థుడు హరిహరనాథుడు. అతడి దయాగుణం అంతటి ప్రౌఢం. దానితో భక్తులు ఆనందిస్తున్నారు. జగద్రక్షణ భారాన్ని కోరివహించాడు హరిహరనాథుడు. ఆ రక్షాసత్తితో వినోదిస్తున్నాడు. అతడిది శమాభ్యాస నిరతమైన నిర్విభేదస్థితి. (శమాభ్యాసంతో విభేదాలు నిర్గతమైపోయి సర్వాంతర్యామిత్వం పొందినవాడని). [(శమాభ్యాస నిరతశ్చాసౌ నిర్విభేదశ్చ - తత్పంబుద్ధౌ).]

విశేషం: 'అఖిలజగద్రక్షాసక్త - రక్షాసక్తి - వినోద' అనే పాఠాంతరాలు కనిపిస్తున్నాయి. రక్షణయందు ఆసక్తమైన (సంలగ్నమైన) వినోదం కలవాడా - అనీ, రక్షణయందున్న ఆసక్తితో (అభిలాషతో) వినోదించేవాడా - అనీ ఈ పాఠాంతరాలకు అర్థం. మూడు పాఠాలకూ భావంలో పెద్దగా తేడా లేదు. సంబోధన లన్నింటా అంత్యానుప్రాస పాటించాడు తిక్కన. 'ద' అనేది అంత్యానుప్రాసాక్షరం. ఇది హ్రస్వం కాబట్టి దీని పూర్వాక్షరాన్ని మూడుచోట్లా దీర్ఘమే వేసి నియమం పాటించాడు.

భీష్ముని ధర్మజుండు ప్రశంసించి యక్షర క్షరంబుల నడుగుట. (సం. 12-291-1)

వ. **దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు యోగసాంఖ్యవిదు లక్షరంబునొంది యానందస్వరూపు లగుదురని చెప్పిన విని ధర్మతనయుండు దేవవ్రతునితో 'నీవు పరమజ్ఞాన నిధివని వేదసంవేదు లగు విప్రులు సెప్ప నప్పలుకులు నిన్ను సాంఖ్యయోగ ప్రవీణులయిన యతులును మునిపతులును వర్ణింప నవ్వచనంబులును నాకర్ణించుచుం బ్రమోదంబునం బొందుచుండుదుము. దక్షిణాయనశేషదినంబు లింక నల్పంబు, లర్కుండు మరలంబడినఁ బరమగతిం బ్రాపించెదవు, మఱి మేమెవ్వరిచేత వినువారము? కురువంశంబునకుం బ్రజ్ఞాఘృత ప్రదీపితంబగు దీపంబుగావె? భవత్తేజంబు నాశ్రయించెద' మని తనవారలం**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గలసికొని పలికి, 'నీవు నిర్దేశించిన యక్షరం బనునది యెట్టిది? క్షరం బెయ్యది? యెఱింగింపవే?' యనుటయు నతండు 'వసిష్ఠజనక సంవాదంబనంబరఁగు విశిష్టేతిహాసంబు గలదు. దాన నీయడిగిన యవియును మఱియునెఱుంగ వలయునట్టివి యనేకార్థంబులును దెలివిపడు; విను'మని సుప్రసాదభరితుండై. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ హరిహరనాథా! వైశంపాయనుడు; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= వివరించాడు; అట్లు= ఇంతకుముందు (పంచమాశ్వాసం చివర) చెప్పినట్లుగా; యోగసాంఖ్యవిదులు= ఒక తెరువువారే అయిన యోగవిద్యావేత్తలూ, సాంఖ్యవిద్యావేత్తలూ; అక్షరంబును ఒంది= క్షరం (నాశము) లేని స్థితిని పొంది; ఆనందస్వరూపులు= ఆనందస్వరూపులు; అగుదురు అని= అవుతారని; చెప్పినన్= భీష్ముడు చెప్పేసరికి; విని; ధర్మతనయుండు; దేవవ్రతునితో= భీష్ముడితో (ఇట్లా అంటున్నాడు); నీవు; పరమజ్ఞాననిధివి= పరమజ్ఞానానికి నిధివి; అని; వేదసంవేదులు అగు విప్రులు= వేద వేత్తలయిన విప్రులు (విజ్ఞులు); చెప్పన్= చెబుతూంటే; ఆ+పలుకులున్= ఆ మాటలనూ; సాంఖ్యయోగ ప్రవీణులయిన= సాంఖ్యవిద్యాప్రవీణులూ, యోగవిద్యా ప్రవీణులూ అయిన; యతులును= యతీశ్వరులూ; మునిపతులును= మునీశ్వరులూ; నిన్ను; వర్ణింపన్= వర్ణిస్తూంటే; ఆ+వచనంబులున్= ఆ పలుకులనూ; ఆకర్ణించుచున్= శ్రద్ధగా వింటూ; ప్రమోదంబునన్ పొందుచుందుము= మేమంతా ఆనందం పొందుతూ వుంటాం; దక్షిణ+అయన శేషదినంబులు= ఈ దక్షిణాయనంలో మిగిలిన రోజులు; ఇంకన్= ఇక; అల్పంబులు; చాలా తక్కువ; అర్కుండు= సూర్యుడు; మరలంబడినన్= ఉత్తరాయణంలోకి ప్రవేశిస్తే; పరమగతిన్ ప్రాపించెదవు= నీవు పరమపదిస్తావు - అక్షయపుణ్యలోకాలకు చేరుకుంటావు; మఱి మేము= మరింక మేము; ఎవ్వరిచేతన్= ఎవరినుంచి; వినువారము?= వినగలం?; కురువంశంబునకున్= ఈ కురువంశానికి; ప్రజ్ఞా= తెలివి అనే; ఘృత= నేతితో; ప్రదీపితంబు అగు= వెలిగించబడిన; దీపంబు+కావె?= దీపానికి నీవే కదా?; భవత్= నీ; తేజంబున్= తేజస్సును; ఆశ్రయించెదము= ఆశ్రయిస్తాం; అని= అంటూ; తనవారలన్= తన సోదరాదులను; కలిపికొని= కలుపుకొని; పలికి= మాట్లాడి; నీవు; నిర్దేశించిన= ఇంతకుముందు పేర్కొన్న; అక్షరంబు అనునది= 'అక్షరము' అనేది; ఎట్టిది= ఎటువంటిది?; క్షరంబు= క్షరము (పుట్టి-నాశనమయ్యేది); ఏ+అది= ఏది?; ఎఱింగింపవే?= దయచేసి తెలియచెప్పవా?; అనుటయున్= అని ధర్మరాజు అడిగేసరికి; అతండు= ఆ భీష్ముడు; వసిష్ఠజనకసంవాదంబు అనన్= 'వసిష్ఠజనకసంవాదము' అని; పరఁగు= ప్రసిద్ధిపొందిన; విశిష్ట+ఇతిహాసంబు= ఒక విశిష్టమైన కథ; కలదు= ఉన్నది; దానన్= దానితో; నీ+అడిగిన అవియును= నువ్వు అడిగినవీ; మఱియున్= ఇంకా; ఎఱుంగన్ వలయునట్టివి= తెలుసుకోవలసినవి; అనేకార్థంబులును= అనేక విశేషాలూ; తెలివిపడున్= స్పష్టపడతాయి; వినుము అని; సుప్రసాదభరితుండై= ప్రసాదగుణభరితుడై - సుప్రసన్నుడై - భీష్ముడు ఇట్లా అన్నాడని (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు; 'ఆ విధంగా యోగసాంఖ్య పండితులు అక్షరమైన ఆనందస్వరూపులౌతారని చెప్పగా విని, ధర్మరాజు దేవవ్రతుడితో ఇట్లా అన్నాడు. 'నీవు పరమజ్ఞానివని వేదవిదులు, సాంఖ్యయోగ ప్రవీణులయిన యతీంద్రులు చెప్పగా విని సంతోషిస్తూ ఉంటాము. దక్షిణాయనంలో ఇంకా మిగిలిన రోజులు తక్కువ. సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించగానే నీవు పరమపదిస్తావు. ఆ తరువాత మేము ఎవరివలన వినగలుగుతాము? కురువంశంలో ప్రజ్ఞ అనే నేయితో వెలుగుతున్న దీపంవలె ఉన్నావు. నీ తేజస్సును ఆశ్రయిస్తున్నాము' అని తనవారితో కలిసి పలికి 'నీవు చెప్పిన 'అక్షర'మనేది ఎటువంటిది?' 'క్షర' మేది? తెలుపుము' అన్నాడు. భీష్ముడు 'వసిష్ఠ జనకుల సంవాద' మనే ఉత్తమ ఇతిహాసం ఉన్నది. దానివలన నీ వడిగిన విశేషాలన్నీ తెలుస్తాయి వినుము' అని సుముఖుడై.

విశేషం: 'ప్రజ్ఞాఘృత ప్రదీపితంబగు దీపంబుగావె' అనేచోట 'ప్రజ్ఞాకృత/ ప్రజ్ఞామృత ప్రేరితంబగు దీపంబవుగావె' అని పాఠాంతరాలు కనిపిస్తున్నాయి. ప్రాజ్ఞకృతము అని ఉన్నప్పుడు ప్రదీపితము - ప్రేరితము అనే (క్త) నిష్ఠాంతాలు వ్యర్థమవుతాయి. ప్రజ్ఞను అమృతంగా పోల్చినందువలన అది ఇంధనంగా ప్రదీపితత్వానికి సాధకం కానేరదు. అంచేత 'ప్రజ్ఞాఘృత ప్రదీపితంబగు'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనేదే సాధుపాఠం. 'కురువంశప్రదీపస్త్వం జ్ఞానద్రవ్యేణ దీప్యసే' (శాంతి 291-5) అని వ్యాసుడు దీపన సాధకంగా జ్ఞానద్రవ్యమన్నాడు. ఆ ద్రవ్యాన్ని తిక్కన ఘృతమని స్పష్టపరిచాడు. తరువాతి శ్లోకంలో 'న తృప్యామీహ రాజేంద్ర శృణ్వన్నమృత మీదృశమ్' (291-6) అన్నాడు. ఉపదేశాన్ని అమృతంగా పోల్చి దాని ఆస్వాదనతో ఎంతకీ తనివితీరటం లేదని ధర్మరాజు అభిప్రాయం. అమృతంతో పోల్చినప్పుడు ఇలా ఆస్వాదానుభూతి అన్వయిస్తుందే కానీ ప్రదీపితత్వం కాదు.

'దీపంబవు గావె - దీపంబుగావె' అనే రెండు పాఠాలూ తెలుగువ్యాకరణానికి అనుకూలమే. దీపంబు అనేది ఈ వాక్యంలో యుష్మద్విశేషణం. కాబట్టి వుగాగమం ప్రాయికంగా వస్తుంది. వస్తే 'దీపంబవుగావె' అనీ, రాకపోతే 'దీపంబుగావె' అనీ అవుతుంది. వుగాగమ రహితరూపం 'ప్రాయోగ్రహణంబుచే రక్షితంబయ్యె'.

సీ. **అనఘ! సుఖాసీనుఁడైన వసిష్ఠసం। యమిఁగాంచి భక్తిఁ బాదముల కెఱఁగి**
జనకభూనాథుండు వినయంబుతోడ ను। పాసించి 'మునివర! యక్షరం బ
నాది శివంబన నపునరావృత్తి సి। ద్ధిదమగుచుండు నెయ్యది యెఱుంగఁ
జెప్పవే!' యనుడు నాశ్రిత వత్సలుండగు। నమ్మహాత్ముఁడు దెలియంగఁ జెప్పె

తే. **నద్దయాళుని చెప్పిన యత్తెఱంగు। ప్రస్ఫుటంబుగఁ జెప్పెదఁ బాండవాగ్ర**
జన్మ! నీ కని పలికి యజ్జాహ్నవీత। నూజుఁ డిట్లను నాననాంభోజ మలర. 3

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! ఓ ధర్మరాజా!; సుఖాసీనుఁడైన= సుఖంగా కూర్చున్న; వసిష్ఠసంయమిన్= వసిష్ఠమహర్షిని; కాంచి= చూచి; భక్తిన్= భక్తితో; పాదములకున్= పాదాలకు; ఎఱఁగి= నమస్కరించి; జనకభూనాథుండు= జనకమహారాజు; వినయంబుతోడన్= వినయంతో; ఉపాసించి= అర్చించి; మునివర!= ఓ మునీశ్వరా!; అక్షరంబు= నాశనం లేనిదీ; (క్షరము= పుట్టి నశించేది; అక్షరము= పుట్టుకలేనిది - నశించనిది; అనాది= ఆది లేనిదీ; శివంబు అనన్= శుభప్రదం అనబడేదీ; అపునరావృత్తి సిద్ధిదము= జన్మరాహిత్య సిద్ధిని కలిగించేదీ; అగుచుండున్ ఎయ్యది?= అవుతూ ఉంటుందో - అది ఏది?; ఎఱుంగన్ చెప్పవే?= దయచేసి తెలియజెప్పవా?; అనుడున్= జనకభూనాథుడు ఇట్లా అనేసరికి; ఆశ్రితవత్సలుండగు= ఆశ్రితులమీద వాత్సల్యం కలవాడైన; ఆ+మహాత్ముఁడు= ఆ మహానుభావుడు వసిష్ఠుడు; తెలియంగన్ చెప్పెన్= తెలిసేటట్లు చెప్పాడు; పాండవ+అగ్రజన్మ!= ఓ పాండవులలో పెద్దవాడా!; ఆ+దయాళుని= ఆ దయామయుడు వసిష్ఠుడు; చెప్పిన ఆ+తెఱంగున్= వివరించిన ఆ విధానమంతా; ప్రస్ఫుటంబుగన్= స్పష్టపడేటట్లు; నీకున్ చెప్పెదన్= నీకు నేను చెబుతాను; అని పలికి= అని చెప్పి; ఆ+జాహ్నవీతనూజుఁడు= ఆ గంగాపుత్రుడు భీష్ముడు; ఆనన+అంభోజము+అలరన్= తన ముఖపద్మం వికసించగా; ఇట్లు= ఈ చెప్పబోయే విధంగా; అనున్= పలికాడు.

తాత్పర్యం: ఒకప్పుడు జనకమహారాజు వసిష్ఠుడిని అడిగాడు - అక్షరతత్త్వం తెలియజెప్పుమని. అప్పుడు ఆశ్రిత వత్సలుడూ దయాగుణ విశిష్టుడూ అయిన ఆ మహాత్ముడు పూర్వం వసిష్ఠుడు జనకుడికి వివరించి చెప్పాడు. అది అంతా నీకు నేను స్పష్టంగా చెప్పుతాను' - అని సంతోషంగా భీష్ముడు ధర్మరాజుకు వివరించటం మొదలు పెట్టాడు.

విశేషం: ఇక్కడ జనకభూనాథుడు అంటే సీతాదేవి కన్నతండ్రి కాదు. ఆ వంశంలోవారికి అందరికీ జనకుడు అనేది సాధారణ నామధేయం. అదికాక అసలు పేరు వేరే వుంటుంది. 'వసిష్ఠస్య చ సంవాదం కరాళజనకస్య చ (291-7), పప్రచ్ఛర్షివరం రాజా కరాళజనకః పురా (291-10) అనీ వ్యాసుడు రెండుసార్లు కరాళజనకుడు అన్నాడు. అంటే ఈ జనకమహారాజు అసలు పేరు కరాళుడు అన్నమాట. 'అద్దయాళుని చెప్పిన అత్తెఱంగు' - అనేది తెలుగు వాక్యనిర్మాణంలో ఒక విశిష్టకారకం. దయాళునియొక్క చెప్పిన ఆ విధానం - అంటే దయాళుడు చెప్పిన ఆ విధానం అని ఫలితార్థం. 'నీయడిగినయవి, నా యొనర్పంబూనిన మహా ప్రబంధంబునకు- ఇత్యాదులన్నీ ఇటువంటివే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వసిష్ఠ జనకరాజ సంవాద ప్రకారము (సం. 12-291-7)

వ. జనకజనేశ్వరు బోధించుటకై వసిష్ఠ మునీశ్వరుం డి ట్లనియె. 4

ప్రతిపదార్థం: జనకజనేశ్వరున్= కరాళజనకమహారాజును; బోధించుటకై= జ్ఞానవంతుడిని చెయ్యటానికి; వసిష్ఠమునీశ్వరుండు= ఆ వసిష్ఠమహర్షి; ఇట్లు అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: కరాళజనక మహారాజుకు జ్ఞానం బోధించేందుకు వసిష్ఠమహర్షి ఇట్లా చెప్పాడు.

క. 'నయనముఖ పాణిపాదము । లయమహితా! యెందుఁ గలిగి యాద్యంతపరి
క్షయవృద్ధి రహితమై ని । ర్ద్వయ మగు తత్త్వంబు నక్షరంబండ్రు బుధుల్. 5

ప్రతిపదార్థం: అయమహితా!= ఓ శుభాన్వితా! ధర్మరాజా!; నయన= నేత్రాలు; ముఖ= ముఖం; పాణిపాదములు= చేతులూ, కాళ్ళూ; ఎందున్ కలిగి= సర్వాత్మనా కలిగి ఉండీ; ఆది+అంత+పరిక్షయ+వృద్ధి+రహితమై= ఆది, అంతం, వినాశం, వృద్ధి - అనేవి లేనివై; నిస్+ద్వయము+అగు+తత్త్వమున్= అద్వితీయమైన తత్త్వాన్ని; బుధుల్= పండితులు; అక్షరంబు+అండ్రు= అక్షరము అంటారు.

తాత్పర్యం: 'ఓ మంగళగుణాన్వితా! ధర్మరాజా! కరచరణాది అవయవాలు కలిగి ఉండీ, ఆది, అంతం, క్షయం, వృద్ధి - ఇవి లేనివైన ఏకైక తత్త్వాన్ని 'అక్షరము' అంటారు పండితులు.

విశేషం: నిర్విభేదం, నిర్ద్వయం, అద్వితీయం - ఇవన్నీ సమానార్థకాలు. ఏకైకం అని తాత్పర్యం. ద్వయములేనిది నిర్ద్వయం. ద్వితీయం లేనిది అద్వితీయం. విభేదం లేనిది నిర్విభేదం. సర్వతః పాణిపాదం తత్ సర్వతోక్షి శిరోముఖమ్, సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి (291-16) అనేది మూలశ్లోకం. ఇందులో సర్వతః అనే పదానికి పర్యాయంగా 'ఎందున్ కలిగి' అన్నాడు తిక్కన. సర్వత్రగామి, సర్వదర్శి, సర్వగతి, సర్వశిరస్సు, సర్వానందం, సర్వశ్రోత అయిన ఆ పరబ్రహ్మమే అంతటా ఆవరించి ఉంటుంది - అదే అక్షరమని తాత్పర్యం వివరించారు పెద్దలు.

క. క్షరమండ్రు దానివలనను । క్షరియించిన తత్త్వములను జనవత్సల! య
య్యిరువది నాల్గింటిని దర । తరమ విభాగించి చెప్పెదం దెలియంగన్. 6

ప్రతిపదార్థం: జనవత్సల!= జనులపట్ల వాత్సల్యం కలవాడా! (జనుల వాత్సల్యం చూరగొన్నవాడా అని కానీ); ఓ ధర్మరాజా! దానివలనను= 'అక్షరము' అనబడే ఆ తత్త్వంనుంచి; క్షరియించిన= ఆవిర్భవించిన; తత్త్వములను= తత్త్వాలను; క్షరము అండ్రు= 'క్షరము' అంటారు; ఆ+ఇరువది నాల్గింటిని= క్షరతత్త్వాలు ఇరవై నాల్గింటినీ; తరతరమ= క్రమంగా; విభాగించి= విభజించి; తెలియంగన్= నీకు తెలిసేటట్లు; చెప్పెదన్= చెబుతాను.

తాత్పర్యం: జనవత్సలా! ఓ ధర్మరాజా! అక్షరతత్త్వంనుంచి ఇరవై నాలుగు క్షరతత్త్వాలు ఆవిర్భవించాయి. నీకు స్పష్టంగా తెలియటంకొరకు వాటిని విడమరచి చెప్పుతాను ఆలకించుము.

తే. అక్షరము విక్రియాశబలాత్మకత్వ । మొందు నవ్విక్రియకును బేళ్ళొలసెఁ బ్రకృతి
యనఁ బ్రధానంబునాఁగ నవ్యక్త మనఁగ । దానఁబుట్టు మహన్నామతత్త్వ మనఘ! 7

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పవిత్రుడా!; అక్షరంబు= అక్షరము అని చెప్పబడిన తత్త్వం; విక్రియా= విక్రియతో; శబలాత్మకత్వము+ఒందున్= వైవిధ్యాన్ని పొందుతుంది; ఆ+విక్రియకును= ఆ వికృతికికూడా; ప్రకృతి+అనన్= ప్రకృతి అనీ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రధానంబునాఁగన్= ప్రధానము అనీ; అవ్యక్తము+అనఁగన్= అవ్యక్తము అనీ; పేళ్లు+ఒలసెన్= పేరులు ఏర్పడ్డాయి; దానన్= ఆ విక్రియనుండి; మహత్+నామతత్త్వము= మహత్(మహాన్) అని పిలవబడే తత్త్వం; పుట్టున్= పుడుతుంది. (12-291-17).

తాత్పర్యం: అక్షరతత్త్వం విక్రియను పొందుతుంది. దానికి ప్రకృతి, ప్రధానం, అవ్యక్తం అని పేరులు. ఆ విక్రియనుండి 'మహత్' అనబడే తత్త్వం ఆవిర్భవిస్తుంది.

తే. వినుమహంకార మా తత్త్వమున జనించు । దాన భూతపంచకమును దద్గుణంబు
లైన శబ్దాది విషయంబులైదు నింద్రి । యములుఁ బదియును మనసును నావహిల్లు. 8

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! వినుము; ఆ తత్త్వమునన్= ఆ మహన్నామతత్త్వంనుంచి; అహంకారము= అహంకారమనేది; జనించున్= ఉద్భవిస్తుంది; దానన్= దానినుంచి; భూతపంచకమును= పంచభూతాలూ; తద్గుణంబులైన శబ్దాదివిషయంబులు ఐదున్= పంచభూతాలకూ గుణాలైన శబ్దస్పర్శ రూపరసగంధాదులు అయిదూ; ఇంద్రియముల్ పదియును= జ్ఞానేంద్రియాలు అయిదూ - కర్మేంద్రియాలు అయిదూ వెరసి పది ఇంద్రియాలూ; మనసును= మనస్సునందు; ఆవహిల్లున్= ఏర్పడతాయి.

తాత్పర్యం: ధర్మరాజా! వినుము; ప్రకృతి లేదా ప్రధానం లేదా అవ్యక్తం అనబడే తత్త్వం ఒకటి. దానినుంచి ఆవిర్భవించే మహత్తు - రెండు. అహంకారం - మూడు. పంచభూతాలు, పంచగుణాలు- అయిదు. జ్ఞానేంద్రియాలు-ఐదు కర్మేంద్రియాలు. మనస్సు - ఒకటి. కలిపి మొత్తం ఇరవైనాలుగు తత్త్వాలు ఉన్నాయి. పృథివ్యప్తేజోవాయ్వాకాశాలు (నేల, నీరు, వెలుగు, గాలి, ఆకాశం) పంచభూతాలు. శబ్ద స్పర్శ రూప రస గంధాలు - అయిదు గుణాలు. శ్రోత్రత్వక్చక్షుర్జిహ్వాఘ్రాణాలు (చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు) అయిదూజ్ఞానేంద్రియాలు. వాక్పాణి పాదపాయు మేఢ్రాలు అయిదూ కర్మేంద్రియాలు మనస్సునందు ఏర్పడతాయి.

(12-291-28).

క. క్షరమయ్యిరువది నాలుగు । నరనాథా! యక్షరంబునకు నెయ్యెడలన్
క్షరభావము లే దయ్య । క్ష రము విలాసములు సూవె క్షరతత్త్వమ్ముల్. 9

ప్రతిపదార్థం: నరనాథా!= ఓ రాజా!; క్షరము= క్షరమే; ఆ+ఇరువది నాలుగున్= ఆ ఇరవైనాలుగు తత్త్వాలును; అక్షరంబునకున్= అక్షరము అనబడే తత్త్వానికి; ఏ+ఎడలన్= ఎప్పుడూ; క్షరభావము= క్షరత్వం; లేదు= లేనేలేదు; క్షరతత్త్వమ్ముల్= క్షరతత్త్వాలు అన్నీ; ఆ+అక్షరము విలాసములు చూవె= ఆ అక్షరతత్త్వం తాలూకు విలాసాలే సుమా!

తాత్పర్యం: క్షరమే ఇరవైనాలుగు తత్త్వాలుగా అవుతుంది. అక్షరతత్త్వానికి ఎక్కడా ఎప్పుడూ క్షరభావం ఉండదు. అయితే క్షరతత్త్వాలు అన్నీ అక్షరతత్త్వం తాలూకు విలాసాలే.

వ. ఈ చతుర్వింశతి తత్త్వంబులును విజ్ఞానగోచరంబులు, పంచవింశతితమంబై యక్షరంబనం బరఁగు నిప్పరమతత్త్వంబు విను మవిజ్ఞేయం బవ్యయం బకలంకం బనామయం బమృతంబు. 10

ప్రతిపదార్థం: ఈ చతుర్వింశతి తత్త్వంబులును= ఈ చెప్పిన ఇరవై నాలుగు తత్త్వాలూ; విజ్ఞానగోచరంబులు= విజ్ఞానానికిఅందుతాయి; పంచవింశతితమంబై= ఇరవై అయిదవదై; అక్షరంబు+అనన్= అక్షరము అని; పరఁగు= ఒప్పుతున్న; ఈ+పరమతత్త్వంబు= ఈ పరమతత్త్వం; వినుము; అవిజ్ఞేయంబు= అది విజ్ఞానగోచరం కానిది; అవ్యయంబు= అది వ్యయం కానిది; అకలంకంబు= కళంకంలేనిది; అనామయంబు= ఆమయంలేనిది (నాశమూ, రోగమూ లేనిది); అమృతంబు= మృతిలేనిది; మృతంకానిది.

తాత్పర్యం: శ్రద్ధగా ఆలకించుము. ఈ ఇరవై నాలుగు తత్త్వాలూ విజ్ఞానానికి అందుతాయి. ఇరవై అయిదవ అక్షరమైన పరమతత్త్వం విజ్ఞానానికి గోచరం కానిది. నాశం లేనిది. మృతి లేనిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'అమృతంబు' అనటానికి బదులు 'అనాద్యంతంబు' అనే పాఠాంతరం కనిపిస్తున్నది కొన్ని ప్రతులలో. ఆదీ అంతమూ లేనిది అని దాని భావం.

క. జననాథ! యక్షరం బెం । దును గ్రీడఁ జరించుఁ ద్రిగుణ దోహలపరమై
తనకుఁ బ్రబోధము లేకు । న్నను నానాయోనిగత జననముల వెంటన్. 11

ప్రతిపదార్థం: జననాథ= ధర్మరాజా!; అక్షరంబు= అక్షరతత్త్వమనేది; తనకున్= తనకు; ప్రబోధము= జ్ఞానము - మెలకువ అనేది; లేకున్నను= లేకపోయినట్టయితే; త్రిగుణదోహలపరమై= సత్త్వము, రజస్సు, తమస్సు అనే మూడుగుణాలతో బలపడినదై; (బలపరచునదై) నానాయోనిగత జననములవెంటన్= పలురకాల జీవజాతులలో జననాలను వరుసగా పొందుతూ; ఎందును= సర్వత్ర; క్రీడన్= కేళీవిలాసంగా; చరించున్= సంచరిస్తుంది.

తాత్పర్యం: అక్షరతత్త్వానికి ప్రబోధం లేకపోతే సత్త్వరజస్తమోగుణాల సంయోజనకారణంగా నానాజాతులలో జన్మపరంపరలను పొందుతూ ఉంటుంది. ఇది అక్షరతత్త్వానికి ఒక క్రీడావిలాసం (12-291-42).

క. విను సత్త్వరజస్తమముల । యనుసరణమువలన వివిధమగు యోనిగణం
బున వెలసిన యా తత్త్వము । దనుఁ జూడఁగలేక యవియ తానని యుండున్. 12

ప్రతిపదార్థం: విను= ధర్మరాజా! శ్రద్ధగా ఆలకించుము; సత్త్వరజస్తమముల= ఆ త్రిగుణాల; అనుసరణమువలనన్= వెంట తగులుకోవటం వలన; వివిధము+అగు= పలు రకాలైన; యోనిగణంబునన్= జాతులలోనికి; వెలసిన= అవతరించిన; ఆ తత్త్వము= ఆ అక్షరతత్త్వం; తనున్ చూడఁగ లేక= తనను తాను అవలోకించుకోలేక (గ్రహించుకోలేక); అవియ= ఆ జాతులే; తాను= నేను; అని= అనుకొని; ఉండున్= నివసిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: సత్త్వరజస్తమోగుణాలను అనుసరించటం వలన జన్మపరంపరలలోనికి జారిపోయిన ఆ అక్షరతత్త్వం తనను తాను తెలిసికొనలేక, అవే తాను అనుకొని వాటిలో నివాసం సాగిస్తూ ఉంటుంది.

ఉ. సత్త్వరజస్తమోగుణవశస్థితి నక్షర మర్థధర్మ సం
గిత్వము మధ్యకర్మతయుఁ గిల్బిషకృత్యమునొంది యొంది ది
వ్యత్వనరత్వగోమృగఖగాదిక తిర్యగనేక హీనజం
తుత్వములన్ సుఖంబులును దుఃఖములున్ నరకంబులుం గనున్. 13

ప్రతిపదార్థం: అక్షరము= అక్షర తత్త్వమనేది; సత్త్వరజస్తమో గుణవశస్థితిన్= సత్త్వగుణము - రజోగుణము - తమోగుణము అనే ఈ మూడింటికీ వశవర్తి అగుట వలన; వరుసగా - అర్థధర్మసంగిత్వమున్= అర్థమైన ధర్మాలతో కూడి ఉండటం అనే స్థితినీ (ఇది సత్త్వగుణ లక్షణం); మధ్యకర్మతయున్= పుణ్యపాపాలు రెండింటినీ ఆచరించటమనే స్థితినీ (ఇది రజోగుణ లక్షణం); కిల్బిషకృత్యమున్= కేవలం పాపకార్యాలే చెయ్యటం అనే స్థితినీ (ఇది తమోగుణ లక్షణం); ఒంది+ఒంది= పూర్తిగా పొంది; దివ్యత్వ= దేవతాత్వంలో; నరత్వ= మానవత్వంలో; గోమృగఖగాదిక తిర్యక్+అనేక హీన జంతుత్వములన్= గోవు, మృగము, పక్షి మొదలైన తిర్యగ్జాతికి చెందిన అనేక నీచ జంతుత్వాలలో; సుఖంబులును= సుఖాలనూ; దుఃఖములున్= దుఃఖాలనూ; నరకంబులున్= నరకాలనూ; కనున్= అనుభవిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: సత్త్వగుణానికి వశవర్తి అయిన అక్షరతత్త్వం అర్థధర్మాలను పొందీ ఆచరించీ దివ్యత్వంతో సుఖాలను అనుభవిస్తుంది. రజోగుణానికి వశవర్తి అయి పుణ్యపాపాలను చెరిసగంగా ఆచరించి నరత్వం పొంది సుఖదుఃఖాలను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెరిసగంగా అనుభవిస్తుంది. తమోగుణానికి వశవర్తి అయి కేవలం పాపకృత్యాలనే ఆచరించి పశుపక్ష్యాది జంతుత్వాన్ని పొంది నరకం అనుభవిస్తుంది.

విశేషం: ఈ పద్యమంతటా క్రమాలంకారమూ ఉంది. అలంకారం: క్రియాలంకారం,

క. జనవర! శుక్లము లోహిత। మును గృష్ణమునైన వర్ణముల నక్షర మొం
దును సత్త్వరజస్తమముల। యనుసారంబున నవర్ణమయ్యు వికృతమై. 14

ప్రతిపదార్థం: జనవర!= ఓ యుధిష్ఠిరా!; అక్షరము= అక్షరతత్త్వం; అవర్ణమయ్యున్= ఏ రంగూలేనిదే అయినప్పటికీ; సత్త్వరజస్తమముల+అనుసారంబునన్= సత్త్వరజస్తమోగుణాలను అనుసరించటం వలన; వికృతమై= మార్పునకు లోనై; శుక్లము= తెలుపూ; లోహితము= ఎరుపూ; కృష్ణమును+ఐన= నలుపూ అయిన; వర్ణములన్= రంగులను; ఒందును= పొందుతుంది.

తాత్పర్యం: అక్షరానికి స్వతస్సిద్ధంగా ఏ రంగూ లేదు. కానీ, అది ఈ త్రిగుణాలను అనుసరించటం వలన మార్పులకు లోనవుతుంది. సత్త్వగుణానుసారంగా తెలుపురంగునూ, రజోగుణానుసారంగా ఎరుపురంగునూ, తమోగుణానుసారంగా నలుపురంగునూ పొందుతుంది.

క. అగుణంబయ్యును నిమ్మెయిఁ। బ్రగుణతఁ బ్రాపించు నక్షర మహంకార
స్థగుణంబూఁదిన, విడిచినఁ। దెగు నన్నియు నిర్వికారదీప్తంబునగున్.' 15

ప్రతిపదార్థం: అక్షరము= అక్షరతత్త్వం; అగుణంబు+అయ్యున్= తనంతతాను నిర్గుణమే అయినా; అహంకారస్థగుణంబు= అహంకారగతమైన గుణాన్ని (అహంకారలక్షణాన్ని); ఊఁదినన్= పొందినట్లయితే; ఈ+మెయిన్= ఈ ప్రకారంగా; ప్రగుణతన్= ప్రకృష్టగుణవత్తను; ప్రాపించున్= పొందుతుంది; విడిచినన్= అహంకారస్థగుణాన్ని విడిచినట్టయితే; అన్నియున్= ఈ గుణాలన్నీ; తెగున్= తొలగిపోతాయి; నిర్వికార= నిర్వికారస్థితితో; దీప్తంబున్= ప్రకాశించేదికూడా; అగున్= అవుతుంది.

తాత్పర్యం: నిర్గుణమైన అక్షరతత్త్వం అహంకారగుణ సంయోగంవలన ఈ రకంగా ఇన్ని వికారాలను పొందుతున్నది. అహంకారగుణ సంయోగాన్ని విడిచిపెట్టేస్తే ఈ వికారాలు అన్నీ తొలగిపోతాయి. నిర్వికారస్థితితో మళ్ళీ ప్రదీప్తంకూడా అవుతుంది.'

వ. అని చెప్పి వెండియు. 16

ప్రతిపదార్థం: అని చెప్పి= వసిష్ఠుడు ఇట్లా వివరించి; వెండియున్= మరల.

తాత్పర్యం: అని చెప్పి, వసిష్ఠుడు మళ్ళీ (ఇట్లా వివరిస్తున్నాడు.)

చ. 'క్రతువులఁ దీర్థయాత్రలను రాత్ర్యశనంబుల భూమిశయ్యలన్
వ్రతపరినిష్ఠలన్ జడలు వల్కలముల్ వివిధంపు దండముల్
సతతముఁ దాల్చుటన్ వపువు సంకటపాటునఁ బెట్టు నాద్యమ
చ్యుత మమలంబు దాను దనుఁ జూడక యక్షరమప్రబుద్ధమై. 17

ప్రతిపదార్థం: ఆద్యము= తొట్టతొలిదీ; అచ్యుతము= చ్యుతి లేనిదీ; అమలంబు= మలినరహితమూ అయిన; అక్షరము= అక్షరతత్త్వం; తాను తనున్ చూడక= తనను తాను తెలుసుకోలేక; అప్రబుద్ధమై= జ్ఞానప్రబోధం లేనిదై; వపువున్= శరీరాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(ఉపాధిని); సంకటపాటునన్ పెట్టున్= కష్టపెడుతూ వుంటుంది; ఏ రకంగా అంటే - క్రతువులన్= యజ్ఞయాగాది క్రియలతోనూ; తీర్థయాత్రలను= పుణ్యక్షేత్రాలకు ప్రయాణం సాగించటాలతోనూ; రాత్రి+అశనంబులన్= రాత్రిపూట మాత్రమే భోజనం చెయ్యటాలతోనూ (ఏకభుక్తాలతోనూ); భూమిశయ్యలన్= కటికనేలమీద పవ్వళించటాలతోనూ; వ్రతపరినిష్ఠలన్= రకరకాల వ్రతాల నియమనిష్ఠలతోనూ; జడలు= జడలూ; వల్కలముల్= నారచీరలూ; వివిధంపు దండముల్= రకరకాల దండాలూ (సన్న్యాసాశ్రమానికి సూచకంగా ఉండే దండములు - కర్రలు, ఏకదండి, ద్విదండి, త్రిదండి ఇత్యాదిగా ఆశ్రమభేదాలు ఉన్నాయి); సత్వరమున్= ఎల్లవేళలా; తాల్చుటన్= ధరించటంతోనూ; వపువును సంకటపాటున పెడుతుంది.

తాత్పర్యం: తనను తాను తెలిసికొనలేక ఈ అక్షరతత్త్వం. 'క్రతువులు చేయటం, తీర్థయాత్రలకు తిరగటం, ఏకభుక్తాలు ఉండటం, నేలమీద పడుకొనటం - ఇంకా రకరకాల కఠోరవ్రత నియమాలు పాటించటం, జటావల్కల దండాలు ధరించటం - ఇత్యాది కార్యక్రమాలతో శరీరాన్ని సంకటపెట్టుతూ ఉంటుంది - ఇది అచ్యుతమే. అమలమే. కానీ, ఇప్పుడు అప్రబుద్ధం.

క. **అమృతము నభవము నజరము। నమలమునగు తన్ను మృతము నాహితభవమున్**
సమధికజరమును మలసహి। తముగా నక్షరము మమతఁ దలఁచు నరేంద్రా! 18

ప్రతిపదార్థం: నరేంద్రా!= ధర్మరాజా!; అమృతము= చావులేనిది; అభవము= పుట్టుకలేనిది; అజరము= ముసలితనము లేనిది; అమలమున్= మలినము లేనిది; అగు= అయినటువంటి; అక్షరము= అక్షరతత్త్వం; తన్నున్= తననుతాను; మృతము= చావు కలదిగానూ; ఆహితభవమున్= పుట్టుక కలదిగానూ; సమధికజరమును= బాగా ముసలితనము (జరా) పొందేదిగానూ; మలసహితముగాన్= మలినసహితముగానూ; మమతన్= మమకారంతో; తలఁచున్= భావిస్తుంది.

తాత్పర్యం: అక్షరతత్త్వానికి చావూ పుట్టుకా ముసలితనం - ఇట్లాంటివి ఏమీలేవు. అది అమలం. కాని, ఉపాధిగతమైన మమకారంతో ఇవన్నీ తనకు ఉన్నాయని భావిస్తూ ఉంటుంది.

ఆ. **తనకుఁదాన బంధమొనరించుకొనియెడు। పొత్తినూలికాయ పురువు భంగి**
నగుణమయ్యు సగుణతావాప్తిఁ బొందు న। క్షరము ప్రకృతి గుణము సంక్రమించి. 19

ప్రతిపదార్థం: తనకున్ తాన= తనకుతానే; బంధము= బంధాన్ని; ఒనరించుకొనియెడు= కల్పించుకునేటువంటి; పొత్తినూలికాయ పురువుభంగిన్= సాలెపురుగువలె (సాలీడువలె); అక్షరము= అక్షరతత్త్వమనేది; అగుణమయ్యున్= స్వతస్సిద్ధంగా నిర్గుణమే అయినా; ప్రకృతి గుణము= ప్రధానము - ప్రకృతి - అవ్యక్తము అనబడే విక్రియ తాలూకు గుణం; సంక్రమించి= సంక్రమించటంచేత (అది కారణంగా); సగుణత+అవాప్తిన్= సగుణత్వప్రాప్తిని; పొందున్= పొందుతుంది.

తాత్పర్యం: స్వతస్సిద్ధంగా నిర్గుణమైన అక్షరతత్త్వం తన విక్రియ అయిన ప్రకృతిగుణాలు తనకే సంక్రమించటం చేత తానుకూడా సగుణత్వాన్ని పొందుతున్నది. ఇది ఎట్లా ఉన్నదంటే సాలెపురుగువలె ఉన్నది. సాలెపురుగు తన పొత్తికడుపులోనుండి వచ్చిన నూలుదారాలతో తనకు తానే గూడు అల్లుకొని అందులో తానే బందీ అయిపోతుంది. (గుణము అంటే త్రాడు అనికూడా అర్థం ఉన్నది).

విశేషం: ఈ దృష్టాంతం వ్యాసుడు ఇచ్చినదే. "కోశకారో యథాత్మానం కీటః సమనురుంధతి! సూత్రతంతుగుణైర్నిత్యం తథాయ మగుణో గుణైః॥" (12-292-4). భావప్రకటన సమర్థంగా సాలీడుని 'పొత్తినూలికాయ పురువు' అన్నాడు తిక్కన.

ఆ. **అమలవాయుసేవనము నిర్మలత్వంబు। గలుగఁగాఁ బదాఱు కళలఁ బూర్ణుఁ**
డగు సుధాంశు మాడ్కి నక్షర మమలినా। ఖండశాంతిబోధఘనత వెలుఁగు.' 20

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అక్షరము= ఈ అక్షరతత్త్వం; అమల= స్వచ్ఛమైన; వాయు= వాయువుయొక్క; సేవనము= అనుభవం; నిర్మలత్వంబు= నిర్మలస్థితి; కలుగఁగాన్= (రెండూ) లభించినప్పుడు; పదాఱుకళలన్= పదహారు కళలతోనూ; పూర్ణుఁడు+అగు= పరిపూర్ణత్వాన్ని పొందిన; సుధాంశు మాడ్కిన్= అమృతకిరణుడైన చంద్రుడివలె; అమలిన= మలినరహితమూ; అఖండ= పరిపూర్ణమూ అయిన; శాంతి= శాంతియొక్క; బోధ= ఎరుకతో; కలిగిన ఘనతన్= గొప్పదనంతో; వెలుఁగున్= ప్రకాశిస్తుంది.

తాత్పర్యం: వాయుసేవనం వలన (మబ్బులు తొలగిపోయి) నిర్మలస్థితి పొంది పదారుకళలతో పరిపూర్ణుడైన చంద్రుడు ప్రకాశిస్తాడు. అట్లాగే అక్షరతత్త్వం కూడా అఖండశాంతి బోధతో మునుపటి గొప్పదనాన్ని మళ్ళీ పొంది విరాజిల్లుతుంది'.

వ. అనిన విని జనకుం డమ్మునీశ్వరున కిట్లనియె. 21

ప్రతిపదార్థం: అనినన్= అని చెబుతూంటే; విని; జనకుండు; ఆ+మునీశ్వరునకున్= ఆ వసిష్ఠుడితో; ఇట్లు; అనియెన్= సంభాషించాడు.

తాత్పర్యం: అని చెప్పుతూంటే విని, జనకమహారాజు ఆ వసిష్ఠుడితో ఈ ప్రకారంగా అన్నాడు.

క. 'వనితకుఁ బురుషునకుం దన । తనయంతన రూపొకం డొదవఁ జేయఁగ వి
న్ననువు గలుగ దొండొరువుల । నెనయుటఁగాని శ్రుతిమతము నిట్ల మహాత్మా! 22

ప్రతిపదార్థం: మహాత్మా!; గొప్ప ఆత్మకలవాడా! వనితకున్= స్త్రీకీ; పురుషునకున్= పురుషుడికీ; ఒండొరులన్= ఒకరిని ఒకరు; ఎనయుటన్కాని= కలుసుకోవటం వల్లనే తప్ప; తనయంతన= విడివిడిగా; రూపు ఒకండు= ఒక రూపాన్ని; ఒదవన్ చేయఁగన్= ప్రసవించటమనేది; విన్ననువు= నేర్పు; కలుగదు= కనిపించలేదు; శ్రుతిమతమున్= వేదం అభిప్రాయంకూడా; ఇట్లు+అ= ఇలాగే ఉన్నది.

తాత్పర్యం: 'మహాత్మా! స్త్రీపురుషులు పరస్పరం కలిసికొంటే మరొక రూపాన్ని ఉత్పత్తి చేయగలుగుతున్నారే తప్ప, విడివిడిగా ఆ ఇద్దరిలో ఎవ్వరికీ ఆ నేర్పు లేదు అనేది లోకం చూస్తే తెలుస్తున్నది. వేదమూ ఇదే చెప్పుతున్నది.

క. వనితగుణంబులు చర్మం । బును మాంసము శోణితంబుఁ బురుషగుణతతిన్
విను మజ్జాస్థిస్నాయువు । లనఘతపోవిభవ! యిట్లయని శ్రుతి సెప్పన్. 23

ప్రతిపదార్థం: అనఘ= పవిత్రమైన; తపోవిభవ!= తపోవైభవం కలవాడా!; చర్మంబును= చర్మం; మాంసమున్= మాంసం; శోణితంబున్= రక్తం - ఇవి; వనితగుణంబులు= స్త్రీవల్ల శిశువుకు లభించే గుణాలు; పురుష= పురుషునియొక్క; గుణతతిన్= గుణసమూహం వలన; విను; మజ్జా= మూలగ; అస్థి= ఎముకలు; స్నాయువులు= ఆయువు పట్టులు (నెరకులు) అనేవి ఇవి పురుషుడివలన బిడ్డకు లభిస్తాయని; ఇట్ల+అని= ఇలాగనే; శ్రుతి= వేదం; చెప్పున్= చెప్పుతోంది.

తాత్పర్యం: ఓ తపస్వీ! చర్మం, మాంసం, రక్తం - అనేవి స్త్రీనుండీ, మజ్జ, ఎముకలు, స్నాయువులు - అనేవి పురుషుడినుండి బిడ్డకు లభిస్తాయి. వేదం ఇట్లాగే చెప్పుతున్నది.

వ. అది తిర్యఙ్మనుష్యాదులైన సకల యోనులయందును జన్యంబులు ఆవహిల్లెడి తెఱంగు. 24

ప్రతిపదార్థం: అది= ఈ పైని చెప్పినది; తిర్యక్+మనుష్య+ఆదులైన= పశుపక్షిమానవాదులైన; సకలయోనులయందును= సకలజాతులలోనూ; జన్యంబులు(జన్మంబులు)= పుట్టుకలు; ఆవహిల్లెడి తెఱంగు= జరిగే పద్ధతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పైన చెప్పినది పశుపక్షిమానవాదులైన సకలజాతులలోనూ పుట్టుకలు జరిగే పద్ధతి.

క. నరనారీసంబంధము । వరుసగదా పురుషునకును బ్రకృతికి నన్యో
న్యరమణ మది సర్వజనన । కర మిట్టులు శ్రుతులు సెప్పఁ గారుణ్యనిధీ! 25

ప్రతిపదార్థం: కారుణ్యనిధీ!= ఓ కృపానిధీ!; పురుషునకును= పురుషుడికీ; ప్రకృతికిని= ప్రకృతికీ ఉండే; అన్యోన్యరమణము= పరస్పర ఆనందం, ఆకర్షణ అనేది; నరనారీసంబంధము వరుస కదా!= నరనారీ సంబంధం వంటిదే గదా!; అది= ఆ సంబంధం, ఆ ఆకర్షణ; సర్వజననకరము= సకలజీవరాశికీ జన్మకారణం; ఇట్టులు= ఇట్లాగని; శ్రుతులు= వేదాలు; చెప్పన్= చెబుతున్నాయి.

తాత్పర్యం: పురుషుడికీ ప్రకృతికీ ఉన్న ఆకర్షణ నరనారీసంబంధం వరసే. స్త్రీ పురుష సంబంధంవంటిదే ప్రకృతి పురుషుల పరస్పరాకర్షణ. అదే సమస్త ప్రాణికోటికీ జన్మహేతువు. వేదాలు ఇదే చెప్తున్నాయి.

క. వినుము ప్రకృతి పురుషుల భం । గి నిరూపింపంగ ముక్తికిని మార్గంబుం
గను వెరవు లేకయున్నది । మునినాయక! యెఱుఁగఁ జెప్పు మోక్షపదంబున్. 26

ప్రతిపదార్థం: మునినాయక!= ఓ మునీశ్వరా!; వినుము; ప్రకృతిపురుషుల భంగిన్= ప్రకృతి పురుషుల పద్ధతిని; నిరూపింపంగన్= నిరూపించినా (లేదా నిరూపించటానికీ); ముక్తికిని= మోక్షానికి; మార్గంబున్= మార్గాన్ని; కను= తెలిసికొనే; వెరవు= ఉపాయం; లేకఉన్నది= కనిపించటంలేదు (అందుచేత); మోక్షపదంబున్= ముక్తిమార్గాన్ని; ఎఱుఁగన్ చెప్పు= నాకు తెలిసేట్టు చెప్పుము.

తాత్పర్యం: ప్రకృతిపురుషుల పద్ధతిని స్పష్టంగా నిరూపించవచ్చును. అయినా ముక్తిమార్గం మాత్రం తెలియరావటం లేదు. కాబట్టి ఓ మునీశ్వరా! మోక్షమార్గం ఏమిటో స్పష్టంగా తెలియజేయుము.

క. అనుపమ మజర మతీంద్రియ । మనామయ మనంత మమల మన వెలుఁగు నొకం
డని వేదశాస్త్రములచే । వినియుండుదు దానిఁ దెలుపవే కృప నాకున్.' 27

ప్రతిపదార్థం: (ఓ మునినాయకా!) అనుపమము= సాటిలేనిదీ; అజరము= ముసలితనంలేనిదీ; అతీంద్రియము= ఇంద్రియాలకు అతీతమైనదీ; అనామయము= ఆమయాలు (నాశమూ రోగమూ) లేనిదీ; అనంతము= అంతులేనిదీ; అమలము= మాలిన్యం లేనిదీ; అనన్= ప్రసిద్ధిపొందిన; ఒకండు= ఒకానొకతత్త్వం; వెలుఁగున్= ప్రకాశిస్తోంది; అని; వేదశాస్త్రములచేన్= వేదాలవల్లా, శాస్త్రాలవల్లా; వినియుండుదున్= విని ఉన్నాను; దానిన్= ఆ తత్త్వాన్ని; నాకున్= నాకు (కూడా); కృపన్= దయతో; తెలుపవే!= (దయచేసి) తెలియజెప్పవా!

తాత్పర్యం: అనుపమాది లక్షణాలు కలిగి, ఒక తేజస్సు ఏదో ప్రకాశిస్తున్నదని వేదాలూ శాస్త్రాలూ చెప్తున్నాయి. అది విన్నాను. దయచేసి ఆ తత్త్వాన్ని నాకు తెలియజేయుము'.

వ. అని వేఁడిన నమ్మునివరుండు సాదరంబుగా నతని కిట్లనియె. 28

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; వేఁడినన్= జనకుడు ప్రార్థించేసరికి; ఆ+మునివరుండు= ఆ మునీశ్వరుడు - వసిష్ఠుడు; సాదరంబుగాన్= ఆదరంతో; అతనికిన్= ఆ జనకుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఈ ప్రకారంగా ప్రార్థించగా వసిష్ఠుడు ఆదరంతో ఆ జనకుడికి ఈ విధంగా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వసిష్ఠుఁడు జనకున కక్షరక్షర తత్త్వంబుల తెఱం గెఱింగించుట (సం. 12-291-13)

సీ. 'గ్రంథంబు ధరియింతు గాని నీ కర్థబో। ధంబు లే దర్థబోధవ్యపేత
మగు గ్రంథధారణ మప్రయోజన మర్థ। నిశ్చయ మెఱిఁగింతు నిపుణబుద్ధి
నవధరింపుము సాంఖ్య మనుసరించును యోగ। తంత్రంబు నదియును దాని తెరువు
నొందుఁ గావున సాంఖ్యయోగంబు లేకంబ। యని కంద్రు ప్రాజ్ఞులు మనుజనాథ!

తే. సాంఖ్యమునకు యోగమునకు జనని శ్రుతియ। పురుషవనితానపుంసకంబు లనఁ బ్రకృతి
లింగములు గల నాత్ముం డలింగుఁ డతనిఁ। జెంద దది యెద్దియును నని చెప్పు శ్రుతులు. 29

ప్రతిపదార్థం: మనుజనాథ!= ఓ జనకమహారాజా!; గ్రంథంబున్= తత్త్వశాస్త్ర గ్రంథాన్ని; ధరియింతు(వు)కాని= కంఠస్థం చేస్తావే కానీ; నీకున్= నీకు; అర్థబోధంబులేదు= అర్థావగాహన లేదు; అర్థబోధ= అర్థజ్ఞానంతో; వ్యపేత= విరహితమైన; గ్రంథధారణ= పుస్తకపఠనం; అప్రయోజనము= నిష్ఫలం; అర్థనిశ్చయము= అర్థనిర్ణయాన్ని; ఎఱిఁగింతున్= తెలియజేస్తాను; నిపుణబుద్ధిన్= నేర్పుగల ధీశక్తితో; అవధరింపుము= శ్రద్ధగా ఆలకించుము; సాంఖ్యమున్= సాంఖ్యశాస్త్రాన్ని; యోగతంత్రంబు= యోగశాస్త్రం; అనుసరించును= అనుసరిస్తుంది; అదియును= ఆ సాంఖ్యంకూడా; దాని తెరువున్= యోగశాస్త్రపద్ధతిని; ఒందున్= అనుసరిస్తుంది; కావునన్= కాబట్టి; సాంఖ్యయోగంబులు= సాంఖ్యమూ, యోగమూ అనేవి; ఏకంబు+అ+అని= ఒకటే అని; ప్రాజ్ఞులు= పండితులు; కంద్రు= దర్శిస్తున్నారు - భావిస్తున్నారు; సాంఖ్యమునకున్= ఈ సాంఖ్యానికీ; యోగమునకున్= ఆ యోగశాస్త్రానికీ; జనని= తల్లి (ఆవిర్భావ ప్రదేశం); శ్రుతి+అ= వేదమే; పురుషవనితా నపుంసకంబులు+అనన్= పురుషుడు, స్త్రీ, నపుంసకం అని; ప్రకృతి లింగములు= ప్రకృతి సిద్ధమైన లింగాలు; కలవు= ఉన్నాయి; ఆత్ముండు= ఆత్ముడుమాత్రం; అలింగుఁడు= లింగరహితుడు; అతనిన్= ఆత్ముడిని; అది ఎద్దియును= స్త్రీ పుం నపుంసకలింగాలలో ఏ ఒక్కటీకూడా; చెందదు= పొందదు; అని= అని; శ్రుతులు= వేదాలు; చెప్పున్= చెబుతున్నాయి.

తాత్పర్యం: 'మహారాజా! నీవు తత్త్వశాస్త్ర గ్రంథాలు ధారణచేస్తున్నావే తప్ప వాటి అర్థం నీకు అవగాహనకు రాలేదు. అర్థం తెలియని చదువు వ్యర్థం. అర్థనిశ్చయాన్ని నేను చెప్తున్నాను. శ్రద్ధగా ఆలకించుము. సాంఖ్యయోగశాస్త్రాలు ఒకదానిని ఒకటి అనుసరిస్తూ ఉంటాయి. అందుకే అవి అభిన్నాలు, ఒక్కటే అని ప్రాజ్ఞులు గుర్తించారు. ఈ రెండింటికీ వేదమే జన్మస్థానం, అదే ఆధారం. ప్రకృతిలో మూడు లింగాలు ఉన్నాయి. అవి ప్రసిద్ధాలు. ఆత్మకు మాత్రం ఆ లింగాలు ఏవీ ఉండవు. ఇదికూడా వేదం చెప్పిన విషయమే.

క. విను బీజంబున బీజం। బును దేహమునందు దేహమును నింద్రియముల్
దనతనవలనం దానును। మనంబునకు మనసు పుట్టు మహితవిచారా! 30

ప్రతిపదార్థం: మహితవిచారా!= ఓ శ్రేష్ఠమైన ఆలోచన కలవాడా!; విను; బీజంబునన్= విత్తనం నుండి; బీజంబును= విత్తనమూ; దేహమునందున్= శరీరంనుంచి; దేహమును= శరీరమూ; ఇంద్రియముల్= ఇంద్రియాలు; తనతనవలనన్= ఒక్కొక్కదానినుంచి; తానును= తాను ఒక్కొక్కటీ; మనంబునకున్= మనస్సుకు; మనసు= మనస్సూ; పుట్టున్= జన్మిస్తాయి.

తాత్పర్యం: ఓ ఆలోచనాపరుడా! విత్తనంనుండి విత్తనమూ, దేహంనుండి దేహమూ, ఇంద్రియాలనుండి ఇంద్రియాలూ, మనస్సునుండి మనస్సూ - ఇట్లా జన్మిస్తూ ఉంటాయి. తెలిసికొమ్ము.

తే. ఇతఁ డబీజుం డదేహుం డనింద్రియుండు। వీతమానసుఁడని యాత్మవిధము సెప్పు
వేదములు, భవదుఃఖ కర్మాదికములు। నాతనికి లేవు నిర్గుణుం డగుటఁ జేసి. 31

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ ఆత్ముడు; అబీజుండు= బీజ విరహితుడు; అదేహుండు= దేహశూన్యుడు; అనింద్రియుండు= ఇంద్రియ రహితుడు; వీతమానసుఁడు= మనస్సులేనివాడు; అని= అని; ఆత్మవిధము= ఆత్మ తాలూకు స్వభావాన్నీ, విధానాన్నీ; వేదములు= వేదాలు; చెప్పున్= చెబుతున్నాయి; నిర్గుణుండు= గుణరహితుడు; అగుటన్+చేసి= అవ్వటంవలన; ఆతనికిన్= ఆత్ముడికి; భవదుఃఖకర్మాదికములు= పుట్టుక, దుఃఖం, కర్మాచరణ మొదలైనవి; లేవు= ఉండవు.

తాత్పర్యం: ఆత్మకు బీజం లేదనీ, దేహం ఉండదనీ, ఇంద్రియాలు లేవనీ, మనస్సు కూడా ఉండదనీ వేదాలు వివరిస్తున్నాయి. ఆత్మ అనేది నిర్గుణం. అందుచేత దానికి భవబంధాలూ భవదుఃఖాలూ కర్మాచరణలూ - ఇట్లాంటివి ఏమీ ఉండవు.

చ. ప్రకృతి యలింగ, తజ్జనితభంగులు లింగము, లట్టులయ్యు రం
జకగుణశీల లింగచయసంగతిఁ దాను సలింగమయ్యె, మూ
ర్తికలన లేక యుండియుఁ బరిస్ఫుట పుష్పఫలాదిసూచక
ప్రకరముచేత మూర్తమయి రంజిలదే ఋతువేళ సూడఁగన్. 32

ప్రతిపదార్థం: ప్రకృతి= ప్రకృతి అనేది నిజానికి; అలింగ= లింగరహిత; తద్= ఆ ప్రకృతినుంచి; జనిత= పుట్టిన; భంగులు= వికారాలే; లింగములు= లింగాలు; అట్టులయ్యున్= అయినప్పటికీ; రంజక= రంజింపజేసే; గుణ= గుణమూ; శీల= స్వభావమూ ఉన్న; లింగచయ= ఆ లింగ సమూహంయొక్క; సంగతిన్= కలయికతో - సాంగత్యంతో; తానున్= ఆ ప్రకృతి తాను కూడా; సలింగ+అయ్యెన్= లింగసహిత అవుతోంది; మూర్తికలన లేకయుండియున్= ఒక రూపం అనేది లేకపోయినా; ఋతువేళ= వసంతాది ఋతుసమయం; పరిస్ఫుట= స్పష్టంగా కనిపించే; పుష్పఫల+ఆది= పువ్వులూ, పండ్లూ మొదలైన; సూచకప్రకరముచేతన్= సూచకసమూహంతో; మూర్తము+అయి= ఒక రూపం ధరించినదై; చూడఁగన్= మనం గమనించాలే కానీ; రంజిలదే= ప్రకాశించదా!

తాత్పర్యం: వసంతాది ఋతువులకు ఒక రూపమంటూ ఏదీ లేదు. అయినా ఫలపుష్పాలవలన ఆ ఋతువులకు ఒక రూపం ఏర్పడుతున్నది. ఆ చిహ్నాలతో ఆయా ఋతువులను మనం గుర్తిస్తున్నాం. అట్లాగే ప్రకృతికి కూడా ఒక లింగమంటూ ఏదీ లేదు. లింగాలన్నీ ప్రకృతినుండి పుట్టిన వికృతులే. అయితే ఆ లింగాల సాంగత్యంవలన ప్రకృతి కూడా సలింగ అవుతున్నది. నిజానికి అది అలింగ.

క. కావున గుణములు ప్రకృతివ । యేవిధమునఁ జూచినను మహేశ్వరుని గుణి
త్వావేశము పొరయ దస । ద్భావము సద్భావమగునె? భరితవివేకా! 33

ప్రతిపదార్థం: భరితవివేకా!= వివేకవంతుడా!; కావునన్= కాబట్టి; గుణములు= గుణములనేవి; ప్రకృతివి+అ= ప్రకృతివే; ఏ విధమునన్ చూచినను= ఏ విధంగా చూసినప్పటికీ; మహేశ్వరునిన్= మహేశ్వరుడిని (పరమాత్మను); గుణిత్వ+ఆవేశము= గుణాలు ఆవేశించటమనేది; పొరయదు= జరగదు; అసద్భావము= లేనిది; సద్భావము= ఉన్నది; అగునె?= అవుతుందా?

తాత్పర్యం: కాబట్టి గుణాలు ప్రకృతివే కానీ పరమాత్మవి కావు. అవి ఏ రకంగానూ మహేశ్వరుడికి అంటవు. లేనిది ఉన్నట్లు అవుతుందా! కాదు కదా! అట్లాగే ఇదీనూ.

వ. ఇది యక్షర క్షర వివేకం, బేకం బనేకంబు దర్శనం బదర్శనంబు నిస్తత్త్వంబు దత్త్వం బపవర్గంబు వర్గంబని యక్షరక్షరంబుల పర్యాయ నిర్దేశంబు, లక్షరంబు నప్రబుద్ధులు గానరు, ప్రబుద్ధులగు సాంఖ్యులును యోగులును బుద్ధికిం బరంబై పంచవింశతితమంబైన యా తత్త్వంబు నాలోకింతు'రని చెప్పిన వసిష్ఠుతో నవ్వసుమతీవల్లభుండు. 34

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇది= ఇంతవరకూ చెప్పింది; అక్షర - క్షర వివేకంబు= అక్షరమూ క్షరమూ అనేవాటి వివేకం (జ్ఞానం); ఏకంబు= ఏకమూ; అనేకంబు= అనేకమూ; దర్శనంబు= దర్శనమూ (కనబడేది); అదర్శనంబు= అదర్శనమూ; నిస్తత్త్వంబు= తత్త్వరహితమూ; తత్త్వంబు= తత్త్వమూ; అపవర్గంబు= అపవర్గమూ; వర్గంబు= వర్గమూ; అని= అని వరుసగా; అక్షర క్షరంబులు= అక్షర క్షరాల పర్యాయనిర్దేశంబులు= పర్యాయసంజ్ఞలు; అక్షరంబున్= అక్షర తత్త్వాన్ని; అప్రబుద్ధులు= ప్రబుద్ధులు కానివారు (జ్ఞానరహితులు); కానరు= తెలుసుకోలేరు; ప్రబుద్ధులు అగు= జ్ఞానులైన; సాంఖ్యులును= సాంఖ్యులూ; యోగులును= యోగులూ; బుద్ధికిన్ పరంబై= బుద్ధికి అందనిదై; పంచవింశతి తమంబైన= ఇరవై అయిదవదైన; ఆ తత్త్వంబున్= ఆ అక్షరతత్త్వాన్ని; ఆలోకింతురు= దర్శిస్తారు; అని; చెప్పినన్= చెప్పేసరికి; వసిష్ఠుతోన్= ఆ వసిష్ఠుడితో; ఆ+వసుమతీ వల్లభుండు= ఆ జనకమహారాజు.

తాత్పర్యం: ఇంతరకూ చెప్పినది అక్షరమూ - క్షరమూ అనే వాటి జ్ఞానం. ఏకమూ, అనేకమూ; కనబడేది, అదర్శనమూ; తత్త్వరహితమూ - తత్త్వమూ; అపవర్గమూ వర్గమూ అని వరుసగా అక్షర క్షరాల పర్యాయసంజ్ఞలు. అజ్ఞానులు అక్షరతత్త్వాన్ని గ్రహించలేరు. తెలిసికొనలేరు. జ్ఞానులైన సాంఖ్యులూ, యోగులూ, బుద్ధికి అందనిదై, ఇరవై అయిదవదైన ఆ అక్షరతత్త్వాన్ని దర్శిస్తారు' అని వసిష్ఠుడు చెప్పగా విని, ఆ జనకమహారాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **'కలదు నానాత్వ మేకత్వ మాత్మునకు న । విద్యయు విద్య నా విందు నదియు**
నదియును నెఱిఁగింపు మక్షరక్షరభేద । మీవు సెప్పితి బుద్ధి యెంతయేని
నస్థిరగాన యయ్యవబోధమును మాసె । సాంఖ్యయోగంబుల చందములును
దెలియంగఁ జెప్పఁగా వలయు నా' కనుడు న । మ్ముని యిట్టు లనియె నమ్మనుజ పతికి

తే. **'యోగమనఁగను ధ్యానంబు రాగరహిత! । యదియు వినుము ప్రాణాయామ మనఁగ నొకటి**
మనసు నేకాగ్రతావృత్తి యనఁగనొకఁడు । పరఁగు సగుణత్వ నిర్గుణ భావగతుల. **35**

ప్రతిపదార్థం: ఆత్మునకున్= ఆత్మకు; నానాత్వము= అనేకత్వమూ; ఏకత్వము= ఏకత్వమూ; కలదు= ఉంది; అవిద్యయున్= అవిద్య; విద్య= విద్య; నాన్= అని పెద్దలు చెప్పగా; విందున్= విన్నాను; అదియున్ అదియున్= ఆ రెండింటినీ; ఎఱిఁగింపుము= నాకు తెలియజేయుము; అక్షర క్షర భేదము= అక్షర క్షరాల విభేదాన్ని; ఈవు= నీవు; చెప్పితి(వి)= చెప్పావు; బుద్ధి= ఈ బుద్ధి అనేది; ఎంతయేనిన్= ఎంతయినా; అస్థిర= అస్థిరం దీనికి స్థిరతలేదు; కానన్= కాబట్టి; ఆ+అవబోధమునున్= ఆ వివేకంకూడా; మాసెన్= అంతరించిపోయింది; సాంఖ్యయోగంబుల= సాంఖ్యయోగాల; చందములునున్= తీరుతెన్నులను కూడా; నాకున్= నాకు; తెలియంగన్+చెప్పఁగాన్ వలయున్= తెలిసేట్లు నీవే చెప్పాలి; అనుడున్= అని అడిగేసరికి; ఆ+ముని= ఆ వసిష్ఠుడు; ఆ+మనుజపతికిన్= ఆ జనకమహారాజుకు; ఇట్టులు+అనియెన్= ఇట్లా చెప్పాడు; రాగరహిత!= రాగమూ మోహమూ అనేవి లేనివాడా!; యోగము+అనఁగను= యోగం అంటే; ధ్యానంబు= ధ్యానమే; వినుము= విను; అదియున్= అదికూడా; ప్రాణాయామము+అనఁగన్+ఒకటి= ప్రాణాయామమని ఒకటీ; మనసు+ఏకాగ్రతావృత్తి+అనఁగన్+ఒకఁడు= మనస్సు యొక్క ఏకాగ్రతాప్రవృత్తి అని మరొకటీ; సగుణత్వ - నిర్గుణభావగతులన్= సగుణనిర్గుణ పద్ధతులుగా; పరఁగున్= ఉన్నాయి.

తాత్పర్యం: 'మహర్షీ! ఆత్మకు ఏకత్వం అనేకత్వం ఉన్నది అంటున్నారు. అట్లాగే విద్య, అవిద్య - అనేవి ఉన్నాయి అంటున్నారు. ఇవి రెండూకూడా నాకు తెలిసేటట్లు చెప్పుము. అక్షర-క్షర విభేదం ఏమిటో చెప్పావు. కానీ, బుద్ధి ఎంతయినా అస్థిరం. అందుచేత ఆ వివేకం అప్పుడే రూపుమాసిపోయింది. సాంఖ్యయోగ పద్ధతులను కూడా మరింత స్పష్టంగా వివరించుము' అని జనక మహారాజు అడిగాడు. అప్పుడు వసిష్ఠుడు ఇట్లా అన్నాడు. 'ఓ రాగరహితుడా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెప్పుతున్నాను శ్రద్ధగా వినుము. యోగం అంటే ధ్యానం. అది ప్రాణాయామం అని ఒకటీ, మానసిక ఏకాగ్రత అని ఒకటీ - రెండు పద్ధతులలో ఉంటుంది. వీటిలో మొదటిది సగుణత్వ విధానం. రెండవది నిర్గుణత్వ పద్ధతి. ("ఏకాగ్రతా చ మనసః ప్రాణాయామస్తథైవ చ, ప్రాణాయామస్తు సగుణో నిర్గుణో మనసస్తథా" (12-294-8).)

వ. తదనుష్ఠాన ప్రకారంబు సెప్పెద. 36

ప్రతిపదార్థం: తద్= ఆ రెండింటికీ; అనుష్ఠాన ప్రకారంబు= అనుష్ఠాన పద్ధతి; చెప్పెదన్= చెప్పుతాను. తెలిసికొమ్ము.

తాత్పర్యం: ఆ రెండింటికీ అనుష్ఠానపద్ధతి చెప్పుతాను వినుము.

క. 'మలమూత్రంబుల కాలం । బుల భుక్తి కనంతరమున భూవర! యోగం
బలవఱుచు రెండు మార్గం । బులును నిషిద్ధంబు లండ్రు పూర్వాచార్యుల్. 37

ప్రతిపదార్థం: భూవర!= ఓ జనకమహారాజా!; మలమూత్రంబుల= మలమూత్రాలు విసర్జించే; కాలంబులన్= సమయాల్లోనూ; భుక్తికిన్= భోజనానికి; అనంతరమునన్= తరువాత సమయంలోనూ; యోగంబు= ఈ యోగాన్ని; అలవఱుచు= అలవాటుగా చేసేటువంటి; రెండు మార్గంబులును= రెండు పద్ధతులూ; నిషిద్ధంబులు= నిషిద్ధాలు అని; పూర్వాచార్యుల్= పురాతన గురువులు; అండ్రు= అంటున్నారు.

తాత్పర్యం: 'ఓ రాజా! మలమూత్రాలు విసర్జించే సమయంలోనూ, భోజనానికి తరువాతా ప్రాణాయామాదికమైన యోగాన్ని అనుష్ఠించటం సమంజసం కాదనీ, అది నిషిద్ధమనీ పూర్వాచార్యులు చెప్పుతున్నారు. ('మూత్రోత్సర్గే పురీషే చ భోజనే చ నరాధిప! త్రికాలం నాభియుంజీత శేషం యుంజీత తత్పరః' (12-294-9).)

సీ. కొంచెపుటశనంబుఁ గొనుచు సంగంబులఁ । బాసి యింద్రియముల పజ్జఁ జనమి
శబ్దాదియైన విషయజాత మంతరం । గంబున సందడిగాక యుండ
సద్బుద్ధి దృఢమగు సాధనంబుగఁ గొని । మరలిచి యాత్మన మనసు నిలిపి
యపగతసంకల్పుఁడై యుపలస్థాణు । భంగికస్థితిఁ బనుపడి దివంబు

తే. రాత్రియును యోగసేవానురతి నివాత । దీపమును బోలె వెలుఁగు నాత్మీయమూర్తిఁ
గనుచు నెడనెడ నుపరమకాలములు స । నంగ వర్తించి యోగి యానంద మొందు. 38

ప్రతిపదార్థం: కొంచెము+అశనంబు= అల్పపరిమాణంలో ఆహారాన్ని; కొనుచున్= స్వీకరిస్తూ; సంగంబులన్= తగులుకోళ్ళను; పాసి= వదిలించుకొని; ఇంద్రియముల పజ్జన్= ఇంద్రియాలవైపు; చనమి= వెళ్ళకపోవటం; శబ్దాదియైన= శబ్దము మొదలైన; విషయజాతము= విషయసమూహం; అంతరంగంబునన్= హృదయంలో; సందడికాక+ఉండన్= సందడి చెయ్యకుండా ఉండటం; సద్బుద్ధిన్= మంచి ధీశక్తిని; దృఢము+అగు= గట్టిదైన; సాధనంబుగన్+కొని= సాధనంగా స్వీకరించి; మనసున్= మనస్సును; మరలిచి= మళ్ళించి; ఆత్మన్+అ= ఆత్మలోనే; నిలిపి= నిలబెట్టి; అపగత సంకల్పుఁడై= ఏ రకమైన సంకల్పాలూ లేనివాడై; ఉపలస్థాణుభంగికస్థితిన్= రాయివలె నిశ్చలమైన (స్థాణు)భంగితో ఉంటూ; పనుపడి= పూనికతో వరుసగా; దివంబున్ రాత్రియును= పగలూ రాత్రికూడా; యోగసేవా+అనురతిన్= యోగానుష్ఠానం పట్ల గాఢవాంఛతో; నివాతదీపమును పోలెన్= గాలి లేనప్పుడు నిశ్చలంగా వెలిగే దీపం వలె; వెలుఁగు= ప్రకాశించే; ఆత్మీయమూర్తిన్= ఆత్మ(తాలూకు) రూపాన్ని; కనుచున్= దర్శిస్తూ; ఎడనెడన్= మధ్యమధ్యలో; ఉపరమకాలములు= విరామసమయాలు; చనంగన్= కడచిపోతూండగా; వర్తించి= యోగానుష్ఠానంతో వర్తించి; యోగి= యోగి అయినవాడు; ఆనందము+ఒందున్= ఆనందం పొందుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కొలదిగా మాత్రమే ఆహారాన్ని భుజిస్తూ, కలయికలను వదలిపెట్టి, ఇంద్రియాలపై దృష్టి పెట్టకుండా, విషయసంబంధమైన ప్రలోభాలు లోలోపల గొడవచేయకుండా ఉండేటందుకు మంచి బుద్ధిబలాన్ని ఆయుధంగా గ్రహించి, మనస్సును ఆత్మలోనికి మరల్చి, రాయివలె ఏ సంకల్పాలూ లేకుండా, గాలిలేనప్పుడు నిశ్చలంగా ఉండే దీపంవలె ఆత్మస్వరూపాన్ని నిరంతరం దర్శించుకొంటూ యోగి ఆనందిస్తాడు.

వ. ఇది యోగప్రకారంబు, సాంఖ్యంబు తెఱం గెఱింగించెద. 39

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పినది; యోగప్రకారంబు= యోగ పద్ధతి; సాంఖ్యంబు తెఱంగు= ఇంక సాంఖ్య పద్ధతి; ఎఱింగించెదన్= తెలియజేస్తాను.

తాత్పర్యం: పైన చెప్పినది యోగ పద్ధతి. ఇక సాంఖ్యం గురించి వివరిస్తాను.

తే. ప్రకృతివాదు లవ్యక్తంబు ప్రకృతియండ్రు । ప్రసవధర్మిణియైన యా ప్రకృతి దన్ను
బుద్ధ్యహంకారములుఁ బంచభూతములును । విషయములు నింద్రియములుఁగా విస్తరించు. 40

ప్రతిపదార్థం: ప్రకృతివాదులు= సాంఖ్యులు; ప్రకృతి= ప్రకృతి అనేది; అవ్యక్తంబు= అవ్యక్తము; అండ్రు= అంటారు; ప్రసవధర్మిణి+ఐన= ప్రసవించే ధర్మం కలదైన; ఆ ప్రకృతి; తన్నున్= తనను తాను; బుద్ధి+అహంకారములు= బుద్ధి, అహంకారం; పంచభూతములును= పంచభూతాలూ; విషయములు= శబ్దాదివిషయాలూ; ఇంద్రియములున్= శ్రోత్రాది ఇంద్రియాలూ; కాన్= అయ్యేటట్లు; విస్తరించున్= విస్తరించుకొంటుంది.

తాత్పర్యం: మహారాజా! ప్రకృతివాదులైన సాంఖ్యులు ఈ ప్రకృతిని 'అవ్యక్తము' అంటారు. దీనికి ప్రసవించే ధర్మం ఉన్నది కాబట్టి తనను తాను బుద్ధిగా, అహంకారంగా, పంచభూతాలుగా, శబ్దాది విషయాలుగా, శ్రోత్రాది ఇంద్రియాలుగా (జ్ఞానేంద్రియాలూ, కర్మేంద్రియాలూ) విస్తరించుకొంటుంది.

వ. పురుషునివలన నివి యెల్లను గలుగుఁ బురుషుఁడింతకు నధిష్ఠాతయై యుండు. 41

ప్రతిపదార్థం: పురుషునివలనన్= పురుషుడివలన; ఇవి+ఎల్లనున్= పైని చెప్పిన విస్తరణ అంతా; కలుగున్= జరుగుతుంది; పురుషుఁడు= పురుషుడే; ఇంతకున్= దీనికంతటికీ, ఇంతకూ; అధిష్ఠాతయై ఉండున్= అధిష్ఠాతగా ఉంటాడు.

తాత్పర్యం: పురుషుడివలన ఈ విస్తరణ అంతా జరుగుతుంది. పురుషుడే దీని కంతటికీ అధిష్ఠాత.

క. అనులోమంబున సృష్టియు । జనవర! ప్రతిలోమవృత్తి సంహారముఁ గ
ల్గును జనన ప్రళయంబులఁ । దనకు బహుత్వంబు నేకతయు శోభిల్లున్. 42

ప్రతిపదార్థం: జనవర!= ఓ రాజా!; అనులోమంబునన్= అనులోమ పద్ధతిలో; సృష్టియున్= సృష్టీ; ప్రతిలోమవృత్తిన్= ప్రతిలోమపద్ధతిలో; సంహారమున్= ఉపసంహారమూ (ప్రళయం లేదా వినాశం); కల్గును= ఏర్పడతాయి; జనన ప్రళయంబులన్= ఈ సృష్టి సంహారాలలో; తనకున్= ప్రకృతికి; బహుత్వంబున్= అనేకత్వమూ; ఏకతయున్= ఏకత్వమూ; శోభిల్లున్= వరుసగా ప్రకాశిస్తాయి.

తాత్పర్యం: ఓ జనకా! అనులోమంలో (పైనుండి క్రిందకు) సృష్టి జరుగుతుంది. ప్రతిలోమంలో (క్రిందినుండి పైకి) సంహారం జరుగుతుంది. సృష్టి జరుగుతున్న (జనన) సమయంలో ప్రకృతికి అనేకత్వం శోభిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రళయసమయంలో ఏకత్వం విరాజిల్లుతుంది. 'అనులోమేన జాయంతే, లీయంతే ప్రతిలోమతః (12-294--32). ఏకత్వం ప్రళయే చాస్య, బహుత్వం చ యదాసృజత్ (12-294-33)'.

వ. క్షేత్రంబన నవ్యక్తంబనం బకృతియనం బ్రధానం బనం బరఁగు తత్త్వం బొక్కటియ. దానిన సత్త్వంబు నండ్రు, జీవుం డా క్షేత్రంబు నెఱింగినవాఁడు, కావున క్షేత్రజ్ఞుఁడును, నవ్యక్తపురంబున వసియించుటఁజేసి పురుషుండు, ననవెలుంగు, క్షేత్రక్షేత్రజ్ఞులు వేఱగుట ప్రస్ఫుటంబు, అవ్యక్తంబు జ్ఞానంబు, పురుషుండు జ్ఞేయుండు, ప్రకృతి సగుణాత్మక, పురుషుండు నిర్గుణుం డిది సాంఖ్యప్రకారం, బిట్లు పరిసంఖ్యానరూపంబునఁ జతుర్వింశతితత్త్వంబుల నేర్పరించి పురుషుండు దన్నుఁదాన చూడం గైవల్యంబు సిద్ధించు; నిట్టిది యపునరావృత్తిపదంబు, తత్త్వసమూహం బప్రబుద్ధం బది క్షరంబు, పంచవింశతితత్త్వ విశిష్టుండగు పురుషుండు ప్రబుద్ధుం డక్షరంబునం బరఁగు, నిత్తెఱం గెఱింగిన వా రెల్లవలనను నిర్భయులు. భూవర! యోగంబును సాంఖ్యంబును నక్షరంబును జెప్పితి. విద్యావిద్యలు సెప్పెద నాకర్ణింపుము. 43

ప్రతిపదార్థం: క్షేత్రంబు+అనన్= క్షేత్రముఅనీ; అవ్యక్తంబు అనన్= అవ్యక్తము అనీ; ప్రకృతి అనన్= ప్రకృతి అనీ; ప్రధానంబు అనన్= ప్రధానము అనీ; పరఁగు= చెప్పబడుతున్న; తత్త్వంబు+ఒక్కటి+అ= తత్త్వం ఒక్కటే; దానిన= దానినే; సత్త్వంబున్+అండ్రు= సత్త్వము అని కూడా అంటారు; జీవుండు= జీవుడు; ఆ క్షేత్రంబున్= అవ్యక్తమైన ఆ ప్రకృతిని; ఎఱింగెడివాఁడు= తెలిసికొనే వ్యక్తి; కావునన్= కాబట్టి; క్షేత్రజ్ఞుఁడును= క్షేత్రజ్ఞుడు అనీ; అవ్యక్తపురంబునన్= ప్రకృతిలో; వసియించుటన్ చేసి= నివసించటం వలన; పురుషుండును+అనన్= పురుషుడు అనీ; వెలుంగున్= ప్రకాశిస్తున్నాడు; క్షేత్ర-క్షేత్రజ్ఞులు= ప్రకృతి పురుషులు; వేఱు అగుట= విభిన్నులు అనేది; ప్రస్ఫుటంబు= స్పష్టం; అవ్యక్తంబు= ప్రకృతి అనేది; జ్ఞానంబు= జ్ఞానం; పురుషుండు= పురుషుడు; జ్ఞేయుండు= తెలిసికొనదగినవాడు; ప్రకృతి= ప్రకృతి అనేది; సగుణాత్మక= సగుణస్వరూపం కలది; పురుషుండు= పురుషుడు; నిర్గుణుండు= నిర్గుణుడు; ఇది= ఇది అంతా; సాంఖ్యప్రకారంబు= సాంఖ్యపద్ధతి; ఇట్లు= ఇలా; పరిసంఖ్యానరూపంబునన్= పరిగణనరూపంలో; చతుర్వింశతి తత్త్వంబులన్= ఇరవై నాలుగు తత్త్వాలనూ; ఏర్పరించి= నిర్ధారించుకొని; పురుషుండు= పురుషుడు; తన్నున్ తాన= తనను తానే; చూడన్= దర్శిస్తే; కైవల్యంబు సిద్ధించున్= కైవల్యం (మోక్షం) సిద్ధిస్తుంది; ఇట్టిది= ఇటువంటిది; అపునరావృత్తిపదంబు= పునర్జన్మ లేని స్థానం; తత్త్వసమూహంబు= తత్త్వసమూహమనేది; అప్రబుద్ధంబు= ప్రబుద్ధంకానిది; అది= అది; క్షరంబు= క్షరతత్త్వం; పంచవింశతితత్త్వవిశిష్టుండు అగు పురుషుండు= ప్రబుద్ధుడు (జ్ఞాని); అక్షరంబు అనన్= అతడే అక్షరతత్త్వం అని; పరఁగున్= ఒప్పును; ఈ+తెఱంగు= ఈ పద్ధతిని; ఎఱింగినవారు= తెలుసుకొన్నవారు; ఎల్లవలనను= సమస్తంనుండి; నిర్భయులు= భయరహితులు; (వారికి దేనినుంచీ ఏ భయమూ ఉండదని); భూవర!= ఓ జనకరాజా!; యోగంబును= యోగమునూ; సాంఖ్యంబును= సాంఖ్యమునూ; అక్షరంబును= అక్షర (తత్త్వ)మునూ; చెప్పితిన్= నీకు వివరించాను; విద్యావిద్యలు= విద్య, అవిద్య అనేవి; చెప్పెదన్= తెలియజేస్తాను; ఆకర్ణింపుము= శ్రద్ధగా విను.

తాత్పర్యం: క్షేత్రం, అవ్యక్తం, ప్రకృతి, ప్రధానం అని చెప్పబడుతున్నది ఒక్కటే తత్త్వం. 'సత్త్వము' దానికి మరొక పేరు. అట్టి ప్రకృతిని ఎరిగినవాడు గనుక క్షేత్రజ్ఞుడుగా, ప్రకృతిలో ఉండటంవలన పురుషుడుగా జీవుడు ప్రకాశిస్తున్నాడు. ప్రకృతి వేరు, పురుషుడు వేరు అనేది స్పష్టం. ప్రకృతి జ్ఞానం. పురుషుడు తెలిసికొనవలసినవాడు. ప్రకృతికి గుణాలు ఉన్నాయి. పురుషుడు నిర్గుణుడు. ఇది సాంఖ్య పద్ధతి ఇట్లా పరిగణన రూపంగా ఇరవై నాలుగు తత్త్వాలనూ గ్రహించి దర్శించుకొంటే మోక్షం లభిస్తుంది. ఇది పునర్జన్మ లేని స్థితి. తత్త్వసమూహం వ్యక్తం కానిది. నాశవంతమైనది. పంచవింశతితత్త్వాలతో కూడిన పురుషుడు ప్రకటస్వరూపుడు, క్షరము లేనివాడు. ఈ విషయం తెలిసినవాళ్ళు నిర్భయంగా ఉండగలరు. రాజా! యోగమునూ, సాంఖ్యమునూ అక్షరతత్త్వాన్ని, నీకు బోధించాను. ఇక 'విద్య - అవిద్య' అనగా ఏమిటో వివరిస్తాను వినుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విద్యావిద్యల ప్రకార నిరూపణము (సం.12-295-1)

ఆ. విద్యయనఁగఁ బంచవింశతితమ తత్త్వ । మైన యక్షరంబు మానవేంద్ర!
విను మవిద్య నాఁగఁ జనుఁ బ్రధానము, దేట । పఱిచెదను విశేషభంగు లెల్ల. 44

ప్రతిపదార్థం: మానవేంద్ర= మానవనాయకా!; విద్య+అనఁగన్= విద్య అంటే; పంచవింశతితమ తత్త్వము+ఐన= ఇరవై అయిదో తత్త్వమైన; అక్షరంబు= అక్షరమే; వినుము; ప్రధానము= ప్రకృతియే; అవిద్య నాఁగన్+చనున్= అవిద్య అనబడుతున్నది; విశేషభంగులు+ఎల్లన్= విశేష పద్ధతులన్నీ; తేటపఱిచెదను= స్పష్టపరుస్తాను.

తాత్పర్యం: ఓ మానవనాయకా! ఇరవై అయిదో తత్త్వమైన అక్షరమే విద్య. ప్రధానమూ అవ్యక్తమూ క్షేత్రమూ అనే పేర్లతో వ్యవహరింపబడే ప్రకృతియే అవిద్య. వీటిలో ఉన్న తక్కిన విశేషవిభాగాలు కూడా స్పష్టంగా చెప్పుతాను వినుము.

వ. కర్మేంద్రియంబులకు బుద్ధీంద్రియంబు విద్య, బుద్ధీంద్రియంబులకు మనస్సును, మనస్సునకు భూతపంచకంబును, భూతపంచకంబునకు నహంకారమును, నహంకారమునకు బుద్ధియు, బుద్ధికి నవ్యక్తంబును, నవ్యక్తంబునకుం బంచవింశతితమ తత్త్వంబును విద్య'లని చెప్పి వెండియు నమ్మునివరుం డిట్లనియె. 45

ప్రతిపదార్థం: కర్మేంద్రియంబులకున్= కర్మాచరణ చేసే ఇంద్రియాలకు; బుద్ధి+ఇంద్రియంబు= జ్ఞానేంద్రియం; విద్య; బుద్ధీంద్రియంబులకున్= జ్ఞానేంద్రియాలకు; మనస్సును= మనస్సు అనేది విద్య; మనస్సునకున్= ఈ మనస్సుకు; భూతపంచకంబును= పంచభూతాలు విద్య; భూత పంచకంబునకున్= పంచభూతాలకు; అహంకారమును= అహంకారమూ; అహంకారమునకున్= ఆ అహంకారానికి; బుద్ధియున్= బుద్ధి అనేదీ; బుద్ధికిన్= ఆ బుద్ధికి; అవ్యక్తంబును= అవ్యక్తము అనబడే ప్రకృతీ; అవ్యక్తంబునకున్= ఆ ప్రకృతికి; పంచవింశతితమతత్త్వంబును= ఇరవై అయిదవ తత్త్వమూ; విద్యలు= విద్యలు అవుతాయి; అని చెప్పి= ఇట్లా వివరించి; వెండియున్= తిరిగి; ఆ+మునివరుండు= ఆ వసిష్ఠుడు; ఇట్లు+అనియెన్= ఇంకా ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: కర్మాచరణ చేసే ఇంద్రియాలకు జ్ఞానేంద్రియాలు, జ్ఞానేంద్రియాలకు మనస్సూ, మనస్సుకు పంచ భూతాలూ, పంచ భూతాలకు అహంకారమూ, అహంకారానికి బుద్ధీ, బుద్ధికి ప్రకృతీ, ఆ ప్రకృతికి ఇరవై అయిదవ తత్త్వమూ విద్యలు' అని చెప్పి, వసిష్ఠుడు ఇంకా ఇట్లా అన్నాడు.

తే. 'క్షరము నక్షరమును ననఁ గలుగు రెంటి । నేర్పఱిచి మున్ను సెప్పితి నింక నొకటి
సెప్పఁ గలదు సమగ్రవిశేషకలిత । మవహితుండవై విను విదేహాధినాథ! 46

ప్రతిపదార్థం: విదేహాధినాథ!= విదేహరాజ్యాధిపా - జనకమహారాజా!; క్షరము= క్షరతత్త్వమూ; అక్షరమును= అక్షరతత్త్వమూ; అనన్= అనే పేర్లతో; కలుగు= ఉన్నటువంటి; రెంటిన్= రెండింటినీ; ఏర్పఱిచి= విడమరిచి; మున్ను= ఇంతవరకూ; చెప్పితిన్= చెప్పాను; ఇంకన్+ఒకటి= మరొకటి; చెప్పన్= చెప్పటానికి; కలదు= ఉంది; సమగ్రవిశేషకలితము= అది పరిపూర్ణమైన విశేషంతో కూడినది; అవహితుండవై= సావధానుడవై; విను.

తాత్పర్యం: 'ఓ విదేహరాజా! క్షరమూ అక్షరమూ అనే తత్త్వాలను రెండింటినీ ఇంతవరకూ వివరించి చెప్పాను. ఇంకా చెప్పవలసింది మరొకటి ఉన్నది. అది సమగ్రవిశేషకలితం. సావధానుడవై వినుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. జీవుండుఁ బ్రకృతియు భూవర! యక్షర । క్షరము లీ రెంటిని క్షరము లనియు
నార్యులు సెప్పుదు రక్షరంబులు నందు । రాద్యంతరహితంబు లగుట యీశ్వ
రత్వంబుగల్గుట తత్త్వాదికము లనఁ । జనుట రెంటికి సదృశంబు సూవె
ప్రకృతిగుణంబులై పరఁగెడు మహదహం । కారాదికంబులఁ గలసినపుడు

ఆ. క్షర మనంగ వచ్చుఁ బురుషునిఁ బ్రకృతిఁ దా । నని తలంచుఁగాన, నదియుఁ బురుషుఁ
బొంద గుణవికారములు లేమి నిర్గుణ । మక్షరం బనంగ నగును దాని. 47

ప్రతిపదార్థం: భూవర!= మహారాజా!; జీవుండున్= జీవుడూ; ప్రకృతియున్= ప్రకృతి అనేదీ; అక్షర క్షరములు= వరుసగా అక్షరమూ క్షరమూను; ఈ రెంటినిన్= ఈ రెండింటినీ; క్షరములు+అనియున్= కేవలం క్షరములు అని కూడా; ఆర్యులు= పెద్దలు; చెప్పుదురు= చెప్తుతుంటారు; అక్షరంబులున్ అందురు= అక్షరములు అని కూడా అంటారు; ఆద్యంత రహితంబులు అగుట= ఆదీ అంతమూ లేనివి కావటం; ఈశ్వరత్వంబు కల్గుట= ఈశ్వరత్వం ఉండటం; తత్త్వాదికములు+అనన్+చనుట= తత్త్వాదికాలు అని చెప్పటానికి తగినవి కావటం అనే ఈ లక్షణాలు; రెంటికిన్= జీవుడికీ, ప్రకృతికీ; సదృశంబు+చూవె= సమానం సుమా!; ప్రకృతిగుణంబులై= ప్రకృతిగుణాలుగా; పరఁగెడు= ఒప్పేటువంటి; మహత్+అహంకారాదికంబులన్= మహత్తు అహంకారం మొదలైనవాటితో; కలసినపుడు= కూడినప్పుడు(జీవుడు); ప్రకృతిన్= ప్రకృతిని; తాను+అని= తానే అని; తలంచున్‌గానన్= భావిస్తాడు కాబట్టి; పురుషునిన్= జీవుడిని; క్షరము అనంగన్ వచ్చున్= క్షరము అని కూడా అనవచ్చును; అదియున్= ఆ ప్రకృతికూడా; పురుషున్+పొందన్= జీవుడిని పొందినప్పుడు; గుణవికారములు= గుణసంబంధమైన వికారాలు; లేమిన్= లేకపోవటం వలన; నిర్గుణము= నిర్గుణమనీ; అక్షరంబు= అక్షరము అనీ; దానిన్= ఆ ప్రకృతిని; అనంగన్ అగును= చెప్పవచ్చును.

తాత్పర్యం: భూవరా! జీవుడిని అక్షరమనీ, ప్రకృతిని క్షరమనీ అంటారు. కొందరు పెద్దలు ఈ రెంటినీ 'క్షరములు' అన్నారు. మరికొందరు 'అక్షరములు' అన్నారు. ఆద్యంతాలు లేకపోవటం, ఈశ్వరతత్త్వాన్ని కలిగిఉండటం-ఇత్యాదులు జీవుడికీ ప్రకృతికీ ఉన్న సాదృశ్యాలు. మహదహంకారాది ప్రకృతిగుణాలను పొందినపుడు పురుషుడు (జీవుడు) తనను తాను ప్రకృతిగా భావిస్తాడు కనుక అతడిని 'క్షరము' అని కూడా అనవచ్చును. ఈ ప్రకృతి పురుషుడిని పొందినప్పుడు గుణవికారరహితంగా ఉంటుంది కాబట్టి అప్పుడు దానిని నిర్గుణమనీ అక్షరమనీ కూడా వ్యవహరించవచ్చును.

వ. ఎప్పుడు పురుషుండు ప్రబుద్ధుం డయ్యె నప్పు డతండు. 48

ప్రతిపదార్థం: ఎప్పుడు= ఎప్పుడయితే; పురుషుండు= జీవుడు; ప్రబుద్ధుండు+అయ్యెన్= ప్రబుద్ధుడు (జ్ఞాని) అవుతాడో; అప్పుడు; అతండు= ఆ జీవుడు.

తాత్పర్యం: జీవుడు ఎప్పుడయితే జ్ఞాని అవుతాడో అప్పుడు ఆ జీవుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. ఇంతకాలమేని యెఱుఁగక సంగాభి । భూతయగుచు నప్రబోధకలిత
యైనయట్టి ప్రకృతి యేనంటి నిస్సంగ । బోధమహిమఁగానఁ బోలదయ్యె. 49

ప్రతిపదార్థం: ఇంతకాలమేని= ఇంతకాలమయినా; ఎఱుఁగక= తెలియక; సంగాభిభూతయగుచున్= సాంగత్యసహిత అవుతూ; అప్రబోధకలిత+ఐనయట్టి= అజ్ఞానసహిత అయినటువంటి; ప్రకృతి= ప్రకృతియే; ఏను+అంటిన్= నేను అనుకున్నాను; నిస్సంగ బోధమహిమన్= నిస్సంగమహిమ, బోధమహిమ (సాంగత్య రహితతత్త్వమూ, జ్ఞానసహితతత్త్వమూ) - అనేవాటిని; కానన్+ పోలదు+ అయ్యెన్= తెలుసుకోలేకపోయాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: సాంగత్యసహితమూ జ్ఞానరహితమూ అయిన ప్రకృతియే నేను అని ఇంతకాలమూ తెలియక అనుకొన్నాను. నిస్సంగమహిమనూ జ్ఞానమహిమనూ గుర్తించలేకపోయాను. (అని జీవుడు అనుకొంటాడట).

క. ప్రకృతికి నాకును నుదకము। నకు మత్స్యంబునకుఁ బోలె నైసర్గికమై
ప్రకటంబైనది వేర్పా। టకట! యహంకారవశత నది యే నంటిన్. 50

ప్రతిపదార్థం: ప్రకృతికిన్= ప్రకృతినీ; నాకునున్= నాకూ; ఉదకమునకున్ మత్స్యంబునకున్+పోలెన్= నీటికీ చేపకూ వలె; నైసర్గికమై= సహజసిద్ధమై; వేర్పాటు= విభిన్నత; ప్రకటంబైనది= స్పష్టంగా ఉంది; అకట!= అయ్యో!; అహంకారవశతన్= అహంకారానికి వశుడిని అవటంవలన; అది= ఆ ప్రకృతి; ఏను+అంటిన్= నేనే అనుకొన్నాను.

తాత్పర్యం: (ప్రబుద్ధుడైన పురుషుడు ఇంకా ఇట్లా అనుకొంటాడట). నీటికీ చేపకూ వలె ప్రకృతికీ నాకూ విభిన్నత అనేది సహజసిద్ధమై స్పష్టంగా భాసిస్తూనే ఉన్నది. అయినా అయ్యో! అహంకారంవలన నేనే ఆ ప్రకృతి అనుకొన్నాను సుమా!

విశేషం: నీరూ చేపా వేరు వేరు అన్న దృష్టాంతాన్ని వ్యాసుడే ఇచ్చాడు. **మత్స్యోఽన్యత్వం యథా జ్ఞానాదుదకాన్నాభిమన్యతే । ఆత్మానం తద్వదజ్ఞానాదన్యత్వం చైవ వేద్మ్యహమ్** ॥ (12-295-25). అజ్ఞానంతో చేప వలను అనుసరించినట్టుగా పురుషుడు ప్రకృతివెంట పడతాడనికూడా వ్యాసుడు చెప్పాడు. 'మత్స్యో జాలం హ్యవిజ్ఞానా దనువర్తితవాం స్తథా' (12-295-23).

క. ప్రకృతి గుణంబులఁ గొని బహు। వికృతపురూపముల నట్లు వెట్టిగొలిపె నే
నకలంకుండ నరూపుఁడఁ। బ్రకృతి దొఱఁగి నిలిచెదను నిరంజనమహిమన్. 51

ప్రతిపదార్థం: ప్రకృతి= ప్రకృతి; గుణంబులన్ కొని= సత్త్వాది గుణాలను స్వీకరించి; బహు= పలురకాలయిన; వికృతపురూపములన్= రూపవికారాలతో; అట్లు= ఆ విధంగా; వెట్టిగొలిపెన్= వ్యామోహపరచింది; (నిజానికి) నేను; అకలంకుండన్= కళంకరహితుడను; అరూపుఁడన్= రూపరహితుడను; ప్రకృతిన్ తొఱఁగి= ప్రకృతి విడిపించుకుని (విడిచిపెట్టి); నిరంజనమహిమన్= నిరంజనమహిమతో (అహంకారమమకార రహితస్థితిలో); నిలిచెదను= నిలుస్తాను.

తాత్పర్యం: ప్రకృతి తన గుణవికారాలతో లోభపెట్టి ఇంతకాలమూ నన్ను వెర్రివాడిని చేసింది. నిజానికి నేను కళంకరహితుడను, రూపరహితుడను, ఈ ప్రకృతిని విడిచి నిర్మముడనూ, నిరహంకారుడనూ అయి శాశ్వతంగా నిలుస్తాను. అక్షరత్వం పొందుతాను.

తే. ప్రకృతి సేసెనె యీ యపరాధ మరయ?। నాయదియకాక వే ఱొకండే? యసంగ
కలితుఁడగు నేను దానితోఁ గలియనేల?। కలిగె బహురూపములు దానఁగాదె నాకు. 52

ప్రతిపదార్థం: ఈ అపరాధము= ఈ అపరాధాన్ని; ప్రకృతి చేసెనె?= నిజంగా ప్రకృతియే చేసిందా?; అరయన్= ఆలోచించి చూస్తే; నా+అదియకాక= ఇది నా అపరాధమే కాక; వేఱొకండే?= వేరొకటా?; అసంగకలితుఁడు+అగు= సాంగత్యరహితుడను అయిన; నేను= నేను(జీవుడు లేక పురుషుడు); దానితోన్= ఆ ప్రకృతితో; కలియన్+ఏల?= కలవటం ఎందుకు?; నాకున్= నాకు; బహురూపములు= అనేకరూపాలు; కలిగెన్= కలగటం; దానన్ కాదె!= దానివల్లనే కదా!

తాత్పర్యం: నిజంగా ఈ అపరాధం ప్రకృతివలననే జరిగిందా? కాదు. దోషమంతా నాదే. అసంగుడను అయిన నేను అసలు ప్రకృతితో ఎందుకు కలిశాను?అట్లా నేనై కలిసినందువలననే కదా ఈ అనేకరూపత కలిగింది నాకు!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మమతంగాదే బహు జ । న్మములయ్యెడు! దీని విడిచి నానాయోని
భ్రమణంబుం బాసెద న । త్యమలుఁడ నగు నాకుఁ బ్రకృతి యాశ్రయ మేలా? 53

ప్రతిపదార్థం: మమతన్ కాదె= మమకారం వల్లనే కదా; బహుజన్మములు+అయ్యెడున్!= బహుజన్మలు కలుగుతున్నాయి!; దీనిన్= ఈ మమకారాన్ని; విడిచి= పరిత్యజించి; నానాయోని భ్రమణంబున్= పలు జాతులలో జన్మించటమనే ఈ తిరుగుడును; పాసెదన్= తొలగించుకుంటాను, అతి+అమలుఁడన్+అగు= పూర్తిగా నిర్మలుడను అయిన; నాకున్= నాకు; ప్రకృతి ఆశ్రయము= ప్రకృతిని ఆశ్రయించటమనే ఈ లక్షణం; ఎలా?= ఎందుకూ?

తాత్పర్యం: మమకారంవలన బహుజన్మలు కలుగుతున్నాయి. దానిని వదలించుకొన్నాను - అంటే ఈ నానా జన్మభ్రమణం తొలగిపోతుంది. సహజంగా నేను (పురుషుడు - జీవుడు) నిర్మలుడను. ప్రకృతిని ఆశ్రయించటం అనే ఈ లక్షణం నాకెందుకు? అనవసరం.

తే. ఎన్ని రూపులు గొనివచ్చి యెట్లు పొడవు । చూపెనేనియుఁ బ్రకృతినేఁ జూడ మమత
నా నహంకారమనఁ గల్గు వానిఁ జేర । నీక త్రోచినఁ బ్రకృతి దానెట్లు దోఁచు? 54

ప్రతిపదార్థం: ఎన్నిరూపులు= ఎన్ని రూపాలను; కొని= ధరించి; వచ్చి= ప్రత్యక్షమై; పొడవున్+చూపెన్+ఏనియున్= విజృంభణను చూపించినా; ప్రకృతిన్= ఈప్రకృతిలో; ఏన్+చూడన్= నేను పరిశీలిస్తే; మమత+నాన్= మమకారం అనీ; అహంకారము+అనన్= అహంకారం అనీ; కల్గున్= రెండు ఉన్నాయి; వానిన్= ఆ రెండింటినీ; చేరనీక= దగ్గరకు రానివ్వకుండా; త్రోచినన్= పరిహరించినట్లయితే; ప్రకృతి= ఈ ప్రకృతి; తాను= అది; ఎట్లుతోఁచున్?= ఇంక ఎలా నన్ను వశపరచుకుంటుంది? (వశపరచుకోదు).

తాత్పర్యం: ఎన్ని రూపాలలో ఈ ప్రకృతి విజృంభించినా మమకారం, అహంకారం అనేవి రెండే దీని మూలతత్త్వాలు. ఇవి రెండూ పరిహరించగలిగితే ఇంక ఈ ప్రకృతి పురుషుడిని ఏమీ చేయలేదు.

క. నిశ్చేతనయును నెంతయు । దుశ్చేష్టయునైన ప్రకృతి దొఱఁగి సముద్య
న్నిశ్చయవృత్తి నిరామయ । నిశ్చలనిర్మల పదైక నిరతుఁడ నగుదున్.' 55

ప్రతిపదార్థం: నిశ్చేతనయున్= చైతన్యరహితమూ; ఎంతయున్= మిక్కిలి; దుశ్చేష్టయున్+అయిన= దుశ్చేష్టాసహితమూ అయిన; ప్రకృతిన్= ఈ ప్రకృతిని; తొఱఁగి= విడిచిపెట్టి; సముద్యత్= విజృంభిస్తున్న; నిశ్చయవృత్తిన్= నిశ్చయ ప్రవృత్తితో (నేను= నేను); నిరామయ= ఆమయ రహితమూ (రోగాదికాలు లేనిది); నిశ్చల= నిశ్చలమూ; నిర్మల= మలిన రహితమూ అయిన; పద+ఏక+నిరతుఁడన్= స్థానం పట్ల మాత్రమే ఆసక్తి కలవాడను; అగుదున్= అవుతాను.

తాత్పర్యం: నిశ్చేతనతా దుశ్చేష్టతలు ప్రకృతి లక్షణాలు. అటువంటి ప్రకృతిని విడిచిపెట్టివేయాలి. అప్పుడు నిశ్చయవృత్తితో నిరామయ నిశ్చల నిర్మలపదాన్ని పొందగలుగుతాను'.

వ. అని యిట్లు పరబోధనంబునం జేసి క్షరంబగు నవ్యక్తంబు దొఱంగిన పంచవింశకుం డక్షరం బనం బరఁగు, నక్షరంబునకుం బరంబైన దానిం బెక్కండ్రెఱుంగరు, సాంఖ్యసూక్ష్మ త్వదర్శకులు గాంతురు, క్షరాక్షర పరంబు లప్రబుద్ధబుధ్యమాన బుద్ధంబులను నిర్దేశంబులు గలిగియుండుఁ, బరతత్త్వ నిర్దేశంబునం బొల్చు షడ్వింశకంబు బుద్ధంబును విమలంబును నప్రమేయంబును సనాతనంబునునై పంచవింశంబును జతుర్వింశంబునుం గనుచు వెలుంగు నని చెప్పి వెండియు. 56

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని+ఇట్లు= ఈ ప్రకారంగా; పరబోధనంబునన్+చేసి= ఉత్తమ జ్ఞానంవలన; క్షరంబు+అగు= నశించేదైన; అవ్యక్తంబున్= ప్రకృతిని; తొఱంగిన= విడిచిపెట్టిన; పంచవింశకుండు= ఇరవై అయిదవ తత్త్వమైన పురుషుడు (జీవుడు); అక్షరంబు+అనన్= 'అక్షరము' అని; పరఁగున్= అలరారుతాడు; అక్షరంబునకున్= ఈ అక్షరతత్త్వానికన్నా; పరంబు+అయిన+దానిన్= ఉత్తమమైన దానిని (పైది) (నాశనము లేనివాడు); పెక్కండ్రు= చాలామంది; ఎఱుంగరు= ఎరుగరు; సాంఖ్యసూక్ష్మత్వ దర్శకులు= సాంఖ్యశాస్త్రంలో ఉన్న సూక్ష్మతత్త్వాన్ని గ్రహించగలిగినవారు మాత్రమే; కాంతురు= గ్రహిస్తారు; క్షర+అక్షర+పరంబులు= క్షరమూ, అక్షరమూ పరమూ అనే ఈ మూడూ; అప్రబుద్ధ+బుధ్యమాన+బుద్ధంబులు= అప్రబుద్ధమూ,(తెలుసుకోబడనిది) బుధ్యమానమూ (తెలుసుకొంటున్నది); బుద్ధమూ; (తెలుసుకోబడినది) అను= అనేటటువంటి; నిర్దేశంబులు= పేర్లు; కలిగియుండున్= కలిగిఉంటాయి; పరతత్త్వనిర్దేశంబునన్= పరతత్త్వం అనే పేరుతో; పొల్చు= ఉండేటటువంటి; షడ్వింశకంబు= ఈ ఇరవై ఆరవతత్త్వం; బుద్ధంబును= బుద్ధమూ (జ్ఞానసంపన్నం); విమలంబును= (మలినరహితం) విమలమూ; అప్రమేయంబును= కొలతకు అందనిదీ; అప్రమేయమూ; సనాతనంబును+ఐ= సనాతనమూ అయి; పంచవింశంబును= ఇరవై అయిదవ తత్త్వాన్నీ; చతుర్వింశంబును= ఇరవై నాల్గవతత్త్వాన్నీ; కనుచున్= దర్శిస్తూ; వెలుంగున్= ప్రకాశిస్తుంది; అని చెప్పి= అని వసిష్ఠుడు వివరించి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని ఈ విధంగా ఉత్తమ జ్ఞానం వల్ల నశించే ప్రకృతిని విడిచిపెట్టిన పురుషుడు (ఇరవై అయిదవతత్త్వం) అక్షరు డనబడతాడు. దీనికంటె పైన ఉన్న ఉత్తమతత్త్వాన్ని చాలామంది ఎరుగరు. సాంఖ్యులు తప్ప. క్షరుడు, అక్షరుడు, ఉత్తముడు; వీరు అప్రబద్ధులు (తెలుసుకోబడనివారు)ఇరవై ఆరవతత్త్వం పురుషతత్త్వం. వరుసగా ఇవి - తెలిసికొనబడనిది, తెలిసికొంటున్నది, తెలియబడినదీను, చివరిది (పరతత్త్వం) జ్ఞానసంపన్నం, శుద్ధం, కొలతకు అందనిదీ, శాశ్వతమైనదీను. ఇది ఇరవై అయిదవతత్త్వాన్ని, ఇరవై నాలగవతత్త్వాన్ని దర్శిస్తూ వెలుగొందుతుంది.

క. 'విను దృశ్యంబు నదృశ్యం। బును నగు జీవ పరతత్త్వములు బ్రహ్మసమా
ఖ్యను నెగడుఁ బ్రకృతి కది లే। దనఘా! యక్షరము తెఱఁగు నభివర్ణింతున్. 57

ప్రతిపదార్థం: అనఘా!= పవిత్రుడవైన జనకమహారాజా!; విను; దృశ్యంబున్= దృశ్యమూ; అదృశ్యంబును= అదృశ్యమూ; అగు= అయిన; జీవ-పరతత్త్వములు= జీవతత్త్వం, పరతత్త్వం అనేవి (ఈ జీవుడూ పరుడూ); బ్రహ్మసమాఖ్యను= బ్రహ్మ(తత్త్వం) అనే పేరుతో; నెగడున్= ఒప్పారుతుంటాయి; ప్రకృతికిన్= ప్రకృతికి; అది లేదు= ఆ పేరు లేదు; అక్షరము తెఱఁగున్= అక్షరతత్త్వంయొక్క పద్ధతిని; అభివర్ణింతున్= వివరిస్తాను.

తాత్పర్యం: దృశ్యమూ అదృశ్యమూ అయిన ఈ జీవతత్త్వపరతత్త్వాలకు 'బ్రహ్మము' అనే పేరుకూడా ఉన్నది. ప్రకృతికి అది లేదు. ఇంక అక్షరతత్త్వాన్ని వివరిస్తాను తెలిసికొనుము.

ఆ. ప్రకృతి దొఱఁగి తన్నుఁ బరికించు జీవుండు। పరముఁ గాంచునపుడు ప్రకృతి సగుణ
తానిరూఢి యడఁగి తన్మయత్వము నొంది। జీవకేవలత్వసిద్ధి యొలయు. 58

ప్రతిపదార్థం: ప్రకృతిన్= ప్రకృతిని; తొఱఁగి= విడిచిపెట్టి; తన్నున్= తనను తాను; పరికించు= దర్శించేటువంటి; జీవుండు= జీవుడు (పురుషుడు); పరమున్= పరతత్త్వాన్ని (ఇరవై ఆరవది); కాంచునపుడు= తెలుసుకొనేటప్పుడు; ప్రకృతి= ప్రకృతి తాలూకు; సగుణతానిరూఢి= సగుణత్వస్ఫూర్తి; అడఁగి= నశించి; తద్+మయత్వమున్ ఒంది= తన్మయత్వాన్ని పొంది; జీవకేవలత్వసిద్ధి= జీవుడియొక్క కేవలతా సిద్ధి (నేను ప్రకృతికాదు. కేవలమూ జీవుడిని అనే స్థితిని); ఒలయున్= పొందుతాడు.

తాత్పర్యం: ప్రకృతిని విడిచిపెట్టేసి, జీవుడు తనను తాను తెలిసికొని, పరతత్త్వాన్ని దర్శించేటప్పుడు ప్రకృతి తాలూకు సగుణత్వస్థితి నశించిపోతుంది. తన్మయత్వాన్ని పొంది ఈ పురుషుడు తన కేవల జీవతత్త్వసిద్ధిని గ్రహిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **విను కేవలుఁడగు జీవుఁడు । దనుఁ బరముంగాఁగఁ జూచి తల్లీనత్వం**
బున వెలుఁగు నది నిరామయ । మనంతమగు పదముసూవె యతులవివేకా! 59

ప్రతిపదార్థం: అతులవివేకా!= సాటిలేని వివేకంకలవాడా!; విను; కేవలుఁడు+అగు+జీవుఁడు= కేవలత్వసిద్ధిని పొందిన జీవుడు; తనున్= తనను తాను; పరమున్+కాఁగన్= పరతత్త్వంగా; చూచి= దర్శించి; తద్+లీనత్వంబునన్= తన్మయత్వంతో; వెలుఁగున్= ప్రకాశిస్తాడు (పరతత్త్వమయుడు అవుతాడు); అది= ఆ స్థితి; నిరామయము= ఆ మయరహితమూ; అనంతము+అగు= అనంతమూ అయిన పదము+చూవె= స్థానం సుమా!

తాత్పర్యం: తన కేవలత్వాన్ని గుర్తించిన జీవుడు తనను తాను పరతత్త్వంగా దర్శించి తల్లీనుడవుతాడు. అదే నిరామయమూ అనంతమూ అయిన పదం సుమా!

క. **ఈ నెఱి పురుషునకుం గల । నానాత్వైకత్వములును నరనాయక! శా**
స్త్రానూన దృష్టిఁ గనుఁగొనఁ । గా నగుఁ దాత్పర్యశుద్ధి కలితాత్మునకున్. 60

ప్రతిపదార్థం: నరనాయక= ఓ జనకమహారాజా!; ఈ నెఱిన్= ఈ విధంగా (ఈ ఉపాయంతో); పురుషునకున్ కల= పురుషుడికి (జీవుడు) ఉన్న; నానాత్వ+ఏకత్వములును= అనేకత్వమూ ఏకత్వమూ అనేవి; శాస్త్ర+అనూనదృష్టిన్= శాస్త్రం తాలూకు మహోన్నత దృష్టితో; తాత్పర్యశుద్ధికలిత+ఆత్మునకున్= శ్రద్ధకలిగినవాడికి; కనుఁగొనఁగాన్+అగున్= తెలుసుకోవటం సాధ్యమవుతుంది.

తాత్పర్యం: ఓ రాజా! పురుషుడికి సంబంధించిన ఏకత్వం, అనేకత్వం అనేవాటిని శాస్త్రమర్యాదతో ఈ విధంగా తెలిసికొనవచ్చును. శ్రద్ధ ఉన్నవాడు ఇవి గ్రహించగలుగుతాడు.

క. **అనఘా! మోక్షము తెఱఁ గిది । విను మోక్షణమిట్లు పంచవింశునకుఁ గాఁ**
గనినది యతండు ప్రకృతిం । దనుగాఁ గొని తద్గుణములఁ దగులుట వలనన్. 61

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పావనుడా! విను; మోక్షము తెఱఁగు= మోక్షంతాలూకు పద్ధతి; ఇది= ఇదీ; ఇట్లు; మోక్షణము= (విడుదల) మోక్షం అనేది; పంచవింశునకుఁగాన్= ఇరవై అయిదవ తత్త్వమయిన జీవుడికోసమని; కనినది= ఏర్పడింది, దర్శింపబడింది; అతండు= ఆ జీవుడు (పురుషుడు); ప్రకృతిన్= ఈ ప్రకృతిని; తనున్+కాన్= తానుగా; కొని= సంభవించి, స్వీకరించి; తద్+గుణములన్= ఆ ప్రకృతిగుణాలలో (మమకారాహంకారాదుల్లో); తగులుటవలనన్= తగుల్కోవటంవలన (అతడికి వాటినుంచి మోక్షణం అవసరమయ్యింది అని అన్వయం.)

తాత్పర్యం: పరమపావనుడా! ఇది మోక్ష పద్ధతికి. పంచవింశుడైన పురుషుడికే మోక్షం అనేది. ఈ జీవుడు తనను ప్రకృతిగా భావించి దాని గుణాలలో తగుల్కొని ఉంటాడు కాబట్టి అతడికి వాటినుంచి మోక్షణం (విడుదల) అవసరమవుతుంది.

తే. **తగులువాసి షడ్వింశకత్వమునఁ గలియఁ । దనకు మును లేని కేవలత్వమును నిర్మ**
లత్వ శుచితా స్వతంత్రత్వ సత్త్వపరత । లొందుఁ దద్ధర్మ సమవాయ మొలసి యధిప!' 62

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; తగులున్+పాసి= అహంకార మమకారాలనే ప్రకృతి గుణాల్లో తగుల్కొన్న స్థితిని విడిచిపెట్టి (ఈ జీవుడు); షడ్వింశకత్వమునన్= ఇరవై ఆరవ తత్త్వంలో (పరంలో); కలియన్= ఐక్యం పొందినట్టయితే; తనకున్= తనకు; మునులేని= అంతవరకూ లేని; కేవలత్వమును= కేవలత్వం; నిర్మలత్వ= నిర్మలత్వం; శుచితా= శుచిత్వం; స్వతంత్రత్వ సత్త్వపరతలు= స్వతంత్రత్వం, సత్త్వ పరత్వం అనేవి; తద్+ధర్మ+సమవాయము+ఒలసి= ఆ ధర్మసముదాయంతో ఐక్యం జెంది (అవిభాజ్యంగా); ఒందున్= కేవలత్వాదులను పొందుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ప్రకృతితో తనకున్న తగులును విడిచిపెట్టి పురుషుడు ఇరవై ఆరవతత్త్వంతో కలిసినట్టయితే అతడు తనకు అంతకు ముందు లేని కేవలత్వనిర్మలత్వాది పరతత్త్వలక్షణాలను పొందుతాడు. వాటితో సమైక్యంచెందుతాడు'

వ. అని యిట్లు ప్రబోధించి. 63

ప్రతిపదార్థం: అని+ఇట్లు= అని ఈ ప్రకారంగా; ప్రబోధించి= బోధపరచి - వసిష్ఠుడు ఇంకా కొనసాగిస్తున్నాడు.

తాత్పర్యం: ఈ ప్రకారంగా బోధించి, వసిష్ఠుడు ఇంకా ఇట్లా చెప్పాడు.

క. 'శివమును బరమ బ్రహ్మము । నవికృతియు సనాతనంబు నగు పదమును భూ
ధవ! యెఱిఁగించితి నిర్భయుఁ । డవు గ మ్మలవఱుపు మిది దృఢంబుగ నాత్మన్. 64

ప్రతిపదార్థం: భూధవ!= ఓ రాజా!; శివమును= శుభప్రదమూ; పరమబ్రహ్మమున్= పరబ్రహ్మమూ; అవికృతియున్= వికారాలు లేనిదీ; సనాతనంబున్= సదాతనమూ (ఎల్లకాలమూ ఉండేది); అగు= అయిన; పదమును= స్థానాన్ని - పరమపదాన్ని; ఎఱిఁగించితిన్= నీకు తెలియజేశాను; ఇది= ఈ తత్త్వాన్ని; ఆత్మన్= నీ ఆత్మలో; దృఢంబుగన్= గట్టిగా; అలవఱుపుము= అలవరుచుకో; నిర్భయుఁడవు కమ్ము= భయరహితుడవు కమ్ము.

తాత్పర్యం: 'జనకమహారాజా! శివమూ, పరబ్రహ్మమూ, వికారరహితమూ, సనాతనమూ అయిన పదాన్ని తెలియజేశాను. దీనిని నీవు స్థిరచిత్తంతో అలవరచుకొమ్ము. అందువలన నిర్భయుడవు అవుతావు.

తే. దీని నెఱిఁగించునపుడు భక్తియును శమము । దమము సంశ్రయమును వేదతత్పరతయుఁ
గలుగఁజూచి యెఱింగింపు కానివాని । కీకుమా విద్య పాత్రదానైక నిరతి 65

ప్రతిపదార్థం: దీనిన్= ఈ విద్యను; ఎఱిఁగించునపుడు= నీవు ఎవరికైనా తెలియజెప్పాలనుకుంటే; భక్తియున్= భక్తి; శమము= అంతరింద్రియ నిగ్రహం; దమము= బాహ్యేంద్రియనిగ్రహం; సంశ్రయమును= అనన్యచిత్తంతో శరణాగతిగా ఆశ్రయించటం; వేదతత్పరతయున్= వేదాలపట్ల భక్తితాత్పర్యాలు; కలుగన్+చూచి= ఉండటాన్ని గమనించి కలవాడవై; పాత్రదాన+ఏక+నిరత= పాత్రుడికే దానం చెయ్యాలి అనే నియమం కలవాడా!; ఎఱింగింపు= అటువంటివాడికే తెలియజెప్పుము; కానివానికిన్= ఈ లక్షణాలు లేని అనర్హుడికి; విద్యన్= ఈ సాంఖ్యవిద్యను; ఈకుమా!= ఇవ్వకు సుమా!

తాత్పర్యం: మహారాజా! నీకు ఇంతవరకూ తెలియజెప్పిన ఈ విద్యను నీవు మరెవరికయినా తెలియజెప్పాలని-అనుకొంటే అవతలి వ్యక్తి అర్హతానర్హతలు గమనించి వ్యవహరించుము. భక్తీ, నిగ్రహం, సంశ్రయణం, వేదాలపట్ల గౌరవం - ఈ లక్షణాలు ఉన్నవాడికే ఉపదేశించుము. పాత్రత ఎరిగికదా దానం చేయుమన్నారు! ఈ లక్షణాలు లేని అపాత్రుడికి ఈ విద్యను ఉపదేశం చేయకుము సుమా!

ఆ. అఖిల రత్నపూర్ణయగు వసుంధర యెల్ల । నొసఁగితేని నొసఁగు యోగ్యతాభి
యుక్తిలేనివాని కొసఁగకు మీ విద్య । తగిన పాత్రమైనఁ దడయ కిమ్ము.' 66

ప్రతిపదార్థం: రాజా! అఖిల= సమస్తమైన; రత్న= రత్నాలతో; పూర్ణయగు= నిండినదైన; వసుంధర ఎల్లన్= భూమినంతటినీ; ఒసఁగితేనిన్ ఒసఁగు= ఇస్తే ఇమ్ము; యోగ్యతా+అభియుక్తి లేనివానికిన్= నిగ్రహాదియోగ్యతల కూడిక లేనివాడికి మాత్రం; ఈ విద్యన్= ఈ సాంఖ్య విద్యను; ఒసఁగకుము= ఇవ్వకు; తగిన పాత్రము ఐనన్= తగిన యోగ్యుడు (అర్హుడు) అయినట్టయితే; తడయక= ఆలస్యం చేయకుండా వెంటనే; ఇమ్ము= ఉపదేశించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మహారాజా! యోగ్యతాయోగ్యతలు చూడకుండా ఎవడికి ఇవ్వాలనుకొంటే వాడికి సామ్రాజ్యమంతా ఇచ్చివేయుము. నేను కాదనను. కానీ, ఈ విద్యనుమాత్రం పైని పేర్కొన్న యోగ్యతలు లేనివాడికి దయచేసి ఎప్పుడూ ఇవ్వవద్దు. అర్హుడు అయినట్లయితే మరి ఆలస్యం చేయకుండా వాడికి ఉపదేశించుము'.

క. 'అని చెప్పె, నియతుఁడై విని । జనకనృపాలుఁడు గృతార్థజన్ముం డయ్యెన్
మనుజేంద్రవర్య నీకే । వినిపించితిఁ దదితిహాస విధ మేర్పడఁగన్.' 67

ప్రతిపదార్థం: అని చెప్పెన్= ఈ ప్రకారంగా వసిష్ఠుడు చెప్పాడు; జనక నృపాలుఁడు= జనకమహారాజు; నియతుఁడై= నియమనిష్ఠలు కలవాడై; విని= అంతా శ్రద్ధగా విని; కృతార్థజన్ముండు= చరితార్థమైన జన్మకలవాడు; అయ్యెన్= అయ్యాడు; మనుజేంద్రవర్య!= ఓ రాజశ్రేష్ఠుడా ధర్మరాజా!; తద్= ఆ; ఇతిహాస= జనకవసిష్ఠులమధ్య జరిగిన వృత్తాంతంయొక్క; విధము= వరుస అంతా; ఏర్పడఁగన్= స్పష్టపడేట్టు; నీకున్= నీకు; ఏన్= నేను; వినిపించితిన్= వివరించాను.

తాత్పర్యం: జనకమహారాజు నియమనిష్ఠలతో వసిష్ఠుడు చెప్పినది అంతా విని జన్మ చరితార్థతను పొందాడు. ఓ ధర్మరాజా! ఆ జరిగిన కథ అంతా నీకు నేను స్పష్టంగా వివరించి చెప్పాను.'

వ. అని పలికి భీష్ముఁడు పాండవాగ్రజున కిట్లనియె. 68

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; భీష్ముఁడు; పాండవ+అగ్రజునకున్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

క. 'ఇది బ్రహ్మ వసిష్ఠునకున్ । సదయుండై చెప్పె నతఁడు నారదునకు సం
విదితంబు నేసె నమ్ముని । మదాత్మకుం దేటపఱిచె మహనీయకృపన్. 69

ప్రతిపదార్థం: (ధర్మరాజా!) ఇది= ఈ సాంఖ్యరహస్యాన్ని; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; వసిష్ఠునకున్= వసిష్ఠుడికి; సదయుండై= దయ కలవాడై; చెప్పెన్= తెలియజెప్పాడు; అతఁడు= ఆ వసిష్ఠుడు; నారదునకున్= నారదమహర్షికి; సంవిదితంబున్ చేసెన్= ఎరుక పరిచాడు; ఆ+ముని= ఆ నారదముని; మద్+ఆత్మకున్= నా ఆత్మకు (అంతరంగానికి); మహనీయకృపన్= గొప్ప దయతో; తేటపఱిచెన్= స్పష్టపరిచాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! మొట్టమొదటిగా ఈ తత్త్వరహస్యాన్ని బ్రహ్మదేవుడు వసిష్ఠుడికి తెలియజేశాడు. వసిష్ఠుడు నారదుడికి వివరించాడు. ఆ నారదుడేమో దయతో నాకు ఉపదేశించాడు.

క. ఏను వసిష్ఠవచనముల । కానెఱిఁగించితి మనంబు కలఁక విడిచి యీ
జ్ఞానం బలవఱుపుము పర । మానందప్రదము కౌరవాన్వయముఖ్యా! 70

ప్రతిపదార్థం: కౌరవ+అన్వయ+ముఖ్యా!= కౌరవవంశంలో ప్రధానుడా!; ధర్మరాజా! ఏను= నేను; వసిష్ఠ వచనములు+అ కాన్= వసిష్ఠుని మాటలుగానే (అ కాన్= వలె); ఎఱిఁగించితిన్= నీకు తెలియజెప్పాను; మనంబు(యొక్క) కలఁకన్= దిగులును; విడిచి= విడిచిపెట్టి; ఈ జ్ఞానంబు= నేను ఇంతవరకూ ఉపదేశించిన ఈ విద్యను; అలవఱుపుము= అభ్యాసంలోకి తెచ్చుకొమ్ము; పరమ+ఆనంద ప్రదము= (ఇది) బ్రహ్మానందాన్ని (ఇస్తుంది) ఇచ్చేది.

తాత్పర్యం: పాండవాగ్రజా! నాకు నారదుడు ఉపదేశించిన ఈ విద్యను నీకు (జనక వసిష్ఠుల సంభాషణగా) వసిష్ఠుడి మాటలుగా తెలియజెప్పాను. మానసికమైన కలతను విడిచిపెట్టి, ఈ జ్ఞానాన్ని అలవరచుకొమ్ము. ఇది పరమానందాన్ని సమకూరుస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. క్షరమును నక్షరమును ద । త్పరమును నెఱిఁగితి విశోకభయమోహుఁడవై
కురువర! యా నిశ్శ్రేయస । కరప్రబోధంబు నూఁదు గాఢాదరతన్.' 71

ప్రతిపదార్థం: కురువర!= ఓ కురువంశోత్తమా! ధర్మరాజా!; క్షరమును= క్షరతత్త్వం; అక్షరమును= అక్షరతత్త్వం; తద్ పరమును= వాటికంటే పై దయిన పరతత్త్వం - వీటిని; ఎఱిఁగితి(వి)= తెలుసుకున్నావు; విశోకభయమోహుఁడవై= శోకం, భయం, మోహం అనేవి విగళితమైపోయినవాడవై; ఆ= నేను వివరించిన; నిశ్శ్రేయసకర= మోక్షప్రదమయిన; ప్రబోధంబున్= జ్ఞానాన్ని; గాఢ+ఆదరతన్= మిక్కిలి ఆదరంతో; ఊఁదు(ము)= అవలంబించుము.

తాత్పర్యం: ఓ కురువరా! క్షర, అక్షర పరతత్త్వాల గురించి తెలిసికొన్నావు. శోకం, భయం, మోహం అనేవి నీకు పోయి ఉంటాయి. మోక్షప్రదమైన ఆ విద్యను గాఢమైన ఆదరంతో అవలంబించుము'.

వ. అని చెప్పి వెండియు. 72

ప్రతిపదార్థం: అని చెప్పి= ఇలా వివరించి; వెండియున్= తిరిగి - భీష్ముడే ఇంకా ఇట్లా కొనసాగిస్తున్నాడు.

తాత్పర్యం: ఇట్లా వివరించి, తిరిగి ఇట్లా కొనసాగిస్తున్నాడు.

సీ. 'వేఁట వేడుక నడవికిఁ జని వసుమంతుఁ । డనువాఁడు జనకుని తనయుఁడొక్క
చో భృగువంశతేజో వర్ధనుండగు । నొక మునీశ్వరుఁ జూచి యుచితవృత్తిఁ
జేరి వినమ్రుఁడై 'చిత్తానువృత్తిమై । నిహపరంబుల కెద్ది హితము సెప్ప
వే' యన్నఁ గృప నతండిట్లను - భూతహి । తాహితాచరణంబు లధిప! సౌఖ్య

ఆ. దుఃఖముల నొనర్చు దుర్వార తృష్ణ త । న్నిరసనంబు మేలు నరులు జుంటి
చవియకాని నెగులుఁ జఱి రయంబున నెక్కి । తారు విఱుగఁబడుటఁ దలఁప లేరు. 73

ప్రతిపదార్థం: జనకుని తనయుఁడు= జనకుని కుమారుడైన; వసుమంతుఁడు+అనువాఁడు= వసుమంతుడు అనే వ్యక్తి; వేఁటవేడుకన్= వేటపట్ల ఉన్న వేడుకతో; అడవికిన్ చని= అరణ్యానికి వెళ్ళి; ఒక్కచోన్= ఆ అడవిలో ఒకచోట; భృగువంశతేజోవర్ధనుండు+అగు= భృగువంశ తేజస్సును వృద్ధి పరిచేవాడైన; ఒక మునీశ్వరున్= ఒక మునీశ్వరుడిని; చూచి= దర్శించి; ఉచితవృత్తిన్= తగిన పద్ధతితో (ప్రవర్తనతో); చేరి= సమీపించి; వినమ్రుఁడై= వినయంతో వంగినవాడై; చిత్త+అనువృత్తిమైన్= చిత్తాన్ని అనుసరించి; ఇహపరంబులకున్= ఇహపరాలకు; ఎద్ది= ఏది; హితము= హితమో; చెప్పవే= వివరింపవా'; అన్నన్= అని అడిగేసరికి; కృపన్= దయతో; అతండు= ఆ భృగువంశమునీశ్వరుడు; ఇట్లు+అనున్= ఇలా చెప్పాడు; అధిప!= రాజా! (జనకరాజపుత్రా!) వసుమంతుడా!; భూత= ప్రాణులకు-లేదా పంచభూతాలకూ; హిత= మేలు; అహిత= కీడు; ఆచరణంబులు= చెయ్యటాలు; సౌఖ్య - దుఃఖములన్= సౌఖ్యాన్నీ, దుఃఖాన్నీ; ఒనర్చున్= కలిగిస్తాయి; దుర్వార= వారింపరానిదైన; తృష్ణ= ఇచ్ఛకలిగి ఉండటం; తద్= అది (దానిని); నిరసనంబు= నిరసించటం; మేలు= హితం; నరులు= జీవులు; జుంటి= తేనెయొక్క; చవియకాని= రుచినేకానీ; నెగులున్= శ్రమనూ (దుఃఖాన్నీ); చఱి= కొండచరియను; రయంబునన్= వేగంగా; ఎక్కి= అధిరోహించి; తారు= తాము; విఱుగన్+పడుటన్= విరిగిపడిపోవటాన్నీ; తలఁపన్ లేరు= ఊహించలేరు.

తాత్పర్యం: 'ధర్మరాజా! జనకుడి కుమారుడైన వసుమంతుడు ఒకరోజున వేటకొరకు అడవికి వెళ్ళి అక్కడ ఒకచోట భృగువంశమునీశ్వరుడిని చూచి వినయంగా 'స్వామీ! ఇహపరాలకు హితం ఏదో తెలియచెప్పవా?' అని అడిగాడు. అప్పుడు ఆ మునీశ్వరుడు ఇట్లా అన్నాడు. 'వసుమంతుడా! మనం చేసే హితాహితకార్యాలు సౌఖ్యాన్నీ దుఃఖాన్నీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇస్తాయి. (హితకార్యాలు సౌఖ్యాన్నీ, అహితకార్యాలు దుఃఖాన్నీ ఇస్తాయి). అందుచేత అవి చేయాలి - అనే తృష్ణను విడిచిపెట్టుకొనటం మంచిది. మానవులు ఎట్లాంటివాళ్ళంటే - తేనె రుచిమీద కోరికేకానీ దాన్ని సంపాదించటంలో ఉన్న శ్రమమీద ధ్యాస ఉండదు. దానికొరకు కొండచరియలు ఎక్కుతున్నాం అనుకొంటారే తప్ప ఆనక అక్కడనుండి జారిపడతాం - అనే విషయం తలచుకోరు.

విశేషం: 'దుర్వారతృష్ణతన్నిరసనంబు' అనేది వావిళ్ళవారి ప్రతిలో ఉన్నపాఠం. 'దుర్వారతృష్ణితన్నిరసనంబు' అనేది సంశోధితభారతప్రతిలో ఉన్న పాఠం. 'స్వాదుకాముక! కామానాం వైతృష్ణ్యం కిం న గచ్ఛసి (12-297-7)' కోరికలపట్ల వైముఖ్యం ఎందుకుపొందవు? - అనేది వ్యాసభారతం. తృష్ణతన్ లేదా తృష్ణితన్+నిరసనంబు అని విభజించినా అర్థం కిట్టించవచ్చును. దుర్వారతృష్ణ లేదా తృష్ణి+తన్నిరసనంబు అని సమాసాలుగా విభజిస్తే అన్వయం ఇంకా సులువుగా కుదురుతుంది. కానీ, అప్పుడు 'దన్నిరసనంబు' కావాలి. ఈ పాఠం ఎక్కడా లేదు. అందుచేత ఇక్కడ 'తత్' శబ్దాన్ని సమాసమధ్యంలో పూర్వావయవపరామర్శకంగా ప్రయోగించాడనటమే సమంజసం. దుర్వారతృష్ణ(ష్ణి)యది నిరసించుట - అన్న పద్ధతిలో సమాసం. తత్ - తావదాదులను వాక్యాలంకారాలుగా వాడటమూ సంస్కృతంలో ఉన్నది. అప్పుడు 'తృష్ణాతన్నిరసనంబు' అని ఉండవలసి వస్తుంది. అది ఆటవెలదిలో కుదరదు. కాబట్టి 'దుర్వారతృష్ణితన్నిరసనంబు' అన్న సంశోధితముద్రణ పాఠమే మేలుబంతి.

క. ధర్మంబుఁ బరిజ్ఞానము । నిర్మలమతి నభ్యసించి నృప! యనిశంబున్
ధార్మికసంగతి గలిగినఁ । బేర్మి యుభయలోకముల నభిష్టుత్యమగున్.' 74

ప్రతిపదార్థం: నృప!= ఓ వసుమంతుడా!; ధర్మంబున్= ధర్మాన్నీ; పరిజ్ఞానమున్= విద్యనూ; నిర్మలమతిన్= నిర్మలమైన మనస్సుతో(నూ); అభ్యసించి= అలవరచుకొని; అనిశంబున్= ఎల్లవేళలా (రేయింబవళ్ళు); ధార్మికసంగతి= ధార్మికుల సాంగత్యం (ధార్మికక్రియల సాంగత్యం); కలిగినన్= పొందినట్టయితే; పేర్మి= ఆ గొప్పదనం; ఉభయలోకములన్= ఇహ పరలోకాలలో; అభిష్టుత్యము+అగున్= కొనియాడదగినది అవుతుంది.

తాత్పర్యం: ఓ వసుమంతుడా! ధర్మాన్నీ, జ్ఞానాన్నీ నిర్మలమైన మనస్సుతో అభ్యసించాలి. ఎల్లవేళలా ధార్మికసాంగత్యం పెంపొందించుకొనాలి. అప్పుడు ఆ గొప్పదనం ఆ ప్రవర్తన ఇహపరలోకాలలో అభినందించబడుతుంది'
.

వ. అని మఱియును. 75

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; మఱియును= ఇంకా.

తాత్పర్యం: అని చెప్పి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. బ్రాహ్మణ ప్రార్థితములైన పనులు సేయు । మిమ్ము ధనము పాత్రములకు నిచ్చి వగవ
కుండు, మక్రోధకామత్వ మొలయఁ జేయు । మతికి ధృతి సాలఁ గల్గుము మనుజనాథ! 76

ప్రతిపదార్థం: మనుజనాథ!= ఓ వసుమన్మహారాజా!; బ్రాహ్మణ= బ్రాహ్మణులచేత; ప్రార్థితములైన= కోరబడిన; పనులు= కార్యాలు; చేయుము= చెయ్యి; పాత్రములకున్= అర్హులకు; ధనము= ధనం; ఇమ్ము; ఇచ్చి= అట్లా దానంచేసి; వగవకుండుము= మరి బాధపడవద్దు; అక్రోధకామత్వము= క్రోధరహితత్వం - కామరహితత్వాలను; ఒలయన్ చేయు(ము)= పొందుము; మతికిన్= మదికి(అంతరంగానికి); ధృతి= ధైర్యాన్ని; చాలన్= అధికంగా; కల్గుము= కలిగించుకొమ్ము.

తాత్పర్యం: 'ఓ రాజా! బ్రాహ్మణులు కోరిన పనులు చేయుము. పాత్రత గుర్తించి ధనాదికం దానం చేయుము. చేసిన తరువాత 'అయ్యో! ఇచ్చేశానే' అని బాధపడకుము. క్రోధాన్నీ, కామాన్నీ విడిచిపెట్టుము. మనస్సుకు ధైర్యం పెంపొందించుకొమ్ము. ఇది చాలా ముఖ్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ధృతిలేమింగాదె మహాభిషాఖ్యుండగు నృపముఖ్యుండు త్రివిష్టపంబుననుండి విభ్రష్టుండయ్యె! ధృత్యాలంబనంబునంగదా యయాతి యాపద నిస్తరించె!' 77

ప్రతిపదార్థం: మహాభిష+ఆఖ్యుండు+అగు= మహాభిషుడు అనే పేరుగల; నృపముఖ్యుండు= రాజోత్తముడు; ధృతిలేమిన్+కాదె= ధృతి అనేది లేకపోవటంవలననే కదా; త్రివిష్టపంబుననుండి= స్వర్గంనుండి; విభ్రష్టుండు+అయ్యెన్!= పరిభ్రష్టుడయ్యాడు! (జారిపడ్డాడని); యయాతి= యయాతి మహారాజు; ధృతి+ఆలంబనంబునన్+కదా= ధృతిని అవలంబించటం వల్లనేకదా!; ఆపదన్= ప్రమాదాన్ని; నిస్తరించెన్!= కడచి గట్టెక్కగలిగాడు! (సం. 12-297-23).

తాత్పర్యం: మహాభిషుడనే రాజు ధైర్యం కోల్పోయే కదా స్వర్గభ్రష్టుడైనాడు! అదీ ధైర్యాన్ని పొందటంవలననే కదా! యయాతి ఆపదనుండి బయటపడ్డాడు!'

**క. అనిన విని యా నృపతి య । మ్ముని వచనము లూఁది కామమునకుం గ్రోధం
బునకుం దొలఁగించి తనదు । మనము ధృతికి ధర్మమునకు మరుగంజేసెన్.' 78**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పేసరికి; ఆ నృపతి= ఆ వసుమంతుడు; ఆ+మునివచనములు= ఆ భృగువంశమహర్షి మాటలను; ఊఁది= ఆధారం చేసికొని; తనదు మనమున్= తన మనస్సును; కామమునకున్= కామానికీ; క్రోధంబునకున్= క్రోధానికీ; తొలఁగించి= దూరంచేసి; ధృతికిన్= ధైర్యానికీ; ధర్మమునకున్= ధర్మానికీ; మరుగన్+చేసెన్= అలవాటు పడేటట్టు చేశాడు.

తాత్పర్యం: భృగువంశమహర్షి చేసిన ఉపదేశాన్ని ఆధారం చేసికొని ఆ వసుమంతుడు కామక్రోధాలను వదలిపెట్టి ధృతిధర్మాలను అలవాటు చేసికొన్నాడు.'

వ. అని చెప్పినం బ్రియంబంది మందాకినీనందనుతో ధర్మనందనుండు 'ధర్మాధర్మవియుక్తంబును సర్వసంశయ విముక్తంబును జన్మమృత్యు రహితంబును నిత్యంబును శుచియును శివంబును నవ్యయంబును పరంబును ననాయాసంబును నగునట్టిదాని నెఱింగింపవే?' యని ప్రార్థించిన నతండు యాజ్ఞవల్క్య జనక సంవాదం బితిహాస రూపంబునం బ్రవర్తిల్లు నది వినిన భవదభ్యర్థితంబైన యర్థంబు ప్రతిభాసించు మఱియు వలయునవి యెఱుంగనగుం జెప్పెదనని పలికి యతని కిట్లనియె. 79

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని చెప్పేసరికి; ప్రియంబు+అంది= సంతోషించి; మందాకినీనందనుతోన్= గంగాపుత్రుడైన భీష్ముడితో; ధర్మనందనుండు= ధర్మరాజు; ధర్మ+అధర్మ+వియుక్తంబును= ధర్మాధర్మాలు లేనిదీ; సర్వసంశయ= సమస్త సంశయాలనుంచీ; విముక్తంబును= విడుదల పొందినదీ; జన్మమృత్యు రహితంబును= పుట్టుక చావులు లేనిదీ; నిత్యంబును= సదాతనమైనదీ; శుచియును= పరిశుభ్రమైనదీ; శివంబును= శుభప్రదమైనదీ; అవ్యయంబును= నశించనిదీ లేక మార్పులేనిదీ; పరంబును= పరము అని పిలువబడేదీ; అనాయాసంబును= దుఃఖరహితమైనదీ (క్లేశరహితమనిగానీ); అగునట్టి దానిన్= ఇటువంటి లక్షణాలు గల తత్త్వాన్ని; ఎఱింగింపవే?= తెలియజెప్పవా?; అని; ప్రార్థించినన్= ప్రార్థించేసరికి; అతండు= ఆ భీష్ముడు; యాజ్ఞవల్క్యజనక సంవాదంబు= యాజ్ఞవల్క్యుడూ, జనకుడూ - వీరిద్దరికీ మధ్య సాగిన సంభాషణ; ఇతిహాసరూపంబునన్= కథారూపంగా; ప్రవర్తిల్లును= ప్రసిద్ధికెక్కింది; అది= ఆ వృత్తాంతాన్ని; వినినన్= విన్నట్టయితే; భవత్= నీచేత; అభ్యర్థితంబైన= ప్రార్థించబడిన; అర్థంబు= విషయం; ప్రతిభాసించున్= నీకు అవగతమవుతుంది; మఱియున్= అంతేకాదు; వలయునవి= కావలసినవి అన్నీ; ఎఱుంగన్+అగున్= తెలుస్తాయి; చెప్పెదన్= ఆ ఇతిహాసం చెప్తుతాను; అని పలికి= అని చెప్పి; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు అనియెన్= ఇలా తెలియజేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: భీష్ము డింతవరకు చెప్పినదానికి సంతోషపడి ధర్మరా జతడితో 'ధర్మాధర్మాల విచారం లేనిదీ, అన్ని సంశయాలనూ పోగొట్టేదీ చావుపుట్టుకలు లేనిదీ, శుచి, శుభ్రత కలిగినదీ, శాశ్వతమైనదీ, మార్పులేనిదీ, 'పరము' అని పిలువబడేది, దుఃఖాన్ని పోగొట్టేదీ - అయినట్టి తత్త్వాన్ని బోధించు' మన్నాడు. దానికి బదులుగా 'నీ ప్రశ్నలన్నింటికి సమాధానం ఇదీ - యాజ్ఞవల్క్యజనక సంవాదాన్ని గూర్చి చెప్తుతాను' అంటూ ఆ వృత్తాంతాన్ని చెప్పసాగాడు.

యాజ్ఞవల్క్య జనకరాజ సంవాదప్రకారము (సం.12-298-3)

ఆ. వినుము సకలలోక విశ్రుత విజ్ఞాన । ఘనుని యాజ్ఞవల్క్యుఁడను మునీంద్రు
వినయ మొప్పఁ గాంచి వినతుఁడై మిథిలేశుఁ । డైన జనకనృపతి యతనితోడ. 80

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! వినుము; సకలలోక= సమస్తలోకాల్లో; విశ్రుత= ప్రసిద్ధికెక్కిన; విజ్ఞానఘనునిన్= మహా విజ్ఞాని అయిన; యాజ్ఞవల్క్యుఁడు+అను+మునీంద్రున్= యాజ్ఞవల్క్యుడనే మునీశ్వరుడిని; వినయము+ఒప్పన్= వినయం అలరారేటట్టు; కాంచి= దర్శించి; వినతుఁడై= నమస్కరించినవాడై; మిథిలేశుఁడైన జనకనృపతి= మిథిలాపరిపాలకుడైన జనకమహారాజు; అతనితోడన్= ఆ యాజ్ఞవల్క్య మహర్షితో.

తాత్పర్యం: ధర్మరాజా! యాజ్ఞవల్క్యుడు సకలలోకాలలోనూ ప్రసిద్ధికెక్కిన మహాజ్ఞాని. ఒకరోజున జనకమహారాజు ఆ మహర్షిని దర్శించాడు. సాష్టాంగ నమస్కారం చేశాడు. ఇట్లా అడిగాడు.

వ. ఇంద్రియంబులు నవ్యక్తంబును బ్రహ్మంబును బరంబును భూతసర్గ ప్రళయంబులును దత్కాల సంఖ్యలును దేటపఱిచి భవదీయ దయాళుత్వంబు నెఱపవే యనిన నమ్మునివరుం డమ్మహీవరున కిట్లనియె. 81

ప్రతిపదార్థం: ఇంద్రియంబులును= జ్ఞానకర్మేంద్రియాలూ; అవ్యక్తంబును= ప్రకృతి; బ్రహ్మంబును= బ్రహ్మము అనబడేది; భూత సర్గ ప్రళయంబులును= పంచభూతాలూ, వాటి సృష్టి, వాటి ప్రళయం; తత్కాల సంఖ్యలును= వాటికి చెందిన కాలసంఖ్యలు; తేటపఱిచి= (వీటిని) నాకు స్పష్టంగా తెలియజేసి; భవదీయ= నీయొక్క; దయాళుత్వంబు= కృపాసహితత్వాన్ని (దయగలవాడవు అనటాన్ని); నెఱపవే= నిర్వహించవా; అనినన్= అని అభ్యర్థించేసరికి; ఆ+మహీవరునకున్= ఆ జనకమహారాజుకు; ఆ మునివరుండు= యాజ్ఞవల్క్యుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఇంద్రియాలు, ప్రకృతి, బ్రహ్మము, పంచభూతాలూ, వాటి సృష్టి, ప్రళయం, వాటి సంఖ్యను - వీటి నన్నిటినీ దయతో నాకు చెప్పవలెను' అని జనక మహారాజు అడుగగా, దానికి మునిశ్రేష్ఠుడైన యాజ్ఞవల్క్యుడు ఇట్లా సమాధాన మిచ్చాడు.

సీ. 'అధిప! సర్గముఁ బ్రళయంబు నవ్యక్తంబు । దానొనరించుఁ దత్కాల సంఖ్య
విను-కల్పములు పది దినమున, కంతియ । రజనికాలంబు, సర్గంబు పగలు
సేయు, రే ప్రళయంబు సెల్లించుఁ దొలుత న । శేషభూతములకు జీవనముగ
నోషధికల్పన మొనరించు, దానికై । హైరణ్యమైన మహాండమున వి

తే. ధాతఁ బుట్టించు, నతఁడు భూతములనెల్ల । జనన మొందించు, భూమ్యాది సారభూత
గంధముఖ్య గుణోత్కరగ్రాహకములు । శ్రోత్రముఖములు, దత్స్వామి సూవె మనసు. 82

ప్రతిపదార్థం: అధిప!= జనకమహారాజా!; సర్గమున్= సృష్టినీ; ప్రళయంబున్= ప్రళయాన్నీ (వినాశం); అవ్యక్తంబు= అవ్యక్తం అనబడే ప్రకృతి; తాన్= తాను; ఒనరించున్= కల్పిస్తుంది; తత్కాలసంఖ్య= వాటి కాలపరిమాణం (పరిగణన); విను= చెప్పుతున్నాను ఆలకించుము; దినమునకున్= పగటిపూటకు; కల్పములు= కల్పాలు; పది= పది; రజనికాలంబు= రాత్రి సమయంకూడా; అంతియ= అంతే - పదికల్పాలు; సర్గము= సృష్టి అనే దాన్ని; పగలు చేయున్= పగటిపూట నిర్వహిస్తుంది; రే= రాత్రిపూట; ప్రళయంబు= ప్రళయాన్ని; చెల్లించున్= నిర్వహిస్తుంది; తొలుతన్+అ= వీటి అన్నింటికంటే ముందే; అశేష భూతములకున్= అన్ని ప్రాణులకూ; జీవనముగన్= ఆధారంగా; ఓషధి కల్పనమున్= ఓషధుల సృష్టిని; ఒనరించున్= చేస్తుంది; దానికై= దానికోసమని; హైరణ్యమైన= హిరణ్యసంబంధమైన; మహాండమునన్= ఈ పెద్ద అండంలో - బ్రహ్మాండంలో; విధాతన్= విధాత అనబడే బ్రహ్మదేవుడిని; పుట్టించున్= సృష్టిస్తుంది; అతఁడు= ఆ విధాత; భూతములన్ ఎల్లన్= భూతాలను అన్నింటినీ (పంచభూతాలూ - సకలప్రాణులూ); జననము+ఒందించున్= పుట్టిస్తాడు; భూమి+ఆది= భూమ్యాకాశాది పంచభూతాలకూ; సారభూత= సారమైన; గంధముఖ్య= గంధశబ్దాదులైన; గుణ+ఉత్కర= గుణసమూహానికి; గ్రాహకములు= స్వీకారకాలు (గ్రహించేవి); శ్రోత్రముఖములు= ముక్కూ చెవీ మొదలైన ఇంద్రియాలు; మనసు= మనస్సు అనేది; తద్= ఆ ఇంద్రియాలకు; స్వామి చూవె= ప్రభువు సుమా!

తాత్పర్యం: 'జనకమహారాజా! సర్గమూ ప్రళయమూ అనేవాటిని అవ్యక్తమే ('ప్రకృతి - అహంకారం) సృష్టిస్తుంది. పదికల్పాలు ఒక పగలు. పది కల్పాలు ఒక రాత్రి. పగటిపూట సృజన, రాత్రిపూట ప్రళయం. అశేషప్రాణికోటికీ జీవనాధారంగా అన్నిటి కంటే ముందు ఓషధీసృష్టి జరుగుతుంది. దీనికొరకని ఈ బ్రహ్మాండంలో విధాతను సృష్టిస్తుంది. అత డేమో పంచభూతాలనూ సృష్టిస్తాడు. పృథివీ - అప్ - తేజో - వాయు - ఆకాశాలు పంచభూతాలు. గంధ - రస - రూప - స్పర్శ - శబ్దాలు వీటికి సారభూతమైన గుణాలు. ఈ గుణాలను ముక్కు- నాలుక - కన్ను - చర్మం- చెవి - అనే ఐదు ఇంద్రియాలు గ్రహిస్తాయి. గుణోత్కర గ్రాహకాలు ఇవి. ఈ ఇంద్రియాలకు మనస్సు ప్రభువు.

విశేషం: ఇంద్రియాలకు మనస్సు ప్రభువు అనటాన్ని వ్యాసుడు ఇంకా ఇట్లా వివరించాడు. ఇంద్రియాలు ఏమీ గ్రహించలేవు. గ్రహించేది మనస్సే. కన్ను చూస్తోంది అనుకుంటాం. కాదు. మనస్సే కన్నుతో చూస్తోంది. మనస్సు కనక వ్యాకులంగా ఉంటే చూస్తున్నా కన్ను చూడనట్టే. ఏమీ కనపడదు. మనస్సు ద్వారానే ఇంద్రియాలు అన్నీ ఆయాగుణాలను గ్రహిస్తున్నాయి. మనస్సు నిద్రపోతే ఇంద్రియాలు అన్నీ నిద్రపోతాయి. ఇంద్రియాలు నిద్రపోయినా మనస్సు మాత్రం నిద్రపోదు. అందుచేత మనఃప్రధానాలు ఇంద్రియాలు. **చక్షుఃపశ్యతి రూపాణి మనసా తు న చక్షుషా। మనసి వ్యాకులే చక్షుః పశ్యన్నపి న పశ్యతి । తథేంద్రియాణి సర్వాణి పశ్యన్తీత్యభిచక్షతే**

(12-299-16). మనస్యుపరతే రాజన్ ఇంద్రియోపరమో భవేత్। న చేంద్రియోపరమే మనస్యుపరమో భవేత్ ॥ ఏవం మనః ప్రధానాని ఇంద్రియాణి విభావయేత్ । ఇంద్రియాణాం హి సర్వేషామీశ్వరం (12-299-17,18). ఈ శ్లోకాల భావాన్ని తిక్కన ఈ తరువాతి పద్యంలో అందిస్తున్నాడు.

వ. అది యెట్లంటేని. 83

ప్రతిపదార్థం: అది= మనస్సే ఇంద్రియాలకు ప్రభువు అనటం; ఎట్లు+అంటి(వి)+ఏనిన్= ఎలాగ అన్నట్టయితే - విను.వివరిస్తున్నాను.

తాత్పర్యం: ఇంద్రియాలకు మనస్సే ప్రభువు అవటం వలన. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినుటకును గనుటకును సా । ధనములయిన చెవియుఁ గన్నుఁ దనతనయంతన్
వినను౦ గానను నేర్చునె । మనఃప్రభావమునఁ గాక? మనుజాధీశా! 84

ప్రతిపదార్థం: మనుజాధీశా!= ఓ జనకమహారాజా!; వినుటకును= వినటానికీ; కనుటకునున్= చూడటానికీ; సాధనములు+ఐన= సాధనాలైన (ఉపకరణాలైన ఇంద్రియాలు); చెవియున్= చెవీ; కన్నున్= కన్నూ; మనఃప్రభావమునన్ కాక= ఇదంతా మనస్సు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రభావంతో కాకుండా తనతనయంతన్= తమంతతాము; వినమన్= వినటం; కానమన్= చూడటం; నేర్చునె?= చెయ్యగలవా?;(అవి తమంతతాము వినలేవు, చూడలేవు అని.)

తాత్పర్యం: ఓ మహారాజా! మనస్సు ప్రభావంతోనే తప్ప చెవి తనంత తాను వినలేదు, కన్ను తనంత తాను చూడలేదు. ఇట్లాగే తక్కిన ఇంద్రియాలు అన్నీను.

తే. **ఇంద్రియములెల్ల నట్టివ యెలసి యొండు । వలన మనసున్నఁ దమతమ వర్తనముల**
నిగుడ నేరమి తెల్లంబు నృపవరేణ్య! । యిట్టు లగు టజ్ఞులకునైన నెఱుఁగవచ్చు. **85**

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= ఓ రాజోత్తమా!; ఇంద్రియములు+ఎల్లన్= ఇంద్రియాలు అన్నీ; అట్టివి+అ= అట్లాంటివే - మనస్సు అధీనంలోనే ఉంటాయి; ఎలసి= ఆసక్తమై; ఒండువలనన్= మరొకవిషయం వైపు; మనసు+ఉన్నన్= మనస్సు ఉన్నట్టయితే; తమ తమ వర్తనములన్= ఇంద్రియాలు తమ తమ వ్యాపారాల్లో; నిగుడన్ నేరమి= ప్రవర్తించలేకపోవటం (చొరలేకపోవటం, ప్రవేశించలేకపోవటం); తెల్లంబు= స్పష్టం; ఇట్టులు+అగుట= ఇట్లా ఉండటం (ఈ పరిస్థితి); అజ్ఞులకునైనన్= అజ్ఞులకుకూడా; ఎఱుఁగన్+వచ్చున్= తెలియవచ్చే విషయమే.

తాత్పర్యం: ఓ రాజా! ఇంద్రియాలన్నీ ఇట్లా మనఃప్రభావంతోనే ఉంటాయి. ఈ మనస్సు కనుక మరింకేదయినా విషయంలో ఆసక్తమై ఉన్నట్లయితే ఇంద్రియాలు ఏవీ కూడా తమతమ పనులను చేయలేవు. అజ్ఞానులు కూడా ఈ విషయాన్ని తేలికగా గ్రహించగలరు.

తే. **మనసు చేతివ యింద్రియ మహిమలెల్ల । నుపరతంబైన మనసుతో నుడిగి మడఁగు**
నింద్రియము లుపరమ మొందెనేని దాన । మనసు మగుడదు విషయతృష్ణన చరించు. **86**

ప్రతిపదార్థం: ఇంద్రియ మహిమలు+ఎల్లన్= ఇంద్రియాల శక్తులన్నీ; మనసుచేతివి+అ= మనస్సుచేతిలోవే (మనస్సుకి అధీనాలే); ఉపరతంబైన= వెనక్కుమళ్ళిన; మనసుతోన్= మనస్సుతోపాటు (ఇంద్రియమహిమలు కూడా); ఉడిగి= విరమించి; మడఁగున్= ఉపశమిస్తాయి; ఇంద్రియములు; ఉపరమము+ఒందెన్+ఏని= ఉపశమించినా; దానన్= దానివలన; మనసు= మనస్సు; మగుడదు= వెనక్కు మళ్ళదు; విషయతృష్ణన్+అ= ఆసక్తిగొన్న ఆ విషయం పట్ల తృష్ణతోనే; చరించున్= సంచరిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: రాజా! ఇంద్రియమహిమలన్నీ మనస్సు చేతిలోవే. మనస్సు కనుక విషయాసక్తినుండి వెనక్కు మళ్ళితే ఇంద్రియాలు అన్నీ దానితోపాటే వెనక్కు మళ్ళుతాయి. కానీ, ఇంద్రియాలు వెనక్కు మళ్ళినా వాటితోపాటు మనస్సుకూడా వెనక్కు మళ్ళుతుందని చెప్పలేము. మళ్ళదు. విషయతృష్ణలోనే అట్లాగే సంచరిస్తూ ఉంటుంది.

క. **కావున నింద్రియ చేష్టల । నేవలనికిఁ బోవ నీమి యింతకు ముఖ్యం**
బై వడిగొను మనసు దిగువఁ । గావలయును మగుడ దీనిఁ గనుఁగొను మనఘా! **87**

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పవిత్రుడా!; కావునన్= కాబట్టి; ఇంద్రియచేష్టలన్= ఇంద్రియాల చేష్టలను; ఏ వలనికిన్= ఏ వైపునకూ; పోవన్+ఈమి= పోనివ్వకపోవటం; ఇంతకున్= ఇంతకూ; ముఖ్యంబై= ప్రధానమైనదై; వడిగొను= విషయాసక్తితో పరుగులుతీసే; మనసున్= మనస్సును; మగుడన్= వెనకకు మళ్ళేట్టు; తిగువఁగాన్ వలయున్= దిగలాగాలి; దీనిన్= ఈ విధాన్ని; కనుఁగొనుము= దర్శించుము, అభ్యసించుము.

తాత్పర్యం: అనఘా! ఇంద్రియాలనూ వాటి చేష్టలనూ నిగ్రహించటం అతిప్రధానం. విషయాసక్తమై పరుగులుతీసే మనస్సును వెనుకకు మళ్ళించాలి. ఇది గ్రహించి అభ్యసించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ప్రళయప్రకారంబు వినుము. రాత్రియగుటయు నవ్యక్తం బహంకృతి పురుషు బోధించిన నతండు పండ్రెండు మూర్తులు గైకొని రశ్మిజాలంబుల జరాయుజ ప్రభృతి సర్వభూతంబులను రూపుమాపినం గూర్మపృష్ఠంబునుంబోని పృథివి జలమయం బగు జలంబు లోకంబు లెల్లం దమమయంబకాఁ బేర్చి తన్నుం గాలాగ్ని మడియింపం గుదియుఁ బ్రజ్వల జ్వాలాభీలం బగు నయ్యనలం బనిలంబుచేతం జెడు నెందునుం దానయై పరఁగు నమ్మహాబలు నాకసంబు మ్రింగు నతివితతంబగు నవ్వియత్తత్త్వంబు మనంబు గ్రసియించు మనంబు నయ్యహంకారాధిష్ఠిత పురుషుండు గబళించు నయ్యహంకృతి నవ్యక్తంబు లోఁగొను నిట్లు రేయిపోయిన నెప్పటివిధంబు ప్రవర్తిల్లు. 88

ప్రతిపదార్థం: ప్రళయప్రకారంబున్= ప్రళయపద్ధతిని; వినుము; రాత్రి+అగుటయున్= రాత్రి కావటంతోనే; అవ్యక్తంబు= ప్రకృతి; అహంకృతిపురుషున్= అహంకారయుక్తుడైన పురుషుడిని; బోధించినన్= నిద్రలేపగా; అతండు= ఆ అహంకృతి పురుషుడు; పండ్రెండుమూర్తులు కైకొని= పన్నెండు సూర్యరూపాలు ధరించి; రశ్మిజాలంబులన్= కిరణసమూహాలతో; జరాయుజ+ప్రభృతి= గర్భజాతాలూ, అండజాతాలూ, స్వేదజాతాలూ; ఉద్భిజ్జాలూ అయిన; సర్వభూతంబులను= చతుర్విధ జీవరాశినీ; రూపుమాపినన్= నశింపజేస్తే; కూర్మపృష్ఠంబునున్+పోని= తాబేటి వీపువలె ఉండే; పృథివి= భూమి; జలమయంబు+అగున్= జలమయం అయిపోతుంది; జలంబు= ఈ నీరు; లోకంబులెల్లన్= లోకాలన్నీ; తమమయంబు+అ కాన్= జలమయాలే అయిపోయేట్టు; పేర్చి= విజృంభించి; తన్నున్= ఆ జలాన్ని; కాలాగ్ని= ప్రళయకాలాగ్ని; మడియింపన్= నశింపజేస్తే; కుదియున్= అంతరించిపోతుంది; ప్రజ్వలత్= అతిశయించి మండుతున్న; జ్వాలా= మంటలతో; ఆభీలంబు+అగు= భయంకరమైన; ఆ+అనలంబు= ఆ కాలాగ్ని; అనిలంబుచేతన్= అష్టాత్మకుడైన మహావాయువుచేత; చెడున్= నశిస్తుంది; ఎందునున్= ఎక్కడచూసినా; తానయై= తానే అయి; పరఁగు= సంచరిస్తున్న; ఆ+మహాబలున్= ఆ వాయువును; ఆకసంబు= ఆకాశము; మ్రింగున్= మింగేస్తుంది; అతి వితతంబు+అగు= అతి విస్తృతమైన; ఆ+వియత్‌తత్త్వంబున్= ఆ ఆకాశతత్త్వాన్ని; మనంబు= మనస్సు; గ్రసియించున్= కబళిస్తుంది; మనంబున్= మనస్సును; ఆ+అహంకార+అధిష్ఠిత పురుషుండు= ఆ అహంకృతిపురుషుడు; కబళించున్= మింగేస్తాడు; ఆ+అహంకృతిన్= ఆ అహంకారాన్ని; అవ్యక్తంబు= అవ్యక్తము అనబడే ప్రకృతి; లోఁగొనున్= కబళిస్తుంది; ఇట్లు= ఈ ప్రకారంగా; రేయి+పోయినన్= రాత్రిగడిస్తే; ఎప్పటివిధంబు= మళ్ళీ పూర్వపద్ధతి; ప్రవర్తిల్లున్= ప్రవర్తిస్తుంది.

తాత్పర్యం: (పగటిని సృష్టిగానూ, రాత్రిని ప్రళయంగానూ లోగడ (శాంతి - 6-82) చెప్పాడు.) రాత్రి అయ్యేసరికి అవ్యక్తం అహంకృతిపురుషుడిని ప్రబోధిస్తుందిట. అప్పుడు అతను పన్నెండు సూర్యరూపాలు గ్రహించి తన కిరణాలతో జీవరాశిని అంతటినీ నశింపజేస్తాడు. జీవరాశి నాలుగువిధాలు. గర్భాశయంనుండి పుట్టేవి (జరాయుజములు), గుడ్డులనుండి పుట్టేవి (అండజాలు), స్వేదంనుండి పుట్టేవి (స్వేదజములు), గింజలనుండి మొలకెత్తేవి (ఉద్భిజ్జాలు), ఈ మొత్తం జీవరాశిని ద్వాదశాదిత్యకిరణాలు నాశనం చేస్తాయి. అప్పుడు ఈ భూమి తాబేటి చిప్పవలె (కూర్మపృష్ఠం) అయిపోతుంది. అప్పుడు మహాప్రవాహంవలె నీరు వచ్చి ఈ భూగోళాన్ని ముంచివేస్తుంది. జలమయం చేసివేస్తుంది. కాలాగ్ని చెలరేగి ఆ నీటిని ఆవిరి చేసివేస్తుంది. మహావాయువును ఆకాశం మ్రింగివేస్తుంది. ఆకాశాన్ని మనస్సు కబళిస్తుంది. మనస్సును అహంకృతిపురుషుడు గ్రసిస్తాడు. అహంకారాన్ని అవ్యక్తం లోగొంటుంది. ఇదీ ప్రళయం. రాత్రి గడిస్తే మళ్ళీ అంతా మామూలే. పగటిపూట సృజన.

క. ప్రీతిగ నధ్యాత్మము నధి। భూతము నధిదైవతంబు భూవర! సంప్ర
ద్యోతితములుగాఁ జెప్పెద। నా తెఱఁగు ప్రబోధకారియగు నూహింపన్. 89

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భూవర!= జనకమహారాజా!; అధ్యాత్మము= ఆధ్యాత్మికమూ; అధిభూతము= ఆధిభౌతికమూ; అధిదైవతంబు= ఆధిదైవికమూ అనే వీటినిగురించి; ప్రీతిగన్= ప్రేమగా; సంప్రద్యోతితములు+కాన్= స్పష్టపడేటట్లు; చెప్పెదన్= చెబుతాను; ఆ తెఱఁగు= ఆ పద్ధతి; ఊహింపన్= ఆలోచిస్తే; ప్రబోధకారి+అగున్= నీకు జ్ఞానప్రదం అవుతుంది.

తాత్పర్యం: మహారాజా! అధ్యాత్మ, అధిభూత, అధిదైవతాలు ఏమిటో నీకు స్పష్టపరుస్తాను. అది నీకు కనువిప్పు కలిగిస్తుందని భావిస్తాను.

అధ్యాత్మాధిభూతాధిదైవత ప్రకారము (సం.12-301-1)

సీ. పాదపాయూపస్థపాణివాక్కులు విను । మధ్యాత్మములు దత్క్రమానుయుక్తి
గంతవ్యమును విసర్గంబు నానందంబుఁ । గర్తవ్యవక్తవ్యకములు నయ్యె
నధిభూతములు వాని కధిదైవములు వరు । సన విష్ణుమిత్త్రప్రజాపతులును
శక్రపావకులును జక్షువు జిహ్వయు । ఘ్రాణంబుఁ ద్వక్కు శ్రోత్రంబుఁ జూవె

తే. యనఘ! యధ్యాత్మములు రూపమును రసంబుఁ । జాలుపడ గంధసంస్పర్శ శబ్దములును
దదధిభూతంబు లధిదైవతములు సూర్య । జలమహీ వాయు దిశలండ్రు శాస్త్రవిదులు 90

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; విను(ము); పాద, పాయు, ఉపస్థ పాణి, వాక్కులు= కాళ్ళు, గుదము, రహస్యావయవము, చేతులు, నాలుక ఇవి అయిదూ; అధ్యాత్మములు= అధ్యాత్మాలు; తద్+క్రమ+అనుయుక్తిన్= వాటివరుసలోనే; గంతవ్యమును= గమ్యం; విసర్గంబున్= విసర్జించదగిన మలమూత్రాదికం; ఆనందంబున్= ఆనందమును; కర్తవ్య= చేయదగినది; వక్తవ్యకములు= పలుకదగినది - ఇవి అయిదూ; అధిభూతములు= అధిభూతాలు; వానికిన్= ఆ అయిదింటికీ; వరుసన= అదే వరుసలో; విష్ణుమిత్త్ర ప్రజాపతులును= విష్ణువు, సూర్యుడు, ప్రజాపతి(బ్రహ్మ) అనేవారూ; శక్రపావకులును= ఇంద్రుడు, అగ్ని అనేవారూ మొత్తం అయిదుగురు; అధిదైవములు= అధిదైవతాలు; చక్షువు= కన్ను; జిహ్వయున్= నాలుక; ఘ్రాణంబున్= ముక్కు; త్వక్కు= చర్మం; శ్రోత్రంబున్= చెవి అనే ఈ అయిదూ; అధ్యాత్మములు+చూవె= అధ్యాత్మాలు సుమా!; రూపమును= రూపమూ; రసంబున్= రుచి; గంధ= వాసన; సంస్పర్శ= స్పర్శ; శబ్దములును= శబ్దమూ అనే ఈ అయిదూ; చాలుపడన్= వరుసగా; తద్= కన్ను మొదలైన వాటి కయిదింటికీ; అధిభూతంబులు= అధిభూతాలు; సూర్య= సూర్యుడూ; జల= నీరూ; మహీ= నేలా; వాయు= గాలీ; దిశలు= ఆకాశం అనే అయిదూ; అధిదైవతములు= పైవాటికి అధిదైవతాలు; శాస్త్రవిదులు= శాస్త్రవేత్తలు; అండ్రు= ఇట్లా చెబుతారు (దైవానికి అధీనంలో ఉండేవి).

తాత్పర్యం: కాళ్ళూ, గుదమూ, ఉపస్థ, చేతులూ, నాలుక - అనేవి అయిదూ అధ్యాత్మాలు. వీటికి గంతవ్యం, విసర్జనం, ఆనందం, కర్తవ్యం, వక్తవ్యం - అనేవి అయిదూ అధిభూతాలు. వీటికే వరుసగా విష్ణు, సూర్య, ప్రజాపతి, ఇంద్ర, అగ్ని - వీరు అయిదుగురూ అధిదైవతాలు. కన్ను, నాలుక, ముక్కు, చర్మం, చెవి - ఇవి అయిదూ అధ్యాత్మాలు. రూప, రస, గంధ, స్పర్శ, శబ్దాలు వాటికి వరుసగా అధిభూతాలు. తేజస్సు, జలం, భూమి, వాయువు, ఆకాశం అనేవి అయిదూ అదే క్రమంలో అధిదైవతాలు.

క. మన మధ్యాత్మము దానికి । ననఘా! మంతవ్యమందు రధిభూతము చం
ద్రుని నధిదైవతముగ బుధ । జనములు చెప్పుదురు శ్రుతివచఃప్రతిపత్తిన్. 91

ప్రతిపదార్థం: అనఘా!= పవిత్రుడా!; మనము= మనస్సు అనేది; అధ్యాత్మము= అధ్యాత్మం; దానికిన్= దానికి; మంతవ్యము= మంతవ్యమనేది (మననము చేసికొనదగినది); అధిభూతము= అధిభూతం; అందురు= అంటారు; శ్రుతివచః= వేదవాక్కుల;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపత్తిన్= ప్రామాణికతతో; బుధజనములు= పండితులు; చంద్రునిన్= చంద్రుడిని; అధిదైవతముగన్= మనస్సుకు అధిదైవతంగా; చెప్పుదురు.

తాత్పర్యం: రాజా! మనస్సు అనేది అధ్యాత్మం. దీనికి మంతవ్య మనేది అధిభూతం. చంద్రుడేమో అధిదైవతం. వేదప్రామాణ్యాన్ని బట్టి పండితులు ఇట్లా చెప్పుతున్నారు.

తే. **బుద్ధి యధ్యాత్మమనఁ జను భూతవర్య! । దాని కధిభూత మండ్రు బోద్ధవ్యమైన**
దానిఁ బొల్చు తదీయాధిదైవతంబు । వినుము క్షేత్రజ్ఞుఁడని చెప్పు వేదచయము. **92**

ప్రతిపదార్థం: భూతవర్య!= జీవోత్తమా! జనకమహారాజా!; బుద్ధి= బుద్ధి అనేది; అధ్యాత్మము= అధ్యాత్మం; అనన్+చెల్లును= అనటం తగును; బోద్ధవ్యమైన దానిన్= (దానికి) తెలిసికొనదగినదానిని; అధిభూతము+అండ్రు= బుద్ధికి అధిభూతము అంటారు; పొల్చు= అతిశయించే; తదీయ= ఆ బుద్ధియొక్క; అధిదైవతంబు= అధిదైవతం; క్షేత్రజ్ఞుఁడు+అని= క్షేత్రజ్ఞుడే అని; వేదచయము= వేదసమూహం; చెప్పున్= చెప్పుతుంది; వినుము.

తాత్పర్యం: బుద్ధి అధ్యాత్మమనీ, బోద్ధవ్యం అధిభూతమనీ, క్షేత్రజ్ఞుడైన జీవుడే అధిదైవతమనీ వేదాలు చెప్పుతున్నాయి.

క. **ఆరయ నధ్యాత్మ మహం । కారం బధిభూతనామకం బభిమానం**
బారూఢ యశఃపరమో । దారా! రుద్రుఁ డధిదైవతం బన నెగడున్. **93**

ప్రతిపదార్థం: ఆరూఢ= ప్రసిద్ధికెక్కిన; యశః= కీర్తితో; పరమ+ఉదారా!= గొప్ప ఔదార్యం కలవాడా! ఓ జనకమహారాజా!; ఆరయన్= పరిశీలించగా; అహంకారంబు= అహంకారమనేది; అధ్యాత్మము= అధ్యాత్మం; అభిమానంబు= అభిమానమనేది; అధిభూతనామకంబు= అహంకారానికి అధిభూతం అవుతుంది; రుద్రుఁడు= భవుడు; అధిదైవతంబు= అధిదైవతం; అనన్= అనగా; నెగడున్= ఒప్పును.

తాత్పర్యం: అహంకార మనేది ఆధ్యాత్మం. దానికి అభిమాన మనేది అధిభూతం. అధిదైవతమేమో రుద్రుడు.

విశేషం: దీనికి మూలశ్లోకం ఇట్లా ఉన్నది - **"అభిమానోఽ ధిభూతం తు భవస్తత్రాధిదైవతమ్" (12-301-12).** అనే పాఠం కూడా కొన్ని ప్రతులలో ఉన్నది. తెలుగు ప్రతులన్నింటా అభిమానమనేదే కనపడుతున్నది. భవుడు అన్నదానిని తిక్కన రుద్రుడు అన్నాడు. స్థూలార్థం సమానమే అయినా వ్యుత్పత్తి స్వభావంలో తేడా ఉన్నది. దీనికి 'బుద్ధి యధిదైవతంబన' అనే పాఠాంతరం తెలుగులో ఉన్నది. **విరించోఽత్రాధిదైవతమ్** అనే పాఠాన్ని సంశోధిత ముద్రణ అధస్సూచికలో (పి.వి.యన్. శాస్త్రి ప్రతి 12-298-12) చూపింది.

తే. **ధరణివల్లభ! చిత్తమధ్యాత్మ మనఁగ । బరఁగుఁ జేతయితవ్యంబు భావితాత్ము**
లైన మహనీయు లధిభూతమండ్రు బ్రహ్మ । మంచితాధిదైవతమను నాగమములు.' **94**

ప్రతిపదార్థం: ధరణివల్లభ!= ఓ మహారాజా! (భూపతీ!); చిత్తము= చిత్తము అనేది; అధ్యాత్మము+అనఁగన్+పరఁగున్= అధ్యాత్మం అనబడుతుంది; భావిత+ఆత్ములైన= ఆలోచనాపరులైన; మహనీయులు= గొప్పవారు; చేతయితవ్యంబున్= చేతయితవ్యము అనబడేదాన్ని; అధిభూతము+అండ్రు= చిత్తానికి అధిభూతం అంటారు; ఆగమములు= వేదాలూ, శాస్త్రాలూ; బ్రహ్మమున్= బ్రహ్మము అనబడేదాన్ని; అంచిత= ఒప్పయిన; అధిదైవతము+అనున్= చిత్తానికి అధిదైవతం అంటాయి.

తాత్పర్యం: రాజా! చిత్తం అధ్యాత్మం, చేతయితవ్యం దానికి అధిభూతం, పరబ్రహ్మం దానికి అధిదైవతం అని ఆగమాలు చెప్పుతున్నాయి'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: దీనికి మూలశ్లోకం భండార్కరు వారి ప్రామాణిక ప్రతిలో ప్రధానపాఠంగా లేదు. అధస్సూచిలో మాత్రమే ఉన్నది. **చిత్తమధ్యాత్మమిత్యాహుర్యోగినః సూక్ష్మదృష్టయః । అధిభూతం చైత్యమాహూ రుద్రస్తత్రాధిదైవతమ్ ॥** ఇది గ్రంథలిపిలో లాహోరు ప్రతిగా వారు సూచించారు. దీనివలన చేతయితవ్యమే చైత్యమని తెలుస్తోంది. రుద్రుడు తెలుగులో బ్రహ్మం అయాడు.

వ. అని చెప్పి 'ప్రకృతి పురుష ప్రకారంబులు వినుట మనో నిర్వికారత్వకారణం బగు' నను పలుకు పలికి యిట్లనియె. 95

ప్రతిపదార్థం: అని చెప్పి= యాజ్ఞవల్క్యుడు ఇట్లా చెప్పి; ప్రకృతి పురుషప్రకారంబులు= ప్రకృతిపురుషుల పద్ధతులు; వినుట= వినటం; మనోనిర్వికారత్వ కారణంబు+అగున్= మనస్సు తాలూకు నిర్వికారత్వానికి హేతువు అవుతుంది; అను పలుకు= ఈ మాట; పలికి= అని; ఇట్లు అనియెన్= మళ్ళీ ఇట్లా కొనసాగించాడు.

తాత్పర్యం: యాజ్ఞవల్క్యుడు ఇట్లా చెప్పి 'ప్రకృతి పురుషుల పద్ధతులు వినుటవలన మనస్సు నిర్వికారత్వాన్ని పొందుతుం'దంటూ, ఇంకా ఇట్లా చెప్పాడు.

క. 'ప్రకృతి దనయిచ్చఁ గ్రీడా । ర్థకముగ సత్త్వాదిగుణ వితానము నానా
వికృతులఁ బొందింప నసం । ఖ్యకవిధమై పరఁగుచుండునది మనుజేంద్రా! 96

ప్రతిపదార్థం: మనుజేంద్రా!= ఓ రాజేంద్రా!; ప్రకృతి= ప్రకృతి అనేది; తనయిచ్చన్= స్వేచ్ఛతో; క్రీడార్థకముగన్= క్రీడావిలాసంకోసం అన్నట్టు; సత్త్వాదిగుణవితానమున్= సత్త్వమూ, రజస్సూ, తమస్సూ అనే గుణసమూహాన్నీ; నానావికృతులన్= వాటివలన పలురకాల వికారాలనూ (రూపభేదాలనూ); పొందింపన్= కలుగజేస్తే; అసంఖ్యకవిధమై= లెక్కపెట్టలేనన్ని భేదాలు కలదై; పరఁగుచుండున్+అది= ఒప్పుతూ ఉంటుంది.

తాత్పర్యం: ఈ ప్రకృతి అనేది స్వేచ్ఛగా క్రీడావిలాసంగా సత్త్వాదిగుణాలనూ, నానా వికృతులనూ పురుషుడికి కల్పిస్తూ ఉంటుంది.

క. దీపమున ననేకములగు । దీపములు పరంపరానుదీప్తాకృతులై
వ్యాపించు చందమున గుణ । రూపంబులఁ బరపుఁ బ్రకృతి రోషవిదూరా! 97

ప్రతిపదార్థం: రోషవిదూరా!= రోషరహితుడా!; దీపమునన్= ఒక దీపంనుండి; అనేకములగు= అనేకమైన; దీపములు= దీపాలు; పరంపరా+అనుదీప్త+ఆకృతులై= ఒకదాని నుంచి ఒకటి వరసగా వెలిగిన ఆకారాలు కలవై; వ్యాపించు చందమునన్= వ్యాప్తి చెందినట్టుగా; ప్రకృతి= ఈ ప్రకృతి అనేది; గుణరూపంబులన్= సత్త్వాదిగుణాలనూ రూపాలనూ; పరపున్= వ్యాప్తి చెందిస్తుంది.

తాత్పర్యం: రోషరహితుడా! ఒక దీపం నుంచి అనేకదీపాలు వ్యాప్తి చెందినట్టు ఈ ప్రకృతి అనేది గుణరూపాలను వ్యాప్తి పొందిస్తుంది.

సీ. సత్త్వగుణంబులు సంతోష మానంద । మారోగ్య మక్రోధ మార్జవంబు
శుద్ధి ప్రకాశత సుస్థిరత్వ మహింస । నిర్మల శ్రద్ధ వినీతి లజ్జ
సత్యంబు శౌచంబు సమత యాచారం బ । కార్పణ్యపైశున్య కామవృత్తి
విను రజోగుణములు విగ్రహ దర్పాభి । మాన కామక్రోధ మత్సరములు

ఆ. కరుణలేమి భోగకాంక్ష యహంకార । ముమ్మలిక తమోగుణమ్ము లప్ర
కాశమోహ బహుతరాశన వాదప్ర । మాద మౌర్ఖ్యమరణ భేదనములు. 98

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సంతోషంబు= సంతోషంగా ఉండటం; ఆనందము= ఆనందంగా ఉండటం; ఆరోగ్యము= రోగరహితంగా ఉండటం; అక్రోధము= క్రోధంలేకపోవటం; ఆర్జవంబు= ఋజుత్వం (తిన్నని నడవడి); శుద్ధి= పరిశుభ్రత; ప్రకాశత= తేజస్విత; సుస్థిరత్వము= నిశ్చలత్వం; అహింస= హింస విడనాడటం; నిర్మలశ్రద్ధ= నిర్మలమైన శ్రద్ధ (దీక్ష); వినీతి= వినయం; లజ్జ= సిగ్గు; సత్యంబు= నిజం చెప్పటం; శౌచంబు= శుచిగా ఉండటం; సమత= సర్వప్రాణి సమానత్వం; ఆచారంబు= ఆచారపరత్వం; అకార్పణ్య పైశున్యకామవృత్తి= లోభించటం (దుష్టత), చాడీలు చెప్పటం, కాముకత్వం అనేవి లేకుండా ప్రవర్తించటం ఇవి; సత్త్వగుణంబులు= సత్త్వగుణాలు; విను; విగ్రహ= కలహించటం; దర్ప= అహంకారం; అభిమాన= గర్వం; కామ= అతివాంఛ; క్రోధ= కోపం; మత్సరములు= ఈర్ష్య అనేవీ; కరుణ లేమి= దయ లేకపోవటం; భోగకాంక్ష= భోగాలు అనుభవించాలి అనే కోరిక; అహంకారము= అహంభావం; ఉమ్మలిక= దుఃఖం - ఇవన్నీ; రజోగుణములు= రజోగుణాలు; అప్రకాశ= తేజోరహితత్వం; మోహ= వ్యామోహం; బహుతర+అశన= తిండిపోతుగా ఉండటం; వాద= వాదోపవాదాల్లో ప్రీతి; ప్రమాద= పొరపాటు పడటం; మౌర్ఖ్య= మూర్ఖత్వం; మరణ= మరణం; భేదనములు= ఒకరిమీద ఒకరికి చాడీలు చెప్పటం - ఇవన్నీ; తమోగుణమ్ములు= తమోగుణాలు.

తాత్పర్యం: సంతోషాదులు సత్త్వగుణాలనీ, అహంకార కామ క్రోధాదులు రజోగుణా లనీ, తిండిపోతుదనం చాడీకోరుతనం మొరకుదనం ఇత్యాదులు తమోగుణాలనీ తెలిసికొమ్ము.

క. ప్రకృతికిని గుణములుం గొని । యకలంకుండైన యంతరాత్ముని వేవే
ల్వికృతులఁ బొందించుట పా । యక కలుగుం దత్స్వభావ మది యరయంగన్. 99

ప్రతిపదార్థం: గుణములన్+కొని= సత్త్వరజస్తమోగుణాలను స్వీకరించి; అకలంకుండు+ఐన= స్వతస్సిద్ధంగా కళంకరహితుడైన; అంతరాత్మునిన్= అంతరాత్ముడిని; వేవేల్= వేలకువేలుగా; వికృతులన్+పొందించుట= రూప వికారాలను పొందేట్టు చెయ్యటం; ప్రకృతికిన్= ఈ ప్రకృతి అనేదానికి; పాయక= వదలక; కలుగున్= ఉంటుంది; అరయంగన్= ఆలోచించి చూస్తే; అది= అట్లా పొందించటమనేది; తద్= ఆ ప్రకృతియొక్క; స్వభావము= స్వభావం.

తాత్పర్యం: సత్త్వాది గుణాలతో - కళంకరహితుడైన పురుషుడికి అనేకరూపాలు కల్పించటం ప్రకృతికి స్వభావం. అది దానిని వదలదు.

క. పురుషుఁడు చైతన్యాత్ముఁడు । నరనాయక! ప్రకృతి చేతనారహిత జగ
ద్ధురఁ బురుషుని వెలుఁగునఁ దా । ధరియించుం బురుషుఁ దిగుచుఁ దనమెయిఁ దిరుగన్. 100

ప్రతిపదార్థం: నరనాయక!= జనకమహారాజా!; పురుషుఁడు= జీవాత్ముడు; చైతన్యాత్ముఁడు= చైతన్యస్వరూపుడు; ప్రకృతి= ఈ ప్రకృతిమాత్రం; చేతనారహిత= చైతన్యరహితం; పురుషుని= అంతరాత్మునికి చెందిన; వెలుఁగునన్= ప్రకాశంలో; తాను= ఈ ప్రకృతి; జగత్+ధురన్= జగద్భారాన్ని; ధరియించున్= వహిస్తుంది; పురుషున్= పురుషుడిని; తనమెయిన్= తనతో; తిరుగన్= తిరిగేట్టు; తిగుచున్= లాగుతుంది.

తాత్పర్యం: రాజా! పురుషుడు చైతన్య సహితుడు. ప్రకృతికి చైతన్యం లేదు. అయినా పురుషుడి ప్రకాశంలోనే తాను జగద్భారాన్ని వహిస్తుంది. పురుషుడిని కూడా తనవెంట తిప్పుకొంటుంది.

ఉ. సత్త్వరజస్తమోగుణ వశస్థితిఁ గేవలపుణ్యమిశ్రకా
రిత్వ విరుద్ధకర్మములఁ బ్రేరితమై కను నూర్ధ్వలోకసే
విత్వము మానుషత్వ పదవీకలనంబును రౌరవంబు నా
తత్త్వము తన్నెఱుంగమి ప్రధానము చేఁతల నావహిల్లినన్. 101

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ తత్త్వము= పురుషుడు అనబడే ఆ తత్త్వం; తన్నున్+ఎఱుంగమి= తనను తాను తెలుసుకోకపోవటంచేత; ప్రధానము చేఁతలన్= ప్రధానము అనబడే ప్రకృతియొక్క చేష్టలలోకి; ఆవహిల్లినన్= లొంగిపోయినట్టయితే; సత్త్వ రజ స్తమోగుణ వశస్థితిన్= సత్త్వమూ, రజస్సూ, తమస్సూ అనే మూడు గుణాలకూ వివశమైపోయిన పరిస్థితిలో; కేవలపుణ్య= పూర్తిగా పుణ్యకర్మలను చెయ్యటం; మిశ్రకారిత్వ= పుణ్యకార్యాలను కొన్నింటినీ, పాపకార్యాలను కొన్నింటినీ చెయ్యటం; విరుద్ధకర్మములన్= పుణ్యవిరుద్ధమైన పాపకర్మలు చెయ్యటం - వాటితో; ప్రేరితమై= ప్రేరేపింపబడినదై; క్రమంగా - ఊర్ధ్వలోకసేవిత్వము= పుణ్యలోకాలను సేవించటం; మానుషత్వ పదవీ+కలనంబును= మనుష్యజన్మను అధిష్ఠించటం; రౌరవంబున్= రౌరవము అనబడే నరకాన్నీ; కనున్= పొందుతుంది.

తాత్పర్యం: జీవాత్మ అనబడే ఈ తత్త్వం తనను తాను తెలిసికొనలేక, ప్రధానము అనబడే ప్రకృతితత్త్వపు చేతలలో ఇరుక్కుపోయి సత్త్వగుణంతో కేవల పుణ్యకర్మలను ఆచరించి ఊర్ధ్వలోకాలను పొందుతుంది. రజోగుణంతో మిశ్రకర్మలను ఆచరించి మానుషత్వం పొందుతుంది. తమోగుణంతో కేవల పాపకర్మలు ఆచరించి రౌరవాది నరకాల పాలవుతుంది.

క. తను నెఱిఁగిన నవ్యక్తము । చనవునఁ బోఁ డాత్ముఁ డజర శాశ్వత విగతాం
జన విమలాచ్యుత పదముం । గని యక్షరుఁడగు నిజప్రకాశస్థిరతన్.' 102

ప్రతిపదార్థం: ఆత్ముఁడు= ఈ జీవాత్ముఁడు; తనున్= తనను తాను; ఎఱిఁగినన్= తెలుసుకొన్నట్టయితే; అవ్యక్తము చనవునన్= అవ్యక్తము అనబడే ప్రకృతియొక్క చనవుతో; పోఁడు= దానివెంట పడి వెళ్ళడు; అజర= ముసలితనం లేనిదీ; శాశ్వత= శాశ్వతమైనదీ; విగత+అంజన= నిరంజనమైనదీ (పాపరహితం, శివప్రదం); విమల= నిర్మలమైనదీ; అచ్యుత= చ్యుతిలేనిదీ అయిన; పదమున్= స్థానాన్ని; కని= పొంది; నిజ= తనయొక్క; ప్రకాశ= తేజస్సు తాలూకు; స్థిరతన్= నిశ్చలత్వంతో; అక్షరుఁడు+అగున్= (జీవాత్ముడు) అక్షరాత్ముడే అయిపోతాడు.

తాత్పర్యం: జీవాత్ముడు ప్రబుద్ధు డైనట్లయితే అవ్యక్త మనబడే ప్రకృతివెంట తగిలిపోడు. శాశ్వతం, నిరంజనం, నిర్మలం, జరావిరహితం అయిన అచ్యుతపదాన్ని పొంది అక్షరుడై పోతాడు. పంచవింశతితత్త్వవిశిష్టుడైన పురుషుడు తనను తాను తెలిసికొని ప్రబుద్ధుడైతే అక్షరుడైపోతాడు.'

వ. అనిన విని జనకపతి యమ్మునిపతితో 'ననాదినిధనంబులు నమూర్తంబులు నచలంబులు నగ్రాహ్యంబులు నగు పురుషప్రకృతితత్త్వంబులయం దొక్కటి సచేతనంబైయుండఁ దక్కినయది చేతనారహితం బగుటకుం గతం బేమి యెఱింగింపవే' యనుటయు నతం డతని కిట్లనియె. 103

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలించి; జనకపతి= జనకమహారాజు; ఆ+మునిపతితోన్= ఆ యాజ్ఞవల్క్య మునీశ్వరుడితో; అనాదినిధనంబులును= ఆదీ అంతమూ లేనివీ; అమూర్తంబులును= ఆకారరహితాలూ; అచలంబులున్= నిశ్చలాలూ; అగ్రాహ్యంబులును= గ్రహింపరానివీ; అగు= అయినటువంటి; పురుష-ప్రకృతి తత్త్వంబులయందున్= ఈ పురుషతత్త్వ - ప్రకృతితత్త్వాలలో; ఒక్కటి= ఒకటి (పురుషతత్త్వం); సచేతనంబై+ఉండన్= సచేతనంగా ఉంటే; తక్కినయది= రెండవది (ప్రకృతితత్త్వం); చేతనారహితంబు+అగుటకున్= చైతన్యరహితమై పోవటానికి; కతంబు= కారణం; ఏమి= ఏమిటో; ఎఱింగింపవే= తెలియజెప్పవా; అనుటయున్= అని వేడుకోగా; అతండు= ఆ యాజ్ఞవల్క్యుడు; అతనికిన్= ఆ జనకమహారాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని చెప్పగా విని జనకమహారాజు ఆ యాజ్ఞవల్క్య మునీశ్వరుడితో 'ఆదీ, అంతమూ లేనివీ, ఆకారరహితాలూ, నిశ్చలాలూ, గ్రహింపరానివీ అయిన పురుష, ప్రకృతి తత్త్వాలలో ఒకటి సచేతనంగా ఉండగా రెండవది - ప్రకృతితత్త్వం చైతన్యరహితమై పోవటానికి కారణం ఏమిటో తెలియజెప్పు' మని అడుగగా ఆ జనకమహారాజుతో యాజ్ఞవల్క్యుడు ఇట్లా అన్నాడు.

క. సగుణం బగుణం బగునే? । యగుణము సగుణమగు నెట్టు? లవ్యక్తము ని
త్యగుణసమవేతమై జడ । త గలిగియుండంగఁ బురుషధర్మము గలదే? 104

ప్రతిపదార్థం: సగుణంబు= సత్త్వాదిగుణసహితమైనది; అగుణంబు+అగునే?= గుణరహితం అవుతుందా?; అగుణము= గుణరహితమైనది; సగుణము= గుణసహితం; అగునెట్టులు?= ఎలా అవుతుంది?; అవ్యక్తము= అవ్యక్తము అనబడే ప్రకృతి; నిత్య= ఎల్లవేళలా; గుణసమవేతమై= సత్త్వాదిగుణాలతో కూడినదై; జడతన్= చైతన్యరహితత్వాన్ని; కలిగి+ఉండన్= ధరించి ఉండగా; పురుషధర్మము= పురుషతత్త్వానికి స్వభావమైన చైతన్యం; కలదే?= దానికి ఉంటుందా?

తాత్పర్యం: సగుణం, అగుణం కాదు. అట్లాగే అగుణమూ సగుణం కాదు. సత్త్వాదిగుణాలు కలిగి జడస్థితిలో ఉండే అవ్యక్తానికి (ప్రకృతికి) పురుషధర్మమైన (జీవాత్మ) చైతన్యం ఉండదు.

క. పురుషుని కల రూపెఱిఁగెడు । పరిబోధము లేకయుండుఁ బ్రకృతికిఁ బ్రకృతిం
బురుషుఁ డెఱుంగును దనకుం । బరంబు లేదనియుఁ గను శుభస్థిర దృష్టిన్. 105

ప్రతిపదార్థం: ప్రకృతికిన్= ప్రకృతికి (అవ్యక్తానికి); పురుషుని= పురుషుడియొక్క; కలరూపు= యథార్థరూపాన్ని; ఎఱిఁగెడు= తెలిసికొనగలిగిన; పరిబోధము= జ్ఞానం; లేకయుండున్= ఉండదు; పురుషుఁడు= జీవాత్ముడు; ప్రకృతిన్= అవ్యక్తాన్ని; ఎఱుంగును= తెలుసుకోగలడు; తనకున్= తనకంటే; పరంబు= పరమైనది; లేదు+అనియున్= లేదు అనికూడా; శుభస్థిరదృష్టిన్= శుభప్రదమైన నిశ్చలదృష్టితో; కనున్= దర్శింపగలడు.

తాత్పర్యం: రాజా! పురుషుడి యథార్థరూపాన్ని గ్రహించగలిగిన జ్ఞానం ప్రకృతికి లేదు. కానీ, ప్రకృతిని తెలిసికొనగలిగిన జ్ఞానం - చైతన్యం పురుషుడికి ఉన్నాయి. అంతేకాదు - ఈ పురుషుడు నిశ్చలదృష్టితో చూచి తనకన్నా పరతత్త్వం లేదని కూడా గ్రహించగలడు.

క. కావునఁ బ్రకృతి యచేతన । భూవల్లభ! చేతనుండు పురుషుఁడు సమ్య
గ్భావన యలవడిన మునీం । ద్రావళి యిమ్మెయి సునిశ్చయంబుగఁ బలుకున్. 106

ప్రతిపదార్థం: భూవల్లభ!= జనకభూపతీ!; కావునన్= అందుచేత; ప్రకృతి= ప్రకృతితత్త్వమనేది; అచేతన= చైతన్యరహితం; పురుషుఁడు= జీవాత్ముడు; చేతనుండు= చైత్యసహితుడు; సమ్యక్+భావన= సరిగ్గా భావించటమనేది; అలవడిన= అభ్యాసపరచుకొన్న; మునీంద్రావళి= మునీశ్వరుల సమూహం; ఈ+మెయిన్= ఈ ప్రకారంగా; సునిశ్చయంబుగన్= కచ్చితమైన నిశ్చయంగా; పలుకున్= చెప్పుతోంది.

తాత్పర్యం: పైని చెప్పిన కారణంవలన ప్రకృతి అచేతన అనీ, పురుషుడు సచేతనుడనీ తెలుస్తున్నది. ఆలోచనాపరులైన మునీశ్వరులందరూ ఇదే నిశ్చయంగా తెలియజెప్పారు.

వ. అని వెండియు. 107

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అనిచెప్పి మరల ఇట్లా కొనసాగిస్తున్నాడు.

ఆ. తాను బ్రకృతిఁ బ్రకృతి తనయందు నిల్చు ని । ల్చినను దాన వికృతిఁ జెందకుండుఁ
బురుషుఁ డుదకమత్స్యముల యుదుంబరమశ । కముల సంగమంబు కరణి గలుగ. 108

ప్రతిపదార్థం: తాను= పురుషుడు తాను; ప్రకృతిన్= ప్రకృతియందూ; ప్రకృతి= అవ్యక్తం; తనయందున్= తనయందూ; నిల్చున్= నిలుస్తారు; నిల్చినను= అట్లా నిల్చినప్పటికీ; ఉదకమత్స్యముల= నీరూ, చేపలయొక్క; ఉదుంబర మశకముల= మేడి దోమల యొక్క; సంగమంబు-కరణి= కలయికతో పోలిక; కలుగన్= లభించేట్టు; పురుషుఁడు= జీవాత్ముడు; వికృతిన్+చెందక+ఉండున్= ఏ వికారాన్నీ పొందకుండా ఉంటాడు.

తాత్పర్యం: పురుషుడు ప్రకృతిలో ఉంటాడు. ప్రకృతిని తనలో నిలుపుకొంటాడు. కానీ, ఈ కలయికవలన తానుమాత్రం ఏ వికృతినీ పొందడు. చేప నీళ్ళల్లో ఉన్నట్లూ, ఒకరకం దోమలు మేడిపండులోకి దూరి ఉన్నట్లూ ఈ కలయిక ఉంటుంది. ఇదీ ప్రకృతితో పురుషుడి సాంగత్యం. లీనత్వంలో అలీనత్వం.

విశేషం: 'మేడిపండు చూడ మేలిమై యుండును, పొట్ట విచ్చిచూడ పురుగులుండు' అన్నాడు వేమన్న. ఈ పురుగులు దోమల్లాగానే ఉంటాయి. ఎగిరే పురుగులు. వ్యాసుడూ మశకా లనే అన్నాడు. **"అన్యం చ మశకం విద్యాత్, అన్యచ్చోదుంబరం తథా । న చోదుంబర సంయోగైర్మశకస్తత్ర లిప్యతే॥"** (12-303-14)

ఆ. జలముఁ గదిసియుండ జలముచే నార్ద్రంబు । గాక యుండునట్టి కమలదళము
భంగి నంతరాత్మ ప్రకృతిఁ బొందియును ద । ద్వికృతిఁ బొందకుండు వీతదోష! 109

ప్రతిపదార్థం: వీతదోష!= దోషరహితుడా! ఓ జనకమహారాజా!; జలమున్= నీటిని; కదిసి+ఉండి= కలిసి ఉండీ కూడా; జలముచేన్= ఆ నీటితో; ఆర్ద్రంబుకాక+ఉండునట్టి= తడి కాకుండా ఉండేటటువంటి; కమలదళము -భంగిన్= తామరపువ్వు రేకువలె; అంతరాత్మ= జీవాత్ముడు; ప్రకృతిన్= ప్రకృతిని; పొందియును= కలిసికూడా; తద్+వికృతిన్= దానివలన కలిగే వికారాన్ని; పొందక+ఉండున్= పొందకుండా ఉండగలుగుతాడు.

తాత్పర్యం: తామరపువ్వు గానీ తామర ఆకు గానీ నీళ్ళను తాకుతూ నీళ్ళల్లోనే ఉంటుంది. కానీ, దాని ఆకులకు గానీ రేకులకు గానీ తడి అంటదు. అట్లాగే జీవాత్ముడు ప్రకృతిలో ఉన్నా దాని వికారాలు మాత్రం ఇతడికి అంటవు.

వ. ఇది సాంఖ్యానుభావంబు, యోగంబు తెఱం గెఱింగించెద. 110

ప్రతిపదార్థం: ఇది= ఇంతవరకూ చెప్పినది; సాంఖ్య+అనుభావంబు= సాంఖ్యస్వరూపం; యోగంబు తెఱంగున్= ఇంక యోగం పద్ధతిని; ఎఱింగించెదన్= తెలియజేస్తాను.

తాత్పర్యం: ఇంతవరకూ సాంఖ్యయోగం గురించి చెప్పాను. ఇక యోగపద్ధతిని తెలియజేస్తాను.

క. విను సాంఖ్యసమజ్ఞానం । బును యోగసమానబలము భూవర! లే వెం
దును, నవి రెండును వేఱుగఁ । గను బాలిశుఁ డొక్క తెరువకా నేఁ గందున్. 111

ప్రతిపదార్థం: భూవర!= జనకమహారాజా!; విను; సాంఖ్య= సాంఖ్యంతో; సమ= సమానమైన; జ్ఞానంబును= జ్ఞానమూ; యోగ= యోగంతో; సమాన= సాటివచ్చే; బలమును= బలమూ; ఎందునున్ లేవు= ఇంక ఎక్కడా లేవు; అవి రెండును= ఆ సాంఖ్యయోగాలు రెండింటినీ; బాలిశుఁడు= మూర్ఖుడు; వేఱుగన్+కను= వేరు వేరుగా చూస్తాడు; నేన్= నేను; ఒక్కతెరువు+అకాన్= ఒకే మార్గంగా; కందున్= దర్శిస్తాను, భావిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: జనకమహారాజా! సాంఖ్యంతో సాటివచ్చే జ్ఞానంకానీ, యోగంతో సాటివచ్చే బలంకానీ ఇంక ఎక్కడా- ఏ వేదశాస్త్రాలలోనూ కనిపించవు. మూర్ఖుడు ఈ రెండింటినీ వేరువేరు శాస్త్రాలుగా భావిస్తాడేమో కానీ నేను మాత్రం ఒక్కటిగానే చూస్తాను.

క. జననాథ! మనోధారణ । యును బ్రాణాయామ విధియు నుపయోగ్యములై
చను నిర్గుణమును సగుణం । బును ననఁగా రెండు తంత్రములు యోగమునన్. 112

ప్రతిపదార్థం: జననాథ!= ఓ జనకమహారాజా!; యోగమునన్= ఈ యోగంలో; మనోధారణయును= మనస్సును ఏకాగ్రం చేయటం; ప్రాణ+ఆయామ+విధియున్= ప్రాణాయామం చెయ్యటం - అనేవి; ఉపయోగ్యములై= ఉపయోగింపదగినవిగా; చనున్= ఉంటాయి; నిర్గుణమును= ఒకటి నిర్గుణం; సగుణంబునున్= మరొకటి (ప్రాణాయామం) సగుణం; అనఁగాన్= అని; రెండు తంత్రములు= ఇవి రెండు తంత్రాలు - రెండు ఉపాయాలు.

తాత్పర్యం: మనస్సును ఏకాగ్రం చేయటం, ప్రాణాయామం అనేవి యోగంలో రెండు ప్రధాన తంత్రాలు. వీటిలో మొదటిదానిని నిర్గుణం అంటారు. రెండోదానిని సగుణం అంటారు. మనస్సును ఏకాగ్రం చేయటమే ధ్యానం. అదే మనోధారణ.

క. ప్రాణాయామము గ్రమమునఁ । బ్రాణోత్పీడనము గాని భంగి నడుపుచున్
ఘోణాగ్రస్థితి విషయ । శ్రేణి దొఱఁగి యుండి యోగసిద్ధతఁ బడయున్. 113

ప్రతిపదార్థం: ఘోణ+అగ్రస్థితిన్= నాసిక అగ్రభాగం నుంచి; ప్రాణాయామమున్= ప్రాణాయామాన్ని; క్రమమునన్= ఒక క్రమంతో; ప్రాణ+ఉత్పీడనము= ప్రాణాపాయం; కాని భంగిన్= జరగని పద్ధతిలో; నడుపుచున్= సాగిస్తూ; విషయశ్రేణిన్= ఇంద్రియసుఖాలను; తొఱఁగియుండి= విడిచిపెట్టేసి; యోగసిద్ధతన్= యోగసిద్ధిని; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: రాజా! శ్వాసకు ఇబ్బంది కలగకుండా నాసికాగ్రభాగంనుండి క్రమం తప్పకుండా ప్రాణాయామం నడిపిస్తూ, ఇంద్రియసుఖాలపట్ల ఆసక్తిని వదలించుకొని అభ్యాసకుడు యోగసిద్ధుడు అవుతాడు.

వ. ఎట్లంటేని. 114

తాత్పర్యం: అది ఎట్లా అంటే (ఇదిగో వినుము).

తే. కరము నియతుఁడై కొంతేసి కాలముల శ । రీర ధర్మవిరోధిగా రేయుఁ బగలుఁ
బ్రాణ సంయమనము నడపంగవలయు । దాన చిత్తంబుఁ దనువు శుద్ధత వహించు. 115

ప్రతిపదార్థం: కరమున్= మిక్కిలి; నియతుఁడై= నియమవంతుడై; కొంత+ఏసి+కాలములన్= కొంచెం కొంచెం సేపుగా; శరీరధర్మ+అవిరోధిగాన్= శరీరస్వభావానికి విరోధం కలగకుండా; రేయున్= రాత్రి; పగలున్= పగలూ; ప్రాణసంయమనము= ప్రాణాయామం; నడపంగన్+వలయున్= నడపించాలి; దానన్= దానితో; చిత్తంబున్= అంతరంగమూ; తనువు= బహిరంగమూ (శరీరం); శుద్ధతన్ వహించున్= శుద్ధి పొందుతాయి.

తాత్పర్యం: ప్రాణాయామం అభ్యసించే వ్యక్తి చాలా నియమనిష్ఠలతో ఉండాలి. క్రమక్రమంగా కొంచెం కొంచెం సేపు దాన్ని అభ్యసించాలి. శరీరధర్మానికి ఇబ్బంది కలగని పద్ధతిలో దాన్ని ఆచరించాలి. రేయి కొంతసేపూ, పగలు కొంతసేపూ నడిపించాలి. అట్లా చేస్తే అంతశ్శుద్ధీ బహిశ్శుద్ధీ లభిస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అది సిద్ధత్వసంపదకు మూలం బిది సగుణతంత్రంబు తెఱఁగు, నిర్గుణ తంత్రప్రకారం బెఱింగించెద.116

ప్రతిపదార్థం: అది= ప్రాణాయామమూ, దానివల్ల లభించే అంతర్బహిశ్శుద్ధులూ; సిద్ధత్వసంపదకున్= యోగసిద్ధిని పొందటమనే మహాభాగ్యానికి; మూలంబు= మూలం; ఇది= ఇంతవరకూ చెప్పింది; సగుణతంత్రంబు తెఱంగు= సగుణోపాయం తాలూకు పద్ధతి; నిర్గుణతంత్ర ప్రకారంబు= మనోధారణ లేదా ధ్యానం అనే నిర్గుణోపాయం తాలూకు తెరగు; ఎఱింగించెదన్= ఇక తెలియజేస్తాను.

తాత్పర్యం: ప్రాణాయామమూ దానివలన లభించే అంతర్బహిశ్శుద్ధులూ, యోగసిద్ధికి మూలం. ఇంతవరకూ చెప్పింది సగుణోపాయ పద్ధతి. ధ్యానం అనే నిర్గుణోపాయాన్ని ఇక తెలియబరుస్తాను.

తే. ఇంద్రియంబులు మనమునం దివురఁజేసి । మనసుఁ దిగిచి యహంకారమున నడంచి
బుద్ధిలోన నహంకృతిఁ బుచ్చి బుద్ధి । ప్రకృతిఁ గలఁపఁ దద్ధ్యానతత్పరత గలుగు. 117

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు= ఇంద్రియాలను; మనమునందున్= మనస్సులో; ఇవురన్+చేసి= ఇంకిపోయేట్టు చేసి; మనసున్= మనస్సును; తిగిచి= వెనక్కులాగి; అహంకారమునన్= అహంకారంలో; అడంచి= అణిచివేసి; అహంకృతిన్= ఈ అహంకారాన్ని; బుద్ధిలోనన్= బుద్ధిలో; పుచ్చి= అంతరింప జేసి; బుద్ధి= ఆ బుద్ధి(ని); ప్రకృతిన్= ప్రకృతిలో; కలఁపన్= కలిపినట్లయితే; తద్= ఆ; ధ్యానతత్పరత= ధ్యానతత్పరత్వం; కలుగున్= లభిస్తుంది.

తాత్పర్యం: ఇంద్రియాలను మనస్సులో, మనస్సును అహంకృతిలో, అహంకృతిని బుద్ధిలో, బుద్ధిని ప్రకృతిలో సంలీనం చేసినట్లయితే అదే ధ్యానం. అదే మనోధారణ.

క. ధ్యానైక తత్పరాత్ముఁడు । గానఁబడయు నజరు నిర్వికల్పు విమలు ని
త్యానందసత్యశుద్ధ । జ్ఞానమయుం బరము నచలు శాశ్వతుని శివున్. 118

ప్రతిపదార్థం: ధ్యాన+ఏక+తత్పర+ఆత్ముఁడు= ధ్యానంపట్ల అద్వితీయమైన తత్పరత కలిగిన వ్యక్తి; అజరున్= జరలేనివాడూ; నిర్వికల్పున్= వికల్పాలు లేనివాడూ; విమలున్= మలినరహితుడూ; నిత్య+ఆనంద+సత్య+శుద్ధ+జ్ఞానమయున్= నిత్యానందమయుడూ, సత్యమయుడూ, శుద్ధమయుడూ; జ్ఞానమయున్= జ్ఞానమయుడూ; పరమున్= పరతత్త్వం అనబడేవాడూ; అచలున్= నిశ్చలుడూ; శాశ్వతునిన్= శాశ్వతమైనవాడూ అయిన; శివున్= శివుడిని; కానన్+పడయున్= చూడగలడు.

తాత్పర్యం: ధ్యాననిష్ఠ కలిగిన వ్యక్తి - జరావికల్పరహితుడూ, నిర్మలుడూ, నిత్యానందమయుడూ, సత్య-శుద్ధ జ్ఞానమయుడూ, పరముడూ, అచలుడూ, శాశ్వతుడూ అయిన శివుడిని దర్శించగలుగుతాడు.

చ. ఉదిత సమగ్రబోధుఁడగు యోగికి నిశ్చలదీపరూపసం
పద సుఖసుప్తు భంగి ఘనపంక్తులు లేని వియత్తలంబు నొ
ప్పిద మొదవుం దరంగముల పెల్లునఁ దాఁ జలితంబుగాని వా
ర్ధి దశ నతం డకంపుఁ డగు ధీపరివృత్తులు గల్గనేనియున్. 119

ప్రతిపదార్థం: ఉదిత= ఆవిర్భవించిన; సమగ్ర= పరిపూర్ణమైన; బోధుఁడు+అగు= జ్ఞానం కలవాడైన; యోగికిన్= ధ్యానతత్పరుడికి; నిశ్చల= చలనంలేని; దీప= దీపంయొక్క; రూపసంపద= రూపసంపత్తీ; సుఖసుప్తు= ఆదమరిచి నిద్రపోయినవాడియొక్క; భంగి= పోలిక; ఘనపంక్తులు= మేఘాల గుంపులు; లేని= లేనటువంటి; వియత్+తలంబు(యొక్క) ఒప్పిదము= ఆకాశపు చందమూ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒదవున్= లభిస్తాయి; తరంగములు= కెరటాలు; పెల్లునన్= అతిశయంతో; తాన్= తాను; చలితంబు= చలించినది; కాని= కానటువంటి; వార్ధి+దశన్= సముద్రంవలె; అతండు= ఆ యోగి; ధీ+పరివృత్తులు= బుద్ధి చాంచల్యాలు; కల్గెనేనియున్= ఎన్ని కల్గినప్పటికీ; అకంపుఁడు+అగున్= కంపించడు - చలించడు.

తాత్పర్యం: పరిపూర్ణ జ్ఞాని అయిన యోగి నిశ్చలదీపంవలె ఉంటాడు. ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నట్లు ఉంటాడు. నిర్మేఘమూ నిర్మలమూ అయిన ఆకాశంవలె ఉంటాడు. బుద్ధిలో మార్పులూ చాంచల్యాలూ ఎన్ని వచ్చినా- తరంగాల తాకిడికి చలించని సముద్రంవలె అతడూ నిశ్చలంగా ఉంటాడు.

విశేషం: అలం: మాలోపమ.

క. **భేరీ శంఖాదిక నా - నారవములు వొడమెనేని నాతఁడు దానం**
గారింపఁబడఁడు వీతవి । కారస్థితిఁ బొలిచియుండు గగనముభంగిన్. **120**

ప్రతిపదార్థం: భేరీ= యుద్ధభేరులూ; శంఖ+ఆదిక= శంఖాలూ మొదలైన; నానా+రవములు= రకరకాల ధ్వనులు; పొడమెనేనిన్= తనచుట్టూ చెలరేగినా; ఆతఁడు= ఆ యోగి; దానన్= ఆ రణగుణధ్వనితో; కారింపఁబడఁడు= హింసింపబడడు; గగనముభంగిన్= ఆకాశంలాగా; వీతవికార స్థితిన్= వికారాలు ఏమీ లేని స్థితితో; పొలిచి+ఉండున్= విరాజిల్లుతూంటాడు.

తాత్పర్యం: భేరీభాంకారాలూ శంఖఝుంకారాలూ తన చుట్టూ ఎన్ని చెలరేగినా యోగి చలించడు. ధ్యానం భంగపడదు. నిర్వికారంగా నిశ్చలంగా ఆకాశంవలె ఉంటాడు.

క. **తేనియకుండఁ గొనుచు సో । పానము లేమఱుట లేక ప్రాఁకిన క్రియ నా**
త్మానందరసంబొక కణ । మైనఁ జిలుకనీక తుదికి నాతం డెక్కున్. **121**

ప్రతిపదార్థం: తేనియకుండన్= తేనెతో నిండిన కుండను; కొనుచున్= మోస్తూ; సోపానములు= మెట్లు; ఏమఱుటలేక= ఏమరుపాటు లేకుండా; ప్రాఁకిన క్రియన్= అధిరోహించిన విధంగా('క్రియన్' అనేది 'పోలెన్', 'వలెన్' మొదలైన వాటివలె ఉపమావాచకం); ఆత్మానందరసంబు= ఆత్మానందమనే మధురద్రవం; ఒక కణమైనన్= ఒక్క బిందువు కూడా; చిలుకనీక= తొణికి పడనీయకుండా; ఆతండు= ఆ యోగి; తుదికిన్= కొసదాకా; ఎక్కున్= అధిరోహిస్తాడు.

తాత్పర్యం: తేనెకుండ నెత్తిమీద పెట్టుకొని ఏమరుపాటు అనేది లేకుండా మెట్టులు ఎక్కినట్లుగా యోగి తన ఆత్మానందరసం ఒక్క బొట్టు కూడా చిందిపోకుండా అధిరోహించి గమ్యం చేరుకొంటాడు.

విశేషం: అలం: ఉపమ. దీనికి వ్యాసుడి శ్లోకం ఇట్లా ఉన్నది **"తైలపాత్రం యథా పూర్ణం కరాభ్యాం గృహ్య పూరుషః । సంయతాత్మా భయాత్తేషాం న పాత్రాద్బిందు ముత్సృజేత్ । తథైవోత్తరమాణస్య చైకాగ్ర మనసస్తథా ॥"** నూనె నిండిన పాత్రను చేతులతో పట్టుకొని ఒక వీరుడు మెట్టు ఎక్కుతూ ఉంటాడు. అటూ ఇటూ కత్తులవారు ఝళిపిస్తూ ఉంటారు. ఏకాగ్రతను కోల్పోకుండా నూనె బొట్టు తొణికి పడకుండా ఆ వీరుడు అన్ని మెట్లు ఎక్కి పైకి చేరుకొనాలి. చేరుకొంటాడు. అట్లాగే ఆకర్షణలూ ఆటంకాలూ ఎన్ని వచ్చినా యోగి చలించకుండా సాధన కొనసాగించి గమ్యం (ముక్తి) చేరుకొంటాడు. పోలికగా చెప్పిన ఈ అంశం ఒకరకం యుద్ధవిద్య. వీరుడి భౌతికశక్తినీ, బౌద్ధిక శక్తినీ పరీక్షించే విధాన మిది. కరాటే - కుంగ్‌ఫూ వంటి మార్షల్ ఆర్ట్స్‌లో ఇది ఇప్పటికీ ఉన్నది. ఇక్కడ తైలపాత్రను తిక్కన తేనియకుండగా మార్చాడు. ఆత్మానందరసంతో పోల్చటం వలన ఈ మార్పు మరింతగా అందగించింది.

క. **అనఘ! యిది యోగపథ మిం । దనలసుఁడై చనఁగఁ జాలు నతఁడు కృతార్థుం**
డనితరసులభ పద ప్రా । ప్తినిరూఢుఁ డనామయుం డభిష్టుతుఁ డెందున్. **122**

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పవిత్రుడా!; ఇది= ఈ చెప్పినది; యోగపథము= యోగమార్గం; ఇందున్= ఈ మార్గంలో; అనలసుఁడై= ఏమరుపాటు (అలసత) లేనివాడై; చనఁగఁ జాలునతఁడు= ప్రయాణించగల్గినవాడు; కృతార్థుండు= కృతకృత్యుడు; ఎందున్= సర్వత్ర; అతఁడు; అనితరసులభ= ఇతరులకు అందని; పద= మోక్షపదం యొక్క; ప్రాప్తి= లబ్ధితో; నిరూఢుఁడు= ప్రసిద్ధికెక్కినవాడూ; అనామయుండు= రోగరహితుడూ; అభిష్టుతుఁడు= కొనియాడబడేవాడూను.

తాత్పర్యం: జనకమహారాజా! ఇంతవరకూ చెప్పినది యోగమార్గం. ఈ మార్గంలో ప్రయాణించాలంటే చాలా ఏకాగ్రత ఉండాలి. జాగరూకుడై ప్రయాణించినవాడు కృతార్థుడవుతాడు. ఇతర మార్గాలలో ప్రయాణించేవారికి అంత తేలికగా అందని మోక్షపదం ఇతడికి లభిస్తుంది. అనామయు డవుతాడు. సర్వేసర్వతస్స్తుతిపాత్రుడు అవుతాడు.

వ. అని యుపదేశించి వెండియు. 123

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; ఉపదేశించి= ఉపదేశం చేసి; వెండియున్= మరల - కొనసాగిస్తున్నాడు.

తాత్పర్యం: ఈ ప్రకారంగా చెప్పి, మరల (కొనసాగిస్తున్నాడు).

సీ. నరనాథ! యుత్క్రమణప్రదేశంబులు । పాదజంఘాజానుపాయు గుహ్య
ములు నూరుపార్శ్వనాభులు బాహువక్షోగ । ళాననశ్రోత్ర నాసాంబకములు
భ్రూఫాలమస్తకంబులు నోలి విష్ణుండు । వసుసాధ్యమిత్రులు వసుధయును బ్ర
జాపతి మరుదిందు సంక్రందనస్థాణు । లును నరుం డను మహామునియు విశ్వ

తే. దేవదిగ్గంధవహులును బావకుండు । నశ్విపితృ శతానందులు నందు వెలుఁగు
చుండ్రు హృన్మయ పవనక్రమోత్క్రమముల । నొందు నద్దైవతంబుల యోగివరుఁడు.' 124

ప్రతిపదార్థం: నరనాథ!= మిథిలేశ్వరా!; పాద= కాళ్ళు; జంఘా= పిక్కలు; జాను= మోకాళ్ళు; పాయు= గుదం; గుహ్యములును= రహస్యాంగాలు అనేవీ; ఊరు= తొడలు; పార్శ్వ= డొక్కలు; నాభులు= బొడ్డు అనేవీ; బాహు= చేతులు; వక్షః= ఉరస్సు; గళ= గొంతు (కంఠం); ఆనన= ముఖం; శ్రోత్ర= చెవులు; నాసా= ముక్కు; అంబకములు= కన్నులు అనేవీ; భ్రూ= కనుబొమలు; ఫాల= నుదురు; మస్తకంబులున్= శిరస్సు - అనేవీ; ఉత్క్రమణ ప్రదేశములు= యోగి హృదయగతమైన ప్రాణవాయువు శరీరంనుంచి ఉత్క్రమించే ప్రదేశాలు; ఓలిన్= క్రమంగా; విష్ణుండు= విష్ణుమూర్తి (పాద); వసు= వసువులు (జంఘా); సాధ్య= సాధ్యులు; మిత్రులు= సూర్యుడు అనేవారూ; వసుధయును= భూమి (గుహ్య); ప్రజాపతి= ప్రజాపతి అనబడే బ్రహ్మ; మరుత్= మరుత్తులు అనే దేవతలు; ఇందు= చంద్రుడు (నాభి); సంక్రందన= ఇంద్రుడు (బాహు); స్థాణులును= శివుడు (వక్షః); అనేవారూ; నరుండు+అను+మహామునియున్= నరుడు అనే పేరుగల మహాముని (గళం); విశ్వదేవ= విశ్వేదేవతలు; దిక్= దిక్కులు (శ్రోత్ర); గంధవహులును= వాయువు (నాసా) అనేవారూ; పావకుండు= అగ్ని (అంబకములు); అశ్వి= అశ్వినీ దేవతలు; పితృ= పితృదేవతలు; శతానందులు= శతానందుడు అనబడే మరొక బ్రహ్మ; అందున్= ఆయా అవయవాలలో; వెలుఁగుచుండ్రు= విరాజిల్లుతూ ఉంటారు; యోగివరుఁడు= యోగీశ్వరుడు; హృద్+మయ= హృదయగతమైన; పవన= ప్రాణవాయువుయొక్క; క్రమ+ఉత్క్రమములన్= వరుసగా జరిగిన ఉత్క్రమణాలతో; ఆ+దైవతంబులన్= ఆయా దేవతలను; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: (యోగీశ్వరుడి శరీరంలో ఏయే ప్రదేశాలనుండి ప్రాణవాయువు ఉత్క్రమిస్తే అతడు ఏయే దేవతల స్థానాన్ని పొందుతాడో ఈ పద్యంలో వివరించి చెప్పాడు). కాళ్ళనుండి ఉత్క్రమిస్తే వైష్ణవస్థానాన్నీ, పిక్కలనుండి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అయితే వసుస్థానాన్ని, మోకాళ్ళనుండి సాధ్యులస్థానాన్ని, గుదప్రదేశంనుండి సూర్యస్థానాన్ని, రహస్యాంగంనుండి వసుధాస్థానాన్ని, తొడలనుండి ప్రజాపతిస్థానాన్ని, పార్శ్వాలనుండి మరుత్తుల స్థానాన్ని, నాభినుండి చంద్రస్థానాన్ని, బాహువులనుండి ఇంద్రస్థానాన్ని, రొమ్మునుండి స్థాణుత్వాన్ని, గళంనుండి నరుడనే మునీశ్వరుడి స్థానాన్ని, ముఖంనుండి విశ్వేదేవత్వాన్ని, చెవులనుండి దిక్కుల స్థానాన్ని (దిక్పాలకత్వమేమో **దిశః శ్రోత్రేణ చాప్నుయాత్** అని మూలం), నాసికనుండి వాయుత్వాన్ని, నేత్రాలనుండి పావకత్వాన్ని, కనుబొమలనుండి అశ్వినీదేవత్వాన్ని, ఫాలంనుండి పితృదేవతల స్థానాన్ని, మస్తకంనుండయితే శతానందత్వాన్ని పొందుతాడు'.

విశేషం: పాఠాంతరాలతో సరిజూచుకొంటే ఆంధ్రీకరణం యథామూలంగా సరిపోతోంది. (12-305-1 నుండి 7 శ్లోకాలు)

యాజ్ఞవల్క్యుఁడు జనకునితో మరణసూచకంబులఁ జెప్పుట (సం. 12-305-7)

వ. అని చెప్పి మఱియు నిట్లను 'నరిష్టంబుల తెఱం గెఱుంగవలయుం గావున నెఱింగించెద నాకర్ణింపుము.' 125

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; చెప్పి= వివరించి; మఱియున్= ఇంకా; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు; అరిష్టంబుల తెఱంగు= అరిష్టాలు ఎట్లా ఉంటాయో; ఎఱుంగన్ వలయున్= తెలుసుకోవాలి; కావునన్= కాబట్టి; ఎఱింగించెదన్= తెలియజేస్తాను; ఆకర్ణింపుము= ఆలించు.

తాత్పర్యం: 'ప్రాణోత్క్రమణవేళ అరిష్టసూచకాలను వివరిస్తాను తెలిసికొమ్ము' అని యాజ్ఞవల్క్యుడు జనకమహారాజుకు చెప్పుతున్నాడు.

సీ. 'ధ్రువమండలమున నరుంధతిఁ గనుశక్తి । గంటికిఁ గలుగంగఁ గానకున్న
ముక్కున వలపటఁ జెక్కవాసినయట్లు । దోఁచినఁ బూర్ణచంద్రుండు మలినుఁ
డై కానవచ్చిన నాయువు సంవత్స । రంబునఁ గడచను రాజముఖ్య!
కాంతి దొల్లిటియట్లుగాక యంతకు నెక్కు । డైనను గడుఁజెడ్డ నట్లు ప్రజ్ఞ

తే. క్రొత్తగాఁ బెద్దయైనను గొంచెమైన । నాఱునెలల మరణదశ యగుట గలుగు
నిందుమండలమున రవి యందు నడుమఁ । దెఱపి గాంచినఁ దెగు నేడు దివసములకు. 126

ప్రతిపదార్థం: రాజముఖ్య!= ఓ రాజోత్తమా!; ధ్రువమండలమునన్= సప్తర్షిమండలంలో; అరుంధతిన్= అరుంధతీ నక్షత్రాన్ని; కనుశక్తి= చూడగలిగిన శక్తి; కంటికిన్= నేత్రాలకు; కలుగంగన్= ఉన్నప్పటికీ; కానకున్నన్= చూడలేక పోతే; ముక్కునన్+వలపటన్= ముక్కు కుడివైపున; చెక్క+పాసినయట్లు= ముక్కు తెగిపోయినట్లు; తోఁచినన్= కనిపించినట్టయితే; పూర్ణచంద్రుండు= నిండు జాబిల్లి; మలినుఁడై= మసకబారి; కానవచ్చినన్= కనిపించినట్టయితే; ఆయువు= అటువంటివాడి ఆయుర్దాయం; సంవత్సరంబునన్= ఒక సంవత్సరకాలంలో; కడచను= అంతం అవుతుంది; కాంతి= తేజస్సు; తొల్లిటి+అట్లు గాక= మునుపటివలె కాకుండా; అంతకున్+ఎక్కుడు+ఐనను= అంతకంటే ఎక్కువ అయినా; కడున్+చెడ్డన్= లేదా పూర్తిగా చెడిపోయినా; అట్లు= అట్లాగే; ప్రజ్ఞ= తెలివి అనేది; క్రొత్తగాన్= ఉన్నట్టుండి; పెద్దయైననున్= గొప్పగా అతిశయించినా; కొంచెము+ఐనన్= బాగా తరిగిపోయినా; ఆఱునెలలన్= ఆరుమాసాల్లో; మరణదశ+అగుట= మరణ దశ ప్రాప్తించటం; కలుగున్= జరుగుతుంది; ఇందుమండలమునన్= చంద్రబింబంలోనూ; రవియందున్= సూర్యబింబంలోనూ; నడుమన్= మధ్యభాగంలో; తెఱపి= వెలితి; కాంచినన్= కనిపించినట్లయితే; ఏడు దివసములకున్= కేవలం వారం రోజుల్లో; తెగున్= వాడు మరణిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'జనకమహారాజా! సప్తర్షిమండలంలో అరుంధతిని చూడగలిగిన శక్తి కంటికి ఉన్నా అరుంధతి కనపడకపోతే వాడి ఆయుర్దాయం ఇక సంవత్సరమే అని గ్రహించుము. నాసికకు కుడివైపున ఒక ముక్కు ఊడిపోయినట్లు తన చూపులకే అనిపిస్తే వాడు కూడా సంవత్సరంకంటె జీవించడు. అట్లాగే నిండు చందమామ మకిలిపట్టినట్టు బూజురు బూజురుగా కనిపిస్తే అతడూ అంతే - సంవత్సరం తరువాత మరి ఉండడని తెలిసికొమ్ము. ముఖవర్చస్సు ఇదివరకువలె కాకుండా బాగా పెరిగినట్లు కనపడినా తరిగినట్లుగా కనపడినా, తెలివికూడా అట్లాగే బాగా పెరిగినట్లో తరిగినట్లో అనిపించినా వాడు ఆరునెలల్లో సెలవు తీసికొంటాడని గుర్తించుము. సూర్యచంద్రబింబాలలో తొర్రెలు కనపడితే వాడు వారం రోజులకంటె బ్రతుకడు సుమా!

క. విను గుడిలోనున్న సమయ । మున సురభిద్రవ్యములను బొల వల్చుట గ
ల్గిన నాఱు దివసములఁ గ । ల్గును మృత్యుసమాగమంబు గుణరత్ననిధీ! 127

ప్రతిపదార్థం: గుణరత్ననిధీ!= గుణసముద్రుడా - జనకమహారాజా! విను; గుడిలోన్+ఉన్న+సమయమునన్= కోవెలలో కూర్చున్న తరుణంలో; సురభిద్రవ్యములను= పువ్వులూ, గంధం మొదలైన పరిమళవస్తువుల్లో; పొల వల్చుట= దుర్గంధ విజృంభణ; కల్గినన్= తనకు అనిపిస్తే; ఆఱు దివసములన్= ఆరు రోజులలో; మృత్యు సమాగమంబు= మృత్యుప్రాప్తి; కలుగున్= అవుతుంది.

తాత్పర్యం: సద్గుణసముద్రుడా! మరొక విషయం చెప్తున్నాను గ్రహించుము. కోవెలలోకి వెళ్ళినప్పుడు అక్కడున్న గంధపుష్పాది సుగంధద్రవ్యాలు ఎవడి ముక్కుకి దుర్గంధంవలె సోకుతాయో వాడు ఆరునెలల్లో 'హరీ' అంటాడని తెలిసికొమ్ము.

విశేషం: 'పొల వల్చుట' అని మాత్రమే అన్నాడు తిక్కన. కానీ వ్యాసుడు శవం కంపు కొట్టటం అన్నాడు. **"శవగంధముపాఘ్రాతి సురభిం ప్రాప్య యో నరః । దేవతాయతనస్థస్తు షడ్రాత్రేణ స మృత్యుభాక్ ॥"** (12-305-14).

తే. ముక్కువ్రాలుట కర్ణముల్ మ్రొగ్గఁబడుట । రదనవైవర్ణ్యమక్షి విరాగభావ
మంగ మతికృష్ణ మగు టుల్ల మడరఁ జెడుట । సూచకములు సద్యోమృత్యు గోచరతకు. 128

ప్రతిపదార్థం: ముక్కు= నాసిక; వ్రాలుట= ఒరిగిపోవటం; కర్ణముల్= చెవులు; మ్రొగ్గఁబడుట= వాలిపోవటం; రదన= దంతాల; వైవర్ణ్యము= రంగు మారిపోవటం; అక్షి= నేత్రాల; విరాగభావము= విరక్తి; అంగము= శరీరం; అతికృష్ణము+అగుట= బాగా నల్లబడటం; ఉల్లము= హృదయం; అడరన్+చెడుట= స్పందన కోల్పోవటం; సద్యోమృత్యు గోచరతకున్= వెంటనే మృత్యువు ప్రత్యక్షమవుతుంది అనటానికి; సూచకములు= చిహ్నాలు.

తాత్పర్యం: చెవులూ, ముక్కూ వాలిపోవటం, దంతాలు రంగు మారిపోవటం, కన్నులు నిర్జీవంగా అయిపోవటం, శరీరమంతా మాడిపోయినట్టు నల్లబడటం, హృదయస్పందన కోల్పోవటం - ఇవన్నీ సద్యోమృత్యువుకు సూచకాలు.

తే. కారణము లేక దాపలి కను ద్రవించు । నెత్తి చక్కటి ధూమంబు నెగయు నపుడ
మరణదశ యావహిల్లెడు మానవునకు । జనకనృప! యివి బ్రహ్మ సెప్పిన విధములు. 129

ప్రతిపదార్థం: జనకనృప!= జనకమహారాజా!; కారణములేక= కారణం ఏదీ లేకుండానే; దాపలి కను= ఎడమకన్ను; ద్రవించున్= నీరు కారుతుంది; నెత్తిచక్కటిన్= నెత్తిమీద; ధూమంబు= పొగ; నెగయున్= ఎగసిపడుతుంది; మానవునకున్= ఇవి జరిగిన మానవుడికి; మరణదశ= చివరిదశ; అపుడు+అ= ఆ క్షణంలోనే; ఆవహిల్లెడున్= ప్రాప్తిస్తుంది; ఇవి= ఇవన్నీ; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; చెప్పిన= వివరించిన; విధములు= తీరులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అకారణంగా ఎడమకన్ను నీరోడినా, నెత్తిమీదనుంచి పొగలు రేగినా ఆ మానవుడు తత్ క్షణమే మరణిస్తాడని సూచన. ఇవన్నీ బ్రహ్మదేవుడు స్వయంగా చెప్పిన విషయాలు సుమా!

క. విను యోగివరుఁ డరిష్టము । కనుఁగొని యనిశమును యోగగతియుతసాంఖ్యం
బనపాయత నడుపుచు నా । త్మునిఁ బరముం జేర్చి కాలముం గబళించున్. 130

ప్రతిపదార్థం: విను= రాజా! ఆలకించుము; యోగివరుఁడు= యోగీశ్వరుడు; అరిష్టము= అశుభాన్ని; కనుఁగొని= పైని చెప్పిన మరణ సూచకాలతో గ్రహించి; అనిశమును= ఎల్లప్పుడూ; యోగగతియుత= యోగమార్గంతో కూడిన; సాంఖ్యంబున్= సాంఖ్యవిద్యను; అనపాయతన్= విడిచిపెట్టకుండా; నడుపుచున్= సాగిస్తూ; ఆత్మునిన్= జీవాత్ముడిని; పరమున్ చేర్చి= పరమాత్మను చేర్చి; కాలమున్= కాలాన్ని; కబళించున్= స్వాయత్తం చేసుకుంటాడు - స్వాధీనపరచుకుంటాడు.

తాత్పర్యం: ఆయా మరణసూచకాలతో యోగీశ్వరుడు అరిష్టాన్ని గుర్తించి, యోగమార్గం విడువకుండా సాగిస్తూ, జీవాత్మను పరమాత్మతో అనుసంధానించి, కాలాన్ని స్వాధీనపరుచుకొంటాడు.

వ. ఇవ్విధమున నతండు. 131

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ పద్ధతిగా; అతండు= ఆ యోగీశ్వరుడు.

తాత్పర్యం: ఈ విధంగా ఆ యోగీశ్వరుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. కాల కబళనైక శీలుఁడై మృత్యువు । గెలిచి శాశ్వతము నచలము శివము
నచ్యుతము ననామయము నమృతము నవ్య । యంబు నగు పదంబునందు నిలుచు.' 132

ప్రతిపదార్థం: కాల= కాలాన్ని; కబళన= స్వాధీనపరచుకోవటమనే; ఏక= (ఒకే ఒక్క) అద్వితీయమైన; శీలుఁడై= స్వభావం కలవాడై; మృత్యువున్= మృత్యువును; గెలిచి= జయించి; శాశ్వతమున్= నిత్యమైనదీ; అచలమున్= చలించనిదీ; శివమున్= శుభప్రదమైనదీ; అచ్యుతమున్= చ్యుతిలేనిదీ; అనామయమున్= రోగరహితమైనదీ; అమృతమున్= మరణంలేనిదీ; అవ్యయంబున్= మార్పులేనిదీ; అగు= అయినటువంటి; పదంబునందున్= స్థానంలో; నిలుచున్= నిలుస్తాడు.

తాత్పర్యం: యోగీశ్వరుడు కాలాన్ని కబళించే శీలంతో మృత్యువును జయించి, శాశ్వతాదిలక్షణాలు కలిగిన అవ్యయ పదాన్ని పొందుతాడు'.

వ. అని పలికి యాజ్ఞవల్క్య మునీశ్వరుండు జనకజనేశ్వరుతోఁ 'బరంబు దేటపఱుపు మని నీ వడిగి; తా ప్రశ్నంబు సూక్ష్మం; బుత్తరం బవహితుండ వయి విను'మని యిట్లనియె. 133

ప్రతిపదార్థం: అని పలికి= ఇట్లా చెప్పి; యాజ్ఞవల్క్యమునీశ్వరుండు= యాజ్ఞవల్క్యుడు; జనక+జన+ఈశ్వరుతోన్=జనకమహారాజుతో; పరంబు= పరతత్త్వాన్ని; తేటపఱుపుము+అని= విశదీకరించుమని; నీవు; అడిగితి(వి)= అడిగావు; ఆ ప్రశ్నంబు= ఆ ప్రశ్న; సూక్ష్మంబు= చాలా సూక్ష్మమైనది; ఉత్తరంబు= సమాధానం; అవహితుండవు+అయి= సావధానుడవై; వినుము; అని; ఇట్లు+అనియెన్= ఇట్లా వివరించాడు.

తాత్పర్యం: అని చెప్పి యాజ్ఞవల్క్యుడు జనకమహారాజుతో 'పరతత్త్వాన్ని విశదీకరించు మని అడిగావు. ఆ ప్రశ్న చాలా సూక్ష్మమైనది' అంటూ ఇట్లా కొనసాగించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **'మహనీయతపమున మార్తాండు నాకుఁ బ్ర । సన్నుఁగాఁ జేసితి సదయదృష్టి**
ననుఁజూచి యద్దేవుఁ డనఘ! వరంబు నీ । కిచ్చెద నీ కోర్కి యెద్ది? సెప్పు
మనవుడుఁ బ్రణతుండనై యజుస్సంప్రాప్తి । గోరెద ననిన నవ్వారిజాప్తుఁ
డట్లేని వాగ్దేవి నావహించెద వివృ । తంబుగాఁ జేయు మాస్యంబు విప్ర!

తే. **యనియె నవ్వచనము విని యాననమ్ము । సంతసమున విచ్చితి సరస్వతియు నాదు**
తనువుఁ జొచ్చెఁ బదంపడి దాహమొంది । తన్ను నెఱుఁగక వెగడొందు నన్ను నినుఁడు. **134**

ప్రతిపదార్థం: మహనీయ తపమునన్= గొప్ప తపస్సుతో; మార్తాండున్= సూర్యుడిని; నాకున్= నాకు; ప్రసన్నుఁగాన్= ప్రసన్నుడిగా; చేసితిన్= చేసికొన్నాను; ఆ+దేవుఁడు= ఆ సూర్యభగవానుడు; సదయదృష్టిన్= కరుణగల చూపులతో; ననున్+చూచి= నన్ను వీక్షించి; అనఘ!= ఓ పవిత్రుడా! యాజ్ఞవల్క్యుడా!; వరంబున్= ఒక వరాన్ని; నీకున్+ఇచ్చెదన్= నీకు ఇస్తాను; నీ కోర్కి= నీ కోరిక; ఎద్ది?= ఏమిటి?; చెప్పుము= చెప్పు; అనవుడున్= అని సూర్యుడు అనగానే; ప్రణతుండను+ఐ= నమస్కరించినవాడిని అయి; యజుః+సంప్రాప్తిన్= యజుర్వేద లబ్ధిని; కోరెదన్= కోరుకుంటున్నాను; అనినన్= అని నేను అడగగానే; ఆ+వారిజ+ఆప్తుఁడు= పద్మాలకు ఆప్తుడైన ఆ సూర్యుడు; అట్లు+ఏనిన్= అట్లాగయితే; వాగ్దేవిన్= సరస్వతిని; ఆవహించెదన్= ఆవహింపజేస్తాను; విప్ర!= ఓ బ్రాహ్మణుడా!; ఆస్యంబున్= నీ నోటిని; వివృతంబుగాన్+చేయుము= బాగా తెరుచుకునేట్టు చెయ్యి; అనియెన్= అన్నాడు; ఆ+వచనము= ఆ మాట; విని= ఆలించి (పాటించి); సంతసమునన్= సంతోషంతో; ఆననమ్మున్= నా నోటిని; విచ్చితిన్= తెరిచాను; సరస్వతియున్= వాగ్దేవి; నాదు తనువున్= నా శరీరాన్ని; చొచ్చెన్= ప్రవేశించింది; పదంపడి= వెనువెంటనే; దాహము+ఒంది= మంటలకు లోనై; తన్నున్+ ఆ సూర్యభగవానుడిని; ఎఱుఁగక= గుర్తించలేక; వెగడు+ఒందు= తల్లడిల్లుతున్న; నన్నున్= నన్ను; ఇనుఁడు= ఆ సూర్యదేవుడు.

తాత్పర్యం: 'జనకమహారాజా! ఒకప్పుడు నేను గొప్ప తపస్సుచేసి సూర్యభగవానుడిని మెప్పించాను. ఆ దేవుడు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకొనుమన్నాడు. అయితే 'నాకు యజుస్సులను సంప్రాప్తింపజేయుము' అని అడిగాను. 'సరే అట్లాగే. సరస్వతీదేవిని ఆవహింపజేస్తాను. నోరు పెద్దదిగా తెరువుము' - అన్నాడు సూర్యుడు. నేను ఆనందంతో నోరు తెరిచాను. సరస్వతి శరీరంలోనికి ప్రవేశించింది. వెంటనే శరీరం భగభగ లాడిపోయింది. తట్టుకొనలేక ఎదురుగా ఉన్న సూర్యుడిని గుర్తుపట్టలేక తల్లడిల్లిపోయాను. అట్లాంటి నన్ను చూచి ఆ సూర్యుడు (ఇట్లా అన్నాడు).

క. **కనుఁగొని యించుకసేపునఁ । దనువడు నని పలికెఁ బిదపఁ దనువడుటయునుం**
బనుపడియె నప్పు డద్దే । వుని వదనాబ్జమున నా చెవుల కింపారన్. **135**

ప్రతిపదార్థం: కనుఁగొని= నన్నుచూసి; ఇంచుకసేపునన్= కొంచెం సేపట్లో; తనువడున్= చల్లబడుతుంది; అని పలికెన్= అని అన్నాడు; పిదపన్= అటు తరువాత; తనువడుటయునున్= చల్లపడటమనేది కూడా; పనుపడియెన్= జరిగిపోయింది; అప్పుడు= ఆ సమయాన; ఆ+దేవుని= ఆ సూర్యదేవుడి; వదన+అబ్జమునన్= ముఖ పద్మంనుంచి; నా చెవులకున్= నా కర్ణేంద్రియాలకు; ఇంపారన్= ఇంపు అతిశయించేట్టు.

తాత్పర్యం: సూర్యుడు నన్ను చూచి 'ఓ విప్రుడా! కొంచెంసేపు తట్టుకొమ్ము. మంటలు చల్లబడతాయి' అన్నాడు. అనట మేమిటి చల్లబడటం కూడా జరిగిపోయింది. అప్పుడు సూర్యుడి ముఖపద్మంనుండి నా చెవులకు ఇంపుగా కొన్ని పలుకులు వినిపించాయి.

విశేషం: 'వదనాబ్జమునుండి నా చెవులకింపారన్ అని ఉండవలసిన పంచమీవిభక్తికి బదులుగా 'వదనాబ్జమునన్' అని సప్తమీవిభక్తి నిలిచింది. దీనిని బాలవ్యాకర్త సూత్రించాడు. 'ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగా నగు'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(కారక - 11) 'వదనాబ్జముననుండి' అన్న చోట ఉన్న 'ఉండి' శబ్దానికి లోపం బహుళంబుగా వస్తుందని ప్రౌఢవ్యాకర్త సూత్రించాడు. 'వలన కాదేశంబగు ద్వితీయాసప్తములమీఁది యుండికి లోపంబు బహుళంబుగా నగు (కారక -11)' 'వదనాబ్జమున నా చెవుల కింపారన్.'

క. భూసురవర! వేదము ప్రతి । భాసిల్లుచు సంతతప్రపత్తి గలుగు ను
ల్లాసంబు బుద్ధినొందు స । మాసన్నంబు లగు సాంఖ్యమతయోగంబుల్. 136

ప్రతిపదార్థం: భూసురవర!= ఓ బ్రాహ్మణోత్తమా! యాజ్ఞవల్క్యుడా!; వేదము= నీవడిగిన యజుర్వేదం; ప్రతిభాసిల్లుచున్= విరాజిల్లుతూ; సంతతప్రపత్తి= శాశ్వత శరణాగతి; కలుగున్= నీకు లభిస్తుంది; ఉల్లాసంబు= వికాసం; బుద్ధిన్= నీ బుద్ధిని; ఒందున్= పొందుతుంది; సాంఖ్యమతయోగంబుల్= సాంఖ్యమతమూ, యోగమూ; సమాసన్నంబులు+అగున్= నిన్ను చేరుకుంటాయి.

తాత్పర్యం: యాజ్ఞవల్క్యమహర్షీ! వేదం నీకు లభిస్తుంది. నీ బుద్ధి వికసిస్తుంది. సాంఖ్యయోగాలు నీకు ప్రాప్తిస్తాయి. (వేదం భాసించే ప్రపత్తితో ఉన్న ఉల్లాసం బుద్ధికి కలుగుతుందని గానీ).

ఆ. యోగసాంఖ్య సిద్ధినొందు నిష్టావాప్తి । సనుము సమ్మదమున' నను మృదూక్తు
లుద్భవించె మోద ముత్కట మయ్యె నా । కమృతవృష్టిఁ దోఁగినట్టు లైతి. 137

ప్రతిపదార్థం: యోగసాంఖ్య సిద్ధిన్= యోగసాంఖ్యాల సిద్ధితో; ఒందు+ఇష్ట+అవాప్తిన్= లభించేటువంటి ఇష్టావాప్తితో; సమ్మదమునన్= సంతోషంగా; చనుము= వెళ్ళుము; అను= అనేటువంటి; మృదు+ఉక్తులు= మృదువైన మాటలు; ఉద్భవించెన్= వెలువడ్డాయి; నాకున్= నాకు; మోదము= ఆనందం; ఉత్కటము+అయ్యెన్= అతిశయించింది; అమృతవృష్టిన్= అమృతవర్షంలో; తోఁగినట్టులు+ఐతిన్= ఓలలాడినట్టు అయ్యాను.

తాత్పర్యం: యోగసాంఖ్యాల సిద్ధివలన కలిగే ఇష్టావాప్తి నీకు లభిస్తుంది. ఆనందంగా వెళ్ళుము' అనే మెత్తని పలుకులు సూర్యుడి నోటినుండి నా చెవులకు సోకాయి. నా ఆనందానికి అవధులు లేవు. అమృతవర్షంలో దొప్పదోగినట్టు అయ్యాను.

విశేషం: అలం: ఉపమ.

వ. తదనంతరంబ యద్దేవుం డస్తాచలంబువలని కరిగె; నేనుం బరమానందకందళిత మనస్కుండ నగుచు మందిరంబున కేతెంచి సరస్వతిం దలంచుచున్నంత - 138

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ వెంటనే; ఆ+దేవుండు= ఆ సూర్యభగవానుడు; అస్తాచలంబువలనికిన్= పశ్చిమాద్రి వైపునకు; అరిగెన్= వెళ్ళిపోయాడు; నేనున్= నేనుకూడా; పరమానంద= గొప్ప ఆనందంతో; కందళిత= పులకించిన; మనస్కుండను+అగుచున్= మనస్సుకలవాడను అవుతూ; మందిరంబునకున్= ఇంటికి; ఏతెంచి= తిరిగివచ్చి; సరస్వతిన్= వాగ్దేవిని; తలంచుచున్+ఉన్నంతన్= ధ్యానిస్తూండగా.

తాత్పర్యం: తరువాత ఆ సూర్యభగవానుడు పశ్చిమదిక్కుగా వెళ్ళిపోయాడు. నేను మిక్కిలి సంతోషిస్తూ ఇంటికి వచ్చి సరస్వతీదేవిని ధ్యానిస్తూ ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినుము వినుతస్వరవ్యం । జనభూషిత యగ్రభాగ సంస్ఫురదోంకా
రనితాంత హృద్యమధుగ । ర్ఘనిజాకృతి విశదముగ సరస్వతి దోఁచెన్. 139

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వినుము= జనకమహారాజా! ఆలకించుము; వినుత= పొగడొందిన; స్వర= అచ్చులూ; వ్యంజన= హల్లులతో; భూషిత= అలంకరింపబడినదీ; అగ్రభాగ= ఉపరిభాగంలో; సంస్ఫురత్= విరాజిల్లుతున్న; ఓంకార= ప్రణవం కలదీ; నితాంత= మిక్కిలి; హృద్య= మనోహరమైన; మధు= తీయందనం- మకరందం; గర్భ= మధ్యభాగంలోగల; నిజ+ఆకృతి= తన ఆకారం కలదీ; ఐన సరస్వతి= భారతి; విశదముగన్= స్పష్టంగా; తోఁచెన్= భాసించింది.

తాత్పర్యం: మిథిలాధిపతీ! ఓంకారం అగ్రభాగంలో ఉండగా అచ్చులూ హల్లులతో అలంకరింపబడిన సరస్వతి నాకు ప్రత్యక్షం అయింది. హృద్యమైన మధువు ఆ రూపానికి మధ్యభాగంలో భాసిస్తోంది. ఈ రూపం నాకు స్పష్టంగా కనిపించింది.

విశ్వావసునకు యాజ్ఞవల్క్యుఁ డుపదేశించిన తత్త్వప్రకారము (సం. 12-306-30)

వ. **తోఁచిన నత్యంతభక్తిం బ్రపత్తిసేసి సూర్యప్రసాదలబ్ధయుఁ బంచ దశశాఖా సమన్వితయు నిఖిలోత్తర సంహితయు నగు నయ్యజుర్వచోమూర్తి ధరియించి శిష్యులం బరిగ్రహించి వారల నధ్యయనంబు సేయించుచు నివ్వాఙ్మయ బ్రహ్మంబునందు వేదితవ్యం బెయ్యదియో యని విచారింప విరోచనుమహానుభావంబునం జేసి యోగసాంఖ్య రూపోపాయ ప్రకారంబు దోఁచెఁ బదంపడి తదుపేయంబగు వేదవేద్యంబును నద్దేవుని కరుణావిశేషంబునం బ్రతిభాసించెఁ గొండొక కాలంబునకు విశ్వావసుం డను గంధర్వేశ్వరుండు నాకడకుం జనుదెంచి తన్నెఱింగించి యేనుజేయు నతిథిపూజనం బత్యాదరంబునఁ గైకొని 'విశ్వావిశ్వంబులు మిత్రావరుణులు జ్ఞానజ్ఞేయంబులుఁ దపోzతపంబులు సూర్యాతిసూర్యులు విద్యావిద్యలు వేద్యావేద్యంబులుం జలాచలంబులు ననునవి వేదోదితంబులు వానిం దేటపఱుపవే' యని యడిగిన నవహితుండవై వినుమని పలికి - విశ్వంబు భూతభవ్యభవత్కరం బగు నవ్యక్తం బవ్యక్తనామ ప్రకృతి య; విశ్వంబు నిర్గుణుండగు పురుషుండు; మిత్రావరుణులు పురుష ప్రకృతులు, జ్ఞానజ్ఞేయంబులుఁ దపోzతపంబులు సూర్యాతిసూర్యులును ప్రకృతిపురుషుల కానెఱుంగుము. విద్యావిద్యా వేద్యావేద్యా చలచలంబులను శబ్దంబులు వరుసం బురుషునకుం బ్రకృతికిని వాచకంబు లని చెప్పివెండియు నిట్లనియె.** **140**

ప్రతిపదార్థం: తోఁచినన్= సరస్వతీదేవి ప్రత్యక్షమయ్యేసరికి; అత్యంత భక్తిన్= మిక్కిలి భక్తితో; ప్రపత్తి+చేసి= శరణాగతి చేసి; సూర్య= సూర్యదేవుడి; ప్రసాద= అనుగ్రహంతో; లబ్ధయున్= చేకూరినదీ; పంచదశ= పదిహేను; శాఖా= శాఖలతో; సమన్వితయున్= కూడుకొన్నదీ; అగు= అయిన; ఆ+యజుః+వచః+మూర్తిన్= యజుర్వేదం అనే ఆ సరస్వతిని; ధరియించి= ఆవాహన చేసికొని; శిష్యులన్= కొందరు శిష్యులను; పరిగ్రహించి= స్వీకరించి; వారలన్= వారితో; అధ్యయనంబు+చేయించుచున్= యజుశ్శాఖల అధ్యయనం చేయిస్తూ; ఈ+వాఙ్మయ బ్రహ్మంబునందున్= ఈ వాగ్రూపమైన యజుర్వేదంలో; వేదితవ్యంబు= తెలిసికొనవలసినది; ఏ+అదియో= ఏదో; అని; విచారింపన్= ఆలోచిస్తుండగా; విరోచను= సూర్యుడియొక్క; మహా+ అనుభావంబునన్+చేసి= గొప్ప మాహాత్మ్యంతో; యోగ - సాంఖ్యరూప= యోగం సాంఖ్యం అనే రూపంగల; ఉపాయప్రకారంబు= ఉపాయవిధానం; తోఁచెన్= కనిపించింది; పదంపడి= తరువాత; తద్= ఆ ఉపాయంతో; ఉపేయంబు+అగు= పొందదగినద్తె; వేదవేద్యంబును= వేదంతో మాత్రమే తెలుసుకోవలసిన తత్త్వం కూడా; ఆ+దేవుని= ఆ సూర్యభగవానుడి; కరుణా విశేషంబునన్= దయావిశేషంతో; ప్రతిభాసించెన్= స్ఫురించింది; కొండొక కాలంబునకున్= కొంతకాలానికి; విశ్వావసుండు+అను= విశ్వావసుడు అనే; గంధర్వ+ఈశ్వరుండు= గంధర్వప్రభువు; నా కడకున్= నా వద్దకు; చనుదెంచి= వచ్చి; తన్నున్+ఎఱింగించి= తన పరిచయం చెప్పుకుని; ఏను= నేను; చేయు= చేసిన; అతిథిపూజనంబు= అతిథిమర్యాదలను; అతి+ఆదరంబునన్= మిక్కిలి ఆదరంతో; కైకొని= స్వీకరించి; విశ్వ+అవిశ్వంబులున్= విశ్వమైనదీ, విశ్వంకానిదీ; మిత్రావరుణులు= మిత్రుడూ, వరుణుడూ అనేవారూ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జ్ఞాన జ్ఞేయంబులున్= జ్ఞానమూ, జ్ఞేయమూ అనేవీ; తపః+అతపంబులున్= తపస్సయినదీ తపస్సు కానిదీ; సూర్య+అతిసూర్యులున్= సూర్యుడూ, అతిసూర్యుడూ అనేవీ; విద్యా+అవిద్యలు= విద్య అయినదీ, విద్యకానిదీ; వేద్య+అవేద్యంబులున్= తెలిసికొనదగినదీ తెలిసికొనదగనిదీ; చల+అచలంబులున్= చలించేదీ, చలించనిదీ; అనునవి= అనే ఇవన్నీ; వేద+ఉదితంబులు= వేదోక్తాలు; వానిన్= వాటిని; తేటపఱుపవే= నాకు తెలియజెప్పవా; అని; అడిగినన్= అభ్యర్థిస్తే; అవహితుండవు+ఐ= సావధానుడవై; వినుము; అని; పలికి= చెప్పి; భూతభవ్య భవత్కరంబు+అగు= భూతకాలమూ, భవిష్యత్కాలమూ, వర్తమానకాలమూ అనేవాటిని రూపొందించే; అవ్యక్తనామప్రకృతి= అవ్యక్తం అనబడే ప్రకృతియే; విశ్వంబు= విశ్వము అనబడుతుంది; నిర్గుణుండు+అగు= సత్త్వాది గుణరహితుడైన; పురుషుండు= పురుషుడే; అవిశ్వంబు= అవిశ్వం అనబడేది; మిత్రావరుణులు= మిత్రుడూ, వరుణుడూ అనేవారు; పురుష ప్రకృతులు= వరుసగా పురుషుడూ, ప్రకృతీ; జ్ఞానజ్ఞేయంబులున్= జ్ఞానమూ, జ్ఞేయమూ అనేవీ; తపః+అతపంబులున్= తపస్సూ అతపస్సూ అనేవీ; సూర్య+అతిసూర్యులును= సూర్యుడూ, అతిసూర్యుడూ అనేవీ; ప్రకృతిపురుషులు+అ కాన్= వరుసగా ప్రకృతి పురుషులు అని; ఎఱుంగుము= తెలుసుకో; విద్యా+అవిద్యా= విద్య, అవిద్యలూ; వేద్య+అవేద్య= వేద్య, అవేద్యాలూ; అచల+చలంబులు= అచలమూ, చలమూ; అను= అనేటువంటి; శబ్దంబులు= పదాలు; వరుసన్= క్రమంగా; పురుషునకున్= పురుషుడికీ; ప్రకృతికిని= ప్రకృతికీ; వాచకంబులు= బోధకాలు; అని చెప్పి= అని వివరించి; వెండియున్= తిరిగి ఇంకా; ఇట్లు+అనియెన్= యాజ్ఞవల్క్యుడు గంధర్వుడితో ఇలా అన్నాడు.

తాత్పర్యం: ధ్యానంలో సాక్షాత్కరించిన సరస్వతీదేవిని నేను (యాజ్ఞవల్క్యుడు) శరణు వేడగా సూర్యానుగ్రహంతో పదిహేను శాఖల యజుర్వేదం స్ఫురించింది. దానిని శిష్యులకు నేర్పి, వేదవేద్యమైన తత్త్వాన్ని సాంఖ్యయోగాల సహాయంతో తెలిసికొనగలిగాను. ఇట్లా కాలం గడుస్తున్నది. ఒకనాడు విశ్వావసువు అనే గంధర్వుడు నా దగ్గరకు వచ్చాడు. పదిహేను ప్రశ్నలు వేసాడు. అన్నింటికీ సమాధానాలు చెప్పాను. విశ్వావిశ్వాలూ మిత్రావరుణులూ జ్ఞానజ్ఞేయాలూ తపోతపస్సులూ, సూర్యాతిసూర్యులూ, విద్యావిద్యలూ, వేద్యావేద్యాలూ, చలాచలాలూ - వీటిని తెలియజెప్పుమని పదిహేనవ ప్రశ్నగా కట్టకడపట అడిగాడు. విశ్వమూ, వరుణుడూ, జ్ఞానమూ, తపస్సూ, సూర్యుడూ - ఇవన్నీ అవ్యక్తము అనబడే ప్రకృతి. అవిశ్వమూ, మిత్రుడూ, జ్ఞేయమూ, అతపస్సూ, అతిసూర్యుడూ - ఇవన్నీ పురుషుడు. అట్లాగే విద్య, వేద్యం, అచలం అనే శబ్దాలు పురుషుడికి పర్యాయపదాలు - అని చెప్పి యాజ్ఞవల్క్యుడు ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: "విశ్వంబు భూతభవ్యభవత్కరంబగు నవ్యక్తం బవ్యక్త నామప్రకృతి" తెలుగు (సం. 12-306-36) భారతప్రతులలో కనిపిస్తున్న పాఠం. దీనికి మూలశ్లోకం ఇట్లా ఉన్నది: **విశ్వావ్యక్తం పరం విద్యాత్ భూతభవ్య భయంకరమ్.** దీనికి 'భూతభవ్యరూపం యద్భయం, సంసారస్తత్కరోతీతి భూతభవ్యభయంకరమ్' అని నీలకంఠ వ్యాఖ్య. 'భూతభవ్యభవత్తథా' అనే పాఠాంతరంకూడా (జి2, ఎమ్ 1. 5-7) ఉన్నట్లు భండార్కరు ప్రతిలో అధస్సూచిక ఉన్నది. తిక్కన్నకు దొరికిన పాఠం ఇదే అయ్యుండాలి. 'భయంకరమగు' అనేది పాఠాంతరంగా తెలుగు ప్రతులలోనూ ఉన్నది. అయితే ఇందులో 'అవ్యక్తంబు' అనే మాట ఒకటి అదనంగా కనపడుతున్నది. దాని అవసరం కనిపించటంలేదు. భూత భవ్యభవత్కరంబగు నవ్యక్తనామ ప్రకృతి= విశ్వంబు అని అన్వయం కుదిరిపోతున్నది. కాబట్టి అదనంగా ఉన్న 'అవ్యక్తంబు' అనే మాట లేఖకదోషమో ముద్రాపకుల దోషమో అయి ఉంటుంది. 'విద్యావిద్యా - వేద్యావేద్య-చలాచలంబులు' అని సంశోధితముద్రణ పాఠం. దీని ప్రకారం చల= పురుషుడు, అచల= ప్రకృతి అని అన్వయం. **"చలాం తు ప్రకృతిం ప్రాహుః కారణం క్షేపసర్గయోః। అక్షేపసర్గయోః కర్తా నిశ్చలః పురుషః స్మృతః" (12-306-42)** అనేది మూలశ్లోకం. సర్గప్రతిసర్గలకు కారణం అవుతున్నది కాబట్టి చల అంటే ప్రకృతి. వాటికి కర్త కాడు కనుక అచలుడు (నిశ్చలః) అంటే పురుషుడు. సంశోధిత ముద్రణలో పాఠం పూర్తిగా దీనికి వ్యతిరేకంగా ఉన్నది. కాబట్టి 'విద్యావిద్యా-వేద్యావేద్యాచల చలంబులు' అని ఉన్న వావిళ్ళ ప్రతిలో పాఠమే సరియైనది. విద్యా+అవిద్యా, వేద్య+అవేద్య+అచల+చలంబులు అని పదవిభాగం. అప్పుడు వరుసగా 'అచలంబు పురుషునకున్, చలంబు ప్రకృతికిని వాచకంబులు' అవుతాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. అజము లవ్రణంబు లక్షయంబు లతీంద్రి। యములు ప్రకృతి పురుషు లనఁగఁ బరఁగు
రెండు తత్త్వములు నఖండరూపతఁ బొంది। నపుడు ప్రకృతి పురుషునట్ల కాన. 141

ప్రతిపదార్థం: రెండు తత్త్వములున్= వ్యక్తమూ అవ్యక్తమూ అనే ఈ రెండు తత్త్వాలూ; అఖండరూపతన్+పొందిన+అపుడు= ఏకాకారాన్ని పొందినప్పుడు; ప్రకృతి= అవ్యక్తమనబడే ప్రకృతి; పురుషునట్లు+అ+కాన= వ్యక్తమనబడే పురుషునివంటిదే అవుతుంది కాబట్టి; అజములు= అజాలూ; అవ్రణంబులు= అవ్రణాలూ (అక్షరాలు); అక్షయంబులు= అక్షయాలూ; అతీంద్రియములు= అతీంద్రియాలూ; అనఁగన్= అనే పేర్లతో; ప్రకృతి పురుషులు= ప్రకృతి తత్త్వమూ, పురుషతత్త్వం రెండూ కూడా; పరఁగున్= ఒప్పుతాయి.

తాత్పర్యం: విశ్వావసుగంధర్వా! వ్యక్తావ్యక్త తత్త్వాలు రెండూ సమైక్యం పొంది అఖండరూపత్వం పొందినప్పుడు అజములూ అవ్రణములూ అక్షయములూ అతీంద్రియములూ అనే పేర్లతో రెండూ వ్యవహరించబడుతూ ఉంటాయి.

విశేషం: దీనికి మూలశ్లోకాలు ఇట్లా ఉన్నాయి: **"అజా వుభా వప్రజౌ చ అక్షయౌ చాప్యుభావపి । అజౌ నిత్యావుభౌ ప్రాహురధ్యాత్మగతి నిశ్చయాః ॥ అక్షయత్వాత్ప్రజననే అజమత్రాహురవ్యయమ్ । అక్షయం పురుషం ప్రాహుః క్షయో హ్యస్య న విద్యతే ॥' ' (12-306-43,44)** అజములూ, అప్రజములూ, అక్షయములూ, నిత్యములూ అనే పేర్లు రెండింటికీ వర్తిస్తాయని ద్వివచనంతో చెప్పాడు వ్యాసుడు. అప్రజములూ, నిత్యములూ అనే పదాలు తిక్కన ఆంధ్రీకరణంలోనికి రాలేదు. అప్రజంబులు అనేది అవ్రణంబులు అయిందో! అతీంద్రియములు అనేది అదనంగా వచ్చి చేరింది. 'అతీంద్రియావుభౌ' అనే పాఠాంతరం దీనికి మూలం. అజౌ అన్నపదాన్ని వ్యాఖ్యానిస్తూ నీలకంఠీయం। **"అజౌ, అజననహేతూ, పురుషసన్నిధానస్య, అనయా భూతసర్గం కరోమీతీచ్ఛాయాశ్చ అభావాత్. ప్రకృతేరపి సర్గాసామర్థ్యాత్"** - అంది. సాన్నిధ్యం లేకపోవటం వలన, ఇచ్ఛలేకపోవటం వలన ప్రకృతి పురుష తత్త్వాలు జననహేతువులు కాలేకపోతున్నాయి. భూతసృష్టి చెయ్యలేక పోతున్నాయి. కాబట్టి రెండూ 'అజములు' అవుతాయి అని తాత్పర్యం. 'అప్రజములు' అనేది దీనికి పర్యాయపదం అవుతుంది.

అజ్ఞౌ అని పాఠాంతరం ఉన్నది. దాన్ని వ్యాఖ్యానిస్తూ 'యథా ప్రకృతిర్జడత్వాత్ స్వాత్మానం న జానాత్యేవం నిష్కలాత్మాపి స్వాత్మని వృత్తివిరోధాత్ స్వాత్మనం న జానాతీత్యత ఉభావప్యజ్ఞౌ' అన్నాడు. జడత్వం కారణంగా ప్రకృతికి స్వాత్మజ్ఞానం ఉండదు. నిర్గుణుడైన పురుషుడికి కూడా ఆత్మవృత్తి విరోధం వలన ఈ జ్ఞానం ఉండదు. అందుచేత రెండూ అజ్ఞములు అవుతాయని భావం. 'అజౌ నిత్యావుభౌ' అనే ఉత్తరార్ధాన్ని వ్యాఖ్యానిస్తూ 'ద్విత్వ మవివక్షితమ్. తేన యదకర్మఫలం తదజం తదేవ చ నిత్యమిత్యర్థః' అన్నాడు. రెండింటికీ కలిపి ఇవి వాచకాలు అవుతున్నాయి కాబట్టి ద్వివచనం అవసరం లేదు. అది వివక్షితం కాదు. అకర్మఫలాన్నే 'అజము' అంటారు. ఇది ప్రకృతి పురుషతత్త్వాలకు రెండింటికీ సమానం.

వ. అని తెలిపి మఱియును. 142

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; తెలిపి= తెలియజెప్పి; మఱియును= ఇంకా .

తాత్పర్యం: ఇట్లా తెలిపి, ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం).

క. విను వేదవేద్యము నెఱుఁ। గని యాతని వేదపాఠకలనంబు సుధీ
ధన! వేదభారవహనం। బనఁజను నింతియ నిరర్థకాయాసంబై. 143

ప్రతిపదార్థం: సుధీధన!= జ్ఞానసంపన్నుడా! విశ్వావసూ!; విను; వేదవేద్యమున్= వేదంతో తెలుసుకోదగిన ఆ తత్త్వాన్ని; ఎఱుంగని ఆతని= తెలుసుకోని వ్యక్తి(యొక్క) చేసే; వేదపాఠకలనంబు= వేదపఠనమనే పని (వ్యాపారం); నిరర్థక= నిష్ప్రయోజనమైన; ఆయాసంబై= శ్రమ అయి; వేదభార వహనంబు= వేదాల బరువు మొయ్యటం మాత్రమే; అనన్+చనున్= అనదగింది;ఇంతియ=ఇంతే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వేదాధ్యయనానికి ఫలం వేదవేద్యాన్ని తెలిసికొనటం. అది జరగనినాడు అయిదు వేదాలనూ బట్టీయం పట్టినా అది కేవలం శ్రమ. వేదాల బరువుని మోయటం మాత్రమే. నిష్ప్రయోజనం. ఇంతే!

ఆ. క్షరము నక్షరంబుఁ గానంగఁ బోలు వే । దార్థచింతనమున నమ్మిథునము
నందుఁ బూర్వ మురివి యపరంబు సేపట్టి । నిలువవలయు నధికనిష్ఠ గలిగి. 144

ప్రతిపదార్థం: వేదార్థచింతనమునన్= వేదార్థాన్ని మననం చెయ్యటంవలన; క్షరమున్= ఏది క్షరతత్త్వమో; అక్షరంబున్= ఏది అక్షరతత్త్వమో; కానంగన్+పోలున్= తెలుసుకోగలగాలి; ఆ+మిథునమునందున్= ఆ జంటలో; పూర్వము= మొదటిది; ఉరివి= విడిచిపెట్టి; అపరంబు= రెండవదైన అక్షరతత్త్వాన్ని; చేపట్టి= స్వీకరించి; అధికనిష్ఠ కలిగి= దృఢమైన నిష్ఠను వహించి; నిలువన్+వలయున్= నిలవాలి.

తాత్పర్యం: వేదార్థచింతనవలన క్షర - అక్షరతత్త్వాల వివేకం కలుగుతుంది. వీటిలో క్షరాన్ని విడిచిపెట్టి అక్షరతత్త్వాన్ని స్థిరమైన నిష్ఠతో స్వీకరించాలి.

తే. అక్షరం బగు పంచవింశాఖ్య తత్త్వ । తత్పరత నున్నఁ గేవలత్వము ఘటిల్లు
వినుము కేవలత్వమున షడ్వింశదర్శ । నంబు పురుషున కొదవి తన్మయత గలుగు. 145

ప్రతిపదార్థం: అక్షరంబు+అగు= అక్షరము అనబడే; పంచవింశాఖ్య= ఇరవై అయిదవదైన; తత్త్వ= తత్త్వంపట్ల; తత్పరతన్= తాత్పర్యంతో; ఉన్నన్= ఉన్నట్లయితే; కేవలత్వము= కేవలత్వస్థితి; ఘటిల్లున్= సంభవిస్తుంది; వినుము= ఓ విశ్వావసూ! ఆలకించుము; కేవలత్వమునన్= ఆ కేవలతా సిద్ధివలన; పురుషునకున్= పురుషుడికి; షట్+వింశదర్శనంబు= ఇరవై ఆరవదైన పరతత్త్వ సాక్షాత్కారం; ఒదవి= లభించి; తద్+మయత= దానితో తాదాత్మ్యం; కలుగున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: ఇరవై అయిదవదైన అక్షరతత్త్వాన్ని ఉపాసిస్తే క్షరాతీతమైన కేవలత్వం సిద్ధిస్తుంది. దానివలన ఇరవై ఆరవదైన పరతత్త్వం సాక్షాత్కరిస్తుంది. తాదాత్మ్యం కలుగుతుంది.

క. పురుషుని నవ్యక్తము రెం । డు రూపులుగఁ జూచు టొప్పెడు తెఱం గతఁడుం
బురుషోత్తముండు నరయఁగ । నిరువురుగా రతఁడ యాతఁ డిది నిజము సుమీ. 146

ప్రతిపదార్థం: పురుషునిన్= పురుషతత్త్వాన్నీ; అవ్యక్తమున్= ప్రకృతినీ; రెండు రూపులుగన్= వేరువేరైన రెండు తత్త్వాలుగా; చూచుట= చూడటమనేది; ఒప్పెడు తెఱంగు= ఒప్పయిన పద్ధతియే; అతఁడున్= పరముడు అనబడే ప్రబుద్ధపురుషుడూ; పురుషోత్తముడున్= పురుషోత్తముడు అనబడే ఇరవై ఆరవతత్త్వమూ; అరయఁగన్= పరిశీలించి చూస్తే; ఇరువురు కారు= విడివిడిగా ఇద్దరు కారు; అతఁడు+అ= అతడే; ఆతఁడు= ఆతడు; ఇది; నిజము సుమీ= సత్యం సుమా!

తాత్పర్యం: పురుషుడినీ, ప్రకృతినీ వేరువేరు రూపాలుగా చూడట మనేది సమంజసమే. కాని, పరముడూ పురుషోత్తముడూ వేరువేరు కాదు. ఇద్దరూ ఒకటే. (ఇరవై అయిదూ ఇరవై ఆరూ తత్త్వాలకు భేదం లేదని).

క. పురుషోత్తమ షడ్వింశక । పరమేశ్వర నామకములు వరఁగును విను మా
పరమునకు నదియ నిష్కళ । నిరంజనానంద బోధనిత్యం బనఘా!' 147

ప్రతిపదార్థం: అనఘా!= పవిత్రుడా! విశ్వావసూ!; వినుము; ఆ పరమునకున్= ప్రసిద్ధుడైన ఆ పరమాత్మకు; పురుషోత్తమ= పురుషోత్తముడనీ; షడ్వింశక= ఇరవై ఆరవ తత్త్వమనీ; పరమేశ్వర= పరమేశ్వరుడనీ; నామకములు= ప్రసిద్ధమైన నామధేయాలు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరఁగును= ఉన్నాయి; అదియ= అదే; నిష్కళ= నిర్గుణం; నిరంజన= నిరంజనం; ఆనంద= ఆనందం; బోధ= జ్ఞానం; నిత్యంబు= నిత్యం.

తాత్పర్యం: పురుషోత్తముడూ షడ్వింశకతత్త్వమూ పరమేశ్వరుడూ అనేవి ఆ పరమాత్మకే పేర్లు. (ప్రబుద్ధుడైన జీవాత్ముడే పరమాత్ముడని లోగడ వివరించాడు). అదే నిష్కలం. అదే నిరంజనం. అదే ఆనందం. అదే జ్ఞానం. అదే నిత్యం'.

వ. అని చెప్పిన విని విశ్వావసుండు 'పంచవింశకతత్త్వంబునకుం బరంబు గలుగుటయు నది రూపింప నేకంబగుటయు నారద జైగీషవ్య దేవల కపిలశుక సుమంత పైలాదులైన పరమమునుల గోష్ఠీ విశేషంబుల విందు. వినినను నిస్సంశయంబగు బోధం బుదితంబు గామి నిన్నాశ్రయించితి, నీవు సంయమిలోక సురలోక బ్రహ్మలోక ప్రఖ్యాత ప్రజ్ఞాన సంభావనీయుండవు. మదీయ సందేహాపనయంబు సేయవే' యనుటయు నారదాయత్త చిత్తుండనై. 148

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని యాజ్ఞవల్క్యుడు చెప్పగా; విని= గ్రహించి; విశ్వావసుండు= ఆ విశ్వావసువు; పంచవింశక తత్త్వంబునకున్= ఇరవై అయిదవ తత్త్వంకంటే; పరంబు= పరమైనది; కలుగుటయున్= ఉండటమూ; అది= ఆ తత్త్వం; రూపింపన్=నిర్ధారిస్తే; ఏకంబు+అగుటయున్= ఒక్కటే కావటం అనేది; నారద= నారదుడూ; జైగీషవ్య= జైగీషవ్యుడూ; దేవల= దేవలుడూ; కపిల= కపిలుడూ; శుక= శుకుడూ; సుమంత= సుమంతుడూ; పైల+ఆదులైన= పైలుడూ మొదలైన; పరమమునుల= మహామునుల; గోష్ఠీవిశేషంబులన్= చర్చాసందర్భాలలో; విందున్= విని ఉన్నాను; వినినను= విన్నప్పటికీ; నిస్సంశయంబు+అగు= సంశయరహితమైన; బోధంబు= జ్ఞానం; ఉదితంబు+కామిన్= కలగకపోవటంతో; నిన్నున్= నిన్ను; ఆశ్రయించితిన్= ఆశ్రయించాను; నీవు= ఓ యాజ్ఞవల్క్యమహర్షీ! నీవు; సంయమిలోక= నిగ్రహసంపన్నులైన మహర్షుల సమూహంలోనూ; సురలోక= దేవలోకంలోనూ; బ్రహ్మలోక= బ్రహ్మలోకంలోనూ; ప్రఖ్యాత= ప్రసిద్ధికెక్కిన; ప్రజ్ఞాన= తత్త్వజ్ఞానంతో; సంభావనీయుండవు= గౌరవింపబడుతున్నవాడవు; మదీయ= నా; సందేహ+అపనయంబు= సందేహాన్ని తొలగించటం; చేయవే?= చేయవా?; అనుటయున్= అని అభ్యర్థించటంతో; నారద+ఆయత్త-చిత్తుండను+ఐ= నారదుడిని ధ్యానించిన హృదయం కలవాడనై - హృదయంలో నారదుణ్ణి ధ్యానించి యాజ్ఞవల్క్యుడు పలుకుతున్నాడు.

తాత్పర్యం: అని యాజ్ఞవల్క్యుడు చెప్పగా విశ్వావసుడు 'ఇరవై అయిదవ తత్త్వానికి పైన మరొకటి ఉండటం, అది మరలా ఒకటే కావటం అన్న విషయాన్ని నారద, జైగీషవ్య, దేవల, కపిల, శుక, సుమంత పైలాదుల గోష్ఠీ సందర్భాలలో విని ఉన్నాను. అయినా ఇంకా అనుమాన నివృత్తి కాలేదు. సర్వలోక పూజ్యుడవైన నీవే నా సందేహాన్ని తొలగించాలి' అని న న్నడుగగా, నారదుడిని ధ్యానించి.

క. మునిగోష్ఠివలని కొఱఁతయె। విను భవదీయాంతరంగవృత్తి కలుషయై
నిను సంశయాత్మునింగా। నొనరించుచు నున్నయది సముజ్జ్వలతేజా! 149

ప్రతిపదార్థం: సముత్+జ్వలతేజా= ప్రకాశించే తేజస్సు కలవాడా!; మునిగోష్ఠివలని కొఱఁతయె= నీ సంశయం తీరకపోవటం మహర్షుల గోష్ఠిలోని లోపమా?; విను; భవదీయ= నీ; అంతరంగవృత్తి= మనః ప్రవృత్తి - ఏకాగ్రత; కలుషయైనను= కలుషితమై చెడిపోతే; నిను, సంశయాత్మునిన్+కాన్= నిన్ను సంశయాత్ముడిగా; ఒనరించుచునున్న+అది= చేస్తోంది.

తాత్పర్యం: ఓ తేజస్వీ! నీ సందేహం తీరకపోవట మనేది ఎవరి తప్పు అంటావు? మహర్షుల గోష్ఠిదా ఆ లోటు? కాదు కదా! ఏకాగ్రత కోల్పోయి నీ బుద్ధి కలుషం అయితే అది నిన్ను సంశయాత్ముడిగానే ఉంచేస్తుంది మరి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ప్రసన్నైకాగ్రచిత్తుండవై యాకర్ణింపు మని యిట్లంటి. 150

ప్రతిపదార్థం: (అందుచేత ఓ విశ్వావసూ!); ప్రసన్న= కలతదేరి ప్రసన్నమైన; ఏకాగ్రచిత్తుండవు+ఐ= ఏకాగ్రతతో ఉన్న చిత్తం కలవాడవై; ఆకర్ణింపుము= వినుము; అని; ఇట్లు+అంటిన్= ఈ ప్రకారంగా పలికాను.

తాత్పర్యం: అందుచేత ఓ విశ్వావసూ! ప్రశాంతమైన మనస్సుతో వినుము' అంటూ ఇట్లా కొనసాగించాను.

క. 'పురుషున కవ్యక్త పరి । స్ఫురణ శబలవృత్తి గలుగఁ బోయిన నతనిం
బురుషోత్తముఁ డనరు జనన । మరణాది వికారయుక్తి మాటయి యజ్ఞుల్. 151

ప్రతిపదార్థం: పురుషునకున్= జీవాత్మునికి; అవ్యక్త= ప్రకృతియొక్క; పరిస్ఫురణన్= స్ఫూర్తితో; శబలవృత్తి= అనేక రూపత్వం; కలుగన్+పోయినన్= కలిగినట్లయితే; అతనిన్= ఆ జీవాత్ముడిని; జననమరణ+ఆది= పుట్టుక చావు మొదలైన; వికారయుక్తి= వికారాలతో కూడి ఉండటమనేది; మాటు+అయి= మిషగా; అజ్ఞుల్= తత్త్వజ్ఞాన రహితులు; పురుషోత్తముఁడు+అనరు= పురుషోత్తముడు అని అనరు.

తాత్పర్యం: ప్రకృతితో సాంగత్యంవలన పురుషుడికి అనేకరూపత్వం కలుగుతుంది. జనన మరణాది వికారాలు తప్పవు. ఇది కారణంగా అతడిని పురుషోత్తముడు అనకపోవటం అజ్ఞత. ప్రకృతి సాంగత్యంలో ఉంటూనే పురుషుడు తన విభిన్నత్వాన్ని తెలిసికొనగలిగితే ప్రబుద్ధుడు అయినట్లే. జననమరణాది వికారాలు ఎన్ని ఉన్నా అతడిని (ప్రబుద్ధ జీవాత్మను) పురుషోత్తముడుగా గుర్తించటం విజ్ఞులు మాత్రమే చెయ్యగలరు.

వ. అని వెండియు. 152

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: అని చెప్పి మరల యాజ్ఞవల్క్యుడు ఇట్లా అంటున్నాడు.

తే. ప్రకృతి పురుషునిఁ గానదు, ప్రకృతిఁ గనుచు । నునికిఁ బురుషుండు పరమునిఁ గనుట లేక
యుండుఁ, గనుఁ దద్ద్వయముఁ బరముండు, పరమ । వీక్షణము పురుషున కగు వెరవు వినుము. 153

ప్రతిపదార్థం: ప్రకృతి= ప్రకృతితత్త్వం; పురుషునిన్= జీవాత్ముడిని; కానదు= దర్శించదు; పురుషుండు= జీవాత్ముడు; ప్రకృతిన్= ప్రకృతిని; కనుచున్+ఉనికిన్= దర్శిస్తూ ఉండటంచేత; పరమునిన్= పరమాత్ముడిని; కనుట= దర్శించటం; లేక+ఉండున్= లేకుండా ఉండిపోతాడు; పరముండు= పరమాత్మ; తద్+ద్వయమున్= ప్రకృతి పురుషతత్త్వాలు రెండింటినీ; కనున్= చూస్తాడు; పురుషునకున్= జీవాత్మకు; పరమవీక్షణము= పరమాత్మ దర్శనం; అగు= అయ్యే; వెరవు= ఉపాయం; వినుము.

తాత్పర్యం: ప్రకృతి పురుషుడిని చూడదు. ప్రకృతినే చూస్తూ పురుషుడు పరమాత్మను దర్శించలేడు. పరమాత్మ మాత్రం ఈ రెండింటినీ చూస్తూ ఉంటాడు. పురుషుడు పరమాత్మను దర్శించే ఉపాయం ఏమిటో చెప్తుతాను వినుము.

క. స్నేహసహవాసములు స । మ్మోహముఁ దలకొలుపఁ గాలమున మునుఁగుచు గా
ఢాహంకారమమత్వము । లీహఁ బెనుపఁ బ్రకృతిఁ బురుషుఁ డే ననుచుండున్. 154

ప్రతిపదార్థం: స్నేహసహవాసములు= స్నేహమూ, సహవాసమూ అనేవి; సమ్మోహమున్= వ్యామోహాన్ని; తలకొలుపన్= కలిగిస్తే; కాలమునన్= ఋతువులూ, సంవత్సరాలూ ఇత్యాదిగా ఉన్న కాలంలో; మునుఁగుచున్= మునిగిపోతూ; గాఢ= గాఢమైన;అహంకార=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అహంభావమూ; మమత్వములు= మమకారం అనేవి; ఈహన్= కోరికను; పెనుపన్= పెంపొందించగా; పురుషుఁడు= జీవాత్ముడు; ఏను= నేను; ప్రకృతిన్= ప్రకృతిని; అనుచుండున్= అనుకుంటూ ఉంటాడు.

తాత్పర్యం: పురుషుడికి ప్రకృతితో స్నేహమూ, సహవాసమూ తప్పవు. అవి అతడిలో ప్రకృతిపట్ల వ్యామోహం కలిగిస్తాయి. దానితో కాలంలో మునిగిపోతాడు. అహంకార మమకారాలు కోరికను పెంచుతాయి. ఇంక ఈ జీవాత్ముడు 'నేనే ప్రకృతిని' అనుకొంటూ ఉంటాడు. ఈ వ్యామోహం ఉన్నంతవరకూ పురుషుడికి 'పరమవీక్షణము' లభించదు.

క. అది లెస్సగ విడిచి ప్రకృతి । కుదకనిభాకలనమును ఝషోపమ తనకుం
బదిలుఁడయి చూడనేర్చిన । విదితం బగు దానితోడి వేర్పా టనఘా! 155

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! - విశ్వావసూ!; అది= ప్రకృతిని నేనే అనే భావం; లెస్సగన్= బాగా; విడిచి= విడిచిపెట్టేసి; ప్రకృతికిన్= ప్రకృతికి; ఉదకనిభ+ఆకలనమును= నీటితో పోలిక; తనకున్= తనకు; ఝష+ఉపమ= చేపతో పోలిక; పదిలుఁడు+అయి= జాగరూకుడై; చూడనేర్చినన్= చూడగలిగితే; దానితోడి వేర్పాటు= ప్రకృతితో తన విభిన్నత; విదితంబు+అగున్= స్పష్టపడుతుంది.

తాత్పర్యం: ఓ విశ్వావసూ! నేనే ప్రకృతిని అనే భావం విడిచిపెట్టి పురుషుడు చూడగలగాలి. ప్రకృతిని నీరుగా, తనను చేపగా దర్శించగలిగితే తనకూ ప్రకృతికీ ఉన్న వేర్పాటు ఏమిటో తెలుస్తుంది.

ఆ. ప్రకృతి దొఱఁగి తన్నుఁ బన్నుగాఁ జూచు వి । వేక దృఢతఁ బంచవింశకుండు
సంగరహితమైన షడ్వింశపదము ని । స్సంశయముగఁ గాంచు వంశవర్య! 156

ప్రతిపదార్థం: వంశవర్య!= గంధర్వవంశశ్రేష్ఠుడా!; ప్రకృతి= ప్రకృతిని; తొఱఁగి= విడిచిపెట్టి; తన్నున్= తననుతాను; పన్నుగాన్= వేరుపడినవానిగా; చూచు= దర్శించే; వివేకదృఢతన్= జ్ఞానదృఢత్వంతో; పంచవింశకుండు= ఇరవై అయిదవ తత్త్వమైన పురుషుడు (జీవాత్ముడు); సంగరహితము+ఐన= బంధరహితమైన; షడ్వింశపదమున్= ఇరవై ఆరవ తత్త్వమైన పరమస్థితిని; నిస్సంశయముగన్= నిస్సందేహంగా; కాంచున్= దర్శిస్తాడు.

తాత్పర్యం: ఓ విశ్వావసూ! ప్రకృతిని విడిచిపెట్టి తనను తాను భిన్నుడుగా గుర్తించగలిగిన దృఢవివేకం పురుషుడికి లభిస్తే అప్పుడు నిస్సంగమైన పరతత్త్వాన్ని నిస్సందేహంగా చూడగలుగుతాడు.

క. జననజరామృత్యు భయం । బున యోగసమేతసాంఖ్యముం దిరముగ నూఁ
దిన యతులు నిర్మమత్వం । బునఁ బడయుదు రప్పరంబు పొం దచలముగన్. 157

ప్రతిపదార్థం: జనన= పుట్టుట; జరా= ముసలితనం; మృత్యు= చావు అనే వీటివలన కలిగే; భయంబునన్= భయంతో; యోగసమేత= యోగసహితమైన; సాంఖ్యమున్= సాంఖ్యాన్ని; తిరముగన్= స్థిరంగా; ఊఁదిన= ఆశ్రయించిన; యతులు= యోగులు; నిర్మమత్వంబునన్= మమకార రహితస్థితితో; ఆ+పరంబు+పొందు= ఆ పరతత్త్వసాన్నిధ్యాన్ని; అచలముగన్= నిశ్చలంగా; పడయుదురు= పొందుతారు.

తాత్పర్యం: జననమృత్యుభయాలతో యోగసాంఖ్యాలను ఆశ్రయించిన యతీశ్వరులు నిర్మమత్వస్థితితో పరతత్త్వ సాన్నిధ్యాన్ని సుస్థిరంగా అనుభవిస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అపునరావృత్తిపదం బగు నప్పదంబు సూవె పరం' బని చెప్పి వెండియు. 158

ప్రతిపదార్థం: అపునరావృత్తి పదంబు+అగు= పునర్జన్మ అనేది లేని స్థానమైన; ఆ+పదంబు+చూవె= ఆ స్థితియే సుమా!; పరంబు= పరతత్త్వమంటే; అని; చెప్పి= పలికి; వెండియున్= మరల.

తాత్పర్యం: పునర్జన్మ లేని స్థానమైన, ఆ స్థితియే పరతత్త్వ మంటే' అని పలికి మరల.

క. నెట్టన చూడమి నయ్యెడు । నట్టిది యొకచూపునం బరానందంబున్
గట్టిగఁ జేయఁగ వికృతులు । పుట్టక పురుషుండు తత్ప్రబోధాత్ముఁడగున్. 159

ప్రతిపదార్థం: నెట్టన= పూనికతో; చూడమిన్= చూడకపోవటంవలన; అయ్యెడు+అట్టిది= ఏర్పడేటువంటిది; ఒకచూపునన్= ఒక ప్రత్యేక అవగాహనతో; పరానందంబున్= పరము అనబడే ఆనందాన్ని; గట్టిగన్+చేయఁగన్= స్థిరపరుచుకుంటే; వికృతులు= సత్త్వరజస్తమోగుణ సంబంధమైన వికారాలు; పుట్టక= కలగకుండా; పురుషుండు= జీవాత్ముడు; తద్= ఆ పరమాత్మకు సంబంధించిన; ప్రబోధ+ఆత్ముఁడు+అగున్= జ్ఞానంతో కూడినవాడు అవుతాడు.

తాత్పర్యం: 'నేను ప్రకృతికంటే భిన్నుడను' అనే పూనికతో చూడకపోవటం వలన కలిగేది, ఒక ప్రత్యేకమైన అవగాహనతో కూడిన చూపుతో చూస్తే, అందువలన కలిగే పరమానందాన్ని స్థిరపరుచుకొనగలిగితే పురుషుడికి ఏ వికారాలూ ఉండవు. ప్రబుద్ధుడు అవుతాడు.

క. పురుషోత్తముండుఁ బురుషుఁడు । నిరువు రగుట గలదు గలిగెనేనియుఁ బురుషుం
బురుషోత్తమునందుఁ గలపు । వెరవున నేకత్వమహిమ విజ్ఞాతమగున్. 160

ప్రతిపదార్థం: పురుషోత్తముండున్= పరమాత్ముడూ; పురుషుఁడున్= జీవాత్ముడూ; ఇరువురు+అగుట= ఇద్దరుగా విభిన్నులు+ కావటం; కలదు= ఉంది; కలిగెనేనియున్= ఉన్నప్పటికీ; పురుషున్= జీవాత్ముడిని; పురుషోత్తమునందున్= పరమాత్మలో; కలపు= ఐక్యంచేసే; వెరవునన్= ఉపాయంలో; ఏకత్వమహిమ= ఏకత్వం తాలూకు గొప్పతనం; విజ్ఞాతము+అగున్= తెలివిడికి వస్తుంది.

తాత్పర్యం: పురుషోత్తముడూ, పురుషుడూ విభిన్ను లనటమూ ఉన్నది. అయినా ఇద్దరినీ కలిపే ఉపాయంలోనే ఏకత్వమహిమ సాధకుడికి అనుభవంలోనికి వస్తుంది. (సాంఖ్యయోగాలద్వారా ఇది సిద్ధిస్తుందని).

క. ఇది విజ్ఞానము కృత్యము । తుది విజ్ఞానాత్ముఁడు నగు, దుర్లభము ప్రశాం
తి దశాహీనాత్ముల క । ప్పదమది, మోక్షంబు మమత వాసినఁ గల్గున్.' 161

ప్రతిపదార్థం: ఇది= ఏకత్వమహిమ విజ్ఞాతం కావటమనేది; విజ్ఞానము కృత్యము= విద్యవలన జరిగేపని; తుదిన్= కట్టకడపటికి; విజ్ఞానాత్ముఁడున్= పురుషుడు విద్యావంతుడు కూడా; అగున్= అవుతాడు; ప్రశాంతిదశా+హీన+ఆత్ములకున్= చిత్తశాంతి అనే దశ లేనివారికి; ఆ+పదము+అది= ఆ పరమాత్మ స్థాయి; దుర్లభము= ఒకపట్టాన దొరకదు; మమత= మమకారం అనేది; పాసినన్= వదిలిపోయినట్టయితే; మోక్షంబు= ముక్తి; కల్గున్= లభిస్తుంది.

తాత్పర్యం: జీవాత్మ పరమాత్మల ఏకత్వమహిమను ఎరుక పరచటమే విజ్ఞానం (విద్య) చేసేపని. చిత్తశాంతి అనేది లేనివాళ్ళకు పరానందం లభించదు. ఏకత్వమహిమ సిద్ధించదు. మమకారాన్ని విడిచిపెట్టుకొంటే మోక్షం లభిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని యుపదేశించిన విని విశ్వావసుండు ప్రమోదంబు నొంది 'పథ్యంబును హితంబును దథ్యంబును నగుతెఱం గనుగ్రహించితి భవదీయ ప్రసాదంబునం గలంకదేఱి నిర్మలుండ నయితి' నని పలికి సభక్తికంబుగా బ్రదక్షిణంబును ప్రణామంబునుం జేసి నిజస్థానంబున కరిగె' నని చెప్పి యాజ్ఞవల్క్యమునినాథుండు జనకజననాథుతో వెండియు నిట్లనియె. 162

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; ఉపదేశించినన్= ఉపదేశించగా; విని; విశ్వావసుండు= విశ్వావసుడు అనే గంధర్వుడు; ప్రమోదంబున్+ఒంది= సంతోషించి; పథ్యంబును= ఆచరించదగినదీ; హితంబును= మేలుకూర్చేదీ; తథ్యంబును= నిజమైనదీ; అగు= అయిన; తెఱంగు= విధానాన్ని; అనుగ్రహించితి(వి)= నాకు దయచేశావు; భవదీయ= నీ; ప్రసాదంబునన్= అనుగ్రహంతో; కలంక+తేఱి= కలతనుంచి తేరుకుని తేటపడి; నిర్మలుండన్+అయితిన్= మలినరహితుడిని అయ్యాను; అని పలికి= ఇట్లా చెప్పి; సభక్తికంబుగాన్= భక్తితో; ప్రదక్షిణంబును= ప్రదక్షిణం; ప్రణామంబును= సాష్టాంగనమస్కారం; చేసి= ఆచరించి; నిజ స్థానంబునకున్= తన నెలవుకు; అరిగెన్= వెళ్ళిపోయాడు; అని చెప్పి= ఇట్లా వివరించి; యాజ్ఞవల్క్య మునినాథుండు= మునీశ్వరుడైన యాజ్ఞవల్క్యుడు; జనక - జననాథుతోన్= జనేశ్వరుడైన జనకుడితో; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా నేను ఉపదేశించగా వినిన విశ్వావసుడు 'నాకు మేలుకూర్చేదీ ఆచరణయోగ్యమైనదీ, నిజమైనదీ అయిన మార్గాన్ని చెప్పావు. నీ అనుగ్రహంవలన తేటపడ్డాను' అని నాకు నమస్కరించి, విశ్వావసుడు సెలవు తీసికొన్నాడు' అని యాజ్ఞవల్క్యుడు ఇంకా ఇట్లా చెప్పసాగాడు.

క. 'మానవపతిసత్తమ! యీ । జ్ఞానము బ్రహ్మాది దివిజ సంయమిమత మె
వ్వానికి మోక్షంబునకుం । దాన తెరువు - తెరువు లొండ్లు దలఁపం గలవే? 163

ప్రతిపదార్థం: మానవ+పతిసత్తమ!= రాజోత్తమా!; ఈ జ్ఞానము= నేను ఇంతవరకూ ఉపదేశించిన ఈ విద్య; బ్రహ్మ+ఆది= బ్రహ్మమొదలైన; దివిజ= దేవతల; సంయమి= నిగ్రహసంపన్నులైన మునీశ్వరుల; మతము= అభిమతం; ఏ+వానికిన్= ఎవడికైనా; మోక్షంబునకున్= ముక్తికి; తాను+అ= అదియే; తెరువు= మార్గం; ఒండ్లు+తెరువులు= వేరే మార్గాలు; తలఁపన్= ఎంత ఆలోచించినా; కలవే?= ఉన్నాయా? (లేవని భావం).

తాత్పర్యం: జనకరాజోత్తమా! ఇంతవరకూ నేను చెప్పింది బ్రహ్మాది దేవతలకూ, మునులకూ సమ్మతమైన మతం. ఇదే ముక్తికి మార్గం. మరి వేరే మార్గాలు లేనే లేవు.

ఆ. జ్ఞానమునన కాని జన్మజరామృత్యు । వుల జయించునట్టి యలఘు మోక్ష
పదము గల్గ నేర దది కారణముగ సు । జ్ఞాన మెల్లభంగి సాధ్యతమము. 164

ప్రతిపదార్థం: జ్ఞానమునన్+అ+కాని= జ్ఞానంచేతనే తప్ప; జన్మ= పుట్టుక; జరా= ముసలితనం; మృత్యువులన్= మరణం అనే వీటిని; జయించునట్టి= జయించేటువంటి; అలఘుమోక్షపదము= ఆ గొప్ప ముక్తిపదవి; కల్గన్ నేరదు= లభించదు; అది కారణముగన్= అందుచేత; ఎల్లభంగిన్= సర్వవిధాలా; సుజ్ఞానము= ఈ మంచిజ్ఞానం (విద్య); సాధ్యతమము= తప్పకుండా సాధించవలసిన వాటి అన్నింటిలో ఉత్తమోత్తమం.

తాత్పర్యం: జననమరణాలను జయించటమే మోక్షపదవి. అది కేవలం ఈ జ్ఞానంచేతనే లభిస్తుంది కాబట్టి జ్ఞానసాధన అనేది అన్నివిధాలా ఉత్తమోత్తమ కర్తవ్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. గురుఁ డెవ్వఁడైననగు ని । వ్వెర వుపదేశించువాఁడ వేల్పుగ శ్రద్ధా
పరమతి గావలయు జనన । మరణంబులు శ్రద్ధ లేని మనుజునిఁ బొదువున్. 165

ప్రతిపదార్థం: గురుఁడు= ఆచార్యుడు; ఎవ్వఁడు+ఐనన్+అగున్= చతుర్వర్ణాలలో ఎవడయినా కానిమ్ము; ఈ+వెరవు= ఈ ఉపాయాన్ని; ఉపదేశించువాఁడు+అ= ఉపదేశించినవాడే; వేల్పుగన్= దేవుడుగా; శ్రద్ధాపర+మతిన్= శ్రద్ధతోకూడిన బుద్ధికలవాడు; కావలయున్= కావాలి; జననమరణంబులు= ఈ జననజరామృత్యువులు; శ్రద్ధలేని= శ్రద్ధలేనటువంటి; మనుజునిన్= మానవుడిని; పొదువున్= పొదువుకుంటాయి లేక ఆవరిస్తాయి.

తాత్పర్యం: చతుర్వర్ణాలలో గురువు ఎవడైనా కానిమ్ము, ఈ ఉపాయం చెప్పినవాడే దేవత. శిష్యుడికి అంతటి శ్రద్ధ ఉండాలి. శ్రద్ధ లేకపోతే జననమరణరూపమైన అజ్ఞానం వదలదు. పొదువుకొనే ఉంటుంది.

క. విను మజ్ఞానంబునఁ గ । ర్మనిరూఢత గలుగు దాన మలఁగవు జననం
బును మరణము సమ్యక్ జ్ఞా । న నిత్యుఁ డగువాఁడు మోక్షణముఁ జుల్కఁ గనున్. 166

ప్రతిపదార్థం: వినుము= రాజా! ఆలకించు; అజ్ఞానంబునన్= అవిద్యవలన; కర్మనిరూఢత= కర్మాచరణమనే బంధంలో కూరుకుపోవటమనేది; కలుగున్= జరుగుతుంది; దానన్= అందుచేత; జననంబును-మరణమున్= జననమరణాలు; మలఁగవు= అంతరించవు; సమ్యక్+జ్ఞాన+నిత్యుఁడు+అగువాఁడు= సరియైన విద్యపట్ల నిష్ఠ కలిగినవాడు; మోక్షణమున్= ముక్తిని; చుల్కన్= తేలికగా; కనున్= పొందుతాడు.

తాత్పర్యం: రాజా! వింటున్నావా! అజ్ఞానంవలన జీవాత్ముడు కర్మాచరణబంధనంలో కూరుకొనిపోతాడు. అతడికి జననమరణాదులు అంతరించవు. మోక్షపదం లభించదు. సరియైన జ్ఞానం కలవాడికి ముక్తి కరతలామలకం.

క. ఈ వెర వూఁదుము నృప! నను । నీ వడిగిన యంతయును వినిశ్చయకృతి సం
భావితముగాఁగఁ జెప్పితిఁ । బోవిడువుము శోకమోహమును, నిలుపు ధృతిన్.' 167

ప్రతిపదార్థం: నృప!= రాజా!; ఈ వెరవు= ఈ మార్గాన్ని; ఊఁదుము= ఆశ్రయించుము; ననున్= నన్ను; నీవు; అడిగినయంతయునున్= అడిగినంతా; వినిశ్చయకృతిన్= ఏ సందేహమూ, సంశయమూ లేని నిశ్చయరీతిలో; సంభావితముగాఁగన్= అందరూ ఒప్పి మెచ్చేట్టు; చెప్పితిన్= వివరించాను; శోకమోహమును= దుఃఖహేతువైన మోహాన్ని; పోన్+విడువుము= వదలించుకొమ్ము; ధృతిన్= ధైర్యాన్ని; నిలుపు= అలవరచుకొమ్ము.

తాత్పర్యం: రాజా! ఇప్పటివరకూ నేను ఉపదేశించిన ఈ మార్గాన్ని ఆశ్రయించుము. నీవు నన్ను అడిగినదంతా నలుగురికీ సమ్మతమైన పద్ధతిలో ఏ సందేహాలకూ తావులేకుండా వివరించి చెప్పాను. శోకహేతువైన మోహాన్ని లేదా శోకాన్నీ, మోహాన్నీ, విడిచిపెట్టుము. జ్ఞానంవలన కలిగే ధైర్యం నిలుపుకొమ్ము'.

క. అని చెప్పిన ముదితుండై । జనకుఁడు శోకాదిభావ సంగవిరహితం
బును బ్రహ్మధ్యానపరం । బును నగు చిత్తంబుతోడ ముదితుం డగుచున్. 168

ప్రతిపదార్థం: అని చెప్పినన్= యాజ్ఞవల్క్యుడు ఇట్లా చెప్పేసరికి; జనకుఁడు= జనకమహారాజు; ముదితుండై= సంతోషించినవాడై; శోక+ఆది= దుఃఖమూ మొదలైన; భావ= భావాలతో; సంగవిరహితంబును= సాంగత్యం లేనిదీ; బ్రహ్మధ్యాన పరంబును= పరమాత్మను ధ్యానించటంలో సక్తమైనదీ; అగు= అయిన; చిత్తంబుతోడన్= అంతరంగంతో; ముదితుండు+అగుచున్= సంతోషించినవాడు అవుతూ.

తాత్పర్యం: యాజ్ఞవల్క్యుడు ఇట్లా వివరించి చెప్పేసరికి జనకమహారాజు సంతోషపడ్డాడు. దుఃఖాది భావాలను విడిచిపెట్టేసి బ్రహ్మధ్యానంలో జనకుడి చిత్తం సంలగ్నమయ్యింది. అందువలన మరీ సంతోషం కలిగింది. ఆ ఆనందంలో అట్లా ఉండిపోయాడు.

విశేషం: సంశోధిత ముద్రణ ప్రతిలో ముదితుండై - ముదితుండగుచున్ అనే పాఠమే కనపడుతున్నది. వావిళ్ళవారి ప్రతిలోనూ ఇట్లాగే ఉన్నది. ఇది పునరుక్తి. 'ముని నతుఁడగుచున్' అనే పాఠాంతరాన్ని సంశోధితముద్రణ అధస్సూచికగా ఇచ్చింది. దాన్ని స్వీకరిస్తే పునరుక్తి తొలగిపోతుంది. ముని= యాజ్ఞవల్క్య మహర్షికి; నతుఁడు+అగుచున్= నమస్కరిస్తూ - ఉండెను అని అన్వయం మరింత సమంజసంగా ఉంటుంది.

వ. ఉండెం బాండవాగ్రజా! యీ యాజ్ఞవల్క్యమునివరు వాక్యరూపంబునన యే నిమ్మహనీయజ్ఞానంబు నీ కుపదేశించితి' నని చెప్పి భీష్ముఁ డతనితో 'నీ విందుల తాత్పర్యంబు గలిగి యార్యగర్హితంబులగు శోకమోహాదిప్రాకృతభావంబులం దొఱంగి సుఖి వగు' మనిన విని య క్కౌంతేయాగ్రజుండు సంతుష్టాంతరంగుండై య గ్గాంగేయునకుం బ్రణమిల్లి 'గృహస్థ ధర్మంబు పరిత్యజింపక మోక్షంబు వడయుట గలుగనోపునే?' మదీయ చిత్తంబు సంశయాయత్తం బగుచుండు; నిక్కాలుష్యంబు వాపవే' యని యభ్యర్థించిన నతండు 'జనకసులభాసంవాదం బను నితిహాసంబు గలుగు దాన నేతత్సంశయంబు వాయు దానిం జెప్పెద విను' మని పలికి యతని కిట్లనియె. 169

ప్రతిపదార్థం: ఉండెన్= ఉన్నాడు; పాండవ+అగ్రజా!= ధర్మరాజా!; ఈ యాజ్ఞవల్క్యమునివరు= ఈ యాజ్ఞవల్క్యుడనే మునీశ్వరుడి; వాక్యరూపంబునన్+అ= పలుకుల ప్రకారమే; ఏను= నేను; ఈ+మహనీయ జ్ఞానంబున్= ఈ గొప్ప విద్యను; నీకున్= నీకు; ఉపదేశించితిన్= ఉపదేశించాను; అని చెప్పి= అని తెలిపి; భీష్ముఁడు= భీష్మాచార్యుడు; అతనితోన్= ఆ ధర్మరాజుతో; నీవు; ఇందులన్= ఈ విషయంపట్ల; తాత్పర్యంబు= శ్రద్ధ; కలిగి= వహించి; ఆర్య= సజ్జనులచేత; గర్హితంబులు+అగు= నింద్యాలయిన; శోక మోహ+ఆది= దుఃఖమూ, వ్యామోహమూ మొదలైన; ప్రాకృత భావంబులన్= ప్రకృతి సంబంధమైన భావాలను; తొఱంగి= విడిచి; సుఖివి= సుఖవంతుడవు; అగుము= కమ్ము; అనినన్= అని పలుకగా; విని; ఆ+కౌంతేయ+అగ్రజుండు= కుంతీపుత్రులలో పెద్దవాడైన ఆ ధర్మరాజు; సంతుష్ట+అంతరంగుండై= సంతోషించిన హృదయం కలవాడై; ఆ+గాంగేయునకున్= గంగాపుత్రుడైన ఆ భీష్ముడికి; ప్రణమిల్లి= నమస్కరించి; గృహస్థధర్మంబు= గృహస్థాశ్రమాన్ని; పరిత్యజింపక= విడిచిపెట్టకుండా; మోక్షంబు+పడయుట= ముక్తి పొందటం; కలుగన్+ఓపునే?= సంభవిస్తుందా?; మదీయచిత్తంబు= నా అంతరంగం; సంశయ+ఆయత్తంబు+అగుచుండున్= ఈ సందేహానికి లోనవుతూ ఉంటుంది; ఈ+కాలుష్యంబు= ఈ మాలిన్యాన్ని; పాపవే?= దయచేసి తొలగింపవా?; అని; అభ్యర్థించినన్= ప్రార్థించేసరికి; అతండు= ఆ భీష్ముడు; జనకసులభాసంవాదంబు+అను= ధర్మధ్వజుడనే జనకమహారాజూ, సులభాదేవి - వీరిద్దరిమధ్యా నడిచిన వివాదం అనే; ఇతిహాసంబు= ఒక పూర్వవృత్తాంతం; కలుగున్= ఉంది; దానన్= ఆ కథతో; ఏతత్+సంశయంబు= నీ ఈ సందేహం; పాయున్= తొలగిపోతుంది; దానిన్= ఆ సంవాదాన్ని; చెప్పెదన్= చెబుతాను; వినుము; అని పలికి= అని చెప్పి; అతనికిన్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇలా వివరించాడు.

తాత్పర్యం: ధర్మరాజా! యాజ్ఞవల్క్యముని పలుకుల ప్రకారమే నేను ఈ గొప్పవిద్యను నీకు ఉపదేశించాను; అని చెప్పి భీష్ముడు 'నీవు దీనియందు శ్రద్ధకలిగి సజ్జనులు గర్హించే శోకమోహాలను త్యజించి సుఖివి కమ్ము' అని ధర్మరాజుతో పలుకగా అతడు సంతోషించి భీష్ముడికి నమస్కరించి 'గృహస్థ ధర్మాన్ని వదలకుండా మోక్షం పొందవచ్చునా? అనే అనుమానం నా మనస్సులో ఉన్నది. దానిని తొలగించు' మని వేడుకొన్నాడు. భీష్ముడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'జనకసులభాదేవుల నడుమ జరిగిన సంవాద మనే ఇతిహాసాన్ని విను' మనీ, 'దానివలన సందేహాలన్నీ తొలగిపోతాయి. దానిని విను' మని ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు జనక సులభా సంవాదంబు సెప్పుట (సం. 12-308-3)

క. సులభాభిధాన యగునొక । లలన విమలయోగధర్మ లంపటు జనకుం
గెలన విని యతని బోధము । కొలఁది పరీక్షింపఁ దనకుఁ గోర్కి వొడమినన్. 170

ప్రతిపదార్థం: సులభా+అభిధాన+అగు= సులభ అనే పేరుగలదైన; ఒక లలన= ఒక వనిత; విమల= పవిత్రమైన; యోగధర్మ= యోగాచరణంలో; లంపటున్= పూర్తిగా మునిగిపోయిన; జనకున్= ధర్మధ్వజుడనే జనకమహారాజును; కెలనన్= సమీపంలోనే (ఉన్నాడని); విని= తెలిసికొని; అతని= ఆ జనకుడి; బోధముకొలఁది= జ్ఞానం లోతు; పరీక్షింపన్= పరీక్షించాలని; తనకున్= తనకు; కోర్కి= కోరిక; పొడమినన్= కలుగగా.

తాత్పర్యం: అనగా అనగా ఒక వనిత. ఆవిడపేరు సులభ. యోగ ధర్మాలను ఒక వ్యసనంవలె ఆచరిస్తున్న జనకమహారాజును పరీక్షించాలనీ, అతడి జ్ఞానం తాలూకు లోతు ఎంతో తెలిసికొనాలనీ ఆవిడకు ఒక కోరిక కలిగింది. జనకమహారాజు ఆ దగ్గరలోనే ఉన్నా డని తెలిసికొన్నది.

వ. నియమాచరణకృశం బగు శరీరంబు యోగప్రభావంబున డాఁచి సుందరసుకుమారం బగు నాకారంబు వహించి జనకుం గాంచి భిక్షావృత్తిత్వసూచకంబు లగు వచనంబు లుపన్యసించిన నతం డాసనపాద్యార్చనంబు లాచరించి మహనీయంబగు భోజనం బొనర్చిన సంతృప్తిం బొంది యవ్విదేహపతికి నాసన్నంబగు నుచితాసనంబున నాసీనయైయుండి యాతండు ముక్తుండగుఁ గామిఁ గనుఁగొను తలంపున నిజానుభావంబున నతని చిత్తంబు ప్రవేశించి మారవికారంబు భావించి. 171

ప్రతిపదార్థం: నియమ+ఆచరణ= యోగ నియమాలను ఆచరించటం వలన; కృశంబు+అగు= చిక్కిపోయిన; శరీరంబున్= తన శరీరాన్ని; యోగప్రభావంబునన్= యోగశక్తితో; డాఁచి= మరుగుపరచి; సుందర సుకుమారంబు+అగు= సుందరమూ, సుకుమారమూ అయిన; ఆకారంబు= రూపం; వహించి= ధరించి; జనకున్= జనకమహారాజును; కాంచి= సమీపించి; భిక్షావృత్తిత్వ= తాను భిక్షావృత్తితో ఉన్నాను అనే విషయానికి; సూచకంబులగు= సూచకాలైన; వచనంబులు= మాటలు; ఉపన్యసించినన్= పలికే సరికి; అతండు= ఆ జనకుడు; ఆసన పాద్య+అర్చనంబులు= కూర్చోవటానికి ఆసనం; కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళూ అందివ్వటమనే గౌరవాలు; ఆచరించి= చేసి; మహనీయంబు+అగు= గొప్పదైన; భోజనంబు+ఒనర్చినన్= విందుభోజనం ఏర్పాటు చేయగా; సంతృప్తిన్+పొంది= ఆవిడ సంతుష్టురాలై; ఆ+విదేహపతికిన్= ఆ జనకమహారాజుకు; ఆసన్నంబు+అగు= సమీపంలో ఉన్న; ఉచిత+ఆసనంబునన్= సముచిత పీఠంమీద; ఆసీనయై యుండి= సుఖంగా కూర్చుని; ఆతండు= ఆ జనకుడు; ముక్తుండు= సంగవిరహితుడు; అగున్ కామిన్= అవునోకాదో; కనుఁగొను తలంపునన్= తెలిసికొనే ఉద్దేశంతో; నిజ= తన; అనుభావంబునన్= కటాక్షాది చేష్టలతో; అతని చిత్తంబు= ఆ జనకుడి హృదయం (లోనికి); ప్రవేశించి= చొరబడి; మారవికారంబున్= మన్మథవికారాన్ని; భావించి= ఊహించి.

తాత్పర్యం: ఆమె యోగప్రభావంతో చిక్కిపోయిన తన శరీరాన్ని మరుగుపరిచి, అందమైన శరీరాన్ని తెచ్చిపెట్టుకొని, జనకుడివద్దకు వెళ్ళి, తాను భిక్షుకి నన్నట్లుగా తోచే మాటలు అతడితో అనగా, ఆయన ఆమెను సాదరంగా ఆహ్వానించి, భోజనం పెట్టి, సుఖాసీనురాలినిగా చేశాడు. అతడు నిజంగా విరక్తుడగునో కాదో పరీక్షించటానికి తన చేష్టలతో ఆమె మన్మథవికారాన్ని కలిగించబోయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తన లోచనదీప్తుల న। మ్మనుజపతి మొగంబునందు మల్లడిగొనఁ జే
సిన నమ్మహాత్ముఁ డప్ప। ద్మనయన తలఁ పెఱిఁగి జనిత మందస్మితుఁడై. 172

ప్రతిపదార్థం: తన= ఆ సులభాదేవి తన యొక్క; లోచనదీప్తులన్= నేత్రకాంతులను; ఆ+మనుజపతి= ఆ జనకమహారాజుగారి; మొగంబునందున్= ముఖంమీద; మల్లడిగొనన్= గుంపుగా పెనవేసుకునేట్లు; చేసినన్= చేసేసరికి; ఆ+మహాత్ముఁడు= ఆ మహానుభావుడు; ఆ+పద్మనయన= ఆ పద్మాక్షియొక్క; తలఁపు= ఆలోచనను; ఎఱిఁగి= గుర్తించి; జనితమందస్మితుఁడై= మొలకెత్తిన చిరునవ్వు కలవాడై.

తాత్పర్యం: సులభాదేవి మన్మథభావసూచకాలైన తన మెరుపు చూపులను జనకమహారాజు ముఖంమీదికి వ్యాపింపజేసింది. అతడు ఆమె మనస్సును గ్రహించాడు. చిన్నగా నవ్వుకొన్నాడు. మెల్లగా ప్రశ్నించాడు.

ఆ. 'ఎచటినుండి యెచటికేఁగెద? వెవ్వరి। దాన? వేమి వెంటఁ దగిలి నడతు
సుదతి! నాకుఁ జెప్పు మది యట్టులుండె నా। మాట వీవు విను సమాదరమున. 173

ప్రతిపదార్థం: సుదతి!= అందమైన పలువరుస కలదానా!; ఎచటనుండి+ఎచటికిన్+ఏఁగెదవు?= ఎక్కడనుండి ఎక్కడికి వెళుతున్నావు?; ఎవ్వరిదానవు?= నీవెవరవు?; ఏమిటి వెంట+తగిలి+నడతు(వు)= నీవు ఏమి చేస్తుంటావు?; నాకున్= నాకు; చెప్పుము= తెలియజేయుము; అది+అట్టులు+ఉండెన్= అది అట్లా ఉంచి; నా మాటలు= నీకు చెప్పబోయే మాటలు; ఈవు= నీవు; సమాదరమునన్= శ్రద్ధతో; విను.

తాత్పర్యం: 'ఓ సుదతీ! నీవు ఎవరవు? ఏ ఊరు? ఎక్కడికి వెళ్ళుతున్నావు? ఏమి చేస్తుంటావు? వివరంగా చెప్పుము. దానికేంగానీ ముందు నేను చెప్పే మాటలు శ్రద్ధగా వినుము.

విశేషం: ఈ ఇతిహాసంలో జనకమహారాజు పేరు ధర్మధ్వజుడు. **"సన్న్యాస ఫలికః కశ్చిద్బభూవ నృపతిః పురా! మైథిలో జనకో నామ ధర్మధ్వజ ఇతి శ్రుతః॥"** (12-308-4). మిథిలాధిపతులందరికీ 'జనకుడు' అనేది సాధారణ నామధేయం. ఎవరికి వారికి ప్రత్యేకంగా విశిష్టనామధేయాలూ ఉంటాయి. అది ఆ వంశసంప్రదాయం. ఈ సులభ - జనకమహారాజును మిథిలానగరం వెళ్ళి మంత్రి పండిత సభా మధ్యంలో కలుసుకున్నట్టుగా వ్యాసుడు ముందే చెప్పాడు. **"సా ప్రాప్య మిథిలాం రమ్యాం సమృద్ధజనసంకులామ్। భైక్షచర్యాపదేశేన దదర్శ మిథిలేశ్వరమ్॥"** (12-308-12). **"అథ భుక్తవతీ ప్రీతా రాజానం మంత్రిభిర్వృతం । సర్వభాష్యవిదాం మధ్యే చోదయామాస భిక్షుకీ॥" (15).** దీనిని తిక్కన 206వ వచనంలో ప్రస్తావించాడు. తన నేత్రకాంతులతో జనకుడి నేత్రకాంతులను సంయోజన చేసి (చూపుల పగ్గాలు పెనవేసి - రశ్మి అంటే పగ్గమనికూడా) యోగబంధనంలో అతడిని బంధించింది అన్నాడు వ్యాసుడు. **" నేత్రాభ్యాం నేత్రయోరస్య రశ్మీన్సంయోజ్య రశ్మిభిః । సా స్మ సంచోదయిష్యంతం యోగబంధైర్బబంధ హ॥''** (12-308-17).

సీ. పంచశిఖుండను పరమమునీశ్వరు। శిష్యుండ నతనిచే శిక్షితంబు
గమలాక్షి సాంఖ్యయోగక్షితి పాలనం। బులఁ ద్రివిధంబగు మోక్షధర్మ
మట్లుగావున సంశయము లేక ముక్తకా। మస్థితి నమ్మాఁడు మార్గములను
నడచి పరంబున కెడపడకుండుదు। ముక్తి వైరాగ్యైకమూల సూవె

తే. విను విరక్తి దృఢ జ్ఞానజనిత గాన। దీపిత జ్ఞానమును విరక్తియు ధరింపఁ
బడిన బుద్ధి నిర్ద్వంద్వత బరఁగు నింటి। యంద నిల్చి నిస్సంగుఁడనై చరింతు. 174

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కమలాక్షి!= పద్మాలవంటి కన్నులుగలదానా!; పంచశిఖుండు+అను= పంచశిఖుడు అనే పేరుగల; పరమమునీశ్వరు= మహామునివరుని; శిష్యుండన్= శిష్యుడను నేను; సాంఖ్య - యోగ - క్షితిపాలనంబులన్= సాంఖ్యమూ, యోగమూ, రాజ్యపరిపాలనమూ అనే వీటితో; త్రివిధంబు+అగు= మూడు విధాలైన; మోక్షధర్మము= ముక్తి పద్ధతి (స్వభావం); అతనిచేన్= ఆ పంచశిఖగురునిచేత; శిక్షితంబు= (నాకు) నేర్పబడింది; అట్లు+కావునన్= అందుచేత; సంశయము లేక= ఏ సందేహమూ లేకుండా; ముక్తకామస్థితిన్= కోరికలు తొలగిన స్థితితో; ఆ+మూఁడు+మార్గములను= ఆ మూడు మోక్షపద్ధతుల్లోనూ; నడచి= ప్రవర్తించి; పరంబునకున్= పరతత్త్వానికి లేదా పరలోకానికి; ఎడపడక+ఉండుదున్= దూరం కాకుండా ఉండగలుగుతున్నాను; ముక్తి= మోక్షమనేది; వైరాగ్యైకమూల+చూవె= వైరాగ్యమే మూలంగా కలది సుమా!; విను; విరక్తి= వైరాగ్యమనేది; దృఢ-జ్ఞాన-జనిత= నిశ్చలమైన జ్ఞానం వల్లనే పుడుతుంది; కానన్= కాబట్టి; దీపిత జ్ఞానమునున్= ప్రకాశించే జ్ఞానమూ; విరక్తియున్= అందువలన కలిగే వైరాగ్యమూ; ధరింపఁబడిన= రెండూ ధరించినటువంటి; బుద్ధి= అంతరంగం; నిర్ద్వంద్వతన్= సుఖదుఃఖాది ద్వంద్వాలకు అతీతంగా; పరఁగున్= వ్యవహరిస్తుంది; ఇంటియంద= ఇంటిలోనే; నిల్చి= ఉండీ; నిస్సంగుఁడనై= విరక్తుడనై; చరింతున్= సంచరిస్తూ ఉంటాను.

తాత్పర్యం: ఓ పద్మాక్షీ! పంచశిఖుడు అనే మునీశ్వరుడికి నేను శిష్యుడను. ఆయన నాకు సాంఖ్యంలోనూ యోగంలోనూ రాజ్యపరిపాలనలోనూ - ఈ మూడింటా ముక్తిపొందే మార్గాలు ఉపదేశించారు. అందుచేత నిస్సంశయంగా నిష్కామంగా ఆ మూడు మార్గాల్లోనూ నడుస్తూ పరమాత్మకు సన్నిహితంగా ఉంటున్నాను. ముక్తికి వైరాగ్యమే మూలం. వైరాగ్యానికి జ్ఞానమే ఆధారం. కాబట్టి జ్ఞానంతో కలిగిన విరక్తి నా అంతరంగంలో ఉండటం వలన సుఖదుఃఖాలూ, రాగద్వేషాలూ వంటి ద్వంద్వాలకు అతీతంగా జీవించగలుగుతున్నాను. ఇంటిలోనే (సంసారంతోనే) ఉండి కూడా నిస్సంగుడిగా మనుతున్నాను.

క. **వనితా! చందనమునఁ బూ । సినఁ గత్తిని వ్రేసినను సుచిత్తత నా క**
జ్జను లిరువురయందును సరి, । కనకము లోష్టమును సమమ కాఁ గనుగొందున్. **175**

ప్రతిపదార్థం: వనితా!= ఓ మగువా!; చందనమునన్= మంచి గంధంతో; పూసినన్= పులిమినా; కత్తిని= ఖడ్గంతో; వ్రేసినన్= ఖండించినా; నాకున్= నాకు; ఆ+జనులు= ఆ పనిచేసిన వ్యక్తులు; ఇరువురయందునున్= ఇద్దరిపట్లా; సుచిత్తత= ద్వేషం లేని మంచి మనస్సు కలిగి ఉండటమనేది; సరి= సమానం; కనకమున్= బంగారాన్నీ; లోష్టమునున్= మట్టినీ; సమము+అ= సమానమే; కాన్= అయ్యేట్టు; కనుఁగొందున్= చూస్తాను.

తాత్పర్యం: ఓ వనితా! నా శరీరానికి (కుడిభుజానికి) చందనం పులిమినా (ఎడమభుజాన్ని) కత్తితో నరికినా ఆ ఇద్దరి వ్యక్తుల పట్లా నేను రాగ-ద్వేష రహితంగా సమానంగా ఉండగలను. నా దృష్టిలో బంగారానికీ, మట్టికీ తేడా లేదు. నాకు రెండూ సమానమే.

తే. **జ్ఞానమును గర్మమును రెంటి సంగమంబు । నిష్ఠలుగ మోక్షవిదులు వర్ణింతు రాత్మ**
శాస్త్రములు గని మద్గురుశాసనంబు । సుగమపదము తృతీయంబు సూవె యబల! **176**

ప్రతిపదార్థం: అబల!= ఓ సుకుమారీ!; జ్ఞానమును= జ్ఞానమూ; కర్మమును= కర్మత్యాగమూ లేదా కర్మాచరణమూ; రెంటి= ఈ రెండింటి; సంగమంబున్= సాంగత్యాన్ని; నిష్ఠలుగన్= జ్ఞాననిష్ఠగానూ, కర్మనిష్ఠగానూ; మోక్షవిదులు= ముక్తిస్వరూపం తెలిసినవారు; ఆత్మశాస్త్రములు+కని= ఆత్మతత్త్వాన్ని గురించీ మోక్షం గురించీ చర్చించే శాస్త్రాలు చదివి; వర్ణింతురు= వివరించి చెబుతూ ఉంటారు; మత్+గురు+శాసనంబు= మా గురువుగారి ఆజ్ఞ(ఉపదేశం); సుగమపదము= తేలికగా పొందదగినది; తృతీయంబు+చూవె= అది మూడవ నిష్ఠ సుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ సుకుమారీ! వేదాంతగ్రంథాలు చదివిన మోక్షవేత్తలు జ్ఞాననిష్ఠ - కర్మనిష్ఠ అనే రెండు మార్గాలు చెప్పుతూ ఉంటారు. కానీ, మా గురువుగారు చెప్పేది సులభమైన మూడవ మార్గం సుమా!

ఆ. **కీడుగని యొకండు గృహధర్మ ముడిగి స । మాశ్రయించు నాశ్రమాంతరంబు**
దాన సంగ ముడుగఁగా నేర దదియొల్ల । మియును వలపుగాన మీననయన! **177**

ప్రతిపదార్థం: మీననయన!= ఓ మచ్చెకంటీ!; కీడు+కని= ఏదో ప్రమాదాన్ని పొంది; ఒకండు= ఒక గృహస్థు; గృహధర్మము+ఉడిగి= గృహస్థాశ్రమాన్ని విడిచిపెట్టి; ఆశ్రమాంతరంబున్= సన్న్యాసాశ్రమాన్ని (ఎందుకంటే); సమాశ్రయించున్= స్వీకరిస్తాడు; దానన్= అట్లా స్వీకరించినందువలన; సంగము= తగుల్కోలు; ఉడుగఁగాన్+నేరదు= అంతరించిపోదు (మరొక ఆశ్రమం - సన్న్యాసం); అది+ఒల్లమియున్= గృహస్థాశ్రమం వద్దనటం కూడా; వలపు+కానన్= ఒక కోరికయే కాబట్టి.

తాత్పర్యం: ఓ చేపకన్నుల చిన్నదానా! కుటుంబంలో ఏదో కీడు జరిగింది కదా అని ఒకడు గృహస్థాశ్రమం వదిలేసి సన్న్యాసాశ్రమం స్వీకరిస్తాడు. అంతమాత్రాన అతడికి సాంగత్యం వదలదు. గృహస్థాశ్రమం వద్దు అని ద్వేషించటం కూడా ఒక సంగమే. రాగమే కాదు ద్వేషమూ పనికి రాదు సుమా!

క. **దండముఁ గాషాయంబును । ముండితయుఁ గమండలువును మోక్ష మొసఁగ వె**
ట్లండేని లింగములకు న । ఖండజ్ఞాన ప్రదత్వకలనము గలదే? **178**

ప్రతిపదార్థం: దండమున్= సన్న్యాసులు ధరించే పొడవాటి కఱ్ఱ (త్రిదండి); కాషాయంబును= కాషాయవస్త్రధారణ; ముండితయున్= గుండు కలిగియుండుట; కమండలువును= నీటి కమండలమూ - ఇవి; మోక్షమున్+ఒసఁగవు= మోక్షాన్ని ఇయ్యవు; ఎట్లు+అండు(వు)+ఏనిన్= ఎలాగంటే; లింగములకున్= చిహ్నాలకు; అఖండ= అఖండమైన; జ్ఞాన= జ్ఞానాన్ని; ప్రదత్వకలనము= ఇవ్వగలిగిన శక్తి; కలదే?= ఉన్నదా? (లేదని భావం.)

తాత్పర్యం: సన్న్యాసాశ్రమం స్వీకరించాడు - అనటానికి చిహ్నాలైన కాషాయధారణ, ముండనం, దండకమండల వహనం, ఇత్యాదులు మోక్షాన్ని ఇవ్వవు. బాహ్యచిహ్నాలకు జ్ఞానప్రదానశక్తి ఉండదుగదా! జ్ఞానమనేది ఆత్మగుణం. ఈ చిహ్నాలు ఏమీ లేకుండానూ జ్ఞాని ఉండవచ్చును.

విశేషం: ఎట్లు+అంటి(వి)+ఏనిన్= ఎట్లంటేనిన్ అని ఉంటే అన్వయం హాయిగా కుదురుతుంది. కానీ అప్పుడు ప్రాసనియమం భంగపడుతుంది. అందు(వు)+ఏనిన్= అండేనిన్ అని విభజించి ద-డలకు అభేదం కనక 'అండేనిన్' అని సమన్వయించాలి. 'అందురు- అండ్రు' అనే రూపాల్లో దకారం డకారంగా మారటం ఉన్నది.

క. **మగువా! దుఃఖము శిథిలం । బగునని లింగములు దాల్తు రమ్మెయి లే దె**
ట్లు? గొడుగునందుం గావున । వగవఁగ మోక్షదముగాఁగ వలయున్ గొడుగున్. **179**

ప్రతిపదార్థం: మగువా!= ఓ వనితా!; దుఃఖము= శోకమనేది; శిథిలంబు+అగున్+అని= తొలగిపోతుంది అనుకొని; లింగములు= కాషాయమూ మొదలైన వైరాగ్య చిహ్నాలను; తాల్తురు= ధరిస్తూ ఉంటారు; ఆ+మెయి= ఆపాటి; గొడుగునందున్= రాజలాంఛనమైన వెల్లగొడుగులోమాత్రం; లేదు+ఎట్లు?= లేదా ఏమిటి?; కావునన్= కాబట్టి; వగవఁగన్= దుఃఖాలు కొనితెచ్చుకొనటానికీ; మోక్షదము+కాఁగన్= ముక్తిప్రదం అవ్వటానికీ; గొడుగున్= కాషాయాదులతోపాటు గొడుగుకూడా; వలయున్= కావలసిందే మరి!

తాత్పర్యం: దుఃఖం తొలగిపోతుందని కాషాయాది సన్న్యాసచిహ్నాలను స్వీకరిస్తారు. ఆ పాటి శక్తి రాజలాంఛనంగా నేను ధరించే సితచ్ఛత్రానికి మాత్రం లేదా! అది దుఃఖహేతువైనా ముక్తిప్రదమైనా గొడుగు అనేది నాకు తప్పదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(జ్ఞానం కాక కాషాయాదులే మోక్షాన్ని ఇచ్చేటట్లయితే నాకు నా గొడుగూ మోక్షదం అవుతుందని; జ్ఞానమే మోక్ష హేతువయినప్పుడు అది నాకు ఉన్నది కనుక ఇంక ఈ రాజలాంఛనాలు నాకు దుఃఖకారణాలూ బంధనాలూ కావని భావం.)

విశేషం: దీనికి మూలశ్లోకంలో భావం మరింత స్పష్టంగా కనపడుతున్నది. **"అథవా దుఃఖశైథిల్యం వీక్ష్య లింగే కృతా మతిః । కిం తదేవార్థ సామాన్యం ఛత్రాదిషు న లక్ష్యతే॥" (12-308-49).** ఏ చిహ్నాలూ లేనంతమాత్రం చేత మోక్షం లభించదు. ఏవో కొన్ని లాంఛనాలు ఉన్నంతమాత్రంచేత అవి బంధనాలూ కావు. చిహ్నాలు ఉన్నా లేకపోయినా జీవుడు జ్ఞానంచేతనే ముక్తుడు అవుతున్నాడు. **"ఆకించన్యే న మోక్షోఽస్తి, కైంచిన్యే నాస్తి బంధనమ్ । కైంచిన్యే చేతరే చైవ జంతుః జ్ఞానేన ముచ్యతే॥" (12-308-50).**

ఆ. జ్ఞానమునన కాని మానిని! లింగమా । త్రమున ముక్తి యగునె? రాజ్యబంధ
రాగబంధ నిఖిల భోగబంధములఁ బ్ర । జ్ఞాసిఁ దునిమినాఁడ నది గతముగ. 180

ప్రతిపదార్థం: మానిని!= ఓ మగువా!; జ్ఞానమునన్+అ+కాని= జ్ఞానం చేతనే తప్ప; లింగమాత్రమునన్= కాషాయాది చిహ్నాలను ధరించినంత మాత్రంచేత; ముక్తి+అగునె?= మోక్షం లభిస్తుందా?; రాజ్యబంధ= రాజ్యపరిపాలనం అనే బంధాన్నీ; రాగబంధ= వ్యామోహం అనే బంధాన్నీ; నిఖిల= సమస్తమైన; భోగబంధములన్= భోగబంధాలనూ; ప్రజ్ఞా+అసిన్= ప్రజ్ఞ అనే ఖడ్గంతో; తునిమినాఁడన్= ఖండించినవాడను; అది+కతముగన్= ఆ కారణంగా.

తాత్పర్యం: మానినీ! జ్ఞానంవలన మాత్రమే ముక్తి లభిస్తుంది. దండ కమండల కాషాయాది చిహ్నాలవలన కాదు. నేను రాజ్య, రాగ, భోగబంధాలను అన్నింటినీ జ్ఞానం అనే కత్తితో తెగకోసుకొన్నాను. అది కారణంగా ముక్తుడను అయ్యాను. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: అలం: రూపకం.

వ. ఇట్లు ముక్తుండ నైయున్న నాయెడ ముక్తత్వాముక్తత్వంబు లారయవేఁడి వచ్చి మచ్చిత్తంబు మెత్తన చొచ్చి తిదియ ప్రయోజనం బట్లుంగాక. 181

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా; ముక్తుండను+ఐ+ఉన్న= ముక్తుడిని అయి ఉన్న; నా+ఎడన్= నాయందు; ముక్తత్వ+ అముక్తత్వంబులు= ముక్తుడా? అముక్తుడా? అనే లక్షణాలు; ఆరయన్= తెలుసుకోవటం కోసం; వేఁడి వచ్చి= కోరి వచ్చి; మత్+చిత్తంబున్= నా హృదయాన్ని; మెత్తన= మెల్లగా; చొచ్చితి(వి)= ప్రవేశించావు; ప్రయోజనంబు= దీనికి ప్రయోజనం; ఇదియ= ఇదే, ఇంతే; అట్లున్+కాక= అట్లా కాక.

తాత్పర్యం: ఇట్లా ముక్తుడనై ఉన్న నన్ను పరీక్షించటానికి నా హృదయంలోనికి మెల్లగా ప్రవేశించావు. దీనికి ప్రయోజనం ఇంతే! అట్లా కాక.

తే. బ్రాహ్మణివి యోగినివి పరభార్య వబల! । భర్త ప్రోషితుఁ డేను నృపాలసుతుఁడ
వినుము గృహమేధి నాచారఘనుఁడ నిట్టి । నేను నీవు రమించుట నిందఁ దేదే? 182

ప్రతిపదార్థం: అబల!= ఓ సుకుమారీ!; బ్రాహ్మణివి= నీవు బ్రాహ్మణస్త్రీవి; యోగినివి= భిక్షుకివి; పరభార్యవు= పరకాంతవు; భర్త= నీ మగడు; ప్రోషితుఁడు= ఏదో పనిమీద దూరప్రాంతాలకు వెళ్ళినవాడు; వినుము= ఆలకించు; ఏను= నేను; నృపాల సుతుఁడన్= క్షత్రియకుల సంజాతుడిని; గృహమేధిన్= గృహస్థాశ్రమంలో ఉన్నవాడిని; ఆచారఘనుఁడన్= ఆచారాలను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పాటించటంలో నిష్ఠకలవాడిని; ఇట్టి= ఇటువంటి; నేనున్= నేనూ; నీవున్= నీవూ; రమించుట= సుఖించటమనేది; నిందన్+ తేదె?= అపకీర్తి తీసుకురాదా?

తాత్పర్యం: మానినీ! నేను ముక్తుడనో కాదో పరీక్షించటంకొరకే నీవు నా హృదయంలోనికి ప్రవేశించావు అనుకొంటున్నాను. అట్లా కాక మరింకేదయినా శృంగారపరమైన శారీరకవాంఛతో ప్రవేశించినట్లయితే - వినుము. మరి నీవు బ్రాహ్మణకులంలో పుట్టినదానవు. నేను క్షత్రియుడను. నీవు యోగినివి. నేను గృహమేధిని. నీవు పరభార్యవు. నేను ఆచారపరుడను. ఇట్లాంటి నీవూ నేనూ రమించటం ఎంతటి నింద్యం! ఎంతటి అపకీర్తి!

వ. స్వతంత్రవై నీవు చేసిన యీ యవినయంబున నెయ్యది వాటిల్లిన నది నీయంద నిలుచుం గాక!' యని పలికి వెండియు. 183

ప్రతిపదార్థం: స్వతంత్రవు+ఐ= స్వతంత్రురాలవై; నీవు; చేసిన; ఈ; అవినయంబునన్= అవినీతివలన; ఎయ్యది= ఏది; పాటిల్లినన్= జరిగినా; అది; నీయందున్+అ= నీయందే; నిలుచున్+కాక!= నిలుచుగాక!; అని పలికి= అని హెచ్చరించి; వెండియున్= మళ్ళీ ఇలా అన్నాడు.

తాత్పర్యం: స్వతంత్రించి నీవు చేసిన ఈ అవినీతి పనివలన ఏమి జరిగినా అది నీకే చెందుతుంది గాక!' అని చెప్పి, ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'నావలని రాగముననే । నీవిట్లైతి నను గెల్చు నిపుణతకుం గా
కీ వెడమాయల నిప్పుడుఁ । బో విడువవు యోగశక్తి పొలుపు కలిమినే. 184

ప్రతిపదార్థం: ననున్= నన్ను; గెల్చు= జయించటం అనే; నిపుణతకున్+కాక= నైపుణ్యంకోసం కాకుండా; ఈ+వెడమాయలన్= ఈ రకమైన వృథా మాయలు; ఇప్పుడున్= ఇంత చెప్పినా ఇప్పటికీ; పోన్+విడువవు= నీవు విడవటం లేదు; అది యోగశక్తి= యోగశక్తియొక్క; పొలుపు= మహిమ; కలిమినే= నీకు ఉండటంచేతనే.

తాత్పర్యం: 'ఓ మానినీ! నన్ను పరీక్షించి గెలవటంకొరకు కాక నాపట్ల అనురాగంతోనే నీవు ఇట్లా అందాలరాశిగా రూపం ధరించి వచ్చావు. అందుకే ఈ వృథామాయలను ఇప్పటికీ నీవు వదిలిపెట్టటం లేదు. ఇదంతా నీకున్న యోగశక్తి మహిమవలన సాధ్యపడుతున్నది.

క. నిను డాఁచి కుటిలభావం । బున దుష్టచరిత్రవైతి ముక్తుల తెఱఁగే
వనిత! యిది యే బయలుపఱి । చిననైనను మానవలదె చెన్నఁటిచూపుల్?' 185

ప్రతిపదార్థం: వనిత!= ఓ మగువా!; నినున్= నిన్ను నీవు; డాఁచి= కప్పిపుచ్చుకొని; కుటిలభావంబునన్= వక్రబుద్ధితో; దుష్టచరిత్రవు+ఐతి(వి)= దుష్టస్వభావవు అయ్యావు; ఇది= ఇటువంటిది; ముక్తుల తెఱఁగే?= ముక్తుల పద్ధతియేనా?; ఏన్= నేను; బయలుపఱిచిన నైననున్= ఇట్లా నా స్వభావాన్నీ, నీ వ్యవహారాన్నీ బట్టబయలు చేసినప్పుడైనా; చెన్నఁటి చూపుల్= వంకర చూపులు (దుష్టమైన చూపులు); మానవలదె?= మానవద్దా?

తాత్పర్యం: అమ్మాయీ! వక్రబుద్ధితో నిన్ను నీవు కప్పిపుచ్చుకొని నీ దుష్టస్వభావం వెల్లడించుకొన్నావు. ఇది ముక్తుల పద్ధతేనా? పోనీ నేను బయలుపరచాను కనుక ఇప్పటికైనా నీ కుటిల వీక్షణాలు మానుకొనవద్దా?'

క. అని తన వైరాగ్యంబును । ఘనబోధము మహిమయుం బ్రకాశింప మనం
బున సరకుగొనక యి ట్ల । వ్వనితఁ బలికి యన్నరేంద్రవర్యుఁడు మఱియున్. 186

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; ఆ+నరేంద్రవర్యుఁడు= ఆ రాజశ్రేష్ఠుడు జనకమహారాజు; తన= తనయొక్క; వైరాగ్యంబును= విరక్తి; ఘన= గొప్పదైన; బోధము+మహిమయున్= జ్ఞానం యొక్క మహిమా; ప్రకాశింపన్= విరాజిల్లేటట్లు; మనంబునన్= మనస్సులో; సరకుగొనక= సులభను లెక్కచెయ్యకుండా; ఇట్లు= ఈ ప్రకారంగా; ఆ+వనితన్= ఆ స్త్రీని ఉద్దేశించి; పలికి= ఉపన్యసించి; మఱియున్= ఇంకా (ఇట్లా అంటున్నాడు.)

తాత్పర్యం: జనకమహారాజు అమెను లెక్కచెయ్యకుండా తన వైరాగ్యమూ, తన జ్ఞానమహిమమూ ప్రకాశించేట్లు ఇట్లా మాట్లాడి, మళ్ళీ తనే ఇంకా ఉపన్యాసం కొనసాగిస్తున్నాడు.

క. తను వొప్పెడునది యౌవన । మును నూతన మిట్టి నీకుఁ బొలఁతీ! యోగం
బున నింతచొరవ యెమ్మెయిఁ । బనుపడియెం జెపుమ! దాఁపఁ బనిలే దింకన్.' 187

ప్రతిపదార్థం: పొలఁతీ!= ఓ వనితా!; తనువు= నీ శరీరం; ఒప్పెడునది= చాలా అందంగా ఉంది; యౌవనమును= నీ జవ్వనంకూడా; నూతనము= తొలిదశలో ఉంది; ఇట్టి నీకున్= ఇలా తొలిప్రాయంలో ఉన్న నీకు; యోగంబునన్= యోగమార్గంలో; ఇంత చొరవ= ఇంతటి ప్రవేశం (చనవు); ఏ+మెయిన్= ఎట్లా; పనువడియెన్= అలవడింది; చెపుమ!= దయచేసి చెప్పుము!; ఇంకన్= ఇక; దాఁపన్+పనిలేదు= దాచవలసిన అవసరంలేదు.

తాత్పర్యం: ఓ వనితా! నీ శరీరం చూస్తే ఒప్పులకుప్పవలె ఉన్నది. నీ యౌవనమూ తొలిదశలో ఉన్నది. మరి నీకు ఇంతటి యోగమహిమ ఎట్లా అలవడింది? ఇంకా దాపరికం ఎందుకు? చెప్పుము'.

వ. అనుచు. 188

తాత్పర్యం: అంటూ.

క. తను సరకుసేయ కి ట్ల । జ్జననాథుఁడు వలుక నవ్వచనములు దెలియన్
విని సులభ చతురముగ ని । ట్లను నించుక గొంకులేక యవ్విభుతోడన్. 189

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; తనున్= తనను; సరకుసేయక= లక్ష్యపెట్టకుండా; ఇట్లు= ఈ విధంగా; ఆ+జననాథుఁడు= ఆ జనకమహారాజు; పలుకన్= మాట్లాడేసరికి; ఆ+వచనములు= ఆ మాటలు; తెలియన్ విని= అర్థమయ్యేట్టు ఆలకించి; సులభ= ఆ సులభ; చతురముగన్= నిపుణంగా; ఆ+విభుతోన్= ఆ రాజుతో; ఇంచుక= కొంచెమైనా; కొంకులేక= జంకు అనేది లేకుండా; ఇట్లు= ఈ ప్రకారంగా; అనున్= అన్నది.

తాత్పర్యం: జనకమహారాజు ఇట్లా తనను ఏ మాత్రమూ లెక్కచెయ్యకుండా మాట్లాడినా; అంతా శ్రద్ధగా ఆలకించి, సులభాదేవి చాలా నిపుణంగా బదులు పలికింది.

క. 'శ్రోతకుఁ దనకుం బ్రియమగు । నే తెరువున నట్టిమెయి సమీరిత మైనం
జూ తగు వాక్యం బది నృప । సూతీ! పెఱపలుకు బాలిశుల చొ ప్పరయన్. 190

ప్రతిపదార్థం: నృపసూతీ!= ఓ రాకుమారా!; శ్రోతకున్= వినే వ్యక్తికీ; తనకున్= చెప్పే తనకూ; ఏ తెరువునన్= ఏ పద్ధతిలో; ప్రియము+అగున్= హితవు అవుతుందో; అట్టి మెయిన్= ఆ పద్ధతిలో; సమీరితము+ఐనన్+చూ!= చెప్పబడినది అయితేనే సుమా!; అది; తగువాక్యంబు= తగినమాట అవుతుంది; పెఱపలుకు= తక్కినవాక్యం (మాట); అరయన్= పరిశీలనగా చూస్తే; బాలిశుల చొప్పు= మూర్ఖుల పద్ధతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఓ క్షత్రియకుమారా! వినే వ్యక్తికీ, చెప్పే వ్యక్తికీ హితమైన పద్ధతిలో వెలువడినదే సరి అయిన మాట. తక్కినవన్నీ మూఢుల మాటలక్రిందే లెక్క.

వ. భవదీయ వాక్యవైదగ్ధ్యం బట్లుండె నీవు నన్నెవ్వరిదాన? వెచ్చటినుండి వచ్చి? తెటుపోయె?దని తొలుత నడిగి తవహితుండవై వినుము చెప్పెద. 191

ప్రతిపదార్థం: భవదీయ= నీ; వాక్య= మాటల; వైదగ్ధ్యంబు= నేర్పు; అట్లు+ఉండెన్= అట్లా ఉంది; నీవు; నన్నున్= నన్ను; ఎవ్వరిదానవు?= ఎవరి వనితవు?; ఎచ్చటినుండి వచ్చితి(వి)?= ఎక్కడనుంచి వచ్చావు?; ఎటుపోయెదు?= ఎక్కడికి వెడతావు?; అని; తొలుతన్= ఆదిలో; అడిగితి(వి)= అడిగావు, అవహితుండవై= సావధానుడవై; వినుము= ఆలకించు; చెప్పెదన్= చెబుతాను.

తాత్పర్యం: నీ మాటల చాతుర్యం అట్లా ఉండనిమ్ము. నా వివరాలను మొదట్లో అడిగావు కనుక చెప్పుతున్నాను. సావధానంగా వినుము.

జనకుని ప్రశ్నంబులకు సులభ ప్రత్యుత్తరంబు లిచ్చుట (సం. 12-308-95,96)

**క. విను పాంసూదకముల చా । డ్పున జతుకాష్ఠముల భంగి భూతంబులకున్
మనుజేంద్ర! కలుగుఁ బొం దా । పని నన్యోన్యసమధీనభావము గలదే? 192**

ప్రతిపదార్థం: మనుజేంద్ర= ఓ మహారాజా!; విను; పాంసు+ఉదకముల+చాడ్పునన్= దుమ్మూ, నీరులాగా; జతు+కాష్ఠముల+భంగిన్= లక్కా చెక్కల్లాగా; భూతంబులకున్= పంచభూతాలకు; పొందు= కలయిక (సాంగత్యం); కలుగున్= ఏర్పడుతుంది; ఆ పనిన్= ఆ కలయికలో; అన్యోన్య సమ్+అధీన+భావము= పరస్పరం ఒకదాని అధీనంలో మరొకటి ఉండటమనే స్థితి; కలదే?= ఉంటుందా?

తాత్పర్యం: ధూళికణాలూ, నీటి బిందువులూ కలిసినట్లుగా, లక్కతో కర్ర అతికినట్లుగా పంచభూతాలకు యాదృచ్ఛికంగా పరస్పరం కలయిక ఏర్పడుతూ ఉంటుంది. ఎంతగా కలిసి ఉన్నా ఇవి పరస్పరాధీనాలు కావు. దేని అస్తిత్వం దానికుంటుంది. ఒకదానితో కలిసి ఉన్నట్టు మరొక దానికి తెలియదు.

విశేషం: అలం: ఉపమ.

**ఆ. ఒక్క మేనియంద యుర్వీశ! పంచభూ । తములు దశమితేంద్రియములు మనసు
బుద్ధియును బ్రధానమును గల వివి యొక్కఁ । డొకటియవియె, యేల యొండు సెప్ప? 193**

ప్రతిపదార్థం: ఉర్వీశ!= రాజా!; ఒక్క మేనియందున్+అ= ఒక్క శరీరంలోనే; పంచభూతములున్= పంచభూతాలూ; దశమిత+ఇంద్రియములున్= పది పరిమితమైన ఇంద్రియాలూ; మనసున్= మనస్సూ; బుద్ధియును= బుద్ధి అనేదీ; ప్రధానమును= ప్రకృతి లేదా అవ్యక్తం అనబడే తత్త్వమూ; కలవు= ఉన్నాయి; ఇవి= ఇవన్నీ; ఒక్కఁడు+ఒకటి+అవియె= వేటికవి స్వతంత్రాలే; ఒండు= మరొకటి ఉదాహరణంగా; చెప్పన్ ఏల?= చెప్పటం ఎందుకూ?

తాత్పర్యం: ఒకే శరీరంలో పంచభూతాలూ, దశేంద్రియాలూ, మనస్సూ, బుద్ధీ, ప్రకృతీ ఇవి అన్నీ కలిసిఉంటున్నాయి. కానీ, ఒకదాని ఉనికి మరొక దానికి తెలియదు. దేని కది ప్రత్యేకమే. ఇంక మరొకటి చెప్పవలసిన పని ఏముంది? (పంచభూతాల కలయిక అన్యోన్య సమధీనం కాదు అనటానికి ఇది చాలు - అని.)

వ. నిక్కంబునకు నెవ్వరు నెవ్వరివారుం గామి తెలియవే? యని పలికి వెండియు. 194

ప్రతిపదార్థం: నిక్కంబునకున్= నిజానికి; ఎవ్వరున్= ఎవ్వరూకూడా; ఎవ్వరివారున్+కామి= ఎవ్వరివారూ కాకపోవటం; తెలియవే?= ఎరుగవా?; అని పలికి= అని చెప్పి; వెండియున్= మరల.

తాత్పర్యం: నిజానికి ఎవరూ ఒకరికి చెందినవారు కారని తెలియదా?' అని చెప్పి మరల ఇట్లా కొనసాగించింది.

తే. **'సకలలోకములను సదశ్వంబు కరణి । ధావనము సేయుచుండుఁ బ్రధాన మింత**
యెఱిఁగి జననాథ! యెవ్వరి నెచటనుండు । వార లనువార మమ్మాటవలను సెపుమ! 195

ప్రతిపదార్థం: జననాథ!= ఓ రాజా!; ప్రధానము= ప్రకృతి అనేది (ప్రాణం); సత్+అశ్వంబు+కరణిన్= మేలుజాతి గుఱ్ఱంలాగా; సకలలోకములను= సమస్తలోకాలలోనూ; ధావనము+చేయుచుండున్= పరుగుతీస్తూ ఉంటుంది; ఇంత= ఇదంతా; ఎఱిఁగి= తెలిసీ; ఎవ్వరిన్= ఎవరిని; ఎచటనుండువారలు= ఎక్కడ ఉండేవారు; అనువారము?= అనగలం?; ఆ+మాట+వలనున్= ఆ మాట తీరూ అర్థం; (వలను= తీరు, దిక్కు); చెపుము!= చెప్పుము చూద్దాం!

తాత్పర్యం: 'జనకమహారాజా! ప్రకృతి అనేది జవనాశ్వంవలె సకలలోకాలకూ పరుగులు తీస్తూ ఉంటుంది. అది నీకూ తెలుసు, నాకూ తెలుసు. ఇంత తెలిసీ ఎవరిని ఎక్కడివాళ్ళు అని అడగగలం? అసలు ఆ ప్రశ్నకు అర్థంఏమిటి?

తే. **నీవు నీయందు నినుఁగను నెఱియ యొరుల । యందుఁ గానంగవలవదే యధిప! తన్ను**
నొరులనొక్కటిగాఁ జూచు పురుషుఁ డెచట । మీరలుండుదు రెవ్వరివార లనునె? 196

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నీవు; నీయందున్= నీలో; నినున్= నిన్ను; కను= చూసుకొనే; నెఱియ= అందమే, పద్ధతియే; ఒరులయందున్= ఇతరులలో కూడా; కానంగన్+వలవదే?= చూడవద్దా?; తన్నున్= తననూ; ఒరులన్= ఇతరులనూ; ఒక్కటిగాన్= అభిన్నంగా; చూచు= దర్శించగలిగిన; పురుషుఁడు= జ్ఞాని; ఎచటన్= ఎక్కడ; మీరలు= మీరు; ఉండుదురు?= నివసిస్తారు?; ఎవ్వరివారలు?= ఎవరికి చెందినవారు మీరు?; అనునె?= అని ప్రశ్నిస్తాడా?

తాత్పర్యం: రాజా! నీలో నిన్ను నీవు చూచికొనగలిగినట్లే ఇతరులలోనూ చూడగలగాలి కదా! జీవాత్మ్మడి సాక్షాత్కారం సర్వప్రాణికోటిలోనూ పొందగలిగినవాడు తాను అనీ, ఇతరులు అనీ భేదభావంతో ఉండగలడా? అతడికి అందరూ అంతా ఒక్కటే. 'నీవు ఎవరవు? ఎవరి దానవు?' - ఇట్లాంటి ప్రశ్నలు వెయ్యడు. అవునా?

తే. **అరులు మిత్త్రు లుదాసీను లనుచు సంధి । విగ్రహాది షడ్గుణముల వెరవు లొకరుఁ**
డలవరించుచు విజయంబు నాసపడుచు । నుండునటె? ముక్తితెఱఁ గిటులున్నె యరయ?! 197

ప్రతిపదార్థం: ఒకరుఁడు= అటువంటి జ్ఞానం కలిగిన వ్యక్తి ఒకడు; అరులు= శత్రువులూ; మిత్త్రులు= స్నేహితులూ; ఉదాసీనులు= మధ్యస్థులూ; అనుచున్= అని ఇతరులను విభజిస్తూ; సంధి= పొత్తూ; విగ్రహ= యుద్ధమూ; ఆది= మొదలైన; షడ్గుణముల= ఆరు విధానాల; వెరవులు= ఉపాయాలు; అలవరించుచున్= ఆచరణలో పెట్టుతూ; విజయంబున్= శత్రువులమీద విజయాన్ని; ఆశపడుచున్= ఆశిస్తూ; ఉండునటె?= ఉంటాడా?; అరయన్= ఆలోచిస్తే; ముక్తి తెఱఁగు= మోక్షవిధానం - ముక్తిమార్గం; ఇటులు+ఉన్నె?= ఇట్లా ఉంటుందా?

తాత్పర్యం: రాజా! వీరు శత్రువులనీ, వారు మిత్రులనీ, వీరు మధ్యస్థులనీ జనులను విభజించి చూస్తూ, వాళ్ళమీద విజయం సాధించటానికి ఆరురకాల రాజనీతి ఉపాయాలను పన్నుతూ - ఇట్లా ఉంటాడా నిజమైన జ్ఞాని? ముక్తిమార్గం ఇట్లాగే ఉంటుందా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. కావున నీవు ముక్తుఁడవు గా విటు గాకయు నిన్ను ముక్తుఁగా
భూవర! చూచె దిక్కలఁక బుద్ధులు సెప్పి తగం దొలంగఁగాఁ
ద్రోవఁగఁ బాడి బంధులకు దుర్మతి పుట్టినయట్టి మర్త్యు వా
రే విధినైన మందు లిడి యెప్పటి బుద్ధి ఘటించుచాడ్పునన్. 198

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; కావునన్= కాబట్టి; నీవు; ముక్తుడవు= బంధవిముక్తుడవు (జ్ఞానివి); కావు= కాదు; ఇటు+ కాకయున్= ఇట్లా కాకపోయినా; నిన్నున్= నిన్ను నీవు; ఇటు= ఇట్లా; ముక్తున్+కాన్= ముక్తుడుగా; చూచెదు= భావిస్తున్నావు; ఈ+కలఁకన్= ఈ రుగ్మతను; బుద్ధులు+చెప్పి= జ్ఞానం ఉపదేశించి; తగన్= తగిన పద్ధతిలో; తొలంగఁగాన్+త్రోవఁగన్= తొలగ జేయటం; బంధులకున్= హితులకు; దుర్మతి+పుట్టిన+అట్టి+మర్త్యున్= దురాలోచనలూ, దుర్బుద్ధులూ పుట్టే మానవుడిని; వారు= ఆ బంధువులు; ఏ విధినైనన్= ఎట్లాగైనా; మందులు+ఇడి= ఔషధాలు ఇచ్చి; ఎప్పటి బుద్ధి= మునుపటి సద్బుద్ధి; ఘటించు+ చాడ్పునన్= కలగజేసినట్టుగా; పాడి= ధర్మం.

తాత్పర్యం: ఓ రాజా! షాడ్గుణ్యం పన్నుతూ జయాభిలాషివై ఉన్నావు కాబట్టి నీవు ముక్తుడవు కావు. కాకపోయినా ఇట్లా నిన్ను నీవు ముక్తుడుగా భావిస్తున్నావు. అంటే ఇదేదో మానసికరుగ్మత. తగిన బుద్ధి చెప్పి దీనిని తొలగించటం బంధువుల కర్తవ్యం. ఎవడయినా ఒకడు ఉన్నట్టుండి దుర్మతి అయిపోతే వాడికి ఎట్లాగైనా ఏ మందులో మాకులో ఇప్పించి మళ్ళీ మనిషిని చేసినట్లుగా బంధువులంతా పూనుకొని నీ కలక వదలించాలి. ఇది పాడి. ఇది ధర్మం.

వ. ఏనెట్లు ముక్తుండఁగా? నంటేని విను మింకనుం జెప్పెద. 199

ప్రతిపదార్థం: రాజా! ఏను= నేను; ఎట్లు= ఏ విధంగా; ముక్తుండన్+కాను?= ముక్తుడిని కాను?; అంటి(వి)+ఏనిన్= అని నీవు అడిగినట్లయితే; వినుము= ఆలకించు; ఇంకనున్= ఇంకా వివరంగా; చెప్పెదన్= చెబుతాను.

తాత్పర్యం: ఓ రాజా! 'నేను ఏ విధంగా ముక్తుడను కాను?' అని నీవు అడిగితే గనుక ఇంకా చెప్పుతాను. వినుము.

సీ. వర్గత్రయంబున వలనను సప్తాంగ । ములయందుఁ జిత్తంబు మెలఁగుచుండ,
రాజులు-మజ్జనభోజన నిద్రావ । సరములు లోనుగా జనులుసేయు
విజ్ఞాపనము విని యాజ్ఞాపనం బొన । రించుచు, మంత్రులుఁ బ్రేమపాత్ర
తరుణులు నస్వతంత్రతఁ జేయ, నర్థుల । కొసరి తిండియు ధనగుప్తిమీఁది

తే. భరముఁ దమలో విరోధులై పట్టి మనసుఁ । జిక్కువఱుపంగఁ, బెక్కండ్రు సిరికి నడువఁ
బరిహరించుచు - బహుదుఃఖపరులు నల్ప । సౌఖ్యులును నగుచునికి రాజ్యంబు తెఱఁగు. 200

ప్రతిపదార్థం: వర్గత్రయంబున+వలనను= ధర్మ, అర్థ, కామాలు అనే మూడు పురుషార్థాల పట్లా; సప్త+అంగములయందున్= సైన్యమూ, కోశమూ మొదలైన రాజ్యాంగాలు ఏడింటిపట్లా; చిత్తంబు= మనస్సు; మెలఁగుచున్+ఉండన్= నిత్యమూ మెలగుతూ ఉంటే; మజ్జన+అవసరము= స్నాన సమయమూ; భోజన+అవసరము= భోజనసమయమూ; నిద్రా+అవసరము(లు)= నిద్రాసమయమూ అని; లోనుగాన్= ఈ మొదలైనవాటిని; జనులు= సేవకజనులు; చేయు= చేసేటటువంటి; విజ్ఞాపనము= విన్నపం; విని= ఆలకించి; ఆజ్ఞాపనంబు+ఒనరించుచున్= వాటివాటికి ఏర్పాట్లు చెయ్యమని ఆజ్ఞలు జారీ చేస్తూ; మంత్రులున్= అమాత్యులూ; ప్రేమపాత్ర= ప్రేమకు పాత్రలైన; తరుణులున్= వనితలూ; అస్వతంత్రతన్= అస్వతంత్రస్థితిని; చేయన్= తనకు కల్పించగా; అర్థుల= యాచకుల విషయంలో; కొసరి= ఇంకా ఇంకా కొసరి కొసరి; తిండియున్= ఆహారాదికం; ధనగుప్తిమీఁది= కోశాగారంలో ఉన్నధనం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కాపాడటంపట్ల ఉండే; భరమున్= బాధ్యత; తమలోన్= పరస్పరం; విరోధులై= శత్రువులై; పట్టి= ఆక్రమించి; మనసున్= మనస్సును; చిక్కు+పఱుపంగన్= కలతపెట్టగా; పెక్కండ్రు= పలువురు; సిరికిన్= తన సంపదకోసం; నడువన్= ప్రయత్నిస్తోంటే; పరిహరించుచున్= అటువంటివారిని పరిహరిస్తూ; రాజులు= పరిపాలకులు; బహుదుఃఖపరులు= అధికదుఃఖాలు కలవారూ; అల్పసౌఖ్యులును= తక్కువ సుఖాలు కలవారుగా; అగుచున్+ఉనికి= అవుతూ ఉండటం; రాజ్యంబు తెఱఁగు= రాజ్యం తాలూకు పద్ధతి.

తాత్పర్యం: రాజుల హృదయంలో ఎప్పుడూ వర్గత్రయకాంక్ష, సప్తాంగాలపట్ల జాగరూకత - ఇవే ఉంటాయి. వారి స్నానసంధ్యాదులు దాసదాసీజనం గుర్తుచేస్తే జరుగుతాయి. వారు చేసే ఏర్పాట్ల ప్రకారం ఉంటాయి. మంత్రులూ, తరుణులూ రాజులను పూర్తిగా అస్వతంత్రులను చేసేస్తారు. ధనాగారం కాపాడుకొనటం ఒకవైపూ, అర్థులకు దానం చెయ్యటం మరొకవైపూ రాజుల మనస్సులను పట్టిపీడిస్తూ ఉంటాయి. తన సిరికి ఆశపడేవాళ్ళను పరిహరించటం- అదొక బాధ్యత. మొత్తంమీద పరిపాలకులకు దుఃఖాలు ఎక్కువ - సౌఖ్యాలు తక్కువ. ఇదీ రాజ్యం పద్ధతి.

విశేషం: 'అర్థులకొసరి తిండియు - ధనగుప్తిమీఁది భరమున్' అనే పాఠంలో అన్వయం క్లిష్టంగా ఉన్నది. 'అర్థుల కొసఁగి తిండియు' అన్న పాఠాంతరంలో అన్వయసౌలభ్యం ఉన్నా అఖండయతి అవుతున్నది. 'అర్థులకున్+ఒసఁగి= అర్థుల కొసఁగి'లో 'కొ' కి గుప్తిలో 'గు'తో యతి. దీనికి మూలమైన సంస్కృతశ్లోకాలు **"అభిగమ్యాభిగమ్యైనం యాచంతే సతతం నరాః । న చాప్యుత్సహతే దాతుం విత్తరక్షీ మహాజనాత్॥ దానే కోశక్షయోహ్యస్య వైరం చాప్యప్రయచ్ఛతః । క్షణేనాస్యోపవర్తంతే దోషా వైరాగ్యకారకాః ॥"** స్పష్టంగా ఉన్నాయి. **(12-308-144).**

వ. వారలు ముక్తులు గామి దెల్లం బది యట్లుండె నీకు విశేషించియు. 201

ప్రతిపదార్థం: వారలు= అటువంటి రాజులు; ముక్తులు+కామి= ముక్తులు కాకపోవటం; తెల్లంబు= స్పష్టం; అది= ఆ విషయం; అట్లు+ఉండెన్= అట్లా ఉండనిమ్ము; నీకున్= నీకు; విశేషించి= విశేషంగా.

తాత్పర్యం: అటువంటి రాజులు ముక్తులు కాకపోవటం స్పష్టం, నీకు విశేషంగా చెప్పాలంటే.

చ. సదయ మనీషఁ బంచశిఖసంయమి మోక్షము దెల్పెనంటి, నీ
హృదయము నాదు చొచ్చుటకు నెంతయు రోసితి, ముక్తు చందమే
యిది? నిరపేక్షుఁడైన విను మెయ్యది యెట్లయినం బ్రశాంతిసం
పద నొకయింతయుం గలఁగఁ బాఱకయుండఁడె నిర్వికారుఁడై? 202

ప్రతిపదార్థం: సదయమనీషన్= దయగల హృదయంతో; పంచశిఖ-సంయమి= పంచశిఖుడు అనే యోగీశ్వరుడు; మోక్షంబు= ముక్తివిధానం; తెల్పెన్+అంటి(వి)= తెలియజేశాడు అన్నావు; నీ హృదయమున్= నీ హృదయాన్ని; నాదు+చొచ్చుటకున్= నేను ప్రవేశించటానికి; ఎంతయున్+రోసితి(వి)= ఎంతగానో అసహ్యించుకున్నావు; ఇది= ఇట్లా అసహ్యించుకోవటం; ముక్తు+చందమే?= ముక్తుడి పద్ధతియేనా?; వినుము; నిరపేక్షుఁడైనన్= వ్యక్తినిజంగా విరక్తుడే అయితే; ఏ+అది+ఎట్లు+అయినన్= ఏది ఎట్లా జరిగినా; నిర్వికారుఁడై= ఏ రకమైన ప్రతిస్పందనా లేనివాడై; ప్రశాంతిసంపదన్= తన విలువైన మానసిక ప్రశాంతి విషయంలో; ఒక+ఇంతయున్= రవ్వంతకూడా; కలఁగన్+పాఱక= కలతచెందకుండా; ఉండఁడె?= ఉండడా?

తాత్పర్యం: మహారాజా! పంచశిఖమునీశ్వరుడు నీకు మోక్షపద్ధతిని ఉపదేశించాడు అన్నావు. నేను నీ హృదయంలోకి ప్రవేశించా నని అసహ్యించుకొంటున్నావు. ఇది ముక్తుడి పద్ధతేనా? నిజంగా విరక్తుడైన వ్యక్తి ఏది ఎట్లా జరిగినా నిర్వికారుడుగానే ఉంటాడు తప్ప ఎట్టి పరిస్థితులలోనూ తన మానసిక ప్రశాంతినికోల్పోడు,చలించడు, కలత చెందడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విను శూన్యస్థానంబున । నునికి యతికిఁ గృత్య మగుట నుర్వీశ్వర! ము
క్తుని మానసంబు శూన్యం । బని చొచ్చితి, ముక్తి లేమి నది తప్పయ్యెన్. 203

ప్రతిపదార్థం: ఉర్వీశ్వర!= భూపాలా!; విను; శూన్యస్థానంబునన్= శూన్యప్రదేశంలో (నిర్జన ప్రదేశంలో); ఉనికి= నివాసం; యతికిన్= యోగికి; కృత్యము+అగుటన్= కర్తవ్యం కాబట్టి; ముక్తుని= ముక్తుడైనవాడి; మానసంబున్= మనస్సుకూడా; శూన్యంబు+అని= శూన్యమే అని; చొచ్చితిన్= నీ మనస్సులోకి ప్రవేశించాను; ముక్తి= ముక్తి అనేది; లేమిన్= లేకపోవటంతో; అది= అట్లా నేను ప్రవేశించటం; తప్పు+అయ్యెన్= పొరపాటు అయ్యింది.

తాత్పర్యం: మహారాజా! యోగీశ్వరులు శూన్యప్రదేశాలలో నివసించటం పరిపాటి. యోగుల మనస్సులు కూడా రాగద్వేషాదిభావశూన్యాలుగానే ఉంటాయి. నీవు ముక్తుడవుకదా అనుకొని నీ మనస్సులోనికి ప్రవేశించాను. కానీ నీవు ముక్తుడవు కావు. అందుకని నేను చేసిన పని తప్పు అయింది. నీవు నిందిస్తున్నావు.

వ. అట్లుం గాక. 204

ప్రతిపదార్థం: అట్లున్+కాక= అదీకాక.

తాత్పర్యం: అదీకాక మరొక్క విషయం.

ఆ. కాలుఁజేయి మొదలుగాఁగల నాయంగ । కములలోన నిన్నుఁ గలయ దొకటి
యేని, రిత్త యిప్పుడేటికిఁ గటకటం । బడుచు నిట్లు దూరఁబలికి తధిప! 205

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; కాలున్= కాలూ; చేయిన్= చేయీ; మొదలుగాన్+కల= మొదలుగా ఉన్న; నా+అంగకములలోనన్= నా శరీరావయవాలలో; ఒకటియేనిన్= ఒక్కటయినా; నిన్నున్= నిన్ను; కలయదు= స్పృశించలేదు; రిత్త(న్)= వృథా(గా); ఇప్పుడు; ఏటికిన్= ఎందుకని; కటకటంబడుచున్= మనస్సు కష్టపెట్టుకుంటూ; ఇట్లు= ఇలా; దూరన్+బలికితి(వి)?= నన్ను నిందించావు?

తాత్పర్యం: రాజా! నా కాలుగానీ చేయిగానీ మరింక ఏ అవయవంగానీ నిన్ను తాకలేదు. ఎందు కింత వ్యథ చెందుతున్నావు? వృథాగా నన్ను ఎందుకు నిందిస్తున్నావు? ఇప్పుడు ఏమంత అపచారం జరిగిపోయిందని?

వ. అని యమాత్యుల దిక్కు సూచి. 206

ప్రతిపదార్థం: అని; అమాత్యుల దిక్కు= మంత్రులవైపు; చూచి= వీక్షించి.

తాత్పర్యం: అని మంత్రులవైపు చూచి.

ఆ. వీరు పెద్దవారు; వీరలు విన నిట్టి । తులువమాటలాడ దొరకుఁదగునె?
యెదిరిఁ దూలవుచ్చు టే మంచివెరవు? గాం । భీర్యహాని దలఁచు పెంపు లేదె? 207

ప్రతిపదార్థం: వీరు= ఈ మంత్రులందరూ; పెద్దవారు= పెద్దలు; వీరలు= వీరంతా; వినన్= వింటూండగా; ఇట్టి= ఇటువంటి; తులువమాటలు= నీచమైన పలుకులు; ఆడన్= మాట్లాడటం; దొరకున్= ప్రభువుకు; తగునె?= తగునా?; ఎదిరిన్= ఎదుటి వ్యక్తిని; తూల+పుచ్చుట= కించపరచటం; ఏ మంచి వెరవు?= ఏమంత మంచి పద్ధతి?; గాంభీర్యహానిన్= ఉదాత్తత దెబ్బతింటోంది అనే విషయాన్ని; తలఁచు= గుర్తించేటువంటి; పెంపు= ఔన్నత్యం; లేదె?= నీకు లేదా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వయోజ్ఞాన వృద్ధులూ, పెద్దలూ అయిన మంత్రులు ఇంతమంది వింటూ ఉండగా ఇట్లా నీచంగా మాట్లాడటం నీవంటి ప్రభువుకు తగిన విషయమేనా? ఎదుటివారిని కించపరచటమే మంచిపద్ధతి అనుకొంటున్నావా? నీ గాంభీర్యం దెబ్బతింటున్నది - అనే విషయాన్ని గమనించేపాటి ఔన్నత్యంకూడా నీకు లేదనుకోనా?

క. **వనితల పురుషులయెడఁ బు । ట్టినయది వెల్లివిరిసేఁత డిమ్మరితన, మె**
ట్టి నికృష్టుం డైనను ని । ప్పనికిఁ జొరఁడు; దగునె యిది నృపాలసుతునకున్? 208

ప్రతిపదార్థం: వనితల - పురుషుల+ఎడన్= స్త్రీపురుషుల మధ్య; పుట్టిన+అది= ఏర్పడిన సంబంధాన్ని; వెల్లివిరిసేఁత= బాగా ప్రచారం చేయటమనేది; డిమ్మరితనము= దుష్టుడి లక్షణం; ఎట్టి= ఎంతటి; నికృష్టుండు+ఐననున్= నీచుడైనా; ఇప్పనికిన్= ఈ పనికి; చొరఁడు= పూనుకోడు; నృపాలసుతునకున్= నీవంటి రాకుమారుడికి; ఇది; తగునె?= అర్హమా?

తాత్పర్యం: స్త్రీపురుష సంబంధాన్ని ఊరంతా వరదగట్టించటం దుష్టలక్షణం. ఎంతటి నీచుడైనా ఈ పని చెయ్యడు. అటువంటిది ఒక రాజకుమారుడవై నీవు చేయటం సమంజసమా? చెప్పుము.

చ. **బిసరుహపత్త్రలగ్న జలబిందువు చాడ్పున సంగవర్జితో**
ల్లసనమునన్ వసించితి నిలావర! నీ మది నిట్టిదానిఁగాఁ
బొసఁగ నెఱుంగవైతి నను; బొంకగు టేర్పడియెన్ విముక్తి చొ
ప్పు సదయవృత్తి నీకు మునిపుంగవు చెప్పుట మాటలేటికిన్? 209

ప్రతిపదార్థం: ఇలావర!= భూవిభూ!; బిసరుహపత్ర= తామరపాకుమీద; లగ్న= నిలిచిన; జలబిందువు చాడ్పునన్= నీటిబిందువువలె; సంగవర్జిత= సాంగత్యరహితమైన; ఉల్లసనమునన్= విలాసంతో; వసించితిన్= ఇంతకాలమూ జీవించాను; ఇట్టిదానిన్+కాన్= ఇటువంటి నిస్సంగగా; ననున్= నన్ను; పొసఁగన్= సముచితంగా; నీ మదిన్= నీ మనస్సులో; ఎఱుంగవు+ఐతి(వి)= తెలుసుకోలేకపోయావు; సదయవృత్తిన్= దయామయమైన ప్రవృత్తితో; నీకున్= నీకు; విముక్తి చొప్పు= మోక్షపద్ధతి; మునిపుంగవు చెప్పుట= పంచశిఖమునీశ్వరుడు ఉపదేశించటం; బొంకు+అగుట= అసత్యం కావటం; ఏర్పడియెన్= జరిగింది, సిద్ధించింది; మాటలు+ఏటికిన్= ఇంక వెయ్యిమాటలు ఎందుకు?

తాత్పర్యం: తామరాకుమీద నీటిబొట్టువలె నిస్సంగంగా జీవితం గడుపుతున్నాను. నన్ను నీవు తెలిసికొనలేకపోయావు. అంటే - పంచశిఖమునీశ్వరుడు దయతో నీకేదో ముక్తిమార్గం ఉపదేశించాడు - అన్నది అసత్యమని తేలింది. ఇంతకూ సారాంశం ఇదీ. ఇంక వేయిమాటలు ఎందుకు!

విశేషం: అలం: ఉపమ.

క. **నీవు గృహధర్మ పరతయుఁ । బో విడిచితి; నీకు మోక్షమును విదితము గా**
దేవలనికిఁ గా కిట్లు ధ । రావర! మిథ్యా ప్రబోధరతుఁడై తరయన్. 210

ప్రతిపదార్థం: ధరావర!= భూభర్తా!; నీవు; గృహధర్మపరతయున్= గృహస్థాశ్రమధర్మాన్ని ఆచరించటమూ; పోవిడిచితి(వి)= పూర్తిగా విడిచిపెట్టేశావు; నీకున్= నీకు; మోక్షమును= ముక్తిమార్గమంటావా - అదీ; విదితము+కాదు= అర్థం కాలేదు; అరయన్= ఆలోచిస్తే; ఏవలనికిన్+కాక= ఎటూ చెందకుండా; ఇట్లు= ఇట్లా; మిథ్యా ప్రబోధరతుఁడు(డవు)= మిథ్యాజ్ఞానంలో సంబరపడే వాడవు; ఐతి(వి)= అయ్యావు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజా! నీవు అటు గృహస్థాశ్రమధర్మాలనూ విడిచి పెట్టేశావు. ఇటు మోక్షమార్గమూ నీకు అర్థం కాలేదు. రెంటికీ చెడ్డావు. ఒక మిథ్యాజ్ఞానంతో సంబరపడుతున్నావు.

క. ముక్తులు ముక్తులఁ గలయుట । యుక్తమ - యది నభము నభము నొందు తెఱఁగు, నీ
ముక్తత బొంకని దీనిని । సక్తతగా నీవు గనుట సాలదె తెలుపన్? 211

ప్రతిపదార్థం: ముక్తులు= భవబంధాలనుండి మానసికంగా ముక్తిపొందినవారు; ముక్తులన్= అటువంటి ముక్తులతో; కలయుట= కలవటం; యుక్తము+అ= ఉచితమే; అది= ఆ కలయిక; నభము= ఆకాశం; నభమున్= ఆకాశాన్ని; ఒందు తెఱఁగు= పొందినట్లుంటుంది; దీనినిన్= ఈ కలయికను; సక్తతగాన్= సాంగత్యంగా; నీవు; కనుట= భావించటమనేది; నీ ముక్తత= నీవు ముక్తుడవనటం; బొంకు+అని= అబద్ధమని; తెలుపన్= తెలియజెయ్యటానికి; చాలదె?= సరిపోదా?

తాత్పర్యం: ముక్తులూ, ముక్తులూ కలవటం ఎప్పుడూ యుక్తమే - ఆకాశమూ, ఆకాశమూ కలిసినట్టుగా. రెండూ శూన్యాలే. కాబట్టి సక్తత అనేదే ఉండదు. కానీ, నీవు ఈ కలయికను సక్తతగా భావించావు. అంటే నీవు ముక్తుడవు కావన్నమాట. నీ ముక్తత అబద్ధ మనటానికి ఈ ఒక్క ఉదాహరణ చాలదా?

వ. మనము ముక్తులము గాకున్నను మనకు సాంగత్యము గలుగుట నింద్యంబుగా దెట్లంటేని. 212

ప్రతిపదార్థం: మనము= నీవు, నేనూ; ముక్తులము= ముక్తులం; కాకున్నను= కాకపోయినప్పటికీ; మనకు= మన ఇద్దరికీ; సాంగత్యము= కలయిక; కలుగుట= ఏర్పడటం; నింద్యంబు+కాదు= దుష్టం కాదు; ఎట్లు+అంటి(వి)+ఏనిన్= అది ఎట్లా అంటే.

తాత్పర్యం: మనం ముక్తులం కాకపోయినప్పటికీ, మనకు కలయిక ఏర్పడటం దుష్టం కాదు. అది ఎట్లా అంటే చెప్తుతాను వినుము.

సీ. నిఖిలజన శ్రోత్రసుఖకరం బగు చరి । త్రమునఁ బెంపారెడు ప్రథన నృపతి
కులమునఁబుట్టితి, సులభ నా పేరు, మ । త్పూర్వులు శతశృంగమునను ద్రోణ
మునను శక్రద్వారమున మహాధ్వరములు । సేసిరి, విను పాకశాసనుండు
దమ పాలి కేతేరఁ దద్గోష్ఠిఁ బరమార్థ । చింత సేయుదురు, భూకాంత! యేను

తే. నాకు నెనయైన పురుషుండు లేకయునికి । మోక్షధర్మ ప్రవర్తనమునఁ జరింతుఁ,
గాన నీ చూచు వర్ణసాంకర్య మస్మ । దీయ సాంగత్యమున లేమి దెల్లమరయ. 213

ప్రతిపదార్థం: భూకాంత!= భూపతీ!; నిఖిలజన= సమస్తజనుల; శ్రోత్ర= చెవులకు; సుఖకరంబు+అగు= పండువుగా సుఖప్రదమైన; చరిత్రమునన్= చరిత్రతో; పెంపు+ఆరెడు= పెంపొందుతున్న; ప్రథననృపతి కులమునన్= ప్రథనుడు అనే పేరుగల రాజుగారి వంశంలో; పుట్టితిన్= జన్మించాను; నా పేరు; సులభ; మత్+పూర్వులు= మా వంశంలో పూర్వపు పెద్దలు; శతశృంగమునను= శతశృంగం అనే చోట; ద్రోణమునను= ద్రోణం అనే చోట; శక్రద్వారమునన్= శక్రద్వారం అనే చోట; మహా+అధ్వరములు= గొప్ప యజ్ఞాలు; చేసిరి= చేశారు; విను; పాకశాసనుండు= దేవేంద్రుడంతటివాడు; తమపాలికిన్= తమ సన్నిధికి; ఏతేరన్= రాగా; తద్+గోష్ఠిన్= అతడితో గోష్ఠిలో; పరమార్థ చింత= పరమార్థానికి సంబంధించిన ఆలోచనలు; చేయుదురు= చేస్తూ ఉండేవారు; నాకున్= నాకు; ఎనయైన= సాటియైన; పురుషుండు= మగవాడు; లేక+ఉనికిన్= లేకపోవటంతో; ఏనున్= నేను; మోక్షధర్మ ప్రవర్తనమునన్= మోక్షధర్మ ఆచరణతోనే; చరింతున్= సంచరిస్తున్నాను; కానన్= కాబట్టి; నీ+చూచు= నీవు చూస్తున్న;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వర్ణసాంకర్యము= బ్రాహ్మణ, క్షత్రియ వర్ణ సాంకర్యం అనేది; అస్మదీయ= మన ఇద్దరియొక్క; సాంగత్యమునన్= కలయికలో; లేమి= లేకపోవటం; అరయన్= పరిశీలించి చూస్తే; తెల్లము= తేటతెల్లం.

తాత్పర్యం: ఓ క్షత్రియా! నేను ప్రధనమహారాజు వంశంలో పుట్టిన దానను. మా వంశచరిత్ర జగదానందదాయకం. ప్రజల చెవులకు పండుగ. నా పేరు సులభ. మా వంశంలో పూర్వీకులు శతశృంగంలో, ద్రోణంలో, శక్రద్వారంలో మహాయజ్ఞాలు అనేకం చేశారు. దేవేంద్రుడంతటివాడు తానై తరలివచ్చి కూర్చుంటే మా పెద్దలు ఆయనతో పరమార్థగోష్ఠి నడిపేవాళ్ళు తెలుసా? వింటున్నావా? నాకు సాటివచ్చే పురుషుడు కనిపించకపోవటంతో నేను ఇట్లా మోక్షధర్మం పట్టి సంచరిస్తున్నాను. కాబట్టి మన ఇద్దరి సాంగత్యంలోనూ నీవు అనుకునే వర్ణసాంకర్యం ఏమీ లేదు. నేను బ్రాహ్మణిని కాను సుమా!

విశేషం: 'నీవు బ్రాహ్మణివి - నేను క్షత్రియుడను' మన ఇద్దరి సాంగత్యమూ నింద తేదా? - అని తిక్కన గారి జనకుడు చాలా సుకుమారంగా పలికాడు (182). వ్యాసభారతంలో ఇది చాలా ఘాటుగా ఉన్నది. 'నీవు బ్రాహ్మణ కాంతవు - నేను క్షత్రియ పురుషుడను. కాబట్టి మొదటిది వర్ణసాంకర్యం. నీవు యోగినివి - నేను గృహస్థుడను. కాబట్టి రెండవది ఆశ్రమసాంకర్యం. నీ గోత్రమేమిటో నాకు తెలియదు. నా గోత్రం ఏమిటో నీకు తెలియదు. ఒకవేళ సగోత్రులమైతే మూడవది గోత్రసాంకర్యం. నీ భర్త జీవించి ఉన్నాడో - ప్రోషితుడయ్యాడో. ఏమయినా పరభార్యవు. పొందదగని దానవు. కాబట్టి నాలుగవది ధర్మసాంకర్యం. ఇన్ని అకార్యాలకు సిద్ధపడుతున్నావు. ఇది అజ్ఞానమో! మిథ్యాజ్ఞానమో!' అన్నాడు వ్యాసులవారి జనకుడు. **"వర్ణప్రవరముఖ్యాసి బ్రాహ్మణీ క్షత్రియో హ్యహమ్। నావయోరేకయోగోzస్తి మా కృథా వర్ణసంకరమ్. (12-308-59). వర్తసే మోక్షధర్మేషు గార్హస్థ్యే త్వహమాశ్రమే । అయం చాపి సుకష్టస్తే ద్వితీయోzzశ్రమసంకరః (60). సగోత్రాం వాసగోత్రాం వా న వేద త్వాం న వేత్థమామ్ । సగోత్రమావిశంత్యాస్తే తృతీయో గోత్రసంకరః (61). అథ జీవతి తే భర్తా ప్రోషితోzప్యథవా క్వచిత్ । అగమ్యా పరభార్యేతి చతుర్థో ధర్మసంకరః ॥ (62) సా త్వమేతాన్యకార్యాణి కార్యాపేక్షా వ్యవస్యసి । అవిజ్ఞానేన వా యుక్తా మిథ్యాజ్ఞానేన వా పునః॥' ' (63).** ఇన్ని శ్లోకాల సారాంశాన్నీ ఒక తేటగీతిలోకి (6-182) సంగ్రహించాడు తిక్కన. వీటికి అన్నింటికీ సమాధానంగా మన కలయికలో ఏ సాంకర్యమూ ఏ అధర్మమూ లేదని ఈ సీసపద్యంలో సులభ స్పష్టం చేసింది. ప్రధననృపతి కులంలో పుట్టాను అనటం వలన వర్ణ గోత్రసూచన. అవివాహితనూ, కన్యనూ అని చెప్పటం వలన ఆశ్రమ-ధర్మ సాంకర్యాలు లేవని సూచన.

క. నను డాఁప నేల దానం । గనియెడునది గలదె? ముక్తి గలదో? లేదో?
జనకున కరసెదఁ గా కని । చనుదెంచితిఁ, దప్పె యది విచారింపంగన్.' 214

ప్రతిపదార్థం: ననున్= నన్ను నేను; డాఁపన్+ఏల= దాచుకోవటం ఎందుకు?; దానన్= అట్లా దాచుకున్నందు వలన; కనియెడునది= పొందేది; కలదె?= ఏమైనా ఉన్నదా?; జనకునకున్= ఈ జనకమహారాజుకు; ముక్తి= ముక్తి అనేది; కలదో?= ఉన్నదో?; లేదో?; అరసెదన్+కాక= పరీక్షించెదను; అని; చనుదెంచితిన్= వచ్చాను; విచారింపంగన్= ఇప్పుడు ఆలోచించి చూస్తే; అది; తప్పె= తప్పయిపోయింది, వ్యర్థమని తేలింది.

తాత్పర్యం: నన్ను నేను కప్పి పుచ్చుకొనవలసిన అవసరం ఏముంది? అట్లా చేసినందువలన నాకు కలిగేది ఏముంది? జనకమహారాజు ముక్తుడా? కాదా? - పరిశీలిద్దామని వచ్చాను. ఇప్పుడు ఆలోచిస్తే అది తప్పే అని తేలింది.'

క. అని యిట్లు పలుకు పలుకులు । విని పలుకకయున్న జనకవిభు నాననముం
గనుఁగొని సులభ నగుచు ని । ట్లనియె నతనితోడఁ గౌరవాన్వయముఖ్యా! 215

ప్రతిపదార్థం: కౌరవాన్వయముఖ్యా!= కౌరవవంశంలో ప్రధానమైనవాడా! ఓ ధర్మరాజా!; అని; ఇట్లు= ఈ ప్రకారంగా; పలుకు= పలుకుతున్న; పలుకులు= మాటలు; విని= ఆలకించి; పలుకక+ఉన్న= మాట్లాడకుండా కూర్చున్న; జనకవిభు+ఆననమున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జనకమహారాజుయొక్క ముఖాన్ని; కనుఁగొని= చూచి; సులభ= ఆ సులభ; నగుచున్= నవ్వుతూ; అతనితోడన్= ఆ జనకుడితో; ఇట్లు+అనియెన్= ఇలా అంది.

తాత్పర్యం: (ఇదంతా భీష్ముడు ధర్మరాజుతో చెప్తున్నాడు) ఓ ధర్మరాజా! సులభ ఇట్లా మాట్లాడుతుంటే వింటూ జనకమహారాజు మౌనంగా ఉండిపోయాడు. ఆ రాజుగారి ముఖం చూసి నవ్వుతూ మళ్ళీ సులభ ఇట్లా అన్నది.

తే. ‘అగ్ని వెచ్చనో? చల్లనో? యని మనమునఁ । గరము సందియ మందుట గాదె నిన్ను
నధిప! ముక్తుండవో? కావొ? యని తలంచు । టది మదీయ బాలిశభావ మని తలంపు. 216

ప్రతిపదార్థం: అధిప!= జనకమహారాజా!; నిన్నున్= నిన్ను; ముక్తుండవో?= ముక్తి పొందినవాడవో?; కావొ?= కావో?; అని; తలంచుట+అది= ఆలోచించటమనేది; అగ్ని= నిప్పు; వెచ్చనొ?= వేడిగా ఉంటుందో?; చల్లనో?= చల్లగా ఉంటుందో?; అని; మనమునన్= మనస్సులో; సందియము+అందుట+కాదె= సందేహించటం కాదా!; మదీయ= నాయొక్క; బాలిశభావము= అవివేకం; అని; తలంపు(ము)= భావించుము.

తాత్పర్యం: ‘రాజా! నీవు ముక్తుడవు అవునో కాదో అని నేను సంశయించటం - అగ్ని వేడిగా ఉంటుందో చల్లగా ఉంటుందో అని సందేహించటంతో సమానం. ఇది కేవలం నా అజ్ఞానమనీ మూర్ఖత్వమనీ భావించుము.

విశేషం: అలం: దృష్టాంతం.

చ. జనవర! నీ సుభాషల నసత్యమొకండును లేదు నీవు స
న్మునిగణకీర్తనీయుఁడవు మోక్షము నీ కఱచేతిలోనిదై
యునికి దృఢంబుగాఁ గనియు నొండొక చందము మాటలాడితిన్
నిను నగుపింపఁగా వలసి నీదగు మన్నన శంక వాసినన్. 217

ప్రతిపదార్థం: జనవర!= ఓ రాజా!; నీ= నీయొక్క; సుభాషలన్= మంచి మాటలలో; అసత్యము= అబద్ధమనేది; ఒకండునున్= ఒక్కటికూడా; లేదు; నీవు; సత్+మునిగణ= మహాముని బృందంచేత; కీర్తనీయుఁడవు= స్తుతింపదగినవాడవు; మోక్షము= ముక్తి అనేది; నీకున్= నీకు; అఱచేతిలోనిది= అరచేతిలోది; ఐ+ఉనికి= అయి ఉండటం; దృఢంబుగాన్= గట్టిగా; కనియున్= తెలిసికొని కూడా; నీది+అగు= నీవు ఇచ్చినటువంటి; మన్ననన్= గౌరవంవల్ల (చనవువలన); శంక+పాసినన్= (అయ్యో); మహారాజు కదా; నేను ఇట్లా మాట్లాడవచ్చునా? - అనే శంక తొలగిపోవటంతో; నినున్= నిన్ను; నగుపింపఁగాన్+వలసి= నవ్విద్దామనిపించి; ఒండొక చందము= మరొకరకం; మాటలు= పలుకులు; ఆడితిన్= పలికాను.

తాత్పర్యం: రాజా! నీవు మాట్లాడిన వాక్యాలలో ఒక్కటయినా అసత్యం లేదు. మునీశ్వరులచేతకూడా కీర్తనీయుడవు. మోక్షం నీకు అరచేతిలోనిది. ఇన్నీ తెలిసినా - నీవు ఇచ్చిన మన్ననతో జంకు వదిలిపోయి, నిన్ను నవ్విద్దా మనిపించి (ఆటపట్టిద్దామని) మరోరకంగా మాట్లాడాను. అంతే సుమా!

క. అవియెల్ల నసత్యంబుల । యవనీశ్వర! యరయవచ్చుటది యొక్కఁడు ని
క్కువ మీ యపరాధము భవ । దవిరళ సౌజన్యమగ్న మగుఁగాక తగన్. 218

ప్రతిపదార్థం: అవనీశ్వర= మహారాజా!; అవి+ఎల్లన్= ఆ నా మాటలన్నీ; అసత్యంబులు+అ= అబద్ధాలే; అరయన్+వచ్చుట= నిన్ను పరీక్షించటానికి నేను రావటం అనేది; అది+ఒక్కఁడు= ఆ ఒక్కటీ; నిక్కువము= నిజం; ఈ+అపరాధము= ఈ తప్పు;తగన్= తగినట్టు; భవత్= నీయొక్క; అవిరళ= చిక్కనైన; సౌజన్య= ఔదార్యంలో(సజ్జనత్వంతో); మగ్నము+అగున్+కాక= మునిగిపోవుగాక!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ రాజా! ఇంతవరకూ నేను మాట్లాడినవన్నీ అసత్యాలే. అయితే - నిన్ను పరీక్షించాలి అని రావటం ఉన్నదే - అదొక్కటే నిజం. నా ఈ అపరాధం నీ స్నిగ్ధమైన సౌజన్యంలో (మంచితనంలో) మునిగి, మరుపున పడిపోవాలని ఆశిస్తున్నాను.

క. **సులభానామము సంసృతి । పాలమొల్లక తిరుగుటయును భూలోకవరా!**
కలరూప నేఁటి కిచ్చట । నిలిచెద నీవు మునిసేవనీయుఁడ వగుటన్.' 219

ప్రతిపదార్థం: భూలోకవరా!= భూపాలా!; సులభానామము= సులభ అనే పేరు; సంసృతి పాలము= సంసార పరిధి; ఒల్లక= ఇష్టపడక; తిరుగుటయును= దేశసంచారం చేయటం; కల+రూపు+అ= (ఇవి రెండూ) ఉన్న స్వరూపమే.; నీవు; ముని= మునులకు కూడా; సేవనీయుఁడవు= సేవింపదగినవాడవు; అగుటన్= కాబట్టి; నేఁటికిన్= ఈ రోజుకి; ఇచ్చటన్= ఇక్కడే; నిలిచెదన్= ఉంటాను.

తాత్పర్యం: జనకమహారాజా! నా పేరు సులభ అనేదీ, నేను సంసార బంధం ఇష్టపడక దేశసంచారం చెయ్యటమనేదీ - ఇవి రెండూ ఉన్న నిజాలు. నీవేమో మునులకుకూడా అర్చనీయుడవు. కాబట్టి ఈ రోజు ఇక్కడే నీ అతిథిగా ఉంటాను.'

తే. **అనినఁ దానును మంత్రులు నవ్విభుండు । సులభఁ గొనియాడె; నాఁడెల్ల నలఘుగోష్ఠిఁ**
బ్రియము రెట్టింప నయ్యోగినియును దారు । నెమ్మి నొక్కట నుండిరి నృపవరేణ్య! 220

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజశ్రేష్ఠా! ధర్మరాజా!; అనినన్= సులభ ఇట్లా అనేసరికి; ఆ+విభుండు= ఆ జనకమహారాజు; మంత్రులున్= మంత్రులూ; తానునున్= తానూ; సులభన్= సులభాదేవిని; కొనియాడెన్= ప్రశంసించాడు; నాఁడు+ఎల్లన్= ఆ రోజంతా; అలఘుగోష్ఠిన్= సుదీర్ఘమైన చర్చలో (విలువైన గోష్ఠి); ప్రియము= ప్రీతి; రెట్టింపన్= రెట్టింపుకాగా (ఇబ్బడికాగా); ఆ+యోగినియును= ఆ సులభాదేవీ; తారును= రాజూ, మంత్రులూ; నెమ్మిన్= మైత్రితో (ఆదరంతో); ఒక్కటన్+ఉండిరి= ఒకచోట కాలక్షేపం చేశారు.

తాత్పర్యం: ఇట్లా సులభాదేవి పలికేసరికి జనకుడూ అతడి మంత్రులూ ఆమెను ఎంతగానో కొనియాడారు. ధర్మరాజా! ఆ రోజంతా వారందరికీ విలువైన విషయాలతో గోష్ఠి నడిచింది. ప్రేమాదరాలతో ఒకచోట కాలక్షేపం చేశారు.

వ. **మఱునాఁ డజ్జనపతి యనుమతిసేయ నమ్మహానుభావ నిజేచ్ఛం జనియె' నని చెప్పిన నప్పౌరవోత్తముండు ప్రమోదాయత్తస్వాంతుండయి శాంతనవునితో 'శుకుని కెవ్విధంబున వైరాగ్యంబు సొప్పడియెం జెప్పవే?' యనుటయును నతం డా ధర్మ సుతున క్లినియె. 221**

ప్రతిపదార్థం: మఱునాఁడు= మరుసటిరోజు; ఆ+జనపతి= ఆ జనకమహారాజు; అనుమతి+చేయన్= అనుమతించగా; ఆ+మహానుభావ= ఆ మహాత్మురాలు - సులభాదేవి; నిజ+ఇచ్ఛన్= తన కోరిక ప్రకారం; చనియెన్= వెళ్ళిపోయింది; అని; చెప్పినన్= భీష్ముడు వివరించేసరికి; ఆ+పౌరవ+ఉత్తముండు= పురువంశంలో ఉత్తముడైన ఆ ధర్మరాజు; ప్రమోద= ఆనందానికి; ఆయత్త= స్వాధీనమైన; స్వాంతుండు+అయి= హృదయం కలవాడై (మనస్సులో సంతోషించి); శాంతనవునితోన్= శంతనుమహారాజు పుత్రుడైన భీష్ముడితో; శుకునికిన్= శుకమహర్షికి; ఏ+విధంబునన్= ఎట్లాగ; వైరాగ్యంబు= విరక్తి అనేది; చొప్పడియెన్= ఏర్పడింది?; చెప్పవే?= దయచేసి వివరించవా?; అనుటయున్= అనటమూ; అతండు= ఆ భీష్ముడు; ఆ; ధర్మసుతునకున్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: మరుసటిరోజు జనకుడి అనుమతితో ఆ సులభాదేవి వెళ్ళిపోయింది' అని భీష్ముడు వివరించగా, ధర్మరాజు 'శుకుడికి వైరాగ్యం ఎట్లా కలిగింది?' అనే ప్రశ్న వేశాడు. దానికి బదులుగా భీష్ము డీ విధంగా చెప్ప సాగాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వేదవ్యాసుఁడు శుకున కుపదేశించిన వైరాగ్యప్రకారము (సం. 12-309-2)

సీ. 'ప్రాకృతజనుల వర్తనములవెంటఁ జి । త్తమున జరామరణముల కలిమి
దలఁపక యేమఱి మెలఁగెడు శుకుఁజూచి । విపులధర్మజ్ఞాన నిపుణ ధిషణుఁ
డైన వేదవ్యాసుఁ డాతని కిట్లను । 'మనసు నింద్రియములు మర్దితములు
గాఁ జేయు ముత్పథగాములు గానీకు । మక్రోధసత్య శమార్జవములుఁ

తే. దపము దమము నహింసయు ధర్మమునకు । నాకృతులు వీనిఁ బాలింపు మాఁకలియును
నీరువట్టును దగియెడు నెఱి నడంచి । దేవతాతిథి శేషోపజీవి వగుము. 222

ప్రతిపదార్థం: ప్రాకృతజనుల= పామరజనులయొక్క; వర్తనములవెంటన్= నడవడికలను అనుసరిస్తూ; జరామరణముల= ముసలితనం, మరణం అనే విషయాలయొక్క; కలిమిన్= ఉనికిని; చిత్తమునన్= ఎడదలో; తలఁపక= ఆలోచించకుండా; ఏమఱి= ఏమరుపాటుతో; మెలఁగెడు= జీవిస్తున్న; శుకున్= తన పుత్రుడైన శుకుడిని; చూచి= తిలకించి; నిఖిల= సమస్తమైన; ధర్మ= ధర్మాలకు సంబంధించిన; జ్ఞాన= ఎరుకతో; నిపుణ= నిపుణమైన; ధిషణుఁడు= బుద్ధికలవాడు; ఐన= అయిన; వ్యాసుఁడు= వ్యాసభగవానుడు; ఆతనికిన్= ఆ శుకుడికి; ఇట్లు; అనున్= చెప్పుతున్నాడు; మనసున్= మనస్సునూ; ఇంద్రియములున్= జ్ఞాన కర్మేంద్రియాలనూ; మర్దితములుగాన్= అణచివేయబడినవిగా; చేయుము; ఉత్పథగాములు= తప్పుడు మార్గాలలో ప్రయాణించేవిగా; కానీకుము= కానీయకుము; అక్రోధ= క్రోధం లేకపోవటం; సత్య= సత్యం; శమ= అంతరింద్రియనిగ్రహం; ఆర్జవములున్= ఋజుత్వం అనే ఇవీ; తపమున్= తపస్సూ; దమమున్= బాహ్యేంద్రియ నిగ్రహం; అహింసయున్= హింసాప్రవృత్తి లేకపోవటం - ఇవన్నీ; ధర్మమునకున్= ధర్మానికి; ఆకృతులు= స్వరూపాలు; వీనిన్= వీటిని; పాలింపుము= ఆచరించుము; ఆఁకలియును= ఆకలీ; నీరువట్టును= దప్పికా; తగియెడు నెఱిన్= తగిన పద్ధతిలో; అడంచి= అణచివేసికొని; దేవతా+అతిథి= దేవతలకూ, అథితులకూ సమర్పించాక; శేష= మిగిలినదానితో; ఉపజీవివి= జీవించేవాడవు; అగుము= కమ్ము.

తాత్పర్యం: 'జీవుడికి జరామరణాలు ఉన్నాయి అనే విషయమే మర్చిపోయి పామరజనులతో కలిసి అజాగ్రత్తగా జీవితం గడిపివేస్తున్న శుకుడిని చూసి వ్యాసుడు ఇట్లా ఉపదేశించాడు. 'మనస్సునూ, ఇంద్రియాలనూ మర్దించి స్వాధీనం చేసికొమ్ము. వాటిని ఎప్పుడూ తప్పుడు దారులలోనికి రానివ్వకుము. అదుపులో ఉంచుకొమ్ము. క్రోధత్యాగం, సత్యం, నిగ్రహం, ఋజుత్వం, తపస్సు, అహింస - అనేవి ధర్మానికి ఆకారాలు. వీటిని పరిపాలించుము. ఆకలి దప్పికలను నేర్పుగా తగ్గించుకొమ్ము. దేవతలకూ, అతిథులకూ సమర్పించాక మిగిలినదానితో జీవితం గడుపుకొనటం అలవాటు చేసికొమ్ము.

క. నురువున నొనరించిన పం । జరంబులో నున్న పులుఁగు చాడ్పున మేనం
బురుషవర! జీవ ముండుట । పరికింపక యేమఱంగఁ బాడియె నీకున్? 223

ప్రతిపదార్థం: పురుషవర!= ఓ మానవోత్తమా!; నురువునన్= ఫేనంతో(నీటి నురుగుతో); ఒనరించిన= తయారుచేసిన; పంజరంబులోన్= పంజరంలో; ఉన్న= ఉన్నటువంటి; పులుఁగు చాడ్పునన్= పిట్టవలె; మేనన్= శరీరంలో; జీవము= ప్రాణం; ఉండుట= ఉండటాన్ని; పరికింపక= గమనించకుండా; ఏమఱంగన్= ఇట్లా ఏమరుపాటుతో ఉండటం; నీకున్= నీకు; పాడియె?= తగునా?

తాత్పర్యం: నాయనా! నురుగుతో చేసిన పంజరంవంటిది ఈ శరీరం. ఇందులో ఒక పిట్టవలె ఉంటున్నది ప్రాణం. ఈ పరిస్థితిని గమనించకుండా ఏమరుపాటుతో ఉండటం నీకు తగునటరా! (ఈ నురుగు పంజరం ఏ క్షణంలోనైనా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చితికిపోవచ్చును. పిట్ట తుర్రుమనవచ్చును. తలచుకొంటేనే భయంగా ఉంటుందే - నీకసలు నిద్ర ఎట్లా పట్టుతున్నది పుత్రకా! అని భావం.)

విశేషం: అలం: ఉపమ. దీనికి సంస్కృత మూలం: **"ఫేనపాత్రోపమే దేహే జీవే శకునివత్ స్థితే । అనిత్యే ప్రియసంవాసే కథం స్వపిషి పుత్రక॥" (సం. 12-309-6)**

తే. ఎన్నికొనుచుండఁ జనుచుండు నేండ్లు లివ్వి । ధమున నాయువు దోడ్తోడఁ దఱిఁగి జీవ
హాని వాటిల్లఁగాఁ బుత్ర! యనవధాన । నిద్ర మోహితుఁడై యున్కి నీకుఁ దగునె? 224

ప్రతిపదార్థం: పుత్ర!= బిడ్డా!; ఎన్నికొనుచుండన్= లెక్కపెట్టుకొంటూంటే; ఏండ్లులు= సంవత్సరాలు; చనుచుండున్= వెళ్ళిపోతూ ఉంటాయి; ఈ+విధమునన్= ఈ విధంగా; ఆయువు= ఆయుర్దాయం; తోడ్తోడన్= క్రమక్రమంగా; తఱిఁగి= తరిగిపోయి; జీవహాని= ప్రాణవియోగం; పాటిల్లఁగాన్= జరిగే పరిస్థితి ఉండగా; అనవధాన= ఏమరుపాటు అనేటటువంటి; నిద్రన్= నిద్రలో; మోహితుఁడై= సమ్మోహితుడై; ఉన్కి= ఉండటమనేది; నీకున్= నీకు (నీ వంటి వాడికి); తగునె?= అర్హమా? - సమంజసమా?

తాత్పర్యం: తనయా! లెక్కపెట్టుతూ ఉంటే వెళ్ళిపోతూనే ఉంటాయి సంవత్సరాలు. ఇట్లా క్రమక్రమంగా ఆయుర్దాయం తరిగిపోయి, చివరికి హంస ఎగిరిపోతుంది. ఇది తెలిసి నీవంటివాడు ఏమరుపాటుతో నిద్రపోతూ ఉండటం తగునా? చెప్పుము. లేచి పరుగెత్తవద్దా?

విశేషం: దీని మూలశ్లోకం ఇట్లా ఉన్నది. **"గణ్యమానేషు వర్షేషు క్షీయమాణే తథాయుషి జీవితే శిష్యమాణే చ కిముత్థాయ న ధావసి?"** (12-309-8). 'గణ్యమానేషు' అనే పదానికి అనువాదంగా ఎన్నికొనుచుండన్ అన్నాడు తిక్కన. ఎన్నటం, ఎంచటం అనేవి లెక్కపెట్టటం అనే అర్థంలో నెల్లూరు మాండలికాలట.

క. విను మాంసశోణిత వివ । ర్ధనమగు నైహికమునందుఁ దత్పరులు పరం
బని యొకటి కలిమి దలఁపరు । గొనరు బుధులమాట నాస్తికులు వినయనిధీ! 225

ప్రతిపదార్థం: వినయనిధీ!= వినయానికి నిధీ!; విను; మాంస= మాంసంతోనూ; శోణిత= రక్తంతోనూ; వివర్ధనము+అగు= వృద్ధిపొందేటువంటి; ఐహికమునందున్= ఈ శరీరంపట్లా, ఈ జన్మపట్లా; తత్పరులు= సంసక్తులైనవారు; పరంబు+అని= పరము అంటూ; ఒకటి; కలిమి= ఉండటాన్ని; తలఁపరు= అసలు ఆలోచించరు; నాస్తికులు= పరము లేదు అనే ఈ నాస్తికులు; బుధుల= పండితులయొక్క; మాట= ఉపదేశాన్ని; కొనరు= స్వీకరించరు.

తాత్పర్యం: ఓ వినయశీలీ! ఇహలోకం అంతా మాంసశోణితాలతో వృద్ధి పొందుతూ ఉంటుంది. దానిలో సంసక్తులైనవారు పరలోకం అంటూ ఒకటి ఉన్నది - అనే విషయాన్ని గ్రహించరు (నాస్తికులు). వీళ్ళు పెద్దల మాట చెవిని పెట్టరు.

తే. బుద్ధిమంతుల తెరువునఁ బోక యుత్ప । థప్రవర్తుల నడచు పథంబునందుఁ
జనుట విను మప్పటికిఁ జూడఁ దనకుఁ జాల । నించియుండు నాపద యొనరించుఁ బిదప. 226

ప్రతిపదార్థం: వినుము; బుద్ధిమంతుల= బుద్ధిమంతులయొక్క; తెరువునన్= మార్గంలో; పోక= నడవకుండా; ఉత్పథవర్తులు+అ= దుష్టులు మాత్రమే; నడచు= ప్రయాణించే; పథంబునందున్= మార్గంలో; చనుట= నడవటం; అప్పటికిన్ చూడన్= అప్పటికి చూస్తే; తనకున్= తనకు; చాలన్= బాగా; ఇంచియుండున్= నచ్చి కనపడుతుంది - ఆనందదాయకంగా ఉంటుంది; పిదపన్= తరువాత; ఆపద+ఒనరించున్= ఆపద కలిగిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: బుద్ధిమంతుల మార్గంలో పోకుండా దుష్టులమార్గంలో నడిస్తే అది అప్పటికి బాగానే ఉంటుంది. తృప్తిగానూ, ఆనందంగానూ ఉంటుంది. కానీ, ఆలోచించి చూడగా - అది చిట్టచివరకు ఆపద తెచ్చిపెట్టుతుంది.

చ. తన తన ధర్మమున్ నడపి దానన సంతసమంది శాంత భా
వనరతినుండు వారిఁ గని, వారల చెప్పెడు ధర్మవృత్తి ని
చ్చెనయుఁగ నూఁది సత్పదముఁ జెందుట కెక్కుము, పొత్తినూలి ప్రు
వ్వునెనయుఁగాకు, బంధకుఁడవుం దన కజ్ఞుఁడు దాన యెమ్మెయిన్. 227

ప్రతిపదార్థం: తన తన ధర్మమున్= తమకు విధ్యుక్తమైన ధర్మాన్ని; నడపి= ఆచరించి; దానన్+అ= దానితోనే; సంతసము+అంది= ఆనందించి; శాంతభావన రతిన్= ప్రశాంతమైన భావనపట్ల ప్రేమతో; ఉండువారిన్= జీవిస్తున్నవారిని; కని= దర్శించి; వారల= వారియొక్క; చెప్పెడు= ఉపదేశించేటువంటి; ధర్మవృత్తి= ధర్మప్రవృత్తి; నిచ్చెనయుఁగన్+ఊఁది= నిచ్చెనగా ఆలంబనం చేసికొని; సత్పదమున్= సత్ స్థానాన్ని; చెందుటకున్= అందుకోవటానికి; ఎక్కుము; పొత్తినూలిప్రువ్వు+ఎనయున్+కాకు= సాలీడుకి సాటి కాకుము (ప్రువ్వు= పురుగు, ఎన= సాటి); అజ్ఞుఁడు= మూర్ఖుడు; ఏ+మెయిన్= ఎలాగయినా; తనకున్= తనకు; తాను+అ= తానే; బంధకుఁడు+అవున్= బంధనం కల్పించుకొనేవాడు అవుతాడు.

తాత్పర్యం: ధర్మాచరణంతో ఆనందిస్తూ శాంతచిత్తులై జీవితం గడిపేవారిని దర్శించుము. వారి ధర్మోపదేశాలు నిచ్చెనగా సత్పదం అందుకొమ్ము. సాలీడువలె నీకు నీవే బంధనాలు కల్పించుకొనవద్దు. అది అజ్ఞుడి లక్షణం.

విశేషం: అలం: ఉపమ. శాంతభావ నిరతినుండు వారిఁ గని - అనే పాఠాంతరంలో అన్వయసౌలభ్యం ఉన్నది.

తే. అస్థిరేంద్రియ సలిలమయంబుఁ గామ । రోషదారుణ గ్రాహ ప్రదూషితంబు
నైన సంసారసాగర మతులధైర్య । పోతపాత్రిక నిస్తరింపుము కుమార! 228

ప్రతిపదార్థం: కుమార!= పుత్రకా!; అస్థిర= చంచలమైన; ఇంద్రియ= ఇంద్రియాలు అనేటటువంటి; సలిలమయంబున్= నీటితో నిండినదీ; కామ= కామమూ; రోష= క్రోధమూ అనేటటువంటి; దారుణ= భీషణమైన; గ్రాహ= మొసళ్లతో; ప్రదూషితంబున్= నింద్యమైనదీ; ఐన= అయినటువంటి; సంసారసాగరమున్= సంసారము అనే సముద్రాన్ని; అతుల= సాటిలేని; ధైర్య= ధీరత్వం అనే; పోతపాత్రికన్= ఈతకాయతో; నిస్తరింపుము= పూర్తిగా తరించు - దాటు.

తాత్పర్యం: కుమారా! ఈ సంసారం ఒక సముద్రం. చంచలమైన ఇంద్రియాలే నీళ్ళు. అరిషడ్వర్గమే మొసళ్ళు. దీనిని దాటటానికి ధైర్యం ఒక్కటే తెప్ప. దానితో తరించవయ్యా!

విశేషం: అలం: ఉపమ. దీనికి మూలశ్లోకం ఇట్లా ఉన్నది: **"కామం క్రోధం చ మృత్యుం చ పంచేంద్రియజలాం నదీమ్ । నావం ధృతిమయీం కృత్వా జన్మదుర్గాణి సంతర ॥"** (12-309-16). పోతము అంటే నావ, తెప్ప, దోనె ఇట్లాంటి అర్థాలు ఉన్నాయి. ఇవన్నీ నీటిని దాటటానికి ఉపయోగించే సాధనాలే. ఈతకొట్టే వ్యక్తి సులువుగా ఎక్కువదూరం ఈదటానికని సొరకాయ కానీ కుండగానీ బిందెగానీ గుండెలకింద అదుముకుంటాడు. ఆ పాత్రను 'ఈతకాయ' అంటారు. ఈదటానికి ఉపయోగించే కాయ. పాండురంగమాహాత్మ్యంలో (ద్వితీయాశ్వాసం) దశావతార వర్ణన చేస్తూ కూర్మావతారాన్ని 'ఈతకాయరూపై పృథుకర్పరంబనర... (2.57)' అన్నాడు తెనాలి రామకృష్ణుడు. పోతపాత్రిక అంటే పోతంవలె - తెప్పవలె - ఉపయోగించే చిన్నపాత్ర (పాత్రిక) అని తాత్పర్యార్థం. అలాగే సంసారసాగరాన్ని ఈదటానికి కూడా గుండె ధైర్యంకలిగి ఉండాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కామాదితృప్తుఁడై నరుఁ । డేమఱియుండంగ గొఱియనెత్తెడు పులి యు
ద్దామత మృత్యువు గొని చను । నామూఢుని యట్లుగాకు మతుల వివేకా! 229

ప్రతిపదార్థం: అతులవివేకా!= సాటిలేని తెలివికలవాడా!; కామ+ఆది= కామము మొదలైన సుఖాలలో; తృప్తుఁడై= తృప్తిపొందినవాడై; నరుఁడు= జీవుడు; ఏమఱియుండఁగన్= ఏమరుపాటుతో ఉంటే; గొఱియన్+ఎత్తెడు= గొఱ్ఱెను వేసుకుపోయే; పులి= పులియొక్క; ఉద్దామతన్= ఔద్ధత్యంతో; మృత్యువు; కొని చనున్= తన్నుకుపోతుంది; ఆ మూఢుని+అట్లు= అటువంటి మూర్ఖునిలాగా; కాకుము= కావద్దు.

తాత్పర్యం: నాయనా! నీకు గొప్ప వివేకం ఉన్నది. గ్రహించగలవు. అందుకే చెప్పుతున్నాను వినుము. కామాది సౌఖ్యాలతో తృప్తుడై జీవుడు ఏమరితే గొఱ్ఱెను ఎత్తుకుపోయే పులివలె మృత్యువు తన్నుకొనిపోతుంది. నీవు మాత్రం అట్లాంటి మూఢుడివి కావద్దు.

తే. బ్రాహ్మణత్వంబు గడు దుర్లభంబు; దాని । నెట్టకేలకుఁ గని కడయెయ్యఁ జేయ
వలదె తపము దమంబు నిశ్చలవివేక । సంపదయు నూఁది నరుఁడు దుస్సంగ ముడిగి? 230

ప్రతిపదార్థం: బ్రాహ్మణత్వంబు= బ్రహ్మపరాయణుడుగా ఉండటమనేది; కడున్= మిక్కిలి; దుర్లభంబు= దుర్లభం; దానిన్= ఆ బ్రాహ్మణత్వాన్ని; ఎట్టకేలకున్= ఎట్లాగో ఎన్నిజన్మలకో; కని= పొంది(న); నరుఁడు= జీవుడు; దుస్సంగము+ఉడిగి= చెడు సాంగత్యాన్ని విడిచిపెట్టి; తపమున్= తపస్సునూ; దమంబున్= ఇంద్రియనిగ్రహాన్నీ; నిశ్చల వివేక సంపదయున్+ఊఁది= స్థిరమైన జ్ఞానసంపత్తినీ ఆసరా చేసికొని (ఆ బాహ్మణత్వాన్ని); కడఎయ్యన్+చేయన్+వలదె?= ఈ జన్మ ముగిసేంతవరకు ఆచరించవద్దా?

తాత్పర్యం: నాయనా! బ్రాహ్మణత్వమనేది బహుజన్మదుర్లభం. ఎట్టకేలకు దానిని పొందిన నీవంటివాడు ఏం చేయాలి? దుస్సాంగత్యాలు విడిచిపెట్టి, తపస్సునూ, ఇంద్రియనిగ్రహాన్నీ, స్థిరమైన జ్ఞానసంపత్తినీ ఊతగా తీసికొని ఈ జన్మ ముగిసేంతవరకు ఆచరించవద్దా?

క. విను విప్రశరీరము సుఖ । మునకే? బహునియమదుఃఖముల నిహమునఁ జెం
దను నిత్యసౌఖ్యముం బర । మునఁ బొందను బుట్టెఁ గాక బోధప్రవణా! 231

ప్రతిపదార్థం: బోధప్రవణా!= జ్ఞానం పట్ల ఆసక్తి కలవాడా!; విను; విప్రశరీరము= బ్రాహ్మణజన్మ అనేది; సుఖమునకే?= సుఖాలు అనుభవించటానికా?; బహునియమ= అనేక నియమాలవలన కలిగే; దుఃఖములన్= క్లేశాలను; ఇహమునన్= ఈ లోకంలో; చెందనున్= అనుభవించటానికీ; పరమునన్= పరలోకంలో; నిత్యసౌఖ్యమున్= శాశ్వతమైన సౌఖ్యాన్ని; పొందనున్= అనుభవించటానికీ; పుట్టెన్+కాక!= పుట్టిందే తప్ప!

తాత్పర్యం: అబ్బాయీ! నీకు జ్ఞానంమీద శ్రద్ధ ఉన్నది. ఆలకించుము. బ్రాహ్మణజన్మ అనేది ఇహలోకంలో నియమనిష్ఠలవలన కలిగే దుఃఖాన్ని అనుభవించటానికీ, పరలోకంలో శాశ్వతమైన సౌఖ్యాన్ని చవిచూడటానికీ లభిస్తుందే తప్ప ఇహంలో సుఖపడటానికి కాదురా నాయనా!

క. బలితపుటురిఁ గామంబున । నిలుచుట యా రజ్జుఁద్రెవ్వ నీలిగి సుమతుల్
వెలువడి చని సుఖు లగుదు ర । వ్వల నెఱుఁగరు పడుదు రంద వత్స! దురాత్ముల్. 232

ప్రతిపదార్థం: వత్స!= బిడ్డా!; కామంబునన్= కామసౌఖ్యంలో; నిలుచుట= ఉండటం అనేది; బలితపు+ట్+ఉరి= దృఢమైన ఉరి; సుమతుల్= బుద్ధిమంతులు; ఆ రజ్జున్= ఆ ఉరిత్రాడును; త్రెవ్వన్+నీలిగి= తెగిపోయేటట్టు లాగి; వెలువడి చని= బయటకు వచ్చి; సుఖులు+అగుదురు= సుఖవంతులు అవుతారు; దురాత్ముల్= దుర్బుద్ధులు; ఆ+వలను= ఆ ఉపాయాన్ని; ఎఱుఁగరు= గుర్తించలేరు; అందున్+అ= దానిలోనే; పడుదురు= పడిపోతూ ఉంటారు.

తాత్పర్యం: నాయనా! కామసుఖాలు అనుభవించటమంటే మనకు మనం బలమైన ఉరిత్రాడు బిగించుకొనటం. బుద్ధిమంతులు ఎవ్వరూ అట్లా చెయ్యరు. ఆ ఉరిత్రాడును తెగద్రెంచుకొని బయటపడతారు. నిత్యమూ - శాశ్వతమూ - సత్యమూ అయిన సుఖాలను అనుభవిస్తారు. అజ్ఞానులు మాత్రం ఆ వలను గుర్తించలేరు. అందులోనే పడి అట్లాగే కొట్టుకొంటూ ఉంటారు.

తే. **తాను దెగునేని బాంధవదారపుత్త్ర । మిత్త్రు లను నజ్జనంబు లేమిటికి? విగత**
చింతుఁడై గుహసొచ్చి యశ్రాంతబుద్ధిఁ । దడవి కానంగ వలవదె తన్నుఁ దాన? 233

ప్రతిపదార్థం: తాను= నరుడు తాను; తెగున్+ఏని= మరణించినట్లయితే; బాంధవ= బంధువులూ; దార= భార్య; పుత్త్ర= సంతానం; మిత్త్రులు= స్నేహితులూ; అను= అనేటువంటి; ఆ+జనంబులు= ఆ మనుష్యులంతా; ఏమిటికిన్?= ఎందుకు?; విగతచింతుఁడు+ఐ= చింత తొలగినవాడై; గుహ+చొచ్చి= ఏ కొండగుహలోకో ప్రవేశించి; అశ్రాంత= అలిసిపోని; బుద్ధిన్= బుద్ధితో; తడవి= అన్వేషించి; తన్నున్= తనను; తాను+అ= తానే; కానంగన్+వలవదె?= దర్శించవద్దా?

తాత్పర్యం: నరుడు తాను మృతి చెందాక బంధుమిత్ర భార్యాపుత్ర బృందం ఉండీ ఏమి లాభం? ఏమి ప్రయోజనం? కాబట్టి జ్ఞాని చింతాసక్తుడు కాకుండా, ఏకాంతంగా ఏ కొండగుహలోనికో వెళ్ళి (అంతర్దర్శనం) మేల్కొన్న బుద్ధితో అన్వేషించి తనను తాను తెలిసికొనాలి. ఆత్మసాక్షాత్కారం పొందాలి.

తే. **జరయు మరణంబు మర్త్యుని జన్మమాది । గాఁగ వెనువెంటఁ దగులు నగ్గంబు వేచి**
యెల్లి సేసెద ననక మే లిపుడ చేయు । తనయ! వార్చునె మృత్యువు జనుల పనులు! 234

ప్రతిపదార్థం: తనయ!= పుత్రుడా!; జరయున్= ముసలితనమూ; మరణంబున్= మృత్యువూ; మర్త్యునిన్= మానవుడిని; జన్మము+ఆది+కాఁగన్= పుట్టుక మొదలుగా; వెనువెంటన్= వెంటబడినే; తగులున్= అనుసరించి ఉంటాయి; అగ్గంబు= తగిన సమయం; వేచి= వచ్చేదాకా ఆగి; ఎల్లి= రేపు; చేసెదన్= చేస్తాను; అనక= అనకుండా; మేలు= మంచిని (మంచి పనులను); ఇపుడు+అ= ఈ క్షణంలోనే; చేయు(ము); మృత్యువు= మరణమనేది; జనుల= ప్రజల; పనులు= కార్యాలు; వార్చునె?= ప్రతీక్షిస్తూ ఆగుతుందా?

తాత్పర్యం: జరామృత్యువులు మనిషిని పుట్టుకనాటినుండి వెన్నంటే ఉంటాయి. కాబట్టి 'అనుకూల ముహూర్తం వరకూ వేచి వేచి ఎప్పుడో మంచి పనులు' చేస్తాను అంటే కుదరదు. చేద్దామనుకొన్న మంచిని వెంటనే ఆ క్షణంలోనే చేసివేయ్యాలి. నీవు చేసే మంచిపనులు పూర్తి అయ్యేవరకూ నిరీక్షిద్దామని మృత్యువు అనుకోదు సుమా!

ఆ. **ఆశ్మశాన గమను లంతియ చుట్టంబు । లగ్నిఁ గలిపి మరలు నఖిలమైన**
జ్ఞాతిజనము దీనిఁ జర్చింప కందఱి । యందు మమతఁ బెనుచు నజ్ఞుఁ డనఘ! 235

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; చుట్టంబులు= బంధువులు; ఆశ్మశాన గమనులు= శ్మశానం వరకూ తోడు వచ్చేవారు; అంతియ= అంతే; అగ్నిన్= అగ్నిలో; కలిపి= భస్మంచేసేసి; అఖిలమైన= సమస్తమైన; జ్ఞాతిజనమున్= బంధువర్గమూ; మరలున్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వెనక్కి మరలి వెళ్ళిపోతారు; దీనిన్= ఈ సత్యాన్ని; చర్చింపక= ఆలోచించకుండా; అజ్ఞుఁడు= మూర్ఖుడు; అందఱియందున్= అందరిపట్లా; మమతన్= అనురాగాన్ని; పెనుచున్= పెంచుకుంటాడు.

తాత్పర్యం: నాయనా! బంధువర్గం ఎంత రక్తసంబంధీకులైనా చచ్చినవాడితో తామూ చావరు. కాటిదాకా సాగనంపి, కళేబరాన్ని అగ్నికి ఆహుతి చేసి, తిరిగి ఎవరి ఇళ్ళకు వాళ్ళు వచ్చేస్తారు. అంతే! ఎవరి లోకయాత్ర వారు హాయిగా సాగిస్తారు. దీనిని గుర్తించకుండా అందరిపట్లా అనురాగం పెంచుకొనటం, మమకారం పెంచుకొనటం - ఇది అజ్ఞుడి లక్షణం.

క. లోకము కాలముచే ని । ట్లాకుల పడుచునికి గాంచి యధికధృతిని ధ
ర్మైకాంతతా నిరూఢిం । గైకొని త్రోవంగవలదె కాలవికృతులన్? 236

ప్రతిపదార్థం: లోకము= ప్రపంచం (ప్రాణికోటి); కాలముచేన్= కాలంచేత; ఇట్లు= ఈ రకంగా; ఆకులపడుచున్+ఉనికి= వ్యాకులం చెందుతూ ఉండటాన్ని; కాంచి= చూచి(గ్రహించి); అధికధృతిని= అత్యంత ధైర్యంతో; ధర్మ+ఏకాంతతా+నిరూఢిన్= ధర్మాచరణం ఒక్కటే శాశ్వతం అనే నిశ్చయాన్ని; కైకొని= స్వీకరించి; కాలవికృతులన్= కాలం తెచ్చే వికారాలను; త్రోవంగన్+వలదె?= పారద్రోలవద్దా?

తాత్పర్యం: కాలం ఇన్ని ఇబ్బందులపాలు చేస్తోంది లోకాన్ని. అది గమనించి, అత్యంత ధైర్యంతో ధర్మాచరణం ఒక్కటే ఏకాంతం అనే నిర్ణయం తీసికొని కాలవికారాలను జయించగలగాలి.

క. మానుషము దుర్లభము, సో । పానంబగు నది విముక్తి పదము గనుటకున్,
దానిఁ గని తొంటి చందము । రానీక, సముద్యమమునఁ బ్రాకఁగ వలదే? 237

ప్రతిపదార్థం: మానుషము= మానవజన్మ అనేది; దుర్లభము= దుర్లభం; ముక్తిపదము= మోక్షపదవి; కనుటకున్= పొందటానికి; అది= ఆ మానవజన్మ; సోపానంబు+అగున్= ఒక మెట్టు అవుతుంది; దానిన్= ఆ విషయాన్ని; కని= గ్రహించి; తొంటిచందము= పూర్వపు జన్మల పద్ధతి; రానీక= దరికి రానివ్వకుండా; సముద్యమమునన్= గొప్ప ప్రయత్నంతో; ప్రాఁకఁగన్+వలదే?= పై మెట్టులకు ప్రాకవద్దా?

తాత్పర్యం: మానవజన్మ బహు దుర్లభం. దాన్ని ఒక సోపానంగా చేసికొని నిచ్చెన ఎక్కి, మోక్షపదం అందుకొనాలి. పూర్వజన్మల లక్షణాలు దరికి రానివ్వకూడదు.

విశేషం: అలం: రూపకం.

క. అనఘా! తపోవనమునన । జననంబును మరణదశయు సంప్రాప్తము ల
య్యెనయేని వాఁడు ముక్తుఁడె । మనంబు బహుకామవికృతి మగ్నంబైనన్. 238

ప్రతిపదార్థం: అనఘా!= పావనుడా!; జననంబునున్= పుట్టుకా; మరణదశయున్= మరణమూ; తపోవనమునన్+అ= ఆశ్రమంలోనే; సంప్రాప్తములు+అయ్యెను+అ+ఏనిన్= ప్రాప్తించినట్టయితే; మనంబు= వాడి హృదయం; బహు= పలురకాలైన; కామవికృతి= కామ వికారాలలో; మగ్నంబు+ఐనన్= మునిగిపోయినచో; వాఁడు= ఆ వ్యక్తి; ముక్తుఁడె?= ముక్తుడు అగునా?

తాత్పర్యం: పావనుడా! జననమూ మరణమూ అనేవి తపోవనంలోనే జరిగినప్పటికీ జీవించి ఉన్నకాలంలో వాడి మనస్సు ఎన్నో కామవికారాలకు లోనైతే వాడు ముక్తుడు కాగలడా? (కాలేడని భావం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **భోగములు సంపరిత్యక్తములుగఁ జేసి । కేవలాంగుఁడై నిర్మలభావయుక్తిఁ**
దపము గృహముననేనియుఁ దత్పరతఁ జ । రించి సంసారజలధిఁ దరించు నరుఁడు. **239**

ప్రతిపదార్థం: భోగములు= భోగాలు; సంపరిత్యక్తములుగన్+చేసి= పూర్తిగా విడిచిపెట్టి; కేవల+అంగుఁడై= శరీరమాత్రుడుగా మిగిలి; నిర్మల= మలినరహితమైన; భావయుక్తిన్= హృదయస్పందనలతో; నరుఁడు= మానవుడు; గృహమునన్+ఏనియున్= ఇంటిలోనే అయినా; తత్పరతన్= తాదాత్మ్యంతో; తపము= తపస్సు; చరించి= ఆచరించి; సంసారజలధిన్= సంసారము అనే సముద్రాన్ని; తరించున్= దాటుతాడు.

తాత్పర్యం: భోగాలను విడిచిపెట్టి, నిస్సంగుడై, నిర్మలాంతరంగుడై ఇంటిలోనైనా తాదాత్మ్యంతో తపస్సు చేసికొనే నరుడు సంసారసముద్రాన్ని తేలికగా తరిస్తాడు.

విశేషం: అలం: రూపకం.

క. **విను దారపుత్రమిత్రులు । సనిరి కొడుక! మున్ను చనిన జన్మంబుల, నీ**
కును వారు, వారలకు నీ । వును మఱుపుట్టువులఁ గొఱయవుట గల్గెనొకో? **240**

ప్రతిపదార్థం: కొడుక!= పుత్రుడా!; విను; మున్ను= ఇంతకుముందు; చనిన= కడచిన; జన్మంబులన్= పుట్టుకలలో; దార= భార్యలూ; పుత్ర= సంతానం; మిత్రులు= స్నేహితులూ - ఎంతోమంది; చనిరి= గతించారు; నీకును= నీకు; వారున్= వారూ; వారలకున్= వారికి; నీవునున్= నీవూ; మఱుపుట్టువులన్= అనంతర జన్మలలో; కొఱ+అవుట= శేషంగా కొనసాగటం; కల్గెనొకో?= జరిగిందా?

తాత్పర్యం: నాయనా! ఇప్పటికి నీవు ఎన్ని జన్మలు ఎత్తి ఉంటావు? ప్రతిజన్మలోనూ భార్యాపుత్ర మిత్రులు ఉంటూనే ఉన్నారు కదా! వారంతా గతించిపోయారు. ఒక జన్మలో వారు మరొక జన్మలోనికి అదే బంధుత్వంతో శేషంగా కొనసాగటమనేది నీకుగానీ వారికిగానీ జరిగిందంటావా? నీ అంతట నీవూ - వారంత వారుగా జన్మపరంపరలలో యాత్ర సాగిస్తున్నారు. ఇది తెలిసికొనరా తండ్రీ!

ఆ. **ఏన కలను నాకు, నెవ్వరివానిఁగా । నాత్మఁ దలఁతు?, నన్ను నట్టివాని**
నెందుఁగానఁ, గాన యెవ్వరివాఁడను । గా ననంగవలదె మాననీయ! **241**

ప్రతిపదార్థం: మాననీయ!= గౌరవింపదగినవాడా!; ఏను+అ= నేనే; నాకున్= నాకు; కలను= ఉన్నాను; ఎవ్వరివానిన్+కాన్= ఎవ్వరివాడనుగా; ఆత్మన్= అంతరంగంలో; తలఁతున్= (నన్ను నేను) భావిస్తాను?; నన్నున్+అట్టివానిన్= నావంటి వాడిని; ఎందున్= ఎక్కడా; కానన్= చూడను; కాన= కాబట్టి; ఎవ్వరివాఁడనున్+కాను= నేను ఎవరివాడినీ కానే కాను; అనంగన్+వలదె?= అనుకోవద్దా?

తాత్పర్యం: మాన్యుడా! నాకు నేనే ఉన్నాను. మరెవ్వరూ లేరు. నేను ఎవరివాడను అని అనుకోను? నావంటివాడు మరొకడు ఎక్కడా లేడు, ఉండడు. అందుచేత నేనే ఎవ్వరివాడనూ కాను. జ్ఞాని అయినవాడు ఇట్లా భావించాలి నాయనా!

క. **దారాపేక్షం గష్ట । ప్రారంభముఁ బూని యిహమునందుఁ బరమునన్**
వారని సంక్లేశంబులఁ । గూరు నరుఁడు దానిఁ జేయ గొనకొండ్రె బుధుల్? **242**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నరుఁడు= పురుషుడు; దార+అపేక్షన్= భార్యావ్యామోహంతో; కష్టప్రారంభమున్= కష్టాల ఆరంభాన్ని; పూని= పొంది; ఇహమునందున్= ఈ లోకంలోనూ; పరమునన్= పరలోకంలోనూ; వారని= ఎడతెగని; సంక్లేశంబులన్= క్లేశాలలో; కూరున్= కూరుకుపోతాడు; దానిన్= అటువంటి దారాపేక్షను; చేయన్= పెట్టుకోవటానికి; బుధుల్= జ్ఞానులు; గొనకొంద్రె?= పూనుకొంటారా?

తాత్పర్యం: భార్యపట్ల వ్యామోహం (అపేక్ష) అనేది కష్టాలకు ప్రారంభం. ఇహంలోనూ పరంలోనూ అది అంతులేని క్లేశాలను కల్పిస్తుంది. అందుచేత తెలివిగలవారెవ్వరూ దారాపేక్షకు పూనుకోరు, కష్టాలలో కూరుకోరు.

చ. **ధన మది యేల భోగమును దానము లేదగునేని? శత్రు మ**
ర్దన మొనరింపఁడేని బలదర్పము లేల? సధర్మవృత్తికిన్
గొనకొనఁడేని విన్కి మునికుంజర! యేల జితేంద్రియుండు గాఁ
డనఁ జనునేని నాత్మవిధ మారయు నా క్రమమేల చెప్పుమా!' **243**

ప్రతిపదార్థం: మునికుంజర?= మునిశ్రేష్ఠా!; భోగమును= అనుభవించటమూ; దానమున్= త్యాగం చెయ్యటమూ అనేవి; లేదు+అగున్+ఏని= లేకపోయినది అయినట్లయితే; ధనము+అది= ఆ ధనం; ఏల?= ఎందుకు?; శత్రుమర్దనము= శత్రువులను మర్దించటం; ఒనరింపఁడు+ఏనిన్= చేయనివాడు అయినట్లయితే; బల దర్పములు= బలమూ పౌరుషమూ అనేవి; ఏల?= ఎందుకు?; సధర్మవృత్తికిన్= ధర్మసహితమైన ప్రవర్తనకు; గొనకొనఁడు+ఏనిన్= పూనుకోనివాడు అయినట్లయితే; విన్కి= బహుశ్రుతత్వం (వేదాలూ, శాస్త్రాలూ గురుముఖతః వినటం); ఏల?= ఎందుకు?; జిత+ఇంద్రియుండు+కాఁడు= ఇంద్రియనిగ్రహం కలవాడు కాదు; అనన్= అనటానికి; చనున్+ఏని= వీలు కలిగినట్లయితే; ఆత్మవిధము= ఆత్మతత్త్వం; ఆరయు= తెలిసికొనే; ఆ+క్రమము= ఆ వరుస అంతా; ఏల?= ఎందుకు?; చెప్పుమా!= చెప్పు చూద్దాం!

తాత్పర్యం: మునివరా! శుకా! భోగానికీ, త్యాగానికీ కాని ధనం ఎందుకు? శత్రు సంహారం చేయలేని బలదర్పాలు ఎందుకు? ధర్మాచరణానికి పూనుకోని జ్ఞానం ఎందుకు? జితేంద్రియుడు కాలేనప్పుడు ఆత్మతత్త్వం గురించి శ్రమపడి తెలిసికొని ఏమి లాభం - చెప్పుము!'

క. **అని యి ట్లుపదేశించిన । విని శుకుఁడు విముక్తిమార్గవిదుఁడై చనియెన్**
జనకుఁ దొఱఁగి నిశ్చలదీ । పనిభాత్ముం డగుచుఁ గురునృపాలవరేణ్యా!' **244**

ప్రతిపదార్థం: కురునృపాల వరేణ్యా!= కురురాజోత్తమా! ధర్మరాజా!; అని; ఇట్లు= ఈ ప్రకారంగా; ఉపదేశించినన్= వ్యాసుడు ఉపదేశించేసరికి; విని= ఆలకించి; శుకుఁడు; విముక్తిమార్గ విదుఁడై= మోక్షమార్గం తెలిసికొన్నవాడై; జనకున్= తండ్రిని; తొఱఁగి= విడిచిపెట్టి; నిశ్చల= చలించని; దీప= దీపంతో; నిభ= సాటివచ్చే; ఆత్ముఁడు+అగుచున్= ఆత్మ కలవాడు అవుతూ, నిశ్చలదీపంలా; చనియెన్= వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: ధర్మరాజా! వ్యాసుడు ఇట్లా ఉపదేశించేసరికి శుకుడికి ముక్తిమార్గం తెలిసిపోయింది. ఆత్మ నివాత నిశ్చలదీపంవలె ప్రకాశించింది. తండ్రిని విడిచిపెట్టి వెళ్ళిపోయాడు'.

విశేషం: అలం: ఉపమ.

క. **అనిన విని దేవతటినీ । తనయునితోఁ బాండురాజ తనయాగ్రజుఁ డి**
ట్లనుఁ బ్రీతియు వినయము నా । ననమునఁ దళుకొత్త నరతనయవంశవరా! **245**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నర= అర్జునుడియొక్క; తనయ= కుమారుడైన అభిమన్యుడి; వంశ= వంశంలో; వరా!= శ్రేష్ఠమైనవాడా ఓ జనమేజయా!; అనినన్= అని భీష్ముడు చెప్పగా; విని= ఆలకించి; పాండురాజతనయ+అగ్రజుఁడు= పాండురాజు కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజు; దేవతటినీ+తనయుతోన్= గంగాపుత్రుడైన భీష్ముడితో; ప్రీతియున్= ప్రేమా; వినయమున్= వినయమూ; ఆననమునన్= ముఖంలో; తళుకొత్తన్= వికసించగా; ఇట్లు; అనున్= అన్నాడు.

తాత్పర్యం: జనమేజయా! ఇట్లా గాంగేయుడు చెప్పినది అంతా శ్రద్ధగా ఆలకించాడు ధర్మరాజు. అతడి ముఖంలో ఒక తృప్తి, ఒక వినయం వికసించాయి. జనమేజయా! ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అంటున్నాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు శుకుని జన్మప్రకారంబు సెప్పుట (సం. 12-310-1)

వ. 'కృష్ణద్వైపాయన పుత్త్రుండను మాత్రమ కాని శుకుని జన్మంబు తెఱంగును నతని తల్లిని నతండు బాల్యంబున మహానుభావుం డగుటకుం గతంబును నతండు సిద్ధిఁబొందిన భంగియు నెఱుంగ నవియెల్ల నెఱింగింపుము.' 246

ప్రతిపదార్థం: కృష్ణద్వైపాయన పుత్రుండు= వ్యాసుడి కుమారుడు; అను మాత్రము+అ+కాని= అని మాత్రమే కానీ; శుకుని= శుకునియొక్క; జన్మంబు తెఱంగునున్= జన్మప్రకారమూ; అతని= అతడియొక్క; తల్లిని= తల్లినిగురించీ; అతండు= ఆ శుకుడు; బాల్యంబునన్= పిన్నవయస్సులోనే; మహానుభావుండు= మహాత్ముడు; అగుటకున్= కావటానికి గల; కతంబునున్= కారణమూ; అతండు= ఆయన; సిద్ధి+పొందిన భంగియున్= సిద్ధుడు అయిన విధానమూ; ఎఱుంగన్= ఇవి ఏవీ నేను ఎరుగను; అవి+ఎల్లన్= ఆ విశేషాలన్నీ; ఎఱింగిపుము= దయచేసి తెలియజెప్పుము.

తాత్పర్యం: శుకుడు వ్యాసుడి పుత్రుడనే విషయం తప్పించి, ఆతడు ఎట్లా జన్మించాడు? చిన్నతనంలోనే అంతటి మహానుభావు డెట్లా అయ్యాడు? అతడు సిద్ధు డెట్లా అయ్యాడు - ఈ వివరాలను అన్నింటినీ నే నెరుగను. అవి నాకు తెలుపవలసింది'. (అని ధర్మరాజు భీష్ముడిని అడిగాడు).

సీ. అనవుడు నతఁడిట్టులను నాతనికిఁ గర్ణి । కారవనం బనఁ గలదు మేరు
తటమున నం దద్రితనయయుఁ దానును । పశుపతి లీలమైఁ బ్రమథగణము
గొలువనుండఁ దనూజుఁగోరి వేదవ్యాస । సంయమి దత్ప్రదేశమున యోగ
బలమూర్జితముగఁ దపంబొనరించె యో । గమునకు రాజసూయములు నశ్వ

తే. మేధములును నపరిమితములైనను సరి । గావు సూవె వినుము కౌరవేంద్ర!
తత్తపోవిశిష్టతకు మెచ్చి శివుఁడు ప్ర । త్యక్షమై యభీష్టమడుగు మనిన. 247

ప్రతిపదార్థం: కౌరవేంద్ర!= ధర్మరాజా!; అనవుడున్= అని ధర్మరాజు అడిగేసరికి; అతఁడు= ఆ భీష్ముడు; ఆతనికిన్=ఆ ధర్మరాజుతో; ఇట్టులు= ఈ ప్రకారంగా; అనున్= చెబుతున్నాడు; మేరుతటమునన్= మేరు పర్వతపార్శ్వంలో; కర్ణికార వనము+అనన్= కర్ణికారము అనే పేరుతో ఒక వనం; కలదు= ఉన్నది; అందున్= ఆ వనంలో; పశుపతి= శివుడు; ప్రమథగణము= ప్రమథుల సమూహం; కొలువన్= సేవిస్తుండగా; తానున్= తానూ; అద్రితనయయున్= పార్వతీదేవీ; లీలమైన్= విలాసంగా; ఉండన్= క్రీడిస్తూ ఉన్న కాలంలో; వేదవ్యాస సంయమి= మునీశ్వరుడైన వేదవ్యాసుడు; తనూజున్= ఒక పుత్రుడిని; కోరి= కోరుకుని; తద్+ప్రదేశమునన్= ఆ ప్రదేశంలో; యోగబలము= యోగశక్తి; ఊర్జితముగన్= అతిశయించేటట్టు; తపంబు= తపస్సు; ఒనరించెన్= చేశాడు; వినుము; రాజసూయములున్= రాజసూయ యజ్ఞాలూ; అశ్వమేధములున్= అశ్వమేధాలూ; అపరిమితములైననున్= అసంఖ్యాకంగా చేసినా; యోగమునకున్= యోగమార్గానికి;

సరి+కావు+చూవె!= సాటిరావు సుమా!;

తద్= ఆ వ్యాసుడియొక్క; తపః+విశిష్టతకున్= విశిష్టమైన తపస్సుకు; మెచ్చి= సంబరపడి; శివుఁడు= పశుపతి; ప్రత్యక్షమై= దర్శనం అనుగ్రహించి; అభీష్టమున్= కోరుకొన్నదానిని; అడుగుము= అడుగుమని; అనినన్= అనేసరికి.

తాత్పర్యం: (భీష్ముడు చెప్పుతున్నాడు) 'ధర్మరాజా! మేరుపర్వత సానువులలో కర్ణికారవనం ఉన్నది. అందులో పార్వతీపరమేశ్వరులు ప్రమథుల సేవలు అందుకొంటూ విహరిస్తుంటారు. ఒకప్పుడు వేదవ్యాసుడు ఆ ప్రదేశంలో పుత్రుడిని కోరి తపస్సుకు పూనుకొన్నాడు. ఇక్కడ ఒకమాట చెప్పుతాను వినుము. రాజసూయాలూ, అశ్వమేధాలూ ఎన్నయినా యోగనిష్ఠకు సాటిరావు సుమా! వ్యాసుడి తపస్సుకు శివుడు సంతోషించి ప్రత్యక్షమయ్యాడు. ఏమి కావాలో కోరుకొనుమన్నాడు. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అ మ్మునీశ్వరుండు భక్తి సంభ్రమభరితుం డగుచుం దండప్రణామంబు చేసి. 248

ప్రతిపదార్థం: ఆ+ముని+ఈశ్వరుండు= ఋషీంద్రుడైన ఆ వ్యాసుడు; భక్తి= భక్తితో; సంభ్రమ= భరితుండు+అగుచున్= దండప్రణామంబు= సాష్టాంగనమస్కారం; చేసి= ఆచరించి.

తాత్పర్యం: ఆ వ్యాసుడు ఆనందభరితుడై భక్తితో సాష్టాంగనమస్కారం చేసి.

క. 'జల పవనాంబరవసుధా । నల సమవీర్యుఁడగు పుత్త్రు నా కొసఁగంగా
వలయు' ననుడు నిచ్చితి నని । పలికి చనియె నమ్మహాకృపామూర్తి నృపా! 249

ప్రతిపదార్థం: నృపా!= ధర్మరాజా!; జల= నీటితో; పవన= వాయువుతో; అంబర= ఆకాశంతో; వసుధా= భూమితో; అనల= అగ్నితో; సమ= సమానమైన; వీర్యుఁడు= శక్తికలవాడు; అగు= అయిన; పుత్త్రున్= కుమారుడిని; నాకున్= నాకు; ఒసఁగంగాన్+ వలయున్= ఇమ్ము; అనుడున్= అని అనటంతోనే; ఇచ్చితిన్= ఇచ్చాను; అని; పలికి= చెప్పి; ఆ+మహా కృపామూర్తి= గొప్ప దయా స్వరూపుడైన ఆ శివుడు; చనియెన్= వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: 'ధర్మజా! 'పంచభూతాలతో సమానమైన శక్తియుక్తులు కలిగిన పుత్రుడిని వరప్రసాదంగా అనుగ్రహించుము' అని వ్యాసుడు శివుడిని వేడుకొన్నాడు. 'ఇచ్చాను' అని చెప్పి శివుడు అంతర్ధానం అయ్యాడు. శివుడు గొప్ప దయామయుడు.

వ. ఇట్లు లబ్ధవరుం డగుచు సత్యవతీసుతుం డగ్నికార్యపరుండై యరణి వుచ్చికొని మథింపం దొడంగిన ఘృతాచి యను నప్సరోవనిత లోచనగోచరం బగుటయుఁ దానునుం గామగోచరత్వంబు నొందిన నయ్యిందువదన యమ్ముని తెఱం గెఱింగి వంచనం జిలుకయై యుండె నతండును ధైర్యం బవలంబించి యరణికార్య ప్రవణుండై యుండం బ్రబలుండగు నంగజుని చెయ్ది నప్సరోరూపాతిశయసక్తచిత్తుండైన యా సంయమి శుక్లం బయ్యరణియందుఁ బడియె. నవ్విప్రుండు నిర్విశంకంబగు నంతఃకరణంబుతో నరణిమథనం బొనరించిన. 250

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; లబ్ధవరుండు= పొందినవరం కలవాడు; అగుచున్= అయి (వరం పొందినవాడై); సత్యవతీసుతుండు= సత్యవతి కుమారుడైన ఆ వ్యాసుడు; అగ్నికార్యపరుండు+ఐ= అగ్నికార్యం నిర్వహిద్దామనే పూనికతో; అరణి+ పుచ్చికొని= అరణిని అందుకొని; మథింపన్+తొడంగినన్= మథించటం మొదలు పెట్టేసరికి; ఘృతాచి= ఘృతాచి; అను= అనే పేరుగల; అప్సరస్+వనిత= అప్సరస; లోచనగోచరంబు+అగుటయున్= కన్నుల ఎదుట కనిపించటంతో; తానునున్= ఆ వ్యాసుడు కూడా; కామగోచరత్వంబున్+ఒందినన్= ఇంద్రియాలు కామప్రకోపాన్ని పొందేసరికి; ఆ+ఇందువదన = ఆ చంద్రముఖి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ+ముని+తెఱంగు= ఆ మునీశ్వరుడి పరిస్థితి; ఎఱింగి= గుర్తించి; వంచనన్= వంచనతో; చిలుక+అయి+ఉండెన్= చిలుకగా మారిపోయింది; అతండును= ఆ వ్యాసుడుకూడా; ధైర్యంబు= ధీరత్వాన్ని; అవలంబించి= వహించి; అరణికార్యప్రవణుండు+ఐ= అరణిని మథించే పనిలో నిమగ్నుడై; ఉండన్= ఉండగా; ప్రబలుండు+అగు= మిక్కిలి బలశాలియైన; అంగజుని= మన్మథుడియొక్క; చెయ్దిన్= చేష్టవలన; అప్సరస్+రూప+అతిశయ= ఘృతాచియొక్క సౌందర్యాతిశయం పట్ల; సక్త= లగ్నమైన; చిత్తుండు+ఐన= మనస్సు కలవాడైన; ఆ+సంయమి= ఆ ఋషియొక్క; శుక్లంబు= వీర్యం; ఆ+అరణియందున్= ఆ అరణిలో; పడియెన్= పడింది; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; నిర్విశంకంబు+అగు= ఏ సంశయమూ లేని; అంతఃకరణంబుతోన్= హృదయంతో; అరణిమథనంబు= అరణిని మథించటం; ఒనరించినన్= కొనసాగించేసరికి.

తాత్పర్యం: ధర్మరాజా! వరం పొందిన వ్యాసుడు ఒకరోజున తన ఆశ్రమంలో అగ్నికార్యాలు నిర్వహించటం కొరకని అరణిని మథిస్తున్నాడు (గుండ్రటి చెక్కమీద పుల్లతో మథించి అగ్నిని పుట్టిస్తారు. ఆ చెక్కను అరణి అంటారు). ఆ సమయంలో ఘృతాచి అనే అప్సరస కనిపించింది. మహర్షికి ఆమెను చూసి కామప్రకోపం కలిగింది. దానిని గమనించిన అప్సరస భయపడిందో ఏమో ఎందుకయినా మంచిదని వంచనతో చిలకగా మారిపోయింది. వ్యాసుడు మనస్సు చిక్కబట్టుకొని అరణిని చిలకటం కొనసాగించాడు. కానీ, మన్మథుడు మహాబలశాలి కదా! వ్యాసుడి మనస్సులో అప్సరస రూపమే నిలిచిపోయింది. దాని కారణంగా వీర్యస్ఖలనం అయింది. అది అరణిలో పడింది. అయినా వ్యాసుడు నిర్వికారచిత్తంతో అరణిమథనం కొనసాగించాడు.

తే. **అయ్యరణిఁ బుట్టి జనకసమాకృతియును । భూరి కాంతియు వెలుఁగంగఁ బొలిచె శుకుఁడు**
యాగకాల సుసంభృత హవిరవాప్తి । మహితతేజస్కుఁడగు హుతవహుని మాడ్కి. **251**

ప్రతిపదార్థం: ఆ+అరణిన్= ఆ అరణిలో; పుట్టి= ఉద్భవించి; జనకసమ= తండ్రితో సమానమైన; ఆకృతియును= ఆకారమూ; భూరి= గొప్ప; కాంతియున్= తేజస్సూ; వెలుఁగంగన్= ప్రకాశించగా; శుకుఁడు= వ్యాసపుత్రుడు శుకుడు; యాగకాల= యజ్ఞసమయంలో; సుసంభృత= సమృద్ధిగా సమర్పించబడిన; హవిస్+అవాప్తి= హవిస్సుయొక్క (నెయ్యి) ప్రాప్తితో; మహిత= గొప్ప; తేజస్కుఁడు+అగు= తేజస్వంతుడయ్యే; హుతవహుని+మాడ్కిన్= అగ్నిలాగా; పొలిచెన్= విరాజిల్లాడు.

తాత్పర్యం: ఆ అరణినుంచి ఒక మగపిల్లవాడు జన్మించాడు. అతడే శుకుడు. రూపంలో ముమ్మూర్తులా వ్యాసుడే. యజ్ఞకుండంలో ఆజ్యంపోస్తే అగ్ని ఎట్లా ప్రకాశిస్తుందో శుకుడు గొప్ప తేజస్సుతో. అట్లా వెలిగిపోతున్నాడు.

విశేషం: అలం: ఉపమ.

సీ. **అపుడు మందాకిని సాకారయై వచ్చి । మంగళస్నాన సమన్వితుఁడు గ**
నొనరించె నాకసంబుననుండి పడియెఁ గృ । ష్ణాజినదండంబు లతని యెదుర
దివ్యదుందుభులును దేవాంగనాగాన । ములును వీతెంచె నద్భుతముగాఁగఁ
గుసుమవర్షంబులు గురిసె నింద్రాది దే । వతలు గారవమున వచ్చి రంబి

తే. **కాసమేతుఁడై యేతెంచి కామవైరి । యతని నుపనీతుఁ గావించె నమరనాథుఁ**
డుజ్జ్వలంపుఁ గమండులు వొసఁగె నిచ్చి । రమరు లెన్నండు మాయని యంబరములు. **252**

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో; మందాకిని= గంగానది; సాకారయై= ఆకారం ధరించి; వచ్చి; మంగళస్నానసమన్వితుఁడుగన్= వచ్చి మంగళస్నానంతో కూడుకొన్నవాడిగా శుకుడిని; ఒనరించెన్= చేసింది (మంగళస్నానం చేయించింది); ఆకసంబుననుండి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆకాశంనుంచి; కృష్ణాజినదండంబులు= నల్లని జింకతోలూ, బ్రహ్మచారి ధరించే ఒక దండమూ; అతని+ఎదురన్= అతడి ఎట్టఎదుట; పడియెన్= పడ్డాయి; దివ్యదుందుభులును= దేవతల దుందుభులూ; దేవాంగనా= అమరకాంతల; గానములును= పాటలూ; వీతెంచెన్= వినవచ్చాయి; అద్భుతము+కాఁగన్= ఆశ్చర్యజనకంగా; కుసుమవర్షంబులు= పూలవానలు; కురిసెన్= కురిశాయి; ఇంద్ర+ఆది+దేవతలు= ఇంద్రుడు మొదలైన దేవతలు; గౌరవమునన్= గౌరవసూచకంగా; వచ్చిరి= వచ్చారు; కామవైరి= మన్మథసంహారకుడైన శివుడు; అంబికా సమేతుఁడై= పార్వతితో కూడినవాడై; ఏతెంచి= వచ్చి; అతనిన్= ఆ బాలుడిని; ఉపవీతున్= ఉపనయనం జరిగినవాడిగా; కావించెన్= చేశాడు (పార్వతీ పరమేశ్వరులు వచ్చి అతడికి ఉపనయనం చేసి జందెం వేశారని భావం); అమరనాథుఁడు= దేవనాయకుడు ఇంద్రుడు; ఉజ్జ్వలంపు= ప్రకాశిస్తున్న; కమండలువు= కమండలువును; ఒసఁగెన్= బహూకరించాడు; అమరులు= దేవతలు; ఎన్నండున్= ఎప్పటికీ; మాయని= మాసిపోని; అంబరములు= వస్త్రాలను; ఇచ్చిరి= సమర్పించారు.

తాత్పర్యం: పాండవా! సరిగ్గా అప్పుడే గంగానది స్త్రీరూపంలో వచ్చింది. ఆ బిడ్డకు మంగళస్నానం చేయించింది. ఆకాశంనుండి కృష్ణాజినమూ దండమూ వచ్చి పడ్డాయి. దుందుభులు మ్రోగాయి. దేవతాంగనల గానాలు వినిపించాయి. ఆశ్చర్యజనకంగా పూలవాన కురిసింది. ఇంద్రాది దేవతలు గౌరవంతో వచ్చారు. పార్వతీపరమేశ్వరులు శుకుడికి ఉపనయనం చేశారు. దేవేంద్రుడు తళతళలాడే కమండలం ఇచ్చాడు. దేవతలేమో ఎప్పుడూ మాసిపోని దివ్యమైన వస్త్రాలు బహూకరించారు.

క. మృగపక్షి సమూహము లా। దిగఁ గల్గు చరాచరముల దివ్యప్రభవుం
డగు శుకుని పుట్టొనర్చెం। బ్రగాఢతమ సంప్రమోద భరితంబులుగాన్. 253

ప్రతిపదార్థం: దివ్యప్రభవుండు+అగు= మానవాతీతమైన జన్మకలవాడైన; శుకుని= శుకుడియొక్క; పుట్టు= పుట్టుక; మృగపక్షి సమూహములు= జంతుబృందాలూ పక్షిసమూహాలూ; ఆదిగన్= మొదలుగా; కల్గు= ఉన్న; చరాచరములన్= జంగమస్థావరాలను; ప్రగాఢతమ= మిక్కిలిగాఢమైన; సంప్రమోద= ఆనందంతో; భరితంబులు+కాన్= నిండినవాటిగా; ఒనర్చెన్= చేసింది.

తాత్పర్యం: శుకుడిది దివ్యమైన పుట్టుక. అది మృగపక్షి సమూహాలతో కూడిన సకలచరాచర జగత్తులోనూ ప్రగాఢమైన ఆనందాన్ని నింపివేసింది.

క. జనియించిన మాత్రన య। మ్మునిప కిశోరమును వేదములు వొందెను ద
జ్జనకుని మును పొందిన తెఱఁ। గున, నబ్బాలుఁడు వరించె గురుఁడుగ ధిషణున్. 254

ప్రతిపదార్థం: జనియించిన మాత్రన్+అ= పుట్టటంతోనే; ఆ+మునిప+కిశోరమును= మునీశ్వరుడి బిడ్డ అయిన ఆ శుకుడిని; వేదములు= వేదాలు; మునుపు= పూర్వం; తద్+జనకున్= అతడితండ్రి వ్యాసుడిని; పొందిన తెఱఁగునన్= పొందినట్లే; పొందెను= వరించాయి; ఆ+బాలుఁడు= ఆ కుమారుడు; ధిషణున్= బృహస్పతిని; గురుఁడుగన్= తనకు గురువుగా; వరించెన్= కోరుకొన్నాడు;

తాత్పర్యం: మునుపు వ్యాసుడు పుట్టగానే వేదాలు అతడిని పొందాయి. ఇప్పుడూ అట్లాగే శుకుడిని వచ్చి చేరాయి. శుకుడేమో బృహస్పతిని తనకు గురువుగా వరించాడు.

వ. ఆచారపరిపాటి యవలంబించి యి ట్లుపాధ్యాయవరణంబు సేసి. 255

ప్రతిపదార్థం: ఆచార పరిపాటి= ఆచారవిధానం; అవలంబించి= స్వీకరించి; ఇట్లు; ఉపాధ్యాయవరణంబు= ఉపాధ్యాయుడిని కోరుకోవటం అనేది; చేసి= చేసి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆచారవిధానం స్వీకరించి ఉపాధ్యాయుడిని కోరుకొని (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **అతఁడు సదివింప వేదవేదాంగధర్మ। శాస్త్రరాజనీత్యాదిక సకల విద్య**
లును గ్రమంబునఁ జదివి యమ్మునికుమారుఁ। డచ్చటన యుండె వ్రతచర్యలందుఁ దగిలి. **256**

ప్రతిపదార్థం: అతఁడు= ఆ బృహస్పతి; చదివింపన్= చదివిస్తూంటే; వేద= వేదాలూ; వేదాంగ= ఛందోవ్యాకరణ జ్యోతిషాదులైన షడంగాలూ; ధర్మశాస్త్ర= ధర్మశాస్త్రాలూ; రాజనీతి+ఆదిక= రాజనీతి మొదలైన; సకలవిద్యలును= సమస్తవిద్యలనూ; క్రమంబునన్= వరుసగా; చదివి= అభ్యసించి; ఆ+మునికుమారుఁడు= ఆ శుకుడు; వ్రతచర్యలందున్= బ్రహ్మచర్యవ్రతనియమాలపట్ల; తగిలి= ఆసక్తి కలవాడై; అచ్చటన్+బృహస్పతి సన్నిధిలోనే; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: బృహస్పతి చదివిస్తూంటే శుకుడు వేదాలూ వేదాంగాలూ సకల శాస్త్రాలూ క్రమంగా అభ్యసించాడు. బ్రహ్మచర్య వ్రతదీక్షతో ఆ నియమాలు పాటిస్తూ గురువుగారి దగ్గరే ఉండిపోయాడు.

వ. **దేవతలకు లోనుగా నామంత్రణీయుండును మాననీయుండును నగుచు నట్లుండు నయ్యారణీయుండు నిజాశ్రమంబున నున్న తండ్రిపాలికిం జనుదెంచి తదనుసరణ ప్రక్రియం బ్రవర్తించునెడ నచ్చేరువం జరించు మునికుమారులతోడి మాటలు మరిగి లోకంబుతోడి పాటియై యాత్మానుసంధానంబు సేయలేక మెలంగుచున్నం జూచి యా సత్యవతీసుతుండు సాంఖ్యయోగశాస్త్రంబు లతనికి నధిగతంబులు గావించె మఱియు దేహంబునందలి యహంకారంబంతయు బంధులవలని మమతయుం బాయునట్టి వాక్యంబు లుపదేశించెదానం బ్రబోధం బుదయించుటం జేసి యమ్మహామతికి బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థ ధర్మంబులను నాశ్రమంబులు మూఁటను బుద్ధి రమింపదయ్యె నయ్యుఁ బరమపరుం డప్పారాశర్యుతో మోక్షప్రదం బెయ్యది దాని నెఱింగింపవే యనుటయు.** **257**

ప్రతిపదార్థం: దేవతలకులోనుగాన్= దేవతలకుకూడా; ఆమంత్రణీయుండున్= ఆహ్వానింప దగినవాడును; మాననీయుండును= గౌరవింపదగినవాడును; అగుచున్= అవుతూ; అట్లు+ఉండు= అలా ఉన్న; ఆ+ఆరణీయుండు= అరణి సంభవుడైన ఆ శుకుడు; నిజ+ఆశ్రమంబునన్+ఉన్న= తన ఆశ్రమంలో తానుగా ఉన్న; తండ్రిపాలికిన్= తండ్రిదగ్గరకు (వ్యాసాశ్రమానికి); చనుదెంచి= వచ్చి; తద్+అనుసరణ= ఆ తండ్రిని అనుసరించే; ప్రక్రియన్= విధానంతో; ప్రవర్తించునెడన్= ప్రవర్తిస్తున్న సమయంలో (తండ్రిని అనుసరించి మెలగుతున్న తరుణంలో); ఆ+చేరువన్= ఆశ్రమానికి సమీపంలో; చరించు= సంచరిస్తున్న; మునికుమారులతోడి= మునిబాలకులతోటి; ఆటలు మరిగి= క్రీడలకు అలవాటుపడి; లోకంబుతోడి పాటియై= మిగతా ప్రపంచంతో సమానుడైపోయి; ఆత్మ+అనుసంధానంబు= ఆత్మధ్యానం; చేయలేక; మెలంగుచున్నన్= కాలం గడుపుతూండగా; చూచి; ఆ సత్యవతీసుతుండు= సత్యవతి కుమారుడైన ఆ వ్యాసుడు; సాంఖ్య - యోగ శాస్త్రంబులు= సాంఖ్యమూ, యోగమూ అనే శాస్త్రాలు; అతనికిన్= ఆ శుకుడికి; అధిగతంబులు+కావించెన్= బోధించి నేర్పాడు;మఱియున్= ఇంకా; దేహంబునందలి= జీవోపాధిలో ఉండే; అహంకారంబు+అంతయున్= అహంకారమంతటినీ; బంధులవలని= బంధువులపట్ల; మమతయున్= మమకారాన్నీ; పాయునట్టి= విడిచిపెట్టేటువంటి; వాక్యంబులు= పలుకులు; ఉపదేశించెన్= ఉపదేశించాడు; దానన్= దానితో; ప్రబోధంబు= జ్ఞానం; ఉదయించుటన్+చేసి= కలగటంచేత; ఆ+మహామతికిన్= ఆ గొప్ప ధీశాలికి; బ్రహ్మచర్య= బ్రహ్మచర్యం; గార్హస్థ్య= గార్హస్థ్యం; వానప్రస్థధర్మంబులు= వానప్రస్థధర్మాలు; అను= అనేటువంటి; ఆశ్రమంబులు= ఆశ్రమాలు; మూఁటను= మూడింటిలోనూ; బుద్ధి= అంతరంగం; రమింపదు+అయ్యెన్= ఆసక్తం కాలేదు; అయ్యున్= అయినప్పటికీ; పరమపరుండు= పరమాత్మపట్లనే ఆసక్తి కలిగిన ఆ శుకుడు; ఆ+పారాశర్యుతోన్= ఆ వ్యాసుడితో; మోక్షప్రదంబు= మోక్షాన్ని ఇచ్చేది; ఎయ్యది= ఏది; దానిన్= దానిని; ఎఱింగింపవే= తెలియజెప్పవా; అనుటయున్= అని అడగటంతో.

తాత్పర్యం: దేవతలచేతకూడా గౌరవించబడే ఆ శుకుడు తన తండ్రిని అనుసరిస్తూ ఉండేవాడు. తోటి మునికుమారుల సహవాసంవలన ఆటలలోపడి ధ్యానం చేయలేకపోతున్న కుమారుడికి సాంఖ్యయోగ శాస్త్రాలను బోధించి అహంకారమమకారాలను విడిచిపెట్టే పద్ధతిలో బోధచేశాడు, దానితో జ్ఞానోదయమైన శుకుడు విరాగి అయ్యాడు. అయినా కూడా 'మోక్షాన్ని ఇచ్చేది ఏది?' అనే విషయమై తనకు తెలియజెప్పుమని తండ్రిని ప్రార్థించగా.

ఆ. అతఁడు మోక్షదర్శి యగుట నిరూపించి । యమ్మహామునీంద్రుఁ డతనితోడ
వత్స! కానఁ బొమ్ము వైదేహుఁడగు జన । క క్షితీశు వినయగౌరవమున. 258

ప్రతిపదార్థం: అతఁడు= తన కుమారుడైన ఆ శుకుడు; మోక్షదర్శి= మోక్షాన్ని దర్శించాలి (తెలుసుకోవాలి) అనే శీలం కలవాడు; అగుట= కావటాన్ని; నిరూపించి= నిర్ధారించుకొని; ఆ+మహాముని+ఇంద్రుఁడు= ఆ మహామునీశ్వరుడైన వ్యాసుడు; అతనితోడన్= ఆ శుకుడితో; వత్స!= నాయనా! (బిడ్డా!); వైదేహుఁడు+అగు= విదేహ రాజ్యాధిపతి అయిన; జనక క్షితీశున్= జనకమహారాజును; వినయగౌరవమునన్= వినయాతిశయంతో; కానన్+పొమ్ము= దర్శించటానికి వెళ్ళు.

తాత్పర్యం: తన కుమారుడు మోక్షాన్ని సందర్శించాలి అనే కోరికతో ఉన్నాడు - అనే విషయాన్ని వ్యాసుడు గమనించాడు. ఇట్లా అన్నాడు: నాయనా! విదేహాధిపతి జనకమహారాజు ఉన్నాడు. నీవు వినయంగా, గౌరవంగా ఆయన దగ్గరకు వెళ్ళుము.

క. గగనంబునఁ జను టుడుగుము । తగఁగఁ బాదప్రచారితన చను మిథిలా
నగరమునకు నమ్ముని మా । న్యగుణుం గను మోక్షధర్మ మతఁ డెఱిఁగించున్. 259

ప్రతిపదార్థం: గగనంబునన్= ఆకాశమార్గంలో; చనుట= ప్రయాణంచేసి వెళ్ళటం; ఉడుగుము= మానివేయుము; తగంగన్= తగినట్టు; పాదప్రచారితన్+అ= పాదసంచారంతోనే; మిథిలానగరమునకున్= మిథిలాపట్టణానికి; చను(ము)= వెళ్ళుము; ఆ+మునిమాన్యగుణున్= మునులకు కూడా గౌరవింపదగిన గుణాలుకల ఆ జనకుడిని; కను(ము)= సందర్శించు; మోక్షధర్మము= ముక్తిమార్గం; అతఁడు= ఆయన; ఎఱిఁగించున్= తెలియజెబుతాడు.

తాత్పర్యం: నాయనా! ఆకాశమార్గంలో వెళ్ళవద్దు. పాదచారివై ప్రయాణం చేసి, మిథిలానగరం చేరుకొమ్ము. జనకుడంటే మునులకు కూడా గౌరవింపదగినవాడు. ఆయన నీకు మోక్షధర్మం ఉపదేశిస్తాడు.

క. ఆ రాజన్యునెడ నహం । కారిత మమకారితయును గర్తవ్యముగా
దేరికినైనను బూజ్యుం । డారయ నాతఁడు వినీతియ తగుం జుమ్మీ! 260

ప్రతిపదార్థం: ఆ రాజన్యునెడన్= ఆ జనకమహారాజుపట్ల; అహంకారిత= అహంకారం చూపడం; మమకారితయును= మమకారం చూపటం; కర్తవ్యము+కాదు= చెయ్యదగినపని కాదు; ఆరయన్= పరిశీలించి చూస్తే; ఆతఁడు= ఆయనగారు; ఏరికిన్+ఐనను= ఎవ్వరికైనా; పూజ్యుండు= అర్చింపదగినవాడు; అందుచేత - వినీతి+అ= వినయమే; తగున్+చుమ్మీ= తగును సుమా!

తాత్పర్యం: తనయుడా! ఆ జనకమహారాజు పట్ల అహంకారం చూపటంగానీ, మమకారం ప్రదర్శించటం కానీ ఎవ్వరికీ తగదు. ఎవ్వరికైనా అతడు పూజింప దగినవాడు. అందుచేత వినయం ఒక్కటే కర్తవ్యం సుమా!

ఆ. అనిన నట్లకాక యని మేరుముఖనగం । బులు ననేకనదులుఁ బలుదెఱఁగుల
దేశములను వివిధతీర్థంబులును జుల్కఁ । గడచి వచ్చె భరతఖండమునకు. 261

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అని వ్యాసుడు చెప్పగా; అట్లు+అ+కాక= అట్లాగే; అని; మేరుముఖ= మేరువు మొదలైన; నగంబులున్= పర్వతాలూ; అనేక నదులున్= అనేక ప్రవాహాలూ; పలుతెఱఁగుల దేశములను= రకరకాల దేశాలలో; వివిధ= అనేకమైన; తీర్థంబులును= పుణ్యక్షేత్రాలూ; చుల్కన్= వేగంగా; కడచి= దాటి; భరతఖండమునకున్= భరతభూభాగానికి; వచ్చెన్= శుకుడు వచ్చాడు.

తాత్పర్యం: వ్యాసుడు చెప్పినదానికి అట్లాగే అని ఒప్పుకొన్నాడు శుకుడు. వెంటనే పాదచారిగా బయలుదేరాడు. మేరువు మొదలైన పర్వతాలు దాటాడు. నదులు ఈదాడు. పలు దేశాలలో అనేక పుణ్యతీర్థాలు అతిగమించాడు. తేలికగా, వేగంగా ప్రయాణం సాగించి సాగించి, భరతఖండం చేరుకొన్నాడు.

వ. వచ్చునప్పు డెయ్యెడ నే పదార్థంబులఁ జూచినం జూడనివాఁడపోలె వచ్చె. నిట్లు వచ్చి విదేహజనపదంబు సొచ్చి మిథిలాపురంబు నుపవనంబు దఱిసి చని తదీయప్రాకారద్వారదేశంబు సేరిన సమయంబున. 262

ప్రతిపదార్థం: వచ్చునప్పుడు= వస్తున్నప్పుడు; ఏ+ఎడన్= ఎక్కడ; ఏ పదార్థంబులన్= ఏ వస్తువులను; చూచినన్= చూచినా; చూడనివాఁడు+అ+పోలెన్= చూడనివాడివలెనే; వచ్చెన్= ప్రయాణం సాగించి వచ్చాడు; ఇట్లు= ఇట్లా; వచ్చి= విచ్చేసి; విదేహజనపదంబు= విదేహరాజ్యం; చొచ్చి= ప్రవేశించి; మిథిలాపురంబు+ఉపవనంబు= మిథిలాపట్టణంయొక్క ఉద్యానవనం; దఱిసి= సమీపించి; చని= ఇంకా ముందుకు నడిచి; తదీయ= జనక మహారాజు గారి మిథిలాపట్టణంయొక్క; ప్రాకార= కోటగోడతాలూకు (ప్రహరి); ద్వారదేశంబు= ప్రధానద్వారాన్ని; చేరిన సమయంబునన్= చేరుకున్న సమయంలో.

తాత్పర్యం: దారిలో దేనిని చూచినా చూడనివాడివలె దానిని ఉపేక్షిస్తూ ప్రయాణించి, మిథిలా నగరాన్ని చేరుకొన్నాడు శుకుడు. ఉద్యానవనాన్ని దాటి, ప్రధానద్వారాన్ని చేరుకొన్న సమయంలో.

**ఆ. ద్వారపాలు రచట వారింప శాంతిమై। నూరకున్నఁ జూచి వారు వెఱచి
లోని కెఱుకచేసి లోఁగుచు వారు ద। న్ననుప నరిగె నృపగృహంబు సేర. 263**

ప్రతిపదార్థం: ద్వారపాలురు= ద్వారపాలకులు (గుమ్మం కావలివారు); అచటన్= అక్కడ; వారింపన్= ఆపివేస్తే; శాంతిమైన్= ప్రశాంతంగా (కిమ్మనకుండా); ఊరకున్నన్= శుకుడు ఊరుకునేసరికి; చూచి; వారు= ఆ ద్వారపాలకులు; వెఱచి= భయపడి; లోనికిన్= ప్రాకారంలోపలికి; ఎఱుకచేసి= తెలియజెప్పి; లోఁగుచున్= వినయంగా వంగుతూ; వారు= ఆ కావలివారు; తన్నున్= తనను; అనుపన్= లోపలికి పంపగా; నృపగృహంబు= రాజప్రాసాదం; చేరన్+అరిగెన్= సమీపించటానికి వెళ్ళాడు, ప్రాసాదం సమీపించాడు.

తాత్పర్యం: ప్రాకారద్వారం దగ్గర కావలివారు అడ్డగించారు. శుకుడు కోపించలేదు. ప్రశాంతంగా నిలిచాడు. ఆ ప్రశాంతిని చూచి, ద్వారపాలకులు భయపడి, లోపలికి వర్తమానం పంపి సగౌరవంగా రాజగృహం వైపు పంపించారు. అట్లా రాజప్రాసాదం చేరుకొన్నాడు శుకుడు.

**క. అచటఁ బ్రతిహారు లాఁగిన। నచలిత శమవృత్తినుండె నవ్వేత్రధరుల్
ప్రచలితమతులై యా తెఱఁ। గుచితంబుగఁ జెప్ప నృపతియుఁ బురోహితునిన్. 264**

ప్రతిపదార్థం: అచటన్= రాజగృహద్వారంలో; ప్రతిహారులు= సేవకులు; ఆఁగినన్= ఆపితే; అచలిత= చలించని; శమవృత్తిన్= శాంతప్రవృత్తితో; ఉండెన్= నిలబడ్డాడు; ఆ+వేత్రధరుల్= బెత్తాలు ధరించిన ఆ ప్రతిహారులు; ప్రచలిత= కంపించిన; మతులు+ఐ= మతికలవారై; ఆ+తెఱఁగున్= ఆ విధానమంతా; ఉచితంబుగన్= తగినరీతిలో; చెప్పన్= లోపలికి వచ్చి వివరించేసరికి; నృపతియున్= ఆ జనకమహారాజు కూడా; పురోహితునిన్= తన పురోహితుడిని.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజగృహద్వారంలో సేవకులు ఆపివేశారు. అక్కడా శుకుడు అట్లాగే చలించని ప్రశాంతితో నిలబడ్డాడు. ప్రతిహారుల గుండెలు చలించిపోయాయి. బెత్తాలు ఊపుకొంటూ గబగబా లోపలికి వెళ్ళి రాజుగారికి విషయమంతా వివరించారు. అప్పుడు జనకుడు తన పురోహితుడిని పిలిచి (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **అరయఁ బుత్తెంచె నాతఁడు నరసిపోయి । నిజ మెఱింగింప భక్తి వినీతి సంభ్ర**
మములు ముప్పిరిగొనఁగ నమ్మనుజనాథుఁ । డఖిల మంత్రులు బుధులుఁ దో నరుగుదేర. 265

ప్రతిపదార్థం: అరయన్= చూచి రావటానికి; పుత్తెంచెన్= పంపించాడు; ఆతఁడున్= ఆ పురోహితుడు కూడా; అరసి= చూచి; పోయి= తిరిగి లోపలికి వెళ్ళి; నిజము= ఉన్న పరిస్థితిని; ఎఱింగింపన్= తెలియ జెప్పేసరికి; ఆ+మనుజనాథుఁడు= ఆ జనక మహారాజు; భక్తి; వినీతి= వినయం; సంభ్రమములు= హడావిడి అనేవి; ముప్పిరిగొనన్= మూడూ ఒక్కసారిగా చుట్టుముట్టగా;అఖిల మంత్రులున్= తన మంత్రులు అందరూ; బుధులున్= ఆస్థాన పండితులూ; తోన్+అరుగుదేరన్= తనతోపాటు బయలుదేరిరాగా.

తాత్పర్యం: జనకుడు తన పురోహితుడిని పంపించాడు. ఆయన వెళ్ళి ద్వారదేశంలో శాంతచిత్తంతో నిలబడి ఉన్న శుకుడిని చూచి వచ్చి మహారాజుకు విన్నవించాడు. రాజుగారి మనస్సులో భక్తీ, వినయమూ, సంభ్రమమూ ముప్పేటగా అలుముకొన్నాయి. తన మంత్రులూ, పండితులూ వెంటరాగా బయలుదేరాడు.

చ. **శిరమున నర్ఘ్యపాత్రఁగొని చెచ్చెర వచ్చి ప్రియం బెలర్ప న**
గ్గురుసుతుఁగాంచి యంతిపురి కోటకు లోనగు నొక్క సౌమ్యమం
దిరమున కమ్మునిం గొనుచు దేవసమప్రతిపత్తి నేఁగి ర
త్నరుచిర కాంచ నాసనమునం దగనుంచి సునీతపాద్యుఁడై. 266

ప్రతిపదార్థం: శిరమునన్= శిరస్సుమీద; అర్ఘ్యపాత్రన్= అర్ఘ్యంతో నిండిన పాత్రను; కొని= వహించి; చెచ్చెరన్= గబగబా; వచ్చి= శుకుడు నిలబడ్డ ద్వారం దగ్గరికి వచ్చి; ప్రియంబు+ఎలర్పన్= ప్రీతి చిగురింపగా; ఆ+గురుసుతున్= గురుపుత్రుడైన ఆ శుకుడిని; కాంచి= దర్శించి; అంతిపురి= అంతఃపురమూ; కోటకున్= రాజప్రాసాదానికీ; లోన్+అగు= మధ్యలో ఉన్న; ఒక్క= ఒకానొక; సౌమ్యమందిరమునకున్= సౌమ్యమైన మందిరానికి; ఆ+మునిన్= ఆ శుకుడిని; కొనుచున్= నడిపిస్తూ; దేవ= దేవుడితో; సమ= సమానమైన; ప్రతిపత్తిన్= గౌరవం చూపుతూ; ఏఁగి= తీసుకువెళ్ళి; రత్న= రత్నాలతో; రుచిర= అందమైన; కాంచన+ఆసనమునన్= బంగారుగద్దెమీద; తగన్+ఉంచి= తగినట్టు కూర్చోబెట్టి; సునీతపాద్యుఁడై= కాళ్ళు కడిగినవాడై.

తాత్పర్యం: జనకమహారాజు స్వయంగా అర్ఘ్యపాత్రను (పూజాద్రవ్యాలు ఉంచిన పాత్ర) నెత్తిమీద పెట్టుకొని గబగబా ఎదురువెళ్ళాడు. గురుపుత్రుడిని చూసేసరికి ఎంతో ప్రీతి కలిగింది. తన కోటలో ఒక చంద్రశాలకు శుకుడిని వెంట ఉండి తీసికొని వెళ్ళాడు. దేవుడివలె చూచుకొంటూ తీసికొనివెళ్ళాడు. రత్నాలు పొదిగిన బంగారు ఆసనంమీద కూర్చోబెట్టి కాళ్ళు కడిగాడు.

విశేషం: సౌమ్యము= సోమసంబంధమైనది. (సోముడు= చంద్రుడు). (తెల్లని మందిరానికి అనిగానీ, చంద్రశాలకు అనిగానీ). పై అంతస్తులో విశాలమైన ముంగిలితో నిర్మించిన ఒంటరిగదిని చంద్రశాల అంటారు. చంద్రకాంతపు మణులు పొదిగిన మందిరమైనా కావచ్చును.

క. **లలితాక్షతములఁ గుసుమం । బులఁ బూజితుఁ జేసి యర్ఘ్యమును గోవును న**
క్కులపతికి నిచ్చె విధిపరి । కలనజ్ఞుండైన యతఁడుఁ గైకొనియెఁ దగన్. 267

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: లలిత= మనోజ్ఞమైన; అక్షతములన్= అక్షతలతోనూ (అక్షింతలు అంటారు. బియ్యమూ, పసుపూ, కుంకుమ కలిపి చేసినవి); కుసుమంబులన్= పువ్వులతోనూ; పూజితున్= పూజింపబడినవాడినిగా; చేసి= పూజించి; అర్ఘ్యమును= అర్ఘ్యమును; గోవునున్= ఒక ఆవును; ఆ+కులపతికిన్= ఆ శుకుడికి; ఇచ్చెన్= జనకుడు సమర్పించాడు; విధిపరికలనజ్ఞుండు+ఐన= అతిథిపూజా నియమాలు తెలిసినవాడైన; అతఁడున్= ఆ శుకుడున్నూ; తగన్= తగినట్లు; కైకొనియెన్= వాటిని స్వీకరించాడు.

తాత్పర్యం: జనకమహారాజు అక్షతలూ కుసుమాలూ తీసికొని అతడిని అర్చించాడు. అర్ఘ్యం ఇచ్చాడు. గోవును బహూకరించాడు. అతిథులను అర్చించే విధులు తెలిసిన వాడు కాబట్టి శుకుడు వాటిని స్వీకరించాడు.

విశేషం: పదివేలమందికి అన్నపానాదులు ఇచ్చి విద్యను బోధించే బ్రహ్మర్షిని కులపతి అంటారు. వ్యాసుడు కులపతి. ఆయన కుమారుడు కాబట్టి శుకుడికీ ఆ విశేషణం కుదురుతుంది. వంశశ్రేష్ఠుడని కూడా అర్థం ఉన్నది కాబట్టి అట్లాగయినా చెల్లుతుంది.

వ. **జనకుండు సవినయంబుగా నిలుచుండి యమ్ముని యనుమతి సేసిన మఱి మహియంద సమాసీనుండై తానును మంత్రులు విద్వజ్జనంబులు గొలిచియుండె నట్టియెడ నన్నరపతి పరివారజాతం బెల్లను గౌతుకంబునం జనుదెంచి యంతంత మ్రొక్కుచుం జూచుచుండ.** **268**

ప్రతిపదార్థం: జనకుండు= జనకమహారాజు; సవినయంబుగాన్= వినయం ఉట్టిపడేట్టు; నిలుచుండి= నిలబడి; ఆ+ముని= ఆ శుకుడు; అనుమతి+చేసినన్= అనుమతించగా; మఱి= అప్పుడు; మహి+అందున్+అ= నేలమీదనే; సమాసీనుండై= కూర్చుని; తానునున్= తానూ; మంత్రులున్= తన అమాత్యులూ; విద్వత్+జనంబులున్= పండితులూ; కొలిచియుండెన్= సేవిస్తూ ఉన్నాడు; అట్టియెడన్= ఆ సమయంలో; ఆ+నరపతి= ఆ రాజుగారి; పరివారజాతంబు+ఎల్లనున్= సేవకసమూహం అంతా; కౌతుకంబునన్= కుతూహలంతో; చనుదెంచి= వచ్చి; అంతంతన్= అంతంత దూరంలో; మ్రొక్కుచున్= వంగివంగి నమస్కరిస్తూ; చూచుచుండన్= చూస్తూ ఉండగా.

తాత్పర్యం: సవినయంగా నిలబడిన జనకమహారాజును కూర్చోమన్నాడు శుకుడు. అప్పుడు రాజుగారూ అతడి మంత్రులూ, పండితులూ అంతా నేలమీదనే ఆసీనులయ్యారు. ఇది చూచి, పరిజనమంతా ఆశ్చర్యపోయి వాళ్ళూ వంగి వంగి అల్లంత దూరంలో నమస్కరిస్తూ నిలబడ్డారు.

తే. **రూపవిభ్రమముల నప్సరోజనంబుఁ । గ్రేణిసేయు వారాంగనాశ్రేణి గీత**
నృత్యనిరతి నారాధింప నిర్విశేష । యోజితేంద్రియుఁడై యతఁ డుండె నధిప! **269**

ప్రతిపదార్థం: అధిప!= ధర్మరాజా!; రూప= సౌందర్యంలోనూ; విభ్రమములన్= విలాసాల్లోనూ; అప్సరస్+జనంబున్= దేవకాంతా సమూహాన్ని; క్రేణి+చేయు= తిరస్కరించేటటువంటి; వారాంగనాశ్రేణి= వేశ్యాబృందం; గీతనృత్య నిరతిన్= సంగీత నాట్యాల ప్రదర్శనతో; ఆరాధింపన్= అర్చించగా; అతఁడు= ఆ శుకుడు; నిర్విశేష= నిర్వికారంగా; యోజిత= నిగ్రహింపబడిన; ఇంద్రియుఁడై= ఇంద్రియాలు కలవాడై; ఉండెన్= కూర్చున్నాడు, ఆరాధన స్వీకరించాడు.

తాత్పర్యం: ధర్మరాజా! సౌందర్యంలోనూ, విలాసాలలోనూ అప్సరసలను మించిన వేశ్యలు వచ్చి తమ సంగీతంతో, నృత్యప్రదర్శనతో శుకుడిని అర్చించారు. ఇంద్రియ వికారాలు ఏమీ లేని నిశ్చలస్థితితో శుకుడు వాటిని ఆలకించాడు, తిలకించాడు.

చ. **అతనికి నన్నపానముల నంచితభక్తి నొనర్పఁగాఁ బురో**
హితు నియమించి యవ్వసుమతీశ్వరుఁ డద్దినశేషయామినుల్
చతురము భక్తియుక్తమును సంప్రమదంబునుఁ గా నయించె స
మ్మితమృదు సారభాషణసమీరణతం దదుపాంతవర్తియై. **270**

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ శుకుడికి; అన్నపానములన్= భోజనపానీయాదులను; అంచిత భక్తిన్= గొప్పభక్తితో; ఒనర్పఁగాన్= సమకూర్చటానికి; పురోహితున్= తన కులబ్రాహ్మణుడిని; నియమించి= నియోగించి; ఆ+వసుమతీ+ఈశ్వరుఁడు= ఆ జనకభూపాలుడు; ఆ+దినశేష+యామినుల్= ఆ రోజులో అప్పటికి శేషించి ఉన్న సమయాన్నీ, ఆనాటి రాత్రినీ; చతురమున్= చతురంగానూ (నేర్పుగా); భక్తియుక్తమును= భక్తియుక్తంగానూ; సంప్రమదంబునున్+కాన్= సంతోషంగానూ; సమ్మిత= అంగీకారయోగ్యమైన; మృదు= సుకుమారమైన; సార= విలువైన; భాషణ= సంభాషణలయొక్క; సమ్+ఈరణతన్= ప్రసారంతో; తద్= ఆ శుకునియొక్క; ఉపాంత= సమీపంలో; వర్తియై= కూర్చున్నవాడై; నయించెన్= కడపాడు.

తాత్పర్యం: ఒప్పిన భక్తితో శుకుడికి అన్నపానాదులు సమకూర్చటానికని జనకుడు తన పురోహితుడిని నియమించాడు. అవి అయిన తరువాత ఆ దినశేషాన్నీ, ఆ రాత్రినీ హాయిగా, నేర్పుగా, భక్తి ప్రపత్తులతో సారవంతమూ సజ్జనసమ్మతమూ అయిన సంభాషణలతో గడిపాడు జనకమహారాజు. అతడి సన్నిధిని విడిచిపెట్టి మరి ఎక్కడికీ వెళ్ళలేదు. పనికిరాని మాటలు దొర్లలేదు.

వ. మఱునాఁ డమ్మహీపాలుండు గాలోచితకృత్యంబు లాచరించి కృతకరణీయుండును సుఖాసీనుండునునై యున్నయమ్మునిపాలికి సూరిజన సమేతంబుగాఁ జని పరివేష్టించి యుండి కేలుమోడ్చి 'మీరిట విచ్చేయుటకుం గతంబేమి?' యని సవినయంబుగా నడిగిన నమ్మహాత్ముండు 'మా తండ్రి పంపున మోక్షమార్గబోధార్థినై వచ్చితి విప్రునకుం గర్తవ్యం బెయ్యది? మోక్షం బేమిటం బడయవచ్చు? నెఱింగింపవే!' యనుటయు నతండు సవిశేష సమాదరుండై - 271

ప్రతిపదార్థం: మఱునాఁడు= మరుసటిరోజున; కాల+ఉచితకృత్యంబులు= ఉదయకాలానికి చేయవలసిన స్నానాది విధులను; ఆచరించి= చేసి; కృతకరణీయుండునున్= చేయవలసినవి చేసినవాడూ; సుఖ+ఆసీనుండును+ఐన= సుఖంగా ఆసీనుడై ఉన్నవాడూ అయి; ఉన్న= ఉన్నటువంటి; ఆ+ముని+పాలికిన్= ఆ శుకుడి దగ్గరికి; సూరిజనసమేతంబుగాన్= పండితజన సహితంగా; ఆ+మహీపాలుఁడు= ఆ జనకమహారాజు; చని= వెళ్ళి; పరివేష్టించి ఉండి= ఆయనకు చుట్టూ కూర్చుని; కేలుమోడ్చి= నమస్కరించి; మీరు= తమరు; ఇటన్= ఇక్కడికి; విచ్చేయుటకున్= రావటానికి; కతంబు= కారణం; ఏమి?= ఏమిటి; అని; సవినయంబుగాన్= వినయంతో; అడిగినన్= అభ్యర్థించేసరికి; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు శుకుడు; మా తండ్రి పంపునన్= మా తండ్రిగారి ఆజ్ఞమీద; మోక్షమార్గ= ముక్తిమార్గానికి సంబంధించిన; బోధ= జ్ఞానాన్ని; అర్థినై= కోరినవాడనై; వచ్చితిన్= ఇక్కడకు వచ్చాను; విప్రునకున్= బ్రాహ్మణుడికి; కర్తవ్యంబు= చెయ్యదగినది; ఏ+అది= ఏది?; మోక్షంబు= ముక్తి అనేది; ఏమిటన్= దేనితో; పడయన్ వచ్చున్?= పొందవచ్చును?; ఎఱింగింపవే!= తెలియజెప్పవా! - అనుటయున్= అని శుకుడు అనటమూ; అతండు= ఆ జనకుడు; సవిశేష+సమాదరుండై= విశిష్టమైన ఆదరం కలవాడై.

తాత్పర్యం: మరుసటిరోజున ఉదయకాలానికి చేయవలసిన స్నానాది విధులను నిర్వహించి, సుఖాసీనుడైన ఆ శుకుడి దగ్గరికి, పండితజన సహితంగా ఆ జనకమహారాజు వెళ్ళి ఆయన దగ్గర కూర్చుని నమస్కరించి, 'మీరు ఇక్కడికి రావటానికి కారణం ఏమి?' టని సవినయంగా అడిగేసరికి, శుకుడు 'మా తండ్రిగారి ఆజ్ఞమీద, ముక్తి మార్గానికి సంబంధించిన జ్ఞానాన్ని కోరినవాడనై ఇక్కడకు వచ్చాను. బ్రాహ్మణుడు చేయదగినది ఏది? ముక్తి అనేది దేనితో పొందవచ్చును? తెలియజెప్పు'మని జనకుడిని అడుగగా, జనకుడు విశిష్టమైన ఆదరంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జనకుఁడు శుకున కుపదేశించిన మోక్షధర్మ ప్రకారము: (సం. 12-313-9)

సీ. 'విను ముపనీతుఁడై విప్రుండు బ్రహ్మచ । ర్యంబు వేదాభ్యసనంబు నడపి
దారసంగ్రహము సంతానసంపాదనం । బును నధ్వరక్రియయును నొనర్చి
దేవపిత్రతిథిపూజా విధిపరుఁడగు । చుండి వనమునకు హుతవహప్ర
యుతముగఁ జని యందు నతిథులఁ గొనియాడి । వ్రతము గషాయపక్వత నొనర్ప

తే. నగ్నులాత్మయంద యారోపితములుగఁ । జేసి వీతరాగ చిత్తవృత్తిఁ
బరమశాంతిఁ బొంది బ్రహ్మాశ్రమపదంబుఁ । బొందువాఁడు లోకపూజ్యచరిత!' 272

ప్రతిపదార్థం: లోకపూజ్యచరిత!= లోకానికి పూజింపదగిన ప్రవర్తనకలవాడా! ఓ శుకమహర్షీ!; వినుము; విప్రుండు= బ్రాహ్మణుడు; ఉపనీతుఁడై= ఉపనయనం చేసికొని; బ్రహ్మచర్యంబున్= బ్రహ్మచర్యాన్నీ; వేద+అభ్యసనంబున్= వేదాధ్యయనాన్నీ; నడపి= నిర్వర్తించి; దారసంగ్రహమున్= భార్యను పొందటం (వివాహంతో గృహస్థాశ్రమం స్వీకరించటం); సంతాన సంపాదనంబునున్= పుత్రపౌత్రాదికంగా సంతానం కలగటం; అధ్వరక్రియయునున్= యజ్ఞాలు చెయ్యటం అనేవాటిని; ఒనర్చి= నిర్వహించి; దేవ= దేవతలు; పిత్రు= పితృదేవతలు; అతిథి= అతిథులు - వీరిని; పూజా= అర్చించటమనే; విధి= కర్తవ్యంపట్ల; పరుఁడు= తత్పరుడు; అగుచుండి= అవుతూ (గృహస్థాశ్రమాన్ని) గడపి; హుతవహప్రయుతముగన్= అగ్నిహోత్రంతో సహా; వనమునకున్= అరణ్యానికి; చని= వెళ్ళి (వానప్రస్థం స్వీకరించి); అందున్= అక్కడ కూడా; అతిథులన్= అతిథులను; కొనియాడి= అర్చించి; వ్రతమున్= వానప్రస్థ దీక్షను; కషాయ పక్వతన్= కషాయం పరిపక్వతను పొందినట్లు ('కాషాయపక్వతన్' - అనే పాఠాంతరం ఉంది. 'వైరాగ్య పరిపక్వతలో' అని దాని అర్థం); ఒనర్పన్= నిర్వహించుటకై; అగ్నులు= అగ్నిహోత్రాలను; ఆత్మయందున్+అ= అంతరంగంలోనే; ఆరోపితములుగన్+చేసి= ఆరోపించి; వీతరాగచిత్తవృత్తిన్= తొలగిపోయిన రాగబంధంతో కూడిన మనఃప్రవృత్తితో (వైరాగ్య సంపన్నమైన మనస్సుతో అని); పరమశాంతిన్= గొప్ప ప్రశాంతిని; పొంది= అనుభవించి; బ్రహ్మ+ఆశ్రమపదంబున్= బ్రహ్మాశ్రమము అనబడే జ్ఞానమయ సన్న్యాసాశ్రమాన్ని; పొందువాఁడు= పొందుతాడు. (పొందేవాడు అవుతాడు).

తాత్పర్యం: లోకాలకు ఆరాధనీయమైన ప్రవర్తన కలవాడా! అడిగావు కనుక చెప్పుతున్నాను. ఆలకించుము. బ్రాహ్మణుడు ముందు ఉపనయనం చేసికొని, బ్రహ్మచర్యాశ్రమం స్వీకరించాలి. వేదాధ్యయనం చేయాలి. అటుపైని వివాహం చేసికొని గృహస్థాశ్రమంలోనికి ప్రవేశించాలి. పుత్రపౌత్రాదికంగా సంతానం పొందాలి. గృహస్థుడు చేయవలసిన యజ్ఞయాగాదులు చేయాలి. దేవపూజలూ, పితృపూజలూ, అతిథిపూజలూ తత్పరతతో నిర్వహించాలి. అటుపైని తన నిత్యాగ్నిహోత్రాలతో సహా అరణ్యానికి వెళ్ళి వానప్రస్థం స్వీకరించాలి. అక్కడకూడా అతిథిపూజలు జరపాలి. ఆ దీక్షలో కషాయసమపాకంగా పరిపక్వతను పొందటానికై అగ్నిహోత్రాలను ఆత్మలో నిక్షేపించుకొని, వైరాగ్యపూర్ణమైన మనఃప్రవృత్తితో పరమప్రశాంతిని పొంది, సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించాలి. అటువంటి వాడే ఆ బ్రహ్మాశ్రమపదవికి అర్హుడు అవుతాడు'.

వ. అనిన విని యమ్మునివరుండు. 273

ప్రతిపదార్థం: అనినన్= జనకుడు ఇట్లా అనేసరికి; విని= ఆలకించి; ఆ+మునివరుండు= ఆ మునీశ్వరుడైన శుకుడు.

తాత్పర్యం: దీనినంతా ఆ శుకుడు ఆలకించి. (ఇట్లా అంటున్నాడు).

క. 'జ్ఞానోదయమ్మైయుండఁగ । మానక వెండియును నాశ్రమత్రయవాసుం
డై నిలిచి తత్క్రియాను । ష్ఠానము గ్రమవృత్తి నడపుటయు వలయు నొకో? 274

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: జ్ఞాన+ఉదయమై+ఉండఁగన్= తనంత తాను జ్ఞానోదయమై ఉన్నప్పటికీ; మానక= విడువకుండా; వెండియును= మళ్ళీ; ఆశ్రమత్రయవాసుండై= బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం అనే ఈ మూడు ఆశ్రమాలలోనూ నివసించినవాడై; నిలిచి= ఉండి; తద్= ఆయా ఆశ్రమాలకు చెప్పిన; క్రియా= విధులయొక్క; అనుష్ఠానమున్= ఆచరణను; క్రమవృత్తిన్= యథాక్రమంగా (క్రమప్రక్రియగా); నడపుటయున్= నిర్వహించటంకూడా; వలయున్+ఒకో?= అవసరమంటావా?

తాత్పర్యం: జ్ఞానోదయమై ఉండగా విడువకుండా మళ్ళీ మూడు ఆశ్రమాల్లోనూ ఉండి ఆయా ఆశ్రమాల విధులను యథాప్రకారంగా నడపడం అవసరమా!

తే. **జ్ఞానవిజ్ఞాన దృష్టి శాశ్వతిక తత్త్వుఁ। డయ్యెనేనియు విడువరా దాశ్రమముల**
క్రమ సమారూఢి యనునె వేదములు? దీనిఁ। దెలియఁజెప్పవె మోక్షవిత్తిలకజన్మ.' **275**

ప్రతిపదార్థం: మోక్షవిత్= ముక్తివేత్తలయందు; తిలక= శ్రేష్ఠమైన; జన్మ!= పుట్టుక కలవాడా! - జనకమహారాజా!; జ్ఞాన= జ్ఞానమూ; విజ్ఞాన= వివేకమూ అనేవాటితో కూడిన; దృష్టిన్= దర్శనంతో; శాశ్వతిక తత్త్వుఁడు= శాశ్వతమైన పరమాత్మ తత్త్వం తెలిసికొన్నవాడు; అయ్యెన్+ఏనియున్= అయినప్పటికీ; వేదములు= వేదాలు; ఆశ్రమముల= బ్రహ్మచర్యాది ఆశ్రమాల; క్రమసమారూఢి= క్రమ నివాసాన్ని; విడువన్+రాదు= వదలటానికి వీలు లేదు; అనునె?= అంటున్నాయా?; దీనిన్= ఈ విషయాన్ని; తెలియన్= నాకు తెలిసేట్టు; చెప్పవె?= చెప్పవా?

తాత్పర్యం: "మోక్షవేత్తలయందు శ్రేష్ఠమైనజన్మకలవాడా! జ్ఞానము వివేకమూ కలిగి శాశ్వతమైన పరమాత్మతత్త్వాన్ని తెలుసుకొన్నాకుండా(బ్రహ్మచర్యాలు) ఆశ్రమాలన్నింట క్రమంగా నివసించడం విడువరాదని వేదాలంటాయా? దీనిని తెలియజేప్పుము''.

వ. **అనవుడు నతం డతని కిట్లనియె.** **276**

ప్రతిపదార్థం: అనవుడున్= అని శుకుడు అనేసరికి; అతండు= ఆ జనకుడు; అతనికిన్= శుకుడికి; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: అని శుకుడు అనగా జనకుడు మళ్ళీ ఇట్లా అన్నాడు.

తే **జ్ఞానవిజ్ఞానములు మోక్షసాధనములు। గురుని యుపదేశమున నవి దొరకొనంగ**
వాన మోక్షంబు గాంచినవాఁడు విడుచు। నయ్యుపాయద్వయమ్మును నతులబుద్ధి. **277**

ప్రతిపదార్థం: జ్ఞానవిజ్ఞానములు= విద్యావివేకాలు; మోక్షసాధనములు= మోక్షానికి ఉపకరణాలు; గురుని= గురువుయొక్క; ఉపదేశమునన్= ఉపదేశంతో; అవి; దొరకొనంగన్= లభిస్తే; వానన్= వాటితో; మోక్షంబు= ముక్తి; కాంచినవాఁడు= పొందినవాడు; అతులబుద్ధిన్= సాటిలేని ధీశక్తితో; ఆ+ఉపాయద్వయమ్మును= ఆ రెండు ఉపాయాలనూ; విడుచున్= విడిచిపెట్టేస్తాడు.

తాత్పర్యం: మోక్షసాధనాలైన జ్ఞానవిజ్ఞానాలను సద్గురుడి ఉపదేశం వలన పొంది వాటితో ముక్తి సంపాదించినవాడు కట్టకడపటికి తన బుద్ధిపటిమతో ఆ రెండుసాధనాలనూ కూడా వదిలివేస్తాడు. (అతులబుద్ధి అనే సమాసాన్ని బహువ్రీహిగా శుకుడికి సంబోధనకూడా చేయవచ్చును.)

క. **లోకోచ్ఛేదముఁ గర్మ। వ్యాకులతయుఁగాక యుండవలయుటకై సు**
శ్లోకా! చతురాశ్రమములు। గైకొని నడిపిరి దృఢంబుగాఁ బూర్వమునుల్. **278**

ప్రతిపదార్థం: సుశ్లోకా!= పొగడదగినవాడా!; లోక+ఉచ్ఛేదమున్= లోక వినాశమూ; కర్మవ్యాకులతయున్= కర్మాచరణలోసాంకర్యమూ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(కలత); కాక= జరగకుండా; ఉండన్+వలయుటకై= ఉండటంకోసం; పూర్వమునుల్= మన పూర్వమహర్షులు; చతుర్+ఆశ్రమములు= నాలుగు ఆశ్రమాలు; కైకొని= స్వీకరించి; దృఢంబుగాన్= కట్టుదిట్టంగా; నడిపిరి= నడిపారు (సమాజాన్ని నడిపారు).

తాత్పర్యం: స్తుతింపదగినవాడా! లోకవినాశమూ, కర్మసాంకర్యమూ జరగకుండా ఉండటంకొరకే బ్రహ్మచర్యాది ఆశ్రమాలను నాల్గింటిని ఏర్పాటుచేసి మన పూర్వమహర్షులు ఆ ఆశ్రమధర్మాలను దృఢంగా నడిపారు, నడిపించారు.

తే. **అందుఁ దుదముట్ట నడచిన నందవచ్చు । ముక్తి బహుజన్మ సంసిద్ధమోక్షకార**
ణముల శుద్ధుఁడై ప్రథమాశ్రమమునయంద । కాంచు మోక్ష మెందేని నొక్కరుఁడు మునిప! 279

ప్రతిపదార్థం: మునిప!= మునీశ్వర!; అందున్= ఆశ్రమచతుష్టయమార్గంలో; తుదముట్టన్= కట్టకడపటిదాకా; నడచినన్= నడిచినట్లయితే; ముక్తిన్= మోక్షాన్ని; అందవచ్చున్= పొందవచ్చు; ఎందేనిన్= ఎక్కడయినా (అరుదుగా); ఒక్కరుఁడు= ఒక వ్యక్తి; బహుజన్మ= పూర్వానేక జన్మలలో; సంసిద్ధ= లభించిన; మోక్షకారణములన్= మోక్షసాధనాలతో; శుద్ధుఁడై= శుద్ధి పొందినవాడై; ప్రథమ+ఆశ్రమున+అందున్+అ= మొదటిదైన బ్రహ్మచర్యాశ్రమంలోనే; మోక్షమున్= ముక్తిని; కాంచున్= పొందుతాడు.

తాత్పర్యం: మునీశ్వరా! ఈ ఆశ్రమాల వరుసలో ప్రయాణం చేసేవాడు కట్టకడపటిదాకా యథావిధిగా నడిస్తే ముక్తి పొందుతాడు. అట్లాకాక అరుదుగా ఎక్కడైనా ఒక వ్యక్తికి పూర్వజన్మల సంస్కారం వలన ముక్తిహేతువులు సిద్ధిస్తే అతడు ఈ జన్మలో ప్రథమాశ్రమంలోనే - బ్రహ్మచర్యాశ్రమంలోనే - ముక్తిని కైవసం చేసికొంటాడు. అట్లా జరుగవచ్చును.

క. **వానికి మూఁడాశ్రమముల । లో నిలువఁ బ్రయోజనంబులుం గలవె? తమో**
ధీనతను రజఃపరత । న్మానవలయుఁ గాక? సత్త్వనైష్ఠికమతియై. 280

ప్రతిపదార్థం: సత్త్వనైష్ఠికమతియై= సత్త్వనిష్ఠకుదురుకొన్న మతికలవాడై; తమః+అధీనతను= తమోగుణానికి లొంగిపోవటం; రజఃపరతన్= రజోగుణానికి పరతంత్రు కావటం అనేవాటిని; మానవలయున్+కాక= విడిచిపెట్టాలే తప్ప; వానికిన్= అటువంటి అరుదైన వ్యక్తికి; మూఁడు+ఆశ్రమములలోన్= బ్రహ్మచర్యాదికమైన మొదటిమూడు ఆశ్రమాలలోనూ; నిలువన్= ఉండటంవలన; ప్రయోజనంబులున్+కలవె?= ఉపయోగాలు ఏమయినా ఉన్నాయా? (లేవు అని భావం.)

తాత్పర్యం: పూర్వజన్మల సంస్కారాలవలన మోక్షహేతులు ఈ జన్మలో సిద్ధించిన అరుదైన వ్యక్తి మొదటి మూడు ఆశ్రమాలలోనూ వరుసగా కాలం గడపవలసిన అవసరం ఏమీ లేదు. అట్లా గడపినందువలన ప్రత్యేక ప్రయోజనమూ లేదు. కాకపోతే అతడు తమోగుణానికీ రజోగుణానికీ లొంగిపోకుండా సత్త్వగుణనిష్ఠ కలిగినవాడై ఉండాలి. అంతే.

తే. **సత్త్వమార్గాభిరతి యాత్మతత్త్వదర్శ । నంబు గావింపఁ దనుఁ దాన నరుఁడు గాంచు**
విశ్వమునఁ దానుఁ దనయందు విశ్వమును వ । సించుటయుఁ జూచుచును ముక్తిఁ జెందియుండు.281

ప్రతిపదార్థం: సత్త్వ= సత్త్వగుణసంపన్నమైన; మార్గ= విధానంలో; అభిరతి= ఆసక్తి అనేది; ఆత్మతత్త్వ= ఆత్మతత్త్వానికి సంబంధించిన; దర్శనంబు= దర్శనాన్ని (ఆత్మసాక్షాత్కారాన్ని); కావింపన్= కలిగిస్తే; నరుఁడు= సాధకుడు; తనున్= తనను; తాను+అ= తానే; కాంచున్= దర్శిస్తాడు; విశ్వమునన్= ప్రపంచంలో; తానున్= తానూ; తనయందున్= తనలో; విశ్వమును= ప్రపంచం; వసించుటయున్= ఉండటం అనేదాన్ని కూడా; చూచుచును= దర్శిస్తూ; ముక్తిన్= విముక్తిని; చెందియుండున్= పొందుతాడు.=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నరుడు సాత్త్వికప్రవృత్తివలన ఆత్మతత్త్వాన్ని తెలిసికొంటాడు. దానివలన తనను తాను దర్శించగలుగుతాడు. ఆత్మజ్ఞుడు అవుతాడు. అప్పుడు విశ్వంలో తననూ, తనలో విశ్వాన్నీ చూడగలుగుతాడు. రాగద్వేషాది బంధాలనుంచి విముక్తి పొందిన స్థితితో జీవిస్తూ ఉంటాడు.

వ. ఇవ్విషయంబున యయాతి వాక్యంబులు గల వాకర్ణింపుము. 282

ప్రతిపదార్థం: ఈ+విషయంబునన్= ఈ అంశంలో; యయాతి వాక్యంబులు= యయాతి చెప్పిన మాటలు; కలవు= ఉన్నాయి; ఆకర్ణింపుము= చెప్పుతాను వినుము.

తాత్పర్యం: ఈ విషయమై యయాతి చెప్పిన మాటలను వినుము.

ఆ. జ్యోతి యాత్మయంద యున్నది కాన శ । క్యము సమాహితాత్ముఁడైన మునికి
నొరులవలనఁ దనకు నొరులకుఁ దన దెస । భయము లేకయున్నఁ బరముఁ గాంచు. 283

ప్రతిపదార్థం: జ్యోతి= తేజస్సు (పరమాత్మ); ఆత్మయందున్+అ= నరుడి ఆత్మలోనే; ఉన్నది= ఉంది; సమాహిత+ఆత్ముఁడు+ఐన= ఏకాగ్రచిత్తం కలవాడైన; మునికిన్= జ్ఞానికి; కానన్= ఆ జ్యోతిని దర్శించటం; శక్యము= సాధ్యమే; ఒరులవలనన్= ఇతరులవలన; తనకున్= తనకూ; ఒరులకున్= ఇతర జీవులకూ; తనదెసన్= తనవలనా; భయము= భీతి అనేది; లేక+ఉన్నన్= లేకపోయినట్లయితే (నిర్భయస్థితిలో); పరమున్= పరమాత్మను; కాంచున్= దర్శిస్తాడు.

తాత్పర్యం: జ్యోతిస్స్వరూపమైన పరతత్త్వం ప్రతివ్యక్తికీ ఆత్మలోనే ఉంటుంది. ఏకాగ్రత సాధించిన మునీశ్వరుడు ఆ జ్యోతిని తనలో తాను దర్శించగలుగుతాడు. ఇతరులవలన తనకూ, తనవలన ఇతరులకూ ఏ విధమైన భయమూ లేని నిర్భయస్థితి అలవడినప్పుడు పరమాత్మను సాధకుడు చూడగలుగుతాడు.

క. కోరికయు నొల్లమియు లే । కే రూపున భూతములకు నెగ్గగు తెఱఁగుం
జేరక యకామవృత్తిఁ ద । పోరతి నున్నతఁడు బ్రహ్మముం బ్రాపించున్. 284

ప్రతిపదార్థం: కోరికయున్= ఒకటి కావాలి అనుకోవటంగానీ; ఒల్లమియున్= ఒకటి వద్దు అనుకోవటంగానీ; లేక= లేకుండా; ఏ రూపునన్= ఏ రకంగానూ; భూతములకున్= ప్రాణికోటికి; ఎగ్గు+అగు+తెఱఁగున్= అపకారం చేసే పద్ధతిని; చేరక= చేరకుండా; అకామవృత్తిన్= నిష్కామప్రవర్తనతో (కోరికలు లేని జీవనవిధానంతో); తపోరతిన్= తపస్సు పట్ల గాఢమైన ఆసక్తితో; ఉన్న+అతఁడు= ఉన్న వ్యక్తి; బ్రహ్మమున్= పరమాత్మను (పరబ్రహ్మను); ప్రాపించున్= పొందుతాడు (బ్రహ్మసాక్షాత్కారం అతడికి అవుతుంది).

తాత్పర్యం: రాగమూ, ద్వేషమూ అనేవి లేకుండా ఏ ప్రాణికీ అపకారం చెయ్యకుండా సర్వభూతహితుడై, నిష్కామంగా తపస్సు చేసికొనే సాధకుడు పరబ్రహ్మను పొందగలుగుతాడు.

క. వినఁ జూడం బడు నం దె । ల్లను సమతం బరముఁ గనుచు లౌల్యనిరసనం
బున సుఖదుఃఖాదిద్వం । ద్వనిరూఢుఁడు గాక యున్నతఁడు ముక్తిఁ గనున్. 285

ప్రతిపదార్థం: వినన్+పడునందెల్లనున్= వినబడే అన్నింటిలోనూ; చూడన్+పడునందున్+ఎల్లనున్= కనపడే అన్నింటిలోనూ; సమతన్= సమదృష్టితో; పరమున్= పరమాత్మను; కనుచున్= దర్శిస్తూ; లౌల్య= లోలత్వంయొక్క; నిరసనంబునన్= పరిత్యాగంతో (లోలుడు కాకుండా); సుఖదుఃఖాది= సుఖదుఃఖాలూ - రాగద్వేషాలూ మొదలైన; ద్వంద్వ= జంటలలో; నిరూఢుఁడు+కాక= తగుల్కొనవాడు కాకుండా; ఉన్న+అతఁడు= జీవించగలిగిన వ్యక్తి; ముక్తిన్= విముక్తిని (మోక్షాన్ని); కనున్= పొందుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వినబడే, కనబడే సర్వవిషయాలలోనూ సమదృష్టితో పరమాత్మనే చూడగలిగి, దేనిలోనూ లోలుడు కాకుండా, రాగద్వేష సుఖదుఃఖాదికమైన ద్వంద్వాలకు అతీతంగా, జీవితం గడపగలిగినవాడు తప్పకుండా ముక్తి పొందుతాడు.

క. ఇనుమును గనకము నిందయు । వినుతియు సమములుగఁ గొనుచు వివిధాంగకముల్
దనలోన నడఁచు కమఠము । ననువున నింద్రియము లడఁచునతఁడు గను శివున్.' 286

ప్రతిపదార్థం: ఇనుమును= ఇనుమునూ; కనకమున్= బంగారాన్నీ; నిందయున్= నిందనూ; వినుతియున్= స్తుతినీ; సమములుగన్= సమానంగా; కొనుచున్= పరిగణించి పరిగ్రహిస్తూ; వివిధ+అంగకముల్= అన్ని అవయవాలనూ; తనలోనన్= తన డిప్పలోనే; అడఁచు= ముడుచుకొనే; కమఠము (యొక్క)+అనువునన్= తాబేలు చందంగా; ఇంద్రియములు= తన ఇంద్రియాలను; అడఁచు+అతఁడు= నిగ్రహించేవాడు; శివున్= పరమాత్మను; కనున్= దర్శిస్తాడు.

తాత్పర్యం: ఇనుమునూ, బంగారాన్నీ సమానంగా చూడగలగాలి. పొగడ్తనూ, తెగడ్తనూ ఒక్కలాగే స్వీకరించగలగాలి. తాబేలు తన కాళ్ళూ, చేతులూ, తలా మొదలైన అన్ని అవయవాలనూ సాచి మళ్ళీ డిప్పలోకి ఉపసంహరించు కొంటున్నట్లుగా- లేదా - సంకోచపరచుకొంటున్నట్లుగా సాధకుడు సర్వేంద్రియాలను నిగ్రహించుకొనగలగాలి. అటు వంటి వ్యక్తి మాత్రమే శివుడిని దర్శించగలుగుతాడు.'

విశేషం: అలం: ఉపమ.

వ. అని చెప్పి. 287

ప్రతిపదార్థం: అని= యయాతి వాక్యాలుగా వీటిని; చెప్పి= జనకుడు వినిపించి-

తాత్పర్యం: అని చెప్పి (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అవ్విశేషంబు లెల్ల నీయందుఁ గలుగు । టనఘ! భవదీయ జనకదయాసమృద్ధి
సిద్ధ దివ్యబోధంబునఁ జేసి తోఁచె । నవ్విధముకంటె నీ చంద మధికతరము. 288

ప్రతిపదార్థం: అనఘ!= పావనుడా!; ఆ+విశేషంబులు+ఎల్లన్= పైని చెప్పిన ఆ విశేషాలు అన్నీ; నీయందున్= నీలో; కలుగుట= ఉండటం; భవదీయ= నీయొక్క; జనక= తండ్రియైన వ్యాసుని; దయాసమృద్ధి= పుష్కలమైన కృపచేత; సిద్ధ= సిద్ధించిన; దివ్యబోధంబునన్+చేసి= దివ్యజ్ఞానం చేత; తోఁచెన్= జరిగినది; ఆ+విధముకంటెన్= ఆ సాత్త్వికప ద్ధతికన్నా; నీ చందము= నీ విధం; అధికతరము= మిక్కిలి గొప్పది.

తాత్పర్యం: పవిత్రుడా! పైని చెప్పిన సాత్త్వికపద్ధతులన్నీ నీలో ఉన్నాయి. అది మీ తండ్రిగారి దయావిశేషంవలన నీకు లభించిన జ్ఞానంతో సిద్ధించింది. నిజం చెప్పాలంటే నీ పద్ధతి అంతకన్నా గొప్పది.

క. నీ వట్టిఁడ వగు టెఱుఁగవు । భావంబున సంశయమును భయమును బాల్యం
బావేశింపఁగఁ జేయ న । భావితనిశ్చయుఁడ వగుటఁ బరమమునీంద్రా! 289

ప్రతిపదార్థం: పరమమునీంద్రా!= అత్యుత్తమ మహర్షీ!; బాల్యంబు= పిన్నవయస్సు అనేది; భావంబునన్= అంతరంగంలో;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంశయమును= సంశయమూ; భయమును= భయమూ (వెరపూ) అనేవాటిని; ఆవేశింపఁగన్+చేయన్= ఎక్కువగా కలిగిస్తున్నందువలన; అభావితనిశ్చయుఁడవు= నిశ్చయం లేనివాడవు; అగుటన్= కావటంచేత; నీవు; అట్టిఁడవు= అంతటివాడవు (అటువంటి గొప్పవాడవు); అగుటన్= కావటం; ఎఱుఁగవు= గుర్తించలేకపోతున్నావు.

తాత్పర్యం: ఓ ఉత్తమోత్తమ మునీశ్వరా! నిజానికి నీవు మీ తండ్రి అంతటివాడవే. కానీ నీ బాల్యమనేది నీ మనస్సులో కొంత సంశయాన్నీ, కొంత భయాన్నీ ఆవేశింపజేస్తున్నది. దానితో నీ వొక నిశ్చయానికి రాలేక నిన్ను నీవు అంతటివాడుగా గుర్తించలేకపోతున్నావు. అంతే సుమా!

విశేషం: బాల్యం సంశయభయాలను ఆవేశింపజేస్తున్నది అన్నట్టుగా అన్వయిస్తున్నది ఈ పద్యం. కానీ మూలంలో బాల్యం కూడా ఒక హేతువుగా కనపడుతున్నది. **"బాల్యాద్వా సంశయాద్వాపి భయాద్వాప్యవిమోక్షజాత్ । ఉత్పన్నే చాపి విజ్ఞానే నాధిగచ్ఛతి తాం గతిమ్॥" (12-313-45)**

క. జ్ఞానము విజ్ఞానము నీ । మానిత గుణము లగు నవి సమగ్రములైనం
గానేరదు మోక్షపదము । గానుపు - దృఢనిశ్చయుండు గాకున్నేనిన్. 290

ప్రతిపదార్థం: జ్ఞానము= జ్ఞానమూ; విజ్ఞానము= విజ్ఞానమూ; నీ= నీయొక్క; మానితగుణములు+అగున్= గొప్ప గుణాలు అయ్యాయి - నిజమే; అవి= ఆ రెండూ; సమగ్రములు+ఐనన్= పరిపూర్ణాలు అయినా; దృఢనిశ్చయుండు= దృఢమైన నిశ్చయం కలవాడవు; కాకున్న+ఏనిన్= కానట్లయితే; మోక్షపదము+కానుపు= మోక్షపదం యొక్క దర్శనం; కానేరదు= జరగబోదు.

తాత్పర్యం: శుకమహర్షీ! జ్ఞానం, విజ్ఞానం అనేవి నీ గొప్ప గుణాలు అనటం నిజమే. అవి ఎంత సమగ్రంగా నీలో ఉన్నా నీవు బాల్యం వలన కలిగే సంశయభయాలను విడిచిపెట్టి దృఢనిశ్చయానికి రాకపోతే ముక్తిపదవీదర్శనం జరుగదు సుమా!

తే. ఒక్క కొఱఁతయు లేదు నీ వుదితమోక్ష । బోధుఁడవు సంశయములెల్లఁ బోవవిడిచి
నిశ్చయింపుము నీ కన్న నెలవు శాశ్వ । తంపు నెలవుగ విషయావికంపితాత్మ!' 291

ప్రతిపదార్థం: విషయ= నృత్యగీత సౌందర్యాదులూ ద్వంద్వాలూ మొదలైన విషయాలకు; అవికంపిత= చలించని; ఆత్మ!= అంతరంగం కలవాడా!; ఒక్క కొఱఁతయున్= ఒక్కటంటే ఒక్క లోటుకూడా; లేదు= నీలో లేదు; నీవు; ఉదిత= సిద్ధించిన; మోక్షబోధుఁడవు= మోక్షజ్ఞానం కలవాడవు; సంశయములు+ఎల్లన్= సందేహాలన్నీ; పోవన్+విడిచి= పారద్రోలి; నీ+కన్న+నెలవు= నీవు దర్శించిన చోటు; శాశ్వతంపు+నెలవుగన్= శాశ్వతస్థానంగా; నిశ్చయింపుము.

తాత్పర్యం: నిశ్చలమైన మనస్సు కలవాడా! నీకు ఏ లోటూ లేదు. నీవు మోక్షజ్ఞానివి. సంశయాలు అన్నీ విడిచిపెట్టుము. నీవు దర్శించిన చోటునే ఈ శాశ్వతనివాసంగా నిశ్చయించుకొమ్ము.

విశేషం: ఇక్కడ మూలభారతంలో శుకుడిని ప్రశంసించే శ్లోకాలు మూడు ఉన్నాయి. 'మహర్షీ! నీకు సుఖదుఃఖాలకు తేడా లేదు. దేనికీ లోలుడవు కావు. నృత్తగీతాలపట్ల ఔత్సుక్యం లేదు. రాగమూ లేదు. బంధువులపట్ల అనుబంధం లేదు. భయమూ లేదు. మట్టినీ, బంగారాన్నీ సమానంగా చూడగలిగిన మహానుభావుడవు నీవు. అక్షయమూ, అనామయమూ అయిన మోక్షమార్గాన్ని పొందినవాడవుగా నిన్ను నేనూ తక్కిన ఈ మనీషులూ భావిస్తున్నాం. **"నాస్తి తే సుఖదుఃఖేషు విశేషో నాస్తి లోలుపా(?) నౌత్సుక్యం నృత్తగీతేషు న రాగ ఉపజాయతే (48). న బంధుషు నిబంధస్తే న భయేష్వస్తి తే భయమ్ । పశ్యామి త్వాం మహాభాగ తుల్యలోష్టాశ్మకాంచనమ్ ॥ (49). అహం చ త్వామనుపశ్యామి యే చాప్యన్యే మనీషిణః । ఆస్థితం పరమం మార్గమక్షయం**

తమనామయమ్॥" (50). ఈ మూడు శ్లోకాల సారాన్ని తిక్కన 'విషయాకంపితాత్మ!' అనే సంబుద్ధిలోనికి సంగ్రహించాడు.

శుకుఁడు హిమవంతంబున నున్న వ్యాసునియొద్దకు వచ్చుట (సం. 12-314-2)

క. అని బోధించిన జనకు వ । చనములు విని శుకుఁడు విగతసంశయుఁడై శాం
తినిరూఢిఁ బరమసౌఖ్యం । బు నొంది తనుఁ దాన కనుచుఁ బోవుచునుండెన్. 292

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; బోధించిన= ఉపదేశించిన; జనకు= జనకమహారాజుగారి; వచనములు= పలుకులు; విని= ఆలకించి; శుకుఁడు= శుకమహర్షి; విగత= తొలగిపోయిన; సంశయుఁడై= సంశయాలు కలవాడై (సంశయాలు తొలగినవాడై); శాంతి= మనశ్శాంతియొక్క; నిరూఢిన్= స్థిరసంప్రాప్తితో; పరమసౌఖ్యంబున్= గొప్ప సౌఖ్యాన్ని; ఒంది= పొంది; తనున్= తనను; తాను+అ= తానే; కనుచున్= దర్శిస్తూ; పోవుచున్+ఉండెన్= ప్రయాణం సాగిస్తున్నాడు.

తాత్పర్యం: జనకుడి ఉపదేశంతో శుకుడి సంశయాలు తీరిపోయాయి. శాంతీ సౌఖ్యమూ గాఢంగా లభించాయి. అంతర్దర్శనం ఏర్పడింది. ప్రయాణం అయ్యాడు.

తే. మారుతముతో సమానధర్మత్వమొంది । యతఁ డుదఙ్ముఖుడై నిఖిలామరులును
మునులు గరుడగంధర్వాదులును గుతూహ । లమున వసియించు శిశిరశైలమున కరిగె. 293

ప్రతిపదార్థం: మారుతముతోన్= వాయువుతో; సమానధర్మత్వము= సమానమైన లక్షణాన్ని; ఒంది= పొంది; అతఁడు= ఆ శుకుడు; ఉదక్+ముఖుడు+ఐ= ఉత్తరదిక్కుకు అభిముఖుడై; నిఖిల+అమరులును= సమస్తదేవతలూ; మునులున్= మునులూ; గరుడగంధర్వ+ఆదులును= గరుత్మంతుడూ, గంధర్వులూ మొదలైన దివ్యజాతులవారూ; కుతూహలమునన్= ఉత్సుకతతో; వసియించు= నివసించే; శిశిరశైలమునకున్= చలిమలకు (హిమవత్పర్వతానికి); అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: శుకుడు ఉత్తరదిశగా బయలుదేరాడు. వాయువేగంతో ఆకాశమార్గాన సాగిపోయాడు. సకలదేవతలూ, మునులూ గరుడగంధర్వాదులూ ముచ్చటపడి నివసించే హిమశైలానికి వెళ్ళాడు.

సీ. కురువంశముఖ్య! యగ్గిరి పుణ్యవిభవస । మేతంబు విను మమ్మహీధరమునఁ
బరమేశ్వరుండు దపం బేకపాదస్థుఁ । డై బహువర్షంబు లాచరించెఁ,
బుత్రలాభార్థిత్వమునఁ గృష్ణుఁ డుత్కృష్ట । నియమాచరణములు నిష్ఠ సలిపె,
షణ్ముఖుం డాత్మీయశక్తి ప్రభావంబుఁ । దెలిపి దేవాధికతేజుఁ డయ్యె,

తే. మఱియుఁ బెక్కండ్రు మునులు నమర్త్యులును సు । చరితములఁ బెంపునొంది, రా శైల మా వృ
షాంకునకుఁ గూఁతునిచ్చె, యాగాంగయోని । యగుట నజుఁడు దదాత్మత్వమర్థిఁబొందె. 294

ప్రతిపదార్థం: కురువంశముఖ్య!= కురువంశంలో ప్రధానుడవైన ఓ ధర్మరాజా!; ఆ+గిరి= ఆ హిమవత్పర్వతం; పుణ్యవిభవ= పుణ్యవైభవంతో; సమేతంబు= కూడుకొన్నది; వినుము; ఆ+మహీధరమునన్= ఆ పర్వతంమీద; పరమేశ్వరుండు= శివుడు; ఏకపాదస్థుఁడై= ఒంటికాలిమీద నిలిచి; తపంబు= తపస్సు; బహువర్షంబులు= చాలా సంవత్సరాలు; ఆచరించెన్= చేశాడు; కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; పుత్రలాభ+అర్థిత్వమునన్= తనకు కొడుకు పుట్టాలి అనే కోరికతో; ఉత్కృష్ట= శ్రేష్ఠమైన; నియమ= తపోనియమాల; ఆచరణములు= ఆచరణాలను (నియమాలను ఆచరించటాలు); నిష్ఠన్= దీక్షతో (నిష్ఠతో); సలిపెన్= జరిపాడు; షట్+ముఖుండు= ఆరు ముఖాలుగల కుమారస్వామి; ఆత్మీయ= తనయొక్క; శక్తి= శక్తి అనే ఆయుధం తాలూకు; ప్రభావంబున్= మహిమను; తెలిపి= ప్రకటించి; దేవ+అధిక= దేవతలందరిలోకీ అధికమైన; తేజుఁడు= పరాక్రమం కలవాడు; అయ్యెన్= అయ్యాడు-

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సకలదేవతలలోకీ అధికతేజస్వి అయ్యాడు; మఱియున్= ఇంకా; పెక్కండ్రు= పలువురు; మునులు= ఋషులూ; అమర్త్యులును= దేవతలూ; సుచరితములన్= మంచి చరిత్రలతో - తపోనియమాల ఆచరణలతో; పెంపున్+ఒందిరి= ప్రసిద్ధి పొందారు (అతిశయించారు); ఆ+శైలము= ఆ హిమవత్పర్వతం; వృష+అంకునకున్= వృష(భ) వాహనుడైన శివుడికి; కూఁతున్+ఇచ్చెన్= కూతురునిచ్చి వివాహం చేశాడు; యాగ+అంగ+యోని= యజ్ఞయాగాలకు అవసరమైన వస్తువులకు (అంగాలకు) జన్మస్థలం; అగుటన్= అవ్వటంవలన; అజుఁడు= బ్రహ్మదేవుడు; తద్+ఆత్మత్వము= హిమవంతుడి హృదయస్థానాన్ని; అర్థిన్= కోరికతో; పొందెన్= పొందాడు; బ్రహ్మదేవుడే తానై కోరి హిమశైలాత్మ అయ్యాడు.

తాత్పర్యం: ధర్మరాజా! పరమపవిత్రమూ, పుణ్యప్రదమూ అయిన ఆ హిమవత్పర్వతం గురించి చెప్తాను వినుము. పరమేశ్వరుడు ఒంటికాలిమీద నిలబడి వేల సంవత్సరాలు అక్కడ తపస్సు చేశాడు. కొడుకు పుట్టాలి - అనే కోరికతో విష్ణుమూర్తి (శ్రీకృష్ణుడు) కఠిన నియమాలతో తపస్సు చేసింది అక్కడే. షణ్ముఖుడు తన శక్త్యాయుధం మహిమను దేవతలకందరికీ ప్రదర్శించి అత్యధిక తేజస్వంతుడుగా నిరూపణ పొందిందీ అక్కడే. ఇంకా చాలామంది మునులూ, దేవతలూ తమ తమ తపోదీక్షలతో ప్రశస్తి పొందిందీ అక్కడే. ఆ శైలరాజే తన కూతురు పార్వతిని శివుడికి ఇచ్చి వివాహం చేశాడు. యజ్ఞావసర వస్తువుల కన్నింటికీ ఆ పర్వతం పుట్టిల్లు. అందుకని బ్రహ్మదేవుడు కోరి ఆ పర్వతాత్మ అయ్యాడు. (అంటే హిమవత్పర్వతం పరబ్రహ్మస్వరూపం అని. ఇంకా భీష్ముడు చెప్తున్నాడు.)

వ. అట్టి మహామహిమ గలుగు నా హిమవంతంబునకు మున్న వచ్చి సుమంతు వైశంపాయన జైమిని పైలనామధేయు లగు శిష్యులం గరుణావిధేయుండగు సాత్యవతేయుం డధ్యయనంబు సేయించుచుండం బుణ్యతమంబగు తదాశ్రమంబు భానుప్రభానిభంబగు నిజకాంతి విసరంబున వెలుంగ నయ్యారణేయుం డమ్ముని పాలికింజని తాను యోగబలంబున ననేకంబులైన గిరిసరిదరణ్యంబులు గడచి యెందునుం దగులువడక కార్ముకజ్యానిర్ముక్త శరంబుచందంబున నేతెంచుటకుం బ్రీతుండగు నప్పరాశరనందను పాదంబుల కభివందనంబు సేసిన నతం డభినందింప నాసన్నక్షమాసీనుండై జనకజననాథసంవాదవిధంబు విన్నవించి విశేషసమ్మదం బావహించె నిట్లరణిసుతు సమాగంబు నొంది. 295

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; మహామహిమ= గొప్ప మహత్తు; కలుగు= కలిగిన; ఆ హిమవంతంబునకున్= ఆ హిమవత్పర్వతానికి; మున్ను+అ+వచ్చి= ముందే చేరుకుని; సుమంతు= సుమంతుడూ; వైశంపాయన= వైశంపాయనుడూ; జైమిని; పైల= పైలుడూ అనే; నామధేయులు+అగు= పేర్లు కలవారైన; శిష్యులన్= శిష్యులను; కరుణావిధేయుండు+అగు= దయకు లొంగిపోయినవాడైన (దయాశీలి); సాత్యవతేయుండు= సత్యవతీదేవి కుమారుడు - వ్యాసుడు; అధ్యయనంబు= వేదాభ్యాసం; చేయించుచుండన్= చేయిస్తూ ఉండగా; పుణ్యతమంబు+అగు= అధికపుణ్యప్రదమైన; తద్+ఆశ్రమంబు= ఆ ఆశ్రమం; భానుప్రభా= సూర్యకాంతితో; నిభంబు+అగు= సాటివచ్చేదయిన; నిజ= తనయొక్క; కాంతివిసరంబునన్= తేజఃపుంజంతో; వెలుంగన్= ప్రకాశించగా; ఆ+ఆరణేయుండు= అరణి సంభవుడైన ఆ శుకుడు; ఆ+ముని+పాలికిన్= ఆ వ్యాసమహర్షి సమీపానికి; చని= వెళ్ళి; తాను; యోగబలంబునన్= యోగశక్తితో; అనేకంబులు+ఐన= అసంఖ్యాకాలైన; గిరి= పర్వతాలూ; సరిత్= నదులూ; అరణ్యంబులు= అడవులూ; కడచి= దాటుకుంటూ; ఎందునున్= ఎక్కడా కూడా; తగులు+పడక= మనస్సు సంలగ్నంకాక; కార్ముక= ధనుస్సుయొక్క; జ్యా= అల్లెత్రాడునుంచి; నిర్ముక్త= విడువబడిన; శరంబు+చందంబునన్= బాణంవలె; ఏతెంచుటకున్= తిరిగివచ్చినందుకు; ప్రీతుండు+అగు= సంతోషించినవాడైన; ఆ+పరాశరనందను= ఆ వ్యాసునియొక్క; పాదంబులకున్= చరణాలకు; అభివందనంబు= నమస్కారం; చేసినన్= చేసేసరికి; అతండు= ఆ వ్యాసుడు; అభినందింపన్= మెచ్చుకోగా; ఆసన్న= సమీపమందలి; క్షమా= నేలమీద; ఆసీనుండై= కూర్చున్నవాడై; జనక జననాథ= జనకమహారాజుతో జరిగిన; సంవాద=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంభాషణయొక్క; విధంబున్= పద్ధతిని; విన్నవించి= మనవిచేసి; విశేష= అత్యధికమైన; సమ్మదంబున్= సంతోషాన్ని; ఆవహించెన్= కలిగించాడు; ఇట్లు; అరణిసుతు= శుకమహర్షియొక్క; సమాగమంబున్= కలయికను; ఒంది= పొంది.

తాత్పర్యం: అటువంటి హిమాలయానికి శుకుడికంటే ముందే వ్యాసుడు చేరుకున్నాడు. సుమంతు వైశంపాయన జైమిని పైలులనే నలుగురు శిష్యులకు వేదం నేర్పుతున్నాడు. అటువంటి దయాశాలి నివసిస్తున్న ఆశ్రమం సూర్యకాంతితో ప్రకాశిస్తోంది. శుకుడు అక్కడికి చేరుకొన్నాడు. తాను యోగబలంతో నానాగిరినదీనదాలు దాటి ఎక్కడా చిక్కుపడక ధనుస్సునుండి వెలువడిన బాణంవలె తన పుత్రుడు తిరిగిరావటాన్ని వ్యాసుడు సంతోషించాడు. శుకుడు పాదాభివందనం చేసి చేరువలో నేలమీద కూర్చున్నాడు. జనకుడితో జరిపిన సంభాషణ అంతా విన్నవించాడు. వ్యాసుడికి పరమానందం అయింది.

విశేషం: అలం: ఉపమ.

క. అమ్మునియును శిష్యులతో । నమ్మహితాత్ము నునుచికొని యధ్యాపనశీ
లమ్మగు చిత్తముతోడ సు । ఖమ్ముండఁగ నొక్కనాఁడు గౌరవమొప్పన్. 296

ప్రతిపదార్థం: ఆ+మునియును= ఆ వ్యాసుడుకూడా; శిష్యులతోన్= తన నలుగురు ఛాత్రులతోనూ; ఆ+మహితాత్మున్= ఆ మహానుభావుడైన శుకుడిని; ఉనిచికొని= కలుపుకొని; అధ్యాపనశీలమ్ము+అగు= నిరంతరం చదువు చెప్పే స్వభావం కలదైన; చిత్తముతోడన్= హృదయంతో; సుఖమ్ము+ఉండఁగన్= సుఖంగా ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజున; గౌరవము+ఒప్పన్= గౌరవం స్ఫురించేట్టు.

తాత్పర్యం: వ్యాసుడు ఆ శుకుడిని తన నలుగురు శిష్యులతోనూ కలిపి మొత్తం అయిదుమందికీ అధ్యాపనం చేస్తున్నాడు. వ్యాసుడు అనారతాధ్యాపన తత్పరుడు. అదే ఆయనకు ఆనందం. అట్లా సుఖంగా కాలం గడుస్తోంది. వ్యాసుడిని గౌరవంగా సేవించుకొనే శిష్యులంతా ఒకరోజున ఇట్లా అన్నారు: (తరువాతి వచనంతో అన్వయం).

వ. కొలిచియుండు సుమంతుప్రభృతులు నలువు రతనితో 'దేవా! శుకుండు మొదలుగాఁ గల యేమేవురము వేదవిషయప్రఖ్యాతి నెల్లవారికంటె నెక్కుడు గావలయు, మమ్ముంబోలె నొడ్ల నాదరాధిక్యంబున భరంపడి సవిశేషంబుగా నధ్యయనంబు సేయింపకుండుట మాకు వరం' బని విన్నవించిన వీత పక్షపాత చిత్తుండగు నత్తాపసోత్తముండు. 297

ప్రతిపదార్థం: కొలిచియుండు= సేవిస్తూండే; సుమంతుప్రభృతులు= సుమంతుడూ మొదలైన; నలువురు= నలుగురూ; అతనితోన్= ఆ వ్యాసుడితో; దేవా!= గురుదేవా!; శుకుండు= శుకుడు; మొదలుగాన్= మొదటివాడుగా; కల= ఉన్న; ఏము+ఏవురమున్= మేము అయిదుగురమూ; వేదవిషయ= వేదాలు కారణంగా లభించే; ప్రఖ్యాతిన్= ప్రసిద్ధి విషయంలో; ఎల్లవారికంటెన్= అందరికన్నా; ఎక్కుడు= ఎక్కువ; కావలయున్= కావాలి; మమ్మున్+పోలెన్= మాలాగా; ఒడ్లను= ఇతరులను; ఆదర+ఆధిక్యంబునన్= అధికాదరంతో; భరంపడి= పూచీవహించి (బాధ్యత వహించి); సవిశేషంబుగాన్= అత్యధికంగా; అధ్యయనంబు+చేయింపక+ఉండుట= వేదాధ్యయనం చేయించక పోవటం (ఇతరులకు మాకంటే అధికంగా వేదాలు నేర్పకపోవటం); మాకున్= మాకు; వరంబు+అని= మంచిది అని (నీవు ఈయవలసిన వరం అని); విన్నవించినన్= మనవి చేసేసరికి; వీతపక్షపాత= పక్షపాతం లేని; చిత్తుండు+అగు= హృదయం కలవాడైన; ఆ+తాపస+ఉత్తముండు= ఆ ఋషీశ్వరుడు-

తాత్పర్యం: 'గురుదేవా! వేదాలవలన లభించే ప్రసిద్ధిలో మేము అయిదుగురమూ అందరికంటే ఎక్కువగా ఉండాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మమ్మల్ని మించినవారు ఉండకూడదు. అంటే నీవు మరింకెవరికీ ఇంతకన్నా ఆదరంతో ఇంతకన్నా అధికంగా వేదాలు నేర్పకూడదు. ఈ వరం అనుగ్రహించు' మని శిష్యులు అభ్యర్థించేసరికి పక్షపాతరహితుడైన ఆ వ్యాసుడు ఇట్లా సమాధానం చెప్పాడు.

తే. **భక్తుఁడగు బ్రాహ్మణునకు వా గ్బ్రహ్మ మఖిల । మును బ్రియంబున నిచ్చు సజ్జనుని చేతి**
లోనియది బ్రహ్మలోకంబు దీని మీర । లేర్పడఁగ నెన్నఁడును విని యెఱుఁగ రెట్లు! 298

ప్రతిపదార్థం: బ్రహ్మలోకంబు= బ్రహ్మలోకం; భక్తుఁడు+అగు= భక్తుడైన (ఆసక్తి కలవాడైన); బ్రాహ్మణునకున్= విప్రుడికి; వాక్+బ్రహ్మము= వాగ్రూపమైన (బ్రహ్మము) వేదాన్ని; అఖిలమున్= పూర్తిగా; ప్రియంబునన్= ప్రేమతో; ఇచ్చు= నేర్పేటువంటి; సజ్జనుని= సత్పురుషుడియొక్క; చేతిలోని+అది= చేతిలోది; దీనిన్= ఈ విషయాన్ని; మీరలు= మీరు; ఏర్పడఁగన్= స్పష్టపడేట్టు; ఎన్నఁడునున్= ఏనాడూ; విని+ఎఱుఁగరు+ఎట్లు!= విని ఎరగరా ఏమి! (విని ఉండలేదా!).

తాత్పర్యం: 'భక్తుడైన బ్రాహ్మణుడికి వేదమంతా ప్రేమతో నేర్పే సత్పురుషుడికి బ్రహ్మలోకమనేది అరచేతిలో వస్తువు. అతడు అంత అనాయాసంగా బ్రహ్మలోకం పొందుతాడు. దీన్ని మీరు ఎప్పుడూ ఎక్కడా విని ఉండలేదా! ఆశ్చర్యమేనే!

క. **వినుఁ డెల్లవారు దుర్గం । బును గడచి శుభంబునొంది పురుషార్థములం**
గనువార కాక యనియెడు । ననుగ్రహము వలదె? యిట్టులనఁ దగ వగునే? 299

ప్రతిపదార్థం: వినుఁడు= శిష్యులారా! వినండి; ఎల్లవారున్= చతుర్వర్ణాలవారు అందరూ; దుర్గంబును= కష్టాన్ని; కడచి= దాటి; శుభంబున్= మంచిని; ఒంది= పొంది; పురుష+అర్థములన్= ధర్మార్థకామ మోక్షాలను; కనువారు+అ+కాక!= పొందేవారే కదా!; అనియెడు= అనేటువంటి; అనుగ్రహము= అనుగ్రహం; వలదె?= ఉండవద్దా?; ఇట్టు= ఇలా; అనన్= అనటం; తగవు= న్యాయం; అగునే?= అవుతుందా? - ధర్మమేనా?

తాత్పర్యం: శిష్యులారా! ఆలకించండి. ప్రపంచంలో ప్రతివాడూ కష్టాలు గడచి శుభాలు పొందాలి, పురుషార్థాలను అనుభవించాలి - అనివారిపై అనుగ్రహం మనకు ఉండవద్దా! మీరు ఇట్లా స్వార్థంతో అడగటం సమంజసమా? అది ధర్మమా? చెప్పండి?

విశేషం: అందరూ కష్టాలను గట్టెక్కుదురుగాక! భద్రాలను పొందుదురుగాక! బ్రాహ్మణుడిని అగ్రభాగంలో కూర్చోబెట్టుకుని నాలుగువర్ణాలవారికీ వేదాలు వినిపింతురుగాక! - అని ఉంది మూలంలో. **"సర్వస్తరతు దుర్గాణి సర్వో భద్రాణి పశ్యతు । శ్రావయేచ్చతురో వర్ణాన్ కృత్వా బ్రాహ్మణమగ్రతః ॥" (12-314-45).**

చ. **అనుటయు వార లొండొరుల యాననముల్ గనుఁగొంచు నవ్వి యి**
ట్లని రటులేనిఁ బోదుమె దయాపర! శైలము డిగ్గి భూమి నెం
దును జరియించి యధ్యయన దోహలులం జదివించి యాజనం
బు నడపి నీ కృపారసము పొంగు నిగుడ్తుమె యెల్ల చోటులన్? 300

ప్రతిపదార్థం: అనుటయున్= వ్యాసుడు అలా అనేసరికి; వారలు= ఆ శిష్యులు నలుగురూ; ఒండొరుల+ఆననముల్= ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు; కనుఁగొంచున్= చూసుకుంటూ; నవ్వి= చిరునవ్వుల చిందించి; ఇట్లు+అనిరి= ఇలా అన్నారు: దయాపర!= ఓ కృపాళూ!; శైలమున్= ఈ హిమవత్పర్వతాన్ని; డిగ్గి= దిగి; పోదుమె?= వెళ్ళమా?; భూమిన్= భూలోకంలో; ఎందున్= అంతటా; చరియించి= సంచారం సాగించి; అధ్యయనదోహలులన్= వేదాలు అధ్యయనం చేయాలి అనే ఉత్సాహమూ, కోరికా కలవారిని, చదివించి; యాజనంబున్= యజ్ఞాలు చెయ్యించటాన్ని; నడపి= నిర్వహించి; ఎల్లచోటులన్= అన్ని ప్రదేశాల్లోనూ; నీ= నీయొక్క;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కృపారసము+పొంగున్= దయామృతపు వెల్లువను; నిగుడ్తుమె?= ప్రవహింప చెయ్యమా?

తాత్పర్యం: వ్యాసుడి మాటలకు ఆ శిష్యులు నలుగురూ ముఖముఖాలు చూచుకొన్నారు. చిన్నగా నవ్వులు చిందించి ఇట్లా అన్నారు: ఓ దయాళూ! అయితే మరి మమ్మల్ని ఈ హిమాలయం దిగి భూమిమీదకు వెళ్ళమంటారా? అక్కడ అంతటా సంచరిస్తూ, వేదాలు నేర్చుకొనాలి - అనే కోరిక కలవాళ్ళను గుర్తించి వాళ్ళకు నేర్పమంటారా? యజ్ఞయాగాదులు చేయించమంటారా? మీ దయామృతం వెల్లువలను అంతటా ప్రవహింపజేయుమంటారా?

విశేషం: ఇక్కడ మూలంలో శిష్యులు పరమవైదికంగా మాట్లాడారు. 'మహామునీ! వేదాలను బహుశాఖలుగా విస్తరింపజేయాలి అనే కోరికతో మేమంతా ఇక్కడినుండి భూమికి దిగాలని కోరుకొంటున్నాం. సమ్మతమేనా?' అన్నారు. '**శైలాదస్మాన్మహీం గంతుం కాంక్షితం నో మహామునే, వేదా ననేకధా కర్తుం యది తే రుచిరం ప్రభో (4).** కృపారసము పొంగు నిగుడ్తుమె' అనే కవితామయోక్తి తిక్కన కల్పన.

చ. **అనవుడు 'మున్న యిట్టు లన రైతిరి వోవఁగనీను మిమ్ము నెం**
దును గడు వెడ్డువెట్టితిరి దోహల మిమ్మెయినుండ జాణలై
నను నిటు వేఁటొకం డడిగి నా వచనంబులు మీ మనోరథం
బున కిటు సాధనంబులుగఁ బోకలఁ బోయితి' రంచు నవ్వుచున్. 301

ప్రతిపదార్థం: అనవుడున్= అని శిష్యులు అడిగేసరికి - వ్యాసుడు ఇట్లా అంటున్నాడు; మున్ను+అ= ముందుగానే; ఇట్టులు= ఇట్లా; అనరు+ఐతిరి= మీరు అనకపోయారు; మిమ్మున్= మిమ్ములను; ఎందున్= ఎక్కడికీ; పోవఁగన్+ఈను= వెళ్ళనీయను; కడున్= బాగా; వెడ్డ+పెట్టితిరి= నన్ను మోసగించారు; దోహలము= మీ ఉత్సాహం; ఈ+మెయిన్= ఈ రీతిగా; ఉండన్= ఉంటే (ఉండగా); జాణలై= చతురులై; ననున్= నన్ను; ఇటు= ఇట్లా; వేఱు+ఒకండు= మరొకటి; అడిగి= అభ్యర్థించి; నా+ వచనంబులు= నా సమాధానవాక్యాలు; మీ+మనోరథంబునకున్= మీ కోరికకు; సాధనంబులుగన్= అనుకూలముగా ఉండేట్టు; పోకలన్+పోయితిరి= వేషాలు వేసారు; అంచున్= అంటూ; నవ్వుచున్= నవ్వుతూ.

తాత్పర్యం: శిష్యులు అట్లా అడిగేసరికి వ్యాసుడికి అసలు సంగతి అర్థమయింది. నవ్వుతూ ఇట్లా అన్నాడు: 'శిష్యులారా! ముందుగానే మీరు ఇట్లా అడిగి ఉంటే బాగుండేది. అడుగలేదు. నన్ను మోసం చేశారు. మీ మనస్సులో కోరిక ఇట్లా భూమిమీదకు వెళ్ళాలి అని ఉంటే మరో విధంగా మాట్లాడి నా మాటలు మీ కోరికలకు అనుకూలంగా ఉండేటట్లు పన్నాగం పన్నారు. జాణతనం చూపించి వేషాలు వేశారు.' అంటూ నవ్వుతూ.

విశేషం: ఈ సరస సంభాషణ పూర్తిగా అమూలకం. తిక్కన కల్పన.

తే. **తమ్ము సంప్రీతిఁ గనుఁగొను నమ్మునీంద్రు । చరణకమలంబులకుఁ జక్కఁ జాఁగి మ్రొక్కి**
రన్నలువురును వారల నతఁడు దివిచి । కరుణ సిగురొత్త బిగియారఁ గౌఁగిలించి. 302

ప్రతిపదార్థం: తమ్మున్= తమ నలుగురినీ; సంప్రీతిన్= ప్రేమతో; కనుఁగొను= తిలకిస్తున్న; ఆ+మునీంద్రు= ఆ వ్యాసమహర్షి యొక్క; చరణకమలంబులకున్= పాదపద్మాలకు; ఆ+నలువురును= ఆ నలుగురూ; చక్కన్= (వెంటనే) చక్కగా; చాఁగిమ్రొక్కిరి= సాష్టాంగ నమస్కారం చేశారు; వారలన్= ఆ నలుగురినీ; అతఁడు= ఆ వ్యాసుడు; తివిచి= లేవనెత్తి; కరుణ+చిగురు+ఒత్తన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దయ పల్లవింపగా; బిగియారన్= గట్టిగా; కౌఁగిలించి= ఆలింగనం చేసుకొని.

తాత్పర్యం: ప్రేమ నిండిన కన్నులతో తమను వీక్షిస్తున్న ఆ వ్యాసుడికి నలుగురూ సాష్టాంగపడ్డారు. వారిని లేవనెత్తి ఆ మహర్షి దయ పల్లవించగా గట్టిగా కౌగిలించుకొన్నాడు. అటుపైని దీవించాడు. (తరువాతి వచనంతో అన్వయం).

వ. దీవించి 'యెయ్యది సేసిన నప్రమాదాయత్త చిత్తులరై చేయుండు త్రిలోకంబు లందును మీకుం బ్రియంబైన చోటుల వర్తిల్లుం'డని వీడుకొలిపినఁ జని వార లధ్యాపనయాజన విశేషంబుల నశేషదేశంబులు నలంకరించుచుండి; రట్టియెడ. 303

ప్రతిపదార్థం: దీవించి= ఆశీర్వదించి; ఏ+అది+చేసినన్= ఏది చేసినా; అప్రమాద+ఆయత్త+చిత్తులరు+ఐ= పొరపాటుపడని మనస్సుకలవారై (జాగరూకులై); చేయుండు= చేయండి; త్రిలోకంబులందునున్= ముల్లోకాలలోనూ; మీకున్= మీకు; ప్రియంబైన చోటులన్= ఇష్టమైన (నచ్చిన) ప్రదేశాలలో; వర్తిల్లుండు= సంచరించండి; అని= అని చెప్పి; వీడుకొలిపినన్= వ్యాసుడు పంపిస్తే; చని= వెళ్ళి; వారలు= ఆ నలుగురూ; అధ్యాపన= వేదాలు చదివించటం; యాజన= యజ్ఞాలు చేయించటం అనే; విశేషంబులన్= విశేషకార్యక్రమాలతో; అశేషదేశంబులన్= అన్ని రాజ్యాలనూ (ప్రదేశాలనూ); అలంకరించుచుండిరి= శోభిల్లజేస్తున్నారు; అట్టియెడన్= అప్పుడు.

తాత్పర్యం: వ్యాసుడు ఆ శిష్యులను దీవించి, 'ఏది చేసినా, జాగరూకులై చెయ్యండి. ముల్లోకాలలోనూ, మీకు ఇష్టమైన ప్రదేశాలలో సంచరించండి' అని చెప్పి పంపగా వెళ్ళి ఆ నలుగురూ వేదాలు చదివించటం, యజ్ఞాలు చేయించటం వంటి కార్యక్రమాలతో అన్ని రాజ్యాలనూ శోభింపజేస్తున్నారు. అప్పుడు.

క. నారదుఁడు వచ్చి ప్రీతిం। బారాశర్యమునిఁ గాంచి 'బ్రహ్మనినాదం
బీ రున్నచోట లేమికిఁ। గారణమేమియొకొ?' యనుడు గారవమెసఁగన్. 304

ప్రతిపదార్థం: నారదుఁడు= నారదమహర్షి; వచ్చి= విచ్చేసి; ప్రీతిన్= ప్రియంగా; పారాశర్యమునిన్= పరాశరుడి సంతానమైన వ్యాసమునీంద్రుడిని; కాంచి= దర్శించి; ఈరు= మీరు; ఉన్నచోటన్= ఉన్నస్థలంలో; బ్రహ్మనినాదంబు= వేదధ్వని; లేమికిన్= లేకపోవటానికి; కారణము+ఏమియొకొ?= హేతువు ఏమిటిచెప్మా?; అనుడున్= అనటంతో; గారవము+ఎసఁగన్= గౌరవం స్ఫురించేట్టు.

తాత్పర్యం: శిష్యులు నలుగురూ వెళ్ళిపోయారు. తండ్రీకొడుకులు ఇద్దరే ఆశ్రమంలో ఉంటున్నారు. ఆ సమయంలో ఒకరోజున నారదమహర్షి వ్యాసాశ్రమానికి వచ్చాడు. వస్తూనే ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. 'మహర్షీ! మీరు ఉన్నచోట వేదధ్వనులు వినిపించకపోవటం ఏమిటి? వింతగా ఉందే? దీనికి కారణం ఏదయినా ఉన్నదా?' అని అడిగాడు. సగౌరవంగా వ్యాసుడు (బదులు పలికాడు).

క. అతఁ డతనితోడ 'శిష్య। ప్రతతి యిచట లేమి' యనుడు 'బ్రహ్మర్షివరా!
సుతుఁడును నీవైనను ద। ద్వ్రతంబు సెల్లించుచుండవలదే?' యనినన్. 305

ప్రతిపదార్థం: అతఁడు= ఆ వ్యాసుడు; అతనితోడన్= ఆ నారదుడితో; శిష్యప్రతతి= శిష్యబృందం; ఇచటన్= ఇక్కడ; లేమి= లేకపోవటమే(కారణం); అనుడున్= అనేసరికి; బ్రహ్మర్షివరా!= బ్రహ్మర్షులలో ఉత్తముడా! ఓ వ్యాసా!; సుతుఁడును= నీ కుమారుడూ; నీవు+ఐనను= నీవు అయినా; తద్+వ్రతంబు= ఆ వేదాధ్యయన వ్రతాన్ని; చెల్లించుచుండన్+వలదే= నిర్వహిస్తూ ఉండవద్దా? (దానికి అంతరాయం రాకూడదు కదా!); అనినన్= అనేటప్పటికి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'శిష్యబృందం ఇప్పుడు ఇక్కడ లేకపోవటమే వేదధ్వని వినిపించక పోవటానికి కారణం' అని వ్యాసుడు సగౌరవంగా బదులు పలికాడు. 'వేదాధ్యయనం నిరంతరంగా కొనసాగాలి కదా! అందుచేత నీవూ నీ కుమారుడూ అయినా ఆ వ్రతాన్ని కొనసాగించకపోయారా? అనగా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'నీవును నైనను వ్రతమది సెల్లించుచుండవలదే?' - అని పాఠాంతరం ఉన్నది. 'నీవును నైనను' అనే సముచ్చయార్థకంలో అన్వయసౌలభ్యమూ వాక్యవిన్యాసంలో వ్యావహారికతా మరింత ఎక్కువగా ఉన్నాయి.

క. **నారదుని వచనములుఁ బెం। పారం గొనియాడి భువనమంతయు నాదా**
పూరితముఁ జేసె నమ్ముని। సారాధ్యయనమునఁ బుత్రసంయుక్తుండై. **306**

ప్రతిపదార్థం: నారదుని= నారదుడియొక్క; వచనములున్= సూచనలనుకూడా; పెంపారన్= అతిశయించేట్టు; కొనియాడి= ప్రశంసించి; ఆ+ముని= ఆ వ్యాసుడు; పుత్రసంయుక్తుండై= పుత్రుడితో కలిసినవాడై; సార+అధ్యయనమునన్= సారభూతమైన వేదాధ్యయనంతో; భువనము+అంతయున్= లోకమంతటినీ; నాద= వేదధ్వనితో; ఆపూరితమున్= నిండిపోయిన దానినిగా; చేసెన్= చేసివేశాడు.

తాత్పర్యం: నారదుడినీ అతడి సూచననూ వ్యాసుడు ఎంతగానో ప్రశంసించాడు. తన పుత్రుడితో కలిసి ఉత్తమోత్తమమైన వేదాధ్యయనం తత్క్షణమే ప్రారంభించి ముల్లోకాలనూ వేదధ్వనితో నింపివేశాడు.

వ. **ఇట్లయ్యిరువురు నధ్యయనంబు సేయ మహావాయువు బెట్టు వీచిన నవిశ్శేషజ్ఞుండు పుత్రుతో ననధ్యయన సమయం బగుట సెప్పి తదధ్యయనంబు వారించి తానును నూరకున్న నయ్యారణీయుండు 'నియ్యత్యధికమారుతం బెక్కడిది?' యని యడిగిన నఖిల భూతవేదియగు వేదవ్యాసుండు దేవయానంబున విష్ణుండును పితృయానంబున భానుండును నూర్ధ్వాధోగమన పర్యాయరూపంబునం బ్రవర్తిల్లుదు రది పవనాలంబనకలితంబై చెల్లుఁ బవనుల వినుము సెప్పెద సమానుండు దైవతసంఘసంభవుం డతనికి నుదానుండును నుదానునికి వ్యానుండును వ్యానునికి నపానుండును నపానునికిఁ బ్రాణుండును జనియించిరి. జగంబులు వీరిచేత సంవ్యాప్తంబులైయుండుం బ్రవహుం డావహుం డుద్వహుండు సంవహుండు వివహుండు పవహుండు పరాహుం డనం బవనులు సప్తసంఖ్యు లదితిపుత్రు లఖిల భువనవ్యాప్తులై చరియింతురు. వారు సమానాదిపవనపంచక మహితాత్ములు. వారలవలన వర్షంబులకుం బ్రవర్తన నివర్తనంబులు గలుగుచుండు. వివిధదైవత విమానంబులకును మహితయానం బావహిల్లు నొక్కొక్కనాఁడు విష్ణుని నిశ్శ్వాసవేగంబు.** **307**

ప్రతిపదార్థం: ఇట్లు; ఆ+ఇరువురున్= ఆ తండ్రీకొడుకు లిద్దరూ; అధ్యయనంబు+చేయన్= వేదాధ్యయనం చేస్తుంటే; మహా వాయువు= పెద్దగాలి; బెట్టువీచినన్= భయంకరంగా వీచేసరికి; ఆ+విశేషజ్ఞుండు= విశేషజ్ఞానం కలిగిన ఆ వ్యాసుడు; పుత్రుతోన్= కుమారుడితో; అనధ్యయన సమయంబు= అది వేదాధ్యయనం చెయ్యకూడని సమయం; అగుట= కావటాన్ని; చెప్పి= తెలియపరిచి; తద్= అతడి; అధ్యయనంబు= వేదాధ్యయనం; వారించి= నిలుపుదల చేయించి; తానునున్= తాను కూడా; ఊరక+ఉన్నన్= ఆపివేసి ఉండగా; ఆ+ఆరణీయుండు= అరణి సంభవుడైన ఆ శుకుడు; ఈ+అత్యధిక మారుతంబు= ఈ మహావాయువు; ఎక్కడిది?= ఎక్కడినుంచి వీస్తున్నది; అని; అడిగినన్= అడిగితే; అఖిలభూతవేది+అగు= పంచభూతాలనూ ఎరిగినవాడైన; వేదవ్యాసుండు= ఆ వేదవ్యాసుడు; దేవయానంబునన్= దేవతావిమానంలో; విష్ణుండును= విష్ణుమూర్తీ; పితృయానంబునన్= పితృదేవతలు ప్రయాణించే విమానంలో; భానుండును= సూర్యుడూ; ఊర్ధ్వ+అధః+గమన+పర్యాయరూపంబునన్= పైకీ కిందికీ ఒకరి తరువాత ఒకరుగా; ప్రవర్తిల్లుదురు= ప్రయాణం చేస్తారు; అది= ఆ ప్రయాణం; పవన+ఆలంబన+కలితంబై= వాయువే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆధారంగా కలదై; చెల్లున్= జరుగుతుంది; పవనులన్= వాయువులనుగురించి; చెప్పెదన్= వివరిస్తాను; వినుము; సమానుండు= సమానుడు అనే పేరుగల వాయువు; దైవతసంఘ సంభవుండు= దేవతల జాతిలో (సమూహంలో) జన్మించాడు; అతనికిన్= ఆ సమానుడికి; ఉదానుండును= ఉదానుడనే వాయువూ; ఉదానునికిన్= ఆ ఉదానుడికి; వ్యానుండును= వ్యానుడు అనే వాయువూ; వ్యానునికిన్= ఆ వ్యానుడికి; అపానుండును= అపానుడు అనే వాయువూ; అపానునికిన్= ఆ అపానుడికి; ప్రాణుండును= ప్రాణుడు అనే వాయువూ; జనియించిరి= జన్మించారు; జగంబులు= లోకాలన్నీ; వీరిచేతన్= ఈ వాయుదేవతలచేత; సంవ్యాప్తంబులై= నిండినవై; ఉండున్= ఉంటాయి; ప్రవహుండు= ప్రవహుడూ; ఆవహుండు= ఆవహుడూ; ఉద్వహుండు= ఉద్వహుడూ; సంవహుండు= సంవహుడూ; వివహుండు= వివహుడూ; పవకుండు= పవకుడూ; పరాహుండు= పరాహుడూ; అనన్= అనే పేర్లతో; అదితిపుత్రులు= అదితికుమారులైన; పవనులు= వాయుదేవతలు; సప్తసంఖ్యులు= ఏడుగురు; అఖిలభువనవ్యాప్తులై= అన్ని లోకాలకూ వ్యాపించినవారై; చరియింతురు= సంచరిస్తూ ఉంటారు; వారు= ఆ ఏడుగురూ; సమాన+ఆది= సమానుడూ మొదలైన; పవనపంచక= అయిదుగురు పవనులతో; మహిత+ఆత్ములు= కలిసిన మహానుభావులు; వారలవలనన్= వారివల్లనే; వర్షంబులకున్= వానలకు; ప్రవర్తన+నివర్తనంబులు= ప్రవృత్తి - నివృత్తులు; కలుగుచుండున్= కలుగుతూ ఉంటాయి; వివిధ= పలురకాలైన; దైవతవిమానంబులకున్= దేవవిమానాలకు; మహితయానంబు= వేగవంతమైన కదలిక; ఆవహిల్లున్= సంభవిస్తుంది; ఒక్కొక్కనాఁడు= ఎప్పుడైనా ఒక్కొక్కరోజున; విష్ణుని= విష్ణుమూర్తియొక్క; నిశ్శ్వాసవేగంబు= నిట్టూర్పు వాయువుల వేగం. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఈ విధంగా ఆ ఇద్దరూ వేదాధ్యయనం చేస్తుంటే భయంకరంగా పెద్దగాలివీచింది. వ్యాసుడు ఆనాడు అనధ్యయనదినంగా ప్రకటించాడు. శుకుడు 'ఈ పెనుగాలి ఎక్కడినుండి వీస్తున్నది?' అని అడిగాడు. విశ్వభూత జ్ఞానంగల వ్యాసుడు దానికి కారణం చెప్పాడు. 'దేవతావిమానంలో విష్ణుమూర్తీ, పితృదేవతల విమానంలో సూర్యుడూ క్రిందికీ మీదికీ ప్రయాణం చేయటం వలన ఈ పెనుగాలి ఏర్పడింది. ఆ వాయువులను గురించి వివరిస్తాను. వినుము. సమానుడు అనే వాయువు దేవతలగణంలో పుట్టాడు. సమానుడికి ఉదానుడూ, ఉదానుడికి వ్యానుడూ, ఆ వ్యానుడికి అపానుడూ, అపానుడికి ప్రాణుడూ పుట్టారు. లోకాలన్నీ ఈ వాయువులతో నిండి ఉన్నాయి. ప్రవహుడూ, ఆవహుడూ, ఉద్వహుడూ, సంవహుడూ, వివహుడూ, పవహుడూ, పరాహుడూ అనే పేర్లతో అదితిపుత్రులైన వాయుదేవతలు ఏడుగురు లోకాలన్నీ వ్యాపించి తిరుగుతూ ఉంటారు. ఈ ఏడుగురూ సమానాది పంచవాయువులతో కలిసి ఉండే గొప్పవారు. వారివలననే వానలు కురవటం, కురవకపోవటం కలుగుతూ ఉంటాయి. వివిధ దేవవిమానాలకు వేగవంతమైన కదలికలు కలిగితే, ఒక్కొక్కనాడు విష్ణుదేవుడి నిట్టూర్పు గాలుల వేగం (తరువాతి పద్యంతో అన్వయం).

క. అప్పవనములను గలఁచిన । నిప్పరుసగు వికృతవాయు విది దీని రయం
బిప్పుడు మహనీయంబగు । నిప్పర్వతమునుఁ జలింప నెసకం బెసఁగెన్. 308

ప్రతిపదార్థం: ఆ+పవనములను= ఆ సప్తవాయువులనూ; కలఁచినన్= కలచివేస్తే; ఈ+పరుసు+అగు= ఈ విధంగా జరుగుతుంది; వికృతవాయువు+ఇది= పిచ్చిగాలి ఇది; దీని= ఈ వెర్రిగాలియొక్క; రయంబు= వేగం; ఇప్పుడు; మహనీయంబు+అగున్=పరమ పవిత్రమైన; ఈ+పర్వతమునున్= ఈ హిమవత్పర్వతం కూడా; చలింపన్= కదలిపోయేట్టు; ఎసకంబు+ఎసఁగెన్= అతిశయిస్తుంది.

తాత్పర్యం: విష్ణుమూర్తులవారి నిట్టూర్పు గాలుల వేగం సప్తపవనాలనూ కలచి వేస్తే అప్పుడు ఇటువంటి వెర్రిగాలి ఆవిర్భవిస్తుంది. ఈ హిమాలయాన్ని కూడా కదలించేస్తుందా అన్నంతగా ఉంటుంది దీని అతిశయం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. ఇట్టియప్పుడు సదివిన నెల్లభంగి। నెడరుపుట్టుఁ గావునఁ జదు వుడుగవలసె'
నవియెఁ బదపడి ప్రకృతిస్థమయ్యెఁ బవన। మఖిల భూతంబులకు సౌఖ్య మావహిల్లె. 309

ప్రతిపదార్థం: ఇట్టి+అప్పుడు= ఇటువంటప్పుడు; చదివినన్= వేదాధ్యయనం చేస్తే; ఎల్లభంగిన్= అన్నివిధాలా; ఎడరు+పుట్టున్= కీడు సంభవిస్తుంది; కావునన్= కాబట్టి; చదువు= అధ్యయనం; ఉడుగన్+వలసెన్= ఆపివెయ్యవలసి వచ్చింది; అనియెన్= అని వ్యాసుడు; చెప్పాడు పదపడి= క్రమంగా (కొంతసేపటికి); పవనము= ఆ వికృతవాయువు; ప్రకృతిస్థము+అయ్యెన్= సహజస్థితికి వచ్చింది; అఖిల= సమస్తమైన; భూతములకున్= ప్రాణులకూ; సౌఖ్యము+ఆవహిల్లెన్= సౌఖ్యం కలిగింది.

తాత్పర్యం: నాయనా! ఇటువంటి సమయంలో వేదాధ్యయనం చేస్తే అది అన్నివిధాలా కీడు కలిగిస్తుంది. అందుకని చదువు ఆపవలసి వచ్చింది' అని వ్యాసుడు వివరించాడు. అటుపైని క్రమంగా సుడిగాలి సద్దు మణిగింది. ప్రాణికోటి అంతా హమ్మయ్య అనుకొన్నది, సుఖపడింది.

వ. స్నానకాలం బయ్యెనని పలికి పుత్రునకు 'నీవు చదువుచుండు' మని చెప్పి యప్పారాశర్యుం డాకాశగంగా ప్రపాతప్రదేశంబునకుం జనియె నయ్యారణీయుండును నారదుం డాకర్ణింపఁ గొంతసే పధ్యయనంబుసేసిన నద్దేవముని మెచ్చి యతనితో 'నీకు మేలొనర్చెద నిష్టంబు సెప్పు' మనిన నతం 'డీలోకంబునం బుట్టినవానికి హితం బెయ్యది దానిం జెప్పవే?' యనుటయు నమ్మహాత్ముండు దొల్లి సంయములకు సనత్కుమారుండు సెప్పిన వాక్యంబు లేతత్ప్రయోజనంబు లయియుండు వానిం జెప్పెద వినుమని యిట్లనియె. 310

ప్రతిపదార్థం: స్నానకాలంబు= స్నానానికి వేళ; అయ్యెన్+అని= అయింది అని; పలికి= అంటూ; నీవు; చదువుచుండుము= వేదపాఠం కానిస్తూండుము; అని; పుత్రునకున్= శుకునికి; చెప్పి= ఆజ్ఞాపించి; ఆ+పారాశర్యుండు= పరాశరుడి కుమారుడైన ఆ వ్యాసుడు; ఆకాశగంగా= ఆకాశగంగయొక్క; ప్రపాత= జలపాతాలు ఉన్న; ప్రదేశంబులకున్= ప్రాంతాలకు; చనియెన్= వెళ్ళాడు; ఆ+ఆరణీయుండును= ఆ శుకమహర్షి; నారదుండు; ఆకర్ణింపన్= వింటూండగా; కొంతసేపు= కొంచెంసేపు; అధ్యయనంబు= వేదపఠనం; చేసినన్= చేసేసరికి; ఆ+దేవముని= దేవముని అయిన ఆ నారదుడు; మెచ్చి= మెచ్చుకొని; అతనితోన్= ఆ శుకుడితో; నీకున్= నీకు; మేలు+ఒనర్చెదన్= మేలు చేస్తాను; ఇష్టంబు= నీకు ఇష్టమైనది ఏమిటో; చెప్పుము; అనినన్= అంటే; అతండు= ఆ శుకుడు; ఈ లోకంబునన్= ఈ లోకంలో; పుట్టినవానికిన్= జన్మించిన వ్యక్తికి; హితంబు= హితమైనది; ఎయ్యది= ఏది?; దానిన్= అటువంటి దాన్ని గురించి; చెప్పవే?= వివరించవా?; అనుటయున్= అనటమూ; ఆ+మహాత్ముండు= మహానుభావుడైన ఆ నారదుడు; తొల్లి= పూర్వకాలంలో; సంయములకున్= మునీశ్వరులకు; సనత్కుమారుండు= సనత్కుమారుడు అనే మహర్షి; చెప్పిన= వివరించినటువంటి; వాక్యంబులు= మాటలు; ఏతద్+ప్రయోజనంబులు= ఇదే ప్రయోజనంగా కలవి; అయి+ఉండున్= అవుతాయి నీవు అడిగిన ప్రయోజనానికి సరిపోతాయి; అని; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పటం మొదలుపెట్టాడు.

తాత్పర్యం: ఇక నాకు స్నానానికి వేళ అయింది' అని వ్యాసుడు లేచి, ఆకాశగంగా జలపాతా లున్న చోటికి వెళ్ళిపోయాడు. శుకుడు నారదుడు వింటూండగా కొంతసేపు వేదపఠనం చేశాడు. దానికి మెచ్చి నారదుడు 'నీ కేమి కావాలో కోరుకొమ్ము' అని అడుగగా 'మానవుడికి హితమైనదానిని తెలియజెప్పు' మని శుకుడు అడిగాడు. దానికి నారదుడు 'మునుపు సనత్కుమారుడనే ఋషి కొందరు మునులకు ఇదే విషయాన్ని వివరించాడు. ఇదే ప్రయోజనంకొరకు ఆ వివరాలను విశదీకరిస్తాను' అంటూ నారదుడు మొదలుపెట్టాడు.

నారదుఁడు శుకున కుపదేశించిన తత్త్వప్రకారము (సం. 12-316-5)

తే. తపము సత్యంబ, కన్ను విద్యయ, సుఖంబు। విడుప, దుఃఖంబు రాగంబ, వినుఁడు నరుఁడు
ముక్తి కుత్సహింపక భవసక్తుఁ డైన। నొండు పుట్టువునం దది యొందరాదు. 311

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సత్యంబు+అ= సత్యమే; తపము= తపస్సు; విద్యయ= విద్యయే (జ్ఞానమే); కన్ను= నేత్రం; విడుపు+అ= త్యాగం చెయ్యటమే; సుఖంబు= సుఖం; రాగంబు+అ= అనురాగమే; దుఃఖంబు= దుఃఖం; వినుఁడు= మహర్షులారా! ఆలకించండి; నరుఁడు= జీవుడు; ముక్తికిన్= మోక్షానికి; ఉత్సహింపక= ఉత్సాహం చూపకుండా; భవసక్తుఁడు+ఐనన్= సంసారంలో తగుల్కొన్న వాడైతే; ఒండు పుట్టువునందున్= మరొకజన్మలో; అది= ఆ ముక్తి; ఒందన్+రాదు= పొందటం సాధ్యం కాదు.

తాత్పర్యం: సత్యమే తపస్సు. జ్ఞానమే కన్ను. త్యాగమే సుఖం. రాగమే దుఃఖం. మునులారా! వినండి. నరుడుమోక్షానికి ప్రయత్నించకుండా సంసార బంధాలలో తగుల్కొన్నట్లయితే మరొక జన్మలోకూడా ఆ ముక్తి సాధ్యం కాదు.

విశేషం: దీనికి మూలమైన సంస్కృతశ్లోకం చతురస్రంగా ధారణయోగ్యంగా క్లుప్తంగా ఉన్నది. **"నాస్తి విద్యాసమం చక్షుః నాస్తి విద్యాసమం తపః । నాస్తి రాగసమం దుఃఖం నాస్తి త్యాగసమం సుఖమ్॥" (12-316-6)**

క. ఆరయఁ గామముఁ గ్రోధము । వైరులు ముక్తి కవి రెండు వారించిన సం
సార మనాకారం బగు । నేరిమి యొండేల ముక్తి నెలవు గనుటకున్? 312

ప్రతిపదార్థం: ఆరయన్= పరిశీలించి చూసినట్టయితే; కామమున్= కామమూ; క్రోధమున్= క్రోధమూ; ముక్తికిన్= మోక్షానికి; వైరులు= శత్రువులు; అవి రెండున్= ఆ రెండింటినీ; వారించినన్= అడ్డుకోగలిగినట్టయితే; సంసారము= భవము అనేది; అనాకారంబు+అగున్= ఆకారరహితం అయిపోతుంది - సంసారం తన ఉనికిని కోల్పోతుంది; ముక్తి నెలవు= మోక్షపదాన్ని; కనుటకున్= పొందటానికి; నేరిమి= నేర్పు; ఒండు= ఇంతకన్నా మరొకటి; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: కామక్రోధాలే ముక్తికి శత్రువులు. ఆ రెండింటినీ జయించి పారద్రోలినట్లయితే మానవుడికి సంసారమనేది రూపరహితం అయిపోతుంది. ముక్తి పదం పొందటానికి ఇంతకన్నా మరొక నేర్పరితనం ఎవరికిమాత్రం ఎందుకు?

తే. అపరిగ్రహ సర్వారం । భ పరిత్యాగములు గలుగు పండితునకు దుః
ఖపుఁ దెరువు వాటిలదు మో । క్షపదము సొప్పడి తదాత్మక సుఖం బొందున్. 313

ప్రతిపదార్థం: అపరిగ్రహ= ఏ దానాన్నీ స్వీకరించటకపోవటం; సర్వ= సమస్తవిధాలైన; ఆరంభ= ప్రయత్న - క్రియాప్రారంభాల; పరిత్యాగములు= త్యాగం (విడవటం) అనేవి రెండూ; కలుగు= ఉన్నటువంటి; పండితునకున్= జ్ఞానికి; దుఃఖపున్ తెరువు= దుఃఖమార్గం అనేది; పాటిలదు= సంభవించదు; మోక్షపదము= ముక్తిస్థానం; చొప్పడి= లభించి; తదాత్మక= తాదాత్మ్యరూపమైన; సుఖంబున్= సౌఖ్యాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: అపరిగ్రహం - సర్వారంభపరిత్యాగం అనేవి రెండూ ఉన్న జ్ఞానికి అసలు దుఃఖమనేదే ఉండదు. మోక్షపదాన్ని తాదాత్మ్యంతో పొందటం, సుఖపడటం - అనేవి అతడికి సిద్ధిస్తాయి.

క. భూతంబుల దర్శింపమి । భూతాస్పర్శనము భూతములయెడ సంభా
షా తరలత నొందమి సూ । రే తెరువు విమోక్ష సుఖగరిష్ఠత వడయన్. 314

ప్రతిపదార్థం: భూతంబులన్= ప్రాణికోటిని; దర్శింపమి= చూడకపోవటం; భూత= ప్రాణికోటియొక్క; అస్పర్శనము= తాకకపోవటం (వాటిని); భూతములయెడన్= ప్రాణులతో; సంభాషాతరలతన్= సంభాషించాలి అనే ఉబలాటాన్ని; ఒందమి= పొందకపోవటం అనే ఇవి; విమోక్ష= విముక్తికి సంబంధించిన; సుఖ= సుఖంయొక్క; గరిష్ఠతన్= ఆధిక్యాన్ని; పడయన్= పొందటానికి; తెరువు= మార్గం; చూరే= చూడండి. (తెలుసుకోండి సుమా!)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మహర్షులారా! ప్రాణికోటిని దర్శించకుండా, స్పృశించకుండా, సంభాషించకుండా నిగ్రహంతో దూరంగా ఉండటమే విముక్తికి మార్గం. దయచేసి గుర్తించండి.

విశేషం: చూరె - చూరే అనేవి అన్వయాలు. ప్రసిద్ధినీ ఆభిముఖ్యాన్నీ తెలియజేస్తాయి. **"అదర్శనమసంస్పర్శః తథాऽసంభాషణం సదా। యస్య భూతైస్సహ మునే స శ్రేయో విందతే పరమ్॥"** [1](12-316-17)

ఆ. ' హింసలేక యునికి యింద్రియ జయము నై। రాశ్య మచపలత్వ మను గుణములు
నాల్గుఁ గలుగునట్టి నరునకుఁ గరతలా। మలక మంతరాత్మ మహిమ యెల్ల. 315

ప్రతిపదార్థం: హింసలేక+ఉనికి= హింసాప్రవృత్తి లేకపోవటం; ఇంద్రియజయము= ఇంద్రియనిగ్రహమూ; నైరాశ్యము= ఆశారహితత్వమూ; అచపలత్వము= చాపల్యం లేకపోవటమూ; అను= అనే; గుణములు= సద్గుణాలు; నాల్గున్= నాలుగూ; కలుగునట్టి= ఉన్నటువంటి; నరునకున్= జీవుడికి; అంతరాత్మ మహిమ ఎల్లన్= అంతరాత్మయొక్క గొప్పతనం అంతా; కరతల+ఆమలకము= అరచేతిలోని ఉసిరికపండు;

తాత్పర్యం: అహింస, ఇంద్రియనిగ్రహం, నైరాశ్యం, అచపలత్వం అనే ఉత్తమగుణాలు నాలుగూ ఉన్న వాడికి అంతరాత్మ తత్త్వం తేటతెల్లమవుతుంది. అరచేతిలో ఉసిరికపండంత సులభంగా అనుభవంలోకి వస్తుంది.

విశేషం: 'వైరాగ్యము' అనే సంశోధిత ముద్రణపాఠంలో యతిభంగం. నిర్+ఆశా... 'నైరాశ్యము' - ఇది వావిళ్ళవారి పాఠం. 'వైరాగ్య' అయినా 'నైరాశ్య అను' అయినా, రెండవ పాదంలోని మొదటి అక్షరం 'రా' కదా! 'రా'కు 'మ'కు యతి ఉంటే ఉన్నట్లు - లేకపోతే రెండు పాఠాలలోనూ లేనట్లే కదా! గమనించగలరు.

క. ' అమ్మునిపతి వాక్యముల వి। ధమ్మిది దీనం బ్రగాఢ తత్పరతం జి
త్తమ్మున నిడి తెలిసినడవు। మిమ్మెయి సమకూరు నీకు నిహపర సుఖముల్.' 316

ప్రతిపదార్థం: ఆ+మునిపతి= మునీశ్వరుడైన ఆ సనత్కుమారుడు చెప్పిన; వాక్యముల= మాటలయొక్క; విధమ్ము+ఇది= పద్ధతి ఇది - ఇట్లా ఉన్నది; దీనిన్= ఈ విధాన్ని; ప్రగాఢతత్పరతన్= ప్రగాఢమైన ఆసక్తితో; చిత్తమ్మునన్= మనస్సులో; ఇడి= పెట్టుకుని; తెలిసి నడవుము= ఎరుకతో సంచరించుము (ప్రవర్తించుము); ఇహపరసుఖముల్= ఇహానికీ పరానికీ చెందిన సుఖాలు; ఈ+మెయిన్= ఇట్లా (ఇకనుండి); నీకున్= నీకు; సమకూరున్= వాటంతట అవి లభిస్తాయి.

తాత్పర్యం: సనత్కుమారుడు ఆ మహర్షులకు చెప్పిన మాటల సారాంశం ఇది. దీన్ని నిజమైన ఆసక్తితో మనసులో పెట్టుకొని తెలిసి నడిచావంటే ఇహపరసుఖాలు వాటంతట అవి నీకు సమకూరుతాయి.'

వ. అని చెప్పి వెండియు. 317

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; చెప్పి= నారదుడు చెప్పి; వెండియున్= తిరిగి ఇలా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా నారదుడు చెప్పి ఇంకా.

ఆ. ' పుత్త్రదార బంధుమిత్త్ర సక్తుఁడు రొంపిఁ। బడిన గజము నట్ల యెడరునొందు
భోగజాలపరుఁడు వాగురాజాలసం। పతిత మృగఝషముల భంగిఁ దలరు. 318

ప్రతిపదార్థం: పుత్త్ర= సంతానమూ; దార= కళత్రమూ; మిత్త్ర= నెచ్చెలులూ - వీరిపట్ల; సక్తుఁడు= వ్యామోహితుడైనవాడు; రొంపిన్+పడిన= ఊబిలో కూరుకుపోయిన; గజము+అట్లు+అ= ఏనుగువలెనే; ఎడరున్+ఒందున్= దుఃఖాన్ని పొందుతాడు; భోగ=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సుఖాల; జాల= సమూహంలో; పరుఁడు= ఆసక్తుడైన వ్యక్తి (భోగసమూహంలో లాలసుడైనవాడు); వాగురా= వలల; జాల= సమూహంలో; సంపతిత= చిక్కుకొన్న; మృగ= లేడి; ఝషముల= చేపల; భంగిన్= పోలికగా; తలరున్= దుఃఖిస్తాడు.

తాత్పర్యం: 'శుకమహర్షీ! పుత్రికాపుత్రులు, భార్యలూ, బంధువులూ, మిత్రులూ - వీరిపట్ల వ్యామోహితుడైనవాడు ఊబిలో దిగిన ఏనుగువలె హింస పడతాడు. భోగలాలసుడు వలలో చిక్కుకొన్న మృగంవలె చేపవలె గిలగిలలాడతాడు.

విశేషం: పుత్రులు అంటే కేవలం మగబిడ్డలే కా నవసరం లేదు. 'పుత్రాశ్చ పుత్ర్యశ్చ - పుత్రాః' అని ఏకశేషసమాసం. 'పుమాన్ స్త్రియా' - అని పాణినీయసూత్రం). పుత్రికలూ, పుత్రులూ కలిపి పుత్రులు అనవచ్చును. పుత్రదార బంధుమిత్ర- అన్నచోట పుత్రికా పుత్రరూపమైన సంతానం అంతా - అని అర్థం. మిత్రపదంకూడా అట్లాగే ఏకశేషసమాసం అనుకుంటే స్నేహితురాండ్రూ స్నేహితులూ ఇద్దరూ వస్తారు. నెచ్చెలి అనేది స్త్రీ పురుషులకు సమానం.

వ. ధర్మాధర్మంబులును సత్యాసత్యంబులును దొఱంగవలయుఁ దొఱంగుటెట్లు సొప్పడు నంటేని. 319

ప్రతిపదార్థం: ధర్మ+అధర్మంబులును= ధర్మాధర్మాలూ; సత్య+అసత్యంబులును= సత్యాసత్యాలూ; తొఱంగన్+వలయున్= విడిచిపెట్టెయ్యాలి; తొఱంగుట= ఆ విడవటం; ఎట్లు= ఎలా; చొప్పడున్= సాధ్యమవుతుంది; అంటి(వి)+ఏనిన్= అన్నావనుకో.

తాత్పర్యం: ధర్మాధర్మాలను, సత్యాసత్యాలను విడనాడాలి. అ దెట్లా సాధ్యమంటే.

సీ. విను మధర్మం బహింసనమున నెడలు ధ। ర్మంబు సంకల్పవర్జనముచేత
నవ్యాప్తిఁ బొందు సత్యాసత్యములు బుద్ధిఁ। గొని త్రోవనగు' నని మునివరుండు
మఱియును జెప్పు 'నాత్మవిభావనంబున। బుద్ధివిలీనతఁబొందు శోక
భయహేతువులు నిచ్చఁ బదివేలు వాటిల్లుఁ। బండితుం డందుఁ బొందండు భూత

తే. ములును నింద్రియములు నొక్క ప్రోవు గట్టి। యున్న వీనికి వగఁ బొందు టూరివారి
కొలయు నెడరుల కెల్లఁ దా నుమ్మలికము। గట్టికొని కుందునట్టులు గాదె? వత్స!' 320

ప్రతిపదార్థం: వినుము= శుకమహర్షీ! ఆలకించుము; అధర్మంబు= అధర్మము అనేది; అహింసనమునన్= అహింసవలన; ఎడలున్= తొలగిపోతుంది; ధర్మంబు= ధర్మమనేది; సంకల్ప= సంకల్పాల యొక్క; వర్జనముచేతన్= విడుమరతో (సంకల్పరాహిత్యంతో); అవ్యాప్తిన్+పొందున్= వ్యాప్తిని కోల్పోతుంది; సత్య+అసత్యములు= సత్యాసత్యాలు అనేవాటిని; బుద్ధిన్+కొని= బుద్ధియొక్క సహకారం స్వీకరించి; త్రోవన్+అగున్= పారద్రోలవచ్చును; అని; మునివరుండు= నారదుడు; మఱియునున్= ఇంకా; చెప్పున్= ఉపదేశిస్తున్నాడు; బుద్ధి= ఈ బుద్ధి అనేది; ఆత్మవిభావనంబునన్= ఆత్మసందర్శనంలో; విలీనతన్+పొందున్= లీనమైపోతుంది; శోకభయహేతువులు= శోకకారణాలూ, భయహేతువులూ అనేవి; నిచ్చన్= ఎల్లప్పుడూ; పదివేలు= అసంఖ్యాకంగా; వాటిల్లున్= ఏర్పడుతూనే ఉంటాయి; పండితుండు= జ్ఞాని; అందున్= వాటిలో; పొందండు= సంలగ్నుడు కాడు; వత్స!= నాయనా!; భూతములును= పంచభూతాలూ; ఇంద్రియములును= పది ఇంద్రియాలూ; ఒక్కప్రోవుగట్టి= ఒక పోగులాగా (మూట) చర్మంతో కట్టి; ఉన్నన్= ఉండగా; వీనికిన్= ఈ శరీరాలకోసమని; వగన్= దుఃఖాన్ని; పొందుట= పొందటం; ఊరివారికిన్= ఊళ్ళో జనానికి; ఒలయు= వచ్చే; ఎడరులకున్= క్లేశాలకూ, కీడులకూ; ఎల్లన్= అన్నింటికీ; తాను; ఉమ్మలికము+కట్టికొని= దిగులు పెట్టుకొని; కుందునట్టులు+కాదె!= బాధపడినట్లు కాదా!

తాత్పర్యం: అహింసను అలవాటు చేసికొనటంతో అధర్మాన్ని విడిచిపెట్టవచ్చును. సంకల్పాలను పరిత్యజించటంతో ధర్మాన్ని వదిలించుకొనవచ్చును. బుద్ధిబలంతో సత్యాసత్యాలను తొలగించుకొనవచ్చును. శుకా! ఆలకించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆత్మజ్ఞానంతో బుద్ధినీ వికసింపజేసికొనవచ్చును. శోకహేతువులూ, భయహేతువులూ నిత్యజీవితంలో రోజూ వేలకువేలు ఉంటూనే ఉంటాయి. జ్ఞాని అయినవాడు వాటిలో తగుల్కొనడు. పంచభూతాలనూ పది ఇంద్రియాలనూ పోగుచేసి చర్మంతో మూటగట్టిన ఈ శరీరంకొరకు దుఃఖించటమా? ఊళ్ళోవాళ్ళ దుఃఖాలకు మనం ఏడవటం వంటిది కాదూ ఇది!

చ. అన విని సంశయం బురివి యమ్మునితో నరణీతనూజుఁ డి
ట్లను 'భవదీయ దివ్యవచనామృత మాని యరోగచిత్తతం
గని కృతకృత్యతం బొరయఁ గాంచితిఁ బొందెద యోగసిద్ధి సూ
ర్యుని మహితప్రసారమున, నూని సమస్తము డిగ్గఁ ద్రావెదన్.' 321

ప్రతిపదార్థం: అనన్= అని (నారదుడు) చెప్పగా; విని= ఆలకించి; సంశయంబు= సందేహం; ఉరివి= తొలగి; ఆ+మునితోన్= ఆ నారదమహర్షితో; అరణీతనూజుఁడు= అరణీ సంభవుడైన శుకుడు; ఇట్లు+అనున్= ఇలా అంటున్నాడు; భవదీయ= నీయొక్క; దివ్య= దివ్యమైన (పవిత్రమైన); వచన+అమృతము= వాగమృతాన్ని; ఆని= క్రోలి (త్రాగి); అరోగచిత్తతన్= రోగరహితమైన మానసికస్థితిని; కని= పొంది; కృతకృత్యతన్= చరితార్థతను; పొరయన్+కాంచితిన్= పొందగలిగాను; సూర్యుని= సూర్య భగవానుడియొక్క; మహిత= గొప్పదైన; ప్రసారమునన్= ప్రసరణంతో (దయాప్రసారం వలన); యోగసిద్ధిన్= యోగంలో సిద్ధిని; పొందెదన్= పొందుతాను; ఊని= ప్రయత్నించి; సమస్తమున్= అన్నింటినీ; డిగ్గన్+త్రావెదన్= పరిత్యజిస్తాను.

తాత్పర్యం: నారదుడి ఉపదేశంతో శుకుడికి సంశయాలు తొలగిపోయాయి. అతడితో అంటున్నాడు 'మహర్షీ! నీ వాగమృతం గ్రోలటంతో నా మనస్సుకు స్వస్థత చేకూరింది. చరితార్థుడను అయాను. సూర్యభగవానుడి దయవలన యోగసిద్ధి పొందుతాను. రాగద్వేషాలూ, ధర్మాధర్మాలూ, సత్యాసత్యాలూ మొదలైనవన్నీ పరిత్యజిస్తాను.'

క. అని పలికి యమ్మునీశ్వరు । ననుజ్ఞఁ గొని తండ్రికడకు నరిగి వినతుఁడై
తన నిశ్చయంబు సెప్పిన । విని యతఁ డలరెం దదీయ విజ్ఞానతకున్. 322

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఆ+మునీశ్వరు+అనుజ్ఞన్= ఆ నారదమహర్షి అనుమతిని; కొని= స్వీకరించి; తండ్రికడకున్= తండ్రియైన వ్యాసుడి దగ్గరకు; అరిగి= వెళ్ళి; వినతుఁడై= నమస్కరించి; తన= తనయొక్క; నిశ్చయంబు= నిర్ణయం; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; అతఁడు= ఆ వ్యాసుడు; తదీయ= ఆ పుత్రుడియొక్క; విజ్ఞానతకున్= తెలివికి; అలరెన్= సంతోషించాడు.

తాత్పర్యం: శుకమహర్షి తన ఆకాంక్షను చెప్పి నారదుడి అంగీకారం పొంది వెళ్ళి వ్యాసుడికి నమస్కరించాడు. తన నిశ్చయం తెలియజేశాడు. వ్యాసుడు పుత్రుడి విజ్ఞతకు సంతోషించాడు.

క. సంప్రమోదమందు సాత్యవతేయునిఁ । గని ప్రదక్షిణంబుగాఁగ వచ్చి
నరుగ నుత్సహించె నారణీయుఁడు దానిఁ । గాంచి వత్సలత్వగౌరవమున. 323

ప్రతిపదార్థం: సంప్రమోదము= ఆనందాన్ని; అందు= పొందుతున్న; సాత్యవతేయునిన్= వ్యాసుడిని; కని= చూచి; ప్రదక్షిణంబుగాఁగన్= ప్రదక్షిణం అయ్యేట్టు; వచ్చి= చుట్టి వచ్చి; ఆరణీయుఁడు= శుకుడు; అరుగన్+ఉత్సహించెన్= వెళ్ళటానికి ఉత్సాహపడ్డాడు; దానిన్= ఆ ఉత్సాహాన్ని; కాంచి= గమనించి; వత్సలత్వ= వాత్సల్యరూపమైన; గౌరవమునన్= గురుత్వంతో - గారాబంతో.

తాత్పర్యం: ఆనందిస్తున్న తండ్రికి ప్రదక్షిణం చేసి శుకుడు బయలుదేరబోయాడు. ఆ ఉత్సాహాన్ని గుర్తించిన వ్యాసుడు పుత్రప్రేమతో, గారాబంతో (ఇట్లా అన్నాడు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఆ బ్రహ్మర్షి సత్తముండు. 324

ప్రతిపదార్థం: ఆ బ్రహ్మర్షి సత్తముండు= బ్రహ్మర్షులలో ఉత్తముడైన ఆ వ్యాసుడు.

తాత్పర్యం: ఉత్తముడైన ఆ వ్యాసుడు.

క. ' ప్రమద మొనర్చెదు నా నయ । నములకు నంత కటు నిలుము నాఁగా' నిః స్నే
హము నిస్సంశయముం దన । యమలమతిం బల్లవింప నా శుకుఁ డరిగెన్. 325

ప్రతిపదార్థం: నాయనా! నా = నాయొక్క; నయనములకున్= కన్నులకు; ప్రమదము= ఆనందాన్ని; ఒనర్చెదు= కలిగిస్తున్నావు; అంతకున్= అంతదాకా; అటు= అట్లా; నిలువుము= ఆగుము; నాఁగాన్= అని వ్యాసుడు అనగా; ఆ శుకుఁడు= ఆ శుకర్షి; నిస్స్నేహమున్= మైత్రీరాహిత్యమూ; నిస్సంశయమున్= సంశయరాహిత్యమూ; తన= తనయొక్క; అమలమతిన్= నిర్మలమైన మనస్సులో; పల్లవింపన్= చిగురొత్తగా; అరిగెన్= ఆగకుండా వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: 'నాయనా! నా కన్నులకు ఆనందం కలిగిస్తున్నావు. కొంచెం సేపు (ఈపూటకు) ఇక్కడ ఉండవయ్యా!' అని వ్యాసుడు అడిగాడు. కానీ, శుకుడి మనస్సులో ఏ స్నేహమూ లేదు. ఏ సంశయమూ లేదు. నిర్మమంగా బయలుదేరి వెళ్ళిపోయాడు.

విశేషం: ఇక్కడ మూలంలో శ్లోకం ఇట్లా ఉన్నది. **"శ్రుత్వా ఋషిస్తద్వచనం శుకస్య ప్రీతో మహాత్మా పునరాహ చైనమ్ । భోభోః పుత్ర! స్థీయతాం తావదద్య యావచ్చక్షుః ప్రీణయామి త్వదర్థమ్॥" (12-318-62)** ఎంతవరకూ నా కన్నులు ఆనందిస్తాయో అంతవరకూ నీవు ఈ రోజు ఇక్కడ ఉండుము - అని యావత్తావత్ శబ్దాలతో ఉన్న వాక్యాన్ని 'అంతకిటు నిలువుము' అని తిక్కన ఆంధ్రీకరించాడు.

ఆ. జనకు విడిచి యిట్లు సని సిద్ధచారణ । సముదయోపసేవితమును యోగ
సేవనార్హ విధమునై వెలుఁగొందు కై । లాసశిఖరితట మలంకరించె. 326

ప్రతిపదార్థం: జనకున్= తండ్రియైన వ్యాసుడిని; విడిచి= వదలి; ఇట్లు; చని= వెళ్ళి; సిద్ధ= సిద్ధులూ; చారణ= చారణులూ అనే దేవజాతులయొక్క; సముదయ= సమూహంతో; ఉపసేవితమును= సేవింపబడేదీ; యోగసేవన= యోగాభ్యాసానికి; అర్హవిధమును+ఐ= అనువైన పద్ధతిలో ఉండేదీ అయి; వెలుఁగు+ఒందు= ప్రకాశించే; కైలాసశిఖరి= కైలాసము అనే పేరుగల పర్వతంయొక్క; తటమున్= చరియను; అలంకరించెన్= అలంకరించాడు.

తాత్పర్యం: ఇట్లా తండ్రిని విడిచిపెట్టి వెళ్ళిన శుకుడు కైలాసపర్వతం చేరుకొన్నాడు. అక్కడ సిద్ధులూ, చారణులూ మొదలైన దేవతలు నివసిస్తూ ఉంటారు. అది యోగసాధనకు చాలా అనుకూలమైన ప్రదేశం. అందుకని అది ఎంచుకొని వెళ్ళాడు శుకుడు.

సీ. విను మందు సమము వివిక్తంబు నగుచోటఁ । బ్రాఙ్ముఖాసీనుఁడై పరమయోగ
రతిఁ బదప్రభృతిగాత్రములఁ గ్రమంబుగ । నాత్మధారణము సేయంగ నంత
నినుఁ డుదయించినం గని పాణిపాదసం । యమ మొప్ప నద్దేవు నాశ్రయించి
నిర్విషయంబగు సర్వాత్మ తత్త్వంబు । గాంచి విశిష్టయోగక్రమంబుఁ

తే. బొంది నారదముని యలవోక యచటి । కరుగుదెంచిన వినతుఁడై యాత్మయోగ
సిద్ధి యెఱిఁగించి' నీ కృపఁజేసి తెరువు । గంటి నరిగెద విగతసంగత్వమొంది.' 327

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! ఆలకించుము; అందున్= ఆ కైలాసపర్వతంమీద; సమము= ఎత్తుపల్లాలు లేనిదీ; వివిక్తంబున్= ఏకాంతం కలదీ; అగు= అయిన; చోటన్= స్థలంలో; ప్రాక్+ముఖ+ఆసీనుఁడై= తూర్పు ముఖంగా కూర్చున్నవాడై; పరమ యోగరతిన్= శ్రేష్ఠమైన యోగంపట్ల గాఢమైన అభినివేశంతో (కోరికతో); పదప్రభృతి= పాదాలు మొదలుకొని; గాత్రములన్= సర్వావయవాల్లోనూ; క్రమంబుగన్= వరుసగా; ఆత్మధారణము+చేయంగన్= ఆత్మధారణ చేయగా; అంతన్= అప్పుడు; ఇనుఁడు= సూర్యుడు; ఉదయింపన్= సాక్షాత్కరిస్తే; కని= దర్శించి; పాణి= చేతులూ; పాద= కాళ్ళూ వీటి; సంయమము+ఒప్పన్= పొందిక అతిశయించేట్టు; ఆ+దేవున్= ఆ సూర్యభగవానుడిని; ఆశ్రయించి= శరణువేడి; నిర్విషయంబు+అగు= విషయవాసనా రహితమైన; సర్వాత్మ తత్త్వంబున్= సర్వాత్మయొక్క తత్త్వాన్ని; కాంచి= తెలిసికొని; విశిష్ట= అసాధారణమైన; యోగక్రమంబున్= యోగమార్గాన్ని; పొంది= అందుకొని; నారదముని= నారదమహర్షి; అలవోక= యథాలాపంగా; అచటికిన్= అక్కడికి; అరుదెంచినన్= వచ్చేసరికి; వినతుఁడై= శుకుడు నమస్కరించి; ఆత్మయోగసిద్ధి= తనకు కలిగిన ఆత్మ యోగం యొక్క సిద్ధిని; ఎఱిఁగించి= నారదుడికి చెప్పి; నీ= నీయొక్క; కృపన్+చేసి= దయచేత; తెరువు= సరియైన మార్గం; కంటిన్= దర్శించాను; విగతసంగత్వము+ ఒంది= నిస్సంగస్థితిని పొంది; అరిగెదన్= ప్రయాణం సాగిస్తాను.

తాత్పర్యం: కైలాసపర్వతంమీద అనువైన చోటు చూచికొని శుకుడు తూర్పుముఖంగా కూర్చున్నాడు. సర్వాంగాలలోనూ ఆత్మధారణ చేశాడు. అంతలో సూర్యుడు సాక్షాత్కరించాడు. శుకుడు సాష్టాంగపడ్డాడు, సమాశ్రయించాడు. సర్వాత్మతత్త్వాన్ని గ్రహించాడు. అప్పుడు యథాలాపంగా నారదుడు వచ్చాడు. శుకుడు తన యోగసిద్ధిని తెలియజేశాడు. 'దేవర్షీ! నీ దయవలన సరియైన మార్గం దొరికింది. నిస్సంగుడినై ఈ యోగమార్గంలో ప్రయాణిస్తాను.' (అన్నాడు.)

క. **అని పలికి విమలయోగం । బున నాకసమునకు నెగసిపోయె గరుత్మం**
తుని భంగి నపుడు సాధ్యులు । మునులుంగని విస్మయమున మునుఁగుచుఁ దమలోనన్. **328**

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; విమలయోగంబునన్= పవిత్రమైన యోగశక్తితో; ఆకసమునకున్= ఆకాశానికి; గరుత్మంతుని భంగిన్= గరుత్మంతుడిలా; ఎగసి+పోయెన్= శుకుడు ఎగిరి వెళ్ళాడు; అపుడు= ఆ సమయంలో; సాధ్యులు= సాధ్యులు అనే దేవతలూ; మునులున్= మహర్షులూ; కని= చూచి; విస్మయమునన్= ఆశ్చర్యంలో; మునుఁగుచున్= మునుగుతూ; తమలోన్= తమలో తాము.

తాత్పర్యం: నారదుడితో ఆ రెండుమాటలూ పలికి శుకుడు తన యోగశక్తితో గరుత్మంతు డిలా ఆకాశంలోకి ఎగిరి వెళ్ళాడు. చాలాకాలం ఆ పర్వతంమీదనే యోగాభ్యాసం చేస్తున్న సిద్ధులూ, సాధ్యులూ, మహర్షులూ - వీరంతా అది చూచి ఆశ్చర్యంలో మునిగిపోతూ తమలో తాము. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **' అచిరకాలంబునన యమ్మహాత్ముఁ డిట్లు । యోగసిద్ధిఁ బ్రాపించునె? యుల్ల మెంత**
నిర్మలమొ! పితృభక్తి వినిశ్చలత్వ । సంపదన చూవె యీతఁ డీ పెంపువడసె. **329**

ప్రతిపదార్థం: అచిరకాలంబునన్+అ= అనతికాలంలోనే; ఆ+మహాత్ముఁడు= ఆ మహానుభావుడు - శుకుడు; ఇట్లు; యోగసిద్ధిన్= యోగసిద్ధిని; ప్రాపించునె?= పొందగలిగాడా!; ఉల్లము= అతడి హృదయం; ఎంత నిర్మలమొ!= ఎంత నిర్మలమైనదో కదా!; పితృభక్తి= పితృభక్తి రూపమైన; వినిశ్చలత్వ= స్థిరత్వంయొక్క; సంపదన్+అ= సంపత్తితోనే; చూవె!= సుమా!; ఈతఁడు= ఈ శుకుడు; ఈ పెంపున్= ఈ గొప్పదనాన్ని; పడసెన్= పొందాడు!

తాత్పర్యం: 'అనతికాలంలోనే ఈ మహాత్ముడు యోగసిద్ధిని ఎట్లా పొందగలిగాడో! ఈయన మనస్సు ఎంత నిర్మలమో! పితృభక్తిపట్ల ఇతడి కున్న నిశ్చలత్వం వల్లనే సుమా - ఇతడికి ఈ పెంపు లభించింది!' అనుకొన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యాసుఁడు వెనుకొన శుకుఁడు యోగమార్గంబున నదృశ్యుండగుట (సం. 12-320-2,3)

వ. అని మఱియు ననేకభంగులం బ్రస్తుతించుచుండి రట్టియెడ శుకుండు మృగపక్షిశైలసరిత్సరసీతరుగుల్మలతలం గలయం గనుంగొని 'మా తండ్రి నా వెనుకం జనుదెంచి నాదగు పేరం బిలిచెనేని మీరెల్ల నో యనవలయుం జుండీ!' యనిన నవి యట్ల చేసెదమనియె. నా బ్రహ్మర్షివరుండు దమోరజస్సత్త్వంబులం గ్రమంబున డిగ్గఁ ద్రావియు నుత్తరాభిముఖుండై పోవ నొక్క మహాపర్వతంబు శృంగంబులు రెండత్యంతపీతశ్వేతంబులై మేరు హిమవంతంబులం దెగడుచుం గదిసి యనేక యోజనాయామ విస్తారంబులు గలిగి మార్గంబున కడ్డపడియుండె నతం డప్రతిహతగమనంబునం జన నవి దుత్తుమురై రాలె నద్భుతభంగియగు నా సిద్ధపుంగవుపైఁ బుష్పవర్షంబు గురియుచు నమరగణంబు బహువిధంబులం బ్రణుతించె నప్పారాశర్యపుత్రుం డయ్యెడం బ్రవహించు మందాకిని మీఁదం జదలఁ జేరువం జనియె నట్లు సను సమయంబున. 330

ప్రతిపదార్థం: అని; మఱియున్= ఇంకా; అనేకభంగులన్= పలురకాలుగా; ప్రస్తుతించుచున్+ఉండిరి= పొగుడుతున్నారు; అట్టియెడన్= అప్పుడు; శుకుండు= ఆ శుకమహర్షి; మృగ= జంతువులనూ; పక్షి= పక్షులనూ; శైల= పర్వతాలనూ; సరిత్= నదులనూ; సరసీ= సరోవరాలనూ; తరు= వృక్షాలనూ; గుల్మ= పొదలనూ; లతలన్= తీగెలనూ; కలయన్+కనుంగొని= అన్నివైపులా తేరిపార చూచి; మా తండ్రి= మా నాన్నగారు (వ్యాసుడు); నా వెనుకన్= నా వెన్నంటి; చనుదెంచి= ఇక్కడికి వచ్చి; నాది+అగు+పేరన్= నా పేరుతో; పిలిచెన్+ఏని= పిలిచినట్లయితే; మీరు+ఎల్లన్= మీరంతా; ఓ+అనవలయున్+చుండీ= 'ఓ' అని బదులు పలకాలి సుమండీ! - అనినన్= అనేసరికి; అవి= ఆ మృగపక్షిశైలాదులన్నీ; అట్లు+అ= అట్లాగే; చేసెదము= చేస్తాం; అనియెన్= అన్నాయి; ఆ+బ్రహ్మ+ఋషి+వరుండు= బ్రహ్మర్షులలో అగ్రగణ్యుడైన ఆ శుకుడు; తమః= తమోగుణాన్నీ; రజః= రజోగుణాన్నీ; సత్త్వంబులన్= సత్త్వగుణాన్నీ; క్రమంబునన్= ఇదే వరుసలో; డిగ్గఁద్రావియున్= పరిత్యజించి; ఉత్తర+అభిముఖుండు+అయి= ఉత్తరదిక్కువైపు; పోవన్= వెళ్ళగా; ఒక్క= ఒకానొక; మహాపర్వతంబు= మహాగిరియొక్క; శృంగంబులు= శిఖరాలు; రెండు; అత్యంత= మిక్కిలి; పీత= పసుపు; శ్వేతంబులై= తెలుపూ అయి; మేరు= మేరు పర్వతాన్నీ; హిమవంతంబులన్= హిమవత్పర్వతాన్నీ; తెగడుచున్= తిరస్కరిస్తూ; కదిసి= క్రిక్కిరిసి; అనేకయోజన= పలు యోజనాల; ఆయామవిస్తారంబులు= పొడుగూ, వెడల్పులు; కలిగి; మార్గంబునకున్= శుకుడు ప్రయాణిస్తున్న ఆకాశమార్గానికి; అడ్డపడి+ఉండెన్= అవరోధంగా ఉన్నాయి; అతండు= ఆ శుకుడు; అప్రతిహత= నిరాటంకమైన; గమనంబునన్= సంచారంతో; చనన్= ప్రయాణించేసరికి; అవి= ఆ రెండుపర్వత శిఖరాలూ; తుత్తుమురై= తునకలు తునకలై; రాలెన్= నేలకు రాలిపోయాయి; అద్భుతభంగి+అగు= ఆశ్చర్యకరమైన పద్ధతి కలవాడైన; ఆ; సిద్ధపుంగవుపైన్= యోగసిద్ధులలో అగ్రగణ్యుడిమీద (శుకుడిమీద); పుష్పవర్షంబు= పూలవాన; కురియుచున్= కురిపిస్తూ; అమరగణంబు= దేవతల సమూహం; ప్రణుతించెన్= స్తుతించింది; ఆ+పారాశర్యపుత్రుండు= వ్యాసపుత్రుడైన ఆ శుకుడు; ఆ+ఎడన్= ఆ సమీపంలో; ప్రవహించు= ప్రవహిస్తున్న; మందాకినిమీఁదన్= గంగానదిమీద నుండి; చదలన్= ఆకాశంలో; చేరువన్= తక్కువ ఎత్తున; చనియెన్= వెళ్ళాడు; అట్లు; చను+సమయంబునన్= వెడుతున్న తరుణంలో.

తాత్పర్యం: అని అనేకవిధాలుగా పొగడుతున్నారు. అప్పుడు శుకుడు మృగాలనూ, పక్షులనూ, పర్వతాలనూ, నదులనూ, కొలకులనూ, చెట్లనూ, గుట్టలనూ, తీగలనూ చూచి 'మాతండ్రి నా వెంట వస్తూ నాపేరుతో పిలుస్తూ ఉంటే మీరు 'ఓ' అని బదులు పలకాలి సుమా!' అనగానే అవి దానికి అంగీకరించాయి. శుకుడు త్రిగుణాలనూ త్యజించి ఉత్తరంగా వెళ్ళుతుండగా, మహాపర్వత శిఖరాలు రెండు పసుపూ, తెలుపు రంగులలో ఉండి మేరు హిమనగాలను ధిక్కరిస్తూ శుకుడి పయనానికి అడ్డం వచ్చాయి. శుకుడు నిరాఘాటంగా ముందుకు సాగేసరికి ఆ శిఖరాలు ముక్కలు ముక్కలై కూలిపోయాయి. దేవతలు అతడిమీద పూలవాన కురిపించారు. శుకుడు గంగానది మీద ఆకాశంలో తక్కువ ఎత్తున వెళ్ళే సమయంలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **నగ్నలై యప్సరస్త్రీజనములు సలిల । కేళి సలుపుచునుండి శంకింప కమ్మ**
హాత్ముఁ గనుఁగొను చెప్పటియట్ల నిర్వి । కారవృత్తి వర్తించిరి కౌరవేంద్ర! **331**

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= ధర్మరాజా!; అప్సరస్+స్త్రీ+జనములు= అప్సరసలు; నగ్నలు+ఐ= దిగంబరలై; సలిలకేళి= జలక్రీడను; సలుపుచున్+ఉండి= ఆ గంగానదిలో జరుపుతూ; శంకింపక= అయ్యో!- పురుషుడే అని సంకోచించకుండా; ఆ+మహాత్మున్= మహానుభావుడైన ఆ శుకుడిని; కనుఁగొనుచున్= అట్లా చూస్తూ; ఎప్పటి+అట్లు+అ= ఎప్పటిలాగానే; నిర్వికారవృత్తిన్= ఏ వికృతీ లేని ప్రవృత్తితో; వర్తించిరి= జలకేళి కొనసాగించారు.

తాత్పర్యం: ధర్మరాజా! తక్కువ ఎత్తులో శుకుడు అట్లా వెళ్ళుతున్నప్పుడు క్రింద ఆ గంగానదిలో అప్సరసలు దిగంబరంగా జలకేళి ఆడుతున్నారు. వారంతా శుకుడిని చూచారు. కానీ, ఏ వికారమూ పొందలేదు, శంకించలేదు. సిగ్గు అనుకోలేదు. ఎప్పటివలె జలక్రీడలు కొనసాగించారు.

వ. **అయ్యవసరంబున సత్యవతీసుతుండు నిజసుతు వెనుక మహాయోగ గమనంబు గైకొని తగిలె నంతకు నయ్యారణేయుండు వాయుపథం బతిక్రమించి సర్వభూతాత్మకుం డయ్యె నప్పుడు.** **332**

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; సత్యవతీసుతుండు= వ్యాసుడు; నిజసుతు (యొక్క); వెనుకన్= తన కుమారుడి వెనకాల; మహాయోగ గమనంబు= గొప్ప యోగవిద్యవలన లభించిన (గతిని) గమనాన్ని; కైకొని= స్వీకరించి (చేపట్టి); తగిలెన్= వెంటపడ్డాడు; అంతకున్= అప్పటికి; ఆ+ఆరణేయుండు= ఆ శుకుడు; వాయుపథంబు= వాయుమార్గం; అతిక్రమించి= దాటి; సర్వభూతాత్మకుండు= పంచభూతాలకూ అంతర్యామి; అయ్యెన్= అయ్యాడు; అప్పుడు= అప్పుడు.

తాత్పర్యం: ఆ సమయంలో వ్యాసుడు తన కుమారుడి వెనుక గొప్ప యోగవిద్యవలన లభించిన గమనాన్ని స్వీకరించి వెంటపడ్డాడు. అప్పటికి ఆ శుకుడు, వాయుమార్గం దాటి పంచభూతాలకూ అంతర్యామి అయ్యాడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **వెనుక నరుగుచునున్న యవ్వేదమూర్తి । తోడ సిద్ధచారణులు దత్సుతుఁడు శైల**
శృంగ విధ్వంసియై పోక సెప్ప నెలుఁగు । పెంపు మిగుల 'శుకా!' యని పిలిచె నతఁడు. **333**

ప్రతిపదార్థం: వెనుకన్= శుకుని వెనకాల; అరుగుచునున్న= వెడుతున్న; ఆ+వేదమూర్తితోడన్= వేదస్వరూపుడైన ఆ వ్యాసుడితో; సిద్ధచారణులు= సిద్ధులూ, చారణులూ; తద్+సుతుఁడు= ఆయన పుత్రుడైన శుకుడు; శైలశృంగ= పర్వతశిఖరాల; విధ్వంసియై= వినాశకుడై; పోక= వెళ్ళటం; చెప్పన్= చెప్పేసరికి; అతఁడు= ఆ వ్యాసుడు; ఎలుఁగుపెంపు= కంఠధ్వని; మిగులన్= అతిశయించేట్టు; శుకా!= ఓ శుకా!; అని; పిలిచెన్= కేకవేశాడు;

తాత్పర్యం: కొడుకును వెదుక్కొంటూ వెనకాలే బయలుదేరిన బ్రహ్మశ్రీవేదమూర్తులైన వ్యాసులవారిని చూచి సిద్ధచారణులు ఇట్లా అన్నారు: 'స్వామీ! మీ అబ్బాయి రెండు పర్వతశృంగాలను విధ్వంసం చేసి ఇటే వెళ్ళాడు' అని. ఇది విన్న వ్యాసుడు గొంతెత్తి గట్టిగా 'శుకా!' అని అరచి పిలిచాడు.

వ. **పిలిచిన నా సర్వగతుండు నిజప్రకారం బంతర్హితం బగుట దేటపడ బయల నో యను నాదంబు నిగుడునట్లు సేసెం దదనంతరంబ.** **334**

ప్రతిపదార్థం: పిలిచినన్= వ్యాసుడు అట్లా పిలిస్తే; ఆ సర్వగతుఁడు= సర్వభూతాత్మకుడుగా మారిపోయిన ఆ శుకుడు; నిజప్రకారంబు= తన స్వరూపం; అంతర్హితంబు+అగుటన్= అదృశ్యమైపోవటం; తేటపడన్= స్పష్టపడేట్టు; బయలన్=

ఆకాశంలో; ఓ+అను+నాదంబు= ఓ అనే ధ్వని; నిగుడునట్లు+చేసెన్= వ్యాపించేట్టు చేశాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: వ్యాసుడు అట్లా పిలిచేసరికి శుకుడికి తెలిసింది. అత డిప్పుడు సర్వభూతాత్మకుడుగా మారిపోయాడు. కాబట్టి రూపం కనపడదు. అయినా వ్యాసుడికి వినిపించేటట్లు ఓ అనే ధ్వని ఆకాశమంతటా వ్యాపించి మారుమ్రోగేటట్లు చేశాడు. అప్పుడు ఏమి జరిగిందంటే.

విశేషం: 'అంతర్హితంబగుటఁ దేటపడ' అని అన్నిప్రతులలోనూ అరసున్న ఉన్నది. అంతర్హితం అవటంచేత తేటపడేటట్లు - అంటే ఏది తేటపడేటట్లు? అన్న ప్రశ్న పుట్టుతుంది. దానికి సమాధానం లేదు. అరసున్న తీసేస్తే - తన స్వరూపం అంతర్హిత మవ్వటం అనేది తండ్రికి తేటపడేట్టు ఓ అనే ధ్వని నిగుడించాడు - అని అన్వయం హాయిగా కుదురుతుంది. ఈ సందర్భంలో మూలశ్లోకం ఇట్లా ఉన్నది. **"అంతర్హితః ప్రభావం తు దర్శయిత్వా శుకస్తదా । గుణాన్సంత్యజ్య శబ్దాదీన్ పదమధ్యగమత్పరమ్ ॥" (12-320-26).** అంతర్హితుడైన శుకుడు తన ప్రభావాన్ని ప్రదర్శిస్తూ శబ్దాదిగుణాలను కూడా విడిచిపెట్టి పరమపదాన్ని పొందాడు అని ఈ శ్లోకానికి భావం. పై అన్వయానికి అనువైనది.

తే. సకలజంగమ స్థావర సమితు లెల్ల । నో యనిన నద్భుతం బెడ్ద నుద్భవింప
సత్యవతి కొడ్కు - కొడుకు విశాలమహిమఁ । దెలిసి యప్పర్వతముమీఁద నిలువఁబడియె. 335

ప్రతిపదార్థం: సకల= సమస్తమైన; జంగమ= కదిలేవీ; స్థావర= కదలినివీ; (చరాచర) అయిన; సమితులు+ఎల్లన్= (వస్తు) సమూహం అంతా; ఓ+అనినన్= ఓ అనేసరికి; అద్భుతంబు= ఆశ్చర్యం; ఎడ్డన్= హృదయంలో (ఎడఁద-ఎడ్ద-ఎడ్డ-ఎద,ఎడ); ఉద్భవింపన్= కలగగా; సత్యవతి కొడ్కు= సత్యవతీ సుతుడైన వ్యాసుడు; కొడుకు= తన కొడుకు శుకుడియొక్క; విశాలమహిమన్= విస్తారమైన మహత్తును; తెలిసి= గ్రహించి; ఆ+పర్వతముమీఁదన్= అదే కొండమీద; నిలువన్+పడియెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: చరాచర వస్తుసమూహం అంతా 'ఓ' - అని ధ్వనించింది. వ్యాసుడు ఆశ్చర్యపోయాడు. తన కుమారుడి అనంతమైన మహిమ తెలిసికొన్నాడు. అదే పర్వతశిఖరం మీద అట్లాగే నిలుచుండిపోయాడు.

వ. ఇట్లు నిలిచిన యవ్వేదవ్యాస మునీశ్వరుం గాంచి జలవిహారంబు సలుపు నయ్యప్సరోజనంబులు సిగ్గు నగ్గలికగ్రందుకొన నందఱు నంబరంబులు ధరియించి రద్దివ్యబోధమహనీయుండు నిజతనయు చనునప్పుడు వారు శంకలేక యునికిఁ గని యతని ముక్తతయుఁ దన సక్తతయు నిరూపించి ప్రియంబును లజ్జయు నొక్కటఁ బొడమ నున్నంత. 336

ప్రతిపదార్థం: ఇట్లు= ఇలా; నిలిచిన= ఆగిపోయిన; ఆ+వేదవ్యాసముని+ఈశ్వరున్= ఆ వ్యాసమహర్షిని; కాంచి= చూసి; జలవిహారంబు+సలుపు= (అప్పటికీ) గంగానదిలో (ఇంకా) జలవిహారం చేస్తున్న; ఆ+అప్సరోజనంబులు= ఆ దేవకాంతలు; సిగ్గున్+అగ్గలిక= లజ్జాతిశయం (మిక్కిలి సిగ్గు); క్రందుకొనన్= ఆవహించగా; అంబరంబులు= వస్త్రాలు; ధరియించిరి= ధరించారు; ఆ+దివ్యబోధ+మహనీయుండు= దివ్యజ్ఞానంతో మహానుభావుడైన ఆ వ్యాసుడు; నిజతనయు= తన కుమారుడు; చనునప్పుడు= వెళ్ళేటప్పుడు; వారు= ఆ అప్సరసలు; శంకలేక+ఉనికిన్= ఏ సంకోచమూ లేకుండా ఉండటాన్ని; కని= చూసి; అతని= ఆ శుకుడి యొక్క; ముక్తతయున్= విముక్తస్థితీ; తన= తనయొక్క; సక్తతయున్= సక్తస్థితీ (సాంసారిక స్పృహ); నిరూపించి= గ్రహించి; ప్రియంబునున్= (కుమారుడి స్థితికి) సంతోషమూ; లజ్జయున్= (తన స్థితికి) సిగ్గూ; ఒక్కటన్= ఒకేసారి; పొడమన్= కలగగా; ఉన్నంత= అలా ఉన్న సమయంలో.

తాత్పర్యం: ఇట్లా ఆగిపోయిన వ్యాసుడిని చూచి, అక్కడ జలకాలాడుతున్న అప్సరసలు సిగ్గు ఎక్కువ కాగా, అందరూ బట్టలు కట్టుకొన్నారు. దివ్యజ్ఞానం కలిగిన ఆ వ్యాసుడు తన కుమారుడు అదే దారిలో వెళ్ళినప్పుడు వారికి శంకలేదన్న

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిజాన్ని గ్రహించి, కుమారుడి విముక్తస్థితిని, తన ఆసక్తస్థితినీ గ్రహించి కుమారుడి ఔన్నత్యానికి సంతోషించాడు. తన స్థితికి సిగ్గుపడ్డాడు. అట్లా ఆయన ఉండగా.

క. సుర ముని సిద్ధగణంబులు । పరివేష్టింపంగ నతని పాలికి గంగా
ధరుఁ డేఁగుదెంచి నెవ్వగఁ । బొరయు నతనితోడఁ గరుణ పొంపిరివోవన్. 337

ప్రతిపదార్థం: సుర (గణంబులు)= దేవతాబృందాలూ; ముని (గణంబులు)= ముని సమూహాలూ; సిద్ధగణంబులు= సిద్ధుల గుంపులూ; పరివేష్టింపంగన్= గుమిగూడి రాగా; గంగాధరుఁడు= శివుడు; అతనిపాలికిన్= ఆ వ్యాసుడి దగ్గరకు; ఏఁగుదెంచి= వచ్చి; నెవ్వగన్ (నెఱ+వగన్)= పెద్ద దిగులు; పొరయు= పొందుతున్న; అతనితోడన్= ఆ వ్యాసుడితో; కరుణ= దయ; పొంపిరి+పోవన్= అతిశయించేటట్టు.

తాత్పర్యం: దిగులుపడుతున్న వ్యాసుడిదగ్గరకు సాక్షాత్తూ గంగాధరుడు విచ్చేశాడు. సురలూ, మునులూ, సిద్ధులూ- ఇత్యాదులందరూ గుంపులు గుంపులుగా ముందు వెనుకల నడుస్తూంటే పెద్ద కోలాహలంగా వచ్చాడు పరమేశ్వరుడు. దిగులుపడుతున్న వ్యాసుడిని చూచి దయ తొణికిసలాడేటట్టు ఓదార్పు మాటలు పలికాడు.

వ. అనునయ పూర్వకంబుగా నిట్లనియె. 338

ప్రతిపదార్థం: అనునయ పూర్వంబుగాన్= బుజ్జగింపుగా; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= పలికాడు - శివుడు.

తాత్పర్యం: బుజ్జగింపుగా శివుడు ఇట్లా అన్నాడు.

క. ' జలపవనాంబర వసుధా । నల సమవీర్యుఁడగు పుత్త్రు నాకొసఁగంగా
వలయు'నని యడిగి తిచ్చితి । నలఘు తపోవిభవ! యేను నట్టికుమారున్. 339

ప్రతిపదార్థం: అలఘు!= గొప్ప; తపోవిభవ!= తపోవైభవం కలవాడా!; జల= నీరు; పవన= వాయువు; అంబర= ఆకాశం; వసుధా= నేల; అనల= అగ్ని - ఈ పంచభూతాలతో; సమ= సాటివచ్చే; వీర్యుఁడు+అగు= శక్తి కలవాడైన; పుత్త్రున్= కుమారుడిని; నాకున్= నాకు; ఒసఁగంగాన్+వలయున్= ఇవ్వాలి; అని; అడిగితి(వి)= అలనాడు అడిగావు; ఏనున్= నేనుకూడా; అట్టికుమారున్= అటువంటి పుత్రుడిని; ఇచ్చితిన్= నీకు వరంగా ఇచ్చాను.

తాత్పర్యం: 'ఓ తపస్వీ! అలనాడు నీ తపస్సుకి మెచ్చి నేను ప్రత్యక్షమయినప్పుడు 'పంచభూత సమవీర్యుడిని కొడుకుగా అనుగ్రహించు'మని నీవు వరం అడిగావు. నేను అట్లాగే అటువంటి వాడినే ఇచ్చాను.

వ. వాఁడును మత్ప్రభావంబునను భవత్తపోవిశేషంబునను బ్రహ్మతేజోమయుండై దేవతలకుం బొందరానిపరమగతిం బ్రాపించె దీనంజేసి మోదంబు నందవలదె? విషాదంబునకుం బనియేమి?' యని పలికి వెండియు. 340

ప్రతిపదార్థం: వాఁడునున్= ఆ శుకుడు; మత్+ప్రభావంబుననున్= నా ప్రభావంవల్లనూ; భవత్= నీ; తపోవిశేషంబుననున్= నీ విశిష్ట తపస్సువల్లనూ; బ్రహ్మతేజోమయుండు+ఐ= బ్రహ్మతేజస్సుతో కూడినవాడై; దేవతలకున్= దేవతలకైనా; పొందరాని= పొందటానికి శక్యంకాని; పరమగతిన్= ఉత్తమోత్తమ గతిని; ప్రాపించెన్= పొందాడు; దీనన్+చేసి= దీనితో; మోదంబున్+అందన్+వలదె?= సంతోషించవద్దా?; విషాదంబునకున్= దుఃఖానికి; పని+ఏమి?= అవసరం ఏముంది?; అని పలికి= అని మాట్లాడి; వెండియున్=తిరిగి.

తాత్పర్యం: ఆ శుకుడు నా ప్రభావంవలన, నీ విశిష్టమైన తపస్సువలనా, బ్రహ్మతేజస్సుతో కూడినవాడై, దేవతలకైనా, పొందటానికి శక్యంకాని ఉత్తమోత్తమ గతిని పొందాడు. దీనితో సంతోషించాలి. దుఖపడవలసిన అవసరం ఏముంది?' అని చెప్పి తిరిగి. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **‘ ఇలయు గిరులును శరధులు నెంతదాఁకఁ। గలుగు నంతకాలంబును వెలయుచుండు**
శుకుని కీర్తియు నీదు యశోవిభూతి। యును జనంబుల వీనుల కుత్సవముగ.’ 341

ప్రతిపదార్థం: ఇలయున్= ఈ భూమీ; గిరులునున్= పర్వతాలూ; శరధులున్= సముద్రాలూ; ఎంతదాఁకన్= ఎంతకాలం; కలుగున్= ఉంటాయో; అంతకాలంబునున్= అంతకాలమూ; శుకుని= శుకమహర్షియొక్క; కీర్తియున్= యశస్సూ; నీదు= నీయొక్క; యశః+విభూతియునున్= కీర్తి మహిమ (ఇవి రెండూ); జనంబుల= ప్రజల; వీనులకున్= చెవులకు; ఉత్సవముగన్= పండువుగా; వెలయుచుండున్= ప్రకాశిస్తూ ఉంటాయి.

తాత్పర్యం: ‘వ్యాసమహర్షీ! ఈ నేలా, ఈ కొండలూ, ఈ సముద్రాలూ ఉన్నంతకాలమూ నీ పుత్రుడి కీర్తీ, నీ యశోవిభూతీ ఉంటాయి. తరతరాలకూ ప్రజలకు చెవులపండువు చేస్తాయి. ’

వ. **అని నిర్దేశించి ‘వలయునేనిఁ బుత్రసదృశయైన ఛాయ నిన్నెప్పుడు ననుగమింప దర్శించువాఁడవు గా’కనియె నిట్లనుగ్రహించి యా బ్రహ్మర్షి ప్రవరుని సంప్రీతునింజేసి వీడుకొల్పి విశ్వేశ్వరుండు నిజేచ్ఛం జనియె నింతవట్టు నారదుండు నాకుం జెప్పె. 342**

ప్రతిపదార్థం: అని; నిర్దేశించి= అలా నిర్దేశం చేసి; వలయునేనిన్= అంతగా కావలిస్తే; పుత్ర సదృశ+అయిన= నీ కుమారుడిలాంటి; ఛాయ= నీడ ఒకటి; నిన్నున్= నిన్ను; ఎప్పుడున్= ఎల్లవేళలా; అనుగమింపన్= అనుసరిస్తూంటే; దర్శించువాఁడవు+కాక= దర్శిస్తావు గాక; అనియెన్= అని అనుగ్రహించాడు; ఇట్లు= ఇలా; అనుగ్రహించి= దయచూపించి; ఆ= ఆ ప్రసిద్ధుడైన; బ్రహ్మ+ఋషి+ప్రవరునిన్= బ్రహ్మర్షులలో శ్రేష్ఠుడైన వ్యాసుడిని; సంప్రీతునిన్= సంతోషించినవాడినిగా; చేసి; వీడుకొల్పి= వీడ్కోలు చెప్పి; విశ్వేశ్వరుండు= గంగాధరుడు; నిజ+ఇచ్ఛన్= తన ఇచ్ఛమేరకు; చనియెన్= వెళ్ళిపోయాడు; ఇంతవట్టున్= ఇంతమట్టుకే; నారదుండు= నారదుడు; నాకున్+చెప్పెన్= నాకు చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి, ‘నీకు అంతగా కావాలని అనిపిస్తే, అతడివంటి నీడ నిన్ను అనుసరించగా చూడగలవు’ అని అనుగ్రహించి, శివుడు వెళ్ళిపోయాడు. ఇంతవరకూ నాకు నారదుడు చెప్పాడు.

క. **ఇది యితిహాసవరము దనుఁ। జదివిన వారలకు వినిన జనముల కాయుః**
ప్రదమగు లక్ష్మీ కీర్త్య। భ్యుదయంబుల నిచ్చు సుగతియును గావించున్. 343

ప్రతిపదార్థం: ఇది; ఇతిహాసవరము= శ్రేష్ఠమైన ఇతిహాసం (కథ); తనున్= తనను; చదివినవారలకున్= చదివినవారికీ; వినిన జనములకున్= విన్న ప్రజలకూ; ఆయుఃప్రదము+అగున్= దీర్ఘాయుస్సును ఇస్తుంది; లక్ష్మీ+అభ్యుదయంబులన్= సంపదల అభివృద్ధినీ; కీర్తి+అభ్యుదయంబులన్= యశస్సుల అభివృద్ధినీ (లక్ష్మినీ, కీర్తినీ ఇంకా పలురకాల అభ్యుదయాలనూ); ఇచ్చున్= ఇస్తుంది; సుగతియునున్= సద్గతిని కూడా (ముక్తిని); కావించున్= కలిగిస్తుంది;

తాత్పర్యం: ధర్మరాజా! ఉత్తమోత్తమమైన ఇతిహాసం ఇది. దీనిని చదివినవారికీ, విన్నవారికీ దీర్ఘాయుర్దాయం లభిస్తుంది. సకలసంపదలూ యశస్సులూ ఇంకా అనేకమైన అభ్యుదయాలూ కలుగుతాయి. కట్టకడపటికి సద్గతులను (ఉత్తమలోకాలను) ప్రసాదిస్తుంది. (అని ఫలశ్రుతి కూడా చెప్పాడు నారదుడు.)’

వ. **అనియె నద్దేవమునిచేత నా వినినచొప్పున నీకుం జెప్పితి నీవింక నేమి వినవల తనుటయ ధర్మతనయుండు శంతనుతనయుతో బ్రహ్మచర్యాదులగు నాలుగాశ్రమంబుల వారును దమకు నుత్తమపదసిద్ధిం గోరి యారాధించు దైవం బెయ్యది దయ పల్లవింప నా కెఱింగింపుము. 344**

ప్రతిపదార్థం: అనియెన్= అని ముగించాడు నారదుడు; ఆ+దేవమునిచేతన్= దేవర్షి అయిన ఆ నారదుడిచేత; నా+వినిన చొప్పునన్= నేను విన్నది విన్నట్టు; నీకున్= నీకు; చెప్పితిన్= చెప్పాను; నీవు; ఇంకన్= ఇంకా; ఏమి= ఏమిటి; వినన్+వలతు(వు)?= వినగోరుతున్నావు?; అనుటయున్= అని భీష్ముడు అడిగేసరికి; ధర్మతనయుండు= యమునికుమారుడైన ధర్మరాజు; శంతను తనయుతోన్= శంతనుమహారాజుగారి కుమారుడైన భీష్మడితో; బ్రహ్మచర్య+ఆదులు+అగు= బ్రహ్మచర్యం మొదలుగాగల; నాలుగు+ఆశ్రమంబులవారునున్= నాలుగు ఆశ్రమాలలోనూ ఉండేవారు; తమకున్= తమకు; ఉత్తమపదసిద్ధిన్= ఉత్తమమైన మోక్షసిద్ధిని; కోరి= కాంక్షించి; ఆరాధించు= కొలిచే; దైవంబు= దైవం; ఏ+అది= ఏది (నాలుగు ఆశ్రమాలవారికీ ఆరాధింపదగిన దైవం ఎవరు?); దయ పల్లవింపన్= కృప చిగురొత్తగా; నాకున్= నాకు; ఎఱింగింపుము= తెలియజేయుము.

తాత్పర్యం: నారదు డిట్లా చెప్పగా నేను విన్నంతమేరకు నీకు చెప్పాను. నీ వింకా ఏమి వినగోరుతున్నావు?' అని భీష్మ డడుగగా ధర్మరాజు 'నాలుగు ఆశ్రమాలలోనూ ఉండేవాళ్ళు కొలిచే దైవం ఏది? నాకు తెలియజెప్పుము.' అని అడిగాడు.

క. అనియె నని చెప్పి గురుభ। క్తి నిరూఢుఁడు లోకమాన్య తేజుఁడు విద్యా
ఘనుఁడగు నా వైశంపా। యనమునివరుఁ డిట్టు లనియె నాతనితోడన్. 345

ప్రతిపదార్థం: అనియెన్= అని అడిగాడు ధర్మరాజు; అని చెప్పి= అని; గురుభక్తినిరూఢుఁడు= గొప్పభక్తితో స్థిరంగా కూడినవాడూ; లోక= ప్రజలకు; మాన్య= గౌరవింపదగిన; తేజుఁడు= తేజస్సుకలవాడూ; విద్యాఘనుఁడు= విద్యచేత గొప్పవాడూ; అగు= ఐన; ఆ+వైశంపాయన+మునివరుఁడు= మునివరేణ్యుడైన ఆ వైశంపాయనుడు; ఆతనితోడన్= శ్రోతగా ఉన్న జనమేజయుడితో; ఇట్టులు+అనియెన్= ఇంకా ఇలా అన్నాడు.

తాత్పర్యం: (ఇప్పుడు కథను జనమేజయ వైశంపాయనులతో కలుపుతున్నాడు కవి.) ధర్మరాజు భీష్మడిని ఇట్లా అడిగాడు అని వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పాడు. ఈ వైశంపాయనుడు గురుభక్తి కలవాడు. (సకలలోకాల చేత) లోకులు అందరిచేత గౌరవించబడేవాడు. విద్యావిషయకంగా ఘనుడు. ఆయన తన ప్రధానశ్రోత అయిన జనమేజయుడితో ఇట్లా అన్నాడు:

తే. వ్యాసమునినాథు షడ్గుణైశ్వర్యధుర్యు। నాగమవ్యాసకర్మఠు నమితతేజుఁ
గొలిచి తత్ప్రసాదంబున వలనుఁ బెంపుఁ। గలిగి యేను నారాయణు కథ ఘటింతు. 346

ప్రతిపదార్థం: షట్+గుణ= ఆరువిధాలైన; ఐశ్వర్యధుర్యున్= సౌభాగ్యం కలవాడూ; ఆగమ= ఆగమాలలో (ధర్మశాస్త్రాలలో); వ్యాస= వివరింపబడిన; కర్మఠున్= కర్మలను ఆచరించేవాడూ (కర్మఠః= కర్మాచరణ పరాయణుడు); అమితతేజున్= మహాతేజస్వంతుడూ అయిన; వ్యాసమునినాథున్= మునీశ్వరుడైన వ్యాసుడిని; కొలిచి= సేవించి; తద్+ప్రసాదంబునన్= ఆయన అనుగ్రహంవలన; వలనున్= సామర్థ్యమూ; పెంపున్= అతిశయమూ; కలిగి= పొంది; ఏను= నేను; నారాయణు (యొక్క) కథన్= నారాయణుడి ఇతిహాసాన్ని; ఘటింతున్= (నీ వీనులకు) పొందుపరుస్తాను.

తాత్పర్యం: ఆరు రకాలైన ఆధ్యాత్మిక ఐశ్వర్యాలు కలవాడూ, ఆగమశాస్త్రాలలో చెప్పబడినట్లుగా కర్మాచరణం చేసేవాడూ, మహాతేజస్వంతుడూ అయిన వ్యాసమునీశ్వరుడిని సేవించి వారి దయవలన సామర్థ్యమూ, ప్రావీణ్యమూ పొందిన నేను నారాయణుడి కథను నీకు వివరించి చెప్పుతాను. అని వైశంపాయనుడు. జయమేజయునితో అన్నాడు

వ. అని భక్తిపూర్వకంబుగాఁ బలికి జనమేజయున కిట్లనియె న ట్లజాతశత్రుం డడిగిన నయ్యాపగాపుత్త్రుం డతనితో నారాయణనారద సంవాదం బను నితిహాసంబు మా తండ్రి నాకుం జెప్పె దాన నీయడిగిన యర్థంబు దేటపడం జెప్పెద. 347

ప్రతిపదార్థం: అని= ఇలా; భక్తిపూర్వంబుగాన్= భక్తిపురస్సరంగా; పలికి= మాట్లాడి; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= వైశంపాయనుడు చెప్పాడు; అట్లు= ఆ విధంగా; అజాతశత్రుండు= ధర్మరాజు; అడిగినన్= అడిగితే; ఆ+ఆపగాపుత్రుండు= గంగా పుత్రుడైన ఆ భీష్ముడు (ఆపగ= నది); అతనితోన్= ఆ ధర్మరాజుతో; నారాయణ నారదసంవాదంబు= నారాయణ, నారద సంవాదం; అను= అనే; ఇతిహాసంబు= వృత్తాంతం; మా తండ్రి= మా తండ్రిగారైన శంతనుమహారాజు; నాకున్= నాకు; చెప్పెన్= చెప్పాడు; దానన్= దానితో; నీ+అడిగిన= నీవు అడిగిన; అర్థంబు= ప్రయోజనం (విశేషం); తేటపడన్= స్పష్టపడేట్టు; చెప్పెదన్= వివరిస్తాను; ఈ ఇతిహాసం ద్వారా నీ సందేహం తీరుస్తాను అని భావం.

తాత్పర్యం: ఇట్లా చెప్పి వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు: 'ధర్మరాజు ప్రశ్నకు బదులుగా భీష్ముడు 'మా తండ్రి శంతనుడు నాకు నారాయణనారద సంవాదాన్ని చెప్పాడు. అది నీ సందేహాన్ని తీర్చగలదు.'

క. అని పలికి యాదరంబున । మనంబు మేదురము గాఁగ మనుజేశ్వర! య
జ్జనపతి వీను లమృతరస । మున నించినయట్టి చందముగ నిట్లనియెన్. 348

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర= జనమేజయమహారాజా!; అని పలికి= భీష్ముడు అట్లా పలికి; ఆదరంబునన్= ప్రేమతో; మనంబు= హృదయం; మేదురము+కాఁగన్= క్రిక్కిరియగా; ఆ+జనపతి= ఆ ధర్మరాజుయొక్క; వీనులు= చెవులు; అమృతరసమునన్= అమృతరసంతో; నించిన+అట్టి చందముగన్= నింపినట్టుగా; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: జనమేజయా! ఆదరంతో మనస్సు మేదురం కాగా భీష్ముడు ధర్మజుడి చెవులలో అమృతరసం నింపినట్లుగా ఆ ఇతిహాసాన్ని ఇట్లా వివరించాడు.

భీష్ముఁడు ధర్మజునకు నారదనారాయణ సంవాదంబు సెప్పుట: (సం. 12-321-7)

సీ. 'విను మవ్యయుఁడు సనాతనుఁడు విశ్వాత్ముఁడు । నైన నారాయణుండను మునీంద్రు
బదరికాశ్రమమున భక్తిమైఁ గొలిచి నా । రదుఁ డెద్ది సిద్ధి కారాధనీయ
మానతి యిమ్మన్న నతఁడుఁ ధ్రువం బచ । లం బింద్రియాగోచరంబు సూక్ష్మ
మనుపమ మన సర్వమున కంతరాత్మయై । వెలుఁగు తత్త్వము దక్క వేఱ కలదె?

తే. అరయ నారాధ్యమై యజుఁ డాదిగాఁగ । సకల భూతంబులకును బూజ్యంబు దాన
యనియె నిట్లన్న నరసఖుఁ డతికృపార్ద్ర । భావుఁడై చెప్ప నప్పద్మభవసుతుండు. 349

ప్రతిపదార్థం: వినుము= ధర్మరాజా! ఆలకించుము; అవ్యయుఁడు= వ్యయంకానివాడూ; సనాతనుఁడు= సనాతనుడూ; విశ్వాత్ముఁడు= విశ్వస్వరూపుడూ; ఐన= అయినటువంటి; నారాయణుండు= నారాయణుడు; అను= అనే; మునీంద్రున్= మునీశ్వరుడిని; బదరికాశ్రమమునన్= బదరికాశ్రమంలో; భక్తిమైన్= భక్తితో; కొలిచి= సేవించి; నారదుఁడు= నారదమహర్షి; ఎద్ది= ఏది; సిద్ధికిన్= మోక్షసిద్ధికి; ఆరాధనీయము= ఆరాధింప దగినదో; ఆనతి+ఇమ్ము= ఆజ్ఞాపించుమని; అన్నన్= అడిగితే; అతఁడు= ఆ నారాయణుడు; ధ్రువంబు= ధ్రువమైనదీ; అచలంబు= చలించనిదీ; ఇంద్రియ+అగోచరంబు= ఇంద్రియాలకు అందనిదీ; సూక్ష్మము= సూక్ష్మమైనదీ; అనుపమము= సాటిలేనిదీ; అనన్= అనబడుతూ; సర్వమునకున్= సమస్తానికీ; అంతరాత్మయై=లోపలి ఆత్మయై; వెలుఁగు= ప్రకాశించే; తత్త్వము= ఆ తత్త్వం ఒక్కటి; తక్కన్= తప్ప; వేఱు+అ= వేరే మరొకటి; అరయన్= ఎంత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరిశీలించినా; ఆరాధ్యము+ఐ= ఆరాధనీయమైనది; కలదె?= ఉన్నదా?; అజుఁడు+ఆదిగాఁగన్= బ్రహ్మదేవుడు మొదలుగా; సకల భూతంబులకున్= సమస్త ప్రాణులకూ; పూజ్యంబు= ఆరాధింపదగినది; తాను+అ= అదే; అనియెన్= అని చెప్పాడు; ఇట్లు+అన్నన్= ఇట్లా అన్నటువంటి; నరసఖుఁడు= నరుడి మిత్రుడైన (నరనారాయణులే అర్జున కృష్ణులు) నారాయణుడు; అతి కృపా+ఆర్ద్రభావుఁడై= మిక్కిలి దయతో చెమ్మగిల్లిన హృదయం (భావం) కలవాడై; చెప్పన్= వివరించేసరికి; ఆ+పద్మభవ+సుతుండు= బ్రహ్మదేవుని (పద్మభవుడు) కుమారుడైన ఆ నారదుడు.

తాత్పర్యం: భీష్ముడు చెప్పుతున్నాడు. 'ధర్మరాజా! వినుము. నారాయణుడు అనే మునీంద్రుడిని బదరికాశ్రమంలో సందర్శించి సంసేవించి నారదుడు ఒక ప్రశ్న వేశాడు. మోక్షసిద్ధికి ఆరాధనీయమైనది ఏది?- అని. 'సమస్తానికీ అంతరాత్మగా వెలిగే తత్త్వం ఒక్కటే తప్ప మరొకటి ఆరాధనీయం ఏముంది? బ్రహ్మాదులకూ సకల భూతాలకూ అదే ఆరాధనీయం'. అని నరసఖుడైన నారాయణుడు తెలిపేసరికి నారదుడు విని సంప్రీతుడయ్యాడు.

వ. సంప్రీతుండై సవిశేష వినయంబున నమ్మహాత్మున కిట్లనియె. 350

ప్రతిపదార్థం: సంప్రీతుఁడు= నారదుడు ఆనందించి; సవిశేషవినయంబునన్= విశిష్టమైన వినయంతో; ఆ+మహాత్మునకున్= ఆ మహానుభావుడికి; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: నారదుడు ఆనందించి, సవినయంగా ఇట్లా అడిగాడు.

క. ' లోకేశ! నీవు ధర్మ । శ్రీ కావలి గాఁగ నవతరించుట విద్వ
ల్లోకంబు సెప్పు నమ్మూ । లాకృతి యెట్లుండునో? దయాత్మకమూర్తీ! 351

ప్రతిపదార్థం: లోక+ఈశ= జగన్నాయకా!; నీవు; ధర్మశ్రీ= ధర్మసంపదకు (లక్ష్మి యొక్క); కావలి+కాఁగన్= రక్షకుడవుగా; అవతరించుట= జన్మించటం; విద్వత్+లోకంబు= పండితుల సమూహం; చెప్పున్= చెప్పుతోంది; ఆ+మూల+ఆకృతి= నీ దయిన ఆ అసలు స్వరూపం; దయా+ఆత్మకమూర్తీ!= ఓ దయాస్వరూపుడా!; ఎట్లు+ఉండునో?= ఎలా ఉంటుందో?

తాత్పర్యం: ఓ జగన్నాయకా! ఓ దయాస్వరూపా! నీవు ధర్మసంరక్షకుడవుగా ~~ఈ~~ అవతారం ధరించావని విజ్ఞులంతా చెప్పుతున్నారు. మరి నీదయిన అసలు సిసలు మూలాకారం ఎట్లా ఉంటుందో కదా!

క. శ్రుతిపరతయు గురుభక్తియు । మతిఁ గల వొకకొంత కొంత మన్నింపఁగఁ బా
త్రత గలిగెనేని నా కొసఁ । గు తదీయాలోకనం బగు తెఱంగు కృపన్. 352

ప్రతిపదార్థం: శ్రుతిపరతయున్= వేదనిష్ఠ; గురుభక్తియున్= గురువుపట్ల భక్తి అనేవి; మతిన్= నా హృదయంలో; కలవు= ఉన్నాయి; ఒక కొంతకొంత= ఏ కొంచెమయినా; మన్నింపఁగన్= గౌరవించటానికి; పాత్రత= అర్హత; కలిగెన్+ఏనిన్= నాకు ఉన్నట్టయితే; తదీయ= ఆ మూలాకృతియొక్క; ఆలోకనంబు= దర్శనం; అగు= అయ్యే; తెఱంగున్= పద్ధతిని (ఉపాయాన్ని, మార్గాన్ని); కృపన్= దయతో; నాకున్= నాకు; ఒసఁగు(ము)= ఇమ్ము (అనుగ్రహించు - తెలియజేయుము).

తాత్పర్యం: మహానుభావా! నాకు వేదాలపట్ల నిష్ఠ ఉన్నది . గురువులపట్ల భక్తి ఉన్నది. వీటివలన ఏ కొంచెమయినా గౌరవార్హత నాకు కలిగినట్టయితే దయచేసి నీ మూలస్వరూపాన్ని దర్శించే అవకాశం కల్పించుము.

వ. అని వేఁడిన భక్తపరాధీనుండైన యమ్మహానుభావుం డద్దేవసంయమితోఁ బరమైకాంతి వగుము. నీ కట్టి పెంపు సంపాదించెదం బొ మ్మని యత్నాదరంబున వీడుకొలిపినం బ్రీతుండై యవ్వియద్వీథిం జని యమ్మునిని

గనకనగంబునందు నియతాత్ముండయి యుండి దుగ్ధార్ణవంబు నుత్తరంబు చేరువ నున్న శ్వేతద్వీపంబునం దనాహారులు నింద్రియవృత్తిరహితులు నస్వేదులు సుగంధిశ్వేతాంగులు నగు పురుషులం గాంచె ననిన విని ధర్మపుత్రుం డవ్విశేషంబులు ముక్తలక్షణంబులై యున్నయవి యప్పురుషుల తెఱం గెఱింగింపవే ? యని యడిగిన శంతనునందనుం డతని కిట్లనియె. 353

ప్రతిపదార్థం: అని; వేఁడినన్= అభ్యర్థించగా; భక్తపరాధీనుండైన= భక్తులకు పరవశుడైన; ఆ+మహానుభావుండు= ఆ మహాత్ముడు; ఆ+దేవసంయమితోన్= ఆ దేవర్షి నారదుడితో; పరమ+ఏకాంతివి= మిక్కిలి ఏకాగ్రచిత్తుడవు; అగుము= కమ్ము; నీకున్= నీకు; అట్టి= అటువంటి; పెంపున్= శక్తిని (మహత్తును); సంపాదించెదన్= కలిగిస్తాను; పొమ్ము= వెళ్ళుము; అని; అతి+ఆదరంబునన్= మిక్కిలి ఆదరంతో; వీడుకొలిపినన్= సాగనంపగా; ప్రీతుండు+ఐ= సంతుష్టుడై; వియత్+వీథిన్= ఆకాశమార్గంలో; చని= ప్రయాణించి; ఆ+ముని= ఆ నారదుడు; కనకనగంబునందున్= మేరుపర్వతంమీద; నియత+ఆత్ముండు+అయి= నియమబద్ధుడై; ఉండి= (తపోదీక్షతో) ఉండి; దుగ్ధ+అర్ణవంబు+ఉత్తరంబు+చేరువన్= క్షీరసముద్రం యొక్క ఉత్తరతీరంలో; ఉన్న; శ్వేతద్వీపంబునందున్= శ్వేతద్వీపంలో; అనాహారులున్= ఆహారం తీసికొననివారూ; ఇంద్రియవృత్తి రహితులున్= ఇంద్రియవ్యాపారాలనన్నింటినీ వదిలించుకొన్నవారూ (జితేంద్రియులు); అస్వేదులున్= స్వేదం (చెమట) పట్టనివారూ; సుగంధి= పరిమళించే; శ్వేత+అంగులున్= తెల్లని శరీరాలు కలవారూ; అగు= అయినటువంటి; పురుషులన్= పురుషులను; కాంచెన్= (నారదుడు) దర్శించాడు; అనినన్= అని భీష్ముడు చెప్పగా; విని= ఆలకించి; ధర్మపుత్రుండు= ధర్మరాజు; ఆ+విశేషంబులు= ఆ విశేషాలు; ముక్తలక్షణంబులు+ఐ= ముక్తి పొందినవారి చిహ్నాలై; ఉన్నయవి= ఉన్నాయి; ఆ+పురుషుల= ఆ పురుషులయొక్క; తెఱంగున్= పద్ధతి అంతా; ఎఱింగింపవే?= తెలియజేయవా?; అని; అడిగినన్= అడిగితే; శంతనునందనుండు= భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: అని వేడగా నారాయణుడు నారదుడితో ఇట్లా అన్నాడు: 'నీవు మిక్కిలి ఏకాగ్రచిత్తుడవు కమ్ము. నీకు కూడ అటువంటి మహత్తును కలిగిస్తాను పొమ్ము' అని ఆదరంతో వీడుకొల్పాడు. నారదుడు గగనమార్గంలో పయనించి మేరుపర్వతంమీద నియమనిష్ఠలతో, క్షీరసముద్రపు టుత్తరతీరంలో ఉన్న శ్వేతద్వీపంలో నిరాహారులై, జితేంద్రియులై, చెమట పట్టనివారై, పరిమళయుతమైన తెల్లని మేనులతో ఉన్న పురుషులను చూచాడు.' అని భీష్మ డనగా 'ఆ లక్షణాలు ముక్తులైన పురుషుల చిహ్నాలై ఉన్నాయి. ఆ పురుషులపద్ధతి నాకు తెలియజెప్పు' మని అడిగాడు. భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

క. 'వారల కథ మా తండ్రికి । గారవమున బుధులు సెప్పఁగా నే వింటిం
గౌరవముఖ్య! విశిష్టా । చారుఁడు నృపుఁ డొక్కఁ డుపరిచరవసు వనఁగన్. 354

ప్రతిపదార్థం: కౌరవముఖ్య!= ధర్మరాజా!; వారలకథ= ఆ పురుషుల వృత్తాంతం; మా తండ్రికిన్= మా నాన్నగారికి; గారవమునన్= గౌరవంతో (ప్రేమతో); బుధులు= దేవతలు లేదా పండితులు; చెప్పఁగాన్= చెపుతుండగా; ఏన్= నేను; వింటిన్= విన్నాను; విశిష్ట+ఆచారుఁడు= విశిష్టమైన ఆచారాలు కలిగినవాడైన; నృపుఁడు= రాజు; ఒక్కఁడు= ఒకానొకడు; ఉపరిచరవసువు= ఉపరిచర వసువు; అనఁగన్= అనే పేరుతో.

తాత్పర్యం: 'ధర్మరాజా! సుగంధిశ్వేతాంగులైన ఆ పురుషుల వృత్తాంతం ఒకప్పుడు బుధులు మా తండ్రిగారికి చెప్పుతుంటే నేను విన్నాను. అది నీకు చెప్పుతాను. ఉపరిచరవసువు అనే పేరుతో ఒక రాజు ఉండేవాడు. ఆయన ఆచారపరాయణుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. కలిగెఁ దొల్లి భూమి గలయంతయును నేలు । సత్యమును దమంబు శమము విష్ణు
భక్తియును నయంబు బలిమియుఁ గ్రతుకుతూ । హలము బ్రాహ్మణ ప్రియంబుఁ గలఁడు. 355

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వకాలంలో; కలిగెన్= (ఉపరిచరవసువు అనే రాజు) ఉన్నాడు; భూమి+కల+అంతయునున్= మొత్తం ఉన్న భూమిని అంతటినీ (భూగోళం మొత్తాన్ని); ఏలున్= పరిపాలిస్తూ ఉండేవాడు; సత్యమునున్= సత్యవాక్య పరిపాలనమూ; దమంబున్= బాహ్యేంద్రియ నిగ్రహమూ; శమము= అంతరింద్రియ నిగ్రహమూ; విష్ణుభక్తియునున్= విష్ణుమూర్తి పట్ల భక్తీ; నయంబు+బలిమియున్= నైతిక బలమూ (రాజనీతివలన కలిగే బలం. లేదా నయంబున్= రాజనీతి; బలిమియున్= సైన్యబలమూ - స్వీయబలమూ); క్రతు= యజ్ఞాలపట్ల; కుతూహలమున్= చేయాలనే ఉత్సాహమూ; బ్రాహ్మణ= బ్రాహ్మణులపట్ల; ప్రియంబున్= ఇష్టమూ; కలఁడు= కలిగినవాడు అతడు.

తాత్పర్యం: ఆ ఉపరిచరవసువు మొత్తం భూగోళాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. అతడు సత్యసంధుడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు, విష్ణుభక్తుడు, రాజనీతికుశలుడు. అదే అతడికి బలం. యజ్ఞయాగాదులు చేయటమంటే ఆయనకు ఎంతో సంబరం. బ్రాహ్మణులపట్ల చాలా ప్రేమగా ఉండేవాడు.

వ. అమ్మహాత్ముండు. 356

ప్రతిపదార్థం: ఆ+మహాత్ముఁడు= మహానుభావుడైన ఆ ఉపరిచరవసువు.

తాత్పర్యం: మహానుభావుడైన ఆ ఉపరిచరవసువు.

చ. అలఘు తపంబుఁగోరి వసుధాధిపతిత్వము డిగ్గఁద్రావి కా
నలఁ జరియించుచుండ సురనాయకుఁ డాతని పాలికేఁగి 'నె
చ్చెలివయి నా కడం దగ వసింపుము వచ్చుచుఁ బోవుచున్న మే
లిలయును నేలు దివ్యతయు నిచ్చితి మెచ్చితి నీదు నిష్ఠకున్. 357

ప్రతిపదార్థం: అలఘు తపంబున్= మహాతపస్సును; కోరి= చేయగోరి (ఆ వసురాజు); వసుధా+అధిపతిత్వము= రాజ్యాధికారాన్ని; డిగ్గఁద్రావి= పరిత్యజించి; కానలన్= అడవుల్లో; చరియించుచుండన్= సంచరిస్తుండగా; సురనాయకుఁడు= దేవేంద్రుడు; ఆతనిపాలికిన్= ఆ వసురాజుదగ్గరకు; ఏఁగి= వెళ్ళి; నెచ్చెలివి+అయి= మంచి మిత్రుడవై; నాకడన్= నా దగ్గర; తగన్= తగినట్లు; వసింపుము= ఉండుము; వచ్చుచున్+పోవుచున్నన్= (లేదంటే) మా నగరానికి వస్తూ పోతూ ఉంటే; మేలు= మంచిది; ఇలయునున్= భూమినికూడా; ఏలు(ము)= పరిపాలించుము; దివ్యతయున్= దివ్యత్వాన్ని కూడా; ఇచ్చితిన్= నీకు ఇచ్చాను; నీదు నిష్ఠకున్= నీ తపోదీక్షకు; మెచ్చితిన్= మెచ్చాను.

తాత్పర్యం: ఆ వసురాజు మహాతపస్సును చెయ్యాలని నిశ్చయించుకొని రాజ్యభారాన్ని వదలి అరణ్యాలలోనికి వెళ్ళిపోయాడు. ఒక రోజున దేవేంద్రుడు అతడి దగ్గరకు వచ్చాడు. 'వసురాజా! నాతో స్నేహం చేయుము. నాతో ఉండుము. మా నగరానికి (అమరావతికి) వస్తూ పోతూ ఉండుము. ఈ భూమినికూడా పరిపాలించుము. నీకు దివ్యత్వాన్ని ఇస్తున్నాను. నీ తపోనిష్ఠకు మెచ్చుకొంటున్నాను.

తే. దేవభావంబునకుఁ దగ దీనినెక్కి । తిరుగు మెల్లెడ' నని రత్నదీప్తమైన
యొక విమానంబు సంప్రీతి నొసఁగె నతఁడు । నతని మాటకు మిగులక యట్ల చేసె. 358

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దేవభావంబునకున్= దివ్యత్వానికి; తగన్= తగినట్లుగా; దీనిన్= ఈ విమానాన్ని; ఎక్కి= అధిరోహించి; ఎల్ల+ఎడన్= అంతటా (సకలలోకాలూ); తిరుగుము= విహరించుము; అని; రత్న= రత్నాలతో; దీప్తమైన= ప్రకాశించే; ఒక+విమానంబున్= ఒక విమానాన్ని; సంప్రీతిన్= ప్రేమతో; ఒసఁగెన్= బహూకరించాడు; అతఁడున్= ఆ వసురాజుకూడా; అతని మాటకున్= ఆ ఇంద్రుడి మాటకు; మిగులక= జవదాటకుండా; అట్లు+అ= అలాగే; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: దివ్యత్వానికి అనువుగా ఇదిగో - ఈ విమానాన్ని స్వీకరించి దీనిమీద సకలలోకాలకూ రాకపోకలు చేయుము.' అంటూ ఇంద్రుడు రత్నఖచితమైన ఒక విమానం వసురాజుకు బహూకరించాడు ఇంద్రుడిమాట కాదనలేక వసురాజు అట్లాగే నని స్వీకరించాడు.

వ. దానం జేసి వసునామధేయుండైన యతం డుపరిచరుఁ డనం బరఁగె నదియునుం గాక వేఱొక్కటి యవ్విభుని విశేషంబు వినుము -కల్పాదియందు మరీచి యత్రి అంగిరసుండు పులహుండు పులస్త్యుండు క్రతువు వసిష్ఠుండనియెడు మహామునులు చిత్రశిఖండినామధేయులు స్వాయంభువుండను మనువుం దారు ననేకవర్షంబులు విష్ణు నుద్దేశించి తపంబు సేసిన నద్దేవుం డదృశ్యరూపంబున వారల కట్టెదుర నిల్చి వారితో 'మీరు ధర్మశాస్త్రకరణ ప్రవణులరై నన్నాశ్రయించితిరి. భారతి మీయందు నిలువ నియోగించితి. మీచేతం బ్రణీతంబై సకల జగంబులకు హితంబును మర్యాదాప్రవర్తకంబును నై శాస్త్రంబు వెలుంగు నంగిరసువలన బృహస్పతి యను నొక్క మహామతి జన్మించు వానియం దాసందర్భంబు ప్రతిష్ఠించునది' యని యానతిచ్చి వెండియు. 359

ప్రతిపదార్థం: దానన్+చేసి= అట్లా విమానం ఎక్కి తిరగటంచేత; వసునామధేయుండైన= వసువు అనే పేరుగలిగిన; అతండు= ఆ రాజు; ఉపరిచరుఁడు+అనన్+పరఁగెన్= ఉపరిచరుడు అనే ప్రఖ్యాతిని పొందాడు; అదియున్+కాక= అదీకాక; ఆ+విభుని= ఆ వసురాజుగారి; వేఱొక్కటి+విశేషంబు= మరొక విశేషం; వినుము; కల్ప+ఆదియందున్= ఈ కల్పానికి ఆదిలో, మరీచి - అత్రి - అంగిరసుండు, పులహుండు, పులస్త్యుండు, క్రతువు, వసిష్ఠుండు; అనియెడు= అనేటువంటి; మహామునులున్= మహర్షులూ; చిత్ర - శిఖండి నామధేయులున్= చిత్రుడు, శిఖండి అనేవారూ; స్వాయంభువుండు+అను= స్వాయంభువుడు అనే; మనువున్= మనువూ; తారున్= తామంతా; అనేకవర్షంబులు= అనేక సంవత్సరాలపాటు; విష్ణున్+ఉద్దేశించి= విష్ణుమూర్తిని మనస్సులో పెట్టుకొని; తపంబు+చేసినన్= తపస్సు చేస్తే; ఆ+దేవుండు= ఆ విష్ణు భగవానుడు; అదృశ్యరూపంబునన్= అదృశ్యరూపంలో; వారల= వారియొక్క; కట్టెదురన్= ఎట్టఎదుట; నిల్చి= నిలబడి; వారితోన్= వారందరితోనూ; మీరు= మీరంతా; ధర్మశాస్త్ర కరణ= ధర్మశాస్త్రాలను రచించటంలో; ప్రవణులరు+ఐ= తత్పరులై; నన్నున్= నన్ను; ఆశ్రయించితిరి= ఆశ్రయించారు; భారతిన్= సరస్వతిని; మీయందున్= మీలో; నిలువన్= నివసించటానికి; నియోగించితిన్= ఆజ్ఞాపించాను; మీచేతన్= మీచేత; ప్రణీతంబై= రచింపబడి; సకలజగంబులకున్= సమస్తలోకాలకూ; హితంబునున్= మేలునూ; మర్యాదాప్రవర్తకంబునున్+ఐ= కట్టుబాటుల అమలునూ చేసేదై; శాస్త్రంబు= ధర్మశాస్త్రం; వెలుంగున్= ప్రకాశిస్తుంది; అంగిరసువలనన్= అంగిరసుడికి; బృహస్పతి+అను= బృహస్పతి అనేటువంటి; ఒక్క= ఒకానొక; మహామతి= మహాధీశాలి; జన్మించున్= ప్రభవిస్తాడు; వానియందున్= ఆ బృహస్పతిలో; ఆ+సందర్భంబు= ఆ శాస్త్రగ్రంథం; ప్రతిష్ఠించునది= నెలకొల్పండి (బృహస్పతికి బోధించి, ఆ శాస్త్రానికి అతడిని వారసుడిని చేయండి); అని; ఆనతి+ఇచ్చి= ఆజ్ఞాపించి; వెండియున్= తిరిగి ఇట్లా.

తాత్పర్యం: వసువు అనే పేరుగల ఆ రాజు అట్లా విమానం ఎక్కి తిరగటంచేత ఉపరిచరుడు అనే ప్రఖ్యాతిని పొందాడు. మరొకవిశేషం వినుము. కల్పాదిలో మరీచి మొదలైన మునులూ, చిత్తుడు, శిఖండి, స్వాయంభువుడు (మనువు), అనేక సంవత్సరాలు విష్ణువును గూర్చి తపస్సు చేశారు. ఆ దేవుడు వారికి అదృశ్యరూపంలో వారి ఎదుట నిలిచి 'మీరంతా ధర్మశాస్త్రాలు రచించటంలో ఆసక్తులై నన్ను ఆశ్రయించారు. సరస్వతిని మీలో నిలవాలని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆజ్ఞాపించాను. మీ వలన ధర్మశాస్త్రం సమస్త లోకాలకూ మేలును, మర్యాదలను కలిగించేటట్లు వెలుగొందుతుంది. అంగిరసుడికి బృహస్పతి పేర ఒక మేధావి జన్మిస్తాడు. అతడి ద్వారా శాస్త్ర గ్రంథాన్ని నెలకొల్పండి' అని ఆజ్ఞాపించి మరల ఇట్లా అన్నాడు:

తే. **' ఉపరిచరవసు వను నొక్క నృపతి పుట్టు । నాతఁ డర్హుఁ డా శాస్త్రంబు నధిగమింప**
నా బృహస్పతి సెప్పంగ నధిగమించి । తత్సమాచార నాయకత్వము వహించు. **360**

ప్రతిపదార్థం: ఉపరిచరవసువు= ఉపరిచరవసువు; అను= అనేటటువంటి; ఒక్క నృపతి= ఒక రాజు; పుట్టున్= జన్మిస్తాడు; ఆతఁడు= ఆయన; ఆ శాస్త్రంబున్= ఆ ధర్మశాస్త్రాన్ని; అధిగమింపన్= పొందటానికి (నేర్చుకోవటానికి); అర్హుఁడు= యోగ్యుడు; ఆ బృహస్పతి= అంగిరసుడి కుమారుడై పుట్టబోయే ఆ బృహస్పతి; చెప్పంగన్= నేర్పగా; అధిగమించి= నేర్చుకొని; తద్+సమ= ఆ శాస్త్రంతో సమానమైన; ఆచార= ఆచరించటానికి నాయకత్వమున్= నేతృత్వాన్ని; వహించున్= వహిస్తాడు.

తాత్పర్యం: 'మహర్షులారా! ఉపరిచరవసువు అనే ఒక మహారాజు జన్మిస్తాడు. అతడు మీరు రచించబోయే ధర్మశాస్త్రాన్ని అధ్యయనం చెయ్యటానికి యోగ్యుడు. బృహస్పతి నేర్పగా అతడు నేర్చుకొని శాస్త్రప్రకారం ఆచరిస్తూ యజ్ఞయాగాది ఆచారాలకు నాయకుడు ఔతాడు.

వ. **' అమ్మహితాత్ముండు మద్భక్తుండు మీకు సంభావనీయుం' డని పలికి చనియె నత్తెఱంగునన యా పెంపు నొందినయట్టి యవ్వసువు హయమేధంబునకుం బ్రవర్తించిన నమ్మరీచ్యాదులగు సప్తసంఖ్యులును మఱియునుం దత్సములగు మహానుభావులును ఋత్విక్కరణంబు లాచరించిరి, బృహస్పతి యుపదర్శనంబు నడపెఁ, బ్రజాపతిపుత్రు లగు నేకతుండును ద్వితుండును ద్రితుండును నను మునిసత్తములు సదస్యులై రిట్లు సెల్లు నయ్యధ్వరంబునందు.** **361**

ప్రతిపదార్థం: ఆ+మహిత+ఆత్ముండు= మహానుభావుడైన ఆ వసురాజు; మత్+భక్తుండు= నా భక్తుడు; మీకున్= మీ కందరికీ; సంభావనీయుండు= గౌరవింపదగినవాడు; అని; పలికి= చెప్పి; చనియెన్= విష్ణుమూర్తి వెళ్ళిపోయాడు; ఆ+తెఱంగునన్+అ= అదే విధంగా; ఆ+పెంపున్= ఆ అభివృద్ధిని; ఒందినయట్టి= పొందినటువంటి; ఆ+వసువు= ఆ వసుమహారాజు; హయమేధంబునకున్= అశ్వమేధయజ్ఞం చేయటానికి; ప్రవర్తించినన్= పూనుకొంటే; ఆ+మరీచి+ఆదులు+అగు= మరీచిప్రభృతులైన ఆ; సప్తసంఖ్యులునున్= ఏడుగురూ; మఱియునున్= ఇంకా; తద్+సములు+అగు= వారితో సమానులైన; మహానుభావులునున్= మహాత్ములూ; ఋత్విక్+కరణంబులు= ఋత్విక్కులు చేసే పనులు (యాజ్ఞికత్వాలను); ఆచరించిరి= చేశారు; బృహస్పతి= అంగిరసుడు; ఉపదర్శనంబున్= పెత్తనాన్ని; నడపెన్= నడిపాడు; ప్రజాపతిపుత్రులు+అగు= బ్రహ్మదేవుడి కుమారులైన; ఏకతుండును= ఏకతుడూ; ద్వితుండునున్= ద్వితుడూ; త్రితుండునున్= త్రితుడూ; అను= అనే; మునిసత్తములు= మునిశ్రేష్ఠులు; సదస్యులు+ఐరి= సభ్యులయ్యారు; ఇట్లు; చెల్లు= నడుస్తున్న; ఆ+అధ్వరంబునందున్= ఆ యజ్ఞంలో.

తాత్పర్యం: మహానుభావుడైన ఆ వసురాజు నా భక్తుడు, గౌరవింపదగినవాడు' అని చెప్పి విష్ణువు వెళ్ళిపోయాడు. వసుమహారాజు అభివృద్ధి పొంది అశ్వమేధయాగం చేశాడు. అందులో మరీచి మొదలైన సప్తర్షులు, మరికొందరు ఋత్విక్కులుగా పాల్గొన్నారు. బృహస్పతి దర్శకత్వం వహించాడు. బ్రహ్మ పుత్రులైన ఏకతుడూ, ద్వితుడూ, త్రితుడూ సదస్యులయ్యారు. అట్లా నడుస్తున్న ఆ యజ్ఞంలో.

తే. **అన్నరేంద్రుం డహింసకుం డగుటఁ జేసి । పశు విశసనంబు లేకుండఁ బరమనిష్ఠ**
నాతఁ డారణ్యకోద్గీత మైన వాక్య । సంచయము విష్ణుగుఱిచి పఠించె నధిప! **362**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అధిప= ధర్మరాజా!; ఆ+నరేంద్రుండు= ఆ వసుమహారాజు; అహింసకుండు= ప్రాణిహింసకు వ్యతిరేకి; అగుటన్+ చేసి= కావటంచేత; పశువిశసనంబు= యజ్ఞంలో పశువును బలి ఇవ్వటం అనేది; లేకుండన్= లేకుండా దాని బదులు; పరమనిష్ఠన్= అత్యంతనిష్ఠతో; ఆతఁడు= యజమానుడైన ఆ వసురాజు; ఆరణ్యక+ఉద్గీతము+ఐన= ఆరణ్యకాలు అనే వేదభాగాలలో చెప్పబడిన; వాక్యసంచయమున్= మంత్రసమూహాన్ని; విష్ణుగుఱిచి= విష్ణుమూర్తినుద్దేశించి; పఠించెన్= జపించాడు.

తాత్పర్యం: ధర్మరాజా! ఆ వసుమహారాజు జీవహింసకు వ్యతిరేకి. అందుచేత అశ్వమేధంలో పశుసంహారానికి అంగీకరించలేదు. దానికి బదులుగా ఆరణ్యకాలలో చెప్పబడిన కొన్ని మంత్రాలను పరమనిష్ఠతో ఆ మహారాజు విష్ణుమూర్తి నుద్దేశించి పఠించాడు.

క. కరుణావిధేయుఁ డగు నా । హరి యతనికిఁ గానవచ్చు నట్టులుగాఁ జె
చ్చెర వచ్చి హవిర్భాగా । హరణం బొనరించి చనుడు నతికుపితుండై. 363

ప్రతిపదార్థం: కరుణా విధేయుఁడు+అగు= దయకు వశంవదుడైన; ఆ+హరి= ఆ విష్ణుమూర్తి; అతనికిన్= ఆ వసురాజుకు మాత్రమే; కానవచ్చునట్టులుగాన్= కనిపించేటట్టు; చెచ్చెరన్+వచ్చి= వేగమే వచ్చి; హవిర్భాగ+ఆహరణంబు+ఒనరించి= యజ్ఞ హవిర్భాగాన్ని (పురోడాశం) స్వీకరించి; చనుడున్= వెళ్ళిపోగా; అతికుపితుండై= మిక్కిలి కోపించి.

తాత్పర్యం: దయాపరుడైన విష్ణుమూర్తి సంతోషించి యజమానుడైన వసురాజుకు మాత్రమే కనిపించేటట్లు వచ్చి తనకు ఉద్దేశించిన హవిర్భాగాన్ని స్వీకరించి వెంటనే వెళ్ళిపోయాడు. ఆధ్వర్యం వహిస్తున్న బృహస్పతికి కోపం వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. దివ్యధిషణుం డగు ధిషణుండు గన్నీ రొలుక నన్నరపతితోఁ దనకై యెత్తిన పురోడాశభాగంబు విష్ణుం డెల్ల వేలుపులుంబోలె నాకు దర్శనగోచరుండై కొనక యదృశ్యుండై కొనియె నని యుగ్గడించిన నయ్యుపరిచరుండు భరితవినయుండై యతని ననునయించె. సదస్యులు సంభ్రమంబు లేక యన్నాకేశమంత్రితో నిట్లనిరి. 364

ప్రతిపదార్థం: దివ్య= దివ్యమైన; ధిషణుండు= బుద్ధికలవాడు; అగు= అయిన; ధిషణుండు= బృహస్పతి; కన్నీరు+ఒలుకన్= శోకిస్తూ; ఆ+నరపతితోన్= ఆ వసుమహారాజుతో; విష్ణుండు= విష్ణుమూర్తి; తనకై= తనకొరకని; ఎత్తిన= మీదుగట్టిన; పురోడాశభాగంబున్= హవిర్భాగాన్ని; ఎల్ల+వేలుపులున్+పోలెన్= తక్కిన అందరు దేవతలవలె; నాకున్= నాకు; దర్శనగోచరుండై= కనబడుతూ; కొనక= స్వీకరించకుండా; అదృశ్యుండై= అదృశ్యరూపంలో; కొనియెన్= స్వీకరించాడు(డా); అని; ఉగ్గడించినన్= పలికేసరికి; ఆ+ఉపరిచరుండు= ఆ ఉపరిచరవసువు; భరితవినయుండై = నిండా (నిండిన) వినయంతో; అతనిన్= ఆ బృహస్పతిని; అనునయించెన్= ఊరడించాడు (బుజ్జగించాడు); సదస్యులు= సదస్యులుగా వచ్చిన ప్రజాపతి పుత్రులు; సంభ్రమంబు లేక= కంగారుపడకుండా; ఆ+నాక+ఈశమంత్రితోన్= దేవేంద్రుడి మంత్రియైన ఆ బృహస్పతితో; ఇట్లు; అనిరి= అన్నారు.

తాత్పర్యం: ధీమంతుడైన బృహస్పతి కన్నీరు కారుస్తూ వసుమహారాజుతో ఇట్లా అన్నాడు: 'అందరు దేవతలవలె కాక విష్ణువు తన కిచ్చే హవిర్భాగాన్ని ప్రత్యక్షంగా కాక అదృశ్యుడై స్వీకరించా' డని చెప్పాడు. వసుమహారాజు బృహస్పతిని ఊరడించాడు. అప్పుడు ప్రజాపతి పుత్రులు బృహస్పతితో ఇట్లా అన్నారు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏకతద్వితత్రితులు బృహస్పతికి విష్ణుదేవుమహిమ సెప్పుట (సం. 12-323-19)

సీ. 'అలుక మానుము హరికై సముద్యతమైన । భాగంబు హరిగొన్నఁ బదరనేల?
యతని దర్శింప శక్యమె నీకు మాకును? । నజుని మానస పుత్రు లైన యేము
హరిదర్శనముఁ గోరి యధికతపం బాచ । రించుచుండఁగ నశరీరవాణి
దుగ్ధార్ణవంబునందు విశాల రమణీయ । మగు నొక్కదీవి దెల్పారియుండు

తే. నచటి కరుగుఁ డనుచు నతి సితవర్ణుల । స్వేదు లింద్రియప్రవృత్తి విముఖు
లధిక సురభిదేహు లాహార రహితులు । హరిపరాత్ములైన నరులు గలరు. 365

ప్రతిపదార్థం: ఓ బృహస్పతీ! అలుక= కోపం; మానుము= విడిచిపెట్టుము; హరికై= విష్ణుమూర్తికోసం; సముద్యతము+ఐన= మీదుగట్టిన; భాగంబున్= హవిర్భాగాన్ని; హరి= విష్ణుమూర్తి; కొన్నన్= స్వీకరిస్తే; పదరన్+ఏల= బాధ పడటం ఎందుకు?; అతనిన్= ఆ విష్ణుమూర్తిని; దర్శింపన్= చూడగలగటమనేది; నీకున్= నీకూ; మాకునున్= మాకూ; శక్యమె?= సాధ్యమా?; అజుని= బ్రహ్మదేవునియొక్క; మానసపుత్రులు+ఐన= మనస్సు నుంచి జన్మించిన కుమారులమైన; ఏము= మేము ముగ్గురమూ; హరిదర్శనమున్= విష్ణుమూర్తి దర్శనాన్ని; కోరి; అధికతపంబు= గొప్ప తపస్సు; ఆచరించుచున్+ఉండఁగన్= చేస్తూండగా; అశరీరవాణి= ఆకాశవాణి; దుగ్ధ+అర్ణవంబునందున్= క్షీరసముద్రంలో; విశాల= విశాలమూ; రమణీయము= రమణీయమూ; అగు= అయిన; ఒక్క= ఒకానొక; దీవి= ద్వీపం; తెలుపు+ఆరి+యుండున్= తెల్లగా ఉంటుంది; అచటికిన్= అక్కడికి; అరుగుఁడు= వెళ్ళండి; అచటన్= ఆ ద్వీపంలో; అతిసితవర్ణులు= మిక్కిలి తెల్లని రంగు కలవారూ; అస్వేదులు= చెమటపోయనివారూ; ఇంద్రియప్రవృత్తి= ఇంద్రియవ్యాపారాలపట్ల; విముఖులు= వైముఖ్యం కలవారూ; అధిక= బాగా; సురభి= పరిమళాలు విరజిమ్మే; దేహులు= శరీరాలు కలవారూ; ఆహారరహితులు= ఆహారం ఏమీ తీసికొననివారూ; హరి+పర+ఆత్ములు= విష్ణుమూర్తి పట్ల సంలగ్నమైన ఆత్మలు కలవారూ; ఐన= అయినటువంటి; నరులు= పురుషులు; కలరు= ఉన్నారు.

తాత్పర్యం: 'ఓ బృహస్పతీ! ఎందుకయ్యా అనవసరంగా అలుగుతావు? కోపం వదలుము. విష్ణుమూర్తికొరకని ఎత్తిన హవిరంశాన్ని విష్ణుమూర్తి తీసికొనివెళ్ళాడు. దానికి నీవు అలగటం ఎందుకు? నీవు బాధపడటం ఎందుకు? ఆయనను దర్శించటమనేది నీకూ మాకూ అవుతుందా! సాక్షాత్తూ బ్రహ్మమానసపుత్రులమైన మాకే సాధ్యం కాలేదు. విష్ణుమూర్తి దర్శనం కోరి మేము ముగ్గురమూ బ్రహ్మాండమైన తపస్సు చేశాం. అపుడు అశరీరవాణి మాకు వినిపించేటట్లు ఇట్లా చెప్పింది. క్షీరసముద్ర మధ్యభాగంలో ఒక శ్వేతద్వీపం ఉన్నది. అక్కడికి వెళ్ళండి. ఆ ద్వీపంలో మిక్కిలి తెల్లని రంగువారూ, చెమట పట్టనివారూ, జితేంద్రియులూ, పరిమళాలు విరజిమ్మే శరీరం కలవారూ, నిరాహారులూ, హరిభక్తి పరాయణులూ అయిన నరులు ఉంటారు.

క. వారలకుఁ జూపు నిజతే । జోరూపము విష్ణుఁ డపుడు సూడఁగనైనన్
మీరును జూతు రనినఁ బ్రియ । మారిన చిత్తములతోడ నందఱము వెసన్. 366

ప్రతిపదార్థం: వారలకున్= ఆ నరులకు; విష్ణుఁడు= విష్ణుమూర్తి; నిజ= తనయొక్క; తేజస్+రూపమున్= కాంతిమయమైన రూపాన్ని; చూపున్= చూపిస్తూ ఉంటాడు (కాంతి స్వరూపుడుగా దర్శనం అనుగ్రహిస్తాడు); అపుడు= ఆ సమయంలో; చూడఁగన్+ఐనన్= చూడగలిగితే (చూడటం తటస్థపడితే); మీరునున్= మీరుకూడా; చూతురు= చూద్దురుగాని; అనినన్= అని అశరీరవాణి చెప్పగా; ప్రియము+ఆరిన= ప్రీతినిండిన; చిత్తములతోడన్= హృదయాలతో; అందఱమున్= మేము ముగ్గురమూ; వెసన్= వెంటనే.

తాత్పర్యం: ఆ నరులకు విష్ణుమూర్తి తన తేజోరూపాన్ని చూపిస్తూ ఉంటాడు. అప్పుడు చూడగలిగితే మీరూ చూడ్దురుగాని - అని ఆకాశవాణి చెప్పింది. ఆ మాటలకు మా హృదయాలు ఆనందపరవశాలు అయ్యాయి. ముగ్గురమూ వెంటనే బయలుదేరాము.

వ. శ్వేతద్వీపంబునకుం జని యశరీరవాణి సెప్పిన చందంబు మానవులం గంటి మట్టి దీప్తి విశేషంబు లే లోకంబుల నెజ్జాతులకు లేవు. వారలు మానసజప పరాయణులైయున్నవా రే మయ్యెడ నేకాంతిజనుల కింతనంత నున్నంత భాను సహస్ర ప్రభాభాసితంబగు నొక్కదివ్య తేజోరూపంబు వారి యగ్రభాగంబునం దోఁచిన వారు గూడుకొని భక్తిమయ ప్రణామంబులు సేయుచుం జేరి జయ పుండరీకాక్ష! జయ హృషీకేశ! జయ విశ్వభావన! నమస్తే నమస్తే యను నెలుంగులు నింగిముట్టం గొల్పి రట్టియెడ. 367

ప్రతిపదార్థం: శ్వేతద్వీపంబునకున్= ఆ శ్వేతద్వీపానికి; చని= వెళ్ళి; అశరీరవాణి= ఆకాశభారతి; చెప్పిన+చందంబు+మానవులన్= చెప్పిన తీరులోనే ఉన్న నరులను; కంటిమి= చూశాము; అట్టి= అటువంటి; దీప్తివిశేషంబులు= విశిష్టమైన శరీరకాంతులు (రూపప్రకాశం); ఏ లోకంబులన్= ఏ లోకాలలోనూ; ఏ+జాతులకున్= ఏ జాతులవారికీ; లేవు= ఉండవు; వారలు= ఆ శ్వేతశరీరాలు; మానస+జప+పరాయణులు+ఐ= మనస్సులో ధ్యానతత్పరులై; ఉన్నవారు= ఉన్నారు; ఏము= మేము; అయ్యెడన్= అక్కడ; ఏకాంతిజనులకున్= ఏకాగ్రచిత్తులైన ఆ విష్ణుభక్తులకు; ఇంతన్+అంతన్= చేరువలో (ఇంతా అంతా దూరాలలో); ఉన్నంతన్= నిలువగా; భానుసహస్ర= వేయిమంది సూర్యబింబాల; ప్రభా= వెలుగులతో; భాసితంబు+అగు= ప్రకాశించే; ఒక్క= ఒకానొక; దివ్యతేజోరూపంబు= దివ్యమైన కాంతిమయ స్వరూపం; వారి= ఆ శ్వేతవర్ణుల; అగ్రభాగంబునన్= ఎట్టయెదుట; తోఁచినన్= ప్రత్యక్షమయ్యేసరికి; వారు= ఆ నరులందరూ; కూడుకొని= సామూహికంగా; భక్తిమయ= భక్తితో నిండిన; ప్రణామంబులు= నమస్కారాలు; చేయుచున్= చేస్తూ; చేరి= సమీపించి; పుండరీకాక్ష!= తెల్లతామరల వంటి కన్నులుకలవాడా!; జయ= నీకు జయము; హృషీకేశ!= ఓ విష్ణూ!; జయ= జయము; విశ్వభావన!= విశ్వరూపా!; జయ= నీకు జయము నమః+తే= నీకు నమస్కారము; నమః+తే= నీకు నమస్కారము; అను= అనే; ఎలుంగులు= కంఠధ్వనులు; నింగి+ముట్టన్+కొల్పిరి= ఆకాశం అంటేటట్లు చేశారు (మిన్ను ముట్టేలా బిగ్గరగా జయజయ ధ్వానాలు చేశారు); అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ శ్వేతద్వీపానికి వెళ్ళి, ఆకాశవాణి చెప్పినట్లుగా ఉన్న మానవులను చూచాం. అటువంటి విశిష్టమైన శరీరరూపాలు ఏ లోకాలలోనూ ఏ జాతులవారికీ ఉండవు. ఆ శ్వేతశరీరులు మనస్సులో ధ్యానతత్పరులై ఉన్నారు. మేము అక్కడ ఏకాగ్రమైన మనస్సుతో ఆ విష్ణుభక్తుల చెంత నిలువగా వేయిమంది సూర్యబింబాల వెలుగులతో ప్రకాశించే ఒకానొక దివ్యమైన కాంతిమయ స్వరూపం ఆ శ్వేతవర్ణుల ఎట్టయెదుట ప్రత్యక్షమయ్యేసరికి ఆ నరులందరూ సామూహికంగా భక్తితో నిండిన నమస్కారాలు చేసి 'తెల్లతామరలవంటి కన్నులుకలవాడా! నీకు జయము! హే విష్ణూ! నీకు జయము. విశ్వరూపా! నీకు జయము జయము.' అంటూ మిన్నుముట్టేటట్లు జయజయధ్వానాలు చేశారు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: హృషీకము= ఇంద్రియము. హృషీక+ఈశుఁడు= ఇంద్రియాలను స్వాధీనపరచుకొన్నవాడు - విష్ణువని అర్థం.

క. మా నయనంబులు దత్తే । జోనిహతము లగుడుఁ దెలియఁ జూడ నశక్యం
బైనం జేడ్పడి యుండం । గా నొక భూతంబు వలికె గగనతలమునన్. 368

ప్రతిపదార్థం: మా నయనంబులు= మా కన్నులు; తత్+తేజోనిహతములు= ఆ కాంతిచేత చూడలేనివి; అగుడున్= కావటంచేత; తెలియన్= స్పష్టంగా; చూడన్= చూడటానికి; అశక్యంబు+ఐనన్= సాధ్యం కాకపోగా; చేడ్పడి+ఉండన్= నివ్వెరపాటుచెంది ఉండగా; ఒక భూతంబు= ఒక మహాశక్తి; గగనతలమున్= ఆకాశభాగాన; పలికెన్= మాట్లాడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ కాంతిచేత మా కన్నులు చూడలేకపోవటంతో ఆ దివ్యరూపాన్ని స్పష్టంగా తెలిసికొనటం సాధ్యంకాక మేమందరం నివ్వెరపాటుచెంది ఉండగా ఒక భూతం ఆకాశపుటంచున ఈ విధంగా పలికింది.

క. ఈ దేవునిఁ గన్నట్టుల । కాదే? యిప్పురుషవరులఁ గాంచుట మీకున్
ఖేదంబు వలదు నియమ త । పోదానము లితనిఁ జూపఁ బూఁటవడియెనే? 369

ప్రతిపదార్థం: ఈ+పురుషవరులన్= నరులలో శ్రేష్ఠులైన ఈ శ్వేతశరీరులను; కాంచుట= చూడటం అనేది; ఈ దేవునిన్= ఈ విష్ణుమూర్తిని; కన్న+అట్టుల+కాదే?= చూసినట్టుకాదా?; మీకున్= మీకు; ఖేదంబు= దిగులు; వలదు= వద్దు (దిగులుపడకండి); నియమ= మీరు ఆచరించిన నియమాలూ; తపః= తపస్సులూ; దానములు= దానాలూ; ఇతనిన్+చూపన్= ఈ దేవుడిని దర్శింపజేయటానికి; పూఁట+పడియెనే= పూచీపడ్డాయా?

తాత్పర్యం: బ్రహ్మమానసపుత్రులారా! విష్ణుమూర్తిని దర్శించలేకపోయామే అని ఖేదపడకండి. ఈ శ్వేతశరీరులైన దివ్యపురుషులను దర్శించారు. చాలు. సంతృప్తి పడండి. విష్ణుమూర్తిని దర్శించినట్లే. ఇంతకాలమూ మీరు ఆచరించిన నియమనిష్ఠలూ, తపస్సులూ, దానాలూ ఇవన్నీ విష్ణుమూర్తి దర్శనం మీకు ఇప్పించటానికి ఏమయినా పూచీపడ్డాయా? (మీ తపస్సులు ఇంకా చాలవు సుమా! అని భావం).

క. ఏకాంతిక భక్తిరతి న । నేకములగు వత్సరముల కివ్విష్ణుని నా
లోకింపంగా దొరకొనుఁ । గా కిటు వేగపడ మీకుఁ గానఁగ వశమే? 370

ప్రతిపదార్థం: ఏకాంతిక= తదేకమైన; భక్తి రతిన్= భక్తినిరతితో (దీక్షతో); అనేకములు+అగు+వత్సరములకున్= అనేక సంవత్సరాలకు; ఈ+విష్ణునిన్= ఈ విష్ణుమూర్తిని; ఆలోకింపంగాన్= చూడటానికి; దొరకొనున్+కాక= అవకాశం లభిస్తుందే తప్ప; ఇటు= ఇట్లా; వేగపడన్= తొందరపడితే; మీకున్= మీకు; కానఁగన్+వశమే?= దర్శించటం సాధ్యమా?

తాత్పర్యం: తదేకభక్తితో, దీక్షతో అనేక సంవత్సరాలు తపస్సు చేస్తే, అప్పటికి ఈ విష్ణుమూర్తి దర్శనం లభిస్తుంది. అంతే కాని ఇట్లా తొందరపడితే దొరుకుతుందా? అది అంత తేలిక విషయం కాదు.

క. అని పలికిన విని క్రమ్మఱఁ । జనుదెంచితి మేము విష్ణు చందం బిది నీ
కనఘా! యలుగం బనిలే । దనూనములు గాఁగ నడపు మధ్వరవిధులన్.' 371

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పవిత్రుడా!; అని; పలికినన్= (ఆకాశవాణి) పలికితే; విని; ఏము= మేము ముగ్గురమూ; క్రమ్మఱన్= తిరిగి; చనుదెంచితిమి= వచ్చేశాం; విష్ణు+చందంబు= విష్ణుమూర్తియొక్క పద్ధతి; ఇది; నీకున్= నీకు; అలుగన్+పనిలేదు= అలగవలసిన అవసరంలేదు; అధ్వరవిధులన్= ఈ యజ్ఞకర్తవ్యాలను; అనూనములు+కాఁగన్= ఏ లోటూ లేనివిగా; నడపు(ము)= జరిపించుము.

తాత్పర్యం: ఆకాశవాణి ఇట్లా చెప్పేసరికి మేము ముగ్గురం మళ్ళీ తిరిగి వచ్చాం. విష్ణుమూర్తులవారి పద్ధతి అది. అట్లా ఉంటుంది. అందుచేత ఓ బృహస్పతీ! కనిపించకుండా వెళ్ళిపోయాడే విష్ణుమూర్తి - అని నీవు అలగవలసిన పనిలేదు. ఈ అశ్వమేధయజ్ఞంలో ఇంకా మిగిలిపోయిన విధుల నన్నింటినీ ఏ లోటూ రాకుండా శ్రద్ధగానడిపించుము.'

వ. అని యిట్లేకతద్వితత్రితులు సెప్పినం బ్రశాంతుండై పురుహూతపురోహితుం డయ్యాగంబు సుప్రయోగంబుగాఁ జెల్లించె నా భూవల్లభుం డట్లు పుణ్యపరుం డగుచుఁ బ్రజాపరిపాలనం బొనరించె నట్టియెడ నాకలోకంబునన సురమునిగోష్ఠి యందు సుర లధ్వరంబుల నజంబుల విశసింపవలయు నని పలికిరి మును లజంబు లన్నంతన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యెల్లయుగంబులను ఛాగంబులఁగాఁ గొనరాదు. కృతయుగ విషయంబుగా వేదంబు లజంబు లోషధులని చెప్పెంగాన యని రిట్లు వివాదంబైన సమయంబున నలవోక నుపరిచరవసు వయ్యెడకుం జనిన నా రెండు దెఱంగులవారును జయాపజయంబులకు నతనిమాట పాటిగా నూఁది యడిగిన నాతండు. 372

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; ఏకత, ద్విత, త్రితులు= ఏకతుడూ, ద్వితుడూ, త్రితుడూ అనే ముగ్గురూ; చెప్పినన్= చెప్పేసరికి; ప్రశాంతుండై= కోపం తగ్గి ప్రశాంతి పొందినవాడై; పురుహూత పురోహితుండు= దేవేంద్రుడి పురోహితుడైన బృహస్పతి; ఆ+యాగంబున్= వసురాజు చేస్తున్న ఆ అశ్వమేధ యజ్ఞాన్ని; సుప్రయోగంబుగాన్= బాగా చేయబడినదానిగా; చెల్లించెన్= పూర్తిచేయించాడు; ఆ+భూవల్లభుండు= ఆ వసుమహారాజు; అట్లు; పుణ్యపరుండు+అగుచున్= పుణ్యతత్పరుడు అవుతూ; ప్రజాపరిపాలనంబు= లోకపరిపాలన; ఒనరించెన్= చేశాడు; అట్టియెడన్= అట్లా ఉండగా ఒకనాడు; నాకలోకంబునన్+అ= దేవలోకంలోనే; సురమునిగోష్ఠియందున్= దేవతలూ, మునులూ జరుపుతున్న ఒక చర్చలో; సురలు= దేవతలు; అధ్వరంబులన్= యజ్ఞాలలో; అజంబులన్= మేకలను (గొర్రెలు); విశసింపన్+వలయున్= బలి ఇవ్వాలి; అని; పలికిరి= అన్నారు; మునులు= మునులేమో; అజంబులు+అన్నంతన= అజములు అనగానే; ఎల్లయుగంబులను= అన్ని యుగాలలోనూ; ఛాగంబులన్+కాన్+కొనరాదు= మేకలు అనే తీసుకోవటానికి వీలులేదు; వేదంబులు= వేదాలు; కృతయుగ విషయంబుగాన్= కృతయుగంలో మాటగా; అజంబులు+ఓషధులు= అజములంటే ఓషధీలతలూ; అని; చెప్పెన్= చెప్పింది; కానన్= కాబట్టి అజములు అంటే అన్ని యుగాల లోనూ ఛాగాలు కాదు యుగయుగానికీ దీని అర్థం మారిపోతూ ఉంటుంది కాబట్టి; అనిరి= అన్నారు; ఇట్లు; వివాదంబు+ఐన+సమయంబునన్= వాదం నడుస్తున్న తరుణంలో; అలవోక+పోలెన్= యథాలాపంగా అన్నట్టు; ఉపరిచరవసువు; అయ్యెడకున్= వివాదం జరుగుతున్న ఆ చోటికి; చనినన్= (తన విమానంమీద) వెళ్ళేసరికి; ఆ+రెండు తెఱంగులవారునున్= ఆ రెండు పద్ధతులవారూ; జయ+అపజయంబులకున్= గెలుపూ ఓటములకు; అతనిమాట= వసురాజుగారి వాక్కే; పాటిగాన్+ఊఁది= ఆధారంగా భావించి (తుదినిర్ణయంగా ఒప్పుకొని); అడిగినన్= అడిగితే; ఆతండు= ఆ వసురాజు.

తాత్పర్యం: ఈ విధంగా ఏకతుడూ, ద్వితుడూ, త్రితుడూ అనే ముగ్గురూ చెప్పేసరికి కోపం తగ్గి ప్రశాంతుడై బృహస్పతి వసుమహారాజుయొక్క యజ్ఞాన్ని పూర్తిచేయించాడు. ఆ వసుమహారాజు పుణ్యతత్పరుడై లోకపరిపాలన చేశాడు. అట్లా ఉండగా ఒకనాడు దేవలోకంలోనే దేవతలూ, మునులూ జరుపుతున్న ఒక చర్చలో దేవతలు యజ్ఞాలలో మేకలను బలిఇవ్వాలి అన్నారు. మునులేమో 'అజములు అనగానే అన్ని యుగాలలోనూ మేకలు అనే అర్థాన్ని తీసికొనటానికి వీలులేదు. కృతయుగంలో అజములంటే ఓషధులనే అర్థం గ్రహించాలి' అని అన్నారు. యథాలాపంగా అక్కడకు వెళ్ళిన ఉపరిచరవసువును చూచి, తుదినిర్ణయాన్ని ఉభయపక్షాలవారూ అతడికి వదలివేశారు. దానికి అతడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఛాగమ విశసనయోగ్యము। యాగంబుల నెల్ల యుగములందు ననియెం
దా గీర్వాణుల పక్షం। బై గెలు పది యపుడు వారి కగుటకు నధిపా! 373

ప్రతిపదార్థం: అధిపా!= ధర్మరాజా!; తాన్= ఆ వసురాజు; గీర్వాణుల పక్షంబై= దేవతల పక్షంచేరి; అపుడు= అప్పటికి; గెలుపు+అది= జయమనేది; వారికిన్= దేవతలకు; అగుటకున్= కావటం కోసం; ఎల్లయుగములందున్= అన్ని యుగాలలోనూ; యాగంబులన్= యాగాలలో; ఛాగము+అ= మేకయే; విశసనయోగ్యము= బలి ఇయ్యదగినది; అనియెన్= అన్నాడు;

తాత్పర్యం: అప్పుడు ఆ వసురాజు అన్ని యుగాలలోనూ యజ్ఞాలలో బలి ఇవ్వదగినది మేక ఒక్కటే అని దేవతలను అప్పటికి గెలిపించటంకొరకు వారి పక్షం చేరి వారికి అనుకూలంగా తీర్పు చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని వేదార్థాపలాపంబునకుం గోపంబు నొందిన మునుల శాపంబున నతండు భూవివరపతితుండై యుండ నమరు లేతెంచి యతని యంతరంగంబునకుం దెలివును నంగంబునకు డప్పి లేకునికియు నొసంగి విష్ణుప్రసాదంబునఁ బ్రత్యాపన్నుండ వగు దని యూఱడించి యరిగి రన్నరవరుండును విష్ణుధ్యాన జపపరాయణుం డగుచుండ నచిరకాలంబునకు విష్ణుండు విహగపతిం బుత్తెంచి యెత్తించికొనిపోయి శరీరంబుతోడన బ్రహ్మలోకగతుం గావించి సంభావించిన నమ్మహానుభావుండు పరమానందంబునొంది వెలింగె. 374

ప్రతిపదార్థం: అనినన్= వసురాజు అట్లా అనేసరికి; విని= మునులు విని; వేదార్థ+అపలాపంబునకున్= వేదార్థాన్ని అన్యథాకరించినందుకు; కోపంబున్+ఒందిన= కోపించిన; మునుల= మునులయొక్క; శాపంబునన్= శాపంతో; అతండు= ఆ వసురాజు; భూవివర+పతితుండు+ఐ+ఉండన్= భూమిరంధ్రంలో పడిపోయినవాడై ఉండగా; అమరులు= దేవతలు; ఏతెంచి= అక్కడికివచ్చి; అతని= ఆ వసుమహారాజుగారి; అంతరంగంబునకున్= (మనస్సుకు) ఆత్మకు; తెలివును= కాంతీ, (జ్ఞాపకం); అంగంబునకున్= శరీరానికి; డప్పి= దప్పికా; లేక+ఉనికియున్= లేకపోవటాన్ని; ఒసంగి= ఇచ్చి (మనస్సుకు తెలివీ, శరీరానికి డప్పికా లేకుండా చేశారు); విష్ణు= విష్ణుమూర్తియొక్క; ప్రసాదంబునన్= అనుగ్రహంతో; ప్రతి+ఆపన్నుండవు= మళ్ళీ యథాస్థితికీ వచ్చినవాడవు; అగుదు(వు)+అని= అవుతావు అని (మళ్ళీ సురలోకానికి తిరిగి వస్తావని); ఊఱడించి= ఉపశమన వాక్యాలు పలికి; అరిగిరి= వెళ్ళిపోయారు; ఆ+నరవరుండునున్= ఆ వసుమహారాజు; విష్ణుధ్యాన జప పరాయణుండు= విష్ణుమూర్తిని ధ్యానించేవాడూ, జపించేవాడూ; అగుచుండన్= అవుతూ ఉండగా (ధ్యానజపాలు చేస్తూండగా - అని); అచిరకాలంబునకున్= స్వల్పకాలంలోనే; విష్ణుండు= ఆ విష్ణుమూర్తి; విహగపతిన్= పక్షిరాజయిన గరుత్మంతుడిని; పుత్తెంచి= పంపించి; ఎత్తించి కొనిపోయి= వసురాజును పైకి లేవనెత్తించి తీసికొనివెళ్ళి; శరీరంబుతోడన్+అ= సశరీరంగానే; బ్రహ్మలోకగతున్= బ్రహ్మలోకం పొందిన వాడినిగా; కావించి= చేసి (బ్రహ్మలోకంలో ఆవాసం కల్పించి); సంభావించినన్= గౌరవించేసరికి; ఆ+మహానుభావుండు= ఆ మహాత్ముడు; పరమానందంబున్+ఒంది= గొప్ప ఆనందం పొంది; వెలింగెన్= విరాజిల్లాడు.

తాత్పర్యం: వసురాజు అట్లా అనేసరికి వేదార్థాన్ని అన్యథాకరించినందుకు కోపించిన మునులు శపించగా అతడు నేలపై పడ్డాడు. దేవతలు అక్కడికి వచ్చి అతడి మనస్సుకు తెలివీ, శరీరానికి దప్పికా లేకుండా చేశారు. 'విష్ణుదేవుడి ప్రసాదం వలన మరల సురలోకానికి వస్తా'వని ఊరడించి వెళ్ళారు. వసురాజు విష్ణుదేవుడిని ధ్యానించి, జపించి సేవించగా కొద్దికాలంలోనే విష్ణువు గరుత్మంతుడిని పంపి, అతడిని సశరీరంగా బ్రహ్మలోకానికి తెప్పించాడు. ఆ గౌరవానికి వసురాజు పరమానందం పొందాడు.

విశేషం: 'అంతరంగంబునకుం - 'దెలివును' అనే పాఠానికి 'తెవులును' అని మరొకపాఠం ఉన్నది. సంస్కృతమూలంలో **"మా చ త్వాం గ్లాని రాస్పృశేత్"** (13-324-24) అని ఉన్నది. 'గ్లాని'కి 'తెవులు' అనే పాఠం సముచితమని తోస్తున్నది.

క. కురునాథ! యుపరిచరవసు । చరితంబు ప్రసంగకలన సంప్రాప్తంబై
బెరసెను నీ వడిగిన య । ప్పురుషుల దివ్యానుభావముం జెప్పంగన్.' 375

ప్రతిపదార్థం: కురునాథ!= ఓ ధర్మరాజా!; నీవు; అడిగిన= అడిగినటువంటి; ఆ+పురుషుల= ఆ శ్వేతశరీరుల; దివ్య+అనుభావమున్= దివ్యమైన ఆకార చేష్టాదికాన్ని; చెప్పంగన్= చెప్పుతూ ఉంటే; ప్రసంగకలనన్= ప్రసంగవశాత్తూ; ఉపరిచరవసు= ఉపరిచరవసుమహారాజు యొక్క; చరితంబు= కథ; సంప్రాప్తంబై+బెరసెను= వచ్చి కలిసింది. (బెరయు= కలియు)

తాత్పర్యం: ధర్మరాజా! శ్వేతద్వీపంలో ఉండే దివ్యపురుషుల ఆకారాదులను నీ కోరికపై చెప్పబోతే మధ్యలో ఈ ఉపరిచరవసువు వృత్తాంతం ప్రసంగవశాత్తూ వచ్చిపడింది.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి భీష్ముం డా భూపతితో 'నారదు వృత్తాంతంబు వివరించెద నాకర్ణింపుము.' 376

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; భీష్ముండు= భీష్మాచార్యుడు; ఆ+భూపతితోన్= ఆ ధర్మరాజుతో; నారదు= నారదుడి యొక్క; వృత్తాంతంబు=(349వ పద్యంతో ప్రారంభించిన) కథ; వివరించెదన్= (మిగిలినది) వివరిస్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని భీష్ముడు నారదుడి కథను ధర్మరాజుకు చెప్పటం మొదలుపెట్టాడు.

సీ. అని చెప్పి యిట్లను 'నధిప! నారదుఁ డట్టు । లద్దీవియును నద్భుతాంగులైన
యమ్మానవులుఁ దన యంతరంగంబునఁ । దోఁచినఁ బ్రీతి నందులకు నేఁగి
యమ్మహాత్ములు దన్ను నాత్మల నాదరిం । పంగఁ దా నత్యంతభక్తిఁ బ్రణతుఁ
డై పరమైకాంతులగువారి కింతింత । నిలిచి దుష్కరతపోనిష్ఠఁ బూని

తే. యూర్ధ్వబాహుతఁ గదలకయుండి వివిధ । గూఢ దివ్యనామోక్తి సంప్రౌఢి యచటి
సకలజీవుల నానంద సంభృతములఁ । జేయుచుండ విష్ణుస్తుతి సేయుచుండె. 377

ప్రతిపదార్థం: అని చెప్పి= అని; ఇట్లు+అనున్= ఇట్లా కొనసాగిస్తున్నాడు; అధిప!= ఓ ధర్మరాజా!; అట్టులు= ఆ రకంగా; నారదుఁడు= నారదమహర్షి; ఆ+దీవియునున్= ఆ శ్వేతద్వీపమూ; అద్భుత+అంగులైన= ఆశ్చర్యకరమైన శరీరాలు కలిగిన; ఆ+మానవులున్= ఆ దివ్యపురుషులూ (నరులు); తన= తనయొక్క; అంతరంగంబునన్= హృదయంలో (మనస్సులో); తోఁచినన్= కనిపించేసరికి; ప్రీతిన్= ప్రేమతో; అందులకున్= ఆ శ్వేతద్వీపంలోకి; ఏఁగి= వెళ్ళి; ఆ+మహాత్ములు= ఆ శ్వేతశరీరులైన మహానుభావులు; తన్నున్= తనను; ఆత్మలన్= వారి హృదయాలలో; ఆదరింపంగన్= గౌరవించగా; తాన్= తాను(నారదుడు); అత్యంతభక్తిన్= మిక్కిలి భక్తితో; ప్రణతుఁడై= నమస్కరించినవాడై; పరమ+ఏకాంతులు+అగు= మిక్కిలి ఏకాగ్రచిత్తులైన; వారికిన్= ఆ శ్వేతశరీరులకు; ఇంతింతన్= చేరువలో; నిలిచి= నిలబడి; దుష్కర= కఠినమైన; తపోనిష్ఠన్= తపోదీక్షను; పూని= వహించి; ఊర్ధ్వబాహుతన్= చేతులు పైకి చూపిన భంగిమలో (స్థితిలో); కదలక+ఉండి= నిశ్చలంగా ఉండి; వివిధ= పలురకాలైన; గూఢ= రహస్యమైన; దివ్యనామ= మంత్రప్రాయమైన విష్ణునామాల; ఉక్తి= తన ఉచ్చారణతో ఏర్పడిన; సంప్రౌఢి= ప్రౌఢత్వం; అచటి= అక్కడ ఉన్న; సకలజీవులన్= సమస్త ప్రాణికోటినీ; ఆనంద= ఆనందంతో; సంభృతములన్= నిండినవిగా (నిండినవానిఁగా); చేయుచుండన్= చేస్తూఉంటే (దివ్యనామాల ఉచ్చారణ వీటిని ఆనందపరుస్తోంది - అని); విష్ణుస్తుతి= ఇట్లా విష్ణుమూర్తికి సంబంధించిన స్తోత్రం; చేయుచుండెన్= (నారదుడు) చేస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! నారదుడి మనస్సులో శ్వేతద్వీపమూ శ్వేతశరీరులైన దివ్య పురుషులూ రూపుగట్టారు. వెంటనే బయలుదేరి ఆ ద్వీపం చేరుకొన్నాడు. ఆ మహాత్ములను దర్శించాడు, నమస్కరించాడు. వారంతా నారదుడిని ఆత్మీయంగా గౌరవించారు. వారికి చేరువలోనే నారదుడు కూడా తపస్సుకు పూనుకొన్నాడు. ఊర్ధ్వబాహుడై నిలబడి విష్ణునామాలను ఉచ్చరించటం మొదలుపెట్టాడు. అవి నిగూఢమైన దివ్యనామాలు. వాటి ఉచ్చారణ ఆ ప్రాంతంలో ఉన్న సకలప్రాణులనూ ఆనందింపజేసింది. ఇట్లా నారదుడు ధ్యానమూ విష్ణుస్తోత్రమూ చేస్తున్నాడు.

వ. ఇవ్విధంబున నేకాంతియై సంస్తుతింప సితాసితపీతారుణ పిశంగ హరిత వర్ణంబులను బహుశిరోబాహుపాదంబులను వేది - కమండలు - స్రుక్స్రు వాగ్ని ధారణంబున నోంకారసావిత్రీ చతుర్వేదోచ్చారణంబులను మహాద్భుతంబయిన నిజదివ్యరూపంబు నారదునకు దర్శనగోచరంబుగా నిలిచి విష్ణుండు వినయ సంభ్రమోపేతభక్తి ప్రణతుండగు నప్పరమముని నాదరించి యిట్లనియె. 378

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ ప్రకారంగా; ఏకాంతియై= ఏకాగ్రచిత్తుడై; సంస్తుతింపన్= స్తుతించేసరికి; సిత= తెలుపు; అసిత= నలుపు (నీలం); పీత= పసుపు; అరుణ= ఎరుపు; పిశంగ= పుప్పొడి రంగు; హరిత= ఆకుపచ్చ; వర్ణంబులను= రంగులతోనూ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బహు= అనేకమైన; శిరః= తలలూ; బాహు= చేతులూ; పాదంబులను= కాళ్ళతోనూ; వేది= కుండమూ; కమండలు= కమండలువూ; స్రుక్+స్రువ= హోమం చెయ్యటానికి నెయ్యి పోసే చెక్క గరిటెలు రెండూ (పాత్రలోనుండి నెయ్యి తీయటానికి ఉపయోగించేది - స్రువం. అగ్నిలో ఆ నెయ్యిని పోయటానికి ఉపయోగించే పొడవాటిది - స్రుక్కు); అగ్ని= హోమాగ్ని - వీటి; ధారణంబునన్= వహనంతో (వీటిని ధరించటంతోపాటు); ఓంకార= ప్రణవమూ; సావిత్రీ= గాయత్రీ మంత్రమూ; చతుర్వేద= నాలుగువేదాలూ - వీటి; ఉచ్చారణంబులను= ఉచ్చారణలతోనూ; మహా (హత్)+అద్భుతంబు+ఐన= మిక్కిలి ఆశ్చర్యకరమైన; నిజ= తనయొక్క; దివ్యరూపంబు= దివ్యస్వరూపం; నారదునకున్= ఆ నారదమహర్షికి; దర్శన+గోచరంబుగాన్= చూపులకు (కన్నులకు) కనిపించేటట్లు; నిలిచి= ప్రత్యక్షమై నిలబడి; విష్ణుండు= ఆ విష్ణుమూర్తి; వినయ= వినయమూ; సంభ్రమ= కంగారూ - వీటితో; ఉపేత= కూడుకొన్న; భక్తి= భక్తితో; ప్రణతుండు+అగు= నమస్కరిస్తున్న; ఆ+పరమమునిన్= ఆ దేవర్షి నారదుడిని; ఆదరించి= గారవించి; ఇట్లు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా నారదుడు ఏకాగ్రచిత్తుడై ధ్యానం చేస్తుండగా విష్ణుమూర్తి ప్రత్యక్షం అయ్యాడు. ఆయన తెలుపూ, నలుపూ, పసుపూ, ఎరుపూ, గోరోచనమూ, ఆకుపచ్చ రంగులలో ఉన్నాడు. సహస్రశిరస్సులూ, సహస్రబాహువులూ, సహస్రపాదాలూ ఉన్నాయి. హోమవేదిక, కమండలువూ, స్రుక్కూ, స్రువమూ, అగ్నీ - వీటినన్నింటిని ధరించి ఉన్నాడు. ఓంకారాన్ని ఉచ్చరిస్తున్నాడు. గాయత్రీమంత్రాన్ని జపిస్తున్నాడు. ఇట్లా అత్యద్భుతమైన దివ్యరూపంతో స్వామి ప్రత్యక్షమయ్యాడు. నారదుడి కన్నులకు కనిపించాడు. వినయసంభ్రమాలతో భక్తిగా నారదుడు నమస్కరించాడు. స్వామి ఆతడిని ఆదరించి ఇట్లా అన్నాడు:

శ్వేతద్వీపవాసియగు నారాయణుండు నారదున కుపదేశించిన తత్త్వము (సం. 12-326-10,11)

క. ' ననుఁ గానఁ బడయ రెవ్వరు । ననఘా! యేకాంతికులక యర్హము మద్ద
ర్శన మీ వేకాంతికుఁడవు । ననహంకారుఁడవుఁ గాన యబ్బెం జూడన్.' 379

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్మా!; ఎవ్వరున్= ఎవరు ఎంతటివారైనప్పటికీ; ననున్= నన్ను; కానన్+పడయరు= చూడటం పొందరు (చూడలేరు - అని); ఏకాంతికులకున్+అ= ఏకాగ్రచిత్తులకే; మత్+దర్శనము= నా దర్శనం; అర్హము= యోగ్యం. (వారే పొందగలరు - అని); ఈవు= నీవు; ఏకాంతికుఁడవు= ఏకాగ్రచిత్తం కలవాడవు; అనహంకారుఁడవు= అహంకారం లేనివాడవు; కాన= కాబట్టే; చూడన్= నన్ను దర్శించటం; అబ్బెన్= (అబ్బింది) నీకు లభించింది.

తాత్పర్యం: 'ఓ పవిత్రుడా! ఎవ్వరూ నన్ను దర్శించలేరు. ఏకాగ్రచిత్తులే నా దర్శనం పొందటానికి అర్హులు. నీవు ఏకాగ్రచిత్తుడవు. అహంకార రహితుడవు. కాబట్టి నా దర్శనం నీకు లభించింది.'

వ. అని పలికి వరంబు వేడుమనుటయు నతండు 'దేవా! భవద్దర్శనంబుకంటె మిగుల వరంబునుం గలదే?' యనుటయు నద్దేవుండు సవిశేషప్రసాదభరితుండై. 380

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; వరంబున్= ఏదయినా ఒక వరాన్ని; వేడుము= కోరుకొమ్ము; అనుటయున్= అనటమూ; అతండు= ఆ నారదుడు; దేవా!= మహానుభావా!; భవత్= నీ; దర్శనంబుకంటెన్= దర్శనంకన్నా; మిగుల= మించి (అతిశయించి); వరంబునున్+కలదే?= వరం ఒకటి ఏదయినా ఉన్నదా?; అనుటయున్= అనటమూ; ఆ+దేవుండు= ఆ విష్ణుమూర్తి; సవిశేష= విశేషంతో కూడిన; ప్రసాద= అనుగ్రహంతో (విశిష్టమైన అనుగ్రహంతో); భరితుండు+ఐ= నిండినవాడై.

తాత్పర్యం: అని చెప్పి ఏదయినా వరాన్ని కోరుకోమన్నాడు. నారదుడు 'దేవా! నీ దర్శనభాగ్యానికి మించి వేరొక వరం ఉన్నదా?' అన్నాడు. అపుడు విష్ణుమూర్తి అనుగ్రహం నిండిన మనస్సు కలవాడై. (తరువాతి పద్యంతోఅన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. ఇంద్రియంబుల కందఁ డెల్ల భూతంబులుఁ। దెగినను దెగకుండుఁ ద్రిగుణరహితుఁ
డఖిలంబునకు నాత్మ యన సర్వసాక్షినా। నజుఁ డన నిష్కళుండన వెలుంగు
క్షేత్రజ్ఞుఁ డాతండు జీవుండు వాసుదే। వుండును సంకర్షణుండుఁ జూవె
వారు మనం బహంకారంబు వరుసఁ బ్ర। ద్యుమ్నానిరుద్ధనామోపహితము

తే. లింతయును మన్మయంబ యే నిరువదియును। నాల్గునగు తత్త్వకోటికి నాథుఁడైన
పంచవింశకాభిఖ్యుండఁ బరమపురుషుఁ। డనియు నాపేరు మఱి పర మరయ లేదు. 381

ప్రతిపదార్థం: క్షేత్రజ్ఞుఁడు= క్షేత్రజ్ఞుడు అనబడేవాడు (ఆత్మ); ఇంద్రియంబులకున్= ఇంద్రియాలకు; అందఁడు= లొంగడు; ఎల్ల+భూతంబులున్= సకలప్రాణులూ (పంచభూతాలూ); తెగినను= నశించినా; తెగకుండున్= తాను నశించకుండా ఉంటాడు; త్రిగుణ రహితుఁడు= సత్త్వరజస్తమోగుణాలు లేనివాడు; అఖిలంబునకున్= సమస్తానికీ; ఆత్మ+అనన్= ఆత్మ అనీ; సర్వసాక్షి+నాన్= సర్వసాక్షి అనీ; అజుఁడు+అనన్= అజుడు అనీ; నిష్కళుండు+అనన్= నిష్కళుడు అనీ - వ్యవహరింపబడుతూ; వెలుంగున్= ప్రకాశిస్తాడు; ఆతండు= ఆతడే; జీవుండున్= జీవుడూ; వాసుదేవుండును= వాసుదేవుడూ; సంకర్షణుండున్+చూవె= సంకర్షణుడూ సుమా!; మనంబు= మనస్సూ; అహంకారంబున్= అహంకారమూ అయిన; వారు= వాసుదేవ సంకర్షణులు; వరుసన్= క్రమంగా; ప్రద్యుమ్న+అనిరుద్ధ= ప్రద్యుమ్నమూ అనిరుద్ధమూ అనేటువంటి; నామ= పేరులతో; ఉపహితములు= చెప్పబడేవి; ఇంతయునున్= ఇదంతా; మత్+మయంబు+అ= నా వికృతియే (నా మయమే); ఏను= నేను; ఇరువదియును నాల్గునగు= ఇరవై నాల్గుగా చెప్పబడిన; తత్త్వకోటికిన్= తత్త్వసమూహానికి; నాథుఁడు+ఐన= ప్రభువైన; పంచవింశక+అభిఖ్యుఁడన్= పంచవింశకుడు అనే పేరుగలవాడిని (ఇరవై అయిదవ తత్త్వాన్ని నేనే); పరమపురుషుఁడు+అనియున్= పరమపురుషుడు అని కూడా; నాపేరు= నా నామధేయం; మఱి= ఇంతకన్నా; పరము= పరము అనేది; అరయన్= ఎంత చూసినా; లేదు= లేదు.

తాత్పర్యం: నారదా! క్షేత్రజ్ఞుడూ, జీవుడూ, వాసుదేవుడూ, సంకర్షణుడూ - అందరూ ఒక్కటే. అంతా నేనే. వాసుదేవుడే మనస్సు. అదే ప్రద్యుమ్నం. అహంకారమే సంకర్షణుడు. అదే అనిరుద్ధం. ఇరవైనాలుగు తత్త్వాలకూ ప్రభువైన ఇరవై అయిదవ తత్త్వం నేనే. నన్ను అందుకే పంచవింశకుడు అంటారు. పరమపురుషుడిని నేనే. నాకంటె పరం (శ్రేష్ఠం) మరొకటి లేనేలేదు.

క. విను మేకాంతికుఁ డెవ్వనిఁ। గని నిత్యానందపదము గను నప్పరమా
త్ముని వాసుదేవు నిష్కలు। ననుపముఁగా నను నెఱుంగు టాత్మహితమగున్. 382

ప్రతిపదార్థం: వినుము= నారదా! ఆలకించుము; ఏకాంతికుఁడు= ఏకాగ్రచిత్తుడైన యోగి; ఎవ్వనిన్+కని= ఎవరిని దర్శించి; నిత్య+ఆనందపదము= ఎల్లప్పుడూ ఆనందమయమైన స్థానాన్ని (నిత్యానంద స్థితి); కనున్= పొందుతాడో; ఆ+పరమాత్మునిన్= ఆ పరమాత్మగా; వాసుదేవున్(కాన్)= వాసుదేవుడిగా; నిష్కలున్ (కాన్)= నిష్కలుడిగా; అనుపమున్+కాన్= సాటిలేనివాడినిగా; ననున్= నన్ను; ఎఱుంగుట= తెలియుట; ఆత్మహితము+అగున్= ఆత్మకు మేలు అవుతుంది.

తాత్పర్యం: ఏకాగ్రచిత్తులైన యోగీశ్వరులు ఎవరిని దర్శించి నిత్యానందస్థితి పొందుతారో ఆ పరమాత్మగా, ఆ వాసుదేవుడిగా, ఆ నిష్కలుడిగా, ఆ సాటిలేనివాడిగా నన్ను తెలిసికొనటం నీకు ఆత్మహితం. గ్రహించుము దేవర్షీ!

క. భూతాత్మకమైన యఖిల। ధాతుచయము వెలిగ లేదు తను నా మొత్తం
బాతతజీవవ్యాప్తి స। మేతము గాకున్నఁ జేష్ట నెసఁగదు వత్సా! 383

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వత్సా!= నాయనా!; భూత+ఆత్మకమైన= సకల జీవులకూ ప్రాణభూతమైన; అఖిల ధాతుచయము= సమస్తవిధాల ధాతుసమూహం (అంతశ్శక్తి); వెలిగన్+లేదు= నాకన్నా భిన్నంగా (వెలుపలగా) లేదు; తను= అది; నా= నాయొక్క; మొత్తంబు= మొత్తం (అది సమస్తం నేను, నా సమస్తం అదీ); ఆతత= నిడుపైన; జీవ= జీవశక్తియొక్క (ప్రాణం); వ్యాప్తి= వ్యాపనంతో;సమేతము= (ధాతుచయం) కూడుకొన్నది; కాకున్నన్= కాకపోయినట్టయితే; చేష్టన్= కదలికతో (క్రియాశక్తితో); ఎసఁగదు= అలరారదు.

తాత్పర్యం: నాయనా! నారదా! ఈ సృష్టిలో సకలప్రాణికోటిలో అంతర్గతంగా ఉన్న ధాతుశక్తి నాకంటె భిన్నమైనది కాదు. నాలోనే ఉన్నది. అది నా మొత్తం. జీవశక్తి అనేది సర్వత్ర పరివ్యాప్తం కాకపోతే చేష్టలూ చైతన్యాలూ ఉండవుగదా!

క. **జీవశరీరములు పృథ । గ్భావాకలితములు గాఁగఁ గనుటయు వలయున్**
జీవునిఁ గంటి ననుట మా । యావిలసన మస్మదీయ మది మునివర్యా! **384**

ప్రతిపదార్థం: మునివర్యా!= మునిశ్రేష్ఠా!; జీవ+శరీరములు= జీవమూ, శరీరమూ అనేవాటిని; పృథక్+భావ+ఆకలితములు కాఁగన్= వేరు వేరు అనే భావంతో; కనుటయున్= చూడటంకూడా; వలయున్= అవసరం; జీవునిన్= జీవుడిని; కంటిన్= దర్శించాను; అనుట= అనటం; మాయా+విలసనము= ఒక మాయావిలాసం; అది= ఆ మాయావిలాసం; అస్మదీయము= నాదే.

తాత్పర్యం: మునీశ్వరా! జీవుడు వేరు, శరీరం వేరు అనే విషయాన్ని గ్రహించటం చాలా అవసరం. ఎవరయినా జీవుడిని చూశాను అని అంటే అదంతా మాయ. ఆ మాయావిలాసానికి సృష్టికర్తను నేనే.

క. **జీవుఁడు మత్సముపేతుఁడు । గావు టెఱుఁగవలయు దృఢముగా భక్తిమయం**
బై వఱలు నాశ్రయంబున । నేవాఁ డొందు నను వాని కిత్తు విముక్తిన్. **385**

ప్రతిపదార్థం: జీవుఁడు= జీవాత్మ (ఎప్పుడూ); మత్+సమ్+ఉపేతుఁడు= నాతో గాఢంగా కూడి ఉన్నవాడే (నాలో భాగం); కావుట= కావటాన్ని; ఎఱుఁగన్+వలయున్= (నీవు) తెలిసికోవాలి; దృఢముగాన్= గట్టిగా (నిశ్చలంగా); భక్తిమయంబు+ఐ= భక్తితో నిండినదై (భక్తిమయం అయి); వఱలు= ఒప్పేటటువంటి; ఆశ్రయంబునన్= ఆధారంతో (సాధనంతో); ఏ వాఁడు= ఎవడు; ననున్= నన్ను; ఒందున్= పొందుతాడో; వానికిన్= ఆ భక్తుడికి; విముక్తిన్= మోక్షాన్ని; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: జీవుడు నాకంటె భిన్నుడు కాదు. నాతోనే కలిసి ఉంటాడు. ఈ విషయాన్ని కూడా గ్రహించటం అవసరం. భక్తిమయమైన సాధనంతో ఎవడు నన్ను పొందుతాడో వాడికి విముక్తిని అనుగ్రహిస్తాను.

క. **ఆదిత్య మరు ద్వసురు । ద్రాది దివిజగణము నంబుజాసనుఁడుఁ జతు**
ర్వేదములు మదాత్మకతం । గాదే తత్తద్విశేష గౌరవమొందున్! **386**

ప్రతిపదార్థం: ఆదిత్య= ఆదిత్యులూ; మరుత్= మరుత్తులూ; వసు= వసువులూ; రుద్ర= రుద్రులూ; ఆది= మొదలైన; దివిజగణమున్= దేవతాసమూహమూ; అంబుజ+ఆసనుఁడున్= పద్మాసనుడైన బ్రహ్మదేవుడూ; చతుర్వేదములున్= నాలుగు వేదాలూ; మత్+ఆత్మకతన్+కాదే!= నా స్వరూపాలు కావటం వల్లనేకదా!; తత్తత్= ఆయా; విశేషగౌరవమున్= విశేషమైన గౌరవాన్ని; ఒందున్= పొందేది.

తాత్పర్యం: ఆదిత్యులూ, మరుత్తులూ, వసువులూ, రుద్రులూ మొదలైన దేవగణాలూ, బ్రహ్మదేవుడూ, చతుర్వేదాలూ ఆయా గౌరవాలను పొందటం నా మహిమవలననే.

తే. **కమలగర్భు సృజించి సకలజగద్ధు । రానియుక్తునిఁ గావించి యే నివృత్తి**
పరత నేకాకినై దివ్యభవ్య మగు స । హాయముగ సంచరింతు మధ్యస్థవృత్తి. **387**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కమలగర్భున్= బ్రహ్మను; సృజించి= సృష్టించి; సకలజగత్= సకలప్రపంచం యొక్క; ధురా= భారవహనంపట్ల; నియుక్తునిన్+కావించి= నియమించి; ఏన్= నేను; నివృత్తిపరతన్= నివృత్తిమార్గంలో తత్పరత కలిగి; ఏకాకిని+ఐ= అద్వితీయుడిని అయి (ఏకాంతం అనుభవిస్తూ); మధ్యస్థవృత్తిన్= మధ్యస్థుడుగా ఉంటూ (ఏ పక్షపాతమూ లేకుండా); దివ్య= దివ్యమూ; భవ్య= భవ్యమూ; అగు= అయిన; సహాయముగన్= సహాయంగా; సంచరింతున్= వ్యవహరిస్తూ ఉంటాను.

తాత్పర్యం: బ్రహ్మదేవుడిని నేనే సృష్టించాను. ప్రపంచభారాన్ని అప్పగించాను. నేను నివృత్తి మార్గం చేపట్టాను. ఏకాంతంగా గడుపుతాను. మధ్యస్థుడుగా ఉంటూ బ్రహ్మాదులకు అవసరాన్ని బట్టి దివ్యమూ, భవ్యమూ అయిన సహాయం చేస్తుంటాను.

వ. ఒక్కొక్కకాలంబుల జగద్ధితంబుగా జన్మకర్మంబులం బూనుదు వినుము వారాహ రూపంబు దాల్చి హిరణ్యాక్షుని నారసింహమూర్తి ధరియించి హిరణ్యకశిపుని భృగువంశంబున జామదగ్న్యుం డన జనియించి సర్వక్షత్రంబును దశరథుండను రాజునకు రామనామంబునం బుట్టి రావణాసురుం బరిమార్పంగలవాఁడ. భూభారంబు వాపుటకై యాదవకులంబునఁ బ్రభవించి పురందరనందనుండై యవతరించిన నరుండు దోడ్పడ నక్కార్యంబు నిర్వహింతు. నేను దొల్లి నరనారాయణు లనియెడు నామంబుల మూర్తిద్వయంబును ఋషిత్వంబును వెలయ నొలసి లోకరక్షణం బాచరించుచున్నవాఁడ. నమ్మూర్తుల పదంపడి కేళీమానుషత్వంబు గైకొని యిట్లు సేయు నయ్యవతారంబునఁ గంస కాలయవన మురనరక బాణప్రముఖులైన కంటకులం జెఱుతు. నందు బాణాసురుం గాతునని పూని మహాదేవుండు మహాసేనానీసహితుండై యడ్డపడ నమ్మహాత్ముని జయించి బాణునిం బరాభవింతు. నింతకుమున్ను మత్స్యత్వంబుకూర్మత్వంబుల నొంది నిఖిలచ్ఛందోబృందారక హితం బొనర్చితి మచ్చరితంబులు నీకుం గర్ణగోచరంబులు గాకుండెడునే? మఱియు ధర్మరక్షణార్థంబుగా నేమేమి సేయవలయు నవియెల్లనుం జేయువాఁడఁ గృత్యంబులు గృతంబులైన మదీయ ప్రకృతిం బొందుదుఁ బరమేష్ఠినందనా! నీ వేకాంతికుండ వగుట నీకు నా తెఱంగెల్ల నెఱింగించితి' నని చెప్పి యమ్మునిం గని యనాహారులు నవింద్రియులు నస్వేదులు సుగంధి శ్వేతదేహులు నగు నమ్మానవులం జూపి 'వీరేకాంతికులు' మన్మయధ్యానపరులునై యున్నవారు వీరలకు సమ్మర్దంబుగా మెలఁగం దగదు. నీవింకం బొ'మ్మని పరమాదరంబునం బలికి వీడ్కొలిపిన నద్దేవమునిసత్తముండు పరమానందభరితుఁ డై బదరికాశ్రమంబునకుం జనుదెంచి నరనారాయణులం గాంచి. **388**

ప్రతిపదార్థం: ఒక్కొక్కకాలంబులన్= కొన్ని కొన్ని సమయాలలో; జగత్+హితంబుగాన్= ప్రపంచానికి మేలు అయ్యేట్టు; జన్మకర్మంబులన్= జన్మలనూ, కర్మాచరణాలనూ (జన్మల రూపమైన కర్మలను); పూనుదున్= వహిస్తూ ఉంటాను; వినుము; వారాహరూపంబున్+తాల్చి= వరాహావతారం ధరించి; హిరణ్య+అక్షునిన్= హిరణ్యాక్షుడు అనే రాక్షసుడినీ; నారసింహ+మూర్తిన్= నరసింహరూపాన్ని; ధరించి= వహించి; హిరణ్యకశిపునిన్= హిరణ్యకశిపుడు అనే రాక్షసుడినీ; భృగువంశంబునన్= భృగు మహర్షి వంశంలో; జామదగ్న్యుండు+అని= పరశురాముడు అనే రూపంతో (జమదగ్ని కుమారుడు); జనియించి= జన్మించి; సర్వక్షత్రంబునున్= సకల క్షత్రియసమూహాన్ని; దశరథుండు+అను= దశరథుడు అనే; రాజునకున్= రాజుగారికి; రామనామంబునన్= రాముడు అనే పేరుతో; పుట్టి= ప్రభవించి; రావణ+అసురున్= దశగ్రీవుడు అనే రాక్షసుడినీ; పరిమార్పన్+కలవాఁడన్= సంహరిస్తాను; భూభారంబు= భూమి బరువును; పాపుటకై= తగ్గించటంకోసం; యాదవకులంబునన్= యదువు అనే రాజుగారి వంశంలో; ప్రభవించి= జనించి; పురందర= ఇంద్రుడియొక్క; నందనుండై= కుమారుడై; అవతరించిన= పుట్టిన; నరుండు= అర్జునుడు; తోడ్పడన్= సహకరించగా; ఆ+కార్యంబున్= భూభారాన్ని తొలగించటమనే ఆ పనిని (కురుక్షేత్ర సంగ్రామంతో); నిర్వహింతున్= నిర్వహిస్తాను; ఏను= నేను; తొల్లి= పూర్వకాలంలో; నరనారాయణులు+అనియెడు= నరనారాయణులు అనే; నామంబులన్= పేరులతో; మూర్తిద్వయంబును=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రెండు రూపాలూ; ఋషిత్వంబునున్= ఋషిత్వమూ; వెలయన్= పరిఢవిల్లగా (ఒప్పగా); ఒలసి= పొంది; లోకరక్షణంబు= ప్రపంచ సంరక్షణ (ప్రాణిరక్ష); ఆచరించుచున్నవాఁడన్= చేస్తున్నాను; ఆ+మూర్తుల= ఆ నరనారాయణ అవతారాల; పదంపడి= తరువాత; కేళీమానుషత్వంబున్= విలాసార్థంగా మానవరూపం; కైకొని= చేపట్టి; ఇట్లు= ఇట్లా; చేయు+ఆ+అవతారంబునన్= చేసే ఆ శ్రీకృష్ణావతారంలో; కంస= కంసుడూ; కాలయవన= కాలయవనులూ; ముర= మురుడూ; నరక= నరకుడూ; బాణ= బాణుడూ; ప్రముఖులైన= మొదలైన; కంటకులన్= పీడకులను (లోక కంటకులు= లోకానికి ముళ్ళవంటివారు); చెఱుతున్= నాశనం చేస్తాను (కంటకాలను చెఱపటం అంటే చెక్కివేయటం); అందున్= వారిలో (ఆ పని చేస్తున్నప్పుడు); బాణ+అసురున్= బాణుడు అనే రాక్షసుడిని; కాతున్+అని= రక్షిస్తాను అని; పూని= పూనుకొని (బాధ్యత మీద వేసికొని); మహాదేవుండు= శంకరుడు; మహాసేనానీసహితుండై= ప్రమథసేనాపతి అయిన కుమారస్వామితో కలిసి (సేనాని= కుమారస్వామి); అడ్డపడన్= నాకు (బాణాసుర సంహారంలో) అడ్డురాగా; ఆ+మహాత్మునిన్= మహానుభావుడైన ఆ శివుడిని; జయించి= జయించి; బాణునిన్= (శివరక్షణలో ఉన్న) బాణాసురుడిని; పరాభవింతున్= అవమానపరుస్తాను (ఉషానిరుద్ధుల వివాహంతో ఆ రాక్షసుడిని అవమానించటం); ఇంతకున్+మున్ను= ఇంతకుపూర్వం; మత్స్యత్వ+కూర్మత్వంబులన్= మత్స్యావతారాన్ని, కూర్మావతారాన్నీ (తాబేలు); ఒంది= ధరించి; నిఖిల= సమస్తమైన; ఛందః= వేదాలకూ (మత్స్యావతారంలో సోమకాసురుడిని జయించి వేదాలను ఉద్ధరించటం); బృందారక= దేవతలకూ (క్షీరసముద్రమథనం - అమృతోత్పత్తి - కూర్మావతారం); హితంబు= మేలు; ఒనర్చితిన్= చేశాను; మత్+చరితంబులు= నా ప్రవర్తనలు (చరిత్రలు - కథలు); నీకున్= నీకు; కర్ణగోచరంబులు= చెవులకు వినిపించినవి; కాకుండెడునే?= కాకుండా ఉన్నాయా? (ఇవి వినే ఉంటావు - అని); మఱియున్= ఇంకా; ధర్మరక్షణార్థంబుగాన్= ధర్మాన్ని రక్షించటంకోసమని; ఏమేమి+చేయన్+వలయున్= ఏమిటేమిటి చేయాలో; అవి+ఎల్లనున్= అవి అన్నీ; చేయువాఁడన్= చేస్తాను - చేస్తుంటాను; కృత్యంబులు= చేయవలసినవి; కృతంబులు+ఐనన్= చేయబడినవి అయినట్టయితే (చేయవలసినవన్నీ చేశాక); మదీయ ప్రకృతిన్= నా సహజస్వభావాన్ని (స్థితిని); పొందుదున్= పొందుతాను; పరమేష్ఠినందనా!= బ్రహ్మదేవుని పుత్రుడా! నారదుడా!; నీవు; ఏకాంతికుఁడవు+అగుటన్= ఏకాగ్రచిత్తం కలవాడవు అవటంచేత; నీకున్= నీకు; నా+తెఱంగు+ఎల్లన్= నా పద్ధతి (విధం) అంతా; ఎఱింగించితిన్= తెలియజెప్పాను; అని; చెప్పి= పలికి; ఆ+మునిన్= ఆ నారదమహర్షిని; కని= తిలకించి; అనాహారులు= ఆహారం తీసికోనివారూ; అనింద్రియులున్= ఇంద్రియచాంచల్యం లేనివారూ; అస్వేదులున్= చెమటపట్టనివారూ; సుగంధి= పరిమళించే; శ్వేతదేహులున్= తెల్లని శరీరాలు కలవారూ; అగు= అయినటువంటి; ఆ+మానవులన్= ఆ నరులను; చూపి= చూపించి; వీరు= వీరంతా; ఏకాంతికులున్= ఏకాగ్రత కలవారూ; మత్+మయ+ధ్యానపరులై= నాతో నిండిన ధ్యానం కలవారూ అయి (నన్నే ధ్యానిస్తూ); ఉన్నవారు= ఉన్నారు; వీరలకున్= ఈ దివ్యపురుషులకు; సమ్మర్దంబుగాన్= ఒత్తిడి అయ్యేట్టు (ఇబ్బంది అయ్యేట్టు); మెలఁగన్+తగదు= సంచరించటం పనికిరాదు (నీ సంచారమూ నీ ఉనికీ వాళ్ళ ఏకాగ్రతను భంగపరుస్తుంది - అని); నీవు; ఇంకన్= ఇంక; పొమ్ము= తిరిగివెళ్ళుము; అని; పరమ+ఆదరంబునన్= మిక్కిలి ఆదరంతో (ప్రేమతో, ఆత్మీయతతో); పలికి= చెప్పి; వీడ్కొలిపినన్= వీడ్కోలు ఇచ్చేసరికి; ఆ+దేవముని+సత్తముండు= దేవర్షులలో ఉత్తముడైన ఆ నారదుడు; పరమ+ఆనంద భరితుండై= బ్రహ్మానందంతో నిండినవాడై; బదరికా+ఆశ్రమంబునకున్= తానుండే బదరికాశ్రమానికి (బదరి= రేగుచెట్టు); చనుదెంచి= తిరిగి వచ్చి; నరనారాయణులన్= నరనారాయణులు ఇద్దరినీ; కాంచి= దర్శించి.

తాత్పర్యం: కొన్ని కొన్ని సమయాలలో లోకహితం కొరకు జన్మకర్మలను పూనుతూ ఉంటాను. వరాహరూపం తాల్చి హిరణ్యాక్షుడిని, నరసింహరూపం ధరించి హిరణ్యకశిపుడినీ, భృగువంశంలో పరశురాముడై పుట్టి క్షత్రియలోకాన్నంతటినీ, దశరథరాముడిగా జన్మించి రావణుడినీ సంహరిస్తాను. యాదవకులంలో కృష్ణుడినై పుట్టి అర్జునుడి సహాయంతో భూభారాన్ని తొలగిస్తాను. నేను పూర్వం నరనారాయణు లనే పేర్లతో రెండు రూపాలతో, ఋషిత్వంతో వెలసి జగద్రక్షణాన్ని చేస్తున్నాను. ఆ మూర్తులే తరువాత లీలామానుష రూపాలతో తమ కార్యాలను నిర్వహిస్తూ కంసుడు, కాలయవనుడు, మురుడు, నరకుడు, బాణుడు మొదలైన కంటకులను రూపుమాపుతారు. అందులో బాణాసురుడిని రక్షిస్తానని పూనుకొని శివుడు కుమారస్వామితో కలిసి అడ్డగించగా ఆ మహాత్ముడిని జయించి బాణుడిని అవమానించాను. ఇంతకు ముందు మత్స్యకూర్మభావాలను పొంది దేవగణాలకు మేలు చేశాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నా లీలలు నీవు వినకుండా ఉన్నావా? ఇంకా ధర్మరక్షణం కొరకు ఏయే పనులు చేయాలో వాటిని తప్పక నిర్వహిస్తాను. నా కర్తవ్యాలు పూర్తి కాగానే నా మూలప్రకృతిని మరల పొందుతాను. నారదా! ఏకాగ్రచిత్తుడవు కావటంచేత నా తీరునంతా నీకు తెలిపాను' - అని పలికి ఆ మునిని చూచి నిరాహారులూ, ఇంద్రియ నిగ్రహులూ, స్వేదం లేనివారూ, సుగంధి శ్వేతదేహులూ అయిన ఆ మానవులను చూపి, వారు ఏకాగ్రచిత్తులు, నన్నే స్మరించేవారూ అయి ఉన్నారు. వారికి ఇబ్బంది కలిగేటట్లు వ్యవహరించరాదు. నీ వింక పొమ్ము' అని పలికి గౌరవంగా వీడ్కోలు పలుకగా, నారదుడు పరమానందంగా బదరికాశ్రమానికి వచ్చి నరనారాయణులను దర్శించి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **భక్తి వీడ్కొని చని మునిప్రతతి కెందు । నచ్యుతాననోద్గతము వేదార్థమయము**
యోగసాంఖ్యాత్మకమునైన వాగమృతముఁ । గర్ణపుటపేయముగఁ జేయు గారవమున. **389**

ప్రతిపదార్థం: భక్తిన్= భక్తితో; వీడ్కొని= (విష్ణుమూర్తి దగ్గర) సెలవు తీసికొని; చని= నారదుడు వెళ్ళి; మునిప్రతతికిన్= మునిబృందానికి; ఎందున్= అంతటా; అచ్యుత= విష్ణుమూర్తియొక్క; ఆనన= ముఖంనుండి; ఉద్గతమున్= వెలువడినదీ; వేద+అర్థమయమున్=వేదసారంతో నిండినదీ; యోగ+సాంఖ్య+ఆత్మకమున్= యోగరూపమూ, సాంఖ్యరూపమూ; ఐన= అయినటువంటి; వాక్+అమృతమున్= వాగ్రూపమైన అమృతాన్ని; గారవమునన్= ప్రేమతో; కర్ణపుట= (చెవులు అనే దొప్పలతో) చెవులతో; పేయముగన్= త్రోలబడేదిగా; చేయున్= చేశాడు (వాగమృతాన్ని మునుల చెవులకు పానీయంగా అందించాడు - అని).

తాత్పర్యం: విష్ణుమూర్తి దగ్గర సెలవు తీసికొని వెళ్ళిన నారదుడు తాను స్వామినుండి గ్రహించిన ఉపదేశామృతాన్ని తక్కిన మహర్షులందరికీ కర్ణరసాయనంగా అందించాడు. అదియే వేదసారం. యోగసారం. సాంఖ్యసారం.

వ. **నారదుం డట్లు విష్ణుని దివ్యవాక్యవితతి విద్వజ్జనంబులకు వినిపించుచు బ్రహ్మసభ కరిగి యందునుం బ్రకటించె' ననుటయు 'నప్పద్మభవునకు నది వింతయే?' యనిన నక్కౌంతేయాగ్రజుతో శాంతనవుం 'డా శతానందునకు నపరిజ్ఞాతంబునుం గలదే? యతనిం గొలువ వచ్చినట్టి సిద్ధసాధ్యాదులకు వినిపించెఁగాక' యని పలికి వెండియు నిట్లనియె.** **390**

ప్రతిపదార్థం: నారదుండు; అట్లు; విష్ణుని= విష్ణుమూర్తియొక్క; దివ్య= దివ్యమైన; వాక్య+వితతిన్= వాక్సమూహాన్ని; విద్వత్+జనంబులకున్= పండితులకు; వినిపించుచున్= వినిపిస్తూ; బ్రహ్మసభకున్= బ్రహ్మదేవుడి సభకు; అరిగి= వెళ్ళి; అందునున్= ఆ సభలోకూడా; ప్రకటించెన్= అందరికీ వినిపించాడు; అనుటయున్= అని భీష్ముడు చెప్పటంతోనే; ఆ+పద్మభవునకున్= ఆ బ్రహ్మదేవుడికి; అది= ఆ విషయం; వింతయే?= అంత కొత్తదా (ఎరుగనిదా)?; అనిన= అని అడిగిన; ఆ+కౌంతేయ+అగ్రజుతోన్= కుంతీపుత్రులలో (మొదటివాడైన) పెద్దవాడైన ఆ ధర్మరాజుతో; శాంతనవుండు= శంతను సుతుడు ఆ భీష్ముడు - ఇట్లా అన్నాడు: ఆ+శతానందునకున్= ఆ బ్రహ్మదేవుడికి; అపరిజ్ఞాతంబునున్+కలదే?= తెలియనిది కూడా ఉన్నదా? (ఆయనకు అన్నీ తెలుసు అని); అతనిన్= ఆ బ్రహ్మను; కొలువన్= సేవించటానికి; వచ్చినట్టి= వచ్చినటువంటి; సిద్ధసాధ్య+ఆదులకున్= సిద్ధులూ,సాధ్యులూ ఈ మొదలైన జనాలకు; వినిపించెన్+కాక= (నారదుడు) వినిపించాడు కానీ - అని పలికి= అని భీష్ముడు; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అట్లా నారదుడు బ్రహ్మలోకానికి కూడా వెళ్ళాడు. అక్కడ కూడా ఆ ఉపదేశామృతాన్ని ప్రకటించాడు' అని భీష్ము డనగా, 'ఆ విషయం బ్రహ్మకు క్రొత్తదా?' అని ఆ ధర్మరాజు అడిగాడు. 'బ్రహ్మకు తెలియదని కాదు. ఆ సభకు వచ్చిన సిద్ధసాధ్యాదులకొరకు ఆయన అట్లా చేశాడు' అని భీష్ముడు బదులిచ్చి, చెప్పటం మొదలుపెట్టాడు.

క. **'క్రమమున వాఙ్మయమగు న । య్యమృతము లోకమునఁ బరఁగె నది మజ్జనకుం**
డమితదయఁ జెప్పె నాకును । శమయుత! యేఁజెప్పితిని విశదముగ నీకున్. **391**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: శమయుత!= ఇంద్రియనిగ్రహం కలవాడా!; క్రమమునన్= క్రమక్రమంగా (ఆనోటా ఆనోటా); వాక్+మయము+అగు= వాగ్రూపమైన; ఆ+అమృతము= ఆ ఉపదేశామృతం; లోకమునన్= భూలోకమంతటా; పరఁగెన్= వ్యాపించింది; అది= దాన్ని; మత్+జనకుండు= మా తండ్రిగారు; అమితదయన్= మిక్కిలి దయతో; నాకునున్= నాకు; చెప్పెన్= తెలియజేశారు; ఏన్= నేను; నీకున్= నీకు; విశదముగన్= స్పష్టంగా; చెప్పితిని= తెలియజెప్పాను.

తాత్పర్యం: 'ఓ శాంతస్వభావా! విష్ణుమూర్తి అందించిన ఆ ఉపదేశామృతం క్రమక్రమంగా కర్ణాకర్ణికగా లోకమంతటా వ్యాపించింది. మా తండ్రి దానిని నాకు అత్యంతదయతో బోధించాడు. నేనేమో నీకు విశదంగా తెలియజెప్పాను.

క. మునులును సురలును దీనిని । విని కొనియాడుదురు విష్ణు వినుతింతురు భ
క్తినిరూఢులై జపింతురు । మనమునఁ జపింతు రతిసమాహితు లగుచున్. 392

ప్రతిపదార్థం: మునులునున్= మహర్షులూ; సురలునున్= దేవతలూ; దీనినిన్= ఈ ఉపదేశసారాన్ని; విని= ఆలకించి; కొనియాడుదురు= ప్రశంసిస్తారు; విష్ణున్= విష్ణుమూర్తిని; వినుతింతురు= స్తుతిస్తారు; భక్తి+నిరూఢులై= గాఢమైన భక్తి కలవారై; మనమునన్= మనస్సులో; జపింతురు= జపిస్తారు; అతి= మిక్కిలి; సమాహితులు+అగుచున్= సావధానులు అవుతూ; చర్చింతురు= (దీన్ని పలురకాలుగా) చర్చిస్తారు.

తాత్పర్యం: ధర్మరాజా! విష్ణుమూర్తి అందించిన ఈ ఉపదేశసారాన్ని మునులూ, ఋషులూ మెచ్చుకొంటారు. విష్ణుమూర్తిని స్తుతిస్తారు. భక్తితో దీన్ని జపిస్తారు. నలుగురూ కలిసినచోట ఏకాగ్రచిత్తులై దీనినే చర్చిస్తారు. ఇవన్నీ జరగటం నేను ఎరుగుదును.

తే. నీవు నిట్టుల చేయు వినీతిపరుఁడు । విష్ణుభక్తుండు శమదమాన్వితుఁడు నైన
యట్టివానికిఁ జెప్పుమీ యచ్యుతాన । నోద్గతంబైన యిప్పురాణోత్తమంబు. 393

ప్రతిపదార్థం: నీవున్= నీవుకూడా; ఇట్టులన్= ఇట్లాగే; చేయు(ము)= స్తుతించటం, జపించటం, చర్చించటం చేయుము; వినీతి పరుఁడున్= వినయ సంపన్నుడూ; విష్ణుభక్తుండున్= విష్ణుభక్తుడూ; శమ+దమ+అన్వితుఁడున్= అంతర్బహిరింద్రియ నిగ్రహం కలవాడూ; ఐన+అట్టివానికిన్= అయినటువంటి వాడికి; అచ్యుత= విష్ణుమూర్తియొక్క; ఆనన= ముఖంనుంచి; ఉద్గతంబు+ఐన= వెలువడిన; ఈ+పురాణ+ఉత్తమంబున్= ఈ ఉత్తమ పురాణగాథను; చెప్పుమీ!= ఉపదేశించు సుమీ!

తాత్పర్యం: ధర్మరాజా! నీవు కూడా ఇట్లాగే విష్ణుమూర్తిని స్తుతించుము. ఈ ఉపదేశం చర్చించుము. ఈ మంత్రం జపించుము. అంతేకాదు, నీవు ఎవరికైనా ఈ ఉత్తమపురాణాన్ని చెప్పదలచుకొంటే వినయపరుడూ, విష్ణుభక్తుడూ ఇంద్రియనిగ్రహం కలవాడూ అయిన వ్యక్తికే ఉపదేశించుము.

క. నీ వినిన యుపాఖ్యానము । లేవియు సరిగావు దీని కిది దీర్ఘాయుః ।
శ్రీవిభవారోగ్యములం । గావించుఁ బఠించినం దగం దను వినినన్.' 394

ప్రతిపదార్థం: నీ= నీయొక్క; వినిన= (ఇంతవరకూ) విన్నటువంటి; (నీవు విన్న - అని); ఉపాఖ్యానములు= ఉపకథలు; ఏవియున్= ఏవీ కూడా; దీనికిన్= ఈ ఉపాఖ్యానానికి; సరిగావు= సాటిరావు (సమానం కావు); ఇది= ఈ ఉపాఖ్యానం; తగన్= శ్రద్ధగా; తనున్= తనను; పఠించినన్= చదివినా; వినినన్= ఆలకించినా; దీర్ఘాయువుః= దీర్ఘమైన ఆయుర్దాయాన్నీ; శ్రీవిభవ= సంపద్వైభవాన్నీ; ఆరోగ్యములన్= ఆరోగ్యాన్నీ (ఆయుశ్శ్రీ= ఆయుస్సంపదనూ); కావించున్= కలిగిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మజా! ఇంతవరకూ నీవు విన్న ఉపాఖ్యానాలు ఏవీ దీనికి సరిపోలవు. దీనిని శ్రద్ధగా చదివినా, వినినా అట్టివారికి దీర్ఘాయుస్సూ, సకల సంపదలూ, వైభవాలూ, ఆరోగ్యమూ అన్నీ సమకూడుతాయి.'

క. అని శాంతనవుఁడు సెప్పిన । విని మోదమునొంది పాండవేయులు దీనిన్
వినుచుఁ బఠించుచు విష్ణుం । గొనియాడుదు రధికభక్తిఁ గురువంశవరా!' 395

ప్రతిపదార్థం: కురువంశవరా!= కురువంశంలో ఉత్తముడా! ఓ జనమేజయుడా!; అని= ఈ ప్రకారంగా; శాంతనవుఁడు= శంతనుకుమారుడైన భీష్ముడు; చెప్పినన్= చెబితే; విని= ఆలకించి; మోదమున్+ఒంది= సంతోషించి; పాండవేయులు= పాండుపుత్రులు; దీనిన్= ఈ ఉపాఖ్యానాన్ని; వినుచున్= వింటూ; పఠించుచున్= పఠిస్తూ; విష్ణున్= విష్ణుమూర్తిని; అధికభక్తిన్= అత్యంతభక్తితో; కొనియాడుదురు= స్తుతించేవారు.

తాత్పర్యం: (కథను మళ్ళీ జనమేజయ వైశంపాయనులకు కలుపుతున్నాడు.) 'ఓ జనమేజయా! భీష్ముడు ఇట్లా చెప్పితే శ్రద్ధగా విన్న పాండుపుత్రులు దీనినే వింటూ, పఠిస్తూ భక్తితో విష్ణుమూర్తిని స్తుతిస్తూ కాలం గడిపారు.'

వ. అని చెప్పి వైశంపాయనుండు వెండియు. 396

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; వైశంపాయనుండు= వ్యాసశిష్యుడైన వైశంపాయనముని; వెండియున్= తిరిగి ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: ఇంకా వ్యాసశిష్య డైన వైశంపాయనముని ఇట్లా చెప్పాడు.

ఉ. ' సాత్యవతేయుఁ డీ పరమ జప్యము భక్తిఁ బఠించుచున్ వియ
ద్గత్యభిరాముఁడై నియమతత్పరతం జను దుగ్ధవార్ధికిన్
నిత్యము విష్ణుఁగాంచి మహనీయతరం బగు పూజనంబు సం
స్తుత్యముగాఁగఁ జేతకుఁ గుతూహలసంపద పల్లవింపఁగన్.' 397

ప్రతిపదార్థం: నిత్యమున్= ప్రతిరోజూ; విష్ణున్= విష్ణుమూర్తిని; కాంచి= దర్శించి; మహనీయతరంబు+అగు= మిక్కిలి పవిత్రమైన (విలువైన); పూజనంబు= అర్చనను; సంస్తుత్యము+కాఁగన్= పొగడదగినదిగా; చేతకున్= చేయటానికి; కుతూహల సంపద= ఉత్సాహశ్రీ; పల్లవింపఁగన్= చిగురొత్తగా; సాత్యవతేయుఁడు= సత్యవతీ తనయుడైన వ్యాసుడు; ఈ+పరమ+జప్యమున్= ఉత్తమమూ జపించదగినదీ అయిన ఈ ఉపాఖ్యానాన్ని; భక్తిన్= భక్తితో; పఠించుచున్= పఠిస్తూ; వియత్+గతి+అభిరాముఁడై= ఆకాశగమనంతో శోభిల్లినవాడై; నియమతత్పరతన్= నియమనిష్ఠాపరుడై; దుగ్ధవార్ధికిన్= క్షీరసముద్రానికి; చనున్= వెడతాడు.

తాత్పర్యం: ఈ పరమపవిత్రమైన ఉపాఖ్యానాన్ని భక్తితో జపిస్తూ వ్యాసుడు ఆకాశమార్గాన ప్రయాణం చేసి క్షీరసముద్రానికి వెళ్ళుతాడు. నిత్యమూ విష్ణుమూర్తిని దర్శించాలి, ఉత్తమపూజలు ఆచరించాలి అనే కుతూహలం వ్యాసుడి మనస్సులో ఎప్పుడూ పల్లవిస్తూ ఉంటుంది.'

వ. అనిన విని జనమేజయుండు మోదంబునొంది యమ్ముని సత్తమునితోడ నీవు మోక్షం బత్యంత సుఖం బని చెప్పుదు. సకలజనంబులు నభ్యుదయకరంబులైన కర్మవిశేషంబులం దగిలి యుండుదు 'రొరుల ననేల? దేవతలును దద్ధర్మంబు వాటింపక హవ్యభోజనపరత్వం బూని యుండుదు రమ్మహాత్ము లట్లగుట యెట్లొకో? యని యేను విచారించుచుండుదు నత్తెఱంగు దేటపడ నెఱింగింపవే?' యని యడిగిన నప్పారాశర్యశిష్యుం డా భూవరున కిట్లనియె. 398

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనినన్= అని వైశంపాయనుడు చెబితే; విని= ఆలకించి; జనమేజయుఁడు= జనమేజయుడు; మోదంబున్+ఒంది= సంతోషించి; ఆ+మునిసత్తమునితోడన్= ఆ మునీశ్వరుడితో (వైశంపాయనుడితో); నీవు; మోక్షంబు= ముక్తి అనేది; అత్యంత సుఖంబు= మిక్కిలి సుఖమైనది; అని; చెప్పుదు(వు)= చెబుతావు; కానీ - సకలజనంబులున్= జనులందరూ; అభ్యుదయ కరంబులు+ఐన= భౌతికంగా అభివృద్ధిని కలిగించే; కర్మవిశేషంబులన్= ఆయా విశేషమైన పనులలో; తగిలి+ఉండుదురు= సక్తులై ఉంటున్నారు; ఒరులన్= ఇతరులను; అనన్+ఏల= అనటం ఎందుకుగానీ; దేవతలునున్= దేవతలుకూడా; తద్+ ధర్మంబున్= మోక్షధర్మాన్ని; పాటింపక= ఆచరించకుండా; హవ్యభోజన పరత్వంబున్= పురాడోశాన్ని తినటమే పనిగా; ఊని= స్వీకరించి; ఉండుదురు= జీవిస్తుంటారు (ఊనియుండుదురు); ఆ+మహాత్ములు= ఆ మహనీయులు; అట్లు= ఆ విధంగా; అగుట= కావటం; ఎట్లొకో!= ఎట్లా సమంజసం!; అని; ఏనున్= నేను; విచారించుచుండుదున్= ఆలోచిస్తూ ఉంటాను; ఆ+ తెఱంగున్= వారు అట్లా ఉండటానికి కారణాన్ని; ఎఱింగింపవే= తెలియజెప్పవా!; అని; అడిగినన్= అడిగితే; ఆ+పారాశర్యశిష్యుండు= ఆ వ్యాసశిష్యుడైన వైశంపాయనుడు; ఆ+భూవరునకున్= ఆ జనమేజయ మహారాజుకి; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని వైశంపాయనుడు చెప్పగా విని, జనమేజయుడు ఆ మునీశ్వరుడితో 'నీవు ముక్తి అనేది మిక్కిలి సుఖమైనది అని చెప్పుతావు కానీ, జనులందరూ కేవలం భౌతిక విషయాలపైన మాత్రమే ఆసక్తి చూపుతున్నారు. అంతే కాదు, దేవతలు కూడా మోక్షధర్మాన్ని ఆచరించకుండా పురోడాశాన్ని తినటమే పనిగా జీవిస్తుంటారు. ఇదేమిటి?- వీరెందుకు ఇట్లా అయ్యారు? అని నేను ఆలోచిస్తూ ఉంటాను. వారు అట్లా ఉండటానికి గల కారణాన్ని తెలియజెప్పు' మని అడుగగా వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ విధంగా తెలిపాడు.

క. విమలాత్ముఁడు పారాశ । ర్యమునీంద్రుఁడు శిష్యులను మహాభారతపం
చమములగు వేదముల మే । రుమహీధరవాసియై కరుణఁ జదివించెన్. 399

ప్రతిపదార్థం: విమల+ఆత్ముఁడు= నిర్మలాంతరంగుడైన; పారాశర్యమునీంద్రుఁడు= ఆ వ్యాసుడు; మేరుమహీధర+వాసియై= మేరుపర్వతంమీద నివసిస్తున్నవాడై; శిష్యులను= తన శిష్యులను; మహాభారత పంచమములు+అగు= మహాభారతం అయిదవదిగా కలదైన; వేదములన్= వేదాలను (వేదాలు నాలుగయితే మహాభారతం అయిదవది. పంచమవేదం); కరుణన్= శిష్యులపట్ల దయతో; చదివించెన్= చదివించాడు (వేదాలను శిష్యులతో చదివించాడు అంటే నేర్పాడు అని).

తాత్పర్యం: నిర్మలమనస్వి ఆ వ్యాసుడు మేరుపర్వతంమీద నివసిస్తూ తన శిష్యులకు నాలుగు వేదాలూ, పంచమవేదమైన మహాభారతమూ దయతో నేర్పాడు.

వ. అట్టియెడ నేనును సుమంతు - పైల - జైమినులు నీ విప్పుడు నన్నడిగిన చందంబున నమ్మహాత్ము నడిగితిమి దానికి సుముఖుండయి సర్వజ్ఞుండును సదయహృదయుండును నగు సాత్యవతేయుండు మాకు నిట్లని యానతిచ్చె. 400

ప్రతిపదార్థం: అట్టియెడన్= అలా చదివిస్తున్న సమయంలో; ఏనునున్= నేనూ; సుమంతు= సుమంతుడూ; పైల= పైలుడూ; జైమినులు= జైమిని - అనే మేము నలుగురమూ; నీవు; ఇప్పుడు; నన్నున్= నన్ను; అడిగిన+చందంబునన్= అడిగినట్టే; ఆ+ మహాత్మున్= ఆ మహానుభావుడు వ్యాసుడిని; అడిగితిమి= అడిగాం; దానికిన్= ఆ విషయానికి; సుముఖుండు+అయి= అనుకూలుడై; సర్వజ్ఞుండునున్= అన్నీ తెలిసినవాడూ; సదయ+హృదయుండునున్= దయతో కూడిన హృదయం కలవాడూ; అగు= అయిన; సాత్యవతేయుండు= సత్యవతీతనయుడు - వ్యాసుడు; మాకున్= మాకు; ఇట్లు+అని= ఇట్లాగని; ఆనతి+ఇచ్చెన్= సెలవిచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ సమయంలో నేనూ, సుమంతుడూ, పైలుడూ, జైమిని అనే నలుగురమూ నీవు ఇప్పుడు నన్ను అడిగినట్టే ఆ వ్యాసభగవానుడిని అడుగగా ఆయన ఇట్లా బదులిచ్చాడు.

తే. **ఏ నతీతంబులును వర్తమానములు న । నాగతమ్ములు నగు జగదఖిలవర్త**
నంబులును గను దివ్యబోధంబు గోరి । పాలకడలి తీరమునఁ దపంబుసేసి. **401**

ప్రతిపదార్థం: ఏను= నేను; అతీతంబులును= కడచిపోయినవీ; వర్తమానములున్= జరుగుతున్నవీ; అనాగతమ్ములున్= (ఇంకా రానివీ) జరగబోయేవీ; అగు= అయిన; జగత్= ప్రపంచంయొక్క; అఖిల= సమస్తమైన; వర్తనంబులును= నడవడికలూ; కను= తెలిసికొనేటువంటి (దర్శించే); దివ్యబోధంబు= దివ్యజ్ఞానం; కోరి= వాంఛించి; పాలకడలి+తీరమునన్= క్షీరసముద్రతీరంలో; తపంబు+చేసి= తపస్సు చేసి.

తాత్పర్యం: శిష్యులారా! భూతభవిష్యద్వర్తమానాలలో ప్రపంచప్రవర్తనను తెలిసికొనగలిగిన దివ్యదృష్టిని పొందాలని కోరి నేను క్షీరసముద్రతీరంలో తపస్సు చేశాను.

వ. **నారాయణప్రసాదంబునం జేసి సిద్ధమనోరథుండ నైతిం గావునం గల్పాదియందుఁ గమలసంభవప్రముఖ బృందారకు లాచరించిన కృత్యంబులు గానవచ్చు వానిం జెప్పెద దాన మీ యడిగిన యర్థంబు దేటపడు వినుండు.** **402**

ప్రతిపదార్థం: నారాయణప్రసాదంబునన్+చేసి= నారాయణుడి అనుగ్రహంచేత; సిద్ధమనోరథుండను+ఐతిన్= సిద్ధించిన కోరిక కలవాడను అయ్యాను (నా కోరిక సిద్ధించి ఆ దివ్యజ్ఞానమూ, దివ్యదృష్టీ లభించాయి అని); కావునన్= కాబట్టి; కల్పాదియందున్= సృష్టి ప్రారంభంలో; కమలసంభవ= బ్రహ్మదేవుడూ; ప్రముఖ= మొదలైన; బృందారకులు= దేవతలు; ఆచరించిన= చేసినటువంటి; కృత్యంబులు= పనులు; కానవచ్చువానిన్= కనిపించే వాటిని (ఏవి ఎంత కనిపిస్తే అంత); చెప్పెదన్= చెబుతాను; (కానవచ్చున్= కనబడతాయి వానిన్= వాటిని, చెప్పెదన్= చెప్పుతాను); దానన్= దానివలన; మీ+అడిగిన+అర్థంబు= మీరు అడిగిన విషయం (ప్రయోజనం); తేటపడున్= స్పష్టపడుతుంది; వినుండు= వినండి.

తాత్పర్యం: నారాయణుడి అనుగ్రహంచేత నా కోరిక సిద్ధించి, ఆ దివ్యజ్ఞానమూ, దివ్యదృష్టీ లభించాయి. కాబట్టి, సృష్టి ప్రారంభంలో బ్రహ్మదేవుడూ మొదలైన దేవతలు చేసినటువంటి పనులు చెప్పుతాను. దానివలన మీకు ప్రయోజనం సిద్ధిస్తుంది. మీ రడిగిన విషయం స్పష్టమౌతుంది.

క. **ఆదిత్యమరుద్వసురు । ద్రాదిసురులు మునులు నంబుజాసనుఁగని మా**
కేది కరణీయ మీశ? ద । యా దృష్టిని మమ్ముఁ జూచి యానతి యీవే? **403**

ప్రతిపదార్థం: ఆదిత్య= ఆదిత్యులూ; మరుత్= మరుత్తులూ; వసు= వసువులూ; రుద్ర= రుద్రులూ; ఆది= మొదలైన; సురులున్= దేవతలూ; మునులున్= ఋషులూ; అంబుజ+ఆసనున్= పద్మగర్భుడైన బ్రహ్మదేవుడిని; కని= దర్శించి; ఈశ!= ప్రభూ!; మాకున్= మాకు; ఏది; కరణీయము?= కర్తవ్యం?; దయాదృష్టిని= దయగల దృష్టితో; మమ్మున్= మమ్మల్ని; చూచి= వీక్షించి; ఆనతి+ఈవే?= ఆజ్ఞాపించవా?

తాత్పర్యం: ఆదిత్యాది సమస్తదేవతలూ, మహర్షులూ ఒకరోజున బ్రహ్మదేవుడిని దర్శించి ఇట్లా అడిగారు: 'ప్రభూ! మాకు కర్తవ్యం ఏమిటో దయతో ఆజ్ఞాపించవా?' - అని.

వ. **అని విన్నవించిన విని భరితాదరుండగుచు నప్పరమేష్ఠి వారితో 'మీ కెయ్యది కర్తవ్యంబో యను తలంపు మున్న నా చిత్తంబునం బొడమి యున్నయది. మీరు నిమ్మాట సెప్పి మేలు సేసితిరి. మీకును నాకును బ్రబలత్వం**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బెద్దానం గలుగు దాని నుపదేశించుటకుం బురుషోత్తము శరణు సొత్తము రం' డని పలికి వారునుం దానును దుగ్ధవారాశితీరంబునకుం బోయి ఘోరంబగు తపంబు బహుసహస్ర సఖ్యంబులగు దివ్యవర్షంబు లాచరించిన వారలకు గంభీరమధురప్రకారయగు వాణి యిట్లని వీతెంచె. 404

ప్రతిపదార్థం: అని; విన్నవించినన్= విజ్ఞప్తి చేస్తే; విని= ఆలకించి; భరిత+ఆదరుండు+అగుచున్= ఆదరంతో నిండినవాడు అవుతూ; ఆ+పరమేష్ఠి= ఆ బ్రహ్మ; వారితోన్= వారితో; మీకున్= మీకు; ఎయ్యది= ఏది; కర్తవ్యంబో= కర్తవ్యమో; అను= అనేటటువంటి; తలంపు= ఆలోచన; మున్ను+అ= మునుపే; నా చిత్తంబునన్= నా హృదయంలో; పొడమి+ఉన్నయది= పుట్టి ఉన్నది; మీరున్= మీరూ; ఈ+మాటన్= ఇదే మాట; చెప్పి= అడిగి; మేలు+చేసితిరి= మేలు చేశారు; మీకునున్= మీకూ; నాకునున్= నాకూ; ప్రబలత్వంబు= పుష్టి (ఆధిక్యం); ఎద్దానన్= దేనివలన; కలుగున్= కలుగుతుందో; దానిన్= దానిని; ఉపదేశించుటకున్= ఉపదేశించటానికి; పురుష+ఉత్తమున్= శ్రీమన్నారాయణుడిని; శరణు+చొత్తము= శరణువేడుదాం; రండు= రండి; అని పలికి= అని చెప్పి; వారునున్= వారందరూ; తానునున్= తానూ; దుగ్ధవారాశి తీరంబునకున్= క్షీరసముద్రతీరానికి; పోయి= వెళ్ళి; ఘోరంబు+అగు= తీవ్రమైన; తపంబు= తపస్సు; బహుసహస్ర సంఖ్యంబులు+అగు= వేలకువేల సంఖ్య కలవైన; దివ్యవర్షంబులు= దివ్యసంవత్సరాలు (మానుష సంవత్సరాలు కాదు - వేలకు వేల దివ్యసంవత్సరాలు); ఆచరించినన్= చేస్తే; వారలకున్= వారికి; గంభీర= గంభీరమూ; మధుర= మధురమూ అయిన; ప్రకార+అగు= విధానం కలదైన; వాణి= (సరస్వతి) ఒక వాక్కు; ఇట్లు+అని= ఇలాగని; వీతెంచెన్= వినవచ్చింది (గాలిలో తేలివచ్చింది).

తాత్పర్యం: అని వారు అడుగగా, ఆదరంతో ఆ బ్రహ్మ వారితో 'ఇదే ఆలోచన మునుపే నా హృదయంలో పుట్టి ఉన్నది. మీరూ ఇదే మాట అడిగారు. మీకూ, నాకూ ఆధిక్యం దేనివలన కలుగుతుందో, దానిని ఉపదేశించు మని శ్రీమన్నారాయణుడిని శరణు వేడుదాం రండి' అని చెప్పి వారందరూ తానూ క్షీరసముద్రతీరానికి వెళ్ళి, తీవ్రమైన తపస్సు వేలకువేల దివ్యసంవత్సరాలు చేయగా వారికి గంభీరమూ, మధురమూ అయిన ఒక వాక్కు ఈ విధంగా వినవచ్చింది.

విష్ణుఁ డదృశ్యరూపంబున బ్రహ్మాదిదేవతల కుపదేశించిన హితప్రకారము: (సం. 12-327-47,48,49)

క. ' మీ వచ్చినపని యెఱుఁగుదు । నీ వనజభవుండు జగము లిన్నిటికి గురుం
డే విధిఁ బనిచిన నది శ్రుతి । భావితకర్మంబు దానఁ బరఁగుదుఁ దగఁగన్. 405

ప్రతిపదార్థం: మీ+వచ్చినపని= మీరు వచ్చిన పని ఏమిటో; ఎఱుఁగుదున్= ఎరుగుదును; ఈ+వనజభవుండు= ఈ బ్రహ్మ (వనజము= పద్మం); జగములు+ఇన్నిటికిన్= ఈ జగత్తులు అన్నింటికీ; గురుండు= గురువు(తండ్రి); ఏ విధిన్= ఏ కర్తవ్యాన్ని; పనిచినన్= ఆజ్ఞాపించినా; అది; శ్రుతి= వేదాలలో; భావిత= ప్రతిపాదింపబడిన; కర్మంబు= పనే (అయి ఉంటుంది); దానన్= ఆ వేదంలోనే; తగఁగన్= తగినట్టు; పరఁగుదున్= నేనూ ఉంటాను (దానన్ అంటే ఆ ఆజ్ఞలోనే అనీ చెప్పవచ్చును).

తాత్పర్యం: 'దేవతలారా! మునులారా! మీరు వచ్చిన పని ఏమిటో నేను ఎరుగుదును. ఈ బ్రహ్మదేవుడు ముజ్జగాలకూ గురువు (సృష్టికర్త, తండ్రి). ఈయన ఏ కర్తవ్యాన్ని నిర్ణయించినా అది వేదప్రతిపాదితమే. నేనూ అందులోనే చరిస్తాను.

వ. ఏనునుం జెప్పెద వినుండు వేదహితం బగు నొక్క యాగంబు సేయుం డందు భాగంబు నాకుం గల్పింపవలయు' ననిన వారుం బ్రీతిఁ బొంది. 406

ప్రతిపదార్థం: ఏనునున్= నేనుకూడా; చెప్పెదన్= చెబుతాను; వినుండు= ఆలకించండి; వేదహితంబు+అగు= వేదవిహితమైన (వేదాలకు హితమైన); ఒక్క= ఒకానొక; యాగంబు= యజ్ఞం; చేయుండు= చెయ్యండి; అందున్= ఆ యాగంలో; నాకున్= నాకు; భాగంబు= భాగం; కల్పింపన్+వలయున్= కల్పించాలి; అనినన్= అని ఆకాశంలో ఒక కంఠం వినిపించేసరికి; వారున్= వారందరూ; ప్రీతిన్= సంతోషాన్ని; పొంది= పొంది;

తాత్పర్యం: నేను కూడా చెప్పుతాను వినండి. వేదవిహితమైన యజ్ఞం చెయ్యండి. ఆ యాగంలో నాకు భాగం కల్పించాలి' అని ఆకాశంలో ఒక కంఠం వినిపించే సరికి వారందరూ సంతసించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కమలజు పంచిన క్రియ యా । గము వైష్ణవ మనఁగఁ జేసి, కల్పించిరి భా
గము విష్ణున కం, దతఁ డ । య్యమరుల మునివరులపై దయను గగనమునన్. 407

ప్రతిపదార్థం: కమలజు= పద్మసంభవుడైన బ్రహ్మదేవుడియొక్క; పంచిన= ఆజ్ఞాపించిన; క్రియన్= విధంగా (బ్రహ్మ ఆజ్ఞాపించినట్టు); వైష్ణవము+అనఁగన్= వైష్ణవం అనేటటువంటి; యాగము= యజ్ఞం; చేసి= నిర్వహించి; అందున్= ఆ యాగంలో; విష్ణునకున్= విష్ణుమూర్తికి; భాగము= భాగం; కల్పించిరి= కల్పించారు; అతఁడు= ఆ విష్ణుమూర్తి; ఆ+అమరుల= ఆ దేవతల; మునివరుల= మహర్షుల; పైన్= పైని; దయను= కృపతో; గగనమునన్= ఆకాశంలో.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు ఆజ్ఞాపించిన విధంగా 'వైష్ణవం' అనే యజ్ఞం చేసి దేవతలూ, మునులూ అందులో విష్ణుమూర్తికి భాగం కల్పించారు. దానికి సంతోషించి ఆ విష్ణుమూర్తి వారిపై దయతో ఆకాశంలో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అదృశ్యుండై నిలిచి వారలతో నిట్లనియె. 408

ప్రతిపదార్థం: అదృశ్యుండు+ఐ= కంటికి కనబడకుండా; నిలిచి= ఆకాశంలో నిలబడి; వారలతోన్= బ్రహ్మాదిదేవతలతో, ఋషులతో; ఇట్లు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అదృశ్యరూపంలో ఆకాశంనుండి బ్రహ్మాదిదేవతలతో విష్ణుమూర్తి ఈ విధంగా అన్నాడు:

క. నా పంపునను బ్రవృత్తి । వ్యాపకయైనట్టి సత్క్రియం జేసితి రి
ట్టీ పుణ్యంబునకును ఫల । రూపంబగుదాని నే నిరూపింతుఁ దగన్. 409

ప్రతిపదార్థం: నా= నాయొక్క; పంపునను= ఆజ్ఞతో; ప్రవృత్తి వ్యాపక+ఐనట్టి= విస్తరించి జరిగినటువంటి; సత్క్రియన్= మంచిపనిని (సత్కార్యాన్ని); చేసితిరి= చేశారు; ఇట్లు= ఇట్లా చేసినటువంటి; ఈ పుణ్యంబునకున్= ఈ సుకృతానికి; ఫలరూపంబు+అగుదానిన్= ప్రతిఫలమైనదాన్ని; నేన్= నేను; తగన్= తగినట్టు; నిరూపింతున్= మీకు నిర్ణయిస్తాను.

తాత్పర్యం: మహర్షులారా! నా ఆజ్ఞమేరకు విస్తరించే ప్రవృత్తి కలిగిన ఒక మంచిపనిని చేశారు. ఇట్లా చేసిన ఈ పుణ్యానికి ఫలితాన్ని తగినట్లు మీకు నేను నిర్ణయిస్తాను.

వ. మరీచి యంగిరసుం డత్రి పులస్త్యుండు పులహుండు క్రతువు వసిష్ఠుఁడను వీర లవ్వారిజభవునకు మానసపుత్రు లిమ్మహాత్ములు నట్టివార; వేదాచార్యులు యజ్ఞకార్యధుర్యులు; వీరు విధింప సర్వయజ్ఞంబులును మానవులు మాననీయంబులుగా నడప మీ కెల్లను నయ్యాగంబుల భాగంబులు గలిగి తద్భాగంబుల నాప్యాయితులై యుపబృంహణంబు నొందువారలు సన సనక సనందన సనాతన కపిల సనత్కుమారులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరమేష్ఠిమనోనిర్మితులు సహజజ్ఞాన విజ్ఞానులు నివృత్తిపరులునై సాంఖ్యయోగంబులకుం బ్రవర్తకు లగుచుండుదురు. వీరలచేత మోక్షధర్మంబులు సువ్యంజితంబు లగు. మీకుం దల్లియుం దండ్రియు గురుండును నివ్విరించియ. మదీయానుశాసనంబున నితండు సర్వానుశాసకుండై వర్తిల్లువాఁడు. మత్ఫాలప్రభవుండైన రుద్రుండు సర్వలోకారాధనీయుండును సకలవరప్రదుండునుం జుండీ! మీరు వొండు ; వేదోదితకర్మంబు లిక్కమలభవుండును మరీచ్యాది ప్రజాపతులునుం బంచినట్లు నడవం గలయవి. యిది కృతయుగం బను పేరింటి యుత్తమకాలంబు; దీనియందుఁ బశువులు హింస్యంబులు గావు సంశయంబు వలవదని నిర్దేశించిన.
410

ప్రతిపదార్థం: మరీచి, అంగిరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు - అను వీరలు= అనే వీరంతా; ఆ+వారిజభవునకున్= ఆ బ్రహ్మకు; మానసపుత్రులు= మనస్సు నుండి ప్రభవించిన కుమారులు; ఈ+మహాత్ములున్= ఈ మహానుభావులందరూ కూడా; అట్టివారు+అ= అంతటివారే (బ్రహ్మతో సమానులు); వేద+ఆచార్యులు= వీరు వేదాలకు గురువులు; యజ్ఞకార్య= యజ్ఞకృత్యాలకు; ధుర్యులు= నిర్వాహకులు; వీరు= ఈ మరీచి ప్రభృతులు; విధింపన్= నియమాలు చేయగా; సర్వ యజ్ఞంబులును= అన్ని యజ్ఞాలూ; మానవులు= మనుష్యులు; మాననీయంబులుగాన్= గౌరవింపదగినవిగా; నడపన్= నిర్వహించగా; మీకున్= మీకు; ఎల్లను= అందరికీ; ఆ+యాగంబులన్= ఆ యజ్ఞాలలో; భాగంబులు= భాగాలు; కలిగి= లభించి; తద్+భాగంబులన్= ఆ భాగాలతో; ఆప్యాయితులై= తృప్తిపొందినవారై; ఉపబృంహణంబున్= వృద్ధిని; ఒందువారలు= మీరంతా పొందుతారు; సన, సనక, సనందన, సనాతన, కపిల, సనత్కుమారులు= సనుడు, సనకుడు, సనందనుడు, సనాతనుడు, కపిలుడు, సనత్కుమారుడు - అనే వీరు; పరమేష్ఠి= బ్రహ్మయొక్క; మనః= మనస్సుచేత; నిర్మితులు= సృష్టింపబడినవారు (సంకల్పమాత్ర సంభవులు); సహజ= జన్మసిద్ధంగానే; జ్ఞానవిజ్ఞానులు= జ్ఞానవిజ్ఞానాలు కలవారు; నివృత్తిపరులునై= ముక్తి పరాయణులూ అయి (ప్రవృత్తి= విస్తరించటం; నివృత్తి= మరలటం); సాంఖ్యయోగంబులకున్= సాంఖ్యానికీ, యోగానికీ; ప్రవర్తకులు+అగుచుండుదురు= ప్రచారకులు అవుతుంటారు; వీరలచేతన్= వీరిచే; మోక్షధర్మంబులు= ముక్తికి సంబంధించిన ధర్మాలు; సువ్యంజితంబులు+అగున్= స్పష్టం చేయబడతాయి; మీకున్= మీకందరికీ; తల్లియున్= తల్లీ; తండ్రియున్= తండ్రీ; గురుండున్= గురువూ; ఈ+విరించి+అ= ఈ బ్రహ్మదేవుడే; మదీయ= నాయొక్క; అనుశాసనంబునన్= ఆజ్ఞతో; ఇతండు= ఈ బ్రహ్మ; సర్వ+అనుశాసకుండై= సమస్తాన్నీ శాసించేవాడై; వర్తిల్లువాఁడు= వర్తిస్తాడు; మత్= నాయొక్క; ఫాల= నుదుటినుంచి; ప్రభవుండైన= పుట్టినవాడైన; రుద్రుండు= శివుడు; సర్వలోక= సమస్తలోకాలకూ; ఆరాధనీయుండును= పూజింపదగినవాడూ; సకల= సమస్తమైన; వర= వరాలనూ; ప్రదుండునున్= ఇచ్చేవాడూ; చుండీ!= సుమా!; మీరు+పొండు= ఇంక మీరు వెళ్ళండి; వేద+ఉదిత= వేదాలలో చెప్పబడిన; కర్మంబులు= పనులు; ఈ+కమలభవుండును= ఈ బ్రహ్మదేవుడూ; మరీచి+ఆది+ప్రజాపతులునున్= మరీచి మొదలైన ప్రజాపతులూ (బ్రహ్మతుల్యులు అన్నాడు కనక ప్రజాపతులే); పంచినట్లు= ఆజ్ఞాపించినట్టుగా; నడవన్+కలయవి= నడుస్తాయి; ఇది= ఇప్పుడిది; కృతయుగంబు అను+పేరిట= కృతయుగం అనే పేరుగల; ఉత్తమకాలంబు= ఉత్తమమైన కాలం; దీనియందున్= ఈ యుగంలో; పశువులు= జంతువులు; హింస్యంబులు= హింసించదగినవి (యజ్ఞాలలో పశుబలి); కావు= కాదు; సంశయంబు+వలవదు= సందేహం వద్దు; అని; నిర్దేశించినన్= ఆజ్ఞాపించేసరికి.

తాత్పర్యం: మరీచి, అంగిరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు - అనే బ్రహ్మమానసపుత్రులూ, ఈ మహాత్ములూ సమానులే. వీరు వేదపండితులు, యజ్ఞకార్య నిర్వాహకులు. వేదం నిర్దేశించగా మానవులు యజ్ఞాలన్నీ గౌరవంగా నిర్వహించి మీకందరికీ హవిర్భాగాలు కల్పించగా వాటిని మీరు గ్రహించి తృప్తిపడి అభివృద్ధి పొందండి. సన, సనక, సనందన, సనాతన, కపిల, సనత్కుమారులు బ్రహ్మ మానసపుత్రులు. వారు సహజజ్ఞానులు. ముముక్షువులు అయి సాంఖ్యయోగ మార్గాలను ప్రవర్తింప చేస్తారు. వీరిచేత మోక్షధర్మాలు స్పష్టమౌతాయి. మీకు తల్లీ, తండ్రీ, గురువు ఈ బ్రహ్మయే. నా ఆజ్ఞచేత బ్రహ్మ సర్వశాసకుడిగా ఉంటాడు. నా నుదురునుండి పుట్టిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రుద్రుడు లోకాలన్నింట పూజించదగినవాడు, వరాల నిచ్చేవాడు సుమా! ఇక మీరు వెళ్ళండి. ఈ బ్రహ్మదేవుడూ, మరీచి మొదలైన ప్రజాపతులూ ఆజ్ఞాపించినట్లు నడుచుకొనండి. ఇప్పుడు ఉత్తమకాలమైన కృతయుగం. దీనిలో పశువులను చంపకూడదు. అనుమానం వద్దు' అని ఆదేశించగా.

క. మునులును సురలును విష్ణు । న్వినుతించి నమస్కరించి నిజపదములకుం
జనిరి పరమేష్ఠి యొకరుఁడ । చన కచ్చట నిలిచె హరియు సన్నిహితుండై. 411

ప్రతిపదార్థం: మునులునున్= మహర్షులూ; సురలునున్= దేవతలూ; విష్ణున్= విష్ణుమూర్తిని; వినుతించి= స్తుతించి; నమస్కరించి= మ్రొక్కి; నిజపదములకున్= తమ తమ స్థానాలకు (నెలవులకు); చనిరి= వెళ్ళిపోయారు; పరమేష్ఠి= బ్రహ్మ; ఒకరుఁడు+అ= ఒక్కడే; చనక= వెళ్ళకుండా; అచ్చటన్= అక్కడ; నిలిచెన్= నిలబడ్డాడు; హరియున్= విష్ణుమూర్తికూడా; సన్నిహితుండు+ఐ= బ్రహ్మదేవుడి చేరువకు వచ్చి -

తాత్పర్యం: విష్ణుమూర్తి ఆజ్ఞను శిరసావహించి మునులూ, దేవతలూ నుతించి, నతించి ఎవరి నెలవులకు వారు వెళ్ళిపోయారు. బ్రహ్మ ఒక్కడే వెళ్ళకుండా అక్కడే నిలబడ్డాడు. అప్పుడు విష్ణుమూర్తి ఆయన సమీపానికి వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. హయశిరోభాసితుండును హస్తకలిత । లలిత దండకమండలూజ్జ్వలుఁడు సాంగ
వేదముఖరముఖుండునై యాదరార్ద్ర । దృష్టి నిగుడంగ నిలిచి యద్దివిజముఖ్యు. 412

ప్రతిపదార్థం: హయశిరః= గుర్రపు తలతో; భాసితుండునున్= ప్రకాశిస్తున్నవాడూ (హయగ్రీవుడు); హస్త= చేతిలో; కలిత= ధరించిన (అలరారుతున్న); లలిత= (సుకుమారమైన) అందమైన; దండ= దండమూ; కమండలు= కమండలువు-వీటితో; ఉజ్జ్వలుండున్= ప్రకాశిస్తున్నవాడూ; స+అంగ= ఛందోజ్యోతిషాది షడంగాలతో కూడిన; వేద= వేదంతో; ముఖర= మారుమ్రోగుతున్న; ముఖుండును= వదనంకలవాడు; ఐ= అయి; ఆదర+ఆర్ద్ర+దృష్టి= ఆదరంతో (ప్రేమతో); చెమ్మగిల్లిన చూపు; నిగుడంగన్= ప్రసరించగా; నిలిచి= చేరువలో నిలిచి; ఆ+దివిజముఖ్యున్= దేవతలలో ముఖ్యుడయిన ఆ బ్రహ్మను (కౌగిలించుకొని).

తాత్పర్యం: విష్ణుమూర్తి హయగ్రీవుడుగా దర్శనమిచ్చాడు. చేతులలో దండకమండలువులు భాసిస్తున్నాయి. సాంగంగా వేదధ్వని ముఖంలో మారుమ్రోగుతున్నది. ఆదరంతో నిండి చెమ్మగిల్లిన కన్నులతో చూస్తూ బ్రహ్మను. (తరువాతి వచనంతో అన్వయం).

వ. కౌఁగిలించుకొని నీవు సర్వంబునకును విధాతవు గురుండవు ప్రభువవు నయి నడపుము. నీయందు సర్వభారంబునుం బెట్టి సుఖినై యుండెద. నడపుట నీకెప్పుడేనిఁ గడిందియై తోఁచె నప్పు డేను దోఁచి సమస్తంబును సునీతంబు సేయంగలవాఁడ ననియెఁ దదనంతరం బావిష్ణుం డంతర్హితుం డయ్యె. నిట్లు యజ్ఞంబు లందగ్రభాగార్హుండును యజ్ఞధారియునైన యప్పద్మనాభుండు ప్రవృత్తిధర్మంబు బ్రహ్మాదులకుం గృత్యంబు సేసి నివృత్తి ధర్మంబునందు నిష్ఠుండును విద్యాసహాయుండునునై సర్వగతుం డగుచుఁ జరియించు నని చెప్పి యప్పారాశర్యుండు. 413

ప్రతిపదార్థం: కౌఁగిలించుకొని= బ్రహ్మను ఆలింగనం చేసికొని; నీవు; సర్వంబునకునున్= సమస్తానికీ (యజ్ఞాలు అన్నింటికీ); విధాతవు= సృష్టికర్తవూ; గురుండవు= గురువువు; ప్రభువవు= అధికారివీ; అయి; నడపుము= నడిపించుము; నీయందున్= నీమీద; సర్వభారంబునున్= సమస్తభారాన్నీ (మొత్తం బాధ్యతల బరువునంతటినీ); పెట్టి= ఉంచి; సుఖినై= నేను సుఖిగా; ఉండెదన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉంటాను; నడపుట= ఈ కార్యభారాన్ని సాగించటం; నీకున్= నీకు; ఎప్పుడేనిన్= ఎప్పుడయినా; కడిందియై= కష్టమై; తోఁచెన్= తోస్తే (కష్టమనిపిస్తే); అప్పుడు; ఏనున్= నేను; తోఁచి= ప్రత్యక్షమై; సమస్తంబునున్= అంతటినీ; సునీతంబు= బాగా నడపబడినదిగా; చేయంగలవాఁడన్= చేస్తాను; అనియెన్= అన్నాడు విష్ణుమూర్తి; తద్+అనంతరంబు= ఆ తరువాత; ఆ+విష్ణుండు= ఆ విష్ణుమూర్తి; అంతర్హితుండు+అయ్యెన్= అంతర్ధానం చెందాడు; ఇట్లు; యజ్ఞంబులందున్= యాగాలలో; అగ్రభాగ+అర్హుండున్= అగ్రస్థాన గౌరవానికి యోగ్యుడూ (అగ్రతాంబూలం అందుకుంటూ); యజ్ఞధారియున్+ఐన= యజ్ఞాలను ధరించేవాడూ అయిన; ఆ+పద్మనాభుండు= ఆ విష్ణుమూర్తి (పద్మం నాభియందు కలవాడు); ప్రవృత్తి ధర్మంబు= క్రియాశీలమైన ప్రవృత్తిధర్మాన్ని (కర్మాచరణమే ప్రవృత్తి); బ్రహ్మాదులకున్= బ్రహ్మాదిదేవతలకూ, ఋషులకూ; కృత్యంబు+చేసి= కర్తవ్యంగా ఏర్పరిచి; నివృత్తి ధర్మంబునందు= (నిష్క్రియారూపమై అంతర్ముఖలక్షణమైన) నివృత్తిధర్మంలో; నిష్ఠుండునూ= (స్థిరపడినవాడూ) నిష్ఠ కలవాడూ; విద్యా+సహాయుండునున్= జ్ఞానమే సహాయంగా కలవాడూ; ఐ= అయి; సర్వగతుండు అగుచున్= అన్నింటా ఉన్న వాడవుతూ (సర్వత్ర నివసిస్తూ); చరియించున్= సంచరిస్తూ ఉంటాడు; అని చెప్పి= అని వివరించి; ఆ+పారాశర్యుండు= ఆ వ్యాసుడు - ఇంకా ఇట్లా అంటున్నాడు. (అగ్రభాగ+హరుండు= ప్రథమభాగం లేదా ఉత్తమభాగం అందుకొనేవాడు - అని పాఠాంతరం.)

తాత్పర్యం: బ్రహ్మను ఆలింగనం చేసికొని, 'నీవు యజ్ఞాల కన్నిటికీ సృష్టికర్తవు, గురువువు, అధికారివీ అయి నడిపించుము. నీమీద భారమంతా ఉంచి సుఖంగా ఉంటాను. నీ కెప్పుడైనా కష్టమనిపిస్తే నేను ప్రత్యక్షమై అన్నీ నడిపిస్తాను' - అని చెప్పి విష్ణువు అంతర్ధాన మయ్యాడు. ఇట్లా యజ్ఞాలలో అగ్రభాగానికి యోగ్యుడూ, యజ్ఞధారీ అయిన ఆ విష్ణువు కూడా జ్ఞానకారకుడై, అన్నిటా ఉన్నవాడై ప్రవర్తిల్లుతూ ఉంటాడు' అని చెప్పి ఆ వ్యాసుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. మొదలఁ గలిగించి జగములఁ । బదిలంబుగ నునిచి వానిఁ బదపడి తనయం
దొదిఁగించి మఱియు నెమ్మెయి । నుదారగతి నడపు చిన్మయుని గొలుతు హరిన్. 414

ప్రతిపదార్థం: జగములన్= లోకాలను; మొదలన్= ముందుగా; కలిగించి= సృష్టించి; పదిలంబుగన్= జాగ్రత్తగా; ఉనిచి= ఉంచి (పోషించి); వానిన్= ఆ లోకాలను; పదపడి= ఆ తరువాత; తనయందున్= తనలో; ఒదిఁగించి= లీనం చేసికొని; మఱియున్= ఇంకా; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; ఉదారగతిన్= ఉదారమైన పద్ధతిలో; నడపు= నిర్వహించే; చిన్మయునిన్= జ్ఞానమయ స్వరూపుడైన; హరిన్= విష్ణుమూర్తిని; కొలుతున్= (సేవిస్తాను) సేవిస్తున్నాను.

తాత్పర్యం: లోకాలను సృష్టించి, పోషించి, కట్టకడపటికి వాటిని తనలోనే లీనం చేసికొని అన్నివిధాలా ఉదారంగా నడిపించే జ్ఞానమయుడు విష్ణుమూర్తి. ఆ దేవుడిని నేను సేవించుకొంటున్నాను.

ఆ. అజుని విశ్వరూపు నమరుని సర్వామ । రాధినాథు నాద్యు సాంగవేద
వేదితవ్యు నాత్మవేద్యు నీశాను న । వ్యయుఁ దపఃఫలాత్ము నాశ్రయింతు. 415

ప్రతిపదార్థం: అజునిన్= పుట్టుకలేని వాడినీ; విశ్వరూపున్= విశ్వస్వరూపుడినీ; అమరునిన్= మృతిలేనివాడినీ (శాశ్వతుడు); సర్వ+అమర+అధినాథున్= సకలదేవతలకూ నాయకుడినీ; ఆద్యున్= తొట్టతొలివాడినీ; సాంగవేద= షడంగసహితాలైన వేదాలతో; వేదితవ్యున్= తెలుసుకోదగినవాడినీ; ఆత్మవేద్యున్= ఆత్మతోమాత్రమే తెలియదగినవాడినీ; ఈశానున్= ఈశ్వరుడినీ; అవ్యయున్= వ్యయంలేనివాడినీ (మార్పులేనివాడు లేదా వినాశం లేనివాడు); తపః= తపస్సులకు; ఫల+ఆత్మున్= ఫలస్వరూపమైనవాడూ - అయిన శ్రీ మహావిష్ణుమూర్తిని; ఆశ్రయింతున్= ఆశ్రయిస్తున్నాను (శరణు వేడుతున్నాను).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అజ, విశ్వరూప, అమర, అమరాధినాథ, ఆద్య, వేదవేద్య, ఆత్మవేద్య, ఈశాన, అవ్యయ, తపఃఫలాత్మ అనే విశేషణాలు ఆయా లక్షణాలను బట్టి విష్ణుమూర్తికి ఏర్పడ్డాయి. ఏవంవిధ లక్షణలక్షితుడైన ఆ దేవదేవుడిని సేవించుకొంటున్నాను.

వ. అని మఱియు ననేకప్రకారంబుల నప్పరమముని యప్పుడు భావంబున నెలకొన్న నారాయణుం బ్రస్తుతించి మమ్ముం గలయ నవలోకించి పూర్వవృత్తాంతంబు ప్రజ్ఞాదృష్టిని నా కన్నయది మీ కెఱింగించితి విష్ణుని దివ్యవచనంబుల చొప్పున నడచునది. యప్పరమేశ్వరుం గొలువుండు; వేదవాక్యంబులం దత్ప్రకీర్తనంబు సేయుం డనియె; నేము నట్లకాక యని ఋగ్యజుస్సామంబుల నా త్రిధాముం బ్రస్తుతించి మనంబుల నారాధించితి' మని చెప్పి వైశంపాయనుండు వెండియు. 416

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; మఱియున్= ఇంకా; అనేకప్రకారంబులన్= చాలా విధాలుగా; ఆ+పరమముని= ఆ దివ్యర్షి వ్యాసుడు; అప్పుడు= ఆ సమయంలో; భావంబునన్= హృదయంలో; నెలకొన్న= నివసిస్తున్న (నెలవు+కొను= నెలకొను); నారాయణున్= శ్రీమహావిష్ణుమూర్తిని; ప్రస్తుతించి= బాగా స్తుతించి; మమ్మున్= శిష్యులమైన మమ్ములను; (వైశంపాయన పైల సుమంతు ప్రభృతులను); కలయన్+అవలోకించి= పరిశీలనగా చూచి; పూర్వవృత్తాంతంబు= కడచిన కథను; ప్రజ్ఞాదృష్టిని= దివ్యదృష్టితో (తెలివి అనే చూపుతో); నా+కన్న+అది= నేను చూచినది; మీకున్= మీకు; ఎఱింగించితిన్= తెలియజేశాను; విష్ణుని= విష్ణుమూర్తి చెప్పినటువంటి; దివ్యవచనంబుల+చొప్పునన్= దివ్యమైన వాక్కుల ప్రకారం; నడచునది= వర్తించండి; ఆ+పరమేశ్వరున్= ఆ పరమేశ్వరుడిని; కొలువుండు= సేవించండి; వేదవాక్యంబులన్= వేదమంత్రాలతో; తద్= ఆ స్వామియొక్క; ప్రకీర్తనంబు= సంస్తుతి; చేయుండు= చేయండి; అనియెన్= అని చెప్పాడు వ్యాసుడు; ఏమున్= మేముకూడా; అట్లకాక= అట్లాగే; అని; ఋక్+యజుస్+సామంబులన్= మూడు వేదాలతోనూ; ఆ+త్రిధామున్= ఆ విష్ణుమూర్తిని; ప్రస్తుతించి= బాగా స్తుతించి; మనంబులన్= మనస్సులలో; ఆరాధించితిమి= పూజించాము; అని చెప్పి= అని పలికి; వైశంపాయనుండు= ఆ వైశంపాయనమహర్షి; వెండియున్= తిరిగి ఇలా అంటున్నాడు:

తాత్పర్యం: అని, ఇంకా పెక్కు విధాలుగా వ్యాసుడు భావనాపథంలో నిలిచిన నారాయణుడిని కీర్తించి, మమ్ముల నందరినీ తేరిపారచూచి, 'దివ్యదృష్టితో నేను చూచిన పూర్వవృత్తాంతం మీకు తెలియజెప్పాను. విష్ణుదేవుడి దివ్య వచనాల నాశ్రయించి ముందుకు నడవండి. పరమేశ్వరుడు కొలువుండే వేదవాక్యాలను గానం చేయండి.' అన్నాడు. 'అట్లాగే చేస్తా' మని మేము ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదంలో నివసించే విష్ణువును స్తుతించాము' అని చెప్పి వ్యాసుడు మళ్ళీ (ఇట్లా అన్నాడు).

సీ. సర్వజ్ఞుఁడగు పరాశరనందనుని చేత । భాషితంబైన యప్పరమపుణ్య
వృత్తంబు సదివిన విన్నను విప్రుండు । వేదవేదియు, రాజు విజయశాలి
యును, వణిజుండు లాభోపేతుఁడును, శూద్రుఁ । డత్యంతసుఖియును నగు నరేంద్ర!
కన్య సద్వరకరగ్రహణంబు వడయు, గ । ర్భిణియైన కాంత సద్గుణునిఁ బుత్రుఁ

ఆ. గాంచుఁ, బ్రసవకాలకలయందు నెఱి దప్పి । యున్న బిడ్డగలుగునువిద సుఖక
రప్రసూతి నిర్భరతనొందు, వంధ్య సం । తానసిద్ధి సమ్మదంబు నొందు. 417

ప్రతిపదార్థం: సర్వజ్ఞుఁడు= సమస్తమూ తెలిసినవాడైన; పరాశరనందనునిచేతన్= వ్యాసునిచే; భాషితంబైన= చెప్పబడిన; ఈ+పరమపుణ్య వృత్తంబు= మిక్కిలి పావనమైన ఈ కథను; చదివినన్= చదివినా; విన్ననున్= విన్నా; విప్రుండు= బ్రాహ్మణుడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వేదవేదియున్= వేదాలను తెలిసికొన్నవాడూ; రాజు= క్షత్రియుడు; విజయశాలియునున్= విజయవంతుడూ; వణిజుండు= వ్యాపారస్థుడు; లాభ+ఉపేతుఁడునున్= అధికలాభాలు పొందేవాడూ; శూద్రుఁడు= నాల్గవజాతివ్యక్తి; అత్యంత సుఖియునున్= మిక్కిలి సుఖాలు పొందేవాడూ; అగున్= అవుతాడు; నరేంద్ర= జనమేజయా!; కన్య= కన్య ఎవరయినా ఇది చదివినా, విన్నా; సత్+వర= ఉత్తమవరుడియొక్క; కరగ్రహణంబు= పాణిగ్రహణం (వివాహం); పడయున్= పొందుతుంది; గర్భిణియైన+కాంత= గర్భిణీస్త్రీ అయితే; సద్గుణునిన్= మంచి గుణవంతుడైన; పుత్రున్= తనయుడిని; కాంచున్= ప్రసవిస్తుంది; ప్రసవకాల+కలయందున్= ప్రసవించే ముహూర్తంలో ఈ కథ వింటే (కళ= ముప్పది కాష్ఠలకాలం); నెటిదప్పియున్న బిడ్డ గలుగు నువిద= గర్భకోశంలో ఉండవలసిన తీరును తప్పి ఉన్న శిశువును ధరించిన స్త్రీ (గర్భంలో బిడ్డ అడ్డంతిరిగితే); సుఖకరప్రసూతి నిర్భరతన్= సుఖంగా ప్రసవించే స్థితిని; ఒందున్= పొందుతుంది (సుఖప్రసవం అవుతుంది - అని); వంధ్య= గొడ్రాలు; సంతానసిద్ధి= సంతానప్రాప్తి వలన కలిగే; సమ్మదంబున్= సంతోషాన్ని; ఒందున్= పొందుతుంది (గొడ్రాలు కూడా సంతానవతి అవుతుందని ఈ కథ విన్నా చదివినా అని).

తాత్పర్యం: వ్యాసుడు మాకందరికీ చెప్పిన ఈ పవిత్రకథను విన్నా, చదివినా విప్రుడు వేదవేత్త అవుతాడు. రాజు విజయశాలి అవుతాడు. వ్యాపారి అధికలాభాలు పొందుతాడు. శూద్రుడు సుఖాలు పొందుతాడు. కన్యకు మంచి వరుడు దొరుకుతాడు. గర్భిణీస్త్రీకి గుణవంతుడైన కొడుకు పుట్టుతాడు. గర్భకోశంలో బిడ్డ అడ్డం తిరిగి ఉన్న స్త్రీకయితే సుఖంగా ప్రసవం అవుతుంది. గొడ్రాలు సంతానవతి అవుతుంది. అంత పరమపావనమైనది ఈ కథ' అని వైశంపాయనుడు ఫలశ్రుతి చెప్పాడు.

విశేషం: నెటి దప్పియున్న బిడ్డ గలుగునువిద - ప్రసవకాల కళయందున్ - సుఖకర ప్రసూతి నిర్భరతన్ - ఒందున్ అనే దానికి సంస్కృతమూలం ఇట్లా ఉన్నది: **"లగ్నగర్భా విముచ్యేత గర్భిణీ జనయేత్సుతమ్."**

భగవన్నామ నిర్వచన ప్రకారము (సం. 12-328-3)

వ. ' మఱియు నెవ్విధంబు మనోరథంబులైనను సఫలంబు లను ననిన విని జనమేజయుండు 'గూఢంబు లగు విష్ణునామంబు లనిర్వచనంబులు వినవలతు వివరింపవే' యనుటయు వైశంపాయనుం డమ్మహీ నాయకులతో నర్జునుం డడుగం గృష్ణుండు వివరించిన నిజనామంబుల నిరుక్తి తెఱంగెఱింగించెద నాకర్ణింపు మప్పార్థుని బోధించుటకై యద్దేవుం డిట్లనియె. 418

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఏ+విధంబు= ఏ రకమైన; మనోరథంబులైనను= కోరికలైనా; సఫలంబులు+అగున్= ఫలిస్తాయి; అనినన్= అని చెబితే; విని; జనమేజయుండు= ఆ జనమేజయుడు; గూఢంబులు+అగు= రహస్యాలైన; విష్ణు నామంబులు= విష్ణుమూర్తి నామధేయాలు; అనిర్వచనంబులు= నిర్వచనాలకు లొంగేవి కావు; వినన్+వలతున్= వినాలి అని కోరు కుంటున్నాను; వివరింపవే= దయచేసి వివరించవా?; అనుటయును= అనటంతోనే; వైశంపాయనుండు= వైశంపాయనుడు (ఇలా చెబుతున్నాడు); అర్జునుండు= కిరీటి; అడుగన్= అడిగినప్పుడు; ఆ+మహీ+నాయకులతోన్= ఆ పాండవులకు(తో); కృష్ణుండు= శ్రీకృష్ణపరమాత్మ; వివరించిన= వివరించి చెప్పినటువంటి; నిజనామంబుల= తన నామధేయాల; నిరుక్తి= నిర్వచనంయొక్క; తెఱంగున్= పద్ధతిని; ఎఱింగించెదన్= నీకు తెలియజెపుతాను; ఆకర్ణింపుము= వినుము; ఆ+పార్థునిన్= ఆ అర్జునుడిని; బోధించుటకై= జ్ఞానవంతుడిని చెయ్యటంకోసం; ఆ+దేవుండు= ఆ శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'ఇంకా ఎటువంటి కోరికలైనా ఫలిస్తాయి' - అనగా విని జనమేజయుడు 'గూఢములైన విష్ణువు నామాలు నిర్వచనాలకు లొంగేవికావు. అయినా వాటిని వినాలని ఉన్నది. చెప్పుము' అనగా వైశంపాయనుడు జనమేజయుడితో - 'ఇదే ప్రశ్నను అర్జునుడు అడుగగా విష్ణువు తన నామాలను నిర్వచించిన విధం చెప్పుతాను వినుము' అని ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **'నరుఁడు నారాయణుండు ననంగఁ బరఁగు। నిత్యపురుషులు నీవును నేనుఁ జుమ్ము,**
భువనహిత మాచరింపఁగాఁ బూని వేడ్క। వచ్చి యిమ్మహిఁ బుట్టినవార మనఘ! **419**

ప్రతిపదార్థం: అనఘ!= పావనుడా! అర్జునా!; నరుఁడున్= నరుడూ; నారాయణుండున్= నారాయణుడూ; అనంగన్= అని; పరఁగు= ఒప్పే; నిత్యపురుషులు= సదాతన పురుషులు; నీవునున్= నీవూ; నేనున్= నేనూ; భువన= లోకాలకు; హితము= మేలు; ఆచరింపఁగాన్= చెయ్యటంకోసం; పూని= పూనుకొని; వేడ్కన్= వేడుకగా (లీలావిలాసంగా); వచ్చి= అవతరించి; ఈ+మహిన్= ఈ భూలోకంలో; పుట్టినవారము= మనం ఇద్దరమూ జన్మించాం. చుమ్ము= సుమా!;

తాత్పర్యం: 'పావనా! అర్జునా! నీవూ నేనూ - నరుడూ నారాయణుడూ అనే నిత్యపురుషులం. లోకహితం కోరి ఈ భూలోకంలో ఇట్లా జన్మించాం సుమా!

వ. **గూఢంబులగు మదీయాభిధానంబుల యర్థంబులు దేటపఱిచెద నాకర్ణింపుము.** **420**

ప్రతిపదార్థం: గూఢంబులు+అగు= అతి నిగూఢాలైన; మదీయ= నాయొక్క; అభిధానంబుల= నామధేయాల; అర్థంబులు= అర్థాలు; తేటపఱిచెదన్= నీకు విశదపరుస్తాను; ఆకర్ణింపుము= ఆలకించుము.

తాత్పర్యం: అతి నిగూఢాలైన నా నామధేయాల అర్థాలు నీకు విశదపరుస్తాను. ఆలకించుము.

క. **నారము లనఁగా జలముల। పే రయనం బనఁగ నెలవు ప్రీతిగ నాకున్**
నారము లయనం బగుటను। నారాయణుఁ డండ్రు జనులు నన్నుఁ గిరీటీ! **421**

ప్రతిపదార్థం: కిరీటీ!= అర్జునా!; నారములు+అనఁగాన్= నారములు అంటే; జలముల+పేరు= నీటికి పర్యాయపదం (పేరు); అయనంబు+అనఁగన్= అయనము అంటే; నెలవు= స్థానం అని అర్థం; ప్రీతిగన్= ఇష్టంగా; నాకున్= నాకు; నారములు= నీళ్ళు; అయనంబు= నివాసస్థానం; అగుటను= అవ్వటంవలన; నన్నున్= నన్ను; జనులు= ప్రజలు; నారాయణుఁడు+అండ్రు= నారాయణుడు అంటారు.

తాత్పర్యం: అర్జునా! నారములు అంటే నీళ్ళు. అయనము అంటే నివాసం. నాకు నారములు అయనం కాబట్టి (నార+అయన - నార మయనం యస్య సః - నారాయణః) నన్ను ప్రజలంతా నారాయణుడు అంటారు.

క. **వసియింతు నే జగములన్। వసియించున్ జగములెల్ల నాయం దిమ్మై**
పొసఁగి వెలుంగుచునుండుట। నసదృశగుణ! వాసుదేవుఁ డనఁగఁ బరఁగుదున్. **422**

ప్రతిపదార్థం: అసదృశగుణ!= సాటిలేని సద్గుణాలు కలవాడా!; ఏన్= నేను; జగములన్= జగత్తులలో; వసియింతున్= నివసిస్తూంటాను; జగములు+ఎల్లన్= జగత్తులన్నీ; నాయందున్= నాలో; ఇమ్ము+ఐ= నెలకొన్నవై (స్థానం కల్పించుకొని, ఇమ్ము= స్థానం); వసియించున్= నివసిస్తూ ఉంటాయి; పొసఁగి= అట్లా పొల్పారి; వెలుంగుచున్+ఉండుటన్= విరాజిల్లుతూండటంచేత; వాసుదేవుఁడు+అనఁగన్= వాసుదేవుడు అనే పేరుతో; పరఁగుదున్= ఒప్పుతాను.

తాత్పర్యం: సద్గుణసంపన్నా! నేను జగత్తులన్నింటా ఉంటాను. అన్ని జగత్తులూ నాలో ఉంటాయి. ఇట్లా ఒప్పెసలారటంవలన నన్ను 'వాసుదేవుడు' అంటారు.

క. **వ్యాపించి రోదసీకుహ। రాపూర్ణత్వమున నునికి నధికక్రమణ**
శ్రీ పొలుపున విష్ణుండను। దీపితనామంబునను బ్రతీతుఁడ నగుదున్. **423**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వ్యాపించి= విస్తరించి; రోదసీకుహర= అంతరిక్షగుహలో (కుహరం= గుహ); ఆపూర్ణత్వమునన్= పూర్తిగా పిక్కటిల్లి; ఉనికిన్= ఉండటంచేత; అధిక= అధికంగా; క్రమణ= ఆక్రమించటమనే; శ్రీ= సంపత్తియొక్క; పొలుపునన్= అందంచేత (జగద్వ్యాపకత); విష్ణుండు= విష్ణుడు (వ్యాపనశీలుడు); అను= అనేటువంటి; దీపిత= ప్రకాశించే; నామంబునను= పేరుతో; ప్రతీతుఁడన్+అగుదున్= ప్రసిద్ధిపొందాను (పొందుతాను).

తాత్పర్యం: రోదసీకుహరంలో నేనే పిక్కటిల్లి ఉంటాను. మిగతా జగత్తు అంతటా ఆక్రమించి ఉన్నవాడినీ నేనే. ఈ రెండు లక్షణాలవలనా నాకు 'విష్ణుడు' అనే పేరు ప్రసిద్ధికెక్కింది.

తే. **దమమునాఁ గల యుత్తమధర్మ మెడఁద । నలవఱిచి నన్నుఁ గామించు నార్యజనము**
దివియు భువియు నా నడుమన తేజరిల్లు । నట్టు లగుట దామోదరుఁ డండ్రు నన్ను. **424**

ప్రతిపదార్థం: దమము+నాన్= దమం అనే పేరుతో (ఇంద్రియ నిగ్రహం); కల= ఉన్న; ఉత్తమ ధర్మము= ఉత్తమగుణం; ఎడఁదన్= హృదయంలో; అలవఱిచి= అభ్యసించి; నన్నున్= నన్ను; ఆర్యజనము= సజ్జనసమూహం; కామించున్= కోరుకొంటుంది; దివియున్= ఊర్ధ్వ లోకమూ; భువియున్= భూలోకమూ; నా+నడుమన్+అ= నా పొట్టలోనే (ఉదరంలోనే); తేజరిల్లున్= ప్రకాశిస్తూంటాయి; అట్టులు+అగుటన్= అలా కావటం వలన; నన్నున్= నన్ను; దామ+ఉదరుఁడు= దామోదరుడు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: దమము అనే ఉత్తమ లక్షణం ఉన్న సజ్జనులు నన్ను ధ్యానిస్తూ ఉంటారు. ఊర్ధ్వలోకమూ, భూలోకమూ నా ఉదరంలోనే ఉంటాయి. ఈ రెండు కారణాలవలనా నాకు దామోదరుడు అనే పేరు ఏర్పడింది.

విశేషం: దీని మూలశ్లోకం ఇట్లా ఉన్నది: **"దమాత్సిద్ధిం పరీప్సంతో మాం జనాః కామయంతి హి । దివం చోర్వీం చ మధ్యం చ తస్మాత్ దామోదరో హ్యహమ్ ॥" (12-328-39). "దామ్ని ఉదరే మనసి కుర్వంతి ధ్యాయంతీతి దామోదరః"** అని వ్యాఖ్యానం.

ఆ. **అన్నమును జలంబు నమృతంబు వేదంబుఁ । బృశ్ని యనఁగ నొప్పుపేరఁ బరఁగు,**
నది మదీయగర్భ మగుట విద్వజ్జను । లనఘ! పృశ్నిగర్భుఁ డండ్రు నన్ను. **425**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా! పార్థా!; అన్నమును= అన్నమూ (తినేది ఏదయినా); జలంబున్= నీరూ; అమృతంబున్= అమృతమూ (సు ధ); వేదంబున్= వేదమూ; పృశ్ని+అనఁగన్= పృశ్ని అని; ఒప్పు= ఒప్పేటటువంటి; పేరన్= పేరుతో; పరఁగున్= అలరారుతూ ఉంటాయి; అది= ఆ పృశ్ని అనేది; మదీయ= నాయొక్క; గర్భము+అగుటన్= గర్భంలో ఉండటంచేత (అదే నా గర్భం కావటంచేత); విద్వత్+జనులు= పండితులు; నన్నున్= నన్ను; పృశ్ని గర్భుఁడు= పృశ్నిగర్భుడు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పార్థా! అన్నమూ, జలమూ అమృతమూ, వేదమూ - వీటికి పృశ్ని అని పేరు. అదే నా గర్భం. అందుచేత పండితులు నన్ను పృశ్నిగర్భుడు (పృశ్ని గర్భంగా కలవాడు) అంటారు.

విశేషం: **"పృశ్ని రిత్యుచ్యతే చాన్నం వేదా ఆపోఽమృతం తథా। మమైతాని సదా గర్భే పృశ్నిగర్భస్తతో హ్యహమ్ ॥"** అని దీని మూలశ్లోకం.

క. **ఇనరశ్ములుఁ జంద్రాంశులు । ననలశిఖలు గేశ సంచయము నాకుం గా**
వునఁ గేశవాభిధానం । బునఁ గొనియాడుదురు ననుఁ బ్రబుద్ధజనంబుల్. **426**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇనరశ్మలున్= సూర్యకాంతులూ; చంద్ర+అంశులు= చంద్రకాంతులూ; అనల+శిఖలు= అగ్నిజ్వాలలూ (శిఖ= చివరిభాగం); నాకున్= నాకు; కేశసంచయము= కేశసమూహం; కావునన్= కాబట్టి; ననున్= నన్ను; ప్రబుద్ధజనంబుల్= జ్ఞానులైన ప్రజలు (మహర్షులు); కేశవ+అభిధానంబునన్ (అభిధానమునన్)= కేశవ అనే పేరుతో; కొనియాడుదురు= స్తుతిస్తూ ఉంటారు.

తాత్పర్యం: సూర్యకిరణాలూ, చంద్రకిరణాలూ, అగ్నిజ్వాలలూ నాకు కేశసమూహం. అందుచేత జ్ఞానులైన పెద్దలు నన్ను కేశవనామంతో స్తుతిస్తూ ఉంటారు.

క. క్షత్రము బ్రహ్మము నై లో । కత్రాణన మాచరింపఁ గావలసి పృథా
పుత్రా! యగ్నీషోములు । చిత్రస్థితి వెలుఁగుదురు ప్రసిద్ధాకృతులన్. 427

ప్రతిపదార్థం: పృథా+పుత్రా= పృథాదేవి కుమారుడా! పార్థా!; క్షత్రము= క్షత్రియత్వమూ; బ్రహ్మమున్= బ్రహ్మత్వమూ; ఐ= పొంది; లోక+త్రాణనమున్= లోకాలను రక్షించటం; ఆచరింపన్+కావలసి= చేయవలసి వచ్చి; అగ్నీషోములు= అగ్ని,చంద్రుడూ; చిత్రస్థితిన్= విచిత్రమైన స్థితితో; ప్రసిద్ధ+ఆకృతులన్= ప్రసిద్ధమైన రూపాలతో వెలుఁగుదురు= ప్రకాశిస్తూ ఉంటారు.

తాత్పర్యం: పార్థా! లోకరక్షణకొరకు క్షత్రియత్వమూ, బ్రాహ్మణత్వమూ స్వీకరించి అగ్ని, చంద్రుడు విచిత్రస్థితితో ప్రసిద్ధమైన ఆకారాలతో ప్రకాశిస్తూ ఉంటారు.

వ. అని చెప్పి బ్రహ్మక్షత్రపదంబులు విప్రరాజ నిర్దేశంబు లగుట దేటపడం బలికి విప్రుల రాజుల మహానుభావంబులు విలసిల్లినయెడలు నిదర్శనంబులుగా నిరూపించి యుపన్యసించి యవియెల్ల నగ్నీషోమమాహాత్మ్యంబు గావు టెఱింగించి. 428

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; బ్రహ్మక్షత్రపదంబులు= బ్రహ్మ అనే పదమూ, క్షత్ర అనే పదమూ; విప్ర -రాజ - నిర్దేశంబులు= విప్రుడికీ, రాజుకీ నిర్దేశకాలు (వాచకాలు); అగుట= అవ్వటం; తేటపడన్= స్పష్టపడేట్టు; పలికి= వివరించి; విప్రుల= బ్రాహ్మణుల యొక్క; రాజుల= రాజులయొక్క; మహానుభావంబులు= మాహాత్మ్యాలు; విలసిల్లిన ఎడలు= విరాజిల్లిన తావులు; నిదర్శనంబులుగాన్= సాక్ష్యాలుగా; నిరూపించి= చూపించి; ఉపన్యసించి= ప్రసంగించి; అవి ఎల్లన్= అవి అన్నీ; అగ్నీషోమ మాహాత్మ్యంబు= అగ్నీషోమ మాహాత్మ్యము; కావుట= కావటం; ఎఱింగించి= తెలియజెప్పి -

తాత్పర్యం: అని బ్రహ్మ, క్షత్రపదాలు వరుసగా విప్రుడికీ, రాజుకీ నిర్దేశకాలు కావటం వివరించి, బ్రాహ్మణులయొక్క, రాజులయొక్క మాహాత్మ్యాలు విరాజిల్లిన తావులు సాక్ష్యాలుగా చూపి, అవి అన్నీ అగ్నీ షోమ మాహాత్మ్యము కావటం తెలియజెప్పి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. బోధనస్థాపనంబులు బుధవరేణ్య! । యగ్నియును సోముఁడును జేసి యఖిలజగము
నఖిలహర్షంబుఁ బొందింతు రవ్యయప్ర । వర్తనత్వంబు దమయందు వఱలుచుండ. 429

ప్రతిపదార్థం: బుధవరేణ్య!= ఓ పండితాగ్రణీ! విజయా!; బోధన= మేలుకొల్పటం (వికాసం); స్థాపనంబు= స్థిరపరచటం లేదా వృద్ధిపొందించటం అనే పనులను; అగ్నియును= అగ్నిదేవుడూ (ఇతడే సూర్యుడు); సోముఁడును= చంద్రుడూ; చేసి= నిర్వర్తించి; అవ్యయ= వ్యయంకాని; ప్రవర్తనత్వంబు= చైతన్యం (జగత్తును ప్రవర్తింపజేసే అవ్యయ శక్తి - సూర్యచంద్రులు); తమయందున్= తమలో; వఱలుచున్+ఉండన్= ఒప్పి ఉండటంచేత; అఖిలజగమున్= సకల ప్రపంచాన్నీ; అఖిలహర్షంబున్= అంతులేని ఆనందం (ఖిలము కానిది అఖిలం= వినాశం లేనిది); పొందింతురు= పొందేటట్లు చేస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మేలుకొల్పటం, వృద్ధిపొందించటం అనే పనులు వరుసగా అగ్నిదేవుడూ, చంద్రుడూ చేస్తారు. ప్రపంచానికి అవ్యయమైన చైతన్యాన్ని వీరు ప్రసాదించి ఆనందింపజేస్తుంటారు.

విశేషం: దీనికి మూలమైన శ్లోకాలు ఇట్లా ఉన్నాయి. **"సూర్యాచంద్రమసౌ శశ్వత్ కేశైర్మే ఽంశుసంజ్ఞితైః। బోధయం స్తాపయంశ్చైవ జగదుత్తిష్ఠతః పృథక్ ॥ బోధనాత్తాపనాచ్చైవ జగతో హర్షణం భవేత్। అగ్నీషోమకృతైరేభిః కర్మభిః పాండునందన ॥" (12330 - 1,2).** వీటిలో 'స్థాపనాత్' అనేది పాఠాంతరంగా కనపడుతున్నది. దానినే తిక్కన స్వీకరించాడు. తాపనం అంటే వేడితో తపింపజేయటం. అది చంద్రుడి పనిగా మూలశ్లోకం చెప్పుతున్నది. ప్రకృతివిరుద్ధం. కాబట్టి స్థాపనాత్ అనేదే సాధుపాఠంగా భావించాలి. చంద్రుడు ఓషధీకారకుడూ, వృద్ధికారకుడూను. సూర్యాచంద్రమసౌ అని మొదటి శ్లోకంలోనూ, అగ్నీషోమౌ అని రెండవశ్లోకంలోనూ ఉన్నది. సూర్యాగ్నులకు అభేదం. సూర్యుడు అస్తమిస్తూ తన తేజస్సును అగ్నిలో నిక్షేపిస్తాడని వేదోక్తి. 'దినాంతే నిహితం తేజః సవిత్రేవ హుతాశనః' అని కాళిదాససూక్తి. (రఘు - 4-1).

క. అనఘా! యగ్నీషోముల। ననుఁగా భావింప జగమునకు నెపుడు హితం
బొనరింతుఁ దత్సుకృతములఁ। బొనరిన మద్భవ్యనామముల వివరింతున్. 430

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; అగ్నీషోములన్= ఈ సూర్యచంద్రులను; ననున్+కాన్= నన్నుగా; భావింపన్= తెలిసికొంటే; జగమునకున్= ప్రపంచానికి; ఎపుడున్= ఎల్లవేళలా; హితంబు+ఒనరింతున్= మేలు చేకూరుస్తాను; తద్= అలా చేసిన; సుకృతములన్= మంచిపనులవలన; ఒనరిన= నాకు దక్కిన; భవ్యనామములన్= పవిత్రమైన నామధేయాలను; వివరింతున్= వివరిస్తాను - విను.

తాత్పర్యం: అర్జునా! అగ్నీషోములను నన్నుగా భావించుము. సూర్యచంద్ర రూపాలలో నేను ఎల్లవేళలా ప్రపంచానికి మేలు చేకూరుస్తూ ఉంటాను. అలా మేలు చేసినందువలన నాకు కొన్ని భవ్యనామధేయాలు ఏర్పడ్డాయి. వాటిని వివరిస్తాను. ఆలకించుము.

ఆ. పరమ వరద, లోకభావనేశ్వర హృషీ। కేశనామకము లహీనచిత్త!
యనియు మఱియు నిట్టు లను యాగముల భాగ। మాహరింతుఁ గాన హరియునంద్రు. 431

ప్రతిపదార్థం: అహీనచిత్త!= ఓ ఉత్తమచిత్తం కలవాడా!; పరమవరద= వరాలను ఇచ్చే (వరద) పరముడు; లోకభావన= లోకభావనుడు; ఈశ్వర= ఈశ్వరుడు; హృషీకేశ= హృషీకేశుడు అనే; నామకములు= ప్రసిద్ధనామధేయాలు (ఏర్పడ్డాయి); అనియున్= అని చెప్పి; మఱియున్= ఇంకా; ఇట్టులు= ఇట్లా; అనున్= అంటున్నాడు శ్రీకృష్ణుడు; యాగములన్= యజ్ఞాలలో; భాగము= పాలు; ఆహరింతున్= రాబట్టుకుంటాను; కానన్= కాబట్టి; హరియున్= నన్ను హరి అనికూడా; అంద్రు= అంటారు.

తాత్పర్యం: ఓ అహీనచిత్తా! వరదుడు, లోకభావనుడు, ఈశ్వరుడు, హృషీకేశుడు అనే ప్రసిద్ధనామధేయాలు నాకు ఏర్పడ్డాయి' అని చెప్పి శ్రీకృష్ణుడు ఇంకా ఇట్లా అంటున్నాడు: 'అర్జునా! యాగాలలో భాగాలు ఆహరిస్తాను కాబట్టి నన్ను హరి అని కూడా అంటారయ్యా!

విశేషం: జగత్తును హర్షింప చేస్తారు కనుక సూర్యచంద్రులు - హృషీ (ద్వివచనం). వారి కిరణాలే కేశాలుగా కలవాడు హృషీకేశుడు. సంస్కృతవ్యాఖ్యానం ఇట్లా ఉన్నది: **"జగద్దర్షయతో యస్మాత్తస్మాత్తౌ హృషీ - అగ్నీషోమౌ కేశౌ అంశూ యస్య స హృషీకేశః. హృషీరితి ఈకారాంతం పదం వా తదా హృష్యా కేశౌ యస్యేతి సమాసః."**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. గో వన మహి యది గుహలోనఁ బడకుండ । జెంది యెత్తుటను గోవిందుఁడనియు
వీతంపు రోమంబుచేత నొప్పార నా । విష్టుం డగుట శిపివిష్టుఁడనియుఁ,
గర్షణక్రియ భూమిఁ గావింతుఁ, జాయయుఁ । గృష్ణంబు గావునఁ గృష్ణుఁడనియు,
నలవడ సదసద్ద్వయంబును నాయందు । సమవేతమై యున్కి సత్యుఁడనియుఁ,

తే. దాత్త్వికంబైన నాకు జాతత్వవికృతి । లేమి నజుఁడనియును, నది లేకపోయి
నపుడు తదనంతరక్షయ మంద కునికి । బుధు లధోక్షజుఁడనియుఁ జెప్పుదురు నన్ను. 432

ప్రతిపదార్థం: గోవు+అనన్= గోవు అంటే; మహి= భూమి; అది= ఆ భూమి; గుహలోనన్= (యుగాంతంలో ఏర్పడిన) గుహలో; పడకుండన్= పడిపోకుండా; చెంది= (వరాహరూపంలో) సమీపించి; ఎత్తుటన్= (భూగోళాన్ని జలప్రళయంనుంచి) ఉద్ధరించాను కనుక; గోవిందుఁడు+అనియున్= గోవిందుడు అనీ; వీతంపు+రోమంబుచేతన్= తొలగిపోయిన రోమాలతో (రోమాలు తొలగిపోవటంతో); ఒప్పారన్= అందంగా; ఆవిష్టుఁడన్= కూడుకొన్నవాడిని; అగుటన్= కావటంచేత (నిరోమత్వం వలన); శిపివిష్టుఁడు; అనియున్= అనీ; కర్షణక్రియన్= దున్నటం అనే పనిని; భూమిన్= ఈ భూమిమీద; కావింతున్= చేస్తాను; చాయయున్= నా శరీరం రంగుకూడా; కృష్ణంబు= నలుపు; కావునన్= అందుచేత (ఈ రెండు కారణాలతోనూ); కృష్ణుఁడు+అనియున్= నన్ను కృష్ణుడు అనీ; అలవడన్= కుదురుగా; సత్+అసత్+ద్వయంబునున్= సత్తూ, అసత్తూ (చిత్తు) అనే జంట; నాయందున్= నాలో; సమవేతమై+ఉన్కిన్= కూడి ఉండటం వలన (చేరి ఉండటంతో); సత్యుఁడు+అనియున్= సత్యుడు అనీ; తాత్త్వికంబు+ఐన= తత్త్వసిద్ధమైన; నాకున్= నాకు; జాతత్వ= పుట్టుక అనే; వికృతి= వికారం; లేమిన్= లేకపోవటంచేత; అజుఁడు+అనియునున్= అజుడు అనీ; అది= ఆ పుట్టుక అనేది; లేకపోయినపుడు= లేకపోయాక; తద్+అనంతర= దానికి తరువాతిదైన; క్షయమున్= మరణం అనేదాన్ని; అందక+ఉనికిన్= పొందకపోవటంచేత; బుధులు= పండితులూ, దేవతలూ; అధోక్షజుఁడు+అనియున్; నన్నున్= నన్ను; చెప్పుదురు= వివరిస్తారు, కీర్తిస్తారు.

తాత్పర్యం: గోవు అంటే భూమి. దానిని కాపాడాడు కనుక గోవిందుడు. రోమరహితంగా ఒప్పారటం వలన శిపివిష్టుడు. భూమిని దున్నటంవలనా, నల్లగా ఉండటంవలనా కృష్ణుడు. సత్తూ, అసత్తూ ఆయనలోనే ఉండటం వలన సత్యుడు. పుట్టుక అనేది లేదు కాబట్టి అజుడు. క్షయము అనేదీ లేదు కాబట్టి అధోక్షజుడు. అర్జునా! ఇట్లా ఈ పేర్లు నాకు ఏర్పడ్డాయి.

విశేషం: సంస్కృతమూలంలో ఈ పేర్లను రెండు గణాలుగా విభజించాడు వ్యాసుడు. గుణాలను బట్టి ఏర్పడినవి కొన్నీ, చేసిన పనులనుబట్టి వచ్చినవి కొన్నీ. **"గౌణాని తత్ర నామాని కర్మజాని చ కానిచిత్ । నిరుక్తం కర్మజానాం శృణుష్వ ప్రయతోఽనఘ॥" (12-328-10).** నారాయణాదులు గౌణనామాలు. హృషీకేశ గోవిందాదులు కర్మజనామాలు. ఈ రెండింటినీ వేర్పరచటంకొరకూ, మూలంలో విస్తృతంగా ఉన్న అగ్నీషోమమాహాత్మ్యాన్ని రెండు పంక్తులలోనికి సంగ్రహించటం కొరకూ నాలుగువందల ఇరవై ఎనిమిదవ వచనం అవతరించింది.

క. సత్త్వముననుండి తొలఁగమి । సత్త్వము నాచేతఁ జేసి సత్తఁ బొరయుటన్
సత్త్వమయజన్ముఁ డగుటను । సాత్త్వతుఁ డను నామ మయ్యె జనవర! నాకున్. 433

ప్రతిపదార్థం: జనవర!= నరవరా!; సత్త్వముననుండి= సత్త్వగుణంనుంచి; తొలఁగమిన్= తప్పుకోకపోవటంచేతా (సత్త్వగుణాన్ని ఎప్పుడూ విడవకుండా ఉండటంచేత); సత్త్వము= ఆ సత్త్వగుణం అనేది; నా= నాయొక్క; చేతన్+చేసి= పనితో (చేతలు); సత్తన్= అస్తిత్వాన్ని; పొరయుటన్= పొందటంచేతా; సత్త్వమయ= సత్త్వరూపమైన; జన్ముఁడు= జన్మ కలవాడు; అగుటన్= కావటంచేతా; నాకున్= నాకు; సాత్త్వతుఁడు+అను= సాత్త్వతుడు అనే; నామము= పేరు; అయ్యెన్= ఏర్పడింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నేను ఏనాడూ సత్త్వగుణాన్ని వదలిపెట్టను. నా పనులవలననే సత్త్వగుణానికి ఉనికి ఏర్పడుతున్నది. నా జన్మ సత్త్వమయం. కాబట్టి నన్ను సాత్త్వతుడు అంటారు.

తే. చ్యుతము లేకున్కిఁ జేసి యచ్యుతుఁడ వాత । ముఖ్య ధాతుత్రయాకారమున శరీర
ధారకుండనై యున్కిఁ ద్రిధాతువును న । నంగఁ బరఁగుదు మునివచనంబులందు. 434

ప్రతిపదార్థం: చ్యుతము= జారుపాటు (వినాశం); లేక+ఉన్కిన్+చేసి= లేకపోవటం చేత; అచ్యుతుఁడన్= నేను అచ్యుతుడిని; వాతముఖ్య= వాయువు మొదలైన (వాత - పిత్త - శ్లేష్మాలు); ధాతుత్రయ= మూడు ధాతువుల; ఆకారమునన్= రూపంతో; శరీర= ప్రాణులదేహాలకు; ధారకుండను= పోషకుడను (ఆధారం); ఐ+ఉన్కిన్= అయి ఉండటం చేత; త్రిధాతువును= త్రిధాతువు; అనంగన్= అని; మునివచనంబులందున్= ఋషివాక్కులలో; పరఁగుదున్= అలరారుతాను.

తాత్పర్యం: చ్యుతము అనేది నాకు లేదు. కాబట్టి నేను అచ్యుతుడను. వాతపిత్తశ్లేష్మాల రూపంలో నేనే జీవుల శరీరాలకు ధారకం. కాబట్టి నన్ను ఋషులు త్రిధాతువు అంటారు.

క. ఘృత మర్చిస్సంపద యయి । ఘృతార్చి రభిధాన మొందెఁ గ్రీడి! వృషము వి
శ్రుత ధర్మము - ధర్మమయ । స్థితి కతమున వృషుఁడనం బ్రసిద్ధి వహింతున్. 435

ప్రతిపదార్థం: క్రీడి!= ఓ అర్జునా!; అర్చిః+సంపద= నా తేజస్సంపత్తిచే ఘృతము+అయి= నేయి ఏర్పడటం కారణంగా; ఘృతార్చిః+అభిధానము= ఘృతార్చి అనే పేరు; ఒందెన్= నాకు ఏర్పడింది; విశ్రుత= ప్రసిద్ధికెక్కిన; ధర్మము= ధర్మమే; వృషము= వృషము అనబడుతోంది; ధర్మమయ= ధర్మస్వరూపమైన; స్థితి+కతమునన్= నా స్థితివలన; వృషుఁడు+అనన్= వృషుడు అని; ప్రసిద్ధిన్+వహింతున్= ప్రసిద్ధి పొందాను.

తాత్పర్యం: కిరీటీ! నా తేజస్సంపద వలననే ఆయా జంతువులలో ప్రాణధారకమైన ఘృతం ఏర్పడుతున్నది. కాబట్టి నన్ను ఘృతార్చి అంటారు. "ఘృతం మమార్చిషో లోకే జంతూనాం ప్రాణధారణం। ఘృతార్చి రహమవ్యగ్రైః వేదజ్ఞైః పరికీర్తితః ॥" ధర్మానికే వృషము అని పేరు. నేను ధర్మమయుడను. కాబట్టి నాకు వృషుడు అని ప్రసిద్ధి ఏర్పడింది.

తే. ఆదిమధ్యాంతములు నాకు నరయ లేమి । నై యనాది యమధ్యుఁ డనంతుఁ డనఁగఁ
జెల్లు పేళ్ళులు, శుచులు నా చెవుల కింపు । లగుట మునులు శుచిశ్రవుఁ డంద్రు నన్ను. 436

ప్రతిపదార్థం: నాకున్= నాకు; ఆది= మొదలూ; మధ్య= నడుమా; అంతములు= అంతమూ అనేవి; అరయన్ లేమిన్+ఐ= ఎవరూ తెలిసికొనలేరు కనక; అనాది= అనాది; అమధ్యుఁడు= అమధ్యుడు; అనంతుఁడు= అనంతుడు; అనఁగన్= అని; పేళ్ళులు= పేర్లు; చెల్లున్= చెల్లుతున్నాయి; నా+చెవులకున్= నా చెవులకు; శుచులు= శుచి అయిన మాటలు; ఇంపులు+అగుటన్= ఇంపు కూర్చేవి అవుతాయి కనక; మునులు= ఋషులు; నన్నున్= నన్ను; శుచిశ్రవుఁడు= శుచిశ్రవుడు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: అర్జునా! నాకు మొదలూ నడుమా అంతమూ అనేవి లేవు. ఎవరూ వీటిని తెలిసికొనలేరు. అందుకని అనాది, అమధ్యుడు, అనంతుడు అనే పేర్లు ఏర్పడ్డాయి. శుచి అయిన పలుకులే నా చెవులకు హితవుగా ఉంటాయి. వాటినే వింటాను. అందుచేత నన్ను శుచిశ్రవుడు (శుచిశ్రవసుడు) అంటారు మహర్షులు.

ఆ. ఒక్క శృంగమునన యుర్వి యెత్తితి వరా । హావతారలీల యతిశయిల్ల
నట్టు లగుటఁ జేసి యార్యజనప్రియ । నాకు నేక శృంగనామ మయ్యె. 437

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆర్యజనప్రియ!= సజ్జనులకు ప్రియమైనవాడా!; ఒక్క శృంగమునన్+అ= ఒకే ఒక్క కోరతోనే; ఉర్వి= భూమిని; వరాహ+అవతార+లీల= వరాహావతారం తాలూకు విలాసం; అతిశయిల్లన్= అతిశయించేట్టు; ఎత్తితిన్= ఉద్ధరించాను; అట్టులు+అగుటన్+చేసి= అట్లా కావటం వలన; నాకున్= నాకు; ఏకశృంగనామము= ఏకశృంగుడు అనే పేరు; అయ్యెన్= ఏర్పడింది.

తాత్పర్యం: ఆర్యజనప్రియా! వరాహావతారంలో ఒకే కోరతో మొత్తం భూగోళాన్ని ఎత్తి రక్షించాను. అప్పటినుండీ నాకు ఏకశృంగుడు అనే పేరు వచ్చింది.

క. వినుత మగు లోకరేచన । మున నన్ను విరించుఁ డండ్రు బుధనుత! రవియం
దనుపాధిక విద్యాస్థితి । నునికిం గపిలాభిధాన ముల్లసిత మగున్. 438

ప్రతిపదార్థం: బుధనుత!= పండితులచే స్తుతింపబడేవాడా!; వినుతము+అగు= ప్రసిద్ధి కెక్కిన; లోకరేచనమునన్= ప్రపంచకోత్తేజనంవలన (లోకాన్ని చైతన్యవంతం చేయటంవలన); నన్నున్= నన్ను; విరించుఁడు+అండ్రు= విరించుడు అంటారు; అనుపాధిక= శరీరంలేని; విద్యాస్థితిన్= విద్యారూపంతో; రవియందున్= సూర్యుడిలో; ఉనికిన్= ఉండటంచేత; కపిల+అభిధానము= కపిలుడు అనే పేరు; ఉల్లసితము+అగున్= నాకు ప్రకాశిస్తోంది.

తాత్పర్యం: పండితస్తవనీయా! లోకాన్ని చైతన్యవంతం చేస్తాను కాబట్టి (రేచనం) నన్ను విరించుడు అంటారు. నిరుపాధికమైన జ్ఞానరూపంతో సూర్యుడిలో ఉంటాను కాబట్టి కపిలుడు అంటారు నన్ను.

క. విను యోగంబు హిరణ్యం । బనఁ బరఁగును యోగగర్భుఁడగుటను విద్వ
జ్జనములు హిరణ్యగర్భుం । డని ననుఁ గొనియాడుదురు మహాగుణశాలీ! 439

ప్రతిపదార్థం: మహాగుణశాలీ!= గొప్ప గుణవంతుడా!; విను= వింటున్నావా? వినుము; యోగంబు= యోగమే; హిరణ్యంబు+అనన్= హిరణ్యము అని; పరఁగున్= ఒప్పుతోంది; యోగగర్భుఁడు+అగుటను= నేను యోగగర్భుడను కనుక; విద్వత్+జనములు= పండితులు; హిరణ్యగర్భుండు+అని= హిరణ్యగర్భుడు అని; ననున్= నన్ను; కొనియాడుదురు= స్తుతిస్తారు.

తాత్పర్యం: సద్గుణసంపన్నా! యోగాన్నే హిరణ్యం అంటారు. నేను యోగగర్భుడను. అందుచేత నన్ను హిరణ్యగర్భుడు అని కూడా అంటారు.

తే. నరుఁడు నారాయణుండు ననంగ లోక । రక్షణార్థంబు గాఁగ ధర్మమున కేను
బుట్టినాఁడఁ గావున బాండుభూపతనయ! । నాకు ధర్మజుఁ డనియెడు నామమయ్యె. 440

ప్రతిపదార్థం: పాండుభూపతనయ!= పాండురాజుగారి కుమారుడా!; నరుఁడున్+నారాయణుండున్+అనంగన్= నరనారాయణులు అనే పేరుతో; లోకరక్షణార్థంబు+కాఁగన్= లోకాలను రక్షించటం కోసం కాగా; ధర్మమునకున్= ధర్మరక్షణార్థం; ఏను= నేను; పుట్టినాఁడన్= జన్మించాను; కావునన్= కాబట్టి; నాకున్= నాకు; ధర్మజుఁడు+అనియెడు= ధర్మజుడు అనే; నామము+అయ్యెన్= పేరు ఏర్పడింది.

తాత్పర్యం: అర్జునా! నరుడూ నారాయణుడూ అనే అవతారాలు లోకరక్షణార్థం కాగా ధర్మరక్షణార్థం నేను జన్మించాను కాబట్టి నన్ను ధర్మజుడు అంటారు.

వ. ఇట్లు వుట్టి గంధమాదనంబున నేను దపంబు సేయుచుండ నక్కాలంబునఁ గాలాంతకుండు దక్షునియజ్ఞంబున కలిగిన నది భీతిం బఱతెంచి నా యురఃస్థలంబు నొందిన మదీయ కేశంబులు ముంజనిభంబులగుటం జేసి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముంజకేశుండనుపేరు గలిగె నా రుద్రుండు రౌద్రాకారంబున నయ్యజ్ఞంబు వెనుకొని నాపయిం గవిసిన నొక్క యిషీక పరశురూపంబుగా నభిమంత్రించి యతనిపయిం బ్రయోగించిన నతండు దాని ఖండితధారంబు సేయుటంజేసి ఖండపరశు వను నభిధానంబునుం గలిగె ననుటయు. 441

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; పుట్టి= జన్మించి; గంధమాదనంబునన్= గంధమాదన పర్వతంమీద; నేను; తపంబు= తపస్సు; చేయుచుండన్= చేస్తూండగా; ఆ+కాలంబునన్= ఆ సమయంలో (ఆ రోజుల్లోనే); కాలాంతకుండు= కాలాంతకుడైన శివుడు (యముడిని జయించినవాడు); దక్షుని= దక్షప్రజాపతిచేసే; యజ్ఞంబునకున్= యజ్ఞానికి; అలిగినన్= కోపించగా (యజ్ఞంమీద కోపించితే); అది= ఆ యజ్ఞం; భీతిన్= భయంతో; పఱతెంచి= పారిపోయి వచ్చి; నా+ఉరః స్థలంబున్= నా వక్షఃస్థలాన్ని; ఒందినన్= శరణుజొచ్చితే; మదీయ= నాయొక్క; కేశంబులు= (గుండెపై) వెంట్రుకలు; ముంజనిభంబులు= ముంజగడ్డిలాగా; (గోధుమరంగు); అగుటన్+చేసి= కావటం చేత; ముంజకేశుండు= ముంజకేశుడు; అను పేరు= అనే పేరు; కలిగెన్= ఏర్పడింది; ఆ+రుద్రుండు= ఆ శివుడు; రౌద్ర+ఆకారంబునన్= భయంకరమైన ఆకారంతో; ఆ+యజ్ఞంబున్= ఆ యజ్ఞాన్ని; వెనుకొని= వెన్నంటి (తరుముకు వస్తూ); నాపయిన్= నామీదకు; కవిసినన్= కలియబడితే; ఒక్క= ఒకే ఒక్క; ఇషీక= బాణం; పరశురూపంబుగాన్= గొడ్డలి రూపం ధరించేట్టు; అభిమంత్రించి= మంత్రం పెట్టి; అతనిపయిన్= ఆ శివుడిమీద; ప్రయోగించినన్= ప్రయోగిస్తే; అతండు= శివుడు; దానిన్= ఆ పరశువును; ఖండిత= ఖండింపబడ్డ; ధారంబు= అంచుకలదిగా (అంచు ఖండింపగా); చేయుటన్+చేసి= చేయటంచేత; ఖండపరశువు= ఖండపరశువు; అను= అనేటటువంటి; అభిధానంబు= పేరు; కలిగెన్= నాకు సిద్ధించింది; అనుటయున్= అని శ్రీకృష్ణుడు చెప్పగా.

తాత్పర్యం: ఈ విధంగా పుట్టి నేను గంధమాదన పర్వతంమీద తపస్సు చేస్తున్నప్పుడు దక్షప్రజాపతి యాగం చేస్తున్నాడు. ఆ యాగానికి శివుడు కోపించాడు. అప్పుడు ఆ యజ్ఞం భయంతో హడలిపోయి నా వక్షఃస్థలాన్ని ఆశ్రయించింది. ఆ కారణంవలన అక్కడి నా రోమాలు ముంజగడ్డివలె మారాయి. అందువలన నాకు ముంజకేశుడనే పేరు వచ్చింది. రుద్రుడు ఆ యజ్ఞాన్ని తరుముకొని వచ్చి నన్ను తాకగా నేనొక బాణాన్ని పరశురూపంలో ప్రయోగించగా శివుడు దాని అంచును ఖండించాడు. అందువలన నాకు 'ఖండపరశువు' అనే పేరు వచ్చింది.

క. 'విని పార్థుఁ డిట్లు గలిగిన । యనియం దా రుద్రునొకొ జయము నీకో క
ల్గెను? దాని తెఱంగేర్పడ । వినఁ గౌతుక మొలసెఁ జెప్పవే విశ్వాత్మా!' 442

ప్రతిపదార్థం: విని= ఆలకించి; పార్థుఁడు= అర్జునుడు; ఇట్లు= ఇట్లా; కలిగిన= ఏర్పడ్డ; అనియందున్= యుద్ధంలో; జయము= జయమనేది; ఆ రుద్రునకొ= ఆ శివునికో; నీకో= నీకో; కల్గెను?= కలిగింది?; దాని తెఱంగు= ఆ యుద్ధం పద్ధతిని; ఏర్పడన్+వినన్= స్పష్టంగా వినాలని; కౌతుకము= ఉత్సాహం; ఒలసెన్= కలుగుతోంది (కలిగింది); విశ్వాత్మ= విశ్వరూపా!; చెప్పవే?= చెప్పవా?

తాత్పర్యం: అర్జునుడు అంతా విని ఇట్లా అన్నాడు: 'ఓ విశ్వరూపా! ఆ యుద్ధంలో నీవు గెలిచావా? శంకరుడు గెలిచాడా? ఆ కథ అంతా వినాలనే కుతూహలం కలిగింది దయచేసి వివరంగా చెప్పవా?'

వ. అనిన విష్ణుం డర్జునున కిట్లనియె. 443

ప్రతిపదార్థం: అనినన్= అని అడిగేసరికి; విష్ణుండు= శ్రీకృష్ణుడు; అర్జునునకున్= పార్థుడికి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు:

తాత్పర్యం: అని అడుగగా శ్రీకృష్ణుడు పార్థుడితో ఇట్లా అన్నాడు:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శివకేశవుల పరస్పరకోపప్రసాదముల విధము (సం. 12-309-2)

సీ. **రుద్ర నారాయణరూప ప్రవర్తిత । మూర్తి ద్వయము రణమునకుఁ జొచ్చి**
పరమసంరంభంబు పాటింప, నుద్వేజి । తములయ్యె నఖిలభూతములు, శ్రుతులు
మునులకుఁ దోఁపవ, యనలంబు లాహుతుల్ । గొనవయ్యెఁ, బగిలె దిక్కులు నభంబు
ధరణి వడంకె, భూధరములు దిర్దిరం । దిరిగె, దేవతలకు దిగులు సొచ్చె

తే. **నాననము పల్లటిల్లంగ నజుఁడు గలఁగె, । నిట్టు లెందును సంక్షోభ మెసకమెసఁగ,**
నా విధాత - మునీంద్రులు దేవతలును । దన్ను వేష్టింప వచ్చె సత్వరముగాఁగ. 444

ప్రతిపదార్థం: రుద్ర (రూప)= రుద్రరూపంతోనూ; నారాయణ రూప= నారాయణ రూపంతోనూ; ప్రవర్తిత+ప్రవృత్తిని పొందిన; మూర్తిద్వయము= మూర్తుల జంట; రణమునకున్= యుద్ధానికి; చొచ్చి= దిగి (పూనుకొని); పరమ సంరంభంబు= గొప్ప హడావుడి; పాటింపన్= చేసేసరికి; అఖిలభూతములున్= పంచభూతాలూ (సకలప్రాణులూ); ఉద్వేజితములు+అయ్యెన్= ఏమి జరుగుతుందో అనే ఉద్వేగం పొందాయి; మునులకున్= మహర్షులకు; శ్రుతులు= వేదమంత్రాలు; తోఁపవు+అ= స్ఫురించటమే లేదు (మంత్రాలు దర్శనం ఇవ్వటమే లేదు); అనలంబులు= హోమాగ్నులు; ఆహుతుల్= ఆహుతులను (ఆజ్యంతో అగ్నిలో వేల్చే వస్తువుల్నీ - వేల్చటాన్నీ ఆహుతులు - ఆహుతి అంటారు); కొనవు+అయ్యెన్= స్వీకరించటం లేదు (హోమాగ్నిలో ఏదీ ఆహుతి కావటం లేదు అని); దిక్కులున్= దశదిశలూ; నభంబున్= ఆకాశమూ; పగిలెన్= బ్రద్దలయ్యాయి; ధరణి= భూమి; వడంకెన్= కంపించింది; భూధరములు= పర్వతాలు; దిర్దిరన్+తిరిగెన్= గిరగిరా తిరిగాయి; దేవతలకు= అమరులకు; దిగులు= దిగులు(కుందు); చొచ్చెన్= ప్రవేశించింది(మొదలయ్యింది); ఆననము= ముఖం; పల్లటిల్లంగన్= వాడిపోగా; అజుఁడు= బ్రహ్మదేవుడు; కలఁగెన్= కలతచెందాడు; ఇట్టులు= ఇలా; ఎందునున్= అంతటా; సంక్షోభము= అల్లకల్లోలం; ఎసకము+ఎసఁగన్= వ్యాపించగా; ఆ విధాత= ఆ బ్రహ్మదేవుడు; మునీంద్రులున్= మహర్షులూ; దేవతలునున్= అమరులూ; తన్నున్= తనను; వేష్టింపన్= చుట్టూ చేరిరాగా; సత్వరము+కాఁగన్= సత్వరంగా (వేగంగా); వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: అర్జునా! రుద్రుడూ, నారాయణుడూ యుద్ధానికి దిగారు. భయంకరమైన సంక్షోభం ఏర్పడింది. సకలప్రాణులూ ఉద్వేగం పొందాయి. (ఊపిరి బిగ్గబట్టుకొన్నాయి). మహర్షులకు వేదమంత్రాలు స్ఫురించటం లేదు. హోమాగ్నికుండాలలో వేల్చిన ఆహుతులు ఆహుతి కావటం లేదు. దశదిశలూ ఆకాశమూ బీటలు వారుతున్నాయి. భూమి, పర్వతాలు బొంగరాలవలె తిరుగుతున్నాయి. దేవతలకు ఎక్కడ లేని దిగులూ పట్టుకుంది. దేవతలతో, మునీంద్రులతో కలిసి బ్రహ్మదేవుడు యుద్ధభూమికి వచ్చాడు.

వ. **వచ్చి రుద్రునకుం బ్రణమిల్లి సంప్రార్థనంబు దోఁప నిట్లనియె:** 445

ప్రతిపదార్థం: వచ్చి= అలా వచ్చి; రుద్రునకున్= శివుడికి; ప్రణమిల్లి= నమస్కరించి; సంప్రార్థనంబు= అభ్యర్థన; తోఁపన్= స్ఫురించేట్టు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: అట్లా వచ్చి శివుడికి నమస్కరించి, ఈ విధంగా శివుడిని అభ్యర్థించాడు.

క. **' శివుఁడవు నీవు జగములకు । శివ మొనరింపంగ వలదె? చేయుము క్రోధ**
ప్రవిహతి, విష్ణుండనఁగా । శివుఁడన నొకఁడౌట దివ్యచిత్తమ యెఱుఁగున్. 446

ప్రతిపదార్థం: నీవు శివుఁడవు; జగములకున్= ప్రపంచాలకు; శివము= శుభం; ఒనరింపంగన్+వలదె?= చేయవద్దా?; క్రోధ= నీ కోపంయొక్క; ప్రవిహతిన్= విడుమరను; చేయుము= చేయుము (క్రోధం విడిచిపెట్టుము అని); విష్ణుండు+అనఁగాన్= విష్ణుమూర్తి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అన్నా; శివుఁడు+అనన్= శివుడు అన్నా; ఒకఁడు+ఔట= ఒక్కడే అవటాన్ని; దివ్యచిత్తము+అ= తమ దివ్యచిత్తమే; ఎఱుఁగున్= ఎరుగును. (శివకేశవుల అభేదాన్ని దివ్యమైన హృదయమే తెలుసుకోగలదు అని కానీ)

తాత్పర్యం: 'రుద్రా! నీవు శివుడవు. లోకాలకు శివం (శుభం) కలిగించాలి కానీ ఇదేమిటి? కోపం ఉపసంహరించుకొనుము. విష్ణువు అన్నా శివుడు అన్నా ఒక్కరే అని నీ దివ్యచిత్తానికి తెలుసును కదా!

తే. **నిగమవేద్య మద్వంద్వంబు నిర్గుణం బ। మూర్తమనియెడు తత్త్వంబు మూర్తిభేద**
కలనమున లోకమున ద్విధాకారి యయ్యెఁ। గాక - హరియన నీవనఁ గలదె వేఱు!' **447**

ప్రతిపదార్థం: నిగమ= వేదాలతో; వేద్యము= తెలిసికొనదగినదీ; అద్వంద్వంబు= రెండు కానిదీ (ఒక్కటే అని); నిర్గుణంబు= సత్త్వరజస్తమోగుణాలకు అతీతమైనదీ; అమూర్తము= రూపం లేనిదీ; అనియెడు= అని చెప్పబడే; తత్త్వంబు= ఒకానొక మూలతత్త్వం; మూర్తిభేదకలనమునన్= రూపభేదాన్ని (భిన్న రూపాలను) పొందటంవలన; లోకమునన్= లోకంలో; ద్విధాకారి+అయ్యెన్+కాక= రెండుగా అయ్యింది గానీ - నిజానికి; హరి+అనన్= విష్ణుడు అనీ; నీవు+అనన్= నీవనీ (శివుడు అనీ); వేఱు= భేదం; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: వేదవేద్యమూ, అద్వంద్వమూ, నిర్గుణమూ, అమూర్తమూ అయిన ఒకే ఒక్క మూలతత్త్వం లోకం కొరకని రెండు రూపాలు ధరించింది. అందులో ఒకటి నీవూ, మరొకటి విష్ణుడూను. అంతేకానీ నిజానికి శివకేశవులకు భేదం లేదు.'

వ. **అని బోధించి వెండియు.** **448**

ప్రతిపదార్థం: అని= ఇలా; బోధించి= ఉపదేశించి; వెండియున్= మళ్ళీ కొనసాగించాడు.

తాత్పర్యం: ఇట్లా ఉపదేశించి మళ్ళీ.

క. **' నరనారాయణు లనఁగాఁ। బురహర! జగదాదియైన పురుషులు, మనముం**
బరికింపఁ దన్మయత్వ। స్ఫురితులము ప్రసన్న దివ్యబుద్ధిం గనుమా! **449**

ప్రతిపదార్థం: పురహర!= త్రిపురాసుర సంహారం చేసిన ఓ రుద్రుడా!; నరనారాయణులు+అనఁగాన్= నరనారాయణులు అంటే; జగత్+ఆదియైన+పురుషులు= ఈ జగత్తుకు మొట్టమొదటి పురుషులు; పరికింపన్= లోతుగా ఆలోచించి చూస్తే; మనమున్= మనమందరం కూడా; తద్+మయత్వ+స్ఫురితులము= వారి అంశలతో ఏర్పడినవాళ్ళమే; ప్రసన్న= కోపం విడిచి తేరుకున్న; దివ్యబుద్ధిన్= దివ్యమైన బుద్ధితో; కనుమా!= ఒక్కసారి చూడుము.

తాత్పర్యం: 'త్రిపురాంతకా! నరనారాయణులు అంటే జగదాది పురుషులు. ఇంకాస్త లోతుగా ఆలోచిస్తే నీవూ నేనూ ఈ దేవతలూ, ఋషులూ అందరమూ తదంశలతో స్ఫురించిన వాళ్ళమే. ప్రసన్నమూ, దివ్యమూ అయిన బుద్ధితో ఆలోచించి చూడుము. నీకే తెలుస్తుంది.

ఆ. **తెలుపు మితని, ననుడుఁ దేఱి కోపంబు వో। విడిచి నన్నుఁ గొలిచె మృడుఁడు పార్థ!**
యేను నతనితోడ నిట్లంటి మృదుసత్య। పథ్య ముని మనోజ్ఞ భంగికముగ. **450**

ప్రతిపదార్థం: పార్థ!= పృథానందనా! అర్జునా!; ఇతనిన్= ఈ విష్ణుమూర్తిని; తెలుపుము= ప్రసన్నుడిని చేయుము; అనుడున్= అని బ్రహ్మ చెప్పగానే; మృడుఁడు= శివుడు; తేఱి= తేరుకొని; కోపంబు= క్రోధం; పోన్+విడిచి= విడిచిపెట్టి; నన్నున్= నన్ను;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కొలిచెన్= శరణు వేడాడు(సేవించాడు); ఏనున్= నేను; అతనితోడన్= ఆ శివుడితో; మృదు= సుకుమారమూ; సత్య= సత్యమూ; పథ్య= హితమూ; మునిమనోజ్ఞ= మునులకు మనోహరమూ అయిన; భంగికముగన్= భంగిగా; ఇట్లు+అంటిన్= ఇలా అన్నాను.

తాత్పర్యం: రుద్రా! ఈ విష్ణుమూర్తిని ప్రసన్నుడిని చేసికొమ్ము' అని బ్రహ్మదేవుడు చెప్పగానే కోపం వదిలి శివుడు నన్ను (విష్ణువును) శరణువేడాడు. అప్పుడు నేను శివుడితో మృదువుగా సత్యమూ, పథ్యమూ అయ్యేటట్లు మునులు హర్షించేటట్లు ఇట్లా అన్నాను.

క. ' నిను నెవ్వఁ డెఱిఁగె నాతఁడు । నను నెఱిఁగినవాఁడ, నిన్ను నమ్మిక సేవిం
చిన నదియ నన్నుఁ గొల్చుట । యను వాసిగ లేదు భేద మరయఁగ మనకున్. 451

ప్రతిపదార్థం: నినున్= నిన్ను; ఎవ్వఁడు= ఏ వ్యక్తి; ఎఱిఁగెన్= తెలుసుకున్నాడో; ఆతఁడు= ఆ వ్యక్తి; ననున్= నన్నుకూడా; ఎఱిఁగినవాఁడు+అ= తెలిసికొన్నవాడే; నినున్= నిన్ను; నమ్మికన్= విశ్వాసంతో; సేవించినన్= సేవిస్తే; అది+అ= అదే; నన్నున్= నన్ను కూడా; కొల్చుట= సేవించటం; అను= అనేటువంటి; వాసిగన్= పద్ధతిగా; మనకున్= మన ఇద్దరికీ; అరయఁగన్= పరిశీలిస్తే; భేదము= వేర్పాటు (భిన్నత్వం); లేదు= లేదంటే లేదు.

తాత్పర్యం: 'శివా! నిన్ను తెలిసికొంటే నన్ను తెలుసుకొన్నట్లే. నిన్ను సేవిస్తే నన్నే సేవించినట్లే. ఈ పద్ధతిగా మన ఇద్దరికీ భేదం అనేది లేనే లేదు.

క. శ్రీవత్సము శూలాంకిత । మై వెలయుంగాక యిప్పు డాదిగ నాకున్
నీవును మత్పాణ్యంకో । ద్భావన శ్రీకంఠుఁడనఁగఁ బరఁగుము శర్వా!' 452

ప్రతిపదార్థం: శర్వా!= ఓ శివా!; ఇప్పుడు+ఆదిగన్= ఇది మొదలుగా; నాకున్= నాకు; శ్రీవత్సము= గుండెపై ఉన్న శ్రీవత్సము అనే పుట్టుమచ్చ; శూల+అంకితమై= త్రిశూలచిహ్నమై; వెలయున్+కాక= ఒప్పునుగాక!; నీవునున్= నీవుకూడా; మత్= నా; పాణి+అంక= చేతిముద్ర యొక్క; ఉద్భావనన్= ప్రస్ఫుటీకరణంతో; శ్రీకంఠుఁడు+అనఁగన్= శ్రీకంఠుడు అనే పేరుతో; పరఁగుము= ఒప్పుము.

తాత్పర్యం: ఓ శర్వా! ఈ రోజునుండీ నా గుండెలపై శ్రీవత్సం నీ త్రిశూలానికి ప్రతీకగా గుర్తించబడుతుంది. నీ కంఠంమీద ఉన్న నలుపు నా చేతిముద్రగా నీకు శ్రీకంఠుడు అనే పేరు సార్థకమవుతుంది.' (విష్ణుమూర్తి శివుడిని కంఠాలింగనం చేసికొంటే గళం చుట్టిన చేతి నలుపురంగుగా అతడు శ్రీకంఠుడు అయ్యాడని భావం).

వ. అని యివ్విధంబున. 453

ప్రతిపదార్థం: అని; ఈ+విధంబునన్= ఈ విధంగా.

తాత్పర్యం: అనిచెప్పి, కృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు:

క. ' ఇతరేతర మతి సంభా । విత లక్షణకలన మొంది వృషవాహనుతో
నతినిర్మల సఖ్యము సే । సితి బ్రహ్మదులును సంతసిల్లిరి విజయా! 454

ప్రతిపదార్థం: విజయా!= ఓ అర్జునా!; ఇతర+ఇతర= పరస్పరం; మతి= బుద్ధితో; సంభావిత= (గౌరవించుకొన్న) ఆలోచించి ఏర్పరుచుకొన్న; లక్షణకలనము= చిహ్నధారణం; ఒంది= పొంది; వృషవాహనుతోన్= వృషభవాహనుడైన శివుడితో; అతి నిర్మలసఖ్యము= మిక్కిలి పావనమైన (నిర్మలినమైన) మైత్రి; చేసితిన్= కుదుర్చుకొన్నాను - చేశాను; బ్రహ్మదులునున్= బ్రహ్మదేవుడూ (దేవతలూ, మునులూ) మొదలైనవారుకూడా; సంతసిల్లిరి= సంతోషించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'అర్జునా! ఇట్లా పరస్పరం ఆలోచించి ఏర్పరుచుకొన్న మైత్రీచిహ్నాలను ధరించాం. నిర్మలమైన సఖ్యాన్ని శివుడితో కుదుర్చుకొన్నాను. దీనికి బ్రహ్మాదులు అందరూ ఎంతో సంతోషించారు.

మ. మదీయనామ నిర్వచనంబులును రుద్రునితోడి రణంబునసైన జయంబు తెఱంగును నీ కెఱింగించితి. 455

ప్రతిపదార్థం: మదీయ= నాయొక్క; నామ= నామధేయాల; నిర్వచనంబులునున్= వ్యుత్పత్తులూ; రుద్రునితోడి= శివుడితో జరిగిన; రణంబునన్= యుద్ధంలో; ఐన= లభించిన; జయంబు= విజయం తాలూకు; తెఱంగునున్= విధానమూ; నీకున్= నీకు; ఎఱింగించితిన్= తెలియజేశాను.

తాత్పర్యం: నా నామధేయాల వ్యుత్పత్తులూ, శివుడితో చేసిన యుద్ధంలో లభించిన విజయవిధానమూ నీకు తెలియజేశాను.

క. నానారూపంబుల ని । ట్లేను బ్రవర్తింతు జగము లిన్నింటను, నీ
శానుఁడు నభవుఁడు నమృతుఁడు । నైన శివుని నీవుఁ గొలువు మర్జున! యెపుడున్. 456

ప్రతిపదార్థం: అర్జున!; నానారూపంబులన్= అనేక రూపాలతో; ఇట్లు= ఇలా; ఏను= నేను; జగములు+ఇన్నింటనున్= ఇన్ని జగత్తులలోనూ; ప్రవర్తింతున్= సంచరిస్తూ ఉంటాను; నీవున్= నీవు కూడా; ఎపుడున్= ఎల్లవేళలా; ఈశానుఁడున్= ప్రభువూ; అభవుఁడున్= పుట్టుకలేనివాడూ; అమృతుఁడున్= మృతిలేనివాడూ; ఐన= అయినటువంటి; శివునిన్= శివుడిని; కొలువుము= సేవించుము.

తాత్పర్యం: అర్జునా! ఇట్లా అనేకరూపాలలో నేను ఈ జగత్తులన్నింటా సంచరిస్తూ ఉంటాను. ఈశానుడూ, అభవుడూ, అమృతుడూ అయిన శివుడిని నీవు కూడా ఎల్లవేళలా అర్చించుము. (12-330-67,81).

తే. ఏను రక్షింప జయము నీ కెసకమెసఁగె । సమరమున శూలపాణియై శత్రుకోటి
నీదు మునుమున వధియించు నిరుపమాన । తేజు రుద్రుఁగా నెఱుఁగుము ధీరచిత్త!' 457

ప్రతిపదార్థం: ధీరచిత్త!= ధీరమైన హృదయం కలవాడా!; సమరమునన్= కురుక్షేత్ర సంగ్రామంలో; ఏను= నేను; రక్షింపన్= కాపాడటం వలన; జయము= విజయం; నీకున్= నీకు; ఎసకము+ఎసగెన్= ఒప్పించింది; నీదు+మునుమునన్= నీ మునుముందట (అగ్రభాగంలో); శూలపాణియై= శూలం చేతబట్టినవాడై; శత్రుకోటిన్= శత్రుసమూహాన్ని; వధియించు= సంహరించేటువంటి నిరుపమాన తేజున్= సాటిలేని తేజస్సుకల వానిని; రుద్రున్+కాన్= రుద్రుడుగా; ఎఱుఁగుము= తెలిసికొమ్ము.

తాత్పర్యం: ధీర హృదయుడా! నేను రక్షించాను కాబట్టి కురుసంగ్రామంలో నీకు జయం లభించింది. నీ అగ్రభాగంలో శూలపాణిగా రుద్రుడు సంచరిస్తూ నీకంటె ముందే నీ శత్రువులను సంహరించాడు. ఇదికూడా నీవు తెలిసికొనటం మంచిది.'

వ. అనియె నని చెప్పిన విని జనమేజయుండు. 458

ప్రతిపదార్థం: అనియెన్= శ్రీకృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు; అని చెప్పినన్= అని వైశంపాయనుడు తెలియజేస్తే; విని= ఆలకించి; జనమేజయుఁడు= జనమేజయమహారాజు - ఇట్లా అంటున్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడని వైశంపాయనుడు తెలుపగా, జనమేజయమహారాజు మరల ప్రశ్నిస్తున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'అరుదే సర్వేశ్వరుఁ డగు । హరి తోడుగ జయము గొనుట యర్జునునకు? న
పృురుషోత్తము బాంధవులై । పరఁగిరి; పెఱ వినుతు లేల పాండుసుతులకున్?' 459

ప్రతిపదార్థం: సర్వేశ్వరుఁడు+అగు= సర్వేశ్వరుడైన; హరి= విష్ణుమూర్తి; తోడుగన్= సహాయుడుగా ఉండగా; జయము+కొనుట= జయాన్ని పొందటం; అర్జుననకున్= కిరీటికి; అరుదే?= దుర్లభమా?; ఆ+పురుషోత్తము= ఆ పురుషోత్తముడైన ఆ శ్రీకృష్ణుడికి; బాంధవులై= బంధువులై; పరఁగిరి= అలరారిరి; పాండుసుతులకున్= ఆ పాండవులకు; పెఱ వినుతులు= మరింక వేరే స్తుతులు; ఏల?= ఎందుకూ?

తాత్పర్యం: వైశంపాయనా! సర్వేశ్వరుడైన హరి తోడుగా ఉంటే కురుసంగ్రామంలో అర్జునుడు విజయుడయ్యాడు. ఇందులో ఆశ్చర్యం ఏముంది? అదీగాక ఆ పురుషోత్తముడికి మా పాండవులు బంధువులయ్యారు. ఇంతకన్నా ప్రశంసావాక్యాలు ఏమి కావాలి చెప్పుము?

వ. అని పలికి యిట్లనియె. 460

ప్రతిపదార్థం: అని= అని; పలికి= మాట్లాడి; ఇట్లు+అనియెన్= ఇంకా జనమేజయుడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని పలికి జనమేజయుడు మళ్ళీ ఇట్లా అడుగుతున్నాడు.

క. నారదుఁడు పరమపురుషుని । కారుణ్యము వడసి వచ్చి క్రమ్మఱ నరునిన్
నారాయణునిం గాంచుట । సారమతిం జెప్పి తీవు సంయమివర్యా! 461

ప్రతిపదార్థం: సంయమివర్యా!= నిగ్రహ సంపన్నులలో (మునులలో) అగ్రగణ్యుడా!; నారదుఁడు= నారదమహర్షి; పరమపురుషుని= పరాత్పరుడైన శ్రీమహావిష్ణువుయొక్క; కారుణ్యమున్= దయను; పడసి= శ్వేతద్వీపంలో పొంది; వచ్చి; క్రమ్మఱన్= మళ్ళీ; నరునిన్= నరుడినీ; నారాయణునిన్= నారాయణుడినీ; కాంచుట= బదరికాశ్రమంలో దర్శించటం; సారమతిన్= శ్రేష్ఠమైన మతితో; ఈవు= నీవు; చెప్పితి(వి)= చెప్పావు.

తాత్పర్యం: ఓ వైశంపాయనా! శ్వేతద్వీపానికి వెళ్ళి నారదమహర్షి శ్రీమహావిష్ణువును సందర్శించుకుని తిరిగివచ్చి బదరికాశ్రమంలో నరనారాయణులను కలిసికొన్నాడు - అన్నదాకా ఆ కథ చెప్పావు. సారమతితో వివరించావు. బాగుంది.

వ. తదీయసల్లాప విశేషంబులు వినవలతుం జెప్పుమనిన నప్పుడమిఱేనికి వైశంపాయనుం డిట్లనియె. 462

ప్రతిపదార్థం: తదీయ= ఆ ముగ్గురి; సల్లాప= సంభాషణల; విశేషంబులున్= వివరాలూ; వినన్+వలతున్= వినాలని అనుకుంటున్నాను; చెప్పుము+అనినన్= చెప్పు అని అడిగితే; ఆ+పుడమిఱేనికిన్= ఆ రాజుగారికి; వైశంపాయనుండు= వైశంపాయనుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: వారి సంభాషణలను వినగోరుతున్నాను చెప్పు మని ఆ రాజు అడుగగా వైశంపాయనుడు ఇట్లా వివరించసాగారు.

నరనారాయణ నారద సల్లాపప్రకారము (సం. 12-331-36)

క. నారదుఁడు వచ్చి నరునిన్ । నారాయణుఁగాంచి భక్తినమ్రుండైనన్
వా రతనికి నాతిథ్యము । గారవమున నడపి యడుగఁగా వారలతోన్. 463

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నారదుఁడు= నారదమహర్షి; వచ్చి= శ్వేతద్వీపంనుంచి బదరికాశ్రమానికి వచ్చి; నరునిన్= నరుడినీ; నారాయణున్= నారాయణుడినీ; కాంచి= దర్శించి; భక్తినమ్రుండైనన్= భక్తితో వంగి నమస్కరించగా; వారు= నరనారాయణులు; అతనికిన్= ఆ నారదమహర్షికి; ఆతిథ్యమున్= అతిథిమర్యాదను; గారవమునన్= ప్రేమతో (గౌరవంతో); నడపి= చేసి; అడుగఁగాన్= కుశల విశేషాదులు అడిగితే; వారలతో= ఆ ఇద్దరితోనూ.

తాత్పర్యం: నారదమహర్షి శ్వేతద్వీపంనుండి బదరికాశ్రమానికి తిరిగి వచ్చాడు. నరనారాయణులను మళ్ళీ దర్శించాడు. వారు ఆ మహర్షికి ఆదరంతో అతిథిమర్యాదలు జరిపారు. కుశలం అడిగారు. శ్వేతద్వీపం విశేషాలు అడిగారు. అప్పుడు వారితో. (తరువాతి వచనంతో అన్వయం.)

వ. అద్దేవముని యిట్లనియె. 464

ప్రతిపదార్థం: ఆ+దేవముని= దేవర్షి అయిన ఆ నారదుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: దేవర్షి నారదుడు ఇట్లా చెప్పాడు.

క. శ్వేతద్వీపంబున భవ । దాతతకృపఁ గానఁ బోలె నచ్యుతుఁ దద్రూ
పాతిశయము మీ చందమ । యాతని కడఁ గంటి మిమ్ము నద్భుత మెసఁగన్. 465

ప్రతిపదార్థం: భవత్= మీయొక్క; ఆతత కృపన్= విస్తారమైన దయవలన; శ్వేతద్వీపంబునన్= శ్వేతద్వీపంలో; అచ్యుతున్= శ్రీమహావిష్ణువును; కానన్+పోలెన్= దర్శించటమయ్యింది (దర్శించగలిగాను); తద్= ఆ విష్ణుమూర్తియొక్క; రూప+అతిశయము= రూపవైభవం; మీ+చందము+అ= అచ్చం మీవంటిదే; ఆతని కడన్= ఆయన సన్నిధిలో; అద్భుతము+ఎసఁగన్= ఆశ్చర్యజనకంగా (ఆశ్చర్యం ఎసగేట్టు); మిమ్మున్= మీ ఇద్దరినీ; కంటిన్= దర్శించాను.

తాత్పర్యం: 'నరనారాయణులారా! మీ దయావిశేషంవలన నేను శ్వేతద్వీపంలో శ్రీమహావిష్ణువును దర్శించగలిగాను. ఆయన రూపం అచ్చం మీవలెనే ఉన్నది. తేడా ఏమీ లేదు. ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే - మిమ్ములను ఇద్దరినీ ఆయన సన్నిధిలోనూ చూశాను.

క. శ్వేతులు నింద్రియ వర్జిత । చేతస్కులునైన నరులఁ జెలువుగ మౌనో
పేతులఁ గంటి నచట వా । రాతేజోమూర్తికిని దయాపాత్రంబుల్. 466

ప్రతిపదార్థం: అచటన్= ఆ శ్వేతద్వీపంలో; శ్వేతులు= తెల్లని శరీరంకలవారూ; ఇంద్రియవర్జిత= ఇంద్రియాలచే విసర్జించబడిన; చేతస్కులున్= మనస్సులు కలవారూ (ఇంద్రియ వికారాలకు లొంగని మనస్సులు కలవారూ); చెలువుగన్= అందంగా; మౌన+ఉపేతులన్= మౌనదీక్షతో ఉన్నవారూ; ఐన= అయినటువంటి; నరులన్= పురుషులను; కంటిన్= చూసాను. (చెలువుగన్+ కంటిన్= అందంగా తిలకించాను); వారు= ఆ శ్వేతశరీరులైన నరులు; ఆ+తేజోమూర్తికిని= తేజఃస్వరూపుడైన ఆ విష్ణుమూర్తికి; దయాపాత్రంబుల్= కృపాపాత్రులు (దయకు అర్హమైనవారు).

తాత్పర్యం: ఆ శ్వేతద్వీపంలో ఇంద్రియనిగ్రహం కలిగి, మౌనదీక్షతో తపస్సు చేసికొంటున్న శ్వేతశరీరులైన నరులను దర్శించాను. వారందరూ విష్ణుమూర్తికి దయాపాత్రులు కావటాన్ని గుర్తించాను.

వ. అద్దేవుండు వత్సలుండయి వారలతోడం గూడి విహరించుచుండు నామీఁదం గృపసేసి క్షేత్రజ్ఞప్రకారంబు సకలంబును దేటపడ ననుగ్రహించి యాగామినిజప్రాదుర్భావంబుల తెఱంగెల్ల నెఱింగించె. శ్వేతద్వీపం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బనునది శాంతిస్వరూపం బందు సూర్యసోమాంశువ్యాప్తియు వాయుసంచారంబును లే దా లోకనాథునకు నేకాంతిక జనంబులం గడచిన ప్రియులు లేకునికి యెఱింగి యేకాంతినై యుండితి; నవ్విభుండువీడుకొలుప మీకడకు వచ్చితి; నిచ్చట మీకుం గారుణ్యభాజనంబనై యుండెద ననుటయు వార లతని కిట్లనిరి. 467

ప్రతిపదార్థం: ఆ+దేవుండు= ఆ విష్ణుమూర్తి; వత్సలుండయి= వాత్సల్యం కలవాడై; వారలతోడన్= ఆ శ్వేతశరీరులతో; కూడి= కలిసి; విహరించుచుండున్= విహరిస్తుంటాడు; నామీఁదన్= నా పట్ల; కృప+చేసి= దయను వహించి; క్షేత్రజ్ఞప్రకారంబు= క్షేత్రజ్ఞుని పద్ధతి; సకలంబును= అంతా; తేటపడన్= స్పష్టమయ్యేట్టు; అనుగ్రహించి= నాకు ఉపదేశించి; ఆగామి= రాబోయే; నిజ= తనయొక్క; ప్రాదుర్భావంబులన్= జన్మలయొక్క (అవతారాల); తెఱంగు+ఎల్లన్= విధానమంతా; ఎఱింగించెన్= తెలియజేశాడు; శ్వేతద్వీపంబు+అనునది= శ్వేతద్వీపం అనేది; శాంతి స్వరూపంబు= పూర్తిగా శాంతియే రూపంగా ధరించిన చోటు; అందున్= అక్కడ; సూర్యసోమ= సూర్యచంద్రుల; అంశు= కిరణాల; వ్యాప్తియున్= ప్రసారంకానీ; వాయు= గాలియొక్క; సంచారంబునున్= సంచారంకానీ; లేదు= లేనేలేదు; ఆ+లోకనాథునకున్= జగదీశ్వరుడైన ఆ విష్ణుమూర్తికి; ఏకాంతికజనంబులన్= ఏకాగ్రచిత్తులైన వ్యక్తులను; గడచిన= మించిన; ప్రియులు= ఇష్టులు; లేక+ఉనికి= లేకపోవటం (లేరన్న సంగతి); ఎఱింగి= గుర్తించి; ఏకాంతినై= నేను కూడా ఏకాగ్రచిత్తుడనై; ఉండితిన్= ఉన్నాను; ఆ+విభుండు= ఆ ప్రభువు; వీడుకొలుపన్= సాగనంపగా; మీకడకున్= మీ దగ్గరకి; వచ్చితిన్= వచ్చాను; ఇచ్చటన్= ఇక్కడ ఈ బదరికాశ్రమంలో; మీకున్= మీ ఇద్దరికీ; కారుణ్యభాజనంబను+ఐ= దయాపాత్రుడనై; ఉండెదన్= ఉంటాను (నివసిస్తాను); అనుటయున్= అనేసరికి; వారలు= ఆ నరనారాయణులు; అతనికిన్= ఆ నారదమహర్షికి; ఇట్లు+అనిరి= ఇట్లా చెప్పారు.

తాత్పర్యం: ఆ విష్ణుమూర్తి వాత్సల్యంతో వారితో కలిసి విహరిస్తుండగా, నామీద గల దయతో క్షేత్రజ్ఞుడిని గురించినదంతా తేటపడేటట్లు చేసి, రాబోయే తన జన్మలను తెలియచేశాడు. శ్వేతద్వీపం అనేది శాంతి స్వరూపం. అందులో సూర్యచంద్రకాంతులుగానీ, వాయుప్రసారంగానీ లేవు. విష్ణువుకు ఏకాగ్రచిత్తుల కంటె మించిన ఇష్టులు లేరని తెలిసికొని నేనుకూడా ఏకాంతినై ఉన్నాను. విష్ణువు వీడ్కోల్పగా మీ దగ్గరకు వచ్చాను. ఇక్కడ మీఇద్దరి దయకూ పాత్రుడనై నివసిస్తాను' అనగా ఆ నరనారాయణులు నారదుడితో ఇట్లా అన్నారు:

తే. ' పడసి తద్దేవుఁ గానఁ , దద్భాషణములు । వింటి, నీవు ధన్యుండవు, గంటి మేము
నచట నీయున్న తెఱఁగెల్ల, నిచట నునికి । మేలకాక - యుండుము - పరమేష్ఠితనయ! 468

ప్రతిపదార్థం: పరమేష్ఠితనయ!= బ్రహ్మపుత్రా! ఓ నారదా!; ఆ+దేవున్= ఆ విష్ణుమూర్తిని; కానన్= దర్శించటం; పడసితి(వి)= పొందావు (కానన్+పడసితివి= దర్శించగలిగావు); తద్= ఆయనయొక్క; భాషణములు= పలుకులు; వింటి(వి)= విన్నావు; నీవు; ధన్యుండవు= నిజంగా చరితార్థుడవే ; ఏమున్= మేము కూడా; అచటన్= ఆ శ్వేతద్వీపంలో; నీ+ఉన్న= నీవు నివసించిన (ప్రవర్తించిన); తెఱఁగు+ఎల్లన్= తీరు అంతా; కంటిమి= చూశాం; ఇచటన్= ఈ బదరికాశ్రమంలో; ఉనికి= నీవు ఉండటం; మేలు+అ+కాక= మేలే కదా!; ఉండుము.

తాత్పర్యం: 'ఓ నారదా! విష్ణుమూర్తిని దర్శించగలిగావు, ఆయనతో సంభాషించగలిగావు. నీవు నిజంగా ధన్యుడవయ్యా! మేము కూడా అక్కడి నీ ప్రవర్తనను తిలకించాము. ఇక్కడ ఉంటాను - అంటున్నావు. మంచిదే. ఉండుము.

క. దైవముఁ బిత్త్రంబును ద । ద్దేవసమారాధనంబు దెల్లము శ్రుతి సం
భావిత మది తత్పరతన్ । నీ వేకాంతివయి నిలువు నిర్మలహృదయా!' 469

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నిర్మలహృదయా!= నిర్మలమైన హృదయం కలవాడా!; దైవమున్= దైవమూ (దేవసంబంధమైనది= దైవము, ఇష్టదేవతారాధన); పిత్ర్యంబునున్= పిత్ర్యమూ (పితృదేవతారాధన) అనే పేరులతో ఉన్న; తద్+దేవ+సమారాధనంబు= ఆ దైవార్చన; అది; శ్రుతి+సంభావితము= వేదప్రతిపాదితం; తెల్లము= స్పష్టం (అది తెల్లము= ఆ విషయం స్పష్టం); తత్పరతన్= వాటిపట్ల ఆసక్తితో; నీవు; ఏకాంతివి+అయి= ఏకాగ్రచిత్తుడవై; నిలువు(ము)= ఉండుము.

తాత్పర్యం: నిర్మలాంతరంగా! దైవమూ, పిత్ర్యమూ అనే ఆరాధనలు వేదప్రతిపాదితాలు అన్న సంగతి స్పష్టమేకదా! నీవు వాటిపట్ల భక్తిశ్రద్ధలతో (తాత్పర్యంతో) ఇక్కడ ఉండుము.'

ఆ. అనిన సంతసిల్లి యద్దేవముని వేయు । దివ్యవత్సరములు భవ్యతపము
నియతి నాచరించెఁ బ్రియమున వారు ద । న్నాదరింపఁగాఁ దదాశ్రమమున. 470

ప్రతిపదార్థం: అనినన్= అని నరనారాయణులు అనుమతించగా; సంతసిల్లి= సంబరపడి; ఆ+దేవముని= ఆ నారదమహర్షి; వారు= నరనారాయణులిద్దరూ; ప్రియమునన్= ప్రేమతో; తన్నున్= తనను; ఆదరింపఁగాన్= ఆదరిస్తూండగా; తద్+ఆశ్రమమునన్= వారి ఆశ్రమంలో; వేయు= వెయ్యి; దివ్యవత్సరముల్= దివ్యసంవత్సరాలు (మానుష సంవత్సరాలు కాదు - దివ్యవత్సరాలు); భవ్యతపమున్= పవిత్రమైన తపస్సును; నియతిన్= నియమంతో; ఆచరించెన్= చేసాడు.

తాత్పర్యం: నరనారాయణులు ఇట్లా అనుమతించేసరికి నారదుడు సంతోషించాడు. ఆ బదరికాశ్రమంలోనే వేయి దివ్యసంవత్సరాలపాటు భవ్యమైన తపస్సు చేసాడు. అంతకాలమూ నరనారాయణులు ప్రేమగా నారదుడిని ఆదరించారు.

వ. అ ట్లేకాంతియై తపంబుసేసి యత్యంతశాంతి నొంది నారదుండు నరనారాయణుల వీడ్కొని హిమవన్నగంబునకుం జని తన యాశ్రమంబునందు బృందారకాది విశిష్టపూజితుండై యుండె నని చెప్పిన విని సంప్రీతుండైన జనమేజయుతో వెండియు వైశంపాయనుం డిట్లనియె. 471

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; ఏకాంతియై= ఏకాగ్రచిత్తుడై; తపంబు+చేసి= తపస్సుచేసి; అత్యంతశాంతిన్= మిక్కిలి శాంతిని; ఒంది= పొంది; నారదుండు= నారదమహర్షి; నరనారాయణులన్= నరనారాయణులనిద్దరినీ; వీడ్కొని= విడిచి; హిమవత్+నగంబునకున్= హిమవత్పర్వతమునకు; చని= వెళ్ళి; తన= తనయొక్క; ఆశ్రమంబునందున్= తపోవనంలో; బృందారక+ఆది= దేవతలూ మొదలైన; విశిష్ట= విశిష్టులచేత; పూజితుండై+ఉండెన్= అర్చించబడుతూ ఉన్నాడు; అని; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; సంప్రీతుండైన= సంతోషించినవాడైన; జనమేజయుతోన్= జనమేజయుడితో; వెండియున్= మళ్ళీ; వైశంపాయనుండు= వైశంపాయనుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అట్లా ఏకాగ్రచిత్తుడై తపస్సుచేసి నారదుడు ప్రశాంతిని పొందాడు. వారివద్ద సెలవు తీసికొని, హిమాలయాలకు వెళ్ళి తన ఆశ్రమంలో గొప్పవారిచేత సేవించబడ్డాడు' అని చెప్పగా జనమేజయుడు సంతసిల్లాడు. వైశంపాయనుడు ఇట్లా కొనసాగించాడు.

ఉ. ' పాండవవంశవర్య! పటుపాపవినాశనియైన యిక్కథన్
నిండుమనంబుతో వినుట నీవు గృతార్థుఁడ వైతి శాశ్వతా
ఖండసుఖాత్ము విష్ణు నధికస్థిరభక్తి సమాశ్రయింపు నీ
కొండొకఁ డేల? యిమ్మెయి మహోన్నతిఁ జేయు జగత్త్రయంబునన్. 472

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పాండవ వంశ= పాండవవంశంలో; వర్య!= శ్రేష్ఠమైనవాడా!; పటుపాప= మహాపాపాలను; వినాశని+ఐన= విధ్వంసం చేయగలిగిన; ఈ+కథన్= ఈ వృత్తాంతాన్ని; నిండు మనంబుతోన్= నిండు మనస్సుతో; వినుటన్= వినటంచేత; నీవు; కృతార్థుడవు+ఐతి(వి)= కృతకృత్యుడవయ్యావు; శాశ్వత= శాశ్వతమైన; అఖండ= అఖండమైన (పరిపూర్ణమైన); సుఖ+ఆత్మున్= ఆనందమయుడైన (ఆనందరూపి); విష్ణున్= విష్ణుమూర్తిని; అధిక= అధికమైన; స్థిర= స్థిరమైన; భక్తిన్= భక్తితో; సమాశ్రయింపు(ము)= శరణుపొందుము; నీకున్= నీకు; ఒండొకఁడు= ఇతరులకు; ఏల?= ఎందుకు?; ఈ+మెయి= ఈ విధానం; జగత్+త్రయంబునన్= ముల్లోకాలలోనూ; మహోన్నతిన్+చేయున్= (నీకు) గొప్ప ఉన్నతిని కలిగిస్తుంది.

తాత్పర్యం: ఓ పాండవోత్తమా! మహాపాపాలను కూడా కడిగివేయగలిగిన ఈ కథను నీవు నిండుమనసుతో ఆలకించావు. కృతార్థుడవయ్యావు.శాశ్వత అఖండ సుఖస్వరూపుడైన విష్ణుమూర్తిని సుస్థిరభక్తితో సమాశ్రయించుము. ఇతర దైవాలు ఎందుకు! విష్ణుమూర్తినే ఆశ్రయించుము. ఆ విష్ణుభక్తి నిన్ను ముల్లోకాలలోనూ మహోన్నతుడిని చేస్తుంది.

క. లే వుభయలోకములు హరి । పై విద్వేషంబు గలుగు పాపాత్ములకున్,
భూవర! యట్టి జనుల పితృ । దేవతలకు నరక మగుటఁ దెలుపును శ్రుతులున్. 473

ప్రతిపదార్థం: భూవర!= జనమేజయ మహారాజా!; హరిపైన్= విష్ణుమూర్తిమీద; విద్వేషంబు+కలుగు= ద్వేషం పెంచుకున్న; పాపాత్ములకున్= పాపిష్ఠులకు; ఉభయలోకములున్= ఇహపరలోకాలు రెండూ; లేవు; అట్టి జనుల= అటువంటి పాపాత్ముల; పితృదేవతలకున్= పితృదేవతలకు కూడా (పెద్దలకు); నరకము= నరకలోకం; అగుటన్= ప్రాప్తించటాన్ని; శ్రుతులున్= వేదాలుకూడా; తెలుపును= తెలియజేస్తున్నాయి.

తాత్పర్యం: జనమేజయమహారాజా! హరిని ద్వేషించే పాపాత్ములకు ఇహపరలోకాలు (పుట్టగతులు) ఉండవు. వారి పితృదేవతలకు కూడా నరకమే ప్రాప్తిస్తుం దని వేదాలు చెబుతున్నాయి.

క. హరి యాత్మ యెల్లవారికి । నరవర! తన యాత్మపై మనంబున దృఢత
త్పరభావము లేని కుజనుఁ । బొరయవె యాపదలు? వేఱ బోధన మేలా? 474

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; ఎల్లవారికిన్= అందరికీ; హరి= విష్ణుమూర్తి; ఆత్మ; తన+ఆత్మపైన్= ఇలా తనదే అయిన ఆత్మమీద; దృఢ+తత్పర+భావము= దృఢమైన (భక్తి) తాత్పర్యం; లేని= లేనటువంటి; కుజనున్= దుర్జనుడిని; ఆపదలు= దుఃఖాలు; పొరయవె?= చుట్టుముట్టవా?; వేఱు+అ= వేరే; బోధనము= జ్ఞానం; ఏలా?= ఎందుకు?

తాత్పర్యం: మహారాజా! అందరికీ శ్రీ విష్ణువే ఆత్మ. మరి తమ ఆత్మమీద తమకే భక్తితాత్పర్యాలు లేవంటే ఆ దుర్జనులు ఆపదలపాలు కారా?

క. మునివరుఁడు గంధవతి నం । దనుండు నా గురుఁడు గరుణ దళుకొత్తఁగఁ జె
ప్పిన వాక్యంబుల యర్థము । లనఘా! యివి నీవు వీని నలవఱుపు మదిన్. 475

ప్రతిపదార్థం: అనఘా!= పవిత్రుడా!; గంధవతి= మత్స్యగంధి అయిన సత్యవతియొక్క; నందనుండు= కుమారుడూ; నా+గురుఁడు= నాకు గురువుగారూ అయిన; మునివరుఁడు= వ్యాసమునీంద్రుడు; కరుణ= దయ అనేది; తళుకొత్తఁగన్= చిగురించగా (ప్రకాశించగా); చెప్పిన= నాకు ఉపదేశించిన; వాక్యంబుల= వాక్యాల; అర్థములు= భావాలు; ఇవి= ఇవి (ఇంతవరకూ నేను నీకు చెప్పినవి); నీవు= నీవునూ; మదిన్= మనస్సులో; వీనిన్= వీటిని; అలవఱుపు(ము)= అలవరుచుకొమ్ము (అభ్యసించుము).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: జనమేజయా! నా గురువు సాత్యవతేయ మునీంద్రుడు దయతో నాకు చెప్పిన మాటల సారాంశం అంతా నీకు చెప్పాను. వీటిని నీవు అర్థం చేసికొని ఆచరణలో అలవాటు చేసికొమ్ము.

శా. **విద్వన్మోదవిధాయి నిర్మలవచోవిస్ఫూర్తి విఖ్యాతుఁ గృ**
ష్ణద్వైపాయను నీ వెఱుంగుము విభున్ నారాయణుం గా విప
శ్చిద్వంద్యంబగు భారతాధ్యయనముం జేయంగ శక్తుండు ధ
ర్మాద్వైతుండు సరోజలోచనుఁడకా కన్యుండు తద్వాచ్యుఁడే! **476**

ప్రతిపదార్థం: విద్వత్= విద్వాంసులకు; మోదవిధాయిన్= ఆనందాన్ని కలిగించేవాడూ; నిర్మల= పావనమైన; వచః= వాక్కుల యొక్క; విస్ఫూర్తి= విస్ఫురణతో; విఖ్యాతున్= ప్రఖ్యాతి పొందినవాడూ అయిన; కృష్ణద్వైపాయనున్= కృష్ణద్వీపంలో పుట్టిన వ్యాసుడిని; నీవు= నీవునూ; విభున్= ప్రభువైన; నారాయణున్+కాన్= విష్ణుమూర్తిగా; ఎఱుంగుము= తెలిసికొమ్ము; విపశ్చిత్= పండితులచేత; వంద్యంబు+అగు= నమస్కరింపదగినది అయిన; భారత+అధ్యయనమున్+చేయంగన్= భారతాన్ని అవగాహన చేసికొనటానికి; శక్తుండు= సమర్థుడు; ధర్మ+అద్వైతుఁడు= ధర్మానికి అభిన్నుడు (ధర్మస్వరూపుడు) అయిన; సరోజలోచనుఁడు+ అ+కాక= పుండరీకాక్షుడే తప్ప; అన్యుండు= మరొకడు; తద్= శక్తుడు అనే ఆ మాటతో; వాచ్యుఁడే= చెప్పబడతాడా?

తాత్పర్యం: మహావిద్వాంసులకు ఆనందాన్ని కలిగించే వచోవిలాసానికి పెట్టిందిపేరు మా గురువుగారు వ్యాసులవారు. ఆయనను సాక్షాత్తూ నారాయణుడుగా తెలియుము. మహాభారతానికి పండితులంతా నమస్కారం పెడతారు. అటువంటి భారతాన్ని అధ్యయనం చేయాలి అంటే ధర్మస్వరూపుడైన పుండరీకాక్షుడికి తప్ప మరొకరికి ఎవరికైనా అయ్యే పనేనా!

క. **బహు విధ ధర్మంబులు లో । క హితంబుగ నిట్లు సెప్పఁగా నిర్మలతా**
మహనీయధిషణుఁడగు న । మ్మహాత్మునక తీరుఁ గురుసమాజవరేణ్యా!' **477**

ప్రతిపదార్థం: కురుసమాజవరేణ్యా!= కురువంశంలో ఉత్తముడా (కౌరవసమూహంలో అగ్రగణ్యుడా!) ఓ జనమేజయా!జనమేజయుడా!; బహువిధ= రకరకాలైన; ధర్మంబులు= ధర్మాలు; లోకహితంబుగన్= లోకానికి హితంగా; ఇట్లు= ఈ విధంగా; చెప్పఁగాన్= చెప్పటానికి; నిర్మలతా= నిర్మలత్వంతో; మహనీయ= గొప్పదైన; ధిషణుఁడు+అగు= బుద్ధి కలిగిన; ఆ+మహాత్మునకున్+అ= ఆ మహానుభావుడు వ్యాసుడికే; తీరున్= చెల్లును (తగును).

తాత్పర్యం: కురువంశసంభవుల బృందంలో ఉత్తముడవైన ఓ జనమేజయా! రకరకాల ధర్మాలు ఇట్లా లోక శ్రేయస్సుకొరకు చెప్పటమంటే అది మా గురువుగారికే తగును. ఆయన మహానుభావుడు. నిర్మలమూ, మహనీయమూ అయిన బుద్ధివైభవం కలవాడు. అందుకని అది ఆయనకే చెల్లింది.'

విశేషం: సమాజం అంటే మానవసమూహం అని అర్థం. సమజం అంటే పశువుల గుంపు అని. కురుసమాజమంటే కురువంశజులైన మానవుల సమూహం. అందులో జనమేజయుడు వరేణ్యుడు అని సంబోధన.

హయగ్రీవదేవ మాహాత్మ్యాభివర్ణనము (సం. 12-335-9,10)

వ. **అనిన విని సవిశేష సమ్మదుండై జనమేజయుండు వైశంపాయనుతో 'హయశిరోభాసితుం డగు విష్ణుండు వేధకు సన్నిహితుండయ్యె నని చెప్పితి వప్పురుషోత్తముం డప్పు డేమిటికై యా మూర్తి వహించె? నత్తెఱం గెఱింగింపు' మని యడిగిన నమ్మునిని య మ్మనుజపతి కిట్లనియె..** **478**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; సవిశేష= అత్యధికంగా; సమ్మదుండై= సంతోషించినవాడై; జనమే జయుండు= జనమేజయుడు; వైశంపాయనుతోన్= వైశంపాయన మహర్షితో; హయశిరః= గుఱ్ఱపుతలతో; భాసితుండు+అగు= విరాజిల్లేవాడై; విష్ణుండు= విష్ణుమూర్తి; వేధకున్= బ్రహ్మదేవునికి; సన్నిహితుండు= దగ్గరకి వచ్చినవాడు; అయ్యెన్= అయ్యాడు (ఆ రూపంలో బ్రహ్మను సమీపించాడు); అని= అని; చెప్పితి(వి)= చెప్పావు (శాంతి - 6-412); ఆ+పురుషోత్తముండు= ఆ విష్ణువు; అప్పుడు= ఆ సమయంలో; ఏమిటికై= ఎందుకోసమని; ఆ మూర్తి= ఆ రూపం (హయగ్రీవ రూపం); వహించెన్?= వహించాడు?; ఆ+తెఱంగున్= ఆ రీతి అంతా; ఎఱింగింపుము= తెలియజెప్పుము; అని= అని; అడిగినన్= అడిగితే; ఆ+ముని= ఆ వైశంపాయనముని; ఆ+మనుజపతికిన్= ఆ జనమేజయమహారాజుకి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: వైశంపాయనుడు చెప్పినదంతా వినిన జనమేజయుడు 'గుఱ్ఱపుతలతో ఒప్పే విష్ణువు బ్రహ్మను సమీపించా డని చెప్పావు. ఎందు కాయన ఆ రూపాన్ని ధరించాడు? ఆ వివరములు చెప్పు' మని అడుగగా వైశంపాయనుడిట్లా చెప్పసాగాడు.

సీ. **ప్రళయకాలంబున జలముల విష్ణుండు । యోగనిద్రారతి నొంది మేలు**
కాంచి లోకంబులు గావింపఁ దలఁప న । హంకార మెసఁగె బ్రహ్మాభిధాన
కలితమై తన్నాభికమలంబునం దిట్లు । జనియించి యా బ్రహ్మ సకలసృష్టి
కాదిభూతములుగ వేదముల్ నాలుగు । గలిగించె నప్పు డక్కమలనాభు

తే. **నందు మును లయించినట్టి గుణంబులు । మూఁటఁ దొలుత సత్త్వమునకుఁ దోఁపు**
కలిమి దాననుండెఁ గమలోద్భవుఁడు రజ । స్తమము లసురలయ్యె ధరణినాథ! 479

ప్రతిపదార్థం: ధరణినాథ!= జనమేజయమహారాజా!; ప్రళయకాలంబునన్= సృష్టి అంతం అయినప్పుడు (జలప్రళయం వచ్చినపుడు); జలములన్= నీటిలో; విష్ణుండు= విష్ణుమూర్తి; యోగనిద్రారతిన్= యోగనిద్రపట్ల ఆసక్తి; పొంది= పొంది (యోగనిద్ర కానిచ్చి); మేలుకాంచి= మేల్కొని; లోకంబులు= లోకాలు; కావింపన్+తలఁపన్= సృష్టిస్తాను అనుకునేసరికి; బ్రహ్మ= బ్రహ్మ అనే; అభిధాన= పేరుతో; కలితమై= ఒప్పినదై; అహంకారము+ఎసఁగెన్= అహంకారం జనించింది; తద్+నాభికమలంబునందున్= ఆ విష్ణుమూర్తి పొక్కిలినుంచి (బొడ్డునుంచి) పుట్టిన పద్మంలో; ఇట్లు= ఈ విధంగా; జనియించి= జన్మించి; ఆ+బ్రహ్మ= ఆ బ్రహ్మదేవుడు; సకలసృష్టికిన్= మొత్తం (జరగబోయే) సృష్టికి అంతటికీ; ఆదిభూతములుగన్= మొట్టమొదటివిగా; వేదముల్= వేదాలు; నాలుగు= నాల్గు; కలిగించెన్= సృష్టించాడు; అప్పుడు= ఆ సమయాన; ఆ+కమలనాభునందున్= ఆ విష్ణుమూర్తిలో (కమలం నాభియందు కలవాడు); మును= (యోగనిద్రాసమయంలో) పూర్వకాలం; లయించినట్టి గుణంబులు= లీనమైన సత్త్వరజస్తమోగుణాలు; మూఁటన్= మూడింటిలోనూ; తొలుతన్= మొట్టమొదట; సత్త్వమునకున్= సత్త్వగుణానికి; తోఁపు+కలిమిన్= ఆవిర్భావం జరగటం వలన (తోఁచు-తోఁపు. తోఁచుట= ఉదయించుట); దానన్= ఆ సత్త్వగుణంలో (నాభికమలంలో);కమలోద్భవుఁడు= బ్రహ్మ; ఉండెన్= స్థిరపడ్డాడు; రజః+తమములు= రజోగుణతమోగుణాలు; అసురలు= రాక్షసులు; అయ్యెన్= అయ్యాయి.

తాత్పర్యం: జనమేజయా! ప్రళయకాలంలో యోగనిద్రకు ఉపక్రమించిన విష్ణుమూర్తి మేల్కొని 'జగత్తులను సృష్టిద్దాం' అనుకొన్నాడు. అనుకొనటమేమిటి - అహంకారం ఆవిర్భవించింది. దానికి బ్రహ్మ అనే పేరు ఏర్పడింది. విష్ణుమూర్తి నాభికమలంనుండి ఇట్లా జన్మించిన ఆ బ్రహ్మదేవుడు సృష్టికి శ్రీకారంగా వేదాలను నాల్గింటిని సృష్టించాడు. ప్రళయవేళ యోగనిద్రాసమయాన విష్ణుమూర్తిలో లీనమైపోయిన సత్త్వరజస్తమోగుణాలలో మొట్టమొదటగా సత్త్వగుణం ఆవిర్భవించింది. బ్రహ్మ ఆ సత్త్వగుణంలోనే ఉన్నాడు. తరువాత వెలువడ్డ రజస్తమోగుణాలు రాక్షసులు అయ్యాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విను కైటభుండు నా మధు । వనఁ బేర్చిన యద్దురాత్ము లవ్వేదములం
గొని వేగ చని రసాతల । మున వైచిరి గాఢబంధములు సేసి నృపా! 480

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; విను= ఆలకించుము; కైటభుండు+నాన్= కైటభుడు అనీ; మధువు+అనన్= మధువు అనీ;పేర్చిన= విజృంభించిన; ఆ+దురాత్ములు= ఆ దుష్టులు (రాక్షసులు); ఆ+వేదములన్+కొని= ఆ వేదాలను నాల్గింటినీ అపహరించి; వేగ+ చని= వేగంగా వెళ్ళి (పారిపోయి); గాఢబంధములు+చేసి= గట్టిగా కట్టివేసి; రసాతలమునన్= పాతాళంలో; వైచిరి= విసరివేశారు (దాచారు).

తాత్పర్యం: రాజా! కైటభుడు అనీ, మధువు అనీ ఇద్దరు దుష్టస్వభావులు ఉండేవారు. వాళ్ళు నాలుగు వేదాలనూ అపహరించుకొనిపోయి గట్టిగా కట్టేసి పాతాళంలో పారవైచారు.

వ. దాన నవ్వేధ విహ్వాలించి. 481

ప్రతిపదార్థం: దానన్= అందువల్ల; ఆ+వేధ= ఆ బ్రహ్మదేవుడు; విహ్వాలించి= బాధపడి.

తాత్పర్యం: దానితో ఆ బ్రహ్మదేవుడు బాధపడి.

క. ‘ లావును దృష్టియు గతియును । నా వేదచయంబ నాకు నవి యడఁగిన నే
నేవిధి సృజింతు లోకము? । లే వాఁ డీ యెడరు తలఁగు నిం కెట్లొక్కో?’ 482

ప్రతిపదార్థం: నాకున్= నాకు; లావును= బలమూ; దృష్టియున్= చూపూ; గతియునున్= ఆధారమూ (నడవడిక); ఆ+ వేదచయంబు+అ= ఆ వేదసమూహమే; అవి= ఆ వేదాలు; అడఁగినన్= అంతరించిపోతే; నేను= నేను; ఏ విధిన్= ఏ విధంగా; లోకములు= లోకాలు; సృజింతున్?= సృష్టిస్తాను?; ఏవాఁడు= ఏ వ్యక్తి; ఈ+ఎడరు= ఈ ఆపదను; ఇంకన్= ఇక ఏవిధంగా; ఎట్లు+ఒక్కో?= ఎట్లాగో ఏమిటో కదా; తలఁగున్= తప్పిస్తాడు;

తాత్పర్యం: ‘నాకు బలమూ, చూపూ, ఆధారమూ - అన్నీ వేదాలే. అవే నశించిపోతే నే నింక జగత్తులను ఎట్లా సృష్టిస్తాను? ఈ ఆపదనుంచి నన్ను ఎవరు ఎలా తప్పించగలరు?

వ. అని పలవించి. 483

ప్రతిపదార్థం: అని= ఇట్లాగ; పలవించి= దుఃఖించి.

తాత్పర్యం: ఇట్లా దుఃఖించి.

ఆ. విష్ణు బహువిధముల వినుతింప నజ్జల । శాయి హయశిరంబు సకలవర్ణ
భాసురంబునైన పరమాద్భుతంపు రూ । పంబు దాల్చి వేదపరత నొంది. 484

ప్రతిపదార్థం: విష్ణున్= విష్ణుమూర్తిని; బహువిధములన్= అనేక ప్రకారాలుగా; వినుతింపన్= స్తుతించేసరికి; ఆ+జలశాయి= ప్రళయ జలధిలో శయనించిన ఆ విష్ణుమూర్తి; హయశిరంబున్= గుఱ్ఱపు తలకలదీ; సకలవర్ణ= అన్ని రంగులూ కలిగి; భాసురంబు= ప్రకాశిస్తున్నదీ; ఐన= అయినటువంటి; పరమ+అద్భుతంపు+రూపంబు= మిక్కిలి ఆశ్చర్యకరమైన మూర్తి; తాల్చి= ధరించి; వేదపరతన్= వేదాన్వేషణ తత్పరతను; ఒంది= పొంది - ‘నానామూర్తిభిరావృతమ్’ - అని మూలంలో ఉంది. సకలవర్ణ భాసురము అన్నాడు తిక్కన.)

తాత్పర్యం: బ్రహ్మదేవుడు విష్ణుమూర్తిని బహువిధాలుగా స్తుతించాడు. ప్రళయజలధిలో నిద్రిస్తున్న విష్ణువు అప్పుడు హయగ్రీవరూపం ధరించాడు. గుఱ్ఱపుతల, వివిధ వర్ణాలతో ప్రకాశించే శరీరం - ఈ రూపంతో వేదాన్వేషణకు ఉపక్రమించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **పాతాళమునకుఁ జని యం । దాతతమై ప్రణవరూప మగు నాదం బు**
ద్ద్యోతితము సేసె నది యా । దైతేయులు విని పటుప్రతాపం బెసఁగన్. 485

ప్రతిపదార్థం: పాతాళమునకున్= పాతాళలోకానికి; చని= వెళ్ళి; అందున్= అక్కడ; ఆతతమై= సుదీర్ఘమూ; ప్రణవరూపము= ఓంకారరూపమూ; అగు= అయిన; నాదంబున్= ధ్వనిని; ఉద్ద్యోతితము+చేసెన్= మారుమ్రోగించాడు; అది= ఆ ప్రణవధ్వని; ఆ+దైతేయులు= ఆ రాక్షసులు ఇద్దరూ (మధుకైటభులు); విని= ఆలకించి; పటుప్రతాపంబు+ఎసఁగన్= గొప్ప శౌర్యం అతిశయించేటట్టు.

తాత్పర్యం: హయగ్రీవరూపంలో విష్ణువు పాతాళానికి వెళ్ళి అక్కడ సుదీర్ఘంగా ప్రణవధ్వని చేసాడు. అది విన్న మధుకైటభులు మహాప్రతాపంతో అటువైపు వచ్చారు.

క. **ఆ నాదము దెసకుం జన । దానవరిపుఁ డొండువలనఁ దా నరిగి తదీ**
యానూనబంధపీడిత । లైన శ్రుతులు విడిచి తెచ్చి యజునకు నిచ్చెన్. 486

ప్రతిపదార్థం: ఆ+నాదము+దెసకున్= ఆ ప్రణవధ్వని వైపు; చనన్= మధుకైటభులు రాగా; దానవరిపుఁడు= రాక్షసుల శత్రువైన విష్ణువు; ఒండువలనన్= మరొకవైపు; తాన్+అరిగి= తాను వెళ్ళి; తదీయ= వారియొక్క; అనూన= దృఢమైన; బంధ= బంధనాలతో; పీడితలు+ఐన= హింసింపబడుతున్న; శ్రుతులు= వేదాలు; విడిచి= కట్లు విప్పి (విడిపించి); తెచ్చి= తీసుకువచ్చి; అజునకున్= బ్రహ్మకు; ఇచ్చెన్= సమర్పించాడు.

తాత్పర్యం: ఆ ప్రణవధ్వని వినవస్తున్న వైపు పరుగుతీసారు మధుకైటభులు. అప్పుడు హయగ్రీవుడు మరొకవైపు వెళ్ళి, అక్కడ బంధపీడితాలై పడి ఉన్న వేదాలకు కట్టులు విప్పి వాటిని తీసికొనివచ్చి, బ్రహ్మకు అప్పగించాడు.

తే. **ఇచ్చి యెప్పటి యట్ల యహీంద్రతల్ప । శయనుఁడై యుండె నటఁ దమ చనినచోట**
నెవ్వరినిఁ గాన కా దైత్యు లెచట శ్రుతులు । దారు మును వెట్టి రందు సత్వరముగాఁగ. 487

ప్రతిపదార్థం: ఇచ్చి= బ్రహ్మకు అప్పగించి; ఎప్పటియట్లు+అ= ఎప్పటిలాగానే; అహి+ఇంద్ర+తల్ప+శయనుఁడై - అహీంద్ర= సర్పరాజయిన ఆదిశేషుడు అనే; తల్ప= శయ్యమీద; శయనుఁడు+ఐ= శయనించినవాడై; ఉండెన్= ఉన్నాడు; అటన్= ఆ పాతాళంలో; తమ+చనిన+చోట= తాము వెళ్ళినవైపున; ఎవ్వరినిన్= ఎవరినీ; కానక= చూడక (ఎవ్వరూ కనపడకపోవటంతో); ఆ+దైత్యులు= ఆ మధుకైటభ రాక్షసులు; ఎచటన్= ఏ ప్రదేశంలో; శ్రుతులు= వేదాలు; తారు= తాము; మును= ఇంతకుపూర్వం; పెట్టిరి= దాచారో; అందున్= ఆ ప్రదేశంలోకి; సత్వరము+కాఁగన్= గబగబా వెళ్ళిచూశారు.

తాత్పర్యం: వేదాలను బ్రహ్మకు అప్పగించి విష్ణుమూర్తి వెళ్ళి ఏమీ ఎరగనట్లు ఎప్పటివలె శేషతల్పంమీద శయనించాడు. ఇంక పాతాళంలో సంగతి - ఓంకారం వినిపించిన వైపు పరుగుపరుగున వెళ్ళిన మధుకైటభులకు అక్కడ ఎవ్వరూ కనబడలేదు. వాళ్ళు మునుపు వేదాలు ఎక్కడ దాచారో గబగబా అక్కడికి వెళ్ళిచూశారు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. **అరిగి యచట వాని నరసి కానక రభ । సమునఁ గలయఁ దిరిగి శార్ఙ్గిఁ గాంచి**
యుద్ధమునకుఁ బిల్వ నద్ధరణీధరుం । డదరి సమయఁ జూచె నసురయుగము. 488

ప్రతిపదార్థం: అరిగి= వెళ్ళి; అచటన్= అక్కడ; వానిన్= ఆ వేదాలను; అరసి= వెదికి; కానక= (చూడక) కనిపించకపోవటంతో; రభసమునన్= కంగారుగా; కలయన్+తిరిగి= చిందుతొక్కి (అంతటా వెదకి); శార్ఙ్గిన్= విష్ణుమూర్తిని; కాంచి= చూచి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యుద్ధమునకున్= యుద్ధానికి; పిల్వన్= పిలిచేసరికి; ఆ+ధరణీధరుండు= ఆ విష్ణుమూర్తి (వరాహావతారంలో భూగోళాన్ని ధరించినవాడు); అడరి= విజృంభించి; అసురయుగమున్= ఆ రాక్షసుల జంటను; సమయన్+చూచెన్= చనిపోవటం చూచాడు. (చనిపోయేట్టు చేసాడు - సంహరించాడు అని ఫలితార్థం.)

తాత్పర్యం: వేదాలను ఎక్కడ దాచారో అక్కడ అంతా వెదికారు. అవి కనిపించలేదు. అంతటా గాలించారు. యోగనిద్రలో ఉన్న విష్ణుమూర్తి కనిపించాడు. వీళ్ళు యుద్ధానికి ఆహ్వానించారు. కయ్యానికి కాలుదువ్వారు. స్వామి చూశాడు, యుద్ధం చేశాడు. సంహరించాడు.

వ. ఇట్లు విష్టరశ్రవుండు సృష్టకార్యంబు నిర్విఘ్నంబుఁ జేసిన విధాత యప్పని సునీతంబు సేసె నాఁటనుండియు హయశిరోమహితయగు నమ్మూర్తి దక్కిన మూర్తులకంటె నెక్కు డయ్యె నా జగత్కర్తను వేదంబులు నాశ్రయించియుండు'నని చెప్పి వెండియు. 489

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; విష్టరశ్రవుండు= విష్ణుమూర్తి; సృష్టికార్యంబున్= జగత్తులను సృష్టించటం అనే పనిని; నిర్విఘ్నంబున్+చేసినన్= (ఆటంకం తొలగించి) నిర్విఘ్నం చేస్తే; విధాత= బ్రహ్మదేవుడు; ఆ+పని= ఆ సృష్టికార్యాన్ని; సునీతంబు+చేసెన్= నెరవేర్చాడు (కడతేర్చాడు); నాఁటినుండియున్= ఆ రోజునుంచీ; హయశిరః= గుర్రపుతలతో; మహిత+అగు= కూడినదైన; ఆ+మూర్తి= ఆ స్వరూపం; తక్కిన= మిగిలిన; మూర్తులకంటెన్= స్వరూపాలకన్నా; ఎక్కుడు+అయ్యెన్= ఎక్కువది అయ్యింది; ఆ జగత్కర్తను= లోకకారకుడైన ఆ విష్ణుమూర్తిని; వేదంబులున్= వేదాలుకూడా; ఆశ్రయించి+ఉండున్= ఆశ్రయించుకొని ఉంటాయి; అని చెప్పి= అని వివరించి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ఇట్లా విష్ణువు జగత్తును సృష్టించటంలో ఉన్న ఆటంకాన్ని తొలగించగా, బ్రహ్మ సృష్టికార్యాన్ని నెరవేర్చాడు. ఆనాటినుండి హయగ్రీవమూర్తి తక్కిన మూర్తులకంటె మహిమాన్వితమయింది. వేదాలు కూడా ఆ విష్ణువును ఆశ్రయించి ఉన్నాయి' అని చెప్పి తిరిగి.

క. 'హరి సత్త్వాదిగుణంబులఁ । బోరిఁబోరిఁ గలిగింపఁ బెంపఁ బొలియింపఁగ భూ
వర! యవి యెక్కువఁ దక్కువఁ । బొరయుచుఁ బరివర్తనంబుఁ బొందుచునుండున్. 490

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; హరి= విష్ణుమూర్తి; సత్త్వ+ఆది+గుణంబులన్= సత్త్వరజస్తమోగుణాలను; పొరిన్+పొరిన్= క్రమక్రమంగా; కలిగింపన్= కల్గించటం; పెంపన్= పెంచటం; పొలియింపఁగన్= త్రుంచటం చేస్తే; అవి= ఆ గుణాలు; ఎక్కువన్+పొరయుచున్= ఎక్కువ అవుతూ; తక్కువన్+పొరయుచున్= తక్కువ అవుతూ (పొరయు= పొందు); పరివర్తనంబున్= ఇలా మార్పును; పొందుచున్+ఉండున్= పొందుతూ ఉంటాయి.

తాత్పర్యం: 'ఓ జనమేజయ మహారాజా! విష్ణుమూర్తి తన చిత్తం వచ్చినట్లు సత్త్వరజస్తమో గుణాలను కలిగిస్తూ పెంచుతూ తగ్గిస్తూ ఉంటాడు. దానినిబట్టి అవతారమూర్తులలో ఎక్కువలూ, తక్కువలూ వస్తూ ఉంటాయి. ఇట్లా మార్పులు జరుగుతుంటాయి.

క. గుణవంతుఁడు గుణరహితుఁడు । గుణకల్పనతత్పరుండు గుణనాశననై
పుణశాలి గుణనిబద్ధుఁడు । గుణమోక్షణకరుఁడు శార్ఙ్గి కురుకులముఖ్యా! 491

ప్రతిపదార్థం: కురుకుల= కురువంశంలో; ముఖ్యా!= ముఖ్యుడా! ఓ జనమేజయా!; శార్ఙ్గి= విష్ణుమూర్తి (విష్ణుమూర్తి ధనుస్సుపేరు శార్ఙ్గం. అది కలవాడు కాబట్టి శార్ఙ్గి); గుణవంతుఁడు= త్రిగుణాలూ కలవాడూ; గుణరహితుఁడు= గుణాలు లేనివాడు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గుణకల్పన తత్పరుడు= గుణాలకల్పనలో ఆసక్తి కలవాడూ (గుణాలను కల్పించేదీ అతడే); గుణనాశన= గుణాలను నాశనంచేసే; నైపుణశాలి= నేర్పరీ అతడే; గుణ= గుణాలకు; నిబద్ధుఁడు= కట్టుబడి ఉండేవాడూ; గుణ= గుణాలకు; మోక్షణ+కరుఁడు= విముక్తి కలిగించేవాడూ అతడే.

తాత్పర్యం: జనమేజయా! విష్ణుమూర్తి తత్త్వం చాలా విచిత్రంగా ఉంటుంది. గుణవంతుడూ ఆతడే, గుణరహితుడూ ఆతడే. గుణాలను సృష్టించేదీ అతడే, తుదముట్టించేదీ అతడే. గుణాలకు నిబద్ధుడై ఉండేదీ అతడే, విముక్తి కలిగించేదీ అతడే.

క. విను నారాయణపరములు । జననాయక! వేదములును జన్నంబులుఁ ద
క్కిన పుణ్యసమారంభము । లును రసముఖగోచరంబులును భూతములున్. 492

ప్రతిపదార్థం: జననాయక!= నరాధిపా!; విను= వినుము; వేదములును= వేదాలూ; జన్నంబులున్= యజ్ఞాలూ; తక్కిన= ఇంకా మిగిలిన; పుణ్యసమారంభములును= పవిత్రకార్యక్రమాలూ; రసముఖ= నీరు మొదలుగా; గోచరంబులును= ఇంద్రియగ్రాహ్యాలైన (తెలిసే); భూతములున్= పంచభూతాలూ; నారాయణపరములు= నారాయణాత్మకాలు.

తాత్పర్యం: రాజా! వేదాలూ, యజ్ఞాలూ, సకలపుణ్యకార్యాలూ, పంచభూతాలూ - ఇవన్నీ నారాయణ స్వరూపాలూ, నారాయణపరాలూను.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనుతో 'నేకాంతికజనులు లోకోత్తరులని చెప్పి; తయ్యేకాంతికత్వం బెట్టిది? యెఱింగింపవే?' యనుటయు నతం డతని కిట్లనియె. 493

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలించి; జనమేజయుండు= ఆ జనమేజయుడు; వైశంపాయనుతోన్= వైశంపాయన మహర్షితో; ఏకాంతికజనులు= ఏకాగ్రచిత్తం కలవారు; లోక+ఉత్తరులు+అని= చాలా గొప్పవారని (లోకంలో - లోకులలో గొప్పవారు - లోకోత్తరులు); చెప్పితి(వి)= అన్నావు; ఆ+ఏకాంతికత్వంబు= ఆ ఏకాగ్రచిత్తత; ఎట్టిది= ఎటువంటిది?; ఎఱింగింపవే?= తెలియజెప్పవా?; అనుటయున్= అని అడగగానే; అతండు= ఆ వైశంపాయనుడు; అతనికిన్= ఆ జనమేజయుడికి; ఇట్లు= ఇలా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అంతా విని, జనమేజయుడు 'ఏకాగ్రచిత్తం అంటే ఏమిటి? తెలుపుము.' అని అడుగగా దానికి వైశంపాయనుడు ఇట్లా బదులిచ్చాడు.

ఆ. ' సాంఖ్యయోగ పరమసారభూతం బిది । మున్ను వింటి యుద్ధమునకుఁ జొరక
కరుణ నార్ద్రుఁడైన గాండీవి బోధింపఁ । గృష్ణు చెప్పినట్టి గీత లందు. 494

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పబోయే ఏకాంతికత్వం అనేది; సాంఖ్య-యోగ= సాంఖ్యమూ, యోగమూ అనే రెండింటియొక్క; పరమసారభూతంబు= ఉత్తమసారమయినది; యుద్ధమునకున్= కురుక్షేత్రంలో యుద్ధానికి; చొరక= దిగకుండా; కరుణన్= దుఃఖంతో; ఆర్ద్రుఁడు+ఐన= మెత్తబడిపోయిన; గాండీవిన్= గాండీవధారి అయిన అర్జునుడిని; బోధింపన్= మేలుకొల్పటంకోసం (జ్ఞానిని చేయటంకోసం); కృష్ణు= కృష్ణుడు; చెప్పినట్టి= ఉపదేశించిన (కృష్ణుడు ఉపదేశించిన - అని); గీతలందున్= భగవద్గీతలలో; ఇది= దీనిని; మున్ను= వెనుకటికి; వింటిన్= విన్నాను (అది నీకు చెబుతున్నాను అని).

తాత్పర్యం: 'జనమేజయా! నీవు అడిగిన ఏకాంతికత్వం అనేది సాంఖ్యయోగశాస్త్రాల సారం. వెనుకటికి - కురుక్షేత్ర సంగ్రామంలో యుద్ధవిముఖుడైన పార్థుడిని ప్రబోధించటానికి శ్రీకృష్ణుడు ఉపదేశించిన గీతలలో ఉన్న విషయం ఇది. దీనిని అప్పు డెప్పుడో విన్నాను. ఇప్పుడు నీకు చెప్పుతున్నాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వైశంపాయనుఁడు జనమేజయున కేకాంతికధర్మ మెఱింగించుట (సం. 12-336-8)

క. నిర్మలమగు నేకాంతిక । ధర్మము నారాయణోదితంబై క్రియలం
గర్మఠుఁడగు బ్రహ్మమతిని । ధార్మికవర! యొలసె, నతఁడు దయ సిగురొత్తన్. 495

ప్రతిపదార్థం: ధార్మికవర!= ధార్మికులలో ఉత్తముడా!; నిర్మలము+అగు= పవిత్రమైన; ఏకాంతిక ధర్మము= ఈ ఏకాంతిక లక్షణం; నారాయణ+ఉదితంబై= విష్ణుమూర్తిచేత చెప్పబడినదై; క్రియలన్= పనులలో; కర్మఠుఁడు+అగు= కర్మిష్ఠి (నైష్ఠికుడు) అయినటువంటి; బ్రహ్మమతినిన్= బ్రహ్మదేవుని బుద్ధిని; ఒలసెన్= పొందింది; (నారాయణుడు చెప్పగా బ్రహ్మదేవుడు గ్రహించాడు) - అని; అతఁడు= ఆ బ్రహ్మ; దయ= కరుణ; చిగురొత్తన్= పల్లవించగా.

తాత్పర్యం: ధర్మాచరణంలో ఉత్తముడవైన ఓ జనమేజయా! ఏకాంతికతత్త్వాన్ని ముందుగా నారాయణుడు బ్రహ్మకు చెప్పాడు. అటుపైన బ్రహ్మదేవుడు దయతో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. దక్షునకు నెఱింగించిన । దక్షుఁడు బోధించెఁ దనదు దౌహిత్రు జగ
చ్చక్షుని నా సవిత్రుండు మ । నుక్షితిపతి కిచ్చె నవ్వినుతధర్మంబున్. 496

ప్రతిపదార్థం: దక్షునకున్= దక్షప్రజాపతికి; ఎఱింగించినన్= బ్రహ్మదేవుడు చెప్పగా; దక్షుడు= ఆ దక్షప్రజాపతి; తనదు+దౌహిత్రున్= తన మనుమడూ (కూతురి కొడుకు); జగత్+చక్షునిన్= లోకనేత్రమూ అయిన సూర్యుడిని ఉద్దేశించి; బోధించెన్= ఉపదేశించాడు; ఆ+సవిత్రుండు= ఆ సూర్యుడు; ఆ+వినుత+ధర్మంబున్= నుతింపదగిన ఆ ధర్మాన్ని; మనుక్షితిపతికిన్= మను మహారాజుకి; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు దక్షప్రజాపతికీ, దక్షుడు సూర్యుడికీ, సూర్యుడు మనువుకూ ఈ ఏకాంతికధర్మాన్ని ఉపదేశించారు.

క. మను విక్ష్వాకున కొసఁగె న । తని వలనఁ దదీయ యోగ్యతా కలితులు స
జ్జనములు వడసి రనేకులు । విను నారాయణునిచేత విని నారదుఁడున్. 497

ప్రతిపదార్థం: మనువు= ఆ మనువు; ఇక్ష్వాకునకున్= ఇక్ష్వాకుమహారాజుకు; ఒసఁగెన్= ఇచ్చాడు; అతనివలనన్= ఆ ఇక్ష్వాకువు నుండి; తదీయ= దానికి అవసరమైన; యోగ్యతా= అర్హతలతో; (ఆ) కలితులు= కూడుకొన్న; సత్+జనములు= సత్పురుషులు; అనేకులు= చాలామంది; పడసిరి= పొందారు; విను= జనమేజయా! ఆలకించుము; నారాయణునిచేతన్= నారాయణునినుంచి; విని= తెలిసికొని; నారదుఁడున్= నారదమహర్షి కూడా.

తాత్పర్యం: మనువునుండి ఇక్ష్వాకుమహారాజుకూ, అతడినుండి దానిని అందుకొనే యోగ్యత ఉన్న సజ్జనులకు చాలామందికీ ఆ ఏకాంతికధర్మం అందింది. సాక్షాత్తూ నారాయణుడినుండి తెలిసికొన్న నారదుడు కూడా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తగియెడు శిష్యుల కొసఁగెను । జగతీశ్వర! యిట్టు లది ప్రశస్తంబై యి
జ్జగములను గలిగె విను మ । య్యగాధ ధర్మంబు దుష్కృతాప్రాప్యమగున్. 498

ప్రతిపదార్థం: జగతీ+ఈశ్వర!= మహారాజా!; తగియెడు= తగిన; శిష్యులకున్= శిష్యులకు; ఒసఁగెను= (ఉపదేశం) ఇచ్చాడు;ఇట్టులు= ఇలా; అది= ఆ ఏకాంతికధర్మం; ప్రశస్తంబు+ఐ= ప్రసిద్ధికెక్కి; ఈ+జగములను= ముల్లోకాలలోనూ; కలిగెన్= వెలిసింది; వినుము= విను; ఆ+అగాధధర్మంబు= లోతైన (అంతుచిక్కని) ఆ ఏకాంతికధర్మం; దుష్కృత= పాపాత్ములకు; అప్రాప్యము+అగున్=అందదు.

తాత్పర్యం: ఆ నారదుడు తగిన శిష్యులకు నేర్పాడు. ఇట్లా పరంపరగా ఈ ఏకాంతికధర్మం సకల లోకాలలోనూ ప్రసిద్ధికెక్కింది. అగాధమైన ఈ ధర్మం పాపాత్ములకు మాత్రం అందదు.

క. దాని కహింసయ మూలము। దానన హరి ప్రీతుఁ డగు నతం డన ధరణీ
జానీ! క్షేత్రజ్ఞుం డనఁ। గా నొక్కఁడ యగుట దెలియఁగా వలయుఁ గడున్. 499

ప్రతిపదార్థం: ధరణీజానీ!= (భూమి భార్యగా కలవాడా!) ఓ రాజా!; దానికిన్= ఆ ఏకాంతికధర్మానికి; అహింస+అ= అహింస ఒక్కటే; మూలము= (ఆధారం) మూలం; దానన్+అ= దానితోనే; హరి= విష్ణుమూర్తి; ప్రీతుఁడు+అగున్= సంతుష్టుడు అవుతాడు; అతండు+అనన్= విష్ణుమూర్తి అన్నా; క్షేత్రజ్ఞుండు+అనఁగాన్= క్షేత్రజ్ఞుడు అన్నా; ఒక్కఁడ+అగుట= ఒక్కడే కావటం (ఇద్దరూ అభిన్నం); కడున్= బాగా; తెలియఁగాన్+వలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: ఈ ఏకాంతికధర్మానికి అహింస ఒక్కటే మూలం. ఈ ధర్మంతోనే హరి సంప్రీతుడు అవుతాడు. హరి అన్నా క్షేత్రజ్ఞుడన్నా ఒక్కడే అనే విషయం తప్పక గుర్తించాలి.

క. ఏకద్విత్రిచతుర్వ్యూ। హాకారతఁ దోఁచుచుండు హరి భక్తజనా
లోకమున వాసుదేవా। ద్యోకః ప్రాప్తముగఁ దత్తదుచితస్ఫూర్తిన్. 500

ప్రతిపదార్థం: ఏక(వ్యూహ+ఆకారతన్)= ఒక వ్యూహంతోనూ; ద్వి+వ్యూహాకారతన్= రెండు వ్యూహాల ఆకారంతోనూ; త్రివ్యూహాకారతన్= మూడు వ్యూహాల ఆకారంతోనూ; చతుః+వ్యూహాకారతన్= నాలుగు వ్యూహాల ఆకారంతోనూ; హరి= విష్ణుమూర్తి; భక్తజన+ఆలోకమునన్= భక్తులైన జనుల చూపులకు (అంతర్ దృష్టికి); వాసుదేవ+ఆది= వాసుదేవుడూ మొదలైన; ఓకః= నివాసాల (ఉపాధులు); ప్రాప్తముగన్= ప్రాప్తితో (వాసుదేవాది వ్యూహాలను ధరించి అని); తత్తత్= ఆయావాటికి; ఉచిత= తగిన; స్ఫూర్తిన్= ప్రకాశంతో (స్ఫురణతో); తోఁచుచుండున్= దర్శనం ఇస్తూ ఉంటాడు.

తాత్పర్యం: ఒక్కొక్కటీ రెండేసీ మూడేసీ నాలుగేసీ వ్యూహాలతో వాసుదేవాది ఉపాధులను (జీవుడికి నివాసం శరీరం కనుక అదే ఉపాధి. దానినే 'ఓకస్' అన్నాడు తిక్కన.) ఉచితరీతిలో స్వీకరించి విష్ణుమూర్తి భక్తుల చూపులకు దర్శనం అనుగ్రహిస్తూ ఉంటాడు. ఏకవ్యూహం ద్వివ్యూహం - అంటూ ఇక్కడ వ్యూహాల సంఖ్య పెరిగినా, ప్రథమవ్యూహం ద్వితీయవ్యూహం ఇత్యాదిగా పరిగణించటమే సంప్రదాయం.

విశేషం: దీనికి మూలశ్లోకం ఇట్లా ఉన్నది - **"ఏకవ్యూహ విభాగో వా క్వచిద్ ద్వివ్యూహసంజ్ఞితః । త్రివ్యూహశ్చాపి సంఖ్యాతః చతుర్వ్యూహశ్చ దృశ్యతే" (53)** వ్యూహం అనేది ఆధ్యాత్మికంగా ఒక పారిభాషికపదం. అవతార ప్రణాళిక లేదా తత్త్వం అని తేలికగా చెప్పుకొనవచ్చును.

తే. వాసుదేవుండు ప్రథమంబు వసుమతీశ! । యొలి సంకర్షణుండుఁ బ్రద్యుమ్నుఁడును ద్వి
తీయకంబుఁ దృతీయంబుఁ దెల్ల మచ్చ । తుర్థ మనిరుద్ధుఁ డిట్లు చతుర్విధములు. 501

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= భూమీశా! జనమేజయా! ఈ వ్యూహంలో; వాసుదేవుండు= వాసుదేవవ్యూహం; ప్రథమంబు= మొదటిది; ఒలిన్= క్రమంగా; సంకర్షణుండున్= సంకర్షణవ్యూహమూ; ప్రద్యుమ్నుఁడునున్= ప్రద్యుమ్నవ్యూహమూ అనేవి; ద్వితీయకంబున్= రెండవదీ; తృతీయంబున్= మూడవదీను; తెల్లము= స్పష్టం(గా); ఆ+చతుర్థము= నాల్గవది; అనిరుద్ధుఁడు= అనిరుద్ధవ్యూహం; ఇట్లు= ఈ విధంగా; చతుర్విధములు= వ్యూహాలు నాలుగు విధాలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: జనమేజయా! వాసుదేవావతారం ప్రథమవ్యూహం. సంకర్షణుడు అనేది ద్వితీయవ్యూహం. ప్రద్యుమ్నుడు -తృతీయవ్యూహం. అనిరుద్ధుడు చతుర్థవ్యూహం. ఇట్లా ఇవి నాలుగు విధాలు.

క. ఈ నెలవులఁ దోఁచును హరి । దా నొక్కఁడ; యింద్రియప్రతతి కందం; డే
కానూనభక్తి కగపడు; । దానికిఁ దపమును శమంబు దమమును వలయున్. 502

ప్రతిపదార్థం: ఈ నెలవులన్= ఈ స్థానాలలో (వ్యూహాలలో - ఉపాధులలో); హరి= విష్ణువు; తోఁచును= కనిపిస్తుంటాడు; తాను+ఒక్కఁడు+అ= అతడు ఒక్కడే; ఇంద్రియ ప్రతతికిన్= ఇంద్రియ సమూహానికి; అందండు= అందడు; ఏక= అద్వితీయమూ; అనూన= అత్యధికమూ అయిన; భక్తికిన్= భక్తికి; అగపడున్= కనపడతాడు; దానికిన్= అటువంటి భక్తికి (అంతటి/భక్తి/కుదరాలంటే); తపమును= తపస్సూ; శమంబున్= అంతరింద్రియ నిగ్రహమూ; దమమునున్= బాహ్యేంద్రియ నిగ్రహమూ; వలయున్= కావాలి.

తాత్పర్యం: మహారాజా! శ్రీమహావిష్ణువు ఈ నాలుగు నెలవులలోనూ దర్శనమిస్తాడు. ఇంద్రియాలకు గోచరుడు కాని దైవం అత డొక్కడే. అద్వితీయమూ అత్యధికమూ అయిన భక్తికి మాత్రమే అతడు కనపడతాడు. అంతటి భక్తి కుదరాలి అంటే తపస్సూ ఇంద్రియ నిగ్రహమూ ఉండాలి.

క. శాంతిపరినిష్ఠునకు నే । కాంతికధర్మంబు గరతలామలక మగుం
జింతాతంతుత్రుటనా । త్యంతవిదగ్ధంబు సూవె యది మనుజేంద్రా! 503

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్రా!= మానవనాయకా! (ఇంద్రశబ్దం శ్రేష్ఠతార్థకం కూడా); శాంతిపరినిష్ఠునకున్= శాంతిపట్ల పరినిష్ఠ కుదిరిన వ్యక్తికి (శమగుణ ప్రధానుడికి - లేదా - శాంతిపరినిష్ఠకల వ్యక్తికి); ఏకాంతిక ధర్మంబు= ఈ ఏకాంతిక లక్షణం; కరతల+ఆమలకము= అరచేతిలో ఉసిరిక పండు; అగున్= అవుతుంది (కైవసమై ఉంటుంది - అని); అది= ఆ ఏకాంతికధర్మం అనేది; చింతాతంతు త్రుటనాత్యంత విదగ్ధంబు సూవె - చింతా= దిగుళ్ళు అనే; తంతు= దారాలను; త్రుటనా= తుంపివెయ్యటంలో; అత్యంత= మిక్కిలి; విదగ్ధంబు= (నేర్పు కలది) సమర్థం; చూవె= సుమా!

తాత్పర్యం: మానవేంద్రా! శాంతిపట్ల ప్రగాఢమైన నిష్ఠ కల వ్యక్తికి ఏకాంతికధర్మమనేది కరతలామలకం, అత్యంత సులభం. అది చింతలు అనే దారాలను తెంపివెయ్యటంలో మిక్కిలి సమర్థం సుమా!

క. అనిన నతఁ 'డిట్టి ధర్మముఁ । గొనియాడక వ్రతము లొండు గోరి నడపఁగాఁ
బని యేమి? యెఱింగింపుము । జనముల చందంబు నాకు సంయమివర్యా!' 504

ప్రతిపదార్థం: అనినన్= అని వైశంపాయనుడు చెప్పగా; అతఁడు= ఆ జనమేజయుడు ఇట్లా అన్నాడు; సంయమివర్యా!= మునీశ్వరా!; ఇట్టి= ఇంతటి ఉత్తమమైన; ధర్మమున్= ఏకాంతికధర్మాన్ని; కొనియాడక= స్వీకరించి ఆచరించకుండా (స్తుతించక); ఒండు వ్రతములు= ఇతర వ్రతాలను (ధర్మాలను); కోరి= కావాలని చేపట్టి; నడపఁగాన్= ఆచరించటానికి; పని+ఏమి?= అవసరం ఏమిటి?; జనముల+చందంబు= ఈ ప్రజల తీరు; నాకున్= నాకు ఎఱింగింపుము= అర్థమయ్యేటట్టు చెప్పుము.

తాత్పర్యం: 'వైశంపాయనా! ఇంత గొప్పదయిన ఈ ఏకాంతిక ధర్మాన్ని ఆచరించకుండా ఇతర వ్రతాలు ఏవేవో చేపట్టవలసిన అవసరం ఏముంది అసలు? ప్రజలు ఇట్లా ఎందుకు చేస్తున్నారు? వీరి తీరు ఏమిటో నాకు కొంచెం తెలియజెప్పుము.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అని యడిగిన వైశంపా । యనుఁ డతనికి నిట్టు లనియె 'నది గల దధిపా!
విను సాత్త్వికమును రాజస । మును దామసమును వికారములు మానసముల్. 505

ప్రతిపదార్థం: అని+అడిగినన్= అని అడిగేసరికి; వైశంపాయనుఁడు= వైశంపాయన మహర్షి; అతనికిన్= ఆ జనమేజయుడికి; ఇట్టులు+అనియెన్= ఇలా అన్నాడు; అధిపా!= జనమేజయా!; అది= అటువంటిది; కలదు= ఉంది; విను= ఆలకించుము; సాత్త్వికమును= సాత్త్వికమూ; రాజసమును= రాజసమూ; తామసమును= తామసమూ అనే; వికారములు= వికృతులు; మానసముల్= మనస్సుకు సంబంధించినవి.

తాత్పర్యం: జనమేజయుడు ఇట్లా అడిగేసరికి వైశంపాయనుడు వివరిస్తున్నాడు. 'ఓ రాజా! సాత్త్వికం, రాజసం, తామసం అని మనోవికారాలు మూడురకాలు.

తే. వికృతు లందును సత్త్వస్థ విధము మేలు । దాన హరిఁ బొందవచ్చు నతండు నడపుఁ
దత్ప్రకారుల కుశలంపుఁ దంత్ర మెల్ల । వార లేకాంతికులు పెఱవారి వినుము. 506

ప్రతిపదార్థం: వికృతులందునున్= ఈ మనోవికారాలలో; సత్త్వస్థ+విధము= సాత్త్వికవికారం పద్ధతి; మేలు= ఉత్తమం; దానన్= దానితో; హరిన్= విష్ణువును; పొందవచ్చున్= పొందవచ్చు; తద్+ప్రకారుల= ఆ సాత్త్వికుల; కుశలంపున్+తంత్రము+ఎల్లన్= యోగక్షేమాల కార్యక్రమమంతా; అతండు= ఆ విష్ణువే; నడపున్= నడిపిస్తాడు (చూచుకుంటాడు); వారలు= ఆ సత్త్వనిష్ఠకలవారే; ఏకాంతికులు= ఏకాంతికులంటేను (ఏకాగ్రచిత్తులు-అద్వితీయులు); పెఱవారిన్= తక్కినవారిని గురించి; వినుము= వినుము.

తాత్పర్యం: పైన చెప్పిన మూడు మనోవికారాలలోనూ సాత్త్వికం ఉత్తమం. అది కలవారి యోగక్షేమాలన్నీ ఆ విష్ణువే చూచుకొంటాడు. వారే ఏకాంతికు లంటేను. ఇంక మిగతావారిని గురించి చెప్తాను ఆలకించుము.

క. కలగొన రాజసతామస । ము లయిన భావములు వికృతిఁ బొందింపఁగ మ
ర్త్యుల కేకాంతికవృత్తిని । నెలకొనఁగా నెట్లువచ్చు? నిర్మలధిషణా! 507

ప్రతిపదార్థం: నిర్మలధిషణా!= నిర్మలమైన బుద్ధికలవాడా!; కలగొనన్= క్రమ్ముకొనేట్టు (కలపు+కొను= కలగొను= వ్యాపించు; క్రమ్ము. కలఁక+కొను= కలగొను= క్షోభించు, వ్యాకులపడు); రాజసతామసములు+అయిన+భావములు= రాజసములయిన భావాలూ తామసములయిన భావాలూ; వికృతిన్+పొందింపఁగన్= వికారాన్ని కలిగిస్తూంటే; మర్త్యులకున్= మానవులకు; ఏకాంతికవృత్తిని= ఏకాంతికవ్రతదీక్షతో; నెలకొనఁగాన్= ఉండటం; ఎట్లు వచ్చున్?= ఎట్లా కుదురుతుంది?

తాత్పర్యం: మలినరహితమైన హృదయం కలవాడా! జనమేజయా! పరస్పరం ఆవరించి రాజసతామసభావాలు మానవుల హృదయాలను వికారపరుస్తూంటే వారు ఏకాంతికధర్మాన్ని అవలంబించటం ఎట్లా సాధ్యపడుతుంది?

క. వారికిఁ బ్రవృత్తి లక్షణ । తారూఢంబైన ధర్మ మలవడు హరికిం
గారుణ్య పాత్రములు గా । రారయ వా రన్యపథసమాశ్రితు లగుటన్. 508

ప్రతిపదార్థం: వారికిన్= అటువంటి వారికి; ప్రవృత్తి లక్షణతా= సంసారంలో ప్రవర్తించే లక్షణంతో (నివృత్తి లక్షణం కానిది); ఆరూఢంబైన= స్థిరపడిన; ధర్మము= మార్గం (వ్రతం); అలవడున్= అలవడుతుంది; (నివృత్తిధర్మం అలవడదు-అని); ఆరయన్= చూడగా; వారు= అటువంటివారు; అన్యపథ= వేరేమార్గాలను; సమాశ్రితులు+అగుటన్= ఆశ్రయించినవారు కావటంవలన; హరికిన్= విష్ణుమూర్తికి; కారుణ్యపాత్రములు= దయాపాత్రులు; కారు= కాలేరు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజసతామసగుణాలు కలవారికి ప్రవృత్తి లక్షణమే అలవడుతుంది కాని నివృత్తి లక్షణమైన ఏకాంతికధర్మం అలవడదు. అన్యమార్గాలను అవలంబించారు కాబట్టి వారు హరికి దయాపాత్రులుకూడా కాలేరు.

క. ఏకాంతికజనంబులు సు। శ్లోకుండగు హరిమనంబులో నుండుదు రా
లోకింప వారి కతనికి। నేకత్వము గలదు దెల్లమిది వేదములన్. 509

ప్రతిపదార్థం: ఏకాంతికజనంబులు= ఏకాంతికధర్మాన్ని అనుష్ఠించేనరులు (అద్వితీయులు); సుశ్లోకుండు+అగు= స్తుతిపాత్రుడైన; హరి= విష్ణుమూర్తియొక్క; మనంబులోన్= హృదయంలో; ఉండుదురు= ఉంటారు; ఆలోకింపన్= చూడగా; వారికిన్= వారికీ; అతనికిన్= హరికీ; ఏకత్వము+కలదు= అభేదముంది; ఇది= ఈ విషయం; వేదములన్= వేదాలలో; తెల్లము= స్పష్టం.

తాత్పర్యం: ఏకాంతిక ధర్మాన్ని అనుష్ఠించే ఉత్తములు ఎప్పుడూ విష్ణుమూర్తి మనస్సులోనే ఉంటారు. నిజానికి వారికీ హరికీ అభేదమే. ఇదే చెప్తున్నాయి వేదాలు.

క. ఈ తెరువు మద్గురుఁడు సం। ప్రీతిని దయ నన్ను నాదరించుచుఁ జెప్పెం
జేతశ్శుద్ధికలనమెయి। వీతదురితమైన భంగి విన్నది యధిపా! 510

ప్రతిపదార్థం: అధిపా!= జనమేజయా!; ఈ తెరువు= ఈ మార్గం; మద్గురుఁడు= మా గురువుగారు వ్యాసమునీంద్రుడు; సంప్రీతిని= ప్రేమతో; దయన్= దయతో; నన్నున్= నన్ను; ఆదరించుచున్= ఆదరిస్తూ; చెప్పెన్= ఉపదేశించాడు; చేతః+శుద్ధి= మనశ్శుద్ధి; కలనమెయిన్= ఉండటంతో; వీత= పోగొట్టబడిన; దురితము+ఐన భంగిన్= పాపాలు కలదయ్యేట్టు; విన్నది= నేను విన్నది - ఈ తెరువు (నాకు చేతశ్శుద్ధికలనమెయిన్ ఉండటంచేత, మద్గురుఁడు చెప్పెన్ అని కూడా అన్వయించవచ్చును).

తాత్పర్యం: మా గురువుగారు నామీద ప్రేమతో దయతో నాకు ఈ మార్గం ఉపదేశించారు. నాకు అంతశ్శుద్ధి ఉన్నది కనుక ఉపదేశించారు. నేను కూడా పాపాలు అన్నీ పోగొట్టుకొనగలిగిన పద్ధతిలో దీనిని విన్నాను. ఇది వినటంతో ఆచరించటంతో పాపాలు తొలగిపోయి పవిత్రుడను అయ్యాను.

క. చాలిన నీవును హరి ని। ట్లాలోకింపుము నిరంతరానందశ్రీ
శాలివగు దనిన నా భూ। పాలోత్తముఁ డా తపస్విపతి కిట్లనియెన్. 511

ప్రతిపదార్థం: చాలినన్= సమర్థుడవైతే - లేదా - ఇష్టపడితే; నీవునున్= నీవుకూడా; హరిన్= విష్ణుమూర్తిని; ఇట్లు+ఆలోకింపుము= ఇలా దర్శించుము (ఈమార్గంలో చూడుము); నిరంతర= ఎడతెరిపిలేని; ఆనంద+శ్రీశాలివి= ఆనందమనే భాగ్యం కలవాడివి (ఆనందభాగ్యశాలివి); అగుదు(వు)= అవుతావు; అనినన్= అని చెప్పగా; ఆ+భూపాల+ఉత్తముఁడు= ఆ రాజశ్రేష్ఠుడు; ఆ+తపస్విపతికిన్= ఆ మునీశ్వరునికి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: రాజా! ఇష్టపడితే, నియమాలను పాటించగలను అనుకొంటే నీవుకూడా ఏకాంతికధర్మాన్ని ఆచరించి ఈ మార్గంలో హరిని దర్శించుము. ఎడతెరిపి లేని నిజమైన ఆనందం అనే సౌభాగ్యాన్ని (ఆనందశోభను) పొందగలుగుతావు' అనేసరికి వైశంపాయనుడితో జనమేజయుడు ఇట్లా అంటున్నాడు మళ్ళీ.

తే. 'వేదములు సాంఖ్యమును యోగవిధియుఁ బాశు। పతముఁ బాంచరాత్రంబు నా బహువిధములఁ
జెల్లు బోధసాధనముల కెల్ల నిష్ఠ। యొక్కటియొ? యివి భిన్ననిష్ఠోదితములొ? 512

ప్రతిపదార్థం: వైశంపాయనా! వేదములున్= వేదాలూ; సాంఖ్యమునున్= సాంఖ్యమూ; యోగవిధియున్= యోగశాస్త్రమూ; పాశుపతమున్= పాశుపతమూ; పాంచరాత్రంబున్= పాంచరాత్రమూ; నాన్= అని; బహువిధములన్= పలు రకాలుగా; చెల్లు= ఒప్పుతున్న; బోధసాధనములకున్+ఎల్లన్= జ్ఞానమార్గాలకు అన్నింటికీ (సాధనం= ఉపకరణం); నిష్ఠ= (శ్రద్ధ) ఆశ్రయం; ఒక్కటియొ?= ఒకటేనా?; ఇవి= ఇవన్నీ; భిన్ననిష్ఠా+ఉదితములొ?= వేరువేరు ఆధారాలనుండి ఆవిర్భవించాయా?

తాత్పర్యం: మహర్షీ! వేదాలనీ, సాంఖ్యమనీ, యోగశాస్త్రమనీ, పాశుపతమనీ, పాంచరాత్రమనీ ఇట్లా రకరకాలుగా ఉన్నాయి జ్ఞానాన్ని ఇచ్చే మార్గాలు. వీటికి అన్నింటికీ నిష్ఠ అనేది ఒకటేనా? లేకపోతే దేనికదిదే విభిన్న నిష్ఠలూ ఆశ్రయాలూ ఉన్నాయా?

వ. నా కెఱింగింపవే వీనికిఁ బ్రవర్తకు లెవ్వరు? వారలం జెప్పు'మని యడిగిన జనమేజయునకు వైశంపాయనుండు. 513

ప్రతిపదార్థం: నాకున్= నాకు; ఎఱింగింపవే?= తెలియజేయవా?; వీనికిన్= ఈ విభిన్న సాధనాలకు (మార్గాలకు); ప్రవర్తకుల్= (ఆదిలో కర్తలై అమలు జరిపినవారు) ఉపదేశకులు; ఎవ్వరు= ఎవరు?; వారలన్= వారిని గురించి; చెప్పుము= తెలియజెప్పుము; అని= అని; అడిగిన= అడిగినటువంటి; జనమేజయునకున్= జనమేజయుడికి; వైశంపాయనుండు= వైశంపాయనమహర్షి (ఇట్లా చెబుతున్నాడు).

తాత్పర్యం: వీటి ప్రవర్తకు లెవరు? ఈ వివరాలు నాకు తెలియజెప్పవలసినది' అని జనమేజయుడు అడుగగా తిరిగి వైశంపాయనుడు చెప్పుతున్నాడు.

ఉ. ద్వీపమునం బ్రబోధపరిదీప్తుని వేదనిధానమున్ జగ
ద్వ్యాపకతేజు గంధవతియందుఁ బరాశరసంయమీశ్వరుం
డే పురుషోత్తముం బడసి యుద్ధృతమౌన్నతి నొందె లోకశి
క్షాపరు భారతాధ్యయన కారకుఁ గొల్చెద నమ్మహాత్మునిన్. 514

ప్రతిపదార్థం: ద్వీపమునన్= కృష్ణద్వీపంలో; ప్రబోధ= జ్ఞానంతో; పరిదీప్తునిన్= ప్రకాశించినవాడూ; వేద= వేదాలకు; నిధానమున్= నిధి అయినవాడూ (ఆకరమైనవాడూ); జగత్= ప్రపంచమంతటా; వ్యాపక= విస్తరించే; తేజున్= తేజస్సుకలవాడూ; (మరియు) పరాశర= పరాశరుడు అనే; సంయమీశ్వరుఁడు= ఋషీశ్వరుడు; ఏ పురుషోత్తమున్= ఏ ఉత్తమ మానవుడినీ; గంధవతియందున్= మత్స్యగంధియందు (సత్యవతియందు); పడసి= పుత్రుడుగా పొంది; ఉద్ధృతమ= మిక్కిలి స్తుతించదగిన; ఉన్నతిన్= ఔన్నత్యాన్ని (గౌరవాన్ని); ఒందెన్= పొందాడో; లోక= ప్రపంచానికి (ప్రజలకు); శిక్షా= విద్యనేర్పటంలో; పరున్= ఆసక్తి కలవాడూ; భారత+అధ్యయన+కారకున్= భారత అధ్యయనానికి హేతువైనవాడూ (మాకు భారతం రచించి నేర్పినవాడు) అయిన; ఆ+మహాత్మునిన్= మహానుభావుడైన ఆ వ్యాసుడిని; కొల్చెదన్= సేవిస్తాను.

తాత్పర్యం: రాజా! ముందుగా వ్యాసమహర్షికి నమస్కరిస్తున్నాను. ఆయన కృష్ణద్వీపంలో పరాశరుడికీ మత్స్యగంధికీ జన్మించి జ్ఞానతేజస్సుతో ప్రకాశిస్తున్నవాడు. ప్రపంచమంతటా ఆయన తేజస్సు వ్యాపించింది. ఆయన వేదాలకు నిధి. ఆయనను పుత్రుడుగా పొందటంవలన పరాశరుడికి లోకోన్నత విఖ్యాతి కలిగింది. ఆయనే లోకాల కన్నింటికీ ఉపదేశకుడు. భారతాధ్యయనానికి సృష్టికర్త.

వ. అనుచుం గృష్ణద్వైపాయనధ్యానపరాయణుం డగుచుం బలికి యా భూవిభున కభిముఖుండై. 515

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనుచున్= అని; కృష్ణద్వైపాయన+ధ్యాన+పరాయణుండు+అగుచున్= వ్యాసుడిని తత్పరతతో ధ్యానిస్తూ; పలికి= మాట్లాడి; ఆ+భూవిభునకున్= ఆ జనమేజయ మహారాజుకు; అభిముఖుండై= ముఖాముఖిగా కూర్చుని.

తాత్పర్యం: ఇట్లా వ్యాసుడిని ధ్యానించుకొని, రాజైన జనమేజయుడికి ఎదురుగా కూర్చొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినుమీ తంత్రంబుల కె । ల్లను నరయ బరాయణం బలఘుతరసంవి
త్తనుఁడగు నారాయణుఁడ, య । తనిఁ బొందఁగ ఋజువులగు పథములివి యధిపా! 516

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; వినుము; ఈ+తంత్రంబులకున్+ఎల్లను= ఈ శాస్త్రాలకు అన్నింటికీ; అరయన్= పరిశీలించి చూసినట్టయితే; అలఘుతర= మిక్కిలి గొప్పదయిన; సంవిత్+తనుఁడు+అగు= జ్ఞానమే శరీరంగా (రూపంగా) కలవాడైన; నారాయణుఁడు+అ= నారాయణుడే; పరాయణంబు= ఆశ్రయం (గమ్యం); అతనిన్= ఆ శ్రీమన్నారాయణుడిని; పొందఁగన్= చేరటానికి; ఇవి= ఈ తంత్రాలన్నీ; ఋజువులు+అగు= తిన్ననైన; పథములు= మార్గాలు.

తాత్పర్యం: రాజా! వేదసాంఖ్యాదిశాస్త్రాలక న్నింటికీ పరమగమ్యం, ఆశ్రయం శ్రీమన్నారాయణుడే. ఆయన జ్ఞానస్వరూపుడు. ఆయనను అందుకొనటానికి ఈ శాస్త్రాలు ఋజుమార్గాలు. (ఇక్కడికి నిష్ఠనుగురించి ప్రథమభాగానికి సమాధానం అయ్యింది).

వ. వేదంబులకుం బ్రవర్తకుండు నారాయణనందనుం డపాంతరతముం డనుపేరం బ్రసిద్ధుండగు వేదవ్యాసుండు, సాంఖ్యంబునకుం గపిలుండును, యోగంబునకు హిరణ్యగర్భుండును, బాశుపతంబునకు శివుండును బాంచరాత్రంబునకు విష్ణుండును బ్రవర్తకులు. పాంచరాత్రంబు వైష్ణవం బనం బరఁగు' ననిన విని యజ్ఞనపతి యమ్మునిపతితో 'వేదవ్యాసుండు పరాశరపుత్త్రుండని చెప్పి తప్పరమమునికి నారాయణనందనత్వం బెట్లు వచ్చె? ననుటయు నతం డతని కిట్లనియె. 517

ప్రతిపదార్థం: (ఇంక ప్రవర్తకులను గురించిన రెండవభాగానికి సమాధానం చెబుతున్నాడు) వేదంబులకున్= వేదాలకు; ప్రవర్తకుండు= ఉపదేశకుడు; నారాయణనందనుండు= శ్రీమన్నారాయణుని పుత్రుడూ; అపాంతరతముండు= అపాంతరతముడు; అనుపేరన్= అనే పేరుతో; ప్రసిద్ధుండు= విఖ్యాతుడూ; అగు= అయిన; వేదవ్యాసుండు= వేదవ్యాసుడే; సాంఖ్యంబునకున్= సాంఖ్యశాస్త్రానికి; కపిలుండును= కపిలుడూ; యోగంబునకున్= యోగశాస్త్రానికి; హిరణ్యగర్భుండునున్= బ్రహ్మదేవుడూ; పాశుపతంబునకున్= పాశుపతానికి; శివుండునున్= శివుడూ; పాంచరాత్రంబునకున్= పాంచరాత్రానికి; విష్ణుండునున్= విష్ణువూ; ప్రవర్తకులు= ఉపదేశకులు; పాంచరాత్రంబు= ఈ పాంచరాత్రమే; వైష్ణవంబు+అనన్+పరఁగున్= వైష్ణవమనీ పిలవబడుతుంది; అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ఆ+జనపతి= ఆ నరేంద్రుడు; ఆ+మునిపతితోన్= ఆ మునీంద్రుడితో; వేదవ్యాసుండు; పరాశరపుత్రుండు+అని= పరాశరమహర్షికి కుమారుడు అని; చెప్పితి(వి)= చెప్పావు; ఆ+పరమమునికిన్= ఆ వ్యాసమహర్షికి; నారాయణనందనత్వంబు= నారాయణుడికి పుత్రుడు కావటం అనేది; ఎట్లు= ఏ విధంగా; వచ్చెన్?= సిద్ధించింది?; అనుటయున్= అని అడిగేసరికి; అతండు= ఆ వైశంపాయనుడు; అతనికిన్= ఆ జనమేజయునికి; ఇట్లు+అనియెన్= ఇట్లా బదులు పలికాడు.

తాత్పర్యం: వేదాలకు ఉపదేశకుడు అపాంతరతముడనే పేరుకల వేదవ్యాసుడు. సాంఖ్యానికి కపిలుడు, యోగానికి హిరణ్యగర్భుడు, పాశుపతానికి శివుడు, పాంచరాత్రానికి విష్ణువూ ప్రవర్తకులు. పాంచరాత్రం వైష్ణవం అనబడుతుంది' అనగా విని ఆ రాజు ఆ మునితో 'వేదవ్యాసుడు పరాశరుడి కుమారు డని చెప్పావు; ఆ మునిశ్రేష్ఠుడిని నారాయణ పుత్రుడు అనే మాట ఎట్లా కలిగింది?' అని అనగా వైశంపాయనుడు జనమేజయుడికి ఇట్లా బదులు చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. హిమవన్నగంబు పాదమున మహాభార । తం బొనర్చి పరిశ్రమంబు దోఁప
భావించి శిష్యులు గావించు పరిచర్యఁ । దద్వినోదనపరత్వమున నొంది
వారికి వేదార్థభారతార్థంబులు । సాత్యవతేయుండు సదయబుద్ధి
నెఱిఁగించు చున్నట్టియెడ నేను లోనుగాఁ । గొందఱు దత్పాదవందనంబు

తే. భక్తిఁ జేసి నారాయణప్రభవుఁ డండ్రు । నిన్నుఁ గృపఁ జెప్పవే మాకు నిర్మలాత్మ!
యత్తెఱం గని యడిగిన నమ్మహాను । భావుఁ డత్యంతకరుణార్ద్రభావుఁ డగుచు. 518

ప్రతిపదార్థం: హిమవత్+నగంబు= హిమవత్పర్వతంయొక్క; పాదమునన్= సమీపంలో (ప్రత్యంత పర్వతంమీద. (పెద్దపర్వతానికి చుట్టూ ఉండే చిన్నపర్వతాలను ప్రత్యంత పర్వతాలనీ పాదపర్వతాలనీ అంటారు); మహాభారతంబు+ఒనర్చి= మహాభారతరచన పూర్తిచేసి; పరిశ్రమంబు= అలసట; తోఁపన్= కనిపించగా; భావించి= గుర్తించి; శిష్యులు= ఛాత్రులు; కావించు= చేసిన; పరిచర్యన్= సేవకు; తద్= ఆ శిష్యులను; వినోదనపరత్వమునన్+ఉండి(ఒంది)= ఆనందింపజేస్తూ ఉండి (ఆనందపరచటం మొదలుపెట్టి); వారికిన్= శిష్యులకు; వేదార్థ= వేదార్థమూ; భారతార్థంబులు= భారతార్థమూ; సదయబుద్ధిన్= కరుణ కలిగిన మనస్సుతో; సాత్యవతేయుండు= వ్యాసుడు; ఎఱిఁగించుచున్నట్టి ఎడన్= నేర్పుతున్న సమయంలో; నేను లోనుగాన్= నేను మొదలుగా; కొందఱు= కొందరు శిష్యులం; తద్+పాద+వందనంబు= వ్యాసుడి పాదాలకు నమస్కారం; భక్తిన్= భక్తితో; చేసి= చేసి; నిర్మలాత్మ!= పవిత్రమనస్వీ!; నిన్నున్= నిన్ను; నారాయణప్రభవుఁడు+అండ్రు= నారాయణాత్మజుడు అంటారు; ఆ+తెఱంగు= (అది ఎట్లా వచ్చిందో) ఆ తీరు; మాకున్= మాకు; కృపన్= దయతో; చెప్పవే?= తెలియజేయవా?; అని= అని; అడిగినన్= ప్రార్థించేసరికి; ఆ+మహానుభావుఁడు= ఆ మహాత్ముడు-వ్యాసుడు; అత్యంత= మిక్కిలి; కరుణా+ఆర్ద్ర+భావుఁడు+అగుచున్= దయతో చెమ్మగిల్లిన హృదయం కలవాడు అవుతూ -

తాత్పర్యం: వ్యాసమునీంద్రుడు హిమాలయాలలో భారతరచన పూర్తిచేసి అలసిపోయి ఉన్న సమయంలో మేమంతా ఆయనకు పరిచర్యలు చేశాము. దానికి ఆయన సంతోషించి, మమ్ములను వినోదింపజేయటానికి వేదార్థమూ భారతార్థమూ చెప్పుతూ వచ్చాడు. ఆ సమయంలోనే మేము కొందరం ఆయనకు సాష్టాంగపడి, 'గురుదేవా! నారాయణాత్మజుడు అని నిన్ను పెద్దలు చెప్పుతుంటారు. అది ఎట్లా? తెలియజేయవా?' అని ప్రార్థించాము. అప్పుడు వ్యాసుడు దయబూని. (తరువాతి వచనంతో అన్వయం).

వ. మాతోడ నిట్లనియె. 519

ప్రతిపదార్థం: మాతోడన్= మాతో; ఇట్లు= ఇలా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: మాతో ఈ విధంగా అన్నాడు.

వేదవ్యాసునకు నారాయణనందనత్వంబు గలిగిన ప్రకారము (సం. 12-336-24)

సీ. ఆదికాలమునఁ బ్రజాభిసర్గమునకు । నారాయణుఁడు నిజనాభిపద్మ
మున బ్రహ్మఁ గల్పింప భూతసంఘమ్ముల । నెల్ల నాతఁడు సృజియించె నతని
ముఖమున బహువేదములు ప్రసరింపఁగఁ । జేసి వానికి మేలుసేఁత బుద్ధిఁ
దలఁచి యవ్విష్ణుండు నలఘుబోధుని నపాం । తరతముం డనియెడు తనయుఁ జిత్త

తే. మునన కల్పించి యతిభక్తి మ్రొక్కి నిలిచి । యున్న యక్కుమారుని శ్రుతు లన్నియును దృ
ఢావధానుండవై విని నీవు వాని । నంచితవ్యాస మొందింపు మనియెఁ బ్రీతి. 520

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆదికాలమునన్= సృష్టికన్నా ముందరికాలంలో; నారాయణుఁడు= శ్రీమహావిష్ణువు; ప్రజా+అభిసర్గమునకున్= జీవ సృష్టికోసమని; నిజ= తనయొక్క; నాభి= పొక్కిలినుంచి వికసించిన; పద్మమునన్= పద్మంలో; బ్రహ్మన్= బ్రహ్మదేవుడిని; కల్పింపన్= ఉత్పాదించగా; ఆతఁడు= ఆ బ్రహ్మదేవుడు; భూతసంఘములన్+ఎల్లన్= ప్రాణికోటినంతటినీ; సృజియించెన్= సృష్టించాడు; అతని ముఖమునన్= ఆ బ్రహ్మదేవుని ముఖంనుంచి; బహువేదములు= అనేక వేదాలు; ప్రసరింపఁగన్+చేసి= ప్రసారం అయ్యేట్టు తానే చేసి; వానికిన్= ఆ వేదాలకు; మేలుచేఁతన్= మేలు చెయ్యటం అనే విషయాన్నికూడా; బుద్ధిన్= బుద్ధిలో; తలఁచి= ఆలోచించి; ఆ+విష్ణుండు= ఆ శ్రీమన్నారాయణుడు; అలఘు= గొప్పదైన; బోధునిన్= జ్ఞానం కలవాడూ; అపాంతరతముండు+ అనియెడు= అపాంతరతముడు అనే పేరున్నవాడూ అయిన - తనయున్= కుమారుడిని; చిత్తమునన్+అ= మనస్సులోనే; కల్పించి= సృష్టించి; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; మ్రొక్కి నిలిచియున్న= నమస్కరిస్తూ నిలబడ్డ; ఆ+కుమారునిన్= ఆ తనయుడిని; దృఢ= గాఢమైన; అవధానుండవు+ఐ= ఏకాగ్రత కలవాడవై; శ్రుతులు+అన్నియును= వేదాలు అన్నీ; విని= ఆలకించి; నీవు= నీవు; వానిన్= ఆ వేదాలను; అంచితవ్యాసమున్= అందమైన విభజనను (వ్యాసము= విడమరిచినది); ఒందింపుము= పొందించుము; అనియెన్+ప్రీతిన్= అని ప్రేమతో ఆజ్ఞాపించాడు - చెప్పాడు.

తాత్పర్యం: ఆదికాలంలో శ్రీమన్నారాయణుడు ప్రజాసృష్టి చేయటంకొరకని తన నాభికమలంనుండి బ్రహ్మను సృష్టించాడు. ఆయన సకలభూతాలనూ సృష్టించాడు. బ్రహ్మదేవుడి ముఖంనుండి వేదాలు ప్రసరించేటట్లు చేశాడు. ఆ వేదాలకు మేలు చేయటంకొరకని ఒక మహాజ్ఞానిని పుత్రుడుగా పొందాడు. ఆయన పేరే అపాంతరతముడు. ఆ కుమారుడు తండ్రికి భక్తితో నమస్కరించి నిలబడ్డాడు. 'నాయనా! ఏకాగ్రతతో వేదాలను అధ్యయనం చేయుము. వాటిని అందంగా విభజించుము' అన్నాడు.

ఆ. అనిన నట్లకాక యని యయ్యపాంతర । తముఁడు వేదభేదనము నొనర్చె
దాని కవ్విభుండు దద్దయుఁ బ్రీతుఁడై । వత్సలత్వ గౌరవం బెలర్ప. 521

ప్రతిపదార్థం: అనినన్= అని శ్రీమన్నారాయణుడు చెప్పగానే; అట్లు+అ+కాక= అట్లాగే; అని; ఆ+అపాంతరముఁడు= ఆ అపాంతరముడు; వేదభేదనమున్= వేదాల విభజనను (వేదాలను నాలుగుగా); ఒనర్చెన్= చేశాడు; దానికిన్= ఆ విభాగానికి; ఆ+విభుండు= ఆ శ్రీమన్నారాయణుడు; తద్దయున్= మిక్కిలి; ప్రీతుఁడై= సంతోషించి; వత్సలత్వగౌరవంబు= వాత్సల్యాతిశయం (వాత్సల్యరూపమైన గౌరవం); ఎలర్పన్= వికసింపగా.

తాత్పర్యం: శ్రీమన్నారాయణుడి ఆజ్ఞను స్వీకరించి, అపాంతరతముడు వేదాలను అధ్యయనం చేసి, వాటిని నాలుగుగా విభజించాడు. దానికి నారాయణుడు చాలా సంతోషించి వాత్సల్యంతో ఇట్లా అన్నాడు.

క. వేదవ్యాసుఁడ! రమ్మని । యాదరమునఁ బిలిచి నాకు నాత్మజుఁడై సం
పాదించువాఁడ వధికా । హ్లాదము మన్వంతరంబు లన్నిటియందున్. 522

ప్రతిపదార్థం: వేదవ్యాసుఁడ= ఓ వేదవ్యాసుడా!; రమ్ము= ఇట్లా రావయ్యా!; అని= అంటూ; ఆదరమునన్= ఆదరంతో; పిలిచి= ఆహ్వానించి; నాకున్= నాకు; ఆత్మజుఁడై= కుమారుడవై; మన్వంతరంబులు+అన్నిటియందున్= అన్ని మన్వంతరాలలోనూ (కల్పాలలోనూ); అధిక+ఆహ్లాదము= మిక్కిలి ఆనందం; సంపాదించువాఁడవు= పొందుతావు.

తాత్పర్యం: 'ఓ వేదవ్యాసుడా! రమ్ము. నాకు పుత్రుడవై నీవు అన్ని మన్వంతరాలలోనూ అత్యధికంగా ఆహ్లాదించుము.'

క. అని యానతిచ్చి మఱియును । జననంబులు నీకుఁ గల్గు సంయమిమాన్యా!
యనియుఁ బలికి వెండియు ని । ట్లనియెను విష్ణుండు పేర్చు నర్మిలితోడన్. 523

ప్రతిపదార్థం: అని=అంటూ; ఆనతి+ఇచ్చి= ఆజ్ఞాపించి; సంయమిమాన్యా!= మునీశ్వరా!, వేదవ్యాసా!; మఱియునున్= ఇంకా; జననంబులు= జన్మలు; నీకున్= నీకు; కల్గున్= లభిస్తాయి; అనియున్= అనికూడా; పలికి= చెప్పి; వెండియున్= మళ్ళీ; విష్ణుండు= ఆ నారాయణుడు; పేర్చు+నర్మిలితోడన్= అతిశయించే ప్రేమతో; ఇట్లు= ఈ విధంగా; అనియెను= అన్నాడు.

తాత్పర్యం: అని ఆనతిచ్చిన విష్ణుమూర్తి వేదవ్యాసుడికి ఇంకా మరికొన్ని జన్మలు లభిస్తాయని చెప్పాడు. ఇంకా ప్రేమతో ఇట్లా అన్నాడు.

క. 'నా చరితంబులుఁ ద్రైలో । క్యాచరణంబులును ధర్మ మఖిలంబు మదిం
జూచి త్రికాలజ్ఞత్వస । మీచీనత వెలయు - మునులు మేటి యనంగన్. 524

ప్రతిపదార్థం: మునులు= మహర్షులు; మేటి+అనంగన్= గొప్పవాడు - అని నిన్ను పొగడేటట్టు; నా+చరితంబులున్= నా కథలూ; త్రైలోక్య= ముల్లోకాలకూ; ఆచరణంబులునున్= ఆచరించదగిన అంశాలూ; అఖిలంబు= సమస్తమైన; ధర్మము= ధర్మమూ; మదిన్= అంతరంగంలో; చూచి= దర్శించి; త్రికాలజ్ఞత్వ= భూతభవిష్యద్వర్తమానాలను తెలియటం అనే; సమీచీనతన్= సామంజస్యంతో, వెలయు(ము)= విరాజిల్లుము.

తాత్పర్యం: 'నా కథలూ, ముల్లోకాలూ ఆచరించవలసిన అంశాలూ, అఖిలధర్మాలూ మనస్సులో దర్శించి త్రికాలజ్ఞుడవై మహర్షులలోకెల్లా ఉత్తముడవుగా విరాజిల్లుము నాయనా!

క. ఉత్తరకాలంబున లో । కోత్తరుఁడు వసిష్ఠపౌత్రుఁ డుదితజ్ఞానో
దాత్తుఁడు పరాశరుండను । నుత్తమసంయమికిఁ బుట్టు దుజ్జ్వలతేజా! 525

ప్రతిపదార్థం: ఉజ్జ్వలతేజా!= అధికంగా ప్రకాశించే తేజస్సుకలవాడా!; ఉత్తరకాలంబునన్= భవిష్యత్కాలంలో; లోక+ఉత్తరుఁడు= లోకంలో ఉత్తమోత్తముడూ; వసిష్ఠపౌత్రుఁడూ= వసిష్ఠమహర్షికి మనుమడూ (పౌత్రుడు= పుత్రుని పుత్రుడు); ఉదిత= ఆవిర్భవించిన; జ్ఞాన= జ్ఞానంతో; ఉదాత్తుఁడు= గొప్పవాడూ; పరాశరుండు+అను= పరాశరుడనే; ఉత్తమసంయమికిన్= గొప్ప మహర్షికి; పుట్టుదు(వు)= కుమారుడుగా జన్మిస్తావు.

తాత్పర్యం: ఓ వేదవ్యాసా! భవిష్యత్కాలంలో నీవు పరాశరుడికి పుత్రుడుగా జన్మిస్తావు. ఆ పరాశరుడు లోకోత్తరుడు. జ్ఞాని. వసిష్ఠుడికి మనుమడు. ఆయనకు నీవు పుత్రుడుగా జన్మిస్తావు.

క. నీ వలనన కలిగి కురు । క్ష్మావలయం బేలునట్టి జనపతు లన్యో
న్యావిష్టరోషులై రణ । సేవనమునఁ గులము తఱచు సెఱుతురు వత్సా! 526

ప్రతిపదార్థం: వత్సా!= తనయుడా! (అపాంతరతమా! వ్యాసా!); నీవలనన్+అ= నీవల్లనే; కలిగి= జన్మించి; కురుక్ష్మావలయంబు= కురు సామ్రాజ్యాన్ని; ఏలునట్టి= పరిపాలించే; జనపతులు= రాజులు (కౌరవపాండవులు); అన్యోన్య= పరస్పరం; ఆవిష్ట= ఏర్పడ్డ (నాటుకొన్న); రోషులై= రోసం కలవారై; రణసేవనమునన్= యుద్ధాన్ని ఆశ్రయించటంతో (ఆచరించటంతో); కులము+తఱచున్= వంశపు ఆధిక్యాన్ని; చెఱుతురు= నాశనం చేస్తారు.

తాత్పర్యం: నాయనా! అపాంతరతమా! నీవలన జన్మించినవాళ్ళే కురుసామ్రాజ్యాన్ని పరిపాలిస్తారు. ఆ రాజులకు పరస్పరం రోషాలు పెరుగుతాయి. యుద్ధానికి దిగుతారు. వంశవినాశనం అవుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. కాలముల కీడు కతమునఁ గలఁగఁ బడిన । వేదముల నీవు నాఁడును విమలబుద్ధి
నంచితవ్యాస మొందించి యఖిల దివిజ । మునిగణముల కొనర్తు సమ్మోద మనఘ! 527

ప్రతిపదార్థం: అనఘ!= పవిత్రుడా!; కాలముల= కాలాలు గలిగించిన; కీడుకతమునన్= కీడు కారణంగా; కలఁగఁబడిన= కలగాపులగం అయిపోయిన; వేదములన్= వేదాలను; నీవు= నీవు; నాఁడునున్= అప్పుడు కూడా మళ్ళీ; విమలబుద్ధిన్= నిర్మలమైన బుద్ధితో; అంచితవ్యాసము= అందంగా విభజనం; ఒందించి= చేసి; అఖిల= సమస్తమైన; దివిజ= దేవతలూ; మునిగణములకున్= ఋషి బృందాలకూ; సమ్మోదము= ఆనందం; ఒనర్తు(వు)= కలిగిస్తావు.

తాత్పర్యం: పవిత్రుడా! ఓ అపాంతరతమా! (వ్యాసా!) కాలం కలిగించిన కీడు కారణంగా వేదాలు అన్నీ మళ్ళీ కలగాపులగం అయిపోతే నీవు మళ్ళీ నీ బుద్ధివైభవంతో వాటిని నాలుగుగా విభజిస్తావు. దేవతలకూ, ఋషులకూ ఆనందం కలిగిస్తావు.

తే. ధర్మసందేహములు నీవు నిర్మలంపు । వాక్యములఁ బాపి జగములవార లెల్ల
నఖిల సంశయచ్ఛేత్త పుణ్యాత్మకుండు । లోకహితవాణి యనఁగ సుశ్లోకుఁ డగుదు. 528

ప్రతిపదార్థం: ధర్మసందేహములు= ధర్మానికి సంబంధించిన సందేహాలు; నీవు= నీవు; నిర్మలంపు వాక్యములన్= నిర్మలమైన వాక్యాలతో; పాపి= తీర్చి; జగములవారలు+ఎల్లన్= ప్రపంచంలోని ప్రజలు అందరూ; అఖిల సంశయచ్ఛేత్త= అన్ని సంశయాలనూ ఛేదించేవాడు; పుణ్యాత్మకుండు= పుణ్యాత్ముడు; లోకహితవాణి= లోకానికి హితం కలిగించే వాక్కు కలవాడు; అనఁగన్= అనేట్టు; సుశ్లోకుఁడు= స్తుతింపబడేవాడవు; అగుదు(వు)= అవుతావు.

తాత్పర్యం: ప్రపంచంలో ప్రజలకు వచ్చే ధర్మసందేహాలన్నీ నీ మాటలతో తీరుతాయి. నిన్ను అఖిలసంశయ విచ్ఛేదకుడ వనీ, పుణ్యాత్ముడ వనీ లోకానికి హితం కలిగించే వాక్కు కలవాడ వనీ ప్రజలు స్తుతిస్తారు.

క. రాగిత్వము విడువదు నిను, । రాగవిదూరుఁడగు సుతుఁడు ప్రభవించును నీ,
కాగమ విధానబుద్ధియు । యోగము సాంఖ్యంబు మది సముదితంబు లగున్. 529

ప్రతిపదార్థం: వ్యాసుడా!; నినున్= నిన్ను; రాగిత్వము= అనురాగసహితత్వం అనేది (లోకమూ కుటుంబమూ - వీటిపట్ల ప్రేమ); విడువదు= విడిచిపెట్టదు (నీవు విరాగివి కాలేవు అని); నీకున్= నీకు; రాగవిదూరుఁడు+అగు= రాగరహితుడైన (విరాగి అయిన); సుతుఁడు= తనయుడు; ప్రభవించును= జన్మిస్తాడు (శుకుడు నీకు కుమారుడుగా జన్మిస్తాడని); ఆగమవిధాన= శాస్త్ర సమ్మతమైన; బుద్ధియున్= మతియూ; యోగమున్= యోగమూ; సాంఖ్యంబున్= సాంఖ్యమూ; మదిన్= అంతరంగంలో; నీకున్= నీకు; సముదితంబులు+అగున్= ఉదయిస్తాయి (ప్రకాశిస్తాయి, ఆవిర్భవిస్తాయి).

తాత్పర్యం: తనయుడా! నీవు విరాగివి కాలేవు. కాని, ఒక విరాగి నీకు కుమారుడుగా జన్మిస్తాడు. శాస్త్రాలనూ, ఆగమాలనూ అనుసరించే బుద్ధితోపాటు నీ అంతరంగంలో సాంఖ్యయోగాలు కూడా వికసిస్తాయి.

వ. అని నిర్దేశించి నీవు నిజేచ్ఛం బ్రవర్తింపు మని పలికి యద్దేవుం డంతర్హితుం డయ్యె నిది మదీయ నారాయణసంభవత్వంబు తెఱం గేను యమనియమనిరూఢి నిర్మలతపఃకరణంబు చిరకాలం బాచరించి యప్పురుషోత్తము కారుణ్యంబు నామీఁద నంతకంతకు నెక్కుడగునట్లు సేసితి నని మద్గురుండును త్రికాల వేదియు నగు వేదవ్యాసుండు సెప్పె నని చెప్పి వైశంపాయనుండు జనమేజయునితో వెండియు నిట్లనియె. 530

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; నిర్దేశించి= ఆజ్ఞాపించి; నీవు= నీవు; నిజ+ఇచ్ఛన్= నీ కోరికమేరకు; ప్రవర్తింపుము= సంచరించుము; అని= అట్లా; పలికి= అనుమతించి; ఆ+దేవుండు= ఆ శ్రీమన్నారాయణుడు; అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడయ్యాడు; ఇది= ఇంతవరకూ చెప్పినది; మదీయ= నాయొక్క; నారాయణసంభవత్వంబు= నారాయణపుత్రత్వం తాలూకు; తెఱంగు= తీరు. (నేను నారాయణపుత్రుడిని ఎట్లాగయ్యానో తెలియజేసే కథ - అని); ఏనున్= నేను; యమ= ఇంద్రియనిగ్రహమూ; నియమ= ఇంకా తక్కిన నియమాలయొక్క; ఆరూఢిన్= గాఢతతో (ప్రసిద్ధితో); నిర్మల= పవిత్రమైన; తపఃకరణంబు= తపస్సమాచరణ; చిరకాలంబు= చాలాకాలం; ఆచరించి= చేసి; ఆ+పురుషోత్తము= ఆ పురుషోత్తముడైన విష్ణుమూర్తియొక్క; కారుణ్యంబు= దయ; నామీఁదన్= నాపైని; అంతకంతకున్= పోనుపోనూ; ఎక్కుడు+అగునట్లు= అధికం అయ్యేట్టు; చేసితిన్= నడచుకొన్నాను (చేసికొన్నాను); అని= ఆ విధంగా; మత్+గురుండును= నా గురువుగారూ; త్రికాల+వేదియున్= భూత భవిష్యద్వర్తమానాలను ఎరిగినవాడూ; అగు= అయిన; వేదవ్యాసుండు= వేదవ్యాసుడు; చెప్పెన్= చెప్పాడు; అని చెప్పి= ఇట్లా వివరించి; వైశంపాయనుండు= వైశంపాయనమహర్షి; జనమేజయునితోన్= ఆ జనమేజయ మహారాజుతో; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించి 'నీ కోరిక ననుసరించి నడచుకొనుము' అని పలికి నారాయణుడు అంతర్ధానమొందాడు. ఇదీ నేను నారాయణుడికి పుట్టిన విధం. నేను యమ నియమాలతో నిర్మలమైన తపస్సు చాలాకాలం చేసి విష్ణుదేవుడి దయ నామీద అంతకంతకూ ఎక్కువయ్యేటట్లు చేసికొన్నాను' అని నా గురువు, త్రికాలజ్ఞుడు అయిన వేదవ్యాసుడు చెప్పాడు - అని వైశంపాయనుడు జనమేజయుడితో మరల ఇట్లా అన్నాడు:

సీ. **అట్లు ధర్మజుఁడు నారాయణనారద । సంవాదకథ విన్న సమయమునను**
నారదుఁ డచ్యుతు కారుణ్య మమ్మెయిఁ । బడసి క్రమ్మఱి వచ్చి బదరికాశ్ర
మమున నారాయణు మన్ననతోడి సం । భాషణంబును గాంచి పరమతపము
దాఁ జేఁత యెఱిఁగించి తదనంతరంబ య । య్యమరమునీంద్రుఁ డే మడిగినట్ల

ఆ. **యడుగ ధర్మనందనాదులుఁ గృష్ణుండు । వినఁగ మద్గురుం డతనికిఁ జెప్పె**
సురలు మోక్షధర్మపరులు గా కధ్వరా । యత్తచిత్తులైన యత్తెఱంగు. **531**

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారం; ధర్మజుఁడు= ధర్మరాజు; నారాయణ నారద సంవాదకథ= నారాయణ నారద సంభాషణ రూపమైన ఇతివృత్తాన్ని; విన్న సమయమునను= ఆలకించిన వేళలో; నారదుఁడు= నారదమహర్షి; అచ్యుతు+కారుణ్యము= విష్ణుమూర్తి దయను; ఆ+మెయిన్= ఆ విధంగా; పడసి= పొంది; క్రమ్మఱి= తిరిగి; వచ్చి= వచ్చి; బదరికా+ఆశ్రమమునన్= బదరి కాశ్రమంలో; నారాయణు= నారాయణునియొక్క; మన్ననతోడి= మన్ననతో (గౌరవం) కూడిన; సంభాషణంబును= సల్లాపాన్ని; కాంచి= పొంది (నారాయణుడితో సంభాషించగలిగి అని); పరమతపము= గొప్ప తపస్సును; తాన్= తాను(నారదుడు); చేఁత= చేయటం; ఎఱింగించి= తెలియజేసి; తద్+అనంతరంబు+అ= ఆ వెంటనే; ఆ+అమరముని+ఇంద్రుడు= దేవఋషి వర్యుడయిన నారదుడు; ఏము+అడిగినట్ల= మేము అడిగినట్టే; అడుగన్= అడిగితే; ధర్మనందనాదులున్= ధర్మజాది పాండవులూ; కృష్ణుండున్= శ్రీకృష్ణుడూ; వినఁగన్= వినేటట్టు (తెలిసికొనేటట్టు); మత్+గురుండు= మా గురువుగారు వ్యాసుడు; అతనికిన్= ఆ నారదుడికి; సురలు= దేవతలు; మోక్షధర్మపరులు+కాక= మోక్షధర్మంపట్ల ఆసక్తులు కాకుండా; అధ్వర+ఆయత్త+చిత్తులైన= యజ్ఞయాగాదుల పట్ల సంసక్తమైన హృదయాలు కలవారుగా అయినటువంటి; ఆ+తెఱంగున్= ఆ తీరును; చెప్పెన్= వివరించాడు.

తాత్పర్యం: (ఇంక శ్రోతల పరంపరను కలుపుతున్నాడు.) నారదనారాయణ సంవాదకథను శ్రీకృష్ణుడు చెప్పగా ధర్మరాజాదులు విన్నారు. ఆ కథలో నారదుడు శ్వేతద్వీపంనుండి తిరిగి బదరికాశ్రమానికి రావటం, అక్కడ నరనారాయణులతో సంభాషించటం ఉన్నది. ఆ తరువాత అదే ఆశ్రమంలో నారదుడు వారి అనుమతి పొంది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నివసిస్తూ తపస్సు చేసికొంటున్నాడు. జనమేజయా! ఒకరోజున మేము అడిగినట్లే నారదుడు మా గురువు గారిని అడిగాడు. దేవతలు మోక్షపరులు కాకుండా పురోడాశపరాయణులు అవుతున్నారు ఇ దేమిటి స్వామీ! - అని (చూ. శాంతి-6-400). వారు అట్లా ఉండటానికి కారణం ఏమిటో మా గురువుగారు చెప్పారు. అప్పుడు దానిని ధర్మజాదులూ, శ్రీకృష్ణుడూ అంతా విన్నారు.

వ. ఇట్లు సెప్పి. 532

తాత్పర్యం: ఇట్లా వివరించి.

క. వేదవ్యాసుఁడు సుముఖత । నా దైవతమునికిఁ జెప్పె హయశిరుఁడగు దా
మోదరుని దివ్యలీల స । మాదరమున ధర్మనందనాదులు వినఁగన్. 533

ప్రతిపదార్థం: వేదవ్యాసుఁడు= ఆ వ్యాసమునీంద్రుడు; సుముఖతన్= ఆనుకూల్యంతో; ఆ+దైవతమునికిన్= ఆ దేవర్షికి (నారదుడికి); హయశిరుఁడు+అగు= హయగ్రీవుడైన; దామోదరుని= శ్రీమహావిష్ణువుయొక్క; దివ్యలీలన్= దివ్యవిలాసాన్ని; సమాదరమునన్= ఆదరంతో (అనురక్తితో); ధర్మనందన+ఆదులు= ధర్మరాజు మొదలైనవారు; వినఁగన్= వింటూండగా; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: వేదవ్యాసుడు సుముఖుడై ఆ నారదుడికి ఆదరంతో హయగ్రీవుడి దివ్యవిలాసాన్ని వివరించాడు. ధర్మరాజూ, ఆయన సోదరులూ ఆదరంతో దానిని ఆలకించారు.

వ. అని చెప్పి వెండియు. 534

ప్రతిపదార్థం: అని చెప్పి= అని పలికి; వెండియున్= మళ్ళీ; వైశంపాయనుడే అంటున్నాడు.

తాత్పర్యం: అని పలికి మరల.

క. నిజనామ నిర్వచనములు । విజయుం డడుగంగ నెల్లవియు నెఱిఁగించెం
ద్రిజగద్భజనీయపదాం । బుజుఁ డగు కృష్ణుండు భరితపుణ్యచరిత్రా! 535

ప్రతిపదార్థం: భరిత= వహించబడిన; పుణ్యచరిత్రా!= పవిత్రగాథ కలవాడా! (పవిత్రమైన చరిత్ర కలవాడా!); త్రిజగత్= ముల్లోకాలచేతనూ; భజనీయ= సేవింపబడే; పద+అంబుజుఁడు= పాదపద్మాలు కలవాడు; అగు= అయిన; కృష్ణుండు; నిజ= తనయొక్క; నామ= నామధేయాల; నిర్వచనములు= వ్యుత్పత్తులు (వివరాలు); విజయుండు= అర్జునుడు; అడుగంగన్= అడగగా; ఎల్ల+అవియున్= అన్నీ; ఎఱిఁగించెన్= తెలియజెప్పాడు.

తాత్పర్యం: పవిత్రచరిత్ర కలిగిన ఓ జనమేజయా! ముల్లోకాలకూ ఆరాధ్యుడైన శ్రీకృష్ణుడు తన నామధేయాల గాథలనూ అంతరార్థాలనూ విజయుడు అడిగితే తానే స్వయంగా అన్నీ వివరించాడు.

వ. ఇ ట్లగుట ము న్నెఱింగించితి. 536

ప్రతిపదార్థం: ఇట్లు; అగుట= కావటం; మున్ను= ఇంతకుపూర్వమే; ఎఱింగించితిన్= నీకు తెలియజెప్పాను.

తాత్పర్యం: దీనిని ఇంతకు పూర్వమే నీకు తెలియజేశాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వేదాదులైన పథము ల । భేదప్రాప్యంబు లగుట ప్రియ మెసఁగఁగ న
వ్వేదవ్యాసుఁడు సెప్పె స । మాదరమునఁ బార్థుఁ డడుగ నందఱు వినఁగన్. 537

ప్రతిపదార్థం: వేద+ఆదులు+ఐన= వేదమూ, సాంఖ్యమూ మొదలైన (యోగ-పాశుపత-పాంచరాత్రాలు ఆదిపదంతో గ్రహించాలి చూ. శాంతి - 6-512); పథములు= మార్గాలు; అభేద= భేదంలేకుండా (ఉత్తమమనీ మధ్యమమనీ ఇట్లాంటి తేడాలు లేకుండా); ప్రాప్యంబులు= పొందదగినవి; అగుట= కావటాన్ని; పార్థుఁడు+అడుగన్= అర్జునుడు అడిగినప్పుడు; అందఱున్+వినఁగన్= అందరూ వినేట్టు; ఆ+వేదవ్యాసుడు= ఆ వేదవ్యాసుడు; ప్రియము+ఎసఁగఁగన్= ప్రేమ అతిశయించేటట్టు; చెప్పెన్= నిర్ధారించి చెప్పాడు.

తాత్పర్యం: వేదమూ, సాంఖ్యమూ, యోగమూ, పాశుపతమూ, పాంచరాత్రమూ అని ఉన్న మార్గాలలో భేదాలూ హెచ్చుతగ్గులూ ఏమీ లేవు - అని ఆ వేదవ్యాసుడు పార్థుడి సందేహానికి సమాధానంగా చెప్పాడు. దీనిని అందరూ అప్పుడు విన్నారు.

క. ఏకాంతికధర్మము సు । శ్లోకుండగు నాతఁ డడుగ లోకోత్తర! యా
లోకారాధ్యుఁడు సెప్పె ద । యాకరమతి కృష్ణధర్మజాదులు వినఁగన్. 538

ప్రతిపదార్థం: లోకోత్తర!= ఓ సర్వోత్తమా!; సుశ్లోకుండు+అగు= స్తుతింప దగినవాడైన; ఆతఁడు= ఆ అర్జునుడు; ఏకాంతిక ధర్మమున్= ఏకాంతిక లక్షణాన్ని; అడుగన్= అడిగితే; ఆ+లోక+ఆరాధ్యుఁడు= సకలలోకాలకూ ఆరాధింపదగినవాడైన ఆ వేదవ్యాసుడు; దయా+ఆకర+మతిన్= కృపకు నిలయమైన మనస్సుతో; కృష్ణ ధర్మజ+ఆదులు= శ్రీకృష్ణుడూ, ధర్మరాజూ ఇంకా మొదలైనవారు; వినఁగన్= వినేటట్టు; చెప్పెన్= వివరించాడు. (వారు వింటూండగా దయతో వివరించాడు - అని).

తాత్పర్యం: ఓ లోకోత్తరుడా! ఏకాంతికధర్మాన్ని గురించి అర్జునుడు అడిగితే వేదవ్యాసుడు దయతో వివరించాడు. అప్పుడు దానిని కృష్ణుడూ, ధర్మరాజూ ఇంకా మరికొందరూ (భీమ నకుల సహదేవాదులు) విన్నారు.

క. దైవవశంబున నేఁడును । నీ వడుగఁగ నింతవట్టు నిస్సందేహం
బై వఱలఁగ నేఁ జెప్పితిఁ । బావన మిది యసదృశంబు పౌరవముఖ్యా!' 539

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశంలో ముఖ్యుడైనవాడా!; దైవవశంబునన్= అదృష్టవశాత్తూ; నేఁడునున్= ఈ రోజయినా; నీవు= నీవు; అడుగఁగన్= అడిగావు కాబట్టి; ఇంతవట్టు= ఇంతవరకూ (ఇంతమటుకు); నిస్సందేహంబు+ఐ+వఱలఁగన్= సందేహరహితమై అతిశయించేటట్టు; నేన్= నేను; చెప్పితిన్= చెప్పాను; ఇది= ఈ ఏకాంతిక ధర్మం; పావనము= పవిత్రం; అసదృశంబు= సాటిలేనిది.

తాత్పర్యం: ఓ కౌరవశ్రేష్ఠా! అదృష్టవశాత్తూ ఈరోజు అడిగావు కాబట్టి నీ సందేహం నివృత్తి అయేటట్లుగా నేను చెప్పాను. ఈ ఏకాంతిక ధర్మం సాటిలేనిది.'

వ. అని పలికి నారాయణ నారద సంవాదాదికంబైన యివ్వాఙ్మయం బంతయుం బేర్కొని. 540

ప్రతిపదార్థం: అని పలికి= అని వివరించి; నారాయణనారద సంవాద+ఆదికంబైన= నారద నారాయణ సంవాదమూ మొదలైన; ఈ+వాఙ్మయంబు+అంతయున్= ఈ వాక్యరూపమైనది (సాహిత్య రూపమైనది) అంతా; పేర్కొని= చెప్పి.

తాత్పర్యం: ఈ విధంగా వివరించి, ఈ సంవాదం మొదలైన సాహిత్యాన్నంతా చెప్పి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. నారాయణీయమగు నీ। సారాఖ్యానంబు వినినఁ జదివిన సంప
త్తారోగ్యాయుస్సద్గతు। లేరికినైనం గురుక్షితీశ్వర! కలుగున్. 541

ప్రతిపదార్థం: కురుక్షితి+ఈశ్వర!= కౌరవసామ్రాజ్యాధిపతీ!; నారాయణీయము+అగు= నారాయణుడికి సంబంధించినదైన; ఈ= ఈ; సార= శ్రేష్ఠమైన; ఆఖ్యానంబున్= కథను; వినినన్= విన్నా; చదివినన్= చదివినా; సంపత్తు= సకలసంపదలూ; ఆరోగ్య= ఆరోగ్యమూ; ఆయుస్= ఆయుర్దాయమూ; సద్గతులు= ఉత్తమలోకాలూ; ఏరికిన్+ఐనన్= ఎవ్వరికైనా; కలుగున్= లభిస్తాయి.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! నారాయణీయమైన ఈ పవిత్రగాథను విన్నవారికీ, చదివినవారికీ సకల సంపదలూ సిద్ధిస్తాయి. ఆయురారోగ్యాలు ఇహంలోనూ, సద్గతులు పరంలోనూ లభిస్తాయి.

వ. అనిన విని యత్యంతాహ్లాద భరితాంతఃకరణుం డయిన యక్కౌరవేంద్రుతో నమ్మునీంద్రుం డిట్లను నిట్లు సకలలోకసంభావనీయ సత్కథ లాకర్ణించి సముదీర్ణ సంప్రీతుండగు నప్పాండవాగ్రజుండు. 542

ప్రతిపదార్థం: అనినన్= అని వైశంపాయనుడు చెప్పగా; విని= ఆలకించి; అత్యంత= మిక్కిలి; ఆహ్లాద= ఆనందంతో; భరిత= నిండిన; అంతఃకరణుండు+అయిన= మనస్సు కలవాడైన; ఆ+కౌరవేంద్రుతోన్= ఆ జనమేజయుడితో; ఆ+మునీంద్రుండు= ఆ వైశంపాయనుడు; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు; ఇట్లు= ఈ ప్రకారంగా; సకలలోక= సర్వలోకాలలోనూ; సంభావనీయ= గౌరవింపదగినవైన; సత్కథలు= మంచి ఉపాఖ్యానాలు; ఆకర్ణించి= భీష్మడినుండి విని; సముదీర్ణ= వికసించిన; సంప్రీతుండు+అగు= సంతృప్తి కలవాడైన; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ ధర్మరాజు.

తాత్పర్యం: ఇది విన్న జనమేజయుడు చాలా సంతోషించాడు - అని భీష్మడి నుండి విన్న ధర్మజుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అమరతటినీసుతున కిట్టు లనియె రాజ। ధర్మముఖ్యంబులగు సర్వధర్మముల ను
దాత్తకృప నెఱిఁగించి తత్యుత్తమంపు। ధర్మమెయ్యది సెప్పుము ధర్మనిత్య! 543

ప్రతిపదార్థం: అమరతటినీ+సుతునకున్= గాంగేయునికి (అమరులనది - గంగ. గంగానది పుత్రుడు - భీష్మడు); ఇట్టులు+అనియెన్= ఇలా అన్నాడు; రాజధర్మముఖ్యంబులు+అగు= రాజనీతి మొదలైన; సర్వధర్మములన్= అన్ని ధర్మాలనూ; ఉదాత్తకృపన్= గొప్ప దయతో; ఎఱిఁగించితి(వి)= తెలియజెప్పావు; ధర్మనిత్య!= ధర్మస్వరూపా!; అత్యుత్తమంపు= అత్యుత్తమమైన; ధర్మము= ధర్మం; ఏ+అది= వీటిలో ఏది; చెప్పుము= చెప్పు.

తాత్పర్యం: ఓ ధర్మనిత్యుడా! రాజనీతి మొదలుకొని అన్ని ధర్మాలూ చెప్పావు. వీటిలో ఏది ఉత్తమధర్మమో చెప్పుము. అని గాంగేయుడిని ధర్మరాజు అడిగాడు.

వ. అనుటయు నా దేవవ్రతుం డన్నరదేవోత్తమున కిట్లనియె. 544

ప్రతిపదార్థం: అనుటయున్= అనటంతోనే; ఆ+దేవవ్రతుండు= దేవవ్రతుడు అనేపేరుగల భీష్మడు; ఆ+నరదేవ+ఉత్తమునకున్= ఆ రాజులలో ఉత్తముడైన ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు (దేవవ్రతుడు అనేది తల్లిదండ్రులు చేసిన నామకరణం. భీష్మడు అనేది ప్రతిజ్ఞతో ఏర్పడినది).

తాత్పర్యం: అనగా ఆ భీష్మడు ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు.

చ. అరయఁగ ధర్మతంత్రములయందు నిరర్థములే దొకండు, నె
వ్వరిమది యెందు వ్రాలెఁ దగ వారలు దానిని పూని యాచరిం
తు, రదియ వారి కిష్టఫల దోహనకార్య మొనర్చు, నెల్లెడం
బురుషులఁ జూడమే తమకుఁ బోలిన ధర్మములన్ వెలుంగఁగన్? 545

ప్రతిపదార్థం: అరయఁగన్= పరిశీలించి చూస్తే; ధర్మతంత్రములయందున్= ఈ ధర్మశాస్త్రాలలో; ఒకండున్= ఒక్కటికూడా; నిరర్థము= నిష్ప్రయోజనమైనది; లేదు= లేదు; ఎవ్వరి+మది= ఎవరి మనస్సు; ఎందున్= ఏ ధర్మశాస్త్రంలో; వ్రాలెన్= మొగ్గు చూపుతుందో; తగన్= అందంగా; వారలు= వారు; దానినిన్= ఆ శాస్త్రాన్ని; ఆచరింతురు= అనుసరిస్తారు; అది+అ= అదే; వారికిన్= వారికి; ఇష్టఫల= కోరుకొన్న ఫలితాలకు సంబంధించిన; దోహనకార్యము= పెంపుదలను; ఒనర్చున్= చేస్తుంది; తమకున్= తమకు; పోలిన= (అనుకూలమైన) తగిన; ధర్మములన్= ధర్మాలతో; వెలుంగఁగన్= ప్రకాశిస్తున్న; పురుషులన్= మానవులను; ఎల్లెడన్= ప్రపంచంలో అంతటా; చూడమే?= మనం చూడటం లేదా?

తాత్పర్యం: ధర్మశాస్త్రాలలో అన్నీ పనికివచ్చేవే. ఒక్కటికూడా పనికిరానిది అంటూ లేదు. ఎవరికి నచ్చిన ధర్మశాస్త్రాన్ని వారు అనుసరిస్తారు. అదే వారి కోరికలు పండటానికి దోహదం చేస్తుంది. తమకు తగిన ధర్మాలను ఆచరిస్తున్నవారిని లోకంలో ఎంతమందిని మనం చూడటంలేదు కనుక?

ఇంద్రునకు నారదుఁడు సెప్పిన భృగునామక విప్రుని చరిత్రము (సం. 12-340-4, 5)

వ. అది యట్లుండె; నప్రతిహతగతియై చరించుచుండి యొక్కనాఁడు నారదుం డాఖండలు పాలికిం జనిన నతం డతనికి సముచిత సత్కారంబు లాచరించి సుఖాసీనుండై యున్న యమ్మునివరు నాననంబునం జూడ్కి నిలిపి నీవు మెలంగునెడ నెద్దియేనియు నాశ్చర్యంబు గన్నయది గలదే?యని యడిగిన నమ్మహితాత్ముం డమ్మహేంద్రునకుం జెప్పిన కథ సెప్పెద; నది భవత్ప్రశ్నంబున కుత్తరం బైయుండు. దాని వినుము. భాగీరథీదక్షిణతీరంబున మహాపద్మం బనియెడు పురవరంబునఁ గులశ్రేష్ఠుండగు భృగుండను విప్రుండు గలం; డప్పురుషవరుండు. 546

ప్రతిపదార్థం: అది+అట్లుండెన్= అది అట్లా ఉండగా ; నారదుండు= నారదమహర్షి; అప్రతిహతగతియై= నిరాటంకమైన గమనం కలవాడై; చరించుచుండి= లోకాలన్నీ సంచరిస్తూ; ఒక్కనాఁడు= ఒకరోజున; ఆఖండలు పాలికిన్= ఇంద్రుడి సన్నిధికి; చనినన్= వెళ్ళగా; అతండు= ఆ ఇంద్రుడు; అతనికిన్= నారదుడికి; సముచిత సత్కారంబులు= తగిన మన్ననలు; ఆచరించి= చేసి; సుఖ+ఆసీనుండై+ఉన్న= సుఖంగా ఆసనంపై కూర్చుని ఉన్న; ఆ+మునివరు= ఆ నారదుడియొక్క; ఆననంబునన్= ముఖంమీద; చూడ్కి= తన దృష్టి; నిలిపి (నారదుడి ముఖం చూస్తూ); నీవు= నారదా! నీవు; మెలంగునెడన్= సంచరించే చోటులలో; ఎద్ది+ఏనియున్= ఏదయినా; ఆశ్చర్యంబు= అద్భుతం; కన్న+అది= నీవు చూచినది; కలదే?= ఉన్నదా?; అని; అడిగినన్= అడిగితే; ఆ+మహితాత్ముండు= ఆ మహాత్ముడు నారదుడు; ఆ+మహేంద్రునకున్= ఆ దేవేంద్రుడికి; చెప్పిన= చెప్పినటువంటి; కథ= వృత్తాంతం; చెప్పెదన్= నీకు చెబుతాను; అది= ఆ కథ; భవత్+ప్రశ్నంబునకున్= నీ ప్రశ్నకు; ఉత్తరంబు+ఐ+ఉండున్= సమాధానం అవుతుంది; దానిని= దాన్ని; వినుము= వినుము; భాగీరథీ= గంగానదియొక్క; దక్షిణతీరంబునన్= దక్షిణపు ఒడ్డున; మహాపద్మంబు+అనియెడు= మహాపద్మం అనే; పురవరంబునన్= గొప్పపట్టణంలో; కులశ్రేష్ఠుండు+అగు= వంశంలో ఉత్తముడైన; భృగుండు+అను= భృగుడు అనే; విప్రుండు= బ్రాహ్మణుడు; కలండు= ఉన్నాడు; ఆ+పురుషవరుండు= ఆ మానవోత్తముడు.

తాత్పర్యం: అది అట్లా ఉండగా, నారదుడు నిరాటంకంగా లోకాలనన్నిటినీ సంచరిస్తూ, ఒకనాడు ఇంద్రుడి వద్దకు వెళ్ళగా అతడు నారదుడిని సత్కరించి 'నారదా! నీవు తిరిగిన చోటులలో ఏదైనా అద్భుతం చూచావా?' అని అడిగాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అప్పుడు నారదుడు ఇంద్రుడికి చెప్పిన కథ వినిపిస్తాను. అది నీ ప్రశ్నకు ఉత్తర మౌతుంది. వినుము. గంగానది దక్షిణతీరాన మహాపద్మ మనే మహానగరంలో భృగుడు అనే బ్రాహ్మణుడు ఉన్నాడు. ఆ ఉత్తముడు (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **ధర్మనిత్యుండు సత్యవ్రత పరుఁ డహిం । సాశాలి యింద్రియజయ విభాసి**
నిజకర్మతృప్తుండు నిష్క్రోధుఁ డంచిత । న్యాయసంప్రాప్త ధనముల దేవ
పిత్రతిథిజ్ఞాతి మిత్రకార్యములు ని । ర్వర్తించు, సువినయవంతులైన
తనయులఁ గన్నాఁడు, ద న్నెల్లవారును । వినుతింప మన్నాఁడు, దన మనమున

తే. **నెట్టి కృత్యంబు మేలొ యే నెద్దిసేసి । కృతపరాయణ ధర్మతా స్థితి వహింతు**
నొక్కొ?యని చింతఁ బొందుచు నుండు నాత్మ । నిష్ఠ యలవాటు కాంక్షించి నృపవరేణ్య! 547

ప్రతిపదార్థం: ధర్మనిత్యుండు= ధర్మంపట్ల నిత్యస్పృహ కలవాడు - ఎప్పుడూ ధర్మం తప్పనివాడు; సత్యవ్రతపరుఁడు= సత్యంపట్ల దీక్ష కలిగినవాడు; అహింసాశాలి= అహింసావ్రతం వహించినవాడు; ఇంద్రియజయ= ఇంద్రియాలను జయించి; విభాసి= ప్రకాశించేవాడు (ఇంద్రియజయంతో విరాజిల్లేవాడు); నిజకర్మ= తన పనులతో; తృప్తుండు= సంతుష్టి పడేవాడు (ఆత్మసంతృప్తిగా కర్మాచరణం చేసేవాడు); నిష్క్రోధుఁడు= క్రోధం అనేది లేనేలేనివాడు; అంచిత= ఒప్పిన; న్యాయ= ధర్మబద్ధంగా; సంప్రాప్త= లభించిన; ధనములన్= డబ్బుతో (సంపదలతో); దేవ (కార్యములు)= దేవతల; పితృ= పితృదేవతల; అతిథి= అతిథుల; జ్ఞాతి= దాయాదుల; మిత్ర= స్నేహితుల; కార్యంబులు= పనులు (విధులు); నిర్వర్తించున్= నిర్వహిస్తూ ఉంటాడు; సువినయవంతులైన= మంచి వినయసంపన్నులైన; తనయులన్= పుత్రులను; కన్నాఁడు= పొందాడు; తన్నున్= తనను; ఎల్లవారున్= అందరూ; వినుతింపన్= స్తుతించగా; మన్నాఁడు= జీవితం గడిపాడు (మనుట= జీవించుట); నృపవరేణ్య!= రాజోత్తమా!; ఆత్మనిష్ఠ= ఆత్మనిష్ఠయొక్క (పరమాత్మపట్ల నిష్ఠ); అలవాటు= అభ్యాసాన్ని; కాంక్షించి= కోరి; తన= తనయొక్క; మనమునన్= మనస్సులో - ఎట్టి= ఎటువంటి; కృత్యంబు= పని; మేలొ= మంచిదో; ఏను= నేను; ఎద్ది= ఏది; చేసి= ఆచరించి; కృత= చేయబడిన; పరాయణ= ఉత్తమోత్తమ; ధర్మతా= ధర్మాలు కలిగిన; స్థితి= దశ (ఉత్తమ ధర్మాలను ఆచరించిన స్థితి); వహింతునొక్కొ?= వహిస్తానో?; అని= అనే; చింతన్= ఆలోచనను; పొందుచున్+ఉండున్= పొందుతూ ఉంటాడు (ఎప్పుడూ అదే ఆలోచనతో ఉంటాడు అని).

తాత్పర్యం: ఆ భృగువు ధర్మనిత్యుడు. సత్యవ్రత పరాయణుడు. అహింసాపరుడు. ఇంద్రియనిగ్రహం కలవాడు. తన కర్మాచరణం పట్ల తృప్తికలవాడు. క్రోధం ఎరుగనివాడు. న్యాయంగా లభించిన ధనంతో దేవకార్యాలూ, పితృకార్యాలూ, అతిథి సత్క్రియలూ, మిత్రకార్యాలూ నిర్వర్తిస్తూ ఉంటాడు. అతడికి వినయవంతులైన కుమారులు కలిగారు. లోకంలో అందరి మన్ననలూ పొందాడు. అతడికి ఎప్పుడూ ఒక్కటే ఆలోచన - ఏవి మంచి పనులు? వేటిని ఆచరిస్తే మేలు? ధార్మికుడను ఎలా అవుతాను? నాకు ఆత్మనిష్ఠ ఎట్లా అలవాటవుతుంది? - ఇదే అతడి చింత.

వ. **అట్లుండ నొక్కనాఁడు. 548**

ప్రతిపదార్థం: అట్లు+ఉండన్= అలా ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజున.

తాత్పర్యం: అట్లా ఉండగా ఒకరోజున.

తే. **తన గృహంబున కతిథి యుదాత్తుఁ డొక్క । బ్రాహ్మణుఁడు వచ్చె; వచ్చినఁ బరమభక్తి**
యుక్తి నాతిథ్య మొనరించియున్నయప్పు । డమ్మహాద్విజుతోడ నిట్లనియె భృగుఁడు. 549

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తన= ఆ భృగువుయొక్క; గృహంబునకున్= ఇంటికి; ఉదాత్తుఁడు= గొప్పవాడైన; ఒక్కబ్రాహ్మణుఁడు= ఒక విప్రుడు; అతిథి= అతిథిగా; వచ్చెన్= వచ్చాడు; వచ్చినన్= వస్తే; పరమభక్తియుక్తిన్= మిక్కిలి భక్తితో (భక్తియొక్క యుక్తితో= కూడికతో); ఆతిథ్యము= అతిథిమర్యాద; ఒనరించి= చేసి; ఉన్న+అప్పుడు= ఉన్న సమయంలో; ఆ+మహాద్విజుతోడన్= ఆ ఉత్తమ విప్రుడితో; భృగుఁడు= భృగువు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఒక ఉత్తమబ్రాహ్మణుడు తన ఇంటికి అతిథిగా వచ్చాడు. భృగువు అతిథిమర్యాదలన్నీ యథావిధిగా జరిపాడు. అది అయ్యాక నెమ్మదిగా ఇట్లా అడిగాడు.

సీ. **'అనఘ! నీ మధుర వాక్యంబులఁ జేసి మి । త్రత్వంబు నొంది మద్భాగవతము**
నీ కెఱింగించెద నీవు నెయ్యమెలర్ప । హిత ముపదేశింపు మేను నియతి
నాత్మావలోకన మాచరించెద నని । తొడఁగుదు నది యలవడదు నాకు
లోకసామాన్య గుణాకలనంబున । బద్ధుండ నగుట నెబ్భంగి నాత్మ

తే. **నాత్మయందు కని యనామయత్వముఁ బొంది । ఖండరహిత మగు సుఖమున మునిఁగి**
యుండువాఁడ? భూసురోత్తమ! చెప్పవే । యనిన నతని కిట్టు లనియె నతఁడు. **550**

ప్రతిపదార్థం: అనఘ!= పవిత్రుడా!; నీ= నీయొక్క; మధురవాక్యంబులన్+చేసి= తీయని మాటలచేత; మిత్రత్వంబు= స్నేహం; ఒంది= కుదిరి(పొంది); మత్+భాగవతమున్= నా భాగవతాన్ని (భగవద్భక్తికి సంబంధించిన విషయాన్ని); నీకున్= నీకు; ఎఱింగించెదన్= తెలియజేస్తాను (చెప్తున్నాను); నీవు= నీవు; నెయ్యము+ఎలర్పన్= స్నేహం వికసించేట్టు; హితము= మేలు చేకూర్చేదానిని; ఉపదేశింపుము; ఆత్మావలోకనము= ఆత్మదర్శనం; ఆచరించెదన్= ఆచరిస్తాను; అని= ఆ విధంగా; ఏనున్=నేను; నియతిన్= నియమబద్ధంగా (నిష్ఠతో); తొడఁగుదున్= పూనుకొంటాను; అది= (కానీ) అది; నాకున్= నాకు; లోకసామాన్య= సర్వజనసాధారణమైన; గుణ= సత్త్వాదిగుణాల; ఆకలనంబునన్= సమ్మిశ్రణంలో; బద్ధుండను+అగుటనన్= తగుల్కొన్నవాడిని కావటం వలన; అలవడదు= కుదరటంలేదు (ఆత్మదర్శనం కావటంలేదు); ఏ+భంగిన్= ఎలా; ఆత్మన్= ఆత్మను; ఆత్మ యందున్+అ= ఆత్మలోనే; కని= దర్శించి; అనామయత్వమున్= ఆరోగ్యాన్ని; పొంది= పొంది; ఖండరహితము+అగు= అఖండమైన; సుఖమునన్= సుఖంలో; మునిఁగి+ఉండువాఁడన్?= మునిగి ఉండిపోగలుగుతాను?; భూసుర+ఉత్తమ!= ఓ బ్రాహ్మణోత్తమా!; చెప్పవే?= దయచేసి తెలియజేయవా?; అనినన్= అని అడిగేసరికి; అతనికిన్= ఆ భృగువుకు; అతఁడు= ఆ అతిథి; ఇట్టులు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: 'ఓ రాజోత్తమా! నీ తీయనిమాటలు మనకు మైత్రి కలిగించాయి. కనుక నా భక్తివిషయం నీకు వినిపిస్తున్నాను. ఆలకించి, మేలైన సలహా చెప్పుము. నేను నియమనిష్ఠలతో ఆత్మావలోకనానికి కూర్చుంటాను (పూనుకొంటాను) కానీ' అది నాకు సిద్ధించటం లేదు. లోకసాధారణమైన సత్త్వరజస్తమోగుణాలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే ఎట్లా సిద్ధిస్తుంది మరి? అందుచేత ఆత్మసందర్శనం పొంది అఖండమైన ఆనందాన్ని పొందుతూ అట్లా ఉండిపోవాలి - అంటే దానికి మార్గం ఏమిటి? దయచేసి అది ఉపదేశించవా?' అని అడుగగా ఆ బ్రాహ్మణుడు భృగువుతో ఇట్లా అన్నాడు:

క. **ఏనును నిట్టుల మోహా । ధీనుఁడ నై యాత్మఁగాంచు తెఱఁ గొలయుటకుం**
బూని వడుదు, నెయ్యదియో! । కానం దెరు వా శుభప్రకలనంబునకున్. **551**

ప్రతిపదార్థం: ఏనునున్= నేనుకూడా; ఇట్టులన్= ఇలా నీవలెనే; ఆత్మన్= ఆత్మను; కాంచు= దర్శించే; తెఱఁగు= విధానం; ఒలయుటకున్= పొందటానికి; పూని= పూనుకొని; మోహ+అధీనుఁడను+ఐ= మోహానికి లొంగిపోయి; పడుదున్= జారిపోతూ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉంటాను; ఆ+శుభప్రకలనంబునకున్= ఆత్మసందర్శనం అనే ఆ శుభాన్ని పొందటానికి; తెరువు= మార్గం; ఎయ్యదియో!=ఏదోకదా!

తాత్పర్యం: ఓ భృగూ! నేనూ నీవలెనే ఆత్మదర్శనంకొరకు ప్రయత్నించి సఫలం కాలేక జారిపోతున్నాను. మోహం అడ్డు వస్తున్నది. మరి ఆ శుభసందర్శనానికి సరియైన దారి ఏదో మరి!

ఉ. కొందఱు బ్రహ్మచర్యమునఁ గొందఱు భవ్యగృహస్థధర్మముం
బొందుటఁ గొంద ఱిద్ధ తపమున్ వనభూమిఁ దగం జరించుటం
గొందఱు నిష్క్రియత్వమునఁ గొందఱు యజ్ఞవిధాన శాలితం
గొంద ఱనూనదానములఁ గోరి యొనర్తురు నిత్యసౌఖ్యమున్. 552

ప్రతిపదార్థం: నిత్యసౌఖ్యమున్= నిరంతరం ఆనందస్థితిని; కోరి= కాంక్షించి; కొందఱు= కొంతమంది; బ్రహ్మచర్యమునన్= బ్రహ్మచర్యంద్వారా; ఒనర్తురు= ఆత్మసందర్శనం చేస్తారు; కొందఱు= మరికొంతమంది; భవ్య= పవిత్రమైన; గృహస్థధర్మమున్= గృహస్థాశ్రమ ధర్మాన్ని; పొందుటన్= పొందటంద్వారా; ఒనర్తురు= ఆత్మసందర్శనం చేస్తారు; కొందఱు= ఇంకా కొంతమంది; ఇద్ధతపమున్= గొప్ప తపస్సును; వనభూమిన్= అరణ్యంలో; తగన్= తగినట్లు; చరించుటన్= ఆచరించటంద్వారా; ఒనర్తురు= ఆత్మదర్శనం చేస్తారు; కొందఱు= ఇంకొంతమంది; నిష్క్రియత్వమునన్= నిష్కర్మత్వం ద్వారా; కొందఱు= మరికొంతమంది; యజ్ఞవిధానశాలితన్= యజ్ఞాలను చెయ్యటంపట్ల తత్పరులై (నేర్పరులై); కొందఱు= మరికొందరు; అనూన= అత్యధికమైన; దానములన్= దానాలను చెయ్యటం ద్వారా; ఒనర్తురు= (ఆ శుభప్రకలనంబు) ఆత్మసందర్శనం చేస్తారు.

తాత్పర్యం: బ్రహ్మచర్యంద్వారా కొందరూ, గృహస్థ ధర్మాచరణంద్వారా కొందరూ, తపస్సుతో కొందరూ, నిష్కర్మత్వంతో కొందరూ, యజ్ఞాలద్వారా కొందరూ, దానధర్మాలద్వారా కొందరూ ఆత్మసందర్శనం పొందుతూ ఉంటారు.

క. జననీజనకారాధన । మున గురుభక్తిని సువృత్తమున శాంతిని దాం
తిని సత్యమున నహింసను । విను కాంతురు మోక్షపదము వేర్వేఱ జనుల్. 553

ప్రతిపదార్థం: ఓ భృగూ! విను= వినుము; జననీజనక= తల్లిదండ్రులను; ఆరాధనమునన్= సేవించటంద్వారా; గురుభక్తినిన్= గొప్ప భక్తితోనూ (గురువుపట్ల భక్తితోనూ); సువృత్తమునన్= మంచి నడవడికతోనూ; శాంతినిన్= శాంతస్వభావంతోనూ; దాంతినిన్= ఇంద్రియనిగ్రహంతోనూ; సత్యమునన్= సత్యవాక్య నియమపాలనంతోనూ; అహింసనున్= అహింసతోనూ ఇట్లా= ఈ విధంగా; జనుల్= ప్రజలు; వేర్వేఱ= వేరువేరుగా (ఎవరిదారిని వారు ప్రయాణించి); మోక్షపదము= ముక్తిపదవిని; కాంతురు= పొందుతారు (దర్శిస్తారు).

తాత్పర్యం: ఓయీ భృగూ! తల్లిదండ్రులను సేవించి కొందరూ, భక్తితో కొందరూ, మంచి శీలంతో కొందరూ, శాంతస్వభావంతో కొందరూ, ఇంద్రియ నిగ్రహంతో కొందరూ, సత్యవాక్య నియమంతో కొందరూ, అహింసావ్రతంతో కొందరూ - ఇట్లా ప్రజలు వేరే వేరే మార్గాలలో ముక్తిపదం పొందుతారు.

వ. అట్లు బహువిధంబు లగు ధర్మద్వారంబులు గలవు?; గలిగిన కలుచ నెల్లవారికి నాత్మానందం బలవడ నేర్చునే? యొకటి యుపదేశించెద నాకర్ణింపుము. 554

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; బహువిధంబులు+అగు= అనేక విధాలయిన; ధర్మద్వారంబులు= ముక్తిమార్గాలు; కలవు= ఉన్నాయి; కలిగిన కలుచన్= (ముక్తిపొందాలి అనే) బుద్ధి పుట్టినప్పుడల్లా (కోరినప్పుడల్లా - అనికానీ. కలుచన్ అనే మాటకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క్రోధము - క్షోభ - దోషము అనే అర్థాలను నిఘంటువులు చెబుతున్నాయి; అవి ఏవీ ఇక్కడ కుదరటంలేదు. కారణము అనే అర్థాన్ని శబ్దార్థ చంద్రిక ఇచ్చింది. ఈ వాక్యార్థానికి అది కొంత సరిపోతోంది. కోరిక పుట్టటమే కారణం కనుక); ఎల్లవారికిన్= అందరికీ; ఆత్మానందంబు= ఆత్మానందం అనేది; అలవడన్+నేర్చునే?= దొరుకుతుందా?; ఒకటి= ఒక్కవిషయం; ఉపదేశించెదన్= చెబుతాను; ఆకర్ణింపుము= శ్రద్ధగా విను.

తాత్పర్యం: ఆ విధంగా ధర్మద్వారాలు ఎన్నో ఉన్నాయి. మోక్షం కావాలి అనుకొనగానే అందరికీ వెంటనే అది లభిస్తుందా? ఒక విషయం చెప్పుతాను. వినుము.

తే. **నైమిశారణ్యమునయందు గోమతి యనఁ । బరఁగు నుత్తమనది, మహాపద్మ మనఁగఁ**
గలదు పుణ్యప్రదము దాని యలఘుతటత । లంబు నెలవుగానుండు నాగం బొకండు. **555**

ప్రతిపదార్థం: నైమిశ+అరణ్యమున+అందున్= నైమిశారణ్యంలో; గోమతి+అనన్= గోమతి అనే పేరుతో; ఉత్తమనది= ఒక ఉత్తమమైన నది; పరఁగున్= ఉన్నది; మహాపద్మము+అనఁగన్= మహా పద్మము అనే పేరుతో; పుణ్యప్రదము= పవిత్రమైన మడుగు; కలదు= అక్కడే ఉన్నది; దాని= దానియొక్క; అలఘు= పెద్దదయిన; తట= ఒడ్డుయొక్క; తలంబునన్= పరిసరం (తటతలంబు= ఒడ్డు); నెలవుగాన్= నివాసస్థలంగా; ఒకండు= ఒక; నాగంబు= సర్పం; ఉండున్= నివసిస్తోంది.

తాత్పర్యం: నైమిశారణ్యంలో పవిత్ర గోమతీనదీతీరంలో మహాపద్మమనే పవిత్ర తటాకం ఉన్నది. దాని ఒడ్డున ఒక సర్పం నివసిస్తున్నది.

క. **ఆ తీర్థోత్తమమున మాం । ధాతృఁడు లోనుగ విశిష్టతపముల నిహలో**
కాతిశయముఁ బరలోక । ద్యోతనముం బడసినారు దొల్లి యనేకుల్. **556**

ప్రతిపదార్థం: ఆ+తీర్థ+ఉత్తమమునన్= ఉత్తమమైన ఆ తీర్థంలో (జలాశయంలో, రేవులో); మాంధాతృఁడు లోనుగన్= మాంధాతృడు మొదలుగా; అనేకుల్= చాలామంది; తొల్లి= పూర్వకాలంలో; విశిష్ట తపములన్= ప్రత్యేకమైన (విశిష్టమైన) తపస్సులతో; ఇహలోక= ఈ లోకంలో; అతిశయమున్= ఔన్నత్యాన్నీ; పరలోక= పరలోకానికి చెందిన; ద్యోతనమున్= తేజస్సునూ (పరలోక స్ఫూర్తినీ); పడసినారు= పొందారు.

తాత్పర్యం: 'మహాపద్మము' అనే ఆ తటాకప్రాంతంలో గొప్పగొప్ప తపస్సులు చేసి మాంధాతృడు మొదలుగా చాలామంది పూర్వకాలంలో ఇహపర శ్రేయస్సులు పొందారు.

వ. **అప్పుణ్యక్షేత్రంబున.** **557**

ప్రతిపదార్థం: ఆ+పుణ్యక్షేత్రంబునన్= ఆ పవిత్రస్థలంలో.

తాత్పర్యం: ఆ పవిత్రస్థలంలో.

తే. **పద్మఁడను పేరి యన్నాగపతి యుదాత్తుఁ । డఖిల ధర్మజ్ఞుఁ డతుల దయాన్వితుండు**
సుజన సంభావ్యమానుఁ డస్తోకపుణ్య । నియత నిత్యుఁ డాగంతుకప్రియతముండు. **558**

ప్రతిపదార్థం: పద్మఁడు+అను+పేరి= పద్మడు అనే పేరు కలిగిన; ఆ+నాగపతి= ఆ సర్పరాజు; ఉదాత్తుఁడు= గొప్పవాడు; అఖిలధర్మజ్ఞుఁడు= సమస్త ధర్మాలూ తెలిసినవాడు; అతుల= సాటిలేని; దయా+అన్వితుండు= దయతో కూడినవాడు; సుజన= సజ్జనులతో; సంభావ్యమానుఁడు= గౌరవింపబడేవాడు; అస్తోక= అధికమైన; పుణ్య= పుణ్యకార్యాలతో; నియత= నియతమైన;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిత్యుఁడు= ప్రతిక్షణమూ కలవాడు. (అనుక్షణం - నిత్యం - పుణ్యాకార్యాలను నియతంగా - విధిగా - ఆచరించేవాడు అని); ఆగంతుక= అతిథులకు; ప్రియతముండు= మిక్కిలి ఇష్టుడు (ఆగంతకులే ప్రియతములుగా కలవాడు అని కానీ).

తాత్పర్యం: ఆ పుణ్యక్షేత్రంలో ఉండే నాగరాజు పేరు పద్మనాభుడు. అతడు ఉత్తముడు. అన్ని ధర్మాలూ తెలిసినవాడు. గొప్ప దయాశాలి. సజ్జనులతో గౌరవించబడే వ్యక్తిత్వం కలవాడు. నిరంతరం పుణ్యప్రదమైన కార్యక్రమాలను ఆచరిస్తూ ఉంటాడు. అతిథులంటే అతడికి వల్లమాలిన ప్రేమ. అతిథులకూ అతడు ప్రియతముడే.

ఉ. **ఆతనిఁ గానఁ బొమ్ము ప్రచురాదరణంబున నీదుకోర్కి సం**
ప్రీతిగఁ దీర్చు నా గుణగరిష్ఠుఁడు నా పలుకూఁదు మన్న మో
దాతిశయంబు నొంది భృగుఁ డా ధరణీసురవర్యుతో మహా
త్మా! తెలివొందె నా మనము తావక పావన వాక్యసంపదన్. **559**

ప్రతిపదార్థం: ఆతనిన్= ఆ పద్మనాభుడిని; కానన్= దర్శించటానికి; పొమ్ము= వెళ్ళుము; ఆ+గుణగరిష్ఠుఁడు= గుణాలలో దొడ్డవాడైన ఆ పద్మనాభుడు; ప్రచుర+ఆదరణంబునన్= విస్తృతమైన ఆదరంతో; సంప్రీతిగన్= ప్రీతి కలిగేటట్టు (నీకు తృప్తికలిగేటట్టు); నీదుకోర్కి= నీ కోరిక; తీర్చున్= తీరుస్తాడు; నా పలుకున్= నామాటను; ఊఁదుము= ఆధారంగా స్వీకరించుము (విశ్వసించుము); అన్నన్= అని అతిథి చెప్పేసరికి; భృగుఁడు= భృగుడు; మోద+అతిశయంబున్= అతిశయించిన ఆనందాన్ని (ఆనందాధిక్యాన్ని); ఒంది= పొంది; ఆ+ధరణీసుర+వర్యుతోన్= బ్రాహ్మణోత్తముడైన ఆ అతిథితో; మహాత్మా!= మహానుభావా!; తావక= నీయొక్క; పావన= పవిత్రమైన; వాక్యసంపదన్= మాటల సంపత్తితో; నా మనము= నా మనస్సు; తెలివి+ఒందెన్= తెలివిని (జ్ఞానాన్ని) పొందింది.

తాత్పర్యం: ఓ భృగూ! ఆ పద్మనాభుడిని దర్శించుము. అతడు నీ కోరిక తీరుస్తాడు' అని అతిథి చెప్పాడు. దానికి భృగువు ఎంతో సంతోషించాడు. 'మహాత్మా! నీ మాటలతో నాకు జ్ఞానోదయమయింది' అన్నాడు.

క. **అని పలికి యిట్లనియె ని । ద్దినశేషము రాత్రియును మదీయనివాసం**
బున నిలువు నిలిచి మత్పా । వనుఁడవు గావలయు గౌరవశ్రీభరితా! **560**

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఇట్లు+అనియెన్= ఇంకా ఇట్లా అన్నాడు; గౌరవశ్రీ= గౌరవశోభతో; భరితా!= నిండినవాడా!; ఈ+దినశేషమున్= ఈ పగటిపూటలో మిగిలిన ఈ కాస్తసేపూ; రాత్రియునున్= ఈ రాత్రీ; మదీయనివాసంబునన్= మా ఇంటిలో; నిలువు(ము)= ఆగుము; మత్పావనుఁడవు= నన్ను పవిత్రుడిని చేసేవాడవు; కాన్+వలయున్= అవ్వాలి.

తాత్పర్యం: ఇంకా, గౌరవసంపన్నుడా! ఈ పూటకూ ఈ రాత్రికీ నీవు నా నివాసంలోనే ఉండాలి. నన్ను పావనుడిని చేయాలి' అన్నాడు.

క. **అనిన నతఁడట్ల చేయ న । తనిఁ బూజించుటను మధురతరసల్లాపం**
బున ధర్మసత్కథావ । ర్తనమున నక్కాల మతఁ డుదాత్తతఁ గడపెన్. **561**

ప్రతిపదార్థం: అనినన్= అని అభ్యర్థించగా; అతఁడు= ఆ అతిథి; అట్లు+అ= అట్లాగే; చేయన్= చేయగా; అతనిన్= ఆ అతిథిని; పూజించుటను= అర్చించటంతోనూ; మధురతర= మిక్కిలి మధురమైన; సల్లాపంబునన్= సంభాషణతోనూ; ధర్మ= ధర్మంతో కూడిన (ధర్మాలను ఉపదేశించే); సత్కథా+ఆవర్తనమునన్= మంచి కథలను కలబోసికొనటంతోనూ; ఆ+కాలమున్= ఆ సమయాన్ని; అతఁడు= ఆ భృగువు; ఉదాత్తతన్= ఉత్తమంగా(ఉదాత్తంగా); కడపెన్= కడపాడు.

తాత్పర్యం: భృగువు అభ్యర్థనను అతిథి అంగీకరించి ఆగిపోయాడు. అతడిని అర్చించటంలోనూ, మధుర సంభాషణలతోనూ, ధార్మికగాథలను ఆలకించటంలోనూ ఉదాత్తంగా ఆ సమయాన్ని భృగువు గడిపాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వేగిన నామంత్రితుఁడై । యా గుణనిధి వీడుకొలిపి యతఁడు ప్రయాణో
ద్యోగంబు సమీచీనవి । ధా గరిమప్రౌఢవృత్తిఁ దగ నొనరించెన్. 562

ప్రతిపదార్థం: వేగినన్= తెల్లవారింది - అప్పుడు; ఆమంత్రితుఁడై= వీడ్కోల్పబడినవాడై; ఆ గుణనిధిన్= గుణసంపన్నుడైన ఆ అతిథిని (గుణాలకు నిధి); వీడుకొలిపి= పంపించి (పరస్పరం వీడ్కోలు చెప్పుకొని - అని); అతఁడు= ఆ భృగువు; సమీచీన= సరియైన; విధా= విధానం యొక్క; గరిమ= గొప్పదనంతో కూడిన; ప్రౌఢవృత్తిన్= నేర్పరితనంతో; ప్రయాణ+ఉద్యోగంబు= తన ప్రయాణ ప్రయత్నాన్ని; తగన్+ఒనరించెన్= తగినట్టుగా చేశాడు.

తాత్పర్యం: మధురసంభాషణలతో తెల్లవారింది. అప్పుడు అతిథి భృగువుకు వీడ్కోలు చెప్పాడు. భృగువు అతిథిని వీడ్కొలిపాడు. ఆ తరువాత తన ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లను సరియైన పద్ధతిలో నేర్పుగా తగిన రీతిలో చేశాడు.

భృగుం డను విప్రుండు పద్మం డను సర్పరాజుం గనవచ్చుట (సం. 12-343-2)

వ. ఇవ్విధంబున నుద్యుక్తుండై భృగుండు బంధుమిత్రజన సమ్మతం బగు తెఱంగునం గదలి యెడనెడ బహుతీర్థసేవనంబు సేయుచుం జని పుణ్యంబగు నైమిశారణ్యంబు సొచ్చి గోమతీతీరంబు సేరి, సుప్రసిద్ధం బగు మహాపద్మహ్రదంబు తటంబునం బొలుచు భుజగేంద్రమందిరంబు గాంచి తగం బ్రవేశించి నట్టియెడ. 563

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఇట్లా ఉద్యుక్తుండై= సన్నద్ధుడై; భృగుండు= భృగువు; బంధు(జన)= బాంధవులకూ; మిత్రజన= మిత్రులకూ; సమ్మతంబు+అగు= అంగీకార యోగ్యమైన; తెఱంగునన్= పద్ధతిలో; కదలి= బయలుదేరి; ఎడనెడన్= అక్కడక్కడా; బహుతీర్థ సేవనంబు= అనేక తీర్థాలను సేవించటం; చేయుచున్= చేస్తూ; చని= వెళ్ళి; పుణ్యంబు+అగు= పుణ్యప్రదమైన; నైమిశ+అరణ్యంబు= నైమిశారణ్యం; చొచ్చి= ప్రవేశించి; గోమతీతీరంబు= గోమతీ నది ఒడ్డు; చేరి= సమీపించి; సుప్రసిద్ధంబు+అగు= మిక్కిలి ప్రసిద్ధమైన; మహాపద్మ హ్రదంబు= మహాపద్మము అనే తటాకంయొక్క; తటంబునన్= ఒడ్డున; పొలుచు= ఒప్పారుతున్న; భుజగేంద్ర మందిరంబు= నాగేంద్రుడి గృహం; కాంచి= చూచి; తగన్= తగినట్టు; ప్రవేశించినట్టి+ఎడన్= ప్రవేశించిన సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా పూనుకొని భృగుడు బంధుమిత్రుల అనుమతిగల పద్ధతిలో పయనించి, అక్కడక్కడ పుణ్యతీర్థాలను సేవిస్తూ వెళ్ళి, పవిత్ర నైమిశారణ్యంలో ప్రవేశించి, గోమతీనది తీరం చేరి, ప్రసిద్ధమయిన మహాపద్మ మనే సరస్సు గట్టుమీద ఉన్న నాగేంద్రమందిరం చూచి, సముచితంగా అందులో ప్రవేశించే సమయంలో.

తే. భక్తితోడ నన్నాగేంద్రుపత్ని యెదురు । వచ్చి తోడ్కొని చని యర్ఘలిచ్చి 'మీర
లిందు రాకకుఁ గారణమేమి సెప్పుఁ । డెద్ది పనిచినఁ జేసెద నిద్ధచరిత!' 564

ప్రతిపదార్థం: ఆ+నాగేంద్రు= ఆ నాగేంద్రుని; పత్ని= భార్య; భక్తితోడన్= భక్తితో; ఎదురువచ్చి= ఎదురువచ్చి; తోడ్కొని చని= వెంట తీసికొనివెళ్ళి; అర్ఘలు+ఇచ్చి= (అతిథి మర్యాదలుగా) పూజలు చేసి; ఇద్ధచరిత!= పవిత్రమైన నడవడి కలవాడా!; మీరలు= తమరు; ఇందున్+రాకకున్= ఇక్కడకు రావటానికి; కారణము= కారణం (హేతువు); ఏమి= ఏమిటో; చెప్పుఁడు= దయచేసి చెప్పండి; ఎద్ది= ఏది; పనిచినన్= ఆజ్ఞాపించినా; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: ఆ నాగేంద్రుడి భార్య ఎదురువచ్చి భృగువును భక్తితో ఇంటికి తీసికొనివెళ్ళింది. అతిథిపూజలు చేసింది. 'మీరు ఏమి పనిమీద ఇక్కడికి వచ్చారో చెప్పండి. ఏది ఆజ్ఞాపిస్తే అది చేస్తాను' అన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనుటయు నమ్మహీదేవుండు 'దేవీ! భవదీయపతిం గాన వచ్చితి నెచ్చోనున్నవాఁ డవ్విభుం గానిపింపు' మనిన నతని కా భుజంగాంగన యిట్లనియె. 565

ప్రతిపదార్థం: అనుటయున్= అని ఆవిడ అనేసరికి; ఆ+మహీదేవుండు= ఆ బ్రాహ్మణుడు - భృగువు; దేవీ!= అమ్మా!; భవదీయపతిన్= నీ భర్తను; కానన్= చూడటానికి; వచ్చితిన్= వచ్చాను; ఎచ్చోన్= ఎక్కడ; ఉన్నవాఁడు= ఉన్నాడు?; ఆ+విభున్= ఆ నీ భర్తను; కానిపింపుము= చూపించుము; అనినన్= అంటే; అతనికిన్= భృగువుకు; ఆ భుజంగ+అంగన= ఆ సర్పకాంత; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పింది.

తాత్పర్యం: దానికి ఆ బ్రాహ్మణుడు 'అమ్మా! నీ భర్తను కలిసి వెళ్ళటానికి వచ్చాను. ఆయన ఎక్కడున్నాడో తెలుపుము' అనగా ఆ సర్పకాంత ఇట్లా అన్నది.

క. ' తనకు నెలవరుస వచ్చిన । నినరథ వహనమున కాతఁడేఁగినవాఁ డే
డెనిమిది దివసములకు నిట । సనుదెంచుం దథ్యమిది ప్రసాద ప్రవణా! 566

ప్రతిపదార్థం: ప్రసాద= ప్రసన్నతాగుణంపట్ల; ప్రవణా!= తత్పరత కలవాడా! (ప్రసన్నమైన ఆకృతి కలవాడా! - అని అర్థం); తనకున్= నా భర్తకు; నెలవరుస= నెలవారీవంతు; వచ్చినన్= వచ్చి; ఇనరథ+వహనమునకున్= సూర్యరథాన్ని మోయటానికి; ఆతఁడు= ఆయన; ఏఁగినవాఁడు= వెళ్ళాడు; ఏడు+ఎనిమిది= ఏడులేక ఎనిమిది; దివసములకున్= రోజులకు; ఇట= ఇక్కడికి; చనుదెంచున్= తిరిగి వస్తాడు; ఇది= ఇది; తథ్యము= నిజం.

తాత్పర్యం: 'ఓ ప్రసన్నమూర్తీ! నెలవారీ వంతు రావటంతో నా భర్త సూర్యరథాన్ని మోయటానికి వెళ్ళాడు. ఏడు ఎనిమిది రోజులలో వస్తాడు. ఇది నిజం. (సూర్యరథానికి సర్పాలే రజ్జువులని పురాణప్రసిద్ధి.)

క. అతని తెఱంగిట్టిది వాం । ఛిత మెయ్యది యిత్తు ననఘ! చెప్పు' మనుడు నా
సతి కిట్లను భృగుఁడు 'భవ । త్పతిఁ గనుటయ కాక వాంఛ దక్కును గలదే? 567

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పవిత్రుడా!; అతని తెఱంగు= నా భర్త (ఉద్యోగ) పద్ధతి; ఇట్టిది= ఇటువంటిది (నెలనెలా ఒక వారం రోజులు సూర్యరథవహనానికి వెళ్ళటం); వాంఛితము= నీ కోరినది; ఏ+అది?= ఏమిటి?; ఇత్తున్= ఇస్తాను; చెప్పుము; అనుడున్= అనేసరికి; ఆ సతికిన్= ఆ పతివ్రతతో; భృగుఁడు= భృగువు; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు; భవత్= నీయొక్క;పతిన్= భర్తను; కనుట+అ+కాక= దర్శించటం ఒక్కటే తప్ప; తక్కును= మరొక; వాంఛ= కోరిక; కలదే?= నాకు ఉన్నదా?(లేదని అర్థం).

తాత్పర్యం: ఓ పావనుడా! నా భర్త చేసే ఉద్యోగం పద్ధతి ఇది. నెలనెలా ఒకవారం రోజులు సూర్యరథ వహనానికి వెళ్ళుతాడు. నీ కోరిక ఏమిటో చెప్పుము, తీరుస్తాను' అన్నది ఆ పతివ్రత. 'అమ్మా! నీ భర్తను దర్శించటంకంటె నాకు వేరే కోరిక ఏమీ లేదు' అని అన్నాడు భృగువు.

వ. అయ్యురగవల్లభు వచ్చునంతకు నుల్ల వనంబున నిలిచెద; నవ్విభుండు వచ్చినప్పుడు మఱవక నా తెఱం గెఱింగింపవలయు' నని పలికి పోయి భృగుండు గోమతీతట పుణ్యారణ్యంబున జప్యపరుండును నిరాహారుండునునై యుండె; నట్లుండ నా భుజంగపతి బాంధవులు దదీయ పత్నీపుత్ర సహితంబుగా నమ్మహీసురవరు పాలికిం జనుదెంచి మృదుమధురవాక్యంబుల ననునయించి 'నీ వాహారంబుగొనక నిలువం దొడంగిన నాఁటికి నేఁ డాఱవదినం బయ్యె నే మతిథిపూజా పరులము మాకు ధర్మవిరోధంబు గాకుండ మా చేయు నాతిథ్యంబు నాదరింపు మస్మత్ప్రార్థనంబున నన్నంబు ఫలంబు మూలంబు మఱియు నెయ్యదియైనను భుజించి మమ్ము రక్షింపవే?' యనిన వారలతో నా సువ్రతశీలుం డిట్లనియె. 568

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఆ+ఉరగవల్లభుండు= ఆ సర్పరాజు; వచ్చునంతకున్= వచ్చేదాకా; ఉల్ల= అదిగో అల్లంతదూరంలో ఉన్న (ఉల్ల= అల్ల); వనంబునన్= అరణ్యంలో; నిలిచెదన్= వేచి ఉంటాను; ఆ+విభుండు= ఆ నాగరాజు; వచ్చినప్పుడు+అ= వచ్చిన వెంటనే; మఱవక= మరచిపోకుండా; నా తెఱంగు= నా విషయం; ఎఱింగింపన్+వలయున్= తెలియజేయాలి సుమా!; అని పలికి= అని చెప్పి; పోయి= వెళ్ళి; భృగుండు= భృగువు; గోమతీతట= ఆ గోమతి ఒడ్డున ఉన్న; పుణ్య+అరణ్యంబునన్= పవిత్రమైన అడవిలో; జప్యపరుండును= జప తత్పరుడూ; నిరాహారుండును+ఐ= ఆహారం తీసికోనివాడూ అయి; ఉండెన్= ఉన్నాడు; అట్లుండన్= అట్లా ఉండగా; ఆ భుజంగపతి= ఆ సర్పరాజు; బాంధవులు= బంధువులు; తదీయ= అతడి; పత్నీపుత్ర సహితంబుగాన్= భార్యాపుత్రులతో సహా; ఆ+మహీసురవరు= ఆ బ్రాహ్మణుడి; పాలికిన్= దగ్గరకు; చనుదెంచి= వచ్చి; మృదు= సున్నితమైన; మధుర= తీయనైన; వాక్యంబులన్= మాటలతో; అనునయించి= బుజ్జగించి; నీవు; ఆహారంబు+కొనక= ఆహారం తీసుకోకుండా; నిలువన్+తొడంగిన+నాఁటికిన్= ఇక్కడ ఉండటం మొదలుపెట్టినరోజుకు; నేఁడు= ఈనాడు; ఆఱవదినంబు= ఆరవ రోజు; అయ్యెన్= అయింది; ఏము= మేమంతా; అతిథిపూజాపరులము= అతిథులను అర్చించటమే వ్రతంగా కలవారం; మాకున్= మాకు; ధర్మవిరోధంబు= ధర్మలోపం (అతిథులను అర్చించకపోవటం అనే ధర్మవిరోధం); కాకుండన్= జరగకుండా; మా చేయు= మేము చేస్తున్న; ఆతిథ్యంబున్= అతిథిమర్యాదను; ఆదరింపుము= మన్నించి స్వీకరించుము; అస్మత్= మా; ప్రార్థనంబునన్= అభ్యర్థనతో; అన్నంబు= అన్నమో; ఫలంబు= ఫలమో; మూలంబు= దుంపయో; మఱియున్= ఇంకా; ఏ+అది+ఐనన్= ఏదయినా; భుజించి= ఆహారంగా తీసికొని; మమ్మున్= మమ్ములను; రక్షింపవే!= కాపాడవా! (ధర్మలోపం నుంచి రక్షించుము); అనినన్= అనివారు అభ్యర్థించగా; ఆ సువ్రతశీలుండు= మంచిదీక్ష, మంచి శీలమూ కలిగిన ఆ భృగువు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ నాగరాజు వచ్చేంతవరకు ఆ వనంలో ఉంటాను. ఆ రాజు రాగానే నా సంగతిని తెలపండి' అని చెప్పి, భృగుడు గోమతీపుణ్యారణ్యంలో జపం చేస్తూ, నిరాహారుడై ఉన్నాడు. అట్లా ఉండగా ఆ నాగరాజు బంధువులు అతడి భార్యాపుత్రులతో కలిసివచ్చి భృగువును తియ్యనిమాటలతో అనునయించి, 'నీవు ఆహారం తీసికొనక నేటికి ఆరునాళ్ళయింది. మేము అతిథిపూజాప్రియులం. మాకు ధర్మలోపం జరుగకుండా మా ఆతిథ్యం స్వీకరించుము. మా కోరిక మన్నించి అన్నమో, పండ్లో, కందమూలాలో - ఏవైనా తిని మమ్ములను రక్షించుము' అని అనగా, ఆ నిష్ఠాపరుడైన భృగువు ఇట్లా అన్నాడు:

ఉ. ' ఇంతన నేల? యేను భుజగేశ్వరు రాకయ వార్చినాఁడ, నా
కం తవునంతకుం గుడువ నాఁకలి నీళ్ళు ద్రావఁ దృష్ణ యొ
క్కింతయు లేదు గా కలిగి యే యటవీస్థలి కేఁగుదెంచి యే
కాంతమ యున్నవాఁడ? నియమాభిరతున్ నను నేఁపనేటికిన్? 569

ప్రతిపదార్థం: ఇంత+అనన్+ఏల?= ఇంతగా చెప్పటం ఎందుకు?; ఏను= నేను; భుజగ+ఈశ్వరు= ఆ సర్పరాజు యొక్క; రాకయ= రాకకే; వార్చినాఁడన్= ఎదురుచూస్తున్నాను; అంత+అవునంతకున్= అంతవరకూ (అది సిద్ధించే దాకా); నాకు; కుడువన్= భుజించటానికి; ఆఁకలి= ఆకలీ; నీళ్ళులు= నీరు; త్రావన్= త్రాగటానికి; తృష్ణ= కోరికా; ఒక్కింతయున్= కాసింతకూడా; లేదు; (ఆకలీ ఉండదు దప్పికా ఉండదు అని - లేదు+కాక= ఉండనే ఉండదు - అని కానీ); కాక= అట్లా కాక; అలిగియే= కోపించినందువలనా; అటవీస్థలికిన్= ఈ అరణ్యప్రదేశానికి; ఏఁగుదెంచి= వచ్చి; ఏకాంతము+అ= ఒంటరిగా; ఉన్నవాఁడన్?= నేను ఉన్నది? (అలిగి ఇక్కడికి రాలేదు కదా!- అని); నియమ= ఒక నియమంపట్ల; అభిరతున్= పట్టుదల గలవాడనైన; ననున్= నన్ను; ఏఁపన్+ఏటికిన్= ఇట్లా బాధపెట్టటం ఎందుకు? (ఇబ్బంది పెట్టటం దేనికి?)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'అయ్యా! ఇంతంతమాటలు అనటం ఎందుకు? సర్పరాజు రాకకొరకు ఎదురు చూస్తున్నాను. అది సిద్ధించేవరకూ నాకు ఆకలీ ఉండదు, దప్పికా ఉండదు. అంతేకాని, నేను అలిగి ఇట్లా వచ్చేసి ఈ అడవిలో ఏకాంతంగా కూర్చుండలేదుగదా! ఒక నియమంతో ఉన్నాను. నన్ను బాధపెట్టటం ఎందుకు చెప్పండి!

క. మీకును ధర్మవిరోధము । గాకుండుట కేన పూఁట గారవమున నా
లోకింపుఁ డింక దివసయు । గాకలనమునఁ గల్గ వ్రతసమాప్తియుఁ గలుగున్. 570

ప్రతిపదార్థం: మీకునున్= మీకు కూడా; ధర్మవిరోధము= ధర్మలోపం; కాకుండుటకున్= కాకుండా ఉండటానికి; ఏను+అ= నేనే; పూఁట= పూచీ (ఆ బాధ్యతనాది - అని); గారవమునన్= ప్రేమతో; ఆలోకింపుఁడు= చూడండి (వేచి ఉండండి); ఇంకన్= మరొక; దివసయుగ= రెండురోజులు; ఆకలనమున్= కడవటంకూడా; కల్గన్= జరిగితే; వ్రతసమాప్తియున్= నా (నిరాహార) దీక్షాసమాప్తి కూడా; కలుగున్= జరుగుతుంది.

తాత్పర్యం: మీకు ధర్మవిరోధం జరుగకుండా ఉండటానికి నాదీ పూచీ. కాస్త గౌరవంతో వేచి చూడండి. మరొక రెండురోజులు ఇట్లాగే గడిస్తే నా వ్రతం కూడా పూర్తి అయిపోతుంది.

క. వినుఁ డష్టమమగు దివసం । బున ముదమారంగ నిందు భుజగేంద్రుఁడు రా
కునికి గలిగెనేనియుఁ బర । దినమునఁ గుడిచెద భవన్మతిం బ్రియ మెసఁగన్. 571

ప్రతిపదార్థం: వినుఁడు= వినండి; అష్టమము+అగు= ఎనిమిదవదైన; దివసంబునన్= రోజున; ముదమారంగన్= సంతోషకరంగా; ఇందున్= ఇక్కడికి; భుజగ+ఇంద్రుఁడు= ఆ సర్పరాజు; రాక+ఉనికి= రాకపోవటం; కలిగెన్+ఏనియున్= జరిగినట్టయితే (రాకపోతే); పరదినమునన్= ఆ మరుసటిరోజున; భవత్+మతిన్= మీ కోరికమేరకు (మీ ఆలోచన ప్రకారం); ప్రియము+ఎసఁగన్= ఇష్టం అతిశయించేట్టు (పూర్తి ఇష్టంతో); కుడిచెదన్= భుజిస్తాను.

తాత్పర్యం: అయ్యా! వినండి. ఎనిమిదవ రోజుకు ఆ సర్పరాజు రావాలి. ఒకవేళ రాకపోతే ఆ మర్నాడు మీరు కోరినట్లే హాయిగా ఇష్టపడి భోజనం చేస్తాను.

వ. మీర లిత్తెఱంగున కనుజ్ఞ సేయవలయు' నని సంప్రార్థనీయస్వరంబునం బలికిన వారలందఱు నొడంబడి నిజనివాసంబులకుం జని రయ్యష్టమ దివసంబున. 572

ప్రతిపదార్థం: మీరలు= మీరు; ఈ+తెఱంగునకున్= ఈ పద్ధతికి; అనుజ్ఞ= అనుమతి; చేయవలయున్= ఈయవలెను; అని= అని; సంప్రార్థనీయ+స్వరంబునన్= వేడుకొనే కంఠస్వరంతో; పలికినన్= అడిగేసరికి; వారలు+అందఱున్= వారంతా; ఒడంబడి= అంగీకరించి; నిజనివాసంబులకున్= తమ తమ గృహాలకు; చనిరి= వెళ్ళారు; ఆ+అష్టమ దివసంబునన్= ఆ ఎనిమిదవ రోజున-

తాత్పర్యం: మీరు దీనికి అంగీకరించాలి' అని ఆయన వేడుకొనగా, వాళ్ళందరూ దానికి అంగీకరించి తమ నివాసాలకు వెళ్ళిపోయారు. ఎనిమిదవ రోజున. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వరుస దినంబులు దీఱిన । నరవిందాప్తుండు దనకు ననుమతి సేయం
గురువంశముఖ్య! తగ న । య్యురగాధీశుండు విభవమొప్పఁగ వచ్చెన్. 573

ప్రతిపదార్థం: కురువంశముఖ్య!= కురువంశంలో ప్రధానమైనవాడా (పెద్దవాడా) ఓ ధర్మరాజా!; వరుసదినంబులు= తనవంతు రోజులు (తన చుట్టు రోజులు); దీఱినన్= తీరిపోగా; అరవింద+ఆప్తుఁడు= పద్మాలకు మిత్రుడైన సూర్యుడు; తనకున్= తనకు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనుమతి+చేయన్= వెళ్ళటానికి అనుమతి ఈయగా; తగన్= తగినట్లు; ఆ+ఉరగ+అధీశుండు= ఆ సర్పరాజు; విభవము+ఒప్పఁగన్= తన వైభవం అతిశయించేటట్టు; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: ధర్మరాజా! సర్పరాజుకు సూర్యరథాన్ని మోయవలసిన తనవంతు రోజులు గడిచిపోయాయి. సూర్యుడు అనుమతి ఇచ్చాడు. ఆ సర్పరాజు వైభవంగా ఇంటికి తిరిగివచ్చాడు.

ఉ. వచ్చిన సంభ్రమంబు గరువంపు టెలర్పును నుల్లసిల్లి మే
నచ్చు పడంగఁ జేయఁ జెలు వా భుజగేశ్వరుపత్ని యాతనిం
జెచ్చెరఁ దా నెదుర్కొని విశిష్టసమాదరయై యుపాయనం
బిచ్చి తదీయచిత్తమునకిం పెసలారఁగఁ బాద్య మిచ్చినన్. 574

ప్రతిపదార్థం: వచ్చినన్= వచ్చేసరికి; సంభ్రమంబున్= హడావుడీ; గరువంపు+ఎలర్పునన్= అతిశయం తాలూకు విజృంభణలతో; ఉల్లసిల్లి= సంతోషించి; మేను= శరీరం (ఆకారం); చెలువున్= ఆ సౌందర్యాన్ని (సంభ్రమమూ గరువమూ - వీటి విలాసాన్ని); అచ్చుపడంగన్+చేయన్= స్పష్టపడేటట్టు చేయగా (స్వేదరోమాంచాదులతో అవి స్పష్టపడ్డాయి - అని); ఆ+భుజగ+ఈశ్వరు+పత్ని= ఆ సర్పరాజుగారి భార్య; ఆతనిన్= ఆ సర్పరాజును; చెచ్చెరన్= వెంటనే (వేగంగా); తాను= సర్పరాజు భార్య; ఎదుర్కొని= ఎదురు సన్నాహం వెళ్ళి; విశిష్ట= విశేషమైన; సమాదరయై= ఆదరంతో కూడినదై; ఉపాయనంబు+ఇచ్చి= (ప్రేమసూచకంగా) బహుమతి ఇచ్చి; తదీయ= ఆతని; చిత్తమునకున్= హృదయానికి; ఇంపు+ఎసలారఁగన్= ఇంపు కలిగేటట్టు; పాద్యము= పాదోదకం; ఇచ్చినన్= ఈయగా (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: సర్పరాజు భార్య హడావుడిగా 'నా భర్త ఇంటికి వచ్చాడు' అనే అతిశయంతో ఎదురువెళ్ళి ఆదరంగా బహూకరించి తీసికొని వచ్చింది. కాళ్ళకు నీళ్ళు ఇచ్చింది. సర్పరాజు మనస్సు ఈ ఆదరానికి సంతోషించింది.

వ. సంప్రీతుండై సముచితప్రకారంబున నుండె నట్లున్న యన్నాగేంద్రుండు సమీపాసీనయైన యద్దేవి నాలోకించి. 575

ప్రతిపదార్థం: సంప్రీతుండై= సంతోషించినవాడై; సముచితప్రకారంబునన్= తగిన పద్ధతిలో; ఉండెన్= ఉన్నాడు; అట్లు+ఉన్న= అలా ఉన్నటువంటి; ఆ+నాగేంద్రుండు= ఆ నాగరాజు; సమీప= తనకు దగ్గరగా; ఆసీనయైన= కూర్చునిఉన్న; ఆ+దేవిన్= ఆమెను (తనభార్యను); ఆలోకించి= చూచి.

తాత్పర్యం: సర్పరాజు సంతోషించాడు. తనకు దగ్గరగా ఉన్న భార్యను చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ' అతివ! సేమమె? తగ దేవతాతిథి ప్ర। పూజనంబులు నడచునే? పూర్వవృత్తి
యెడలి యేను లేకునికి నేమేని వికల। మయ్యెనో? చెప్పు' మనవుడు నా మృగాక్షి. 576

ప్రతిపదార్థం: అతివ= ఓ మగువా! సేమమె?= క్షేమమేనా?; తగన్= తగిన పద్ధతిలో; దేవతా+అతిథి+ప్రపూజనంబులు= దేవతాపూజలూ, అతిథిసేవలూ; నడుచునే?= సాగుతున్నాయా?; ఏనున్= నేను; లేకునికిన్= లేకపోవటంతో; పూర్వవృత్తి+ఎడలి= మునుపటి పద్ధతి తప్పిపోయి; ఏమేనిన్= ఏదయినా; వికలము+అయ్యెనో?= పొరపాటు జరిగిందా?; చెప్పుము; అనవుడున్= అనగానే; ఆ+మృగాక్షి= లేడి కన్నులవంటి కన్నులుగల ఆ వనిత.

తాత్పర్యం: 'ఓ అతివా! క్షేమమే కదా! దేవతాపూజలూ, అతిథి పూజలూ యథావిధిగా జరుగుతున్నాయా? నేను ఊళ్ళో లేనుకదా అని మునుపటి పద్ధతి తప్పిపోయి ఏమయినా మార్పులూ పొరపాట్లూ జరిగాయా? చెప్పుము' అని ఆ సర్పరాజు ప్రేమగా అడిగాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ఆతనితోడ నిట్లనియె 'నంత యెఱుంగమి రాదు నీదు శి
క్షాతిశయంబు గల్మి భుజగాధిప! నాకుఁ దగన్ సమస్తదే
వాతిథి పూజనంబులు సమగ్రములై నడచెన్ సుహృజ్జన
ప్రీతియు మున్నపోలె నవిభేదత యొప్పఁగ నిర్వహించితిన్.' 577

ప్రతిపదార్థం: ఆతనితోడన్= ఆ సర్పరాజుతో; ఇట్లు+అనియెన్= ఆమె ఇలా అంది; భుజగ+అధిప!= ఓ సర్పరాజా!; నీదు= నీవు ఇచ్చిన; శిక్షా= అభ్యాసంతాలూకు (తర్ఫీదు); అతిశయంబు+కల్మిన్= ఔన్నత్యం ఉండటంవల్ల; నాకున్= నాకు; అంత+ఎఱుంగమి= ఆ మాత్రం ఎరగకపోవటం; కాదు= లేదు (ఆమాత్రం ఎరుగుదునులెమ్ము - అని); తగన్= తగినపద్ధతిలో; సమస్తదేవ= సకలదేవతల; అతిథి= అతిథుల పూజనంబులు= అర్చనలు; సమగ్రములై= పరిపూర్ణాలై; నడచెన్= సాగాయి; సుహృద్+జన= స్నేహితుల; ప్రీతియున్= సంతృప్తికూడా (వారిని గౌరవించి ఆనందింపజేయటమనేది సైతం); మున్ను+అ+పోలెన్= మునుపటివలెనే; అవిభేదతన్= ఏమీ తేడా లేకుండా; ఒప్పఁగన్= ఒప్పేట్టు; నిర్వహించితిన్= నిర్వహించాను.

తాత్పర్యం: 'ఓ సర్పరాజా! నే నేమీ ఆమాత్రం ఎరుగనిదానిని కాదు. ఇంతకాలమూ నీవు ఇచ్చిన శిక్షణ ఉన్నది కదా! దేవతాపూజలూ అతిథిసత్కారాలూ అన్నీ సమగ్రంగా యథావిధిగా జరిగాయి. స్నేహితులను గౌరవించి సంప్రీతులను చేయటమనేది కూడా మునుపటివలెనే ఏమీ తేడా లేకుండా నిర్వహించాను' అని బదు లిచ్చింది.

వ. అని వెండియు. 578

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ - (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. గురుభక్తి శిష్యులకును, వేదపరత వి । ప్రులకును, జనరక్ష భూపతులకు,
న్యాయార్జనంబు వైశ్యజనంబులకుఁ ద్రివ । ర్ణారాధనంబు శూద్రావళికిని,
బతివాక్య కరణంబు భటులకు, సర్వోప । కారక్షమంబైన సారభూత
మనఁగఁ బెంపొందు గృహస్థాశ్రమంబుపై । వారని ప్రియ మెల్లవారలకును,

తే. లోక మేల? యేనేల? యి ట్టేకతంబ । యింద్రియంబులఁ గుదియించి యిచ్చ నడఁచి
యుండువాఁడఁ గాకను మతి యోగికిని, బ । తివ్రతాత్వంబు భార్యకు సువ్రతములు. 579

ప్రతిపదార్థం: గురుభక్తి= గురువుపట్ల భక్తి; శిష్యులకును= శిష్యులకూ; వేదపరత= వేదాలపట్ల తత్పరత; విప్రులకును= బ్రాహ్మణులకూ; జనరక్ష= ప్రజలను రక్షించటం; భూపతులకున్= రాజులకూ; న్యాయ+ఆర్జనంబు= న్యాయంగా ధనాన్ని సంపాదించటం; వైశ్యులకున్= కోమటులకూ; త్రివర్ణ= పై మూడు వర్ణాలవారినీ; ఆరాధనంబు= అర్చించటం; శూద్ర+ఆవళికిని= శూద్రుల సమూహానికీ; పతి= ప్రభువుయొక్క; వాక్య= ఆజ్ఞను; కరణంబు= చేయటం; భటులకున్= సేవలకూ(సైనికులకూ); సర్వ= అందరికీ; ఉపకార= ఉపకరించటంలో; క్షమంబు+ఐన= సమర్థమైన; సారభూతము= సారప్రాయమయినది; అనఁగన్= అని; పెంపొందు= ప్రశస్తిని పొందిన; గృహస్థ+ఆశ్రమంబుపైన్= గృహస్థాశ్రమం మీద; వారని= వారింపరాని; ప్రియము= ప్రేమ; ఎల్లవారలకును= అందరికీ; (సువ్రతములు); లోకము+ఏల?= ఈ లోకం ఎందుకు? ఏను+ఏల?= నేను ఎందుకు?; ఇట్టు= ఇట్లా; ఏకతంబు+అ= ఒంటరిగా (ఏకాంతంలో)నే; ఇంద్రియంబులన్= ఇంద్రియాలను; కుదియించి= నిగ్రహించి; ఇచ్చన్= కోరికను; అడఁచి= అణచివేసి; ఉండువాఁడన్+కాక= ఉండిపోతానే తప్ప; అను= అనేటటువంటి; మతి= బుద్ధి; యోగికినిన్= యోగికీ; పతివ్రతాత్వంబు= పాతివ్రత్యం; భార్యకున్= భార్యకూ; సువ్రతములు= ఆచరించదగిన వ్రతాలు (నియమాలు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: గురువుపట్ల భక్తి శిష్యులకు వ్రతం. వేదతత్పరత బ్రాహ్మణులకు వ్రతం. లోకరక్షణ రాజులకు వ్రతం. న్యాయంగా ధనం సంపాదించటం వైశ్యులకు వ్రతం. పై మూడు వర్గాలవారినీ సేవించటం శూద్రులకు వ్రతం. రాజాజ్ఞను శిరసావహించటం భటులకు వ్రతం. సర్వాశ్రమాల వారికీ ఉపకారం అందించే గృహస్థాశ్రమం మీద ప్రేమ అందరికీ వ్రతం. లోకం ఏమిటి? నే నేమిటి? ఇవన్నీ నాకెందుకట! హాయిగా ఏకాంతంలో తపస్సు చేసికొంటూ ఇంద్రియాలను జయిస్తాను, కోరికలను జయిస్తాను - అనే బుద్ధి కలిగి ఉండటం యోగికి వ్రతం. పాతివ్రత్యం భార్యకు వ్రతం.

వ. కావున ధర్మసూక్ష్మ సంవేది వగు నీదు చిత్తంబున భేదం బొక్కింతయేనియు దొడరునట్టి విధంబున వర్తింతునే? యొకండు విన్నపంబు సేయంగల దవధరింపుము. పరమపావనమూర్తి యొక్క మహీసురోత్తముం డిచ్చటికి వచ్చి యభ్యర్చితుండై భవత్పతి దర్శింప వచ్చితిననియెఁ గార్యంబేమి? యని యడిగిన నాకుం జెప్పకుండె; నేను నీ వట సనుటం జెప్పిన విని యట్లయిన నా భుజంగవిభుండు వచ్చునంతకు నుల్ల వనంబున నుండెద నతండు వచ్చిన నా తెఱంగు గెఱింగింపు మని చని యేడెనిమిది నాళ్ళైని జప్యపరుండును నిరాహారుండునై యున్నవాఁడు; నీ వచ్చటి కరిగి యతని సంభావింపవలయు నని చెప్పిన నా సర్ప గ్రామణి గుపితచిత్తుండై. 580

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ధర్మసూక్ష్మ= ధర్మసూక్ష్మాలను; సంవేదివి+అగు= తెలిసినవాడవైన; నీదు= నీయొక్క; చిత్తంబునన్= మనస్సులో; భేదంబు= బాధ; ఒక్కింత+ఏనియున్= కొంచెమయినా; తొడరునట్టి= కలిగేటటువంటి; విధంబునన్= విధంగా; వర్తింతునే?= ప్రవర్తిస్తానా?; ఒకండు= ఒకానొకటి; విన్నపంబు= విజ్ఞాపన; చేయన్= చేయటానికి; కలదు= ఉంది; అవధరింపుము= దయతో ఆలకించుము; పరమపావనమూర్తి= మిక్కిలిపవిత్రమైన ఆకారం కలవాడు; ఒక్క= ఒకానొక; మహీసుర+ఉత్తముండు= బ్రాహ్మణోత్తముడు; ఇచ్చటికిన్= ఇక్కడికి (మన ఇంటికి); వచ్చి= విచ్చేసి; అభ్యర్చితుండై= పూజింపబడినవాడై; భవత్= (అమ్మా!) నీయొక్క; పతిన్= భర్తను; దర్శింపన్= దర్శించటంకోసం; వచ్చితిన్= వచ్చాను; అనియెన్= అన్నాడు; కార్యంబు= పని; ఏమి?= ఏమిటి?; అని; అడిగినన్= అడిగితే; నాకున్= నాకు; చెప్పక+ఉండెన్= చెప్పలేదు; నేనున్= నేను; నీవు; అట= సూర్యరథవహనం కోసమని అట్లా; చనుటన్= వెళ్ళటాన్ని; చెప్పినన్= తెలియజేస్తే; విని; అట్లు+అయినన్= అట్లాగైతే; ఆ+భుజంగవిభుండు= ఆ సర్పరాజు; వచ్చునంతకున్= వచ్చేదాకా; ఉల్ల= అల్లదిగో ఆ; వనంబునన్= అరణ్యంలో; ఉండెదన్= (నిరీక్షిస్తూ) ఉంటాను; అతండు= ఆ సర్పరాజు; వచ్చినన్= వస్తే (రాగానే); నా తెఱంగున్= నా విషయం; ఎఱింగింపుము= తెలియచేయుము; అని; చని= వెళ్ళి; ఏడు+ఎనిమిదినాళ్ళు+ఏనిన్= ఏడెనిమిది రోజులయినా; జప్యపరుండును= జపతత్పరుడూ; నిరాహారుండునున్+ఐ= ఆహారం ఏమీ తీసికోనివాడుగా; ఉన్నవాఁడు= ఉన్నాడు; నీవు= నీవు; అచ్చటికిన్= అక్కడికి; అరిగి= వెళ్ళి; అతనిన్= ఆ బ్రాహ్మణుడిని; సంభావింపన్+వలయున్= గౌరవించాలి; అని= అని; చెప్పినన్= ఆమె చెప్పేసరికి; ఆ సర్పగ్రామణి= ఆ నాగరాజు (గ్రామణి= నాయకుడు); కుపిత= కోపించిన; చిత్తుండై= హృదయం కలవాడై (కోపించిఅని).

తాత్పర్యం: కాబట్టి ధర్మరహస్యం తెలిసిన నీదు హృదయంలో ఏమాత్రం భేదం కలిగే విధం వర్తిస్తుందా? నాది ఒక విన్నపం ఉన్నది. వినుము. పవిత్రుడైన ఒక బ్రాహ్మణోత్తముడు ఇచ్చటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించి 'మీ భర్తను దర్శించటానికి వచ్చాను' అన్నాడు. 'పని ఏమిటి?' అని అడిగాను. దాని కతడు సమాధానం చెప్పలేదు. నేను-నీవు అక్కడికి వెళ్ళటం తెలిపాను. 'అయితే, ఆ నాగరాజు వచ్చేంతవరకు అల్లంత దూరంలో ఉన్న వనంలో ఉంటాను. ఆయన వస్తే నా సంగతి తెలియజేయుము' అని వెళ్ళి, ఏడెనిమిది నాళ్ళైనా జపంలో ఉండి, నిరాహారుడై ఉన్నాడు. నీవు అక్కడికి వెళ్ళి అతడిని పలుకరించాలి' అని చెప్పగా, ఆ నాగరాజు కుపితుడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ' ఏనటె! యొక్కెడ కొక్కొరుఁ । గానఁగఁ బోదు నటె! దేవగణము నసురులున్
లోనుగ నన్నే చందము । మానుగ నడపుదురు తలఁపుమా చతురమతీ! 581

ప్రతిపదార్థం: చతురమతీ!= ఓ నెఱజాణా! (చతురమైన మతి కలదానా!); ఏనటె!= నేనా!; ఒక్క+ఎడకున్= మరొకచోటుకు; ఒక్కొరున్= మరొకరిని; కానఁగన్= దర్శించటానికి; పోదునటె!= వెడతానా! (వెళ్ళటమా!); దేవగణమున్= దేవతల సమూహమూ; అసురలున్= రాక్షసులూ; లోనుగన్= మొదలైనవారు; నన్నున్= నన్ను (నాపట్ల); ఏ చందము= ఏ ప్రకారం; మానుగన్= గౌరవంగా (ఏ చందముమానుగన్= ఏ ప్రకారంగా); నడపుదురు= నడుపుతూ ఉంటారో (నన్ను ఎట్లా గౌరవిస్తుంటారో); తలఁపుమా= ఒకసారి గుర్తుచేసుకో.

తాత్పర్యం: 'ఓ నెఱజాణా! నేనా! ఇంకొక చోటికి ఎక్కడికో వెళ్ళి ఎవరినో దర్శించటమా! అసంభవం. దేవతలూ, రాక్షసులూ ఇంకా తక్కినవారూ నాపట్ల ఎట్లా ఉంటారో, ఎంత గౌరవం చూపుతారో నీవు ఎరుగుదువు అది ఒకసారి గుర్తుకు తెచ్చుకొమ్ము. వా డెవడి దర్శనానికో నన్ను వెళ్ళమంటా వేమిటి!

తే. అనిన నీ రాక వార్చి మహాశతోడ । నున్న విప్రుని యభిలాష మొక్కభంగిఁ
దీర్పకుండుట ధర్మువే? ధీరశాంత । చిత్త! నీయట్టి యాచారవిత్తమునకు. 582

ప్రతిపదార్థం: అనినన్= అనేసరికి; ధీర శాంత చిత్త!= గంభీరమైన శాంతమైన చిత్తం కలవాడా!; నీ రాక= నీ ఆగమనం; వార్చి= (ఎదురుచూస్తూ) ప్రతీక్షించి; మహా+ఆశతోడన్= పెద్ద ఆశతో; ఉన్న= ఉన్నటువంటి; విప్రుని= బ్రాహ్మణుడియొక్క; అభిలాషము= కోరికను; ఒక్కభంగిన్= ఒక విధంగా; తీర్పక+ఉండుట= తీర్చకపోవటం; నీ+అట్టి= నీవంటి; ఆచారవిత్+తమునకున్= సదాచారం తెలిసినవారిలో గొప్పవాడికి; ధర్మువు+ఏ ?= ధర్మమా? (న్యాయమా?)

తాత్పర్యం: ధీరశాంతచిత్తుడా! నీ రాకకొరకు వేచి ఆశతో ఎదురుచూస్తున్న ఒక బ్రాహ్మణుడి కోరికను తీర్చకపోవటం నీవంటి ధర్మవేత్తకు న్యాయమా? చెప్పుము.

క. ధరణీసురు నాస సెఱిచినఁ । బొరసిన పాపాగ్నిఁ గాల్పఁ బూనెదవే? నీ
పురుషార్థంబును సముచిత । పరత్వమును గృపయు ధర్మపాండిత్యంబున్. 583

ప్రతిపదార్థం: ధరణీసురు= బ్రాహ్మణుడియొక్క; ఆస= ఆశను; చెఱిచినన్= నాశనం చేసినందువలన; పొరసిన= ఉత్పన్నమైన; పాప+అగ్నిన్= పాపము అనే అగ్నిలో; నీ= నీయొక్క; పురుషార్థంబునున్= ముక్తినీ; సముచిత పరత్వమునున్= ఉచితజ్ఞతను (సముచితమైన దానిపట్ల తత్పరత కల్గి ఉండుట) లేదా సత్ప్రవర్తననూ; కృపయున్= దయనూ; ధర్మపాండిత్యంబున్= ధర్మాలపట్ల నీకున్న పాండిత్యాన్నీ; వీటన్నింటినీ; కాల్పన్+పూనెదవే?= దగ్ధం చెయ్యటానికి పూనుకొంటావా?;

తాత్పర్యం: ఒక బ్రాహ్మణుడిని నిరాశపరిచి, ఆ పాపాగ్నిలో నీ ముక్తినీ, ఔచిత్యాన్నీ, దయనూ, ధార్మిక పాండిత్యాన్నీ - వీటన్నింటినీ తగులబెట్టుకొంటావా?

క. విను మాశావిచ్ఛేదన । మునఁ బాటిలు బ్రహ్మహత్య, భుజగోత్తమ! ధ
ర్మనిరూఢుఁడైన పురుషున । కును దద్విజునాస దీర్పఁగోరుట వలదే? 584

ప్రతిపదార్థం: భుజగ+ఉత్తమ!= ఓ సర్పరాజా!; వినుము= వినండి; ఆశా+విచ్ఛేదనమునన్= ఆశను సంహరించటంవలన; బ్రహ్మ హత్య= బ్రాహ్మణుడిని సంహరించిన దోషం; పాటిలున్= కలుగుతుంది (చుట్టుకొంటుంది); ధర్మ= ధర్మంపట్ల; నిరూఢుఁడు+ఐన=

నిష్ఠకల్గినవాడైన; పురుషునకును= మానవుడికి; తద్= ఆ; ద్విజు= బ్రాహ్మణుడి; ఆస= కోరిక; తీర్పన్+కోరుట+వలదే?= తీర్చాలి అనుకోవటం అవసరంలేదా?

తాత్పర్యం: ఓ సర్పరాజా! బ్రాహ్మణుడి ఆశను ఖండిస్తే బ్రాహ్మణుడినే సంహరించినంతటి పాపం చుట్టుకొంటుంది. నీవు ధర్మపరుడవు. అట్లాంటి విప్రుల కోరిక తీర్చటం నీవు కోరుకొనవలసింది కాదంటావా!

క. మౌనమున దృఢజ్ఞానము । దానంబున నభ్యుదయము ధర్మనిరత! యా
శా నిర్వహణంబున నర । కానీక నిహరణ సౌఖ్య మగునండ్రు బుధుల్. 585

ప్రతిపదార్థం: ధర్మనిరత!= ఓ ధర్మతత్పరుడా! (ధర్మంపట్ల నిరతి కలవాడా!); మౌనమునన్= మౌనంవలన; దృఢజ్ఞానము= నిశ్చలమైన (గాఢమైన); జ్ఞానమున్= జ్ఞానమూ; దానంబునన్= దాతృత్వంవలన; అభ్యుదయమున్= అభివృద్ధీ; ఆశా నిర్వహణంబునన్= ఆశలు తీర్చినందువలన; నరక+అనీక= నరకలోకాల (అనీకం= గుంపు); నిహరణ= పరిహరణరూపమైన (పరిహరణంతో కలిగిన); సౌఖ్యము= సుఖమూ; అగున్= కలుగుతాయి అని; బుధుల్= పండితులు; అండ్రు= అంటూ ఉంటారు.

తాత్పర్యం: ఓ ధార్మికా! మౌనంవలన దృఢజ్ఞానమూ, దానంవలన అభ్యుదయమూ, ఆశలు తీర్చినందువలన నరకలోక బాధ తప్పిపోయి స్వర్గలోకసుఖాలు లభిస్తా యని పెద్దలు చెప్పుతూ ఉంటారు.

తే. చాతకము వానఁగోరెడు చందమొంద । నెదురుచూచుచు నున్నవాఁ డిందు నీదు
రాక కక్కట! యడవిలో బ్రాహ్మణుండు । రోష ముడుగుము ధర్మనిరూఢ హృదయ!' 586

ప్రతిపదార్థం: ధర్మ= ధర్మంపట్ల; నిరూఢ= గాఢంగా నాటుకొన్న; హృదయ!= హృదయం కలవాడా!; చాతకము= చాతకపక్షి; వానన్= తొలకరివానను; కోరెడు+చందము+ఒందన్= కోరినరీతిలో పొందేవిధంగా; ఇందున్= ఇక్కడ; అడవిలోన్= అరణ్యంలో; బ్రాహ్మణుండు= ఆ విప్రుడు; నీదు= నీయొక్క; రాకకున్= ఆగమనానికి; ఎదురుచూచుచున్నవాఁడు= నిరీక్షిస్తున్నాడు; అక్కట!= అయ్యో!; రోషము= రోషాన్ని (నేనా! వెళ్ళటమా! అనే రోషాన్ని); ఉడుగుము= విడిచిపెట్టుము.

తాత్పర్యం: ధర్మనిరూఢమైన హృదయం కలిగిన ఓ సర్పరాజా! తొలకరి వానకొరకు చాతకం ఎదురుచూసేటట్లు నీ రాకకొరకు ఎదురుచూస్తూ ఆ విప్రుడు ఇక్కడే ఈ అడవిలోనే ఉన్నాడు. అయ్యో! నీ రోషం చాలించుము.

విశేషం: అలం: ఉపమ.

వ. అని పత్ని బోధించిన. 587

ప్రతిపదార్థం: అని; పత్ని= భార్య; బోధించినన్= బోధించేసరికి.

తాత్పర్యం: అని భార్య బోధించగా.

చ. అనయముఁ దేఱి నాగపతి యక్కమలానన మోము సూచి యి
ట్లను 'నోరుఁ గానఁ బొమ్మనిన యంతన రోషము వచ్చి యిట్టు లో
ప్పని పలుకుల్ సగర్వమునఁ బల్కితి దానికి శంకలేక చె
ప్పిన జతనంపు ధర్మమునఁ బేర్మియు నాకు నొనర్చి తుగ్మలీ! 588

ప్రతిపదార్థం: అనయమున్= పూర్తిగా (నయము= నీతి. అది కానిది అనయము= అధర్మం. దానినుండి); తేఱి= తేరుకొని; నాగపతి= ఆ నాగరాజు; ఆ+కమల+ఆనన= ఆ పద్మముఖి; మోము= ముఖం; చూచి; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు (అన్నాడు);

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉగ్మలీ!= ఓ వనితా!; ఒరున్= పరుడిని; కానన్= దర్శించటానికి; పొమ్ము= వెళ్ళు; అనిన+అంతన= అన్న వెంటనే; రోషమువచ్చి= నాకు రోషం పొడుచుకు వచ్చి; ఇట్టులు= ఇట్లా; ఒప్పని= తగని; పలుకుల్= మాటలు; సగర్వమునన్= అహంకారంతో; పల్కితిన్= పలికాను; దానికిన్= అలా చేసినదానికి; శంకలేక= జంకూ గొంకూ లేకుండా (ఇంక ఎంత మండిపడతానో - అనే శంక పెట్టుకోకుండా); చెప్పిన= నీవు ఉపదేశించినటువంటి; జతనంపు ధర్మమునన్= ప్రయత్నధర్మంవలన (ఆచరించవలసిన ధర్మంవలన); నాకున్= నాకు; పేర్మియున్= ప్రతిష్ఠను; ఒనర్చితి(వి)= సమకూర్చావు.

తాత్పర్యం: భార్య చేసిన ఉపదేశంతో నాగరాజు తేరుకొన్నాడు. సౌమ్యంగా మాట్లాడుతున్నాడు. 'ఓ వనితా! ముక్కూ మొగమూ తెలియనివాడిని దర్శించి రమ్మని నీవు అనటంతోనే నాకు రోషం పొడుచుకొని వచ్చింది. ఆ గర్వంతో అనరాని మాటలు అన్నాను. అయినా నీవు జంకకుండా, నన్ను శంకించకుండా నాకు చేయవలసిన ధర్మాన్ని తెలియచేశావు. దానితో నా ప్రతిష్ఠను కాపాడావు. లేకపోతే ఎంత అప్రతిష్ఠపాలు అయ్యేవాడినో కదా!

ఆ. **కార్తవీర్య దశముఖ ప్రముఖులు జమ । దగ్ని తనయ రాఘవాదులైన**
పురుషవరులచేతఁ బొలియరే సక్రోధ । వృత్తిఁ గాన యలుకవిడుపు మేలు. **589**

ప్రతిపదార్థం: కార్తవీర్య= (వేయిబాహువులు కల) కార్తవీర్యార్జునుడూ; దశముఖ= పది తలకాయలు గల రావణుడూ; ప్రముఖులు= ఇత్యాదులు; జమదగ్నితనయ= పరశురాముడూ; రాఘవ+ఆదులైన= దశరథ రాముడూ మొదలైన; పురుషవరులచేతన్= మహాపురుషుల చేతులలో; సక్రోధవృత్తిన్= క్రోధంతో కూడిన ప్రవర్తనవల్ల; పొలియరే!= నశించిపోలేదా! (చనిపోలేదా); కాన= కాబట్టి; అలుక విడుపు= కోపాన్ని విడిచిపెట్టటం; మేలు= మంచిది.

తాత్పర్యం: క్రోధం కారణంగానే కార్తవీర్యార్జునుడు పరశురాముడి చేతిలో మరణించాడు. క్రోధం కారణంగానే దశకంఠుడు దశరథరాముడి చేతిలో సమసిపోయాడు. ఇంకా చాలామంది కోపంవలన దెబ్బతిన్నవారు ఉన్నారు. కాబట్టి కోపాన్ని వదలుకొనటం ఎవరికైనా ఎప్పటికైనా మేలు.

క. **నీయట్టి భార్య కలుగుటఁ । దోయజదళనయన! యిట్లు దొలఁగితి దురితా**
పాయంబునఁ బొరయక, యేఁ । బోయెద నవ్విప్రు కోర్కి పూర్ణము సేయన్. **590**

ప్రతిపదార్థం: తోయజదళ= పద్మదళాలవంటి (తామరపువ్వు రేకులవంటి); నయన!= నేత్రాలు కలదానా!; నీ+అట్టి= నీలాంటి; భార్య= ధర్మపత్ని; కలుగుటన్= లభించటంవలన; ఇట్లు; దురిత= పాపరూపమైన; అపాయంబునన్= ప్రమాదంలో; పొరయక= నశించిపోకుండా; తొలఁగితిన్= తప్పించుకున్నాను; ఆ+విప్రు= ఆబ్రాహ్మణుడి; కోర్కి= కోరిక; పూర్ణము+చేయన్= నిండించటం కోసం (తీర్చటానికి); ఏన్= నేను; పోయెదన్= ఇదే పోతున్నాను.

తాత్పర్యం: ఓ పద్మాక్షీ! నీవంటి భార్య దొరకటంవలన గొప్ప ప్రమాదంనుండి తప్పించుకొనగలిగాను. లేకపోతే మహాపాపకూపంలో పడి నశించిపోయి ఉండేవాడిని. సరే. ఆ విప్రుడిని దర్శించటంకొరకు ఇదిగో ఇప్పుడే వెళ్ళుతున్నాను.

క. **అని పలికి సత్వరంబుగఁ । జని భృగునిం గాంచె వినయసంభ్రమములతో**
జనపాలోత్తమ! యతఁడు న । తనిఁగని యుల్లమునఁ బ్రియము దళుకొత్తంగన్. **591**

ప్రతిపదార్థం: జనపాల+ఉత్తమ= రాజోత్తమా! ధర్మజా!; అని పలికి= అని చెప్పి; సత్వరంబుగన్= మిక్కిలి వేగంగా; చని= వెళ్ళి; వినయ+సంభ్రమములతోన్= వినయంతోనూ, సంభ్రమంతోనూ; భృగునిన్= భృగువును; కాంచెన్= సర్పరాజు దర్శించాడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అతఁడున్= ఆ భృగువుకూడా; అతనిన్+కని= ఆ సర్పరాజును చూచి; ఉల్లమునన్= హృదయంలో; ప్రియము= ప్రేమ(ఇష్టం); తళుకు+ఒత్తంగన్= ప్రకాశించగా.

తాత్పర్యం: అని భార్యను మెచ్చుకొని, ఆ సర్పరాజు వేగాతివేగంగా వెళ్ళి భృగువును వినయసంభ్రమాలు ఉట్టిపడేటట్లు దర్శించాడు. సర్పరాజును చూసి భృగువుకూడా సంతోషించాడు. హృదయంలో ప్రేమ తళుక్కుమనగా. (తరువాతి పద్యంతో అన్వయం).

పద్మునఁడను సర్పరాజు భృగుఁడను విప్రుం గానవచ్చుట (సం. 12-349-2,3)

వ. అంగంబులు పొదల నెదురుకొనియె; ని ట్లిరువురు సుసంగతులై సుసంగతపత్త్ర ప్రకరతరుచ్ఛాయాశీతల సికతాతలంబున సుఖాసీనులై; రయ్యహీంద్రుం డా మహీసురవరునితో మధురస్వరంబున నిట్లనియె.592

ప్రతిపదార్థం: అంగంబులు= శరీరావయవాలు; పొదలన్= ఉప్పొంగగా; ఎదురుకొనియెన్= భృగువు ఎదురుసన్నాహం వెళ్ళాడు; ఇట్లు= ఈ విధంగా; ఇరువురున్= ఇద్దరూ; సుసంగతులై= కలిసినవారై; సుసంగత= దట్టంగా అలుముకున్న; పత్త్రప్రకర= ఆకుల గుబురులు కలిగిన; తరు= చెట్లయొక్క; ఛాయా= నీడతో; శీతల= చల్లనైన; సికతాతలంబునన్= ఇసుక తిన్నెమీద; సుఖ+ఆసీనులై= సుఖంగా కూర్చున్నవారై; ఆ+అహి+ఇంద్రుండు= ఆ సర్పరాజు; ఆ+మహీసురవరునితోన్= ఆ బ్రాహ్మణోత్తమునితో; మధురస్వరంబునన్= తియ్యని కంఠధ్వనితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: శరీరం ఉప్పొంగుతుండగా భృగువు ఎదురు వెళ్ళాడు. ఇట్లా ఇద్దరూ కలిసికొని, చెట్లనీడలో ఇసుకతిన్నెమీద కూర్చొన్నారు. ఆ సర్పరాజు ఆ బ్రాహ్మణుడితో తీయనైన స్వరంతో ఇట్లా అన్నాడు:

తే. 'అనఘ! నా రాక వార్చి నీ వధికనిష్ఠ। నిట్టు లునికికిఁ గారణమేమి గోర్కి
యెవ్విధంబైన దాని నే నిపుడ నిర్వ। హించి పుచ్చెద నత్తెఱం గెఱుఁగఁ జెపుము! 593

ప్రతిపదార్థం: అనఘ!= పావనుడా!; నా రాక!= నా ఆగమనాన్ని; వార్చి= ప్రతీక్షించి; నీవు= మహర్షీ; అధికనిష్ఠన్= పెద్ద నియమంతో; ఇట్టులు= ఇట్లా; ఉనికికిన్= ఉండటానికి; కారణము= హేతువు; ఏమి?= ఏమిటి?; కోర్కి= నీ కోరిక; ఏ+విధంబు+ఐనన్= ఎటువంటిదయినా; దానిన్= దానిని; ఏన్= నేను; ఇప్పుడు+అ= ఇప్పుడే; నిర్వహించి= తీర్చి; పుచ్చెదన్= పంపుతాను; ఆ+తెఱంగు= ఆ తీరు ఏదో; ఎఱుఁగన్= తెలిసేటట్టు; చెపుము!= దయచేసి చెప్పుము.

తాత్పర్యం: 'పావనుడా! ఓ బ్రాహ్మణోత్తమా! నా రాకను ప్రతీక్షిస్తూ నిరాహార దీక్షతో ఇట్లా నీవు ఉండటానికి కారణం ఏమిటి? నీ కోరిక ఏమిటో చెప్పుము. అది ఎటువంటిదైనా సరే తీరుస్తాను. ఇప్పుడే తీర్చివేస్తాను (తీర్చి పంపుతాను). అదేమిటో తెలియజెప్పుము.

వ. స్వజనంబులచేత నిచ్చట నీయునికి విని యభిగమ్యుండ వగు నీ కడకుం జనుదెంచితి; ననవుడు నద్ధరామరవరుండు ధర్మారణ్యంబుననుండి నిన్నుం గాన వచ్చితి; మాననీయమహీసురసూనుండ; భాను నారాధింప నీ చనుట భవదీయ వల్లభువలన నెఱింగి వాడిన చేనివాఁడు వానకెదురుచూచునట్లు భవదాగమనంబు వార్చి నియతవృత్తి నున్నవాఁడ. మదీయమనక్లేశంబు నిరసింప నీవ యర్హుండ' వనుటయు. 594

ప్రతిపదార్థం: స్వజనంబులచేతన్= మావాళ్ళవలన; ఇచ్చట= ఇక్కడ; నీ+ఉనికిన్= నీవు నివసించటాన్ని; విని= ఆలకించి; అభిగమ్యుండవు+అగు= నిన్నుచేరి దర్శింపదగిన వాడవైన; నీ కడకున్= నీ దగ్గరకు; చనుదెంచితిన్= వచ్చాను; అనవుడున్= అని సర్పరాజు పలకగా; ఆ+ధరా+అమరవరుండు= ఆ బ్రాహ్మణోత్తముడు (ఇట్లాఅన్నాడు); ధర్మారణ్యంబుననుండి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మారణ్యంనుంచి; నిన్నున్= నిన్ను; కానన్+వచ్చితిన్= దర్శించటానికి వచ్చాను; మాననీయ= గౌరవింపదగిన; మహీసుర బ్రాహ్మణుని; సూనుండన్= కుమారుడను; భానున్= సూర్యుడిని; ఆరాధింపన్= అర్చించటం కోసం; నీ చనుట= నీవు వెళ్ళటం; భవదీయ= నీయొక్క; వల్లభవలనన్= భార్యనుంచి; ఎఱింగి= తెలిసికొని; వాడిన= వడలిపోయిన; చేనివాఁడు= చేను కలవాడు (రైతు); వానకున్= వానకోసం; ఎదురుచూచునట్లు= ఎదురుచూసినట్టు; భవత్+ఆగమనంబు= నీ రాకకై; వార్చి= నిరీక్షించి; నియతవృత్తిన్= నియమ సహితమైన ప్రవర్తనతో (నిష్ఠతో); ఉన్నవాఁడన్= ఈ అడవిలో ఇక్కడ ఉన్నాను; మదీయ= నాయొక్క; మనః= మనస్సుకు సంబంధించిన; క్లేశంబు= కష్టం; నిరసింపన్= తొలగించటానికి; నీవు+అ= నీవే; అర్హుండవు= తగినవాడవు; అనుటయున్= అనటంతో.

తాత్పర్యం: మా వాళ్ళు నీ విక్కడ ఉన్నావని చెప్పగా విని, దర్శనీయుడవైన నీవద్దకు వచ్చాను' అని సర్పరాజు అనగా, దానికి ఆ బ్రాహ్మణుడు 'నే నొక బ్రాహ్మణకుమారుడను. నీవు సూర్యార్చనకై వెళ్ళినట్లు నీ భార్య చెప్పగా విని, ఈ అడవిలో నీకొరకు నిరీక్షిస్తున్నాను. నా మనసులోని బాధను తొలగించటానికి నీవే అర్హుడవు' అనగా.

తే. ' నీవు కల్యాణమూర్తివి నీ మనోర । థంబు సఫలంబు సేసికదా మదీయ
జనన సఫలత గలిగింతు' నను భుజంగ । మాధిపతి మోముఁ జూచి యిట్లనియె నతఁడు. 595

ప్రతిపదార్థం: నీవు= ఓ భృగూ! నీవు; కల్యాణమూర్తివి= శుభస్వరూపుడవు; నీ; మనోరథంబు= కోరిక; సఫలంబు+చేసి కదా!= నెరవేర్చి కదా!; మదీయ= నాయొక్క; జనన= జన్మకు; సఫలత= చరితార్థత; కలిగింతున్!= కల్పించుకుంటాను!; అను= అన్నటువంటి; భుజంగమ+అధిపతి= ఆ సర్పరాజుయొక్క; మోమున్= ముఖాన్ని; చూచి= వీక్షించి; అతఁడు= ఆ భృగువు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'ఓ భృగూ! నీవు శుభస్వరూపుడవు. నీ కోరిక తీర్చినప్పుడే నా జన్మ చరితార్థం అవుతుంది. చరితార్థం చేసికొంటాను' అన్నాడు సర్పరాజు. అప్పుడు భృగువు ఇట్లా అంటున్నాడు.

క. నా కోర్కి పిదపఁ జెప్పెద । లోకనుతా! యొకటి యడుగ లోలత్వము చి
త్తాకలితమయ్యెఁ బ్రార్థన । సేకొని యది నాకు మున్ను చెప్పఁగవలయున్. 596

ప్రతిపదార్థం: లోకనుతా!= లోకంలో నుతిపొందినవాడా! (లోకంచేత నుతింపబడినవాడా!); నా కోర్కి= నా కోరిక ఏమిటో; పిదపన్= తరవాత; చెప్పెదన్= చెప్పుతాను; ఒకటి= ఒక్కవిషయం; అడుగన్= అడగడానికి; లోలత్వము= చపలత్వం; చిత్త+ఆకలితము+అయ్యెన్= మనస్సులో పుట్టుతోంది; ప్రార్థనన్= నా అభ్యర్థనను; చేకొని= విని (స్వీకరించి); అది= ఆ విషయం; నాకున్= నాకు; మున్ను= ముందుగా; చెప్పఁగన్+వలయున్= చెప్పాలి.

తాత్పర్యం: లోకస్తుత్యా! నా కోరిక ఏమిటో తరవాత చెప్పుతాను కాని, నిన్ను మరొకటి అడగాలని మనస్సు తొలుస్తున్నది. అది అడుగుతాను. విని ముందు అది చెప్పుము.

వ. అనుటయు నయ్యురగ వల్లభుం 'డది యెయ్యది యడుగు' మనిన భృగుండు 'నీవు రవిరథంబు వహింపం జనినయెడఁ గనిన వినినయట్టి యాశ్చర్యంబులు గలవేని వాని నా కెఱింగింపవే?' యనిన నతం డతని కిట్లనియె. 597

ప్రతిపదార్థం: అనుటయున్= అనటంతోనే; ఆ+ఉరగవల్లభుండు= ఆ సర్పరాజు; అది= నీవు అడగాలి అనుకొంటున్నది; ఏ+అది= ఏది?; అడుగుము; అనినన్= అనేసరికి; భృగుండు= భృగువు; నీవు= ఓ సర్పరాజా! నీవు= అడుగుము; రవిరథంబున్= సూర్యరథాన్ని; వహింపన్= మోయటానికి; చనినయెడన్= వెళ్ళినపుడు; కనిన= చూచిన; వినిన+అట్టి= విన్నట్టి; ఆశ్చర్యంబులు= అద్భుతాలు;కలవేనిన్=

ఉన్నట్టయితే; వానిన్= వాటిని; నాకున్= నాకు; ఎఱింగింపవే?= తెలియజెప్పవా?; అనినన్= అని అడిగితే; అతండు= ఆ సర్పరాజు; అతనికిన్= ఆ భృగుడితో; ఇట్లు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: దానికి సర్పరాజు 'నీవు అడుగవలెనని అనుకొంటున్న దేదో అడుగుము' అన్నాడు. బదులుగా దానికి భృగువు ' ఓ సర్పరాజా! నీవు సూర్యరథాన్ని మోయటానికి వెళ్ళినపుడు నీవు చూచిన, విన్న అద్భుతాలు ఏవైనా ఉంటే నాకు చెప్పాలి' అన్నాడు. దానికి సర్పరాజు తిరిగి ఈ విధంగా బదులిచ్చాడు.

సీ. **' ఆశ్చర్యములకెల్ల నాస్పదం బాదిత్యుఁ । డాతని వలనన భూతజాల**
మఖిలంబుఁ జరియించు నది యచ్చెరువు గాదె! । యద్దేవు నంశువులందుఁ బ్రీతి
నమరులు వాలఖిల్యాదిమునీంద్రులు । సిద్ధులు శాఖలఁ జెంది యుండు
విహగకులంబుల విధమున వసియింతు । రంతకంటెను నెక్కు డద్భుతంబు

తే. **గలదె! యమ్మహాత్మువలనన వాయువు । వెడలి యతని నడిమి విపుల రశ్మిఁ**
బొంది వృష్టి గురియు నెందును నట్టి చో । ద్యములు గలవె? భూసురాగ్రగణ్య! 598

ప్రతిపదార్థం: భూసుర+అగ్రగణ్యా= బ్రాహ్మణులలో మొదట లెక్కింపదగినవాడా! ఓ బ్రాహ్మణోత్తమా!; ఆశ్చర్యములకున్= అద్భుతాలకు; ఎల్లన్= అన్నింటికీ; ఆదిత్యుఁడు= సూర్యుడు; ఆస్పదంబు= స్థానం; ఆతనివలనన్+అ= ఆ సూర్యుడివల్లనే; భూతజాలము= ప్రాణిసమూహం; అఖిలంబున్= అంతా; చరియించున్= చైతన్యవంతమై సంచరిస్తూ ఉంటుంది (జనియించున్= పుట్టుతుంది - అని పాఠాంతరం); అది= ఆ విషయం; అచ్చెరువు+కాదె!= ఆశ్చర్యం కాదా!; ఆ+దేవు= ఆ సూర్యభగవానుడియొక్క; అంశువులందున్= కిరణాలలో; ప్రీతిన్= ప్రేమతో; అమరులున్= దేవతలూ; వాలఖిల్య+ఆది= వాలఖిల్యులు మొదలైన; మునీంద్రులున్= మహామునులూ; సిద్ధులున్= సిద్ధులూ - వీరంతా; శాఖలన్= కొమ్మలను; చెంది= ఆశ్రయించి; ఉండు= ఉండే; విహగకులంబుల+విధమునన్= పక్షులవలె; వసియింతురు= నివసిస్తూ ఉంటారు; అంతకంటెనున్= అంతకన్నా; ఎక్కుడు= అధికమైన; అద్భుతంబు+కలదె!= ఆశ్చర్యం ఉన్నదా?; ఆ+మహాత్మువలనన్+అ= ఆ మహానుభావుడివల్లనే; వాయువు= (ఒకానొక విధమైన) గాలి; వెడలి= బయలుదేరి; అతని= ఆ సూర్యుడి; నడిమి= (గోళం) మధ్యలో ఉన్న; విపులరశ్మిన్= దట్టమైన కాంతిని; పొంది= కలిసి; వృష్టి+కురియున్= వర్షం కురుస్తుంది; ఎందునున్= ఎక్కడయినా; అట్టి= అటువంటి; చోద్యములు= అద్భుతాలు; కలవె?= ఉన్నాయా?;

తాత్పర్యం: 'ఓ బ్రాహ్మణోత్తమా! ఆశ్చర్యాలకన్నింటికీ నిలయం సూర్యుడే. అతడినుండే సకలప్రాణికోటీ జన్మిస్తున్నదంటే ఇంతకంటె ఆశ్చర్యం ఏమి ఉంటుంది! వాలఖిల్యాది ఋషులూ, సిద్ధులూ, దేవతలూ అందరూ సూర్యుడి కిరణాలలోనే - చెట్టుకొమ్మలమీద పిట్టలున్నట్లు - నివసిస్తూ ఉంటారు. ఇది అద్భుతం కాదా! సూర్యగోళంనుండి వెలువడే వాయువు గోళం మధ్యలో ఉండే దట్టమైన కాంతితో కలిసి వర్షం కురుస్తుంది. ప్రపంచంలో ఎక్కడయినా ఇట్లాంటి అద్భుతాలు ఉన్నాయా?

క. **రవి సృజియించును వర్షము । రవియ మగుడఁ గిరణతతుల రస మంతయుఁ దాఁ**
దివుచును విస్మయకారక । మవనీసురవర్య! దాని కధికము గలదే? 599

ప్రతిపదార్థం: అవనీసురవర్య!= ఓ బ్రాహ్మణోత్తమా!; రవి= సూర్యుడు; వర్షమున్= వానను; సృజియించును= సృష్టిస్తాడు; రవి+అ= సూర్యుడే; మగుడన్= మళ్ళీ; కిరణతతులన్= కిరణసమూహాలతో; రసము+అంతయున్= నీటినంతటినీ; తాన్= తాను; తివుచును= వెనుకకు లాగుకొంటాడు (ఎండిస్తాడు, ఆవిరిచేస్తాడు); దానికిన్= దానికన్నా; విస్మయకారకము= ఆశ్చర్యకరమైన విషయం; అధికము= గొప్పది (మరొకటి); కలదే?= ఉన్నదా? (ఉంటుందా?)

తాత్పర్యం: ఓ బ్రాహ్మణోత్తమా! సూర్యుడే వర్షాలు కురిపిస్తాడు. మళ్ళీ అతడే తన కిరణాలతో నీటినంతటినీ వెనుకకు లాగుకొంటాడు. ఇంతకన్నా ఆశ్చర్యకరమైన సంగతి ఈ సృష్టిలో మరొకటి ఉంటుందా?

క. ఇనువేఁడిమి శోషించిన । జనములయం దాత్మనిష్ఠ శాశ్వతికత్వం
బున వెలుఁగుచుండు దానికి । ననఘా! మిగులంగఁ జిత్రమైనది గలదే! 600

ప్రతిపదార్థం: అనఘా!= పావనుడా!; ఇను= సూర్యుడియొక్క; వేఁడిమి= ఉష్ణత; శోషించినన్= ఎండిపోతే; జనములయందున్= ప్రజలలో; ఆత్మనిష్ఠ= మోక్షం; శాశ్వతికత్వంబునన్= శాశ్వతమై; వెలుఁగుచుండున్= ప్రకాశిస్తూ ఉంటుంది; దానికిన్= దానికన్నా మిగులంగన్= మించిన; చిత్రమైనది= ఆశ్చర్యకరమైన విషయం; కలదే!= ఉన్నదా!

తాత్పర్యం: పాపరహితుడా! సూర్యుడి వేడిమి తగ్గిపోతే ప్రజలలో ఆత్మనిష్ఠ అనేది శాశ్వతంగా ప్రకాశిస్తుంది. ఇంతకంటె ఆశ్చర్యకరమైన అంశం ఏముంది చెప్పుము.

తే. సూర్యువలనన బీజంబు ధార్యమాణ । మగుఁ జరాచరధారిణియైన ధరణి
చేత నంతకు మిగులఁ జర్చింప నక్క । జంబు లెందును గలవె? నిష్ఠానిరూఢ! 601

ప్రతిపదార్థం: నిష్ఠానిరూఢ!= నియమాసక్తా!; చరాచర= జంగమస్థావరాలను; ధారిణి+అయిన= ధరించేదయిన; ధరణిచేతన్= ఈ భూమిచేత; బీజంబు= విత్తనం; సూర్యువలనన్+అ= సూర్యుడివలననే; ధార్యమాణము+అగున్= జీవింపజేయబడుతోంది - మొలకెత్తుతోంది; చర్చింపన్= ఆలోచిస్తే; అంతకున్+మిగులన్= అంతకంటె మించి; అక్కజంబులు= అద్భుతాలు; ఎందునున్= ఎక్కడైనా; కలవె?= ఉన్నాయా?

తాత్పర్యం: సూర్యుడివలననే విత్తనాలు భూమిలో మొలకెత్తుతున్నాయి. ఇంతకంటె అద్భుతాలు ఎక్కడ ఉంటాయి స్వామీ!

క. పరముండు నిరంజనుఁ డ । క్షరుఁ డజరుం డద్వయుండు శాశ్వతుఁ డగు న
ప్పురుషుఁడు రవియంద వెలుఁగు । నరుఁ దంతటికంటెఁ గలదె? యగ్రిమవర్ణా! 602

ప్రతిపదార్థం: అగ్రిమవర్ణా!= అగ్రవర్ణంలో జన్మించినవాడా! (బ్రాహ్మణుడా!); పరముండు= పరాత్పరుడూ; నిరంజనుఁడు= నిర్గుణుడూ; అక్షరుఁడు= నాశనం లేనివాడూ; అజరుండు= ముసలితనం లేనివాడూ; అద్వయుండు= ద్వయము కానివాడూ (అద్వితీయుడు); శాశ్వతుఁడు= శాశ్వతమైనవాడూ; అగు= అయినటువంటి; ఆ+పురుషుఁడు= ఆ మహాపురుషుడు; రవియందున్+అ= సూర్యుడిలోనే; వెలుఁగున్= ఒప్పారుతుంటాడు; అంతటికంటెన్= అంతకన్నా; అరుదు= అద్భుతం; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: పరాత్పరుడైన శ్రీమన్నారాయణుడు సూర్యమండలంలోనే ప్రకాశిస్తుంటాడు. ఓ బ్రాహ్మణుడా! అంతకంటె ఆశ్చర్యం ఏముంది చెప్పుము!

వ. అని వెండియు. 603

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; వెండియున్= మళ్ళీ ఇట్లా కొనసాగించాడు.

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ ఇట్లా కొనసాగించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉంఛవృత్తి మహిమ (సం. 12-350-8)

క. విను మత్యాశ్చర్య మొకటి । మనుజోత్తమ! యొక్కనాఁడు మధ్యాహ్నమునం
దన వెలుఁ గినుని వెలుఁగుతో । నెనగా గగనమున నొక్కఁ డేతెంచె వడిన్. 604

ప్రతిపదార్థం: మనుజ+ఉత్తమ!= ఓ మానవోత్తమా!; అతి+ఆశ్చర్యము= ఎంతో ఆశ్చర్యకరమైనది; ఒకటి= ఒక్కటి ఉంది ; వినుము; ఒక్కనాఁడు= ఒకరోజు; మధ్యాహ్నమునన్= మధ్యాహ్నసమయంలో; ఒక్కఁడు= ఒకానొక పురుషుడు; తన= తనయొక్క; వెలుఁగు= తేజస్సు; ఇనుని= సూర్యుడి; వెలుఁగుతోన్= కాంతితో; ఎనగాన్= సాటిరాగా; గగనమునన్= ఆకాశంలో; వడిన్= వేగంగా; ఏతెంచెన్= ఎదురు వచ్చాడు.

తాత్పర్యం: ఓ మానవోత్తమా! అత్యాశ్చర్యకరమైన విషయం ఒకటి చెప్పుతాను. శ్రద్ధగా వినుము. ఒకరోజున మధ్యాహ్నం ఆకాశంలో ఒక పురుషుడు ఎదురయ్యాడు. ఆయన తేజస్సు సూర్యుడి తేజస్సుతో పోటీ పడుతున్నట్లు అనిపించింది.

క. అంబరపాటనమునఁ బో । లెం బెద్దయు మెఱయు తనదు లీలాగతి క
య్యంబరమణి యధికప్రమ । దంబున నభిముఖుఁడుగా నుదగ్రస్ఫూర్తిన్. 605

ప్రతిపదార్థం: అంబరపాటనమునన్+పోలెన్= ఆకాశాన్ని బద్దలు కొట్టేస్తుందా అన్నట్టు (బద్దలు కొట్టిందా అన్నట్టు); పెద్దయున్= ఎక్కువగా; మెఱయు= ప్రకాశించే; తనదు= అతడియొక్క; లీలాగతికిన్= సవిలాసగమనానికి; ఆ+అంబరమణి= ఆ సూర్యుడు; అధికప్రమదంబునన్= అత్యధిక సంతోషంతో; ఉదగ్రస్ఫూర్తిన్= ఇంకా అతిశయించిన స్ఫురణతో; అభిముఖుఁడుగాన్= ఎదురుగా.

తాత్పర్యం: ఆకాశాన్ని పగులగొట్టేస్తాడా? - అన్నంతటి తేజస్సుతో సవిలాసంగా వస్తున్న ఆ పురుషుడికి సూర్యుడు చేయిసాచాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

చ. కదియఁగఁ బాఱుతెంచిన వికాసవిభాసిముఖారవిందుఁడై
యెదురుగఁ జేయి సాఁచె దివసేశుఁ డతండును లీలఁ గేలు నొ
ప్పిదముగఁ బట్టి రూపము లభిన్నతఁ బొందఁగఁ జొచ్చె బింబమున్
సదనముఁ జొచ్చునట్ల విలసద్గతి నింకిట యేమి సెప్పుదున్? 606

ప్రతిపదార్థం: కదియఁగన్= తనను సమీపించటానికి; పాఱుతెంచినన్= ఆ తేజస్వి పరుగు పరుగునరాగా; దివస+ఈశుఁడు= దినపతి అయిన సూర్యుడు; వికాస= ఆనందంతో (వికాసంతో); విభాసి= వెలిగిపోతున్న; ముఖ+అరవిందుఁడై= ముఖపద్మం కలవాడై; ఎదురుగన్= ఆతనికి అభిముఖంగా; చేయి సాఁచెన్= చెయ్యి చాపాడు; అతండునున్= ఆ పురుషుడు సయితం; లీలన్= విలాసంగా; కేలున్= ఆ చేతిని; ఒప్పిదముగన్= అందంగా; పట్టి= పట్టుకొని; రూపములు= ఆకారాలు; అభిన్నతన్= అభేదాన్ని; పొందఁగన్= పొందుతూండగా (ఒకటే అయిపోతూండగా); విలసత్+గతిన్= అందమైన పద్ధతిలో (సవిలాసగమనంతో అని కానీ); సదనమున్+చొచ్చునట్లు= గృహంలోకి ప్రవేశించినట్టు; బింబమున్= ఆ సూర్యబింబంలోకి; చొచ్చెన్= ప్రవేశించాడు; ఇంకన్+ఇటన్= ఇంక ఇక్కడ; ఏమి+చెప్పుదున్?= ఏమి చెప్పను!

తాత్పర్యం: ఆ దివ్యతేజస్వి తనకు ఎదురుగా వేగంగా వచ్చేసరికి సూర్యుడి ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. సాదరంగా చేయి చాపాడు. ఆతడు దానిని ఒయ్యారంగా అందుకొన్నాడు. ఇద్దరి ఆకారాలూ క్రమక్రమంగా ఏకమయిపోతున్నాయి. ఇంటిలోనికి ప్రవేశించినంత విలాసంగా ఆ తేజస్వి సూర్యబింబంలోనికి ప్రవేశించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్టియెడ. 607

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

చ. **అరదముమీఁద మున్ పొలుచునాతఁడొ? యిప్పటియాతఁడో? దివా**
కరుఁ డను సందియంబు భుజగంబుల చిత్తము లందుఁ బుట్టి యొం
డొరువులతోడ వారు గడు నొయ్యనఁ బల్కఁగ నే వినీతసు
స్థిరమృదుభాషినై యడిగితిం బ్రభువున్ ధరణీసురోత్తమా! 608

ప్రతిపదార్థం: ధరణీసుర+ఉత్తమా!= ఓ బ్రాహ్మణోత్తమా!; అరదముమీఁదన్= రథంపైని; మున్= అంతకుముందు; పొలుచునాతఁడొ?= ఉన్నవాడో?; ఇప్పటియాతఁడో?= ఇప్పుడు వచ్చి ఉన్నవాడో?; దివాకరుఁడు= సూర్యుడు; అను= అనే; సందియంబు= సందేహం; భుజగంబులు= సర్పాల; చిత్తములందున్= హృదయాలలో; పుట్టి= కలిగి; ఒండొరువులతోడన్= పరస్పరం; వారు= ఆ సర్పశ్రేష్ఠులు; కడున్+ఒయ్యనన్= మెల్లమెల్లగా; పల్కఁగన్= గుసగుసలు పోతోంటే; ఏన్= నేను; వినీత= వినయ సంపన్నమైన; స్థిర= నిశ్చలమైన; మృదుభాషిన్+ఐ= మృదుభాషలు కలవాడనై (మృదువుగా పలుకుతూ); ప్రభువున్= మా అధిపతిని (సూర్యుడిని); అడిగితిన్= అడిగాను.

తాత్పర్యం: ఓ బ్రాహ్మణోత్తమా! ఇప్పటిదాకా రథంమీద ఉన్నవాడా? లేకపోతే ఇప్పుడు వచ్చినవాడా? - ఎవరు సూర్యుడు? అనే సందేహం రథం లాగుతున్న మా సర్పరాజుల కందరికీ కలిగింది. పరస్పరం గుసగుసలు పోతున్నారు అందరూ. అప్పుడు వినయంగా మృదువుగా నిశ్చలంగా నేనే మా ప్రభువును అడిగాను.

క. **ఇతఁ డెవ్వం?డని యమ్మెయి । నతిచకితాత్ముండ నగుచు నడుగుటయు నహః**
పతి నా మీఁదఁ గృపాసం । గతమగు తన చూడ్కి వొలయఁగా వత్సలుఁడై. 609

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= అట్లా; అతిచకిత+ఆత్ముండన్+అగుచున్= మిక్కిలి ఆశ్చర్యపోయిన వాడిని అవుతూ; ఇతఁడు= ఈయన; ఎవ్వండు= ఎవరు?; అని; అడుగుటయున్= నేను అడగటంతో - అహఃపతి= దివసనాథుడు (సూర్యుడు); నామీఁదన్= నా పైని; కృపాసంగతము+అగు= దయతో కూడిన; తన= తనయొక్క; చూడ్కి= చూపు; పొలయఁగాన్= వ్యాపించేట్టు (చూసి); వత్సలుఁడై= ప్రేమ కలవాడై.

తాత్పర్యం: ఇతడు ఎవరు? - అని నేను చాలా ఆశ్చర్యపోయి అడిగాను. దానికి సూర్యుడు నా వైపు ఒకసారి దయనిండిన కన్నులతో చూచి ప్రేమగా ఇట్లా అన్నాడు.

సీ. **'సురయక్ష గంధర్వ గరుడోరగాదుల । లోన నెవ్వఁడు గాఁ డలోలుపాత్ముఁ**
డుంఛవృత్తి మహీసురోత్తముం డస్థల । నియముండు ఫలమూల నీరమారు
తాహారుఁడగు ముని యాకాంక్ష సేయఁడు । ప్రాప్తంబు గాని పదార్థములకు
సర్వభూత హితతత్వశాలి యిమ్మెయి సిద్ధిఁ । బ్రాపించె నని చెప్పెఁ బ్రకటఫణితి

తే. **ననఘ! యిట్టి విశేషంబు గనుఁగొనంగ । వినను గాంచితి' ననిన నవ్విప్రవరుఁడు**
ప్రమద మెద నిండి పొంగారఁ బాపఱేని । యాననము సూచి యిట్లను మానవేంద్ర! 610

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పావనుడా! ; ఓ పద్మడా! ఈ వచ్చిన వ్యక్తి -సురయక్షగంధర్వగరుడ+ఉరగ+ఆదులలోనన్= సురలలో, యక్షులలో, గంధర్వులలో, ఉరగులలో (సర్పజాతి), ఇంకా తక్కిన జాతులలో; ఎవ్వఁడున్+కాఁడు= ఎవ్వడూ కాడు; ఇతఁడు - అలోలుప+ఆత్ముఁడు= దేనిపట్లా తగులు చెందని మనస్సుకలవాడు (నిరీహుడు - నిశ్చలాత్ముడు); ఉంఛవృత్తి= నూర్చిన పొలాలలో చెదిరిపడిన ధాన్యపుగింజలను ఏరుకొని వాటితో పొట్టగడుపుకొనే; మహీసుర+ఉత్తముండు= బ్రాహ్మణోత్తముడు; అస్ఖల= చెదరని; నియముండు= నియమాలు కలవాడు (స్థిరనిష్ఠ కలవాడు); ఫల= పళ్ళూ; మూల= దుంపలూ; నీర= నీళ్ళూ; మారుత= వాయువూ; ఆహారుఁడు= ఆహారంగా కలవాడు - అగు= అయిన; ముని= ఒక ముని ఈయన; ప్రాప్తంబు+కాని= తనకు ప్రాప్తంలేని; పదార్థములకున్= వస్తువులకోసం; ఆకాంక్ష+చేయఁడు= కోరిక పెట్టుకోడు; సర్వభూత= సమస్తప్రాణులకూ; హితత్వశాలి= మేలుకోరేవాడు - మేలు చేసేవాడు; ఈ+మెయిన్= ఇలా; సిద్ధిన్+ప్రాపించెన్= సిద్ధిపొందాడు; అని; ప్రకటఫణితిన్= స్పష్టమైన మాటలతో (శైలితో); చెప్పెన్= (సూర్యుడు నాకు) చెప్పాడు; ఇట్టి= ఇటువంటి; విశేషంబున్= విశేషాన్ని; కనుఁగొనంగన్+ వినన్+కాంచితిన్= చూడగలిగాను; వినగలిగాను (కనుగొనంగన్/కాంచితిన్. వినన్/కాంచితిన్); అనినన్= అని పద్మడు చెప్పేసరికి; ఆ+విప్రవరుఁడు= ఆ బ్రాహ్మణోత్తముడు - భృగువు; ప్రమదము= ఆనందం; ఎదన్= హృదయంలో; నిండి+పొంగారన్= నిండి పెల్లుబుకగా; పాపఁడేని= ఆ సర్పరాజుయొక్క; ఆననము+చూచి= ముఖంలోకి చూసి; మానవేంద్ర!= ఓ ధర్మరాజా!; ఇట్లు= ఇలా; అనున్= అన్నాడు (అంటున్నాడు).

తాత్పర్యం: ఓ పద్మడా! ఈ వచ్చినవాడు సురయక్ష గంధర్వ గరుడోరగాదులలో ఎవ్వడూ కాడు. నిశ్చలమైన మనస్సు కలవాడూ, ఉంఛవృత్తితో జీవించే బ్రాహ్మణుడూ, నిశ్చలమైన నియమాలు కలవాడూ, కందమూల ఫలోదక మారుతాలు మాత్రమే ఆహారంగా స్వీకరించేవాడూ, నిరాకాంక్షుడూ, సర్వభూతహితం కోరుకొనేవాడూ, మునీశ్వరుడూ అయిన ఒక మహానుభావుడు. ఇట్లా సిద్ధి పొందాడు - అని సూర్యుడు స్పష్టం చేశాడు. ఓ భృగూ! అటువంటి అద్భుతం చూడగలిగాను, వినగలిగాను' అని పద్మడు చెప్పేసరికి ఆ భృగువు పరమానంద సంభరితుడై ఇట్లా అన్నాడు.

క. ' ఇవి యన్నియు నాశ్చర్యము । లవుఁ దెరువును నాకుఁ జూపి తన్వర్థత నొ
ప్పు వివిధ శబ్దంబుల బో । ధవరేణ్యా! పోయి వచ్చెదం బ్రియమొందన్. 611

ప్రతిపదార్థం: బోధవరేణ్యా!= జ్ఞానంచేత ఉత్తముడా! (గురూత్తమా!); ఇవి= నీవు చెప్పిన ఈ విషయాలు; అన్నియున్= అన్నీ; ఆశ్చర్యములు= అద్భుతాలు; అవున్= అవును (నిజమే); అన్వర్థతన్= సార్థకంగా; ఒప్పు= ఒప్పేటటువంటి; వివిధ శబ్దంబులన్= వివిధ పదాలతో; నాకున్= నాకు; తెరువునున్= మార్గంకూడా; చూపితి(వి)= చూపించావు; ప్రియము+ఒందన్= ప్రియం కలిగేటట్టు; పోయివచ్చెదన్= నేనింక వెళ్ళివస్తాను.

తాత్పర్యం: 'ఓ పద్మడా! నీవు ఇంతవరకూ చెప్పినవి అన్నీ అద్భుతాలే. అవును. నిజమే. వీటిని చెప్పటంలోనే సార్థకపదాలతో నాకు మార్గంకూడా చూపించావు. ఓ గురూత్తమా! చాలాసంతోషం! నే నింక వెళ్ళివస్తాను.

క. నను మఱవక పనుపం దగు । పనులెల్లను బనుపు శిష్యభావశుభము నా
కనఘా! కలిగెను నీ దెస । ననూనభద్రములు నీకు నయ్యెడు మెపుడున్.' 612

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పవిత్రుడా, పద్మడా!; ననున్= నన్ను; మఱవక= మర్చిపోకుండా; పనుపన్+తగు= ఆజ్ఞాపించదగిన; పనులు+ఎల్లనున్= పనులు అన్నీ; పనుపు(ము)= ఆజ్ఞాపించు; నీదెసన్= నీపట్ల; నాకున్= నాకు; శిష్యభావ= శిష్యుడను అనే భావం తాలూకు; శుభము= పుణ్యం; కలిగెను= కలిగింది (నీకు శిష్యప్రాయుడను అనే భావం నాకు కలిగింది - అని); నీకున్= నీకు; ఎపుడున్= ఎల్లవేళలా; అనూన= అత్యధికమైన; భద్రములు= అయ్యెడున్= అగుగాక!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ పద్మ్ముడా! నన్ను మరిచిపోవద్దు. ఆజ్ఞాపించదగినవన్నీ నాకు ఆజ్ఞాపించుము. నీకు శిష్యుడను అనే భావం నాకు ఏర్పడింది. అది శుభప్రదం. నీకు ఎల్లవేళలా శుభాలు కలగాలని ఆకాంక్షిస్తున్నాను.'

విశేషం: అయ్యెడున్+ఎపుడున్. ఆశీరర్థంలో 'ఎడున్' లోని నకారం మకారంగా మారింది. ఎడుతల ద్రుతంబున కచ్చు పరంబగునపుడు మకారంబగు (క్రియ-18) అని బాలవ్యాకరణం.

చ. **అన విని, నన్నుఁ గాంచితి ప్రయత్నమునన్, వినిపింపు మీవు వ**
చ్చిన పని నాకు, నీ కొకటి సేసితినే? యిటు వృక్షమూల వా
సుని క్రియ లేచిపోక తగుచొ ప్పగునే? భవదీయవాంఛ సె
ప్పిన నది యేను దీర్తు, మఱి పెం పెసఁగం జను భూసురోత్తమా!' 613

ప్రతిపదార్థం: అనన్= అని భృగుడు పలికేసరికి; విని= ఆలకించి; పద్మ్ముడు ఇట్లా అంటున్నాడు - నన్నున్= నన్ను; ప్రయత్నమునన్= ప్రయత్నపూర్వకంగా (ఇంతదూరం వచ్చి ఎనిమిదిరోజులు ఉపవాసం ఉండి); కాంచితి(వి)= చూశావు; ఈవు= నీవు; వచ్చిన పనిన్= వచ్చిన పని ఏమిటో దానిని; నాకున్= నాకు; వినిపింపుము= వినిపించవయ్యా!; నీకున్= నీకు; ఒకటి= ఒక్కటయినా; చేసితినే?= (ఉపకారం) చేసానా? (నీకు ఇంతవరకూ ఏ ఉపకారమూ చెయ్యనే లేదుగదా నేను); ఇటు= ఇట్లా; వృక్షమూలవాసుని+క్రియన్= చెట్టు మొదట్లో కాపురం ఉన్నవాడివలె; లేచిపోక= చటుక్కున లేచి ఉన్నపళంగా వెళ్ళిపోవటం; తగుచొప్పు+అగునే?= తగిన పద్ధతేనా (మంచి పద్ధతే అవుతుందా చెప్పుము!); భవదీయ= నీయొక్క; వాంఛ= కోరిక; చెప్పినన్= చెబితే; అది; ఏనున్= నేను; తీర్తున్= తీరుస్తాను; మఱి= అటుపైని; భూసుర+ఉత్తమా!= ఓ బ్రాహ్మణోత్తమా!; పెంపు+ఎసఁగన్= గొప్పదనం అతిశయించేట్లు; చను(ము)= వెళ్ళుము (వెడుదువుగాని).

తాత్పర్యం: భృగువు చెప్పిన పలుకులు ఆలకించి పద్మ్ముడు ఇట్లా అన్నాడు. 'ఓ బ్రాహ్మణోత్తమా! కష్టపడి ప్రయత్నపూర్వకంగా వచ్చి నన్ను చూచావు. ఇంతకీ నీవు వచ్చిన పని ఏమిటో చెప్పనే లేదు. చెప్పుము. ఇంతవరకూ నీకు నే నేమీ చేయనే లేదు. చెట్టుక్రింద కాపురం ఉన్నవాడివలె ఉన్నపళంగా ఇట్లా దులుపుకొని లేచి చక్కా పోవటం భావ్యమా? సమంజసమా? నీ కోరిక ఏమిటో చెప్పుము. తీరుస్తాను. అటుపైని వెళ్ళిపోదువుగాని.'

వ. **అని వెండియు. 614**

ప్రతిపదార్థం: అని= అని; వెండియున్= ఇంకా ఇట్లా అంటున్నాడు.

తాత్పర్యం: అని ఇంకా ఈ విధంగా అంటున్నాడు.

తే. **' అనఘ! నాయందు నీవు నీయందు నేనుఁ। గలము నీకు నీ సర్వలోకంబుఁ గలదు**
చింత కవకాశ మెద్ది? నిశ్చింతభావ। మొందు' మనియె నా దందశూకోత్తముండు. 615

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పావనుడా! భృగూ!; నాయందున్= నాలో; నీవున్= నీవూ; నీయందున్= నీలో; నేనున్= నేనూ; కలము= ఉన్నాం; నీకున్= నీకు (ఇంకా); ఈ సర్వలోకంబున్= ఈ సమస్త ప్రపంచమూ; కలదు= ఉంది; చింతకున్= దిగులుకు; అవకాశము+ఎద్ది?= చోటు ఏది?; నిశ్చింతభావమున్= నిశ్చింత అయిన స్థితిని; ఒందుము= పొందు - అని; ఆ+ దందశూక+ఉత్తముండు= సర్పశ్రేష్ఠుడైన ఆ పద్మ్ముడు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'ఓ భృగూ! నాలో నీవు ఉన్నావు. నీలో నేను ఉన్నాను. నీకు ఇంకా ప్రపంచమంతా ఉన్నది. దిగులు పడకుము. నిశ్చింతగా ఉండుము' అని ఆ సర్పరాజు పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని భృగుండు పద్మునకి ట్లనియె. 616

ప్రతిపదార్థం: అనినన్= అంటే; విని= ఆలించి; భృగుండు; పద్మునకున్; ఇట్లు; అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా ఆలకించి, భృగుడు పద్ముడితో ఇట్లా అన్నాడు:

తే. 'భోగివర! యిది యిట్టిద భూతములును। నీవు నేనును సర్వగతావిశిష్ట
విధములము వేదితవ్యంబు విదితమయ్యె। నిట్టి సందర్శనము వ్రతమింక నాకు. 617

ప్రతిపదార్థం: భోగివర!= ఓ సర్పరాజా! (భోగము= పడగ. అది కలది -భోగి); ఇది= నీవు అన్నది; ఇట్టిది+అ= నిజమే (ఇంతటిదే); నీవున్= నీవూ; నేనునున్= నేనూ; భూతములును= పంచభూతాలూ (నిఖిలప్రాణికోటీ); సర్వగత= అన్నిటా అంతటా వ్యాపించిన; అవిశిష్ట= భేదంలేని; విధములము= తీరు కలవాళ్ళం; వేదితవ్యంబు= తెలుసుకోవలసింది; విదితము+అయ్యెన్= తెలిసింది; ఇట్టి= ఇటువంటి; సందర్శనము= తత్త్వదర్శనం; ఇంకన్= ఇటుపైని; నాకున్= నాకు; వ్రతము= నియమం.

తాత్పర్యం: 'ఓ సర్పరాజా! నీవు అన్నది నిజమే. నీవూ నేనూ ఈ ప్రాణికోటీ, పంచభూతాలూ అంతటా వ్యాపించి ఏ భేదమూ లేని వాళ్ళం. అభిన్నులం. సమానులం. తెలిసికొనదగినది ఏదో తెలిసిపోయింది. ఇదే తత్త్వదర్శనం - సర్వసమతాదృష్టి ఇకపైని నాకు వ్రతం.

క. ఈ విధము నిశ్చయము నే। భావింపఁగఁ గంటి నీ కృపారతివలనన్
నీవు కృతార్థుఁడవు సుజన। సేవిత! యామంత్రణంబు సేసినవాఁడన్.' 618

ప్రతిపదార్థం: సుజనసేవిత!= సజ్జనులచేత సేవింపబడినవాడా!; ఈ విధము నిశ్చయము= ఇటువంటి నిశ్చయాన్ని (పుంప్వాదేశం చేయలేదు); నీ= నీయొక్క; కృపారతివలనన్= దయారూపమైన ఆసక్తివలన; భావింపఁగన్+కంటిన్= ఆలోచించగలిగాను (చేసికోగలిగాను - అని); నీవు= నీవు; కృతార్థుఁడవు= చరితార్థుడవు; ఆమంత్రణంబు= వీడ్కోలు; చేసినవాఁడన్= చెప్తున్నాను; (ఆమంత్రణశబ్దానికి ఆహ్వానమూ వీడ్కోలు అని రెండు అర్థాలూ ఉన్నాయి. నమస్కారం అనే అర్థంలో కూడా దీని వాడుక ఉంది. నమస్కారం చేస్తున్నాను అనే అర్థం ఇక్కడ ఇంకా బాగా కుదురుతుంది).

తాత్పర్యం: సజ్జనసేవితా! నీ దయావిశేషంవలన నేను ఈ రకం నిశ్చయానికి రాగలిగాను. అటువంటి పరిణతి నీ మాటలవలన నాకు వచ్చింది. నీవు చరితార్థుడవు. నీకు నమస్కరించి సెలవు తీసికొంటున్నాను.'

వ. అని పలికి యివ్విధంబునఁ గృతనిశ్చయుండై భృగుండు భుజంగవిభు వీడ్కొని దీక్షావిశేషకాంక్షం జేసి భార్గవకుల పవిత్రుం జ్యవనుం గాంచి నిజవృత్తాంతంబు సెప్పి తత్కృతసంస్కారంబునం గృతకృత్యుం డయ్యె; నిప్పుణ్యకథ యబ్భార్గవుండు జనకసదనంబున నారదునకు వివరించె; నద్దేవమునివరుండు దేవతావరునకు వినిపించె నమ్మహాత్ముండు వసువులకుం జెప్పె జామదగ్న్యుతోడి సంగ్రామంబున నుద్దామచిత్తుండనైన నన్నుం దేర్చుటకై వసువులు సకలభూత సమదర్శిత్వ సంపాదకంబైన యీ యితిహాసంబు నాకుం జెప్పిరి. నీవు పరమధర్మం బెయ్యది? యని యడిగిన నేను నీకుం జెప్పితి సర్వసమతాసముపహితంబైన యనాకాంక్షిత్వంబు ధర్మోత్తమంబు నిరతిశయానందంబునకు నిధానంబు.' 619

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఈ విధంబునన్= ఈ ప్రకారంగా; కృతనిశ్చయుండై= నిశ్చయం చేసుకున్నవాడై; భృగుండు= భృగుడు; భుజంగవిభున్= సర్పరాజును; వీడ్కొని= విడిచిపెట్టి; దీక్షా= దీక్షపట్ల; విశేష= విశేషమైన; కాంక్షన్+చేసి= కోరికచేత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(దీక్షవిశేషం పట్ల కోరికతో అని కానీ); భార్గవకుల= భృగువంశంలో; పవిత్రున్= పావనుడైన; చ్యవనున్= చ్యవన మహర్షిని; కాంచి= దర్శించి; నిజ= తనయొక్క; వృత్తాంతంబు= కథ; చెప్పి= వివరించి; తద్= ఆ చ్యవనునిచేత; కృత= చేయబడిన; సంస్కారంబునన్= (దీక్ష ఇచ్చేటప్పుడు కులంపెద్ద చెయ్యవలసిన) మంత్ర సంస్కారంతో; కృతకృత్యుండు+అయ్యెన్= చరితార్థుడు అయ్యాడు; ఈ+పుణ్యకథ= ఈ పవిత్రకథ; ఆ+భార్గవుండు= ఆ చ్యవనుడు (పరశురాముడు); జనకసదనంబునన్= జనకమహారాజుగారి నివాసంలో; నారదునకున్= నారదమహర్షికి; వివరించెన్= తెలియజేశాడు; ఆ+దేవమునివరుండు= ఆ దేవర్షివర్యుడు - నారదుడు; దేవతావరునకున్= ఇంద్రుడికి; వినిపించెన్= వివరించాడు (దేవేంద్రసన నివేశనే -4); ఆ+మహాత్ముండు= మహానుభావుడైన ఆ ఇంద్రుడు; వసువులకున్= అష్టవసువులకూ; చెప్పెన్= చెప్పాడు; జామదగ్న్యుతోడి= పరశురామునితో ఏర్పడిన; సంగ్రామంబునన్= యుద్ధంలో; ఉద్దామచిత్తుండను+ఐన= కలతచెందిన హృదయం కలవాడనైన; నన్నున్= నన్ను; తేర్చుటకై= ప్రసన్నపరచటం కోసం; వసువులు= ఆ వసువులు; సకలభూత= సమస్తప్రాణికోటినీ; సమ= సమానంగా; దర్శిత= చూడటం అనే గుణాన్ని; సంపాదకంబైన= కలిగించేదైన; ఈ+ఇతిహాసంబు= ఈ వృత్తాంతం; నాకున్= నాకు; చెప్పిరి= తెలియజేశారు. (భీష్ముడు పూర్వజన్మలో అష్టవసువులలో ఒకడు); నీవు= ధర్మరాజా! పరమధర్మంబు= అత్యుత్తమధర్మం; ఏ+అది= ఏది; అని; అడిగినన్= అడిగితే; నేనున్= నేను; నీకున్= నీకు; చెప్పితిన్= తెలియజేశాను; సర్వసమతా= సర్వప్రాణి సమానత్వంతో; సముపహితంబైన= కూడుకొన్న; అనాకాంక్షిత్వంబు= వాంఛారహితస్థితి (ఏ కోరికలూ లేకపోవటం - నిష్కామత్వం); ధర్మ+ ఉత్తమంబు= ధర్మాలలోకెల్లా శ్రేష్ఠమైనది; నిరతిశయ+ఆనందంబునకున్= సర్వోత్కృష్టమైన ఆనందానికి; నిధానంబు= నిలయం.

తాత్పర్యం: అని పలికి, ఈ విధంగా గట్టిగా నిశ్చయించుకొన్నవాడై భృగుడు నాగరాజును వీడ్కొని, విశేషదీక్షకొరకు భార్గవకులశ్రేష్ఠుడైన చ్యవనమహర్షిని దర్శించి, తన కథ చెప్పుకొని, అతడు చేసిన సంస్కారంతో ధన్యుడయ్యాడు. ఈ పుణ్యకథ జనకుడి గృహంలో భార్గవుడు నారదుడికి వివరించాడు. నారదుడు ఇంద్రుడికి చెప్పాడు. అతడు వసువులకు చెప్పాడు. పరశురాముడితో కలిగిన యుద్ధ సందర్భంలో కలత చెందిన నన్ను తేర్చటానికై వసువులు సకలభూత సమభావాన్ని పొందాలని ఈ ఇతిహాసం నాకు తెలిపారు. 'పరమధర్మం ఏది?' అని నీవు అడుగగా నేను నీకు చెప్పాను. సమస్త భూతాలను సమదృష్టితో కూడిన నిష్కామత్వం ఉత్తమధర్మం. ఉత్తమమైన ఆనందానికి అది నిలయం.'

క. అని యిట్లు ధర్మసుతునకు । ననిమిషతటినీతనూజుఁ డధికప్రేమం
బునఁ జెప్పట వైశంపా । యనుఁడును జనమేజయునకు నర్థిం జెప్పెన్. 620

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఇలా; ధర్మసుతునకున్= ధర్మరాజుకు; అనిమిషతటినీ= గంగాదేవి; తనూజుఁడు= కుమారుడైన భీష్ముడు (అనిమిషులు= దేవతలు, తటిని= నది); అధికప్రేమంబునన్= మిక్కిలి ప్రేమతో; చెప్పుట= చెప్పటాన్ని; వైశంపాయనుఁడు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= జనమేజయుడికి; అర్థిన్= కోరికతో; (ఇష్టంతో) చెప్పెన్= వినిపించాడు.

తాత్పర్యం: అని ఇట్లా భీష్ముడు ధర్మరాజుకు చెప్పటాన్ని వైశంపాయనుడు తన శ్రోత అయిన జనమేజయుడికి వివరించాడు.

వ. చెప్పిన విని జనమేజయుండు వైశంపాయనుతో నిత్తెఱంగునఁ బితామహుండు హితోపదేశంబు సేసిన నమ్మహీశుం డెవ్విధంబు దశావిశేషంబు నొందె మునీంద్రా! చెప్పవే యనుటయు. 621

ప్రతిపదార్థం: చెప్పినన్= చెబితే; విని= ఆలకించి; జనమేజయుండు= ఆ జనమేజయమహారాజు; వైశంపాయనుతోన్= ఆ వైశంపాయనమహర్షితో; ఈ+తెఱంగునన్= ఇలా; పితామహుండు= భీష్ముడు; హిత+ఉపదేశంబు= మేలును గురించిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉపదేశం; చేసినన్= చేస్తే; ఆ+మహీ+ఈశుండు= ఆ మహారాజు ధర్మజుడు; ఏ+విధంబు= ఏ రకమైన; దశావిశేషంబున్= విశిష్టమైన అవస్థను (దశను); ఒందెన్= పొందాడో; మునీంద్రా!= ఓ మహామునీ!; చెప్పవే= తెలియజెయ్యవా!; అనుటయున్= అనటమూ.

తాత్పర్యం: దీనినంతా విని జనమేజయుడు వైశంపాయనుడితో 'భీష్ముడి ఉపదేశం విని ధర్మజుడు ఎట్టి అనుభూతిని పొందాడు?' నాకు తెలిసికొనాలని ఉన్నది. తెలియజేయుము' అని అడుగగా. (తరువాతి పర్వంలోని కథతో అన్వయం).

ఆశ్వాసాంతము

ఉ. ఆగమపుష్ప సౌరభశుభాంగ! నివాస బుధాంతరంగ! వి
ద్యా గృహమేధితా సుభగతా మహనీయ! సురార్చనీయ! ని
ర్భోగ సభోగ సంపదనిరూప్య! సుసంవిదవాప్య! భక్తి ల
క్ష్మీగురునిత్య యోగిజన సేవిత! శాంతిసుఖైకభావితా! 622

ప్రతిపదార్థం: ఆగమ= వేదాలూ, శాస్త్రాలూ అనేటువంటి; పుష్ప= పూవులయొక్క; సౌరభ= సుగంధంతో కూడిన; శుభ= శుభప్రదమైన; అంగ= శరీరంకలవాడా!; నివాస= ఆవాసమైన; బుధ= పండితుల (దేవతల) యొక్క; అంతరంగ!= హృదయాలు కలవాడా! (బుధుల హృదయాలే నివాసంగా కలవాడా! - అనే భావంలో వ్యధికరణ బహువ్రీహిగా దీనిని సంభావించటమైనది- ఆలోచించాలి); విద్యా= జ్ఞానానికి; గృహమేధితా= యజమానత్వం వల్లనైన; సుభగతా= సౌందర్యంతో; మహనీయ!= మహనీయుడా! (గృహమేధి= కుటుంబయజమానుడు, అధికారి); సుర= దేవతలచే; అర్చనీయ!= పూజింపదగినవాడా! నిర్భోగ= భోగరహితమైన; సంపద్= సంపదలతోనూ; సభోగ= భోగసహితమైన; సంపద్= సంపదలతోనూ; అనిరూప్య!= నిరూపించటానికి శక్యం కానివాడా! (నిర్గుణసంపత్తి - సగుణ సంపత్తి. రెండింటికీ అందనివాడా!); సుసంవిత్= సరియైన జ్ఞానంతో (ఆత్మజ్ఞానంతో); అవాప్య= పొందదగినవాడా!; (జ్ఞానైకసులభుడా!); భక్తి= భక్తి అనేటువంటి; లక్ష్మీ= లక్ష్మికి (సంపదకు); గురు= గురువులైన; నిత్యయోగిజన= నిత్యయోగులచేత; సేవిత!= భజింపబడేవాడా!; శాంతిసుఖ+ఏక= శాంతిసుఖాలతో మాత్రమే; భావితా!= భావింపబడేవాడా!; శాంతిసుఖస్వరూపా - అని; (ఆగమపుష్పసౌరభశుభాంగనివాస! - అటువంటి శరీరాంగాలకు నివాసమైనవాడా అని; బుధాంతరంగ విద్యాగృహమేధితా సుభగతామహనీయ! - అంతరంగ విద్య అంటే ఆత్మజ్ఞానం. దానికి అధికారి - పరమాత్మ. ఇట్లా కూడా అన్వయించవచ్చునంటున్నారు కొందరు పెద్దలు).

తాత్పర్యం: ఓ హరిహరనాథా! ఆగమాలు అనే పుష్పాల సౌరభంతోకూడిన శరీరం కలవాడా! బుధుల అంతరంగాలే నివాసంగా కలవాడా! విద్యకు అధికారివైన సౌందర్యంతో విరాజిల్లేవాడా! (జ్ఞానసౌందర్యం - తేజస్సు). దేవతలచేత అర్చించబడేవాడా! నిర్భోగ సభోగసంపదలకు అందనివాడా! ఒక్క ఆత్మజ్ఞానానికే అందేవాడా! భక్తి అనే లక్ష్మికి గురువులైన నిత్యయోగీశ్వరులతో సేవించబడేవాడా! శాంతిస్వరూపా! సుఖస్వరూపా!

క. అభిమతఫల సంపాదన । విభవమహీయః ప్రసాద! విశ్రుతవేదా!
ఋభు విభు విలోచనాంబుజ । శుభద రవిత్వా! హరిత్వ సుభగహరత్వా! 623

ప్రతిపదార్థం: అభిమత= కోరుకొన్న; ఫల= ఫలాలను; సంపాదన= సమకూర్చటమనే; విభవ= సంపదతో (వైభవంతో); మహీయః= గొప్పదైన; ప్రసాద= అనుగ్రహం కలవాడా!; విశ్రుత+వేద= చెవికెక్కిన (వీను మిగిలిన) వేదాలు కలవాడా!; ఋభువిభు= దేవతల నాయకుడైన దేవేంద్రుడియొక్క; విలోచన+అంబుజ= నేత్రపద్మాలకు; శుభద= శోభను కలిగించే; రవిత్వా!= సూర్యత్వం కలవాడా!;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

హరిత్వ= విష్ణుత్వంతో; సుభగ= అందమయిన (సొంపిల్లిన); హరత్వా!= శివత్వం కలవాడా! (హరిత్వమూ హరత్వమూ పరస్పర సౌందర్యదాయకాలుగా విరాజిల్లుతున్నవాడా! - అని).

తాత్పర్యం: ఓ హరిహరనాథా! భక్తులకు కోరుకొన్న ఫలాలను అందించటంలో ఘనత వహించింది నీ అనుగ్రహం. వేదాలను నిరంతరం వింటూ ఉంటావు. దేవేంద్రుడి నేత్రపద్మాలను వికసింపజేసే సూర్యుడివి నీవే. నీలో హరిత్వమూ హరత్వమూ సొగసుగా జతగూడి ఉన్నాయి.

మాలిని.

వరబహునుత వేదవ్యాస! విశ్వాత్మభాసా!
నిరుపమతను లీలానిత్య! సత్యాధికృత్యా!
నిరతిశయ సమత్వోన్నిద్ర! కారుణ్యభద్రా!
భరితభువనవర్గా! భాస్వదానందమార్గా! 624

ప్రతిపదార్థం: వర= ఉత్తమంగా; బహు= (అధికంగా) బహువిధాలుగా; నుత= నుతించిన; వేదవ్యాస!= వేదవ్యాసుడు విశ్వ+ఆత్మ+భాసా!= విశ్వాత్ముడవై ప్రకాశించేవాడా! (విశ్వాత్మకమైన తేజస్సు కలవాడా!); నిరుపమ= సాటిలేని; తను= అవతార రూపాలయొక్క (శరీరాలయొక్క); లీలా= విలాసాలతో; నిత్యా!= నిత్యుడా!; సత్య+అధికృత్యా!= సత్యస్వామీ! (సత్యరూపా!); నిరతిశయ= సాటిలేని; సమత్వ= సకలప్రాణి సమానత్వంతో; ఉన్నిద్ర!= తేజరిల్లేవాడా!; కారుణ్యభద్రా!= దయానిలయా! (కృపారూపమైన శుభస్వరూపా!); భరిత= భరింపబడిన; భువనవర్గా!= లోకసమూహం కలవాడా!; భాస్వత్= ప్రకాశించే; ఆనందమార్గా!= ఆనందమార్గం కలవాడా! (ప్రకాశించే ఆనందానికి మార్గమైనవాడా!)

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నిన్ను వేదవ్యాసుడు ఉత్తమంగా బహువిధంగా నుతించాడు. నీ తేజస్సు విశ్వవ్యాప్తమై విశ్వాత్మగా ఉంటుంది. నీ అవతారలీలలు నిత్యాలూ నిరుపమాలూ. సత్యస్వరూపుడవు నీవే. సర్వప్రాణి సమతాభావంతో నీవెప్పుడూ జాగరూకుడవై ఉంటావు. నీవు కారుణ్యమూర్తివి. భద్రప్రదాతవు. సకల భువనాలనూ నీవే భరిస్తావు. నీవే నిజమైన ఆనందమార్గానివి, ఆనంద స్వరూపుడవూ, ఆనందప్రదాతవూ - అని హరిహరనాథుడిని స్తుతించే స్తోత్రములు.

విశేషం: మాలినీ వృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న,న,మ,య,య అనే గణాలుంటాయి. తొమ్మిదవ అక్షరానికి యతిమైత్రి ఉంటుంది. ప్రాసనియమం ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున శాంతిపర్వమునందు సర్వంబును షష్ఠాశ్వాసము.

తాత్పర్యం: ఇది మంగళకరులైన ఉభయ (సంస్కృతాంధ్ర) కవులకు మిత్రుడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, పండితులను ఆరాధించటంచేత ప్రకాశించేవాడూ (పండితులచేత ఆరాధించబడి రాజిల్లేవాడూ) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలోని శాంతిపర్వం ముగించే ఆరవ ఆశ్వాసం.

శాంతిపర్వంలోని ఆరవ ఆశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతంలోని శాంతిపర్వం ముగిసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతి పర్వము

(రెండవ భాగము)

గద్య పద్య ప్రథమ పాద సూచి

పద్యము	పుట
అ	
అంగంబులు వొదల నెదరు	1087
అంతంతకు సత్కర్మము	812
అందుఁ దుదముట్ట	978
అందు మూఁడేసి ఋతువుల	691
అంబర పాటవమునఁ బో	1091
అకట! భవిచ్ఛిత్తము నిర్వికార	671
అక్షరంబగు పంచ	933
అక్షరము విక్రియా	886
అఖిల కర్మఫలము	609
అఖిలరత్నపూర్ణయగు	905
అగమునునిన్	596
అగుణం బయ్యును	889
అగు నీ తత్త్వము సత్త్వా	542
అగ్గోవున కతం డిట్లనియె	774
అగ్నినోషధి వృక్ష	816
అగ్ని వెచ్చనొ? చల్లనో	956
అచటఁ బ్రతిహారు	972
అచరములు జరంబు	602
అచలు సూక్ష్ము వరేణ్యు	593
అచిర కాలంబునన	996
అజగరచరితము	536
అజము లవ్రణంబు	932
అజుండు జగంబులు	743
అజుని విశ్వరూపు	1030
అట్టి మహామహిమ	983
అట్టియెడ	1092

పద్యము	పుట
అట్టియెడఁ దత్త్వజ్ఞాన	638
అట్టియెడ నేనును	1024
అట్లకాక యని ప్రియంబు	761
అట్లుంగాక	952
అట్లుంగాక ధర్మా	544
అట్లుండ నొక్కనాఁడు	1072
అట్లు కల్పించి జలముల	588
అట్లు ధర్మజుఁడు	1067
అట్లు బహువిధంబులగు	1074
అట్లు మ్రోసిన విని	751
అట్లు సనుదెంచు	767
అట్లు సాకారమై వచ్చి	559
అట్లు సిద్ధుండగుటయు	790
అట్లేకాంతియై తపంబు	1048
అడవి సొచ్చి యంత	619
అడిగితి లెస్సగ	875
అడిగి మేలు సేసి	795
అతండతని కిట్లనియె	637
అతం డతని కిట్లనియె	762
అతండు ననేకవర్షం	569
అతఁ డతనితోడ శిష్య	987
అతఁడు కాలకలితమైన	622
అతఁడు గడంగ	814
అతఁడు చిరకాల	762
అతఁడు మోక్షదర్శి	971
అతఁడు రాత్రి నిద్రించు	696
అతఁడు సదివింప వేద	970

పద్యము	పుట
అతనిఁ బొదువు సంకల్పం	701
అతనికి నన్నపానముల	974
అతనికి సరిత్సముద్ర	866
అతని తలఁపున	536
అతని తెఱం గిట్టిది	1078
అతనితోడ నిట్లనియె	1082
అతనివలన భూతములకు	723
అతివ! సేమమె? తగ	1081
అతులవేదాంతశాస్త్ర	727
అత్రిముని యింద్ర దైవత్య	626
అది తిర్యఙ్మనుష్యా	891
అది ధర్మంబుల కెల్లం	734
అది భావనీయంబు	690
అది యట్టులుండె నీతో	661
అది యట్లుండె నప్రతి	1071
అది యట్లుండె వినుము	778
అది యెట్లంటేని	911
అది యెట్లంటేని దేవ	694
అది యోగి కొప్పదు	630
అది యోగిజనంబుల	691
అది లెస్సగ విడిచి	936
అది సిద్ధత్వసంపదకు	922
అదృశ్యుండై నిలిచి	1027
అద్దేవముని యిట్లనియె	1046
అద్దేవుండు వత్సలుం డయి	1046
అధిప! లఘ్వాశియై	803
అధిప! సర్గముఁ బ్రళయంబు	910

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనఘ! దివసంబు రాత్రియు	740
అనఘ! దురన్నము	828
అనఘ! దేహంబు కంటె	739
అనఘ! నాయందు నీవు	1094
అనఘ! నా రాక వార్చి	1087
అనఘ! నీ మధురవాక్యం	1073
అనఘ! బ్రహ్మంబు	696
అనఘ! మూఢాత్ము	847
అనఘ! యింద్రియముల	708
అనఘ! యింద్రియములు	731
అనఘ! యిది భార్గవుండు	831
అనఘ! యిది యోగ	923
అనఘ! యుత్తర దక్షిణా	692
అనఘ! విను కామ	714
అనఘ! విష్ణు విహారంబు	810
అనఘ! సుఖదుఃఖ	839
అనఘ! సుఖాసీనుఁడైన	885
అనఘా! తపోవనము	963
అనఘా! దుఃఖాత్మక	545
అనఘా! భవదీయ	789
అనఘా! మర్త్యుల	836
అనఘా! మృత్యువు	801
అనఘా! మోక్షము తెలుఁగిది	904
అనఘా! యగ్నీషోముల	1036
అనఘా! విధివిహితంబుం	650
అనఘా! విను మవ్యక్తం	633
అనఘుం డింద్రియహయ	833
అనఘుఁ బరాశర	689
అనఘులారా! సంసిద్ధు	571
అనయముఁ దేఱి నాగ	1085
అనయము నీసు వొనర్చిన	807
అనలము దోఁచునే	577
అనలునకు రవికిని	595
అన విని నన్నుఁ గాంచితి	1094
అన విని బలి	655
అనవుడు నతం డతని	977
అన విని సంశయం	944
అనవుడు నతండు నీవీ	659
అనవుడు నతఁ డిట్టులను	966
అనవుడు నతనికి నత	685
అనవుడు నతనితో	865
అనవుడు నద్దేవి	681
అనవుడు ననిమిషవతి	652
అనవుడు నమ్మహాను	832
అనవుడు నరనాథుఁడు	566
అనవుడు నాతఁడిట్లను	754
అనవుడు భీష్ముఁ డిట్లనియె	829
అనవుడు మున్న యిట్లు	986
అనహంకారము నప్రార్థన	824
అనహంకారుఁడు నక్రో	781
అని కామం బనునది	523
అని గలిగి పరాక్రమ	659
అని గురుఁ డుపదేశించిన	587
అని చెప్పి	180
అని చెప్పి తపము పెంపును	838
అని చెప్పినం బ్రమదంబు	761
అని చెప్పినం బ్రియం	909
అని చెప్పినం బ్రీతుండై	749
అని చెప్పిన నమ్ముని	799
అని చెప్పిన ముదితుండై	939
అని చెప్పిన రాయంచతో	857
అని చెప్పిన విని యప్పాండ	653
అని చెప్పిన విని యజాత	518
అని చెప్పిన విని విద్య	718
అని చెప్పిన విని విశ్వా	934
అని చెప్పి పారాశర్యుం	702
అని చెప్పి ప్రకృతి	916
అని చెప్పి బ్రహ్మక్షత్త్ర	1035
అని చెప్పి భీష్ముండు	858
అని చెప్పి భృగుండు	550
అని చెప్పి మఱియు నిట్లను	925
అని చెప్పి మఱియును	732
అని చెప్పి యంత నిలువక	669
అని చెప్పి యంత నిలువక	755
అని చెప్పి యనిమిష	662
అని చెప్పి యప్పరాశర	724
అని చెప్పి యప్పారాశర్యుం	714
అని చెప్పి యప్పురుష	792
అని చెప్పి యబ్బలము	815
అని చెప్పి యమరతటినీ	822
అని చెప్పి యిట్లను	1015
అని చెప్పి వెండియు	847
అని చెప్పి వెండియు	852
అని చెప్పి వెండియు	866
అని చెప్పి వెండియు	877
అని చెప్పి వెండియు	887
అని చెప్పి వెండియు	907
అని చెప్పి వెండియు	992
అని చెప్పి వెండియు	1068
అని చెప్పి వెండియుం బరా	843
అని చెప్పి వెండియు నిట్లనియె	557
అని చెప్పి వెండియు నిట్లను	762
అని చెప్పి వైశంపాయను	1023
అని చెప్పె నగ్గుణంబు	689
అని చెప్పె ననిన విని	521
అని చెప్పె ననిన విని	742
అని చెప్పె ననుడు	687
అని చెప్పె ననుడు	825
అని చెప్పె నిట్టు లయ్యుని	610
అని చెప్పె నియతుండై	906
అని జపించి సర్వావస్థల	607
అని తన వైరాగ్యంబును	946
అని తెలిపి మఱియును	932
అని ధర్మం బగ్గించి	791
అనిన జనకుడిట్టు	841
అనిన జాజలి యట్లేని	754
అనిన ధర్మసుతుండు	850
అనినం గర్మంబు విడువమి	719

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనినం దొల్లియు నిది	747
అనినం బితామహునితో	646
అనినఁ గపిలుఁ డిట్టు	778
అనినఁ దదీయయబోధనంబు	752
అనినఁ దానను మంత్రులు	957
అనినఁ దేజస్విఁ జేసి	831
అనినఁ బ్రియమంది	829
అనిన నజాతశత్రుం	864
అనిన నట్లుకాక యని	971
అనిన నట్లకాక యని	1064
అనిన నట్లకాక యాచ	789
అనిన నట్లకాక వినుము	809
అనిన నతండు ప్రీతుండై	818
అనిన నతఁ డట్లచేయ	1076
అనిన నతఁ డతని	671
అనిన నతఁ డిట్టి ధర్మము	1058
అనిన నద్దేవముని	590
అనిన నభినందించి	760
అనిన నాతఁడు భయమంది	569
అనిన నీ రాక వార్చి	1084
అనిన భృగుఁ డిట్టులను	541
అనిన వారు కృతార్థులై	805
అనిన వారు మరాళంబున	856
అనిన విని కురుపతి	556
అనిన విని కౌంతేయా	535
అనిన విని కౌంతేయా	647
అనిన విని జనకజన	640
అనిన విని జనకజనే	846
అనిన విని జనకపతి	918
అనిన విని జనకభూవిభు	843
అనిన విని జనకుం డమ్మునీ	891
అనిన విని జనకుండు	840
అనిన విని జనమేజయుం	1023
అనిన విని జనమేజయుం	1055
అనిన విని జాజలి	753
అనిన విని దేవతటినీ	965

పద్యము	పుట
అనిన విని ధర్మంబు	565
అనిన విని ధర్మజుఁడు	684
అనిన విని ధర్మతనయుండు	644
అనిన విని ధర్మతనయుండు	867
అనిన విని ధర్మనందనుండ	859
అనిన విని ధర్మనందనుండు	799
అనిన విని భృగుండు	1095
అనిన విని ధర్మపుత్రుండు	770
అనిన విని పరమ	587
అనిన విని పాకశాసనుం	674
అనిన విని ప్రీతుఁడై పాండ	637
అనిన విని బలి దేవతా	655
అనిన విని బలి యతని	667
అనిన విని భరద్వాజు డా	546
అనిన విని భరద్వాజుండు	547
అనిన విని భరితా	690
అనిన విని భృగుఁడ	541
అనిన విని మేధావి	514
అనిన విని యజాత	531
అనిన విని యజ్ఞపతి	508
అనిన విని యత్యంతా	1070
అనిన విని యమ్మహా	745
అనిన విని యమ్ముని	559
అనిన విని యమ్ముని	976
అనిన విని యా నృపతి	909
అనిన విని యుధిష్ఠిరుండ	552
అనిన విని యుధిష్ఠిరుండు	860
అనిన విని యుధిష్ఠిరుండు	872
అనిన విని యుధిష్ఠిరుండె	803
అనిన విని యొండు	661
అనిన విని విస్మయము	652
అనిన విని విప్రుండ	562
అనిన విని వృత్రుం	813
అనిన విని వేదార్థా	1014
అనిన విని శుకుం డా	710
అనిన విని శుకుండు	716

పద్యము	పుట
అనిన విని శుకుండు	734
అనిన విని సవిశేష	1050
అనిన విని స్యూమరశ్మి	777
అనిన విని స్యూమరశ్మి	782
అనిన విని హిరణ్య	648
అనిన విష్ణుం	1040
అనిన సంతసిల్లి యద్దేవ	1048
అని నిర్దేశించె నట్లా	770
అని నిర్దేశించిన	780
అని నిర్దేశించి నీవు	1066
అని నిర్దేశించి వలయు	1000
అని నిర్దేశించి వెండియు	583
అని పత్ని బోధించిన	1085
అని పలవించి	1052
అని పలికిన ధర్మం	560
అని పలికిన విని	1012
అని పలికి తొల్లి	750
అని పలికి నారాయణ	1069
అని పలికి పుత్రుండు	800
అని పలికి భీష్ముండా	1015
అని పలికి భీష్ముండు	815
అని పలికి భీష్ముఁడు	906
అని పలికి మఱియు నిట్లను	804
అని పలికి యధిప!	747
అని పలికి యమ్మునీశ్వరు	994
అని పలికి యాజ్ఞవల్క్య	927
అని పలికి యాదరంబున	1003
అని పలికి యిట్లనియె	612
అని పలికి యిట్లనియె	1045
అని పలికి యిట్లనియె నిద్దిన	1076
అని పలికి యివ్విధంబు	526
అని పలికి యివ్విధంబునఁగృత	1095
అని పలికి యుచితముగ	675
అని పలికి యుద్దామంబై	523
అని పలికి వరంబు	1016

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అని పలికి విమల	996
అని పలికి వెండియు	650
అని పలికి వెండియు	669
అని పలికి సత్వరంబుగ	1086
అని పలికి సమ్యగ్జ్ఞానంబు	581
అని పలికి సాధ్యులకు	858
అని పలికె నిట్లు లక్ష్మి	660
అని పలుకుటయు	746
అని పలుకుటయు స్యూమరశ్మి	787
అని ప్రార్థించె నప్పుడు	566
అని పుత్రుం డుపదేశించిన	517
అని పుత్రు నుద్దేశించి	768
అని బోధించిన జనకు	982
అని బోధించిన సగరుం	829
అని బోధించి వెండియు	1042
అని బోధించె నిట్లు	643
అని భక్తి పూర్వకంబుగా	1003
అని భీష్ముం డుపదేశించిన	611
అని భృగుండు సెప్పిన	539
అని మఱియు దయ	592
అని మఱియు ననేక	997
అని మఱియు ననేక	1031
అని మఱియు నిట్లను	758
అని మఱియును	533
అని మఱియును	544
అని మఱియును	577
అని మఱియును	844
అని మఱియును	908
అనిమిత్తము భూతం	527
అనిమిషనాథు తోడి	808
అని యడిగిన నతం	826
అని యడిగిన నతనికి	794
అని యడిగిన నమ్మహా	823
అని యడిగిన నయ్యుధిష్ఠిరు	664
అని యడిగిన నాదరించి	852
అని యడిగిన నైశం	1059

పద్యము	పుట
అని యడిగిన హంస	856
అనియతంబులైన	530
అని యతఁడు నిజనివా	791
అని యతని మనశ్శుద్ధి	807
అని యధ్యాత్మప్రకారం	554
అని యభ్యర్థించిన	823
అని యమాత్యుల దిక్కు	952
అని యమ్ముని పలు	636
అని యానతిచ్చి మఱి	1065
అని యిట్లాడిన మాటలు	671
అని యిట్లు ధర్మతనయు	676
అని యిట్లు ధర్మసుతు	1096
అని యిట్లు నముచి	664
అని యిట్లుపదేశించి	736
అని యిట్లుపదేశించి	786
అని యి ట్లుపదేశించిన	965
అని యిట్లు పరబోధన	902
అని యిట్లు పెక్కుభంగుల	767
అని యిట్లు పెక్కుభంగుల	850
అని యిట్లు ప్రబోధించి	905
అని యిట్లు పలుకు పలుకులు	955
అని యిట్లేకతద్వైత	1012
అని యిట్లోలయు వితర్కం	631
అని యివ్విధంబున	1043
అని యుపదేశించి మఱియును	705
అని యుపదేశించి వెండియును	924
అని యుపదేశించిన విన	938
అని యుపదేశించి యింక	728
అనియె నద్దేవముని	1000
అనియె నని చెప్పి గురు	1002
అనియె నని చెప్పిన	1044
అనియె నని చెప్పిన విని	773
అనియె నయ్యిరువుర	571
అనిలముఖదోషము	632
అని విచారించి తలంచు	764
అని వితర్కించియు	765

పద్యము	పుట
అని విన్నవించిన విని	1025
అని విప్రుం డుపదేశించిన	512
అని వెండియు	529
అని వెండియు	543
అని వెండియు	549
అని వెండియు	576
అని వెండియు	631
అని వెండియు	696
అని వెండియు	735
అని వెండియు	759
అని వెండియు	919
అని వెండియు	935
అని వెండియు	1082
అని వెండియు	1090
అని వెండియు	1094
అని వెండియు విరోచన	656
అని వేఁడిన నమ్ముని	892
అని వేఁడిన భక్తపరా	1004
అని శాంతనవుఁడు	1023
అని సత్యక్షమాదమ	855
అనుచు	947
అనుచుం గృష్ణద్వైపా	1061
అనుచుం జనుదెంచి	769
అనుటయు	573
అనుటయు	856
అనుటయు దేవవ్రతుం	532
అనుటయు దేవవ్రతుఁడ	797
అనుటయు ధర్మంబు	560
అనుటయు నతఁడిట్టు	748
అనుటయు నమ్మహీ	795
అనుటయు నమ్మహీ	1078
అనుటయు నమ్ముని	710
అనుటయు నయ్యున	563
అనుటయు నయ్యురగ	1088
అనుటయు నా కృష్ణుం	688
అనుటయు నాతఁడిట్టు	805

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనుటయు నా దేవవ్రతుం	1070
అనుటయు నిట్లనుం	776
అనుటయుఁ బరాశరుం	841
అనుటయు మహేంద్రుండు	661
అనుటయు వార లొండొ	985
అనుటయు స్యూమరశ్మి	775
అనుటయు హంస మిట్లు	857
అనుడు నజాతశత్రుఁడిటు	796
అనుడు నతఁడు కర్మమఖిలంబు	719
అనుడు ననపాయమగు	795
అనునయపూర్వకంబుగా	1000
అనుపమ మజర మతీంద్రియ	892
అనుభవము మ్రింగు శాంతిం	585
అనులోమంబున సృష్టియు	897
అన్నమును జలంబు	1034
అన్నరేంద్రుం డహింసకుం	1008
అపరిగ్రహసర్వారంభ	991
అపుడు మందాకిని సాకార	968
అపునరావృత్తి పదంబగు	937
అప్పని మనచేత నయ్యెడి	756
అప్పరమేశ్వరుండు	821
అప్పవనములను గలఁచిన	989
అప్పుడ యసమర్థుండగు	766
అప్పుడు తదీయ బ్రహ్మ	572
అప్పుణ్య క్షేత్రంబున	1075
అప్పురుషుండు	542
అభినందించిరి దేవ	683
అభిమతఫల సంపా	1097
అమరతటినీసుతున	1070
అమరుం డవ్యయుఁ డజరుం	616
అమరులు విమల శ్రద్ధా	757
అమలంబగు నీ యితి	644
అమలవాయుసేవనము	890
అమల హృదయవేద్యా	677
అమలిన గృహస్థ	776
అమృతం బచ్యుతమమలం	586
అమృతపానంబుఁ జేసిన	675
అమృతము నభవము	890
అమృతము మృత్యువు	515
అమ్మహాత్ముం డమ్మహీ	688
అమ్మహాత్ముండు	1006
అమ్మహితాత్ముండు మధ్య	1008
అమ్మునిపతి వాక్యము	992
అమ్మునియును శిష్యు	984
అమ్మునీశ్వరుండు భక్తి	967
అమ్మెయి నిలుచుటకును	830
అయనవశంబునఁ దేజో	661
అయిదు దెఱఁగుల	597
అయినను నా యెఱింగి	775
అయ్యరణిఁ బుట్టి జనక	968
అయ్యవసరంబున సత్య	998
అయ్యురగవల్లభు	1078
అరదముమీఁద మున్	1092
అరయంగా శబ్దంబును	699
అరయంగా శబ్దంబును	782
అరయఁగామము	991
అరయఁగ ధర్మతంత్రముల	1071
అరయఁగ విషయము	627
అరయఁగ సంస్పర్శము	626
అరయఁ బుత్తెంచె	973
అరయ మే లసంగ	846
అరసి చూడ సత్త్వంబు	554
అరిగి యచట వాని	1053
అరుదే సర్వేశ్వరుఁడగు	1045
అరులు మిత్రులుదాసీను	949
అర్థంబుల యస్థిరత్వంబ	807
అర్థముల్ దుఃఖదోషా	797
అలఘుతపంబు గోరి	1006
అలఘుమతిని యజ్ఞా	775
అలసులు ధనహీనులు	777
అలుక మానుము హరికై	1010
అల్పమైన యగ్ని	861
అవనిఁ బొందదు దివ	725
అవమానమునకు	686
అవయవము లెట్లు	728
అవి గలిగి పరాక్రమ	659
అవి ప్రయోజనపడుట	810
అవి యెల్ల నసత్యం	956
అవి వినఁగ నెఱుఁగ	613
అవ్యక్తు శాశ్వతు నఖిల	592
అవ్విధంబున మహాను	790
అవ్విప్రవరుం డతని	640
అవ్విశేషంబులెల్ల నీ	980
అశని నిర్ఘోషంబు	540
అశ్వమేధ సహస్రంబు	610
అష్టమియగు దేవత	683
అసమాలంబ శబ్దము	576
అసితుండగు దేవలుండు	685
అస్థిరేంద్రియ సలిల	960
ఆ	
ఆకర్ణింపుము	692
ఆకసమును మనసు	701
ఆగమపుష్ప	1097
ఆగమ సత్యధర్మాచార	543
ఆ గుణములు మఱియు	660
ఆచారనేమియుఁ బ్రాణ	706
ఆచార పరిపాటి	969
ఆ చూపు మరిగి చిత్తం	625
ఆతఁ డతిభక్తిఁ దలఁచె	790
ఆతత సంసారము తృష్ణా	636
ఆతనిఁ గానఁ బొమ్ము	1076
ఆ తీర్థోత్తమమున	1075
ఆ తెరువులు రెంటికి	859
ఆ తెఱఁ గఘములఁ బాచు	853
ఆత్మయం దగ్ని సమా	722
ఆత్మునకు రెండు రూపంబు	870
ఆదికాలమున బ్రజాభి	1063
ఆదిత్యమరుద్వసు	677

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఆదిత్యమరుద్వసు	1018
ఆదిత్య మరుద్వసు	1025
ఆదినిధనరహితుఁడగు	733
ఆదిమధ్యాంతములు	1038
ఆదియు మధ్యము నంతము	585
ఆ ధర్మతనయుతోడ	590
ఆనతవైరి! యిట్టులను	856
ఆ నదియం దాచరిత	680
ఆ నరపతి శాంతనవుని	664
ఆ నాదముదెసకుం జన	1053
ఆ బ్రహ్మ యఖిల భూతా	537
ఆ బ్రహ్మర్షి సత్తముండు	995
ఆ యుగంబులు నాల్గు	695
ఆయువు దఱుఁగు నంతం	800
ఆ యైశ్వర్యము గ్రమ్మఱ	808
ఆరయఁ గదళీగర్భా	848
ఆరయఁ గామముఁ గ్రోధము	991
ఆరయ నధ్యాత్మ మహం	915
ఆ రాజన్యునెడ నహం	971
ఆర్జవంబు ప్రసన్నత	652
ఆర్యులుఁ బ్రవృత్తి లక్షణ	618
ఆ వణిజుఁడు ధర్మస్థితి	761
ఆ వాసవు చందంబున	818
ఆ విధము శుక్లగతి	626
ఆశయ యింద్రియజయ	512
ఆశ్చర్యములకెల్ల నాస్పదం	1089
ఆశ్మశాన గమను లంతియ	962
ఆ సుకృతము గడయెయ్ది	791
ఆహితాగ్ని బుణ్యుఁడను	835
ఇ	
ఇంతకాలమేని యెఱుఁగక	900
ఇంతకు మును సూచితి	673
ఇంతకు మూలము దృష్టా	622
ఇంతననేల? యేను భుజ	1079
ఇందుల తాత్పర్యము నీ	684
ఇంద్రియంబుల కంద	1017

పద్యము	పుట
ఇంద్రియంబుల నాఁటింటి	734
ఇంద్రియంబులు దమ	580
ఇంద్రియంబులు నవ్యక్తం	910
ఇంద్రియంబులు మనము	922
ఇంద్రియముల గెల్చి హృద	687
ఇంద్రియములలో నొక్కటి	715
ఇంద్రియములెల్ల నట్టివ	912
ఇంద్రియార్థంబుల నేనింట	869
ఇంద్రుఁ డబ్జజుకడ	653
ఇంద్రుఁడుజ్జ్వల రథం	813
ఇంద్రునకు రుద్రుఁ డత్తఱి	814
ఇంద్రు లెందఱు వో రింద్రు	670
ఇచ్చి యెప్పటి యట్ల	1053
ఇచ్ఛానిరసనంబు	524
ఇటు గర్వించుట నీచత	657
ఇట్టి జనని వధించుట	767
ఇట్టి మహిమ గలిగి	697
ఇట్టి యప్పుడు సదివిన	990
ఇట్టివాఁడు వెడల	704
ఇట్లగుట మున్నెఱింగించితి	1068
ఇట్లయ్యిరువురు నధ్య	988
ఇట్లాయురంశంబులు	722
ఇట్లు కృతయుగంబునకు	694
ఇట్లు గలిగి వర్తిలుచున్న	698
ఇట్లు కృతయుగంబునకు	693
ఇట్లు నిలిచిన యవ్వేద	999
ఇట్లు ప్రణామంబుసేసి	611
ఇట్లు ముక్తుండనై యున్న	945
ఇట్లు లబ్ధవరుండగుచు	967
ఇట్లు విష్టరశ్రవుండు	1054
ఇట్లు వుట్టి గంధమాద	1039
ఇట్లు సెప్పి	1068
ఇతఁ డబీజుం డదేహుం	893
ఇతఁ డెవ్వండని యమ్మెయి	1092
ఇతరేతర మతి సంభావిత	1043
ఇత్తెఱఁగునఁ బురుషుం	825

పద్యము	పుట
ఇది కర్మభూమి భోగా	548
ఇది నా కయ్యెం గాఁగల	663
ఇది నాయదియనుఁ నూత	509
ఇది బ్రహ్మచారి ప్రకారం	721
ఇది బ్రహ్మ వసిష్ఠునకు	906
ఇది మేలపుమాట సుమీ	658
ఇది యక్షరక్షర వివేకం	894
ఇది యితిహాసవరము	1001
ఇది యేమి? శోకమున	507
ఇది యోగప్రకారంబు	707
ఇది యోగ ప్రకారంబు	897
ఇది విజ్ఞానము కృత్యము	937
ఇది శమ ప్రకారంబని	530
ఇది శ్రీమదుభయకవిమిత్ర	678
ఇది సాంఖ్యప్రకారంబు	873
ఇది సాంఖ్యానుభావంబు	920
ఇద్ధమైన యగ్ని యింధన	862
ఇనరశ్ములుఁ చంద్రాంశులు	1034
ఇనరుచిఁ బాషాణము	847
ఇను నడుమ వెలుంగుచు	598
ఇనుమును గనకము	980
ఇనురూపము జలముల	739
ఇను వేఁడిమి శోషించిన	1090
ఇయ్యఖిలము సృజియిం	709
ఇరుప్రొద్దు గుడుచుచు	646
ఇల జలంబుల జలం	604
ఇలయు గిరులును శర	1001
ఇవి కర్మస్థల తెఱంగులు	699
ఇవి పుణ్యలోక విషయ	549
ఇవి యన్నియు నాశ్చర్యము	1093
ఇవ్విధంబున నుద్యుక్తుం	1077
ఇవ్విధంబున నేకాంతియై	1015
ఇవ్విధంబున శాంతినొంది	735
ఇవ్విధమున నతండు	927
ఇవ్విషయంబునకు నొక్క	680
ఇవ్విషయంబున యయాతి	979

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఇవ్విషయంబున వృత్ర	806
ఇవ్వేరవునకు వైరాగ్యంబు	642

ఈ

పద్యము	పుట
ఈ చక్రంబున సకల	617
ఈ చతుర్వింశతి తత్త్వం	887
ఈ తెరువునఁ జరియిం	879
ఈ తెరువున వేదవిదుఁడు	706
ఈ తెరువు మద్గురుఁడు	1060
ఈ తెఱంగు లేనెఱుంగుదు	528
ఈ దేవునిఁ గన్నట్టుల	1012
ఈ నెఱి పురుషునకుం	904
ఈ నెలవులఁ దోఁచును	1058
ఈ యయిదింటన కాదె	539
ఈ రెండు ప్రకారంబుల	708
ఈ లోకంబుల నెల్లం	713
ఈ లోకము దుఃఖ	548
ఈ విధము నిశ్చయము	1095
ఈ వెరవూఁదుము	939
ఈ సర్వము దేహత్వా	615

ఉ

పద్యము	పుట
ఉండెం బాండవా	940
ఉత్తమం బెద్ది	851
ఉత్తమమెయ్యది? నావుడు	506
ఉత్తరకాలంబున లోకో	1065
ఉత్తరాయణమును	845
ఉత్సవంబు మీఁద	533
ఉదయమగు సూర్యు	551
ఉదిత సమగ్ర	922
ఉపరిచరవసు వను	1008
ఉముక దినుచు	655

ఎ

పద్యము	పుట
ఎక్కుడు చాయ శుక్ల	812
ఎచటినుండి యెచటి	942
ఎచ్చోటనైన నధనుఁడు	519
ఎట్లంటేని	921
ఎన్నికొనుచుండఁ	959
ఎన్ని రూపులు గొని	902
ఎప్పుడు పురుషుండు	900
ఎలమియు వాడుట	657
ఎల్లకడలకు వెలువడు	734
ఎవ్వఁడు రమించు	856
ఎవ్వఁడు సచరాచర	594

ఏ

పద్యము	పుట
ఏకత్వం బన్యత్వ	602
ఏకద్విత్రి చతుర్వ్యూ	1057
ఏకరసమయక్షేత్ర	583
ఏకాంతిక భక్తి రతి	1012
ఏకాంతి జనంబులు	1060
ఏకాంతిక ధర్మము	1069
ఏతద్విషయంబైన	665
ఏదియుఁ దలఁప	785
ఏన కలను నాకు	964
ఏనటె! యెుక్కెడ	1084
ఏ నతీతంబులును	1025
ఏనిది యంతయు	807
ఏనుఁగులు సుట్టిరాఁ	654
ఏనుఁ గర్త ననుట	650
ఏనునుం జెప్పెద	1026
ఏనును నిట్టుల మోహ	1073
ఏను రక్షింప జయము	1044
ఏను వసిష్ఠు వచనముల	906
ఏను వేఁదుఱగుడు	511
ఏ నెట్లు ముక్తుండఁ	950
ఏమి గతి లక్ష్యభేదము	863
ఏమిట రూపగు	679
ఏమిట లోకం	855
ఏము సాధ్యులమని	851
ఏవాఁడెమ్మెయిఁ	637
ఏ విధము కాంతనైనన్	779
ఏ విధమున దుర్దశలకు	664

ఐ

పద్యము	పుట
ఐనను గాఢనిరూపణ	535

ఒ

పద్యము	పుట
ఒకటి గోరి దాని	686
ఒకఁడు గోదానమొనరింప	567
ఒక్క కొఱంతయు లేదు	981
ఒక్క మేనియంద	948
ఒక్క శృంగమునన	1038
ఒక్కొక్క కాలంబున	1019
ఒడ లెట్లు విడువ	560
ఒదవు వృత్రు రక్తమున	817
ఒరులకుఁ దా వెఱవక	737
ఒరుల పనికిగా	848
ఒరులేమేమి యొనర్చిన	749
ఒలయు జరావ్యాధి	545
ఒలసి లోభమోహములు	639

క

పద్యము	పుట
కట్టిన చీరయునుం	634
కడుపులోన నుండి	830
కదియఁగ బాఱుతెంచిన	1091
కదియుం గాష్ఠము గాష్ఠము	508
కనకమయ యూపమొప్పు	654
కనుఁ గన్నె వినుఁ జెవియై	731
కనుఁగొని యించుక సేపు	928
కనుట వినుట యాదిగా	711
కపిలదర్శన విదులగు	875
కమలగర్భు సృజించి	1018
కమలజు పంచిన క్రియ	1027
కమలభవుండు దాఁదపము	839
కరచరణాది సంఘటిత	765
కరణంబులు దొడరిన	740
కరము నియతుఁడై కొంతేసి	921
కరుణావిధేయుఁ డగు	1009

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
కర్మంబునం గానిది	718
కర్మేంద్రియంబులకు	899
కఱవుపయిఁ గఱవు	533
కలగొన రాజసతామస	1059
కలదు నానాత్వమేకత్వ	895
కలయంగ నెల్లయెడలం	600
కలవాఁడు లేనివాఁడు	766
కలిగెఁ దొల్లి భూమిగల	1006
కలిగె వినుమహంకారము	614
కలిమియును లేమియును	806
కలిమి లేమి యనఁగఁ	648
కలుగుం దోషమి యమవసఁ	579
కళలుం గాష్ఠలు లోనుగఁ	672
కాదిది విక్రమకాలము	669
కామంబుం బెడఁబాచు	714
కామ క్రోధాద్యములగు	517
కామసుఖ దివ్యసుఖములు	526
కామాదిత్యప్తుఁడై నరుఁ	961
కారణము గలిగియును	641
కారణములవలనఁ గృత	755
కారణము లేక దాపలి కను	926
కార్తవీర్య దశముఖ	1086
కార్యవిచారము చిరముగ	769
కాలంబెడలిన విద్యో	701
కాల కబళనైక శీలుఁడై	927
కాలగతి గనుట శాంతికి	674
కాలచక్రంబు నిరవధికంబు	612
కాలప్రకారం బెఱుంగుదుం	671
కాల మడగించు జను	673
కాలముల కీడు కతమున	1066
కాలముఁ బర్జన్యుండును	594
కాలములకు భూతములకు	690
కాలవిధములు భూత	690
కాలుఁజేయి మొదలుగా	952
కావున	522
కావున	724
కావునన్	811
కావునఁ గురువంశోత్తమ	770
కావునఁ బ్రకృతి యచేతన	919
కావునఁ బ్రార్థన సెఱుపం	570
కావున గుణములు ప్రకృతి	894
కావున గృహస్థ వృత్తి	828
కావున ధర్మసూక్ష్మ	1083
కావున నింద్రియ చేష్టల	912
కావున నీకే జెప్పిన	609
కావున నీవును	517
కావున నీవు ముక్తుఁడవు	950
కావున ఫలమిట్టిది	563
కావున భూతానిత్యత	651
కావున లోకసంక్షయము	802
కావున శుక్లస్థితికిం	627
కీడాడిన మేలాడుచు	853
కీడుగని యొకండు	944
కుపితుఁడగు నంతకుండు	862
కుపితుఁడగువాని వ్రతము	854
కురిసెఁ బుష్పవృష్టి	684
కురునాథ! యుపరిచర	1014
కురువంశముఖ్య యగ్గిరి	982
కృతమిది యకృతంబిది	801
కృష్ణద్వైపాయన పుత్త్రుండ	966
కృష్ణుఁడు బ్రభవిష్ణుండగు	587
కెలనికిఁ జూడఁగ దైన్యా	675
కేవల వైరాగ్యము	640
కైలాసశైల శిఖరమున	536
కొంచెపు టశనంబు	896
కొందఱు కర్మకరణ	717
కొందఱు బ్రహ్మచర్యమున	1074
కొనువారు ప్రవృత్తులు	562
కొలిచియుండు సుమంతు	984
కోపంబును లోభంబును	519
కోరికయు నొల్లమియు	979
కౌఁగిలించుకొని నీవు	1029
క్రతువులఁ దీర్థయాత్రలను	889
క్రతువులు సేతయు దేవ	670
క్రతువుసేత సేయించుట	703
క్రమమున జలపవనము	789
క్రమమున వాఙ్మయమగు	1021
క్రమమున సంధ్యలు	694
క్రమయుక్తిని శబ్ద	697
క్రియ లహంకారమునఁ	621
క్షత్త్రము బ్రహ్మమునై	1035
క్షమఁగ్రోధమకృత సంకల్పత	795
క్షమ క్రోధమునకు సంకల్ప	873
క్షమయును దమమును	852
క్షమయును సత్యంబును	624
క్షయవృద్ధులఁ జంద్రుఁడు	872
క్షరమంద్రు దానివలనను	886
క్షరమయ్యిరువది నాలుగు	887
క్షరము నక్షరంబుఁగానంగఁ	933
క్షరము నక్షరమును నసం	712
క్షరము నక్షరమును	899
క్షుద్ర జంతువులకు గురులకు	766
క్షేత్రంబన నవ్యక్తంబనం	898
క్షేత్రజ్ఞుం డనఁగ నిఖిల	542

గ

పద్యము	పుట
గంధరసాదుల కాంక్ష	794
గగనంబునఁ జనుటుడుగు	971
గగనపవన తేజో	729
గతహర్ష భయక్రోధుఁడు	705
గాడిద రూపు దాల్చి	657
గుణములకు నాదియై	599
గుణమూర్తి మాయ దానిని	582
గుణవంతుఁడు గుణ	1054
గుమ్మడిపువ్వుఁ దేనియయు	717
గురుఁడెవ్వఁడైన నగు	939
గురునకు భక్తుఁడై	546
గురుని వచనంబు తెఱఁగు	877

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
గురుభక్తి నిరతులు	682
గురుభక్తి శిష్యులకును	1082
గూఢంబులగు మదీయా	1033
గోవన మహి యది	1037
గ్రంథంబు ధరియింతు	893
ఘ	
ఘనరుషమున్ సముద్ధత	861
ఘనతర ప్రజ్ఞయను	705
ఘృతమర్చిస్సంపద యయి	1038
చ	
చంపఁగఁ జూచియు	772
చక్కఁగఁ జాఁగి మ్రొక్కుట	790
చతురాశ్రమముల వృత్త	825
చనినఁ జను నున్ననుండు	534
చలనంబు లేక జాజలి	750
చలనమేది పుట్టుఁ జావు	529
చాతకము వాన గోరెడు	1085
చాలిన నీవును హరి	1060
చిత్తశుద్ధి మాత్రఁ జేసె	717
చిరకారి యెట్లునుం దన	767
చిరముగ గర్భవాసమున	768
చుట్టము పగయను భేదం	687
చెందుచునుండుఁ బుణ్యములు	871
చెప్పిన విని జనమేజయుండు	1096
చెప్పుచున్నాఁడఁ గాలంబు	672
చెప్పెద నాకర్ణింపుము	507
చెలులుం జుట్టలును	668
చైతన్యశక్తిఁ బురుష	614
చ్యుతము లేకున్కిఁ జేసి	1038
ఛ	
ఛాగము విశసన	1013
జ	
జంతు పదములెల్ల	723
జగవతీవర! యోగస్థూల	863
జగముల కెల్ల శరణ్యుం	724
జనకజనేశ్వరు బోధించు	886
జనకభూపతి యడిగినఁ	832
జనకుండు సవినయంబుగా	974
జనకుఁడ యేనై జన్మించిన	764
జనకుఁడు దపమును	764
జనకునికడకు మాండవ్యుండు	797
జనకు విడిచి యిట్లు	995
జననజరామృత్యుభయం	936
జననము జరయును	628
జననాథ మనోధారణ	921
జననాథ! యక్షరం బెందును	888
జననికరములకుం	723
జననీ జనకారాధన	1074
జననీ వధంబు సేసిన	763
జనములను స్మృతిఁ	608
జనములు దను నవమానించి	852
జనవర! కృషిఁబశు	837
జనవర! నీ సుభాషల	956
జనవర! యసిధారావ్రత	865
జనవర! శుక్లము లోహిత	889
జనవర! సాంఖ్య మిట్టిది	878
జనవర! సౌఖ్యముం	642
జనియించిన మాత్రన	969
జనియించి విప్రుండు	702
జప ఫలమున సగమిచ్చెద	563
జపయజననిషేవ్యా	882
జరయు మరణంబు	962
జలధితరంగల చాడ్పునఁ	552
జలపవనాంబర వసుధా	967
జలపవనాంబర వసుధా	1000
జలముఁ గదిసియుండ	920
జలము పృథివికంటె	584
జలములందు నిలిచి	732
జాతుఁడు మృతుఁడగుట	845
జాపకులకు యోగులకును	573
జీవశరీరములు పృథ	1018
జీవుండుఁ బ్రకృతియు	900
జీవుఁడు మత్స్యముపేతుఁడు	1018
జీవుఁడు శుక్లచ్ఛాయా	812
జ్ఞానంబు దృష్టి నరునకుఁ	623
జ్ఞానంబు నాశ్రయించిన	781
జ్ఞానంబు వడయుటకు	706
జ్ఞానధ్యాన పరాయణు	597
జ్ఞానము యింధనముగ	630
జ్ఞానము గేవలకృప	609
జ్ఞానము ధర్మమున కధిష్ఠానము	785
జ్ఞానమునకు నగ్గుణ	620
జ్ఞానమునన కాని జన్మ	938
జ్ఞానమునన కాని మానిని	945
జ్ఞానమును గర్మమును	943
జ్ఞానము విజ్ఞానము	981
జ్ఞానయోగము కృపా	575
జ్ఞాన విజ్ఞానదృష్టి	977
జ్ఞానవిజ్ఞానములు మోక్ష	977
జ్ఞానాజ్ఞానంబులకుం	622
జ్ఞానోదయమై యుండగ	976
జ్వరకథ వినినఁ బఠించిన	822
జ్యోతి యాత్మయంద యున్నది	979
డ	
డెందమున కింద్రియములకు	578
త	
తగియెడు శిష్యుల కొసఁగె	1056
తగులువాసి షడ్వింశకత్వ	904
తత్ప్రకారం బెట్టిదనిన	696
తత్స్వభావ మెఱిఁగి	732
తదనంతరంబ యంతర్హితుం	574
తదనంతరంబ యద్దేవుం	929
తదనుష్ఠాన ప్రకారంబు	896
తదీయసల్లాప విశేషంబులు	1045

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
తనకుందా నెరవనినను	509
తనకుఁ దానబంధమొనరించు	890
తనకు నెలవరుస వచ్చిన	1078
తనకు మహితప్రసాదం	726
తన కుసుమంబులన్ ఫల	735
తన గృహంబున కతిథి	1072
తన గృహమున నభ్యాసం	848
తన తన తెరువునఁ గర్మం	760
తన తన ధర్మమున్ నడిపి	960
తనతోఁ దుల్యుండైనను	844
తనది యనక యేమి	738
తన దేహము దోషములం	872
తన పతికి భాగకల్పన	819
తనయంద తోఁచువిషయము	553
తన లోచనదీప్తుల	942
తనుఁ దనయంద నిలిపి	606
తను నెఱిఁగిన నవ్యక్తము	918
తనుయాత్రకుఁగా నశనము	779
తనువు దొఱఁగి సను	559
తను వొప్పెడునది యౌవన	946
తను సరకుసేయకిట్ల	947
తన్ను నుత్తమ మధ్యమాధమము	811
తపములును యజ్ఞములు	753
తపము సత్యంబ కన్ను	990
తమ్ము సంప్రీతిఁ గనుఁగొను	986
తలఁచు మనమందు నిశ్చయ	730
తలఁపఁగ నాయు వింతియ	868
తలఁపులు గ్రందుగఁ బొడముట	641
తల్లి ధాత్రిక బీజంబు	764
తాన సుతుఁ డగుట దెలియం	841
తాను గ్రోధాదు లెడలించుఁ	796
తాను దెగునేని బాంధవ	962
తాను బ్రకృతిఁ బ్రకృతి	920
తాను మున్న వినీతుఁడై	772
తాలిమి లేని జనంబులు	762
తెలియ మేల్కనియుండుట	633
తెలివొంది మనసు నిశ్చల	555
తెలిసికొనఁ బడయ రొరు	534
తెలుపుదురు సాంఖ్యులును	859
తెలపుమితని ననుడుఁ	1042
తేజోరూపము బ్రహ్మము	698
తేనియకుండఁ గొనుచు	923
తేరక యుండఁగ జేరుం	649
తొలి తొలి యిమ్మంత్రము	592
తొల్లిటి సచ్చారిత్రము	660
తోఁచిన నత్యంతభక్తిం	930
తోలు దిగవిడిచి నాగము	643
త్యాగమొక నెలవు	786
త్రినయనుఁడు వచ్చి	743
త్వరితము సేయక కార్యము	762

ద

పద్యము	పుట
దండముఁ గాషాయంబును	944
దక్షునకు నెఱింగించిన	1056
దనుజనాథ! యివ్విధంబునఁ	674
దమంబు సద్గుణంబుల	645
దమమునఁ గర్మేంద్రియముల	853
దమమునాఁ గల యుత్తమ	1034
దాంతుఁడు బ్రజ్ఞావంతుఁడు	651
దానం జేసి వసునామధేయుం	1007
దానగుణము శ్రద్ధలేని	759
దాన నవ్వేధ విహ్వలించి	1052
దానములఁ బుణ్యతీర్థ	846
దానాధ్యయన యజనముల	704
దానాధ్యయనాతిథి	682
దానానుష్ఠానంబు సర్వ	703
దాని కహింసయ మూలము	1057
దానికి నరవింద సంభవుం	744
దారధన మిత్రపుత్ర	839
దారాపేక్షం గష్టప్రారంభ	964
దివ్యధిషణుండగు ధిషణుం	1009
దీని నెఱిఁగించినపుడు	905
దీపమున ననేకములగు	916
దీవించి యెయ్యది సేసిన	987
దురమున జయము గొనుట	843
దురితంబులు దొడరు	833
దేవతలకు లోనుగా	970
దేవత లచ్చెరువడి	573
దేవతలను బ్రార్థించిన	789
దేవభావంబునకుఁ దగ	1006
దేవా! మోక్షార్థిజనము	590
దేవా! వైశంపాయనుండు	505
దేవా! వైశంపాయనుండు	679
దేవా! వైశంపాయనుండు	883
దేవి చిత్తమెఱింగి దేవుండు	820
దేహస్థు నదేహు నఖిల	601
దైవతమానుష తిర్య	807
దైవముఁ బిత్ర్యంబును	1047
దైవవశంబున నేఁడును	1069
దొరకొన్న ననుభవించు	798
దోష మరసి కామంబు	772
ద్వంద్వములు లేక పేర్మికి	780
ద్వారపాలు రచట వారింప	972
ద్వారములు నాల్గు మూయంగ	780
ద్వీపమునం బ్రబోధ	1061
ద్వేష్యంబుఁ బ్రియము	603

ధ

పద్యము	పుట
ధను మది యేల భోగము	965
ధనమించుకేని ధర్మం	834
ధనము కలిమియు	518
ధనము గలవాఁడు	519
ధనము చేటునవిసి	525
ధనములు బంధులు	640
ధనమేటికి? నీ విప్రుని	788
ధనయోగము దుర్లభమని	828
ధనవత్త్వము దుఃఖకరం	520
ధరణి పాదంబు లతని	810

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ధరణి మొదలయిన	584
ధరణివల్లభ! చిత్త	915
ధరణీసురు నాస	1084
ధరణీసురుఁడును జప	558
ధర్మంబు తెఱంగిట్టిదని	748
ధర్మంబు తెఱంగు సూక్ష్మం	748
ధర్మంబుఁ బరిజ్ఞానము	908
ధర్మనిత్యుండు సత్య	1072
ధర్మ మధర్మము వోలె	705
ధర్మయమాదులను	571
ధర్మలబ్ధమైన ధనము	836
ధర్మసందేహములు నీవు	1066
ధర్మాధర్మంబులును	993
ధర్మారాముఁడు సంతత	755
ధీరుఁడై యభేద దృష్టి	850
ధూతపాపుఁడైన పూతాత్మకుం	704
ధృతి యారోగ్యము నొసగు	665
ధృతి లేమింగాదె మహాభి	909
ధైర్యంబునఁ వీర్యంబున	663
ధ్యానయోగ నిశ్చలము	581
ధ్యానైక తత్పరాత్ముఁడు	922
ధ్రువమండలమున	925

న

పద్యము	పుట
నగము లెల్లఁ బుణ్య	755
నగ్నులై యప్సర స్త్రీజనం	998
నదిరయము వారణేందుఁ	862
ననుఁ గానఁ బడయ రెవ్వరు	1016
నను డాఁప నేల దానం	955
నను నెవ్వరాశ్రయించిన	790
ననుబోఁటికిఁ బశుయజ్ఞం	801
నను మఱవక పనుపం	1093
నన్నాఱులు మున్నాఱులు	694
నయనముఖపాణిపాద	886
నరనాథ! యమృతమగు	803
నరనాథ! యుగ్రసేనుఁడు	688
నరనాథ! యుత్క్రమణ	924
నరనాథ! సుఖము దుఃఖము	509
నరనాయక! శిశ్నోదర	849
నరనారాయణులనఁగాఁ	1042
నరనారీ సంబంధము	892
నరసుత! వినుమీ సప్త	697
నరవర దానముఁ	532
నరుఁడు నారాయణుండు	1033
నరుఁడు నారాయణుండు	1039
నరుఁడు సుఖదుఃఖముల	643
నరుల నెలలు నేఁడులుఁ	692
నా కలిమితోడ నిచ్చెద	561
నాకు నా తపంబునకు	768
నాకు నీకు నేల నాకేశ	669
నాకుఁ బ్రజగతి నిచ్చు	516
నాకోర్కి పిదపఁ జెప్పెద	1088
నాకెఱిఁగింపవే వీనికిఁ	1061
నా చరితంబులు ద్రిలో	1065
నానారూపంబుల నిట్లేను	1044
నానా శాస్త్రంబుల నర్థా	823
నా పంపునను బ్రవృత్తి	1027
నా మనంబు సందియంబుఁ	782
నారచీరయేనిఁ జారు	529
నారద పర్వత దేవల	835
నారదుం డట్లు విష్ణుని	1021
నారదుఁడు పరమపురుషు	1045
నారదుఁడు వచ్చి నరునిన్	1045
నారదుఁడు వచ్చి ప్రీతిం	987
నారదుని వచనములు	988
నారము లనఁగా జలముల	1033
నారాయణప్రణీతంబై	880
నారాయణప్రసాదంబు	1025
నారాయణీయమగు	1070
నాలుగింటను వెండియు	595
నా వలని రాగమునవే	946
నావుడు నల్లనగుచు	821
నిక్కంబునకు నెవ్వరు	948
నిక్కమ కాలంబు నీకు	514
నిఖిల జనశ్రోత్రసుఖ	954
నిగమవేద్య మద్వంద్వంబు	1042
నిజనామ నిర్వచనము	1068
నిత్యతృప్తి శౌచనిరతి	530
నిత్యతృప్తుఁడైన సత్య	754
నిను డాఁచి కుటిలభావం	946
నిను నెఱుఁగకున్న	600
నిను నెవ్వఁ డెఱిఁగె	1043
నిను నే గెలుచుట	668
నిన్ను నెప్పుడుఁ దలఁచెద	606
నియమాచరణ కృశం	941
నిర్మలమగు నేకాంతిక	1056
నిశ్చేతనయును నెంత	902
నీ కడుపున జన్మించుట	831
నీ మూలంబే నెఱిఁగితిఁ	523
నీ యట్టి భార్యగలుగుటఁ	1086
నీ వట్టిఁడ వగు టెఱుఁగవు	981
నీ వడిగి తేను నిచ్చితి	564
నీవలనన కలిగి కురు	1065
నీ వాసపఱుప ధనములు	524
నీ వినిన యుపాఖ్యానము	1022
నీవు కల్యాణమూర్తివి	1088
నీవు గృహధర్మ పరత	953
నీవు నిట్టుల చేయు	1022
నీవు నీయందు నినుఁగను	949
నీవు మును హీనుఁడగుట	667
నుతియు నమస్కృతియు	719
నురువున నొనరించిన	958
నృపధర్మ వైశ్యధర్మము	837
నృప నీవు మదీయం	568
నెట్టన చూడమి నయ్యెడు	937
నేతికుండ మోచి యే	864
నేలయెల్లను నేలిన	828
నైమిశారణ్యమున	1075

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
న్యాయంబులు ధర్మంబులు	695
న్యాయమున సంగరంబుం	844
న్యాయాద్యనేక తంత్రము	613

ప

పద్యము	పుట
పంచశిఖుండను పరమ	942
పడయరాని యాయు వొడలి	833
పడసి తద్దేవుఁ గానఁ	1047
పడినం బాఱినఁ గైదువు	844
పడియెడు దుఃఖము	849
పద్మభవముఖబాహూరు	840
పద్ముఁడను పేరి యన్నాగ	1075
పరతత్త్వోపాసన	738
పరమ బ్రహ్మపదము	710
పరమబ్రహ్మము భూతో	700
పరమమునీంద్ర సంయమన	676
పరమర్మ భేదులును	852
పరమవరద లోక	1036
పరమ సుఖము దృష్ణ	510
పరమాత్ముని నారాయణుఁ	606
పరముండు నిరంజనుఁడ	1090
పరము నక్షరు విష్ణుని	590
పరితాప మనభితోషము	641
పరిపాటిఁ గర్మ మెడలఁగ	739
పరిహాసము భాషణమును	624
పర్వములయందు విప్ర	818
పలుకఁ డసత్యము	779
పలుకక యుండు కంటె	854
పలుకు వడినతనిఁ	854
పవనం బేకము ప్రాణా	870
పాండవవంశవర్య	1048
పాణి యుపస్థం బుదరము	778
పాతాళమునకుఁ జని	1053
పాదపాయూపస్థపాణి	914
పాదములకుం బ్రణమిల్లి	612
పాపకర్మంబు లెల్లను	824

పద్యము	పుట
పాపక్షయమున బోధం	581
పాప మించుక దొడరిన	836
పామెఱుగుఁ బాముకాళులు	579
పింగళయను వేశ్య దన	511
పిచ్చికలు గూఁడు శిరమునఁ	752
పిలిచిన నా సర్వగతుండు	998
పుచ్చికొనఁడు ముందట	779
పుట్టి దక్షిణాభిముఖియై	744
పుత్ర! వినుము నవద్వార	615
పుత్త్రదార బంధుమిత్త్ర	992
పునరావర్తన రహితుం	877
పురము శరీరంబు	741
పురుషుం డేమిటఁ బాపా	793
పురుషుఁడు చైతన్యాత్ముఁడు	917
పురుషుఁడును నంగనయు	746
పురుషున కవ్యక్తపరి	935
పురుషుని కల రూపెఱిఁగెడు	919
పురుషుని నవ్యక్తము	933
పురుషుని నింద్రియంబు	876
పురుషుని వలన	897
పురుషు లఖిలభూతముల	623
పురుషోత్తమ షడ్వింశక	933
పురుషోత్తముండుఁ బురుషుఁడు	937
పురహూతున కభిముఖియై	681
పులుగులలోఁ బూత్యండక	533
పూజారూపంబున నిచ్చిన	562
పొంతకు వచ్చినవాని	511
పొందు సత్త్వ రజ	617
పొరి బొరి భూతముల	738
పొరి నర్థంబు	656
పౌరుషంబు సూవె ఫలద	699
ప్రకృతికి నాకును నుదకము	901
ప్రకృతికిని గుణములు	917
ప్రకృతి గుణంబులఁగాని	901
ప్రకృతి దనయిచ్చఁ గ్రీడా	916

పద్యము	పుట
ప్రకృతి దొఱఁగి తన్నుఁ	903
ప్రకృతి దొఱఁగి తన్న	936
ప్రకృతి పదాఱు	869
ప్రకృతి పురుషునిఁ గానదు	935
ప్రకృతి యలింగ తజ్జనిత	894
ప్రకృతి వాదులవ్యక్తంబు	897
ప్రకృతియు, బుద్ధ్యహం	601
ప్రకృతి సేసెనె యీ యపరాధ	901
ప్రజ యేనా కాన నన్నుం	802
ప్రజల హరియించుటిది	745
ప్రజలు దల్లిఁ జెందు పగిది	777
ప్రజ్ఞయ ప్రతిష్ఠలాభము	531
ప్రణవ పూర్వకమగు	591
ప్రత్యక్షహేతు	859
ప్రమద మొన	995
ప్రసన్నైకా	935
ప్రళయకాలంబున	1051
ప్రళయప్రకారంబు	913
ప్రాకృతజనుల	958
ప్రాజ్ఞుఁడు రమించు	857
ప్రాణాయామము గ్రమమునఁ	921
ప్రియములు నప్రియములును	507
ప్రియములు నప్రియములును	639
ప్రీతిం గడుఁ బొదలు విషాద	731
ప్రీతిగ నధ్యాత్మమునధి	913

ఫ

పద్యము	పుట
ఫలకాంక్షి గాక నియతిం	547
ఫలములు గోరక కర్మం	601

బ

పద్యము	పుట
బంధనంబులలో నెల్లఁ	737
బలమును నొప్పు బుద్ధియు	656
బలితపు టురిఁ గామంబున	961
బలి ప్రహ్లాద	531
బహువిధ ధర్మంబులు	1050

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
బాలభాను బింబంబు	680
బాలుఁడైనఁ గొడుకు	766
బిసరుహపత్రలగ్న	953
బుధుఁడు సూక్ష్మవిమల	542
బుద్ధికి మహత్తను	614
బుద్ధిఁగొని మనంబు వోనీక	629
బుద్ధిమంతుల తెరువునఁ	959
బుద్ధి యధ్యాత్మ మనఁ జను	915
బుద్ధియు ధృతియును	683
బుద్ధియును బ్రాణమును నిన్నుఁ	605
బోధనస్థాపనంబులు	1035
బ్రహ్మచర్య మహింస	635
బ్రహ్మచర్యసమేత తపంబు	719
బ్రహ్మచర్యాదులగు నాల్గు	784
బ్రహ్మరంధ్ర నిర్గతుఁడైన	573
బ్రహ్మహత్య దన్నుఁ బట్టిన	816
బ్రాహ్మణత్వంబు గడు	961
బ్రాహ్మణ ప్రార్థితము	908
బ్రాహ్మణివి యోగినివి	945
బ్రాహ్మణునకుఁ బ్రధాన	709

భ

పద్యము	పుట
భక్తి గలవు నాకుఁ బ్రజ్ఞాన	612
భక్తితోడ నన్నాగేంద్రుపత్ని	1077
భక్తి వీడ్కొని చని ముని	1021
భక్తుఁడగు బ్రాహ్మణునకు	985
భవదీయ వాక్యవైదగ్ధ్యం	948
భావములు నిజస్వభావం	650
భీమనాదుండు భీమ	747
భీరుఁడు శూరుఁడు జడుఁడు	515
భూతంబులఁ బచరించుచు	728
భూతంబుల దర్శింపమి	991
భూతజాలంబుతో	613
భూతతారతమ్యంబులు	708
భూతదయయు న హంకారాన	783
భూతములను గుణంబుల	877
భూతముల పుట్టుఁ జేష్టయుఁ	827
భూతము లవ్యక్తంబున	616
భూతంబులు నింద్రియ	845
భూతాత్మకమైన యఖిల	1017
భూమిజయము దొడఁగి	707
భూమి మొదలుగఁ గల	620
భూముఖ్యంబగు భూత	541
భూవర! నాకుం జూడంగా	842
భూసురవర! వేదము	928
భేరీ శంఖాదిక నానా	923
భోగంబుఁ దపముఁ బొరిఁబొరి	863
భోగములు సంపరిత్యక్త	964
భోగివర! యిది యిట్టిద	1095

మ

పద్యము	పుట
మంకినాఁ బరగు బ్రాహ్మణుఁడు	521
మగువా! దుఃఖము	944
మణిమయములుఁ గనక	583
మతిగల సాంఖ్యులు	598
మత్సరాది చిత్తమాలిన్యములు	760
మదీయనామ నిర్వచనం	1044
మన మధ్యాత్మము దానికి	914
మనమునకు సుఖము	522
మనమున నెద్దియుఁ గోరం	783
మనము ముక్తులము గాకున్న	954
మనసు గొని మనసు	586
మనసు చేతివ యింద్రియ	912
మనసు నింద్రియములఁ	726
మనసును నింద్రియములనుం	715
మనసు నియమింప భూతా	711
మనసును వాక్కును గాయం	628
మనసును వాక్కును రక్షం	854
మన సేకాగ్రతఁ బొంద	715
మనుజుల హరించి బాంధవ	744
మను విక్ష్వాకున కొసఁగె	1056
మమతంగాదే బహు	902
మరీచి యంగిరసుం	1027
మరీచియు నత్రియు నంగి	588
మఱియు నిత్తెఱంగు	880
మఱియు నెవ్విధంబు	1032
మఱియు నొక్కతెఱంగు	715
మఱియు నొక్క విశేషంబు	746
మఱునాఁ డజ్జనపతి	957
మఱునాఁ డమ్మహీపాలుండు	975
మలమూత్రంబుల కాలం	896
మహనీయ తపమున	928
మాతోడ నిట్లనియె	1063
మా నయనంబులు దత్తేజో	1011
మానవపతి సత్తమ!	938
మానవులకుఁ దలపఁగ	845
మానితముని యొకఁడు	611
మానుషజన్మము మేలతి	846
మానుషము దుర్లభము	963
మాయాశబలుండై యటు	729
మారుతముతో సమాన	982
మిత్రత్వము శత్రుత్వముఁ	769
మిత్రులు భార్యలు భ్రాతలుఁ	850
మీకును ధర్మవిరోధము	1080
మీరలిత్తెఱంగున కనుజ్ఞ	1080
మీ వచ్చినపని యెఱుఁగుదు	1026
ముక్కు వ్రాలుట కర్ణముల్	926
ముక్తుల ములుకులఁ గలయుట	954
మునిగోష్ఠివలని కొఱఁత	934
మునిజన వినుత చరిత్రా	589
మునివర! ధర్మదేవత	756
మునివరుఁడు గంధవతి	1049
మునుల ఋణ	834
మునులవలన దత్త్వం	760
మునులును సురలును	1022
మునులును సురలును	1029
మూఁడు పదులు ముహూర్తముల్	691
మూత్రమునఁ బురీషమున	621

పద్యము	పుట
మృగపక్షి సమూహము	969
మేలర్థింపను గీడున	528
మేలు గీడుమ నరుఁ బొందు	663
మేలొనరింపగ దొరకొను	811
మైత్రిం బోలెడు ధర్మము	710
మొదలఁ గలిగించి జగము	1030
మౌనమున దృఢజ్ఞానము	1085
య	
యక్షవరునితోడ	788
యజ్ఞధరుడు పంచయజ్ఞుడు	596
యజ్ఞపరుడు రక్షకుఁడు	836
యజ్ఞార్థమొక్క బ్రాహ్మణుఁడు	787
యాగంబునందు శ్రద్ధా	758
యోగంబుఁ దపంబు	802
యోగతంత్రంబు సకల	867
యోగనిరూఢుఁడు	866
యోగబలము లేని యొక	861
యోగసాంఖ్యసిద్ధి నొంది	929
యోగి చూచు	879
యోగి యెట్టి యాహారంబు	864
యోగులకు యోగబలమున	860
యోగులును సాంఖ్యులును	878
ర	
రజతాచలంబున రత్న	819
రథికునకుఁ గలమరికి	864
రవిబింబము రాహువు	579
రవి సృజియించును వర్ష	1089
రసకర్మజ్ఞుఁడు దారము	811
రసగంధప్రముఖంబుల	720
రాగపరిలిప్తమానస	623
రాగిత్వము విడువదు	1066
రాజభావంబు తొడుసునఁ	805
రాజునకు ధర్మము	837
రాజులకు యుద్ధంబు	564
రాజోచిత ధర్మంబు	506
రుద్రనారాయణరూప	1041
రూపవిభవముల నప్సరో	974
రోషముఁ గామము రాగ	600
ల	
లలితాక్షతముల గుసుమం	973
లావును దృష్టియు గతియు	1052
లీలాస్వీకృతచక్రశూల	881
లేవు భయలోకములు	1049
లోకంబంతయు నెవ్వ	597
లోకంబెల్లను నేఁ జిత్రాకార	753
లోకము కాలముచే నిట్లాకుల	963
లోకము చందము గనికొని	520
లోక మెల్లను నఱచేతిలో	675
లోకేశ! నీవుధర్మ	1004
లోకోచ్ఛేదముఁ గర్మ	977
వ	
వచ్చిన సంభ్రమంబు	1081
వచ్చి పోయి చూచువాఁడు	765
వచ్చి యభిపూజితుండై	809
వచ్చి రుద్రునకుం బ్రణమిల్లి	1041
వచ్చునప్పు డెయ్యెడనే	772
వధము ధర్మంబుగా బుధులు	771
వనితకుఁ బురుషునకుం	891
వనితగుణంబులు	891
వనితల పురుషులయెడ	953
వనితా చందనమున	943
వరధర్మము నర్థంబును	840
వరబహునుత వేదవ్యాస	1098
వరుసఁ గృత త్రేతా	695
వరుసదినంబులు దీఱిన	1080
వరుసన ధరణీ	707
వర్గత్రయంబున వలనను	950
వఱదఁగాష్ఠముల్	527
వల యురి యోదము	578
వసియింతు నే జగముల	1033
వాఁడును మత్ప్రభావంబు	1000
వాకును మనసును	635
వాఙ్మనః కాయములు	628
వానప్రస్థ ప్రక్రియ	722
వానిం జెప్పెద నవహితుండ	826
వానికి మూఁడాశ్రమ	978
వాయువు చేష్టారూపము	539
వాయువుల నియత	572
వారక వడ్డికిచ్చి కుడువన్	759
వారల కథ మా తండ్రికి	1005
వారలకుఁ జూపు నిజ	1010
వారలకు వేదవిహితా	775
వారలు ముక్తులు గామి	951
వారికిఁ బ్రవృత్తిలక్షణ	1059
వారి కిట్లనియె నిష్ఠా	804
వాసవునకును బలికి	653
వాసుదేవుండు ప్రథమంబు	1057
వికసిత తృష్ణాలతికకు	636
వికృతులందును	1059
వికృతులు మహదాదిక	615
విడువరాదు దుర్మతు	798
విదితము గర్భాధానము	778
విద్వన్మోదవిధాయి	1050
విద్యయనఁగఁ బంచ	899
వినఁ జూడం బడునందె	979
వినయము విద్యయుం	712
విని నిద్రాదోషంబున	630
విని పార్థుఁ డిట్లు గలిగిన	1040
విని భరద్వాజుండు	538
వినుఁ డష్టమమగు	1080
వినుఁడెల్లవారు దుర్గం	985
విను! కామముఁ గ్రోధము	872
విను కుసుమంబుల	812
విను కేవలుఁడగు జీవుఁడు	904

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
విను కైటభుండు నా	1052
విను! గర్భవాస దుఃఖం	871
విను గుడిలో నున్న	926
విను గుణములు	554
విను చంపఁ దగిన	772
వినుటకును గనుట	911
వినుఁ డెల్లవారు	985
విను తత్ప్రసాద	727
వినుతమగు లోక	1039
వినుత జ్ఞానాభ్యాసం	631
వినుతించిన నిందించిన	686
విను తెవు లుడుపఁగ	619
విను తొల్లి ధర్మవర్తనము	838
విను తృష్ణారాహిత్యంబున	784
విను దారపుత్రమిత్రులు	964
విను దేవతా ప్రసాదం	629
విను దుఃఖంబులుఁ దెగ	546
విను దృశ్యంబు నదృశ్యం	903
విను నవద్వారపురమున	713
విను నారాయణవరములు	1055
విను నృప! హర్షంబు	641
విను పర్యాయంబున	667
విను పశుయజ్ఞము	516
విను పాంసూదకముల	948
వినుపించునది యను	608
విను పురుషున కింద్రియ	577
విను ప్రవృత్తి కర్మ	717
విను బీజంబున బీజంబును	893
విను భావాభావంబులు	673
విను మంచివారిచే	756
విను మంతర్నాడిం జన	555
విను మందు నొక విశేషం	711
విను మందు మనుము	995
విను మకంపనుఁడను	742
విను మచిరవృత్తిఁ జేసిన	770
విను! మజుఁడు శ్రద్ధ	758

పద్యము	పుట
విను మజ్ఞానంబున	939
విను మజ్ఞునకును	776
వినుమత్యాశ్చర్య	1091
విను మధర్మం బహింస	993
విను మనఘ! యింక	808
విను మని ముని యిట్టులను	720
విను మనేక విధంబుల	506
విను మమకార వివర్జిత	549
విను మరిష్ట నేమియను	826
విను మర్త్వుఁడగు ననర్త్వం	835
విను మలసుండును	825
విను మవిద్య గామము	639
విను మవ్యయుఁడు	1003
విను మహంకార జయము	707
వినుమహంకారమా	887
విను! మహన్మనో	697
విను మహింస విప్ర	773
విను మాంసశోణిత	959
విను మాంసాస్థిమయం	624
విను మాచార్యులు నూర్వురు	637
విను! మాత్మతీర్థ సంసే	725
విను మాత్ముఁడు క్షేత్రజ్ఞం	553
విను మానస ప్రసన్నత	580
విను మాయావిధమిట్టిది	582
విను మాఱుంచులు	725
విను మాశావిచ్ఛేదన	1084
విను మింద్రియ సహితము	876
విను మిచ్ఛేదనని	564
విను మీ తంత్రంబుల	1062
వినుమీ సంహరణం	701
వినుము ఘటము సేయుట	795
వినుము జీవావస్థలు	810
వినుము దనుజనాథ	809
వినుము దేహాభిమానికి	619
వినుము నృప సత్త్వమును	582
వినుము నిమేషంబులు	691

పద్యము	పుట
విను మునివర! వాగ్వృత్తి	758
వినుము నివాత స్థానం	727
విను ముపనీతుఁడై	976
వినుము ప్రకృతి పురుషుల	892
వినుము ప్రతిగ్రహంబును	842
వినుము పురాతన జన్మం	510
వినుము బ్రహ్మోదితంబు	634
వినుము! మృణాళంబున	848
వినుము యోగమథనమున	616
వినుము వినుతస్వర	929
వినుము విప్రకామార్థ	646
వినుము శ్రద్ధ గలుగు	759
వినుము సకలలోక	910
వినుము సత్త్వాది గుణముల	642
వినుము సుమతి	847
విను మూర్ణనాభి తంతువు	732
విను మెఱుక గలర	781
విను మేకాంతికుఁ డెవ్వని	1017
విను మైదింద్రియములకును	729
విను మొక్క కారణంబున	763
విను మోక్షము గార్హస్థ్యం	777
విను మోహబీజ	740
విను యోగంబు హిరణ్యం	1039
విను యోగివరుఁ డరిష్టము	927
విను! రేఖామాత్రపు	718
విను! లోభము సంతోషం	839
విను విధికృత్యము	651
విను విప్రశరీరము	961
విను విష్ణుని సంస్పర్శం	815
విను వీతకల్మషున	591
విను వేదవేద్యము	932
విను శాంతులైన విప్రులు	784
విను శూన్యస్థానంబున	952
విను సంసృతి మృత్యువు	515
విను సత్త్వరజస్తమముల	634
విను సత్త్వరజస్తమముల	888

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
విను సర్వభూతముల	824
విను సాంఖ్యమ్మును యోగము	879
విను సాంఖ్యసమజ్ఞానం	920
విను సాత్త్వికములు	621
విను సుమతి విషయముల	847
విప్రుఁ డేమిట దేవత్వ	857
విబుధుల పంద్రెండు	692
విమలాత్ముఁడు పారాశర్య	1024
విముఖుం డగుటయు	866
విలయం బింద్రియము	631
విలుచుట నమ్మట	752
విష్ణు బహువిధముల	1052
వీడ్కొని చని జగతిఁ జరియించి	654
వీరు పెద్దవారు వీరలు విననిట్టి	952
వృద్ధకళత్రంబు బుద్ధి	827
వెడపనికి నాలిఁ జంప	767
వెడలుమని తెరువు సూపిన	830
వెనుక నరుగుచున్న	998
వెలుఁగుచుండెడి దీపంబు	576
వేఁట వేడుక నడవికి	907
వేగిన నామంత్రితుఁడై	1077
వేదంబులకుం బ్రవర్తకుండు	1062
వేదతాత్పర్య మారసి	785
వేద మాచారములఁ జెప్పు	750
వేదములవలన నాకు	774
వేదములుఁ దదంగములు	737
వేదములు డాంబికత్వా	774
వేదములు సాంఖ్యమును	1060
వేదవిదుండగు విప్ర	513
వేదవేదాంగ సంవేది	558
వేదవ్యాసుడ! రమ్మని	1064
వేదవ్యాసుడు సుముఖత	1068
వేదశాస్త్ర పురాణ	878
వేదశాస్త్ర సరణి విడుచు	782
వేదసారంబు సత్యంబు	853
వేదాంతవిదు లనుమోదించు	556
వేదాంతవిదుఁడు దుర్లభు	618
వేదాదులైన పథముల	1069
వేదాధ్యయనంబుఁ దదంగా	825
వేదితవ్యంబన విదితంబు	786
వైష్ణవియుఁ గల్మష	607
వ్యక్త మవ్యక్తమను	633
వ్యక్తమునకుఁ బ్రభవం	596
వ్యక్త సప్తధార మవ్యక్త	617
వ్యాపకుఁడు స్రష్ట బ్రహ్మ	698
వ్యాపించి రోదసీకుహరా	1033
వ్యాసమునినాథు	1002
వ్రేఁగు పెద్దైనవోడ వారిధి	849
శ	
శతమఖ కమలావాసా	684
శత్రుజనులు చెఱుచుట	649
శమనిరతియు నాత్మ	733
శమము దమము లేమి	843
శమసంపద బ్రాహ్మణ	733
శాంతము ధర్మప్రచయం	736
శాంతి పరినిష్ఠునకు	1058
శాంతిమంతులైన సౌమ్యుల	685
శాంతుఁడ వగు మని	658
శాకకణ మూలఫల	629
శారీర మానసములగు	545
శారీరస్థితికిఁ బ్రథమ	625
శాస్త్రతత్త్వ మెఱుంగక	822
శిరమున నర్ఘ్యపాత్ర	973
శిరమును నాభియు	864
శివకరము దపము	699
శివమును బరమబ్రహ్మము	905
శివుఁడవు నీవు జగములకు	1041
శిశ్నము నుదరమును	714
శుక్లమునకు మనసు	627
శూల ముగ్రతనెత్తి	830
శైలాదులయందు నిట్లు	540
శోకప్రమదాది ద్వంద్వా	798
శోకశ్రమ తృష్ణలకున్	524
శౌచమక్రోధంబు సంతోష	645
శౌచాదిగుణము లెడలుట	557
శౌర్యమువనొ వృద్ధ	666
శ్రద్ధయును బలంబు	570
శ్రద్ధ ఋషితనయ!	757
శ్రమమున నింద్రియములు	632
శ్రీ కరణనిపుణ	679
శ్రీయును భూతియు	659
శ్రీవత్సము శూలాంకిత	1043
శ్రీశ్రితవక్షస్థల	505
శ్రీసంధాన ప్రౌఢదయా	883
శ్రుతము నాచారంబు	688
శ్రుతిపరతయు గురు	1004
శ్రోతకుఁ దనకుం	947
శ్వేతద్వీపంబునకుం	1011
శ్వేతద్వీపంబున భవ	1046
శ్వేతులు నింద్రియ	1046
స	
సంతోషంబున నేగతి	785
సంతోషామృత సుఖిత	784
సంపద లేమికి మది	648
సంప్రమోదమందు	994
సంప్రీతుండై సముచిత	1081
సంప్రీతుండై సవిశేష	1004
సకల జంగమస్థావర	999
సకల దుఃఖభేషజం	614
సకల భూతంబులకును	663
సకల రత్నపూర్ణ సర్వ	727
సకల లోకములను	949
సగుణం బగుణంబగునే	919
సజ్జనులం దురాచార	550
సత్త్వగుణంబులు	916
సత్త్వమార్గాభిరతి	978

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
సత్త్వమునమండి	1037	సిత రక్తపీత నీలము	544	స్వస్థతయు దుఃస్థతయు	730
సత్త్వరజస్తమోగుణ	888	సిరిఁ బాసియును నొక్క	662	స్థావరములు జంగమములు	594
సత్త్వరజస్తమోగుణ	917	సుజనసంగతి కర్తవ్య	835	స్థావరముల జంగమముల	712
సత్త్వక్షమాదమంబులు	855	సుత! నీవు సుప్రసన్నా	736	స్థావరములు జంగమములు	700
సత్య ధర్మపరుండవగుటం	682	సుత! విను శబ్దబ్రహ్మము	716	స్థూలభంగులు	625
సత్యమ తపము	565	సురయక్ష గంధర్వ	1092	స్నానకాలం బయ్యెనని	990
సత్యమ బ్రహ్మము	544	సురతంబు గుప్తమగు	551	స్వాధ్యాయంబు దపంబు	699
సత్పాత్ర దానక్రియ	567	సురపితృ పూజల	607	స్వాపావస్థం బ్రకృతి	632
సదయమనీషఁ బంచ	951	సురమకుట ఘటితరత్న	881	స్వామీ కోపంబు	820
సదోపవాసియు సదా	646	సురమునిసిద్ధ గణంబు	1000	స్త్రీ పున్నపుంసకత్వము	576
సన్నిధిసేసి తపము	745	సురలార్చిరి తూర్యం	815	స్రోతోవేగము పటుగతి	862
సమదర్శియై యఖిల	834	సురలు మునులు భయ	820		
సమదృష్టిని జాయియు	716	సురసంయమి గరుడోరగ	698	**హ**	
సమయంబైనను గుసుమ	534	సురసరిదాత్మజుతో	761	హయ శిరోభాసితుండును	1029
సరకు సేయవను చసడ్డ	667	సులభమొ దుర్లభంబొ	525	హరియం దేనును	605
సరసాన్నము పిణ్యాకము	528	సులభానామము సంసృతి	957	హరియాత్మ యెల్లవారికి	1049
సర్వజ్ఞుఁడగు పరాశర	1031	సులభాభిధానయగు	941	హరిసత్త్వాది గుణంబులు	1054
సరిపెంపునఁ గడు	670	సూర్యువలనన బీజంబు	1090	హరునకు మ్రొక్కి మీ	816
సర్వ వర్ణాశ్రమములకు	644	సృష్టి తెఱంగు మున్నెటిం	700	హర్షంబును మానంబు	686
సర్వసంకల్ప రహితుఁడై	726	సొమ్ము గోరిన యంతన	524	హస్తిమశకాంతరము	548
సవినయంబునఁ దన	721	సోమార్కాగ్నిమయము	599	హింస లేక యునికి	992
సాంఖ్యయోగ పరమ	1055	స్పర్ధ సద్ధర్మమునకు	757	హిమవన్నగంబు	1063
సాత్యవతేయుఁడీ పరమ	1023	స్మృతియు సంప్రీతి	620	హీనస్థానమున	666
సాదరవృత్తి సాధ్యుల	858	స్వజనంబులచేత	1087	హృదయవేదిక	724
సారమతిఁ బరికింపంగ	522	స్వతంత్రవై నీవు చేసిన	946	హేతురహితుఁడవు	603

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 14

ఆనుశాసనిక పర్వము

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు

డా॥ శలాక రఘునాథశర్మ

శ్రీ ముదివర్తి కొండమాచార్యులు

డా॥ యం.కులశేఖరరావు

ప్రధానసంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Anusasanika parvamu of Tikkana Somayaji
Vol. XIV.

Commentary by
Dr. Tummapudi Koteswara Rao - 1,2 Cantos
Dr. Salaka Raghunatha Sarma - 3,4 Cantos
Sri Mudivarthi Kondamacharyulu, Dr. M. Kulasekhara Rao - 5th Canto

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Series No.613
First Edition : August 2006

Second Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D. Tirupati.

Cover Design:

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నందూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

ఆంధ్రమహాభారతంలో ఆనుశాసనిక పర్వం పదమూడవ పర్వం. ఇది మహాభారతవ్యాఖ్యానసంపుటాల్లో పదునాల్గవది. శాంతి పర్వంలో కథా వస్తువు ధర్మ వివేచన. అది ఈ పర్వంలోను ధారావాహికంగా ముందుకు సాగుతుంది. భీష్ముడు కురుక్షేత్ర సంగ్రామంలో పదిరోజులు చెలరేగి శత్రుసంహారం చేసి, ఆవల శరతల్పమున పవళించి శరీరత్యాగానికి ఉత్తరాయణ పుణ్యకాలానికై ఎదురుచూస్తూ తాను అవగాహన చేసుకొనిన ధర్మసూక్ష్మాలను ముందుతరం వారికై ధర్మరాజుకు ఉపదేశం చేయడం ఈ పర్వంలోని వృత్తాంతం. ఇది అయిదు ఆశ్వాసాలలో సాగిన కథనం అనడం కంటే ధర్మవిశ్లేషణ, ధర్మ సూక్ష్మ వివరణలకు ఆకరం అనడం బాగుంటుంది. ఈ పర్వంలో కథా కథనం కంటే ప్రశ్న ప్రతివచనాల మూలంగా పలు ధార్మిక విషయాలు తేటతెల్లంగా తెలుపబడ్డాయి.

ఈ ఆనుశాసనిక పర్వంలోని ఐదు ఆశ్వాసాలకు వ్యాఖ్యాతలు నలుగురు. వీరు తిక్కన హృదయాన్ని ఆకళింపు చేసుకొన్న పెద్దలే. డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు, డా॥ శలాక రఘునాథశర్మ, డా॥ ఎమ్. కులశేఖరరావు, శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యుల వారు – వీరంతా ఎంతో ప్రతిభాపాటవాలతో కూడిన పాండిత్య ప్రకర్షతో ఈ పర్వానికి వ్యాఖ్యానాన్ని సమకూర్చారు. దేవస్థానం తరపున వీరికి అభినందనలు తెలుపుతున్నాను. ఈ సంపుటానికి ప్రధాన సంపాదకులు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు. వీరికి మా శుభాభినందనలు.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీవేంకటేశ్వరస్వామి వారి దివ్యానుగ్రహంతో తిరమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమ స్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం – ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో – అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు – రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 –' 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి – ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) – అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' – అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నందూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జులై 11వ తేదీన హైదరాబాదు బాలాజీభవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ – భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అర సున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట– ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో – సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయతల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్లవేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను."

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి– వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్వురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్లవేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో – 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ" కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిక్రమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశా స్త్రి గారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగా పర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము – మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీమధునాపంతుల సత్యనారాయణశా స్త్రిగారి గృహంలో 1991 జులై 3వ తేదీన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డి గారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక"ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యవంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం– అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥కె. సర్వోత్తమరావు	**శ్రీడి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥ రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాత్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు – వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన – కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిని అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉట్టంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జులై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీడి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య – ఆ యా రచయితలు వ్రాసి పంపనందున – దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్న భిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం – సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీస్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలో ని ప్రచురణల విభాగం (Publications Wing) లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్లకొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పండ్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులుబాటు కల్పించుకోవచ్చు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి, విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి".

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాష్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదక మండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) – అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

సంపాదకమండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు	**శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు**
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య	**డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య**
డా॥ కె.జె. కృష్ణమూర్తి	**డా॥ కే. సర్వోత్తమరావు**

సలహామండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే.	**డా॥ బిరుదురాజు రామరాజు**
అన్నమాచార్యప్రాజెక్ట్ డైరెక్టర్, తి.తి.దే.	**డా॥ ఎం. కులశేఖరరావు**
ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి, తి.తి.దే.	**డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు**
	డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలుల లోని సభ్యులయొక్క సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటాలన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్త పాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ప్రథమ సంపుటం– ఆదిపర్వం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(రెండు భాగాలు), ద్వితీయ సంపుటం – సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి.సుబ్బారావుగారి తరువాత కార్యనిర్వహణాధికారి అయిన డా॥ పి.కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్., గారు వచ్చిన తత్క్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణ ప్రణాళికను ఆసక్తితో గమనిస్తూ అన్ని విధాల సహకరించి ఆది, సభా పర్వాల విడుదలకు ఏర్పాటు చేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాల నిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ ప్రణాళిక వ్యాఖ్యా సహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. అప్పట్లో తీవ్రతరం అయిన ప్రయత్నంతో గోదావరి పుష్కరాల సమయానికి ఆరణ్యపర్వం (2 భాగాలు), విరాటపర్వం విడుదల అయ్యాయి. తర్వాత శ్రీ అజేయ కల్లంగారు కార్యనిర్వహణాధికారిగా విచ్చేసిన వెనువెంటనే ఈ మహాభారత వ్యాఖ్యాన సహిత ప్రకటనా ప్రణాళికను మరింత వేగిరపరచి కృష్ణాపుష్కరాల లోపల యుద్ధపంచకాన్ని విడుదల చేయాలనీ, 2004 సంవత్సరం చివరకు మిగిలిన పర్వాష్టకము వెలుగుచూడాలనీ నిర్ణయించడం జరిగింది. 2004 కృష్ణాపుష్కరాల సమయంలో ఉద్యోగ, భీష్మ, ద్రోణపర్వాలు వెలువడ్డాయి. తరువాత కర్ణపర్వం ఒక సంపుటంగాను, తరువాతి పర్వాలైన శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు మూడింటిని కలిపి ఒకే సంపుటంగాను, శాంతి పర్వాన్ని రెండు సంపుటాలుగాను ముద్రించాము. ఇవి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారి చేతులమీదుగా విడుదల అయ్యాయి. ఆ తరువాత అనుశాసనికపర్వం (ఐదు ఆశ్వాసాలు) ఒక సంపుటంగాను, మిగిలిన ఐదుపర్వాలను (అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థాన, స్వర్గారోహణపర్వాలు)ఒక సంపుటంగాను ప్రచురించాలని నిర్ధారణచేసి త్వరితగతిని ఉపక్రమించినప్పటికి అనుకోని ఆటంకాలు ఏర్పడి జాప్యం జరిగిన సంగతి నిజం. అపుడు మనలను ఆదుకున్నవారు ఎడిటోరియల్‌సెల్‌లో సభ్యులైన శ్రీముదివర్తి కొండమాచార్యులువారు. ఆయన కష్టపడి కునుకువేయక తుదిమెరుగుల వరకు పనిచేసి ఇస్తేకాని గట్టు ఎక్కలేకపోయాము.

ఈ మధ్యకాలంలో అంటే మహాభారత వ్యాఖ్యాన ప్రచురణ యజ్ఞం చివరిదశలో ఉండగా సంచాలకులైన సప్తగిరి సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తిగారు పదవీ విరమణ చేయడం జరిగింది. 1994 సం॥లో సప్తగిరి సంపాదకుడిగా పదవి స్వీకరించిన నాటినుండి మహాభారత వ్యాఖ్యాన ప్రచురణ భారాన్ని భుజానవేసుకొని సమర్థంగా అన్ని ఆటంకాలను అధిరోహించి ఆంధ్రదేశం గర్వించతగ్గ ఒక మహా గ్రంథాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ఆయన చేసిన కృషి అభినందనీయము.

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. లోగడ తి.తి.దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వున్న శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహానికి కృతజ్ఞతాభివందనాలు. ఈ మహాగ్రంథం పూర్తిగా వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.పి.వి.ఎన్. శర్మ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. తి.తి.దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి సాహిత్య ప్రియులూ ఐన శ్రీ ఎన్.ముక్తేశ్వరరావు, ఐ.ఏ.ఎస్., గారు మరింత ప్రోత్సాహం ఇచ్చి ప్రాజెక్టు పనిని వేగవంతం చేశారు. దీనికోసం ప్రతిరోజు నిరంతరాయంగ పని జరిగేటట్లు చూడడమే కాకుండ వారానికొక 'నివేదిక'ను అడిగి తగు మార్గదర్శనాన్ని చేసినవారు ఆయన. వారికి గౌరవాదరాలతో కృతజ్ఞతలు తెలుపటానికి సంతోషిస్తున్నాము.

సంబంధిత విభాగాధిపతిగా, సలహామండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన శ్రీ కె.రాంపుల్లారెడ్డి, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి- వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయ సహకారాలందించిన తదితర అధికారిగణానికి నమస్సులు. ఈ ప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధాన పాత్ర వహించిన- వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదక మండలి, సలహా మండలి) విద్యావేత్తలకు, ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారికి- నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు. తి.తి.దేవస్థానముల సవ్యాఖ్యాన మహాభారతాన్ని ప్రకటించడంలో వేగాన్ని పుంజుకోవడానికై తీర్మానించినప్పుడు ఎడిటోరియల్ కమిటీ వారు దాని కొరకై ప్రధాన సంపాదకునికి సహాయంగా స్థానిక పండితవర్యుల ఉప సంఘం (ఎడిటోరియల్ సెల్) నిర్మాణానికి సిఫారసు చేస్తే దేవస్థానం ఆమేరకు పండితవరేణ్యులు డా॥ కే. సర్వోత్తమరావు, శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, మహాకవి శ్రీముదివర్తి కొండమాచార్యులు గారలతో ఎడిటోరియల్ సెల్‌ను ఏర్పరచడం జరిగింది. ఈ మేరకు ఆరణ్యపర్వంలోని ద్వితీయభాగంతో ఆరంభమైన ఈ సెల్ ఉపకారం అద్వితీయమై మరువరానిది. వర్క్‌షాపువలె నిర్వహింపబడుతున్న కవిత్రయ మహాభారత యజ్ఞంలో వీరు పాలుపంచుకుంటున్నారు. ఆ కారణంగానే తక్కిన పర్వాలను త్వరితంగా గుణాత్మకంగా వెలువరించగలుగుతున్నాం.

"సప్తగిరి" సంపాదకులుగా, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి అమరులయ్యేవరకూ ప్రముఖ పాత్ర వహించిన కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దికకృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥ కోరాడ రామకృష్ణ, తెలుగు ఉప-సంపాదకులు డాక్టర్ కే.రాధారమణ, డాక్టర్ అల్లాడి సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ ఉప-సంపాదకులు శ్రీ బి.ఎన్.శ్రీనివాసన్‌గారికి, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగసుందరంగా తీర్చి దిద్ది పాఠకులకు తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయాధికారి శ్రీ.జి.వెంకటేశ్వరరావుగారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూఉన్న ఈ 'వ్యాఖ్యానసహిత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ భారత' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహ విశేషంవల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

సి.శైలకుమార్
కన్వీనర్
సంపాదకుడు – సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి

అధ్యక్షులు

శ్రీ ఏ.పి.వి.ఎన్.శర్మ ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకులు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం,

సంపాదక మండలి సభ్యులు

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆచార్య ఎం. బుద్ధన్న

శ్రీ కే. రామపుల్లారెడ్డి, పౌరసంబంధాధికారి (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ మేడసాని మోహన్, డైరెక్టర్

అన్నమాచార్య ప్రాజెక్టు, (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య, కార్యదర్శి,

ధర్మప్రచార పరిషత్తు (ఎక్స్ అఫిషియో సభ్యులు)

కన్వీనర్

శ్రీ సి. శైలకుమార్

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా. 1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా 1,2
4. డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా. 2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా. 4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా. 5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్నశాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా. 1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	అను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	అను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	అను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది. – ఆదిపర్వం

సభా. – సభాపర్వం

ఆర. – ఆరణ్యపర్వం

విరా. – విరాటపర్వం

ఉద్యో. – ఉద్యోగపర్వం

భీష్మ. – భీష్మపర్వం

ద్రోణ. – ద్రోణపర్వం

కర్ణ. – కర్ణపర్వం

శల్య. – శల్యపర్వం

సౌప్తి. – సౌప్తికపర్వం

స్త్రీ. – స్త్రీ పర్వం

శాంతి. – శాంతిపర్వం

అను. – అనుశాసనికపర్వం

అశ్వ. – అశ్వమేధపర్వం

ఆశ్ర. – ఆశ్రమవాసపర్వం

మౌస. – మౌసలపర్వం

మహా. – మహాప్రస్థానికపర్వం

స్వర్గా. – స్వర్గారోహణపర్వం

సం. – భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి

సం.మ.భా. – సంస్కృత మహాభారతము

అను. – పై ప్రతిలోని అనుబంధాలు

సంపా. – ప్రధాన సంపాదకుడు

క. – కందపద్యం

వ. – వచనం

ఆ. – ఆటవెలది

తే. – తేటగీతి

సీ. – సీసం

ఉ. – ఉత్పలమాల

చ. – చంపకమాల

మ. – మత్తేభవిక్రీడితం

శా. – శార్దూలవిక్రీడితం

ఆశ్వా. – ఆశ్వాసం

క్రీ.శ. – క్రీస్తుశకం

య. – యగణం

మ. – మగణం

త. – తగణం

ర. – రగణం

జ. – జగణం

భ. – భగణం

న. – నగణం

స. – సగణం

ల. – లఘువు

గ. – గురువు

అలం. – అలంకారం

సం. – సంవత్సరం

మొ. – మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆనుశాసనిక పర్వము

గద్య పద్య ప్రథమ పాద సూచి

పద్యము	పుట
అ	
అంగహీను దరిద్రు విద్యా	503
అంగుష్ఠ మొకటి మోపి	35
అంగుళాగ్రముల్ చిటికెనల	507
అంచితవాహనాకలిత	306
అంతయు నెఱింగి	92
అంతవాఁడు శిఖండిచే	839
అందు వస్తుచయము	803
అందొక కచ్ఛపప్రవరు	81
అంబురంబున శౌచ	431
అంబరాది భూతముల	551
అంబరాది భూతములు	120
అంబిక కిట్లను హరుఁడు	728
అంబుజసూతి యేర్పడ	657
అకట! దత్తాత్రేయునకు	792
అకలుష హృదయాంతర్యాగ	313
అక్కజం బగుచున్న యిక్కథ	140
అక్కాలంబున వినోదంబున	66
అక్కిటంబును భక్తిన్	591
అక్కొరవేశ్వరుం డప్పుడు	827
అఖిలజగత్ప్రభువగు	776
అఖిలజనులకుఁ బరమ	450
అగ్గోవు లప్విభుల నధ్వరం	346
అగ్ని నంట హిమవదచలం	203
అగ్నియొపి రక్షింతు	602
అగ్ని వాయువాసవాదిత్య	808
అగ్ని సన్నిధి గోనిచయంబు	336

పద్యము	పుట
అగ్నులును యజమానుఁడు	797
అగ్రప్రదాయి వర్ణ సన	476
అచటనయుండి లోకముల	634
అచట నారాయణు నచ్యుతు	130
అచట మణిమయంబు	257
అచ్చట నే నతనిం గానక	133
అజుఁడు కల్పాదియందన్న	278
అజుఁ డుపలాలింప నద్దేవు	97
అజుఁడు మున్ లోకహితార్థం	643
అజుని యనుగ్రహంబున	93
అజు విశ్వాధీశ్వరు	782
అట్టిదశ చింతావివర్జనం	737
అట్టియెడం బవనుండు	786
అట్టియెడఁ బూర్వంబునం	479
అట్టియెడ	88
అట్టియెడలఁ దనకు	508
అట్టు లియ్యకొనిన యా క్షణ	299
అట్టులున్నఁ జూచి యత్తన్వి	151
అట్టులైన గంగాప్రసాదాతి	193
అట్ల చేయువాఁడ నని	825
అట్లమ్మని యావహించుట	41
అట్లయిన నాతత్త్వంబు	539
అట్లుండి యొక్క యనువు	214
అట్లు కంఠంబునందు	630
అట్లు కొమ్ములొసంగి	333
అట్లు గంగాత్మజుండు	643
అట్లుగాక పతుల యంతియ	767

పద్యము	పుట
అట్లుగాక యహంకార	553
అట్లు గృహమేధి ధర్మ	466
అట్లు పలుకుటయు	418
అట్లు పావక క్రియా కలాపం	393
అట్లు భయముఁ బొంది	136
అట్లు లోక కర్తయగు	122
అట్లు వర్తిల్లు నరిష్టంబు	444
అట్లు వారివలన నాదర	253
అట్లు శోభిల్లి వారల	827
అడిగిన నద్దేవి కద్దేవు	674
అడిగిన నిచ్చుకంటెను	268
అడిగి మేలు సేసి	309
అడిచిన నందు	62
అడుగక యున్నను	267
అడుగ వలయుదాని	804
అడుగు మనినం గౌంతేయ	170
అతం డతని కిట్లనియె	513
అతం డిట్లనియె	807
అతండు నారాయణునాత్మ	124
అతండు వారి నాలోకించి	378
అతఁడు తైలాభ్యంగ	254
అతఁడు నగుచు భృగుని	46
అతఁడు నానంద సంభరి	594
అతఁడు నివృత్తి ధర్మము	658
అతఁడు భక్తిం బ్రణమిల్లి	74
అతఁడు వాసుదేవుఁ డన	605
అతఁడు సూవె మా యింటికి	806
అతఁడు సెజ్జఁ జేరి యధిపు	251

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అతఁ డొక నాఁడొక యెడ	212
అతఁ డొకరుండ లోకముల	775
అతని కన్ను నీరనాప్లుతం	304
అతనికి నాతఁ డిట్లను	183
అతనికిఁ బ్రణమిల్లి యనఘ!	770
అతనికి నతఁ డిట్టులను	582
అతనికి వత్సలుం డగుట	91
అతని కోఘవంతుఁడను	21
అతని ముఖమున వెడలి	618
అతని శిఖండియేల	840
అతిథిఁ బూజించు వేడ్క	22
అతిథి జనులు దమతమ	23
అతిథి నినుఁగోరె నేనియు	23
అతిథి పూజఁ గడచినట్టి	29
అతివ కామకృతములైన	692
అతివా! కన్నియ నిచ్చిన	721
అతి వినయంబున	24
అత్తెఱం గాకర్ణింపుము	591
అత్తెఱంగు వివరించెద	624
అత్తెఱం గెఱింగించెద	395
అదికారణముగ గోవులు	338
అది గుదిసిన విజ్ఞానము	547
అది తరువు విడిచిపోవక	54
అది దురిత నిరాసము	462
అది నారాయణుఁ డొకనికి	538
అది పవిత్రదేశ మచ్చుట	146
అది యింద్ర మతంగ సంవాదం	31
అదియుఁగాక విశేషించి	8
అదియునుంగాక	5
అదియును	575
అదియ శ్రుతిచేత ధర్మ	667
అది యెట్లంటేని	654
అది యెయ్యది యంటేని	299
అది యొకఁడుఁ జేయఁ	92
అది లేనివాఁడు నరకా	565
అది సదాభ్యాస కలన	736

పద్యము	పుట
అద్దేవుండు వెండియు	659
అధికపుఁ దపమునన్నైన	662
అధిక సౌందర్యములుగల	681
అధిప! నా మనమున	287
అధిప! యాషాఢ ముఖ్యంబు	581
అధిప! యింకను విను	290
అధిప! రజస్వల నంటుట	512
అధిప! సహస్ర బాహార్జును	785
అధ్యయనంబును యజనంబు	645
అధ్యయనమున మస్తకం	502
అధ్యాత్మాదులు సెప్పెద	120
అధ్వపరిశ్రాంతుఁ డగు	51
అధ్వరంబు లనేకంబు	595
అనఘ! కపిలాప్రదానంబున	362
అనఘ! కీటంబులకు	588
అనఘ! గృహస్థ ధర్మమున	14
అనఘ! గోవులు ప్రాణంబుల	288
అనఘ! చూడ సమర్థుఁడగు	188
అనఘ! దానపాత్రమగుట	158
అనఘ! నాదగు చిత్తము	2
అనఘ! నిర్జన నిశ్శబ్దమైన	547
అనఘ! పితృపితామహ	399
అనఘ! భంగాస్వనుండను	106
అనఘ! యంచితస్వాధ్యాయ	814
అనఘ! యధర్మము ధర్మ	813
అనఘ! యనులోమమున	535
అనఘ! యష్టావక్రమును	177
అనఘ! యష్టావక్రుఁడను	146
అనఘ! యాచారమాయువు	498
అనఘ! యిచటనుండుమని	251
అనఘ! వచ్చితి ధర్మనందను	829
అనఘ! విను మరీచి	117
అనఘ! విశాఖ నెద్దనురాధ	281
అనఘ! విషమమైన	229
అనఘ! సోమములేని	185

పద్యము	పుట
అనఘాత్మ! యజపాదుఁడన	339
అనఘా! యెవ్వని కావించిన	283
అనఘుఁ డౌద్దాలకి యను	303
అనయముఁ గాంచెపు	293
అనయము పండుచుండు	55
అనయముఁ బ్రీతిఁబొంది	418
అనలం బించుకయైన	49
అనలము గోవును బ్రాహ్మణుఁ	502
అనలునకు సుదర్శనకును	21
అనలుని నన్వేషింపఁగ	376
అనవిని కొల్చియున్న	637
అనవిని గృహస్థునకు	659
అనవిని గౌరి నీకు భువ	629
అనవిని తెలిసి విడిచె	13
అనవిని దాని కిట్టులను	588
అనవిని దాని కియ్యకొని	78
అనవిని యంబిక సుకృతము	714
అనవిని యమ్ముని ప్రవరు	250
అనవిని యుధిష్ఠిరుఁడు	814
అనవుడు దక్షుయజ్ఞమున	636
అనవుడు నమ్మృగాక్షి యిటు	68
అనవుడు వాసుకి ప్రభృతు	70
అనవుడుఁ దాత యలరి	458
అనవుడుఁ బ్రీతయై యనఘ	154
అనవుడు గౌతముండు	413
అనవుడు ధర్మపుత్రుండు	229
అనవుడు నాతఁ డమ్మనుజ	560
అనవుడు నాతనితో నిట్లను	269
అనవుడు బ్రాహ్మణత్వము	33
అనవుడు భీష్ముఁ డిట్టులను	3
అనవుడు మ్రొక్కి యింద్రుండు	493
అనవుడు వైనతేయుండు	82
అనశన నిష్ఠఁ జేసి	522
అనశన వ్రతంబు లందును	525
అని కురుపితామహుఁడు	264
అని గంగాపుత్రుఁడు	332

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అని గోవులు పలికిన	364
అని చెప్పి	12
అని చెప్పి	52
అని చెప్పి	367
అని చెప్పి	448
అని చెప్పి	500
అని చెప్పి	545
అని చెప్పి	661
అని చెప్పి	677
అని చెప్పి కొన్ని ధర్మము	729
అని చెప్పి గాంగేయుం డన్న	289
అని చెప్పి గౌరి పతి	767
అని చెప్పి చనిన నా దగు	372
అని చెప్పి తదనంతరంబ	535
అని చెప్పి దేవవ్రతుండు	141
అని చెప్పి దైవరహస్యంబు	707
అని చెప్పి ధర్ముండు ధవళ	29
అని చెప్పినం బ్రముదిత	803
అని చెప్పినఁ బాండునృపతి	338
అని చెప్పినఁ గృష్ణుఁడు	461
అని చెప్పిన నగేంద్ర	710
అని చెప్పిన నాయువేమిటం	695
అని చెప్పిన భీష్మున	560
అని చెప్పిన విని కుంతీ	308
అని చెప్పిన విని నారదుం	210
అని చెప్పిన విని హిమ	734
అని చెప్పిన హిమవద్గిరి	725
అని చెప్పిన నారదుం	768
అని చెప్పిన భీష్ముం డా భూపతితో	200
అని చెప్పి భీష్ముండు	98
అని చెప్పి భీష్ముండు	248
అని చెప్పి భీష్ముండు	596
అని చెప్పి భీష్ముండు పాండ	114
అని చెప్పి భీష్ముండు వెండియు	272
అని చెప్పి భీష్ముండు వెండియు	419
అని చెప్పి భీష్ముఁ డమ్మను	58

పద్యము	పుట
అని చెప్పి మఱియు	164
అని చెప్పి మఱియు	167
అని చెప్పి మఱియు	652
అని చెప్పి మఱియు	743
అని చెప్పి మఱియును	328
అని చెప్పి మఱియును	333
అని చెప్పి మఱియును	566
అని చెప్పి మఱియును	677
అని చెప్పి మఱియును	811
అని చెప్పి మఱియు శివుఁ	743
అని చెప్పి యట్టి చందం	603
అని చెప్పి యప్పరమేశ్వరుం	692
అని చెప్పి యప్పరమేశ్వరునకుం	765
అని చెప్పి యప్పురుషోత్తము	760
అని చెప్పి యాపగాతనయుం	286
అని చెప్పి యిట్లనియె నేనుం	570
అని చెప్పి వినుమని మఱియు	266
అని చెప్పి వెండియు	390
అని చెప్పి వెండియు	451
అని చెప్పి వెండియు	670
అని చెప్పి వెండియు	752
అని చెప్పి శంకరుం డింక	630
అని చెప్పి శాంతనవుండు	393
అని చెప్పి శాంతనవుఁ డిట్లను	194
అని చెప్పి సర్వజాతి సామాన్యం	439
అని చెప్పి సిద్ధుండు వెండియు	191
అని చెప్పుటయు నప్పరమ	360
అని చెప్పెఁ దత్ప్రకారంబులు	106
అని చెప్పెనట్లు బృహస్పతి	322
అని చెప్పె నయ్యవసరంబు	182
అని జమదగ్ని మఱియు	413
అని తగ నేకవాక్యత	623
అని తలంచి	56
అని తలంచి నీదు పలుకు	156
అని తెలిపిన గౌరి	704
అని తెలిపెనట్లగుటం	99
అని ధర్మతనయుఁ డడిగిన	354

పద్యము	పుట
అని ధర్మస్థితితోఁప మాట	95
అని ధృతరాష్ట్రుఁ డాడిన	492
అనినం గౌంతేయాగ్రజుం	818
అనినం బాండవాగ్రజుండు	98
అనినం బాండవాగ్రజుండు	268
అనినం బార్వతి	161
అనినఁ జావను నదియేమి	694
అనినఁ బితామహుతోన	30
అనినఁ బ్రశాంతుడై తపను	424
అనినఁ బ్రసన్నత నట్టులు	378
అనినఁ బ్రియమంది తాతకు	562
అనిన బ్రియమంది నృపతి	243
అనినఁ బ్రీతుఁడై పాండు	513
అనినఁ బృథివి యిట్టులను	200
అనిన గౌతము పల్కు విని	489
అనిన నంబిక గర్భంబు	706
అనిన మో మలరన్	425
అనిన నక్కోమలి యక్కిరాతుం	4
అనిన నజాతశత్రుండు	614
అనిన నజ్జనపతి	565
అనిన నట్టులేని నాఁగాక	113
అనిన నతండు కైకేయీ	600
అనిన నతం డెవ్వరి	56
అనిన నత్యంత సంతుష్ట	366
అనిన నది యట్టిద	82
అనిన నద్దేవముని	196
అనిన నద్దేవుఁ డమ్మహా	632
అనిన నప్పుడమిఱేఁ డప్పురుష	388
అనిన నమ్మునివరుండు	152
అనిన నయ్యందఱును	417
అనిన నష్టావక్రుఁ డట్ల	147
అనిన నష్టావక్రుఁ డతి	151
అనిన నాపగేయుండు	815
అనిన నాసర్వజ్ఞుఁ డద్దేవి	725
అనిన నిక్కంబిది యందఱు	417
అనిన నీ తోడి గోష్ఠికి	529

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అనినను ముని మేరు వనం	489
అనినను శాంతిలేమికి	423
అనిన మఱియును	224
అనిన నూరకయున్న	790
అనిన భవాని వనవాస	653
అనిన భసితాంగరాగంబు	635
అనిన భుజగ మిట్టులను	10
అనిన మృత్యువునుం బామును	11
అనిన వార లతని కిట్లనిరి	405
అనిన విని కద్రువ	69
అనిన విని కరంబు	347
అనిన విని కురుపతి	402
అనిన విని కౌంతేయాగ్రజుం	164
అనిన విని కౌంతేయాగ్రజుం	323
అనిన విని కౌంతేయాగ్రజుం	368
అనిన విని గౌరి	709
అనిన విని గౌరి కొందఱు	678
అనిన విని దివ్యబోధం	218
అనిన విని ధర్మజుండు	42
అనిన విని ధర్మజుండు	237
అనిన విని ధర్మజుండు	302
అనిన విని ధర్మజుండు	481
అనిన విని ధర్మజుండు	524
అనిన విని ధర్మతనయుం	51
అనిన విని ధర్మతనయుం	456
అనిన విని ధర్మనందనుం	166
అనిన విని ధర్మనందనుం	603
అనిన విని ధర్మపుత్త్రుం	327
అనిన విని ధర్మసుతు	206
అనిన విని ధర్మసూనుం	385
అనిన విని నిక్కమాడిన	208
అనిన విని పాండవాగ్రజుఁ	265
అనిన విని పాండవాగ్రజుం	230
అనిన విని పాండవాగ్రజుఁ	336
అనిన విని పాండుభూవర	426
అనిన విని పార్వతి	695
అనిన విని పార్వతి	712
అనిన విని ప్రీతుండై	458
అనిన విని బోయకు	8
అనిన విని భీష్ముతో న	495
అనిన విని మహాదేవుం	698
అనిన విని మెచ్చి పృథివిం	201
అనిన విని మొగంబు	77
అనిన విని యంబిక తనకు	628
అనిన విని యక్కురువంశ	248
అనిన విని యగ్గలంబైన	247
అనిన విని యగ్నికల్పుఁడ	261
అనిన విని యజాతశత్రుం	124
అనిన విని యజాతశత్రుం	162
అనిన విని యజాతశత్రుం	172
అనిన విని యజాతశత్రుం	276
అనిన విని యజాతశత్రుం	420
అనిన విని యజాతశత్రుం	477
అనిన విని యజాతశత్రుం	484
అనిన విని యజాతశత్రుం	581
అనిన విని యజాతశత్రుం	785
అనిన విని యజాతశత్రుం	819
అనిన విని యజ్జనపతి	225
అనిన విని యజ్ఞంబు	723
అనిన విని యట్లు సేసెద	213
అనిన విని యట్ల చేసెద	353
అనిన విని యత్యంత	812
అనిన విని యద్దేవుండు	295
అనిన విని యన్నరేంద్రుం	194
అనిన విని యపర్ణాదేవి	676
అనిన విని యమ్మహాదేవికి	629
అనిన విని యమ్మహీశ్వరుం	197
అనిన విని యమ్మునిపతికిం	305
అనిని విని యమ్మునిపతికి శుకు	358
అనిన విని యమ్ముని సిద్ధ	140
అనిన విని యవ్వనితా	655
అనిన విని యా జగన్మాత	665
అనిన విని యా దంపతులు	250
అనిన విని యా శుకంబు	55
అనిన విని యింద్రుం డిట్లనియె	494
అనిన విని యుధిష్ఠిరుండు	158
అనిన విని యుధిష్ఠిరుండు	232
అనిన విని యుధిష్ఠిరుం	268
అనిన విని యుధిష్ఠిరుం	2
అనిన విని యుధిష్ఠిరుండు	279
అనిన విని యుధిష్ఠిరుండు	771
అనిన విని వారలు	60
అనిన విని వాసుదేవుం	833
అనిని విని విషాదంబుతో	242
అనిన విని సంప్రీతయై	661
అనిన విని సురమునులు	760
అనిన విని హర్షపూరం	610
అనిన విని హుతవహుం	19
అనిన విని హైమవతి	732
అనిన సంతసిల్లి యనిలు	793
అనిన సంతసిల్లి యమ్మహీ	585
అనిన సంప్రీతుండై ధర్మ	116
అనిన సిగ్గుతోడి యలంతి	758
అనిన నారదుఁ డుపదేశం	609
అని నిర్జరాపగానందనుం	400
అని నిర్దేశించి	163
అని నిర్దేశించి	169
అని నిర్దేశించి	231
అని నిర్దేశించి	291
అని నిర్దేశించి	330
అని నిర్దేశించి	443
అని నిర్దేశించి	660
అని నిర్దేశించి	672
అని నిర్దేశించి	691
అని నిర్దేశించి	693
అని నిర్దేశించి	703

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అని నిర్దేశించి	728
అని నిర్దేశించి	769
అని నిర్దేశించి	691
అని నిర్దేశించి	693
అని నిర్దేశించి	801
అని నిర్దేశించి	823
అని నిర్దేశించిన	311
అని నిర్దేశించిన	414
అని పరిభాషించి	501
అని పలికి	831
అని పలికి కుశికుండు	261
అని పలికి గోవునిచ్చితి	320
అని పలికి చరుతరువ్యత్యాసం	41
అని పలికి జరామృత్యువుల	740
అని పలికి తమ కులంబు	45
అని పలికినఁ బార్వతీదేవి	730
అని పలికినఁ బితృదేవతల	398
అని పలికిన నతని	96
అని పలికిన నప్పరమ	491
అని పలికి నారదుఁడు	769
అని పలికి నీవు దేవాంగన	757
అని పలికి పాము బోయ	10
అని పలికి భరద్వాజుం	412
అని పలికి భీష్ముఁ డిట్లను	480
అని పలికి మఱియు	758
అని పలికి మఱియును	291
అని పలికి మఱియును	302
అని పలికి మునిజన	545
అని పలికి యా భూవల్లభు	372
అని పలికి యామంత్రణంబు	574
అని పలికి యింకను నధ్యాత్మ	528
అని పలికి యిట్లనియె	192
అని పలికి యిట్లనియె	645
అని పలికి యిది యెట్లొకో	691
అని పలికి రథవహన	802
అని పలికి విశ్వంబు	778

పద్యము	పుట
అని పలికి వీడుకొలిపిన	308
అని పలికి వెండియు	26
అని పలికి వెండియు	371
అని పలికి శౌచవిధి	429
అని పలుకుటయు	413
అని పల్కినం బాండు	53
అని పల్కి యమ్మహాత్ముండు	59
అని పల్కి వెండియు	209
అని పుత్రకామేష్టి సేసినం	44
అని ప్రీతిఁ బలికి యమ్ముని	245
అని బలు మ్రొకులు వేగమ	294
అని బోధించి	671
అని భీష్ముఁడు వెండియు	160
అని భీష్ముండు వెండియు	236
అని మఱియుఁ బెక్కు పేళ్ళన్	137
అని మఱియు ననేక	110
అని మఱియును	162
అని మఱియును	224
అని మఱియును	548
అని మఱియును	598
అని మఱియును	613
అని మఱియును	658
అని మఱియును	698
అని మఱియు శాంతనవుఁ	201
అనిమిష గంధర్వ	138
అనిమిషవరుఁ డివ్విధమున	110
అనిమిషులున్ మహామునులు	357
అని మునిపతి పలికిన	487
అని మునిపతి సెప్పినఁ	363
అని ముని సెప్పిన సౌదాస	331
అని యడిగిన నతం	30
అని యడిగిన నతండు	127
అని యడిగిన నద్దేవుండు	709
అని యడిగిన నయ్యాపగా	270
అని యడిగిన నా భూపతి	776
అని యడిగిన యక్కురుపతి	317

పద్యము	పుట
అని యడిగిన యాయము	600
అని యడుగుటయు	183
అని యడుగుటయు	312
అని యడుగుటయు	639
అని యతఁడు వల్కె	279
అని యనిమిష తటినీ	382
అని యనుజ్ఞ చేసి	824
అని యప్పగించి యాగం	214
అని యవ్విభుండు పలికి	351
అని యష్టావక్రదిశా	155
అని యహింస తెఱఁగు	673
అని యిటు లేర్పడం బలికి	245
అని యిట్లందఱుం దన	416
అని యిట్లాశ్రమ ధర్మంబు	651
అని యిట్లు గంగాగుణంబు	193
అని యిట్లు గంగాపుత్త్రుం	775
అయి యిట్లు గో విశేషము	311
అని యిట్లుపదేశించిన	783
అని యిట్లుపదేశించిన	797
అని యిట్లుపదేశించిన	823
అని యిట్లుపన్యసించిన	336
అని యిట్లు భీష్ముండు	142
అని యిట్లు భీష్ముండు	462
అని యిట్లు భీష్ముండు	770
అని యిట్లు యమబ్రాహ్మణ	292
అని యిట్లు వర్తిల్లు నాలుగు	161
అని యిట్లు శివునకును	560
అని యిట్లు సుప్రసంగం	517
అని యిట్లేర్పడఁ జెప్పిన	614
అనియునుం జెప్పెనని	397
అని యుపదేశించి	737
అని యుపదేశించి	822
అని యుపదేశించిన	83
అని యుపదేశించి వెండియు	737
అని యుపన్యసించి యమ్ముని	555
అని యూఁది చెప్పి	23

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అని యూఱడిలం బలికెఁ	841
అనియెం గావునఁ గుంతీ	197
అనియెఁ గాని నా మాట	298
అనియెఁ దదనంతరంబ	411
అనియె గోవుల పావనత్వం	334
అనియె నంత నినుం డపర	251
అనియె ననిచెప్పి వీడ్కొని	484
అనియె నని యవ్వాక్యం	274
అనియె నని యిట్లు గౌరి	638
అనియె యిట్లు ప్రథమ	64
అనియె నివ్వాక్యంబులు	301
అని యెఱింగించి	282
అని యెఱింగించి	679
అని యెఱింగించి	689
అని యెఱింగించిన	727
అని రట్టియెడం గొందఱు	71
అని రాజసంబు దోఁపం	487
అని రామయైయున్న రాజన్యుం	112
అని వగచిన	840
అని వరమిచ్చి మహేంద్రుఁడు	36
అని వితర్కించి యమ్ముని	215
అని విన్నవించి గంగ	759
అని విలాపంబు చేసి	839
అని వెండియు	13
అని వెండియు	28
అని వెండియు	63
అని వెండియు	96
అని వెండియు	210
అని వెండియు	256
అని వెండియు	259
అని వెండియు	278
అని వెండియు	310
అని వెండియు	362
అని వెండియు	411
అని వెండియు	473
అని వెండియు	562

పద్యము	పుట
అని వెండియు	612
అని వెండియు	676
అని వెండియు	689
అని వెండియు	700
అని వెండియు	751
అని వెండియు	805
అని వెండియు	819
అని వెండియు	832
అని వెండియు నద్దేవునితో	689
అని శాంతనవుఁడు సెప్పిన	599
అని సంస్తుతిపూర్వకంబు	125
అని సకల ధర్మోపదేశ	454
అని సనత్కుమారుఁ డభవుతో	540
అని సవినయంబుగా	257
అని సవినయ ప్రణామం	300
అని సహజన్ములయిన	549
అని సహోదర ప్రకారంబు	516
అని సాత్యవతేయుఁడు గృప	591
అని సిగ్గునఁ జెన్నగు	768
అనుగతుఁడగు శిష్యునకుం	181
అనుచు నమస్కరించి	832
అనుచు నమ్మహనీయ	260
అనుజు ఁడొకఁడు వెంగలి	514
అనుటయు	91
అనుటయుఁ బాండవాగ్రజుం	158
అనుటయు గాంగేయుం	363
అనుటయు దాక్షాయణి	720
అనుటయు దేవవ్రతుం	385
అనుటయు ధర్మజుండు	266
అనుటయు ధర్మనందనుఁ	163
అనుటయు ధర్మరహస్యము	665
అనుటయు నంబిక	633
అనుటయు నక్కిటంబు	588
అనుటయు నగ్గోవులు	345
అనుటయు నట్లకాక	306
అనుటయు నతం డతని	207

పద్యము	పుట
అనుటయు నతం డతని	427
అనుటయు నతండు	7
అనుటయు నతండు	208
అనుటయు నతండు	488
అనుటయు నతనికి	198
అనుటయు నత్తన్వి తనువున	217
అనుటయు ననేకమాయలు	213
అనుటయు నభవుండు	660
అనుటయు నమ్మహనీయుం	575
అనుటయు నమ్మహేశ్వరుం	635
అనుటయు నయ్యఖిల	498
అనుటయు నవ్విభుండు	794
అనుటయు నా కృత్రిమజన	486
అనుటయు నా దేవవ్రతుం	495
అనుటయును సిరినాదు	365
అనుటయు బ్రహ్మ యవ్విభు	497
అనుటయు భవదీయ	620
అనుటయు భీష్ముండు	616
అనుటయు మునివరు	241
అనుటయు లెస్సఁ గఁ దలఁచి	585
అనుటయు వసిష్ఠుండు	410
అనుటయు వారలందఱు	623
అనుటయు శంభుఁ డిట్లను	678
అనుటయు సంతోషించి	80
అనుటయు సందియం బది	358
అనుడు ధర్మాత్మజుఁ డతనితో	159
అనుడు నచట నున్న ముని	727
అనుడు వంటకము సేసిన	415
అనుడు విషాదము తోడం	405
అనుడు విహంగనాథుఁడు	75
అనుడు సంతసిల్లి యట్ల	495
అనునెడ నిందు రండని	260
అనుభవించుచు గమనం	445
అనుమానం బదియేల	80
అనుమానింపకు మంధుండు	816

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అను సమయంబున	563
అనేక సహస్రంబు	668
అన్నంబుఁ దోయంబు	710
అన్నదానంబు ధర్మంబు	573
అన్నదాన సదృశమగు	277
అన్నమిడిన మణిమయా	279
అన్నమున దుగ్ధమున	459
అన్నరనాథుతోడ	491
అన్ని తత్త్వంబులకు	534
అన్ని యింద్రియముల	747
అన్యమాంసమున నిజాంగ	583
అన్యవర్ణుండు దీనుఁ	19
అపగత కామరోష	462
అపగత మోహశోకమగు	492
అపరంబగు పక్షంబును	384
అపుడు బుధ్యమానునిఁ గను	543
అపుడు వీక్షించి సత్యవతీ	823
అప్పటికి వారు లేకున్న	460
అప్పని పాపంబు గాకుండ	223
అప్పరమేశ్వరుండు	118
అప్పరమేశ్వరుండు	137
అప్పు డతిథి ప్రీతి నతని	27
అప్పుడు	247
అప్పుడు ప్రకృతిం దొఱంగి	748
అప్పుడు ఫాలలోచనము	626
అప్రమేయ మవిజ్ఞేయ	537
అప్రవాసియైన యవనీ	204
అప్రసక్తం బైనను నీ	522
అమరవల్లభుండు నమృత	56
అమర విభుని భగసహస్ర	201
అమరు మహాదేవుఁడను	805
అమరేంద్రుండు సముద్ధతిన్	92
అమరేంద్రు నిర్జించి యమృతం	128
అమలంబగు కుశసంస్తరణము	370
అమలాత్మ గోవు మూత్రము	334
అమలినతరదర్భన్యాసము	394

పద్యము	పుట
అమవస నమవసఁ బిత్రు	383
అమితజ్ఞానము విజ్ఞానము	682
అమ్మహాత్ముండమ్మహీపతితో	332
అమ్మహాత్ముఁ డిట్టులను	401
అమ్మహానుభావుండు సంసార	449
అమృతంబు దుర్లభంబ	78
అమృతకరాన్వయంబున	71
అమృతోత్పత్తి సమయమున	124
అమ్మిథునము బహుసంతాన	342
అమ్ముని నభ్యంతర సదన	251
అమ్మునివరు నాపర్యంకమ్ము	149
అమ్ముని శిష్యుఁ డయ్యువిద	217
అమ్మెయిఁ బాపముల్ వొలియు	712
అమ్మెయి నన్నలువురును	837
అయిదు దెఱఁగులందు	227
అయినను	807
అయ్యగ్నిదేవుండు	377
అయ్యాకాశపవనాగ్ని	119
అయ్యైకర్మంబులదెస	444
అరయంగఁ దత్త్వము లను	530
అరయఁగ నాలుగు విధములఁ	575
అరయఁ గృష్ణుఁ డధ్వరాత్మకు	796
అరయ దుర్గమములు నతి	180
అరయ మీకుఁ గృత్యమన్యంబు	202
అరిగి తచ్చరణపద్మంబులకుం	90
అరిగి యతనిచేయు	101
అరియైన దీనుఁడై తను	267
అరుణంబులును సకంటక	469
అరుణ ధవళమేచక	330
అర్చించు నప్పు డయ్యంగన	16
అర్థిగోరిన వస్తువులర్థితోడ	265
అలఘుతపములు	821
అలఘుతర సకల కామ్యం	282
అలసతయున్ విచిత్తతయు	752
అలుకఁబురి నూర వనమున	171
అలుకయు నసూయయును	203

పద్యము	పుట
అవధరింపుము భూతంబు ల	531
అవనిఁ బడనీకశాఖ	87
అవనీదేవత లొక్కెడం	496
అవనీసురుఁడు జప	435
అవహితుండయి తద్దశ	751
అవిజితేంద్రియబల	217
అవిబిట్టు బెదరఁ దక్కటి	325
అవ్యక్తం బనఁగా దన	118
అవ్వాక్యంబు లాకర్ణింపుము	160
అవ్వాక్యంబులు సెప్పెద	427
అవ్విధంబున కారాజు	259
అవ్విధంబు నొక్కొక్క యెడం	229
అవ్విభుండు	19
అవ్విశేషంబున నశేష	381
అస్థికలిగి హీనమగు	440

ఆ

పద్యము	పుట
ఆఁకలియు నీరువట్టును	497
ఆఁకలేక యెవ్వాని జలాశయమున	284
ఆఁడుదానిఁ జంపి నతఁడేక	569
ఆ కృష్ణుఁడు నిజసామ్యా	618
ఆగమాధ్యయనంబు	311
ఆగమోక్త విధంబుఁ బ్రత్యక్ష	815
ఆ గార్దభి తన కొదమతో	31
ఆ చతుర్వింశతి	533
ఆచమన పూర్వకంబుగ	507
ఆచరించు దండ మక్రోధ	663
అచర్మణ్వతి యను నది	669
ఆచారహీనతయతి	589
ఆచేత పిదపదాన	460
ఆ జంతువుం గనుంగొని	590
ఆజి ప్రాప్త మృతులు గురు	272
ఆడుచుఁ బాడుచు గణములు	146
ఆతఁడు దానికి నతి	101
ఆతఁడు సర్పయాగమును	72

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఆతని యున్నెడ యారసి	376
ఆత్మఁ బొంగి మ్రొక్కి యతఁడాల	91
ఆత్మజాతియందు నవుల	228
ఆత్మ సదృశత ప్రాణభయంబు	584
ఆదియుగంబున నబల	631
ఆ దేవుఁ జిత్తమున నిడి	132
ఆ ధూళితోడఁ గుడిచిన	483
ఆ నసంబునను జిహ్వను	340
ఆ నరనాయకుం డొక	19
ఆపత్సమయంబున శౌచా	432
ఆపదఁ దూలపోక సిరినంది	677
ఆ పొలఁతియట్లు పలికిన	69
ఆ భృగువంశ వర్యుండు	254
ఆభ్యంతరంబు బాహ్యమున	716
ఆయాసపడకుండ నర్థంబు	680
ఆ రమణికి నతనికి	16
ఆ రాజకుమారుల మతి	109
ఆ రాముండు శుచిత్వ శ్రీ	381
ఆర్‌ష్టిసేనాశ్రమంబున	179
ఆలనేయి ముఖ్యము మహిషాది	473
ఆలు నిజ జాతియందు	231
ఆలుబిడ్డ లొఱటులై	683
ఆలేమ సుదర్శనునకు	22
ఆలోకదానమున భూపాల	472
ఆవేశించెద యోగ	214
ఆ సనత్సుజాతుం డంగుష్ఠ	117
ఆ సమయంబున	21
ఆ సమయంబున నరుణో	65
ఆస్యశుద్ధి యొనర్చిన	434
ఆహారముడిగి మహాశ్రమంబు	174

ఇ

పద్యము	పుట
ఇంతకు మూలమై యిరువదేనవ	123
ఇంతిఁ దా విడువని యంతియ	788
ఇంతి! నాచెప్పిన యిప్పాప	689
ఇంద్రియములకంటె నీశాన	550
ఇచ్చినం బ్రీతుండై	219
ఇచ్చినవారల కొనఁగా	296
ఇచ్చెదఁ గొందఱ నెత్తఱి	112
ఇట్టిది యోగధర్మం బనిన	753
ఇట్టివనటఁ బొందునట్టి	13
ఇట్టి సౌరభంబు నెవ్వఁడు	220
ఇట్టు లురియాడు చిత్తంబు	25
ఇట్టు వినతపట్టి పట్టిన	86
ఇ ట్లత్యాదరంబున సంభవించి	593
ఇట్లనియె నప్పర్వతరాజ	643
ఇట్లయడుగం గలవాఁడై	318
ఇట్లు కపట జయంబున	73
ఇట్లు గాకాత్మ ధర్మంబు	429
ఇట్లు గాన నంజుడు నములుట	582
ఇట్లు గావించి యా రెంటిని	39
ఇట్లు చని ద్వాదశ వార్షిక	617
ఇట్లు నిర్జించి తత్క్షణంబ	126
ఇట్లు నిష్కల్మషత్వంబు	594
ఇట్లు పరమ హర్షంబునం	195
ఇట్లు ప్రవేశించి యయ్యోగి	215
ఇట్లు ప్రసన్నుండయి	326
ఇట్లు మదనాగ్ని నుదిలకొని	17
ఇట్లు మాతలి యమరేంద్రుని	455
ఇట్లు వారించి యిది శాపంబున	153
ఇట్లు వినతయుం దెంపు సేసి	69
ఇట్లు వినుచు నిలాతలంబునం	299
ఇట్లు శపియించిన నబ్బాల	303
ఇట్లు సుదర్శనా వివాహోత్సవం	20
ఇట్లు సెప్పం బడునట్టి	227
ఇట్లు సెప్పి సనత్సుజాతుం	123
ఇట్లు సేసి శక్తియెల్లను	35
ఇతరుల దానమేనిఁ దమ	273
ఇత్తెఱంగున నొక్కట నెత్తి	379
ఇది కపిలాది పరమర్షి	748
ఇది బుద్ధీంద్రియ ప్రపంచంబు	121
ఇది మేలితెఱంగు గొందఱు	526
ఇది యద్దహనంబు తెఱంగని	621
ఇది యేటి కార్యముగ	152
ఇది శ్రీమదుభయ కవిమిత్ర	144
ఇది శ్రీమదుభయ కవిమిత్ర	314
ఇది శ్రీమదుభయ కవిమిత్ర	465
ఇది శ్రీమదుభయ కవిమిత్ర	641
ఇది శ్రీమదుభయ కవిమిత్ర	843
ఇది సకలజన సామాన్యం	156
ఇది సాంఖ్యానము దీనిని	453
ఇది సాయుజ్యావాప్తి ప్రకారం	756
ఇధ్మములు దెచ్చి యిచ్చు	485
ఇనశశిపావక భూమి	9
ఇన్ని యాచారములలోన	513
ఇమ్మీలను నన్నును	240
ఇమ్మెయిఁ బోరిపోరిమది	85
ఇమ్మెయి గుహ్యతలము	431
ఇమ్మెయి నలంగియొక	421
ఇరుదెఱఁగు విను తమము	702
ఇరువది నాల్గనువారలు	530
ఇరువది మూఁడనువార	530
ఇరువది రెండవనాఁడమ్ముని	252
ఇరువుర మేము పుట్టుదు	62
ఇలఁ జాఁగి మ్రొక్కియటు	111
ఇలువెడలిపోయె నేమియు	252
ఇవి నానా ముఖముల	700
ఇవి మూఁడు దెఱంగులు	815
ఇవి యెఱిఁగి యెపుడు బర	442
ఇవి యెల్ల నశాశ్వతములు	445
ఇవి యెల్లను వానప్రస్థ	656
ఇవి యెల్ల విష్ణునందు	122
ఇవి వర్ణ ధర్మ ప్రకారం	649
ఇవి శాస్త్ర దృష్టమార్గము లవని	429
ఇవుల నేడు దరంబుల	187
ఇవ్విధంబున	90
ఇవ్విధంబున	301

పద్యము	పుట
ఇవ్విధంబున	742
ఇవ్విధంబున నౌచిత్యం	95
ఇవ్విధంబున విండ్లు	631
ఇవ్విధంబున విబుధులు	376
ఇవ్విధంబున సద్విజుండై	594
ఇవ్విధంబున సప్తాంగ	663
ఇవ్విధంబున సుఖింజేసి న	135
ఇవ్విధముగాంచు యోగికి	543
ఇవ్విధమున గోవునిచ్చిన	321
ఇవ్విధమున వినోదింప	421
ఈ	
ఈ కపిలాఖ్యానము సుశ్లోకము	326
ఈ కమలవనము చేరువ	407
ఈ క్రియ నావశం బగునే	7
ఈ తంత్రంబు పఠించిన	524
ఈతఁడు దక్కఁగ నౌరులకు	88
ఈ తెరువు లాదరింపఁగఁ	742
ఈ తెఱఁగు లెల్ల నెఱిఁగి	392
ఈ దైవతముల నన్నిఁటి	542
ఈ నామ నిర్వచనములు	810
ఈ నాలుగు దెఱఁగులఁ దగ	576
ఈ నీతులకు విరుద్ధము	664
ఈ నెఱిఁ గైకొని శూద్రుం	442
ఈ నెఱి నిలుచుట గలుగదు	533
ఈ పరిబోధం బభవా	558
ఈ పాముఁ జంపఁ బ్రదుకునె	5
ఈ మూఁడు తెఱంగుల జను	206
ఈ యనృతవర్తనము	154
ఈ యాచారాధ్యాయం	513
ఈ యాఱును మంచి తెరువు	574
ఈ యితిహాస మార్యసభ	419
ఈ యుపస్థాన మచలిత	812
ఈలోకం బేటికి మన	348
ఈ వాక్యంబులు భూదేవావలి	357
ఈవిధ మెమ్మెయి నైనం	71
ఉ	
ఉండు నన విని విహంగ	79

పద్యము	పుట
ఉగ్రత్వమునఁ బ్రతాపోన్నతి	808
ఉచితంబుగా నెఱి నుగ్గడించిన	612
ఉత్తమ పథంబు ధర్మా	564
ఉత్తమ బ్రాహ్మణుం డొకనికి	295
ఉత్తమ శ్రద్ధలేకున్న	535
ఉత్తర కురుభూమియు	259
ఉదకంబు లందుండి	838
ఉదకము రక్షకం బగుచు	79
ఉద్యోగము ప్రియవాదిత	664
ఉన్నఁ గని యప్పడఁతి	4
ఉపవాసములు మౌనమూర్వీశ	653
ఉపవాసవిధి యోగ్యతయును	518
ఉపవాసాయాసంబును	525
ఉపహార సమర్చకుఁడగు	475
ఉలుము గొన్నవాఁడు తొలుమేన	685
ఉవిద మునియోగబల	260
ఋ	
ఋతుమతి గాక శుద్ధతయు	760
ఎ	
ఎంత నిష్ఠగలిగెనేనియు	521
ఎంతెంత మేలు చేసిన	677
ఎక్కుడు దినముల శుభములు	520
ఎచట మెలఁగె నేమి యెట్లుండె	661
ఎట్లంటేని	813
ఎట్లనిన దృష్టారిష్ట వికృతులయి	555
ఎట్టివి కర్మంబులట్టి	700
ఎత్తికొని పోయి తనపురి	787
ఎదుర్కొని ప్రణామపూర్వకం	564
ఎన్ని నిమిషములు దైవత	480
ఎన్ని యేఁడులు మనుజుని	185
ఎప్పుడు ధర్మంబు నెడ	822
ఎఱిఁగిన యప్పెను వ్రేఁగు	87
ఎఱింగి కూడుకొని గోవుల	359
ఎఱుక గలిగి పిదప నేని	766
ఎల్లపుష్పంబులు నెక్కాలమును	731
ఎల్లవారుఁ దమకు నెంతగూర్తురు	801

పద్యము	పుట
ఎవ్వఁడెఱుఁగఁబడిన	527
ఎవ్వనికిఁ బుట్టెనేనియు	234
ఎవ్వరు ధర్మంబు నెడ	817
ఏ	
ఏక భుక్తవ్రత మెంతయు	519
ఏకాగ్రచిత్తుండవై	804
ఏటి దరికిం దిగువఁబడి	239
ఏతద్విషయంబయిన	761
ఏ తద్విషయంబైనది	203
ఏతెంచి నిభృతిమై నీశ్వరు	325
ఏ నడుగఁగ నారదముని	276
ఏ నమరేంద్రుఁడ నాదగు	216
ఏనుంగు నెక్కి పెక్కేనుంగు	592
ఏను గృష్ణు నెఱుంగుదు	794
ఏను దండ ప్రణామం బాచరించి	129
ఏమను భార్యయు బంధులు	250
ఏనును మీరు నేల మఱి	128
ఏనును శిష్యుల కీ వి	558
ఏనుఁ బ్రసన్నుఁడనైనం	754
ఏను బ్రహ్మముఖంబున	374
ఏను వలదని చెప్పిన	34
ఏ నూఱేండ్లకుఁ బుట్టు	63
ఏ నెఱిఁగినంత సెప్పితి	191
ఏ నెఱుంగుదు నితఁడు	831
ఏ నెవ్వత నైతినేమి	408
ఏ నేమి తప్పు సేసితి	7
ఏ నై మేల్కనునంతకు	252
ఏ నొక్కటి యడిగెదఁ జెపుమా	207
ఏ నొల్లఁగాక భస్మము	218
ఏము గోవుల మనవుడు	344
ఏయువాఁడుండ నమ్మేమి	8
ఏ విధమున నోపిన యతి	439
ఐ	
ఐనను మీరడిగిన	758

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఒ	
ఒంటి మెయినుండఁగా	82
ఒండొరుల శంకించి శపథంబులు	410
ఒకటి గొలనిలోని నుండు	82
ఒకటి యడిగెదఁ గృప	262
ఒకతఱి దేవతలకు	790
ఒకతఱి మునివర్యు లొక్కట	397
ఒక దానవుఁడు జగన్నా	620
ఒకనాఁడు గో వొకటి	351
ఒక విప్రవరుఁడు నను(గని	483
ఒకళులు సూచిన మది	506
ఒక్కఁడొక్కని చేత నెక్కుచు	746
ఒక్కనాఁ డవసరంబు గాంచి	102
ఒక్క యితిహాసంబు సెప్పెద	482
ఒక్క సృగాలంబు నొకవానరం	99
ఒక్కింత సేపునకుం దెలిసె	791
ఒప్పు నవ్వనంబునం	625
ఒరుల మెచ్చక	22
ఒరులిచ్చిన దీపంబ	473
ఓ	
ఓంకారవాచ్య మది	537
ఓషధు లమృత మయ్యుత్తమ	467
ఔ	
ఔపరమిక మనునది	715
ఔపరమికాభిధానంబు	714
క	
కడుఁ గ్రొవ్వివాఁడు లోకము	621
కద్రువ గన్గొని సంతో	73
కద్రువ పాలికిం బోయి	76
కనక మాయుః ప్రదంబు	282
కనకము ధేనువుల్ మణి	297
కనకము రజతము	270
కనకములు మణులు	836
కనఖలమున గంగా ద్వారము	173
కని యజ్జనపతి ఋత్విజు	20
కని యప్పావకుం బావక	131
కని యీ ధూళికిఁ గడు	482
కనుఁగొని పశ్చాత్తాపం	304
కనుటరిది యొండుమెయి	608
కనువెలుంగు వేదవ్యాస	823
కన్ను మనంబును దనిసిన	226
కపిల యిచ్చిన వానిన కాదు	360
కమనీయ హంసకుల	135
కమలదళమున నున్న జలము	557
కయ్యమునకు నెపుడు	664
కరి కచ్ఛపముల పెన్నె	89
కరి చెలంగి నీ మీఁద	494
కరిపతి నీరు ద్రావుటకుఁ గా	82
కరుణ మొగమునందు	111
కరుణాఢ్యుఁ డగు పరాశర	428
కరువునఁ బోసిరో విధుని	67
కర్ణశృంగాక్షి ఖుర	361
కర్మ ఫలములు గుడిచిన	691
కర్మములకుఁ గర్తగా	699
కలదది యూరక కానఁగ	709
కలదొక రహస్య గోపన	209
కలదో లేదో యనియెడు కలదోలేదో	708
కలమెయిఁ బాల నేత	756
కలయఁగఁ జూడ	136
కలిగియుండియుఁ దెవు	681
కలుగునె యమోఘమగు	46
కల్లుత్రావుట గురు తల్ప	441
కవిసి ఖరంబులైన ముని	85
కశ్యపాత్రి విశ్వామిత్ర	402
కశ్యపు భార్యలు కద్రువ	61
కాంచి నిరూపించి యా	586
కాంత జాత్యంధుండు	684
కాంస్యోపదోహాయుఁ	264
కాదని పూని పల్కుటయు	68
కానకు నేఁగి తాపసులఁ	108
కాన తపంబును విద్యయు	599
కాననము గిరుల నదులు	286
కామములు భోగములఁ	739
కామరసమున నతి	740
కామార్థంబులు మోహో	814
కారుణికత్వధుర్యుండగు	592
కారు దుర్యోధనుఁడు నీవు	14
కార్తెఁ బాయసమబ్జ	280
కార్తెఁ బైతృకమగు	386
కార్యమగుటయు నరిగె	152
కాలఁ గేలఁ గోలఁ గపిల	361
కావున	474
కావున	606
కావున	821
కావునం బతికి	763
కావునఁ గాంతాధర్మము	757
కావునఁ గామక్రోధము	116
కావునఁ గుడువక	692
కావునఁ జెఱువులు	283
కావునఁ గౌరవంబున	517
కావున ధర్మంబు	813
కావున నత్యాదరంబున	550
కావున నధ్యాత్మక	527
కావున నన్నదానమున	599
కావున నాచారపరత	499
కావున నిందఱునుడుగుం	12
కావున నీవడిగి మేలు	389
కావున నీవు నిన్నిచ్చినం	154
కావున నుద్యోగంబును	706
కావున నుపవాస వ్రత	523
కావున నెట్లుఁ జంపుదు	5
కావున నే విధమున	714
కావున నొల్లను బది	486
కావున భవితవ్యము	830
కావున భిక్షుఁ జెంది	449
కావున భూమియు	362
కావున మాంసముపై	576
కావున మీకుం బ్రియముగ	620

పద్యము	పుట
కావున లోభము విడుచుట	418
కావున వారికి భక్తుఁడ	803
కావున విను త్రివర్గంబు	734
కావున విప్రారాధకుఁడై	672
కావున విష్ణుని పేళ్ళగు	783
కావున శ్రాద్ధ క్రియలకు	395
కావున సాగ్నికుఁ డయి	398
కావున సువర్ణ మసదృశ	373
కాశిరాజ కన్యకలకు	839
కినియమి సంగవర్జన	650
కిల్బిషంబు గోశకృన్మాత్ర	329
కీడొకప్డు లేదు కృత	834
కీర్తనీయుఁ డైన కేశవు	779
కుటిలంపుఁ దలఁపున	70
కుడిచిన యప్పుడ యోగము	546
కుడిచేతఁ బిదప డాచే	431
కుడుచుట కట్టుట	210
కుడుపునకు ముందరొడ్డ	293
కుడుపు నిదురయు	252
కుల కన్యకలకు వేడుక	18
కులమును రూపము	510
కలమును విద్యయు	278
కులమును శీలము	226
కులమును సమ్మాన్య	208
కుల వయోరూప శీల	389
కుసుమముల గంధము	470
కృత్తికాంగార సంసేవ	174
కృష్ణుండు	795
కృష్ణునకుఁ బ్రణమిల్లి	797
కృష్ణుపాలికిఁ బోయి	295
కొండొక కాలంబునకు	375
కొంతవడికిఁ దెపిఱి	253
కొడుకులఁ బంచితెల్పె	95
కొడుకులు బహువిధు	232
కొనియంత నిలువక	246
కొమ్ములఁ గాళ్లం బిండిగ	349
కొలను వెడలి బిసము	409
కొలుచపహరించు నన్నరు	567
కోకిల కుల గంధర్వా	625
కోపమునఁ బ్రసాదంబున	199
క్రందున మేను సిదియు	587
క్రూరపు భూతముల్	633
క్రూరునకు నాస్తికునకు	289
క్రేపులు తో రా దుర్గతి	345
క్రోధకామాదులైన దుర్గుణ	702
క్రోధలోభ కామానృత	745
క్షత్త్రబంధుఁ డనఁగ	481
క్షత్త్రియాదుల చేతనుం	36
క్షత్త్రియుం డశ్వంబు	511
క్షత్త్రియుధనము భాగము	231
క్షత్త్రియులకు విప్ర	646
క్షమయు సత్యంబు	696
క్షరుఁడు నక్షరుండు	543
క్షాత్త్రమంద్రు బుధులు	226
క్షీరము దధియును	356
క్షుత్పిపాసలచేఁ గడు	658
క్షేత్రంబు పురుషకారము	48
గ	
గంగా తరంగ శీకర	187
గంగా తీరంబునం గ్రతువు	789
గంధ పుష్పమాలికా	727
గంధమాదన సంగత	173
గతి పతియ చువ్వె భార్యకు	765
గరగ లొసఁగిన నరుఁడు	284
గరుడవృషపతాకా కల్పితా	143
గరుడారోరహణ లీలా	125
గాధి యమ్మునిపుత్రు	38
గార్గ్య గౌతమ కాత్యాయ	559
గిరిజయు గిరీశుఁడును	374
గిరివనదుర్గము లందును	396
గుణములఁ బొందఁడు	552
గుదతలము నొవ్వఁ దోమిన	430
గురునిమాట సరకు	499
గురు నుపదేశము	546
గురు శుశ్రూషకులును	309
గురు శుశ్రూషా మహిమం	454
గూనివాఁడును బిచ్చుక	686
గృహస్థ ధర్మ ప్రకారంబు	24
గృహస్థ ధర్మానుష్ఠానంబు	22
గొడ్డు బడుగుఁ దెవులు	289
గొఱియ నంజుడు ఖడ్గంబు	386
గో ఘృతంబు ప్రాశించి	357
గోదాన విధము సుపథ	293
గోలోకంబునకు ముఖ్య	349
గోవగ్నిమయ మమృత	244
గోవిశేష మర్థి నీవు	354
గోవిషయ వాక్య పఠన	367
గోవునకు బ్రాహ్మణుల	243
గోవులకును గోవులు గతి	345
గోవులకు మేలు సేయంగ	367
గోవులకై యొండెను	593
గోవుల పాలమృతం బని	288
గోవుల విప్రులకిచ్చిన	288
గోవులు మొదలగు తిర్య	602
గోవులు సూర్యుని యుజ్జ్వల	308
గోవు లెక్కుడు తపో	287
గౌతమీ లుబ్ధక భుజంగ	14
గౌరియగు కన్య వరదా	399
గ్రువ్వ గ్రద్ద దివ్యా	509
ఘ	
ఘనతర కంధరుండు	64
ఘనతరమగు హ్రీ	160
ఘనుఁడగు కాలుని	11
ఘృతము పాలమివర్తి	473
చ	
చంచులఁ జిగురాకు	66
చండదేవుఁడనఁ బ్రశస్తి	36
చంద్రార్క నక్షత్ర సహిత	781
చచ్చిన నత్తపస్వి సతి	110
చతురవు వివేక విభవో	757

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
చతురాశ్రమముల లోపల	608
చతుర్వింశతి తత్త్వంబులు	531
చని దానిచుట్టు మండెడు	90
చనినన్ గరుత్మంతుండు	88
చని భీష్ముని వీర శయన	828
చని యల్ప శరీరుండై	84
చనుదెంచి పామునకు	9
చనుదెంచి యర్జునకు	12
చయనంబుల ఋగ్వేదం	796
చరితం బద్భుతము	262
చరియించు భక్తజనులకు	756
చరువులు నమ్మని	40
చాఁగి మ్రొక్కి తప్పుసైఁపు	238
చిగురుటాకుల గాసి	18
చిచ్చుఱ కన్నదరు లెగయ	324
చిత్రకూట జనస్థాన	175
చిరకాలంబున సాక్షా	610
చుట్టాల నీ దగు చెట్ట	612
చూపినం జూచి	46
చెప్పినఁ గోపమున్	76
చెప్పిన భయంబును	240
చెప్పిన విని భవాని	705
చెప్పుమనిన నప్పరమే	734
చెప్పుము మఱియు	529
చెలులుం జుట్టలు సంబం	205
చేతఁగొని యుప్పు నమలుట	506
చేతనుఁడగు పురుషుని	551
చేయఁ డపాత్రవ్యయ	663
చేయుటెంతయు మేలైన	719
చేయునది లేక నిర్జర	93
చేరి వినయావనతుం	138
చేరువ తీర్థము కంటెను	718
చ్యవననందనుండు	40
చ్యవనుఁడు గవిజాతుఁడు	247
చ్యవనుని నహుషుని	237
ఛ	
ఛందోజ్ఞున కైనను	416
ఛత్రమిచ్చి కాంచు	285
ఛాయ నతిథి వర్గంబు	457
జ	
జగదవన వినోదాసత్య	464
జనకుం డధికుఁ డు	516
జనకుఁడు గౌరికిన్	179
జనకుఁడు వేడుకఁ	369
జననాథ విను తపస్వా	57
జననిం బాసి జనించు	65
జననీజనక గురుల	567
జననీ జనకులచే	516
జననీ జనకు లుదక	234
జననీ జనకులు లేకున్న	236
జననీ నీవమృతంబు	94
జనపతుల్ దమ	690
జనపతులకుఁ గర్తవ్యము	197
జనములు దుస్స్వప్నం	329
జనములు సూచుచు	432
జనవర కృమి గర్దభ	566
జనవర తీర్థ విధాశంసన	181
జనవర పుణ్య కర్మముల	298
జనవర మాంసము చవి	578
జనవర యన్నదమ్ములు	514
జనులకుఁ గీడు రోయక	733
జనులకు నింద్రుఁడు	189
జపములం దెల్ల నుత్తమ	776
జలచరములపై నర్మిలి	239
జలదస్వన సన్నిభమై	125
జలమున మీను న	556
జాములును దివసములు	741
జాలరులు వలల నచ్చటి	238
జాహ్నవీదేవికి జనకుఁడై	37
జిహ్వ మరలఁ బడఁగ	377
జిహ్వ సోముఁడు వాణి	541
జీవుఁడు జీర్ణ శరీరము	694
జూదరి గరదుండు	389
జ్ఞాతులయెడ గోవుల	412
జ్ఞానమున విముక్తి	743
జ్ఞానుల యీ పనికై	350
జ్యోతి స్సాలోక్య కులో	474
జ్వరమున గుల్మపీడ	685
త	
తండ్రి పిమ్మట నన్నయ	515
తగనియది యెద్దియైన	501
తగిన తెఱంగు సెప్పెద	239
తగిన యట్టి ధూపము	471
తగిన వరునకు నిచ్చిన	233
తగు బుద్ధి లేక సంపద	682
తగు భృత్యులఁ బ్రోవ	414
తత్పుత్ర పౌత్ర క్రమం	47
తత్త్వమునఁ గల్గు	545
తదనంతరంబ	119
తదనంతరంబ	320
తదనంతరంబ	830
తదనంతరంబ	837
తదనంతరంబ యకుంతిత	125
తదనంతరంబ విపులుం	218
తదనంతరంబ సౌర	340
తదవసరంబున వంగా	219
తనకడకు నారదుఁడు	195
తనకుం జండాలత	32
తనకుఁ గలయట్టి	291
తనకుఁ దాన కలఁడు	564
తనకు నొక్క తాపసుం	108
తన కులము వీతహవ్య	44
తనచేతికి నిచ్చిన	764
తన తన వర్ణంబునకు	648
తన తనువు వనిత	256

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
తనపోయెడు పనికిం	32
తన ముందటి తెఱంగెఱింగించి	296
తనయ నొక్కని కిచ్చి	568
తనయింటఁ గలుగు	474
తనయునిఁ బడయుట	617
తనయులఁ దెగటార్చి	45
తనలావున కధిక	696
తన సవతియైన కద్రువ	61
తనియ మేసి నీరు ద్రావి	317
తనుఁ గనుఁ గొనియెడి	304
తనుఁ జూపి యోడ	137
తను నమలిన వాని నమలు	577
తన్ను వెఱగు పడిచూచు	94
తన్వి సాత్త్విక రాజస	700
తపమని యార్యులు	400
తపమునను బ్రహ్మచర్య	696
తపము పెంపున సురభి	339
తపముల దానంబుల	580
తప ముల్లము కల్మష	598
తప్పక కాన్పుఁగ లేమిం	813
తమకు ధనము లేక	680
తమజాతికిఁ దగు కర్మ	358
తమ తమ కర్మముల్	676
తమ తమ సారములకు	729
తమ బంధులుఁ దారును	688
తమయంత నెఱుఁగరు	818
తము విశసించుట కా	669
తమ్ములును గృష్ణుఁడును	826
తఱియైన మనుజులఁ	709
తలఁ జీర సుట్టియును	390
తలదిక్కు గవలుఁ	837
తలపై జాహ్నవి నాలుక	186
తల విసరి వెలఁ దగఁగ	241
తల్లిఁ దండ్రిఁ బాసి తనయంత	234
తల్లికిఁ దండ్రికి సుతులకు	510
తల్లి కెఱిఁగి ముదము	826

పద్యము	పుట
తల్లి గోవు వృషము దండ్రి	319
తల్లిదండ్రులమ్మఁ దనయు	236
తాత పాదపద్మములు	183
తాత్త్వికములైన పురుష	698
తాన దికృతి దనకిట్లు	788
తానును వేఱొక్క సెజ్జం	150
తాను శుచిత్వం బేమిట	435
తిరిసి యేనియు నన్నంబు	572
తిలదాన మఖిల దానంబుల	286
తిలపాయస ఘృతములు	385
తిలపిష్టము దధిదుగ్ధం	475
తిలరాశి యిచ్చినఁ గలుగు	722
తిలలు పితృభోజ్యములు	285
తీర్థ భజనంబునకు నెందు	624
తెచ్చి డించి కద్రువ ప్రీతి	93
తెచ్చితి ఋత్విజుల్ వచ్చిరి	829
తెప్ప దెరలంగ బండు	587
తెరువుఁ దప్పి తూఁగాడుచు	438
తెరువున నొక మిధునము	222
తెఱవ యొడఁ బాటు	25
తెవుళులు గొన్నవారి కవి	730
తొలుమేన నహింసారుచి	821
తొల్లి నిర్దోషచిత్తత	211
త్రిపథగా సేవనమున	184
త్రిశిఖరంబను పేరి ధాత్రి	341
త్వరిత విహిత గాఢ	640

ద

పద్యము	పుట
దంతధావనము మూత్ర	504
దంతి యడుగు లోనఁ దక్కిన	575
దంతి సనంగ భూరిమద	84
దమమును దపము నహింసయు	180
దమమును దపము నహింసయు	561
దర్శన ప్రీతి వారిపైఁ దగుల	246
దశకల్ప సహస్రంబులు	118
దానఁ జేసి తదీయ మహా	478
దానన చేసి యతినికిన్	343

పద్యము	పుట
దాన నీ యడిగిన యర్థంబు	586
దానప్రవణ యుపాన	426
దానము ధర్మము దప	580
దానమును దపంబు	584
దానము యజ్ఞక్రియనాఁ గా	268
దానము లన్నిటికిని	270
దానము లాదిగాఁ గలుగు	286
దానము సమగ్ర ఫల	302
దాన రతులు సక్షము	490
దానార్హ వస్తువులలో	598
దానిం జెప్పెద నవధరింపుము	483
దానిఁ గని పాకశాసను	109
దాని కమ్మను లెల్లఁ జిత్త	619
దానికి దివిజులు అసూయా	211
దానికి నేను జిత్తమున	296
దాని తెఱంగు నా కెఱింగింప	224
దాని నెఱింగి గృహంబున	204
దాని నెఱింగి భూసురత	422
దాని పేరు గోలోకంబు	309
దాని మీఁదనుండి వాని	86
దాని యుదాత్త వృత్తము	55
దానోపవాసముల సన్మా	438
దాయ ధనంబు సంగర	310
దారయుతంబుగా	653
దారిద్ర్యముచేఁ గుందుచు	271
దాసత్వమొంది యదల్పు	687
దాసియై సవతాలికి	75
దినకర చిత్త స్పష్టము	425
దినమున సురతం	508
దినము రాత్రియు ఋతువు	223
దివము వంధ్యంబు గాకుండ	573
దివియలోఁ బడుఁ బ్రువ్వు	667
దివ్యపరిమళంబు నవ్య	219
దివ్యబోధ మహనీయుండు	40
దివ్య బోధాఢ్యు వేదవ్యాస	170
దివ్యముని యగు కాశ్యపు	285

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
దీనికి నఖిలాశ్రమ	659
దీని విఘటింపం జేయుదు	109
దుందుభి నిస్వనములు	133
దురితము లనేకములు	481
దుర్యోధనుం డతిలోభం	2
దుష్టమైన గోదానంబు	294
దూరాగతులు నపూర్వు	206
దేవగృహము కడ వీథి	501
దేవతలఁ జిత్ర తపము	190
దేవతలకు నగ్రపు	474
దేవతలర్హ కుసుమ	470
దేవత లాఁకొని దేవతా	323
దేవతిర్యఙ్నరస్థావరా	456
దేవ దేవ జీవాత్మక	832
దేవా నీ దగు కారుణ్య	300
దేవపితృ సమర్చనా	293
దేవశర్మ యను ముని	212
దేవాతిథి పితృపూజలు	660
దేవా! నీదు ప్రసాద	759
దేవా! విశ్వము గలుగుట	619
దేవా! వైశంపాయనుండు	1
దేవా! వైశంపాయనుండు	145
దేవా! వైశంపాయనుండు	315
దేవా! వైశంపాయనుండు	466
దేవా! వైశంపాయనుండు	642
దేవాసురయుద్ధంబున	204
దేవా హుతవహ పరి	459
దేహం బనియెడ నెరవు	533
దేహగత భూప్రభృతి	565
దేహాభిమాన సంభృత	640
దైవంబు నదైవము	198
దైవంబొ? కర్మవర్తన	705
దైవగతిఁ జేసి తమకుం	668
దైవతార్చలపుడు తామస	472
దైవిక కృత్యంబులకు	388
దొరకొనని వానిఁ గోరక	180
దొరకొనని వానిఁ గోరక	562
ద్రవిడ కళిం గాశీనర	199
ద్రుమముల దళకుసుమ	52
ద్రోణశర్మ పదంబున రూఢ	175
ద్వారవతినొక్క నూతం	294
ద్విజభామినికి నధర్మ	767
ధ	
ధనము గలిగియుండి	680
ధనములు చెడిన బాంధ	737
ధనములును దానములుఁ	741
ధనవాంఛ నిరాయుధు	569
ధనియధనుఁడు రూపసి	764
ధరణియుఁ గాశ్యప	160
ధరణీదేవ క్షేత్రము	483
ధరణీసుర జనన	594
ధరణీసుర ధనహరణము	301
ధరణీసుర రాజ వణి	229
ధర్మంబు నానావిధంబుల	730
ధర్మంబు భయమున	168
ధర్మదేవత నేనుదగ	27
ధర్మనందనుఁడు పితా	574
ధర్మపథమునఁ బనిచి	233
ధర్మపుత్రుండును దమ్ములు	836
ధర్మములకు సంజ్ఞ	812
ధర్మములు దానములును	724
ధర్మా ధర్మ విదూరనీతి	312
ధూపదానంబుల యందు	471
ధృతవేద త్యజనానల	414
ధృతి పూనమిఁ బ్రకృతికి	553
ధృతి విజ్ఞాన శ్రద్ధలు	745
ధేను ప్రమాణయగు	331
ధ్యానంబింద్రియ వృత్తుల	573
ధ్యానమున దర్శనీయం	529
న	
నక్షత్ర విశేషం బాకర్ణిం	386
నగుచుం గద్రువ	73
నడప మదాత్మయగ్ని	621
ననుఁ బ్రద్యుమ్నుం డివ్విధ	798
నను నిండు రెండు లోకము	273
నను నే డాఁచెదనన్న	494
నన్నుం గనుగొని నీవు	801
నన్నుం గానమికిం గలంక	134
నన్ను నీ వడిగిన యట్లు	458
నమ్మి యిల్లడవెట్టిన	570
నయనములకుఁ జిత్త	307
నయ మిట్లారఁగ నాత	424
నరకం బెట్టిది కల్మష	710
నరకవాస కారణము	170
నరనాథ కాలహీనంబు	165
నరనాథ యహింసాగుణ	584
నరనాథుండై యుండియు	42
నరవర గౌతమునకు	181
నరవర దుర్దాంతు లయిన	159
నరవర పొల్పు నోఘవతి	28
నరవర యర్థంబులును	525
నరుఁడు జరాయుజము	701
నర్మద నాడి భూనాథ	178
నలినంబులు జాజులు	468
నల్లఁగా జేయువార	72
నహుషుఁడు భూపాలనము	477
నాకనిన యాశ్చర్యంబు	799
నాకపతి యిచ్చటికి	218
నాకుఁ గ్రతువు సేయింప	213
నాకు నివ్వర మిమ్మని	41
నాతి తీర్థ సేవనంబును	717
నాతి వినుగ్రహచారంబు	693
నా దిక్కు కనుంగొని	135
నానాతీర్థ సతత	655
నానాత్త్వైకత్వము ల	554
నా నీ సంవాదము	768
నాయంగంబుల నెల్లం	801
నారదముని నాయకుని	489

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
నారాయణ పదవాచ్యం	607
నారాయణ సౌహార్దో	624
నారాయణాంక తలమున	104
నాలుగాశ్రమముల	755
నాలుగు జాతుల నాతులు	156
నాలుగు ముఖములు నీకు	628
నా వచనంబు నట్టుల	26
నా విని భవాని పురుష	697
నావుడు నరుంధతి యల్ల	414
నావుడు మీ లోపల నొక	351
నిందితాచారయుతము	88
నిజదారపరులు సంతత	267
నిజ ధర్మ నిరతుఁడై	193
నిజేచ్ఛమై వచ్చిన	67
నిటలంబు కనుదెఱచు	627
నిత్యసత్యులు శౌచ	105
నిత్యుఁ డాత్ముండు దేహ	694
నిద్రపెంపు నిద్ర నిగ్రహిం	753
నిను నే మఱతునె నీ దగు	134
నిమి యక్కుమారునకు	393
నియతియు వినయము	101
నియతుండై తలఁచిన	38
నిరుపకరణ మనఁగ	716
నివ్వెఱపడి యండనయ్యండ	62
నిశ్చితంబుగా నొక్కెడనుండి	634
నీకుం బుట్టెడు కొడుకు	41
నీకుం బుత్రోత్పత్తి	39
నీకును నేను బుత్రుఁడ	77
నీకు నే ననుజ్ఞ యిచ్చితి	834
నీచ శూద్ర వైశ్యనృప	591
నీ దగు తనువున దివ్యా	305
నీ పనుపు చేసి బ్రదికెద	793
నీ బుద్ధి ధర్మైకనిష్ఠ	824
నీ యడిగిన గూఢము	563
నీ యడిగిన యట్టిదానికి	616
నీ యాజ్ఞఁ జని కమనీయ	305

పద్యము	పుట
నీరుంబాయఁగఁ జల్లి	91
నీవలసి నప్పుడట్టి	38
నీవా చ్యవనుండును	792
నీ వాహన మయ్యెద రథ	129
నీవిట్లు నన్ను నడిగితి	807
నీవు కతంబుగ నా దగు	216
నీవు గెల్చిన దాస్యంబు	69
నీవు నా మనంబరసి	588
నీవు నామీఁది వేడుక	134
నీవును నవధానము	311
నీవును మత్సంపూజ్య	197
నీవును మృత్యువుఁ బాప	11
నీవు మమ్ము బోధింపఁగా	619
నీవు రుచిఁ గాచునప్పటి	222
నీవు శోకంబు దక్కుము	840
నీ వెట్టి పురుషులయందు	104
నీళ్ళ నాడక ముని పూఁత	505
నృప యీ యాఖ్యానము	603
నృపవర పూర్వాహ్ణం	164
నృప వైష్ణవ ధర్మము	116
నేయి పాలుపఱిన	50
నేయు మధువు సక్తువు	507
నేరిమి దాని నుపేక్షం	553
నేర్చి యలజడిఁ బడిన	572
న్యాయార్జితంబైన యర్థంబు	719
న్యాయార్జితమగు నన్నము	571
ప	
పంచ పర్వసురత	660
పంచవింశ మధిష్ఠాన	531
పగలును రేయుఁ గుడ్చి	526
పట్ట పగలింటి సూర్యుని	132
పడి యొక్కింత సేపు	304
పతి తనకు నేమి యిచ్చిన	764
పతిభక్తి ముఖ్యధర్మము	660
పతిమతము గొనక	762
పదంపడి	412

పద్యము	పుట
పదంపడి ధనదుండు	148
పదపడి నయమున	150
పదపడి యక్కుమారకుఁడు	102
పదియును నూఱును వేయును	328
పనిచిన నప్పొలంతి	16
పనిచిన యప్పలుకులు	241
పనులయెడ మాఱు	763
పరదారగమన దోషము	568
పరదారగమన మొప్పదు	500
పరదారల యందును	500
పరధనంబుల కాస	439
పరధన పరదారల	676
పరబలముపై నడరి	669
పరమగు నీ వ్రతమున	523
పరమజ్ఞానుల యొద్దను	454
పరమజ్యోతి యనఁగ	797
పరమతప మాచరింపఁగ	33
పరమతేజంబును బరమ	777
పరమనిష్ఠతోడ బ్రహ్మ	482
పరమ పవిత్రముల్	333
పరమమైన యీ ధర్మంబు	450
పరమబ్రహ్మం బనఁగా	605
పరమ మంత్ర విధుల	673
పరమ వినీతమై నెఱఁగి	76
పరమ సంస్కృత యగు	232
పరమానుష్ఠేయం బిది	606
పరమేశ యాసురి	766
పరమేష్ఠి చెప్పిన పరమ	604
పరశురాముఁడు గిన్క	372
పరశురాముఁడు భృగు	50
పరిగృహీతులైన	394
పరుషత్వము లేకంతః	729
పరుసని పల్కు బొంకు	733
పఱతెంచి పరమాదరం	149
పలల వృథోపభుక్తి	411
పలికినఁ దత్క్షణంబ	246

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
పలికిన బ్రాహ్మణుం డొ	423
పలికి యంతర్హితుండయ్యె	129
పలుక వలదు శౌచక్రియ	430
పలుదెఱంగుల వంట	391
పలువురు గ్రీడింతురు	224
పలు సదువులు సదివి	161
పవనుఁ డాకసమున	215
పసులం బాలించు నతఁడు	675
పాండవాగ్రజ నహుషుం	480
పాద్యమిఁ బితృయజ్ఞ	384
పాతివ్రత్యము గలిగిన	225
పాద పాయూపస్థపాణి	121
పాదరోగు లశుచి	685
పానీయ దానముత్తమ	282
పాపంబుఁ బుణ్యమును	53
పాపంబులును భయంబులు	775
పామును మృత్యువు నేనును	12
పారంబు లేని ధర్మా	815
పారావతములు శుకములు	509
పారాశర్యాదిమునులు	616
పాఱినవాతని వెనుకన	801
పాఱిభీతిదోఁపఁ బల్కు	45
పాలుగడుఁ బెక్కుదాని	297
పావకునిం బ్రస్తుతించు	20
పావనంబులలో నెల్ల	522
పావనమని శ్రుతి చెప్పిన	355
పావనము సువర్ణము	371
పిండ సంబంధమున	399
పితృకరంబునఁ బిండంబు	370
పితృకార్య యజ్ఞముఖ	577
పితృపూజ సమగ్రము	382
పితృయజ్ఞంబునకు	383
పితృయజ్ఞ ప్రకారం	382
పిలకాదులఁ గంతులచే	685
పిలిచి యేకాంతంబున	212
పుట్టి యప్పుడమితేని	406

పద్యము	పుట
పుణ్యంబగు నితిహాస మ	616
పుణ్యంబులైన యరణ్యం	447
పుణ్యకర్ములు హర్షంబు	487
పుణ్య దినమునందు భూసు	318
పుణ్యపాపానుగుణభంగి	566
పుణ్యఫలకాలమున	446
పుణ్యస్థలములనెల్ల	595
పుణ్యాంగనాకారములు	626
పురుష వరులార యద్భుత	140
పురుషాతిగ యై తోఁచును	115
పురుషుఁడు శతాయు వను	498
పురుషు హిరణ్మయు	443
పురుషోత్తముని నామ	780
పులుఁ గొక్కఁడు పూర్వా	62
పూజకుండు శక్తి సంపన్ను	475
పూజా నమస్కారంబులకు	783
పూజా నమస్కారములకుఁ	784
పూజితునిఁ జేసి యతనికి	249
పూరి పంట ప్రాలునారుగ	397
పూర్వదత్తయైన భూమి	275
పూవులఁ గాయలఁ బెరిగి	54
పెండ్లిగాక మున్న పితృ	235
పెక్కుదినంబు లాహార	255
పెలుచన్ గోళుల నొత్తి	86
పేర్కొని పలుమాఱు	26
పేర్చు మతంగ వాపిక	176
పొడసూపి ధర్మమార్గం	371
పోరులయందలి మరణము	670
పౌరుషమ్ము దైవంబు	49
పౌర్ణమాసిఁ బూర్వపక్షా	519
ప్రకృతి కవ్యక్త నామక	743
ప్రకృతి నిట్లు వాసి పంచ	557
ప్రకృతులు పెక్కన్నింటికి	115
ప్రణమిల్లి యతనితో	610
ప్రణుతయగు నమో	607
ప్రబల దైత్యులు పుర	806

పద్యము	పుట
ప్రమద విషాదాది	313
ప్రయతులై పుట్టి యే	687
ప్రస్తుతులఁ బుండరీ	777
ప్రాక్పయోనిధి పొంత	80
ప్రాఙ్ముఖుండు నార్ద్రపాదుం	501
ప్రాణంబులకు విధారక	277
ప్రాణునపాను నందును	751
ప్రియభక్తుండవు భక్త	127
ప్రియమతి యజ్ఞసేనియు	644
ప్రియవాదితయును శాంతి	437
ఫ	
ఫలము దళంబునుం	666
ఫలము నినుము వెండి	569
బ	
బలము నీవ నాకు భక్తుండ	832
బలము లేఁబ్రాయమును	308
బలవంతుండవు నేర్పు	78
బలిభిక్షము గడప కిడ	765
బలిమిమెయి వరుఁడు	227
బలు లుభయప్రకారం	460
బహునేత్రములు మేన	809
బహురూప విశ్వరూపక	331
బహువిధముల ధాన్య	404
బాల్యమునఁ దండ్రి యౌవన	154
బిసములాదట నందఱు	409
బుద్ధిగల్గు సాధనముల	8
బుద్బుద విరహితంబుగ	432
బొడ్డుతామరయం దొక్క	795
బోధ మక్షీణపాపునకు	451
బోయలు నిజకుల ధర్మము	240
బ్రదుకును జావును పరమ	587
బ్రదుకును జావును సుఖ	585
బ్రహ్మఁ గల్పించి దానికి	119
బ్రహ్మచర్యంబు కంటెను	162
బ్రహ్మచర్య భిక్షాశన	755
బ్రహ్మచర్యవ్రత పరమ	649

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
బ్రహ్మ యాతమంబు	702
బ్రాహ్మణజాతికిఁ బరి	58
బ్రాహ్మణత్వంబు గడు	30
బ్రాహ్మణారాధనమున	816
బ్రాహ్మణుఁ డొకనికి భార్య	761
బ్రాహ్మణుల సృజియించి	202
బ్రాహ్మణ్యం బెల్లవర్ణం	202
భ	
భక్తవత్సల పరమాత్మ	124
భగిని గురుని మిత్త్రు	508
భరితానందుఁ డగుచు	301
భవదీయ బంధు లందఱు	596
భాగీరథి యెచట నుద	173
భార్య పుత్త్రకుఁ డల్లు	613
భార్య పుత్త్రు లాదిగఁ గల	446
భార్యా సహితముగా	249
భావశుద్ధి గలిగి యా	665
భిక్షకుఁ డిమ్మెయి	448
భిక్షుభావంబుఁ బొంది	453
భీష్ముం డిట్లనియె	339
భూతపంచక శక్తులు	505
భూతముల కలుగు	584
భూతము లన్నియు నడఁగి	540
భూతరక్షోగణములకు	469
భూదేవ శక్తిన కాదె	786
భూనాథ! విప్రులు సమా	198
భూనాథుఁడు తృష్ణ సెడం	107
భూమికి గోవులకును	371
భూమి కెంతాయువు	270
భూమి నఖిలమగు విభూతి	721
భూమి రత్నగర్భ పురు	274
భూరిగుణయోగ విఖ్యాత	778
భూసుర కోటికిన్ వినయ	269
భూసుర ధనాపహరణ	481
భూసురుల కలుక పుట్టం	671
భూసురులకు నృపులకు	517
భృగువంశ సంభవులగు	341
భోగార్థులై తపంబునకు	651
భోజనార్థులఁ దుష్టి	166
భ్రమగొని యద్దేవుని	133
భ్రాతృ స్నేహముగల్గి	109
మ	
మంగళ రక్షాశుచితా	755
మగతనమునాఁడు మీరు	108
మతంగుం డేకపాదంబు	33
మదనహరా యోగనిరతు	548
మదమునఁ బెలుచన	31
మది ఖేదము మై దప్పియు	132
మది నద్భుతంబుఁ బ్రమ	247
మధ్యదేశమున గ్రామంబు	291
మనమున నైదింద్రియ	751
మనసంవాదం బెవ్వరు	769
మనసునను వాక్కునను	576
మనసు నింద్రియములు	261
మనుజనాథ యశేష	775
మనుజేంద్ర కురుక్షేత్రం	596
మనువంశంబునఁ బుట్టి	15
మమకారాహంకారము	134
మమ్ము సంసారవార్ధి	615
మఱియుం బొడము మాట	296
మఱియు గంధమాల్య	307
మఱియును బంక్తిదూషకు	389
మఱియును యమదూత	711
మఱియు నొక్కటి యక్కజం	341
మఱియు నొక్క విశేషంబు	697
మఱియు నొక్క విశేషంబు	365
మఱుఁనాఁడు	318
మలయజము నగలు	472
మహాత్మా సుమనోధూప	467
మహానుభావుండు గావున	352
మహితాత్మక యేతాదృశ	381
మాంసంబు పితృదేవత	577
మాంసభక్షణ దోషంబు	583
మాంస మానకునికి	579
మాకుం గుశలము గోరుము	378
మాతకును వేదమునకు	521
మాతృపితృగురులు	567
మాతృ పితృ హీనయై	227
మాధవ పాండు కుమార	832
మానవనాథ యీఫెన	353
మానవనాయక! యగ్రజు	515
మానవ లోక కలిత	98
మానవుఁడొపి యాశ్వయుజ	321
మానస కృత్యముల్ సుర	724
మానిత పాత్రము సదను	307
మానిని త్రివిధముల్	712
మానుషయోని జనించి	623
మామకు నత్తకు మార్వల్క	600
మా మూత్ర పురీషంబులు	365
మాయారహితుఁ డహంకా	706
మాసోపవాస విధులం	655
మిమ్ముఁ దెగఁ జూచి సద్గతి	350
మీనములుఁ దారుఁ దనువు	246
మీ రాఁకలి పెల్లున నాహారం	404
మీరిట్లు ప్రసన్న మతిన్	366
మీరీ యనలంబు తెఱం	619
మీ సమీపంబునం దున్కి	364
ముట్టునను భార్యఁ గవయు	413
మునగ యుల్లి యడవి	394
ముని కృప నావహింపఁగ	44
మునిజనుల నదుల	157
మునినాథ గోవు నిచ్చెద	243
మునిపతికిని వినయ	45
మునిపతియుం దఱి	102
ముని మనుజ పతుల	615

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ముని వనమున శూన్యా	546
మునివర నాదగు చిత్తం	638
ముని హృదయాబ్జ శాంతి	142
మును దా విప్రున కిచ్చెద	275
మును నిద్రించు ప్రక్క	253
మును పాపము లెన్నియొ	185
మునుముట్ట నెఱిఁగి	392
మునులకు జప్య బిది	182
మునులకు నేనుఁ గేటికి	486
మును లనుపఁగఁ గృష్ణ	825
మునులును దివిజులు	276
ముమ్మాటి జలపానము	433
మూఁడు పథములఁ జని	188
మూత్రపురీషో త్సృష్టికి	430
మృతిఁ బొంది పునర్జన్మము	727
మృతిఁ బొంది వేగ జన్మిం	704
మృతుండు మేను విడిచి	563
మృతులైన వారలు నిరా	709
మృదువులు సత్యోపేతులు	489
మెలఁగుచుండి రట్టియెడ	67
మేధావియై విన్కి మిగిలి	683
మేనించుక సోఁకిన గంగా	184
మేను జీర్ణముగాఁజేయు	695
మేనెల్లఁ గపిలమైనను	361
మేరువు మణులును	192
మేలి గుణములు గని	392
మేలివి కీడివి యని భూ	500
మేలు గడువేగ చేయరు	741
మేలు రెండు లోకంబుల	49
మేలొనర్చెదం గాక	56
మొదవుఁ దన్నుట రవి	410
మొదవులలో నెల్లఁ గపిల	323
మొలవం బెట్టని యట్టిది	820
మోక్షపరులు శుచి	634
మ్రానను ఱాతనుం గలదె	578
య	
యక్ష గంధర్వ సిద్ధ	549
యతిరుజఁ బొందినం	438
యతిసర్వాశ్రమచరణ	436
యాగకర్తయు శాంతుం	271
యాగాది కర్మముల	284
యాయావరుల నమర	654
యుగసామర్థ్యంబు	521
యోగంబు తెఱఁగు	550
యోగధర్మంబు కంటెను	549
యోగ్యుఁడైన విప్రుఁ డొక	164
యోషిజ్జనంబులు దోషం	209
యౌవన దర్పమంది జప	74
ర	
రంతిదేవుండు వేవత్సర	346
రక్తమాంస సహిత భక్త	476
రక్షించునది యుదరం	452
రచ్చ కొట్టంబు నారామం	169
రథముఁ దివిచి డస్సి రమణి	800
రదిఁ గొను మచ్చోటను	492
రమణీ! తృష్ణాసమదుఃఖ	739
రమణీ! యధ్యయనము	646
రమణీ! వర్గత్రయ	734
రవిపాల నిచ్చెద రమ్ము	491
రసగంధాది గుణాలి	748
రాజన్య సముచితం బగు	593
రాజముఖ్య తగు సరస్వతి	292
రాజవర రాజుదెస	405
రాజు దనదు సకల	242
రాజునకు రాజవంశ	228
రాజునకు వైశ్యునకు	228
రాత్రిత్రయంబు బ్రహ్మ	518
రుక్మిణియును నేను	802
రుచి నెపుడు వేచితిరుగు	212
రుచి మీఁదం గన్నిడి	214
రుచి యప్పువ్వులకుం	220
రూప గుణ శీలముల	171
రెండు చరువులొనర్చి	39
రే నిద్రించు ప్రభాతం	118
రేపకడ నీరు ద్రావక	323
రేపకడయును బగలు	162
రౌరవం బనఁగ ధరాస్థలి	711
ల	
లలన యిలువాడి నాథు	763
లోకజనని వగుటన్	200
లోకత్రయంబున మీకు	622
లోకము నిర్మర్యాదత్వా	713
లోకస్వరూపంబు లోలాక్షి	635
లోక హితార్థంబుగ	427
లోలలోచన దీప్తులు	637
లోలాక్షి యచట నిమ్మరి	421
వ	
వంచనయును జాడ్యంబు	675
వగచుచుఁ జూడనయ్యు	3
వచ్చి పర్ణశాల వాకిట	25
వడ్డి కిచ్చి కుడుచువాఁడు	165
వణిజులు లోక ప్రవర్తనం	647
వత్సరంబెల్లఁ బక్షోప	520
వనధి మహాతీర్థంబందు	717
వనరుహ సంభవుఁ డత్తెఱఁ	367
వనిత లీ పాపములు	570
వనితలుఁ బురుషులుఁ	760
వనితలు మాయావినులై	211
వనితా స్వభావ మిట్టిది	208
వరుఁడొక వెంట నెన్నఁడు	601
వరుణు సమీరణు	196
వర్గత్రయము నప	798
వర్ణముల కెల్ల నింద్రియ	450
వర్ణాశ్రమ ధర్మముల	637
వర్తించునెడ	787
వర్తిల్లుచుండ నొక్క	343

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
వలయుఁ బ్రాఙ్ము ఖోద	510
వలవదు వటపిప్పల	505
వల్లరీ గుల్మకముగ	379
వసియించు నమ్మదిత	147
వసిష్ఠుని దేవియగు	403
వసుదాయిని యైన	274
వసుధామర గాయత్రీ	362
వాఁడు సురగణంబు	791
వాజిమేధంబు కంటెను	577
వాజిమేధముల్ వేయొక్క	161
వానిందెచ్చి యమ్మహా	406
వానిన పోలు నంద్రు	237
వానియందును ముని	717
వాయుదేవుం డన్నరదేవు	792
వారల నేకాదశరుద్రు	339
వారలా నృపుతోఁ జెప్ప	20
వారలు ప్రాతస్సమయా	257
వారుపట్టి చూచి వాని	406
వారు పూజ లొనర్పంగ	133
వాసుదేవుఁ డనేక సంవత్స	299
వింటే మృత్యువు మాటలు	11
విండు నారాయణ పరాయణ	608
విచ్చలవిడి నింద్రియ	740
విడిచి భరిత లీలంబుగా	89
విడువకున్న నమ్మని	788
విద్యయిచ్చుట నత్యాత్ర	722
విద్యామయ షడ్వింశుఁడు	555
విధివశంబున మృతి	667
విధివశమున వచ్చిన	4
వినతకు దాస్యమొందె	90
వినత తెలియం జూచి	68
వినత హయమింత యొప్పు	67
వినవలఁతుం జెప్పవే	269
విని గిరి తనూజ పెఱ	632
వినిన వేడుక సేసినఁ గనిన	187
వినిపించితి సంవాసంబున	248
వినిపింపు మనిన నమ్మహా	574
విని యజ్ఞగతీనాథుఁడు	113
విని యతఁడు రాజసంబు	406
విని యతఁడే నింద్రుఁడ	111
విని యా ధేనువు లాతని	348
విని యుత్సాహము గంద	83
విని యేమేమీ నొంచెనె	422
విని సత్వరముగ నట గొని	89
వినుఁ డట్టులు పాపము	96
వినుఁ డుభయలోకముల	273
విను ఋగ్వేదము కృష్ణుని	796
విను కర్మం బొనరించును	12
విను కాశీశ్వరు దేశం	54
విను క్రోధంబును హింసయు	499
విను గంగ గంగయను	187
విను గంగను బ్రహ్మశిరం	177
విను గర్భిణియగు టెఱుఁగక	235
విను గురుపూజన విప్రా	162
విను గృహస్థ ధర్మ విధమిది	461
విను గోలోకంబును	310
విను గోవులను బ్రభాతం	328
విను జనమేజయ మను	230
విను తక్కిన వర్ణంబులు	330
విను తత్పరభావంబున	191
వినుతత్రివర్గనిరతులు	197
విను తమచేసిన కర్మంబు	691
విను తమము నిస్తమము	548
విను తల్లిదండ్రు లొల్లక	234
వినుతాచారుండగు విప్రు	199
విను తీర్థసేవ గామంబు	180
విను దానంబులఁ బాపము	571
విను దానికిఁ బేరు సుద	16
విను దేవాలయమున	469
విను దేహియు దేహము	747
విను ధనార్జనంబు ధన	738
విను నష్ట సకల ధనులగు	688
విను నియమంబును	316
విను నీ తనయులు	831
విను పరమపదప్రాప్తికి	802
విను పుణ్యలోకముల	289
విను పురుషుఁడు గావింపని	48
విను పృథివియును	292
విను పౌరుషమును	50
విను ప్రయాగమునకు	177
విను భక్తియు వెఱపు	514
విను భూమి దానకర్తకు	721
విను మటు కాలునిదెస	10
విను మధుకైటభులని	81
విను మధ్యాత్మ ప్రభృతు	536
విను మనుజేంద్రుల	479
విను మప్పుఁ దల్లియట్లుగ	516
విను మయ్యెడఁగాల	309
విను మర్త్యుఁడైన విప్రు	272
విను మవిచింత్యుఁడ	754
విను మవ్యక్తం బనఁగా	122
విను మలుకయుఁ గూర్మి	679
విను మాంసము గోరు నరుఁడు	579
విను మాచార మవశ్యం	512
విను మింతి వైదికంబును	723
విను మింద్రియంబులు	749
విను మిచ్చుట నృపకుల	46
విను మిట్లగు టేర్పడ	10
విను మిత్తెఱంగు తపంబు	34
వినుము	79
వినుము జరానుబంధ	52
వినుము దానంబుఁ దప	821
వినుము ధర్మములెల్ల	496
వినుము నరేంద్ర మహత్త్వం	808
వినుము నాస్తికులగు	488
వినుము రజస్తమో	817
వినుము విశాఖ సత్త	387
వినుము విశ్వ లనఁగఁ	809

పద్యము	పుట
వినుము సపిండీకరణ	510
విను మృత్యువునకుఁ దగు	7
విను మెత్తఱి ధర్మంబులు	795
విను మొక కుంచెడు	729
విను మొక యించుక	607
విను మొరు మూచూచిన	505
విను రాజులకు నవశ్యం	275
విను వర్ణాచారంబుల	511
విను వింధ్యంబున నొక	178
విను వైశ్యులకును శూద్రు	519
విను శిష్యుఁడు వ్రతశీలుం	320
విను షడ్వింశుఁ డబుద్ధుం	544
విను సంసారపథము	115
విను సంసారమునకు	737
విను సద్విజుండు నిజ	158
విను సోపకరణ మను	718
విను సౌభాగ్య సమేతు	682
విను హవ్యకవ్యములు	232
విపతులైన సతులకు	826
విపులశాఖ నిచట విడిచి	88
విభుఁ డా విష్ణుండే	120
విభునిఁ దాను దొఱంగి	235
విమలమతిం గౌశిక	176
విమలాంబువుల నుప	335
విమలాత్మ యహింస	816
వివిధ సంకల్ప యజ్ఞ	141
వివిధాగమాశ్రయంబగు	243
విశేషించి మనుష్యులకు	383
విశ్వామిత్రుం డెట్లు	37
విష శస్త్ర కేశముల్	167
విష్ణుఁ డొక్కరుండ విను	782
విష్ణు నామంబులు వేయు	779
విష్ణుపదము వలన	191
విస్మితుండై యింద్రుఁడు	113
వీణా కాహళ వేణుక్వాణ	356

పద్యము	పుట
వీతహవ్యుఁడును మహా	47
వీనితోడి సంవాసంబు	239
వీని నెల్ల సనత్కోటిగా	552
వీర శయనంబు మేలంద్రు	266
వీరిం బరిపాలింపుము	831
వృద్ధు వచ్చునపుడు విను	502
వెడలి చింతించి	107
వెఱ్ఱులు తొలు మేన వెడ్డున	686
వెల వెలఁ బాఱుచు వడఁకు	63
వెలిశుచియై మఱి తీర్థంబు	718
వేఁటవోయి మరలి విభుఁ	404
వేఁడికొని నట్టి కృపణు	245
వేగినఁ బొడ సూపి వేగంబ	254
వేడ్కఁ జాచుచు నెప్పుడు	343
వేడ్క నీకు నేను వివరించి	192
వేదంబులు దమలోన	57
వేదమయుఁడు వేదవేద్యుం	60
వేదశాస్త్ర పరిజ్ఞాన వృద్ధ	830
వేదాధ్యయనార్థ ప్రతి	572
వేఱుగఁ గనినం బ్రకృతికి	544
వైఖానసులు ఖరవ్రతు	655
వైనతేయుం డగుట మనం	87
వైర నిర్బంధంబు వలవదు	502
వైరాగ్యంబు ప్రశాంతికిఁ	742
వ్యాకరణ ధర్మశాస్త్ర	391
వ్యాసమహాముని లోక	811
వ్యాసమునీంద్రుండు వారణ	597
వ్యాస మైత్రేయ పుణ్య	597
వ్యాస సంప్రణీతమైన	782
వ్రత శీలతఁ బరఁగి తుదిన్	595

శ

పద్యము	పుట
శంఖ చక్రగదాధరు	609
శంతను నృపతి లోకాంత	369
శకట పథంబునఁ గీటం	586
శత రుద్రీయము	804
శతవర్ష దుష్కర తపః	580
శరణంబు లేని జనులకు	186
శస్త్ర జీవికయును నరి	647
శాంతుఁడు సువ్రతశీలు	391
శివదేవు ముట్టఁ గొల్వంగ	807
శివముఖ్య నామములు	807
శివలింగస్థాపనము	756
శునకంబు రజస్వల	395
శూలియునుం దానదిశా	795
శౌచము బ్రహ్మచర్యము	736
శౌచవిధి సమస్తవర్ణ	435
శ్రద్ధ సాలంగఁ గల్గిన	158
శ్రమము లేదు ప్రతోద	257
శ్రాద్ధంబు ప్రకారంబును	400
శ్రీకాళీ త్వాదర	642
శ్రీపరమ మహిమనిశ్చల	466
శ్రీమత్కటాక్షరోచి	1
శ్రీమయ వక్షస్స్థల	145
శ్రీమహిమ దానకరుణా	315
శ్రీవోలె నింటిలో	297
శ్రుతముఁ బరిత్యాగముఁ	813
శ్రుతము నరునిఁ బరిజ్ఞాన	703
శ్రుతి పఠనమునకు	52
శ్రుతి పురుషు నమృతార్థ	534
శ్రుతి విహిత హింసగ	673
శ్రుతి సదువమి సన్న్యాస	411
శ్రుతులు నౌపనిషద	356
శ్రోత్ర మధ్యాత్మంబు సూవె	120
శ్రోత్రియు లరోగు లవికల	726

స

పద్యము	పుట
సంగము బంధ మఖిల	559
సంగ వాభిధాన సత్కాల	319
సంపదయు దివ్యభోగము	151
సంశయంబు విషాదంబు	746
సకరుణ దివ్యచిత్త	842
సకల జంతువులకు	536

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
సకల జనంబులుఁ గర్మ	13
సకల వర్ణధేను సమితికి	347
సగర నల దిలీప నృగ	581
సగర నృపతి పుత్త్రచయ	189
సతతంబు నత్త దూఱుట	415
సతి దన పతివచనంబు	24
సత్కులంబునఁ బుట్టుట	161
సత్యంబు బ్రహ్మచర్యము	401
సత్త్వాధిష్ఠానకృత	463
సత్య శౌచ దయాదులు	699
సత్త్రంబు సాలయుఁ జలి	167
సత్త్వాశ్రయమునఁ బురు	554
సత్సంగతి సజ్జనులకు	301
సత్సేవ్యచరణ శమవ	842
సదయాపాంగా పరిణా	143
సనకుఁడు సనందనుండు	117
సప్త దినంబులు చంద్ర	172
సమధురమును గటువు	471
సముచితముగఁ బ్రత్యు	216
సమ్మోదమ్మున నేనుం	615
సరిగా నా రెండెడలకు	708
సర్వ జగన్నిత్య సాక్షి	811
సర్వజ్ఞుఁడగు పరాశర	332
సర్వశాస్త్ర వాక్యసమితి	606
సలిలాశయములు చేసిన	457
సల్లకీ జాత నిర్యాస మెల్ల	470
సవతాలికిఁ బతి వలచిన	764
సాంఖ్య యోగయుక్తులు	139
సాధు లింద్రియ విభ్రాంతి	819
సారములగు గోవులు	320
సిత పీతంబులు ధార్యము	505
సిరిధేనువులలోని కరిగి	363
సీతయ్యె ననుచు నల్లన	150
సుకృతముల నరుఁడు	692
సుకృతము లమ్మెయి	590
సుకృతు లమరలోక	697
సుతనమ్మి కొనుట	411
సుమన యనియెడు కైకేయి	600
సుర గంధర్వ ఖచర	768
సురతంబునఁ గడు	113
సురభి దపము సేయ	366
సురభులు సౌరభేయు	329
సురలఁ బితృదేవతల	478
సురలకు నిమ్మెయి	133
సురలును గంధర్వులు	259
సురలు మునులు సుర	262
సేసలు చల్లఁగ మహిమో	826
సౌదపై నుండఁగ వారలు	403
సోమాత్మకు లీశ్వర	199
సౌఖ్యతుష్టి ప్రకాశ	744
సౌదాసుఁ డనఁగ నిక్ష్వాకు	327
సౌమ్యా సౌమ్య బలులు	476
స్థావర జంగమాత్మక	355
స్థూల ప్రకారమున నీ	128
స్త్రీ రక్ష సూక్ష్మమీవ	224
స్త్రీ స్వభావంబులు నీ	208
స్నానముఁ బితృతర్పణ	175
స్నానమునఁ బానమున	669
స్ఫుట తత్త్వోదయ	639
స్మయ విరహిత పూజ్యా	843
స్మరహర పొందు నింద్రియ	539
స్మృతి సౌఖ్య క్షాంతి శ్రీ	781
స్వప్న మనఁగ సుప్త	705
స్వాధ్యాయ సంగీత సాహిత్య	258
స్వాయంభువుఁడను	579
హ	
హరుఁడు కరుణ జూడ	627
హరుఁడు సనత్కుమారు	528
హర్యశ్వుఁ గాశీశు నాజి	43
హవ్యకవ్యంబులకు	344
హింసకు నొడఁ బడనే	6
హిమగిరిమీఁద ననేక	100
హిమగిరి మీఁద ననేక మునీ	126
హిమవన్నగంబునం దేను	632
హిమశైలతట మెక్కి	148
హీన నరునట్ల గుజ్జము	441
హోమ విధులఁ దన్మాంస	673

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పీఠిక

[**పీఠిక - విషయసూచిక :** (1) ముగ్గురు మహాపురుషులు - పు.1* (2) ధర్మజుడు జిజ్ఞాసువే కాని ముముక్షువుకాడు - పు.2* (3) పర్వ ప్రబంధ ధ్వని - పు.2* (4) పర్వ పరిమాణం పు.3.* (5) ధర్మజుడి చిత్తపరిపాకాన్ని పెంచిన దానధర్మాల ప్రశస్తి - పు.4* (6) ఉత్తమ ధర్మ నిర్దేశం పర్వవస్తు ప్రత్యేకత - పు. 5* (7) తిక్కన చేసిన సంగ్రహరచన - పు 7* (8) సంవాదాలు: ఉపాఖ్యానాలు- పు. 7* (9) సంవాదరచనా శిల్పం - పు. 8* (10) ఉపాఖ్యాన రచనా వైభవం - పు. 10* (11) భీష్మ నిర్యాణం- పు. 16* (12) హరిహరనాథతత్త్వం- పు. 18* (13) కవిత్రయమహాభారతం: వ్యాఖ్యానం - పు.36* (14) కథాసారం - పు.38*]

తే. 'దేవదేవ! జీవాత్మక! దేవవంద్య!
శంఖచక్ర గదాపద్మ చారుహస్త!
వాసుదేవ! త్రివిక్రమ! వరద! పరమ
పురుష! ప్రణుతి యొనర్చెదఁ గరుణఁ జూడు!' (అను.5.461)

1. ముగ్గురు మహాపురుషులు :

కురుక్షేత్రంలో మహాయుద్ధం ముగిసింది. మహాజ్ఞాన యజ్ఞం మొదలయింది. దేవర్షులు, మహర్షులు, మహీపతులు, మేధావులు, జిజ్ఞాసువులు అసంఖ్యాకంగా గుమిగూడి శాంతనవుడు ప్రబోధించే ప్రజ్ఞాపూర్వక వాక్యాలను వాఙ్మయ వేదాలుగా వింటున్నారు. ఆ విజ్ఞాన పరిషత్తులో త్రేతాగ్నులవలె వెలుగుతున్నారు ముగ్గురు మహాపురుషులు. ఆ ముగ్గురూ మూడు ప్రవృత్తులకు ముచ్చటైన ప్రతినిధులవలె ప్రకాశిస్తున్నారు.

అంపశయ్యమీద పరున్న కురువృద్ధుడు భీష్ముడు - ఆచార్య (బోధక) స్థానీయుడు, మరొకడు జ్ఞానపిపాసతో ప్రశ్న లడుగుతున్నాడు. జిజ్ఞాసువు ధర్మరాజు సాధన స్థానీయుడు. ఇంకొకడు పరమాత్మ స్వరూపుడు శ్రీకృష్ణుడు - సర్వజ్ఞుడు. సర్వసాక్షీభూతుడు. భీష్ముడు కర్మయోగి. అపూర్వ సాహసి. తాను చేపట్టిన ప్రతిజ్ఞయే, పరమధర్మమని భావించే పట్టుదల కలవాడు. గురుభక్తి, దైవభక్తి కలవాడైనా యుద్ధప్రియుడు. అపార విజ్ఞానఖని. తండ్రి కొరకు భీష్మ ప్రతిజ్ఞలు చేసి అతడి దయవలన తాను కోరుకొన్నప్పుడే చనిపోయే 'ఇచ్ఛామరణ'మనే అపూర్వ వరాన్ని పొందినవాడు. శిఖండితో యుద్ధం చేయనన్న వ్రతంతో యుద్ధంలో అర్జునుడు తన శరీరంలో నింపిన బాణాలను శయ్యగా ఏర్పరచుకొన్న యోగి. ఉత్తరాయణకాలం వచ్చేంతవరకు తనువును బాణశయ్యపై ఉంచుకొని జీవించిన ఘోరకర్మశీలి. అతడు చనిపోతే సమకాలీన జ్ఞానకోశం ఒకటి కనుమరుగైపోయినట్లే అని శ్రీకృష్ణాదులు భావించి, అతడి చేత ధర్మరాజునకు ధర్మనీతి బోధలు చేయించారు. భీష్ముడు ధర్మరాజునకు తగిన గురువు. ఆ గురువుకు తగిన శిష్యుడు ధర్మరాజు. ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేంతవరకు అంపశయ్యమీద ఒంటిగా యోగవృత్తిలో ఉండాలని అనుకొన్న కర్మయోగి లక్షణం - అతడిలో పురుషకారప్రవృత్తికి గల ప్రాధాన్యాన్ని తెలుపుతుంది. భీష్ముడు పురుషకారానికి ఇచ్చిన ప్రాముఖ్యాన్ని దైవానుకూల్యానికి ఇచ్చినట్లు కానరాడు. అందువలననే జీవితంలో అప్పుడప్పుడు ఎదురుదెబ్బలు తిన్నాడు. శ్రీకృష్ణుడి కరుణకొరకు భక్తితో ప్రార్థనలు చేసిన ఘట్టాలు కూడా కనపడతాయి. హస్తినాపుర సింహాసన రక్షణకే అంకితమైపోయి కౌరవుల పక్షాన యుద్ధం చేసిన రణకర్మశూరుడు అతడు. ప్రవృత్తి విద్యకు సంబంధించిన విజ్ఞానం అపారంగా గడించి, నివృత్తి జ్ఞాన సంస్కారాన్ని పండించుకొన్న పండితుడు అతడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అతడికి మోక్షకాంక్ష ఉన్నట్లు లేదు. ధర్మకర్మనిర్వహణ వలన కలిగే సహజ స్వర్గసుఖమే అతడు కోరుకొన్నాడు. అతడు నేర్పిన విజ్ఞానమే ధర్మజుడికి సజాతీయంగా ఉంటుందని వాసుదేవుడు భావించి భీష్ముడి ప్రబోధానికి శ్రోతగా అతడిని నియోగించాడు.

భీష్ముడు ఇప్పటికే ధర్మరాజుకు శాంతిపర్వ విశేషాలను వినిపించాడు. అందులో ప్రధానంగా రాజధర్మాలూ, ఆపద్ధర్మాలూ వినిపించిన తరువాత వేటిని తెలిసికొంటే సర్వజ్ఞానసంపన్ను లౌతారో అటువంటి మోక్షధర్మాలను కూడా వినిపించి అతడి జ్ఞానతృష్ణను తీర్చటానికి యత్నించాడు. కాని అన్నీ విన్న ధర్మరాజుకు బంధుజన సంహారం వలన కలిగిన పాపభీతివలన మనశ్శాంతి కుదరలేదు. మరల విషాదాన్ని ప్రకటించాడు. భీష్ముడు సర్వధర్మ నిశ్చయ జ్ఞానం కలిగే విశేషాలూ, దానవిధులు, తీర్థసేవలూ, ఆచారవిధులు మొదలైన అంశాలు వివరించి చెప్పి, ధృతరాష్ట్రాదులకు హితవు పలికి, ఉత్తరాయణపుణ్యకాలం వచ్చిన తరువాత స్వర్గస్థు డయ్యాడు. ఈ ధర్మాలు చెప్పే భాగంగా ఆనుశాసనికపర్వం మహాభారతంలో పదమూడవపర్వంగా ఒప్పారుతున్నది.

2. ధర్మజుడు జిజ్ఞాసువే కాని ముముక్షువు కాడు :

కొందరు ఆనుశాసనిక పర్వాన్ని శాంతిపర్వంలో భాగంగానే పరిగణిస్తారు. కాని, దీనిని ప్రత్యేక పర్వంగా పరిగణించటమే వ్యాసహృదయం. అయితే, శాంతిపర్వంలో మోక్షధర్మాలను అడిగి తెలిసికొన్న ధర్మరాజు మరల ఈ పర్వంలోని లౌకికధర్మాలను, వర్ణాశ్రమ ధర్మాలను, దాన తీర్థాది విశేషాలను విరివిగా అడిగి తెలిసికొనటంలోని తాత్పర్యమేమై ఉంటుందని కొందరు విచారించారు. అడిగింది ధర్మరాజు కాబట్టి, ఆ ప్రశ్నల వెనుక అతడి చిత్తవృత్తి, వ్యక్తిత్వ స్వభావాలు ఎక్కువగా ప్రతిఫలిస్తాయి. ధర్మజుడు ముముక్షువయితే లౌకికధర్మాలమీద, ప్రవృత్తి ధర్మాలమీదా అనురక్తి ఎక్కువగా ఉండేది కాదు. అతడు మౌలికంగా కర్మయోగి. పుణ్యవ్రతశీలి, ధర్మనీతి వర్తనుడు కాబట్టి అతడు వినే మోక్షధర్మాలన్నీ వ్యుత్పత్తిని మాత్రం కలిగిస్తాయనీ, అతడి సహజ ధర్మప్రవృత్తి లౌకిక ధర్మాలయందే రమిస్తుందనీ పండితులు భావించారు. ఉదాహరణకు శ్రీయల్లంరాజు శ్రీనివాసరావుగారి మాటలు కొన్ని గమనిద్దాం. "మోక్షధర్మాలు శ్రవణం చేసినా జిజ్ఞాసువై చేశాడేకాని, ముముక్షువై చేయలేదు ధర్మరాజు. అంచేత అది జీవిత లక్ష్యంగా పెట్టుకోలే దాయన. పెట్టుకొన్న జీవితలక్ష్యం ధర్మమే. ధర్మం తప్పకుండా నడవడమే సర్వస్వ మాయనకు. అందుకే దానిఫల మేదో అదే అనుభవానికి వచ్చింది. ఏమిటి ధర్మాచరణకు ఫలం? స్వర్గం. స్వర్గమే ప్రాప్తించింది గాని ధర్మరాజుకు మోక్షం కాదు. మహాప్రస్థానం చేసి పరివ్రాజకుడై చివర కాయన గడించింది స్వర్గఫలమే. స్వర్గారోహణంతోనే పరిసమాప్తమయింది జీవితయాత్ర. ఆయన జీవితమే కాదు. ఆ మాటకు వస్తే భారతవీరులందరి జీవితాలూ అంతే'' (మహాభారత వైభవము - పుట 485) అందువలన శాంతిపర్వంలోగాని, ఆనుశాసనిక పర్వంలోగాని ధర్మరాజు సహజంగా రమించేది మోక్షధర్మాలు కావు. ప్రవృత్తి ధర్మాలే. అందుకే ఆనుశాసనికపర్వం లోకధర్మ విజ్ఞానసర్వస్వంగా వెలువడింది. ఇందులో మోక్షధర్మ ప్రసక్తికూడా ఉన్నది. అది విన్న తరువాత కూడా ధర్మరాజుకు శాంతి కలుగలేదు. తేలిన తాత్పర్య మేమిటంటే - చెప్పిన వక్త ముముక్షువు కాడు. విన్న శ్రోత కూడా ముముక్షువు కాడు. శాంత్యనుశాసనిక పర్వాలలోని ప్రబోధమంతా ధర్మరాజులో శాస్త్రజ్ఞానంగా వెల్లివిరిసిందే కాని, ప్రజ్ఞానంలో అనుభవజ్ఞానంగా పల్లవించలేదు.

3. పర్వప్రబంధధ్వని:

స్థూలంగా పరిశీలిస్తే శాంతిపర్వంలోని ధర్మాల కథనానికీ, ఆనుశాసనిక పర్వంలోని ధర్మాల కథనానికీ భేదం కొంత కానవస్తుంది. శాంతిపర్వంలోని ధర్మాలు విశ్వజనీనంగా ధర్మపరులైన రాజులందరికీ పనికివచ్చే సామాన్య ధర్మాలుగా గోచరిస్తాయి. ఆనుశాసనికపర్వంలోనివి విశేషధర్మాలవలె స్ఫురిస్తాయి. ఎట్లాగంటే - ఒకరాజు ప్రజాపాలన చేస్తున్నపుడు అతడు ధర్మాసనం మీద కూర్చుండి చెప్పవలసిన తీరులు ఎన్నో ఉంటాయి. ప్రజల జీవన విధానంలో అనుశాసించ వలసిన లౌకికధర్మాచరణ పద్ధతులు మరెన్నో ఉంటాయి. మరొక విధంగా చెప్పాలంటే - నిత్యజీవితంలో రాజు ప్రజల సమస్యలపై ఇవ్వవలసిన ధార్మికమైన న్యాయబద్ధమైన, సాంస్కృతికమైన తీర్పులకు సంబంధించిన విషయాలు ఎన్నో ఉంటాయి. వాటికి సంబంధించిన అనుశాసనాలను ధర్మరాజు ఈ పర్వంలో తెలిసికొన్నాడని స్పష్టమౌతుంది.

దీనివలన కథాపరమైన ప్రయోజనం కూడా ఏర్పడింది. ధర్మరాజు ప్రభువైన తరువాత చేసిన ప్రజాపరిపాలన విశేషాలను గురించికాని, తీర్చిన ప్రజల న్యాయ, ధర్మ సమస్యలను గురించిగాని, ఏర్పడిన ధర్మసంఘర్షణలు, ధర్మసంశయాలు, వాటి నివారణల గురించిన వివరాలుగాని, కథాసందర్భాలుగాని ప్రధానేతివృత్తంతో మనకు కానరావు. వాటన్నిటికి బదులు ఆనుశాసనిక పర్వంలో ధర్మరాజు అడిగిన ప్రశ్నలే సమస్యల పరిష్కారాలుగా సూచింపబడ్డాయి. హస్తినాపుర సింహాసనం రక్షణతోపాటు, హస్తినాపురంలోని ధర్మరక్షణకు తోడ్పడే అనుశాసనాన్ని అందించి భీష్ముడు ధర్మసంప్రదాయ పరిరక్షకుడైనాడు. భీష్మానుశాసనాన్ని తన పరిపాలనలో రాజానుశాసనంగా ధర్మజుడు ప్రవర్తిల్లచేసికొన్నాడు అన్నది ఈ పర్వంలో అందించే ప్రబంధధ్వనిగా గ్రహించవచ్చును.

4. పర్వ పరిమాణం:

ఆనుశాసనికపర్వం పన్నెండువేల శ్లోకాల పరిమాణం కలిగిందని నన్నయ పర్వసంగ్రహపర్వంలో పేర్కొన్నాడు. కాని, చిత్రశాల ప్రతిలో ఎనిమిదివేల శ్లోకాలే ఉన్నాయి. భండార్కరుసంస్థవారి ప్రతిలో 6700 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. అయితే, పి.పి.యస్.శాస్త్రి ప్రతిలో మాత్రం 12వేల శ్లోకాలని పేర్కొనబడింది. కాబట్టి నన్నయాదులు ఉత్తరాది ప్రతులకంటె దాక్షిణాత్య ప్రతులనే అనుసరించారని, వీటిలో దాదాపు నాలుగువేల శ్లోకాలు ప్రత్యక్షంగా చేరి ఉన్నాయని స్పష్టమౌతున్నది. ఉదాహరణకు ఆంధ్రమహాభారతంలోని ఆనుశాసనికపర్వంలోని చతుర్థాశ్వాసంలో హరసంపత్కుమారపర్వం ఉత్తరాదిప్రతులలో కానరాదు. ఇట్లాగే గోవులను గూర్చి బ్రాహ్మణమాహాత్మ్యాన్ని గురించి చెప్పిన అంశాలు తెలుగులో విస్తారంగా చేరాయి. సంస్కృత భారతంలో ఆనుశాసనికపర్వంలో 146 అధ్యాయాలు ఉన్నట్లు చిత్రశాలా ప్రతిలో ఉండగా అది 168 అధ్యాయాల గ్రంథంగా విస్తరించింది. ఆయాకాలాలలో ప్రజలు జీవిత ధర్మాలలో వస్తున్న పరిణామాలను, అప్పటి అవసరాలను అనుసరించి, ఈ పర్వంలో లౌకిక ధర్మాలను గురించిన అనేకాంశాలు చేర్చబడుతూ ఉండి ఉండవచ్చును. పంచమవేదంలో చెప్పబడిన ధార్మికాంశాలను అనుశాసనాలుగా ప్రామాణికాలుగా భావించడం ఈ విస్తృతికి కారణం కావచ్చును.

ప్రక్షిప్తాలుగా భావించబడే అంశాలమీద కొందరు విమర్శకులకు ఉదాత్తమైన అభిప్రాయం కూడా లేదు."ఇట్లు చేర్చబడిన యంశము లన్నియు ఉదాత్తములైనవి, కథామహితము లైనవి అని చెప్పుటకు వీలులేదు. అవి కొన్ని మిక్కిలి పేలవములు. శిశుప్రాయములు. ఉదాహరణకు పితృకార్యములందు ఉపానత్తులు, ఛత్రము ఈయవలెనని చెప్పుదురు. దీని భావ మేమని ధర్మరాజు అడుగును. వృద్ధుడగు గాంగేయుడు శ్రద్ధతో సమాధానము చెప్పును. సర్వసర్వంసహా చక్రవర్తి యగు పాండవాగ్రజు డిట్టి చొప్పదంటు ప్రశ్న వేసె నేమి? యని పైకి అనిపించును. పంచమవేదమునందు వివరించవలసిన యంశమేనా ఇది? యని తోచును. మహాభారతము కేవలము కథాకావ్యము కాదు. అది ప్రాచీన విజ్ఞాన సర్వస్వము. మానవ నాగరకతా యాత్రయందలి మజిలీలన్నియు దానియందు వింతగా పరిస్ఫురించును. ఒకప్పుడు మానవునకు ఉపానత్తులు - పాదరక్షలు లేక చెప్పులు, గొడుగు - వీని ప్రయోజనము తెలియకుండెను. ఎండకును, చలికిని అతడు బాధపడుచుండెను. ప్రాచీన సంఘమందలి యొక బుద్ధిమంతుడు చెప్పులు, గొడుగు - వీనిని బుద్ధికుశలతచే కల్పించగల్గెను. ప్రాక్తన మానవుని దృష్టిలో ఇది యొక అద్భుతకల్పనమేకదా! అతడు సంతోషము చెంది దాని కొక కథారూపమును కల్పించినాడు. ఆ కథయు మహాభారతమున కందమే అయినది. (చూడు కథాసారం. ప్రశ్న 60కి ఉత్తరం - సూర్యజమదగ్ని సంవాదం అనే ఇతిహాసం)... ఇది పసిబాలురకు చెప్పవలసిన 'అనగనగా' కథవంటిది అయినను విపులముగా పరిశీలించినచో ప్రాచీన సంఘము యొక్క సంస్కృతి విశేషములు దీనియందు గోచరించును. ప్రాచీన మహర్షులు వీరవ్రతులు. వారు శరాసన విద్యను చక్కగా నేర్చుచుండిరి. జనసమ్మర్దము లేని మైదానమునందు వారు అస్త్రసాధన చేయుచుండిరి. కర్ణుడు దీనికి భిన్నముగా ప్రవర్తించి ఒక బ్రాహ్మణుని గోవును బాణముతో కొట్టుటచే శాపగ్రస్తు డాయెను. రాజులవలె మహర్షులు సంపన్నులు కాకపోవుటచే వారికి పరివారము లేకుండెను. జమదగ్నికి అతని కుటుంబమే పరివారము. ఆమె యాతని యమ్ములపొదులను మోసి తెచ్చెను. దూరమున పడిన బాణములను ఏరి తెచ్చుచుండెడిది. తపోనిష్ఠులయ్యును మునిజనులు తమ స్త్రీ జనమునందు అనురాగము కలిగి యుండిరి. ఎండనుండియు, అమితమైన చలినుండియు తనదేహమును కాపాడుకొనుట ప్రాచీన మానవునకు ఒక

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సమస్యగానే యుండెను. చెట్టు నీడ నిచ్చుటను అతడు చూచెను. చెట్టును మోసికొని పోకుండ నీడను వెంటగొని పోవుటెట్లు? అనునది కొంతకాలము మానవునకు సమస్యగానే యుండెను. బుద్ధిశాలి యొక్కడు గొడుగు కల్పించెను. ఇది నేడు మనకు అత్యంత పరిచితమైన వస్తువగుటచే అద్భుతమును గొల్పదు. దానిని ఇతివృత్తముగా చేసిన కథ ఈ కాలమున వెలువడదు. అట్లే చెప్పులును, పాదములకు శీతాతపములు సోకకుండుటకై రక్షణ అవసర మనిపించెను. నేర్పరియైన మానవుడు శుష్కకాష్ఠమును, చర్మమును శీతోష్ణవాహకములు కావని (నాన్ కండక్టర్స్) కొంతకాలమునకు కనిపెట్టెను. మొదట ఎండుకట్టెతో పావకోళ్ళు నిర్మించుకొనెను. సన్న్యాసులు పావకోళ్ళనే ధరింతురు. వివాహాదులయందు కూడ వీనినే ధరింప చేయుదురు. కావున కట్టెతో నిర్మించిన పాదరక్షలే మొదటి దశయని చెప్పవలెను. చర్మ నిర్మితమైన పాదరక్షలు ఎక్కువ సుఖకరము లైనను తోలు అంటుటకు మహర్షులంతగా సమ్మతించి యుండరు. చర్మకాష్ఠములు విద్యుద్వాహకములు కూడ కావని ఇటీవల శాస్త్రజ్ఞులు కనిపెట్టినారు. మహాభారతమునందు సూర్య జమదగ్ని సంవాదమువంటి చిట్టి కథలును కలవు. అహింసాతత్త్వ బోధకమైన సక్తుప్రస్థుని వృత్తాంతమువంటి గొప్పకథలును కలవు. అందుచేతనే మహాభారతము విశ్వజనీనమని నన్నయభట్టు ఉచితముగ ప్రశంసించెను (ఆది. 1.32)'' - ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనము - (అనుశాసనికపర్వ పీఠిక -(ఉస్మానియాప్రతి). పుట.11-12)

5. ధర్మజుడి చిత్తపరిపాకాన్ని పెంచిన దానధర్మాల ప్రశస్తి:

ఆనుశాసనికపర్వంలో దాదాపు మూడవవంతు ప్రశ్నలు దానధర్మాలను గురించి తెలుసుకొనటానికి ధర్మరాజు అడిగాడు. (చూడు. వివరాలకు కథాసారంలో ప్రశ్నోత్తరాల సంఖ్యలు : 21-25; 40-50; 54, 59, 60, 63, 64, 77, 80 మొదలుగునవి). దానితో ఈ పర్వం దానధర్మాలకు ప్రాధాన్య మున్నదానిగా భావించటం కొంతమందికి పరిపాటి అయిపోయింది కూడా. అయితే అట్టి దానధర్మప్రబోధం సార్థకమని భావించే పండితులే ఎక్కువమంది కనపడతారు. వారందరి అభిప్రాయాలకూ ప్రాతినిధ్యం వహిస్తాయి. శ్రీ యల్లంరాజు శ్రీనివాసరావుగారి మాటలు "భారతానుశాసనిక పర్వంలో భీష్ముడు దానా లెన్ని ఉన్నవో అన్నీ ఏకరువు పెడతాడు. గోదానమే కాదు, భూదానమే గాదు, హిరణ్యదానమే గాదు, మాషయవగోధూమ తండులాది దానాలే కాదు. తుదకు పాదుకాఛత్ర చామరాది దానాలే కాదు, ఏదంటే అది. ఎవ రడిగితే వారికి ఆఖరుకు శిబిచక్రవర్తి లాగా - దధీచిలాగా తన ప్రాణా లడిగినా దానం చేయవలసి వస్తుంది. భౌతికంగా ఇవన్నీ చేయాలని చేస్తేనే గొప్ప అనీ కాదు మన మర్థం చేసుకోవలసింది. అలా చేసే బుద్ధీ, సంసిద్ధతా - కలిగి ఉండాలి మానవుడు, క్రియ గాదు, బుద్ధి, అంతరమైన ఆ బుద్ధికి బాహ్యమైన ప్రతీకలే భీష్ముడు వర్ణించిన కథలన్నీ. అన్నీ ఈ సిద్ధాంతాని కుదాహరణలే. నిజంగా ఆ కథలలో చెప్పిన వన్నీ జరిగాయనీ, చేశాయనీ, అలాగే జరగాలనీ కాదు. చారిత్రకంగా జరిగితే జరగవచ్చు. లేకుంటే లేదు. మానసికంగా అలవరచుకోవలసిన ఒకానొక భావన ఇది. త్యాగభావన త్యాగక్రియ గాదు. ద్రవ్యత్యాగంతో నిమిత్తం లేదు. త్యాగభావ ముంటే జ్ఞానికి పూచికపుల్ల అయినా సరే. ఇది నా దగ్గర ఉంటే బాగుంటుందనుకొంటే ఆమేర కది బంధమే మానవుడికి. జ్ఞాన ప్రవాహానికి ప్రతిబంధమే. నిరాఘాటంగా జ్ఞానం నిలవాలంటే ఈ మమత్వబుద్ధి అనేది ఉండరాదు. అంటే అంతా 'మమే'. లేకుంటే ఏదీ 'మమ' కాదనే దృష్టి ఏర్పడాలి. ఇదీ జ్ఞానానికి పరాయణం."

"ఇంతకూ పశ్చాత్తప్తుడైన మానవుడు గురూపసదనం చేసి, సకల ధర్మాలూ శ్రవణం చేయగలిగితే, అందులో ప్రవృత్తి ధర్మం సత్త్వాన్ని శుద్ధిచేసి, నివృత్తిరూపమైన మోక్షధర్మానికి దారితీస్తే - అది కదలకుండా నిలకడ చెంది మోక్షసుఖాన్నే మన కందివ్వటానికి త్యాగసన్న్యాస వైరాగ్యాపర పర్యాయమైన దానగుణాన్ని పూర్తిగా అలవరచుకోవాలి. అప్పుడే మనకు కలిగిన ఆత్మ జ్ఞాన మనుభవంగా మారగలదు. మారితే అదే పరిపూర్ణత జీవితానికి. ఇలాంటి పరిపూర్ణతను ప్రసాదించడానికే రాజధర్మాలు మొదలుకొని దానధర్మాలవరకూ ఈ చతుర్విధ ధర్మాలనూ ఈ వరుసలో బోధించాడు పితామహుడు." (మహాభారత వైభవము పుట.419-420)

ఆనుశాసనిక పర్వంలో బోధగా జాలువారిన దానధర్మసంస్కారం అశ్వమేధ పర్వంలో ధర్మరాజు అఖండ స్వర్ణదానం చేయటానికీ, చివరకు సర్వ సామ్రాజ్యాన్ని వేదవ్యాసుడికి దక్షిణగా ఇవ్వటానికీ తగిన చిత్తపరిపాకాన్ని కలిగించింది.

6. ఉత్తమ ధర్మ నిర్దేశం పర్వవస్తు ప్రత్యేకత:

ధర్మరాజు అనేక విశేషాలను, వివరాలను భీష్ముడిని అడిగి తెలిసికొంటూనే ఆయా అంశాలలో శ్రేష్ఠములైనవి, గొప్పవి, ఉత్తమములైనవి, ఏవి? అని అడగటం ఒక విశేషం. 'రత్నహారీ తు పార్థివ' అనే కాళిదాసోక్తి స్ఫురణకు వస్తుంది. లోకానికి వివిధ ధర్మాలలో వస్తుసముదాయాలలో తరతమ బేధం తెలియవస్తుంది. ఈ పర్వంలో అటువంటి ప్రశ్నలు 12కు మించే ఉండటం గమనార్హం. (వివరాలు చూడు కథాసారం, మచ్చుకు కొన్ని అంశాలు.

రాజులకు కర్తవ్యాలు ఎన్నో ఉంటాయి. కాని, వాటిలో ప్రధానకృత్యం ఏమిటి? అన్నది ధర్మరాజు ప్రశ్న. (చూడు ప్రశ్న 32) బ్రాహ్మణపూజ మూర్ధాభిషిక్తుల ప్రథమ కర్తవ్యమని భీష్ముడు చెప్పి విప్రసేవ కల్పవృక్ష సేవవంటిదని పేర్కొని, శంబరాది రాక్షసులు సైతం బ్రాహ్మణసేవవలన అపార సంపదలు గడించారని వివరించాడు.

దానాలలో గోదానం గొప్పదనీ, భూదానం ఉత్తమమనీ, ఇట్లా వివరాలన్నీ విన్న ధర్మరాజు అన్నిటికంటె గొప్పదానమేది? అని ప్రశ్నించాడు. (ప్రశ్న 41). యాచకుడు కోరిన దానిని ప్రేమతో ఇచ్చినదాని కంటె గొప్పదానం మరొకటి లేదని భీష్ముడు ఘంటాపథంగా చెప్పాడు. దానాలను గురించి ఇన్ని విశేషాలు విన్నా అడిగిన దానిని ఇచ్చే సత్త్వగుణం దానగుణ శిఖరం.

గోవులలో కపిలగోవు గొప్పదని తెలిసికొన్న తరువాత, సమస్త లోకాలనూ సృష్టించిన బ్రహ్మలోకంకంటె గోలోకం ఉన్నతంగా ఉండటానికి కారణం అడిగాడు ధర్మరాజు. (ప్రశ్న 52) బ్రహ్మ సృష్టించిన సురభి మార్తాండుల ఇతిహాసాన్ని వినిపించి, వారికి పుట్టిన గోవులు బ్రహ్మలోకం కంటె పై భాగాన ఉండి క్షీరాల నిస్తాయని పేర్కొన్నాడు భీష్ముడు. గోమహిమలను తెలిపే ఇతిహాసాలు తెలిపాడు. (చూడు ప్రశ్న 52 సమాధాన వివరాలు)

పుణ్య తీర్థాలనుగురించి అడిగి తెలిసికొన్న ధర్మరాజు ఆ తీర్థాలన్నింటిలో ఎక్కువ పవిత్రత కలిగిన దేది? అని భీష్ముడిని ప్రశ్నించాడు. (ప్రశ్న 73 కథాసారం) భీష్ముడు భౌతిక తీర్థాలకంటె అంతస్తీర్థాలు గొప్పవని తెలిపాడు. మానస తీర్థం మేలైనది అన్నాడు. దానిపేరు 'సత్యం' అని చెప్పి, దాని విశేషాలు వివరించాడు. దమము, తపస్సు, శమము - అనే గుణాలు కూడా తీర్థాలే. భౌతిక తీర్థాలకంటె ఆధ్యాత్మికగుణాలే తీర్థాలని వివరించి నదులలో ఊరికే స్నానాలు చేసినదానికంటె, దొరకని వాటికై తాపత్రయ పడకుండా, దొరికినవాటితో తృప్తిపడి, ఆశకు దూరంగా ఉంటూ జీవించే సత్పురుషులే నిజమైన పుణ్యతీర్థాలని ప్రబోధించాడు.

విద్య, తపస్సు, దానం - ఈ మూడింటిలో ఏది గొప్పది? అని అడిగాడు ధర్మరాజు (ప్రశ్న.77). భీష్ముడు 'వ్యాసమైత్రేయ సంవాదం' అనే ఇతిహాసాన్ని వినిపించాడు. తపస్సు విద్య మొదలైన ధర్మాలన్నింటిలో దానం గొప్పదనీ, దానాలలో అన్నదానం గొప్పదని వ్యాసుడు మైత్రేయుడికి చెప్పాడు. విద్య తపస్సును వృద్ధి చేస్తుంది. తపస్సు, విద్యా, దాన మహిమతో పెంపొందుతాయి- అని వివరించాడు.

ఆచారాలను గురించి ఎన్నో వివరాలు విన్న ధర్మరాజు 'సర్వశాస్త్ర సారమైనదీ, సర్వశ్రేష్ఠమైనదీ అయిన ఆచరణ (ఆచారం) ఏది? అని భీష్ముడిని అడిగాడు. పితామహుడు 'నారదపుండరీక సంవాదం' అనే ఇతిహాసాన్ని వినిపించాడు. ఇరువది నాల్గవ తత్త్వమైన ప్రకృతికి తరువాతి తత్త్వం జీవాత్మ, అతడు సర్వభూతాల స్వరూపం అయినవాడు. అతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యవహారనామం 'నరుడు' అతివలన ఏర్పడిన తక్కిన తత్త్వాలన్నీ నారములు. అతడు నారములు స్థానంగా కలవాడు కాబట్టి నారాయణుడు. ఆ ప్రభువు విశ్వాన్ని సృష్టిస్తూ మరల తనలోనే లీనం చేసికొంటూ 'విభుడు' ఔతున్నాడు. ఆ నారాయణుడే పరబ్రహ్మం, పరతత్త్వం, పరమపదం, ఈశ్వరుడు, విష్ణువు - అనే పేర్లతో పిలువబడుతూ ఉంటాడు. అతడు వాసుదేవుడు. ఆత్మ - అనే పేర్లతో ఉపనిషత్తులు పిలుస్తాయి. ఆ పేర్లు నరుడికి కూడా వర్తిస్తాయి. సర్వశాస్త్రాల వాక్యాలనూ పరిశీలించి నిర్ణయించిన తాత్పర్యమిది. కాబట్టి ఎల్లవేళలా నారాయణుడిని స్మరించాలి. మరణకాలంలో 'నమో నారాయణాయ' అనే మంత్రాన్ని పలికితే నరులు ప్రణవానికి అర్థమైన పరమపదాన్ని పొందుతారు' అని నారదుడు చెప్పాడు. విష్ణువును సేవించుమని భీష్ముడు ధర్మరాజుకు హితవు చెప్పాడు. అదే ఉత్తమ ఆచారమని బోధించాడు.

పాపాలన్నింటినీ పారదోలే ప్రాచీన గాథను వినిపించుమని ధర్మజుడు భీష్ముడిని కోరాడు. ఆయన 'ఉమామహేశ్వర సంవాదం' అనే ఇతిహాసాన్ని వినిపించాడు. ఈ పర్వంలో ఉన్న ఇతిహాసాలన్నింటిలో పెద్దదీ, సకల పుణ్యప్రదమూ అయిన ఇతిహాస మిది.

ఆనుశాసనిక పర్వాంతంలో ధర్మరాజు ఆధ్యాత్మికమైన ప్రశ్నలను పుంఖానుపుంఖాలుగా వర్షించాడు. ఉదాహరణకు కొన్ని. దారిద్ర్యం, దుఃఖం పోగొట్టే జపం ఏది? లోకాల కన్నిటికీ మహనీయమై ఆశ్రయించి అనుభవించగల దైవం ఎవరు? అర్చనతో, స్తుతితో ఎవరిని కొలిస్తే జనులు శుభాన్ని పొందుతారు? అనేక ధర్మాలలో ఉత్తమమైన అభిమతాన్ని చూరగొనేది ఏది? జపాలన్నింటిలో ఉత్తమ జపం ఏది? తనను జపించేవారికి జన్మమూ, సంసార బంధాలను పోగొట్టేది ఏది? కర్మ యోగులకూ, ధర్మసాధకులకూ తరణోపాయాలుగా భాసించే ఈ ప్రశ్నలు ఈ పర్వానికి భరత వాక్య తుల్యాలుగా ప్రకాశిస్తూ ఉన్నాయి.

"ఓం నమో భగవతే వాసుదేవాయ, నమః పురుషోత్తమాయ, నమ స్సర్వలోక గురవే, నమ స్సర్వలోక పిత్రే, నమ స్సర్వలోక పితామహాయ, నమ స్సర్వలోక ప్రపితామహాయ, నమ స్సర్వలోకేశ్వరాయ, నమ స్సర్వలోక విశిష్టాయ, నమ స్సర్వలోకసుఖప్రదాయ, నమ స్సర్వలోక కర్త్రే, నమ స్సర్వలోక భర్త్రే, నమ స్సర్వలోక హర్త్రే, నమ స్సర్వలోక నిధయే, నమ స్సర్వలోక విధానాయ, నమ స్సర్వలోక హితాయ, నమ స్సర్వలోక హితకరాయ, నమ స్సర్వలోక ధ్రువాయ, నమ స్సర్వలోకోద్భవకరాయ, నమో విష్ణవే, ప్రభవిష్ణవే" అని జపించటమే మహాజపం.

సమస్త జగత్తులకు ప్రభువు, దేవదేవుడు, అనంతుడు, పురుషోత్తముడు అనే పేరుగలవాడి సహస్రనామాలను నిరంతరం స్తుతిస్తూ, జాగృత మనస్కుడై యజ్ఞకర్తను, అవ్యయుడైన అతడిని అర్చనం చేస్తూ అచంచల ధ్యానంతో నమస్కరిస్తూ, ఆద్యంతాలు లేని ఆ విష్ణుదేవుడిని, సర్వలోకాధ్యక్షుడిని, బ్రహ్మణ్యుడిని, త్రిలోక కీర్తి వర్ధనుడిని, సర్వ ధర్మాలూ తెలిసిన వాడిని, దయామయుడిని, లోకనాథుడిని, పంచభూతాల ఉత్పత్తికి కారకుడైన వాడిని నమ్మి భక్తితో సేవిస్తే అతడు దుఃఖాల నన్నింటినీ తొలగదోస్తాడు. పుండరీకాక్షుడిని స్తుతిస్తూ పరమభక్తితో పూజించటమే నా మతం. ధర్మరాజా! ధర్మా లన్నింటికంటే ఉత్తమధర్మం ఇదే అని తెలిసికొనుము. పరబ్రహ్మమైన ఆ విష్ణుదేవుడి సహస్రనామ సంకీర్తనం పాపాలను, భయాలను పోగొట్టుతుంది. సకల సంపదలను సమకూరుస్తుంది. 'విశ్వంబు, విష్ణుండు, వషట్కారుండు, భూతభవిష్యత్ప్రభు' మొదలైన నామాలతో మొదలుపెట్టి, 'రథాంగపాణి, అక్షోభ్యుడు, సర్వప్రహరణాయుధుడు' అనే నామాలు తుదిగాగల సహస్రనామాలను భీష్ముడు ఉపన్యసించాడు. తరతరాలుగా ఆ సహస్రనామాలు ప్రసిద్ధి కెక్కాయని తెలిపాడు. విష్ణు సహస్రనామాలను నిత్యం పఠించిన మనుష్యుడు ఇహపరశుభాలను పొందుతాడు. చతుర్వర్ణాలవారికీ బహువిధలాభాలు కలుగుతాయి. చతుర్విధ పురుషార్థ ఫలసిద్ధి కలుగుతుంది. సర్వవిధాల అరిష్టాలకూ, దుఃఖాలకూ దూరమై పరమపదం పొందుతాడు. విష్ణువొక్కడే మహాభూతం, భూతము లెన్ని ఉన్నా త్రిలోక వ్యాప్తుడుగా విస్తరించి ఈ విశ్వాన్ని అనుభవిస్తాడు. ధర్మరాజా! వ్యాసవిరచితమైన విష్ణుసహస్రనామాలను పఠించి శుభాలు, సుఖాలు అనుభవించుమని బోధించాడు.

ధర్మరాజు అడిగిన ప్రశ్నలు గమనిస్తే - అవి ఒక వ్యక్తికి కలిగిన సంశయాలుగా మాత్రమే కాకుండా ఒక సమాజంలో జీవనయాత్ర సాగిస్తున్న మానవులు ఎదుర్కొంటున్న వివిధ ధార్మిక జీవన సమస్యల సమాహారంగా గోచరిస్తాయి. ధర్మరాజు ఒక వ్యక్తిగా గాక ఒక సమాజానికి జిజ్ఞాసువైన ప్రతినిధిగా గోచరిస్తాడు. అందుకే ఈ పర్వం విశ్వజనీనంగా పరిగణించబడుతుంది.

7. తిక్కన చేసిన సంగ్రహ రచన:

ఆనుశాసనిక పర్వంలో తిక్కన సోమయాజి పాటించిన రచనా ప్రణాళికను గురించి ప్రసిద్ధ విమర్శకులు కీ॥శే॥ కురుగంటి సీతారామయ్యగారు చెప్పిన మాటలు గమనార్హాలు. "తిక్కన భారతమును, యథామాతృకముగా భాషాంతరీకరించలేదని మీ కిదివరకే తెలియును. తిక్కన యొక్కడే కాదు నన్నయ కూడ తన యిచ్ఛవచ్చినట్లు కుదించుట, పెంచుట చేసెను. సంస్కృతమునకుఁ జేయు భాషాంతరీకరణమునందును దెనుఁగులోఁ జేయునది సరియై, మాతృక ననుసరించిన యెడలఁ దప్పక మాతృక కంటె విస్తరించు ననుట నిజము. తిక్కన కృతి మాతృక కంటెఁ గొన్ని మడుగుల పరిమితిలో న్యూనము. దాదాపు మూడవవంతుండవచ్చునని నా యూహ... ఈ కుదింపు చేసిన తెరువుకూడ దిఙ్మాత్రముగా నుల్లేఖింతును."

"ఆనుశాసనిక పర్వమునందును సంగ్రహకథనము గలదు. సుదర్శనోపాఖ్యానమును సంగ్రహించినను మిక్కిలి రసవంతముగాఁ జేసినాడు. గరుత్మంతుని చరిత్రమును మిక్కిలి రసవంతము చేసెను. కాని, యిది మాతృకలోఁ గాన రాదు. శివమాహాత్మ్యమును విడిచివైచెను. అష్టావక్రచరిత్రముతో నానుశాసనిక ద్వితీయాశ్వాస మారంభమగును. ఈ పర్వమున దాన తీర్థ మాహాత్మ్యము లనేకములు కలవు. వానిలో ననేకాధ్యాయముల నెగురగొట్టెను. తన విషయ వివేచనాశక్తి నుపయోగించి రసవంతములుగా నుండు ఘట్టముల నేరి రచించెను. మూడధ్యాయములలో నున్న విపులోపాఖ్యానమును 38 పద్యములలో ముగించెను. కాని, మాతృకలో కంటె రసవంత మొనర్చెను. చ్యవనోపాఖ్యానమును సంగ్రహించిన వెనుక నౌద్దాలిక పుత్ర చరిత్రముతో ద్వితీయాశ్వాసము ముగియును. ఆరంభమైన గోదాన మహిమాదికము తృతీయాశ్వాసములోని కనువృత్తములయ్యెను. శ్రాద్ధ ప్రకరణమును స్పృశించి వదలెననియే చెప్పవలెను. గోదానములతోఁ జతుర్థాశ్వాస మారంభమగును. ఇది మాతృకయందు 100వ అధ్యాయము. హస్తికూటాధ్యాయమును రసవంతముగా 30 పద్యముల సంతరించెను. ఈ యుపాఖ్యానమును మిక్కిలి సరళముగను సులభగ్రాహ్యముగను నొనరించెను. ఉమామహేశ్వర సంవాదముతోఁ, జతుర్థాశ్వాసము ముగిసి తదనంతర సంభాషణ మంతయుఁ బంచమాశ్వాసములోని కనువృత్త మగుచున్నది. శివపార్వతీ సంవాదమున విష్ణుసహస్రనామములు తిక్కన తన మామూలు ననుసరించి విడచివైచెను. మిగిలిన యీ యాశ్వాసమంతయు శివపార్వతీ సంవాదమే యనవచ్చును. భీష్ముడు మఱికొన్ని ధర్మములను దెలిపి, ధర్మజు నొడంబఱచి హస్తిపురికిఁ బోవ ననుజ్ఞ నిచ్చును. మరల ధర్మజుడు కృష్ణసహితముగాఁ బితామహుని యంత్యకాలమునఁ గురుక్షేత్రమునకు వచ్చిన తదుపరి శ్రీకృష్ణుని యనుజ్ఞను గొని భీష్ముడు శరీరమును జాలించును. ఆయన యంత్యక్రియలు జరిగిన వెనుక గంగను గృష్ణుడు సమాశ్వాసము చేయుటతో నానుశాసనికము ముగియును."

"ఇది తిక్కనార్యుని సంగ్రహకథన పద్ధతి. పాఠకులకు విసుగు జనించకుండ తాత్త్విక భాగములను మిక్కిలి కుదించిన స్థలములోఁ గూడ రసమునకు గొఱవడకుండ రచించుటయుఁ, గథయుఁ గాక, యేమియుఁ గాక, నామపుంజములగు సహస్రనామములను వదలుటయు మొదలగు పద్ధతులచే నాంధ్రమహాభారతమును సర్వజన పఠనీయముగాను, మహాకావ్యముగాను తిక్కనార్యుడు సంతరించెను. దీనినే నాయన రచించిన భాగము ప్రబంధమండలి యయ్యెను."

(ఆంధ్ర మహాభారతోపన్యాసములు, పుట. 212. 215,216)

8. సంవాదాలు, ఉపాఖ్యానాలు:

ఆనుశాసనికపర్వంలో భీష్ముడు చెప్పిన సమాధానాలు స్థూలంగా మూడు విధాలుగా ఉంటాయి. 1. ప్రశ్నలకు తగిన అంశాలకు సూటిగా భీష్ముడే సమాధానాలు చెప్పినవి. 2. అడిగిన ప్రశ్నలకు అనువైన పూర్వప్రముఖుల సంవాదాలను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇతిహాసాలుగా వినిపించి విషయాలు వివరించినవి. 3.పృచ్ఛకు డడిగిన ప్రశ్నలోని పరమార్థాన్ని తెలుపగల కథనుగాని, ఉపాఖ్యానాన్ని గాని ఇతిహాసంగా వినిపించి తాత్పర్యాన్ని తేటపరచినవి. ఇతిహాస కథనంలో ఈ మూడూ ముచ్చట కొలిపే రచనా శిల్పాలే. వాటి స్థూల స్వరూప స్వభావాలు తెలియటానికి ఈ పర్వకథాసారంలో ప్రశ్నోత్తర మాలికగా వాటిని ప్రదర్శించటం జరిగింది. పఠితలు వాటిని ప్రాతిపదికలుగా స్వీకరించ ప్రార్థన. ధర్మరాజు వేసిన ప్రశ్నలు మొత్తం మీద 95గా గుర్తించటం జరిగింది. (ఇది రమారమి మాత్రమే) వాటిలో 62 ప్రశ్నలకు సూటి సమాధానాలున్నాయి. దాదాపు 19 ప్రశ్నలకు సంవాదాలను దృష్టాంతాలుగా పేర్కొనబడిన ఉత్తరాలున్నాయి. (ప్రశ్నసంఖ్యలు 1, 13, 16, 38, 39, 50, 53, 60, 61, 62, 65, 67, 71, 72, 77, 78, 79, 81, 86); దాదాపు 15 ప్రశ్నలకు ఉపాఖ్యానాలను ఉదాహరించి సమాధానాలు చెప్పినవి ఉన్నాయి. (ప్రశ్నల సంఖ్యలు 2, 4, 5, 8, 10, 14, 18, 49, 51, 52, 54, 59, 66, 88) సంవాదాలలో - గౌతమీలుబ్ధక సర్పమృత్యుకాల సంవాదము ప్రశ్న 1, ఇంద్రమతంగ సంవాదం. (ప్ర.3); సనత్సుజాత నారదసంవాదం (ప్ర.16); చ్యవన నహుష సంవాదం (ప్ర.38); చ్యవన కుశికసంవాదం (ప్ర.39); బృహస్పతి మాంధాతృ సంవాదం (ప్ర.50); గో శ్రీ సంవాదం (ప్ర.53); సూర్యజమదగ్ని సంవాదం (ప్ర.60); పరాశర శిష్య సంవాదం (ప్ర.61); భూదేవీ విష్ణుదేవుల సంవాదం (ప్ర.62); శుక్రబలిసంవాదం (ప్ర.65); గౌతమదేవేంద్ర సంవాదం (ప్ర.67); అంగీరస భీష్మసంవాదం (ప్ర.71); హరసనత్కుమార సంవాదం (ప్ర.72); వ్యాసమైత్రేయ సంవాదం (ప్ర.77); సుమనాశాండిలీసంవాదం (ప్ర.78); శారదపుండరీక సంవాదం (ప్ర.79); ఉమామహేశ్వర సంవాదం (ప్ర.81); పవనార్జున సంవాదం (ప్ర.86); ముఖ్యమైనవి. ఉపాఖ్యానాలలో ప్రసిద్ధమైనవి - సుదర్శన కథ (ప్ర.2); ఋచీకుడి కథ (ప్ర.4); వీతహవ్యుడి కథ (ప్ర.5); చిలుక కథ (ప్ర.8); గరుత్మంతుడి కథ (ప్ర.10); భంగాస్వనుడి కథ (ప్ర.14); అష్టావక్రవృత్తాంతం (ప్ర.18); నచికేతుడి కథ (ప్ర.49); కపిల ధేనువు కథ; సౌదాసుడి కథ (ప్ర.51); సుమిత్రుడి కథ (ప్ర.52); పరశురాముడి స్వర్ణదాన కథ (ప్ర.54); ఇంద్రసప్తర్షుల కథ (ప్ర.59); క్షత్రబిందు కథ (ప్ర.66); దుర్వాసుడి కథ (ప్ర.88); వీటిని సంగ్రహంగా రచించినా తిక్కన సోమయాజి శిల్పసుందరంగా రసవంతంగా తీర్చిదిద్దాడు.

9. సంవాద రచనా శిల్పం:

శాంతి పర్వ కథార్థాలు విన్న ధర్మరాజు మనస్సుకు శాంతి కుదరలేదు. దానికి ముఖ్యకారణం బంధువధవలన, రాజవధ వలన కలిగిన పాపభయం. దానికి హేతువులుగా అతడు భావించినది - దుర్యోధన ధర్మజులు ఇరువురూ రాజ్యం పంచుకొని అనుభవించటానికి అంగీకరించని లోభక్రోధగుణాలు. అందువలన అతడికి పశ్చాత్తాపం తప్పలేదు. దానిని నివారించటానికి భీష్ముడు ఒక ఇతిహాసం చెప్పాడు. అది సంవాద ప్రధానమైనది. అందులో గౌతమి, బోయవాడు, సర్పం, మృత్యువు, కాలపురుషుడు పాత్రలు. వీరి మధ్య సాగిన సంభాషణమే అందులో కథ. సంభాషణ ఫలితాంశమే ఇతిహాస బోధ. గౌతమి కొడుకును పాము కరిచింది. బాలుడు చనిపోయాడు. తల్లి రోదిస్తుంది. అతడి మృతికి పాము కారణమని భావించి అర్జునకుడు అనే బోయవాడు ఆ పామును తాడుతో కట్టి చంపబోయాడు. గౌతమి పామును చంపటంవలన బాలుడు బ్రతకడని భావించి కిరాతకుడిని వారించింది. క్రూరజంతువును చంపటం పాపం కాదని బోయవా డన్నాడు. ఆ మాట విని పాము తాను మృత్యుదేవత పంపగా వచ్చిన సాధనమే కాని, బాలుడి మృతికి తాను ప్రత్యక్ష కారణం కాదని వాదించింది. మృత్యువు కూడా అక్కడకు వచ్చి తాను యముడు పంపగా తన కర్తవ్యాన్ని నిర్వహించాననీ, అతడి మరణానికి తాను కర్త కాదని వాదించాడు. అప్పుడు యముడు అక్కడకు వచ్చి తా మెవ్వరూ బాలుడి మరణానికి కర్తలం కామనీ, అతడి కర్మయే అతడి చావుకు కారణమనీ, జీవుడు కర్మఫలాన్ని తప్పించుకొనలేడనీ, కాబట్టి పామును వదలిపెట్టుమనీ కిరాతుడిని కోరాడు. అతడు తత్త్వాన్ని గ్రహించి పామును వదలిపెట్టాడు.

ఈ కథలో ఆయువుపట్టు యముడి సందేశం. తిక్కన ప్రబోధాన్నీ, తత్త్వాన్నీ పఠిత హృదయానికి సూటిగా హత్తుకొనటానికి అనువుగా కందాన్ని ఎన్నుకొనటం ఒక రచనాశిల్పం. ఈ కథలో సంభాషణలు చాలావరకు కందాలలో సాగాయి. కందాన్ని స్పష్టతకూ, నాటకీయతకూ, సారళ్యానికి, సార్థకశబ్ద ప్రయోగానికీ శక్తిమంతమైన సాధనంగా తిక్కన వాడుకొన్నాడు. ఈ కథాప్రాణం ఈ క్రింది కందంలో నిక్షిప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'విను; కర్మం బొనరించును । జననము మరణంబు; నదియ సౌఖ్యము దుఃఖం
బును గావించుం; దన చే । సినదానం బడకపోవ శివునకు వశమే!'' **(అను.1.34)**

సంస్కృతంలో అనుష్టుప్పులకు వలె తెలుగులో కందపద్యాలకు ధారణానుకూల్యం ఉన్నదన్న సత్యాన్ని గుర్తించి, దానికి ఆ శక్తి నిచ్చి, నీతికీ, బోధకూ, తత్త్వానికీ, భాషణకూ దానిని సరళవాహికగా సాగించిన సవ్యసాచి తిక్కన సోమయాజి. బంధువుల మరణానికి, ధర్మరాజుగానీ, దుర్యోధనుడుగానీ కర్తలు కారు. వారి కర్మలే వారి మరణానికి కారణాలని తెలిసికొంటే ధర్మరాజు మనస్సుకు శాంతి లభిస్తుం దని ఈ సంవాద సారాంశం! సందేశం!

ఆధ్యాత్మికం, అధిదైవం, అధిభూతం అనే మూడు తత్త్వాలకు ఆధారమై, వాటిలో తానూ జీవిస్తూ కర్తా, భర్తా, హర్తా అయిన భగవంతుడిని గురించి సనత్సుజాతుడు వివరించి, నారదుడికి చెప్పిన అంశాలను అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు అందించి, భీష్ముడు ముగింపుగా చెప్పిన ఈ పద్యం భక్తిజ్ఞాన ప్రదీపిక!

ఉ. 'ఇంతకు మూలమై యిరువదేనవ తత్త్వ మనంగ వేద వే
దాంతపురాణవేద్యుఁ డగు నప్పురుషుండు వెలుంగు; వాఁడ కా
లాంతకుఁ డైన యచ్యుతుఁ డనంతుఁడు యోగిజనాంతరంగ వి
శ్రాంతుఁడు విష్ణుఁ డద్వయుఁ డసంగుఁడు గౌరవవంశదీపకా!' **(అను.1.336)**

కృష్ణభక్తుడైన భీష్మడి నోట పలికించిన ఈ పద్యం తిక్కనలో పోతన ఆవేశించి పలికించిన భక్తికవితవలె భాసించింది. ముక్తిపథాన్ని చూపించే తాత్త్విక వచనాలలో భక్తిరసాన్ని చిలికించే రచనా శిల్పం తిక్కన కవితా కళ!

అధ్యాత్మ విద్యా వివరణం కలిగించే మహిమాన్వితవాక్యాలకు రత్నాకరం వంటిది - 'హరసనత్కుమార సంవాదం'. సనత్కుమారుడు మహాజ్ఞాని. ఆయనవద్దకు మహాశివుడే వచ్చి ఆధ్యాత్మిక తత్త్వాలను అడిగి తెలిసికొన్న అపూర్వ సంవాదం ఉత్తరాదిప్రతులలో లేదు. దక్షిణాది ప్రతులలో కానవస్తున్నది. సంస్కృత వేదాంత పరిభాషనూ, తార్కిక క్లిష్టతనూ తెలుగులో దూరం చేసి తేటతెలుగులో వివరించి విజ్ఞత ప్రకటించాడు తిక్కన సోమయాజి. హరసనత్కుమార సంవాదం వచనంలో వ్రాస్తుంటే, అసంకల్పితంగా అది ఛందోగతి నాశ్రయించిందా అన్నట్లు తిక్కన రచన గోచరిస్తుంది. కందం, తేటగీతి, ఆటవెలది - అనే దేశి వృత్తాలు తిక్కన రచనకు భావవాహికలుగా పరిఢవిల్లాయి. మచ్చుకు ఆ మూడు పద్యాలలో చెప్పిన మూడు ఆధ్యాత్మికాంశాలు గమనించండి.

క. 'జలమున మీను, నుదుంబర । ఫలమున మశకములుఁ బోలెఁ బ్రకృతిం దా ని
మ్ముల నునికి దెలిసి, వేర్పా । టలవఱచిన పురుషుఁ డవ్యయత్వముఁ బొందున్.'

తే. 'కమలదళమున నున్న జలమువిధమునఁ । బ్రకృతి నుండి తదీయ సంబంధవికృతి
లేని తనుఁ గని వెలుఁగు నిర్లేపనిశ్చ । లాజరామర పదవి జీవాప్యాయుండు.'

ఆ. 'ప్రకృతి నిట్లు వాసి పంచవింశుండు ష । డ్వింశభావ మొంది విమలశివ ని
రంజన స్వరూపుఁ డై వెలుఁగొందు న । త్తెఱఁగు ముక్తి యండ్రు దేవదేవ!'

(అను.4.232-234)

సనత్కుమారుడు రుద్రుడికి తెలిపిన సాంఖ్యయోగవిధానం తెలుగున పారాయణ పర్వంగా తిక్కన సోమయాజి సంతరించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'సంగము బంధ; మఖిలని । స్సంగత మోక్షంబు; బహువిచారము లేలా?
పింగజటాజూట కలిత । గంగాబాలేందు మహిత ! గౌరీసహితా!' **(అను.4.238)**

అనే ముగింపు పద్యం వేదాంత సూత్రం కందార్థంగా జాలువారి తెలుగువారి గళంలో గేయంగా రూపొందినట్లు రక్తికట్టింది. తిక్కన రచన తెలుగుదనపు పూదోట!

విద్య, తపస్సు, దానం - అనే మూడింటిలో దానమే గొప్పదని నిరూపించేది వ్యాసమైత్రేయ సంవాదం. ఆకలి గొన్న వ్యాసుడికి మైత్రేయుడు అతిథి సత్కారంతోపాటు మృష్టాన్న మిచ్చి తృప్తుడిని చేశాడు. వ్యాసమహర్షి దానాలలో అన్నదానం మిన్న అని ప్రతిపాదించాడు. ఆ వాదం మొత్తం నాలుగు పద్యాల పరిమాణంలో ఉంటుంది. వాదం మూడు కందాలు. ఫలితాంశం ఒక ఉత్పలమాల. సముచిత ఛ్చందశ్శిల్పం.

క. 'దానార్హ వస్తువులలో । మానిత మన్నంబ ; యన్నమయము లసువులున్
మేనుఁ దదీయ బలంబును । గాన బుధులు దానిఁ దద్దఁ గైకొంద్రు మదిన్.'

క. 'తప ముల్లము కల్మషముల । నపగతములఁ జేయు విద్య కాస్పద మగు నా
తపసి మహితదానంబున । నుపచిత మగు విద్య దపము నుత్కర్షించున్.'

క. 'కాన తపంబును విద్యయు । దానౌదాత్త్య ప్రవర్ధితంబులు విద్యా
నూనత్వం బచ్యుతుఁ గను । దానికి దీపంబు సద్వ్రత ప్రవణులకున్!'

ఉ. 'కావున నన్నదానమునఁ గా కెటులుండు మహాప్రమోద మ
త్యావిలచిత్తుఁ డైనను మహత్తర దానమునన్ విశుద్ధస
ద్భావత నొందు నిక్క' మని పల్కె నరేంద్ర! తపంబు విద్యయున్
దైవత పూజనీయములు; దానము వానికిఁ బోషకం బగున్.' **(అను.4.350-353)**

సర్వశాస్త్ర సారరూపమైనదీ, సర్వశ్రేష్ఠమైనదీ ఏది? అని ధర్మరాజు అడిగితే భీష్ముడు నారద పుండరీక సంవాదం తెలిపాడు. నారదుడు చెప్పిన పరమార్థాన్ని పుండరీకుడికి చెప్పాడు. తిక్కన ఆ పరమార్థ సారాన్ని ఒక ఆటవెలదిలో తెలుగువారి కందించాడు.

ఆ. 'సర్వశాస్త్ర వాక్య సమితి నాలోకించి । మఱియు దృఢవిచార మహిమఁ దెలిసి
నిశ్చయింపఁ బడియె నిష్ఠ నారాయణు । నెపుడుఁదలఁప వలయు నిది యొకండ.' **(అను.4.368)**

ఈ ఒక్క పద్యం చాలు - ఆచారాల కన్నింటికీ ఆచార్యకం!

సంవాదా లన్నింటికీ శిఖరప్రాయం 'ఉమామహేశ్వర సంవాదం'. భూలోకంలో ధర్మరాజు భీష్ముడిని అడిగినట్లుగానే ఎన్నో యుగాల పూర్వం పార్వతి శివుడిని అడిగింది. పరమేశ్వరతత్త్వం నుండి పరమలౌకిక విషయాల వరకూ ఆమె అడిగిన ప్రశ్నల పరంపర ఒక మహా విజ్ఞాన జిజ్ఞాస సంప్రదాయానికి ఇతిహాసగౌరవాన్ని కలిగించింది. తిక్కన తెలుగులో ఆ వెలుగుబాటను ఆనుశాసనిక పర్వం నిర్వహణ రంగంగా నిలిపి నిండుదనం కలిగించాడు.

10. ఉపాఖ్యాన రచనా వైభవం:

ఉపదేశానికి ఉపాఖ్యానం ఊతకర్రగా ఉపయోగిస్తుంది. ప్రబోధానికి బలవర్ధకంగా పనిచేస్తుంది. ప్రతిపాద్యాంశానికి ప్రమాణంగా పనికివస్తుంది. జీవిత సత్యానికి అనుభవచిత్రంగా అన్వయిస్తుంది. వర్తమానానికి కర్తవ్యాన్ని బోధించే ఇతిహాస స్మృతిగీతిగా వినిపిస్తుంది. ఉపాఖ్యానం కావ్యార్థాలకు రసవత్తర వ్యాఖ్యానం. ఆనుశాసనిక పర్వం దాదాపు నూరు ప్రశ్నలకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉత్తరాలు చెప్పే చర్చావేదిక. వాటిలో దాదాపు 15 ప్రశ్నార్థాలకు ఉపరంజనాత్మకమైన ఉపాఖ్యానాలు రమణీయ రసోల్లాసాన్ని కలిగించాయి.

సుదర్శనోపాఖ్యానం : (ప్రశ్న - 2)

గృహస్థాశ్రమంలో ఉండికూడా మృత్యుభయం పోగొట్టుకొన వచ్చునా? అనే ప్రశ్నకు సమాధానంగా ధర్మానికి స్థిరంగా నిలబడగలిగితే గృహస్థుడు సశరీర స్వర్గాన్ని, ముక్తిని సాధించవచ్చునని చెప్పే కథ ఇది. ఈ కథలో రెండు కథలున్నాయి. ఒకటి దుర్యోధనుడనే రాజుకూ నర్మదానదికీ పుట్టిన సుందరాంగి సుదర్శన అనే కన్య కథ. రెండవది ఓఘవతిని వివాహమాడిన సుదర్శనుడి చరిత్ర. నిజానికి గృహస్థాశ్రమధర్మానికి నిలబడిన దంపతులు ఓఘవతీసుదర్శనులు. వారికి ధర్మదేవత సశరీరస్వర్గాన్ని ప్రసాదించాడు. ఈ కథా నిర్మాణంలో ఒక చక్కని ధర్మ మర్మం ఇమిడి ఉన్నది. అపూర్వ సౌందర్యవతి అయిన సుదర్శనను తండ్రి దుర్యోధనుడు అగ్నిహోత్రుడి సేవలో నియుక్తురాలినిగా చేశాడు. ఆమె నిష్ఠతో గృహంలోని అగ్నిని ఆరాధిస్తున్నది. కాని, ఆమె సౌందర్యానికి అగ్ని ముగ్ధుడై ఆమె మీద మరులు గొన్నాడు. అగ్ని మదనాగ్నికి వశుడై పోయిన వింతపోకడలను తిక్కన ప్రబంధశైలిలో శృంగార రసపోషకంగా ఇట్లా వర్ణించాడు.

సీ. 'అర్చించునప్పు డయ్యంగన కెంగేలి । జిగి సొంపు చిత్తంబు దిగిచికొనఁగ
నరసి కన్గొనునప్పు డయ్యింతి కనుఁగవ । పొలపంబు రాగంబు వొదలఁ జేయ
నన్యులఁ బనిఁ బంచునప్పు డమ్ముద్దియ । పలుకులతీపు గోర్కులఁ గెరల్ప
నల్లన యూఁదెడు నప్పు డక్కొమ్మ వా । తెఱతావి ధైర్యంబు ద్రిప్పుకొలుప

తే. మరుఁడు దోడ్తోడఁ దేకువ మాలి కదిసి । తూపుగముల క్రొవ్వాఁడిమి సూప నంత
కంత కగ్గల మగు వలవంతఁ దూలి । పోయెఁ బావకుఁ డేమి సెప్పుదు నరేంద్ర!' **(అను.1.48)**

అర్చించేటప్పుడు ఎర్రని ముంజేతులు దగ్గరకు వచ్చేవి కావు. అవి అగ్నిదేవుడి హృదయాన్ని దగ్గరకు లాగుకొనేవి; అగ్నిని పరిశీలించి చూస్తున్నపుడు ఎర్రబడ్డ కన్నుగవ హృదయంలో అనురాగాన్ని పెంచేది. ఇతరులకు పనులను పురమాయించేటప్పుడు ఆమె మాటల తియ్యనిదనం హృదయంలో తియ్యని రాగాల వలపు భావాలను రేకెత్తించేది. అగ్నిని వెలిగించేటప్పుడు ఆమె ఊదేది. అప్పుడు ఆమె పెదవుల సుగంధం అగ్నిదేవుడి మనోధైర్యాన్ని దూరం చేసేది. మన్మథుడు విడువకుండా వరుసగా బాణాలు వేయటంవలన అగ్నికి వలపులవేడి ఎక్కువ అయి నిలువరించుకొనటం సాధ్యం కాకపోయింది. ఇందులో చేష్టాగతమైన విరహం భావోన్మీలనం వలన ప్రదర్శితమైనట్లు మనోహరంగా చిత్రించబడింది. మనస్సు లగ్నం కావటం, రాగోదయం కావటం, వలపుకోర్కెలు, రేగటం, మనోధైర్యం పోవటం, వలపు వేడి పొంగటం అనే మదనదశా వికాసం పైసీసంలో పరమరమణీయంగా వర్ణించబడింది.

మదనావేశపరుడైన అగ్ని ఏకాంతంలో ఆమెకు తన మనసులోని మాటను మధుర మధురంగా బైట పెట్టాడు. తిక్కన రచనలో మరొకవలపుతీగ వంటిసీసం అల్లుకొని వచ్చింది.

సీ. 'చిగురుటాకుల గాసిసేయు నీ యడుగుల । చెలువంబు సూడ్కులఁ జేర్చికొనియె;
మారేడుపండులగారాము సెఱచునీ । యెలచన్నుఁగవ వేడుకలఁ బొనర్చె;
నునుఁదీవఁ జీరికిఁ గొనని నీ మైఁదీప । మురిపంబు డెందంబు మరులు కొలిపె
నెఱచందురుని సిగ్గువఱుపంగఁ జాలు నీ । నెమ్మోము దాలిమి వమ్ము సేసె;

తే. నాతి! నీకునై పెక్కుబన్నములు వడితి । నంగజుని చేత; వల్లభ వగుము నాకు'
నావుడును సిగ్గు గదిరి యాననము వాంచి । యలఁతి యెలుఁగున నిట్లను నాలతాంగి.' **(అను.1.50)**

నాయికా సౌందర్యాన్ని పొగడుతూ, దానివలన తాను పొందిన మదనావస్థలను మనసుకు హత్తుకొనేటట్లు చెప్పే వలపుమాటల చమత్కారం ఈ పద్యంలోని శృంగార రసోల్లాసం. చిగురుటాకులను ధిక్కరించే ఆమె అడుగుల కోమలత్వ సౌందర్యం ఆయన చూపులను ఆకర్షించింది. మారేడుపండ్ల పొంకాన్ని కాదనే ఆమె చన్నుగవ పొంకం అతడిలో ఆసక్తిని రేకెత్తించింది. లేత తీవ అందాన్ని లెక్కచేయని ఆమె మైదీవ లావణ్యం మనసులోని విరహాన్ని విరజిమ్ముతున్నది. పూర్ణచంద్రబింబాన్నే అవమానించగల ఆమె అందమైన ముఖం అతడి ధైర్యాన్ని వమ్ముచేసింది. మన్మథుడు పెట్టే బాధలన్నీ అగ్నిదేవుడు పొందాడట! ఆ బాధ లన్నీ తీరాలంటే సుదర్శన ఆయనను వివాహమాడి ఇల్లాలిగా మారాలి - అని కోరుకొన్నాడు.

అగ్నిదేవుడు పొందిన విరహవేదన ఆ సుందరాంగిని భోగించటానికి పడిన వలపుల వంత కాదు. అతడు శృంగారాన్ని ఒలకపోసినా శృంగార నాయకుడిగా కాక ధర్మబద్ధమైన వివాహం చేసికొనటానికి సిద్ధమైన ఉదాత్తుడిగా గోచరించాడు. ఈ కథలోని కీలకం ఇదే. శృంగారం ధర్మబద్ధమైనప్పుడు మాత్రమే గృహస్థులకు ఆదర్శజీవితాన్ని అందించగలుగుతుంది.

అగ్నిదేవుడి కోరికను సుదర్శన తిరస్కరించలేదు. అతడి మాటలు విని కోపగించుకొనలేదు. సిగ్గు లొలకపోసింది. తలవంచి లజ్జను అభినయించింది. సన్నని గొంతుతో బదులుపలికి సౌముఖ్యాన్ని ప్రకటించింది. అయితే, క్షత్రియ వనిత కదా అని గాంధర్వ వివాహానికి ముందుకు రాలేదు. కులకన్యల ధర్మాన్ని పేర్కొని తన తండ్రియొక్క గృహస్థాశ్రమ గౌరవాన్ని నిలువబెట్టింది.

క. కులకన్యకలకు వేడుకఁ । దలవీడులఁ బరులతోడి తగుమాటలకుం
దులకొనఁ దగునే? గురుజన । ముల కా కర్తెఱఁగు వారు పురుషార్థ నిధీ!' **(అను.1.51)**

ఈ మాటలు సుదర్శనా సౌందర్యానికి శీలసౌందర్యాన్ని కలిగించిన అమృతవాక్కులు. అగ్నిదేవుడు గంభీరుడు. తన కోర్కెను సుదర్శనకు తెలియజెప్పాడు. ఆమె అతడిమాటను తిరస్కరించలేదు. కాని, పెద్దల అనుమతి కావాలని భావించింది. పెద్దలతో ఎవరు చెప్పాలి? ఆమెయే తండ్రికి చెప్పి ఒప్పింపచేస్తుందని అగ్నిదేవుడు భావించాడు. కాని, అది జరుగలేదు. అందువలననే యజ్ఞంలో బ్రాహ్మణవేషంలో కనపడి కన్యను అడిగిన అగ్నిదేవుడి కోర్కెను రాజు తిరస్కరించాడు. అప్పుడు తన కోర్కెను బయటపెట్టటం అగ్నికి ఔచిత్యం కాదని తెలిసింది. యజ్ఞంలోనుండి రూపాన్ని ఉపసంహరించుకొన్నాడు. ఋత్విక్కులు యజ్ఞభంగం ఔతుందని భయపడి అగ్నిఋుక్కులు చదివారు. అప్పుడు అగ్ని తన మనసులోని మాట వారికి చెప్పుకొన్నాడు. రహస్యంగా వారు రాజుకు చేరవేశారు. అతడు సంతోషించి తన కుమార్తె నిచ్చి అగ్నికి వివాహం చేశాడు. యజ్ఞం సక్రమంగా ముగిసింది.

ఈ కథలో కేంద్ర బిందువు కులకన్య సుదర్శన. ఆమె తన తండ్రికి గృహస్థగౌరవానికి దివ్యజ్యోతివలె నిలిచింది. దైవస్వరూపుడయిన అగ్నిని తాను వరించా నని కాని, అతడు వరిస్తే తాను అంగీకరించానని గాని ఎక్కడా బయటికి పొక్కనీయలేదు. అట్లని అగ్నిసేవలు ఉపసంహరించుకొనలేదు. వివాహానికి ముందు కన్య తండ్రి యొక్క రక్షలో ఉంటుంది. అగ్ని తనను అడిగినట్లే, తన తండ్రిని అడిగి అనుమతి పొందాలని ఆమె ఆకాంక్ష! ఆ మాట వ్యంగ్యంగా సూచించింది. మౌనంగా ఉండిపోయింది. అగ్నియే అన్నిపనులూ తానే ముగించి తన గౌరవాన్నీ, కులకన్య మర్యాదనూ, గృహస్థధర్మాన్నీ నిలువబెట్టి, గృహస్థాశ్రమం ఒక పవిత్ర యజ్ఞ కర్మవంటిది అన్న సత్యాన్ని తన ప్రవర్తనం ద్వారా లోకానికి తెలిపాడు.

సుదర్శనకూ అగ్నిదేవుడికీ కలిగిన సంతానంలో ఒకడు సుదర్శనుడు. అతడి భార్య ఓఘవతి. ఆమె పతివ్రత. పతిమాట జవదాటని ఇల్లాలు. సుదర్శనుడు గృహస్థాశ్రమ ధర్మనిష్ఠాపరుడు. నిరంతరం అతిథిపూజ చేయటం, గృహస్థ ధర్మాలలో ఉత్తమమని భావించి త్రికరణశుద్ధిగా దానిని ఆచరించ నారంభించాడు. ధర్మపత్నిని కూడా ధర్మాచరణంలో నిమగ్నురాలినిగా చేశాడు. ఆమె కిట్లా బోధించాడు.

క. 'అతిథిజనులు దమతమ వాం । ఛితము లనుభవించునట్లు సేయం గనినం
గృతకృత్యతఁ బొందరె గృహ । పతియును గృహిణియును ధర్మభారమువలనన్.'

క. 'అతిథి నినుఁ గోరె నేనియు । మతిఁ గింకిరిపడక యొలమాసగొనక నీ
వతనికిఁ బ్రియంబు సల్పుము । సతికిం బతిపనుపు సేయఁ జను నెల్లదియున్.' **(అను.1.67, 68)**

అతిథి సత్కారం పరమధర్మమే అయినా, సతిశీలదానం ధర్మవిరుద్ధం కాదా? అనే ధర్మసందేహం కలుగుతుంది. ఆ నియమం సుదర్శనుడు గృహస్థ ధర్మంగా ప్రకటించాడు. ధర్మదేవతకే అది ప్రశ్నార్థక మయింది. ఆ నియమానికి పరీక్ష పెట్టాడు. సుదర్శనుడు ఇంట లేనప్పుడు ధర్మదేవత అతిథిగా వచ్చి ఓఘవతిని కోరాడు. ఆమె ధర్మపథాన్ని తెలిపి వారించ యత్నించింది. అతడు మదనాతురుడై ఆమెను కోరాడు. ఆమె భర్త ఆనతిని మనసులో తలంచి అతిథికోర్కెను తీర్చటానికి వెనకాముందూ ఆడి జంకుతూ సంకట పడింది. కాని, పతి మాటకు తలయొగ్గి అతిథికి సుముఖురా లయింది. ఆత డామెను మరుగునకు తీసికొని వెళ్ళాడు. అంతలో సుదర్శనుడు వచ్చి భార్యను పిలిచాడు. ఆమె మాట్లాడలేదు. అతడు పెద్దగా ఎలుగెత్తి పిలిచాడు. ఆమె అతిథి సేవలో ఉన్నదనీ, కోపగించవద్దనీ లోనినుండి ధర్మదేవత పలికాడు. ఆ మాటలు విని సుదర్శనుడు త్రికరణశుద్ధిగా సంతోషించి, తన భార్యను అతిథి సేవకు పురికొల్పాడు. అప్పుడు సుదర్శను డిట్లా ప్రకటించాడు.

ఉ. 'నా వచనంబు నట్టుల మనంబును; దీనికి సాక్షు లుర్వియుం
బావకుఁడున్ జలంబును నభంబును వాయువుఁ జంద్రసూర్యులున్'
నావుడు మ్రోసె నాకసమునన్ విశదంబుగ దివ్యవాణి సం
భావితుఁ డీతఁ డీవిభునిపల్కు నిజంబని కౌరవేశ్వరా!' **(అను. 1.78)**

'ధర్మో రక్షతి రక్షితః' అన్న న్యాయం ప్రకారం ధర్మదేవత గృహస్థ ధర్మరక్షణం చేశాడు. ఆ దేవుడు సాకారుడై ప్రత్యక్షమై మాట తప్పితే సుదర్శనుడిని చంపటానికి మృత్యువు అతడి వెనువెంటనే వేచి ఉన్నాడనీ, కాని, ధర్మాన్ని త్రికరణ శుద్ధిగా పాటించిన ఆ దంపతులకు సశరీరస్వర్గసుఖాన్ని ఇస్తున్నాననీ ప్రకటించాడు. ఓఘవతి తన పుణ్యంలోని సగభాగంతో పుణ్యనదిగా ప్రవహించి లోకులను ఉద్ధరిస్తుందనీ, మిగిలిన సగంతో పతిని సేవిస్తుందనీ వరమిచ్చాడు. ఇది పుణ్యకథగా, ఇతిహాసంగా ప్రసిద్ధికెక్కింది.

ఆ. 'అతిథిపూజఁ గడచినట్టి ధర్మువు గృహ । స్థులకు నొండు లేమి దెలుపుచున్న
యది; సమస్త కిల్బిషాపహ మీయితి । హాస మిచ్చు నెల్ల యభిమతములు.' **(అను.1.84)**

అని ఫలశ్రుతి పలికాడు పితామహుడు. తిక్కన ఈ చిన్న ఇతిహాసాన్ని స్వయంసమగ్రమైన ప్రబంధంగా తీర్చిదిద్దాడు.

సౌపర్ణోపాఖ్యానము : (ప్రశ్న : 10)

గరుత్మంతుడు మహాత్ముడని ధర్మరాజు విన్నాడు. దాని తాత్పర్యం వివరించు మని భీష్ముడిని అడిగాడు. భీష్ముడు ఆ ప్రశ్న వెనుక ఉన్న రహస్యాన్ని భావించి శ్రీకృష్ణుడి వైపు మొగం త్రిప్పి 'స్వామీ! నీవే ఆ గరుత్మంతుడవై పుట్టావని విన్నాను' అని అడిగాడు. శ్రీకృష్ణుడు నవ్వి 'అడుగుతున్నవాడి అభిప్రాయాన్ని గమనించి కథను సాగించు' మని సూచించాడు. భీష్ముడు కథ చెప్పాడు.

సౌపర్ణోపాఖ్యానం ఆదిపర్వం ద్వితీయాశ్వాసంలో ఒకసారి చెప్పబడింది. నాగమాత కద్రువ తన కొడుకుకు శాప మెందు కిచ్చింది? అనే ప్రశ్నకు సమాధానంగా ఆదిపర్వంలో కథ చెప్పబడింది. ఈ పర్వంలో గరుత్మంతుడి మాహాత్మ్య లక్షణాలను నిరూపించటానికి కథ చెప్పబడింది. కథా ప్రయోజనాన్ని బట్టి కథాకథనం, దానిశిల్పం మార్పు చెందటం సహజం. ప్రస్తుత కథా ప్రణాళికలో ఆ మార్పు కనబడుతుంది. స్థూలంగా గోచరించే అంశా లివి:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

1. ఇందులో కథా కాలక్రమ పద్ధతి ననుసరించి సాగదు. కార్యకారణ క్రమపద్ధతి ననుసరించి సాగుతుంది. అందువలన కథలో కద్రువకు సర్పాలు పుట్టిన తరువాత వినత అసూయతో తన మొదటి అండాన్ని పగులకొట్టుతుంది. అందులోనుండి సగం శరీరంతో అరుణుడు పుట్టి, తల్లి తొందరపాటుకు కోపించి, ఆమె కద్రువకు దాసి అయ్యేటట్లు శపించాడు. ఇది పూర్వకథకంటె భిన్నమైన కల్పన.

2. ఆ తరువాత అయిదువేల సంవత్సరాలకు మహాబలవంతుడు పుట్టి స్వేచ్ఛగా అంతరిక్షంలో తిరుగుతూ బ్రహ్మ సూచించిన ఆహారాన్ని తింటూ ఉంటాడు. అరుణుడే గరుత్మంతుడు తల్లి దాస్యాన్ని తొలగిస్తాడని సూచించాడు. ఇది పూర్వకథకంటె విలక్షణంగా ఉన్నది. గరుత్మంతుడు పుట్టి స్వేచ్ఛగా తిరుగుతూ తల్లిని పట్టించుకొనకపోవడం విశేషం. నారదుడు చెప్పేంతవరకు అతడికి తల్లి సవతికి దాస్యం చేస్తున్నదని తెలియకపోవటం ఈ కథలో విశేషం.

3. కద్రువా, వినతలు సముద్ర తీరానికి పోయి, ఉచ్చైశ్శ్రవాన్ని చూచి, దాని తోక నల్లగా ఉన్నదా లేదా? అన్నదాని మీద శపథాలు చేసికొని, మరునాడు కద్రువ కపట వర్తనంవలన వినత మోసపోయి సవతికి దాసిగా దైన్యజీవితాన్ని గడుపుతూ ఉన్న కథను గరుత్మంతుడి జన్మకథ తరువాత చెప్పటం ఈ కథలో విశేషం. వినతాదాస్యం గరుత్మంతుడి మహాపురుష లక్షణాన్ని నిరూపించటంలో ప్రాధాన్యం వహించలేదు కాబట్టి కార్యకారణసంబద్ధమైన కథన శిల్పం పాటించబడింది.

4. తల్లి సవతికి దాస్యం చేస్తున్న విషయం గరుత్మంతుడికి నారదుడివలన తెలియటం ఈ కథలో విశేషం. కద్రువ వినతాదాస్య విముక్తికి అమృతం తేవాలి అన్న నియమం పెట్టింది. దాని ప్రకారం గరుత్మంతుడు అమృతభాండాన్ని తెచ్చి చూపించి, వెంటనే దానిని దేవేంద్రుడికి ఒప్పచెప్పుతాడు. ఈ కల్పన ఈ కథకే ప్రత్యేకం. మిగిలిన కథంతా సామాన్యమే.

5. చివరకు ఇంద్రుడు గరుత్మంతుడు సాక్షాత్ విష్ణువుగా పేర్కొని కీర్తించాడు. 'అతండు సాక్షాద్విష్ణుండు; కృష్ణుండన శూరుఁ డను యాదవ ధాత్రీశునకుఁ బౌత్రుండై లోక హితార్థంబుగాఁ జరియింపంగలవాఁ; డీమూర్తియు విడువండు; వివిధవర్తనంబుల వినోదించుచుండు ననియె' (ఆను.1.269). గరుత్మంతుడు మహాత్ము డనటానికి ఈ అంశం పరాకాష్ఠ. దీనితో కథముగియటం ఈ ఇతిహాస వైశిష్ట్యం. ఈ ఇతిహాసానికి తిక్కన తన వర్ణనా సామర్థ్యంతో ప్రబంధ గౌరవాన్ని కలిగించాడు. గరుత్మంతుడి వర్ణనం.

చ. ఘనతరకంధరుండు, దృఢకాయుఁడు, దీప్తముఖుండు, రక్తలో
చనుఁడు, మహోత్తమాంగకుఁడు, చారుసుసంగత పక్షసారమం
డనుఁడు, పరిస్ఫుర ద్యుతి విడంబిత బాలదివాకరుండు, లో
కనయన పర్వనిర్వహణకారి సుపర్ణుఁడు పుట్టె భూవరా! **(ఆను.1.177)**

ఇందులో వాడిన ప్రతి విశేషణమూ కథతో ముడిపడి ఉండటం సార్థక్యం. సముద్రతీర వర్ణనం కావ్యోచితరీతిలో సాగి ఉపాఖ్యానానికి అందాన్ని చేకూర్చింది.

సీ. చంచులఁ జిగురాకుఁ జించియాడుచు నలి । నెలుఁగించు గండుఁగోయిలలసొంపు,
నలరుఁ దేనియఁ గ్రోలి, యన్ను సోలంబుల । మురియు తేఁటుల నునుమ్రోఁత యింపుఁ,
దమిఁ బండ్ల రసమాని తమలోనఁ జెలఁగుచుఁ । బలికెడు రాచిల్క పటురవంబు,
గొలఁకుల కెలఁకులఁ గూడి క్రీడించుచుం । డెడు నంచతండంబు నడబెడంగుఁ,

తే. దరఁగఁ దేలుచుఁ, బూఁదీవఁ దగులఁ బడుచు । వచ్చు చిఱుగాలి సోఁకును, మెచ్చి మెచ్చి,
తగిలి కొనియాడుచును, వినతయునుఁ గద్రు । వయును మున్నీటి చేరువ వనమునందు. **(ఆను.1.181)**

ఉత్ప్రేక్షాలంకారంలో ఉచ్చైశ్శ్రవ వర్ణనం ఉజ్జ్వలం!

చ. కరువునఁ బోసిరో విధుని కాంతి సుధాబ్ధి తరంగఁ దెచ్చి గం
డరు వొనరించిరో! హరుజటాస్థలికిం దొడ వైన యేటి పె
న్నురువునఁ జేసిరో! యన మనోజ్ఞ సితచ్ఛవి నుల్లసిల్లు సుం
దర తురగోత్తమంబు దవుదవ్వులఁ గాంచిరి చారులోచనల్. **(అను.1.183)**

ఈ ఉపాఖ్యానం మహాపురుష ప్రశస్తితో ముగిసినట్లు రచించిన తిక్కన ప్రబంధ రచనా ప్రతిభను ప్రదర్శించాడు. గమనించండి.

సీ. 'అజుఁ డుపలాలింప నద్దేవు కావించు । వరభోజనంబులఁ బెరిగె నితఁడె!
ఘనకాయజవసత్త్వ గజకచ్ఛపముల నొ । క్కెత్తున లీలమై నెత్తె నితఁడె!
విపులభూరుహశాఖ విఱిగిన మునిహితా । ర్థంబుగాఁ జంచునఁ దాల్చె నితఁడె!
సురసేనతోఁ బురందరుని నిర్జించి యు । ద్దీప్తుఁడై యమృతంబుఁ దెచ్చె నితఁడె!

తే. తల్లిదాస్యంబు దనబాస దప్పకుండఁ । బాపి యాసుధ మరల నప్పాకశాస
నునకు దయ నిచ్చె నీతఁడె యనుచు సిద్ధ । సాధ్యు లగ్గింప గరుడుఁడు సనియె మగిడి'. **(అను.1.270)**

పునరుక్తమైనా ఈ ఉపాఖ్యానం పునరుద్భవ గౌరవం పొందింది.

అష్టావక్రుడి చరిత్ర : (ప్రశ్న.18)

ఈ పర్వంలో చాలామంది దృష్టిని ఆకర్షించే ఉపాఖ్యాన మిది. కన్యాదానానికి ఎటువంటి వరుడు కావాలి? అన్నది ధర్మజుడి ప్రశ్న. అస్ఖలిత బ్రహ్మచారి అని సమాధానం. ఆ అంశాన్ని నిరూపించే వ్యక్తి అష్టావక్రుడు. వదాన్యుడనే ముని తన కూతురైన సుప్రభను వివాహమాడుతానని కోరుకొన్న అష్టావక్రుడిని పరీక్షించిన కథ ఇది. శ్రీ కురుగంటి సీతారామయ్య గారీ ఉపాఖ్యానాన్ని గురించి ఇట్లా సమీక్షించారు. "మూడధ్యాయముల కథను 30 పద్యములలో (తిక్కన) సంతరించెను. స్త్రీ స్వభావము మాతృకలో నతివిపులముగా నున్నది. దానినంతను తిక్కన యొక్క పద్యములో ముగించినాడు. దీని వెనుకటి ఘట్టము అనఁగా భంగాస్వన చరిత్రము కూడ స్త్రీ స్వభావ వర్ణనమునకు సంబంధించినదే.

సీ. 'వనితలు కామార్తి వశతఁ బొంది

తే. వంశహానిఁ దలంపరు వరుస కలుక
రాత్మజులఁ జూడ రగ్రజు ననుజుఁ గొనరు' **(అను.2.17)**

అని కొంచె మతిశయోక్తిగఁ గనఁ బడినను నిందు లోకవృత్త మెఱింగినవారికి సత్య మున్నదని తోఁచును. సోదరీమణులు నన్ను మన్నింతురు గాక! అష్టావక్రపాత్రము మిక్కిలి యుదాత్తమైన ఘట్టము. స్వచ్ఛంద యగు నుత్తరదిశయు, స్వచ్ఛుఁ డగు నష్టావక్రుఁ డును విరుద్ధ స్వభావములు గల పాత్రలు. వారి పరస్పర సంభాషణము మిక్కిలి హృదయంగమము. ఒకరి నొకరు జయింప నుద్దేశింతురు. కానఁ దుదకు సుశీలమే గెలిచెను. అష్టావక్ర పాత్రపోషణమును ఒరవడిగాఁ గొని ప్రవరపాత్రను దీర్చి దిద్దినాడు పెద్దన యని నాయూహ. చూడుఁడు.

క. పదపడి నయమున మెయిమెయిఁ । గదియించి లతాంగి చిక్కఁ గౌఁగిటఁ జేర్పం,
గదలని చిత్తము గలిగియు, । మద మేమియు లేక, యతఁడు మ్రానై యుండెన్. **(అను.2.14)**

కౌఁగిలించిన కాంతను ద్రోసి పడవేసిన ప్రవరునికంటె నితని ప్రవర్తన యెక్కువ చిత్త స్థైర్యమును దెల్పుట లేదా? 'మెయిమెయి' యనునుడికారము రెండు శరీరముల సామీప్యమును జెప్పక చెప్పుచున్నది. "అశిథిల పరిరంభము"ను జెప్పఁ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దలఁచి 'మెయి' శబ్ద పునరుక్తితోఁ గార్యమును సంతరించినాడు తిక్కన. 'మ్రానై యుండెన్' అని వెనుకటి పరిరంభము యొక్క వైఫల్యమును దెలిపినాఁడు. అందులకై 'కదలని చిత్తము' 'మదము లేకపోవుట' యను కారణములను దెల్పు కావ్యార్థములతో గార్యమును సాధించినాఁడు. అష్టావక్రపాత్ర మాదర్శబ్రహ్మచారి పాత్రము. తాను ప్రేమించిన కన్యయెడల నతని కెంత గాఢరతియున్నదో తెల్పినాఁడు''. (ఆంధ్ర మహాభారతోపన్యాసములు. పు.232-233)

ప్రతి ఉపాఖ్యానంలోనూ ఏదో ఒక ప్రత్యేకత కానరావటం తిక్కన రచనా శిల్ప విశేషం. ఆనుశాసనిక పర్వంలో ఎన్నో సూక్తులు తెలుగువారి నాల్కలకు రుచులు కలిగిస్తూ ఉన్నాయి. మచ్చుకు కొన్ని.

తే. 'బాల్యమునఁ దండ్రి, యౌవనప్రాప్తి మగఁడు, । వార్ధకంబునఁ దనయుఁడు, వామనయన
నరసి నడపన కా కెందు నంగనలకు । వలసినట్టులు సేయఁగా వచ్చు నెట్లు? **(అను.2.22)**

క. పరమజ్ఞానుల యొద్దను । బరఁగిన నజ్ఞుఁడును బోధభరితుఁడగు నిరం
తర మేరుసమీపస్థితి । హిరణ్యరుచిఁ గాక మెసక మెసఁగిన పగిదిన్. **(అను.3.325)**

ఆ. 'దంతియడుగు లోనఁ దక్కిన జంతుచ । యంబు నడుగు లెల్ల నడఁగి యుండు
నట్ల ధర్మకోటు లన్నియు లోనగు । నిద్ధగుణ! యహింస కింత నిజము. **(అను.4.383)**

తే. క్రోధకామాదులైన దుర్గుణము లెల్ల । వాయుహతి మేఘపటలంబు వాయు పగిది
శ్రుతముచేఁ బాయు; నరులలో సురల కరణి । శ్రుతయుతులు దేజరిల్లుదు రతిశయిల్లి. **(అను.5.148)**

ఆనుశాసనిక పర్వం అక్షరాలా సూక్తి రత్నాకరం!

11. భీష్మ నిర్యాణం:

ఆనుశాసనిక పర్వం భీష్మ నిర్యాణంతో ముగుస్తుంది. అది ఒక ఉజ్జ్వలమైన నిర్వహణ. భీష్ము డెంతటి మహావీరుడో అంతటి కృష్ణభక్తుడు. శ్రీకృష్ణుడిలో పరమాత్మ తత్త్వాన్ని దర్శించిన అంతర్యోగి. పాండవులు అతడిని దివ్యపురుషుడిగా భావించి సేవించారు. భీష్ముడు ఆయన దైవమని ధ్యానించాడు. ఉత్తరాయణపుణ్యకాలం రాగానే ఆయన ఎదుట శ్రీకృష్ణుడు నిలిచాడు. విష్ణువును దర్శించినట్లు భీష్ముడు తన్మయుడయ్యాడు. ఆ దేవదేవుని దివ్యనామాలతో స్తుతించాడు. సంకల్పమరణం తన ఆధీనంలో ఉన్నా స్వర్గగమనానికి శ్రీకృష్ణుడి అనుమతిని కోరాడు. మానుష సంకల్పంకంటె దైవసంకల్పం గొప్పదని నమ్మి దేవదేవుడిని మనసారా ప్రార్థించాడు.

ఆ. 'బలము నీవ నాకు, భక్తుండ నీయెడ, । నాలుబిడ్డ లేని యట్టివాఁడఁ,
గావు నన్ను నధిక కారుణ్యమున నిమ్మ । నుజ్జ్వల గమలదళమనోజ్ఞనయన!' **(అను.5.463)**

అల్పాక్షరాలలో అనల్పార్థ రచన ఇది. బ్రతికినన్నాళ్ళు ఎదురులేని వీరుడుగా బ్రతికాడు భీష్ముడు. అతడి బలం అతడి అహంకారానికి చిహ్నం. ఇప్పుడు ఆ బలం పరమాత్మ శక్తిగా భావిస్తున్నాడు. దీనితో అతడు సాధించిన విజయాలన్నీ బ్రహ్మార్పణమైనట్లే అయింది. సర్వధర్మాలను పరిత్యజించి అంపశయ్యమీద ఉన్న భీష్ముడు శ్రీకృష్ణుడినే శరణు వేడుతున్నాడు. 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ!' అన్న భగవానుడి వాక్యాన్ని అక్షరాలా పాటించాడు. 'ఆలు బిడ్డలు లేనియట్టివాఁ

డన్' అనే వాక్యం వినేవారికి కన్నీరు పెట్టిస్తుంది. పున్నామ నరకాన్ని తప్పించే పుత్రులు కాని, ఆ సంతానాన్ని ఇవ్వగల భార్య గాని లేని భీష్ముడు నరకలోకం పొందక తప్పదనీ దాని నుండి భీష్ముడిని కాపాడే భారం బాధ్యత శ్రీకృష్ణుడిదే అనే అర్థం ఒకటి. పెండ్లాంబిడ్డలు లేని బ్రహ్మచారి కాబట్టి అతడికి సద్గతుల కొరకు అపరకర్మలు చేసే పుత్రులు లేరనీ ఒక భావం. సంసారబంధం లేకపోవటంచేత స్వర్గాది ఉత్తమ లోకాలను ఇవ్వటం శ్రీకృష్ణుడికి కష్టం కాదనీ అర్థాలు ఏర్పడతాయి. ఏమైనా అధిక కారుణ్యబుద్ధి లేకపోతే భీష్ముడిని రక్షించి ఉత్తమగతి కల్పించటం కష్టమని అతడి బాధ. ప్రాణత్యాగానికి విష్ణుమూర్తి (కమలాక్షుడు) అయిన శ్రీకృష్ణుడి అనుజ్ఞ కోరుతున్నాడు. ఆర్తితో కూడిన అనన్య భక్తికి ఈ పద్యం అక్షరోదాహరణం.

శ్రీకృష్ణుడు 'యోగక్షేమం వహామ్యహమ్' అన్నట్లు అభయ మిచ్చి అనుజ్ఞ ఇచ్చాడు.

ఆ. 'కీ డొకప్డు లేదు; కృతపుణ్యుఁ డవు, తండ్రి । వలని భక్తి పెంపు గలవు; దానఁ
గాదె బంటుఁ బోలె గాంగేయ! మృత్యువు । నీవశమున నిలిచె నిర్భరముగ'!

వ. 'నీకు నే ననుజ్ఞ యిచ్చితి; వసువులం బొందుము'
అన్నాడు. భీష్ముడి జన్మ కృతార్థ మయింది. (అను.467,468)

భీష్మపితామహుడి వ్యక్తిత్వాన్ని గురించి డా॥ వేదాంతం సంపత్కుమారాచార్యగారు పలికిన ఈ క్రింది వాక్యాలు ఆ అద్భుతమూర్తికి అక్షర నీరాజనాలు.

"నిశిత శరశయ్యపై శయనించి ఏబది యెనిమిది దినము లుండి ఉత్తరాయణ పుణ్యకాలములో మాఘ శుక్ల అష్టమి నాడు తన యిచ్ఛ ననుసరించి మరణించిన మహితాత్ముడు భీష్ముడు. ముప్పదిమూడుకోట్ల దేవతలకు మూల దేవతలు ముప్పది ముగ్గురు మాత్రమే. ద్వాదశాదిత్యులు, ఏకాదశరుద్రులు, అష్టవసువులు, అశ్వినీదేవతలు ఇద్దరు. అష్టవసువులలో ద్యౌ అను ఎనిమిదవవాడు వసిష్ఠుని శాపముచే భూలోకమున సిద్ధపురుషుడైన శాంతనవునకు త్రిలోకపావనియైన గంగవలన పుత్రుడై జన్మించి దేవవ్రత (ప్రభాసుడు అనియు అందురు) నామధేయుడై తండ్రికొరకు భీషణ ప్రతిజ్ఞ గావించి భీష్ముడై, ఆజన్మబ్రహ్మచర్య నియమ నిష్ఠుడై అప్రతిహత పరాక్రమ సమన్వితుడై నిష్కపటవర్తనుడై, కూలంకష విజ్ఞానఖనియై, శ్రీకృష్ణపరమాత్మ యందు అనన్య భక్తుడై వేదతుల్యమగు అమృతోపదేశములు ధర్మజున కుపదేశించిన లోకోత్తర మహావ్యక్తియై విరాజిల్లుచున్నాడు. శ్రీకృష్ణుడే అనినట్లు మానవులలోనే కాదు దేవతలయందు కూడా ఇంతటివాడు లేడనుట అతిశయోక్తి కానేరదు.

శ్రీకృష్ణుని మహత్త్వమునకు ప్రభావమునకు సంబంధించిన జ్ఞానము ఆ కాలములో భీష్మునియం దున్నంతగా ఇతరులయందు లేదు. అనేక పర్యాయములు ధృతరాష్ట్రునకు దుర్యోధనునకు శ్రీకృష్ణుని మహత్త్వము తెలియజెప్పెను. రాజసూయయాగములో అగ్రపూజకు అర్హుడెవరను ప్రశ్న తలయెత్తినపుడు నిండుసభలో శ్రీకృష్ణుడు మాత్రమే సర్వవిధముల పాత్రుడని స్పష్టపరచి, అతని మహత్త్వమును ఉగ్గడించి సాక్షాత్తు భగవంతుడని తెలియజేసెను. అర్జునుని రక్షణము కోరి సుదర్శనమును చేత బూని తనవైపు పరుగిడి వచ్చువేళ భీష్ముడు ఆ పరమపురుషుని చేతిలో మరణము తన భాగ్యవిశేషముగా భావించి శరసముదాయముతో పూజింపనెంచి సంతోషముతో శ్రీకృష్ణునకు ఆవాహనము తెలిపెను. యుధిష్ఠిరున కుపదేశించిన విష్ణుసహస్రనామస్తోత్రములో ప్రత్యక్షరములోను భీష్ముడి భగవద్భక్తి భగవత్తత్త్వపరిజ్ఞానము ప్రతిబింబిత మగుచుండును. శ్రీకృష్ణ పరమాత్మ భీష్ముని అవసానసమయమున దర్శనమును ప్రసాదించి కృతకృత్యుని గావించెను. ఏ విధముగా పరిశీలించినను భీష్ముడు మనకు పరమాదర్శమూర్తి. అపుత్రకుడై మరణించినను హిందువులలో మూడు వర్గములవారు ఈ నాటికి పితృతర్పణ లిచ్చువేళ భీష్మునకు తర్పణలు అర్పించుచుండుటకు ఆ మహనీయునిలోని విశిష్టతయే హేతువు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అర్థ కామములకు హేతువులైన కామినీ కాంచనములు త్యాగము చేసి కేవలము ధర్మము మాత్రము స్వీకరించిన భీష్మపితామహుని గురించి శాంతి పర్వము ద్వితీయాశ్వాసమున తిక్కన గారిచే చెప్పబడిన పద్యమిది.

ఉ. 'రాజటె! రాగహీనుఁ డటె! రాజిత సుందరమూర్తి యట్టె! వి
భ్రాజిత సంపదున్నతి విభాసితవర్తనుఁ డట్టె! కామినీ
రాజిమనోజ్ఞభంగి చతురత్వధనుండటె! బ్రహ్మచర్య దీ
క్షాజిత మన్మథుండు నటె! జన్మము లిట్టివి యెందుఁ గల్గునే!'' **(శాంతి. 2.103)**

12. హరిహరనాథతత్త్వం :

విష్ణుశివ సహస్రనామాలను వర్ణించి హరిహరతత్త్వాలను వ్యాసుడు ఈ పర్వంలో కీర్తించాడు. తిక్కన హరిహరనాథ తత్త్వాన్ని ఉపాసించి ఆ దేవుడికి తాను రచించిన ఆంధ్ర మహాభారతం పదునేను పర్వాలను అంకితం చేశాడు. ఆ హరిహర నాథ తత్త్వాన్ని గురించి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు రచించిన వ్యాసాన్ని కృతజ్ఞతలతో ఇక్కడ పొందుపరచు కొంటున్నాను. (చూడు.ఆంధ్రమహాభారత సంశోధితముద్రణము. 8వ సంపుటము, పు.43-64)

“కవిబ్రహ్మ తిక్కనసోమయాజి ఆంధ్రమహాభారతమున హరిహరినాథదేవుని సంబోధించి చెప్పిన విషయము సర్వజనవిదితము. ఈ హరిహరనాథ భావన అతని కెట్లు కలిగెను? ఇది యాతడు క్రొత్తగా కల్పించిన దేవతాస్వరూపమా? ఇట్టికల్పనచే అతడు సాధింపదలచిన ప్రయోజనమేమి? ఈ మొదలైన ప్రశ్నలు స్ఫురించును. విమర్శకలోకమునందు దీనిని గూర్చి ఎక్కువ వివేచనము జరిగినట్లు కాన్పింపదు. సామాన్యపాఠకు లీసమస్యచే నాకర్షింపబడరు. వారు కథామాత్రసంతృప్తులు గనుక భారతమందలి ఆశ్వాసారంభ, ఆశ్వాసాంతపద్యముల జోలికిపోరు. పోయినను వారి కవి ఒక పట్టాన అర్థము కావు. అందును తిక్కనసోమయాజి హరిహరనాథ సంబోధన పద్యములు విద్వాంసులను కూడా చిక్కుపెట్టునవిగా ఉన్నవి. అర్థము మాట యటుంచి వాని పదచ్ఛేదము కూడ క్లిష్టతరముగనే యున్నది. సరియైన పదచ్ఛేదము కుదిరిన గాని అర్థనిర్ణయము చేయుటకు వీలులేదు. కొన్ని కొన్ని సంబోధనములు కష్టము మీద మూర్తస్థితికి వచ్చినను, పెక్కుసంబోధనములు అమూర్తములుగనే నిలిచిపోవుచున్నవి. అవి గంభీరార్థమహితములు, యోగ, సాంఖ్య, అద్వైతవేదాంతముల నిగూఢభావములు తెలిసిన కాని ఆ సంబోధనములు తమయర్థపీయూషమును స్రవింపజేయవు. కావున తిక్కనసోమయాజి హరిహరనాథ సంబోధనములు ప్రగాఢ పాండితీమండితులకు మాత్రమే ఉపగమ్యము లగుచున్నవి. పోనిండు. “వాని నుపేక్షింపరాదా. కథావగతి కవి ఏ విధముగను తోడ్పడవు'' అనవచ్చును. కాని, హరిహరనాథసంబోధనముల నుపేక్షించుట మహాకవి అంతర ప్రభాప్రపంచమును ఉపేక్షించుటయే యగును. ఆతని బాహ్యప్రతిభా సంపత్తితో మాత్రమే తృప్తిపడినట్లగును. తిక్కనసోమయాజి కవితాశిల్పము గొప్పదే. కాని యాతని యాంతరవిజ్ఞానము ఇంకను గొప్పదిగా తోచును. అతడు శబ్దార్థ శిల్పియే కాదు. వాని వెనుక నున్న స్ఫోటకబ్రహ్మోపాసకుడు. కావుననే అతడు లోకోత్తరుడును, కాలాతీతుడును అగుచున్నాడు.

హరిహరనాథసంబోధనమునందు కవి యొక పద్ధతి నవలంబించెను. ఆశ్వాసారంభమున ఒక కందపద్యము, ఆశ్వాసాంతమందు మూడు పద్యములు. వీనిలో మొదటిది ఉత్పలమాల, చంపకమాల, మత్తేభము, శార్దూలము - వీనిలో ఒకటిగా నుండును. దీనికి కొంత యపవాదము కలదు. సౌప్తిక పర్వము ప్రథమాశ్వాసము చివర మహాస్రగ్ధరయు, ద్వితీయాశ్వాసము అంతమున స్రగ్ధరావృత్తమును కూర్పబడినవి. ఇట్లే స్త్రీ పర్వము ప్రథమాశ్వాసము చివర శిఖరిణీ వృత్తమును, రెండవ యాశ్వాసము కడపట మందాక్రాంతా వృత్తమును ఉన్నవి. రెండవపద్యము కందముగను మూడవది మాలినీ వృత్తముగను ఉన్నవి. ఆద్యంతముల నివి యిట్లే ఉన్నవి. తాను వ్రాసిన 46 యాశ్వాసముల చివరను తిక్కనసోమయాజి మాలినీ వృత్తమునే ఏల యాదరించెనో ఛందశ్శిల్పము తెలిసినవారు ఊహింపదగియున్నది. హరిహరనాథున కిది అక్షరరూపమైన మాలగా నాతడు భావించెనేమో! సంబోధన పద్యములు ఆద్యంతములందు ఆశ్వాసమునకు నాలుగు చొప్పున 46 యాశ్వాసములకు 184 పద్యములను, షష్ఠ్యంతములు ఐదున్ను, కథాప్రారంభమునకు ముందు మూడున్ను, వెరసి 129 పద్యము లగుచున్నవి. విరాటపర్వము ప్రస్తావన భాగమంతయు హరిహరనాథ విషయకమే. కావున ఇంచుమించు 200 పద్యముల గ్రంథమును హరిహరనాథుని ఆరాధనమునకు తిక్కనసోమయాజి వినియోగించె నని చెప్పవచ్చును.

ఈ పద్యములను పదచ్ఛేదము చేయుట యందు అంత్యానుప్రాస నియమము మార్గబోధకముగా కన్పించును. సంబోధనాత్మక రచనయందు అనుప్రాసము శ్రుతిసుభగముగ నుండును. తిక్కనసోమయాజి యీ యుద్దేశ్యముతోనే సమాసాంతములందు వర్ణ సామ్యమును కూర్చియుండును.

+'క్రమపరిణతమూర్తీ! శ్రౌతశాఖాగ్రవర్తీ! (4-1-335)
పరమకృపా విధేయ! నిరుపాధికచిన్మయకాయ!
గాఢవిస్తర నిగమైక వేద్య! గుణతత్త్వవికారనియత్యభేద్య!
సంస్మరణ నిరస్తతాప! ఘనసంసృతి సంతమసప్రదీప!
(సంసారమను చీకటికి దీపమువంటివాడా!)

నిష్ఠురభుజసార దానవ నిషూదన! భక్తజన ప్రమోదనా! (4-2-363)
భూరికృపానుషంగ! మునిపుంగవ చిత్తసరోజభృంగ!

సంసారదవప్రవర్ష! సురసంస్తుత దివ్యగుణప్రకర్ష! (5-1-383)

ఒక్కొక్కప్పుడు పద్యపాదమంతయు సమాసముగా చేసి దానిమీద అంత్యవర్ణ సామ్యమును పాటించుట కవికి సమ్మతము.

తపస్స్వాధ్యాయాదిక్షపితమల చిత్తప్రకలితా!
విపజ్జాల జ్వాలా విరమణ సుఖా వృష్టిలలితా! (11-1-187)

పరమ మునీంద్ర సంయమన పక్వవివేక విభూతరమ్య!
విస్తరమహనీయ తార్కిక వచః కలనానభిగమ్య! (12-4-455)

ధర్మాధర్మవిదూర నీతి పరవిద్వచ్చిత్తయోగీ!
జగన్నిర్మాణస్థితి తంత్రసంహరణ ధూర్నిర్వాహరాగీ! (13-2-476)

ఒక్కొక్క సందర్భమున మహాకవి ప్రౌఢరచనా ప్రీతిచేత కాబోలు పద్యము మూడు పాదము లాక్రమించు సమాసము కూర్చి దానికి నాల్గవపాదములో అంత్యానుప్రాస ఘటించును. ఇట్టివి నకృత్తుగనే ఉన్నవి.

కమల భవాది దైవత ముఖస్ఫుట నిర్గళితప్రశస్త వా
గమృత రస ప్రసార కలితాంచిత నైకవిధిప్రకర్ష సం
గమ సముదీరితోల్లసన కందళిత ప్రహసద్దయాలతా!
సుమహదుపాశ్రయ ప్రమద శోభిత విశ్వజగన్మధువ్రతా! (5-4-426)

బ్రహ్మామున్నగు దేవతల ముఖనిర్గళితములగు స్తోత్రములను జలసేచనముచేత పుట్టినదై చిగుళ్ళు దాల్చిన కృపాగుణమను లతకు ఆలవాలమైనవాడా! గొప్ప ఆశ్రయము లభించుటచేత సంతోషభరితమైన జగత్తను తుమ్మెద కలవాడా! అని యర్థము భాసించును. ఇట్టి దీర్ఘ సమాన కల్పనా చణత్వము స్త్రీ పర్వము రెండవ యాశ్వాసము 184వ పద్యము నందును కన్పించును.

వీణానాద ప్రతిమ నిగమావిర్భవత్సారపుణ్యా
శ్రేణీసంపాదిత విమలతాస్థేమ నిర్లేప చిత్త
త్రాణక్రీడాకలన సతతోత్సాహవద్దివ్యభావా!
ప్రాణాపానా హరణ నిపుణ ప్రాపణీయానుభావా!

+ పద్యసంఖ్యనిచ్చుటలో మొదటిది పర్వసంఖ్యను, రెండవది ఆశ్వాస సంఖ్యను, మూడవది పద్యసంఖ్యను తెలుపును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(సుస్వరయుక్తమై వీణానాద సదృశమగు వేదపఠనముచే సంపాదింపబడిన పుణ్యబాహుళ్యముచేత నిర్మలచిత్తము గలవారిని రక్షించుటయందు సంతతోత్సాహము కలవాడా! వాయు నిరోధనమునందు నిపుణులైన యోగులచేత కుద్దాలింపదగిన అనగా తెలుసుకోదగిన అనుభావము కలవాడా! స్వరయుక్తమైన వేదపఠనమునందు తిక్కన సోమయాజికి గల ప్రత్యయము దీనివలన తెల్లమగుచున్నది. హరిహరనాథుడు 'వైదిక ధ్యాయిత కిచ్చమెచ్చు' వాడని గ్రంథారంభమునందే కవి వాక్రుచ్చెను.

సంబోధనమునందు అంత్యానుప్రాసము ఇంపుగా నుండు నని మహాకవి తలచినను దీనిని ఎల్లయెడలను వాడలేదు.

మర్దిత తాప సంకలన మంజులనామ; దురంత దుర్దశా
కర్దములేప నిర్హరణకారి కృపామృతపూర; కర్మస
మ్మర్ద నిరాసకర్మఠ; సమత్వ పరిస్ఫుట రూపభావనా;
నిర్దళితారివర్గ; మహనీయ మనోరమణీయవైభవా! (6-3-453)

కర్ణపర్వము ప్రథమాశ్వాసము 320 పద్యముకూడ ఈ విధమైన రచనకు ఉదాహరణము కాగలదు. అరుదుగ ఈయన ముక్తపదగ్రస్తమును కూడా ఆదరించినట్లు కనబడును.

బాంధవ శాత్రవాకలిత భావభవా; భవపాశబంధ (4-1-333)

ఇట్లు కొన్ని మెలకువలతో క్లిష్టాన్వయము గల ఈ సంబోధన పద్యములను అన్వయింపవలెను. శ్రద్ధాళువులకు గాని తత్త్వవిషయములను చెప్పకూడదను పెద్దల సంప్రదాయమును పాటించుటకై కవిబ్రహ్మ వీనియందు గ్రంథ గ్రంథులను కావలెననియే కూర్చెనేమో. లేనిచో సాధారణముగా ప్రసన్నమగు నాతని కవిత్వమునం దివి గులకరాళ్ళవలె నుండును.

మన మిదివరలో వేసికొన్న ప్రశ్నలకు సమాధానము లరయుదము. హరిహరనాథ కల్పనము తిక్కనసోమయాజి క్రొత్తగా చేసెనా? అంతకుముందే యున్నదా? ఈ భావము తిక్కన మనస్సునందు కొంతకాలమునుండియు మెదలుచుండెననుటకు విరాటపర్వారంభము నందలి స్వప్నవృత్తాంతమే తార్కాణము, కొమ్మనామాత్యుడు కవికి స్వప్నసాక్షాత్కార మిచ్చి ఇట్లు పలికెను. " కి మస్థిమాలాం కిము కౌస్తుభం వా । పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్ । కిం కాలకూటః కిమువా యశోదాస్తన్యం తవస్వాదు వద ప్రభో మే॥" అని నీవు తొల్లి రచించిన పద్యంబు గాఢాదరంబున నవధరించి భక్తవత్సలుం డగు హరిహరనాథుండు నిన్నుం గృతార్థుంజేయ విజయం చేయుచున్నవాడు. ("ఓ దేవా! నీకు ఎముకలపేరు సమ్మతమా? కౌస్తుభము సమ్మతమా?, కాలకూట విషము నీకు రుచికరమా?, యశోదాస్తన్యమా?'' అని పద్యభాగము,) ఆదియు తొల్లి రచించిన పద్యము. అనగా మహాభారత రచనాకాలమునకు చాలాముందుగనే హరిహరాభేదభావము తిక్కన మనస్సులో రూఢమయ్యెను. నిర్వచనోత్తరరామాయణమునందు 'మహేశ్వరాంఘ్రి కమలధ్యానైక శీలుండ' అని అతడు చెప్పుకొనినను కొట్టరువు వారిది స్మార్తులు పాటించు సామాన్యశైవమే కాని వేదమును గర్హించిన తీవ్రశైవము కాదు. ఈ కాలమునకే అతని మనస్సు అద్వైత ప్రవణముగా నుండినట్లు సూచన కలదు. నిర్వచనోత్తర రామాయణమునందు మనుమసిద్ధి తాతనుగూర్చి చెప్పుచు అతడు ధర్మాద్వైతమూర్తి యని వర్ణించెను. ఈ ధర్మాద్వైత పదమే విరాటపర్వమునందు తిరిగి వచ్చినది. 'ధర్మాద్వైత స్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన యమ్నాయమున్' (4-1-3) పురుషార్థములలో ధర్మమునకును వేదాంతములలో అద్వైతమునకు ప్రాధాన్యము కలుగునట్లు కృష్ణద్వైపాయనుడు మహాభారతమును రచించెనని సోమయాజి నిశ్చితాభిప్రాయముగ కన్పించుచున్నది. అద్వైతము, ఘనిష్ఠమైన తత్త్వచింతనము. అది జీవేశ్వర అభేదమూలకము. సామాన్యజనుల భావనకు అందుబాటులోనికి రానిది. సామాన్యజనులకు కూడా నానాత్వమునందు ఏకత్వమును బోధించుటకై ప్రాచీనులు "శివాయ విష్ణురూపాయ - శివరూపాయ విష్ణవే । శివస్యహృదయం విష్ణుః । విష్ణోశ్చ హృదయగ్ం శివః'' అను మంత్రమును దర్శించిరి. ఇంతకు ముందే 'ఏకం సద్విప్రా బహుధా వదంతి - ఇంద్రం యమం వరుణం మాతరిశ్వాన మాహుః' అను ప్రాచీన ఋక్కు వెలువడినది. 'అగ్నిశ్చమే ఇంద్రశ్చమే సోమశ్చమ ఇంద్రశ్చమే' అను యజుస్సు కూడా సర్వదేవతలును

ఇంద్రస్వరూపమని సూచించుచున్నది. విష్ణుపారమ్యమును చెప్పు వాక్యములును రుద్రపారమ్యమును చెప్పు వాక్యములును వేదములందు కలవు. తిక్కనసోమయాజి ఈ యుభయ దైవముల అభేదమును భావనచేసి లోకమునకు చాటినవాడు.

హరిహరభావము అమూర్తస్థితినుండి మూర్తస్థితికి తిక్కనకు ముందే వచ్చినట్లు కన్పించును. హరిహరదేవునిపేర గుళ్ళును, విగ్రహములును వెలసెను. తూర్పుచాళుక్య వంశీయుడగు మొదటి శక్తివర్మ (క్రీ.శ.999-1012) పెన్నేరు (పెనికేరు) శాసనమునందు పిణ్ణెయ భట్టారకుడను బ్రాహ్మణవీరుని ప్రశంస వచ్చినది. ఈయన జైనుడుగ తోచును. అట్లయ్యును ఈ భట్టారకుడు హరిహరభక్తుడని కూడా వర్ణింపబడినది. దీనిని బట్టి తిక్కనసోమయాజికి రెండువందల ఏబది సంవత్సరములకు పూర్వమే ఆంధ్రదేశమునందు హరిహరనాథ సంప్రదాయము ప్రవర్తిల్లెనని చెప్పవీలగుచున్నది. పిణ్ణెయ భట్టారకుడు జినభక్తుడును హరిహరనాథ భక్తుడునుకూడా అగుట విశేషము. నెల్లూరు పట్టణమునందు తిక్కన సోమయాజి కాలమున ఇప్పటి రంగనాథస్వామి ఆలయ స్థానమునందు హరిహరనాథాలయముండెనని కొందరు ఊహించుచున్నారు. కన్నడదేశమునందు హరిహర అనుచోట హరిహరనాథాలయము ప్రసిద్ధమై యున్నది. ఈ ఆలయమునందలి ఒక శాసనములో హొయసల రెండవనరసింహునకు సేనాపతియైన పోలాళ్వ దండనాథుడు క్రీ.శ.1220 ప్రాంతమున హరిహరాలయమును జీర్ణోద్ధారము చేసినట్లు చెప్పబడి యున్నది. అనగా ఈ దేవళము అంతకుముందే ఉండెననియు, దాని నాతడు మరమ్మత్తు చేయించె ననియు ఊహింపవచ్చును. అక్కడ హరిహరేశ్వర విగ్రహము 6 అడుగుల ఎత్తుగలిగి వామపార్శ్వమున శంఖచక్రచిహ్నితమై విష్ణుని యర్ధరూపమును, దక్షిణభాగమున అక్షమాలయు త్రిశూలము గల హరరూపము చెక్కబడెనని తెలియుచున్నది. విష్ణుని యర్ధమున కిరీటమును, శివుని సగమున జడలును చంద్రవంకయు కన్పించును. కాని, కన్నడకవులలో ప్రసిద్ధులైన వారెవరును హరిహరదేవుని ప్రశంసయైన చేయలేదు. 13వ శతాబ్దమునందలి కన్నడకవులలో ముఖ్యులైనవారు కవిచక్రవర్తి జన్న, అండయ్య, కేశిరాజు, చౌండరసు మున్నగువారు. వీరిలో మొదటిముగ్గురును జైనులు. చౌండరసు తన కావ్యమును పండరిక్షేత్రమునందలి విఠోభాదేవున కంకితము ఇచ్చెను. ఆ కాలపు శివకవులలో ముఖ్యులు హరిహరుడు, రాఘవాంకుడు, కెరెయపద్మరసు మొదలైనవారు. వీరెవ్వరును కవిబ్రహ్మ తిక్కన సోమయాజివలె అద్వైతామృతమును సేవించినవారు కారు. ఆంధ్ర కన్నడదేశములు సంస్కృతియందు అక్కచెలియళ్ళవంటివి. కావున తెలుగుదేశమునందును హరిహరనాథభావనయు, ఆ దేవునకు గుళ్ళుగోపురములును వెలసియుండును. ఈ యంశమునకు పాల్కురికి సోమనాథుని పండితారాధ్యచరిత్ర మనకు తార్కాణము.

పాల్కురికి సోమనాథుడు అచ్చపు శివారాధకుడు, మహావిద్వాంసుడు, మహాకవి. ఈతడు తిక్కన సోమయాజికి పూర్వుడని పూర్వ విమర్శకులు కొందరు భావించిరి. పండితారాధ్య చరిత్రము వాదప్రకరణమునం దీతడు హరిహరదేవప్రశంస తెచ్చి ఆ భావమును దీర్ఘముగను తీవ్రముగను ఖండించినాడు. అవహేళనమును చేసినాడు. ఇంతవిపులముగ హరిహరనాథ కల్పనను ఖండించుట కాతనిని ప్రేరేపించినది తిక్కనసోమయాజి మహాభారతమే కావలెను.

ఇది సత్యమైనచో పాల్కురికి సోమనాథుడు తిక్కనకు సమకాలికుడో అనంతరుడో కావచ్చునను విశ్వాసము బలపడుచున్నది. సోమనాథుడు హరిహరరూపమున ఒక దైవము ఉండుటకే వీలులేదని పెక్కు ఉక్తిప్రత్యుక్తులతో వాదము సాగించెను. హరిని ఒక సందర్భమున సంహరించుటచే శివుడు హరిహరుడయ్యెనని వ్యుత్పత్తి కల్పించెను. 'శివాయ విష్ణురూపాయ' అను సూక్తి ప్రక్షిప్తమని త్రోసి పుచ్చెను. హరిహరనాథుని ఆరాధించినవారు ముఖముమీద ఒక వంక విభూతియు మరొకవంక తిరుచూర్ణముతో నామములను దిద్దుకొనవలదా? అని అవహేళన చేసెను. హరిహరనాథుని గుళ్ళమీద నందియు పందియు చెక్కవలదా? అని యాక్షేపము తెల్పెను. హరిహరనాథుని సేవించువారికి హరిహరలోకమను పుణ్యలోక మెక్కడ ఉన్న? దని ప్రశ్నించెను. ఇటువంటి కల్పనలో అనౌచిత్యమున్నదని వాదించెను. హరియున్న దేహమున పార్వతి యుండునా? హరుడున్న దేహమున లక్ష్మీదేవి ఎట్లు నిలుచును? హరియు హరుడును సమానులు తుల్యులు కారని ఆవేశముతో చర్చించెను. హరి పంచవింశకుడనియు (అనగా సాంఖ్యులు చెప్పు చతుర్వింశతి తత్త్వములకు ఒక మెట్టుపై వాడనియు) హరుడు షడ్వింశకుడు (అనగా పంచవింశకుని కంటె అధికుడు) అనియు వేదాంతపరముగ అన్వయించి హరిహరులు సమానులు కారని స్థాపించి, హరిహరనాథుడను ఏకరూపముండుటకే వీలులేదని గర్జించెను.

తక్కిన యాక్షేపము లెట్లున్నను పాల్కురికి సోమనాథుడు చూపిన ఒక యాక్షేపణ గణింపదగియున్నది.

"హరి గొన్నయర్ధంబు నద్రిజ గొనునె?
హరి యద్రిసుత గొన్నయర్థంబుఁ గొనునె"? (పండితారాధ్య చరిత్ర)

లోకసామాన్యదృష్టికి ఇది గొప్ప యనౌచిత్యమే. దీనిని తిక్కనసోమయాజి యెట్లు వారించుకొనెను? అను ప్రశ్న కలుగును. దీనికి సమాధానము కొంత విరాటపర్వాదియందలి 'శ్రీయన గౌరి నాఁబరఁగు చెల్వకు' అనుపద్యమునందే కలదు. శ్రీయనియు గౌరియనియు వ్యవహారమునందు వేర్వేరు స్త్రీమూర్తులైనను, పరమార్థదృష్టితో వారిద్దరును ఒక్కతత్త్వమే. భిన్నతత్త్వములు కావు. కావుననే మహాకవి 'గౌరినాఁబరఁగు చెల్వకు చిత్తము పల్లవింప' అని వారినిద్దరిని ఉద్దేశించి ఏకవచనమునే ప్రయోగించెను. అనగా లక్ష్మీపార్వతులకు నామభేదమే కాని వ్యక్తిభేదము లేదు. అట్లే హరిహరనాథ శబ్దమును ఏకవచనముగనే కవి ఎల్లయెడలను ప్రయోగించెను. ఇంద్రాగ్నులు, మిత్రవరుణులు మున్నగు దేవతాద్వంద్వముల వంటివి కావు, హరిహరశబ్దము. విడిగా నాత డెక్కడను హరిహరులు అని వాడలేదు. ఎప్పుడును హరిహరనాథుడనియే. శివకేశవులకంటె పరుడైన పరబ్రహ్మము అనియే తిక్కన భావముగా స్ఫురించును. హరిహరనాథుడును, లక్ష్మీపార్వతులును ప్రకృతి పురుషులకు ప్రతీకలు. వీరికి నామభేదమే కాని వస్తుభేదము లేదు. శ్రీ గౌరులు వ్యావహారిక సత్యములే కాని పారమార్థిక సత్యములు కారు. వారు తత్త్వములే కాని వ్యక్తులు కారని తిక్కన సోమయాజి యొక సందర్భమున వ్యక్తము చేసెను.

గౌరీత్వోజ్జ్వల తత్త్వ భాస్వర! నిజగారాత్మకత్రీశ్వరా!- 17-1-77

లక్ష్మీపార్వతు లను ఉజ్జ్వలతత్త్వము చేత ప్రకాశించువాడా! అని సంబోధనము. కావున అనుచిత స్త్రీ పురుష సంబంధమును హరిహరనాథకల్పనకు ఆరోపించుట నిర్హేతుకమనియు భ్రాంతిమూలకమనియు చెప్పదగియున్నది.

హరిహరనాథభావనచే తిక్కనసోమయాజి సాధింపదలచిన మహాప్రయోజన మేమి? ఒకటి వైయక్తికమైనది. రెండవది సాంఘికమైనది. అతడు సాధారణ శైవుల కుటుంబమున జనించినను యౌవనమునుండియు అతనియందు శివకేశవ అభేదభావము విరూఢమగుచుండెను. దీనికి తార్కాణము 'కిమస్థిమాలాం' అను భావగర్భితమైన శ్లోకమే. ఈ కాలమున తిక్కన భావనచేయుచున్న హరిహరనాథైక్యరూపమైన పరతత్త్వము ద్వంద్వాతీతము. ఆ తత్త్వమునందు అన్ని రుచులును ఒకటే. అది సుందరము. బీభత్సము, క్రమముగా ఆయన మనస్సునందు అద్వైతభావన నెలకొని స్థిరపడజొచ్చెను. కావుననే మహాభారతమునందు ముఖ్యవేదాంతము అద్వైతమైనట్లు గ్రంథారంభముననే సూచించెను. "ధర్మాద్వైత స్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయమున్' (4-1-3)' తిక్కన యాధ్యాత్మిక జీవితమునందు నాలుగు ప్రధాన సూత్రములు భాసించుచున్నవి. (1) వేదములందు పూజ్యభావన (2) వైదిక మార్గమునందు అనగా కర్మమార్గమునందు అవిరళ నిష్ఠ (3) అభేదభక్తి (4) అద్వైతసాధన. దీనిలో మొదటిమెట్టు శివకేశవ అభేదచింతనము. పై మెట్టు జీవేశ్వర అభేదమననము. ఈ క్రమముయొక్క ఫలితము మోక్షసాధనము. అది జననమరణ దుఃఖరూప సంసారతరణము. పునర్జన్మ లేకుండుట. ఈ భావములన్నియు హరిహరనాథుడు స్వప్న దర్శన మొసగినపుడు వివృతమైనవి.

'నీ కరుణ నిట్లు పదస్థుఁడ నైతి నింక జన్మాంతర దుఃఖముల్ దొలఁగు నట్లుగఁ జేసి సుఖాత్ముఁ జేయవే॥(4-1-21)

అని యుపలాలితుండగు డింభకుండు తన కొలంది యెఱుంగక మహాపదార్థంబు వేఁడు విధంబున బ్రహ్మానందస్థితిం గోరి సర్వాంగాలింగితమహీతలం బగు నమస్కారంబు సేసిన నజ్జగన్నాథుండు.

జనన మరణాదులైన సంసారదురిత
ములకు నగపడ కుండంగఁ దొలఁగు తెరువు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గను వెలుంగు నీ కిచ్చితి ననిన లేచి (4-1-22, 23)

హరిహరాభేదభావముచే తిక్కన సాధింపదలచిన మరియొక మహాప్రయోజనము లోక కల్యాణము. సమకాలిక సంఘోద్ధరణము. ఇది మొదటి దానివలె విస్పష్టముగా విస్తరింపబడలేదు. ఒక్క చిన్న వాక్యములో మాత్రమే ఇది సూచితమైనది.

కావున భారతామృతముఁ గర్ణపుటంబుల నారఁ గ్రోలి యాంధ్రావళి మోదముంబొరయునట్లుగ - (4-1-30)

గ్రంథరచన చేయుట ఆయన సంకల్పము. మునిమాన్యుడైన పారాశర్యుడు కూడ లోకకల్యాణము నుద్దేశించియే పంచమవేదమును కూర్చెనని తిక్కన ఇదివరలో చెప్పియున్నాడు.

'కృష్ణద్వైపాయనుఁ డర్థి లోకహిత నిష్ఠం బూని కావించె' (4-1-8)

ఇక్కడ మిక్కిలి సంక్షిప్తముగా సూచింపబడిన ఆ లోకకల్యాణము, లోకహితనిష్ఠ ఏ రూపమైనదో మనము సమకాలిక పరిస్థితులనుబట్టి ఊహింపవలెను. ఆంధ్రదేశమునందును పరిసర దేశములందును కూడా మతవిషయికమైన కల్లోలము తీవ్రముగా నుండెను. చార్వాకులనువారు తప్ప మిగిలిన వారందరును భగవంతుడున్నాడని దృఢముగా నమ్మి, అతనిని చేరుటకు తమకు తోచిన మార్గములు అభినివేశముతో ప్రచారమొనర్చినవారే. పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్యచరిత్ర వాదప్రకరణమునందు తనకాలమున ఉండిన వివిధసమయములవారిని గూర్చి విపులమైన పరిజ్ఞానమును మనకు కలిగించినాడు. అతడు వీరిని గూర్చి దూషణవాక్యకలితముగా వ్రాయక, కొంచెము సహనమును, సంయమనమును ప్రదర్శించినచో సోమనాథుడు మనకు గొప్ప ఉపకారము చేసినవాడయి యుండును. ఏమయిన క్రీ.శ.12వ శతాబ్దమునందు దేశమును చైతన్యవంతమొనర్చిన ఆస్తికశాఖలను గురించి సోమనాథుడు చెప్పకున్నచో మనకు ఆ యుగము అంధకార భూయిష్ఠముగా నిలిచిపోవును. పాల్కురికి కవి గుర్తించిన వివిధ మతశాఖ లీరీతిగ నున్నవి. బౌద్ధులు, జైనులు, సన్న్యాసులు, అద్వైతవాదులు, బ్రహ్మవాదులు, అవేదవాదులు (వేదప్రమాణము నంగీకరింపనివారు కావచ్చును), పాంచరాత్రులు, అంతరాలికులు, ఏకాత్మవాదులు, అభేదవాదులు, శూన్యవాదులు, కాలవాదులు, కర్మవాదులు, నాస్తికులు, చార్వాకులు, ప్రకృతివాదులు, మాయావాదులు, శబ్దబ్రహ్మవాదులు, పురుషత్రయైకవాదులు (నన్నయ భట్టారకుడు త్రిపురుషులను గ్రంథారంభమున స్తుతించెను. ఇది యాతనిమీద విసురుకావచ్చును), ద్విపురుషైక కలితవాదులు, మూర్త్యైకవాదులు (కాళిదాసు అష్టమూర్తియైన శివుని స్తుతించెను); స్మార్తులు, యోగశాస్త్రభ్రమితులు, రసమంత్రవాద సిద్ధులు, షట్తర్కవిదులు, కౌటిల్యశాస్త్రప్రబుద్ధులు (అర్థశాస్త్రవేత్తలు కావచ్చును), నక్షత్రపాఠకులు; ఈ విధముగ లెక్కలేనన్ని శాఖలవారిని సోమనాథుడు నిరసనవాక్యములతో పేర్కొనెను. అద్వైతులను నీతివర్జితులనియు, పాంచరాత్రులను భ్రాంతచిత్తులనియు, శూన్యవాదులను జఘన్యచరిత్రులనియు, మాయావాదరతులను ప్రచ్ఛన్న బౌద్ధనిబద్ధులనియు ఈ విధముగా ఒక్కొక్కరికి ఒక్కొక్క దూషణ విశేషములను సోమనాథుడు జతపరిచెను. అతడు పేర్కొన్న వారందరను ప్రత్యేకశాఖలు కాకపోవచ్చును. మాయావాదము, శూన్యవాదము, బ్రహ్మవాదము (సర్వంఖల్విదం బ్రహ్మ నేహనా నాస్తి కించన) ఏకాత్మవాదము ఇవన్నియు అద్వైత వాదమందలి అవాంతరభావములే కాని విభిన్నశాఖలు కాకపోవచ్చును. ఎట్లైనను ఇంత విస్తృతమైన మత విశ్వాససంపద ఆనాడు ఉండెననుట గమనింపదగినది.

పైని పేర్కొన్న పెక్కు సమయములలో చెప్పుకోదగిన అనుయాయివర్గము కలవారు బౌద్ధులు, జైనులు, అద్వైతులు, పాంచరాత్రులు, కర్మవాదులు. పాల్కురికి సోమనాథుడు పతిత వర్గమునకు అతీతమని భావించిన శివపారమ్యవాదులును వీరిలో చేర్చదగినవారే. క్రమముగ రాజాదరణము కోల్పోవుటచే బౌద్ధజైన శాఖలు ప్రక్షీణములగుచుండెను. శైవులును, పాంచరాత్రులును ప్రజాహృదయమున జైన బౌద్ధులు పోగొట్టుకొనిన స్థానమును ఆక్రమించుకొనుచు, ఆధిక్యమునకై అఱ్ఱులుసాచుచుండిరి. మొదట శైవులదే పైచేయిగా నుండెను. అప్పు డాంధ్రదేశమునంతను పాలించిన కాకతీయులు పరమమాహేశ్వరులై యుండుటచే శైవమునకు రాజాదరణము విస్తారముగా లభించెను. కానైతే కాకతీయులు వీరశైవులు కారు.

బసవేశ్వరుని ఉపజ్ఞా ఫలితముగ శైవము వీర శైవముగా మారి పరసమయములను సహింపక వానిపై ధ్వజమెత్తు పరిణామమునకు లోనయ్యెను. పాల్కురికి సోమనాథుని రచనలయందు తీవ్రవైఖరియే ప్రత్యక్షమగును.అప్పటి వైష్ణవమింకను వీరశైవమునకు ప్రతిద్వంద్వి కాదగినస్థితిలో లేకుండవచ్చును. సోమనాథుడు విష్ణువుపేరు పేర్కొని ఆ దైవము శివునితో సమానుడు కాజాలడని నిరూపించుటకు వాదప్రకరణమున చాలగా రచించెను. అయినను అతడు వైష్ణవమును పేరెత్తి చెప్పక పాంచరాత్రులను ఉదాహరించెను. వారైనను ఉపేక్షణీయులని కాబోలు ఒక్క తిరస్కార వాక్యముతో 'భ్రాంత చిత్తులు' అని త్రోసిపుచ్చెను. అద్వైతమునుండి సోమనాథుడు వీరశైవమునకు ఎక్కువ ప్రతిఘటనమును ఎదురుచూచి యుండవచ్చును. అభేదవాదులైన వీరు గోడమీదిపిల్లివంటివారని యాతని భావము. కావుననే కాబోలు అద్వైత సిద్ధాంతమునకు చెందిన వేర్వేరు భావములను ప్రత్యేకశాఖలుగా పరిగణించి వానిని ఆగ్రహముతో తెగడెను.

దేశమునందు చెలరేగుచున్న మతసంబంధకమైన అసహనమును ద్వేషమును ఉపశమిల్లునట్లు చేయుటకు కవిబ్రహ్మ సంకల్పించెను. హరిహరనాథ కల్పన మాతనికి ఈ సదుద్దేశమునందు మిక్కిలి సహకారి అయ్యెను. సామాన్య జనులకు హరిహర అభేదమును బోధించి వారిని శాంతచిత్తులను చేసెను. వ్యుత్పన్నమతులైన వారికి జీవేశ్వరాభేదరూపమైన వేదాంతమును ప్రతిపాదించెను. సాంఖ్య, యోగ సిద్ధాంతములను అద్వైతమునకు బాసటగా స్వీకరించెను. వీని కన్నిటికిని భక్తియోగమును మూలకందముగా గ్రహించెను.

హరిహరనాథతత్త్వపటము నందలి కొన్ని ముఖ్య తంతువులను గుర్తింతము.

1. వేదప్రామాణ్యము, వేదములు ఈశ్వరుని నిశ్శ్వసితములు. అవి భగవంతుని రూపమును ప్రతిపాదించును.
2. కర్మప్రాధాన్యము, కర్మలు మనస్సును నిర్మలము చేయు సాధనములు. ఫలాభిసంధిలేని కర్మాచరణము మోక్షహేతువు.
3. వేదవ్యాససంస్తుతి, వేదవ్యాసుడు వేదవిభజనము చేసెను. బ్రహ్మసూత్రకర్త, విజ్ఞానఖని.
4. హరిహరుల అభేద సంకలనము, ఏకతా నిరూపణము.
5. సామాన్యస్తుతి, భగవంతునిలీలలు, పరతత్త్వమహత్త్వము, భక్తపోషణము, రాక్షససంహారము.
6. యోగము, యమనియమాదులు, షట్చక్రములు, కుండలినీసంచారము.
7. సాంఖ్యము, ప్రకృతిపురుషులు, చతుర్వింశతి తత్త్వములు.
8. అద్వైతము, మాయావాదము, జీవేశ్వరాభేదము.

హరిహరనాథ సంబోధన పద్యములం దీ అష్టసూత్ర విధానమును తిలకింతము. క్రింద నీయబడిన ఉదాహరణములు? సూచనప్రాయములే కాని సమగ్రవ్యవస్థను సందర్శించునవికావు.

1. వేదప్రామాణ్యము :

శ్రౌతశాఖాగ్రవర్తీ 4-1-335; గాఢవిస్తర నిగమైకవేద్య 4-2-363; నిగమకుసుమ గంధోన్మేష భూతాభిధానా 4-6-407; పదనసముత్థితవేదా 7-2ı382; తపస్స్వాధ్యాయాదిక్షపితమల చిత్తప్రకలితా 11-1.187; వేదపరిషత్సంస్తుత్య 12-1-398; నిగమాంత స్ఫీత హర్మ్యాగ్ర సంచరణ ప్రౌఢమయూర 12-2-447;; (వేదములను హర్మ్యాగ్రములందు సంచరించు నెమలియైనవాడా అనుట) వేదవిద్యా విభావ్యా 12-3-531; వేదజలద శ్రేణీమయూరా 11-5-630; సుతపస్స్వాధ్యాయ సద్మా 13-2-476, వేదసభైక నాయకా 14-3-226; ప్రణవైకభావ్య 17-1.78.

2. కర్మప్రాధాన్యము :

వైదికమార్గనిష్ఠమగు వర్తనము 4-1-15; యజ్ఞాత్మకరూప 4-3-239; కర్మసమ్మర్ద నిరాసకర్మఠ 6-3-454; యజనవిధిఫలత్వవ్యాప్త 8-2-401; కరణఫలపరిత్యాగ ప్రవోదాత్తచేతః పరిణత సుఖపీఠ భ్రాజమానా (కర్మఫలత్యాగముచే

ఉదాత్తమైన చేతస్సనుపీఠమందు ప్రకాశించువాడా అనుట); 8-3-401; (కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన అను గీతావాక్యభావము; కర్మ ప్రాధాన్యము చెప్పుచు ఫలత్యాగబుద్ధిని ప్రశంసించుచున్నది) సాయం ప్రాతర్హుత ప్రజ్వలిత హుతవహస్ఫైర నిర్ధూత జాడ్య । స్ఫాయచ్చేతః ప్రసాదప్రసృమర విమలప్రౌఢ బోధానుమోదీ (ఉదయాస్తమయములందు వేల్చబడిన ప్రజ్వలితుడైన అగ్నిదేవునిచేత స్వేచ్ఛగనే పోగొట్టబడిన అజ్ఞానరూపమైన జాడ్యము కలదగుటచేత వికాసము నొందిన మనస్సు యొక్క ప్రసాదత్వముచేత వ్యాపించు స్వచ్ఛమైన ఆత్మజ్ఞానమును అనుమోదించువాడా అనుట. విధ్యుక్తకర్మానుష్ఠానముచే మనస్సు నిర్మలమై అజ్ఞాన దూరమయి బ్రహ్మాత్మజ్ఞానము ప్రకాశించుననుట) 10-2-134; మఖతతి హృతినిర్మాణ సంపాద్యమానా 10-2-134; హవ్యకవ్య ప్రసాద్యా 12-4-457.

3. వేదవ్యాస సంస్తుతి :

తిక్కన సోమయాజికి వేదవ్యాసమహర్షియందు గాఢ ప్రత్యయము కలదు. ఆ మునీంద్రుడు చేసిన కార్యములును అసాధారణములు. ఆయన వేదవిభజనము చేసెను. బ్రహ్మసూత్రముల నిర్మించెను. మహాభారతమును పెక్కుపురాణములను గ్రథించెను. శుకయోగీంద్రుని తండ్రి, భారతవంశవివర్ధనుడు, అద్వైత సిద్ధాంత ప్రతిపాదనమునందు తిక్కన సోమయాజి తనకు మిక్కిలి సన్నిహితుడైన ఆచార్యశంకరుని ఎచ్చటను పేర్కొనలేదు. వ్యాసమహర్షియే సర్వవేదాంత విజ్ఞానమునకు మూలకందముగా తిక్కన గ్రహించెను. 'విద్వత్సంస్తవనీయ భవ్యకవితావేశుండు' 4-1-3; ప్రాంశు పయోదనీలతను భాసితు 6-1-71 మున్నగు పద్యములందు తిక్కనసోమయాజి తనకు బాదరాయణమునీంద్రుని యెడ గల గౌరవతాత్పర్యములను చక్కగా ప్రకటించెను. హరిహరనాథ సంబోధన పద్యములందు వ్యాసమునీంద్రుని ప్రస్తావనము తరచు వచ్చును.

వ్యాసాదిముని ప్రోక్తమ । హా సందర్భాప్రమేయతారూఢగుణో । ల్లాసా 5-2-333; సాత్యవతేయ భారతీప్రోక్త 5-3-413; సాత్యవతేయ వాఙ్మయ విశాల గృహస్ఫురిత ప్రదీపితా 7-1-395; జనవినుత బాదరాయణ మునీంద్ర వాగమృతనిధి సముద్భూతాహ్లా దనకీర్తిసుధాకిరణ 7-5-433; వేదవ్యాస వచోవిభవలక్ష్య 12-1-1; వ్యాసచేతోనివాసీ 12-4-457; వేదవ్యాస వచోవిభవవేద్య 15-1-1.

4. హరిహరుల అభేదసంకలనము :

హరిహరాత్మకమైన ఏకరూపమును కవిబ్రహ్మ బహుధా భావన చేసి బహుభంగుల, బహుచమత్కృతులతో తీర్చి మనకు ప్రత్యక్షము చేసినాడు. తన ప్రశస్తకవితానైపుణినంతను హరిహరనాథ చిత్రణమునందు వ్యక్తీకరించినాడు. ఇదియంతయు హరిహరనాథుని సాకారరూపమును భక్తులు భావనచేయుటకు వీలుగా వర్ణించుట. ఆయన ఆంతరము, నిరాకారము అయిన రూపము యోగ, సాంఖ్య, అద్వైత భావములతో నిండియున్నది. ఆరంభమునందే హరిహరనాథుడు కలలో తనకు ప్రత్యక్ష్యమైనప్పుడు ప్రదర్శించిన ప్రసన్నరూపమును తిక్కన వర్ణించినాడు.

కరుణారసము వొంగి తొరఁగెడు చాడ్పున
శశిరేఖ నమృతంబు జాలువాఱ   4-1-12.

ఈ మొదటి పద్యమునందే హరిహరనాథుని మూర్తమైన రూపమును చిత్రించుటలో తానవలంబింపబోవు పద్ధతులకు కవిబ్రహ్మ బీజావాపము చేసినాడు. శశిరేఖ నమృతంబు జాలువార అనుటచే శంకరుని ఒక పంక్తిలో సూచించి, 'నాభిధవళపంకజము మెఱయ' అనుటచే రెండవ పంక్తియందు నీలమేఘశ్యాముడైన విష్ణువును సూచించినాడు. మూడవ పంక్తియందు 'గళంబుచాయ' అనుటచే కాలకంఠుని సూచించి, ఉరమ్మునఁ గౌస్తుభరత్న మొప్ప అనుటచే విష్ణువును జ్ఞప్తికి తెచ్చినాడు. గీతపాదద్వయమునందు సితాసిత దేహకాంతులు గల శివకేశవులను రూపొందించినాడు. హరిహరనాథుడు అనంతశక్తిమంతుడు. విశ్వాకారుడు. సూర్యచంద్రులాయనకు నయనములు అను మహాభావమును తనదక్షిణనేత్రమును, సుధారోచియ కా నను వింతలేక చూచి, 4-1-14 అను వాక్యమునందు వ్యంజింపజేసినాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

షష్ఠ్యంతములు మొదటి నాలుగు పద్యములలో గంభీరవేదాంతార్థములను ప్రతిపాదించినాడు. ఇవి హరిహరనాథుని అమూర్తస్వభామునకు సంబంధించినవి. 'ఆ దేవుడు ఓంకారవాచ్యుడు. అహంకారరహితమైన భావనచేతమాత్రమే తెలుసుకొనబడువాడు. మంత్రశాస్త్రము ఆయనకు అలంకారమైనది. అది హ్రీంకారమయము, హరిహరనాథుడు పాంచభౌతికమైన జగత్తంతను నిండియున్నాడనియు, విశ్వమంతయు ఆయనలో ఇమిడియున్న దనియు చెప్పుటకు అర్థవంతమైన రూపకములను కల్పించినాడు. ముల్లోకములను చిలుకకు ఆయన దృఢపంజరమైనవాడు. త్రిభువనముల కుబుసము హరిహరనాథుడను భుజంగమపతిని కప్పియుండును. ఆయన శ్రుతి సీమంతమణి, ఆశ్రితుల వాంఛలను పూర్తి చేయుటయందు చింతామణి. అజ్ఞానమను చీకటికి సూర్యుడు, శమనిరతులైన సంయమీంద్రుల మనస్సులను కుముదములను వికసింపజేయును ఆయన చరణనఖచంద్రికలు. ఇంతలో కవికి ఆ భగవంతుని మూర్తరూపము జ్ఞప్తియందు వెలసి ఇట్లు చమత్కారముగా పలికినాడు. హరిహరనాథునకు మందాకినీనది పాదభూషణము, శిరోవేష్టనము. అనగా విష్ణురూపుడైన ఆ దేవునకు సురనది పాదములందు పుట్టినది. శివరూపుడైన ఆయనకు జటాభూషణమైనది. హరిహరనాథమూర్తియందు భిన్నవస్తువులు సమన్వయించుట ఆయన అవలంబించిన యొక రమ్యమార్గము. 'వనమాలికా భుజంగాభరణా' (ఆభరణములలో వైచిత్రి. ఒకరికి తులిసిమాలయు, ఒకరికి పాములును భూషణములు, ధనుస్సమన్వయము) 4-1-38; అజగవశార్ఙ్గాలంకృత (ఒకే వస్తువు ఒకరికి ఒక విధముగను మరొకరికి మరొకవిధముగ ఉపకరించుట మరొకవైచిత్రి) 4-1-39. భుజగ సమాచరితశయన భూషణకృత్యా. (సర్పము విష్ణువునకు శయ్య, శివునకు ఆభరణము, ఒకచో అనంతుడు, మరొకచో వాసుకి, శివకేశవుల అత్తవారిండ్లు వేర్వేరు) 4-1-39, జలనిధిహిమవద్భూధర, కలిత జననకేళికౌతుక.. స్త్రీసనాథ (వారి స్త్రీ జనము వ్యక్తావ్యక్త లలితసౌందర్యము కలవారు. వారు లోకసామాన్య వనితలు కారు. ప్రకృతిస్వరూపిణులు) అనుట 4-1-40. సృష్టికార్యమునకు పూర్వముండునది అవ్యక్తరూపము సృష్టియనంతరము వ్యక్తరూపము. మహాకవి గూఢవేదాంతార్థములను ఇట్లు వ్యంజితము చేయుచుండును.

ఈ దేవతామూర్తిని మహాకవి పాదములనుండి మౌళివరకును ఆయావిశేషణములతో స్తుతించును. నిర్వృతిపణ్యాపణపదారవింద వికాసా (పరమశాంతియను వెలగల వస్తువునకు ఆపణమైన పదారవిందము కలవాడు) 4-2-364; పునర్భవ పరిహార హారి పదపద్మయుగ 8-1-320; సురమకుట ఘటితరత్న స్ఫురితచరణ 12-5-631; జరామరణనోదక పదస్మరణా 12-5-631; మహాశర్మాపాదన పాదపద్మ 13-2-476; వినుత చతుర్వర్ణక సంజనక ముఖభుజోరుపాద (చాతుర్వర్ణ్యమునకు సంభవకారణమైన ముఖాద్యంగములు కలవాడా) 14-2-227; అజరామరపదకరపదభజనా 14-4-286.

హరిహరనాథుని పరిధానము :

1. పరిధాన ప్రావరణీకరణాదృత పీతవసనగజచర్మ 7-3-309.
2. పీతస్ఫీత సామాజగత్వగ్వసనా 15-1-185

వక్షశ్శోభ :

1. శ్రీమత్తులసీపల్లవ దామచ్ఛవిలబ్ధ మరకతప్రతిమత్వోద్దామప్రభాస్థిమాలా శ్యామాయిత విపులవక్ష (తద్గుణాలంకారము) 5-4-1.
2. భసిత పరభాగ హేలాలసిత శ్రీవత్సలలిత లాంఛన 6-3-454.
3. వనమాలికోరగహార పరిష్కారసార 7-3-1
4. తులసీదళదామ కపాలమాలికాభావిభవాభిరామ 18-1-95.

భుజములు :

నిష్ఠుర భుజసార 4-2-363; కరఖేలచ్చక్రశూలా 10-1-338; స్మయభయదర్పిత క్షుభిత సామజమర్దన రక్షణక్రియాశ్రయణ విలాస భాసురభుజా 12-3-529; (గర్వముచేత దర్పితమైనట్టియు భయము చేత క్షుభితమైనట్టియు సామజములను

మర్దించుట రక్షించుట అనుక్రియలకు ఆశ్రయమైన భుజవిలాసము గలవాడు. క్రమాలంకారము. శివునిగజాసుర సంహారమును విష్ణువు గజేంద్రమోక్షణ వృత్తాంతమును స్మరింపవలెను.)

నేత్రములు :

రవిశశిమయనేత్రా 4-3-415; దివాకరచంద్ర కృశానులోచనా (త్రిలోచన వైభవము); 8-3-3939; దేవతాసుర పరిరక్షణోన్మథనశోభి కటాక్షవిహార - (క్రమాలంకారము) 12-4-455, లసదపాంగోత్సార్యమాణాశ్రితార్తీ - 13-2-478.

మౌళి :

పింఛ ప్రస్పమరరుచి శబలోరగ విస్పమర దీధితి కలాపవేష్టితమౌళీ 6-3-454 సరిద్వరా బర్హి బర్హ చారుశిరస్కా 10-2-135; పింఛదామ భుజగాభరణా 12-5-631; సోమపింఛాభిరామా 13-3-347.

కేతనములు :

ద్విజపతి వృషభాంకోదీర్ణ 8-2-401; తార్క్ష్యశాక్వరమహామూర్తిస్ఫురత్కేతనా 12-1-398; గరుడ వృషపతాకా 13-1-388.

వాహనములు :

సముద్ధురవాహనీకృతోజ్జ్వల గరుడ వృషభ 7-3-309

లక్ష్మీపార్వతుల యాలంబనముచే నైన హరిహరనాథుని మూర్తి సౌందర్యమును మహాకవి పెక్కువిధముల ప్రత్యక్షీకరించును.

శ్రీగౌరి పల్లవపుటయోగాశ్రయమంజరీ సముజ్జ్వల మూర్తీ 5-1-1;
లక్ష్మీరమణత్వ శివాప్రియతా సమవాయాలంబ్యమాన సౌందర్యనిధీ 8-1-321;
శ్రీ గిరిజా సమవాయ మహాగురుతర సుభగ సంపదాలంబ 9-1-1.

గమనిక : లక్ష్మీపార్వతులకు హరిహరనాథునితో నుండు సంబంధము సమవాయసంబంధ మని తిక్కనసోమయాజి సూచించినాడు. సంబంధము రెండువిధములు. సంయోగసంబంధము, సమవాయ సంబంధము. సమవాయము నిత్య సంబంధము 'నిత్యసంబంధ స్సమవాయః' లక్ష్మీపార్వతులు ప్రకృతి స్వరూపిణులు. ప్రకృతికి పురుషునితో నిత్యసంబంధమును వేదాంతము చెప్పును. లక్ష్మీపార్వతులు తత్త్వమూర్తులే కాని లౌకికవనితలు కారని క్రింది సంబోధనమున కవి చెప్పుచున్నాడు.

మా గౌరీత్వోజ్జ్వల తత్త్వభాస్కర 17-1-77. దీనిని బట్టి పాల్కురికి సోమనాథుని వంటివారు చేసిన ఆక్షేపణలు పేలవము లనియు పారమార్థికములు కావనియు నిశ్చితమగుచున్నది. ఆ దేవునకు మిత్రులును లేరు. శత్రువులును లేరు. మన్మథు డాయన కొకప్పుడు కుమారుడు. ఒకప్పుడు వైరి. క్రింది సంబోధనములలో నిది సూచితమగుచున్నది.

రతిపతి హితాహితాక్షా 5-1-384; సంజనిత సముపసంహృత మదనా 13-1-387; "పరిత్రాణాయ సాధూనాం, వినాశాయ చ దుష్కృతామ్" అను గీతావాక్యముమేరకు భగవంతునకు దుష్టవర్తనులే శత్రువులు. శిష్టవర్తనులే ఆప్తులు. ఈ భావము హరిహరనాథసంబోధనములందు ఎడనెడ వచ్చుచునే యుండును. ఆ దేవుడు సంహారకారకుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దానవ నిషూదన 4-2-363

చక్ర త్రిశూల ధారణరక్షో భీకర 7-2-1

దుర్దమ దనుసూను సంచయవిదారణ 7-5-431

చక్రపరశుచ్ఛిన్నాసురానీక 15-1-184

(భగవంతుడు ధర్మమునకు కవచము. భక్తపరాధీనుడు)

భక్తి నిగమానుభవోజ్జ్వల దివ్యవర్మ 4-5-405

భక్తసంపోషణశాలీ.... సదవనపరచిత్తా 14-2-228

ధర్మసరోజాసీన 6-2-1; ధర్మశీలానురక్తా 7-1-240

ధర్మపాలనా 13-1-368

శ్రీధర్మ కామహృదయ సమాధానాధాన కారకాంఘ్రియ సరోజా 16-1-1

దుశ్శీలాంతఃకరణావిభావ్య 16-1-224

(హరిహరనాథుని మార్గము సచ్చిదానందపథము. అది సరళమార్గము)

సమయ బహుత్వారణ్య పరిశ్రామ్యదంతరంగ నితాంతోత్తమ సరళమార్గదర్శన సమర్థ! - పెక్కుమతములను అరణ్యమార్గముల సంచరించి మిక్కిలి శ్రమగొన్న మనస్సునకు ఉత్తమ సరళమార్గమును చూపగల తెరువరి హరిహరనాథదేవుడు. 5-4-427 'గభీరే కాసారే విశతి విజనే ఘోరవిపినే' అను శివానందలహరీ శ్లోకభావము ననువదించుట.

శశ్వదాహ్లాదవర్మా 7-2-383

శాశ్వతానందమూర్తీ 7-5-438

వైభవానందదీపా 11-1-189

భాస్వదానందమార్గా 12-6-624

నిష్కలానందమూర్తీ 13-5-484

దర్శితానందవర్మా 14-4-287

హరిహరనాథలీలలు - మహిమలు :

లోకామయ నిర్వారణ నిపుణ 4-2-1

శ్రీవాగ్విభవారోగ్య ప్రావీణ్య ప్రాభవానుభావమహిత సౌఖ్యావహ పదస్మరణ 5-3-1

(భగవంతుని పాదస్మరణము సమస్త వైభవముల నిచ్చునది అనుట)

ఘోర సంసార దురామయా పదవసాయక 6-2-408

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జననమరణ దుఃఖోత్సారి 7-1-397

జగజ్జనిస్థితి ప్రలయవిధానకేళి పరిపాటి వికస్వర 7-2-381

(హరిహరనాథుడు సృష్టిస్థితి సంహారకారకు డనుట)

రసాత్మక 8-1-320

'రసోవైసః' అని యుపనిషత్తు.

నిరవధి పరిణాహా 8-3-401.

భణన మనన దూరస్ఫార విస్తారసీమా - 9-1-405

'యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అని యుపనిషత్తు. విస్తర మహనీయ తార్కిక వచః కలనానభిగమ్య 12-4-455. తర్కకౌశలముచే సాధింపబడదు అనుట. భక్తిగమ్యుడు.

అకలుష హృదయాంతర్యాగ సంసిద్ధమూర్తీ 13-2-478

అంతర్యాగముచే సిద్ధించువాడనుట. దంభపూరిత బహిర్యాగములచే కాదనుట.

పాపకబహుదివ్యనామ 13-5-482

కాలస్వైరవిహార భంజన కళాకౌతూహల స్తవ్య 16-1-224. కాలము మహాప్రభావము కలది. అది ఎట్టివారికిని దుర్వార్యము, హరిహరనాథుడు కాలముయొక్క స్వైరవిహారమునకు అతీతుడు కాడు అనుట. ఈ భావమునే కవీంద్రుడు మరియొకచోట ఇట్లు ప్రకటించెను.

నవతాదూర, పురాణతానుపగతా, నానాత్వ సంశోభితా 4-4-275 అతడు నవ్యుడు పురాణపురుషుడు అనుట. 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అనుభావమును మహాకవి ఇట్లు ప్రదర్శించెను.

సూక్ష్మతర సంభాసా, మహాస్థూలమూర్తి విశేషా 4-4-275

వ్యాస సమాసైకరూప 4-5-1.

ఇట్లు బహుముఖములుగా హరిహరనాథుని మూర్తరూపమును సాధారణభక్తుల కర్థమగునట్లు చిత్రించి శివకేశవుల యభేదము వారిమనస్సులకు హత్తుకొనునట్లు తిక్కనసోమయాజి కావించినాడు. లోకమునందు ముగ్ధభక్తులును ఉన్నారు. 'నీటికొలది తామరసుమ్మీ, యన్నట్లు ఎవరి అధికారమునకు తగినట్లు వారికి పరతత్త్వనిర్దేశము చేయవలెను. 'యే యథా మాం ప్రపద్యంతే, తాం స్తథైవ భజామ్యహమ్' అని భగవంతుని వాక్యము. హరిహరనాథుని అమూర్తరూపమును అందుకొనుటకు యోగము, సాంఖ్యము, వేదాంతము మొదలగు జ్ఞానమాత్రసాధ్యములైన దుర్గమపథములు కలవు. అధిగతపరమార్థుడైన తిక్కనసోమయాజికి అవియును సుపరిచితములు. ఇక ముందు వాని వెంట పాఠకుని గొనిపోవుచున్నాడు.

యోగము :

'యోగ శ్చిత్తవృత్తినిరోధః' అని మనోవ్యాపారములను అరికట్టుటచే అది క్షుద్రలౌకిక వృత్తులనుండి మరలి భగవంతునకు ఉన్ముఖ మగునని యోగులు భావింతురు. మనస్సు అతిచంచలము. 'చంచలం హి మనః కృష్ణ!' అని అర్జునుడు నిర్వేదముతో పలికినాడు. అట్టి మనస్సును నియమించుటకు ఏర్పడిన కట్టుత్రాళ్ళు యమ నియమ ఆసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధారణా సమాధులు. దీనినే అష్టాంగ యోగమందురు. యోగము రెండు విధములు. అభ్యాసయోగము, క్రియాయోగము. యమనియమాదు లభ్యాసయోగము, రెండవది జ్ఞానయోగము. దీనినే రాజయోగమనియు చెప్పుదురు. అభ్యాసయోగమున యమనియమాసన ప్రాణాయామములు పూర్వయోగము. ప్రత్యాహార ధ్యానధారణాసమాధులు ఉత్తరయోగము. రేచక పూరక కుంభకములు ప్రాణయామాంగములు. దేహాభ్యంతరమున ఆరు నాడీకేంద్రములు కలవు. వీనిని షట్చక్రము లందురు. మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞాచక్రములు బ్రహ్మదండియనబడు వెన్నెముక వెంటనుండును. బ్రహ్మదండినంటియే మూడు ప్రధాననాడులు దేహమునందు ఊర్ధ్వముఖముగ ప్రసరించును. అవి ఇడా, పింగళ, సుషుమ్న యనబడును. ఇడా, పింగళలు సుషుమ్నకు ఉభయపార్శ్వముల చెలగును. ఇడా పింగళలకు పితృయాన దేవయానములను సంకేతము కలదు. ప్రాణాయామముచే కుండలిని యను పరాశక్తిమూలాధారమునుండి ఊర్ధ్వాభిముఖముగా సంచరించి షట్చక్రముల తాకుచు సహస్రారమనబడు బ్రహ్మరంధ్రము పర్యంతము విజృంభించుననియు, అచ్చటినుండి యమృతము స్రవించుననియు యోగజ్ఞులు చెప్పుదురు. యోగమునందు నాదబిందుకళలను త్రిపుటికి విశేషప్రాధాన్యము కలదు. నాదమనగా ప్రణవము నుండి యుద్భవించినది. యోగసిద్ధులు మాత్రమే దీనిని ఆకర్ణింపగలుగుదురు. బిందువనగా జీవుడనియు, అన్నమయాదిపంచకోశములలో నొక్కటైన విజ్ఞానకోశమనియు, ఇచ్చట బుద్ధి యుండుననియు, బుద్ధియే బిందుస్థానమనియు చెప్పబడుచున్నది. కళ యనగా విజ్ఞానకోశము నందు ప్రతిఫలించు ఆనందకోశము యొక్క తేజోంశము. ఆనందమయకోశము బ్రహ్మస్థానము. కావున బ్రహ్మము జీవునియందు ప్రతిబింబించుట కళ యనదగును. అట్లే హంసశబ్దమునకును యోగశాస్త్రమునందు గొప్ప ప్రమేయము కలదు. హకారము బ్రహ్మమనియు, నకారము మాయాస్థానమనియు ఈ రెండింటినడుమ నున్న బిందువే జీవుడనియు యోగవేత్తలు భావింతురు. ఇట్లు గహనమైన యోగసాధనచే చిత్తవృత్తులు శమించి బ్రహ్మసాక్షాత్కారమగునని యోగతంత్రజ్ఞులు విశ్వసింతురు. క్లేశబహుళమైన అభ్యాసయోగముకన్న జ్ఞానయోగము మేలని కొందరు తలతురు. తిక్కనసోమయాజి యోగవిద్యానిపుణుడని ఆయన చేసిన ప్రసంగములవలన విశదమగును. హరిహరనాథుని చేరుటకు యోగము మహత్తర సాధనమని యాతని మతము. షట్ప్రమాణ పరమ దూర 4-3-238

ప్రత్యక్షాది ప్రమాణ సాధ్యుడు కాడనుట. భగవంతుడు విపుల తర్కవాక్యముల కందడని ఇదివరకే చెప్పనైనది.

దేవపితృ పథప్రవర్తన 4-3-238 ఇడా పింగళా నాడులు పితృయాన దేవయానములు.

నిర్భరనిష్ఠా మర్దిత వివిధ వికారామల చేతోనివాస 4-4-1

అవగమిత రహస్యాష్టాంగ సమ్యక్ప్రకారోత్సవ గురు కరుణా విస్తార 5-4-428. గురువు కరుణా విస్తారముచేతనే రహస్యమైన అష్టాంగయోగము సుసాధ్యమనుట.

నాసాగ్ర నివాసరసిక, నాదామృత ధారాసారరూప 6-1-1

యోగానుభావ్యా 6-1-306

హంస నాదైక వేద్యా 6-2-410

నాదాంతస్సార; వాదవిదూరా 7-1-396 లలిత చతుర్దళాఢ్యకమల ప్రసవ ప్రసరత్సరస్వతీ విలసన సౌరభోద్గమ నివిష్ట 7-2-381. మూలాధారచక్రము చతుర్దళకమలము. అచ్చటినుండి సరస్వతీవాహిని ప్రసరించును. సుషుమ్నానాడికి సావిత్రి సరస్వతియను సంకేతములు కలవు. ఇడా పింగళలు గంగాయమునలు - బ్రహ్మము సుషుమ్నయందు నివిష్టమై యుండుననుట.

బిందు చిదాత్మనాదమయపీఠ చతుష్కలసద్విహార 7-4-34

శమదమ పరివర్తీ 7-5-433

అవిరళ దర్శన స్థిర మహాముని మానసవాస ఖేలనోత్సవరసికా 8-1-320

హంసభావైకగమ్యా 8-1-322

పశ్చిమ నాడీసరణ 9-1-404. పశ్చిమనాడి యనగా పింగళనాడిగా తోచును. అది దేవయానసంజ్ఞికము. భరిత వికసనాంతః పద్మనిశ్రేణికా - ఇత్యాది 9-2-422. పద్యమునందు యోగసిద్ధాంత క్రమమంతయు సంగ్రహరమ్యముగా చెప్పనైనది. అంతః పద్మములు షట్చక్రస్థానములు - బ్రహ్మదండి నిశ్రేణిక. కుండలినీ శక్తి ప్రాణాయామబలముచే మేల్కని షట్చక్రములను నిచ్చెనమీదుగా ఎక్కి సహస్రారమను చంద్రబింబమునుండి స్రవించు అమృతమును గ్రహించి ఆనందరూపమున పర్యవసించును.

యమనియమాద్యష్టాంగ క్రమాభ్యసన నిర్మథిత వికార సుచేతః కమలామోదమయాత్మా 12-2-448

యోగభావ్యైకరమ్యా 12-5-632

పవన విజయలీలా ప్రౌఢ చేతోనివాసా 14-1-233

సతతాభ్యాస వికాసి సమాధి సమాసాదిత శాంతిలోల 14-2-1

పశ్చిమనాళ నందితా 14-2-226

మాన్యయోగప్రతోషి 14-2-228

పాశ్చాత్యనాడికార్ద్రవ్యజనా 14-4-286 పశ్చిమనాడి పింగళనాడియైనచో యమునాసంకేతముగల ఈ నాళము హరిహరనాథునకు చల్లనితాళవృంత మగుట యుక్తముగానే యున్నది.

యమనియమాది ప్రావీణ్యపూర్ణమిత్ర 18-1-1 యోగశక్తి విశదాద్భుత ఖేలన 18-1-95

సాంఖ్యము :

సాంఖ్యము ప్రాచీనదర్శనము. సృష్టినిర్మాణమునందలి వివిధ తత్త్వములను సాంఖ్యులు నిపుణతతో పరిశీలించి ప్రదర్శించిరి. వీరు ఇరువదియైదు తత్త్వములను ప్రతిపాదించిరి. అందు రెండు అత్యంత ప్రధానములు. పురుషుడు చేతనుడు. ప్రకృతి జడము. తత్కారణముగా దానినుండి ప్రభవించిన సమస్త పదార్థజాతమును జడము. పురుషుడు జీవులకు మూలము. జీవులు అనంతము. పురుషుడు నిష్క్రియుడు. అసంగుడు. స్వతఃశుద్ధుడు. తామరాకును నీరు అంటని విధమున సుఖదుఃఖము లితనిని అంటనేరవు. అయినను అవి బుద్ధియందు ప్రతిఫలించుటచే పురుషుడు బుద్ధితో తాదాత్మ్యమును పొంది సుఖదుఃఖములను తాను అనుభవించుచున్నట్లు భావించి మోదవిషాదముల నొందును. జడప్రకృతి సంసర్గముచే ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, అధిదైవికములైన త్రివిధ దుఃఖములకు పాల్పడును. ఈ విధముగ పురుషుడును, ప్రకృతియు, కుంటివాడును, గుడ్డివాడును కలిసి పయనించినట్లు సృష్టిలీలను నిర్వహింతురు. బుద్ధితాదాత్మ్యముచే గలిగిన బంధమునుండి పురుషుడు విడివడుటయే కైవల్యము. దీనికి జ్ఞానము ఆవశ్యకము.

సాంఖ్యులు ఇరువదినాలుగు తత్త్వములను పరిగణించి చెప్పిరి. సృష్టిక్రియ కంతకును ఆద్యమైనది మూలప్రకృతి. అది దేనికిని వికృతి కాదు. దానినుండి మహత్తు(బుద్ధి), దానినుండి అహంకారము జనించును. అందుండి పంచతన్మాత్రలు (శబ్దస్పర్శ రూపరస గంధములు) ఉద్భవించినవి. ఇవి ఏడును ప్రకృతివికృతులు. అనగా నివి మీదితత్త్వములకు వికృతులు. క్రింది తత్త్వములకు ప్రకృతులు. కేవలవికృతులు పదునారు. పంచమహాభూతములు జ్ఞానేంద్రియకర్మేంద్రియములు, మనస్సు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రకృతి క్రియాశీలము, పురుషుడు తటస్థుడు, ప్రకృతి త్రిగుణాత్మకమైనది. మూలప్రకృతియందు సత్త్వరజస్తమోగుణములు సామ్యావస్థయందుండును. సత్యము సుఖమును, రజస్సు దుఃఖమును, తమస్సు మోహమును జనింపజేయును. గుణత్రయమునందలి సామ్యావస్థ పరిత్యజింప బడుటచే ఆయావస్తుసృష్టి జరుగుచున్నది. కారణమగు మూల ప్రకృతియందు గుణత్రయ ముండుటచే కార్యములైన సృష్టిపదార్థము లన్నింటను గుణవ్యవస్థ సంక్రమించినది. మట్టివిత్తనమునందు వటవృక్షమువలె కార్యమగు జగత్తు కారణమగు ప్రకృతియందు లీనమైయున్నది. మట్టి, నీరు గాలితో సంబంధం కల్గినప్పుడు విత్తనమునుండి వటవృక్షము అభివ్యక్తమగుచున్నది. లేని పదార్థమునుండి ఉన్న పదార్థము పుట్టుట అసంభవము గనుక జగన్నిర్మాణకారణమైన ప్రకృతి అసత్తు అనుటను సాంఖ్యులు అంగీకరింపరు. వేదాంతులు చెప్పినట్లు జగత్తు మిథ్య యనుట వీరికి సమ్మతము కాదు. సాంఖ్యులు ఈశ్వరతత్త్వమును అంగీకరింపరు. జగదావిర్భావమునందు ఈశ్వరునకు ప్రసక్తియే లేదని వీరి మతము. ప్రకృతియే అంతయు నిర్వహించునని వీరి విశ్వాసము. కావున ప్రాచీన సాంఖ్యము నిరీశ్వరమను ఖ్యాతిని పొందెను. అయినను సాంఖ్యులు వేదప్రమాణము నంగీకరింతురు. పునర్జన్మయందు వీరికి విశ్వాసము ఉన్నది. కావున సాంఖ్యము ఆస్తిక దర్శనములలోనే పరిగణింపబడుచున్నది.

అద్వైతము :

వేదాంతులు సాంఖ్యదర్శనమునందలి భావములన్నిటిని గ్రహించి దానికి ఈశ్వరుని చేర్చి, తమ సిద్ధాంతమును ప్రతిపాదించిరి. మహాభారతమునందు కేవలసాంఖ్యము ప్రతిబింబించదు. ఈశ్వరసహితముగనే సృష్టిక్రమమంతయు వివరింపబడును. సాంఖ్యులు పురుషునితో కలిపి పంచవింశతితత్త్వములను ప్రతిపాదింపగా వేదాంతులు షడ్వింశుని కూడా చేర్చి ఇరువదియారు తత్త్వములను గ్రహించిరి. జడ మగు ప్రకృతి, ఈశ్వరచైతన్యము గల జీవుడు లేక ప్రత్యగాత్మ. జీవుని అధిగమించి సచ్చిదానంద లక్షణములు గల పరమాత్మ - ఇది వీరి తత్త్వక్రమము. "క్షరః సర్వాణి భూతాని, కూటస్థోఽక్షర ఉచ్యతే, ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః యో లోకత్రయ మావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః యస్మాత్ క్షరమతీతోఽహ మక్షరాదపిచోత్తమః అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః" పంచదశాధ్యాయమున గీతావాక్యము. సర్వభూతములు క్షర మనబడును. కూటస్థుడు (జీవాత్మ) అక్షరుడు అనబడును. వీరిని మించిన తత్త్వము పరమాత్మ యనబరగుచున్నది. ఇది ముల్లోకములను ఆవరించి భరించుచున్నది. అక్షర తత్త్వమునకు పురుషుడు అను వ్యవహారము కూడా నుండుటచే సర్వాతిశాయియైన పరతత్త్వమును పురుషోత్తముడు అందురు.

శ్రుతివాక్యములను భిన్నప్రస్థానముల వారు భిన్నరీతుల అన్వయించిరి. ద్వైతులు జీవేశ్వరులకు భేదమునే నమ్ముదురు. విశిష్టాద్వైతులు బ్రహ్మము సగుణము, అనంతకల్యాణగుణయుక్తము అని భావింతురు. అద్వైతులు జీవేశ్వరుల కభేదమును నిశ్చయించిరి. వీరు జడపదార్థమైన ప్రపంచము కూడా బ్రహ్మాభిన్నమనియే చెప్పుదురు. అద్వైతుల దృష్టియందు సత్పదార్థమంతయు ఒక్కటే. అదియే బ్రహ్మము. వీరు 'బ్రహ్మసత్యం జగన్మిథ్యా నేహనా నాస్తికించన సత్యంజ్ఞాన మనంతం బ్రహ్మ తత్త్వమసి' ఇత్యాది శ్రుతివాక్యముల నాశ్రయించి తమ ఆధ్యాత్మికవిచారణను సాగించిరి. జీవాత్మ బ్రహ్మచైతన్యమునకు మారురూపమని వీరి మతము అయినచో జీవుడు సంసారగతుడై సుఖదుఃఖములు పొంద నేల? అను ప్రశ్న రాగా, అవిద్యచే నాతడు ప్రకృతి కధీనుడై దేహాత్మ భ్రాంతి కలిగియున్నాడని వీరి సమాధానము. అవిద్య తొలగగనే జీవగతాత్మ శుద్ధమై తాను పరమాత్మ అంశమే కాని జడమైన ప్రకృత్యంశము కాదని తెలిసికొనును. అవిద్యావరణచ్ఛేదమే మోక్షహేతువు.

సృష్టివిధానమును అద్వైతులు ఇట్లు అన్వయింతురు. బ్రహ్మముకంటె జగత్తు వేరు కాదు. అదియు బ్రహ్మపదార్థమే ఇది యెట్లు? ప్రకృతి శుద్ధజడము పూర్ణచైతన్యము బ్రహ్మమూ, జడమూ చైతన్యమని యెట్లు చెప్పనగును? అను ప్రశ్నకు వీరిట్లు సమాధానము చెప్పుదురు. సృష్టికి బ్రహ్మమే ఉపాదానకారణము. కార్యమైన జగత్తు కారణమైన బ్రహ్మము కన్న వ్యతిరిక్తముగా ఉన్నది కదా యన్నచో ఇది వివర్తోపాదానమే అని అన్వయింతురు. ఉపాదానము రెండు విధములు.

పరిణామోపాదానము, వివర్తోపాదానము. క్షీరము దధిగా మారుట పరిణామోపాదనమునకు ఉదాహరణము. శుక్తిరజత భ్రాంతి వివర్తోపాదానమునకు ఉదాహరణము. వివర్తోపాదానమునకు మూలము భ్రాంతి లేక మోహము అని చెప్పవచ్చును. ముత్యపుచిప్పయందు వాస్తవముగా వెండి లేకున్నను ఉన్నట్లు భాసించి సంతోషమును కలిగించుచున్నది. అట్లే జగత్తు మిథ్యాపదార్థమైనను సత్యమువలె భాసించి మోహకారణమగుచున్నది. జగత్సృష్టికి మూలమైన ఈశ్వరశక్తిని అద్వైతులు మాయ అని వ్యవహరింతురు. ఈ మాయయొక్క తత్త్వము తెలియరాదని చెప్పుదురు. 'మమ మాయా దురత్యయా' అని గీతయు నుడువుచున్నది. ఈశ్వరగతమైనప్పుడు మాయ యనియు జీవగతమైనప్పుడు అవిద్య యనియు దీనికే సంకేతములు. ఇవి తొలగినప్పుడు జీవాత్మ వాస్తవముగ తాను పరమాత్మ సంబంధియనియు, ప్రకృతి కాదనియు పరమార్థమును తెలిసికొనును. వేదాంతులుకూడ సాంఖ్యులు గుణవాదమును అంగీకరింతురు. బ్రహ్మము మాత్రము గుణాతీతమని వారి భావన. మాయతో కూడిన బ్రహ్మ పరాంశమే సృష్టికార్యము నిర్వహించు ననియు వాస్తవముగా బ్రహ్మము నిష్క్రియ మనియు వారు ప్రతిపాదింతురు.

తిక్కనసోమయాజి బాదరాయణ మహర్షి ప్రోక్తమైన అద్వైతమునందు పరమ ప్రమాణబుద్ధి కలవాడు. మధ్యమాధికారులకు హరిహరనాథరూపమును మూర్తముగ చిత్రించి చెప్పినను వేదాంతదృష్టితో ఆయన నిర్గుణ నిష్క్రియ శుద్ధ పరబ్రహ్మమనియే బహుధా ప్రపంచించి స్తుతించెను. తిక్కన మతములో మోక్షసిద్ధికి కేవలజ్ఞానము చాలదు. హరిహరాభేద జ్ఞానము కాని బ్రహ్మైక్యజ్ఞానము కాని భక్తి సహితమైనప్పుడే ఫలము నిచ్చును. భక్తిరహితమైన శుష్కజ్ఞానము ఫలసిద్ధి కావింపదని సోమయాజి నిశ్చయము. కావుననే గ్రంథారంభ పద్యమందే 'భక్తజనంబు వైదికధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వముఁ గొల్చెద నిష్టసిద్ధికిన్' అని ప్రకటించినాడు. వైదికధ్యాయిత ఆయనకిష్టమే కాని అది భక్తజన సంబంధియైనచో భగవంతునకు ఎక్కువ కూర్చునని సోమయాజి సందేశము. ఈ భావమునే 'వైదికమార్గ నిష్ఠమగు' అను పద్యమున విశదము చేసినాడు. హరిహరనాథుడు తిక్కనసోమయాజి 'భేదము లేని భక్తిని' అనుగ్రహముతో ప్రశంసించినాడు. భక్తి సూచకముగా తిక్కన చేసిన స్తుతులు అసంఖ్యాకములు. నిరీశ్వరమైన సాంఖ్యమునకు ఆయన సుముఖుడు కాడు గనుక సేశ్వర సాంఖ్యమునే ఆశ్రయించి హరిహరనాథుని స్తుతించును. వేదాంతమునందు ఆయనకు అభిమతమైన మార్గము అద్వైతపథము. క్రింద నీయబడు ఉదాహరణములలో భక్తి, సేశ్వరసాంఖ్యము అద్వైతముల ఉజ్జ్వల వర్ణకిర్మీరము శోభిల్లును.

భవపాశబంధ సంబంధ విరామరామ; పరిపక్వవివేక నిరూఢ భక్తహృద్గ్రంథి విభేదనా 4-1-333.

అన్నమయత్వాది విరామోన్నతః జగదాధారా 4-1-334

గుణతత్త్వవికార నియత్యభేద్య 4-2-363

శ్రీత్వ శివాత్వాలంబన 4-3-1 అను ఈ చిన్న కందపద్యములో అద్వైత వేదాంతమంతయు ఇమిడ్చినాడు. హరిహరనాథ రూపబ్రహ్మము వాస్తవముగా కర్తృత్వరహితము. ఐనను స్వేచ్ఛచేతనే ఆయన లక్ష్మి పార్వతి యను తత్త్వాశ్లేషముచేత శబలితుడై జగత్కర్తృత్వాది లక్షణము కలవాడగుచున్నాడు. అనగా నిష్క్రియుడు క్రియాశీలి అయినవాడు. ప్రకృతి రూపములైన లక్ష్మీ పార్వతీతత్త్వమునుండి మహదహంకారము లుద్భవించుచున్నవి. మహదహంకారాది వికృతుల కతీతుడైన యాశుద్ధ బ్రహ్మమే స్వలీలచేత వాటితో కూడినట్లు భాసించుచున్నాడు.

నిరుపాధికా, గుణమయా, నిష్క్రియా 4-4-275

అంతఃకరణ చతుష్టయ శాంతిసముద్య ద్వివేక సంపద్వేద్యా 4-4-276

పురుషత్రయతా వివృతస్వభావ 4-5-405

దుర్వహ పటుతాపత్రయ నిర్వాపణకరణ 4-5-406

సాక్షిత్వ నానా జగదవనపిధానస్థైర్య దత్తావధానా 4-5-407

యోగీంద్ర సంతతాంతర్యాగ పరీపాకరూప 5-1-1

ఇద్ధమాయావిలాసా 5-1-385

నిత్యానిత్య వివేకవైభవ సమున్నిద్రాంత రంగస్ఫుట ప్రత్యక్షా 5-2-332

నైర్గుణ్య సముద్భాసి రహస్యానుభావ 5-2-333

గుణవర్జన, నిష్కల, నిత్యపుష్కలా 5-3-413

వికారవిదూర విలాసభాస్వరా 6-1-304

దూరాంతిక దుర్గమవిస్తార 6-1-305

(దూరస్థం చాంతికే చ తత్ - భగవద్గీత)

కర్మ సమ్మర్దనిరాసకర్మఠ 6-3-452

క్షరణ రహితవృత్తీ 6-3-454

వివిక్త యుక్త జనకౌశలభావిత 7-1-395

మూల విద్యానవద్యా 7-2-383

నిరుపమ గుణరాశీ - నిర్గుణత్వ ప్రకాశీ 7-3-310

ఈ పద్యమంతయు అన్వయ వ్యతిరేకములచేత హరిహరనాథ బ్రహ్మమును ప్రతిపాదించుచున్నది. ఆయన గుణరాశి. నిర్గుణుడు. నిర్మాణకార్యము నిర్వహించువాడు. అయ్యును నైష్కర్మ్యధుర్యుడు. ఆయన స్ఫురిత బహుశరీరుడు అయ్యును శుద్ధవైరూప్యసారుడు.

మోహవ్యతికరతిమిర ప్రధ్వంసనాదీపరూపా 7-4-337

వీతరాగాదిగమ్యా 7-5-433

సత్త్వనలినగంధరూప; నిత్యనిష్క్రియా 8-2-399

ప్రమితివిదూరా 8-2-400

కేవల సత్త్వసద్మ మాయా వ్యవధూత్యేకాయనగమ్యా 9-2-1 (మాయానిరసనమను ఏక మార్గముచేత పొందదగినవాడు అనుట).

మాయా వ్యాపారదూరా 10-2-134

ప్రకృతి వికృతి భావప్రాప్త సాంఖ్యప్రదీప్తా 10-2-136

'మూలప్రకృతి రవికృతిర్మహదాద్యాః ప్రకృతి వికృతయః' అని సాంఖ్యవేత్తల భావము.

సత్యత్వానంతత్వ నిరత్యయ శుభసారమయ సమగ్ర వికాసా 11-1-188 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' అని శ్రుతి.

సదసదనభిషిక్తా 11-1-189 'నసత్తన్నా సదుచ్యతే' గీతావాక్యము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

త్వంతాహంతా నిరసన శాంతాంతః కరణయోగి జనవిజ్ఞేయా 11-2-186 తత్త్వమసి, అహంబ్రహ్మాస్మి మున్నగు మహావాక్యముల సారము.

నివృత్తి లంపటచిత్తోల్లాసన దక్షా 12-1-1

మాయా వినిర్ముక్త ద్యోతన 12-1-398

ప్రకృతి పురుషయోగీ 12-1-400 ఇది అచ్చపుసాంఖ్యభావన, వేదాంతమునందు రెండవదశ.

వీతకారణా 12-4-455

కామదూరానుభావ్యా; యమనియమ వికాసీ 12-4-457

జరామరణనోదక పదస్మరణా 12-5-631

సంగనిర్ముక్త భావ్యా 12-5-632

వ్యామోహవిదూర 13-1-1

మనోంతర్ముద్రా లతికాఫలత్వలసితా 13-2-476

ప్రమద విషాదాదిద్వంద్వ మలావిహితాంతరంగవాసా 13-2-477 స్థితప్రజ్ఞుడు ద్వంద్వాతీతుడని గీతలో బహుధా చెప్పనైనది.

వికృతిదశక షట్క స్వీకృతి ప్రౌఢవర్తీ 13-2-478 షోడశవికారములు సాంఖ్యభావన అపగత కామరోషహృదయాంతరఖేలన కల్య (13-3-345) (అరిషడ్వర్గ నిరసనము).

సత్త్వాధిష్ఠాన; తత్త్వంపదార్థరూపా 13-3-346 త్రుటితాపత్య సమున్నతాశ్రితజనా 13-4-449

గుణసమతాను భూతిహృతికోవిద సార వివేక భవ్య 14-1-231

సృష్టికి పూర్వము మూలప్రకృతియందు గుణసమత్వముండునని సాంఖ్యులు.

నవ్యత్వపురాణత్వ దశావ్యపనయ దుర్నిరూప సౌందర్యా 14-1-232

అనపేక్షిత ఫలతాశోభన మహనీయక్రియా విపాకాత్మక 14-3-227

ఫలాభినంది లేని మహనీయుల క్రియాపరిణామమైనవాడు. అనగా హరిహరనాథుడు ఫలాపేక్షలేని కర్మచేత అభిగమ్యుడు. ఫలాపేక్షతో చేసిన కర్మకు స్వర్గాదులు గమ్యము కావచ్చును. జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత - శ్రుతి

తరుణ జరఠభావద్రావణోదారమూర్తీ 14-3-228 (భగవంతుడు నిత్యతరుణుడు. నిత్యవృద్ధుడు అనుట.)

ఆశాపాశవిమోచనోపకరణవ్యాకోచహృద్ధామ 15-1-184 (ఆశాపాశమును విడుచుటయను సాధనముచే వికసించిన హృదయమునందు వసించువాడు)

విద్యావిద్యాఘనచింతాంతిక దూరలసన 15-1-185 విద్యతో కూడిన చింతనకు సమీపమందును అవిద్యాచింతనకు దూరమునందును ప్రకాశించువాడు హరిహరనాథదేవుడు. క్రమాలంకారము.

గత సంకల్పాంతరంగస్థితిస్మేరాకార 15-2-174

నానాగమక్షీరోద్యన్నవనీతతాలసిత 15-2-174

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(ఆగమ క్షీరములనుండి ఉద్భాసించు నవనీతము హరిహరనాథుడు)

సమదవిమదదూరాసన్నరక్షాప్రసన్నా 15-2-176 (క్రమాలంకారము)

సంగిగాఢ త్రితాపా 16-1-226 (సంగము కలవారికి అనగా విషయాసక్తులకు గాఢమైన తాపత్రయము కలిగించువాడా అనుట.)

విస్తారోదారగుణత్రయ స్ఫుటవిశేషా; నిర్గుణాశ్లేష 17-1-77 సృష్టి నిర్మాణదశయందు గుణత్రయ విశిష్టుడు. సృష్టి పూర్వదశయందు నిర్గుణుడు.

జన్యసకలద్రవ్యా 17-1-78 (సర్వపదార్థములు హరిహరనాథజన్యము.)

మహావిద్యోన్మేషగాత్ర 18-1-1

సాంఖ్య విద్యావహ 18-1-95

హరిహరనాథ! సర్వభువనార్చిత! నన్ దయఁజూడు మెప్పుడున్ 18-1-94,,

13 కవిత్రయ మహాభారతం : వ్యాఖ్యానం

తెలుగులో ఆదికావ్యమైన ఆంధ్రమహాభారతం అవతరించి వెయ్యేళ్ళు కావస్తున్నా, ఇంతవరకు దానికి సమగ్ర వ్యాఖ్య వెలువడలేదు. ఆంధ్రుల అభిమానదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో కవిత్రయ మహాభారతానికి తెలుగులో శిష్టవ్యావహారిక భాషలో సరళవ్యాఖ్య వెలువడటం ఆంధ్రావళి ఆనందించే అపూర్వ సాహిత్యోత్సవం. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు భారతీయ వైదిక ధర్మ ప్రచార మహోద్యమాన్ని చేపట్టి మహనీయంగా సాగిస్తున్నారు. అందులో ఈ పంచమ వేద వ్యాఖ్యాన ప్రణాళిక ఒక మహత్తర సారస్వత యజ్ఞం. ఏడుకొండలరాయడు మాత్రమే చేపట్టి ధర్మరక్షణ కళా ప్రావీణ్యంతో ఈ బృహత్తర ధర్మకార్యాన్ని ప్రజలకు ప్రసన్నంగా ప్రసాదించగలిగిన పరమదయాళువు. ఆ దేవదేవుడి కృపాకటాక్షంతో పండితులు వ్యాఖ్యానించిన పదునెనిమిది పర్వాల ఈ దివ్యప్రబంధమండలిని పరిష్కరించి, సర్వాంగసుందరంగా ప్రచురించి, సామాన్యజనులకు అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారు చేసికొన్న వెలుగుల పుణ్యం. ఈ పవిత్ర మహత్తర ప్రయత్నానికి శ్రీ తిరుమలేశుడి పక్షాన బాధ్యత వహించి, అభ్యుదయ పరంపరను విజయవంతంగా సమకూరుస్తున్న మాన్యులు మహనీయులు టి.టి.డి.బోర్డు ఛైర్మన్; సభ్యులూ, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, వారి సహకారులూ, సంపాదకులూ, సంపాదక సలహామండలి సభ్యులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, ఎడిటోరియల్ సెల్ సభ్యులూ, పలురకాలుగా ఈ కార్యక్రమంలో తోడ్పడుతున్న అధికారులూ, అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటి. అది రెండు భాగాలుగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపుదిద్దుకొన్నది. విస్తృతమైన ఆరణ్యపర్వం మూడవ సంపుటిగా, రెండు భాగాలుగా ప్రచురించబడింది. మొదటిభాగం నన్నయ రచించిన ఆరణ్యపర్వభాగం, రెండవభాగం ఎఱ్ఱాప్రెగడ పూరించిన ఆరణ్యపర్వశేషం. ఈ విధంగా ఆరణ్యపర్వం విభజించబడి ప్రచురించటం తెలుగులో ఇది ప్రథమం. నాల్గవ, అయిదవ, ఆరవ, ఏడవ, ఎనిమిదవ సంపుటాలుగా విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ పర్వాలు వెలువడ్డాయి. తొమ్మిదవ సంపుటిగా శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు వెలశాయి. పదవసంపుటిగా శాంతిపర్వం రెండు భాగాలలో వెలువడింది. పదకొండవ సంపుటిగా ఈ ఆనుశాసనిక పర్వం వెలువరించటం జరుగుతున్నది.

ఆనుశాసనిక పర్వంలోని మొదటి రెండాశ్వాసాలకూ వ్యాఖ్యానం రచించారు ప్రసిద్ధ విమర్శకులూ కవులూ అయిన డాక్టర్ తుమ్మపూడి కోటేశ్వరరావుగారు, తృతీయ చతుర్థాశ్వాసాలకు వ్యాఖ్యను సంతరించారు ప్రసిద్ధ సాహిత్యాచార్యులు డాక్టర్ శలాక రఘునాథశర్మగారు, పంచమాశ్వాసానికి వ్యాఖ్య రచించిన వారు ప్రసిద్ధ పరిశోధకులు, కవులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

డాక్టర్ యం.కులశేఖరరావుగారూ,

ప్రముఖ కవులూ, విద్వన్మణులూ శ్రీ ముదివర్తి కొండమాచార్యులుగారు. ఈ పర్వానికి సంపాదకుడుగా నేను పీఠికను సంతరించాను. ఇవి ఆంధ్రుల ఆమోదాన్ని పొందుతాయని ఆశిస్తున్నాను.

ఈ సంపుటి ఈ విధంగా రూపొందటానికి తోడ్పడిన మిత్రులు, విద్వన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారికి, శ్రీ సత్యరామ్ ప్రసాదుగారికి, శ్రీ జి.రాధాకృష్ణగారికి, శ్రీమతులు సుశీలా, లక్ష్మీవిద్యానాథులకూ, డాక్టర్ వి.యన్.లక్ష్మికీ నా కృతజ్ఞతలు.

పరమ కల్యాణభద్రమూర్తి అయిన శ్రీ పద్మావతీ సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి వేదవేద్యులు, వేదాంతగమ్యులు, పరతత్త్వరూపులు. అయినా భక్తసులభులు, సాహిత్య సంగీత కళాప్రియులు, రసానందమూర్తులు. ఆ స్వామికి ఈ పంచమవేదం అక్షరమైన తోమాలసేవ, వ్యాఖ్యానం సుగంధ పరిమళసేవ; విశేషాంశాలు ఉజ్జ్వలాలంకారసేవ; పీఠిక ఆ విరాణ్మూర్తికి మంగళ నీరాజనసేవ, ఈ పర్వం శ్రీ స్వామివారికి సారస్వతమైన అక్షరార్చన.

సత్య శివ సుందర రూపులైన శ్రీ స్వామివారి దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యాన సంపుటిని వాఙ్మయారాధనలోని భాగంగా పుణ్యపూజకు సుమమంజరిగా సమర్పించుకొంటున్నాను. విశ్వశ్రేయస్సును ప్రసాదించుమని స్వామివారిని వేడుకొంటున్నాను.

హైదరాబాదు

15-8-2005

ప్రధాన సంపాదకుడు

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆనుశాసనిక పర్వ కథాసారం

ప్రశ్నోత్తర మాలిక:

ధర్మరాజు భక్తి వినయాలతో అడుగుతూ ఉండగా భీష్ముడు అతడి ప్రశ్నలకు తగిన సమాధానాలు ఈయనారంభించాడు.

ధర్మరాజు :

ప్రశ్న 1 : పితామహా! మునులు కూడా గౌరవించే పుణ్యమూర్తివి నీవు. ఎన్నో నీతులను, ధర్మాలను దయతో నాకు బోధించావు. అయినా నాకు శాంతి కలగలేదు. పట్టుదలతో చుట్టాలను పక్కాలను చంపుకొన్నాను. నీపై కోపంతో క్రూరకర్మ చేసి నిన్ను పడగొట్టాను. ఈ రెండూ నా మనస్సును తీవ్రంగా బాధిస్తున్నాయి. లోభి అయిన దుర్యోధనుడు రాజ్యం పంచుకొని అనుభవించటానికి అంగీకరించలేదు. నేను కూడా కోపం మాని అతడిని రాజ్యం అనుభవించనీయలేదు. మా ఇద్దరివలన ఇంతటి కీడు పుట్టింది. ఏ విధంగా కూడా నాకు పశ్చాత్తాపం తప్పటంలేదు.

భీష్ముడు : ధర్మరాజా! చంపటానికి మనుజుడు కర్త కాడు. దీనికి ఉదాహరణగా ఒక ఇతిహాసం చెప్పుతాను వినుము. గౌతమి అనే పేరుగల బ్రాహ్మణ వనిత ఉండేది. ఆమె శాంత స్వభావురాలు. ఆమె కొడుకు విధివశాన పాము కరిచి చనిపోయాడు. ఆమె దుఃఖిస్తూ ఉండగా, ఒక కిరాతుడు పామును తాడుతో కట్టి తెచ్చి దాని తలను నరకబోయాడు. గౌతమి అతడిని వారించింది. 'విధి వశాన పాము కరిచింది. దీనికి అల్పులు బాధపడతారు. పామును చంపితే బిడ్డ బ్రతుకుతాడా?' అని వారించింది. అర్జునకుడు అనే ఆ బోయవాడిని పేరుకు తగినట్లు ప్రవర్తించుమన్నది. శత్రువునైనా తనచేత చిక్కినప్పుడు చంపటం న్యాయం కాదన్నది. కిరాతుడు ఆమె మాటలను అంగీకరించలేదు. క్రూరజంతువును చంపటం పాపం కాదని వాదించాడు. ఆ మాటలు విన్న పాము 'తాను మృత్యుదేవత పంపగా వచ్చిన సాధనమే కాని స్వయంగా కర్తను కా'నని వాదించింది. అంతలో మృత్యువు అక్కడికి వచ్చి తనను యముడు పంపగా వచ్చాననీ, బాలుడి చావుకు తాను కారణం కాననీ పేర్కొన్నది. కాని, బోయవాడు వారిద్దరూ పాపానికి వశమైన మనస్సుతో వ్యవహరించారు కాబట్టి బాలుడి మరణానికి వారే బాధ్యులని వాదించాడు. అంతలో యమధర్మరాజు అక్కడికి వచ్చి బోయవాడితో ఇట్లా అన్నాడు. 'నేనూ, పామూ, మృత్యువూ ఈ బాలుడి చావుకు కారణాలు కాము. అతడి కర్మయే దానికి కారణం. జీవుడు తన కర్మఫలాన్ని తప్పించుకొనలేడు. కాబట్టి పామును వదలిపెట్టుము, అన్నాడు. కిరాతుడికి జ్ఞానోదయమై పామును వదలి పెట్టాడు.

కాబట్టి ధర్మరాజా! నీవూ దుఃఖాన్ని వదలిపెట్టుము. యుద్ధంలో బంధువులు మరణించటానికి కారణం వారి కర్మలే కాని నీవు కాని, దుర్యోధనుడు కాని కాదు. ఈ సత్యం తెలిసికొని శాంతిని పొందుము.

ప్రశ్న 2 : గృహస్థాశ్రమంలో ఉండికూడా మృత్యుభయం పోగొట్టుకొనవచ్చునా ?

ఉత్తరం : ధర్మానికి స్థిరంగా నిలబడగలిగితే గృహస్థుడు ముక్తిని పొందగలడు. దీనికి ఒక కథ చెప్పుతాను వినుము. పూర్వం మనువంశంలో దుర్యోధనుడు అనే అందమైన రాజు ఉండేవాడు. అతడి సౌందర్యాన్ని చూచి

నర్మదానది మోహించి స్త్రీ రూపం తాల్చి వివాహమాడింది. వారిరువురికీ సుదర్శన అనే సుందరాంగి పుట్టింది. ఆ రాజు ఆ కన్యను అగ్ని సేవకు నియోగించాడు. అగ్నిదేవుడు ఆ కన్య సౌందర్యానికి ముగ్ధుడై ఆమెను కోరాడు. ఆమె పెద్దల నడిగి తనను వివాహమాడుమని చెప్పింది. దుర్యోధనుడు ఒక మహాయజ్ఞం చేస్తూ విప్రులకు దానాలిచ్చే సందర్భంలో అగ్ని బ్రాహ్మణ వేషంతో సుదర్శనను తన కిచ్చి వివాహం చేయుమని రాజును కోరగా పేదబాపడికి కన్యనివ్వటానికి దుర్యోధనుడు ఇచ్చగించలేదు. దానితో అగ్ని కోపించి యజ్ఞంలో తన తేజస్సును ఉపసంహరించుకొన్నాడు. ఋత్విక్కులు దానికి భయపడి మంత్రాలను పఠించటం మొదలుపెట్టారు. అగ్ని తన మనసులోని మాటను వారికి చెప్పాడు. దుర్యోధనుడు సంతోషించి సుదర్శనను అగ్నిదేవుడి కిచ్చి వివాహం చేశాడు. అగ్ని సంతోషించి మరల తన తేజస్సును ప్రకాశింపజేసి యజ్ఞాన్ని సఫలం చేశాడు. వారిరువురికి సుదర్శనుడు అనే కొడుకు పుట్టాడు. అతడు పెద్దవాడై రాజ్యభారాన్ని వహించి నిర్వహించాడు. అతడికి ఓఘవంతుడు, అతడికి ఓఘరథుడు, ఓఘవతి అనే కొడుకు, కూతురు పుట్టారు. ఓఘవతిని సుదర్శనుడి కిచ్చి పెండ్లి చేశాడు. అతడు గృహస్థాశ్రమాన్ని పాటిస్తూ మృత్యువును జయించాలని నిశ్చయించాడు. ఓఘవతితో కలిసి కురుక్షేత్రంలో ఒక ఆశ్రమం కట్టుకొని నివసించాడు. అతిథిపూజను నిత్యవ్రతంగా స్వీకరించాడు. అతిథులు ఎవరి ఇంట్లో తమ కోరికలన్నీ తీర్చుకోగలుగుతారో ఆ యజమానుడూ, యజమానురాలూ కృతార్థులౌతారని ఆ దంపతులు విశ్వసించారు. అతిథి యజమానురాలిని కోరినా జుగుప్సపడకుండా అతడిని సంతోషపెట్టాలని నిశ్చయించారు. ఒకనాడు సుదర్శనుడు సమిధల కొరకు అడవికి పోగా ధర్మదేవత బ్రాహ్మణ రూపంలో అతిథి అయి వచ్చి ఆమెను కోరాడు. గృహస్థధర్మాలు అతడికి తెలియజెప్పినా అతడు ఆమెను వాంఛించాడు. భర్త నియమాన్ని మనస్సులో భావించి ఆమె అంగీకరించింది. అతిథి ఆమెను చాటుకు తీసుకొని వెళ్ళాడు. అంతలో సుదర్శనుడు వచ్చి భార్యను పిలిచాడు. ఆమె పలుకలేదు. ఆమె తనను సేవిస్తున్నదని అతిథి పలికాడు. త్రికరణశుద్ధిగా ఆమె చర్యకు సుదర్శనుడు హర్షించాడు. అప్పుడు ధర్మదేవత సంతోషించి, తన తేజోమయరూపాన్ని ప్రదర్శించి అతడిని ప్రశంసించాడు. ప్రతిజ్ఞకు లోపం జరిగితే చంపటానికి మృత్యువు వెన్నంటే ఉన్నదనీ, దానిని సుదర్శనుడు జయించాడనీ ధర్మదేవత ప్రకటించాడు. ఆ భార్యాభర్తలకు బొందితో స్వర్గాన్ని ప్రసాదించాడు. ఓఘవతి తన మనస్సులోని సగభాగంతో పుణ్యనదిగా ప్రవహిస్తుందనీ మిగిలిన సగంతో భర్తను సేవిస్తుందనీ అనుగ్రహించాడు. ధర్మరాజా! అతిథి పూజాధర్మంతో గృహస్థు మృత్యువును జయించవచ్చునని ఈ కథవలన తాత్పర్యం గ్రహించుము.

ప్రశ్న 3 : క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాల వారికి గుణ కర్మలతో బ్రాహ్మణత్వం సిద్ధిస్తుందా?

ఉత్తరం : బ్రాహ్మణత్వం కడు దుర్లభం. ఎన్నో జన్మల ఫలం. ఈ సంగతి 'ఇంద్ర మతంగ సంవాదం' అనే ఇతిహాసంవలన స్పష్టమౌతుంది. మతంగు డనే బ్రాహ్మణ బాలుడు తండ్రి పంపున ఒక యజ్ఞానికి పోతూ దారిలో ఒక గాడిద పిల్లను కర్రతో కొట్టాడు. అది బాధతో తల్లిగాడిదతో చెప్పింది. ఆ తల్లిగాడిద ఆ బాలుడిని 'చండాలుడా'! అని తిట్టింది. ఆ తిట్టుకు కారణ మడిగి తెలిసికొని తన తల్లికి ఒక మంగలివలన పుట్టినట్లు గ్రహించి, ఆ సంగతి తండ్రికి చెప్పి, తపస్సుచేత బ్రాహ్మణత్వాన్ని పొందుతానని చెప్పి ఇంద్రుడిని గురించి తపస్సు చేయ మొదలు పెట్టాడు. ఇంద్రుడు ప్రత్యక్షమై బ్రాహ్మణత్వం ఇతర జాతులకు లభించేది కా దని చెప్పినా వినక మతంగుడు ఘోర తపస్సు చేయసాగాడు. ఎంత తపస్సు చేసినా శరీరం శుష్కించిందే కాని బ్రాహ్మణత్వం సిద్ధించలేదు.

ప్రశ్న 4 : విశ్వామిత్రు డెట్లా బ్రాహ్మణత్వాన్ని పొందగలిగాడు ?

ఉత్తరం : జహ్నుడి కులంలో గాధి జన్మించాడు. అతడి కూతురు సత్యవతి. ఆమెను భృగుకులంలో పుట్టిన ఋచీకుడు

భార్యగా నిమ్మని గాధిని కోరాడు. అతడికి ఇష్టం లేక ఒక చెవి నల్లగా ఉన్న వేయి తెల్లని గుర్రాలను శుల్కంగా అడిగాడు. ఋచీకుడు వరుణుడిని యాచించాడు. అతడు కరుణించి 'ఎక్కడ కోరితే అక్కడ అటువంటి గుర్రాలు పుట్టగల'వని వరమిచ్చాడు. అతడు గంగానది ఉత్తరతీరంలో నియమంతో సంకల్పించగా నేలనుండి వేయి గుర్రాలు పుట్టాయి. ఆ స్థలానికి అశ్వతీర్థమనే పేరు కలిగింది. ఋచీకుడు ఆ గుర్రాలను గాధికి శుల్కంగా సమర్పించాడు. గాధి సత్యవతి నిచ్చి అతడికి వెంటనే పెండ్లి చేశాడు. ఋచీకుడు సంతానం కావాలనుకొని భావించి బ్రాహ్మణత్వం గల కొడుకు నిచ్చే ఒక చరువును కల్పించాడు. బ్రాహ్మణ కుమారుడి నిచ్చే చరువును తన భార్యను, క్షత్రియత్వంగల కొడుకు నిచ్చే చరువును ఆమె తల్లిని తీసికొని ఋతుకాలంలో భార్యను మేడిచెట్టును, అత్తను రావిచెట్టును కౌగలించుకొనేటట్లు నిర్దేశించాడు. కాని, దైవవశాత్తు తల్లీకూతుళ్ళు వాటిని వ్యత్యాసంగా చేసి గర్భాలు తాల్చారు. దానిని గ్రహించిన ఋచీకుడు భార్యకు ఆ సంగతి తెలియచెప్పాడు. సత్యవతి దుఃఖించి తనకు బ్రాహ్మణత్వం గల కొడుకు కలిగేటట్లు వరమిమ్మని కోరింది. ఋచీకుడు దయామయుడై ఆమెకు బ్రాహ్మణుడు పుట్టుతాడనీ, అతడి కొడుకు రాజలక్షణాలు కలిగి ఉంటాడనీ వరమిచ్చాడు. దానివలన సత్యవతికి జమదగ్ని బ్రాహ్మణ తేజస్సుతో పుట్టాడు. అతడికి పరశురాముడు క్షత్రియ తేజస్సుతో కలిగాడు. గాధి భార్యకు విశ్వామిత్రుడు పుట్టాడు. చరుతరుగుణాల తారుమారువలన అతడిలో బ్రాహ్మణత్వ స్ఫురణ, తపశ్శక్తి ఎక్కువగా కలిగాయి.

ప్రశ్న 5 : వీతహవ్యుడనే రాజు బ్రాహ్మణత్వాన్ని పొందాడని వింటాం. ఆ సంగతి తెలుపుము.

ఉత్తరం : మను వంశజుడైన హైహయుడికి (ఇతడికే వీతశమ్యుడనే మరొక పేరుండేది) పదిమంది భార్యలవలన వందమంది వీరపుత్రులు పుట్టారు. వారందరు కలిసి కాశీరాజైన హర్యశ్వుడిని యుద్ధంలో చంపారు. ఆ తరువాత అతడి కొడుకు సుదేవుడినీ చంపారు. అతడి కొడుకు దివోదాసుపై కూడా దాడి చేసి ఓడించారు. అతడు భరద్వాజ మహర్షిని ఆశ్రయించి హైహయులనుండి తన వంశ రక్షణాన్ని కోరాడు. ఆ మహర్షి యజ్ఞంనుండి ప్రతర్దనుడు అనే పుత్రుడిని సృష్టించి రాజుకు ఇచ్చాడు. అతడు ఆ నూరుగురు హైహయులను చంపి వీతహవ్యుడి మీదకు పోయాడు. అతడు భయపడి భృగుమహర్షిని ఆశ్రయించాడు. అతడు తన ఆశ్రమంలోని శిష్యులలో ఆ రాజును దాచాడు. ప్రతర్దనుడు భృగుమహర్షి వద్దకు వెళ్ళి, వీతహవ్యుడిని తనకు వశం చేయుమని కోరాడు. అప్పుడు భృగుమహర్షి తన ఆశ్రమంలో అందరూ బ్రాహ్మణులే ఉన్నారని పలికాడు. ఆ మహర్షి మాటవలన వీతహవ్యుడు బ్రాహ్మణుడయ్యాడు. ప్రతర్దనుడు సంతోషించి వెళ్ళిపోయాడు. వీతహవ్యుడు అనేకమంది బ్రాహ్మణ పుత్రులను కన్నాడు. ఆ వంశానికి అతడే మూలపురుషు డయ్యాడు.

ప్రశ్న 6 : దైవం, పౌరుషం ఈ రెండింటిలో ఏది గొప్పది?

ఉత్తరం : పురుషకారం చేను, దైవం బీజం. ఈ రెండింటిని కలిపే ప్రయత్నం చేస్తే మానవుడు ఫలాన్ని పొందుతాడు. దైవం సహకరించకపోతే పురుషకారం ఫలం పొందలేదు. అగ్ని కొంచెమైనా గాలితో పెరిగి ప్రకాశించినట్లు మంచిపనులు చేయటంవలన దైవానుకూల్యం పెరుగుతుంది. నేయి తగ్గిపోతే దీపకాంతి తగ్గినట్లే పురుషకారంలో పవిత్రత లోపిస్తే దైవానుకూల్యం కూడా లోపిస్తుంది. కాబట్టి దైవ పౌరుషాలు రెండూ సమానమే.

ప్రశ్న 7 : సత్కర్మవలన కలిగే ఫలాలు ఎట్లా ఉంటాయి?

ఉత్తరం : సత్కర్మలకూ, దుష్కర్మలకూ తగిన సమయాలలో వాటికి తగిన ఫలితాలు కలుగుతాయి. లోకానురక్తులకు పాప పుణ్య కర్మలు దుఃఖాన్ని కలిగిస్తాయి. విరక్తులకు ఆ ఫలాలు కలుగవు.

ప్రశ్న 8 : తమ జీవితాలకు ఆధారమైన యజమాని పట్ల ఆశ్రితులు ఎట్లా నడచుకొనాలి ?

ఉత్తరం : తనను కాపాడిన యజమాని ఆశ్రితులు రక్షిస్తారు. ఉదాహరణకు ఒక కథ. కాశీదేశంలో ఒక వేటగాడు విషబాణాన్ని ఒక లేడిపై ప్రయోగించగా అది గురితప్పి ఒక ఫలవృక్షాన్ని తాకింది. దాని ప్రభావం వలన ఆ చెట్టు ఎండిపోయింది. ఆ చెట్టు తొర్రలో ఒక చిలుక నివసిస్తూ ఉన్నది. ఎండిపోయిన చెట్టును వీడిపోకుండా చిలుక ఆ చెట్టుతొర్రలోనే ఉండసాగింది. ఇంద్రుడు ఆ చిలుకను మరొక ఫలవృక్షాన్ని ఆశ్రయించుమని సలహా ఇచ్చాడు. కాని, చిలుక 'చెట్టు పండినపుడు ఉండటం, ఎండినపుడు విడిపోవటం కృతఘ్నత కదా' అని సమాధానం చెప్పింది. ఇంద్రుడు సంతోషించి చిలుకను వరం కోరుకొను మన్నాడు. వెంటనే చిలుక 'స్వామీ! ఈ చెట్టుకు పూర్వవైభవాన్ని అనుగ్రహించుము' అని కోరింది. ఆ విధంగా ఆశ్రితురాలివలన ఆ చెట్టుకు మేలు జరిగింది. ఇది ఆశ్రిత లక్షణం.

ప్రశ్న 9 : యజమానులు ఆశ్రితులలో ఎవరిని ఎట్లా ఆదరించాలి ?

ఉత్తరం : రాజు బ్రాహ్మణుడిని కొడుకువలె కాపాడాలి. గురువువలె గౌరవించాలి. అగ్నివలె పూజించాలి. అతడిని అవమానిస్తే ఆపద కలుగుతుంది. వ్యాసమహర్షి శల్యుడితో జ్ఞానాలలో ఉత్తమ జ్ఞానమేది? అనే అంశాన్ని వివరిస్తూ యజ్ఞమూర్తి విష్ణువు, అతడిని తెలియటమే ఉత్తమ జ్ఞానం. ఆ విష్ణువే శ్రీకృష్ణుడు. ఆశ్రితుడైన శ్రీకృష్ణుడే నీవు ఆశ్రయించదగిన పరమజ్ఞానమని తెలియటం ఉత్తమ జ్ఞానం. అదియే బ్రాహ్మణత్వ సిద్ధికి ఫలం అని చెప్పాడు.

ప్రశ్న 10 : గరుత్మంతుడు మహాత్ముడని విన్నాను. అతడి కథను చెప్పుము.

ఉత్తరం : భీష్ముడు శ్రీకృష్ణుడిని చూచి 'స్వామీ! నీవు ఆ గరుత్మంతుడవని విన్నాను' అన్నాడు. శ్రీకృష్ణుడు నవ్వి అడుగుతున్న ఆ రాజు కోర్కెను తీర్చుమని' అన్నాడు. భీష్ముడు చెప్పటం ప్రారంభించాడు.

కశ్యప ప్రజాపతికి కద్రువ, వినత అనేవారు ఇద్దరు భార్యలు. భర్త వలన కద్రువ వేయిమందినీ, వినత ఇద్దరినీ కొడుకులను వరాలుగా పొందారు. 1500 సంవత్సరాలు గడచిన తరువాత కద్రువ పెట్టిన గ్రుడ్లనుండి వేయి పాములు పుట్టాయి. వినత గ్రుడ్లు పిగలలేదు. ఆమె అసూయతో ఒక గ్రుడ్డును పగులగొట్టింది. అందులోనుండి సగం శరీరం గల అరుణుడు పుట్టి, తల్లి తొందరపాటుకు కోపించి, ఆమె కద్రువకు దాసి అయ్యేటట్లు శపించాడు. ఆ తరువాత అయిదువేల సంవత్సరాలకు రెండవ అండం నుండి మహా బలవంతుడు పుట్టి, తల్లికి దాస్యవిముక్తి చేస్తాడని అనుగ్రహించాడు. గరుత్మంతుడు మహాబలశాలిగా పుట్టి స్వేచ్ఛగా అంతరిక్షంలో తిరుగుతూ బ్రహ్మ సూచించిన ఆహారాన్ని గ్రహిస్తూ ఉన్నాడు. అరుణుడు సూర్యుడిని సేవించటానికి వెళ్ళాడు.

ఒకనాడు కద్రూ వినతలు విహారార్థం సముద్రతీరానికి పోయి అక్కడ ఉచ్చైశ్శ్రవాన్ని చూచారు. ధవళకాంతులతో వెలుగొందుతున్న ఆ ఇంద్రాశ్వాన్ని చూచి వినత ఆశ్చర్యాన్ని ప్రదర్శించింది. కద్రువ ఆ గుర్రం తోక నల్లగా ఉన్నది కదా! అని అన్నది. వినత దానికి అంగీకరించలేదు. తోక నల్లగా ఉంటే వినత కద్రువకు దాస్యం చేసేటట్లు పందెం వేసికొన్నారు. ఆనాడు పతిసేవకు సమయం కావటంతో ఇంటికి వెళ్ళి, మరునాడు ఉదయం వచ్చి సత్యాసత్యాలు నిరూపించుకొనాలని నిశ్చయించుకొన్నారు. ఆ రాత్రి కద్రువ కుటిలబుద్ధితో తన కొడుకులతో కుతంత్రం చేసింది. కొడుకులను తోకకు వ్రేలాడి అది నల్లగా తోచేట్లు చేయండని అడిగింది. చాలామంది అది అన్యాయమని భావించి తల్లి ఆనతిని తిరస్కరించారు. వారిని జనమేజయుడు చేయబోయే

సర్పయాగంలో హతులయ్యేట్లు కద్రువ నిర్దాక్షిణ్యంగా శపించింది. ఆ శాపానికి భయపడిన కొందరు నాగులు తల్లి మాటను పాటించి ఉచ్చైశ్రవ వాలానికి నల్లగా వ్రేలాడి నిలిచారు. వినత కద్రువకు దాసిగా ఉండవలసి వచ్చింది. సవతిని హీనంగా చూస్తూ దాస్య వృత్తిని చేయించుకొనేది కద్రువ. వినత గరుత్మంతుడివలన తనకు దాస్య విముక్తి కలుగుతుందని ఆశతో కాలం గడపసాగింది.

ఒకనాడు నారదుడివలన ప్రబోధితుడై గరుత్మంతుడు మాతృదాస్యాన్ని తొలగించటానికి పూనుకొని కద్రువ వద్దకు వచ్చి వేడుకొన్నాడు. అమృతాన్ని తెచ్చి మాతృదాస్య విముక్తి చేసికొమ్మని కద్రువ గరుత్మంతుడిని ఆజ్ఞాపించింది. అమృతాన్ని తెస్తానని శపథం చేసి గరుత్మంతుడు వెంటనే కశ్యప ప్రజాపతి వద్దకు వెళ్ళి ఉపాయాన్ని కోరుకొన్నాడు.

ఇంద్రుడు అమృతాన్ని భద్రంగా రక్షిస్తుంటాడు. జలం మధ్య అగ్ని మండుతూ ఉండగా తీవ్రమైన ఆయుధాలతో భయంకర రాక్షసులు రక్షిస్తుండగా ఇనుప వలలో అమృతం సురక్షితంగా ఉంటుంది. దానిని సాధించటం దేవతలకైనా సాధ్యం కాదు. దానిని సాధించాలంటే గరుత్మంతుడు తూర్పు సముద్రం చెంత ఉండే మహా పర్వతం మీద రెండు మహా గజ కచ్ఛపాలున్నాయి. ఆ రెండూ పూర్వకాలంలో మధుకైటభులు. పరస్పరం ఘర్షణపడుతుంటాయి. ఆ సందర్భంలో ఆ రెండింటినీ పట్టి భక్షిస్తే కలిగే బలంవలన గరుత్మంతుడు అమృతాన్ని హరించగలడని కశ్యపుడు సూచించాడు. గరుత్మంతుడు తన వాడి గోళ్ళతో ఆ గజ కచ్ఛపాలను పట్టి ఆకాశానికి ఎగిరి, ఐదు యోజనాల పొడవున ఉన్న ఒక మహావృక్షశాఖ మీద వాలాడు. ఆ బరువుకు ఆ కొమ్మ విరిగింది. ఆ కొమ్మ మీద మహామునులు తపస్సు చేసుకుంటున్నారు. అందువలన ఆ కొమ్మ కిందపడకుండా ముక్కుతో పట్టుకొని గరుత్మంతుడు ఎగిరాడు. మునులు ఆ మహాత్ముడి మహిమను చూచి కొమ్మనుండి దిగిపోయారు. ఆ కొమ్మను దురాచారంతో అపవిత్రమైన కులింద దేశ సముద్ర ప్రాంతంతో వదలుమని చెప్పారు. గరుత్మంతు డాపని చేసి, ఒక మహాగిరి శిఖరం మీద విశాల ప్రాంతంలో గజకచ్ఛపాలను భక్షించి మహాబలోపేతుడై అమృతమున్న స్థానానికి చేరాడు. దానిచుట్టూ మండుతున్న అగ్నిని దాటటానికి ఉపాయం కొరకు బ్రహ్మను ఆశ్రయించాడు. కొండంత వెన్నను అగ్నిపై ఉంచుమని పితామహుడు ఉపాయం చెప్పాడు. సప్రయత్నంగా వెన్నను సంపాదించి అగ్నిపై ఉంచి దాని ఉద్ధృతి తగ్గటంతో అమృతభాండంపై లంఘించాడు. ఇంద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించినా అది విఫలమై పోవటంతో అతడు విముఖుడయ్యాడు. గరుత్మంతుడు అమృతాన్ని తెచ్చి కద్రువ ముందుపెట్టి తల్లి దాస్యానికి విముక్తి కలిగించాడు. అమృతం తేవటమే నియమం కాబట్టి తెచ్చి కద్రువకు చూపించి, మరల ఆ అమృతాన్ని ఇంద్రుడికి ఒప్పగించి గరుత్మంతుడు దేవతల మన్ననలను పొందాడు. పాములపై పగ సాధించాడు. ఇంద్రుడు గరుత్మంతుడిని సాక్షాద్ విష్ణువుగా కీర్తించి, భవిష్యత్కాలంలో యదువంశంలో శ్రీకృష్ణుడుగా అవతరించి లోకకల్యాణం నిర్వహిస్తాడని ప్రకటించాడు. ధర్మరాజా! ఈ గరుత్మంతుడి కథ ముక్తికి సోపానం. నీవు విని ధన్యుడవైనావు.

ప్రశ్న 11 : బ్రాహ్మణుడికి ఏదైనా ఇస్తానని మాట ఇచ్చి ఇవ్వనివాడు ఏ గతి పొందుతాడు?

ఉత్తరం : పూర్వజన్మలో బ్రాహ్మణుడికి ఇస్తానన్నది ఇవ్వకపోవటంవలన నక్కగా పుట్టి పీనుగు మాంసం తినే గతి పట్టిన నక్క కోతి కథనం భీష్ముడు వినిపించాడు.

ప్రశ్న 12 : గొప్పగుణాలున్న హీనవర్ణుడికి మంత్ర తంత్రాదులు బోధించటం ధర్మమా? కాదా?

ఉత్తరం : బ్రాహ్మణుడు మూడు కులాలవారికి మాత్రమే పరీక్షించి మంత్ర తంత్రాదులు చెప్పాలని ఒక కథ భీష్ముడు తెలిపాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రశ్న 13 : లక్ష్మీదేవి ఎక్కడెక్కడ నివసిస్తుందో తెలుపుము.

ఉత్తరం : ఒకసారి లక్ష్మీదేవి రుక్మిణీదేవితో తన నివాస స్థానాలను గురించి ఇట్లా చెప్పింది. నిత్యసత్యులు, శౌచనిరతులు, గురుభక్తులు, అప్రమత్తులు, దక్షులు, నిర్మలమతులు, సత్కర్మపరులు, విజ్ఞానం, తపం, దానం, బ్రహ్మచర్యం, శమం మొదలైన గుణాలు కలవారు లక్ష్మీ నివాసస్థానాలు. క్రూరులు, నాస్తికులు, కృతఘ్నులు, దుష్టబుద్ధుల పాలిట లక్ష్మి ఉండదు. గృహనీతి గల స్త్రీలయందు లక్ష్మి ఉంటుంది. పతి వ్యతిరేకులు, కఠిన చిత్తులు, అధిక నిద్రాసక్తులు అయిన స్త్రీలయందు లక్ష్మి ఉండదు. సరస్సులలో, పూల తోటలలో లక్ష్మి నివసిస్తుంది.

ప్రశ్న 14 : స్త్రీ పురుషుల రతిలో ఎవరికి ఎక్కువ సుఖ ముంటుంది?

ఉత్తరం భంగాస్వనుడు అనే రాజు ఇంద్రుడికి ఇష్టం లేని యజ్ఞం చేసి నూరుగురు కొడుకులను పొందాడు. అతడు ఒకసారి వేటకు వెళ్ళినపుడు ఒక కొలనులో దిగి నీరు త్రాగి స్త్రీగా మారిపోయాడు. ఆశ్చర్యంతో అతడు నగరానికి తిరిగి వచ్చి, మంత్రులకు, బంధువులకు జరిగింది తెలియచెప్పి, కొడుకులకు రాజ్యం కట్టబెట్టి, అతడు అడవికి వెళ్ళి మునులతో కలిసి నివసించాడు. స్త్రీ రూపంలో ఉన్న అతడిని ఒక ముని ప్రేమించి వరుసగా ఆమెయందు నూరుగురు కొడుకులను పొందాడు. రాజు ఆ కొడుకులను కూడా పూర్వ పుత్రులతో చేర్చి, రాజ్యసుఖాలను కలిగించాడు. ఇంద్రుడు ఆ శుభ పరిణామాలకు అసూయపడి రాకుమారుల నడుమ కలతలు రేపి, వారిని యుద్ధంలో చనిపోయేటట్లు చేశాడు. స్త్రీ రూపంలో ఉన్న ఆ రాజు రోదించాడు. ఇంద్రుడు కరుణించి కొందరు కొడుకులను బ్రతికిస్తానన్నాడు. స్త్రీ రూపంలో ఉన్న ఆ రాజు తాను స్త్రీగా ఉన్నప్పుడు కలిగిన కొడుకులను బ్రతికించుమని కోరాడు. ఇంద్రుడు దానికి కారణమడిగాడు. తల్లికి బిడ్డల మీద ప్రేమ ఎక్కువ అని అతడు సమాధానం చెప్పాడు. ఇంద్రుడు సంతోషించి అతడికి పోయిన మగతనాన్ని కూడా ఇస్తానన్నాడు. అప్పుడు ఆ రాజు తనను స్త్రీగానే ఉండనిమ్మని ఇంద్రుడిని కోరాడు. దానికి ఇంద్రుడు ఆశ్చర్యపడి కారణం అడుగగా 'రతిలో పురుషులకంటె స్త్రీలకు సుఖమెక్కువ కాబట్టి నేను స్త్రీగానే ఉండి సుఖించాలని కోరుకొంటున్నాను' అని అన్నాడు. ధర్మజా! ఈ తాత్పర్యం తెలిసికొమ్ము.

ప్రశ్న 15 : సంసార చక్రంలో పడి తిరుగకుండా ముక్తిని కలిగించే విష్ణుభక్తిని బోధించుము.

ఉత్తరం : శాశ్వత సుఖం పేరే మోక్షం. అదే నిర్వాణం. పురుషాతీతంగా ప్రకృతి ఉంటుంది. దానిని నిరూపించటం కష్టం. అదే సంసార చక్రం. దానిని త్రోసివేయటమే మోక్షం. అది పొందాలంటే కామక్రోధాలను జయించి మనస్సును సత్త్వగుణ భరితం చేసికొనుము. అదే వైష్ణవ ధర్మం. దానిని అనుసరించి సంసార భయాన్ని జయించుము.

ప్రశ్న 16 : ఆధ్యాత్మికం, అధిదైవం, అధిభూతం అనే మూడు తత్త్వాలకు ఆధారమై, వాటిలో తానూ జీవిస్తూ కర్తా, భర్తా, హర్తా అయిన భగవంతుడిని గురించి చెప్పుము.

ఉత్తరం : సనత్సుజాతుడు నారదుడికి చెప్పిన తత్త్వసారం వినుము. అవ్యక్తమైన విష్ణువు తన స్వరూపంతో తానుంటాడు. అతడు పదివేల యుగాలు నిద్రపోయి లేచి బ్రహ్మను సృష్టించి దాని కతడిని భర్తగా నియమించాడు. అతడు అహంకారాన్ని పొంది పంచభూతాలనూ, గుణాలనూ సృష్టించాడు. వాటన్నిటిలో అహంకారం వ్యాపించి ఉంటుంది. అవన్నీ అవ్యక్త సముద్రంలో మునిగి తేలుతూ ఉంటాయి. ఈ సమస్త సృష్టి స్థితి లయాలకు ప్రభువై విష్ణుమూర్తి శుభాశుభాలను కల్పిస్తూ ఈ సంసార చక్రాన్ని త్రిప్పుతూ వినోదిస్తూ ఉంటాడు. ఆధ్యాత్మమంటే అనుభవించే జీవుడు. తాను ద్రష్ట చూచేవాడు. అధిభూతమంటే ద్రష్ట - అనుభవించే పరార్థ సృష్టిలోని గుణం దృశ్యం.

అధిదేవత అంటే దృక్కు. చూచే శక్తి తేజస్సు. ఈ కెరటాలు వ్యక్తమయ్యే దానిని సృష్టి అంటారు. పంచభూతాలే దేవతలు. వాటి గుణాలే అధిభూతం. అనుభవించే నేనే అధ్యాత్మంగా చెప్పబడుతున్నాము.

ప్రశ్న 17: నియమంతో అగ్నులను తమలో ఆవహింపజేసికొని మహాత్ములు పరమాత్ముడిని ఎట్లాంటి వాడినిగా భావిస్తారు?

ఉత్తరం : గరుత్మంతుడికి విష్ణువు తన తత్త్వాన్ని ఇట్లా బోధించాడు. నా స్వరూపం దేవతలకూ తెలియదు. సమస్తం నాలో పుట్టి, జీవించి, మరణించినా నేనా సంసార చక్రంలో బంధితుడను కాను. కాని, వాటికి లోబడి అన్నింటిలోనూ ఉంటాను. నా తత్త్వం జడులు కానివారూ, అహింసా ప్రవృత్తి కలవారూ, కామం లేనివారూ, అహంకారం లేనివారూ, దానంగా దేనినీ స్వీకరించనివారూ, కోపం లేనివారూ, స్వచ్ఛమైన జ్ఞానం కలవారూ, నిత్యతృప్తులూ, శాంతీ, భక్తీ కలవారూ, నిష్ఠ కలవారూ, తమలో అగ్నిని సన్నిహితం చేసికొంటే నన్ను పొందగలరు. రజస్తమస్సులతో మలినం కాని కేవల సత్త్వగుణాన్నే స్థిరంగా చేసికొన్న జ్ఞానంతో నన్ను ధ్యానించటమే ముక్తిమార్గం. నానా విధాలైన సంకల్పాలు, యజ్ఞాలు, విడిచిపెట్టి ఆత్మలో అగ్నిని ప్రతిష్ఠించుకొని విరక్తుడై విష్ణువులో మనస్సును లయం చేసినవాడు ముక్తిని పొందుతాడు.'

ప్రశ్న 18 : కన్యాదానానికి ఎట్లాంటి వరుడు కావాలి?

ఉత్తరం : దీనికి ఒక ఇతిహాసం చెప్పుతాను వినుము. వదాన్యుడనే మునికి సుప్రభ అనే కుమార్తె ఉన్నది. అష్టావక్రుడు ఆమెను వివాహమాడగోరి వదాన్యుడిని అడిగాడు. ఆయన రూపగుణవర్తనాలలో యోగ్యుడైన అష్టావక్రుడికి కూతురి నిస్తానని మాట ఇచ్చి, అతడిని ఉత్తరదిశగా పయనించి పార్వతి శివుడికొరకు తపస్సు చేసిన ప్రాంతం దాటి కదంబవనంలో ప్రవేశించి, అక్కడ నివసించే ఒక పవిత్ర ప్రౌఢ వనితను దర్శించి తిరిగి రమ్మని కోరాడు. ఆ వెంటనే వివాహం చేస్తానన్నాడు. అష్టావక్రుడు దానికి అంగీకరించి ఆ రాత్రి బాహుదానదీతీరంలో ఆగి, మరునాడు కుబేర నగరానికి పోయి ఆయన కల్పించిన వినోదాలను వీక్షిస్తూ నిశ్చల మనస్సుతో ఏడాది గడపి, ఈశ్వరుడి క్రీడా క్షేత్రాలను దర్శించి, కడిమి చెట్ల వనం చేరి బంగారు మేడలో నివసించే ఒక పవిత్ర వనితను దర్శించాడు. ఆమె అతడికి ఎన్నో అతిథి సత్కారాలను చేసింది. రాత్రి శయ్యపై అతడితో శయనించి భోగించుమని కోరింది. అష్టావక్రుడు తనను తాకకుండా ఉంటే ఉంటానని లేకపోతే వెంటనే వెళ్ళిపోతానని అంటాడు. ఆ రోజు మిన్నకుండి మరునాడు రాత్రి మరల అతడిని కోరింది. అష్టావక్రుడు ఇట్లా అన్నాడు. స్త్రీని పసితనంలో తండ్రి, వివాహమైన తరువాత భర్త, ముసలితనంలో కొడుకు రక్షిస్తారు తప్ప ఆమె స్వతంత్రంగా ఏమీ చేయతగదు కాబట్టి నిన్ను నేను స్వీకరించను' అన్నాడు. ఆమె ఎన్ని విలాసాలు ప్రదర్శించినా చలించలేదు. అప్పు డామె సంతోషించి, తాను ఉత్తరదిశా కన్యనని, వదాన్యుడి ఆనతితో అతడిని పరీక్షించానని చెప్పి అభినందించి పంపింది. అష్టావక్రుడు తిరిగి వచ్చి వదాన్యుడి అభినందనలతో పాటు, సుప్రభను భార్యగా పొంది సుఖించాడు. కాబట్టి కన్యాదానానికి అర్హుడు ఉత్తమ బ్రహ్మచారి.

ప్రశ్న 19 : మునులవలన శూద్ర స్త్రీలకు కలిగిన వారు బ్రహ్మర్షులు ఎట్లా ఔతారు? ఆ రహస్యం తెలుపుము.

ఉత్తరం : మునులకు, రాజులకు కలిగిన సంతానం బీజ ప్రధానమే. వసిష్ఠుడు, ఋశ్యశృంగుడు, అగస్త్యుడు, వ్యాసమహర్షి, మందపాలుడి సంతానం, ద్రోణుడు, కృపుడు మొదలైనవారు దీనికి ఉదాహరణప్రాయులు.

ప్రశ్న 20 : బ్రాహ్మణుడు దాన యోగ్యుడు కావటం అతడి వృత్తి వలననా లేక విరక్తుడై బ్రతకటం వలననా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉత్తరం : తన కులానికి తగిన ఆచార వ్యవహారాలతో బ్రతుకుతూ, మనస్సులో సర్వ బాహ్య చిహ్నాలకు అతీతుడైతే అతడు దానయోగ్యుడు.

ప్రశ్న 21 : శ్రద్ధతో జను లిచ్చే భూరిదానాలు పాపం పొందవు కదా?

ఉత్తరం : పవిత్రులు, శ్రద్ధకలవారు, ఆదరంతో చేసిన దానం పాపపరిహారం చేస్తుందే కాని పాపం కలిగించదు.

ప్రశ్న 22 : దేవ పితృ కార్యాలలో బ్రాహ్మణుడిని పరీక్ష చేసికొని దానాదు లివ్వాలా?

ఉత్తరం : అవును.

ప్రశ్న 23 : అపూర్వమైన దైవ సంబంధం గల పండితులు, సోమయాజులు, తపస్వులు - వీరిలో ఎవరు దానయోగ్యులు?

ఉత్తరం : అందరూ దానయోగ్యులే. ఎవడు ధర్మపన్నాలు చెప్పుతూ వాటిని ఆచరించడో వాడు అయోగ్యుడు. అతడికి దానమిస్తే నరకమే ఫలం.

ప్రశ్న 24 : ధర్మార్థ కామాలను ఆచరించే కాలాలు ఏవి ?

ఉత్తరం : అర్థం తెల్లవారు జామున, ధర్మం పగటివేళ, రాత్రివేళ కామం ఆచరించాలి. అర్థ కామాలపై ఆసక్తి మంచిది కాదు. ధర్మాచరణ శ్రేష్ఠం.

ప్రశ్న 25 : దానయోగ్యు లెవరు ?

ఉత్తరం : ధర్మం చేసేవారు, కోపం లేనివారు, సత్యం పలికేవారు, దాంతులు, ధీరులు, నిజకర్మలు చేసేవారు, ఇంద్రియ నిగ్రహం కలవారు, భూతదయ కలవారు, లోభం లేనివారు, శుచులు, దానయోగ్యులు, వేదవేదాంగాలు చదివి షట్కర్మలు చేసే బ్రాహ్మణులు, మేధాశక్తి, ఉత్తమశీలం, ప్రవర్తన కలవారు దానయోగ్యులు.

ప్రశ్న 26 : దేవ పితృ మనుష్య పూజల కాలాలను తెలుపుము.

ఉత్తరం : ఉదయం దేవతలను, సాయంకాలం పితృదేవతలను, మధ్యాహ్నం మనుష్యులను పూజించాలి.

ప్రశ్న 27 : దైవ, పితృ కార్యాలలో దానం ఇవ్వటానికి ఉత్తమ యోగ్యులు ఎవరు?

ఉత్తరం : భోజనం పెట్టి తృప్తి పరిచేవాడు, దొంగలవలన అంతా పోగొట్టుకొన్నవాడు. వ్రతోద్యాపన కోరి యాచించేవాడు, గురువు, తల్లి, తండ్రి, భార్యా పుత్రులపై ఆధారపడి బ్రతికేవాడు, దీర్ఘవ్యాధిని పోగొట్టుకొనాలనుకొనేవాడు ఎప్పుడూ భిక్షాటనతో జీవించే పుణ్య బ్రాహ్మణుడు - ఈ ఆరుగురూ ఉత్తమ దానయోగ్యులు.

ప్రశ్న 28 : బ్రహ్మహత్యతో సమానమైన కర్మ లేవి ?

ఉత్తరం : దీనుడైన వేదబ్రాహ్మణుడిని ఆహ్వానించి అన్నం పెట్టకపోవటం, విప్రుడి జీవనాధారమైన వృత్తిని చెడగొట్టి వాడి నోరుకొట్టటం, నీరు త్రాగటానికి వచ్చిన ఆలమందలను తరిమి కొట్టటం, చెవిటి, కుంటి, గ్రుడ్డి వారి డబ్బు దొంగిలించటం, వేద శాస్త్రాదులను నిందించటం, కోపంతో నగరానికీ, ఊరికీ, తోటకూ నిప్పు పెట్టటం, పాపస్వభావంతో అబద్ధమాడి బ్రాహ్మణుడికి దుఃఖం కలిగించటం, యోగ్యుడైన వరుడికి పిల్లనీయకుండా ఉండటం బ్రహ్మహత్యతో సమానం.

ప్రశ్న 29 : పితామహా! పుణ్యతీర్థాల విశేషాలు చెప్పుము.

ఉత్తరం : భీష్ముడు పూర్వం అంగిరసుడు గౌతముడికి చెప్పిన పుణ్యతీర్థవిశేషాలను వివరించాడు. (చూడు. 2.79-90) కామక్రోధ విరహితమైన మనస్సుతో తీర్థాలను సేవించాలి. దూరదూర తీర్థాలను భక్తితో స్మరిస్తే చాలు పాపాలు తొలగిపోతాయి.

ప్రశ్న 30 : తాతా! ఏ ఊళ్ళు, కొండలు, ఏళ్ళూ మాహాత్మ్యం కలవో చెప్పుము.

ఉత్తరం : యోగి బ్రాహ్మణుడికి చెప్పిన గంగామాహాత్మ్యాన్ని భీష్ముడు వివరించాడు. (చూడు. 2.101-129) గంగ ఏ దేశంలో ప్రవహిస్తుందో ఆ దేశంలో ఉన్న ప్రతి వస్తువు పవిత్రమైనదే. గంగలో మునిగితే పాపాలన్నీ పోతాయి. దేవతలకు అమృతం ఎట్లాగో నరులకు నదులలో గంగనీరు అట్లాంటిది. గంగను చూడనివాడు గొడ్డుతో సమానుడు. సాగరులను స్వర్గానికి పంపిన గంగమాహాత్మ్యం స్మరణీయం. గంగ దివ్య గుణాలను లెక్కించటం సముద్రంలో నీటి బొట్లను లెక్కించటం వంటిది.

ప్రశ్న 31 : లోకంలో ఎవ్వరు సర్వజన పూజ్యులు ?

ఉత్తరం : వాసుదేవ నారద సంవాదం దీనికి చక్కని తార్కాణం. దాని తాత్పర్యమిది - వరుణాది దేవతలు, వేదవేత్తలు, తపోధనులు, ధనధాన్య భూములను గోవులను దానం చేసేవారు, అతిథి పూజాపరులు, పితృదేవతలను పూజించేవారు, భిక్షాన్నంతో తృప్తిపడే శాంతస్వభావులు, సత్యవ్రతులు, ధర్మార్థకామ సేవనులు, అహంకార మమకార రహితులు, వ్యామోహ రహితులు, సత్ప్రవర్తనులు, జ్ఞానులు - పూజించదగినవారు.

ప్రశ్న 32 : రాజులకు కర్తవ్యాలు ఎన్నో ఉంటాయి. వాటిలో ప్రధాన కృత్యం ఏమిటి?

ఉత్తరం : రాజ్యాభిషిక్తుడైన రాజు చేయదగిన ముఖ్య కర్తవ్యం బ్రాహ్మణ పూజ. పూజ పాపాలను తొలగిస్తుందని భూదేవి వాసుదేవుడికి చెప్పింది. ఆత్మోపాసనం, ధర్మబుద్ధితో పరబ్రహ్మను ఉపాసించటం బ్రాహ్మణధర్మ మని బ్రహ్మదేవుడు పేర్కొన్నాడు. విప్రసేవ కల్పవృక్ష సేవ వంటిది. శంబరాది రాక్షసులు బ్రాహ్మణ సేవవలన అధిక సంపదలు పొందారు.

ప్రశ్న 33 : అపూర్వులు, చిరకాలం నుండి ఆశ్రయించుకొన్నవారు, దూరంనుండి వచ్చినవారు - వీరిలో ఎవరు ఉత్తములు?

ఉత్తరం : ఈర్ష్యాసూయాదులు లేని స్నేహితులు, చుట్టాలు, ఋత్విజులు, పురోహితులు యోగ్యులు. విద్యావంతులూ ఆచారవంతులైతే దూరం నుండి వచ్చినవారుకూడా పూజార్హులే.

ప్రశ్న 34 : పాపాలన్నింటికి మూలం స్త్రీలంటారు నిజమేనా? వారిని ఎట్లా కాపాడుకొనాలి ?

ఉత్తరం : పూర్వం స్త్రీలు సాధువులై పవిత్రలై ఉండేవారు. వారి మనస్సులు పవిత్రంగా ఉండేవి. మాయామర్మాలు లేని ఆ రోజులలో పురుషులంతా కావలసినప్పుడు దైవత్వాన్ని పొందేవారు. స్త్రీ రక్షణను గురించి కథ చెప్పుతాను వినుము. దేవశర్మ అనే మునికి రుచి అనే పేరుగల భార్య ఉండేది. ఆమె అపూర్వ సౌందర్యవతి. ఇంద్రుడు ఆమెను పొందాలని ఉవ్విళ్ళూరుతుండేవాడు. దేవశర్మ రుచిని కాపాడుకొంటూ ఉండేవాడు. ఒకసారి దేవశర్మ ఒక యజ్ఞాన్ని నిర్వహించటానికి పోతూ తన భార్యను ఇంద్రుడి దృష్టినుండి రక్షించే బాధ్యత తన శిష్యుడైన విపులుడికి ఒప్పజెప్పాడు. విపులుడు తన యోగశక్తితో రుచిని ఆవహించాడు. విపులుడి ఆత్మ రుచిలో

ప్రవేశించింది. ఆమె చైతన్యం జడంగా మారింది. అప్పుడు ఇంద్రుడు సుందరరూపంతో ఆమెను సమీపించి ఆమెను వలపుమాటలతో వశం చేసికొనటానికి యత్నించాడు. అప్పుడు ఆమె శరీరంలో ఉన్న విపులుడు ఇంద్రుడిని 'నీవు ఇక్కడికి రావలసిన పని ఏమిటి?' అని ప్రశ్నించి, రుచిని సొమ్మసిల్లచేసి, తన ఆత్మను తన శరీరంలో ఉంచుకొని ఇంద్రుడిని ముఖాముఖి మందలించాడు. ఇంద్రుడు సిగ్గుపడి అదృశ్యుడయ్యాడు. తరువాత విపులుడు రుచిని మేల్కొల్పి, గురువు వచ్చిన తరువాత జరిగిన సంగతి తెలియచెప్పి, అతడివలన వరం పొంది తపస్సుకు వెళ్ళాడు. రుచి దేవశర్మలు సుఖంగా జీవించారు. పతివ్రతకూ దైవానికీ భేదం లేదు. సద్భార్యవలన పురుషుడికి పురుషార్థసిద్ధి కలుగుతుంది.

ప్రశ్న 35 : వధువును ఎన్నుకొనే పద్ధతిని తెలియపరచుము.

ఉత్తరం : కులం, శీలం, విద్య కలవాడిని పిలిచి ప్రీతితో కన్యనివ్వటం బ్రాహ్మవివాహం. కన్యా వరుడూ పరస్పరం కోరుకొని వివాహమాడటం క్షాత్రం.కన్నె తాను కోరుకొన్నవాడితో వివాహమాడటం గాంధర్వం. కట్నంతో చేసికొనేది ఆసురం. బంధువులను చంపి, కన్నెను బలవంతంగా ఎత్తుకొనిపోయి వివాహమాడటం రాక్షసం. ఈ అయిదు రకాలలో మొదటి మూడూ ధర్మవివాహాలు. మిగిలినవి ధర్మాలు కావు. బ్రాహ్మణుడు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య వర్గాలలోని కన్యను వివాహం చేసికొనవచ్చును. శూద్ర స్త్రీ యందు సంతానం కనటం నిషేధం. రాజు క్షత్రియకన్యను, వైశ్యకన్యను శూద్రుడు శూద్రకన్యను, వైశ్యుడు వైశ్య శూద్ర కన్యలను వివాహమాడవచ్చును. బ్రాహ్మణుడు శూద్రస్త్రీని వివాహమాడవచ్చునని కొన్ని సందర్భాలలో చెప్పబడింది.

ప్రశ్న 36 : బ్రాహ్మణుడివలన నాలుగు వర్ణాల స్త్రీలకు సంతానం కలిగితే వారందరికి ఆస్తిపాస్తు లెట్లా పంచాలి? మిగిలిన వర్ణాలవారికి విభాగం ఎట్లా ఉంటుంది?

ఉత్తరం : బ్రాహ్మణుడి ఆస్తి 10 భాగాలు చేసి అందులో 4 పాళ్ళు బ్రాహ్మణస్త్రీవలన పుట్టినవాడికి, 3 పాళ్ళు క్షత్రియ సంతానానికి, 2 పాళ్ళు వైశ్యస్త్రీ సంతానానికి, 1 పాలు శూద్ర సంతానానికి ఇవ్వాలి. క్షత్రియుడి ఆస్తి 8 భాగాలు చేసి అందులో 4 భాగాలు క్షత్రియ స్త్రీ సంతానానికి, 3 వైశ్యస్త్రీ సంతానానికి, 1 శూద్ర స్త్రీ సంతానానికి ఇవ్వాలి. శూద్రుడు తన సంతానానికి ఆస్తి సమంగా పంచి ఇవ్వాలి. వైదిక కర్మలు చేసే అర్హత బ్రాహ్మణ స్త్రీలకే ఉంటుంది.

ప్రశ్న 37 : కొడుకులు బహువిధా లంటారు వారి విధం తెలపండి.

ఉత్తరం : ధర్మపత్నియందు ధర్మబద్ధంగా పుట్టిన కొడుకు ఔరసుడు. కూతురి కొడుకును దత్తత తీసికొంటే వాడు దౌహిత్రుడు. ధర్మమార్గంలో తన భార్యను ఇతరుల కర్పించగా అతడివలన కలిగినవాడు క్షేత్రజుడు. తల్లిదండ్రులు జలధార పూర్వకంగా దానం చేయగా దక్కినవాడు దత్రిముడు; అనాథ బాలుడిని కొడుకుగా గ్రహిస్తే అతడు కృత్రిముడు. అజ్ఞాతంగా ఎవరివలన కలిగినా, పరభార్యకు పుట్టినా, భార్య కలవాడికి అతడు గూఢజుడు. తల్లిదండ్రులు వదలివేసిన వాడిని కొడుకుగా స్వీకరిస్తే అతడు అపవిద్ధుడు. కన్యగా స్త్రీ కన్నకొడుకు కానీనుడు. పెండ్లికాకముందే గర్భవతియై వివాహానంతరం స్త్రీ కన్నకొడుకు సహోఢుడు. భర్తను విడిచిన భార్య, భార్యను విడిచిన భర్త, విధవ- ఎవడి వలన కొడుకును కంటారో ఆ కొడుకు కన్నవాడికే కొడుకు. అతడి పేరు పౌనర్భవుడు. తనను తాను ఇతరులకు దానం చేసికొన్నవాడు స్వయందత్తుడు. తల్లిదండ్రులు అమ్మగా కొనబడినవాడు క్రీతుడు. ఈ పన్నెండుమంది పుత్రులలో ఔరసుడు శ్రేష్ఠుడు. వైదికకర్మలకు తగినవాడు. ఔరసుడితో కూతురుకొడుకు (దౌహిత్రుడు) సమానుడని పండితుల అభిప్రాయం. వేదకర్మలను, శాస్త్రవిధులను పాటించి ఉభయ కులాలను ఉద్ధరిస్తే ద్వాదశపుత్రులూ యోగ్యులే.

ప్రశ్న 38 : కలిసి ఉండటం (సహవాసం) వలన, దర్శనం (చూడటం) వలన పుట్టే స్నేహాలు ఎట్లాంటివి? గోవుల మాహాత్మ్యం ఎటువంటిది?

ఉత్తరం : ఈ సందేహాన్ని చ్యవన నహుష సంవాదం తీరుస్తుంది. చ్యవనమహర్షి గంగాయమునల సంగమ తీర్థంలో మునిగి తపస్సు చేస్తూ ఉండగా అతడి శరీరాన్ని చేపలు తాకుతూ ఉండేవి. వాటిమీద స్నేహంతో (సహవాసంతో) పన్నెండేళ్ళు తపస్సు చేశాడు. ఒకసారి జాలరులు చేపలు పట్టుతూ, చేపలతో పాటు ఆ మునినీ వలలో బంధించి ఒడ్డుకు లాగారు. ఋషిని చూచి జాలరులు భయపడి క్షమాపణ వేడి, చేసిన పనికి ప్రాయశ్చిత్తం చెప్పుమని కోరారు. చ్యవనుడు చేపలమీద ప్రేమతో - వాటితోపాటు తనను కూడా తగిన వెలకు అమ్ముకొనండని సూచించాడు. ఆ మాట విని బోయలు భయపడి నహుషుడనే రాజు వద్దకు వెళ్ళి చ్యవనుడి వృత్తాంతం చెప్పారు. అతడు తొట్రుపాటుతో ఋషివద్దకు వచ్చి క్షమాపణ కోరుకొన్నాడు. చ్యవనుడు తన శరీరం ధర నిర్ణయించి బోయల కిమ్మన్నాడు. రాజు సంతోషించి వేయి మాడల నుండి సర్వరాజ్యంవరకు వెల నిశ్చయించినా, చ్యవనుడు సమ్మతించక 'న్యాయం తెలిసి వెల నిర్ణయించు' మనేవాడు. చివరకు ఆ రాజును మంత్రులతో మంతనం చేసి వెల నిర్ణయించుమని సూచించాడు. రాజు అట్లాగే చేశాడు. అప్పుడక్కడికి గవిజాతుడనే ముని వచ్చి 'రాజా! గోవూ, బ్రాహ్మణుడూ ఒకటేకులం. కాకపోతే బ్రహ్మ రెండుగా సృష్టించాడు. గోవు హవిస్సుకూ, బ్రాహ్మణుడు మంత్రాలకూ ఆధారం. సర్వవేదాలకూ మూలమైన బ్రాహ్మణుడి వెలను శివుడు కూడా నిర్ణయించలేడు. గోవుకు కూడా అంతే. కాబట్టి చ్యవనుడికి వెలగా గోవును ఇవ్వటం న్యాయం' అని నిర్ణయించాడు. ఆ ప్రతిపాదనకు చ్యవనుడు సంతోషించి అంగీకరించాడు. 'గోవు అగ్నిమయం, అమృతమయం, యజ్ఞవిధానానికి పవిత్ర ప్రవాహం. స్వర్గానికి గోవు నిచ్చెన. దేవతలకైనా గోవు పూజ్యమే' అని ప్రశంసించి గోవును తనకు వెలగా ఇమ్మన్నాడు. బోయలు ఆ గోవును స్వీకరించి, చ్యవనుడికి దానం చేశారు. సహవాసంవలన చేపలమీదా, దర్శనంవలన బోయలమీదా స్నేహం ఏర్పడటంవలన చ్యవనుడు వారిరువురికీ బొందితో స్వర్గాన్ని ప్రసాదించాడు. గవిజాతుడు, చ్యవనుడు కలిసి రాజుకు ధర్మ పరాయణత్వాన్ని, ఇంద్రైశ్వర్యాన్నీ వరాలుగా ఇచ్చారు.

ప్రశ్న 39 : మహత్తరమైన బ్రాహ్మణశక్తి గల భృగువంశంలో విచిత్రమైన క్షత్రియ శీలం గల పరశురాము డెట్లా జన్మించాడు? మహోత్తమమైన క్షాత్రశక్తితో ప్రకాశించే కుశికవంశంలో బ్రాహ్మణ తేజస్సుగల విశ్వామిత్రు డెట్లా పుట్టాడు? ఇదివరకు కొంత విన్నా సంశయం తీరలేదు. వివరించుము.

ఉత్తరం : చ్యవన కుశిక సంవాదం దీనికి తగిన సమాధానం. వినుము. కుశికుడివలన తనవంశం సంకరమౌతుందని తెలిసికొని చ్యవనుడు కుశికవంశానికి ఆపద కలిగించాలని భావించి కుశికుడి ఇంటికి అతిథిగా పోయాడు. కుశికుడు సతీసమేతంగా చ్యవనుడికి అతిథిపూజలు చేశాడు. రాజ్యా న్నిచ్చి దాస్యం చేయటానికి పూనుకొన్నాడు. చ్యవనుడు తనకు రాజ్యకాంక్ష లేదనీ, ఒక వ్రతాన్ని పూర్తిచేసికొనాలని ఉన్నదనీ, కుశికుడి ఇంటనుండి ఆ వ్రతాన్ని పూర్తి చేసికొంటాననీ పేర్కొన్నాడు. కుశికుడు దాని కంగీకరించి ఒక దివ్య భవనాన్ని చ్యవనుడికి విడిదిగా ఇచ్చాడు. చ్యవనుడు ఒక శయ్యపై పవళించి కుశిక దంపతులను తాను నిద్రలేచేంతవరకు పాదాలను ఒత్తుతుండండని కోరాడు. వా రట్లాగే చేస్తూ ఉండగా ఇరవై ఒక్కరోజులు ఒకే ప్రక్క పడుకొని నిద్రపోయి, ఆ మరునాడు లేచి నగరం దాటిపోయి మాయమయ్యాడు. రాజ దంపతులు తిరిగివచ్చి భవనంలో చూస్తే శయ్యమీదనే మరొకవైపు తిరిగి పడుకొన్నాడు. వారు ఆశ్చర్యపోయి అతడి పాదాలు ఒత్తుతూ ఉండగా మరొక 21 రోజులు అట్లాగే పరుండి నిద్రలేచి తలంటి నీరు పోయుమన్నాడు. వారు సుగంధతైలంతో తలంటుతుండగా వారిని తెగ తిట్టి మాయమయ్యాడు. రాజదంపతులు అన్నపానీయాలు లేకపోయినా, అలసటతో నీరసించినా కోపతాపాలకు గురికానందుకు సంతోషించి వారిచేత స్నానం చేయించుకొన్నాడు. భోజనానికి వస్తానని రాక

ఎక్కడికో వెళ్ళాడు. రాజదంపతులు భోజనాలు మాని అట్లాగే ఉండిపోయారు. చ్యవనుడు తెల్లవారిన తరువాత వచ్చి ఒక రథం మీద తనను కూర్చుండబెట్టి రాజు రాణీ దానిని లాగుతూ తీసికొని వెళ్ళాలని కోరాడు. అలసటతో ఉన్న ఆ రాజదంపతులు అలజడిపడక రథాన్ని లాగుతూ ఉండగా వారిని ముల్లుగర్రలతో పొడిచి బాధించాడు. అయినా వారు భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగటం చ్యవనుడు సంతోషించి రథం దిగి వారిని కరుణించి వారి శరీరాలకు శ్రమలేకుండా చేసి, నవయౌవనాన్ని ప్రసాదించి, తాను తపోవనానికి వెళ్ళాడు. మరునాడు ఉదయం రాజదంపతులు ఆ తపోవనానికి పోగా అక్కడ స్వర్గలోక భోగాలు కానవచ్చాయి. ఆ తరువాత చ్యవనుడు తపోవనంలో మునివృత్తిలో గోచరించాడు. చ్యవనుడు ఆ దంపతుల ఇంద్రియ నిగ్రహానికి ఆశ్చర్యపడి ప్రశంసించాడు. భృగు వంశసాంకర్యం ఏర్పడుతుందని బ్రహ్మలోకంలో విని, కుశిక వంశాన్ని నాశనం చేద్దామని వచ్చాననీ, కాని ఆ దంపతుల నిష్ఠాప్రపత్తులను చూచి సంతోషించి, రాచరికంమీదకంటె బ్రాహ్మణత్వం మీద ఉన్న మక్కువను గమనించి హర్షించాననీ పేర్కొన్నాడు. కుశికుడి మనుమడు బ్రహ్మతేజోమయు డౌతాడని వరమిచ్చాడు. దానిని వివరిస్తూ చ్యవనుడి వంశంలో ఋచీకుడు జన్మించి కుశిక వంశంలోని గాధి కూతురును పెళ్ళాడతాడనీ, వారిరువురికి జమదగ్ని జన్మిస్తే అతడు విలువిద్యను పొందేటట్లు చేస్తాడనీ, ఆ ధనుర్విద్య అతడికొడుకు పరశురాముడిలో ఫలిస్తుందనీ పేర్కొన్నాడు. పరశురాముడు సకల క్షత్రియ కులనాశనం చేస్తాడనీ తెలిపాడు. దైవఘటనవలన ఋచీక, గాధి వధువుల అనుష్ఠానాలు మార్పు చెంది జమదగ్నికి క్రూరభావంకల క్షత్ర ధర్మంతో పరశురాముడు జన్మిస్తాడు. గాధికి బ్రాహ్మణ తేజోనిధి అయిన విశ్వామిత్రుడు జన్మిస్తాడు - అని వివరించి చ్యవనుడు తీర్థయాత్రలకు పోయాడు. రాజదంపతులు రాచనగరుకు తిరిగి వచ్చారు.

ప్రశ్న 40 : పితామహా! దాన విశేషాలను తెలుపుము.

ఉత్తరం : కన్య, గృహం, భూమి, నీరు, వస్త్రం ఇట్లాంటి వాటికంటె గోదానం గొప్పది. గోవు కెన్ని రోమా లుంటాయో అన్ని దివ్య సంవత్సరాలు గోదానంవలన స్వర్గంలో ఉంటారు.

ప్రశ్న 41 : అన్నింటికంటె గొప్పదాన మేది?

ఉత్తరం : యాచకుడు కోరిన దానిని ప్రేమతో ఇవ్వటం అన్నింటికంటె గొప్పదానం. వీరశయనం అన్నిటికంటె గొప్పదానం. మిగిలినవి అసలు దానాలే కావు. అన్ని పుణ్యవ్రతాలలోనూ అదే గొప్పది.

ప్రశ్న 42 : అడిగినవాడికి దానం చేయటం మంచిదా? అడగనివాడికి దానం చేయటం మంచిదా?

ఉత్తరం : అడిగినవాడికంటె అడగనివాడికి ఇవ్వటమే శ్రేష్ఠం.

ప్రశ్న 43 : దానాలలో ఉత్తమ దాన మేది?

ఉత్తరం : దానాలలో భూదానం శ్రేష్ఠం. (వివరాలకు చూడు 2.350-366)

ప్రశ్న 44 : దానం చేయటానికి తగిన వస్తువు లేవి ?

ఉత్తరం : అన్నం, బంగారం, పానీయాలు మొదలైనవి ఎన్నో ఉన్నాయి. వాటిలో అన్నదానం విశిష్టం. (వివరాలకు చూడు. 2.367-376)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రశ్న 45 : ఏ నక్షత్రంలో ఏ దానం చేస్తే పుణ్యమో చెప్పుము.

ఉత్తరం : వివరాలకు (2.377-379)

ప్రశ్న 46 : స్వర్ణాది దానాల వివరణ.

ఉత్తరం : వివరాలకు (2.381-396) గోదాన మహిమ (2.379-404), అన్న పానీయాది దాన మహిమ (2.405-407) తిలదాన మహిమ (2.408-413) గోమహిమ (2.414-445)

ప్రశ్న 47 : గోదానంవలన కలిగే విశేషఫలం వినాలని ఉన్నది చెప్పుము.

ఉత్తరం : ఉద్దాలకుని కొడుకు ఔద్దాలకి. అతడి కొడుకు నాచికేతుడు. ఒకనాడు ఔద్దాలకి ఏటిరేవులో కుశలు, సమిధలు, కమండలువు, పూలూ - అన్నీ మరచిపోయి ఇంటికివచ్చి వాటిని నాచికేతుడిని తీసికొని రమ్మని పంపాడు. అతడు ఏటివద్దకు పోయేసరికి ఏరు పొంగి వాటిని తనలో కలుపుకొన్నది. నాచికేతుడు వాటిని కానక ఇంటికి తిరిగివచ్చి తండ్రితో ఆ సంగతి చెప్పాడు. ఔద్దాలకి కోపంతో కొడుకును 'యముడి వద్దకు పొమ్మ' (చావుము) అని తిట్టాడు. నాచికేతుడు తండ్రిని క్షమించుమని కోరుతూ ఉండగానే నేలపై పడి ప్రాణాలు కోల్పోయాడు. దానిని గమనించి ఔద్దాలకి పుత్రుడి శవంమీద పడి కన్నీరు మున్నీరుగా దుఃఖించసాగాడు. ఒక పగలు రాత్రి అట్లా గడచిపోయాయి. తండ్రి కన్నీటితో తడిసిన కొడుకు శవం ఆ తరువాత చైతన్యవంతమైనది. అతడి శరీరం సుగంధయుతమై ఇంపుగొలిపింది. కొడుకు బ్రతికేసరికి తండ్రి ఆహ్లాదంతో అతడిని జరిగిన సంగతిగురించి అడిగాడు. నాచికేతుడు తండ్రికి నమస్కరించి ఇట్లా చెప్పాడు. 'నీ ఆనతితో నేను అందమైన యముడి పట్టణానికి వెళ్ళి సమున్నత సింహాసనం మీద ఉన్న యమధర్మరాజును దర్శించాను. ఆయన నేను చావలేదనీ, నీ ఆజ్ఞప్రకారం యముడిని దర్శించాననీ, తిరిగి వెళ్ళుమనీ తెలిపాడు. నేను ధర్మమూర్తి అయిన ఆయనను పుణ్యలోకాలను చూపుమని అడిగాను. ఆయన ప్రీతితో ఒక రథంమీద నన్ను ఎక్కించుకొని పుణ్యలోకాలన్నీ దర్శింపజేశాడు. 'ఈ పుణ్యలోకాలు ఎవరికి లభిస్తాయి?' అని నేను అడుగగా 'అవన్నీ గోదానంవలన కలిగే ఫలా'లని పేర్కొన్నాడు. గోవులు అంటే సూర్యకిరణాలు కాబట్టి గోదానం చేసినవారు సూర్యుడివలె ప్రకాశిస్తారన్నాడు. నన్ను తిరిగి పంపాడు' అని చెప్పి తండ్రికి పరమానందాన్ని కలిగించాడు. నాచికేతుడు.

ప్రశ్న 48 : గోదానం చేసినవారు ఏ లోకాలకు పోతారో చెప్పుము.

ఉత్తరం : పూర్వం ఇదే ప్రశ్నకు బ్రహ్మ ఇంద్రుడి కిచ్చిన సమాధానం చెప్పుతాను వినుము. ఆ లోకంలో కాలక్రమముండదు. ఋతువులుండవు. దప్పి, రోగాలు, ముసలితనం లేవు. ఆ ప్రశస్తలోకం నాశనం లేనిది. స్వచ్ఛమైన ఆనందాన్ని కలిగించేది. దానిపేరు గోలోకం. గోలోకాన్ని మించిన పుణ్యలోకంగాని, గోదానాన్ని మించిన శుభమైన ధర్మంగాని లేవు.

ప్రశ్న 49 : తాతా! శ్రద్ధతో చేయదగిన పను లేవో చెప్పుము.

ఉత్తరం : నియమం, వేదపఠనం వాటిని ధారణచేయుటం, దమము, వేదాలను ఇతరులకు నేర్పటం, దానాలు పట్టకపోవటం, స్వీయకర్తవ్య నిష్ఠ, ఇంద్రియాలను జయించటం, సత్యనిరతి, చదవటంలో ఆసక్తి చూపటం, బ్రహ్మచర్యం, తల్లిదండ్రులను గురువులను సేవించటం, దయకలిగి ఉండటం, గోవ్రతాలను విరివిగా చేయుటం - ఇవి శ్రద్ధతో చేయదగిన పనులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రశ్న 50 : గోవులను దానమిచ్చే పద్ధతిని గురించి తెలుపుము.

ఉత్తరం : బృహస్పతి మాంధాతకు చెప్పిన గోదానవిధిని గురించిన విశేషాలు సంగ్రహంగా చెప్పుతాను వినుము. ఒక మంచిరోజు ఉపవాసముండి గోశాలకు పోయి రోజల్లా నిష్ఠతో గడిపి, మరునాడు సంగవముహూర్తంలో బ్రహ్మ చెప్పిన ఈ వాక్యాన్ని స్మరించాలి. 'ఆవు నా తల్లి. ఎద్దు నా తండ్రి. వీటికి గర్భప్రదేశం స్వర్గం. అది నిలిచిన తావే నాకు తగిన స్థలం' - అని చదివి యోగ్యుడు, పండితుడు అయిన బ్రాహ్మణుడికి దానం చేయాలి. గోదానానికి ఆశ్వయుజమాసంలోని కృష్ణపక్షంలో అష్టమి మొదలు మూడు రోజులు మంచివి. భరత, దిలీపాది మహారాజు లెందరో గోదానాలు చేసి పుణ్యలోకాలు పొందారు. ఆవులలో కపిలగోవు శ్రేష్ఠమైనది. దానిని దానం చేస్తే పాపాలన్నీ పోతాయి.

ప్రశ్న 51 : కపిల గోవుకు ఆ విశేషం ఎట్లా కలిగింది?

ఉత్తరం : దేవతలకు ఆకలివేసి బ్రహ్మవద్దకు పోయారు. ఆయన వారికి అమృతాన్ని అందించాడు. ఆ అమృతపు వాసనలకు కామధేనువు పుట్టింది. దానికి ఆవులు పుట్టాయి. ఒకప్పుడు ఆవులు హిమాలయ పర్వత పై భాగాన తిరుగుతున్నాయి. ఒక లేగదూడ తల్లిపాలు త్రాగుతూ ఉండగా పాలనురుగు గాలివాటానికి ఎగిరి శివుడి శిరస్సుమీద పడింది. దానికి ఆయన కోపించి మూడవ కన్ను తెరిచాడు. ఆ మంటకు ఆవులు ఎర్రబడిపోయాయి. బ్రహ్మదేవుడు శివుడివద్దకు వచ్చి ఆవుపాలు అమృతంవంటివని ప్రశంసించి ఆయనను ప్రసన్నుడిని చేసికొన్నాడు. శివుడు గోవులకు ఎక్కడైనా తిరిగే వరమిచ్చాడు. తన కంటి మంటకు ఎర్రబడిన ఆవులు శ్రేష్ఠమైనవని పేర్కొన్నాడు. దానితో కపిలగోవులను దానం చేయటం ఉత్తమమైనదనే ప్రశస్తి ఏర్పడింది. కపిలగోవుల కథ పుణ్యప్రదమైనది. ధర్మరాజాదులు ఈ కథ విని కపిలగోదాన వ్రతులయ్యారు. భీష్ముడు ధర్మరాజుకు గోదాన మహిమలు తెలిపే సౌదాసుడి కథను (3.28-41) వ్యాసుడు శుకుడికి తెలిపిన గోప్రభావాన్నీ (3.42-51) వివరించాడు.

ప్రశ్న 52 : బ్రహ్మ సమస్త లోకాలకూ ప్రభువు కదా! గోలోకం ఆయన లోకానికి పైన ఉంటుందని విన్నాను. దానికి కారణం ఏమి ?

ఉత్తరం : పూర్వం బ్రహ్మ అపూర్వ సౌందర్యరాశి అయిన సురభి అనే కన్యను, మార్తాండు డనే మగవాడిని సృష్టించి, వారిరువురకు కలిగే సంతానం యాగాలకూ, మోక్షానికీ పనికివచ్చే పాలను సృష్టించి, బ్రహ్మలోకానికి పైభాగాన ఉండేటట్లు వరమిచ్చాడు. వారికి పుట్టిన ఆవులు క్షీరము లిచ్చాయి. ఆవులకు ముందు వారికి ఏకాదశ రుద్రులు జన్మించారు. ఆవుల శరీరాంగాలలో దేవతలు వెలసి ఉండేవారు. గోమహిమ తెలిపే ఒక ఇతిహాసం ఉన్నది. భృగువంశంలో పుట్టిన సుమిత్రుడు డనే ముని గోశర్కర అనే పదార్థ ప్రభావంతో గోగణాన్ని పొందాడు. ఆ ఆవుల మందను శ్రద్ధతో పెంచి పోషించాడు. దూడలు పాలుత్రాగేటప్పుడు ఏర్పడే నురుగును ఆ ముని త్రాగుతూ ఫేనపుడు అనే పేరుతో ప్రసిద్ధి పొందాడు. ఒకనాడు కామరూపధారులైన గోవులు స్త్రీరూపాలను ధరించి కొలనులో స్నానం చేస్తుండగా మిగిలిన గోవులు వారిని వరాలు అడిగాయి. హవ్యకవ్యాలకూ, అతిథిపూజలకూ, ఆహారానికి తగిన క్షీరాల నివ్వటంవలన మునులు వరా లిచ్చారనీ, దానివలన గోలోకానికీ కూడా పోగలమనీ ఆ ఆవులు తెలిపి, మిగిలిన గోవులు కూడా రంతిదేవుడు చేసే వేయేండ్ల యజ్ఞంలో బలి అయితే గోలోకం సిద్ధిస్తుందని సూచించాడు. కొన్ని గోవులు ఆ విధంగా గోలోకాన్ని సంపాదించాయి. కొన్ని గోవులు కొమ్ములతో ఫేనపుడిని చంపి అతడిని గోలోకానికి పంపాయి. భీష్ముడు ధర్మరాజు కోరికపై గోమహిమలను గురించి

మరెన్నో విశేషాలను వివరించి చెప్పాడు. (చూ.3.89-109). బ్రాహ్మణులు, గాయత్రి, వసంతకాలం, సత్యం, గోవులు, బంగారం అనేవి ఒకదాని నుండియే పుట్టాయి. కాబట్టి భూమీ, బంగారమూ, ఆవూ దానమివ్వదగిన వస్తువు లన్నింటికంటె గొప్పవి.

ప్రశ్న 53 : ఆవుపేడలో లక్ష్మి ఉంటుందంటారు. దానికి కారణం ఏమిటి?

ఉత్తరం : దీనికి తగిన సమాధానం గో శ్రీసంవాదం అనే పూర్వగాథ. దానిని వినుము. ఒకసారి లక్ష్మీదేవి గోవులమందలోనికి వెళ్ళి వాటి మధ్య ఉండటానికి అభిలషించింది. కాని, లక్ష్మి చంచల స్వభావురాలు కాన అవి ఆమె కోర్కెను మన్నించలేదు. ఆవులు తిరస్కరిస్తే లోకం గౌరవించదని పలికి లక్ష్మి గోవులను ప్రార్థించింది. గోవులు తమ మలమూత్రాలు పరమ పవిత్రమైనవని వేదం పేర్కొన్నది కాబట్టి వాటిలో వసించుమని అనుమతించాయి. లక్ష్మి దానికి ఆమోదించి వాటియందు వసించింది. అందువలన వాటి మహిమ పెరిగింది. మరొకసారి బ్రహ్మ కామధేనువు చేసే తపస్సుకు మెచ్చి గోలోకాన్ని వరంగా ప్రసాదించాడు. ఆ విధంగా బ్రహ్మలోకంకంటె గోలోకం ఉన్నతంగా నిలిచింది. గోమాహాత్మ్యం తెలిపే కథలు వినినవారికి ఆయువు, సంపద, అధికారం, కీర్తి, సద్గతి కలుగుతాయి.

పశ్న 54 : స్వర్ణదాన మహిమాతిశయం వినగోరుతాను.

ఉత్తరం : భీష్ముడు తాను పిత్రుకార్యం నిర్వహిస్తున్నప్పుడు పితృదేవతలు స్వర్ణదానమహిమను గురించి చెప్పగా అతడు బంగారం దానం చేసి ధన్యుడైన అంశం వివరించాడు. పరశురాముడు వసిష్ఠుడి ప్రబోధంవలన స్వర్ణదానమహిమను తెలిసి, ఆచరించిన కథను కూడా వివరించి చెప్పాడు. పార్వతీపరమేశ్వరులు కలిసి ఉన్నప్పుడు పరమేశ్వరుడి వీర్యం వెలువడింది. అతడు ఆ వీర్యాన్ని అగ్నియందు నిలిపాడు. తారకాసురుడిచేత బాధితులైన దేవతలు బ్రహ్మ వద్దకు వచ్చి మొరపెట్టుకొనగా, ఆ పితామహుడు వారిని అగ్నిని వేడుకొండని ఆదేశించాడు. అగ్ని పాతాళంలో దాగి ఉండగా కప్ప ఆ రహస్యాన్ని దేవతలకు తెలిపింది. దానికి కోపించి అగ్ని కప్ప నాలుక కదలకుండా ఉండాలనీ, రుచులు తెలియరాకుండా ఉండాలనీ శపించాడు. దేవతలు కరుణించి కప్పలు ఎండలకు బొరియలలో ఎండిపోయినా నీరు రాగానే అవి జీవించి బెకబెకలాడుతాయని వరమిచ్చారు. అగ్ని రావిచెట్టులో దాగి ఉండగా ఏనుగు సైగ చేసి దేవతలకు తెలిపింది. అగ్ని కోపించి ఏనుగులకు నాలుక తిరుగబడాలని శపించాడు. దేవతలు ఏనుగులకు నాలుకలు తిరగబడినా రుచులు కలిగేటట్లు వరమిచ్చారు. అగ్ని జమ్మిగర్భంలో దాగి ఉండగా చిలుక ఆ రహస్యాన్ని దేవతలకు తెలిపింది. అగ్ని కోపించి చిలుక నాలుక తిరుగబడేటట్లు శపించాడు. దేవతలు చిలుకకు పలుకులు వచ్చే వరమిచ్చారు. చివరకు అగ్ని దేవతలకు కనిపించి, తారకాసుర వధను గురించిన వారి కోర్కెను తెలిసికొని దానిని తీర్చగలనని మాట ఇచ్చి వారిని పంపాడు. అగ్ని తనలో ఉన్న శివరేతస్సును గంగలో గర్భరూపంగా వదిలాడు. అది చాలా పెద్దదిగా పెరగటంవలన గంగ భరించలేక మేరుపర్వతం ఒడ్డున ఉన్న రెల్లుతోటలో దానిని నిలిపింది. అది బంగారు వన్నెతో మిలమిలలాడుతూ బాలుడి రూపం తాల్చింది. ఆ బాలుడిని కృత్తికలు ఆరుగురూ తమకొడుకుగా భావించి లాలించారు. ఆరుగురు తల్లుల లాలనను అందుకొనటానికి ఆ బాలుడు ఆరు మొగాలవాడయ్యాడు. ఆ విధంగా అగ్నిపుత్రుడు గంగాపుత్రుడూ, కృత్తికాపుత్రుడూ అయ్యాడు. బ్రహ్మాదులు అతడిని పూజించి దేవసేనకు నాయకుడిని చేశాడు. అతడు తారకాసురుడిని సంహరించి దేవతలకూ, మునులకూ సంతోషాన్ని కలిగించాడు. ఆ కుమారస్వామి బంగారమే స్వరూపంగా కలవాడు కావటం, అతడు శివరూపుడు కావటం, అగ్ని హిరణ్యరేతుడు కావటం, శివుడు వహ్నిరేతుడే కావటంవలన బంగారం జాతరూపమనే పేరుతో ప్రసిద్ధి చెందింది. పరశురాముడు స్వర్ణమహిమను తెలిసి దానిని విపులంగా దానం చేసి కృతార్థుడయ్యాడు.

కాబట్టి ధర్మరాజును కూడా స్వర్ణదానం చేసి సంసార సముద్రాన్ని దాటుమని హితవు చెప్పాడు భీష్ముడు.

ప్రశ్న 55 : తాతా! పితృయజ్ఞం ఎట్లా చేయాలో చెప్పుము.

ఉత్తరం : దేవతలు కూడా పితృదేవతలను పూజిస్తారు కాబట్టి దేవపూజకంటె పితృదేవతల పూజ శ్రేష్ఠం. అమావాస్యనాడు పిండప్రదానంతో శ్రద్ధతో చేసిన పితృపూజ నిత్యశ్రాద్ధం చేసిన ఫలితాన్ని ఇస్తుంది. పాడ్యమి మొదలైన తిథులలో కృత్తిక మొదలైన నక్షత్రాలలో శ్రాద్ధకర్మలు ఆచరిస్తే ఆయా విశేష ఫలాలు ఏర్పడుతాయి. కృష్ణపక్షం, అపరాహ్ణం శ్రాద్ధానికి తగిన సమయాలు.

ప్రశ్న 56 : శ్రాద్ధం ఏ వస్తువులతో చేస్తే ఎక్కువ ఫలం వస్తుంది?

ఉత్తరం : నువ్వులు, పాయసం, నేయి శ్రాద్ధాలకు మేలైన వస్తువులు. ఆవులనుండి ఏర్పడేది ఏదైనా గొప్ప ఫలాన్ని ఇస్తుంది. చేపలు, మాంసం, అందులోనూ గోర్రె, ఖడ్గమృగం, గండభేరుండం, మేక మాంసాలు శ్రేష్ఠాలు.

ప్రశ్న 57 : పితృదేవతల ఆరాధనకు యోగ్యులు ఎవరు?

ఉత్తరం : కులవయోరూపశీలవిద్యలలో ఉదాత్తులయినవారు ఆరాధనకు యోగ్యులు. జూదరులు మొదలైనవారు పంక్తిదూషకులు, పగవారిని శ్రాద్ధంలో భోక్తలుగా నియోగించరాదు. అత్రి మహాముని నిమికి శ్రాద్ధక్రియా విశేషాలను తెలిపాడు. (3.184-202) శ్రాద్ధం అగ్నిపూజతో కలిపి చేస్తే ఎంతో ప్రశస్తం.

ప్రశ్న 58 : ఉపవాసవ్రతాన్నే తపస్సని పెద్దలంటారు. అదేనా లేక మరొకటి ఉన్నదా? చేవగల తపస్సు పద్ధతిని నాకు తెలుపుము.

ఉత్తరం : పస్తులుండటం తపస్సు కానేకాదు. అది ఆత్మను హింసించటం. కనుక దానివలన నరుడు తపస్వి కాజాలడు. సత్యం, బ్రహ్మచర్యం, నిత్య పవిత్రత, మౌనం, సాటిలేని నిష్ఠ, భూతదయ, శుద్ధత్యాగం - అనేవి తపస్సంపదయొక్క ఆకారాలని తత్త్వవేత్త లంటారు.

ప్రశ్న 59 : దాన శీలుడి విశేషమూ, దానం పుచ్చుకొననివాడి ప్రత్యేకతా ఎట్టివో నాకు తెలుపుము.

ఉత్తరం : సప్తర్షులు, అరుంధతి, గండ, పశుసఖ డనే పదిమంది తపస్సు చేసికొంటూ భూమిమీద తిరుగుతూ ఉండేవారు. ఒకసారి భయంకరమైన అనావృష్టి ఏర్పడి తినటానికి పదార్థాలేవీ దొరకక బాధపడ్డారు. శిబి కొడుకు యాజ్యుడనేవాడు తన కొడుకైన నీలుడిని ఋత్విక్కులకు యజ్ఞదక్షిణగా ఇచ్చాడు. అతడు కాలంతీరి చనిపోగా, అతడి శవాన్ని తినటానికి సప్తర్షులు సిద్ధమయ్యారు. అప్పుడు వృషాదర్భి అనే రాజు వారికి అగ్రహారాలతోపాటు ఆహారధాన్యాలను ఇస్తానని పిలిచాడు. వారు రాజునుండి దానం పుచ్చుకొనే ఆచారం తమకు లేదని అతడి దానాన్ని తిరస్కరించారు. అతడు కోపించి యజ్ఞంచేసి 'కృత్య'ని సృష్టించి వారిని చంపటానికి పురికొల్పి పంపాడు. సప్తర్షులకు తోడుగా శునస్సఖుడనే సన్న్యాసి వారితో కలిసి తిరుగ నారంభించాడు. వా రొకసారి సరోవరంలోని తామరతూండ్లను తిని బ్రతుకుదామని భావించగా కృత్య వారిని వారించింది. శునస్సఖుడు ఆమెను మంత్రదండంతో భస్మం చేశాడు. ఋషులు తామరతూండ్లను త్రెంచుకొని కట్టకట్టి ఒడ్డున పెట్టి స్నానాదులు ముగించుకొని వచ్చేసరికి తామరతూండ్ల కట్ట మాయమైపోయింది. ఋషులు ఒకరిపై మరొకరు అనుమానపడ్డారు. అప్పు డా పదిమంది తామరతూండ్లను దొంగిలించలేదని ఘోరప్రతిజ్ఞలు చేశారు. శునస్సఖుడు చివరకు తాను తీశానని ఒప్పుకొని

వారి చిత్తవృత్తులను పరీక్షించటానికే అట్లా చేశానని పేర్కొని, తాను ఇంద్రుడనని ప్రకటించుకొని, కృత్యనుండి వారిని కాపాడిన సంగతి చెప్పి, ఎన్ని కష్టాలు వచ్చినా లోభగుణానికి లోనుకాని వారి చిత్తవృత్తులకు మెచ్చుకొని, వారికి శాశ్వతలోకాలను సిద్ధింపజేశాడు. ఈ ఇతిహాసాన్ని వినినవారికి ఆయువూ, సంపదా, ధర్మమూ, దొడ్డ కీర్తీ పుష్కలంగా కలుగుతాయి. అతడిని పితృదేవతలు సర్వదా రక్షిస్తారు.

ప్రశ్న 60 : శ్రాద్ధాదులలో గొడుగులు, చెప్పులు దానం చేస్తారు ఎందుకు?

ఉత్తరం : సూర్యజమదగ్ని సంవాదమనే పూర్వేతిహాసం నీ ప్రశ్నకు తగిన సమాధానం. జమదగ్ని ఒకనాడు బయలుప్రదేశానికి వెళ్ళి బాణప్రయోగం సాధన చేస్తున్నాడు. అతడు వదలిన బాణాలు అతడి భార్య రేణుక తెచ్చి ఇస్తూ ఉండేది. మధ్యాహ్నమయింది. రేణుక సూర్యరశ్మికి నేల కాలుతూ ఉంటే త్వరగా రాలేక చెట్లనీడలలో నిలిచి రావటంవలన ఆలస్యమయింది. అందుకు జమదగ్ని సూర్యుడిపై కోపించి, అతడిపై బాణప్రయోగం చేసి నేలపై కూలనేయబోయాడు. అంతలో సూర్యుడు బ్రాహ్మణవేషంలో అతడి వద్దకు వచ్చి తనను ఎరిగించుకొని శరణు వేడాడు. జమదగ్ని సంతోషించి అప్పుడు సూర్యుడు సంకల్పమాత్రంచేత గొడుగూ చెప్పులూ సృష్టించితెచ్చి అతడి దగ్గర ఉంచి 'ఇవి పూర్వం లేవు. ఈ గొడుగువలన నావేడి శరీరానికి తాకదు. ఈ చెప్పులవలన కాళ్ళకు తాకదు. వీటిని దానం చేస్తే నరులకు ఇహపరలోకసుఖాలు కలుగుతాయి' అని తెలిపాడు. సూర్యుడు మనస్సుతో సృష్టించినవీ, మహర్షి మన్నించినవీ అయిన ఈ మంచి వస్తువులు విలువైనవి. వీటిదానంవలన పుణ్యాలోకాలు లభిస్తాయి.

ప్రశ్న 61 : శూద్రుడు ఎటువంటి నడవడితో ఇహపరసుఖాలనూ, పరమసౌఖ్యాన్నీ పొందుతాడు?

ఉత్తరం : పూర్వం పరాశరుడు శిష్యులకు అందరూ అనుసరించదగిన ధర్మాలను పెక్కింటిని చెప్పాడు. వాటి తాత్పర్యం చెప్పుతాను వినుము. శూద్రుడు ఇంద్రియాలపై పట్టుగలిగి, కామాదులైన అంతశ్శత్రువులను గెలిచి, గర్వం వదలి తక్కిన మూడు వర్ణాలపట్ల భక్తికలిగి వారికి సేవలు చేస్తే, ఉభయలోక సుఖాలనూ పొందగలడు. బహిరంగ స్థలాలలో మలమూత్రాదులు వదలరాదు. ఆ పనులకూ, వాటి శుద్ధి పనులకూ మరుగుతావులు ఉండాలి. శూద్రుడు ఏ విధంగానైనా శుచిత్వాన్ని నిష్ఠతో సాధించి సేవాభావంతో విద్వాంసులయెడ వినయంగా మెలగాలి. బ్రాహ్మణుడికి జపమే యజ్ఞం. అధ్యయనమే బ్రదుకుతెరువు. తపస్సు శోభ నిస్తుంది. క్షత్రియుడికి ప్రయత్నం యజ్ఞం. దండనీతి బ్రతుకుతెరువు. పాలన శోభ తెస్తుంది. వైశ్యుడికి హవ్యం యజ్ఞం. అమ్మకం బ్రదుకుతెరువు. ఆతిథ్యం శోభ తెస్తుంది. శూద్రుడికి సేవ లందించటం యజ్ఞం. సేవలే అతడి బ్రతుకుదెరువు. పనిలో సామర్థ్యం అతడికి వన్నె తెస్తుంది. యతిపట్ల భక్తితో సేవ చేయటం కర్తవ్యం. అది అతడికి సుగతిని కలిగిస్తుంది. పరాశరుడు సర్వవర్ణ సామాన్య ధర్మాలు కూడా చెప్పాడు. (చూడు.2.296-327)

ప్రశ్న 62 : దేవతలుకూడా మ్రొక్కదగిన నరులు ఉంటారని వింటుంటాను. అట్టివారి నడవడి ఎట్లా ఉంటుందో తెలియజెప్పుము.

ఉత్తరం : ధర్మార్థ కామ పురుషార్థాలను ధర్మం తప్పక ఆచరించేవారూ, సుందరాంగులు స్వయంగా కోరినా కామాన్ని వదలి మెలిగేవారూ, విద్యాగర్వం, ధనగర్వం, ప్రభుత్వగర్వం మొదలైనవి లేనివారూ, ఇంద్రియ నిగ్రహం కలవారూ, స్వీయ భార్యలతో తృప్తిపొందేవారూ, దృఢమైన పట్టుదలతో తపోధనాన్ని కూడబెట్టే మహాత్ములూ, సత్యనిష్ఠ కలవారూ, అంతర్బహిశ్శుద్ధి కలవారూ, గుట్టుగా ధర్మాన్ని ఆచరించేవారూ, సన్న్యాస ధర్మాలను నేర్పుతో పాటించేవారూ దేవతలకు కూడా నమస్కార యోగ్యులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పశ్న 63 : చెరువు త్రవ్వించటం అనే ధర్మంలోని గొప్పతనం తెలుపుము.

ఉత్తరం : చెరువు దేవతలకు, పశువులకు, పక్షులకు, రాయి రప్పలవంటి స్థావరాలకు నెలవైనది. అంతే కాదు. అందులో నీరు త్రావి ఆవులమందలు దానిని త్రవ్వించినవారి కులాన్నంతటినీ పుణ్యలోకాలకు పంపుతాయి. ఈ లోకంలో గొప్ప సంపదనూ, చెడని కీర్తినీ కలిగిస్తాయి. వానాకాలంలో, చలికాలంలో, ఎండకాలంలో చెరువులో నీళ్ళుంటే మహాయజ్ఞాలు చేసిన ఫలం ఆ తటాకకర్తకు లభిస్తుంది. కట్టమీద తగిన చెట్లు నాటితే పక్షులు మొదలైన ప్రాణికోటికి నిలువనీడ నిచ్చి సుఖం కూర్చినవాడు కనుక అతడికి ఇహపరసుఖాలు కలుగుతాయి. పితృదేవతలు తమ వంశంవాడు చెరువులు త్రవ్విస్తే పరమానందం పొందుతారు. దానివలన తమకు ఉత్తమ లోకాలకు పోయే వీలు కలుగుతుందని దాని నెప్పుడూ కోరుతూ ఉంటారు. చెరువుగట్లమీదిచెట్లు నీడతో అతిథులకూ, పూవులతో దేవతలకూ, పండ్లతో పితృదేవతలకూ పరమానందం కలిగిస్తాయి.

ప్రశ్న 64 : గృహస్థ ధర్మపరిజ్ఞానం నాకు సమగ్రంగా కలిగేటట్లు ఉపదేశించుము.

ఉత్తరం : పూర్వం విష్ణువుకు భూదేవి తెలిపిన విశేషాలు తెలుపుతాను వినుము. గృహస్థుడు అగ్నిని ఆరాధనం చేయాలి. పూర్ణభక్తితో భూతబలి చేయాలి. దానివలన దేవతలు ఆనందిస్తారు. అన్నం, పాలు, దుంపలు, చల్లని నీరు - వీటిలో దేనితోనైనా ప్రతిదినమూ పితృదేవతలకు తర్పణం చేయాలి. వైశ్వదేవం తప్పనిసరిగా నిర్వహించాలి. ఆ తరువాత శక్తిమేరకు దానాలు చేయాలి. బిచ్చమెత్తుకొనే విద్యావంతులైన బ్రాహ్మణులకొరకు ఎదురు చూచి భిక్షలివ్వాలి. భోజన సమయానికి అతిథులు రాకపోతే వండిన పదార్థాలలో ముందుభాగాన్ని హోమకుండంలోనైనా వేయాలి. తరువాత మిత్రులకు, చుట్టాలకు, అతిథులకు, గురువులకు అన్నం పెట్టి తృప్తిపరచాలి. పిదప బలికార్యం చేయాలి. ఇది గృహస్థధర్మం. ఈ పద్ధతిని సాగించి విప్రుడు భోజనం చేయాలి. అట్టివాడు ఇహపర సుఖాలను పొందుతాడు. కాబట్టి ధర్మరాజా! నీవు కూడా గృహస్థధర్మాన్ని చక్కగా నిర్వహించుము. గృహస్థధర్మం పాపాలను పటాపంచలు చేస్తుంది. శుభాలను కలిగిస్తుంది. కీర్తి సంపదలను ప్రసాదిస్తుంది. పుణ్యలోకాలను పొందిస్తుంది.

ప్రశ్న 65 : పూలనూ, ధూప దీప నైవేద్యాలనూ పూజా సాధనాలని వాటితో దేవతలను పూజిస్తారు. వాటి విశేష మేమిటో తెలియ చెప్పుము.

ఉత్తరం : ఈ విషయాన్ని పూర్వం శుక్రుడు బలికీ, అతడు మనువుకూ, అతడు సువర్ణుడనే తపస్వికీ, ఆతడు నారదుడికీ, ఆ మహర్షి నాకూ తెలియచెప్పారు. దాని తాత్పర్యాన్ని చెప్తుతాను వినుము. ఓషధులు అమృతంవంటివి. పూలు పూచే చెట్లు శ్రేష్ఠమైనవి. పూలతో పూజించేవారికి మంచి మనస్సు కలుగుతుంది. అందుకే పూలను 'సుమనస్సులు' అంటారు. పూలతో పూజించే మానవుల కోర్కెలను దేవతలు మంచి మనస్సుతో తీరుస్తారు. అందుకే వారికి 'సుమనస్కులు' అనే పేరు వచ్చింది. పూలవాసనలతో దేవతలు, వాటి దర్శనంతో యక్షులూ, వాటి అనుభవంతో పాములూ, ఆ మూడు పద్ధతులతో మానవులూ ప్రీతి పొందుతారు. పూలపూజలతో దేవతలు వెంటనే భక్తుల కోర్కెలు తీరుస్తారు. ధూపంవలన భక్తుడు పుష్టినీ, ఆయువునూ పొందుతాడు. దీపం వెలిగించటమంటే వెలుగును ప్రసాదించటం. దీపారాధనంవలన భక్తుడి హృదయం పరమాత్మ ధర్మాలను చూచే స్వభావం కలది ఔతుంది. బాటలోని చావడిలో, దేవాలయంమీదా, కొండమీదా దీపం పెట్టినవారికి ఐశ్వర్యం ప్రాప్తిస్తుంది. ఆవునేయితో దీపం వెలిగించి దానంచేస్తే జ్యోతిర్లోకసిద్ధి, కులప్రకాశం, మహాజ్ఞాన వికాసం కలుగుతాయి. దేవతలకు మొదట నైవేద్యం ఇచ్చి తరువాత భక్తుడు భుజించాలి. లేకపోతే బుద్ధిహీనుడూ,

రాక్షసుడూ కావటం తథ్యం. నివేదనతో అర్పించే వ్యక్తికి గృహదేవతలు సకల శుభాలు కలిగిస్తారు. నహుషుడు ధూపదీప దానాదులు చేయటంవలననే ఇంద్రపదవి పొందాడు. బ్రహ్మసభకు సొంత ఇంటికి వెళ్ళినట్లు వెళ్ళాడు. దానాలన్నిటిలో దీపదానం శ్రేష్ఠమైనది.

ప్రశ్న 66 : విప్రుడి సొమ్ము దొంగిలించినవాడి గతి ఏమిటి?

ఉత్తరం : బ్రహ్మజ్ఞానం కలవాడి సంపదను దొంగిలిస్తే కులనాశనం జరుగుతుంది. మరుజన్మలో చండాలు డయ్యే గతి పట్టుతుంది. దీనికి ఒక ఇతిహాసం ఉన్నది చెప్పుతాను వినుము. క్షత్రబంధు డనే రాజు ఒకనాడు బ్రాహ్మణుడి పొలంపై నుండి గాలికి రేగిన దుమ్మును తప్పించుకొని పోతున్న దుఃఖితుడైన ఒక మాలవాడిని చూచాడు. కారణ మడిగాడు. ఆ మాలవాడు పూర్వజన్మలో బ్రాహ్మణబాలుడు. బ్రహ్మచారిగా భిక్షమెత్తుకొని పోతుండగా బ్రాహ్మణుడి పొలం నుండి రేగిన దుమ్ము వానిపై పడింది. అతడు దానిని తిన్నాడు. ఆ పాపఫలితంగా చండాలజన్మ నెత్తాడు. ఒకనాడు కలలో ఆ బ్రాహ్మణుడు కనపడి క్షత్రబంధు సంవాదం వినిపించి, దానితో అతడి దుఃఖం నశించి పోతుందని చెప్పాడు. ఆనాటితో అతడి దుఃఖం తీరింది. పూర్వపుణ్యఫలంగా ఆ బ్రహ్మచారి ఉత్తమగతి పొందాడు.

ప్రశ్న 67 : స్వర్గం ఒకేరకమైన ఆనందం కలిగిస్తుందా? పెక్కు రీతుల ఆనందం కలిగించేదై ఉంటుందా?

ఉత్తరం : పుణ్యకర్మలు పెక్కు తీరులై ఉండటంవలన, ఆయా కర్మలకు తగిన భోగాలను అందించే పెక్కుతావులు కలదై స్వర్గం దుఃఖం లేనిదీ, అమితమైన సుఖాన్ని కలిగించేదీ అయి ఎంతో ఒప్పారుతూ ఉంటుంది. గౌతమ దేవేంద్ర సంవాదం అనే ఇతిహాసం ఈ ప్రశ్నకు సమాధానంగా తోడ్పడుతుంది. దాని సారాంశ మిది - ఒక అరణ్యంలో గౌతముడనే బ్రాహ్మణుడు తపస్సు చేసికొంటూ ఉండగా తల్లిని కోల్పోయిన ఒక పిల్లఏనుగు కనుపించింది. దానిని పుత్రవాత్సల్యంతో పెంచి పెద్దచేశాడు. ఒకనాడు దేవేంద్రుడు ధృతరాష్ట్రుడు అనే రాజు రూపంలో వచ్చి ఆ ఏనుగును తనకు కావాలని కోరాడు. గౌతముడు ఆ ఏనుగు తనకు చేసేసేవలు పేర్కొని పుత్రుడివంటి దానిని ఈయజాలనని అన్నాడు. 'మునులకు ఏను గెందుకు? వెలలేని ఆవులను ఇస్తాను, మిక్కుటమైన బంగారాన్ని ఇస్తాను. ఏనుగు నిమ్మ'ని ధృతరాష్ట్రుడు పట్టుపట్టాడు. గౌతముడు వాత్సల్యంతో ఏనుగును ఇవ్వలేనన్నాడు. రాజునకు ఏనుగు యోగ్యమైనది కావున దాని నిమ్మని ధృతరాష్ట్రుడు బెదిరించాడు. గౌతముడు భయం వదలి యమలోకంలోగాని, గంగా ఒడ్డునగాని, మేరుపర్వతంలోగాని, నారద వనంలోగాని, ఉత్తర కురుభూములలోగాని, చంద్రుడివద్దగాని, సూర్యుడివద్దగాని, వరుణుడి నగరంలోగాని, ఇంద్రుడి పట్టణంలోగాని, బ్రహ్మలోకంలోగాని, గోలోకంలోగాని ఏనుగు నిస్తాను తీసుకొనుమని వరుసగా అడిగాడు. ఆయా లోకాలలో ఆయా పుణ్మకర్మలకు ఫలాల ననుభవించే వారిని ధృతరాష్ట్రుడు చెప్పి వాటికి అంగీకరించలేదు. గౌతముడు దానిని గమనించి ధృతరాష్ట్ర రూపంలో ఉన్నది దేవేంద్రుడని భావించాడు. ఆయా లోకాలన్నీ తిరిగినవాడు కావటంచేత ఆయా సుఖాల భేదాలను తెలిసికొనగలిగాడని గుర్తించాడు. దేవేంద్రుడు దానికి సంతోషించి గౌతముడికీ, ఏనుగుకూ స్వర్గలోక సౌఖ్యాన్ని ప్రసాదించాడు.

ప్రశ్న 68 : మహాత్మా! మీరు తపస్సును సారమైన ధర్మంగా నొక్కి చెప్పుతూ ఉంటారు. దానికి మించిన ధర్మం మరొకటి లేదా?

ఉత్తరం : తపస్సులన్నీ కొనియాడదగినవే. తపస్సుకు దీటైన ధర్మం మరెక్కడ ఉన్నది? తపస్సు అనగా నియమంగా

భోజనం చేయటం. ఈ సంగతి బ్రహ్మ భగీరథుడనే రాజుకు చెప్పాడు.

ప్రశ్న 69 : వేదం పురుషుడికి ఆయువు నూరేళ్ళని చెప్పుతున్నది. కాని, చిన్నతనంలోనే కొందరు మృతి పొందుతున్నారు. దేనిచేత ఆయువు వృద్ధి పొందుతుంది? దేనిచేత తరిగిపోతుంది?

ఉత్తరం : ఆచారం ఆయువును పెంచుతుంది. అంతే కాదు సంపదను, కీర్తిని కలిగిస్తుంది. దురాచారం ఆయువును క్షీణింప చేస్తుంది. ఉత్తమపురుషులు ఆచరించే మార్గాన్ని తెలిసికొని నడచుకొనటం ఆచారం. అది వర్ణ ధర్మాలకు, ఆశ్రమ ధర్మాలకు అనుగుణంగా ఉంటుంది. (వివరాలకు చూ. 4.90-126) ఆచారాన్ని తప్పనిసరిగా నడిపించాలి. అది ధర్మానికి కుదురు. ధర్మం ఆయువును పెంచుతుంది. సంపదను కీర్తిని వృద్ధి చేస్తుంది. ఆచారాలన్నిటిలో సర్వభూతదయ మిన్న అయినదని ఆదిమును లంటారు. కాబట్టి అన్ని వర్ణాలవారూ దయకలిగి ఉండటం ఉత్తమం.

ప్రశ్న 70 : అన్నదమ్ము లే విధంగా తమలో తాము పొందిక కలిగి ఉండాలి?

ఉత్తరం : తమ్ములు అన్నయెడ భయభక్తులు కలిగి అతడిని ఆరాధించాలి. అన్న తమ్ములను మన్నిస్తూ ఉండాలి. తమ్ముడొకడు బుద్ధిహీనుడైనా ప్రమాదం లేదు కాని అన్న కార్యదక్షత లేనివాడైతే తమ్ముళ్ళు ఇబ్బందుల పాలౌతారు. అన్నదమ్ములు కలతలు లేని బుద్ధితో సంపదను పంచుకొని అనుభవించాలి. అప్పుడు లోకులు వారిని మెచ్చుకొంటారు. సంపద కూడా క్రమంగా వృద్ధి పొందుతుంది. అట్లా కాక ఒకడు అత్యాశతో ఎక్కువ భాగాన్ని ఆపేక్షిస్తే ప్రాణాంతకపు పనులు ఏర్పడుతాయి. తండ్రి తరువాత అన్నయే తమ్ములందరికీ తండ్రి. తల్లి చనిపోయిన తరువాత వదినయే తల్లి. అన్నగాని, తమ్ముడుగాని న్యాయం తప్పి అన్నదమ్ములకు కీడు చేస్తే రాజువలన శిక్షార్హుడౌతాడు. అక్కను, పెంచిన తల్లిని తల్లితో సమానంగా చూడాలి. ఉపాధ్యాయుడికంటె తండ్రి పదిరెట్లు ఎక్కువ మాన్యుడు. తండ్రికంటె తల్లి పదిరెట్లు గౌరవంలో మిన్న. తల్లిదండ్రులవలన కలిగిన జన్మ దేహసంబంధి. ఆచార్యుడివలన కలిగిన జ్ఞానజన్మ జరామరణాలు లేనిది. గౌరవంలో ఆచార్యుడు అందరికంటె మిన్న.

ప్రశ్న 71 : ఉపవాసవిధికి యోగ్యత, దాని గొప్ప ఫలం - అనేవాటిని గురించి వినగోరుతాను.

ఉత్తరం : అంగిరసు డనే ముని ఈ విషయంలో నాకు చెప్పిన వివరాల సారాన్ని వినిపిస్తాను. బ్రాహ్మణ క్షత్రియులు మూడు రోజులు ఉపవాసం చేయవచ్చును. వైశ్యులు శూద్రులు నాలుగు భోజనాలు మానవచ్చును. ఏక భుక్తంతో నెలరోజులు ఉపవసిస్తే శుభాలు కలుగుతాయి. ఉపవాసాలు పెరిగినకొద్దీ శుభాలు కూడా పెరుగుతాయి. మహాత్ములు తల్లిని మించిన గురువూ, వేదాన్ని మించిన శాస్త్రమూ, ధర్మాన్ని మించిన లాభమూ, అట్లాగే ఉపవాసాన్ని మించిన తపస్సూ లేదంటారు. దేవతలు, ఆదిమునులు ఉపవాసనియమం చేతనే గొప్ప ప్రభావం కలవారయ్యారు. విశ్వామిత్రుడు వెయ్యేళ్ళు ఏకభుక్తంతో బ్రాహ్మణత్వాన్ని పొందగలిగాడు. అర్థబలమూ, అంగబలమూ లేకున్నా ఏ లోపమూ లేకుండా చేయదగినది ఉపవాస వ్రతమని అంగిరసుడు చెప్పాడు. ఉపవాస వ్రతంలో తేలిక పద్ధతి ఉన్నది. పగలు ఒకమారూ, రాత్రి ఒకమారూ నీటితో తృప్తిగా భుజిస్తూ మధ్యలో మరేమీ తినకుండా హోమకార్యం తగిన విధంగా చేస్తూ ఉంటే పుణ్యలోకాలు సులభంగా లభిస్తాయి.

ప్రశ్న 72 : 'ఎవరిని తెలిసికొంటే తెలియదగిన విషయాలన్నీ తెలుస్తాయో అట్టివాడు శ్రీకృష్ణుడు' అని వేదవ్యాసుడు తనను ఆశ్రయించినవారందరికీ తెలియ చెప్పాడు. కాబట్టి ఆధ్యాత్మిక వాక్యాలకు ఆతడే గమ్యం. మహామహిమకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గమ్యం శ్రీకృష్ణుడు. నేను ఆ మహిమాన్విత వాక్యాలను వినగోరుతాను. ఇంకా నాకు ఆధ్యాత్మ విద్యావరణం కలిగించే వాక్యాలు వినిపించుము.

ఉత్తరం : 'హరసనత్కుమార సంవాదం' అనే విషయం వింటే పరమార్థ విద్యకు ఉపకరించే అంశాలు తెలుస్తాయి. సంగ్రహంగా చెప్పుతాను వినుము. ఒకసారి శివుడు సనత్కుమారుడివద్దకు వచ్చాడు. మహర్షి మహేశ్వరుడికి అతిథిసత్కారాలు చేశాడు. 'పుణ్యాత్మా! ధ్యానంలో చూడదగిన వస్తు వేది? చక్కగా భావించదగిన తత్త్వాలు ఎన్ని? జ్ఞానమూ, యోగమూ ఏ విధంగా ప్రవర్తిల్లుతాయి?' అని శివుడు అడిగాడు. మరికొన్ని ఆధ్యాత్మ విశేషాలు చెప్పు'మన్నాడు. సనత్కుమారుడు శివుడితో ఇట్లా చెప్పాడు. 'తత్త్వాలు ఇరవైమూడని కొందరు పామరులంటారు. ఇరవైనాలుగని కొందరు అంటారు. నా దృష్టిలో తత్త్వాలు ఇరవైఅయిదు. ఇరవైఅయిదవ తత్త్వం 'అధిష్ఠానం' రూపంలో ఉంటుంది. అది మిగిలిన ఇరవైనాలిగింటికీ ఒక స్థితిని కలిగిస్తుంది. తనయందే లీనమయ్యేటట్లు చేస్తుంది. కాబట్టి అది ఉండటమూ, లేకపోవటమూ రెండూ సంభవమే. కాబట్టి 24 తత్త్వాలను వివరిస్తాను. అవి 5 భూతాలు, 5 వాటి గుణాలు, 10 ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారం, ప్రకృతి - మొత్తం 24 తత్త్వాలు. వీటిని దేహమని జ్ఞానులు భావిస్తారు. కట్టెలో నిప్పువలె అందులో 'పురుషుడు' ఉంటాడు. అతడే 'నేను'. పురుషతత్త్వాన్ని వేదం 'అమృతార్థతత్త్వ'మనీ, 'బ్రహ్మ' మనీ తెలియజేస్తుంది. ఇది అన్ని తత్త్వాలకంటె అతీతమైనది. ఇదే ఈశ్వరం, అనీశ్వరం, సత్యపాకం, అతిరహస్యం. దానిని దర్శిస్తే మృత్యువువలననుండి తప్పుకొన్నట్లే. బ్రహ్మతత్త్వం ఓంకారంచేత మాత్రమే చెప్పదగింది. అనహంకార నిరూఢ భావనారాధ్యం. ఏ మాలిన్యం లేనిది. ద్వంద్వాతీతమైనది. సర్వం శుభమయమైనది. అది అప్రమేయం, అవిజ్ఞేయం, పుండరీకాక్షం, అనక్షయవిషయం, అచ్యుతం, సదసత్తుల సమైక్యభావంతో ప్రకాశించేది. ఆ పరతత్త్వం మొదట నారాయణుడి కొక్కడికే తెలిసింది. అతడివలన దేవతలు, మునులు, సిద్ధులు, సాధ్యులు మొదలగువారికి అందింది. అది బంధవిముక్తులకే దర్శనమౌతుంది. అహంకారం వదలిన జీవుడిలో దశేంద్రియాలూ, మనస్సూ, బుద్ధీ లీనమైపోతాయి. ఆ జీవుడు పరతత్త్వంలో లీనమైపోతాడు. యోగనిష్ఠ కలవాడు ఆ తత్త్వాన్ని అందుకొని దుఃఖాలన్నింటిని తొలగించుకొని, చావు, ముదిమి లేని తావులలో శాశ్వతంగా ఉంటాడు. అణిమాది సిద్ధుల సంపదలతో విహరిస్తూ ఉంటాడు. యోగసాంఖ్యాలు రెండూ ఒకటే అనే భావంతో సంసార సముద్రాన్ని దాటుతాడు. చైతన్యం గల 'పురుషుడు' అనే తత్త్వాన్ని ఆశ్రయించి, చైతన్యం లేని ప్రకృతి పుష్టికలది ఔతుంది. తక్కిన తత్త్వాలు ఆ తత్త్వమహాసముద్రంలోని తరంగాలు. పురుషుడికి ఏ గుణాలూ లేవు. ప్రకృతియే గుణాలకు ఏవైనా గుణాలను ఇస్తుంది. దానిచేత తక్కిన తత్త్వాలు గుణాలు కలవై గుణాలు లేని పరమాత్మకు గుణాలు కలిగిన స్థితిని కలిగిస్తాయి. వీటినన్నంటిని సత్త్వదార్థానికి వేరైనవిగా తెలిసికొని, ప్రకృతిని జయించి తనకు తానే కాని మరొకటి ఏమీ లేదని గుర్తించినపుడు సాధకుడైన పురుషుడు పొగ లేని నిప్పువలె ప్రకాశిస్తాడు. పురుషుడు సత్త్వాన్ని, తత్త్వాన్ని ఆశ్రయించి, ఆ రెండింటిని చక్కగా తెలిసికొని, వాటితో కలియక చైతన్యవంతుడౌతాడు. పెక్కులు కావటం అజ్ఞానంవలన కలిగినస్థితి. ఒక్కటికావటం జ్ఞానంవలన కలిగే స్థితి. పండితులు దీనినే అవిద్య, విద్య అంటారు. ఈ రెండూ ఇరవై అయిదవ తత్త్వమైన జీవుడి దశలు. పరికించగా విద్యయే స్వరూపంగా గల ఇరవై ఆరవ తత్త్వం. వాడు విద్య, అవిద్య అనే దశలు లేనివాడు. ముసలితనం లేనివాడు. మొట్టమొదటివాడు. అంతం లేనివాడు. ఏ విధమైన మార్పులేనివాడు. అనంతుడు, అచ్యుతుడు, అద్వతనుడు, అనాది, కేవలాత్మకుడు. నీటిలో చేపా, మేడిపండులో పురుగులూ ఉన్నట్లుగా తాను ప్రకృతిలో ఉన్నానని తెలిసికొని, దానినుండి వేరుకావటం అభ్యాసం చేసి, సిద్ధిపొందిన పురుషుడు అమృతత్వస్థితి పొందుతాడు. జీవుడు తామరాకుమీది నీటి బిందువువలె ప్రకృతియందు ఉండి కూడా దానికి సంబంధించిన వికారాలు లేకుండా వెలుగొందుతాడు. ఈ విధంగా ప్రకృతిని వదలి పరమాత్మస్థితిని పొందటమే ముక్తి. ఈ జ్ఞానాన్ని

కపిలమహర్షి లోకానికి అనుగ్రహించాడు. దివ్యముని లెందరో దీనిని మన్నించారు. జీవుడు ప్రకృతితో అంటిపెట్టుకొని ఉండటం బంధం. దానినుండి పొందిన విముక్తియే మోక్షం.

ప్రశ్న 73 : ఎక్కువ పవిత్రతను కలిగించగల తీర్థం ఏదో తెలుపుము.

ఉత్తరం : తీర్థాలన్నీ మేలైనవే. మానవ తీర్థం ఒకటి ఉన్నది. దానిపేరు 'సత్యం'. అదే మిక్కిలి పవిత్రత కలిగిస్తుంది. 'ధృతి' అనే మహాజలాశయంలో అది విరాజిల్లుతూ ఉంటుంది. తమస్సు, రజస్సు అనే రెండు గుణాలను దూరంగా తొలగించుకొంటూ, సత్యాన్ని ఊతకర్రగా తీసికొని దానిలోనికి ప్రవేశించి స్నానం చేసినవాడు పరిశుద్ధతతో ప్రకాశిస్తాడు. రాగద్వేషాలు వదలి, ఇంద్రియాలు వికారాలను తొలగించుకొని, ఏ మాత్రమూ సడలని వ్రతం పాటిస్తూ వివేకం కలిగిన మహాత్ములు కూడా గొప్ప నిర్మలతీర్థాలే. వినయపూర్వకంగా ఆశ్రయించటం కూడా తీర్థాలవలన కలిగే సిద్ధిని కలిగిస్తుంది. దమము, తపము, అహింస, శమము కూడా తీర్థాలే. వాటివలన ఎక్కువ శుద్ధత కలుగుతుంది. ఊరకే నీటిలో స్నానంచేస్తే పరిశుద్ధత కలుగదు. దొరకని వాటిని కోరక, దొరికినవాటియందు తృప్తి పొందక ఆశను విడనాడి బ్రదికే నరులు పవిత్రులు. వారికి వేరైన తీర్థాలు అవసరం లేదు.

ప్రశ్న 74 : ఎట్టి ప్రవర్తనతో మానవుడు, ఉత్తమపదం చేరుకొంటాడు? మరణించినవాడు దేహాన్ని వదలి ఏది తోడుగా వెళ్ళుతాడు?

ఉత్తరం : 'నీవడిగిన గూఢమైన అంశాన్ని బృహస్పతి చెప్పగలడు' అని భీష్ము డనగా బృహస్పతి అక్కడకు వచ్చి అతిథిపూజలు స్వీకరించి ధర్మజుడి ప్రశ్నలకు సమాధానం చెప్పాడు. 'మేలు తొలుత ధర్మం మీద ఆధారపడి ఉంటుంది. చచ్చినవారికి ధర్మమే తోడుగా వస్తుంది. ధర్మం చేయనివాడు నరకానికి పోతాడు. నరుడు తాను చేసిన పుణ్యాలకు తగిన విధంగా సుఖమయ సంసారంలోనూ, పాపాలకు అనుగుణంగా దుఃఖమయ సంసారంలోనూ ప్రవేశిస్తాడు. పుణ్యపాపాలకు అనుగుణంగానే ఆయా జన్మ లెత్తుతాడు. (చూడు.4.258-270). పాపాలు దానాలతో నశిస్తాయి. దానాలలో అన్నదానం మిన్న. (4.271-277). ధ్యానం, ఇంద్రియనిగ్రహం, అహింస, గురుసేవ, నిత్యకర్మాచరణం, తపస్సు - అనే వాటిలో అహింస పవిత్రమైనది. ఏ ఉత్తమ ధర్మాలనైనా ప్రకాశింపజేస్తుంది.

ప్రశ్న 75 : దేవతలూ, బ్రాహ్మణులూ, మునిశ్రేష్ఠులూ అహింసను ప్రశంసిస్తూ ఉంటారు. దాని తీరును తెలియజెప్పుము.

ఉత్తరం : ఏనుగు అడుగులో జంతువుల అడుగులన్నీ ఇమిడి ఉండే తీరుగా అహింస అనే ధర్మంలో సర్వధర్మాలూ ఇమిడి ఉంటాయి. ఇది సత్యం. ఆవుకు నాలుగు కాళ్ళున్నట్లుగానే అహింసకు కూడా నాలుగు తీరులుంటాయి. అవి - మనసుచేత, మాటచేత, దేహంచేత హింస చేయటం, మాంసం తినటం అనేవి. మాంసభోజనం హింసను కలిగిస్తుంది. కనుక అది మహాదోషం. పై నాలుగు తెరగుల హింసమానటం అహింస. మాంసం పితృదేవతలకు కూడా ఇష్టమని శ్రాద్ధవిధులలో చెప్పారని అనుమానం రావచ్చును. మాంసభోజనం వదలటం అశ్వమేధయాగంకంటె కూడా పూజనీయం అంటారు. చంపటం, చంపించటం పాపాలన్నింటికంటె గొప్పపాపం. శ్రాద్ధాలలో, యజ్ఞాలలో వేదవిధులలోని హింసవలన దోషం కలుగబోదు కాని మాంసపు రుచి మరగి తినటానికై ప్రాణులను చంపటంవలన పాపం కలుగుతుంది. మాంసం తనను నమిలినవాడిని నమలుతుంది అని ఆగమాలు అంటున్నాయి. మాంసాహారం మానటం తపస్సుతో సమానం - అని మహర్షులు చెప్పారు. దానం, ధర్మం, తపస్సు, యజ్ఞం, పరిశుద్ధత, మంత్రం, అనుష్ఠానం, సత్యం - ఇవన్నీ అహింసారూపాలే కాబట్టి అహింస ఉంటే సంపదలన్నీఉన్నట్లే.

ప్రశ్న 76 : కురుక్షేత్రయుద్ధంలో చచ్చినవారు ఎక్కడికి పోతారో తెలుపుము. బ్రతుకు సుఖాన్నిచ్చేదనీ, చావు దుఃఖాన్ని కలిగిస్తుందనీ ప్రాణులు భావిస్తారు. ప్రాణాలను వదలుకొనటం చాలా అరుదు. అందుకు అడుగుతున్నాను.

ఉత్తరం : కురుక్షేత్రంలో అద్భుతభయంకర యుద్ధంలో దేహాలు వదలిన రాజులకు అనంత సుఖాలు గల గతులు కలగటంలో అనుమానం లేదు. వారందరూ ఉత్తమలోకాలను పొందినవారే. (అని చెప్పి బ్రతుకు సుఖాన్ని, చావు దుఃఖాన్ని గురించిన శంకను నివారించే ఒక ఉదంతం - కీటకానికీ వేదవ్యాసుడికీ జరిగిన సంవాదాన్ని వినిపించాడు (చూడు 4.314-343)

ప్రశ్న 77: విద్య, తపస్సు, దానం - అనే వాటిలో ఏది గొప్పది ?

ఉత్తరం : వ్యాసమైత్రేయ సంవాదం నీ ప్రశ్నకు మంచి సమాధానం. వినుము. ఒకనాడు వ్యాసుడు కాశీక్షేత్రానికి వెళ్ళాడు. అంతకుముందే ఆ నగరంలో ఉన్న మైత్రేయుడి ఇంటికి గుట్టుగా వెళ్ళాడు. మైత్రేయుడు ఆ మహర్షిని గర్తుపట్టి భోజనం పెట్టి సంతుష్టిపరచాడు. వ్యాసుడు పరమానందంతో ఇట్లా అన్నాడు. 'తపస్సు, విద్య మొదలైన ధర్మాలన్నింటిలో దానం గొప్పది. దానాలలో అన్నదానం గొప్పది. ప్రాణాలూ, దేహమూ, దాని బలమూ అన్నం స్వరూపాలే. తపస్సు మనస్సులోని మాలిన్యాల నన్నింటిని తొలగించి వేస్తుంది. విద్యకు అవకాశం కలిగిస్తుంది. ఆ తపసి చేసిన గొప్పదానం వలన విద్య పెంపొందుతుంది. ఆ విద్య తపస్సును వృద్ధి చేస్తుంది. కాబట్టి తపస్సూ, విద్యా, దాన మహిమచేత పెంపొందుతాయి. విద్య వ్రతనిష్ఠాపరుడికి పరమాత్మను చూపించే దీపం వంటిది. కాబట్టి అన్నదానం చేత పరమానందం కలుగుతుంది.

ప్రశ్న 78 : కులస్త్రీ ప్రవర్తన గురించి తెలియపరచుము.

ఉత్తరం : కేకయరాజపుత్రి సుమన అమరావతిలో శాండిలిని చూచి 'కాంతా! ఇంత శ్రేష్ఠమైన దేవలోకనివాసం నీకు ఏ నడవడివలన కలిగింది?' అని అడిగింది. శాండిలి ఇట్లా చెప్పింది. 'నేను అత్తమామలకు ఎదురు చెప్పను. దేవపూజలు శ్రాద్ధములు, అతిథిసపర్యలు చేయటంలో ఎడమొగం పెట్టను. మంచి నడవడితో ఉంటాను. వీథివాకిలి దాటను. పకపకా నవ్వను. విద్య గలవారికి నిర్మలబుద్ధితో భిక్షపెట్టుతూ తక్కిన పనులు చూచుకొంటూ ఉంటాను. భర్త ఇంటికి వచ్చినప్పుడు కాళ్ళకు నీళ్ళు ఇవ్వటం మొదలైన సపర్యలు అనుకూలభావంతో చేస్తాను. బిడ్డలను అలసట లేకుండా తీర్చిదిద్దుతాను. భర్త ఇష్టపడే వంటలు చేసి పెట్టుతూ ఉంటాను. ఏ పనిమీదనైనా భర్త పొరుగూళ్ళకు పోతే, తిరిగివచ్చేంతవరకు పూలు, మైపూతలు, మంచి చీరలు, నగలు, విందులు ఆదరించను. ధాన్యాన్నీ, అన్నాన్నీ వ్యర్థపరచను. బంధువులను తగిన విధంగా గౌరవిస్తాను. ఆవులు మొదలైన పాడిపశువుల సుఖజీవనాన్ని పరీక్షించి సాగిస్తాను. భర్తహృదయం కలతపడే విధంగా ఒక్కమాట కూడా పలకను. భర్త నిత్యాగ్నిహోత్రి అయితే ఆ అగ్నిని ఓపికతో కాపాడుతూ ఉంటాను. రహస్యాన్ని బయటపెట్టను. కడుపుతో ఉన్నప్పుడు బిడ్డ కేవి మేలు చేస్తాయో వాటినే భుజిస్తాను' అని చెప్పింది. ఈ విధంగా ప్రవర్తించిన ఉత్తమ వనిత ఇహపరలోకాలు రెండింటిలో శాశ్వతసుఖం పొందుతుంది. ఆ ఇల్లాలు అరుంధతివలె ప్రశంస కెక్కుతుంది.

ప్రశ్న 79 : సర్వశాస్త్రసారం, సర్వశ్రేష్ఠం అయిన ఆచరణ ఏది?

ఉత్తరం : 'నారద పుండరీక సంవాదం' చెప్పుతాను వినుము. నీ వడిగిన విషయం తేటతెల్లమౌతుంది. తీర్థయాత్రాశీలి అయిన పుండరీకుడు నారదుడు నీవు అడిగిన ప్రశ్ననే అడిగాడు. నారదుడు ఇట్లా చెప్పాడు. బ్రహ్మ చెప్పిన పరమ ధర్మం ఒకటి ఉన్నది. దానిని వినుము. ఇరువదినాలుగవ తత్త్వమైన ప్రకృతికి తరువాతి తత్త్వం, జీవాత్మ.

అతడు సర్వభూతాల స్వరూపం అయినవాడు. అతడి వ్యవహార నామం 'నరుడు'. అతడివలన ఏర్పడిన తక్కిన తత్త్వాలన్నీ నారములు. అతడు నారములు స్థానంగా కలవాడు కాబట్టి నారాయణుడు. ఆ ప్రభువు విశ్వాన్ని సృష్టిస్తూ మరల తనలోనే లీనం చేసికొంటూ 'విభుడు' ఔతున్నాడు. ఆ నారాయణుడే పరబ్రహ్మం, పరతత్త్వం, పరమపదం, ఈశ్వరుడు, విష్ణువు - అనే పేర్లతో పిలువబడుతూ ఉంటాడు. అతడే వాసుదేవుడు. ఆత్మ అనే పేర్లతో ఉపనిషత్తులు పిలుస్తాయి. ఈ పేర్లు నరుడికి కూడా వర్తిస్తాయి. సర్వశాస్త్రాల వాక్యాలను పరిశీలించి నిర్ణయించిన తాత్పర్యమిది. కాబట్టి ఎల్లవేళలా నారాయణుడిని స్మరించాలి. మరణకాలంలో 'నమో నారాయణాయ' అనే మంత్రాన్ని పలికితే నరులు ప్రణవానికి అర్థమైన పరమపదాన్ని పొందుతారు అని చెప్పాడు. ధర్మరాజా! నీవు కూడా పరమ భక్తితో విష్ణువును సేవించుము.

ప్రశ్న 80 : దానం, ప్రియభాషణం - ఈ రెండింటిలో ఏది ఎక్కువ ప్రీతి కలిగిస్తుంది?

ఉత్తరం : రెండూ ప్రీతి కలిగించేవే. దానం ప్రీతికరమైనదని ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ప్రియభాషణంకూడా ప్రీతికరమైన దనటానికి ఒక పురాతన కథ ఉన్నది. చెప్తుతాను వినుము. మాటకారి, బుద్ధిశాలి అయిన ఒక బ్రాహ్మణుడు జనసంచారంలేని అడవికి పోయాడు. ఒక రాక్షసుడు అతడి మాంసం తినగోరి అతడిని పట్టుకొన్నాడు. అతడు కలతపడకుండా ఆ రక్కసుడి మొగంవైపు చూస్తూ ఉండిపోయాడు. ఆ రక్కసుడు ఆశ్చర్యపోయి 'నా ప్రశ్నకు సమాధానం చెప్పితే నిన్ను వదలుతాను' అని 'నా శరీరం కృశించిపోవటానికీ, పాలిపోవటానికీ కారణం ఏమిటి?' అని అడిగాడు. ఆ బ్రాహ్మణుడు తొందరపడక నిబ్బరంగా, అనుకూలభావంతో ఇట్లా చెప్పాడు. 'చుట్టాలు నీ దుష్టస్వభావంతో విసిగి వదలి తరువాత బాధపడటం, దారిద్ర్యం కలిగినప్పుడు అపూర్వ గౌరవాలు కోరటం, ఇతరులు పెట్టిన బాధలను నీవు మొగమాటంవలన అనుభవించగా వారు జయించామని పొంగిపోవటం, జాలి తలచి నీవు మేలు చేయగా ఆ మేలు పొందినవాడు అది తన పరాక్రమమే అని చెప్పటం, బుద్ధి కలవారు నిన్ను పొగడుతూ ఉంటే సిగ్గుపడుతూ పండితుల మెప్పుకొరకు చూస్తూ ఉండటం, నీవు న్యాయంగా పలికిన దానిని జనసభ అంగీకరించకపోవటం, నీ తప్పు నీ భార్యకు తెలిసి ఆమె కుమిలిపోతూ ఉంటే ఆమెను నీవు సముదాయించ లేకపోవటం, నీ సొమ్మును కొట్టివేయాలని ఇతరులు కనిపెట్టుకొని ఉంటే దానికి ఏది దిక్కు అని నీవు ఆలోచిస్తూ ఉండటం, దుర్మార్గుడు చాటున నిన్ను గూర్చి చేసిన నిందలను నీ బంధువులు వినాలని భావించటం, నీవు గొప్ప పనులు చేస్తూ ఉంటే నీ స్నేహితులు నిన్ను మాయలవాడిగా భావించటం, నీ మనసులో ఉన్న పెనువగపును బయట పెట్టుకొనలేకపోవటం, భార్య, కొడుకు, అల్లుడు మంచి నడవడిలేనివారై త్రిప్పలు పెట్టటం, తండ్రి, తల్లి, అన్నదమ్ములు రోగాదులచేత కృశించటం, పూర్వజన్మలో బ్రాహ్మణుడి ఆవును చంపటం, పనికిమాలినవాడిని పనిలో పెట్టుకొని పేరు పాడుచేసికొనటం, ఎంతోకాలం ఎన్నో ప్రయత్నాలు చేసి ఒక కొలిక్కి తెచ్చిన పనిని నీచుడైన పగవాడు పాడుచేయటం - వీటిలో ఒకదానిచేత మానవుడు కృశిస్తాడు. పాలిపోతాడు' అని అన్నాడు. ఆ మాటలు విని రాక్షసుడు అతడిని వదలిపెట్టాడు. మంచిమాటల తీరు ఇట్లా ఉంటుంది.

ప్రశ్న 81 : మహాత్మా! సంసార సముద్ర తీరాన్ని చేర్చగల ఓడ నీ దయా విశేషమే. పాపాలన్నింటినీ పారద్రోలే ఒక ప్రాచీనగాథను వినిపించుము. శ్రీకృష్ణుడు మునులతో, మహారాజులతో కలిసి నీవు చెప్పే గాథను వినాలని వేడుకతో ఉవ్విళ్ళూరు తున్నారు. నేనూ నా తమ్ముళ్ళూ పరమానందంలో తేలియాడే విధంగా మంచి కథను చెప్పుము.

ఉత్తరం : ధర్మరాజా! కరుణానిధీ, సర్వలోకశరణ్యుడూ అయిన శ్రీకృష్ణుడు వింటూ ఉండగా పుణ్యేతిహాసాన్ని చెప్పే

అదృష్టాన్నీ, పుణ్యాన్నీ పొందాను. వ్యాసాదిమహర్షులూ, రాజవంశంవారూ వినటంవలన నా గౌరవం పెరిగింది. ఇదే ఒక పరమపదం. నీవడిగినదానికి 'ఉమామహేశ్వర సంవాదం' అనే ఇతిహాసం ఉన్నది. అది ప్రవర్తిల్లటానికి కారణమైన కథను ముందుగా చెప్పి ఆ తరువాత దానిని చెప్పుతాను' అని శ్రీకృష్ణుడికి నమస్కరించి ధర్మరాజుతో చెప్పనారంభించాడు.

శ్రీకృష్ణుడు పుత్ర సంతానార్థి అయి రుక్మిణితో కలిసి హిమవత్పర్వతానికి వెళ్ళి పన్నెండేళ్ళు వ్రతం చేసి కృశించి ఉన్నాడు. అప్పుడు నారదాది మహర్షులు శిష్యసమూహంతో వచ్చి శ్రీకృష్ణుడిచుట్టూ కూర్చుండి పుణ్యగోష్ఠి చేస్తూ ఉండగా అతడి ముఖం నుండి ఒక మహాగ్ని వెలువడి ఆ పర్వతవనాలను కాల్చివేసింది. ఆ తరువాత శ్రీకృష్ణుడు తన సౌమ్యదృష్టితో ఆ మంటను చల్లార్చి అడవిని మునుపటివలెనే సవ్యంగా ఉండేటట్లు చేసి, అందరినీ ఆశ్చర్యంలో ముంచి ఎత్తాడు. వారి ప్రార్థన మేరకు ఆ అగ్నిని గురించి శ్రీకృష్ణుడు వివరించి చెప్పాడు. 'ఒక రాక్షసుడు నా వరంవలన అస్త్రవిద్యతో అద్భుతశక్తి పొంది, అహంకరించి లోకకంటకుడయ్యాడు. అతడిని సంహరించగల కొడుకును పొందటానికి ఈ మహావ్రతాన్ని చేపట్టాను. నా ఆత్మ అగ్నిగా మారి, నా ముఖం నుండి వెలువడి బ్రహ్మదగ్గరకు వెళ్ళింది. ఆ మహానుభావుడు మన్మథుడిని నా కుమారుడిగా పంపి, ఆ అగ్నిని మరలించాడు. అది తిరిగిపోతూ ఈ అడవిని కాల్చింది. నేను కరుణించి మరల దానికి మొదటిరూపు కల్పించాను' అని అగ్ని కథ చెప్పి ఋషులను 'నా కొక ఉత్తమ ఇతిహాసాన్ని చెప్పి నా కోరిక తీర్చండి' అని కోరాడు. ఋషులు ఆ పనికి సమర్థుడు నారదుడే అని పేర్కొని, అతడిని 'కథ చెప్పు'మని ప్రార్థించారు. అతడు 'ఉమామహేశ్వర సంవాదం' అనే ఇతిహాసాన్ని శ్రీకృష్ణుడికి వినిపించాడు. దానిని నీకు చెప్పుతున్నాను.

నారదుడు : నేను లోక సంచారంచేస్తూ హిమవత్పర్వతంమీద ఒక సుందర దివ్యోద్యాన వనాన్ని చూచాను. ఆ ఉద్యానంలో శార్దూల చర్మధారి, భుజగాభరణుడు, విభూతి సుందరుడు అయిన మహాదేవుడు సురసిద్ధ విద్యాధరమునిగణ, భూతగణ పరివృతుడై ఉండగా ఆ సభలో నేనుకూడా చేరి స్వామిని సేవిస్తూ ఉన్నాను. అంతలో సపరివారంగా పార్వతీదేవి వచ్చి తన కరకమలాలతో పరమేశ్వరుడి కన్నుదోయిని విలాసంగా మూసింది. దానితో లోకంలో సూర్యచంద్రుల కాంతి లోపించి కారుచీకటి వ్యాపించింది. లోకాలు భీతిల్లగా పరమేశ్వరుడు మూడవ కంటిమంటతో వెలుగులు ప్రసాదించాడు. పార్వతి భీతిల్లి పరమేశ్వరుడి పాదాలకు ప్రణమిల్లింది. స్వామి కరుణతో చూడగా మంటలు చల్లారి కొండ చల్లబడింది. అప్పుడు పార్వతి ఇట్లా అడిగింది.

పార్వతి : సర్వేశా! నొసటికన్ను తెరవటానికి గల కారణ మేమిటి?

శివుడు : ఈ లోకాలన్నీ నా స్వరూపాలే. నా కేది కలిగితే లోకాలకు కూడా అది కలుగుతుంది. నీవు నా కన్నులు మూశావు. లోకాలలో చీకటి వ్యాపించింది. భూతాలు భయపడ్డాయి. నీ చేతులు తొలగించకుండా చీకటి పోగొట్టటానికి నా ఫాలనేత్రం తెరవవలసి వచ్చింది.

పార్వతి : స్వామీ! నీకు నాలుగు మొగా లెందుకు ఉన్నాయి?

శివుడు : సుందోపసుందులనే మహాబలవంతులైన రాక్షసులను చంపటానికి విశ్వకర్మ తిలోత్తమను సృష్టించి నా వద్దకు పంపాడు. ఆమె దేవకార్య నిమిత్తమై నా చుట్టూ ప్రదక్షిణాలు చేసింది. నేనే ఆమెను రక్షించటానికై నాలుగు దిక్కులా చూచాను. అప్పుడు నాలుగు మొగాలు మొలిచాయి.

పార్వతి : జగదీశా! నీ కంఠంలో నలుపెందుకు కలిగింది?

శివుడు : క్షీరసాగర మథన సమయంలో వెలువడిన కాలకూటాన్ని లోక సంరక్షణార్థమై నా కంఠంలో ధరించాను. బ్రహ్మాదు లందుకే నన్ను నీలకంఠుడని పిలుస్తారు.

పార్వతి : స్వామీ! నీకు పినాక మనే ఆయుధం మీద ఎక్కువ మక్కువ ఎందుకు?

శివుడు : కృతయుగంలో కణ్వుడు అనే మహర్షి మహాతపస్సు చేశాడు. అతడిమీద పెద్ద పుట్ట, దానిమీద మిక్కిలి పొడవూ వెడల్పూ గల వెదురు మొలిచింది. బ్రహ్మ ఆ మహర్షికి ప్రత్యక్షమై వరమిచ్చి ఆ వెదురును తీసికొని, లోకశ్రేయస్సును కాంక్షించి దానిని మూడు ముక్కలు చేసి మూడవ ముక్కతో పినాకాన్ని నిర్మించి నా కిచ్చాడు. రెండవ ముక్కతో శార్‌ఙ్గమును నిర్మించి విష్ణువుకు ఇచ్చాడు. మొదటి తునుకతో గాండీవాన్ని కల్పించి తాను తీసికొనిపోయాడు. అందువలన నేను పినాకాన్ని అభిమానిస్తాను.

పార్వతి : నంది వాహనాన్ని ఎందుకు ఆదరిస్తారు?

శివుడు : నేను హిమవత్పర్వతంమీద తపస్సు చేసికొంటున్నప్పుడు ఆవులు నా చుట్టూ నిర్భయంగా తిరుగుతూ కష్టపెట్టాయి. నేను కోపించి చూడగా అవి బాధపడ్డాయి. బ్రహ్మ, దేవతలు నా వద్దకు వచ్చి ప్రార్థించి నా కొక ఎద్దును కానుకగా ఇచ్చి 'గోపతి' అని పేరుపెట్టి గోవుల బాధ తీర్చారు. అది మొదలు నేను ఆ ఎద్దును వాహనంగా, ధ్వజంగా చేసికొని సంచరిస్తున్నాను.

పార్వతి : నీవు మనోహరమైన నెలవులను వదలి అశుచి అయి, కేశాస్థికపాల దుర్గంధ దుర్దర్శన మైన శ్మశానంలో ఉండటానికి కారణమేమి?

శివుడు : క్రూరభూతాలు జనులను ఘోరంగా వధ చేయటం గమనించి బ్రహ్మ నన్ను ఆ విపత్తును తొలగించుమని ప్రార్థించాడు. మోక్షమందు ఆసక్తి కలవారు నిర్జనమైన శ్మశానాన్ని పవిత్రస్థానంగా భావిస్తారు. కాబట్టి నేను వల్లకాటిలో ఉండటానికి ఇష్టపడతాను. అక్కడే ఉండి లోకరక్షాకార్యాన్ని నిర్వహిస్తాను.

పార్వతి : బూదిపూత, ఎముకల, పాముల సొమ్ములు, గొడ్డలి, శూలం - అనే ఆయుధాలతో భయంకరమైన రూపం ఎందుకు ధరించావు?

శివుడు : జగత్తంతా సౌమ్యం, ఆగ్నేయం అనే రెంటి కలయికతో కూడి ఉన్నది. సౌమ్యమైన దానిని విష్ణువూ, ఆగ్నేయమైన దానిని నేనూ భరిస్తూ ఉంటాము. ఈ రెంటిని కలిపి ఈ విశ్వాన్ని నేను వహిస్తున్నాను. అందువలన అగ్నిసంబంధ భావంతో కూడుకొనిన ఆకారాన్ని లోకహితంకొరకు తాల్చాను.

పార్వతి : నీవు చంద్రుడిని ప్రేమతో తలపై ధరించటానికి కారణం ఏమిటి?

శివుడు : దక్షయజ్ఞంలో నేను ఆగ్రహించినప్పుడు దేవతలందరినీ హింసించాను. ఆ సందర్భంలో చంద్రుడి దేహాన్ని అడ్డదిడ్డంగా త్రొక్కివేశాను. అతడు నన్ను శరణు కోరాడు. జాలిపడి చేసిన కీడు తొలగటానికి అతడిని తలపై ధరించాను.

పార్వతి : శివా! వర్ణాశ్రమ ధర్మాలను చక్కగా తెలియజెప్పుము.

శివుడు : లోకహితం కొరకు బ్రహ్మ ముఖంనుండి బ్రాహ్మణులను, భుజాలనుండి క్షత్రియులను, తొడలనుండి వైశ్యులను, పాదాలనుండి శూద్రులను సృష్టిచేశాడు. ఆయా వర్ణాలవారికి విధులను, ధర్మాలను నిర్దేశించాడు. బ్రాహ్మణులు లోకానికి ఆధారమైనవారు. వారిని అవమానించటంగాని, అగౌరవపరచటం కాని తగదు. వారికి దానాలు చేయటంవలన శుభాలు కలుగుతాయి. బ్రాహ్మణనింద ఈశ్వరనిందవంటిది వేదాధ్యయనం చేయటం. యజ్ఞాలు

చేయటం, తగినవారికి దానాలు చేయటం, వేదాలు శిష్యులకు నేర్పటం, యజ్ఞాలలో దానాలు స్వీకరించటం, క్రోధాదులు లేని చిత్తంతో భగవద్ధ్యానం చేయటం, మనోవాక్కాయకర్మలలో శుచిగా ఉండటం, సత్యవాక్యపాలనం బ్రాహ్మణవిధులు. తపస్సు యొక్క గొప్పతనాన్ని సాధించటానికీ, ధర్మానికి పునాదిగా ఉండటానికీ, బ్రహ్మ బ్రాహ్మణులను సృష్టించాడు. క్షత్రియులు రాజ్యాన్ని పాలిస్తూ బ్రాహ్మణులను పరిరక్షించాలి. ధనుర్వేదం, నీతిశాస్త్రం, రాజనీతి మొదలైన విద్యలను నేర్పటం, యజ్ఞయాగాది కర్మలు చేయించటం, దానాలు యోగ్యులకు చేయటం, సాధువులను పండితులను రక్షించటం, దుష్టులను శిక్షించటం, ఆయుధ జీవులు కావటం, వ్యవసాయంలోనూ వ్యాపారంలోనూ ఆరవభాగం పన్నుగా గ్రహించటం, ప్రజలను ధర్మంగా న్యాయంగా పాలించటం క్షత్రియుల విధులు. వైశ్యులు లోకులకు ఉపకారం చేసేవారు. వ్యవసాయం, వ్యాపారం, పశుపోషణ వారి ప్రధాన విధులు. వీరికి ద్విజత్వం ఏర్పడింది. విద్యార్జన, యజ్ఞాలు చేయటం, గోభూదానాలు చేయటం తగిన పనులు. అతిథిసత్కారం అవశ్య కర్తవ్యం. శూద్రులకు సేవాధర్మం ముఖ్యమైనది. బ్రహ్మ క్షత్రియ వైశ్యులకు సేవలు చేసి ప్రత్యుపకారం పొందాలి. వినయంతోనూ, సాధు స్వభావంతోనూ వ్యవహరించాలి. వర్ణధర్మాలు ఆచరిస్తే సమాజంలో సుఖశాంతులు కలుగుతాయి. ఇక ఆశ్రమ ధర్మాలు చెప్పుతాను. బ్రహ్మచర్యాశ్రమంలో బ్రహ్మచర్యం, గురుసేవ, విద్యాభ్యాసం, నిత్యాగ్నిహోత్రం అవశ్యకర్తవ్యాలు. గృహస్థాశ్రమం అన్నింటిలో ముఖ్యమైనది. పంచయజ్ఞాలు ఆచరించటం, స్వీయభార్యను పాలించటం, దానాలు చేయటం, బంధువులను గౌరవించటం గృహస్థాశ్రమ ధర్మాలు. అడవిలో నివసించటం, కందమూలాలు భుజించటం, స్త్రీ సంగమం వర్జించటం, జడలు ధరించి జింకచర్మాన్ని కట్టుకొనటం, వానప్రస్థాశ్రమ ధర్మాలు. కోపగించుకోకుండా ఉండటం, బ్రహ్మచర్యాన్ని పాటించటం, ఓర్పు వహించటం, బ్రాహ్మణులతో కలిసి జీవించటం, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, శుచిగా, శుభ్రంగా ఉండటం, సద్వ్రతనిష్ఠ. భిక్షాభోజనం, నేలపై మాత్రమే శయనించటం, దయాస్వభావం కలిగి ఉండటం, సదా తత్త్వచింతనతో, యతి ధర్మాలతో జీవించటం సన్న్యాసాశ్రమ విధులు. ఇవి వేదాలు సమ్మతించిన విధులు.

పార్వతి : ముని జనులు చేసే తపస్సుయొక్క విధానం తెలియజెప్పుము.

శివుడు : తపమంటే సామాన్యంగా వానప్రస్థులు చేసే ధర్మాలు. ఇంద్రియ నిగ్రహం, యోగాభ్యాసం, ఫలాభిరహిత కర్మాచరణం, పంచాగ్ని మధ్య తపస్సు మొదలైనవి చేసి స్వర్గం పొంది సుఖించేవారు తపస్వులు. భార్యాయుతులై తపస్సు చేసేవారు అహింస, దయ మొదలైన గుణాలు కలిగి, సర్వభూత సమభావంతో వర్తిస్తారు. ఉపవాసం, మౌనం, భూతలశయనం మొదలైన వానప్రస్థాశ్రమ నియమాలు తపస్వులు పాటిస్తారు.

పార్వతి : దేశ ద్రిమ్మరులైన విరాగులను గురించి చెప్పుము.

శివుడు : వీరు యాయావరులు, పుణ్యతీర్థాలను సేవిస్తూ నిరాహారవ్రతాలను పాటిస్తుంటారు. బక్కచిక్కిన శరీరాలతో నియమనిష్ఠలతో జీవించి స్వర్గం చేరతారు.

పార్వతి : వైఖానసుల పద్ధతి తెలపండి.

శివుడు : వైఖానసులు కఠిన వ్రతాలు పాటిస్తారు. రాళ్ళతో, నివ్వరిధాన్యాలను దంచుకొని వానిని మాత్రమే నమలుతారు. కొందరు గాలి, నీరు మాత్రమే స్వీకరిస్తారు.

పార్వతి : గృహస్థాశ్రమ ధర్మాలను తెలపండి.

శివుడు : గృహస్థాశ్రమంలో కామం ధర్మప్రధానమై ఉండాలి. ఆత్మనిగ్రహం, భూతదయ, శాంత స్వభావం, అతిథి సత్కారం, మిగిలిన ఆశ్రమవాసులను గౌరవించటం గృహస్థాశ్రమ ధర్మంలో ముఖ్యం. స్త్రీకి పతిని సేవించటం ప్రధాన విధి. గృహస్థుడు నిజభార్యయందే రమించాలి. ఆహారనియమం పాటిస్తే ముక్తి మార్గం సులభం.

పార్వతి : రాజు అందరివలెనే శరీరం కలిగి, భోజనాదులు చేస్తూ ఉండి కూడా అందరిచేత నమస్కరించబడతాడు. నిగ్రహాను గ్రహాలలో సమర్థుడౌతాడు. సర్వాధిపత్యంతో శోభిల్లుతాడు. దీనికి కారణం ఏమిటి?

శివుడు : రాజార్హత తపస్సువలన లభిస్తుంది. అందువలననే ఇతరులకు నమస్కార యోగ్యుడౌతాడు. నిగ్రహానుగ్రహ సమర్థు డౌతాడు. తాను నీతిపరుడై ఇతరులను నీతిపరులుగా చేస్తాడు. అవసరం వస్తే శిక్షిస్తాడు. కామాది అంతశ్శత్రువులను జయించి సప్తాంగాలను శాసిస్తాడు. ధర్మాన్ని రక్షిస్తాడు. చారచక్షువై లోకాన్ని గమనిస్తాడు. ధర్మాన్ని రక్షిస్తాడు. అధర్మాన్ని శిక్షిస్తాడు. అకారణంగా యుద్ధం చేయడు. న్యాయబద్ధంగా యుద్ధానికి పూనుకొంటాడు. యజ్ఞాలు దానాలు చేస్తాడు. ఈ నీతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే రాజుకు పాపం కలుగుతుంది. ప్రజలను బిడ్డలవలె కాపాడి సంపదను, పేరు ప్రఖ్యాతులను గడిస్తాడు. చివరకు స్వర్గసుఖాలను పొందుతాడు.

పార్వతి : ధర్మరహస్యం వినగోరుతాను.

శివుడు : ధర్మాలన్నింటిలో అహింస సూక్ష్మమైన ధర్మం.

పార్వతి : లోకులకు హింసను వదలటం సాధ్యం కాదు. మరి అహింస అంటే ఏమిటి?

శివుడు : శాంతగుణంతో తపస్సు చేసికొనేవారు అహింసావ్రతం పాటించేవారు. లోకులు తమ కర్తవ్యాలు చేస్తూ ఉండగా కొన్ని ప్రాణులు చనిపోతాయి. అప్పుడు వారికి చంపే బుద్ధి ఉండదు. పాపపుణ్యాలకు బుద్ధి ప్రధానం. యుద్ధాలలో మరణించటం, యుద్ధాలలో సంహరించటం హింస కాదు. స్వర్గప్రాప్తికి హేతువులు కూడా. వేటాడటం హింస కాదు. వేదమంత్రయుతంగా యజ్ఞంలో పశువిశసనం హింస కాదు. శిక్షకు తగినవాడిని శిక్షించటం కూడా హింస కాదు.

పార్వతి : జనులు జీవించే విధానాన్ని గురించి చెప్పుము.

శివుడు : మనుష్యజన్మం కర్మభూమి. సుఖదుఃఖాలకు మూలం ధనం. అందువలన ధనసంపాదన మార్గాలు మానవుడు యోచిస్తాడు. అయితే అవి ధర్మపథంలో సాగాలి. కర్మలలో మోసం ఉండకూడదు. ఉపాయంతో పనులు చేయాలి. ఇతరుల ధనాన్నీ, వనితలనూ దొంగిలించరాదు. తల్లిదండ్రులను, అతిథులను, దేవతలను గౌరవించి పూజించాలి. ఇవి అందరూ ఆచరించదగిన జీవన విధానం.

పార్వతి : నాలుగు వర్ణాలవారు చేసే కర్మలు ఏ విధంగా ఫలిస్తాయి?

శివుడు : చాతుర్వర్ణ్యములవారు తమ తమ వర్ణాలకు తగిన పనులు పద్ధతి తప్పక నిర్వహిస్తే స్వర్గసుఖం లభిస్తుంది. మంచి పనులు చేస్తే ఉత్తమ పదాలు లభిస్తాయి.

పార్వతి : లోకంలో కొందరు మానవులు సంపదలతో సుఖిస్తారు. కొందరు పేదరికంతో బాధపడతారు. దీనికి కారణం ఏమిటి?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శివుడు : దైవానికి ఒకరిమీద కోపంగానీ, ఒకరిమీద ప్రేమకాని ఉండవు. పూర్వజన్మలో చేసిన కర్మలయొక్క ఫలితాలు క్రమంగా అనుభవంలోకి వస్తాయి. సమయాన్ని బట్టి కష్టసుఖాలు, సంపదలు, పేదరికాలు ఏర్పడుతాయి. (చూడు. వివరాలకు 5.86-126)

పార్వతి : పసివారు మరణించటానికి, ముసలివారు చాలాకాలం జీవించటానికి కారణ మేమి?

శివుడు : శరీరం శిథిలమౌతున్నది కాని వృద్ధులకు చావు త్వరగా రావటం లేదన్నావు. మృత్యువు నరుడిని చేరినప్పుడు చావు కలుగుతుంది. పూర్వజన్మలో చేసిన కర్మలు మానవుడికి ఆయుస్సును వృద్ధి చేస్తాయి. తగ్గిస్తాయి కూడా. దానివలన బ్రతుకు చావులు సంభవిస్తూ ఉంటాయి.

పార్వతి : ఆయుస్సు ఏమి చేయటంవలన అధికమౌతుంది? దేనివలన తగ్గిపోతుంది?

శివుడు : క్షమ, సత్యం, కృప, శౌచం, గురుభక్తి - ఆయుస్సును వృద్ధి చేస్తాయి. అసత్యభాషణం, క్రౌర్యం, అశుభ్రత, గురువిరోధం ఆయుస్సును తగ్గిస్తాయి. బ్రహ్మచర్యవ్రతం, హితమితాశనం, జరావ్యాధులు పోగొట్టే ఔషధాలను సేవించటంచేతను ఆయుస్సు పెరుగుతుంది. శక్తికి మించిన పనులు చేయటం, తగనటువంటి, అనుసరణీయం కానటువంటి పదార్థాలు తినటం చేతను ఆయుస్సు తగ్గిపోతుంది. ఇవన్నీ పూర్వజన్మలో చేసిన కర్మలవలననే సంభవిస్తాయి.

పార్వతి : స్త్రీ పురుష భేదంతో ఉన్న మానవులలో జీవుడు వర్తించే విధం వివరించుము.

శివుడు : తాత్త్వికంగా జీవుడికి పురుష స్త్రీత్వాలు లేవు. అహంకారం కారణంగా కర్మానుభవం కలిగి భావించిన విధంగా జరుగుతుంది. ఆత్మ శరీరానికి అతీతమైనది. కర్మలకు ఆత్మ కర్త కాదు. అతడి త్రిగుణాత్మక చైతన్యం శరీరాన్ని పొంది కర్తృత్వం వహిస్తుంది. మనుష్యులు చేసే కర్మలను బట్టి ఫలితాలు కూడా కలుగుతాయి. జంతువులలో మానవుడు శ్రేష్ఠుడు. అతడికి గొప్పతనం కలిగించేది విద్య. విద్యవలన అజ్ఞానంవలన, సంసారంవలన కలిగే కష్టనష్టాలు తొలగిపోతాయి. వేదాలవలన జ్ఞానం కలుగుతుంది. వేదవిజ్ఞానంవలన మానవుడిలోని అంతశ్శత్రువులు గాలికి మేఘాలు విచ్చి పోయినట్లుగా తొలగిపోతాయి. విద్యావంతులు దేవతలవలె ప్రకాశిస్తారు.

పార్వతి : స్వప్న మంటే ఏమిటి?

శివుడు : స్వప్నమంటే నిద్రించేవారి మనశ్చేష్ట. అది భవిష్యత్తులో జరుగబోయే శుభాశుభాలను కూడా తెలియజేస్తుంది.

పార్వతి : కర్మాచరణంలో దైవం ముఖ్యమా? మానవుడి ఉత్సాహం ముఖ్యమా?

శివుడు : పూర్వజన్మలో చేసిన కర్మల ఫలితమే ప్రయత్నం వలన మానవుడు పొందుతాడు. దానికి దైవసహాయం తప్పక కావాలి. కాబట్టి కర్మఫలానికి రెండూ కావాలి. అందులో సందేహం లేదు.

పార్వతి : గర్భంలో ప్రాణి ఏ విధంగా ప్రవేశిస్తాడు?

శివుడు : రతిలోని పురుషుడి శుక్లంవలన, స్త్రీ రజస్సువలన, దైవానుగ్రహంవలన ఆత్మ గర్భప్రవేశం చేస్తుంది. జీవుడు మాయారహితుడైనా అహంకారంవలన పుట్టుకకు గురి ఔతున్నాడు.

పార్వతి : నరులకు పునర్జన్మ ఉన్నదా? లేదా?

శివుడు : దేవతలకే ఆ సంగతి తెలియదు. ఇక నరులకు సాధ్యమా? పునర్జన్మ నరులకు ఉంటుంది. కాని, దానిని తెలిసికొనటం కష్టం. వేదవిజ్ఞానంవలన దానిని తెలిసికొనవచ్చును.

పార్వతి : మరణించినవారు ఆకారం లేకుండా ఉంటారు. వారిని యమభటులు బంధించి తీసికొనిపోవటం ఏమిటి? యముడు శిక్షించటం ఏమిటి?

శివుడు : మరణం ఆసన్నమైనపుడు శరీరాన్ని విడిపించి, మనుష్యులను అదృశ్య శరీరం వహించే విధంగా చేసి యమదూతలు తీసికొని వెళ్ళుతారు. వారిలో ధార్మికులను సువాసన భరితంగానూ, సుకుమారంగా ఉండే మార్గంలో కొనిపోతారు. ధర్మాధర్మాలను మిశ్రమంగా చేసినవారిని బాధలు లేనిదారిలో తీసికొనిపోతారు. అధర్మపరులను కఠినం, మలినం అయిన దారిలో నడిపిస్తారు. యమధర్మరాజు వారికి తగిన శిక్షలను విధిస్తాడు.

పార్వతి : నరకం ఎటువంటిది? ఏ విధంగా ఉంటుంది? పాపాత్ములను యముడు ఏ విధమైన బాధలతో శిక్షిస్తాడు?

శివుడు : నరకాలు అయిదు. అవి: రౌరవం, మహారౌరవం, కంటకావనం, అగ్నికుండం, పంచకష్టం. జీవులు చేసిన పాపాలను బట్టి ఆయా నరకాలకు యముడు పంపుతాడు. యమభటులు వారికి కాల్చటం, కత్తిరించటం, కట్టివేయటం, కొట్టటంవంటి శిక్షలు విధిస్తారు. ఆ పాపాత్ములను కుక్కలు కరుస్తాయి. కీటకాలు తొలుస్తాయి. గ్రద్దలు ముక్కుతో పొడుస్తాయి. ఇటువంటి అనేక దుఃఖాలు అనుభవించి పురుగులుగానూ, పక్షులుగానూ, జంతువులుగానూ, మనుష్యులుగానూ జన్మిస్తారు. ఇనుమును వేడిచేసినప్పుడు తుప్పు తొలగిపోయినట్లు, యమ శిక్షలతో పాపాలు తొలగిపోతాయి.

పార్వతి : పాపాలు ఎటువంటివి ?

శివుడు : మానసములనీ, వాచికములనీ, కాయికములనీ పాపాలు మూడు రకాలు. అన్యుల ద్రవ్యాన్ని ఆశించటం, పాపకృత్యాలకు పాల్పడటం, ధర్మాన్ని ద్వేషించటం మొదలైనవి మానసాలు. అసత్యమాడటం, కఠిన సంభాషణం మొదలైనవి వాచికాలు. హత్యచేయటం, ఇతరులను బంధించటం, మద్యపానం అనేవి కాయికాలు. అన్నిటిలో మద్యపానం మహాపాపం. దానిని వదలి యశస్సు, సంపద, సౌఖ్యం, పుణ్యగతి పొందవచ్చును.

పార్వతి : పుణ్యాలంటే ఎటువంటివి?

శివుడు : పుణ్యకర్మలు లోకంలో మూడురకాలు: 1.ఔపమికం, 2.నిరుపకరణం, 3.సోపకరణం. ఔపమికమంటే పాపాన్ని తొలగించేది. నరకభయంతో పాపాలు చేయకుండా ఉండటం. దీనివలన స్వర్గం లభిస్తుంది. నిరుపకరణం అంటే శుచిగా ఉండటం, నిజం మాట్లాడటం, అహింసను పాటించటం, వ్రతదీక్ష, ఉపవాసం. స్త్రీ సంగమ వర్జనం, పుణ్యతీర్థ సేవనంవంటి నియమాలు పాటించటం. దానాదులు చేయటం సోపకరణం.

పార్వతి : దానం చేయదగిన వస్తువు లేవి?

శివుడు : జంతువు లన్నింటికి అన్నం, నీరు, ప్రాణంవంటివి కాబట్టి వాటిని దానంచేయటం దానాలలో శ్రేష్ఠం. ఆ తరువాత బంగారం, గోవు, భూమి, కన్య, విద్య, తిలలు, గొడుగు, దాసదాసీజనం, దీపం, ఔషధం, ఆశ్రయం మొదలైనవి ఉత్తమగతులు కలుగజేస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పార్వతి : యజ్ఞం చేసే పద్ధతిని తెలుపుము.

శివుడు : యజ్ఞవిధులు వైదికాలనీ, లౌకికాలనీ రెండు విధాలు. ఆయావర్ణాలకు తగినట్లుగా ధనధాన్యాలను గ్రహించి వేదవిధులతో దేవతలకు అర్పించేది వైదికం. దేవతలకు ఉత్సవాదులు నిర్వహించటం లౌకికం. దాన ధర్మాలు వ్రతాలు యజ్ఞాలతో సమానం కావు. యజ్ఞం శ్రద్ధతో చేయాలి. హవ్యాలను దేవతలకు అర్పించాలి.

పార్వతి : పితృసంబంధమైన విధులను తెలియపరచుము.

శివుడు : పితృకార్యాలు గయ, కురుక్షేత్రం, గంగ మొదలైన పుణ్యక్షేత్రాలలో చేయటం శ్రేష్ఠం. మాసాలలో మాఘం, భాద్రపదం మేలైనవి. తిథులలో అమావాస్య, ద్వాదశి, నవమి శ్రేష్ఠాలు. పితృదేవతలకు దర్భలు, మినుములు, నువ్వులు ప్రీతి ప్రదాలు. వేదవిదులు భోక్తలుగా పనికివస్తారు. వారికి భోజనం పెట్టి పిండప్రదానం చేయటం పితృకార్యవిధి. దానివలన శివుడు మెచ్చుకొంటాడు.

పార్వతి : మరణించినవారు వారి పుణ్యాల ననుసరించి పునర్జన్మ పొందుతారు కదా! అప్పుడు భూలోకంలో వారి బంధువులు పితృపూజ ఎవరికి చేయాలి? దానివలన ఎవరికి మేలు కలుగుతుంది?

శివుడు : ఈ సందేహం సరైనదే. ఇది చాలా రహస్యమైనది. పితృదేవతలూ ఇతర దేవతలవంటివారే. దేవతలు ఉత్తరదిక్కులో ఉంటే పితృదేవతలు దక్షిణదిక్కులో ఉంటారు. దేవతల కిచ్చేవి హవ్యములు, పితృదేవతల కిచ్చేవి కవ్యములు. మరణించిన తల్లిదండ్రులకు, బంధువులకు శ్రాద్ధకర్మలు చేస్తే పితృదేవతలు సంతోషించి, కర్తకు ఆయురారోగ్యైశ్వర్యాదులే కాక మోక్షం కూడా ప్రసాదిస్తారు. పితృదేవతలు దేవతలవలెనే రాక్షసులకు, గరుడులకు, యక్షులకు కూడా పూజనీయులు.

పార్వతి : ధర్మం అనేకవిధాలుగా ఉంటుంది. దానిని గురించి చెప్పండి.

శివుడు : జాతినిబట్టి, దేశాన్నిబట్టి, కులాన్నిబట్టి, గుణాన్నిబట్టి చేసే ధర్మాలనీ, ఆపద్ధర్మాలనీ ధర్మాలు అయిదు విధాలు.

పార్వతి : స్వర్గంలో లభించే సౌఖ్యాలు ఏ విధంగా ఉంటాయి?

శివుడు : స్వర్గంలో పుష్పాలు వాడవు; కల్పవృక్షం సువాసన ద్రవ్యాలను అందిస్తుంది. వారి ఆహారం అమృతం. శుభ్రమైన దుస్తులూ, అపూర్వాభరణాలు వారికి సహజం. ద్వేషాదిభావాలు లేక మైత్రితో ఉంటారు. ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటారు.

పార్వతి : ధర్మాలలో శ్రేష్ఠమైన ధర్మాలు ఏవి?

శివుడు : ధర్మార్థకామాలకంటె మోక్షధర్మం ఉత్తమమైనది. మానవుడు ఇంద్రియాలను నిగ్రహించటం ద్వారా మోక్షాన్ని పొందగలుగుతాడు. ఎంత ద్రవ్యం ఉన్నా, ఎన్ని దానాలు చేసినా, ఎంత తపస్సు చేసినా, అశ్వమేధాలు రాజసూయాలు చేసినా ముసలితనాన్నీ, మరణాన్నీ నివారించలేవు. మోక్షకాంక్ష ఒక్కటే వాటిని జయించగలదు. వైరాగ్యమే శాంతినీ, మోక్షాన్నీ కలిగిస్తుంది. సాంఖ్యమనే యోగవిశేషం సంసారమనే రోగానికి వైద్యంవలె ఉపయోగిస్తుంది. (వివరాలకు చూడు. 5.244-263)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పార్వతి : భక్తులు ఏ పరిచర్యలవలన నీ సాయుజ్యాన్ని పొందుతారు?

శివుడు : నేను దేవతలకూ, మనుషులకూ అచింత్యుడను. యోగసాంఖ్యాలు నేను చేసినవే. నేను ఈశ్వరుడను, సనాతనుడను, అవ్యయుడను, సత్యాత్ముడను. పంచాక్షరీత్యాది మంత్రాలతో, స్మరణంచేత, నమస్కారంచేత, వివిధ సేవలచేత నియమంతో నన్ను సేవించాలి. చతురాశ్రమాలను పాటించే వారికి పాశుపతవ్రతాన్ని బోధించాను. శివలింగారాధనం, భస్మరుద్రాక్షధారణంవలన పరిశుద్ధులై అభిషేకాదులతో నన్ను ఆరాధిస్తే నా సాయుజ్యాన్ని పొందుతారు.

శివుడు : పార్వతీ! నీవు నారీ శిరోమణివి. నీవలన స్త్రీధర్మాలను వినవలెనని నా కోరిక. వాటిని నీవు నాకు తెలుపుము.

పార్వతి : ప్రభూ! మీరు సర్వజ్ఞులు. మీకు చెప్పేటంతటిదానిని కాను. అయినా మీ ఆజ్ఞను పాటించి నా నేర్చినంత చెప్పుతాను అని పార్వతి గంగాది నదులతో సంప్రదించి పతివ్రతాధర్మాలను చెప్పటం ప్రారంభించింది. కన్యాదానం జరిగిన తరువాత స్త్రీకి భర్త అధికారి. ఆమె భర్తను దైవంగా భావించాలి. అతడి అభిప్రాయాన్ని అనుసరించి దైవపితృకార్యాలు చేయాలి. భర్తకు మేలే చేయాలి. ఆమెను పతివ్రత అంటారు. ఆమెకు ఇహపరలోక సుఖాలు లభిస్తాయి. స్త్రీ గృహనీతి విద్యకు ఆచార్యకం. వంటచేయటం, కాపురం చేయటం ఆమె కర్తవ్యం. భర్త ఎటువంటివాడైనా, ఎట్టి స్థితిలో ఉన్నా అతడిని ఆమె గౌరవించాలి. జంతువులకు బలి, బీదవారికి భిక్షం తప్పక ఇయ్యాలి. భార్యకు భర్తయే గతి. అక్రమంగా ప్రవర్తించే స్త్రీలు మూడురకాలు. 1.ఆసురి, 2.పైశాచి, 3.రాక్షసి. ఆసురి చంచల మనస్సుతో ధనవ్యయం చేస్తుంది. పైశాచికి కోపం అధికం. రాక్షసి కలహప్రియ. వీరు భర్తవంశంవారిని పాడుచేసి తాము పాపలోకానికి పోతారు. ఈ ముగ్గురూ పశ్చాత్తాపంతో ధర్మమార్గంలో నడిస్తే పాపాలు పోగొట్టుకొని భర్తతో కలిసి స్వర్గానికి పోతారు. సతికి పతితో సహగమనం స్వర్గాన్ని కలిగిస్తుంది. సంతానవతికి సహగమనం ధర్మం కాదు.

శివపార్వతుల సంవాదం విన్నవారికి సర్వశుభాలు కలుగుతాయని పరమేశ్వరుడు ప్రకటించాడు. నారదుడు చెప్పిన ఈ అద్భుత వృత్తాంతాన్ని భీష్ముడు ధర్మరాజుకు వినిపించాడు.

ప్రశ్న 82 : మోక్షం ఎట్లా కలుగుతుంది?

ఉత్తరం : విష్ణుమూర్తిని మనస్సులో మననం చేయటంవలన, పుష్పాదులతో అర్చించటంవలన, కీర్తనచేయటంవలన, అతడి పుణ్యకథలు వినటంవలన మోక్షం కలుగుతుంది. అంతేకాక పండితులను, విద్వాంసులను కాపాడుటచేత పుణ్యం లభిస్తుంది.

ప్రశ్న : దారిద్ర్యం, దుఃఖం పోగొట్టే జపం ఏది?

ఉత్తరం : ఓం నమో భగవతే వాసుదేవాయ, నమః పురుషోత్తమాయ, నమ స్సర్వలోక గురవే, నమ స్సర్వలోక పిత్రే, నమ స్సర్వలోక పితామహాయ, నమ స్సర్వలోక ప్రపితామహాయ, నమ స్సర్వలోక ప్రధానాయ, నమ స్సర్వలోకేశ్వరాయ, నమ స్సర్వలోక విశిష్టాయ, నమ స్సర్వలోక సుఖప్రదాయ, నమ స్సర్వలోక కర్త్రే, నమ స్సర్వలోక భర్త్రే, నమ స్సర్వలోక హర్త్రే, నమ స్సర్వలోక నిధయే, నమ స్సర్వలోక నిధానాయ, నమ స్సర్వలోక హితాయ, నమ స్సర్వలోక హితకరాయ, నమ స్సర్వలోకోద్భవాయ, నమ స్సర్వలోకోద్భవకరాయ, నమో విష్ణవే, ప్రభవిష్ణవే" అని (విష్ణుసహస్ర నామాలు జపించటమే మహాజపం. (వివరాలకు చూడు. 5.314)

ప్రశ్న 84 : లోకాలన్నిటికీ మహనీయమై ఆశ్రయించి అనుభవించదగిన దైవం ఎవరు? అర్చనతో, స్తుతితో ఎవరిని కొలిస్తే జనులు శుభాన్ని పొందుతారు? అనేక ధర్మాలలో ఉత్తమమైన అభిమతాన్ని చూరగొనేది ఏది? జపాలన్నిటిలో ఉత్తమజపం ఏది? తనను జపించేవారికి జన్మనూ, సంసార బంధాలనూ పోగొట్టేది ఏది?

ఉత్తరం : సమస్త జగత్తులకు ప్రభువు, దేవదేవుడు, అనంతుడు, పురుషోత్తముడనే పేరుగలవాడి సహస్రనామాలను నిరంతరం స్తుతిస్తూ, జాగృతమనస్కుడై యజ్ఞకర్తను, అవ్యయుడైన అతడిని అర్చనం చేస్తూ, అచంచల ధ్యానంతో నమస్కరిస్తూ, ఆద్యంతాలు లేని ఆ విష్ణుదేవుడిని, సర్వలోకాధ్యక్షుడిని, బ్రహ్మణ్యుడిని, త్రిలోకకీర్తివర్ధనుడిని, సర్వధర్మాలు తెలిసినవాడిని, దయామయుడిని, లోకనాథుడిని, పంచభూతాల ఉత్పత్తికి కారకుడైనవాడిని నమ్మి భక్తితో సేవిస్తే అతడు దుఃఖాలనన్నింటిని తొలగదోస్తాడు. పుండరీకాక్షుడిని స్తుతిస్తూ పరమభక్తితో పూజించటమే నా మతం. ధర్మజా! ధర్మా లన్నింటికంటె ఉత్తమ ధర్మం ఇదే అని తెలిసికొనుము. పరబ్రహ్మమైన ఆ విష్ణుదేవుడి సహస్రనామ సంకీర్తనం, పాపాలను, భయాలను పోగొట్టుతుంది. సకల సంపదలను సమకూరుస్తుంది. 'విశ్వంబు, విష్ణుండు, వషట్కారుండు, భూత భవ్యభవత్ప్రభుడు' మొదలైన నామాలతో మొదలుపెట్టి 'రథాంగపాణి, అక్షోభ్యుడు, సర్వప్రహరణాయుధుడు' అనే నామాలు తుదిగాగల సహస్రనామాలను భీష్ముడు ఉపన్యసించాడు. తరతరాలుగా ఆ సహస్రనామాలు ప్రసిద్ధికెక్కాయని తెలిపాడు. విష్ణుసహస్ర నామాలను నిత్యం పఠించిన మనుష్యుడు ఇహపర శుభాలను పొందుతాడు. చతుర్వర్ణాల వారికీ బహువిధ లాభాలు కలుగుతాయి. చతుర్విధ పురుషార్థ ఫలసిద్ధి కలుగుతుంది. సర్వవిధ అరిష్టాలకూ దుఃఖాలకూ దూరమైనవారు పరమపదం పొందుతారు. విష్ణు వొక్కడే మహాభూతం. భూతములెన్ని ఉన్నా త్రిలోకవ్యాప్తుడుగా ఆయన విస్తరించి ఈ విశ్వాన్ని అనుభవిస్తాడు. ధర్మరాజా! వ్యాసవిరచితమైన విష్ణు సహస్రనామాలను పఠించి శుభాలు సుఖాలు అనుభవించుము.

ప్రశ్న 85 : పూజా నమస్కార గౌరవాలు ఎవరికి చేయాలి? ఎవరికి చెడు చేస్తే కీడు కలుగుతుంది? ఎవరు సంతోషిస్తే శుభాలు కలుగుతాయి?

ఉత్తరం : పూజా నమస్కారాలకు బ్రాహ్మణులు తగినవారు. వారికి అశుభం కలిగితే ఇంద్రుడికి కూడా కీడు కలుగుతుంది. వారికి సంతోషం కలిగితే అన్ని శుభాలు కలుగుతాయి.

ప్రశ్న 86 : బ్రాహ్మణులలో మెచ్చుకొనదగిన ప్రవర్తన ఏమున్నది?

ఉత్తరం : ఈ ప్రశ్నకు పవనార్జున సంవాదం అనే ఇతిహాసం చక్కని ఉదాహరణం. వేయిభుజాలుగల కార్తవీర్యార్జునుడు సప్తద్వీపాలకు అధిపతి అయి తనంత వారెవ్వరూ లేరని గర్వించాడు. ఒక భూతం బ్రాహ్మణుల అధిక్యాన్ని గురించి అతడికి చెప్పింది. బ్రాహ్మణులు రాజులను ఆశ్రయించి జీవిస్తారని అతడు ఆ ప్రతిపాదనను తిరస్కరించాడు. ఆ సమయంలో వాయువు చొరవతీసుకొని బ్రాహ్మణశక్తివలననే రాజులు ప్రజలను రక్షిస్తున్నారనీ, బ్రాహ్మణులను మించినవారు లేరనీ పేర్కొన్నాడు. గౌతముడు, భృగుమహర్షి, ఉచథ్యుడు, అగస్త్యుడు, వసిష్ఠుడు, అత్రి, భార్గవచ్యవనుడు, దత్తాత్రేయుడు మొదలైనవారి మహిమలు చెప్పి బ్రాహ్మణులను దైవస్వరూపులుగా భావించి వారి నీడలో ప్రకాశించటం శుభమని వాయువు హితవు చెప్పాడు. కార్తవీర్యార్జునుడు వాయువు మాటలలోని సత్యాన్ని గ్రహించి బ్రాహ్మణులను గౌరవించాడు.

ప్రశ్న 87 : పితామహా! బ్రాహ్మణ ప్రభావాన్ని ఇంకా వివరించుము.

ఉత్తరం : సూర్యుడు దక్షిణగోళం చివర ఉన్నాడు. నాకు దేహానికి, మనస్సుకు, మాటకు బలం తగ్గుతున్నది. నీవు శ్రీకృష్ణుడిని కోరితే అతడు బ్రాహ్మణుల గొప్పతనాన్ని గురించి వివరిస్తాడు. నేను శ్రీకృష్ణుడిని బాగా ఎరుగుదును. ఆదివరాహ రూపంలో భూమిని ఉద్ధరించిన విష్ణువు అతడే. అతడి లీలలవలననే పంచభూతాలు ఉద్భవించాయి. అతడి నాభికమలం నుండి పుట్టిన బ్రహ్మ ఈ లోకాలను సృష్టించాడు. శ్రీకృష్ణుడి లీలలు సామాన్యమైనవి కావు. ధర్మాలకు రాక్షసులవలన గ్లాని కలిగితే తాను అవతరించి అసురులను సంహరించి ధర్మాన్ని, ధర్మాత్ములను కాపాడుతాడు. శ్రీకృష్ణుడు శుచి, సర్వవ్యాపి, శివుడు. అతడే దిక్పాలకుడు, విశ్వనాథుడు, కాలస్వరూపుడు, దిక్కులు మొదలైన సమస్తం అతడే, అతడు యజ్ఞపురుషుడు, సర్వమంత్ర తంత్రగమ్యుడు, ఋగ్వేదం శ్రీకృష్ణుడి మాహాత్మ్యాన్ని కీర్తించింది. సర్వవేదాలూ అతడి తత్త్వాన్నే ప్రతిపాదిస్తాయి. యజ్ఞంలో అగ్నీ, యజమానుడూ, ఆహుతులూ, యాగఫలం కూడా కృష్ణుడే. సూర్యచంద్ర నక్షత్రాలలోని వెలుగు అతడే. అతడే పరంజ్యోతి. స్వర్గం, అమృతం, వేదాంత వేద్యుడు అతడే.

ప్రశ్న 88 : శ్రీకృష్ణా! బ్రాహ్మణ మాహాత్మ్యాన్ని వివరించ కోరుతున్నాను.

ఉత్తరం : నే నిదివరలో ప్రద్యుమ్నుడికి చెప్పినట్లు నీకు వివరిస్తాను. వేదత్రయ విజ్ఞానాన్ని సంపాదించాలన్నా, మోక్షాన్ని సాధించాలన్నా, పితృదేవతల దయ పొందాలన్నా, ఐహిక సుఖాలు గడించాలన్నా బ్రాహ్మణులను ఆశ్రయించాలి. ఆయురారోగ్య యశస్సంపదలు వారివలన లభిస్తాయి. కోరితే వారు వరాలు ఇవ్వగలరు. కోపిస్తే భస్మం చేయగలరు. వారికి ఉన్నదానిలో దానం చేసివారిని తృప్తిపరిస్తే ఇహపరసుఖాలు కలుగుతాయి. నీ కొక ఆశ్చర్యకరమైన వృత్తాంతాన్ని చెప్పుతాను వినుము. స్వతంత్రవర్తనుడైన దుర్వాసుడు ఒకసారి మా ఇంటికి వచ్చాడు. చిత్రవిచిత్రంగా వ్యవహరించాడు. ఒకసారి ఒంటినిండా పాయసాన్ని పూయించుకొన్నాడు. రథానికి రుక్మిణిని కట్టి లాగించి బాధించాడు. ఆమె మూర్ఛపోగా రథాన్ని వదలి వెడలిపోయాడు. నేను అతడివెంట వెళ్ళి అనునయించి ప్రార్థించాను. అతడు ప్రసన్నుడై 'అందరూ తమను తాము ఎంత ప్రేమించుకొంటారో అంతగా నిన్నుకూడా ప్రేమించి పూజిస్తా' రని వరం ఇచ్చాడు. పాయసం అరికాలికి పూయలేదని చెప్పి దానివలన నాకు ప్రమాదముంటుందని సూచించాడు. రుక్మిణికి అపూర్వ సౌందర్యాన్నీ, భర్తృవాల్లభ్యాన్నీ ప్రసాదించాడు. కాబట్టి బ్రాహ్మణులపట్ల భక్తి కలిగి ఉండడంవలన శుభాలు చేకూరుతాయి. (అని ప్రద్యుమ్నుడికి వలెనే ధర్మరాజుకు కూడా శ్రీకృష్ణుడు బ్రాహ్మణ మాహాత్మ్యాన్ని ప్రబోధించాడు).

ప్రశ్న 89 : దుర్వాసుడు శివాంశసంభూతు డని వింటూంటాం. శివుడి మహిమను గురించి వివరించుము.

శ్రీకృష్ణుడు : ఎవరు శివుడిని మనస్సులో నిలుపుకొని శతరుద్రీయ మంత్రాన్ని జపిస్తారో వారు ఇహపరసుఖాలు పొందుతారు. శివుడు మహాదేవుడు. దానికి మించిన పేరు మరొకటి లేదు. అతడి మూడవ కంటిమంట ధర్మవిరోధులను కాల్చివేస్తుంది. దక్షాధ్వరధ్వంస వృత్తాంతం ప్రసిద్ధం కదా! త్రిపురాసుర సంహారం ఆ దేవుని ప్రతాపానికి చిహ్నం. త్రిపురాసురులను సంహరించిన అస్త్రాన్ని, ఆ దేవుడు ఒడిలో పెట్టుకొనగా, అది బాలుడుగా మారింది. ఆ బాలుడే దుర్వాసుడు.

ప్రశ్న 90 : శివుడి ప్రధాన నామాలు స్తుతిస్తే భోగమోక్షాలు కలుగుతాయి అంటారు. వాటి వ్యుత్పత్తిని తెలిపి నాకు బోధించుము.

శ్రీకృష్ణుడు : శివనామాలన్నీ చెప్పి వివరించటానికి నాకు గానీ, బ్రహ్మకుగానీ సాధ్యం కాదు. కానీ, నీ వడిగావు కాబట్టి నేను ఎరిగినంతవరకు చెప్పుతాను. శివుడు సార్థకనాముడైన మహేశ్వరుడు. ఉగ్రత్వము, ఉన్నత ప్రతాపం ఉండటంచేత

రుద్రు డయ్యాడు. దేవతలలో కెల్ల గొప్పవాడు కావున మహాదేవు డయ్యాడు. సత్కర్మఫలాలైన శుభాలు కలిగినవాడు కావటం చేత శివుడయ్యాడు. సుస్థిర తేజస్సుతో వెలుగొందటంవలన స్థాణు డయ్యాడు. స్థావర జంగమాత్మక రూపాలనన్నింటిని పొందటంచేత బహురూప నామధారి అయ్యాడు. పొగరంగువంటి జటలు కలిగినవాడు కావటంచేత ధూర్జటి అయ్యాడు. విశ్వులనే దేవతలు అతడియందు పుట్టారు కాబట్టి అతడు విశ్వరూప నామధేయు డయ్యాడు. తన శరీరంలో బహునేత్రా లుండటంవలన సర్వతశ్చక్షువనే నామంతో ఒప్పుతున్నాడు. భూతములన్నీ పశువులై తాను వాటికి పతి కావటంచేత పశుపతి అయ్యాడు. నందివాహనుడు కావటంచేత వృషవాహను డయ్యాడు. ప్రాణులను సమభావంతో పాలిస్తాడు కాబట్టి మృత్యువయ్యాడు. ఇవన్నీ వేదాలలో చెప్పిన శివనామాలు. ఇంకా ఎన్నో పేర్లు శివుడికి ఉన్నాయి. వేదవేత్తలు వాటిని తెలిసి శివానందులై విహరిస్తారు. శివనామావళిని భక్తితో చదివినా, విన్నా సౌఖ్యానందాలు జనులు పొందుతారు. వ్యాసమహర్షి లోకహితం కొరకు శివస్తుతిని పఠనీయంగా అందించాడు. దాని భావ మిది - సర్వజగత్తుకు నిత్యసాక్షి, లోకైక శుభావహమూర్తి, నిరామయుడు, పంచభూతాలకు మూలమైనవాడు, ఉదాత్తభూతము, శివుడు, ఫాలాక్షుడు. తనను భక్తితో సేవించేవారికి భవబంధమోక్షాన్ని కలిగించేవాడు. తన పదములపై మనస్సు నిలిపేవారికి ఉత్తమ పదాలను ప్రసాదించేవాడు ఆ మహాదేవుడు. ఈ స్తుతిని చేసేవారికి శివుడు ఆయురారోగ్యైశ్వర్యాదులను ప్రసాదిస్తాడు.

ప్రశ్న 91 : పితామహా! ధర్మాలు అనేక విధాలుగా ఉంటాయి. వాటిలో ఆచరించదగిన ఉత్తమ ధర్మం ఏది?

భీష్ముడు : ధర్మవేత్తలు ధర్మమంటే ఏమిటో చెప్పుతారు. కాలం గడచిన కొద్దీ మరొక విధంగా మారుతుంది. ఒక్కొక్కసారి అధర్మమే ధర్మంగా మనసుకు స్ఫురిస్తుంది. నిశిత పరిశీలనం లేకపోవటంవలన ధర్మానికి సంబంధించిన విశేషాలు తప్పుగా చెప్పటంచేత ధర్మం మార్గం తప్పుతుంది. దానివలన దోషం ఏర్పడుతుంది. దానివలన ధర్మాచరణ పరులు కష్టాలకు లోనౌతారు. కాబట్టి ధర్మం సూక్ష్మ ప్రకారం కలది. వేదవిదులైన సజ్జనులనుండి వివరాలను తెలిసికొనాలి.

ప్రశ్న 92 : వేదాలలో చెప్పబడిందీ, ఎదుట కనబడేదీ, ఆచరణలో ఉన్నదీ - అని ధర్మం వేరువేరుగా ఉండి చీకాకు కలిగిస్తుంది. ధర్మసూక్ష్మతతో ఈ మూడింటిలో సరి అయినది ఏదో తెలియటం కష్టంగా ఉన్నది.

ఉత్తరం : ఈ మూడువిధాలూ ధర్మవిశేషాన్ని తెలిసికొనటంలో మూడు దశలు. ధర్మరాజా! అహింస, దానం, సత్యం, క్రోధపరిత్యాగం అనేవి ఉత్తమ ధర్మాలు. ఇది ధర్మానికి పరసీమ. దీనిని మనస్సులో నిలుపుకొమ్ము.

ప్రశ్న 93 : ఎవరు ధర్మంపట్ల ఈర్ష్య వహిస్తారు? ఎవరు దానిని ఉపాసిస్తారు? ఈ ఇరు తెగలవారూ పొందే గతులు ఎటువంటివి?

ఉత్తరం : రజస్తమోగుణ వికారాలు గల మనస్సున్నవారు ధర్మాన్ని ద్వేషిస్తారు. వారు నరకానికి వెళ్ళుతారు. సత్యవ్రతులు ధర్మాన్ని ఉపాసిస్తారు. వారు ఊర్ధ్వలోకాలకు పోతారు.

ప్రశ్న 94 : సాధులు, అసాధులు - అనేవారు ఎట్టివారు?

ఉత్తరం : అసాధువులు తమంత తాము తెలిసినవారు కారు. ఇతరులు బోధించిన సదుపదేశాలను గ్రహించలేరు. సాధువులు అట్లా కాదు. వారు స్వయంగా తెలిసినవారు; ఇతరులు మంచి చెప్పగా స్వీకరిస్తారు. వారు శిష్టులతో కలిసి భుజిస్తారు. తగినవారికి దారి ఇచ్చి గౌరవిస్తారు. తగనిచోట్ల మలమూత్రాలు విడువరు. సత్యాన్ని,

ఋజుమార్గాన్ని అనుసరిస్తారు. రక్షణకోరిన వారిని కాపాడుతారు. సరసభోజనం, భార్యాసంభోగం, గురువులను గౌరవించటం, నిర్మలహృదయాలను, నిత్య సంతోషాన్ని కలిగి ఉండటం వారి లక్షణాలు. వారు విషయ చాపల్యాన్ని వదలుతారు. పాపాలకు ప్రాయశ్చిత్తం చేసికొంటారు. ధర్మాన్ని అప్రకాశంగా ఆచరిస్తారు. భూతదయను ప్రదర్శిస్తారు.

ప్రశ్న 95 : లోకంలో కొందరికి ప్రయత్నం లేకుండానే ధనం లభిస్తుంది. ధర్మాన్ని ఆచరించేవారు, నీతి తెలిసినవారు పెక్కు మంచి పద్ధతులతో ధనాన్ని కోరినా అది లభించదు. కొందరికి అది లభించినా అది వారి సౌఖ్యానికి ఉపయోగపడదు. గురుబోధ ఎక్కువగా లేకపోయినా కొందరికి విద్య అలవడుతుంది. కొందరు బోధ పొందికూడా దుర్విద్యులౌతున్నారు. కొందరు రోగాలపాలబడి దెబ్బలు తినకుండా చావరు. కొందరు గడ్డిపరక తగలటంచేతకూడా మరణిస్తారు. ఇట్లా జరగటానికి గల కారణ మేమి?

ఉత్తరం : విత్తు లేకుండానే చెట్టు మొలుస్తుందా? అట్లాగే పూర్వజన్మలో చేసిన కర్మ ఈ జన్మలో ఫలాన్నిస్తుంది. గతంలో దానాలవంటి సత్కార్యాలు చేస్తే ఈ జన్మలో ప్రయత్నం లేకుండానే కోరికలు ఫలిస్తాయి. పూర్వజన్మలో తపస్సులు చేసే ఈ జన్మలో అనేక సౌఖ్యాలూ, గురుసేవ చేస్తే విద్యాబలం, అహింస పాటిస్తే నిండు సుఖజీవితం లభిస్తాయి. అటువంటివి పూర్వజన్మలో చేయకపోతే ఈ జన్మలో అనేక కష్టాలు కలుగుతాయి. ఎల్లప్పుడూ ధర్మం మీద నిష్ఠ కలవాడికి కాలమే ధర్మరహస్యాన్ని కలిగిస్తుంది. ధర్మసాధనవలన మానవుడు ఇహలోకంలో శాంతినీ, పరలోకంలో ఆనందాన్నీ పొందుతాడు. మోక్షాన్ని సాధిస్తాడు.

ధర్మరాజా! వేదవ్యాస మునీంద్రుడు నీకు మార్గదర్శి. శ్రీకృష్ణుడు నీకు ఆశ్రయం. అందుచేత చింత విడనాడి శాంతవృత్తితో ప్రజలను పాలించుము. నీకు సర్వత్రా విజయం లభిస్తుంది.

వేదవ్యాసుడు : భీష్మా! ధర్మరాజుకు జ్ఞానం కలిగింది. ఆ జ్ఞానం అమృతంవంటి నీ ఉపదేశంవలన సిద్ధించింది. అతడి సోదరులు, కృష్ణుడు, ఆప్తులైన రాజులు, ధృతరాష్ట్రుడు నిన్ను తగినట్లుగా గౌరవించి నీ దయకు పాత్రులయ్యారు. ఇతడికి ఇక సెలవిమ్ము, సమయం వచ్చినప్పుడు అతడు నీ వద్దకు తిరిగి వస్తాడు.

భీష్ముడు : (ఆర్ద్రమైన కన్నులతో) ధర్మరాజా! నీవు పట్టణానికి వెళ్ళుము. సర్వశుభాలూ నిన్ను పొందుగాక! నీ బుద్ధి ధర్మంలో మాత్రమే నిష్ఠమై ఉండుగాక! యయాతివలె సమగ్ర దక్షిణలతో యజ్ఞాలు నిర్వహించుము. రాజధర్మాలతో ప్రజలను రంజింపజేయుము. ఫలవృక్షాన్ని పక్షులు చేరి సుఖించేటట్లుగా నీ బంధువులు, స్నేహితులు నిన్ను ఆశ్రయించి సుఖిస్తారు గాక! సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించటం తెలిసికొని నా వద్దకు రమ్ము. ఇక వెళ్ళుము. నీవూ, నీ తమ్ములూ, ధృతరాష్ట్రుడూ సుఖంగా ఉండండి.

ధర్మరాజు పులకితుడై, ఆనందంతో దండప్రణామం చేసి 'అట్లే చేస్తాను' అని అనుమతి తీసికొని కృష్ణాదులందరితో కూడి హస్తినాపురం చేరాడు. భీమాదులు తనను సేవిస్తూ ఉండగా ధర్మరాజు పట్టాభిషేక సమగ్ర రాజ్యాధికారాన్ని పొంది మనస్సులో ఊరటచెంది ఆనందించాడు. సమగ్రరాజ్యాన్ని స్వీకరించి, ప్రజలు మెచ్చుకొనేటట్లు పాలిస్తూ ఏభైదినాలు గడచిన తరువాత సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించాడని తెలిసికొని భీష్ముడిని దర్శించటానికి బయలుదేరాడు.

భీష్మ నిర్యాణం:

గాంధారీ, ధృతరాష్ట్రుడూ, కుంతీ ముందు నడువగా, శ్రీకృష్ణాది బంధువర్గం, ధౌమ్యాది పురోహితవర్గం వెంట నడువగా భీష్ముడు శయనించి ఉన్న అంపతల్పం వద్ద ధర్మరాజు చేరాడు. ధ్యానమగ్నుడై ఉన్న భీష్ముడికి తన రాకను,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బంధువుల రాకను ఎరిగించాడు. మాఘమాసం శుక్లపక్షం వచ్చినదని భీష్ముడు సంతోషించాడు. అందరినీ ఆదరంగా చూచాడు. ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'ధృతరాష్ట్రా! నీవు వేదశాస్త్రాలు చదివావు. వ్యాసాదులు బోధించిన ధర్మాలు విన్నావు. పాండవులను పుత్రప్రేమతో పాలించుము. ధర్మరాజు నీ పట్ల భక్తి ప్రేమలు కలవాడు. అవినీతులై దుర్యోధనాదులను గురించి విచారింపకుము.'

ఆ తరువాత శ్రీకృష్ణుడివైపు చూచి భక్తితో ఇట్లా పలికాడు. 'దేవదేవ! జీవాత్మక! దేవవంద్య! శంఖచక్ర గదాపద్మ చారుహస్త! వాసుదేవ! త్రివిక్రమ! వరద! పరమపురుష! ఇవే నా ప్రణతులు. కరుణించుము. నీవే నాకు బలం. నేను నీ భక్తుడను. ఆలుబిడ్డలు లేనివాడను, మిక్కిలి దయతో కాపాడి నాకు అనుజ్ఞనిమ్ము! మాధవా! పాండవులకు నీవే దిక్కు. శ్రీకృష్ణు డే పక్షంలో ఉంటే ఆ పక్షంలో విజయం తథ్యమని నేను దుర్యోధనుడికి చాలాసార్లు చెప్పాను. కాని, అతడు వినలేదు. తనవారిని నశింపజేసి, తానూ నశించాడు. నీ వెవరో నాకు తెలుసు. నరనారాయణులు లోకరక్షణార్థం అవతరించి భూతలంమీద తిరుగుతారని వ్యాసనారద మహర్షులు నాతో చెప్పారు' అని అన్నాడు.

శ్రీకృష్ణుడిని భీష్ముడిని అత్యాదరంతో చూచి ఇట్లా పలికాడు. 'శాంతనవా! నీయం దే దోషమూ లేదు. పైగా పితృభక్తితో మరణాన్ని సైతం నీ అదుపులో పెట్టుకొనగలిగావు. నీకు నేను అనుజ్ఞ ఇచ్చాను. నీతోడివారైన వసువులను కలిసికొనుము' అన్నాడు.

భీష్ముడు సంతోషించి పాండవులను, ధృతరాష్ట్రుడు మొదలైనవారిని చూచాడు. 'మీరుకూడా ఆజ్ఞ ఇచ్చినట్లే కదా!' అని అడిగాడు. అందరినీ ఆలింగనం చేసికొన్నాడు. క్రౌర్యం మాని, సత్యాన్ని నిత్యం పాటించండని పలికాడు. బ్రాహ్మణులను గౌరవించుమనీ, యజ్ఞాలు చేయుమనీ ధర్మరాజుతో పేర్కొని మౌనం తాల్చాడు. ధారణ అనే యోగ విశేషం చేత సమాధిలోనికి వెళ్ళి ప్రాణవాయువులను శరీరంనుండి వెడలించాడు. శరీరంలో ఉన్న బాణాలు రాలిపోయాయి. అది చూచి అందరూ ఆశ్చర్యపడ్డారు. భీష్ముడి ఆత్మ అతడి కపాలాన్ని చీల్చికొని నక్షత్రంవలె ఎగిరిపోయింది. దేవతలు పూలవాన కురిపించారు. వాద్యాలు మ్రోగించారు. భీష్ముడిని స్తుతించారు. ఈ విధంగా భీష్ముడు స్వర్గగతు డయ్యాడు.

పాండవులూ, ధృతరాష్ట్రుడూ రాజలాంఛనాలతో చందన కాష్ఠాలతో కూర్చిన చితిపై భీష్ముడి శరీరాన్ని ఉంచి దహన సంస్కారం చేశారు. గంగను చేరి తిలోదకా లిచ్చారు. గంగాదేవి పుత్రశోకంతో విలపించింది. భీష్మ వ్యక్తిత్వాన్ని కీర్తించింది. శ్రీకృష్ణుడూ, కృష్ణద్వైపాయనుడూ ఆమెను ఓదార్చారు.

'అతని శిఖండి యేల? యమరాధిపుఁడున్ సమయింపఁ జాలునే?
యతఁడు నిజేచ్ఛఁ జేసి నరునంచిత దివ్యశరంబు లంగ సం
గతములు చేసి పొన్పుగ సుఖస్థితి మృత్యువు మాన్చియుండి కీ
ర్త్యతిశయ మొంది తా వలచినప్పుడు పోయె; విషాద మేటికిన్?' **(ఆను.5.480)**

అని శ్రీకృష్ణుడు భీష్మచరిత్రకు భరతవాక్యం పలికాడు.

శ్రీమదాంధ్ర మహాభారతము
ఆనుశాసనిక పర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
గౌతమీ లుబ్ధక సర్ప మృత్యు కాల సంవాదము	13-1-9	3
అగ్నిదేవుఁడు సుదర్శన యనుకన్యను వివాహంబు సేసికొనుట	13-2-12	14
సుదర్శను నింటికి ధర్మదేవత యతిథియై వచ్చుట	13-2-48	23
ఇంద్రమతంగసంవాదం బను నితిహాసప్రకారము	13-3-8	31
విశ్వామిత్రునకు బ్రాహ్మణ్యంబు గలిగిన తెఱంగు	13-3-1	37
వీతహవ్యుం డనురాజునకు బ్రాహ్మణత్వము గలిగిన ప్రకారము	13-8-1	42
భీష్ముండు ధర్మరాజునకు దైవపౌరుషంబుల తెఱం గెఱింగించుట	13-6-1	48
భీష్ముఁడు ధర్మజున కాశ్రయం బెప్పుడు నపరిత్యాజ్యం బని చెప్పుట	13-11-1 (కుంభ)	54
విభునకుం బాటింపవలయువారిని భీష్ముఁడు ధర్మజునకుఁ జెప్పుట	13-8-1	56
భీష్ముఁడు ధర్మరాజునకుఁ బరమమైన ధర్మంబు సెప్పుట	13-18-1(కుంభ)	58
భీష్ముఁడు ధర్మజునకు గరుత్మంతుని చరిత్రంబు సెప్పుట	18-19-1(కుంభ)	61
61కద్రువ తనకొడుకులకు జనమేజయునివలన నాశనంబు గల్గునట్లు శపించుట	13-23-1(కుంభ)	71
కశ్యపుఁడు గరుడునకు గజకచ్ఛపంబుల తెఱం గెఱింగించుట	13-25-1(కుంభ)	80
గరుడుఁ డింద్రుని జయించి యమృతంబు దెచ్చి కద్రువకుఁ జూపుట	12-28-1(కుంభ)	91
బ్రాహ్మణుఁడు హీనవర్ణునకు వైదికమంత్రంబు లుపదేశింపఁ గూడదనుట	13-10-1	100
లక్ష్మీనివాసస్థానములు	13-11-1	104
భంగాస్వనుఁ డనురాజు స్త్రీయై కుమారులం గాంచిన ప్రకారము	13-12-1	106
ఇంద్రుఁడు భంగాస్వనునకుఁ గోరినవరంబు లిచ్చి యనుగ్రహించుట	13-12-38	112
సనత్సుజాతుండు నారదున కుపదేశించిన తత్త్వప్రకారము	13-38-1(కుంభ)	118
గరుత్మంతుడు మునులకు విష్ణుదేవుని మహిమాతిశయంబు సెప్పుట	13-49-1(కుంభ)	126
విష్ణుదేవుఁడు గరుత్మంతున కుపదేశించిన యాత్మతత్త్వప్రకారము	13-43-1(కుంభ)	138

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ద్వితీయాశ్వాసము

అష్టావక్రుం డను మునికుమారు చరిత్రము	13-19-10	145
ఉత్తరదిశ యష్టావక్రుని చిత్తశుద్ధిఁ బరీక్షించుట	13-20-50	150
భీష్ముఁడు ధర్మరాజునకు దానపాత్రభూతుల తెఱం గెఱింగించుట	13-23-1	158
దైవపిత్ర్యంబు లగు దానంబులకుఁ బాత్రభూతుల నిరూపించుట	13-24-49	166
భీష్ముఁడు ధర్మరాజునకుఁ బుణ్యతీర్థవిశేషంబుల నెఱింగించుట	13-26-1	172
అత్రిప్రముఖమహర్షులు శరతల్పగతుఁడైన భీష్ముఁ జూడవచ్చుట	13-27-1	182
భీష్ముఁడు ధర్మజునకు గంగాప్రభావంబు సెప్పుట	13-27-19	183
వాసుదేవ నారద సంవాద ప్రకారము	13-66-1(కుంభ)	195
వాసుదేవ పృథివీ సంవాద ప్రకారము	13-66-1(కుంభ)	200
నారద పంచచూడా సంవాదం బను నితిహాసము	13-38-1	207
దేశశర్మ యను మునివరుభార్య రుచి యనుదాని చరిత్రము	13-40-1	212
భీష్ముఁడు ధర్మజునకు గాంధర్వాదివివాహముల తెఱం గెఱింగించుట	13-41-1	225
భీష్ముఁడు ధర్మజున కౌరసాదిపుత్ర భేదంబు తెఱంగు సెప్పుట	13-49-1	232
చ్యవన నహుష సంవాదం బను నితిహాసము	13-50-1	237
చ్యవన కుశిక సంవాదం బను నితిహాసము	13-52-1	248
చ్యవనుఁడు తనయోగబలంబునఁ గుశికునకు నాకలోకంబు సూపుట	13-54-1	258
భీష్ముడు ధర్మజునకు దానవిశేషముల నెఱింగించుట	13-92-28(కుంభ)	264
భూదాన మహిమాభివర్ణనము	13-61-1	270
నక్షత్రదాన మహిమాతిశయ నిరూపణము	13-63-1	279
తిలదాన విషయక యమ బ్రాహ్మణసంవాదము	13-67-1	291
నృగచరిత్రము	13-69-1	294
నృగుఁడు శ్రీకృష్ణువలనం బాపవిముక్తుఁడై పుణ్యలోకమునకుఁ బోవుట	13-69-28	300
గోప్రభావిషయకం బగు నౌద్దాలకిపుత్త్ర చరిత్రము	13-70-1	303
ఇంద్రునకు బ్రహ్మ చెప్పిన గోదాన విషయక వాక్యములు	13-71-5	308

తృతీయాశ్వాసము

ధర్మజునకు భీష్ముం డనుష్ఠేయంబులఁ జెప్పుట	13-74-1	315
బృహస్పతి మాంధాతకు దెలిపిన గోదానవిధి ప్రకారము	13-75-4	318
గోవులకుఁ గపిలత్వంబు సిద్ధించిన ప్రకారము	13-76-21	323
వేదవ్యాసముని శుకునకుఁ దెలిపిన గోప్రభావప్రకారము	13-80-6	332
సుమిత్రుఁ డను మునిచేఁ బోషింపఁబడిన గోవుల ప్రభావము	13-120-1(కుంభ)	341
గోవులు రంతిదేవు యజ్ఞపశువులై గోలోకంబునకుఁ బోవుట	13-123-26(కుంభ)	352
వేదవ్యాసముని శుకునకుఁ జెప్పిన కపిలగోమహానుభావము	13-126-2(కుంభ)	358
గో శ్రీ సంవాదము	13-81-2	363
భీష్ముఁడు ధర్మజునకు సువర్ణ దాన మహిమాతిశయంబు సెప్పుట	13-83-6	369
వసిష్ఠుఁడు పరశురామునకుఁ జెప్పిన సువర్ణమహిమము	13-83-40	374
భీష్ముఁడు ధర్మజునకుఁ బితృపూజావిధానం బెఱింగించుట	13-87-3	383
అత్రిమహాముని నిమి కెఱింగించిన శ్రాద్ధక్రియావిశేషము	13-91-3	394
సప్తర్షి వృషాదర్భి సంవాదం బను నితిహాసంబు ప్రకారము	13-94-4	402
వృషాదర్భి పుత్తెంచిన కృత్తి శునస్సఖునిచే మృతిఁ బొందుట	13-95-48	408
ఉపానద్దాన విషయక సూర్య జమదగ్ని సంవాదము	13-97-3	420
శూద్రున కవశ్యానుష్ఠేయం బైన ధర్మంబు నిరూపించుట	13-146-4(కుంభ)	427
సర్వవర్ణ సామాన్యధర్మ నిరూపణ ప్రకారము	13-152-1(కుంభ)	439
పరాశరమునిప్రణీత ధర్మవిశేషంబు భీష్ముండు ధర్మజునకుం జెప్పుట	13-153-1(కుంభ)	450
భీష్ముఁడు ధర్మజునకుఁ దటాకనిర్మాణ ఫలవిశేషంబు సెప్పుట	13-92-1	456

చతుర్థాశ్వాసము

ధూపదీపనైవేద్యంబుల ఫలవిశేషము భీష్ముఁడు ధర్మజునకుఁ జెప్పుట	13-155-1(కుంభ)	466
భీష్ముఁడు ధర్మజునకు నహుషుని ధూపదీపదానవిశేషంబు చెప్పుట	13-156-1(కుంభ)	477
ఇంద్రునకు గౌతమునితో నైన సంవాదము	13-159-11(కుంభ)	486
భగీరథునకు బ్రహ్మతో నైన సంవాదప్రకారము	13-190-1(కుంభ)	496
భీష్ముఁడు ధర్మరాజున కుపవాస విధివిశేషము సెప్పుట	13-163-3(కుంభ)	518
హర సనత్కుమార సంవాదప్రకారము	13-165-5(కుంభ)	528

సనత్కుమారుఁడు శివునకు దేహాంతర్గతైవతములం దెలుపుట	13-167-1(కుంభ)	541
సనత్కుమారుఁడు రుద్రునకు సాంఖ్యయోగంబు తెఱం గెఱింగించుట	13-168-1(కుంభ)	550
భీష్ముఁడు ధర్మజునకు నహింసాస్వరూప నిరూపణంబు సేయుట	13-176-6(కుంభ)	575
మాంసభక్షణ మందలి రుచివిశేషంబు మానుట దుష్కరంబని చెప్పుట	13-178-7(కుంభ)	582
వేదవ్యాసుఁడు గీటంబునకు నుత్తమజన్మంబులు గలుగ ననుగ్రహించుట	13-180-1(కుంభ)	591
వ్యాసమైత్రేయసంవాదము భీష్ముఁడు ధర్మరాజునకుఁ జెప్పుట	13-182-1(కుంభ)	597
నారదపుండరీక సంవాదం బను పరమేతిహాసప్రకారము	13-186-1(కుంభ)	604
భీష్ముఁడు ధర్మజునకు శ్రీకృష్ణుని చరిత్రంబు సెప్పుట	13-203-1(కుంభ)	617
ఉమామహేశ్వర సంవాదం బను నితిహాసంబు	13-205-1(కుంభ)	624
శివుఁడు పార్వతికిఁ దన శ్మశానవాసతకుఁ గారణంబు సెప్పుట	13-207-1(కుంభ)	633

పంచమాశ్వాసము

శివుఁడు పార్వతికి వర్ణాశ్రమాచారంబు తెఱఁ గెఱిఁగించుట	13-128-28(అను-1-15)	642
శివుండు పార్వతికిఁ దపస్స్వరూపంబు చెప్పుట	13-580-15(అను-1)	651
శివుఁడు పార్వతికి రాజత్వమహిమాతిశయంబు చెప్పుట	13-అను 1-15-895	662
శివుఁడు పార్వతికి వర్ణకర్మపరిపాకంబులతెఱం గెఱింగించుట	13-అను 1-15-1525	676
శివుడు పార్వతికి ఆయుర్వృద్ధి క్షయంబులకుఁ గారణంబులు సెప్పుట	13-అను 1-15-2300	696
శివుఁడు పార్వతికి స్వప్నాదుల తెఱం గెఱింగించుట	13-అను 1-15-2457	704
శివుఁడు పార్వతికి మానస వాచిక కాయికము లను త్రివిధ పాపములఁ దెల్పుట	13-అను 1-15-2792	712
శివుఁడు పార్వతికి దానఫలవిశేషంబుల నెఱింగించుట	13-అను 1-15-3205	720
శివుఁడు పార్వతికి ధర్మవిశేషంబుల తెఱం గెఱింగించుట	13-అను 1-15-3630	730
శివుఁడు పార్వతికి సాంఖ్యప్రకారంబు దెలుపుట	13-అను 1-15-4096	743
శివుఁడు పార్వతికి నాత్మసాయుజ్యప్రాప్తి సాధనంబులు దెలుపుట	13-అను 1-15-4336	754
పార్వతి శివునకుఁ బతివ్రతాధర్మంబుల తెఱఁ గెఱింగించుట		760
పార్వతి శివునకుఁ బతివ్రత కనర్హంబులగు ధర్మంబులఁ దెలుపుట	13-అను 1-15-4609	766
భీష్ముఁడు ధర్మజునకుఁ బరప్రాప్తిహేతుభూతం బగు జపవిశేషంబు దెలుపుట	13-అను 1-17-5	770
భీష్ముఁడు ధర్మజునకు విష్ణుమంత్రధ్యానం బవశ్యానుష్ఠేయం బని చెప్పుట	13-135-4	776
భీష్ముఁడు ధర్మజునకు విష్ణునామప్రభావంబుఁ దెలుపుట	13-135-121	779

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బ్రాహ్మణపూజానమస్కారంబులు బరమోత్కృష్టంబులని చెప్పుట	13-136-1	784
పవన కార్తవీర్యార్జున సంవాదంబు భీష్ముండు ధర్మరాజునకుం జెప్పుట	13-137-2	785
పవనుఁడు కార్తవీర్యార్జుననకు నత్రిప్రభృతులమహిమ చెప్పుట	13-141-1	790
భీష్ముండు ధర్మజునకుఁ గృష్ణుని ప్రభావం బుపన్యసించుట	13-143-3	794
కృష్ణుఁడు ధర్మరాజునకు బ్రాహ్మణప్రభావంబు చెప్పుట	13-144-1వి	797
దుర్వాసుఁడు కృష్ణునిమనశ్శుద్ధి పరీక్షించి యనుగ్రహించినప్రకారము	13-144-14	799
కృష్ణుఁడు ధర్మజునకు శివునిమహిమ చెప్పుట	13-145-3	804
కృష్ణుఁడు ధర్మజునకు శివనామనిర్వచనంబు చెప్పుట	13-266-1 (కుంభ)	808
భీష్ముఁడు ధర్మజునకు ధర్మసూక్ష్మ ప్రకారంబు చెప్పుట	13-147-10	812
భీష్ముఁడు ధర్మజునకు సాధ్వసాధుజనుల నిరూపించి చెప్పుట	13-148-8	818
శుభాశుభంబులు పూర్వజన్మకృతపుణ్యాపాపంబులచేఁ గల్గునని చెప్పుట	13-149-10	820
భీష్ముఁడు ధర్మజు నూఱడించి కరిపురంబునకుఁ బంపుట	13-152-5	824
ధర్మజుఁడు కృష్ణాదులఁ దోడ్కొని భీష్మునియొద్దకుం బోవుట	13-153-6	827
భీష్ముఁడు శరీరంబు విడుచుటకు శ్రీకృష్ణునను జ్ఞ గొనుట	13-153-36	832
భీష్ముఁడు శరీరంబు విడిచి నాకలోకగతుం డగుట	13-153-46	834
పరలోకగతుండైన భీష్మునకు నగ్నిసంస్కారంబు చేయుట	13-154-8	836
పుత్రశోకాతురయైన గంగాదేవి కృష్ణాదులం గనుంగొని దుఃఖించుట	13-154-18	838
పుత్రమరణ దుఃఖితయగు గంగను గృష్ణద్వైపాయను లూఱడించుట	13-134-26	840

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆనుశాసనిక పర్వము - ప్రథమాశ్వాసము

శ్రీ మత్కటాక్షరోచి । స్తోమ సముల్లాస విహిత సుస్థిర లక్ష్మీ
భూమానందిత భక్త! వ్యామోహ విదూరయుక్త! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: హరిహరనాథా!= విష్ణు శివస్వరూపుడవైన ఓ పరబ్రహ్మమా! శ్రీమత్=మంగళకరమైన, శోభాజనకమైన; కటాక్షరోచిస్= కడగంటిచూపుల వెలుగులయొక్క; స్తోమ= సముదాయంయొక్క; సముల్లాస= వికసనంచేత; విహిత= కలిగించబడిన; సుస్థిర= మిక్కిలి శాశ్వతమైన; లక్ష్మీ= సంపత్తియొక్క; భూమ= అతిశయంచేత; ఆనందిత భక్త!= సంతోషపరచబడిన భక్తులు కలవాడా!; వ్యామోహవిదూర= అజ్ఞానమునకు దూరగు లెవ్వరో వారితో; యుక్త!= కూడినవాడా!

తాత్పర్యం: దేవా! హరిహరనాథా! మంగళకరములైన నీ దయాదృక్కులు తమమీద పొలయుటచేత నీ భక్తులు సుస్థిర లక్ష్మీ సంపన్నులై పరమానంద భరితులవుతారు. స్వామీ! నీవు వ్యామోహరహితులైన జ్ఞానులతో కూడిఉంటావు.

విశేషం: 1. పై రెండూ హరిహరనాథుడికి సంబోధనలు. మొదటిది భగవంతుడి నేత్ర సౌందర్యాన్ని వర్ణిస్తుంది. ఆ నేత్ర సౌందర్యమే భక్తులకు జ్ఞాన ప్రదాయకమై వారి వ్యామోహాన్ని దూరంగా తొలగిస్తున్నది. మొదటి సంబోధన భగవంతుడి సగుణ రూపాన్ని వర్ణిస్తే, రెండవ సంబోధన ఆయన కేవలం ఆనంద స్వరూపుడని నిర్గుణ తత్త్వాన్ని వర్ణిస్తున్నది.

2. "ఈ పర్వమునకు సంస్కృత ప్రతులన్నిటిలోను 'అనుశాసన పర్వము' అనియే వ్యవహారము. వి.వి.శాస్త్రి ప్రతియందు 'అనుశాసన', ఆనుశాసనిక' - అను రెండు పేర్లును గలవు. నన్నయభట్టు 'ఆనుశాసనిక' మనియే వాడినాడు" (1-1-33 & 60)' (ఉస్మానియా సంశోధిత ముద్రిత ప్రతి పుట 1.)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు దివ్యజ్ఞాన దేదీప్యమానుండైన దేవవ్రతుండు వివరింప వివిధంబులగు ధర్మంబు లాకర్ణించి, యజాతశత్రుం డతనికి సభక్తిక ప్రణామం బాచరించి, వినయ విశేష విభూషితుండై. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా (తిక్కన తాను చెప్పే తెనుగు భారతాన్ని హరిహరనాథుడికి విన్నవిస్తున్నాడు. దీని కాయన శ్రోత. ఈ భారతాన్ని సంస్కృతంలో వ్యాసుడు వ్రాసినదాన్ని వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పాడు) వైశంపాయనుండు= వైశంపాయనుడు; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; అట్లు= ఆ విధంగా; దివ్యజ్ఞాన= భగవంతుడిచ్చిన జ్ఞానంచేత; దేదీప్యమానుండు+ఐన= ప్రకాశిస్తున్నవాడైన; దేవవ్రతుండు= యావజ్జీవితమూ దేవతల కనుగుణంగా వ్రతంగా బ్రతికినవాడు - భీష్ముడు; వివరింపన్= చెప్పగా; వివిధంబులు+అగుధర్మంబులు+ఆకర్ణించి= అనేక ధర్మాలు విని; అజాతశత్రుండు= మనస్సులో ఎవరిపైనా శత్రుత్వ భావన లేనివాడు - ధర్మరాజు; అతనికిన్= భీష్మునకు; సభక్తిక ప్రణామంబు= భక్తితో కూడుకొన్న నమస్కారం; ఆచరించి= చేసి; వినయ విశేషభూషితుండు+ఐ= వినయమన్న విశిష్టమైన అలంకారంతో అలంకరించబడినవాడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయుడికి ఇట్లా అన్నాడు. ఆ విధంగా దివ్యజ్ఞానంతో ప్రకాశిస్తున్న భీష్ముడు వివరించగా అనేక ధర్మాలను విని ధర్మరాజు భీష్ముడికి భక్తితో నమస్కరించి వినయంతో శోభించి.

సీ. **'అనఘ! నాదగు చిత్తమునకు శమంబు గా। వించుటకై నీవు వివిధ విశద**
భంగులఁ బరమ కృపానిరతుండ వై। సకల ధర్మోపదేశములుఁ జేసి;
తిమ్మెయిఁ జెప్పఁగా నించుక యేనియు। శమము లేకున్నది; చలముకొని య
నేక బంధుల వధియించితి; నది యొక్క। తలయు, నీ కలిగిన దారుణత్వ

ఆ. **మొక్కతలయు నైన యుగ్రకర్మంబులు। చిత్తవృత్తిఁ దగిలి, యుత్తలంబుఁ**
జేయ, శాంతి యెట్లు సిద్ధించు మునిమాన। నీయ! యింక నేమి సేయువాఁడ? **3**

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా! నీవు; నాదగు చిత్తమునకున్= నా మనస్సుకు; శమంబు కావించుటకై= ఓదార్పు పొందించటానికి; వివిధ విశద భంగులన్= అనేకంగా విస్తారమైన పద్ధతులతో; పరమకృపా నిరతుండవు+ఐ= మహాదయగల వాడవై; సకల ధర్మోపదేశములున్+చేసితి(వి)= సకలధర్మాలు చెప్పావు; ఈ+మెయిన్ చెప్పఁగాన్= ఇంతగా చెప్పినా; ఇంచుక+ఏనియున్= కొంచెం కూడా; శమము లేకున్నది= ఊరట లభించటం లేదు (నేను); చలముకొని= పట్టుదలతో; అనేకబంధులన్= చాలామంది చుట్టాలను; వధియించితిన్= చంపితిని; అది ఒక్క తలయున్= అదొక ఎత్తూ; నీకున్+అలిగిన= నీపై కోపగించి నీ కొనర్చిన; దారుణత్వము+ఒక్క తలయున్= క్రూరత్వమొకెత్తూ; ఐన= అయిన; ఉగ్రకర్మంబులు= క్రూర కర్మలు; చిత్తవృత్తిన్+తగిలి= మనస్సు నంటుకొని; (వృత్తి= కదలిక, చేష్ట); ఉత్తలంబున్ చేయన్= కలతపెట్టగా; శాంతి= మనశ్శాంతి; ఎట్లు సిద్ధించున్?= ఏ విధంగా లభిస్తుంది; ముని, మాననీయ!= మునులకు కూడా గౌరవించ దగినవాడా!; ఇంకన్+ఏమి చేయువాఁడన్?= ఇంక ఏమి చేయగలను?

తాత్పర్యం: ధర్మరాజు భీష్ముడితో ఈ విధంగా అన్నాడు; 'మునులు కూడా నిన్ను గౌరవిస్తారు. నీవు పుణ్యమూర్తివి. ఎన్నో ధర్మాలు చెప్పావు. ఎన్నో నీతులు బోధించినావు. ఎంతో దయతో మన్నించి ఎన్నో రీతులుగా చెప్పినా నా మనస్సు శాంతి పొందటం లేదు. పట్టుదలతో చుట్టాలను ఎందరినో చంపుకొన్నాను. అదొక ప్రక్కా, నీపై కోపం వహించి నిన్ను పడగూల్చిన క్రూరకర్మ మొక ప్రక్కా నా మనస్సును బాధిస్తున్నవి. నా మనశ్శాంతికి మార్గమేదయ్యా? ఏం చేసేది? చెప్పుము.

విశేషం: పద్యమంతా మాటమీద మాటగా ఎడతెగకుండా అల్లబడింది. వాక్యంలో సాఫీదనం లేదు. మనశ్శాంతి లేనివాడు పడే బాధంతా పద్య, వాక్యరచన తెలియజేస్తున్నది.

వ. **దుర్యోధనుం డతి లోభంబున నాతోఁ బంచి కుడువ నొడంబడండ; యేనును నాగ్రహంబున నతనికి, రాజ్యం బిచ్చి, తొలంగి నిలువను; మా యిద్దఱ కతంబున నింత పుట్టెం; బశ్చాత్తాపం బెప్పాటనుం ద్రోపువడ దయ్యెడు'.4**

ప్రతిపదార్థం: దుర్యోధనుండు= దుర్యోధనుడు; అతిలోభంబునన్= మిక్కిలి లోభగుణంతో; నాతోన్; పంచి కుడువన్= రాజ్యం పంచుకొని తినటానికి; ఒడంబడండు+అ= ఒప్పుకోడయ్యె; ఏనును= నేను కూడా; ఆగ్రహంబునన్= పట్టుదలతో;

అతనికిన్; రాజ్యంబు+ఇచ్చి= రాజ్యం కట్టబెట్టి; తొలంగి= తప్పుకొని; నిలువను= ఉండను; మా ఇద్దఱ కతంబునన్= మా ఇరువురి కారణంగా; ఇంతపుట్టెన్= ఇంత జరిగింది; పశ్చాత్తాపంబు= తర్వాతి బాధ; ఏ+పాటనున్= ఏ విధంగానూ; త్రోపు పడదయ్యెడున్= త్రోసి పారేయటానికి వీలు పడనిదయింది.

తాత్పర్యం: దుర్యోధనుడు పరమ లోభి కనుక రాజ్యం చెరిసగం పంచుకొని తిందామంటే కుదరనివ్వలేదు. పోనీ, నేనైనా కోపంలేకుండా సరే పోనివ్వు వాడినే తిననిమ్మని ఊరకున్నా పోయేదేమో! మా ఇద్దరి వలన ఇంత చేటు పుట్టింది. ఈ పశ్చాత్తాపాన్ని త్రోసి వేయటం సాధ్యం కావటం లేదు'.

విశేషం: ధర్మరాజు తనకూ యుద్ధంలో బాధ్యత ఉందనటంలోనే ఆతని మంచితనం వ్యక్త మౌతున్నది

గౌతమీ లుబ్ధక సర్ప మృత్యుకాల సంవాదము (సం. 13-1-9)

చ. అనవుడు భీష్ముఁ డిట్టు లను నాతనితో 'నకటా! వధింపఁగా
మనుజుఁడు గర్త గాఁడు, వినుమా! యితిహాస మొకండు సెప్పెదన్;
మనుజవరేణ్య! గౌతమి యనంగ శమాన్విత యొక్క భూసురాం
గన యురగంబుచే సుతుఁడు గాలవశత్వముఁ బొంది యుండఁగన్. 5

ప్రతిపదార్థం: అనవుడున్= ధర్మజు డిట్లా అనగా; భీష్ముఁడు; అతనితోన్= ధర్మజుడితో; ఇట్టులనున్= ఇట్లు చెప్పుతున్నాడు; అకటా!= అయ్యో! వధింపఁగాన్= చంపుటకు; మనుజుఁడు= మనిషి, కర్తకాఁడు= చేసే వాడు కాడు; ఇతిహాసము+ఒకండు= ఒక పురాణకథ; చెప్పెదన్= చెప్పుతాను; వినుమా!= జాగ్రత్తగా ఆలకించుము; మనుజవరేణ్య!= మానవులలో గొప్పవాడా!, రాజా!, గౌతమి అనంగన్= గౌతమి అనే పేరుగల; శమ+అన్విత= శాంతంతో కూడుకొన్నది; ఒక్క; భూసుర+అంగన= బ్రాహ్మణ స్త్రీ; ఉరగంబు చేన్= పామువలన; సుతుఁడు= తన కొడుకు; కాలవశత్వమున్= మృతిని (కాలానికి లోబడిన దశ); పొంది ఉండఁగన్= పొందగా.

తాత్పర్యం: అయ్యో! రాజా! మనిషి దేనికీ కర్త కాడయ్యా. (కర్త ననుకొనటంతోనే ఇబ్బందులన్నీ) ఒక పూర్వ కథ చెప్పుతాను వినుము. (చాలా ప్రసిద్ధమైనదని భావం). గౌతమి అన్న పేరుగల ఒక బ్రాహ్మణ స్త్రీ ఉండేది. ఆమె కోపతాపాది భావాలను అదుపులో పెట్టుకొన్న మహాత్మురాలు. ఆమె కుమారుడు పాము కరచినందున మరణించాడు.

విశేషం: పుణ్యాత్మురాలికికూడా బాధ తప్పదనటానికి ఆమె శమాన్విత అని చెప్పటం. బుద్ధదేవుని జీవితచరిత్రలో కూడా కిసగౌతమికి (క్షీరగౌతమి= పాలమ్ముకొనే స్త్రీ) తన కుమారు డిట్లాగే పాము కాటుచేత మరణిస్తే బుద్ధదేవుడిని ఆశ్రయిస్తుంది. బుద్ధదేవుడంటాడు 'తల్లీ! ఇది కాల నియతి. దాని నేమీ చేయలేము. మృత్యు తరణోపాయమే శరణ్య' మంటాడు. బహుశః రెండు కథ లొకటే.

చ. వగచుచుఁ జూడ నయ్యురగవల్లభు రజ్జునఁ గట్టి తెచ్చి య
మ్మగువకుఁ జూపి 'దీనిఁ దల వ్రుందఁగ మోఁదెదఁ గోల నొండె, రెం

డుగ నెఱగత్తి వ్రేసెదఁ; గడుం జెడు గీపొడపాఁప పుర్వు, నే

మిగతి వధింతు?' నంచు నొక మేటి కిరాతుఁడు రోషదీప్తుఁడై. 6

ప్రతిపదార్థం: ఒక మేటి కిరాతుఁడు = ఒక గొప్ప అడవిజాతివాడు; రోషదీప్తుఁడు+ఐ= కోపంతో మండిపోతున్నవాడై; ఆ+ఉరగవల్లభున్= ఆ పెద్దపామును; రజ్జునన్= త్రాటితో; కట్టి తెచ్చి; వగచుచున్+చూడన్= దుఃఖిస్తూ చూడగా; (మరణించిన కొడుకుకై) ఆ+మగువకున్= ఆ తల్లికి; చూపి= కిరాతుడు పామును చూపి; దీనిన్, కోలన్= కఱ్ఱతో; తల ద్రుందఁగన్+మోఁదెదన్= తలను చితకబాదుతాను; ఒండెన్= లేదా; నెఱకత్తిన్= వాడి కత్తితో; వ్రేసెదన్= నరుకుతాను; కడున్= మిక్కిలి; చెడుగు= చెడ్డది; ఈ పొడ పాఁప పుర్వు= ఈ పొడలుగల నికృష్టమైన పాము; ఏమిగతిన్ వధింతున్?= ఏ విధంగా చంపుమంటావు? అంచున్= అంటూ (ఆ కిరాతు డడుగగా)

తాత్పర్యం: కొడుకు చావును చూచి దుఃఖిస్తూ ఉన్న తల్లి దగ్గర కొక అడవిజాతివాడు, పామును త్రాడుతో కట్టి దెచ్చి, కోపంతో అన్నాడు; 'తల్లీ! ఇది చాలా దుష్టసర్పం. దీని తలను కఱ్ఱతో చితక గొట్టేదా? లేక కత్తితో దీనిని నరికేదా? ఏం చేయుమంటావో చెప్పుము' అన్నాడు.

క. ఉన్నఁ గని యప్పడఁతి 'యో । యన్న! విడువు భుజగనాథు' ననవుడు నతఁ 'డీ

పిన్నాతని ప్రాణంబులు । గొన్నది యిది, దీనియుసుఱు గొనియెద' ననియెన్. 7

ప్రతిపదార్థం: ఉన్నన్+కని= పై విధంగా అంటూ ఉండగా (వాడిని) చూచి; ఆ+పడఁతి=ఆ స్త్రీ; ఓ+అన్న!= ఓ అన్నా! (ప్రేమతోడి పిలుపు); భుజగనాథున్= పెద్దపామును; విడువు= వదలిపెట్టుము; అనవుడున్= అనగా; అతఁడు= ఆ కిరాతుడు; ఇది= ఈ పాము; ఈ పిన్న+ఆతని= ఈ పసివాడి; ప్రాణంబులు కొన్నది= ప్రాణాలు తీసింది; దీని ఉసుఱు= దీని ప్రాణం; కొనియెదన్= తీస్తాను; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'అన్నా! ఈ సర్పరాజును వదలి పెట్టుము' అని ఆ తల్లి కిరాతుడితో అన్నది, ఆ మాటకు ఆతడు ఇట్లా అన్నాడు. 'ఈ పసివాడి ప్రాణాన్ని తీసిన ఈ పాము ప్రాణం తీస్తాను.

విశేషం: ఆ సందర్భంలో - లోకంలో ఏ తల్లీ పామును పోనివ్వు అనదు.కానీ ఈ కథ కాల స్వభావమే మనిషి జీవన్మరణాలకు కారణమని చెప్పటానికి చెప్పుతున్న ఉపాఖ్యానం కనుక - ఇట్లా వ్రాయవలసి వచ్చింది.

వ. అనిన నక్కోమలి యక్కిరాతుం జూచి. 8

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+కోమలి= ఆ సుకుమారి (స్త్రీ); ఆ+కిరాతున్+చూచి= ఆ బోయవాడిని జాలిగా చూచి.

తాత్పర్యం: ఆమె కిరాతుడిని జాలిగా చూచి.

విశేషం: ఇక్కడ మగువ, పడతి ఇట్లా స్త్రీ పర్యాయ వాచకాలేవీ వాడకుండా కోమలి అనటం ఆమె మెత్తని మనసు కలదని చెప్పటం కొరకే.

క. 'విధివశమున వచ్చిన కీ । డధములు గొనియాడి వెడఁగులై, విపులభవాం

బుధి మునుఁగుదురు; మునుంగరు । సధర్ములగు నుత్తములు, ప్రశాంతిఁ జులుకనై. 9

ప్రతిపదార్థం: విధి వశమునన్= దైవవశంగా వచ్చిన; కీడు= ఆపద, అధములు= క్షుద్రస్వభావం కలవారు; వెడఁగులు+ఐ= బుద్ధిలేనివారై; కొనియాడి= పెద్దగా చేసి; విపుల= విస్తారమైన; భవ+అంబుధిన్= సంసార సముద్రంలో; మునుఁగుదురు= మునిగిపోతారు; సధర్ములు+అగు+ఉత్తములు= ధర్మబుద్ధి గలవారైన మహనీయులు (మాత్రం) ప్రశాంతిన్= మనశ్శాంతి కలవారైనందున; చులుకన్+ఐ= తేలికగా; మునుంగరు= సంసార సముద్రంలో మునుగరు.

తాత్పర్యం: 'అన్నా! (రహస్యం చెప్పుతున్నాను వినుము) ఆపదలు మన పూర్వజన్మ కర్మానుసారంగా వస్తాయి. (వాటిని వేరే ఎవడూ నీ మీద కోపంతో సృష్టించటం లేదు) కనుక అధములైన వారు తల్లడిల్లి సంసార సముద్రంలో మునిగిపోతున్నారు (విచారించటం లేదు). ఉత్తములు మాత్రం అట్లాకాక ధర్మవేత్తలు కనుక (సృష్టి నడతలోని క్రమాన్ని చూచినవారు కనుక) శాంతి పొంది సంసార సాగరాన్ని దాటిపోతున్నారు. (కనుక పాము విధి ఆజ్ఞతో కరిచింది. కనుక వదలిపెట్టుము)

విశేషం: ఈ పద్యంలో వెడఁగులై అని ఉన్నదానికి 'వ్రేఁగులై' అనే పాఠాంతరం ఉన్నది. అది దీనికంటె బాగైన పాఠమని తోస్తుంది. వ్రేఁగులై= బరువైనవారై - వారు బరువైనవారు కనుకనే భవాంబుధిలో మునిగిపోతారు. ఉత్తములు ప్రశాంతిచే చులుకనై= తేలికైనవారై - వారు తేలికైనవారు కనుకనే మునిగిపోరు అనే స్వారస్యం లభిస్తుంది.

వ. అదియునుం గాక! 10

తాత్పర్యం: అంతేకాక (తరువాతి పద్యంతో అన్వయం)

క. ఈ పాముఁ జంప బ్రదుకునె । నా పుత్త్రుఁడు? విడువు మర్జునక!' నావుడు 'వాఁ
డీ పేద మాట లెల్లను । గోప వివశుఁడైన నాకుఁ గొలుపవు, ముగ్ధా!' 11

ప్రతిపదార్థం: ఈ పాముస్+చంపన్= ఈ పామును చంపితే; నాపుత్త్రుఁడు= నా కొడుకు; బ్రదుకునె?= బ్రతుకుతాడా? (ఆలోచించు); అర్జునక!= కిరాతుడా!; విడువుము= పామును వదిలిపెట్టుము; నావుడున్= అనగా; వాఁడు= కిరాతుడు; ఈ పేదమాటలు= ఈ పనికిరాని మాటలు; ఎల్లను= అన్ని; కోప= కోపంతో; వివశుఁడు+ఐన= పరవశుడ నైన; నాకున్; కొలుపవు= నచ్చవు; ముగ్ధా!= అమాయకులారా!

తాత్పర్యం: 'అర్జునకా! దీనిని చంపితే నాబిడ్డ బ్రతుకుతాడా? వదలుము' అన్న దామె. అతడు 'నీవు తెలివి తక్కువదానివి కనుక (ముగ్ధ అని ఇందుకే అన్నాడు) పామును వదలు మంటున్నావు. నేను కోపంతో మైమరచి ఉన్నాను. కనుక నీ మాటలు నాకు నచ్చవు' అన్నాడు.

విశేషం: అర్జునక! అని ఆమె సంబోధన. వీడి మాట ముగ్ధ. ఈ మాటలు చాటున కవి విశేషార్థాన్ని దాచాడు. ముగ్ధ= తెలివి తక్కువదానా - అని. పసిపిల్లవాడిని చంపిన పామును వదలమంటా వేమిటి? పిచ్చితల్లీ - అని ఈతడి సంబోధన.

ఉ. కావున నెట్లుఁ జంపుదున; కాని భుజంగముఁ బోవ నీను జూ
నావుడు; నింతి యర్జునక నామము నీ కవదాత భంగికిం
గావలదే? మహీసురులు గా దను చొప్పునఁ దత్సహాయులుం
బోవరు గాదె! యేల నినుబోఁటికిఁ గ్రూరత నాదు సన్నిధిన్? 12

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఎట్లున్= తప్పక; భుజంగమున్= పామును; చంపుదున కాని= చంపుతానే తప్ప; పోవనీను= వదలిపెట్టను; చూ+ చుమ్ము; నావుడున్= అనగా; ఇంతి= (ఆ) స్త్రీ; నీకున్, అర్జునక నామము= అర్జునుడన్న పేరు; అవదాత= స్వచ్ఛత (తెల్లని); భంగికిన్= పద్ధతికి; కావలదే= కావద్దా!; మహీసురులు= భూదేవతలు (బ్రాహ్మణులు); కాదను చొప్పునన్= కాదన్న పద్ధతిలో; తత్సహాయులున్= వారికి సాయపడేవారు (స్నేహితులు) కూడా; పోవరుకాదె!= పోరుకదా!; నినుబోఁటికిన్= నీవంటి వాడికి; క్రూరత= క్రూరత్వం; నాదు సన్నిధిన్= నా మ్రోల; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: నీ వెన్నైనా చెప్పుము. ఈ పామును చంపకుండా పోనివ్వ' నని ఆ కిరాతు డంటే, ఆమె ఇట్లా అన్నది 'నీ పేరు అర్జునకుడు. అంటే స్వచ్ఛమైనవాడని కదా! ఆ పేరునకు అర్థం మహాత్ములు కాదనేటట్లుగా వారి స్నేహితులు ప్రవర్తించరు కదా! నీ వంటి వాడికి నా సాన్నిధ్యంలో ఈ క్రూరమైన మనస్సేమిటి?

విశేషం: ఆమె శమాన్విత కనుక ఆమె సన్నిధానంలో ఎవరూ ఆమె మాటను కాదని ఒక అంగుళమైనా పోలేరు. మహీసురులు కాదనే మార్గాన్ని వారికి తోడ్పడేవారు అనుసరించరు గదా! అట్లాంటప్పుడు నా ముందు నీ వంటివారు ఈ క్రూరబుద్ధిని ప్రదర్శించవచ్చునా? అని ఆమె ఆశ్చర్యపడుతున్నది.

సీ. హింసకు నొడఁబడ నే నెట్లు? 'ననవుడు, । 'జనబాధకము లైన జంతువులను
జంపినఁ బాపంబు సమకూర' దని పల్కె । బోయ; 'పట్టిన రిపుఁ బొరిగొనంగ
వల' దని చెప్పె నవ్వనిత; వాఁ డహిఁ దెగఁ । జూచి జనంబులఁ గాచు టుఱదె?
వృత్రుఁ జంపఁడె దేవవిభుఁడు? యజ్ఞధ్వంస । నము సేయఁడే? ఫాలనయనుఁ డట్ల

తే. కావె? ధర్మువు హింసలు నీవు దీని । కియ్యకొను' మని తఱిమె; నట్లెంత దఱిమి
నను దయావతి యైన యన్నాతి పాప । మునకుఁ జొరదయ్యెఁ; బోయ కిట్లనియెఁ బాము. **13**

ప్రతిపదార్థం: నేను; ఎట్లున్= ఏ విధంగానూ; హింసకున్= క్రూరకర్మకు; ఒడంబడన్= ఒప్పుకోను; అనవుడున్= అని ఆమె అనగా; బోయ=కిరాతుడు; జనబాధకములు+ఐన= జనులను పీడించే; జంతువులను= మృగాలను; చంపినన్= చంపితే; పాపంబు= పాపం; సమకూరదు= రాదు; అని పల్కెన్= అని కిరాతు డన్నాడు; ఆ+వనిత= ఆ స్త్రీ; పట్టినరిపున్= బంధించిన శత్రువును; పొరిగొనంగన్ వలదు= చంపవలదు; అని చెప్పెన్, వాఁడు= బోయ; అహిన్= పామును; తెగన్+చూచి= చంపి; జనంబులన్= మనుష్యులను; కాచుట= రక్షించటం; ఉఱదె!= మంచిదికాదా; దేవవిభుఁడు= దేవేంద్రుడు; వృత్రున్= వృత్రుడన్న రాక్షసుడిని; చంపఁడు+ఎ= సంహరించ లేదా?; ఫాలనయనుఁడు= లలాటంలో కన్ను కల శివుడు; యజ్ఞధ్వంసనము= దక్షయజ్ఞ నాశనం; చేయఁడే= చేయలేదా; అట్ల కావె!= అట్లా కాదా!; హింసలు= క్రూరకర్మలు; ధర్మువు= ధర్మం; నీవు= తల్లీ నీవుకూడా; దీనికిన్= ఈ పామును చంపటానికి; ఇయ్యకొనుము= అంగీకరించుము అని; తఱిమెన్= ఒత్తిడి చేశాడు; అట్లు; ఎంతతఱిమినను= ఎంతగా ఒత్తిడి చేసినా; దయావతి= దయకలది; ఐన; ఆ+నాతి= ఆ స్త్రీ; పాపమునకున్= హింసకు; చొరదయ్యెన్= అంగీకరించలేదు; (అప్పుడు) పాము; బోయకున్= బోయవాడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: (ఈ పద్యమంతా స్త్రీకి, కిరాతుడికి జరిగిన సంభాషణ) ఆమె 'హింస కంగీకరించ' ననగా, వాడు 'మనుష్యులకు బాధ కలిగించే జంతువులను చంపటంలో పాపం లేదమ్మా!' అని చెప్పాడు. దాని కామె 'శత్రువైనా సరే మన చేత చిక్కినపుడు చంపరాదురా నాయనా' అన్నది. వాడు దాని కంగీకరించక 'పూర్వం దేవేంద్రుడు వృత్రాసురుడిని చంపలేదా? శివుడు దక్షుడి యజ్ఞాన్ని నాశనం చేయలేదా? ఈ హింసలు ధర్మమే కదా! కనుక దీనిని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చంపనిమ్మ్మ' అని వా డెంత బలవంతం చేసినా ఆమె అంగీకరించలేదు. ఇదంతా వింటూ ఉన్న పాము బోయతో అన్నది.

క. 'ఏ నేమి తప్పు సేసితిఁ? గానవు । నెఱి నీవు లెస్సగా, మృత్యుపరా
ధీనత బాలునిఁ గఱచితిఁ । గాని, వినుము! లేవు రోషకామాదు లెదన్'. 14

ప్రతిపదార్థం: ఏను= నేను; ఏమితప్పు= ఏ దోషం; చేసితిన్?= చేశాను; నీవు; నెఱిన్= న్యాయం; లెస్సగాన్= చక్కగా; కానవు= తెలియవు; మృత్యు పరాధీనతన్= మృత్యుదేవతకు లోబడి; బాలునిన్= పసివాడిని; కఱచితిన్= కాటువేశాను; కాని= అంతేకాని; వినుము; రోష+కామ+ఆదులు= కోపం, కోరిక మొదలైనవి; ఎదన్= నా మనసులో; లేవు.

తాత్పర్యం: 'నా దేమి తప్పున్నది? నేను మృత్యుదేవత ఆజ్ఞకు లోనై బాలుడిని కరచాను అంతే, కానీ నాకు కోపం కానీ, కోరిక కానీ ఏమీ లేవు. ఈ రహస్యం నీకు తెలియదు'.

వ. అనుటయు నతండు 15

తాత్పర్యం: అని పాము పలుకగా ఆ బోయవాడు (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'విను! మృత్యువునకుఁ దగు సా । ధనమ వగుటఁ జేసి నిన్ను దండింపంగాఁ
జను' నవనుడుఁ' గుమ్మరికో । లను సారెం బోలితిం దలఁచి చూడు మెడన్. 16

ప్రతిపదార్థం: విను= (నాకు విషయం తెలియదన్నావు కనుక నేను చెప్పుతాను) బాగా వినుము; మృత్యువునకున్= మృత్యుదేవతకు; తగు= తగిన; సాధనమవు+అగుటన్+చేసి= (నీవు) పనిముట్టువైనావు కనుక; నిన్నున్; దండింపంగాన్+చనున్= శిక్షించి తీరాలి; అనవుడున్= అనగా (పామన్నది); కుమ్మరికోలన్= కుమ్మరివాని చేతి కర్రను; సారెన్+పోలితిన్= సారెవలెనైనాను; ఎడన్= మనస్సులో; తలఁచి= ఆలోచించి; చూడుము.

తాత్పర్యం: 'నీవు మృత్యువు చేతిలో పనిముట్టువైనావు కనుక నిన్ను చంపి తీరవలసిందే' అని కిరాతు డనగా, పామన్నది 'అయ్యా! కొంచె మాలోచించి చూడుము. కుండలు చేసేవాడు చేతికర్రతో సారెను త్రిప్పుతాడు కదా! తిరిగే సారెది దోషమా? కర్రతో త్రిప్పిన కుమ్మరిదా దోషం?

విశేషం: అలం: ఉపమ. ఈ పోలిక వేదాంత శాస్త్రంలోనిది. భగవంతుడు కుమ్మరివంటివాడు. కుండను చేయటానికి మట్టి - సారె - కోల అవసరం. ఇవి బాహ్యసాధనాలు. మట్టి కుండగా పరిణమింప చేసే సృజనాత్మక క్రియ, దానివెనుక నున్న భావం - భగవంతుడి సంకల్పంలోనివి. చేతి సాధనాలు అచేతనాలు. సృష్టి చేసే సామర్థ్యం అతడిదే. అట్లాగే మట్టి - కోల- సారెలు కావు కుండను చేసింది. అవి కేవలం సాధనాలు.

వ. ఈ క్రియ నావశం బగునే? యని పల్కినం బామున కర్జునకుం డిట్లనియె. 17

ప్రతిపదార్థం: ఈ క్రియ= ఈ చంపటమన్న పని; నా వశంబు+అగునే?= నాకు శక్యమా?; అని పల్కినన్= అని చెప్పగా; పామునకున్= పాముతో; అర్జునకుండు= కిరాతుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'అయ్యా! చంపేశక్తి నాకెక్కడిది? అని పాముచేగా కిరాతు డా పాముతో ఇట్లా అన్నాడు.

విశేషం: పాము కరిస్తే చాలామంది బ్రతకటం లోకంలో ఉన్నది కనుక చంపే శక్తి తనకు లేదని పామన్నది.

తే. **'ఏయువాఁ డుండ, న మ్మేమి సేయు । ననక, యోపి తత్ఖండనముసేఁత పాప మండ్రె?**
యెవ్వరేఁ బంపఁ; గఱతు గా కేమి? క్రూరు । నిన్ను గీటడఁగించిన నింద రాదు. **18**

ప్రతిపదార్థం: ఏయువాఁడు+ఉండన్= బాణం వేసే విలుకాడుండగా; అమ్ము= బాణం; ఏమిచేయున్= ఏం చేస్తుంది; అనక= అనకుండా; ఓపి= శక్తి గలిగి; తత్ ఖండనము= దానిని నరకటం; పాపము+అండ్రె?= పాపమంటారా? ఎవ్వరేన్= ఎవరైనా; పంపన్= పంపిస్తే; కఱతుకాక ఏమి?= కరుస్తావా; క్రూరున్= క్రూరుడవైన; నిన్ను; గీఁటు+అడఁగించినన్= చంపినందువలన; నింద= అపకీర్తి; రాదు= నాకు రాదు.

తాత్పర్యం: 'విల్లు ఎక్కు పెట్టి విలుకాడు శత్రువుపై బాణమేస్తే, అదేం చేస్తుంది లెమ్మని ఊరుకొనకుండా నడుమనే దానిని విరుగగొట్టినందువలన పాప మంటారా ఎవరైనా? ఎవరో పంపించారని నీ వాబాలుడిని కరుస్తావా? నిన్ను నరికినా పాపం లేదు'.

విశేషం: నేను మృత్యువు చేతిలో సాధనాన్ని అని పామన్న దానికిది కిరాతుడు చెప్పిన సమాధానం. చాలా తెలివిగా ఉన్నది.

తే. **అదియుఁ గాక, విశేషించి యరయ బుద్ధి । గలుగునట్టి సాధనములు గారె మీరు**
మృత్యువున? కట్లు గావున మెలఁగ మిడుక । నీక, పొరిగొనవలయు; మి మ్మెల్లభంగి.' **19**

ప్రతిపదార్థం: అదియున్+కాక= అంతే కాకుండా; విశేషించి= ప్రత్యేకించి; అరయన్= ఆలోచిస్తే; మీరు= మీవంటివారు; మృత్యువునకున్= మృత్యుదేవతకు; బుద్ధికలుగు+అట్టి= మనస్సున్నట్టి; సాధనములు కారె?= పనిముట్లు కాదా? అట్లు కావునన్= కాబట్టి; మెలఁగన్= తిరుగుటకు; మిడుకనీక= కిక్కురుమన నివ్వకుండా; మిమ్మున్= మిమ్ములను; ఎల్లభంగిన్= సర్వవిధాలా; పొరిగొనన్ వలయున్= చంపితీరవలసిందే.

తాత్పర్యం: అంతేకాకుండా; ప్రత్యేకంగా ఆలోచిస్తే మీరు మృత్యువు చేతిలో మనస్సున్న సాధనాలు. కనుక ఇకముందు మిమ్మల్ని తిరగనివ్వకుండా అన్నివిధాలా చంపటమే మంచిది'.

విశేషం: 'కుమ్మరి కోలకు సారె వంటి దాన్ని మృత్యువు చేతిలో నే నన్న పై పద్యంలోని మాట' కిది సమాధానం. కోలా, సారె మనస్సు లేనివి. పాము అట్లా కాదు. అది బుద్ధి ఉన్నట్టి జీవి; అని. ఇక్కడ బుద్ధి అన్నమాట ప్రతి తెలుగువాడూ వాడేదే.

వ. **అనిన విని బోయకు భుజంగం బిట్లనియె.** **20**

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విని; భుజంగంబు= పాము; బోయకున్= కిరాతుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అనగా విని కిరాతుడితో పాము ఇట్లా అన్నది.

తే. **'బుద్ధి గల్గు సాధనముల పో హవిస్సు, లరసి వేల్తురు ఋత్విజు, లా ఫలంబు**
గాంచు నధ్వరకర్తయ । కాక వారి కేమి పని?' యనఁగా మృత్యు వేఁగుదెంచె. **21**

ప్రతిపదార్థం: ఋత్విజులు= యజ్ఞం చేయించే పురోహితులు; బుద్ధి కల్గు= మనస్సున్న; సాధనములపో!= సాధనాలే కదా!; అరసి= (మంత్రాలను చక్కగా) విచారించి; హవిస్సులు= అగ్నియందు హోమంచేసే నేయి మొదలైనవి; వేల్తురు= హోమం చేస్తారు; ఆ ఫలంబు= ఆ యజ్ఞఫలం; అధ్వరకర్తయ= యజ్ఞం చేసే యజమానుడే; కాంచున్= పొందుతాడు; కాక= అట్లా కాకుండా; వారికిన్+ఏమిపని?= ఋత్విజుల కేమిఫలం?; అనఁగాన్= అన్నంతలో; మృత్యువు= ఆ దేవత; ఏఁగుదెంచెన్=వచ్చింది.

తాత్పర్యం: 'నీ వన్నట్లు బుద్ధి గలుగు సాధనాలు కదా యజ్ఞం చేయించే పురోహితులు. వారు చేయించే హోమాల ఫలితం యజమానుడికి వస్తున్నది తప్ప పురోహితులకు వస్తున్నదా? అట్లాగే బుద్ధి ఉన్న సాధనాలమైన మా పని కూడా అంతే' అని పామన్నంతలో మృత్యుదేవత వచ్చింది.

విశేషం: ఈ చర్చ చాలా తర్కంతో కూడుకొన్నది. తెలివితేటలే కాకుండా విషయం తెలిసిన పండితుల చర్చగా ఉన్నది. ఇక్కడ యజ్ఞ మన్న దృష్టాంతా న్నివ్వటం చాలా ప్రజ్ఞావంతమైనది.

క. చనుదెంచి పామునకు ని । ట్లను 'నిను నేఁ గోరి పనిచినట్టుల, నన్నున్
బనిచెం గాలుం; డీ చా । వున కీవును నేను హేతువులు గా మనఘా! 22

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; పామునకున్= పాముతో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది; అనఘా!= పాపంలేనివాడా! (ఇది పామునకు సంబోధన); నినున్= నిన్ను; నేను; కోరి= చెప్పి; పనిచినట్టులన్= పంపినట్లుగానే; కాలుండు= కాలస్వరూపుడైన యముడు; నన్నున్= నన్నూ; పనిచెన్= పంపించాడు; ఈ చావునకున్= ఈ బాలుడి మృతికి; ఈవును, నేనున్= ఇద్దరమూ; హేతువులు కాము= కారణం కాము.

తాత్పర్యం: 'పాపం లేనివాడా! నిన్ను నేను చెప్పి పంపినట్లుగానే నన్ను యముడు పంపించాడు. అందువలన అతడి ఆజ్ఞనే నీకు వినిపించాను. కనుక మన మీ బాలుడి చావునకు కారణం కాము.

విశేషం: అనఘా! అన్న సంబోధన వలన ఈ మృతికి పాము కారణం కాదని చెప్పబడింది.

క. ఇన, శశి, పావక, భూమి, గ । గన, జల, పవనాది వస్తుగతు లెల్లను గా
లుని యఱచేతి వనినఁ ద । క్కిన పని సెప్పంగ నేటికిని భుజగేంద్రా! 23

ప్రతిపదార్థం: భుజగ+ఇంద్రా!= పాములలో గొప్పవాడా!; ఇన= సూర్యుడు; శశి= చంద్రుడు; పావన్= అగ్ని; భూమి= నేల; గగన= ఆకాశం; జల= నీరు; పవన= గాలి; ఆది= మొదలైన; వస్తుగతులు= వస్తువుల నడకలు; ఎల్లను= అన్నీ; కాలుని= యముడి; అరచేతివి= అరచేతిలోనివి (వశమున ఉన్నట్టివి); అనినన్= అనగా; తక్కిన= మిగిలిన; పని= కార్యం; చెప్పంగన్= చెప్పటం; ఏటికిని?= ఎందుకు?

తాత్పర్యం: ఓయీ! పాములరేడా! సూర్యచంద్రాగ్నులు, నేల, ఆకాశం, నీరు, గాలి మొదలైనవి (ఇవి 7 జీవుడు- జీవాత్మ= యజమానుడు= కలిసి 8. వీరే అష్టమూర్తులు= శివుడి శరీరంగా చెప్పారు). వస్తువుల కదలికలన్నీ కాలస్వరూపుడైన ఆ దేవుడి చేతిలోని పనులు. ఇంతకంటె ఇంకా ఏమి చెప్పాలి?

విశేషం: ఇక్కడ యముడే విశ్వానికి అధిపతిగా, సర్వకర్తగా చెప్పబడింది. ఇదే కఠోపనిషత్తు వంటి చోట్ల మిక్కిలిగా వివరించబడినది. కాలుడు కూడా పరబ్రహ్మ స్వరూపుడే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విను మిట్లగు టేర్పడ నెఱిఁ । గిన నాపై నిడుదు వెట్లు, కిల్బిషముం గా

లుని చెయిది నన్ను దూఱిన । నిను దూఱుట' యుఱదె నాదు నిర్మాణమునన్. 24

ప్రతిపదార్థం: వినుము= వినుము; ఇట్లు+అగుటన్= విషయమిట్లాంటిదని; ఏర్పడన్= స్పష్టంగా; ఎఱిఁగినన్= తెలిస్తే; నాపైన్= నామీద; ఎట్లు= ఏ విధంగా; కిల్బిషమున్= పాపమును; ఇడుదువు?= మోపగలవు?; కాలుని= యముడియొక్క; చెయిది= చేష్ట (ఇది); నన్నున్= నన్ను; దూఱినన్= నిందిస్తే; నాదు= నాయొక్క; నిర్మాణమునన్= నిర్మించటంలో; పనిలో; నినున్= నిన్ను; దూఱుట= నిందించటం; ఉఱదె= తగదా.

తాత్పర్యం: విషయ మిట్లాంటిదని తెలిసిన తరువాత నాపై పాపాన్ని మోపటమంటే నీపై నీవే మోపుకొనటం కదా! నేను నిన్ను ఈ పనికి నియోగించినట్లు నన్నాయన నియోగించినాడు కనుక మన ఇద్దరిదీ పాపం కాదు'.

ఆ. అనిన భుజగ మిట్టులను 'నీవలన నేను । గుణము సెప్ప, దోష గణన సేయ

నన్నుఁ బనిచె నంటి, నామీఁది దోషంబుఁ । బాపి కొనుట నాకుఁ బాడి గాదె? 25

ప్రతిపదార్థం: అనినన్= అనగా; భుజగము= పాము; ఇట్టులు+అనున్= ఈ విధంగా అంటున్నది; నీవలనన్= నీయందు; ఏను; గుణము= గుణాన్ని, చెప్పన్= చెప్పగా; దోషగణన= తప్పు లెక్కించటం; చేయన్= చేయగా; నన్నున్; పనిచెను= పంపెను; అంటిన్= అంటిని; నామీది దోషంబున్= నాపై తప్పు; పాపికొనుట= పోగొట్టుకొనటం; నాకున్= నాకు; పాడి= న్యాయం; కాదె= కాదా?

తాత్పర్యం: పై రీతిగా మృత్యువనిన తరువాత పామంటున్నది; 'నీమీద నేను గుణాన్ని ఆరోపించి మాట్లాడితే నీ వేమో నన్ను పంపావని, నా దేదో తప్పున్నట్లు చెప్పుతున్నావు. ఆ తప్పు పోగొట్టుకొనటంకొరకే నేనట్లా అన్నది.

క. విను మటు కాలుని దెసనై । నను దోషము కలిమి లేమి, నా కాడంగాఁ

బని యేమి? దోష గతిచిం । తన భాషణములకు నేను దగుదునె యనఘా!' 26

ప్రతిపదార్థం: అనఘా!= పాపం లేనివాడా!; వినుము; అటు= ఆ ప్రక్క; కాలునిదెసన్= యముడి పక్షాన; ఐనను= ఐనప్పటికిని; దోషము= తప్పు; కలిమి= ఉండటం; లేమి= లేకపోవటం; నాకున్; ఆడంగాన్= చెప్పగా; పని ఏమి= ఏమిపని; దోష= పాప; గతి= పాటు; చింతన= ఆలోచన; భాషణములకున్= తర్కించటానికి, మాట్లాడటానికి; నేను; తగుదునె?= అర్హుడనా?

తాత్పర్యం: అయ్యా! నీ దే పాపం లేదు వినుము. యముడిపై తప్పు మోపటానికి గానీ, తప్పు లేదనటానికి గానీ నే నెవడను? ఆ విధంగా పాపగతిని గురించి ఆలోచించటానికి గానీ, మాట్లాడటానికి గానీ నాకు సత్తా ఎక్కడున్నదసలు?

వ. అని పలికి పాము బోయమొగంబు సూచి. 27

ప్రతిపదార్థం: అని పలికి= ఈ విధంగా అని; పాము= పాము; బోయ= బోయవాడి; మొగంబు చూచి= ముఖం చూచి.

తాత్పర్యం: పాము ఈ రీతిగా పలికి బోయవాడి ముఖం చూచి (తరువాతి పద్యంతో అన్వయం)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'వింటే, మృత్యువు మాటలు? గంటే నామీఁదఁ దప్పు గలిగించెద; వి
ట్లంటం గట్టం దగునే? యంటకు । నగి, బోయ యిట్టు లనియె, నరేంద్రా! 28

ప్రతిపదార్థం: మృత్యువు మాటలు= మృత్యుదేవత చెప్పినవన్నీ; వింటే?= ఆలకించావా?; నా మీఁదన్= నాపై; తప్పున్= దోషాన్ని; కలిగించెదవు= కలిగిస్తున్నావు; కంటే?= (విషయమంతా) చూచావా?; ఇట్లు= ఈ విధంగా; అంటన్+కట్టన్ తగునే?= అంటగట్టటం తగదుకదా!; అంటకున్= అట్లా పాము అనటానికి; నగి= నవ్వి; బోయ= కిరాతుడు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; నరేంద్రా!= ధర్మరాజా! (భీష్మ డతడితో చెప్పుతున్నాడు)

తాత్పర్యం: పాము బోయతో అంటున్నది; 'నీవు మృత్యువు మాటలు విన్నావు. విషయమంతా స్పష్టంగా చూచావు కదా! కనుక ఈ పాపం నాకంటగట్ట దగదు'. అప్పుడు బోయ నవ్వి అన్నాడయ్యా! ధర్మరాజా!

క. నీవును, మృత్యువుఁ బాప స । మావేశితమతుల రొఱగ నాడినయంతం
బోవునె మీపై దోషము, లే । వెఱతునె యిట్టు లనిన యింతన మీకున్'. 29

ప్రతిపదార్థం: నీవును= నీవూ; మృత్యువున్= మృత్యువూ; పాప= పాపం వల్ల; సమ్+ఆవేశిత= చక్కగా ఆవేశించబడిన; మతులరు= మనస్సు కలవారు; ఒఱగన్+ఆడిన+అంతన్= ఒరిగేటట్లుగా చెప్పినంత మాత్రంచేత; మీపైన్ దోషములు= మీమీదనున్న పాపాలు; పోవునె= పోతాయా? ఇట్టులు+అనిన ఇంతన్+అ= ఈ విధంగా చెప్పినంత మాత్రాన; ఏన్= నేను; మీకున్= మీకు; వెఱతునె?= భయపడతానా?

తాత్పర్యం: బోయ పాముతో అన్నాడు - 'నీవూ, మృత్యువూ ఇద్దరూ పాపానికి వశమైన మనస్సు కలవారు కనుక మీరెంత చెప్పినా మీ మీదనున్న దోషాలు తొలగిపోతాయా? ఇందులో ఒరిగే దేమీ లేదు. మీరట్లా అన్నంత మాత్రాన నే నేమీ జడిసేది లేదు'.

వ. అనిన మృత్యువునుం బామును. 30

ప్రతిపదార్థం: అనినన్= అనగా; మృత్యువును= మృత్యువూ; పామును= పామూ.

తాత్పర్యం: అని అనగా మృత్యువూ, పామూ (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'ఘనుఁ డగు కాలుని వశమునఁ । జనియెడుమా, కరయ దోష సంగతి గలదే?'
యనునెడఁ గాలుం డచటికిఁ । జనుదెంచెం, బ్రీతి ధర్మ సంశయ ముడుపన్. 31

ప్రతిపదార్థం: ఘనుఁడు+అగు= గొప్పవాడైన; కాలుని= యముడి; వశమునన్= లోనై; చనియెడు= నడుస్తున్న; మాకున్= మాకు; అరయన్= చూడగా; దోష=తప్పుయొక్క; సంగతి= కూడిక; కలదే?= ఉన్నదా?; అను+ఎడన్=అనే సమయంలో; కాలుండు= యముడు; అచటికిన్= అక్కడకు; ప్రీతిన్= ప్రేమతో; ధర్మ= ధర్మసంబంధమైన; సంశయము= సందేహమును; ఉడుపన్= పోగొట్టటానికి; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: 'మాదేమున్నది? తప్పు మాది కాదు. అంతా కాలానికి లోబడి నడుస్తుంది' అని వారిద్ద రన్నంతలో యముడు ధర్మసందేహాన్ని పోగొట్టటానికి అక్కడికి ప్రేమతో వచ్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. చనుదెంచి యర్జునకు నాలోకించి. **32**

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; అర్జునకున్= కిరాతుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: వచ్చి కిరాతుడిని చూచి.

క. 'పామును, మృత్యువు, నేనును । గా మీదారకుని మృతికిఁ గారణ, మీతం
డేమేఁ గర్మముఁ జేసెం దా । మృతిఁ బొందించె నదియ, తలకొని, యితనిన్. **33**

ప్రతిపదార్థం: పామును= పామూ; మృత్యువున్= మృత్యువూ; ఏనును= నేనూ; ఈ దారకుని= ఈ పసివాడి; మృతికిన్= చావుకు; కారణము= హేతువు; కాము; ఈతండు= ఈ పిల్లవాడు; ఏమేన్= ఏమేమి; కర్మమున్= పాప పుణ్య సంబంధమైన చేష్ట; చేసెన్= చేసెనో; అదియ= అదే; తాన్= తానే; తలకొని= పూనుకొని; ఇతనిన్= ఇతడిని; మృతిన్= చావును; పొందించెన్= కలిగించింది.

తాత్పర్యం: యము డీ విధంగా పలికాడు; 'నేనూ, పామూ, మృత్యువూ ఈ పసివాడి చావుకు కారణం కాము. మరేమిటంటే - వీడి కర్మే పూనుకొని వీడి కా చావును తెచ్చిపెట్టింది.

క. విను కర్మం బొనరించును । జననము, మరణంబు, నదియ సౌఖ్యము, దుఃఖం
బును గావించుం, దనచే । సిన దానిం బడకపోవ శివునకు వశమే?' **34**

ప్రతిపదార్థం: విను= వినుము; కర్మంబు= తాను చేసిన కర్మ; జననమున్= పుట్టుకను; మరణంబున్= చావును; పొనరించును= చేస్తుంది; అదియ= అదే, కర్మే, సౌఖ్యమున్= సుఖాన్ని; దుఃఖంబున్= దుఃఖాన్ని; కావించున్= కలిగిస్తుంది; తన=తాను; చేసిన దానిన్= చేసిన దానిచేత; పడకపోవన్= వశపడకుండా పోవటం; శివునకున్= శివుడికి కూడా; వశము+ఏ?= శక్యమా?

తాత్పర్యం: ఉన్న విషయ మేమంటే, చెప్తుతాను వినుము. జీవుడు తాను చేసిన కర్మవలననే పుట్టుక చావూ పొందుతున్నాడు. అదే సుఖ దుఃఖాలకూ కారణమౌతున్నది. తాను చేసిన కర్మను తప్పుకొనిపోవటం శివుడికి కూడా సాధ్యం కాదు'. (అంటే ఇక మనిషెంత?)

విశేషం: పద్యంలో నాల్గవ పాదం ఒక జాతీయం.

వ. అని చెప్పి. **35**

తాత్పర్యం: ఈ విధంగా పలికి

క. 'కావున, నిందఱు, నుడుగుం డీ । వాదం' బనుడు, బోయ కిట్లను, ధరణీ
దేవాంగన దన యెఱుకయు । దేవాలాపములు నొక్క తెరువై యున్నన్. **36**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఇందఱున్= మీరంతా; ఈ వాదంబు= ఈ చర్చ; ఉడుగుండు= మానండి; అనుడున్= అనగా; ధరణీదేవ= భూసురుడి, బ్రాహ్మణుడి; అంగన= స్త్రీ (బ్రాహ్మణ స్త్రీ); తన ఎఱుకయున్= తన జ్ఞానం; దేవ=దేవుడి; ఆలాపములు= మాటలు; ఒక్క= ఒకే; తెరువై= విధంగా; ఉన్నన్= ఉండగా; బోయకున్= కిరాతుడితో, ఇట్లు+అనున్= ఈరీతిగా అన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'కాబట్టి మీరంతా ఈ చర్చ మానండి' అనేటప్పటికి ఆ బ్రాహ్మణ స్త్రీ తన జ్ఞానం, యము డన్నమాట లోకే రకంగా ఉన్నందున బోయవాడితో ఇట్లనింది.

ఆ. ఇట్టి వనటఁ బొందునట్టి పాపము సేసి । వనిత లిట్ల యగుదు రనఘ! యివ్వి
ధంబు మరణ మొందఁ దగు కిల్బిషంబున । బాలు రిట్ల పోదు రేల కలఁగ.' 37

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా!; ఇట్టి= ఇట్లాంటి; వనటన్= దుఃఖమును; పొందునట్టి= పొందినటువంటి; పాపముచేసి= పాపం చేసి; వనితలు= స్త్రీలు; ఇట్ల అగుదురు= ఇట్లాగే ఔతారు; ఈ+విధంబు= ఈ పద్ధతి; మరణము= చావు; ఒందన్+తగు= పొందదగిన; కిల్బిషంబునన్= పాపాన; బాలురు= పిల్లలు; ఇట్లు+అ= ఇదే విధంగా; పోదురు= పోతారు; కలఁగన్= కలతపడటం; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: పాపం లేనివాడా! అర్జునకా! ఇట్లాంటి దుఃఖం మన పాపంవలననే వస్తుంది. ఈ విధంగా పిల్లలు చచ్చిపోవటానికి వారి పాపకర్మే కారణం తప్ప ఎవరూ కారు'.

వ. అని వెండియు. 38

ప్రతిపదార్థం: అని; వెండియున్= మరల.

తాత్పర్యం: అని మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'సకల జనంబులుఁ గర్మము । నకు ననుగుణమైన తెరువునం బోదురు దీ
నికి రోష విషాదము లే । టికి విడువుము పాము, సంఘటింపుము శమమున్. 39

ప్రతిపదార్థం: సకలజనంబులు= జనులంతా; కర్మమునకున్= కర్మకు; అనుగుణంబు+ఐన= తగిన, తెరువునన్= బాటలో; పోదురు= పోతారు; దీనికిన్= దీనికొరకు; రోష= కోపం; విషాదము= దుఃఖం, ఏడ్పు; దేనికి?= ఎందుకు?; పామున్= పామును; విడువుము= వదలిపెట్టుము; శమమున్= శాంతిని; సంఘటింపుము= పొందుము.

తాత్పర్యం: 'కర్మానుగుణంగానే మనుషులంతా ప్రవర్తిస్తారు. దీనికొరకు కోపం, ఏడ్పు దేనికి? పామును వదలిపెట్టి శాంతిని పొందుము'.

క. అన విని తెలిసి విడిచె, న । ర్జునకుఁడు భుజగము, నపాస్తరోషుం డగుచుం
జని రెలమిఁ బొంది, కాలుం । డును, మృత్యువుఁ గావునను విడువు మీ వడలున్. 40

ప్రతిపదార్థం: అనన్= అని ఆమె చెప్పగా; విని= ఆలకించి; తెలిసి= విషయ మెరిగి; అర్జునకుఁడు= కిరాతుడు; అపాస్త= పోయిన; రోషుండు= కోపం కలవాడు; అగుచున్= అవుతూ; భుజగమున్= పామును; విడిచెన్= వదలిపెట్టాడు; కాలుండును= యముడును; మృత్యువున్= మృత్యుదేవత; ఎలమిన్= సంతోషం; పొంది= పొంది; చనిరి= వెళ్ళిపోయారు; కావునన్= కాబట్టి; ఈవున్= ధర్మరాజా! నీవు కూడా; అడలున్= దుఃఖాన్ని; విడువుము= విడిచిపెట్టుము.

తాత్పర్యం: అంతా విన్న తరువాత జ్ఞానోదయమైన కిరాతుడికి కోపం పోగా పామును వదలిపెట్టాడు. మృత్యువూ, కాలుడూ సంతోషంతో వెళ్ళిపోయారు. కాబట్టి ధర్మరాజా! నీవూ దుఃఖాన్ని పరిత్యజించుము'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. కారు దుర్యోధనుఁడు నీవుఁ గారణములు । బాంధవుల రణ మరణ సంప్రాప్తి కనఘ!
వారు, దమతమ కర్మముల్ కారణములు । గాఁగ నిట్లయి; రేల శోకంబు నీకు ? 41

ప్రతిపదార్థం: అనఘా! దోషరహితుడవైన, ధర్మరాజా!; దుర్యోధనుఁడున్= సుయోధనుడుకానీ; నీవున్= నీవుకానీ; బాంధవుల= చుట్టాలయొక్క; రణ మరణ= యుద్ధంలోని చావులు; సంప్రాప్తికిన్= పొందటానికి; కారణములు= కారణాలు; కారు; తమ తమ= వారి వారి; కర్మముల్= కర్మలే; కారణములు= కారణాలు; కాఁగన్= అయినందున; ఇట్లు+అయిరి= ఈ విధంగా యుద్ధంలో మరణించినవారు అయ్యారు; నీకున్= నీకు; శోకంబు= దుఃఖం; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: నాయనా ధర్మరాజా! యుద్ధంలో చుట్టాలంతా అట్లా మరణించటానికి కారణం వారి కర్మలే కాని నీవు కానీ, దుర్యోధనుడు కానీ కారణం కారు. కనుక దుఃఖం విడిచిపెట్టుము.

వ. గౌతమీ, లుబ్ధక, భుజంగ, మృత్యు, కాల, సంవాదం బను నియ్యితిహాసంబు తాత్పర్యంబు మనంబునం బట్టుకొలిపి, యా పుట్టిన కలంకం దొలంగ జడిసి శమంబున సుఖివి గ' మ్మనం, గౌంతేయాగ్రజుండు సంతసిల్లి శాంతనవునితో ని ట్లనియె. 42

ప్రతిపదార్థం: గౌతమీ= గౌతమి అనే ఆ బ్రాహ్మణస్త్రీ; లుబ్ధక= కిరాతుడు; భుజంగ= పాము; మృత్యు= మృత్యువు; కాల= కాలుడు అనువారి; సంవాదంబు= సంభాషణ; అను= అన్న; ఈ ఇతిహాసంబు= ఈ పురాణకథయొక్క; తాత్పర్యంబు= భావం, రహస్యం; మనంబునన్= మనస్సులో; పట్టుకొలిపి= నిలుపుకొని; ఆ పుట్టిన= నీకు కలిగిన ఆయొక్క; కలంకన్= కలతను; తొలంగన్ జడిసి= పోగొట్టుకొని; శమంబునన్= శాంతితో; సుఖివి కమ్ము= సుఖం పొందుము; అనినన్= అనగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతీ పుత్రులలో పెద్దవాడైన ధర్మరాజు; సంతసిల్లి= సంతోషించి, శాంతనవునితోన్= శంతనుడి కుమారుడైన భీష్మడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ గౌతమి, మృత్యువు, కాలుడు, బోయ, పాము వీరి సంభాషణ రూపమైన పురాణకథ యొక్క భావాన్ని మనస్సులో పెట్టుకొని నీకు కలిగిన దుఃఖాన్ని తొలగించుకొని శాంతిని పొంది సుఖించుము' - అనగా ధర్మరాజు భీష్మడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఈ కథలో పాత్రలు అయిదుగురు. కథ సంభాషణ రూపంలో చెప్పబడింది. అది సంవాదం. ఇతిహాసమంటే పరంపరగా జనం చెప్పుకొనే పురాణకథ. ఈ కథ తాత్పర్య మిది - 'నీకు కలిగిన కష్టనష్టాలకు సుఖదుఃఖాలకు కారణం నీ కర్మతప్ప ఎవరూ కాదు'. ఈ దృష్టితో బ్రతకటమే భక్తి, జ్ఞానం. దీనివలననే శాంతి లభిస్తుంది. సంఘంలో ఘర్షణలు లోపించిపోతాయి. ఇది భారతీయ సంస్కృతి.

అగ్నిదేవుఁడు సుదర్శన యను కన్యకను వివాహంబు సేసికొనుట (సం.13-2-12)

చ. 'అనఘ! గృహస్థధర్మమునయందుఁ జరించి నరుండు మృత్యు సం
జనితభయంబు పాపికొనఁ జాలునొ చాలఁడొ?' యన్న నా సరి
త్తనయుఁడు 'దానికిం దగు విధంబు దిరం బగు నేనిఁ జాలు న
య్యను వొడగూడునట్టి యితిహాసము విన్ము నరేంద్ర! చెప్పెదన్. 43

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనఘ!= (భీష్ముడికి సంబోధన) పాపం లేనివాడా!; నరుండు= మనిషి; గృహస్థ ధర్మమునఅందున్= గృహస్థాశ్రమ ధర్మంలో; చరించి= ప్రవర్తించి; మృత్యుసంజనిత= చావువలన పుట్టే; భయంబు= భయం; పాపికొనన్= పోగొట్టుకొనుటకు; చాలునొ?= సమర్థుడగునా?; చాలఁడొ?= సమర్థుడు కాడా!; అన్నన్= అని ప్రశ్నించగా; ఆ సరిత్+తనయుఁడు= ఆ (గంగా) నది కొడుకు భీష్ముడు; నర+ఇంద్ర!= ప్రజలను పాలించే రాజా!; దానికిన్+తగు విధంబు= దానికి తగిన పద్ధతి; తిరంబు=స్థిరం; అగున్+ఏని= అయితే; చాలున్= సమర్థమే; ఆ+అనువు= ఆ ఉపాయం; ఒడన్+కూడునట్టి= కలిగించే; ఇతిహాసము= పూర్వకథ; చెప్పెదన్= చెప్పుతాను; విన్ము= వినుము.

తాత్పర్యం: 'పుణ్యాత్ముడా! మనిషి గృహస్థాశ్రమంలో ఉండి మృత్యుభయం పోగొట్టుకొనగలడా?' అని ధర్మరాజు ప్రశ్నిస్తే తాతగారైన భీష్ముడు 'ధర్మానికి స్థిరంగా నిలబడగలిగితే ముక్తి పొందగలడు. దాని కొక కథ ఉన్నది చెప్పుతాను వినుము.

విశేషం: 1. పాపమంటే బ్రతుకులో ఎటువీలైతే అటు నడుస్తూ పోవటం. ధర్మానికి కట్టుబడి నడవటం పుణ్యం. 2. మృత్యువంటే చావు కాదు. ధర్మం, భగవంతుడు, ఆత్మవిచారం లేకుండా బ్రతికే వట్టి గొడ్డు బ్రతుకు. మామూలు జీవితం. 3. ఇతి+హ+అస్= ఇది ఇట్లా ఒకప్పుడు ఉన్నది. ఒకప్పుడు ఇట్లా జరిగిందని జన పరంపర చెప్పుకొనే ప్రాచీన కథ. కథ జరిగిందని చెప్పినా ఆ పద్ధతిగా జీవిస్తే ఇప్పటికీ జరుగుతుందని చెప్పేది. కనుక మూడు కాలాలకూ అన్వయించే కథ.

మ. మనువంశంబునఁ బుట్టి, సర్వజనతామందారమై నేలయె
ల్లను బాలించి, జగత్త్రయీప్రణుతలీలం బొల్చె దుర్యోధనుం
డను రా జవ్విభు నొప్పు నర్మదకుఁ గామావేశముం జేసినన్
వనితారూపము దాల్చి పొందె నతనిన్ వైదగ్ధ్య హృద్యంబుగన్. 44

ప్రతిపదార్థం: దుర్యోధనుండు= దుర్యోధనుడు; అనురాజు= అనే పేరు గల ఒకానొక రాజు (పూర్వం జరిగిన కథలో రాజు); మనువంశంబునన్= మనువుతో ప్రారంభమైన వంశంలో; పుట్టి= జన్మించి; సర్వజనతా= అందరు మనుషులకూ; మందారము+ఐ= కల్పవృక్షమై; నేల ఎల్లను= భూమినంతా; పాలించి= ఏలి; జగత్త్రయీ ప్రణుతలీలన్= మూడులోకాలచేత మిక్కిలి స్తుతించదగ్గ విధంగా; పొల్చెన్= ఒప్పారెను; ఆ+విభు= ఆ రాజుయొక్క; ఒప్పు= అందం (దేహసౌందర్యం, మనస్సౌందర్యం); నర్మదకున్= నర్మద అనే నదికి; కామ+ఆవేశమున్= ప్రేమోత్సాహం; చేసినన్= కలిగించగా; వనితారూపము= స్త్రీరూపం; తాల్చి= పొంది; వైదగ్ధ్య= నేర్పుతో; హృద్యంబుగన్= మదికి ఇంపుకాగా; అతనిన్= ఆ రాజును; పొందెన్= వివాహం చేసికొన్నది.

తాత్పర్యం: పూర్వం మనువంశంలో దుర్యోధను డనే రాజు పుట్టి ముల్లోకాలచేత మిక్కిలి స్తుతించబడేటట్లు పాలించాడు. అతడి అందాన్ని చూచి నర్మదానది ప్రేమావేశం పొంది స్త్రీరూపం ధరించి అతడిని పెండ్లి చేసుకొన్నది.

విశేషం: భారతంలో చాలాచోట్ల నదులు స్త్రీలై వచ్చి రాజులను పెండ్లి చేసుకొన్న కథలు చాలా ఉన్నాయి. ఈ కథ చెప్పే భీష్ముడే గంగకు శంతనుడికి పుట్టినవాడు కదా! ప్రపంచ ఇతిహాస వాఙ్మయంలో ఇట్లాంటి కథలు చాలా ఉన్నాయి.

తిక్కనగారు 'ఆంధ్రావళి మోదముం బొరయ' ఆంధ్రులంతా సంతోషించే విధంగా వ్రాస్తానన్నారు కనుక తెలుగు మాటలలోనే తన రచనను చేశాడనటానికి ప్రతిపద్యమూ ఉదాహరణమే - 'నేలయెల్లను' అననక్కరలేదు. భూమిలేదా రాజ్యమెల్లను అనవచ్చునుకదా! ఈ పద్యం ప్రారంభించటం, ముగించటం, యతి, ప్రాస అంతా చాలా గొప్పగా నిర్మించిన శిల్పమయమైన పద్యం.

ఇతిహాసాన్ని ఎట్లా చెప్పాలో ఆ పద్ధతి కిదొక నమూనా.

క. ఆ రమణికి నతనికిఁ గ । న్యారత్నం బుద్భవించె నమరపురంధ్రీ

శ్రీరామణీయకము ని । స్సారం బగునట్లు గాఁగ జగతీనాథా! 45

ప్రతిపదార్థం: జగతీ= లోకానికి, నాథా!= పాలకుడా!; ఆ రమణికిన్= ఆ నర్మదానదీదేవతకు; అమరపురంధ్రీ= దేవతా స్త్రీలయొక్క; శ్రీరామణీయకము= శోభావంతమైన అందం; నిస్సారంబు= సారంలేనిది; అగునట్లు= అయ్యేటట్లు; కాఁగన్= కాగా; కన్యారత్నంబు= శ్రేష్ఠురాలైన కూతురు; ఉద్భవించెన్= పుట్టింది.

తాత్పర్యం: అందమైన ఆ నర్మదకూ ఆ రాజుకూ దేవతాస్త్రీల అందాలను తిరస్కరించగలిగేటటువంటి అందమైన కూతురు పుట్టింది.

విశేషం: ముందుకథలో అగ్నిదేవు డీమె అందం చూచి పెండ్లి చేసికోబోతున్నాడు కనుక దేవతాస్త్రీల అందాలను తలదన్నే అందం కల రత్నంవంటి కూతు రన్నాడు కవి. దానికొరకే ఆ సమాసం. మహాకవి దీర్ఘసమాసం వాడితే ఇట్లా విశేషార్థాలు భావించాలి.

వ. విను! దానికిఁ బేరు సుద । ర్శన, యన్నరనాయకుండు సంప్రీతి మెయిం

బెనిచి, తన యగ్నిహోత్రం । బున పరిచర్యలకుఁ బనిచె బుజ్జవ మొప్పన్. 46

ప్రతిపదార్థం: విను= వినుము; దానికిన్= ఆ కూతురుకు; పేరు; సుదర్శన= అందమైన రూపం కలది; ఆ+నరనాయకుండు= ప్రజాపాలకుడు; సంప్రీతిమెయిన్= మిక్కిలి ప్రేమతో; పెనిచి= పెంచి; అగ్నిహోత్రంబున= అగ్నిని పూజించేశాలలో; పరిచర్యలకున్= సేవలకు; బుజ్జవము= లాలన, వాత్సల్యం; ఒప్పన్= ప్రకాశించగా, స్పష్టపడగా; పనిచెన్= నియోగించాడు.

తాత్పర్యం: ఆ కన్యకు సుదర్శన అని పేరు పెట్టి, ప్రేమతో పెంచి, తండ్రి తన అగ్నిశాలలో అగ్ని పరిచర్యల నిమిత్తం ఆమెను నియోగించాడు.

విశేషం: సుదర్శన అనే పేరు నాటి స్త్రీలకు పెట్టుకొనే రివాజుండేది. క్రీ.పూ. నిర్మించిన భారత్ బౌద్ధస్తూపం మీద సుదర్శన అనే యక్షిణి బొమ్మ ఉన్నది. కనుక అందమైన స్త్రీకి ఆ పేరు పెట్టే ఆచారముండేది.

వ. పనిచిన నప్పొలంతి యప్పనులవెంట మెలంగుచుండె; నట్టియెడ. 47

ప్రతిపదార్థం: పనిచినన్= నియోగించగా; ఆ+పొలంతి= ఆ స్త్రీ; ఆ+పనులవెంటన్= ఆ పనుల ననుసరించి; మెలంగుచున్+ఉండెన్= మెలగుతున్నది; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: తండ్రి ఆ విధంగా నియోగించగా ఆమె ఆయా పనులను తప్పక చేస్తూ ఉన్న సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. అర్చించునప్పు డయ్యంగన కెంగేలి । జిగిసొంపు, చిత్తంబు దిగిచి కొనఁగ,

నరసి కన్గొనునప్పు డయ్యింతి కనుఁగవ । పొలపంబు రాగంబు వొదలఁజేయ,

నన్యులఁ బని పంచునప్పు డమ్ముద్దియ। పలుకుల తీపు గోర్కులఁ గెరల్ప

నల్లన యూఁదెడు నప్పు డక్కొమ్మ వా।తెఱతావి ధైర్యంబు ద్రిప్పుకొలుప.

తే. మరుఁడు దోడ్తోడఁ దేఁకువ మాలి కదిసి। తూపుగముల క్రొవ్వాఁడిమి సూప నంత

కంత కగ్గల మగు వలవంతఁ దూలి। పోయెఁ బావకుఁ; డేమి సెప్పుదు నరేంద్ర! 48

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= రాజా!; పావకుఁడు= అగ్ని; అర్చించునప్పుడు= పూజించేవేళ; ఆ+అంగన= ఆ స్త్రీ యొక్క; కెంగేలి- కెంపు+కేలి= ఎర్రని చేయియొక్క; జిగి= కాంతి; సొంపు= అందం; చిత్తంబు= మనస్సును; తిగిచికొనఁగన్=లాగగా, ఆకర్షించగా; అరసి= నిగాతో, ఏకాగ్రంగా; కన్గొనునప్పుడు= చూస్తున్న సమయంలో; ఆ+ఇంతి= ఆ స్త్రీ యొక్క; కనుఁగవ= కన్నులజంట; పొలపంబు= అందం; రాగంబు= ప్రేమను; పొదలన్+చేయన్= పెంపొందించగా; అన్యులన్= ఇతరులను; పనిన్= ఆయా పనులకు; పంచునప్పుడు= పంపేవేళ; ఆ+ముద్దియ= ఆ ముద్దులాడి (తియ్యగా మాట్లాడేది); పలుకుల= మాటల; తీపు= తియ్యదనం; కోర్కులన్= కోర్కెలను; వాంఛలను; కెరల్పన్= రెచ్చగొట్టగా; అల్లన= నెమ్మదిగా; ఊఁదెడునప్పుడు= (మండించే ప్రయత్నం చేసేవేళ) ఊదేవేళ; ఆ+కొమ్మ= ఆ స్త్రీ, ఆ యౌవనవతి యొక్క; వాతెఱ= పెదవి; తావి= వాసన; ధైర్యంబు= గుండె నిబ్బరాన్ని; త్రిప్పుకొలుపన్= కలతపెట్టగా; మరుఁడు= మరులు కొల్పేవాడు; మన్మథుడు; తోడ్తోడన్= వెన్వెంటనే; తేఁకువ= ధైర్యం; మాలి= కోల్పోయి; కదిసి= సమీపించి; తూపు= అమ్ముల (బాణాల); గములన్= సమూహంతో; క్రొత్త+వాఁడిమి= క్రొత్తపదును; చూపన్= చూపగా; అంతకంతకున్= క్రమక్రమంగా; అగ్గలము+అగు= ఎక్కువయైన; వలపువంతన్= మన్మథబాధతో - విరహంతో; తూలిపోయెన్= ధైర్యం కోల్పోయాడు; ఏమిచెప్పుదున్?= ఇంకేమి చెప్పేది?

తాత్పర్యం: ఏమి చెప్పేది? చిత్రంగా అగ్నిదేవుడు కూడా ఆమెపట్ల ఆకర్షితుడై క్రమంగా ఆమెయందు అనురక్తుడయ్యాడు. తనను పూజించేటప్పుడు ఆ సుదర్శన ఎర్రని వ్రేళ్ళ కాంతికి అతడి మనస్సు ఆకర్షించబడింది. పరిచర్య చేస్తూ ఆమె ఏకాగ్రంగా చూచేటప్పుడు కళ్ళ అందం ప్రేమను గిల కొట్టింది. ఇతరులను ఆయా పనులకు పురమాయించేటప్పుడు ఆ ముద్దులాడి తీపిమాట లాయనలో కోర్కెలను రెచ్చగొట్టేవి. నెమ్మదిగా పొయ్యిని ఊదేటప్పుడు ఆమె పెదవి వాసన అతడి ధైర్యాన్ని తూలిపోయేటట్లు చేసేది. దీనితోపాటుగా మరుడు భయం వీడి, అగ్నిని సమీపించి, తన పంచబాణాల పదను చూపించగా క్షణక్షణానికి విరహవేదన ఎక్కువ కాగా అగ్ని ధైర్యాన్ని పోగొట్టుకొన్నాడు.

విశేషం: ఈ నేపథ్యంలో శృంగార రసవర్ణన చాలా మృదువుగా, నాగరికంగా చేయబడింది. నాయికావర్ణనలో ఎక్కడా ఔచిత్యం కోల్పోలేదు. వ్రేళ్ళు, కళ్ళు, మాటా, వాతెఱతావీ ఇవే చెప్పిన అవయవాలు. ఇది తిక్కనగారు ప్రదర్శించిన ఔచిత్యం. ఈ పద్యం కవి చేసిన వర్ణన.

వ. ఇట్లు మదనాగ్ని నుదిలకొని యగ్నిదేవుం డక్కాంతతో నేకాంతంబున నిట్లనియె. 49

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మదన+అగ్నిన్= మన్మథతాపంతో; ఉదిలకొని= చలించిపోయి; అగ్నిదేవుండు; ఆ+కాంతతోన్= ఆ అందమైన స్త్రీతో; ఏకాంతంబునన్= ఒంటరిగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అగ్నిదేవుడు మదనాగ్ని ప్రభావంతో చలించిపోయి ఆ స్త్రీతో ఒంటరిగా ఈ విధంగా పలికాడు.

సీ. 'చిగురుటాకుల గాసి సేయు నీ యడుగుల । చెలువంబు సూడ్కులఁ జేర్చికొనియె,
మారేడు పండుల గారాము సెఱుచు నీ । యెలచన్నుఁగవ వేడుకలఁ బొనర్చె
నునుఁదీవఁ జీరికిఁ గొనని నీ మైఁదీవ । మురిపంబు డెందంబు మరులుకొలిపె,
నెఱచందురుని సిగ్గువఱుపంగఁ జాలు నీ । నెమ్మోము దాలిమి వమ్ముసేసె.

తే. నాతి నీకునై పెక్కుబన్నములు వడితి । నంగజునిచేత; వల్లభ వగుము, నాకు'
నావుడును సిగ్గు గదిరి, యాననము వాంచి । యలఁతి యెలుఁగున నిట్లను నా లతాంగి. 50

ప్రతిపదార్థం: నాతి!= ఓ అమ్మాయి!; చిగురు+ఆకుల= లేత ఆకుల; గాసిచేయు= బాధించే (తిరస్కరించే); నీ+అడుగుల= నీ పాదాల; చెలువంబు= అందం; చూడ్కులన్= చూపులను; చేర్చికొనియెన్= తమలో లీనం చేసికొన్నాయి; మారేడుపండుల= మారేడుపండ్ల యొక్క; గారాము= గోము, ముగ్ధసౌందర్యం; చెఱుచు= చెడగొట్టు; నీ; ఎల= లేత; చన్నుఁగవ= చనులజంట; వేడుకలన్= పండుగలను, ఉత్సవాలను; పొనర్చెన్= చేసింది; నును+తీవన్= లేతతీగను; చీరికిన్= లెక్కకు; కొనని= గ్రహించని (లెక్కచేయని); నీ; మై= శరీరమన్న; తీవ= తీగయొక్క; మురిపంబు= సౌకుమార్యం; డెందంబున్= మనస్సును; మరులు కొలిపెన్= మోహింపజేసింది; నెఱ= నిండు; చందురుని= జాబిల్లిని; సిగ్గుపఱుపంగన్+చాలు= సిగ్గులపాలు చేసే; నీ; నెఱ+మోము= అందమైన ముఖం, తాలిమిన్= నా ధైర్యాన్ని; వమ్ము చేసెన్= నాశనం చేసింది; నీకునై= నీ కోసమై; అంగజుని చేతన్= మన్మథుడి చేత; పెక్కు= అనేకమైన; బన్నములు= కష్టాలు; పడితిన్= పడ్డాను; నాకున్= నాకు; వల్లభవు= భార్యవు; అగుము= కమ్ము; నావుడును= అనగా; ఆ+లతాంగి= తీగవంటి శరీరం కల ఆ సుదర్శన; సిగ్గు కదిరి= లజ్జ తొణికిసలాడగా; ఆననము వాంచి= తలను వంచుకొని; అలఁతి= సన్నని; ఎలుఁగునన్= స్వరంతో; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: 'సుదర్శనా! చిగురాకులను తృణీకరించే నీ పాదాల సొగసు నా చూపులను తనలో లీనం చేసికొన్నది. మారేడుపండ్ల అందాన్ని కాదనే నీ చనులజంట నాకు నేత్రోత్సవాన్ని కల్పించింది. లేత తీగలను కాలదన్నే నీ శరీరమన్న తీగ నాకు మరుల తీగైనది (అడవిలో ఉండే ఈ తీగను త్రొక్కిన బాటసారులు దారి తప్పిపోతారట). నిండు జాబిల్లిని సిగ్గుపరిచే నీ గుండ్రని ముఖం నా గుండె దిటవును కూల్చివేసింది. ఇవి నాకు మన్మథుడు పెట్టిన బాధలు. కనుక నాకు రాణివి కమ్ము' అని అనగా, విని ఆమె ముఖం కొంచెం వంగి సిగ్గుతో సన్నని గొంతుతో ఇట్లా అన్నది.

విశేషం: ఇందులో వర్ణించబడిన అవయవాలు, పాదాలు, చనుగవ, శరీరం, ముఖం, క్రిందినుండి పైకి వర్ణించబడ్డాయి. పై పద్యంలో చెప్పిన అవయవాలు వేరు. ఆమె ముఖం వాల్చటం, అలతి యెలుఁగు - ఇవన్నీ ఆమె కన్యాత్వాన్ని స్థాపించే మాటలు. అగ్ని ఔచిత్యం మరిచిపోకుండా తన ప్రేమను నాజూకుగా తెలియచేశాడు.

క. 'కులకన్యకలకు వేడుకఁ । దలవీడులఁ బరులతోడి తగుమాటలకుం
దలకొనఁ దగునే? గురుజన । ముల కా కత్తెఱఁగువారు పురుషార్థనిధీ!' 51

ప్రతిపదార్థం: పురుష+అర్థ= ధర్మ, అర్థ, కామ, మోక్షాలకు; నిధీ!= స్థానమైనవాడా! పురుషార్థాలను ఇచ్చేవాడా!; కులకన్యకలకున్= ఉత్తమకులంలో పుట్టిన కన్యలకు (లోకం తెలియని అమాయికలకు); వేడుకన్= కోర్కెతో; తలవీడులన్= సమీప ప్రదేశంలో;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరులతోడి= ఇతరులతో, పరపురుషులతో; తగుమాటలకున్= వయస్సుకు తగినమాటలకు; తలకొనన్= పూనుకొన; తగునే?= తగునా? - తగదు; ఆ+తెఱఁగువారు= ఆ విధంగా మాట్లాడదగినవారు; గురుజనముల కాక= పెద్దలే అగుదురు.

తాత్పర్యం: 'పురుషార్థప్రదాతవు నీవు. కులకన్యలు తలవాకిట్లో బయటివారితో ఇష్టానుసారంగా మాట్లాడుతారా? అట్లా మాట్లాడతగినవారు పెద్దలే కదా!

వ. అనిన విని హుతవహుం 'డట్లకాక' యనియె; నా సమయంబున. 52

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; హుతవహుండు= వేల్చినవాటిని మోసికొనిపోయి దేవతలకిచ్చేవాడు- అగ్ని; అట్ల కాక= సరేలే, అట్లాగే; అనియెన్= అన్నాడు; ఆ సమయంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: సుదర్శన ఆ విధంగా అనగా అగ్ని విని సరే అన్నాడు. ఆ తరువాత.

ఉ. ఆ నరనాయకుం డొక మహాధ్వర మెంతయుఁ వేడ్కఁ జేయఁగాఁ
బూని, మహీసురావళికిఁ బూజ లొనర్పఁగఁ దాను బ్రాహ్మణుం
డై నయ మారఁగా ననలుఁ డాతని పాలికి వచ్చి 'నాకు నీ
వే నృప! నీదుపుత్రిఁ గృప యేర్పడ దానము గాఁగ' నావుడున్. 53

ప్రతిపదార్థం: ఆ+నరనాయకుండు= ఆ ప్రజలను పాలించే రాజు (దుర్యోధనుడు); ఒక= ఒకానొక; మహా=గొప్ప; అధ్వరము= యజ్ఞం; ఎంతయున్= ఎంతో; వేడ్కన్= కోర్కెతో; చేయఁగాన్= చేయటానికి; పూని= పూనుకొని; మహీసుర= భూదేవతల (బ్రాహ్మణుల); ఆవళికిన్= సమూహానికి; పూజలు= అర్చనలు; ఒనర్పఁగన్= చేయగా; తాను= తానుగా వచ్చి; అనలుఁడు= అగ్ని; బ్రాహ్మణుండు+ఐ= బ్రాహ్మణవేషాన్ని ధరించినవాడై; అతనిపాలికిన్= అతడి వద్దకు; వచ్చి= వచ్చి; నయము= ప్రేమ; అరఁగాన్= నిండగా; నృప!= రాజా!; నాకున్= నాకు; నీదు= నీయొక్క; పుత్రిన్= కుమార్తెను; దానముకాగన్= దానంగా; కృప= దయ; ఏర్పడన్= స్పష్టంకాగా; ఈవే?= ఈయవయ్యా!

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు ఒక మహాయజ్ఞం చేయాలని తలపెట్టి, బ్రాహ్మణుల కనేక దానాలు చేస్తూ ఉండగా, అగ్నికూడా వాళ్ళల్లో ఒక బ్రాహ్మణుడై వచ్చి రాజును అతడి కూతురును తనకు దానం చేయుమని అర్థించాడు.

వ. అ వ్విభుండు. 54

ప్రతిపదార్థం: ఆ+విభుండు= ఆ రాజు

తాత్పర్యం: ఆ రాజు

తే. 'అన్యవర్ణుండు, దీనుఁ డీయనకు నెట్లు। గూఁతు నీవచ్చు?' నని మదిఁ గుత్స వుట్టి,
యీఁడ ప్రార్థన మఫల మై యేఁగి యజ్ఞ। సమయమున నగ్ని తనమూర్తి సంహరించె. 55

ప్రతిపదార్థం: అన్యవర్ణుండు= ఇతర కులంవాడు (క్షత్రియుడు కానివాడు); దీనుఁడు= పేదవాడు; ఈయనకున్= ఇతడికి; ఎట్లు= ఏ విధంగా; కూఁతున్= కుమార్తెను; ఈవచ్చున్= ఇయ్యవచ్చును; అని; మదిన్= మనస్సులో; కుత్స= అసహ్యం; పుట్టి=

జనించి; ఈడు+అ= ఇవ్వడు కదా!; అగ్ని= అగ్నిదేవుడు; ప్రార్థనము= తన అభ్యర్థన, వేడుకోలు; అఫలము+ఐ= ఫలించకపోగా; ఏఁగి= పోయి; యజ్ఞసమయమునన్= యజ్ఞం చేసేవేళ; తనమూర్తిన్= తన తేజస్సును; సంహరించెన్= కన్పించకుండా చేశాడు.

తాత్పర్యం: రాజు ఇట్లా తనలో తా ననుకొన్నాడు. 'ఇతడు వేరే కులంవాడు. పైగా పేదవాడు. ఇతడికెట్లా కూతురు నివ్వగలను?' అని మనస్సులో అనుకొని ఇవ్వలేకపోయాడు. అగ్ని తన ప్రార్థన ఫలవంతం కాకపోగా, వెళ్ళి యజ్ఞ సమయంలో తన తేజస్సును ఉపసంహరింపజేశాడు. (అగ్ని మండలేదు)

క. కని యజ్ఞనపతి ఋత్విజు । లును, దానును, వెఱఁగుపడి, 'విలోపము వాటి
ల్లెనొకో! కర్మగతుల' నని । మనమున నూహించి, భవ్యమంత్రముఖరులై. 56

ప్రతిపదార్థం: ఆ+జనపతి= ఆ ప్రజాపాలకుడు, రాజు; కని=చూచి; ఋత్విజులును= పురోహితులును; తానును= తానూ; వెఱఁగుపడి= విస్తుపోయి; కర్మగతులన్= యజ్ఞవిధులలో; విలోపము= పెద్దలోపం; వాటిల్లెన్+ఒకో!= ఏర్పడినదా!; అని; మనమునన్= మనస్సులో; ఊహించి= ఆలోచించి; భవ్య= శ్రేష్ఠమైన; మంత్ర= మంత్రాలను; ముఖరులై= ఉచ్చరిస్తూ.

తాత్పర్యం: రాజూ, పురోహితులూ చూచి విస్తుపోయారు. ఇదేమిటి అగ్ని మండటంలేదని, కర్మలోపంవలన ఇట్లా జరిగి ఉంటుందని భావించి, ఇంకా గొప్ప మంత్రాలను ఉచ్చరిస్తూ (తరువాతి పద్యంతో అన్వయం)

వ. పావకునిం బ్రస్తుతించుచుండ నద్దేవుం డా భూదేవతలకు నల్లన తనతెఱం గెఱింగించిన. 57

ప్రతిపదార్థం: పావకునిన్= అగ్నిని; ప్రస్తుతించుచున్+ఉండన్= పొగడుతుండగా; ఆ+దేవుండు= ఆ అగ్నిదేవుడు; ఆ భూదేవతలకున్= ఆ పురోహిత బ్రాహ్మణులకు; అల్లన= నెమ్మదిగా; తన తెఱంగు= తన విషయం; ఎఱింగించినన్= తెలుపగా.

తాత్పర్యం: భవ్యమంత్రాలతో స్తుతిస్తుండగా ఆ అగ్ని వారితో తన విషయం చెప్పగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. వార లాన్నృపుతోఁ జెప్ప, గారవంబు । సంతసముఁ దలకొనఁగ నయ్యింతిఁ బెండ్లి
సేసె, విప్రకుమారుఁ డై చెన్ను మెఱసి । యగ్ని వరియించె నచ్చెరువంద జనులు. 58

ప్రతిపదార్థం: వారలు= ఋత్విజులు; ఆ నృపుతోన్= ఆ రాజుతో; చెప్పన్= చెప్పగా; గారవంబు= గౌరవం; సంతసమున్= సంతోషం; తలకొనఁగన్= కలుగగా; ఆ+ఇంతిన్ పెండ్లి చేసెన్= తన పుత్రికా వివాహం జరిపించాడు; అగ్ని; విప్రకుమారుఁడు+ఐ= బ్రాహ్మణపుత్రుడై; చెన్ను= అందం; మెఱసి= ప్రకాశించగా; జనులు= ప్రజలు; అచ్చెరువందన్= ఆశ్చర్యపడగా; వరియించెన్= పెండ్లాడాడు.

తాత్పర్యం: ఆ పురోహితులు అగ్ని కోర్కెను రాజుతో చెప్పగా అతడు గౌరవంతో, సంతోషంతో కుమార్తె పెండ్లి చేశాడు. అగ్ని అందమైన బ్రాహ్మణ కుమారుడై ఆమెను వరించాడు. ఇది చూచి ప్రజలు ఆశ్చర్యపడ్డారు.

వ. ఇట్లు సుదర్శనా వివాహోత్సవం బనుభవించి విభావసుండు విభాప్రభాసమానుం డగుచు హుతంబులు పరిగ్రహింప దుర్యోధను యాగంబును సుప్రయోగం బై చెల్లెఁ; బదంపడి. 59

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సుదర్శనా వివాహ+ఉత్సవంబు= సుదర్శన పెండ్లివేడుక; అనుభవించి= పొంది; విభావసుండు= అగ్ని; విభా= కాంతితో; ప్రభాసమానుండు+అగుచున్= వెలుగొందుతూ; హుతంబులు= యజ్ఞంలో వేల్చబడిన ద్రవ్యాలను; పరిగ్రహింపన్= స్వీకరించగా; దుర్యోధను యాగంబును= రాజు యజ్ఞం కూడా; సుప్రయోగంబు+ఐ= చక్కగా నెరవేర్చబడినదై; చెల్లెన్= సమాప్తమయింది; పదంపడి= తర్వాత.

తాత్పర్యం: ఈ విధంగా తాను కోరిన సుదర్శన పెండ్లివేడుక లనుభవించి ఆనందంతో ఉపసంహరించుకొన్న రూపాన్ని ఉజ్జ్వలంగా ప్రకాశింపచేసి అగ్నిదేవుడు దుర్యోధనుడి యజ్ఞ పరిసమాప్తిని చేయించాడు. తరువాత.

విశేషం: 'విభావసుండు విభాప్రభాసమానుండై' - సామాన్యంగా తిక్కనగారు ఇటువంటి సమాసాలు వాడడు. ఇక్కడ పెండ్లికొడుకు ఆనందాన్ని చెప్పటానికి వాడాడు. ఇది ఆయన రచనాశిల్పం.

క. అనలునకు సుదర్శనకును । జనియించె నుదాత్తగుణవిశాలుండు, సుద
ర్శననామధేయుఁ డానృపుఁ । డనూనధర్మమునఁ దాల్చె నవనీభరమున్. 60

ప్రతిపదార్థం: అనలునకున్= అగ్నికి; సుదర్శనకును= ఆ పేరుకల అగ్ని భార్యకు; ఉదాత్తగుణవిశాలుండు= ఉన్నతగుణాలతో పేరుపడ్డవాడు (విశాలబుద్ధి); సుదర్శన నామధేయుఁడు= (తల్లిపేరే కుమారునకు పెట్టారన్నమాట) సుదర్శనుడన్న పేరుకలవాడు; జనియించెన్= పుట్టాడు; ఆ నృపుఁడు= ఆ రాజు; అవనీభరమున్= భూభారాన్ని; అనూన= గొప్ప; ధర్మమునన్= ధర్మంతో; తాల్చెన్= ధరించాడు.

తాత్పర్యం: భార్యాభర్తలకు గొప్ప గుణాలు కల కొడుకు పుట్టాడు. అతడికి సుదర్శనుడు అని తల్లిపేరే పెట్టారు. అతడు పెద్దవాడై రాజ్యభారాన్ని ధర్మదృష్టితో మోయటం మొదలుపెట్టాడు.

విశేషం: తల్లిపేరు పెట్టడం అతి ప్రాచీన సమాజపు అలవాటు.

వ. ఆ సమయంబున. 61

తాత్పర్యం: ఆ వేళలో.

ఆ. అతని కోఘవంతుఁ డనువాఁడు జనియించె । నుదితయశుఁడు; వాని కోఘరథుఁడు,
నోఘవతియు ననఁగ నుదయించి; రయ్యోఘ । వతికి నా విభుండు వరుని నరసి. 62

ప్రతిపదార్థం: అతనికిన్= సుదర్శనునకు; ఉదితయశుఁడు= కీర్తిశాలి; ఓఘవంతుఁడు= ఓఘవంతుడనే పేరుకలవాడు; అనువాఁడు; జనియించెన్= పుట్టాడు; వానికిన్= ఆ ఓఘవంతుడికి; ఓఘరథుడు, ఓఘవతియున్; అనఁగన్= అన్న పేర్లుకల కొడుకు, కూతురు; ఉదయించిరి= జన్మించారు; ఆ+ఓఘవతికిన్= ఆ కుమార్తెకు; ఆ విభుండు= ఆ రాజు; వరునిన్= పెండ్లి కుమారుడిని; అరసి= వెదకి.

తాత్పర్యం: ఆ సుదర్శనునకు ఓఘవంతుడు, ఇతడికి ఓఘరథుడు, ఓఘవతి జన్మిస్తే ఆ తండ్రి కుమార్తెకు వరుడిని వెదకుతుండగా. (ఈ పేర్లన్నీ నదీ ప్రవాహమన్న అర్థాన్నిచ్చేవే. తల్లి తల్లి నర్మదానది కనుక మాతృవంశాన్ని సూచించే నామాలే వారు ధరిస్తూ వచ్చారన్నమాట.)

వ. ఒరుల మెచ్చక. 63

తాత్పర్యం: ఇతరులను అంగీకరించక. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఆ లేమ సుదర్శనునకు । నాలింగా నిచ్చె, నద్దహననందనుఁడున్
లోలతఁ గైకొని, పరిణయ । కేలి నడపి, విమలబుద్ధిఁ గృతనిశ్చయుఁడై. 64

ప్రతిపదార్థం: ఆ లేమన్= ఆ కన్యను; సుదర్శనునకున్= తాతగారైన అగ్నికొడుకునకు; ఆలిన్+కాన్= భార్యగా; ఇచ్చెన్= ఇచ్చెను; ఆ+దహన నందనుఁడున్= అగ్నికొడుకును; లోలతన్= ఆసక్తితో; కైకొని= గ్రహించి; పరిణయకేళిన్= వివాహోత్సవమును; నడపి= చేసి; విమలబుద్ధిన్= స్వచ్ఛమైన బుద్ధితో; కృత= చేయబడిన; నిశ్చయుఁడు+ఐ= నిశ్చయం కలవాడై.

తాత్పర్యం: తండ్రి ఓఘవతిని సుదర్శనుడికిచ్చి పెండ్లి చేశాడు. ఆ అగ్నికొడుకు ఆమెను ప్రేమతో వివాహం చేసికొని స్వచ్ఛమైన మనస్సుతో ఒక నిశ్చయానికి వచ్చాడు.

విశేషం: తాత మనుమరాలిని పెండ్లి చేసుకొనే ఆచారం ఉండేది. దానినిబట్టి ఇది జరిగింది.

వ. 'గృహస్థ ధర్మానుష్ఠానంబునన మృత్యువు జయింతు' నని ప్రతిజ్ఞ చేసి యోఘవతియునుం దానును గురు క్షేత్రంబునకుం జని, యందు రమణీయ ప్రదేశంబున విశాలమగు పర్ణశాల కావించుకొనియుండె; నట్టియెడ న య్యెలనాగతో నతం డిట్లనియె. 65

ప్రతిపదార్థం: గృహస్థధర్మ+అనుష్ఠానంబునన్= గృహస్థుడి ధర్మాలను అనుసరించటంవలననే; మృత్యువున్ జయింతును= ముక్తి నొందుతాను; అని= ఆలోచించి; ప్రతిజ్ఞచేసి= ప్రతినపూని; ఓఘవతియునున్+తానును= భార్యతోపాటుగా తానూ, కురుక్షేత్రంబునకున్= ఆ పేరుగల పుణ్యప్రదేశానికి; చని= పోయి; అందున్= అక్కడ; రమణీయ= చక్కని; ప్రదేశంబునన్= స్థలంలో; విశాలము+అగు= పెద్ద; పర్ణశాల=పూరిగుడిసె (ఆకులతో కప్పిన చిన్ని గుడిసె); కావించుకొని= నిర్మించుకొని; ఉండెన్= ఉన్నాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ+ఎలనాగతోన్= ఆ స్త్రీతో (భార్యతో) అతండు= భర్త; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'గృహస్థాశ్రమధర్మాన్ని పాటిస్తూ మృత్యువును జయిస్తాను' అని శపథంచేసి ఓఘవతీ తానూ కలిసి కురుక్షేత్రానికి వెళ్ళి, అందు అందమైన ప్రదేశంలో విశాలమైన పర్ణశాలను కట్టుకొని ఉన్నాడు. ఆ సమయంలో అతడు భార్యతో ఇట్లా అన్నాడు.

విశేషం: గృహస్థుడై ఉంటూనే మోక్షం పొందవచ్చును. ఒక్క సన్న్యాసమే కాదు ముక్తిమార్గ మనటానికి చెప్పిన కథ కనుక ఆ విషయ మిక్కడ స్పష్టం చేస్తున్నాడు కవి. మృత్యువు, అమృతము అనే రెండు మాటలు; ఈ లోకం, పరలోక మన్న అర్థాలలో వైదిక వాఙ్మయంలో వాడబడినవి. అంతేకాని చావు అని కాదు. ఇది ప్రతి జీవికీ తప్పదు కనుక. కురుక్షేత్రం ధర్మక్షేత్రమని గీత వర్ణిస్తుంది. కనుక అది తపోయోగ్యమైన ప్రదేశమని భారతంలో చాలాచోట్ల దీని ప్రసక్తి వస్తుంది.

తే. 'అతిథిఁ బూజించువేడ్క, నాకగ్గలంబు । వెలఁది । నీవును, ననుకూలవృత్తిఁ దాల్చి
సొలయ కప్పని నడపఁగా వలయుఁబూని । యే నిచట నున్న యప్పుడు, లేనియపుడు. 66

ప్రతిపదార్థం: నాకున్= నాకు; అతిథిన్= అతిథిని; పూజించు= అర్చించే; వేడ్క= కోరిక; అగ్గలంబు= ఎక్కువ; వెలఁది!= గృహిణీ! (స్త్రీ); నీవును= నీవు కూడా; అనుకూలవృత్తిన్= నాకు అనుకూలమైన ప్రవర్తనను; తాల్చి= వహించి; సొలయక= విసుగు కొనక; ఆ+పనిన్= ఆ అతిథి పూజా కార్యమును; ఏను= నేను; ఇచటన్= ఇక్కడ - పర్ణశాలలో; ఉన్న అప్పుడు= ఉన్నప్పుడు; లేనిఅపుడు= లేనప్పుడు; పూని= ఎట్లాగైనా సరే, ప్రయత్నంతో; నడపఁగాన్వలయున్= జరిగేటట్లు చూడాలి.

తాత్పర్యం: 'ఇల్లాలా! నాకు అతిథి పూజ చాలా ఇష్టం. కనుక నే నింట్లో ఉన్నా లేకున్నా నీవు నా కనుకూలంగా ఆ కార్యం జరిగేటట్లు చూడాలి.

విశేషం: గృహస్థాశ్రమంలో స్వార్థముంటుంది కనుక దానిని జయించటానికి అతిథిపూజ ఒక పూజ. అదే తపస్సు. పేదలను ఆదరించటం - వారూ తనవంటి వారేనని ధర్మదృష్టితో పూజించటం ప్రతికావ్యమూ వర్ణించింది. ఈనాటి సమాజంలో దీనికి చాలా ప్రాశస్త్యమున్నది. కావ్యం ధర్మబోధ చేస్తుందనటాని కిదొక ఉదాహరణ.

క. అతిథిజనులు దమతమ వాం । ఛితము లనుభవించునట్లు సేయం గనినం

గృతకృత్యతఁ బొందరె? గృహ । పతియును గృహిణియును ధర్మభారమువలనన్. 67

ప్రతిపదార్థం: అతిథిజనులు= చెప్పా పెట్టకుండా తిథివారనక్షత్రాలతో పనిలేకుండా వచ్చేవారు; తమ తమ వాంఛితములు= తమతమ కోరికలు; అనుభవించునట్లు చేయన్+కనినన్= అనుభవించేటట్లు చేయగలిగితే; గృహపతియును= యజమానుడు; గృహిణియును= యజమానురాలునూ; ధర్మభారమువలనన్= ధర్మమును మోయటంవలన; కృతకృత్యతన్= చరితార్థతను; పొందరె!= పొందరా? తప్పక పొందగలరు.

తాత్పర్యం: అతిథులు ఎవరి ఇంట్లో తమ కోరికల నెల్ల తీర్చుకొనటానికి వీలు కల్పించబడుతుందో ఆ ఇంటి యజమానుడు; యజమానురాలు ఆ ధర్మాచరణవలన కృతార్థు లౌతారు.

క. అతిథి నినుఁగోరెనేనియు । మతిఁ గింకిరి పడక, యోలమాస గొనక, నీ

వతనికిఁ బ్రియంబు సల్పుము । సతికిం బతిపనుపు సేయఁ జను నెల్లదియున్. 68

ప్రతిపదార్థం: అతిథి= ఆ వచ్చినవాడు; నినున్= నిన్ను; కోరెనేనియున్= కోరుకొన్నా; మతిన్= మనస్సులో; కింకిరిపడక= అసహ్యించుకొనక; ఓలమాసగొనక= చాటున దాగుకొనకుండా; నీవు= నీవు; అతనికిన్= అతిథికి; ప్రియంబు= ఇష్టం; సల్పుము=చేయుము; సతికిన్= భార్యకు; పతిపనుపు= భర్త ఆజ్ఞ; ఎల్లదియున్= ప్రతిదీ; చేయన్చనున్= విధిగా చేయాలి.

తాత్పర్యం: అతిథి నిన్ను కోరినా మనస్సులో జుగుప్స వహించి చాటుకుపోయి దాక్కొనకుండా అతడి కోర్కె తీర్చాలి. పతి చెప్పిన మాట ప్రతిదానినీ సతి నెరవేర్చక తప్పదు'.

విశేషం: ఈ ఆచారం అతి ప్రాచీన కాలంలో ఉండేది. మన పురాణాల్లో చాలాచోట్ల ఇది కన్పిస్తుంది. ఆ నా డిది ధర్మంగానే పరిగణించబడి ఉండాలి కదా!

సుదర్శను నింటికి ధర్మదేవత యతిథియై వచ్చుట (సం.13-2-48)

క. అని యూఁది చెప్పి, యొకనాఁ । డనఘ! యతం డిధ్మములకు నటవీస్థలికిం

జనినయెడ నతిథి యొక్కఁడు । సనుదెంచిన నాసనాది సంభావనలన్. 69

ప్రతిపదార్థం: అనఘ!= దోషరహితుడా (ధర్మరాజా); అని; ఊఁదిచెప్పి= ఆ విధంగా నొక్కి చెప్పి; ఒకనాఁడు= ఒకరోజున; అతండు= సుదర్శనుడు; ఇధ్మములకున్= సమిధలకు; అటవీస్థలికిన్= అరణ్యప్రదేశానికి; చనిన+ఎడన్= వెళ్ళిన సమయంలో; అతిథి+ఒక్కఁడు= ఒక అతిథి; చనుదెంచినన్= రాగా; ఆసన+ఆది= పీఠమిడుట మొదలైన; సంభావనలన్= మర్యాదలతో.

తాత్పర్యం: ఆ విధంగా అతడు చెప్పి సమిధలకొరకు అడవికిపోగా ఒక అతిథి అతడి పర్ణశాలకు వచ్చాడు. ఆ ఓఘవతి అతడికి ఆసన మొసగటంవంటి మర్యాదలతో (తరువాతి పద్యంతో అన్వయం)

క. అతివినయంబున సమ్మా ।నితుఁ జేయఁగ నా లతాంగి నెమ్మోమునఁ జూ

పతఁడు నిలిపి, కామాతుర । మతి నైతిం ; బ్రియ మొనర్పు మానిని! నాకున్. 70

ప్రతిపదార్థం: ఆ లతాంగి= తీగవంటి శరీరంకల ఆ ఇల్లాలు; అతి వినయంబునన్= మిక్కిలి నమ్రతతో; సమ్మానితున్ చేయఁగన్= పూజించగా; అతఁడు; (ఆమె); నెమ్మోమునన్= నిండుముఖంమీద; చూపు నిలిపి= చూపులు ప్రసరించి; మానిని!= గృహిణీ!; కామ= కామంతో; ఆతురమతిన్= త్వరపడే మనస్సుకలవాడను; ఐతిన్= అయినాను; నాకున్=నాకు; ప్రియము= ఇష్టం; ఒనర్పుము= చేయుము.

తాత్పర్యం: ఆ గృహిణి అతివినయంతో సపర్యలు చేయగా, అత డామె ముఖం చూస్తూ 'ఓఘవతీ! నీపై మరులుకొన్నాను. నా కోరిక తీర్చుము అన్నాడు.

విశేషం: లతాంగి అన్నమాట ఆమె అందాన్ని చెప్పేది. మానిని అన్నమాట ఆమె గౌరవమర్యాదలు కలదని చెప్పేది.

వ. 'గృహస్థధర్మ ప్రకారంబు నీయెఱుంగనియదియే! యని' పలికిన, నప్పరమపతివ్రత, వేఱొండు దెఱంగుల నభ్యర్థనీయంబు లయిన వస్తువుల నుపన్యసించిన, నతం డవి యెవ్వియు' నొల్ల ననుటయు. 71

ప్రతిపదార్థం: గృహస్థ= గృహయజమాని; ధర్మంబు= విధినిర్వహణ; ప్రకారంబు= పద్ధతి; నీ+ఎఱుంగని+అదియే!= నీకు తెలియనిదా?; అని పలికినన్= అని చెప్పగా; ఆ+పరమ పతివ్రత= ఆ గొప్ప సతి; వేఱు+ఒండు= మరొక; తెఱంగులన్= తీరుల; అభి+అర్థనీయంబులు= మిక్కిలి కోరదగిన; వస్తువులన్= పదార్థాలను; ఉపన్యసించినన్= పేర్కొనగా; అతండు= ఆ అతిథి; అవి+ఎవ్వియున్= అవి ఏవికూడా; ఒల్లను= అంగీకరించను; అనుటయున్= అనగా.

తాత్పర్యం: గృహస్థ ధర్మవిధులు నీకు తెలిసినవే కదా! అని చెప్పగా ఆ సతి కోరదగిన వేరే వస్తువులు కోరుకొమ్మన్నది. అత డవేమియు నాకు అక్కర్లే దన్నాడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. సతి దనపతి వచనంబులు। మతిఁ జొనుపుం దెంపు మాను, మాన వెఱచు, న

య్యతిథి పనుపు సేయక త్రో । చు తలంపలవఱుచుఁ, జేయఁ జూచుం, దలరున్. 72

ప్రతిపదార్థం: సతి= పతివ్రత; తన= తనయొక్క; పతివచనంబులు= భర్తమాటలు; మతిన్= మనస్సులో; చొనుపున్+ ప్రవేశపెట్టుతుంది (ఆలోచిస్తుంది); తెంపు= సాహసము; మానున్= వదలిపెట్టుతుంది; మానన్ వెఱచున్= తెగించకుండా ఉండటానికి భయపడుతుంది; ఆ+అతిథి= ఆ అతిథియొక్క; పనుపు= ఆనతి (కోరిక); చేయక= చేయకుండా; త్రోచు= వదలే; తలంపు= ఆలోచన; అలవఱుచున్= మనస్సులో ఊహిస్తుంది; చేయన్ చూచున్= చేద్దామని అనుకొంటుంది; తలరున్= చేయడానికి భయపడుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ పతివ్రత భర్త మాటలను గురించి ఆలోచిస్తుంది. తెంపు చేద్దామనుకొని, మరలా చేయలేక, అతిథి కోరికను చెల్లించాలనుకొంటుంది కొంచెం సేపు. మరలా (శీలం పోతుందని) భయపడుతుంది.

విశేషం: ఈ పద్యం ఆమె మనస్సులో పడుతున్న ఆవేదన, ఆలోచన, ఆమె ఆలోచనలోని సుడులు, ఏదీ తేల్చుకోలేని పరిస్థితిని చాలా గొప్పగా చిత్రిస్తున్నది. తిక్కనగారి కవిత్వంలో ఒక గొప్ప నేర్పు ఇట్లా మానసిక పరిస్థితులను చిత్రించటం.

తే. ఇట్టు లురియాడు చిత్తంబు నెట్టకేని । నాథు చెప్పిన ధర్మంబునకుఁ జొరంగ
నూలుకొల్పి, నిర్ణయమునఁ గీలుకొన్న । లజ్జవ్రేగునఁబోలె వ్రాలంగ మోము. 73

ప్రతిపదార్థం: ఇట్టులు= ఈ విధంగా; ఉరియాడు= ఉయ్యాలలూగే (ముందు వెన్కల ఆలోచనలతో); చిత్తంబును= మనస్సును; ఎట్టకున్+ఏని= చిట్టచివరకు; నాథు చెప్పిన; ధర్మంబునకున్= పెనిమిటిచెప్పిన విధి నిర్వహణకు; చొరంగన్= పూనుకొనుటకు; నూలుకొల్పి= అంగీకరింపజేసి, ఉత్సహింపచేసి; నిర్ణయమునన్= నిశ్చయంలో; కీలుకొన్న= పూనుకొన్న; లజ్జవ్రేగునన్= సిగ్గుబరువున; పోలెన్= అన్నట్లుగా; మోము= ముఖం; వ్రాలంగన్= వంగిపోగా.

తాత్పర్యం: ఈ విధంగా వివిధాలోచనలతో ఉయ్యాల లూగే మనస్సును ఎట్లాగో చివరకు ఒప్పించి భర్త మాటను నెరవేర్చాలనే నిర్ణయానికి వచ్చిందా, అన్నట్లుగా సిగ్గు బరువున ముఖం వంచింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. తెఱవ యొడఁబాటు మాటం । బఱిపోయిన గొంకుతోడ బ్రాహ్మణుఁ గొని, క
న్మఱుఁ గగునెడకు నరిగె; న । త్తఱి వచ్చె సుదర్శనుండు ధరణీనాథా! 74

ప్రతిపదార్థం: ధరణీనాథా!= ధర్మరాజా!; తెఱవ= స్త్రీ; ఒడఁబాటు= అంగీకారం; మాటన్= మాటచేత; పఱిపోయిన=తీరిపోయిన; కొంకుతోడన్= సందేహంతో; బ్రాహ్మణున్= బ్రాహ్మణుని; కొని;= తీసికొని; కన్మఱుఁగు= కంటిచాటు; అగు= అయిన; ఎడకున్= చోటుకు; అరిగెన్= వెళ్ళింది; ఆ+తఱిన్= ఆ సమయంలో; సుదర్శనుండు= భర్త; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: సిగ్గుతో ముఖాన్ని వ్రాల్చటం ద్వారా ఆమె అంగీకారం తెలిపింది. జంకుమాని బ్రాహ్మణునితో రహస్య స్థలానికి వెళ్ళినంతలో భర్త వచ్చాడు.

ఆ. వచ్చి, పర్ణశాలవాకిట నిల్చి, య । త్తన్విఁ బిల్చె; నతిథి దాని నల్ల
నూరకుండు మనియె; నువిదయు భూసుర । శాపభీతి నెలుఁగు నూపకుండె. 75

ప్రతిపదార్థం: వచ్చి= సుదర్శనుడు అరుదెంచి; పర్ణశాల= పూరిల్లు; వాకిటన్= వాకిట్లో; నిల్చి= నిలబడి; ఆ తన్విన్= ఆ స్త్రీని; పిల్చెన్= పిలిచాడు; అతిథి; దానిని= ఓఘవతిని; అల్లన్ ఊరకుండుము+అనియెన్= మాట్లాడక ఉండుమని చెప్పాడు; ఉవిదయున్= ఆమెకూడా (స్త్రీ); భూసుర= బ్రాహ్మణుడియొక్క; శాపభీతిన్= శాప (శపిస్తాడేమోనన్న) భయంతో; ఎలుఁగు= గొంతును; చూపక= విప్పక, మాట్లాడక; ఉండెన్= ఉన్నది.

తాత్పర్యం: భర్త పర్ణశాల వాకిట్లోకి వచ్చి భార్యను పిలిచాడు. అతిథి ఆమెను మాట్లాడవద్దన్నాడు. ఆమెకూడా అతిథి శపిస్తాడేమోనన్న భయంతో మాట్లాడలేదు.

విశేషం: పై పద్యంలో బ్రాహ్మణశబ్దం వచ్చింది. ఓఘవతి క్షత్రియ సంతానం. వచ్చిన అతిథి ఎవ్వడో? కవి ముందుగా చెప్పలేదు. కనుక ఇవి వర్ణవాచకాలు కావు. ఒక ఆధ్యాత్మిక ధర్మాన్ని అవలంబించే మనస్తత్వం కలవాడు బ్రాహ్మణు డవాలి.

సీ. పేర్కొని, పలుమాఱుఁ బలిచి, యో! యనుట లే । కున్న నయ్యింటిలోఁ గన్ను వఱపి,
వల్లభఁ గానక, వహ్నితనూజుండు । దలఁకొంది ప్రేముడి పలుకు వలుక,
నతని నుద్దేశించి యతిథి 'నాకాతిథ్య । మొనరించుచున్నది వనిత, నీవు
గృహధర్మవిధుఁడవు; కినియకుమయ్య మ' । మ్మనుడు, నప్పరమపుణ్యాత్మకుండు

తే. 'నీదుకతమున నేను సమ్మోదమగ్న । మానసుఁడ నైతి, నతిథులు మహితపూజ
నములు గాంచిన గృహములు విమల తరము । లండ్రు బుధు లింత యెఱుఁగుదు; నట్ల నడతు'. 76

ప్రతిపదార్థం: వహ్నితనూజుండు= అగ్నికొడుకు; పేర్కొని= పేరున; పలుమాఱు= పెక్కుసార్లు; పిలిచి; ఓ యనుట= ఓహో యన్న సమాధానం; లేక+ఉన్నన్= లేకపోగా; ఆ+ఇంటిలోన్= ఆ ఇంటిలోపల; కన్నున్= నేత్రమును; పఱపి= ప్రసరింపచేసి; వల్లభన్= భార్యను; కానక= చూడక; తలఁకు+ఒంది= భయపడి; ప్రేముడిపలుకు= ప్రేమవాక్యం; పలుకన్= పలుకగా; అతిథి= ఇంటికి వచ్చినవాడు; అతనిన్= భర్తను; ఉద్దేశించి= గురించి; వనిత= (నీ భార్య) స్త్రీ; నాకు; ఆతిథ్యము+ఒనరించుచున్+ఉన్నది= ఆతిథ్యం చేస్తున్నది; నీవు; గృహధర్మవిదుఁడవు= గృహస్థధర్మం తెలిసినవాడవు; అయ్య= ఆర్యా!; మమ్మున్= మా ఇద్దరను; కినియకుము= కోపింపకుము; అనుడున్= అనగా; ఆ+పరమ= ఆ శ్రేష్ఠ; పుణ్య+ఆత్మకుండు= పుణ్యజీవి; నీదుకతమునన్= నీవలన; నేను= నేను; సమ్మోద= సంతోషంలో; మగ్న= మునిగిన; మానసుఁడన్+ఐతిన్= మనస్సు కలవాడనైనాను; బుధులు= పండితులు; అతిథులు= ఆతిథ్యంకొరకు వచ్చినవారు; మహిత= గొప్ప; పూజనములు= పూజలు; కాంచిన= పొందిన; గృహములు= ఇళ్ళు; విమలతరములు= నిర్మలములు; అండ్రు= అంటారు; ఇంత ఎఱుఁగుదున్= ఇంత మాత్రం నాకు తెలుసు; అట్లన్=అట్లాగే; నడతున్= నడచుకొంటాను.

తాత్పర్యం: అగ్ని కొడుకు ఆ విధంగా భార్యను పేరెత్తి ఎంత పిలిచినా పలుకకపోయేసరికి లోపలికి చూచి ప్రేమతో మాట్లాడేసరికి (భార్య నుద్దేశించి ప్రేమతో కొన్ని మాటలు అనేటప్పటికి) అతిథి ఇట్లా అన్నాడు; 'నీభార్య నాకు ఆతిథ్య మిస్తున్నది. నీవా ధర్మం తెలిసినవాడవు. కనుక మమ్మ కోపించవద్దయ్యా!' అని. ఆ మాటలు విన్న భర్త 'అట్లాగా! సంతోషం. ఎవరి ఇంట్లో అతిథులు కోరినది పొందుతారో ఆ ఇల్లే పవిత్రం. కనుక నీవన్నట్లే నడచుకుంటాను'.

వ. అని పలికి వెండియు. 77

తాత్పర్యం: ఆ విధంగా అని మరలా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. 'నావచనంబునట్టుల మనంబును; దీనికి సాక్షు లుర్వియుం,
బావకుఁడున్, జలంబును, నభంబును, వాయువుఁ, జంద్ర సూర్యులున్'
నావుడు మ్రోసె నాకసమునన్ విశదంబుగ దివ్యవాణి 'సం
భావితుఁ డీతఁ; డీ విభుని పల్కు నిజం' బని కౌరవేశ్వరా! 78

ప్రతిపదార్థం: నా వచనంబునట్టుల= నా మాటలవలెనే; మనంబును= నా మనస్సుకూడా; దీనికిన్= ఇందుకు; సాక్షులు= చూచేవారు; ఉర్వియున్= భూమీ; పావకుఁడున్= అగ్నీ; జలంబును= నీళ్ళూ; నభంబున్= ఆకాశం; వాయువున్= గాలీ; చంద్రసూర్యులున్= చంద్రుడూ, సూర్యుడూ (నేనన్న దానికి సాక్షులు); నావుడున్= అనగా; కౌరవ+ఈశ్వరా!= ధర్మరాజా!; ఆకసమునన్= అంతరిక్షంలో; దివ్యవాణి= దేవతా వాక్కు (అదృశ్యవాక్కు); విశదంబుగన్= స్పష్టంగా; ఈతఁడు= ఇతడు; సంభావితుఁడు= సన్మానించదగినవాడు; ఈ విభునిపల్కు= ఈ రాజుమాట; నిజంబు+అని= నిజమేనని; మ్రోసెన్= విన్పించింది.

తాత్పర్యం: 'నా మాట ఎంతో మనస్సూ అంతే. దీనికి పంచభూతాలు అనగా నీరూ, నిప్పూ, ఆకాశం, భూమీ, గాలీ, సూర్యచంద్రులూ అంతా సాక్షులే'. అన్నంతనే ఆకాశంనుండి ధర్మరాజా! దివ్యవాణి ఇట్లా విన్పించిందయ్యా! స్పష్టంగా 'ఈ యజమాను డన్న మాట నిజం' అని.

ఆ. అప్పు డతిథి ప్రీతి నతని సన్నిధి కేఁగు । దెంచి, దుర్నిరీక్ష్యతేజ మడర,

తనదుమూర్తి యధికతర సమున్నతిఁ బొలు । పెసఁగ నిల్చి, యతని కిట్టు లనియె. 79

ప్రతిపదార్థం: అతిథి= ఆ యింటికి వచ్చినవాడు; అప్పుడు= భర్త ఆ విధంగా అన్న తర్వాత; ప్రీతిన్= సంతోషంతో; అతని సన్నిధికిన్= అతడి దగ్గరకు; ఏఁగుదెంచి= వచ్చి; దుర్‌నిరీక్ష్య= చూడటానికి వీలులేని; తేజము= కాంతి; అడరన్= వ్యాపించగా; తనదు= తనయొక్క; మూర్తి= రూపం; అధికతర= మిక్కిలి; సమ్+ఉన్నతిన్= గొప్పగా; పొలుపు ఎసఁగన్= అంద మెక్కువ కాగా; నిల్చి= ఎదుటగా నిలబడి; అతనికిన్= అతడితో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అప్పు డతడి దగ్గరకు వచ్చి, చూడటానికి వీలు లేనంత కాంతితో శరీరం ప్రకాశించగా అతిథి అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం: వచ్చిన అతిథి ధర్మదేవత కనుక దేవతా రూపాన్ని ధరించాడన్నమాట.

సీ. 'ధర్మదేవత నేను; దగ నీదుచిత్తంబు । నారయ వచ్చితి ననఘ! నీవు

నిశ్చలవ్రతుఁడవు, నీప్రతిజ్ఞకు హాని గలిగినఁ । దెగఁజూడఁ దలఁచి, తిరుగు

వెనువెంట మృత్యువు, విను జయించితి దానిఁ । గామరోషాదివికారసహిత

ముగ నంతరంగంబు మున్ను గెల్చితి, భవ । త్సతియుఁ బవిత్ర, యస్ఖలితచరిత.

తే. యొడలితోడ నీకు నూర్ధ్వ లోకమునకు । నరుగవచ్చు నెప్పుడరుగు తలఁపు

దోఁచె నప్పు డిదియుఁ దోడిదయై ప్రీతి । నరుగుదెంచు' ననియెఁ గురువరేణ్య! 80

ప్రతిపదార్థం: కురువరేణ్య!= ధర్మరాజా!; ఏను= నేను; ధర్మదేవతన్= ధర్మమూర్తియైన దేవతను; అనఘ!= పాపంలేనివాడా!; తగన్= ఒప్పిదంగా; నీదుచిత్తంబు= నీ మనస్సు; అరయన్= చూడగా; వచ్చితిన్= వచ్చాను; నీవు నిశ్చలవ్రతుఁడవు= నీవు చెదరని వ్రతం కలవాడవు; నీ ప్రతిజ్ఞకున్= నీ శపథానికి; హాని= లోపం; కలిగినన్= కలిగితే; తెగన్+చూడన్+తలఁచి= చంపాలనుకొని; మృత్యువు= మృత్యుదేవత; వెనువెంటన్= నీ వెన్నును అంటుకొని; తిరుగున్= తిరుగుతున్నది; విను= వినుము; దానిన్= మృత్యువును; జయించితి(వి)= గెలిచావు;కామ= కామం; రోషం= కోపం; ఆది= మొదలైన (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములు ఆరుగురు అంతశ్శత్రువులు); వికార సహితముగన్= దోషాలతోపాటు (వికారం=

సహజతకు విరుద్ధమైన కదలిక); అంతరంగంబు= మనస్సు; మున్న= ముందే; గెల్చితి(వి)= జయించితివి; భవత్= నీ; సతియున్= భార్యయు; పవిత్ర= పావనురాలు; అస్ఖలిత= (ధర్మమునుండి) చలించని; చరిత= నడవడి కలది; నీకున్= నీకు; ఎప్పుడు= ఏ సమయంలో; ఒడలితోడన్= శరీరంతో; ఊర్ధ్వలోకమునకున్= పై లోకానికి; అరుగుతలఁపు= వెళ్ళాలన్న ఆలోచన; తోఁచెన్= కలిగిందో; అప్పుడు= ఆ వేళ; ఇదియున్= ఈ భార్యకూడా; తోడిద+ఐ=నీతో కూడినదై; ప్రీతిన్= సంతోషంతో; అరుగుదెంచున్= వస్తుంది.

తాత్పర్యం: 'నేను ధర్మదేవతను. నీ వ్రతాన్ని పరీక్షించటానికి వచ్చాను. నీ ప్రతినకు ఎప్పుడు లోపం కలుగుతుందో అప్పుడు నిన్ను చంపుదామని మృత్యువు నీ వెన్నంటే తిరుగుతున్నది. దానిని జయించావు. కామక్రోధాది షట్ శత్రువులున్న మనస్సును పూర్వమే జయించావు. నీ భార్యకూడా నీవంటిదే. గొప్ప ధర్మచరిత్ర కలది. నీ కెప్పుడు పైలోకాలకు పోవా లనిపిస్తుందో అప్పుడు నీ భార్యతో పాటుగా సశరీరంగా పోవచ్చు' నని ఆ దేవత వరమిచ్చింది ధర్మరాజా!'

విశేషం: దేవత అంటే మూలభావం. ప్రతిభావానికీ ఒక మూలరూప ముండాలి. చెట్టుకు గింజవలె. దాని పేరు దేవత. (ధర్మస్వరూపం) అది రూపధారణం కూడా చేయగలదు. ఇది వేదకాలం నాటి భావన.

వ. అని వెండియు. 81

తాత్పర్యం : ఆ విధంగా చెప్పి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. నరవర! పొల్చు నోఘవతి నా నదియై, జనపావనాకృతిం
బరమతపంబులోని, సగపాలను నియ్యమ యున్న సామునన్
వెరవునఁ దొంటిమై నిలిచి నీకుఁ దగం బరిచర్య సేయు; ని
చ్చరితము మీకు నిర్మలయశంబు నొనర్చుట కే నొనర్చితిన్'. 82

ప్రతిపదార్థం: నరవర!= రాజా! (సుదర్శనుడు); ఇయ్యమ= ఈ+అమ= ఈమె; పరమ తపంబులోని= గొప్ప తపస్సులో; సగపాలను= అర్ధభాగంతో; ఓఘవతినాన్= ఓఘవతిఅన్నపేరుతో; నది+ఐ= ఏరై; జనపావన= మనుష్యులను పవిత్రం చేసే; ఆకృతిన్= రూపంతో; ఉన్న= ఉన్నట్టి; సామునన్= సగంలో; వెరవునన్= ఉపాయంతో; తొంటిమైన్= పూర్వదేహంతో; నిలిచి= ఉండి; నీకున్= నీకు; తగన్= తగునట్లుగా; పరిచర్య= సేవ; చేయున్= చేస్తుంది; ఈ+చరితము= ఈ చరిత్ర; మీకున్; నిర్మల యశంబు= స్వచ్ఛమైన కీర్తి; ఒనర్చుటకున్= ఒడగూర్చి పెట్టటానికి; ఏను= నేను; ఒనర్చితిన్= చేశాను.

తాత్పర్యం: మీ తపస్సులోని సగభాగంతో నీ భార్య ఓఘవతి అనే పేరుగల ఏరై మానవజాతిని పూతం చేస్తూ ప్రవహిస్తుంది. మిగిలిన తపశ్శక్తితో పూర్వం వలెనే నీకు పరిచర్యలు చేస్తూ ఉంటుంది. ఈ కథంతా నేనే మీకు కీర్తి కల్గించటం కొరకు, మీ కొరకే కల్పించాను'.

విశేషం: ఈ కథ నర్మదానదీ సంతానం కథ కనుక - దానితోనే ప్రారంభమై ఆ వంశంలోని మరొక స్త్రీ నదిగా ప్రవహించటంతో ముగిసింది. ఈ విధంగా కథ మొదలూ చివరా ఒకే రకంగా ఉండేటట్లు నిర్మించటం కథ చెప్పటంలో ఒక అందం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని చెప్పి ధర్ముండు ధవళహయసహస్రంబుపూనిన మాననీయ రథంబునం జనియె నోఘవతి యద్దేవుని చెప్పినట్ల వర్తిల్లె; సుదర్శనుండును బరమసంతోష భరితుండయ్యెఁ; బాండవాగ్రజా! నీ మనంబున నెక్కొలుపు మిక్కథయభిప్రాయంబు. 83

ప్రతిపదార్థం: అని చెప్పి= ఆ విధంగా చెప్పి; ధర్ముండు= ధర్మదేవత; ధవళ= తెల్లని; హయ= గుర్రాల, సహస్రంబు= వేయి; పూనిన= కట్టిన; మాననీయ= గౌరవించదగిన, (మహత్తరమైన); రథంబునన్= రథంమీద; చనియెన్= వెళ్ళాడు; ఓఘవతి= ఆ గృహిణి; ఆ+దేవునిచెప్పినట్ల= ఆ దేవుడు చెప్పినట్లుగానే; వర్తిల్లెన్= నడుచుకొన్నది; సుదర్శనుండు= రాజు; పరమ= గొప్ప; సంతోష= సంతోషంతో; భరితుండు= నిండినవాడు; అయ్యెన్= అయ్యాడు; పాండవ+అగ్రజా!= ధర్మరాజా! (పాండవులలో పెద్దవాడా!); నీ మనంబునన్= నీ మనస్సులో; ఇక్కథ= ఈ కథయొక్క; అభిప్రాయంబు= సారాంశమును; నెక్కొలుపుము= భావించుము, నిలుపుకొమ్ము.

తాత్పర్యం: ఆ విధంగా చెప్పి ధర్మదేవత వేయిగుర్రాలు కట్టిన రథంమీదెక్కి వెళ్ళిపోయాడు. తర్వాత ఓఘవతి కూడా ఆ దేవుడు చెప్పినట్లుగా ప్రవర్తించింది. (సగం తపస్సుతో నదిగా లోకాన్ని పావనం చేయటం, సగం తపస్సుతో భర్తను సేవించటం) ఆమె భర్త కూడా సంతోషభరితుడైనాడు. నాయనా! ధర్మరాజా! ఈ కథాసారాంశాన్ని మనస్సున నిలుపుకొమ్ము.

ఆ. అతిథిపూజఁ గడచినట్టి ధర్మువు గృహ । స్థులకు నొండు లేమిఁ దెలుపుచున్న
యది; సమస్త కిల్బిషాపహ మీ యితి । హాస; మిచ్చు నెల్లయభిమతములు'. 84

ప్రతిపదార్థం: గృహస్థులకున్= గృహస్థాశ్రమాన్ని స్వీకరించినవారికి; అతిథిపూజన్= ఆతిథ్యమన్న పూజను; కడచినట్టి= మించిన; ధర్మువు= ధర్మం; ఒండు= మరొకటి; లేమిన్= లేకపోవటాన్ని; ఈ+ఇతిహాసము= ప్రాచీనకథ; తెలుపుచున్న+అది= తెలుపుతున్నది, సమస్త, కిల్బిష+అపహము= పాపాలన్నిటినీ పోగొట్టేది; ఎల్ల= సమస్త; అభిమతములు= కోర్కెలను; ఇచ్చున్= ఇస్తుంది.

తాత్పర్యం: గృహస్థులకు అతిథిపూజకంటె గొప్ప ధర్మం లేదని ఈ పవిత్రమైన ప్రాచీనకథ చెప్తుతున్నది. ఇది సమస్త పాపాలను పోగొట్టి కావలసిన కోర్కెలను తీరుస్తుంది.

విశేషం: ఈ మాటలు భీష్ముడివి. ధర్మరాజు ప్రశ్న కీ కథ సమాధానంగా చెప్పబడింది కనుక వక్త తన సమాధానాన్ని ముగిస్తూ చివరిమాటగా అన్నాడు.

ఆశ్రమాలు 4. 1.బ్రహ్మచర్య, 2.గృహస్థ, 3.వానప్రస్థ, 4.సన్న్యాస ఆశ్రమాలు. నరుడికి నాల్గంచెలు (అంశలు) అని ఒక సామెత. ఈ నాల్గాశ్రమాలే మనిషి 100 ఏళ్ళ పూర్ణజీవితానికివి నాల్గు మెట్లు. మొదటిది విద్యార్థి దశ. గురువు దగ్గరుండి ఇహలోక పరలోక జీవితాలకు సంబంధించిన విద్య (తెలిసికొనదగినది కనుక విద్య) నభ్యసించిన తర్వాత గృహస్థు అవుతున్నాడు మనిషి. ఇక్కడ తాను, భార్య, సంఘం మూడు విషయాలకు ముడి ఉన్నది. మొదటి రెండు కుటుంబం. ఇదే ప్రాచీనకాల సంఘానికి పునాది కనుక సంతానానికి శిక్షణాలయం గృహమే. తానూ ఉన్నాడు; సంఘంతో సంబంధమూ ఉన్నది. దీనికి సూచనమే అతిథి మర్యాదలివన్నీ. మూడవ దశలో సంఘాన్ని వదలి భార్యా తానూ వనవాసం, ఆశ్రమజీవితం జీవిస్తాడు. చివరిది సన్న్యాసం. తానొక్కడే మరలా వచ్చిన చోటికి పోయే మార్గం. దీనితో నూరేళ్ళ జీవితం గట్టెక్కింది. ఇది సంపూర్ణజీవితం. ప్రాచీన ఇతిహాసాలు భారతం - రామాయణం ఈ పూర్ణ మానవ జీవితాన్ని చెప్పినందువలననే మనకు పవిత్రగ్రంథాలై

మానవాళికి మార్గదర్శకాలుగా మిగిలిపోయాయి. ఈ నాల్గింటిలో గృహస్థధర్మాన్ని చెప్పిన కథ ఇది. మనిషికి తాను సంపాదించిన దానిమీద ఒక హక్కు, మమకారం ఉంటాయి. ఈ విషయాలలో ముఖ్యమైన వ్యక్తి భార్య. ఆమె ఉన్న స్వత్వాన్ని కూడా దానం చేయటం - పరులకు ఇవ్వటం ధనాదులవలె - ఈ త్యాగం చాలా గొప్పదని ఈ కథ చెప్పుతున్నది. పురుషునకు భార్యకంటె ప్రియమైన దేమీ లేదు. కనుకనే వానప్రస్థంలో ఆమె తనకు తోడుగానే వస్తున్నది. మను వన్నాడు 'స్త్రీ పూజింపబడ్డ చోట దేవత లానందిస్తున్నారు. ఆమె పురుషునకు జీవనసముద్రం దాటే నౌక' అని. కనుకనే ఆమె లేకుండా ఏ కర్మా చేయటానికి వీలులేదన్నారు. అయితే ధర్మదేవత ఆమెను, అతడిని పరీక్షించాడే తప్ప ఆమె శీలాన్ని అపహరించలేదని కథలో చెప్పబడింది. ఈ ధర్మాన్ని - సర్వాన్ని త్యజించే బుద్ధి - ఇతరులకు దానం చేయటం - నీవూ అలవరచుకొమ్ము అన్నది భారతం - నీవు అంటే ప్రతి పాఠకుడున్నూ.

క. అనినఁ బితామహుతో న । జ్జనపతి 'బ్రాహ్మణ్య మవులజాతులు మూఁటన్
జనియించినవానికి దొర । కొనునొకొ? యతివిమలకర్మ గుణయోగమునన్'. 85

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+జనపతి= ఆ రాజు (జనులకు పాలకుడు); పితామహుతోన్= తాతతో; అవులజాతులు= బ్రాహ్మణుడు కాక మిగిలిన జాతులు; మూఁటన్= మూడిటిలో; జనియించిన= పుట్టిన; వానికిన్= వాడికి; బ్రాహ్మణ్యము= బ్రాహ్మణత్వం; అతివిమల కర్మగుణ యోగమునన్= మిక్కిలి నిర్మలమైన కర్మములయొక్కయు గుణములయొక్కయు కూడికచేత; దొరకొనునొకొ?= సంభవిస్తుందా?

తాత్పర్యం: ఆ విధంగా తాత చెప్పగా ధర్మరాజిట్లా అన్నాడు. 'బ్రాహ్మణేతరమైన మూడు వర్ణాలవారికీ గుణకర్మలతో బ్రాహ్మణత్వం సంభవిస్తుందా?'

విశేషం: గీత చెప్పుతున్నది - "చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః" - అని త్రిగుణాల విభాగం చేత కర్మల విభాగం చేత నాల్గువర్ణాలను నేనే సృజించాను. కర్మలు= వేదం చెప్పిన విధులు, మనిషి తప్పక చేయవలసినవి.

వ. అని యడిగిన నతం డతని కిట్లనియె. 86

తాత్పర్యం: అని అడుగగా భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తే. 'బ్రాహ్మణత్వంబు గడుదుర్లభం; బనేక । జన్మములఁ బొంది తిరుగంగ సంభవించి
నపుడు గనునది; యున్నతమైన యప్ప । దంబు విను మెఱిఁగించెద దాని తెఱఁగు. 87

ప్రతిపదార్థం: బ్రాహ్మణత్వంబు= బ్రాహ్మణపదం, స్థితి; కడున్= మిక్కిలి; దుర్లభంబు= లభించటం కష్టం; అనేక= చాలా; జన్మములన్= పుట్టుకలను; పొంది= పడసి; తిరుగంగన్= మరలా; సంభవించినపుడు= పుట్టినపుడు; ఉన్నతము+ఐన= గొప్పదైన, మహత్తరమైన; ఆ+పదంబు= ఆ స్థితి; కనునది= పొందదగినది; దాని తెఱఁగు= దాని విషయం; ఎఱిఁగించెదన్= చెప్పుతాను; వినుము= వినుము.

తాత్పర్యం: 'బ్రాహ్మణుడుగా పుట్టటం చాలా కష్టం. ఎన్నో ఎన్నో జన్మలు ఎత్తితే తప్ప ఆ జన్మ సంభవించదు. దాని సంగతి చెప్పుతాను వినుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇంద్రమతంగసంవాదం బను నితిహాస ప్రకారము (సం. 13-3-8)

వ. అది యింద్రమతంగ సంవాదం బను నితిహాసం బాకర్ణించిన నెఱుంగ నగుం గావున నక్కథ యుపన్యసించెద; నొక్క విప్రుని కొడుకు మతంగుం డనువాఁడు యజ్ఞార్థంబైన పనికిం దండ్రిపనుపునం బోయి. 88

ప్రతిపదార్థం: అది= ఆ సంగతి; ఇంద్ర, మతంగ సంవాదంబు+అను= ఇంద్రుడికీ, మతంగుడికీ మధ్య జరిగిన సంభాషణం అనే పేరుగల; ఇతిహాసంబు= పూర్వకథను; ఆకర్ణించినన్= వింటే; ఎఱుంగన్+అగున్= తెలియవచ్చును; కావునన్=కాబట్టి; ఆ+కథ; ఉపన్యసించెదన్= చెప్తాను; ఒక్క విప్రుని కొడుకు= ఒక బ్రాహ్మణుడి కుమారుడు; మతంగుండు+అనువాఁడు= మతంగుడు అనే పేరుకలవాడు; యజ్ఞ+అర్థంబు+ఐన పనికిన్= యజ్ఞం కొరకైన పనిమీద; తండ్రిపనుపునన్= తండ్రి ఆజ్ఞతో; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: ఆ సంగతి ఇంద్రమతంగ సంవాదం అనే ఇతిహాసం వింటే స్పష్టం అవుతుంది. కాబట్టి ఆ కథ వినిపిస్తాను. మతంగుడు అనే పేరుగల ఒక బ్రాహ్మణపుత్రుడు తండ్రి పంపగా ఒక యజ్ఞం కొరకు పోయి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మదమునఁ బెలుచన యొకగా । డిద కొదమం గోల గొని యడిచె, నడిచిన నొ
వ్వొదవి, తనతల్లిఁ జేరఁగ । నది సని, నన్నీతఁ డడిచె నని చెప్పుటయున్. 89

ప్రతిపదార్థం: మదమునన్= మదంతో; పెలుచన= అధికంగా, గట్టిగా; ఒక గాడిదకొదమన్= ఒక గాడిద పిల్లను; కోలకొని= కర్ర తీసికొని; అడిచెన్= కొట్టాడు; అడిచినన్= కొట్టగా; అది= ఆ కొదమ; నొవ్వు= బాధ; ఒదవి= కలిగి; తనతల్లిన్= తనయొక్క తల్లిని; చేరఁగన్ చని= సమీపించి; నన్నున్= నన్ను; ఈతఁడు=వీడు; అడిచెన్= కొట్టాడు; అని చెప్పుటయున్= అని చెప్పగా.

తాత్పర్యం: వాడు దారిన పోతూ పోతూ ఒక గాడిదపిల్లను కర్రతో గట్టిగా కొట్టగా అది బాధతో తల్లి దగ్గరకు పోయి ఆ సంగతి చెప్పగా. (తరువాతి వచనంతో అన్వయం.)

వ. ఆ గార్దభి తన కొదమతో 'వీఁడు చండాలుండు ప్రచండస్వభావుండు గాకుండునే?' యనినం, బూర్వజన్మకర్మ విశేషంబునం దిర్యగ్జాతి భాషావిదుండగుట నవ్విప్రపుత్రుం డప్పల్కులు విని, 'యిది దూషణ భాషణంబు గాదు; నిరూపణాలాపంబై యున్నది; యట్లు గావున మాలతనంబు గలుగనేర్చు'నని నిశ్చయించి యగ్గాడిద కడకుం బోయి. 90

ప్రతిపదార్థం: ఆ గార్దభి= ఆ ఆడగాడిద; తన కొదమతోన్= తన పిల్లతో; వీడు చండాలుండు= వీడు క్రూరజన్మకలవాడు; ప్రచండ= భయంకరమైన; స్వభావుండు= స్వభావం కలవాడు; కాకుండునే!= కాకుండా ఎట్లా పోతాడు? (తప్పక వాడే); అనినన్= అనగా; పూర్వజన్మ కర్మ విశేషంబునన్= పూర్వజన్మలో చేసిన పనుల విశేషంతో; ఆ+విప్రపుత్రుండు= ఆ బ్రాహ్మణకుమారుడు; తిర్యక్‌జాతి= పశుపక్షిజాతి; భాషావిదుండు= భాష తెలిసినవాడు; అగుటన్= కావటంచేత; ఆ+పల్కులు= ఆ మాటలు; విని; ఇది దూషణభాషణంబు కాదు= ఇది తిట్టుకాదు; నిరూపణ= (నా జన్మవిశేషాన్ని గుర్తించి) వ్రేలెత్తి చూపే; ఆలాపంబు+ఐ= సంభాషణ; యై ఉన్నది; అట్లు కావునన్= కాబట్టి; మాలతనంబు= చండాలస్వభావం; కలుగనేర్చున్= కలుగవచ్చును; అని నిశ్చయించి= అని భావించి; ఆ+గాడిదకడకున్= ఆ గాడిద దగ్గరకు; పోయి= వెళ్ళి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ తల్లిగాడిద పిల్లగాడిదతో ఇట్లా అన్నది. 'వీడు చండాలుడు, క్రూరస్వభావుడు కనుకనే ఇట్లా చేశాడు' అని. అది విని ఆ బ్రాహ్మణబాలుడు పూర్వజన్మలో చేసికొన్న పుణ్యకర్మల ప్రభావంచేత పశు పక్ష్యాదుల భాషలు తెలిసినవాడుకావటంవలన 'ఈ గాడిద మాట నన్ను గూర్చిన నిందావచనం కాదు. నా జన్మవిశేషం తెలిసి అన్నట్లున్న' దని ఆ గాడిద దగ్గరకు పోయి. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: ప్రతిజీవికీ ప్రత్యేక భాష ఉన్నది. చెట్టు, పిట్ట, జంతువూ అన్నీ సంభాషించేవే. అక్కడ మన భాషవలె అక్షరరూపమైనది కాకపోవచ్చును కాక సంజ్ఞకూడా భాషే. పూర్వకాలం మనిషి ప్రకృతిమధ్య, చెట్లు జంతువుల మధ్య ఎక్కువ జీవించినవాడు కావటం వలన వాడి కా భాష తెలుసు. పశు సంజ్ఞలు రైతుకు తెలుసు. తేనెటీగలు పెంచేవారికి వాటి భాష తెలుసునని చాలామంది వ్రాశారు. కనుక ఇది సంభవమే.

క. తనకుం జండాలత వ । చ్చిన కారణ మడిగి, దానిచేతం గంద
ర్పుని చెయిది మంగలికి నిజ । జననికిఁ బొందగుట విని విషాదముతోడన్. 91

ప్రతిపదార్థం: తనకున్= తనకు; చండాలత= చండాల జన్మ; వచ్చిన= కలిగిన; కారణము= హేతువు; అడిగి= అడిగి; దానిచేతన్= గాడిదవలన; నిజజననికిన్= తన తల్లికీ; మంగలికిన్= మంగలివాడికీ; కందర్పుని= మన్మథుడి; చెయిదిన్= చేష్టవలన; పొందు= సంభోగం; అగుట విని= కావటం తెలిసికొని; విషాదముతోడన్= దుఃఖంతో.

తాత్పర్యం: 'మన్మథుడి ప్రేరణవలన తన తల్లి మంగలితో సంగమిస్తే తాను పుట్టినట్లు ఆ గాడిదవలన విని దుః ఖంతో (తరువాతి వచనంతో అన్వయం.)

వ. తనపోయెడు పనికిం బోవక, మరలి సదనంబునకుం జని, జనకున కత్తెఱం గెల్ల నెఱింగించి, యతనితో 'శూద్రబీజంబున బ్రాహ్మణియందు జన్మించినవాఁడు చండాలుం డగుటకు సందియం బేమి? గార్దభి శాపజాత గానోపు నది యున్నరూపపలికె; బ్రాహ్మణ్యంబు దపంబున సంపాదించెదం గాక' యని పల్కి, వీడ్కొని వనంబునకుం బోయి. 92

ప్రతిపదార్థం: తన పోయెడు పనికిన్= తానుపోతున్న పనికి; పోవక= పోకుండా; మరలి= వెనుకకు తిరిగి; సదనంబునకున్= ఇంటికి; చని= పోయి; జనకునకున్= తండ్రికి; ఆ+తెఱంగు= ఆ విషయం; ఎల్లన్= అంతా; ఎఱింగించి= చెప్పి; అతనితోన్= తండ్రితో; శూద్రబీజంబునన్= శూద్రుని బీజంతో; బ్రాహ్మణియందున్= బ్రాహ్మణస్త్రీకి; జన్మించినవాఁడు= పుట్టినవాడు; చండాలుండు+అగుటకున్= చండాలుడు కావటానికి; సందియంబు= సందేహం; ఏమి?= ఏమున్నది?; గార్దభి= ఆ ఆడగాడిద; శాపజాత= శాపంవలన (అట్లా) పుట్టింది; కానోపున్= కాబోలు; ఉన్నరూప= ఉన్నమాట; పలికెన్= అన్నది; బ్రాహ్మణ్యంబు= బ్రాహ్మణత్వం; తపంబునన్= తపస్సు చేతనే; సంపాదించెదన్ కాక= పొందుతాను సుమా!; అని; వీడ్కొని= తండ్రిని వదలి; వనంబునకున్= అడవికి; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: యజ్ఞం పనిమీద పోతున్నాడుకదా! అది వదలి ఇంటికి తిరిగిపోయి ఆ గాడిద చెప్పినదంతా తండ్రికి చెప్పి, 'నా జన్మ బ్రాహ్మణ బీజానికి కలిగింది కాదు కనుక ఆ బ్రాహ్మణత్వం తపస్సుచేత సాధిస్తా' నని పలికి తండ్రిని వదలిపెట్టి అడవికి పోయి. (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పరమ తపమాచరింపఁగ । సురపతి వొడచూపి యడుగు సువ్రత! నీకున్

వర మిచ్చెద' ననిన; 'ధరా । మరత్వ మి' మ్మనియె; నతఁడు మది ముద మొదవన్. 93

ప్రతిపదార్థం: పరమ= గొప్ప; తపము= తపస్సు; ఆచరింపఁగన్= చేయగా; సురపతి= దేవతలరాజు, ఇంద్రుడు; పొడచూపి= కన్పించి (పొడ-నీడ-తనపొడ గిట్టదని సామెత); సువ్రత!=మంచి తపస్సు చేసినవాడా!; నీకున్; వరము+ఇచ్చెదన్= వరమిస్తాను; అడుగు; అనినన్= అనగా; అతఁడు= వాడు; మదిన్= మనస్సులో; ముదము= సంతోషం; ఒదవన్= కలుగగా; ధరా+ అమరత్వము= భూమిపై దేవతాత్వము - భూదేవత అంటే బ్రాహ్మణుడు కనుక బ్రాహ్మణత్వమని భావం; ఇమ్ము= ఇవ్వు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: గొప్ప తపస్సు చేయగా ఇంద్రుడు ప్రత్యక్షమై 'సువ్రతా! నీకేమి వరం కావాలో కోరుకొమ్ము' అని అడుగగా అతడు సంతోషంతో 'నాకు బ్రాహ్మణత్వ మి' మ్మన్నాడు.

చ. అనవుడు 'బ్రాహ్మణత్వము మహత్త్వ మెఱుంగవ? యన్యజాతి కం

దునె యది? యొండు వేఁడు; మది దోఁచిన మే' లనియెన్ బలారి; వాఁ

'డనితరసాధ్య మైన తప మస్ఖలితంబుగఁ జేయుచుండెదం;

జనుము మహాత్మ! నీ' వనిన, సస్మితుఁడై యతఁ డేఁగె; నేఁగినన్. 94

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; బల+అరి= బలుడన్న రాక్షసుడిని చంపినవాడు - ఇంద్రుడు; బ్రాహ్మణత్వము మహత్త్వము= బ్రాహ్మణస్థితి గొప్పతనం; ఎఱుంగవె?= తెలియవా?, అన్యజాతికిన్= మరొకవర్ణంలో పుట్టినవాడికి; అది= ఆ బ్రాహ్మణ్యం; అందునె?= అందుతుందా? (అందదు); ఒండు= మరొకవరం; వేడుము= కోరుకొమ్ము; అది= మరొక కోరిక; తోఁచినన్= తోస్తే; మేలు= మంచిది (నీ మనస్సులో మరొక కోరిక తోస్తే అది చెప్పుము మంచిది); అనియెన్= అన్నాడు; వాఁడు= మతంగుడు; మహాత్మ!= (దేవతలకు రాజువైన) స్వామీ!; అనితర సాధ్యము+ఐన= ఇతరులకు సాధ్యం కాని; తపము= తపస్సు; చేయుచున్= చేస్తూ; ఉండెదన్= ఉంటాను; నీవు; చనుము= వెళ్ళుము; అనినన్= అంటే; అతఁడు= ఇంద్రుడు; స+స్మితుఁడు+ఐ= నవ్వుతో కూడినవాడై; ఏఁగెన్= వెళ్ళాడు; ఏఁగినన్= అట్లా వెళ్ళగా.

తాత్పర్యం: మతంగు డట్లా చెప్పగా ఇంద్రుడు ఇట్లా అన్నాడు. 'బ్రాహ్మణత్వం ఇతర జాతులకందేది కాదు. మరొకవరం కోరుకొమ్ము' అని.కాని అతడు 'మహాత్మా! నీవు వెళ్ళుము. నా కోరిక ఫలించేంతవరకు నే నిట్లా ఇతరులకు సాధ్యం కాని తపస్సు చేస్తూనే ఉంటాను' అని చెప్పగా అతడు వెళ్ళిపోగా. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: బ్రాహ్మణత్వ మన్నది పుట్టగానే ఎవరికీ దక్కేది కాదు. అది తపస్సుచేత సాధ్య మన్నమాట.

వ. మతంగుం డేకపాదంబున నూఱేండ్లు తపంబు సేసిన నింద్రుండు గ్రమ్మఱ వచ్చి. 95

ప్రతిపదార్థం: మతంగుండు= చండాలుడు (క్రూరకర్మలు చేసేవాడు); ఏకపాదంబునన్= ఒకేపాదంమీద (నిలిచి); నూఱు+ఏండ్లు= నూరు సంవత్సరాలు; తపంబు= తపస్సు; చేసినన్= చేయగా; క్రమ్మఱన్= మళ్ళీ; ఇంద్రుండు వచ్చి.

తాత్పర్యం: మతంగుడు ఒంటికాలి మీద నిలిచి నూరేళ్ళు తపస్సు చేయగా మళ్ళీ ఇంద్రుడు ప్రత్యక్షమై.

తే. 'ఏను వలదని చెప్పిన మాన వెట్లు? । పరమదుర్లభ పద మాసపడి, కరంబు
మేలితప మాచరించి చండాలు డిట్టి । దాన నశియించు; నిది నీకుఁ దగదు, విడువు. 96

ప్రతిపదార్థం: ఏను= నేను; వలదు= వద్దు; అని చెప్పినన్= అని చెప్పినప్పటికీ; మానవు= వదలవు; ఎట్లు?= ఎట్లాగా?; పరమ= మిక్కిలి; దుర్లభ= లభించని; పదము= స్థితి; ఆసపడి= కోరి; కరంబు= మిక్కిలి; మేలితపము= గొప్ప తపస్సు; చండాలుఁడు= మతంగుడు; ఆచరించి= చేస్తే; ఇట్టిదానన్= ఇట్లాంటి దానివలన; నశియించున్= నశిస్తాడు; ఇది నీకున్= ఇది నీకు; తగదు= మంచిదికాదు.

తాత్పర్యం: 'నేను వద్దని చెప్పినా నీవు వినకుండా ఉన్నావు. చండాలుడు ఇట్లాంటి తపస్సు చేస్తే చస్తాడు తప్ప మేలు పొందడు. కాబట్టి నీకు ఈ తపస్సు తగదు.

వ. విను మిత్తెఱంగుతపంబునకుఁ బదిమడుంగులు సేసి చండాలుండు శూద్రుండగు; నూఱుమడుంగు లనుష్ఠించి శూద్రుండు వైశ్యుండగు; వేయిమడుంగు లాచరించి వైశ్యుండు క్షత్రియుం డగు; నప్పుణ్యాచరణంబునకుఁ బదివేలు మడుంగులు నిర్వర్తించి క్షత్రియుండు దుర్బ్రాహ్మణుం డగు; నా నియమంబునకు లక్షమడుంగులు సల్పి శమదమ సత్యాహింసల సమాత్సర్యంబున నార్య బ్రాహ్మణహృదయంబులు సదయంబులు గావించి దుర్బ్రాహ్మణుండు సద్బ్రాహ్మణుం డగు; నిట్లు బ్రాహ్మణ్యం బలఁతులం బడయవచ్చునే; పడసియు, నది సెడకుండ నడప శక్యంబగునే? యనేక జన్మంబుల నొకప్పుడు బ్రాహ్మణజన్మంబు నొందియుం గొందఱు ధనవాంఛా విషయ లౌల్యాదులం దదాచారంబు దిగవిడిచి చెడుదు; రిట్టి మహాపదంబు గోరి నిన్ను నీవ యేల వినాశంబు నొందించుకొనియెద? వీ తపోనిష్ఠ సాలించి, తగునది యొక్క వరంబు వేడు' మనియె, ననిన వాఁడూరకున్న, నాఖండలుం డరిగె; వెండియు. 97

ప్రతిపదార్థం: వినుము= విను; ఈ తెఱంగు తపంబునకున్= ఇటువంటి తపస్సునకు; పదిమడుంగులు= పదిరెట్లు; చేసి= ఆచరించి; చండాలుండు= కడజాతివాడు; శూద్రుండు= నాలుగవజాతివాడు; అగున్= అవుతాడు; నూఱు మడుంగులు= వందరెట్లు; అనుష్ఠించి= శ్రద్ధతో చేసి; శూద్రుండు= శూద్రుడు; వైశ్యుండు= మూడవవర్గంవాడు; అగున్= అవుతాడు; వేయి మడుంగులు= వేయిరెట్లు; ఆచరించి= చేసి; వైశ్యుండు= వైశ్యవర్ణంవాడు; క్షత్రియుండు= క్షత్రియవర్ణంవాడు; అగున్= అవుతాడు; ఆ+పుణ్య+ఆచరణంబునకున్= ఆ పుణ్యమైన పనికి; పదివేలు మడుంగులు= పదివేలరెట్లు; నిర్వర్తించి= చక్కగా ఆచరించి; క్షత్రియుండు= రెండవవర్ణంవాడు; దుర్బ్రాహ్మణుండు= చెడ్డబాపడు; అగున్= అవుతాడు; ఆ నియమంబునకున్= అటువంటి నిష్ఠకు; లక్షమడుంగులు= లక్ష రెట్లు; చల్పి= చేసి; శమ, దమ, సత్య+అహింసలన్= లోపలియింద్రియాలను కట్టడి చేయటం, వెలుపలి ఇంద్రియాలను జారిపోనీకుండటం, అబద్ధాలాడకపోవటం, ఎవరికీ దేనికీ బాధ కలిగించకుండటం అనేవాని చేతనూ, అమాత్సర్యంబునన్= ఇతరుల మేలును చూడలేకపోవటం అనే స్వభావం లేకపోవటం చేతనూ; ఆర్య, బ్రాహ్మణ హృదయంబులు= ఉత్తమ స్వభావం కల బ్రాహ్మణుల హృదయాలను; సదయంబులు= రక్షించాలి అనేభావన కలవిగా; కావించి= చేసి; దుర్బ్రాహ్మణుండు= పుట్టుకచేత మాత్రమే బ్రాహ్మణుడైనవాడు; సత్+బ్రాహ్మణుండు= ఉత్తముడైన విప్రుడుగా; అగున్= అవుతాడు; ఇట్లు= ఈ విధంగా; బ్రాహ్మణ్యంబు= బ్రాహ్మణుడు కావటం; అలఁతులన్= తక్కువతీరు కర్మలచేత; పడయన్+వచ్చునే= పొందనగునా? పడసియున్= పొందికూడా; అది= ఆ బాపనితనం; చెడక+ఉండన్= చెడిపోకుండా; నడపన్= ప్రవర్తింపజేయటం; శక్యంబు+అగునే= సాధ్యం అవుతుందా? అనేక జన్మంబులన్= పెక్కు పుట్టుకల తరువాత;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక+అప్పుడు= ఒకపుట్టుకలో; బ్రాహ్మణజన్మంబున్= బ్రాహ్మణుడుగా పుట్టటం; ఒందియున్= పొందికూడా; కొందఱు= కొంతమంది; ధనవాంఛా విషయ తౌల్య+ఆదులన్= ధనం మీది కోరిక, ఇంద్రియాలకు సంబంధించిన శబ్దముమొదలైనవాని యందలి చపలత్వం మొదలైనవానిచేత, తత్+ఆచారంబున్= ఆ బ్రాహ్మణుని నడవడిని; దిగన్+విడిచి= పూర్తిగా వదలివైచి; చెడుదురు= పాడైపోతారు; ఇట్టి మహా పదంబున్= ఇటు వంటి గొప్పస్థితిని; కోరి= కాంక్షించి; నిన్నున్= నిన్ను; నీవు+అ= నీవే; ఏల= ఎందుకు; వినాశంబున్= పాడగుటను; ఒందించుకొనియెదవు= చేసుకుంటావు; ఈ తపస్+నిష్ఠన్= ఈ తపస్సునందలి మిక్కిలిశ్రద్ధను; చాలించి= ఆపివేసి; తగు+అది= యోగ్యమైనదైన; ఒక్క వరంబున్= ఒక్కవరాన్ని; వేడుము= కోరుకో; అనియెన్= అన్నాడు; అనినన్= అట్లు పలికినా; వాఁడు= ఆ చండాలుడు; ఊరక+ఉన్నన్= బదులు చెప్పక ఉంటే; ఆఖండలుండు= దేవేంద్రుడు; అరిగెన్= వెళ్లి పోయాడు; వెండియున్= తరువాత.

తాత్పర్యం: ఇటువంటి తపస్సునకు పదిరెట్లు తపస్సు చేసి చండాలుడు శూద్రుడౌతాడు. అతడు వందరెట్లు తపస్సు చేస్తే కాని వైశ్యుడు కాడు. అతడు వేయిరెట్లు చేస్తే క్షత్రియుడౌతాడు. అతడు పదివేల రెట్లు చేస్తే దుర్బ్రాహ్మణుడు ఔతాడు. అతడు లక్షరెట్లు చేస్తే కాని బ్రాహ్మణుడు కాడు. కనుక ఆ మహాపదవి అల్పులకు పొందరాదు. ఒకవేళ పొందినా నిలుపుకొనటం కష్టం. కొందరు వేలజన్మల తర్వాత బ్రాహ్మణులై పుట్టి కూడా ధనలోభాదులవలన చెడిపోతున్నారు. కనుక నీ తపస్సు వదలిపెట్టుము' అని చెప్పి ఇంద్రుడు వెళ్ళిపోయాడు. తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అంగుష్ఠ మొకటి మోపి, మ । తంగుఁడు నూఱేండ్లు సేసెఁ దపము నియతిమై.
నంగము తో లస్థులతో । సంగతముగఁ దోఁప, వెక్కసముగా నరముల్. 98

ప్రతిపదార్థం: మతంగుఁడు; అంగుష్ఠము= కాలిబొటనవ్రేలు; ఒకటి మోపి= ఒకదానిపై నిలిచి; నూఱు= వంద; ఏండ్లు= సంవత్సరాలు; నియతిమైన్ = నియమంతో; అంగము= అవయవం; తోలు= చర్మం; అస్థులతోన్= బొమికలతో; నరముల్= నరాలు; సంగతముగన్= అంటుకొన్నట్లు; వెక్కసముగాన్= కంటికిబరువుగా, భయంకరంగా; తోఁపన్= కన్పించగా, తపము చేసెన్= తపస్సు చేశాడు.

తాత్పర్యం: నూరేళ్ళు కాలిబొటనవ్రేలిపై నిలిచి, శరీరంలో తోలు, ఎముకలు, నరాలు తప్ప ఏమీ మిగులకుండు నంతగా భయంకరంగా కన్పించేంత వరకు తపస్సు చేశాడు.

విశేషం: ప్రతి పద్యంలోనూ తిక్కనగారు కావాలని తెలుగు పదాలు వాడటం గమనించాలి. ఉదా; తోలుకు బదులు చర్మం వాడవచ్చు. కాని అది సంస్కృతం. తపస్సు చేసి చిక్కి శల్యమైన బుద్ధవిగ్రహాలు మనదేశంలో వచ్చాయి. పోల్చుకొనవచ్చును.

ఆ. ఇట్లు సేసి శక్తి యెల్లను గడచన్న । నతఁడు, నేల వ్రాలె; నతిరయమున
వచ్చి, యమరఁ బట్టి వాసవుఁ 'డక్కట! నీకుఁ జెప్పనయ్య! నెమ్మి నేను. 99

ప్రతిపదార్థం: ఇట్లు చేసి= ఈ విధంగా చేసి; శక్తిఎల్లను= ఓపిక అంతా; కడచన్నన్= వట్టిపోగా; (కడ=చివరకు; చన్నన్= పోగా); అతఁడు= మతంగుడు; నేలన్= భూమిపై; వ్రాలెన్= పడ్డాడు; వాసవుఁడు= ఇంద్రుడు; అతిరయమునన్= మిక్కిలి వేగంతో; వచ్చి; అమరన్= చక్కగా; పట్టి= పట్టుకొని; నేను; నీకున్; నెమ్మిన్= ప్రేమతో; చెప్పనయ్య!= అయ్యా! చెప్పనా? (ఇదివరకే చెప్పాను కదా!)

తాత్పర్యం: ఇట్లా తపస్సు చేసి అతని శరీరం శుష్కించి శక్తి అంతా క్షీణించిపోగా నేలపై కుప్పకూలిపోయాడు. (అప్పుడు) మిక్కిలివేగంతో ఇంద్రుడు వచ్చి అతడిని పడకుండా చక్కగా పట్టుకొని, అయ్యా! నే నిదివరకే చెప్పలేదా?

వ. క్షత్రియాదులచేతనుం బట్టువడని బ్రాహ్మణశార్దూలంబుతోడి మేలంబు దక్కుము; నీకు నొక్కవరం బిచ్చెదం గైకొను' మని పల్కుటయు, నతం డొడంబడినం బరమాదరంబున. 100

ప్రతిపదార్థం: క్షత్రియ+ఆదులచేతనున్= రాజులు మొదలైనవారికి కూడా; పట్టువడని= లభించని; బ్రాహ్మణశార్దూలంబు= బ్రాహ్మణత్వమన్న పులికి; తోడి= సంబంధించిన; మేలంబు= ఆట, నవ్వులాట; తక్కుము= వదలిపెట్టుము; నీకున్= నీకు; ఒక్క వరంబు= ఒక్క వరాన్ని; ఇచ్చెదన్= ఇస్తాను; కైకొనుము= తీసికొనుము; అని; పల్కుటయున్= చెప్పగా; అతండు= ఆ మతంగుడు; ఒడంబడినన్= అంగీకరించగా; పరమ= గొప్ప; ఆదరంబునన్= ప్రేమతో.

తాత్పర్యం: క్షత్రియుడికి కూడా లభించని ఆ బ్రాహ్మణత్వమన్న పులితో ఆటలాడటం మానివేస్తే నీకొక వరమిస్తా' నని ఇంద్రుడంటే అతడూ సరే నన్నాడు. అప్పుడు ఇంద్రుడు ప్రేమతో. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. చండదేవుఁ డనఁ బ్రశస్తి వహించి, సు । స్త్రీలు, పూజనంబు సేయఁ, గామ
రూపధారివై, నిరూపింప విహగభా। వంబుగల్గి, ప్రమదవర్తి వగుము'. 101

ప్రతిపదార్థం: చండదేవుఁడు+అనన్= ఆ పేరుతో; ప్రశస్తి= కీర్తి; వహించి= మోసి; సు స్త్రీలు= మంచి ఆడువారు; పూజనంబు= పూజలు; చేయన్= చేస్తూ+ఉండగా; కామరూపధారివి+ఐ= ఇష్టం వచ్చిన రూపాన్ని ధరించగలవాడివై; నిరూపింపన్= అందరు గుర్తించేటట్లుగా; విహగభావంబు= ఆకాశంలో ఎగిరే పక్షి స్వభావం; కల్గి= పొంది; ప్రమద= సంతోషంతో; వర్తివి= చరించేవాడవు; అగుము= కమ్ము.

తాత్పర్యం: చండదేవుడనే పేరుతో కీర్తిశాలివై స్త్రీల పూజలందుతూ కామరూపంతో పక్షిభావం పొంది సంతోషంతో విహరించుము'.

క. అని వరమిచ్చి, మహేంద్రుఁడు । సనియె' ననిన విని, యజాతశత్రుఁడు గాంగే
యునితో 'బ్రాహ్మణ్యము పెఱ । జనులకుఁ బొందంగ ని ట్లశక్యం బేనిన్. 102

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; వరము+ఇచ్చి= కోరిన కోరిక తీర్చి; మహేంద్రుఁడు= ఇంద్రుడు; చనియెన్= వెళ్ళాడు; అనినన్= చెప్పగా; విని; అజాత= పుట్టని, లేని; శత్రుఁడు= శత్రువులు కలవాడు (శత్రువు లేనివాడు ధర్మరాజు); గాంగేయునితోన్= గంగాతనయుడైన భీష్ముడితో; పెఱ= ఇతర; జనులకున్= వర్ణాలవారికి; బ్రాహ్మణ్యము= బ్రాహ్మణత్వం; పొందంగన్= పొందటం; ఇట్లు= ఈ విధంగా; అశక్యంబు+ఏనిన్= సాధ్యం కాకపోతే.

తాత్పర్యం: అని వరమిచ్చి ఇంద్రుడు వెళ్ళాడని విన్న ధర్మరాజు భీష్ముడిని ఇట్లా ప్రశ్నించాడు. 'ఇతరుల కీ విధంగా బ్రాహ్మణత్వం పొందరానిదే అయితే. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అజాతశత్రువు అంటే ఇతడిని దుర్యోధనాదులు శత్రువుగా చూచారు తప్ప ఇతడు వారి నట్లా చూడలేదని అర్థం. ఎవడి మనస్సులో ద్వేషం, విరోధం లేవో వా డజాతశత్రువు. అశోకుడు, గాంధీ, బుద్ధులూ ఇట్టివారే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశ్వామిత్రునకు బ్రాహ్మణ్యంబు గలిగిన తెఱంగు (సం. 13-3-1)

వ. విశ్వామిత్రుం డెట్లు వొందె? నత్తెఱం గెఱింగింపవే!' యని యడిగిన నన్నరదేవునకు దేవవ్రతుం డిట్లనియె.103

ప్రతిపదార్థం: విశ్వామిత్రుండు= విశ్వానికంతా స్నేహితుడైన ఋషి; ఎట్లు= ఏ విధంగా, పొందెన్= బ్రాహ్మణత్వాన్ని పొందాడో; ఆ+తెఱంగు= ఆ పద్ధతి; ఎఱింగింపవే= తెల్పవే; అని; అడిగినన్= అడుగగా; ఆ నరదేవునకున్= ఆ రాజునకు; దేవవ్రతుండు= భీష్ముడు; ఇట్లు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: బ్రాహ్మణత్వం ఇతరవర్ణాలవారికి లభ్యం కాదన్నావు కదా! మరి విశ్వామిత్రు డెట్లా పొందగలిగాడో చెప్పుము' అని అడిగిన ధర్మరాజుతో భీష్ము డిట్లా అన్నాడు.

సీ. 'జాహ్నవీదేవికి జనకుఁడై వెలసిన। జహ్నుని కులమున సంభవించె
గాధినాఁ బ్రకట భూకాంతుఁ ; డాతనిపుత్రి। యగు సత్యవతిఁ దన కాలి గాఁగ
నిమ్మని యర్థించె నమ్మహీశ్వరు ఋచీ। కుం డనుముని; భృగుకులవరేణ్యుఁ
డతని కీ నొల్ల కప్పతి దనకూఁతున। కుంకువగాఁ, జెప్పెనొక్క కర్ణ

తే. మసితమై తెలుపారెడు హరులు వేయి। మానియై భార్గవుఁడు దేరఁబూని వరుణుఁ
గానఁ జని యవ్విధము ఘోటకముల వేఁడె। నాతఁ డిచ్చుట కొడఁబడి యతనితోడ. 104

ప్రతిపదార్థం: జాహ్నవీదేవికిన్= గంగాదేవికి; జనకుఁడు+ఐ= తండ్రి అయి; వెలసిన= ప్రకాశించిన; జహ్నుని కులమునన్= జహ్నుడన్న ముని వంశంలో (జహ్నుడి కూతురు కనుక జాహ్నవి అని పేరు వచ్చింది); గాధినాన్= గాధి అన్న పేరు కలవాడుగా; ప్రకట= అందరకు తెలిసిన; భూకాంతుఁడు= రాజు (భూమికి పాలకుడు); సంభవించెన్= జన్మించాడు; అతని పుత్రి= అతడి కుమార్తె; అగు; సత్యవతి= సత్యవతి అనే పేరుగలది (సత్యం కలది); తనకున్= ఋచీకు డన్న మునికి; ఆలికాఁగన్= భార్యకాగా; ఋచీకుండు+అనుముని; భృగుకులవరేణ్యుఁడు= భృగుకులంలో శ్రేష్ఠుడు; ఆ+మహీశ్వరున్= ఆ రాజైన గాధిని; అర్థించెన్= కోరాడు; తనకూఁతును= తన కుమార్తెను; అతనికిన్= ఋచీకునకు; ఈన్= ఇవ్వటానికి; ఒల్లక= ఇష్టపడక; ఉంకువగాన్= ఓలిగా, శుల్కం కాగా; ఒక్క కర్ణము= ఒక చెవి; అసితము+ఐ= నల్లనిదై; తెలుపు+ఆరెడి= స్వచ్ఛమైన తెలుపుగల; హరులు= గుర్రాలు; వేయి= సహస్రం; చెప్పెన్= ఋచీకుడికి గాధి ఆ విధంగా చెప్పాడు; మాని+ఐ= పౌరుషంగలవాడై; భార్గవుఁడు= భృగు కులంలో పుట్టిన ఆ ఋచీకుడు; తేరన్= తెచ్చుటకు; పూని= పూనుకొని; వరుణున్= వరుణదేవుని; కానన్= చూడగా; చని= వెళ్ళి; ఆ విధము= అలాంటి; ఘోటకములన్= గుర్రాలను; వేఁడెన్= ప్రార్థించెను; ఆతఁడు= ఆ వరుణుడు; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; ఒడఁబడి= అంగీకరించి; అతని తోడన్= ఋచీకుడితో.

తాత్పర్యం: జాహ్నవీదేవికి తండ్రి అయిన జహ్నుడికులంలో గాధి అనేవాడు జన్మించాడు. అతడి కూతురు సత్యవతి. ఆమెను భృగుకులంలో పుట్టిన ఋచీకు డనేవాడు భార్యగా నిమ్మని ఆమె తండ్రి గాధిని కోరాడు. గాధికి ఇష్టం లేదు. అందుకని ఒక చెవి నల్లగా ఉన్న తెల్లని వేయి గుర్రాలను శుల్కంగా తెస్తే, ఇస్తా నన్నాడు. అభిమాన ధనుడైన ఋచీకుడు వరుణుడి దగ్గరకు వెళ్ళి యాచించాడు. ఆయన ఇవ్వటానికి ఒప్పుకొని ఈ క్రింది విధంగా అన్నాడు.

విశేషం: ఆ రోజులలో ఓలి ఇచ్చి వివాహం చేసికొనే ఆచార ముండేది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'నీ వలసినప్పు డట్టి హ। యావలి ప్రభవించు నెచటనైన' ననవుడున్
దీవించి యరిగి యమ్ముని। దేవతటిని యుత్తరంపుఁ దీరమునఁ దగన్. 105

ప్రతిపదార్థం: నీ= నీకు; వలసినప్పుడు= అవసరమైనప్పుడు; (నీకు అవసర మేర్పడినపుడు); అట్టి= అట్లాంటి; హయ+ఆవలి= గుఱ్ఱాల సమూహం; ఎచటన్+ఐనన్= నీవు కోరినచోట; ప్రభవించున్= పుట్టుతాయి; అనవుడున్= అనగా; ఆ+ముని= ఆ ఋచీకుడు; దీవించి= ఆశీర్వదించి; అరిగి= పోయి; దేవతటిని= గంగానది (దేవతా నది); ఉత్తరము+తీరమునన్= ఉత్తరదిక్కున ఉన్న ఒడ్డున; తగన్= చక్కగా

తాత్పర్యం: 'నీ వెక్కడ కోరితే అక్కడ అట్లాంటి గుఱ్ఱాలు పుట్టుతాయి' అని వరుణు డన్నాడు. సంతోషించి ఆ ఋచీకుడు వరుణుడిని ఆశీర్వదించి గంగానది ఉత్తరపుటొడ్డున.

వ. నియతుండై తలఁచిన తత్క్షణంబ గాధి చెప్పిన చందంబగు గుఱ్ఱంబులు వేయునుం బుడమిఁ బొలిచి నిలిచె; దానం గన్యాకుబ్జంబున కనతిదూరం బగు తత్ప్రదేశం బశ్వతీర్థం బనం బరఁగె; నమ్ముని కుమారుం డత్తురంగంబుల నిచ్చిన, నచ్చెరువును సంతోషంబును శాపభయంబును హృదయంబున ముప్పిరిగొనం దనపుత్రికి నుంకువగా నియ్యకొని. 106

ప్రతిపదార్థం: నియతుండు+ఐ= నియమం కలవాడై; తలఁచిన= అనుకొనగానే; తత్క్షణంబు+అ= వెనువెంటనే; గాధి చెప్పిన చందంబు+అగు= గాధి చెప్పినటువంటి; వేయునున్= వేయీ; పుడమిన్= భూమిపై; పొలిచి= సంభవించి; నిలిచెన్= నిలిచాయి; దానన్= అందువలన; కన్యాకుబ్జంబునకున్= ఆ పేరున్న దేశానికి; అనతి దూరంబు+అగు= కొంచెం దూరంలో ఉన్న; తత్ప్రదేశంబు= ఆ చోటు (గుఱ్ఱాలు పుట్టిన స్థలం); అశ్వతీర్థంబు= గుఱ్ఱాలు పుట్టిన పవిత్రస్థలం; అనన్= అన్నపేరున; పరఁగెన్= వ్యాప్తి చెందెను; ఆ+ముని= ఆ ముని; కుమారుండు=కొడుకు; ఆ+తురంగంబులన్= ఆ గుఱ్ఱాలను; ఇచ్చినన్= ఇవ్వగా; అచ్చెరువును= ఆశ్చర్యం; సంతోషంబును= ఆనందమూ; శాపభయంబును= శపిస్తాడేమోనన్న భీతి; హృదయంబునన్= మనస్సునందు; ముప్పిరిగొనన్= ముప్పేటలు పడగా (మూడు పిరము - త్రాడు మూడు పేటలుగా పేనటం); తన పుత్రికిన్= తన కూతురునకు; ఉంకువగాన్= శుల్కంగా (ఓలిగా); ఇయ్యకొని= అంగీకరించి, ఒప్పుకొని.

తాత్పర్యం: నియమంతో సంకల్పించగానే వెంటనే గాధి చెప్పినవిధంగా వేయి గుఱ్ఱాలు నేలనుండి పుట్టి ఎదుట నిలిచాయి. దానివలన కన్యాకుబ్జానికి కొద్దిదూరంలో ఉన్న ఆ ప్రదేశం అశ్వతీర్థమని ప్రసిద్ధి కెక్కింది. ఋచీకుడు ఆ గుఱ్ఱాలను ఇచ్చాడు. గాధి సంతోషంలోనూ, ఆశ్చర్యంలోనూ, శాపభయంలోనూ మునిగిపోయాడు. ఆ ముప్పేటభావంతో కూతురుకు ఆ గుఱ్ఱాలను శుల్కంగా అంగీకరించాడు.

తే. గాధి యమ్మునిపుత్త్రు శీఘ్రమునఁ బెండ్లి। సేసె; నిట్లు, వరించి ఋచీకుఁ డధిక
సమ్మదమున గృహస్థ ధర్మమ్ము నడపు। చుండి, సంతాన కాంక్ష, నయ్యువిదతోడ. 107

ప్రతిపదార్థం: గాధి= గాధిరాజు; ఆ+మునిపుత్త్రున్= ఆ ఋచీకుడికి; శీఘ్రమునన్= వెంటనే; పెండ్లిచేసెన్= వివాహం చేశాడు; ఋచీకుఁడు= మునికొడుకు; ఇట్లు వరించి= ఈ విధంగా సత్యవతిని పెండ్లి చేసుకొని; అధిక= ఎక్కువ; సమ్మదమునన్= సంతోషంతో; గృహస్థ ధర్మమ్ము= గృహస్థుడి విధులను; నడపుచున్+ఉండి= నిర్వహిస్తూ; సంతానకాంక్షన్= సంతానంమీద కోర్కెతో; ఆ+ఉవిదతోడన్= భార్యతో.

తాత్పర్యం: రాజు ఋచీకుడికి తన కూతురు సత్యవతి నిచ్చి వెంటనే పెండ్లి చేశాడు. ఆ ముని గృహస్థాశ్రమాన్ని సంతోషంతో నడుపుతూ, సంతానం కావాలనుకొని భార్యతో (అన్నాడు).

వ. 'నీకుం బుత్రోత్పత్తి గావింపం జాలు చరువు సంపాదించెద ననియెఁ; దొల్లి దానితల్లి దనయల్లుని మహానుభావం బెఱుంగుటంజేసి, యా సత్యవతితో 'నాకుం దనయుండు గలుగ, దయసేయునట్లుగాఁ బుణ్యకర్తయగు నీభర్తం బ్రార్థింపు' మనినయది గావున నమ్మాట యమ్ముద్దియ యతనికిం జెప్పిన నప్పరమధర్మపరుండు. 108

ప్రతిపదార్థం: పుత్ర+ఉత్పత్తి= కుమారుడి పుట్టుకను; కావింపన్+చాలు= కలిగించగలుగు; చరువు= హవ్యము, హోమం చేసే అన్నం; సంపాదించెదను= తెస్తాను; అనియెన్= అన్నాడు; తొల్లి= పూర్వం; దానితల్లి= సత్యవతి తల్లి; తన అల్లుని= తన అల్లుడియొక్క; మహానుభావంబు= మాహాత్మ్యం, ఎఱుంగుటన్+చేసి= తెలియటంచేత; ఆ సత్యవతితోన్= సత్యవతితో; నాకున్= నాకు; తనయుండు+కలుగన్= కుమారుడు పుట్టేట్లు; దయచేయు+అట్లుగాన్= అనుగ్రహించేటట్లుగా; పుణ్యకర్త+అగు= పుణ్యకార్యాలు చేసేవాడైన; నీ భర్తన్= నీ పెనిమిటిని; ప్రార్థింపుము= నాకు మారుగా వేడుము; అనిన+అది= అని అడిగింది; కావునన్= కాబట్టి; ఆ+మాట= ఆ పలుకు; ఆ+ముద్దియ= ఆ ముగ్ధ (నూతన వధువు); అతనికిన్ చెప్పినన్= అతడికి చెప్పగా; ఆ+పరమ= ఆ గొప్ప; ధర్మపరుండు= ధర్మబుద్ధి కలవాడు.

తాత్పర్యం: ఋచీకుడు (క్రొత్తగా కాపురానికి వచ్చిన) భార్యతో ఇట్లా అన్నాడు. 'నీకు సంతానా న్నివ్వగల చరువును సంపాదిస్తాను' అన్నాడు. అంతకుముందే సత్యవతి తల్లి - గాధి భార్య - తన అల్లుడు మహానుభావుడన్న సంగతి తెలిసినది కాబట్టి కూతురుతో చెప్పింది 'నాకు కొడుకును అనుగ్రహించుమని నీ భర్తతో చెప్పు' మని. ఆమె భర్తతో ఆ మాట చెప్పింది. ఆ ధర్మమూర్తి (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. రెండు చరువు లొనర్చి, యొక్కండు బ్రాహ్మ। ణత్వ మత్యుజ్జ్వలముగ నొనర్ప, నొకటి
రాజభావంబు నధిక తీవ్రముగఁ జేయఁ। జాలునట్లుగ నిజతపశ్శక్తిఁ జేసె. 109

ప్రతిపదార్థం: నిజ= (ఋచీకుడు) తనయొక్క; తపః= తపస్సుయొక్క; శక్తిన్+చేసి= శక్తితో (తపశ్శక్తివలన); రెండు చరువులు= రెండు హవ్యములు; ఒక్కండు= ఒకటి; అతి+ఉజ్జ్వలముగన్= మిక్కిలి వెలిగేటట్లుగా; బ్రాహ్మణత్వము= బ్రాహ్మణలక్షణం; ఒనర్పన్= చేయగా; ఒకటి= మరొకటి; రాజభావంబు= రాజత్వం; అధిక= మిక్కిలి; తీవ్రముగన్= తీవ్రంగా; చేయన్+చాలునట్లుగన్= చేయగలిగేటట్లు; చేసెన్= (రెండు చరువులను) నిర్మించాడు.

తాత్పర్యం: ఒకటి గొప్పగా వెలిగే బ్రాహ్మణత్వం కల కుమారుడి నిచ్చేదీ, మరొకటి తీవ్రమైన రాజభావం కల కొడుకును కల్పించేదీ అయిన రెండు చరువులను ఋచీకుడు నిర్మించాడు.

వ. ఇట్లు గావించి, యా రెంటిని సత్యవతికిం జూపి, తత్ప్రభావంబు వేఱువేఱ యుపన్యసించి, క్షాత్రంబైన చరువు మీతల్లి కిచ్చి, బ్రాహ్మం బయిన దాని నీవు పుచ్చికొనుము. ఋతుకాలంబున నీతల్లి యశ్వత్థంబును, నీ వుదుంబరంబును నాలింగనంబు సేసి భక్తితో మీమీ చరువు లుపయోగించునది' యని నియోగించె; వారి యుపయోగంబు సమయంబున విధివశంబునంజేసి. 110

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; కావించి= ఏర్పాటుచేసి; ఆ రెంటినిన్= ఆ రెండింటినీ; సత్యవతికిన్= సత్యవతికి; చూపి= చూపించి; తత్ ప్రభావంబు= వాని గొప్పశక్తిని; వేఱు, వేఱు+అ= విడివిడిగా; ఉపన్యసించి= వివరంగా చెప్పి; క్షాత్రంబు= క్షత్రియ సంబంధం; ఐన= అయిన; చరువున్= హవ్యమును; మీతల్లికిన్= మీ అమ్మకు; ఇచ్చి= ఒసంగి; బ్రాహ్మంబు= బ్రాహ్మణసంబంధం; అయినదానిన్= అయినచరువును; నీవు= నీవు; పుచ్చికొనుము= తీసుకో; ఋతుకాలంబునన్= నెలసరి ఋతువుకాలంలో; నీతల్లి= మీ అమ్మ; అశ్వత్థంబును= రావిచెట్టును; నీవు= నీవు; ఉదుంబరంబును= మేడిచెట్టును; ఆలింగనంబు+చేసి= కౌగిలించుకొని; భక్తితోన్= గౌరవంతో; మీమీ చరువులు= మీయిరువురకు విడిగా ఏర్పాటయిన హవ్యములను; ఉపయోగించునది= పుచ్చుకోండి; అని; నియోగించెన్= ఆజ్ఞాపించాడు; వారి ఉపయోగంబు సమయంబునన్= వారు అవి పుచ్చుకొనే వేళలో; విధివశంబునన్+చేసి= దైవం నిర్ణయం ప్రకారం.

తాత్పర్యం: భార్య కా రెండు చరువులను చూపించి, 'ఇది బ్రాహ్మణ కుమారుడిని, ఇది క్షత్రియుడైన కొడుకును ఇస్తుందని, దేని కది చెప్పి నీ తల్లికి క్షత్రియ చరువు నిచ్చి, నీవు బ్రాహ్మణ చరువును తీసికొని ఋతుకాలంలో నీవు మేడిచెట్టును, నీతల్లి రావిచెట్టును కౌగలించుకోవాలని చెప్పాడు. తరువాత వారుపయోగించేవేళ దైవవశాత్తుగా.

క. చరువులు, నమ్ముని చెప్పిన । తరువులు, వీడ్వడియె సుతకుఁ దల్లికి; నట్ల
య్యిరువురు నుపయోగింపఁగఁ । గరువులు దత్తత్ప్రకార కలితము లయ్యెన్. 111

ప్రతిపదార్థం: ఆ+ముని= ఆ ఋచీకుడు; చెప్పిన= చెప్పినటువంటి; చరువులున్= అన్నములు; తరువులున్= చెట్లూ; సుతకున్= కూతురుకు; తల్లికిన్= జననికిన్; వీడ్వడియెన్= మారిపోయాయి, తారుమారయ్యాయి; అట్లు= ఆ విధంగా; ఆ+ఇరువురు= ఆ ఇద్దరు; ఉపయోగింపఁగన్= వాడుకోగా; కరువులు= గర్భాలు; తత్+ప్రకార= ఆయా విధంగా; ముని చెప్పినట్లుగా; కలితములు= కూడినవి; అయ్యెన్= అయినవి.

తాత్పర్యం: ఋచీకుడు చెప్పిన చరువులూ చెట్లూ తల్లీ కూతుళ్ళకు మారిపోగా, ఆ ఇద్దరకు గర్భాలు కూడా ఆ విధంగానే తారుమారయ్యాయి.

వ. దివ్యబోధ మహనీయుండు గావున. 112

ప్రతిపదార్థం: దివ్య= దేవతాసంబంధమైన; బోధ= జ్ఞానం చేత; మహనీయుండు= మహానుభావుడు; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: ఆ ముని దివ్యజ్ఞానం కల మహాత్ముడు కనుక. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. చ్యవననందనుండు సత్యవతీ గర్భ । భంగి సూచి, 'యకట! బ్రాహ్మణుండు
గాఁడు, తరుణి! నీదు కడుపులోపలి బిడ్డ । క్రూరుఁడైన రాచకొడుకు గాని.' 113

ప్రతిపదార్థం: చ్యవన నందనుండు= చ్యవనుడి కొడుకు (ఋచీకుడు); సత్యవతీ= సత్యవతియొక్క; గర్భభంగి= గర్భపద్ధతి; చూచి= పరీక్షించి; తరుణి!= సత్యవతీ! (స్త్రీ); నీదు= నీయొక్క; కడుపులోపలి= కడుపులో ఉన్న; బిడ్డ= పిండం; బ్రాహ్మణుండు కాఁడు; క్రూరుఁడు+ఐన= కఠినుడైన; రాచకొడుకుగాని= క్షత్రియకుమారుడు తప్ప.

తాత్పర్యం: ఋచీకుడు తన భార్య గర్భపద్ధతిని పరీక్షించి 'తరుణీ! నీ కడుపులో పెరిగే బిడ్డ దుర్మార్గుడైన రాచకొడుకు తప్ప బ్రాహ్మణ కుమారుడు కాడు'.

వ. అని పలికి, చరుతరువ్యత్యాసంబున నట్లగుట దేటపడం జెప్పిన, నబ్బోటి యత్యంత విషాదవేదనాదూయమాన మానసయై. 114

ప్రతిపదార్థం: అని; పల్కి= చెప్పి; చరు, తరు, వ్యత్యాసంబునన్= చరువు, చెట్టు తారుమారు కావటం వలన; అట్లు= ఆ విధంగా; అగుటన్= కావటం; తేటపడన్= స్పష్టంగా; చెప్పినన్= చెప్పగా; ఆ+బోటి= ఆమె (బోటి = స్త్రీ); అత్యంత= మిక్కిలి; విషాద= దుఃఖంతో; దూయమాన= బాధపడుతున్న; మానస+ఐ= మనస్సు కలదై.

తాత్పర్యం: చరువులు, చెట్లు తారుమారు కావటంవలన ఇట్లా జరిగిందని చెప్పటం విని ఆమె దుఃఖంతో బాధపడుతున్న మనస్సు కలదై.(తరువాతి పద్యంతో అన్వయం)

క. 'నీకుం బుట్టెడు కొడుకు వి । వేకనిధీ! బ్రాహ్మణత్వ విరహితుఁ డైనన్
లోకము మెచ్చునె? యట్టులు । గాకుండఁగఁ జేయు తపము గౌరవ మొప్పన్. 115

ప్రతిపదార్థం: వివేకనిధీ!= దివ్యజ్ఞానవంతుడా!; నీకున్= నీవంటిమునికి; పుట్టెడు= జన్మించే; కొడుకు; బ్రాహ్మణత్వ విరహితుఁడు+ఐనన్= బ్రాహ్మణజాతిలక్షణాలు లేనివాడైతే; లోకము మెచ్చునె?= జనం మెచ్చుకొంటుందా? అట్టులు= ఆ విధంగా; కాకుండఁగన్= కాని విధంగా; తపము= నీ తపస్సు; గౌరవము= గురుత్వం, గొప్పతనం; ఒప్పన్= వెల్లడి కాగా; చేయు= చేయుము.

తాత్పర్యం: నీవు జ్ఞానసంపన్నుడవు. నీకు పుట్టే కొడుకు బ్రాహ్మణత్వం కోల్పోయినవాడైతే లోకం మెచ్చుకోదు. కనుక నీవు తపస్సు, గొప్పతనం స్పష్టపడేటట్లుగా అట్లా కాకుండా చేయుము!

తే. నాకు నివ్వర మి 'మ్మని నమ్ర యగుడు, । 'వీడు బ్రాహ్మణుఁ డగుఁ గాక, వీని కొడుకు
నందు రాజత్వ సంపద యతిశయిల్లు' । ననియెఁ గరుణార్ద్రచిత్తుఁడై యత్తపస్వి. 116

ప్రతిపదార్థం: ఈ+వరము= ఈ వరం; నాకున్ఇమ్ము+అని= నాకు ఇమ్మని; నమ్ర= నమస్కరించుటకై వంగినది; అగుడున్= కాగా; ఆ తపస్వి= ఆ ఋచీకుడు; కరుణా= దయతో, ఆర్ద్ర= మెత్తబడిన; చిత్తుఁడు+ఐ= మనస్సు కలవాడై; వీఁడు= నీ కొడుకు; బ్రాహ్మణుఁడు+అగున్+కాక!; వీని కొడుకు= నీ కొడుకు యొక్క కొడుకు; రాజత్వ సంపద= రాజలక్షణాల సమూహంతో; అతిశయిల్లున్= ప్రకాశిస్తాడు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'నాకు ఈ వరం ప్రసాదించు'మని నమస్కరించగా ఆ ముని దయతో ఇట్లా అన్నాడు. 'వీడు బ్రాహ్మణుడౌతాడు. కాని వీడికొడుకు రాజలక్షణాలు కలవా డౌతాడు' అని వరమిచ్చాడు.

వ. అ ట్లమ్ముని యావహించుట కతంబున సత్యవతీ పుత్త్ర పౌత్త్రులైన జమదగ్ని పరశురాములు గ్రమంబున బ్రహ్మక్షత్త్ర తేజోవిరాజితు లయిరి; గాధి భార్యకు జనియించి విశ్వామిత్రుండు. 117

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; ఆ+ముని= ఆ ఋచీకుడు; ఆవహించుట= ఆవరించటం; కతంబునన్= కారణంగా; సత్యవతీ పుత్త్రపౌత్త్రులైన= సత్యవతికి కొడుకు, మనుమలైన; జమదగ్ని పరశురాములు; క్రమంబునన్= వరుసగా; బ్రహ్మ క్షత్త్ర= బ్రాహ్మణ, క్షత్రియ; తేజోవిరాజితులు= తేజస్సుతో ప్రకాశించినవారు; అయిరి= అయ్యారు; గాధిభార్యకున్ జనియించి= గాధి భార్యకు పుట్టి; విశ్వామిత్రుండు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ విధంగా ఆ ముని ఆనతిచ్చిన విధంగా సత్యవతికి బ్రాహ్మణుడైన జమదగ్ని కొడుకుగా, క్షత్రియ తేజస్సుతో పరశురాముడు మనుమడై పుట్టాడు. గాధిభార్యకు విశ్వామిత్రుడు జన్మించాడు.

విశేషం: విశ్వామిత్రకథ కిది మొదలు. అతడు రాజై బ్రాహ్మణత్వం పొందటానికి హేతువుగా చెప్పబడిన పూర్వకథ. ఆవహించటమంటే తన తేజస్సుతో సంతానాన్ని ఆవరించి వారి భవిష్యత్తులు తారుమారు చేయటం. 113వ పద్యంలో చెప్పిన క్రూరుడైన రాచకొడుకును మనుమడిగా మార్చటం.

క. నరనాథుండై యుండియుఁ, । జరు తరు గుణ సంక్రమమున సద్బ్రాహ్మణతా
స్ఫురణంబు వడసెఁ, దపమును । గరమధికం బతనియందుఁ గలిగెఁ గుమారా!'. 118

ప్రతిపదార్థం: కుమారా!= నాయనా! (ధర్మరాజా!); నరనాథుండు+ఐ= రాజై (ప్రజలకు పాలకుడై), ఉండియున్= ఉండికూడా; చరు= చరువుయొక్క; తరు= చెట్టుయొక్క; గుణసంక్రమమునన్= గుణాల తారుమారుచేత; సత్=మంచి; బ్రాహ్మణతా= బ్రాహ్మణత్వంయొక్క; స్ఫురణంబు= స్ఫురణ (మనస్సును ప్రేరేపించే సూక్ష్మస్వభావం); పడసెన్= పొందాడు; అతనియందున్= అతడిలో; తపమును= తపస్సుకూడా; కరము= మిక్కిలి; అధికంబు= ఎక్కువ; కలిగెన్= కలిగింది.

తాత్పర్యం: ధర్మరాజా! రాజై కూడా చరుతరు గుణాల తారుమారుచేత అతడిలో బ్రాహ్మణత్వ స్ఫురణ, తపశ్శక్తి మిక్కిలి ఎక్కువగా కలిగాయి'.

విశేషం: రాజు కావటం రాజుకొడుకైనందున, ఋషి కావటం ఋచీకుడి వరంవలన. ఇది లోపల స్ఫురణ. బూడిదలో నిప్పురవ్వవలె గాలికి మండి మంటలైనట్లు అణగిఉన్న స్ఫురణ క్రమంగా ఋషిత్వంగా పరిణమించింది.

ఇంతటితో ఈ కథ త్రెంచివేయటం జరిగింది. తర్వాతి కథ రామాయణంలో, భారతంలో ఇతర పర్వాలలో చెప్పబడింది. ఏ కథ ఎంతవరకు, ఎక్కడ చెప్పాలో కవి చేసికొన్న పథకాన్ని అనుసరించి ఉంటుంది. వ్యాసమహర్షి భారత రచనా ప్రణాళికలో ఇట్లాంటి విశేషాలు చాలా కన్పిస్తాయి.

వీతహవ్యం డనురాజునకు బ్రాహ్మణత్వంబు గలిగిన ప్రకారము (సం. 13-8-1 (కుంభ)

వ. అనిన విని, ధర్మజుండు 'వీతహవ్యం డనురాజు బ్రాహ్మణత్వంబుఁ బడసె నని విందు; నత్తెఱం గెఱింగింపు' మనవుడు నతనికి శంతనునందనుం డిట్లనియె; 'మనుసంభవుఁడైన శర్యాతి యన్వయంబున హైహయుండను నొక్క జనపతి జనియించి వత్సదేశాధీశుండై పొలిచె, నాతనికి వీతహవ్య నామంబునుం గలిగియుండుఁ; దదీయభార్యలు పదుండ్రు; వారలు వీరులుం బ్రబలులు నగు పుత్త్రుల నూర్వురఁ గాంచి; రమ్మహారథులు విక్రమ కుతూహలంబున. 119

ప్రతిపదార్థం: అనినన్ విని= అని భీష్ముడు పలుకగా ఆలకించి; ధర్మజుండు; వీతహవ్యుండు+అనురాజు= వీతహవ్యుడనే నరపాలుడు; బ్రాహ్మణత్వంబున్= బ్రహ్మణుతనమును; పడసెన్= పొందెను; అనివిందున్= అని విన్నాను; ఆ+తెఱంగు= ఆ విధం; ఎఱింగింపుము= తెలుపుము; అనవుడున్= అని ధర్మజుడు అడిగినమీదట; అతనిన్= ధర్మపుత్రునకు; శంతనునందనుండు= శంతనుని కొడుకు భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా పలికాడు; మనుసంభవుఁడు+ఐన=

మనువు వలన జన్మించిన; శర్యాతి= శర్యాతి అనువానియొక్క; అన్వయంబునన్= వంశంలో; హైహయుండు+అను= హైహయుడనే; ఒక్కజనపతి= ఒకరాజు; జనియించి= పుట్టి; వత్సదేశ+అధి+ఈశుండు+ఐ= వత్సదేశమునకు రాజై; పొలిచెన్= కీర్తి పొందాడు; అతనికిన్= ఆ హైహయునకు; వీతహవ్యనామంబునున్= వీతహవ్యుడనే పేరు కూడా; కలిగి ఉండున్= లభించి ఉండేది; తదీయ భార్యలు= అతనియొక్క పెండ్లాలు; పదుంద్రు= పదిమంది; వారలు= ఆ వీతహవ్యుని పెండ్లాలు; వీరులున్= శూరులూ; ప్రబలులున్+అగు= మిక్కిలి బలము గల్గిన; నూర్వురన్+పుత్త్రులన్= వందమంది కొడుకులను; కాంచిరి= పొందిరి; ఆ+మహారథులు= ఆ గొప్పవీరులు; విక్రమ కుతూహలంబునన్= శౌర్యోత్సాహంతో;

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు 'వీతహవ్యు డనేరాజు బ్రాహ్మణత్వాన్ని పొందా డని వింటాం. ఆ సంగతి తెలుపుము' అని అడుగగా అతడితో భీష్ముడిట్లా అన్నాడు. మనువుకు పుట్టిన శర్యాతివంశంలో హైహయుడు అనే రాజు పుట్టి, వత్సదేశాధీశుడై వెలుగొందాడు. అతడికి వీతహవ్యుడు అనే మరొకపేరు కూడా ఉండేది. అతడి పదిమంది భార్యలు వీరులైన నూరుమంది పుత్రులను కన్నారు. ఆ మహారథులు పరాక్రమ ప్రదర్శన కుతూహలంతో.(తరువాతి పద్యంతో అన్వయం)

సీ. హర్యశ్వుఁ గాశీశు నాజికిఁ బిలిపించి, । యొక్క యుమ్మడి లావు నుక్కు మెఱయఁ
బొదివి చంపిరి, వానిపుత్త్రుండు పట్టంబు । గట్టె, సుదేవుండు గ్రమ్మఱంగ
నురవడి నరిగి, యద్ధరణీశు ననిఁ దెగఁ । జూచి, రాహైహయసుతులు గడిమి,
నాతని నందనుఁ డగు దివోదాసుండు । రాజైన నమ్మహీరమణుమీఁద

తే. నడచి, వారు ఘనరణం బొనరించి సై । న్యంబుఁ ద్రుంచి,రోడి యతఁడు వాఱి,
ప్రకటసంయమిని భరద్వాజ మునిఁ గని । యధికభక్తి నతని నాశ్రయించి. 120

ప్రతిపదార్థం: హరి+అశ్వున్= ఆ పేరుగలరాజును (పచ్చని గుర్రాలు కలవాడు); కాశీ+ఈశున్= కాశీరాజును; ఆజికిన్= యుద్ధానికి; పిలిపించి= పిలిపింపజేసి; ఒక్క ఉమ్మడిన్= ఒకేసారి హఠాత్తుగా; లావున్= బలం; ఉక్కు= శక్తి; మెఱయన్= ప్రకాశించగా; పొదివి= క్రమ్ముకొని, మీదపడి; చంపిరి; వానిపుత్త్రుండు= వాడి కొడుకు; సుదేవుండు= సుదేవుడు; పట్టంబున్= రాజ్యపాలనను; కట్టెన్= కట్టుకొన్నాడు; క్రమ్మఱంగన్= మరల; ఆ హైహయసుతులు= ఆ హైహయుడి కొడుకులు; ఉరవడిన్= వేగంగా; అరిగి= వెళ్ళి; ఆ+ధరణీ+ఈశున్= ఆ భూమికి పతిని, సుదేవుడిని; అనిన్= యుద్ధంలో; కడిమిన్= మగతనంతో, పౌరుషంతో; తెగన్= చచ్చేటట్లు; చూచిరి= చేశారు (తెగఁజూచిరి= చంపారు); ఆతని= సుదేవుడి; నందనుఁడు= కొడుకు; అగు= అయిన; దివోదాసుండు= ఆ పేరుగలవాడు; రాజు+ఐనన్= రాజు కాగా; ఆ+మహీ+రమణుమీఁదన్= ఆ భూమికి పతిఅయిన వాడిమీద; వారు= ఆ హైహయసుతులు; నడచి= దండెత్తి; ఘన= గొప్ప; రణంబు= యుద్ధం; ఒనరించి= చేసి; సైన్యంబున్= సేనను; త్రుంచిరి= చంపారు; అతఁడు= ఆ దివోదాసుడు; ఓడి= ఓడిపోయి; పాఱి= పారిపోయి; ప్రకట= గొప్ప; సంయమినిన్= ప్రసిద్ధుడైన మునిని (ఇంద్రియనిగ్రహం కలవానిని); భరద్వాజమునిన్= భరద్వాజుడన్న మునిని; కని= దర్శించి; అధిక భక్తిన్= గొప్పభక్తితో; అతనిన్+ఆశ్రయించి= ఆతని ఆశ్రయం పొంది.

తాత్పర్యం: కాశీరాజైన హర్యశ్వుడిని యుద్ధానికి పిలిపించి ఒకేసారి అందరూ పైబడి పరాక్రమంతో చంపారు. అతడి తరువాత అతడి కొడుకు, సుదేవుడనే వాడు పట్టం కట్టుకోగా, మరల అతడినీ చంపారు. అతడి కొడుకు దివోదాసు డనేవాడు రాజైనాడు. వాడి మీదకు పోయి మరల వాడినీ ఓడించగా వాడు పారిపోయి ప్రసిద్ధమునీశ్వరుడైన భరద్వాజమునిని ఆశ్రయించాడు.

క. తనకులము వీతహవ్యుని । తనయులచేఁ ద్రుంపఁబడుట దగ నెఱిఁగింపన్
విని, యతఁ 'డోడకు, నీ కొక । తనయునిఁ గల్పింతు రిపువిదారణ నిపుణున్'. 121

ప్రతిపదార్థం: తనకులము= తన వంశమంతా; వీతహవ్యుని తనయులచేన్= వీతహవ్యుని కొడుకులచేత; త్రుంపన్+పడుటన్= చంపబడటం; తగన్= స్పష్టంగా; ఎఱిఁగింపన్= తెలుపగా; అతఁడు= ఆ భరద్వాజుడు; విని= ఆలకించి; ఓడకు= భయపడకు; నీకున్= నీకు; ఒక తనయునిన్= ఒక కొడుకును; రిపు= శత్రువులను; విదారణ= చంపటంలో; నిపుణున్= నేర్పరిని; కల్పింతున్= సృష్టిస్తాను.

తాత్పర్యం: తన వంశాన్ని వీతహవ్యుడి కొడుకులు చంపటం విన్పించగా ఆ భరద్వాజముని విని 'భయపడకుము. నీకొక శత్రుసంహారిఅయిన కొడుకును సృష్టిస్తాను'. (అన్నాడు)

వ. అని పుత్త్రకామేష్టి సేసినం బ్రభవించిన పుత్త్రుం డప్పుడ పదుమూఁడేండ్ల ప్రాయంబువాఁడయ్యెఁ బ్రతర్దన నామధేయుం డక్కుమారుం డమ్మహాత్ముని యనుగ్రహంబున వేదంబులు ధనుర్వేదంబును వేగంబ యధిగమించి. 122

ప్రతిపదార్థం: అని= అనిపల్కి; పుత్రకామ+ఇష్టి= పుత్రులను కోరిచేసే యజ్ఞం; చేసినన్+చేయగా; ప్రభవించిన= పుట్టిన; పుత్త్రుండు; పదుమూడేండ్ల ప్రాయంబువాఁడు= పదమూడుసంవత్సరాల వయసు కలవాడు; అయ్యెన్; ప్రతర్దన= ప్రతర్దనుడన్న; నామధేయుండు= పేరుగలవాడు; ఆ+కుమారుండు= ఆ పుత్రుడు; ఆ+మహాత్ముని= ఆ మహానుభావుడి; అనుగ్రహంబునన్= దయతో; వేదంబులు= వేదాలు; ధనుః+వేదంబును= విలువిద్యను; వేగంబు+అ= త్వరగా; అధిగమించి= అభ్యసించి (పొంది).

తాత్పర్యం: అని పుత్రుడిని కలిగించే యజ్ఞం చేసి ప్రతర్దనుడనే పేరుగల కొడుకును సృష్టించాడు. అతడు పుట్టటం తోటే పదమూడేళ్ళవాడుగా పుట్టి వేదాలను, విలువిద్యను నేర్చాడు.

చ. మునికృప నావహింపఁగ సముజ్జ్వల తేజముఁ బొంది ప్రీతిమై
జనకుఁడు యౌవరాజ్యపద సంగతుఁ జేసినఁ బేర్చి యవ్విభుం
డనుమతి సేయ నెత్తి చని, యాజిముఖంబున వీతహవ్య నం
దనతతి నెల్ల గీటడఁచె దర్ప మెలర్పఁగ నశ్రమంబునన్. 123

ప్రతిపదార్థం : ముని కృపన్= ముని దయతో; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశించే; తేజమున్= ప్రకాశం, తేజస్సు; ఆవహింపఁగన్= ఆవరింపగా (క్రమ్ముకొనగా); పొంది= లభ్యమైన దానిని తీసికొని; జనకుఁడు= తండ్రి; ప్రీతిమైన్= ప్రేమతో, సంతోషంతో; యౌవరాజ్య పదసంగతున్= యువరాజపట్టస్థితి కలవాడినిగా; చేసినన్= చేయగా; పేర్చి= విజృంభించి; ఆ+విభుండు= ఆ రాజు (తండ్రి); అనుమతిచేయన్= ఆజ్ఞాపించగా; ఎత్తి= దండెత్తి; చని= పోయి; ఆజిముఖంబునన్= యుద్ధరంగంలో; వీతహవ్య= వీతహవ్యుడి యొక్క; నందన= కుమారుల; తతిన్= సమూహాన్ని; ఎల్లన్= అందరినీ; దర్పము= గర్వం; ఎలర్పఁగన్= ప్రకాశించగా; అశ్రమంబునన్= తేలికగా; గీటడఁచెన్= చంపాడు.

తాత్పర్యం: మునిదయతో ఆవరించిన తేజస్సును పొంది, తండ్రి తనను యువరాజును చేసి ఆజ్ఞాపించగా దండెత్తి పోయి వీతహవ్యుడి కొడుకుల నందరినీ అవలీలగా శౌర్యంతో చంపాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తనయులఁ దెగటార్చి వడిం । దనమీఁదం గవిసినం బ్రతర్దను శౌర్యం

బున కలికి వీతహవ్యుం । దనయము వెసఁ బాఱె భృగువునాశ్రమమునకున్. 124

ప్రతిపదార్థం: తనయులన్= కొడుకులను; తెగటార్చి= చంపి; వడిన్= వేగంగా; తనమీఁదన్= తనమీదకు; కవిసినన్= దూకగా; వీతహవ్యుండు= రాజు; ప్రతర్దను శౌర్యంబునకున్= ప్రతర్దనుని విక్రమమునకు; అలికి= భయపడి; అనయమున్= మిక్కిలి; వెసన్= వేగంగా; భృగువు నాశ్రమమునకున్= భృగుమహర్షి ఆశ్రమానికి; పాఱెన్= పరుగెత్తాడు.

తాత్పర్యం: ప్రతర్దనుడు కొడుకులనందరినీ చంపి వీతహవ్యుడి మీదకు దూకగా, అతడు భయపడి భృగుమహర్షి ఆశ్రమానికి పారిపోయాడు.

ఆ. పాఱి, భీతి దోఁపఁబల్క, నమ్ముని తన । దైన శిష్య సమితి లోన నునిచె

నతనిఁ, గాశిరాజసుతుఁడును, వెనువెంటఁ । దగిలి యచటి కరిగి, తగువిధమున. 125

ప్రతిపదార్థం: పాఱి= పరుగెత్తి; భీతి= భయం; తోఁపన్= స్పష్టపడేటట్లు; పల్కన్= పలుకగా; ఆ+ముని= ఆ ముని; అతనిన్= వీతహవ్యుడిని; తనదైన= తనయొక్క; శిష్యసమితిలోనన్= శిష్య సమూహం లోపల; ఉనిచెన్= దాచాడు; కాశిరాజసుతుఁడును= కాశీరాజు కొడుకు ప్రతర్దనుడు కూడా; వెనువెంటన్= అతని వెనుకనే; తగిలి= వెంబడించి; అచటికిన్= ఆ భృగుని ఆశ్రమానికి; అరిగి= వెళ్ళి; తగువిధమునన్= తగిన పద్ధతిగా.

తాత్పర్యం: పారిపోయి భయం తోపగా పలికినంతనే ఆ ముని అతడిని తన శిష్య సమూహంలో దాచాడు. కాశీరాజు కొడుకు కూడా వెన్నంటి ఆశ్రమానికి వచ్చి తగురీతిగా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. మునిపతికిని వినయము సే । సిన నిట రాకకుఁ గతంబు సెప్పు మనియె న

జ్జనవంద్యుఁ డక్కుమారుం । 'డనఘా! మధ్యస్థవృత్తివై వినవలయున్'. 126

ప్రతిపదార్థం: మునిపతికిని= మునిరాజునకు; వినయముచేసినన్= నమస్కరించగా; ఆ+జనవంద్యుఁడు= ఆ జనులకు నమస్కరించ దగిన మునిరాజు; ఇట రాకకున్= ఇచటికి వచ్చుటకు; కతంబు= కారణం; చెప్పుము+అనియెన్= చెప్పుము అన్నాడు; ఆ+కుమారుండు= ఆ కాశీరాజు కొడుకు; అనఘా!= పాపం లేనివాడా!; మధ్యస్థవృత్తివై= నడుమసాక్షివై; వినవలయున్= వినాలి.

తాత్పర్యం: మునిశ్రేష్ఠుడికి నమస్కరించినంతనే ఆయన 'నీ విక్కడకు వచ్చిన కారణ మే?'మని అడిగాడు. ఆ రాజకుమారుడు 'మహాత్మా! నీవు మా మధ్య సాక్షివై వినాలి'.

వ. అని పలికి, తమకులంబు వీతహవ్యుని కొడుకులచేత నశించిన విధంబును, దాను వారల నందఱ ద్రుంచుట యును, వీతహవ్యుం డాహవంబునం దనకు నోడి పాఱుటయును జెప్పి, 'మునీంద్రా! యారా జిటవచ్చె; నాతనిం బొలియించుటకై వచ్చితి' ననిన నత్తపోధనసత్తముండు. 127

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; తమకులంబు= తమ వంశం; వీతహవ్యుని కొడుకులచేతన్= వీతహవ్యుని కుమారులచేత; నశించిన విధంబును= నాశనమైన పద్ధతిని; తాను= ప్రతర్దనుడనే పేరుగల తాను; వారలన్+అందఱన్= వారినందరినీ; ద్రుంచుటయును= చంపటాన్నీ; వీతహవ్యుండు= వీతహవ్యుడు; ఆహవంబునన్= యుద్ధంలో; తనకున్= తనకు; ఓడి=

పరాజయం పొంది; పాఱుటయును= పారిపోవటాన్నీ; చెప్పి= తెలియజేసి; ముని+ఇంద్రా!= మునులలో శ్రేష్ఠుడైనవాడా! ఆరాజు= ఆ వీతహవ్యుడనే నరపతి; ఇటన్= ఇచటికి; వచ్చెన్= వచ్చాడు; ఆతనిన్= అతనిని; పొలియించుటకై= రూపుమాపటానికై; వచ్చితిని= వచ్చాను; అనినన్= అని చెప్పగా; ఆ తపస్+ధన, సత్తముండు= తపస్సే ధనంగా గల గొప్పవాడైన ఆ భృగుమహర్షి.

తాత్పర్యం: అని చెప్పి తన వంశమంతా వీతహవ్యుడి కొడుకులచేతిలో నాశనం కావటం, తాను వాళ్ళ నందరినీ చంపటం, వీతహవ్యుడు యుద్ధంలో తనచేత ఓడిపోయి పారిపోవటం చెప్పి 'మునీంద్రా! ఆ రాజిక్కడ దాక్కున్నాడు కనుక అతడిని చంపటానికై వచ్చాను' అని చెప్పగా విని ఆ మునిశ్రేష్ఠుడు (అన్నాడు).

క. 'విను మిచ్చట నృపకుల సం । జనితుఁడు, లేఁ; డింతయుం బ్రశస్త మహీదే
వ నికాయమ; కనుఁగొను'మని । తన శిష్య ప్రతతిఁ జూపె దయ చిగురొత్తన్. 128

ప్రతిపదార్థం: వినుము= (విషయం చెప్పుతాను జాగ్రత్తగా) వినుము; ఇచ్చటన్= ఇక్కడ; నృపకుల= రాజవంశంలో; సంజనితుఁడు= పుట్టినవాడు; లేఁడు; ఇంతయున్= వీరంతా; ప్రశస్త= శ్రేష్ఠమైన; మహీదేవ= భూదేవతల, బ్రాహ్మణులయొక్క; నికాయము+అ= సమూహమే; కనుఁగొనుము= చూడుము; అని= అట్లాచెప్పి; దయ= కారుణ్యం; చిగురు+ఒత్తన్= పల్లవించగా, చిగురించగా; తన శిష్య= తన శిష్యులయొక్క; ప్రతతిన్= సమూహాన్ని, చూపెన్= చూపించాడు.

తాత్పర్యం: 'చెప్పుతున్నాను వినుము. ఇక్కడ రాజవంశీయు డెవడూ లేడు. ఉన్న వారంతా బ్రాహ్మణులే. చూడు' మని దయతో వీతహవ్యుడితో కూడియున్న తన శిష్యులను చూపించాడు.

వ. చూపినం జూచి. 129

తాత్పర్యం: అలా చూపించగా తాను పరీక్షగా చూచి.

ఆ. అతఁడు నగుచు, భృగుని యడుగుల కెఱఁగి, మ । హాత్మ! దీన నేఁ గృతార్థవృత్తి
నైతిఁ బగతు నిట్లు జాతికిం బెడఁ బాపి । గాసి గాఁగఁ జేయఁగంటిఁ గాన. 130

ప్రతిపదార్థం: అతఁడు= ఆ కాశీరాజు కొడుకు; నగుచున్= నవ్వుతూ; భృగుని అడుగులకున్= భృగుమహర్షి పాదాలకు; ఎఱఁగి= నమస్కరించి; మహాత్మ!= మహానుభావా!; దీనన్= దీనితో; నేన్= నేను; కృత+అర్థవృత్తిన్+ఐతిన్= నెరవేరిన ప్రయోజనం కలవాడనైనాను; ఇట్లు= ఈ విధంగా; పగతున్= శత్రువును; జాతికిన్= తన జాతికి; పెడన్+పాపి= దూరం చేసి; గాసికాఁగన్= దుఃఖపడువానినిగా; చేయన్ కంటిన్= చేయగలిగాను; కానన్= కనుక.

తాత్పర్యం: అతడు నవ్వి మహర్షి పాదాలకు నమస్కరించి, 'మహాత్మా! నేను దేనికొరకు ఇంతకాలం ప్రయత్నించానో, ఆ ప్రయోజనం నెరవేర్చుకోగలిగాను. అదేమంటే క్షత్రియుడైన వీతహవ్యుడిని అతడి జాతికి దూరం చేసి బాధపడేట్లు చేయగలిగాను.

క. కలుగునె యమోఘ మగు నీ । పలుకున, కన్యతత్వ? మేను బనివినియెద, న
న్నలఘు కృపఁ జూడు మని తగఁ । బలికిన, ముని ప్రీతి నానృపతి వీడ్కొలిపెన్. 131

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అమోఘము= వమ్ముకాని; నీపలుకునకున్= నీ వాక్కునకు; అనృతత్వము= అసత్యం; కలుగునె?= అంటునా? ఏను= నేను; పని వినియెదన్= సెలవు తీసికొంటాను; నన్నున్= నన్ను; అలఘుకృపన్= గొప్పదయతో; చూడుము= రక్షించుము; అని; తగన్= తగునట్లుగా (పెద్దలతో మాట్లాడేపద్ధతిగా); పలికినన్= పలుకగా; ముని= భృగుమహర్షి; ప్రీతిన్= ప్రేమతో; ఆ నృపతిన్= ఆ రాజును; వీడ్కొలిపెన్= పంపాడు.

తాత్పర్యం: మహాత్మా! నీ మాటకు అసత్యదోష మంటుతుందా? ఇక నేను సెలవు తీసికొంటాను. నన్ను దయతో చూడుము' అని చక్కగా (వినయంగా) చెప్పేసరికి ముని సంతోషంతో ఆ రాజును పంపాడు.

ఆ. వీతహవ్యుఁడును మహాతపస్సందీప్తుఁ । డైన యమ్మునీంద్రు నప్రతర్క్య
భంగి భాషణముల బ్రాహ్మణుఁ డై గృత్స । మద సమాఖ్యుఁ గాంచె మహితసుతుని. 132

ప్రతిపదార్థం: వీతహవ్యుఁడును= వీతహవ్యుడు కూడా (తర్వాత); మహాతపః= గొప్ప తపస్సుచేత; సందీప్తుఁడు+ఐన= ప్రకాశించే; ఆ+ముని+ఇంద్రు= ఆ మునిశ్రేష్ఠుడియొక్క; అప్రతర్క్య= తర్కించరాని; భంగి= పద్ధతిగల; భాషణములన్= మాటలతో; బ్రాహ్మణుఁడు+ఐ= విప్రుడై; మహిత= గొప్ప; సుతునిన్= కొడుకును; గృత్సమద= గృత్సమదుడన్న; సమాఖ్యున్= పేరుగలవాడిని; కాంచెన్= కన్నాడు, పొందాడు.

తాత్పర్యం: తరువాత వీతహవ్యుడు కూడా మహాతపశ్శక్తి గల ఆ మునీంద్రుడి గొప్ప మాటల ప్రభావంతో బ్రాహ్మణుడై గృత్సమదు డనే కొడుకును కన్నాడు.

వ. తత్పుత్రపౌత్త్ర క్రమంబున సుతేజసుండును, వర్చసుండును, నిహవ్యుండును, వితత్యుండును, సత్యుండును, సంతుండును, శ్రవసుండును, దమసుండును, బ్రకాశుండును, వాగీంద్రుండును, బ్రమతియును, రురుండును, సముదుండును, శునకుండును, శౌనకుండును నన మహాద్విజులు జన్మించి; రిట్లు విద్యా మౌక్తిక శ్రేణి వంశంబగు మునివంశంబునకు మూలం బయి యవ్వీతహవ్యుండు భవ్యకీర్తి వడసెఁ; బాండవాగ్రజా! యింక నెయ్యది యడిగెద వడుగు' మనుటయు, నతండు 'దైవంబును, బౌరుషంబును నను రెంటియందు నెయ్యది యధికంబు సెప్పు' మనిన నప్పురుషవరుండు 'దొల్లి' యిట్లు వసిష్ఠుండు బ్రహ్మ నడిగిన నమ్మహాత్ముం డుపదేశించిన వాక్యంబుల యర్థంబు లుపన్యసించెద నాకర్ణింపు' మని యిట్లనియె. 133

ప్రతిపదార్థం: తత్= అతడియొక్క; పుత్త్రపౌత్త్ర = కొడుకులు, మనుమల; క్రమంబునన్= వరుసలో; సుతేజసుఁడు, వర్చసుఁడు, నిహవ్యుఁడు, వితత్యుఁడు, సత్యుఁడు, సంతుఁడు, శ్రవసుఁడు, దమసుఁడు, ప్రకాశుఁడు, వాగీంద్రుఁడు, ప్రమతి, రురుఁడు, సముదుఁడు, శునకుఁడు, శౌనకుఁడు; అనన్= అన్న పేర్లుగల; మహాద్విజులు= మహాబ్రాహ్మణులు; జన్మించిరి= పుట్టిరి; ఇట్లు= ఈ విధంగా; విద్యా= విద్యలన్న (14 శాస్త్రవిద్యలు); మౌక్తిక= ముత్యాల; శ్రేణి= వరుస; సమూహం; వంశంబు= కులం; అగు= అయిన; మునివంశంబునకున్= ముని కులానికి; మూలంబు+అయి= మొదలై; ఆ+వీతహవ్యుండు= ఆ వీతహవ్యుడు; భవ్య= శ్రేష్ఠమైన; కీర్తిన్= పేరు ప్రఖ్యాతులను; పడసెన్= పొందాడు; పాండవ+అగ్రజా! పాండవులలో తొలుత పుట్టిన ధర్మజా! ఇంకన్= మరి; ఏ+అది= (ఎయ్యది)= ఏది; అడిగెదవు= చెప్పుమందువో; అడుగుము= చెప్పుము; అనుటయున్= అనిపల్కగా; అతండు= ధర్మజుడు; దైవంబును= అదృష్టం; పౌరుషంబును= మానవప్రయత్నం; (ఇది మనిషియొక్క కృషి దానిఫలితమిచ్చే దాని పేరు దైవం. అది కన్పించదు); అను రెంటియందున్= అనే రెండింటిలో; ఏ+అది(ఎయ్యది)= ఏది;

అధికంబు= గొప్పది; చెప్పుము= తెల్పుము; అనినన్= అని అడుగగా; ఆ+పురుషవరుండు= ఆ మానవశ్రేష్ఠుడు, భీష్ముడు; తొల్లి= పూర్వం; ఇట్లు= ఈ ప్రకారం; వసిష్ఠుండు= వసిష్ఠుడు; బ్రహ్మన్= బ్రహ్మదేవుని; అడిగినన్= ప్రశ్నించగా; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; ఉపదేశించిన= చెప్పిన; (మంత్రోపదేశమన్న మాటలో ఉపదేశం వేరు) వాక్యంబుల= మాటలయొక్క; అర్థంబులు= అభిప్రాయం, సారాంశం; ఉపన్యసించెదన్= చెపుతాను; ఆకర్ణింపుము= వినుము; అని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: వీతహవ్యుడికి సుతేజసుడు మొదలుగాగల పుత్రపౌత్రు లనేకులు జన్మించారు. వారంతా మహాబ్రాహ్మణులై అనేక విద్యలనే ముత్యాలను పండించారు. ఆ వంశానికి మూలం వీతహవ్యుడే. నాయనా! పాండవాగ్రజా! ఇంకా ఏమడుగుతావో అడుగు చెప్పుతాను. అన్నంతనే ధర్మరా జడిగాడు. 'మహాత్మా! దైవం, పౌరుషం - ఇందులో ఏది గొప్పది? (కొందరు మనిషి చేతిలో ఏమున్నది అంతా దైవానిదే అంటున్నారు. మరికొందరు దేవుడు అన్నం పెట్టుతాడా? మనమే పండించుకొనాలి అంటున్నారు కనుక) అని అడిగితే ఆ మానవోత్తముడు భీష్ము డన్నాడు. 'పూర్వం నీవలెనే వసిష్ఠుడు బ్రహ్మ నడిగాడు. ఆయన చెప్పిన మాటలు నీకు చెప్పుతాను. సారాంశం గ్రహించుము' అని ఇట్లా చెప్పసాగాడు.

విశేషం: అలం: శ్లేష. విద్యామౌక్తిక శ్రేణి వంశంబు - వంశము : వెదురుపొద అని కూడా అర్థమున్నది. అది ఏ విధంగా అల్లుకుపోతుందో అలాగే కులం కూడా పుత్ర పౌత్రాది రూపంగా అధికమౌతుంది. వెదురులో ముత్యాలు పుట్టుతాయని కవిసమయం ఉన్నది. ఇక్కడ విద్యలే ముత్యాలు. అందుకని వంశమంటే రెండర్థాలలో కవిబ్రహ్మ ప్రయోగించాడని భావించాలి.

భీష్ముండు ధర్మరాజునకు దైవపౌరుషంబులతెఱం గెఱింగించుట (సం. 13-6-1)

క. క్షేత్రంబు పురుష కారము । ధాత్రీశ్వర! బీజ మరయ దైవము! రెండున్
సూత్రపడఁ గూడె నేనిం । బాత్రం బగుఁ, గర్మకరుఁడు ఫలమున కెందున్. 134

ప్రతిపదార్థం: ధాత్రీ+ఈశ్వర!= భూమికి పాలకుడైనవాడా! (ధర్మజా!); పురుషకారము= మానవప్రయత్నం, పౌరుషం; క్షేత్రంబు= భూమి (స్త్రీ); దైవము= అదృశ్య శక్తి (కన్పించని అదృష్టశక్తి); అరయన్= పరికించగా; బీజము= విత్తు; రెండున్= ఈ రెండు; సూత్రపడన్= ఒకే సూత్రానికి సరిగా; కూడెన్+ఏనిన్= కూడగలిగితే; కర్మకరుఁడు= కర్మ చేసే మనిషి (పౌరుషశక్తి); ఫలమునకున్= ఫలితానికి; ఎందున్= ఎప్పుడైనా, ఎక్కడైనా; పాత్రంబు= అర్హుడు; అగున్= కాగలడు.

తాత్పర్యం: పౌరుషం చేను. దైవం విత్తు. ఈ రెండు కలవగలిగేటట్లు ప్రయత్నించే మనిషి చక్కని ఫలం పొందగలడు.

విశేషం: దైవం+పౌరుషం = మానవజీవితం; బీజం+క్షేత్రం= పంట; మనిషి జీవితంలో ఈ రెండూ విరుద్ధశక్తులు. ఒకటి పౌరుషం మన చేతిలో ఉన్నది. ఫలమిచ్చే అదృష్టం - కన్పించని శక్తి దైవం. ఈ రెండూ కలిస్తే మానవజీవితం సఫలమౌతుంది. ఈ విధంగా భారతీయ సంస్కృతి రెంటినీ - మనిషినీ, దైవాన్నీ కలుపుకొన్నది. జీవిత సాఫల్యాని కిదే మార్గం.

క. విను, పురుషుఁడు గావింపని । పనులకు దైవ మది యెట్లు ఫల మొనరించున్?
జనములు గార్యము నడపఁగ । ననుకూలత నిచ్చుఁ గాక యయ్యైఫలముల్. 135

ప్రతిపదార్థం: విను= జాగ్రత్తగా ఆలకించుము (అన్న అర్థంలోనే ఈ క్రియను ప్రయోగిస్తాడు కవిబ్రహ్మ); పురుషుఁడు= వ్యక్తి; మనిషి (మగవాడని అర్థం లేదు. స్త్రీకూడా); కావింపని= చేయని; పనులకున్= కార్యాలకు; దైవము= అదృష్టం; అది ఎట్లు= అది ఏ విధంగా; ఫలమున్= ఫలితమును; ఒనరించున్?= చేస్తుంది?, ఇస్తుంది?; జనములు= మానవులు; కార్యమున్= పనులను; నడపఁగన్= చేయగా; అయ్యై ఫలముల్= ఆయా ఫలితాలు; అనుకూలతన్= ఆనుకూల్యంతో; ఇచ్చున్ కాక= ఇస్తాడు తప్ప.

తాత్పర్యం: మనిషి ఏ పనీ చేయకుండా కూర్చుంటే దైవం మాత్ర మేం చేస్తుంది? మనుషులు పనులు చేస్తే ఆయా ఫలాలను దైవ మిస్తుంది తప్ప. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: మనిషిలోని అలసతను, బద్ధకాన్ని పోగొట్టే సూక్తి ఇది. చాలా గొప్పది.

తే. పౌరుషమ్ము. దైవంబు తోడ్పాటు లేక । ఫలముఁ బొందంగనేరదు పార్థివేంద్ర!
విత్తు సహకారి గాకున్న రిత్తనేల । వంధ్య మగుఁ గాక, తా ఫలవంత మగునె? **136**

విశేషం: పార్థివ+ఇంద్ర!= రాజులలో గొప్పవాడా!; పౌరుషంబు= పురుష ప్రయత్నం; దైవంబు= దైవముయొక్క; తోడ్పాటు లేక= సహకారం లేక; ఫలమున్= ఫలితాన్ని; పొందంగనేరదు= పొందలేదు; విత్తు= గింజ; సహకారి= తోడ్పాటు, తోడు; కాకున్నన్= కాకపోతే; రిత్తనేల= వట్టినేల; వంధ్యము= గొడ్డుబోతు (ఎడారి); అగున్+కాక= అవుతుంది తప్ప; తాన్= నేల; ఫలవంతము+అగునె!= ఫలిస్తుందా?

తాత్పర్యం: రాజులలో గొప్పవాడా! దైవం సహకరించకపోతే పౌరుషం ఫలవంతం కాలేదు. విత్తు తోడ్పాటు లేకుండా నేల బీడుపడ్డట్లు అవుతుంది తప్ప ఫలాన్ని ఇస్తుందా? (ఇవ్వదని భావం.)

తే. మేలు రెండు లోకంబుల మేల తెచ్చు; । గీడు సేసినఁ దప్పదు కీడ యగుట
కాన పురుషవర్తనమున కానుకూల్య । శీల మగు దైవ మది ఫలసిద్ధిఁ జేయు. **137**

ప్రతిపదార్థం: మేలు= ఇతరులకూ తనకూ క్షేమం కోరితే; రెండు లోకంబులన్= ఈ లోకంలో పరలోకంలో; మేలు+అ, తెచ్చున్= క్షేమాన్నే కలిగిస్తుంది; కీడు+అ= ఆపద; చేసినన్= చేస్తే; కీడు+అ= కీడే; అగుట తప్పదు= కాక తప్పదు; కాన= కాబట్టి; పురుషవర్తనమునకున్= మనిషి నడవడికి; ఆనుకూల్య= అనుకూలతను కల్పించే; శీలము= స్వభావం; అగు= అయిన; దైవము= అదృష్టం; అది= ఆ దైవం; ఫలసిద్ధిన్= ఫలమును కల్గించటం; చేయున్= చేస్తుంది.

తాత్పర్యం: మేలు చేస్తే రెండు లోకాలలో మేలే. కీడు చేస్తే కీడే. కనుక మనిషి ప్రయత్నానికి అనుకూలించే స్వభావం కల దైవం పని ఏదైతే అదే ఫలితాన్నిస్తుంది. (మేలో కీడో నీవే ఎంచుకొని చేయాలి)

క. అనలం బించుక యైనఁ బ । వనుచే వెలుఁగొందు మాడ్కి వర్ధనముం బొం
దును సత్కర్మాచరణం । బున దైవము నానుకూల్యము గురుప్రవరా! **138**

ప్రతిపదార్థం: కురు ప్రవరా!= కురువంశంలో శ్రేష్ఠుడా!; అనలంబు= అగ్ని; ఇంచుక+ఐనన్= కొంచెమైనా; పవనుచేన్= గాలిచేత; వెలుఁగు+ఒందు= ప్రకాశించే; మాడ్కిన్= విధంగా; సత్కర్మ = మంచిపనులు; ఆచరణంబునన్= చేయటంవలన; దైవము= దైవముయొక్క; ఆనుకూల్యము= అనుకూలత; వర్ధనమున్= పెరుగుటను; పొందును= పొందగలదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మజా! నిప్పు కొంచెమైనప్పటికీ గాలితో పెరిగి ప్రకాశించినట్లు మంచిపనులు చేయటంవలన దైవానుకూల్యం పెరుగుతుంది.

విశేషం: అలం: ఉపమ.

క. నేయి పాలు పఱిన దీవియ । మాయుకరణిఁ, గర్మశుద్ధి మలిఁగిన హీన
త్వాయత్తంబై తానును । మాయును దైవానుకూల్య మహిమ మహీశా! 139

ప్రతిపదార్థం: మహీ+ఈశా!= రాజా!; నేయి= నెయ్యి; పొలుపు= ఉనికి; అఱిన= నశించిన; దీవియ= దీపం; మాయుకరణిన్= ఆరిపోయినట్లు; కర్మశుద్ధి= పనులలో స్వచ్ఛత్వం; మలిఁగినన్= నశించిపోగా; దైవ+ఆనుకూల్య= దైవానుకూలత్వముయొక్క; మహిమ= మహత్త్వం; తానును= తాను కూడా; మాయును= నశిస్తుంది.

తాత్పర్యం: రాజా! నేయి తగ్గిపోతే దీపకాంతీ తగ్గిపోతుంది కదా! అట్లాగే మనిషి చేసే కర్మలలో పవిత్రత లోపిస్తే దైవానుకూలత కూడా లోపిస్తుంది.

విశేషం: అలం : ఉపమ. ఈ పద్యంలో దీపం అందమైన ఉపమానం. అది నేతి దీపం. అదీ పూజలలో వెలిగించే దీపం. కనుక ఆరిపోకూడదు. మనిషి పరిశుద్ధ కర్మ నెయ్యి. దైవం అనుకూలించటం దీపం వెలగటం. ఆ వెలుగు ఇంటికి అలంకారమే కాక ఏదెక్కడ ఉన్నదో కన్పింప చేస్తుంది. అట్లాగే సత్కర్మ కూడా.

తే. పరశురాముఁడు, భృగుఁడును, బలియు, లోను । గాఁగ మహనీయ పురుషులు గర్మసూక్ష్మ
భంగిఁ గలుషితదైవప్రభావితాత్ము । లైరి; కర్మంబు దైవంబు నలఁతు లెట్లు. 140

ప్రతిపదార్థం: పరశురాముఁడు, భృగుఁడును; బలియున్= బలిచక్రవర్తి; లోనుగాఁగన్= మొదలైన; మహనీయ పురుషులు= మహానుభావులైన వ్యక్తులు; కర్మ= కర్మలయొక్క; సూక్ష్మభంగిన్= రహస్యం వలన; కలుషిత= మలినం చేయబడిన, దైవప్రభావిత= దైవ ప్రభావానికి లోనైన; ఆత్ములు+ఐరి= ఆత్మలు కలవారయ్యారు; కర్మంబు= కార్యము; దైవంబు= దైవమూ; అలఁతులు= తక్కువవి; ఎట్లు= ఎట్లాగా; ఏ విధంగా? (తక్కువ విషయాలు కావు).

తాత్పర్యం: పరశురాముడు మొదలైన వారు మహాత్ములయినా కర్మలు బహుసూక్ష్మరహస్యం కలవి కావటంచేత వారికి దైవం కలుషితమైపోయింది. దాని ప్రభావానికి వారూ లోనుకాక తప్పలేదు. కాబట్టి కర్మ, దైవం తక్కువ విషయాలుకావు.

క. విను, పౌరుషమును, దైవము । నన రెండును గార్యఫలము నందింపఁగ నె
ట్టనఁ గారణములు గావున । జననాయక! సదృశములు విచారింపంగన్' 141

ప్రతిపదార్థం: జననాయక!= ప్రజలకు నాయకుడైనవాడా!; విను= ఆలకించుము; విచారింపంగన్= ఆలోచిస్తే; పౌరుషమును= పురుష ప్రయత్నమూ; దైవమున్= దేవుడూ; అనన్= అనే; రెండును= రెండూ కూడా; కార్యఫలమును= పనికి ఫలితాన్ని, అందింపఁగన్= అందివ్వటానికి; నెట్టనన్= తప్పనిసరి అయిన; కారణములు= హేతువులు; కావునన్= కాబట్టి; సదృశములు= రెండు సమానాలే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆలోచిస్తే ఒక పని ఫలవంతం కావటానికి దైవ పౌరుషాలు రెండూ ఉండి తీరాలి. కనుక ఆ రెండింటిలో ఎక్కువ తక్కువలు లేవు. రెండూ సమానమే'.

వ. అనిన విని ధర్మ తనయుండు 'సత్కర్మంబుల నయ్యెడు ఫలంబులు వినవలతు' ననుటయు నక్కురుసత్తమునకు నక్కురు పితామహుం డిట్లనియె. 142

ప్రతిపదార్థం: ధర్మతనయుండు= యముడి కుమారుడు (ధర్ముఁడు= యముడు), సత్కర్మంబులన్= మంచిపనులవలన; అయ్యెడు= కలిగే; ఫలంబులు= ఫలితాలు; వినన్= వినాలని, వినటానికి; వలతున్= కోరుకొంటున్నాను, ఇష్టపడుతున్నాను; అనుటయున్= అనగా; ఆ+కురు సత్తమునకున్= కురువంశంలో ఉత్తముడైన వాడికి - ధర్మరాజుకు; ఆ+కురు పితామహుండు= కౌరవులకు తాత - భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా చెప్పటం విని ధర్మరాజు 'మంచి పనులకు కలిగే ఫల మెట్లా ఉంటుందో వినాలని కుతూహలంగా ఉన్న' దనగానే తాత భీష్మ డిట్లా అన్నాడు.

సీ. 'అధ్వపరిశ్రాంతుఁ డగు వింతవానికి । నన్నం బిడిన ఫల మట్టి దిట్టి
దనఁ బెద్ద యగ్ని సమారాధనమునకుఁ । బౌరుష శ్రేష్ఠత భవ్యదాన
ములకుఁ, దత్తద్వస్తువులమహామహిమలు । మౌనంబునకుఁ బరిజ్ఞానశక్తి
యతుల తపంబున కధికభోగము లహిం । సకు రూప, బల, చిదైశ్వర్య, సిద్ధి

తే. బ్రహ్మచర్యమునకుఁ బరమాయు వుపవాస । ములకుఁ జిత్తశుద్ధి ఫలజలంబు
లాహరించి యునికి కాధిరాజ్యము, పత్త్ర । భక్షతకు, దివంబు ఫలము లధిప! 143

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; (అధి= పైనుండి అధిష్ఠించి; ప= పాలించేవాడు); అధ్వ= బాటలో; పరిశ్రాంతుఁడు+అగు= అలసినవాడైన; వింతవానికిన్= పరాయివాడికి (దారిన పోయే వాడికి); అన్నంబు= అన్నం; ఇడినఫలంబు= పెట్టినదానికి వచ్చే ఫలితం; అట్టిది+ఇట్టిది అనన్= అట్లాంటిది, ఇట్లాంటిది, అనటానికి; పెద్ద= గొప్పది; అగ్ని= అగ్నియొక్క; సమారాధనమునకున్= చక్కని పూజకు; పౌరుషశ్రేష్ఠత= శ్రేష్ఠమైన ప్రయత్నం (ఫలం); భవ్యదానములకున్= మంచి దానకర్మలకు (మంచివారికి చేసే దానకర్మలకు); తత్ తత్= ఆయా; వస్తువుల= ద్రవ్యములయొక్క; మహా= గొప్ప; మహిమలు= మహత్త్వములు; మౌనంబునకున్= మౌన (మాట్లాడకుండా ఉండటం) వ్రతానికి; పరిజ్ఞానశక్తి= మంచిజ్ఞానశక్తి; అతుల= సాటిలేని; తపంబునకున్= తపస్సుకు; అధికభోగంబులు= గొప్పసుఖానుభవాలు; అహింసకున్= దేనినీ చంపని వ్రతానికి; రూప= మంచి ఆకారం; బల= సత్తువ, శక్తి; చిత్= జ్ఞానం; ఐశ్వర్య= ధన అధికారాలు; సిద్ధి= లబ్ధి; బ్రహ్మచర్యమునకున్= బ్రహ్మచారి వ్రతానికి; పరమ= గొప్ప; ఆయువు= ఆయుష్షు; ఉపవాసములకున్= అన్నం తినకుండా; జపసంధ్యాదులు చేస్తూ భగవంతుడికి మనస్సులో దగ్గరకావటానికి (ఉప= సమీపంలో; వాసము= ఉండటం, భగవంతుడికి సమీపంగా ఉండటం); చిత్తశుద్ధి= స్వచ్ఛమైన మనస్సు (కలగటం ఫలం); ఫల= పండ్లు; జల= నీళ్ళు; ఆహరించి= తిని; ఉనికిన్= ఉండటానికి; ఆధిరాజ్యము= రాజ్యపాలనం; పత్త్ర భక్షతకున్= ఆకులు తినే వ్రతానికి; దివంబు= స్వర్గం; ఫలములు= ఫలితాలు.

తాత్పర్యం: అలసిపోయిన బాటసారికి అన్నం పెట్టటంకంటె గొప్ప ధర్మం లేదు. దానివల్ల వచ్చే ఫలితాన్ని ఎంచటానికి వీల్లేదు. అగ్ని ఆరాధనంవలన మంచి ప్రయత్న సిద్ధి కలుగుతుంది. మంచివారికి దానం చేస్తే ఆయా

వస్తువుల సిద్ధి (కలుగుతుంది). మౌన వ్రతానికి ఫలితం జ్ఞానశక్తి లభించటం, గొప్ప తపస్సుకు అధికభోగం, అహింసకు రూపబలజ్ఞాన ఐశ్వర్యాలు ఫలాలు. బ్రహ్మచర్య వ్రతానికి దీర్ఘాయువు ఫలం. ఉపవాసానికి ఫలం చిత్తశుద్ధి. నీళ్ళూ, పండ్లూ తింటూ బ్రతకటానికి ఫలితం రాజ్యపరిపాలన. ఆకులు మాత్రం తింటూ చేసే తపస్సుకు స్వర్గం ఫలం. (బాటసారికి అన్నదానం, అగ్ని ఆరాధన, దానకర్మ, మౌనం, తపస్సు, అహింస, బ్రహ్మచర్యం, ఉపవాసం, పండ్లు, ఆకులు తింటూ బ్రతకటం - ఇవన్నీ పవిత్ర వ్రతాలుగా చేసేవారికి ఆయా ఫలితాలు చెప్పే పద్యం.)

క. శ్రుతిపఠనమునకు, నర్థ । ప్రతి బోధంబునకు, వరుస ఫలములు సౌఖ్య
స్థితియును, సుగతియు; సత్య । వ్రతమునకు ఫలంబు ముక్తి వసుధాధీశా! 144

ప్రతిపదార్థం: వసుధా= భూమికి; అధి+ఈశా!;= అధిపతివైన రాజా!; శ్రుతి= వేదం; పఠనమునకున్= చదవటానికి; అర్థ= దాని అర్థంయొక్క; ప్రతిబోధంబునకున్= జ్ఞానానికి, చెప్పటానికి; వరుసన్= వరుసగా; సౌఖ్యస్థితియును= సుఖంగా ఉండటం; సుగతియున్= మరణానంతరం స్వర్గస్థితి; ఫలములు= ఫలితాలు; సత్యవ్రతమునకున్= సత్యం చెప్పాలన్న నియతికి; ముక్తి= మోక్షం; ఫలంబు= ఫలితం.

తాత్పర్యం: భూమికి అధిపతివైన ఓ రాజా! వేదం పఠిస్తే సౌఖ్యమూ, దానికర్థం గ్రహిస్తే సుగతీ, సత్యవ్రతానికి ముక్తి ఫలితం.

క. ద్రుమముల దళకుసుమఫలో । ద్గమములక్రియఁ గర్మముల నొదవుఁ దత్ఫలముల్
దమ తమ తఱిఁ గర్తకు భో । గ్యములై నియతిని శుభాశుభాకారములన్. 145

ప్రతిపదార్థం: ద్రుమములన్= చెట్లలో; దళ= ఆకులూ; కుసుమ= పూలూ; ఫల= పండ్లూ (వీటియొక్క); ఉత్+గమముల= పొటమరించటం, ఆకుతొడగటం, పూలు పూయటం, కాయలు కాయటం; క్రియన్= వలె; కర్తకున్= కర్మలు చేసేవాడికి; భోగ్యములై= అనుభవించ దగినవై; నియతిని= నియమం తప్పక; శుభ= శుభం; అశుభ= చెడు; ఆకారములన్= రూపాలలో; (మంచి చెడు రూపాలలో); తమ తమ = శుభ అశుభ కర్మలు; తఱిన్= సమయాలలో; తత్ తత్= ఆయా (శుభాశుభ); కర్మములన్= కర్మల వలన; ఫలితముల్= ఫలితాలు; ఒదవున్= కలుగుతాయి.

తాత్పర్యం: మనిషి చేసే మంచి పనులకు, చెడ్డ పనులకు ఆయా సమయాలలో ఆయా కర్మలవల్ల మంచి చెడు ఫలితాలు కలుగుతాయి. ఎట్లాగంటే కాలానుగుణంగా చెట్లకు ఆకులు, పువ్వులు, కాయలు, పండ్లు కలిగినట్లుగా మంచి చెడ్డ ఫలితాలుకూడా కలుగుతాయి.

విశేషం: అలం: ఉపమ. చాలా అందమైన పోలిక.

వ. అని చెప్పి. 146

తాత్పర్యం: ఆ విధంగా ఉదాహరణ పూర్వకంగా బోధించి.

చ. వినుము, జరానుబంధమున వెండ్రుకతండముఁ, బండ్లు, వీనులుం
గనుఁగవయున్, జరం బొరయుఁ గాని యొకప్పుడు దృష్ణ జీర్ణగా;

దనయముఁ బేర్చి, ప్రాణముల నన్పక పోవనిరోగ మల్పబు

ద్ధినరులు ద్రోవ లే రది, మదిం జొరనీరు సుఖార్థులై బుధుల్. 147

ప్రతిపదార్థం: వినుము; జరా+అనుబంధమునన్= ముసలితనంయొక్కసంబంధం చేత; వెంద్రుక= జుట్టు; తండము= సమూహం; పండ్లు= దంతాలు; వీనులున్= చెవులున్నూ; కను+కవయున్= కళ్ళజంటా; జరన్= వృద్ధాప్యమును; పొరయున్= పొందుతాయి; కాని; ఒకప్పుడున్= ఏనాటికీ; తృష్ణ= కోరిక; జీర్ణగాదు= జీర్ణించదు,నశించదు; పేర్చి= ఎసరేగి, విజృభించి; ప్రాణములన్= ప్రాణాలను; అన్పక= అణచక, చావగొట్టక; పోవనిరోగము= చచ్చినా పోనిరోగం; అల్పబుద్ధి= స్వల్పబుద్ధి కల; నరులు= మనుష్యులు, త్రోవ లేరు= త్రోసివేసికొనలేరు; అది= అట్లాంటి ఆలోచన; మదిన్= మనస్సులో; చొరనీరు= ప్రవేశించనివ్వరు; బుధుల్= పండితులున్నూ; సుఖార్థులు+ఐ= సుఖం కోరుకొన్నవారై; త్రోవలేరు= త్రోసికొనలేరు; అది= అట్లాంటి ఆలోచన; మదిన్= మనస్సులో; చొరనీరు= ప్రవేశించనివ్వరు; బుధుల్= పండితులున్నూ; సుఖార్థులు+ఐ= సుఖం కోరుకొన్నవారై.

తాత్పర్యం: ముసలితనం రాకతో జుట్టు, దంతాలు, చెవులు, కళ్ళూ ముసలివౌతాయి. కాని, కోరికకు మాత్రం ముసలితనం రాదు. ప్రాణా లున్నంతవరకూ పోని రోగ మది. అది రోగ మని కూడా అల్పబుద్ధులైన నరులు ఆలోచించరు. పండితులు కూడా సుఖాలు మరిగి, కోరిక అన్న రోగాన్ని పోగొట్టుకొందామన్న ఆలోచన మనస్సులోనికి కూడా రానివ్వరు.

క. పాపంబుఁ బుణ్యమును దృ । ష్ణా పరులకు దుఃఖసౌఖ్య సంపాదులగున్

భూపాల! వితృష్ణులు, ని । ర్లేపు లగుట వారిఁ బొందలే వా ఫలముల్. 148

ప్రతిపదార్థం: భూపాల!= రాజా!; పాపంబున్= పాపం; పుణ్యమును= పుణ్యమూ; తృష్ణాపరులకున్= కోరికలున్నవారికి; దుఃఖ, సౌఖ్య సంపాదులు+అగున్= దుఃఖాన్ని, సౌఖ్యాన్ని కలిగిస్తాయి; వితృష్ణులు= కోరికలు లేనివారు; నిర్లేపులు= విరక్తులు; అగుటన్= అయినందువలన; ఆ ఫలముల్= ఆ సుఖదుఃఖాలు; వారిన్= నిర్లేపులను; పొందలేవు= పొందజాలవు.

తాత్పర్యం: లోకానురక్తులైన వారికి పాపపుణ్యకర్మలు దుఃఖాన్ని కలిగిస్తే, మమకారం లేనివారికి విరక్తులకు ఆ ఫలాలు కలుగవు. (వారికి సుఖదుఃఖ అనుభవం ఉండదు. రెంటినీ ఒకటిగానే చూస్తారు)

వ. అని పల్కినం, బాండునందను లందఱుం బ్రభూత హర్షోత్కర్షంబు నొందిరి; గంగానందనుండు ధర్మనందను నుద్దేశించి, యీ యర్థజాతంబు మునిప్రణీతంబయి యధిగతం బైనది, నీకు నుపదేశించితి 'నీవింక నేమి వినవల' తనవుడు, నా భూవల్లభుండు 'నిజాశ్రయంబున కాస్పదం బయిన పురుషునెడ భక్తజనంబు చరితం బెట్టిది గావలయు?' నని యడిగిన నతం డతని కిట్లనియె. 149

ప్రతిపదార్థం: పాండు నందనులు= పాండురాజు కొడుకులు; ప్రభూత= మిక్కిలి; హర్ష= సంతోషముయొక్క; ఉత్కర్షంబున్= ఆధిక్యం; ఒందిరి= పొందినారు; గంగానందనుండు= గంగకొడుకు భీష్ముడు; ధర్మనందనున్= ధర్మరాజును; ఉద్దేశించి= లక్షించి; ఈ+అర్థజాతంబు= ఈ శాస్త్రవిషయ సమూహం; ముని ప్రణీతంబు+అయి= మునులచేత రచించబడి; అధిగతంబు+ఐనది= చదువబడినది, పొందబడినది; నీకున్; ఉపదేశించితిన్= బోధించాను; నీవు; ఇంకన్; ఏమి; వినవలతు(వు)= వినగోరెదవు; అనవుడున్= అనిన మీదట; ఆ భూ వల్లభుండు= భూమికి పతి, రాజు; నిజ= తనకు, తనయొక్క;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆశ్రయంబునకున్= ఆధారానికి; ఆస్పదంబు= తావు, ఆటపట్టు; అయిన; పురుషునెడన్= యజమానుడైన వ్యక్తి విషయంలో; భక్తజనంబు= భక్తులైన మానవులయొక్క; చరితంబు= నడవడి; ఎట్టిదికావలయున్= ఎట్లా ఉండాలి? అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్!

తాత్పర్యం: అని చెప్పగా పాండవులంతా బ్రహ్మానంద భరితులయ్యారు. అప్పుడు భీష్ముడు ధర్మరాజుతో అన్నాడు; 'ఈ విషయం పూర్వ మునులు చెప్పగా మనకు దక్కిన విద్య. అదే నీకూ చెప్పాను. ఇంకా ఏమి వినాలనుకొంటున్నావో చెప్పుము' అనగానే ధర్మరాజు 'తమ జీవితాలకు ఆధారమైన యజమానుని యెడల అతడి దగ్గర బ్రతికే వా రెట్లా నడచుకొనాలో చెప్పుము' అని అడుగగా భీష్ము డతడితో ఈ విధంగా అన్నాడు.

భీష్ముఁడు ధర్మజున కాశ్రయం బెప్పుడు నపరిత్యాజ్యం బని చెప్పుట (సం.13-11-1 (కుంభ))

క. 'విను, కాశీశ్వరుదేశం । బున నొక లుబ్ధకుఁడు వేఁట వోయిన చోటన్
ఘనతర విషదిగ్ధశరం । బున నేసిన మృగముఁ దప్పి భూజముఁ దాఁకెన్. 150

ప్రతిపదార్థం: కాశీ+ఈశ్వరు= కాశీరాజు; దేశంబునన్= రాజ్యంలో; ఒక లుబ్ధకుఁడు= ఒక కిరాతుడు; వేఁట పోయినచోటన్= వేటకై వెళ్ళినచోట; ఘనతర= మిక్కిలి గొప్ప; విషదిగ్ధ= విషం పూసిన; శరంబునన్= బాణంతో; మృగమున్= లేడిని; ఏసినన్= కొట్టగా; తప్పి= అది తప్పిపోయి; భూజమున్= చెట్టును; తాఁకెన్= తగిలింది.

తాత్పర్యం: కాశీదేశంలో ఒక వేటగా డున్నాడు. వా డొక రోజున వేటకు పోయి విషంపూసిన వాడి అయిన బాణాన్ని ఒక లేడిపై ప్రయోగించాడు. అది తప్పిపోయి చెట్టుకు గ్రుచ్చుకొన్నది.

క. పూవులఁ గాయలఁ బెరిగిన । యా వృక్షము శుష్క మయ్యెఁ; నవ్విధమున ధా
త్రీవర! తదీయ కోటర । మావాసము గాఁగ, నొక మహాశుక ముండున్. 151

ప్రతిపదార్థం: ధాత్రీవర!= భూపతికి పతివైనవాడా! పూవులన్= పూలతో; కాయలన్= కాయలతో; పెరిగిన; ఆ వృక్షము= ఆ చెట్టు; ఆ+విధమునన్= ఆ రీతిగా (ఉన్నదున్నట్లుగా); శుష్కము+అయ్యెన్= ఎండిపోయింది; తదీయ= ఆ చెట్టుయొక్క; కోటరము= తొర్ర; ఆవాసము= ఇల్లు, నివాసం; కాఁగన్= అవునట్లుగా; ఒక మహాశుకము= గొప్ప పేరుగల చిలుక; ఉండున్= ఉండేది.

తాత్పర్యం: పూలతో కాయలతో ఏపుగా పెరిగిన ఆ చెట్టు ఆ బాణానికి నిలువునా మాడిపోయింది. దాని తొర్రలో ఒక పెద్ద చిలుక కాపురముండేది. (గొప్ప పేరుగల అన్నమాటకు అర్థం 155వ పద్యంలో ఉన్నది)

క. అది తరువు విడిచిపోవక, । హృదయంబున భక్తి పేర్మి నెండను గాలిన్
బెదరక ధృతిమై నయ్యెడఁ । గదలకయుండె ననుజీవిగౌరవ మెసఁగన్. 152

ప్రతిపదార్థం: అది= ఆ చిలుక; తరువున్= చెట్టును; విడిచిపోవక= విడిచివెళ్ళకుండా; హృదయంబునన్= మనస్సులో; భక్తి పేర్మిన్= భక్తియొక్క అతిశయంతో; ఎండను= ఎండకు; గాలిన్= గాలికి; బెదరక= భయపడక; ధృతిమైన్ = ధైర్యంతో; ఆ+ఎడన్= అక్కడే; అనుజీవి= ఆశ్రయించిన ప్రాణియొక్క; గౌరవము= మర్యాద; ఎసఁగన్= ప్రకాశించగా; కదలక ఉండెన్= ఎటూ పోకుండా అక్కడే ఉన్నది.

తాత్పర్యం: ఆ చిలుక గాలికీ, ఎండకూ బెదరక ఎండిన ఆ చెట్టునే ఆశ్రయించుకొని ఉన్నది. ఇన్నాళ్ళు ఆ చెట్టు తన కాశ్రయ మిచ్చిందన్న గౌరవ భావమే ధైర్యం కాగా ఎటూ పోలేదు.

ఉ. దాని యుదాత్త వృత్తము శతక్రతుఁ, డాత్మ నెఱింగి వచ్చి , 'బెం
డైనది యిమ్మహీజము; మహాతరువుల్ ఫలవృద్ధి నొంది యి
క్కాన ననేకముల్ గలుగఁగా, నిటు లేటికి నిందు నిల్వ నో
మానితకీరమా!' యనియె మానుష భంగికరూప మొప్పఁగన్. 153

ప్రతిపదార్థం: శతక్రతుఁడు= ఇంద్రుడు (నూరు యజ్ఞాలు చేసినవాడు); దాని= ఆ చిలుకయొక్క; ఉదాత్త= నీతి కల గొప్ప; వృత్తము= నడవడి; ఆత్మన్= తనలో; ఎఱింగి= చూచి; ఈ+మహీజము= చెట్టు; (మహీ= భూమినుండి; జము= పుట్టినది); బెండు+ఐనది= ఎండిపోయినది; ఫలవృద్ధిన్= పండ్ల సమృద్ధి; ఒంది= పొంది; మహాతరువుల్= ఉన్నత వృక్షాలు; ఈ+కానన్= ఈ అడవిలో; అనేకముల్= చాలా; కలుగఁగాన్= ఉండగా; ఇందున్= ఈ ఎండిన చెట్టుపైనే; ఏటికిన్= ఎందుకు; ఇటులు= ఈ విధంగా; నిల్వన్= నిల్చుట; ఓ మానిత= ఓ పొగడదగిన; కీరమా!= చిలుకా!; మానుషభంగిక రూపము= మనిషివలె ఆకారం; ఒప్పఁగాన్= ప్రకాశింపగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇంద్రుడు చిలుక వృత్తాంతం తనంత తాను తెలిసికొని చిలుక దగ్గరకు వచ్చి 'ఓ చిలుకా! ఈ అడవిలో ఫలసమృద్ధి గల చెట్లు ఎన్నో ఉన్నాయి కదా! ఇంకా ఈ ఎండిన చెట్టునే ఆశ్రయించి దేని కున్నట్లు?' అని అన్నాడు.

వ. అనిన విని యా శుకంబు. 154

తాత్పర్యం: అనగా విని ఆ చిలుక.

చ. 'అనయము పండుచుండు నెడ నాశ్రయ మొప్పిన నిల్చి, యెండి పో
యినతఱిఁ బాసి పోక తగ వెట్లు? కృతఘ్నత గాదె యివ్విధం
బనిమిషనాథ!' యన్న నతఁ డచ్చెరువంది 'పురాకృతోప సం
జనిత విశేష మీ ఖగము జానుగ నన్ను నెఱింగె, దీనికిన్. 155

ప్రతిపదార్థం: అనయము= ఎప్పుడు; పండుచుండునెడన్= పండ్లు పండేవేళ; ఆశ్రయము= ఆధారం; ఒప్పినన్= చిక్కగా; నిల్చి= ఉండి; ఎండిపోయిన తఱిన్= ఎండినప్పుడు; పాసి= వదలి; పోక= పోవటం; కృతఘ్నతకాదె= చేసినమేలు మరవటం కదా; అనిమిషనాథ!= దేవతలకు రాజా! ఇంద్రా! (అనిమిషులు= రెప్పపాటు లేనివారు, దేవతలు); అన్నన్= అనగా; అతఁడు= ఇంద్రుడు; అచ్చెరువు= ఆశ్చర్యం; అంది= పొంది; ఈ ఖగము= ఈ పక్షి, పురాకృత= పూర్వజన్మలో చేసిన పుణ్యం వలన; ఉపసంజనిత= చక్కగా పుట్టిన; విశేషము= ఎన్నదగినది; జానుగన్= చక్కగా; నన్నున్= దేవతలకు రాజైన నన్నే; ఎఱింగెన్= గుర్తించింది; (కనుక) దీనికిన్= దీనికి.

తాత్పర్యం: 'చెట్లు పండినపుడు ఉండటం, ఎండినపుడు విడిచిపెట్టి పోవటం కృతఘ్నత కదా! మహేంద్రా!' అని చిలుక అనేటప్పటికి ఇంద్రు డనుకొన్నాడు - 'అరే! ఇది పూర్వజన్మ వాసనా విశేషంవలన నన్ను గుర్తుపట్టగలిగింది. కనుక ఈ గొప్ప పక్షికి. (తరువాతి వచనంతో అన్వయం)

వ. మే లొనర్చెదం గాక! 156

తాత్పర్యం: శుభం చేస్తాను గాక! (నిశ్చయించటం)

క. 'అని తలఁచి నీదు పలుకులు । విని మెచ్చితి; వరము గోరు విహగోత్తమ! నీ'

వనిన, శుకంబు మహీజం । బునకుం బే రెలమి వేఁడె భూపవరేణ్యా! 157

ప్రతిపదార్థం: భూ ప= భూమికి పతులైనవారిలో; వరేణ్యా!= మిక్కిలి శ్రేష్ఠమైనవాడా!; అని= ఈ విధంగా; తలఁచి= ఇంద్రుడనుకొని; నీదు= నీయొక్క; పలుకులు= మాటలు; విని; మెచ్చితిన్= మెచ్చుకొన్నాను; విహగ= పక్షులలో; ఉత్తమ!= గొప్పదానా!; వరమున్= శ్రేష్ఠమైన కోరికను; కోరు= కోరుకొమ్ము; నీవు; అనినన్= అనగానే; శుకంబు= చిలుక; మహీజంబునకున్= చెట్టుకు; పేరు+ఎలమిన్= గొప్ప సంతోషాన్ని; వేఁడెన్= కోరింది.

తాత్పర్యం: రాజా! ఇంద్రు డావిధంగా మనస్సులో భావించుకొని చిలుకతో 'మహా శుకమా! నీ మాటలు నాకు ఆనందాన్ని కలిగించాయి. కనుక నీ కేదైనా వరమిస్తాను కోరుకొమ్ము' అన్నాడు. వెంటనే చిలుక 'స్వామీ! ఈ చెట్టుకు పూర్వవైభవాన్ని అనుగ్రహించుము' అని అన్నది. (చూచావా ఆ చిలుక ఎంత గొప్పదో తనకు ఏ మేలూ కోరుకోకుండా చెట్టు మేలును కోరింది).

ఆ. అమరవల్లభుండు నమృతసేచనమునఁ । భూజమునకుఁ దొంటి పొల్పు కంటె

మిగుల నెలమి సేసె; మేలియాశ్రితు లిట్ల । మనుతు రధిపుఁ గురుకుమారవర్య! 158

ప్రతిపదార్థం: కురుకుమార వర్య!= కౌరవులలో మంచివాడా!, శ్రేష్ఠుడా!; అమర= దేవతలకు; వల్లభుండు= రాజు; అమృత సేచనమునన్= అమృతాన్ని చల్లటం వలన; భూజమునకున్= భూమినుండి పుట్టినది, చెట్టునకు; తొంటి= ముందటి; పొల్పుకంటెన్= అందంకంటె; మిగులన్= ఎక్కువ; ఎలమిన్= సంతోషమును; చేసెన్= కల్గించాడు; అధిపున్= ఏలినవాడిని, యజమానుని, ఆశ్రయమిచ్చిన వాడిని; మేలి= మంచి; ఆశ్రితులు= ఆశ్రయించి బ్రతికేవారు; ఇట్లు+అ= ఇదే విధంగా; మనుతురు= రక్షిస్తారు.

తాత్పర్యం: కౌరవులలో ఉత్తముడా! ఇంద్రుడు అమృతం చల్లి చెట్టుకు పూర్వ వైభవంకంటె గొప్ప వైభవా న్నిచ్చాడు. తనను కాపాడినవారిని మంచి ఆశ్రితులు ఇట్లాగే రక్షిస్తారు'.

విభునకుం బాటింపవలయువారిని భీష్ముఁడు ధర్మజునకుఁ జెప్పుట (సం.13-8-1)

వ. అనిన నతం'డెవ్వరిఁ బాటించుట విభులకు వలయు'నని యడిగిన నా భూపతికి భీష్ముం డిట్లనియె. 159

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అతండు= ధర్మరాజు; విభులకున్= రాజులకు, యజమానులకు; ఎవ్వరిన్= ఎవరిని; పాటించుట= ఆదరించటం; వలయును= చేయాలి; అని; అడిగినన్; ఆ భూపతికిన్= భూమికి పతియైన ధర్మజునకు; భీష్ముండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు 'ఆశ్రితులలో ఎవరిని ఎట్లా యజమానులు ఆదరించాలి'? అని అడుగగా భీష్ముడు అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇది పోషించే వారికి సంబంధించిన విషయం.

సీ. 'జననాథ! విను, తప స్స్వాధ్యాయముఖ కర్మ । కరణత నుభయలోకముల వశగ
తములఁ జేయఁగఁ జాలు ధాత్రీసురులు మన్న । నకుఁ బాత్రములు; పతి నాతి కెట్లు
రాజునకును నట్లు బ్రాహ్మణుఁ డొడయుండు । బ్రాహ్మణుం డను మాట పావనంబు,
హర్షించి శుభముల నలిగి యాపదల నిం । ద్రునికైనఁ జేయు విప్రుండు నృపతి

తే. గొడుకుఁ బోలె నరయ, గురుఁ బోలెఁ గొలువంగ । నగ్నిఁ బోలె నిష్ఠ నర్చితుఁడుగఁ
జేయవలయు విప్రుఁ జెప్పెద, వేదసం । వాద; మేకబుద్ధి నాదరింపు. 160

ప్రతిపదార్థం: జననాథ!= ప్రజలకు స్వామి!; తపః+స్వాధ్యాయ, ముఖ, కర్మ, కరణతన్= తపస్సు, వేదము చదవటం మొదలైన పనులను చేయటం వలన; ఉభయలోకములన్= రెండులోకాలను, ఈ లోకము, పరలోకము అనేవానిని; వశగతములన్= అధీనమైనవానినిగా; చేయఁగన్+చాలు= చేయటానికి సమర్థులైన; ధాత్రీసురులు= భూదేవతలు (బ్రాహ్మణులు); మన్ననకున్= గౌరవానికి; పాత్రములు= యోగ్యులు; పతి= మగడు; నాతికిన్= స్త్రీకి; ఎట్లు= ఎట్లో; అట్లు= ఆ విధంగా; బ్రాహ్మణుఁడు= విప్రుడు; రాజునకును= ఏలికకు; ఒడయుండు= స్వామి; బ్రాహ్మణుండు+అను మాట= బ్రాహ్మణుడు పలికేమాట; పావనంబు= పవిత్రమైనది; విప్రుండు= జ్ఞానవిద్యాసంపదగల బ్రాహ్మణుడు; ఇంద్రునికిన్+ఐనన్= దేవేంద్రునకు కూడా; హర్షించి= సంతోషము పొంది; శుభములన్= మేలైన ఫలములను; అలిగి= కోపించి; ఆపదలను= కీడులను; చేయున్= చేయగలడు; నృపతి= రాజు; విప్రున్= ఉత్తమబ్రాహ్మణుని; కొడుకున్, పోలెన్= కన్నకుమారుని వలె; అరయన్ వలయున్= కాపాడాలి; గురున్+పోలెన్= జ్ఞానమును ప్రసాదించిన గురువును వలె; కొలువంగన్, వలయున్= పూజించాలి; నిష్ఠన్= చెదరని బుద్ధితో; అగ్నిన్+పోలెన్= అగ్నిదేవుని విధంగా; అర్చితుఁడుగన్= పూజలందుకొనిన వానినిగా; చేయన్, వలయన్= చేయాలి; (దీనికి ప్రమాణభూతంగా) వేద సంవాదమున్= వేదంలోని తార్కాణరూపమైన వాక్యాన్ని; చెప్పెదన్= నీకు తెలియజేస్తాను; ఏకబుద్ధిన్= చెదరని మదితో; ఆదరింపు= శ్రద్ధతో గ్రహించు.

తాత్పర్యం: రాజా! వినుము. తపస్సు, వేదాధ్యయనం వంటి కర్మలు చేయటం వలన ఉభయలోకాలను అరచేతిలో పెట్టగల బ్రాహ్మణులను గౌరవించాలి. వారు సతికి పతివలె రాజుకు యజమానులు. వారి మాటలు పావనమైనవి. ఇంద్రుడికైనా సరే! వారు హర్షిస్తే సుఖం. అలిగితే కీడు కల్పించగలరు. రాజు విప్రుడిని కొడుకువలె కాపాడాలి. గురువువలె చూడాలి. అగ్నివలె పూజించాలి. దీనికి సంబంధించిన వేద సంభాషణం చెప్పుతున్నాను. ఏకాగ్రబుద్ధివై వినుము.

విశేషం: తపస్సు అంటే ఒక విషయాన్ని గూర్చి అతిగాఢంగా భావన చేయటం. దానికోసం చేసే అతికఠినమైన దేహేంద్రియాలను వశం చేసుకొనే ప్రక్రియలన్నీ తపస్సు క్రిందికి వస్తాయి. స్వాధ్యాయం అంటే తనకు సంప్రదాయ సిద్ధంగా ఏర్పడిన వేదాన్ని లేదా వేదశాఖలను గురుముఖాన అభ్యసించటం. విప్రుడు- 'విద్యయా యాతి విప్రత్వమ్' అన్నమాటను బట్టి విద్య అంటే విముక్తిని ప్రసాదించే జ్ఞానమే కనుక అది పుష్కలంగా కలవాడు.

వ. వేదంబులు దమలోన గోష్ఠి సేయుచున్న సమయంబున. 161

తాత్పర్యం: వేదాలు తమలో తాము చర్చిస్తున్న వేళ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **బ్రాహ్మణజాతికిఁ బరిభవం బొనరింప । మున్ను చేసిన పుణ్యములు నశించు,**
జపహోమముఖ కర్మసంచయంబున కధి । కతరంబు విప్రముఖమున నిడుట.
భూసురార్చన మొక మాసంబు సలిపినఁ । బాపంబులెల్లను బాసిపోవు,
నగ్రవర్ణులఁ గాంచి యాదరింపక యుండు । కంటెను, గీడొండు గలుగ దరయ,

తే. **నని క్రమంబున ఋగ్వేదమును యజుస్సు । సామము నథర్వణమ్మును, సారభూత**
భవ్య సంభాషణముసేఁత దివ్యమునుల । వలన విందుము, కౌరవకులపవిత్ర!' **162**

ప్రతిపదార్థం: కౌరవకుల= కురువంశంలో; పవిత్ర= పావనమైనవాడా!; ఋగ్వేదం చెప్పుతున్నది; బ్రాహ్మణ జాతికిన్= బ్రాహ్మణ జాతికి; పరిభవంబున్= అవమానం; ఒనరింపన్= చేస్తే; మున్ను చేసిన= పూర్వం చేసిన; పుణ్యములు= పవిత్రకర్మఫలాలు; నశించున్= నశిస్తాయి; యజుర్వేదం చెప్పినది; జప, హోమ, ముఖ= జపం, హోమం చేయటంవంటి; కర్మసంచయంబునకున్= కర్మలను చక్కగా కూర్చుటకన్నను; అధికతరంబు= చాలా ఎక్కువ; విప్రముఖమునన్= బ్రాహ్మణున కెదురుగా (భక్తితో); ఇడుట= ఇవ్వటం; సామవేదమిట్లా అంటున్నది; భూసుర= భూదేవతలైన బ్రాహ్మణులయొక్క; అర్చనము= పూజను; ఒక మాసంబు= ఒక నెల; సల్పినన్= చేస్తే; పాపంబులు= అపవిత్రకర్మల ఫలాలు; ఎల్లను= అన్నీ; పాసిపోవున్= నశిస్తాయి; అధర్వణవేద మన్నది; అగ్రవర్ణులన్= పైకులంవారిని; కాంచి= చూచి; ఆదరింపక= ఆదరించకుండా; ఉండుటకంటెను= ఉండటం కంటె; అరయన్= ఆలోచించి చూస్తే; ఒండు= మరొక; కీడు= ఆపద, అశుభం; కలుగదు; అని= ఈ విధంగా; ఋగ్యజుస్సామాధర్వణ వేదాలు క్రమక్రమంబునన్= వరుసగా (గీతపద్యంలోని నాలుగు వేదాలు కర్తలు. పై నాలుగు పాదాలు వీటికి క్రమంగా అన్వయించుకొనటమే క్రమం); సారభూత= సారాంశమైన; భవ్యసంభాషణము= మేలైన వాదం; చేఁత= చేయటం; దివ్యమునులవలనన్ విందుము= దివ్యులైన మునుల ద్వారా వింటున్నాము.

తాత్పర్యం: కురువంశంలో పవిత్రమైనవాడా! మునులద్వారా వింటున్నాము. బ్రాహ్మణజాతికి అవమానం చేస్తే పూర్వం చేసిన పుణ్యం నశిస్తుందని ఋగ్వేదం చెప్పుతున్నది. విప్రులకు చేసే దానం, జపం, హోమం మొదలైన వైదిక కర్మలకంటె ఎక్కువైనదని యజుర్వేదం చెప్పుతున్నది. ఒక నెల బ్రాహ్మణులను పూజిస్తే పాపాలన్నీ తొలగుతాయని సామవేదం చెప్పుతున్నది. పై కులం వారిని చూచి ఆదరించకుండా ఉండటం కంటె ఆలోచించి చూస్తే మరొక ఆపదలేదని అధర్వణవేదం తెలుపుతున్నది'.

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బరమమైన ధర్మంబు చెప్పుట (సం.13-18-1 (కుంభ))

సీ. **అని చెప్పి, భీష్ముఁ డమ్మనుజేంద్రుతోఁ 'బర । మశ్రేష్ఠమైన ధర్మంబుఁ దెలియ**
విను' మని పల్కి యిట్లను; మద్రనాథుండు । సత్యవతీ పుత్రచరణములకు
నెఱఁగి కేలు మొగిడ్చి, యెద్దాని నెఱుఁగుట । యెఱుకల కెల్లను నెక్కుడని, స
భక్తిక సమ్మతిఁ బ్రార్థించి యడిగిన; । నమ్మహాముని దయ నతనిఁ జూచి

తే. **విష్ణు నెఱుఁగు టధిక విమలబోధము, యజ్ఞ । మూర్తి, యజ్ఞకర్తృమూర్తి, యజ్ఞ**
కలనమూర్తి, యజ్ఞ ఫలమూర్తి, విష్ణుఁ; డ । తండు కృష్ణుఁ డమలతరచరిత్ర!' **163**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని చెప్పి; భీష్ముఁడు= భీష్ముడు ఆ విధంగా పల్కి; ఆ+మనుజ+ఇంద్రుతోన్= ఆ రాజుతో - ధర్మరాజుతో; పరమ= గొప్ప; శ్రేష్ఠము= ఉన్నతం; ఐన; ధర్మంబున్= ధర్మాన్ని; తెలియన్ వినుము; అని పల్కి; ఇట్లు; అనున్; మద్రనాథుండు= మద్రదేశానికి రాజైనవాడు - శల్యుడు; సత్యవతీ పుత్ర= సత్యవతి కుమారుడైన వ్యాసుడి; చరణములకున్= పాదాలకు; కేలు మొగిడ్చి= అంజలిఘటించి; ఎఱఁగి= నమస్కరించి; ఏ+దానిన్= దేనిని; ఎఱుఁగుట= తెలియటం; ఎఱుకల కెల్లనున్= అన్ని జ్ఞానాలలోకీ; ఎక్కుడు= ఎక్కువ; అని; సభక్తిక= భక్తితో కూడిన; సమ్మతిన్= ఇష్టంతో; ప్రార్థించి= ప్రార్థనాపూర్వకంగా; అడిగినన్= అడుగగా; ఆ+మహామునిి= ఆ మహర్షి; దయన్= కృపతో; అతనిన్= అతడిని; చూచి; విష్ణున్= శ్రీమహావిష్ణుని; ఎఱుఁగుట= తెలియుట; విమలబోధము= స్వచ్ఛమైన జ్ఞానం; అమలతర చరిత్ర= నిర్మలమైన నడవడి కలవాడా!; యజ్ఞమూర్తి= యజ్ఞమే ఆకారంగా కలవాడు; యజ్ఞకర్తృమూర్తి= యజ్ఞం చేసే యజమానుని స్వరూపుడు; యజ్ఞకలనమూర్తి= యజ్ఞమం దుండేవాడు; యజ్ఞఫలమూర్తి= యజ్ఞఫలమే ఆకారమైనవాడు; విష్ణుఁడు= విష్ణుమూర్తి; అతండు; కృష్ణుఁడు= ఆ కృష్ణుడే విష్ణువు;

తాత్పర్యం: అని చెప్పి మరల భీష్ము డిట్లా ధర్మరాజుతో అన్నాడు. 'నీవలెనే మద్రరాజు వ్యాసమహర్షి పాదాలకు నమస్కరించి జ్ఞానాలలో ఉత్తమజ్ఞానమే' దని అడిగితే ఆ మహర్షి చెప్పాడు; 'నిర్మలచరిత్రా! యజ్ఞమూర్తి, యజమానమూర్తి. యజ్ఞకలనమూర్తి, యజ్ఞఫలమూర్తియే విష్ణువు. అతడిని తెలియటమే ఉత్తమజ్ఞానం. ఆ విష్ణువే ఈ కృష్ణుడు.

వ. అని పల్కి యమ్మహాత్ముండు వెండియు శల్యున కిట్లనుఁ 'గృష్ణుండు వినుచుండఁ గొందఱు బ్రాహ్మణు లతని నుపలక్షించి, నాతో నిబ్బాలుండు యాదవుండైన వసుదేవునకుఁ గంసానుజయైన దేవకియందు జన్మించిన వాఁ; డితని నీవు క్రతుపురుషుండని కొనియాడుటకుఁ గతం బేమి? యని యడిగిన నన్నారాయణుండు నగుచు నన్నుఁ గన్గొని 'వీరలప్రశ్నంబునకు నుత్తరంబు దగనిత్తుగాక' యనిన నద్దేవునికిం బ్రణమిల్లి యే నిట్లంటి.164

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పల్కి= మాటాడి; ఆ+మహా+ఆత్ముండు= దొడ్డబుద్ధిగల వ్యాసమహర్షి; వెండియున్= ఇంకా; శల్యునకున్= మద్రరాజైన శల్యునకు; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; కొందరు, బ్రాహ్మణులు= కొందరు బ్రాహ్మణ జాతికి చెందినవారు; కృష్ణుండు= వాసుదేవుడు; వినుచుండన్= వింటూ ఉండగా; అతనిన్= ఆ శ్రీకృష్ణుని; ఉపలక్షించి= ఉద్దేశించి; నాతోన్= నాతో; ఈ+బాలుండు= ఈ పసివాడు; యాదవుండు= యదువంశంవాడు; ఐన= అయినట్టి; వసుదేవునకున్= వసుదేవుడనేవానికి; కంస+అనుజ= కంసుని చెల్లెలు; ఐన= అయిన; దేవకియందున్= దేవకి అనే స్త్రీయందు; జన్మించినవాఁడు= పుట్టినవాఁడు; నీవు; ఇతనిన్= ఇట్టి ఈ బాలుని; క్రతు పురుషుండు= యజ్ఞాత్మకుడైన వ్యక్తి; అని; కొనియాడుటకున్= పొగడటానికి; కతంబు= కారణం; ఏమి= ఏమిటి?; అని; అడిగినన్= ప్రశ్నింపగా; ఆ+నారాయణుండు= సాక్షాత్తు నారాయణుడే అయిన వాసుదేవుడు; నగుచున్= నవ్వుతూ; నన్నున్= నన్ను (వ్యాసుని) కన్గొని= చూచి; వీరలప్రశ్నంబునకున్= వీరిప్రశ్నకు; ఉత్తరంబున్= సమాధానాన్ని; తగన్= తగు విధంగా; ఇత్తు+కాక= ఇవ్వు; అనినన్= అంటే; ఆ+దేవునికిన్= దేవుడైన ఆ శ్రీకృష్ణునకు; ప్రణమిల్లి= సాష్టాంగదండ నమస్కారం చేసి; ఏను= నేను; ఇట్లు= ఈ విధంగా; అంటిన్= చెప్పాను.

తాత్పర్యం: వ్యాసమహర్షి ఇట్లా చెప్పి ఇంకా అన్నాడు; 'శల్యా! కొంతమంది బ్రాహ్మణులు ఒకసారి కృష్ణుడిని దృష్టిలో పెట్టుకొని ఆయనముందే నాతో అన్నారు. 'ఇతడు యాదవుడైన వసుదేవుడికీ, కంసుని చెల్లెలు దేవకికీ పుట్టినబాలుడు. ఇతడిని యజ్ఞపురుషుడైన విష్ణు వంటా వేమిటి?' అని. అది విని కృష్ణుడు నవ్వుతూ నాతో అన్నాడు; 'వీళ్ళ ప్రశ్నలకు సరిపోయే సమాధానం చెప్పుము' - అని అపు డా దేవుడికి నమస్కరించి నే నిట్లా అన్నాను.

వ. 'వేదమయుఁడు, వేదవేద్యుండు, వేదార్థ । విత్తమప్రియుండు, విష్ణుఁ డీతఁ
డిట్టిఁ డగుట, యాత్మ నెఱుఁగుట యుత్తమ । బ్రాహ్మణత్వసిద్ధి భవ్యులార!' 165

ప్రతిపదార్థం: భవ్యులు+ఆర!= ఉత్తములారా!; విష్ణుఁడు+ఈతఁడు= ఈ కృష్ణుడే విష్ణువు; వేదమయుఁడు= వేదములే స్వరూపంగా కలవాడు; వేదవేద్యుండు= ఆ వేదములచేతనే తెలియదగినవాడు; వేదార్థ= వేదాల అర్థాన్ని; విత్= తెలిసినవారిలో; తమ= శ్రేష్ఠులకు; ప్రియుండు= ఇష్టమైనవాడు; ఇట్టిఁడు= ఇటువంటివాడు (ఈ కృష్ణుడు); అగుటన్= కావటం; ఆత్మన్= మనసులో; ఎఱుఁగుట= తెలియటం; ఉత్తమ= గొప్ప; బ్రాహ్మణత్వ సిద్ధి= బ్రాహ్మణత్వాన్ని పొందటం.

తాత్పర్యం: 'బ్రాహ్మణత్వ సిద్ధికి ఫలమేమంటే - శ్రీకృష్ణుడే వేదమయుడు. వేదవేద్యుడు. వేదార్థం తెలిసిన పండితులకు ఇష్టుడైనవా డని తెలియటమే'.

వ. అనిన విని వారలు దద్భావనం గృతకృత్యులై 'రని చెప్పిన మద్రవిభుండు మానసంబు మాలిన్యరహితంబును బ్రసాద సహితంబును నయి చరితార్థుండయ్యెఁ; బాండవాగ్రజా! నీకు నీయర్థంబు విజ్ఞాతం బగుట యెఱుంగుదు, నైననుం బ్రజ్ఞావిశుద్ధి కరణం బాచరించితి' నని చెప్పుటయు నతం డత్యంత సంతుష్టాంత రంగుండై 'గరుత్మంతుండు మహానుభావుం డని విందు, నవ్విహగవిభుని వృత్తాంతంబు తెఱం గెఱుంగ వినవలతు వివరింపవే', యనుటయు నతం డచ్యుతునాలోకించి, 'యాసుపర్ణుండు నీవ కా వినియుండుదుం జెప్పెద' ననవుడు నప్పుండరీకాక్షుండు వికచవదనుండై 'యట్లచేయు; మిక్కురుపతి కోర్కి దీర్చుట కర్తవ్యం' బని పల్కిన, నా దేవవ్రతుండు భూవల్లభున కిట్లనియె. 166

ప్రతిపదార్థం: అనినన్; విని; వారలు= శ్రోతలు, విన్నవారు; తత్= (వ్యాసమహర్షి చెప్పిన కృష్ణ సంబంధమైన) దానియొక్క, అతడియొక్క; భావనన్= ఏకాగ్రధ్యానంచేత; కృతకృత్యులు+ఐరి= ధన్యులైరి; అని చెప్పినన్; మద్రవిభుండు= మద్రదేశరాజు, శల్యుడు; మానసంబు= మనస్సు; మాలిన్యరహితంబు= మలినం లేనిదీ; ప్రసాదసహితంబును= ప్రసన్నతతో కూడినదీ; అయి; చరిత+అర్థుండు= నెరవేరిన ప్రయోజనం కలవాడు (ధన్యుడు); పాండవ+అగ్రజా! పాండవులలో జ్యేష్ఠుడా! నీకున్= నీకు; ఈ అర్థంబు= ఈ విషయం (శ్రీకృష్ణుడే విష్ణువన్న జ్ఞానం); విజ్ఞాతంబు= తెలిసిందే; అగుట; ఎఱుంగుదున్= తెలియుదును; ఐననున్= ఐనప్పటికి; ప్రజ్ఞా= మేధాశక్తిని; విశుద్ధి కరణంబు= పరిశుద్ధం చేయటం; ఆచరించితిన్= చేశాను; అని; చెప్పుటయున్= చెప్పగా; అతండు= ధర్మరాజు; అత్యంత= మిక్కిలి; సంతుష్ట ఐ= అయి; సంతోషించిన; అంతరంగుండు= ఆత్మ కలవాడు; గరుత్మంతుండు, మహా+అనుభావుండు; అని విందున్= అని విన్నాను; ఆ+విహగ విభుని= ఆ పక్షిరాజు యొక్క; వృత్తాంతంబు= కథయొక్క; తెఱంగు= విధానం; ఎఱుంగన్= తెలిసికొనటానికి; వినన్ వలతున్= వినటానికి ఇష్టపడుతున్నాను; వివరింపవే= విశదీకరించవే (ప్రార్థన); అనుటయున్= అతండు; అచ్యుతున్= (సచ్చిదానంద స్వరూపం నుండి చ్యుతి లేనివాడు ఏమరుపాటు జారుపాటు లేనివాడు) శ్రీకృష్ణుడిని; ఆలోకించి= చూచి; ఆ సు+పర్ణుండు= ఆ గరుత్మంతుడు (గట్టి రెక్కలున్న వాడు) నీవకాన్= నీవే ఐనట్లు (నీవేనని); విని+ఉండుదున్= విని ఉన్నాను; చెప్పెదన్= తెల్పెదను; అనవుడున్= అని చెప్పినమీదట; ఆ+పుండరీక+అక్షుండు= తెల్లని తామరరేకులవంటి కన్నులున్నవాడు; వికచ= వికసించిన; వదనుండై= ముఖం కలవాడై; అట్లు+అ= ఆ ప్రకారమే; చేయుము; ఈ+కురుపతి= ఈ కౌరవరాజు యొక్క; కోర్కి+తీర్చుట; కర్తవ్యంబు= చేయవలసిన పని; అని పల్కినన్; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; భూవల్లభునకున్= భూమిపతికి, రాజుకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని వారా భావనతో ధన్యులైనారు 'అని చెప్పగా విన్న శల్యుడు స్వచ్ఛమైన మనస్సు కలవాడై - మహామాలిన్యాలన్నీ పోగా ధన్యుడైనాడు. ధర్మజా! నీకీ విషయం తెలిసిందే ఐనా నీ మనస్సును పరిశుద్ధం చేయటానికి ఇది చెప్పాను' అని చెప్పగా విని ధర్మరాజు 'గరుత్మంతుడు మహాత్ముడని విన్నాను. అతడి కథ వినాలని ఉన్నది చెప్పవా' అని ప్రార్థించాడు. భీష్ముడు శ్రీకృష్ణుడిని చూచి 'స్వామీ! నీవే ఆ గరుత్మంతుడవని విన్నాను' అన్నాడు. ఆయన కూడా తెల్లని కన్నులు విప్పారగా ముఖం వికసింప చేసికొని, 'మంచిది. ఈ రాజు కోర్కె తీర్చటం ముఖ్యం కనుక చెప్పు' మనగా, ఆ భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

భీష్ముఁడు ధర్మజునకు గరుత్మంతుని చరిత్రంబు చెప్పుట (సం. 13-19-1 (కుంభ))

సీ. 'కశ్యపు భార్యలు కద్రువ, వినత నాఁ। గల రాతపస్వి వారలకు వరము
గరుణ నిచ్చెద నన్నఁ గద్రువ వేవుర,। వినత యిద్దఱ, వేఁడికొనిరి సుతుల;
మునియు 'నట్లగుఁగాక' యనియెఁ; బదంపడి। యండముల్ వేయును, నండయుగము,
వరుసన, యా కద్రువకు వినతకుఁ బుట్టె,। నవి కుండముల నిడి, యరసి యుండి

తే. రహి సహస్ర మేనూఱేండ్లు నంత నుదయ। మయ్యె, నవ్వేయి గ్రుడ్డుల నధికబలముఁ
దేజమును గల్గి యా సర్పరాజి యొప్పు చుండె, నారెండు విరియక యుండె, మఱియు. 167

ప్రతిపదార్థం: కశ్యపుభార్యలు= తొమ్మిదిమంది ప్రజాపతులలో ఒకడగు కశ్యపుని యొక్క పత్నులు; కద్రువ, వినత; నాన్= అనగా; కలరు; ఆ తపస్వి= ఆ ముని; వారలకున్; వరము; కరుణన్= దయతో; ఇచ్చెదన్= ఇస్తాను; అన్నన్= అని పల్కగా; కద్రువ; వేవురన్= వేయిమందిని; వినత; ఇద్దఱన్; సుతులన్= కొడుకులను; వేఁడికొనిరి= కోరుకొన్నారు; మునియున్= కశ్యపుడును; అట్లు+అగుఁగాక= అట్లాగే అవుతుంది; అనియెన్; పదంపడి= తరువాత; అండముల్= గ్రుడ్లు; వేయునున్= వెయ్యి; అండయుగము= గ్రుడ్లయొక్క జత; వరుసన= క్రమంగా; ఆ కద్రువకున్; వినతకున్; పుట్టెన్; అవి= వాటిని; కుండములన్+ఇడి= కుండలలో పెట్టి; అరసి+ఉండిరి= రక్షించుకొంటూ ఉన్నారు. అహిసహస్రము= వేయి పాములు; ఏనూఱు+ఏండ్లు+అంతన్= ఐదువందలసంవత్సరాల తరువాత; ఆ+వేయి గ్రుడ్డులన్= ఆ వేయి గ్రుడ్లనుండి; ఉదయము+అయ్యెన్= జన్మించాయి; అధికబలము= మిక్కిలి బలం, శరీరబలం; తేజమును+కల్గి= ప్రాణశక్తి కల్గి; ఆ సర్పరాజి= ఆ పాముల సమూహం; ఒప్పుచున్+ఉండెన్= ప్రకాశిస్తూ ఉండింది; మఱియున్= ఇంకా; ఆ+రెండున్= వినతగ్రుడ్లు రెండూ; విరియక= పిగులక; ఉండెన్= ఉన్నాయి;

తాత్పర్యం: కద్రువ, వినత కశ్యపబ్రహ్మకు భార్యలు. వారికి దయతో 'వరా లిస్తాను కోరుకొ'మ్మన్నాడు ముని. కద్రువ వేయిమంది, వినత ఇద్దరు కొడుకులు కావాలని వేడుకొన్నారు. ఆయన 'అట్లాగే జరుగుతుం దని అన్నాడు. తర్వాత కద్రువకు వేయి, వినతకు రెండు గ్రుడ్లు కలిగితే వారు వాటిని కుండలలో పెట్టి కాపాడుతున్నారు. ఐదువందలేండ్లు గతించినాక కద్రువ వేయిగ్రుడ్ల నుండి వేయి పాములు పుట్టి అధికబలము, తేజస్సుతోను పెరుగుతుండగా, వినతగ్రుడ్లు రెండు పగలనేలేదు.

క. తన సవతి యైన కద్రువఁ। గని వగపును మత్సరంబుఁ గదిరెడు మదితో
వినత గడున్ వేగిరపడి। యనీతి నొకయండ మవియ నడిచె నరేంద్రా! 168

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ప్రజలకు పతివైన రాజా!; వినత; తన సవతిన్ కద్రువన్ కని= సపత్నిఅయిన కద్రువను చూచి; వగపు= దుఃఖం (తనకు సంతానం కలుగలేదని); మత్సరంబున్= అసూయ (దానికి కలిగారని); కదిరెడు= వ్యాపించిన; మదితోన్= మనస్సుతో; కడున్= మిక్కిలి; వేగిరపడి= తొందరపడి; అనీతిన్= నీతిమాలి; ఒకఅండము= ఒక గ్రుడ్డు; అవియన్= పగులునట్లుగా; అడిచెన్= కొట్టింది.

తాత్పర్యం: రాజా! సవతి కద్రువను చూచి దుఃఖం, అసూయ కలుగగా వినత తొందరపడి ఒక గ్రుడ్డు పగులకొట్టింది. ఇది నియమాన్ని తప్పటం (సృష్టి నియమాన్ని కాదనటం. ఆ గ్రుడ్లు వాటంతటవే పిగిలి పిల్లలు పుట్టాలి తప్ప పగులకొట్టితే ఎట్లా? అది అనీతి)

వ. అడిచిన నందు. 169

ప్రతిపదార్థం: అడిచినన్= పగులగొట్టగా; అందున్= అందులోనుండి.

తాత్పర్యం: పగులగొట్టగా అందులోనుండి.

క. పులుఁగొక్కఁడు పూర్వాంగము । గలిగి జనించుటయు, వానిఁ గని, యానతి గ
న్నుల నశ్రుకణంబులు పె । ల్లొలుకఁగ శోకమున మునుఁగు నుల్లముతోడన్. 170

ప్రతిపదార్థం: పులుఁగు= పిట్ట; ఒక్కఁడు= ఒకటి; పూర్వ+అంగము= పై శరీరం; కలిగి; జనించుటయున్= పుట్టగా; ఆ సతి= ఆ వినత; వానిన్+కని= అర్ధశరీరం గల కొడుకును చూచి; కన్నులన్= కళ్ళనుండి; అశ్రుకణంబులు= కన్నీటిబొట్లు; పెల్లు= ఎక్కువ; ఒలుకఁగన్= కారగా; శోకమునన్= దుఃఖంలో; మునుఁగు= మునిగిన; ఉల్లముతోడన్= మనస్సుతో;

తాత్పర్యం: ఊర్ధ్వశరీరం మాత్రం కల పక్షి పుట్టింది. ఆ తల్లి ఆ కొడుకును చూచి కన్నీళ్ళు కారుస్తూ దుఃఖంలో మునిగిపోయిన మనస్సుతో (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. నివ్వెఱపడి యుండ నయ్యండజంబు. 171

ప్రతిపదార్థం: నివ్వెఱపడి= నిశ్చేష్టురాలై; ఉండన్= ఉండగా, నిలబడి పోగా; ఆ+అండజంబు= ఆ గ్రుడ్డు నుండి పుట్టినపక్షి.

తాత్పర్యం: నిశ్చేష్టురాలై ఉండగా ఆ గ్రుడ్డునుండి పుట్టిన పక్షి.

చ. 'ఇరువుర మేము పుట్టుదు మహీనపు మేనులతో, మహాబల
స్ఫురణ వెలుంగ నప్పెనుపుఁ బొందఁగ నీ కవియించి తిట్లు మ
త్సరమునఁ జాపలంబునను దత్ఫల మందుము, నీ సపత్నికిన్
వరవుడవై చరింపు మని, వారని నెవ్వగ శాప మిచ్చినన్. 172

ప్రతిపదార్థం: మేము; ఇరువురము= ఇద్దరం; పుట్టుదుము= పుట్టేవాళ్ళం; అహీనపు= గొప్ప, తక్కువకాని; మేనులతోన్= శరీరాలతో; మహాబల స్ఫురణ = గొప్ప బలకాంతి; వెలుంగన్= ప్రకాశించగా; ఆ+పెనుపు= ఆ అభివృద్ధి; పొందఁగ నీక= పొందకుండా; అవియించితి (వి)= పగులగొట్టావు; ఇట్లు= ఈ విధంగా; మత్సరమునన్= అసూయతో; చాపలంబునను= చాపల్యంతో; తత్= దానికి; ఫలము= ఫలితం; అందుము= గ్రహించుము; నీ; సపత్నికిన్= సవతికి; వరవుడవై= దాసివై;

చరింపుము= బ్రతుకు; అని; వారని= మళ్ళించరాని; నెఱ+వగన్, నెవ్వగన్= నిండు దుఃఖంతో; శాపము= శాపాన్ని; ఇచ్చినన్= ఇవ్వగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: మహాబలవంతులమై గొప్ప శరీరాలతో ఇద్దరం పుట్టేవాళ్ళం. ఆ పరిణతిని పొందనివ్వకుండా చేశావు. కేవలం నీ సవతిపై నున్న అసూయా, చపలత్వంవలన. కనుక దానికి ఫల మనుభవించుము. 'నీ సవతికి దాసివై బ్రతుకు' మని తీరని దుఃఖంతో శపించాడు.

క. వెలవెలఁ బాఱుచు, వడఁకుచు । నలుకుచుఁ, దనమోముఁ జూచు నయ్యంగన న
ప్పులుఁగు కృపఁ జూచి, తల్లీ! వలవ దడల నిది విధాతృ వశమయి వచ్చెన్. 173

ప్రతిపదార్థం: వెలవెల+పాఱుచున్= పాలిపోతూ (ముఖాన కత్తివేటుకు నెత్తురు చుక్క లేకపోవటం); వడఁకుచున్= వణకుతూ; అలుకుచున్= (గాలికి చిగురాకువలె) భయంతో కంపిస్తూ; తన మోమున్= తన ముఖాన్ని; చూచు=చూస్తున్న; ఆ+అంగనన్= ఆ తల్లిని; ఆపులుఁగు= ఆ పక్షి; కృపన్= జాలితో; చూచి; తల్లీ= అమ్మా! (ప్రేమతో పిలిచిన పిలుపు;) అడలన్ వలదు= భయపడవద్దు; ఇది = ఈ శాపం; విధాతృ వశమయి= బ్రహ్మ (కర్మ) అనుసారంగా; వచ్చెన్= దాపురించింది.

తాత్పర్యం: పాపం సవతిసంతానాన్ని చూచి వాపోయి ఈ పనిచేస్తే జరిగింది. సరిగా అవయవాలు ఏర్పడకుండానే కొడుకు పుట్టాడు. తనను సరిగా పెరగనివ్వకుండా చేసిన తల్లి మాత్సర్యం, దుఃఖచాపల్యం చూచి కొడుకుకు కోపం వచ్చి శపించాడు. అట్లా పుట్టిన కొడుకును చూచి దుఃఖపడింది. ఆ తల్లి; కొడుకు శాపానికే భయపడుతుందా? ఈ సంకటంలో ఆమె తెల్లబారిపోయింది. వణికింది, భయంతో కంపించిపోయింది. అమాయకురాలైన ఆ తల్లి 'నాయనా! నన్నా శపించా' వన్నట్లు తన ముఖాన్ని చూస్తూ నిలబడిపోతే కొడుకు గుండె కరిగి నీరై పోయింది. 'అమ్మా! ఇది సృష్టికర్త సంకల్పంవలన వచ్చింది. భయపడకుము' అని ఓదార్చాడు.

విశేషం: ఒక చిన్న పద్యంలో మహాకవి ఎంత శోచనీయస్థితిని సృష్టించాడు. తల్లీ కొడుకులు ఎట్లాంటి పరిస్థితులలో చిక్కుకుపోయారు. అంత విచిత్ర పరిస్థితిని కల్పించిం దెవరు? సృష్టికర్త తప్ప. దానికి లోబడిన లోకం అనుభవించటంకంటె చేసేదేముంది? ఆ బ్రహ్మ సంకల్పం ఈ నాటకం. సుఖమూ, దుఃఖమూ కలది.

వ. అని వెండియు. 174

తాత్పర్యం: మళ్ళీ ఇంకా.

శా. 'ఏనూఱేండ్లకుఁ బుట్టు నాయనుజుఁ; డిం కీయున్న యండంబు నె
ట్లైనన్ ధైర్యము గల్గి కావుము ప్రయత్నాసక్తివై వాఁడు ద
ర్వానూనుండు బలాభిరాముఁడు మదీయస్ఫూర్తి మన్మూర్తి నీ
కానందంబుగ నీఁగు దాస్యము త్రిలోకాశ్చర్య సంపాదియై. 175

ప్రతిపదార్థం: నా= నాయొక్క; అనుజుఁడు (అనుసరించి పుట్టేవాడు) తమ్ముఁడు; ఏనూఱు= ఐదువందలు; ఏండ్లకున్= సంవత్సరాలకు; పుట్టున్= పుట్టగలడు; ఇంకన్= ఇక; ఈ ఉన్న= ఈ మిగిలిన; అండంబున్= రెండో గ్రుడ్డును; ఎట్లు+ఐనన్=

ఎట్లాగైనా; ధైర్యము కల్గి= ధైర్యంతో; ప్రయత్న+ఆసక్తిమైన్= ప్రయత్నంతో; కోర్కెతో, ప్రయత్న పూర్వకమైన ఆసక్తి గలిగి; కావుము= రక్షించుము; వాఁడు= ఇక ఆ పుట్టబోయేవాడు; దర్ప+అనూనుండు= గొప్ప దర్పం (దర్జా) కలవాడు; బల+అభిరాముండు= బలంతో అందమైనవాడు; మదీయ= నా యొక్క; స్ఫూర్తిమత్= తేజస్సు కల; మూర్తి= ఆకారం కలవాడు; త్రిలోక= ముల్లోకాలకు; ఆశ్చర్య= అబ్బురపాటును; సంపాది+ఐ= కల్గించగలవాడై; నీకున్; ఆనందంబుగన్= సంతోషం కలిగేటట్లు; దాస్యమున్= బానిసతనాన్ని; ఈఁగున్= పోగొట్టును.

తాత్పర్యం: ఈ ఉన్న గ్రుడ్డునైనా జాగ్రత్తగా కాపాడుకొమ్ము. ఇంకా ఐదువందల ఏండ్లు గడచిన తరువాత నాకు తమ్ముడు జన్మిస్తాడు. ఆ పుట్టే వాడున్నాడే వాడు మహా దర్పం కలిగి గొప్ప బలశాలియై, నా తేజస్సునంతా తాను పొందిన ఆకారంతో జన్మించి, ముల్లోకాలకు ఆశ్చర్యం కలిగిస్తూ, నీకానందం కలిగిస్తూ, నీ దాస్యాన్ని పోగొట్టుతాడు.

విశేషం: పై పద్యంలో తల్లిని శపించాడు. ఈ పద్యంలో తల్లిని ఓదారుస్తున్నాడు. అందుకే పెద్ద పద్యం. పుట్టే తమ్మునిమీద ప్రేమకొద్దీ పెద్ద మాటలతో వాడిని పొగడుతున్నాడు. అట్లాంటివాడు జన్మిస్తాడు. పుట్టి తల్లికి కలిగిన దాస్యాన్ని పోగొట్టుటే కాక ముల్లోకాలకు ఆశ్చర్య కారకుడౌతాడు. కనుక ఐదువందల ఏళ్ళు ఎట్లాగైనా ఓపిక పట్టుమని తల్లిని ఓదార్చటం పద్యభావం. పుట్టబోయే గరుత్మంతుడిని పరిచయం చేయటం రాబోయేపాత్రను ముందుగానే మరొక పాత్రతో పరిచయం చేసినట్లు. చాలా గొప్ప పద్యం. పై పద్యంలో దుఃఖం. ఈ పద్యంలో ఆనందం. వెరసి మానవజీవితం.

వ. అనియె; నిట్లు ప్రథమ పుత్రుండు వికలాంగుం డగుటకును, శాపప్రాప్తికిని, బరమనిర్వేదంబు నొంది, వినతయు నవ్విహంగంబు నిర్దేశించిన కాలంబు ప్రతీక్షించి, యయ్యండంబు రక్షించి కాచియుండం, దత్సమయ సమాగమంబున. 176

ప్రతిపదార్థం: అనియెన్= అని చెప్పాడు; ఇట్లు= ఈ విధంగా; ప్రథమపుత్రుండు= పెద్దకొడుకు; వికల+అంగుండు= సరిగా పెరగని అవయవాలు కలవాడు (కుంటివాడు); అగుటకును; శాపప్రాప్తికిని= శాపం కలిగినందుకూ; పరమ= చాలా గొప్ప; నిర్వేదంబు= దుఃఖం; ఒంది= పొంది; ఆ+విహంగంబు= ఆ పక్షి (పెద్దకొడుకు); నిర్దేశించిన= చెప్పిన; కాలంబు= ఐదువందల ఏండ్లు; ప్రతీక్షించి= ఎదురుచూచి; ఆ+అండంబున్= ఆ గ్రుడ్డును; రక్షించి= కాపాడి; కాచియుండన్= కనిపెట్టుకొని ఉండగా; తత్= ఆ, ఐదువందల ఏళ్ళ; సమయ= కాలం; సమాగమంబునన్= రాకతో.

తాత్పర్యం: ఈ విధంగా పెద్దకొడుకు వికలాంగుడు కావటం - శాపం రావటంతో గుండె చెదరిపోయిన తల్లి ఆ పెద్దకొడుకు చెప్పిన కాలంకొరకు నిరీక్షిస్తూ ఆ గ్రుడ్డును కాపాడుతూ ఉండగా, కాలం తిరిగి వచ్చింది. (ఐదువందల ఏళ్ళు గడచిపోయాయి)

చ. ఘనతరకంధరుండు, దృఢకాయుఁడు, దీప్తముఖుండు, రక్తలో
చనుఁడు, మహోత్తమాంగకుఁడు, చారుసుసంగత పక్షసారమం
డనుఁడు, పరిస్ఫుర ద్ద్యుతి విడంబిత బాలదివాకరుండు, లో
కనయన పర్వనిర్వహణకారి సుపర్ణుఁడు పుట్టె భూవరా! 177

ప్రతిపదార్థం: భూవరా!= భూమికి రాజా!, సుపర్ణుఁడు= మంచి రెక్కలు గలవాడు, గరుత్మంతుడు; ఘనతర= చాలాగొప్ప; కంధరుండు= మెడ కలవాడు, బలిసిన మెడ కలవాడు; దృఢ= బలిష్ఠమైన; కాయుఁడు= శరీరం కలవాడు; దీప్త= కాంతితో

వెలిగే; ముఖుండు= ముక్కు కలవాడు, (ముఖం కలవాడు); రక్త= నెత్తురువలె ఎర్రని; లోచనుఁడు= నేత్రాలున్నవాడు; మహా+ఉత్తమ+అంగకుఁడు= గొప్ప తల కలవాడు; చారు= అందంగా; సుసంగత= కూడిన - పొందిపొసగినట్లున్న; పక్ష= రెక్కల; సార= సారం, శక్తి; మండనుఁడు= అలంకారంగా కలవాడు; పరి= మిక్కిలిగా; స్ఫురత్= ప్రకాశించే; ద్యుతి= కాంతితో; విడంబిత= పోలిన; బాలదివాకరుండు= బాలసూర్యుడు; లోక= ముల్లోకాల; నయన= నేత్రాలకు; పర్వ= పండుగను; నిర్వహణ= నిర్వహించటం; చక్కగా మోయటం; కారి= చేసేవాడు; (పర్వ నిర్వహణకారి= పండుగను కల్పించటం చేసేవాడు;) పుట్టెన్= జన్మించాడు.

తాత్పర్యం: ధర్మరాజా! గరుత్మంతుడు (రెక్కలు కలవాడు) జన్మించాడు. (అత డెట్లా ఉన్నాడంటే) అతడు బలిసినమెడతో; బలిష్ఠమైన దేహంతో, అగ్నివలె జ్వలించే ముఖంతో, ఎర్రని నేత్రాలతో, కాంతితో ప్రకాశించే బాలసూర్యుడి వంటివాడు, సర్వలోకాల నేత్రాలకు పండుగను కల్పించేవాడు (ఆనందదాయకుడు) ఐనవాడు.

విశేషం: పద్యమంతా సుపర్ణుడి గొప్ప ఆకారాన్ని వర్ణిస్తున్నది. 175వ పద్యంలో చెప్పినట్లుగా ఒక మహాపురుషుడి ఆకార విశేషం ఇందులో వర్ణించబడింది. కనుక పద్యరచనలో ఒక సాంద్రత కన్పిస్తుంది. బిగువుగా నడుస్తుంది పద్యం. ఆ బిగువంతా మహా పురుషుడి గొప్పతనానికి సంకేతం.

క. ఆ సమయంబున నరుణో । ద్భాసిత గాత్రుండు, తొలుతపట్టి యరుణుఁ డు
ల్లాసి యగుచు రవి పరిచ । ర్యాసుఖ మెదఁ గోరి చనియె నంబరవీథిన్. 178

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ సమయంలో; అరుణ= ఎర్రని కాంతితో; ఉత్+భాసిత= చక్కగా ప్రకాశించే; గాత్రుఁడు= శరీరం కలవాడు; తొలుత పట్టి= వినత మొదటి కొడుకు; అరుణుఁడు= ఆ పేరు కలవాడు; ఉల్లాసిఅగుచున్= సంతోషిస్తూ; రవి= సూర్యుడి; పరిచర్యా= సేవా; సుఖము= సుఖాన్ని; ఎదన్= మనస్సులో; కోరి= కోరుకొని; అంబరవీథిన్= ఆకాశమార్గంలో; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ వేళ ఎర్రని శరీరం కల వినత మొదటి కొడుకు అరుణుడు సంతోషించి, సూర్యుడిని సేవించటానికి ఇష్టపడి ఆకాశంలో ఎగిరిపోయాడు. (తమ్ముడు పుట్టేంతవరకు తల్లిని కాపాడుకొంటూ తోడుగా ఉన్నాడని భావం.)

మ. జననిం బాసి జనించునప్డ తనయిచ్ఛం బక్షినాథుండునుం
జని, పద్మోద్భవకల్పితంబు లగు భోజ్యంబుల్ శరీరంబు వ
ర్ధన మొందింపఁగ సిద్ధసాధ్యగణముల్ దన్ ముద్దు సేయంగఁ గ్రీ
డన లోలత్వమునం జరించుఁ బరితుష్టస్వాంతుఁడై యెల్లెడన్. 179

ప్రతిపదార్థం: జనించునప్డు+అ= పుట్టినప్పుడే; పక్షినాథుండునున్= పక్షులకు రాజైనవాడు; జననిన్= తల్లిని; పాసి= వదలి; తన= తన యొక్క; ఇచ్ఛన్= ఇష్టానుసారంగా; కోర్కెతో; చని= వెళ్ళి; పద్మ+ఉద్భవ= పద్మంనుండి పుట్టిన బ్రహ్మచేత; కల్పితంబులు= సృష్టిచేయబడిన; భోజ్యంబుల్= ఆహారాలు; శరీరంబున్= దేహాన్ని; వర్ధనమున్= పెరుగుదలను; ఒందింపఁగన్= పెంపొందింపగ చేయగా; ఎల్లెడన్= ఎల్ల యెడల; పరితుష్ట = సంతుష్టి పొందిన; (స+అంత= స్వాంతము= మనస్సు (లోపలిది)) స్వాంతుఁడై= మనస్సు కలవాడై; సిద్ధ, సాధ్య గణముల్= సిద్ధుల, సాధ్యుల (దేవతలలో జాతులు) సమూహాలు; తన్= తనను; ముద్దుచేయంగన్= ముద్దు చేస్తుండగా; క్రీడన= ఆటలపై; లోలత్వమునన్= ఆసక్తితో; చరించున్= విహరిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: గరుత్మంతుడు పుట్టినప్పుడే తల్లిని వదలి తన ఇష్టానుసారంగా బ్రహ్మ సృష్టించిన ఆహారానికై లోకాలన్నీ క్రీడగా విహరిస్తుంటే; సిద్ధ సాధ్యులైన దేవతలందరు తనను ముద్దు చేస్తుండేవారు.

వ. అక్కాలంబున వినోదంబునకై యరిగి యొక్క యెడ. 180

ప్రతిపదార్థం: ఆ+కాలంబునన్= ఆ సమయంలో; వినోదంబునకై= ఆటకై; అరిగి= వెళ్ళి; ఒక్క ఎడన్= ఒకచోట.

తాత్పర్యం: ఆ సమయంలో ఆటకై వెళ్ళి ఒకచోట. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. చంచులఁ జిగురాకుఁ జించియాడుచు నలి । నెలుఁగించు గండుఁగోయిలలసొంపు,
నలరుఁ దేనియఁ గ్రోలి, యన్ను సోలంబుల । మురియు తేఁటుల నునుమ్రోఁత యింపుఁ,
దమిఁ బండ్ల రసమాని తమలోనఁ జెలఁగుచుఁ । బలికెడు రాచిల్క పటురవంబు,
గొలఁకుల కెలఁకులఁ గూడి క్రీడించుచుం । డెడు నంచతండంబు నడబెడంగుఁ,

తే. దరఁగఁ దేలుచుఁ, బూఁదీవఁ దగులఁ బడుచు । వచ్చు చిఱుగాలి సోఁకును, మెచ్చి మెచ్చి,
తగిలి కొనియాడుచును, వినతయును గద్రు । వయును మున్నీటి చేరువ వనమునందు. 181

ప్రతిపదార్థం: చంచులన్= ముక్కులతో, చిగురాకున్= చివురాకులను; చించి= చీల్చి; ఆడుచున్= ఆడుతూ; నలిన్= ప్రేమతో; సన్నగా; ఎలుఁగించు (ఎలుఁగు+ఇంచు)= కూసే, పాడే; గండుకోయిలల= మగకోకిలల; సొంపున్= అందాన్ని; అలరుఁదేనియన్= పూలతేనెను; క్రోలి= త్రాగి; అన్ను= అందమైన; సోలంబులన్= కుత్తుకలతో; మురియు= మురిసిపోతున్న; తేఁటుల= తుమ్మెదల; నును= సన్నని; సుకుమారమైన; మ్రోఁత= ధ్వని; ఇంపున్= అందమున్నూ; తమిన్= కోర్కెతో; పండ్లరసము= పళ్ళరసాలను; ఆని= త్రాగి; తమలోనన్= తమలో తాము; చెలఁగుచున్= ఏపురేగి, విజృంభించి; పలికెడు= పలుకుతున్న; రాచిల్క= రాజచిలుకలయొక్క; ముక్కు ఎరుపు; దేహం పచ్చదనం); పటురవంబున్= పటిష్ఠమైన స్వరం; కొలఁకులన్= చెరువులలోనూ; కెలఁకులన్= వాటిప్రక్కలా; కూడి= కూడుకొని; క్రీడించుచుండెడు= ఆడుకొంటున్న; అంచతండంబు= హంసల గుంపుల; నడ= నడకల; బెడంగున్= అందాలనూ; తరఁగన్= తరగలమీదుగా; తేలుచున్= తేలిపోతూ; పూఁదీవన్= పూలతీగలో; తగులన్‌బడుచున్= చిక్కుకుపోతూ; వచ్చు= వచ్చే; చిఱుగాలి= లేతగాలి; సోఁకునున్= స్పర్శను; మెచ్చిమెచ్చి= తెగమెచ్చుకొంటూ; తగిలి= ఆసక్తితో; కొనియాడుచున్= ప్రశంసిస్తూ; మును+నీటి= సముద్రంయొక్క; చేరువ= దగ్గరలో ఉన్న; వనమునందున్= తోటలో; వినతయును, కద్రువయును= సవతులిద్దరూ.

తాత్పర్యం: మదించిన మగ కోకిలలు ముక్కులతో చిగురాకులను చీలుస్తూ ఆడుతూ గొంతెత్తి పాడుతున్నాయి. వాటి పాటల అందాలనూ, పూల తేనెలు త్రాగిన మత్తుతో మురిసే తుమ్మెదల ఝుంకారాల అందాలనూ, పండ్లరసం త్రాగి తమలో చెలరేగుతూ అరుస్తున్న చిలుకగుంపుల ధ్వనులున్నూ, చెరువులలోనూ, వాటి చుట్టుపట్లా కూడి మాడి ఆటలాడే హంసల గుంపుల నడకల అందాలనూ, కెరటాలు కెరటాలుగా వస్తూ, తీగెలలో చిక్కుపడుతూ వచ్చే లేతగాలి స్పర్శకు ఆనందిస్తూ సముద్రతీరంలో ఉన్న చెట్ల తోపులలో వినత కద్రువలనే సవతులిద్దరూ. (క్రింది వచనంతో అన్వయం)

విశేషం: ఇది చాలా గొప్ప వర్ణన.

వ. మెలఁగుచుండి రట్టియెడ. 182

విశేషం: విహరిస్తున్న సమయంలో.

చ. కరువునఁ బోసిరో! విధుని కాంతి, సుధాబ్ధి తరంగఁ దెచ్చి, గం
డరు వొనరించిరో! హరుజటాస్థలికిం దొడ వైన యేటి పె
న్నురువునఁ జేసిరో! యన మనోజ్ఞ సితచ్ఛవి నుల్లసిల్లు సుం
దర తురగోత్తమంబు దవుదవ్వులఁ గాంచిరి చారులోచనల్. 183

ప్రతిపదార్థం: చారు= అందమైన; లోచనల్= కన్నులున్న కద్రూవినతలు; దవు దవ్వులన్= అల్లంత దూరంలో; విధుని కాంతి= చంద్రుడి వెలుగును; కరువునన్= మూసలో; పోసిరో?= పోసినారా!; సుధాబ్ధి తరంగన్= పాలసముద్రం అలను; తెచ్చి= తీసికొని వచ్చి; గండరువు= పడియచ్చు; ఒనర్చిరో?= చేశారా?; హరు= శివుడియొక్క; జటాస్థలికిన్= జడలప్రదేశానికి; తొడవు= అలంకారం, భూషణం; ఐన= అయినటువంటి; ఏటి= గంగయొక్క; పెన్+నురువునన్= పెద్ద నురుగుదిబ్బతో; చేసిరో!= చేశారో; అనన్= అన్నట్లుగా; మనోజ్ఞ= మనస్సును హరించే; సిత= తెల్లని; ఛవిన్= కాంతితో; ఉల్లసిల్లు= ప్రకాశించే; సుందర= అందమైన; తురగ+ఉత్తమంబు= శ్రేష్ఠమైన గుర్రాన్ని; దవుదవ్వులన్= అల్లంతదూరంలో; కాంచిరి= చూచారు

తాత్పర్యం: (పద్యమంతా అందమైన తెల్లని గుర్రం వర్ణన. ఆ తెలుపు ఎంత అందంగా ఉన్నదంటే) చంద్రకాంతిని మూసలో పోసి చేసినట్లు, పాలసముద్రపు అలను తెచ్చి శిల్పంగా చెక్కినట్లు, శివుడి జడల కలంకారమైన దేవతా గంగలోని నురుగుతో చేసినట్లు ఆశ్చర్యంగా ఉన్న ఆ గుర్రాన్ని అల్లంతదూరంలో అందమైన కళ్ళతో ఆస్వాదించారు.

విశేషం: ఇవన్నీ అందమైన ఉత్ప్రేక్షలు.

వ. నిజేచ్ఛమై వచ్చిన యుచ్చైశ్శ్రవంబు నాలోకించి. 184

ప్రతిపదార్థం: నిజ= తనయొక్క; ఇచ్ఛమైన్ = కోర్కెతో; వచ్చిన; ఉచ్చైశ్శ్రవంబున్= ఇంద్రుడి గుర్రాన్ని; (ఉచ్చైః= పైకి నిగిడి ఉన్న; శ్రవంబు= చెవులు కలది); ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఇష్టానుసారంగా వచ్చిన ఇంద్రుడి అశ్వమైన ఉచ్చైశ్శ్రవాన్ని చూచి.

క. వినత 'హయ మింత యొప్పునె । యనూన ధవళప్రభాఢ్యమై' యని పలుకన్
విని, కద్రువ 'యపరాంగం । బున నీలిమ దోఁచె' ననియె భూపవరేణ్యా! 185

ప్రతిపదార్థం: భూప= భూమిపతులలో; వరేణ్యా!= శ్రేష్ఠుడా!; వినత; అనూన= అతిశయమైన; మిక్కిలి; ధవళ= తెల్లని; ప్రభా= కాంతితో; ఆఢ్యమై= కలిగినదై; హయము= గుర్రం; ఇంత ఒప్పునె!= ఇంత అందంగా ఉన్నదే; అని; పలుకన్= పలుకగా;; విని; కద్రువ; అపర+అంగంబునన్= చివరి అవయవంలో; తోకమీద, నీలిమ= నలుపు; తోఁచెన్= కనిపిస్తున్నది; అనియెన్= అని పలికింది.

తాత్పర్యం: వినత అన్నది: 'అబ్బా! ఇంత తెల్లని కాంతితో గుర్రం ఎంత అందంగా ఉన్నదే'? అని అంటే విని కద్రువ అన్నది; 'తోక నల్లగా ఉన్నది కదా!' అని.

చ. అనవుడు నమ్మృగాక్షి 'యిటు లాడితి, నవ్వుల కాడితో? నిజం
బునకునొ? నీదు చూపునకుఁ బోలిన భంగియొ? చెప్పు' మన్న న
వ్వనిత దరస్మితస్ఫురితవక్త్రముతో 'నిది యేటి మాట? న
ల్లనియెడ గానరాదె? తెరలం బలుకం బని యేమి? నావుడున్. 186

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా, అట్లా అంటే; ఆ+మృగ+అక్షి= ఆ లేడికన్నులవంటి కన్నులు కలది - వినత; ఇటులు= ఈ విధంగా; ఆడితి= అన్నావు; నవ్వులకున్= నవ్వులాటగా; ఆడితో(తివి+ఓ)?= అన్నావా?; నిజంబునకునొ?= నిజంగానేనా?; నీదు= నీ; చూపునకున్= దృష్టికి; పోలిన భంగియొ?= ఉచితరీతియా?, తగిన విధానమా? (నీ కళ్ళ కట్లా కన్పిస్తున్నదా?); చెప్పుము= చెప్పుము; అన్నన్= అనగా; ఆ+వనిత= ఆ స్త్రీ, కద్రువ; దర= కొంచెం; స్మిత= లేతనవ్వు; స్ఫురిత= స్ఫురించిన, కన్పించిన; వక్త్రముతోన్= ముఖంతో; ఇదిఏటిమాట?= ఇదేం మాట? నల్లని+ఎడ= నల్లనిచోటు; కానరాదె?= కన్పించదా? తెరలన్+పలుకన్= కాదనటం, అబద్ధం చెప్పటం; పని ఏమి= ఏమిపని?; నావుడున్= అనగా.

తాత్పర్యం: అట్లా అనేసరికి, వినత అన్నది 'నవ్వులాటగా అన్నావా? లేక నిజంగా నీ చూపున కట్లాగే కనిపిస్తున్నదా?' అని ప్రశ్నించగానే ఆమె చిన్నగా నవ్వుతూ 'నీవన్నమాట కాదనవలసిన అవసర మేమిటి? అదిగో నల్లగా ఉన్న ప్రదేశం కన్పించటంలేదా?' అని అనగానే. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: వినత అమాయకురాలు కనుక మృగాక్షి. లేడి అమాయక జంతువు. కనుకనే ఉన్న మాట అన్నది. కద్రువ మోసగత్తె. కనుకనే సన్నగా నవ్వింది. ఆ నవ్వు మోసగాళ్ళ లక్షణమని చెప్పటానికే కవి వ్రాశాడు.

వ. వినత తెలియం జూచి. 187

ప్రతిపదార్థం: వినత; తెలియన్= తెలిసేటట్లుగా; చూచి= మళ్ళీ చూచి.

తాత్పర్యం: ఆమె అట్లా అనేసరికి స్పష్టంగా చూచింది వినత.

ఉ. కాదని పూని పల్కుటయుఁ గద్రువ 'పన్నిద మేమి దీనికి?
న్వా దిది యేల? రిత్త' యనినన్ విని యాసతి 'నిక్కమేని నీ
వేది పణంబుగాఁ దలఁచి యేర్పడఁ జెప్పితి దాని కేను సం
వాదము సేయుదాన గరువంబుగ నొక్కటి నిశ్చయింపుమా!' 188

ప్రతిపదార్థం: కాదు+అని= వినత ఆ విధంగా చూచి నీ వన్నది కాదు అని; పూని= నిశ్చయంగా; పల్కుటయున్= అనగానే; కద్రువ; పన్నిదము+ఏమి?= ఏమి పందెం?; దీనికిన్= ఈ విషయానికి; వాదు ఇది= ఈ వివాదం; రిత్త= వ్యర్థంగా; ఏల?= ఎందుకు?; అనినన్= అనగా; ఆ సతి= ఆ వినత; విని; నిక్కము= సత్యం; ఏని= అయితే; నీవు; ఏది; పణంబుగాన్= పందెంగా; తలఁచి= ఆలోచించి; ఏర్పడన్= స్పష్టంగా; చెప్పితి(వి)= చెప్పుతావో; దానికిన్; ఏను; సంవాదము= అంగీకారం; చేయుదానన్= చేస్తాను; గరువంబుగన్= సగర్వంగా; ఒక్కటి= ఏదో ఒకటి; నిశ్చయింపుమా!= నిర్ణయించుము.

తాత్పర్యం: వినత కద్రువతో 'నీవు చెప్పినది సరికాదు' అన్నది. దానికి కద్రువ 'ఈ వివాదం వ్యర్థంగా దేనికి?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక పందెం వేయుము' అన్నది. దాని కా వినత 'నీవేది పందెంగా నిర్ణయిస్తావో దానికి నేనంగీకరిస్తాను. కనుక పందె మేదో ఒకటి నిశ్చయించుము' అన్నది.

వ. అనిన విని కద్రువ వినత వదనంబునఁ జూడ్కి నిలిపి. 189

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా విని; కద్రువ; వినత వదనంబునన్= వినత ముఖంమీద; చూడ్కి= చూపు; నిలిపి= లగ్నంచేసి.

తాత్పర్యం: అనగా విని వినత ముఖంలోకి చూచి కద్రువ. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. 'నీవు గెల్చిన దాస్యంబు నీకు నేను । జేయఁ గలదాన, నేను గెల్చినను నీవు
నాకుఁ జేయంగఁ గలదాన; వీ కడింది । పన్నిదము సఱ' మని తెగఁబాఱి పలికె. 190

ప్రతిపదార్థం: నీవు గెల్చినన్= నీవు గెలిస్తే; నీకున్ నేను; దాస్యంబు= బానిసతనం; చేయగలదానన్; నేను గెల్చినన్= నేను గెలిస్తే; నీవు నాకున్; చేయంగన్+కలదానవు= చేయాలి; ఈ కడింది= ఈ గట్టి; పన్నిదము= పందెం; చఱుము= వేద్దాం; అని; తెగఁబాఱి= తెగించి; పలికెన్= అన్నది.

తాత్పర్యం: ' ఈ విషయంలో నీవు గెలిస్తే నేను దాస్యం చేస్తాను. నేను గెలిస్తే నీవు దాస్యం చేయాలి. ఈ పందెం కాద్దాం' అని పలికింది కద్రువ.

క. ఆ పొలఁతి యట్లు పలికిన । శాపము ప్రేరేప నరుణ జననికి నుత్సా
హోపేత మయ్యెఁ జిత్తం । బాపన్నిదమునకు; నేమి యనఁగల దధిపా! 191

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! (ధర్మరాజా!) ఆ పొలఁతి= ఆ స్త్రీ (కద్రువ); అట్లు పల్కినన్= అట్లా అనగా; అరుణ జననికిన్= అరుణుడి తల్లికి; శాపము ప్రేరేపన్= (అతడి) శాపం ప్రేరేపించగా; ఆ పన్నిదమునకున్= ఆ పందెమునకు; చిత్తంబు= వినత మనస్సు; ఉత్సాహ= ఉత్సాహంతో; ఉపేతము= కూడుకొన్నది; అయ్యెన్= ఐనది; ఏమి అనన్+కలదు?= ఏమనటాని కేమున్నది?

తాత్పర్యం: రాజా! కద్రువ అట్లా పందెం కాయగానే అరుణుడి తల్లికి మనస్సు ప్రేరేపించగా, పందెం అంగీకరించటానికి ఉత్సాహపడింది.

వ. ఇట్లు వినతయుం దెంపు సేసి యత్తెఱంగున కియ్యకొనియె; నయ్యిరువురుఁ బంచమహాభూతంబులు సాక్షులుగాఁ బల్కి పన్నిదంబు సఱచిరి; కద్రువ 'పతిపరిచర్యకుం గాలమయ్యె; మఱివచ్చి యశ్వంబు నాలోకింత' మని నెపంబిడి యప్పటికిం జూపుఁ దప్పించె; నవ్విధంబున మగిడి యరుగుదెంచిరి; తదనంతరంబ. 192

ప్రతిపదార్థం: ఇట్లు వినతయున్= ఈ విధంగా వినత; ఆలితెంపుచేసి= తెగించి; ఆ+తెఱంగునకున్= ఆ పద్ధతికి; ఇయ్యకొనియెన్= అంగీకరించింది; పంచమహాభూతంబులు= భూమి, వాయువు, జలం, అగ్ని, ఆకాశమన్న అయిదుమహాశక్తులు; సాక్షులుగాన్= సాక్ష్యంగా; పన్నిదంబు= పందెం; చఱచిరి= వేసికొన్నారు; కద్రువ; పతిచర్యకున్= భర్తసేవకు; కాలము+అయ్యెన్= సమయమైంది; మఱి= మరలా; వచ్చి; అశ్వంబున్= గుర్రాన్ని; ఆలోకింతము అని= చూద్దాం అని; నెపంబు+ఇడి= మిష పెట్టి;

అప్పటికిన్= ఆ సమయానికి; చూపున్= చూపును; తప్పించెన్= దాటవేసింది; ఆ+విధంబునన్= ఆ రీతిగా; మగిడి= తిరిగి; అరుగుదెంచిరి= వచ్చారు; తత్+అనంతరంబు+అ= అటు తర్వాత.

తాత్పర్యం: వినత కూడా తెగించి పందెం అంగీకరించింది. ఆ విధంగా వా రిద్దరూ పంచభూతాలు సాక్షిగా పందెం వేసికొన్నారు. కద్రువ తెలివిగా 'ఇప్పుడు భర్తకు సేవ చేసే సమయమైనది కనుక రేపు వచ్చి గుర్రాన్ని చూద్దా'మని అప్పటికి చూపు తప్పించింది. వినత అమాయకురాలు. కనుక సరే అన్నది. ఆ విధంగా వారిద్దరు ఇంటికి తిరిగి వచ్చారు. ఆ తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. **కుటిలంపుఁ దలఁపునఁ గొడుకుల రావించి । కద్రువ యిట్లనుఁ గన్నునీరు**
దొరఁగంగ వారలతో 'నబ్ధి పొంతకు । వినతయు నేనును వేడ్క నరిగి
యచ్చ తెల్పునఁ గడునభిరామ మగునొక్క । యశ్వంబు గాంచితి; మవ్వధూటి
గేవలధవళంబు నా విని, యొడ్డార । మునకు నే నదె నల్లదనముఁ గంటె

తే. **వెనుకదెస 'నన్న వాదయ్యెఁ, గనలి పన్ని । దంబు సఱచితి; మోడిన దాస్యవృత్తి**
వచ్చు సవతికి; నే నెట్లు వరవుడంబు । సేయఁ దగు?; దోఁక నల్లగాఁ జేయరయ్య! **193**

విశేషం: కద్రువ; కుటిలంపుఁదలఁపునన్= కుటిలమైన ఆలోచనతో; కొడుకులన్= తన కుమారులను; రావించి= పిలిపించి; కన్ను నీరు తొరఁగంగన్= కన్నీళ్ళు కారగా; వారలతోన్= వాళ్ళతో; ఇట్లు+అనున్= ఆ విధంగా అంటున్నది; వినతయున్; నేనును; వేడ్కన్= ఉత్సాహంతో; అరిగి= వెళ్ళి; అచ్చ తెల్పునన్= అచ్చమైన తెలుపుతో; కడున్= మిక్కిలి; అభిరామము= అందమైనది; అగు= ఐన; అశ్వంబున్= గుర్రాన్ని; కాంచితిమి= చూచాము; ఆ+వధూటి= ఆమె (వినత); కేవలధవళంబు= కేవలం తెలుపు; నాన్= అనగా; విని= నేను విని; ఒడ్డారమునకున్= ప్రతిఘటనకు, ద్వేషానికి; నేను; అదె నల్లఁదనమున్ కంటె?= అదుగో నలుపును చూచావా; వెనుక దెసన్ = వెనకప్రక్క; అన్నన్= అనగా; వాదు= వివాదం; అయ్యెన్= ఐనది; కనలి= కోపగించి; పన్నిదంబు= పందెం; చఱచితిమి= వేసికొన్నాం; ఓడినన్= ఓడిపోతే; సవతికిన్= నా సవతికి; దాస్యవృత్తి= పనులు చేయవలసిన స్థితి; వచ్చున్= వస్తుంది; నేను; ఎట్లు= ఏ విధంగా; వరవుడంబు= దాస్యం; చేయన్= చేయగా; తగున్= వీలౌతుంది; తోఁకన్= తోకను; నల్లగాన్= నలుపుగా; చేయరు+అయ్య= బాబూ చేయండిరా!

తాత్పర్యం: కద్రువ కుటిలబుద్ధితో కొడుకులను పిలిచి కన్నీళ్ళు కారుస్తూ 'నేనూ వినతా సముద్రతీరానికి ఉత్సాహంగా వెళ్ళాం. అక్కడ అచ్చమైన తెల్లని గుర్రం కన్పించింది. వినత అది చూచి 'గుర్రమెంత తెల్లగా ఉన్నది'! అన్నది. నేను ఆమె అన్నదానిని కాదనటానికే 'తోకలో నలు పున్న' దన్నాను. కోపంతో ఇద్దరం పందెం వేసికొన్నాం. ఓడిపోతే సవతికి దాస్యం చేయాలి. నే నెట్లా చేయగలను? కనుక నాయనలారా! తోకను నలుపు చేయండిరా' అన్నది.

చ. **అనవుడు వాసుకి ప్రభృతు లక్కట! ధర్మువు గాదు; నీవు సూ**
చినతెరు వట్టి గెల్పు శుభసిద్ధి యొనర్చునె? యట్లుగాక య
వ్వనితయుఁ దల్లి గాదె? గరువంపుఁ దనంబునఁ జూడ మాకు ని
ట్లనఁ దగునమ్మ? యెట్లయిన నయ్యెను; బాపము సేయవచ్చునే? **194**

ప్రతిపదార్థం: అనవుడున్= తల్లి అట్లా అన్నంతటి; వాసుకి ప్రభృతులు= వాసుకి మొదలైన (కొడుకులు) వారు; అక్కట!=అయ్యో!; నీవు చూచిన తెరువు= నీవు చెప్పిన పద్ధతి; ధర్మువు కాదు= ధర్మం కాదు; అట్టిగెల్పు= అట్లాంటిజయం; శుభసిద్ధి, ఒనర్చునె!= శుభాన్ని కల్గిస్తుందా? అట్లుకాక= అట్లాగూ కాక; ఆ+వనితయున్= ఆమెకూడా; గరువంపు(దనంబునన్= గౌరవబుద్ధితో; చూడన్= పరికింపగా; మాకున్= మాకు; తల్లిగాదె!= తల్లియే కదా!; ఇట్లు+అనన్+తగు+అమ్మ!= నీవు ఇట్లా అనవచ్చునా తల్లీ!; ఎట్లు అయినన్+అయ్యెను= ఎట్లా జరుగవలసింది అట్లాగే జరుగుతుంది; పాపము చేయవచ్చునే!= పాపం చేయరాదు కదా!

తాత్పర్యం: కద్రువ అట్లా అనగానే వాసుకి మొదలైన వారు అన్నారు 'అయ్యో! తల్లీ! ఇది ధర్మం కాదు. నీవు చెప్పిన పద్ధతి శుభాలను కల్గించదు. అంతేకాక ఆమె కూడా గౌరవబుద్ధితో పరికించినప్పుడు మాకు తల్లియే గదా! మమ్మా పనికి ఆదేశింపవచ్చునా? జరుగనున్నది జరుగకమానదు. మేమీ పాపకృత్యము చేయలేము.

క. ఈ విధ మెమ్మెయి నైనం । గావింపఁగ వలయు ననుట గల్గినఁ బరదే

శావాసుల మగుదుము; మము । నీ వింకం దగదు తల్లి! నిర్బంధింపన్. 195

ప్రతిపదార్థం: ఈ విధము= నీవు చెప్పిన పద్ధతినే; ఏ+మెయిన్+ఐనన్= ఏ విధంగా నైనా సరే; కావింపఁగ వలయున్+ అనుట కల్గినన్= చేయాలి అని అనటమే జరిగితే; పరదేశ= ఇతర దేశాలలో; ఆవాసులము+అగుదుము= నివసిస్తాము (కానీ); నీవు+ఇంకన్= నీవింకా; మమున్= మమ్మల్ని; తల్లి!= అమ్మా!; నిర్బంధింపన్ తగదు= నిర్బంధించటం మంచిదికాదు, బలవంతం చేయటం కూడదు.

తాత్పర్యం: అట్లాకాదు. నేను చెప్పిందే చేసి తీరాలని కనుక నీ వంటే మే మిల్లూ, ఊరూ వదలి పొరుగు దేశాలకైనా పోతాం తప్ప తల్లీ! మమ్ములను నిర్బంధించటం మంచిది కాదు.

క. అని రట్టియెడం గొందఱు । జననిఁ దొఱఁగి యెక్కడేనిఁ జని; రా భంగిం

జనిన తనూజులఁ బేర్కొని । నెనరు విడిచి, యా నెలంత నిష్ఠురమతియై. 196

ప్రతిపదార్థం: అనిరి= వాసుకి మొదలైన వారట్లా అన్నారు; అట్టి+ఎడన్= తల్లితో వాసుకి మొదలైనవారు మాట్లాడుతున్న సమయంలో; కొందఱు= మిగిలిన కొడుకులలో కొంతమంది; జననిన్= తల్లిని; తొఱఁగి= వదలి; ఎక్కడ+ఏనిన్= ఎక్కడకైనా; చనిరి= వెళ్ళారు; ఆ భంగిన్= ఆ విధంగా; చనిన= వెళ్ళిన; తనూజులన్= కొడుకులను; పేర్కొని= పేరుపేరున పిలుస్తూ; ఆ నెలంత= ఆమె (కద్రువ); నెనరున్= ప్రేమను; విడిచి= త్యజించి; నిష్ఠుర= కఠిన; మతి+ఐ= హృదయం కలదై.

తాత్పర్యం: ఆ సమయంలో కొందరు కొడుకులు మన కెందుకీ గోలంతా; అమ్మకు ముఖం తప్పించుదామని ఎక్కడికో వెళ్ళిపోయారు. వారిని గురించి తల్లి మాతృప్రేమను కూడా వదలిపెట్టి రాతిగుండె కలదై.

కద్రువ తనకొడుకులకు జనమేజయునివలన నాశంబు గల్గునట్లు శపించుట(సం.13-23-1(కుంభ))

చ. 'అమృతకరాన్వయంబున మహాముని వేడ్క నరుండు పాండుభూ

రమణుని దేవి గొంతి యుదరంబునఁ బుట్టి, ధనంజయాది నా

మముల వెలుంగు దత్సుతుని మన్మఁడు సంభృతధర్మమైన పే

ర్మి మెఱయ నేల యేలు; జనమేజయనాముఁ డరాత్యజయ్యుఁడై. 197

ప్రతిపదార్థం: అమృతకర= అమృతమే కిరణాలుగా కల చంద్రుడియొక్క; అన్వయంబునన్= వంశంలో; మహాముని నరుండు= నరనారాయణులన్న మహా మునులలో నరుడన్నవాడు; వేడ్కన్= కోరికతో; పాండుభూరమణుని= పాండురాజుయొక్క; దేవి= భార్యయైన; గొంతి= కుంతియొక్క; ఉదరంబునన్= కడుపునందు; పుట్టి= జన్మించి; ధనంజయ+ఆదినామములన్= ధనంజయుడు మొదలైన పేర్లతో; వెలుంగున్= ప్రఖ్యాతి పొందుతాడు; తత్=అతడి; సుతుని= కొడుకు అభిమన్యుడికి; మన్మఁడు= మనుమడు, పరీక్షిత్తు కొడుకు; జనమేజయనాముఁడు= జనమేజయు డన్న పేరుగలవాడు; సంభృత= చక్కగా భరించిన; ధర్మము= ధర్మం; ఐన= కల; పేర్మిన్= పెంపున (గొప్ప ధర్మం అతిశయించగా); అరాతి= శత్రువులకు; అజయ్యుఁడు+ఐ= జయించరానివాడై; నేలన్= భూమిని; ఏలున్= పాలిస్తాడు.

తాత్పర్యం: ఆదిముని నరుడన్నవాడు కోర్కెతో చంద్రవంశీయుడైన పాండురాజునకు కుంతీదేవి కడుపున పుట్టి ధనంజయుడు మొదలైన పేర్లతో ప్రపంచ ప్రఖ్యాతుడైన వానికి మనుమడు జనమేజయుడు శత్రుభయంకరుడై రాజ్యపాలనం చేస్తాడు.

ఉ. ఆతఁడు సర్పయాగమను నధ్వరముం గుపితాత్ముఁడై పితృ

ప్రీతిగఁ జేయుఁ; దద్దహనభీకర భూరి శిఖా ప్రవేశసం

జాతదురంతతాపమునఁ జావఁగలా' రని శాప మిచ్చెఁ; ద

త్పాతన వృత్తికిన్ వెఱచి తక్కటి నాగము లా భుజంగితోన్. 198

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ జనమేజయుడు; సర్పయాగము= ఆ పేరుగల (సర్పాలను చంపే); ఆధ్వరమున్= యజ్ఞమును; కుపిత+ఆత్ముఁడై= కోపం కలవాడై; పితృ= తండ్రికి; ప్రీతిగన్= సంతోషం కొరకు; చేయున్= చేస్తాడు (ముందుకాలంలో); తత్ ఆ యజ్ఞంలోని; దహన= అగ్నియొక్క; భీకర= భయంకరమైన; భూరి= పెద్ద; శిఖా= మంటలలో; ప్రవేశ= ప్రవేశించటంవలన, పడటంవలన; సంజాత= పుట్టిన; దురంత= దాటరాని; తాపమునన్= వేడికి; చావగన్‌కలారు= చావగలరు; అని; శాపము ఇచ్చెన్= శపించింది; తత్= ఆ; పాతనవృత్తికిన్= యజ్ఞకుండాలలో పడటమనే స్థితికి; వెఱచి= భయపడి; తక్కటి= మిగిలిన; నాగములు= పాములు; ఆ, భుజంగితోన్= ఆ ఆడుపాముతో, కద్రువతో.

తాత్పర్యం: ఆ జనమేజయుడు తండ్రి ప్రీతికొరకు కోపంతో సర్పయాగం చేస్తాడు. మీరంతా భయంకరమైన ఆ నిప్పు మంటలలో పడి మాడండి అని తల్లి పిల్లలను శపించింది. ఆ శాపానికి భయపడి పాములు కద్రువతో. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: పద్యంలో దీర్ఘసమాసం చాలా విచిత్రార్థసముపేత మైనది. 'తద్దహన - సంతాపమునన్' తత్ దహన - ఈ ఒత్తక్షరం, భీకర-భూరి-శిఖా ప్రవేశ- సంతాప-దురంత-తాపము- ఈ దీర్ఘాక్షరాలు. సంతాప - దురంత-బిందుపూర్వక - తకరాలు - ఆమె కోపతీవ్రతను వ్యక్తపరుస్తున్నవి. చావగలారు - అని చేతులు కలుపుకోవటం - భుజంగి - ఆడుపాము - తన పిల్లలను తానే కొరికి తింటుందనటాన్ని ధ్వనిస్తుంది.

తే. నల్లగాఁ జేయువార, మే మెల్లభంగి । నాతురంగమపతివాల। మని, రయమునఁ

బోయి, వాలధి రోమముల్ వొదివి, నీల - రోమసంచయమైరి కురుక్షితీశ! 199

ప్రతిపదార్థం: కురు= కౌరవ; క్షితి= భూమికి; ఈశ!= రాజా!; ఏము= మేము; ఎల్లభంగిన్= అన్నివిధాలా; ఆ తురంగము= ఆ గుర్రాలలో; పతి= రాజుయొక్క; వాలము= తోకను; నల్లన్+కాన్= నల్లగా; చేయువారము= చేస్తాము; అని; రయమునన్= వేగంగా; పోయి= వెళ్ళి; వాలధి=తోకయొక్క; రోమముల్= వెండ్రుకలను; పొదివి= కప్పి; నీలరోమ= నల్లని వెండ్రుకల; సంచయము= గుంపు; ఐరి= అయినారు.

తాత్పర్యం: రాజా! తల్లీ నీవు చెప్పినట్లు అన్ని విధాలా ఆ ఉత్తమాశ్వం తోకను నల్లగా చేస్తామని పాములు వేగంగా వెళ్ళి గుర్రం తోకను చుట్టుకొని నల్లని వెంట్రుకల గుంపైనారు.

క. కద్రువ, గన్గొని సంతో । షద్రుతమతి యగుచుఁ బిలిచి సవతికిఁ జూపెన్
భద్రాత్మక యవ్వినతయు । దద్ద్రోహం బెఱుఁగలేమి దైన్యము నొందెన్. 200

ప్రతిపదార్థం: కద్రువ; కన్గొని= చూచి; సంతోష= సంతోషంతో కలిగిన; ద్రుత= వేగంతో కూడుకొన్న; మతి+ఐ= మనస్సు కలదై; పిలిచి; సవతికిన్= వినతకు; చూపెన్= చూపించింది; భద్ర+ఆత్మక= శుభమైన మనస్సుకల; ఆ+వినతయున్= ఆ వినత; తత్= (కద్రువయొక్క); ఆ; ద్రోహంబు= వంచన, మోసం; ఎఱుఁగలేమిన్= తెలిసికొనలేకపోవటం వలన; దైన్యమున్= దీనత్వాన్ని, దిగులు; ఒందెన్= పొందింది.

తాత్పర్యం: కద్రువ చూచి, సంతోషంతో ఆగలేక వినతను పిలిచి చూపించింది. అభం శుభం తెలియనిది కనుక వినత కూడా సవతి వంచనను గుర్తించలేక దైన్యం పొందింది.

క. నగుచుం గద్రువ 'వరవుడ । వగుము విచారంబు విడిచి' యనుడు, వినత 'య
ట్లగుఁగా' కని, లజ్జయుఁ బెను । వగయుఁ దొలఁగఁ ద్రోచి, చేసె వరవుడము దగన్. 201

ప్రతిపదార్థం: కద్రువ; నగుచున్= నవ్వుతూ; విచారంబున్= దిగులు; విడిచి= వదలి; వరవుడవు= దాసివి; అగుము= కమ్ము; అనుడున్= అనగా; వినత; అట్లు+అగున్+కాక= సరే అట్లాగే అని; లజ్జయున్= సిగ్గును; పెను= పెద్ద; వగయున్= దుఃఖం; తొలఁగన్+త్రోచి= అవతలకు నెట్టి; వరవుడము= దాస్యం; తగన్= చక్కగా; చేసెన్= చేసింది.

తాత్పర్యం: సంతోషం పట్టలేక నవ్వుతూ కద్రువ నాకు దాసివికమ్ము. ఈ దిగులు వదలిపెట్టుము. అనగానే వినత సరే లెమ్మని సిగ్గూ, దిగులూ వదలి ఆమెకు చక్కగా దాస్యం చేసింది.

వ. ఇట్లు కపట జయంబునఁ గద్రువ సత్యవినయాది గుణవతి యయిన వినతం దనకు దాసి చేసికొని, పరిహీణంబు లయిన, పరిచారికాకృత్యంబుల నిత్యంబు నలంచుచుండెం; బదంపడి యప్పరమసాధ్వి దన యగ్రతనయుం డాదేశించిన తెఱం గూహించి, రెండవ యండంబున జనియించిన తనూజుం దలంచుచు నాసపాటు గదిరిన హృదయంబుతో దాస్యం బనాలస్యంబున నడపుచుండ. 202

ప్రతిపదార్థం: ఇట్లు; కద్రువ; కపట విజయంబునన్= వంచనతో సాధించిన గెలుపుతో; సత్య, వినయ+ఆది గుణవతి= నిజం చెప్పటం; అణకువ మొదలైన గుణాలు కలది; అయిన వినతన్, తనకున్= తనకు (కద్రువకు); దాసి చేసికొని= దాసిగా చేసికొని; పరి= మిక్కిలి; హీనంబులు+అయిన= నీచములైన; పరిచారికా కృత్యంబులన్= సేవికలు చేసే పనులతో; నిత్యంబున్= ఎల్లప్పుడును; నలంచుచుండెన్= బాధ పెట్టుతున్నది; పదంపడి= తర్వాత; ఆ+పరమ= ఆ గొప్ప; సాధ్వి= పతివ్రత; తన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అగ్రతనయుండు= తన పెద్దకొడుకు అరుణుడు; ఆదేశించిన= చెప్పిన; తెఱంగు= విధానం; ఊహించి= ఆలోచించి; రెండవ అండంబునన్= రెండో గ్రుడ్డునుండి; జనియించిన= పుట్టిన; తనూజున్= కొడుకును; తలంచుచున్= తలచుకొంటూ; ఆసపాటు= ఆశ; కదిరిన= కలిగిన; హృదయంబుతోన్= మనస్సుతో; న+ఆలస్యంబునన్= అనాలస్యంబునన్= అలసతలేకుండా; దాస్యంబున్; నడపుచుండన్= సాగిస్తుండగా

తాత్పర్యం: కపట విజయంతో కద్రువ సత్యవినయాదిగుణవతి అయిన వినతను దాసిగా చేసి మామూలు పరిచారికలు చేసే పనులు చెప్పి హీనంగా బాధిస్తున్నది. మహాపతివ్రత అయిన వినతమాత్రం తన పెద్దకొడుకు చెప్పినట్లు రెండో గ్రుడ్డు పగిలి బైటపడే కొడుకును తలచుకొంటూ ఎప్పుడు తన కీ దాస్యం పోతుందా అని ఆశతో దాస్యం జాగ్రత్తగా చేస్తూ ఉన్నది.

ఉ. యౌవనదర్ప మంది, జవ మంతకు నంతకు నగ్గలింప, మై
లా వధికంబు గాఁగ, నుపలాలన సేయఁగఁ బద్మసంభవుం
డా విహగోత్తముండు హృదయంబున గర్వ మెలర్ప నుద్ధతుం
డై విహరింపఁ జూచి యొక యప్పుడు, నారదుఁ డల్లఁ జేరినన్. 203

ప్రతిపదార్థం: యౌవనదర్పము= యువకత్వంవలన కలిగిన ఔద్ధత్యం; అంది= పొంది; ఆ విహగ+ఉత్తముండు= ఆ పక్షిరాజు (విహంగము= ఆకాశంలో ఎగిరేది) జవము= వేగం; అంతకున్+అంతకున్ (అంతంతకు)= నానాటికి; అగ్గలింపన్= అతిశయించగా; మై= శరీరంయొక్క; లావు= బలం; అధికంబుకాఁగన్= ఎక్కువ కాగా, పద్మసంభవుండు= బ్రహ్మ, పద్మం నుండి పుట్టినవాడు; ఉపలాలనన్= మంచిలాలన; చేయఁగన్= చేస్తూ ఉండగా; హృదయంబునన్= మనస్సులో; గర్వము; ఎలర్పన్= తుళ్ళింతలాడగా; ఉద్ధతుండై= గర్విష్ఠిఅయి; విహరింపన్= తిరుగుతుండగా; ఒక+అప్పుడు= ఒకసారి; నారదుఁడు; అల్లన్= మెల్లగా; చేరినన్= సమీపించగా.

తాత్పర్యం: ఆ గరుత్మంతుడిని తాత బ్రహ్మ గోముతో లాలిస్తున్నాడు. పైగా యౌవనమదం. శరీరంలో క్రొవ్వు బలిసిపోతున్నది. గర్వం, దర్పం, ఔద్ధత్యం రోజురోజుకూ అతిశయిస్తుండగా లోకాలన్నిటా యథేచ్ఛగా విహరిస్తున్నాడు. ఒకరోజు నారదమహర్షి నెమ్మదిగా అతడిని సమీపించగా.

విశేషం: అక్కడ తల్లి నానా బాధలూ పడుతున్నది. ఒక కొడు కట్లా శపించి పోయాడు. వీ డేమో ఇల్లు పట్టకుండా మదించి తెగ తిరుగుతున్నాడు. ఈ సందర్భంలో నారదుడు కథలో ప్రవేశించాడు. సామాన్యంగా మన పురాణాలలో కథ మలుపు తిరిగే సమయంలో పాత్ర క్లిష్ట పరిస్థితులలో ఉండగా నారద పాత్ర ప్రవేశించి కథ నడుపుతుంది. అంటే నారదు డెవరు? దేవర్షి. ఋషి అంటే జ్ఞానశక్తికి ప్రతీక. నారదు డంటే జ్ఞానా న్నిచ్చేవాడు. జ్ఞానస్వరూపుడైన ఋషి. నీ వొక క్లిష్టపరిస్థితులలో ఏమీ దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు ఒక మార్గాన్ని చెప్పేవాడు బయటనుండీ రావచ్చును. లేదా నీకే తోచవచ్చును. ఆ స్ఫురణశక్తి పేరు నారదుడు.

వ. అతఁడు భక్తిం బ్రణమిల్లి నిల్చిన నప్పక్షిపుంగవునకు నమ్మునిపుంగవుం డిట్లనియె. 204

ప్రతిపదార్థం: అతఁడు= గరుత్మంతుడు; భక్తిన్= భక్తితో; ప్రణమిల్లి= నమస్కరించి; నిల్చినన్= నిలువగా; ఆ+పక్షిపుంగవునకున్= ఆ పక్షిరాజునకు; ఆ+మునిపుంగవుండు= ఆ మునిరాజు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: గరుత్మంతుడు నమస్కరించి నిలువగా అతడితో నారదుడు ఇట్లా అన్నాడు.

తే. 'దాసియై సవతాలికిఁ దల్లి పనులు । సేసి నలఁగంగ, నద్దెసఁ జింత వంత
లేక నీ విట్లు దిరుగుట లెస్స యగునె? । యద్భుతోజ్జ్వలతేజ! కశ్యపతనూజ!' 205

ప్రతిపదార్థం: అద్భుత+ఉజ్జ్వలతేజ!= ఆశ్చర్యకరంగా ప్రకాశించే తేజస్సు కలవాడా!; కశ్యప తనూజ!= కశ్యపమహర్షి కొడుకా!; తల్లి= వినత; సవతి+ఆలికిన్= సవతి అయిన భార్యకు, సవతికి; దాసి+ఐ= బానిస అయి; పనులుచేసి= కద్రువ చెప్పే నీచమైన కార్యాలు చేస్తూ; నలఁగంగన్= నలిగిపోగా (మనస్సులో క్రుంగిపోవటం, శరీరదృష్టితో కృశించిపోవటం); ఆ+దెసన్= ఆ వైపున; చింత వంత= ఆలోచన కానీ, బాధ కానీ; లేక= లేకుండా; నీవు; ఇట్లు= ఈవిధంగా; తిరుగుట= విహరించటం; లెస్సఅగునె?= బాగున్నదా?

తాత్పర్యం: నాయనా! నీవు గొప్ప పరాక్రమశాలివి. కశ్యపబ్రహ్మకుమారుడవు అయి ఉండి నీ తల్లి ఒక ప్రక్క తన సవతికి నీచంగా దాస్యం చేస్తుంటే అదేమీ పట్టించుకొనకుండా ఇట్లా తిరగటం ఏం బాగుంది?

విశేషం: ఇది పెద్దవారు చీవాట్లు పెట్టే పద్ధతి. తెలుగు వాడి నోటినిండుగా అమరిన వాక్యవిన్యాసం కాకువు-తిక్కనగారి సొత్తు.

చ. అనుడు, విహంగనాథుఁడు 'మదంబకు దాస్యము రాకకుం గతం
బనఘవిచార!యెద్ది? తెలియన్ వినిపింపవె!' యన్నఁ జెప్పె న
మ్మునివరుఁ డున్నరూపు, హయముం గను టాదిగఁ గల్గు కశ్యపాం
గనల చరిత్ర మాతని కఖండ పరిస్ఫుట భాషణంబులన్. 206

ప్రతిపదార్థం: అనుడున్= అట్లా నారదముని చెప్పగా; విహంగనాథుఁడు= పక్షిరాజు; మత్= నా; అంబకున్= అమ్మకు; దాస్యమురాకకున్= దాస్యం రావటానికి; కతంబు= కారణం; ఎద్ది= ఏది?; అనఘ విచార!= పవిత్రమైన వివేకం కల స్వామీ! తెలియన్= నాకు స్పష్టపడేటట్లు; వినిపింపవె?= సవిస్తరంగా చెప్పవా!; అన్నన్= అనగా; ఆ+మునివరుఁడు= ఆ మునిశ్రేష్ఠుడు; హయమున్= గుర్రాన్ని; కనుట ఆదిగన్= చూచింది మొదలు; కల్గు= జరిగిన; కశ్యప+అంగనల= కశ్యపుడి భార్యల; చరిత్రము= కథ; ఉన్నరూపు= ఉన్న వైఖరి; అతనికిన్= గరుత్మంతుడికి; అఖండ= పూసగ్రుచ్చినట్లుగా (ఖండము = ముక్క; అక్కడక్కడ ముక్కలు ముక్కలుగా కాకుండా ఏకధాటిగా); పరిస్ఫుట= విస్పష్టమైన; భాషణంబులన్=మాటలలో; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: నారదముని అట్లా అనగానే విన్న గరుత్మంతుడు 'అయ్యో! మా అమ్మ దాస్యం చేస్తున్నదా? ఎందుకో చెప్పుము నారదా, అని ప్రార్థించగా ఆయన స్పష్టమైన మాటలలో గుర్రాన్ని చూచింది మొదలు కద్రూ వినతల మధ్య జరిగిన కథనంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు.

విశేషం: నాకు తెలిసేటట్లు చెప్పుమన్నాడు గరుత్మంతుడు. ఈయన 'అఖండ - భాషణంబులన్' చెప్పాడట. ప్రశ్నకు తగ్గ సమాధానం చెప్పాలి కనుక. తెలిసేటట్లు అనటంలోని రహస్యం 173వ పద్యంలోని అరుణుడు చెప్పిన విధాతృ వశమయివచ్చిన రీతి వివరించటం. ఆ కథ అట్లా ఎందుకు జరిగిందో ఆ సృష్టి రహస్యాన్ని వ్యాఖ్యానించటం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. చెప్పినఁ, గోపమున్ వగపుఁ జిత్తమునం గదురంగ 'మేలు మే
లప్ప హితంబు సేసెఁ, జెలియల్ మనుచున్నది, పెంపుతోడ' నం
చప్పుడ వాయువేగమున నయ్యెడకుం జని, మాట యెద్దియుం
జెప్పక తల్లికిం బ్రణతి సేసె విషాద భరార్తమూర్తియై. 207

ప్రతిపదార్థం: చెప్పినన్= చెప్పగా; కోపమున్= కోపమూ; వగపున్= దుఃఖం; చిత్తమునన్= మనస్సులో; కదురంగన్= కలుగగా; మేలుమేలు= ఓహో, సెబాసు (కోపంతో ఎగతాళిగా అనటం); అప్ప= అక్కయ్య; హితంబుచేసెన్= మేలు చేసింది; చెలియల్= చెల్లెలు; పెంపుతోడన్= హాయిగా, సుఖంగా; మనుచున్+ఉన్నది= బ్రతుకుచున్నది; అంచున్= అంటూ; వాయువేగమునన్= గాలి వేగంతో; అప్పుడు+అ= వెంటనే; ఆ+ఎడకున్= ఆ చోటికి; చని= వెళ్ళి; మాట ఎద్దియున్= ఏ మాటా; చెప్పక= చెప్పకుండా; తల్లికిన్; విషాదభర= దుఃఖభారంతో; ఆర్తమూర్తి+ఐ= చింతయే ఆకారం కలవాడై; ప్రణతి= నమస్కారం; చేసెన్= చేశాడు. (విషాదంతో చెక్కిన ఆకారం కలవాడై, మనస్సులోని చింత, దుఃఖం బయటకు వస్తే ఎట్లా ఉంటాయో అట్లా ఉన్నాడని భావం.)

తాత్పర్యం: చెప్పగానే ఆయన మనస్సంతా కలత చెందింది. కోపం వచ్చింది. ఆ బాధతో, కోపంతో అన్నాడు; 'ఆహా! చాలా బాగుంది. అప్పగారు మేలు చేసింది. చెల్లెలు కనీసం బ్రతుకుతున్నది' అని అంటూ వెంటనే వాయువేగంతో వెళ్ళి ఏమీ మాట్లాడకుండా దుఃఖంతో తల్లికి ప్రణామం చేశాడు.

విశేషం: పద్యంలో వాక్యం - మాట - పూటంతా కోపంతో బాధలో ఉన్నవాడు ఎట్లా ఉంటాడో అట్లాగే వ్రాయడం గమనించ దగింది. పెదతల్లిమీద కోపం, తల్లి అమాయకత్వానికి జాలిపడిన పాటుకు విషాదం, తనతో చెప్పనైనా లేదే తల్లి అన్న చింతా, అనేక భావాలతో నిండిన హృదయం నుండి వచ్చిన మాట ఈ పద్యం. అందుకే ఏమీ మాట్లాడకపోవటం.

వ. కద్రువపాలికిం బోయి. 208

తాత్పర్యం: కద్రువ దగ్గరకు వెళ్ళి (గరుత్మంతుడు)

చ. పరమ వినీతిమై నెఱఁగి, బాంధవ మారఁగ నల్ల నిట్లనున్
గరుడుఁడు దారితారి వగఁ గందుచు 'నీ చెలియల్ చరించు ని
వ్వరవుడవుం జరిత్రమున వచ్చునె నీ కొక పేర్మి? యీసతిం
గరుణ యెలర్పఁగా విడువ గౌరవ సంపదఁ జేయు నెంతయున్. 209

ప్రతిపదార్థం: గరుడుఁడు= గరుత్మంతుడు; పరమ= గొప్ప; వినీతిమైన్= వినయంతో; ఎఱఁగి= నమస్కరించి; బాంధవము+ఆరఁగన్= బంధుత్వం వెల్లివిరిసేటట్లు; తారితారి= తారట్లాడుతూ (భయంతో వినయంతో చెప్పలేక పెద్దవారిముందు చిన్నవాళ్ళు పడేపాట్లు సూచించే మాట); అల్లన్= నెమ్మదిగా; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; నీ చెలియల్= నీ చెల్లెలు; వగన్= దుఃఖంతో; కందుచున్= బాధపడుతూ కందిపోతూ; చరించు= చేసే; ఈ; వరవుడము+చరిత్రమునన్= దాస్య కథతో; నీకున్; ఒక పేర్మి= ఒక గొప్ప కూడా; వచ్చునే? = కలుగుతుందా? (కలగదు); ఈ సతిన్= ఈ అమాయకురాలిని; కరుణ= దయ; ఎలర్పఁగాన్= చిగురించగా; విడువన్= విడిచిపెట్టితే; గౌరవ సంపదన్= గొప్ప గౌరవాన్ని; ఎంతయున్ చేయున్= మిక్కిలి కలిగిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మహావినయంతో నమస్కరించి తారట్లాడుతూ, బంధుత్వాల్ని త్రవ్వుతూ గరుత్మంతు డీ విధంగా అన్నాడు; 'నీ చెల్లెలు పాపం దుఃఖంతో కందిపోతూ చేసే ఈ దాస్యం కథవలన నీకు వచ్చే గొప్ప ఏమిటి? ఆ అమాయకురాలిని వదలిపెట్టుము. నీకెంతో గౌరవం దక్కుతుంది.

విశేషం: మా అమ్మను వదలిపెట్టుము. లేకపోతే ఊరుకొనేది లేదని అనవచ్చును. అట్లా అనకుండా పెదతల్లి కనుక మర్యాదతో, వినయంతో సంభాషించటం ఇందులో చెప్పుకొనదగ్గ అంశం. ఆ మాట బంధుత్వ దృష్ట్యా అన్నాడు. కనుకనే నీ చెల్లెలు అని అనటం, మా అమ్మ అనటం వేరు. ఇట్లా అనటం వేరు కదా! కనుక గరుత్మంతుడి మాటలో వ్యవహారం తెలిసినవాడి లక్షణమున్నది.

చ. నీకును నేను బుత్త్రుఁడన; నెమ్మిఁ దగన్ ననుఁ జూచియైనఁ ద
ల్లీ! కృపసేఁత పెద్దయును లెస్స; యధర్మము ధర్మమ న్వగల్
నా కవి యేల? దాస్యకృతి నా జనయిత్రికి నివ్విధంబునన్
రాకయు దైవకృత్యమ మనంబునఁ బొంగుదు విడ్పుగల్గినన్. 210

ప్రతిపదార్థం: తల్లీ!= అమ్మా!; నీకును= నీకూ; నేను; పుత్రుఁడన= కొడుకునే (నీ కొడుకులతోపాటు); నెమ్మిన్ తగన్= ప్రేమతో తగినట్లు, తగిన ప్రేమతో; ననున్‌చూచిఐనన్= నా ముఖం చూచి అయినా; కృపసేఁత= దయచూపించటం; పెద్దయును= చాలా; లెస్స= గొప్ప, మంచిది; నాకున్; అధర్మము, ధర్మము; అన్ వగల్= ఇది ధర్మం, అది అధర్మం అన్న వగలమాటలు (వగలాడి లోని వగలు); అవి+ఏల? అవెందుకు?; నా జనయిత్రికిన్ ధర్మము= నా తల్లికి; ఈ+విధంబునన్= ఈ విధంగా; దాస్యకృతి= దాస్యం చేసేపని; రాకయున్= రావటం కూడా; దైవకృత్యము+అ= దైవం తప్ప జూడటమే; విడ్పు= నా తల్లి విడుదల; కల్గినన్= కలిగితే; మనంబునన్= మనస్సులో; పొంగుదున్= సంతోషిస్తాను.

తాత్పర్యం: అమ్మా! నీ వేయిమంది కొడుకులతో పాటుగా నేనూ నీకు కొడుకునే. కనుక నా ముఖం చూచైనా మా అమ్మను వదలిపెట్టుము. ఇది ధర్మమా! అధర్మమా అనే వగలమాటలు నాకెందుకు? నా తల్లికి దైన్యం కలగటం కూడా దైవం పనే. కనుక విడిచిపెట్టితే నేను సంతోషిస్తాను.

విశేషం: పై పద్యంలో చెప్పినమాటకు కద్రువ ఉలకలేదు, పలకలేదు. కనుకనే నేనూ కొడుకునే కదా! నా ముఖం చూచైనా అని అన్నాడు. ధర్మాధర్మ జిజ్ఞాస నా కెందు కనకుండా వగలు అనటంలో లోకం ఆ రెండు మాటలను అట్లా వినియోగించుకొంటుంది కనుక. మనస్సులో ఏమీ లేకుండా పైకున్నట్లు నటించటం వగలు.

వ. అనిన విని మొగంబు ముఱకటించు కొనుచుఁ గద్రువ గరుత్మంతున కిట్లనియె. 211

ప్రతిపదార్థం: మొగంబు= ముఖం; ముఱకటించుకొనుచున్= మూతి ఒక ప్రక్కకు త్రిప్పి ఎగతాళితో అభినయిస్తూ; కద్రువ; గరుత్మంతునకున్= గరుత్మంతుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: ఆమెకు ఈ మాటలు రుచించలేదు. అందుకని మూతి ఒక ప్రక్కకు తిప్పి ఎగతాళిగా గరుత్మంతుడితో ఈ విధంగా అన్నది;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. 'బలవంతుండవు, నేర్పు చందములఁ జెప్పంజాలి యీరిత్త ప
ల్కులఁ దేర్పం బనిలేదు; తల్లికి మదిం గూర్తేని వే పోయి లో
కులు నిన్నుం బ్రణుతింపఁ దె మ్మమృతమున్; ఘోరంపు దాస్యంబు నేఁ
దొలఁగం బెట్టెద మీ కనంతమగు సంతోషంబు సంధిల్లఁగన్. 212

ప్రతిపదార్థం: బలవంతుండవు= చాలా గొప్ప బలశాలివే (ఎగతాళి- నిజాన్ని ఎగతాళి చేయటం); ఈ రిత్తపల్కులన్= ఈ వట్టిమాటలతో; తేర్పన్= మంచి చేసికొనటం వలన; పని లేదు= పని లేదు, లాభంలేదు; తల్లికిన్; మదిన్= మనస్సులో; కూర్తు (వు)+ఏని= (ప్రేమ కలవాడవైతే; వేపోయి= వెంటనే పోయి; లోకులు= జనం; నిన్= నిన్ను; ప్రణుతింపన్= పొగడగా; అమృతమున్= సుధను; తెమ్ము= తీసికొనిరమ్ము; ఘోరంపు= ఘోరమైన; దాస్యంబున్= బానిసతనాన్ని; నేన్= నేను; తొలఁగన్ పెట్టెదన్= తొలగిస్తాను; (నే నున్నాను కదా తొలగించటానికి నీ వది త్వరగా తీసికొనిరా. ఇదీ వాక్య నిర్మాణానికి పునాది); అనంతమగు= లెక్కింపరాని; సంతోషంబు= ఆనందం; మీకున్= నీకూ, నీ తల్లికీ; సంధిల్లఁగన్= కలుగగా (నేను దాస్యాన్ని తొలగిస్తాను)

తాత్పర్యం: 'చాలా బలవంతుడవే! చాలా నేర్పుగానే మాట్లాడావు. పోరా పో! ఈ వట్టిమాటలతో ఏమి లాభం? (బంధుత్వం, చెల్లెలు, కొడుకు వంటి మాటలు) మీ అమ్మమీద నీకు నిజంగా ప్రేమంటూ ఉంటే పోయి వెంటనే అమృతం తీసికొనిరా. మీ అమ్మను నేను వదిలిపెట్టుతాను. మీకు నీ వన్నట్లు అనంత సంతోషం కలుగుతుంది.

చ. అన విని, దాని కియ్యకొని, యప్డు సుపర్ణుఁడు పోయి, కశ్యపుం
గని, తన భాషణంబులును, గద్రువ పల్కులుఁ జెప్పి, 'తెచ్చువాఁ
డ నమృత మెట్లు నే నని యొడంబడి వచ్చితి' నన్న నాతఁ డ
త్తనయునిఁ జూచి యుల్లము ముదంబును నచ్చెరుపాటు వొందఁగన్. 213

ప్రతిపదార్థం: అనన్, విని; సుపర్ణుండు= గరుత్మంతుడు (మంచి రెక్కలు గలవాడు); దానికిన్= కద్రువమాటకు; ఇయ్యకొని= అంగీకరించి; అప్డు= ఆ సమయంలో; పోయి= వెళ్ళి; కశ్యపున్= తండ్రిని; కని= చూచి; తన భాషణంబులును= తన మాటలూ; కద్రువపల్కులున్= తల్లిమాటలూ; చెప్పి= వివరించి; ఎట్లున్= ఏ విధంగానైనా సరే; నేను; అమృతమున్= సుధను; తెచ్చువాఁడను= తెస్తాను; అని; ఒడంబడి= అంగీకరించి; వచ్చితిని= మీ దగ్గరకు వచ్చాను; అన్నన్= అనగా; ఆతఁడు= కశ్యపుడు; ఆ తనయునిన్= ఆ కొడుకును; చూచి= తేరిపార చూచి (ఎంతవాడైనా డన్నట్లుగా); ఉల్లము= మనస్సు; ముదంబును= సంతోషం; అచ్చెరుపాటు= ఆశ్చర్యం; ఒందఁగన్= పొందగా.

తాత్పర్యం: కద్రువ చెప్పిన మాటలు విని వెంటనే సుపర్ణుడు తండ్రి దగ్గరకు వెళ్ళి, తనకూ, పెద్దమ్మకు జరిగిన సంభాషణ అంతా వివరించి 'ఎట్లాగైనా సరే అమృతం తెస్తానని అంగీకరించి వచ్చాను' అని చెప్పాడు. అంతా విని కొడుకును తేరిపార చూచి మనస్సులో ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ పొందాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: ఒక తండ్రి ప్రయోజకు డైన కొడుకును చూచి పొందే ఆనందలక్షణ మిట్లాగే ఉంటుంది.

క. 'అమృతంబు దుర్లభం, బ। య్యమరుల కేనియు నతిప్రయత్నంబున గు
ప్తము సేసి యుండు వాసవుఁ। డమలచరిత! నీకు నగునె యట్టిది తేరన్' 214

ప్రతిపదార్థం: అమల= నిర్మలమైన, మచ్చలేని; చరిత!= ప్రవర్తన కలవాడా!; అమృతంబు= అమృతం; అ+అమరులకేనియున్= ఆ దేవతలకైనా; దుర్లభంబు= లభించటం కష్టం - దొరకదు; వాసవుఁడు= ఇంద్రుడు; అతి ప్రయత్నంబునన్= చాలా జాగ్రత్తగా; గుప్తము చేసిఉండున్= దాచి ఉంచుతాడు; అట్టిది= అట్లాంటిదాన్ని; తేరన్= తేవటం; నీకున్= నీకైనా; అగునె?= సాధ్యమా?

తాత్పర్యం: నీవు నిర్మల హృదయుడవే! కానీ ఆ అమృతం వాసవుడు చాలజాగ్రత్తగా భద్రం చేస్తాడు. కనుక దేవతలకే అది చిక్కదు. మరి నీ కట్లాంటిది ఎట్లా సాధ్యం?

వ. వినుము. 215

తాత్పర్యం: (రహస్యం చెప్పుతాను) వినుము.

చ. ఉదకము రక్షకం బగుచునుండఁగ, నుజ్జ్వలవహ్నియందునుం
పొదువఁ, గృపాణశక్తి ముఖ భూరితరాయుధహస్తులై బలో
న్మదులు, మహోగ్రకోపులు, ఘనస్థిరకాయు లనేకరాక్షసుల్
పొదిగొని కావ నిన్పవలలో నమృతంబు సురక్షితస్థితిన్. 216

ప్రతిపదార్థం: ఉదకము= నీరు; రక్షకంబు= కాపాడేది; అగుచున్ ఉండన్= కాగా; అందునున్= అందులో, దానిమధ్యలో; ఉజ్జ్వల= మండే; వహ్ని= అగ్ని; పొదువన్= అమృతాన్ని ఆవరించి క్రమ్మగా; అనేక రాక్షసుల్= పెక్కుమంది రాకాసులు; కృపాణ=కత్తి; శక్తి= ఒక రకం బల్లెం; ముఖ= మొదలైన; భూరితర= గొప్ప; ఆయుధ= ఆయుధాలున్న; హస్తులై= చేతులు కలవారై; బల+ఉన్మదులు= బలంతో మదించినవారు; మహా+ఉగ్రకోపులు= గొప్ప తీవ్రమైన కోపం కలవారు; ఘన=పటిష్ఠమైన, పెద్ద; స్థిర= చెదరని; కాయులు= శరీరాలవారు; పొదిగొని= చుట్టూ మూగి; కావన్= కాపాడుతూ ఉండగా; ఇన్పవలలోన్= ఇనుముతో చేసిన వల లోపల; అమృతంబు= అమృతం; సురక్షితస్థితిన్= భద్రంగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: జలం రక్షిస్తుంటే దాని మధ్య అగ్ని మండుతూ ఉండగా, కత్తులతో, బల్లెంవంటి పదునైన ఆయుధాలతో మదించి, తీవ్రకోపిష్ఠులై, పెద్ద శరీరాలున్న రాక్షసు లనేకమంది కాపలా కాస్తుండగా ఇనుపవలలో అమృతం సురక్షితంగా ఉంటుంది. అందుకని అది దేవతలకైనా దుర్లభమనటం జరిగింది.

క. ఉండు నన విని, విహంగ వి । భుం డల్లన నగుచు, 'నీవు పుత్రస్నేహా
ఢ్యుండవయి పలికితే; బలి । యుండ, నుపాయజ్ఞుఁడను, మహోజ్జ్వలతేజా! 217

ప్రతిపదార్థం: ఉండున్= ఉంటుంది; అనన్ విని; విహంగ విభుండు= పక్షిరాజు; అల్లనన్= నెమ్మదిగా; నగుచున్= నవ్వుతూ; మహా+ఉత్‌జ్వల= గొప్పగా పైకి అంతటా ప్రసరించే; తేజా!= కాంతికలవాడా!; నీవు; పుత్రస్నేహ= కొడుకుమీది ప్రేమచేత; ఆఢ్యుండవు+ అయి= దొడ్డవాడవై; పలికితి= అన్నావు; ఏన్= నేను; బలియుండన్= బలవంతుడిని;ఉపాయజ్ఞుఁడను= ఉపాయం తెలిసినవాడిని.

తాత్పర్యం: తండ్రి అట్లా చెప్పగా విని పక్షిరాజు నవ్వుతూ 'దివ్యతేజస్సు కల తండ్రీ! పుత్రస్నేహంతో అన్నావే తప్ప నా శక్తి తెలియదా? చాలా బలశాలిని. ఉపాయం తెలిసినవాడను (నన్ను చిన్నవాడిగా భావించవద్దు అని సూచన).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. అనుమానం బది యేల? తెత్తు నమృతం 'బన్నం గడుం బొంగి, యా
తనిఁ దాఁ గౌఁగిటఁ జేర్చి కశ్యపుఁడు, పుత్రా! నిశ్చయం బట్లయే
ని, నిభంబుం గమఠంబునుం గలవు; వానిం దిన్న లావెక్కు; నా
ఘనజంతు ద్వితయంబు నీకు నెరగాఁ గల్పించితిం బోవనా!' 218

ప్రతిపదార్థం: అనుమానంబు= సందేహం; అది+ఏల?= నీకెందుకు? అమృతంబున్= సుధను; తెత్తున్= తప్పక తెస్తాను; అన్నన్= అంటే; కశ్యపుఁడు= తండ్రి; కడున్= చాలా; పొంగి= ఉబ్బిపోయి; అతనిన్= అతడిని; తాన్= తాను; కౌఁగిటన్= తన సందిట్లో; చేర్చి= చేర్చికొని; పుత్రా!= కుమారా! (ప్రేమతో పొంగిపోయి పిలిచిన పిలుపు); నిశ్చయంబు= నీ నిర్ణయం; అట్లు+అ+ఏనిన్= అట్లాగే అయితే; ఇభంబున్= ఏనుగు; కమఠంబున్= తాబేలున్నూ; కలవు= ఉన్నాయి; వానిన్= వాటిని; తిన్నన్= తింటే; లావు= బలం; ఎక్కున్= ఎక్కువౌతుంది; ఆ; ఘన= గొప్ప; జంతుద్వితయంబున్= జంతువులజంటను; నీకున్; ఎరగాన్= ఆహారంగా; కల్పించితిన్= సృష్టించాను; పోవనా= పోవయ్యా!

తాత్పర్యం: నీ కనుమాన మక్కరలేదు. అమృతం తప్పక తెస్తాను'. అనేసరికి తండ్రి ఉబ్బితబ్బిబ్బైపోయి కౌగిలించుకొని 'బాబూ! నీ నిర్ణయ మంతే అయితే సరే. ఒక యేనుగూ, ఒక తాబేలూ ఉన్నాయి. అవి ఘనజంతువులు. వాటిని తింటే బలం వస్తుంది. నీకు వాటిని నీ ఆహారంగా నిశ్చయించాను. అన్నా! అవి తిని పోయిరా!'

వ. అనుటయు సంతోషించి గరుత్మంతుం 'డా గజకచ్ఛపంబు లెచ్చట నుండు? నెబ్భంగివి? యని యడిగిన నమ్మునీంద్రుం డవ్విహగేంద్రున కిట్లనియె. 219

ప్రతిపదార్థం: అనుటయున్= అనటంతోనే; సంతోషించి= ఆనందపడి; గరుత్మంతుండు= సుపర్ణుడు; ఆ గజ, కచ్ఛపంబులు= ఆ ఏనుగు, తాబేలు; ఎచ్చటన్+ఉండున్?= ఎక్కడుంటాయి; ఏ+భంగివి?= ఎట్లాంటివి?; అని అడిగినన్= అని అడుగగా; ఆ+మునీంద్రుండు= ఆ ఋషీశ్వరుడు; ఆ విహగ+ఇంద్రునకున్= ఆ పక్షిరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు, చెప్పాడు.

తాత్పర్యం: అనటంతోనే సంతోషంతో 'ఆ ఏనుగు, తాబేలు ఎక్కడున్నాయి? వాటి సంగతేమిటి?' అని కొడుకు ప్రశ్నించగా తండ్రి ఇట్లా అన్నాడు.

కశ్యపుఁడు గరుడునకు గజకచ్ఛపంబుల తెఱం గెఱింగించుట (సం.13-25-1 (కుంభ))

సీ. 'ప్రాక్పయోనిధి పొంతఁ బర్వతం బొక్కటి । ఘన శృంగ కబళితాకాశ మగుచు,
నురగనామంబున నొప్పు, నచ్చేరువ । వసియించు నొక మహావారణంబు,
దానితటంబునఁ దామరకొల నబ్ధి । ననుకరించుచు మధురాచ్ఛవారి
సంపద సొంపారు సమదలీలల నగ్గ । జం బా నగంబుపై సంచరింప

తే. మిట్టుఁ బల్లంబు గట్టును మెట్టు నొక్క । మట్టమైయది నునుపారు మహిత మైన
యక్కొలన నీరు ద్రావఁగా ననుదినంబు । నరుగు నయ్యిభవల్లభుఁ డనఘచరిత! 220

విశేషం: అనఘ చరిత= పాపరహితమైన నడవడి గలవాడా!; ప్రాక్+పయోనిధి= తూర్పు సముద్రం; పొంతన్= ప్రక్కనే; పర్వతంబు= కొండ; ఘనశృంగ= ఎత్తైన శిఖరాలతో; కబళిత= మ్రింగబడిన; ఆకాశము+అగుచున్= మిన్ను కలదై; ఉరగ నామంబునన్= ఉరగమన్న పేరుతో; ఒప్పున్= పేరొందెను; ఆ+చేరువన్= ఆ ప్రక్కనే; ఒక మహావారణంబు= ఒక పెద్ద ఏనుగు; వసియించున్= నివశిస్తుంది; దానితటంబునన్= దాని ఒడ్డునే, ఆ పర్వతం చరియలో; తామర సరస్సు= తామరపూల సరస్సు; అబ్ధిన్= సముద్రాన్ని; అనుకరించుచున్= సరి పోలుతూ; మధుర= తీయని; అచ్చ= స్వచ్ఛమైన; వారి= నీటియొక్క; సంపదన్= సమృద్ధితో; సొంపు+ఆరున్= అందగిస్తుంది; ఆ+గజంబు= ఆ ఏనుగు; సమదలీలన్= మదంతో కూడిన విలాసంతో; ఆ నగంబుపైన్= ఆ కొండపై; సంచరింపన్= తిరుగగా; మిఱ్ఱు= ఎత్తు; పల్లంబు= లోతు, నిమ్న ప్రదేశం; గట్టును మెట్టును= గట్టూ, మెట్టూ; ఒక్కమట్టమై= సమమై; నునుపారున్= నున్నబడుతుంది; అనుదినంబు= ప్రతిరోజూ; మహితమైన= గొప్పదైన; ఆ+కొలన నీరు= ఆ చెరువునీరు; త్రావఁగాన్= త్రాగటానికి; ఆ+ఇభవల్లభుఁడు= ఆ ఏనుగు రాజు; అరుగున్= వెళ్ళుతాడు, వెళుతుంది.

తాత్పర్యం : తూర్పు సముద్రం చెంత ఒక గొప్ప పర్వతం ఉన్నది. దాని శిఖరాలు ఆకాశాన్ని కప్పివేస్తుంటాయి. దానిపేరు ఉరగము. దాని ప్రక్కనే ఒక ఏనుగు నివసిస్తూ ఉన్నది. ఆ కొండ ప్రక్క ఒక కొలను. అందులో నీరు స్వచ్ఛంగా తియ్యగా ఉంటుంది. ఆ ఏనుగు ఆ కొండపై తిరుగాడుతూ ఉంటే ఎత్తూ పల్లాలూ, గట్టూ మెట్టూ, ఏకచదరమైపోతుంది. ఆ ఏనుగు ఆ కొలనులో నీరు త్రాగటానికి ప్రతిరోజూ వెళ్ళుతుంది.

ఉ. అందొక కచ్ఛపప్రవరుఁ, డత్యధికంబగు కాయమున్, బలం
బుం దనరన్ వసించు, జలముం గొను వాంఛ, గజంబు వోయినం
జెందఁగనీక, సంగరముఁ జేయుఁ బెనంగుచు నీరుద్రావు, గౌ
రుం దెగియుండు నిట్ల పగ రోష మెలర్పఁగ నాఁడు నాఁటికిన్. 221

ప్రతిపదార్థం: అందున్= ఆ కొలనులో; ఒక; కచ్ఛప ప్రవరుఁడు= ఒక శ్రేష్ఠమైన తాబేలు; అతి= మిక్కిలి; అధికంబు+అగు= గొప్పదైన; కాయమున్= శరీరమూ; బలంబున్= బలమూ; తనరన్= ఒప్పగా; వసించున్= నివసిస్తున్నది; గజంబు= ఏనుగు; జలమున్+కొను వాంఛన్= నీరు త్రాగాలన్న ఆసక్తితో; పోయినన్= కొలని చెంతకు పోగా; చెందఁగనీక= నీరందనివ్వకుండా; పెనంగుచున్= పెనగులాడుతూ; సంగరమున్ చేయున్= యుద్ధం చేస్తుంది; నీరుత్రావు= నీరుత్రాగే; గౌరున్= ఏనుగుకూడా; తెగి= తెగించి; నాఁడు నాఁటికిన్= రోజు రోజుకూ; పగ= వైరం; రోషము= కోపం; ఎలర్పఁగన్= ఎక్కువకాగా; ఇట్లు+అ= ఇదే రీతిగా; ఉండున్= ఉంటుంది.

తాత్పర్యం: ఆ కొలనులో పెద్ద శరీరం కల బలిష్ఠమైన పెద్ద తాబేలు ఉంటున్నది. నీరు త్రాగటానికి ఏనుగు దప్పికతో వస్తే అది త్రాగనివ్వకుండా పోట్లాడుతుంది. ఆ ఏనుగుకూడా అట్లాగే పగ, రోషం రోజురోజుకూ ఎక్కువ కాగా జీవిస్తూ ఉన్నది.

క. విను, మధు కైటభు లనియెడు । దనుజేంద్రులు కచ్ఛపంబు దంతియు నై పు
ట్టినవారు దమ్మెఱుంగమిఁ । బెనఁగుదు రొండొరులతోడ భీకరభంగిన్. 222

ప్రతిపదార్థం: మధుకైటభులు+అనియెడు= ఆ పేర్లు కల; దనుజ+ఇంద్రులు= రాక్షసరాజులు; కచ్ఛపంబు= తాబేలు; దంతియున్= ఏనుగు ఐ; పుట్టినవారు= జన్మించినవారు; తమ్మున్= తమను తాము; ఎఱుంగమిన్= తెలియనందువలన; భీకరభంగిన్= భయంకర విధంగా; ఒండొరులతోడన్= ఒకరితో నొకరు; పెనఁగుదురు = పోట్లాడుకొంటారు.

తాత్పర్యం: వాళ్ళు మధుకైటభులనే రాక్షస శ్రేష్ఠులు. కానీ తాబేలు, ఏనుగులుగా పుట్టినందువలన తా మెవ్వరో తమకు తెలియనందున భయంకరంగా ఒకరితో ఒకరు కయ్యమాడుకొంటున్నారు.

క. ఒంటిమెయి నుండఁగా ము । క్కంటికి నా కచ్ఛపంబు గౌరుం బట్టం
గంట యరిది, యొకపఁటి నా । రెంటిం బొదువంగవలయు రే వెర వారన్. **223**

ప్రతిపదార్థం: ఆ కచ్ఛపంబున్= ఆ తాబేలును; ఆ గౌరున్= ఆ ఏనుగును; ఒంటిమెయిన్= ఒంటరిగా; ఉండగాన్= ఉన్నప్పుడు; పట్టన్+కంట= పట్టుకొగలగడం; ముక్కంటికిన్= మూడు కన్నులున్న శివుడికైనా; అరిది= అసాధ్యం; ఒకపఁటిన్= ఒకేసారి; ఆ రెంటిన్= ఆ రెండింటినీ; రే= రాత్రివేళ; వెరవారన్= ఉపాయంతో; పొదువంగవలయున్= పొదివి పట్టుకొనాలి.

తాత్పర్యం: ఆ రెండూ విడివిడిగా ఉన్నప్పుడు శివుడైనా పట్టుకొనలేడు. రాత్రిపూట ఆ రెంటిని ఒకేసారి పట్టుకొనాలి. ఇదే ఉపాయం.

వ. అనవుడు వైనతేయుండు. **224**

తాత్పర్యం: కశ్యపు డట్లా అనగా వినత కుమారుడైన గరుత్మంతుడు (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. 'ఒకటి గొలనిలోన నుండు నొక్కటి గొండ । మీఁద సంచరించు, మీరు రెంటి
నడఁగ నొక్కమాట యడరి పట్టుట కృత్య । మనియెదరు, వశంబె? యట్ల చేయ?' **225**

ప్రతిపదార్థం: ఒకటి= తాబేలు; కొలని లోనన్ ఉండున్= చెరువులో ఉంటుంది; ఒక్కటి= ఒక్కటి; కొండమీఁదన్= పర్వతంపైన; సంచరించున్= తిరుగుతుంది కదా!; మీరు= మీరేమో!; రెంటిన్= రెండింటినీ; అడఁగన్= అణగారేటట్లు; అడరి= ఏపురేగి; ఒక్కమాటు+అ= ఒకేసారి; అడరి= విజృంభించి; పట్టుట= బంధించటం; కృత్యము= చేయదగినపని; అనియెదరు= అంటారు; అట్లు+అ= అట్లాగే; చేయన్= చేయటానికి; వశంబె?= శక్యమా?

తాత్పర్యం: మీరు రెంటినీ ఒకేసారి పొదివి పట్టుకొనాలి అంటారు. ఒకటేమో చెరువులో ఉంటుంది. మరొకటి కొండమీద తిరుగుతుంది కదా! ఇ దెట్లా వీలుపడుతుంది?

విశేషం: ఇది పాఠకుడికి కలిగే ప్రశ్న. పాత్రద్వారా కవి చెప్పిస్తున్నాడు. కథ చెప్పటంలో ఇది గడుసుతనం. మీరు అనటం తండ్రి గారిని గౌరవించటం.

వ. అనిన 'నది యట్టిద, ఉపాయంబు సెప్పెద; నాకర్ణింపు' మని యమ్మునివరుండు. **226**

ప్రతిపదార్థం: అనినన్= అనగా (గరుత్మంతుడు) అది అట్టి= అది అంతే; ఆకర్ణింపుము= వినుము; ఉపాయంబు= ఉపాయం; చెప్పెదన్= చెప్తుతాను; ఆకర్ణింపుము= వినుము; అని; ఆ+మునివరుండు= ఆ మునిరాజు, కశ్యపుడు.

తాత్పర్యం: అదంతే. అని ఆ మునిశ్రేష్ఠుడు 'ఉపాయం చెప్తుతాను వినుము' అని. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. 'కరిపతి నీరు ద్రావుటకుఁ గాఁ జనుదెంచినఁ గూర్మరాజు సం
గర మొనరించుచుండి తమకంబున నీళ్ళులఁ బాసి వీఁకమై

దరి నడరంగఁ బట్టునది, తత్సమయంబున రెంటిఁ గూడ నీ

వెరవున నూఁది చిత్తమున వేగిరపా టెటు లేక పొంచుమీ'! 227

ప్రతిపదార్థం: కరిపతి= ఏనుగురాజు; నీరు+త్రావుటకున్ కాన్= నీరు త్రాగటానికై; చనుదెంచినన్= రాగా; కూర్మరాజు= తాబేలు రాజు; సంగరము= యుద్ధం; ఒనరించుచుండి= చేస్తూ చేస్తూ; తమకంబునన్= పట్టుదలతో; నీళ్ళులన్= నీటిని; పాసి= వదలి; వీఁకమైన్= ఉదుటుతో; దరిన్= ఒడ్డున; అడరంగన్= విజృంభించగా; పట్టునది= పట్టుకొనేది; తత్+సమయంబునన్= అప్పుడు; రెంటిన్= రెండిటిని; కూడన్= కలిసేటట్లు కలిపి; ఈ వెరవునన్= ఈ ఉపాయంతో; ఊఁది= నొక్కి; చిత్తమునన్= మనస్సులో; వేగిరపాటు= తొందరపాటు; ఎటు లేక= ఏదీ లేకుండా; పొంచుమీ!= పొంచి ఉండాలి సుమా!

తాత్పర్యం: 'ఏనుగు నీళ్ళకు రాగానే తాబేలు పోట్లాడటం ప్రారంభిస్తూ ఒడ్డుమీదికి వస్తుంది. ఆ సమయం కొరకు నీవు ఉపాయంగా తొందరపడకుండా పొంచి ఉండాలి'.

విశేషం: చిన్న పిల్లవాడికి తండ్రి చెప్పే వైనం భావించుకొని చూస్తే కాని ఈ సంభాషణలో అందం తెలియదు.

వ. అని యుపదేశించిన వీడ్కొనుటకు వినతుం డయిన తనయు నత్యాదరంబునం గనుంగొని యత్తపోధన సత్తముండు 'నీవు గజకచ్ఛపంబుల నాహారంబుగాఁ గొనిన నీకుం ద్రిదశాహారంబు తేర దొరకొనుటకు సందేహంబు లేదను పల్కు వల్కి పరమాశీర్వాదంబు లిచ్చిన. 228

ప్రతిపదార్థం: అని ఉపదేశించినన్= అని బోధించగా; వీడ్కొనుటకున్= వదలివెళ్ళుటకు; వినతుండు+అయిన= వంగి నమస్కరించిన; తనయున్= కొడుకును; అతి+ఆదరంబునన్= మిక్కిలి వాత్సల్యంతో; కనుంగొని= చూచి; ఆ+తపోధన= ఆ తపస్సే ధనంగా కలవారిలో (అతడి ఐశ్వర్యమంతా అదే); సత్తముండు = శ్రేష్ఠుడు; నీవు; గజ= ఏనుగు; కచ్ఛపంబులన్= తాబేలులను; ఆహారంబుగాన్= అన్నంగా; కొనినన్= గ్రహిస్తే; నీకున్; త్రిదశ+ఆహారంబు= దేవతల అన్నమైన అమృతం; త్రిదశులు= బాల్య యౌవన కౌమార దశలు మూడే కలవారు; (దేవతలు. వారికి వృద్ధాప్యం లేదు); తేరన్= తేవటానికి; దొరకొనుటకున్= పూనుకొనటానికి; సందేహంబు= సంశయం; లేదు= లేదు; అనుపల్కు పల్కి= అనే మాటలు చెప్పి; పరమ= గొప్ప, మహత్తరమైన; ఆశీర్వాదంబులు= ఆశీస్సులు; ఇచ్చినన్= ఇవ్వగా (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: తండ్రి మార్గం చెప్పగానే ప్రయాణమై పోవటానికి వంగి నమస్కరించిన కొడుకును ప్రేమగా చూచి ఆ మహా తపస్వి ఇట్లా అన్నాడు; 'నీవు ఆ ఏనుగు తాబేళ్ళను ఆహారం చేసికొంటే అమృతం తెచ్చే శక్తి నీకు వస్తుంది. సందేహం లేదు' అని ఆశీర్వదించాడు.

మ. విని యుత్సాహము గందళింపఁగ వియద్వీథీగతుం డై, విమా

న నికాయంబులు దూలఁ బక్షతివితానస్ఫార దీప్తి వ్రజం

బినరశ్మి ప్రకరంబుఁ గీడ్పఱుపఁ బక్షీంద్రుండు చంచద్గతిం

జనియెం దానురగాభిధాన మగు నా శైలంబు పెంపిప్పకున్. 229

ప్రతిపదార్థం: పక్షి+ఇంద్రుండు= పక్షులరాజు; విని= ఆలించి; ఉత్సాహము= పనిమీద తొందర; కందళింపఁగన్= అంకురించగా; వియత్= ఆకాశమనే; వీథీ= మార్గం; గతుండై= పొందినవాడై; విమాన నికాయంబులు= విమానసమూహాలు; తూలన్=

చెల్లాచెదరుకాగా; పక్షతి= రెక్కల; వితాన= సమూహం యొక్క; స్ఫారదీప్తి వ్రజంబు= కదిలే కాంతుల గుంపు; ఇనరశ్మి= సూర్యకాంతి; ప్రకరంబున్= సమూహాన్ని; కీడ్పఱుపన్= కీడుపరచగా; చంచద్గతిన్= ఉత్సాహంతో చలించే నడకతో; తాను= గరుత్మంతుడు; ఉరగ+అభిధానము+అగు= ఉరగమన్న పేరుగల; ఆ= ఇదివరకే తెలిసిన; శైలంబు= కొండమీద ఉన్న; పెన్+తిప్పకున్= పెద్ద శిఖరానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: గరుత్మంతుడు తండ్రి చెప్పినదంతా శ్రద్ధగా విని ఉత్సాహం ఉరకలు వేస్తుండగా, రెక్కల జంట నుండి వెలువడే కాంతులు సూర్యకాంతిని కప్పివేయగా, ఆకాశంలో దేవతల విమానాలు అతడి రెక్కల గాలికి చెల్లాచెదరు కాగా, ఉరగమన్న పేరున్న ఆ కొండతిప్పకు వెళ్ళాడు.

విశేషం: పద్యంలో గుంపు - అన్న అర్థంలో ఎన్ని పర్యాయపదాలు వచ్చాయో పాఠకులు గుర్తించాలి.

క. చని, యల్పశరీరుండై, తను నెఱుఁగక యుండ, మెలఁగి దానోగ్ర గజేం
ద్రునిఁ గాంచి నీరి కది పో । యిన యప్పుడు వెనుకఁ జనియె నెలమి దలిర్పన్. 230

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; అల్పశరీరుండు+ఐ= చిన్న శరీరం కలవాడై; తనున్= తనను; ఎఱుఁగక ఉండన్= ఎవ్వరూ గుర్తించకుండా ఉండునట్లు; మెలఁగి= ప్రవర్తించి; దాన+ఉగ్ర= మదజలంతో భయంకరమైన; గజ+ఇంద్రునిన్= ఏనుగులరాజును; కాంచి= చూచి; నీరికిన్= నీటికొరకై; అది= ఆ యేనుగు; పోయిన= వెళ్ళిన; అప్పుడు= ఆ సమయంలో; ఎలమి= సంతోషం; తలిర్పన్= చిగురెత్తగా; వెనుకన్ చనియెన్= వెనుకగా వెళ్ళాడు.

తాత్పర్యం: తన శరీరాన్ని చిన్నదిగా చేసికొని ఎవరికీ తెలియకుండా దాక్కొంటూ భయంకరమైన ఆ యేనుగు నీళ్ళకు బయలుదేరగా, వెన్నంటి తానూ వెళ్ళాడు.

విశేషం: అల్పశరీరం= అణిమ అన్న అష్టసిద్ధులలో ఒకటి. దాన+ఉగ్ర= మదించిన ఏనుగు దౌడల నుండి మదపువాసన గల నీరు స్రవిస్తుంది అని గజశాస్త్రం.

ఉ. దంతి సనంగ, భూరిమదధారల గాలి యెఱింగి, కూర్మ మ
త్యంత సముద్ధతిం గొలని కడ్డపడన్ వెసవచ్చె; వచ్చినన్,
దంతియు నీరువట్టున నుదగ్రపుఁ గోపము సందడింప, దు
ర్దాంతసముద్యమం బెసఁగ దాని పయిన్ గవిసెన్ మహోగ్రమై. 231

ప్రతిపదార్థం: దంతి= ఏన్గు; చనంగన్= వెళ్ళగా; భూరి= గొప్ప; మదధారల= మదజలపు ధారల; గాలి= వాసన; ఎఱింగి= తెలిసి; కూర్మము= తాబేలు; అతి+అంత= అత్యంత= చాలా ఎక్కువ; సముద్ధతిన్= గర్వంతో; కొలనికిన్= చెరువుకు; అడ్డపడన్= అడ్డపడటానికి; వెసన్= శీఘ్రముగా; వచ్చెన్= వచ్చింది; వచ్చినన్= వచ్చేటప్పటికి; దంతియున్= ఏనుగుకూడా; నీరువట్టునన్= దప్పికవలన; ఉత్+అగ్రపు= చాలా భయంకరమైన; కోపము= రోషం; సందడింపన్= ముసురుకొనగా; దుర్+దాంత= అణచరాని; సముద్యమంబు= గొప్ప ప్రయత్నం; ఎసఁగన్= అతిశయించగా; దాని పయిన్= తాబేలు మీదకు; మహా+ఉగ్రము+ఐ= మహా భయంకరంగా; కవిసెన్= దూకింది.

తాత్పర్యం: ఏనుగు చెరువును సమీపిస్తుండగానే గాలివలన దాని మదజల వాసనను పసిగట్టి తాబేలు మహోద్రేకంతో కొలను కడ్డంగా నిలబడింది. అసలే దప్పికతో ఉన్న ఏనుగుకు కోపం హద్దులు దాటింది. వెంటనే మహాభయంకరంగా తాబేలుపైకి దూకింది.

చ. కవిసి, ఖరంబులైన మునికాళ్ళను వ్రేయఁగ, సాము నీరిలో
ను వెడలకుండి కూర్మ మతను స్థిర తీవ్రనఖంబులం బదా
గ్ర విదళనంబు సేయఁగఁ గరంబున మోదఁగ వారణంబు దం
తవిహతి నొంపఁ గచ్ఛపము, దారుణ మయ్యె రణంబు భూవరా! 232

ప్రతిపదార్థం: భూవరా!= భూమికి భర్తవయిన ధర్మరాజా! (ఈ కథను భీష్ముడు ధర్మరాజుకు చెప్పుతున్నాడు. అని మరచిపోయిన పాఠకులకు గుర్తుచేయటం, వక్త-శ్రోత-వీరిద్దరినీ ఆశ్రయించే పురాణం వచ్చింది; కవిసి= (ఏనుగు) ఎదిరించి; ఖరంబులు+ఐన= వాడిఅయిన; మునికాళ్ళను= ముందుకాళ్ళతో; వ్రేయఁగన్= వేసికొట్టేసరికి; కూర్మము= తాబేలు; సాము= సగం; నీరిలోను= నీటిలోనుండి; వెడలక+ఉండి= బయటకు రాకుండా ఉండి; అతను = బలిష్ఠమైన; స్థిర= గట్టిగా ఉన్న; తీవ్ర= భయంకరమైన; నఖంబులన్= గోళ్ళతో; పద+అగ్ర= పాదాల పైభాగాన్ని; విదళనంబు= చీల్చటం; చేయఁగన్= చేసేసరికి; వారణంబు= ఏనుగు; కరంబునన్= తొండంతో; మోదఁగన్= గట్టిగా కొట్టగా; కచ్ఛపము= తాబేలు; దంత= పండ్ల; విహతిన్= దెబ్బతో; నొంపన్= నొప్పింపగా; రణంబు= యుద్ధం; దారుణము= భయంకరం; అయ్యెన్= అయినది.

తాత్పర్యం: ధర్మరాజా! దప్పికతో వచ్చిన ఏనుగు అడ్డుపడిన తాబేలును తన వాడియైన మునికాళ్ళతో త్రొక్కింది. తాబేలేమో సగం నీటిలోనే ఉంటూ తన గట్టిగోళ్ళతో ఏనుగు పాదాల పైభాగాలను చీల్చింది. ఏనుగు తొండంతో బాదింది. తాబేలు దంతాలతో కొరికింది. ఈ విధంగా యుద్ధం భయంకరంగా సాగింది.

విశేషం: తెలుగు సాహిత్యంలో జంతువుల యుద్ధవైఖరిని అద్భుతంగా చిత్రిస్తున్న పద్య మిది. ఆముక్తమాల్యదలో ఖాండిక్య కేశి ధ్వజసంవాదంలో యాగగోవును పులి చంపిన వైనం రాయలవారు చిత్రించారు. దీనికి తిక్కన్నగారి పద్యం మూలంవలె ఉన్నది. అంటే రెండూ చదివి తీరాలని భావం.

ఉ. ఇమ్మెయిఁ బోరి పోరి, మది నేపును గోపము నగ్గలింపఁ, గూ
ర్మమ్ము గడంగి, నీ ర్వెడలి మత్తకరిన్ వడి నాక్రమింపఁగా,
గ్రమ్మన రెంటినిం బొదివి, కచ్ఛపమున్ వలకాల వామపా
దమ్మున వారణంబును ముదమ్మునఁ బట్టి తగిల్చె గోళ్ళులన్. 233

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; పోరిపోరి= పోరాడి పోరాడి; మదిన్= మనస్సులో; ఏపును= విజృంభణ; కోపము= రోషం; అగ్గలింపన్= ఎక్కువకాగా; కూర్మమ్ము= తాబేలు; కడంగి= పూనుకొని; నీరు+వెడలి= నీటినుండి బైటికి దూకి; మత్తకరిన్= మదించిన ఏనుగును; వడిన్= వేగంగా; ఆక్రమింపఁగాన్= పైకి దూకేసరికి; గ్రమ్మనన్= హఠాత్తుగా; రెంటినిన్= రెండింటినీ; పొదివి= ఆక్రమించి; వలకాలన్= కుడికాలితో; కచ్ఛపమున్= తాబేటిని; వామపాదమ్మునన్= ఎడమకాలితో; వారణంబును= ఏనుగును; ముదమ్మునన్= సంతోషంతో; పట్టి= పట్టుకొని; గోళ్ళులన్= గోళ్ళకు; తగిల్చెన్= వ్రేలాడదీశాడు.

తాత్పర్యం: ఈ విధంగా రెండూ పోరిపోరి విసుగెత్తి కోపం, మదం విజృంభించగా తాబేలు నీటిలోనుండి బైటకు వచ్చి గజరాజును ఆక్రమించింది. అదను చూచి గరుత్మంతుడు తాబేలును కుడికాలితో, ఏనుగును ఎడమ కాలితో గోళ్ళకు పట్టుకార్లకు వ్రేలాడదీసినట్లు వ్రేలాడదీశాడు.

విశేషం: ఇది చాలా గొప్ప వర్ణన. రెంటినీ గరుత్మంతుడు పట్టుకొన్న వైనం చాలా గొప్పగా చిత్రం గీసి చూపించాడుకవిబ్రహ్మ.

వ. ఇట్టు వినతపట్టి పట్టిన నవి దమయంగంబులు పొరలం బడ నడిచిపడుటయు నతండు. 234

ప్రతిపదార్థం: ఇట్టు= ఈ విధంగా; వినతపట్టి= వినతకొడుకు - గరుత్మంతుడు; పట్టినన్= గోళ్ళతో పట్టుకొనగా; అవి= తాబేలూ, ఏనుగు; తమ; అంగంబులు= అవయవాలు; పొరలన్+పడన్= తిరగబడగా, బోర్లపడగా; అడిచిపడుటయున్= ఎగిరిపడగా; అతండు= గరుత్మంతుడు.

తాత్పర్యం: ఈ విధంగా గరుత్మంతుడు గోళ్ళతో పట్టుకొనగా తాబేలూ, ఏనుగూ తమ శరీరాలు తిరగబడగా ఎగిరిపడ్డాయి. అప్పు డతడు.

విశేషం: గరుత్మంతుడి గోళ్ళకు వ్రేళ్ళాడే జంతువుల స్థితిని వర్ణిస్తుంది ఈ చిన్న వచనం.

మ. పెలుచన్ గోళుల నొత్తి, యగ్గజముఁ దాఁబేలున్ వసం బేది మూ
ర్ఛల నొందన్ వెస నెత్తి, మేఘయుగళీసక్తోల్లసద్గైరికా
చలవైహాయసకేళియో యన నభస్సంచారియై, యుబ్బు న
గ్గలికన్ దవ్వుగఁ బాఱి, యొక్క ఘనవృక్షం బయ్యెడం దోఁచినన్. 235

ప్రతిపదార్థం: పెలుచన్= గట్టిగా; గోళులన్= గోళ్ళతో; ఒత్తి= అదిమి పట్టుకొని; ఆ+గజమున్= ఆ ఏనుగు; తాఁబేలున్= కచ్ఛపమున్నూ; వసంబు+ఏది= స్వాధీనత కోల్పోయి; మూర్ఛలనొందన్= మూర్ఛపోగా; వెసన్= త్వరగా; ఎత్తి= పైకిలేపి; మేఘ యుగళీ= రెండు మేఘాలతో; సక్త= కూడియున్న; ఉత్+లసత్= ప్రకాశించే; గైరిక= బంగారు; అచల=కొండయొక్క; వైహాయస కేళియోఅనన్= ఆకాశసంచారక్రీడా అన్నట్లుగా; నభః+సంచారిఐ= ఆకాశంలో ఎగురుతూ; ఉబ్బు= గర్వం యొక్క; అగ్గలికన్= ఆధిక్యంతో; దవ్వుగన్= దూరంగా; పాఱి= ఎగిరిపోయి; ఒక్క= ఒక; ఘన= పెద్ద; వృక్షంబు= చెట్టు; అయ్యెడన్= అక్కడ; తోఁచినన్= కనిపించగా.

తాత్పర్యం: ఆ రెండు జంతువులనూ గోళ్ళతో అదిమి పట్టుకొనేసరికి అవి స్వాధీనము తప్పి మూర్ఛపోయాయి. ఆ రెండింటితో ఆకాశంలోకి ఎగరటం ఎట్లా ఉన్నదంటే - రెండు మేఘాలు తనమీద వాలగా బంగారుకొండ ఆకాశంలో ఎగిరిపోతున్నట్లుగా ఉన్నది. అట్లా గర్వాతిశయంతో ఎగురుతూ దూరంగా పోయి ఒక చెట్టు కనిపించగా. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఇందులో చెప్పిన పోలిక (అలంకారం) చాలా అందమైనదే కాక చాలా గంభీరమైనది కూడా. గరుత్మంతుడు ఎర్రనివాడు కనుక బంగారుకొండ. జంతువులు రెండు నల్లనివి కనుక మేఘాలు.

ఆ. దానిమీఁద నుండి, వాని రెంటిని భుజింౕ పంగ మదిఁ దలంచి, పంచయోజ
నముల నిడువు గల్గు రమణీయశాఖపైౕ గరుడుఁ డెలమి నెఱఁగెఁ గురువరేణ్య! 236

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కౌరవశ్రేష్ఠుడా!; దానిమీఁదన్= చెట్టుపైన; ఉండి= కూర్చొని; వానిన్ రెంటినిన్= ఆ రెండు జంతువులను; భుజింపంగన్= తినటానికి; మదిన్= మనస్సులో; తలంచి= అనుకొని; పంచ= ఐదు; యోజనములు= యోజనమంటే సుమారు 4 క్రోసులు - ఆమడ; ఐదు యోజనములు= 20 ఆమడలు; నిడుపు= పొడవు; కల్గు= ఉన్న రమణీయ= అందమైన; శాఖపైన్= కొమ్మ మీద; గరుడుఁడు= గరుత్మంతుడు; ఎలమిన్= సంతోషంతో; ఎఱఁగెన్= వ్రాలెను.

తాత్పర్యం: ఐదు యోజనాల పొడవున్న ఆ చెట్టు కొమ్మమీద కూర్చొని ఆ రెంటిని తిందామని అనుకొని గరుత్మంతుడు సంతోషంతో దానిమీదికి వ్రాలాడు.

క. ఎఱఁగిన, యప్పెను వ్రేగున । విఱుగుటయును, శాఖ చూచి విహగేంద్రుఁడు గొం
దఱు మునుల నందు గన్గొని । వెఱపున నాత్మీయ చిత్తవృత్తి గలంగన్. 237

ప్రతిపదార్థం: ఎఱఁగిన= వ్రాలగా; ఆ+పెను= ఆ పెద్ద; వ్రేఁగునన్= బరువుచేత; శాఖ= కొమ్మ; విఱుగుటయునున్= విరుగగా; చూచి= కన్గొని; విహగ+ఇంద్రుఁడు= పక్షిశ్రేష్ఠుడు, గరుత్మంతుడు; అందున్= ఆ కొమ్మలో; కొందఱు మునులన్= కొంతమంది తపస్వులను; కన్గొని= చూచి; వెఱపునన్= భయంతో; ఆత్మీయ= తన; చిత్తవృత్తి= మనస్సు; కలంగన్= కలతచెందగా.

తాత్పర్యం: వ్రాలేసరికి ఆ పెద్దబరువుకు అంతకొమ్మకూడా విరిగిపోయింది. ఆ కొమ్మలో కొందరు మునులుండటం చూచిన గరుత్మంతుడి మనస్సు బాధపడి. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. అవనిఁ బడనీక, శాఖఁ జంచువునఁ బట్టి । పట్టి వారల సుస్థితుల్ పల్లటిలక
యుండ, వెరవున ధరియించి, యొయ్య నెగయఁ । జూచి యవ్వాలఖిల్యులు చోద్య మంది. 238

ప్రతిపదార్థం: అవనిన్= నేలపై; పడనీక= పడనివ్వక; శాఖన్= కొమ్మను; చంచువునన్= ముక్కుతో; పట్టిపట్టి= గట్టిగా కరచుకొని; వారల= మునుల; సుస్థితుల్= కూర్చున్నతీరు; పల్లటిలకయుండన్= చెదరిపోకుండా; వెరవునన్= నేర్పుతో; ధరియించి= ధరించి, పట్టుకొని; ఒయ్యన్= నెమ్మదిగా; ఎగయన్= ఎగరటం; చూచి; ఆ+వాలఖిల్యులు= వాలఖిల్యులనబడే ఆ మునులు; చోద్యము+అంది= ఆశ్చర్యపడి.

తాత్పర్యం: భూమిపై పడబోతున్న ఆ కొమ్మను ముక్కున పట్టుకొని ఆ మునుల కేమాత్రం స్థానభ్రంశం కాకుండా చూస్తూ నెమ్మదిగా ఎగిరేసరికి ఆ మునులు చూచి ఆశ్చర్యపడి.

విశేషం: ఆ మునులు 360 మంది సంవత్సరకాలమనీ, గరుత్మంతుడు సూర్యుడనీ, కాలస్వరూపుడనీ వేదం వర్ణిస్తుంది.

వ. వైనతేయుం డగుట మనంబుల ననుసంధించి కరుణించి. 239

ప్రతిపదార్థం: వైనతేయుండు= వినతకొడుకు; అగుట= కావటం; మనంబులన్= మనసులలో; అనుసంధించి= భావించి; కరుణించి= దయతలచి.

తాత్పర్యం: అతడు గరుత్మంతుడని మనస్సులలో భావించి దయతలచి. (తరువాతి పద్యంతో అన్వయం)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'ఈతఁడు దక్కఁగ, నొరులకు । నీతెఱఁగు బలంబు, వెరవు నేల కలుగు? నం
చాతరుశాఖ విడిచి చని । రాతని దీవించి యోగ్య మయ్యెడు నెడకున్. 240

ప్రతిపదార్థం: ఈతఁడు= ఈ గరుత్మంతుడు; తక్కఁగన్= తప్ప; కాక; ఒరులకు= ఇతరులకు; ఈ తెఱఁగు= ఈ విధమైన; బలంబు= బలమూ; వెరవు= నేర్పూ; ఏల కలుగున్= ఎట్లా కలుగుతాయి? అంచున్= అనుకొంటూ; ఆ తరుశాఖన్= ఆ చెట్టుకొమ్మను; విడిచి= వదలిపెట్టి; అతనిన్ దీవించి= అతడి కాశీస్సు లిచ్చి; యోగ్యము+అయ్యెడు= తగినటువంటి; ఎడకున్= చోటికి; చనిరి= పోయారు.

తాత్పర్యం: గరుత్మంతుడికి తప్ప ఈ విధమైన బలము, నేర్పూ ఇతరులకు లేవని ఆ మునులు అతడిని దీవించి ఆ చెట్టుకొమ్మను వదలిపెట్టి వాళ్ళకిష్టమైన చోటికి వెళ్ళిపోయారు.

వ. చనినన్ గరుత్మంతుండు సంతోషించెఁ; దదనంతరంబ. 241

ప్రతిపదార్థం: చనినన్= వెళ్ళగా; గరుత్మంతుఁడు= వినతకొడుకు; సంతోషించెన్= ఆనందించాడు; తత్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: వెళ్ళగా గరుత్మంతుడు సంతోషించాడు. ఆ తరువాత.

ఆ. 'విపులశాఖ నిచట విడిచిన నిచ్చటి । జంతుకులము లెల్లఁ జచ్చు; నింక
నేమి సేయువాఁడ? నే' నను నెవ్వగ । పుట్టె నవ్విహంగపుంగవునకు. 242

ప్రతిపదార్థం: విపుల= విస్తారమైన; శాఖన్= కొమ్మను; ఇచటన్= ఇక్కడ; విడిచినన్= వదలితే; ఇచ్చటి= ఇక్కడి; జంతు కులములు= జంతువుల గుంపులన్నీ; చచ్చున్= చస్తాయి; ఇంకన్= మరి; ఏమిచేయువాఁడన్? = ఏం చేసేది?; అను= అన్నటువంటి; నెఱ+వగ= నిండు దుఃఖం; ఆ+విహంగ= ఆ పక్షి; పుంగవునకున్= శ్రేష్ఠునకు; పుట్టెన్= కలిగింది.

తాత్పర్యం: 'ఈ పెద్దకొమ్మ నిక్కడ వదలిపెట్టితే ఇక్కడున్న జంతువులన్ని నలిగి చచ్చిపోతాయి. మరి ఇప్పుడేం చేయాలన్న బాధ కలిగింది ఆ గరుత్మంతుడికి.

విశేషం: ఈ ఆలోచన అతడి దయను ప్రకటిస్తుంది. గరుత్మంతుడు ఎంత మహానుభావుడో వివరించే కథ కనుక ఆయా గుణాలను చెప్పుతూ పోతాడు మహాకవి. వాటిని మనం భావించాలి.

వ. అట్టి యెడ. 243

తాత్పర్యం: అప్పుడు.

తే. 'నిందితాచార యుతము, కులింద దేశ । మంబుధి ప్రాంత; మీశాఖ యందు విడువు,
మమరవరుల పం పిది, విహగాధినాథ!' యను నెలుంగు నభంబునం దావహిల్లె. 244

ప్రతిపదార్థం: విహగ =(ఆకాశంలో ఎగిరే) పక్షులకు; అధినాథ!= అధిపతీ! రాజా!; నిందిత= అపవిత్రమైన; ఆచార= ఆచారాలతో; యుతము= కూడుకొన్నది; కులింద దేశము= ఆ పేరుగల దేశము; అంబుధిప్రాంతము= అది సముద్రప్రాంతంలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉంది; ఈ శాఖ= ఈ కొమ్మను; అందున్= అక్కడ; విడువుము= వదలిపెట్టుము; ఇది; అమరవరుల= పూజించదగిన దేవతలయొక్క; పంపు= ఆజ్ఞ; అను+ఎలుంగు= అన్న కంఠధ్వని; నభంబునందున్= ఆకాశంలో; ఆవహిల్లెన్= వ్యాపించెను.

తాత్పర్యం: 'ఓయీ! పక్షిరాజా! పూజ్యులైన దేవతలు నీ కనుజ్ఞ ఇస్తున్నారు. 'దురాచారాలతో అపవిత్రమైన కులిందదేశ సముద్ర ప్రాంతంలో ఈ కొమ్మను వదలిపెట్టుము' అన్న మాటలు ఆకాశంలో వినిపించాయి.

విశేషం: అధర్మం, శిక్షించదగింది కనుక ఆ శిక్షించే అధికారులు దేవతలు కనుక వా రాజ్ఞాపించారు. ప్రపంచగతిలో సమత్వాన్ని కాపాడేవారు దేవతలు. అసమత్వాన్ని కల్పించే శక్తులు రాక్షసులు. వీళ్ళిద్దరూ వ్యక్తులు కారు. విశ్వంలో భావశక్తులు.

క. విని, సత్వరముగ నటఁ గొని । చని, యద్దేశమునఁ గల్గు జనములు మృతిఁ బొం
ద, నతం డా చక్కటి నా । ఘనశాఖయు నెమ్మనంబు కలఁకయు విడిచెన్. 245

ప్రతిపదార్థం: విని= ఆలించి, సత్వరముగన్= తొందరగా; అటన్= అక్కడకు; కొని= గ్రహించి; చని= వెళ్ళి; ఆ+దేశమునన్= ఆ ప్రాంతంలో; కల్గు= ఉండే; జనములు= ప్రజలు; మృతిన్ పొందన్= చావగా; అతండు= ఆ గరుత్మంతుడు; ఆ చక్కటిన్= ఆ ప్రదేశంలో; ఆ ఘనశాఖయున్= ఆ పెద్దకొమ్మను; నెమ్మనంబు= నిండు మనస్సులోని; కలఁకయున్= కలతను; విడిచెన్= త్యజించాడు.

తాత్పర్యం: వినీ వినగానే ఆ ప్రదేశానికి వెళ్ళి అక్కడివారు చచ్చేటట్లుగా; ఆ పెద్దకొమ్మను తన మనస్సులోని కలతతో పాటు విడిచిపెట్టాడు.

విశేషం: కొమ్మను విడవటమూ - కలతపోవటమూ ఒకేసారి జరిగాయన్నమాట.

వ. విడిచి భరితలీలంబుగా నొక్క శైలంబు విశాల తటంబునకుం బోయి. 246

ప్రతిపదార్థం: విడిచి= కొమ్మను విడిచి; భరిత= భరించబడిన; లీలంబుగాన్= విలాసంగా; ఒక్క శైలంబు= ఒక కొండయొక్క; విశాల తటంబునకున్+పోయి= విశాలమైన చదునైన ప్రదేశానికి వెళ్ళి.

తాత్పర్యం: కొమ్మను అట్లా వదలిపెట్టి చాలా విలాసంగా ఒక కొండపై ఉన్న చదరమైన మైదానానికి పోయి.

విశేషం: భరితలీలంబుగాన్= బరువు దించుకొన్న తరువాత కలిగే ఉల్లాసాన్ని సూచించే మాట.

క. కరికచ్ఛపముల పెన్నె । త్తురుఁ, గండలుఁ, గ్రొవ్వు, మెదడుఁ, దుష్టిగఁ బక్షీ
శ్వరుఁ డాని, యధికబలబం । ధురుఁడై యమృతమున కేఁగె దుర్దాంతగతిన్. 247

ప్రతిపదార్థం: కరి కచ్ఛపముల= ఏనుగు తాబేళ్ళ యొక్క; పెన్= పెద్ద; నెత్తురున్= నెత్తురును; కండలున్= కండలును; క్రొవ్వు; మెదడున్; తుష్టిగన్= సంతోషంగా; పక్షి+ఈశ్వరుఁడు= పక్షిరాజు; అని= తిని; అధిక= ఎక్కువ; బలబంధురుఁడు+ఐ= బలంతో కూడుకొన్నవాడై; దుర్+దాంత= ఆపరాని, గతిన్= నడకతో, ప్రయాణంతో; అమృతమునకున్= అమృతంకొరకు; ఏఁగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఏనుగూ, తాబేలూ ఆరెండింటి నెత్తురూ, కండలూ, క్రొవ్వూ, మెదడూ తృప్తిగా భుజించి సంతుష్టుడై పక్షిరాజు కావలసిన బలాన్ని పొంది, ఆపరాని వేగంతో అమృతం కొరకు వెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇవ్విధంబున. **248**

తాత్పర్యం: ఈ విధంగా.

క. చని, దానిచుట్టు మండెడు । ననలంబును జూచి, తన్మహత్తర జిహ్వల్

దనికిన నెఱకలు గమరునొ । యను తలఁపున బ్రహ్మఁ గాన నరిగె రయమునన్. **249**

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; దాని= అమృతంయొక్క; చుట్టు= చుట్టూరా; మండెడు= మండే; అనలంబును= అగ్నిని; చూచి= కని; తత్= ఆ అగ్నియొక్క; మహత్తర= గొప్ప; జిహ్వల్= నాల్కలు; తనికినన్= తాకితే; ఎఱకలు= రెక్కలు; కమరునొ= కాలునో; అను= అన్న; తలఁపునన్= ఆలోచనతో; బ్రహ్మన్= తాతగారైన బ్రహ్మదేవుడిని; కానన్= చూడటానికి; రయమునన్= వేగంగా; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అమృతం దగ్గరకు వెళ్ళేసరికి దానిచుట్టూ అగ్ని మండుతున్నది. ఆ మంటలు తాకితే రెక్కలు కమిలిపోతాయేమోనన్న భయంతో తాత బ్రహ్మ దగ్గరకు వెళ్ళాడు. (ఉపాయం కొరకు)

వ. అరిగి తచ్చరణ పద్మంబులకుం బ్రణతుఁడై కేలు మొగిచి. **250**

ప్రతిపదార్థం: అరిగి= వెళ్ళి; తత్= బ్రహ్మ యొక్క; చరణ= పాదాలనెడి; పద్మంబులకున్= తామరపూలకు; ప్రణతుఁడు+ఐ= వంగి; కేలు మొగిచి= చేతులు జోడించి, నమస్కరించి;

తాత్పర్యం: వెళ్ళి, ఆయన పాదపద్మాలకు వంగి నమస్కరించి.

చ. 'వినతకు దాస్య మొందె నొకవెంటఁ, దదీయ నిరాసహేతువై

యనఘవిచార! నాకు నమృతాహరణంబు విధేయ మయ్యెఁ; న

ప్పనిమెయి నగ్నిచేత నగుఁబా టగు నన్వెఱతో భవద్దయా

వననిధి నాశ్రయించుటకు వచ్చితి; నార్తశరణ్య! కావవే!' **251**

ప్రతిపదార్థం: అనఘ= పాపంలేని; విచార!= ఆలోచన కలవాడా!; ఒక వెంటన్= ఒకానొక కారణంగా; వినతకున్= మా అమ్మకు; దాస్యము+ఒందెన్= దాస్యం కలిగింది; తదీయ= దాని; నిరాసహేతువు+ఐ= పోగొట్టే కారణంగా; నాకున్= నాకు; అమృత= అమృతాన్ని; ఆహరణంబు= తేవటం; విధేయము= చేయవలసిన పని; అయ్యెన్= సంభవించింది; ఆ పనిమెయిన్= ఆ కార్యంలో; అగ్నిచేతన్= అగ్నివలన; నగుఁబాటు= అవమానం; అగున్= ఔను; అన్= అన్నట్టి; వెఱతోన్= భయంతో; భవత్=నీ; దయా= కరుణ అనే; వననిధిన్= సముద్రాన్ని; ఆశ్రయించుటకున్= శరణొందటానికి; వచ్చితిన్= వచ్చాను; ఆర్తశరణ్య!= బాధలలో ఉన్నవారికి దిక్కైనవాడా!; కావవే!= రక్షించుమా!

తాత్పర్యం: 'పవిత్రమైన ఆలోచన కలవాడా! మా అమ్మ కొక కారణంగా దాస్యం కలిగింది. దానిని పోగొట్టుకొనే నిమిత్తం నాకు అమృతం తేవలసి వచ్చింది. ఈ పనిలో నా కగ్నివలన అవమానం కలుగుతుందన్న భయంతో నీ శరణాగతుడనై వచ్చాను. దుఃఖంలో ఉన్నవారికి ఆశ్రయమైన వాడా! నన్ను రక్షించవా?' అని గరుత్మంతుడు ప్రార్థించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అగ్నిచేత అవమానం కలుగుతుందేమో అన్న భయంతో సముద్రాన్ని ఆశ్రయించటానికి వచ్చినాడనటం సముచితంగా ఉన్నది.

వ. అనుటయు. 252

తాత్పర్యం: అనగా.

చ. అతనికి వత్సలుం డగుట నంబుజగర్భుఁడు 'వెన్న పై పయిన్
వితతము గాఁగ జిహ్వలకు వ్రేగగునట్లుగఁ జాల వైచినం,
బతగవరేణ్యఁ! మ్రుక్కఁబడుఁ బావకుఁ; డయ్యెడఁ జొచ్చి నీదువాం
ఛితము ఫలింప సత్వరతఁ జేకొను మయ్యమృతంబు' నావుడున్. 253

ప్రతిపదార్థం: అంబుజ= పద్మం; గర్భుఁడు= జన్మస్థానంగా కలవాడు - బ్రహ్మ; అతనికిన్= గరుత్మంతుడిపై; వత్సలుండు= ప్రేమగలవాడు; అగుటన్= అయినందువలన; వెన్న= వెన్నను; పైపయిన్= పైన; వితతము= విస్తారంగా; కాఁగన్= అగునట్లుగా; జిహ్వలకున్= అగ్నిమంటలకు; వ్రేఁగు= బరువు; అగునట్లుగన్= అయ్యేటట్లుగా; చాలన్= ఎక్కువ; వైచినన్= వేస్తే, పతగవరేణ్యా!= పక్షులలో శ్రేష్ఠుడా!; పావకుఁడు= అగ్ని; మ్రుక్కఁబడున్= అణగును; అయ్యెడన్= అప్పుడు; చొచ్చి= ప్రవేశించి; నీదు= నీయొక్క; వాంఛితము= కోరిక; ఫలింపన్= నెరవేరేటట్లుగా; ఆ+అమృతంబున్= ఆ అమృతాన్ని; సత్వరతన్= శీఘ్రమే; చేకొనుము= పుచ్చుకొనుము; నావుడున్= అనగా.

తాత్పర్యం: బ్రహ్మకు గరుత్మంతుడిపైన వాత్సల్యమున్నది (మనుమడు కదా!) అందుకని చెప్పుతున్నాడు 'నాయనా! వెన్న తెచ్చి ఆ అగ్నిలో వేస్తే ఆయన దానికడుగునబడి ఆ బరువుకు తగ్గి ఉంటాడు. నీ కోరిక నెరవేరుతుంది. సమయం చూచి అమృతం తీసికొనిపొమ్ము!' అని చెప్పగా.

ఆ. ఆత్మఁ బొంగి, మ్రొక్కి యతఁ డాలమందలు । పరపులైన యెడల కరిగి యరిగి
కొండ యంత వెన్నఁ గూర్చి, వేగము కొని । పోయి, యమ్మహాగ్నిఁ బొదువవైచి. 254

ప్రతిపదార్థం: అతఁడు= ఆయన; ఆత్మన్= హృదయంలో; పొంగి= సంతోషించి; మ్రొక్కి= నమస్కరించి; ఆలమందలు= ఆవులమందలు; పరపులు= విస్తారంగా; ఐన+ఎడలకున్= ఉన్న చోట్లకు; అరిగి అరిగి=పోయి పోయి (చాలాచోట్లకు); కొండఅంత= పర్వతమంత; వెన్నన్= వెన్నను; కూర్చి= ప్రోగుచేసి; కొనిపోయి= తీసికొని వెళ్ళి; అ+మహా= ఆ గొప్ప; అగ్నిన్= అగ్నిదేవుణ్ణి; పొదువన్= కప్పేటట్లు - కన్పించకుండా; వైచి= వేసి.

తాత్పర్యం: మనస్సులో సంతోషంతో పొంగిపోయి ఆలమందలున్న చోట్లన్నీ వెదకి వెదకి కొండంత వెన్న కూర్చుకొని ఆ అగ్నిదేవుడి మీద వేశాడు.

గరుడుఁ డింద్రుని జయించి యమృతంబు దెచ్చి కద్రువకుఁ జూపుట (సం.13-28-1(కుంభ))

శా. నీరుం బాయఁగఁ జల్లి, రాక్షసుల యున్మేషంబు మర్దించి, హృ
త్సారోదారుఁ డయోమయం బయిన యజ్ఞాలంబు వే వ్రచ్చి, దు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ర్వారస్వైరవిహార మొప్ప, నమృతగ్రాహం బొడం గూడుడుం

దారావీథిఁ జనం దొడంగె మగుడన్ దర్పం బెలర్పన్ వడిన్. **255**

ప్రతిపదార్థం: నీరున్= నీళ్ళను; పాయఁగన్= తొలగునట్లు; చల్లి= పారబోసి; రాక్షసులు= కాపలా ఉన్న రక్కసుల యొక్క; ఉన్మేషంబున్ = పరాక్రమాన్ని; మర్దించి= అణచి; హృద్+సార+ఉదారుఁడు= మనస్సులోని గొప్ప బలంతో ఉదారుడైనవాడు; అయోమయంబు= ఇనుపదైన; ఆ+జాలంబున్= ఆ వలను; వేః= వేగంగా; వ్రచ్చి= త్రెంచి; దుర్వార= వారించటానికి; వీలులేని; స్వైర విహారము= స్వేచ్ఛతోకూడిన క్రీడ; ఒప్పన్= ప్రకాశించగా; అమృతగ్రాహంబు= అమృతస్వీకారం; ఒడన్+కూడుడున్= లభించగా; దర్పంబు= గర్వం; ఎలర్పన్= చిగుర్పగా; తారావీథిన్= నక్షత్రమార్గంలో, ఆకాశమార్గంలో; వడిన్= వేగంగా; మగుడన్= మరలా; చనన్= వెళ్ళటానికి; తొడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: అగ్ని ఆరిపోగా, చుట్టూఉన్న నీళ్ళను బయటకు చల్లి కాపలా ఉన్న రాక్షసుల విజృంభణం అణచి హృదయోల్లాసంతో ఇనుపవలను ఛేదించి, అడ్డూ అదుపు లేని స్వేచ్ఛా విహారంతో అమృతాన్ని అపహరించి నక్షత్రమార్గాన ఎగిరిపోవటం మొదలుపెట్టాడు.

వ. అంతయు నెఱింగి. **256**

ప్రతిపదార్థం: అంతయున్= దానినంతా; ఎఱింగి= తెలిసికొని.

తాత్పర్యం: దాని నంతా తెలిసికొని.

మ. అమరేంద్రుండు సముద్ధతిన్ వెడలి దేవానీకముల్ దోడ్పడన్

సమరక్రీడకుఁ జొచ్చి పక్షిపతిచే సైన్యంబు లెల్లన్ విధూ

తము లైనం గనుఁగ్రేవఁ గెం పెసఁగ రౌద్రం బైన చిత్తంబుతో

డ మహోదగ్రతఁ బొల్చు వజ్రము నవష్టంభోగ్రుఁడై వైచినన్. **257**

ప్రతిపదార్థం: అమర+ఇంద్రుండు= దేవతలరాజు; సముద్ధతిన్= మిక్కిలి దర్పంతో; వెడలి= దండెత్తి; దేవ+అనీకముల్= దేవతల సేనలు; తోడ్పడన్= సహాయం కాగా; సమరక్రీడకున్= యుద్ధమన్న ఆటకు; చొచ్చి= ప్రవేశించి; పక్షిపతిచేన్= గరుత్మంతుడిచేత; సైన్యంబులు= సేనలు; ఎల్లన్= అన్నీ; వి+ధూతములు= చెదరగొట్టబడినవి; ఐనన్= కాగా; కను+క్రేవన్= కనులచివళ్ళలో; కెంపు+ఎసఁగన్= ఎర్రదనం ఎక్కువ కాగా; రౌద్రంబు=కోపం; ఐన= అయినటువంటి; చిత్తంబుతోడన్= మనస్సుతో (మనస్సు కోపంగా పరిణామం పొందగా); మహా= గొప్ప; ఉత్+అగ్రతన్= ఉద్రేకంతో; అవష్టంభ= గర్వంతో; ఉగ్రుఁడు+ఐ= భయంకరుడై; వజ్రమున్= వజ్రాయుధాన్ని; వైచినన్= ప్రయోగించగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: కయ్యానికని దేవేంద్రుడు సేనతో భయంకరంగా బయలుదేరి, యుద్ధంలో తన సేననంతా గరుత్మంతుడు చెల్లాచెదరు చేయగా, కోపంతో కళ్ళెర్రపడగా రౌద్రంతో మనస్సంతా నిండిపోగా ఇంద్రుడు భయంకరమైన వజ్రాయుధాన్ని ప్రయోగించాడు.

క. అది యొకఁడుఁ జేయఁ జాలక । విదళితశైల మగు తనదు విలసన మచటం

గుదియుటఁ దనకుం దెలిసిన । మద మఱి గిరిభేదికడకు మగుడం జనియెన్. **258**

ప్రతిపదార్థం: అది= ఆ వజ్రాయుధం; ఒకఁడున్= ఏమీ; చేయన్+చాలక= చేయలేక; విదళితశైలము= నరకబడ్డ కొండలు గలది; అగు= ఐన; తనదు= తనయొక్క; విలసనము= విలాసం; అచటన్= ఈ విషయంలో; కుదియుటన్= సమసిపోవటం; తనకున్= వజ్రాయుధానికి; తెలిసినన్= తెలిసేసరికి; మదము+అఱి= గర్వంపోయి; గిరిభేది కడకున్= పర్వతాలను భేదించిన ఇంద్రుడి దగ్గరకు; మగుడన్+చనియెన్= తిరిగి వెళ్ళింది.

తాత్పర్యం: ఆ వజ్రాయుధం తానేమీ చేయలేక, పర్వతాలను నరికిన తన గొప్పతనమంతా గరుత్మంతుడి విషయంలో మొక్కపోవటం తెలిసికొని ఇంద్రుడి దగ్గరకు తిరిగిపోయింది.

విశేషం: ఇవీ గరుత్మంతుడి మాహాత్మ్యం, బలపరాక్రమాలు.

క. చేయునది లేక నిర్జర। నాయకుఁడును వెఱఁగుపాటునను వ్రాన్పడుచుం
బోయెం గ్రమ్మఱి ధరణీ। నాయక! నిజపట్టణంబునకు దీనగతిన్. 259

ప్రతిపదార్థం: ధరణీనాయక!= భూమికి నాథుడా!, రాజా; నిర్జర= దేవతల; నాయకుఁడును= ఇంద్రుడుకూడా; చేయునదిలేక= చేసేది ఏమీలేనందువలన, ఏమీ చేయలేక; వెఱగుపాటునను= ఆశ్చర్యంతో (వజ్రాయుధం కూడా ఏమీ చేయలేకపోయిందేమిటని); వ్రాన్పడుచున్= నిశ్చేష్టుడగుచు; క్రమ్మఱి= తిరిగి; నిజపట్టణంబునకున్= తన నగరానికి; దీనగతిన్= దైన్యంతో; పోయెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: దేవేంద్రుడు కూడా చేసేదేమీ లేక ఆశ్చర్యంతో నిశ్చేష్టుడై తన నగరానికి దిగులుతో తిరిగిపోయాడు.

చ. అజుని యనుగ్రహంబునఁ విహంగమవల్లభుఁ డట్లు సాలన
క్కజ మగు శౌర్యసంపద ప్రకాశతఁ బొందఁగఁ గేలి సల్పి యిం
ద్ర జయమహోత్సవంబున నుదాత్తయశః పరిపూరితంబు లై
త్రిజగములున్ వెలుంగ నలిఁ దెచ్చె సుధారసపూర్ణభాండమున్. 260

ప్రతిపదార్థం: విహంగమ= ఆకాశంలో ఎగిరే పక్షులకు; వల్లభుఁడు= రాజు; అజుని= బ్రహ్మయొక్క; అనుగ్రహంబునన్= దయతో; అట్లు= ఆ విధంగా; చాలన్= ఎక్కువ; అక్కజము= ఆశ్చర్యం; అగు= అయిన; శౌర్యసంపద= పరాక్రమ సంపద; ప్రకాశతన్= వెలుగు; పొందఁగన్= చెందగా,లోకానికి తెలియగా; కేలి= క్రీడ; సల్పి= చేసి; ఇంద్రజయ= ఇంద్రుని గెల్చుట వలన లభించిన; మహా+ఉత్సవంబునన్= గొప్ప పండుగతో; ఉదాత్త= గొప్ప; యశః= కీర్తితో; పరిపూరితంబులు+ఐ= నిండినవై; త్రిజగములున్= ముల్లోకాలూ; వెలుంగన్= వెలిగిపోగా; సుధారస= అమృతద్రవంతో; పూర్ణ= నిండిన; భాండమున్= కుండను; నలిన్= సంతోషంతో; తెచ్చెన్= తెచ్చాడు.

తాత్పర్యం: గరుత్మంతు డా విధంగా బ్రహ్మదయవలన ఆశ్చర్యకరమైన బలపరాక్రమాలు వెల్లడి కాగా, యుద్ధం చేసి ఇంద్రుడిని ఓడించి ఆ విజయమహోత్సవంతో ముల్లోకాలలో తనకీర్తులు నిండారగా అమృతభాండాన్ని తెచ్చాడు.

తే. తెచ్చి డించి, కద్రువ ప్రీతిఁ దేలఁ జూపి। తల్లి చెఱవాపికొని పొంగి చెల్లునాగ
డమున మగుడ నయ్యమృతభాండంబు దాన। పుచ్చికొని యెడఁ గలుగంగఁ బోయి నిలిచి. 261

ప్రతిపదార్థం: తెచ్చి= అమృతభాండం తీసికొని వచ్చి; డించి= క్రిందపెట్టి; కద్రువ= అతని పెద్దతల్లి; ప్రీతిన్= సంతోషంలో; తేలన్= తేలిపోవగా; చూపి= చూపించి; తల్లిచెఱ= తనతల్లి దాసాన్ని; పాపికొని= పోగొట్టుకొని; పొంగి= పొంగిపోయి; చెల్లు= సాగే; ఆగడమునన్= అల్లరితనంతో; మగుడన్= తిరిగి; ఆ+అమృతభాండంబున్= ఆ అమృతపు కుండను; తాన= తానే; పుచ్చికొని= గ్రహించి; ఎడ= దూరం; కలుగంగన్= కలిగేటట్లు; పోయి= వెళ్ళి; నిలిచి= నిలబడి.

తాత్పర్యం: అమృతభాండం తెచ్చి క్రిందపెట్టి కద్రువకు సంతోషం కలిగేటట్లు చూపించి, తనతల్లి దాస్యం చెల్లిపోయిందనిపించుకొని తిరిగి ఆ అమృతం కుండను తానే తీసికొని గడుసుదనంతో దూరంగా పోయి నిలబడి.

విశేషం: కద్రువ 212వ పద్యంలో అన్నది. 'లోకులు నిన్నుం బ్రణుతింపఁ దెమ్మమృతమున్' అని. అత డట్లాగే తెచ్చాడు. ఇందుకే 260వ పద్యం వ్రాసింది కవి. తెమ్మన్నదే కాని ఇమ్మనలేదు. అందుకని ఇవ్వలేదు.

వ. తన్ను వెఱఁగుపడి చూచుచున్న కద్రువ నుద్దేశించి. 262

ప్రతిపదార్థం: తన్నున్= గరుత్మంతుడిని; వెఱఁగుపడి= ఆశ్చర్యపడి; చూచుచున్+ఉన్న= చూస్తూ ఉన్న; కద్రువన్= పెదతల్లిని; ఉద్దేశించి= దృష్టిలో ఉంచుకొని; చూస్తూ;

తాత్పర్యం: గరుత్మంతుడిని భయపడుతున్న చూపులతో చూస్తూ ఉన్న కద్రువతో. (తరువాతి పద్యంతో అన్వయం)

మ. 'జననీ! నీ వమృతంబు తె' మ్మనిన, యా సత్యోక్తి పాటించి యేఁ
జని నానావిధ కర్మకర్మఠుఁడ నై సాధించి, వే తెచ్చితిన్
విను, నా నీయొడఁబాటు సెల్లె జనులన్ విన్పించితిం దెల్లఁగా
వినతం దోడ్కొని పోయెదన్ మనమునన్ విభ్రాంతి లే కుండుమీ!' 263

ప్రతిపదార్థం: జననీ!= అమ్మా!; నీవు; అమృతంబు= అమృతం; తెమ్ము= తేవోయి; అనినన్= అనగా; ఆ+సత్య+ఉక్తి= ఆ నిజమైన మాట; పాటించి= అంగీకరించి; ఏన్= నేను; నానావిధ= అనేకమైన; కర్మ= కార్యాలు; కర్మఠుఁడనై= చేసినవాడనై; సాధించి (అమృతాన్ని) సంపాదించి; వే= త్వరగా; తెచ్చితిన్= తెచ్చాను; విను= జాగ్రత్తగా వినుము; నా నీ= మన ఇద్దరి; ఒడఁబాటు= సంధి, అంగీకారం; చెల్లెన్= నెరవేరింది; తెల్లఁగాన్= స్పష్టంగా; జనులన్= జనానికి; విన్పించితిన్= చాటిచెప్పాను; వినతన్= మా అమ్మను; తోడ్కొని= వెంటబెట్టుకొని; పోయెదన్= పోతున్నాను; మనమునన్= మనస్సులో; విభ్రాంతి= భ్రమ; లేకుండుమీ= లేకుండా ఉండుము.

తాత్పర్యం: 'తల్లీ! నీవన్నావు! అమృతం తీసికొని రమ్ము' అని. ఆ మాటను పట్టుకొని అనేకవిధాల కష్టాలుపడి కార్యం సాధించుకొని వచ్చాను. మన ఒప్పందం చెల్లింది. జనులందరికీ ఈ విషయం స్పష్టంగా చాటి చెప్పాను. మా అమ్మను తీసికొని పోతున్నాను. నీవు ఏమీ భ్రమపెట్టుకోకు'.

విశేషం: 212వ పద్యంలో కద్రువ ఎగతాళిగా అన్నది. 'అమృతం తేరా చూద్దాం' అని. అది మత్తేభం పద్యంలో ఉన్నది. ఈ పద్యం గరుత్మంతుడి సమాధానం. ఇదీ మత్తేభమే. ఎగతాళిమాటకు తగినట్లు బుద్ధి చెప్పటం ఆయన చేసిన పని. దుర్మార్గులను శిక్షించటమే ధర్మం. కనుక గరుత్మంతుడి గొప్పతనానికి ఇదొక గుర్తు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. అని ధర్మస్థితి తోఁప మాట వెర వేపారం దగం బల్కి నే
రృునకున్ లోకము మెచ్చఁ గద్రువకుఁ బెంపుం గీర్తియున్ మాయ సొం
పునఁ దల్లిం దనయింటి కన్పి యమృతంబుం గ్రమ్మఱన్ గ్రక్కునం
గొని, పక్షీంద్రుఁడు వోయి యింద్రుఁ డెలమిం గూరంగ నిచ్చెం దగన్. 264

ప్రతిపదార్థం: అని= పై విధంగా చెప్పి; ధర్మస్థితి= ధర్మంయొక్క ఉనికి; తోఁపన్= స్పష్టం కాగా; మాట వెరపు= మాట ఉపాయం; ఏపారన్= తెలిసేటట్లుగా; తగన్= ఉచితంగా; పల్కి= చెప్పి; నేర్పునకున్= తన తెలివికి; లోకము= జనమంతా; మెచ్చన్= మెచ్చుకొనగా; కద్రువకున్= పెదతల్లికి; పెంపున్= గొప్పతనం; కీర్తియున్= కీర్తి; మాయన్= లోపించగా; సొంపునన్= చక్కగా; తల్లిన్= వినతను; తన ఇంటికిన్= స్వగృహానికి; అన్పి= పంపి; అమృతంబున్= సుధను; క్రమ్మఱన్= తిరిగి; గ్రక్కునన్= వెంటనే; పక్షి+ఇంద్రుఁడు= పక్షిరాజు; కొని= గ్రహించి; పోయి= వెళ్ళి; ఇంద్రుఁడు= సురరాజు; ఎలమిన్= సంతోషంలో; కూరంగన్= కూరుకొనిపోగా; తగన్= ఒప్పిదముగా; ఇచ్చెన్= అర్పించాడు.

తాత్పర్యం: అని ధర్మానుగుణంగా చెప్పి తనమాట నేర్పుకు లోకం మెచ్చుకొనగా, కద్రువకు కీర్తి గొప్పతనం పోగా, చక్కగా తనతల్లిని ఇంటికి పంపి అమృతాన్ని తిరిగి ఇంద్రుడి కర్పించాడు.

విశేషం: గరుత్మంతుడు ధర్మం పాటించటమంటే పాపాత్మురాలికి అమృతం ఇవ్వకపోవటమే. ఆమెను మాటతోనే జయించాడు. అందుకని లోకం మెచ్చుకొన్నది.

వ. 'ఇవ్విధంబున నౌచిత్యంబు సంస్తుత్యంబుగా నమృతం బమృతాశన పతికి నొసంగి యెసకం బెసంగు తేజంబున విరాజితుం డయి యావృత్రవైరిని సూరెల నున్న సురలను మునులను గలయం గనుంగొని. 265

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; ఔచిత్యంబు= ఉచితత్వం; సంస్తుత్యంబుగాన్= స్తుతికి యోగ్యం కాగా; అమృతంబున్= సుధను; అమృత+ఆశన= అమృతం ఆహారంగా కలవారు దేవతలు; వారియొక్క పతికిన్= రాజుకు; ఒసంగి= ఇచ్చి; ఎసకంబు= ఆధిక్యం; ఎసంగు= ఎక్కువగు; తేజంబునన్= తేజస్సుతో; విరాజితుండు+అయి= ప్రకాశించి; ఆ వృత్రవైరిని= ఆ వృత్రాసురుడి శత్రువైన దేవేంద్రుణ్ణి; సూరెలన్= ప్రక్కల; ఉన్న= ఉన్నట్టి; సురలను= దేవతలను; మునులను= ఋషులను; కలయన్+కనుంగొని= తేరిపారజూచి

తాత్పర్యం: ఈ విధంగా ఆమెకు తగినట్లు బుద్ధి చెప్పి అమృతాన్ని ఇంద్రుడి కర్పించి అందరిచేత మన్ననలంది ఆ ఇంద్రుడిని అతడితోపాటు ఇరుప్రక్కల కొలువు దీరిన దేవతలను మునులను చూచి.

చ. 'కొడుకులఁ బంచి తెల్పెసఁగు గుఱ్ఱము వాలమునందు నల్ల గ
ల్గెడు క్రియఁ దీర్చి, పన్నిదము గెల్చిన కద్రువ నేను మాటమై
నొడిచితిఁ దల్లి దాసి యగు టోర్వక, తండ్రి యనుజ్ఞ, మీ కెదు
ర్పడిన దురుద్ధతిన్ మఱచి బాంధవసత్కృతి నాదరింపుఁడీ!' 266

ప్రతిపదార్థం: కొడుకులన్= కుమారులను; పంచి= ఆజ్ఞాపించి; తెల్పు+ఎసఁగు= తెల్లనైన; గుఱ్ఱము వాలమునందున్= గుర్రం తోకలో; నల్ల= నలుపు; కల్గెడు క్రియన్= కలిగేటట్లు; తీర్చి= చేసి; పన్నిదము= పందెం; గెల్చిన= జయించిన;

కద్రువన్= పెదతల్లిని; ఏను= నేను; మాటమైన్= మాటతోనే; ఒడిచితిన్= గెల్చాను; తల్లి= మా తల్లి వినత; దాసి అగుటకున్= దాసి కావటానికి; ఓర్వక= సహించలేక; తండ్రి= కశ్యపుడి; అనుజ్ఞన్= ఆనతితోన; మీకున్= ఇంద్రుడికి; ఎదుర్పడిన= ఎదురించిన; దురుద్ధతిన్= చెడుగర్వాన్ని; మఱచి= విస్మరించి; బాంధవ, సత్కృతిన్= బంధుప్రేమతో; ఆదరింపుఁడీ!= నన్ను ఆదరించండి

తాత్పర్యం: 'కద్రువ తన కొడుకులను ఆజ్ఞాపించి పంపి తెల్లని గుర్రం తోకను నలుపుగా చేసి, పందెంగెల్చి నా తల్లిని దాసిగా చేసికొన్నది. కనుక నేనూ నా తండ్రి ఆనతితో మా పెదతల్లిని మాటతోనే ఓడించాను. ఈ విషయంలో మిమ్మల్ని ఎదురించవలసి వచ్చింది. దానిని మరచిపోయి నన్ను బంధుప్రీతితో చూడండి'.

విశేషం: ఇవి గరుత్మంతుడికి పెద్దలయందున్న భక్తిశ్రద్ధలు. ఎక్కడా పొల్లుమాట అనడు. తూచినట్లు మాట్లాడటం, తగినట్లుగా చేయటం. ఎంతవరకుండాలో అంతవరకే ఉండటం అతడిస్వభావం. దుర్మార్గుడికి బుద్ధి చెప్పకపోతే సన్మార్గు డెట్లా ఔతాడు?

వ. అని వెండియు. **267**

తాత్పర్యం: అని ఇంకా.

క. 'వినుఁ! డట్టులు పాపము సే । సిన కద్రువ సుతులఁ బొదివి చెండుదు, మత్తుం
డనితాంతోగ్ర విహారం । బునఁ దండ్రియు మీరు ధర్మమును సాక్షులుగన్'. **268**

ప్రతిపదార్థం: వినుఁడు= వినండి (కోపంతో నొక్కి చెప్పటం); అట్టులు= ఆ విధంగా (గుర్రం తెల్లని తోకను నల్లగా చేసిన); చేసిన= చేసినటువంటి; కద్రువ సుతులన్= కద్రువ కొడుకులను; పాములను; పొదివి= కాళ్ళతో తొక్కిపట్టి; తండ్రియున్= నా తండ్రి కశ్యపులు; మీరు= ఇంద్రాదులు; ధర్మమును= (లోకం సాఫీగా నడవటానికాధారమైన) న్యాయం; సాక్షులుగన్= చూస్తూండగా (స+అక్షి= కన్ను కలవాడు, చూచేవాడు) మత్= నా యొక్క; తుండ= ముక్కుయొక్క; నితాంత= అంతులేని; ఉగ్ర= భయంకరమైన; విహారంబునన్= క్రీడతో; చెండుదున్= చీల్చిచెండాడుతా.

తాత్పర్యం: ఆ విధంగా మా అమ్మను బానిసగా చేసిన పాపాన బోయిన ఆ కద్రువ సంతానాన్ని మా తండ్రి, మీరూ, ధర్మం సాక్షులుగా. నా ముక్కుతో పొడిచి ఉగ్రంగా చీల్చి చెండాడుతాను.

విశేషం: చాలా కోపంతో ఊగిపోతూ అన్నమాటలు ఇవి. సామాన్యంగా తిక్కన గారి కందపద్యం చాలా అందమైనదన్న ప్రశస్తి ఉన్నది. దాని కీ పద్యాలవంటివి సాక్ష్యంగా తీసికొనాలి.

వ. అని పలికిన నతని నందఱు నభినందించి; రమ్మునులును సురలునుం బురందరుని తోడ 'నితనికి నొక్కవరం బొసంగ వలదే!' యనిన, నతండు దలంచికొని దరహసితంబుతో వారల నాలోకించి 'మనవరంబునకు నాసపడియెడు కొలంది వాఁడు గాఁ; డతండు సాక్షాద్విష్ణుండు కృష్ణుండనశూరుఁ డను యాదవ ధాత్రీశునకుఁ బౌత్రుండై లోకహితార్థంబుగాఁ జరియింపం గలవాఁడీమూర్తియు విడువండు; వివిధ వర్తనంబుల వినోదించుచుండు' ననియెఁ; దదనంతరంబ సముచితప్రకారంబున నాజంభారిని వారలను దా నామంత్రితులం జేసి. **269**

ప్రతిపదార్థం: అని పలికినన్= అని చెప్పిన; అతనిన్= గరుత్మంతుడిని; అందఱున్= ఇంద్రాదులు; అభినందించిరి= పొగడారు; పురందరునితోడన్= దేవేంద్రుడితో; ఆ+మునులును= ఆ మునులు; సురలునున్= దేవతలు; ఇతనికిన్= ఈ గరుత్మంతుడికి; ఒక్క వరంబున్= ఒక వరాన్ని; ఒసంగన్‌వలదే!= ఇవ్వవద్దా!; అనినన్= అనగా; అతండు= దేవేంద్రుడు; తలంచికొని= ఆలోచించుకొని; దరహసితంబుతోన్= చిరునవ్వుతో; వారలన్= మునులను, సురలను; ఆలోకించి= చూచి; అతండు= ఆయన; మన వరంబునకున్= మన వరానికి; ఆసపడియెడు కొలందివాఁడు కాఁడు= ఆశపడేటంత తక్కువవాడు కాడు; సాక్షాద్విష్ణుండు= సాక్షాత్తుగా విష్ణువు; కృష్ణుండు+అనన్= కృష్ణుడనే పేరున; శూరుఁడు అను= శూరుడనే పేరుగల; యాదవ ధాత్రీశ్వరునకున్= యాదవ రాజునకు; పౌత్రుండు+ఐ= మనుమడై; లోకహిత+అర్థంబుగాన్= లోకక్షేమంకొరకు; చరియింపన్+కలవాఁడు= విహరించగలడు; ఈ మూర్తియున్= ఈ రూపం కూడా; విడువండు= వదలిపెట్టడు; వివిధ= అనేక; వర్తనంబులన్= ప్రవర్తనలతో; చరియించుచుండున్= విహరిస్తాడు; అనియెన్= అన్నాడు; తత్+అనంతరంబ= ఆ తర్వాత; సముచిత= తగిన; ప్రకారంబునన్= విధంగా; ఆ జంభ+అరిని= ఆ ఇంద్రుడిని (జంభుడన్న రాక్షసుడిని చంపినవాడిని); వారలను= ఆ మునులను, దేవతలను; తాను= గరుత్మంతుడు; ఆమంత్రితులన్= పంపించటం; చేసి= ఆచరించి.

తాత్పర్యం: అని అనగా ఆ గరుత్మంతుడిని అందరూ ప్రశంసించారు. ఆ మునులూ, దేవతలూ ఇంద్రుడితో ఇట్లా అన్నారు. 'ఈయన కేదేనా వరమివ్వరాదా?' అని. ఆయన ఆలోచించి 'ఈయన మన వరాల కాశపడేటంత తక్కువ శక్తి కలవాడు కాడు. ఈయన సాక్షాద్విష్ణువు. భవిష్యత్తులో శూరుడనే యాదవరాజునకు మనుమడై పుట్టి కృష్ణుడన్న పేరుతో లోకకల్యాణం కొరకు అవతరించనున్నాడు. ఈ ప్రస్తుతమూర్తిలో కూడా అనేక కార్యాలు నిర్వహిస్తాడు' అని చెప్పాడు. అంతట గరుత్మంతుడు వారి నందరినీ పంపించివేసి. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: ఈ మాటలన్నీ ఇంద్రుడు గరుత్మంతుడి మాహాత్మ్యాన్ని గురించి వివరించటాని కన్నవి. గరుత్మంతుడే అక్క డున్న కృష్ణుడు. ఇందుకే భీష్ముడు కథను ప్రారంభిస్తూనే ఇట్లా అన్నాడు కృష్ణుడితో ' ఆ సుపర్ణుండు నీవ కా వినియుండుదున్' (166 వ పద్యం) అని. కథ అదే మాటలతో ముగిస్తున్నాడు కవి.

సీ. **'అజుఁ డుపలాలింప నద్దేవు కావించు । వరభోజనంబులఁ బెరిఁగె నితఁడె!**
ఘనకాయజవసత్త్వ గజకచ్ఛపముల నొ । క్కెత్తున లీలమై నెత్తె నితఁడె!
విపులభూరుహశాఖ విఱిగిన మునిహితా । ర్థంబుగాఁ జంచునఁ దాల్చె నితఁడె!
సురసేనతోఁ బురందరుని నిర్జించి యు । ద్దీప్తుఁడై యమృతంబుఁ దెచ్చె నితఁడె!

తే. **తల్లిదాస్యంబు దనబాస దప్పకుండఁ । బాపి యాసుధ మరల నప్పాకశాస**
నునకు దయ నిచ్చె నీతఁడె!' యనుచు సిద్ధ । సాధ్యు లగ్గింప, గరుడుఁడు సనియె మగిడి'. **270**

ప్రతిపదార్థం: అజుఁడు= బ్రహ్మ; ఉపలాలింపన్= ముద్దు చేస్తుండగా; ఆ+దేవు= ఆ దేవుడు; కావించు= సృష్టించే; వర= శ్రేష్ఠ; భోజనంబులన్= ఆహారాలలో; పెరిఁగెన్+ఇతఁడె= ఇతడే పెరిగి పెద్దవాడైనాడు; ఘన= పెద్ద; కాయ= శరీరం; జవ= వేగం; సత్త్వ= బలం కల; గజ= ఏనుగును; కచ్ఛపములన్= తాబేలును; ఒక్క+ఎత్తునన్= ఒకేసారి; లీలమైన్= విలాసంగా; ఎత్తెన్= పైకి ఎత్తుకొనిపోయినది; ఇతఁడె!= ఇతడేకదా! అని ఆశ్చర్యం; విపుల= విస్తారమైన; భూరుహ= చెట్టు; శాఖ= కొమ్మ; విఱిగినన్= విరిగితే; మునిహిత+అర్థంబుగాన్= మునుల క్షేమంకోరి; చంచునన్= ముక్కున; తాల్చెన్= ధరించాడు; ఇతఁడె!= ఈయనేకదా!; ఇతఁడె= ఈయనే; సురసేనతోన్= దేవతాసైన్యంతో; పురందరునిన్= ఇంద్రుడిని; నిర్జించి= జయించి;

ఉత్+దీప్తుఁడు+ఐ= మిక్కిలి (కీర్తితో, పరాక్రమంతో) ప్రకోపించినవాడై; అమృతంబున్= సుధను; తెచ్చెన్= తెచ్చాడు; తల్లిదాస్యంబు= తల్లియైన వినత బానిసతనం; తన బాస= తన ప్రతిజ్ఞ; తప్పకుండన్= తప్పిపోకుండా; పాపి= పోగొట్టి; మరలన్= తిరిగి; ఆ సుధన్= ఆ అమృతం; ఆ పాకశాసనునకున్= ఆ ఇంద్రుడికే (పాకుడనే రాక్షసుడిని చంపినవాడు); దయన్= దయతో; ఈతఁడె= ఈయనే; ఇచ్చెన్= ఇచ్చాడు; అని=అంటూ; సిద్ధసాధ్యులు= సిద్ధులు, సాధ్యులు (దేవతలలో తెగలు); అగ్గింపన్= స్తుతించగా; మగిడి= తిరిగి; గరుడుఁడు చనియెన్= గరుత్మంతుడు వెళ్ళాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవు డంతటి వాడు ముద్దుగా ప్రత్యేకాహార మేర్పాటుచేసి పెంచితే పెరిగినవా డీయనే కదా! అంత పెద్ద శరీర, బల వేగాలున్న గజకచ్ఛపాలను ఒకేసారి అవలీలగా పైకెత్తుకొని పోయిన బలశాలి ఈయనేకదా! అంతపెద్ద కొమ్మ విరిగితే దానిపై నున్న వాలఖిల్యులనే మునుల క్షేమంకొరకు ముక్కున ధరించినవా డీయనే కదా! దేవతా సైన్యంతో దండెత్తివచ్చిన ఇంద్రుడిని జయించి అమృతం తెచ్చిన వా డీయనే. తన మాట తప్పకుండా తల్లి దాస్యాన్ని పోగొట్టి తిరిగి తానుతెచ్చిన అమృతాన్ని ఇంద్రుడి కర్పించిన మహానుభావు డీయనే కదా!'

విశేషం: ముగింపుగా ఈ పద్యం వ్రాయటం తిక్కనగారి కథ చెప్పే నేర్పును ప్రకాశింపచేస్తుంది. ఈ పద్యంలో 5 పాదాల మీదుగా మొదటినుండి చివరిదాకా కథనంతా పూసగ్రుచ్చినట్లు చెప్పటం లోకోత్తరమైన శిల్పం. తిక్కనగారు ఇలాంటి పద్యాలు ముగింపుగా వ్రాయటం చాలా చోట్ల కన్పిస్తుంది. గరుత్మంతుడు పెరగటం దగ్గరనుంచి మొదలుపెట్టి కథాంతం వరకూ చెప్పినవైనం భావించదగింది. ప్రతివాక్యం 'ఇతడె' అన్న సర్వనామంతో అంతం కావటంతో పద్యంలో మంచి శైలి ఏర్పడింది.

వ. అని చెప్పి భీష్ముండు. 271

తాత్పర్యం: ఈ విధంగా వర్ణించి భీష్ముడు.

క. 'మానవలోక కలిత బహు । ళానందకరంబు, నిష్కలావ్యయసుఖ సో
పానము నగు సౌపర్ణా । ఖ్యానము విని పుణ్యతముఁడ వైతి నరేంద్రా!' 272

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= ప్రజలకు నాయకుడా! ధర్మరాజా!; మానవలోక= మనుష్య స్వభావంతో; కలిత= కూడుకొన్నది; బహుళ= విస్తారమైన; ఆనంద కరంబు= ఆనందాన్ని కలిగించేది; నిష్కల= నిర్గుణమైన; అవ్యయ= తరగని; సుఖ= ముక్తికి; సోపానము= మెట్టు; అగు= అయిన; సౌపర్ణ= గరుత్మంతుడియొక్క (సు+పర్ణ= బలిష్ఠమైన రెక్కలు కలవాడు); ఆఖ్యానము= కథ (ఆఖ్యానమంటే ప్రసిద్ధమైనదీ జరిగినదీ అయిన కథ); విని; పుణ్యతముఁడవు= పుణ్యశాలివి; ఐతి (వి) = అయినావు.

తాత్పర్యం: ధర్మజా! నీవు గొప్ప పుణ్యశాలివైనావు. ఎందుకంటే ఈ గరుత్మంతుడి కథ ముక్తికి సోపానం. వ్యయంకాని నిర్గుణమైన సుఖం ముక్తి కదా! ఈ కథలో మానవస్వభావ మున్నందున గొప్ప ఆనందాన్ని కలిగిస్తుంది.

విశేషం: కథలో లక్షణాన్ని చెప్పుతున్న పద్య మిది. సవతుల మధ్య తగాదాలు, వాటినుండి మనిషి బయట పడటానికి పడే తంటాలు, ఇవన్నీ కథలో ఉండటమే మానవ లోక ముండటం. ఆ దృష్టితో ఈ కథ చదువుకొమ్మని కవి మనకు సూచించటం.

వ. అనినం బాండవాగ్రజుండు సంతసించి, 'విప్రున కెద్దియేనియు నిచ్చువాఁడుగా నొడంబడి యూనివాఁ డేమి గతిం బోవం గలవాఁ? డని యడుగుటయు, నతం డతనితో నొక నిదర్శనంబున, నది యెఱింగించెద విను' మని యిట్లనియె. 273

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పాండవ+అగ్రజుండు= పాండవులలో జ్యేష్ఠుడు; సంతసించి=సంతోషించి; విప్రునకున్= బ్రాహ్మణుడికి; ఎద్ది ఏనియున్= ఏమైనా; ఇచ్చువాఁడుగాన్= ఇస్తానన్నవాడై; ఒడంబడి= ఒప్పుకొని; ఈనివాఁడు= ఇవ్వనివాడు; ఏమిగతిన్= ఏ గతిని; పోవన్+కలవాఁడు?= పోతాడు? అని అడుగుటయున్= అని అడుగగా; అతండు= భీష్ముడు; అతనితోన్= ధర్మరాజుతో; ఒక నిదర్శనంబునన్= ఒక ఉదాహరణతో; అది ఎఱింగించెదన్= అది తెలుపుతాను; వినుము+ అని+ఇట్లు+అనియెన్= వినుమని ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: గరుత్మంతుడి కథ విన్న తరువాత ధర్మరాజు భీష్మడితో ఇట్లా అన్నాడు 'బ్రాహ్మణున కేదైనా ఇస్తానని ఇవ్వనివా డేగతి పొందుతాడో చెప్పు'మని అడుగగా; 'ఒక ఉదాహరణంతో నీ కది స్పష్టం చేస్తాను విను' మని భీష్మ డన్నాడు.

సీ. ఒక్క సృగాలంబు, నొక వానరంబును । బ్రీతిమైఁ గూడి వర్తించుచుండు,
దొలుపుట్టువున మానవులును నెచ్చెలులు నై । యుండుట గూర్చు నొండొంటి; కొక్క
యెడ, నొకనాఁ డవ్వఅడుతోడ నాక్రోఁతి । 'గటకటా! నీ కిట్లు గడును హేయ
మైన పీనుఁగునంజు డాహార మైనట్టి ' భవము వాటిల్లు టేపాపముననొ?'

తే. యనిన జాతిస్మరణవంత మగుటఁ జేసి । యది విషాదముఁ బొంది 'ధరామరునకు
నీ నొడంబడ్డ ధన మీన కాన యిట్టు । నీచతరజాతియందు జన్మింపవలసె. 274

ప్రతిపదార్థం: ఒక్క= ఒక; సృగాలంబున్= నక్క; ఒక వానరంబును= ఒక కోతియును; ప్రీతిమైన్= స్నేహంతో; కూడి= కలిసి; వర్తించుచుండున్= జీవిస్తూ ఉండేవి; తొలుపుట్టువునన్= పూర్వజన్మంలో; మానవులును= మనుషులూ; నెచ్చెలులును+ఐ= స్నేహితులు కూడా ఐ; ఉండుటన్= ఉండటంవలన; ఒండు+ఒంటికిన్= పరస్పరం, ఒకదానితో ఒకటికి; కూర్చున్= స్నేహమున్నది; ఒక్కఎడన్= ఒక సమయంలో; ఒకనాఁడు= ఒకరోజున; ఆ క్రోఁతి= ఆ కోతి; ఆ+వఱడుతోడన్= ఆ నక్కతో; కటకటా!= అయ్యో; నీకున్+ఇట్లు= నీకీ విధంగా; కడునున్= మిక్కిలి; హేయము+ఐన= నికృష్టమైన; పీనుఁగు= శవపు; నంజుడు= మాంసం; ఆహారము= తిండి; ఐనట్టి= ఐనటువంటి; భవము= జన్మ; పాటిల్లుట= కలగటం; ఏ పాపముననొ?= ఏ పాపం వల్లనొ?; అనినన్= అనగా; అది = ఆ నక్క; జాతిస్మరణవంతము= పూర్వజన్మకు సంబంధించిన స్మృతి కలది; అగుటన్ చేసి= అవటం వలన; విషాదమున్= దుఃఖాన్ని; పొంది; ధరా+అమరునకున్= భూదేవతకు - బ్రాహ్మణుడికి; ఈన్= ఇవ్వటానికి; ఒడంబడ్డ= ఒప్పుకొన్న; ధనమున్= డబ్బును; ఈన= ఇవ్వలేదు; కాన= కాబట్టి; ఇట్లు= ఈ విధంగా; నీచతర తెగయందున్= మిక్కిలి నీచమైన తెగలో; జన్మింపన్‌వలసెన్= పుట్టవలసి వచ్చింది.

తాత్పర్యం: ఒక నక్క, ఒక కోతి స్నేహంగా ఉండేవి. ఎందుకంటే పూర్వజన్మలో అవి, మనుషులూ స్నేహితులూ కావటంవలన. ఇట్లా ఉండగా ఒకరోజు కోతి నక్కతో ఇట్లా అన్నది 'ఏ పూర్వ జన్మ పాపం వలన నీ వీ జన్మలో పీనుగు మాంసం తిండిగా బ్రతకవలసి వచ్చిందో కదా!' అని. ఆ మాట విన్న నక్క పూర్వజన్మ జ్ఞానులజాతిలో పుట్టినది కావటం వలన దుఃఖం పొంది 'నేను పూర్వజన్మలో ఒక బ్రాహ్మణుడి కిస్తానన్న ధన మివ్వనందువలన నాకీ నీచజన్మ వచ్చింది' అని చెప్పింది.

వ. అని తెలిపె; నట్లగుటంజేసి 'యాస గొల్పి, విప్రున కియ్యకున్కి యొప్ప' దని చెప్పిన, నప్పాండవాగ్రజుం 'డహీనగుణ వర్ణనీయుం డయిన హీనవర్ణునకు మంత్రతంత్రాదు లుపదేశించుట ధర్మవిరుద్ధం బయి యుండు నొకో?'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యని యడిగిన నయ్యనిమిష నదీనందనుం 'డీప్రశ్నంబున కుత్తరం బగునది యొక యితిహాసము గల; దాకర్ణింపు' మని యిట్లనియె. 275

ప్రతిపదార్థం: అని తెలిపెన్= అని చెప్పింది; అట్లు+అగుటన్+చేసి= అట్లా కావటం వల్ల; ఆస+కొల్పి= ఆశపెట్టి; విప్రునకున్= బ్రాహ్మణుడికి; ఇయ్యక+ఉన్కి= ఇవ్వకపోవటం; ఒప్పదు= మంచిదికాదు; అని చెప్పినన్= అని చెప్పగా; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు; అహీన= గొప్ప; గుణ= గుణాలతో; వర్ణనీయుండు= పొగడదగిన; హీన= నీచమైన; వర్ణునకున్= వర్ణంలో పుట్టినవాడికి; మంత్ర తంత్ర= మంత్రం, పూజ చేసే విధానాలు; ఆదులు= మొదలైనవి; ఉపదేశించుట= బోధించటం; ధర్మవిరుద్ధంబు= ధర్మానికి వ్యతిరేకం; అయి ఉండునొకో!= ఔతుందా? అని అడిగినన్= అని అడిగితే; ఆ+అనిమిష= ఆ దేవతల; నదీ= గంగయొక్క; నందనుండు= కొడుకు (భీష్ముడు); ఈ ప్రశ్నంబునకున్= ఈ ప్రశ్నకు; ఉత్తరంబు= సమాధానం; అగునది= అయినది; ఒక+ఇతిహాసము = ఒక ఇతిహాసం; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= వినుము; అని; ఇట్లు; అనియెన్= చెప్పాడు

తాత్పర్యం: 'అందువలన ఆశ పెట్టి బ్రాహ్మణుడి కివ్వకపోవటం మంచిది కాదు' అని చెప్పగా విని ధర్మరాజు 'గొప్ప గుణా లున్న హీనవర్ణుడికి మంత్రతంత్రాదులు బోధించటం ధర్మమా? కాదా?' అని అడిగాడు. దానికి భీష్మ డిట్లా అన్నాడు. 'నీ ప్రశ్నకు సమాధానంగా ఒక కథ ఉదాహరణంగా చెప్పుతాను వినుము' - అని ఇట్లా చెప్పాడు.

బ్రాహ్మణుఁడు హీనవర్ణునకు వైదికమంత్రంబు లుపదేశింపఁ గూడదనుట (సం.13-10-1)

సీ. హిమగిరిమీఁద ననేకద్విజులు దప । మాచరింపంగ నయ్యాశ్రమమున
కొక్కశూద్రుండు ధర్మోపేతుఁ డేతెంచి । యమ్మునులకు గురుఁ డగు మునీంద్రుఁ
గని, 'కృప నుపదేశ మొనరింపవే తపో । వృత్తికై నా' కని వేఁడుటయును,
'జనదు వైదికము శూద్రున కుపదేశింప; । నీవు శుశ్రూషమై నిలువు' మనియె,

తే. ననుడు, వాఁడు శుశ్రూషకుఁడై వసించె । గుడిసె యొకదెసఁ గావించుకొని ముదమున
నతిథి సురపితృపూజ లత్యధిక భక్తి । తోడఁ జేయుచు నొక్కింత కీడు లేక. 276

ప్రతిపదార్థం: హిమగిరి= మంచుకొండ; మీఁదన్= పైన; అనేకద్విజులు= పలువురు బ్రాహ్మణులు; తపము+ఆచరింపంగన్= తపస్సు చేస్తుండగా; ఆ+ఆశ్రమమునకున్= ఆ ఆశ్రమానికి; ఒక్క= ఒక; ధర్మ+ఉపేతుఁడు= ధర్మాత్ముడు; శూద్రుండు= నాల్గవ కులంవాడు; ఏతెంచి= వచ్చి; ఆ+మునులకున్= ఆ ఋషులకు; గురుఁడు= గురువైన; ముని+ఇంద్రున్= మునిశ్రేష్ఠుడిని; కని= దర్శించి; కృపన్= దయతో; తపోవృత్తికై= తపస్సు చేయటానికి; ఉపదేశము= బోధ; ఒనరింపవే?= చేయవా? నాకున్+అని= నాకోసమని; వేఁడుటయునున్= ప్రార్థించగా; శూద్రునకున్= శూద్రుడైన వాడికి; వైదికము= వేద సంబంధమైన తపస్సు; ఉపదేశింపన్= బోధించటానికి; చనదు= కూడదు; నీవు; శుశ్రూషమైన్= సేవతో; నిలువుము+అనియెన్= ఉండుము అన్నాడు; అనుడున్= అనగా; వాఁడు= ఆ శూద్రుడు; శుశ్రూషకుఁడు+ఐ= సేవకుడై; ముదమునన్= సంతోషంతో; ఒక దెసన్= ఒక ప్రక్క; గుడిసెన్= పర్ణశాలను; కావించుకొని= నిర్మించుకొని; ఒక్కింత= కొంచెంకూడా; కీడు= లోపం; లేక= లేకుండా; అతిథి= అతిథులకు (తిథి లేకుండా వచ్చేవాడు); సుర= దేవతలకు; పితృ= పితృదేవతలకు; పూజలు= అర్చనలు; అతి= మిక్కిలి; భక్తితోడన్= భక్తితో; చేయుచున్= చేస్తూ; వసించెన్= నివసించాడు.

తాత్పర్యం: హిమాలయంమీద అనేకమంది బ్రాహ్మణులు తపస్సు చేసికొంటూ ఉండగా, ఆ ఆశ్రమానికి ఒక శూద్రుడు వచ్చి, గురువుగారిని ప్రార్థించాడు. 'నాకూ తపస్సును బోధించండి' అని. దాని కాయన 'శూద్రుడికి వైదికం బోధించకూడదు. నీవు మాకు సేవ చేసికొంటూ ఉండుము' అని చెప్పాడు. వాడు కూడా ఒక పర్ణశాల కట్టుకొని ఒక ప్రక్క ఉంటూ అతిథులకు, దేవతలకు, పితృదేవతలకు పూజలు చేసికొంటూ ఉండేవాడు.

క. నియతియు, వినయముఁ జూచిన । దయ పుట్టెడునట్లు గాఁగ, ధర్మనిరూఢ
క్రియ లొనరింపఁగ, మునిపతి । ప్రియమునఁ గనుఁగొనుటకై యరిగె నచ్చటికిన్. 277

ప్రతిపదార్థం: నియతియున్= నియమమూ; వినయమున్= అణకువయును; చూచినన్= చూస్తే; దయ= కరుణ; పుట్టెడునట్లు= పుట్టేటట్లు; కాఁగన్= కాగా; ధర్మనిరూఢ= ధర్మబద్ధమైన; క్రియలు= పనులు; (క్రియ=యాగం - అతిథిసుర పితృపూజలే యజ్ఞాలు); ఒనరింపఁగన్= చేస్తూ ఉండగా; ప్రియమునన్= ప్రేమతో; మునిపతి= మునిరాజు; కనుఁగొనుటకై= చూడటానికి; అచ్చటికిన్= అతడి ఆశ్రమానికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: నియమంతో, వినయంతో జాలి కలిగేటట్లుగా ధర్మబద్ధుడై అతడు క్రియలు చేస్తుంటే దయతో చూడటానికని మునుల గురువు అతడి గుడిసెకు వెళ్ళాడు.

ఆ. అరిగి యతనిచేయు నయ్యనుష్ఠానంబు । లోనఁ గానివాని మానఁ జెప్పి,
'యనఘ! యిట్లు సేయు' మని యుపదేశింపఁ । గరుణపేర్మిఁ బుణ్యకర్మగతులు. 278

ప్రతిపదార్థం: అరిగి= పోయి; అతనిచేయు= అతడు చేసే; ఆ+అనుస్ఠానంబులోనన్= ఆ వైదిక కర్మాచరణంలో; కానివానిన్= పనికిరానివాటిని; మానన్= మానుకొనేటట్లు; చెప్పి; అనఘ!= పుణ్యాత్ముడా!; ఇట్లు= ఈ విధంగా; చేయుము+అని= చేసికొమ్మని; పుణ్య= పవిత్ర; కర్మ= వేదవిధుల; గతులు= పద్ధతులు; కరుణ పేర్మిన్=అధికమైన దయతో; ఉపదేశింపన్= బోధించగా.(తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: వెళ్ళి అతడు చేసే వేద కర్మానుష్ఠానం చూచి అందులో ఉన్న లోపాలు చెప్పి 'పుణ్యాత్ముడా! పుణ్యకర్మ ఇట్లా చేయాలి' అని దయతో బోధించాడు.

విశేషం: అనఘ! అన్న సంబోధన మునికి కలిగిన దయను చెప్పుతున్నది. దానికి కారణం అతడు చేసే పనుల మీద ఉన్న శ్రద్ధా భావం.

క. ఆతఁడు దానికి నతిసం । ప్రీతాత్ముం డగుచు నడపి పిదపం గాలం
బై తెగి, యొకనృపునకు సం । జాతుం డయ్యెను సమస్త సద్గుణములతోన్. 279

ప్రతిపదార్థం: ఆతఁడు= ఆ శూద్రుడు; దానికిన్= ముని చెప్పిన దానికి; అతి= మిక్కిలి; సంప్రీత= సంతోషించిన; ఆత్ముండు+అగుచున్= ఆత్మకలవాడగుతూ; నడపి= చేసి; పిదపన్= తర్వాత; కాలంబు+ఐ= కాలం సమీపించి; తెగి= మరణించి; ఒకనృపునకున్= ఒకరాజుకు; సమస్త= అన్నీ; సత్= మంచి; గుణములతోన్= గుణాలతో; సంజాతుండు+అయ్యెను= పుట్టాడు.

తాత్పర్యం: అతడు దానికి సంతోషించి అదే విధంగా ఆయా కర్మలు చేసి చివరకు కాలం సమీపించగా మరణించి, ఒకరాజునకు అన్ని సద్గుణాలు కల కొడుకై జన్మించాడు.

క. మునిపతియుం దతితోడన, । తనువు విడిచి యరిగి, యతని తండ్రి యగుడు, వి
ప్రునకుం బుట్టెన్, వేదా । ద్యనుపమ విద్యలకు నెల్ల నావాసం బై. 280

ప్రతిపదార్థం: మునిపతియున్= మునిశ్రేష్ఠుడు కూడా; తతితోడన= కాలంతోపాటు; తనువు= శరీరం; విడిచి= వదలి; అరిగి= పోయి; అతని తండ్రి= అతడికి తండ్రి; అగుడున్= కాగా; విప్రునకున్= బ్రాహ్మణుడికి; వేద+ఆది= వేదం మొదలైన; విద్యలకున్= చదువులకు; ఎల్లన్= అన్నిటికీ; ఆవాసంబు+ఐ= నిలయమై; పుట్టెన్= జన్మించాడు.

తాత్పర్యం: మునినాథుడు కూడా కాలాంతరంలో శరీరాన్ని విడిచి, ఆ రాజకుమారుని దగ్గర, ఒక బ్రాహ్మణుడికి కుమారుడై సకల వేదవిద్యలకు నిలయంగా జన్మించాడు.

చ. పదపడి యక్కుమారకుఁడు పట్టముగట్టి, పురోహితత్వమున్
విదిత విభూతితో నొసఁగె విప్రుని పుత్త్రున; కవ్విభుండు న
వ్వొదవెడు మోముతో నతనినోరలు వాఱఁగ జూచు; నాతఁ డె
య్యది గత మొక్కొ నవ్వునకు నంచు మదిం దలపోయు భూవరా! 281

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; పదపడి= తర్వాత; ఆ+కుమారకుఁడు= ఆ రాజకుమారుడు; పట్టముకట్టి= రాజ్యానికి పట్టాభిషిక్తుడై; విప్రునిపుత్త్రునకున్= బ్రాహ్మణపుత్రుడికి; పురోహితత్వమున్= రాజపురోహితవృత్తిని; విదిత= లోకానికంతా తెలిసిన; విభూతితోన్= ఐశ్వర్యంతో; ఒసఁగెన్= ఇచ్చాడు; ఆ+విభుండు= ఆ రాజు; నవ్వు+ఒదవెడు= నవ్వు కలిగిన; మోముతోన్= ముఖంతో; అతనిన్= పురోహితుడిని; ఓరలువాఱగన్= కన్ను ఓరగా పెట్టి; చూచున్= చూచేవాడు; ఆతఁడు= ఆ పురోహితుడు; నవ్వునకున్= ఆ నవ్వుకు; ఏ+అది= ఏది; కతము= కారణం; ఒక్కొ= ఒకో; అంచున్= అంటూ; మదిన్= మనస్సులో; తలపోయున్= ఆలోచించేవాడు.

తాత్పర్యం: ధర్మరాజా! తర్వాత ఆ రాజకుమారుడు రాజై బ్రాహ్మణ కుమారుడిని పురోహితుడిగా చేసి కావలసిన సంపద నిచ్చాడు. ఆ రా జెప్పుడూ ఆ పురోహితుడిని ఓరకంట చూచి నవ్వేవాడు. అతడి కర్థం కాక ఆ నవ్వుకు కారణం ఏమిటా అని ఆలోచించేవాడు.

వ. ఒక్కనాఁడవసరంబు గాంచి, యప్పురోహితుం డా భూవరునితో 'దేవా! నన్నుం గనినప్పుడు నవ్వుదు; నావలన నేమి కీడు గలద యెఱింగింపవే! యిదియ నాకు వరం' బని వేఁడిన, నజ్జనపతి దనకు జాతి స్మరత్వంబు గలుగుటం జేసి, పూర్వజన్మంబు దెలిపి యక్కాలంబునం దన యనుష్ఠానంబున నేమేని విహితంబు లుపదేశించుట దేటవడం బలికి, శూద్రవిషయోపదేశంబునం బరమగతి దప్పి యిప్పాట రాజసేవాత్మకంబైన పౌరోహిత్యంబు నడపుటకై నీకుం బుట్టవలసె; నేను బుట్టువెఱింగి పుట్టినవాఁడ నగుటం జేసి యెఱింగి నవ్వుదు; నవ్వునకుఁ గతంబింతియ కాని, నీ వొండుకల్మషంబు గల వాఁడవే? మహాధర్మపరుండవు గురుండ;

వాదుష్కర్మంబునకుం బ్రాయశ్చిత్తంబు సేసికొ' మ్మని యనేక గోవులం గనకరాశులను నొసంగిన, నా భూసురోత్తముండు పురాతన జననకృతం బగు సుకృతంబునం జిత్తంబు నిర్మలంబై యుండుకతంబున నారాజు సెప్పినంత వట్టునుం గలవోలెఁ దనకుఁ దోఁచినం దోషితుండై దానంబులం దీర్థస్నానంబుల మఱియు జపహోమాదిపుణ్య విధానంబులం బాపంబులు వాపికొని, యీ పుట్టువును నీఁగికొని, సంయమి సంతానజాతుండై యెప్పటి యాశ్రమంబునం దపం బాచరించి మహాపదంబు నొందెఁ గావున బ్రాహ్మణ క్షత్రియవైశ్యులకుం దక్కఁ దక్కటివారికి నుపదేశించి బ్రాహ్మణుండు కల్మషభాజనంబగు బ్రాహ్మణాదులకుం బరీక్షాపూర్వకంబుగా నుపదేశింప వలయు నని చెప్పిన నప్పుడమిఱేఁడు, 'లక్ష్మియెట్టి జనంబులయందు వసియించు?' నని యడిగిన నాదేవవ్రతుం డతని కిట్లనియె. 282

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు= ఒకరోజు; అవసరంబుకాంచి= సమయం చూచి; ఆ+పురోహితుండు= ఆ పురోహితుడు; ఆ భూవరునితోన్= ఆ రాజుతో; దేవా!= ప్రభూ!; నన్నున్= నన్ను; కనినప్పుడు= చూచినప్పుడెల్లా; నవ్వుదు= నవ్వుతావు కదా!; నావలనన్= నావలన; ఏమి కీడు= ఏమి లోపం; కలదు?= ఉన్నది? అది= దానిని; ఎఱింగింపవే?= తెలుపవా?; ఇది+అ= ఇదే; నాకున్ వరంబు=నాకు వరం; అని వేఁడినన్= అని ప్రార్థించగా; ఆ+జనపతి= ఆ రాజు; తనకున్= తనకు; జాతి స్మరత్వంబు= పూర్వజన్మ నెరుగుట; కలుగుటన్+చేసి= కలగటంవలన; పూర్వ జన్మంబు= తమ పూర్వజన్మం; తెలిపి= చెప్పి; ఆ+కాలంబునన్= ఆ జన్మలో; తన = తనయొక్క; అనుష్ఠానంబునన్= కర్మాచరణంలో; ఏమి+ఏని= ఏమైనా; విహితంబులు= చేయవలసినవి; ఉపదేశించుట= బోధించటం; తేటపడన్+పలికి= స్పష్టంగా చెప్పి; శూద్ర= శూద్రుడికి; విషయ+ఉపదేశంబునన్= వేద విషయాన్ని బోధించటంవలన; పరమగతి= ముక్తి; తప్పి= తొలగి; ఈ+పాటన్= ఈ విధంగా; రాజ= రాజుయొక్క; సేవా+ ఆత్మకంబు+ఐన= సేవారూపమైన; పౌరోహిత్యంబు= పురోహితత్వం; నడపుటకై= చేయటానికి; నీకున్+పుట్టవలసెన్= నీకు జన్మనెత్తవలసి వచ్చింది; నేను; పుట్టువు= జన్మ; ఎఱింగి= తెలిసి; పుట్టినవాఁడను; అగుటన్+చేసి= కావటంవలన; ఎఱింగి= తెలిసి; నవ్వుదున్= నవ్వుతాను; నవ్వునకున్= నా నవ్వుకు; కతంబు= కారణం; ఇంతియ= ఇంతే; కాని; నీవు; ఒండు= ఒక; కల్మషంబు= పాపం; కలవాఁడవే!= కలవాడివా!; మహా=గొప్ప; ధర్మపరుండవు= ధర్మాత్ముడవు; గురుండవు= గురువవు; ఆ దుష్కర్మంబునకున్= ఆ పాపకర్మకు; ప్రాయశ్చిత్తంబు= దోషంపోయే కర్మ; చేసికొమ్ము; అని; అనేక= చాలా; గోవులన్= ఆవులను; కనక= బంగారు; రాశులను= ప్రోగులను; ఒసంగినన్= ఇస్తే, ఇవ్వగా; ఆ భూసుర+ఉత్తముండు= ఆ ఉత్తముడైన బ్రాహ్మణుడు; పురాతన= పూర్వం; జనన= జన్మలో; కృతంబు+అగు= చేసిన; సుకృతంబునన్= పుణ్యంవలన; చిత్తంబు= మనస్సు; నిర్మలంబు+ఐ= స్వచ్ఛమై; ఉండుకతంబునన్= ఉన్నందువలన; ఆ రాజు; చెప్పినంతవట్టునున్= చెప్పినంతవరకు; కలపోలెన్= స్వప్నంవలె; తనకున్= తనకు; తోఁచినన్= తోచగా; తోషితుండు+ఐ= సంతోషించినవాడై; దానంబులన్= దానాల వలన; తీర్థ= పుణ్యనదుల, స్నానంబులన్= స్నానాలవలన; మఱియున్= ఇంకా; జపహోమ= జపం, అగ్నిహోత్రం; ఆది= మొదలైన; పుణ్యవిధానంబులన్= పుణ్యకార్యాలవలన; పాపంబులు= పాపాలను; పాపికొని= పోగొట్టుకొని; ఈ పుట్టువును= ఈ జన్మను; ఈఁగికొని= పోగొట్టుకొని; సంయమి= మునుల; సంతానజాతుండు+ఐ= సంతానంగా పుట్టి; ఎప్పటి= మునుపటి; ఆశ్రమంబునన్= ఆశ్రమంలో; తపంబు= తపస్సును; ఆచరించి= చేసి; మహాపదంబున్= గొప్ప స్థానాన్ని; ఒందెన్= పొందాడు; కావునన్= కాబట్టి; బ్రాహ్మణుండు= విప్రుడు; బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియలకున్+తక్కన్= ఈ మూడు కులాలవారికి దప్ప; తక్కటివారికిన్= మిగిలిన వారికి; ఉపదేశించి= బోధించి; కల్మష= దోషానికి, పాపానికి; భాజనంబు+అగున్= స్థానమవుతాడు; బ్రాహ్మణ+ఆదులకున్= బ్రాహ్మణుడు మొదలైనవారికి; పరీక్షాపూర్వకంబుగాన్= పరీక్షించి; ఉపదేశింపవలయున్= బోధించాలి; అని చెప్పినన్= అని చెప్పగా; ఆ+పుడమిఱేఁడు= ఆ భూమికిరాజు; లక్ష్మి= లక్ష్మీదేవి; ఎట్టి= ఎట్లాంటి; జనంబుల అందున్= జనాలలో; వసియించున్?= నివసిస్తుంది?; అని అడిగినన్= అని ప్రశ్నించగా; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఒకనాడు సమయం చూచి ఆ పురోహితుడు ఆ రాజుతో 'ప్రభూ! నన్ను చూచినప్పుడల్లా మీరు నవ్వుతారు. నావలన ఏదయినా దోషం ఉన్నదా? ఉంటే చెప్పండి. ఇదే నాకు వరం' అని అడిగాడు. దానికి రాజు తనకు పూర్వజన్మ స్మృతి ఉండటంచేత పూర్వజన్మ తెలిపి ఆ సమయంలో తన అనుష్ఠానంలో ఏమయినా విధులను బోధిస్తానని స్పష్టం చేసి, శూద్ర విషయోపదేశం వలన పరమగతిని తప్పి, ఈ విధంగా రాజసేవాత్మకమైన పౌరోహిత్యాన్ని నడపటానికి నీకు పుట్టవలసి వచ్చింది. నేను పూర్వజన్మస్మృతి కలవాడనవటం చేత నవ్వాను. ఇంతేకాని నీవు ఒక్క కల్మషం కూడా లేనివాడవు. ధర్మపరుడవు. గురుడవు. ఆ పాపానికి ప్రాయశ్చిత్తం చేసికొమ్ము' అని పెక్కు గోవులనూ, కనకరాసులనూ ఇవ్వగా ఆ బ్రాహ్మణోత్తముడు పూర్వజన్మ పుణ్యం వలన మనస్సు నిర్మలమై ఉండటంచేత ఆ రాజు చెప్పినదంతా కలవలె తనకు తోచగా సంతుష్టుడై దానాలవలనా తీర్థస్నానాలవలనా జపహోమానుష్ఠానాలవలనా పాపాలు పోగొట్టుకొని ఆ పుట్టుకను విడిచి మునికి పుట్టి ఎప్పటి ఆశ్రమంలో తపస్సు చేసి మహాపదం పొందాడు. కాబట్టి బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు తప్ప తక్కినవారికి ఉపదేశం చేస్తే బ్రాహ్మణుడు పాపాత్ము డవుతాడు. బ్రాహ్మణాదులను కూడా పరీక్షించి మరీ ఉపదేశించాలి' అని చెప్పగా ఆ రాజు 'లక్ష్మి ఎటువంటి జనులలో ఉంటుంది?' అని అడుగగా భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

లక్ష్మీనివాసస్థానములు (సం. 13-11-1)

క. నారాయణాంకతలమున । శ్రీ రాజిల్లంగఁ జూచి, చిత్తం బతి వి
స్మేరం బై రుక్మిణి వి । స్తారరుచిరనయన యగుచు, సంభావనతోన్. 283

ప్రతిపదార్థం: రుక్మిణి= రుక్మిణీదేవి, శ్రీకృష్ణుడి భార్య; శ్రీ= లక్ష్మీదేవి; నారాయణ= (నార+అయన) నీరునివాసంగా గల్గిన విష్ణుమూర్తి యొక్క అంకతలమునన్= ఒడిలో; రాజిల్లంగన్= ఒప్పారగా (అందంగా ఉండగా); చూచి= రుక్మిణి చూచి; చిత్తంబు= మనస్సు; అతి= మిక్కిలి; విస్మేరంబు+ఐ= ఆశ్చర్యచకితమై; విస్తార= విశాలమైన; రుచిర= అందమైన; నయన= కనులు కలది; అగుచున్= ఔతూ; సంభావనతోన్= గౌరవంతో.

తాత్పర్యం: శ్రీ నారాయణుడి ఒడిలో అందంగా కూర్చుని ఉన్న లక్ష్మిని చూచి మనస్సు ఆశ్చర్యమును పొందగా రుక్మిణీదేవి విప్పారిన అందమైన కళ్ళతో చూస్తూ లక్ష్మీదేవితో భక్తితో ఇట్లా అన్నది.

వ. 'నీ వెట్టి పురుషులయందు, నెబ్భంగి భామలపాల వసియింతు?' వనిన నా దేవి మకరధ్వజమాతకుం జెప్పిన వాక్యంబుల యర్థంబు లుపన్యసించెద; దాన నీ యడిగినయది తేటపడు; నాకర్ణింపుము. 284

ప్రతిపదార్థం: నీవు= లక్ష్మీ! నీవు; ఎట్టి= ఎట్లాంటి; పురుషులయందున్= మగవారిలో; ఏ భంగి= ఎట్లాంటి; భామలపాలన్= స్త్రీలలో; వసియింతువు= నివసిస్తావు; అనినన్= అనగా; ఆ దేవి= ఆ లక్ష్మి; మకరధ్వజ= మన్మథుడి; (జెండాపై మొసలి గుర్తుగా గలవాడు); మాతకున్=తల్లికి, రుక్మిణికి; చెప్పిన వాక్యంబుల= చెప్పినమాటల, అర్థంబులు= భావాలు; ఉపన్యసించెదన్= వివరిస్తాను; దానన్= దానితో; నీ అడిగిన అది= నీవడిగింది; తేట+పడున్= స్పష్టపడుతుంది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: 'నీవెట్లాంటి మగవారిలో, ఎట్లాంటి స్త్రీలలో ఉంటావు?' అని అడిగిన రుక్మిణికి ఆ లక్ష్మి చెప్పినమాటల తాత్పర్యం నీకు వివరిస్తాను. దానితో నీ వడిగినది స్పష్టపడగలదు వినుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **'నిత్యసత్యులు, శౌచనిరతులు, గురుభక్తు, । ల ప్రమత్తులు, దక్షు లమలమతులు,**
సత్కర్మపరులు, విజ్ఞానముఁ దపము దా । నము బ్రహ్మచర్యంబు శమముఁ గల్గు
వారలు, ప్రీతి నా వసియించు నిక్కలు । క్రూరు, నాస్తికుఁ, గృతఘ్నునిఁ, గుబుద్ధి
వర్జింతు; నెంగిలి వర్జించి, యిలువాడి । ఘటశుద్ధి గలిగిన కాంతలందు

తే. **నిల్తు ; వల్లభ ప్రతికూల, నిష్ఠురాత్మ । నన్యమందిరగామిని, నధికనిద్ర**
యైన మానినిఁ దొఱఁగుదు ; నబ్జినీ త । టాక తరుషండ పుష్ప వాటముల నిలుతు'. **285**

ప్రతిపదార్థం: నిత్య= ఎల్లవేళలా; సత్యులు= సత్యం చెప్పేవారు; శౌచ నిరతులు= శుచిత్వం నిత్యమూ పాటించేవారు; గురుభక్తులు= చదువు చెప్పినవారికి భక్తులైనవారూ; అప్రమత్తులు= మదించనివారు; దక్షులు= నేర్పరులు; అమల= స్వచ్ఛమైన; మతులు= మనస్సు కలవారు; సత్= మంచి; కర్మపరులు= కర్మలు చేసేవారు; విజ్ఞానమున్= విశిష్టమైన జ్ఞానం; తపము= తపస్సు; దానము= దానం (జలధారా పూర్వకంగా ఇచ్చేది); బ్రహ్మచర్యంబున్= బ్రహ్మచర్యం; శమము= అంతరింద్రియ నిగ్రహం; కల్గువారలు- కలవారు; ప్రీతిన్= ప్రేమతో; నా వసియించు= నే నుండే; ఇక్కలు= చోట్లు; క్రూరున్= కఠినమనస్కుడిని; న+అస్తికున్= (నాస్తికున్) తన యథార్థస్వరూపం తెలియనివాడిని, వేదాలను నిందించేవాడిని; కృతఘ్నునిన్= చేసిన మేలు మరచినవాడిని; కుబుద్ధిన్= చెడుబుద్ధిగలవాడిని, దుర్మార్గుడిని; వర్జింతున్= విడిచిపెడతాను; ఎంగిలి వర్జించి= ఎంగిలిని వదలి, మరొకడు తినగా మిగిలిన దానిని వదలిపెట్టి; ఇలు+పాడి= ఇలుపాడి= గృహనీతి కలిగి; ఘటశుద్ధిన్= పాత్రల శుభ్రత; కలిగిన= ఉన్న; కాంతల+అందున్= స్త్రీలలో; నిల్తున్= ఉంటాను; వల్లభ ప్రతికూలన్= మగడికి ప్రతికూల అయిన దానిని; నిష్ఠుర+ఆత్మన్= కఠినమైన మనస్సు కలదానిని; అన్య= ఇతర; మందిర= ఇళ్ళకు; గామినిన్= పోయే దానిని; అధిక= ఎక్కువ; నిద్రఐన= నిద్రపోయే; మానినిన్= స్త్రీని; తొఱఁగుదున్= వదలిపెట్టుతాను; అబ్జినీ= తామరతీగలు; తటాక= చెరువులు; తరుషండ= చెట్ల సమూహం; పుష్ప వాటములన్= పూల తోటలలో; నిలుతున్= ఉంటాను.

తాత్పర్యం: లక్ష్మి ఉండేచోట్లు, ఉండనిచోట్లు ఈ పద్యంలో చెప్పబడ్డవి. లక్ష్మి అంటే ధనమే కాదు. శుచీ, శుభ్రత, సరళత, అందం - ఇట్లాంటివన్నీ. 'నిత్యమూ సత్యం చెప్పేవారు, శుచికలవారు, గురుభక్తులు, మత్తులు కానివారు, కార్యసాధకులు, స్వచ్ఛమైన మనస్సు కలవారు, మంచి కర్మలు చేసేవారు, విజ్ఞానం, తపస్సు, దానం, బ్రహ్మచర్యం, ఇంద్రియ నిగ్రహం కలవారు - నేను నివసించేచోట్లు. నే నుండని స్థలాలు - క్రూరులు, నాస్తికులు, కృతఘ్నులు, చెడ్డబుద్ధి కలవారు (లోకంలో వీరిదగ్గర డబ్బుండటం చూస్తున్నాం. కాని లక్ష్మి అంటే డబ్బు కాదు. తృప్తి, ఆనందం, నిండుదనం, సంతోషం). ఎంగిలి కాని పాత్రశుద్ధి కలిగిన గృహనీతి కల స్త్రీల దగ్గర ఉంటాను. భర్తను ఎదిరించే స్త్రీ, కఠినమైన మనస్సుకలదీ, కొంపలవెంట తిరిగేదీ, ఎక్కువ నిద్రపోయేదీ - ఈ స్త్రీలు నాకు నచ్చరు. ఇట్లాంటివారిలో నేనుండను. తామరపూలతో నిండిన సరస్సులు, చెట్లు, పూలు కల తోటలలో ఉంటాను. (కనుక అందమున్న చోట్లు లక్ష్మికి నివాసాలు)

విశేషం: మనుషులలో పవిత్రత, ధర్మం, జ్ఞానం, సత్కర్మలుండాలి. లక్ష్మి అంటే ఇదే. కేవలం ధనం కాదు. దుర్మార్గులు, నాస్తికులు, సంఘవిద్రోహులు. వారికి డబ్బున్నా లక్ష్మి లేనివారే. స్త్రీలు గృహనీతి తప్పి చరిస్తే వారూ ద్రోహబుద్ధులే కనుక లక్ష్మి ఉండదు. ఇదంతా సాంఘికదృష్టి, వ్యక్తి ధర్మం వీటిని గురించి చెప్పినదే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని చెప్పెఁ దత్ప్రకారంబులు బుద్ధిగతంబులు సేసికొమ్మనినం, గురుపతి 'పురుషుల పురంధ్రులసంగతి యందు సంస్పర్శ సుఖంబు నతిశయం బెవ్వరికిం గలుగు?' నని యడిగిన వియత్తటినీ తనూజుం 'డివ్విషయంబున కొక్క యితిహాసంబు గలదు; విను' మని యిట్లనియె. 286

ప్రతిపదార్థం: అని చెప్పెన్= అట్లా చెప్పాడు; తత్= ఆయా; ప్రకారంబులు= పద్ధతులు; బుద్ధిగతంబులు= మనస్సులో నాటుకొనేటట్లు; చేసి కొమ్మనినన్= చేసికొమ్మనగా; కురుపతి= ధర్మరాజు (కౌరవవంశ శ్రేష్ఠుడు); పురుషుల= మగవారియొక్క; పురంధ్రుల= స్త్రీలయొక్క; సంగతి+అందున్= కూడిక లోపల; సం స్పర్శ= మంచి స్పర్శకు సంబంధించిన; సుఖంబు+ అతిశయంబు= ఎక్కువ సౌఖ్యము; ఎవ్వరికిన్= ఎవరికి; కలుగున్?= ఉంటుంది?; అని అడిగినన్= అని ధర్మరాజు అడుగగా; వియత్= ఆకాశ; తటినీ= నది; తనూజుండు= కొడుకు (భీష్ముడు); ఈ విషయంబునకున్= ఈ సంగతికి; ఒక్క= ఒక; ఇతిహాసంబు= పూర్వగాథ; కలదు= ఉన్నది; వినుము; అని; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: లక్ష్మీనివాస స్థానాలు చెప్పి ఆయా విషయాలు మనస్సులో నిలుపుకోవయ్యా!' అని చెప్పగా, ధర్మరాజు మరల ప్రశ్నించాడు. 'స్త్రీపురుషుల రతిలో ఎవరి కెక్కువ సుఖ ముంటుంది?' అని. దానికి గంగకొడుకు ఇట్లా అన్నాడు. 'ఒక కథ ఉన్నది చెప్పుతాను. దానివలన నీకు విషయం తెలుస్తుంది. వినుము అని కథ చెపుతున్నాడు.

భంగాస్వనుం డను రాజు స్త్రీయై కుమారులం గాంచిన ప్రకారము (సం.13-12-1)

సీ. 'అనఘ! భంగాస్వనుం డనురాజు పుత్త్రార్థి । యై వజ్రి కప్రియం బగుమఖంబు
సేసి, పుత్త్రుల సవిశేషుల నూర్వురఁ । గని, సంతసంబునఁ గ్రాలుచుండు;
నాతఁడు వేటకై యరిగినచో వజ్రి । దిగ్భ్రాంతి పుట్టించి తేరకాఁడు
సనునట్లు సేయ నజ్జనపతి యెక్కిన । తురగంబుతో నొంటి దూరమైన

ఆ. కాన కేఁగి, తృష్ణ గదిరిన, నలుగడ । నరసి, యొక్క పద్మసరసి గాంచి
వెన్ను మునుఁగ హయము నన్నీరఁ దిగిచి, తాఁ । దనివు సొంపు మిగుల మునిఁగి లేచి. 287

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; భంగాస్వనుండు; అను రాజు= ఆ పేరుగల రాజు; పుత్ర+అర్థిఐ= కొడుకులను కోరి; వజ్రికిన్= ఇంద్రుడికి; అప్రియంబు= ఇష్టంలేని; మఖంబు= యజ్ఞం; చేసి= నిర్వహించి; సవిశేషులన్= విశేషగుణ వంతులైన; పుత్రులన్= కొడుకులను; నూర్వురన్+కని= వందమందిని కని; సంతసంబునన్+క్రాలుచున్+ఉండున్= సంతోషంతో ఉండేవాడు; ఆతఁడు= ఆ రాజు; వేఁటకై= వేటకొరకు; అరిగినచోన్= వెళ్ళినపుడు; వజ్రి= ఇంద్రుడు; దిక్+భ్రాంతి= దిశలు తెలియని అజ్ఞానం; పుట్టించి= కల్గించి; తేరకాఁడు= పిచ్చివాడు; చనునట్లు= వెళ్ళేవిధంగా; చేయన్= చేస్తే; ఆ+జనపతి= ఆ రాజు; ఎక్కిన= కూర్చున్న; తురగంబుతోన్= గుర్రంతో; ఒంటి= ఒంటరిగా; దూరమైన= దూరంగా ఉన్న; కానకున్= అడవికి; ఏఁగి= వెళ్ళి; తృష్ణ= దప్పిక; కదిరినన్= కలుగగా; నలుగడన్= నాలుగు దెసలు; అరసి= చూచి; ఒక్క పద్మసరసిన్= ఒక తామరలున్న చెరువును, కాంచి= చూచి; హయము= గుర్రం; వెన్ను= వీపు; మునుఁగన్= మునిగేటట్లు; ఆ+నీరన్= ఆ నీటిలో; తిగిచి= లాగి; తాన్= తానూ; తనివు= తృప్తి; సొంపు= హాయి; మిగులన్= ఎక్కువ కాగా; మునిఁగి= నీట స్నానం చేస్తూ మునిగి; తేలి= పైకి వచ్చి.

తాత్పర్యం: ఒక రాజుండేవాడు. అతడి పేరు భంగాస్వనుడు. సంతానంకొరకు తపించి యజ్ఞం చేసి నూర్గురు కొడుకులను కన్నాడు. కాని, ఆ యజ్ఞం ఇంద్రుడికి ఇష్టంలేనిది కావటం వలన రాజు వేటకు వెళ్ళినపుడు ఇంద్రుడు అతడికి ఏ దిక్కు ఎటో తెలియని మాయ కల్గించాడు. ఆ రాజు పిచ్చిగా ఎటో దూరాన అడవులలోకి పోయి అక్కడ దప్పిక కలుగగా ఒక తామరల చెరువు చూచి, గుఱ్ఱాన్ని వీపుమునిగే టట్లు నీటిలోనికి లాగుతూ, తానూ మునిగి లేచాడు.

క. భూనాథుఁడు తృష్ణ సెడం । బానక్రియ యాచరించి, భామినియై తన్
దాన కనుంగొని, విస్మయ । మూనెడుమదితోడ సరసి నొయ్యన వెడలెన్. 288

ప్రతిపదార్థం: భూ= భూమికి; నాథుఁడు= పతి - భంగాస్వనుడు; తృష్ణ= దప్పిక; చెడన్= పోగా; పానక్రియ= త్రాగటం; ఆచరించి= చేసి; భామిని+ఐ= స్త్రీ అయి; తన్+తాన= తనను తానే; కనుంగొని= చూచి; విస్మయము= ఆశ్చర్యం; ఊనెడు= కలిగే; మదితోడన్= మనస్సుతో; ఒయ్యనన్= నెమ్మదిగా; సరసిన్= చెరువులోనుండి; వెడలెన్= బయటకు వచ్చాడు;

తాత్పర్యం: ఆ చెరువులో మంచినీళ్ళు త్రాగేసరికి రాజు స్త్రీగా మారిపోయాడు. తనను తానే చూచికొని ఆశ్చర్యం పొంది బరువైన మనస్సుతో ఒడ్డుకు చేరాడు.

విశేషం: భారతంలో శిఖండి కథలోవలె - ఇక్కడా లింగ పరిణామం చెందిన విషయం చెప్పబడింది. ఇది సాధ్యమేనని ఇవ్వాళ మనం పత్రికలలో చదవటమే కాక శాస్త్రీయంగా ఇది సత్యమే ననీ తెలిసికొంటున్నాం. ప్రతి స్త్రీ పురుషులలో తల్లి అంశ సగం, తండ్రి అంశ సగం ఉంటుంది కనుక. ఇది సత్యమే. శాస్త్రీయమే.

సీ. వెడలి, చింతించి, యీ యొడలితో నే భంగిఁ । దురగంబు నెక్కుదుఁ? బురజనంబు
లేను బోయినఁ జూచి యే మని తలఁతురో? । పొలఁతు లేమను వారో? పుత్త్రు లేమి
గాఁగ నూహింతురో ? కానన యుండంగ । వచ్చునే? పోవంగ వలయు నెట్లు?
నని విచారించి, పోయిన నెల్లవారును । నాశ్చర్య మందుచు నంత నంతఁ

ఆ. గనుఁగొనంగ, మంత్రిగణము రావించి దిగ్ । భ్రాంతిఁ దాను బోయి పద్మసరసి
యందు మునిఁగి వనిత యగుట యెఱింగించి । రాజ్యమునఁ దనూజరాజి నిలిపి. 289

ప్రతిపదార్థం: వెడలి = బైటకు వచ్చి; చింతించి= ఆలోచించి; ఈ ఒడలితోన్= ఈ శరీరంతో; ఏ+భంగిన్= ఏ విధంగా; తురంగంబున్= గుఱ్ఱాన్ని; ఎక్కుదున్.= ఎక్కేది?; ఏను+పోయినన్= నేను ఇట్లా వెళ్ళితే; పురజనంబులు= నగరంలోని ప్రజలు; చూచి= స్త్రీనైన నన్ను చూచి; ఏమి+అని తలఁతురో?= ఏమనుకుంటారో?; పొలఁతులు= భార్యలు; ఏమి+అనువారో?= ఏమంటారో?; పుత్త్రులు=కొడుకులు; ఏమి కాఁగన్= ఎట్లా; ఊహింతురో?= ఊహిస్తారో; కానన్+అ= (అట్లా నగరానికి పోకుండా) అడవిలోనే; ఉండంగన్ వచ్చును+ఏ= ఉండవచ్చునా? ఎట్లు= ఏ విధంగానైనా; పోవంగన్ వలయున్= వెళ్లి తీరాలి; అని= ఈ విధంగా; విచారించి= తర్కించి, పోయినన్=పోగా; ఆశ్చర్యము= అబ్బురపాటు; అందుచున్= పొందుతూ; ఎల్లవారున్= అందరూ; అంతన్+అంతన్= అక్కడ కూడా బెరుకు బెరుకుగా; కనుఁగొనంగన్= తన్ను చూడగా; మంత్రిగణమున్= మంత్రిమండలిని; రావించి = పిలిపించి; దిగ్భ్రాంతిన్= దిశాజ్ఞానం లేకుండా; తాను పోయి= తాను వెళ్ళి; పద్మసరసియందున్= తామరల చెరువులో; మునిఁగి= స్నానమాడి; వనిత= స్త్రీ; అగుటన్= కావటం; ఎఱింగించి= తెలిపి; రాజ్యమునన్= సింహాసనంమీద; తనూజ= కొడుకుల; రాజిన్= సమూహాన్ని (వందమంది కనుక సమూహం); నిలిపి= నియమించి.

తాత్పర్యం: ఒడ్డుకు వచ్చి ఆలోచించటం ప్రారంభించాడు. ఈ శరీరంతో గుర్రాన్ని ఎట్లా ఎక్కేది ? ఇట్లా పోతే నగరంలో ప్రజలేమనుకుంటారో? నా భార్య లేమంటారో? కొడుకు లేవిధంగా ఆలోచిస్తారో? అని భావించి అడవిలో ఎట్లా ఉండటం?; ఏ విధంగా నైనా సరే నగరానికి పోక తప్పదు అని నిశ్చయించుకొని వెళ్ళి, మంత్రులందరినీ పిలిచి, తాను దిగ్భ్రాంతినిపొందటం, చెరువులో మునగటం, స్త్రీ కావటం, అంతా చెప్పి కొడుకులకు రాజ్యమప్పగించి (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: పద్యమంతా గజిబిజి ఆలోచనలు. అనిశ్చిత స్థితి. ఆ స్థితిలో ఉన్నవాడి మానసిక పరిస్థితి ఎట్లా ఉంటుంది? పద్యం పద్యమంతా ఆ విధంగా వ్రాయటం వలన నడకపోయింది. పద్యం వచన వాక్యాలుగా విరిగిపోతున్నవి. ఆరువిధాల వాక్యాలుగా పాదాలు మలచటం శిల్పం.

ఉ. కానకు నేఁగి తాపసులఁ గాంచి, తపం బొనరింప, నం దొకం
డా నలినాక్షిఁ బొంది ప్రియుఁడై నడచెం, గ్రమవృత్తి నందనుల్
దానికిఁ బుట్టి రిద్ధబలదర్పులు నూర్వురు; వారిఁ గొంచు న
మ్మానిని పూర్వ పుత్రక సమాజము పాలికిఁ బోయి, నెమ్మితోన్. 290

ప్రతిపదార్థం: కానకున్= అడవికి; ఏఁగి= పోయి; తాపసులన్= తపస్వులను; కాంచి= దర్శించి; తపంబు= తపస్సును; ఒనరింపన్= చేయగా; అందున్= ఆ తాపసులలో; ఒకండు= ఒకడు (పేరు చెప్పకుండా ఎవడో ఒకడు అనటం); ఆ నలిన+అక్షిన్= ఆ స్త్రీని; (పద్మాలసరసిలో మునగటంవలన స్త్రీరూపం వచ్చింది కనుక తామరలవంటి నేత్రాలు కలవని అన్నాడు); పొంది= కలిసి; ప్రియుఁడై= ప్రేమకలవాడై; నడచెన్= ప్రవర్తించాడు; క్రమవృత్తిన్= క్రమపర్యాయంగా; దానికిన్= ఆ స్త్రీకి; నందనుల్= కొడుకులు; ఇద్ధ= శుద్ధమైన; బల= బలంతో; దర్పులు= గర్వించినవారు; నూర్వురు= వందమంది; పుట్టిరి= పుట్టారు; వారినిన్+కొంచున్= వారిని తీసికొని; ఆ+మానిని= ఆ స్త్రీ; పూర్వపుత్రక సమాజము= ముందు పుట్టిన కొడుకుల సమూహం; పాలికిన్= దగ్గరకు; పోయి= వెళ్ళి; నెమ్మితోన్= సంతోషంతో.

తాత్పర్యం: అడవికి పోయి అక్కడ మునుల దగ్గర తపస్సు చేస్తుండగా ఆమెను ఒకడు ప్రేమించాడు. తత్ఫలితంగా ఆమెకు గొప్ప బలవంతులు వందమంది కొడుకులుపుట్టారు. తాను రాజుగా ఉన్నప్పుడు పుట్టిన కొడుకుల దగ్గరకు వారిని తీసికొనిపోయి సంతోషంతో. (తరువాతి వచనంతో అన్వయం)

వ. తనకు నొక్క తాపసుండు ప్రియుం డగుటయు, వానివలన నత్తనయశతంబు జనియించుటయు నెఱింగించి. 291

ప్రతిపదార్థం: తనకున్; ఒక్క తాపసుండు= ఒక తపస్వి; ప్రియుండు= భర్త; అగుటయున్= కావటం వలనను; వానివలనన్= ఆ తాపసుడి ద్వారా; ఆ+తనయ శతంబు= ఆ నూర్గురు కొడుకులు; జనియించుటయున్= పుట్టటం; ఎఱింగించి= తెలిపి.

తాత్పర్యం: తనకు ఒక తపస్వి ప్రియుడైనాడనీ, అతడివలన ఆ నూరుగురు కొడుకులు కలిగారనీ చెప్పి.

క. 'మగతనమునాఁడు మీరున్ । మగువతనము నపుడు వీరు నాయం దుదయం
బగుటను దోడంబుట్టువు । లగుదురు; ధర వంచి కుడువుఁ డందఱు' ననుడున్. 292

ప్రతిపదార్థం: మీరున్= మీరు; మగతనమునాఁడు= నేను మగవాడుగా ఉన్నపుడు; వీరు; మగువతనమునపుడు= నేను ఆడదానిగా ఉన్నప్పుడు; నాయందున్= నాకు; ఉదయంబు+అగుటను= పుట్టటంవలన; తోడంబుట్టువులు= అన్నదమ్ములు; అగుదురు= (వీరుమీరు) అవుతారు; ధరన్= రాజ్యాన్ని; పంచి= పంచుకొని, అందఱున్= అంతా; కుడువుఁడు= అనుభవించండి; అనుడున్= అనగా.

తాత్పర్యం: నేను మగవాడుగా ఉన్న రోజుల్లో మీరు పుట్టారు. స్త్రీగా ఉన్నపుడు వీరు జన్మించారు. కనుక మీరంతా తోబుట్టువులు. అందుచేత ఈ రాజ్యాన్ని అందరూ సమానంగా పంచుకొని అనుభవించండి, అనగా.

క. భ్రాతృస్నేహము గల్గి, య । రాతులు భయమందఁగా ధరారాజ్యము సం
ప్రీతి ననుభవించిరి జను । లాతతహర్షమునఁ బొంద నందఱు నెమ్మిన్. 293

ప్రతిపదార్థం: భ్రాతృస్నేహము= అన్నదమ్ముల అనురాగం; కల్గి= పొంది; అరాతులు= శత్రువులు; భయము+అందఁగాన్= భయపడగా; జనులు= ప్రజలు; ఆతత= విస్తారంగా; హర్షమునన్; పొందన్= సంతోషించగా; అందఱున్= అంతా; నెమ్మిన్= సంతోషంతో; ధరారాజ్యము= భూసామ్రాజ్యము; ప్రీతిన్= ప్రేమతో; అనుభవించిరి= అనుభవించారు.

తాత్పర్యం: అంతా అన్నదమ్ములై కలిసి మెలిసి రాజ్యాన్ని పంచుకొని శత్రువులు భయపడేటట్లుగా, ప్రజలు సంతోషమును పొందగా, హాయిగా పాలించారు.

తే. దానిఁ గని, పాకశాసనుఁ 'డేను వీని । కహితముగఁ జేయ నిది హితమై ఘటించె
నధిక పుత్త్రసమృద్ధి రాజ్యాభివృద్ధి; నిమ్మహీపతి సమ్మదం బినుమడించె. 294

ప్రతిపదార్థం: దానిన్= ఆ విషయం లేదా ఆమెను; కని= చూచి; పాకశాసనుఁడు= పాకుడను రాక్షసుడిని చంపినవాడు - ఇంద్రుడు; ఏను= నేను; వీనికిన్= వీడికి; అహితముగన్= అశుభమని; చేయన్= చేస్తే; హితము+ఐ= శుభమై; ఘటించెన్= ఒనరింది; అధిక= ఎక్కువ; పుత్త్ర= కుమారుల; సమృద్ధి= సంపదయు; రాజ్య+అభివృద్ధి= రాజ్యం పెంపుదల కారణంగా; ఈ+మహీపతి= ఈ రాజుయొక్క; సమ్మదంబు= సంతోషం; ఇనుమడించెన్= రెట్టింపైనది.

తాత్పర్యం: జరిగిన విషయమంతా చూచి ఇంద్రు డనుకొన్నాడు. 'వీడికి అశుభం చేద్దామనుకొంటే అదంతా వీడికి మేలైనదే. రాజ్యంతోపాటుగా సంతానాభివృద్ధీ అయినది కనుక వీడికి సంతోషం రెండింతలైనది' అని.

వ. దీని విఘటింపం జేయుదు' నని భూసురాకారుండై వచ్చి పూర్వులం గాంచి. 295

ప్రతిపదార్థం: దీనిన్= ఈ సమృద్ధిని; విఘటింపన్+చేయుదును= నాశనం చేస్తాను; అని; భూసుర+ఆకారుండు+ఐ= బ్రాహ్మణ రూపంలో; వచ్చి; పూర్వులన్= మొదటి సంతానాన్ని; కాంచి= చూచి.

తాత్పర్యం: ఈ సమృద్ధిని నాశనం చేస్తాను' - అని బ్రాహ్మణరూపంలో వచ్చి, మొదటి సంతానాన్ని చూచి.

క. ఆ రాజకుమారుల మతి । నీరసము జనించునట్టు ।'లెక్కడి జనకుం?
డేరికినేనియుఁ బుట్టిన । వారిం దోబుట్టువులుగ వల్వం జనునే?' 296

ప్రతిపదార్థం: ఆ రాజకుమారుల= మొదటి సంతానమైన ఆ రాజుకొడుకుల యొక్క; మతిన్= మనస్సులో; ఈరసము= అసూయ; జనించునట్టులు= పుట్టేటట్లుగా; ఎక్కడి జనకుండు= ఎక్కడ తండ్రి?; ఏరికిన్+ఏనియున్= ఎవడికో (తండ్రి ముని కనుక తర్వాతి వారికి); పుట్టిన= జన్మించిన; వారిన్= వారలను; తోఁబుట్టువులుగన్= తమ్ములుగా; వల్వన్= ప్రేమించ; చనునే?= చెల్లుతుందా? (కుదరదు).

తాత్పర్యం: ఆ రాజు మొదటి సంతానం మనస్సులో అసూయ పుట్టేట్లుగా అన్నాడు. 'ఈ పిల్లలకు తండ్రి ఎవడో? ఆ సంతానం మీకు తోబుట్టువు లనుకొనటం వెర్రికాదా?' అని.

వ. అని మఱియు, ననేక ప్రకారంబులం జెప్పి, వార లెఱుంగకుండ నపరకుమారకుల కడకు నేఁగి యితకరి మాటలమొత్తంబుల వారలచిత్తంబులను గలంచె. 297

ప్రతిపదార్థం: అని; మఱియున్= ఇంకా; అనేక ప్రకారంబులన్= అనేక రకాలుగా; చెప్పి= పూసగ్రుచ్చినట్లు చెప్పి; వారలు= మొదటి సంతానం; ఎఱుంగకుండన్= తెలియకుండా; అపర= రెండో; కుమారకుల= కొడుకుల; కడకున్= దగ్గరకు; ఏఁగి= పోయి; ఇతకరి= హితం కలిగించే, మాటల= వాక్కులయొక్క; మొత్తంబులన్= సమూహంతో; వారల= రెండో సంతానంయొక్క; చిత్తంబులను= మనస్సులను; కలంచెన్= కలతపెట్టాడు.

తాత్పర్యం: ఇంకా చెప్పవలసిన రీతులలో అనేకం చెప్పి, వారికి తెలియకుండా రెండో సంతానం దగ్గరకుపోయి చుట్టంవలె మెత్తనిమాటలతో వారి మనస్సులనూ కలతపరచాడు.

విశేషం: అనేక ప్రకారంబులన్-సామాన్యంగా వచనంలో తిక్కన గారిట్లా వ్రాస్తే, మూలంలో అనేక శ్లోకా లుంటా యని అర్థం. వాటిని పండితులు చూచుకొనవచ్చునన్న సూచనమేరకు ఇట్లా వ్రాయటం ఆ మహానుభావుడి అనువాద పద్ధతులలో ఒకటి.

క. అనిమిషవరుఁ డివ్విధమున; । జనియింపఁగఁ జేసెఁ బగ; యసంగతు లై వా
రును దెగి, యొండొరువులతో । ననిఁ బెట్టుగఁ జేసి చచ్చి రందఱు నధిపా! 298

ప్రతిపదార్థం: అధిపా!= రాజా! ధర్మరాజా!; ఈ+విధమునన్= ఈ విధంగా; అనిమిషవరుఁడు= దేవతలరాజు (అనిమిష:= నిమిషం - అంటే కనురెప్పపాటు లేనివారు దేవతలు); పగ= వైరాన్ని; జనియింపఁగన్= పుట్టేటట్లు; చేసెన్= చేశాడు; వారునున్= ఆ రాజకుమారులంతా; తెగి= (కోపంతో) ఏపురేగి; అసంగతులు+ఐ= స్నేహం పోగొట్టుకొని; అనిన్= యుద్ధం; ఒండొరువులతోన్= పరస్పరం; బెట్టుగన్= తీవ్రంగా చేసి; అందఱున్= అంతా; చచ్చిరి= చనిపోయారు.

తాత్పర్యం: ధర్మరాజా! ఇంద్రుడు పెట్టిన కుంపటితో రాజకుమారులు తమ మధ్య స్నేహాన్ని పోగొట్టుకొని శత్రువులైనారు. యుద్ధం తీవ్రంగా చేసికొని, చచ్చారు.

విశేషం: లోకంలో బెట్టు అనే మాటను 'వాడు చాలా బెట్టుసరి మనిషి' అన్న పదం వాడుకలో ఉన్నది. 'వానలు లేక పొలం బెట్టు తీసింది'. అన్న ప్రయోగంలో కఠినమని అర్థం. ఈ అర్థంలో బెట్టు వేరు.

ఉ. చచ్చిన నత్తపస్విసతి సన్నులు మోమును మోదికొంచుఁ బై
వెచ్చని కన్ను నీ రడర, వీడిన వేనలితోడఁ బెల్చ వా
పుచ్చి, తనూజులం బనువఁ బొంచి కనుంగొని పోయె విప్రుఁ డై
యచ్చటికిన్ సురాధిపతి; యాతనిఁ జూచి లతాంగి వెక్కుచున్. 299

ప్రతిపదార్థం: చచ్చినన్= చస్తే; ఆ+తపస్విసతి= ఆ మునిభార్య; చన్నులున్= రొమ్ములు; మోమునున్= ముఖం; మోదికొంచున్= కొట్టుకొంటూ; పైన్= రొమ్ములపైన; ముఖానికీ పైన; వెచ్చని= వేడి; కన్నునీరు= కన్నీరు; అడరన్= వ్యాపించగా; వీడిన= చెదరిన; వేనలితోడన్= జడతో; పెల్చన్= పెద్దగా; వా= వాక్కు (ఏడ్పు); పుచ్చి= అరిచి; తనూజులన్= కొడుకులను గూర్చి; పనువన్= ఏడ్వగా; పొంచి= చాటునఉండి; కనుంగొని= చూచి; సుర+అధిపతి= దేవతల రాజు; విప్రుఁడు+ఐ= బ్రాహ్మణుడై; అచ్చటికిన్= ఆమె దగ్గరకు; పోయెన్= వెళ్ళాడు; లతాంగి= స్త్రీ; అతనిన్+చూచి= అతడిని చూచి; వెక్కుచున్= వెక్కిపడుతూ (వెక్కివెక్కిపడి ఏడ్వటం - వ్యవహారంలోమాట).

తాత్పర్యం: కొడుకులంతా చావగా తల్లి రొమ్మూ, మొగమూ బాదుకొంటూ వాటిమీద కన్నీళ్ళు కారగా, జడముడి ఊడిపోగా, పెద్ద గొంతుకతో కొడుకులను పేరుపేరున తలచుకొంటూ ఏడుస్తూ ఉండగా, చాటున నుండి చూస్తున్న ఇంద్రుడు బ్రాహ్మణరూపంలో ఆమెను సమీపించాడు. ఆమె ఇంకా వెక్కి వెక్కి పడుతూ, (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: స్వభావోక్తి. తల్లి దుఃఖవర్ణన యథార్థంగా చిత్రించబడటం చూడవచ్చును.

ఆ. కరుణ మొగమునందుఁ గనుఁగొని, తాను ము । న్నర్థి వేట వోవు టాదిగాఁగ

సకల సుతులు నాజిఁ జచ్చుట తుదియు గఁ । గలుగు వర్తనంబు దెలియఁ బలికె. 300

ప్రతిపదార్థం: కరుణ= జాలి; మొగమునందున్= అతడి ముఖంలో; కనుఁగొని= చూచి; తాను= భంగాస్వనుండు; మున్ను= పూర్వం; అర్థిన్= కోర్కెతో; వేఁటపోవుట= వేటకైపోవటం; ఆదికాఁగన్= మొదలుకొని; సకల, సుతులు= కొడుకులంతా; ఆజిన్= యుద్ధంలో; చచ్చుట= చావటం; తుదియుగన్= ముగింపు కాగా; కలుగువర్తనంబు= జరిగిన కథనంతా; తెలియన్ పలికెన్= అతడికి తెలిసేటట్లుగా చెప్పింది.

తాత్పర్యం: అతడి ముఖంలో తనపట్ల కనబరుస్తున్న జాలిని చూచి తాను పూర్వం రాజుగా ఉన్నపుడు వేట కేగిన దగ్గరనుండి కొడుకులంతా చచ్చినదాకా జరిగిన కథనంతా చెప్పింది.

క. విని, యతఁ 'డే నింద్రుఁడ, నా కనిష్ట మగు క్రతువుఁ జేసి; తది హేతువుగా

నినుఁ బఱచితి నిత్తెఱఁగున' । ననుటయు, సంభ్రమ సమేతమైన భయమునన్. 301

ప్రతిపదార్థం: విని= విన్నాక; అతఁడు= వాడు; ఏన్= నేను; ఇంద్రుఁడన్= దేవతలరాజును; నాకున్; అనిష్టము+అగు= ఇష్టంలేని; క్రతువున్= యజ్ఞం; చేసితి(వి)= చేశావు; అది హేతువుగాన్= అది కారణంగా; నినున్= నిన్ను; ఈ+తెఱఁగునన్= ఈ విధంగా; పఱచితిన్= పరుగెత్తించాను (కష్టాలు పెట్టాను); అనుటయున్= అనటంతోనే; సంభ్రమ= తొట్రుపాటుతో; సమేతము+ఐన= కూడిన; భయమునన్= భయంతో.

తాత్పర్యం: విని 'నేను ఇంద్రుడను. నాకిష్టం లేని యజ్ఞం చేసినందువలన ని న్నీ విధంగా కష్టపెట్టాను'. అనటంతోనే ఆమె తొట్రుపాటుతో కూడిన భయంతో. (తరువాతి పద్యంతో అన్వయం)

క. ఇలఁ జాఁగి మ్రొక్కి 'యటు తన । యులకై సమ్మూఢబుద్ధి నొనరించితిఁ ద

ప్పలఘు దయఁ జూడు; నీ కేఁ జలమునకుం బాత్రమే విశాలయశోర్థీ!' 302

ప్రతిపదార్థం: ఇలన్= నేలపై; చాఁగి= సాష్టాంగపడి; మ్రొక్కి= నమస్కరించి; తనయులకై= కొడుకులకొరకు; అటు= ఆ విధంగా; సమ్మూఢ= మూర్ఖమైన; బుద్ధిన్= ఆలోచనతో; తప్పు= దోషం; ఒనరించితిన్= చేశాను; అలఘు= గొప్ప; దయన్= కరుణతో; చూడు= చూడుము; నీకున్; ఏన్= నేను; చలమునకున్= పట్టుదలకు; పాత్రమే= తగిన వ్యక్తినా; విశాల= అనంతమైన; యశః+అర్థీ!= కీర్తిని కోరేవాడా!

తాత్పర్యం: 'గొప్పకీర్తి గల నీకు నేనా దొరికాను? కొడుకులకొరకు చేసిన తప్పునకు నా కింత శిక్ష విధించాలా? గొప్ప మనసుతో కరుణించుము'.

వ. అని రామయై యున్న రాజన్యుండు, దైన్యంబు దోఁపం బలికిన, బలసూదనుండు ప్రసన్నుండై. 303

ప్రతిపదార్థం: అని; రామఐ= స్త్రీగా ఉన్న; రాజన్యుండు= రాజు; దైన్యంబు= దీనత్వం; తోఁపన్= కన్పించేటట్లు; పలికినన్= చెప్పితే; బలసూదనుండు= బలుడన్న రాక్షసుడిని చంపిన ఇంద్రుడు; ప్రసన్నుండు+ఐ= దయ కలవాడై.

తాత్పర్యం: స్త్రీ రూపంలో రాజు ఆ విధంగా ఏడ్చేసరికి ఇంద్రుడు ప్రసన్నుడైనాడు.

ఇంద్రుఁడు భంగాస్వనునకుఁ గోరిన వరంబు లిచ్చి యనుగ్రహించుట (సం.13-12-38)

సీ. 'ఇచ్చెదఁ గొందఱ; నెత్తఱిఁ గాంచిన । తనయుల నొసఁగుదు' ననిన నతఁడు
'కాంతనై యుండి యేఁ గనిన వారల నిమ్ము । దేవ!' నావుడుఁ దొల్లి నీవు గన్న
ప్రజల నే లడుగవు? నిజము సెప్పుము నాకు' । ననియెఁ బురందరుం డవ్విభుండు
వెడసిగ్గుపాటుతోఁ 'పడఁతుల కర్మిలి । బిడ్డలదెసఁ గడుఁ బెద్ద' యనిన

తే. 'సత్యవాది వైతి సకలతనూజులు । బ్రదికి నెగడువారు భామినీత్వ
దైన్య ముడిపి పురుషతయు నిత్తు నీ' కని । పాకశాసనుండు వల్కె నధిప! 304

ప్రతిపదార్థం: అధిప!= ధర్మరాజా!; పురందరుండు= ఇంద్రుడు; కొందఱన్= కొంతమందిని; ఇచ్చెదన్= బ్రతికిస్తాను; ఎత్తఱిన్= ఏ సమయంలో; కాంచిన= కన్న; తనయులన్= కొడుకులను; ఒసఁగుదున్= ఇచ్చెదను; అనినన్= అనగా, అంటే; అతఁడు= భంగాస్వనుడు; కాంతనై ఉండి= స్త్రీనై ఉండి; ఏన్= నేను; కనిన= కన్నట్టి; వారలన్= వారిని; ఇమ్ము= ఇవ్వు; దేవ= స్వామీ!; నావుడున్= అనగా; తొల్లి= అంతకుముందు; నీవు; కన్న= కన్నట్టి; ప్రజలన్= సంతానాన్ని; ఏల?= ఎందుకు; అడుగవు= అడగలేదు; నిజము చెప్పుము= సత్యం చెప్పుము; నాకున్; అనియెన్= ఇంద్రుడన్నాడు; ఆ+విభుండు= ఆ రాజు; వెడ= కొంచెం; సిగ్గుపాటుతోన్= సిగ్గుతో; పడఁతులకున్= స్త్రీలకు; బిడ్డలదెసన్= బిడ్డలమీద; అర్మిలి= ప్రేమ; కడున్= మిక్కిలి; పెద్ద= ఎక్కువ; అనినన్= అనగా; పాకశాసనుఁడు= ఇంద్రుడు; సత్యవాదివి= నిజం చెప్పేవాడివి; ఐతి(వి)= ఐనావు; సకల తనూజులు= కొడుకులంతా; బ్రదికి= జీవించి; నెగడువారు= వర్ధిల్లగలరు; భామినీత్వదైన్యమున్= స్త్రీత్వంవలన కలిగిన దీనత్వం కూడా; ఉడిపి= పోగొట్టి; పురుషతయున్= మగతనాన్ని కూడా; నీకున్; ఇత్తున్= ఇస్తాను; అని పలికెన్= అని అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజా! ఇంద్రు డన్నాడు; 'చచ్చినవారిలో కొందరిని బ్రతికిస్తాను. ఎవరిని కోరుకొంటావో చెప్పుము' అంటే అతడన్నాడు. 'నేను స్త్రీగా ఉండి కన్నవారి నిమ్ము' అని. 'ముందరి బిడ్డల నెందు కడగలే' దని ఇంద్రుడంటే - అత డన్నాడు 'స్త్రీకి పిల్లలమీద ప్రేమ ఎక్కువ కదా! అందుకని' అని కొంచెం సిగ్గుపడుతూ అంటే- ఇంద్రుడు 'నీవు నిజం చెప్పావు. కనుక నీ కొడుకులందరినీ బ్రతికించి ఇస్తాను. అంతేకాక నీకు మగతనాన్ని కూడా ఇస్తాను' అని చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విని, యజ్జగతీనాథుఁడు । 'దనయుల నందఱను నీదుదయఁ బడసితి; నే
వనిత నయి యిట్ల యుండెద । ననఘా యివ్వరము నొసఁగు' మని పల్కుటయున్. 305

ప్రతిపదార్థం: ఆ+జగతీనాథుఁడు= ఆ రాజు (జగత్తు= ప్రపంచం, రాజ్యం); విని; నీదు= నీయొక్క; దయన్= దయతో; తనయులన్= కొడుకులను; అందఱన్= అందరినీ; పడసితిన్= పొందాను; నేన్= నేను; వనితన్+అయి= స్త్రీనై; ఇట్ల+ఉండెదన్= ఇదేవిధంగా ఉంటాను; అనఘా!= పుణ్యాత్ముడా!; ఈ+వరము= ఈ వరం; ఒసఁగుము= ఇమ్ము; అని; పల్కుటయున్= అనగా.

తాత్పర్యం: ఆ రాజు ఇంద్రుడి మాటలు విని 'నీ దయవలన నాకు కొడుకు లందరూ దక్కారు. కాని నన్నిట్లాగే స్త్రీగానే ఉండనిమ్ము. ఈ వరం చాలు' అని అన్నాడు.

వ. విస్మితుండై యింద్రుండు 'దీనికిం గతం బేమి? యని యడిగిన నా భంగాస్వనుం డిట్లనియె. 306

ప్రతిపదార్థం: ఇంద్రుండు; విస్మితుండు+ఐ= ఆశ్చర్యపడి; దీనికిన్= నీ వడిగిన దానికి; కతంబు= కారణం; ఏమి?= ఏమిటి?; అని; అడిగినన్= అడుగగా; ఆ భంగాస్వనుండు; ఇట్లు అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇంద్రుడు ఆశ్చర్యపడి ' ఈ విధంగా నీవు అడగటానికి కారణ మేమి?' టని అడిగాడు. దానికి భంగాస్వనుడు ఈ విధంగా పలికాడు.

క. 'సురతంబునఁ గడు నెక్కుడు । పురుషులకంటెను సుఖంబు పొలఁతులకు, సురే
శ్వర! యట్లగుటను నాకీ । వెరవున రమియించి నిలువ వేడుక గలిగెన్.' 307

ప్రతిపదార్థం: సుర+ఈశ్వర!= దేవతలకు రాజా!; పొలఁతులకున్= స్త్రీలకు; సురతంబునన్= రతిలో; కడున్= మిక్కిలి; సుఖంబు= సుఖం; ఎక్కుడు= ఎక్కువ; అట్లు= ఆ విధం; అగుటను= కావటంవలన; నాకున్; ఈ వెరవునన్= ఈ ఉపాయంతో; రమియించి= సుఖించి; నిలువన్= బ్రదకటానికి; వేడుక= కోరిక; ఉత్సాహం; కలిగెన్= కలిగింది.

తాత్పర్యం: 'ఇంద్రా! రతిలో పురుషులకంటె స్త్రీలకు సుఖ మెక్కువ కనుక నే నదే రీతిగా స్త్రీనై సుఖించాలని ఉత్సాహపడుతున్నాను.'

ఆ. అనిన, నట్టులేని నౌఁ గాక, యిమ్మెయి । విపుల సౌఖ్య మొంది, విహరణంబు
సలిపి నిలువు' మనుచు, శక్రుండు సనియె భం । గాస్వనుండుఁ బ్రీతి నట్ల యుండె'. 308

ప్రతిపదార్థం: అనినన్; శక్రుండు= ఇంద్రుడు; అట్టులు+ఏని= అలాగైతే; ఔన్+కాక= సరే అట్లాగే; ఈ+మెయిన్= ఈ విధంగా (స్త్రీవై); విపుల= విస్తారమైన; సౌఖ్యము+ఒంది= సుఖాలు పొంది; విహరణంబు సలిపి= విహరించి; నిలువుము= బ్రతుకుము; అనుచున్= అంటూ; చనియెన్= పోయాడు; భంగాస్వనుండున్= ఆ రాజుకూడా; ప్రీతిన్= సంతోషంతో; అట్లు+అ= అదే విధంగా; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: అని అనగా విని ఇంద్రుడు 'అట్లాగా! సరే! నీ వట్లాగే ఉండి సుఖించుము' అని దీవించి వెళ్ళిపోయాడు. భంగాస్వనుడు కూడా స్త్రీగానే ఉండిపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని చెప్పి భీష్ముండు 'పాండవాగ్రజా! దీన నీయడిగిన యర్థంబు దెలిసికొ' మ్మనిన, నమ్మనుజపతి 'బహువిధము లగు ధర్మంబులు భవత్ప్రసాదంబున వినుచున్నవాఁడ; నవియెల్లను జన్మ మరణాది దుఃఖంబులం బాపంజాలునే? యనేక జననీ జనకులకుం బుట్టుచు సంసార చక్రంబునం దిరుగంజాల; గర్భవాసంబన నరకంబన భేదంబు గలదే? సచరాచరంబైన యిజ్జగం బస్థిరం; బట్లుంగాక దీని విషాన్నంబు చందముగాఁ గనియెద; భవమోక్షణం బగు వైష్ణవధర్మం బుపదేశింపవే! యది యీ యుగంబునం దిరోహితం బగుట కృష్ణద్వైపాయనుండు సెప్పె; మీ యనుగ్రహంబుల నెఱింగెద; భవదీయ చరణంబులు శరణంబులుగాఁ బ్రసన్నుండ నైతి' నని ప్రార్థించిన నమ్మహాత్ముండు 'పగతురం దెగటార్చి పేర్చి పూజ్యంబగు సామ్రాజ్యంబు గైకొని, తదీయంబు లగు సుఖంబు లనుభవించుచుండుట గీడుగాఁ జూడఁ గురుకుల చూడా మణియగు నీకుం జనుఁగాక, యౌవనస్థ లగు రాజ్య పదస్థుల తలంపుల చొప్పె యిది? మిథిలాపతియగు జనకుండుం బోలెం బలికెద' వని యుపలాలించి యమ్మహీపాలున కిట్లనియె. 309

ప్రతిపదార్థం: అని చెప్పి= అనివచించి; భీష్ముడు; పాండవ+అగ్రజా!= పాండవులలో పెద్దవాడా!; ధర్మరాజా!; నీ అడిగిన= నీ వడిగిన; అర్థంబు= అర్థాన్ని; దీనన్= ఈ కథ ద్వారా; తెలిసికొమ్ము= తెలిసికొనుము; అనినన్= అనగా; ఆ మనుజపతి= ఆ రాజు; బహువిధములు+అగు ధర్మంబులు= అనేక ధర్మాలను; భవత్= నీయొక్క; ప్రసాదంబునన్= దయతో; వినుచున్నవాఁడన్= వింటున్నాను; అవి ఎల్లనున్= అవన్నీ; జన్మ= పుట్టుక; మరణ= చావు; ఆది=మొదలైన; దుఃఖంబులన్= దుఃఖాలను; పాపన్+చాలునే?= పోగొట్టునా? అనేక= చాలామంది; జననీ= తల్లులకు; జనకులకున్= తండ్రులకు; పుట్టుచున్= జన్మలెత్తుతూ; సంసారచక్రంబునన్= పుట్టుక చావులతో గూడిన సంసారమనే చక్రంలో చిక్కుకొని; తిరుగన్+చాలన్= తిరగలేను; గర్భవాసంబు+అనన్= కడుపులో ఉండటం అనగా; నరకంబు= నరకము; అనన్= అంటే; భేదంబు కలదే?= భేద మున్నదా?; సచర+ఆచరంబు= కదలెడివి, కదలనివి అయిన వానితో కూడినదైన; ఈ+జగంబు= ఈ లోకం; అస్థిరంబు= స్థిరంగా ఉండనిది; అట్లుంగాక= అందువలన; దీనిన్= దీనిని; విష+అన్నంబు= విషం కలిపిన అన్నం; చందముగాన్= వలె; కనియెదన్= చూస్తాను; భవ= జన్మ; మోక్షణంబు+అగు= తప్పించునట్టి; వైష్ణవధర్మంబు= విష్ణువే దైవమని చెప్పే మార్గం; ఉపదేశింపవే!= బోధించవా!; అది= ఆ ధర్మం; ఈ యుగంబునన్= ఈ ద్వాపరయుగంలో; తిరోహితంబు= అదృశ్యం; అగుట= కావటం; కృష్ణద్వైపాయనుండు= వ్యాసమహర్షి; చెప్పెన్; మీ అనుగ్రహంబులన్= మీ దయతో; (ఇక్కడ బహువచనం లోకంలో వాడటం లేదు. కాబట్టి మిక్కిలి దయతో అని చెప్పుకొనాలి); ఎఱింగెదన్= తెలిసికొంటాను; భవదీయ= మీ; చరణంబులు= పాదాలు; శరణంబులుగాన్= దిక్కుగా; ప్రపన్నుండను= భక్తుడను; ఐతిని; అని; ప్రార్థించినన్= మిక్కలి కోరగా- వేడుకొనగా; ఆ+మహా+ఆత్ముండు= ఆ విశాలమైన హృదయం కలవాడు (ఎవడు తనను విశ్వంలో, విశ్వాన్ని తనలో దర్శించగలడో వాడే గొప్ప ఆత్మ కలవాడు); పగతురన్= శత్రువులను; తెగటార్చి= నరికి; పేర్చి= వర్ధిల్లి; పూజ్యంబు= పవిత్రమైన; సామ్రాజ్యంబు= గొప్ప రాజ్యం; కైకొని= పొంది; తదీయంబులు= దానికి సంబంధించిన; సుఖంబులు=సౌఖ్యాలు, భోగాలు; అనుభవించుచున్+ఉండుట= అనుభవించటం; కీడుగాన్= ఆపదగా; చూడన్= చూడటం; కురుకుల= కురువంశానికే; చూడామణి= తలపై పెట్టుకొనే మణి; అగు నీకున్= అయిన నీకు; చనున్‌గాక!= చెల్లుగాక! యౌవనస్థులు= యువకులు; రాజ్యపదస్థుల= రాజ్యపాలన అందున్నవారి (యౌవరాజ్య పట్టాభిషిక్తులైనవారి); తలంపుల చొప్పె?= ఆలోచనల పద్ధతియా? ఇది= నీవు చెప్పింది; మిథిలాపతి= మిథిలారాజ్య పాలకుడైన; జనకుండున్+పోలెన్= జనకుడివలె; పలికెదవు= చెప్పుతున్నావు; అని; ఉపలాలించి= ముద్దుచేసి; బుజ్జగించి; ఆ+మహీపాలునకున్= ఆ భూమిపతితో.

తాత్పర్యం: ఈ కథవలన నీవడిగిన అర్థం తెలిసికొనుము' అని భీష్ముడనగా విని ధర్మరా జన్నాడు. 'మహాత్మా! నీ వలన ఎన్నో ధర్మాలు వింటున్నాను. చావు పుట్టుకల చక్రంలో పడి తిరుగుతూ ఎన్నిసార్లు జన్మించాలి? నాకీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బంధం వద్దు. తల్లి కడుపులో ఉండటమంటే నరకవాసమే కదా! కనుక విష్ణుభక్తిని బోధించుము. నీ పాదాలే నాకు దిక్కు' అని ప్రార్థించేసరికి భీష్ము డన్నాడు. 'నాయనా! నీ మాటలు చూస్తే ఎవరో జనకమహారాజు మాటలుగా ఉన్నాయిరా! లేకపోతే ఇంత సామ్రాజ్యం పొంది కూడా ఆ భోగాలు వద్దనుకొనటం సామాన్యమా? నీవు కురువంశోద్ధారకుడవయ్యా!' అని మెచ్చుకొని ఇట్లా అన్నాడు.

క. 'పురుషాతిగ యై తోఁచును, । నిరూపణము సేయ నూఁది నిర్దేశింపన్
వెరవుపడక, శాశ్వతసుఖ । భరితతత, నిర్వాణ మనఁగఁబడుఁ బ్రకృతి నృపా! 310

ప్రతిపదార్థం: నృపా= రాజా!; నిర్వాణము= మోక్షం; అనఁగన్+పడు= అనబడే; ప్రకృతి= వ్యక్త, అవ్యక్త రూపిణి అయిన ప్రకృతి; పురుష+అతిగ+ఐ= పురుషుడికంటె మించినదై; తోఁచును= ప్రకాశిస్తుంది; నిరూపణము చేయన్= నిరూపించుటకు; ఊఁది= నొక్కి; నిర్దేశింపన్= వ్యాఖ్యానించుటకు; వెరవుపడక= అంతు చిక్కక; సుఖ భరితతత= నశించని సుఖంతో నిండినదై.

తాత్పర్యం: శాశ్వతసుఖం పేరే మోక్షం. అదే నిర్వాణం. అది పురుషుడికంటె అధికమైన ప్రకృతి అనబడుతుంది. దానిని నిర్దేశించటానికిగానీ, 'ఇది' అని చెప్పటానికి గానీ, చూపటానికి గానీ, తర్కించటానికి గానీ వీలుపడదు.

విశేషం: ప్రకృతి, పురుషులు సాంఖ్యయోగంలోనివి. ప్రకృతి, పురుషు లనేకంగా ఉంటారని సాంఖ్యులు చెప్పారు. తర్వాత వచ్చిన వేదాంతులు దీన్ని ఖండించారు. ఈ సాంఖ్యయోగం గీతలోనూ చెప్పబడింది. ఈ సిద్ధాంత స్థాపకుడు కపిలమహర్షి. ఆయన 5000 సంవత్సరాల క్రితం వాడని చెప్పుతారు.

క. ప్రకృతులు పె; క్కన్నింటికి । నకృతి యనం జనిన యదియ యాద్య; మహీపా
లక! పురుషరూపిణియు నై । వికృతిం బొరయదు వివేకవిజ్ఞాత యగున్. 311

ప్రతిపదార్థం: మహీపాలక!= భూమిపాలకా!; ప్రకృతులు పెక్కు= ప్రకృతులు అనేకం; అన్నింటికిన్= అన్నిటికీ; ఆద్య= మూలము; అకృతి+అనన్+చనిన+అది+అ= అకృతి అని పేర్కొనదగినది; పురుషరూపిణియున్+ఐ= ఆ ఆకృతి పరమపురుష స్వరూపిణియై; వికృతిన్= వికారమును (పరిణామం); పొరయదు= పొందదు; వివేక= జ్ఞానముచేతనే (ఆత్మానాత్మ వివేకము చేత) విజ్ఞాత= స్పష్టంగా తెలుసుకోబడినది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: ఓ రాజా! ప్రకృతులు పెక్కింటికి అకృతియే తల్లి. అది పరమపురుష రూపిణియై ఏవికృతిని పొందదు. అది జ్ఞానము చేతనే తెలియదగినది.

క. విను, సంసార పథమునకు । ననురూపతఁదోఁచుచుండఁ, నన్యప్రకృతుల్
దనతోఁపు భవనిరాసం । బునకుం గారణము, గామమునఁ బిహిత మగున్. 312

ప్రతిపదార్థం: విను= ఆలకింపుము; అన్యప్రకృతుల్= అకృతి కంటే వేరైన ప్రకృతులు; సంసార పథమునకున్= జనన మరణ రూపమైన సంసార మార్గానికి; అనురూపతన్= అనుకూలముగా; తోఁచుచుండన్= స్ఫురించుచుండగా; భవనిరాసంబునకున్= సంసార విచ్ఛేదానికి; తనతోఁపు= అకృతి యొక్క స్ఫురణ; కారణము= హేతువు; కామమున్= కామము చేత; అది= (ఆ కారణము); పిహితమగున్= కప్పబడును.

తాత్పర్యం: అకృతికంటే వేరైన ప్రకృతులన్నీ సంసార మార్గానికి అనుకూలంగా తోస్తూ ఉంటాయి. అలా తోస్తూ ఉండగా సంసార నిర్మూలనానికి కారణమైనది అకృతియొక్క స్ఫురణ మాత్రమే. అది కూడా కామము చేత కప్పబడుతున్నది.

క. కావునఁ గామక్రోధము । లావిర్భూతములు గానియట్లుగఁ దత్స
త్త్వావేశంబునఁ దనుపుము । భావం; బివ్విధము విష్ణుపరతఁ గుమారా! 313

ప్రతిపదార్థం: కావునన్= కనుక; కుమారా!= నాయనా!; కామ, క్రోధములు= కోరిక, కోపాలు; ఆవిర్భూతములు కాని అట్లుగన్= పుట్టకుండా ఉండేటట్లు; తత్= ప్రసిద్ధమైన; సత్త్వ= సత్త్వగుణం యొక్క; ఆవేశంబునన్= ఆవహించటంచేత; భావంబు= మనస్సును; ఈ+విధము= ఈ పద్ధతి; విష్ణుపరతన్= విష్ణుభక్తితో; తనుపుము= తృప్తి పొందించుము.

తాత్పర్యం: నాయనా! కాబట్టి కామక్రోధాలను అణచి మనస్సును సత్త్వగుణభరితం చేసికొమ్ము. ఇదే వైష్ణవ ధర్మమంటే.

విశేషం: సత్త్వం - రజస్సు - తమస్సు అని గుణాలు మూడు. రజస్సు ఉద్రేకం - కర్మ చేయించే స్వభావం. తమస్సు - చీకటి - అజ్ఞానం. ఏ పనీ చేయించని బద్ధకం దీని లక్షణం. సత్త్వం= శుభాన్ని గూర్చే ధర్మాదులను చేయించే ఉద్రేకం లేని శాంతగుణం.

క. నృప! వైష్ణవధర్మము నీ । కుపదేశించితిఁ; బ్రసాదయుతుఁడ వగుచు సా
రపుఁ దెరు వగు నిది గనికొని, । యపగత సంసార భయుఁడ వై నడపు తగన్. 314

ప్రతిపదార్థం: నృప= రాజా!; నీకున్= నీకు; వైష్ణవ ధర్మము= విష్ణుసంబంధమైన ధర్మాన్ని; ఉపదేశించితిన్= బోధించాను; ప్రసాదయుతుఁడవు= శాంత గుణంతో కూడుకొన్నవాడవు; అగుచున్= ఔతూ; ఇది= ఈ వైష్ణవ ధర్మం; సారపు= సారవంతమైన; తెరువు= మార్గం; అగున్= ఔతుంది; కనికొని= విచారించి; అపగత= పోయిన; సంసార= జనన మరణ ప్రవాహంవలని; భయుఁడవై= భయం కలవాడవై; తగన్= చక్కగా; నడపు= జీవించుము.

తాత్పర్యం: నీ వడిగిన ధర్మం చెప్పాను. దీనితో ఉద్రేకాలు లేని మనస్సుతో సంసార భయాన్ని జయించి జీవించుము.

వ. అనిన సంప్రీతుండై ధర్మజుండు భీష్మునితోఁ 'దత్త్వంబులు నధ్యాత్మంబులు, నధిభూతంబులు, నధి దైవంబులు, ననుసర్వంబునకుం గర్తయు, భర్తయు, హర్తయు నగుచు సకల భూతంబులుం దనుపజీవింపం బెంపారు వాని నెఱింగింపవే!' యని ధర్మజుం డడుగుటయు నతనికి నమ్మహితాత్ముం డిట్లనియె. 315

ప్రతిపదార్థం: అనినన్= అనగా; సంప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; ధర్మజుండు; భీష్ముని తోన్= భీష్ముడితో; అధ్యాత్మంబులు= ఆత్మ సంబంధమైనవీ; అధిభూతంబులు= పంచభూతాలకు సంబంధించినవీ; అధిదైవంబులు= దైవాలకు సంబంధించినవీ; తత్త్వంబులు= శాస్త్రీయసత్యాలు; అను= ఈ చెప్పినవాటిని; సర్వంబునకున్= అన్నింటికీ; కర్త= చేసినవాడు; భర్త= పోషించేవాడు; హర్త= చంపేవాడు; అగుచున్; సకలభూతంబులున్= సర్వజీవులూ; తన్నున్= తనను; ఉపజీవింపన్= బ్రదికిస్తూ ఉండగా (తన ఉనికిని చాటుతుండగా); పెంపారువానిన్= పేరుగన్న వాడిని; ఎఱింగింపవే= తెలుపవే; అని;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మజుండు; అడుగుటయున్= అడుగగా; ఆ+మహిత+ఆత్ముండు= ఆ గొప్ప ఆత్మ కలవాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: ఆ మాటలు విని ధర్మరాజు సంతోషించి ఆ మహాత్ముడితో అన్నాడు 'ఆధ్యాత్మికం, అధిదైవం, అధిభూత మన్న మూడు తత్త్వాలకు ఆధారమై, వాటిలో తానూ జీవిస్తూ కర్తా, భర్తా, హర్తా అయిన భగవంతుడి గురించి చెప్పవా?' అని అడుగగా; భీష్ముడన్నాడు.

క. 'సనకుఁడు, సనందనుండును, । సనత్కుమారుఁడు, సనత్సుజాతుఁడు, నలువుర్
తనయుల్ బ్రహ్మకుఁ, బంచము । డును షష్ఠుండును వసిష్ఠుఁడును, శంకరుఁడున్. 316

ప్రతిపదార్థం: బ్రహ్మకున్ = బ్రహ్మదేవునికి; సనకుఁడు, సనందనుండును, సనత్కుమారుఁడు, సనత్సుజాతుఁడు; తనయుల్= కొడుకులు; నలువుర్= నలుగురు; తనయుల్= కుమారులు; పంచముఁడును= ఐదవవాడును; షష్ఠుండును= ఆరవవాడును, (వరుసగా) వసిష్ఠుఁడును= వసిష్ఠమహర్షి, శంకరుఁడున్= శంకరుడూ (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు, వసిష్ఠుడు, శంకరుడు. ఈ ఆరుగురూ బ్రహ్మకు కొడుకులు.

ఆ. అనఘ! విను మరీచి యనఁగ, భృగుం డన, । నంగిరసుఁ డనఁగ, ననంతరంబ
యత్రి యనఁ, బులస్త్యుఁ డన, బులహుం డనఁ, । గ్రతు వనంగఁ, బుట్టు సుతచయంబు. 317

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; విను= ఆలకించుము; మరీచి; అనఁగన్; భృగుండు; అనన్; అంగిరసుఁడు; అనఁగన్; అనంతరంబు+అ= తర్వాత; అత్రిఅనన్; పులస్త్యుఁడు+అనన్; పులహుండు+అనన్; క్రతువు అనంగన్; పుట్టు= జన్మించిన; సుతచయంబు= కొడుకుల సమూహం;

తాత్పర్యం: పుణ్యాత్ముడా! వినుము. ఆ తరువాత మరీచి, భృగుడు, అంగిరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు అనే పేర్లుగల కొడుకులు పుట్టారు.

వ. ఆ సనత్సుజాతుం డంగుష్ఠ ప్రమాణమూర్తియుుం, బ్రజ్వల దనలస్ఫూర్తియునయి లోకంబుల నెందునుం జరియించుచు నొక్కనాఁడు మేరు శిఖరంబున నారదుండు సన్నిహితుం డగుటయుఁ దదీయసల్లాపసౌఖ్యం భనుభవించుచున్న యెడ నిట్లపోలె నడిగిన నారదునకు నమ్మహాయోగీశ్వరుండు సెప్పిన వాక్యంబు లితిహాసరూపంబునం జెల్లునవి యుపన్యసించెద; నవి భవత్ప్రశ్నంబున కుత్తరంబగు; నాకర్ణింపుము. 318

ప్రతిపదార్థం: ఆ సనత్సుజాతుండు; అంగుష్ఠప్రమాణ మూర్తియున్= బొటనవ్రేలంత ఎత్తున్నవాడూ; ప్రజ్వలత్+అనల స్ఫూర్తియున్= మండుతున్న అగ్నివంటివాడూ; అయి=ఐ; లోకంబులన్= లోకాలలో; ఎందునున్= అన్నిచోట్లా; చరియించుచున్= సంచరిస్తూ; ఒక్కనాఁడు= ఒక రోజున; మేరు శిఖరంబునన్= మేరుపర్వత శిఖరంమీద; నారదుండు; సన్నిహితుండు+ అగుటయున్= ప్రత్యక్షం కాగా; తదీయ సల్లాప సౌఖ్యంబు= అతడితో మాట్లాడటంవలన కలిగే హాయి; అనుభవించుచున్+ ఉన్న=పొందుతూ ఉన్న; ఎడన్= సమయంలో; ఇట్లు+అ+పోలెన్= ఈ విధంగానే; అడిగినన్= అడుగగా; ఆ+మహాయోగి+

ఈశ్వరుండు= గొప్పయోగులలో గొప్పవాడైన ఆ సనత్సుజాతుడు; నారదునకున్; చెప్పిన; వాక్యంబులు= వాక్యాలు, సూక్తులు; ఇతిహాస రూపంబునన్= పూర్వగాథవలె; చెల్లున్= ప్రచారంలో ఉన్నాయి; అవి= వాటిని; ఉపన్యసించెదన్= వివరిస్తాను; అని= ఆ వాక్యాలు; భవత్+ప్రశ్నంబునకున్= నీ ప్రశ్నకు; ఉత్తరంబు= సమాధానం; అగున్= ఔతుంది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ సనత్సుజాతుండు బొటనవ్రేలంత ఎత్తున్నవాడూ, మండుతూ ఉన్న అగ్నివలె ప్రకాశించేవాడూ అయి, లోకాలన్నీ సంచరిస్తూ ఉండేవాడు. ఒకనాడు మేరుపర్వత శిఖరం మీద నారదుడు కన్పించగా అతడితో సంభాషిస్తూ ఉండగా నీవలెనే నారదు డడిగితే ఆయన చెప్పిన మాటలు లోకంలో వ్యాపించాయి. ఆ పురాతన వాక్యాలు నీ వడిగిన ప్రశ్నకు సమాధానాలు. కనుక వినుము చెప్పుతాను.

సనత్సుజాతుండు నారదున కుపదేశించిన తత్త్వప్రకారము (సం.13-38-1 (కుంభ))

క. దశకల్ప సహస్రంబులు । నిశ, యింతియ దివస, మిది సునిద్రారతికిన్.
విశదప్రబోధమునకున్ । వశగతకాలములు విష్ణునకు విమలమతీ! 319

ప్రతిపదార్థం: విమల= కల్మషంలేని; మతీ!= మనస్సు కలవాడా!; దశకల్ప సహస్రంబులు= పదివేలకల్పాలు; నిశ= రాత్రి; ఇంతియ= ఇంతే; దివసము= పగలు; ఇది= ఈ లెక్క; సునిద్రా రతికిన్= మంచి నిద్రాసుఖానికీ; విశద= స్పష్టమైన; ప్రబోధమునకున్= మేల్కొని ఉండటానికీ; విష్ణునకున్= విష్ణుదేవుడికి; వశగత= వశమైన; కాలములు= సమయాలు.

తాత్పర్యం: స్వచ్ఛమైన మనస్సు కలవాడా! నారదా! విష్ణువు చక్కగా నిద్రపోవటానికి రాత్రి పదివేల కల్పాలు. మేల్కొనే కాలమూ అంతే. ఇవి విష్ణుమూర్తికి రేయింబవళ్ళు.

క. అవ్యక్తం బనఁగాఁ దన । దివ్యాత్మన కలిగియుండు ధీసారనిధీ!
భవ్యాత్ము లభేదస్థితి । సవ్యాహతదృష్టిఁ గాంతు రయ్యమళమ్మున్. 320

ప్రతిపదార్థం: ధీ= బుద్ధి; సార= సారమునకు; నిధీ!= భండారమైనవాడా!; అవ్యక్తంబు= వ్యక్తం కానిది (వ్యక్తం ప్రపంచం= పదార్థ స్రష్ట) అనఁగాన్; తన; దివ్య+ఆత్మన= దివ్యాత్మతోనే; కలిగిఉండున్= కలిగి వుంటాడు; భవ్య= శ్రేష్ఠ; ఆత్ములు= ఆత్మలు కలవారు (పండితులు); ఆ+యమళమ్మున్= ఆ జంటను (యమళము= జంట) - రేయింబవళ్ళు; అవ్యాహత= ఎదురులేని; దృష్టిన్= చూపుతో; అభేద= భేదం లేని; స్థితిన్= ఉనికిని; కాంతురు= చూస్తారు.

తాత్పర్యం: సారవంతమైన ఆలోచనకు నిధి వంటివాడా! అవ్యక్తమంటే విష్ణువు తన స్వరూపంతో తా నుండటం. మహానుభావులు వ్యక్తాన్నీ (పగలు), అవ్యక్తాన్నీ (రాత్రినీ) ఒకే విధంగా చూస్తారు. (అవి రెండూ ఒకటే)

వ, అప్పరమేశ్వరుండు. 321

ప్రతిపదార్థం: ఆ+పరమ+ఈశ్వరుండు= ఆ మహేశ్వరుడు.

తాత్పర్యం: ఉన్నతుడైన ఆ భగవంతుడు.

క. రే నిద్రించు, ప్రభాతం । బైనన్ మేల్కని సృజించు నంబువులఁ దగం
దా నం దిడుఁ దనవీర్యము । దాన మహాండ మగు హేమతాస్ఫురితంబై. 322

ప్రతిపదార్థం: రే= రాత్రి; నిద్రించున్= నిద్రపోతాడు; ప్రభాతంబు= పగలు; ఐనన్= కాగా; మేల్కని= లేచి; సృజించున్= సృష్టిస్తాడు; అంబువులన్= నీళ్ళలో; తగన్= తగునట్లుగా; తాను; అందున్= నీళ్ళలో; తన; వీర్యమున్= బీజాన్ని; ఇడున్= నిక్షేపిస్తాడు; దానన్= దానితో; హేమతా= బంగారు కాంతితో; స్ఫురితంబు+ఐ= ప్రకాశిస్తూ; మహా+అండము+అగున్= పెద్ద గ్రుడ్డు ఔతుంది.

తాత్పర్యం: రాత్రి కాగానే ఆయన నిద్రపోయి, మరలా వేకువ రాగానే లేచి సృష్టి చేస్తాడు. ఎట్లా అంటే తన బీజాన్ని నీళ్ళలో నిక్షేపించి ఉంచటంవలన. దానితో ఒక పెద్ద బంగారు గ్రుడ్డు ఏర్పడుతుంది.

విశేషం: ఇది సృష్టి విద్య. నీళ్ళంటే సృష్టి చేయటాని కాధారమైన ప్రకృతి. విష్ణువు పురుషుడు. ఇతడి వీర్యధారణ వలన ఒక బంగారు గ్రుడ్డు పెడుతుంది ఆ ప్రకృతి.

వ. తదనంతరంబ. 323

ప్రతిపదార్థం: తత్+అనంతరంబు+అ= ఆ వెంటనే

తాత్పర్యం: దాని తరువాత.

తే. బ్రహ్మఁ గల్పించి, దానికిఁ బతిగఁ జేయు, । నమ్మహాత్ముఁ డహంకార మావహించి,
మనసుఁ బదియింద్రియములు, బుద్ధిని ఘటించి । చదలు మొదలగు భూత పంచకముఁ జేయు. 324

ప్రతిపదార్థం: బ్రహ్మన్= బ్రహ్మను; కల్పించి= సృష్టించి; దానికిన్= అండానికి; పతిగన్= భర్తగా; చేయున్= చేయగా; ఆ+మహాత్ముఁడు; అహంకారము= నేను అన్న వ్యక్తిత్వభావం; ఆవహించి= పొంది; మనసున్; పది యింద్రియములు= కర్మేంద్రియాలు 5, జ్ఞానేంద్రియాలు 5; బుద్ధిని= ఆలోచనలో మంచి చెడూ నిర్ణయించేది; ఘటించి= నిర్మించి; చదలు= ఆకాశం; మొదలు+అగు= మొదలైన; భూతపంచకమున్= పంచ(5) భూతాలు (ఆకాశం, నీరూ, నిప్పూ, గాలీ, భూమీ); చేయున్= సృష్టిస్తాడు.

తాత్పర్యం: విష్ణువు బ్రహ్మను సృష్టించి దానికి భర్తగా నియమించాడు. ఆయన 'నేను' అన్న భావాన్ని పొంది మనసు, బుద్ధి, పది ఇంద్రియాలు, ఆకాశం మొదలైన పంచభూతాలను సృష్టించాడు.

వ. అ య్యాకాశ పవనాగ్ని జలభూము లగుభూతంబు లేనింటికి గుణంబులుగా శబ్దస్పర్శరూపరసగంధంబు లావహించుం; గ్రమంబున దేవముని దానవ గంధర్వ కిన్నర నరజాతి జంతు జాలంబులం గల్పించు నన్నియు నహంకార వ్యాప్తంబు లయి యవ్యక్త సాగరంబున మగ్నోన్మగ్నంబు లగుచుండు. 325

ప్రతిపదార్థం: ఆ+ఆకాశ= ఆ మిన్ను; పవన= వాయువు; అగ్ని= నిప్పు; జల= నీరు; భూములు= నేలలు; అగు= అయిన; భూతంబులు ఏనింటికిన్= ఆ పంచభూతములకు; గుణంబులుగాన్= గుణాలుగా; శబ్ద, స్పర్శ, రూపరసగంధంబులు= శబ్దమూ, స్పర్శ, రూపమూ, రసమూ, వాసనలు; ఆవహించున్= కల్పిస్తాడు; క్రమంబునన్= వరుసగా; దేవ= దేవతలు; ముని= మునులు; దానవ= రాక్షసులు; గంధర్వ= గంధర్వులు, కిన్నర= కిన్నరులు, నర= నరులు అనే; జాతి= జాతులను; జంతు= జంతువుల; జాలంబులన్= సమూహాలను; కల్పించున్= సృజించును; అన్నియున్= అన్నీ; అహంకార= నేనన్న వ్యక్తిత్వభావం;

వ్యాప్తంబులు+అయి= వ్యాపించినవై; అవ్యక్త= వ్యక్తం కాని; ప్రధాన తత్త్వమన్న; సాగరంబునన్= సముద్రంలో; మగ్న= మునుగుతూ; ఉన్మగ్నంబులు= లేస్తూ ఉన్నవి; అగుచుండున్= అవుతుంటాయి.

తాత్పర్యం: పంచభూతాలకు గుణాలు అయిదు. ఆకాశానికి శబ్దం, గాలికి స్పర్శ, అగ్నికి రూపం, నీటికి రుచి, భూమికి వాసన అనేవి గుణాలు. క్రమంగా దేవదానవాది జాతులు సృష్టించబడ్డాయి. వీటన్నింటియందు అహంకారం వ్యాపించి ఉంటుంది. ఇవన్నీ అవ్యక్త సముద్రంలో మునుగుతూ లేస్తూ, జన్మిస్తూ, చస్తూ ఉంటాయి.

క. విభుఁ డావిష్ణుం డేతత్ । ప్రభవస్థితి విలయముల, శుభము నశుభంబుం
బ్రభువై తగఁ గాంచి, నడపి । విభవోజ్జ్వలకేలి సల్పు, వినుము, మహాత్మా! 326

ప్రతిపదార్థం: మహాత్మా= మహాత్ముడా!; వినుము; విభుఁడు= ప్రభువైన; ఆ విష్ణుండు= ఆ విష్ణువు; ఏతత్= ఈ; ప్రభవ=సృష్టి, స్థితి= ఉనికి; విలయముల= ప్రళయాలయొక్క; శుభము= మేలు; అశుభంబున్= కీడు; ప్రభువై= పాలకుడై; తగన్= చక్కగా; కాంచి= కని; నడపి= ప్రవర్తింపచేసి; విభవ+ఉజ్జ్వల= ప్రకాశించే వైభవంతో; కేలి= క్రీడ; సల్పున్= చేస్తాడు.

తాత్పర్యం: ఈ సమస్త సృష్టి స్థితి లయాలకు ప్రభువై విష్ణుమూర్తి శుభాశుభాలు కల్పిస్తూ ఈ సంసార చక్ర భ్రమణాన్ని కలిగిస్తూ గొప్ప వినోదంలో మునిగి తేలుతూ ఉంటాడు.

తే. అంబరాదిభూతములు శబ్దాది గుణము । లింద్రియంబు, లహంకార, మిద్ధతేజ!
మనము, బుద్ధి, యవ్యక్తంబు, మహితవేద । వేద్యతత్త్వంబు లీ చతుర్వింశతియును. 327

ప్రతిపదార్థం: ఇద్ధతేజ!= ప్రకాశించే తేజస్సు కలవాడా! అంబర= ఆకాశం; ఆది= మొదలుగాగల; భూతములు= పంచభూతాలు; శబ్ద= సద్దు; ఆది= మొదలుగాగల; గుణములు= గుణాలు అయిదు; ఇంద్రియంబులు= కర్మేంద్రియాలు ఐదు, జ్ఞానేంద్రియాలు ఐదు, అహంకారము= అహంకారం; మనము= మనస్సు; బుద్ధి= బుద్ధి; అవ్యక్తంబు= అవ్యక్తము; మహిత= గొప్ప; వేద= వేదవిద్య వలన; వేద్య= తెలియదగిన; తత్త్వంబులు= సత్యాలు; ఈ చతుర్వింశతియును= ఈ 24 తత్త్వాలు.

తాత్పర్యం: ఆకాశం మొదలైన అయిదు భూతాలు, అహంకారం, మనస్సు, బుద్ధి, అవ్యక్తం మొదలైన 24 తత్త్వాలు వేదవేద్యతత్త్వాలు.

విశేషం: అవ్యక్తం నుండి మొదలైన సృష్టి 24 తత్త్వాలు కలది. అవే ఈ పద్యంలో చెప్పబడ్డవి. ఇదంతా సాంఖ్యం చెప్పిన సిద్ధాంతం.

వ. అధ్యాత్మాదులు సెప్పెద నాకర్ణింపుము. 328

తాత్పర్యం: ఆత్మకు సంబంధించినవి చెప్పుతాను వినుము.

సీ. శ్రోత్ర మధ్యాత్మంబు సూవె, శబ్దం బధి । భూతంబు దిక్కులు పురుషముఖ్య!
యధిదైవముల్, చర్మ మధ్యాత్మమందలి । సంస్పర్శ మధిభూతసంజ్ఞకంబు,

దానికి నధిదైవతంబు మరుత్తు, నే। త్రంబు దా నధ్యాత్మకంబు, రూప
మధిభూత, మాదిత్యుఁ డధిదైవతము, జిహ్వ। యధ్యాత్మకము, రస మారయంగ

తే. దాని యధిభూత ముదకము, దదధిదైవ। తంబు ఘ్రాణ మధ్యాత్మంబు దలఁప గంధ
మనఘ! యధిభూత మగుఁ దదీయాధిదైవ। తంబు, మేదిని యండ్రు విద్వజ్జనమ్ము. 329

ప్రతిపదార్థం: పురుషముఖ్యా= ఉత్తమపురుషుడా!; శ్రోత్రము= శ్రవణేంద్రియం; అధ్యాత్మంబు= అధ్యాత్మము; చూవె= సుమా!; శబ్దంబు= సద్దు; (అక్షర రూపమైన భాషకు ఆధారమైనది శబ్దం) అధిభూతంబు= అధిభూతము (పంచభూత విషయమైనది); దిక్కులు= దిశలు; అధిదైవముల్= అధిదైవములు; చర్మము= త్వగింద్రియము; అధ్యాత్మము= అధ్యాత్మము; అందలి సంస్పర్శము= అందున్న స్పర్శ; అధిభూతసంజ్ఞకంబు= అధిభూతమను పేరుగలది; దానికిన్= ఆ స్పర్శకు; అధిదైవతంబు= అధిదైవము; మరుత్తు= గాలి; నేత్రంబు= చక్షురింద్రియము; తాన్= తాను; అధ్యాత్మకంబు= అధ్యాత్మకము; రూపము= రూపము; అధిభూతము= దానికి అధిభూతము; ఆదిత్యుఁడు= సూర్యుడు; అధిదైవతము= అధి దైవము; జిహ్వ= రసనేంద్రియము; అధ్యాత్మకము= అధ్యాత్మము; రసము= రుచి; ఆరయంగన్= చూడగా; దాని+అధిభూతము= దానియొక్క అధిదేవత; ఉదకము= నీరు; తత్+అధిదైవతంబు= దానియొక్క అధిదేవత; ఘ్రాణము= ఘ్రాణేంద్రియము; అధ్యాత్మంబు= అధ్యాత్మము; తలఁపన్= ఆలోచించగా; అనఘ= పుణ్యాత్ముడా!; గంధము= వాసన; అధిభూతము+అగున్= అధిభూత మవుతుంది; తదీయ= దానికిసంబంధించిన; అధిదైవతంబు= అధిదైవము; మేదిని= భూమి అని; విద్వజ్జనంబు= పండితులైన మనుష్యులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: శ్రవణేంద్రియము అధ్యాత్మము. శబ్దము అధిభూతము; దిక్కులు అధిదైవములు; త్వగింద్రియము అధ్యాత్మము. త్వగింద్రియములోని స్పర్శ అధిభూతము. స్పర్శమునకు అధిదైవతము వాయువు. చక్షురింద్రియము అధ్యాత్మము. చక్షురింద్రియమునకు విషయమైన రూపము అధిభూతము. సూర్యుడు అధిదైవతము. జిహ్వేంద్రియము అధ్యాత్మకము. దానికి విషయమైన రసము అధిభూతము. ఉదకము అధిదైవము. ఘ్రాణేంద్రియము అధ్యాత్మము. దానికి విషయమైన గంధము అధిభూతము. భూమి దానికి అధిదైవతము అని పండితులంటారు.

వ. ఇది బుద్ధీంద్రియ ప్రపంచంబు. 330

ప్రతిపదార్థం: ఇది= ఈ చెప్పినది; బుద్ధి+ఇంద్రియ ప్రపంచంబు= బుద్ధి మొదలైన ఇంద్రియాల సముదాయం.

సీ. పాద, పాయూ పస్థ, పాణి, వాగ్వర్గంబు। గర్మేంద్రియము లివి నిర్మలాత్మ!
యధ్యాత్మములు, వాని కగు నధిభూతముల్। గంతవ్యమును విసర్గంబు నోలి
నానందమును విను మనఘ! కర్తవ్య వ। క్తవ్యంబు లన, నధిదైవతములు
వాసుమిత్ర ప్రజాపతి శక్రవహ్నులు। మఱి యహంకారంబు మనసు బుద్ధి

తే. పూజితాధ్యాత్మకము, లధిభూతవృత్తి। వెలయు, నభిమానమంతవ్యములును, నిశ్చ
యంబు నధిదైవములు, మేధ యమృతకరుఁడు'। బ్రహ్మ మిది వేదవాక్య నిర్ణయవిధంబు. 331

ప్రతిపదార్థం: నిర్మల+ఆత్మ!= స్వచ్ఛమైన ఆత్మ కలవాడా!; పాద= అడుగు; పాయు= గుదము, ముడ్డి; ఉపస్థ= యోని (లింగం); పాణి= చేయి; వాక్= మాట; వర్గంబు= గుంపు; ఇవి; కర్మ ఇంద్రియములు= పనిచేసే ఇంద్రియాలు; వానికిన్+అగు=

వాటికి సంబంధించిన; అధిభూతముల్= భూతసంబంధమైనవి; గంతవ్యమును= పోదగినదియు (నడువదగినది= దూరం కాలికి); విసర్గంబును= విసర్జనమును; (పాయూపస్థలకు సంబంధించిన మలమూత్రాదులు); ఓలిన్= క్రమంగా; వినుము; అనఘ!= దోషరహితుడా!; ఆనందమును= సంతోషం; కర్తవ్య= చేయదగినది; వక్తవ్యంబులు= చెప్పదగినది; అనన్= అనగా; వీటికి అధి దైవతములు= దేవతలు; వాసు= విష్ణువు; మిత్ర=సూర్యుడు; ప్రజాపతి= సృష్టికర్త; శక్ర= ఇంద్ర; వహ్నులు= అగ్ని దేవులు; పాదం= విష్ణువు; పాయువు= సూర్యుడు; ఉపస్థ= ప్రజాపతి; పాణి= ఇంద్రుడు; వాక్కునకు; అగ్ని; అధి దేవతలు; మఱి= ఇంకనూ; అహంకారంబు; మనసు; బుద్ధి - ఇవి; పూజిత= పూజించదగిన అధ్యాత్మకములు; వీటికి అధిభూత వృత్తి= ఆధి భౌతిక వ్యాపారాలు; వెలయున్= ప్రకాశిస్తూ; అభిమాన= పౌరుషం; మంతవ్యములును= మనసు చేయదగినదియును; నిశ్చయంబును= తర్కించి నిశ్చయించటం; అహంకారానికి అభిమానం; అధిభూతం; మనసునకు ఆలోచనకు; బుద్ధికి నిశ్చయజ్ఞానం, వీటికి వరుసగా అధి దైవములు= దేవతలు; మేధ= ప్రజ్ఞ (ఇది అహంకార దేవత); అమృతకరుఁడు= చంద్రుడు; అమృతమే కిరణాలుగా కలవాడు - ఇతడు మనస్సుకు దేవత; బ్రహ్మము= పరాత్పరుడు - బుద్ధికి దేవత.

తాత్పర్యం: పాదానికి నడక, పాయువునకు విసర్జనం, ఉపస్థకు ఆనందం, పాణికి కర్తవ్యం, వాక్కునకు వక్తవ్యం వరుసగా అధిభూతములు. వరుసగా పైన చెప్పిన పాదాది కర్మేంద్రియ పంచకానికి దేవతలు. విష్ణువు, సూర్యుడు, బ్రహ్మ, ఇంద్రుడు, అగ్ని. అలాగే అహంకారం, మనస్సు, బుద్ధి అనే అధ్యాత్మములకు పౌరుషం, మంతవ్యం నిశ్చయం అనేవి అధిభూతాలు. మేధ, చంద్రుడు, బ్రహ్మము అనేవి అధిదైవాలు.

క. ఇవి యెల్ల విష్ణునం దు । ద్భవము లయముఁ బొందుచుండు; బహువీచిక ల
ర్ణవమునఁ బొడమి యడఁగుమా । డ్కి విశేషము గల్గ దతనికిన్ విభుఁ డగుటన్. 332

ప్రతిపదార్థం: ఇవి ఎల్లన్= ఇవన్నీ; విష్ణునందున్= విష్ణుమూర్తిలో; ఉద్భవము= పుట్టువు; లయము= మృత్యువును; పొందుచున్+ ఉండున్= పొందుతుంటాయి; అర్ణవమునన్= సముద్రంలో; బహు= అనేక; వీచికలు= అలలు; పొడమి= పుట్టి; అడఁగుమాడ్కిన్= అణగారినట్లుగా; అతనికిన్= ఆ విష్ణువునకు; విభుఁడు+అగుటన్= ప్రభువైనందున; విశేషము= పైన మరొకటి; కల్గదు= ఉండదు.

తాత్పర్యం: ఇవన్నీ విష్ణువన్న మహాసముద్రంలో పుట్టి, అణగారిపోయే అలలవంటివి. ఆయనకంటె పైన మరొక సత్యం లేదు. ఆయనే అన్నిటికి ప్రభువు కనుక.

క. విను మవ్యక్తం బనఁగాఁ । జను, మూలప్రకృతి పురుష చైతన్యము నె
క్కొనినం జేతన యగుచు భు । వనతంత్రం బెల్ల నడపు వైభవ మెసఁగన్. 333

ప్రతిపదార్థం: వినుము= విను; అవ్యక్తంబు+అనఁగాన్+చను= అవ్యక్తమనే పేరుతో ప్రకాశించు; మూలప్రకృతి= ఈ కన్పించే సర్వానికి మూలమైన ప్రకృతి; పురుషచైతన్యము= పురుషుడనే చేతనత్వం= ఆత్మ; నెక్కొనినన్= ప్రవేశిస్తే; చేతన అగుచున్= ఆ మూలప్రకృతి ప్రాణవంతమై; భువన తంత్రంబు+ఎల్లన్= ప్రపంచ సృష్టి, స్థితి, లయాదులన్నిటినీ; వైభవము= పరిపాలన; ఎసఁగన్= ప్రకాశించగా; నడపున్= నిర్వహిస్తుంది.

తాత్పర్యం: అవ్యక్తమంటే మూలప్రకృతి. దానిలోకి పురుషుడు ప్రవేశిస్తే అది చైతన్యవంతమై సృష్టికార్యాన్ని నిర్వహిస్తుంది.

ఆ. అట్లు లోకకర్త యగు నంబుజాక్షుండు । పట్టుఁ గొమ్ము, భావభవహరుండు
హరుని యనుమతమున నఖిలాబ్జజాండంబు । లట్లు పుట్టఁజేసి, యడఁచుచుండు'. 334

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అట్లు= ఆవిధంగా; లోకకర్త+అగు= లోకాలను నిర్మించినవాడైన; అంబుజ+అక్షుండు= పద్మాలవంటి కనులుగల విష్ణువు; పట్టు(గొమ్మ= ఈ సృష్టికంతా ఆధారం; భావభవహరుండు= మన్మథుని సంహరించినవాడైన; హరుని= శివుడియొక్క; అనుమతమునన్= అంగీకారముతో; అఖిల= సమస్తమైన; అబ్జజ+అండంబులు= బ్రహ్మాండాలు; పుట్టన్+చేసి= జన్మింపజేసి; అడచుచున్+ఉండున్= లయింపజేస్తూ ఉంటాడు.

తాత్పర్యం: లోకకర్త విష్ణువు సమస్త సృష్టికి ఆధారం. ఆయన శివుడి అనుమతితో సమస్తబ్రహ్మాండాలు సృష్టించటం, లయించటం చేస్తూ ఉంటాడు.

విశేషం: ఇంతవరకూ రాని శివుడు ఈ పద్యంలో ఎందుకు వచ్చినట్లు? 326వ పద్యంలో రాని శివ ప్రసక్తి ఇక్కడ దేనికి? కనుకనే ఇది చాలా తాళపత్ర ప్రతులలో లేదని గుర్తించటం జరిగింది. ఈ పద్యం లేకపోయినా నష్టం లేదు.

వ. ఇట్లు సెప్పి సనత్సుజాతుండు నారదుం జరితార్థుం జేసె నని చెప్పి భీష్ముండు భీమాగ్రజుతో వెండియు.335

ప్రతిపదార్థం: ఇట్లు+చెప్పి= ఈవిధంగా వచించి; సనత్సుజాతుండు; నారదున్= నారదుణ్ణి; చరితార్థున్+చేసెన్= ధన్యుని చేశాడు; అని చెప్పి= అనిపల్కి, భీష్ముండు; భీమ+అగ్రజుతోన్= భీముడి అన్నతో, ధర్మరాజుతో; వెండియున్= మరలా.

తాత్పర్యం: ఇట్లా చెప్పి సనత్సుజాతుడు నారదుడిని కృతార్థుడిని చేశాడని చెప్పి, భీష్ముడు ధర్మరాజుతో మరలా (ఇట్లా అన్నాడు)

ఉ. 'ఇంతకు మూలమై, యిరువదేనవ తత్త్వ మనంగ, వేద వే
దాంత పురాణవేద్యు(డగు నప్పురుషుండు వెలుంగు, వా(డ కా
లాంతకు(డైన యచ్యుతు(డనంతు(డు, యోగిజనాంతరంగ వి
శ్రాంతు(డు, విష్ణు(డద్వయు(, డసంగు(డు గౌరవవంశదీపకా!' 336

ప్రతిపదార్థం: కౌరవ వంశదీపకా!= కౌరవవంశాన్ని వెలిగించినవాడా!; ఇంతకున్= ఇందాక చెప్పిన సృష్టికంతటికి; మూలము+ఐ= ఆధారమై; ఇరువది+ఏనవ= ఇరవై అయిదో; తత్త్వము= సత్యం; అనంగన్; వేద వేద+అంత= వేదాలకు, ఉపనిషత్తులకు; పురాణ= పురాణాలకూ; వేద్యు(డు= తెలియదగినవాడు; అగు= అయిన; ఆ+పురుషుండు= ఆ తత్త్వమూర్తి; వెలుంగున్= వెలుగొందుతున్నాడు; వాడు+అ= అతడే; కాల+అంతకు(డు= కాలాన్ని అంతం చేసేవాడు; ఐన= ఐనట్టి; అచ్యుతు(డు= చెడనివాడు; అనంతు(డు= అంతంలేనివాడు; యోగిజన= యోగుల; అంతరంగ= హృదయమే; వి(శ్రాంతు(డు= సేదే దీరే స్థానంగా ఉన్నవాడు; విష్ణు(డు= వ్యాపనశీలుడు; అద్వయుండు= ఏకతత్త్వం, రెండవది లేనివాడు; అద్వైతమూర్తి; అసంగు(డు= దేనియందు తగుల్కొననివాడు.

తాత్పర్యం: 'ధర్మజా! ఈ ఇరవైనాలుగు తత్త్వాలకు మూలమైన తత్త్వం ఇరవై ఐదవది విష్ణువన్న పేరున ఉన్న పురుషుడనే పేరు గలది. అది పురాణ, వేద, ఉపనిషత్తులచేత ఎరుగనైనది. కాలమున కంతకుడు, అద్వయుడు, అసంగుడు అతడు. అతడి పేరు విష్ణువు.

విశేషం: 24 తత్త్వాల విచారణ చేసింది సాంఖ్యం. అందులో ఈశ్వరతత్త్వం చెప్పబడలేదు. ఈ ఇరవైఐదవతత్త్వం చెప్పింది యోగదర్శనం. కనుకనే కవి - వేదవేదాంత పురాణ వేద్యుడన్నాడు. ఇట్లు తత్త్వం అక్కడే చెప్పబడింది. బ్రహ్మసూత్రాలలో,

భాష్యాలలో ఈ విషయం వ్యాఖ్యానించబడింది. కనుక ఇది యోగదర్శనం లోనిది. ఇందుకే 'యోగి జనాంతరంగ విశ్రాంతుడు' అనబడింది. ఇది చెప్పుమనే ధర్మరాజు అడిగింది.

వ. అనిన విని యజాతశత్రుండు సరిత్పుత్రునితో 'నియతు లయి యగ్నులు దమయంద సమాహితంబులు సేసికొని మహితాత్ములు నిజాత్మల నప్పరమాత్ము నెట్టివానింగా, భావింతు రెఱింగింపవే' యనుటయు నతనికి భీష్ముం డిట్లనియె. 337

ప్రతిపదార్థం: అనినన్; విని; అజాతశత్రుండు= ధర్మరాజు; న+జాత= పుట్టని; శత్రుండు= శత్రువులు కలవాడు; సరిత్+పుత్రునితోన్= గంగకొడుకు భీష్మునితో; నియతులు+అయి=నియమం కలవారై; అగ్నులు= అగ్నులను; తమ+అందున్+అ= తమలో; సమాహితంబులు చేసికొని= ఆవహింపచేసికొని; మహిత+ఆత్ములు= మహానుభావులు; నిజ= తమ యొక్క; ఆత్మలన్= ఆత్మలలో; ఆ+పరమ+ఆత్మున్= ఆ భగవంతుడిని; ఎట్టివానిన్+కాన్= ఎట్లాంటివాడినిగా, భావింతురు?= భావిస్తారు; చూస్తారు?; ఎఱింగింపవే= తెలుపుమా; అనుటయున్= అని అడుగగా; అతనికిన్= ధర్మజుడికి; భీష్ముండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధర్మరాజు భీష్ముడిని మరలా ప్రశ్నిస్తున్నాడు. 'నియమంతో అగ్నులను తమలో ఆవహింపచేసికొని మహాత్ములు పరమాత్ముడిని ఎట్లాంటి వాడినిగా భావిస్తారు. చెప్పవే' అని.

విశేషం: ఆ రోజులలో వేదం చెప్పిన అగ్నులను ఉపాసించే వారిని గురించి ఈ ప్రశ్న వేయబడింది. గీతలో కూడా ఈ విషయం వస్తుంది.

క. అమృతోత్పత్తి సమయమున । నమరులకును, దానవులకు నని వాటిలె; నం
దమరులు దప్పిం జేడ్పడి । కమలభవుని నాశ్రయింపఁగా నియతిమెయిన్. 338

ప్రతిపదార్థం: అమృత= అమృతం; ఉత్పత్తి= పుట్టుక; సమయమునన్= వేళలో; అమరులకును= దేవతలకూ; దానవులకున్= రాక్షసులకూ; అని= యుద్ధం; పాటిలెన్= కలిగింది; అందున్= ఆ యుద్ధంలో; అమరులు= దేవతలు; డప్పిన్= దప్పికతో; చేడ్పడి= వశంతప్పి, నియతిమెయిన్= నియమంతో; కమలభవునిన్= బ్రహ్మను (పద్మంలో పుట్టినవాడు); ఆశ్రయింపఁగాన్= ఆశ్రయించగా.

తాత్పర్యం: సముద్ర మథనంతో అమృతం పుట్టింది. అప్పుడు దేవదానవులకు యుద్ధం జరుగగా అందులో దేవతలకు దప్పి కలిగి, ఆయాసపడి బ్రహ్మను నిష్ఠతో ఆశ్రయించారు.

వ. అతండు నారాయణు నాత్మయందు నిలిపి. 339

ప్రతిపదార్థం: అతండు= బ్రహ్మ; నారాయణున్= విష్ణుని; ఆత్మఅందున్= తన ఆత్మలో; నిలిపి= స్థాపించుకొని.

తాత్పర్యం: బ్రహ్మ నారాయణుడిని హృదయంలో నిలిపికొని.

తే. 'భక్తవత్సల! పరమాత్మ! పద్మనేత్ర! సర్వభూతమహేశ । ఋక్సామ యజురు
పాస్య! సాధుసంరక్షణ పరవిహార! సురలు రిపులచే నలఁగిరి, శరణ మగుము'. 340

ప్రతిపదార్థం: భక్తవత్సల!= భక్తులపై వాత్సల్యము కలవాడా!; పరమాత్మ= పరమేశ్వరా!; పద్మనేత్ర!= తామరపూలవంటి కన్నులున్న వాడా!; సర్వభూత= అఖిల ప్రపంచానికీ; మహేశ!= పరమేశ్వరా; ఋక్= ఋగ్వేదం; సామ= సామవేదం; యజుః = యజుర్వేదంచేత; ఉపాస్య!= ఉపాసించదగ్గవాడా!; సాధు= సత్పురుషులను; సంరక్షణ= రక్షించటమనే కర్మకు; పర= బద్ధుడవై; విహారా!= విహరించేవాడా!; సురలు= దేవతలు; రిపులచేన్= శత్రువులవలన; నలఁగిరి= బాధపడ్డారు; శరణము= దిక్కు; అగుము= కమ్ము.

తాత్పర్యం: 'మూడువేదాల ద్వారా ఉపాసించబడే భక్తవత్సలా! పరమాత్మా! సత్పురుషులను రక్షించటమన్న కర్మతో విహరించేవాడా! దేవతలు రాక్షసులవలన బాధపడ్డారు. రక్షించు.

వ. అని సంస్తుతిపూర్వకంబుగాఁ బ్రార్థించె; నట్టియెడ. 341

ప్రతిపదార్థం: అని; సంస్తుతి= గొప్ప స్తోత్రం; పూర్వకంబుగాన్= ముందు కలదిగా; ప్రార్థించెన్= వేడుకొన్నారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో

తాత్పర్యం: అని స్తుతితో కూడిన ప్రార్థన చేశారు. ఆ సమయంలో.

విశేషం: ప్రార్థన స్తుతిపూర్వకంగా ఉంటుంది. కనుక దాని ద్వారా ప్రార్థించారు.

క. జలదస్వనసన్నిభమై । యెలుఁ గొక్కటి సదలఁ జెలఁగె; 'నే నిదె మిమ్మున్
గెలిపింపఁగ వచ్చితి; నను । విలసద్వర్ణములు, గాఢ విశదంబులుగాన్. 342

ప్రతిపదార్థం: ఎలుఁగు+ఒక్కటి= ఒక కంఠస్వరము; జలద= నీటినిచ్చేది, మేఘంయొక్క; స్వన= ఉరుము; సన్నిభమై= పోలినదై; చదలన్= ఆకాశంతో; నేను; ఇదె= ఇదుగో; మిమ్మున్= మిమ్మల్ని; గెలిపింపఁగన్= గెలిపించటానికి; వచ్చితిన్= వచ్చేశాను; అను= అన్న; విలసత్= అందమైన; వర్ణములు= అక్షరాలు; గాఢ= పెద్దగా; విశదంబులుగాన్= స్పష్టంగా; చెలఁగెన్= ధ్వనించింది.

తాత్పర్యం: ఆకాశంలో ఉరు మురిమిన ట్లొక ధ్వని వినిపించింది. అందులోనుండి స్పష్టమైన మాటలు ఇట్లా వినిపించాయి - 'ఇదుగో మిమ్మల్ని కాపాడటానికి వస్తున్నాను' అని.

వ. తదనంతరంబ యకుంఠిత విక్రముం డగు వైకుంఠుండు 343

ప్రతిపదార్థం: తత్= దానికి; అనంతరంబ= అంతరం; ఎడం లేకుండా వెంటనే; అకుంఠిత= మొక్కవోని; విక్రముండు= పరాక్రమం కలవాడు; అగు; వైకుంఠుండు= విష్ణువు.

తాత్పర్యం: వెంటనే మొక్కవోని పరాక్రమం కలవాడైన విష్ణువు. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: మాటలు విన్పించటం, వెంటనే విష్ణువు రావటం ఒకేసారి జరిగాయి.

క. గరుడారోహణలీలా । సరభసుఁడై, చక్రగదలు శార్‌ఙ్గముఁ, జంచ
త్కరముల వెలుంగ నడరి య । సురగణములఁ ద్రుంచె సురలు చోద్యంబందన్. 344

ప్రతిపదార్థం: గరుడ+ఆరోహణ= గరుత్మంతుడిపై ఎక్కి; లీలా= అందమైన; సరభసుఁడు+ఐ= ఆటోపం కలవాడై; చక్రగదలు= చక్రము, గద - అనే రెండు ఆయుధాలు; శార్ఙ్గము= విల్లు; చంచత్= ఒప్పుతున్న; కరముల= చేతులలో; వెలుంగన్= ప్రకాశించగా; అడరి= విజృంభించి; సురలు= దేవతలు; చోద్యంబు= ఆశ్చర్యం; అందన్= పొందగా; అసురగణములన్= రాక్షస సేనలను; త్రుంచెన్= సంహరించాడు.

తాత్పర్యం: గరుత్మంతుడిపై నెక్కి, విలాసంగా తొందర కలవాడై చక్ర గదా శార్ఙ్గములనే ఆయుధాలు అందమైన చేతులలో ప్రకాశించగా, రాక్షస సమూహాన్ని సంహరించాడు. అదిచూచి దేవతలు ఆశ్చర్యపడ్డారు.

వ. ఇట్లు నిర్జించి తత్‌క్షణంబ యతం డంతర్ధానంబు నొందిన సంతసంబును, నచ్చెరువును బెనంగొను డెందంబుతో బృందారక బృందంబు 'లిమ్మహాత్ముం డెవ్వం? డేమి భంగివాఁ డెఱింగింపవే?' యని యడిగిన నజుం 'డితండు విష్ణుండు; వైకుంఠాభిధానం బగు మూర్తి విశేషంబున విహరించె; విష్ణుని విధం బిట్టిదని యెఱుంగను; నెఱింగింపను శక్యం బగునే?' యయిన నొక్క తెఱంగునం దెలిపెడునట్టి యితిహాసంబు గలదు; వినుం 'డని పలికి వినిపించె' ధర్మనందనా! యా నిర్మలవాక్యంబు లుపన్యసించెద; దాన నీయడిగిన యర్థంబు దేటపడు; నాకర్ణింపుము. 345

ప్రతిపదార్థం: ఇట్లు; నిర్జించి= జయించి; తత్‌క్షణంబు+అ= ఆ క్షణంలోనే; అంతర్ధానంబు నొందినన్= అదృశ్యుడు కాగా; సంతసంబును= సంతోషం; అచ్చెరువును= ఆశ్చర్యం; పెనంగొను= ముప్పిరిగొన్న; డెందంబులతోన్= మనస్సులతో; బృందారక=దేవతల; బృందంబులు= సమూహాలు; ఈ+మహాత్ముండు= ఈ మహానుభావుడు; ఏమిభంగివాఁడు?= ఎట్లాంటివాడు; ఎఱింగింపవే= తెలుపవే; అని; అడిగినన్; అజుండు= బ్రహ్మ; ఇతండు= ఈయన; విష్ణుండు= విష్ణువు; వైకుంఠ= వైకుంఠుడనే; అభిదానంబు+అగు= పేరుగల; మూర్తి విశేషంబునన్= ప్రత్యేక ఆకారంతో; విహరించెన్= యుద్ధ విహారం చేశాడు; విష్ణునివిధంబు= విష్ణుడి పద్ధతి; ఇట్టిదని= ఇట్లాంటిదని; ఎఱుంగను= తెలిసికొనటానికిగానీ; ఎఱింగింపను= చెప్పటానికి గానీ; శక్యంబు+అగునే?= సాధ్యమౌతుందా? అయినన్= అయినా; ఒక్క తెఱంగునన్= ఒక పద్ధతిగా; తెలిపెడు+అట్టి= అతడిని గూర్చి చెప్పే; ఇతిహాసంబు= పురాణకథ; కలదు= ఉన్నది వినుండు; అని; పలికి= చెప్పి; వినిపించెన్= తెలియజెప్పాడు; ధర్మనందనా= ధర్మజా!; ఆ నిర్మలవాక్యంబులు= ఆ పుణ్యావాక్యాలను; ఉపన్యసించెదన్= యథాతథంగా చెప్పుతాను; దానన్= దానితో; నీ అడిగిన అర్థంబు= నీ వడిగిన విషయం; తేటపడున్= స్పష్టపడుతుంది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఈ విధంగా జయించి వెంటనే ఆయన అదృశ్యుడు కాగా సంతోషం, ఆశ్చర్యం పెనవేసుకొని పోయిన మనస్సులతో దేవతలు బ్రహ్మను ప్రశ్నించారు. 'స్వామీ! ఈయన ఎవరు? ఎట్లాంటివాడు? అని. బ్రహ్మ అన్నాడు - 'ఆయనే విష్ణువు. వైకుంఠనామధేయంతో ప్రత్యేకరూపంతో విహరించాడు. ఆయన ఇట్లాంటివాడని ఎవరికి తెలుసు? ఎవరు చెప్పగలరు? అయినా ఒకరకంగా ఆయనను గురించి చెప్పే పురాణకథ ఒకటి ఉన్నది' అని బ్రహ్మ వినిపించాడు. దానిని నీకు చెప్పుతాను. ధర్మదేవతకుమారుడా! అది నీ వడిగిన విషయానికి సమాధానమౌతుంది. వినుము!' అని భీష్ముడు చెప్పుతున్నాడు.

గరుత్మంతుండు మునులకు విష్ణుదేవుని మహిమాతిశయంబు సెప్పుట (సం.13-40-1 (కుంభ))

సీ. హిమగిరిమీఁద ననేక మునీంద్రులు । సిద్ధులుఁ గూడి గోష్ఠీసుఖంబు
ననుభవింపఁగ లీల నచటికి వచ్చి సు । పర్ణుండు వారికిఁ బ్రణతుఁ డగుడు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వా రభినందించి గారవమున సుఖా। సీనుఁ గావించి, యర్చించి, ప్రీతి

నతనితో సల్లాపమాచరించుచు నుండి। 'యొక్కటి యడిగెద ముజ్జ్వలాత్మ!'

తే. యనిన నాతండు 'ధన్యుండ నైతి; మీర। లెద్ది యడిగెద? రేను నా యెఱిఁగినంత,

యతులమతులార ! చెప్పెద' ననుడు, వార। లెలమి నవ్విహగేంద్రున కిట్టు లనిరి. 346

ప్రతిపదార్థం: హిమగిరిమీఁదన్= మంచుకొండమీద, హిమాలయంమీద; అనేక= చాలామంది; ముని+ఇంద్రులు= మునిశ్రేష్ఠులు; సిద్ధులున్= దేవతాజాతివారు; కూడి= కలిసికొని; గోష్ఠి= స్నేహపూర్వక చర్చా సమావేశంయొక్క; సుఖంబు= సౌఖ్యం; అనుభవింపఁగన్= అనుభవిస్తుండగా; లీలన్= విలాసముగా; సుపర్ణుండు= గరుత్మంతుడు (మంచి బలమైన రెక్కలు గలవాడు); అచటికిన్; వచ్చి; వారికిన్= మునిశ్రేష్ఠులకు; ప్రణతుఁడు= నమస్కరించినవాడు; అగుడున్= కాగా; వారు= మునులు సిద్ధులు; అభినందించి= పొగడి; గారవమునన్= గౌరవంతో; సుఖ+ఆసీనున్ గావించి= సుఖమైన ఆసనమందు కూర్చుండబెట్టి; ప్రీతిన్= భక్తితో; అర్చించి= పూజించి; అతనితోన్= సుపర్ణుడితో; సల్లాపము= సంభాషణ; ఆచరించుచున్= చేస్తూ ఉండి; ఉజ్జ్వల+ఆత్మ!= ప్రకాశించే ఆత్మకలవాడా! (దివ్యదృష్టితో చూస్తే తెలిసే విషయం); ఒక్కటి అడిగెదము= ఒక టడుగుతాం; అనినన్= అంటే; ఆతండు= సుపర్ణుడు; ధన్యుండను+ఐతిన్= నేను పవిత్రుడ నైనాను; మీరలు; ఎద్ది= ఏది; అడిగెదరు?= అడుగుతారు?; అతుల= సాటిలేని; మతులార!= మనస్సు కలవారలారా!; ఏను= నేను; నా ఎఱిఁగినంతన్= నాకు తెలిసినంత; చెప్పెదన్= చెప్పుతాను; అనుడున్= అనగా; వారలు= ఆ సిద్ధులు, మునులు; ఎలమిన్= సంతోషంతో; ఆ+విహగ+ఇంద్రునకున్= ఆ పక్షిరాజుతో (విహగము= ఆకాశంలో ఎగిరేది= పక్షి); ఇట్టులు= ఈ విధంగా; అనిరి= అన్నారు.

తాత్పర్యం: ఒకప్పుడు హిమాలయం మీద మునులూ, సిద్ధులూ కూర్చుని ఆధ్యాత్మిక విషయ చర్చ చేస్తూ ఉండగా అక్కడకు గరుత్మంతుడు వచ్చి, వారందరికి నమస్కరించాడు. అతడిని వారు సుఖంగా కూర్చోబెట్టి గౌరవంతో సల్లాపం చేస్తూ 'మహాత్మా! నిన్నొకటి అడగాలని ఉన్నది' అన్నారు. ఆయన 'నేను ధన్యుడనైనాను. మీరేమడుగుతారో అడగండి. నాకు తెలిసినంత చెప్పుతాను' అనగానే వా రిట్లా అన్నారు.

క. 'ప్రియభక్తుండవు, భక్త। ప్రియుఁడును విష్ణుండు, నీవు ప్రియుఁడై భక్తుం

డయి వర్తింతు విభుకడ। దయఁ దెలియఁగఁ జెప్పవే యతని తెఱఁ గెల్లన్'. 347

ప్రతిపదార్థం: ప్రియ= ఇష్టుడవైన; భక్తుండవు= భక్తుడవు; విష్ణుండు; భక్తప్రియుఁడును= పూజించే వారియందు ప్రేమ కలవాడు; ఆ విభుకడన్= ఆ స్వామి దగ్గర; నీవు; ప్రియుఁడు+ఐ= ఇష్టుడవై; భక్తుండు+అయి= సేవించేవాడవై; వర్తింతు(వు)= ఉంటావు; అతని తెఱఁగు= ఆయన విషయం; ఎల్లన్= అంతా; దయన్= దయతో; తెలియఁగన్= స్పష్టపడేటట్లుగా; చెప్పవే!= విన్పించవా!

తాత్పర్యం: 'సుపర్ణా! నీవు విష్ణువునకు ఇష్టుడవైన భక్తుడవు. ఆ స్వామి భక్తులపై వాత్సల్యం కలవాడు. నీవా స్వామి వద్ద ప్రియభక్తుడవై ఉంటావు కనుక ఆయన విషయమంతా దయతో మాకు చెప్పుము'.

వ. అని యడిగిన నతండు వారల కిట్లనియె. 348

ప్రతిపదార్థం: అని; అడిగినన్= ప్రశ్నించగా; అతండు= గరుత్మంతుడు; వారలకున్= వారికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని అడుగగా వారితో సుపర్ణు డిట్లా అన్నాడు.

క. స్థూలప్రకారమున నీ । త్రైలోక్యము గావఁబూని, దయ చిగురొత్తన్
లీలఁ బ్రవర్తింపఁగ మన । మాలోకింతు మది గనుట యనవచ్చునొకో! 349

ప్రతిపదార్థం: దయ= కృప; చిగురొత్తన్= చిగుర్చగా; ఈ త్రైలోక్యము= ఈ ముల్లోకాలను; కావన్+పూని= రక్షించాలని; లీలన్= క్రీడగా; ప్రవర్తింపఁగన్=(భగవంతుడు) ప్రవర్తిస్తున్నాడు; మనము; ఆలోకింతుము= చూస్తున్నాం; స్థూలప్రకారమునన్= స్పష్టంగా కన్పించేటట్లుగా (కొండ గుర్తుగా); అది; కనుటఅనవచ్చున్+ఒకో?= చూచామని చెప్పవచ్చునా?

తాత్పర్యం: ఒక విషయాన్ని స్థూలంగా చూచి అది నాకు తెలుసు అని చెప్పలేం కనుక. భగవంతుడు (ఈ సృష్టి చేయటం మనకు తెలియదు కానీ) రక్షిస్తున్నాడు కదా! ఇదే స్థూలంగా మనకు తెలిసింది. ఇంతమాత్రాన ఆయన విషయం సొంతం నాకు తెలుసు నని ఎట్లా చెప్పేది?

ఉ. ఏనును, మీరు, నేల మఱి యెవ్వరు? దక్షులు, విష్ణుచందమున్
బూని యెఱుంగ, నవ్విభుఁడు భూరి దయారతి నాకు నేర్పడం
దాను మహాద్భుతంపుఁ జరితంబులు సూపుచు భాషణామృతం
బానఁగఁ జేసె నా చెవుల; నవ్విధముం దెలియంగఁ జెప్పెదన్. 350

ప్రతిపదార్థం: ఏనును= నేనూ; మీరున్= మీరూ; ఏల= ఏమిటి?; మఱి= ఇంకా; ఎవ్వరు; విష్ణుచందమున్= విష్ణువు ఉనికి; పూని= పూనుకొని; ఎఱుంగన్= తెలిసికొనటానికి; దక్షులు?= సమర్థులు? ఆ+విభుఁడు= ఆ స్వామి; భూరి= గొప్ప; దయారతిన్= కృపాసక్తితో (నిండు దయతో); నాకున్; ఏర్పడన్= స్పష్టపడేటట్లు; తాను; మహా+అద్భుతంపు= గొప్ప విచిత్రమైన; చరితంబులు= కథలు; చూపుచున్= ప్రదర్శిస్తూ; భాషణామృతంబు= అమృతంవంటి మాటలను; నా చెవులన్= నా చెవులతో; ఆనఁగన్+చేసెన్= త్రాగించాడు; ఆ+విధమున్= దానిని; తెలియంగన్= స్పష్టంగా; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: ఆ స్వామి విషయం నాకూ మీకూ కాదు కదా మరి ఎవరికీ తెలియదు. కాకపోతే తన కథలు తాను నాకు చూపించి వాటి అర్థాలను నా చెవులలో అమృతంవలె పోశాడు (నింపాడు) కనుక ఆ విషయం మాత్రం చెప్పగలను.

సీ. అమరేంద్రు నిర్జించి యమృతంబు గొనిపోవు । నప్పుడు వీతెంచె నాకసమున
'మెచ్చితి విహగేంద్ర! యిచ్చెద వరము నీ' । కనుమాట యది విని, హర్షమెసఁగ
'నెవ్వరో! యెఱుఁగ ని న్నెఱిఁగించి మఱి వర । మి' మ్మంటి, దానికి నెలమి నగుచుఁ
'గాలంబుతోఁ గూడఁగా నెఱింగెదవు, వా । హనమవు గమ్ము నా' కనుచుఁ బురుషుఁ

తే. డొక్కఁ, డుజ్జ్వల తేజోమయుండు తోఁచి । 'జరయు మరణంబు లేక యసురుల సురల
నోర్వఁ జాలిన బలముతో నుల్లసిల్లు' । మనివరం బిచ్చె; నిచ్చిన నధికభక్తి. 351

ప్రతిపదార్థం: అమర+ఇంద్రున్= దేవతలరాజును; నిర్జించి= జయించి; అమృతంబున్= సుధను; కొనిపోవునప్పుడు= తీసికొని పోయేవేళ; ఆకసమునన్= ఆకాశంలో; విహగ+ఇంద్ర!= పక్షిరాజా! మెచ్చితిన్= మెచ్చుకొన్నాను; నీకున్; వరము;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇచ్చెదన్= ఇస్తాను; అనుమాట= అన్నమాట; వీతెంచెన్= విన్పించింది; అది విని; హర్షము= సంతోషం; ఎసఁగన్= ఎక్కువ కాగా; నిన్నున్; ఎవ్వరో ఎఱుఁగన్= ఎవరో తెలియదు; ఎఱిఁగించి= తెలిపి; మఱి= తర్వాత; వరమున్= వరాన్ని; ఇమ్ము+అంటిన్= అన్నాను; దానికిన్= నా మాటకు; ఎలమిన్= సంతోషంతో; నగుచున్= నవ్వుతూ; కాలంబుతోన్+కూడఁగాన్= కాలంతోపాటుగా; ఎఱింగెదవు= తెలిసి కొంటావు; నాకున్; వాహనమవు కమ్ము= వాహనానివికా; అనుచున్= అంటూ; ఒక్క పురుషుఁడు= ఒక దేవతామూర్తి; ఉజ్జ్వలతేజో మయుండు= ప్రకాశించే తేజస్స్వరూపుడు; తోఁచి= కన్పించి; జరయున్= ముసలితనం; మరణంబున్= మృతీ; లేక= లేకుండా; అసురులన్= రాక్షసులను; సురలన్= దేవతలను; ఓర్వన్+చాలిన= ఎదిరించి నిలువగల; బలముతోన్= బలంతో; ఉల్లసిల్లుము= కీర్తి పొందుము, వెలుగొందుము; అని; వరంబు; ఇచ్చెన్; ఇచ్చినన్= ఇవ్వగా; అధికభక్తిన్= ఎక్కువభక్తితో. (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: నేను దేవేంద్రుడిని జయించి అమృతం తెస్తున్నపుడు ఆకాశంలో 'పక్షిరాజా! నిన్ను మెచ్చానోయి. నీకు వరమిస్తాను' అన్నమాట విన్పించింది. విని సంతోషంతో నే నన్నాను 'నీ వెవ్వరవో తెలిపి తర్వాత వర మిమ్ము' అన్నాను. దాని కాయన నవ్వి 'కాలం తోడ్పాటుతో నీకు నా సంగతి తర్వాత తెలుస్తుంది. నాకు వాహనానివి కమ్ము. సురాసురులను జయించే బలం నీ కిస్తున్నాను' అంటూ ఒక మహావ్యక్తి కళ్ళు మిరుమిట్లు గొలిపే తేజస్సుతో కన్పించి వర మిచ్చాడు. ఇవ్వగా నేను మిక్కిలి భక్తితో.

వ. ఏను దండప్రణామం బాచరించి. 352

ప్రతిపదార్థం: ఏను= నేను; దండ= కట్టెవలె పడి; ప్రణామంబు= సాష్టాంగనమస్కారం; ఆచరించి= చేసి.

తాత్పర్యం: నేను దండప్రణామం చేసి.

క. 'నీ వాహన మయ్యెద, రథ । మీ వెక్కినఁ గేతువై వహింతుఁ బెనుపు, నా
కీ వరము నిచ్చి మనుపుము' । నావుడు 'నవుఁ గాక!' యని మనఃప్రియ మెసఁగన్. 353

ప్రతిపదార్థం: నీ వాహనము+అయ్యెదన్= నీకు వాహన మౌతాను; ఈవు; రథము+ఎక్కినన్= రథమెక్కితే; కేతువై= జెండామీద గుర్తునై; పెనుపున్= పెంపును; వహింతున్= పొందుతాను; నాకున్; ఈ వరమున్; ఇచ్చి; మనుపుము= కాపాడుము; నావుడున్= అనగా; అవున్+కాక= సరే; అని; మనఃప్రియము= మనస్సంతోషం; ఎసఁగన్= ఎక్కువ కాగా.

తాత్పర్యం: నేను నీకు వాహనమౌతాను. నీవు రథమెక్కినప్పుడు జెండామీద గుర్తునై కీర్తి పొందాలని ఉన్నది. నా కీ వర మిచ్చి రక్షించుము. అని అనగా సరే లెమ్మని, నా మనస్సునకు సంతోషం కలిగేటట్లుగా. (తరువాతి వచనంతో అన్వయం)

ఉ. పలికి యంతర్హితుం డయ్యె; నంత సంతసంబు నచ్చెరువు బెరయు మనంబుతో మదీయ జనకుపాలికిం జని, యీ వృత్తాంతం బెఱింగించిన, నతండు వికసిల్లుచు నా వదనంబు వీక్షించి 'ధన్యుండ వైతి; వమ్మహాత్ముండు నారాయణుండు; నీ వలని యనుగ్రహంబున సల్లాపసౌఖ్యంబుఁ బ్రసాదించెఁ; దపంబున నేక యోగసమాధి నవలంబించి యేను దన్నెఱుంగుటం గోరి యారాధించిన నాకు నీల, శ్వేత, పీతారుణ పింగళంబును బహుాదర పాదపాణి శిరో నేత్రంబును నైన దివ్యగాత్రంబు సూపి, 'సంగంబు గల యంతరంగంబున న న్నెఱుంగ వచ్చునే;

నిస్సంగుండవై యెఱింగెదవు గాక!' యనియె; నట్టి యవ్విశ్వరూపునకు శాశ్వతపరిచర్య సేయంగల వాఁడ వగుటం గృతార్థతం బొందితి; బదరికాశ్రమంబున కరిగి యచ్చట సకల లోకసేవ్యుం డగు నా భవ్యమూర్తి సేవింపు' మని యానతిచ్చిన, నయ్యెడకు ముదంబునం బొదలుచుం బోయి. 354

ప్రతిపదార్థం: పలికి; అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడై పోయాడు; అంతన్= తర్వాత; సంతసంబున్= సంతోషం; అచ్చెరువున్= ఆశ్చర్యం; బెరయు= పెనగొను; మనంబుతోన్= మనస్సుతో; మదీయ= నా; జనకు పాలికిన్= తండ్రి దగ్గరకు; చని= పోయి; ఆ వృత్తాంతంబు= ఆ విషయం; ఎఱింగించినన్= చెప్పగా; అతండు= నాతండ్రి; వికసిల్లుచున్= సంతోషిస్తూ; నా వదనంబు= నా ముఖం; వీక్షించి= చూచి, ధన్యుండవు= అదృష్టవంతుడవు; ఐతివి; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; నారాయణుండు= విష్ణువు; నీవలని= నీమీద, అనుగ్రహంబునన్= దయతో; సల్లాప= సంభాషణ; సౌఖ్యంబున్= సుఖం; ప్రసాదించెన్= అనుగ్రహించాడు; తపంబునను= తపస్సుతో; ఏకయోగసమాధిని= మిక్కిలి ఏకాగ్రత కల యోగసమాధిని; అవలంబించి= ఆధారంగా చేసికొని; ఏను= నేను; తన్నున్= తనను; ఎఱుంగుటన్+కోరి= తెలిసికొనాలన్న కోరికతో; ఆరాధించినన్= ఉపాసించగా; నాకున్, నీల= ఊదారంగు; శ్వేత= తెలుపు; పీత= పసుపు; అరుణ= ఎరుపు; పింగళంబును= వైడూర్యంరంగు కల; బహు= అనేక; ఉదర=పొట్టలు; పాద= కాళ్ళు; పాణి= చేతులు; శిరోనేత్రంబును+ఐన= శిరస్సులు కళ్ళు కల; దివ్యగాత్రంబు= దివ్యమైన శరీరాన్ని; చూపి= చూపించి; సంగంబు= రక్తి; కల; అంతరంగంబునన్= అంతఃకరణంతో; నన్నున్; ఎఱుంగవచ్చునే?= చూడగలవా?; నిస్సంగుండవు+ఐ= విరక్తి కలవాడవై; ఎఱింగెదవు గాక= తెలిసికొనగలవు; అనియెన్= అని అన్నాడు; అట్టి= అట్లాంటి; ఆ విశ్వరూపునకున్= లోకమే శరీరంగా కలవాడికి; శాశ్వత= నిత్యం; పరిచర్య= సేవ; చేయన్+కలవాఁడవు+అగుటన్= చేయగలిగే స్థితి పొందావు కనుక; కృత+అర్థతన్= ధన్యతను; పొందితి(వి)= పొందావు; బదరికా+ఆశ్రమంబునకున్= ఆ పేరుగల ఆశ్రమం (బదరి= రేగుచెట్లు! కల వనంలో ఉన్నందున ఆ పేరు వచ్చింది); అరిగి= పోయి; అచ్చటన్= అక్కడ; సకల లోక= లోకాలన్నిటికిని; సేవ్యుండు= పూజించదగినవాడు; అగు= ఐన; ఆ భవ్య= ఆ దివ్య; మూర్తిన్= రూపుడిని; సేవింపుము= పూజించుము; అని; ఆనతి= ఆజ్ఞ; ఇచ్చినన్= ఇవ్వగా; ఆ+ఎడకున్= ఆ చోటికి; ముదంబునన్= సంతోషంతో; పొదలుచున్= పొంగుతూ; పోయి= వెళ్ళి.

తాత్పర్యం: అట్లా చెప్పి అదృశ్యుడు కాగా, నేను సంతోషం, ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరై పోయి వెళ్ళి, మా తండ్రిగారితో ఆ వృత్తాంతం చెప్పగా ఆయన నా ముఖం చూస్తూ, ఉల్లాసంతో 'నీవు అదృష్టవంతుడవయ్యా! ఆయన శ్రీమన్నారాయణుడు. నీమీద అనుగ్రహంతో నీ కా సంభాషణ ప్రసాదించాడు. సంతోషం. నేను ఏకభుక్తుడనై తపస్సు చేస్తే నీ కాయన నీలం, తెలుపు, ఎరుపు, వైడూర్యం (పిల్లి కళ్లకాంతి) రంగులు గల తన దివ్యమూర్తిని చూపించి అన్నాడు - 'నన్ను విరక్త బుద్ధితో చూడగలవు తప్ప లోకరక్తి గల మనస్సుతో చూడలేవు' అని. అట్లాంటి దివ్యమూర్తికి నిత్యం సేవ చేసే భాగ్యం నీకు కలిగింది. బదరికావనానికి పోయి ఆ స్వామిని సేవించుకొ' మ్మని ఆజ్ఞాపిస్తే, నేను సంతోషంతో వెళ్ళి.

సీ. అచట నారాయణు, నచ్యుతుహరిఁ బుండ । రీకాక్షుఁ, గోవిందు, లోకజనకుఁ
గని, భక్తిఁ బ్రణమిల్లి వినుతిసేయంగఁ, బీ । తాంబర కలితమై యష్టభుజము
శంఖ చక్రగదా సిశార్ఙ్గ ధరంబును । నైనరూపము దాల్చి యవ్విభుండు
సిఱునవ్వుతోడ 'వచ్చితి మేలు సేసితి । ర' మ్మంచుఁ దా నుత్తరంపుఁ దూర్పు

తే. దెసకు నల్లన పోవఁ బెంపెసఁగఁ గడఁగి। పాఱ వలయు; నా కెమ్మెయి బహుసహస్ర
యోజనంబులునని వితతోజ్జ్వలాగ్ని। యద్భుతముగ ననింధన మై వెలుంగ. 355

ప్రతిపదార్థం: అచటన్= బదరికాశ్రమంలో; నారాయణున్, అచ్యుతున్, హరిన్; పుండరీక+అక్షున్= పద్మంవంటి నేత్రాలు గలవాడిని; గోవిందున్; లోకజనకున్= లోకాలకు తండ్రిని; కని= చూచి; భక్తిన్= భక్తితో; ప్రణమిల్లి= నమస్కరించి; వినుతిచేయంగన్= స్తుతించగా; పీత+అంబర= పచ్చని పట్టువస్త్రంతో; కలితము+ఐ= కూడినదై; అష్టభుజము= ఎనిమిది భుజాలు కలిగి; శంఖ= శంఖం; చక్ర= చక్రం, గదా= గద; అసి= కత్తి; శార్ఙ్గము= విల్లు; ధరంబును+ఐన= ధరించినదైన; రూపము= ఆకారం; తాల్చి= ధరించి; ఆ+విభుండు= ఆ ప్రభువు; చిఱు= చిన్న; నవ్వుతోడన్= నవ్వుతో; వచ్చితి(వి)= వచ్చావు; మేలు= మంచి; చేసితి(వి)= చేసావు; రమ్ము+అంచున్= రమ్మంటూ; తాను; ఉత్తరంపుఁ దూర్పు దెసకున్= ఈశాన్య దిక్కునకు; అల్లన= నెమ్మదిగా; పోవన్= పోగా; పెంపు= ఆధిక్యం; ఎసఁగన్= ఎక్కువ కాగా; కడఁగి= ప్రయత్నంతో; నాకున్= నాతో; పాఱవలయున్= పరుగెత్తాలి; బహు= అనేక; సహస్ర= వేల; యోజనంబులు= ఆమడలు; అని; వితత= విస్తారమైన; ఉజ్జ్వల= వెలిగే; అగ్ని= నిప్పు; అద్భుతముగన్= ఆశ్చర్యంగా; అనింధనము+ఐ= ఇంధనం (కట్టె) లేకుండా; వెలుంగన్= ఆ అగ్ని వెలుగగా. (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: అక్కడ అచ్యుతుడు, పద్మాక్షుడు, గోవిందుడు సర్వలోకాలకు తండ్రి అయిన శ్రీమన్నారాయణుడికి భక్తితో నమస్కరించి స్తుతించగా ఆయన పీతాంబరం, ఎనిమిది భుజాలలో, శంఖ చక్ర గదా ఖడ్గ శార్ఙ్గములను దాల్చిన రూపముతో, చిరునవ్వుతో ఇట్లా అన్నాడు. 'మంచిది వచ్చావు. నాతో రమ్ము! అంటూ ఈశాన్య దిక్కునకు పోయాడు. నేనూ ఆయన వెంటనంటి అనేక వేలయోజనాలదూరం పరుగెత్తవలసి ఉంటుందని భావించాను. ఎదురుగా ఒక మహాద్భుతమైన అగ్ని కట్టెలు లేకుండా మండుతున్నది.

వ. కని, యప్పావకుం బావకద్యుతి యగు నమ్మహాయోగి ప్రవేశించి, యందు శివాసహితుం డై శివుండు దపంబుసేయఁ దదీయ సంవిత్సౌఖ్యం బనుభవించి, యయ్యనలంబు గడచి యరుగుచుండ, నేనును బథిశ్రమాభిభూతుండ నగుచు విడువక వెనుకఁ బోవు చుండితి; నిట్లు మఱియునుం బెద్దయు దవ్వు సని యద్దేవుండు భాస్కరకిరణంబులకుం బ్రవేశంబు లేని మహాతమంబు సొచ్చె; నచ్చటం జూడ్కిసెడి మూఢత్వంబు నొంది. 356

ప్రతిపదార్థం: కని= చూచి; ఆ+పావకున్= ఆ అగ్నిదేవుడిని; పావక ద్యుతి+అను= అగ్నివంటి కాంతికలిగిన; ఆ+మహాయోగి= ఆ మహాయోగమూర్తి (విష్ణువు); ప్రవేశించి= అగ్నిలోచొచ్చి; అందున్= ఆ అగ్నిలో; శివా= పార్వతితో; సహితుండు+ఐ= కూడినవాడై; శివుండు= ఈశ్వరుడు; తపంబుచేయన్= తపస్సు చేస్తూ ఉండగా; తదీయ= దానికి సంబంధించిన; సంవిత్= జ్ఞానం; సౌఖ్యంబు= సంతోషం (శివుని తపస్సు చూస్తూ జ్ఞానానందాన్ని పొంది); ఆ+అనలంబున్= ఆ అగ్నిని; కడచి=దాటి; అరుగుచుండన్= పోతూ ఉండగా; నేనునున్= నేనుకూడా; పథిశ్రమ= మార్గశ్రమతో; అభిభూతుండను= అలసట పొందినవాడను; అగుచున్; విడువక= వదలక; వెనుకన్= వెన్నంటి; పోవుచుండితిన్= పోతూనే ఉన్నాను; ఇట్లు= ఈ విధంగా; మఱియునున్= ఇంకా; పెద్దయున్దవ్వు= చాలా దూరం; చని= పోయి; ఆ+దేవుండు= ఆ భగవంతుడగు విష్ణువు; భాస్కర= సూర్యుడి; కిరణంబులకున్= కిరణాలకున్నూ; ప్రవేశంబు లేని= దూరటానికి వీలుకాని; మహాతమంబు= గొప్ప చీకటిలోనికి; చొచ్చెన్= ప్రవేశించాడు; అచ్చటన్= అక్కడ; చూడ్కి= చూపు; చెడి= చెడిపోయి; మూఢత్వంబును+ఒంది= దారి తెన్నూ తెలియనివాడనై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అగ్నివంటి ఆ మహాయోగి అగ్నిలో ప్రవేశించాడు. అక్కడ పార్వతీ సహితుడై శివుడు తపస్సు చేస్తున్నాడు. అది చూచి జ్ఞానసౌఖ్యం పొంది, ఆ అగ్నిని దాటి పోతున్నాడు స్వామి. నేను మార్గాయాసం లెక్క చేయక వెనకనే పోతున్నాను. ఈ విధంగా పోయి పోయి సూర్యకిరణాలు కూడా ప్రవేశించ వీలులేని అంధకారంలోనికి ప్రవేశించేసరికి, నాకు దిక్కు తెన్ను తెలియక. (తరువాతి పద్యంతో అన్వయం)

క. ఆ దేవుఁ జిత్తమున నిడి । 'యాదిపురుష! కరుణ నన్ను నరయు; మెచటికో
యేది గతియొ నా?' కనఁగా । 'నీ దెస ర' మ్మనుచుఁ దీపుటెలుఁగుం జూపెన్. 357

ప్రతిపదార్థం: ఆ దేవున్= ఆ స్వామిని; చిత్తమునన్= బుద్ధిలో; ఇడి= పెట్టుకొని; ఆదిపురుష!= సృష్టికి మొదలైనస్వామీ!; కరుణన్= దయతో; నన్నున్; అరయుము= చూడుము; ఎచటికో= ఈ ప్రయాణ మెక్కడకు; ఏది గతియో= ఏది దిక్కో; నాకున్?; అనఁగాన్= అనేసరికి; ఈ దెస= ఈ దిక్కునకు; రమ్ము; అనుచున్; తీపు+ఎలుఁగు= ఒక తీయని కంఠస్వరాన్ని; చూపెన్= ప్రదర్శించాడు.

తాత్పర్యం: ఆ దేవుడినే మనస్సులో పెట్టుకొని 'ఆదిపురుషా! (పరమాత్మా!) ఈ ప్రయాణం ఎక్కడికో తెలియదు. నా కేది గతి?' అనేసరికి ' ఈ దెసకు రమ్ము!' అన్న ఒక తీయని కంఠధ్వని వినిపించింది.

క. మది ఖేదము, మై దప్పియుఁ । గదిరిన నే శరణు వేఁడఁగా దమ మెల్లం
దుది వోయి లేక తక్కెను । హృదయానందకర మైన యెడయై యుండెన్. 358

ప్రతిపదార్థం: మదిన్= మనస్సులో; ఖేదము= దైన్యం; మైన్= శరీరంలో; దప్పియున్= దప్పిక, ఆయాసం; కదిరినన్= కలుగగా; నేన్= నేను; శరణు వేఁడఁగాన్= ఆశ్రయం కోరగా; తమము+ఎల్లన్= చీకటిఅంతా; తుదిన్= చివరకు; పోయి= అంతరించి, నశించి; లేక= కొంచెమూ మిగలక; తక్కెను= లోపించింది; హృదయ+ఆనందకరము=హృదయానికి ఆనందాన్ని కల్గించిన; ఎడయై= సమయమై; ఉండెన్= ఉన్నది.

తాత్పర్యం: మనస్సులో దుఃఖం, శరీరంలో శ్రమ కలిగేసరికి నేను శరణు కోరాను. ఆ చీకట్లన్నీ కొంచెం కూడా మిగలకుండా అంతరించాయి. ఆ సమయ మెంత ఆనందాన్ని కల్గించిందో చెప్పలేను.

తే. పట్టపగలింటి సూర్యుని పగిది నతఁడు । దోఁచెఁ సూర్యేందు తారక ద్యుతుల కచటు
గోచరము గాదు; దేవతాకోటి యాది । యైన జంతువులకు నగమ్యస్థలంబు. 359

ప్రతిపదార్థం: అతఁడు= ఆ భగవంతుడు; పట్టపగలింటి= పట్టపగటియందలి; సూర్యుని పగిదిన్= సూర్యుడివలె; తోఁచెన్= వెలుగుతున్నాడు; తారక= నక్షత్ర; ద్యుతులకున్= కాంతులకు; అచటు= ఆ స్థలం; గోచరము కాదు= కన్పించదు; దేవతాకోటి= దేవతల సమూహం; ఆది= మొదలు, ఐన= కాగల; జంతువులకున్= జీవులకు; అగమ్య స్థలంబు= పోరానిచోటు.

తాత్పర్యం: ఆయన మిట్టమధ్యాహ్నం సూర్యుడివలె వెలుగుతున్నాడు. చుక్కల కాంతుల కా చోటు కన్పించదు. దేవతలు మొదలైన జీవులకు పోరానిచోటు.

క. దుందుభి నిస్వనములు, నా । నందనమృదుమధుర గీతనాదములుఁ జెవిం
బొందె మకరందబిందు । స్యంది కమల సుభగ నదులు నచ్చటఁ దోఁచెన్. 360

ప్రతిపదార్థం: దుందుభి= భేరుల; నిస్వనములు= ధ్వనులు; ఆనందన= ఆనందంతో; మృదు= మెత్తని; మధుర= తీయని; గీత= పాటల; నాదములు= ధ్వనులు; చెవిన్= చెవులను; పొందెన్= పొందాయి; మకరంద= తేనె; బిందు= బొట్లు; స్యంది= స్రవించే; కమల= తామరపూలతో, సుభగ= అందమైన; నదులును= ఏరులుకూడా; అచ్చటన్= అక్కడ; తోఁచెన్= కన్పించాయి.

తాత్పర్యం: భేరీ నినాదాలు ఆనందంతో నిండిన మెత్తని తీయనిపాటల సంగీతాలూ వినిపించాయి. తేనెను స్రవించే తామరపూలతో అందమైన నదులూ అక్కడ వెలిశాయి.

క. సురలకు నిమ్మెయిఁ దేజ । స్స్ఫురణము లేదన్న యట్టిపొలుపున వెలుఁగన్
నరులం గొందఱఁ గాంచితి । దరుణులనుం గంటి నద్భుతతమాకృతులన్. 361

ప్రతిపదార్థం: సురలకున్= దేవతలకు కూడా; ఈ+మెయిన్= ఈ విధంగా; తేజఃస్ఫురణము= కాంతి ప్రకాశం; లేదన్న అట్టి= లేదు అనిపించే; పొలుపునన్= అందంతో; వెలుఁగన్= ప్రకాశించే; నరులన్= మనుష్యులను; కొందఱన్= కొంతమందిని; కాంచితిన్= చూచాను; అద్భుతతము= మిక్కిలి విచిత్రమైన; ఆకృతులన్= ఆకారాలు కల; తరుణులనున్= ఆడవారిని కూడా; కంటిన్= చూచాను.

తాత్పర్యం: దేవతలకు కూడా ఇట్లాంటి తేజస్సు లేదనిపించే మగవారినీ, ఆశ్చర్యకరమైన రూపవతులు కొందరు స్త్రీలనూ చూచాను.

తే. వారు పూజ లొనర్పంగ గారవంపుఁ । జూడ్కి నద్దేవుఁ డందఱఁ జూచు చరిగె;
మఱియు నట తత్ప్రదేశంబు మహితవహ్ని । మయతఁ జేసి భయంకర మయి వెలింగె. 362

ప్రతిపదార్థం: వారు= ఆ స్త్రీ పురుషులు; పూజలు+ఒనర్పంగన్= పూజలు చేయగా, ఆ+దేవుఁడు= ఆ భగవంతుడు; గారవంపు= ముద్దుచేసే; చూడ్కిన్= చూపుతో; అందఱన్= అందరినీ; చూచుచున్= చూస్తూ; అరిగెన్= వెళ్ళాడు; మఱియున్= ఇంకా; అటన్= అక్కడ; తత్ప్రదేశంబు= ఆ చోటు; మహిత= దివ్యమైన; వహ్నిమయతన్+చేసి= అగ్నిమయమైన కారణంగా; భయంకరము+అయి= భయము కొల్పుతూ; వెలింగెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: వారంతా పూజిస్తూ ఉండగా, ఆ స్వామి వారిని వాత్సల్యంతో చూస్తూ వెళ్ళాడు. ఆ ప్రదేశమంతా అగ్నిమయంగా ఉన్నందున భయంకరంగా వెలిగిపోయింది.

వ. అచ్చట నే నతనిం గానక. 363

ప్రతిపదార్థం: అచ్చటన్= పైన వర్ణించిన తేజోమయలోకంలో; నేను; అతనిన్= భగవంతుని; కానక= చూడలేక.

తాత్పర్యం: అక్కడ నేను అతడిని చూడలేక.

క. భ్రమ గొని యద్దేవునిఁ జి । త్తమునం దిడి 'శరణు శరణు, దయఁ గావుము' న
న్న మితైశ్వర్య ! యనుడు శ్రీ । తమధుర లలితాక్షరముగఁ దా నిట్లనియెన్. 364

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భ్రమకొని= భ్రాంతిపడి; ఆ+దేవునిన్= ఆ స్వామిని; చిత్తమునందున్= మనస్సులో; ఇడి= పెట్టుకొని; అమిత= అమితమైన; ఐశ్వర్య!= సంపద కలవాడా!; (ఈశ్వర!= ఈశ్వరత్వం కలవాడు) ఈశ్వరత్వమంటే సర్వాధికారం - సంపద - శాసించే శక్తి అని అర్థం); శరణు= దిక్కు నీవే; దయన్= దయతో; నన్నున్; కావుము= రక్షించుము; అనుడున్=అనగా; శీత= చల్లని; మధుర= తీయని; లలిత= కోమలమైన; అక్షరముగన్= అక్షరాలు కల మాటలతో; తాను= భగవంతుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: నాకు భ్రాంతి కలిగి దిక్కు తోచక ఆ స్వామిని మనస్సులో నుంచుకొని శరణని ప్రార్థించేసరికి ఆయన చల్లగా మధురంగా కోమలంగా ఇట్లా అన్నాడు.

క. 'నిను నే మఱతునె? నీదగు। జనకునిచే నన్ను విని సుసంగతమతివై
చనుదెంచు టే నెఱుంగనె? వినతాసుత! యిందు రమ్ము, విడువుము భయమున్. 365

ప్రతిపదార్థం: వినతాసుత!= వినతా కుమారా!; నినున్= నిన్ను; నేన్= నేను; మఱతునె?= మరిచిపోతానా?; నీదగు= నీ యొక్క; జనకునిచేన్= తండ్రివలన; నన్నున్ విని= నన్ను గురించి విని; సుసంగతమతివి+ఐ= నాయందు చక్కగా లగ్నమైన మనస్సుగలవాడవై; చనుదెంచుట= రావటం; ఏన్= నేను; ఎఱుంగనె?= ఎరుగనా? ఇందున్ రమ్ము= ఇట్లా రమ్ము; భయమున్ విడువుము= భయాన్ని విడిచిపెట్టుము.

తాత్పర్యం: 'వినతాకుమారా! నిన్ను నేను మరచిపోతానా? నీ తండ్రివలన నన్ను గురించి విని నా దర్శనం కొరకు వచ్చావుకదా! భయం దేనికి? ఇట్లా రమ్ము.

వ. నన్నుం గానమికిం గలంక వలవదు. 366

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను; కానమికిన్= చూడకపోవటం వలన; కలంక= దుఃఖం; వలవదు= వద్దు.

తాత్పర్యం: నన్ను చూడలేనందుకు కలత పడవద్దు.

క. మమకారాహంకారము। ల మతిం జొరనీక, నిశ్చలంబగు చూడ్కిన్
సమవేతరూపు నన్నున్। శమభరితాత్మకులు గంద్రు సారవిచారా! 367

ప్రతిపదార్థం: సార విచారా!= సారవంతమైన ఆత్మ వివేకం కలవాడా!; మమకార= నా దనే వ్యామోహం; అహంకారములన్= నేను అనే గర్వం; మతిన్= మనస్సులో; చొరనీక= ప్రవేశించనివ్వక; నిశ్చలంబు+అగు= చలించని, ఏకాగ్రమైన; చూడ్కిన్= చూపుతో; సమవేతరూపున్= విశ్వరూపుడనైన; నన్నున్= నన్ను; శమ= శాంతి; భరిత= నిండిన; ఆత్మకులున్= ఆత్మకలవారు; కంద్రు= చూస్తారు.

తాత్పర్యం: ఆత్మ విచారణ కలవాడా! మమకారం, అహంకారం మనస్సులో ఏమాత్రం ప్రవేశించనివ్వకుండా, ఏకాగ్రమైన చూపుతో విశ్వస్వరూపుడను, సర్వాత్ముడను ఐన నన్ను శాంతి నిండిన ఆత్మకలవారు చూస్తారు.

తే. నీవు నామీఁది వేడుక నెఱయ నిష్ఠ। తోడఁ దలఁచుట మామక స్థూలరూప
దర్శి వై యుండు; దని నన్ను దయదలిర్ప। గారవించిన ననలంబు క్రందు వాసె. 368

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నీవు; నామీఁది= నాపైన; వేడుక= కోరిక; నెఱయన్= నిండుగా; నిష్ఠతోడన్= నియమంతో; తలఁచుట= భావించటం; మామక= నాదైన; స్థూలరూప= బాహ్యరూపాన్ని; దర్శివి= చూచేవాడివి; ఐ ఉండుదు+అని= ఐ ఉంటావని; నన్నున్= నన్ను; దయ తలిర్పన్= దయ చిగురించగా; గారవించినన్= మన్నించగా; అనలంబు= అగ్ని సంబంధమైన; క్రందు= బాధ; పాసెన్= పోయింది.

తాత్పర్యం: నీవు నిష్ఠతో నన్ను భావించటంవలన నా స్థూలరూప దర్శనం కలవాడివై ఉండగల' వని దయతో చెప్పేసరికి అగ్ని వేడి బాధ ఉపశమించింది.

వ. ఇవ్విధంబున సుఖిం జేసి ననుం గొలిపించుకొని మఱియు దవ్వుసని యాకాశంబున కెగసిన నేనుం దోన తగిలిపోవ నంతర్ధానంబు సేసె; నిట రమ్మను నెలుంగ యాధారంబుగా నా చక్కటికిం బోయి. 369

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; సుఖిన్+చేసి= నన్ను సుఖపడేటట్లు చేసి; ననున్= నన్ను; కొలిపించుకొని= సేవించుకొనేటట్లు చేసి; మఱియున్= ఇంకా; దవ్వు= దూరం; చని= వెళ్ళి; ఆకాశంబునకున్= మింటిపైకి; ఎగసినన్= ఎగిరిపోగా; నేనున్= నేను కూడా; తోన= వెన్నంటి; తగిలి= అంటుకొని; పోవన్= పోగా; అంతర్ధానంబు చేసెన్= అదృశ్యుడై పోయాడు; ఇటన్= ఇక్కడకు; రమ్ము= రా; అను= అన్న; ఎలుంగు+అ= కంఠధ్వనియే; ఆధారంబుగాన్= ఆశ్రయంగా, ఊతగా; ఆ చక్కటికిన్+పోయి= ఆ ప్రదేశానికి వెళ్ళి.

తాత్పర్యం: ఈ రకంగా నన్ను సుఖపెట్టి నా సేవ లందుకొని ఇంకా దూరంపోయి ఆకాశాని కెగిరి అదృశ్యుడు కాగా, నేను కూడా వెంబడించి 'ఇలా రా' అన్న మాటనే ఆధారంగా గ్రహించి ఆ ప్రదేశానికి వెళ్ళాను.

క. కమనీయహంస కుల సం। గమశోభిత మైన యొక్క కమలాకరముం
బ్రమదమున దాన నవగా। హము సేయుచున్న తన్ను నచటం గంటిన్. 370

ప్రతిపదార్థం: కమనీయ= అందమైన; హంసకుల= అంచల గుంపుయొక్క; సంగమ= కలయికతో; శోభితము+ఐన= సుందరమైన; ఒక్క; కమల+ఆకరమున్= తామరపూలకు నిలయమైన చెరువును; ప్రమదమునన్= సంతోషంతో; దానన్= దానియందు; అవగాహము= స్నానం; చేయుచున్+ఉన్న= చేస్తున్న; తన్నున్= తనను; అచటన్= అక్కడ; కంటిన్= చూచాను.

తాత్పర్యం: అందమైన హంసల గుంపులు చేరటం చేత మరీ అందంగా ఉన్నట్టిదీ, తామరపూలతో అందమైనదీ అయిన చెరువునూ, తా నొక్కడే అందులో స్నానం చేస్తున్న భగవంతుడినీ చూచాను.

క. నా దిక్కు కనుంగొని, తా। నాదరమునఁ బిల్చె; నేను నచటికిఁ జని యం
దాదేవునిఁ గానమికి వి। షాదం బందుమదితోడఁ జంచల దృష్టిన్. 371

ప్రతిపదార్థం: నా దిక్కు= నా వైపు; కనుంగొని= చూచి; తాను; ఆదరమునన్= ఆదరంతో; పిల్చెన్= పిలిచాడు; నేనున్; అచటికిన్; చని; అందున్= అక్కడ; ఆ దేవునిన్= ఆ భగవంతుడిని; కానమికిన్= చూడలేక పోవటంవలన; విషాదంబు= దుః ఖం; అందు= పొందు; మదితోడన్= మనస్సుతో; చంచల= చలించే; దృష్టిన్= చూపుతో.

తాత్పర్యం: నా వైపు చూచి ప్రేమతో పిలిచినందువలన వెళ్ళగా, ఆయన కన్పించలేదు. నేను దుఃఖంతో వెతికే చూపులతో (తరువాతి పద్యంతో అన్వయం)

చ. కలయఁగఁ జూడ నద్భుతము గాఁగ ననేక శతాగ్నిహోత్రముల్
వెలుఁగుట గానవచ్చె, బహువేదరవంబులు వింటిఁ, దత్ప్రవ
క్తలఁ బొడగాన, నట్టియెడ దారుణరూప సుపర్ణ సంఘముల్
బలువిడి నాపయిం; గవిసె; భ్రాంతుఁడ నైతి భయంబు పెంపునన్. 372

ప్రతిపదార్థం: కలయఁగన్= అంతటా; చూడన్= చూడగా; అద్భుతము= చిత్రం; కాఁగన్= కాగా; అనేక= ఎన్నో; శత= వందల; అగ్నిహోత్రముల్= అగ్నిహోత్రాలు; వెలుఁగుట= ప్రకాశించటం; కానన్ వచ్చెన్= కన్పించాయి; బహు= అనేక; వేద రవంబులు= వేదధ్వనులు; వింటిన్= విన్నాను; తత్ ప్రవక్తలన్= ఆ వేద మంత్రాలు చదివిన వారిని; పొడగానన్= దర్శించలేదు; అట్టి+ఎడన్= అట్లాంటి సమయంలో; దారుణ= క్రూరమైన; సుపర్ణ= గరుత్మంతుల; సంఘముల్= సమూహాలు; బలు విడి= హఠాత్తుగా; నాపయిన్= నామీద; కవిసెన్= దూకాయి; భయంబు= భయముయొక్క; పెంపునన్= అతిశయంచేత; భ్రాంతుఁడన్+ఐతిన్= ఏమీ చేయలేని మూఢుడ నయ్యాను

తాత్పర్యం: అంతటా కలయజూస్తే అనేకవందల అగ్నిహోత్రాలు వెలిగాయి. ఎవరూ కనిపించకుండా అనేక వేదమంత్రాలు చదివిన ధ్వనులు వినిపించాయి. అట్లాంటి సమయంలో క్రూరమైన గరుత్మంతుల గుంపులెన్నో ఒకేసారి నా పయికి హఠాత్తుగా విజృంభించాయి. నేను భయభ్రాంతుడనయ్యాను.

ఆ. అట్లు భయముఁ బొంది, 'యచ్యుత! శివ! సహ! స్రాక్ష! వేదమయ!, యనాదినిధన!
త్రిభువనైకనాథ! త్రినయన! గోవింద! పద్మనాభ! హర! కృపావిధేయ! 373

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; భయమున్= భీతిని; పొంది= చెంది; అచ్యుత!= (పరమాత్మ స్థితినుండి) చ్యుతి (భ్రష్టత) లేనివాడా!; శివ!= మంగళరూపుడా!; సహస్ర+అక్ష!= వేయి కనులు కలవాడా!; వేదమయ!= వేదమూర్తీ!; అనాదినిధన!= (న+ఆది+నిధన)= చావు పుట్టుకలు లేనివాడా!; (ఆది= మొదలు; జన్మ!; నిధన= మరణం; న= లేనివాడా); త్రిభువన= ముల్లోకాలకు; ఏక= ఏకైక; నాథ!= పతీ!; త్రినయన= మూడు కన్నులు కలవాడా!; గోవింద!= గోవులను కాపాడేవాడా!; (గో అంటే శబ్దం, కిరణం - అని అనేక అర్థాలు. కనుక గోవిందుడంటే సూర్యుడనీ అర్థం); పద్మనాభ!= తామరపువ్వు బొడ్డులో ఉన్నవాడా! (అందులో నుండే బ్రహ్మ పుట్టి సృష్టి చేస్తున్నాడని పురాణగాథ; పద్మమంటే కంటికి కన్పించే ప్రకృతి= విశ్వం. అంతా. దానికి కేంద్ర బిందువుగా - చక్రానికి ఇరుసువలె ఉండేవాడని అర్థం); హర!= హరించేవాడా!= (ప్రళయం చేసేవాడా!); కృపా విధేయ!= దయకు లోబడినవాడా! (దయ కలవాడా!)

తాత్పర్యం: ఆ విధంగా భయపడి 'అచ్యుతా! శివా! సహస్రాక్షా! వేదమయా! అనాదినిధనా! త్రిభువనైకనాథా! త్రినయన! గోవింద! పద్మనాభ! హర! కృపావిధేయ!'

విశేషం: ఇది వైదిక స్తోత్రం. పురాణస్తోత్రం కాదు. స్తుతింపబడేది విష్ణువైనా, శివ, సహస్రాక్ష (ఇంద్రుడు) త్రినయన - అనే నామాలు వాడటం వలన ఇక్కడ శబ్దాల కున్న అర్థాలే ప్రధానం తప్ప పైన వ్రాసిన విధంగా, తర్వాత వచ్చిన మతాల ప్రకారం, పురాణాల ప్రకారం - శివుడు, పద్మనాభుడు వేరు దేవతలు కారు. ఎట్లాగంటే మూడవకన్ను యోగనేత్రం. అది సాధన చేస్తే ఎవరికైనా లభించే దివ్యదర్శన శక్తి. యోగి కూడా త్రినయనుడే. కనుక ఈ సమన్వయం కొరకు కవి ఇట్లా వ్రాశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అని మఱియుఁ, బెక్కు పేళ్ళన్, । వినుతించుచు, శరణు వేఁడి వినత శిరస్కుం
డును, ముకుళీకృత హస్తుం । డును నై యే నుండ దేవుఁడు ప్రసాదమునన్. 374

ప్రతిపదార్థం: అని= అట్లా స్తుతించి; మఱియున్= ఇంకా; పెక్కు= అనేకమైన; పేళ్ళన్= పేర్లతో; వినుతించుచున్= స్తుతిస్తూ; శరణువేఁడి= శరణుకమ్మని ప్రార్థించి; వినత= వంగిన; శిరస్కుండును= తల కలవాడును; ముకుళీకృత= ముడిచిన; హస్తుండును= చేతులు కలవాడును; ఐ= అవుతూ; ఏన్= నేను; ఉండన్= ఉండగా; దేవుఁడు= స్వామి; ప్రసాదమునన్= ప్రసన్నతతో.

తాత్పర్యం: ఇట్లా ఎన్నో నామాలతో స్తుతించి తలవాల్చి, దోసిలొగ్గిన నన్ను చూచి స్వామి దయతో. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అని మఱియుఁ బెక్కు పేళ్ళన్= సహస్రనామాలు. ఈ మాట తిక్కనగారి అనువాద పద్ధతిని తెలియచేస్తుంది. ఈ ఘట్టమంతా ఉత్తరదేశప్రతులలో లేదు. కుంభకోణ ప్రతిలోనే ఉన్నది. మూలంలో సహస్రనామాలు(శివ, విష్ణు) వాటిని తెలుగులో వ్రాయటానికి వీలులేదు కనుక తిక్కనగారు మక్కికి మక్కి అనువదించలేదు. కనుక మూలంలో ఎన్నో నామాలుంటే వాటిలో ప్రధానమైనవి తీసికొని వ్రాస్తున్నాను - అనటానికి సూచన 'పెక్కు పేళ్ళు'.

క. తనుఁ జూపి, 'యోడ కోడకు । వినతాసుత!' యనియె నపుడు వినుఁడే మొదలం
గనిన బదరికాశ్రమ మ । య్యె నచటు విష్ణుని ప్రభావ మేమనవచ్చున్! 375

ప్రతిపదార్థం: తనున్= తనను; చూపి= కన్పింపచేసి; వినతాసుత!= వినత కొడుకా!; ఓడకు+ఓడకు= భయపడకు భయపడకు; అనియెన్= అన్నాడు; అపుడు= ఆ సమయంలో; వినుఁడు= వినండి (ఒక తమాషా); ఏన్=నేను; మొదలన్= మొదట; కనిన= చూచిన; బదరికాశ్రమము= రేగుచెట్ల గుంపులలోని (పూరి గుడిసె) ఆశ్రమం; అయ్యెన్= ఐనది; అచటు= ఆ స్థలం; విష్ణుని ప్రభావము= విష్ణువు మహత్త్యం; ఏమనవచ్చున్!= ఎంతని పొగడగలము!

తాత్పర్యం: అప్పు డాయన కన్పించి 'భయపడవద్దయ్యా! వినతాసుత!' అన్నాడు. అప్పు డాస్థలం నేను మొదట చూచిన బదరికాశ్రమమే. ఎంత విచిత్రమో! ఆ భగవంతుడి లీల నెవ్వడు కొనియాడగలడు?

ఉ. అ ప్పరమేశ్వరుండు లలితాష్టభుజం బగు రూపుఁ దాల్చి, తా
నెప్పటియట్ల నిల్చెఁ; గని యేను మనంబున నద్భుతంబుతో
ముప్పిరి యైన కౌతుకము మోదము నెక్కొన, నాకు సత్కృపం
జెప్పెడుఁ, గాక యెట్లు నని చేరితి నంజలి మౌళిఁ జేర్చుచున్. 376

ప్రతిపదార్థం: అ+పరమేశ్వరుండు= ఆ మహాదేవుడు; లలిత= కోమలములైన; అష్టభుజంబు= ఎనిమిది చేతులు కల; రూపున్= ఆకారాన్ని; తాల్చి= ధరించి; తాన్= తాను; ఎప్పటిఅట్ల= ఎప్పటివలెనే; నిల్చెన్= నిలబడ్డాడు; కని= చూచి; ఏనున్= నేను కూడా; మనంబునన్= మనస్సులో; అద్భుతంబుతోన్= ఆశ్చర్యంతో; ముప్పిరి+ఐన= మూడు పేటలుగా పెనవేసికొన్న; కౌతుకము= కుతూహలం; మోదము= సంతోషం; నెక్కొనన్= ఎక్కువ కాగా; నాకున్; సత్కృపన్= చక్కని దయతో; చెప్పెడున్+కాక!= తప్పక చెప్పగలడు; ఎట్లున్= ఎట్లాగైనా సరే!; అని= అనుకొంటూ; అంజలిన్= దోసిలిని; మౌళిన్= తలపై; చేర్చుచున్= చేరుస్తూ; చేరితిన్= ఆయన దగ్గరకు చేరాను.

తాత్పర్యం: ఆ మహాస్వామి ఎనిమిది చేతులతో కనిపించాడు. నేను ఆశ్చర్యపోయాను. నాకు కుతూహలమూ, సంతోషమూ ముప్పిరిగొన్నాయి. దయతో తన స్వరూపం ఎట్లాగూ తెలియచేస్తా డీ స్వామి అనుకొంటూ తలపై చేతులు మోడ్చి ఆయన దగ్గరకు చేరాను.

వ. చేరి వినయావనతుండ నయి 'దేవా! యేను భవత్పాద భక్తుండనేని నీ దయకు భాజనంబనేని నాకు వినందగునేని దురధిగమసారంబైన భవదీయప్రకారం బిట్టిదని యెఱుంగు నట్లుగాఁ జెప్పవే' యనిన నా సర్వలోక శరణ్యుండు గారుణ్యామృత మయం బైన చూడ్కి నామీఁద నొలయ నిట్లనియె. 377

ప్రతిపదార్థం: చేరి= సమీపించి; వినయ+అవనతుండన్+అయి= వినయంతో తలనువంచినవాడనై; దేవా!= స్వామీ!; ఏను= నేను; భవత్= తమ; పాదభక్తుండను= పాదాలపై భక్తి కలవాడను; ఏనిన్= అయితే; నీదయకున్; భాజనంబను= పాత్రుడను; ఏనిన్= ఐతే; నాకున్, వినన్ తగునేని= వినటానికి అర్హతుంటే; దుర్+అధిగమ= కష్టంతో పొందదగిన; సారంబు+ఐన= సారముగలదైన; భవదీయ= తమ; ప్రకారంబు= పద్ధతి; ఇట్టిది+అని= ఇట్లాంటిదని; ఎఱుంగునట్లుగాన్= తెలిసేటట్లుగా; చెప్పవే= అనుగ్రహించవే; అనినన్= అనగా; ఆ; సర్వలోక= అన్ని లోకాలకు; శరణ్యుండు= శరణని చేరదగినవాడు; కారుణ్యా= దయ అన్న; అమృతమయంబు= అమృతంతో నిండిన; చూడ్కిన్= చూపుతో (దయ అన్న అమృతం వర్షించే చూపు); నామీఁదన్= నాపయి; ఒలయన్= వ్యాపించగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అట్లా దగ్గరకు పోయి 'స్వామీ! నేను నీకు భక్తుడనైతే, నీ దయకు పాత్రుడనైతే, వినే అర్హత నాకుంటే, తపస్సుచేతకాని పొందలేని నీ సారవంతమైన తత్త్వం నాకు బోధించవా?' అని వేడికొనగా, ముల్లోకాలకూ ఆశ్రయమైన ఆ స్వామి దయామృతాన్ని వర్షిస్తూ నన్ను చూచి. (తరువాతి పద్యంతో అన్వయం)

విష్ణుదేవుఁడు గరుత్మంతున కుపదేశించిన యాత్మతత్త్వ ప్రకారము (సం.13-43-1 (కుంభ))

సీ. 'అనిమిష గంధర్వదనుజు లాదిగ నెవ్వ । రును విను, నాయున్న రూ పెఱుంగ;
రఖిలభూతములు నాయం దుద్భవించు, వ । ర్తించు, లయించు, వర్తింప నేను
వాని వశంబున వసియింతు సర్వంబు । నందును, నాతత్త్వ మధిగమింప
నగు నగ్ని యాత్మ సమాహితంబుగఁ జేయఁ । గామవర్జిత మహంకారవిముఖ

తే. మజడ, మపరిగ్రహం బహింసానుమోది । క్రోధరహితంబు నిర్మలబోధయుతము
నిత్యతృప్తంబు, శాంతంబు, సత్యభక్తి । యైన చిత్తంబు గల నియతాత్మకులకు. 378

ప్రతిపదార్థం: విను= (రహస్యం చెప్పుతున్నాను జాగ్రత్తగా) వినుము; అనిమిష= రెప్పపాటు లేనివారు, దేవతలు; గంధర్వ= గంధర్వులు; దనుజులు= రాక్షసులు; ఆదిగన్= మొదలుగా; ఎవ్వరును= ఎవ్వరు కూడా; నా= నా యొక్క; ఉన్నరూపు= కల స్వరూపం; ఎఱుంగరు= తెలిసికొనలేరు; అఖిలభూతములు= సమస్త జీవరాసులు; నాయందున్= నాలో; ఉద్భవించున్= పుట్టుతాయి; వర్తించున్= బ్రతుకుతాయి; లయించున్= చస్తాయి; నేను వర్తింపన్= నేను మాత్రం ఈ సంసారచక్రంలో జన్మమృత్యురూపంలో తిరగటం లేదు; వానివశంబునన్= వాటికి లోబడి; సర్వంబునందునున్= అన్నింటిలో; వసియింతున్= నివసిస్తాను; నా తత్త్వము= నా స్వరూపం; అధిగమింపన్= పొందటానికి; అగు= ఔనట్టి మార్గం; అగ్నిన్= అగ్నితత్త్వాన్ని (దీన్ని

గురించి వేదం అనంతంగా వర్ణించింది); ఆత్మన్= తనలో; జీవుడిలో; సమ+ఆహితంబుగన్ చేయన్= సన్నిహితం చేసికొంటే; కామవర్జితమున్= కామంలేనిదీ; అహంకార= నేనన్న భావనకు; విముఖము= విరుద్ధమైనది; అజడము= జడంకానిది (కదిలేది); అపరిగ్రహంబు= దానంగా ఏదీ స్వీకరించనిది; అహింసా= హింస లేకపోవటాన్ని; అనుమోది= అంగీకరించేదీ; క్రోధరహితంబున్= కోపం లేనిదీ; నిర్మల= స్వచ్ఛమైన; బోధయుతము= జ్ఞానంతో కూడుకొన్నదీ; నిత్య= ఎల్లప్పుడూ; తృప్తంబు= తృప్తి కలదీ; శాంతంబు= శాంతి స్వరూపమైనదీ; సత్య= నిజమైన; భక్తిఐన చిత్తంబున్= భక్తి కల మనస్సు; కల= ఉన్న; నియత+ఆత్మకులకున్= నిష్ఠకల ఆత్మలు కలవారికి.

తాత్పర్యం: నా స్వరూపం దేవతలు, గంధర్వులు, రాక్షసులు మున్నుగా గలవారెవ్వరికినీ తెలియదు. సమస్త ప్రాణకోట్లు నాయందేపుట్టి మెలగుతూ, నాయందే లయిస్తాయి. నేను మాత్రం ఆ భూతకోటులకు వశపడి వర్తించను. సర్వమూ నాయందే వసిస్తుంది. నా తత్త్వం జడులు కానివారూ, అహింసా ప్రవృత్తి కలవారూ, కామం లేనివారూ, అహంకారం లేనివారూ, దానంగా దేన్నీ స్వీకరించనివారూ, కోపం లేనివారూ, స్వచ్ఛమైన జ్ఞానంకలవారూ, నిత్యతృప్తులూ, శాంతీ, భక్తీ కలవారూ, నిష్ఠ కలవారూ, తమలో అగ్నిని సన్నిహితం చేసికొంటే నన్ను పొందగలరు.

వ. సాంఖ్యయోగయుక్తులు, బహిర్దర్శనులై నిశ్చయరహితు లైరేని నస్మదీయ తత్త్వంబు గాన నేర; రది మోహపంకమగ్ను లగువారికి నుపవాసంబుల నియమంబుల వ్రతంబుల నెఱుంగ శక్యంబుగా, దేకాంతిక ధ్యానపరుల కెఱుంగుట గలుగు; రజస్తమోదూషితంబు గాక కేవలసత్త్వాధిష్ఠితంబయిన జ్ఞానంబున న నన్నవలం బించునది, సూక్ష్మ సరణి వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధ నామంబులం జతుర్విధంబుల విభక్తుండనై, ప్రాణులయం దాత్మ బుద్ధ్యహంకార మనోరూపవ్యాపకత్వంబు నొంది యుండుదు; నిట్టిది మదీయ స్థూల ప్రకారంబు; కశ్యపనందనా! నీవు మన్మనస్కుండవు, మద్భక్తుండవు మత్పరాయణుండవు నై మత్స్వరూపవేది వగు' మనియె నని చెప్పి సుపర్ణుండు. 379

ప్రతిపదార్థం: సాంఖ్యయోగయుక్తులు=సాంఖ్యయోగాన్ని అనుసరించేవారు; బహిర్దర్శనులు+ఐ= బాహ్యదృష్టికలవారై; నిశ్చయ రహితులు= నిశ్చయబుద్ధిలేనివారు; ఐరేనిన్= ఐతే; అస్మదీయ= నా; తత్త్వంబు= యథార్థరూపం; కాననేరరు= చూడలేరు; అది= నా యథార్థస్వరూపం; మోహ= వ్యామోహమన్న; పంక= బురదలో; మగ్నులు= మునిగినవారు; అగువారికిన్= ఐనట్టివారికి; ఉపవాసంబులన్= భోజనం లేకుండా భగవదారాధన చేసినా; నియమంబులన్= నియమాలతో; వ్రతంబులన్= ఉపవాసాది పుణ్యకర్మలతో; ఎఱుంగన్= తెలియటం; శక్యంబుకాదు= అసాధ్యం; ఏక+అంతిక= భగవత్సాన్నిధ్యాన్ని ముఖ్యంగా అనుభవించే వారు ఏకాంతిక భక్తులు; ధ్యానపరులకున్= ధ్యానపరాయణులైతే (వారికి); ఎఱుంగుట= తెలియటం; కలుగున్= సాధ్యపడుతుంది, భగవద్దర్శనం ఆత్మానుభవం ధ్యానంతోనే సాధ్యం; రజః= రజోగుణం; తమః=తమోగుణం; దూషితంబుకాక= ఆ గుణాలతో మలినంకాని; కేవల సత్త్వ= పరిశుద్ధసత్త్వగుణంలో; అధిష్ఠితంబు+అయిన= అధిష్ఠించిన; కూర్చున్న, జ్ఞానంబునన్= జ్ఞానంతో; నన్నున్; అవలంబించునది= ఆధారంగా, ధ్యేయంగా చేసికొనాలి; సూక్ష్మ= స్థూలంకానిది; సరణిన్= రీతిలో; వాసుదేవ, సంకర్షణ= బలరామ; ప్రద్యుమ్న= మన్మథ; అనిరుద్ధ= అడ్డంలేని విజృంభణం లేదా వ్యాప్తి కలవాడు; నామంబులన్= పేర్లతో; చతుర్విధంబులన్= నాలుగు రకాలుగా; విభక్తుండనై= విభాగించుకొని; ప్రాణులయందున్= జీవులలో; ఆత్మ, బుద్ధి, అహంకార, మనః= మనస్సులన్న; రూప= రూపాలతో; వ్యాపకత్వంబు= వ్యాప్తి; ఒంది= పొంది; ఉండుదున్= ఉంటాను; ఇట్టిది= ఇట్లాంటిది; మదీయ= నా; స్థూల ప్రకారంబు= బాహ్య పద్ధతి; కశ్యపనందనా!= కశ్యపుడి కుమారుడా!; నీవు; మత్= నాయందు; మనస్కుండవు= మనస్సు కలవాడవు; మత్= నాపై; భక్తుండవు= భక్తి కలవాడవు; మత్పరాయణుండవును+ఐ= నా స్మరణ కలవాడవై; మత్= నా; స్వరూప= తత్త్వం; వేదివి= తెలిసిన వాడవు; అగుము= కమ్ము; అనియెన్= అన్నాడు; అని చెప్పి; సుపర్ణుండు= గరుత్మంతుడు.

తాత్పర్యం: సాంఖ్యయోగులై కూడా అంతర్‌దృష్టి లేక, నిశ్చయబుద్ధిలేక చంచల మనస్కులైనవారికి నా యథార్థ రూపం తెలియదు. వ్యామోహ మన్న బురదలో కూరుకొనిపోయి ఏవో వ్రతాలనీ, ఉపవాసాలనీ, నియమాలనీ ఆచరించినంత మాత్రాన నా తత్త్వం తెలిసేది కాదు. (లోకంలో దేవుడన్నా మతమన్నా వ్రతాలు - ఉపవాసాలు ఇవి కావంటున్నాడు) రజస్తమస్సులతో మలినం కాని కేవల సత్త్వగుణాన్నే స్థిరంగా చేసికొన్న జ్ఞానంతో నన్ను ధ్యానించటమే ముక్తిమార్గం. వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అనే నాలుగు పేర్లతో నన్ను నేను విభాగించుకొని సూక్ష్మంగా, సర్వజీవులలోను ఆత్మ (వాసుదేవుడు), బుద్ధి (సంకర్షణుడు), అహంకారం (ప్రద్యుమ్నుడు), మనస్సు (అనిరుద్ధుడు) ఈ నాలుగు రూపాలుగా వ్యాపించి ఉంటాను. ఇదీ నా స్థూలరూపం. కశ్యపకుమారా! నీవు నా యందే మనస్సు నిలిపి, నన్నే భక్తితో ఆరాధిస్తూ, నిత్యం నన్నే స్మరిస్తూ నా రూపం తెలిసికొమ్ము' అని చెప్పి గరుత్మంతుడు (తరువాతి పద్యంతో అన్వయం)

క. పురుషవరులార! యద్భుత । తర మగు హరి దివ్యచేష్టితము నాకుం ద
త్కరుణం దోఁచిన యట్టిది । పరిపాటిని మీకుఁ దేటపఱిచితి భక్తిన్!' 380

ప్రతిపదార్థం: పురుషవరులార!= మానవశ్రేష్ఠులారా!; అద్భుతతరము+అగు= మిక్కిలి చిత్రమైన; హరి= విష్ణువు యొక్క; దివ్య= అతిలోకమైన (లోకాతీతమైన); చేష్టితము= చేష్ట; నాకున్; తత్= ఆ స్వామి; కరుణన్= దయతో; తోఁచినఅట్టిది= అనుభవానికి వచ్చిన దానిని; మీకున్; పరిపాటిని= క్రమంగా; భక్తిన్= భక్తితో; తేటపఱిచితిన్= స్పష్టం చేశాను.

తాత్పర్యం: మానవశ్రేష్ఠులారా! నారాయణుడి దివ్యచేష్టావిలాసం నా కాయన దయతో తెలిసింది. అది మీకు క్రమంగా భక్తితో స్పష్టం చేశాను.

వ. అనిన విని యమ్మును సిద్ధజనంబులు పరమాదరంబున నప్పక్షిదేవు దీవించి, యామంత్రణంబు సేసి, హర్షోత్కర్షంబునం జిత్తంబులు జొత్తిల్లఁ దమలోన. 381

ప్రతిపదార్థం: అనినన్= సుపర్ణుడు చెప్పగా; విని; ఆ+ముని= ఆ మునుల; సిద్ధ= ఆ సిద్ధుల; జనంబులు= సమూహాలు; పరమ= గొప్ప; ఆదరంబునన్= ఆదరంతో; ఆ+పక్షిదేవున్= ఆ పక్షిరాజును; దీవించి= ఆశీర్వదించి; ఆమంత్రణంబుచేసి= వీడ్కొల్పి (పంపించి); హర్ష= సంతోషం యొక్క; ఉత్కర్షంబునన్= అతిశయంతో; చిత్తంబులు= మనస్సులు; జొత్తిల్లన్= సొమ్మసిల్లగా; తమలోనన్= తమలో తాము.

తాత్పర్యం: చెప్పగా విన్న మునులు, సిద్ధులు ప్రేమతో సుపర్ణుడిని దీవించి పంపించి సంతోష పారవశ్యంతో మనస్సులు సొమ్మసిల్లిపోగా తమలో. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'అక్కజం బగుచున్న యిక్కథ యితనిచే । విని కృతార్థుల మైతి' మనిరి, మఱియుఁ
'బుణ్య మాయుష్యంబు భూతిప్రదము; భక్తి । వినిన విప్రుఁడు వేదవిద్య పెంపు,
నృపవైశ్య శూద్రు లనుపమాన జయధన । సౌఖ్యంబులను గంద్రు; సర్వ జనుల
కిహపర సిద్ధుల కిది సాధనం బగు' । నని పల్కి యాత్రేచ్ఛఁ జనిరి; దీని

ఆ. బ్రహ్మ సురలకుఁ జెప్పిన భంగి వసువు। లవనిసురు లయి వచ్చి మాయమ్మపాల
నున్న నా కర్థిఁ జెప్పిః రయ్యున్న రూపు। నీకు జెప్పితిఁ గురుకులనృపవరేణ్య! 382

ప్రతిపదార్థం: అక్కజంబు= ఆశ్చర్యం; అగుచున్న= అవుతున్న; ఇక్కథ= ఈ ఉపాఖ్యానం; ఇతనిచేన్= సుపర్ణునిచేత; విని; కృత+అర్థులము= నెరవేరిన కోరికలు కలవారం; ఐతిమి= అయ్యాము; అనిరి= అన్నారు; మఱియున్= ఇంకనూ; పుణ్యము= పుణ్యవ్రతం; ఆయుష్యంబు= ఆయుస్సును వద్ధిచేసేది; భూతిప్రదము= ఐశ్వర్యాన్నిచ్చేది; భక్తిన్= భక్తితో; వినిన విప్రుఁడు= విన్న బ్రాహ్మణుడు; వేదవిద్య= వేదవిద్యలయొక్క; పెంపు= సంపద; నృప= రాజు; వైశ్య= కోమట్లు; శూద్రులు= నాలుగవ కులంవారు; అనుపమాన= సాటిలేని; జయ= విజయం; ధన= ధనం; సౌఖ్యంబులను= సౌఖ్యాలను; కంద్రు= పొందుతారు; సర్వజనులకున్= లోకానికంతా; ఇహ= ఈ లోకం; పర= ఆ లోకం; సిద్ధులకున్= సంపదలకు; ఇది= ఈ కథ; సాధనంబు+అగున్= ఉపాయమౌతుంది; అని పల్కి= అని చెప్పుకొంటూ; యాత్రా= తీర్థయాత్రలపై; ఇచ్ఛన్= కోరికతో; చనిరి= వెళ్ళారు; దీనిన్= ఈ కథను; కురుకుల= కురువంశ; నృపవరేణ్య!= రాజశ్రేష్ఠుడా!; బ్రహ్మ= సృష్టికర్త; సురలకున్= దేవతలకు; చెప్పిన భంగిన్= చెప్పిన తీరుగా; వసువులు= అష్టవసువులు; అవనిసురు లయి= భూదేవతలైన బ్రాహ్మణ రూపంలో; వచ్చి; మా యమ్మపాలన్= మా అమ్మ గంగాదేవి దగ్గర ఉన్న; నాకున్= ఉన్నట్టినాకు; (భీష్ముడు); అర్థిన్= కోర్కెతో; చెప్పిరి= చెప్పారు; ఆ+ఉన్నరూపు= ఆ ఉన్న విషయం; నీకున్; చెప్పితిన్= నేను చెప్పాను.

తాత్పర్యం: 'అద్భుతమైన ఈ కథ ఇతడివలన విని కృతార్థుల మైనాం. ఇది పుణ్యం. ఆయురైశ్వర్యాల నిచ్చేది. భక్తితో వింటే బ్రాహ్మణులకు వేదవిద్య పెరుగుతుంది. రాజులకు విజయాలు కలుగుతాయి. కోమట్లు ధనలాభం పొందుతారు. శూద్రులకు సౌఖ్యాలు సమకూడుతాయి. సర్వజనులకు ఇహపరతారకమైన కథ' అని ప్రశంసించి వారంతా తీర్థయాత్రలకు వెళ్ళారు. నాయనా! ధర్మజా! ఈ కథ నట పూర్వం బ్రహ్మ వసువులకు చెప్పగా వారు బ్రాహ్మణాకారాలు ధరించి మా అమ్మ దగ్గరున్న నాకు కావాలని చెప్పి వెళ్ళారయ్యా! అదంతా నీకు వినిపించాను.'

విశేషం: వసువులు ఎనిమిదిమంది. వారే గంగకు కొడుకులై పుట్టి వెంటనే మరణించారు. ఎనిమిదవ వసువే భీష్ముడు.

వ. అని చెప్పి దేవవ్రతుండు వెండియు నిట్లనుఁ 'పాండవాగ్రజా! వైకుంఠ సుపర్ణ సంవాదంబగు నీ యాఖ్యానంబునకు నభిప్రాయం బాకర్ణింపుము. 383

ప్రతిపదార్థం: వెండియున్= ఇంకా; దేవవ్రతుండు= దైవమే జీవితధ్యేయంగా బ్రతికేవాడు భీష్ముడు; ఇట్లు; అనున్; పాండవ= పాండురాజు కొడుకులలో; అగ్రజా!= ముందుపుట్టినవాడా!; వైకుంఠ= విష్ణువు; సుపర్ణ= గరుత్మంతుడి; సంవాదంబు= సంభాషణం; అగు; ఈ; ఉపాఖ్యానంబునకున్=కథకు; అభిప్రాయంబు= భావం, తాత్పర్యం; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: దేవవ్రతు డా విధంగా చెప్పి ఇంకా అంటున్నాడు. 'నాయనా! ధర్మరాజా! విష్ణువునకు, సుపర్ణుడికి మధ్య జరిగిన సంభాషణం విన్నావు కదా! దాని తాత్పర్యం కూడా చెప్తుతాను వినుము.

తే. వివిధ సంకల్ప యజ్ఞముల్ విడిచి యాత్మ। యందు నిష్ఠమై నగ్ని సమాహితముగఁ
జేసి నిస్స్పృహుఁడై విష్ణుఁ జిత్తవృత్తిఁ। జేర్చు వాఁ డవ్యయస్థితిఁ జేరనేర్చు.' 384

ప్రతిపదార్థం: వివిధ = అనేకమైన; సంకల్ప= కోరికలు; యజ్ఞముల్= జన్నాలను; విడిచి= పరిత్యజించి; ఆత్మఅందున్= ఆత్మలో; నిష్ఠమైన్= నియమంతో; అగ్నిన్= అగ్నిని; సమాహితముగన్+చేసి= చక్కగా సన్నిధి కల్పించుకొని; నిస్స్పృహుఁడు+ఐ=

విరక్తుడై; విష్ణున్= నారాయణుడిని; చిత్తవృత్తిన్= మనసునందు; చేర్చువాఁడు= లగ్నం చేసినవాడు; అవ్యయ= శాశ్వతమైన; స్థితిన్= దశను; చేరనేర్చున్= చేరుకొనగలడు.

తాత్పర్యం: నానావిధాలైన సంకల్పాలు, యజ్ఞాలు విడిచిపెట్టి, ఆత్మలో అగ్నిని ప్రతిష్ఠించుకొని విరక్తుడై విష్ణువులో మనస్సును లయం చేసినవాడు ముక్తి నందగలడు.'

వ. అని యిట్లు భీష్ముండు విష్ణు స్వరూప జ్ఞానప్రకారం బితిహాస రూపంబున ధర్మజునకుం జెప్పెనని చెప్పిన 'సప్పురుష వరుల యడుగుటలును, జెప్పుటలును లోకహితంబులై యింత యొప్పియుండునే! యటమీఁది సంభాషణ విశేషంబులు సెప్పు' మని యడుగుటయు. 385

ప్రతిపదార్థం: విష్ణుస్వరూప= విష్ణురూప సంబంధమైన, జ్ఞాన= జ్ఞాన సంబంధమైన; ప్రకారంబు= పద్ధతి; ఇతిహాస రూపంబునన్= కథారూపంలో; ధర్మజునకున్= ధర్మరాజునకు; చెప్పెను; అని; చెప్పినన్= చెప్పగా; ఆ+పురుషవరుల= ఆ మహాత్ముల; అడుగుటలును= ప్రశ్నించిన రీతులూ; చెప్పుటలును= సమాధాన రీతులున్నూ; లోక= లోకానికి; హితంబులు+ఐ= కళ్యాణదాయకాలై; ఇంత ఒప్పిఉండునే!= ఇంత చక్కగా ఉంటాయా!; అట మీఁది= ఆ తరువాతి; సంభాషణ= పరస్పరం మాట్లాడుకొన్నవాటి; విశేషంబులు= ప్రధాన విషయాలు; చెప్పుము; అని; అడుగుటయున్= అడుగగా.

తాత్పర్యం: భీష్ము డీవిధంగా విష్ణు రూప, జ్ఞాన పద్ధతులను కథారూపంలో ధర్మరాజుకు వివరించిన విధానం విని 'ఆ మహాత్ములు అడగటం, చెప్పటం లోకహితాన్ని కలిగించేదిగా ఉండి ఇంత అందంగా ఉంటుందా? తరువాతి సంభాషణ విశేషాలు చెప్పవయ్యా!' అని అడుగగా.

ఆశ్వాసాంతము

చ. మునిహృదయాబ్జ శాంతిమధుమోద వినోది మరాళ! గాఢ చ
క్రనిహత శూలనిర్మథిత రాక్షసయూథ! నితాంత భక్తి భా
వన రమణీయ! వేద పరివాదనిరర్గళ సేవనీయ! ని
త్యనిరుపమాన నిర్మల నిరంజన ఖేలన! ధర్మపాలనా! 386

ప్రతిపదార్థం: ముని= మునులయొక్క; హృదయ+అబ్జ= హృదయాలనే తామరపూలలో; శాంతి మధు= శాంతి అనే తేనెవలని; మోద వినోది= సంతోషంతో వినోదించే; మరాళ!= హంసా!; గాఢ= గాఢంగా; చక్ర= చక్రాయుధంతో; నిహత= చంపబడిన; శూల= శూలంతో; నిర్మథిత= సంహరించబడిన; రాక్షస= రాకాసుల, యూథ!= గుంపు కలవాడా!; నితాంత= ఎడతెగని; భక్తిభావన= భక్తి కల భావనకు; రమణీయ!= అందమైనవాడా!; వేద= మంత్రాలాపంచేసే; పరివాద= వీణానాదంతో; నిరర్గళ= ఏకధాటిగా, (అడ్డు లేకుండా); సేవనీయ!= సేవించబడే వాడా!; (పరివాదం= నింద, వీణ) నిత్య= ఎల్లప్పుడు, నిరుపమాన= సాటిలేని; నిర్మల= స్వచ్ఛమైన; నిరంజన= జ్ఞానంతో; ఖేలన!= క్రీడించేవాడా!; ధర్మ= ధర్మాన్ని; పాలనా= రక్షించేవాడా!

తాత్పర్యం: మునుల హృదయాలనే తామరపూలనుండి స్రవించే శాంతి మధువును త్రాగిన ఆనందంతో విహరించే హంసస్వరూపుడా! చక్రంతో; శూలంతో రాక్షసులను చంపేవాడా! నిత్యభక్తిభావ దృష్టికి అందమైనవాడా!, వేదాలాపన

చేసే వీణానాదంతో సేవించదగినవాడా; (లేదా) వేదనింద చేసేవారికి సేవించదగినవాడా!, నిత్యమూ సాటిలేనివాడా!, స్వచ్ఛమైన జ్ఞానంతో క్రీడించేవాడా!, ధర్మపాలన చేసేవాడా!

విశేషం: ఇది హరిహరనాథ స్తుతి కనుక 2వ వాక్యంలో శూలం, చక్రం చెప్పబడ్డాయి. 4వ వాక్యాన్ని రెండు రకాలుగానూ అన్వయించుకొనవచ్చును. వేద నిరసన చేసినవారు రాక్షసులు. సోమకాసురుడిని వధించి వేదాలను ఉద్ధరించినవాడు విష్ణువు. ఇదే మత్స్యావతార కథ అని విష్ణుపరమైన అర్థం. శివుడు వీణాధరుడు కనుక వీణ ప్రాచీనకాలంలో వేదమంత్రగాన సాధనం కనుక శివపరంగా చెప్పుకొనవచ్చును. రెంటికీ తగిలి వచ్చేటట్లు పరివాద శబ్దాన్ని వాడిన తిక్కనగారి ప్రతిభకు నమస్కరించాలి.

క. సదయాపాంగా! పరిణా । మదశా సంగమ నిరాసమధురతమాంగా!
మదశోక రహితచేత । స్సదనా! సంజనిత సముపసంహృతమదనా! 387

ప్రతిపదార్థం: సదయ= దయతో (తడిసిన) కూడుకొన్న; అపాంగా!= కంటి చివరి చూపు (కటాక్షం) కలవాడా!; పరిణామ= మార్పు; దశా= స్థితి; సంగమ= ఆసక్తిని; నిరాస= తిరస్కరించేవారికి; మధురతమ= మిక్కిలి తీయనైన; అంగా!= అవయవాలు కలవాడా! మద= గర్వం; శోక= దుఃఖం; రహిత= లేని; చేతస్= మనస్సులే; సదనా!= ఇల్లుగా ఉండేవాడా!; సంజనిత= చక్కగా పుట్టించబడిన; సమ్+ఉపసంహృత= చక్కగా ఉపసంహరించబడిన (చంపబడ్డ); మదనా!= మన్మథుడు కలవాడా!

తాత్పర్యం: దయతో కూడిన క్రీగంటి చూపులు కలవాడా! పరిణామ దశలయందు ఆసక్తిలేని మధురతమమైన ఆకృతి కలవాడా! మదం, శోకాదులు లేని మనస్సును మందిరంగా చేసికొన్నవాడా! మన్మథుడి పుట్టుకకు, మరణానికీ కారణమైన నాథా! హరిహరనాథా!

విశేషం: భగవంతుడి కటాక్షం దయాస్నిగ్ధం దయను వర్షించేది. పరిణమించే సృష్టియందు ఆసక్తిలేనివారికి మధురమైన శరీరం కలవాడు. గర్వం దుఃఖం లేని మనస్సులలో ఉండేవాడు, విష్ణువు మన్మథుడిని కన్నాడు. శివుడు దహించాడు.

మాలిని

గరుడవృషపతాకా! కల్పితాశేషలోకా!
సురపరిషదుపాస్యా! శుద్ధసంవిద్వికాస్యా!
పరమమహిమసీమా! భవ్యకారుణ్యధామా!
నిరతిశయగుణాలీ! నిష్కలానందశాలీ! 388

ప్రతిపదార్థం: గరుడ= గరుత్మంతుడు; వృష= ఎద్దు; పతాకా!= జెండాలపై గుర్తులుగా కలవాడా! (వాహనమే పతాకల చిహ్నం); కల్పిత= సృష్టించబడిన; అశేష= సమస్త; లోకా!= లోకాలు కలవాడా!; సురపరిషత్= దేవతల సముదాయానికి; ఉపాస్యా!= సేవింపదగినవాడా!; శుద్ధసంవిత్= అద్వైతజ్ఞానంతో; వికాస్యా!= వికసించేవాడా!; పరమ= గొప్ప; మహిమ= మాహాత్మ్యానికి; సీమా!= సరిహద్దయినవాడా!; భవ్య= శ్రేష్ఠమైన; కారుణ్యా= దయకు; ధామా!= గృహమైనవాడా!; నిరతిశయ= మిక్కిలి ఎక్కువైన; గుణాలీ!= గుణసమూహం కలవాడా!; నిష్కల= అద్వైత; ఆనందశాలీ= ఆనందం కలవాడా!

తాత్పర్యం: గరుత్మంతుడు, ఎద్దు పతాకలపై గుర్తులుగా ఉన్నవాడు, సమస్త సృష్టి చేసేవాడు, దేవతల కుపాసించదగినవాడు, అద్వైతజ్ఞానంతో వికసించేవాడు, గొప్ప మాహాత్మ్యానికి అవతలి ఒడ్డున ఉన్నవాడు, దివ్యమైన దయకు స్థానమైనవాడు, మహాగుణాలున్నవాడు, కేవలానందస్వరూపుడు అయిన హరిహరనాథుడికి నమస్కారము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మాలినీవృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, న, మ, య, య అనే గణాలుంటాయి. 9వ అక్షరం యతిస్థానం. ప్రాస నియమం ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున నానుశాసనిక పర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈ రచన; శ్రీమత్= మంగళకరుడైన; ఉభయకవిమిత్త్ర= కావ్యశాస్త్ర కవులిరువురికీ మిత్రుడైనవాడు; బుధ+ఆరాధన విరాజి= పండితులను (జ్ఞానులను) సేవించటం వలన కీర్తితో ప్రకాశించేవాడు; తిక్కన సోమయాజి= సోమయాజి అయిన తిక్కన చేత; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీ మహాభారతంబున; ఆనుశాసనిక పర్వంబునందున్; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది ఉభయకవిమిత్రుడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, జ్ఞానులచేత ఆరాధించబడి రాణించే వాడూ అయిన తిక్కన సోమయాజి శుభప్రదంగా రచించిన శ్రీ మహాభారతంలోని ఆనుశాసనికపర్వంలో మొదటి ఆశ్వాసం.

ఆనుశాసనిక పర్వంలోని ప్రథమాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆనుశాసనిక పర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీమయ వక్షస్థల గౌ । రీమయ వామార్ధ । బంధురీ కృత సౌంద

ర్యామృత రసకీర్తన వి । ద్యామయ! నిగమాంతవేద్య! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీమయవక్షస్థల = లక్ష్మీమయమైన గుండె చేతను; గౌరీమయ= పార్వతీమయమైన; వామ+అర్ధ= ఎడమ సగం శరీరం చేతను; బంధురీకృత = ఇంపుగా చేయబడిన; సౌందర్య= అందమనెడు; అమృతరస= సుధాద్రవాన్ని; కీర్తన= కొనియాడెడు; విద్యామయ!= కళ్యాణస్వరూపుడా!; నిగమ+అంత= ఉపనిషత్తులచేత; వేద్య= తెలియదగినవాడా!; హరిహరనాథ!= హరిహరనాథ దేవా!

తాత్పర్యం: లక్ష్మీదేవి నివసించే వక్షస్థలం చేతను, పార్వతితో కూడిన ఎడమ శరీరార్ధముతోను శోభిల్లే నీ అందమనెడు అమృతరసాన్ని కీర్తించే విద్య ఏదికలదో అదియే స్వరూపమైనవాడా! ఉపనిషత్తులచేత తెలియదగినవాడా! హరిహరనాథా! చిత్తగించుము.

అష్టావక్రుం డను మునికుమారు చరిత్రము (సం.13-19-10)

వ. దేవా వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; అట్లు నారాయణ స్వరూప నిరూపణ ప్రకారంబు విని యజాతశత్రుండు సంజాతప్రీతుండై, పితామహుతోఁ 'గన్యాదానంబునకు వరుం డెట్టివాఁడు గావలయు?' ననుటయు' నక్కురువంశవరుం 'డీవిషయంబున నొక్క యితిహాసంబు గలదు విను' మని యమ్మానవపతి యాననం బాలోకించి. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయనుడనే కథకుడు; జనమేజయునకున్= జనమేజయ మహారాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అట్లు= ఆరీతి; నారాయణ స్వరూప నిరూపణ ప్రకారంబు= విష్ణుతత్త్వం బోధించిన పద్ధతి; విని; అజాతశత్రుండు= ధర్మరాజు; సంజాతప్రీతుండు+ఐ= పుట్టిన ఆనందం కలవాడై (ఆనందించి); పితామహుతోన్= తాతతో (భీష్మునితో); కన్యాదానంబునకున్= పెండ్లిలో పిల్ల నివ్వటానికి; వరుండు; ఎట్టివాఁడు= ఎట్లాంటివాడు; కావలయున్?= కావాలి?; అనుటయున్= అంటే; ప్రశ్నిస్తే; ఆ+కురువంశవరుండు= ఆ కౌరవవంశశ్రేష్ఠుడు భీష్ముడు; ఈ విషయంబునన్= ఈ విషయంలో; ఒక్క ఇతిహాసంబు= ఒక దృష్టాంత కథ; కలదు; వినుము; అని; ఆ+మానవపతి= ఆ ప్రజలకు భర్త అయిన ధర్మరాజు యొక్క; ఆననంబు= ముఖం, ఆలోకించి= చూచి.

తాత్పర్యం: వైశంపాయనుడు జనమేజయుడితో అంటున్నాడు. ఆ విధంగా విష్ణుతత్త్వం చెప్పటం విన్న ధర్మరాజు సంతోషించి భీష్ముడిని అడిగాడు. 'కన్యాదానానికి ఎట్లాంటి వరుడు కావాలి?' అని. దాని కాయన 'ఒక ఇతిహాసం ఉన్నది వినుము' అని చెప్పుతున్నాడు.

సీ. 'అనఘ! యష్టావక్రుఁడను బ్రహ్మచారి స । త్తముఁడు. వదాన్యుఁ డన్తాపసోత్త
మునికూఁతు, సుప్రభ యను కన్యఁ బెండ్లిగాఁ । గోరి యాతని నడుగుటయు, నతఁడు
'నీవు యోగ్యుండవు, నీ కిత్తు నా పుత్రి; । నంతకు నుత్తర మరిగి రమ్ము'
నావుడు, సంయమినందనుం 'డెందుల । కరుగుదు? నే పని యాచరింతుఁ

ఆ. బనుపు 'మనుడు వదాన్యుండు 'ధనదుపురము । గడచి హిమగిరి కరుగుము; మృడుని గుఱిచి
గిరిజ తప మొనరించె నగ్గిరితటమునఁ । దత్ప్రదేశంబు పుణ్యంబు దానియందు. 3

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; అష్టావక్రుఁడు+అను= అష్టావక్రుడనే పేరుగల; బ్రహ్మచారి= వటువు; సత్ తముఁడు= బ్రహ్మచారులలో చాలా ఉత్తముడు; వదాన్యుఁడు+అన్= వదాన్యుడనే పేరుగల; తాపస+ఉత్తముని= ఋషిశ్రేష్ఠుడి; కూఁతున్=కూతురిని; సుప్రభ= సుప్రభ అనే పేరు గల; కన్యన్= పెండ్లిగాని కన్నెను; పెండ్లికాన్+కోరి= వివాహం చేసికొనాలని; ఆతనిన్= ఆ వదాన్యుడిని; అడుగుటయున్= వేడుకొనగా; అతఁడు; నీవు; యోగ్యుండవు= తగినవాడవు (నేటికీ ఈ పదాన్ని ఈ సందర్భంలో ఇట్లాగే వాడుకొంటున్నాం. యోగ్యుడైన వరుడికిచ్చి అని వ్యవహారంలో మాటే); నాపుత్రిన్= నా కూతురిని; నీకున్+ఇత్తును; అంతకున్= అంతలో-ఈ లోపల; ఉత్తరము= ఉత్తర దిక్కునకు; అరిగి= పోయి; రమ్ము; నావుడున్= అనగా విని; సంయమి నందనుండు= మునికుమారుడు; ఎందులకున్= ఏ అక్కరగల్గి; అరుగుదున్= వెళ్ళుదును (వెళ్ళుతాను); ఏ పని ఆచరింతున్= ఏ పని చేయాలి; పనుపుము= ఆజ్ఞాపించుము; అనుడున్= అనగా; వదాన్యుండు; ధనదు= ధనాన్ని ఇచ్చేవాడు కుబేరుడి; పురము= నగరం; కడచి= దాటి; హిమగిరికిన్= మంచుకొండకు; అరుగుము= వెళ్ళుము; మృడుని= శివుడిని; గుఱిచి= గురించి; గిరిజ= హిమాలయుడి కూతురు - పార్వతి; తపము= తపస్సు; ఒనరించెన్= చేసిందో; ఆ+గిరి= ఆ కొండ; తటమునన్= ఒడ్డున; తత్ ప్రదేశంబు= ఆ ప్రదేశం; చోటు; పుణ్యంబు= పవిత్రం; దానియందున్= అక్కడ.

తాత్పర్యం: అష్టావక్రుడని ఒక బ్రహ్మచారి వదాన్యుడనే మునికుమార్తెను - సుప్రభను పెండ్లి చేసికొనాల నుకొన్నాడు. వదాన్యుడు కూడా ఇద్దామనుకొన్నాడు. కానీ, ఈ లోపల ఉత్తరదిశకు పోయి రమ్మన్నాడు. ఎందుకని అడిగితే శివుడిగురించి పార్వతీదేవి తపస్సుచేసిన చోటు చాలా పవిత్రమైనది. అక్కడ.

క. ఆడుచుఁ బాడుచు గణములు । గూడి చరింపంగ గిరిజకుం బ్రియముగఁ, దా
వేడుక నమ్మృడుఁ డెప్పుడుఁ । గ్రీడించుచు నుండు మునులు గీర్తింపంగన్. 4

ప్రతిపదార్థం: గణములు= శివుడి గణాలు; కూడి= కలసి మెలసి; ఆడుచున్ పాడుచున్= ఆడుతూ పాడుతూ; చరింపంగన్= వినోదిస్తుండగా; గిరిజకున్= పార్వతికి; ప్రియముగాన్= ఇష్టమైనట్లు; ఆ+మృడుఁడు= ఆ శివుడున్నూ; తాన్= తాను; వేడుకన్= ఉత్సాహంతో; ఎప్పుడున్= నిత్యం; మునులు కీర్తింపంగన్= మునులు స్తుతిస్తుండగా; క్రీడించుచున్+ఉండున్= విహరిస్తుంటాడు.

తాత్పర్యం: శివుడి గణాలు కూడి యాడి వినోదిస్తూ ఉంటే ఆటలతో, పాటలతో శివుడు కూడా తపస్సు మాని పార్వతికి వేడుక కలిగించటానికై తానూ విహరిస్తుంటాడు. వారి క్రీడలను మునులు స్తుతిస్తుంటారు.

ఆ. అది పవిత్రదేశ ; మచ్చటు సూచుచుఁ । గడచి చనఁగ నీపకాననంబు
కానవచ్చు నందు గట్టి ప్రాయమునది । పుణ్యమూర్తి యమలబుద్ధి యోర్తు. 5

ప్రతిపదార్థం: అది పవిత్రదేశము; అచ్చటు= ఆ చోటు; చూచుచున్= చూస్తూ; కడచి= దాటి; చనఁగన్= పోగా; నీప= కడిమిచెట్ల; కాననంబు= తోపు; కానవచ్చున్= కనిపిస్తుంది; అందున్= అందులో; గట్టి ప్రాయమునది= ప్రౌఢవయస్సు కలది; పుణ్యమూర్తి= పవిత్రమైన రూపం కలది (చూడగానే నమస్కరించే బుద్ధి కలిగేది); అమల= నిర్మలమైన; బుద్ధి= మనస్సు కలది; ఓర్తు= ఒక స్త్రీ.

తాత్పర్యం: ఆ పవిత్ర ప్రదేశం చూస్తూ, దాటిపోగా, కదంబవనం కనిపిస్తుంది. అందులో ఒక ప్రౌఢవయస్కురాలూ, పవిత్రరూపం కలదీ, సద్బుద్ధి కలదీ అయిన ఒకామె ఉంటుంది.

క. **వసియించు నమ్ముదితఁ బ్రియ । మసలారఁగఁ గాంచి వచ్చు నప్పుడ ప్రమదం**
బెసఁగంగఁ బెండ్లి సేసెద । నసదృశ రూప గుణవర్త నాన్వయ విద్యా!' 6

ప్రతిపదార్థం: వసియించున్= ఉంటుంది; ఆ+ముదితన్= ఆ స్త్రీని; ప్రియము= ప్రీతి; అసలు+ఆరఁగన్= ఒప్పుతుండగా; కాంచి= చూచి; వచ్చునప్పుడు+అ= వచ్చేటప్పుడు; అసదృశ= సాటిలేని; రూప= ఆకారం; గుణ= సద్గుణాలు; వర్తన= నడవడి; అన్వయ= వంశం; విద్యా!= విద్యకలవాడా! ప్రమదంబు= సంతోషం; ఎసఁగంగన్= అతిశయించగా; పెండ్లి= వివాహం; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: ఆమెను చూచిరాగానే నీకు సంతోషంతో వివాహం చేస్తాను. రూపంలో, గుణంలో, ప్రవర్తనలోను, వంశంలోను, విద్యలోను సాటిలేనివాడవు కదా! తప్పక వివాహం చేస్తాను'.

సీ. **అనిన నష్టావక్రుఁ 'డట్ల కా' కని చని, । బాహుదా తీరభూభాగవర్తి**
యై, రాత్రి గడపి, ధనాధీశు ప్రోలికి । నరుగఁగ నతఁ డమ్మహాత్మురాక
విని, యెదురేతెంచి, వినయంబుతోడఁ దో । డ్కొనిపోయి, మహిత పూజన మొనర్చి
యూర్వశి రంభ తిలోత్తమ మొదలగు । నప్సరోవనితల యాటపాట

తే. **లాదిగాఁ గల, వివిధ వినోదకృతుల । ననుదినంబు నారాధింప, నందు నిల్చె**
నమ్మునీంద్రుండు, దగులు లే కభిమత ప్ర । వర్తనంబుల నొక్క సంవత్సరంబు. 7

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అష్టావక్రుఁడు; అట్లకాక అని= సరేఅని; చని= వెళ్ళి; బాహుదా= బాహుదానది యొక్క (మన రాష్ట్రంలో కడపజిల్లాలో చెయ్యేరు అనేపేరుతో బాహుదానది అన్న నది ఉన్నది); తీర= ఒడ్డునగల; భూభాగ= ప్రదేశంలో; వర్తి+ఐ= నివసించినవాడై; రాత్రి గడపి= రాత్రిని గడిపి; ధన+అధీశు= కుబేరుడి; ప్రోలికిన్= నగరానికి; అరుగఁగన్= పోగా; అతఁడు; ఆ+మహాత్ము= అష్టావక్రుడి రాక; విని; ఎదురు+ఏతెంచి= గౌరవంతో ఎదురుగా ఆహ్వానించటానికి వచ్చి; వినయంబుతోడన్= అణకువతో; తోడ్కొనిపోయి= తీసికొనివెళ్ళి; మహిత= గొప్ప; పూజనము= పూజ; ఒనర్చి= చేసి; ఊర్వశి, రంభ, తిలోత్తమ= దేవలోకంలో ఉన్న ఊర్వశి, రంభ, తిలోత్తమ అనే నర్తకీమణులు; మొదలగు= మొదలైన; అప్సరోవనితల= అప్సరస్ స్త్రీల యొక్క; ఆటపాటలు; ఆదిగాన్‌కల= మొదలైన; వివిధ= అనేక; వినోదకృతులన్= వినోద కార్యాలతో; అనుదినంబున్= ప్రతిరోజు; ఆరాధింపన్= పూజించగా; అందున్; ఆ+ముని+ఇంద్రుండు= ఆ మునిశ్రేష్ఠుడు; తగులు లేక= ఆసక్తిలేక, విరక్తితో; అభిమత= ఇష్టం వచ్చిన; ప్రవర్తనంబులన్= చర్యలతో; ఒక్కవత్సరంబు= ఒక సంవత్సర కాలం; నిల్చెన్= అక్కడే ఉన్నాడు.

తాత్పర్యం: ఆ మాట విని అష్టావక్రుడు వెళ్ళి ఆ రాత్రి బాహుదా నదీతీరంలో కడపి, కుబేరుడి నగరానికి వెళ్ళాడు. అతడి రాక తెలిసి కుబేరుడు ఎదురు పోయి సాదరంగా ఆహ్వానించి తెచ్చి అతిథిపూజ చేసి అతడికి వినోదార్థం రంభాదుల నాట్యాలు ఏర్పాటు చేశాడు. అష్టావక్రుడు మనస్సు చలించకుండా ఒక ఏడాది అక్కడ ఉన్నాడు.

వ. పదంపడి ధనదుండు 'నీ కేమి సేయవలయుం జేసెదం జెప్పు' మనిన నతండును 'సర్వంబును సంపన్నంబ, నీవు నిత్యసంపద నున్నతుండవై యుండు; మేనొక్క మునిపతి సెప్పిన పనికై పోయెద; నీతోడి వేడుక నిల్చితి; నింతియ కాని నా కభ్యర్థనీయం బొండు లే' దని పల్కి యట వోయి. 8

ప్రతిపదార్థం: పదంపడి= తరువాత; ధనదుండు= కుబేరుడు; నీకున్= నీకు; ఏమిచేయవలయున్= ఏమిసల్పవలెనో; చేసెదన్= చేస్తాను; చెప్పుము= తెల్పుము; అనినన్, అతండును; సర్వంబును= అంతా; సంపన్నంబు+అ= నిండుగా, తృప్తిగా ఉన్నది; నీవు; నిత్యసంపదన్= శాశ్వతమైన ఐశ్వర్యంతో; ఉన్నతుండవై= గొప్పవాడవై; ఉండుము; ఏను= నేను; ఒక్కమునిపతి+ చెప్పినపనికై= ఒక మునీశ్వరుడు చెప్పిన పని నెరవేర్చుటకై; పోయెదన్; నీతోడివేడుకన్= నీతో కలిసిఉండే కోర్కెతో; నిల్చితిన్= ఉన్నాను; అంతియకాని= అంతేతప్ప; నాకున్= నాకు; అభి= మిక్కిలి; అర్థనీయంబు= కోరదగినది; ఒండు= వేరేదీ; లేదని; పల్కి; అటపోయి= ఆ చోటు వదలి వెళ్ళిపోయి. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: తర్వాత కుబేరు డడిగాడు; 'నీకేమి కావాలో చెప్పితే ఇస్తా'నని. అత డన్నాడు- 'నీతో ఒక ఏడాది సంతోషంగా గడిపాను. అది చాలు. నా కేమీ కోరదగినవి లేవు. నే నొక మునిపనిమీద వెళ్ళుతున్నాను' అని చెప్పి ఆ నగారాన్ని వదలి వెళ్ళిపోయాడు.

సీ. హిమశైలతట మెక్కి యీశ్వర క్రీడన । స్థలిఁ గాంచి మ్రొక్కి ప్రదక్షిణముగఁ
జని, యట యరుగంగ మునివరు చెప్పిన । కడిమిలేమ్రాఁకుల యడవి దోఁచె;
దానిఁ బ్రవేశింపఁగా, నందు మణిహేమ । మయ చిత్రరమ్య హర్మ్యము లనేక
ములు గానవచ్చె; నుజ్జ్వల సమున్నతరమ్య । హర్మ్యంబు వానిలో నధిక విభవ

ఆ. సారమై యున్నఁ జూచితద్వారభూమిఁ । జేరి, లోనికిఁ దనపేరు సెప్పి పుచ్చఁ
గన్యకలు పఱతెంచిరి, కాంతిరూప । విలసనము లొప్పఁ గొందఱు, వినయ మెసఁగ. 9

ప్రతిపదార్థం: హిమశైల తటము= మంచుకొండ పార్శ్వం; ఎక్కి= అధిరోహించి; ఈశ్వర= శివుడి; క్రీడన స్థలిన్= విహారస్థలం; కాంచి= చూచి; మ్రొక్కి= నమస్కరించి; ప్రదక్షిణముగన్= ప్రదక్షిణపూర్వకంగా; చని= వెళ్ళి; అట= పైకి; అరుగంగన్= పోగా; మునివరుచెప్పిన= మునీశ్వరుడు తెల్పిన; కడిమి= కదంబ; లే= లేత; మ్రాఁకుల= చెట్ల; అడవి= వనం; తోఁచెన్= కనపడింది; దానిన్= అందులో; ప్రవేశింపఁగాన్= వెళ్ళేసరికి; అందున్= ఆ లోపల; మణి= రత్నాలు; హేమ= బంగారం; మయ= మయమైన; చిత్ర= ఆశ్చర్యకరమైన; రమ్య= అందమైన; హర్మ్యములు= మేడలు; అనేకములు+కానవచ్చెన్= పెక్కు కనబడినవి; ఉజ్జ్వల= ప్రకాశించే; సమున్నత= చాలా ఎత్తైన; రమ్య హర్మ్యంబు= అందమైన మేడ; వానిలోన్= ఆ మేడల వరుసలో (ఇది); అధిక= ఎక్కువ; విభవ= వైభవ; సారము= సారం; ఐ=కలిగి; ఉన్నన్+చూచి= ఉండటం చూచి; తత్ద్వార భూమిన్= ఆ మేడ ద్వార ప్రదేశం; చేరి= సమీపించి; లోనికిన్= మేడలోపలికి; తనపేరు చెప్పి పుచ్చన్= ఫలానా మనిషి వచ్చాడని కబురు చేయగా;

కన్యకలు= అవివాహితలు; కాంతి= లావణ్యం; రూప= అందమైన రూపాలు; విలసనములు= అందాలు; ఒప్పన్= ప్రకాశించగా; వినయము ఎసఁగన్= వినయం వెల్లడి అయ్యేటట్లు; కొందఱు= కొంతమంది; పఱతెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: మంచుకొండ లెక్క ఈశ్వరుడి క్రీడా స్థలాలు దర్శించి మునివరుడు చెప్పిన లేత కడిమిచెట్ల వనంలో రత్నాలు పొదిగిన బంగారు మేడల వరుస లనేకం చూచాడు. అందులో అధిక వైభవంతో ప్రకాశించే బంగారుమేడ చూచి ద్వారం దగ్గరకు పోయి లోపలకు కబురు చేశాడు ఫలానా వారు వచ్చారని. వినీవినగానే అందాలరాసులైన కన్యకలు కొందరు వినయంతో పరుగు పరుగున వచ్చారు.

వ. పఱతెంచి పరమాదరంబునం దోడ్కొని పోవునప్పు, డప్పొలంతుల యొప్పు, సూడ్కులకుం జిత్తంబునకు వేడ్కలు సేయంజాలినను, లోలత్వ రాహిత్యంబున నత్యుదాత్తుం డగుచుం జని, యభ్యంతర మందిరంబున వివిధ రత్నరశ్మి విరాజితంబైన పర్యంకంబున నార్యమూర్తియు, ధవళవసనాంగరాగయు, రుచిరాభరణ భూషితయు, ప్రౌఢవయస్కయు, నగు నొక్క వనితం గని 'మే లయ్యెడు' మనుచు నిలిచిన, నయ్యిందువదన 'యిందు రం' డని పలుకుచుం బ్రత్యుత్థానంబు సేసి. 10

ప్రతిపదార్థం: పఱతెంచి= వచ్చి; పరమ+ఆదరంబునన్= మంచి ప్రేమతో; తోడ్కొని= వెంటబెట్టుకొని; పోవునప్పుడు= వెళ్ళేటప్పుడు; ఆ+పొలంతుల= ఆ స్త్రీల; ఒప్పు= అందం; చూడ్కులకున్= చూపులకు; చిత్తంబునకున్= మనస్సుకు; వేడ్కలు= కోర్కెలు; చేయన్ చాలినను= కల్గించగలిగినా; లోలత్వ= ఆసక్తి; రాహిత్యంబునన్= లేనందువలన; అతి= మిక్కిలి; ఉదాత్తుండు= మహాత్ముడు; అగుచున్; చని= వెళ్ళి; అభ్యంతర మందిరంబునన్= లోపలి సౌధంలో; వివిధ రత్న= అనేక రత్నాల; రశ్మి= కాంతులతో; విరాజితంబు+ఐన= ప్రకాశించే; పర్యంకంబునన్= వేదికపై; ఆర్యమూర్తియున్= పుణ్యాకృతి కలదీ; ధవళ= తెల్లని; వసన= వస్త్రం; అంగరాగయున్= శరీరానికి పూసికొన్న వాసన ద్రవ్యాలు కలది, (కస్తూరి, జవ్వాది మొదలుగునవి); రుచిర= అందమైన; ఆభరణ= నగలచేత; భూషితయున్= అలంకరించుకొన్నది; ప్రౌఢవయస్కయున్= మంచి ప్రాయం కలది; అగు= అయిన; ఒక్కవనితన్= ఒక వెలదిని; కని= చూచి; మేలు+అయ్యెడున్+అనుచున్= శుభమగుగాక అని పలుకుతూ; నిలిచినన్= నిలువగా; ఆ+ఇందువదన= చంద్రుడిని పోలిన ముఖం కల్గిన ఆమె; ప్రతి+ఉత్థానంబు ఒనర్చి= ఎదురుగా లేచివెళ్ళటం చేసి. (మీది పద్యంతో అన్వయం)

తాత్పర్యం: కన్యకలు పరుగు పరుగున వచ్చి అష్టావక్రుడిని వెంటబెట్టుకొని తీసికొనిపోయారు. వారి అందచందాలకు అతడి మనస్సు చలించలేదు. అంతఃపురంలో పలురత్నాలకాంతులతో ప్రకాశించే పర్యంకముమీద పవిత్రస్వరూపిణీ (పార్వతీదేవివంటిది) తెల్లనిచీర, మైపూతలు ధరించినదీ, అందమైన ఆభరణాలు అలంకరించుకొన్నదీ, ప్రౌఢవయస్కురాలు అయిన ఒక కాంతను అతడు దర్శించి శుభమస్తు అంటూ నిలిచాడు. అపుడా చంద్రవదన 'ఇట్లా రండి' అంటూ లేచి ఎదురుగా వెళ్ళి ఆహ్వానించి తెచ్చింది.

క. అమ్మునివరు నాపర్యం । కమ్ము పయిం బ్రీతి నునిచి, గారవమునఁ బా
ద్యమ్మును నర్ఘ్యము శ్రుతివిహి । తమ్మైన విధమున నిచ్చి, తత్పార్శ్వమునన్. 11

ప్రతిపదార్థం: ఆ+మునివరున్= ఆ మునిశ్రేష్ఠుడిని; ఆ= పైన చెప్పిన; పర్యంకమ్ముపయిన్= వేదికమీద, ఆసనంమీద; ప్రీతిన్= సంతోషంతో; ఉనిచి= కూర్చోబెట్టి; గారవమునన్= గౌరవంతో; పాద్యమ్మునున్= పాదాలు కడుగుకొనటానికి నీళ్ళు;

అర్ఘ్యమున్= పూజకు తగిన నీళ్ళు; శ్రుతివిహితమ్ము+ఐన= వేదం చెప్పిన; విధమునన్= రీతిగా; ఇచ్చి; తత్= అతడి; పార్శ్వమునన్= ప్రక్కనే.

తాత్పర్యం: అష్టావక్రుడిని ఆపర్యంకంమీద కూర్చుండబెట్టి ప్రీతితో అర్ఘ్యపాద్యాలను వేదం చెప్పిన రీతిగా ఇచ్చి అతడి ప్రక్కనే.

వ. తానును వేఱొక్క సెజ్జం గూర్చుండె; నమ్ముని గలయం గనుంగొని యక్కన్నియల విభ్రమ వికారంబులు దన లోచనంబులకు గోచరంబులగుటకు నొల్లక 'యిమ్మదవతీ జనంబు లిచ్చట నేల?' యనిన నక్కాంత యక్కన్యల నెల్లం బోవం బనిచి సముచిత సల్లాపంబులు సేయుచుండి, రాత్రి యగుటయు. 12

ప్రతిపదార్థం: తానును= తానుగూడ; వేఱొక్క= మరొక; సెజ్జన్= శయ్యపై; కూర్చుండెన్; అమ్ముని; కలయన్+కనుంగొని= పరిసరాలన్నీ చూచి; ఆ+కన్నియల= ఆ కన్యల యొక్క; విభ్రమ వికారంబులు= కామభావంవలన శరీరంమీద కలిగే అందమైన చేష్టలు; తన; లోచనంబులకున్= కళ్ళకు; గోచరంబులు+అగుటకున్= కనిపించటానికి; ఒల్లక= ఇష్టపడక; ఈ+మదవతీజనంబులు= కామంతో కలిగే మత్తు కళ్ళు మొదలైన అవయవాలతో ఉన్న స్త్రీల గుంపు; ఇచ్చటన్; ఏల; అనినన్; ఆ+కాంత= ఆ స్త్రీ; ఆ కన్యలన్= ఆ కన్నియలను; ఎల్లన్= అందరినీ; పోవన్+పనిచి= పోయేటట్లు ఆజ్ఞాపించి; సముచిత= తగిన; సల్లాపంబులు= సంభాషణలు; చేయుచున్+ఉండి= సల్పుతూ ఉండి; రాత్రి; అగుటయున్= కాగా.

తాత్పర్యం: అతడి ప్రక్కనే మరొక శయపై కూర్చుండగానే ఆ ముని - ఆ కన్యల అందచందాలు చూడటానికి ఇష్టపడక వారిని పంపించివేయుమని ఆమెతో చెప్పగానే ఆమె కూడా వారిని పంపించివేసింది. తరువాత అతడితో తగిన సంభాషణలు చేస్తూ ఉన్నది. ఇంతలో రాత్రి కావటంతోనే.

ఉత్తరదిశ అష్టావక్రుని చిత్తశుద్ధిఁ బరీక్షించుట (సం.13-20-50)

క. సీతయ్యె ననుచు, నల్లన । యాతని శయనమున కరిగి, యతఁ డెడ యీఁగా,
నా తల్పంబున నొక దెసఁ । బ్రీతహృదయయై శయించెఁ బృథ్వీనాథా! 13

ప్రతిపదార్థం: పృథ్వీనాథా!= భూమికి నాథుడా! రాజా! సీతు= చలి; అయ్యెన్+అనుచున్= పుట్టుతున్నదని; అల్లన= నెమ్మదిగా; అతని శయనమునకున్= ఆయన సెజ్జకు; అరిగి= పోయి; ఆతఁడు= ఆయన; ఎడ= చోటు; ఈఁగాన్= ఇవ్వగా; ఆ తల్పంబునన్= ఆ సెజ్జపై; ఒకదెసన్= ఒక ప్రక్క; ప్రీతహృదయ+ఐ= సంతోషించిన మనస్సు కలదై; శయించెన్= పవ్వళించింది, పండుకొన్నది.

తాత్పర్యం: ధర్మరాజా! రాత్రి అయినందువలన ఆమె చలి పుట్టుతున్నదని చెప్పుతూ అతడి మంచం దగ్గరకు రాగా అతడు అవతలకు జరిగి ఆమెకు చోటిచ్చాడు. ఆమె కూడా సంతోషించి ఒక ప్రక్కగా పండుకొన్నది.

క. పదపడి నయమున మెయిమెయిఁ । గదియించి లతాంగి చిక్కఁ గౌఁగిటఁ జేర్పం,
గదలని చిత్తము గలిగియు, । మద మేమియు లేక, యతఁడు మ్రానై యుండెన్. 14

ప్రతిపదార్థం: పదపడి= తరువాత; నయమునన్= నేర్పుగా; మెయిన్= తన దేహాన్ని; మెయిన్= అతడి శరీరంతో; కదియించి= చేర్చి; లతా+అంగి= తీగవంటి సన్నని శరీరం కలది; చిక్కన్= గట్టిగా; కౌఁగిటన్= కౌగిటిలో; చేర్పన్=

చేర్చుకొనగా; కదలని= చలించని; చిత్తము= మనస్సు; కలిగియున్= ఉండి; మదము= కామవికారం; ఏమియున్= కొంచెంకూడా; లేక= లేకుండా; ద్రమను+ఐ= చెట్టువలె; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: తరువాత నేర్పుగా ఆమె తన శరీరాన్ని అతడి దగ్గరకు చేర్చి గట్టిగా కౌగిలించుకొన్నది. అతడి మనస్సులో చలనం కానీ, మదం కానీ ఏమీ లేక వట్టి కట్టెవలె ఉన్నాడు.

ఆ. అట్టు లున్నఁ జూచి యత్తన్వి 'మగవారు। భోగపరులు, తాల్మి పొలఁతులందుఁ
గలుగు; నవ్విధంబు గాక యేఁ గోరంగ। ననుభవింప కునికి యగునె నీకు? 15

ప్రతిపదార్థం: అట్టులు= ఆ విధంగా; ఉన్నన్= ఉంటే; చూచి; ఆ+తన్వి= ఆ సన్నని శరీరం కలది; మగవారు= పురుషులు; భోగపరులు= భోగాలకు లోబడేవారు; పొలఁతులందున్ = స్త్రీలలో; తాల్మి= ఓర్పు; కలుగున్= ఉంటుంది; ఆ+విధంబు= ఆ పద్ధతి; కాక= కాకుండా; ఏన్= స్త్రీనైన నేను; కోరంగన్= కోరగా; అనుభవింపక+ఉనికి= అనుభవించకుండా ఉండటం; నీకున్; అగునె?= తగునా?

తాత్పర్యం: అప్పు డామె అతడితో అన్నది 'ఇదేమిటి? పురుషులు భోగతత్పరులు. స్త్రీలకు ఓర్పు ఉంటుంది. ఇది లోకంలో పద్ధతి. కాని మనపట్ల అది విపరీతంగా ఉన్నది. స్త్రీనైన నేను నిన్ను కోరగా, అనుభవించకుండా ఉండడం నీకు తగునా?

క. సంపదయు దివ్యభోగము। లింపారఁ బరిగ్రహింపుఁ; డే మీ ధనమై
పం పొనరించెద? ననుఁ గా। రింపక, కైకొని వరింపరే? యిచ్చోటన్. 16

ప్రతిపదార్థం: సంపదయున్= నా ఐశ్వర్యం; దివ్య= దేవలోక సంబంధమైన; భోగములు= అనేక భోగాలు (సుఖాలు); ఇంపారన్= ఇష్టమైనట్లు; పరిగ్రహింపుఁడు= స్వీకరించండి; ఏన్= నేను; మీ ధనమై= మీకు సొమ్మై; పంపు= మీ ఆజ్ఞలను; ఒనరించెదన్= చేస్తాను; ననున్= నన్ను; కారింపక= బాధపెట్టక; కైకొని= అంగీకరించి; ఇచ్చోటన్= ఇక్కడ; వరింపరే?= చేకొనరా?

తాత్పర్యం: నా కున్న ఈ ఐశ్వర్యాన్ని, భోగాలను స్వీకరించండి. నేనూ మీ సొమ్మై మీరు చెప్పిన పనులన్నీ చేస్తాను. నన్ను బాధించక వివాహం చేసికొనండి.

సీ. అనిన నష్టావక్రుఁ 'డతిదూష్యమగు పర। దారాభిగమనంబు దగదు; శూద్ర
సతి యైన నధిక దోషంబు, బ్రాహ్మణపత్ని। యగునేనిఁ బాతక మప్రమేయ;
మదియును గాక, నే నస్ఖలిత బ్రహ్మ। చర్యంబునం దుండి భార్యఁ గోరి
యున్నాఁడ 'ననుడు; 'నీ యొప్పునం దగిలితి। వనితలు గామార్తి వశతఁ బొంది

తే. వంశహాని దలంపరు, వరుస కలుక;। రాత్మజులఁ జూడ; రగ్రజు ననుజుఁ గొనరు
పురుష శతకంబు సంగమంబునను దృప్తి। సనరు; దీని విచారింపు మనియె' నువిద. 17

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అష్టావక్రుఁడు; అతిదూష్యము+అగు= మిక్కిలి నిందించదగిన; పర= ఇతరుడి; దార= భార్యతో; అభిగమనంబు= తిరగటం; తగదు= కూడదు; శూద్రసతి= శూద్రుడి భార్య; ఐనన్= అయితే; అధిక= మిక్కిలి;

దోషంబు= తప్పు; బ్రాహ్మణపత్ని= బ్రాహ్మణుడి భార్య; అగున్+ఏనిన్= అయితే; పాతకము= పాపం; అప్రమేయము= మితిలేనిది; అదియును+కాక= అంతేకాకుండా; ఏను= నేను; అస్ఖలిత బ్రహ్మచర్యంబునందున్= చెదరని బ్రహ్మచర్య వ్రతంలో; ఉండి; భార్యన్+కోరి ఉన్నాడన్= అనుడున్= పత్నిని వాంఛించి ఉన్నాను అనగా; ఉవిద= ఆ స్త్రీ, ఆమె; నీ ఒప్పునన్= నీ అందంలో; తగిలితిన్= చిక్కుకొన్నాను; వనితలు= స్త్రీలు; కామ+ఆర్తి= మన్మథ బాధకు; వశతన్= లోబడటం; పొంది; వంశహాని= కులనాశనం; తలంపరు= భావించరు; వరుసకున్= వావివరుసలకు; అలుకరు= జంకరు; ఆత్మజులన్+ చూడరు= కొడుకులను గమనించరు; అగ్రజున్= అన్నను; అనుజున్= తమ్ముడిని; కొనరు= సరకుగొనరు, లెక్కించరు; పురుషశతకంబు= నూరుమంది మగవారి; సంగమంబునను= రతితో; తృప్తిచనరు= తృప్తిపడరు; దీనిన్= ఈ విషయం; విచారింపుము= ఆలోచించుము; అనియెన్= అనిపల్కింది.

తాత్పర్యం: అష్టావక్రు డన్నాడు 'పరునిభార్యతో పోవటం నింద్యం. శూద్రసతి అయితే మరీపాపం. బ్రాహ్మణ సతి అయితే మహాపాపమే. పైగా నేను బ్రహ్మచారినై భార్యను కోరి ఉన్నాను' అని చెప్పటంతో ఆమె అన్నది 'నేను నీ అందానికి బానిసనై పోయాను. స్త్రీకి కామం కలిగితే వంశహానిని, వావి వరుసలను, అన్నదమ్ములను లక్ష్యపెట్టదు. నూరుమంది మగవారితోనూ తృప్తిపొందదు'. ఈ విషయం ఆలోచించు అన్నది.

వ. అనిన నమ్మునివరుండు. 18

తాత్పర్యం: అనగానే ఆ మునిశ్రేష్ఠుడు.

క. 'ఇది యేటి కార్యముగ నా । మది కెక్కఁగఁ జెప్పె? దిట్టి మాటలుఁ గలవే?

మదవృత్తి మాను; మేఁ బో । యెద' నావుడు నమ్మృగాక్షి యెలన వ్వొలయన్. 19

ప్రతిపదార్థం: ఇది ఏటి కార్యముగన్= ఇదేమంత చేయదగిన పని అయినట్లుగా; నా మదికిన్= నా మనస్సునకు; ఎక్కఁగన్= ఎక్కేటట్లుగా; చెప్పెదు= చెప్పుతావు; ఇట్టి= ఇట్లాంటి; మాటలున్= మాటలు కూడా; కలవే?= ఉన్నవా?; మదవృత్తిన్= మనస్సులోని కామాన్ని; మానుము= వదలుము; ఏన్= నేను; పోయెదన్= పోతాను; నావుడున్= అనగా; ఆ మృగాక్షి= ఆ లేడి కన్నులవంటి కన్నులు కలది; ఎల= లేత; నవ్వు= నగవు; ఒలయన్= (పెదవులపై) వ్యాపించగా.

తాత్పర్యం: 'ఇదేమంత ఘనకార్యమని నా మనసు కెక్కేటట్లు చెప్పుతున్నావు? ఇట్లాంటి మాటలు కూడా ఉంటాయా? నాకు తెలియదా? ఈ కోరికను వదలిపెట్టుము. నేను పోతున్నాను' అని అనగా ఆమె లేత నవ్వు చిందించి.

తే. 'కార్య మగుటయు నరిగెదు గాక పిదప, నిల్వు మంతకు' ననుటయు 'నీవు నన్నుఁ

గదియ కుండెద వేని నిల్చెద; సధర్మ । వృత్తి వగు' మని వారించె నత్తపస్వి. 20

ప్రతిపదార్థం: కార్యము= పని; అగుటయున్= కాగానే; పిదపన్= తరువాత; అరిగెదుగాక= వెళ్ళుదువుగాని; అంతకున్= అందాకా; నిల్వుము= నిలువుము; అనుటయున్= అనగా; నీవు; నన్నున్; కదియక= తాకక; ఉండెదవు+ఏనిన్= ఉంటే; నిల్చెదన్= ఉంటాను; సధర్మవృత్తివి= ధర్మదృష్టి కలదానివి; అగుము= కమ్ము; అని; ఆ+తపస్వి= ఆ ముని; వారించెన్= అడ్డగించాడు.

తాత్పర్యం: 'పనికాగానే పోదువుగానిలే. అందాక ఉండుము' అని ఆమె అనగా, అత డన్నాడు 'నీవు నన్ను తాకకుండా ఉంటే ఉంటాను. ధర్మంగా ప్రవర్తించుము' అని వారించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు వారించి యిది శాపంబున ముదురుదనంబు నొందిన బృందారక సుందరి గావలయు; నట్లయ్యేం గాకుండె, దీని తెఱంగు నా కెఱుంగన్ జాలిం బడనేల?' యని యాత్మ నూహించి యూరకుండె; నంతఁ బ్రభాతం బైనం 'గాలోచిత కృత్యంబులు దీర్పు' మని పలికి యప్పొలంతి యుత్తమ స్నానీయ ద్రవ్యంబులు దెచ్చి, యమ్ముని యనుజ్ఞ వడసి మృదుకరతలంబుల మేను దొడసి కృతస్నానుం జేసి, యతండు సంధ్యావందనాగ్ని కార్యంబు లాచరించిన, నమృతోపమానంబులగు నన్నపానంబుల నతనిం దృప్తునిం గావించి, యుచిత సంభాషణబులం బ్రొద్దు పుచ్చి నిశాసమయం బగుటయు శయనంబునకుఁ బిలిచిన నా సుశ్లోకుండు రాకున్న 'నేనుం గన్యక; నస్ఖలిత బ్రహ్మచర్యంబునన చూవె పరిణత వయస్కనైతి; స్వతంత్ర నై యుండుదుం; బాణిగ్రహణ మహోత్సవం బనుభవింపు' మని పలికిన నమ్మహాత్ముం డిట్లనియె. 21

ప్రతిపదార్థం: ఇట్లు వారించి; శాపవశంబునన్= శాపవశాత్తు; ఇది= ఈమె; ముదురుదనంబు= గట్టివయస్సు; ఒందిన= పొందిన; బృందారక= దేవజాతి; సుందరి= అందగత్తె; కావలయున్ అయి ఉండవలెను; అట్లు+అయ్యెన్ అట్లాగే కావచ్చు; కాక+ఉండెన్= కాకపోవచ్చు; నాకున్= నాకు; దీనితెఱంగు= దీని జన్మకథ; ఎఱుంగన్= తెలిసికొనటానికి; జాలిన్+పడన్+ఏల?= జాలిపొందటం దేనికి?; అని; ఆత్మన్= తనలో; ఊహించి= ఆలోచించుకొని; ఊరకుండెన్= మిన్నకున్నాడు; అంతన్= అటుపిమ్మట; ప్రభాతంబు+ఐనన్= తెల్లవారగా; కాల+ఉచిత= ఆ సమయానికి తగిన; కృత్యంబులు= చేయదగిన పనులు; తీర్పుము;+అని+పలికి; ఆ+పొలంతి= ఆ స్త్రీ; ఉత్తమ= శ్రేష్ఠమైన; స్నానీయ= స్నానయోగ్యమైన; ద్రవ్యంబులు= వస్తువులు; తెచ్చి; ఆ+ముని; అనుజ్ఞ= అనుమతి; పడసి= పొంది; మృదు= మెత్తని; కరతలంబులన్= చేతులతో; మేను= శరీరాన్ని; తొడసి= తడిపి; కృతస్నానున్చేసి= స్నానంచేయించి; అతండు= ఆయన; సంధ్యావందన+అగ్నికార్యంబులు= బ్రాహ్మణ కర్మలైన ప్రాతఃకాలసంధ్యావందనం, అగ్నిహోత్రాదులు; ఆచరించినన్= చేయగా; అమృత+ఉపమానంబులు+అగు= అమృతం వంటి; అన్నపానంబులన్= అన్న, పానీయాలతో; అతనిన్; తృప్తునిన్= తృప్తి పొందినవాడిని; కావించి= చేసి; ఉచిత= తగిన; సంభాషణంబులన్= మంచిమాటలతో; ప్రొద్దుపుచ్చి= ప్రొద్దుగడిపి; నిశాసమయంబు= రాత్రి; అగుటయున్= కాగా; శయనంబునకున్= తనపడకకు; పిలిచినన్= పిలిస్తే; ఆ సుశ్లోకుండు= ఆ స్తుతింప దగ్గవాడు; రాకున్నన్= రాకపోతే; నేనున్= నేనుకూడా; కన్యకన్; అస్ఖలిత= చెదరని; బ్రహ్మచర్యంబునన= బ్రహ్మచర్యంలోనే; పరిణత= ముదిరిన; వయస్కను= వయస్సు కలదానను; ఐతిన్+చూవె= అయినాను సుమా!; స్వతంత్రను+ఐ+ఉండుదున్= నా ఇష్టం చొప్పున ప్రవర్తిస్తాను; పాణిగ్రహ+మహా+ఉత్సవంబు= పెండ్లి సంబరం; అనుభవింపుము= పొందుము; అని పల్కినన్; ఆ+మహా+ఆత్ముండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా వారించి 'ఈమె శాపవశాత్తు ఇట్లా ముదిరిపోయిన దేవకాంత కాబోలు! అట్లా కాదేమో. ఏమైనా దీని ఆలోచనతో నేను సతమతం కావటం దేనికి?' అని ఆలోచిస్తూ అతడు ఊరుకొన్నాడు. అంతలో తెల్లవారింది. ఆమె అతడితో అన్నది 'ఈ సమయానికి తగిన పనులన్నీ పూర్తి కానిమ్ము' అని. అతడి స్నానానికి ఏర్పాట్లు చేసి, అతడి అనుమతితో తన మెత్తటిచేతులతో అతని శరీరం రుద్ది స్నానం చేయించింది. అతడు తరువాత ప్రాతఃకాల విధ్యుక్త కర్మలు పూర్తి చేసుకొన్నాక అతడిని అన్నపానాలతో తృప్తిపరచి మంచి మాటలతో ప్రొద్దు గడపింది. తరువాత రాత్రి కాగా ఆమె తనపడకకు రమ్మన్నది. అతడు కదలలేదు. అప్పు డామె 'నేను బ్రహ్మచర్య వ్రతంలోనే జీవితాన్ని గడిపాను. అందువలననే నా కింత వయసు వచ్చింది. నన్ను వివాహం చేసికొమ్ము' అంటే ఆ మహాత్ము డిట్లా అన్నాడు.

తే. 'బాల్యమునఁ దండ్రి, యౌవనప్రాప్తి మగఁడు, । వార్ధకంబునఁ దనయుఁడు, వామనయన
నరసి నడపన కా కెందు నంగనలకు । వలసినట్టులు సేయఁగా వచ్చు నెట్లు? 22

ప్రతిపదార్థం: వామనయనన్= అందాల కళ్ళు కల స్త్రీని; అరసి= కాపాడి; నడపన= జీవించేటట్లుగా (చేసేవారు); తండ్రి; బాల్యమునన్= పసితనంలో; మగఁడు= భర్త; యౌవనప్రాప్తిన్= యుక్తవయస్సులో; తనయుఁడు= కొడుకు; వార్ధకంబునన్= ముసలితనంలో; కాక; ఎందున్= ఎప్పుడూ; అంగనలకున్= స్త్రీలకు; వలసినట్టులు= వారు ఇష్టం వచ్చినట్లు; చేయఁగాన్= చేయటానికి; ఎట్లు వచ్చున్= ఎట్లా వీలౌతుంది?

తాత్పర్యం: 'స్త్రీకి పసితనంలో తండ్రి, వివాహమైన తరువాత భర్త, ముసలితనంలో కొడుకు రక్షిస్తారు తప్ప ఆమెకు స్వతంత్రంగా ఏమీ చేయటానికి వీలు లేదు కదా!

వ. 'కావున నీవు ని న్నిచ్చినం బరిగ్రహించుట పాడిగా' దను సమయంబునం జూడఁ జూడ నచ్చేడియ సుభగ యౌవన సుందరాంగియు మనోహర విలాస భంగియు నయ్యె; నైనను దానియందుఁ దగులని చిత్తంబుతో నత్తపోధన కుమారుండు. 23

ప్రతిపదార్థం: కావునన్= కనుక; నీవు= నీకై నీవు; నిన్ను ఇచ్చినన్= నిన్ను సమర్పించుకొన్నా; పరిగ్రహించుట= నేను స్వీకరించటం; పాడికాదు= న్యాయం కాదు; అను= మాట లంటున్న; సమయంబునన్= వేళలో; చూడన్+చూడన్= చూస్తూ ఉండగా; ఆ+చేడియ= ఆ స్త్రీ; సుభగ= అందమైన; యౌవన= యుక్త వయస్సులో; సుందరాంగియున్= అందమైన అవయవాలు కలది; మనోహర విలాసభంగియున్= అందమైన ఒయ్యారం కలదీ; అయ్యెన్= అయింది; ఐనను= అయినప్పటికి; దానియందున్= ఆమెపై; తగులని= ఆసక్తి పొందని; చిత్తంబుతోన్= మనస్సుతో; ఆ+తపోధన కుమారుండు= తపస్సే సంపదగా కల ఋషి కొడుకు, మునికుమారుడు.

తాత్పర్యం: 'కాబట్టి స్వతంత్రించి నీకై నిన్ను అర్పించుకొన్నా నేను స్వీకరించలేను. అది న్యాయం కాదు' అని అంటూ ఉండగానే ఆమె వికసించిన యౌవనం అందమైన అవయవాలూ, మనస్సును హరించే విలాసం కలదీ అయింది. ఐనప్పటికీ అతడు చలించలేదు.

క. 'ఈ యనృత వర్తనము లే । లా? యున్న నిజంబు నీ తలంపును నిన్నుం
దోయజలోచన! చెప్పుము; । పోయెదఁ బనులు గల; వనిచి పుచ్చుము నన్నున్. 24

ప్రతిపదార్థం: ఈ అనృత= ఈ అబద్ధపు; వర్తనములు= చేష్టలు; ఏలా?= ఎందుకు?; ఉన్న నిజంబు= కలమాట; నీ తలంపును= నీ ఆలోచన; నిన్నున్= నీ వెవరవో, నిన్ను గురించి; తోయజలోచన!= తామరపూలవంటి కళ్ళున్నదానా!; చెప్పుము; పోయెదన్= పోతాను; పనులు కలవు= చేయవలసిన కార్యాలు ఉన్నాయి; నన్నున్; అనిచి పుచ్చుము= నన్ను సాగనంపుము.

తాత్పర్యం: 'ఈ అబద్ధపు చేష్టలు దేనికి? నీ సంగ తేమిటి? నీ వెవరవు? వివరంగా చెప్పుము. నాకు చాల పనులు ఉన్నాయి. కనుక నన్ను పంపించు పోతాను'.

సీ. అనవుడుఁ బ్రీతయై 'యనఘ! ని న్నారయు । తలఁపునఁ జూవె వదాన్యుఁ డిందుఁ
బుత్తెంచె; నేను నీ యుత్తరదిశఁ జుమ్ము; । నీ నిష్ఠ గాంచితి; దీన నతఁడు

నిను మెచ్చు; నాదెస మనమునఁ బ్రియమొందు; । మరుగుము సుప్రభా పరిణయమున'

కనిన నద్దేవికి వినతుఁడై, వీడ్కొని । యరిగి, యమ్మునిపతి, యాత్మఁ గనియుఁ

తే. దన్ను నడుగంగ సకలవృత్తంబుఁ జెప్పి । యతని పుత్త్రికఁ బెండ్లియై యతుల ధర్మ

భోగ గౌరవకీర్తులఁ బొంది జగతి । నతిశయిల్లె నష్టావక్రుఁ డధిపముఖ్య!' 25

ప్రతిపదార్థం: అనవుడున్= అని పల్కగా; అధిపముఖ్య!= రాజశ్రేష్ఠుడా!; ప్రీత+ఐ= సంతోషించినదై; అనఘ!= పుణ్యాత్ముడవైన అష్టావక్ర మునీంద్రా!; నిన్నున్; అరయు తలఁపునన్= పరీక్షించే ఆలోచనతో; చూవె= సుమా!; వదాన్యుఁడు= సుప్రభ తండ్రి; ఇందున్= ఇక్కడకు; పుత్తెంచెన్= నిన్ను పంపించాడు; నేను; ఈ ఉత్తర దిశన్ చుమ్మి= ఈ ఉత్తర దిక్కాంతను సుమా!; నీనిష్ఠ=నీ బ్రహ్మచర్య నియమం; కాంచితిన్= పరీక్షించాను; దీనన్= ఈ పరీక్షవలన; అతఁడు= వదాన్యుడు; నినున్ మెచ్చున్= నిన్ను మెచ్చుకొంటాడు; నా దెసన్= నా యందు; మనమునన్= మనస్సులో; ప్రియము+ఒందుము= ప్రీతిపొందుము; సుప్రభా పరిణయమునకున్= సుప్రభను వివాహం చేసికొనటానికి; అరుగుము= వెళ్ళుము; అనినన్; ఆ+దేవికిన్= ఆ దేవతకు; వినతుఁడు+ఐ= నమస్కరించి; వీడ్కొని= ఆమెవద్ద సెలవు పుచ్చుకొని; అరిగి= వెళ్ళి; ఆ+మునిపతి= ఆ వదాన్యుడన్న మునిరాజు; ఆత్మన్= తనలో; కనియున్= జరిగిన కథనంతా చూచికూడా; తన్నున్= అష్టావక్రుడిని; అడుగంగన్= అడుగగా; సకల వృత్తంబున్= జరిగినదంతా; చెప్పి= తెలిపి; అతని; పుత్రికన్= అతని కుమార్తెను; పెండ్లి+ఐ= వివాహం చేసికొని; అతుల= సాటిలేని; ధర్మ= ధర్మం; భోగ= సుఖాలు; గౌరవ= గౌరవం; కీర్తులన్= కీర్తిని; పొంది; జగతిన్= లోకంలో; అష్టావక్రుఁడు; అతిశయిల్లెన్= గొప్పవాడయ్యాడు.

తాత్పర్యం: అనేసరికి ఆమె సంతోషించి 'నిన్ను పరీక్షించే నిమిత్తం వదాన్యుడు న న్నిక్కడకు పంపించాడు. నేను ఉత్తర దిక్కాంతను. నీ నియమం చూచాను. దీనితో వదాన్యుడు సంతోషిస్తాడు. నాయందు ప్రీతినెరపుము. వెళ్ళి సుప్రభను వివాహం చేసికొను' మనగా అతడు ఆమెకు నమస్కరించి వెళ్ళి వదాన్యుడికంతా చెప్పి అతడి కూతుర్ని వివాహం చేసికొని గొప్ప ధర్మపరుడుగా గౌరవమర్యాదలతో కీర్తిపొందాడు'.

వ. అని యష్టావక్రదిశా సంవాదంబు సెప్పిన విని యప్పాండవాగ్రజుండు 'మునులవలన శూద్రజాతి భామలయందుఁ బ్రభవించిన వారికి బ్రహ్మర్షిత్వంబు గల్గుట యది యెట్లొకో'! యని వితర్కింతు; నత్తెఱంగు నాకెఱింగింపవే!' యని యనిమిషనదీనందను నడుగుటయు, నక్కురుపతికిఁ గురుపితామహుం డిట్లనియె. 26

ప్రతిపదార్థం: అని= అంటూ; అష్టావక్రదిశా సంవాదంబు= అష్టావక్రునకు ఉత్తరదిక్కాంతకు జరిగిన సంభాషణ; చెప్పినన్ విని= భీష్ముడు తెల్పగా ఆలకించి; ఆ+పాండవ+అగ్రజుండు= ఆ పాండవులలో పెద్దవాడు; మునులవలనన్= మునులద్వారా; శూద్రజాతి భామలయందున్= నాలుగవజాతి స్త్రీలలో; ప్రభవించిన= పుట్టిన; వారికిన్, బ్రహ్మర్షిత్వంబు= బ్రహ్మర్షిత్వం; కల్గుట= సంభవించుట; ఎట్లు+ఒకో!= ఎట్లాగబ్బా!; అని; వితర్కింతున్= ఆలోచిస్తాను; ఆ+తెఱంగు= ఆ విధానం; నాకున్; ఎఱింగింపవే= తెలుపవా; అని; అనిమిషనదీ నందనున్= గంగాపుత్రుడైన భీష్ముడిని; అడుగుటయున్= అడుగగా; ఆ+కురుపతికిన్= ఆ కురువంశ చక్రవర్తి అయిన ధర్మజుడితో; కురుపితామహుండు= కురువంశస్థులకు తాత ఐన భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అష్టావక్రుడికి దిశాకన్యకు జరిగిన సంవాదం చెప్పగా విని ధర్మరాజు ఇట్లా అడిగాడు; 'మునుల వలన శూద్రస్త్రీలకు కలిగిన సంతానం బ్రహ్మర్షులు ఎట్లా కావటం? అని నాకు చాలా రోజులుగా ఆలోచన తెగటం లేదు. దీని రహస్యం విప్పి చెప్పు' మని. భీష్ముడు ఇట్లా అన్నాడు.

సీ. నాలుగు జాతుల నాతులు, విప్రున । కాండ్రుగాఁ గైకొన నగు; నృపునకుఁ
దనకులంబున నట తక్కువ కులములు । రెంటను బరిణయశ్రీ వహింపఁ
జను; వైశ్యునకు నాత్మజాతి, శూద్రాన్వ యం । బునఁ బెండ్లి గాఁ దగు భూపవర్య!
శూద్రున కర్థంబు శూద్రకన్యకఁ బెండ్లి । యగుటయు; నిది వివాహ ప్రకార

ఆ. కథిత ధర్మ; మిట్టిగతిఁ దప్పి ప్రతిలోమ । సరణి యైనఁ, గల్గు సంకరంబు;
తల్లి యెట్టి కులము దాని కులంబ యౌ । సన్నుతానులోమ సంభవునకు. 27

ప్రతిపదార్థం: విప్రునకున్= బ్రాహ్మణుడికి; నాలుగు జాతుల= నాలుగు వర్ణాల; నాతులు= స్త్రీలను; ఆండ్రు+కాన్= భార్యలుగా; కైకొనన్= స్వీకరించటానికి; అగున్= తగును; నృపునకున్= రాజునకు; తన కులంబునన్= తన క్షత్రియ కులంకంటె; అట తక్కువ= ఆ తక్కువ; కులములు రెంటను= రెండు కులాలనుండి; పరిణయశ్రీ= వివాహ మంగళం; వహింపన్ చనున్= చేసికొనవచ్చును; వైశ్యునకున్= కోమటికి; ఆత్మ జాతిన్= తమ కులంలో; శూద్ర+అన్వయంబునన్= శూద్రకులంలోను; పెండ్లికాన్= పెండ్లి అగుట; తగున్= న్యాయం; భూపవర్య!= రాజశ్రేష్ఠుడా!; శూద్రునకున్; శూద్రకన్యకన్= తమకులం పిల్లనే; పెండ్లిఅగుటయున్= వివాహం చేసికొనటమే; అర్థంబు= యుక్తము; ఇది= ఇయ్యది; వివాహప్రకార= వివాహ విధానంగా; కథిత= చెప్పబడిన; ధర్మము= న్యాయం; ఇట్టి= ఇట్లాంటి; గతిన్= పద్ధతిని; తప్పి= త్రోసిరాజని; ప్రతిలోమ సరణి= పై కులాలవారిని క్రిందికులాలవారు చేసికొనటం; ఐనన్= అయితే; సంకరంబు= వర్ణసాంకర్యం (కులాలన్ని కలగాపులగంగా కలిసిపోవటం); కల్గున్= అవుతుంది; తల్లి; ఎట్టికులము= ఏ కులందో; దాని= తల్లి; సన్నుత= పొగడ దగిన; అనులోమ= పై కులం వారినుండి; సంభవునకున్= పుట్టిన వానికి; కులంబ ఔ= కులమే అవుతుంది.

తాత్పర్యం: బ్రాహ్మణుడైతే నాలుగు కులాల వారినీ పెండ్లి చేసికొనవచ్చును. క్షత్రియుడైతే మూడు కులాల నుండి, వైశ్యుడు రెండు కులాల నుండి, శూద్రుడు తన కులంనుండి మాత్రమే వివాహం చేసికొనటం ధర్మం. ఇది తప్పితే వర్ణసాంకర్యం కలుగుతుంది. ప్రతిలోమ వివాహం పనికిరాదు. అనులోమ వివాహమే అయితే తల్లి ఏ కులానికి చెందిందో ఆమె యొక్క కులమే సంతానానిది ఔతుంది.

విశేషం: ప్రతిలోమం= క్రమంగా క్రిందికి రావటం - అవరోహణ క్రమం. అనులోమ= ఆరోహణ క్రమం. క్రమంగా పైకిపోవటం.

వ. ఇది సకలజన సామాన్యంబైన తెఱంగు; విశేషించి ముని సత్తముల యుత్తమ తపోజ్ఞాన విద్యాప్రభావంబులం జేసి తదీయబీజ సంజాతులు యోని యెద్దియైనను బ్రాహ్మణుల యగుదురు; మహా క్షత్రియులు ననులోమవృత్తి నాత్మ ప్రభావంబులం జేసి నిజబీజ సంజనితులకుఁ దమకులంబ కలిగింపం జాలుదురు; నీవు వియోని జాతులని శంకించి యడిగితివి; వారల యేల? పశు యోని జాతులు నయోనిజాతులును లోనుగా సద్విజులును రాజవరులు నగుట గన్నదిగాదె! కావున మునివరుల నృపవరుల వలనం గలిగిన జన్మంబులెల్లను; బీజ ప్రధానంబులై యతిశయిల్లు; వినుము వసిష్ఠుండు, ఋశ్యశృంగుం, డగస్త్యుండు, సత్యవత్యుద్భవుం డగు కృష్ణద్వైపాయనుండు, మందపాలనందనులు, మఱియు ద్రోణ కృపాదులుం, బ్రభవించిన భంగులు విందుమకాదె! వార లెట్టెట్టి వారయి రెఱుంగవె? యివ్విషయంబున మనువాక్యంబు గల దాకర్ణింపుము. 28

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇది= ఇయ్యది; సకల జనసామాన్యంబు+ఐన= మానవులందరకు సంబంధించినదైన; తెఱంగు= పద్ధతి; విశేషించి= ప్రత్యేకించి; మునిసత్తములు= మునిశ్రేష్ఠుల; ఉత్తమ= గొప్ప; తపః= తపస్సు; జ్ఞాన= జ్ఞానం; విద్యా=చదువు; ప్రభావంబులన్+చేసి= మాహాత్మ్యంవలన; తదీయ= ఆ; బీజ= విత్తు వలన; సంజాతులు= చక్కగా పుట్టినవారు; యోని= క్షేత్రం(భార్య); ఎద్దిఐననున్= ఏదైనా; ఏ కులస్త్రీఅయినా; బ్రాహ్మణుల= బ్రాహ్మణులే; అగుదురు= ఔతారు; మహాక్షత్రియులు= మహారాజులు; అనులోమ వృత్తిన్= ధర్మప్రకారంగా; ఆత్మ= తమ ఆత్మల; ప్రభావంబులన్+చేసి= శక్తితో; నిజ= తమ; బీజ= గింజ వలన; సంజనితులకున్= పుట్టినవారికి; తమకులంబ= తమ వర్ణం; కలిగింపన్+చాలుదురు= కలిగిస్తారు; నీవు; వియోని= విరుద్ధ క్షేత్రంలో; జాతులు= పుట్టినవారు; అని శంకించి= అని సందేహించి; అడిగితివి= అడిగావు; వారలు+అ ఏల?= వారిలోనే ఎందుకు? పశుయోని జాతులు= పశు సంతానం; అయోనిజాతులును= గ్రుడ్డునుండి పుట్టినవారు; లోనుగాన్= మొదలైన; సద్విజులు= మంచి విప్రులు; రాజవరులున్= రాజశ్రేష్ఠులు; అగుట; కన్నదికాదె!= చూచిందే కదా! కావున; మునివరుల, నృపవరుల వలనన్= మునిశ్రేష్ఠులవలన, రాజశ్రేష్ఠులవలన; కలిగిన= ఏర్పడిన; జన్మంబులు+ఎల్లను= పుట్టుక లన్నియూ; బీజప్రధానంబులు+ఐ= క్షేత్రంకంటె బీజం ముఖ్యమైనవై; అతిశయిల్లున్= ప్రకాశిస్తాయి; వినుము= ఆలకింపుము; వసిష్ఠుండు; ఋశ్యశృంగుండు; అగస్త్యుండు; సత్యవతి+ఉద్భవుండు= సత్యవతికి పుట్టినవాడు; అగు= ఐనట్టి; కృష్ణ ద్వైపాయనుండు మందపాలనందనులు; మఱియున్= ఇంకను; ద్రోణకృప ఆదులున్= ద్రోణుడు, కృపుడు మొదలైనవారు; ప్రభవించిన= పుట్టిన; భంగులు= పద్ధతులు; విందుము+అ కాదె= విన్నారముగదా! వారలు= వారు; ఎట్టి+ ఎట్టివారు+అయిరి= ఎంతటివారలైనారో; ఎఱుంగవె= నీకు తెలియదా?; ఈ+విషయంబునన్= ఈ సంగతియందు; మనువాక్యంబు= స్మృతికారుడైన మనువు చెప్పిన మాట; కలదు= ఉన్నది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇది సామాన్యధర్మం. విశేషధర్మాలు వేరు. మునిశ్రేష్ఠులు ఉత్తమ తపస్సు, జ్ఞానం, విద్యలు కలవారు కనుక వారి బీజశక్తిచేత పుట్టినవారు బ్రాహ్మణులే ఔతారు. తమ తల్లి లక్షణాలు రావు. అట్లాగే ఉత్తమ క్షత్రియులు కూడా తమ బీజశక్తి చేత అనులోమ పద్ధతిచేత తమ కులాన్నే కలిగించగలరు. నీవు విరుద్ధ క్షేత్రంలో పుట్టుతారు కదా అని శంకించి అడిగావు. కాని, పశుపక్ష్యాదులలో కూడా మహాబ్రాహ్మణులు, రాజులు జన్మించటం మనకు తెలుసును కదా! కాబట్టి మునులకు, రాజులకు కలిగిన సంతానం బీజ ప్రధానమే. వసిష్ఠుడు, ఋశ్యశృంగుడు, అగస్త్యుడు, వ్యాసమహర్షి, మందపాలుడి సంతానం, ద్రోణుడు, కృపుడు మొదలైన వారు పుట్టిన కథలు విన్నాం కదా! వారలు ఎట్లాంటివారైనారో నీకూ తెలుసును కదా! ఈ సందర్భంలో మనువు చెప్పిన మాటలు వినుము.

క. మునిజనుల, నదుల, సిద్ధుల । జననంబులు బుద్ధి వృత్తిఁ జర్చింపఁగ నె
వ్వనికిన్ వశంబు గా; వవి । తనతన యైనట్ల యై యుదాత్తతఁ బొందున్.' 29

ప్రతిపదార్థం: ముని జనుల= మునులైన మానవుల యొక్క; నదుల= నదులయొక్క; సిద్ధుల= యోగులయొక్క; జననంబులు= పుట్టుకలు; బుద్ధివృత్తిన్= ఆలోచనలతో; చర్చింపఁగన్= తర్కించటానికి; ఎవ్వనికిన్= ఎంతటి వానికిని; వశంబు కావు= వీలు కావు; అవి= అయ్యవి; తన తన+ఐనట్ల+ఐ= తమంత తామై; ప్రత్యేకంగా; ఉదాత్తతన్= గౌరవం; పొందున్= పొందుతాయి.

తాత్పర్యం: మునుల, నదుల, సిద్ధుల జన్మ రహస్యాలు మనబుద్ధికి తోచినట్లు చర్చించటానికి వీలుకావు. అవి ప్రత్యేకమైనవై తమంత తాము గౌరవాన్ని పొందుతాయి'.

విశేషం: ఏరుల జన్మంబు వీరుల జన్మంబు అని నన్నయ్యగా రన్నారు.

వ. అనిన విని యుధిష్ఠిరుండు. 30

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు (ఇట్లా అడిగాడు)

ఆ. 'అనఘ! దానపాత్ర మగుట విప్రుఁడు లింగి। యైననో యలింగుఁ డై చరించు
టనో యెఱుంగఁ జెప్పు' మనవుడు గాంగేయుఁ। డిట్టు లనియె నమ్మహీశ్వరునకు. 31

ప్రతిపదార్థం: అనఘ!= మహాత్మా!; విప్రుఁడు= బ్రాహ్మణుడు; దానపాత్రము= దానమునకు యోగ్యుడు; అగుట= కావటం; లింగిఐననో= లింగవృత్తి కలవాడు కావటంవలననా! (లింగవృత్తి= ఆచారపరంగా బాహ్యంగా జీవించేవాడు); అలింగుఁడు+ఐ= సన్న్యాసియై, విరక్తుడై; చరించుటనో= తిరగటం వలననా; ఎఱుంగన్= తెలిసేటట్లు; చెప్పుము; అనవుడున్= అనగా; గాంగేయుఁడు= భీష్ముడు; ఆ+మహీశ్వరునకున్= ఆ రాజుతో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'బ్రాహ్మణుడు దాన యోగ్యుడు కావటం వాడి వృత్తి విశేషంతోనా? లేక విరక్తుడై బ్రతకటంవలననా?' - అని ధర్మరాజు ప్రశ్నిస్తే గంగాపుత్రుడు ఇట్లా అన్నాడు.

విశేషం: లింగం= గుర్తు; బ్రాహ్మణుడు ఆచారాలు (లింగం) బాహ్యంగా అనుసరిస్తూ జీవించేవాడు. ఆలింగుడు= బాహ్యమైన గుర్తులు ఏమీ లేకుండా విరక్తబుద్ధితో జీవించేవాడు.

భీష్ముఁడు ధర్మరాజునకు దానపాత్రభూతుల తెఱం గెఱింగించుట (సం.13-23-1)

క. 'విను, సద్విజుండు, నిజవ। ర్తనమునఁ జరియించుచున్న దానార్హత్వం
బున వెలుఁగు, లింగియైనను। మనుజేంద్ర! యలింగవృత్తి మహితుం డేనిన్'. 32

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్ర!= మానవులకు అధిపతివైన రాజా!; విను= వినుము; సత్= మంచి; ద్విజుండు= బ్రాహ్మణుడు; లింగిఐననున్= బాహ్యాచార సంపన్నుడైనా; నిజ= తన కులానికి తగిన; వర్తనమునన్= ప్రవర్తనతో; చరియించుచున్+ఉన్నన్= బ్రతికితే; అలింగవృత్తి= బాహ్యచిహ్నాలు లేని, విరక్త చిత్తంతో; మహితుండు+ఏనిన్= గొప్పవాడైతే; దాన+అర్హత్వంబునన్= దానానికి యోగ్యమైన లక్షణంతో; వెలుఁగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: 'తన కులానికి తగిన ఆచార వ్యవహారాలతో బ్రతుకుతూ; బాహ్యవేషధారణాదులు కల్గియున్నా ఆంతరంగికంగా వీటన్నింటికి అతీతమైన ఔన్నత్యం గలవాడైతే అతడు దానయోగ్యుడు.

వ. అనుటయుఁ బాండవాగ్రజుండు. 33

తాత్పర్యం: అని అనగా విని ధర్మరాజు.

తే. శ్రద్ధ సాలంగఁ గల్గిన జనము లిచ్చు। భూరిదానముల్ దురితంబుఁ బొంద నేర
వేయెడల నని తలఁచెద నేను బుద్ధి। ననుడు నాతని కతఁ డిట్టు లను నృపాల! 34

ప్రతిపదార్థం: నృపాల!= రాజా!; శ్రద్ధ= విశ్వాసం; చాలంగన్= ఎక్కువ; కల్గిన= ఉన్న; జనములు= మనుష్యులు; ఇచ్చు= ఇచ్చే; భూరి= పెద్ద; దానముల్= దానాలు, ఏ+ఎడలన్= ఏ సందర్భంలోనూ; దురితంబున్= పాపమును; పొందనేరవు; అని;

ఏను= నేను; బుద్ధిన్= మనస్సులో; తలంచెదన్= అనుకొంటాను; అనుడున్= అనగా; ఆతనికిన్= ధర్మరాజుతో; అతఁడు= భీష్ముడు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: రాజా! 'శ్రద్ధతో జనాలిచ్చే గొప్పదానాలు పాపం పొందవని అనుకొంటాను' అని ధర్మరాజు అనగా భీష్ముడు ఇట్లా అన్నాడు.

క. 'నరవర! దుర్దాంతు లయినఁ। బరిపూతులు శ్రద్ధ గల్గు భవ్యులుఁ దా రా
దర మొప్ప నిచ్చు దానము। దురితహరమ కాక, కీడు దొడరునె యెందున్?' 35

ప్రతిపదార్థం: నరవర!= మానవశ్రేష్ఠుడా!; రాజా!; దుర్దాంతులు= అణచరాని గొప్పతనం కలవారు; అయినన్= అయితే; పరిపూతులు= పవిత్రులు; శ్రద్ధ= విశ్వాసం; కల్గు= కలిగిన; భవ్యులు= మహాత్ములు; తారు= తాము; ఆదరము= ప్రేమ; ఒప్పన్= ప్రకాశించగా; ఇచ్చు= ఇచ్చే; దానం; దురితహరమ కాక= పాపం పోగొట్టేదే తప్ప; కీడు= ఆపద; ఎందున్= ఎక్కడైనా; తొడరునె?= కలుగునా;

తాత్పర్యం: 'రాజా! మహాపవిత్రులు, శ్రద్ధ కలిగినవారు, ఆదరంతో చేసిన దానం పాప పరిహారం చేస్తుందే తప్ప పాపం కలిగించదు.'

సీ. అనుడు ధర్మాత్మజుఁ డతనితో 'దైవ కా। ర్యము నప్డు, విప్రుని నతిపరీక్షి
తునిఁ జేయ వలయునే? యనఘ! పైతృకము వి। ధంబున నన్న నాతండు, నీవు
దలఁచిన యట్టిద తగవు?' నావుడు నా నృ। పాలుం 'డపూర్వ సంబంధి సూరి
యాజి తపోనిత్యులందు సత్పాత్రము। లెవ్వార?' లనుటయు 'నింతవట్టు

తే. వారు సత్పాత్రముల, వంశవర్య ధర్మ। భాషణమ కాని తత్క్రియాపరత లేని
యట్టివానికి నరుఁడు హేమాదు లిచ్చి। పొరయుఁ బదియేండ్లు నరకానుభూతి' ననియె. 36

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; ధర్మ+ఆత్మజుఁడు= యముని కొడుకు ధర్మరాజు; అతనితోన్= భీష్ముడితో; అనఘ!= దోషరహితుడా! పైతృకము విధంబునన్= పితృకార్యములోవలెనే, శ్రాద్ధక్రియలోమాదిరిగా; దైవకార్యము+అప్డు+అ= దేవతా పూజయందును; విప్రునిన్= బ్రాహ్మణుని; అతిపరీక్షితునిన్= మిక్కిలి పరీక్షించబడినవానిగా; చేయన్+వలయునే= చేయవలెనా? (దైవకార్యం= దేవతాపూజ; పైతృకము= పితృకార్యం; శ్రాద్ధం మున్నగునది) అన్నన్= అని ప్రశ్నించగా; ఆతండు= భీష్ముడు; నీవు= ఓ ధర్మజా నీవు; తలఁచిన+అట్టిది= భావించి నట్టిది; తగవు= న్యాయము; నావుడున్= అని భీష్ముడు అనగానే; ఆ నృపాలుండు= రాజైన ధర్మతనయుడు; అపూర్వ= పూర్వపరిచయం లేనివాడు; సంబంధి= చుట్టము; సూరి= పండితుడు; యాజి= యజ్ఞం చేసినవాడు; తపోనిత్యులు= నిత్యం తపస్సు చేసేవాడు; అందున్= వీరిలో; సత్+పాత్రములు= దానం పుచ్చుకొనటానికి యోగ్యులు; ఏ+వారలు= ఎవ్వరు; అనుటయున్= అని అడిగితే; ఇంతవట్టువారు= నీవు చెప్పిన వారంతా; సత్పాత్రములు+అ= మిక్కిలి అర్హులే; వంశవర్య= కులోద్ధారకుడవైన ధర్మజా!; ధర్మ భాషణము+అ+కాని= మాటలలో ధర్మమే తప్ప; తత్+క్రియాపరత= ధర్మసంబంధ కార్యకలాపములపట్ల ఆసక్తి; లేని+అట్టివానికిన్= లేనటువంటివాడికి; నరుఁడు= మనుజుడు; హేమ+ఆదులు= బంగారం మొదలైనవి; ఇచ్చి= దానంచేసి; పది+ఏండ్లు= దశవర్షాలు; నరక+అనుభూతిన్= నరకలోకానుభవం, నరకబాధలు; పొరయున్= పొందుతాడు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు. పితృకార్యంలో వలెనే దేవకార్యంలోనూ బ్రాహ్మణుడిని నిశితంగా పరీక్ష చేసికొని దానాదులివ్వాలా అనగా భీష్ముడు "నీ యాలోచన సరైనదే అని పలికాడు. ధర్మరాజు మరల ఇట్లా అడిగాడు. పూర్వపరిచయం లేనివారు చుట్టాలు, పండితులు, యజ్ఞం చేసినవారు, తపస్వులు వీరిలో ఎవరు దానయోగ్యులు? అని. అందుకు భీష్ముడు "వీళ్లంతా దానయోగ్యులేనని చెప్పి" ఎవడు ధర్మపన్నాలు పలుకుతూ ధర్మాన్ని ఆచరించడో వా డయోగ్యుడు. వాడికి బంగారం మొదలైనవి దానమిస్తే పదేళ్ల నరకలోకానుభవం తప్పదు అన్నాడు.

వ. అని భీష్ముఁడు వెండియు. 37

తాత్పర్యం: అని భీష్ముడు పలికి ఇంకా (ఇట్లా అన్నాడు).

క. 'ధరణియుఁ, గాశ్యప, వైశ్వా । నర, మార్కండేయు లోలిన జగద్ధిత వా

క్పరులై రొక్కెడ; వారొక । మరి గోష్ఠీనిరతి నుండి మనుజాధీశా! 38

ప్రతిపదార్థం: మనుజ+అధి+ఈశా!= ప్రజలకు అధిపతివైన ధర్మజా! ధరణియున్= భూదేవి; కాశ్యప= కాశ్యప మహర్షి; వైశ్వానర= అగ్ని; మార్కండేయులు= మార్కండేయ మహర్షి; ఓలిన= క్రమంగా; వారు= వారలు; ఒకమరి= ఒకసారి; గోష్ఠీనిరతిన్+ఉండి= చర్చా సమావేశంలో ఉన్నవారై; జగత్+హిత= లోకానికి మేలుకూర్చే; వాక్పరులు= సంభాషణా తత్పరులు; ఐరి= ఐనారు.

తాత్పర్యం: ఒకసారి భూదేవి, కాశ్యపుడు, అగ్ని, మార్కండేయుడు ధర్మవిచారణ చేస్తూ లోకానికి మేలు చేసే మాట లన్నారు. వాటిని క్రమంగా చెప్పుతాను వినుము.

వ. అవ్వాక్యంబు లాకర్ణింపుము. 39

ప్రతిపదార్థం: ఆ+వాక్యంబులు= ఆ వాక్యాలు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ వాక్యాలు వినుము.

క. 'ఘనతర మగు హ్రీ గౌరవ । మున మునిఁగినఁ బాప మఖిలమును, రూపు సెడుం

బెనుపున యగ్గలికఁ బొగడు । గనిన పయోరాశిఁ బడ్డ గడ్డయుఁ బోలెన్. 40

ప్రతిపదార్థం: ఘనతరము అగు= చాలా గొప్పదైన; హ్రీ= సిగ్గు; గౌరవమునన్= గురుత్వంలో, ఎక్కువ సిగ్గులో; మునిఁగినన్= మునిగితే; పెనుపునన్= విస్తారంలో; అగ్గలికన్= ఆధిక్యత; పొగడు= పొగడ్త; కనిన= పొంది; పయోరాశిన్= సముద్రలో; పడ్డ= పడిన; గడ్డయున్= మట్టిగడ్డ; పోలెన్= వలె; పాపము అఖిలమున్= పాపమంతా; రూపుచెడున్= నశిస్తుంది.

తాత్పర్యం: గొప్ప సిగ్గు కలిగి ఉంటే విశాలమైన సముద్రంలో పడ్డ గడ్డవలె పాపాలన్నీ నశిస్తాయి.

విశేషం: అలం: ఉపమ.

తే. సత్కులంబునఁ బుట్టుట, సకలవేద । ములుఁ బురాణంబులును, శాస్త్రములును జదువు
టయును సద్గతిఁ జేయఁ బ్రౌఢములు గావు । శీలసామగ్రి లేని దుశ్చేష్టితునకు. 41

ప్రతిపదార్థం: శీల= మంచిస్వభావం యొక్క; సామగ్రి= సాధనం; లేని; దుస్= చెడ్డ; చేష్టితునకున్= చేష్టలు కలవాడికి; సత్కులంబునన్= మంచికులంలో; పుట్టుట= జన్మించటం; సకల= అన్ని; వేదములు; పురాణములు= భాగవతాదులు; శాస్త్రములును= సాంఖ్యం యోగం వంటి శాస్త్ర గ్రంథాలు; చదువుటయునున్= చదవటం; సత్‌గతిన్= మంచి స్థితిని, సుగతిని; చేయన్= చేయటానికి; ప్రౌఢములు కావు= సమర్థం కావు.

తాత్పర్యం: శీలంలేనివాడు ఎంత గొప్ప కులంలో పుట్టినా, అన్నివేదాలూ, పురాణాలూ, శాస్త్రాలూ చదువుకొన్నా వాడికి అవి సద్గతుల నీయలేవు.

ఆ. పలు సదువులు సదివి, పండిత మానియై, । తనదు విద్య నొరుల ఘనయశంబుఁ
దూలపుచ్చునట్టి దుష్టాత్మకుని బ్రహ్మ । హత్య వొందు; సందియంబు లేదు. 42

ప్రతిపదార్థం: పలు= అనేకం; చదువులు= శాస్త్రాలు; చదివి= అభ్యసించి; పండిత మాని+ఐ= పండితుడననుకొంటూ ఉండేవాడై; తనదు= తన; విద్యన్= చదువుతో; ఒరులన్= ఇతరుల; ఘన= గొప్ప; యశంబున్= కీర్తినీ; తూలపుచ్చునట్టి= గడ్డిపోచవలె ఎగరగొట్టే; దుష్టాత్మకునిన్= చెడ్డ మనస్సు కలవాడిని; బ్రహ్మహత్య= బ్రాహ్మణుడిని చంపితే కలిగే పాపం; పొందున్= కలుగుతుంది; సందియంబు= సందేహం; లేదు= లేదు.

తాత్పర్యం: అనేక విద్యలు నేర్చుకొని, పండితుడనే అహంకారంతో తన విద్యచేత ఇతరుల కీర్తిని గడ్డిపోచవలె భావించే దుర్మార్గుడికి బ్రహ్మహత్యా పాపం కలుగుతుంది. అందులో సందేహం లేదు.

తే. వాజిమేధముల్ వే యొక్క వలనఁ బెట్టి, । యలఘు సత్యంబు దక్కటివలనియందు
నిల్పి, తులఁ దూపఁగా, సత్యనిష్ఠ లోని । యర్ధమున కెత్తు వచ్చె నయ్యధ్వరములు.' 43

ప్రతిపదార్థం: వే= వేయి; వాజి మేధముల్= అశ్వమేధ యజ్ఞాలు; ఒక్క వలనన్= ఒక ప్రక్కన; పెట్టి= ఉంచి; అలఘు= గొప్ప; సత్యంబు= సత్యవాక్యం; తక్కటివలని యందున్ నిల్పి= మిగిలిన రెండవ ప్రక్కనుంచి; వలని; తులన్= త్రాసులో; తూపఁగాన్= తూస్తే; సత్యనిష్ఠలోని= సత్య నియమంలో ఉన్న; అర్ధమునకున్= సగానికి; ఆ+అధ్వరములు= ఆ యజ్ఞాలు; ఎత్తు= బరువు, తూకం; వచ్చెన్= వచ్చింది;

తాత్పర్యం: వేయి అశ్వమేధాలు ఒక ప్రక్కా, మరొకప్రక్క సత్యవాక్యాన్ని పెట్టి తూస్తే ఆ యజ్ఞాల బరువు సత్యవాక్యానికే సగం తూకం వచ్చింది.

వ. అని యిట్లు వర్తిల్లు నాలుగు వాక్యంబులుం జెప్పి. 44

తాత్పర్యం: అని ఈ విధంగా ప్రవర్తించిన నాలుగు మాటలు చెప్పి.

విశేషం: నాలుగు మాటలు= లోకంలో పలుకుబడి ఇక్కడ నల్గురు చెప్పిన మాటలు - అని రెండర్థాలు.

తే. 'బ్రహ్మచర్యంబు కంటెను, బరము మద్య । మాంసములు రెండు నుడుగుట మనుజనాథ!
లోకయాత్ర వాటించు చలోలుపతయు । శమముఁ గల్గి వర్తించుట శౌచవిధము'. 45

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; మద్య= కల్లు (సారాయి); మాంసములు= నంజుళ్ళు; రెండును= రెంటినీ; ఉడుగుట= మానటం; బ్రహ్మచర్యంబు కంటెను= బ్రహ్మచారిగా ఉండటం కంటె; పరము= శ్రేష్ఠం; లోకయాత్ర= బ్రతుకు తెరువు; పాటించుచున్= నడుపుకొంటూ; అలోలుపతయున్= విరక్తి; శమమున్= కామం, క్రోధంవంటివి లేకుండా శాంతి; కల్గి; వర్తించుట= బ్రతకటం; శౌచవిధము= శుచిత్వమార్గం.

తాత్పర్యం: 'రాజా! మద్య మాంసాలు మానటం బ్రహ్మచర్యం కంటె గొప్పశౌచమంటే సంసారయాత్ర సాగిస్తూ కూడా దేనియందు ఆసక్తి లేకుండా శాంతితో బ్రతకటం.

వ. అనిన విని, యజాతశత్రుండు 'ధర్మంబు నర్థంబును గామంబును నాచరించు కాలంబు లెఱింగింపవే' యనుటయు నాపగేయుం డతని కిట్లనియె. 46

ప్రతిపదార్థం: అనినన్ విని= అని పలుకగా విని; అజాతశత్రుండు= శత్రువులు లేనివాడు, ధర్మజుడు; ధర్మంబు, అర్థంబును, కామంబును= ధర్మ అర్థ కామాలన్న పురుషార్థాలను; ఆచరించు= అనుష్ఠించే; కాలంబులు= సమయాలు; ఎఱింగింపవే అనుటయున్= తెల్పుమా అనగా; ఆపగేయుండు= గంగానది కొడుకు - భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'ధర్మార్థ కామాలను ఆచరించే వేళలు ఏవి?' అని ధర్మరాజు అడుగగా భీష్ము డిట్లా అన్నాడు.

తే. 'రేపకడయును, బగలును, మాపు, వరుస । నర్థ ధర్మ కామంబుల నాచరింప
వలయు; వానియం దాసక్తి వలదు; సక్తుఁ । డయ్యె నేనియు మేలు ధర్మాభినిరతి'. 47

ప్రతిపదార్థం: వరుసన్= క్రమంగా; రేపకడయును= తెలవారు జాము; పగలును= పగటిపూట; మాపు= సాయంకాలం; అర్థ - ధర్మ - కామంబులన్= ధర్మము, అర్థము, కామములను; ఆచరింపన్= చేయగా; వలయున్= వలెను; వానియందున్= వాటిపై; అసక్తి= అనురక్తి; వలదు= వద్దు; సక్తుఁడు= అనురక్తుడు; ధర్మ+అభినిరతిన్= ధర్మాచరణంలో; అయ్యెన్+ఏనియున్= అయితే; మేలు= మంచిది.

తాత్పర్యం: 'అర్థం తెల్లవారుజామున, ధర్మం పగలు; రాత్రిపూట కామం - ఈ వరుసలో అనుష్ఠించాలి. అయినా అర్థకామాలపై అంత ఆసక్తి ఉండటం మంచిది కాదు. ధర్మమందలి ఆసక్తితో అర్థకామాలయందు ఆసక్తుడు గావడం మంచిదే. ధర్మానికి అవిరుద్ధంగా అర్థకామాలు అనుభవించడం తప్పుగాదని భావం.

వ. అని మఱియును 48

తాత్పర్యం: అని ఇంకా.

క. 'విను, గురుపూజన విప్రా । ర్చనము లధిక పుణ్యములు, ధరావల్లభ! వి
పుని నిందించుటయును, న । గ్నిని వేదము విడుచుటయును గిల్బషతమముల్'. 49

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధరా= భూమికి; వల్లభ!= రాజా!; విను= వినుము; గురుపూజన= గురువులను పూజించటం; విప్ర= బ్రాహ్మణుల; అర్చనములు= పూజలు; అధిక పుణ్యములు= మిక్కిలి పుణ్యాన్ని కలిగించే పనులు; విప్రునిన్= బ్రాహ్మణుడిని; నిందించుటయును= తిట్టడం; అగ్నినిన్= అగ్నిదేవుడినీ; వేదమున్= వేదాన్ని; విడుచుటయున్= త్యజించటం; కిల్బిషతమముల్= మహాపాపాలు.

తాత్పర్యం: 'రాజా! గురువులను, బ్రాహ్మణులను పూజించటం పుణ్యం. బ్రాహ్మణ నిందా; వేదాన్నీ, అగ్నులనూ విడవటం మహాపాపం'.

సీ. అనుటయు, ధర్మనందనుఁడు 'దానంబుల । కెవ్వరు పాత్రంబు లేర్పరింపు'
మనిన 'సద్ధర్ములు, నక్రోధనులు, సత్య । రతులు, దాంతులును, ధీరత్వ యుతులు,
నిజకర్మ నిరతులు, విజితేంద్రియులు సర్వ । భూతహితులు, నలుబ్ధులును, శుచులు
దానపాత్రములు, వేదంబు సాంగంబుగాఁ । జదివి షట్కర్మ నిష్ఠలఁ దొడంగి

తే. తత్త్వవిదులైన బ్రాహ్మణోత్తముల కీఁగి । విను సహస్రగుణంబగు, విశ్రుత శ్రు
తంబుఁ బ్రజ్ఞయు, శీలవృత్తములుఁ గలుగు । వారి కిచ్చుట వంశవిస్తారకంబు'. 50

ప్రతిపదార్థం: అనుటయున్= అని భీష్ముడు చెప్పగా; ధర్మనందనుఁడు= ధర్మరాజు; దానంబులకున్= దానాలకు; ఎవ్వరు; పాత్రంబులు= యోగ్యులు; ఏర్పరింపుము= వేర్వేరుగా చెప్పండి; అనినన్= అని అడుగగా; సద్ధర్ములు= మంచి ధర్మనిష్ఠ కలవారు; అక్రోధనులు= కోపం లేనివారు; సత్యరతులు= సత్యనిష్ఠులు; దాంతులున్= మనో నిగ్రహం కలవారు; ధీరత్వయుతులు= ధైర్యంతో కూడినవారు; నిజకర్మనిరతులున్= తమకు విధించిన కర్మలు చేసేవారు; విజిత= జయించబడిన; ఇంద్రియులున్= ఇంద్రియాలు కలవారు; సర్వభూతహితులున్= అన్ని భూతాలపై ప్రేమ కలవారు; అలుబ్ధులున్= లోభంలేనివారు; శుచులు= పవిత్రులు; దానపాత్రములు= దానయోగ్యులు; స+అంగంబుగాన్= జ్యౌతిషం మొదలైన అంగాలు గల; వేదంబున్= వేదాన్ని చదివి; షట్కర్మనిష్ఠలన్= ఆరు కర్మలయందు నియమం; తొడంగి= పూనుకొని; తత్త్వ విదులు+ఐన= తత్త్వం తెలిసిన; బ్రాహ్మణ+ ఉత్తములకున్= ఉత్తములైన బ్రాహ్మణులకు; ఈఁగి= దానం చేయటం; విను= వినుము; సహస్ర గుణంబు+అగున్= వేయిరె ట్లవుతుంది; విశ్రుత= విస్తారమైన; శ్రుతంబున్= వినికిడి, శాస్త్రము; ప్రజ్ఞయున్= ప్రతిభ; శీల= స్వభావం; వృత్తములున్= ప్రవర్తన; కలుగు= కలిగిన; వారికిన్; ఇచ్చుట= దానమివ్వటం; వంశవిస్తారకంబు= కులాన్ని విస్తరింపచేస్తుంది.

తాత్పర్యం: 'దానయోగ్యు లెవ్వరో వేర్వేరుగా చెప్పు' మని ధర్మరా జడుగగా - భీష్ముడన్నాడు 'ధర్మం చేసేవారు, కోపం లేనివారు, సత్యం చెప్పేవారు, దాంతులు, ధీరులు, నిజకర్మలు చేసేవారు, ఇంద్రియ నిగ్రహం కలవారు, భూతదయ కలవారు, లోభం లేనివారు, శుచులు దానయోగ్యులు. ఆరు అంగాలు గల వేదాన్ని చదివి, షట్కర్మ లాచరించే ఉత్తమ బ్రాహ్మణులకు చేసే దానం వేయిరెట్లు ఫలిస్తుంది. విస్తారమైన వినికిడి, గొప్పమేధాశక్తి, ఉత్తమశీలం, ప్రవర్తన కలవారి కిస్తే వంశం విస్తరిస్తుంది.

విశేషం: షట్కర్మలు :1. యజ్ఞం చేయటం, 2. యజ్ఞం చేయించటం, 3. వేదం చదవటం, 4. వేదం చదివించటం, 5. దానం చేయటం, 6. దానం పుచ్చుకొనటం.

వ. అని నిర్దేశించి భీష్ముండు వెండియు. 51

తాత్పర్యం: అని స్పష్టంగా నిరూపించి భీష్ముడు ఇంకా (ఇట్లా అన్నాడు)

ఆ. 'యోగ్యుఁడైన విప్రుఁ డొకరుండు సంతృప్తిఁ। బొంద నధిక తృప్తిఁ బొందు దేవ
వితతి, ముని సమూహ పితృ సమాజములు; న। ట్లగుట వెదకి తెచ్చు నది విశిష్టు'. 52

ప్రతిపదార్థం: యోగ్యుఁడు+ఐన= పాత్రుడు, తగినవాడు అయిన; విప్రుఁడు= బ్రాహ్మణుడు; ఒకరుండు= ఒక్కడు; సంతృప్తిన్= సంతోషం; పొందన్= పొందితే; దేవ= దేవతలయొక్క; వితతి= సమూహం; ముని= మునుల; సమూహ= గుంపు; పితృ= పితృదేవతల; సమాజములు= సంఘాలు; సమూహం; అధిక= మిక్కిలి; తృప్తిన్= తుష్టిని; పొందున్= పొందుతుంది; అట్లు+అగుటన్= అందువలన; విశిష్టున్= ఉత్తముడిని; వెదకి= వెతికి, అన్వేషించి; తెచ్చునది= తేవాలి.

తాత్పర్యం: 'ఉత్తమ బ్రాహ్మణుడిని ఒక్కడినైనా సంతృప్తిపరిస్తే చాలు. సర్వదేవతలు, పితృదేవతలు, మునులు, అంతా సంతోషిస్తారు. కనుక వెదకి వేసారి అయినా ఒక శిష్టబ్రాహ్మణుడిని తేవాలి.'

వ. అనిన విని కౌంతేయాగ్రజుం డతనితో 'దేవ పితృ మనుష్య పూజల కాలంబు లెఱింగింపవే' యనుటయు నతండు. 53

ప్రతిపదార్థం: అనినన్+విని= అనగా విని; కౌంతేయ+అగ్రజుండు= ధర్మరాజు; అతనితోన్= భీష్ముడితో; దేవ= దేవతల; పితృ= పితృదేవతల; మనుష్య= మానవుల; పూజలకాలంబులు= పూజాసమయాలు; ఎఱింగింపవే= తెలుపవా? అనుటయున్= అనగా; అతండు= అతడు.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీష్ముడితో 'దేవతలను, పితృదేవతలను, మనుష్యులను పూజించే సమయాలు తెలుపుము' అని అడిగాడు. భీష్ముడు (ఇట్లా అన్నాడు)

క. 'నృపవర! పూర్వాహ్ణంబును, । నపరాహ్ణము దేవ పితృ సమారాధన వి
ధ్యుపదిష్ట కాలములు; మ। ధ్యపు సమయము మానుషార్చనార్హం బరయన్.' 54

ప్రతిపదార్థం: నృపవర!= రాజులలో శ్రేష్ఠుడవైన ధర్మరాజా!; అరయన్= విచారిస్తే; పూర్వ+అహ్ణంబును= ప్రొద్దుటిపూటా; అపర+ అహ్ణము= ప్రొద్దువాలే వేళా; దేవ= దేవతలకు; పితృ= పితృ దేవతలకు; సమారాధన= చక్కని పూజకు; విధి= బ్రహ్మ చేత, వేదంచేత; ఉపదిష్ట= నిర్దేశించబడిన; కాలములు= సమయాలు; మధ్యపు సమయము= ప్రాహ్ణ, అపరాహ్ణకాలాల మధ్యవేళ; మధ్యాహ్నం; మానుష= నరులను; అర్చన= పూజించటానికి; అర్హంబు= తగినది.

తాత్పర్యం: 'ధర్మరాజా! ప్రొద్దుటిపూట దేవతల నారాధించాలనీ, అపరాహ్ణసమయంలో పితృదేవతలను పూజించాలనీ, మధ్యాహ్నం మనుష్యులను ఆరాధించాలనీ విధి నిర్దేశించాడు'.

వ. అని చెప్పి మఱియు నిట్లనియె. 55

తాత్పర్యం: అని చెప్పి, ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. 'నరనాథ! కాలహీనంబును, నశుచిసం । స్పృష్టంబుఁ, బరిభుక్తశేషమును, న
మంత్రకంబును, వీతతంత్రంబుఁ, గీటకే । శ ప్రదుష్టంబు, రాక్షసులు గొండ్రు;
మానవీయ ద్రవ్యమేనియు సురపితృ । క్రియల దురాత్మకు లయినవారు
గుడిచిన నట్ల యక్కుడుపులఁ జొనుపక । మత్తుని,జడుని, నున్మత్తుఁ బతితుఁ

తే. గ్లీబుఁ గుష్ఠి, దేవలకుఁ, జికిత్సకునిని; వీతనియము, నపస్మారి, శ్విత్రి రాజ
యక్ష్మయుతుని, నర్తకుని, గాయకుని, సోమ । విక్రయుని, వేదవిక్రయు విడువ వలయు. 56

ప్రతిపదార్థం: నరనాథా!= రాజా!; కాలహీనంబును= కాలనియమం లేనిదీ; అశుచి= అపవిత్రునిచే; సంస్పృష్టంబు= ముట్టుకొనబడినదీ; అమంత్రకంబును= మంత్రం లేనిది; వీత= పోయిన (లేని); తంత్రంబున్= పూజా పద్ధతి కలది; కీట= పురుగులతో; కేశ= వెంద్రుకలతో; ప్రదుష్టంబున్= మిక్కిలి చెడ్డది అయిన; పరిభుక్తశేషమును= తినగా మిగిలిన దానిని; రాక్షసులు; కొంద్రు= తీసికొంటారు; మానవీయ= మానవ సంబంధమైన; ద్రవ్యము+ఏనియున్= వస్తువైనా; సుర= దేవతల; పితృ= పితృదేవతల; క్రియలన్= యజ్ఞాలలో; దురాత్మకులు= దుష్టబుద్ధులు; అయినవారు= అయినటువంటివారు; కుడిచినన్= తిన్నా; అట్ల= అంతే; ఆ+కుడుపులన్= ఆ తిండ్లలో; చొనుపక= ప్రవేశించనివ్వక; మత్తునిన్= మదించిన వాడినీ; జడునిన్= బుద్ధిలేనివాడినీ; ఉన్మత్తునిన్= పిచ్చివాడినీ, పతితున్= భ్రష్టుడైనవాడినీ; క్లీబున్= నపుంసకునీ; కుష్ఠిన్= కుష్ఠరోగినీ; దేవలకున్= పూజారినీ; చికిత్సకునినిన్= వైద్యుడినీ; వీతనియమున్= నియమంలేని వాడిని; అపస్మారిన్= అపస్మారం కలవాడినీ (మూర్ఛరోగగ్రస్తుడినీ); శ్విత్రిన్= బొల్లికలవాడినీ; రాజయక్ష్మయుతునిన్= క్షయరోగినీ; నర్తకునిన్= నాట్యం చేసేవాడినీ; గాయకునిన్= సంగీత విద్వాంసుడినీ, సోమ విక్రయునిన్= సోమరసం అమ్ముకొనేవాడినీ; వేద విక్రయున్= వేద విద్యను అమ్ముకొనేవాడినీ (ధనం తీసుకొని వేదాన్ని చెప్పేవాడిని); విడువవలయున్= పరిత్యజించాలి, వదలాలి.

తాత్పర్యం: 'రాజా! కాలనియమం లేకుండా శుచిలేని వానిచే ముట్టుకొన్నదానినీ, ఎంగిలి చేసినదానినీ, మంత్రపూతం కానిదానినీ, పురుగులు, వెంద్రుకలు కలదీ, పూజాతంత్రం లేనిదీ అయిన తిండిని రాక్షసులు తింటారు. మనుష్యులకూ, పితృదేవతలకూ సంబంధించిన ద్రవ్యాలను దుష్టబుద్ధులు గ్రహించకుండా చూడాలి. మదించినవాడినీ, బుద్ధిలేనివాడినీ, పిచ్చివాడినీ, భ్రష్టుడినీ, నపుంసకుడినీ, కుష్ఠరోగినీ, పూజారినీ, వైద్యుడినీ, నియమం లేనివాడినీ, మూర్ఛరోగినీ, బొల్లివ్యాధి కలవాడినీ, క్షయరోగినీ, నర్తకుడినీ, గాయకుడినీ, సోమరసం అమ్ముకొనేవాడినీ, వేదాలను విక్రయించుకొనేవాడినీ దానయోగ్యులుగా పరిగణించరాదు.

ఆ. వడ్డి కిచ్చి కుడుచువాఁడు, ననగ్నియుఁ । బ్రాణి విక్రయమున బ్రదుకు నతఁడు,
దైవ పిత్ర్యములకుఁ దగరు, సంధ్యోపాస । నములు లేనివారు నరవరేణ్య!' 57

ప్రతిపదార్థం: నరవరేణ్యా!= మానవులలో మహోత్తముడా! రాజశ్రేష్ఠుడా!; వడ్డికిన్= వడ్డీకి; ఇచ్చి= డబ్బునిచ్చి; కుడుచువాఁడు= బ్రతికేవాడు; అనగ్నియున్= అగ్నిహోత్రం చేయనివాడు; ప్రాణి= పశుపక్ష్యాదులయొక్క; విక్రయమునన్= అమ్ముకొనటంచేత; బ్రదుకునతడున్= జీవించేవాడు; సంధ్యా+ఉపాసనము= సంధ్యాకాలంలో చేసే జపాదులు లేనివారు, సంధ్యావార్చనివారు; దైవ= దేవతా కార్యాలకు; పిత్ర్యములకున్= పితృకార్యాలకు; తగరు= పనికిరారు.

తాత్పర్యం: బ్రాహ్మణజాతిలో ఎవరైతే అగ్నిహోత్రం, సంధ్యోపాసన మాని వడ్డీ వ్యాపారస్థు లౌతారో, ప్రాణులనమ్మి జీవిస్తారో వారు దైవపితృ కార్యాలలో చేసే దానాలకు తగరు'.

వ. అనిన విని ధర్మనందనుండు శంతను నందనునితో 'దైవపిత్ర్యంబు లగు దానంబులకు నుత్తమపాత్రంబు లెవ్వ రెఱింగింపవే? యని యడుగుటయు నతం డతని కిట్లనియె. 58

ప్రతిపదార్థం: అనినన్ విని= భీష్ముడట్లు చెప్పగా విని; ధర్మనందనుండు= ధర్మరాజు; శంతను నందనునితోన్=భీష్ముడితో (శంతనుడి కుమారుడితో); దైవ పిత్ర్యంబులు= దేవతలకు; పితృదేవతలకు సంబంధించినవి; అగు= అయినట్టి; దానంబులకున్= దానాలకు; ఉత్తమ= విశిష్ట; పాత్రంబులు= యోగ్యులు; ఎవ్వరు= ఎవరు; ఎఱింగింపవే= తెలుపుమా; అని+అడుగుటయున్= అని అడుగగా; అతండు= భీష్ముండు; అతనికిన్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు. 'దైవకార్యాలలో, పితృకార్యాలలో దానం ఇవ్వటానికి ఉత్తములైన యోగ్యులు ఎవ్వరు? నాకు తెలుపుము' అని ఆ అభ్యర్థనకు సమాధానంగా భీష్ముడు ఇట్లా అన్నాడు.

దైవ పిత్ర్యంబులగు దానంబులకుఁ బాత్ర భూతుల నిరూపించుట (సం.13-24-49)

సీ. 'భోజనార్థులఁ దుష్టిఁ బొందించునతఁడును, । దెరువాటువలనఁ దస్కరులచేతఁ
జే టొంది ధనము వాంఛించు నతండు, వ్ర । తంబున కుద్యాపనంబు సేయఁ
దలఁచి యర్థించునతండును, గురుఁ దల్లి । దండ్రుల సంక్లిష్ట దారపుత్రు
లను బ్రోవఁ బడునతండును, మహావ్యాధి ని । రాసంబు సేయంగ నాస చేయు

తే. నతఁడు, నిష్పాపుఁ డైన ధరామరుండు, । నెపుడు భిక్షయ బ్రదుకగునేని నట్టి
యతఁడు, దైవపిత్ర్యములకు నతిశయంబు । గల్గు పాత్రంబు లగుదురు కౌరవేంద్ర!' 59

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర! = కురుసంతానంలో రాజా! (కురురాజ్యపాలకా); భోజన+అర్థులన్= అన్నం కావాలని వచ్చినవారిని; తుష్టిన్= తృప్తిని; పొందించు అతఁడును= పొందించేవాడునూ; తెరువాటువలనన్= దారిదోపిడి చేత; తస్కరుల చేతన్= దొంగల వలన; చేటు+ఒంది= కీడుపొంది; ధనము= డబ్బు; వాంఛించు= కోరే; అతండున్= వాడునూ; వ్రతంబునకున్= వ్రతానికి; ఉద్యాపనంబు= ముగింపు; చేయన్+తలఁచి= చేయాలనుకొని; అర్థించునతండును= డబ్బు యాచించేవాడు; గురున్= గురువును; తల్లిదండ్రులన్= జననీ జనకులను; సంక్లిష్ట= చిక్కులలోనున్న; దార= భార్య; పుత్రులను= పుత్రులను; ప్రోవన్= పోషించుటకు; పడు+అతండును= పాటుపడేవాడు; మహావ్యాధి= దీర్ఘవ్యాధి; నిరాసంబు+చేయన్= తొలగించుకొనుట కొరకు; ఆసచేయునతఁడున్= కోరుకొనేవాడునూ; నిష్పాపుఁడు= పాపంలేనివాడు; ఐన= అయినట్టి; ధరా+అమరుండు= బ్రాహ్మణుడును; భిక్షయ= బిచ్చమెత్తుకొనటమే; బ్రదుకు= జీవనోపాధి; అగునేనిన్= అయితే; అట్టిఅతఁడు= అట్లాంటివాడు; దైవ పిత్ర్యములకున్= దైవ పితృకార్యాలలో దానాలకు; అతిశయంబు+కల్గు= మిక్కిలి; పాత్రంబులు= యోగ్యులు; అగుదురు= అవుతారు.

తాత్పర్యం: 'కౌరవరాజా! దేవతారాధనలలో, పితృదేవతారాధనలలో దాన ధర్మాలకు యోగ్యులైనవారిని వినుము. భోజనం పెట్టి తృప్తిపరిచేవాడు, దొంగలవలన అంతా పోగొట్టుకొన్నవాడు; వ్రతోద్యాపన కోరి యాచించేవాడు, గురువు, తల్లి, తండ్రి, భార్యా పుత్రులను పోషించుటకై పాటుపడేవాడు, దీర్ఘవ్యాధిని పోగొట్టుకొనాలనుకొనేవాడు, ఎప్పుడూ భిక్షాటనంతో జీవించే పాపంలేని బ్రాహ్మణుడు - ఈ ఆరుగురు ఉత్తమ దానయోగ్యులు.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని చెప్పి మఱియు నిట్లనియె. 60

తాత్పర్యం: ఈ విధంగా చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. 'సత్రంబు, సాలయు, జలిపందిరియు, రచ్చ । కొట్టము ప్రచ్చుట, గురుజనముల
నిందించు, టాగమనింద, దదీయ వి । క్రయవిధి, దద్విలేఖనము, గొండి
యము, సంధిభేదన, మన్య కర్మోప జీ । వన, మకృతజ్ఞత, పారదార
వృత్తి, మంత్ర సుశాస్త్ర విధ్వంసనము, మద । లోల, ననాథను, బాలవృద్ధఁ

తే. దాపసిని, భీతివంచనఁ దలరఁజేయు । టతిథి పుత్రభృత్యులకు నాహారకలన
మాచరింపక కుడుచుట, యార్యకోటి । నిరయహేతువులుగఁ జెప్పు నృపవరేణ్య! 61

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= మహారాజా!; సత్రంబు= ధర్మ సత్రాలు; సాలయున్= సభాశాలలు; చలిపందిరియున్= వేసవిలో నీరుపోసేచోటు; రచ్చకొట్టము= రచ్చచావడి; ప్రచ్చుట= (వీటిని) కూల్చటం; గురుజనములన్= పెద్దవారిని; నిందించుట= తిట్టటం; ఆగమనింద= వేదనింద; తదీయ= ఆ వేదవిద్యను; విక్రయవిధి= అమ్ముకొని బ్రతకటం; తత్= ఆవేదం; విలేఖనము= వ్రాయటం; కొండియము= కొండెం చెప్పటం; సంధిభేదనము= చేసికొన్న సంధిని త్రోసిరాజనటం; అన్యకర్మ= ఇతరున కుచితమైన కర్మలతో; ఉపజీవనము= బ్రతకటం; అకృతజ్ఞత= కృతజ్ఞత లేకపోవటం (చేసినమేలు మరవటం); పారదారవృత్తి= ఇతరుల భార్యలతో వ్యభిచరించటం; మంత్రసుశాస్త్ర విధ్వంసనము= మంచి మంత్రశాస్త్రాలను నాశనం చేయటం; మదలోలన్= మదంతో చపలచిత్తం కలదానిని; అనాథను= ఆధారం లేనిదాన్ని; బాలన్= చిన్నదాన్ని; వృద్ధన్= వృద్ధురాలిని; తాపసిని= స్త్రీ సన్న్యాసిని; భీతిన్= భయంతో; వంచనన్= మోసంతో; తలరన్‌చేయుట= కలతపెట్టటం; అతిథి= తిథి లేక వచ్చేవానికి (ఎప్పుడైనా సరే వచ్చే చుట్టం); పుత్ర= కొడుకులకు; భృత్య= సేవకులకు; ఆహార కలనము= తిండిపెట్టటం; ఆచరించక= చేయక; కుడుచుట= (తాను) తినటం; నిరయ= నరక; హేతువులుగన్= కారణాలుగా; ఆర్యకోటి= పెద్దల సమూహం; చెప్పున్= చెబుతున్నది.

తాత్పర్యం: సత్రాలు, సభాశాలలు, రచ్చకొట్టాలు, చలిపందిళ్ళు కూల్చటం; గురువులను, వేదాన్ని నిందించటం; వేదాన్ని అమ్ముకొనటం; వ్రాయటం, కొండెం చెప్పటం, సంధిని ఉల్లంఘించటం, ఇతరులు చేసే వృత్తిని తాను చేయటం (ఇతర వర్ణాలకు చెప్పబడ్డ కర్మలను చేయటం), కృతజ్ఞత లేకపోవటం, పరస్త్రీతో వ్యభిచరించటం; మంత్రశాస్త్రాన్ని ధ్వంసంచేయటం; మదించినది, అనాథ, బాలిక, ముసలిది, తపస్విని మొదలైన వాళ్ళను భయపెట్టడం; వంచించటం; అతిథికి పుత్రులకు సేవకులకు పెట్టకుండా తానుతినటం - ఇవన్నీ నరకద్వారాలని పెద్దలు చెప్తున్నారు.

సీ. విషశస్త్ర కేశముల్ విక్రయించుట, శస్త్ర । ములచేత కన్యాజనులను విప్ర
తతిని గోగణమును దఱిసిపోవుట, యుపా । ధ్యాయు సభక్తికుం డైన భృత్యు
విడుపు మార్గముఁ గ్రంప నడిచి కొయ్యలు ప్రాంతి । చెఱుచుట నరకంబు సేయు నండ్రు;
నేరమి లేకయు నెపమిడి యర్థంబు । గొనురాజుఁ బ్రజరక్ష వినికి గలిగి

తే. యాచరింపని విభుఁడును, నప్పనంబు । పలుకుబడి దప్పి కొనియెడు పతియు, గోవు
ముక్కు గుట్టెడివాఁడుఁ, దన్ముష్కఘాతి । యగునతండు నధోగతి కరుగువారు. 62

ప్రతిపదార్థం: విషశస్త్ర కేశముల్= విషము, ఆయుధాలు, తల వెంట్రుకలు; విక్రయించుట= అమ్మటం; శస్త్రములచేఁత= ఆయుధాలు తయారు చేయడం; కన్యాజనులను= కన్యకలను; విప్రతతినిన్= బ్రాహ్మణ సమూహాన్ని; గోగణమును= ఆవుల మందలను; తఱిసిపోవుట= దాటిపోవడం, అతిక్రమించడం; ఉపాధ్యాయున్= గురువును; సభక్తికుండు+ఐన= భక్తితో కూడిన; భృత్యున్= సేవకుడిని; విడుపు= విడుచుట; మార్గము= దారిలో; క్రంప నడిచి= కంపగొట్టి; కొయ్యలు= కర్రలు; ప్రాఁతి= నాటి; చెఱుచుట= చెడగొట్టడం; నరకంబు చేయున్+అంద్రు= నరకాన్ని కలిగిస్తాయంటారు; నేరమి= నేరం; లేకయున్= లేకుండానే; నెప మిడి= ఏదో తప్పు నారోపించి; అర్థంబు= డబ్బును; కొను= తీసికొనే; రాజున్= రాజు; వినికి కలిగి= వినియుండి; ప్రజరక్ష= ప్రజలను రక్షించటం; ఆచరింపని= చేయని; విభుఁడునున్= రాజును; పలుకుబడి= అన్నమాట; తప్పి= మీరి; అప్పనంబు= వస్తువులను ఇల్లడ పెట్టటం; కొనియెడు= గ్రహించే; పతియున్= రాజును; గోవు= ఆవుయొక్క; ముక్కున్= ముక్కును; కుట్టెడివాఁడున్= కుట్టేవాడు; తత్= ఆ గోజాతికి చెందిన ఎద్దులయొక్క; ముష్క= వృషణం; ఘాతి= నలగ కొట్టేవాడు; అధోగతికిన్= క్రిందిలోకాలకు; అరుగువారు= పోతారు.

తాత్పర్యం: విషము, ఆయుధాలు, తలవెంట్రుకలు విక్రయించడం, ఆయుధాలు తయారుచేయడం, కన్నెపిల్లలను, విప్రవరులను, ఆవులను దాటుకొంటూపోవటం; చదువు చెప్పే అయ్యవారిని భక్తిగల భృత్యుడిని విడిచిపెట్టటం, మార్గంలో ముళ్ళ కంప వైచి కర్రలు నాటి దారిని చెడగొట్టటం, ఇవన్నీ నరకానికి మార్గాలు. (ఇక రాజులసంగతి) - లేని నెపం పెట్టి డబ్బుగుంజే రాజు, ప్రజల కష్టాలు విని కూడా తీర్చని ప్రభువూ, ఒక వస్తువును దాచిపెట్టినప్పుడు మాట తప్పి తీసికొనేవాడు - (సామాన్య ప్రజలు) - ఆవుముక్కు కుట్టేవాడు; ఎద్దు వృషణాలు నలగ కొట్టేవాడు అధోగతి పాలౌతారు.

సీ. ధర్మంబు భయమున, దారిద్ర్య సంబాధ । మున రోగమునుఁ బాపములుఁ దొలఁగఁ
జేఁతకునైనఁ జేసిన దేవకార్యార్థ । పశుహింసనంబును, బరమ తపము
శుశ్రూషయును గల్గి శ్రుతము సంపాదించి । యప్రతిగ్రాహకుఁ డైన, మద్య
మాంస పరస్త్రీ సమాగమ వైముఖ్య । మున నాశ్రమస్థులఁ దనకులంబు

తే. వారి భరియించినను, హేమవస్త్ర మంది । రాన్నపానంబు లొసఁగిన, నాశ్రయంబు
దీనులకు నిచ్చినను, హింస మానినను, స । మంచిత స్వర్గలక్ష్మి సిద్ధించు నండ్రు. 63

ప్రతిపదార్థం: ధర్మంబు భయమునన్= ధర్మ భీతితో; దారిద్ర్య= పేదరికం వలని; సంబాధమునన్= మిక్కిలి బాధతో; రోగమునున్= రోగం; పాపములున్= పాపాలు; తొలఁగన్+చేఁతకున్+ఐనన్= తొలగద్రోయటానికైనా; చేసిన= చేసినటువంటి; దేవకార్య+అర్థ= దేవతల పనికొరకై; పశుహింసనంబును= పశువులను చంపటం; పరమ= శ్రేష్ఠమైన; తపమును= తపస్సును; శుశ్రూషయునున్= సేవ; కల్గి= కలిగి; శ్రుతము= పాండిత్యం, విద్య; సంపాదించి= కష్టపడి గడించి; అప్రతిగ్రాహకుఁడు= దానం పుచ్చుకొననివాడు; ఐనన్= అయితే; మద్య= మత్తుపానీయం; మాంస= మాంసం; పరస్త్రీ సమాగమ= ఇతర స్త్రీలతో తిరగటం; వైముఖ్యమునన్= విముఖత్వంతో (వ్యతిరేకతతో); ఆశ్రమస్థులన్= బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలలో ఉండేవారిని; తనకులంబువారిన్= స్వకులస్థులను; భరియించినను= పోషించినా; హేమ= బంగారం, వస్త్ర= బట్టలు; మందిర=

ఇల్లు; అన్నపానంబులు= భోజనం, త్రాగటానికి నీరు; ఒసఁగినన్= ఇచ్చినా; దీనులకున్= దరిద్రులకు; ఆశ్రయంబు= ఆధారము, గృహాదికము; ఇచ్చినను= ఒసంగినా; హింస= జీవరాసులను చంపటం; మానినను= మానినా; సమంచిత= ఒప్పిదమైన; స్వర్గలక్ష్మి= స్వర్గభోగం; సిద్ధించున్= లభిస్తుంది, దొరకుతుంది; అంద్రు= అంటారు.

తాత్పర్యం: ధర్మభీతితోనూ; దారిద్ర్య బాధలోనూ రోగాలను, పాపాలను తొలగించుకొనటానికైనా, దైవప్రీతికొరకు పశుహింస చేసినా, ఉత్తమ తపస్సు, గురుశుశ్రూష కలిగి పాండిత్యం సంపాదించి కూడ దానం స్వీకరించనివాడైనా, మద్యం, మాంసం, పరవనితాసంగమం మొదలైన వాటియందు విముఖుడై తన కులంవారిని భరించినా, బంగారంవస్త్రాలూ, మందిరాలూ, అన్నపానీయాలూ ఇచ్చినా, దీనులకు ఆశ్రయమొసంగినా, హింసమానినా సముచితమైన స్వర్గలక్ష్మి సిద్ధిస్తుందని పెద్ద లంటారు.

సీ. రచ్చకొట్టంబు, నారామంబుఁ గూపంబుఁ । బ్రపయుఁ గావించుట, భయభరార్త
కోటిఁ గాచుట, కన్య, గోవు, వాహనము, దా । సుని దాసి నిచ్చుట, దనకుఁ గీడు
సేసిన సైఁచుట, చెలులఁ జుట్టంబులఁ । బ్రోచుట, పెక్కండ్ర పొంటెఁ గార్య
మునఁ బరాక్రమమున ధనమునఁ దా నల । జడిపాటు, దుష్కర్మ సరణిఁ బొరయ

ఆ. కునికి, నాకలోకమునకు నిచ్చెన లగు । నెక్కులమునఁ బుట్టిరేని బహు సు
తుండు, నతికృపాన్వితుఁడు, వేయు నెలలపై । బ్రతికినతఁడుఁ గంద్రు త్రిదశపదము'. 64

ప్రతిపదార్థం: రచ్చకొట్టంబున్= రచ్చచావడి; ఆరామంబున్= తోట; కూపంబున్= నూయి; ప్రపయున్= చలిపందిరి; కావించుట= నిర్మించటం; భయభర= భయ భారంతో; ఆర్త= దుఃఖితులైన మానవుల; కోటిన్= సమూహాన్ని; కాచుట= కాపాడటం; కన్య= కన్యను; గోవున్= గోవును; వాహనమున్= మోసేజంతువును (గుర్రం, ఎద్దు); దాసునిన్= సేవకుడిని; దాసిన్= సేవకురాలిని; ఇచ్చుట= ఇవ్వటం; తనకున్; కీడు= ఆపద; చేసినన్= కలిగిస్తే; సైఁచుట= సహించటం; చెలులన్= స్నేహితులను; చుట్టంబులన్= బంధువులను; ప్రోచుట= కాపాడటం; పెక్కండ్ర పొంటెన్= అనేకులకొరకు; కార్యమునన్= పనిలో; పరాక్రమమునన్= పరాక్రమంలో; ధనమునన్= డబ్బులో; తాన్= తాను; అలజడిపాటు= అలజడిని; దుష్కర్మ= చెడ్డపనుల; సరణిన్= పద్ధతిని; పొరయకునికి= పొందకుండా వుండటం; నాకలోకమునకున్= స్వర్గలోకానికి; నిచ్చెనలు= మెట్లు; అగున్= ఔతాయి; ఏ+కులమునన్= ఏ కులంలో; పుట్టిరేని= పుట్టినా; బహు= పలువురు; సుతుండు= కొడుకులు కలవాడు; అతికృపా+అన్వితుఁడు= మిక్కిలి దయకలవాడు; వేయు= వేయి; నెలలపైన్= నెలలకుపైగా; బ్రతికిన+అతఁడున్= జీవించినతడూ సహస్రమాసోపజీవి; త్రిదశపదమున్= స్వర్గలోకాన్ని; కంద్రు= పొందుతారు.

తాత్పర్యం: రచ్చచావిడి, తోట, బావి, చలిపందిరి కల్పించటం, భయపీడితులను రక్షించటం, కన్యలను, గోవులను, వాహనాలను, దాసులనూ దాసిని ఇవ్వటం; తనకు అపకారం చేసినవాడిని క్షమించటం, స్నేహితులను, బంధువులను రక్షించటం, పెక్కుమంది కొరకు చేసే కార్యాలలో ధనం వెచ్చించి అలజడి పొందకుండా ఉండటం, దుర్మార్గవర్తనంలో చొరకుండా ఉండటం - అనేవి స్వర్గలోకప్రాప్తికి నిచ్చెనలవంటివి. ఏ కులంలో పుట్టినా, పెక్కురు కొడుకులు కలిగి మిక్కిలి దయామయుడై వేయి నెలలకాలం బ్రతికినవాడు స్వర్గలోకం చేరుకొంటాడు.'

వ. అని నిర్దేశించి. 65

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని స్పష్టం చేసి.

ఆ. 'నరకవాసకారణము నెఱింగించితిఁ । బుణ్యలోక హేతు భూతములును

దేట పడఁగఁ జెప్పితిని, గురుసంతతి । శ్రేష్ఠ ! యింక నేమి సెప్పవలయు? 66

ప్రతిపదార్థం: కురుసంతతి= కౌరవులలో; శ్రేష్ఠ!= శ్రేష్ఠుడైనవాడా!; ధర్మరాజా! నరకవాస= నరకంలో ఉండటానికి; కారణమున్= హేతువును; ఎఱింగించితిన్= చెప్పాను; పుణ్యలోక= స్వర్గలోక; హేతుభూతములును= కారణములైనవాటినీ; తేటపడఁగన్= స్పష్టంగా; చెప్పితిని= చెప్పాను; ఇంకన్= ఇకమీద; ఏమి చెప్పవలయున్= ఏమి చెప్పాలి?

తాత్పర్యం: కౌరవవంశ శ్రేష్ఠుడా! నరక, స్వర్గలోకాలు కలగటానికి కారణాలేవో స్పష్టంగా వేర్వేరుగా చెప్పాను. ఇంకా ఏమి చెప్పాలి?

వ. అడుగు 'మనినం, గౌంతేయపూర్వజుండు శాంతనవుతో 'బ్రహ్మహత్యాసమంబు లని కొందఱు గొన్ని కర్మంబు లుగ్గడింతురు; హింస లేకయు నట్లయ్యెడు నవి యెయ్యవి? వాని నేర్పడ నెఱింగింపవే' యనుటయు నతం డతని కిట్లనియె. 67

ప్రతిపదార్థం: అడుగుము; అనినన్= అనిచెప్పగా; కౌంతేయ= కుంతీ సంతానంలో; పూర్వజుండు= ముందుపుట్టినవాడు - ధర్మరాజు; శాంతనవుతోన్= భీష్ముడితో; బ్రహ్మహత్యా= బ్రాహ్మణహత్య - (ఆత్మను అధర్మంతో చంపుకొనటం); సమంబులు= సమానాలు; అని; కొందఱు= కొంతమంది; కొన్ని కర్మంబులు= కొన్ని పనులు; ఉగ్గడింతురు= చెప్తుతారు; హింసలేకయున్= చంపటం లేకుండా; అట్లు= ఆ విధంగా; అయ్యెడునవి= అయ్యేవి; ఎయ్యవి= ఏవి; వానిన్; ఏర్పడన్= విడివిడిగా; ఎఱింగింపవే= తెల్పుమా; అనుటయున్= అనగా; అతండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మరాజు 'కొందరు బ్రహ్మహత్యతో సమానమైన కర్మలు కొన్ని ఉన్నాయంటారు కదా! హింస లేకుండా ఏ కర్మ అయినా సరే బ్రహ్మహత్య ఎట్లా ఔతుంది? అట్లా అయ్యేకర్మ లుంటే వాటిని గూర్చి వివరించండి' అని ప్రశ్నించాడు. అతడితో భీష్ముడు ఇట్లా అన్నాడు.

సీ. 'దివ్యబోధాఢ్యు, వేదవ్యాసమునినాథు । నడిగితి నొక్కనాఁ డధిక భక్తి

నిట్లని; యా సంయమీంద్రుండు గృప నాకు । నెఱిఁగించె, ననఘ! నా యెఱిఁగినట్టి

విధము లెఱింగింతు వినుము; విప్రునిఁ గృశు । నామంత్రితునిఁ జేసి యతఁడు, గుడువ

వచ్చినఁ బెట్టమి, వరకులంబును, సార । విద్యయుఁ, గల, విప్రవృత్తి గొనుట

తే. నీరు ద్రావంగ గోవు లేతేర, విఘ్న । మాచరించుట, బధిర పంగ్వంధ ధనము

లపహరించుట, వేదశాస్త్రాదినింద, । బ్రహ్మహత్య లెట్టట్టుల పౌరవేంద్ర! 68

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర= పురువంశరాజా!; దివ్య= దివ్యమైన; బోధ+ఆఢ్యున్= జ్ఞానంచేత గొప్పవాడు అయిన; వేదవ్యాస= అనంతంగా ఉన్న వేదరాశిని నాలుగుగా విభాగం చేసిన కృష్ణద్వైపాయనుడు అను; మునినాథున్= మునిశ్రేష్ఠుడిని; అధికభక్తిన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మిక్కిలి భక్తితో; ఇట్లు= ఇది ఇట్లా అని; ఒక్కనాఁడు+అడిగితిన్; సంయమి+ఇంద్రుండు= ఆ మునినాథుడు; అనఘ!= పుణ్యాత్ముఁడా! కృపన్= దయతో; నాకున్= నాకు; ఎఱింగించెన్= తెల్పినాడు; నా ఎఱిఁగినట్టి= ఆయనవలన నాకు తెలిసిన; విధములు= తీరులు; ఎఱింగింతున్= నీకు చెపుతాను; వినుము= ఆలకించుము; కృశున్= దీనుడిని; విప్రునిన్= బ్రాహ్మణుడిని; ఆమంత్రితునిన్+చేసి= ఆహ్వానించి, అతఁడు= ఆయన; కుడువన్= తినటానికి; వచ్చినన్= రాగా; పెట్టమి= పెట్టకపోవటం; వరకులంబును= గొప్పకులమునూ; సారవిద్యయున్= సారవంతమైన విద్య, విద్యాసారం; కల= ఉన్న; విప్ర= బ్రాహ్మణుడి; వృత్తిన్= బ్రతుకు తెరువును; కొనుట= గ్రహించటం; నీరు= నీటిని; త్రావంగన్= త్రాగటానికి; గోవులు= ఆవులు; ఏతేరన్= రాగా; విఘ్నము= అడ్డంకి; ఆచరించుట= చేయటం; బధిర= చెవిటివాడు; పంగు= కుంటివాడు; అంధ= గ్రుడ్డివాడు వీరియొక్క; ధనములు= డబ్బులు; అపహరించుట= దొంగిలించటం; వేద శాస్త్ర+ఆది నింద= నాలుగు వేదాలను - ఇతర శాస్త్ర విద్యలను నిందించటం, తిట్టటం; బ్రహ్మహత్యలు; ఎట్టు=ఎట్లో; అట్టుల= అట్లాంటివి.

తాత్పర్యం: 'ధర్మరాజా! దివ్యజ్ఞానం కల వేదవ్యాస మునినాథుడిని ఒకసారి అడిగితే ఆయన నాకు చెప్పిన దేదో అదే నీకు చెప్పుతున్నాను. దీనుడైన వేద బ్రాహ్మణుడిని ఇంటికి ఆహ్వానించి అతడికి అన్నం పెట్టకపోవటం, చక్కగా చదువుకొన్న, మంచి కులం కల విప్రుడి జీవనాధారమైన వృత్తిని చెడగొట్టి అతడి నోరు కొట్టటం, నీరు త్రాగటానికి వచ్చిన ఆలమందలను తరిమికొట్టటం, చెవిటి గ్రుడ్డి మొదలగువారి డబ్బులు దొంగలించటం, వేదశాస్త్రాది నింద - ఇవి బ్రహ్మహత్యలతో సమానం.

తే. అలుకఁ బురి నూర వనమున నగ్ని యిడుట, । పాపశీలతమై బొంకి బ్రాహ్మణునకు
నధికతర మగు శోకంబు నావహించు । టంచితాచార! బ్రహ్మహత్యా సమములు. 69

ప్రతిపదార్థం: అంచిత= ఒప్పిదమైన; ఆచార!= ఆచారంకలవాడా!; అలుకన్= కోపంతో; పురిన్= నగరంలో; ఊరన్= గ్రామంలో; వనమునన్= తోటలో; అగ్నిఇడుట= నిప్పుపెట్టటం; పాపశీలతమైన్= పాపస్వభావంతో; బొంకి= అబద్ధమాడి; బ్రాహ్మణునకున్= విప్రునకు; అధికతరము+అగు= మిక్కిలి ఎక్కువైన; శోకంబున్= దుఃఖాన్ని; ఆవహించుట= కలిగించటం; బ్రహ్మహత్యా సమములు= బ్రహ్మహత్యతో సమానాలు.

తాత్పర్యం: మంచి ఆచారాలను అనుసరించేవాడా! కోపంతో నగరానికీ, ఊరికీ, తోటకూ నిప్పుపెట్టటం, పాప స్వభావంతో అబద్ధమాడి బ్రాహ్మణుడికి మిక్కిలి దుఃఖం కలిగించటం బ్రహ్మహత్యతో సమానం.

విశేషం: ఆచారం= చక్కగా ఆచరించిన వైదికకర్మలు - సంప్రదాయానుసారంగా సంక్రమించేవి.

తే. రూప గుణ శీలముల ననురూపుఁ డైన । వరుని కీక కన్నియఁ దన వలసినట్లు
తగని వానికి నిచ్చుట ధర్మదేవ । తాతనూభవ ! బ్రహ్మహత్యాసమంబు. 70

ప్రతిపదార్థం: ధర్మదేవతా= యముడి; తనూభవ= కుమారా! ధర్మరాజా! (ధర్మరాజు యముడి అంశంతో పుట్టినవాడు); రూప= అందమైన ఆకారంలో; గుణ= మంచిగుణాలలో; శీలములన్= స్వభావములో; అనురూపుఁడు+ఐన= తగినవాడైన; వరునికిన్= పెండ్లికొడుకునకు; కన్నియన్= కన్యను; ఈక= ఇవ్వక; తన వలసినట్లు= తండ్రి తనకిష్టమైనట్లు; తగనివానికిన్= అర్హుడుకాని వాడికి; ఇచ్చుట= ఇచ్చి పెండ్లిచేయటం; బ్రహ్మహత్యా సమంబు= బ్రహ్మహత్యతో సమానం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మదేవతాంశంలో జన్మించినవాడా! రూపం, గుణం, శీలంలో యోగ్యుడై ఉన్నవాడికి పిల్ల నిచ్చి చేయకుండా తన ఇష్టం వచ్చినట్లుగా కన్యనిచ్చి వివాహం చేయటం బ్రహ్మహత్యతో సమానం'.

విశేషం: రూపం= కంటికి కనిపించే శరీర సౌందర్యం. గుణ= మనస్సునకు సంబంధించిన అందం. శీలం= ఆత్మకు సంబంధించిన అందం. ఈ మూడు ఉన్నవాడికిచ్చి వివాహం చేయటం ధర్మం.

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బుణ్యతీర్థ విశేషంబుల నెఱింగించుట (సం.13-26-1)

వ. అనిన విని యజాతశత్రుండు, గంగాపుత్త్రుతోఁ 'బుణ్యతీర్థ విశేషంబులు వినవలతుం జెప్పవే' యనుటయు నమ్మహీపతికి నమ్మహితాత్ముం డిట్లనియె; 'తొల్లి గౌతముఁ డడుగ నంగిరసుండు దీర్థంబులు గొన్నింటి ప్రకారంబు సెప్పెఁ; నప్పరిపాటి సెప్పెద; నాకర్ణింపుము. 71

ప్రతిపదార్థం: అనినన్‌విని =అని భీష్ముడు చెప్పగా ఆలించి; అజాతశత్రుండు= ధర్మరాజు; గంగా పుత్త్రుతోన్= భీష్ముడితో; పుణ్యతీర్థ= పుణ్యక్షేత్రం ప్రక్కన పారే నదుల; విశేషంబులు= ప్రత్యేకతలు; వినవలతున్= వినాలని కోరుకొంటున్నాను; చెప్పవే= ఎరిగింపుమా; అనుటయున్= అనటంతోనే; ఆ+మహీపతికిన్= ఆ భూమి పతియైన ధర్మజునకు; ఆ+మహిత+ఆత్ముండు= ఆ మహాత్ముడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; తొల్లి= మునుపు; గౌతముండు= గౌతముడనే ఋషి; అడుగన్= చెప్పుమని కోరగా; అంగిరసుండు= ఆ పేరుగల ముని; తీర్థంబులు కొన్నింటి ప్రకారంబు= కొన్ని పుణ్యతీర్థముల విధములు; చెప్పెన్= తెల్పినాడు; ఆ+పరిపాటి= ఆ క్రమం, ఆ విధానం; చెప్పెదన్= చెప్తాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు 'పుణ్యతీర్థాల విశేషాలు చెప్పు'మని అడుగగా భీష్ము డిట్లా అన్నాడు. 'పూర్వం నీవలెనే గౌతము డడిగితే అంగిరసుడు చెప్పిన విధానం నీకు చెప్తాను వినుము.

సీ. సప్తదినంబులు చంద్రభాగను, విత । స్తను, నూర్మి మాలినిఁ దగ వసించి
యాహారవిరహితుండై యుండ ముని సమా । నుం డగుఁ, గాశ్మీర మండలమున
నదులు గొన్ని మహావనము సొచ్చి పాఱు ది । వంబు సిద్ధించుఁ దదంబుసేవఁ;
బుష్కరమ్ముఁ బ్రభాసమును, నైమిశము, నింద్ర । మార్గంబు, దేవికా స్వర్గబిందు

తే. లును, సమవగాహనంబున జనుల నప్ప । రస్సమేత విమానవర్తనులఁ జేయు
నవనినాథ! హిరణ్యబిందువుఁ, గుశేశ । యంబు, నెల్ల పాపంబుల నపనయించు. 72

ప్రతిపదార్థం: చంద్రభాగను, వితస్తను, ఊర్మిమాలినిన్= అన్న ఈ మూడు నదులలో; సప్తదినంబులు= ఏడు రోజులు; తగన్= ఆచారయుక్తంగా; వసించి= (తీరంలో) నివసించి; ఆహార విరహితుండు+ఐ= అన్నంలేకుండా ఉపవాసం చేస్తూ; ఉండన్= ఉంటే; ముని సమానుండు+అగున్= మునితో సమానుడౌతాడు; కాశ్మీర మండలమునన్= కాశ్మీర దేశంలో; నదులు కొన్ని= కొన్ని నదులు; మహావనము= సముద్రం (వనం= నీరు; మహా=గొప్ప), అధికజలం కలది; చొచ్చి= ప్రవేశించి; పాఱున్= ప్రవహిస్తాయి; తత్= వాటి; అంబు= నీటిని; సేవన్= సేవించటంతో; దివంబు= స్వర్గం; సిద్ధించున్= లభిస్తుంది; పుష్కరమ్మున్= పుష్కరము; ప్రభాసమును= ప్రభాసం; నైమిశమున్= నైమిశం; ఇంద్రమార్గంబు= ఇంద్రమార్గం; దేవికా= దేవిక; స్వర్గబిందులును=

స్వర్గ బిందువు; సమవగాహనంబునన్= చక్కగా స్నానం చేయటంవలన; జనులన్= మనుష్యులను; అప్సరః+సమేత= అచ్చరలతో కూడిన; విమానవర్తనులన్= విమానాలలో విహరించేటట్లు; చేయున్= చేస్తాయి; అవనినాథ= ఓ భూమీశా!; హిరణ్య బిందువున్, కుశేశయంబున్= కుశేశయమనే ఈ తీర్థాలు; ఎల్లపాపంబులన్= పాపాలన్నిటినీ; అపనయించున్= పోగొడతాయి.

తాత్పర్యం: ధర్మరాజా! చంద్రభాగలో, వితస్తలో, ఊర్మిమాలినిలో ఏడురోజులు తగినవిధంగా నివసించి ఉపవాసం చేస్తే నరుడు ముని సమాను డౌతాడు. కాశ్మీర ప్రాంతంలో కొన్ని నదులు మహావనంలో ప్రవేశించి ప్రవహిస్తాయి. వాటి నీరు సేవిస్తే స్వర్గం లభిస్తుంది. పుష్కరంలో, ప్రభాసంలో, నైమిశంలో, ఇంద్రమార్గంలో, దేవికలో, స్వర్గబిందువులో స్నానం చేసిన జనులకు అప్సరసలతో కూడిన విమానయానం లభిస్తుంది. హిరణ్య బిందువు, కుశేశయములు పాపాల నన్నిటినీ తొలగిస్తాయి.

విశేషం: పుష్కరం, ప్రభాస, నైమిశం, ఇంద్రమార్గం, దేవిక, స్వర్గబిందువులు - ఇవన్నీ తీర్థాలు. (వాటిలో) ఈ పుణ్యతీర్థ విశేషాలు శల్యపర్వంలో చెప్పబడ్డాయి. భారతం క్షేత్ర - తీర్థ విశేషాలను వర్ణిస్తుంది. హిరణ్య= బంగారం. బిందువు, బొట్టు= బంగారం రంగులో నీటి బొట్లు కలది; కుశేశయము= తామరపూలు కలది.

వ. గంధమాదన సంగతయైన యింద్రతోయయుం, గురంగదేశగత యగు కరతోయ యుం, ద్రిరాత్రోపవాసోపేత
స్నాతకులకు నశ్వమేధఫలంబు గలుగం జేయు. 73

ప్రతిపదార్థం: గంధమాదన= ఒక పర్వతం; సంగత+ఐన= ఆ పర్వతం నుండి ప్రవహించే; ఇంద్రతోయ= నదిపేరు; కురంగదేశ= ఒక దేశం; గత= ఉన్న; కరతోయయున్= నదిపేరు; త్రిరాత్ర= మూడు రాత్రులు; ఉపవాస+ఉపేత= ఉపవాసంతో పాటుగా; స్నాతకులకున్= స్నానంచేసేవారికి; అశ్వమేధ ఫలంబు= అశ్వమేధ యాగఫలం; కలుగన్+చేయున్= కలిగిస్తాయి.

తాత్పర్యం: గంధమాదన పర్వతం నుండి ప్రవహించే ఇంద్రతోయ కురంగదేశంలోని కరతోయ - అనే నదులలో మూడురాత్రు లుపవసించి స్నానం చేస్తే చాలు అశ్వమేధఫలం అవి కలిగిస్తాయి.

తే. కనఖలమున, గంగాద్వారముననను, నీల । భూధరమునఁ, గుశావర్తముననను, బిల్వ
కమున, సుస్నాతుఁ డై పాతకములు దొఱఁగి । నాకలోక విహారంబు నరుఁడు వొందు. 74

ప్రతిపదార్థం: కనఖలమునన్, గంగాద్వారముననను, నీల (నల్లని) భూధరమునన్ (కొండలలో పుట్టిన నదిలో) కుశావర్తముననను, బిల్వకమునన్ - ఇవన్నీ నదుల పేర్లు (వాటిలో); సుస్నాతుఁడు+ఐ= భక్తితో స్నానంచేసినవాడై; పాతకములు= పాపాలు; తొఱఁగి= పోగొట్టుకొని; నరుఁడు= మానవుడు; నాకలోక= స్వర్గలోక; విహారంబు= వాహ్యాళి (సరదాగా తిరగటం); పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: కనఖలము గంగాద్వారము, నీలపర్వతము, కుశావర్తము, బిల్వకము అనే పేర్లుగల తీర్థాలలో భక్తితో స్నానంచేస్తే చాలు స్వర్గలోకం లభిస్తుంది.

క. భాగీరథి యెచట నుద । గ్భాగముననను శివుని నెలవు ప్రాంతమునఁ జనున్
ధీగణ్య! యచట నెలకు స । మాగతులగు సురలఁ గం డ్రనాహారవిధిన్. 75

ప్రతిపదార్థం: ధీగణ్యా!= బుద్ధిమంతులలో గణింప దగినవాడా!; భాగీరథి= గంగ; ఎచటన్= ఎక్కడ; ఉదగ్= ఉత్తర; భాగమునను= ప్రదేశంలో; శివుని= మహేశ్వరుడి, నెలవు= స్థానం, ఉండేచోటు; ప్రాంతమునన్= ప్రదేశంలో; చనున్= ప్రవహిస్తుందో; అచటన్= అక్కడ; నెలన్= ప్రతినెలా; సమాగతులు+అగు= వచ్చేటటువంటి; సురలన్= దేవతలను; అనాహార విధిన్= ఉపవాస వ్రతంతో; కంద్రు= చూస్తారు.

తాత్పర్యం: ఎక్కడగంగానది ఉత్తరదిక్కున శివుడి నివాసమైన కైలాసశిఖరం దగ్గర ప్రవహిస్తుందో అక్కడ ఉపవాసముండేవారికి అక్కడికి ప్రతినెలా వచ్చే దేవతలు దర్శనమిస్తారు.

సీ. ఆహార ముడిగి మహాశ్రమంబున నగ్ని। హోత్రియై యొకమాస ముండి నరుఁడు
సకల సిద్ధులు మహాశ్చర్యంబుగాఁ గను,। జననాథ! భృగుతుంగమను మహా ప్ర
దమ్మున వాసరత్రయ ముపవాసి యై। బ్రహ్మవధంబు పాపంబుఁ దొఱఁగు;
వినుము! కన్యాకూపమున సాగ్నిహోత్రత। నున్నఁ గీర్తితుఁ డగు; నుభయలోక

తే. ములను సుందరికాహ్రదంబునను దగఁగ। సకృదుపస్పర్శనము చేసి చారుమూర్తి
యై జనించు; వైమానిక మనఁగఁ బరఁగు। భవ్యతీర్థంబు సేవించి పడయు దివము. 76

ప్రతిపదార్థం: జననాథ!= ప్రజాపతీ! రాజా!; మహాశ్రమంబునన్= (ఆ పేరుగల తీర్థము) మహాశ్రమంలో; అగ్నిహోత్రిఐ= అగ్నిహోత్రం చేస్తూ; ఒకమాసము= ఒక నెల; ఉండి; నరుఁడు= మనుష్యుడు; మహాశ్చర్యంబుగాన్= మిక్కిలి చిత్రంగా; సకలసిద్ధులు= అన్ని యోగసిద్ధులు; కనున్= పొందుతాడు; భృగుతుంగము అను= భృగుతుంగమనే పేరుగల; మహా= గొప్ప; హ్రదమ్మునన్= తీర్థంలో; వాసరత్రయము= మూడురోజులు; ఉపవాసిఐ= ఉపవాస ముండి; బ్రహ్మవధంబు పాపంబున్= బ్రహ్మహత్యాపాపం; తొఱంగున్= విడుచును; వినుము= ఆలకించుము; కన్యాకూపమునన్= ఆ పేరుగల కుండంలో (తీర్థం); స+అగ్ని హోత్రతన్= అగ్నిహోత్రంచేస్తూ; ఉన్నన్= ఉంటే; ఉభయలోకములను= ఈలోకంలో, పైలోకంలో; కీర్తితుఁడు= కీర్తించబడినవాడు; అగున్; సుందరికా= సుందరిక అన్న పేరుగల; హ్రదంబునన్= తీర్థంలో; తగఁగన్= చక్కగా; సకృత్= ఏ కొంచెమైనా; ఉపస్పర్శనము = జలములను తాకి; చారుమూర్తిఐ= అందమైన రూపంకలవాడై; జనించున్= జన్మిస్తాడు; వైమానికము అనఁగన్+పరఁగు= వైమానికము అనే ఆ పేరుతో ప్రసిద్ధమైన; భవ్య= శ్రేష్ఠమైన; తీర్థంబు= పుణ్యతీర్థమును; సేవించి= పూజించి; దివము= స్వర్గం; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: ఒకమాసంపాటు నిత్యాగ్నిహోత్రిఅయి మహాశ్రమంలో ఉంటే మనిషికి అన్ని సిద్ధులు లభిస్తాయి. చాలా ఆశ్చర్యంగా భృగతుంగమన్న (సరస్సు) తీర్థకుండంలో మూడురోజులు ఉపవాసముంటే బ్రహ్మహత్యాపాపం పోతుంది. కన్యాకూపంలో అగ్నిహోత్రిఅయి నివసిస్తే ఇహ, పరలోకాలలో స్తుతించబడతాడు. సుందరికాతీర్థంలో కొంచెం మునిగితే అందమైన రూపంతో తిరిగి జన్మిస్తాడు. వైమానిక తీర్థ సేవచేస్తే స్వర్గం లభిస్తుంది.

తే. కృత్తికాంగార సంసేవ గిల్బిషములఁ। బాపి నాకంబుఁ జేర్చు విపాశఁ ద్రిదివ
సములు, గాలికాశ్రమ బ్రహ్మచర్య నియతి। తోడ సేవింప జన్మంబు దొఱఁగు నరుఁడు. 77

ప్రతిపదార్థం: కృత్తికా+అంగార= కృత్తిక, అంగారముల యొక్క; సంసేవ= పూజ; కిల్బిషములన్= పాపాలను; పాపి= పోగొట్టి; నాకంబున్= స్వర్గానికి; చేర్చున్= చేరుస్తుంది; విపాశన్= ఆ పేరుగల నదిలో; త్రి=మూడు; దివసములు= రోజులు; కాలికాశ్రమ=

ఆ ఆశ్రమాన్ని ఆశ్రయించి; బ్రహ్మచర్య నియతితోడన్= బ్రహ్మచర్య నియమంతో; సేవింపన్= కొలిస్తే; నరుఁడు= మనుష్యుడు; జన్మంబున్= పుట్టుక; తొఱఁగున్= విడుచును.

తాత్పర్యం: కృత్తిక, అంగార సేవలవలన పాపాలు పోయి స్వర్గం లభిస్తుంది. కాళికాశ్రమంలో బ్రహ్మచర్య నియమం పాటిస్తూ ప్రక్కనే ఉన్న విపాశానదిలో మూడురోజులు మునిగితే ముక్తి లభిస్తుంది.

విశేషం: ఉస్మానియా - వావిళ్ళ ప్రతులలో 'కాలికాశ్రయ' అని ఉన్నది. ఇది తప్పు. "కాళికాశ్రమమాసాద్య - విపాశాయాం కృతదోకః బ్రహ్మచారీ జితక్రోధః త్రిరాత్రం ముచ్యతే భవాత్' అని మూలం. కాళికాశ్రమాన్ని ఆశ్రయించి ... స్నానంచేస్తే కోపంలేకుండా, బ్రహ్మచర్యవ్రతంతో - జన్మరాహిత్యం కలుగుతుంది. పైగా ఇక్కడనుండి ఆశ్రమ విషయం చెప్పబడుతున్నది.

క. స్నానముఁ బితృతర్పణమును । మానితగుణ! కృత్తికాశ్రమంబున నియతిన్
మానవులు సేసి శివు కొలు । వానందాత్మకతఁ గాంతు రండ్రు మునీంద్రుల్. 78

ప్రతిపదార్థం: మానిత= గౌరవించదగిన; గుణ= గుణాలు కలవాడా!; స్నానమున్; పితృతర్పణమును= పితృదేవతలకు తర్పణాలివ్వటం; కృత్తికా= కృత్తిక అన్న పేరుగల; ఆశ్రమంబునన్= ఆశ్రమంలో; నియతిన్= నియమంతో; చేసి= చేసి, కావించి; మానవులు= జనులు; శివు కొలువు= శివుడి యొక్క సంసేవ; ఆనంద+ఆత్మకతన్= ఆనందహృదయంతో; కాంతురు= పొందుతారని; ముని+ఇంద్రుల్= మునీశ్వరులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ధర్మరాజా! కృత్తికాశ్రమంలో స్నానం, పితృతర్పణం చేస్తే వారికి శివుడి సన్నిధానంలో ఆనందంతో ఉండే స్థితి లభిస్తుందని మునీంద్రు లంటారు.

తే. ద్రోణశర్మ పదంబున రూఢ మైన । తీర్థమును, శరస్తంబంబు, దేవదారు
వనముఁ దమ్ము సేవించిన మనుజు నెట్టి । వానినైనను నప్సరోవరునిఁ జేయు. 79

ప్రతిపదార్థం: ద్రోణశర్మ పదంబునన్= ద్రోణశర్మమన్న పేరుగల ఆశ్రమంలో; రూఢమైన= ప్రసిద్ధమైన; తీర్థమును; శరస్తంబంబు= ఆ పేరుగల తీర్థం; దేవదారువనమున్= ఆ పేరుగల ఆశ్రమం; తమ్మున్= తమను; సేవించిన= పూజించిన; మనుజున్= మనిషిని; ఎట్టివానిన్+ఐనను= ఎట్లాంటివాడినైనా; అప్సరస్= అప్సరసలకు; వరునిన్= భర్తను; చేయున్= చేస్తాయి.

తాత్పర్యం: ద్రోణశర్మంలోని తీర్థం, శరస్తంబం, దేవదారువనం - తమను సేవించిన వారిని అప్సరసలకు భర్తలను చేస్తాయి.

తే. చిత్రకూట జనస్థాన సేవనములు । రాజలక్ష్మి నొసఁగు; వీతభోజనత్వ
మహితవృత్తుఁడై; శ్యామాశ్రమమున నొక్క । పక్ష మున్న నంతర్ధ్యాన ఫలము గలుగు. 80

ప్రతిపదార్థం: చిత్రకూట, జనస్థాన= చిత్రకూట జనస్థానములయొక్క; సేవనములు= సేవలు; రాజలక్ష్మిన్= రాజు వైభవాన్ని; ఒసఁగున్= ఇస్తాయి; శ్యామ+ఆశ్రమమునన్= శ్యామ మన్న పేరుగల ఆశ్రమంలో; వీత= వదలిన; భోజనత్వ= భోజనముచేత; మహిత= గొప్ప; వృత్తుఁడు+ఐ= వృత్తి కలవాడై; ఒక్క పక్షము= పదునైదు రోజులు; ఉన్నన్= ఉంటే; అంతర్ధ్యాన = ఆత్మధ్యాన; ఫలము= ఫలితం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: చిత్రకూటం, జనస్థానం సేవలవలన రాజలక్ష్మి కలుగుతుంది. శ్యామాశ్రమంలో భోజనం లేకుండా పదునైదు రోజులుంటే ఆత్మలోపల ధ్యానం చేసిన ఫలితం కలుగుతుంది.

విశేషం: బహిర్ధ్యానం= బయటనున్న విగ్రహాలను ధ్యానించటం. అంతర్ధ్యానం = ఆత్మధ్యానం. ఇది శ్రేష్ఠమంటారు పెద్దలు.

క. విమలమతిం గౌశిక వా । లమున, ననాహార మౌనలంపటుఁ డై యు
న్న మనుజుఁ డిరువదియొక్కది । నములం బరమగతి సాధనశ్రీ నొందున్. 81

ప్రతిపదార్థం: విమల= స్వచ్ఛమైన; మతిన్= ఆలోచనతో; న+ఆహార (అనాహార)= ఆహారం లేకుండా; మౌన= మౌనవ్రతమునందు; లంపటుఁడు+ఐ= ఆసక్తి కలవాడై; కౌశికవాలమునన్= ఆ పేరుగల ఆశ్రమంలో; ఉన్న= నివసించిన; మనుజుఁడు= మనిషి; ఇరువదియొక్క దినములన్= మూడు వారాలలో; పరమగతి= ముక్తి; సాధనశ్రీన్= మార్గ సంపదను; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: కౌశికవాలమనే ఆశ్రమంలో మూడువారాలపాటు నిర్మలమైన మనస్సుతో ఉపవాసముండి మౌనవ్రతం పాటిస్తే వాడు ముక్తికి సాధన సంపత్తిని పొందుతాడు.

సీ. పేర్చు మతంగవాపిక నేకరాత్రంబు । నిలిచి సిద్ధుం డగు, నెల వసించి
నైమిశంబునఁ బొందు నరవర! పురుష మే । ధ ఫలంబు, నట్టి విధంబ యుత్ప
లావనంబునఁ జేయఁగా విను మశ్వమే । ధంబు ఫలంబు నర్ధంబుఁ బడయు
నరుఁడు గంగా యమునా సంగమంబునఁ । గాలాంజనం బను శైలమునను
తే. నియతి నాచరితస్నానుఁ డయి విముక్తి । తెరువు గాంచు, వైవస్వత తీర్థసేవఁ
దీర్థభూతత్వ మొందు విధేయ చిత్త । వృత్తిఁ గౌరవవంశ పవిత్ర చరిత! 82

ప్రతిపదార్థం: కౌరవవంశ= కురువంశంలో; పవిత్ర చరిత!= పుణ్యమైన నడవడి కలవాడా!; ఏకరాత్రంబు= ఒకరాత్రి; పేర్చు= అతిశయమైన; మతంగ వాపికన్= మతంగమనే కుండంలో (వాపిక=బావి); నిలిచి= వసించి; సిద్ధుండు+అగున్=సిద్ధి పొందిన వాడౌతాడు; నరవర!= మనుష్యులలో శ్రేష్ఠుడా!; నైమిశంబునన్= నైమిశమనే ఆశ్రమంలో; నెల వసించి= ఒక నెల ఉండి; పురుషమేధ= మనిషిని బలిచ్చే యజ్ఞంయొక్క; ఫలంబు= ఫలితం; పొందున్= పొందును; వినుము= ఆలకించుము; అట్టివిధంబు+అ= అట్లాంటి విధానమే; ఉత్పలావనంబునన్= ఆ పేరుగల ఆశ్రమంలో; చేయఁగాన్= చేస్తే; అశ్వమేధంబు= గుర్రాన్ని బలి ఇచ్చే యజ్ఞం యొక్క; ఫలంబు= ఫలితంలో; అర్ధంబున్= సగం; పడయున్= పొందును; నరుఁడు= మనిషి; గంగా యమునా సంగమంబునన్= గంగా యమునా నదుల కూడలిలో; కాల+అంజనంబను= నల్లని కాటుక అనే; శైలమునన్= కొండపై; నియతిన్= నియమంతో; ఆచరిత= చేసిన; స్నానుఁడు+అయి= స్నానం కలవాడై; విముక్తి తెరువు= మోక్షమార్గం; కాంచున్= పొందుతాడు; వైవస్వత తీర్థ సేవన్= వైవస్వత తీర్థాన్ని సేవిస్తే; విధేయ= వినయం కల; చిత్తవృత్తిన్= మనస్సుతో; తీర్థభూతత్వము= తీర్థమైన లక్షణాన్ని; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: కురువంశంలో పవిత్రచరిత్ర కలవాడా! జాగ్రత్తగా వినుము. మతంగవాపికలో ఒకరాత్రి నివసిస్తే సిద్ధుడౌతాడు. నైమిశారణ్యంలో నెల నివసిస్తే పురుషమేధ ఫలం పొందుతాడు. అదే విధంగా ఉత్పలావనంలో చేస్తే అశ్వమేధ ఫలంలో సగం ఫలం పొందుతాడు. గంగాయమునలకూడలిలో కాలాంజనంబన్న కొండలో (ఊటలో) స్నానం నియమంతో చేస్తే మోక్షమార్గం దొరుకుతుంది. వైవస్వత తీర్థాన్ని సేవిస్తే మహాభాగ్యుడౌతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: తీర్థభూతుఁడు - తీర్థమైనవాడు. కావ్యతీర్థ - వంటి బిరుదులున్నాయి.

ఆ. విను, ప్రయాగమునకుఁ జనుదెంచుఁ గోటిత్ర । యంబు, దశ సహస్రకంబుఁ, దీర్థ
ములు నరేంద్ర! దర్శమున నందు నెలనాళ్ళు । లున్న నరుఁడు ముక్తి కొడయఁ డండ్రు. 83

ప్రతిపదార్థం: నరేంద్ర!= రాజా!; విను= వినుము; దర్శమునన్= అమావాస్యనాడు; ప్రయాగమునకున్= గంగాయమునల కూడలి క్షేత్రమైన ప్రయాగకు; కోటిత్రయంబు= మూడుకోట్లు; దశ=పది; సహస్రకంబున్= వేలు; తీర్థములు= పుణ్యతీర్థాలు; చనుదెంచున్= వస్తాయి; అందున్= ప్రయాగలో; నెలనాళ్ళులు= మాసంపాటు; ఉన్న= నివసించిన; నరుఁడు= మానవుడు; ముక్తికిన్= మోక్షానికి; ఒడయఁడు= రాజు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: రాజా! విను. అమావాస్యనాడు ప్రయాగకు మూడుకోట్ల పదివేల తీర్థాలు చేరుకుంటాయి. కనుక అక్కడ నెలనాళ్ల ఉన్నవ్యక్తి ముక్తికి అధికారి అవుతాడని చెబుతారు.

క. విను, గంగను బ్రహ్మశిరం । బను తీర్థమునందు నెల నిరాహారతమై
నునికిని మర్త్యుం డమృతాం । శునిలోకంబున మహాయశుండై యుండున్. 84

ప్రతిపదార్థం: విను= వినుము; గంగను= గంగలో; బ్రహ్మశిరంబు+అను= బ్రహ్మశిరమనే పేరుగల; తీర్థమునందున్= తీర్థంలో; నెల= ఒక మాసం; నిరాహారతమైన్= ఆహారం లేకుండా; ఉనికిని= ఉన్నందువలన; మర్త్యుండు= నరుడు; అమృత+అంశుని= అమృత కిరణాలు కల చంద్రుడి; లోకంబునన్= లోకంలో; మహా=గొప్ప; యశుండు+ఐ= కీర్తి కలవాడై; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: గంగలో, బ్రహ్మశిరమనే తీర్థంలో నెలనాళ్ళు ఉపవాసముంటే నరుడు చంద్రలోకంలో గొప్ప కీర్తితో ఉంటాడు.

సీ. అనఘ! యష్టావక్రమును, గలవింకము, దేవహ్రదము, బ్రహ్మభావ మొసఁగు
నాచరితస్నానుఁ డగు మర్త్యునకు నుర్వ । శీ కృత్తికా యోగసిద్ధ కీర్తి
యైన, లౌహిత్యంబునందు సుస్నాతుఁడై । పుండరీకాధ్వరమున ఫలంబుఁ
బొందు, రామహ్రదంబున నిరాహారుఁడై । పండ్రెండు దినములు భరిత నియతి

తే. నున్న సకలకల్మషములు నుజ్జగించు । నరుఁడు, నిర్భోజనత నెలనాళ్ళు దా మ
హాహ్రదావాసియై జమదగ్నిఁ గన్న । పుణ్యలోకంబుఁ గను మునిగణ్యుఁ డగుచు. 85

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముఁడా!; అష్టావక్రమును, కలవింకము, దేవహ్రదము= అన్నతీర్థాలు; బ్రహ్మభావము= పరమాత్మ భావాన్ని (అహంబ్రహ్మోస్మి= నేను పరబ్రహ్మన్ని) అన్న దర్శనాన్ని; ఒసఁగున్= ఇస్తాయి; ఆచరిత= చేసిన; స్నానుఁడగు= స్నానంకల; మర్త్యునకున్= మనిషికి; ఉర్వశీ= అప్సరస; కృత్తికా= ఆ నక్షత్రం; యోగ= కలయిక వలన; సిద్ధ= లభించిన; కీర్తిఐన= కీర్తికల; లౌహిత్యంబునందున్= ఆ పేరుగల తీర్థంలో; సుస్నాతుఁడు+ఐ= చక్కగా స్నానంచేసి; పుండరీక+అధ్వరమునన్= పౌండరీక యాగంలోని; ఫలంబున్= ఫలితం; పొందున్= పొందుతాడు; రామహ్రదంబునన్= రామహ్రద మనేచోట; నిరాహారుఁ

డు+ఐ= ఆహారం లేకుండా; పంౘ్రెండు దినములు= పన్నెండు రోజులు; భరిత నియతిన్= నిండైన నిష్ఠతో; ఉన్నన్= ఉంటే; సకల కల్మషములు= పాపాలన్నీ; ఉజ్జగించున్= విడుస్తాడు, పోగొట్టుకొంటాడు; నరుఁడు తాన్= మనిషితాను; నిర్భోజనతన్= భోజనం లేకుండా; మహాహ్రద= ఆ పేరుగల తీర్థంలో; ఆవాసిఐ= నివసించినవాడై; జమదగ్ని (జమత్+అగ్ని) కన్న= ఆ మహర్షి పొందిన; పుణ్యలోకంబున్= పవిత్రలోకాన్ని; మునిగణ్యుఁడు= మునులలో లెక్కింపదగినవాడై; అగుచున్= అవుతూ; కనున్= ఆ పుణ్యలోకాలు పొందుతాడు.

తాత్పర్యం: ఆ మూడు తీర్థాలలో స్నానం చేసినవాడు పరబ్రహ్మ దర్శనం చేస్తాడు. ఊర్వశీ కృత్తికా యోగంలో (జ్యోతిశ్శాస్త్ర సంబంధం కావచ్చును). లౌహిత్య తీర్థంలో స్నానంచేస్తే పౌండరీకయాగ ఫలం పొందుతాడు. రామహ్రదంలో ఉపవాసియై పన్నెండు రోజులు నియమంతో ఉంటే పాపాలన్నీ పోతాయి. మహాహ్రదంలో భోజనం లేకుండా నెలనాళ్ళుంటే జమదగ్ని పొందిన పుణ్యలోకాలు కలుగుతాయి.

క. విను వింధ్యంబున నొక నెల । తనుతాపము నోర్చి చేయుతపమున జనరం

జన! సర్వప్రాయశ్చి । త్త నిరూఢిం బొంది నరుఁడు ధర్మజ్ఞుఁ డగున్. 86

ప్రతిపదార్థం: విను= వినుము; జనరంజన!= ప్రజారంజకుడా!; వింధ్యంబునన్= వింధ్య పర్వతంమీద; ఒకనెల= ఒక మాసం; తను తాపమును= శరీరశ్రమను; ఓర్చి= సహించి; చేయు= చేసే; తపమునన్= తపస్సువలన; సర్వ= అన్ని; ప్రాయశ్చిత్త= పాపాలుచేసి వాటిని పోగొట్టుకొనటానికి చేసే వైదిక కర్మల; నిరూఢిన్= ప్రసిద్ధిని - ఫలితాన్ని; నరుఁడు= మనిషి; పొంది; ధర్మజ్ఞుఁడు= ధర్మం తెలిసినవాడు; అగున్= ఔతాడు.

తాత్పర్యం: ప్రజారంజకుడైనరాజా! వినుము. వింధ్యంమీద ఒక నెల శరీరతాపాన్ని (ఉష్ణాన్ని) ఓర్చుకొని తపస్సు చేస్తే మనిషి సర్వప్రాయశ్చిత్త ఫలం పొందుతాడు. ధర్మవేత్తా ఔతాడు.

సీ. నర్మద నాడి భూనాథనందనుఁ డగు, । జంబుమార్గంబున సంయతాత్ముఁ

డై మాసములు మూఁడు నట యొక్క నాఁడును । నిలిచిన, సర్వసిద్ధులను బొందుఁ

గోకాముఖము నీరఁ గ్రుంకి, తండులికాశ్ర । మమునకుఁ జని, వల్కలము ధరించి,

శాకభోజనుఁ డయి, శాంతిమై నున్న న । న్నెలవున నున్న కన్నెలు పదుంద్ర

తే. కధిపుఁడై యజరామరుండయి సుఖించుఁ, । గుల్యయందుఁ ద్రిరాత్రమ్ము, గుడుపు దక్కి

శౌచియై యఘమర్షణ జపము చేసి । యశ్వమేధఫలముఁ బొందు ననఘ! నరుఁడు. 87

ప్రతిపదార్థం: నర్మదన్= నర్మదానదిలో; ఆడి= స్నానమాడి; భూనాథ= రాజు యొక్క; నందనుఁడు= కొడుకు; అగున్= ఔతాడు; జంబు= నేరేడు - ఆ పళ్ళు రాలినందున నీరు నీలివన్నెతో ప్రవహిస్తుందట; మార్గంబునన్= ఆ మార్గంలో ప్రవహించే నదులలో; సంయత = నియమించిన; ఆత్ముఁడు+ఐ= మనస్సు కలవాడై; ఏకాగ్రతతో; మాసములుమూఁడు= మూణ్ణెల్లు; అట= ఆపై; ఒక్క నాఁడును= ఒక రోజు; నిలిచినన్= ఉంటే; సర్వసిద్ధులను= సిద్ధులన్నిటినీ; పొందున్= పొందుతాడు; కోకాముఖము= కోక అన్న పేరుగల నదీ ద్వారంలో; నీరన్= నీటిలో; క్రుంకి= మునిగి; తండులికా= ఆ పేరుగల; ఆశ్రమమునకున్= ఆశ్రమానికి; చని= వెళ్ళి; వల్కలము= నారబట్ట; ధరించి= కట్టుకొని; శాకభోజనుఁడు+అయి= కూరగాయలు తింటూ; శాంతిమైన్= శాంతితో; ఉన్నన్= ఉంటే; ఆ+నెలవునన్= ఆ చోట; ఉన్న; కన్నెలు= కన్యలు; పదుంద్రకున్= పదిమందికీ; అధిపుఁడై = నాథుడై; అజరా+ అమరుండు+అయి= ముసలితనం, మరణంలేనివాడై; సుఖించున్=

భోగిస్తాడు; కుల్య+అందున్= కుల్యలో, ఆపేరుగల తీర్థంలో; (కుల్య= కాల్వ); త్రిరాత్రమ్ము= మూడు రాత్రులు; కుడుపు= అన్నం; తక్కి= విడిచి; శౌచిఐ= శుచిత్వం కలిగి; అఘ= పాపం; మర్షణ= పోగొట్టే; జపముచేసి= జపమొనర్చి; నరుఁడు= మనుష్యుడు; అశ్వమేధ ఫలమున్ పొందున్= అశ్వమేధమనే యజ్ఞఫలం పొందుతాడు.

తాత్పర్యం: నర్మదానదిలో స్నానం చేస్తే రాజకుమారుడై పుట్టుతాడు. జంబూనదిలో నియమంతో మూడు మాసాలపై ఒకరోజుంటే సర్వసిద్ధులూ కలుగుతాయి. కోకాముఖంలో స్నానంచేసి తండులికాశ్రమంలో నారబట్ట ధరించి శాకాహారంతో శాంతంగా ఉంటే అక్కడున్న పదిమంది కన్యలకు మగడౌతాడు. అతడి కిక ముసలితనంగానీ, మృత్యువుగానీ ఉండదు. కుల్యానదిలో మూడురాత్రులు ఉపవాసం చేస్తే పాపాలు పోగొట్టే మంత్రాలు శుచిగా జపిస్తే - అశ్వమేధ ఫలం పొందుతాడు.

వ. ఆర్ష్టిసేనాశ్రమంబున నుజ్జానక స్నాతుండై, మర్త్యుం డఖిల పాపంబులం దొఱంగు; పిండారకంబున నేకరాత్రంబు నిలిచి యగ్నిష్టోమఫలంబుం బడయు; ధర్మారణ్యంబున బ్రహ్మసరస్సు సేవించి పౌండరీకఫలప్రాప్తిఁ గాంచు. 88

ప్రతిపదార్థం: ఆర్ష్టిసేనా+ఆశ్రమంబునన్= ఆ పేరుగల ఆశ్రమంలో ఉన్న; ఉజ్జానక= ఆ పేరుగల తీర్థంలో; స్నాతుండు+ఐ= స్నానం చేసి; మర్త్యుండు= (మరణం కలవాడు); నరుడు; అఖిల= సమస్త; పాపంబులన్= పాపాలను; తొఱంగున్= విడుస్తాడు; పిండారకంబునన్= ఆ పేరున్న తీర్థంలో; ఏకరాత్రంబు= ఒక రాత్రి; నిలిచి= ఉండి; అగ్నిష్టోమ ఫలంబున్= అగ్నిష్టోమమనే యజ్ఞం చేసిన ఫలం; పడయున్= పొందుతాడు; ధర్మ+అరణ్యంబునన్= ధర్మమన్న పేరుగల అరణ్యంలో (అడవి) ఉన్న; బ్రహ్మసరస్సు= ఆ పేరుగల చెరువును; సేవించి= పూజించి (పవిత్రభావంతో స్నానంచేసి); పౌండరీకఫల= పౌండరీకమనే యాగం చేసిన ఫలితం; కాంచున్= పొందుతాడు.

తాత్పర్యం: ఆర్ష్టిసేనాశ్రమంలోని ఉజ్జానకతీర్థంలో స్నానంచేసిన నరుడికి పాపాలన్నీ తొలగిపోతాయి. పిండారక తీర్థంలో ఒకరాత్రి ఉంటే అగ్నిష్టోమయజ్ఞ ఫలం కలుగుతుంది. ధర్మారణ్యంలో ఉన్న బ్రహ్మసరస్సును సేవిస్తే పౌండరీకయాగం చేసిన ఫలం మానవులకు లభిస్తుంది.

చ. జనకుఁడు గౌరికిన్, వినుము, శంకరు మామ, హిమాద్రి సర్వర
త్ననికర విశ్వపుణ్య భవనంబు ప్రశాంతతత నందు నిల్చి స
న్మునిగణ సేవనంబుఁ దపమున్ నడపంగ నరుండు సిద్ధుఁడై
వినుతికి నెక్కుఁ బొందు నరవిందభవాంతిక వాస సంపదన్. 89

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; గౌరికిన్= పార్వతికి; జనకుఁడు= తండ్రి; శంకరు మామ= శివుడికి మామ; హిమ+అద్రి= మంచుకొండ; సర్వరత్న= అన్నిరత్నాల; నికర= సమూహామునకు; విశ్వపుణ్యభవనంబు= ఎల్లపుణ్యములకు నిలయం; అందున్= ఆ హిమాద్రిలో; ప్రశాంతతతన్= మిక్కిలి శాంతంతో; నిల్చి= ఉంటూ; సత్+ముని= మహామునుల; గణ= సమూహం; సేవనంబున్= సేవనూ; తపమున్= తపస్సునూ; నడపంగన్= చేస్తే; నరుండు= మానవుడు; సిద్ధుఁడు+ఐ= సిద్ధిపొందినవాడై; వినుతికిన్= ప్రస్తుతికి; ఎక్కున్= పొందును; అరవిందభవ= పద్మంలో పుట్టిన బ్రహ్మ; అంతిక= సమీపంలో; వాస= నివాస; సంపదన్= కలిమిని; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: వినుము - గౌరీదేవికి తండ్రి, శివుడికి మామ, సర్వరత్న సమూహాలకూ, సర్వ పుణ్యములకూ స్థానమైన హిమాలయంమీద ప్రశాంతంగా మునిసేవతో, తపస్సుతో ఉంటే, నరుడు సిద్ధ పురుషుడై ఈ లోకంలో కీర్తి పొందటమేకాక బ్రహ్మలోకంలో ఉండే అదృష్టం పొందగలడు.

క. విను, తీర్థసేవ గామం । బును గ్రోధము మదము లోభమును జేరని నె

మ్మనము గలిగి నడపవలయు । ననఘా! ఫలసిద్ధి దాననగుఁ బురుషునకున్. 90

ప్రతిపదార్థం: విను= ఆలకింపుము; కామంబును= కామం; క్రోధము= కోపం; మదము= గర్వం; లోభమును= లోభగుణం; చేరని= సోకని; నెమ్మనము= నిండు మనస్సు కలిగి; తీర్థసేవ= తీర్థాలను సేవించటం; నడపవలయున్= చేయాలి; అనఘా!= పుణ్యాత్ముడా!; దానన్= దానితో; పురుషునకున్= మనిషికి; ఫలసిద్ధి= ఫలితం పొందటం; అగున్= జరుగుతుంది.

తాత్పర్యం: కామాదులు లేని మనస్సుతో తీర్థాలను సేవించాలి. దానివలననే కోరిన ఫలం సిద్ధిస్తుంది.

క. దమమును దపము నహింసయు । శమమును తీర్థముల వాన శౌచాతిశయం

బమలగుణ; కల్గు, రిత్త జ । లములం దోఁగిన శుచిత్వ లాభము గలదే? 91

ప్రతిపదార్థం: దమమును= కర్మేంద్రియ నిగ్రహం; తపము= (వేడి) ఏకాగ్ర భావనతో చేసే ధ్యానం మొదలైనవి; అహింసయున్= జీవహింస చేయకపోవటం; శమమును= జ్ఞానేంద్రియ నిగ్రహం; తీర్థముల= తీర్థములే; వానన్= వాటిలో (ఈ శమదమాదులలో); శౌచ= శుచిత్వ; అతిశయంబు= ఆధిక్యం; కల్గున్= కలుగుతాయి; అమలగుణ!= నిర్మలమైన గుణాలు కలవాడా! ధర్మరాజా!; రిత్త= వట్టి; జలములన్= నీళ్ళలో; తోఁగినన్= మునిగితే; శుచిత్వ లాభము= మనస్సు నిర్మలం కావటం అనే సిద్ధి; కలదే= ఉన్నదా?

తాత్పర్యం: నిర్మలములైన గుణములుగల ధర్మజా! దమము, శమము, అహింస, తపము అనునవి తీర్థములే. వాటివలన అతిశయమైన శుచిత్వం లభిస్తుంది. పై గుణములు లేక వట్టినీళ్ళలో మునిగితే పావనత్వం చేకూరుతుందా! చేకూరదని భావం.

క. దొరకొనని వానిఁ గోరక, । దొరకొనినందున మమత్వ తుష్టహృదయతం

బొరయక, విగతస్పృహులగు । పురుషులు, శుచు; లేల తీర్థములు వారలకున్? 92

ప్రతిపదార్థం: దొరకొనని= లభించని; వానిన్= వాటిని; కోరక= కోరుకొనక; దొరకొనినందునన్= దొరకినందువలన లేదా దొరికిన వాటియందు; మమత్వ= మమకారం; తుష్ట= తృప్తి చెందిన; హృదయతన్= హృదయమును; పొరయక= పొందక; విగత= పోయిన; స్పృహులు= కోరికలు కలవారు; అగు= అయిన; పురుషులు= వ్యక్తులు; శుచులు= పవిత్రులు; వారలకున్= వారికి; తీర్థములు= ఈ పుణ్య తీర్థాలు; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: ఏది నీకు అందుబాటులో ఉండదో దానిని కోరకుండా, దొరుకుతున్నవి కదా అని వాటిమీద మమకారం పెంచుకొనకుండా వాంఛలను జయించినవారు నిత్యము పవిత్రులే. వారి కీ తీర్థాల గొడవ దేనికి?

ఆ. అరయ దుర్గమములు, నతి విషమంబులు । నైన తీర్థములు ధరాధినాథ!

యధిక భక్తి యుక్తి నాత్మఁ దలంచినఁ । జాలు నరుల కల్మషములు వాయు. 93

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధరా= భూమికి; అధినాథ!= పతీ!; అరయన్= విచారిస్తే; దుర్గమములు= పోరానివి; అతి= మిక్కిలి; విషమంబులు= కష్టంతో కూడుకొన్నవి; ఐన= అయినటువంటి; తీర్థములు= తీర్థాలు; అధిక= మిక్కిలి; భక్తి= పరమ ప్రేమ యొక్క; యుక్తిన్= కూడికతో; ఆత్మన్= హృదయంలో; తలంచినన్= భావిస్తే; చాలున్= సరిపోతుంది; నరుల= మనుష్యులయొక్క; కల్మషములు= పాపాలు; పాయున్= పోతాయి.

తాత్పర్యం: పోవటానికి వీల్లేనివి, దూరప్రదేశాలలో ఉండేవి, అయిన తీర్థాలను భక్తితో స్మరిస్తే చాలయ్యా ధర్మరాజా! మనుష్యుల పాపాలన్నీ పోతాయి.

క. జనవర! తీర్థ విధాశం । సన మగు నీ పుణ్యవాక్యచయము పవిత్రం
బనుపమము మాననీయం । బనిమిషపదవీప్రదము రహస్యము సుమ్మీ! 94

ప్రతిపదార్థం: జనవర!= ప్రజలను పాలించేవాడా!; తీర్థ= తీరముల; విధా= పద్ధతి; ఆశంసనము= కోరినది; అగు= అయిన; ఈ పుణ్యా= ఈ పవిత్రమైన; వాక్య= మాటల; చయము= సమూహం; పవిత్రంబు= పుణ్యమైనది; అనుపమము= సాటిలేనివి; మాననీయంబు= గౌరవించదగినది; అనిమిష= దేవతల; పదవీ= స్థానం; ప్రదము= ఇచ్చేది; రహస్యము= ఇది చాలా గోప్యమైనది; సుమ్మీ!= సుమా!

తాత్పర్యం: రాజా! తీర్థ విధానాలకు సంబంధించిన ఈ స్పష్టమైన పవిత్ర వాక్యాలు సాటిలేనివి, గౌరవించదగినవి, స్వర్గప్రదాలుకూడా. చాలా రహస్యం సుమా!

క. అనుగతుఁ డగు శిష్యునకుం' । దనసుతునకుఁ, జుట్టమునకు, ధరణీసుర ము
ఖ్యనియతి పదద్విజాతుల । కును, దగ నెఱిఁగించునది యకుంఠిత కరుణన్. 95

ప్రతిపదార్థం: అకుంఠిత= అడ్డులేని; కరుణన్= దయతో; అనుగతుఁడు= అనుసరించేవాడు; అగు= అయిన; శిష్యునకున్= శిష్యుడికీ; తన సుతునకున్= తన కుమారుడికీ; చుట్టమునకున్= చుట్టానికీ; ధరణీసుర ముఖ్య= బ్రాహ్మణశ్రేష్ఠులకు; నియతి= నియమం; పద= స్థానం కల్గిన; ద్విజాతులకును= రెండు జన్మలు కలవారికి, అనగా క్షత్రియ, వైశ్యులకు; తగన్= చక్కగా; ఎఱిఁగించునది= చెప్పాలి.

తాత్పర్యం: ఈ విషయం అందరితో చెప్పరాదు. ఎవరైతే గురువులను చక్కగా సేవిస్తారో ఆ శిష్యులకు, కుమారులకు, బంధువులకూ. బ్రాహ్మణశ్రేష్ఠులకూ, నియమం అనే యోగఅంగాన్ని సాధించటంలో పట్టుదలగల వైశ్యులకు, క్షత్రియులకూ నిండు ప్రేమతో చెప్పాలి.

క. నరవర! గౌతమునకు నం । గిరసుఁడు సెప్పినది యిది, యకిల్బిషబుద్ధిం
బరిపాటిఁ బఠించినఁ ద । త్పరత వినిన నపుడ పాయుఁ బాపము లెల్లన్. 96

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; గౌతమునకున్= గౌతముడికి; అంగిరసుఁడు= అంగీరస ఋషి; చెప్పినది= చెప్పింది; ఇది= ఈ వాక్య సమూహం; అకిల్బిష= పాపంలేని; బుద్ధిన్= మనస్సుతో; పరిపాటిన్= నిత్యం క్రమం తప్పక; తత్పరతన్= ఆసక్తితో; పఠించినన్= పారాయణం చేసినా; వినినన్= విన్నా; పాపములు ఎల్లన్= అన్ని పాపాలు; అపుడు+అ= అప్పుడే; పాయున్= తొలగుతాయి.

తాత్పర్యం: ధర్మరాజా! గౌతముడికి అంగిరసుడు చెప్పిన ఈ వాక్యాలు పవిత్ర మనస్సుతో పారాయణం చేసినా విన్నా పాపాలన్ని పోతాయి.

క. మునులకు జప్యం బిది, స । ద్వినుతముఁ నిత్యముఁ బఠించు విమలాత్ములకున్;
విను, జాతి స్మరణముతో । జననం బతిపుణ్యపురుష సంతతి గలుగున్.' 97

ప్రతిపదార్థం: ఇది= ఈ వాక్యాల సముదాయం; మునులకున్= మనులకు; జప్యంబు= జపించదగినది; సత్= మంచివారిచే; వినుతమున్= స్తుతించదగింది; నిత్యము= ప్రతిదినము; పఠించు= పారాయణంచేసే; విమల= నిర్మలమైన; ఆత్ములకున్= హృదయాలున్నవారికి; జాతిస్మరణముతోన్= పూర్వజన్మ వాసనలస్మృతితో; జననంబు= జన్మ; అతి= మిక్కిలి; పుణ్యపురుష= పవిత్ర వ్యక్తుల; సంతతి= సంతానం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఈ విషయం మునులకు జపించతగింది. సత్పురుషులచేత స్తుతించతగింది. దీన్ని పారాయణం చేసే నిర్మల మనస్కులకు పూర్వజన్మ ఏ జాతిలో కలిగిందో ఆ స్మరణకల మరుజన్మ కలుగుతుంది. పుణ్యపురుష సంతానమూ కలుగుతుంది.'

అత్రి ప్రముఖ మహర్షులు శరతల్పగతుఁడైన భీష్ముఁ జూడవచ్చుట (సం.13-27-1)

వ. అని చెప్పె నయ్యవసరంబునం బుణ్యవిశేష గణ్యుండైన యగ్గాంగేయుం డట్లు గాండీవిశరంబులు శయ్యగా వీరశయనంబున నునికి నతని వీక్షింప నత్రియు, వసిష్ఠుండును, భృగుండును, బులహుండును, బులస్త్యుండును, గ్రతువు, నంగిరసుండును, నగస్త్యుండును, గణ్వుండును, గౌతముండును, విశ్వామిత్రుండును, జమదగ్నియు మొదలైన మహామునులు శిష్యవ్రాతంబుతో నేతెంచి తపఃప్రభావ స్ఫురిత ప్రభాపూరంబు భూనభోంతరంబున సంతతంబు లగుచుండ నిలిచి, యద్దేవవ్రతుని యున్న తెఱంగు గలయం గనుంగొనిరి, పాండవు లాశ్చర్య భరిత చిత్తులగుచు నత్తపోధనవర్యులం బ్రస్తుతించుచుం బ్రణమిల్లిరి; అప్పుడప్పరమసంయము లంతర్ధానంబు సేసిరి, అక్కౌరవులు నక్కురుపితామహుండును దారును వారల మాహాత్మ్యంబు లుగ్గడించుచుఁ దద్విషయంబైన సంభాషణం బొనర్చిరి; తదనంతరంబ. 98

ప్రతిపదార్థం: అని; చెప్పి; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; పుణ్యావిశేష= విశేషపుణ్యం కలిగినందువలన; గణ్యుండు= గణించదగినవాడు; ఐన; ఆ+గాంగేయుండు= ఆ గంగానది కుమారుడు; అట్లు= ఆరీతిగా; గాండీవి= గాండీవమన్న విల్లు కలవాడు, అర్జునుడి; శరంబులు= బాణాలు; శయ్యగాన్= సెజ్జగా; వీరశయనంబునన్= వీరులకు ఉచితమైన శయ్యపై; ఉనికిన్= ఉన్నందువలన; అతనిన్; వీక్షింపన్= చూడటానికి; అత్రియున్, వసిష్ఠుండును, భృగుండును, పులహుండును; పులస్త్యుండును; క్రతువును, అంగిరసుండును; అగస్త్యుండును, కణ్వుండును, గౌతముండును, విశ్వామిత్రుండును, జమదగ్నియు మొదలైన; మహామునులు; శిష్య= శిష్యులయొక్క; వ్రాతంబుతోన్= సమూహంతో; ఏతెంచి= వచ్చి; తపఃప్రభావ= తపస్సుయొక్క మాహాత్మ్యంతో; స్ఫురిత= ప్రకాశించే; ప్రభాపూరంబు= కాంతి ప్రవాహం; భూ= భూమికి; నభః= ఆకాశానికి; అంతరంబునన్= మధ్యలో; సంతతంబులు= మిక్కిలి వ్యాపించినవి; అగుచుండన్= కాగా; నిలిచి= క్రిందికి దిగకుండా, మీదనే నిలిచి; ఆ+దేవవ్రతుని= ఆ భీష్ముడియొక్క; ఉన్నతెఱంగున్= ఉన్నవిధానం; కలయన్= అంతటా; కనుంగొనిరి= చూచారు; పాండవులు= పాండురాజు కుమారులు; ఆశ్చర్యభరిత= ఆశ్చర్యంతో నిండిన; చిత్తులు= మనస్సులుకలవారు; అగుచున్= అయి; ఆ+తపోధన+

వర్యులన్= ఆ తపస్సు ఐశ్వర్యంగా కల మునిశ్రేష్ఠులను; ప్రస్తుతించుచున్= మిక్కిలి కొనియాడుతూ; ప్రణమిల్లిరి= నమస్కరించారు; అప్పుడు; ఆ+పరమ సంయములు= ఆ గొప్ప మునులు; అంతర్ధానంబు చేసిరి= అదృశ్యమయ్యారు; ఆ+కౌరవులు= పాండవులు - కురువంశ సంతానం; ఆ కురుపితామహుండును= ఆ కౌరవుల తాత, భీష్ముడూ; తారును= తామూ; వారల=ఆ మహామునుల; మాహాత్మ్యంబు= మహిమను; ఉగ్గడించుచున్= చెప్పుకొంటూ; తత్+విషయంబైన= వారికి సంబంధించిన; సంభాషణంబు= ప్రసంగం; ఒనర్చిరి= చేశారు; తత్+అనంతరంబు+అ= అటు తరువాత.

తాత్పర్యం: ఆ సమయంలో విశేషపుణ్య పురుషులలో లెక్కించతగిన భీష్ముడు, అర్జునుడు బాణాలతో నిర్మించిన తల్పంమీద మహావీరునకు తగినట్లుగా శయనించి ఉన్నాడు కనుక చూడటానికి మహర్షులు పెక్కుమంది శిష్యులతో సహా వచ్చారు. భూమికీ ఆకాశానికీ గల మధ్యభాగం వారి తపో మహత్త్వంవలన ఏర్పడిన కాంతితో నిండిపోయింది. వారంతా భీష్ముడి పరిస్థితిని పరికించారు. ఇది చూచి ఆశ్చర్యపడి పాండవులు వారికి నమస్కరించారు. ఆ మునులు అదృశ్యమైపోయారు. అది చూచిన పాండవులు, భీష్ముడు వారి చరిత్రలను ముచ్చటించుకొన్నారు. ఆ తరువాత.

తే. **తాత పాదపద్మములు మస్తకము సోఁక । వినతుఁడై, ధర్మతనయుఁ 'డే జనపదంబు**
లే నగంబు లేనదులు పుణ్యానుభావ । సమధికత్వంబు గలయవి జనవరేణ్య!। 99

ప్రతిపదార్థం: ధర్మతనయుఁడు= యముడి పుత్రుడైన పాండవాగ్రజుడు; తాత= భీష్ముడి; పాదపద్మములు= తామరపూలవంటి అడుగులు; మస్తకము= (తన) తలకు; సోఁకన్= తగిలేటట్లుగా; వినతుఁడు+ఐ= వంగి నమస్కరించి; జనవరేణ్యా= మానవులలో శ్రేష్ఠుడా!; ఏ జనపదంబులు= ఏ పల్లెపట్లు (జనులు నివసించే చోట్లు); ఏ నగంబులు= ఏ కొండలు; ఏ నదులు= ఏ ఏరులు; పుణ్య అనుభావ= పవిత్ర మాహాత్మ్యం చేత; సమధికత్వంబు= గొప్ప అతిశయం; కలయవి= కలవి.

తాత్పర్యం: యమధర్మరాజు కొడుకు ధర్మరాజు తాతగారి అడుగు దమ్ములకు తన తల తాకేటట్లు నమస్కరించి, 'తాతా! ఏ ఊళ్ళు, కొండలు, ఏళ్ళూ మాహాత్మ్యం కలవో చెప్పుము'.

వ. **అని యడుగుటయు. 100**

తాత్పర్యం: అని అడుగగా.

భీష్ముఁడు ధర్మజునకు గంగాప్రభావంబు సెప్పుట (సం.13-27-19)

సీ. **అతనికి నాతఁ డిట్లను; 'నివ్విషయమునఁ । గల దితిహాస మొకండు, దానిఁ**
వివరింతు నీ కుంఛవృత్తిపరుం డగు । నొక విప్రునింటికి నొక్క సిద్ధుఁ
దతిథియై వచ్చిన, నాతిథ్య మొనరించి । యతనితో సల్లాప మాచరింప,
నమ్మహాత్ముండు నీ యడిగిన యట్టుల । యా సిద్ధు నడిగిన, నతఁడు సెప్పె

తే. **ననఘ! యెవ్వాని నడుముగా నరిగెఁ బావ । నాంబుపూర భాగీరథి యట్టి దేశ**
భూధరాది పదార్థముల్ పుణ్యతమము; లట్లు గాకయు గంగ మహత్త వినుము. 101

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ ధర్మరాజుతో; అతఁడు= భీష్ముడు; ఇట్లనున్= ఈ విధంగా చెప్పుతున్నాడు; ఈ విషయమునన్= ఈ విషయంలో ఒకండు= ఒకటి; ఇతిహాసంబు= పురాణ కథ;కలదు; దానిన్; నీకున్; వివరింతున్= వివరించి చెప్పుతాను; ఉంఛవృత్తిపరుండు+అగు= భిక్షాటనమే జీవనోపాధిగా గల; ఒక విప్రు+ఇంటికిన్= ఒక బ్రాహ్మణుడి, గృహానికి; ఒక్క; సిద్ధుఁడు= యోగి; అతిథిఐ= అతిథిగా వచ్చినన్= రాగా; ఆతిథ్యము= అతిథి సత్కారం; ఒనరించి= చేసి; అతనితోన్= ఆ సిద్ధుడితో; సల్లాపము= సరస సంభాషణ; ఆచరింపన్= చేయగా; ఆ మహాత్ముండు= ఆ విప్రుడు; ఆ సిద్ధున్= ఆ సిద్ధుడిని; నీఅడిగిన అట్టుల= నీ వడిగినట్లుగానే; అడిగినన్= అడుగగా; అతఁడు= సిద్ధుడు; చెప్పెన్= చెప్పాడు; అనఘ!= పుణ్యాత్ముడా!; ఎవ్వాని= ఏయే దేశములయొక్క; నడుముగాన్= మధ్యలో; పావన= పవిత్రమైన; అంబుపూర= నీటి ప్రవాహం గల; భాగీరథి= భగీరథుడివలన భూమికి దిగివచ్చిన గంగ; అరిగెన్= ప్రవహించిందో; అట్టి దేశ= అట్లాంటి దేశంలో ఉన్న; భూధర= కొండలు; అది= మొదలైన; పదార్థముల్= వస్తువులు; పుణ్య తమములు= మిక్కిలి పవిత్రములు; అట్లు కాకయున్= అంతే కాకుండా; గంగ= గంగానదియొక్క; మహత్త= ప్రభావం, మహిమ; వినుము= ఆలింపుము.

తాత్పర్యం: ధర్మరాజుతో భీష్ముడన్నాడు 'దీనికి సంబంధించిన ఒక పురాణ కథ ఉన్నది. అది నీ వడిగిన ప్రశ్నకు సమాధానం. భిక్షాటనంతో జీవించే ఒక బ్రాహ్మణుడి ఇంటికి ఒక యోగి అతిథిగా వచ్చాడు. ఆ విప్రు డతడికి మర్యాదలు చేసి కూర్చుండబెట్టి మాట్లాడుతూ నీ వడిగినట్లే యోగిని అడిగాడు. అతడు చెప్పాడు. పుణ్యాత్ముడా!; ఏ దేశాల నడుమగా గంగ ప్రవహిస్తుందో ఆ దేశంలో ఉన్న పర్వతాదులైన వస్తువులన్నీ పవిత్రములే. ఇంతేకాక గంగా మాహాత్మ్యం చెప్పుతాను వినుము.

తే. **త్రిపథగా సేవనమున సిద్ధించునట్టి । గతి, జనములకు నియత కల్పితము లయ్యు**
నధ్వరంబును, బ్రహ్మచర్యంబు, దపము । సంపరిత్యాగమును, జేయఁజాల వనఘ! **102**

ప్రతిపదార్థం: అనఘ!= పవిత్రుడా!; త్రి= మూడు; పథ= మార్గాలలో; గ= నడిచేది- (స్వర్గంలో మందాకిని, భూలోకంలో భాగీరథి, పాతాళంలో భోగవతి అనే పేర్లతో సాగే గంగ యొక్క); సేవనమునన్= సేవతో; సిద్ధించునట్టి= లభించే; గతి= ఉత్తమ స్థితి; జనములకున్= మనుషులకు; నియత కల్పితములు+అయ్యున్= నియమానుసారంగా చేయబడినవైనా; ఆధ్వరంబును= యజ్ఞం; బ్రహ్మచర్యంబు= వేదాభ్యాసం; తపము= తపస్సు; సంపరిత్యాగమును= చక్కని దానం; చేయన్ చాలవు= సమకూర్చలేవు.

తాత్పర్యం: అనఘా! గంగను సేవిస్తే వచ్చే ఫలితం - యజ్ఞం, బ్రహ్మచర్యం, తపస్సు; త్యాగాదులచేతను వచ్చేది కాదు.

క. **మే నించుక సోఁకిన గం । గానది తోయములు జనుల కల్మష కోటిం**
బో నడిచి పురందర లో । కానందముఁ బొందఁ జేయు నాగమవేదీ! **103**

ప్రతిపదార్థం: ఆగమవేదీ!= వేదం తెలిసినవాడా!; మేను= శరీరం; ఇంచుక= కొంచెం; సోఁకినన్= తాకితే; గంగానది తోయములు= గంగానదినీరు; జనుల= మానవుల; కల్మష= పాపాల; కోటిన్= సమూహాన్ని; పోన్= పోయేటట్లుగా; అడిచి= అణగగొట్టి; పురందర లోక ఆనందము= స్వర్గలోకానందాన్ని; పొందన్ చేయున్= లభింపజేస్తుంది.

తాత్పర్యం: గంగానది నీరు కొంచెం శరీరానికి తాకితే చాలు. మనిషి చేసిన పాపాలన్నీ పోవటమే కాక స్వర్గలోకానందాన్నిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: శ్రీరామకృష్ణ పరమహంస తరచుగా ఇదే మాట చెప్పేవారట. గంగను వారు 'బ్రహ్మచారి' అనేవారట. సాక్షాత్తు బ్రహ్మము నుండి ప్రవహించిన జలమని తాత్పర్యం.

క. మును పాపము లెన్ని యొన । ర్చినఁ బిదపను గంగ నాడఁ జీఁకటి రవి దోఁ
చిన విరియుగతి విరియు; న । య్యనఘుఁ డిలాతలము దొఱఁగి యమరత నొందున్. 104

ప్రతిపదార్థం: మును= పూర్వం; పాపములు; ఎన్ని; ఒనర్చినన్= చేసినా; పిదపను= తరువాత; గంగన్= గంగలో; ఆడన్= స్నానం చేస్తే; రవి= సూర్యుడు; తోఁచినన్= ఉదయిస్తే; చీఁకటి= అంధకారం; విరియుగతిన్= విరిసిపోయిన రీతిగా; విరియున్= చెదరిపోతాయి; ఆ+అనఘుఁడు= ఆ పుణ్యాత్ముడు; ఇలాతలము= భూమిని; తొఱఁగి= వదలి; అమరతన్= అమరత్వమును, దేవతాత్వం; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: పూర్వం పాపా లెన్ని చేసినా తరువాత గంగలో మునిగితే పాపాలన్ని పటాపంచలౌతాయి - సూర్యుడు రాగానే చీకట్లు తొలగినట్లు. అంతేకాక వాడు మరణించి దేవలోకాలకు పోతాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. ఎన్ని యేఁడులు, మనుజుని యెమ్ము గంగ । వారియం దుండు, నన్ని వేల్వత్సరములు
నాకలోక మహాసుఖశ్రీకి నాతఁ । డత్తి యుండును నిర్మలచిత్తవృత్తి. 105

ప్రతిపదార్థం: ఎన్ని ఏఁడులు= ఎన్నేళ్ళు; మనుజుని= మనిషియొక్క; ఎమ్ము= ఎముక; గంగవారియందున్+ఉండున్= గంగనీళ్ళలో ఉంటుందో; అన్నివేల్= అన్నివేల; వత్సరములు= ఏళ్ళు; నాకలోక= స్వర్గలోకమందలి; మహాసుఖశ్రీకిన్= చెడని సుఖసంపదకు; ఆతఁడు= ఆ మనిషి; నిర్మల= స్వచ్ఛమైన; చిత్తవృత్తిన్= మనస్సుతో; అత్తియుండును= హత్తుకొని ఉంటాడు.

తాత్పర్యం: మనిషి ఎముక గంగనీళ్ళలో ఎన్నేళ్లుంటుందో అన్నివేల సంవత్సరాలు స్వర్గలోకంలో అతడు మహాసుఖాలు పొందగలుగుతాడు.

సీ. అనఘ! సోమము లేని యధ్వరంబును, శశి । లేని రాత్రియు, రవి లేని నభము
నాత్మధర్మము లేని యాశ్రమంబును, బుష్ప । సంపద లేని భూజమును బోలె,
హీనత నొందు, గంగానది లేని దే । శంబు, చాంద్రాయణ శతము లైన
గంగాపయః పానకరణంబు గావించు । నిర్మలత్వముఁ జేయ నేర; వగ్ని

ఆ. యందుఁ బడిన దూది యట్లగు గంగావ । గాహనమునఁ బాతకంబు లఖిల
భూతములకు దుఃఖములు వాపి కొనుటకు । నేవిధములు గంగ కీడు గావు. 106

ప్రతిపదార్థం: అనఘ!; సోమము= సోమరసం; లేని; అధ్వరంబును= యజ్ఞం; శశి= చంద్రుడు; లేని; రాత్రియున్= రేయి; రవి= సూర్యుడు; లేని= లేనట్టి; నభమున్= ఆకాశం; ఆత్మధర్మము=స్వధర్మంలేని; ఆశ్రమంబును= ఆశ్రమము - నాలుగు ఆశ్రమాలు- బ్రహ్మచర్యం; గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం; పుష్పసంపద= పూలసమృద్ధి; లేని; భూజమును పోలెన్= చెట్టు

వలె; గంగానది లేని దేశంబు= గంగపారని దేశం; హీనతన్+ఒందున్= హీనత్వం పొందుతుంది; చాంద్రాయణ= చాంద్రాయణమనే వ్రతం, చంద్రకళలు తరగటం; పెరగటం బట్టి భోజనం తగ్గించటం, పెంచటములయొక్క; శతములు= వందలు; ఐనన్= అయినప్పటికి; గంగాపయః పానకరణంబు= గంగనీటిని త్రాగటం; కావించు= చేసే; నిర్మలత్వమున్= పవిత్రతను; చేయన్‌నేరవు= చేయజాలవు; గంగా+అవగాహమునన్= గంగలో మునుగుట వలన; పాతకంబులు= పాపములు; అగ్నియందున్= నిప్పులో; పడిన= పడ్డ; దూది అట్లగున్= దూదివలె అయిపోతాయి; అఖిల= సమస్త; భూతములకున్= జీవరాసులకు; దుఃఖములు= శోకాలు; పాపి కొనుటకున్= పోగొట్టుకొనటానికి; ఏవిధములు= ఏ పద్ధతులు కూడా; గంగకున్= గంగానదికి; ఈడుకావు= సమానం కావు.

తాత్పర్యం: సోమం లేని యజ్ఞం; చంద్రుడు లేని రాత్రి, సూర్యుడు లేని ఆకాశం; స్వధర్మం లేని ఆశ్రమం, పూలు లేని చెట్టు ఎట్లా శోభను కోల్పోతాయో, అదే విధంగా గంగలేని దేశం కూడా దైన్యం పొందుతుంది. చాంద్రాయణవ్రతాలు వందచేసినా గంగ నీరు త్రాగిన ఫలితం రాదు. సకలపాపాలు గంగలో మునిగితే పోతాయి. అగ్నిలో పడ్డ దూదివలె సమస్త జీవరాసులకు దుఃఖం పోగొట్టుకొనటానికి ఎన్నిమార్గాలున్నా గంగతో సమానం కావు.

విశేషం: అలం: ఉపమ.

క. శరణంబు లేని జనులకుఁ । బరమశరణ మండ్రు మునులు భాగీరథి, ని
ర్జరులకు నమృతము లట్టుల । నరులకు గంగాజలం బనఁగ నే విందున్. 107

ప్రతిపదార్థం: మునులు= ఋషులు; శరణంబు= దిక్కు; లేని; జనులకున్; భాగీరథిన్= గంగను; పరమ= గొప్ప; శరణము= దిక్కు; అండ్రు= అంటారు; నిర్జరులకున్= దేవతలకు (జర=ముసలితనం లేనివారు); అమృతములు+అట్టుల= అమృతమెట్లాగో అట్లాగే; నరులకున్= భూలోకంలోని వారికి; గంగా జలంబులు= గంగనీళ్ళు; అనఁగన్= అనటం; నేన్= నేను; విందున్= వింటాను.

తాత్పర్యం: దిక్కులేని జనులకు గంగ గొప్ప దిక్కని మును లంటారు. దేవతలకు అమృతమెట్లాగో, నరులకు గంగ నీరు అట్లాంటిది - అని అనటం నేను విన్నాను.

విశేషం: అలం: ఉపమ.

క. తలపై జాహ్నవి వాలుక । యలికికొనిన ఫాలతటిఁ దదంతర్మృత్సం
కలితముఁ జేసిన, బాపం । బులు దొలఁగు సుపర్ణుఁ గనిన భుజగముల క్రియన్. 108

ప్రతిపదార్థం: తలపైన్= నెత్తిపైన; జాహ్నవి= గంగలోని; వాలుక= ఇసుక; అలికికొనినన్= రాసుకొన్నా; ఫాలతటిన్= నుదుటియందు; తత్= ఆ గంగ యొక్క; అంతర్= లోపలి; మృత్= మట్టిని; సంకలితము= కూడుకొన్నట్లు; చేసినన్= చేసినా; సుపర్ణున్= గరుత్మంతుడిని; కనిన= చూచిన; భుజగముల= పాముల; క్రియన్= విధంగా; పాపంబులు; తొలఁగున్= పోతాయి.

తాత్పర్యం: తలమీద గంగ ఇసుక, నొసటిపై గంగమన్ను రాసుకొంటే గరుత్మంతుడిని చూచి పాములు పారిపోయినట్లుగా పాపాలు తొలగిపోతాయి.

విశేషం: అలం: ఉపమ.

క. గంగాతరంగశీకర । సంగతమగు మారుతమున సద్య స్స్పర్శం
బంగీకరించునెవ్వఁడు । భంగపఱుచు నతఁడు ఘోరపాపచయంబున్. 109

ప్రతిపదార్థం: గంగా తరంగ= గంగానది అలల యొక్క; శీకర= తుంపర్లతో; సంగతము+అగు= కూడుకొన్న; మారుతమునన్= గాలితో; సద్యః= అప్పటికప్పటి; స్పర్శంబు= స్పర్శ; ఎవ్వఁడు= ఎవడు; అంగీకరించున్= స్వీకరిస్తున్నాడో; అతఁడు= వాడు; ఘోర= భయంకరమైన; పాపచయంబున్= పాపసమూహాన్ని; భంగపఱుచున్= వమ్ముచేస్తాడు.

తాత్పర్యం: గంగా తరంగాల తుంపర్లు చిందే గాలి శరీరానికి తాకితే వాడి పాపాలన్నీ అప్పటికప్పుడే పోతాయి.

తే. ఇవుల నేడు దరంబుల, నవుల నేడు । దరములను, బితృవర్గంబు, నరుఁడు గంగ
నాడి శుచిఁ జేయుఁ జూచిన యంతమాత్రఁ । బాచు వాఙ్మనః కాయజ పాపతతుల. 110

ప్రతిపదార్థం: ఇవులన్= ఇవతల; ఏడుతరంబులన్= ఏడు తరాలు; అవులన్= అవతల; ఏడు తరములన్= ఏడు తరాలు (14 తరాలు); పితృవర్గంబున్= పితృదేవతలను; నరుఁడు; గంగన్= గంగలో; ఆడి= స్నానంచేసి; శుచిన్= స్వచ్ఛతను; చేయున్= చేస్తాడు; చూచిన అంతమాత్రన్= చూచినంత మాత్రాన; వాక్= మాటవలన; మనః= మనస్సువలన; కాయజ= శరీరం వలన పుట్టిన; పాపతతులన్= పాప సమూహాలను; పాచున్= పోగొట్టుతాడు.

తాత్పర్యం: మనుష్యుడు గంగా స్నానం చేసి పదునాలుగు తరాల పితృదేవతలను పావనుల గావిస్తాడు. గంగను చూచినంతమాత్రాన మాట, మనస్సు, శరీరం వలన కల్గిన పాపాలన్నీ పోతాయి.

తే. వినిన, వేడుక సేసినఁ, గనినఁ జేత । నంటినను, రెండు కులములయందుఁ గలుగు
పితృగణంబుల నెల్ల, సద్గతికిఁ బుచ్చు;। గంగ యెటు సేయునో యవగాహనమున. 111

ప్రతిపదార్థం: వినినన్= విన్నా; వేడుక= ఉత్సవం; చేసినన్= చేసినా; కనినన్= చూచినా; చేతన్= చేత్తో; అంటినను= తాకినా; రెండు కులములఅందున్= రెండు కులాలలోనూ - మాతృపితృ వంశాలలో; కలుగు=ఉన్నట్టి; పితృగణంబులన్= పితృదేవతా సమూహాన్ని; ఎల్లన్= అందరినీ; సత్‌గతికిన్= మంచి పరలోకస్థితికి; పుచ్చున్= పంపుతుంది; గంగ= గంగానది; అవగాహనమునన్= స్నానంచేస్తే; ఎటుచేయునో= ఇంక ఎట్టి సద్గతులు కల్గిస్తుందో చెప్పశక్యంగాదు (చాలా మేలుచేస్తుంది)

తాత్పర్యం: గంగను గురించి విన్నా, ఉత్సవం చేసినా, చూచినా, చేతితో తాకినా, రెండు కులాలలోని (పుట్టినింటి - మెట్టినింటి) పితృదేవతలను స్వర్గానికి పంపిస్తుంది. అట్లాంటప్పుడు ఇక స్నానం చేస్తే వారికేమిస్తుందో ఆ గంగాదేవి? మాటలలో చెప్పలేను.

క. విను, గంగ గంగ యను కీ । ర్తనములతో నొండునీటఁ దగ మునిఁగిన య
జ్జనులు దురితములఁ దొఱఁగుదు । రని యార్యులు సెప్ప విందు నంచితచరితా! 112

ప్రతిపదార్థం: అంచిత= మంచి; చరితా!= నడవడి కలవాడా!; విను= శ్రద్ధగా ఆలకించుము; గంగ గంగ= గంగ గంగ; అను= అన్న; కీర్తనములతోన్= స్తుతులతో (గంగా గంగా అన్నమాటలే కీర్తన); ఒండునీటన్= మరొక నీటిలో; తగన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తగువిధంగా; మునిఁగిన= స్నానంచేసిన; ఆ+జనులు= ఆ మనుష్యులు; దురితములన్= పాపాలను; తొలఁగుదురు= పోగొట్టుకొంటారు; అని; ఆర్యులు= పెద్దలు; చెప్పన్= చెప్పగా; విందున్= విన్నాను.

తాత్పర్యం: గంగా, గంగా అంటూ పరవశంతో కీర్తిస్తూ ఏ నీటిలో మునిగినా పాపాలు పోతాయంటారు పెద్దలు. (ఇంక గంగలో మునిగితే వేరే చెప్పాలా?

సీ. అనఘ! చూడ సమర్థుఁ డగువాఁడు జాహ్నవిఁ । జూడకయున్నఁ బశుప్రతిముఁడు
నంధ సమానుండు నగు ; నింద్రుఁ డాదిగా । సురలు గోరెడు గంగ నరులు గోర
వలదె? చేకుఱు నపవర్గ ముత్క్రమణ కా । లంబున గంగఁ దలంచి రేని;
రాజభయంబుఁ, జోరభయంబుఁ బాప భ । యంబును, భూతభయంబు, లోను

ఆ. గాఁగఁ గలుగు భయనికాయయంబు, గంగా ప్ర । శంసనమునఁ బాయు; శంభుఁ డర్థి
నతులపుణ్య యైన యద్దేవి దివినుండి । రా ధరింపఁడే శిరస్తలమున. 113

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా! చూడన్= దర్శించటానికి; సమర్థుఁడు+అగువాఁడు= శక్తికలవాడు; జాహ్నవిన్= గంగను, (జహ్నుడన్న ముని చెవినుండి ప్రవహించింది కనుక అతడి కూతురు గంగ); చూడక+ఉన్నన్= చూడకపోతే; పశుప్రతిముఁడు= గొడ్డుతో సమానం; అంధ సమానుండు= గ్రుడ్డివాడితో సమానం; అగున్= అవుతాడు; ఇంద్రుఁడు+ఆదిగాన్= ఇంద్రుడు మొదలుకొని; సురలు= దేవతలు; కోరెడు= కోరుకొనే; గంగన్= గంగను; నరులు= మనుష్యులు; కోరన్‌వలదె?= కోరుకొనవద్దా?; గంగన్; ఉత్క్రమణ కాలంబునన్= ప్రాణంపోయే సమయంలో; తలంచిరి+ ఏనిన్= తలచుకొంటే; అపవర్గము= ముక్తి; చేకుఱున్= లభిస్తుంది; రాజభయంబున్= రాజువలన కలిగే భయం; చోరభయంబున్= దొంగలవలని భయం; పాపభయంబును= పాపంవలనిభయం; భూత భయంబున్= ప్రేత, పిశాచాదులవలని భయం; లోనుగాఁగన్‌కలుగు= మొదలుగా కలుగు; భయ నికాయంబున్= ఉండే భయాలన్ని; గంగా ప్రశంసనమునన్= గంగాస్తుతివలన; పాయున్= పోవును; శంభుఁ డు= శివుడు; అర్థిన్= కోరికతో; అతుల= సాటిలేని; పుణ్యాఐన= పుణ్యవతిఅయిన; ఆ+దేవి= ఆ దేవత; దివినుండి= ఆకాశంనుండి; రాన్= రాగా; శిరస్తలమునన్= తలమీద; ధరింపఁడే= తాల్చడా!

తాత్పర్యం: చూడటానికి శక్తి ఉండి గంగను చూడనివాడు గొడ్డుతో సమానం. గ్రుడ్డివాడితో సమానం; ఇంద్రుడు మొదలైన దేవతలే గంగ కావాలనుకొంటే నరు లనుకోవద్దా! ప్రాణం పోయేవేళ గంగను స్మరించినంతమాత్రాన ముక్తి కలుగుతుంది. రాజ, చోర, పాప భయాలన్నీ గంగను కీర్తిస్తే పోతాయి. శివునివంటివాడు ఆ దేవత స్వర్గం నుండి దిగివస్తే తన తలమీద పెట్టుకొన్నాడు కదయ్యా!

తే. మూఁడు పథములఁ జని, లోకములకు మూఁటి । కుజ్జ్వలాలంకృతియుఁ బెంపు నొసఁగినట్టి,
యమలతరమూర్తి యగు దేవి నాశ్రయించు । వాఁడు కృతకృత్యుఁ డిది నిక్కువము కృతాత్మ! 114

ప్రతిపదార్థం: కృత+ఆత్మ!= ధన్యమూర్తీ!; మూఁడు పథములన్= మూడు దారులలో (స్వర్గ, మర్త్య, పాతాళలోకాల మార్గాలలో); చని= ప్రవహించి; లోకములకున్ మూఁటికిన్= మూడు లోకాలకు; ఉజ్జ్వల= ప్రకాశవంతమైన; అలంకృతియున్= అలంకారమునూ; పెంపును= ఆధిక్యమును; ఒసఁగినట్టి= ఇచ్చినటువంటి; అమలతర= మిక్కిలి నిర్మలమైన; మూర్తి= ఆకారం కలది; అగు= అయిన; దేవిన్= దేవతను; ఆశ్రయించువాఁడు= శరణన్నవాడు; కృతకృత్యుఁడు= ధన్యుడు; ఇది; నిక్కువము= సత్యం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: మూడు మార్గాలలో ప్రవహిస్తూ ముల్లోకాలకూ గొప్ప అలంకారమై కీర్తిని కలిగిస్తూ ఉండే స్వచ్ఛమూర్తి గంగాదేవిని ఎవడు ఆశ్రయిస్తున్నాడో వాడు ధన్యుడు.

విశేషం: అమలతరమూర్తి - స్వచ్ఛమైన రూపంకలది; జలానికి ఆకారం, రంగు లేవు. ఆకాశంవలె ప్రతిఫలించి నీలమౌతున్నది తప్ప, పైగా ఈ జలమూర్తులలో మిక్కిలి నిర్మలమైనది గంగాదేవి. హిమాలయాలలో జన్మించినది కాబట్టి ఎన్నో ఓషధుల గుణాలు కలిగినది కాబట్టి పవిత్రమైనది. ఈ దేశసంస్కృతి గాంగేయ సంస్కృతి, గంగకు కుమారస్వామి, భీష్ములిద్దరూ సంతానం. వారిద్దరు గాంగేయులు. గంగ ఒడ్డున కాశి మొదలైన పవిత్ర పుణ్యక్షేత్రాలు వెలిశాయి కనుక భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతికి చిహ్నం - గంగ.

క. జనులకు నింద్రుఁడు, గ్రహముల । కినుఁడును, దారలకు నోషధీశుఁడ పోలెన్

మనుజోత్తమ ! కడు నెక్కుడు । వినుము, నరుల కెల్ల జాహ్నవి మహత్త్వమునన్. 115

ప్రతిపదార్థం: మనుజ+ఉత్తమ!= మానవులలో శ్రేష్ఠుడా! రాజా!; వినుము= ఆలకించుము; జనులకున్= మానవులకు; ఇంద్రుఁడు= దేవతలరాజు; గ్రహములకున్= చంద్రాది గ్రహాలకు; ఇనుఁడును= సూర్యుడు; తారలకున్= నక్షత్రాలకు; ఓషధి+ఈశుఁడు+అ= ఓషధులకు (ఔషధాలకు ఉపయోగించే మొక్కలు లేదా వృక్షాలు) రాజు - చంద్రుడు; పోలెన్= వలె; నరులకు+ఎల్లన్= మనుజులకంతా; మహత్త్వమునన్= మాహాత్మ్యంలో; జాహ్నవి= జహ్నుడనే ముని కూతురు- గంగ; కడున్= మిక్కలి; ఎక్కుడు= గొప్పది;

తాత్పర్యం: రాజా! వినుము. మనుష్యులకు ఇంద్రుడు, గ్రహాలకు సూర్యుడు, నక్షత్రాలకు చంద్రుడు ఎట్లాగో; అట్లాగే మనుషుల కన్ని విషయాలలో మాహాత్మ్యంగల గంగ చాలా గొప్పది.

విశేషం: అలం: ఉపమ. భగీరథుడు తపస్సు చేస్తే గంగ శివుడి జటాజూటంనుండి క్రిందికి ప్రవహించి దారిలో ఉన్న జహ్నుముని ఆశ్రమాన్ని ముంచివేసింది. అది చూచి ఆయన గంగను త్రాగివేశాడు బొట్టు మిగులకుండా. మరల భగీరథుడు ప్రార్థిస్తే ఆ మహర్షి చెవినుండి తిరిగి గంగ ప్రవహించింది. అందుకని ఆమె జహ్నుకన్య - జాహ్నవి అయింది.

అ. సగరనృపతి పుత్త్రచయము, మునీంద్ర శా । పమున భస్మమై యపారదురిత

కల్మషంబుఁ బొందఁగా గంగ నిజజల । సేక మొసఁగి యనిచె నాకమునకు. 116

ప్రతిపదార్థం: సగర నృపతి= సగరుడన్న రాజు యొక్క; పుత్త్రచయము= కుమారుల సమూహం; ముని+ఇంద్ర= మునులకు రాజైన మునిశ్రేష్ఠుడైన కపిల మహర్షియొక్క; శాపమునన్= శాపంతో; భస్మమై= బూడిదై; అపార= అంతులేని; దురిత= పాప; కల్మషంబు= మాలిన్యం; పొందఁగాన్= పొందితే; గంగ= భాగీరథి; నిజ= తన; జల= నీళ్ళయొక్క; సేకమున్= తడుపుట; ఒసఁగి= చేసి; నాకమునకున్= స్వర్గానికి; అనిచెన్= పంపింది.

తాత్పర్యం: కపిలుడి శాపంవలన సగరుడి కొడుకులైన సాగరులు బూడిద కుప్పలుకాగా గంగ ఆ కుప్పలపై ప్రవహించి వారిని స్వర్గానికి పంపించింది. ఇది గంగా మాహాత్మ్యం.

విశేషం: సగరుడు యజ్ఞం చేస్తుండగా యాగాశ్వం తప్పిపోయింది. అతని కొడుకులు 60వేలమంది ఆ గుర్రాన్ని వెదకటానికి వెళ్ళారు. ఆ గుర్రం కపిలముని ఆశ్రమ ప్రాంతంలో తిరుగుతూ ఉండటం చూచి వారు కపిలుడే గుర్రాన్ని అపహరించా

డనుకొని ఆయనను శిక్షించటానికి పోయి, ఆ మహర్షి కోపాగ్నికి భస్మమైపోయారు. ఆ స్థితి వారికి పోవాలంటే గంగ ఆ బూడిద కుప్పలపైకి ప్రసరించాలనే ఉపాయం మహర్షి తానై చెప్పగా చివరకు భగీరథు డా పని సాధించిన వాడయ్యాడు. స్వర్గం నుండి గంగ భూమిపైకి ప్రసరించి ఆ బూడిద కుప్పలపై సుళ్ళు తిరిగితే తిరిగి సాగరులు మనుజులై స్వర్గ గతులైనారని గంగావతరణ కథ. ఇది రామాయణంలో మహర్షి వాల్మీకి ఆశ్చర్యకరంగా వర్ణిస్తాడు. ప్రవహించాలని కోరుకొన్నాడు భగీరథుడు. బ్రహ్మ 'సరే, గంగ భూమిపైకి దిగితే క్రుంగిపోతుంది కనుక శివుడిని ప్రార్థించు' అన్నాడు. మరలా భగీరథుడు శివుడి కొరకు తపస్సు చేస్తే ఆయన ప్రత్యక్షమై భగీరథుడి కోరిక మన్నిస్తానన్నాడు. గంగ ఆయన జటాజూటంలో దూరింది. భూమిపై ప్రవహిస్తూ జహ్నుడి ఆశ్రమాన్ని ముంచెత్తితే ఆయన గంగను త్రాగివేశారు. మరలా భగీరథుడు జహ్నుమునిని ప్రార్థించాడు. అప్పుడు గంగ అతని చెవినుండి నిర్గమించి సాగరుల భస్మరాసులపై ప్రవహించి వారిని సద్గతికి పంపింది.

ఇదీ భగీరథుడి చిత్ర తపస్సు. ప్రచుర పౌరుషం. ఎన్ని విఘ్నాలు వచ్చినా ప్రయత్నం విరమించకుండా సాధించే కృషిని భగీరథ ప్రయత్న మంటారు.

తే. దేవతలఁ జిత్రతపమునఁ దెలచి, గంగఁ । బ్రచుర పౌరుషుఁ డగు భగీరథుఁడు దనదు
పూర్వులైన సగర నృపపుత్రులకు ను । దాత్త గతికయి తెచ్చె నిద్ధరణి కనఘ! 117

ప్రతిపదార్థం: అనఘ! = పుణ్యాత్ముఁడా!; దేవతలన్= దేవతలను; చిత్ర= అద్భుతమైన; తపమునన్= తపస్సు ద్వారా; తెలచి= నమస్కరించి, సేవించి; ప్రచుర= అత్యధికమైన; పౌరుషుఁడు= ప్రయత్నం కలవాడు; అగు= అయిన; భగీరథుఁడు; తనదు= తనయొక్క; పూర్వులు+ఐన= తనవంశంలో ముందు పుట్టినవారైన (తాత ముత్తాతలు); సగర నృప= సగరరాజుయొక్క; పుత్రులకున్= కుమారులకు; గతికి+అయి= ముక్తికొరకు; ఇద్ధరణికిన్= ఈ లోకానికి; గంగన్= గంగను; తెచ్చెన్ = తీసికొని వచ్చాడు.

తాత్పర్యం: ప్రసిద్ధ పౌరుషంతో దేవతలను గురించి తపస్సుచేసి వారిని మెప్పించి సాగరుల భస్మరాసులపై ప్రవహింపచేసి, వారిని ముక్తులను చేయటం కొరకు భూలోకంలోకి గంగను తెచ్చినవాడు భగీరథుడు.

విశేషం: దైవము - పౌరుషము అని రెండున్నాయి. పౌరుషమంటే ఉత్సాహంతో మనిషి చేసే దృఢమైన ప్రయత్నం. దానికి ప్రతీక భగీరథుడు. అందుకే ఇప్పటికీ భగీరథ యత్నమన్న మాటను సామెతగా వాడుతున్నాం.

సగరుని కొడుకులు సాగరులు అరవైవేల మంది. వారు కపిలుడి కోపాగ్నికి గురి అయ్యారు. సగరుడికి మరొక భార్యకు జన్మించినవాడు అంశుమంతుడు. అతడు గంగను తేలేకపోగా అతని కొడుకు దిలీపుడు ప్రయత్నించి మరణిస్తే అతని కొడుకు భగీరథుడు బ్రహ్మను గురించి వేయేండ్లు తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై వరంకోరుకొమ్మంటే గంగ భూమికి ముందుగా బ్రహ్మ నుండి బయలుదేరి ఆకాశం మీదకు వ్యాపించి అక్కడి నుండి సూర్యమండలం ద్వారా మేరుపర్వతంపైకి దూకింది. అక్కడ నుండి నాలుగు పాయలుగా చీలి నాలుగు దిక్కులకు ప్రవహించింది. ఆ నాలుగు దిశలకు పారిన గంగకు నాలుగు పేర్లు;

అలకనంద : ఇది హిమాలయంమీదుగా భారతదేశంలో ప్రవహించిన పాయ - దక్షిణం

సీత : గంధమాదన పర్వతంమీదుగా భద్రేశ్వర దేశాలకు పారిన పాయ - తూర్పు.

సుచక్షువు : మాల్యవంతం మీదుగా కేతుమాల దేశాలలో ప్రవహించిన పాయ - పడమర.

విష్ణుభద్ర : ఉత్తర కురుభూములలో పారే పాయ - ఉత్తరదిశ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ మేరుపర్వతం భూచక్రాని కిరుసుగా మధ్యలో ఉంటుందని పురాణాలు చెప్పినమాట.

ఆ. విష్ణుపదము వలన, విధుని వలన, సూర్యు । వలన, మేరురూపకలితుఁ డైన

విష్ణువలనఁ, ద్రిపుర విజయి మౌళివలన । నుండి హిమనగమున నొలసె గంగ. 118

ప్రతిపదార్థం: విష్ణుపదము= ఆకాశం; వలనన్= ద్వారా, నుండి; విధునివలనన్= చంద్రుడివలన; సూర్యువలనన్= సూర్యుడినుండి; మేరు రూప కలితుఁడు= మేరు పర్వత స్వరూపుడైన; విష్ణువలనన్= విష్ణుదేవుడివలన; త్రిపురవిజయి= మూడు నగరాలను జయించినవాడు శివుడు (అతడి); మౌళివలనన్= జటాజూటంనుండి; హిమనగమునన్= మంచుకొండపై; గంగ; ఒలసెన్= ప్రవహించింది.

తాత్పర్యం: ఆకాశంనుండి చంద్రుడిమీదికి, అతడినుండి సూర్యుడిమీదికి, అతడినుండి మేరుపర్వత స్వరూపుడైన విష్ణువు వద్దకు, అక్కడినుండి శివుడి శిరస్సుమీదకు, అక్కడి నుండి హిమాలయపర్వతం మీదకు గంగ ప్రవహించింది.

క. విను, తత్పర భావంబున । మనంబు నిశ్చలత వొంద మనుజుఁడు శరణం

బని యాశ్రయింప జాహ్నవి । సనాతన పదోపలబ్ధి సంపద నొసఁగున్.' 119

ప్రతిపదార్థం: విను= వినుము; తత్పర భావంబునన్= భక్తిభావంతో; మనంబు= మనస్సు; నిశ్చలత పొందన్= నిశ్చలత్వం పొందగా; మనుజుఁడు= మనుష్యుడు; శరణంబు+అని= దిక్కని; ఆశ్రయింపన్= ఆశ్రయిస్తే; జాహ్నవి= గంగ; సనాతన= నిత్యమైన; పద= స్థానంయొక్క; ఉపలబ్ధి= లాభమన్న; సంపదన్= ఐశ్వర్యాన్ని; ఒసఁగున్= ఇస్తుంది.

తాత్పర్యం: వినుము. తాత్పర్య బుద్ధితో ఎవరైతే నిశ్చలమైన మనస్సుతో శరణని ఆశ్రయిస్తారో వారి జన్మను తరింపచేసి గంగ వారి స్వస్థానమైన ముక్తి నిస్తుంది.'

వ. అని చెప్పి సిద్ధుండు, వెండియు. 120

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; చెప్పి; సిద్ధుండు= సిద్ధపురుషుడు; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: అని చెప్పి సిద్ధుడు ఇంకా (ఇట్లా చెప్పాడు)

క. ఏ నెఱిఁగినంత సెప్పితిఁ గాని యనంత మహిమంబు గంగా గుణ సం

తానంబు, శతానందము । ఖానిమిష ప్రవరకీర్త్య మనఘచరిత్రా! 121

ప్రతిపదార్థం: అనఘ!= పాపంలేని; చరిత్ర!= ప్రవర్తన కలవాడా!; ఏను= నేను; ఎఱిఁగినంత= తెలిసినంత; చెప్పితిన్= చెప్పాను; కాని; గంగా గుణ సంతానంబు= గంగాదేవి గుణ సమూహం; అనంత= విశాలమైన; మహిమంబు= మహత్త్వం కలది; శతానంద= బ్రహ్మ; ముఖ= మొదలైన; అనిమిష= దేవతలలో; ప్రవర= శ్రేష్ఠులచేత; కీర్త్యము= స్తుతించదగినది.

తాత్పర్యం: నాకు తెలిసినంత చెప్పాను. కానీ, నాయనా! ఆ తల్లి గుణగణాలు మాహాత్మ్యం బ్రహ్మాదులచేత స్తుతింప తగినదంటే ఇక మానవుల సంగతి వేరే చెప్పాలా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మేరువు మణులును, వారిధి । వారి కణంబులును నెన్ను వడు వగు గంగా
స్ఫారగుణంబులు తగు సం । ఖ్యారూఢంబులుగఁ జేఁత యతులవివేకా! 122

ప్రతిపదార్థం: అతుల= సాటిలేని; వివేకా!= వివేకం కలవాడా!; గంగా= గంగాదేవియొక్క; స్ఫారగుణంబులు= దివ్యగుణాలు; తగు= తగిన; సంఖ్యారూఢంబులుగన్= లెక్కపెట్టెడి; చేఁత= చేష్ట; మేరువు మణులను= మేరుపర్వతంలోని రత్నాలను; వారిధి= సముద్రంలోని; వారి= నీటి యొక్క; కణంబులును= బొట్లను; ఎన్ను= లెక్కపెట్టే; వడువు+అగున్= పద్ధతిగా ఉంటుంది.

తాత్పర్యం: సాటిలేని వివేకం కలవాడా! గంగ దివ్యగుణాలను వ్రేలు మడిచి ఇన్ని - ఇది అని చెప్పటం ఎట్లాంటిదంటే - మేరుపర్వతంలోని రత్నాలను, సముద్రంలోని నీటి బొట్లను లెక్కపెట్టటంవంటి అవివేకపు పనే అవుతుంది.

వ. అని పలికి యిట్లనియె. 123

తాత్పర్యం: అని ఈ విధంగా చెప్పి ఇట్లా అంటున్నాడు.

విశేషం: అంటే అతడి కెంత చెప్పినా తనివితీరటం లేదని తాత్పర్యం. గంగ అంటే ఈ భారతీయ సంస్కృతిలో ఎట్లాంటిదో కవి తన ఆర్ష (ఋషిసంబంధమైన) నేత్రంతో దివ్యదర్శనంతో చెప్పేమాట. ఈ భావాన్ని వ్యక్తీకరించే వచనపు ముక్కలు 120,123.

లండను ప్రక్కనున్న థేమ్సు నదిలోని నీటిని ఓడపై భారతదేశానికి తెస్తే పురుగు పట్టిందట! ఇక్కడకు వచ్చేలోపల. కానీ గంగనీటిని లండను తీసికొని వెళ్తే పురుగు పట్టలేదట! హిమాలయాలలో - ఎన్నో ఓషధులను కరిగించుకొంటూ మహర్షుల, సిద్ధుల, మునుల, యోగుల, పవిత్ర శరీరాల తపస్సుల శక్తిని సంగ్రహించుకొని ప్రవహించేది గంగ. గంగ వట్టి నది మాత్రమే కాదని మన విశ్వాసం. పరమహంస శ్రీరామకృష్ణవంటి మహాత్ములెప్పుడూ తమ శిష్యులకు ఈ మాటనే చెప్పేవారట! ఒక్కసారి స్నానంచేస్తే చాలురా పాపాలన్నీ పటాపంచలౌతాయని అనేవారట! ఈమాట మొదట శ్రీస్వామి వివేకానందవంటి తర్కబుద్ధికలవారికి రుచించలేదు కాని, తరువాత ఆ మాటలలోని సత్యాన్ని వారు గ్రహించారట!

ఆ. వేడ్క నీకు నేను వివరించినట్టి యీ । జాహ్నవీ గుణములు, సంతతంబు
మనసు, వాక్కుఁ దనువు ననఁగల సాధన । ముల భజింపు భక్తిపూర్వకముగ. 124

ప్రతిపదార్థం: వేడ్కన్= కోరికతో కావాలని; నీకున్; నేను; వివరించినట్టి= విడమరచి చెప్పిన; ఈ జాహ్నవీ గుణములు= ఈ గంగా గుణాలు; సంతతంబున్= నిత్యము, ఎడతెగకుండా; మనసు; వాక్కున్; తనువున్= శరీరం; అనన్= అనగా; కల= ఉన్న; సాధనములన్= కర్మసాధనాలతో; భక్తిపూర్వకముగన్= భక్తి శ్రద్ధలతో; భజింపు= సేవించుము.

తాత్పర్యం: సంతోషంగా నేను నీకు వివరించిన ఈ గంగాగుణాలు ఎల్లప్పుడూ మనోవాక్కాయములనే సాధనాలతో భక్తిపూర్వకంగా కొలువుము.

విశేషం: మనిషికి ఏ పనిచేయటానికైనా మూడే సాధనములు ఉన్నాయి. శరీరం, వాక్కు, మనస్సు. ఈ మూటిని కలిపి ఒకటిగా చేయటమే త్రికరణ పారిశుద్ధ్యం. ఒక టనుకొని మనస్సులో మరొకటి చెప్పి, ఇంకొకటి చేసే నాగరికత ఈనాటిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మనిషి మనిషి కాకుండా పోవటానికి ఈ త్రికరణ పరిశుద్ధి, త్రికరణ సమైక్యం లేకపోవటమే కారణం. ఆ మూటిని ఏకం చేసే సాధన పవిత్ర ఉపాయమే ఇట్లాంటివి వినటం, చదవటం. భారతాదులవలన మనకు కలిగే ప్రయోజన మిదే నని నన్నయ, తిక్కనలు తమ అవతారికలలో చెప్పారు. మరీ నన్నయగారు భారత శ్రవణ ఫలితం చాలా చెప్పారు. కనుక కథంటే త్రికరణ పారిశుద్ధ్యం కొరకు వినేదే అది కలిగించేదే కథంటే - కాబట్టి నీవూ గంగను సేవించి ధన్యుడ వౌతావు.

తే. అట్టులైన గంగా ప్రసాదాతిశయము । వలన సిద్ధుండవై, త్రిభువనములందు
నర్చనీయ సంక్రీడన మవిహతముగ । సంచరించు మాహాత్మ్యంబు సంభవించు. 125

ప్రతిపదార్థం: అట్టులు+ఐనన్= పైన చెప్పిన మాటలు పాటిస్తే - త్రికరణ పరిశుద్ధితో గంగను సేవిస్తే; గంగా ప్రసాద+అతిశయము వలనన్= గంగయొక్క అధికమైన దయ వలన; సిద్ధుండవు+ఐ= నెరవేరిన కోరికలు కలవాడవై; త్రి= మూడు; భువనములందున్= లోకాలలో; అర్చనీయ= సేవించదగిన; సం= చక్కని; క్రీడనము= విహారం; అవిహతముగన్= ఎదురు లేనిదికాగా; సంచరించు= తిరిగే; మాహాత్మ్యంబు= ప్రభావం; సంభవించున్= కలుగుతుంది.

తాత్పర్యం: అట్లా చేస్తే గంగ దయవలన నీవూ సిద్ధపురుషుడ వౌతావు. మూడులోకాలలో నీ విహారాలకు అడ్డుండదు. నీకు ఎదురు లేని సంచార మార్గం - మాహాత్మ్యం లభిస్తుంది.

క. నిజధర్మ నిరతుఁడై తను । భజించు సజ్జనుని చిత్తపద్మము గృపఁ దా
భజియింప గంగ యతనిం । బ్రజనిత చిరసౌఖ్యుఁ జేయుఁ బావనచరితా!' 126

ప్రతిపదార్థం: పావనచరితా= పవిత్రమైన నడవడిగల ధర్మజా! నిజధర్మ నిరతుఁడు+ఐ= స్వధర్మంలో ఆసక్తిగలవాడై; తనున్= తన్ను; భజించు= సేవించే; సత్+జనునిన్= సత్పురుషుని; చిత్తపద్మము= తన హృదయమనే పద్మం; తాన్= తాను; కృపన్= దయను; భజియింపన్= సేవించగా, పొందగా; గంగ= గంగాదేవి; అతనిన్= తన్ను భజించే సత్పురుషుణ్ణి; ప్రజనిత= కల్గించబడిన; చిర సౌఖ్యున్= శాశ్వతసుఖాలు గలవాడిని; చేయున్= చేస్తుంది;

తాత్పర్యం: పావనమైన నడవడిగల ధర్మజా! స్వధర్మాచరణంలో ఆసక్తిగల్గిన సత్పురుషుడు తనని సేవించగా గంగ తనహృదయ పద్మం దయను హత్తుకొనగా అతణ్ణి శాశ్వతసుఖవంతుణ్ణి చేస్తుంది.

విశేషం: ఈ పద్యంలో అన్వయక్లేశముంది. చిత్త పద్మం సజ్జనుడిదైతే అర్థం పొసగదు. గంగాదేవిదైతే కుదురుతుంది. అప్పుడు "సజ్జనునిఁ జిత్తపద్మము'' అని ఖండబిందువుంచి రచనను సరిదిద్దాలి. ఉస్మానియా ప్రతిలో ఈ పద్యం యొక్క మూడవచరణం'' భరియింప'' అని ఉండగా వావిళ్లవారి భారతప్రతిలో "భరియించి'' అని వుంది. అప్పుడు ఈ పద్యానికి తాత్పర్యాన్నిలా పొసగించవచ్చు. స్వధర్మనిరతుడై తనను భజించే సత్పురుషుడి యొక్క చిత్తపద్మాన్ని కృపతో తాను భజించి గంగ అతణ్ణి ప్రజనితచిర సౌఖ్యుణ్ణి చేస్తుంది. భజియించి అనే క్రియా పదానికి ప్రకరగోచితంగా "అనుగ్రహించి'' ఇత్యాదిగ అర్థం చెప్పాలి. "యే యథా మాం ప్రపద్యన్తే.

వ. అని యిట్లు గంగా గుణంబు లమ్మహాద్విజునకు వివరించి యా సిద్ధుండు గగన గమనంబునం జనియె; అ వ్విప్రోత్తముండు నియతచిత్తుండై గంగాసేవనం బాచరించి యనన్యసులభ యగు సిద్ధింబడసెఁ; బాండ వాగ్రజా! నీవును గంగా భజనంబునం బరమశుభంబు నొందుము.' 127

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ విధంగా; గంగాగుణంబులు= గంగ గుణాలు; ఆ+మహాద్విజునకున్= ఆ గొప్ప బ్రాహ్మణుడికి; వివరించి= తెలియజెప్పి; ఆ సిద్ధుండు= ఆ యోగి; గగన= ఆకాశంలో; గమనంబునన్= నడకతో, ప్రయాణంతో; చనియెన్= వెళ్ళాడు; ఆ+విప్ర+ఉత్తముండు= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు; నియత= నియమబద్ధమైన; చిత్తుండు+ఐ= మనస్సు కలవాడై; గంగాసేవనంబు= గంగాసేవ; ఆ+చరించి= చక్కగా చేసి; అనన్య= సాటిలేని; సులభఅగు= తేలికఅయిన; సిద్ధిన్= ఫలాన్ని; పడసెన్= పొందాడు; పాండవ+అగ్రజా!= పాండవులలో పెద్దవాడా!; నీవునున్= నీవున్నూ; గంగా భజనంబునన్= గంగను సేవించటంవలన; పరమ= శ్రేష్ఠమైన; శుభంబును= శ్రేయస్సును; ఒందుము= పొందుము.

తాత్పర్యం: అని ఈ విధంగా సవిస్తరంగా ఆ మహాబ్రాహ్మణుడికి ఆ సిద్ధుడు వివరించి ఆయన ఆకాశమార్గంలో వెళ్ళిపోయాడు. ఆ బ్రాహ్మణుడు కూడా ఆ విధంగా నిష్ఠాపరుడై గంగను సేవించి ఇతర మార్గంలో సులభంగా దొరకని సిద్ధిని పొందాడు. ధర్మరాజా! నీవు కూడా గంగాసేవతో శుభాలు పొందుము.'

విశేషం: ఇంతగా గంగను గురించి చెప్పవలసిన అగత్య మేమిటి? అంటే వేదవాఙ్మయంలో ఇట్లా చెప్పబడింది. "సృష్టికారణమైన జలం పేరే గంగ. భగీరథుడి ద్వారా భూమికి రావటమంటే భావరూపమైన భగవచ్ఛక్తి సృష్టిగా వికసించటమే. ఈ సృష్టి ఐదు అంచెలుగా వచ్చింది. కనుకనే సృష్టికి ప్ర+పంచ= ఐదు కలదని పేరు వచ్చింది. పంచ సింధూనదులంటే సృష్టి ఐదంచెల మీదుగా వచ్చిన విషయాన్ని సూచిస్తుంది'' కనుకనే గంగకు ఒక మూర్తి ఉన్నది. ఆ వర్ణన పురాణాల ప్రకారం ఇట్లా ఉన్నది.

"రత్నపాదుకలు కలది. మకరవాహనం కలదీ, తెల్లని వెన్నెలవంటి శరీరం కలది'' అని ఈ రూపంలో గంగను ఆరాధించాలని పురాణాలు చెప్పుతున్నాయి.

అన్ని పురాణాలు గంగావతరణమును కీర్తించాయి. మహాబలిపురం కొండపై ఈ కథ చెక్కబడింది. ప్రపంచంలో అదొక అపూర్వ శిల్పం. ప్రాచీన భరతనాట్యంలో ఈ గంగావతరణ కథ అభినయించబడేది. దాని విషయం నందికేశ్వరుడు వ్రాసిన భరతార్ణవంలో ఉన్నది. ప్రభావతీప్రద్యుమ్న మన్న కావ్యంలో నటకు లీకథ నభినయించినట్లు పింగళి సూరన్న వర్ణించాడు.

క. అని చెప్పి, శాంతనవుఁ డి । ట్లను ; 'గంగాస్తోత్ర సహితమై పరఁగిన యి
వ్వినుతేతిహాసముఁ బఠిం । చిన వినినను రుజలు వాయుఁ జెంద వఘంబుల్.' 128

ప్రతిపదార్థం: అని చెప్పి= సిద్ధుడు చెప్పిన కథనంతా పూసగ్రుచ్చినట్లు చెప్పి; శాంతనవుఁడు= శంతను కుమారుడైన భీష్ముడు; గంగాస్తోత్రసహితముఐ= గంగాస్తుతితో కూడినదై; పరఁగిన= ఒప్పిన; ఈ+వినుత= ఈ వినుతించదగిన, పొగడదగిన; ఇతిహాసమున్= పురాణకథ; పఠించినన్= చదివినా; వినినను= విన్నా; రుజలు= రోగాలు; పాయున్= తొలగుతాయి; అఘంబుల్= పాపాలు; చెందవు= పొందవు.

తాత్పర్యం: భీష్ముడు కథంతా చెప్పి ఇట్లా అన్నాడు. 'ధర్మరాజా! గంగాదేవి స్తోత్రంతో కూడిన ఈ పురాణ కథను చదివినా, విన్నా రోగాలు పోవటమే కాదు, పాపాలు కూడా పోతాయి.'

విశేషం: పురాణాలలో కథ చెప్పిన ఫలితం, ప్రయోజనమూ చెప్పటం జరుగుతుంది. ఇది అట్లాంటి పద్యం. కథ దీనితో ముగుస్తుంది.

క. అనిన విని, యన్నరేంద్రుం । డనుజ సహితముగఁ బ్రభూతహర్ష సముర్మీ
లన కలనా సంవేశిత । మనస్కుఁడై యాతనికి నమస్కృతి సేసెన్. 129

ప్రతిపదార్థం: అనినన్= భీష్ముడట్లా చెప్పగా; విని= ఆలకించి; ఆ+నర+ఇంద్రుండు= ఆ రాజు; అనుజ సహితముగన్= తమ్ములతోపాటుగా; ప్రభూత= అధికమైన; హర్ష= సంతోషంతో; సమున్మీలన= బాగుగా వికసించిన, వికాసంతో; కలనా= కూడిక; సంవేశిత= స్థానంగా చేయబడిన; మనస్కుఁడు+ఐ= మనస్సు కలవాడై; ఆతనికిన్= ఆ భీష్ముడికి; నమస్కృతి= నమస్కారం; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: చెప్పినదంతా విని ధర్మరాజు సంతోషంతో వికసించిన మనస్సు కలవాడై తమ్ములతోపాటుగా భీష్ముడికి నమస్కరించాడు.

విశేషం: ఆ సంస్కృత సమాసం - భీష్ముడిమీద ధర్మరాజుకు కలిగిన భక్తియొక్క ఆవేశాన్ని సూచిస్తున్నది, ధ్వనిస్తున్నది. దీనికి కారణం భీష్ము డంత అందంగా గంగా మహిమను గానంచేయటం. ఈ సంతోషం పాఠకుడు పొందే అనుభవాన్ని సూచిస్తుంది.

వ. ఇట్లు పరమహర్షంబునం బ్రణతుండై, ధర్మజుండు మందాకినీ తనయుతో 'నెవ్వరు సర్వ జనపూజ్యు? లెఱింగింపవే? భవద్వచనామృతంబునఁ దృప్తి సనక యడిగెద' ననిన, నమ్మహాత్ముండు 'వాసుదేవ నారద సంవాదంబను నితిహాసంబు వినుము; నీ యడిగిన యర్థంబు దానం దేటపడియెడు' నని పలికి యతని కిట్లనియె. 130

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారం; పరమ= గొప్ప; హర్షంబునన్= సంతోషంతో; ప్ర+నతుండై= నమస్కరించి; ధర్మజుండు= ధర్మనందనుండు (యముడికి ధర్ముడని పేరు); మందాకినీ తనయుతోన్= గంగ కుమారుడితో; ఎవ్వరు= ఎవరు; సర్వజన= అందరికీ; పూజ్యులు= పూజించదగినవారు; ఎఱింగింపవు+ఏ= తెలుపవా?; భవత్= నీ; వచనామృతంబునన్= మాటలన్న అమృతంతో; తృప్తి= సంతృప్తి; చనక= తీరక; అడిగెదన్= అడుగుతున్నాను; అనినన్= అనగా; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; వాసుదేవ= శ్రీకృష్ణ; నారద= నారదుల; సంవాదంబు= సంభాషణం; అను= అన్న; ఇతిహాసంబు= పురాణ గాథ; వినుము; నీ అడిగిన= నీవు అడిగిన; అర్థంబు= తాత్పర్యం; దానన్= దానితో; తేటపడియెడున్= స్పష్టపడుతుంది; అని పలికి= అని వచించి; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆయనతో ఈ రీతి వచించాడు.

తాత్పర్యం: అట్లా సంతోషంతో నమస్కరించి యమధర్మరాజు కుమారుడు గంగా తనయుడిని అడిగాడు. 'నీ మాటలనే అమృతం త్రాగి తృప్తితీరక అడుగుతున్నాను. లోకంలో అందరకూ పూజనీయు లెవ్వరో చెప్పుము' అని అడిగితే భీష్ముడు 'నీ వడిగిన ప్రశ్నకు సమాధానంగా వాసుదేవ నారద సంవాద మనే పురాణగాథ చెప్తుతాను వినుము' అని చెప్తుతున్నాడు.

వాసుదేవ నారద సంవాద ప్రకారము (సం.13-66-1 (కుంభ))

వ. 'తన కడకు నారదుఁడు వ।చ్చిన సత్కారము దగంగఁ జేసి, ముకుందుం
డను సమధిక బహుమానం।బున 'నెవ్వారలకు నీవు మ్రొక్కుదు చెపుమా!' 131

ప్రతిపదార్థం: ముకుందుండు= శ్రీకృష్ణుడు (మోక్ష మిచ్చేవాడు); తనకడకున్= తన దగ్గరకు; నారదుఁడు; వచ్చినన్=రాగా; సత్కారము= అతిథి సపర్యలు; తగంగన్= తగినట్లుగా; చేసి; సమధిక= మిక్కిలి ఎక్కువ; బహుమానంబునన్= గౌరవంతో; ఏ+వారలకున్= ఎవరికి; నీవు; మ్రొక్కుదు= నమస్కరిస్తావో; చెపుమా!= చెప్పుము; అనున్= అన్నాడు.

తాత్పర్యం: ఒకసారి నారదమహర్షి విష్ణుదేవుడి దగ్గరకు రాగా ఆయన సత్కారం చేసి ప్రశ్నించాడు. "నీవు మిక్కిలి గౌరవంతో ఎవరికి నమస్కరిస్తావో చెప్పుము" అని.

విశేషం: నమస్కారమంటే వినయంతో వంగి, గౌరవబుద్ధితో, హృదయపూర్వకంగా, అహంకారం లేశమాత్రం లేకుండా దండం పెట్టడం. ఆ దండంలో నేను, అన్న పదార్థమంతా లీనం కావాలి. దానిని నమస్కారమంటారు. ఇది అందరకూ చేతనయ్యేది కాదు.

వ. అనిన నద్దేవముని యద్దేవకీనందనున కిట్లనియె. 132

ప్రతిపదార్థం: ఆ+దేవముని= నారదుడు; ఆ+దేవకీ నందనునకున్= దేవకీ కుమారుడితో; ఇట్లు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా విని నారదుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

సీ. 'వరుణు, సమీరణుఁ, దరణిఁ, బర్జన్యుని, । సప్తార్చి, నీశాను, షణ్ముఖుని, మ
హాలక్ష్మి విష్ణుని, నజు, బృహస్పతిఁ, జంద్రు । జలముల, భూమి, నెజ్జనము లెపుడు
నతిభక్తి సేవింతు రట్టి వారలకు నే । మ్రొక్కుదు; వేదపరులుఁ, దపోధ
నులు, దేవతా పూజనులు, భూమి ధన ధాన్య । గోదాన శీలురు, నాదరంబు

ఆ. గల్గి యతిథిపూజ గావించువారలుఁ । బితృసమర్చకులును, భిక్షితాన్న
పూత శాంత భావములు గలవారు స । త్యవ్రతులును బూజ్యు లనఘ! నాకు. 133

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాశాలీ!; వరుణున్= సముద్రములకు పశ్చిమదిక్కున అధిపతిని; సమీరణున్= వాయుదేవుడిని; తరణిన్= సూర్యుడిని; పర్జన్యునిన్= మేఘుడిని; సప్తార్చిన్= అగ్నినీ; ఈశానున్= ఈశాన్య దిక్కున ఉండే దేవతను; షణ్ముఖునిన్= కుమారస్వామిని; మహాలక్ష్మిన్= లక్ష్మీదేవిని; విష్ణునిన్; అజున్= బ్రహ్మను; బృహస్పతిన్= దేవతాగురువును; చంద్రున్; జలములన్= నీటిని; భూమిన్= భూమినీ; ఏ+జనములు= ఏ మానవులు; ఎప్పుడున్= నిత్యమూ; అతి= మిక్కిలి; భక్తిన్= భక్తితో; సేవింతురు= పూజిస్తారో; అట్టివారలకున్= అట్లాంటి వారికి; నేన్= నేను; మ్రొక్కుదున్= నమస్కరిస్తాను; వేదపరులున్= వేదం నిత్యం చదివేవారు; తపోధనులు= తపస్సే సంపదగా కలవారు; దేవతాపూజనులు= దేవతలను పూజించేవారు; భూమి= భూమినీ; ధన= డబ్బును; ధాన్య= పంటను; గో= ఆవులను; దాన= దానం చేసే; శీలురు= స్వభావం కలవారు; ఆదరంబు కల్గి= ఆదరంతో; అతిథిపూజన్= అతిథుల పూజను; కావించువారలున్= చేసేవారు; పితృ= తండ్రిని; సమర్చకులున్= పూజించేవారు; భిక్షిత+అన్నమున్= బిచ్చమడిగి తెచ్చిన అన్నంతో; పూత= పవిత్రమైన; శాంత= ఉద్రేకాలు లేని; భావములు= మనస్సులు కలవారు; సత్యవ్రతులును= నిజం మాట్లాడే స్వభావం కలవారు; నాకున్= నాకు; పూజ్యులు= పూజించ దగ్గవారు.

తాత్పర్యం: వరుణుడినీ, వాయువునూ, సూర్యుడినీ, మేఘుడినీ, అగ్నినీ, ఈశానుడినీ, కుమారస్వామినీ, మహాలక్ష్మినీ, విష్ణువునూ, బ్రహ్మనూ, బృహస్పతినీ, చంద్రుడినీ, నీటినీ, భూమినీ ఎవరు పూజిస్తారో వారిని నేను భక్తితో సేవిస్తాను. వేదవేత్తలు, తపోధనులు, దేవతలను పూజించేవారు, ధన ధాన్యభూములను, గోవులను దానం చేసేవారు, అతిథిపూజ చేసేవారు, పితృదేవతలను పూజించేవారు, భిక్షాన్నంతో తృప్తిపడే శాంతస్వభావులు, సత్యవ్రతులు - నాకు పూజ్యులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వినుత త్రివర్గనిరతులు, । ననహంకార మమకారులగు జనులు, సువ

ర్తన యుతులు, నలోలురు, బో । ధనులు, నమస్కార్యు లద్రిధర! విను నాకున్. 134

ప్రతిపదార్థం: అద్రి ధర!= (గోవర్ధనమన్న) కొండను మోసినవాడా!; విను; నాకున్= నాకు; నమస్కార్యులు= నమస్కరించ తగ్గవారు (ఈ క్రింద చెప్పినవారు); వినుత= స్తుతింపదగ్గ; త్రివర్గ= ధర్మ, అర్థ, కామాలు; నిరతులు= నిత్యం సేవించేవారు; న+అహంకార= నే నన్న భావం లేనివారు; న+మమకారులు= వ్యామోహం లేనివారు; అగు= అయిన; జనులు= మానవులు; సు= మంచి; వర్తన= ప్రవర్తనతో; యుతులు= కూడినవారు; అలోలురు= ఆసక్తి లేనివారు; బోధనులు= జ్ఞానం కలవారు.

తాత్పర్యం: ధర్మార్థ కామసేవనులు, అహంకార మమకారాలు లేనివారు, వ్యామోహం లేనివారు, సత్ప్రవర్తన కలవారు, జ్ఞానులు నాకు నమస్కరించ తగినవారు.

క. నీవును, మత్సంపూజ్య జ । నావలిఁ జిత్తమున నెఱిఁగి, యర్చనమును, సం

సేవనము, నడుప భూరి శు । భావహ మగు నవ్విధంబు యాదవసింహా'! 135

ప్రతిపదార్థం: యాదవ సింహా!= యదువంశ శ్రేష్ఠుడా!; నీవును= నీవూ; మత్= నా చేత; సం= బాగా; పూజ్య= పూజింపదగిన; జన+ఆవలిన్= మానవ సమూహాన్ని; చిత్తమునన్= మనస్సులో; ఎఱిఁగి= తెలిసి; అర్చనము= పూజ; సంసేవనము= సేవించటం; నడుపన్= నడిపితే; ఆ+విధంబు= ఆ పద్ధతి; భూరి= మిక్కిలి; శుభ= మేలు; ఆవహము+అగున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: కృష్ణా! నీవున్నూ నేనూ పూజించేవారిని మనస్సులో తెలిసికొని పూజిస్తూ సేవిస్తూ ప్రవర్తిస్తే శుభం కలుగుతుంది.

క. అనియెం గావునఁ గుంతీ । తనయాగ్రజ! నీవు నివ్విధముల జనములం

గొనియాడుము, వారలు శో । భనము లొసంగుదు రఘంబుఁ బాపుదురు కృపన్.' 136

ప్రతిపదార్థం: అనియెన్+కావునన్= అన్నాడు కాబట్టి; కుంతీ తనయ+అగ్రజ!= కుంతీ కుమారులలో పెద్దవాడా!; నీవున్= నీవూ; ఈ+విధములన్= ఈ రీతిగా; జనములన్= మనుషులను; కొనియాడుము= స్తుతించుము; వారలు= వారు; శోభనములు=శుభాలు; ఒసంగుదురు= ఇస్తారు; అఘంబున్= పాపాలను; కృపన్= దయతో; పాపుదురు= పోగొట్టుతారు.

తాత్పర్యం: అన్నాడు కనుక ధర్మరాజా! నీవూ అదే విధంగా మనుజులను సేవించుము. వారు నీకు మేలు కలిగిస్తారు. పాపాలను పోగొట్టగలరు. వారి దయను పొందుము'

వ. అనిన విని యమ్మహీశ్వరుం డమ్మహితాత్మున కిట్లనియె. 137

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా ఆలించి; ఆ+మహీ= భూమికి; ఈశ్వరుండు= ప్రభువు; ఆ+మహిత+ఆత్మునకున్= ఆ మహానుభావుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు.

క. 'జనపతులకుఁ గర్తవ్యము । లనేకములు గలవు వానియన్నిటిలోనన్;

వినుత ప్రధానకృత్యం । బనఘచరిత ! చెప్పవే దయం దెలియంగన్.' 138

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యమైన; చరిత!=ప్రవర్తన కలవాడా!; జనపతులకున్= జనులయొక్క అధిపతులకు; కర్తవ్యములు= చేయతగిన పనులు; అనేకములు= చాలా; కలవు; వాని అన్నిటిలోనన్= వాటన్నింటిలో; వినుత= మెచ్చదగిన; ప్రధాన= ముఖ్య; కర్తవ్యంబు= పని; దయన్= దయతో; తెలియంగన్= తెలిసేటట్లు; చెప్పవే!= చెప్పవా?

తాత్పర్యం: 'రాజులు చేయవలసిన పను లనేకం ఉన్నాయి. అందులో మహత్తరమైన ముఖ్యమైన పని ఏదో దయతో చెప్పుము.'

క. అనుటయు నతనికి నతఁడి । ట్లను; 'సామ్రాజ్యాభిషిక్తుడైన నృపతికిన్
విను, కర్తవ్యతమం బగు । పని, బ్రాహ్మణపూజనంబు భవ్యవిచారా! 139

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; అతనికిన్= ధర్మరాజుతో; అతఁడు= భీష్ముడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; భవ్య= శ్రేష్ఠమైన; విచార!= ఆలోచన కలవాడా!; సామ్రాజ్య+అభిషిక్తుఁడు+ఐన= మహారాజ్యానికి అభిషేకం చేయబడిన; నృపతికిన్= రాజుకు; కర్తవ్యతమంబు+అగు పని= మిక్కిలి తప్పక చేయతగిన పని; బ్రాహ్మణ= బ్రాహ్మణులను; పూజనంబు= పూజించటం.

తాత్పర్యం: అని అడుగగా ధర్మరాజుతో భీష్మ డిట్లా అన్నాడు. 'రాజు రాజ్యాని కభిషేకం చేసికొన్న తరువాత చేయతగిన ముఖ్యమైన పని బ్రాహ్మణపూజ! మంచి ఆలోచన కలవాడా! వినుము.

క. భూనాథ! విప్రులు సమా । ధానంబున నున్నఁ బొదలు ధరణి, శుభమ్ముల్
మానార్హు లగుట, వారికి । మానన లేకున్న నడఁగు మనుజాధీశా! 140

ప్రతిపదార్థం: భూ= భూమికి; నాథా!= రాజా; విప్రులు= బ్రాహ్మణులు, సమ+ఆధానంబునన్= సమతా దృష్టితో, ప్రశాంత చిత్తంతో; ఉన్నన్= ఉంటే; ధరణిన్= లోకంలో; శుభమ్ముల్= శుభాలు; పొదలున్= ఎక్కువౌతాయి; మాన= గౌరవానికి; అర్హులు+అగుటన్= తగినవారు కావడం వల్ల; వారికిన్= వాళ్ళకు; మానన= మన్నన; లేకున్నన్= లేకపోతే; అడఁగున్= లోకంలో శుభాలు అణగిపోతాయి.

తాత్పర్యం: రాజా! విప్రులు సమాధానపడితే (రాజులు వారితో స్నేహం కలిగి ఉంటే) లోకానికి మేలు. వారు గౌరవించదగినవారు కనుక వారికి మన్నన లోపిస్తే లోకాలకు మేలు లేదు.

క. దైవంబు నదైవముగ, న । దైవము దైవముగఁ జేయ ధరణీదివిజుల్
భూవర! శక్తులు విను వా । రేవానికిఁ గూర్తు రతఁ డధీశత నొందున్. 141

ప్రతిపదార్థం: భూవర!= భూమికి నాథుడా!, రాజా!; దైవంబున్= దైవాన్ని; అదైవముగన్= దయ్యంగా; అదైవమున్= దయ్యాన్ని; దైవముగన్= దైవంగా; చేయన్= చేయటానికి; ధరణీదివిజుల్= భూదేవులు; బ్రాహ్మణులుః శక్తులు= సమర్థులు; విను= వినుము; వారు= ఆ విప్రులు; ఏ వానికిన్= ఎవడికి; కూర్తురో= ప్రేమకలిగి ఉంటారో; అతఁడు= అతడు; అధీశతన్= ఆధిపత్యాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: విప్రులు దైవాన్ని అదైవంగా, అదైవాన్ని దైవంగా చేయటానికి సమర్థులు. వా రెవరిపై ప్రేమకలిగి ఉంటారో వారు రాజ్యానికి అధిపతులు కాగలరు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కోపమునఁ, బ్రసాదంబున, । నాపదయును,సంపదయును, నప్పుడ తే వా
రోపుదు రింద్రునకైనను; । శాపానుగ్రహము లా సుచరితుల లీలల్. 142

ప్రతిపదార్థం: వారు= బ్రాహ్మణులు; కోపమునన్= కోపంతో; ప్రసాదంబునన్= దయతో; ఆపదయును= ఆపదను; సంపదయును= ఐశ్వర్యాన్ని; అప్పుడు+అ= వెంటనే; తేన్= తెచ్చుటకు; వారు+ఓపుదురు= సమర్థులగుదురు; ఆ సుచరితులు= ఆ మంచి నడవడి కల వారియొక్క; లీలల్= క్రీడలు; ఇంద్రునకున్+ఐనన్= దేవతల రాజునకైనా; శాప+అనుగ్రహములు= శాపము, వరములు. (అగును)

తాత్పర్యం: వారు ఇంద్రుడికైనా కోపంతో ఆపదలు కలిగించగలరు. దయ తలిస్తే సంపదను సృష్టించగలరు. శాపానుగ్రహ సమర్థులు విప్రులు.

క. ద్రవిడ కళిం గాశీనర । యవన శక పుళింద నృపతు లవని సురపరా
భవమునఁ గాదే, ధరణీ । ధవ! పొందిరి తొల్లి శూద్రతా దైన్యంబున్. 143

ప్రతిపదార్థం: ధరణీ ధవ!= భూమికి నాథుడా!; ద్రవిడ= ద్రావిడ దేశం - (తమిళ దేశం); కళింగ= త్రికళింగము (ఉత్తర కళింగం - నేటి ఒరిస్సా, మధ్యకళింగం - కృష్ణా గోదావరి నదీమధ్య దేశం; దక్షిణకళింగం - కృష్ణ మధ్యదిక్కున ఉన్న ప్రాంతం); ఆశీనర= ఉత్తర భారతంలో ఒక ప్రాంతం; యవన= గ్రీసుదేశం; శక పుళింద= శకులు, పుళిందులు అనే జాతివారున్న దేశాలయొక్క; నృపతులు= రాజులు; అవనిసుర= భూ దేవతల; పరాభవమునన్= అవమానంచేతనే; కాదే!= కాదా!; శూద్రతాదైన్యంబున్= శూద్రజాతులయొక్క హీనత్వం; తొల్లి= పూర్వం; పొందిరి= పొందారు.

తాత్పర్యం: ద్రవిడాది దేశాధిపతులు బ్రాహ్మణావమానంచేతనే హీనమైన శూద్రత్వం పాలైనారు కదా!

క. సోమాత్మకు లీశ్వరతా । శ్రీమహితులు, సర్వసౌఖ్య సిద్ధి కరులు, గో
త్రామరులు, వారి నెప్పుడు । భూమీశ్వర! పూజనములఁ బోషింపు తగన్. 144

ప్రతిపదార్థం: భూమి+ఈశ్వర!= రాజా!; గోత్రా= భూమియందు; అమరులు= దేవతలు, బ్రాహ్మణులు; సోమాత్మకులు= చంద్రుడు ఆత్మగా కలవారు సౌమ్యులు; ఈశ్వరతాశ్రీ= ఐశ్వర్యంతో; మహితులు= గొప్పవారు; సర్వసౌఖ్య= అన్ని సుఖాలను; సిద్ధికరులు= సిద్ధింప చేసేవారు; వారిన్= ఆ బ్రాహ్మణులను; ఎప్పుడున్= నిత్యమూ; పూజనములన్= పూజలతో; తగన్= చక్కగా; పోషింపు= పోషించుము.

తాత్పర్యం: రాజా! విప్రులు చంద్రుడే ఆత్మగా కలవారు, ఐశ్వర్యం కలవారు, సర్వసౌఖ్యాలను సిద్ధింపచేసేవారు. వారి నెల్లప్పుడూ పూజలతో తనుపుము.

క. వినుతాచారుం డగు వి । ప్రునకు, సభక్తికము గాఁగ, భోజన మిడినన్
విను, దేవపితృ సమూహము । లనూనపరితృప్తిఁ బొందు నతులచరిత్రా!' 145

ప్రతిపదార్థం: అతుల= సాటిలేని; చరిత్రా!= కీర్తికలవాడా!; విను= వినుము; వినుత= సన్నుతమైన, పొగడదగిన; ఆచారుండు= ఆచారము కలవాడు, సదాచార సంపన్నుడు; అగు= అయిన; విప్రునకున్= బ్రాహ్మణుడికి; సభక్తికముగాఁగన్= భక్తితోపాటుగా,

భక్తిపూర్వకంగా; భోజనము+ఇడినన్= అన్నం పెట్టితే; దేవ= దేవతల; పితృ= పితృదేవతల; సమూహములు= గుంపు; అనూన= అధికమైన; పరితృప్తిన్= మిక్కిలి సంతృప్తిని; పొందున్= పొందుతాయి.

తాత్పర్యం: పదిమంది పొగడే చరిత్ర కలవాడా! వినుము. సదాచార సంపన్నుడైన బ్రాహ్మణుడికి భక్తితో అన్నం పెట్టితే దేవతలు, పితృదేవతలు మిక్కిలిగా సంతృప్తి పడతారయ్యా!'

విశేషం: పితృదేవతలు= వంశకర్తలు. కులంలో పుట్టి పోయిన పెద్దలు. దేవతలు= అగ్ని మొదలైనవారు.

వాసుదేవ పృథివీ సంవాద ప్రకారము (సం.13-66-1 (కుంభ))

వ. అని చెప్పి భీష్ముం డా భూపతితో వెండియు నిట్లను; 'భూసుర విషయంబై వాసుదేవునకుం బృథివికి సంవాదంబు గలిగె; నది యితిహాస రూపంబునఁ జెల్లు; దానిఁ జెప్పెద నాకర్ణింపుము. వాసుదేవుం డొక్కసమయంబునం బృథ్వి నాలోకించి. 146

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వచించి; భీష్ముండు= దేవవ్రతుడు; ఆ భూపతితోన్= రాజుతో; వెండియున్= మరల; ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పాడు; భూసుర విషయంబు+ఐ= బ్రాహ్మణులకు సంబంధించినట్టిదై; వాసుదేవునకున్= విష్ణునకు; పృథివికిన్= భూదేవికి; సంవాదంబు= సంభాషణం; కలిగెన్= కల్గినది; అది= ఆ సంభాషణం; ఇతిహాసరూపంబునన్= కథారూపంగా; చెల్లున్= వ్యాప్తిపొందింది; దానిన్; చెప్పెదన్= తెల్పెదను; ఆకర్ణింపుము= వినుము; వాసుదేవుండు= మహావిష్ణువు; ఒక్క సమయంబునన్= ఒకా నొక వేళ; పృథ్విన్= భూదేవతను; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఇట్లా చెప్పి భీష్మ డింకా ధర్మరాజుతో ఇట్లా అంటున్నాడు. 'ఒకసారి భగవంతుడైన నారాయణుడికీ, భూదేవికీ ఒక సంభాషణం జరిగింది. అది పురాణంగా లోకంలో వ్యాపించింది. దానిని చెప్పుతాను వినుము. అది బ్రాహ్మణ సంబంధమైనది. ప్రస్తుత సందర్భానికి సరిపోతుంది. వాసుదేవుడు ఒకసారి భూదేవిని చూచి.

క. లోకజనని వగుటన్ నిను । నోకాశ్యపి ! యడుగవలయు నొక్కటి దెలియన్
నాకుం జెపుమా ! పాపము । లే కృత్యము సేసి గెలుతు రెల్ల జనములున్.' 147

ప్రతిపదార్థం: ఓ కాశ్యపి= ఓ భూదేవి!; లోకజననివి= లోకాలను కన్న తల్లివి; అగుటన్= అయినందువలన; నినున్= నిన్ను; ఒక్కటి= ఒక విషయం; తెలియన్= తెలిసికొనటానికి; అడుగన్ వలయున్= అడగాల్సి ఉన్నది; పాపంబులు= పాపాలు; ఏకృత్యము= ఏ పని; చేసి= ఆచరించి; ఎల్లజనములున్= మనుష్యులంతా; గెలుతురు= గెలుస్తారో; నాకున్= నాకు; చెపుమా= చెప్పవలయును.

తాత్పర్యం: భూదేవీ! నీవు లోకజననివి కనుక అడుగుతున్నాను. లోకంలో మనుష్యులు ఏ పని చేస్తే పాపాలు పోతాయో నాకు చెప్పుము. వినాలని ఉన్నది.

ఆ. అనినఁ బృథివి యిట్టులను; 'విప్రసేవను; విప్రపూజనమున, విప్రహిత వి
ధానమునను, బాపతతి నోర్చు, మానవ । ప్రతతి, యెందు నివి నృపాలు పనులు. 148

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పృథివి= భూమి; ఇట్టులు+అనున్= ఇట్లా అంటుంది; విప్ర= బ్రాహ్మణుల; సేవను= సేవతో; విప్ర పూజనమునన్= బ్రాహ్మణ పూజతో; విప్రహితవిధానమునను= విప్రులకు మేలుకూర్చే పద్ధతులవల్లనూ; మానవ ప్రతతి=

మానవ సమూహం; పాపతతిన్=పాపాల సమూహాన్ని; ఓర్చున్= జయిస్తుంది; ఎందున్= ఎక్కడైనా; ఇవి= ఇవే; నృపాలు పనులు= రాజులు చేయదగిన పనులు.

తాత్పర్యం: అనగా భూమి ఇట్లా అంటున్నది. ఎప్పుడైనాసరే ఏమరక బ్రాహ్మణులను సేవించటంవల్లా, పూజించటం వల్లా, వారికి శుభాలు కలిగించే విధానాలతో మానవులు పాపాలను సహించుకొనగలరు. ఇదే రాజులకు హితమైన మార్గం.

ఆ. అమరవిభుని, భగసహస్ర చిహ్నునిఁ గాఁగఁ । జేసినదియు, నేత్రభాసురుండు

గా నొనర్చినదియుఁ, । గమలాక్ష! విప్రున । ల్కయుఁ బ్రసాద సంపదయును గావె!' 149

ప్రతిపదార్థం: అమరవిభుని= దేవతల నాయకుడు ఇంద్రుడిని; భగసహస్ర చిహ్నునిన్= వేయి యోనులు గుర్తులు కలవాడిని; కాఁగన్= అగునట్లు; చేసినదియున్= చేసిందీ; నేత్ర= కళ్ళచే; భాసురుండు= ప్రకాశించేవాడు; కాన్= అగునట్లు; ఒనర్చినదియున్ చేసిందీ; కమల+అక్ష!= పద్మాలవంటి నేత్రాలు కలవాడా!; విప్రు= బ్రాహ్మణుడియొక్క; అల్కయున్= కోపమూ; ప్రసాద సంపదయున్= అనుగ్రహ సమృద్ధియూ; కావె!= కారణములు కావా?

తాత్పర్యం: దేవేంద్రుడి శరీరం వేల యోని చిహ్నాలు కలదిగా చేసింది విప్రుని అలుకయే కదా! ఆ గుర్తులనే నేత్రాలుగా ఇతరులకు కనిపించేటట్లు చేసిందీ ఆ బ్రాహ్మణుడి దయయే కదా!'

విశేషం: అహల్యను కామించినప్పుడు గౌతమమహర్షి కోపించి ఇంద్రుడిని శపించి మరలా దయతలచి ఆ యోనుల్ని నేత్రాలుగా కనిపించేటట్లు చేశాడు. ఈ రెండు చర్యలకు ఆయన శాపానుగ్రహాలే కారణం.

క. అనిన విని మెచ్చి, పృథివిం । గొనియాడె రథాంగ పాణి గురునృపవర! నీ

వనిశంబు మిగులనుతిమ । న్ననలను విప్రులకుఁ బ్రియ మొనర్పుము కృపతోన్. 150

ప్రతిపదార్థం: కురు నృపవర= కురువంశంలో రాజ శ్రేష్ఠుడా!; రథ+అంగపాణి= చక్రమే ఆయుధంగా చేతిలో ఉన్నవాడు విష్ణువు; అనినన్ విని= ఆ విధంగా భూమి చెప్పగా విని; మెచ్చి= మెచ్చుకొని; పృథివిన్= భూమిని; కొనియాడెన్= పొగడాడు; నీవున్= ధర్మరాజా! నీవు; అనిశంబున్= ఎల్లప్పుడు; మిగులన్= ఎక్కువగా; నుతి= పొగడ్త; మన్ననలన్= గౌరవంతో; విప్రులకున్= బ్రాహ్మణులకు; కృపతోన్= దయతో; ప్రియము= ప్రేమ; ఒనర్పుము= చేయుము.

తాత్పర్యం: ఈ విధంగా చెప్పగా మెచ్చుకొని చక్రపాణి భూదేవిని పొగడినాడు. కనుక ధర్మరాజా! నీవూ అట్లాగే బ్రాహ్మణులను గౌరవిస్తూ సేవిస్తూ వారికి ప్రియము చేయుము.

క. అని మఱియు శాంతనవుఁ డి । ట్లను 'జననంబునన విప్రు నధిప! మహా భా

గునిఁగాఁ జెప్పుదు రార్యులు । జనులకు వంద్యంబు లతని చరణాంబుజముల్. 151

ప్రతిపదార్థం: అని= చెప్పి; మఱియున్= ఇంకా; శాంతనవుఁడు= శంతనుడి కుమారుడు భీష్ముడు; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు; జననంబునన= పుట్టుకతోనే; విప్రున్= బ్రాహ్మణుడిని; అధిప!= రాజా!; మహాభాగునిన్+కాన్= మహానుభావుడిగా; ఆర్యులు= పెద్దలు; చెప్పుదురు= చెప్పుతారు; అతని= బ్రాహ్మణుడి; చరణాంబుజముల్= పాదపద్మాలు; జనులకున్=మనుష్యులకు; వంద్యంబులు= నమస్కరింపతగినవి.

తాత్పర్యం: అని చెప్పి శాంతనవు డింకా ఇట్లా అంటున్నాడు. 'పుట్టుకతోనే బ్రాహ్మణుడు మహానుభావుడని పెద్దలంటారు. అతడి పాదపద్మాలు అందరూ పూజించతగినవి.

వ. బ్రాహ్మణుల సృజియించి బ్రహ్మ వారలతోఁ జెప్పిన విధం బాకర్ణింపుము. 152

ప్రతిపదార్థం: బ్రాహ్మణులన్= విప్రులను; సృజియించి= సృష్టించి; బ్రహ్మ= సృష్టికర్త; వారలతోన్= వారితో; చెప్పిన విధంబు= నుడివిన తీరు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు బ్రాహ్మణులను సృష్టించి, వారితో చెప్పిన పద్ధతి వినుము.

ఆ. 'అరయ మీకుఁ గృత్య మన్యంబు లే; దాత్మ। కర్మ మూఁది యుక్తధర్మనిరతి
బ్రహ్మగోపనంబుఁ బాటింపుఁ డవ్విధ। మధిక శోభనంబు నావహించు. 153

ప్రతిపదార్థం: అరయన్= విచారిస్తే; మీకున్; అన్యంబు= మరొక; కృత్యము= పని లేదు; ఆత్మకర్మము= మీ జాతికి విధించబడిన ఆధ్యాత్మిక ధర్మం; ఊఁది= ఆధారంగా చేసికొని; యుక్త= తగిన; ధర్మనిరతిన్= నిత్యం ధర్మబద్ధతతో; బ్రహ్మ గోపనంబున్= ఆత్మతత్త్వ రక్షణను; పాటింపుఁడు= అనుసరించండి; ఆ+విధము= ఆ పద్ధతి; అధిక= మిక్కిలి; శోభనంబున్= శుభాన్ని; ఆవహించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: ఆత్మోపాసనమే మీరు చేయతగినది. అన్య ధర్మం లేదు. నిత్యం ధర్మబుద్ధితో పరబ్రహ్మను రక్షించుకొంటూ ప్రవర్తించండి. ఆ విధం మీకు మంచి శుభాలను కలిగిస్తుంది.

విశేషం: విప్ర= శబ్దంలో; వి- ప్ర రెండక్షరాలూ శ్రేష్ఠ అన్న అర్థం కలిగించేవి. మహాశ్రేష్ఠుడని ఆ శబ్దార్థం. బ్రాహ్మణ అంటే బ్రహ్మమునందు నిత్యాను సంధానం కలవాడు. బ్రాహ్మణములన్న వేదశాఖ యున్నది. వేదమంత్రాలతో యజ్ఞ కర్మ లెట్లా చేయాలో చెప్పేవి. ఉపనిషత్తులు జ్ఞాన యోగ ప్రతిపాదకాలు. బ్రాహ్మణాలు కర్మ ప్రధానాలు, యజ్ఞవిషయకాలు. ఉపనిషత్తులు జ్ఞానప్రధానాలని ఒక వివరణ ఉన్నది. బ్రాహ్మణులు బ్రాహ్మణాల ప్రకారం యజ్ఞం చేయించే పురోహితులు; విప్రుడంటే దైవ - ఆత్మ దర్శనం కలవాడని (SEER) అర్థం. కనుక ఈ శబ్దాలు జాతి, గుణ వాచకాలు తప్ప కుల బోధకాలు కావని నేటి పండిత సంప్రదాయం.

వ. బ్రాహ్మణ్యం బెల్ల వర్ణంబులకుం దారకంబు బ్రాహ్మియైన శ్రీఁ దపస్స్వాధ్యాయంబుల వెలుంగంజేయుం డనియె; నట్లు గావున రాజులకు బ్రహ్మ వచన పరిపాలనంబు ప్రధాన కర్తవ్యం బని చెప్పి వెండియు. 154

ప్రతిపదార్థం: బ్రాహ్మణ్యంబు= బ్రాహ్మణవర్ణం; వర్ణంబులకున్= కులాలకు; తారకంబు= తరింపచేసేది; బ్రాహ్మిఐన శ్రీన్= బ్రాహ్మణులయందున్న బ్రహ్మ సంబంధమైన శక్తితో; తపః= తపస్సు; స్వాధ్యాయంబులన్= వేదాధ్యయనాదులను; వెలుంగన్= ప్రకాశించేటట్లు, లోకాలకు వ్యాపించేటట్లు; చేయుండు+అనియెన్= చేయండని పల్కినాడు; కావునన్= కాబట్టి; రాజులకున్= ప్రభువులకు; బ్రహ్మవచన= బ్రహ్మదేవుడిమాట; పరిపాలనంబు= ఆచరించటం; ప్రధాన= ముఖ్యమైన; కర్తవ్యంబు= చేయతగినపని.

తాత్పర్యం: బ్రాహ్మణవర్ణం మిగిలిన వర్ణాలకు తారకం కనుక మీయందున్న ఆధ్యాత్మిక శక్తితో వేదాధ్యయనాదుల ఫలాన్ని లోకాలలో వ్యాపించేటట్లు చేయండి - అని బ్రహ్మ అన్నాడు. కాబట్టి బ్రహ్మ మాటను పాటించటం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాజులకు ముఖ్య కర్తవ్యం' అని చెప్పి ఇంకా.

ఆ. అగ్ని నంట, హిమవదచలంబుఁ గదలుప । గంగఁ గట్టవచ్చుఁ గాని, విప్ర
రాజిఁ బరిభవింపరాదు; విప్రుల కొల్వు । కల్పవృక్ష సేవకరణి యధిప! 155

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అగ్ని= నిప్పును; అంటన్‌వచ్చున్= తాకవచ్చు; హిమవత్+అచలంబున్= మంచుకొండను; కదలుపన్‌వచ్చున్= కదల్చవచ్చు; గంగన్= నీటిని; కట్టన్ వచ్చున్= మూటకట్టవచ్చును; కాని; విప్రరాజిన్= బ్రాహ్మణ సమూహాన్ని; పరిభవింపన్ రాదు= అవమానించ కూడదు; విప్రుల కొల్వు= బ్రాహ్మణసేవ; కల్పవృక్షసేవ కరణి= కల్పవృక్షాన్ని పూజించటం వంటిది.

తాత్పర్యం: నిప్పును తాకవచ్చును, హిమాలయాన్ని కదలించవచ్చును, గంగను మూటకట్టవచ్చును, కాని విప్రులను అవమానించరాదు. విప్రసేవ కల్పవృక్ష సేవ వలె ఫలదాయకం.

విశేషం: అలం: ఉపమ. కల్పవృక్షం= కోర్కెలు తీర్చే దేవతా వృక్షం.

వ. ఏ తద్విషయంబైనది శక్రశంబర సంవాదంబను నితిహాసంబు గలదు వినుము. శక్రుండు జటాసురనందనుండైన శంబరు కడకుంబోయి తదీయ గోష్ఠి నుండి, యతనితో, 'నీ వేమిట నున్నతిం బొంది యుందు?' వనిన నతం డతని కిట్లనియె. 156

ప్రతిపదార్థం: ఏ తత్ విషయంబు+ఐనది= దీనికి సంబంధించినది; శక్ర= ఇంద్ర; శంబర= ఆ పేరు గల రాక్షసునియొక్క; సంవాదంబు= సంభాషణ; అను; ఇతిహాసంబు= పురాణ గాథ; కలదు= ఉన్నది; వినుము= ఆలింపుము; జటా+అసుర= జడలుకలవాడు కనుక ఆ పేరుతో ప్రకాశించు; వాని యొక్క; నందనుండు+ఐన= కుమారుడైన; శంబరు కడకున్+పోయి= శంబరుడి చెంతకు వెళ్ళి; తదీయ గోష్ఠిన్+ఉండి= అతడితో చర్చిస్తూ ఉండి; అతనితోన్= ఆ శంబరుడితో; నీవు; ఏమిటన్= ఏ కారణంవల్ల; ఉన్నతిన్; పొంది+ఉందువు= గొప్పతనాన్ని వహించి ఉన్నావు; అనినన్= అని అడుగగా; అతండు= శంబరుడు; అతనికిన్= ఇంద్రుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దీనికి సంబంధించిన కథ ఒకటి ఉన్నది. ఇంద్రుడికీ జటాసురుడి కొడుకు శంబరుడికీ మధ్య నడచిన సంభాషణ. ఒకసారి ఇంద్రుడు శంబరుడి దగ్గరకు పోయి 'నీ వీ ఉన్నతి పొందటానికి కారణమేమి?' టని అడిగితే అత డన్నాడు.

క. 'అలుకయు, నసూయయును, వి । ప్రులయెడ లే వనఘ! వారిఁ బ్రోతుం గాతున్
సొలయఁ దదీయారాధన । ముల కట్టులు గావునన్ విభూతి వహింతున్. 157

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; విప్రులయెడన్= బ్రాహ్మణులయందు; అలుకయున్= కోపం; అసూయయును= ద్వేషం; లేవు; వారిన్= వారిని; ప్రోతున్= పోషిస్తాను; కాతున్= కాపాడుతాను; తదీయ= వారియొక్క; ఆరాధనములకున్= పూజలకు; సొలయన్= అలసిపోను; అట్టులుకావునన్= అందుచేత; విభూతిన్= ఐశ్వర్యాన్ని; వహింతున్= పొందుతాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నాకు బ్రాహ్మణులపై కోపం, ద్వేషం లేకపోగా వారిసేవలో నేను విసిగిపోను. అలసిపోను. అందుకే నాకీ ఉన్నతి కలిగింది.

వ. దేవాసుర యుద్ధంబున విప్రానుగ్రహంబు దేవతల గెలిపించుట గని, మజ్జనకుండు సోమునితో 'భూమిసురులు మహానుభావులుగదే!' యనుటయు నమ్మహితాత్ముం డతని కిట్లను 'వారలు తపస్స్వాధ్యాయ సిద్ధులై యుండుదురు. వారితెఱం గాకర్ణింపుము. 158

ప్రతిపదార్థం: దేవ= దేవతల యొక్క; అసుర= రాక్షసుల యొక్క; యుద్ధంబునన్= యుద్ధంలో; విప్ర+అనుగ్రహంబు= విప్రుల దయ; దేవతలన్= దేవతలను; గెలిపించుట= గెలిపించటం; కని= చూచి; మత్= నా; జనకుండు= తండ్రి; సోమునితోన్= చంద్రుడితో; భూమిసురులు= బ్రాహ్మణులు; మహానుభావులు కదే!= మహాత్ములు కదా!; అనుటయున్= అనగా; ఆ మహిత+ఆత్ముండు= ఆ మహానుభావుడు; అతనికిన్= అతడితో; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు; వారలు= వారు; తపః= తపస్సు; స్వ+అధ్యాయ= (తమ జాతికి విధించబడిన) వేద అధ్యయనం; సిద్ధులు+ఐ= సిద్ధించినవారై; ఉండుదురు= ఉంటారు; వారి తెఱంగు= వారి విధానం; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: దేవతలకు రాక్షసులకు జరిగిన సంగ్రామంలో బ్రాహ్మణుల దయతో దేవతలు గెలిచారు. కనుక వారు మహానుభావులు కదా! అని నా తండ్రి చంద్రుడితో అంటే ఆయన అన్నాడు 'వారు తపస్సు నందు వేదాధ్యయనమునందు సిద్ధులు కనుక వారి విషయం చెప్పుతాను వినుము'.

ఆ. 'అప్రవాసి యైన యవనీసురుని యుద్ధ । శాలి గాని ధరణిపాలు నురగ
ముల బిలాంధకారమున నడంచిన యట్లు । మెఱయనీక భూమి మ్రింగు నండ్రు. 159

ప్రతిపదార్థం: అప్రవాసిఐన= దూరదేశంపోని; అవనీసురునిన్= బ్రాహ్మణుడిని; యుద్ధశాలికాని= యుద్ధం చేయలేని; ధరణిపాలున్= రాజును; ఉరగములన్= పాపములను; బిల= బొక్కల; అంధకారమునన్= చీకటిలో; అడంచినఅట్లు= చంపినట్లు; మెఱయనీక= ప్రకాశింపనీయక; భూమి= నేలతల్లి; మ్రింగును= కబళిస్తుంది; అండ్రు= అంటారు.

తాత్పర్యం: విద్యార్జనకై దూరదేశం పోని బ్రాహ్మణుడిని, యుద్ధవిద్యావేత్త కాని రాజును కీర్తిపొందనివ్వక భూదేవి కబళిస్తుందంటారు. ఎట్లాగంటే పాములను బొక్కలలోనే చంపినట్లు.

విశేషం: అలం: ఉపమ.

క. దాని నెఱింగి, గృహంబున, । మానిత మగు చదువునందు మనసు గొలుప కెం
దేనిఁ జని చదువుదురు శ్రుతు । లానంత్యమునకుఁ దపస్వు లగుదురు విప్రుల్. 160

ప్రతిపదార్థం: దానిన్= పై దృష్టాంతం; ఎఱింగి= తెలిసి; గృహంబునన్= ఇంట్లో; మానితము+అగు= గౌరవించతగిన; చదువునందున్= విద్యలో; మనసు కొలుపక= మనస్సును పెట్టక; విప్రులు; ఎందేనిన్= ఎక్కడికైనా; చని= వెళ్ళి; చదువుదురు= చదువుకొంటారు; శ్రుతులు= వేదాలు; ఆనంత్యమునకున్= జీవిత చరమ దశలో; తపస్వులు= తపస్సు చేసుకొనేవారు; అగుదురు= ఔతారు.

తాత్పర్యం: బ్రాహ్మణులు పై దృష్టాంతం తెలిసి, ఇంట్లో విద్య ఉన్నా లేదని బయట దూరదేశాలకు పోయి వేదాలు చదువుకొని చివరకు తపస్సు చేస్తారు. ఇది బ్రాహ్మణ కర్మ.

వ. కావున వారలు సర్వాధికులు; వారల యెడ బహుమానావమానంబు లెట్టివారికి శుభాశుభంబుల నొందించుటకు సందియంబు లే 'దనిన సోముని వాక్యంబులు పాటించి మజ్జనకుండు విప్రజనంబులం బూజించి తేజిష్ణుం డయ్యెఁ; నేనుం దదాచారంబునం బెంపువడసితి' నని పలుకుటయు నయ్యసురేంద్రుని వచనంబు లూఁది, సురేంద్రుండు భూసురులకుం బరితోషంబు గావించి సవిశేష సమున్నతిం బొందె 'నని చెప్పిన విని గాంగేయునితోఁ గౌంతేయాగ్రజుం 'డపూర్వ చిరసమాశ్రిత దూరాగతులలోన, నధికతమం బగు పాత్రం బెవ్వ?' రని యడిగిన, నప్పుడమిఱేనికి నప్పురుషవరుం డిట్లనియె. 161

ప్రతిపదార్థం: కావునన్= కనుక; వారలు= విప్రులు; సర్వ+అధికులు= అందరికంటె గొప్పవారు; వారల+ఎడన్= వారి విషయంలో; బహుమాన= గౌరవం; అవమానంబులు= అగౌరవాలు; ఎట్టివారికిన్= ఎంతటివారికైనా; శుభ+అశుభంబులను= మేలు కీళ్ళను; ఒందించుటకున్= పొందించటానికి; సందియంబు లేదు= సందేహం లేదు; అనిన= అని పల్కిన; సోముని= చంద్రుడి; వాక్యంబులు= మాటలు; పాటించి= అనుసరించి; మత్= నా; జనకుండు= తండ్రి; విప్రజనంబులన్+పూజించి= బ్రాహ్మణులను పూజించి, తేజిష్ణుండు= తేజోవంతుడు; అయ్యెన్= అయినాడు; నేనున్= నేనుకూడా; తత్= ఆ; ఆచారంబునన్= ఆచారంతో; పెంపు= ఆధిక్యం; పడసితిన్= పొందాను; అనిపల్కుటయున్= అని పలుకగా; ఆ+అసుర+ఇంద్రుని= ఆ రాక్షస రాజుయొక్క; వచనంబులు= మాటలు; ఊఁది= పట్టుకొని; సుర+ఇంద్రుండు= దేవరాజు; భూ+సురులకున్= బ్రాహ్మణులకు; పరితోషంబు= సంతోషం; కావించి= చేసి; సవిశేష= విశేషమైన; సమున్నతిన్= ఔన్నత్యాన్ని; పొందెన్+అని; చెప్పినన్ విని; గాంగేయునితోన్= గంగా పుత్రుడితో; కౌంతేయ+అగ్రజుండు= కుంతి కుమారులలో పెద్దవాడు ధర్మరాజు; అపూర్వ చిరసమాశ్రిత దూర+ఆగతులలోనన్= క్రొత్తవారు, చాలాకాలం నుండి తన్నాశ్రయించిఉన్నవారు, దూరప్రాంతాలనుండి వచ్చినవారిలో; అధికతమంబు= మిక్కిలి గొప్ప; అగు; పాత్రంబు= యోగ్యుడు; ఎవ్వరు+అని+అడిగినన్; ఆ పుడమి ఱేనికిన్= ఆ మహీవల్లభునికి, ధర్మజునకు; ఆ పురుషవరుండు= పురుష శ్రేష్ఠుడు - భీష్ముడు; ఇట్లు+అనియెన్= ఇట్లన్నాడు.

తాత్పర్యం: కాబట్టి వారందరి కంటె గొప్పవారు. వారిని అగౌరవిస్తే కీడూ; గౌరవిస్తే మేలూ జరుగుతాయి. ఇందులో సందేహం లేదన్న చంద్రుడి మాటలు పాటించి మాతండ్రి తేజస్వంతుడయ్యాడు. నేనూ అదే ఆచారం పాటించి ఉన్నతిని పొందాను. ఆ మాటలు విని ఇంద్రుడు కూడా అదే విధంగా చేసి విశిష్టమైన ఉన్నతిని పొందాడు' అని చెప్పితే విని ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు. క్రొత్తవారూ, చాలాకాలం తన్ను ఆశ్రయించి ఉన్నవారు, దూరదేశం నుండి వచ్చినవారూ వీరిలో ఎవరు ఉత్తములు?' అని అడుగగా భీష్ము డంటున్నాడు.

క. 'చెలులుం జుట్టలు, సంబం । ధులు, ఋత్విజులునుఁ, బురోహితులుఁ, దగు పాత్రం
బులు, హింసా క్రోధేర్ష్యా । దులు లేని జనంబు లైన దురితవిదూరా! 162

ప్రతిపదార్థం: దురిత= పాపానికి; విదూరా!= చాలా దూరాన ఉన్నవాడా!; చెలులున్= స్నేహితులు; చుట్టలు= చుట్టాలు; సంబంధులు= సంబంధించినవారు, వియ్యమందినవారు; ఋత్విజులునున్= యజ్ఞం చేయించే; బ్రాహ్మణులు; పురోహితులున్= పురోహితులున్నూ; తగు= తగిన; పాత్రంబులు= యోగ్యులు; హింసా= జీవహింస; క్రోధ= కోపం; ఈర్ష్య= అసూయ; ఆదులు= మొదలైనవి; లేని= లేనట్టి; జనంబులు= మనుజులు; ఐనన్= అయితే.

తాత్పర్యం: పాపం లేనివాడా! ఈర్ష్య, అసూయ మొదలైనవి లేనివారు అయితే, స్నేహితులు, చుట్టాలు, సంబంధించినవారు, ఋత్విజులు, పురోహితులు తగిన యోగ్యులు.

విశేషం: పురః= రాబోయే; హితుడు= హితాన్ని సూచించేవాడు. అతిప్రాచీన కాలంలో పురోహితుడు మన మానవ లోకానికి రాబోయే మంచిచెడులు సూచించేవాడు. అతడు దైవానికీ, లోకానికీ వంతెనగా ఉండి దేవతలకు రాయబారిగా ఉండేవాడట! ధ్యానంలో దేవతలు చెప్పిన విషయాలను లోకానికి చెప్పేవాడట! లోకం ఆ మాటను పాటించి నడుచుకొనేదట. తరువాతి కాలంలో వారు రాజునకు మంత్రులై రాజ్యానికి కలిగే ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికములైన ఆపదలు తొలగించే వారట! - అని రాజనీతి గ్రంథాలలో చెప్పబడింది.

క. దూరాగతులు, నపూర్వులుఁ, గౌరవకులముఖ్య! పూజఁ గనుటకు నర్హుల్;
సారాచారము విద్యా । గౌరవముం గలుగఁ జూపు కరణీయ మగున్. 163

ప్రతిపదార్థం: కౌరవకుల ముఖ్య!= కురుకులంలో శ్రేష్ఠుడా!; దూర+ఆగతులు= దూరంనుండి వచ్చినవారు; అపూర్వులు= ముందు రానివారు; పూజన్=పూజను; కనుటకున్= పొందటానికి; అర్హుల్= తగినవారు; సార= అర్థవంతమైన; ఆచారము= ఆచరణ, కర్మ; విద్యాగౌరవమున్= గొప్ప విద్యావేత్త అనే మర్యాద; కలుగన్= కలవారయితే; చూపు= దర్శనం; కరణీయము= చేయతగింది; అగున్= ఔతుంది.

తాత్పర్యం: దూరం నుండి వచ్చినవారు ఇంతకుముందు తెలియనివారూ - పూజార్హులెప్పుడౌతారంటే వారు మంచి ఆచారవంతులు, విద్యావంతు లైతే అప్పుడు.

విశేషం: చూపు. అన్నచోట కొన్ని ప్రతులలో పూజ అని ఉన్నది. ఈ పాఠమే బాగుంది. అర్థం సులభంగా కుదురుతుంది.

క. ఈ మూఁడు తెఱంగుల జను । లే మెయిఁ జూచినను నశుచు లేనియుఁ బాత్ర
శ్రీ మహితుల నిజభృత్య । స్తోమము జీవనము నడపి చుమ్మీ యీగుల్.' 164

ప్రతిపదార్థం: ఈ; మూఁడు తెఱంగుల జనులు= మూడు రకాల మనుజులు; ఏమెయిన్= ఏ విధంగా; చూచినను= చూచినప్పటికి; అశుచులు= శుచిత్వం లేనివారు; ఏనియున్= అయినా; పాత్రశ్రీ= యోగ్య సంపదచేత; మహితులు+అ= గొప్పవారే; నిజ= తనయొక్క; భృత్య= సేవకుల; స్తోమము= సమూహం; జీవనము= బ్రతుకు; నడపి= గడపి; చుమ్మీ= సుమా; ఈగుల్= దానాలు.

తాత్పర్యం: అపూర్వ చిరసమాశ్రిత దూరాగతు లన్న మూడు రకాల జనులు ఏ విధంగా చూచినా అశుచులైనా, దానార్హులే. కాని, ఇందులో ఒక రహస్యమున్నది. నీ సేవకుల బ్రతుకు తెరువు చక్కగా గడపిన తరువాతే దానధర్మాలు చేయాలి సుమా!'

క. అనిన విని ధర్మసుతుఁ డి । ట్లను శంతనుసుతునితోడ 'నఘకోటికి నె
ల్లను మూలము వనితల య । జ్ఞనముల తెఱఁ గెఱుఁగఁ జెప్పు చాతుర్యనిధీ'! 165

ప్రతిపదార్థం: అనినన్; విని; ధర్మసుతుఁడు= యముడి కుమారుడు; శంతను సుతుని తోడన్= శంతనుడి కుమారుడితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు; చాతుర్యనిధీ!= నేర్పు కలవాడా!; అఘ= పాపాల; కోటికిన్= సమూహం; ఎల్లను=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మొత్తానికి; మూలము= వేరు, ప్రధాన కారణం; వనితల= స్త్రీలే; ఆ+జనముల= ఆ స్త్రీల; తెఱఁగు= పద్ధతి; ఎఱుఁగన్= తెలిసేటట్లు; చెప్పు= వివరించుము.

తాత్పర్యం: తరువాత ధర్మరాజు మరొక విషయం ప్రశ్నిస్తున్నాడు. 'పాపాలన్నిటికి మూలం స్త్రీలంటారు. వారి సంగతి చెప్పుము. నీవు చెప్పటంలో చాలా నేర్పు కలవాడవు కదా?'

నారద పంచచూడా సంవాదంబను నితిహాసము (సం.13-38-1)

వ. అనుటయు నతం డతని కిట్లనియె; 'అతివలు నీ చెప్పినట్టివార; దీనికి నారద పంచ చూడా సంవాదం బనంబరఁగు నితిహాసంబు గలదు; వనితా స్వభావ విషయంబయి యుండు; దాని నాకర్ణింపుము. దేవ మునివరుం డగు నారదుం డెందునుం జరించుచుండి పంచచూడ యను నచ్చరలేమ నొక్కెడం గాంచి.166

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; అతండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుకు; ఇట్లు అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అతివలు= స్త్రీలు; నీ చెప్పినట్టివారు+అ= నీవెట్లా చెప్పావో అట్లాంటివారే; దీనికిన్; నారద పంచచూడా సంవాదంబు అనన్+పరఁగు; ఇతిహాసంబు= చరిత్ర; కలదు; వనితా= స్త్రీల యొక్క; స్వభావ విషయంబు= స్వభావానికి సంబంధించినది; అయి+ఉండున్= కలదైఉన్నది; దానిన్; ఆకర్ణింపుము= వినుము; దేవముని వరుండు+అగునారదుండు= దేవతాముని శ్రేష్ఠుడైన నారదుడు; (మునులలో దేవతా మునులు, మానవ మునులని భేదమున్నది, నారదుడు దేవముని) ఎందునున్+చరించుచుండి; పంచచూడయను; అచ్చరలేమన్= అప్సరః కాంతను; ఒక్క+ఎడన్= ఒకచోట; కాంచి= చూచి.

తాత్పర్యం: అనగా విని భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు. 'నీవు చెప్పినట్లే స్త్రీలు అట్లాంటివారే. పూర్వం నారదుడు ఒక అప్సరసను - పంచచూడను చూచి అడిగి తెలుసుకొన్న కథ ఉన్నది. అది స్త్రీల స్వభావాన్ని వ్యాఖ్యానించేది. ఆ కథను చెప్పుతాను వినుము. దేవఋషి శ్రేష్ఠుడైన నారదుడు ఎక్కడెక్కడో తిరుగుతూ ఉండి ఒకచోట పంచచూడ అనే అప్సరసను చూచి.

విశేషం: పంచచూడ= అయిదు తలకొప్పులు కలది. ప్రాచీనకాలశిల్పాలలో ఈ కొప్పులు మనం చూడగలం.

క. 'ఏ నొక్కటి యడిగెదఁ జెపు। మా నళినదళాక్షి'! యనుడు మా కొలఁదుల ప
ల్కైన సదుత్తర మిచ్చెద। నానతి యి 'మ్మనియె నది ప్రియం బెసఁగంగన్. 167

ప్రతిపదార్థం: నళిన= తామర పువ్వు; దళ= రేకువంటి; అక్షి!= నేత్రాలు కలదానా!; ఏను= నేను; ఒక్కటి= ఒక సంగతి; అడిగెదన్= ప్రశ్నిస్తాను; చెపుమా= సమాధానం చెప్పుము; అనుడున్= అనగా; అది= ఆ అప్సరస; ప్రియంబు= ప్రేమ, గౌరవం; ఎసఁగంగన్= అతిశయించగా; మా కొలఁదుల= మాకు తగిన; పల్కు= మాట; ఐనన్= అయితే; సత్+ఉత్తరము= సరియైన సమాధానం; ఇచ్చెదన్= ఇస్తాను; ఆనతి ఇమ్ము= ఆనతివ్వండి; అనియెన్= అన్నది.

తాత్పర్యం: నారదు డామెతో అంటున్నాడు. 'నళినదళాక్షీ! నే నొకటి అడుగుతాను చెప్పుము' అని అంటే ఆమె అన్నది 'మీ రడిగేమాట మా బోటివాళ్ళకు తెలిసేదయితే తప్పక సమాధాన మిస్తాను' అని భక్తితో అన్నది.

విశేషం: అడిగింది దేవముని కనుక 'ప్రియంబెసఁగంగన్' మాకొలఁదుల పల్కు' - అని కవి వ్రాయటం ఆమె భక్తి వినయాలను సూచిస్తాయి.

వ. అనుటయు నతండు. **168**

ప్రతిపదార్థం: అనుటయున్= అనటంతో; అతండు= నారదుడు;

తాత్పర్యం: అట్లా అనగా నారదుడు.

క. 'వనితా స్వభావ మిట్టిది । యని తెలియం జెప్పు 'మనుడు, నల్ల నగుచు న
వ్వనిత' తగునయ్య! వనితకు । వనితల దుశ్చేష్టితములు వాక్రువ్వంగన్.' **169**

ప్రతిపదార్థం: వనితా= స్త్రీ యొక్క; స్వభావము= సహజమైన లక్షణం; ఇట్టిది= ఇట్లాంటిది; అని; తెలియన్= స్పష్టంగా; చెప్పుము= చెప్పుము; అనుడున్= అంటే; అల్లన్= నెమ్మదిగా; నగుచున్= నవ్వుతూ; ఆ వనిత= ఆ పంచచూడ; వనితల= స్త్రీల; దుస్+చేష్టితములు= చెడ్డచేష్టలు; వనితకున్= స్త్రీకి; వాక్రువ్వంగన్= చెప్పటం; తగున్+అయ్య!= అయ్యా! ఏం న్యాయం?

తాత్పర్యం: స్త్రీ స్వభావం ఇట్లాంటిదని చెప్పుము అన్నాడు నారదుడు. ఆమె నవ్వి 'స్త్రీ స్వభావంలో దుర్లక్షణాలను స్త్రీగా నే నెట్లా చెప్పేది? అది న్యాయం కాదు కదా!'

క. అనిన విని, 'నిక్క మాడిన, । విను, త ప్పించుకయు లేదు; వివరింపు నిజం'
బని ముని పల్కిన, నయ్యం । గన యతనికి నిట్టు లనియెఁ గౌరవముఖ్యా! **170**

ప్రతిపదార్థం: అనినన్= అంటే; విని= నారదుడు ఆలకించి; నిక్కము= సత్యం; ఆడినన్= చెప్పితే; విను; తప్పు= దోషం; ఇంచుకయున్= కొంచెంకూడా; లేదు; నిజంబున్= సత్యం; వివరింపు= చెప్పుము; అని; ముని= నారదుడు; పల్కినన్= అనగా; ఆ+అంగన= ఆ స్త్రీ; కౌరవముఖ్యా!= కురువంశంలో ముఖ్యమైనవాడా!; అతనికిన్= నారదుడితో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: ధర్మరాజా! పంచచూడ పలికిన మాటలు విని నారదుడు 'నిజం చెప్పితే పాపం ఆవంతకూడా రాదు. నిజం చెప్పుము' అని అన్నాడు. అతడితో ఆమె ఇట్లా అన్నది.

వ. 'స్త్రీ స్వభావంబులు నీ వెఱుంగని యవి లేవు, ఐనను జెప్పెద నవధరింపుము. **171**

ప్రతిపదార్థం: స్త్రీ స్వభావంబులు; నీవు; ఎఱుంగని యవి= తెలియనివి; లేవు; ఐననున్= అయినా; చెప్పెదన్; అవధరింపుము= శ్రద్ధగా వినుము.

తాత్పర్యం: స్త్రీల స్వభావాలు నీకు తెలియనివి లేవు. అయినా చెప్పుతాను వినుము.

విశేషం: నారదుడిపై నున్న మర్యాదకొరకు అన్నమాట లివి. ఆమె వినయ స్వభావాన్ని తెలుపుతున్నవి.

క. కులమును, సమ్మాన్యతయును । గలిగి, యొరుని భార్య యైన గౌరవలీలన్
మెలఁగుచు వెలిఁ జరియించున్ । లలన వలసినట్ల యే మనం గల దనఘా!' **172**

ప్రతిపదార్థం: అనఘా!= పాపం లేనివాడా!; కులమును= సత్కులం; సమ్మాన్యతయును= గౌరవం; కలిగి= ఉండి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒరునిభార్య ఐనన్= మరొకడి భార్య అయినా; గౌరవలీలన్= మర్యాద పద్ధతిగా; మెలఁగుచున్= ప్రవర్తిస్తూ; లలన= స్త్రీ; వలసినట్లు= ఇష్టం వచ్చినట్లు; వెలిన్= బయట; చరియించున్= తిరుగుతుంది; ఏమి+అనన్+కలదు?= అనటాని కేమున్నది?

తాత్పర్యం: సత్కులం, గౌరవమర్యాద లుండి మరొకడి భార్య అయి కూడా గౌరవంతో ఉంటూనే బయట తిరుగుళ్ళు తిరుగుతుంది స్త్రీ. ఇంకా అనటాని కేముంది స్వామీ!'

వ. అని పల్కి వెండియు. 173

తాత్పర్యం: అని చెప్పి ఇంకా.

సీ. 'యోషిజ్జనంబులు దోషంబులకు నెల్ల । మూలంబు; వారల నేల చెప్ప
నడిగితి గానఁ గన్నంత సెప్పెద విను, । పురుషులమేలిమి పొలఁతు లెఱుఁగ;
రదిగాక నిర్లజ్జలై కుత్సితుల భజి । యింతురు కదిసినయంతఁ జేసి,
వర్జనీయులు లేరు వారల కెవ్వరు । దండభీతిన పాడి దప్పకునికి,

తే. యగ్ని కాష్ఠముల మహాంబుధి యేఱుల । నంతకుండు భూతసంతతులను
వనజముఖులు పురుషులను దృప్తిఁ బొందుట । గలుగదండ్రు కోవిదులు మునీంద్ర! 174

ప్రతిపదార్థం: ముని+ఇంద్ర!= ముని ముఖ్యుడా!; యోషిత్+జనంబులు= స్త్రీలు; దోషంబులకున్+ఎల్లన్= అన్ని తప్పులకు; మూలంబు= స్థానం; వారలను= వారిని గురించి; ఏల చెప్పన్?= చెప్పేదేముంది?; అడిగితికానన్= అడిగావు కనుక; కన్న+అంత= తెలిసినంత; చెప్పెదన్= చెప్తాను; విను; పురుషుల= మగవారి; మేలిమి= మంచి; పొలఁతులు= స్త్రీలు; ఎఱుఁగరు= తెలియలేరు; అదిగాక= అంతేకాక; కుత్సితులన్= కుచ్చితం కలవారిని; నిర్+లజ్జలు+ఐ= సిగ్గుమాలినవారై; కదిసిన+అంతన్+చేసి= సమీపించినంత మాత్రంచేత; భజియింతురు= పొందుదురు; వారలకున్= వారికి; ఎవ్వరు= ఎవరు కూడా; వర్జనీయులు= విసర్జింప తగ్గ వారు; లేరు; దండభీతిన= దండనభయంచేతనే; పాడి= న్యాయం; తప్పక= తప్పకుండా; ఉనికి= ఉండటం; కాష్ఠములన్= కట్టెలతో; అగ్ని= నిప్పు; మహా+అంబుధి= పెద్దసముద్రం; ఏఱులన్= ఏర్లతో; భూత= జీవుల; సంతతులను= సమూహంతో; అంతకుండు= మృత్యుదేవత; వనజముఖులు= పద్మంవంటి ముఖం కలవారు-స్త్రీలు; పురుషులను= పురుషులతో; తృప్తిన్+పొందుట= సంతృప్తి చెందటం; కలుగదు= కుదరదు; అని; కోవిదులు= పండితులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: మునీంద్రా! స్త్రీలు సర్వదోషాలకు మూలం. వారిని గురించి చెప్పటం దేనికి? అడిగావు కనుక తెలిసినంత చెప్తాను. పురుషులలోని గొప్పతనం స్త్రీలు గ్రహించలేరు. అంతేకాక సిగ్గులేకుండా దగ్గరకు వచ్చిన కుత్సిత స్వభావులను కూడా వదలిపెట్టరు. శిక్షపడుతుందనే భయం కనుక లేకపోతే వాళ్ళకు పరిత్యజించ తగ్గ వారెవ్వరూ లేరు. ఏ విధంగా నిప్పు కట్టెలతో, సముద్రం నదులతో, మృత్యువు జీవులతో తృప్తి పడదో అదే విధంగా స్త్రీలు పురుషులతో తృప్తి పడరు.

క. కల దొక రహస్య గోపన । మలఘుమతీ! వినుము పురుషు నన్యుం గనినం
బొలఁతులకు, నేమి సెప్పుదుఁ? । గలుగుఁ బదను తోడి కళలు గామగృహమునన్' 175

ప్రతిపదార్థం: అలఘు= గొప్ప; మతీ!= మనస్సు కలవాడా!; ఒక; రహస్యగోపనము= దాచదగిన రహస్యం; కలదు= ఉన్నది; వినుము= జాగ్రత్తగా వినుము; అన్యున్= మరొక (భర్తకాక); పురుషున్= మగవాడిని; కనినన్= చూస్తే; ఏమి చెప్పుదున్= ఏం చెప్పేది; పొలఁతులకున్= స్త్రీలకు; కామగృహమునన్= యోనిలోపల; పదను= తడి; తోడి= తడితో; కళలు= కామ వాంఛలు, కలుగున్= ఏర్పడుతాయి.

తాత్పర్యం: మహామనస్వీ! వినుము. ఒక రహస్య మున్నది. బైటకు చెప్పరానిది. అయినా నీకు చెప్పుతున్నాను. పరపురుషుడిని చూస్తే స్త్రీకి యోని ఆర్ద్రమౌతుంది. ఇం కేం చెప్పేది?

వ. అని వెండియు. 176

తాత్పర్యం: అని ఇంకా.

క. 'కుడుచుట, కట్టుట, పూయుట । తొడుగుటయును, వివిధ ధనతతులు గూడుట, యె
క్కుడు వేడ్కసేయఁ జాలవు । పడఁతికిఁ బరపురుషుఁ గవయఁబాఱుట వోలెన్.' 177

ప్రతిపదార్థం: పడఁతికిన్= స్త్రీకి; పరపురుషున్= ఇతరుడైన మగవాడిని; కవయన్= పొందటానికి; పాఱుట= పరుగెత్తటం; పోలెన్= వలె; కుడుచుట= తినటం; కట్టుట= వస్త్రధారణం; పూయుట= గంధం మొదలైనవి పూసికొనటం; తొడుగుటయును= నగలు మొదలైనవి ధరించటం; వివిధ= అనేక; ధనతతులు= ధనరాసులు; కూడుట= లభించటం; ఎక్కుడు= ఎక్కువ; వేడ్కన్= సంతోషాన్ని; చేయన్+చాలవు= కలిగించలేవు.

తాత్పర్యం: పరపురుషులతో వ్యభిచరించటంమీద ఉన్నంత ప్రీతి స్త్రీకి తినటం, బట్టలు వేసికొనటం, నగలు పెట్టుకొనటం, డబ్బు కూడబెట్టుకొనటం మీద కూడా ఉండదు.

వ. అని చెప్పిన విని నారదుండు 'నిజంబు పల్కి'తని పంచచూడ ననిపి నిజేచ్ఛం జనియె' నని చెప్పిన విని, ధర్మజుండు 'సుందరీ జనంబులఁ గాచు తెఱం గెఱింగింపవే' యని యడిగిన, నాపగాతనూజుం డతని కిట్లను 'వారు మయశంబరాది మాయలం గడచిన మతకంబులు గలిగి నిరూపింపరాక యుండుదురు; అది యునుం గాక వేఱొక్క విశేషం బాకర్ణింపుము. 178

ప్రతిపదార్థం: అని చెప్పినన్; విని; నారదుండు; నిజంబు పల్కితి+అని= నిజం చెప్పావని; పంచచూడను; అనిపి= పంపి; నిజ+ఇచ్ఛన్= తనకిష్టం వచ్చిన చోటికి; చనియెన్= పోయాడు; అని చెప్పినన్ విని ధర్మజుండు; సుందరీ జనంబులన్= స్త్రీల సమూహాన్ని; కాచు= రక్షించు; తెఱంగు= విధానం; ఎఱింగింపవే= చెప్పవే; అని అడిగినన్= అని అడుగగా; ఆపగా తనూజుండు= గంగానది కొడుకు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు+అనున్; వారు= స్త్రీలు; మయ, శంబర+ఆది= మయుడు, శంబరుడు మొదలైన వారి; మాయలన్= మాయలను; కడచిన= అతిక్రమించిన; మతకంబులు= మాయలు; కలిగి; నిరూపింపన్ రాక= ఇది యని చెప్పటానికి వీలు లేకుండా; ఉండుదురు= ఉంటారు; అదియునుంగాక= అంతేకాక; వేఱొక్క విశేషంబు= మరొక్క సంగతి; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని చెప్పగా నారదుడు పంచచూడతో 'చాలా యథార్థం చెప్పా'వని మెచ్చుకొని ఆమెను పంపి తాను ఇష్టం వచ్చిన చోటికి పోయా'డని చెప్పగా ధర్మ రాజన్నాడు. 'ఈ ఆడవాళ్ళను ఎట్లా కాపాడుకొనాలో చెప్పు'మన్నాడు.

దానికి భీష్మ డన్నాడు 'వారు మయశంబరాది రాక్షసుల మాయలకంటె మించిన మాయలు కలవారు. వారి మాయలు ఇట్లాంటి వని నిరూపించటం కష్టం. అదీ కాక మరొక్క విశేషం చెప్పుతాను వినుము.

తే. తొల్లి నిర్దోషచిత్తత నెల్ల జనులు । వలచినప్పుడ దేవత్వ వైభవంబు
నొందఁ జాలి యుండుదురు మాయోపయుక్తి । వనితలకు లేక, సాధ్వులై యునికిఁ జేసి. 179

ప్రతిపదార్థం: వనితలకున్= స్త్రీలకు; మాయా= మాయామర్మాల; ఉపయుక్తిన్= కలిగి ఉండటం; లేక; సాధ్వులై= సాధు స్వభావలై; ఉనికిన్+చేసి= ఉన్నందువలన, తొల్లి= పూర్వం; నిర్దోషచిత్తతన్= దోషం లేని మనస్సుతో; ఎల్లన్ జనులు= మనుషులంతా; వలచినప్పుడు+అ= కావలసినప్పుడే; దేవత్వవైభవంబున్= దివ్యవైభవాన్ని; ఒందన్= పొందగా; చాలి= సమర్థులై; ఉండుదురు= ఉంటారు.

తాత్పర్యం: పూర్వం స్త్రీలు సాధువులై పవిత్రలై ఉండేవారు. వారికి మాయా మర్మాలు లేని ఆ రోజులలో పురుషులంతా కావలసినప్పుడు దైవత్వాన్ని పొందేవారు. వారి మనస్సులు పవిత్రంగా ఉండేవి కనుక.

వ. దానికి దివిజులు అసూయాగ్రస్తులై కమలయోనిం గానం జని నిజచిత్త ప్రకారం బెఱింగించిన, నతం డతివల మాయావతులం గావించి, వారికిఁ గామం బగ్గలంబుగాఁ జేసినం; బురుషులు వారి చిక్కులంబడి రోషాది దుర్గుణ దూషితు లగుటం జేసి విగతానుభావు లైరి; దేవతలును బ్రియం బందిరి; అట్లు గావున. 180

ప్రతిపదార్థం: దానికిన్= పురుషుల కా దైవత్వశక్తి కలగటం వలన; దివిజులు= దేవతలు; అసూయా+గ్రస్తులు= అసూయ భావంతో మ్రింగబడినవారై; కమలయోనిన్= పద్మంలో పుట్టిన బ్రహ్మను; కానన్= చూడటానికి; చని= పోయి; నిజ= తమ; చిత్త= మనస్సులలోని; ప్రకారంబు= ఆలోచన; ఎఱింగించినన్= తెలుపగా; అతండు= బ్రహ్మ; అతివలను= స్త్రీలను; మాయావతులన్= మాయలు నేర్చిన వారినిగా; కావించి= చేసి; వారికిన్; కామంబు; అగ్గలంబు= ఎక్కువ; చేసినన్= చేయగా; పురుషులు= మగవారు; వారి= స్త్రీల; చిక్కులన్= వలలో; పడి= చిక్కి; రోష+ఆది= రోషం మొదలైన; దుర్గుణ= చెడ్డగుణాలచేత; దూషితులు= కలుషితులు; అగుటన్+చేసి= అయినందువలన; విగత= పోయిన; అనుభావులు= మాహాత్మ్యం కలవారు; ఐరి= ఐనారు; దేవతలును= దేవతలూ; ప్రియంబు= సంతోషం; అందిరి= పొందారు; అట్లు+కావునన్= ఆకారణంవల్ల;

తాత్పర్యం: దానికి దేవతలు అసూయపడి బ్రహ్మ దగ్గరకు పోయి తమ మనసులలోని మాట చెప్పగా ఆయన స్త్రీలను మాయలు కలవారినిగా చేసి వారికి కామం హెచ్చుగా కల్గించాడు. దానితో పురుషులు వారి వలలో చిక్కుపడి కోపాది భావాలకు లోనై తమలో ఉన్న ఆ పూర్వపు ప్రభావం పోగొట్టుకొన్నారు. దేవతలు కూడా సంతోషించారు.

క. వనితలు మాయావిను లై । యనిరూపిత చిత్తవృత్తి నంచిత రక్షం
బనువడ కుండుదు; రైనను । వినినది కథయొకటి నీకు వినిపింతుఁ దగన్. 181

ప్రతిపదార్థం: వనితలు= స్త్రీలు; మాయావినులు+ఐ= మాయలు కలవారై; అనిరూపిత= నిరూపించరాని; చిత్తవృత్తిన్= మనస్సులోని తలంపులతో; అంచిత= మంచి; రక్షన్= కట్టుదిట్టాలలో; పనుపడక= లోబడక; ఉండుదురు= ఉంటారు; ఐననున్= అయినప్పటికి; వినినది= నేను విన్నది; కథ+ఒకటి= ఒకకథ; నీకున్; తగన్= చక్కగా; వినిపింతున్= వినిపిస్తాను.

తాత్పర్యం: స్త్రీలు మాయలు కలవారు కనుక వారి మనస్సులోని ఆలోచనలు పసికట్టి అరికట్టటం కష్టం. ఐనా నేను విన్న కథ నొకదాన్ని వినిపిస్తాను వినుము.

దేవశర్మయను మునివరు భార్య రుచి యనుదాని చరిత్రము (సం.13-40-1)

వ. దేవశర్మ యను మునిభార్య రుచి యను నంగన సర్వాంగ సుందరియై యుండుఁ; దదీయ రూపాతిశయంబు దేవగంధర్వాదులకును లోచనీయంబు. 182

ప్రతిపదార్థం: దేవశర్మ అను ముని భార్య; రుచి= రుచిఅనేపేరుగల (లావణ్యం, కాంతి కలదని అర్థం); అంగన= స్త్రీ; సర్వ+అంగసుందరిఐ= అన్ని అంగాలు అందంగా ఉన్నదై; ఉండున్= ఉన్నది; తదీయ= ఆమెయొక్క; రూప+అతిశయంబు= అందముయొక్క; ఆధిక్యం= అతిశయం; దేవ= దేవతలు; గంధర్వ= గంధర్వులు; ఆదులకును= మొదలైనవారికి; లోచనీయంబు= చూడదగింది.

తాత్పర్యం: దేవశర్మ అని ఒక ముని. అతని భార్య రుచి. ఆమె సర్వాంగసుందరి. ఆమె రూపలావణ్యం దేవగంధర్వాదులకు కూడా వాంఛింప తగ్గది.

క. అతఁ డొక నాఁ డొక యెడ కొక । క్రతువున కుపదర్శనంబు గావింపఁగఁ బో
వు తలంపు పుట్టి, వికస । న్మతి యగు తన శిష్యు విపులనామకునిఁ దగన్. 183

ప్రతిపదార్థం: అతఁడు= దేవశర్మ; ఒకనాఁడు; ఒక ఎడకున్= ఒకచోటికి; ఒక క్రతువునకున్= ఒక యజ్ఞానికి; ఉపదర్శనంబు= యాజకత్వం - పురోహితత్వం; కావింపఁగన్= చేయటానికి; పోవు= వెళ్ళే; తలంపు= ఆలోచన; పుట్టి= కలిగి; వికసత్+మతి= పరిపక్వమైన మనస్సు కలవాడు; అగు= అయిన; తన; శిష్యున్; విపుల నామకునిన్= విపులుడు అనే పేరుగల వాడిని; తగన్= చక్కగా. (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: ఒకసారి దేవశర్మ ఒక యజ్ఞం చేయటానికి పోవాలనుకొని వికసించిన ఆలోచనలు కల తన శిష్యుడు విపులు డనే వాడిని పిలిచి.

విశేషం: విపులుఁడు= విపులమైన విశాలమైన బుద్ధి కలవాడు కనుక వికసన్మతి - అని పేర్కొన్నాడు కవి. అతడి విశాలబుద్ధి ముందు కథలో తెలుస్తుంది. ఇది 37 పద్యాలకథ. స్త్రీని రక్షించటం కష్టమని చెప్పటానికై చెప్పబడుతున్నది. ఇదే కథ పురుషుడి దుశ్శీలతకూ ఉదాహరణమే.

వ. పిలిచి యేకాంతంబున నతని కిట్లనియె. 184

ప్రతిపదార్థం: ఏక+అంతంబునన్= ఒకడే ఉన్న రహస్యస్థానంలో.

తాత్పర్యం: పిలిచి రహస్యంగా అతడితో ఇట్లా అన్నాడు.

క. 'రుచి నెపుడు వేచి తిరుగును । శచీవిభుఁడు; దాని నెఱిఁగి సంరక్షణ మే
నుచితంబుగ నొనరింతు, వి । కచకమలనిభాస్యఁ జేరఁ గానఁ డతండున్. 185

ప్రతిపదార్థం: శచీవిభుఁడు= శచి భర్త ఇంద్రుడు; రుచిన్= రుచిని; ఎపుడున్= నిత్యమూ; వేచి= వెన్నాడుతూ; తిరుగును= తిరుగుతూ ఉంటాడు; దానిన్= ఆ విషయం; ఎఱిఁగి= తెలిసి; సంరక్షణము= కాపాడటం; ఉచితంబుగన్= తగినట్లు; ఏను= నేను; ఒనరింతున్= చేస్తూ ఉంటాను; వికచ= వికసించిన; కమల= తామరపూవు; నిభ= వంటి; ఆస్యన్= ముఖంకల దానిని; అతండున్= ఇంద్రుడు; చేరన్= సమీపించటానికి; కానఁడు= నేరడు.

తాత్పర్యం: రుచికొరకు ఇంద్రుడు చాలాకాలంగా పొంచులు వేస్తున్నాడు. అది తెలిసిన నేను తగిన రక్షణ విధాన మాచరిస్తూ ఉన్నందువలన అతడు ఈ ఛాయలకు రాలేకున్నాడు.

తే. **నాకుఁ గ్రతువు సేయింపఁ జనంగ వలసి । యున్నయది; పరదారసముత్సుకుండు**
శక్రుఁ; డటుగాన, రుచికి రక్షావిధాన । మాచరింపుము నీవు దృఢావధాన!' 186

ప్రతిపదార్థం: దృఢ= గట్టి; అవధాన!= జాగ్రత్త కలవాడా!; నాకున్; క్రతువు= యజ్ఞం; చేయింపన్= చేయించటానికి; చనంగన్ వలసి ఉన్న+అది= పోవలసి ఉన్నది; శక్రుఁడు= ఇంద్రుడు; పరదార= పరభార్యలపై; సముత్సుకుండు= వాంఛలు కలవాడు; అటుకానన్= అందుకని; నీవు; రుచికిన్; రక్షావిధానము= రక్షించే పద్ధతిని; ఆచరింపుము= చేయుము.

తాత్పర్యం: నేను యజ్ఞం చేయించే పనిమీద పోవలసి ఉన్నది. ఇంద్రు డేమో రుచికొరకు వేచి ఉంటాడు. కనుక నీవు ఆమె నతడినుండి కాపాడే బాధ్యత తీసికొనుము.'

క. **అనిన విని 'యట్లు సేసెద' । నని విపులుఁడు గురునితోడ 'నమరవిభుం డే**
యనువునఁ జొచ్చు నొకో పర । వనితాహరణమున' కనియె వసుధాధీశా! 187

ప్రతిపదార్థం: వసుధా+అధీశా!= భూమికి పతీ! ధర్మజా! అనినన్; విని; అట్లు= అదే విధంగా; చేసెదన్= చేస్తాను; అని; విపులుఁడు= శిష్యుడు; గురునితోడన్= గురువుతో; పర= ఇతరుల, వనితా= స్త్రీ; ఆహరణమునకున్= అపహరించటానికి; అమర= దేవతల; విభుండు= రాజు; ఏ అనువునన్= ఏ ఉపాయంతో; చొచ్చునొకో!= ప్రవేశిస్తాడో కదా!; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: గురువు చెప్పినది విని 'అట్లాగే చేస్తాను. కాని, పరస్త్రీ కొరకు ఇంద్రు డే రూపంలో ఎట్లా ప్రవేశిస్తాడో కదా!' అని అన్నాడయ్యా ధర్మరాజా!

విశేషం: పరవనితా హరణమునకు విటుడు ఎట్లా వస్తాడో బ్రహ్మచారి శిష్యుడి కెట్లా తెలుస్తుంది? అందుకే అట్లా ప్రశ్నించాడు.

క. **అనుటయు ననేక మాయలు, । పొనరుపఁగా నేర్చు రూపములు పెక్కులు గై**
కొను పక్షిమృగాదిత్వము । లొనరఁగ నవి నియతి నరసి యుండఁగ వలయున్. 188

ప్రతిపదార్థం: అనుటయున్= అంటే; అనేక మాయలు= పలు మాయలు; పొనరుపఁగాన్= చేయగా; నేర్చున్= అతడికి తెలుసు; పక్షి మృగ+ఆదిత్వములు= పక్షి జంతువు మొదలైన; రూపములు= రూపాలు; పెక్కులు= అనేకం; కైకొనున్= వేసికొంటాడు; ఒనరఁగన్= చక్కగా; అవి= వాటిని; నియతిన్= శ్రద్ధగా; అరసిఉండఁగన్+వలయున్= జాగ్రత్తగా చూస్తూ ఉండాలి.

తాత్పర్యం: శిష్యు డట్లా అనగానే గురు వన్నాడు. 'అతడు మహామాయావి. పక్షి, మృగాది రూపాలు చక్కగా ధరిస్తాడు. జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉండాలి.

క. రుచి మీఁదం గన్నిడి యా । శచీవిభుఁడు దిరుగు, విను మసంశయము సుమీ!
యిచటికి నాతఁడు వచ్చుట; । యచలితమతి నమ్మృగాక్షి నరయఁగ వలయున్.' 189

ప్రతిపదార్థం: ఆ శచీవిభుఁడు= ఆ ఇంద్రుడు; రుచిమీఁదన్= రుచిపై; కన్ను+ఇడి= కన్నువేసి; తిరుగున్, వినుము; ఇచటికిన్; అతఁడు; వచ్చుట; అసంశయము సుమీ= సందేహం లేదు సుమా!; ఆ+మృగ+అక్షిన్= లేడికన్నుల వంటి కన్నులు కలదానిని; అచలితమతిన్= జారుపాటులేని, ఏమరుపాటులేని మనస్సుతో; అరయఁగన్ వలయున్= నీవు చూస్తూ ఉండాలి.

తాత్పర్యం: రుచిమీద కన్నువేసిన ఆ ఇంద్రుడు తిరుగుతూ ఉంటాడు. కనుక అత డిక్కడకు రావటం తథ్యం. ఆమెను జాగ్రత్తగా చూస్తూ ఉండుము.'

క. అని యప్పగించి యాగం । బున కమ్ముని సనియె; నవ్విపులుఁడును జిత్తం
బున నవధానము దృఢముగ । వనితం గాచికొని యుండె వసుధాధీశా! 190

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; అప్పగించి= ఆమె బాధ్యత నతడిపై పెట్టి; ఆ ముని; యాగంబునకున్= యజ్ఞానికి; చనియెన్= పోయాడు; ఆ విపులుఁడును; చిత్తంబునన్= మనస్సులో; అవధానము= ఏకాగ్రత, జాగ్రత్త; దృఢముగన్= దృఢం కాగా; వసుధా+అధీశా!= రాజా!; వనితన్= రుచిని; కాచికొని= రక్షిస్తూ; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: అని అప్పగించి ముని వెళ్ళిపోగా, జాగ్రత్తగా శిష్యుడు గురుపత్నిని కాచుకొని ఉన్నాడు.

వ. అట్లుండి యొక్క యనువు విచారించుకొని. 191

ప్రతిపదార్థం: అట్లు+ఉండి= అట్లా ఉంటూ; ఒక అనువు= ఒక ఉపాయం; విచారించుకొని= ఆలోచించుకొని.

తాత్పర్యం: అట్లా ఉంటూ ఒక ఉపాయం ఆలోచించుకొని.

క. 'ఆవేశించెద యోగ । ప్రావీణ్యంబున మునీంద్రు భార్యం, దప్పే?
యా విశ్రుతాత్ము మనమున । కీ విజ్ఞానంబు దోఁచునే? వెఱ పేలా?' 192

ప్రతిపదార్థం: యోగప్రావీణ్యంబునన్= యోగశక్తితో; ముని+ఇంద్రు= దేవశర్మ గురువు యొక్క; భార్యన్= పత్నిని; ఆవేశించెదన్= ఆవహించి ఉంటాను; తప్పే?= ఇది తప్పా? కాదు కదా? ఆ విశ్రుత+ఆత్ము= ఆ జ్ఞానమూర్తియైన గురువుగారి; మనమునకున్= మనస్సుకు; ఈ విజ్ఞానంబు= ఈ (నేను చేసిన ఈ విషయానికి సంబంధించిన) తెలివి; తోఁచునే?= స్పష్టమౌతుందా?; వెఱపు= భయం; ఏలా?= దేనికి?

తాత్పర్యం: 'గురుపత్నిని నా యోగశక్తితో ఆవహించి ఉంటాను. మహాజ్ఞాని అయిన గురువుగారి కిది తెలిసే జాడ లేదు కనుక సందేహం లేకుండా ఈ పని చేస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని వితర్కించి యమ్మునిని చాతుర్య కారుణ్యంబు లూఁది శంకదక్కియక్కొమ్మ కింతనంత నాసీనుండై యుచిత కథ లొక్కింతసేపు సెల్లించి, యోగమాయాబలంబునం జేసి నడపుటయు. 193

ప్రతిపదార్థం: వితర్కించి= ముందు వెనుకలు ఆలోచించి; ఆ ముని= గురువు; చాతుర్య కారుణ్యంబులు= నేర్పు, దయ అనుగుణాలను; ఊఁది= ఆధారంగా చేసికొని; శంక= సందేహం; తక్కి= మాని; ఆ కొమ్మకున్= ఆ స్త్రీకి; అంతన్+ఇంతన్ ఆసీనుండై= దగ్గర కూర్చున్నవాడై; ఉచిత= తగిన; కథలు= పురాణగాథలు (సీతాదుల కథలు); ఒక్క+ఇంతసేపు= కొంచెంసేపు; చెల్లించి= గడపి; యోగమాయాబలంబునన్+చేసి= యోగమాయాశక్తితో; నడపుటయున్= ప్రవర్తించగా.

తాత్పర్యం: అని ఆలోచించి తన గురువుయొక్క చాతుర్యం, కారుణ్యం ఆధారంగా చేసికొని సందేహం లేకుండా ఆమె సమీపంలో కూర్చుండి ఒప్పిదాలైన కథలు కొంతసేపు చెప్పి, యోగమాయా బలంతో ప్రవరిస్తూ ఉండగా.

ఆ. పవనుఁ డాకసమునఁ బరఁగు విధంబున । నమ్మృగాక్షి తనువునందుఁ గలయ
విపులు నాత్మ దగఁ బ్రవేశించె నవ్వధూ । రత్నమునకు నెఱుఁగ రాకయుండ. 194

ప్రతిపదార్థం: ఆ+వధూ రత్నమునకున్= శ్రేష్ఠమైన ఆమెకు; ఎఱుఁగన్= తెలియగా; రాక+ఉండన్= వీలులేకుండా; పవనుఁడు= గాలిదేవుడు; ఆకసమునన్= అంతరిక్షంలో; పరఁగు విధంబునన్= తిరిగేటట్లు; విపులుఆత్మ= విపులుడి ఆత్మశక్తి; ఆ మృగ+అక్షి= లేడికన్నులవంటి కనులుగల ఆమె యొక్క; తనువు+అందున్= శరీరంలో; తగన్= చక్కగా; ప్రవేశించెన్= ప్రవేశించింది.

తాత్పర్యం: గాలి ఆకాశంలో వ్యాపించినట్లు ఆ విపులుడి ఆత్మ ఆమె శరీరంలో ఆమెకు తెలియకుండానే ప్రవేశించింది.

విశేషం: అతడి ఆత్మ ఆమెకు తెలియకుండా ఆమె శరీరంలోకి ప్రవేశించటం - అంతరిక్షంలో గాలి తిరగటంవలె అన్న పోలికవలన ఆత్మ పదార్థం గాలివలె కనిపించేది కాదు, కాని ఉన్నదని తెలుస్తుంది. అనుభవాని కందుతుంది.

ఈ విషయం ఆధునిక పరిశోధనలలోనూ స్పష్టపడింది. దయ్యం పట్టిందనటానికి గాలి సోకిందనటం అందరకూ తెలిసిందే.

వ. ఇట్లు ప్రవేశించి యయ్యోగివరునాత్మ యన్నాతి చైతన్యంబు జడంబుగాఁ జేసికొని యుండె; అట్టియెడం బురందరుం డతిసుందరం బగు నాకారంబు దాల్చి యచ్చటికి వచ్చి విపులుని శరీరంబు సూచి నిద్రితునింగాఁ దలఁచుచు నున్మదుండగుటం జేసి యొండు పరికింపక మునిపత్నిం జేరవచ్చి. 195

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ప్రవేశించి= చొచ్చి; ఆ యోగివరుఆత్మ= ఆ యోగిశ్రేష్ఠుడి ఆత్మ; ఆ నాతి= ఆ స్త్రీ; చైతన్యంబు= జీవాత్మను; జడంబుగాన్= చైతన్యంబు లేకుండా; చేసికొని ఉండెన్= చేసికొని ఉన్నాడు; అట్టి ఎడన్= ఆ సమయంలో; పురందరుండు= ఇంద్రుడు; అతి= మిక్కిలి; సుందరంబు+అగు= అందమైన; ఆకారంబు= రూపం; తాల్చి= ధరించి; అచ్చటికిన్= అక్కడకు; వచ్చి; విపులుని శరీరంబు= దేహం; చూచి; నిద్రితునిన్+కాన్= నిద్రపోయినవాడిగా; తలఁచుచున్= భావిస్తూ; ఉన్మదుండు= మిక్కిలి మదించినవాడు; అగుటన్+చేసి= అయినందువలన; ఒండు= ఇంకొకటి; పరికింపక= చూడక; మునిపత్నిన్= ముని భార్యను; చేరవచ్చి= సమీపించి.

తాత్పర్యం: ఈ విధంగా ప్రవేశించి ఆ యోగివరుడి ఆత్మ ఆమె చైతన్యాన్ని జడంగా చేసింది. అప్పుడు ఇంద్రుడు సుందరమైన రూపం ధరించి అక్కడకు వచ్చి విపులుడి శరీరాన్ని చూచి, నిద్రపోతున్నాడని తలచి కామంతో కన్ను కాననివాడు కాబట్టి మునిభార్యను సమీపించి.

క. 'నీవు కతంబుగ నాదగు । భావంబును భావభవుఁడు పఱచుట యరయం
గావలదే; యని పలికిన, । భూవర! యప్పొలఁతి మూఢబుద్ధిత్వమునన్. 196

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; నీవు కతంబుగన్= నీవలన; నాదగు భావంబును= నా మనస్సును; భావభవుఁడు= మన్మథుడు; పఱచుట= బాధలపాలుచేయటం; అరయన్+కాన్ వలదే= విచారించాలి కదా; అని; పలికినన్= అంటే; ఆ పొలఁతి= ఆ స్త్రీ; మూఢ= జడమైన; బుద్ధిత్వమునన్= బుద్ధికలదైనందువలన.

తాత్పర్యం: ఇంద్రు డామెతో అన్నాడు. 'నీ వలన నా మనస్సును మన్మథుడే కలత పెట్టుతున్నాడు. నీవు కొంచెమైనా ఆలోచించాలి కదా!' అని అనగా రాజా! ఆమె బుద్ధి చైతన్యం కోల్పోయినందువలన.

క. సముచితముగఁ బ్రతుత్థా । నము సేయను, దగిన పలుకునకుఁ జొరఁగను నే
రమి నూరకున్ననుం దమ । కము పెంపున నతఁడు మఱియుఁ గమలాననతోన్. 197

ప్రతిపదార్థం: సముచితముగన్= తగిన విధంగా; ప్రతి+ఉత్థానము= ఎదురుగా లేచి వెళ్ళటం (ఆహ్వానించటానికి); చేయను= చేయటానికి; తగిన; పలుకునకున్= మాటలకు; చొరఁగను= పూనుకొనటానికి గాని; నేరమిన్= తెలియక; ఊరకున్ననున్= కదలకుండా ఉండగా; తమకము= కోర్కెయొక్క; పెంపునన్= అతిశయంతో; అతఁడు= ఇంద్రుడు; మఱియున్= ఇంకా; కమల= తామరవంటి; ఆననతోన్= ముఖంకలదానితో.

తాత్పర్యం: తగినరీతిగా ఆహ్వానించటానికి లేచి ఎదురు పోవటంగానీ, తగినట్లుగా మాట్లాడటంగానీ, చేయకుండా ఉండగా ఇంద్రుడు కోరికతో ఇంకా ఆ పద్మముఖితో ఇట్లా అంటున్నాడు.

విశేషం: మునిపత్నిపేరు రుచి (కాంతి - లావణ్యం) కనుక ప్రతిపద్యంలో కవి దాన్ని సూచిస్తూ విశేషణాలు వాడటం గమనించాలి. (కమలానన - వలె)

క. ' ఏ నమరేంద్రుఁడ నాదగు । మానముఁ గామశిఖి గ్రాఁచె; మానిని! దడయం
గా నేల? నన్నుఁ దగ స । మ్మానింపుము; నీకు సిగ్గు మా టింకేలా?' 198

ప్రతిపదార్థం: ఏను= నేను; అమర= దేవతలకు; ఇంద్రుఁడన్= రాజును; నాదగుమానమున్= నా గౌరవం; కామశిఖి= కామాగ్ని; క్రాఁచెన్= తప్తం చేశాడు; మానిని!= మానంగల దానా!; తడయంగాన్+ఏల?= ఆలస్యం దేనికి?; నన్నున్; తగన్= చక్కగా; సమ్మానింపుము= గౌరవించుము; నీకున్, సిగ్గుమాట= సిగ్గు విషయం; ఇంకన్= ఇంకా; ఏలా?= దేనికి?

తాత్పర్యం: నేను దేవతల రాజును. నా గౌరవాన్ని కామాగ్ని కాల్చి వేస్తున్నాడు. ఆలస్యం దేనికి? మానినీ? నన్ను తగ్గట్లు గౌరవించుము. నీకు ఇంక సిగ్గుతో పని లేదు.'

వ. అనుటయు నత్తన్వి తనువున నున్న విపులుండు దన యోగమాయం జేసి యవ్వనిత వాసవునితో 'నీకు నిందు రాఁ బనియేమి?' యనిపలికి పరవశ యగునట్లుగాఁ జేసినం జూచి యతండు వ్రీడా భయభరిత చిత్తుండయ్యెఁ; నయ్యవసరంబున. 199

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+తన్వి= ఆ స్త్రీ యొక్క; తనువునన్= శరీరంలో ఉన్న; విపులుండు; తన; యోగమాయన్+ చేసి= యోగశక్తితో; ఆ+వనిత= ఆ స్త్రీ; వాసవునితోన్= ఇంద్రునితో; నీకున్, ఇందున్= ఇక్కడకు; రాన్= రావటానికి; పనియేమి?= ఏం పని? అనిపలికి; పరవశఅగునట్లుగాన్= సొమ్మసిల్లిపోయేటట్లుగా; చేసినన్= చేయగా; చూచి; అతండు= ఇంద్రుడు; వ్రీడా= సిగ్గుతో; భయ= భయంతో; భరిత= నిండిన; చిత్తుండు= మనస్సు కలవాడు; అయ్యెన్= అయ్యాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అనటంతోనే ఆమె శరీరంలో ఉన్న విపులుడు తన యోగశక్తితో ఆమె వాసవుడితో 'నీ విక్కడకు రావలసిన పనేమి'టని అనిపించి ఆమెను సొమ్మసిల్లి పడిపోయేటట్లు చేయగా చూచి ఇంద్రుడు సిగ్గుపడ్డాడు. భయపడ్డాడు. అప్పుడు.

ఉ. అమ్మునిశిష్యుఁ డయ్యువిద యంగము వాసి, నిజాంగవర్తియై
యమ్మరుదీశుతో 'మఱచితా మును మూఁడిన యబ్భగాంకిత
త్వ మ్మొకభంగి నీఁగు టిది, దైవతసంయమి సేవనీయ భా
వమ్ము గలట్టి నీకుఁ దగవా? యిసిరో! యని పల్కి వెండియున్. 200

ప్రతిపదార్థం: ఆ+ముని శిష్యుఁడు= ఆ ముని శిష్యుడు విపులుడు; ఆ+ఉవిద= ఆమె; అంగము= శరీరం; వాసి= వదలి; నిజ= తనయొక్క; అంగవర్తిఐ= శరీరంలోకి ప్రవేశించి; ఆ+మరుత్+ఈశుతోన్= ఆ దేవరాజుతో; మఱచితా?= మరిచిపోయినావా? మును= పూర్వం; మూఁడిన= సంప్రాప్తమైన; ఆ+భగాంకితత్వమ్ము= ఆ యోని గుర్తులు కలగటం; ఒక భంగిన్= ఒక రీతిగా; ఈఁగుట= పోగొట్టుకొనటం; ఇది= ఈ పని; దైవత సంయమి= దేవమునులచే; సేవనీయ భావమ్ము= సేవింపదగిన మనస్సు కల; అట్టి= కలిగినట్టి; నీకున్; తగవా?= న్యాయమేనా? ; ఇసిరో= ఛీ ఛీ; అని పల్కి; వెండియున్= మరలా.

తాత్పర్యం: ఆ విపులుడు గురుపత్ని శరీరంనుండి బయటకువచ్చి తన శరీరంలో ప్రవేశించి ఇంద్రుడితో ఇట్లా అన్నాడు. 'నీకు పూర్వం మునిశాపవశాత్తు సంక్రమించిన యోనిగుర్తులన్నీ ఎట్లాగో దేవముని సేవవలన పోగొట్టుకొన్నావు కదా! అట్లాంటి నీ కిది ధర్మమా?' అని ఇంకా.

తే. 'అవిజితేంద్రియబల! కుత్సితాత్మ। నీచ!, యెట్లు పాపంబు దొడరుట కియ్యకొంటి?
నాదు గురుని కోపాగ్నిచే నీదుదేవ। గణ విభుత్వ మహోన్నతి గ్రాఁగి పోదె?' 201

ప్రతిపదార్థం: న+విజిత= చక్కగా జయించబడని; ఇంద్రియ= అవయవాలయొక్క (కన్ను మొ॥) బల!= బలం కలవాడా!; కుత్సిత= కుచ్చితమైన; ఆత్మ= బుద్ధికలవాడా!; నీచ!= నీచుడా! (అధముడు); ఎట్లు= ఏ విధంగా; పాపంబు= పాపం; తొడరుటకున్= చేయటానికి; ఇయ్యకొంటి?= అంగీకరించావు?; నాదు= నా; గురుని కోప+అగ్నిచేన్= గురువుగారి కోపమన్న నిప్పుతో; నీదు= నీ; దేవగణ= దేవతా సమూహము యొక్క; విభుత్వ మహోన్నతి= రాచరికపు ఐశ్వర్యం; క్రాఁగిపోదె= నశించదా.

తాత్పర్యం: 'ఇంద్రియాలను అదుపులో పెట్టుకోలేనివాడా! అసహ్యమైన బుద్ధికలవాడా! నీచుడా! పాపం చేయటానికి ఎట్లా పూనుకొన్నావు? నీ దేవేంద్ర పదవి నా గురుకోపాగ్నికి బలి కాగలదు. జాగ్రత్త!

వ. అనిన విని దివ్యబోధంబును విపులుని యోగ బలంబు తెఱం గెఱింగి వెలవెలం బాఱు నబ్బలవైరి నాలోకించి యత్తపోధనుండు. 202

ప్రతిపదార్థం: అనినన్ విని= అని విపులుడు పల్కగా ఆలకించి; దివ్య= దేవతా సంబంధమైన; బోధంబునన్= జ్ఞానంతో; విపులుని; యోగబలంబు; తెఱంగు= సంగతి; ఎఱింగి= తెలిసి; వెలవెలన్పాఱు= భయంతో తెల్లబడు; ఆ+బలవైరిన్= బలుడనే రాక్షసుడిని చంపినవాడిని - ఇంద్రుడిని; ఆలోకించి= చూచి; ఆ తపోధనుండు= తపస్సే సంపదగా కల విపులుడు,

తాత్పర్యం: దివ్య జ్ఞానంతో ఇంద్రుడు విపులుడి యోగబలం తెలిసికొని భయంతో వెలవెల పోగా ఆ బలారిని చూచి విపులుడు.

క. 'ఏ నొల్లఁ గాక! భస్మము । గా, నిన్నుం జూతునే వికారీ!' యనుడుం
దా నెదురు పలుక కంత । ర్ధానము వెసఁ జేసె నతఁడు ధరణీనాథా! 203

ప్రతిపదార్థం: ఏను; ఒల్లన్+కాక= అంగీకరించను తప్ప; నిన్నున్; భస్మముకాన్= బూడిద అయ్యేటట్లుగా; చూతునే= చూడగలను కదా!; వికారీ!= వికారపు బుద్ధికలవాడా! అనుడున్= అనగా; తాను= ఇంద్రుడు; ఎదురు పలుకక= సమాధానం చెప్పక; అతఁడు= ఇంద్రుడు; అంతర్ధానమున్= అదృశ్యమగుటను; వెసన్= వెంటనే; చేసెన్= చేశాడు; ధరణీనాథా!= రాజా!

తాత్పర్యం: 'నా కిష్టంలేదు. లేకున్న నిన్ను భస్మంచేయనా? వికారపు బుద్ధి కలవాడా! అనగా ఏమీ మాటడలేక వెంటనే ఇంద్రుడు అంతర్ధానమైపోయాడు.

వ. తదనంతరంబ విపులుండు రుచిం బ్రబుద్ధం జేసి పదంపడి దేవశర్మ వచ్చిన నా శిష్యోత్తముండు వినయాచారంబు నడపి యేకాంతంబున నమ్మునితోడ. 204

ప్రతిపదార్థం: తత్+అనంతరంబు+అ= అటు తరువాత; విపులుండు; రుచిన్= ముని పత్నిని; ప్రబుద్ధన్+చేసి= జాగ్రద్దశకు తెచ్చి (లేపి); పదంపడి= పిదప; దేవశర్మ= గురువు; వచ్చినన్= రాగా; ఆ శిష్య+ఉత్తముండు= ఆ గొప్ప శిష్యుడు; వినయ+ఆచారంబు= వినయంగా గురువుకు చేయవలసిన సేవ; నడపి= చేసి; ఏకాంతంబునన్= ఒంటరిగా ఉన్నప్పుడు; ఆ మునితోడన్= గురువుతో.

తాత్పర్యం: తరువాత విపులుడు రుచిని జాగ్రత్స్థితికి తెచ్చి తరువాత గురువుగారు రాగానే వినయంతో నమస్కరించి ఏకాంతంలో.

తే. 'నాకపతి యిచ్చటికి వచ్చి, నాకతమునఁ । జిక్కువడి, మది భయమున సిగ్గు గదురఁ
జనియె' ననవుడు నాతఁడు సంతసిల్లి । యభిమతం బగు వరమిచ్చె నధిపవర్య! 205

ప్రతిపదార్థం: అధిపవర్య!= రాజశ్రేష్ఠుడా! నాకపతి= స్వర్గరాజు; ఇచ్చటికిన్= మన ఇంటికి; వచ్చి; నాకతమునన్= నావలన; చిక్కువడి= చిక్కులలోపడి, ఇబ్బందిపడి; మదిన్= మనస్సులో; భయమునన్= భయంతో; సిగ్గు; కదురన్= కలుగగా,

వ్యాపించగా; చనియెన్= వెళ్ళిపోయాడు; అనవుడున్= అనగా; ఆతఁడు= గురువు; సంతసిల్లి= సంతోషించి; అభిమతంబు+అగు= ఇష్టమైన; వరము+ఇచ్చెన్= వరమిచ్చాడు.

తాత్పర్యం: రాజా! శిష్యు డిట్లా చెప్పాడు. 'దేవరాజు ఇక్కడకు వచ్చి నావలన చిక్కుపడి భయంతో సిగ్గుతో వెళ్ళిపోయాడు' అని చెప్పగా గురువు సంతోషించి ఇష్టమైన వరా లిచ్చాడు.

వ. ఇచ్చినం బ్రీతుండై యవ్విపులుండు విపుల తపం బాచరించె; దేవశర్మయు దేవేంద్రుని వలని శంక దక్కి సుఖంబుండె; ఒక్కనాఁడయ్యాశ్రమంబు చక్కటి చదల దేవాంగన యొర్తు వోవ దాని చేతినుండి ప్రిదిలి భూరి పుష్పదామంబు. 206

ప్రతిపదార్థం: ఇచ్చినన్= ఇస్తే; ఆ+విపులుండు= ఆ విపులుడు; ప్రీతుండు+ఐ= సంతోషించి; విపులతపంబు= విస్తారమైన తపస్సు; ఆచరించెన్= చేశాడు; దేవశర్మయున్= మునికూడా; దేవ+ఇంద్రునివలని= దేవతలరాజునుండి; శంక= భయాన్ని; తక్కి= వదలి; సుఖంబు+ఉండెన్= సుఖంగా ఉన్నాడు; ఒక్కనాఁడు= ఒకరోజున; ఆ+ఆశ్రమంబు= ఆ ఆశ్రమంయొక్క; చక్కటి= నడినెత్తిపైన; చదలన్= ఆకాశంనుండి; దేవ+అంగన= దేవతా స్త్రీ; ఒర్తు= ఒకతె; పోవన్= పోగా; దానిచేతినుండి; ప్రిదిలి= జారి; భూరి= పెద్ద; పుష్ప= పూల; దామంబు= దండ. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: గురువు వరమిస్తే సంతోషించి శిష్యుడు గొప్ప తపస్సు చేశాడు. దేవశర్మకు దేవేంద్రుడినుండి ఇక ఏమీ ఆపదరాదని సుఖంగా ఉన్నాడు. ఇంతలో ఒకరోజున నడినెత్తిపైన ఆకాశంనుండి దేవతాస్త్రీ చేతిలో ఉన్న పూలదండ జారిపడింది.

ఆ. దివ్య పరిమళంబు, నవ్య వికాసంబు । నుల్లసిల్ల వచ్చి యుర్విఁ బడినఁ
గాంచి రుచి యుదీర్ణ కౌతుకచిత్తయై । దానిఁ బుచ్చికొనియె మానవేంద్ర! 207

ప్రతిపదార్థం: మానవ+ఇంద్ర!= మానవులకు ప్రభూ!; దివ్య పరిమళంబు= స్వర్గలోకంలోని వాసన; నవ్య= అపూర్వమైన; వికాసంబున్= కాంతి; ఉల్లసిల్లన్= వెదజల్లుతూ; వచ్చి; ఉర్విన్= భూమిమీద; పడినన్= పడగా; కాంచి= చూచి; రుచి; ఉదీర్ణ= అతిశయమైన; కౌతుక= కుతూహలం కల; చిత్తయై= మనస్సు కలదై; దానిన్= దండను; పుచ్చికొనియెన్= తీసికొన్నది.

తాత్పర్యం: రాజా! దివ్యమైన పరిమళం, నవ్యకాంతి కల ఆ పూలదండను భూమిమీదనుండి రుచి తీసుకొన్నది.

వ. తదవసరంబున వంగాధీశ్వరుం డగు చిత్రరథుం డయ్యాశ్రమంబున కరుగుదెంచె; అతనిదేవియు రుచియుఁ దోడంబుట్టువు లగుటంజేసి నిజగృహంబునం గలిగిన యుత్సవంబున కతండు రుచి సహితంబుగా దేవశర్మఁ బ్రార్థించి పిలిచినఁ జంపానగరంబున కరుగుచుండి రుచి గైసేసి యద్దివ్య కుసుమ దామంబునం గేశకలాపం బలంకరించుకొనినం దత్సమాగమ సమాచారంబు నడపి తద్భగిని తదీయ కుసుమ పరిమళంబున కచ్చెరువంది. 208

ప్రతిపదార్థం: తత్+అవసరంబునన్= ఆ సమయంలో; వంగ+అధీశ్వరుండు= వంగదేశానికి రాజు (వంగ= నేటి బెంగాల్); చిత్రరథుండు= అద్భుతమైన రథంగలవాడు, సూర్యునకు చిత్రరథస్వామి అనే పేరుంది; ఆ+ఆశ్రమంబునకున్; అరుగుదెంచెన్=

వచ్చాడు; అతని దేవియున్= అతడి భార్యా; రుచియున్= రుచీ; తోడంబుట్టువులు= ఒకే కడుపున పుట్టినవారు; అగుటన్+చేసి= అయినందువలన; నిజ= తన; గృహంబునన్= ఇంట్లో; కలిగిన= వచ్చిన; ఉత్సవంబునకున్= పండుగకు; అతండు= చిత్రరథుండు; రుచిసహితంబుగాన్= భార్యతోపాటుగా; దేవశర్మన్= దేవశర్మను; ప్రార్థించి= చక్కగా వేడికొని; పిలిచినన్= ఆహ్వానిస్తే; చంపా నగరంబునకున్= ఆ పేరుగల పట్టణానికి; అరుగుచుండి= పోతూ; రుచి; కైసేసి= అలంకరించుకొని; ఆ+దివ్య కుసుమ దామంబునన్= ఆ దేవతల పూలదండతో; కేశకలాపంబున్= జడముడిని; అలంకరించుకొనినన్= అలంకరించుకొనగా; తత్= వారి; సమాగమ= రాకకు చెందిన; సమాచారంబున్= విషయాన్ని; నడపి= ప్రవర్తింపజేసి; తత్+భగిని= రుచి సోదరి; తదీయ= ఆ; కుసుమ= పూల; పరిమళంబునకున్= వాసనకు; అచ్చెరువు+అంది= ఆశ్చర్యపడి.

తాత్పర్యం: ఆ సమయంలో వంగదేశపురాజు చిత్రరథుడనేవాడు భార్యతోసహా దేవవర్మ ఆశ్రమానికి వచ్చి తన భార్య - రుచి అక్కా చెల్లెళ్ళు కావటం వలన తమ ఇంట్లో ఒక ఉత్సవానికి రమ్మని దేవశర్మను అతని భార్యను ప్రార్థించగా చంపానగరానికి వారూ వెళ్ళారు. ఆ వెళ్ళేటప్పుడు రుచి తనకు దొరికిన పూలదండ నలంకరించుకొని పోయింది. ఆ పూలవాసన చూచి ఆమె సోదరి ఆశ్చర్యపడి.

విశేషం: ఆ దండ దొరికినరోజే సోదరి రావటం తటస్థించింది. ఇది కథలో స్పష్టంగా లేదు. లేదా ఆ పూలదండ దివ్యమైనది కనుక వాడిపోవటం, పరువం తప్పటం జరగనిదనీ అనుకొనవచ్చు.

ఆ. 'ఇట్టి సౌరభంబు నెన్నఁడు నెఱుఁగ; ని। ప్పువ్వు లెచటఁ గలిగెఁ బువ్వుఁబోఁడి!
యనినఁ 'గలిగె నస్మదాశ్రమంబున' నని। పలికి, దేవశర్మ పాలి కరిగి. 209

ప్రతిపదార్థం: ఇట్టి= ఇట్లాంటి; సౌరభంబున్= వాసనను; ఎన్నఁడున్= ఎప్పుడూ; ఎఱుఁగన్= తెలియను; ~~ఈ~~+పువ్వులు= ~~ఈ~~ పుష్పాలు; ఎచటన్= ఎక్కడ; కలిగెన్= పూచాయి; పువ్వుబోఁడి= పూవువంటి మేనుగలదానా!; (పువ్వు+పోఁడిమి= పూలమెత్తదనంకల స్త్రీని పువ్వుబోఁడి అంటారు;) అనినన్= అంటే; అస్మత్= మా; ఆశ్రమంబునన్= ఆశ్రమంలో; కలిగెన్= పూచినవి; అని పలికి; దేవశర్మ పాలికిన్= దేవశర్మ దగ్గరకు; అరిగి= వెళ్ళి. (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: 'ఇట్లాంటి వాసనగల పూలను ఎప్పుడూ చూడలేదు. ఇవి ఎక్కడివి? అని అడుగగా మా ఆశ్రమంలో ఉన్నా' యని చెల్లెలికి చెప్పి రుచి భర్త దగ్గరకు వెళ్ళి.

వ. రుచి యప్పువ్వులకుం దన చెలియలు వేడుక పడుట యెఱింగించిన, నమ్మహానుభావుండు విపులుని రావించి యత్తెఱంగు దేట వడం బలికి 'యిట్టి కుసుమంబులు గొనిరావలయు' నని పలికిన నతం దప్పువ్వులు గనిన చోటు రుచి నడిగి చెప్పించుకొని గురుప్రభావంబును నిజతపశ్శక్తియు నూఁది యప్పనిపూని చనియె; దైవికంబయి యచ్చట నెప్పటి చందంబు పుష్ప దామంబున్నం బుచ్చికొని వచ్చునప్పు డొక్కయెడ నారీ పురుషలొండొరుల చెట్టలు వట్టికొని చక్రభ్రమణభంగిఁ దిరుగుచుండి యొకళ్ళొకళ్ళగతి యొప్పదని పలికి కాలుదొడరితి, కడువేగ తిరిగి తని వివాదంబు పుట్టి యందొకం డేనట్లు సేసితినేనిం బరలోకంబున విపులుని చన్నగతికిం జనుదునని శపథంబు సేసిన, నమ్మాట వినుచు విపులుండు అట సనంజన మఱియు మార్గంబున నార్వురు జూదంబాడుచుండ వాదైన యొకం డట్ల యొట్టిడిన నప్పలుకు నాకర్ణించి యత్తపోధనుండు

చిత్తంబున విషాదంబు గదుర నేమి దోషంబు సేసితి నొకో!' యని విచారించి రుచి శరీరంబునందుఁ బ్రవేశించుట గురునకు నెఱింగింపమి గానోపునని తలంచుచు నరుగుదెంచి యక్కుసుమ మాలిక యొప్పించినం గైకొని యమ్మునివరుండు మఱఁదలి కొసంగి సంతోషం బొలయించెఁ, దదనంతరంబ తమయంతనున్న యవసరంబున నగ్గురుం డా శిష్యునితో నిట్లనియె. 210

ప్రతిపదార్థం: రుచి; ఆ+పువ్వులకున్= ఆ పుష్పాలకు; తన చెలియలు= తన చెల్లెలు; వేడుకపడుట= ముచ్చటపడుట; ఎఱింగించినన్= తెలుపగా; ఆ+మహా+అనుభావుండు= గొప్పవ్యక్తిత్వంగల దేవశర్మ; విపులునిన్; రావించి= పిలిపించి; ఆ+తెఱంగు= ఆ విషయం; తేటపడన్= స్పష్టంగా; పలికి= చెప్పి; ఇట్టి కుసుమంబులు= ఇలాంటి పూలు; కొనిరావలయున్= తప్పకతీసికొని రావాలి; అనిపలికినన్; అతండు= విపులుడు; ఆ+పువ్వులు; కనినచోటు= చూచిన ప్రదేశం; చెప్పించుకొని= రుచి చెప్పగా తెలిసికొని; గురు ప్రభావంబును= గురుని మాహాత్మ్యం; నిజ= తన; తపః+శక్తియున్= యోగబలం; ఊఁది= ఆధారంగా గ్రహించి; ఆ+పనిపూని= ఆ పనికై ఉద్యమించి, ఆ పనిచేయుటకు అంగీకరించి; చనియెన్= పోయాడు; దైవికంబు+అయి= అదృష్టవశాత్తు; అచ్చటన్= ఆ ప్రదేశంలో; ఎప్పటిచందంబు= ఎప్పటివలెనే; పుష్ప= పూల; దామంబు= దండ; ఉన్నన్= ఉండగా; పుచ్చికొని వచ్చునప్పుడు; ఒక్క+ఎడన్; నారీ పురుషులు= స్త్రీ పురుషులు; ఒండు+ఒరుల= ఒకరినొకరు; చెట్టలు పట్టుకొని= చేతి దండలు పుచ్చుకొని; చక్ర భ్రమణ భంగిన్= రథచక్రం తిరిగేటట్లు; తిరుగుచున్+ఉండి= తిరుగుతూ; ఒకళ్ళు= ఒకరు; ఒకళ్ళ= మరొకరి; గతి= ఆట, పద్ధతి; ఒప్పదు= సరికాదు; అనిపలికి; కాలు+తొడరితి= కాలుపెట్టావు; కడున్+వేగ= మిక్కిలివేగంగా; తిరిగితి(వి)= తిరిగావు; అని; వివాదంబు= వాదం, తగవులాట; పుట్టి= కలిగి; అందున్= వారిద్దరిలో; ఒకండు= ఒకడు; ఏను+అట్లు+చేసితిన్+ఏనిన్= ఆ విధంగా నేను చేసినట్లయితే; విపులునిచన్న గతికిన్= విపులుడు పోయిన స్థితికి; చనుదును+అని= పోతానని; శపథంబు= ప్రతిజ్ఞ; చేసినన్; ఆ+మాట; వినుచున్= ఆలించుచు; విపులుండు; అట= అక్కడ; చనన్+చనన్= పోగా పోగా; మఱియున్= ఇంకా; మార్గంబునన్= దారిలో; ఆర్వురు= ఆరుగురు; జూదంబు+ఆడుచున్+ఉండన్; వాదు= తగవు; ఐనన్= ఏర్పడగా; ఒకండు; అట్లు+అ= పై విధంగానే; ఒట్టు+ఇడినన్= ఒట్టుపెట్టగా; ఆ+పలుకు= ఆ మాట; ఆకర్ణించి= విని; ఆ+తపోధనుండు= ఆ యోగి, (విపులుడు) చిత్తంబునన్= మనస్సులో; విషాదంబు= దుఃఖం; కదురన్= కలుగగా; ఏమిదోషంబు= ఏమితప్పు; చేసితిన్+ఒకో= చేశానోకదా! అని విచారించి= అని ఆలోచించి; రుచి శరీరంబు+అందున్+ప్రవేశించుట; గురునకున్; ఎఱింగింపను= చెప్పక పోవటం; కానోపు= కావచ్చు; అనితలంచుచున్; అరుగుదెంచి= వచ్చి; ఆ+కుసుమమాలిక= ఆ పూలదండను; ఒప్పించినన్= ఇవ్వగా; కైకొని= తీసికొని; ఆ+మునివరుండు; మఱఁదలికిన్+ఒసంగి= భార్యచెల్లెలికిచ్చి; సంతోషంబు; ఒలయించెన్= కల్గించాడు; తత్+అనంతరంబు+అ= ఆ తర్వాత; తమ+అంతన్+ఉన్న= ఏకాంతంగా ఉన్న; అవసరంబునన్= వేళలో; ఆ+గురుండు; ఆ శిష్యునితోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: రుచి తన చెల్లెలి కా పువ్వులు కావాలని చెప్పగా, ఆయన విపులుడితో పూలు తెమ్మని చెప్పాడు. అతడు రుచి నడిగి ఆ పూ లెక్కడ దొరుకుతాయో తెలిసికొని అక్కడకు వెళ్ళాడు. దైవికంగా ఆ పూలదండ అక్కడ కన్పించింది. అది తీసికొని వస్తూ ఉండగా దారిలో ఒక జంట నాట్యం చేస్తూ ఒకరు వేసిన అడుగు మరొకరు తప్పంటే - కాదంటూ వాదాడుకోగా, వారిలో ఒకరు నేను తప్పు చేస్తే విపులుడు పోయేగతికి పోతానని శపథం చేశాడు. విపులు డది వింటూ ముందుకు సాగిపోయాడు. దారిలో ఆరుగురు జూదమాడుకొంటూ ఉండగా వారిలో వారికి వాదు కలిగింది. అందులో ఒకడు పై రీతిగానే ఒట్టు పెట్టుకొనటం విపులుడు విన్నాడు. 'విని నే నేమి తప్పు చేశానో అనుకొంటూ వచ్చి గురువుగారికి దండ నప్పగించాడు. గురువు తన మరదలికి ఆ దండ నిచ్చి సంతోషపెట్టాడు. గురువు ఏకాంతంగా ఉండగా శిష్యుడితో ఇట్లా అన్నాడు.

క. 'తెరువున నొక మిథునము, జూ । దరులను గనుఁగొంటి, నీ వధర్మము నీయం
దరసి కనిన వారై పలి । కిరి వారల నెఱుఁగుదే యకిల్బిషచరితా! 211

ప్రతిపదార్థం: అకిల్బిష చరితా!= పాపంలేని నడవడి కలవాడా!; తెరువునన్= మార్గంలో; నీవు; ఒక; మిథునము= జంట, భార్యా భర్తలు; జూదరులను= జూదమాడే వారిని; కనుఁగొంటి= చూచావు కదా; అధర్మము= ధర్యవ్యతిరేకత; నీయందున్= నీలో; అరసి= విచారించి; కనిన వారు+ఐ= చూచిన వారై; పలికిరి= అన్నారు; వారలన్= వా రెవ్వరో; ఎఱుఁగుదే?= తెలుసా?

తాత్పర్యం: పాపం లేనివాడా! నీ వచ్చే దారిలో ఒకజంట, ఆరుగురు జూదరులు కనిపించారు కదా! నీపై అధర్మాన్ని ఆరోపించారే - వా రెవరో తెలిసికొన్నావా?

విశేషం: తిక్కన్నగారు వాడే సంబోధనలు చాలా అర్థవంతంగా ఉంటాయి. అవి కథను, పాత్రను, వారితత్త్వాన్ని, ఆలోచనలను బోధించేవిగా వాడటమే అర్థవంతంగా ఉండటమంటే. కథారంభంనుండి విపులుడికి వాడిన విశేషణాలు.

183. 'వికసన్మతి' - ఇది మొదటి సంబోధన. కథ మొదలు కాబోతూ ఉండగా వాడిన ఈ సంబోధన కథలో అతడెంత పవిత్రంగా, పరిపక్వ బుద్ధిఅయి ప్రవర్తించేదీ సూచించేదిగా ప్రయోగించబడింది.

186. 'దృఢావధాన!' - మంచి కట్టుదిట్టమైన జాగ్రత్త కలవాడా! తన భార్య నెట్లా రక్షించాలో ఈ సంబోధనమే చెప్పుతున్నది. తరువాత కథలో అత డెలా రక్షించాడో మనకు తెలిసింది.

201. ఇంద్రుడిని నిందిస్తూ విపులుడు వాడిన మాటలు. అవిజితేంద్రియబల - జితేంద్రియుడని వాడటం తప్ప ఇట్లా లేదు. ఇంద్రుడి బలమంతా ఏమిటి? కామాదుల ప్రేరణకు లోబడి యథేచ్ఛగా ప్రవర్తించటం, విచ్చలవిడితనమే వాడి బలం. ఇంద్రుడంటే - ఇంద్రియాలపై అజమాయిషీ చేసే దేవుడని అర్థం కనుక. ఈ సంబోధన చాలా అర్థవంతం. మనిషికూడా ఇంద్రియాలకు లోబడిపోవటానికే కారణం ఇంద్రియాధిదేవత అయినవాడే వాటికి లోబడి పోతున్నాడు కనుక మనిషి లెక్కేమిటని అర్థం. కనుకనే ఇంద్రజాల మన్నమాట పుట్టింది. ఇంద్రుడు మనపై వేసిన వల. ఇంద్రియాలకు లోబడటమే వలలో పడటం.

211. అకిల్బిష చరితా! - పై 210 వచనంలో విపులుడు మనస్సులో బాధపడటం చెప్పబడింది. నావలన ఏ తప్పు జరిగిందో అని. దానిని తీసివేయటానికి అకిల్బిషచరితా అనే ఈ సంబోధన ఉపయోగించబడింది.

తే. నీవు రుచిఁ గాచు నప్పటి నిపుణ వృత్తి । నాకు నెఱిఁగింపకునికి యన్యాయముగఁ ద
లంచిరో? లేక దానిఁ గల్మషము గాఁగ । నేను దలఁచిన శాప మీ నెట్లు నీకు? 212

ప్రతిపదార్థం: నీవు; రుచిన్; కాచు= రక్షించు; అప్పటి= వేళ; నిపుణవృత్తిన్= నైపుణ్యంతో - నేర్పుతో; నాకున్; ఎఱిఁగింపక+ ఉనికి= తెలుపకపోవటం; అన్యాయముగన్= న్యాయం కాదని; తలంచిరో?= అనుకొన్నట్లున్నారేమో! లేక; దానిన్= నీవు చేసిన పనిని; నేను; కల్మషముకాఁగన్= పాపమని; తలఁచినన్= అనుకొంటే; నీకున్; ఎట్లున్= ఏ విధంగానైనా సరే; శాపమున్= శాపాన్ని; ఈను= ఇవ్వను (ఇచ్చేవాడినే).

తాత్పర్యం: నీవు నైపుణ్యంతో రుచిని రక్షించిన విధానం (ఆమె శరీరంలో ప్రవేశించటం) నాకు చెప్పకపోవటం అన్యాయ మనుకొని ఉంటారు వారు. కాని, అది పాపమైతే నీకు ఎట్లాగైనా సరే శాప మిచ్చి ఉండేవాడినే కదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: న్యాయం - సాంఘిక ధర్మం - దానిని ఉల్లంఘించడం అన్యాయం.

ధర్మం : సకల ప్రపంచానికీ, భగవంతుడికీ, తనకూ ఉన్న సంబంధం. ఇది ఆత్మ ధర్మం.

కనుకనే సామాజిక ధర్మం యొక్క ఉల్లంఘనం - తాను గురు భార్యా శరీరంలో ప్రవేశించిన విషయం గురువుగారికి చెప్పకపోవటం - చేయటం. కానీ ఆత్మ ధర్మోల్లంఘనం కాదు. కాబట్టి పాపం లేదు. ఇందుకని కవి 'కల్మషముగాఁగ' - గురువనుకోలేదు.

వ. అప్పని పాపంబు గాకుండ వరం బిచ్చితి నది మఱవు; మమ్మిథునంబు లహోరాత్రంబులు, నయ్యార్వురు ఋతువులు' అని పలికిన గురునిబోధనంబునకు నాశ్చర్యంబును బ్రసాదంబునకుఁ బ్రమోదంబునుం బొందు శిష్యునితో నతండు వెండియు. 213

ప్రతిపదార్థం: ఆ+పని= ఆ కార్యం; పాపంబుకాక+ఉండన్= పాపం కాకుండా; వరంబున్; ఇచ్చితిని; అది; మఱవుము= మరిచిపొమ్ము; ఆ+మిథునంబులు= ఆ దంపతులు; అహః+రాత్రంబులు= పగలు, రేయి; ఆ+ఆర్వురు= ఆ ఆరుగురు; ఋతువులు= వసంతాది ఋతువులు; అని పలికిన గురుని; బోధనంబునకున్= జ్ఞానానికి; ఆశ్చర్యంబును; ప్రసాదంబునకున్= దయకు; ప్రమోదంబునున్= ఆనందం; పొందు శిష్యునితోన్; అతండు= గురువు; వెండియున్= మరల.

తాత్పర్యం: ఆ పని పాపం కాకుండా వర మనుగ్రహిస్తున్నాను. దాని సంగతి మరిచిపొమ్ము. ఆ జంట రేయింపగళ్ళు ఆ యారుగురు ఋతువులు' అని చెప్పిన గురువుగారి జ్ఞానానికీ, వర మనుగ్రహించిన దయకూ సంతోషిస్తున్న శిష్యుడితో గురు వింకా అంటున్నాడు.

విశేషం: ఆదిపర్వంలో ఉదంకుడి కథలో కూడా ఈ విషయమే వస్తుంది. "సిత+అసిత తంతు సంతాన పటంబు ననునయించువారి నిద్దఱ స్త్రీలను, ద్వాదశ+అర చక్రంబుఁ బరివర్తించుచున్నవారి నార్వురఁ గుమారులను" 1-117.

దీన్ని వివరిస్తూ 118వ పద్యంలో - సిత తంతువు = తెల్లదారం, అసితతంతువు= నల్లదారంతో నేసే వస్త్రం - పగలు రేయి, అనీ, ఆర్వురు కుమారులు 6 అరలున్న చక్రం - 6 ఋతువుల కాలచక్రమనీ - చెప్పాడు కవి. రెంటినీ పోల్చి చూచుకొనవచ్చును.

తే. దినము, రాత్రియు, ఋతువులు, మనుజు చేయు । సుకృతమును దుష్కృతంబును జూచుచుండుఁ
గాని, యెంత రహస్యపుఁ గార్యమైన । నొరు లెఱుంగరు న న్నని యునికి మోస.' 214

ప్రతిపదార్థం: దినము= పగలు; రాత్రియున్= రాత్రీ; ఋతువులు; మనుజుచేయు= మనిషి చేసే; సు+కృతమును= మంచిపని; దుస్+కృతంబును= చెడ్డపనీ; చూచుచున్+ఉండున్= చూస్తూ ఉంటాయి; కాని; ఎంత= ఎట్లాంటి; రహస్యపు కార్యము= రహస్యపు పని; ఐనన్= అయినా; నన్నున్= చేస్తున్న నన్ను; ఒరులు= ఇతరులు; ఎఱుంగరు= తెలిసికొనలేరు; అని= అనుకొంటూ; ఉనికి= ఉండుట; మోస= మోసం.

తాత్పర్యం: రేయింబవళ్ళు, ఋతువులు - మనిషి చేసే మంచిపనీ చెడ్డపనీ చూస్తూ ఉంటాయి. కాని నేను చేస్తున్న ఈ రహస్యకార్యం ఎవరూ చూడటం లేదనుకొంటే మోసపోతావు సుమా!

విశేషం: ఇది చాలా గొప్ప విషయం. మనిషి ప్రకృతినుండి వస్తున్నాడు. తనకంటె అది పెద్దది. కనుక దాని కళ్ళకు దాని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంతానం మనిషి గంతలు కట్టలేడు. ఇది ఆనాటి మనిషిభావన. నే డది పోవటం వలననే అనేక రకాల అన్యాయాలు జరుగుతున్నాయి.

ఇట్లాగే దుష్యంతోపాఖ్యానంలోనూ శకుంతల దుష్యంతుడితో అంటుంది. పోల్చి చూచుకొనవచ్చును.

వ. అనిన మఱియును. 215

తాత్పర్యం: అని ఇంకా.

క. 'స్త్రీ రక్ష సూక్ష్మ మీ వ । ట్లేరూపున నైన వంశహీనత మమ్ముం
జేరక యుండం దగఁ బరి । హారము సేసి; తది యేల యవగుణ మయ్యెన్? 216

ప్రతిపదార్థం: స్త్రీ రక్ష= స్త్రీని కాపాడటం; సూక్ష్మము= కష్టం; ఈవు= నీవు; అట్లు= ఆ విధంగా; ఏ రూపునన్+ఐనన్= ఏ విధంగానైనా; మమ్మున్= మా దంపతులను; వంశహీనత= కులహీనత; చేరక+ఉండన్= చేరకుండా; తగన్= చక్కగా; పరిహారము= తొలగించటం; చేసితి= చేశావు; అది; ఏల= ఎందుకు; అవగుణము= చెడ్డగుణం, అయ్యెన్= ఐనది?

తాత్పర్యం: 'స్త్రీని కాపాడటం చాలా కష్టం. నీ వా విధంగా మాకు కులం తక్కువతనం రాకుండా కాపాడావు. అది మంచిదే తప్ప చెడ్డది కాదు.

విశేషం: కథ స్త్రీ రక్షణ కష్టమని చెప్పటం కొరకని వచ్చింది కనుక ఇది ముగింపు.

వ. దాని తెఱంగు నా కెఱింగింపకున్న నేమి?' అనుపలుకు పలికి దేవశర్మ విపులు నుల్లం బూరడిల్లం జేసె. అవ్వధూవరులును, విపులుండును బుణ్యలోకంబులు వడసిరి, పాండవాగ్రజా! తెఱవల తెఱంగెఱింగించితి వారి రక్షించుటయు నిట్లరిదియై యుండు' నని చెప్పి భీష్ముండు. 217

ప్రతిపదార్థం: దాని తెఱంగు= రక్షణ విషయ విధానం; నాకున్; ఎఱింగింపక= చెప్పక; ఉన్నన్= ఉన్నంత; ఏమి= ఏమైనది; అనుపలుకు= అన్నమాట; పలికి= చెప్పి; విపులు= విపులుడియొక్క; ఉల్లంబు= మనస్సును; ఊరడిల్లన్+చేసెన్= ఊరట పొందేటట్లు చేశాడు; ఆ వధూవరులును= ఆ భార్యాభర్తలు; విపులుండును; పుణ్యలోకంబులు= స్వర్గం; పడసిరి= పొందారు; పాండవ+అగ్రజా!= పాండవులలో పెద్దవాడా!; తెఱవల= స్త్రీల; తెఱంగున్= పద్ధతి; ఎఱింగించితిన్= చెప్పాను; వారిన్= వారిని; రక్షించుటయున్= కాపాడటం; ఇట్లు; అరిది= సూక్ష్మం; ఐ, ఉండునని చెప్పి భీష్ముండు.

తాత్పర్యం: రుచిని రక్షించిన విషయం చెప్పనంతమాత్రాన ఏమైనది? అని శిష్యుడిని ఊరడించాడు గురువు. గురువూ, అతడి భార్యా, శిష్యుడూ మరణించి పుణ్య లోకాలకు పోయారు. ధర్మరాజా! స్త్రీ సంగతి చెప్పాను. వారిని రక్షించటం కష్టమనీ చెప్పాను.' అని భీష్ముడు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'పలువురు గ్రీడింతురు, భూ । వలయాధిప ! యరయ మంచివారును గల; ర
క్కులధర్మ సతులకతమున । నిల నిరపాయత్వ మొంది, యెసకం బెసఁగున్. 218

ప్రతిపదార్థం: భూ+వలయ+అధిప= భూ చక్రమునకు రాజా!; పలువురు= అనేకులు; క్రీడింతురు= యథేచ్ఛగా తిరుగుతారు; అరయన్= జాగ్రత్తగా విచారిస్తే; మంచివారును= (స్త్రీలలో) మంచివారు కూడా; కలరు= ఉంటారు; ఆ+కుల ధర్మసతుల= మంచివంశంలో పుట్టి అగ్నిసాక్షిగా వివాహమైన పతివ్రతల; కతమునన్= కారణంచేత; ఇల= భూమి; నిర్+అపాయత్వమున్= అపాయం లేనితనమును; ఒంది= పొంది; ఎసకంబు+ఎసఁగున్= అతిశయంగా ప్రకాశిస్తూ ఉన్నది.

తాత్పర్యం: 'రాజా! స్త్రీలలో పలువురు యథేచ్ఛగా సంచరిస్తారు. కాని, చూస్తే వారిలోనూ మంచివా రుంటారు సుమా! ఆ కులసతుల వలననే ఈ లోకం పచ్చగా ఉన్నది.

క. పాతివ్రత్యము గలిగిన । నాతి యనఁగ దైవ మన జనస్తుత! వేఱే?
యాతత ధర్మార్థ సుఖ । ఖ్యాతులు, సద్భార్యవలనఁ గాదే కలుగున్.' 219

ప్రతిపదార్థం: పాతివ్రత్యము= పతినే దైవంగా ఆరాధించే వ్రతం; కలిగిన; నాతి= స్త్రీ; అనఁగన్; దైవము= దేవుడు; అనన్, జనస్తుత!= లోకంతో నుతింపబడు రాజా!; వేఱే?= వేరా? కాదు ఒకరే (పతివ్రతే దైవం); ఆతత= విస్తారమైన; ధర్మ= ధర్మము; అర్థ= ధనం; సుఖ= సుఖము; ఖ్యాతులు= కీర్తులు; సత్=మంచి; భార్యవలనన్= పత్నివలననే; కాదే= కదా; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: జననుతుడవైన ధర్మజా! పతివ్రతకూ దైవానికీ భేదం లేదు. సద్భార్యవలననే పురుషార్థ సిద్ధి. ధర్మం, అర్థం, సుఖం, కీర్తి ఇవన్నీ పురుషుడికి ఆమెవలననే లభిస్తాయి కదా!'

విశేషం: ఇది స్త్రీ ప్రశంస. భారత మొక చిత్రమైన ఇతిహాసం. లోకంలో ఏ విధంగా మంచి చెడులు మనిషిని ఆశ్రయించుకొని ఉంటాయో అదే విధంగా స్త్రీలలో ఈ రెండు పార్శ్వాలు. అట్లాగే పురుషులలోనూ (ధర్మరాజు, దుర్యోధనుడు) ఉంటాయని చూపించటమే వైచిత్రి. కనుక రేయింబవళ్ళ వలె; స్త్రీలలో చెడువారివలె మంచివారూఉన్నారు. ఆ తల్లుల ఉనికి వలననే ఈ భూమి పచ్చగా ఉన్నది - అన్న వాక్యంతో చేసిన ముగింపు చాలా అద్భుతం.

భీష్ముఁడు ధర్మజునకు గాంధర్వాది వివాహ పద్ధతులఁ దెలుఁగెఱింగించుట (సం.13-41-1)

వ. అనిన విని యజ్జనపతి జాహ్నవీనందనుతోఁ 'గన్యావరణ ప్రకారంబు విచారణీయం బైన కృత్యంబు; దాని తెఱంగెఱింగింపవే' యనుటయు, నతం డతని కిట్లనియె. 220

ప్రతిపదార్థం: అనినన్విని; ఆ+జనపతి= ఆ నరేశ్వరుడైన ధర్మజుడు; జాహ్నవీ= గంగయొక్క; నందనుతోన్= కొడుకుతో; కన్యావరణ ప్రకారంబు= వధువు నెన్నుకొనే పద్ధతి; విచారణీయంబు= ఆలోచించదగ్గది ఐన; కృత్యంబు= పని; దాని తెఱంగు= దాని విధము, ఎఱింగింపవు+ఏ= తెల్పవా? అనుటయున్= అనిప్రశ్నించగా; అతండు= భీష్ముడు; అతనికిన్= ధర్మజునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చెప్పగా విన్న ఆ రాజు గంగకొడుకుతో అన్నాడు. 'వధువును ఎంచుకొనే పద్ధతి ఆలోచించదగ్గ విషయం. కనుక దాని సంగతి చెప్పుము' అనగా ఆయన ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

క. 'కులమును, శీలము, విద్యయు । గలవానిం బిలిచి , ప్రీతిఁ గన్నియ నీఁ గా

వలయు, నుదక ప్రదానా । కలితంబుగ; బ్రాహ్మ కర్మ గతి యిది యధిపా! 221

ప్రతిపదార్థం: అధిపా!= (ధర్మాన్ని) అధిష్ఠించి పాలించేవాడా!; కులమును= మంచి సంసారంగల కుటుంబం; శీలమున్= పవిత్రమైన ప్రవర్తన, స్వభావం; విద్యయున్= చదువూ; కలవానిన్= ఉన్నవాడిని; పిలిచి= ఆహ్వానించి; ఉదక= నీరు; ప్రదాన= ఇచ్చుట; కలితంబుగన్= కూడుకొనేటట్లుగా; కన్నియన్= కూతురును; ప్రీతిన్= ప్రేమతో; ఈఁగాన్ వలయున్= ఇవ్వాలి; ఇది; బ్రాహ్మ= బ్రాహ్మణ లేదా వైదిక; కర్మ గతి= కర్మ విధానం.

తాత్పర్యం: మంచికులం, శీలం, విద్య ఉన్న వరుడిని చూచి సాదరంగా పిలిచి ప్రేమతో కన్యను ఉదకధారా పూర్వకంగా కన్యాదానం చేయాలి. ఇది వైదిక కర్మ. వేదోక్తమైన బ్రాహ్మ వివాహం.

ఆ. క్షాత్ర మండ్రు బుధులు, గన్య పురుషుఁ గోర । నతఁడు గన్య మీఁద నాస సేయ,

నచల మగు పరస్పరానురాగము గని । ప్రమదమెసఁగఁ జేయు పరిణయంబు. 222

ప్రతిపదార్థం: కన్య= వధువు; పురుషున్= వరుని; కోరన్= కోరితే; అతఁడున్= వరుడున్నూ; కన్య మీఁదన్= కన్నెపై; ఆస చేయన్= ఆశపడితే; అచలము+అగు= చలనంలేని; పరస్పర అనురాగమున్= ఒకరిపై ఒకరికి కల ప్రేమను; కని= చూచి; ప్రమదము= సంతోషం; ఎసఁగన్= ఎక్కువ కాగా; చేయు= చేసే; పరిణయంబు= వివాహం; బుధులు= పండితులు; క్షాత్రము= క్షత్రియ సంబంధమని; అండ్రు= అంటారు.

తాత్పర్యం: కన్య వరుడిని కోరుకొనటం, వరుడు కన్యను కోరుకొంటూ ఉండటంతో వారిరువురి నడుమ గట్టిదైన అనురాగం గోచరించటంవలన వారిరువురికి జరిగే వివాహం క్షాత్రవివాహం.

విశేషం: వధూవరులు ప్రేమించుకొనటం చూచి చేసిన వివాహం క్షాత్రం. ఇదే నేడు మనం గొప్పదిగా చెప్పుకొనే ప్రేమవివాహం. బ్రాహ్మం వైదిక కర్మ ప్రధానం. ఇది ప్రేమ ప్రధానం. ఇందులో వ్యక్తి ప్రాధాన్యం. అందులో కర్మప్రాధాన్యం. ఈ భేదం గమనించాలి. మనదేశంలో మొదటి దానికే ప్రాధాన్యమున్నది.

క. కన్ను మనంబును దనిసిన । గన్నియ యెవ్వానిఁ గోరు గాంధర్వం బా

యన్ను నతని కిచ్చుట, వెల । వన్నుట యాసురము సూవె పౌరవముఖ్యా! 223

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా= పురువంశంలో శ్రేష్ఠుడా!; కన్ను; మనంబును= మనసు; తనిసిన= తృప్తిపడిన; కన్నియ= వధువు; ఎవ్వానిన్= ఎవరిని; కోరున్= కోరుకొంటుందో; ఆ అన్నున్= ఆ స్త్రీని; అతనికిన్= కోరినవాడికి; ఇచ్చుట= వివాహం చేయటం; గాంధర్వంబు= గంధర్వులకు సంబంధించింది కనుక దానికా పేరు; వెల పన్నుట= కట్నం కావాలనటం; ఆసురము= అసుర సంబంధమైనది; సూవె= సుమా!

తాత్పర్యం: ధర్మరాజా! కన్నెను తాను కోరుకొన్న వాడి కిచ్చి చేసే వివాహం గాంధర్వం. కట్నంతో చేసికొనేది ఆసురం.

విశేషం: గంధర్వ అంశతో మనిషికి సౌందర్యం వస్తుంది. సంగీతం వస్తుంది. గంధర్వులు కళా - సౌందర్య ప్రియులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. బలిమి మెయి వరుఁడు గన్నెకుఁ । గలవారిం బొడిచి, కరము క్రౌర్యంబున, న

ప్పొలఁతుక దుఃఖింపఁగ, వా । రలు వొగులఁగఁ, దెచ్చికొనుట రాక్షసము నృపా! 224

ప్రతిపదార్థం: నృపా!= రాజా! (నృ= మనుష్యులకు; ప= పాలకుడు); బలిమి మెయిన్= బలంతో; వరుఁడు= మగవాడు; కన్నెకున్; కలవారిన్= కన్యా బంధువులైన వారిని; పొడిచి= చంపి, జయించి; కరము= మిక్కిలి; క్రౌర్యంబునన్= క్రూరత్వంతో; ఆ పొలఁతుక= ఆ కన్య; దుఃఖింపఁగన్= ఏడ్వగా; వారలు= బంధువులు; పొగులఁగన్= ఏడ్వగా; తెచ్చికొనుట= బలవంతంగా లాక్కొనిరావటం; రాక్షసము= రాక్షసమన్న పేరు గల వివాహం;

తాత్పర్యం: రాజా! బలవంతంగా కన్నె నెత్తుకొనిపోయి క్రూరంగా ఆమె బంధువులను చంపి, వాళ్ళంతా ఏడుస్తూ ఉండగా చేసికొనే వివాహం రాక్షసం.

వ. ఇట్లు సెప్పంబడునట్టి. 225

తాత్పర్యం: ఈ విధంగా చెప్పబడే.

ఆ. అయిదు దెఱఁగులందు నారయ మూఁడు వి । ధములు ధర్మకృతులు ధర్మపుత్ర!

యాసురంబు రాక్షసాహ్వయంబును ధర్మ । దూర సంవిధాన దూషితములు. 226

ప్రతిపదార్థం: ధర్మపుత్ర!= యముని కుమారుడా!; అయిదు తెఱఁగులందున్= అయిదు రకాల వివాహాలలో; ఆరయన్= విచారిస్తే; మూఁడు విధులు= మొదటి మూడు పద్ధతులు; ధర్మకృతులు= ధర్మ సహితాలైన విధులు; ఆసురంబున్; రాక్షస+ఆహ్వాయంబును= ఆసుర, రాక్షసమన్న పేర్లు కలవి; ధర్మదూర= ధర్మానికి దూరంగా ఉండే; సంవిధాన= పద్ధతితో; దూషితములు= కలుషితాలు (ధర్మక్రమానికి దూరమైనవని తాత్పర్యం)

తాత్పర్యం: ధర్మరాజా! ఈ ఐదు రకాలలో మొదటి మూడు ధర్మవివాహాలు; మిగిలినవి రెండూ ధర్మానికి దూరంగా ఉండే పద్ధతితో కూడుకొన్నందున కలుషితాలు.

విశేషం: బహుశా రాక్షస - ఆసురములు అతి ప్రాచీన ఆటవిక జాతులలో ఆచారాలై ఉండవచ్చును. స్త్రీలు తక్కువగా ఉండే జాతులలో ఇట్లాంటి ఆచారాలు వచ్చే అవకాశ మెక్కువ కనుక ఇట్లాంటివి సంభవిస్తా యంటారు పరిశోధకులు.

తే. మాతృ పితృ హీనయైనను, భ్రాతృరహిత । భావ మొందిన నబ్బాల పరిణయార్థ

వరణమున కర్హ గా దని, కురుకులాగ్ర । గణ్య! చెపుదురు పరిణయకల్పవిదులు. 227

ప్రతిపదార్థం: కురుకుల=కౌరవకులంలో; అగ్రగణ్య!= మొదట ఎన్నదగ్గవాడా! మాతృ= తల్లి; పితృ= తండ్రి; హీనఐనను= లేనిదైనా; భ్రాతృ= సోదర; రహిత భావము= లేనితనం; ఒందినన్= పొందితే; ఆ బాల= ఆ కన్య; పరిణయార్థ వరణమునకున్= వివాహం కొరకు ఎన్నికకు; అర్హ కాదు= తగినది కాదు; అని; పరిణయకల్ప= వివాహశాస్త్ర విధానం ; విదులు= తెలిసినవారు; చెపుదురు= చెప్పుతారు;

తాత్పర్యం: తల్లీ, తండ్రీ, అన్నా లేని పిల్లను వివాహానికి ఎన్నుకొనకూడదని వివాహశాస్త్రవేత్తలు చెప్పుతారు.

విశేషం: అట్లాంటి దురదృష్టవంతురాలు మెట్టినింటినీ అట్లాగే చేస్తుందన్న భావంతో ఈ నిషేధం వచ్చి ఉంటుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. ఆత్మజాతియందు, నవుల జాతులు రెంటఁ । గ్రమవివాహ మొప్పు బ్రాహ్మణునకు

నసఘ! శూద్రవనితయందు నాతని కప । త్యంబు గలిమి పాప మనియుఁ గలదు. 228

ప్రతిపదార్థం: బ్రాహ్మణునకున్= విప్రకులంలో పుట్టిన వాడికి; ఆత్మ= తనయొక్క; జాతి యందున్= వర్ణంలో; అవులజాతులు రెంటన్= తరువాతి రెండు వర్ణాలలో (క్షత్రియ - వైశ్య జాతులలో); క్రమ= క్రమంగా - సక్రమంగా; వివాహము= పెండ్లి; ఒప్పున్= ఒప్పుతుంది; అనఘ!= పుణ్యాత్ముడా!; ఆతనికిన్= ఆ బ్రాహ్మణుడికి; శూద్రవనితయందున్= శూద్ర స్త్రీ వలన; అపత్యంబు= సంతానం; కలిమి= కలిగి ఉండటం; పాపము= సక్రమం కాదు; అనియున్= అని కూడా; కలదు= ఉన్నది.

తాత్పర్యం: బ్రాహ్మణుడు క్రమంగా బ్రాహ్మణ క్షత్రియ వైశ్య వర్ణాలలోని కన్యలను వివాహం చేసికొనవచ్చును. కాని, శూద్రస్త్రీ నుండి సంతానం కనటం మాత్రం నిషేధం అని శాస్త్రం.

తే. రాజునకు రాజవంశజ రమణి యైన । వెనుక వైశ్యవరించుట విహిత విధము

వైశ్యునకు శూద్రునకుఁ దమ వంశములన । పరిణయంబు గాఁదగు నరపాలవర్య! 229

ప్రతిపదార్థం: నర= మానవులను; పాల= పాలించేవారిలో; వర్య!= గొప్పవాడా!; రాజునకున్= క్షత్రియుడికి; రాజవంశజ= రాజవంశంలో పుట్టిన; రమణి= పత్ని; ఐన వెనుకన్= ఐన తరువాత; వైశ్యన్= కోమటిస్త్రీని; వరించుట= వివాహం కావటం; విహిత= వేదంలో విధించబడిన; విధము= పద్ధతి; వైశ్యునకున్= కోమటికి; శూద్రునకున్= నాలుగవ జాతివాడికి; తమ= తమ తమ; వంశములన్+అ= వంశాలలోనే; పరిణయంబు= వివాహం; కాన్+తగున్= చేసికొనటం బాగు.

తాత్పర్యం: రాజుకు ముందు క్షత్రియ కన్యను ఆ తరువాత వైశ్యకన్యను వివాహం చేసికొనటం శాస్త్రం విధించిన కర్మ. వైశ్యుడికి, శూద్రుడికి తమ తమ కులాలలోనే వివాహం చేసికొనాలి. నీవు రాజువు గనుక ఈ నీతిని పాటించాలి.

వ. రాజునకు, వైశ్యునకు శూద్రకన్యావరణంబు సేయుటయును గలిగియుండు' నని చెప్పిన విని యక్కౌంతే యాగ్రజుండు శాంతనవుతో' బాహ్మణునకు శూద్రజాతి యందు భార్యా పరిగ్రహంబు సేయందగు నని విందును; అతనికి భార్యలు ముప్పురని నిర్దేశించితిరి. అది యెట్లొకో? యనుటయు నతం డమ్మహీపతి కిట్లనియె.230

ప్రతిపదార్థం: రాజునకున్; వైశ్యునకున్; శూద్రకన్య= నాలుగవ జాతి కన్యను; వరణంబు చేయుటయునున్= వివాహం చేసికొనట మున్నూ; కలిగి ఉండున్= ఆచారమున్నది; అని; చెప్పినన్= చెప్పగా; విని; ఆ+కౌంతేయ+అగ్రజుండు= ఆ కుంతీనందనులలో పెద్దవాడు; శాంతనవుతోన్= శంతనమహారాజు కుమారుడితో; బ్రాహ్మణునకున్; శూద్రజాతి యందున్= నాలుగవజాతిలో; భార్యా పరిగ్రహంబు= భార్యగా గ్రహించటం; చేయన్+తగున్= చేయవచ్చును; అని విందును= అని వింటున్నాను; అతనికిన్= ఆ బ్రాహ్మణుడికి; భార్యలు= ముప్పురు; అని; నిర్దేశించితిరి= సూచించారు; అది+ ఎట్లు+ఒకో+అనుటయున్, అతండు= భీష్ముడు; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: రాజా! వైశ్యుడు శూద్రకన్యలను చేసికొనటమూ కద్దు' అని చెప్పగా విన్న ధర్మరా జన్నాడు; 'బ్రాహ్మణుడికి ముగ్గురే భార్య లన్నారు మీరు. మరి అతడు నాలుగవ జాతిలోను కన్యావరణం చేయవచ్చునని విన్నానే; ఇదెట్లాగా? అని అనగా భీష్మ్మ డిట్లా చెప్పాడు.

ఆ. అనఘ! విషమ మైన యట్టికార్యంబు వా । టిలినఁ జూచి, పెద్ద వలచి యైన
లోభముననుశూద్రఁ దా భార్యఁగాఁ గొను । విప్రుఁ డధికపాపవృత్తి గామి. 231

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; విషమము+ఐన= తీవ్రమైన (అక్రమమైన); అట్టి కార్యంబు= అటువంటి ఘటన; పాటిలినన్= కలిగితే; చూచి; పెద్ద= గొప్పగా; వలచిఐనన్= ప్రేమించి అయినా; లోభమునను= పినాసితనంతోనైనా; శూద్రన్= శూద్ర స్త్రీని; తాన్= తాను; భార్యన్+కాన్= పెండ్లాముగా; విప్రుఁడు= బ్రాహ్మణుడు; కొనున్= గ్రహిస్తాడు; అధిక= మిక్కిలి; పాపవృత్తి= పాపపు నడవడి; కామిన్= కానందున.

తాత్పర్యం: పుణ్యాత్ముడా! ఏదైనా దుర్ఘటనవలన కాని, ప్రేమించి కానీ, లోభంవలన గానీ విప్రుడు నాలుగవ జాతి పిల్లను పెండ్లిచేసికొనవచ్చును. అది మిక్కిలి పాపపునడవడి కానందువలన.

వ. అవ్విధంబు నొక్కొక్క యెడం గల్గి దూష్యంబు గాక చెల్లునని చెప్పి వెండియు. 232

ప్రతిపదార్థం: ఆ+విధంబును= ఆ పద్ధతికూడ; ఒక్క+ఒక్క= ఒక్కొక్క; ఎడన్= సందర్భంలో; కల్గి= ఏర్పడి; దూష్యంబు కాక= నింద్యం కాకుండా; చెల్లును= చెల్లుబాటౌతుంది; అని చెప్పి; వెండియున్= మరల

తాత్పర్యం: ఆ పద్ధతికూడా ఒక్కొక్క సందర్భంలో నింద్యంగాకపోతుంది' అని మరలా ఇట్లా అన్నాడు.

క. 'ధరణీసుర, రాజ, వణిక్ । తరుణులకును విప్రువలనఁ గల్గిన తనయుల్
కురునాథా! ద్విజు లనఁగా । బరఁగుదు; రది లేదు శూద్రభామ సుతులకున్.' 233

ప్రతిపదార్థం: విప్రువలనన్= బ్రాహ్మణుడి వలన; ధరణీసుర= బ్రాహ్మణ, రాజ= క్షత్రియ; వణిక్= కోమటి; తరుణులకును= స్త్రీలకు; కల్గిన; తనయుల్= కొడుకులు; కురునాథా!= కురువంశ శ్రేష్ఠుడా!; ద్విజులు= రెండు జన్మలు కలవారు; అనఁగాన్= అన్న పేరున; పరఁగుదురు= ప్రకాశిస్తారు; శూద్రభామ= శూద్ర స్త్రీ యొక్క; సుతులకున్= కొడుకులకు; అది= బ్రాహ్మణత్వం; లేదు.

తాత్పర్యం: బ్రాహ్మణునకు మొదటి మూడు కులాలలో పుట్టిన సంతానం బ్రాహ్మణులుగానే పిలువబడుతున్నారు. శూద్ర స్త్రీకి పుట్టిన సంతానం మాత్రం అట్లా లేదు.'

వ. అనవుడు ధర్మపుత్త్రుండు 'భూసురుని వలన నాలుగు జాతుల నాతులకును బ్రసూతులైన సుతులకును నతని ధనంబునందు భాగం బెట్లుండు?' నని యడిగిన. 234

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; ధర్మపుత్త్రుండు; భూసురునివలనన్= భూలోకంలో దేవత - బ్రాహ్మణుడి వలన; నాలుగుజాతుల; నాతులకును= స్త్రీలకు; ప్రసూతులు+ఐన= పుట్టినవారైన; సుతులకును= కొడుకులకు; అతని ధనంబునందున్; భాగంబు; ఎట్లు+ఉండున్; అని అడిగినన్.

తాత్పర్యం: అనిన తరువాత ధర్మరాజు బ్రాహ్మణుడివలన నాలుగు జాతుల స్త్రీలకు సంతానం కలిగితే వారందరికి తండ్రి ఆస్తిపాస్తు లెట్లా పంచాలి?' అని ప్రశ్నించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. 'విను, జనమేజయ మనుజేంద్ర! యమ్మేది । నీశ్వరుతో భీష్ముఁ డిట్టులనియెఁ;
బ్రాహ్మణు నర్థంబు పది పాళ్ళుగాఁ జేయ । నాలుగు బ్రాహ్మణి నందనుండు,
క్షత్రియాత్మజుఁడు భాగములు మూఁడును, వైశ్య । తనయుండు రెండు, శూద్రాతనూజుఁ
డొక పాలు గొనుటకు నొడయులు; తుదివాఁడు । వలచి పెట్టఁగఁ గొనువాఁడు గాని

తే. తండ్రితోడఁ ద్రివిధ తనయులతోడను । దనదు భాగమునకుఁ బెనఁగి కొనఁగఁ
దగదు వారలకును దగదు నిర్దయతఁ ద । ద్దశమభాగ మీక తార కుడువ.' 235

ప్రతిపదార్థం: జనమేజయ మనుజ+ఇంద్ర!= జనమేజయ మహారాజా! ఆ మేదినీ+ఈశ్వరుతోన్= ఆ రాజుతో, ధర్మజునితో; భీష్ముఁడు; ఇట్టులు; అనియెన్; బ్రాహ్మణు+అర్థంబు= బ్రాహ్మణుడి ధనం; పదిపాళ్ళుగాన్+చేయన్= పది భాగాలుగా చేస్తే; బ్రాహ్మణి నందనుండు= బ్రాహ్మణ స్త్రీ కొడుకు; నాలుగు= నాల్గుభాగాలు; క్షత్రియ+ఆత్మజుఁడు= క్షత్రియస్త్రీ కొడుకు; భాగములు మూఁడును= మూడుభాగములు; వైశ్య తనయుఁడు= వైశ్య స్త్రీ కొడుకు; రెండు= రెండుభాగలు; శూద్రా తనూజుఁ డు= శూద్ర స్త్రీ కొడుకు; ఒక పాలు; కొనుటకున్= పై విధంగా పంచుకొనటానికి; ఒడయులు= అర్హులు; తుదివాఁడు= శూద్రసంతానం; వలచి= ప్రేమించి; పెట్టఁగన్= పెట్టితే; కొనువాఁడుకాని= తీసికొనేవాడే తప్ప; తండ్రితోడన్= తండ్రితో; త్రివిధ= ఆ ముగ్గురు; తనయులతోడను= కొడుకులతో; తనదు= తనయొక్క; భాగమునకున్= పాలుకు; పెనఁగి= పెనగులాడి; కొనఁగన్= తీసికొనటం; తగదు= న్యాయం కాదు; వారలకును= తండ్రికి, ఆ ముగ్గురు మిగిలిన కొడుకులకు; నిర్దయతన్= దయలేకుండా; తత్= ఆ శూద్రునకు పోవలసిన; దశమ= పదవ; భాగము= పాలు; ఈక=ఇవ్వకుండా; తార= తామే; కుడువన్= తినటం; తగదు= న్యాయం కాదు.

తాత్పర్యం: బ్రాహ్మణుడి ఆస్తి పది భాగాలు చేసి అందులో నాలుగుపాళ్ళు బ్రాహ్మణ స్త్రీ కొడుకునకు, మూడు పాళ్ళు క్షత్రియ స్త్రీ సంతానానికి, రెండు పాళ్ళు వైశ్య స్త్రీ కొడుకుకు, ఒక పాలు శూద్ర స్త్రీ సంతానానికీ ఇవ్వాలి. ఇందులో నాలుగోజాతివాడు ప్రేమించి పెట్టితే తినేవాడే కాని వా రివ్వకపోతే పోట్లాడకూడదు. అట్లాగే తండ్రి, ఆ మిగిలిన ముగ్గురు కొడుకులు కూడా పదవ పాలు వాడికి ఇవ్వాలి. తామే అంతా దయమాలి తినకూడదు'.

విశేషం: ఈ పద్యం ఒక చారిత్రక సామాజిక స్థితికి అద్దం పడుతున్నది. క్రీ.పూ. 2,3 వేల సంవత్సరాల క్రితం పరిస్థితి ఇది. ఈ విభాగంలో సమత్వం లేదు.

వ. అనిన విని పాండవాగ్రజుండు 'దక్కిన వర్ణంబులవారి ధనంబు లెట్లుగాఁగలయవి సెప్పు' మనుటయు ననిమిష నదీనందనుం డతని కిట్లనియె. 236

ప్రతిపదార్థం: అనినన్ విని; పాండవ అగ్రజుండు= పాండవులలో ముందు పుట్టినవాడు; తక్కిన వర్ణంబులవారి ధనంబులు ఎట్లు కాగలయవి సెప్పుము; అనుటయున్= అనగా; అనిమిషనదీ= దేవతలనది యొక్క; నందనుండు= కొడుకు; అతనికిన్= ఆ ధర్మజుడికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు;

తాత్పర్యం: అని చెప్పగా విన్న ధర్మరాజు 'తక్కిన వర్ణాలవారి ధన విభాగం ఎట్లా ఉంటుంది? చెప్పు'మంటే భీష్ము డిట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అనిమిష - న+నిమిష (అనిమిష)= రెప్పకొట్టటం; లేనివాడు, కళ్ళుమూత పడటం లేనివాడు= దేవత.

సీ. 'క్షత్రియు ధనము భాగము లెనిమిది సేయ, । భూపాల వైశ్యుల పుత్రికలకు,
శూద్ర పుత్రికకును, సుతులైన యట్టి వా । రోలి నాలుగు, మూఁడు నొక్కటియును,
గొనువారు పాళ్ళులు, కురుముఖ్య! వైశ్యుని । సొమ్మున వైశ్యకు సూనుఁ డైన
యతఁడు నాలుగును శూద్రాత్మజుఁ డొకటియుఁ । గాఁగ నైదుగ నంశకములు గొండ్రు

తే. పెనఁగి కొనఁగఁ దగమి విన శూద్ర కొడుకున । కెందుఁ గలదు; వాని కీక కుడువఁ
గామియును సమంబ యేమి జాతులవారి । కయిన నిట్లు దెలియు మంశకృతులు. 237

ప్రతిపదార్థం: క్షత్రియు ధనమున్= క్షత్రియుడి ధనం; ఎనిమిది; భాగములు; చేయన్= చేస్తే; భూపాల వైశ్యుల= రాజుల కోమటులయొక్క; పుత్రికలకున్= కూతుండ్రకు; శూద్రపుత్రికకును; సుతులైన+అట్టివారు= కొడుకులుగా పుట్టినట్టివారికి; ఓలిన్= క్రమంగా; నాలుగు, మూఁడు, ఒక్కటియును; పాళ్ళులు= పాళ్ళుగా; కొనువారు= తీసికొనదగినవారు; కురుముఖ్య!= కురువంశ శ్రేష్ఠుడా!; వైశ్యుని సొమ్మునన్= వైశ్యుడి సొమ్ములో; వైశ్యకున్= వైశ్య స్త్రీకి; సూనుఁడు= కొడుకు; ఐన అతఁడు= అయినవాడు; నాలుగును; శూద్ర+ఆత్మజుఁడు= శూద్రస్త్రీ కొడుకు; ఒకటియున్; కాఁగన్= కాగా; ఐదుగన్= ఐదగునట్లుగా; అంశకములు= పాళ్ళు; కొండ్రు= తీసికొంటారు; శూద్ర కొడుకునకున్= శూద్రస్త్రీ కుమారునకు; పెనఁగి= పోట్లాడి; కొనఁగన్= ఆస్తి తీసికొనటం; తగమి= న్యాయం కాకపోవటం; విను; ఎందున్= ఎక్కడైనా; కలదు= ఉన్నది; వానికిన్= శూద్రుడికి; ఈక= ఇవ్వక; కుడువన్= తినటం; కామియును= కాకపోవటం; సమంబ= సమానమే; ఏమిజాతుల వారికిన్= ఏ జాతివారికైనా; అంశకృతులు= భాగాలు పంచటం; ఇట్లు= ఇంతేనని; తెలియుము= తెలిసికొమ్ము.

తాత్పర్యం: క్షత్రియుడి ఆస్తి ఎనిమిది భాగాలుచేసి క్షత్రియ స్త్రీ కొడుకునకు నాల్గు, వైశ్య స్త్రీ కొడుకునకు మూడు, శూద్ర స్త్రీ కొడుకునకు ఒకపాలు; ఇది పాళ్ళ పంపకం. వైశ్యుడి ధనం ఐదు భాగాలు చేసి, కోమటి స్త్రీ కొడుకునకు నాల్గు; శూద్ర స్త్రీ కొడుకునకు ఒక పాలుగా పంచుకొనాలి. శూద్ర స్త్రీ కొడుకు పోట్లాడి తీసికొనకూడదు. వారూ ఇతడికి ఇవ్వకుండా తినకూడదు అనటం సాధారణాంశమే.

తే. ఆలు నిజజాతియందు, శూద్రాలి కెల్ల । సమములుగఁ బంచికొండ్రు భాగముల శూద్ర
తనయు లెందఱు గల్గినఁ దండ్రి ధనము । ధర్మసంగ్రహతత్పర! ధర్మతనయ!। 238

ప్రతిపదార్థం: ధర్మ= ధర్మముయొక్క; సంగ్రహ సారాంశం గ్రహించటంలో; తత్పర!= భక్తికలవాడా!; ధర్మతనయ!= ధర్మజా!; శూద్ర+ఆలికిన్+ఎల్లన్= శూద్ర సమూహానికి; ఆలు= భార్య; నిజ= తనయొక్క; జాతి= వర్గం; అందున్= అందులోనే; తండ్రి ధనమున్= శూద్ర తండ్రి డబ్బు; తనయులు= కొడుకులు; ఎందఱు= ఎంతమంది; కల్గినన్= ఉన్నా; భాగములన్= పాళ్ళను; సమములుగన్= సమానంగా; పంచి కొండ్రు= పంచుకొంటారు.

తాత్పర్యం: ధర్మసారాంశం వినటంలో ఆసక్తి కలవాడా! ధర్మరాజా! శూద్రుడు మాత్రం వారి జాతులలోనే వివాహం చేసికొనాలి. వాడి ఆస్తిని కొడుకులంతా సమంగా పంచుకొంటారు.'

వ. అని నిర్దేశించి వెండియు. 239

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; నిర్దేశించి= ఏర్పరచి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఈ విధంగా ఏర్పరచి ఇంకా (ఇట్లా తెలిపాడు)

క. 'విను హవ్య కవ్యములు మ । జ్జన భోజనములును, విప్రజాతి వనిత దాఁ

బనిసేయ నడపునది, య । ప్పనులకుఁ బెఱసతులు గామి బ్రాహ్మణుఁడు నృపా!' 240

ప్రతిపదార్థం: నృపా!= మానవులను పాలించేవాడా!; విను; బ్రాహ్మణుఁడు= నాలుగు కులాలనుండి వివాహం చేసికొనటానికి అర్హత ఉన్నవాడు; తాన్= తాను; విప్రజాతి వనితన్= బ్రాహ్మణ స్త్రీని; హవ్య= దేవతలకర్పించేది; కవ్యములు= పితృదేవతల కర్పించేది; మజ్జన= స్నానం; భోజనములు= ఆహారం పక్వంచేయటం - వడ్డించటం; పనిచేయన్= ఈ పనులు చేయటానికి; నడపునది= ఆజ్ఞాపించాలి; ఆ+పనులకున్= ఆ పనులను చేయటానికి; పెఱ= మిగిలిన మూడు వర్ణాల; సతులు= భార్యలు; కామి= అర్హతలేనివారు కావున.

తాత్పర్యం: వైదిక కర్మలు, హవ్య, కవ్యాల అర్పణం; తనకు స్నాన, భోజనాదులు ఏర్పాటు చేసే అర్హత ఒక్క బ్రాహ్మణ స్త్రీకే ఉన్నది. ఇతర భార్యల కీ అర్హత లేదు. కనుక బ్రాహ్మణభర్త తన బ్రాహ్మణపత్నివల్లనే ఈ పనులు అమలుపరచాలి.

భీష్ముఁడు ధర్మజున కౌరసాది పుత్త్రభేదంబు తెఱంగు సెప్పుట (సం.13.49-1)

వ. అనిన విని యుధిష్ఠిరుండు. 241

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు.

క. 'కొడుకులు బహువిధు లని యె । ప్పుడు విందును; వారి తెఱఁగు పురుషవరా! యే

ర్పడఁ జెప్పవలయు నా' కని । యడిగిన, గాంగేయుఁ డిట్టులను నాతనితోన్. 242

ప్రతిపదార్థం: కొడుకులు; బహు= అనేక; విధులు= విధాలు; అని; ఎప్పుడున్= నిత్యం; విందును; పురుష వరా!= మానవులలో శ్రేష్ఠుడా!; నాకున్= నాకు; వారి తెఱఁగు= వారి విధానం; ఏర్పడన్= దేనికదిగా; స్పష్టంగా; చెప్పన్ వలయున్= వివరించాలి; అని అడిగినన్; గాంగేయుఁడు= గంగ కొడుకు - భీష్ముడు; ఆతనితోన్; ఇట్టులు+అనున్= ఇట్లు అన్నాడు.

తాత్పర్యం: 'పురుష శ్రేష్ఠుడా! కుమారు లనేకవిధా లంటారు కదా! నాకు వివరించి చెప్పుము.' అని అడుగగా భీష్ము డిట్లా అంటున్నాడు.

విశేషం: పురుషుడు; పురము= శరీరం; అందులో శయనించేవాడు= ఉండేవాడు; జీవాత్మ. ఈ జీవాత్మ పరమాత్మ అయిన సర్వేశ్వరుడి స్వరూపుడు.

తే. పరమసంస్కృత యగు నాత్మభార్యయందు । ధర్మవిధిఁ గలిగించిన తనయుఁ డనఁగఁ

దాన యౌరసుఁ డను నభిధాన మొప్పఁ । బరఁగు నుత్తముఁ డాతఁడు ప్రథముఁ డధిప! 243

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; పరమ సంస్కృత+అగు= మంచి సంస్కారం గలదైన; ఆత్మ భార్యయందున్= తన భార్య ఆధారంగా; ధర్మవిధిన్= ధర్మబద్ధంగా; కలిగించిన= పుట్టించిన; తనయుఁడు+అనఁగన్= కొడుకు అనగా; తాను+అ= తానే; ఔరసుఁడు= ఉరస్సు - ఆత్మనుండి పుట్టినవాడు; అను= అన్న; అభిధానము= పేరు; ఒప్పన్= వెలయగా; పరఁగు= కీర్తికల; ఉత్తముఁడు= శ్రేష్ఠుడు; ఆతఁడు= అతడు; ప్రథముఁడు= మొదటివాడు.

తాత్పర్యం: ధర్మపత్నియందు ధర్మబద్ధంగా పుట్టిన కొడుకు ఔరసుడు. మిగిలిన కొడుకులందరికంటె ఉత్తము డితడే. ఇతడే మొదటివాడు.

విశేషం: ఔరసుఁడు= గుండె- హృదయం నుండి పుట్టినవాడు. తండ్రి తన ఆత్మను భార్యాగర్భంలో నిక్షేపించి కన్నకొడుకు 'అంగాత్- అంగాత్ సంభవసి' - తండ్రి ప్రతి అవయవం నుండి పుట్టిన కొడుకు ఔరసుడు. దీపం నుండి మరొక దీపం పుట్టినట్లు తండ్రియే భార్యాగర్భం ద్వారా కొడుకై పుట్టుతున్నాడు. ఇందుకే భారతీయ మహిళ ఒక దృష్టితో భార్య - ప్రేయసి, మరొక దృష్టితో తల్లి. ఈ భార్యాత్వం, మాతృత్వం కలబోసి చిత్రించిన ప్రతిమలే మన స్త్రీ శిల్పాలు. కావాలనుకొన్న సంతానం ఔరసుడు. పుత్రకామేష్టి అంటే ఇదే.

తే. తగిన వరునకు నిచ్చిన తనదు దుహితఁ। గనిన పుత్త్రు నయ్యిరువురు వినఁగ నియ్య
కొనఁగ వీఁడు నా కొడు కనఁ గొడుకు వాని। పేరు పుత్త్రికా పుత్త్రుండు పౌరవేంద్ర! 244

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర!= పురువంశంలో గొప్పవాడా!; తగిన= అర్హుడైన; వరునకున్= పెండ్లి కొడుకునకు; ఇచ్చిన= వివాహం చేసిన; తనదు= తనయొక్క; దుహిత= కూతురు; కనిన= కన్న; పుత్త్రున్= కొడుకును; ఆ+ఇరువురు= కూతురు, అల్లుడు ఇద్దరు; వినఁగన్= వింటూ ఉండగా; ఇయ్యకొనఁగన్= అంగీకరిస్తే; వీఁడు= మనుమడు; నా కొడుకు; అనన్= అనగా; కొడుకు= కుమారుడు ఔతాడు; వానిపేరు; పుత్త్రికా పుత్త్రుండు= కూతురు కొడుకు దౌహిత్రుడు.

తాత్పర్యం: పురువంశ రాజా! మంచివాని కిచ్చి పెండ్లి చేసిన తనకూతురు కొడుకును - వాళ్ళిద్దరూ అంగీకరిస్తే దత్తత చేసికొనగా - ఆ దౌహిత్రుడు కూడా కొడుకే.

విశేషం: కొడుకులు లేని తండ్రి తనకు పితృక్రియలు ఎవరో ఒకరు చేయాలి కనుక దౌహిత్రుడిని దత్తత చేసికొనవచ్చును. వాడు పుత్రసమానుడై ఉత్తరక్రియలు నిర్వహించే హక్కు పొందుతున్నాడు.

తే. ధర్మపథమునఁ బనిచినఁ దనదుపత్ని। యర్హపురుష సంగతిఁ గన్న యాత్మజుండు
క్షేత్రజుం డనఁగా నిజపుత్త్ర భావ। మొందు ధర్మప్రపంచాభినందితాత్మ! 245

ప్రతిపదార్థం: ధర్మ ప్రపంచ= ధార్మికవర్గముచేత; అభి= మిక్కిలి; నందిత+ఆత్మ!= ఆనందించిన హృదయం కలవాడా!; ధర్మపథమునన్= ధర్మమార్గంలో; పనిచిన= ఆనతిచ్చిన; తనదు= తన; పత్ని= భార్య; అర్హ= తగిన; పురుష= మగవాడి; సంగతిన్= రతిద్వారా; కన్న; ఆత్మజుండు= కొడుకు; క్షేత్రజుండు= భార్యకొడుకు (క్షేత్రం - భార్య); అనఁగాన్; నిజ= తనయొక్క; పుత్రభావము= పుత్రత్వం; ఒందున్= పొందును.

తాత్పర్యం: ధర్మమార్గంలో తన భార్యను తానై తగిన పురుషుడి కర్పిస్తే ఆమె కన్నసంతానం కూడా తనకు కొడుకే.

విశేషం: ఆ నాటికి ఈ ధర్మం ఉండేది. మనుస్మృతి మొదలైన గ్రంథాలలో ఈ విషయం చెప్పబడింది. ధృతరాష్ట్ర- పాండు రాజులు ఈ ధర్మదృష్టితోనే వ్యాసుడి ద్వారా జన్మించారు. కనుక పద్యంలో అర్హ అంటే వ్యాసుడివంటివాడని. కేవలం

ధర్మదృష్టితోనే సంగమం జరగాలి తప్ప అన్యంకాదు. ఈనాడు "వీర్యనిధి" - "నాళికాశిశువులు" ఉన్నట్లు ఆనా డవకాశం లేదు. కాని, దీనికంటె అది మహోత్తమం.

క. జననీ జనకు లుదక దా । న నిరూఢము గాఁగ నిచ్చినం బడసిన నం
దనుపేరు దత్రిముం డని । ముని జనములు సెప్పుదురు విమోహవిదూరా! 246

ప్రతిపదార్థం: వి+మోహ= మిక్కిలి విషయాసక్తికి; విదూరా!= దూరంగా ఉండేవాడా!; జననీ జనకులు= తల్లి దండ్రులు; ఉదక= నీటి యొక్క; దాన= దానముచే; నిరూఢముకాఁగన్= ప్రసిద్ధంగా; ఇచ్చినన్= ఇస్తే; పడసిన=పొందిన; నందను పేరు= కొడుకుపేరు; దత్రిముండు; అని; మునిజనములు= ముని జనులు; చెప్పుదురు= చెప్పుతారు.

తాత్పర్యం: జలధారాపూర్వకంగా తల్లిదండ్రులు దానం చేసిన కొడుకుపేరు దత్రిముడు.

విశేషం: కొన్ని ప్రతులలో దత్తకుఁడు - అని ఉన్నది. (దత్తత చేసికొనబడ్డవాడు పెంపుడు కొడుకు). దత్రిముఁడు= ధారా పూర్వకంగా దానం చేయబడ్డ కొడుకు కనుక తల్లిదండ్రులు ఇష్టంతో దానం చేయటం చెప్పబడింది.

ఆ. తల్లిఁ దండ్రిఁ బాసి తనయంత నెచ్చట । నేనిఁ దిరుగునట్టి వానిఁ జూచి,
యాత్మసదృశుఁడైన యాత్మజుఁ జేసి కొ । నంగఁ గృత్రిముం డనంగఁ బరఁగు. 247

ప్రతిపదార్థం: తల్లిన్, తండ్రిన్= ఇద్దరినీ; పాసి= పోగొట్టుకొని; తన అంతన్= తనంత; ఎచ్చటనేనిన్= ఎక్కడైనా; తిరుగునట్టివానిన్; చూచి; ఆత్మసదృశుఁడు= తనకు ప్రీతిపాత్రుడు ఐన; ఆత్మజున్= కొడుకుగా; చేసికొనంగన్= చేసికొంటే; కృత్రిముండు= కృత్రిమంగా కొడుకుగా గ్రహించబడినవాడు కనుక; కృత్రిముండు; అనంగన్= అనునట్టి పేరుతో; పరఁగున్= ప్రసిద్ధుడౌతాడు.

తాత్పర్యం: తల్లిదండ్రులను పోగొట్టుకొని ఒంటరిగా తిరిగేవాడిని తన కిష్టమైన కొడుకుగా చేసికొంటే వాడిపేరు కృత్రిముడు.

తే. ఎవ్వనికిఁ బుట్టె నేనియు నెఱుఁగకుండ । నొక్కనికిఁ బరభార్యయం దుదయ మైన
సూనుఁ డా భార్య గలవాని సుతుఁడు, వాని । పేరు 'గూఢజుఁ' డనఁబడుఁ గౌరవేంద్ర! 248

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కురువంశ రాజా!; ఒక్కనికిన్= ఒక్కడికి; పరభార్యయందున్= ఇతరుడి భార్యకు; ఉదయము+ఐన= పుట్టిన; సూనుఁడు= కొడుకు; ఎఱుఁగకుండన్= తెలియకుండా; ఎవ్వనికిన్= ఎవడికైనా; పుట్టెనేనియున్= పుట్టినా; ఆ భార్య గలవాని సుతుఁడు= ఆ భర్త కొడుకు; వానిపేరు; గూఢజుఁడు= రహస్యంగా పుట్టినవాడు; అనఁబడున్= పదిమందితో చెప్పుకొనబడేవాడు.

తాత్పర్యం: తెలియకుండా ఎవడికి పుట్టినా, పరభార్యకు పుట్టినవాడు ఆ భార్య గలవాడి కొడుకే. వాడిపేరు గూఢజుడు.

క. విను తల్లిదండ్రు లొల్లక । తనయుని విడిచిన నొరుండు తనకుఁ దనయుఁగాఁ
గొని నెమ్మి నడప నపవి । ద్ధనాముఁ డగువాఁడు విమలధర్మప్రవణా! 249

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: విమల= నిర్మలమైన; ధర్మప్రవణా!= ధర్మమునం దాసక్తి కలవాడా!; విను; తల్లిదండ్రులు; ఒల్లక= ఇష్టపడక; విడిచిన= విడిచిపెట్టిన; తనయునిన్= కొడుకును; ఒరుండు= మరొకడు; తనకున్; తనయుకాన్+కొని= కొడుకుగా స్వీకరించి; నెమ్మిన్= సంతోషంతో; నడపన్= పోషిస్తే; వాఁడు= అతడు; అపవిద్ధనాముఁడు= అపవిద్ధుడన్న పేరు గలవాడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: మంచి ధర్మాలు వినటంలో భక్తిశ్రద్ధలు కలవాడా! తల్లీదండ్రీ కాదని వదలివేసిన పిల్లవాడిని కొడుకుగా స్వీకరిస్తే వాడిపేరు అపవిద్ధుడు.

విశేషం: అప= చెడ్డగా; విద్ధుఁడు= నిరసింపబడ్డవాడు (విద్ధము= గ్రుచ్చబడినది, కొట్టబడినది)

తే. **పెండ్లి గాకమున్న పితృగృహంబునఁ గన్య । సూనుఁ గనిన వినుము దానిఁ జేసి**
కొనిన యతని కతఁడు గొడు కగుఁ గానీన । నామకమున బరఁగు నరవరేణ్య! **250**

ప్రతిపదార్థం: నరవరేణ్య!= మానవులలో గొప్పవాడా, రాజా!; వినుము= ఆలకించుము; కన్య= అవివాహిత, పెండ్లికాకమున్న= వివాహం కాకముందే; పితృగృహంబునన్= తండ్రి ఇంట్లో; సూనున్= కొడుకును; కనినన్= కంటే; దానిన్= ఆ కన్యను; చేసికొనిన అతనికిన్= చేసికొన్న వాడికి; అతఁడు= ఆ కన్యకు పుట్టినవాడు; కానీన నామకమునన్= కానీను డన్న పేరుతో; కొడుకు+అగున్= కొడుకు అవుతాడు.

తాత్పర్యం: పెండ్లిగాక ముందే తండ్రి ఇంట్లో కొడుకును కంటే ఆమెను వివాహం చేసికొన్నవాడి కా బిడ్డ కొడుకే. వాడి పేరు కానీనుడు.

విశేషం: కానీనుఁడు= కన్నెకొడుకు. భారతంలో కర్ణుడికా పేరున్నది. మనకంటె ఆనాటివారి కా విశాల దృష్టి ఉన్నట్లున్నది.

క. **విను గర్భిణి యగు టెఱుఁగక । యును, నెఱిఁగియుఁ బెండ్లియైన, నుదయించిన నం**
దనుఁ డావరునకుఁ గొడు కగు । జననాథ! సహోఢుఁ డనఁగఁ జను నండ్రు బుధుల్. **251**

ప్రతిపదార్థం: జననాథ!= రాజా!; విను; గర్భిణిఅగుట= గర్భవతి కావటం; ఎఱుఁగకయునున్= తెలియకపోయి, ఎఱిఁగియున్= తెలిసియూ; పెండ్లిఐనన్= పెండ్లి చేసికొన్నాక; ఉదయించిన= పుట్టిన; నందనుఁడు= కొడుకు; ఆ వరునకున్= ఆ పెండ్లి చేసికొన్న వాడికి; కొడుకు+అగున్; సహ+ఊఢుఁడు= (సంతానం)తోపాటు భరించబడువాడు; అనఁగన్= అన్నపేరున; చనున్= లోకంలో చెలామణి ఔతాడు; అని బుధుల్= స్మృతి గ్రంథకర్తలు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పెండ్లి కాకపూర్వమే గర్భవతి అయిన కన్య - ఈ విషయం తెలిసినా తెలియకున్నా పెండ్లి చేసికొన్నాక కంటే ఆ కొడుకు పేరు సహోఢుడు. వాడిని కొడుకుగా ఆమెను వివాహం చేసికొన్నవాడు స్వీకరిస్తాడు.

తే. **విభునిఁ దాను దొఱంగిన వెలఁది, విభుఁడు । విడిచినట్టి సుమధ్యమ, విధవ, యక్ష**
తాత్వ దశ నెవ్వనికిఁ గనఁ దనయుఁ డాతఁ । డతని కొడుకు పౌనర్భవుం డనఁగఁ బరఁగు. **252**

ప్రతిపదార్థం: విభునిన్= భర్తను; తాను= తానై; తొఱంగిన= విడిచిన; వెలఁది= స్త్రీ; విభుఁడు= భర్త; విడిచినట్టి= విడిచిపెట్టిన; సుమధ్యమ= అందమైన నడుము కలది, స్త్రీ; విధవ= భర్త లేనిది; అక్షతాత్వదశన్= కన్యాత్వం భంగంకాని దశలో; ఎవ్వనికిన్=

ఎవడివలననైనా; కనన్= కంటే; తనయుఁడు+ఆతఁడు= ఆ కొడుకు; అతని కొడుకు= ఎవ్వడికి పుట్టాడో అతడికే కొడుకు; పౌనర్భవుండు= తిరిగి పుట్టినవాడు; అనఁగన్; పరఁగున్= ఒప్పును.

తాత్పర్యం: భర్తను విడిచిన భార్య, భర్త విడిచిన భార్య, విధవ, ఎవడికి కొడుకును కంటారో, ఆ కొడుకు కన్నవాడికే కొడుకు. వాడిపేరే పౌనర్భవుడు.

విశేషం: అక్షతాత్వదశ - మూడు రకాలు. 1.భర్తవిడిచిపెట్టినది, 2. భర్తను విడిచిపెట్టినది, 3. విధవ - వీరు కన్యాత్వ భంగంకాని వారై ఉండాలని తాత్పర్యం.

క. జననీజనకులు లేకు । న్నను వారలు దన్ను విడిచినం దాన తనున్
దనయుఁడుగ నొరుల కిచ్చిన । ననఘా! యాతండు సను స్వయందత్తుఁ డనన్. 253

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా! జననీ జనకులు= తల్లిదండ్రులు; లేక+ఉన్నను= లేకపోయినా; వారలు= తల్లీదండ్రి; తన్నున్= తనను; విడిచినన్= వదలిపెట్టినా; తాన= తానే; తనున్= తనను; ఒరులకున్= ఇతరులకు; తనయుఁడుగన్= కొడుకుగా; ఇచ్చినన్= ఇచ్చినా; అతండు= అతడు; స్వయందత్తుఁడు= తనను తానే ఇచ్చుకొన్నవాడు; అనన్= అనగా; చనున్= ఒప్పును.

తాత్పర్యం: పుణ్మాత్ముడా! తల్లిదండ్రులు లేకపోయినా, వారు తనను విడిచిపెట్టినా, తనను తానై ఇతరులకు అర్పణంచేసికొన్నా వాడిని స్వయందత్తు డంటారు.

ఆ. తల్లిదండ్రు లమ్మఁ దనయుఁగా నొక్కరుఁ । డాత్మసదృశజన్ముఁ డైన వాని
విలిచికొనినఁ బాండవేయ మహత్తర! యక్కుమారుఁ గ్రీతుఁ డండ్రు బుధులు.' 254

ప్రతిపదార్థం: తల్లిదండ్రులు; అమ్మన్= అమ్ముకొనగా; ఒక్కరుఁడు= మరొకడు; తనయుఁగాన్= కొడుకుగా; ఆత్మ సదృశ జన్ముఁడు= తనతో సమానమైన జన్మకలవాడు; ఐనవానిన్= అయినటువంటివాడిని; విలిచికొనినన్= డబ్బిచ్చి కొనుక్కొంటే; పాండవేయమహత్తర!= పాండవులలో గొప్పవాడా!; బుధులు= పండితులు; ఆ+కుమారున్= ఆ కొడుకును; క్రీతుఁడు= కొనబడినవాడని; అండ్రు= అంటారు.

తాత్పర్యం: తల్లిదండ్రు లమ్మితే, తనకు తగినటువంటి వాడిని కొడుకుగా కొనుక్కొంటే వాడిని క్రీతు డని పండితు లంటారు.'

క. అని భీష్ముడు వెండియు ని । ట్లను ' నా పన్నిరువురును ధరాధిప! యోగ్య
త్వ నిరూఢు లెల్ల కర్మం । బున; కౌరసుఁ డందులోన ముఖ్యుం డరయన్. 255

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; భీష్ముఁడు; వెండియున్= ఇంకా; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు; ఆ పన్నిరువురును= ఆ పదురెండు మంది; ధరా+అధిప!= రాజా; ఎల్ల కర్మంబునకున్= అన్నివైదిక కర్మలకు; యోగ్యత్వ నిరూఢులు= తగినవారు; అందులోనన్= ఆ పన్నెండు మందిలో; అరయన్= విచారిస్తే; ఔరసుఁడు= ఆ పేరుగల కొడుకు; ముఖ్యుండు= ప్రధానమైనవాడు.

తాత్పర్యం: అని చెప్పి భీష్ము డింకా ఇట్లా అంటున్నాడు. 'ఆ పన్నెండు మంది తగినవారే. అయినా వారిలో ఔరసుడే ముఖ్యుడు. ఎందుకంటే వైదిక కర్మల కన్నిటికీ తగినవాడు వాడే కనుక.

ఉ. వానిన పోలు నండ్రు బుధవర్యులు కౌరవనాథ! పుత్రికా
సూనునిఁ దక్కనీ వినిన సూనులు, యోగ్యత గాంతు రుత్తమం
బైన కులద్వయంబును, సమాగతమై, విధివత్ప్రయోగతా
నూనతఁ గల్గెనేని, నిగమోదిత కర్మకలాప యుక్తికిన్.' 256

ప్రతిపదార్థం: కౌరవనాథ!= కురువంశ శ్రేష్ఠుడా!; బుధవర్యులు= పండితశ్రేష్ఠులు; వానిన= వాడినే, ఔరసుడినే; పుత్రికాసూనునిన్= కూతురు కొడుకును; పోలును+అండ్రు= సమానుడంటారు; తక్కు= మిగిలిన; నీ వినిన= నీవు విన్న; సూనులు= కొడుకులు; ఉత్తమంబు+ఐన= శ్రేష్ఠమైన; కులద్వయంబును= రెండు కులాలు; సమాగతము+ఐ= కలిసి, సమన్వయం పొంది; విధివత్= శాస్త్ర ప్రకారంగా; ప్రయోగితా+అనూనతన్= ప్రయోగాతిశయం; కల్గెన్+ఏనిన్= పొందితే; నిగమ= వేదముచే; ఉదిత= చెప్పబడిన; కర్మకలాప= కర్మ సమూహం; యుక్తికిన్= కూడికకు; యోగ్యతన్= అర్హతను; కాంతురు= పొందుతారు.

తాత్పర్యం: ఔరసుడితో కూతురు కొడుకు సమానుడని పండిత వర్యులు అంటారు. వేద కర్మలను చక్కగా కూర్చటానికి తగిన శాస్త్ర విధులను పాటించి రెండు కులాలను ఉద్ధరిస్తే మిగిలినవారూ యోగ్యులే.'

చ్యవన నహుష సంవాదం బను నితిహాసము (సం.13-50-1)

వ. అనిన విని ధర్మజుండు 'సహవాసంబునను దర్శనంబునను బుట్టెడి స్నేహంబు లెట్టివి? వానిని గోవుల మాహాత్మ్యంబును నెఱుంగవలతుం జెప్పవే' యని యడిగిన నప్పుడమితేనికి భీష్ముం డిట్లనియె. 257

ప్రతిపదార్థం: అనినన్; విని; ధర్మజుండు; సహవాసంబుననున్= కలిసి ఉండటంవలన; దర్శనంబుననున్= చూడటంవలన; పుట్టెడి= కలిగెడు; స్నేహంబులు= ప్రేమలు; ఎట్టివి; వానినిన్= వాటిని; గోవుల= ఆవులయొక్క; మాహాత్మ్యంబును= ప్రభావమునూ; ఎఱుంగన్+వలతున్= తెలియవలెనని, వాంఛిస్తాను; చెప్పవే= తెల్పుమా; అని; అడిగినన్; ఆ+పుడమి ఱేనికిన్= ఆ భూమిపతికి, రాజుకు; భీష్ముండు+ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా విన్న ధర్మరాజు భీష్ముడితో అన్నాడు. 'కలిసి ఉండటంవలన చూడటంవలన పుట్టే స్నేహాలు ఎట్లాంటివి? వాటినీ, గోవులమాహాత్మ్యమూ వినాలని ఉన్నది. చెప్పవా! అని ప్రార్థిస్తే ఆ రాజుతో భీష్ము డంటున్నాడు.

సీ. 'చ్యవనుని, నహుషుని సంవాద మితిహాస। మై చెల్లు జగమున ననఘ! నీకు
దానిఁ జెప్పెద విను; దాన నీ యడిగిన। యర్థముల్ దెలియు, మహాత్ముఁడైన
భార్గవచ్యవనుండు, భాగీరథీ యము। నలు గూడినెడ కేఁగి, యలఘునిష్ఠఁ
గ్రుంకి సుస్థిరుఁ డయి కూర్చుండి, యతుల స। మాధిపరుం డయి, మత్స్య కులము

తే. దనదు చుట్టు మెలఁగఁ దనువునఁ జెందంగ। మూరుకొనఁగఁ గృపయు ముదముఁ గదుర
భావవృత్తి తోడఁ బండ్రెండు వర్షము। లుండె; నట్టు లుండ నొక్కనాఁడు. 258

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా! (నాయనా అనటంవంటి సంబోధన); చ్యవనుని= ఆ పేరుగల ఋషియొక్క; నహుషుని= ఆ పేరుగల ప్రాచీన రాజుయొక్క; సంవాదము= ప్రశ్న ఉత్తర రూపమైన గోష్ఠి; జగమునన్= లోకంలో; ఇతిహాసమై= ఒక పురాణ కథగా; చెల్లున్= ప్రకాశిస్తుంది; నీకున్; దానిన్; చెప్పెదన్; విను; దానన్= దానివలన; నీ అడిగిన= నీవు అడిగిన; అర్థముల్= విషయములు; తెలియున్= తెలుస్తాయి; మహా+ఆత్ముఁడు+ఐన= మహత్త్వం కల; భార్గవచ్యవనుండు= భృగువంశంలో పుట్టిన చ్యవన మహర్షి; భాగీరథి= గంగ; యమునలు= యమునానది; కూడిన+ఎడకున్= సంగమ స్థలానికి; ఏఁగి= వెళ్ళి; అలఘు= గొప్ప; నిష్ఠన్= నియమంతో; క్రుంకి= స్నానంచేసి; సుస్థిరుఁడు+అయి= కదలకుండా; కూర్చుండి; అతుల= సాటిలేని; సమాధిపరుండు+అయి= సమాధియందు మునిగి; మత్స్య కులము= చేపల గుంపు; తనదు= తనయొక్క; చుట్టు= చుట్టూరా; మెలఁగన్= మెలగుతూ ఉండగా; తనువునన్= శరీరమునందు; చెందంగన్= పొందగా; మూరుకొనఁగన్= వాసన చూడగా - (పశుపక్ష్యాదులు ప్రేమతో మనిషిని నాకటం, ముట్టెతో వాసన చూడటం); కృపయున్= దయ; ముదమున్= సంతోషం; కదురన్= వ్యాపించగా; భావవృత్తితోడన్= వాటియందు లగ్నమైన మనోభావనతో; పండ్రెండు; వర్షములు= సంవత్సరాలు; ఉండెన్= ఉన్నాడు; అట్టులు= ఆ విధంగా; ఉండన్= ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజున.

తాత్పర్యం: చ్యవన నహుష సంవాదంవలన నీ సందేహం తీరుతుంది. దానినే చెప్తున్నాను వినుము. భృగువంశంలో పుట్టిన మహాత్ముఁడు చ్యవనుడు గంగా యమునలు కలిసిన చోటికి పోయి తపోనిష్ఠతో సమాధి గతుడయ్యాడు. అప్పుడు చేపలు అతడి చుట్టూ మూగి అతని శరీరాన్ని తాకుతూ అతనిని ముద్దుపెట్టుకొంటూ ఉంటే అతడు సంతోషంతో దయతో మనస్సులో వాటిమీదే భావం లగ్నం కాగా పదురెండు సంవత్సరా లున్నాడు.

విశేషం: ఈ చ్యవనుడి కథ అరణ్యపర్వంలో వచ్చింది. నహుషుడి కథ ఉద్యోగపర్వంలో ఉన్నది.

క. జాలరులు వలల నచ్చటి । మీలఁ దిగుచుచుండి, యయ్యమేయోగ్రతప
శ్శీలునిఁ గూడఁగఁ దిగిచి, భ । యాలోల మనస్కు లగుచు నమ్మునిపతికిన్. 259

ప్రతిపదార్థం: జాలరులు= పల్లెకార్లు; అచ్చటిమీలన్= ఆ మునిఉన్నతావులోని చేపలను; వలలన్= వలలతో; తిగుచుచున్+ఉండి= లాగుతూ; ఆ+అమేయ= ఆ మహత్తర; ఉగ్ర= భయంకర; తపః+శీలునిన్ కూడన్గన్= తపస్సే స్వభావంగా కల మహర్షిని కూడా; తిగిచి= లాగి; భయ+ఆలోల= భయంతో చలించే; మనస్కులు= మనస్సు కలవారు; అగుచున్= అవుతూ; ఆ+ముని పతికిన్= ఆ మునిశ్రేష్ఠుడితో.

తాత్పర్యం: మత్స్యకారు లా ముని ఉన్నచోట వలలతో చేపలను పట్టుతూ ఆ మహామునిని కూడా చేపలతో పాటుగా వలలతో లాగి, భయంతో వణికిపోతూ ఆ మహామునితో.

విశేషం: ఆ ముని గంగా యమునా సంగమంలో నీళ్ళలో మునిగి తపస్సు చేస్తున్నాడు. కనుకనే వలలో తగుల్కొన్నాడు. యోగులు ప్రాణవాయువును బంధించి సమాధిలోకి పోతున్నారు కనుక నీటిలో భూమిలో ఎక్కడైనా గాలి లేకపోయినా సమాధి గతులు కావటం సహజమే. శ్రీరామకృష్ణ పరమహంస సమాధి నిష్ఠులు కాగానే ఉచ్ఛ్వాస నిశ్వాసలుండేవి కావట.

ఆ. చాఁగి మ్రొక్కి 'తప్పసైఁపు మెఱుంగమి । నింతపుట్టె, సంయమీంద్ర! మమ్ముఁ
బరమకరుణఁ జూచి పనుపుము; దీనికి । నేమి సేయువార మింక?' ననుడు. 260

ప్రతిపదార్థం: చాఁగి మ్రొక్కి= సాష్టాంగ నమస్కారం చేసి; తప్పు= అపచారం; సైఁపుము= సహించుము; ఎఱుంగమిన్= తెలియకపోవటంవలన; ఇంత పుట్టెన్= ఇంత జరిగింది; సంయమి+ఇంద్ర!= మునిశ్రేష్ఠా!; మమ్మున్= మమ్ము; పరమ= గొప్ప; కరుణన్= దయతో; చూచి= క్షమించి; పనుపుము= ఆజ్ఞాపించుము; దీనికిన్= ఈ పనికి; ఇంకన్; ఏమి చేయువారము= ఏం చేయగలమో; అనుడున్= అనగా (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: మునీంద్రా! మమ్ము దయతో క్షమించుము. మాకు తెలియనందువలన ఇంత జరిగింది. దీనికి ప్రాయశ్చిత్త మేదో చెప్పి మమ్ములను రక్షించుము' అనగా.

క. జలచరములపై నర్మిలి । గలిగెడు మదిఁ దాల్చి చేర్చి కారుణ్యము బో
యలమీఁద నించుకేనియు । నలుక వొడమనీక యుండె నతఁ డవికృతుఁడై. 261

ప్రతిపదార్థం: అతఁడు= చ్యవనుడు; అవికృతుఁడై= మనోవికారాలు (కోపాదులు) లేనివాడై; జలచరములపైన్= నీటిలో తిరిగే (బ్రతికే); జీవరాసులపై; అర్మిలి= ప్రేమ; కలిగెడు= జనించే; మదిన్= మనస్సును; తాల్చి= పూని; బోయల మీఁదన్= చేపలు పట్టేవారిపై; కారుణ్యము= దయ; చేర్చి= నాటి; ఇంచుక+ఏనియున్= కొంచెమైనా; అలుక= కోపం; పొడమనీక= కలుగనీయక; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: చేపలపై ప్రేమ పూని బోయలపై దయతో మనస్సులో కోపతాపాదులే లేనివాడై ముని ఉన్నాడు.

వ. ఏటిదరికిం దిగువఁబడిన మీలదెస వారికిం జూపి వారితోడ. 262

ప్రతిపదార్థం: ఏటిదరికిన్= ఏటి ఒడ్డుకు; తిగువఁబడిన= లాగబడిన; మీల= చేపలయొక్క; దెసన్= దిశను; వారికిన్= బోయలకు; చూపి= చూపించి; వారితోడన్= బోయలతో.

తాత్పర్యం: వలలో పట్టి ఒడ్డున పెట్టబడిన చేపలవైపు చూపి ఆ బోయలతో.

తే. 'వీనితోడి సంవాసంబు మానసమునఁ । జాల నర్మిలిఁ బెనిచె; నిమ్మీలతోడఁ
గూడఁ బ్రాణంబు విడుచుట కూడదండ్రె । జనులు; గావున నటుసేయుఁ డనఘులార! 263

ప్రతిపదార్థం: అనఘులు+అర!= పాపంలేనివారైన ఓ బోయలారా! మీరు (ఆర= సంబోధనలో వచ్చే ప్రత్యయం); వీనితోడి= ఈ చేపలతో; సంవాసంబు= కలిసి బ్రతకటం; మానసమునన్= మనస్సులో; చాలన్= మిక్కిలి; అర్మిలిన్= ప్రేమను; పెనిచెన్= పెంచింది; జనులు= లోకులు; ఈ మీలతోడన్+కూడన్= ఈ చేపలతోపాటుగా; ప్రాణంబు విడుచుట= వదలుట, మరణించటం; కూడదు= పనికిరాదు; అండ్రె?= అంటారా? కావునన్= కాబట్టి; అటుచేయుఁడు= అట్లా చేయండి.

తాత్పర్యం: ఈ చేపలతోపాటుగా కలిసి నివసించాను కనుక వాటిమీద వల్లమాలిన ప్రేమ ఏర్పడింది. కనుక వాటితోపాటుగా మరణించటమూ మంచిదే. దీన్ని లోకులు మాత్రం కాదంటారా? కాబట్టి నేను చెప్పినట్లు చేయండి.

వ. తగిన తెఱంగు సెప్పెద వినుండు. 264

ప్రతిపదార్థం: తగిన తెఱంగు= వీలైన మార్గం; చెప్పెదన్; వినుండు= ఆలకించండి.

తాత్పర్యం: ఉచితపద్ధతిని చెప్పుతాను వినండి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఇమ్మీలను నన్నును మీ । రమ్మికొనుఁడు సేయువెలల ' కనుటయుఁ గడు శీ
ఘ్రమ్మున నహుషు కడకుఁ జని । యమ్ముని తెఱఁ గెల్లఁ జెప్పి రలుకుచు బోయల్. 265

ప్రతిపదార్థం: ఈ+మీలనున్= ఈ చేపలను; నన్నునున్= నన్నూ; చేయు వెలలకున్= అయిన ధరకు; మీరు; అమ్మికొనుఁడు= అమ్ముకొనండి; అనుటయున్= అనగా; బోయల్; అలుకుచున్= భయపడుతూ; శీఘ్రమ్మునన్= వేగంగా; నహుషు కడకున్= రాజైన నహుషుడి దగ్గరకు; చని= పోయి, ఆ ముని= ఆ చ్యవనుడి; తెఱఁగున్+ఎల్లన్= విషయమంతా; చెప్పిరి= చెప్పారు.

తాత్పర్యం: ఈ చేపలనూ, నన్నూ అయినకాడి కమ్ముకొనండి' అని ముని చెప్పేసరికి పాపం బోయలు బిక్కు బిక్కుమంటూ పరుగులతో నహుషుడనే రాజు దగ్గరకు పోయి ఆ ముని సంగతి అంతా చెప్పారు.

వ. చెప్పిన భయంబును సంభ్రమంబును బెనంగొన నమ్మనుజపతి మంత్రి పురోహిత సహితంబుగా నప్పరమ మునిపాలికిం జనుదెంచి సాష్టాంగ దండప్రణామంబు సేసి 'బోయలు సేసిన యపరాధంబు నేమి భంగి నీఁగు వాఁడ' నని విన్నవించిన, నద్దయాళుం డిట్లనియె.' 266

ప్రతిపదార్థం: చెప్పినన్= చెప్పగా; భయంబునున్; సంభ్రమంబునున్= తొట్రుపాటు; పెనంగొనన్= పెనవేసికొనగా; ఆ మనుజపతి= రాజు; మంత్రి= మంత్రులు; పురోహిత సహితంబుగాన్= పురోహితులతో పాటుగా; ఆ పరమ ముని= ఆ మహాముని; పాలికిన్= దగ్గరకు; చనుదెంచి= వెళ్ళి; సాష్టాంగ దండ ప్రణామంబు= ఎనిమిది అంగములు ఏక మౌనట్లుగా; దండ ప్రణామంబు= కర్రవలె చాగిలబడి చేసే నమస్కారం; చేసి= ఆచరించి; బోయలు; చేసిన; అపరాధంబు= తప్పు; ఏమి భంగిన్= ఏ విధంగా; ఈఁగువాఁడను= పోగొట్టుకొనగలను; అని; విన్నవించినన్= మనవి చేసుకొనగా; ఆ దయాళుండు= ఆ దయగలవాడు, చ్యవనమహర్షి; ఇట్లు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: చెప్పేసరికి తొట్రుపాటూ భయం రెండూ పెనవేసికొనగా ఆ రాజు మంత్రులను, పురోహితులను వెంటబెట్టుకొని సాష్టాంగంగా నమస్కరించి ఆ మహామునితో 'ఈ బోయలు చేసిన తప్పును నే నేవిధంగా సరిదిద్దుకొనగలనో?' అని విన్నవించుకొనగా ఆ దయగల ముని ఇట్లా అన్నాడు.

విశేషం: మంత్రి= రాజనీతివేత్తలు, భౌతిక రాజ్యాంగవేత్తలు, పురోహిత= వైదికులై దైవిక విపత్తులను నివారించేవారు. వీరుకూడా మంత్రులలో ఒకరు. రాష్ట్రానికి సంభవించే భౌతిక విపత్తును నివారించేవారు ఆధి దైవిక విపత్తులను నివారించేవారూ - ఆనాటి మంత్రి మండలిలో ఉండేవారు.

అష్ట+అంగము= రొమ్ము, ముఖం, మోకాళ్ళు, హస్తాలు మొదలైన అవయవాలన్ని భూమికి తాకేటట్లుగా కర్రవలె (దండం) బోర్లాపడి చేసే నమస్కారం. అచ్చమైన భక్తి ఉన్నచోట మాత్రమే ఇట్లా కుదురుతుంది. కర్రవలె అంటే మనస్సు నణచుకొని ఏకాగ్రంగా ఉండటం. నిశ్చలమైన మనస్సుతో చేసే నమస్కారం.

క. 'బోయలు నిజకుల ధర్మము । సేయుట యపరాధ మగునె? చెప్పెద విను వీ
రాయాసపడిరి; వీరికి । నాయొడలికిఁ దగిన వెల జనస్తుత యీవే!' 267

ప్రతిపదార్థం: జనస్తుత!= జనులచే స్తుతింపబడిన రాజా!; బోయలు; నిజ= తమ; కుల= వర్ణము యొక్క; ధర్మము= ఆచారం; చేయుట= పాటించటం; అపరాధము+అగునె?= తప్పు అవుతుందా? కాదు; చెప్పెదన్; విను; వీరు; ఆయాసపడిరి= కష్టపడ్డారు; నా యొడలికిన్= నా శరీరానికి; తగిన= అర్హమైన; వెల= ధర; వీరికిన్= బోయలకు; ఈవే!= ఇయ్యవయ్యా!

తాత్పర్యం: 'బోయలు తమ కుల ధర్మం పాటించటంలో తప్పులేదు. విషయం చెప్తుతాను వినుము. వీరు పాపం చాలా కష్టపడ్డారు. కనుక నా శరీరం ధర ఎంతో నిర్ణయించి అది వీరి కియ్యవయ్యా!'

విశేషం: వర్ణం వేరు. కులం వేరు. వర్ణాలు నాలుగే. కులమంటే ఒకే పద్ధతి, ఆహార విహారాచారాలు గల గుంపు.

క. అనుటయు మునివరు మనమునఁ । గినుక యొకింతయును లేమికిం బ్రీతుండై
జనపతి గిరాతులకు నిం । డని పనిచెను వేయుమాడ లాత్మసచివులన్ 268

ప్రతిపదార్థం: అనుటయున్= అనటంతోనే; మునివరు= మునిశ్రేష్ఠుడి; మనమునన్= మనస్సులో; కినుక= కోపం; ఒకింతయును= కొంచెంకూడా; లేమికిన్= లేకపోవటంవలన; ప్రీతుండై=సంతోషించి; జనపతి= రాజు; కిరాతులకున్= బోయలకు; వేయు= వేయి; మాడలు= నాణెములు (ఆనాటి రూపాయలు); ఇండు= ఇవ్వండి; అని; ఆత్మ= తన; సచివులన్= మంత్రులను; పనిచెను= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: అనటంతోనే రాజునకు సంతోషం కలిగింది. ఈ మునివరుడి మనస్సులో కోపం లేదు కదా అని. మంత్రులను పిలిచి 'వేయిమాడ లివ్వండి బోయలకు' అని ఆనతిచ్చాడు.

వ. పనిచిన యప్పలుకులు విని యమ్ముని యమ్మనుజ విభునితోఁ, 'దగవెఱింగి యిత్తుగా' కనవుడు, నప్పుడమిఱేఁడు పదివేలు సెప్పిన, నప్పరమ సంయమి యప్పటి మాటయ యాడిన, నా రాజు లక్ష యుగ్గడించె; దానికిం దపస్వి ముందటి పలుకు పలికిన; నతండు కోటి యిమ్మనియె; నమ్మాటకు నమ్మహాత్ముండు. 269

ప్రతిపదార్థం: పనిచినన్= ఆనతివ్వగా; ఆ+పలుకులు= ఆ మాటలు; విని; ఆ ముని= ఆ చ్యవనుడు; ఆ మనుజ విభునితోన్= ఆ రాజుతో; తగవు= న్యాయం; ఎఱింగి= తెలిసి; ఇత్తుగాక= ఇస్తావు కాక; అనవుడున్= అంటే; ఆ పుడమిఱేఁడు= ఆ భూమిపతి; పదివేలు= పదివేలు మాడలు; చెప్పినన్= చెప్పగా; ఆ పరమ= ఆ శ్రేష్ఠుడైన; సంయమి= ముని; అప్పటిమాటయ= ఇదివరకు చెప్పిన మాటే; ఆడినన్= అనగా; ఆ రాజు; లక్ష; ఉగ్గడించెన్= చెప్పాడు; దానికిన్= దానికీ; తపస్వి= ముని; ముందటిపలుకు= ఇదివరకు మాటే; పలికినన్; అతండు= రాజు; కోటి; ఇమ్ము+అనియెన్, ఆ మాటకున్; ఆ మహాత్ముండు= ఆ మహానుభావుడు.

తాత్పర్యం: ఆనతివ్వగా ఆ మాటలు విని 'న్యాయం తెలిసి వెల నిర్ణయించుము' అన్నాడు. రాజు పదివేలన్నాడు. మునీ అదే మాటన్నాడు. రాజు లక్ష అన్నాడు. దానికీ ముని ముందటిమాటే అన్నాడు. మరలా రాజు కోటి అన్నాడు. అప్పుడు ఆ మహాముని.

క. తల విసరి 'వెలఁ దగఁగ బో । యల కీ వలదయ్య!' యనిన నన్నరపతి 'వా
రల కిల సగ మిచ్చెద' నని । పలికిన, నప్పలుకు ద్రోపు వడ ముని పల్కెన్. 270

ప్రతిపదార్థం: తల విసరి= తల విదలించి; వెలన్= ధరను; తగఁగన్= తగునట్లు; బోయలకున్; ఈన్+వలదు+అయ్య!= ఇవ్వాలి కదయ్యా!; అనినన్; ఆ నరపతి= ఆ రాజు; వారలకున్; సగము; ఇలన్= రాజ్యాన్ని; ఇచ్చెదన్= ఇస్తాను; అని పలికినన్= అని చెప్పగా; ఆ పలుకు= ఆ మాట; త్రోపువడన్= తిరస్కృతము కాగా; ముని; పల్కెన్.

తాత్పర్యం: అనంగీకారంగా తలను ప్రక్కకుత్రిప్పి 'వెల సరిగా నిర్ణయించుము' అన్నాడు ముని. రాజేమో తన రాజ్యంలో సగ మిస్తా నన్నాడు. దానినీ కాదని ముని.

ఆ. రాజు దనదు సకలరాజ్యంబు బోయల। కిత్తు ననుడు నమ్మునీశ్వరుండు
'నీవు మంత్రివరులు నెయ్యురుఁ దలపోసి। యుచితమైన మూల్య మొసఁగు' మనియె. 271

ప్రతిపదార్థం: రాజు; తనదు= తనయొక్క; సకలరాజ్యంబు= రాజ్యమంతా; బోయలకున్; ఇత్తున్= ఇస్తాను; అనుడున్= అనగా; ఆ ముని+ఈశ్వరుండు= ఆ మునిశ్రేష్ఠుడు; నీవున్= నీవూ; మంత్రివరులు= శ్రేష్ఠులైన మంత్రులు; సచివులు; నెయ్యురున్= స్నేహితులూ; తలపోసి= ఆలోచించి; ఉచితమైన= తగినదైన; మూల్యము= వెల; ఒసఁగుము= బోయలకు ఇమ్ము; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: రాజు తన రాజ్యమంతా ఇస్తా నన్నాడు. అది విని ముని 'నీవూ' నీ మంత్రులూ, స్నేహితులూ అందరూ కలిసి ఆలోచించి తగినమూల్యం నిర్ణయించండి' అన్నాడు.

వ. అనిన విని విషాదంబుతో నహుషుం డవులం జని సచివులుం దానును నింకనేమి సేయువాఁడ నని చింతిల్లుచున్న సమయంబున నయ్యెడకు గవిజాతుండను సంయమి సనుదెంచి వారలతో 'మీరు చింత విడువుఁ డే నిమ్మునిపతి మూల్యంబు నిశ్చయించెద' ననుటయు నయ్యవనీవిభుం డప్పరివారం 'బింతటితో నాపత్పయోధి మునుంగకుండు నట్లుగా నన్నుంగావవే' యనుపలుకు పలికిన నతం డతని కిట్లనియె. 272

ప్రతిపదార్థం: అనినన్; విని; విషాదంబుతోన్= దుఃఖంతో; నహుషుండు; అవులన్+చని= అవతలకు వెళ్ళి; సచివులున్= మంత్రులును; తానునున్= తానూ; ఇంకన్+ఏమిచేయువాఁడను= ఇంకేమి చేసేది; అని; చింతిల్లుచున్= చింతిస్తూ; ఉన్న సమయంబునన్= ఉన్నవేళలో; ఆ+ఎడకున్= ఆ చోటికి; గవిజాతుండు= ఆ పేరుకల; సంయమి= ముని; చనుదెంచి= వచ్చి; వారలతోన్= రాజుతో, మంత్రులతో; మీరు; చింత= దుంఃఖం, విడువుఁడు= వదలిపెట్టండి; ఏను= నేను; ఈ+మునిపతి మూల్యంబున్= ఈ మునీశ్వరుని వెలను; నిశ్చయించెదన్= నిర్ణయిస్తాను; అనుటయున్= అనటంతో; ఆ+అవనీ విభుండు= ఆ భూమికి పతి, రాజు; ఆ పరివారంబు= రాజుతోపాటు వచ్చిన మంత్రులు మొదలగువారు; ఇంతటితోన్= ఈ నిర్ణయంతో; ఆపత్పయోధిన్= ఆపద అన్న సముద్రంలో; మునుంగక= మునగక; ఉండునట్లుగాన్= ఉండేటట్లుగా; నన్నున్; కావవే= రక్షించవే; అను పలుకు= అన్న మాట; పలికినన్= అనగా; అతండు= గవిజాతుండు; అతనికిన్= రాజుతో; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: అని అన్నాక విన్న రాజు క్రుంగిపోయి దుఃఖంతో మంత్రులూ తానూ అవతలకు పోయి విచారించటం ప్రారంభించగా అక్కడకు గవిజాతు డన్న ముని వచ్చి 'మీరు దుఃఖించవద్దు. నే నా ముని వెల నిర్ణయిస్తాను.' అనేసరికి రాజు తేరుకొని 'నేనూ నా పరివారమూ ఈ ఆపద అనే సముద్రంలో మునిగిపోకుండా కాపాడవయ్యా' అని వేడుకొనగా అతడు రాజుతో అంటున్నాడు.

తే. 'గోవునకు బ్రాహ్మణులకును గుల మొకండ । కమలజుఁడు రెండు దెఱఁగులుగా నొనర్చె;
హవికిఁ బూర్వంబు గారణ మఖిల మంత్ర । ములకధిష్ఠాన మపరంబు భూపవర్య! 273

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజశ్రేష్ఠుడా!; గోవునకున్= ఆవుకు; బ్రాహ్మణునకున్= పారునకు; కులము= వర్ణం; ఒకండ= ఒకటే; కమలజుఁడు= పద్మంలో పుట్టినవాడు, బ్రహ్మ; రెండు తెఱఁగులుగాన్= రెండు విధాలుగా; ఒనర్చెన్= నిర్మించాడు; హవికిన్= హవిస్సునకు (యజ్ఞంలో వేసే వస్తువు; నేయి, పాలు మొదలగునవి); కారణము= హేతువు; పూర్వంబు= మొదలైన; గోవు; అపరంబు= రెండవది (బ్రాహ్మణుడు); అఖిల= సమస్తమైన; మంత్రములకున్= వేదమంత్రాలకు; అధిష్ఠానము= ఆధారం.

తాత్పర్యం: రాజా! గోవూ, బ్రాహ్మణు డొకటే కులం. కాకపోతే బ్రహ్మ రెండుగా సృష్టించాడు. మొదటిదైన గోవు హవిస్సుకు కారణం కాగా (పాలు, నెయ్యి ఇచ్చేది కనుక) రెండవదైన తత్త్వం బ్రాహ్మణుడు సకల మంత్రాలకూ ఆధారం.

క. వివిధాగమాశ్రయం బగు । నవనీదేవునకు మూల్య మని వాక్రువ్వన్
శివునకును గాదు ధరణీ । ధవ! గోవును నట్టిదగుట దగు నది యొసఁగన్.' 274

ప్రతిపదార్థం: వివిధ= అనేకములైన; ఆగమ= వేదాలకు; ఆశ్రయంబు= ఆధారం; అగు= అయిన; అవనీ దేవునకున్= భూమిపై ఉన్న దేవత - బ్రాహ్మణుడికి; మూల్యము= వెల ఇది; అని; వాక్రువ్వన్= చెప్పగా; శివునకును= శివుడికైనా; కాదు= చేతకాదు; ధరణీ= భూమికి; ధవ!= పతీ; గోవునున్= ఆవుకూడా; అట్టిది+అగుటన్= అట్లాంటిది కావటంవలన; ఒసఁగన్= వెలగా ఇవ్వటానికి; అది= ఆవు; తగున్= తగును.

తాత్పర్యం: సర్వవేదాలకు మూలం బ్రాహ్మణుడే కనుక అతడివెల నిర్ణయించటానికి శివుడికే శక్తి లేదు. గోవుకూడా అట్లాంటిదే కనుక దానినే వెలగా ఇవ్వటం న్యాయం.'

తే. అనినఁ బ్రియమంది నృపతి సంయమి సమీప । మునకు వచ్చి మహాభాగ! ననుఁ గృపార్ద్ర
దృష్టిఁ జూడుము; భవదీయ దేహమునకు । నింత వెల యన వచ్చునే యేరికైన? 275

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ప్రియము= సంతోషం; అంది= పొంది; నృపతి= రాజు; సంయమి= ముని; సమీపమునకున్= దగ్గరకు వచ్చి; మహాభాగ!= మహానుభావుడా!; ననున్= నన్ను; కృపా+ఆర్ద్ర= దయతో తడిసిన; దృష్టిన్= చూపుతో; చూడుము; ఏరికిన్+ఐనన్= ఎవరికైనా; భవదీయ= నీ యొక్క; దేహమునకున్= ఒడలికి; ఇంత వెల; అనన్ వచ్చునే?= అనుటకు వీలున్నదా?

తాత్పర్యం: గవిజాతు డట్లా వెల నిర్ణయించేసరికి రాజు సంతోషించి చ్యవనుడిని సమీపించి 'మహాత్మా! నన్ను కనికరించుము. నీ శరీరం వెల ఇంతని ఎవరు నిర్ణయించగలరు?

క. మునినాథ! గోవు నిచ్చెద । ననవుడు వికచముఖుఁ డగుచు 'ననుగుణ మూల్యం
బున సంప్రీతిం బొందితి' । నని భృగుకులముఖ్యుఁ డిట్టు లను నహుషునితోన్. 276

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మునినాథ!= మునులలో శ్రేష్ఠుడా!; గోవున్= ఆవును; ఇచ్చెదన్; అనవుడున్; భృగుకుల ముఖ్యుఁడు= భృగుకులంలో గొప్పవాడు చ్యవనుడు; వికచ= విప్పారిన; ముఖుఁడు= ముఖం కలవాడు; అగుచున్= అవుతూ; అనుగుణ= తగిన; మూల్యంబునన్= వెలతో; సంప్రీతిన్= చక్కని ప్రీతిని, నిండుగా ఆనందం; పొందితిన్; అని= అంటూ; నహుషునితోన్=రాజుతో; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు.

తాత్పర్యం: మునినాథ! గోవు నిస్తా' ననేసరికి సంతోషంతో వికసించిన ముఖంతో భార్గవకులనాథుడైన చ్యవనుడు రాజుతో 'నీ వెలకు సంతోషించా' నంటూ ఇంకా ఇట్లా అంటున్నాడు.

క. 'గో వగ్ని మయ మమృతమయ । మో వసుధాధీశ ! వినుము హోమ విధాన
శ్రీవాహిని, నిచ్చెన త్రిద । శావాసంబునకుఁ బూజ్య మమరుల కైనన్.' 277

ప్రతిపదార్థం: ఓ వసుధా+అధీశ!= ఓయీ రాజా! (వసుధ= రత్నగర్భ, భూదేవికి; అధి+ఈశుఁడు= భర్త); గోవు= గోవంటే; అగ్నిమయము= అగ్ని స్వరూపం; అమృతమయము= అమృత స్వరూపం; వినుము= రహస్యం చెప్తున్నాను, జాగ్రత్తగా వినుము; హోమ విధాన= హోమం చేసే పద్ధతికి (అగ్నిలో హవిస్సులను అర్పించే విధానానికి); శ్రీ= పవిత్రమైన; వాహిని= మార్గం లేదా నది; త్రిదశ= దేవతల; ఆవాసంబునకున్= నివాసమైన స్వర్గానికి; నిచ్చెన= మెట్టు; అమరులకున్+ఐనన్= దేవతలకైనా; పూజ్యము= పూజించ తగింది.

తాత్పర్యం: రాజా! గోవంటే ఏమనుకున్నావు? జాగ్రత్తగా వినుము. గోవు అగ్నిమయం. అమృతమయం. యజ్ఞవిధానానికి పవిత్రమైన నది - మార్గం. దేవతలకు నివాసమైన స్వర్గానికి వేసిన నిచ్చెన దేవతల కైనా పూజ్యమే.'

విశేషం: ఈ పద్యం తిక్కనగారి శైలికి పరాకాష్ఠ. ఆయన మహేతిహాస శైలి(Sublime style)కి ప్రతీక.

నన్నయగారి శైలి మధురం. కవిబ్రహ్మశైలి విచిత్రమైనది. మొదటిది స్త్రీ సౌందర్యం వంటిది. ఇది పురుష గాంభీర్యం. క్షాత్ర శైలి. ఇది భావిస్తేనే తెలుస్తుంది. అది వినగానే తెలిసేది. ప్రాసస్థానం మీద ఒక ఊనిక పెట్టి పద్యం చదువుకొనాలి. పూర్వకాలం పద్యం పౌరాణికులు పాడేవారు. అదొక కళ. శ్రావ్యంగా ఆలపించటం ఒక కళగా పౌరాణికుడు అభ్యసించాడు. జానపద కళకారుల వలెనే లోకంలోకి జనమధ్యంలోకి పురాణ విద్యను ప్రచారం చేసినవాడు పౌరాణికుడు. అతడికి తెలిసినవిద్య ఈ పద్యం పాడే విద్య. అదొక అభినయ విశేషం. ఏ మాటను నొక్కి చదవాలి. ఏది తేల్చి చదవాలి. యతి, ప్రాస అంటే ఏమిటి? - ఈ రచనా కళ తెలిస్తే అప్పుడు శైలి తెలిసినట్లు.

గో - వగ్ని - గో అన్న అక్షరాన్ని దీర్ఘంగా సాగదీసి చదివి వ - ను తేల్చి దానిబరువు నంతా - గ్ని - మీద పడేటట్లు చదవాలి. మయమో - మరలా మో, మీవ దీర్ఘం, మోను - సాగదీసి చదవాలి - శ్రీ నీ అట్లాగే త్రిద - ను తేల్చి - "శా"ను సాగదీసి నొక్కుతూ చదివితే - ఆవు గొప్పతనం తెలుస్తుంది. పద్యరచనతో శైలిని సృష్టించటం తిక్కన మార్గం.

నన్నయగారి శబ్దమే మధురం. అల్లికా మధురమే. ఇది అలా కాదు. నన్నయగారి పద్యం అజంతా చిత్రం. తిక్కన్నగారి పద్యం ఎలిఫెంటా గుహలలోని త్రిమూర్తి శివవిగ్రహం. ఇది బరువుతో భూమిలోకి దిగిపోయింది. అది గాలిలో ఎగిరిపోతుంది.

అగ్ని - అమృత - హోమ వంటి శబ్దాలన్నీ వేదంలోని వేదవిద్యలోనివి.

జగత్తును అగ్నిహోమాత్మక అంటారు. ఉష్ణ - శీతశక్తుల ద్వంద్వ సమ్మేళనమే జగత్తు. 1. రేయింబవళ్ళు; 2. స్త్రీ పురుషులు; 3. రాజా ప్రజా; 4. గురువూ శిష్యుడూ; 5. మనిషి దైవం; 6. భూమి ఆకాశం - ఇట్లా ద్వంద్వం విరుద్ధాంశాల సమన్వయం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

1. కాలసూత్రం, 2. గృహస్థాశ్రమం; 3. రాష్ట్రవ్యవస్థ; 4. విద్యావ్యవస్థ; 5.దేవ స్వరూపం.

మతవ్యవస్థ - ఇట్లా ద్వంద్వ శక్తుల సమ్మేళనమే జగత్తు. దానినే సూర్యుడు చంద్రుడు = ఉష్ణశీతశక్తులంటుంది వేదం. అగ్ని= పురుష - ఉష్ణశక్తి; సోమ= చంద్రుడు - స్త్రీ - శీత శక్తి. కనుక గోవంటే ఈ రెండు శక్తుల సమ్మేళనం. ఇందుకే గోవు నారాధించటం ఆర్య సంస్కృతిలో ప్రధానాంశ మైనది.

ఈ ప్రాచీన వైదిక సంప్రదాయం తెలిసిన మహాకవి కనుక కవిబ్రహ్మ ఇంతటి అద్భుతమైన పద్యం వ్రాయగలిగాడు.

చ. అని యిటు లేర్పడం బలికి, 'యా తలఁ పెంతయు మేలు; గోవు ని
మ్మనఘచరిత్ర! యన్న, విభుఁడట్టుల చేసిన, బోయ లప్డు నె
మ్మనములు, మోద మంద గరిమంబున భార్గవుఁ జేరి 'మమ్ముఁ గ
న్గొనినది యాదిగాఁ గరుణ గూరెద వొక్కటి విన్నవింతుమే?' 278

ప్రతిపదార్థం: అని; ఇటులు; ఏర్పడన్= స్పష్టంగా; పలికి; ఆ తలఁపు= ఆ ఆలోచన; ఎంతయున్= మిక్కిలి; మేలు= మంచిది; గోవును= ఆవును; ఇమ్ము; అనఘ!= పాపంలేని; చరిత్ర!= శీలం కలవాడా!; అన్నన్= అనగా; విభుఁడు= రాజు; అట్టుల= అట్లే; చేసినన్= చేయగా; బోయలు; అప్డు; నెఱ+మనములు= నిండు మనస్సులు; మోదము= సంతోషం; అందన్= పొందగా; గరిమంబునన్= గౌరవంతో; భార్గవున్= చ్యవనుడిని; చేరి= సమీపించి; మమ్మున్; కన్గొనిన+అది= చూచినది; ఆదిగాన్= మొదలుగా; కరుణ= దయను; కూరెదవు= నింపుతావు; ఒక్కటి; విన్నవింతుమే?= మనవి చేసుకొందుమే?

తాత్పర్యం: అని ఈ విధంగా చెప్పి ' ఆ ఆలోచన మంచిది. పుణ్యాత్ముడా! గోవు నర్పించుము' అని అనేసరికి రాజు అట్లాగే చేశాడు. బోయ లప్పుడు నిండు మనస్సులు సంతోషించగా గౌరవంతో మునిని సమీపించి 'మమ్మ చూచిన దాదిగా దయను వర్షిస్తున్నావు. మేము ఒక్కటి విన్నవించుకొంటాము (నీవు అనుమతిస్తే).'

క. అని ప్రీతిఁ బలికి, యమ్ముని । యనుజ్ఞఁ గొని, 'మమ్ము, గావు మక్కటికమునం
గొనవయ్య! గోవు మాచే' । నన విని మొగమాట మనము నార్ద్రతఁ బెనుపన్. 279

ప్రతిపదార్థం: అని; ప్రీతిన్= ప్రేమతో; పలికి; ఆ ముని; అనుజ్ఞన్= అనుమతిని; కొని= తీసికొని; మమ్మున్; అక్కటికమునన్= దయతో; కావుము= కాపాడుము; మాచేన్= మానుండి; గోవున్= ఆవును; కొనవయ్య!= తీసికొనవయ్యా!; అనన్, విని; మొగమాట= మొగమాటచేత; మనమున్= మనస్సును; ఆర్ద్రతన్= కరిగిపోవటం; పెనుపన్= పెంచగా.

తాత్పర్యం: అని ప్రీతితో చెప్పి ఆ ముని అనుజ్ఞతో 'మమ్ములను రక్షించుము. దయతో ఆ గోవును నీవే మానుండి తీసికొనవయ్యా!' అని బోయలు వేడగా మొగమాటతో మనస్సు ద్రవించిపోగా.

తే. వేఁడికొనినట్టి కృపణుపై, వాఁడి చూడ్కి । యరయ నాశీవిషము చూపునట్ల కాన
చేయఁ బ్రార్థనా భంగంబు, మీ యభీష్ట । మాచరించెద నని గోవు నతఁడు గొనియె. 280

ప్రతిపదార్థం: వేడికొనిన+అట్టి= ప్రార్థించినట్టి; కృపణుపైన్= దీనునిపై; వాఁడి చూడ్కి= నిశితమైన చూపు; అరయన్= విచారించగా; ఆశీవిషము= పాము (కోరలలో విషమున్నది); చూపునట్లు= చూపు వంటిదే; కానన్= కావునన్; ప్రార్థనాభంగంబున్=

ప్రార్థనను నాశనం చేయటం; చేయన్= చేయను; మీ; అభి+ఇష్టము= కోరికను; ఆచరించెదను= అనుసరిస్తాను; అని; గోవును= ఆవును; అతఁడు=చ్యవనుడు; కొనియెన్= తీసికొన్నాడు.

తాత్పర్యం: వేడుకొన్నవారిపై కాఠిన్యం వహించటం పాము కాటువేయటంవంటిది. కనుక మీ ప్రార్థనను మన్నిస్తాను. భగ్నం చేయను 'మీరు కోరినట్లే గోవును గ్రహిస్తా'నని తీసికొన్నాడు.

వ. కొని యంత నిలువక. 281

ప్రతిపదార్థం: కొని= గ్రహించి; అంతన్= అంతటితో; నిలువక= ఆగక.

తాత్పర్యం: తీసికొని అంతటితో ఆగక.

తే. దర్శనప్రీతి వారిపైఁ దగుల, మీల । వలని యర్మిలి మనమున దళముకొనఁగ,
మీరు, మీలును, సమ్మోదమార దివికి । నేఁగుఁడని పల్కె భార్గవుం డెల్ల వినఁగ. 282

ప్రతిపదార్థం: దర్శనప్రీతి= చూడటంవలన ఏర్పడిన స్నేహం; వారిపైన్= బోయలపై; తగులన్= నాటుకొనగా; మీలవలని= చేపల మీదున్న; అర్మిలి= ప్రేమ; మనమునన్= మనస్సులో; దళము కొనఁగన్= దట్టం కాగా; మీరున్= బోయలైనమీరు; మీలునున్=చేపలును; సమ్మోదము= సంతోషం; ఆరన్= విచ్చుకొనగా; దివికిన్= స్వర్గానికి; ఏఁగుఁడు=పొండు; అని; ఎల్లన్= అందరూ; వినఁగన్= వినేటట్లు; భార్గవుండు= భృగువంశమౌని; పల్కెన్= అన్నాడు.

తాత్పర్యం: చూడటంవలన కలిగే ప్రేమ బోయలపై నాటుకొనగా, చేపలపై నున్న ప్రేమ దట్టం కాగా, బోయలతో ముని అన్నాడు అందరూ వినేటట్లుగా 'మీరూ, చేపలూ స్వర్గానికి పోదురు గాక!' అని.

విశేషం: ఇది వరం తప్ప శాపం కాదు. అకృత్రిమమైన స్వచ్ఛమైన హృదయం కలవారికి మాటలోని స్వచ్ఛత ఋజుత్వం, నిజాయితీ తెలుస్తాయి. కృత్రిమమైన మనస్సు కలవాడు ప్రతిమాటకూ వక్రభాష్యం చెప్పుకొంటాడు. ఇది నేటి మనిషి లక్షణ మని పైన చెప్పబడింది కదా! ఆ దృష్టితో చూస్తే 'ముని బోయలను చావగొట్టా డనవచ్చును. 'ఆశ్రమవాసపర్వం ద్వితీయాశ్వాసంలో ధృతరాష్ట్రుడికి వ్యాసుడు చనిపోయిన వారిని చూపించిన ఘట్టముంది. కొందరు ఆధునిక పండితులు దీనిని వివరిస్తూ వ్యాసుడు వారిని గంగలో త్రోసి చంపిం చాడని చెప్పారు. ఇదే హేతువాద దృష్టి అన్నారు. కాబట్టి శబ్దానికున్న ఋజువైన అర్థమేదో దాన్ని చెప్పటం వ్యాఖ్యానం తప్ప వక్ర వివరణం కాదు.

వ. పలికినఁ దత్క్షణంబ. 283

తాత్పర్యం: పలికిన వెంటనే.

తే. మీనములుఁ దారుఁ దనువుల తోన నెగసి । నాకలోకంబునకుఁ బోవ, నహుష నృపతి
సపరివారంబు గాఁగ నాశ్చర్య పూర । మగ్న మానసుఁ డయి యుండె మానవేంద్ర! 284

ప్రతిపదార్థం: మానవ+ఇంద్ర!= మానవలోకానికి రాజైనవాడా!; మీనములున్= చేపలును; తారున్= తాము, బోయలును; తనువులతోనన్= శరీరాలతోపాటుగా; ఎగసి= ఎగిరి; నాక లోకంబునకున్= స్వర్గలోకానికి; పోవన్= పోగా; నహుష నృపతి=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నహుష చక్రవర్తి; సపరివారంబుగాన్= పరివారంతోపాటుగా; ఆశ్చర్యపూర= ఆశ్చర్య ప్రవాహంలో; మగ్న= మునిగిన; మానసుఁడు+అయి= మనస్సు కలవాడై; ఉండెన్= నిశ్చేష్టుడై ఉన్నాడు.

తాత్పర్యం: చేపలు, బోయలు శరీరాలతో పైకి ఎగిరి స్వర్గానికి పోయారు. చూచిన రాజు, పరివారంతోపాటుగా ఆశ్చర్య సముద్రంలో మునిగిపోయాడు.

విశేషం: న+అ+కం= నాకం; కం=సంతోషం; ఆకం= దుఃఖం - సంతోషం లేకపోవటం; న+అకం= దుఃఖంలేనిది - ఆనందనిలయం.

వ. అప్పుడు. 285

తాత్పర్యం: ఆ సమయంలో.

క. చ్యవనుఁడు, గవిజాతుఁడు, న । య్యవనీశ్వరుఁ బిల్చి 'వరము లడుగుము రెం డీఁ
దివిరితి' మనుడు నతఁడు 'మీ । యవిరళ సంప్రీతికంటె నర్థము గలదే!' 286

ప్రతిపదార్థం: చ్యవనుఁడు=భార్గవుడు; గవిజాతుఁడున్= ఆ పేరుగల మునియు (గవి= ఆవుకు; జాతుఁడు= పుట్టినవాడు- గోసంతానం కనుకనే గోమాహాత్మ్యం చెప్పాడు. చూ.పై.273- 274 పద్యాలు); ఆ+అవనీ+ఈశ్వరున్= ఆ భూమిపతిని; పిల్చి= పిలిచి; వరములు= అనుగ్రహరూపంగా; అడుగుము; రెండున్= రెంటిని; ఈన్= ఇవ్వటానికి; తివిరితిమి= పూనుకొన్నాము; అనవుడున్= అనగా; అతఁడు= రాజు; మీ= మీయొక్క; అవిరళ= ఎడతెగని; (విరళము= పలుచగా - దూరంగా; న=లేనిది, దట్టంగా); సంప్రీతి కంటెన్= మంచి ప్రేమ కంటె; అర్థము= ప్రయోజనం; వరం; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: ఇద్దరు మునులు రాజుతో అన్నారు. 'రెండు వరాలనివ్వాలనుకున్నాం. కోరుకొమ్మంటే రాజన్నాడు 'మీకు నాపై నున్న ప్రేమకంటె కావలసిన దేమున్నది. (కోరదగిన దేమున్నది).'

తే. అనిన విని, యగ్గలం బైన యాదరమున । వారు ధర్మపరత్వంబు వాసవాభ
వైభవము నయ్యెడుమ నీకు వంశపావ । నాత్మ!' యనుచు, నంతర్హితు లైరి వత్స! 287

ప్రతిపదార్థం: అనినన్; విని; వారు; అగ్గలంబు+ఐన= ఎక్కువైన; ఆదరమునన్= ప్రేమతో; నీకున్; వంశపావన+ఆత్మ!= వంశంలో ఉన్నతుడైనవాడా!; ధర్మపరత్వంబు= ధర్మబుద్ధి; వాసవ+ఆభ= వాసవుడివంటి; వైభవము= ఐశ్వర్యం; అయ్యెడుమ= కలుగుగాక!; అనుచున్= అంటూనే; అంతర్హితులు= అంతర్ధానం; ఐరి= అయ్యారు; వత్స!= నాయనా!

తాత్పర్యం: అనేసరికి అధికమైన ఆదరంతో వారిద్దరూ రాజునాశీర్వదించారు. 'వంశోద్ధారకా! నీకు ధర్మపరాయణత్వం, ఇంద్రుడివంటి ఐశ్వర్యం కలుగుగాక! అంటూ అంతర్ధానమయ్యారు.

క. మది నద్భుతంబుఁ బ్రమదముఁ । బొదలఁగ నమ్మునుల మహిమఁ బొగడుచుఁ జనియెం
దదనంతరంబ పతి నిజ । సదనమునకు నెల్ల జనులు సమ్మద మందన్. 288

ప్రతిపదార్థం: మదిన్= మనస్సులో; అద్భుతంబు= ఆశ్చర్యం; ప్రమదమున్= సంతోషం; పొదలంగన్= కలుగగా; ఆ+మునుల;

మహిమన్= మాహాత్మ్యమును; పొగడుచున్= స్తుతిస్తూ; తత్+అనంతరంబు+అ= ఆ తరువాత; ఎల్లన్‌జనులు= జనులంతా; సమ్మదము= సంతోషం; అందన్= పొందగా; పతి= రాజు; నిజ= తన; సదనమునకున్= సౌధానికి - మేడకు; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: రాజు మనస్సులో ఆశ్చర్యం, సంతోషం ముప్పిరిగొనగా ఆ మునుల మాహాత్మ్యం స్తుతిస్తూ జనులంతా ఆనందిస్తుండగా తన సౌధానికి పోయాడు.

వ. అని చెప్పి భీష్ముండు. 289

తాత్పర్యం: అని భీష్ముడు కథను వివరించి.

క. వినిపించితి సంవాసం । బున దర్శనమునను జిత్తమున నధిక స్నే
హ నిరూఢి గల్గుటయు గో । వునందు గల గౌరవముఁ జెవుల కింపెసఁగన్. 290

ప్రతిపదార్థం: సంవాసంబునన్= కలిసి జీవించటంవలన; దర్శనమునను= చూడటంవలన; చిత్తమునన్= మనస్సులో; అధిక= మిక్కిలి; స్నేహ నిరూఢి= స్నేహ దృఢత్వం; కల్గుటయున్= కలుగుట; గోవునందున్= గోవుపై; కల; గౌరవము= గురుత్వ భావం, గొప్పతనం; చెవులకున్; ఇంపు= ఆనందం; ఎసఁగన్= అతిశయం కాగా; వినిపించితిన్= వినిపించాను.

తాత్పర్యం: కలిసిమెలిసి బ్రతకటంవలన, దర్శనంవలన మనస్సులో స్నేహం నాటుకొనటం, ఆవుల గొప్పతనం చెవుల కింపుగా వినిపించాను.

చ్యవన కుశిక సంవాదంబను నితిహాసము (సం.13-52-1)

వ. అనిన విని యక్కురువంశవర్యుం డా ధర్మధుర్యునితో, 'నాకు నొక్కటి వినుటకుం గుతూహలం బెప్పుడుం గల్గియుండు; ఉదాత్తబ్రాహ్మ్యనిధి యైన భార్గవాన్వయంబునం జిత్రతర క్షాత్త్ర చరిత్రుం డగు పరశురాముండు జనియించుటయు, నుత్తమ క్షత్రియత్వ మహోష్మంబైన కుశిక కులంబునం బరమ బ్రాహ్మణ్యవిశ్రుతుం డైన విశ్వామిత్రుం డుదయించుటయును, నది యెట్లొకో? అనుచుండుదుఁ దొల్లియుఁ గొంత వింటి; నిస్సంశయంబు గాదు; మహాత్మా! మదీయచిత్తాయత్తంబుగా నత్తెఱం గెఱింగింపవే!' యనుటయు నయ్యనిమిషనదీ నందనుండు గుంతీనందనాగ్రజు తోడం 'జ్యవనకుశిక సంవాదంబను నితిహాసంబు వినుము. దాన భవత్సంశయంబు వాయు; జ్యవనుండు నిజవంశంబునకుం గుశిక కులంబు కారణంబుగా సంకరంబు గలుగఁ గలయది అని యెఱింగి యక్కుశిక కలంబునకు నుత్పాతం బాపాదింపంగోరి కుశిక భూపాలు పాలికిం జనిన నతండు. 291

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ+కురువంశ వర్యుండు= ఆ కురువంశ శ్రేష్ఠుడు, ధర్మరాజు; ఆ ధర్మధుర్యునితోన్= ఆ ధర్మవేత్తతో; నాకున్ ఒక్కటి వినుటకున్; కుతూహలంబు= కోరిక; ఎప్పుడున్; కల్గి+ఉండున్= కలుగుతుంటుంది; ఉదాత్త= ఉన్నతమగు; బ్రాహ్మ్యనిధి= బ్రాహ్మ్యశక్తికి, బ్రాహ్మణమాహాత్మ్యానికి నిధి అయిన; భార్గవ+అన్వయంబునన్= భార్గవ వంశంలో; చిత్రతర= మిక్కిలి అద్భుతమైన; క్షాత్ర చరిత్రుండు= క్షత్రియ చరిత్ర కలవాడు; అగు; పరశురాముండు; జనియించుటయున్; ఉత్తమ క్షత్రియత్వ= ఉత్కృష్ట క్షాత్ర; మహా+ఊష్మంబు= గొప్ప నిప్పు (వేడి) గల; కుశిక కులంబునన్= కుశిక వంశంలో;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరమ బ్రాహ్మణ్య విశ్రుతుండు= బ్రాహ్మణశక్తితో ప్రఖ్యాతుడు; ఐన విశ్వామిత్రుండు ఉదయించుటయును; అది ఎట్లు+ఒకో!= అదెట్లా సాధ్యం!; అనుచుండుదున్; తొల్లియున్= పూర్వంకూడా; కొంత+వింటిన్; నిస్సంశయంబు కాదు= సందేహం తీరదు; మహా+ఆత్మా; మదీయ= నా; చిత్త+ఆయత్తంబుగాన్= నా మనస్సుకు హత్తుకొనేటట్లు; ఆ+తెఱంగు= ఆ విషయం; ఎఱింగింపవే; అనుటయున్; ఆ+అనిమిష నదీనందనుండు= ఆ దేవతానది అయిన గంగ కొడుకు; కుంతీనందన+అగ్రజుతోడన్= కుంతికొడుకులలో పెద్దవాడైన ధర్మరాజుతో; చ్యవనకుశిక సంవాదంబు+అను ఇతిహాసంబు; వినుము, దానన్; భవత్= నీ; సంశయంబు= సందేహం; పాయున్= తొలగిపోతుంది; చ్యవనుండు; నిజ= తన; వంశంబునకున్; కుశిక కులాలు; కారణంబుగాన్; సంకరంబు=సాంకర్యం; కలుగన్ కలయది= సంభవింపగల్గును; అని; ఎఱింగి= తెలిసి; ఆ+కుశికకులంబునకున్; ఉత్పాతంబు= విపత్తు; ఆపాదింపన్= కలిగింపగా; కోరి; కుశిక భూపాలు పాలికిన్= ఆ కుశికరాజువద్దకు; చనినన్= వెళ్ళగా; అతండు.

తాత్పర్యం: ధర్మరాజు భీష్మడిని ప్రశ్నిస్తున్నాడు. నాకు ఒక విషయాన్ని తెలుసుకోవాలని ఎప్పటినుంచో కుతూహలంగా ఉంది. 'మహత్తరమైన బ్రాహ్మణశక్తి కల భృగువంశంలో విచిత్రమైన క్షత్రియశీలం కల పరశు రాముడెట్లా జన్మించాడు? మహోత్తమమైన క్షాత్రశక్తితో మండే కుశికవంశంలో బ్రాహ్మణ తేజస్సు కల విశ్వామిత్రు డెట్లా పుట్టాడు? ఇదివరకు కొంత విన్నాను. కాని సంశయం తీరలేదు. కనుక నా మనస్సున నాటుకొనేటట్లు స్పష్టంగా ఆ కథ చెప్పుము' అంటే భీష్మడు 'అయితే చ్యవన కుశిక సంవాదం వినుము. నీ సందేహం తీరుతుంది. చ్యవనుడు కుశికుడివలన తన వంశం సంకరమౌతుందని తెలిసికొని ఆ కులానికి ఆపద నాపాదించాలనుకొని కుశికుడి దగ్గరకు పోయి.

విశేషం: ఇదివరకు విన్నాను. అన్నమాట చాలా నేర్పుగా అన్నాడు. ఎందుకంటే ఈ కథలు పూర్వపర్వాలలో వచ్చాయి కనుక.

క. భార్యా సహితముగా న । య్యార్య వరుని కనుగుణంపు టర్చన విధివ
చ్చర్యాపూర్వముగ వినయ । ధుర్యత వెలయంగఁ జేసె దోహల మమరన్. 292

ప్రతిపదార్థం: భార్యాసహితముగాన్= భార్యతోపాటుగా; ఆ+ఆర్యవరునికిన్= ఆ పూజనీయులలో శ్రేష్ఠుడికి; అనుగుణంపు= తగిన; అర్చనన్= పూజను; విధివత్= శాస్త్రానుగుణమైన; చర్యాపూర్వముగన్= చేష్టా పూర్వకంగా; వినయ ధుర్యత= వినయభారం; వెలయంగన్= ప్రకాశించేటట్లు; దోహలము= ఉత్సాహం; అమరన్ చేసెన్= అమరేటట్లు చేశాడు.

తాత్పర్యం: కుశికుడు భార్యతో కలిసి ఆ మునివరునకు శాస్త్రం చెప్పిన పద్ధతిగా వినయంతో ఉత్సాహంగా పూజలు చేశాడు.

విశేషం: ఆర్యుడు= పూజింపదగినవాడన్న అర్థంలోనే ప్రాచీన గ్రంథాలలో ఉన్నది. కాని నేడు చరిత్రకారులు ద్రావిడజాతిని అణగద్రొక్కి, ఆర్యులెక్కడ నుండో కొన్నివేల ఏళ్ళక్రితం భారతదేశానికి వచ్చారని చెప్పుతున్నారు. ఈ దేశాన్ని అప్పటికే పాలించేవారు ద్రావిడజాతి అని వీళ్ళవాదన. కానీ వేదంలో ఎక్కడా ఈ అర్థంలో లేదని పండితులంటున్నారు.

క. పూజితునిఁ జేసి, యతనికి । రాజవరుం డిట్టులనియె 'రాజ్య విభుత్వ
భ్రాజిష్ణుఁడవై భృత్యుని । యోజను నను నడపి యేలు ముర్వి మునీంద్రా! 293

ప్రతిపదార్థం: పూజితునిన్+చేసి= పూజించి (పూజించబడిన వాడినిగా చేసి); అతనికిన్= అతడితో; రాజవరుండు= రాజశ్రేష్ఠుడు; ఇట్టులు; అనియెన్; మునీంద్రా!= మునిశ్రేష్ఠా!; రాజ్యవిభుత్వ= రాజ్యసంబంధమైన ప్రభు భావంతో (రాజత్వంతో);

భ్రాజిష్ణుఁడవు+ఐ= ప్రకాశించేవాడివై; ననున్= నన్ను; భృత్యుని= సేవకుని; ఓజను= వలె; నడపి= నియోగించి; ఉర్వి ఏలుము= భూమిని పాలించుము.

తాత్పర్యం: మునీంద్రుడిని పూజించి రాజేంద్రు డతనితో అన్నాడు. 'మునీంద్రా! నీవు రాజ వైభవంతో వెలుగొందుతూ నన్ను నీ సేవకుడిగా చేసికొని ఈ ధరణిని పాలించుము.

క. **ఏనును, భార్యయు, బంధులు, । నానా జనసహితముగ సనాథతఁ గని య**

ట్లైనం బెంపుం బొరయం । గా నిలకుఁ బ్రమోద మొందఁ గైకొను మమ్మున్. **294**

ప్రతిపదార్థం: ఏనునున్= నేనూ; భార్యయున్= భార్యా; బంధులున్=చుట్టాలూ; నానా జనసహితముగన్= అనేకులతో పాటుగా; సనాథతన్+కని= సభర్తృకత్వమునుపొంది; ఇలకున్= నేలకు (రాజ్యానికి); అట్లు= ఆవిధంగా; అయినన్= అయితే; పెంపున్= శుభం,అభివృద్ధి; పొరయంగాన్= కలుగగా; ప్రమోదము= సంతోషం; ఒందన్= పొందేటట్లుగా; మమ్మున్; కైకొనుము= స్వీకరించుము.

తాత్పర్యం: నేనూ, నా భార్య, చుట్టాలు, పక్కాలు అంతా నిన్ను రాజుగా అంగీకరించి సేవిస్తాం. రాజ్యానికి శుభాభివృద్ధి కలిగేటట్లు మమ్ములను స్వీకరించుము.'

చ. **అన విని, యమ్ముని ప్రవరుఁ డాతని కిట్లను 'రాజ్యకాంక్ష నా**

మనమున లేదు, సద్వ్రతము, మానిత వృత్తిఁ జరించువాఁడ నై

జనవర! వచ్చినాఁడఁ; బరిచారము నీవును నీదు పత్నియున్

గొనకొని చేయఁ గావలయుఁ గోరిక యింతియ తీర్పు మోపినన్.' **295**

ప్రతిపదార్థం: అనన్= అనగా; విని; ఆ ముని= మునులలో; ప్రవరుఁడు= శ్రేష్ఠుడు; అతనికిన్= రాజుతో; ఇట్లు; అనున్; జనవర= మానవనాథా!; నా మనమునన్= నా మనస్సులో; రాజ్యకాంక్ష= రాజ్యంమీద కోరిక; లేదు; మానిత= గౌరవించ దగ్గ; వృత్తిన్= ప్రవర్తనతో; సత్+వ్రతము= మంచి వ్రతం; చరించువాఁడనై= ఆచరించేవాడనై; వచ్చినాఁడన్= వచ్చాను; నీవునున్= నీవూ; నీదు= నీ; పత్నియున్= భార్యా; కొనకొని= పూనుకొని; పరిచారము= సేవ; చేయఁ గావలయున్=చేయాలి; ఇంతియ= ఇంతే; కోరిక= నా అభిలాష!; ఓపినన్= ఓపిక ఉంటే; తీర్పుము= చెల్లించుము.

తాత్పర్యం: అంతా విని మునీంద్రు డన్నాడు. 'రాజా! నాకు రాజ్యమేలాలన్న కోరిక ఏ కోశానా లేదు. నేను ఒక వ్రతాన్ని పూని దానిని చెల్లించుకొనటానికై తిరుగుతున్నాను. నీకు ఓపిక ఉంటే నీవూ, నీ భార్యా, బంధువులూ నాకు సేవచేస్తే చాలు. నా కోరిక ఇంతే.'

వ. **అనిన విని యా దంపతులు ముదంబునం బొదలి 'యట్ల చేయువార' మనిరి; తదనంతరంబ.** **296**

ప్రతిపదార్థం: అనినన్ విని= అనటం విని; ఆ దంపతులు= రాజూ రాణీ; ముదంబునన్= సంతోషంతో; పొదలి= వర్ధిల్లి; అతిశయించి; అట్ల= అట్లే; చేయువారము= చేస్తాము; అనిరి= అన్నారు; తత్+అనంతరంబు+అ= అటు తరువాత.

తాత్పర్యం: అనగా విని ఆ దంపతులు సంతోషించి 'అట్లాగే చేస్తా' మన్నారు. ఆ తరువాత.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అమ్ముని నభ్యంతర సద । నమ్మునకుం గొని విభుండు నాతియుఁ దానున్,
సమ్మోదమ్మునఁ జని, హృ । ద్యమ్మగు, నొక చోటు సూపి యాతనితోడన్. 297

ప్రతిపదార్థం: ఆ+మునిన్= చ్యవన మహర్షిని; అభ్యంతర= లోపలి; సదనమ్మునకున్= ఇంట్లోకి; అంతఃపురానికి; కొని= తీసికొని; విభుండు= రాజు; నాతియున్= స్త్రీ (రాణి); తానున్= (రాజు) తాను; సమ్మోదమ్మునన్= సంతోషంతో; చని= పోయి; హృద్యమ్ము+ అగు= అందమైన; ఒకచోటు= ఒక స్థలం; చూపి; అతనితోడన్= మునితో.

తాత్పర్యం: ఆ మునిని అంతఃపురానికి తీసికొనిపోయి రాజూ రాణీ సంతోషంతో ఆయన కొక అందమైన నివాసం చూపించి ఆ మునితో.

ఆ. 'అనఘ! యిచట నుండు' మని పల్కి, మృదులత । ల్పంబు నంచితాసనంబు నచటఁ
బెట్టఁ బనిచి యేము ప్రీతి నొనర్చెద । మిష్టభంగిఁ బనుపుఁ డెద్దియైన' 298

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా!, స్వామీ; ఇచటన్= ఈ చోట; ఉండుము; అని; పల్కి= చెప్పి; మృదుల= మెత్తని; తల్పంబు= శయ్య; అంచిత= ఒప్పిదమైన; ఆసనంబు= పీఠం; అచటన్= అక్కడ; పెట్టన్= పెట్టుమని; పంచి= ఆజ్ఞాపించి; ఏము= మేమిద్దరం; ప్రీతిన్= ప్రేమతో; ఒనర్చెదము= సేవిస్తాము; ఇష్టభంగిన్= నీకిష్టమైన విధంగా; ఎద్దిఐనన్= ఏదైనా సరే; పనుపుము= ఆనతిమ్ము!

తాత్పర్యం: 'పాపంలేనివాడా! నీవు ఇక్కడ ఉండుము.' అని పరుండుటకు మెత్తని శయ్య, కూర్చోటానికి చక్కనిపీఠం ఉంచుమని ఆజ్ఞాపించి; 'స్వామీ! తమయిష్టానుసారంగా మేము సేవిస్తాము. మీ కేమి చేయాలో చెప్పండి.'

వ. అనియె; నంత నినుం డపరగిరికడచనినం, గాలోచిత కృత్యంబు లాచరించి యమ్మహాత్ముం డాహార మడిగిన నమ్మహీపతి మహితభోజనంబున నతనిం దృప్తునిం గావించిన.' 299

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అంతన్= అంతలో; ఇనుండు= సూర్యుడు; అపరగిరికడ= పశ్చిమదిక్కున నున్న పర్వతందగ్గరికి; - క్రుంకు కొండకు; చనినన్= పోగా; కాల= ఆ సంధ్యాసమయానికి; ఉచిత= తగిన; కృత్యంబులు= వైదిక కార్యాలు (పనులు); ఆచరించి= చేసి; ఆ మహాత్ముండు= ఆ ముని; ఆహారము= భోజనం; అడిగినన్= అడుగగా; ఆ మహీపతి= ఆ భూమిపతి, రాజు; మహిత= గొప్ప; భోజనంబునన్= ఆహారంతో; అతనిన్= మునిని; తృప్తునిన్+కావించినన్= తృప్తిపడేటట్లు చేయగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: అని అన్నాడు. ఇంతలో సాయంకాలమైనది. ముని సంధ్యాకాలంలో చేయదగ్గ సంధ్యావందనాది వేదోక్త కర్మ లాచరించి రాజుతో భోజనం కావా లన్నాడు. రాజు గొప్ప విందు భోజనంతో మునిని తృప్తుడిని చేశాడు.

ఆ. అతఁడు సెజ్జఁ జేరి, యధిపుతో 'నియ్యెడ । నిద్రవోదు నేను నృపవరేణ్య!
మీరు నిదుర దక్కి, మెలపున నాచర । ణంబు లొత్తు చునికి నాకుఁ బ్రియము. 300

ప్రతిపదార్థం: అతఁడు= ముని; సెజ్జన్= శయ్యను; చేరి= సమీపించి; అధిపుతోన్= రాజుతో; ఈ+ఎడన్= ఇక్కడ; నేను నిద్రపోదున్= నిద్రపోతాను; నృపవరేణ్య!= రాజులలో చాలా గొప్పవాడా!; మీరు= మీ దంపతులిద్దరు; నిదుర; తక్కి= లేకుండా; మెలపునన్= చక్కగా; నా చరణంబులు= నా కాళ్ళు; ఒత్తుచున్+ఉనికి= ఒత్తుతూ ఉండటం; నాకున్; ప్రియము= ఇష్టం.

తాత్పర్యం: ముని భోజనం చేసి మంచమెక్కి రాజుతో అన్నాడు 'నే నిక్కడ నిద్రిస్తానయ్యా! రాజశ్రేష్ఠుడా! మీ దంపతులిద్దరూ నిద్రపోకుండా నా కాళ్ళు పిసుకుతూ మేల్కొని ఉండండి: అదే నాకిష్టం.

క. ఏనై మేల్కనునంతకు । భూనాయకవర్య! నన్ను బోధింపకుఁ డీ
మానినియు నీవు' నని, ని । ద్రా నిరతుం డయ్యె, వారుఁ దద్దయు భక్తిన్. 301

ప్రతిపదార్థం: ఏను+ఐ= నా అంత నేనుగా; మేల్కను+అంతకున్= మేలుకొనే టంతవరకు; భూనాయకవర్య!= రాజులలో శ్రేష్ఠుడా!; నన్నున్; ఈ మానినియున్= ఈ నీ భార్యయూ; నీవున్; బోధింపకుఁడు= మేల్కొలుపవద్దు; అని; నిద్రానిరతుండు+ అయ్యెన్= నిద్రలో మునిగిపోయాడు; వారున్= దంపతులు; తద్దయున్= మిక్కిలి; భక్తిన్= భక్తితో.

తాత్పర్యం: నా అంత నేనై లేచేటంతవరకు మీ ఇద్దరిలో ఎవరూ నన్ను నిద్ర లేపవద్దు' అని నిద్రించాడు. ఆ దంపతులు మిక్కిలి భక్తితో. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. కుడుపు నిదురయు, వర్జించి యడుగు లొత్తు । చుండి రమ్ముని వల్లభుఁ డొక్కప్రక్క
నచలగాత్రుఁడై నిద్రింప నద్భుతముగ । దినము లిరువది యొక్కటి సనియె నధిప! 302

ప్రతిపదార్థం: కుడుపు= తిండి; నిదురయున్= నిద్రా; వర్జించి= వదలి; అడుగులు= పాదాలు; ఒత్తుచున్+ఉండిరి= ఒత్తుతూ ఉన్నారు; ఆ ముని వల్లభుఁడు= ఆ మునిరాజు; ఒక ప్రక్కన్= ఒకే ప్రక్కకు తిరిగి; అచల= కదలిక లేని; గాత్రుఁడై= శరీరం కలవాడై; అద్భుతముగన్= ఆశ్చర్యముగా; నిద్రింపన్= నిద్రపోగా; ఇరువదిఒక్కటి; దినములు= రోజులు; చనియెన్= గతించాయి; అధిప!= రాజా! - ధర్మరాజా! (శ్రోత).

తాత్పర్యం: ధర్మరాజా! ఆ దంపతులు అన్నం నిద్రా విసర్జించి పాదాలు ఒత్తుతూనే ఉన్నారు. ఆ ముని ఒకే ప్రక్కకు తిరిగి పడుకొన్నవాడు పడుకొన్నట్లుగానే ఉన్నాడు. శరీరంలో కదలిక లేదు. ఈ విధంగా ఇరవై ఒక్క రోజులు గతించిపోయాయి.

విశేషం: ఇరవై ఒక్క రోజులు ఎట్లా పడుకుంటాడు? పిచ్చికథ అనవచ్చును. కానీ, యోగులు సమాధిలో మునిగి ఉండగలరు. ఈ యుగంలో శ్రీ రామకృష్ణ పరమహంస అట్లా ఉన్నారని వారి జీవిత చరిత్రలో ఉన్నది. ఒత్తుచుండిరి= ఒత్తుతూ ఉన్నారు. ఏమరుపాటు లేకుండా భక్తితో - దీన్ని శత్రర్థక క్రియ అంటారు.

వ. ఇరువది రెండవనాఁ డమ్ముని తనయంతన మేల్కొని. 303

తాత్పర్యం: ఇరవైరెండో రోజున ఆ ముని తనంత తానే నిద్ర లేచి.

క. ఇలు వెడలి పోయె నేమియుఁ । బలుకక; యా దంపతులును బరమశ్రాంతా
త్ము లగుచు వెనుకన చని; ర । క్కులపతి యించుకయు సరకుగొనఁ డవ్విధమున్. 304

ప్రతిపదార్థం: ఏమియున్= ఏమీ; పలుకక= మాట్లాడక; ఇలు వెడలిపోయెన్= ఇల్లు వదలి వెళ్ళిపోయాడు; ఆ దంపతులును= రాజూ రాణీ; పరమ= మిక్కిలి; శ్రాంత+ఆత్ములు= అలసిపోయిన శరీరం కలవారు; అగుచున్= అవుతూ; వెనుకన= ఆముని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వెనుకనే; చనిరి= వెళ్ళారు; ఆ+కులపతి= ఆ ముని; ఇంచుకయున్= కొంచెమైనా; ఆ విధమున్= ఆ పద్ధతిని; సరకుకొనఁడు= లెక్కపెట్టడు.

తాత్పర్యం: ముని లేచిందే తడవుగా ఏమీ మాట్లాడకుండానే ఇల్లు వదలి వెళ్ళిపోయాడు. బాగా అలసిపోయిన దంపతులు ఆయన వెనుక పడ్డారు. దానికీ ఆయన లెక్కచేయలేదు.

విశేషం: కులపతి= పదివేల శిష్యులకు అన్నదానంతోపాటు విద్యాదానం చేసే గురువు. (ఇవ్వాళ వైస్ఛాన్సలరు - అన్నమాట కిది తెలుగుగా వాడుతున్నారు - ఆయన అట్లాంటి పనిచేయకపోయినా).

ఆ. అట్లు వారివలన నాదర రహితుఁడై । పురవరంబు వెడలి పోయి పోయి
యతఁడు సూడఁజూడ 'నంతర్హితుం డైనఁ । బతియు సతియు మూర్ఛపాలు పడిరి. 305

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; వారివలనన్= వారిపై; ఆదర= ప్రేమ; రహితుఁడై= లేనివాడై; పురవరంబు= శ్రేష్ఠమైన నగరం; వెడలి= బహిర్గమించి - బయటకు వచ్చి; పోయిపోయి= చాలా దూరం పోయి; చూడన్+చూడన్= చూస్తూ ఉండగానే; అతఁడు= ఆ ముని; అంతర్హితుండు= అదృశ్యుడు; ఐనన్= కాగా; పతియు సతియున్= భర్తా, భార్యా; మూర్ఛపాలు పడిరి= మూర్ఛపోయారు.

తాత్పర్యం: ఆ విధంగా వారిని నిరాదరించిన ముని నగరం దాటి పోయిపోయి అదృశ్యం కాగా రాజూ రాణీ మూర్ఛపోయారు.

క. కొంతవడికిఁ దెప్పిఱి యెద । నెంతయు వగ నూనఁ బురికి నేతెంచి గృహా
భ్యంతరము సొచ్చి కని ర । య్యింతియును విభుండు నమ్మునీశ్వరు సెజ్జన్. 306

ప్రతిపదార్థం: కొంతవడికిన్= కొంచెం సేపటికి; తెప్పిఱి= మూర్ఛనుండి తెప్పరిల్లి; ఎదన్= హృదయంలో; ఎంతయున్= ఎంతో; వగన్= దుఃఖం; ఊనన్= పొందగా; పురికిన్= నగరానికి; ఏతెంచి= వచ్చి; గృహ+అభి+అంతరమున్= అంతఃపురం లోనికి; చొచ్చి= ప్రవేశించి; ఆ+ఇంతియును= ఆ స్త్రీ (రాణి); విభుండున్= రాజూ; ఆ+ముని+ఈశ్వరున్= ఆముని శ్రేష్ఠుడిని; సెజ్జన్= శయ్యపై; కనిరి= చూచారు.

తాత్పర్యం: కొంతసేపటికి మూర్ఛనుండి తేరుకొని మనస్సులో బాగా మథనపడి తిరిగి నగరం ప్రవేశించి అంతఃపురంలోకి పోయి చూస్తే మునీశ్వరుడు మంచంపైనే ఉన్నాడు.

వ. మును నిద్రించు ప్రక్కదక్క యొండు ప్రక్క నిద్రించు భార్గవు నట్లు గాంచి సంతోషించి, పరిశ్రాంతి దిగద్రావి యెప్పటి చొప్పున నడుగు లొత్తుచుండ, మఱియు దినంబు లిరువది యొక్కటి సనినం బ్రబుద్ధుండై. 307

ప్రతిపదార్థం: మును= ముందు - పూర్వం; నిద్రించు ప్రక్క= నిద్రించే వైపు; తక్కి= వదలి; ఒండుప్రక్కన్= మరొకప్రక్క; నిద్రించు= నిద్రపోయే; భార్గవున్= చ్యవనుడిని; అట్లు= ఆ విధంగా; కాంచి= చూచి; సంతోషించి= ఆనందించి; పరిశ్రాంతిన్= అలసటను; దిగన్ త్రావి= దిగవిడిచి, త్యజించి; ఎప్పటి చొప్పునన్= ఎప్పటివలెనే; అడుగులు= పాదాలు; ఒత్తుచున్+ఉండన్= ఒత్తుతూ ఉండగా; మఱియున్= మరలా; ఇంకా; దినంబులు= రోజులు; ఇరువది= ఇరవై పై; ఒకటి; చనినన్= గడవగా; ప్రబుద్ధుండు+ఐ= మేల్కొని

తాత్పర్యం: ముని పూర్వం నిద్రించిన వైపు వదలి మరొక ప్రక్క తిరిగి నిద్రిస్తున్నాడు. అట్లాంటివాడిని చూచి రాజూ రాణీ కలిగిన అలసట కూడా లెక్కసేయక ఎప్పటివలెనే పాదా లొత్తుతూ ఉన్నారు. మరలా ఇరవై ఒక్క రోజులు గడిచాయి. అప్పు డా భార్గవుడు నిదుర లేచి.

సీ. అతఁడు తైలాభ్యంగ మడిగినఁ బతి కమ్మ । నూనియఁ దెప్పించి మేను శిరము
నభ్యక్తములు సేయ, నమ్ముని సెడ నాడి । యంతర్హితుం డయ్యె నపరఘటికఁ
దోఁచి వికారంబు దొడరక యున్న రా । జును దేవులను గని, సుముఖుఁ డగుచు
నాచరితస్నానుఁ డగుటయు, వారు మ । హార్హంబు లగు వివిధాన్నపాన

ఆ. ములు ఘటించి, కుడువఁ బిలిచినఁ జని, వాని । నెల్లఁ గాంచి, యెక్కడేనిఁ బోయె
వార లడలు గదుర నూరకయుండి రా । పగలు రేయుఁ గురునృపాలవర్య! 308

ప్రతిపదార్థం: కురునృపాల వర్య!= కౌరవరాజశ్రేష్ఠుడా! అతఁడు= చ్యవనుడు; తైల+అభ్యంగము= నూనెరాసుకొని చేసే స్నానం, తలంటు; అడిగినన్= అడుగగా, పతి= రాజు; కమ్మనూనియన్= కమ్మని వాసనవేసే నూనెను; తెప్పించి; మేనున్= శరీరము; శిరమున్= తల; అభ్యక్తములు సేయన్= అభిషేకించగా; ఆ ముని; చెడన్+ఆడి= చెడదిట్టి; అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడయ్యాడు; అపరఘటికన్= మరునిముసంలో; తోఁచి= కనిపించి; వికారంబు= బాధ, దుఃఖం, విసుగు మొదలైన భావాలు; తొడరక= కలుగక; ఉన్న= ఉన్నట్టి; రాజునున్; దేవులను= దేవేరులను, రాణులను; కని; సుముఖుఁడు+అగుచున్= ప్రసన్నముఖం కలవాడై; ఆచరిత= చేయబడిన, చేయించబడిన; స్నానుఁడు= స్నానం కలవాడు; అగుటయున్= కాగా; వారు= రాజు రాణి; మహా+అర్హంబులు+అగు= మిక్కిలితగిన; వివిధ= అనేకములు; అన్న= భోజనం; పానములు= త్రాగేవి; ఘటించి= కూర్చి; కుడువన్= తినడానికి; పిలిచినన్= పిలిస్తే; చని= వెళ్ళి; వానిన్+ఎల్లన్= వాటినన్నిటినీ; కాంచి= చూచి; ఎక్కడ+ఏనిన్= ఎక్కడికైనా, ఎక్కడకో; పోయెన్= పోయాడు; వారలు= రాజు, రాణులు; ఆ పగలు రేయున్= ఆ రోజంతా; అడలు= బాధ, దుఃఖం; కదురన్= కలుగగా; ఊరక ఉండిరి= అట్లాగే కూర్చుండి పోయారు;

తాత్పర్యం: కౌరవరాజులలో శ్రేష్ఠుడైనవాడా! ఆ ముని నూనెతో తలంటు స్నానం చేయాలన్నాడు. రాజు వాసననూనె తెప్పించి తలకు శరీరానికి నూనె పూయగా ఆయన తెగ తిట్టి కనిపించకుండాపోయాడు. మరునిముసంలో కనిపించి రాజూ, రాణీ ముఖంలో కోపతాపాలు లేకపోవటం చేసి సంతోషంతో వికసించిన ముఖం కలవాడై స్నానం చేయించుకొనగా వారున్నూ తగిన అనేక అన్నపానీయాదులు సమకూర్చి భోజానానికి పిలువగా వాటిని చూచి తినకుండానే ఎక్కడికో వెళ్ళిపోయాడు. వారు ఆ రోజంతా అట్లాగే చింతిస్తూ గడిపారు.

వ. ఆ భృగువంశ వర్యుండు. 309

ప్రతిపదార్థం: ఆ భృగువంశ వర్యుండు= ఆ భృగువంశంలో శ్రేష్ఠుడు, చ్యవనుడు.

తాత్పర్యం: ఆ చ్యవనుడు.

సీ. వేగినఁ బొడసూపి, 'వేగంబ యరదంబు । వన్నింపు; నీవు నీ భామినియు వ
హింపఁగా రథికత యెసఁగఁ గాంచన రత్న । గోహయముల యాచకులకు నిచ్చు

చును జనవలయు నా 'కనుడు భూపతి తేరు । సమకట్టి, దాపటఁ జామ, దాను

వలపటఁ బూని, యావస్తువు లెల్లను । గొనివచ్చి యీ మంత్రి జనులఁ బనుప

తే. నెక్కి వారల నా సంయమీశ్వరుండు । నిశితతర మగు మునికోల నెత్తు రొలుక

మోపుచును దీనకోటికి నా పదార్థ । చయము నెడనెడ నొసఁగుచుఁ, జనుచునుండె. 310

ప్రతిపదార్థం: వేగినన్= తెల్లవారగా; పొడసూపి= కనిపించి; వేగంబు+అ= వేగంగా; అరదంబు= రథాన్ని; పన్నింపు= పూన్పుము, కట్టించుము; నీవున్; నీ భామినియున్= నీ భార్యయును, (భామ= స్త్రీ); వహింపఁగాన్= గుఱ్ఱాలై లాగగా; రథికత= నేను రథంలో కూర్చొనటం; ఎసఁగన్= ప్రకాశించగా; కాంచన= బంగారం; రత్న= మణులు; గో= ఆవులు; హయములు= గుఱ్ఱాలు; యాచకులకున్= బిచ్చగాళ్ళకు; ఇచ్చుచును= ఇస్తూ; నాకున్; చనవలయున్= పోవాలి; అనుడున్; భూ+పతి= భూమికి భర్త, రాజు; తేరు= రథం; సమకట్టి= సిద్ధపరచి; దాపటన్= ఎడమప్రక్క; చామ= భార్య; వలపటన్= కుడిప్రక్క; తానున్= రాజూ; పూని= లాగుతూ; వస్తువులు= ముని చెప్పినవి; ఎల్లనున్= అన్ని; కొనివచ్చి= తెచ్చి; ఈన్= ఇవ్వటానికి; మంత్రిజనులన్= మంత్రులను; పనుపన్= నియోగించగా; ఆ సంయమి+ఈశ్వరుండు= ఆ మునినాథుడు; ఎక్కి= రథమెక్కి; వారలన్= గుఱ్ఱాలుగా లాగుతున్న రాజును; రాణిని; నెత్తురు= రక్తం; ఒలుకన్= కారగా; నిశితతరము= మిక్కిలి వాడి; అగు= అయిన; మునికోలన్= ములుకోలతో, ములుగఱ్ఱతో; మోపుచును= పొడుస్తూ; ఆ పదార్థచయమున్= ఆ బంగారు మొదలైన వస్తువుల సమూహం; ఎడన్+ఎడన్= అక్కడక్కడా; దీనకోటికిన్= దీనుల బృందానికి; ఒసఁగుచున్= ఇస్తూ; చనుచున్+ఉండెన్= వెళ్ళుతున్నాడు.

తాత్పర్యం: తెల్లవారగానే కనిపించి 'వెంటనే రథ మేర్పాటు చేయుము; నీవూ నీ భార్యా దాన్ని లాగుతూ ఉండగా నేను అందులో కూర్చుని బంగారం, రత్నాలు, గుఱ్ఱాలు బిచ్చగాళ్ళకు ఇస్తూ పోతూ ఉండాలి' అని చెప్పగానే రాజు రథాన్ని సిద్ధపరచి తన భార్య ఎడమప్రక్క, తాను కుడిప్రక్క గుఱ్ఱాలై లాగుతూ ఉండగా, చ్యవనుడు రథమెక్కి మంత్రులు తెచ్చిన ఆ వస్తువులను దీనజన సమూహానికి ఇస్తూ, మునికోలతో రాజునూ రాణినీ పొడుస్తూ పోతున్నాడు.

వ. పెక్కుదినంబు లాహార నిద్రలు లేమి డప్పిఁ దూలు నమ్మహీపాలు నమ్మహిషి నమ్ముని ములుకోల పోట్లనట్లు పూచిన మోదువుల చందంబు నొందింపఁ జూచి జనంబు లల్లన తమలోన 'నిట్టితపో మహిమయుం గలదే యిది యన్యాయ్యం' బని యలుగను దగవు వలుకను దేటి చూడను రాదయ్యెడు నీ దంపతుల ధీరత్వంబును నిష్ఠాపరత్వంబును నింతయొప్పునే! దుర్వహంబగు భారంబు నిర్వికారులయి వహించుచున్న వారనుచు నుమ్మలించుచుఁ బరివేష్టించి చనం జ్యవనుండు పురంబు వెడలి వారి మనంబుల వికారంబులు గానక, యచ్చెరువును మెచ్చును బెనంగొను హృదయంబుతో నరదంబు డిగ్గి, వారల శిరంబులం గట్టిన పగ్గంబులు విడిచి, శరీరంబులు కరంబున సంస్పర్శించి, యజ్జనపతి యాననం బాలోకించి, 'దస్సితిగదే, వరంబిచ్చెద, వగపు దక్కి పురంబునకుం జను; మేను గంగాతీరవనంబున వ్రతచర్యా శేషంబు నిర్వహించెద; నీవు మహిషీ సహితంబుగా నెల్లి నా కడకుం జనుదె' మ్మని పలుకుటయు 'నాకు వగ పెక్కడి?' దని పలికి యవ్విభుండు.311

ప్రతిపదార్థం: పెక్కు దినంబులు= అనేక దినాలు; ఆహారనిద్రలు; లేమి= ఆహారం, నిద్ర లేనందువల్ల; డప్పిన్= అలసటతో; తూలు= సొమ్మసిలుతున్న; దప్పిక; ఆ+మహీపాలున్= ఆ రాజును; ఆ మహిషిన్= ఆ రాణిని; ఆ+ముని; ములుకోల=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముల్లున్న కర్రయొక్క; పోట్లన్= పోట్లతో; అట్లు= ఆ విధంగా; పూచిన మోదువులచందంబున్= పూచిన మోదుగుల విధంగా; ఒందింపన్= పొందించగా; అల్లన= నెమ్మదిగా; తమలోననిట్టి తపోమహిమయుంగలదె; ఇది అన్యాయ్యంబు+అని; అలుగను; తగవు= న్యాయం; పలుకను= చెప్పటానికి; తేఱిచూడను= తేరిచూడటానికీ; రాదయ్యెడున్= వీలులేదు కదా!; ఈ దంపతుల ధీరత్వంబును= ధైర్యం, కష్టాలలో చెదరని మనస్సు కలిగి ఉండటం; నిష్ఠాపరత్వంబునున్= కార్యదీక్ష; ఇంత ఒప్పునే; దుర్వహంబు= మోయరాని; భారంబు= బరువు; నిర్వికారులయి= ఏమీ మార్పు లేనివారై, వహించుచున్నవారనుచు; ఉమ్మలించుచున్= మనస్సులలో బాధపడుతూ; పరివేష్టించి= చుట్టుకొని; మూగి; చనన్= పోగా; చ్యవనుండు; పురంబు వెడలి= పట్టణం దాటి; వారిమనంబులన్= ఆరాజదంపతుల మనస్సులలో; వికారంబులు= మార్పులు; కానక= చూడక; అచ్చెరువును= ఆశ్చర్యం; మెచ్చునున్= మెప్పుదల; పెనంగొను= ముడిపడు; హృదయంబుతోన్; అరదంబు డిగ్గి= రథం దిగి; వారల శిరంబులన్= తలలపై; కట్టిన; పగ్గంబులు= తాళ్ళు; విడిచి= తొలగించి; శరీరంబులు; కరంబునన్= చేతితో; సంస్పర్శించి= ముట్టుకొని నిమిరి; ఆ+జనపతి= ఆ రాజుయొక్క; ఆననంబు= ముఖం; ఆలోకించి= చూచి; డస్సితి గదే= అలసిపోయినావు గదవయ్యా!; వరంబు+ఇచ్చెదన్; వగవు దక్కి= దుఃఖం వదలిపెట్టి; పురంబునకున్+చనుము; ఏను= నేను; గంగాతీరవనంబునన్= గంగ ఒడ్డున ఉన్న అడవిలో; వ్రతచర్యాశేషంబు= మిగిలిన వ్రతకార్యం; నిర్వహించెదన్= పూర్తిచేస్తాను; నీవు; మహిషీ సహితంబుగాన్= రాణితోపాటుగా; ఎల్లి= రేపు; నా కడకున్= నా దగ్గరకు; చనుదెమ్ము= రమ్ము; అని పలుకుటయున్= అని చెప్పగా; ఆ+విభుండు= ఆరాజు; నాకున్; వగపు+ఎక్కడిది= దుఃఖం లేదు; అని పలికి (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: అనేక దినాలు తిండి నిద్ర లేనందువలన ఆ రాజు, రాణి దప్పికతో అలసి తూలిపోతూ ముని ముల్లుకర్రపోట్ల వలన శరీరాలు పూచిన మోదుగచెట్లుకాగా, చూచిన ప్రజలు 'అయ్యో! ఇదేం న్యాయం? ఈ ముని తపోమహిమవలన ఏమీ అనలేము; కానీ, ఈ దంపతు లెంత ధైర్యంగా కార్యదీక్షను వహిస్తున్నారు?' అని అనుకొన్నారు. రాజు రాణి మనస్సులలో స్వచ్ఛమైన భక్తితో ఉండటం ముని చూచి ఆశ్చర్యంతో మెచ్చుకొంటూ రథం దిగి వాళ్ళ తలలకు కట్టన త్రాళ్ళూడదీసి, రాజుతో 'నాయనా! చాలా అలసిపోయావు. నీకు వరమిస్తాను; నీవూ, నీ భార్యా ఇంటికి పోయి రేపు రండి. నేను మిగిలిన వ్రతాన్ని ఈ గంగా తీరంలో ఉన్న అడవిలో పూర్తి చేసికొంటాను, అని చేతులతో వారి శరీరాలను నిమరగా; రాజు 'స్వామీ! మాకు అలుపుసొలుపు లేదు' అంటూ.

క. తన తనువు వనిత మేనును। గనుఁగొని యచ్చెరువు ముదము గడలుకొనఁగ న
మ్మునితో భవత్ప్రభావముఁ। గొనియాడఁగఁ దరమె మాకు గురుతరకరుణా!' 312

ప్రతిపదార్థం: తనతనువున్= తన శరీరం; వనిత= స్త్రీ; రాణి; మేనునున్= శరీరం; కనుఁగొని= చూచి; అచ్చెరువున్= ఆశ్చర్యం; ముదమున్= సంతోషం; కడలుకొనఁగన్= ముంచెత్తగా; ఆ+మునితోన్= ఆ మునితో; గురుతర కరుణా!= గొప్పదయకలవాడా!; భవత్= మీ; ప్రభావము= మహత్తు; కొనియాడఁగన్= స్తుతింపగా; మాకున్; తరమె= శక్యమా!;

తాత్పర్యం: తన శరీరం, రాణి శరీరం చూచి సంతోషం, ఆశ్చర్యం తన మనస్సును ముంచెత్తగా 'గొప్ప దయగల స్వామీ! మీ మహిమను కొనియాడ మాకుశక్యమా?

వ. అని వెండియు. 313

తాత్పర్యం: అని ఇంకా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. ‘శ్రమము లేదు, ప్రతోద వ్రణములు లేవు, । నాతియును, నేను, నెలజవ్వనంబుఁ గంటి

మిది మహాద్భుతతర మందుమే! భవన్మ । హానుభావత్వ మేమి సేయదు? మునీంద్ర !’ 314

ప్రతిపదార్థం: ముని+ఇంద్ర!= మునీశ్వరా!; శ్రమము= అలసట; ప్రతోద= ముల్లుకోలచే కల్గిన; వ్రణములు= గాయాలు; లేవు; నాతియునున్= నా భార్య; నేను; ఎల= లేత; జవ్వనంబున్= యౌవనం; కంటిమి= పొందితిమి; ఇది; మహా+అద్భుతతరము= మహాశ్చర్యం; అందుమే!= అంటామా!; భవత్= మీ; మహా+అనుభావత్వము= గొప్ప వ్యక్తిత్వం; ఏమిచేయదు?= ఏం చేయలేదు?

తాత్పర్యం: ‘మునిచంద్రా! మాకు శ్రమ లేదు సరికదా! ముల్లుకర్ర వలన కలిగిన పుండ్లూ లేవు. పైగా మేము నూత్న యౌవనం పొందాము. ఇదంతా మీ మాహాత్మ్య మనుకొనమంటారా? అయినా మీ గొప్పతన మేమి చేయలేదుకనుక.

వ. అని సవినయంబుగాఁ దానును దేవియు దండప్రణామంబులు సేసి, యా సంయమివరు వీడ్కొని, సాద్భుత చిత్తులైన సకల జనులుం బరివేష్టింపఁ బురంబు ప్రవేశించి, ప్రమోదమయమూర్తు లగుచు, దివసవర్తనంబును, రాత్రి చర్యయుం గడపి, సూర్యోదయం బగుటయు.’ 315

ప్రతిపదార్థం: అని= అనిపల్కి; సవినయంబుగాన్= వినయంతో; తానునున్= రాజు; దేవియున్= రాణీ; దండప్రణామంబుచేసి= సాష్టాంగంగా కాళ్ళపై పడి; ఆసంయమివరున్= ఆ మునిచంద్రుడిని; వీడ్కొని= సెలవు తీసికొని; స+అద్భుత= ఆశ్చర్యంతో కూడిన; చిత్తులు= మనస్సులు కల; సకల జనులున్= జనమంతా; పరివేష్టింపన్= చుట్టూ మూగగా; పురంబు= నగరం; ప్రవేశించి; ప్రమోదమయ= సంతోషంతో చేసిన; మూర్తులు= శరీరాలు కలవారు; అగుచున్= అవుతూ; దివస వర్తనంబునున్= పగలు చేసే పనులు; రాత్రి చర్యయున్= రాత్రిపూట కార్యాలు; కడపి= ఆచరించి; సూర్య+ఉదయంబు= ప్రొద్దుపొడవటం; అగుటయున్= కాగానే.

తాత్పర్యం: అని వినయంతో దండ ప్రణామం చేసి, ఆ మునివరుడిని వదలి ఆశ్చర్యంలో మునిగిపోయిన జనులంతా తమ చుట్టూ మూగి వెంబడించి రాగా, సంతోషంతో నిండిన శరీరాలతో నగరంలోకి ప్రవేశించి, పగలు రాత్రి చేయదగిన పనులుచేసి తెల్లవారగానే.

క. వారలు ప్రాతస్సమయా । చారంబులు నడపి భక్తి సంపద లొదవన్

గారవమున ముని నిర్ది । ష్టారణ్యమ్మునకుఁ బోయి రవనీనాథా! 316

ప్రతిపదార్థం: అవనీనాథా!= రాజా!; వారలు= రాజదంపతులు; ప్రాతస్సమయ= ప్రొద్దుటిపూట; ఆచారంబులు= ఆచారాలు; నడపి= చేసి; భక్తిసంపదలు= భక్తి అనే సంపదలు; ఒదవన్= కలుగగా; గారవమునన్= గౌరవంతో; ముని నిర్దిష్ట= ముని చెప్పిన; అరణ్యమ్మునకున్= అడవికి; పోయిరి= వెళ్ళారు.

తాత్పర్యం: రాజా! వారు ప్రొద్దున్నే నిర్వర్తించవలసిన విధులు నిర్వర్తించి భక్తి వైభవంతో, గౌరవంతో ముని చెప్పిన అడవికి వెళ్ళారు.

ఆ. అచట మణిమయంబు, నతిసుందరము, దివ్య । సదన నిభము నగు విశాలరమ్య

హర్మ్యమున్నఁ, జూచి యచ్చెరువందు చి । త్తములతోడఁ జనఁగ దానిచుట్టు. 317

ప్రతిపదార్థం: అచటన్= ఆ అడవిలో; మణిమయంబు= మణులతో చేసిన; అతి సుందరము= మిక్కిలి చక్కని; దివ్యసదననిభము= దేవతల సౌధము వంటిది; అగు= అయిన; విశాలరమ్య= పెద్దది, అందమునైన; హర్మ్యము= సౌధం; ఉన్నన్= ఉంటే; చూచి; అచ్చెరువు= ఆశ్చర్యం; అందు= పొందే; చిత్తములతోడన్= మనస్సులతో; చనఁగన్= పోగా; దానిచుట్టు= మేడకు చుట్టూరా.

తాత్పర్యం: అక్కడ రత్నాలతో చెక్కిన దేవతాభవనం వంటిది, విశాలమైన అందమైన సౌధముండగా చూచి ఆశ్చర్యంతో పోగా దాని చుట్టూ. (తరువాతి పద్యంతో అన్వయం)

చ్యవనుఁడు తన యోగబలంబునఁ గుశికునకు నాకలోకంబు సూపుట (సం.13-54-1)

సీ. స్వాధ్యాయ సంగీత సాహిత్య వర్తన । మాననీయము లగు మండపములుఁ,
గోకిల శుకభృంగ కులనాదముల నభి । రామంబు, లైన యారామములును
హంస సారసరవాత్యంత మనోజ్ఞంబు । లై సొంపు మిగులు పద్మాకరములుఁ,
జారుమయూర కేకారుత కలితంబు । లగుచు నొప్పారు క్రీడాచలములు;

తే. వీనులకుఁ జూడ్కులకు నింపు వెల్లి గొల్ప । నేర్పు గలిగిన విభవంబు నెఱయ మెఱయఁ
గరము విలసిల్లుచునికి నాకంబు వేడ్క । నయ్యెడకుఁ గాపు వచ్చిన యట్టు లుండె. 318

ప్రతిపదార్థం: స్వ+అధ్యాయ= వేదపఠనంతో కలిసిన; సంగీత= సంగీతం యొక్క; సాహిత్య= సాహిత్యము యొక్క; వర్తన= ప్రవర్తనతో; మాననీయములు= గౌరవించ దగినవి; అగు; మండపములు= మంటపాలు; కోకిల= పికములు; శుక=చిలుకలు; భృంగ= తుమ్మెదల యొక్క; కుల= సమూహంయొక్క; నాదములన్= ధ్వనులతో; అభిరామంబులు= మిక్కిలి అందమైన; ఆరామములును= తోటలు; హంస= అంచలు; సారస= బెగ్గురు పక్షులు (ఒకరకమైన కొంగలు) వీటి; రవ= ధ్వనులచే; అతి+అంత= మిక్కిలి; మనోజ్ఞంబులై= అందములై; సొంపు= ఇంపు; మిగులు= అతిశయించిన; పద్మ+అకరములు= తామరపూలకు నిలయములైన చెరువులు, చారు= అందమైన; మయూర= నెమళ్ళ యొక్క; కేకా= కూతల యొక్క; రుత= ధ్వనితో; కలితంబులు= కూడుకొన్నవి; అగుచున్; ఒప్పు+ఆరు= అందమైన; క్రీడా= ఆటలాడుకొనటానికి వీలైన; అచలములున్= కొండలును; వీనులకున్= చెవులకు; చూడ్కులకున్= చూపులకు; ఇంపు= వేడుక; వెల్లిగొల్పన్= అతిశయింపచేయగా; నేర్పు= చాతుర్యం; కలిగిన విభవంబు= ఐశ్వర్యం; నెఱయమెఱయ= విస్తరించి విలసిల్లగా; కరమున్= మిక్కిలి; విలసిల్లుచున్= శోభిల్లుచు; ఉనికి= ఉండడం వలన; నాకంబు= స్వర్గం; వేడ్కన్; ఆ+యెడకున్; కాపు వచ్చిన+అట్టులు+ఉండెన్.

తాత్పర్యం: అక్కడ మండపాలలో సంగీతంతో సాహిత్యంతో ప్రవర్తించే వేదమంత్ర పఠనం జరుగుతున్నది. కోకిలల, చిలుకల, తుమ్మెదల గుంపులు చేసే ధ్వనులతో చాలా అందమైన తోటలున్నూ, హంసలు, కొంగలు చేసే ధ్వనులతో (కంటికి, చెవికి) ఇంపైన తామరపూలున్న చెరువులు, అందమైన నెమళ్ళ కూతలుకల విహారపు కొండలు, చెవులకూ, చూపులకూ సంతోషం కలిగించే నేర్పుగల వైభవం ప్రకాశిస్తూ ఉండగా స్వర్గమే అక్కడికి వలస వచ్చిందా అన్నట్లున్నది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. సురలును, గంధర్వులు, న । ప్సరోనికాయములు, వివిధ సరస విహారా
దరలీల నందు నెడనెడఁ । జరించుచుండిరి నితాంత సమ్మోదమునన్. 319

ప్రతిపదార్థం: సురలును= దేవతలును; గంధర్వులున్= ఆ జాతి దేవతలు; అప్సరోనికాయములున్= అచ్చరల సమూహాలు; వివిధ= అనేకములగు; సరస= రసవత్తరమైన; విహార= విహరించుటలోగల; ఆదరలీలన్= ఆదరంతో కూడిన విలాసంతో; అందున్= అక్కడ; నితాంత= ఎడతెగని; సమ్మోదమునన్= సంతోషంతో; ఎడన్+ఎడన్= అక్కడక్కడ; చరించుచున్+ఉండిరి= తిరుగుతున్నారు.

తాత్పర్యం: దేవతలు, సంగీత విద్వాంసులైన గంధర్వులు, అప్సరసల సమూహం అనేకమైన రసవత్తర విహారాలతో, క్రీడలతో అక్కడక్కడ ఆ స్థలంలో సంతోషంగా తిరుగుతున్నారు.

తే. అవ్విధంబున కా రాజు నంగనయును । మనము లద్భుత రసమున మునుఁగుచుండఁ
'గలయొకో యిది! నిక్కమ కానినాఁడు । మిగుల ననుభవ గోచర మగునె యిట్లు?' 320

ప్రతిపదార్థం: ఆ+విధంబునకున్= ఆ పద్ధతికి; ఆ రాజున్; అంగనయును= స్త్రీయూ (రాణి); మనములు= మనస్సులు; అద్భుత రసమునన్= ఆశ్చర్య రసంలో; మునుఁగుచున్+ఉండన్= మునుగుతుండగా; కలఒకో ఇది?= ఇది కలా!; నిక్కమ కానినాఁడు= సత్యం కాకపోతే; ఇట్లు= ఈ విధంగా; మిగులన్= మిక్కిలి; అనుభవగోచరము= అనుభవానికి తోచేది; అగునె?= ఔతుందా?

తాత్పర్యం: ఆ దృశ్యానికి ఆ రాజూ, రాణీ మనస్సులు ఆశ్చర్యంతో మునిగిపోగా 'ఇది నిజమా? కలా? నిజమే కాకపోతే అనుభవానికి ఎట్లా అందుతున్నది?'

వ. అని వెండియు. 321

తాత్పర్యం: అని ఇంకా.

క. 'ఉత్తర కురు భూమియొ? లో । కోత్తర మగునట్టి నాకమొకొ? తనువులతో
నిత్తాపసవరుని కరుణ । నిత్తెఱఁగున సంభవించె నిచ్చోటు సొరన్.' 322

ప్రతిపదార్థం: ఉత్తర కురుభూమియొ?= ఈ పేరుగల రాజ్యం (ప్రాచీన కాలంలో భారతవర్షం నేటి చైనా మంగోలియా దాకా వ్యాపించి ఉండేదట. ఈ ఉత్తర కురుభూములు హిమాలయ ప్రాంతమో అవతలిదో? కొందరు హిమాలయాలకు అవతలి దంటారు); లోకోత్తరము= లోకానికిపైది; అగునట్టి; నాకము+ఒకొ?= స్వర్గమా?; తనువులతోన్= శరీరాలతో; ఇచ్చోటు= ఈ ప్రాంతంలోకి; చొరన్= ప్రవేశించటం; ఈ+తాపసవరుని= ఈ మునిశ్రేష్ఠుడి; కరుణన్= దయవలన; ఈ+తెఱగునన్= ఈ విధంగా; సంభవించెన్= కలిగింది.

తాత్పర్యం: 'ఈ ప్రాంత మేదో? ఉత్తర కురుభూములా? లేక లోకోత్తరమైన స్వర్గమా? సశరీరంగా ఇక్కడకు రావటం కేవలం ఈ మునీశ్వరుడి దయ.'

విశేషం: కురుభూములు= కురుక్షేత్రం, ఇది నేటి ఢిల్లీ ప్రాంతం. దానికి ఉత్తరదిక్కున ఉన్న ప్రదేశం ఉత్తర కురుభూములు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

హిమాలయాలు కావచ్చును. ఎందుకంటే నేటికీ ఆ ప్రాంతం పవిత్రంగా, మహాయోగులు నివసించేదిగా చెప్పబడుతున్నది కనుక. ఈ విషయాలకొరకు 'హిమాలయంలో మహర్షులతో నివసించటం వంటి ఆంగ్ల గ్రంథాలు చూచినా, మహాయోగి ఆత్మకథ చూచినా తెలుస్తుంది. నేటి విద్యావేత్తల కా విషయాలు తెలియకపోవటంవలన భారత ఆధ్యాత్మిక యోగ విద్యలతో పరిచయం లేనందున అబద్ధాలుగా గోచరిస్తున్నవి తప్ప మహాత్ముల జీవితాలలో ఇవి నగ్న సత్యాలే.

వ. అనుచు నమ్మహనీయ హర్మ్యంబు సొచ్చి, యందు మణిమయ పర్యంకంబునం బవ్వళించి యున్న యప్పరమ మునిం గనిరి, అపరక్షణంబున నతం డంతర్ధానంబు సేసె. అతనితోడన యా మేడయు మున్ను గన్న యశేష విశేషంబులును నదృశ్యంబు లయ్యె, అయ్యిరువురు నిట్టట్టు మెలంగి యక్కాన నొక్కెడఁ గౌశబృసీ సమాసీనుండును జపపరుండునునైన యాసంయమివరు నాలోకించి; రట్లు గాంచి భూవిభుండు భార్యతో నిట్లనియె. 323

ప్రతిపదార్థం: అనుచున్; ఆ+మహనీయ= ఆ మహత్తరమైన; హర్మ్యంబు= సౌధం; చొచ్చి= ప్రవేశించి; మణిమయ= రత్నాలతో చేసిన; పర్యంకంబునన్= మంచంమీద; పవ్వళించిఉన్న= పడుకొని ఉన్న; ఆ+పరమ మునిన్= ఆ గొప్పమునిని; కనిరి= చూచారు; అతండు= ఆ ముని; అపరక్షణంబునన్= మరుక్షణంలో; అంతర్ధానంబు చేసెన్= కనిపించకుండా పోయాడు; అతనితోడన; ఆమేడయున్; అశేష విశేషంబులు= అనంత విశేషాలు; అదృశ్యంబులు= కనిపించనివి; అయ్యెన్; ఆ+ఇరువురున్= రాజు రాణి; ఇట్టున్+అట్టున్= ఇటూ అటూ ; మెలంగి=తిరిగి; ఆ+కానన్= ఆ అడవిలో; ఒక్క+ఎడన్= ఒకచోట; కౌశ= దర్భతో నేసిన (కుశ=దర్భ); బృసీ= చాపమీద; సమాసీనుండునున్= కూర్చున్నవాడు; జపపరుండును= జపమగ్నుడైనవాడు; ఐన; ఆ సంయమివరున్= ఆ మునిశ్రేష్ఠుడిని; ఆలోకించిరి= చూచారు; అట్లు; కాంచి= చూచి; భూవిభుండు= భూమిపతి; భార్యతోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అంటూ ఆ మహాభవనంలోకి వెళ్ళిచూస్తే రత్నమంచంపైన మునీంద్రుడు నిద్రిస్తున్నాడు. అంతలోనే మరలా అదృశ్యుడైపోగా; ఆ భవనం, వాళ్ళు చూచిన విశేషాలు అన్నీ కనిపించకుండా పోయాయి. మునిమాత్రం అడవిలో ఒకచోట దర్భచాపపై కూర్చుని జపం చేసికొంటూ కనిపించాడు. అప్పుడు రాజు రాణితో అన్నాడు.

తే. 'ఉవిద! మునియోగబల మిట్టు లుండునే! య । నూనరాజ్యంబు సులభంబు మానవులకు
బ్రాహ్మణత్వంబుఁ దపము దుర్లభము దపము । కలిమిఁ జేయుచు నున్నాఁడు వలసినట్లు.' 324

ప్రతిపదార్థం: ఉవిద!= రాణీ! (స్త్రీ); ముని= ముని యొక్క; యోగబలము= యోగశక్తి; ఇట్టులు= ఈ విధంగా; ఉండునే?= ఉంటుందా?; అనూన= గొప్ప; రాజ్యంబున్; సులభంబు= తేలిక; మానవులకున్= మనుషులకు; బ్రాహ్మణత్వంబున్= బ్రాహ్మణ లక్షణం; తపము= తపస్సు; దుర్లభము= కష్టపడి పొందదగినది; తపముకలిమిన్= తప స్సంపదచేత; వలసినట్లు= ఇష్టం వచ్చినట్లు; చేయుచున్+ ఉన్నాఁడు= చేస్తున్నాడు.

తాత్పర్యం: 'రాణీ! మునియోగశక్తి చూచావా? ఇంతగొప్పదా? మనిషికి రాజ్యం సులభం తప్ప బ్రాహ్మణత్వం, తపస్సు సులభం కావు. ఈయన తపస్సంపద ప్రభావంచేత ఇష్టం వచ్చినట్లుగా సృష్టిస్తున్నాడు.

చ. అనునెడ నిందు రండని సమాదర మొప్పఁగ వారిఁ బిల్చె న
మ్ముని; నరనాథుఁడున్, సతియు, మోడ్చిన చేతులతోడఁ జేరఁగాఁ

జని, ధరఁ జాఁగి మ్రొక్కుటయు, సంయమి దీవన లిచ్చి, రాజు నా

ననమున సుప్రసన్న నయన ప్రభ పర్వఁగ నెమ్మి నిట్లనున్. 325

ప్రతిపదార్థం: అను+ఎడన్= అనే సమయంలో; ఆ+ముని; వారిన్= రాజ దంపతులను; ఇందున్= ఇక్కడకు; రండు+అని= రండు అంటూ; సమాదరము= మంచి ఆదరణ; ఒప్పఁగన్= కలుగగా; పిల్చెన్= పిలిచాడు; నరనాథుఁడున్= రాజు; సతియున్=భార్య; మోడ్చిన= అంజలించిన (దండంపెట్టిన); చేతులతోడన్= హస్తాలతో; చేరఁగాన్ జని= దగ్గరకు వెళ్ళి; ధరన్= నేలపై; చాఁగి= సాగిలబడి; మ్రొక్కుటయున్= నమస్కరించగా; సంయమి= ముని; దీవనలు=ఆశీస్సులు; ఇచ్చి; రాజు+ఆననమునన్= రాజు ముఖంమీద; సు ప్రసన్న= మంచి శాంతం కల; నయన= నేత్రాల; ప్రభ= వెలుగు; పర్వఁగన్= వ్యాపించగా; నెమ్మిన్= సంతోషంతో; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు.

తాత్పర్యం: అంటున్న సమయంలో ముని ఆదరంతో వాళ్ళనిద్దరిని ఇట్లా రండని పిలువగానే వారు చేతులుమోడ్చి మునిని సమీపించి భూమిపై చాగిలపడి మ్రొక్కగా ముని ఆశీర్వదించి రాజు ముఖంమీద తన ప్రశాంత నేత్ర కాంతులు వ్యాపించగా సంతోషంతో ఇట్లా అంటున్నాడు.

ఆ. 'మనసు నింద్రియములు మనుజేంద్ర! యింత వ । శ్యంబు లగునె నీకు? నరయఁ గీ డొ

కింత యైన లేదు సంతసమందితి; । నిత్తు వరము వేఁడు మెద్దియైన.' 326

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్ర!= రాజా!; మనసు= మనస్సు; ఇంద్రియములు= అవయవాలు; ఇంత= ఇంతగా; నీకున్; వశ్యంబులు+అగునె?= వశమైనవా? అరయన్= పారచూచినా; కీడు= లోపం; ఒక+ఇంతయైనన్= ఇంతైనా; లేదు; సంతసము= సంతోషం; అందితిన్= పొందాను; వరమున్; ఇత్తున్= ఇస్తాను; ఎద్దిఐనన్= ఏదైనా; వేఁడుము= కోరుకొమ్ము.

తాత్పర్యం: 'రాజా! నీకు నీ మనస్సూ, ఇంద్రియా లింతగా వశమైనాయా? ఆశ్చర్యమయ్యా! ఎంతో ఆలోచించి చూచినా నీ వలన లోపమింతైనా లేదు వరం కోరుకొమ్ము. ఏదైనాసరే ఇస్తాను. నీవంటే నాకు చాలా సంతోషంగా ఉన్నది.'

క. అనిన విని యగ్ని కల్పుఁడ । వనఁ జను 'నీమది ప్రసన్నమగునట్టులుగా

మునిజనవంద్యా ! కొల్వం । గను కంటెను మిగులమేలు గలదే కోరన్.' 327

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; మునిజనవంద్యా!= ముని సమూహంచేత పొగడదగినవాడా!; అగ్ని కల్పుఁడవు= అగ్నివంటివాడవు; అనన్ చను= అనదగ్గ; నీ మది= నీ మనస్సును; ప్రసన్నము= ప్రశాంతం; అగునట్లుగాన్= అయ్యేటట్లుగా; కొల్వన్= సేవించుట; కనుకంటెన్= పొందటంకంటే; కోరన్= కోరుటకు; మిగుల= అధికమైన; మేలుకలదే!= శుభమున్నదా!

తాత్పర్యం: మునులకే నమస్కరించదగిన నీవు అగ్నితో సమానుడవు. ఇట్లాంటి నీ మనస్సు ప్రసన్నమయ్యేటట్లు సేవించుట కంటే గొప్ప మే లేమున్న దని కోరనయ్యా!

వ. అని పలికి కుశికుండు వెండియు. 328

తాత్పర్యం: అని చెప్పి కుశికుడు ఇంకా (అంటున్నాడు)

తే. ‘ఒకటి యడిగెదఁ గృప చిగురొత్తఁ జెప్ప । వలయు; మీరు మా యింటికి వచ్చి యొక్క
ప్రక్కక్రిందుగ నిరువది యొక్క దినము । లనఘ! నిద్రించి; తది మొదలైన నీదు. 329

ప్రతిపదార్థం: ఒకటి అడిగెదన్= ఒక టడుగుతాను; కృప= దయ; చిగురు+ఒత్తన్= చిగురింపగా; చెప్పన్ వలయున్= చెప్పాలి; మీరు; మాఇంటికిన్; వచ్చి; ఒక్క ప్రక్క= ఒకవైపు; క్రిందుగన్= క్రిందుగా చేసి; ఇరువదిఒక్క దినములు= ఇరవై ఒక్క రోజులు; అనఘ!= పుణ్యాత్ముడా!; నిద్రించితి= నిద్రించావు; అది మొదలు+ఐన= అది మొదలుగా; నీదు= నీ యొక్క.

తాత్పర్యం: ‘స్వామీ! ఒకటడుగుతాను. దయతో చెప్పాలి. మీరు మా ఇంటికి వచ్చి ఒకవైపే ఒత్తిగిలి ఇరవైయొక్క రోజులు పడుకొన్నారు కదా! అది మొదలుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. చరితం బద్భుతము మునీ । శ్వర! దీనికిఁ గారణము విచారమున కగో
చర; మెఱిఁగింపు ‘మనుడు నా । ధరణీవల్లభునితో నతం డిట్లనియెన్. 330

ప్రతిపదార్థం: చరితంబు= కథ, ప్రవర్తన; అద్భుతము= ఆశ్చర్యం; ముని+ఈశ్వర!= మునినాథా!; దీనికిన్; కారణము= ఇందుకు హేతువు; విచారమునకున్= ఆలోచనకు; అగోచరము= కనిపించదు; ఎఱిఁగింపుము= తెలుపుము; అనుడున్; అతండు= ఆ ముని; ఆ ధరణీ విభునితోన్= రాజుతో; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: కథ చాలా అద్భుతం. మునీశ్వర! కారణం గోచరించటం లేదు. కనుక చెప్పండి’ అనగా రాజుతో ముని ఇట్లా అంటున్నాడు.

వ. సురలు మునులు సురజ్యేష్ఠుం గొలిచియుండం బ్రసంగ వశంబున నప్పరమేష్ఠి వారలతో భృగు కుశిక వంశంబులకు బ్రహ్మక్షత్రంబులు తడంబడి సంకరంబు వాటిల్లు నని చెప్పెఁ; నప్పు డేనచ్చట నుండి వినుటం జేసి యాసంకరంబున కోర్వక మీ యన్వయంబు నిర్మూలంబు సేయువాఁడ నయి వ్రతంబు నెపంబిడి, భవద్గృహంబు సొచ్చి యున్ని పోకలం బోయితి; అలసి డస్సి యెప్పుడేని మీర లడ్డ మాడుదురు అప్పుడ శపింతు నిట్టిద నా యెత్తికోలు; మీ యందు ధైర్యహానియు శోకంబును గోపంబును లేమిని మెచ్చి వరం బిచ్చియుం దనివి సనక, తనువులతోడన మీరు నాకలోకం బాలోకించు నట్లుగా నీ గంగాతీరంబున సంఘటించితి; దానిం గని నరేంద్రత్వంబుదెస నుదాసీన భావంబు నొంది బ్రాహ్మణ్యంబునందు స స్పృహుండ వై తది యెఱుఁగుదు; నీకు మూఁడవవాఁడు బ్రహ్మతేజో దీప్తుం డయి జనియించు; వరంబు వేఁడు’ మనుటయు నమ్మానవపతి దీనికంటెను గడచిన వరంబునుం గలదే? మదీయ సంతానంబు బ్రహ్మత్వ ప్రాప్త మహత్త్వ నిరూఢంబును, గాఢధర్మ తత్పరంబునుంగా నను గ్రహింపు’ మనిన నమ్ముని ‘యట్ల యయ్యెడు నూఱడిల్లుము. నీదు మనుమండు త్రిలోక పూజనీయుండు’ అని పల్కిన నప్పతి ‘వాఁడేమి కతంబున బ్రాహ్మణుం డగు నత్తెఱంగెఱింగింపవే’ యనవుడు నత్తాపసోత్తముండు ‘విను మస్మద్వంశంబున ఋచీకుం డనువాఁడు జన్మించి నీ తనయుం’ డైన గాధి యనియెడు వాని పుత్రి భార్యగాఁ బరిగ్రహించు; నత్తపోధనుండు దననందనుం డగు జమదగ్నియందు సమస్త ధనుర్వేదంబును నావహించు, నవ్విశేషంబు తత్పుత్త్రునందు ఫలియించు; నది యంతయు సకల క్షత్రియ క్షయకారి యైన దైవంబు కృత్యంబు, దానివలన ఋచీక, గాధి వధూజనానుష్ఠాన పరివర్తనంబు గలుగు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నది కారణంబుగా నుగ్రక్షత్రధర్ముండగు పరశురాముండు జమదగ్నికిం, బరమ బ్రాహ్మణ్యగణ్యుం డయిన విశ్వామిత్రుండు గాధికి జనియింతురు, బ్రహ్మ పలుకు సత్యంబ; యుష్మదన్వయంబు భార్గవ కులసంబంధంబున జనశ్లాఘనీయంబై వెలయం గలయది, యేను తీర్థంబునకుం జనియెద, నీవు సుఖివై యుండుము' అని చెప్పుటయు, నప్పుడమిఱేఁడు భార్యాసహితంబుగ సవిశేష వినయంబగు వందనం బాచరించి వీడ్కొని చనియె; జ్యవనుండును నిజేచ్ఛం జనియె; నిది పరశురామ విశ్వామిత్ర జన్మ ప్రకారంబు. 331

ప్రతిపదార్థం: సురలు, మునులు, సురజ్యేష్ఠున్= దేవతలలో పెద్దవాడు బ్రహ్మను; కొలిచిఉండన్= సేవిస్తూ ఉండగా; ప్రసంగవశంబునన్= మాటల సందర్భంలో; ఆ పరమేష్ఠి= ఆ బ్రహ్మ; వారలతోన్= వారితో; భృగుకుశిక వంశంబులకున్; బ్రహ్మక్షత్రంబులు= బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలు; తడంబడి= మారుదలపొంది, తలక్రిందులై; సంకరంబు= సాంకర్యం; పాటిల్లున్= జరుగుతుంది; అని చెప్పెన్; అప్పుడు ఏను అచ్చటన్+ఉండి వినుటన్+చేసి; ఆ సంకరంబునకున్; ఓర్వక= సహించక; మీ; అన్వయంబున్= వంశాన్ని; నిర్మూలంబు= నాశనం; చేయువాడను+అయి= చేద్దామనుకొని; వ్రతంబు నెపంబు+ఇడి= వ్రతమిషతో; భవత్= మీ; గృహంబు= ఇల్లు; చొచ్చి= ప్రవేశించి; ఇన్ని; పోకలన్+పోయితిన్= నాటకా లాడాను; అలసి; డస్సి= తూలి; ఎప్పుడేని మీరలు; అడ్డము+ఆడుదురు= ఎదురు చెప్పుతారు; అప్పుడు+అ+శపింతున్; ఇట్టిద, నా; ఎత్తికోలు= పూనిక, ప్రయత్నం; మీయందున్; ధైర్యహానియున్= కష్టాలలో చెదరకుండా ఉండే మనస్తత్వం; శోకంబును కోపంబును లేమిని= లేకపోవటం; మెచ్చి; వరంబు; ఇచ్చియున్; తనివి చనక= తృప్తిపడక; తనువులతోడన; మీరు; నాకలోకంబు; ఆలోకించునట్లుగాన్= చూచేటట్లు; ఈ గంగాతీరంబునన్; సంఘటించితిన్= ఏర్పాటు చేశాను; దానిన్; కని; నర+ఇంద్రత్వంబు దెసన్= రాజత్వంవైపు; ఉదాసీనభావంబున్= ఔదాసీన్యం, తక్కువ చూపు; ఒంది= పొంది; బ్రాహ్మణ్యంబునందున్= బ్రాహ్మణ ధర్మంమీద; సస్పృహుండవు+ఐతి(వి)= కోరిక కలవాడవైతివి; అది ఎఱుఁగుదున్; నీకున్; మూడవవాఁడు= మూడవ తరంవాడు; బ్రహ్మతేజో దీప్తుండు= బ్రాహ్మణ తేజస్సుతో ప్రకాశించేవాడు; అయి జనించు; వరంబు; వేడుము+అనుటయున్; ఆ మానవపతి= ఆ రాజు; దీనికంటెను; కడచిన= దాటిన; అధికమైన; వరంబునున్; కలదే= ఉన్నదా? బ్రహ్మత్వప్రాప్త=బ్రాహ్మణత్వము చేత పొందబడిన; మహత్త్వ= గొప్పతనంచేత; నిరూఢంబునున్= ప్రసిద్ధియైనదిగానూ; గాఢ= గట్టి; ధర్మ తత్పరంబునుంగాన్= ధర్మం మీద తాత్పర్యబుద్ధి గలదిగానూ అనుగ్రహింపుము; అనినన్; ఆ+ముని; అట్ల అయ్యెడున్; ఊఱడిల్లుము; నీదు మనుమండు; త్రిలోకపూజనీయుండు= మూడులోకాలకు పూజించదగ్గవాడు; అనిపల్కినన్; ఆ+పతి= ఆ రాజు; వాఁడు= అతడు; ఏమికడంబునన్= ఏ కారణంవలన; బ్రాహ్మణుండగున్ ఆ తెఱంగు; ఎఱింగింపవే; అనవుడున్; అ+తాపస+ఉత్తముండు= ఆ మునీశ్వరుండు; వినుము, అస్మత్= నా; వంశంబునన్, ఋచీకుండను వాడు జన్మించి నీ తనయుండైన గాధి; అనియెడు; వాని; పుత్రిన్= కూతురును; భార్యగాన్ పరిగ్రహించున్; ఆ+తపోధనుండు; తననందనుండగు జమదగ్నియందున్; సమస్త; ధనుర్వేదంబునున్= ధనుర్విద్య, విలువిద్యను; ఆవహించున్= కల్గించును; ఆ+విశేషంబు; తత్+పుత్త్రునందున్= అతని కుమారుని యందు; ఫలియించున్; అది+అంతయున్; సకలక్షత్రియ= సమస్తరాజుల; క్షయకారి= వినాశము గల్గించునది; ఐన= ఐనట్టి; దైవంబు= దైవముయొక్క; కృత్యంబు= పని,విధి ఘటన; దాని వలనన్; ఋచీక గాధి వధూజనానుష్ఠాన పరివర్తనంబు గలుగు; అది కారణంబుగాన్; ఉగ్ర= క్రూర; క్షత్ర ధర్ముండు= క్షత్రియ స్వభావం కలవాడు అగు పరశురాముండు జమదగ్నికిన్; పరమ= గొప్ప; బ్రాహ్మణ్య= బ్రాహ్మణ సమూహానికి; గణ్యుండు= లెక్కింపదగ్గవాడు అయిన; విశ్వామిత్రుండు; గాధికి జనియింతురు; బ్రహ్మపలుకు సత్యంబు+అ; యుష్మత్+అన్వయంబు= నీ కులం; భార్గవకుల సంబంధంబునన్= సంబంధం వలన, బంధుత్వం చేత; జన= జనులచేత; శ్లాఘనీయంబు+ఐ= పొగడదగ్గదై; వెలయన్ కలయది= ప్రకాశించగలది; ఏను= నేను; తీర్థంబునకున్; చనియెదన్= వెళ్ళెదను; నీవు సుఖివి+ఐ= సుఖవంతుడవై; ఉండుము; అని చెప్పుటయున్; ఆ+పుడమి= భూమికి; ఱేఁడు= రాజు; భార్యసహితంబుగన్= భార్యతోకూడ; సవిశేష వినయంబు+అగు= అధికమైన వినయముతో కూడినదైన; వందనంబు; ఆచరించి వీడ్కొని చనియెన్; చ్యవనుండును; నిజ+ఇచ్ఛన్= తన ఇష్టం వచ్చినచోటికి; చనియెన్= వెళ్ళాడు; ఇది; పరశురామ విశ్వామిత్ర జన్మప్రకారంబు= పుట్టినవిధము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దేవతలు మునులు బ్రహ్మదేవుడిని సేవిస్తున్న సమయంలో, ప్రసంగవశాత్తు బ్రహ్మ వారితో ఇట్లా అన్నాడు. 'భవిష్యత్తులో భృగు, కుశిక వంశాలకు బాంధవ్య మేర్పడుతుంది' అని. అది విని వర్ణసాంకర్యాని కిష్టపడక నీ వంశాన్ని నాశనం చేద్దామన్న తలంపుతో మీ ఇంటికి వచ్చి పోకిళ్ళు పోయాను. కాని, మీలో కోపతాపాదులేవీ నాకు గోచరించలేదు. దానికి సంతోషించి వరమిచ్చాను. అయినా నాకు తృప్తి తీరక స్వర్గలోకం చూపించాను. నీకు రాచరికంమీద కంటె బ్రాహ్మణ్యం మీద మక్కువ. నీకు మూడోతరంలో బ్రహ్మతేజోమయుడు జన్మిస్తాడు. కాబట్టి వరం కోరుకొమ్ము రాజా! అనుగ్రహిస్తాను.' అంతా విని రాజన్నాడు 'నా కింతకంటె వర మేమి కావాలయ్యా! నా సంతానం బ్రాహ్మణత్వం ధర్మపరత్వం పొందే వర మనుగ్రహించుము' అనగా ముని 'నీ మనుమడు మూడులోకాలకు వందనీయు డౌతాడు' అని అన్నాడు. రా జన్నాడు 'నా మనుమడు బ్రాహ్మణు డెట్లా ఔతాడో చెప్పుము' అనగా అత డన్నాడు. 'నా వంశంలో ఋచీకు డనే వాడు జన్మించి నీ కుమారుడైన గాధి కూతురును పెళ్ళి చేసికొనగా అతడికి జమదగ్ని జన్మిస్తే అతడు విలువిద్య నంతా జమదగ్ని పొందేటట్లు చేస్తాడు. ఆ ధనుర్విద్య అతడి కొడుకు పరశురాముడిలో ఫలిస్తుంది. ఈ విద్య సకల క్షత్రియ కుల నాశనం చేస్తుంది. ఇదంతా దైవఘటన. దానివలన ఋచీక, గాధి వధువుల అనుష్ఠానాలు మార్పు పొంది జమదగ్నికి క్రూరస్వభావం కల క్షత్ర ధర్మంతో పరశురాముడు జన్మిస్తాడు. గాధికి మహాబ్రాహ్మణ తేజోనిధి విశ్వామిత్రుడు జన్మిస్తాడు. మీ కులాల కలయిక లోకానికే కీర్తి పాత్రమౌతుంది. నేనిక తీర్థయాత్రలకు పోతాను. నీవు సుఖంగా ఉండుము' అంటూ ముని తన దారిన తాను పోయాడు. రాజు భార్యతో సహా అతడికి వినయంతో నమస్కరించాడు.

విశేషం: ఈ కథను చెప్పుమని అడిగినప్పుడు ధర్మరా జన్నాడు 'మహాత్మా!' మదీయ చిత్తాయత్తంబుగా నత్తెఱంగెఱింగింపవే' యని. ఈ కథ నట్లా మనస్సునకు హత్తుకొనేటట్లు చెప్పాడు మహాత్ముడైన కవిబ్రహ్మ. ఓర్పు ఎంత చేకూరుస్తుందో పాఠకులు గమనించాలి. అచ్చమైన మనిషిని నిర్మించటం సాహిత్య ప్రయోజన మన్నారు తొల్లిటి పెద్దలు. ఇంతకంటె దాని కుదాహరణ మేమున్నది కనుక.

భీష్ముఁడు ధర్మజునకు దానవిశేషముల నెఱింగించుట (సం.13-92-28 (కుంభ))

క. **అని కురుపితామహుఁడు సె । ప్పిన విని, ధర్మాత్మజుండు ప్రియమందుచు నా**
తనితో 'దానవిశేషము । లనఘా! యెఱిఁగింపు' మనుడు నతఁ డిట్లనియెన్. **332**

ప్రతిపదార్థం: అని; కురుపితామహుఁడు= కౌరవుల తాత, భీష్ముడు; చెప్పినన్= చెప్పగా, చెప్పితే; విని; ధర్మ+ఆత్మజుండు= యమధర్మరాజు కొడుకు; ప్రియమున్= ప్రీతిని; అందుచున్= పొందుతూ; అతనితోన్= ఆ భీష్ముడితో; అనఘా!= పుణ్యాత్ముడా!; దానవిశేషములు; ఎఱిఁగింపుము= చెప్పుము; అనుడున్= అంటే; అతండు; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగా విని ధర్మరాజు సంతోషించి తాతగారిని దాన విశేషాలు చెప్పుమని అడిగాడు.

సీ. **'కాంస్యోపదోహయుఁ గాంచన చారుశృం । గయు ధవళాంబర కలితయును, స**
దక్షిణయును నయి తగుగోవుఁ బాత్రత్వ । భవ్యవిప్రునకు సద్భక్తితోడ

నిచ్చిన దానికి నెన్ని రోమము లన్ని। దివ్యవత్సరములుఁ ద్రిదశలోక

మున వసింతురు; కులంబున యేడు తరముల । జనముల సుగతికి ననుతు రధిప!

ఆ. కన్య, భూమి, గృహము, గనక, మన్నము, జల । మంబరంబు, శయన, మాసనంబు,

వాహనంబు, విప్రవరునకు నీగి లో । కముల రెంట సౌఖ్యకారి యండ్రు. 333

ప్రతిపదార్థం: కాంస్య= కంచుతో చేసిన; ఉపదోహయున్= పాలు పితికెడుపాత్రతో కూడినది; కాంచన= బంగారు; చారు= అందమైన; శృంగయున్= కొమ్ములు కలది; ధవళ= తెల్లని; అంబర= వస్త్రంతో; కలితయును= కూడుకొన్నదియు; సదక్షిణయును= దక్షిణతో కూడుకొన్నది అయి; తగు= ఒప్పునట్టి; గోవున్= ఆవును; పాత్రత్వ= అర్హతకల; భవ్య= శ్రేష్ఠుడైన; విప్రునకున్= బ్రాహ్మణుడికి; సత్= మంచి; భక్తితోడన్= భక్తితో; ఇచ్చినన్= దానమిస్తే; దానికిన్= ఆ గోవునకు; ఎన్ని; రోమములు= వెంట్రుకలో; అన్ని; దివ్య వత్సరములు= దేవతా సంవత్సరాలు; త్రిదశ లోకమునన్= దేవతల లోకంలో, స్వర్గంలో; వసింతురు= ఉంటారు; కులంబున= తన కులంలో, ఏడు తరముల; జనములన్= మనుష్యులను; సుగతికిన్= మంచిస్థితికి; అనుతురు= పంపిస్తారు; అధిప!= రాజా!; కన్య= వివాహం కాని పడుచు; భూమి= పంటనేల; గృహము= ఇల్లు; కనకము= బంగారం; జలము= నీరు; అంబరంబు= వస్త్రం; శయనము= మంచం; ఆసనంబు=కుర్చీ, పీట; వాహనంబు= ప్రయాణ సౌకర్యానికి గుర్రం మొదలగునవి; విప్రవరునకున్= బ్రాహ్మణ శ్రేష్ఠుడికి; ఈగి=దానమివ్వటం; లోకములరెంటన్= ఇహపరలోకాలందు; సౌఖ్యకారి= సుఖాన్ని కలిగిస్తుందని; అండ్రు= పెద్దలు అంటారు.

తాత్పర్యం: పాలుపితికెడు కంచుపాత్ర బంగారు కొమ్ముల తొడుగులు తెల్లని వస్త్రాలు వీటితోకూడిన ఆవును దక్షిణతో పాటుగా యోగ్యత గల గొప్పవిప్రునకు మంచిభక్తితో దానమిస్తే ఆ గోవుకు ఎన్ని వెంట్రుకలు ఉన్నాయో అన్ని దివ్యసంవత్సరాలు దేవతలలోకంలో నివసిస్తారు. తమ కులంలో ఏడుతరాల జనాలను ఉత్తమలోకాలకు పంపుతారు. ఆడుపిల్ల, భూమి, ఇల్లు, బంగారము, అన్నము, నీరు, వస్త్రము, పాన్పు, కూర్చుండేపీట, వాహనము అనేవానిని విద్యాపుష్కలంగా ఉన్న బ్రాహ్మణునకు దానం ఇవ్వటం ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖాన్ని కలిగించే కార్యం అని పెద్దలు చెబుతారు.

క. అనిన విని పాండవాగ్రజుఁ । 'డనఘా! యిన్నింటికంటె నధికంబగు దా

ని నెఱింగింపు' మనుడు, న । జ్జనపతి కిట్లను నతఁడు ప్రసన్నాత్మకుఁడై. 334

ప్రతిపదార్థం: అనినన్; విని; పాండవ+అగ్రజుండు= పాండవులలో ముందు పుట్టినవాడు, పెద్దవాడు; అనఘా!= పాపం లేనివాడా!; ఇన్నింటికంటెన్= వీటన్నిటికన్నా; అధికంబు= గొప్పది; అగుదానిన్= అయిన దానిని; ఎఱింగింపుము= తెలియజేయుము; అనుడున్; ఆ+జనపతికిన్= ఆ రాజుతో; అతఁడు= భీష్ముడు; ప్రసన్న+ఆత్మకుఁడై= ప్రశాంత హృదయం కలవాడై; ఇట్లు; అనున్.

తాత్పర్యం: విని ధర్మరా జన్నాడు; 'పాపం లేనివాడా! వీటన్నిటికంటె గొప్ప దానమేదో చెప్పుము' అని. దాని కతడు సంతోషించి ప్రసన్నమైన మనస్సుతో.

తే. 'అర్థి గోరిన వస్తువు లర్థితోడ । నీగి యెల్ల దానములకు నెక్కుడరయ;

నఖిల భూతమ్ములకు నభయంబు నిచ్చు ।టంతకంటెను మే లందు రార్యజనులు.' 335

ప్రతిపదార్థం: అర్థి= యాచకుడు; కోరిన వస్తువులు= ఏది కోరితే అది; అర్థితోడన్= ప్రేమతో; ఈగి= ఇవ్వటం; ఎల్లన్ దానములకున్; ఎక్కుడు= అన్ని దానాలలోకి ఎక్కువ; అరయన్= ఆలోచిస్తే; అంతకంటెన్= దానికంటె కూడా; అఖిల భూతమ్ములకున్= సర్వ జీవరాసులకు; అభయంబున్+ఇచ్చుట= భయం పోగొట్టటం, రక్షణ కల్పించటం; ఆర్యజనులు= ధర్మవేత్తలు, పండితులు; మేలు= గొప్ప; అందురు.

తాత్పర్యం: ఏది కోరి యాచకుడు తన దగ్గరికి వస్తాడో దాన్నే ప్రేమతో ఇవ్వటం అన్ని దానాలలో శ్రేష్ఠం. దానికంటె కూడా సర్వజీవులకు అభయ మివ్వటం చాలా గొప్పది.

విశేషం: దీనికి ఉదాహరణగా ఇదే పర్వంలో నాలుగవ ఆశ్వాసం 314 పద్యం నుండి ప్రారంభమైన పురుగు కథ గ్రహించాలి. మహాభారతమంటే పురుగు దగ్గర నుండి శ్రీకృష్ణపరమాత్మ దాకా వ్యాపించి ఉన్న సమస్త సృష్టి కథ.

వ. 'అని చెప్పి వినుమని మఱియు నిట్లనియె'. 336

తాత్పర్యం: అని ఆ విధంగా వివరించి, ఇంకా విను మని ఇట్లా చెప్పుతున్నాడు.

తే. వీరశయనంబు మేలండ్రు వీనికంటె । మఱియుఁ గొన్నింటి కంటెను మనుజనాథ!
దానముల కావు, వెదకిన దానిఁ బోల । లేవు, పుణ్య కర్మములలో నేవియైన.' 337

ప్రతిపదార్థం: వీనికంటెన్= ఈ చెప్పిన వాటికంటె; వీరశయనంబు= యుద్ధంలో మరణించటం; మేలు+అండ్రు= గొప్పదంటారు; మనుజనాథ!= మానవులకు పాలకుడా!; మాదియున్= ఇంకా కొన్నింటికంటెను; దానముల కావు= అసలు దానాలే లేవు; వెదకినన్= వెతికిచూచినా; పుణ్యకర్మములలోన్= పుణ్య చేష్టలలో; ఏని ఐనన్= ఏవైనాసరే; దానిన్= వీరశయనాన్ని; పోలన్ లేవు= సరిపోలగా లేవు.

తాత్పర్యం: వీరశయన మన్నింటికంటె గొప్పది. దానితో పోలిస్తే మిగిలినవి అసలు దానాలే కావు. సర్వపుణ్య కర్మలలోను అదే గొప్పది.'

వ. అనుటయు ధర్మజుండు తమ్ములం దెసం గనుంగొనిన, వార లతని చిత్తం బెఱింగి రణమరణ స్తుతి సేయ, నతండు సమరంబునం జచ్చిన బంధు, మిత్ర జ్ఞాతి, జనంబుల వలని శోకంబు వదలి వాహినీ నందను వాక్యంబు లభినందించె; నా దేవవ్రతుండు వెండియు. 338

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ధర్మజుండు= ధర్మరాజు; తమ్ములదెసన్= తమ్ముళ్ళవైపు; కనుంగొనినన్= చూడగా; అతని చిత్తంబు= అన్న మనస్సు; ఎఱింగి= తెలిసికొని; రణ= యుద్ధంలో; మరణ= మరణించినవారి; స్తుతి= ప్రశంస; చేయన్= చేయగా; అతండు; సమరంబునన్= యుద్ధంలో; చచ్చిన=మరణించిన; బంధు= చుట్టాలు; మిత్ర= స్నేహితులు; జాతి జనంబులవలని= దాయాది జనులకారణంగా ఏర్పడిన; శోకంబు= దుఃఖము; వదలి= వదలి; వాహినీ= నది; నందనుండు= కొడుకు; వాక్యంబులు= మాటలు; అభినందించెన్= పొగడినాడు; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; వెండియున్= మరలా.

తాత్పర్యం: అనగానే ధర్మరాజు తమ్ముళ్ళవైపు చూచాడు. వారు ఆయన మనసు తెలిసికొని యుద్ధంలో చనిపోయిన వారిని స్తుతించారు. చచ్చిపోయిన బంధువులు, స్నేహితులు, దాయాదులపై ఉన్న దుఃఖాన్ని పోగొట్టుకొని ధర్మరాజు గంగాదేవికొడుకు చెప్పిన మాటలను స్తుతించాడు. భీష్ముడు మరలా ఇట్లా అన్నాడు.

క. 'అరియైన దీనుఁడై తను । శరణం బని వేఁడినం , బ్రసన్నాత్మత న

ప్పురుషుని కోరిక దీర్చినఁ । బురుషోత్తముఁ డందు రతనిఁ బురుషవరేణ్యా! 339

ప్రతిపదార్థం: పురుషవరేణ్యా!= మనుష్యులలో శ్రేష్ఠుడా!, వీరులలో శ్రేష్ఠుడా!; అరి ఐనన్= శత్రువు ఐనా; దీనుఁడై= దైన్యంతో; తనున్= తనను; శరణంబని= దిక్కు అని రక్షింపుమని; వేఁడినన్= ప్రార్థిస్తే; ప్రసన్న+ఆత్మతన్= సమమైన మనస్సుతో, ప్రశాంతబుద్ధితో; ఆ పురుషుని= ఆ వీరుడి, ఆ వ్యక్తియొక్క; కోరిక; తీర్చినన్; అతనిన్= అతనిని; పురుషోత్తముఁడు+ అందురు= నారాయణుడు అని అంటారు; పురుషులలో ఉత్తముడని అంటారు,

తాత్పర్యం: శత్రు వెట్లాంటివా డైనా దైన్యంతో శరణు కోరితే అతడి కోరిక తీర్చిన వాడిని పురుషోత్తము డంటారు.

క. అడుగక యున్నను, నాలిం । గొడుకుల రక్షింప లేక, కుతిలపడుచు నె

ప్పుడుఁ బేదతనము గల నరు । నెడ రుడుపఁగవలయు నది మహితగుణ మనఘా! 340

ప్రతిపదార్థం: అనఘా!; అడుగక ఉన్ననున్= అడుగక పోయినా; ఆలిన్= భార్యను; కొడుకులన్= సంతానాన్ని; రక్షింపలేక= సాక లేక; కుతిలపడుచున్= బాధపడుతూ; ఎప్పుడున్; పేదతనము= పేదరికం; కల; నరుని= మనుష్యుడి; ఎడరు= ఆపద, దుఃఖం; ఉడుపఁగ వలయున్= పోగొట్టాలి; అది; మహిత= గొప్ప; గుణము= స్వభావం.

తాత్పర్యం: భార్యా పుత్రులను పోషించుకొనలేక పేదరికంతో బాధపడే మనిషి దుఃఖాన్ని పోగొట్టటం గొప్ప గుణమయ్యా! ధర్మజా!

క. నిజదారపరులు సంతత । యజనరతులుఁ గామరోష హంతలు నగు స

ద్విజుల నరసి ధన మిచ్చుట । త్రిజగత్పూజ్య మగు నండ్రు ధీరవిచారా!' 341

ప్రతిపదార్థం: ధీరవిచారా! చెదరని మనస్సుతో ఆలోచించేవాడా!; నిజదారపరులు= స్వంత భార్యలయందే ప్రేమకలవారు; సంతత= నిత్యం; యజనరతులు= యాగం చేయడంలో ఆసక్తి కలవారు; కామ=కామాన్ని; రోష= కోపాన్ని; హంతలు= చంపినవారు అగు; సత్+ద్విజులన్= మంచి బ్రాహ్మణులను; అరసి= పరిశీలించి; ధనమున్= డబ్బు; ఇచ్చుట; త్రిజగత్ పూజ్యము= మూడు లోకాలలో పూజించ దగ్గది; అంద్రు= అంటారు.

తాత్పర్యం: సమబుద్ధితో విచారించేవాడా! స్వభార్యలయందే మనస్సు లగ్నమైనవారు, నిత్యమూ యజ్ఞయాగాదులు చేస్తుండేవారు, కామ రోషాలు లేనివారూ అయిన మంచి బ్రాహ్మణులను పరిశీలించి దానంచేయటం మూడు లోకాలలో గొప్పవిషయం. లేదా, మూడు లోకాలకూ పూజించదగ్గది.'

విశేషం: ధర్మపరుడైన మనిషి ఎవరు అంటే ఈ మూడు లక్షణాలు కలవాడు. 1.స్వభార్యారక్తుడు - ఇతర స్త్రీలను ధర్మబుద్ధితో చూచేవాడు, 2. యజనపరుడు - యజ్ఞ యాగాదులు చేయటంలో ఆసక్తుడు; 3.కామ-రోషహంత అవి కలవాడు ఇట్లా ధర్మ - అధర్మ పరులుంటారు. ఈ పద్య రచన చాలా అందమైనది. మూడు గుణాలను ముచ్చటగా సమంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యపాదాలలో మూడేసి వాక్యాలుగా సమవాక్యాలుగా చెప్పటంవలన పద్యరచనలో సమత్వం తూగు వచ్చాయి.

వ. అనినం బాండవాగ్రజుండు 'యాచనా యాచనంబులలో నెయ్యది దానార్హం బగు?' నని యడిగిన నతనికిఁ బితామహుం డిట్లనియె. 342

ప్రతిపదార్థం: అనినన్= అనగా; పాండవాగ్రజుండు= ధర్మరాజు; యాచన= భిక్షాటన, దానమడగటం; అయాచనంబులలోన్= దానం కోరకపోవటంలో; ఏ+అది= ఏది; దాన+అర్హంబు= దానానికి తగింది; అని= అని; అడిగినన్= అడుగగా; అతనికిన్= అతడికి; పితామహుండు= తాత భీష్ముండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా జవాబు చెప్పాడు.

తాత్పర్యం: అనగా, ధర్మరా జన్నాడు 'అడిగిన వాడికి దానం చేయటం మంచిదా? అడగనివాడికి దానం చేయటం మంచిదా?' దీనికి తాతగారు సమాధానం చెప్పుతున్నారు.

చ. 'అడిగిన నిచ్చుకంటెను నయాచకుఁ గాఁగ నెఱింగి యిచ్చు టె
క్కుడు ఫలమిచ్చు; దానవిధికోవిద! వేడుట సావు వేఁడఁగా
బడు టది పెద్దసావు; దగు ప్రార్థన పూర్ణము సేయునాతఁ డా
యడిగిన వానిఁ దన్నును దయారతిఁ గావఁగఁ జాలు వాఁడగున్.' 343

ప్రతిపదార్థం: అడిగినన్= అడిగితేనే; ఇచ్చుకంటెను= ఇవ్వటం కంటె; అయాచకున్+కాఁగన్= అడగనివాడినిగా; ఎఱింగి= తెలిసి; ఇచ్చుట; ఎక్కుడు= ఎక్కువ; ఫలము= ఫలితం; ఇచ్చున్; దానవిధి కోవిద!= దాన సంబంధమైన విధులు తెలిసినవాడా!; వేఁడుట= కోరటం; చావు= మరణం; వేఁడఁగాఁబడుట= ప్రార్థించబడటం; అది; పెద్దచావు= అన్నిటికంటె పెద్దదైన మరణం; తగు ప్రార్థన= అర్హమైన కోరికను; పూర్ణము= సంపూర్ణము; ఫలవంతం; చేయునాతఁడు= చేసేవాడు; అడిగినవానిన్= వేడుకొన్నవాడిని; తన్నునున్= తనను; దయారతిన్= దయాగుణమందలి ఆసక్తితో; కావఁగన్= రక్షించటానికి; చాలువాఁడు= సమర్థుడైనవాడు; అగున్= ఔతాడు.

తాత్పర్యం: 'అడిగితే ఇవ్వటం కంటె అడగనివాడు వీడు అని తెలిసి వాడికి ఇవ్వటం చాలా గొప్పదానం. దానవిధులు తెలిసినవాడా! అసలు అడగట మన్నది చావువంటిది. అడగబడటం పెద్దచావు వంటిది. కనుక అడగని వాడి కివ్వటంవలన వాడినీ, పుచ్చుకొన్నవాడినీ, తననూ రక్షించేవా డౌతాడు.'

వ. అనిన విని యుధిష్ఠిరుం డతని కిట్లనియె. 344

తాత్పర్యం: ఆ విధంగా భీష్ముడు చెప్పగా విని ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. దానము యజ్ఞక్రియ నాఁ । గా నతులిత ధర్మవిధులు గల; వందు ధరి
త్రీ నాథోత్తమ! యధిక ఫ । లానూనంబై వెలుంగు నది యెయ్యదియో?' 345

ప్రతిపదార్థం: దానము; యజ్ఞక్రియ= యజ్ఞ కర్మ; నాన్+కాన్= అనగా; అతులిత= సాటిలేని; ధర్మవిధులు= ధర్మపద్ధతులు; కలవు= ఉన్నవి; అందున్= దానిలో; ధరిత్రీ నాథ!+ఉత్తమ!= రాజులలో శ్రేష్ఠుడా!; అధిక= గొప్ప; ఫల= ఫలితం; అనుమానంబు+ఐ= ఎక్కువై; వెలుంగునది= ప్రకాశించేది; ఎయ్యదియో?= ఏదో?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'దానం యజ్ఞంవంటిది. అందులోనే ధర్మవిధు లున్నాయి. మహారాజా! వాటిలోకెల్లా అధికమైన ఫలితాల నిచ్చే దేదో?

వ. వినవలఁతుం జెప్పవే యని యడిగిన నయ్యనిమిష నదీనందనుం డప్పాండు నందనాగ్రజున కిట్లనియె.346

ప్రతిపదార్థం: వినవలఁతున్= వినటానికిష్టపడుతున్నాను, వినాలనుకొంటున్నాను; చెప్పవే!= చెప్పవా?; అని అడిగినన్; ఆ+అనిమిష= దేవతల; నదీ= ఏరు; నందనుఁడు= కొడుకు, దేవతానది గంగ - ఆమె కొడుకు; ఆ పాండు నందన+అగ్రజునకు= పాండురాజు కొడుకులలో పెద్దవాడు ధర్మరాజుకు; ఇట్లు అనియెన్.

తాత్పర్యం: వినాలనుకొంటున్నాను' అని అడుగగా భీష్ముడు ధర్మరాజుతో ఇలా అంటున్నాడు.

ఉ. భూసురకోటికిన్ వినయపూర్వముగా ధన ధాన్య గో మణి
క్ష్మా సలిలాన్న ముఖ్యములు సమ్మతి నీగి సుయజ్ఞ మాసనో
ద్భాసితసత్క్రియన్ నడపు భవ్యుఁడు యజ్ఞములుం దపంబులుం
జేసిన పుణ్యముం బడయుఁ; జేయుము దానము లోపి నిత్యమున్.' 347

ప్రతిపదార్థం: వినయపూర్వముగాన్= వినయపూర్వకంగా, సమస్కారపూర్వకంగా (వినతి= వినయం, మనస్సులో, వాక్కులో, శరీరంలో, వంగి నమస్కరించే లక్షణం, ఇచ్చేవాడికుండాలి); భూసుర= భూమిపై దేవతలైన - బ్రాహ్మణులయొక్క; కోటికిన్= సమూహానికి; ధన= డబ్బు; ధాన్యం=పంట; గో= ఆవు; మణి= మణులు; క్ష్మా= భూమి; సలిల= నీరు; అన్న= భోజన; ముఖ్యములు= మొదలైనవి; సమ్మతిన్= ఇష్టంతో; ఈగి= ఇవ్వటం; సు+యజ్ఞము= మంచి యజ్ఞము; ఆసన= పీట; ఉత్+భాసిత= పైకి వెలుగొందే; సత్క్రియన్= మంచిపని; ఆసనం మీద కూర్చుండి చేసే పని; నడపు= నడిపే; భవ్యుఁడు= శ్రేష్ఠుడు; యజ్ఞములున్; తపంబులున్; చేసిన పుణ్యమున్= చేసినంత పున్నెం; పడయున్= పొందుతాడు; దానములు; ఓపి= ఓర్పుతో; నిత్యమున్; చేయుము= కావింపుము.

తాత్పర్యం: నిత్యము బ్రాహ్మణులకు వినయపూర్వకంగా, ధనధాన్యాలు, ఆవు, రత్నం, భూమి, నీరు, అన్నాదులు సద్బుద్ధితో ఇవ్వటం యజ్ఞమే. కనుక దానం చేయుము. అది తపస్సు, యజ్ఞం చేసిన ఫలితమిస్తుంది.'

క. అనవుడు నాతనితో ని । ట్లనుఁ గుంతీతనయముఖ్యుఁ 'డనఘా! పెక్కుల్
వినఁబడు దానము లధికం । బనఁ దగియెడు దాన మెద్ది? యన్నిటిలోనన్.' 348

ప్రతిపదార్థం: అనవుడన్; ఆతనితోన్= భీష్ముడితో; కుంతీ తనయ ముఖ్యుఁడు= కుంతి కొడుకులలో పెద్దవాడు; ఇట్లు; అనున్; అనఘా!; దానములు; పెక్కుల్= అనేకం; వినఁబడున్= చెప్పబడుచున్నవి; అన్నిటిలోనన్= వాటన్నిటిలో; అధికంబు= గొప్పది; అనన్= అనుటకు; తగియెడు= అర్హమైన; దానము= దానం; ఎద్ది?= ఏది?

తాత్పర్యం: అనగానే భీష్ముడితో ధర్మరాజు అన్నాడు. 'అనేక దానాలు చెప్పబడుతున్నాయి కదా! వాటిలో ఉత్తమమైనది ఏది?'

వ. అని యడిగిన నయ్యాపగాసూనుం డమ్మానవపతి కిట్లనియె. 349

ప్రతిపదార్థం: అని; అడిగినన్; ఆ+ఆపగాసూనుండు= నదీకుమారుడు, భీష్ముడు; మానవపతికిన్= రాజుకు; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: అని ప్రశ్నించిన ధర్మరాజుతో భీష్ముడు ఇట్లా అన్నాడు.

భూదాన మహిమాభివర్ణనము (సం.13-61-1)

క. దానము లన్నిటికిని భూ । దానం బెక్కుడు సమస్త ధాన్యములుఁ బ్రభూ
తానేక వస్త్ర ధన ర । త్నానూనత్వమును భూమి నవుట కతమునన్. 350

ప్రతిపదార్థం: సమస్త ధాన్యములు= అన్ని పంటలు; ప్రభూత= అధికమైన; అనేక= పెక్కు; వస్త్ర= గుడ్డ; ధన= డబ్బు; రత్న= మణులు; వీనియొక్క అనూనత్వమును= అధిక్యమును; భూమిన్= భూమిలో; అవుట కతమునన్= అవుతున్నందువలన; దానములు; అన్నిటికిని= అన్నిటికంటె; భూదానంబు= నేలను దానం చేయటం; ఎక్కుడు= ఎక్కువ.

తాత్పర్యం: దానాలన్నింటిలో భూదానమే శ్రేష్ఠం. ధాన్యాలన్నిటికి నేలయే ఆధారం. అంతే కాదు, బట్టకు ప్రత్తి అక్కడే పండుతుంది. రత్నాలూ భూమిలోనే కదా దొరికేవి. కనుక అతిశయంగా డబ్బిచ్చేది నేలయే.

క. కనకము రజతము వస్త్రం । బును ధాన్యము వివిధ రత్నములు నిచ్చిన య
వ్వినుత ఫలంబుల నెల్లను । గను నుత్తమభూమి దానకర్త నరేంద్రా! 351

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= మానవనాథా!, రాజా!; కనకము= బంగారం; రజతము= వెండి; వస్త్రంబును= గుడ్డా; ధాన్యము= పంట; వివిధ రత్నములు= అనేక రత్నాలు; ఇచ్చిన= దానం చేసిన; ఆ+వినుత= ఆ పొగడ దగ్గ; ఫలంబులన్+ఎల్లన్= ఫలితాలన్నింటినీ; ఉత్తమ భూమి దానకర్త= మంచిభూమిని దానంచేసినవాడు; కనున్= పొందుతాడు.

తాత్పర్యం: బంగారం, వెండి, వస్త్రం, ధాన్యం, వివిధ రత్నాలు - ఇచ్చిన ఫలా లన్నిటినీ శ్రేష్ఠమైన భూదానం చేసినవాడు పొందుతాడు.

సీ. భూమి కెంతాయువు భూదానకర్తయు । నంతకాలము సుఖ మందుచుండు
నమరలోకంబున; నల్పమైనను భూమి । యిచ్చిన బహుభూమి యేలు నతఁడు;
రాజు విశేషించి రణమృతి యొండెను । భూదాన కర్తృత్వ పుణ్య మొండెఁ
బడయంగవలయుఁ బాపఁగ నోపు బ్రహ్మ హ । త్యాది పాతకముల నైన భూమి

తే. దాన మెంత పాపాత్ముచే నైన భూమిఁ । గొనిన గల్మష మొందదు; వినుము మహిత
మైన భూదానవిధియును నశ్వమేధ । యాగమును సదృశంబులం డ్రాదిమునులు. 352

ప్రతిపదార్థం: భూమికిన్; ఎంత; ఆయువు= ఆయుస్సో; భూదానకర్తయున్= భూదానం చేసినవాడున్నూ; అమర లోకంబునన్= దేవతాలోకంలో; అంత కాలమున్; సుఖమున్; అందుచున్; ఉండున్; భూమి; అల్పము+ఐనను= కొంచెమైనాసరే; ఇచ్చినన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇస్తే; అతఁడు= ఇచ్చినవాడు; బహుభూమి= ఎక్కువ నేలను; ఏలును= పాలించగలడు; విశేషించి= వీరికంటె ఎక్కువగా; రణమృతి= యుద్ధంలో చావు; ఒండెన్= ఐనా; భూదాన= భూమి నివ్వటం; కర్తృత్వ పుణ్యము+ఒండెన్= కర్తయైన పున్నెమైనా సరే (భూమిని దానం చేసిన కర్త పున్నెమైనా; పడయంగన్ వలయున్= పొందవలెను; భూమిదానము; బ్రహ్మహత్య= బ్రాహ్మణ హత్య; అవి= మొదలైన; పాతకములన్+ఐనన్= పాపాలనైనా; పాపఁగన్= పోగొట్టగా; ఓపున్= సమర్థమగును; ఎంత పాపాత్ముఁచే నైనన్; భూమిన్ కొనినన్= భూమిని గ్రహిస్తే; కల్మషము= పాపం; ఒందదు= తగులదు; వినుము; ఆది మునులు= ప్రాచీన కాలఋషులు; మహితము+ఐన= గొప్పదైన; భూదాన విధియునున్= భూమిని దానంచేసే కర్మ; అశ్వమేధయాగమును= అశ్వమేధమన్న యాగమూ; సదృశంబులు= సమానములు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: భూమి ఎంత కాలం ఉంటుందో భూదానం చేసినవాడుసైతం స్వర్గలోకంలో అంతకాలం ఉంటాడు. కొంచెం నేలను దానంచేసినా ఎంతో నేలను పొందగలడు. రాజు రణమరణమైనా పొందాలి, భూదానమైనా చేయాలి. భూదానంవలన బ్రహ్మహత్యవంటి పాపాలు పోతాయి. భూదానాన్ని ఎంత పాపాత్ముడు చేసినా, గ్రహించినవానికి కల్మషం రాదు. భూదానం అశ్వమేధం సమాన మని ఆదిమునులు అంటారు.

క. దారిద్ర్యముచేఁ గుందుచు । నేరిని నడుగంగఁ బోవ కెంతయుఁ గృశతం
గూరిన విప్రున కుర్వర । వారని దయ నీగి ఫలము వాగ్గోచరమే? 353

ప్రతిపదార్థం: దారిద్ర్యముచేన్= పేదరికంతో; కుందుచున్= బాధపడుతూ; ఏరినిన్= ఎవరినీ; అడుగంగన్= అడగటానికి; పోవక= పోకుండా; ఎంతయున్= మిక్కిలి; కృశతన్= లేమిడిలో; కూరిన= కూరుకొనిపోయిన; విప్రునకున్= బ్రాహ్మణుడికి; ఉర్వరన్= భూమిని; వారని దయన్= ఎక్కువ దయతో; ఈగి= దానము చేయడంలోని; ఫలము= ఫలితం; వాక్+గోచరమే?= వాక్కున కందునా? అందదు.

తాత్పర్యం: "దారిద్ర్యంతో బాధపడుతూ ఎవరినీ యాచించడానికి పోకుండా ఎంతోలేమిడిలో కూరుకుపోయిన బ్రాహ్మణుడికి ఎక్కువ దయతో పంటపండే భూమిని దానం చేస్తే కలిగే ఫలితాన్ని మాటల్లో చెప్పడం సాధ్యమా?"

విశేషం: అన్ని రకాల పైరులచే నిండిన నేల 'ఉర్వర'.

తే. యాగకర్తయు శాంతుండు నైన యట్టి । విప్రుఁ బ్రార్థించి యైన నుర్వీప్రతి గ్ర
హంబు సేయించు టత్యధికంబు భూమి । దానవిధి విశేషంబులలోన నెల్ల. 354

ప్రతిపదార్థం: భూమిదాన విధి విశేషంబులు= భూదాన సంబంధమైన విశేష విధానాలు; లోనన్= లోపల; ఎల్లన్= అన్నిటిలో; యాగకర్తయున్= యజ్ఞాలు చేసినవాడు; శాంతుండును= సమత్వం కలవాడును; ఐన అట్టి= అయినటువంటి; విప్రున్= బ్రాహ్మణుడిని; ప్రార్థించియైనన్= మిక్కిలిగా వేడుకొనిఐనాసరే; ఉర్వీ= భూమి; ప్రతిగ్రహంబు= గ్రహించటం; చేయించుట= చేయించటం; అతి+అధికంబు= మిక్కిలి అధికమైనది.

తాత్పర్యం: భూదాన విధులలో విశేషమైన విధి ఏమంటే యాగం చేసినవాడు శాంతుడైనవాడు అయిన బ్రాహ్మణుడిని ప్రార్థించయినాసరే భూమిని గ్రహించేటట్లు చేయించటం గొప్ప విశేషం.

విశేషం: ప్రతి పద్యంలోనూ విప్రశబ్దమే కనిపిస్తున్నది. ఇది చాలా విచారింపదగ్గది. వేదంలో "ఏకం సత్ విప్రా బహుధా

వదంతి'' అని ఉన్నది. 'ఉన్న సత్య మొక్కటే దానినే విప్రు లనేక రకాలుగా వివరిస్తున్నారు' అన్నచోట విప్రశబ్దంలో వి= విశిష్టమైన; ప్ర= అధికమైన; అన్న అర్థంలో ఉపసర్గలు. ఆనాటి కాలంలో శబ్దం నిజమైన అర్థంలోనే వాడబడేది. రానురాను ఆ అర్థం పోయి శబ్దం అరిగిన నాణెమై పోతుంది. కనుక తిక్కనగారు వాడే విప్ర శబ్దం వేదంలో చెప్పిన అర్థంలోనే గ్రహించాలి. విప్ర=ఋషి.

క. విను మర్హుఁడైన విప్రున । కనఘా! గోచర్మమాత్ర యగు మేదిని ని
చ్చినఁ బోని యట్టి పాపము । ఇనుపొడుపునఁ జెడని తమము నెందును గలవే? 355

ప్రతిపదార్థం: అనఘా!; వినుము; అర్హుఁడు+ఐన= తగినవాడైన; విప్రునకున్; గోచర్మమాత్ర= గోవు చర్మమంత మాత్రం; అగు= అయిన; మేదినిన్= భూమిని; ఇచ్చినన్= దానమిస్తే; పోని= పోవని; అట్టి= అటువంటి; పాపము; ఇనుపొడుపునన్= సూర్యోదయంతో; చెడని= నాశంకాని; తమమున్= చీకటి; ఎందునున్= ఎక్కడైనా; కలవే?= ఉన్నాయా?

తాత్పర్యం: ధర్మరాజా! తగినబ్రాహ్మణుడికి గోచర్మమంత భూమిని దానమిస్తే పోని పాపంకానీ, సూర్యోదయంతో తొలగని చీకటికానీ ఎక్కడైనా ఉంటాయా?

విశేషం: అలం: సహోక్తి.

క. ఆజిప్రాప్త మృతులు గురు । పూజకులును, మఱియు నెట్టి పుణ్యాత్మకులున్
రాజోత్తమ! భూదాన । భ్రాజిష్ణునిఁ బోల రండ్రు పరమమునీంద్రుల్'. 356

ప్రతిపదార్థం: రాజ+ఉత్తమ!= ఉత్తముడవైన రాజా!; ఆజి= యుద్ధంలో; ప్రాప్త= పొందిన; మృతులు= చావుకలవారు; గురు= ఆచార్యుని; పూజకులును= పూజించేవారును; మఱియున్; ఎట్టి= ఎట్లాంటి; పుణ్య+ఆత్మకులున్= పుణ్యం చేసినవారున్నూ; రాజ+ఉత్తమ= ఉత్తముడవైన రాజా!; పరమ= గొప్ప; ముని+ఇంద్రుల్= మునిశ్రేష్ఠులు; భూదాన= భూమిని దానంచేయుటంవలన; భ్రాజిష్ణునిన్= ప్రకాశించేవాడిని; పోలరు= సరితూగరు; అంద్రు= అంటారు.

తాత్పర్యం: యుద్ధంలో మరణించినవారు, గురువులను పూజించేవారు, మరి ఎట్లాంటి పుణ్యాత్ములైనా సరే భూదానంతో ప్రకాశించేవాడితో సరిపోలరు అంటారు మునీశ్వరులు.'

వ. అని చెప్పి భీష్ముండు వెండియు నిట్లను 'భూదేవి జనులకు హితంబుగా నానతిచ్చిన వాక్యంబులు భూగీత లనంబరఁగు; వాని విని పరశురాముండు భూదానపరుం డయ్యె నని విందుము పాండవాగ్రజా! యవి నీ వాకర్ణింపుము. 357

ప్రతిపదార్థం: అనిచెప్పి; భీష్ముండు; వెండియున్= మరల; ఇట్లు+అనున్= ఇట్లా అంటున్నాడు; భూదేవి; జనులకున్= జనులకు; హితంబుగాన్= మేలుకొరకుగా; ఆనతి+ఇచ్చిన= సెలవిచ్చిన; వాక్యంబులు= మాటలు; భూగీతలు= భూదేవి చెప్పిన మాటలు; అనన్= అనే పేరున; పరఁగున్= వ్యాప్తిపొందాయి; వానిన్= వాటిని; విని= ఆలకించి, పరశురాముండు= పరశురాముడు; భూదానపరుఁడు= భూమిని దానం చేసేవాడు; అయ్యెన్= అయ్యాడు; అని; విందుము= విన్నాము; పాండవాగ్రజా!= ధర్మరాజా!; అవి= వాటిని, భూగీతలను; నీవు= నీవు; ఆకర్ణింపుము= వినుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పాండవులలో పెద్దవాడా! భూదేవి జనం శుభం కోరి చెప్పిన మాటలు భూగీత లనే పేరున లోకంలో పేరు పొందాయి. అవి విని పరశురాముడు భూదానంచేశాడు. నీవూ అవి వినాలి.

విశేషం: గీత= పాడబడినది. పాట= పరమాత్మ దర్శనంతో ఆనందావేశం పొందిన ఋషి పాడినపాట గీత. ఇదే ఉత్ గీత (థ) లన్న పేరున ఉపనిషత్తులలో చెప్పబడ్డాయి. భగవద్గీత - భగవంతుడి పాట, మాట. బ్రహ్మగీత, దేవీగీతలు ఇట్లా అనేకం వచ్చాయి. ఆత్మానందాన్ని అందించేకొరకు వ్యక్తమైన పాట. పూర్వం మాట లేదు. పాటే ఉండేది. మాట మంత్రమైన పాటయిన దశ ఒకటే ఉన్నది. మాటయినా పాటవలె ఉంటుంది. మహాత్ముల వాక్యాలే గీతలు.

క. 'నను నిండు రెండు లోకము । లను జెడని యశస్సుఖంబులం బడయఁగఁ గో
రినయట్లయినను దీనికి । నెన లేవు సుఁడీ! తలంప నే ధర్మములున్. 358

ప్రతిపదార్థం: రెండు లోకములను= ఇహ పరలోకాలలో; యశః= కీర్తి; సుఖంబులన్= సుఖాలు; పడయఁగన్= పొందటానికి; కోరినఅట్లు+అయిననున్= కోరేటట్లయితే; దీనికిన్= భూదానానికి; ననున్+ఇండు= నన్ను దానం చేయండి; తలంపన్= ఆలోచింపగా; ఏ ధర్మములున్= ఏ ధర్మాలున్ను; ఎనలేవు సుఁడీ= సరిగావు సుమా!

తాత్పర్యం: నన్ను దానంచేస్తే రెండు లోకాలలో మేలు కలుగుతుంది. ఈ లోకంలో కీర్తి, ఆలోకంలో సుఖమూ కావాలనుకొంటే నన్ను దానం చేయండి. దీనికి సమాన మైన ధర్మాలేవీ లేవు.

చ. ఇతరుల దాన మేనిఁ దమ యీగియ యేనిని నన్ను మార్తురే
మతి నరకాధివాసగతి మాన్పఁ దలంచుట గల్గినన్ సమం
చితముగ భక్తి నిచ్చుట కుశీలత మార్చుట నాకు హర్ష భా
సితయుఁ; బరాభవ వ్యథయు జేత సుఁడీ! యిదె చాటి చెప్పితిన్.' 359

ప్రతిపదార్థం: ఇతరుల దానము+ఏనిన్= ఇతరుల దానమైనా; తమ= స్వంత; ఈగియ ఏనిని= దానమైనా; నన్నుమార్తురే?= నన్ను మారుస్తారా; మతి= ఆలోచనలో; నరక= నరకంలో; అధివాసగతి= ఉండేస్థితి; మాన్పన్= మానుకొనే; తలంచుట= తలంపు; కల్గినన్= కలిగితే; సమంచితముగన్= చక్కగా; భక్తిన్= భక్తితో; ఇచ్చుట= దానంచేయటం; కుశీలతన్= చెడ్డస్వభావంతో; మార్చుట= మార్చటం; నాకున్; హర్షభాసితయున్= సంతోషంతో తృప్తినివ్వటం; పరాభవవ్యథయున్= అవమాన బాధ; చేత సుఁడీ= చేయటం సుమా!;= ఇదె= ఇదుగో; చాటి= ఎలుగెత్తి; చెప్పితిన్= చెప్పాను.

తాత్పర్యం: నరకంలో ఉండాలన్న కోరిక లేకపోతే దానమైనా స్వదానమైనా నన్ను మార్చరు. సంతోషంగా నన్ను ఇస్తే నాకు చాలా ఆనందం కలిగించినట్లు. దుష్టస్వభావంతో ఆ దానాన్ని మారిస్తే, హరిస్తే నాకు అవమానం కలిగించినట్లు. ఇదే వినండి అంతవరకు ఎలుగెత్తి చెప్పుతున్నాను.'

విశేషం: ఉద్గీత= ఉత్ గీత= ఎలుగెత్తి చెప్పినదే. అతి ప్రాచీనకాలంలో భూమిపై ఎవరికీ హక్కుండేది కాదు. అంతా రాజాధీనంలోనే ఉండేది. రిజిస్ట్రేషన్ వ్యవస్థ ఆంగ్లేయులు ప్రవేశపెట్టారు. ఈ గీతార్థం అతి ప్రాచీనవ్యవస్థను చెప్పుతుంది.

క. 'వినుఁ డుభయలోకముల మే । లొనరింతుం గీ డొకింతయును నిలువఁగ నీ
క నిరాసంబు నొనర్తును । నను నిచ్చిన నెట్టి దుర్జనములకు నైనన్.' 360

ప్రతిపదార్థం: వినుఁడు= ఆలకించండి; ననున్= నన్ను; ఇచ్చిన= ఇచ్చినటువంటి; ఎట్టి= ఎట్లాంటి; దుర్జనములకున్+ఐనన్= చెడ్డవారికైనను; ఉభయ లోకములన్= ఇహపరలోకముల యందును; మేలు+ఒనరింతున్= శుభములు కలుగ జేస్తాను; కీడు+ఒకింతయును= అశుభం ఏమాత్రమయినా; నిలువఁగనీయక= కలుగనీయక; నిరాసంబున్+ఒనర్తున్= నిరసిస్తాను.

తాత్పర్యం: 'వినండి. ఎట్టి దుర్మార్గులకైనా నన్ను ఇస్తే, నేను ఇహపరాలకు మేలు చేస్తాను. కీడు ఏమాత్రం కలుగకుండా నివారిస్తాను.'

వ. అనియె 'నని యవ్వాక్యంబు లుపన్యసించి దేవవ్రతుం డన్నర దేవోత్తమునకు మఱియుం జెప్పు; 'నవ్విషయంబున నింద్రుం డడుగ బృహస్పతి సెప్పిన వచనంబులు వినుము చెప్పెద. 361

ప్రతిపదార్థం: అనియెన్; అని; ఆ+వాక్యంబులు= ఆ మాటలు; ఉపన్యసించి= వివరించి; దేవవ్రతుండు= భీష్ముడు; ఆ నరదేవ+ఉత్తమునకున్= ఆ రాజశ్రేష్ఠుడికి; మఱియున్; చెప్పున్; ఆ+విషయంబునన్= ఆ సందర్భంగా; ఇంద్రుండు; అడుగన్; బృహస్పతి చెప్పిన; వచనంబులు= పలుకులు; వినుము= ఆలకించుము; చెప్పెదన్= చెప్పెదను.

తాత్పర్యం: అని చెప్పినట్లు ఆ మాటలు భీష్ముడు ధర్మరాజుతో అన్నాడు. ' ఆ విషయంలో ఇంద్రు డడిగితే బృహస్పతి చెప్పిన మాటలు ఉన్నాయి. వినుము చెప్పుతాను.

ఆ. 'భూమి రత్నగర్భ పురుహూత! యటు గాన । కలుగు భూమిదాన కర్త యైన
వాని కశ్వ హస్తి వనితాది సర్వ ర । త్నములు నిచ్చునట్టి యమితఫలము. 362

ప్రతిపదార్థం: భూమి; రత్నగర్భ= రత్నాలు కడుపులో కలది (రత్నమంటే చెట్టూ; బొగ్గూ, పంటా అన్నీ రత్నాలే ధనాన్నిచ్చేవి కనుక); పురుహూత!= ఇంద్రా!; అటుకాన= అట్లు కాబట్టి; భూమిదానకర్తఐన వానికిన్= భూమిని దానంచేసిన వాడికి; అశ్వ= గుర్రం; హస్తి= ఏనుగు; వనిత= స్త్రీ; ఆది= మొదలైన; సర్వ= అన్ని; రత్నములు= మణులు; ఇచ్చునట్టి= దానం చేసినట్టి; అమిత= అధికమైన; ఫలము= ఫలితం; కలుగుతుంది.

తాత్పర్యం: ఇంద్రా! భూదేవి రత్నగర్భ కాబట్టి భూదానం చేసినవాడికి గుర్రం, ఏనుగు, స్త్రీ మొదలైన రత్నాలను ఇచ్చినటువంటి ఫలితం కలుగుతుంది.

విశేషం: రాజనీతి శాస్త్రాలలో సప్తరత్నాలు చెప్పబడ్డాయి. అందులో కొన్ని ఈ పద్యంలో చెప్పబడ్డాయి.

1. గుర్రం, 2.ఏనుగు, 3. స్త్రీ= రాజశ్రీ, రాజు ఐశ్వర్యం. ఈ 7లో రత్నాలు. రథం, ధర్మచక్రం సేనాపతి. మంత్రి మొదలైనవి ఆ ఏడులో ఉన్నాయి. కనుకనే ఆది అని చెప్పబడినది. రాజు రాజ్యపాలనం చేయటానికి ఆధారాలు.

క. వసుదాయిని యైన వసుధ । నొసఁగి నతనిఁ దన్న తన్న యొసఁగె ననుచు సం
తసపడు భూతము లన్నియు । నసమానము భూమిదాన మమరాధీశా! 363

ప్రతిపదార్థం: అమర= దేవతలకు; అధి+ఈశా!= పాలకుడా!; వసుదాయిని= బంగారాన్నిచ్చేది; ఐన; వసుధన్= నేలను (వసువును ధరించేది); ఒసఁగిన= ఇచ్చిన; అతనిన్= అతడిని; తన్న తన్న= తనను, తననే; ఒసఁగెన్= ఇచ్చెను; అనుచున్= అంటూ; భూతములు= పంచభూతాలు (ఆకాశం, అగ్ని, నిప్పు; నీరూ, నేల); అన్నియున్= అయిదూ; సంతసపడున్= సంతోషిస్తాయి; భూమిదానము; అసమానము= సాటిలేనిది.

తాత్పర్యం: దేవరాజా! వసుధ బంగారాన్నిస్తుంది. కనుక సకలభూతాలు తనను, తనను దానంచేశాడని చేసినవాడిని చూచి సంతోషిస్తాయి.

విశేషం: పంచభూతాలలో భూమి అట్టడుగున ఉన్నది. దీనిలో మిగిలిన నాలుగు ఉన్నాయి. కనుక అవి సంతోషిస్తాయి.

క. వినుు రాజులకు నవశ్యం । బును జేయఁగవలయు నధిక భూదానము; రా

జనువాఁ డఘముల కాకర । మనఘా! యది దక్కనొంట నది వ్యయ మగునే? 364

ప్రతిపదార్థం: అనఘా; విను; రాజులకున్; అవశ్యంబును= తప్పక; భూదానమున్; చేయఁగన్ వలయును= చేయాలి; రాజు; అనువాఁడు; అఘములకున్= పాపాలకు; ఆకరము= నిలయం, స్థానం; అది తక్కన్= భూదానం తప్పించి; ఒంటన్= మరొకదానితో; అది= ఆ పాపం; వ్యయము= నాశనం; అగునే= ఔతుందా? కాదని భావం.

తాత్పర్యం: అనఘా! రాజులకు భూదానం తప్పక చేయవలసిన విధి ఉన్నది. ఎందుకంటే రాజైనవాడు పాలనలో అనేక పాపాలు చేయవలసి వస్తుంది. అది పోవాలంటే భూదానమే మార్గం.

విశేషం: రాజ్యాంతే నరకం ధ్రువమ్ - రాజ్యపాలన చివర నరకం తప్పక కలుగుతుంది అని పెద్దలమాట. పరిపాలనలో ఎన్ని అధర్మాలైనా కలిగే అవకాశమున్నది కనుక ఆ సూక్తి పుట్టింది. అది పోగొట్టుకొనటానికి మార్గ మొక్క భూదానమే. ఆ రోజులలో కోశాగారంలో మిగిలిన ధనాన్ని ప్రజలకు పంచి ఇచ్చే అలవాటుండేది. హర్షుడు మొదలగువారిట్లా చేశారని చరిత్ర చెప్పుతున్నది. ప్రాచీన చక్రవర్తుల ధర్మపాలన కదే గుర్తు. రాజు ప్రజలకు తండ్రి. ప్రజ అంటేనే సంతానమని అర్థం. తన సంతానాన్ని కాపాడుకొనవలసిన బాధ్యత తండ్రివంటి రాజుదే. కనుకనే రాజంటే ప్రజారంజనం, ఆనందం చేసేవాడని అర్థం. భారతం ఆ ధర్మచక్రవర్తి ఎట్లా ఉంటాడో చెప్పటానికే వ్రాయబడిన ఇతిహాసం. కనుకనే ధర్మరాజని భారత నాయకుడికి పేరు. కనుకనే ఇతడే ధర్మాలన్నిటికీ శ్రోతగా చేయబడ్డాడు. ఇదొక రాజ శిక్షణ. (ధర్మరాజు రాజధర్మ స్వరూపుడు).

క. పూర్వదత్త యైన భూమి నెవ్వఁడు పుచ్చి । కొనియె, నతఁడు దనదు కులమువారి

నిరువదొక్కతరము నరకవాసులఁ జేయు । దాను నడుము గాఁగ ధర్మనిరత! 365

ప్రతిపదార్థం: ధర్మనిరత!= ధర్మమునందు నిష్ఠకలవాడా!, నిరంతరము ధర్మము నందు లగ్నమైన బుద్ధి కలవాడా!; పూర్వదత్త+ఐన= పూర్వమే ఇవ్వబడిన; భూమినిన్; ఎవ్వఁడు; పుచ్చుకొనియెన్= తీసికొన్నాడో; అతఁడు; తనదు= తన; కులమువారిన్; ఇరువదొక్క తరమున్; నరకవాసులన్= నరకంలో నివసించేవారిగా; చేయున్= చేస్తాడు; తాను; నడుమ= కేంద్రం; కాఁగన్= కాగా.

తాత్పర్యం: ముందిచ్చిన భూమిని తిరిగి ఎవ్వడు గ్రహిస్తాడో తిరిగి తీసికొంటాడో వాడు తన కులంలో ఇరవైయొక్క తరాల వాళ్ళను నరకంలో పడేటట్లు చేస్తాడు. మహాపాపానికి తాను కేంద్రమౌతాడు. (ఈ పాపభారమంతా వాడే మోయాలి)

క. మును దా విప్రున కిచ్చెద । నని భువి యీ కుండుకంటె నధికపుఁ బాపం

బును నడుగ కిచ్చుటకు మిగి । లిన పుణ్యము నెందు నరయ లేవండ్రు బుధుల్.' 366

ప్రతిపదార్థం: మును= ముందుగా; తాన్= తాను; విప్రునకున్= బ్రాహ్మణుడికి; ఇచ్చెదన్= ఇస్తాను; అని; భువిన్=భూమిని; ఈక+ఉండు కంటెన్= ఇవ్వకుండా ఉండటం కంటే; అధికపుఁ బాపంబును= ఎక్కువ పాపం; అడుగక= అడగకుండానే; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; మిగిలిన= మించిన; పుణ్యమున్; ఎందున్= ఎక్కడా; అరయన్= విచారిస్తే; బుధుల్= పండితులు; లేవు+అంద్రు= లేవని అంటారు.

తాత్పర్యం: ఇస్తానని వాగ్దానం చేసిన భూమిని ఇవ్వకపోవటం కంటె మహాపాపం లేదు. అడక్కుండానే ఇచ్చినంత మహాపుణ్యమూ లేదు - అని పండితులంటారు.’

వ. అనిన విని యజాతశత్రుండు సురనదీపుత్త్రుతో ‘దానపరులయిన మానవులకు దాతవ్యంబులగువాని విశేషంబు లెఱింగింపవే’ యనుటయు, నతం డన్న కనక పానీయ ప్రముఖంబులైన పదార్థంబుల విశేషంబులు గల; వవి యెఱింగించెద; నొక్కనాఁ డన్నంబు విషయం బైన దానంబు ప్రకారంబు. 367

ప్రతిపదార్థం: అనినన్; విని; అజాత= పుట్టని (లేని); శత్రుండు= శత్రువులు కలవాడు, ధర్మరాజు; సురనదీ= గంగా; పుత్త్రుతోన్= కొడుకుతో; దానపరులు= దానబుద్ధికలవారు; అయిన; మానవులకున్= మనుష్యులకు; దాతవ్యంబులు+అగువాని= ఈయదగిన వాటియొక్క; విశేషంబులు= విశేషాలు; ఎఱింగింపవే= తెలుపవే; అనుటయున్; అతండు= భీష్ముడు; అన్న= భోజనం; కనక= బంగారం; పానీయ= త్రాగదగ్గవి; ప్రముఖంబులు= మొదలైన; పదార్థంబుల= వస్తువుల; విశేషంబులు; కలవు= ఉన్నాయి; అవి= వాటిని; ఎఱింగించెదన్= చెప్పుతాను; ఒక్కనాఁడు= ఒక్కరోజు; అన్నంబు విషయంబు+ఐ= అన్నానికి సంబంధించిన; దానంబు ప్రకారంబు= దానం పద్ధతి. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: చెప్పగా విని ధర్మరాజు భీష్ముడితో ‘దానస్వభావం కలవారికి దానం చేయటానికి తగిన వస్తువు లేవి? వాటి విశేషాలు చెప్పు’మని అడుగగా భీష్ముడంటున్నాడు. ‘అన్నం, బంగారం, పానీయాలు మొదలైన పదార్థాల విశేషాలు ఉన్నాయి. వాటి సంగతి తరువాత చెప్పుతాను. ‘ముందు ఒకరోజన్నదాన విషయం వినుము.

క. ఏ నడుగఁగ నారదముని । మానితముగఁ జెప్పినట్టి మాటలు సువ్య
క్తానూన వృత్తిఁ జెప్పెద । భూనాయక! యేక చిత్తమున విను వానిన్. 368

ప్రతిపదార్థం: ఏను= నేను; అడుగఁగన్= అడిగితే; నారదముని= నారదమహర్షి; మానితముగన్= ఆదరంగా; చెప్పినట్టి మాటలు; సువ్యక్త= బాగా తెలిసేటట్లు; అనూన= అధికమైన; వృత్తిన్= బుద్ధితో; చెప్పెదన్; భూనాయక!= భూమిపాలకుడా! ఏకచిత్తమునన్= ఏకాగ్రబుద్ధితో; వానిన్= వాటిని; విను= వినుము.

తాత్పర్యం: నేనడిగితే నారదముని ఆదరబుద్ధితో చెప్పిన మాట లున్నాయి. వాటిని స్పష్టపడేటట్లు చేయాలన్న సంకల్పంతో రాజా! చెప్పుతున్నాను; ఏకాగ్రబుద్ధితో వినుము.

విశేషం: సమ్యక్ శ్రవణం బుద్ధదేవుడి అష్టాంగసూక్తులలో ఒకటి. గురువుల వాక్యాలను చక్కగా విని మననం చేసుకోవాలి. దానికే ఈ మాట.

క. మునులును దివిజులు నన్నము । వినుతింతురు లోకతంత్రవిధిఁ గ్రతువులు ద
క్కునుగల సర్వము నన్నం । బున నడచుం గాన యన్నము విశిష్ట మిలన్. 369

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మునులును= మునులున్నూ; దివిజులున్= దేవతలున్నూ; అన్నమున్, వినుతింతురు= స్తుతిస్తారు; లోకతంత్ర విధిన్= లోకయాత్రా పద్ధతిలో; క్రతువులు= యజ్ఞాలు; తక్కునుగల= మిగిలిన; సర్వమున్= సమస్తమూ; అన్నంబునన్= అన్నంతోనే; నడచున్= నడుస్తాయి; కాన= కాబట్టి; అన్నము; ఇలన్= లోకంలో; విశిష్టము= గొప్పది,

తాత్పర్యం: దేవతలు, ఋషులు అన్నాన్ని పొగడుతున్నారు. లోకయాత్రలో యజ్ఞయాగాదులు మిగిలినవన్నీ అన్నంతోనే ప్రవర్తిస్తున్నాయి. కనుక అన్నంకంటె విశిష్టమైన దేదీ లేదు.

విశేషం: వేదంలో అన్నం పరబ్రహ్మంగా స్తుతించబడింది. గీతలోనూ అన్నంనుండి సకల భూతాలు పుట్టుతున్నాయని చెప్పబడ్డది. "అన్నాద్భవంతి భూతాని' - 3.14. నేటి వేదవేత్తలు అన్నము అంటే పదార్థ జగత్తు= భూదేవి అంటున్నారు.

ఆ. అన్నదాన సదృశ మగు దాన మెందు నె । న్నఁడును లేదు గావునను విధేయ
మన్నదాన మధిక యత్నపూతంబుగాఁ । బూని దానిచేఁత పుణ్యతమము. 370

ప్రతిపదార్థం: అన్నదాన సదృశము= అన్నదానంతో సమానము; అగు= అయిన; దానము; ఎందున్= ఎక్కడా; ఎన్నఁడును= ఎప్పుడు; లేదు; కావునను= కాబట్టి; అన్నదానము; విధేయము= విధిగా చేయదగింది; అధికయత్న= మిక్కిలి ప్రయత్న; పూతంబుగాన్= పవిత్రంగా; పూని= పూనుకొని; దానిచేఁత= అన్నదానం చేయటం; పుణ్యతమము= మిక్కిలిపుణ్యం.

తాత్పర్యం: అన్నదానంతో సమానమైనది లేదు. కనుక అది తప్పక చేయదగింది. ఎక్కువ ప్రయత్నంతో నైనా సరే పవిత్రంగా చేయటం ఎక్కువ పుణ్యమిస్తుంది.

సీ. ప్రాణంబులకు విధారక మన్న మింటి జ । నంబుల కుడిగి యైనను సుభక్తి
నతిథికిఁ బెట్టుట యధిక పుణ్యము శ్రాంతు । వృద్ధుఁ దాపసు బాలు వికలు వనితఁ
గడపఁగా దాఁకలి గదిరి యర్థించిన । గృహమేధి కవమతి గినుక దగదు
కాలంబుతోఁ గుక్క మాలఁడు దుదిగాఁగ । నాఁకొని వచ్చిన ననుగుణముగ

ఆ. నాచరింపవలయు నాహార కల్పన । మునుల దేవ పితృ సముత్క రముల
నన్నదాన విధుల నాదరంబుగఁ బ్రియ । మొందఁ జేఁతఁబోల వొండు విధులు. 371

ప్రతిపదార్థం: ప్రాణంబులకున్= ప్రాణాలకు; విధారకము= చక్కని ధారకము, ధరింపచేసేది; అన్నము; ఇంటి జనంబులకున్= ఇంట్లోని మనుష్యులకు; ఉడిగి ఐనను= మానుకొనైనా; సుభక్తిన్= మంచిభక్తితో; అతిథికిన్= తిథిలేకవచ్చేవాడికి; పెట్టుట; అధిక= పెద్ద; పుణ్యము= పవిత్రం; శ్రాంతున్= అలసిపోయినవాడిని; వృద్ధున్= ముసలివాడినీ; తాపసున్= తపస్సు చేసికొనేవాడినీ; బాలున్= పసివాడినీ; వికలున్= అంగలోపం కలవాడినీ; వనితన్= స్త్రీనీ; ఆఁకలి కదిరి= ఆకలి వేసి; అర్థించినన్= అర్థిస్తే; కడపన్ కాదు= పెట్టకుండా త్రోసివేయరాదు; గృహమేధికిన్= గృహస్థుకు; అవమతి= అవమానము; కినుక= కోపం; తగదు= యుక్తం కాదు; ఆఁ కొనివచ్చినన్= ఆకలితో వస్తే; కాలంబుతోన్= సకాలంలో; కుక్క; మాలఁడు; తుదిగాగన్= చివరకాగా; అనుగుణముగన్= తగినట్లుగా; ఆహారకల్పన= భోజన సదుపాయం; ఆచరింప వలయున్= సమకూర్చాలి; మునులన్= ఋషులను; దేవ= దేవతలను; పితృసముత్కరములన్= పితృదేవతా సమూహాన్ని; ఆదరంబుగన్= భక్తితో; అన్నదాన విధులన్= అన్నం పెట్టటంతో; ప్రియము= సంతోషం; ఒందన్= పొందేటట్లు; చేఁతన్= చేయటాన్ని; ఒండు= మరొక; విధులు= కర్మలు; పోలవు= సరికావు, సాటికావు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అన్నం ప్రాణధారకం కనుక ఇంట్లో వాళ్ళకు మానుకొనైనా అతిథులకు పెట్టటం పుణ్యం. అందులోనూ అలసినవాడు, స్త్రీ, బాలుడు, అంగవైకల్యం కలవాడు, ముసలి, తాపసి అయినవారి నసలే కాదనకూడదు. ఆకలితో వచ్చిన కుక్కను, మాలవాడిని గృహస్థు అన్నదానంతో తగినట్లు ఆదరించాలి. అవమానించడం, కోపగించడం కూడదు. మునులు, పితృదేవతలు, దేవతలు - వీరిని అన్నదానంతో సంతోషపెట్టటం శ్రేష్ఠకర్మ.

విశేషం: ధారకమన్నమాటను మన మీనాటికీ ఇట్లాగే వాడుతున్నాము. "ధారకమేమీ లోపలకు పోవటంలేదు'' రోగిని చూచి అనేమాట ధారకమంటే; ప్రాణాన్ని నిలబెట్టేది.

కుక్క, మాలడు - "శుని చైవశ్వపాకేచ పండితాస్సమదర్శినః'' అని గీత. పండితులంటే ఉత్తములతో పాటు, కుక్కనూ, మాలనూ, సమానంగా చూచేవాడని అర్థం.

క. కులమును, విద్యయు, వృత్తము । నలఘుమతీ! యన్న మిడుటకై యడుగంగా
వలవదు; విప్రుని నాదర । మలరంగా నిడుట లెస్స యడిగిన మాత్రన్.' 372

ప్రతిపదార్థం: అలఘుమతీ!= గొప్ప మనసు కలవాడా!; కులమున్= ఉత్తమకులం; విద్యయున్= చదువూ (సంస్కారాన్ని పెంచేది); వృత్తమున్= నడవడిక; అన్నమున్; ఇడుటకై= పెట్టటానికి; అడుగంగాన్ వలవదు= అడగకూడదు; ఆదరము= ఆదరణ; అలరంగాన్= వికసించగా; విప్రునిన్= బ్రాహ్మణుడికి; అన్నము; అడిగిన మాత్రన్= అడిగినంత మాత్రంతోనే; ఇడుట= పెట్టటం; లెస్స= గొప్ప.

తాత్పర్యం: పెద్దమనసు కలవాడా! అన్నం పెట్టటానికి కులము, విద్యా, నడవడిక అడగరాదు. బ్రాహ్మణుడు అన్నం కావాలంటే చాలు. ఆదరపూర్వకంగా పెట్టాలి.'

విశేషం: అలఘుమతీ!= సంబోధన గీతలోని పండితశబ్దాన్ని తాకేది; సమదర్శనం కలవాడని భావం.

వ. అని వెండియు. 373

తాత్పర్యం: అని ఇంకా.

తే. అజుఁడు కల్పాదియం దన్న మమృత మనియె । నన్న హాని బలాధికు నైన దుర్బ
లాత్మ్ముగాఁ జేయుఁ, గావున నన్న భుక్తి । సకలధాతు వృద్ధికినయి జనము గోరు.' 374

ప్రతిపదార్థం: అజుఁడు= జన్మలేనివాడు (మనిషివలె పుట్టేవాడు కాడు) బ్రహ్మ; కల్ప+ఆది+అందున్= సృష్టికి మొదలునందు; అన్నము; అమృతము= మృతిలేనిది; అనియెన్; అన్నహాని= అన్నంలేకపోవటం; బల+అధికున్= అధికబలం కలవాడిని; ఐనన్=అయినా; దుర్బల+ఆత్ముఁగాన్= బలహీనుడిగా; చేయున్= చేస్తుంది; కావునన్= కాబట్టి; అన్నభుక్తి= అన్నం తినటం; సకలధాతు= అన్ని ధాతువుల; వృద్ధికిన్+అయి= పెరుగుదల కొరకు; జనము= ప్రజ; కోరున్= కోరుకొంటుంది.

తాత్పర్యం: సృష్టి ప్రారంభంలో బ్రహ్మ అన్నం అమృతమని చెప్పాడు. కనుకనే అన్నంలేనివా డెంత బలంకలవా డయినా బలహీను డౌతున్నాడు. ఎందుకంటే అన్నం సప్తధాతువులను పోషిస్తుంది కనుక.'

విశేషం: అమృతశబ్దం వేదంలో పరబ్రహ్మ అన్న అర్థంలో ఉన్నది. లోకం మృత్యువనీ, తత్త్వం అమృతమనీ చెప్పబడింది. కనుకనే అన్నం తినకపోతే ఎంత బలం కలవాడయినా బలహీనపడుతున్నాడు. శరీరం సప్త ధాతువులతో నిర్మితమైనది. వస, నెత్తురు, మాంసం, మేదస్సు, ఎముక, మజ్జ, వీర్యం - అనేవి సప్తధాతువులు.

క. అని యతఁడు వల్కె ననియును । విని యన్నము సవినయముగ విప్రాదులకున్
మనుజేశ! యిడుదు నీవును । మన మలరఁగఁబెట్టుమీ సమస్త జనులకున్. 375

ప్రతిపదార్థం: అని; అతఁడు= బ్రహ్మ; పల్కెన్= చెప్పాడు; అనియును విని; సవినయముగన్= వినయంతో; విప్ర+ఆదులకున్= బ్రాహ్మణులు మొదలైనవారికి; అన్నమున్; మనుజ+ఈశ= రాజా!; ఇడుదు= పెడుతున్నావు; నీవునన్= నీవు కూడా; ఇడుదు= పెడుతున్నావు; సమస్తజనులకున్= మనుషులందరకూ; మనము= మనస్సు; అలరఁగన్= సంతోషంతో వికసించేటట్లు; పెట్టుమీ!= పెట్టవయ్యా!

తాత్పర్యం: అని నారదుడు చెప్పిన మాట విని నీవున్నూ ధర్మరాజా! బ్రాహ్మణులు మొదలైనవారికి అన్నం సవినయంగా పెట్టుతున్నావు. కాని, అందరికీ అట్లాగే పెట్టుము.

ఆ. అన్న మిడిన మణిమయావాసశయ్యాస । నములు నమృత భోజనంబు హృద్య
మాల్య లేపనములు మహనీయ మహిళాను । భవముఁ జిరతనొందు దివమునందు.' 376

ప్రతిపదార్థం: అన్నము; ఇడినన్= పెట్టితే; మణిమయ+ఆవాస= మణులతో చేసిన సౌధం; శయ్యా= మణులతో చేసిన మంచం; ఆసనములు= సింహాసనములు; అమృతభోజనంబు= అమృతంతో సమానమైన అన్నం; హృద్య= మదికింపైన; మాల్య= పూలదండలు; లేపనములు= గంధం మొదలైన పూతలు; మహనీయ= మహత్తర; మహిళా+అనుభవమున్= స్త్రీలతో పొందే అనుభవం; దివము నందున్= స్వర్గంలో; చిరతన్= చిరకాలం; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: అన్నదానం వలన స్వర్గసుఖాలు లభిస్తాయి. అవెట్లా ఉంటాయి? అంటే - మణిసౌధాలలో నివసించటం, రత్నాల మంచాలపై శయనించటం, రత్నాల సింహాసనాలపై కూర్చొనటం, మదికింపైన పూలదండలతో, గంధం పూతలతో మహత్తరమైన అప్సరసలను అనుభవించటం - ఇవి చిరకాలం లభిస్తాయి.'

విశేషం: ఈ ఫలాలు శ్రోత కాసక్తి కలిగించే లౌకిక సుఖాలు లేదా స్వర్గసుఖాలు. ఇది పురాణకథా పద్ధతి.

నక్షత్రదాన మహిమాతిశయ నిరూపణము (సం.13-63-1)

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'నక్షత్ర విషయంబులైన దానంబుల తెఱంగెఱింగింపవే' యనుటయు 'నిట్లు దేవకీదేవి యడుగ నన్నారీరత్నంబునకు నారదుండు సెప్పిన వాక్యంబుల యర్థంబు లుపన్యసించెద నాకర్ణింపుము.'377

ప్రతిపదార్థం: అనినన్; విని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; నక్షత్ర విషయంబులు+ఐన= నక్షత్రం దృష్టిగా గల; దానంబుల= దానాల; తెఱంగు+ఎఱింగింపవే= విధానం తెలియజేయవే; అనుటయున్= అనగా; ఇట్లు; దేవకీదేవి; అడుగన్; ఆ+ నారీరత్నంబునకున్= స్త్రీరత్నానికి, - మహాత్మురాలైన స్త్రీకి; (ఎందుకంటే శ్రీకృష్ణుడికి కన్నతల్లి కనుక); నారదుండు; చెప్పిన= విశదీకరించిన; వాక్యంబుల+అర్థంబులు= మాటల తాత్పర్యం; ఉపన్యసించెదన్= వినిపిస్తాను; ఆకర్ణింపుము= ఆలకించుము.

తాత్పర్యం: యుధిష్ఠిరు డన్నాడు భీష్ముడితో 'ఏ నక్షత్రంలో ఏ దానం చేస్తే పుణ్యమో చెప్పుము' అని. భీష్ము డన్నాడు 'దేవకీదేవి ఇట్లాగే అడిగితే నారదమహర్షి వివరించిన తాత్పర్యం చెప్పుతాను వినుము.

విశేషం: నారదుడు - ప్రతికథలో వస్తాడు. చివరకు మొన్న మొన్నటి త్యాగరాజస్వామికి సంగీత గ్రంథాన్నిచ్చి ప్రేరణ కలిగించినాడు కదా! దీని కర్థమేమిటి? అంటే నారదుడు దివ్యజ్ఞానాన్ని ఇచ్చేవాడు అని అర్థం. అజ్ఞానం ప్రతిమనిషిలోనూ ఉంటుంది. నిద్రపోయేదాన్ని కొందరు మేల్కొలుపుకొంటే కొందరు నిద్రపోతారు. ఆ జ్ఞానవృద్ధుడు తెల్లనివాడు, వీణవాయించేవాడు. వీణ- నాదమాధుర్య సంకేతం - యోగభాషలో వెన్నుపాము. దానిలో నిద్రించే శక్తి యోగాభ్యాసంతో మేల్కొల్పబడగలిగితే ఆ శక్తి నిద్రలేస్తూ చేసే నాదమాధుర్యం వీణ. కనుక నారదుడికి చావు, పుట్టుకలు లేవు. నీలో ఉన్న జ్ఞానాని కతడు సంకేతం.

ప్రతిచోట యుధిష్ఠురుడనే కవి వాడటం గమనించాం. రెండు రకాల యుద్ధాలున్నట్లు భారతమే చెప్పింది.

1. రాజులు చేసేది, ఇక్కడ శత్రువు బైటివాడు.

2. తనపై తాను చేసికొనేది. ఇక్కడ శత్రువులు - కామ, క్రోధాదులు. తనకు శత్రువు తానే. ఇది అంతర్యుద్ధం. అది మిథ్యాయుద్ధమట. ఇవి తథ్య యుద్ధములు. తిక్కనగారన్న మాటలే. మొదటిది స్త్రీపర్వంలో ముగిసి రెండవది శాంతిపర్వంతో ఆరంభమైనది. దీనిలోనూ జయం సాధించినవాడే ధర్మచక్రవర్తి అని భారతీయ రాజధర్మం చెప్పుతున్నది. యుదిష్ఠిరు డంటే ఈ అంతర్యుద్ధంలో ఉన్న వీరుడని తాత్పర్యం.

సీ. కార్తెఁ బాయస మబ్జగర్భునితార మా । షములు మాంసమ్ము నంజంగఁ గలుగు
నన్నంబు శశితారయందు గోవార్ద్ర న । దితి తారఁ బులగంబు దీపుగలయు
నట్టులు గురుతార నధిప ! సువర్ణమా । శ్లేష రూప్యము మఖఁ జెల్లు నుప్పు
తిలలు భగుం డధిదేవత యగు తారఁ । జెఱకుఁ దేనియ నుపాసిక్త మైన

తే. భక్త ముత్తరఫల్గునిఁ బాలతోడ । పౌష్టికాన్నంబు రవితార సకరిరథము
చిత్తనాఁడు శ్రీగంధపుఁ జెక్క స్వాతిఁ । దనకుఁ బ్రియమైన యది మేలు దానమునకు. 378

ప్రతిపదార్థం: కార్తెన్= కార్తెలో - కృత్తికా నక్షత్రంలో; పాయసము= పాలతో చేసిన అన్నం, క్షీరాన్నం; అబ్జగర్భునితారన్= బ్రహ్మఅధిదేవతగల నక్షత్రంలో; మాషములు= మినుములు; శశితారయందున్= చంద్ర నక్షత్రంలో; మాంసమ్ముఁ; నంజంగన్+ కలుగు అన్నంబు= నంజుకొనటానికి వీలైన అన్నం; ఆర్ద్రన్= ఆర్ద్రా నక్షత్రంలో; గోవు; అదితితారన్= అదితి నక్షత్రంలో; తీపుగలయునట్టులు= తీపికలిసేవిధమైన; పులగంబు= పులగం అన్నం; అధిప!= రాజా!; గురుతారన్= బృహస్పతి నక్షత్రంలో; సువర్ణము= బంగారం; ఆశ్లేషన్= ఆశ్లేష నక్షత్రంలో; రూప్యము= వెండి; ఉప్పు; తిలలున్= నువ్వులు; మఖన్= మఖా నక్షత్రంలో; చెల్లున్= తగును; భగుండు= సూర్యుడు; అధి దేవతయగు తారన్= అధిదేవతగా కల నక్షత్రంలో; చెఱకుఁ దేనియ= చెఱకు రసం (లేదా చెఱకురసం తేనెతో కలిపి); ఉపాసిక్తము= చక్కగా తడిసిన; భక్తము= అన్నం; ఉత్తర ఫల్గునిన్= ఉత్తర ఫల్గునీ నక్షత్రంలో; పాలతోడన్; పౌష్టికాన్నంబు; రవితారన్= సూర్యదేవతా నక్షత్రంలో, స+కరి+రథము= ఏనుగుతోపాటుగా రథం; చిత్తనాఁడు= చిత్తా నక్షత్రంలో; శ్రీగంధపుఁజెక్క= మంచి గంధంచెక్క; స్వాతిన్= స్వాతిలో; తనకున్; ప్రియమైనఅది= ఏది ఇష్టమో అదీ; దానమునకున్; మేలు= మంచిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కార్తెలో పాయసం, బ్రహ్మఅధిదేవతగాకల నక్షత్రంలో మినుములు, చంద్రతారలో మాంసాన్నం, ఆర్ద్రలో ఆవూ, అదితిలో తీయని పులగం; బృహస్పతి నక్షత్రంలో బంగారం, ఆశ్లేషలో వెండి, మఖలో ఉప్పు, నువ్వులు, భగునితారలో చెఱకు రసంతో నిండిన అన్నం, ఉత్తర ఫల్గునిలో పాలతో వండిన పౌష్టికాన్నం; సూర్య నక్షత్రంలో ఏనుగూ,రథం, చిత్తలో మంచి గంధపు చెక్క; స్వాతిలో తనకిష్టమైన దేదో అది దానానికి మంచిది.

విశేషం: ఈ పద్యంలో ఉన్న నక్షత్రాలను ఈక్రింది విధంగా గుర్తించాలి.

అబ్జగర్భునితార	- (అభిజిత్తు లేదా) రోహిణి
శశితార	- మృగశిర
అదితితార	- పునర్వసు
గురుతార	- పుష్యమి.
భగుండధిదేవత అగుతార	- హస్త

సీ. **అనఘ! విశాఖ నె ద్దనురాధఁ బైచీర । విను జ్యేష్ఠఁ దగఁ గటివేము గూర్చి**
ముల్లంగి మూల సన్మూలఫలంబుఁ బూ । ర్వాషాఢఁ బెరు వుత్తరాఖ్య యైన
యాషాడ మాక్షికార్ద్రాన్నంబు హరివసు । జలతారకములఁ గంబళము గుజ్జు
లమరిన బండియు యవలుఁ బూర్వోత్తరా । భాద్ర పౌష్ణాశ్వినీ భరణులందుఁ.

తే. **గ్రొవ్వుగల మేక నంజుడు గొఱియ యెఱచి । కంచుకుండతో మొద వశ్వకలిత శకట**
మతుల తిలధేను లీఁ బాడి; యఖిలతార । కముల నీగులు నూర్ధ్వలోకములఁ జేయు.' **379**

ప్రతిపదార్థం: అనఘ! విను; విశాఖన్= విశాఖలో; ఎద్దు; అనురాధన్= ఆ నక్షత్రంలో; పై చీర= పైన వేసికొనే పంచె; జ్యేష్ఠన్= జ్యేష్ఠలో; తగన్= ఒప్పిదముగా; కటివేము= కరివేప; కూర్చి= చేసిన, ముల్లంగి; మూలన్= మూలానక్షత్రంలో; సన్మూల= మంచివేరు; ఫలంబు= పండు; పూర్వాషాఢన్= పూర్వాషాఢలో; పెరువు= పెరుగు; ఉత్తర+ఆఖ్య= ఉత్తర పేరుగల; ఆషాఢన్= ఆషాఢలో; ఉత్తరాషాఢలో; మాక్షిక= తేనెతో; ఆర్ద్ర= తడిసిన; అన్నంబు; హరి= విష్ణు; వసు= అష్టవసువులు; జల= నీరు - ఈ మూడు దేవతలుగాగల; తారకములన్= నక్షత్రాలలో వరుసగా; కంబళము= గొర్రె ఉన్నితో నేసిన దుప్పటి (- విష్ణు నక్షత్రంలో;) గుజ్జులు= వసికొయ్యలు; అమరిన= ఏర్పాటైన; బండియున్; (వసు నక్షత్రంలో;) యవలున్= ధాన్య విశేషం (జలతారకలో); పూర్వ+ఉత్తరా భాద్రన్; పౌష్ణ అశ్వినీ, భరణులందున్= ఈ నక్షత్రాలలో వరుసగా; క్రొవ్వుగల మేక నంజుడు= కొవ్వు పట్టిన మేక మాంసం (పూర్వాభాద్రలో దానంచేయాలి); గొఱియయెఱచి= గొర్రెమాంసం (ఉత్తరాభాద్రలో); కంచుకుండతోన్= పూర్వాభాద్ర ఉత్తరాభాద్రలలో మట్టికుండ కాకుండా కంచుతో చేసిన కుండతోపాటుగా; మొదవు= ఆవు (పౌష్ణంలో); అశ్వకలిత= గుర్రంతో కూడిన; శకటము= బండి (అశ్వినిలో); అతులితిలధేనులు= సాటిలేని నువ్వులు; ఆవులు (భరణిలో); ఈన్= ఇవ్వటం; పాడి= న్యాయం; అఖిల= సమస్త; తారకములన్= నక్షత్రాలలో; ఈగులు= దానాలు; ఊర్ధ్వ లోకములన్= పైలోకాలను; చేయున్= కలిగిస్తాయి.

తాత్పర్యం: పుణ్యాత్ముడా! విశాఖలో ఎద్దును, అనూరాధలో ఉత్తరీయం, పై కండువా, జ్యేష్ఠలో కరివేపాకుతో కూడిన ముల్లంగి, మూలానక్షత్రంలో మంచి వేరుగల పండు, పూర్వాషాఢలో పెరుగు, ఉత్తరాషాఢలో తేనెతో తడిసిన అన్నం, శ్రవణంలో కంబళి, ధనిష్ఠలో వసికొయ్యలుగల బండి, శతభిషంలో యవలు, పూర్వాభాద్రలో క్రొవ్విన మేకనంజుడు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉత్తరాభాద్రలో గొర్రెమాంసం, రేవతిలో కంచుకుండతో ఆవు, అశ్వినిలో గుర్రపుబండి, భరణిలో మేలైన నువ్వులు, ఆవులు దానం చేయటం మేలు. అన్ని నక్షత్రదానాలూ సద్గతులను కలిగిస్తాయి.'

వ. అని యెఱింగించి యమ్మానవపతితో నమ్మాననీయుండిట్లనియె. 380

ప్రతిపదార్థం: అని; ఎఱింగించి= తెలిపి; ఆ+మానవపతితోన్= ఆ రాజుతో; ఆ+మాననీయుండు= గౌరవించదగినవాడు;

తాత్పర్యం: అని తెలిసి రాజుతో ఆ మాననీయుడు ఈ విధంగా ప్రసంగం కొనసాగించాడు.

క. 'అలఘుతర సకల కామ్యం । బుల నిచ్చినయట్టి మహిత పుణ్యంబై తా
వెలుఁగుఁ గనక మిచ్చుట యని । పలికెం గర్మజ్ఞుఁ డత్రి పరహితచరితా! 381

ప్రతిపదార్థం: పరహిత= ఇతరుల మేలు కోరే; చరితా!= నడవడి కలవాడా!; అలఘుతర= మిక్కిలి గొప్ప; సకల= సమస్త; కామ్యంబులను= కోరికలను; ఇచ్చినఅట్టి= ఇచ్చునట్టి, ఇవ్వగల; మహిత= మహత్తర; పుణ్యంబు+ఐ= పుణ్యంకలదై; తాన్; వెలుఁగున్= ప్రకాశిస్తుంది; కనకము= బంగారం; ఇచ్చుట= ఇవ్వటం; అని; కర్మజ్ఞుఁడు= వేద కర్మలు (దాన విధులు) తెలిసిన; అత్రి= అత్రిమహాముని; పలికెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇతరుల మేలుకొరకు జీవించేవాడా! చాలా గొప్పకోరికలను తీర్చగలిగేదీ, పుణ్యమైనదీ, బంగారు దానమని అత్రి మహర్షి చెప్పాడు.

తే. కనక మాయుఃప్రదంబు, పావనము, భావ । శుద్ధి నొనరించు దాతకు; సువ్రతమున
వేడ్కతో దాని నిచ్చుట వేఱ పొగడ । నేల? యనియె హరిశ్చంద్రుఁ డిద్ధతేజ! 382

ప్రతిపదార్థం: ఇద్ధ= ప్రకాశించే; తేజ!= క్షాత్ర తేజస్సు కలవాడా!; దాతకున్= దానం చేసినవాడికి; కనకము= బంగారం; ఆయుఃప్రదంబు= ఆయుస్సు నిచ్చేది; పావనము= పవిత్రం; భావశుద్ధిన్= చిత్త నైర్మల్యాన్ని; ఒనరించున్= కలిగిస్తుంది; హరిశ్చంద్రుఁడు; సువ్రతమునన్= మంచి వ్రతంలో; వేడ్కతోన్= వేడుకతో; దానిన్= బంగారం; ఇచ్చుట; వేఱ= వేరే; పొగడన్ ఏల= ఎందుకు ప్రశంసించాలి; (అని) అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ప్రకాశించు తేజస్సు కలవాడా! హరిశ్చంద్రు డిట్లా అన్నాడు. 'బంగారం దాతకు ఆయుస్సు నిస్తుంది. మనస్సును నిష్కల్మషం చేస్తుంది. ఏదైన మంచివ్రతం చేసే సమయంలో దానిని ఇవ్వటం చాలా మంచిదని వేరే చెప్పటం దేనికి?'

క. పానీయదాన ముత్తమ । దానం బని యఖిల ధర్మతత్త్వ దృఢ పరి
జ్ఞానానూనుం డగు మను । మానవపతి సెప్పె నృపసమాజ వరేణ్యా! 383

ప్రతిపదార్థం: నృప సమాజ= రాజసమూహంలో; వరేణ్యా!= గొప్పవాడా!; అఖిల= సమస్త; ధర్మతత్త్వ= ధర్మరహస్య; దృఢ= గట్టి; పరిజ్ఞాన= చక్కని జ్ఞానంతో; అనూనుండు= గొప్పవాడు; అగు= ఐన; మను మానవపతి= మనువన్న రాజు (మానవులకు పాలకుడు); పానీయదానము= త్రాగదగినది, దానంచేయుట; ఉత్తమ= గొప్ప; దానంబు; అని చెప్పెన్= అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఓయీ! రాజశ్రేష్ఠుడా! సకలమానవ లోకానికి ఆద్యుడైన మనువు సమస్త ధర్మ రహస్యాలను గట్టిగా తెలిసిన గొప్పవాడు. ఆయన అన్నాడు - 'త్రాగటానికి చేసేదానం ఉత్తమదాన'మని.

విశేషం: మను శబ్దంనుండి మానవ శబ్ద మేర్పడింది. - ఆంగ్లంలో మాన్ కూడా ఇదే. సకల మానవులకు ఆద్యుడైనవాడు మనువు. మానవజాతి కాయన మూలపురుషుడు. ఆయన వ్రాసిందే మనుస్మృతి. వేల సంవత్సరాలుగా ఈ దేశంలో సకల ధర్మాల కదే ప్రమాణం. అది జర్మన్ భాషలోనికి అనువదించబడింది.

క. కావునఁ జెఱువులు నూతులు । బావులుఁ గొలఁకులును నెపుడుఁ బౌరవవర్యా!

కావింపవలయు; నవి గడుఁ । బావనములు పుణ్యలోక భాగిత నిచ్చున్. 384

ప్రతిపదార్థం: పౌరవవర్యా!= పురువంశంలో శ్రేష్ఠుడా!; కావునన్= కాబట్టి; చెఱువులు; నూతులున్= చేదుడుబావులు; బావులున్= రాతి కట్టడంగల దిగుడుబావులు; కొలఁకులునున్= కోనేళ్లు; ఎపుడున్= ఎల్లప్పుడు; కావింపవలయున్= నిర్మించాలి; అవి; కడున్= మిక్కిలి; పావనములు= పవిత్రాలు; పుణ్యలోక= స్వర్గలోకంలో; భాగితన్ ఇచ్చున్= నివసించే అర్హతనిస్తాయి.

తాత్పర్యం: చెరువులు, కొలనులు, నూతులు, బావులు త్రవ్వించటం మంచిపని. స్వర్గలోక నివాసాన్ని కలిగించే ఈ పనులు దానకర్మలలో పవిత్రమైనవి.

విశేషం: నూయి= ఇది చిన్న నీటి చెలమగుంట. బావి= పెద్ద నుయ్యి, (వాపీ సంస్కృతం, బావి వెలుగు); కొలను= చిన్న నీటి గుంట; చెఱువు= పెద్ద కొలను; కొలను (ఏకవచనం) - కొలకులు, (బహువచనం.)

సప్త సంతానాలలో చెరువులు, బావులు త్రవ్వించటం ఒకటి. నేటికీ రాయలసీమవంటి ప్రాంతాలలో పూర్వపు రాజులు త్రవ్వించిన చెరువులే నీటి కాధారం. నడక ప్రయాణంగాకల రోజులలో అట్లాగే బండ్లపై పోయే రోజులలో దారి ప్రక్క చెట్టు, బావి ఏర్పాటు చేయటం గొప్ప పుణ్య కర్మగా భావించబడేది. ఎండన పడి వచ్చిన బాటసారి, బండి, ఎడ్లు, నీళ్ళుత్రాగి, సేదదీరి పోయేవి. ఒక మనిషికి, జంతువుకు, పిట్టకు, నీరు పోయటం కంటె గొప్ప మానవ సేవ ఏముంటుంది? ఈ నాటికీ ఇది మనం నేర్చుకొనదగిందే కదా! పట్టణాలలో కొళాయిలు వచ్చాక బాటసారికి నీరిచ్చేవారికి కరువైన దంటే ఆ దుస్థితి నేమనాలి. మనకంటె నాటి మానవుడు మానవధర్మవేత్త అనటాని కిదే సాక్ష్యం కదా!

క. అనఘా! యెవ్వని కావిం । చిన సలిలాశయమునందుఁ జెలఁగుచు గోవుల్

గొను నీ రాతని వంశం । బున కవి గావించు నూర్ధ్వ భువన ప్రాప్తిన్. 385

ప్రతిపదార్థం: అనఘా= పుణ్యాత్ముడా!; ఎవ్వని= ఎవడియొక్క; కావించిన= నిర్మించిన; సలిల+ఆశయము+అందున్= నీటి నిలయం, చెరువులు మొదలగువాటియందు; గోవుల్= ఆవులు; చెలఁగున్= ఆటలాడుతూ; నీరున్= నీటిని; కొనున్= త్రాగునో, గ్రహిస్తాయో; ఆతని= అతడి యొక్క; వంశంబునకున్= కులానికి; అవి= ఆవులు; ఊర్ధ్వభువన= పైలోకాలయొక్క; ప్రాప్తిన్= పొందుటను; కావించున్= కలిగిస్తాయి.

తాత్పర్యం: నాయనా! ఎవడు త్రవ్వించిన చెరువులు మొదలైన జలాశయాల్లో ఆవులు కేరింతలుగొడుతూ నీరు త్రాగుతాయో వాడి కులాని కవి స్వర్గాన్నిస్తాయి.

విశేషం: గోలోకమని పద్నాలుగు లోకాలలో ఒకటి. దానికథ హరివంశంలో మనోహరంగా ఉన్నది. గోవు అంటే వెలుగు కిరణం. గోపతి= సూర్యుడు (కృష్ణుడు). చీకటిలోనుండి వెలుగురావటమే సృష్టి. (ప్రళయం చీకటి.) కనుక గోవు అంటే విశ్వం.

(భూమి). సకల చరాచర జీవరాశికీ అది తల్లివంటిది. గోవు అంటే కదిలేది; జగత్తు అన్నా కదిలేదనే అర్థం. కదలిక ప్రాణి లక్షణం. మృత్యు లక్షణం అచేతనత్వం. ఇందుకని మనకు గోవు పూజింపదగింది.

తే. ఆఁకలేక యెవ్వాని జలాశయమున । మండు వేసవి యందును మనుజకోటి
యవభృథస్నాన పానంబు లాచరించు । నతఁడు వొందఁడు వివిధ దుర్గాది గతులు. 386

ప్రతిపదార్థం: ఆఁక లేక= అడ్డం లేకుండా; ఎవ్వాని= ఎవనియొక్క; జల+ఆశయమునన్= నీటికి నిధిఅయిన చెరువులు మొదలగు వాటిలో; మండు వేసవి+అందునున్= మంటలు చెరిగే వేసవిలోనూ; మనుజకోటి= మానవ సమూహం; అవభృథస్నానము= యజ్ఞాంతంలో చేసే మంగళస్నానం; పానంబులు= నీరుత్రాగటం; ఆచరించున్= చేస్తుందో; అతఁడు=ఆ జలాశయం నిర్మించినవాడు; వివిధ= అనేక; దుర్గ+అదిగతులు= దుర్గతులు మొదలైనవి; పొందఁడు.

తాత్పర్యం: ఎవడు త్రవ్వించిన జలాశయాలలో అడ్డం లేకుండా మండు వేసవిలో మానవులు, అవభృథస్నాన పానాలు చేస్తారో ఆ చెరువు త్రవ్వించినవాడు దుర్గతులు పొందడు.

క. యాగాది కర్మముల కుప । యోగింపంబడుటఁజేసి యుత్తమము, ఘృతం
బాగురు వస్తువు నిచ్చుట । యాగములకు నగ్నికిం బ్రియంబై యుండున్. 387

ప్రతిపదార్థం: యాగ= యజ్ఞం; ఆది= మొదలైన; కర్మములకున్= వేదం చెప్పిన కర్మలకు; ఉపయోగింపన్+పడుటన్‌చేసి= ఉపయోగింప బడటం వలన; ఘృతంబు= నేయి; ఉత్తమము= శ్రేష్ఠం; ఆ గురువస్తువున్= ఆ గొప్ప పదార్థమును; ఇచ్చుట= దానం చేయటం; యాగములకున్= యజ్ఞాలకున్నూ; అగ్నికిన్= అగ్నిదేవుడికీ; ప్రియంబు+ఐ= ప్రీతి కలదై; ఉండున్= ఉన్నది.

తాత్పర్యం: ఘృతదానం చాలా శ్రేష్ఠం. అది యాగాదులలో ఉపయోగిస్తుంది. కనుక అట్లాంటి ఘనవస్తువు నివ్వటం వలన యాగాలకూ, అగ్నికీ ప్రీతిపాత్రమౌతున్నది.

తే. గరగ లొసఁగిన నరుఁడు భూసురు లొనర్చు । ఆచమనముఖ కర్మంబులందు షష్ఠ
భాగఫల మొందు నెగడికిఁ బాచనమున । కింధనము లిచ్చి ధనముల నెసక మెసఁగు. 388

ప్రతిపదార్థం: గరగలు= కుండలు; ఒసఁగిన= ఇచ్చిన; నరుఁడు= మనిషి; భూసురులు= భూ దేవతలు (బ్రాహ్మణులు); ఒనర్చు= చేసే; ఆచమన= ఆచమించటం; ముఖ= మొదలైన; కర్మంబులందున్= వేద విధులలో; షష్ఠ= ఆరవ; భాగ= అంశ; ఫలము= ఫలితం; ఒందున్= పొందుతాడు; నెగడికిన్= నెగడునకు; (నెగడు= పెద్దమంట;) పాచనమునకున్= వంటకు; ఇంధనములు= కట్టెలు; ఇచ్చి= దానంచేసి; ధనములన్= డబ్బుతో; ఎసకము+ఎసఁగున్= అతిశయిస్తాడు; తులదూగుతాడు.

తాత్పర్యం: కుండలు దానం చేస్తే బ్రాహ్మణుడు చేసే ఆచమనాది వైదిక విధుల పుణ్యంలో ఆరవభాగం పుణ్యం పొందుతాడు. నెగళ్ళకు, వంటకు కట్టె లిస్తే ధనంతో తులతూగుతాడు.

విశేషం: అతిప్రాచీనమైన పాత్ర కుండ. దానిని చాలా పవిత్రంగా చూడటం ఒక ఆచారమైపోయింది. వివాహాలలో గరగముంత నేటికీ దాంపత్య పూర్ణతకు సాక్షిగా మనకు మిగిలేఉన్నది. అదే ఇక్కడ గరగ.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. ఛత్ర మిచ్చి కాంచుఁ బుత్త్రులఁ బురుషుండు । సకల కామ్య దానసమము శకట

మిచ్చు టనఘ! చెప్పు లిచ్చినఁ గంటకు । లైన రిపులఁ ద్రొక్కి యతఁడు దిరుగు. 389

ప్రతిపదార్థం: పురుషుండు= మానవుడు; ఛత్రము= గొడుగు; ఇచ్చి; పుత్త్రులన్= కొడుకులను; కాంచున్= పొందుతాడు; శకటమున్= బండిని; ఇచ్చుట= ఇవ్వటం; సకల= అన్ని; కామ్య= కోరికలతో చేసే; దానసమము= దానాలతో సమానం; అనఘ!= పుణ్యాత్ముడా!; చెప్పులు; ఇచ్చినన్= ఇస్తే; కంటకులు= ముండ్లు (విరోధులు); ఐన= అయినటువంటి; రిపులన్= శత్రువులను; త్రొక్కి= కాలరాచి; అతఁడు= దానంచేసినవాడు; తిరుగున్= సంచరిస్తాడు.

తాత్పర్యం: మనిషి గొడుగును దానంచేయటంవలన పుత్రసంతానాన్ని పొందగలడు. బండిని దానం చేయడం అన్ని కోరికలనూ తీర్చే దానంతో సమానం. చెప్పులిస్తే కంటకులైన శత్రువులను అణచి హాయిగా బ్రతుకుతాడు.

విశేషం: కామ్యదానం= స్వర్గాదిసుఖాలను కోరి చేసేదానం. అకామ్యదానం= ఏమీ కోరకుండా చేసేది.

కంటకం= ఇది రాజనీతి శాస్త్రంలోని మాట. రాజుకు అనేకమంది విరోధులు ఉంటారు. ఎవడు విరోధి? ఎవడు కాడు? తెలిసికొనటానికి వీలుగా కౌటిల్యుని అర్థశాస్త్రంలో కంటక శోధనాధ్యాయం వ్రాయబడింది.

ఇక్కడ కంటకం రాజుకు సంబంధించింది కాదు. అయితే రాజుకు చెప్పులు దానం చేయట మేమిటి?

క. తిలలు పితృభోజ్యములుగా । జలజభవుఁడు సేసెఁ బితృనిచయ మలరఁ గడుం

దిల లిచ్చిన శుచు లగుదురు । దొలఁగుం బర్వసురతాది దోషము లెల్లన్. 390

ప్రతిపదార్థం: జలజభవుఁడు= పద్మంలో జన్మించినవాడు, బ్రహ్మ; పితృనిచయము=పితృదేవతల సమూహం; అలరన్= సంతోషించేటట్లు; తిలలు= నువ్వులు; పితృ= పితృదేవతలకు; భోజ్యములుగాన్= తిన దగ్గవిగా; చేసెన్= విధించాడు; కడున్= ఎక్కువ; తిలలు= నువ్వులు; ఇచ్చినన్= ఇస్తే; శుచులు= మలినం (పాపంలేనివారు)); అగుదురు= అవుతారు; పర్వ= పర్వములందలి, (అమావాస్య, పూర్ణిమ); సురత+ఆది= సంభోగం మొదలైన వాటివల్లకలిగే; దోషములు= పాపాలు; ఎల్లన్= అన్ని; తొలఁగున్= తొలగిపోతాయి.

తాత్పర్యం: పితృదేవతలకు ఆహారంగా నువ్వులను సృష్టించాడు బ్రహ్మ. తిలలిస్తే పితృదేవత లందరూ సంతోషిస్తారు. కనుక తిలలను ఎవడు ఎక్కువ దానం చేస్తాడో వాడు పవిత్రుడవుతాడు. పర్వదినంలో సంభోగం చేసిన పాపాలవంటివి అన్నీ పోతాయి.

విశేషం: ఆ దినాలలో రతి నిషిద్ధ మన్నమాట.

తే. దివ్యముని యగు కాశ్యపు భవ్య గాత్ర । ముల జనించి భవ్యంబు లై తిలలు వెలయు;

నట్లు గావునఁ దత్కృతయజన మఖిల । వస్తు యజనంబుతో సరివచ్చు నండ్రు. 391

ప్రతిపదార్థం: తిలలు= నువ్వులు; దివ్యముని= దేవతల ముని; అగు; కాశ్యపు= కాశ్యపుడి యొక్క; భవ్య= మహత్తుగల; గాత్రములన్= అవయవాలనుండి, శరీరం నుండి; జనించి= పుట్టి; భవ్యంబులు+ఐ= శ్రేష్ఠములై; వెలయున్= ప్రకాశిస్తాయి; అట్లు కావునన్= అందువలన; తత్= వాటితో; కృత= చేసిన; యజనము= యాగం; అఖిల= సమస్త; వస్తు= పదార్థ; యజనంబుతోన్= యజ్ఞంతో; సరివచ్చును= సమానమౌతుంది; అండ్రు= అని పెద్దలంటారు.

తాత్పర్యం: దివ్యముని అయిన కాశ్యపుని శరీరాంగాలనుండి పుట్టాయి కనుక తిలలు శ్రేష్ఠము లయ్యాయి. కనుక వాటితో చేసే యజ్ఞకర్మ సమస్త వస్తువులతో చేసిన యుగకర్మతో సమానం.

క. తిలదాన మఖిల దానం । బుల కంటె విశిష్ట మెల్ల మునులును నియతిం
దిల లర్హములగు పాత్రం । బుల కిచ్చియ కాదె పెంపు వొందిరి వత్సా!' 392

ప్రతిపదార్థం: వత్సా!= నాయనా!; తిలదానము= నువ్వులను దానంచేయటం; అఖిల= సమస్త; దానంబులకంటెన్= దానాలకంటె; విశిష్టము= గొప్పది; ఎల్లమునులును= మునులందరూ; నియతిన్= నియమంతో; తిలలు= నువ్వులను; అర్హములగు= యోగ్యులైన; పాత్రంబులకున్= వ్యక్తులకు; ఇచ్చియకాదె= ఇచ్చే కదా; పెంపు= అతిశయాన్ని, గొప్పతనాన్ని; పొందిరి= పొందినారు.

తాత్పర్యం: నాయనా! తిలదానం సర్వశ్రేష్ఠం. ఇందుకే మునులంతా వీటిని అర్హులు, యోగ్యులైనవారికి దానం చేసికదా అంతగొప్ప వా రైనారు.'

విశేషం: మన కనేక క్రతువులలో (వైదిక విధులలో) నువ్వులకు విశిష్ట స్థానం ఉన్నది. ఇది ఈనాటికీ ప్రసిద్ధమే.

వ. 'అని చెప్పి యాపగాతనయుం డొక విశేషంబు వినిపింపవలసి ధర్మజున కిట్లనియె.' 393

ప్రతిపదార్థం: అని చెప్పి; ఆపగా తనయుండు= నది కొడుకు, భీష్ముడు; ఒక; విశేషంబున్= ప్రత్యేక విషయాన్ని; వినిపింప వలసి= తప్పక వినిపించదలంచి; ధర్మజునకున్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి భీష్ముడు ఒక విశేషాన్ని వినిపించవలసి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

ఉ. 'దానము లాదిగాఁ గలుగు ధర్మము లెల్లను జేఁతకున్ నిజా
ధీనపుఁ జోటు గావలయు దేవతలున్ మునులుం జతుర్ముఖుం
గానఁగఁ బోయి యజ్ఞముఖ కర్మ సమాచరణార్థ మై తదీ
యానుమతిం దగం బడసి యయ్యయిచోటుల నాచరింపరే. 394

ప్రతిపదార్థం: దానములు; ఆదిగాన్; కలుగు= ఉన్న; ధర్మములు= ధర్మాలు; ఎల్లను= అన్నీ; చేఁతకున్= చేయటానికి; నిజ= తనకు; ఆధీనపు= స్వాధీనమైన; చోటు కావలయున్= తావు కావాలి; దేవతలున్; మునులున్= మునులున్నూ; చతుర్ముఖున్= నాలుగు మొగాలు కల బ్రహ్మను; కానఁగన్= దర్శించగా; పోయి; యజ్ఞముఖ= యాగమూ మొదలైన; కర్మ= కర్మలయొక్క; సమాచరణ+అర్థమై= చక్కగా చేయటం కొరకు; తదీయ= అతడి; అనుమతిన్= సమ్మతిని; తగన్= చక్కగా; పడసి= పొంది; అయ్యయి= ఆయా చోటులన్= స్థలాలలో; ఆచరింపరే= చేయరా?

తాత్పర్యం: దానాది కర్మలు చేయటానికి తనకు లోబడిన చోటు కావాలి. పూర్వం మునులూ, దేవతలూ, బ్రహ్మను దర్శించి యజ్ఞం మొదలైన వేద కర్మలు చేయటానికి ఆయన అనుమతి పొంది ఆయా చోట్ల చేశారు కదా!

క. కాననము గిరులు నదులును । నానా తీర్థములు భూజనంబుల కెల్లన్
భూనుత! సాధారణములు । వానను ధర్మములు సేయవచ్చు నిజేచ్ఛన్. 395

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కాననమున్= అడవీ; గిరులున్= కొండలున్నూ; నదులునున్= నదులూ; నానా= అనేక; తీర్థములున్= తీర్థాలు; భూ= భూమిపై; జనంబులకున్= జనాలకు; ఎల్లన్= అందరకూ; భూనుత!= భూప్రజచేత స్తుతింప దగ్గవాడా!; సాధారణములు= సామాన్యాలు; వానను= వాటిలో; నిజ+ఇచ్ఛన్= స్వేచ్ఛతో; ధర్మములు= ధర్మాలు; చేయవచ్చున్= చేయవచ్చును.

తాత్పర్యం: భూమిచేత అంటే రాష్ట్ర ప్రజలచేత పొగడదగ్గవాడా! అడవీ, కొండలూ, నదులూ అనేక తీర్థాలు దానధర్మాలు చేయటానికి యోగ్య స్థలాలు. అక్కడ భూప్రజ లంతా దానం చేయవచ్చును.

విశేషం: తీర్థం= నదీ, క్షేత్రం కలచోటు. పుణ్యక్షేత్రం ప్రక్కనున్న నది తీర్థం.

ఆ. అధిప! నా మనమునయందుఁ దోఁచినయది । యాచరింపవలయు నర్థమగుటఁ
జేసి దీని నీకుఁ జెప్పితి గో దాన । శస్తమహిమ వినుము విస్తరింతు. 396

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నా మనమునయందున్= నా మనస్సులో; తోఁచిన అది= స్ఫురించినట్టిది; ఆచరింపన్ వలయు= చేయవలసిన; అర్థము= విషయం; అగుటన్‌చేసి= కావటంవలన; దీనిన్= ఈ విషయం; నీకున్; చెప్పితిన్; గోదాన= గోవులను దానం చేయటంయొక్క; శస్త= ప్రశస్తమైన, నుతింపదగ్గ; మహిమ= మహత్త్వం; విస్తరింతున్= వ్యాఖ్యానిస్తాను; వినుము= ఆలకించుము;

తాత్పర్యం: రాజా! నా మనస్సునకు తోచిన దాన్ని ఆచరించదగ్గ విషయం కావటంవలన నీ కిది చెప్పాను. ఇక గోదాన మహిమను వివరిస్తాను వినుము.

సీ. గోవు లెక్కుడు తపోభావితాత్ముల కంటె । ననినఁ దద్గౌరవంబునకు మేర
గలదె? సత్యాఖ్య లోకంబున నవి సోమ । సంగతత్వంబున సంచరించు
వినుత హోమముల కెల్లను బాలుఁ బెరువు నే । యును నిచ్చుఁ గర్సనంబునకు నొదవుఁ
దోలు శృంగంబులు వాలంబు రోమ చ । యము శకృన్మూత్రము లఖిలవర్త

ఆ. నముల కుపకరించు; శ్రమము శీతాతప । వ్యథయు లేమి నెపుడు నతిభరంపుఁ
బనులు సేయు గోవు బ్రాహ్మణుఁ డన నేక । తత్త్వ మగుటఁ బరపదంబుఁ గాంచు. 397

ప్రతిపదార్థం: తపోభావితాత్ములకంటెన్= తపస్సుద్వారా భావించే ఆత్మలు కలవారికంటే; గోవులు= ఆవులు; ఎక్కుడు= ఎక్కువ; అనినన్= అంటే; తత్= వాటియొక్క; గౌరవంబునకున్= గొప్పతనానికి; మేర= సరిహద్దు; కలదె? =ఉన్నదా? సత్య+ఆఖ్య= సత్యమన్న పేరుగల; లోకంబునన్= లోకంలో; అవి= గోవులు; సోమ= చంద్రుడి; సంగతత్వంబునన్= స్నేహంతో; సంచరించున్= తిరుగుతాయి; వినుత= ప్రశస్త; హోమములకున్+ఎల్లనున్= అన్నిహోమాలకు; పాలున్; పెరువున్= పెరుగు; నేయునున్= నేయీ; ఇచ్చున్= ఇస్తాయి; కర్సనంబునకున్= వ్యవసాయానికి; ఒదవున్= ఉపయోగపడతాయి; తోయిన్= చర్మం; శృంగంబులున్= కొమ్ములూ; వాలంబున్= తోకా; రోమచయమున్= వెంట్రుకల గుంపు; శకృత్= పేడ; మూత్రములున్= మూత్రాలు; అఖిల= సమస్త; వర్తనములకున్= పనులకు; ఉపకరించున్= ఉపయోగిస్తాయి; శ్రమము= శ్రమా; శీత= చలి; ఆతప= ఎండ వీటివల్ల; వ్యథయున్= బాధా; లేమి= లేకపోవటంవలన; ఎపుడున్= ఎల్లప్పుడూ; అతి= మిక్కిలి;

భరంపు= బరువైన; పనులు= కార్యములు; చేయున్; గోవు= ఆవు; బ్రాహ్మణుఁడున్= విప్రుడు; అనన్= అనగా; ఏకతత్త్వము= ఒకే సత్యం; అగుటన్= కావటంవలన; పరమ= గొప్ప; పదంబు= స్థానం; కాంచున్= పొందుతాయి.

తాత్పర్యం: తపస్సుద్వారా భగవంతుడిని భావించే వారికంటె ఆవులు గొప్ప - అని అంటే వాటి గౌరవానికి హద్దేమిటి? చంద్రుడితో కలిసి అవి సత్యలోకంలో సంచరిస్తాయి. హోమాలకు కావలసిన పాలు, పెరుగు, నెయ్యి ఇస్తాయి. ఎద్దులు సేద్యానికి పనికివస్తాయి. వాటి చర్మం, కొమ్ములు, తోకా, వెంట్రుకలు, పేడా, మూత్రం అన్ని పనులకు ఉపకరిస్తాయి. ఎండకూ, చలికీ, బాధపడనివి కావటంవలన బరువైన పనులన్నిటికీ పనికి వస్తాయి. గోవన్నా బ్రాహ్మణుడన్నా ఒకే తత్త్వం కావటంవలన గోదానం చేసినవాడు ముక్తిపొందుతాడు.

క. గోవుల విప్రుల కిచ్చిన । నే విషమపు గతులఁ బొరయ కేరికి నరుగం
గా వశము గానిలోకము । లావాసంబులుగ నిలుతు రతి సుఖవృత్తిన్. 398

ప్రతిపదార్థం: గోవులన్= ఆవులను, విప్రులకున్= బ్రాహ్మణులకు; ఇచ్చినన్; ఏ విషమపు గతులన్= ఎట్లాంటి చెడ్డస్థితులను; పొరయక= కలుగక, పొందక; ఏరికిన్= ఎవరికీ; అరుగంగాన్= పోవటానికి; వశముకాని=వీలుపడని; లోకములు= పుణ్యలోకాలు; ఆవాసంబులుగన్= నివాసములుకాగా; అతి= మిక్కిలి; సుఖవృత్తిన్= సుఖమయమైన మనస్సుతో; నిలుతురు= ఉంటారు.

తాత్పర్యం: ఆవులను బ్రాహ్మణులకు దానంచేస్తే ఎట్లాంటి సంకటస్థితులు పొందక, ఎవరూ పొందరాని పుణ్యలోకాలలో సుఖంగా ఉండగలరు.

క. గోవుల పాలమృతం బని । దేవేంద్రుఁడు సెప్పెఁ గాన ధీరత్వనిధీ!
గోవు నొసఁగ నమృతము స । ద్భావంబున నిచ్చినట్టి ఫల మొడఁగూడున్. 399

ప్రతిపదార్థం: ధీరత్వనిధీ!= ధైర్యానికి నిలయమైనవాడా; గోవులపాలు= ఆవులపాలు; అమృతంబు= కేవలం అమృతమే అని; దేవేంద్రుఁడు= వేల్పులదొర; చెప్పెన్+కాన= చెప్పారు కనుక; గోవున్; ఒసఁగన్= ఇవ్వటం; అమృతమున్; సద్భావంబునన్= మంచిమనస్సుతో; ఇచ్చినట్టి; ఫలము= ఫలితం; ఒడన్+కూడున్= లభించును.

తాత్పర్యం: ఆవులపాలు అమృతమేనని దేవేంద్రుడు చెప్పాడు కనుక గోవును ఇవ్వటంవలన అమృతాన్ని దానం చేసిన ఫలాన్ని పొందగలడు.

విశేషం: ధీరత్వము= కష్టనష్టాలలో మనస్సు చెదరకుండా జీవించటం, ఆపదల నెదిరించ గలగటం.

తే. అనఘ! గోవులు ప్రాణంబు లని సమస్త । మునులు సెప్పుదు; రట్లు గావునఁ దలంపఁ
బ్రాణదాన విధాన సంప్రాప్త మైన । ఫలము గోదానకర్తకుఁ గలుగుఁ జూవె! 400

ప్రతిపదార్థం: అనఘ!; గోవులు; ప్రాణంబులు= ప్రాణాలు; అని; సమస్త= అందరు; మునులు= ఋషులు; చెప్పుదురు; అట్లుకావునన్= అందువలన; తలంపన్= ఆలోచిస్తే; ప్రాణదానవిధాన= ప్రాణాన్ని దానం చేసేపద్ధతివల్ల; సంప్రాప్తమైన= లభించిన; ఫలము; గోదానకర్తకున్= గోవును దానం చేసినవాడికి; కలుగున్ చూవె!= కలుగును సుమా!

తాత్పర్యం: మునులు 'ఆవులంటే ప్రాణాలు' అని చెప్పుతారు. కనుక ప్రాణదానం చేయడంవల్ల లభించే ఫలం గోదానకర్తకు కలుగుతుందిసుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. క్రూరునకు నాస్తికునకు దు । రారంభున కిచ్చినం బరమ దుఃఖమునుం

గూరును గో; వది దాతను । నారకిఁ జేయుం; బరీక్షణము గడు వలయున్. 401

ప్రతిపదార్థం: క్రూరునకున్= హింసించేవాడికీ; నాస్తికునకున్= దైవమంటూ ఎవరూ లేరని నమ్మేవానికీ; దుర్+ఆరంభునకున్= దుష్టబుద్ధితో పనులు ప్రారంభించేవాడికీ; ఇచ్చినన్; గోవు; పరమ దుఃఖమునన్= మహా దుఃఖంలో; కూరును= కూరుకొనిపోతుంది; అది= దాని శోకం; దాతనున్= ఇచ్చిన వాడిని; నారకిన్ చేయున్= నరకంలో నివాసిగా చేస్తుంది; పరీక్షణము= పరిశీలన; కడున్= చాలా; వలయున్= కావాలి.

తాత్పర్యం: బాగా పరీక్షించి గోవును దానం చేయాలి. క్రూరుడికీ, నాస్తికుడికీ, చెడ్డపనులు చేసేవాడికీ ఇస్తే గోవు శోకిస్తుంది. ఆ శోకం దాతను నరకలోకంలో పడవేస్తుంది.

ఆ. గొడ్డు బడుగుఁ దెవులు గొంటుఁ గ్రే పెడలిన । దాని నెచ్చటేని నూన మైన

యట్టిదాని నొకట నాయాసపడి యున్న । దాని నీరు గోప్రదానవిదులు. 402

ప్రతిపదార్థం: గొడ్డున్= గొడ్డుబోతు, చూలు కలగనిది; బడుగున్= బక్కచిక్కినది; తెవులుగొంటున్= రోగాలు కలది (గొడ్లకు వచ్చే ఒక రకమైన వ్యాధి, దాటికుట్టు అని కూడా అంటారు); క్రేపు= దూడ; ఎడలిన= పోయిన; దూరమైన; దానిన్(ఒకచూలు తరువాత మరలా చూలు దాల్చనిది); ఎచ్చటన్+ఏనిన్= ఎక్కడైనా; ఊనము= దోషం; ఐన అట్టి దానిన్= కలదానిని; ఒకటన్= ఒకే విధంగా; ఆయాసపడి ఉన్న దానిన్= రొప్పేదానిని; గోప్రదాన విదులు= ఆవులను దానంచేయటం తెలిసినవారు; ఈరు= ఇవ్వరు.

తాత్పర్యం: గొడ్డుబోతుని, తెవులుగొంటును, బక్కచిక్కినదానిని ఎక్కడైనా సరే చెడ్డసుడి ఉన్న దానిని, ఒకేరీతిగా రొప్పు రోగం గల దానిని గోదానవిధి తెలిసినవా రివ్వరు.

విశేషం: దానం చేయట మంటే పనికిరాని దాని నివ్వట మనుకొనవచ్చును కనుక ఈ పద్యం చెప్పబడింది. కఠోపనిషత్తులో తండ్రి ఇట్లాంటి ఆవులనే దానంచేస్తుంటే కొడుకు నచికేతుడు చూచి బాధపడ్డాడని కథ ఉన్నది. అది దానం కాదు - అని చెప్పటం ప్రధానం.

క. విను పుణ్యలోకముల కా । వనఘా! విప్రులకు గోచయంబులఁ బెక్కి

చ్చిన నవి దాతకు మోక్షం । బును జేయఁగఁ జాలు నండ్రు పూర్వాచార్యుల్.' 403

ప్రతిపదార్థం: విను; అనఘా!; విప్రులకున్= బ్రాహ్మణులకు; గోచయంబులన్= ఆవుల మందలను; పెక్కు= ఎక్కువ; ఇచ్చినన్; అవి; దాతకున్= ఇచ్చినవాడికి; పుణ్యలోకములు+అ= పుణ్యలోకాలే; కావు= కావు; మోక్షంబునున్= మోక్షాన్ని; చేయఁ గన్ చాలును= కలిగించగలవు అని; పూర్వ= ముందరి; ఆచార్యుల్= గురువులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: "అనఘా! వినుము బ్రాహ్మణులకు గోవుల గుంపులను ఎక్కువగా దానం చేస్తే ఆ గోవులు పుణ్యలోకాలనే కాదు మోక్షాన్నికూడ కలిగించ కలవని పూర్వాచార్యులు అన్నారు.

వ. 'అని చెప్పి గాంగేయుం దన్న పానీయ దానఫలాతిశయంబులు వెండియు వినిపింప వేడ్కసేసి యవ్విభున కిట్లనియె' 404

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని చెప్పి; గాంగేయుండు= గంగకొడుకు భీష్ముడు; అన్న= అన్నం; పానీయ= త్రాగేవి; దానఫల+అతిశయంబులు= దానంచేయటం వల్ల కలిగే గొప్పఫలితాలు; వెండియున్= ఇంకా; వినిపింపన్= వినిపించాలని; వేడ్క+చేసి= వేడుకపడి; ఆ+విభునకున్= ఆ రాజుతో; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: ఇట్లా వివరించి భీష్ముడు అన్నపానీయ దానాల గొప్పతనం చెప్పాలని ముచ్చటపడి ధర్మరాజుతో అన్నాడు;

సీ. **'అధిప! యింకను విను మన్నంబు జలమును । నిచ్చుట యీవుల కెల్ల నెక్కు**
డగుట నేఁ జెప్పెద నమృత సుధాస్వధా । నామముల్ సురలందు నాగకులము
నందును బితృకోటియందును వర్తిల్లు । నన్నంబునకు నోలినట్లుఁ గాక
యది ప్రాణ మండ్రు మహాత్ములు గావున । దానిఁ బెట్టుట ప్రాణదాన సమము;

తే. **విను విశేషించి తత్పాకమునకు జల ము । పాశ్రయము చంద్రునకుఁ బుట్టఁ బట్టునయ్యె**
జలము చంద్రుండు గాఁడె యోషధులఁ బ్రోచుఁ । గాన యుత్తమ మన్నంబు కంటె జలము.' **405**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఇంకను= ఇంకా; వినుము; అన్నంబు; జలమునున్= నీటిని; ఇచ్చుట; ఈవులకున్+ఎల్లన్= అన్ని దానాలకంటె; ఎక్కుడు= ఎక్కువ; అగుటన్=అయినందువలన; నేన్= నేను; చెప్పెదన్= చెపుతాను; అమృత= అమృతమనునట్టి; సుధా= సుధా అనేటి; స్వధా= స్వధా అనేటి; నామముల్= పేర్లు; (క్రమంగా) సురలందున్= దేవతలలో; నాగకులమునందున్= సర్పజాతిలోను (పాతాళలోకంలో ఉండేది నాగులు; స్వర్గలోకంలో ఉండేది దేవతలు; పితృకోటియందునున్= పితృదేవతల సమూహంలో; వర్తిల్లున్= ప్రవర్తిస్తాయి; అన్నంబునకున్= అన్నానికి; ఓలిన్= క్రమంగా (అన్నాన్ని దేవలోకంలో అమృతమనీ, పాతాళంలో సుధ అనీ, పితృలోకంలో స్వధ అనీ అంటారు); అట్లున్‌కాక= అంతేకాక; అది; ప్రాణము= ప్రాణశక్తి; అని; మహాత్ములు; అండ్రు= అంటారు; కావునన్; దానినీ; పెట్టుట= అన్నం పెట్టటం; ప్రాణదానసమము= ప్రాణం దానంచేయటంతో సమానం; విను= వినుము; విశేషించి= మిాదు మిక్కిలి; తత్+పాకమునకున్= అన్నంవండుటకు; జలము= నీరు; ఉప+ఆశ్రయంబు= ఉనికిపట్టు; చంద్రునకున్= చంద్రుడికి; పుట్టన్= జన్మించుటకు; జలము= నీరు; పట్టున్= స్థానంకూడా; అయ్యెన్= అయినది చంద్రుండుకాఁడె= చంద్రుడే కదా; ఓషధులన్= మొక్కలను; ప్రోచున్= రక్షిస్తాడు; కాన= కనుక; అన్నంబుకంటెన్; జలము= నీరు; ఉత్తమము= శ్రేష్ఠం.

తాత్పర్యం: 'రాజా! ఇంకా చెప్పుతాను వినుము. అన్నదానం అన్నిటికంటె చాలా గొప్పది. అన్నాన్ని స్వర్గలోకంలో అమృతమనీ, నాగలోకంలో సుధ అనీ, పితృలోకంలో స్వధ అనీ అంటారు. దాన్నే మహాత్ములు ప్రాణమంటారు. కనుక అన్నదానం ప్రాణదానంతో సమానం. ఇంకా విశేషించి చెప్పుతాను వినుము. అన్నంకంటె జలదానం గొప్పది. అది అన్నపాకానికి ఉపాశ్రయం. జలంలోనే చంద్రుడు పుట్టి సకల ఓషధులకు రక్షకుడయ్యాడు. కనుక అన్నంకంటె జలం గొప్పది.'

విశేషం: దేవతలకు హోమం చేసే మంత్రాలు స్వాహాతోను,
పితృదేవతా మంత్రాలు స్వధాతోనూ అంతమౌతాయి.

వ. అని పలికి మఱియును. 406

తాత్పర్యం: అని చెప్పి ఇంకా.

క. 'తనకుఁ గలయట్టి యన్నము । నన సుర పితృపూజనములు నరునకు నడపం
జను నతిథి తర్పణము దా । నన తగ నొనరించు వాఁడు నరవరముఖ్యా!' 407

ప్రతిపదార్థం: నరవరముఖ్యా!= రాజశ్రేష్ఠుడా!; తనకున్ కల అట్టి= తనకున్నటువంటి; అన్నమునన=అన్నంతోనే; నరునకున్= మనిషికి; సుర= దేవతల; పితృ= పితృదేవతల; పూజనములు= పూజలు; నడపన్= చేయగా; చనున్= వలయును; అతిథి= అతిథులను; తర్పణము= తృప్తిని; దానన= అన్నంతోనే; వాఁడు; తగన్= చక్కగా; ఒనరించున్= చేస్తాడు.

తాత్పర్యం: 'తనకున్న అన్నంతోనే దేవతల పితృదేవతల పూజలు చెల్లించాలి. అతిథులను దానితోనే తృప్తి పొందించాలి.'

వ. అని నిర్దేశించి తిలదానం బత్యాదరణీయంబని ప్రసంగించి 'యది వినినది యైనను నేమి? తద్విషయంబున కొక్క యితిహాసంబు గలదు; చెప్పెద విను 'మని పలికి, యనిమిష నదీనందనుండు కుంతీనందనాగ్రజుతో నిట్లనియె. 408

ప్రతిపదార్థం: అని; నిర్దేశించి= సెలవిచ్చి, చెప్పి; తిలదానంబు= నువ్వులను దానం చేయటం; అతి+ఆదరణీయంబు= మిక్కిలి ఆదరించదగ్గది;అని; ప్రసంగించి= ప్రసంగం చేసి; అది వినినది+ ఐనను= అది విన్నదైనా; ఏమి= ఏముంది? (వింటే మాత్రమేమి?); తద్విషయంబునకున్= ఆ విషయానికి సంబంధించి; ఇతిహాసంబు= కథ; కలదు= ఉన్నది; చెప్పెదన్; వినుము+అని= ఆలకించుమని; పలికి= వచించి; అనిమిష నదీ నందనుండు= దేవతలనదియైన గంగయొక్క కొడుకు భీష్ముడు; కుంతీనందన= కుంతి కొడుకులలో; అగ్రజుతోన్= పెద్దవాడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చెప్పి తిలదానం చాలా ఆచరించదగ్గది అని వివరించి ఆ విషయం నీవు విన్నదైనా మరలా ఒక కథ చెప్పుతాను వినుము. దానివలన నీకు నష్ట మేమిటి?' కనుక అని భీష్ముడు ధర్మరాజుతో అన్నాడు.

తిలదాన విషయక యమ బ్రాహ్మణ సంవాదము (సం.13-67-1)

సీ. మధ్యదేశమున గ్రామంబు విద్వజ్జన । బహులమై యొక్కటి పర్ణశాల
యను పేర నొప్పారు నందుల విప్రుని । శర్మి నామునిఁ బ్రీతి జముఁడు పిలువఁ
బనిచి దానముల కెల్లను దిలదాన మె । క్కుడు తిలలకుఁ బితృకోటి వేడ్క
సేయుఁ బాపంబులు సెందవు తిలభక్షిఁ । బుణ్య కర్తృత్వంబు బుద్ధిఁ గోరు

తే. దేనిఁ దిల లెప్డువిప్రుల కిమ్ము భక్తి । ననియె వస్త్ర దీపము లీగి యతుల దాన
మనఘ! చీరల దివియల నమర పితృ స । మర్చనము సేఁత పరమధర్మ మని చెప్పె. 409

ప్రతిపదార్థం: పర్ణశాల= ఆకులతో కప్పిన ఇల్లు; అనుపేరన్= అన్నపేరుతో; గ్రామంబు= ఊరు; మధ్యదేశమునన్= మధ్యప్రదేశంలో; విద్వత్+జన బహులమై= పండితుల సమూహంతో క్రిక్కిరిసి; ఒక్కటి, ఒప్పారున్= పేరు పొందింది;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అందులన్= అక్కడ; శర్మి నామునిన్= శర్మి అన్న పేరుగల వాడిని; విప్రునిన్= బ్రాహ్మణుడిని; జముఁడు= యముడు; ప్రీతిన్= ప్రేమతో; పిలువన్ పనిచి= పిలిపించి; దానములకున్+ఎల్లను= అన్ని దానాలలో; తిలదానము; ఎక్కుడు= గొప్పది; తిలలకున్= నువ్వులకు; పితృకోటి= పితృదేవతల సమూహం; వేడ్క సేయున్= ముచ్చటపడుతుంది; తిలభక్షిన్= నువ్వులు తినేవాడిని; పాపంబులు= పాపాలు; చెందవు= పొందవు; పుణ్యకర్తృత్వంబున్= పవిత్ర కర్తృత్వాన్ని; బుద్ధిన్= బుద్ధియందు; కోరుదు+ఏని= కోరితే; విప్రులకున్= బ్రాహ్మణులకు; తిలలు; ఎప్డున్= ఎప్పుడూ; ఇమ్ము= ఇవ్వు; భక్తిన్= భక్తితో; అని; అనియెన్; వస్త్ర= వస్త్రము; దీపములు= దివ్వెలు; ఈగి= దానం; అతుల= సాటిలేని దానము; అనఘ! చీరలన్= వస్త్రాలతో; దివియలన్= దీపాలతో; అమర= దేవతల; పితృ= పితృదేవతల; సమర్చనముచేఁత= పూజించటం; పరమ= గొప్ప; ధర్మము; అని; చెప్పెన్.

తాత్పర్యం: మధ్యప్రదేశములో పర్ణశాల అని ఒక గ్రామమున్నది. అందులో అనేకమంది పండితులు ఉండేవారు. వారిలో శర్మి అనే పేరుగలవాడిని పిలిచి యముడన్నాడు - 'అన్ని దానాలలో తిలదానం గొప్పది. పితృదేవతలు దానికొరకు వేడ్కపడతారు. నువ్వులు తిన్న వానిని పాపాలు పొందవు. కనుక నీవు మంచి పని చేయదలచుకొంటే బ్రాహ్మణులకు నువ్వులు దానం చేయుము. వస్త్రాలు, దీపాలు దానం చేయటం గొప్పది. వస్త్రాలతో దేవతలు, దీపాలతో పితృదేవతలు సంతోషిస్తారు కనుక.

వ. అని యిట్లు యమబ్రాహ్మణ సంవాదంబు వినిపించి శాంతనవుం డమ్మహీకాంతు నాననంబు సవిశేషాదరంబున నాలోకించి. 410

ప్రతిపదార్థం: అని; ఇట్లు; యమ= యముడు; బ్రాహ్మణ= శర్మి; సంవాదంబు= సంభాషణ; వినిపించి, శాంతనవుండు= శంతనుడి కుమారుడు; ఆ మహీకాంతు= ఆ రాజుయొక్క, ఆననంబు= ముఖం; సవిశేష= విశిష్టమైన; ఆదరంబునన్= ఆదరణతో; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అని ఈ విధంగా యమ శర్మి సంవాదం వినిపించి శాంతనవుడు ధర్మరాజును ఆదరణతో చూచి.

క. 'విను పృథివియును సరస్వతి । యును గోవును దాన విధికి నొక్కంతలుగా
విని యుండుదు వీనిం బో । లిన దాతవ్యములు నొండు లేవని విందున్. 411

ప్రతిపదార్థం: పృథివియునున్= భూమి; సరస్వతియునున్= చదువు; గోవునున్= ఆవునూ; దాన విధికిన్= దానం చేయటానికి; ఒక్క+అంతలుగాన్= ఒకటేనని; వినియుండుదున్= విన్నాను; వీనిన్= వీటిని; పోలిన; దాతవ్యములు= ఇవ్వదగ్గవి; ఒండు= మరొకటి; లేవు; అని; విందున్= విన్నాను.

తాత్పర్యం: దానం చేయదగ్గవి మూడే అవి 1.భూమి, 2.చదువు, 3.గోవు. వీటికంటె గొప్పవి లేవు.

ఆ. రాజముఖ్య! తగు సరస్వతి శిష్యున । కొసఁగ, భూమి దాన మూర్జితముగఁ
జేసినట్టి ఫలము సిద్ధించు, ధేనువు । నిచ్చుటయును భూమి నిచ్చినట్ల. 412

ప్రతిపదార్థం: రాజముఖ్య!= రాజశ్రేష్ఠుడా!; శిష్యునకున్= విద్యార్థికి; సరస్వతి= విద్య; ఒసఁగన్= ఇవ్వటం; తగున్= యోగ్యం; భూమిదానము= భూదానం; ఊర్జితముగన్= ఎక్కువగా; చేసినట్టి ఫలము; సిద్ధించున్= కలుగుతుంది; ధేనువును= ఆవును; ఇచ్చుటయును= ఇవ్వటమూ; భూమిన్= నేలను; ఇచ్చినట్లు+అ= దానం చేసినట్లే.

తాత్పర్యం: రాజముఖ్య! శిష్యుడికి తగునట్లుగా విద్యాదానం చేయటం భూదానం చేసినంత! గోవునివ్వటం కూడా భూదానం చేసినంతే!

క. అనయముఁ గొంచెపు వెలకుం । గొనవచ్చును సారభూత గోవును దానం
బున ఫల మధికము దానము । గొని నాతఁడు సుఖము దానఁ గొనుఁ జేసేతన్. 413

ప్రతిపదార్థం: అనయమున్= ఎప్పుడు; కొంచెపు= తక్కువ; వెలకున్= ధరకు; కొనవచ్చును= కొనుక్కొనవచ్చును; సారభూత= అన్నిటికి సారమగుతున్న లేదా పంచభూత సారమైన (గోవు విశ్వసంకేతం కనుక); గోవును= ఆవును; దానంబునన్= గోదానంవలన; ఫలము= ఫలితం; అధికము= ఎక్కువ; దానము కొనినాతఁడు= దానం గ్రహించినవాడూ; చేసేతన్= చేతులారా!; సుఖమున్= సౌఖ్యాన్ని; దానన్= గోదానంతో; కొనున్= గ్రహిస్తాడు.

తాత్పర్యం: పంచభూతస్వరూపిణి అయిన గోమాతను తక్కువ వెలకు కొనవచ్చును. గోదానఫలం ఇచ్చినవాడికీ, - తీసికొన్నవాడికీ కలుగుతుంది.

ఆ. దేవ పితృ సమర్చనావాసములు గోశ । కృత్ప్రలేపనమునఁ గీర్తనీయ
శుచితఁ బడయు ననిన సువ్రత! గోవుల । భూరి మహిమ వేఱ పొగడ నేల? 414

ప్రతిపదార్థం: సువ్రత!= వ్రతనిష్ఠ కలవాడా!; దేవ= దేవతల; పితృ= పితృదేవతల; సమర్చనా= పూజా; ఆవాసములు= నివాసాలు, పూజా మందిరాలు; గో= ఆవు; శకృత్= పేడ; ప్రలేపనమునన్= అలకటంవలన; కీర్తనీయ= పొగడదగ్గ; శుచితన్ పడయున్= శుచిత్వాన్ని పొందుతాయి; అనినన్= అనగా; గోవుల; భూరిమహిమ= గొప్పమహిమ; వేఱ= ప్రత్యేకంగా; పొగడన్+ఏల= పొగడటం దేనికి?

తాత్పర్యం: ధర్మరాజా! దేవతలను, పితృదేవతలను ఆరాధించే నివాసాలు ఆవులపేడతో అలకటం వలన పొగడదగిన పవిత్రత కలుగుతుం దనగా ఇక గోవుల గొప్ప మహిమ వేరే పొగడటం ఎందుకు?

తే. కుడుపునకు ముందు రొడ్డుల గోవునకు స । మంచిత గ్రాసముష్టి నిత్యంబు నేఁడు
గాల మిచ్చిన నతఁ డెల్ల కామ్యములును । బ్రాహ్మణుల కర్థి నొసఁగిన ఫలము వడయు. 415

ప్రతిపదార్థం: ఏఁడుకాలము= సంవత్సరకాలం; నిత్యము= ప్రతిరోజు; కుడుపునకున్= తాను భుజించటానికి; ముందర= ముందే; ఒడ్డుల= మరొకరి; గోవునకున్= ఆవుకు; సమంచిత= చక్కని; గ్రాసముష్టి= పిడికెడు గడ్డి; ఇచ్చినన్= ఇస్తే; అతఁడు; ఎల్ల కామ్యములును= అన్ని కోరికలను; బ్రాహ్మణులకున్= విప్రులకు; అర్థిన్= ప్రేమతో; ఒసఁగిన= ఇచ్చిన; ఫలము= ఫలితం; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: తాను తినే ముందు ఆవుకు పిడికెడు గడ్డి సంవత్సరం పొడుగునా ప్రతి దినమూ ఎవ డిస్తాడో వాడు బ్రాహ్మణులకు కోర్కెలన్నీ తీర్చినంత ఫలం పొందుతాడు.

క. గోదాన విధము సుపథగ । మై దాతకు నెల్ల మేలు నాపాదించున్
వేదప్రియ! యది దురితో । త్పాదక మగు నాతనికి విపథగతమైనన్. 416

ప్రతిపదార్థం: వేదప్రియ!= వేదాలపై ప్రీతికలవాడా!; గోదాన విధము= గోదానం పద్ధతి; సుపథగము+ఐ= మంచి మార్గం పొంది; దాతకున్= ఇచ్చినవాడికి; ఎల్లన్ మేలున్= శుభాన్నంతా (అన్ని శుభాలను); ఆపాదించున్= కలిగిస్తుంది; అతనికిన్= అతనికీ; విపథగతము+ఐనన్= చెడ్డమార్గాన పోతే; అది; దురిత= పాపం; ఉత్పాదకము= పుట్టించేది; అగున్= ఔతుంది.

తాత్పర్యం: గోదానవిధము సన్మార్గంలో సాగితే దాతకు మేలు చేకూరుతుంది. చెడుమార్గంలో అయితే కీడు కలిగిస్తుంది.

విశేషం: వేదప్రియ సంబోధన రహస్యమేమంటే - సుపథ అన్నమాట ఈశావాస్యంలో మోక్షమార్గ మని భావం. విపథ= పాపమార్గం. కనుక వేదప్రియ అనే సంబుద్ధి వాడబడింది.

నృగచరిత్రము (సం.13-69-1)

తే. దుష్టమైన గోదానంబు గష్టవృత్తిఁ దెచ్చె నృగనామ్ముఁ డగు జగతీవిభునకు
నత్తెఱం గితిహాసమై యవనిఁ బరఁగు; వినుము సెప్పెద దాని వివేకధుర్య! 417

ప్రతిపదార్థం: వివేకధుర్య!= బుద్ధిమంతుడా!; దుష్టమైన= చెడ్డదైన; గోదానంబు= గోదానం; నృగనాముఁడు= నృగు డన్న పేరుగల; జగతీ విభునకున్= రాజునకు; కష్టవృత్తిన్= కష్టపాటు; తెచ్చెన్= కలిగించింది; ఆ తెఱంగు= ఆ విధానం; ఇతిహాసము+ఐ= పూర్వకథగా; అవనిన్= లోకంలో; పరఁగున్= వ్యాప్తమైనది; దానిన్; చెప్పెదన్; వినుము.

తాత్పర్యం: నృగుడన్న రాజు చెడ్డగా గోదానంచేసినందువలన కీడు కలిగిన విషయం ఒక పూర్వకథగా లోకంలో ప్రసిద్ధమైనది. అది నీకు చెప్పుతాను వినుము.

క. ద్వారవతి నొక్క నూతం । దొరపుఁ దను వక్కజమగు తొండ నొకటి న
చ్చేరువ మెలఁగుజనులు గని । నీ రిది గలఁగించు నిట్ల నిలిచిన యేనిన్. 418

ప్రతిపదార్థం: ద్వారవతిన్= ద్వారకలో; ఒక్క నూతన్= ఒక నూతిలో; తోరపుఁ దనువు= పెద్ద శరీరంతో; అక్కజము= ఆశ్చర్యం; అగు= అయిన; తొండన్= తొండను; ఒకటిన్= ఒకదానిని; ఆ చేరువ= ఆ సమీపంలో; మెలఁగు జనులు= మసలే మనుషులు; కని= చూచి; ఇది= ఈ తొండ; ఇట్లు= ఇట్లాగే; నిలిచిన ఏనిన్= ఉంటే; నీరు= నీటిని; కలఁగించున్= బురద చేస్తుంది.

తాత్పర్యం: ద్వారకలోని ఒకనూతిలో ఒక పెద్ద శరీరం గల తొండ ఉన్నది. దగ్గరలో ఉన్న మనుష్యులు చూచి దీన్నిట్లాగే ఉండనిస్తే నీరంతా పాడైపోతుంది. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అని బలు మ్రోకులు వేగమ । కొని వచ్చి తగిల్చి లావుగొని తిగువఁగ నా
ఘనజంతు వచలితంబై । యునికికి విస్మయము నొందు నుల్లంబులతోన్. 419

ప్రతిపదార్థం: అని= అంటూ; బలు= పెద్ద; మ్రోకులు= త్రాళ్ళు; వేగమ= వెంటనే; కొనివచ్చి= తెచ్చి; తగిల్చి= దానికి తగిలించి; లావు+కొని= బలం పుంజుకొని; తిగువఁగన్= లాగగా; ఆ ఘన జంతువు= ఆ పెద్ద ప్రాణి; అచలితంబు+ఐ= కదలకుండా; ఉనికికిన్= ఉండటానికి; విస్మయము= ఆశ్చర్యం; ఒందు+ఉల్లంబులతోన్= పొందిన మనస్సులతో.

తాత్పర్యం: ఆ విధంగా భావించి వారు బలమైన మోకులు తెచ్చి దానికి తగిలించి పైకి లాగటానికి ప్రయత్నించారు. కాని, అది కదల్లేదు. అందుకు వారు ఆశ్చర్యపోయారు.

తే. కృష్ణు పాలికిఁ బోయి యక్కీట మున్న । తెఱఁగు సెప్పినఁ జని దానిఁ దిగిచె వెడల
నమ్మహాత్ముఁ డెఱింగియు నర్థితోడ । నడుగ నది 'యేను నృగుఁడఁ జు' మ్మనియె ననఘ! 420

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; కృష్ణుపాలికిన్= శ్రీకృష్ణుడి దగ్గరకు; పోయి; ఆ కీటము= ఆ పురుగు; ఉన్న తెఱఁగు= ఉన్న విధము; చెప్పినన్= చెప్పగా; చని= పోయి; దానిన్= తొండను; వెడలన్= బయటకు వచ్చేటట్లుగా; తిగిచెన్= పైకి లాగాడు; ఆ+మహాత్ముఁడు= ఆ స్వామి; ఎఱింగియున్= తెలిసికూడా; అర్థితోడన్= కోర్కెతో; అడుగన్= అడిగితే; అది= ఆ తొండ; ఏను= నేను; నృగుఁడన్ చుమ్ము= నృగుడను సుమా! అనియెన్= అన్నది.

తాత్పర్యం: వారు శ్రీకృష్ణుడికి విన్నవించగా ఆయన వచ్చి దాన్ని బయటకు లాగాడు. ఆయన కదేదో తెలిసికూడా ప్రశ్నించగా 'నేను నృగుడను సుమా!' అని తొండ చెప్పింది.'

వ. అనిన విని యద్దేవుండు 'నీ వనేక గో సహస్రంబుల విప్రజనంబుల కిచ్చి తని విందు; మిట్టి దుర్జన్మంబు నీకేల వాటిల్లె?' ననుటయు నమ్మనుజవల్లభుండు. 421

ప్రతిపదార్థం: అనినన్; విని; ఆ దేవుండు= ఆ శ్రీకృష్ణుడు; గోసహస్రంబులు= వేల గోవులు; విప్రజనంబులకున్= బ్రాహ్మణులకు; ఇచ్చితి అని విందున్= ఇచ్చావని విన్నానే; ఇట్టి= ఇటువంటి; దుర్జన్మంబు= దుష్టమైన పుట్టుక; నీకున్; ఏల= ఎందుకు; పాటిల్లెన్?= కలిగింది?; అనుటయున్= అనగా; ఆ మనుజవల్లభుండు= ఆ రాజు.

తాత్పర్యం: కృష్ణు డన్నాడు 'అరే! నీవు ఎన్నో గోవులను దానం చేశావని విన్నానే! నీకీ పాడు పుట్టుక ఎట్లా కలిగింది? అనగా అతడు.

సీ. ఉత్తమ బ్రాహ్మణుం డొకనికి నొక్కనాఁ । డొక గోవు నిచ్చితి నుల్ల మలర
నతఁడును గొనిపోయె; నది మేఁత కర్థి మా । కదుపుల లోపలఁ గలసి వచ్చె
గోవుల మఱియును గోపాలకులు దాన । విధికినై తెచ్చుచో విధివశమున
వానిలో నదియును వచ్చిన నెఱుఁగక । దానంబు సేసితి; దాని మున్న

ఆ. గొనినయతఁడు దడవి కని 'యిది నాదు గో' । వనియెఁ బిదపఁ గొనిన యతఁడు పెనఁగి
'నాకు నృపతి యొసఁగె' నా నిద్దఱకును వా। దైన నన్నుఁ గాన నరుగుదెంచి. 422

ప్రతిపదార్థం: ఉత్తమ= మంచి; బ్రాహ్మణుండు+ఒకనికి; ఉల్లము= మనస్సు; అలరన్= వికసించగా; ఒక్కనాఁడు; ఒక గోవున్; ఇచ్చితిన్= ఇచ్చాను; అతఁడును= ఆయన; కొనిపోయెన్= తీసికొనిపోయాడు; అది= ఆ గోవు; మేఁతకున్= మేతకొరకు; అర్థిన్= కోర్కెతో; మా కదుపులలోపలన్= మా ఆలమందలతో కలిసి; వచ్చెన్= వచ్చింది; మఱియును= ఇంకనూ, ఆ పిదప; గోపాలకులు= ఆలమేపరులు, ఆలమందలు మళ్ళవేసేవారు; దానవిధికిన్+ఐ= దాన విధానం కొరకు; గోవులన్ తెచ్చుచోన్= ఆవులను తోలుకొని వస్తున్నప్పుడు; విధివశమునన్= దైవవశాత్తు; వానిలోన్= ఆ గోవులతో కలిసి; అదియున్= ఇదివరకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దానం చేసిన గోవు; వచ్చినన్= రాగా; ఎఱుఁగక= తెలియక; దానంబు చేసితిన్= దానిని మరొకరికి దానం చేశాను; దానిన్; మున్ను= పూర్వం; కొనిన యతఁడు= తీసికొన్నవాడు; తడవి= పరిశీలించి; కని= చూచి; ఇది; నాదుగోవు= నా గోవు; అనియెన్= అన్నాడు; పిదపన్= తరువాత; కొనిన అతఁడు= తీసికొన్నవాడు; పెనఁగి= మారుపల్కి, ఎదురొడ్డి; నాకున్; నృపతి= రాజు; ఒసఁగెన్= ఇచ్చాడు; నాన్= అనగా; ఇద్దఱకున్; వాదు= తగాదా; ఐనన్= జరిగితే; నన్నున్; కానన్= చూడటానికి; అరుగు దెంచి= వచ్చి.

తాత్పర్యం: ఒక ఉత్తమ బ్రాహ్మణుడికి ఒక గోవును ఇచ్చాను. అది మేతకొరకు తిరిగి మా ఆలమందలలో చేరిరాగా, మావారు తెలియక దానంకొరకు ఆవులను తెమ్మంటే దాన్ని వీటితోపాటు తెచ్చారు. దానిని మరొకరికి ఇచ్చాను. మొదటివా డా గోవును చూచి ఇది నాదంటే, రెండోవాడు నాకిది రాజుగారు ఇచ్చారన్నాడు. ఇద్దరకు వాదు కలిగితే నా దగ్గరకు వచ్చి.

వ. తనముందటి తెఱం గెఱింగించి. 423

తాత్పర్యం: తనయొక్క పూర్వస్థితి చెప్పి.

క. ఇచ్చినవారల కొనఁగా । వచ్చిన నడ్డంబు గలదె వసుధాధిప! యం
చిచ్చఁగడు నొచ్చి పలికిరి । వెచ్చని నిట్టూర్పులడర విప్రులిరువురున్. 424

ప్రతిపదార్థం: వసుధా+అధిప!= రాజా! (భూమి నేలేవాడా!); ఇచ్చినవారలు+అ= ఇచ్చినవారే; కొనఁగాన్ వచ్చినన్= తీసికొనటానికి వస్తే; అడ్డంబు కలదె?= అడ్డమున్నదా? అంచున్= అని; ఇచ్చన్= మనస్సులో; కడున్= మిక్కిలి; నొచ్చి= బాధపడి; విప్రులు= బ్రాహ్మణులు; ఇరువురునున్= ఇద్దరూ; వెచ్చని= వేడి; నిట్టూర్పులు= నిశ్శ్వాసాలు; అడరన్= వ్యాపించగా; పలికిరి= మాట్లాడారు.

తాత్పర్యం: రాజా! ఇచ్చినవాడే తీసికొంటే అడ్డ మేమున్నదని ఇద్దరు బ్రాహ్మణులు మనస్సులో బాధపడి వేడి నిట్టూర్పులు విడుస్తూ అన్నారు.

విశేషం: పద్యమంతా కోపం వచ్చినవాడు మాటాడే తీరును తెలుపుతున్నది. ద్విత్వ చకారప్రాస దాని కూతం. వేడి నిట్టూర్పులు ఏమీ చేయలేని కోపాన్ని తెలియజేసేవి.

వ. మఱియుం బొడము మాటల నమ్మొదవు పోకడ నాకుఁ దెల్లం బగుటయు. 425

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా, అనేకంగా; పొడము= పుట్టిన; మాటలన్= మాటలవలన; ఆ మొదవు= ఆ గోవు; పోకడ= విధానం, లేదా పోవటం; నాకున్; తెల్లంబు= స్పష్టం; అగుటయున్= కావటంతో.

తాత్పర్యం: వాళ్ళున్న మాటలనుబట్టి ఆ గో విదివరకే దత్తం చేయబడిందని నాకు స్పష్టం కావటంతో.

ఉ. దానికి నేను జిత్తమునఁ దాపము నొందుచు మున్ను గొన్న య
మ్మానితవిప్రు వేఁడికొని 'మంచివి గోవులు నీకు నూఱు వే
యైనను నిచ్చెదన్ విడువవయ్య మహీసురవర్య! నెమ్మి న
ధ్ధేనువు' నన్న నాస్యమున దీనత దోఁపఁగ నాతఁ డిట్లనున్. 426

ప్రతిపదార్థం: దానికిన్= జరిగిపోయిన విషయానికి; నేను; చిత్తమునన్= మనస్సులో; తాపమున్= బాధను; ఒందుచున్= పొందుతూ; మున్ను= పూర్వము; కొన్న= దానం తీసికొన్న; ఆ+మానిత= ఆ గౌరవింపదగ్గ; విప్రున్= బ్రాహ్మణుడిని; వేడికొని= బ్రతిమాలి; గోవులు; మంచివి; నీకున్; నూఱు వేయి= లక్ష; ఐననున్= ఐనాసరే; ఇచ్చెదన్= ఇస్తాను; మహీసురవర్య!= బ్రాహ్మణ శ్రేష్ఠుడా!; నెమ్మిన్= సంతోషంతో; ఆ+ధేనువున్= ఆ గోవును; విడువవయ్య!= వదలిపెట్టవయ్యా!; అన్నన్= అనగా; అతఁడు; అస్యమునన్= ముఖంలో; దీనత= దైన్యం; తోఁపఁగన్= కనిపిస్తుండగా; ఇట్లు; అనున్.

తాత్పర్యం: జరిగిపోయినదానికి మనస్సులో బాధపడి నేను మొదట తీసికొన్న విప్రుడితో 'స్వామీ! గోవును ఇమ్మ. దానికి బదులు నీకు మంచి గోవులు లక్ష ఇస్తా' ననగా - అతడు దైన్యంతో ఇట్లా అన్నాడు.

తే. **'పాలు గడుఁ బెక్కు దాని సబాము లెస్స । పెయ్య కర్మిలి గలదు మత్ప్రియ సుతుండు**
పాల కేడ్చిన యపుడ చన్పట్టనిచ్చు - నేది ప్రొద్దైన నట్టి గో వెందుఁ గలదు? **427**

ప్రతిపదార్థం: పాలు; కడున్+పెక్కు= చాలా ఎక్కువ; దాని సబాము లెస్స= ఆ ఆవుస్వభావం మంచిది; పెయ్యకున్= దూడపై; అర్మిలి= ప్రేమ; కలదు= కలిగిఉన్నది; మత్= నా; ప్రియసుతుండు= కూర్మి కొడుకు; పాలకున్= పాలకొరకు; ఏడ్చినఅపుడు+అ= ఎప్పుడు ఏడిస్తే అప్పుడు; ఏది ప్రొద్దు+ఐనన్= ఏ వేళనైనా; చన్= పొదుగు; పట్టన్+ఇచ్చున్= పట్టుకొననిస్తుంది, అట్టిగోవు, ఎందున్= ఎక్కడ; కలదు?= ఉన్నది?

తాత్పర్యం: దానికి పాలెక్కువ. దూడమీద దానికి మక్కువ ఎక్కువ. నా చిన్నారి కొడుకు ఏడ్చినప్పుడు ఏ వేళనైనా సరే పొదుగును పట్టుకొన నిస్తుంది. అట్లాంటి గోవు ఎక్కడ ఉంటుంది?

క. **శ్రీవోలె నింటిలో నా । గోవుండఁగఁ జూతుఁగాని కోటి మొదవులుం**
గావు సరి దాని' కని భూ । దేవుఁడు వోవుటయు నేను దీనత దోఁపన్. **428**

ప్రతిపదార్థం: శ్రీ= మహాలక్ష్మి; పోలెన్= వలె; ఆ గోవు; ఇంటిలోన్= ఇంట్లో; ఉండఁగన్= ఉంటే; చూతున్ కాని= చూడగలను కానీ; కోటి; మొదవులున్= ఆవులైనా; దానికిన్; సరికావు= సమానం కావు; అని; భూదేవుఁడు= బ్రాహ్మణుడు; పోవుటయున్= పోగా; నేను; దీనత= దైన్యం; తోఁపన్= తోపగా.

తాత్పర్యం: అది మహాలక్ష్మివలె ఇంట్లో ఉంటే చూడగలను కాని, కోటిగోవులైనా దానితో సమానం కా'వని ఆయన కోపంతో వెళ్ళిపోగా నేను దైన్యంతో.

విశేషం: ఇందాక బ్రాహ్మణుడు దైన్యంతో అంటే ఇప్పుడు రాజు దైన్యం తోపగా అంటున్నాడు.

చ. **'కనకము ధేనువుల్ మణి నికాయము లిచ్చెద; నేమి యైనఁ ద**
క్కును మది కిష్టమైన యది గోరుము గోవున' కంచుఁ జేరి త
క్కిన ధరణీసుపర్వునకుఁ గేడ్పడి యెమ్మెయి వేడికొన్న 'నేఁ
గొన భవదీయ రాజ్యమును; గుత్సితవృత్తికి నియ్యకొందునే?' **429**

ప్రతిపదార్థం: కనకము= బంగారం; ధేనువుల్= గోవులు; మణినికాయములు= అనేక రత్నాలు; ఏమిఐనన్= ఏమైనాసరే; ఇచ్చెదన్= ఇస్తాను; తక్కునున్= మిగిలినది (ఏదైనాసరే); మదికిన్= మనస్సుకు; ఇష్టము= ఇష్టం; ఐనఅది= ఐనదాన్ని;

గోవునకున్= ఆవునకు బదులు; కోరుము= కోరుకొమ్ము; అంచున్= అంటూ; చేరి= సమీపించి; తక్కిన= రెండవ; ధరణీ సుపర్వునకున్= భూదేవుడికి, బ్రాహ్మణుడికి; కీడ్పడి= దైన్యంతో; ఏ+మెయిన్= ఏ విధంగా; వేఁడికొన్నన్= వేడుకొనినా; ఏన్= నేను; భవదీయ= నీ; రాజ్యమును= రాజ్యమైనా; కొనన్= తీసికొనను; కుత్సిత వృత్తికిన్= కుచ్చితపు ఆలోచనకు; ఇయ్యకొందునే?= ఇష్టపడతానా?

తాత్పర్యం: బంగారం, మణులు, ఆవులు ఏదైనా సరే కోరుకొమ్ము కానీ 'ఈ ఆవు నిమ్మ' అని ఎంత దీనంగా బ్రతిమిలాడినా ఆ రెండవ బ్రాహ్మణుడు అంగీకరించక 'నాకు రాజ్యమైనా సరే వద్దు పొమ్ము. ఇంత కుత్సితబుద్ధిని నే నంగీకరించను.'

తే. అనియెఁ గాని నా మాట గైకొనఁడ యాతఁ; డట్టి యెడఁ గాలవశగతి యావహిల్లి
యముని కడ కేఁగ నాతోడ నతఁడు వికచ । నలినలోచన! యిట్లని పలికెఁ బ్రీతి. 430

ప్రతిపదార్థం: అనియెన్+కాని= అన్నాడు తప్ప; ఆతఁడు= అతడు; నా మాటన్; కైకొనఁడ= వినిపించుకొనలేదు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; కాలవశగతి= మరణదశ; ఆవహిల్లి= కలిగి; యముని; కడకున్= సమీపానికి; ఏఁగన్= పోగా; నాతోడన్= నాతో; అతఁడు= యముడు; వికచ= విప్పారిన; నలిన= తామరపూలవంటి; లోచన!= నేత్రాలవాడా!; ఇట్లని= ఈ విధంగా; ప్రీతిన్= ప్రేమతో; పలికెన్= అన్నాడు.

తాత్పర్యం: వికసించిన తామరపూలవంటి నేత్రాలున్నవాడా! ఆ రెండవ బ్రాహ్మణు డట్లా అన్నాడు తప్ప నా మాట పట్టించుకొనలేదు. అప్పుడు మృత్యువు సంభవించి నేను యముని దగ్గరకు పోగా అతడు నాతో ప్రేమగా ఇట్లా అన్నాడు.

విశేషం: వికచ నళిన లోచన= ఈ సంబోధన భగవంతుడి నేత్ర సౌందర్యాన్ని సూచించేదే. అయినా ఇక్కడ కథ విన్నాక కలిగే ఆశ్చర్యాన్ని సూచిస్తుంది.

చ. 'జనవర! పుణ్యకర్మము లసంఖ్యము లీవొనరించి తొక్క వి
ప్రునిధన మజ్ఞతం గొనుటఁ బొందె సకిల్బిషభావ మల్ప మి
ట్లొనరిన రెంట నయ్యెడు మహోన్నతి దుర్గతులందు మున్ను నీ
చనునెడ యెద్ది నావుడు న సౌఖ్యపుఁ జోటని సమ్మతించితిన్. 431

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; ఈవు= నీవు; పుణ్య కర్మములు= పుణ్య కార్యాలు; అసంఖ్యములు= లెక్కలేనన్ని; ఒనరించితి= చేశాడు; ఒక్క; విప్రుని ధనము= బ్రాహ్మణుడి సొమ్ము; అజ్ఞతన్= తెలియక; కొనుటన్= గ్రహించడంవల్ల; సకిల్బిష= పాపంతో కూడిన; భావము= సంస్కారం; అల్పము= కొంచెం; పొందెన్= కలిగింది; ఇట్లు; ఒనరిన= ఒనగూడిన, సంభవించిన; రెంటన్= రెంటితో; అయ్యెడు= కలిగే; మహా+ఉన్నతి= గొప్పదశ; సద్గతి; దుర్గతులు= చెడ్డదశ; అందున్= అందులో; మున్ను= ముందుగా; నీ చనునెడ= నీవు వెళ్ళేలోకం; ఎద్ది= ఏది; నావుడున్= అంటే; అసౌఖ్యపుఁజోటు= సుఖంలేనిచోటు - నరకం; అని; సమ్మతించితిన్= అంగీకరించాను.

తాత్పర్యం: 'రాజా! నీ వనేక పుణ్యకార్యాలు చేసినందున సద్గతి కలుగుతుంది. కాని, తెలియకుండా బ్రాహ్మణుడి సొమ్ము నీకు చేకూరటంవలన పాప మింత అంటింది. కనుక సద్గతి, దుర్గతులలో నీ వేది ముందుగా అనుభవించాలనుకుంటున్నావో చెప్పు'మని యముడు అనగా నేను దుర్గతినే ఎన్నుకొన్నాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. అట్టు లియ్యకొనిన యా క్షణమాత్ర మ । స్తకము క్రిందు గాఁగ ధరణిఁ బడఁగ
వలసె; నపుడు వింటి నలఘు కృపార్ద్ర వ । ర్ణాలికలితమైన యముని పలుకు. 432

ప్రతిపదార్థం: అట్టులు= ఆ విధంగా; ఇయ్యకొనిన= అంగీకరించిన; ఆక్షణమాత్రన్= ఆక్షణంలో; మస్తకము= తల; క్రిందు+ కాఁగన్= క్రిందై; ధరణిన్= భూమిమీద; పడఁగన్ వలసెన్= పడవలసి వచ్చింది; అపుడు; అలఘు= గొప్ప; కృపా+ఆర్ద్ర= దయతో తడిసిన; వర్ణ+ఆలి= అక్షరాల సమూహంతో; కలితమైన= కూడిన; యముని పలుకున్= యముడి మాటను; వింటిన్= విన్నాను.

తాత్పర్యం: అట్లా అంగీకరించానో లేదో తలక్రిందులుగా భూమిపై పడ్డాను. పడుతుండగా దయగల యముని మాట వినిపించింది.

వ. అది యెయ్యది యంటేని. 433

ప్రతిపదార్థం: అది; ఏ+అది= ఏది; అంటేని= అంటే.

తాత్పర్యం: అది ఏమంటే.

తే. వాసుదేవుఁ డనేక సంవత్సరముల । కధిప! నీ యున్న చోటికి నరుగుదెంచి
యుద్ధరించు ని న్నట నిత్యసిద్ధ సౌఖ్య । మైన లోకమునకుఁ జను దనఘ! నీవు. 434

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నీ+ఉన్నచోటికిన్= నీవుండే స్థలానికి; అనేక సంవత్సరములకున్= చాలా కాలం తరువాత; వాసుదేవుఁడు= శ్రీకృష్ణుడు; అరుగుదెంచి= వచ్చి; నిన్నున్; ఉత్+హరించున్= పైకి తీస్తాడు; (ఉత్+ధరించు= చక్కగా ఆదుకొంటాడు, రక్షిస్తాడు) అటన్= అక్కడ; అనఘ!= పుణ్యాత్ముడా!; నీవు; నిత్య= శాశ్వత; సిద్ధ= ఉన్న; సౌఖ్యము= సుఖాలు కలది; ఐన= అయిన; లోకమునకున్= లోకానికి, చనుదు= వెళ్ళుతావు.

తాత్పర్యం: రాజా! చాలా కాలం తరువాత భగవంతుడైన శ్రీకృష్ణుడు నీవున్న చోటికి వస్తాడు. నిన్ను పైకి తీయటమే కాక సద్గతి ననుగ్రహిస్తాడు. తరువాత నీకు అతడి అనుగ్రహంతో శాశ్వత సుఖాలు కల లోకం లభిస్తుంది.

విశేషం: ఇది యముడి దయగల మాట. అతడికీ రాజుమీద జాలి కలిగింది. 'అయ్యో! పాపం దానం చేసి పాపం కొనుక్కొన్నాడే' అని.

వ. ఇట్లు వినుచు నిలాతలంబునం బడి కృకలాసత్వంబు నొంది చరియించుచుండి, నేఁడు దైవదత్తంబయిన చిత్తవర్తనంబునం జేసి యికూపంబునకు వచ్చిన యపర క్షణంబునం గృకలాసంబులకు లేనిమేని పెం పావహిల్లిన నుల్లంబు సవిస్మయం బగుచునుండ యమప్రసాదంబున నెప్పుడును మాయని పరిజ్ఞానంబు వర్తిల్లనున్నంతం బరమ యోగీంద్ర భావ్యంబగునీ భవ్యసన్నిధి దొరకొనియె' నని పలికె నప్పు డప్పుడమిఱేనికిఁ బూర్వాచరిత పుణ్య కర్మానురూపం బగు రూపం బావిర్భవించిన దానికిం బ్రమోదభరితుం డై యతండు. 435

ప్రతిపదార్థం: ఇట్లు వినుచున్= ఇట్లా వింటూ; ఇలా తలంబునన్+పడి= భూమిపై పడి; కృకలాసత్వంబున్= తొండ స్వభావాన్ని, రూపాన్ని; ఒంది= పొంది; చరియించుచుండి= తిరుగుతూ ఉండి; నేఁడు; దైవదత్తంబు+అయిన= దైవ మనుగ్రహించిన; చిత్తవర్తనంబునన్+చేసి= మనసు సంకల్పంతో; ఈ+కూపంబునకున్= ఈ బావికి; వచ్చిన; అపర క్షణంబునన్= మరుక్షణంలో; కృకలాసంబులకున్= తొండలకు లేని; మేని పెంపు= శరీర విస్తృతి; ఆవహిల్లినన్= కలిగితే; ఉల్లంబు= మనస్సు; సవిస్మయంబు+ అగుచున్+ఉండన్= ఆశ్చర్యంపొందుచుండగా; యమప్రసాదంబునన్= యముడి దయతో; ఎప్పుడును= నిత్యం; మాయని= మాసిపోని; పరిజ్ఞానంబు= గొప్ప తెలివి; వర్తిల్లనున్నంతన్= ప్రవర్తిస్తుండగా; పరమ= గొప్ప; యోగి+ఇంద్ర= మహాయోగులకు; భావ్యంబు+అగు= భావించ దగ్గ; నీ; భవ్య= మహా; సన్నిధి= సాన్నిధ్యం; దొరకొనియెన్= లభించింది; అని పలికెన్= అని చెప్పాడు; అప్పుడు; ఆ+పుడమి= ఆ భూమి; తేనికిన్= రాజుకు; పూర్వ+ఆచరిత= పూర్వజన్మంలో చేసిన; పుణ్య= పవిత్ర; కర్మ+అనురూపంబు+అగు= కర్మానుగుణమైన; రూపంబు= ఆకారం; ఆవిర్భవించినన్= కలిగినంత; దానికిన్= ఆ అదృష్టానికి; ప్రమోద= సంతోషంతో; భరితుండై= నిండినవాడై; అతండు= రాజు.

తాత్పర్యం: ఇట్లా వింటూనే భూమిపై పడ్డాను. వెంటనే తొండరూపం వచ్చింది. ఇవ్వాళ దైవానుగ్రహంతో కలిగిన సంకల్పానుసారంగా ఈ బావి దగ్గరకు వచ్చిన మరుక్షణంలో శరీరం సాధారణంగా తొండలకు లేని విధంగా పెరిగిపోతే ఆశ్చర్యపోయాను. యముడి దయతో నాకు మంచి జ్ఞానమున్నది కనుక ఈ రోజు యోగులకు లభించే నీ దివ్య సన్నిధి నాకు లభించింది' అని చెప్పాడు. పూర్వ జన్మకర్మానుగుణమైన రూపం కలిగింది. దాని కతడు సంతోషించి.

నృగుఁడు శ్రీకృష్ణువలనం బాపవిముక్తుఁడై పుణ్యలోకమునకుఁ బోవుట (సం.13-69-28)

తే. 'దేవ! నీ దగు కారుణ్య దృష్టి యమృత । పూరమును బోలె నా మీఁదఁ బొలయుటయును
దీనదశ పాసె; భవదనుజ్ఞానిరూఢి । నేను జనియెద సంచిత స్థానమునకు.' 436

ప్రతిపదార్థం: దేవ!= స్వామీ!; నీ దగు= నీదైన; కారుణ్యదృష్టి= దయగల చూపు; అమృతపూరమును పోలెన్= అమృత ప్రవాహంవలె; నా మీఁదన్= నాపైన; పొలయుటయును= వ్యాపించటంవలన; దీనదశ పాసెన్= దైన్యస్థితి పోయింది; భవత్= నీ; అనుజ్ఞానిరూఢిన్= ఆనతి మేరకు; సంచిత= కర్మతో సంపాదించుకొన్న; స్థానమునకున్= గతికి; నేనున్; చనియెదన్= పోతాను.

తాత్పర్యం: 'స్వామీ! నీ దయ అమృతప్రవాహమై నాపయి పొంగి పొరలినందువలన నా దీనత్వం తొలగిపోయింది. నీ ఆజ్ఞవలన సద్గతికి పోతాను.'

క. అని సవినయ ప్రణామం । బున నారాధించి వృష్ణిపుంగవుఁ దగ వీ
డ్కొని యా నృగుఁడు విమానం । బున నుత్తమలోకమునకుఁ బోయె నరేంద్రా! 437

ప్రతిపదార్థం: నరేంద్రా!= మానవులకు అధిపతీ!; అని; స+వినయ= వినయంతో కూడిన; ప్రణామంబునన్= నమస్కారంతో; ఆరాధించి= పూజించి; వృష్ణిపుంగవున్= వృష్ణివంశంలో శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడిని; తగన్= అర్హమైన రీతిగా; వీడ్కొని= సెలవు కైకొని; ఆనృగుఁడు= ఆ నృగుడనురాజు; విమానంబునన్= విమానంమీద; ఉత్తమ= శ్రేష్ఠమైన; లోకమునకున్= లోకానికి; పోయెన్= వెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజా! ఈ విధంగా వినయంతో నమస్కరించి, శ్రీకృష్ణుడిని పూజించి, తగినట్లుగా వారి సెలవు గైకొని విమానంమీద ఉత్తమలోకాలకు నృగుడు వెళ్ళిపోయాడు.

వ. ఇవ్విధంబున. 438

తాత్పర్యం: ఈ విధంగా.

క. భరితానందుఁ డగుచు నృగుఁ । డరిగిన, లోకహితకారియై కృష్ణుఁడు ని
ర్భర మధురతాతిహృద్యా । క్షరంబుఁగా నిట్టు లనియెఁ గౌరవముఖ్యా! 439

ప్రతిపదార్థం: నృగుఁడు= ఆ రాజు; భరిత= నిండిన; ఆనందుఁడు= ఆనందం కలవాడు; అగుచున్= అవుతూ; అరిగినన్= పోగా; కృష్ణుఁడు; లోకహితకారిఐ= లోకానికి మేలుకోరినవాడై; నిర్భర= నిండారిన; మధురతా= మాధుర్యంతో; అతి= మిక్కిలి; హృద్య= హృదయరంజకమైన; అక్షరంబుఁగాన్= అక్షరాలు కలిగినట్లుగా; కౌరవముఖ్యా!= కౌరవశ్రేష్ఠుడా!; ఇట్టులు; అనియెన్.

తాత్పర్యం: నృగుడు ఈ విధంగా ఆనందభారంతో పోయిన తరువాత శ్రీకృష్ణుడు మాధుర్యం నిండారిన అక్షరాలతో ఇట్లా సెలవిచ్చాడు.

క. 'ధరణీసుర ధన హరణము । దురితతమము నృపున కధిక దోషము నృగగో
హరణ క్రియ విప్రస్వా । హరణము భూపాలవరున కాపదఁ దెచ్చున్.' 440

ప్రతిపదార్థం: నృపునకున్= రాజునకు; ధరణీసుర= బ్రాహ్మణుల; ధనహరణము= సొమ్ము నపహరించటం; దురిత తమము= మిక్కిలి పాపం; అధిక దోషము= అతిశయమైన తప్పు; నృగ గోహరణ క్రియన్= నృగుడు గోవును హరించిన రీతిగా; భూపాలవరునకున్= భూమిని పాలించే ఏ రాజుకైనా; విప్ర= బ్రాహ్మణుడి యొక్క; స్వ+ఆహరణము= సొమ్మును కాజేయటం; ఆపద తెచ్చున్= ఆపదను కలిగిస్తుంది.

తాత్పర్యం: 'రాజునకు విప్రుని సొమ్ము అపహరించటం చాలా పాపం. కనుక విప్రుడి సొంత ధనాన్ని ఏ రాజూ హరించరాదు. అది మహాపాపం. నృగుడు విప్రుడి ఆవును అపహరించటం వలన కదా! అంత ఆపద పొందాడు.'

వ. అనియె; నివ్వాక్యంబులు నీకుం జెప్పవలవ దైన నితిహాసావసానువర్తి యగుటం జేసి వినిపించితి' నని చెప్పి యప్పాండవాగ్రజుతో భీష్ముండు వెండియు. 441

ప్రతిపదార్థం: ఈ+వాక్యంబులు= ఈ వాక్యాలు; నీకున్= నీకు; చెప్పన్= చెప్పటం; వలవదు= అక్కర్లేదు; ఐనన్= ఐనా; ఇతిహాస+అవసాన= కథ చివరలో; అనువర్తి= అనుసరించినది; అగుటం జేసి= అయినందువలన; వినిపించితిన్= వినిపించాను.

తాత్పర్యం: ఈ వాక్యాలు నీకు చెప్పనక్కర్లేదు. కాని, ఈ పురాణ కథాంతంలో ఉన్నందున నీకు చెప్పవలసి వచ్చింది.' అని చెప్పి ధర్మరాజుతో భీష్ముడు ఇంకా.

క. 'సత్సంగతి సజ్జనులకు । నుత్సవ మొనరించు నృగున కున్నతిఁ ద్విజగ
ద్వత్సలుఁ డగు కృష్ణుండు స । ముత్సుకతం జేరఁ జనుట యొసఁగిన మాడ్కిన్.' 442

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: త్రిజగత్+వత్సలుఁడు= మూడు లోకాలయందు వాత్సల్యంగలవాడు; అగు= ఐన; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; సముత్సుకతన్= మంచి ఉత్సాహంతో; చేరన్+చనుట= చెంతకు జేరుట; నృగునకున్= నృగు మహారాజుకు; ఉన్నతిన్= సద్గతిని; ఒసఁగినమాడ్కిన్= అనుగ్రహించిన విధంగా; సత్+జనులకున్= మంచివారికి; సత్+సంగతి= మంచివారిస్నేహం; ఉత్సవము= పండుగ, కోర్కెలు కొనసాగడం; ఒనరించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: 'సత్పురుషులకు మహాత్ములతో కలియటం పండుగవంటిది. శ్రీకృష్ణానుగ్రహంవలన కదా నృగుడుత్తమలోకాలకు వెళ్ళాడు.'

వ. అని పలికి మఱియును. 443

తాత్పర్యం: అని చెప్పి ఇంకా.

క. 'దానము సమగ్ర ఫలదము । భూనాయక! గోవునెడ విబుద్ధిత్వము గీ
డైనది గావున గోస । మ్మానన మేమఱక యుండు మది యేప్రొద్దున్.' 444

ప్రతిపదార్థం: భూనాయక!= రాజా!; దానము; సమగ్ర= పూర్ణసమస్త; ఫలదము= ఫలాన్నిస్తుంది.; గోవునెడన్= ఆవు విషయంలో; విబుద్ధిత్వము= అజ్ఞానం; కీడు= ఆపద; ఐనది; కావునన్= కాబట్టి; ఏ ప్రొద్దున్= ఎప్పుడును; గో సమ్మాననము= ఆవును ఆరాధించటం; మదిన్= మనస్సులో; ఏమఱక= మరువక; ఉండుము.

తాత్పర్యం: 'రాజా! దానం అమిత ఫలదాయి. కనుక ఆవు విషయంలో అజ్ఞానం పనికిరాదు. దానిని గౌరవంతో నిత్యమూ పూజించుము.'

వ. అనిన విని ధర్మజుండు 'గోవులయెడ విరుద్ధాచరణంబున నయ్యెడు దురితంబు తెఱంగెఱింగించితి; గో దాన ఫలవిశేషం బింకను విన వలతుం జెప్పవే' యనుటయు, ననిమిష నదీనందనుం 'డివ్విషయంబున నైనది యొక్క యితిహాసంబు గల దాకర్ణింపు' మని యతని కిట్లనియె. 445

ప్రతిపదార్థం: అనినన్, విని; ధర్మజుండు= ధర్మరాజు; గోవుల ఎడన్= ఆవుల విషయంలో; విరుద్ధ+ఆచరణంబునన్= వ్యతిరేకమైన కర్మచేత; అయ్యెడు= కలిగే; దురితంబు= పాపంయొక్క; తెఱంగు= విధానం; ఎఱింగించితి= స్పష్టం చేశావు; గోదాన ఫలవిశేషంబు= ఆవును దానం చేయటంవలన కలిగే విశేషఫలం; ఇంకనున్= ఇంకా; వినవలతున్= వినాలనివాంఛిస్తున్నాను; చెప్పవే అనుటయున్= అని అడుగగా; అనిమిష నదీ= దేవతానదియైన గంగయొక్క; నందనుండు= కొడుకు; ఇవ్విషయంబునన్= ఈ విషయంలో; ఐనది= జరిగినది; ఒక్క+ఇతిహాసంబు+కలదు= ఒక పూర్వకథ ఉన్నది; అకర్ణింపుము= వినుము అని; అతనికిన్= ధర్మజునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆవు విషయంలో వ్యతిరేకంగా చేయటంవలన కలిగే పాపం సమగ్రంగా చెప్పావు. గోవును దానం చేసినందువలన కలిగే విశేషఫలం వినాలని ఉన్నది. చెప్పు' మని అడిగితే దేవతానది కొడుకు 'ఈ విషయంగా ఒక కథ ఉన్నది చెప్పుతాను వినుము' అని ఇట్లా అన్నాడు.

గో ప్రభావ విషయకం బగు నౌద్దాలకి పుత్త్ర చరిత్రము (సం.13-70-1)

సీ. 'అనఘుఁ డౌద్దాలకి యను మహాముని । దన తనయునిఁ బిలిచి యిధ్మములు దర్భ
కట్టయు జలపూర్ణ కలశంబుఁ బువ్వులు । మఱచి వచ్చితి నేటి మడఁ గుమార!
గొని రమ్ము వేగంబ చని' । యన్ననాచికేతాహ్వయుం డగు నతం డరుగునంత
వాహిని పొంగిన వఱ్ఱోడి యవి వోయెఁ । గానక యాతండు క్రమ్మఱంగ

ఆ. నరుగుదెంచి కాన ననుటయు నాఁకలి । దనదు కర్మవైకృతంబు సైఁపఁ
జాలకలిగి 'యోరి! జముఁ జూడఁ బొ'మ్మని । శాప మిచ్చెఁ దండ్రి భూపవర్య! 446

ప్రతిపదార్థం: అనఘుఁడు= పుణ్యాత్ముడు; ఔద్దాలకి= ఉద్దాలకుడి కొడుకు; అనుమహాముని= అనేగొప్ప ఋషి; తన; తనయునిన్= కొడుకును; పిలిచి; ఇధ్మములు= అగ్నిలో వేసే సమిధలు; దర్భకట్టయున్= దర్భలకట్ట; జలపూర్ణకలశంబున్= నీరునిండా ఉన్న చెంబు; పువ్వులున్; ఏటిమడన్= ఏటిరేవులో - ఒడ్డున; మఱచివచ్చితిన్; కుమార!= నాయనా!; వేగంబ చని= త్వరగా పోయి; కొనిరమ్ము= తీసికొనిరమ్ము; అన్నన్= అని చెప్పగా; నాచికేత+ఆహ్వయుండు+అగు+అతండు= నాచికేతుడన్నపేరుగల ఆతడు; అరుగునంతన్= వెళ్ళేలోపల; వాహిని= నది; పొంగినన్= పొంగగా; వఱ్ఱు ఓడి= వరదపాలై, ప్రవాహంపాలై; అని పోయెన్= తండ్రి చెప్పినవన్నీ నీటిలో కొట్టుకొనిపోయాయి; ఆతండు= నాచికేతుడు; కానక= చూడక; క్రమ్మఱంగన్= తిరిగి; అరుగుదెంచి= వచ్చి; కానన్= వాటిని చూడలేకపోయాను; అనుటయున్= అనగా; ఆఁకలి; తనదు= తన; కర్మవైకృతంబు= కర్మ దుష్ఫలితం; సైఁపన్‌చాలక= ఓర్చుకొనలేక; తండ్రి; ఓరీ= కోపంతోచేసిన సంబోధన; జమున్= యముడిని; చూడన్= చూడటానికి; పొమ్ము= పో; అని; అలిగి= కోపించి; శాపమున్; ఇచ్చెన్.

తాత్పర్యం: ఉద్దాలకుని కొడుకు ఔద్దాలకి. అతడి కొడుకు నాచికేతుడు. ఒకరోజు తండ్రి కొడుకుతో 'నాయనా! ఏటిరేవులో కుశలు, సమిధలు, కమండలువు, పూలూ అన్నీ మరచిపోయి వచ్చాను. త్వరగా పోయి తీసికొనిరమ్ము' అన్నాడు. కొడుకూ సరే నని పోగా, అంతకుముందే నది పొంగి వాటిని తనతోపాటు తీసికొనిపోయింది. కొడుకు వాటిని కానక తిరిగివచ్చి తండ్రితో చెప్పగానే ఆయనకు ఆకలి, దుష్ట కర్మఫలం ఏకమై క్రమ్ముకోగా కొడుకును 'యముడి దగ్గరికి పొమ్ము' (చావుము) అని శపించాడు.

విశేషం: ఇందులో తెలుగు మాటలు - ఏటిమడ, వఱ్ఱు, ఓడి (నీరు ఓడటం) చాలా అందమైనవి.

ఈ ఔద్దాలకి - నాచికేతుల కథ కఠోపనిషత్తులోనిది. ఇందులో తండ్రి ముసలి ఆవులను దానంచేస్తూ ఉంటే చూచిన కొడుకు న న్నెవరికి దానం చేస్తా? వని ముమ్మా రడిగితే 'యముడికి' అని తండ్రి కోపంతో విసుగుతో అంటాడు. వాడు యముడి దగ్గరకు వెళ్ళి ఆధ్యాత్మికవిద్య నెరిగి వస్తాడు. అదే కఠోపనిషత్తు.

వ. ఇట్లు శపియించిన నబ్బాలకుండు గేలు మోడ్చి ఫాలంబున మోపికొనుచుం 'బ్రసన్నుండ వగు' మని పలుకు పలుకఁగాఁ జేతనారహితుండై పడుటయు నమ్మునివరుండు. 447

ప్రతిపదార్థం: ఇట్లు; శపియించినన్; ఆ+బాలకుండు= ఆ పిల్లవాడు; కేలు= చేయి; మోడ్చి= ముడిచి; ఫాలంబునన్= నుదుటిపై; మోపికొనుచున్= ఆనిస్తూ; ప్రసన్నుండవు= ప్రశాంత మనస్కుడవు; అగుము= కమ్ము; అని పలుకు= మాట; పలుకఁగాన్= అన్నంతలో; చేతనా= చైతన్యం, ప్రాణం; రహితుండై= పోయినవాడై; పడుటయున్= క్రిందపడటంతో; ఆ మునివరుండు= ఆ మునిరాజు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తండ్రి శపించేసరికి కొడుకు నమస్కరించి తండ్రీ నా పై దయ చూపించుమని అంటూ ఉండగానే అతడి ప్రాణం పోయి క్రింద పడ్డాడు. అప్పుడు తండ్రి.

క. కనుఁగొని పశ్చాత్తాపం । బున నుల్లం బెరియ నిట్లు పుత్త్రకు నే నే
పనికై చేసితి విగతా । సునిఁగా నని మూర్ఛ మునుఁగుచుం బడియె ధరన్. 448

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; పశ్చాత్= వెనుక కలిగే; తాపంబునన్= బాధచేత; ఉల్లంబు= మనస్సు; ఎరియన్= మాడిపోగా; ఇట్లు; పుత్త్రకున్= కొడుకును; నేను; ఏ పనికై= దేనికొరకు; విగత+అసునిన్ కాన్= పోయిన ప్రాణాలు కలవాడినిగా; చేసితిన్= చేశాను; అని; మూర్ఛన్= మూర్ఛలో; మునుఁగుచున్= మునుగుతూ; ధరన్= భూమిపై; పడియెన్=పడ్డాడు.

తాత్పర్యం: చూచి తండ్రి పశ్చాత్తాపంతో కుమిలి 'అయ్యో! కొడుకును దేనికొరకు చంపుకొన్నా?'నని మూర్ఛపడ్డాడు.

వ. పడి యొక్కింతసేపునకుం దేఱి తనయుం దేఱి చూచి యశ్రులొలుక నబ్బాలకు నురంబున మొగంబు మోపి చేష్ట దక్కి యుండ, నద్దినశేషంబును నయ్యామినియునుం జనియె సూర్యోదయ సమయంబున. 449

ప్రతిపదార్థం: పడి= భూమిపై పడి ఒక్కింతసేపునకున్= కొంచెం సేపటికి; తేఱి= తేరుకొని; తనయున్= కొడుకును; తేఱి జూచి= తేరిపార చూచి; అశ్రులు+ఒలుకన్= కన్నీరు పారగా; ఆ+బాలకు= ఆ కొడుకుయొక్క; ఉరంబునన్= రొమ్ముపై; మొగంబు= తనమొగం; మోపి= ఆనించి; చేష్ట+తక్కి= చైతన్యంపోయి; ఉండన్= ఉన్నంతలో; ఆ+దినశేషంబును= ఆ మిగిలిన పగలు; ఆ+యామినియున్= ఆ రాత్రికూడా; చనియెన్= కడచింది; సూర్య+ఉదయ సమయంబునన్= తెల్లవారి ప్రొద్దుపొడిచేవేళ.

తాత్పర్యం: కొంతసేపటికి తేరుకొని కొడుకును చూచి ఏడ్చి, పిల్లవాడి రొమ్మున మొగంపెట్టి నిశ్చేష్టుడై ఉన్నంతలో మిగిలిన పగటితోపాటు రాత్రికూడ గడచిపోయింది. ప్రొద్దుపొడుస్తున్న వేళలో.

ఆ. అతని కన్ను నీర నాప్లుతంబైన యా । శవము చేతనించి చలన మొంది
యెలమి నత్తపస్వి యీక్షించుచుండఁ గ । న్దెఱచె, నిట్లు మగుడఁ దెలివినొంది. 450

ప్రతిపదార్థం: అతనికన్ను నీరన్= తండ్రియొక్క కన్నీటితో; ఆప్లుతంబైన= అంతటా తడిసిపోయిన; ఆ శమము; చేతనించి= చైతన్యం పొంది; చలనమొంది= కదలిక కలిగి; అత్తపస్వి= ఆ ముని; ఎలమిన్= సంతోషంతో; ఈక్షించుచుండన్= చూస్తుండగా; అట్లు; మగుడన్= తిరిగి; తెలివిన్+ఒంది= తెలివి కలిగి; కన్+తెఱచెన్= కన్ను విప్పాడు.

తాత్పర్యం: తండ్రి కన్నీటిలో నానిపోయిన ఆ శవం క్రమంగా చైతన్యం పొంది తెలివి కలుగగా తిరిగి కళ్ళు తెరిచాడు.

క. తనుఁ గనుఁగొనియెడి సుతుతో । మునిపతి యి ట్లనియెఁ 'బుణ్యముల ప్రోఁకవు నీ
వనఘ! చని పుణ్యలోకముఁ । గని మత్పుణ్యమున రాక గలిగెను మగుడన్. 451

ప్రతిపదార్థం: తనున్= తనను; కనుఁగొనియెడి= చూచెడు; సుతుతోన్=కొడుకుతో; మునిపతి= మునిరాజు; ఇట్లు; అనియెన్; పుణ్యముల ప్రోఁకవు= నా పున్నెముల రాశివి; అనఘ!; నీవు; చని= పోయి; పుణ్యలోకమున్= ఏ స్వర్గలోకమునో; కని= చూచి; మత్= నా; పుణ్యమునన్= పుణ్యంతో; మగుడన్= తిరిగి; రాక= రావటం; కలిగెను= సంభవించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తనను చూస్తున్న కొడుకుతో తండ్రి 'నా పుణ్యాలరాశీ! నాయనా! ఏ పుణ్యలోకమో పోయి తిరిగి నా అదృష్టంచేత తిరిగి రావటం కలిగిందిరా!

క. నీదగు తనువున దివ్యా । మోదము సాంద్రమయి సోడు ముట్టెడు నత్యా
హ్లాదమహాశ్చర్యసము । త్పాది యగుచు; నీగతాగతములం జెపుమా!' 452

ప్రతిపదార్థం: అతి= మిక్కిలి; ఆహ్లాద= సంతోషం; మహా+ఆశ్చర్యం= గొప్ప అద్భుతం; సముత్పాది= కలిగించేది; అగుచున్= అవుతూ; నీది+అగు= నీదైన; తనువునన్= శరీరంలో; దివ్య= దేవతా సంబంధమైన; ఆమోదము= పరిమళం; సాంద్రము+అయి= దట్టమై; సోడు= బ్రహ్మరంధ్రము; ముట్టెడున్= తాకుతున్నది; నీ= నీయొక్క; గత= పోక; ఆగతములన్= రాకలను గురించి; చెపుమా!= చెప్పరా!

తాత్పర్యం: నీ శరీరం నుండి దివ్యమైన వాసనలేవో గుబులుకొంటూ నాసాగోళాలనంట తాకుతున్నవి. ఇది చాలా ఆహ్లాదంగా, ఆశ్చర్యంగా ఉన్నది. కనుక నీ వెక్కడికి వెళ్ళావు? మరలా ఎట్లా తిరిగి రాగలిగావు? ఆ కథ చెప్పవయ్యా!'

వ. అనిన విని యమ్మునిపతికిం బ్రణమిల్లి యక్కుమారుం డిట్లనియె. 453

ప్రతిపదార్థం: అనినన్‌విని; ఆ మునిపతికిన్= ఆ మునిశ్రేష్ఠుడికి; ప్రణమిల్లి= నమస్కరించి; ఆ కుమారుండు= ఆ బాలకుడు; ఇట్లు+అనియెన్;

తాత్పర్యం: ఆ మాటలు విని కొడుకు తండ్రికి నమస్కరించి ఇట్లా అన్నాడు.

సీ. ' నీ యాజ్ఞఁ జని కమనీయ విశాలమై । మణిమయత్వంబున మహిత మగుచు
వెలిఁగెడు సమవర్తి కొలువు కూటముఁ బ్రవే । శించితి నాతఁడు సేరఁ బిలిచి
యంచితాసనము వెట్టించి భవద్గౌర వాతిశయంబున నర్ఘ్య ముఖ్య
పరిపూజనముల సంభావించె నతనితో । 'నే లోకమున వసియించువాఁడ

తే. ననఘ! యానతి యిమ్ము నా కంటి 'ననిన । 'నీవు సావవు; నీ తండ్రి నిన్ను జమునిఁ
జూడఁ బొమ్మని పనిచినఁ జూచి; తంద । యరుగు మమ్ముని వగ పేద' ననియె నతఁడు. 454

ప్రతిపదార్థం: నీ యాజ్ఞన్= నీ ఆనతితో; చని= వెళ్ళి; కమనీయ= అందమైన; విశాలమై= విశాలమైన; మణిమయత్వంబునన్= మణులు నిండారి ఉన్నందున, మణులతో స్థగితమైనందున; మహితము= గొప్పది; అగుచున్= అవుతూ; వెలిఁగెడు= ప్రకాశించే; సమవర్తి= యముడి; కొలువుకూటమున్= సభాశాలలో; ప్రవేశించితిన్= ప్రవేశించాను; ఆతఁడు= ఆ యముడు; చేరన్ పిలిచి= దగ్గరకు పిలిచి; అంచిత= అందమైన; ఆసనము= పీఠం; పెట్టించి= భటులతో ఏర్పాటుచేసి; భవత్= నీపై నున్న; గౌరవ అతిశయంబునన్= అధిక గౌరవ భావంతో; అర్ఘ్య= ఆచమించే నీరు; ముఖ్య= మొదలైన; పరిపూజనములన్= గొప్ప పూజలతో; సంభావించెన్= నన్ను గౌరవించాడు; అతనితోన్; అనఘ!= పుణ్యాత్ముడా!; ఏ లోకమునన్= ఏ లోకంలో; (నేను) వసియించువాఁడను= వసించాలి; నాకున్; ఆనతిఇమ్ము= సెలవిమ్ము; అంటిన్= అన్నాను; అనినన్; నీవు; చావవు= చచ్చిపోలేదు; నీ తండ్రి; నిన్నున్; జమునిన్= యముడిని; చూడన్+పొమ్ము= చూడటానికి పొమ్ము; అని; పనిచినన్= ఆజ్ఞాపిస్తే; చూచితి= (వచ్చి నన్ను) చూచావు; ఆ+ముని= ఆ మునియొక్క; వగపు= దుఃఖం; ఏదన్= పోగా; అంద= అక్కడికే; అరుగుము= పొమ్ము; అని అతఁడు= ఆ యముడు; అనియెన్= అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నీ యానతితో నేను వెళ్ళి విశాలమైన మణులు పొదిగిన అందమైన యముడి కొల్వుకూటంలో ప్రవేశించేసరికి ఆయన నీమీదున్న గౌరవభావంతో నాకు సింహాసనం, అర్ఘ్యం మొదలైనవి ఇచ్చి గౌరవించాడు. నే నన్నాను అర్థంగాక - 'ప్రస్తుతం నేను ఏ లోకంలో ఉండాలని అని అడుగగా అత డన్నాడు 'నీవు చావలేదురా! నీ తండ్రి యముడిని చూడరా' అని తిట్టాడు కదా! చూచావు. అక్కడికే పొమ్మ! పాపం మీ నాయన ఏడుస్తున్నాడు' అని అన్నాడు.

విశేషం: భవత్ గౌరవాతిశయంబునన్ - అని అనటం గొప్ప సంస్కార ఫలితం. అది తన గొప్పతనమని భ్రమించవచ్చునుగదా! కనుక నాచికేతుడి మర్యాదను సూచిస్తున్నది. యముడి మాటలు పెద్దవాడు చిన్నవాడితో ముద్దుగా అన్నట్లున్నాయి.

వ. అనుటయు 'నట్లకాక! మగిడిపోయెద; నీ కడకు వచ్చితి, ధర్మమయుండవగు నిన్ను దర్శించితిం; బుణ్యలోకంబులు దర్శింప వేడ్క పుట్టెడుఁ జూపవే' యని విన్నవించిన. 455

ప్రతిపదార్థం: అనుటయున్= అనియముడు పలుకగా; అట్లకాక= అట్లాగే; మగిడి= తిరిగి; పోయెదన్= పోతాను; నీ కడకున్= నీ దగ్గరకు; వచ్చితిన్= వచ్చాను; ధర్మమయుండవు= ధర్మ స్వభావుడవు; అగు= అయిన; నిన్నున్= నిన్ను (యమధర్మరాజును) దర్శించితిన్= దర్శించగలిగాను; పుణ్యలోకంబులు= స్వర్గాది పుణ్యలోకాలు; దర్శింపన్= చూడాలనే; వేడ్క+పుట్టెడున్= కోరిక కలుగుతున్నది; చూపవే= చూపించవా; అని= అని; విన్నవించినన్= విన్నపం చేయగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: 'అట్లాగే తిరిగి వెళ్ళుతాను. ధర్మమూర్తివైన నిన్ను దర్శించాను. పుణ్యలోకాలని ఉంటాయట గదా! వాటిని దర్శించాలని కోరికగా ఉన్నది. చూపించవా!' అని విన్నవించుకొనగా.

ఉ. అంచిత వాహనా కలిత యానముఁ దేరఁగఁ బంచి నన్ను నె
క్కించి సహాధిరూఢుఁ డయి కేల్ దన కేల నమర్చి సత్కథా
సంచయవర్తనుం డగుచుఁ జారుముఖాబ్జవికాస మొప్ప వ
ర్తించుచుఁ బుణ్యలోకములు ప్రీతి యెలర్పఁగ నాకుఁ జూపినన్. 456

ప్రతిపదార్థం: అంచిత= అందమైన; వాహన+ఆకలిత= గుర్రాలను పూంచిన; యానమున్= బండిని; తేరఁగన్+పంచి= తెప్పించి; నన్నున్; ఎక్కించి; సహ+అధిరూఢుఁడు+అయి= నాతోపాటు తానూకూర్చుండి; కేల్= నా చేతిని; తనకేలన్= తన హస్తంలో; అమర్చి= ఘటించి, పట్టుకొని; సత్ కథా సంచయ= దివ్యకథలసమూహం; వర్తనుండు+అగుచున్= చెప్పుతూ; చారు= అందమైన; ముఖ= ముఖం అనెడి; అబ్జ= తామరపూవుయొక్క; వికాసము+ఒప్పన్= వికసించిన అందం ప్రకాశించగా; వర్తించుచున్= మెలగుతూ; పుణ్యలోకములు= స్వర్గాది లోకాలను; ప్రీతి= ప్రేమ; ఎలర్పఁగన్= తేటపడగా; నాకున్; చూపినన్= చూపించగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: అందమైన గుర్రాలు కట్టిన రథం తెమ్మని ఆజ్ఞాపించి నన్ను ఎక్కించి (చేతితో పట్టి) తానూ నాతోపాటు కూర్చుండి తనచేతితో నాచేయి పట్టుకొని, మంచి కథలు చెప్పుతూ వికసించిన ముఖంతో నవ్వుతూ నాకు పుణ్యలోకాలన్నీ చూపించగా.

తే. నయనములకుఁ జిత్తమున కానంద మొసఁగు । నట్టి మణిగేహవాపికోద్యానములును

బరమభక్ష్య భోజ్యాత్మక గిరులు హృద్య । దుగ్ధ ఘృతమయ ఘనసరిత్తులును గంటి. 457

ప్రతిపదార్థం: నయనములకున్= కన్నులకు; చిత్తమునకున్= మనస్సుకు; ఆనందమున్= ఆనందం; ఒసఁగునట్టి= కలిగించే; మణిగేహ= మణులు తాపిన ఇండ్లు; వాపికా= దిగుడు బావులున్నూ; ఉద్యానములును= ఉద్యాన వనాలున్నూ; పరమ= గొప్ప; భక్ష్య= నమిలి తినేవి; భోజ్య= భుజించేఆహారాలు; ఆత్మక= కల; గిరులు= కొండలు; హృద్య= ఆప్యాయమైన; దుగ్ధ= పాలు; ఘృత= నేయి; మయ= మయమైన; ఘన= గొప్ప; సరిత్తులును= నదులును; కంటిన్= చూచాను.

తాత్పర్యం: కళ్ళకూ మనస్సుకూ ఆహ్లాదాన్ని కలిగించే మణిసౌధాలు, దిగుడుబావులు, ఉద్యానవనాలూ, కొండలవలె ఉన్న భక్ష్యాలు, భోజ్యాలు, నదులై పారే పెరుగు, పాలు, నేయి చూచాను.

విశేషం: కొండలే భక్ష్యభోజ్యాలుగా ఉన్నాయి. పాలు, నేయి నదులుగా పారుతున్నాయి.

వ. మఱియు గంధమాల్య దివ్యాంబరాభరణ ప్రముఖంబులగు భోగ యోగ్య పదార్థంబులు మహారాసులై యుండ నాలోకించితి; 'నీ లోకంబు లే పుణ్యంబులు సేసిన జనుల కనుభావ్యంబు?' లని యడిగితి; నడిగిన ధర్మరా జిట్టిట్టి వారివని యెఱింగించి 'యిం దధిక విభవంబులైన యట్టి మాననీయ స్థానంబులు గోదానంబు లాచరించిన వారలయవి; భక్ష్యభోజ్య గిరులును దుగ్ధ ఘృతనదులును వారివ' యని చెప్పి, వెండియు.458

ప్రతిపదార్థం: గంధ= చందనం; మాల్య= పూదండలు; దివ్య= దేవతా సంబంధమైన; అంబర= వస్త్రాలు; ఆభరణ= నగలు; ప్రముఖంబులు+అగు= మొదలైనవి; భోగయోగ్య= అనుభవించటానికి తగిన; పదార్థంబులున్= వస్తువులు; మహా= గొప్ప; రాసులై= గుట్టలై; ఉండన్= ఉండగా; ఆలోకించితిన్= చక్కగా చూచాను; ఈ లోకంబులు= ప్రస్తుతం నేను చూస్తున్న ఈ లోకాలు; ఏ పుణ్యంబులు= ఎట్లాంటి పుణ్యాలు; చేసిన; జనులకున్; అనుభావ్యంబులు= భోగించ దగ్గవి; అని; అడిగితిన్; అడిగినన్; ధర్మరాజు; యముడు; ఇట్టిట్టివారివి= ఇట్లాంటి వారికి సంబంధించినవని; ఎఱింగించి= స్పష్టపరచి; ఇందున్; అధిక విభవంబులు= మిక్కిలి వైభవం కలవి; ఐనయట్టి; మాననీయ= గౌరవింపదగ్గ; స్థానంబులు= లోకాలు; గోదానంబులు; ఆచరించిన వారలయవి= చేసినవారివి; భక్ష్యభోజ్య గిరులును= భక్ష్యాల, భోజ్యాల కొండలు; దుగ్ధ= పాలు; ఘృత= నేయి; నదులును; వారివ= గోదానం చేసినవారివే, అని చెప్పి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: మంచిగంధం, పూలమాలలు, దేవలోకంనుండి వచ్చిన వస్త్రాలు, ఆభరణాలు మొదలైన భోగాలకు తగిన పదార్థాలు పెద్దరాసులుగా ఉండగా చూచాను. ఈ లోకాలు ఏ పుణ్యకార్యాలు చేసినవారికి అనుభవించదగినవి అని అడిగాను. అప్పుడు ధర్మరాజు ఇటువంటివారివి యీలోకాలు అని తెలియజేసి ఇందులో చాలా గొప్ప సంపదలుగలవి, గొప్పగా భావింపదగినవి అయిన స్థానాలు గోదానాలు చేసిన వారివి. భుజింపదగిన పదార్థాలకొండలు, పాలు, నెయ్యి అనేవాని నదులున్నూ వారివే అని చెప్పి యింకా.

క. మానిత పాత్రము సద ను । ష్ఠానంబును బ్రీతి భక్తి సంపన్నతలున్

ధేనువు మేలిమియుం గల । దానముఫల మిట్టి దనఁగఁ దరమె యజునకున్. 459

ప్రతిపదార్థం: మానిత= గౌరవింప దగ్గదీ; పాత్రము= యోగ్యమైనదీ; సత్+అనుష్ఠానంబును= మంచి కర్మానుష్ఠానానికి యోగ్యమైనదీ; ప్రీతి= ప్రేమ; భక్తి; సంపన్నతలున్= సంపదలును; ధేనువు= ఆవే; మేలిమియున్= మేలు; ఆధిక్యం; కల= కలిగిన; దానము ఫలము= దానఫలం; అజునకున్= బ్రహ్మకు; ఇట్టిది; అనఁగన్= అనటానికి; తరమె!= శక్యమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: గౌరవించ దగినదీ, యోగ్యమైనదీ, అనుష్ఠానం, ప్రేమ, భక్తి సంపదల మేల్మిగలట్టి గోదాన ఫల మింతింతని చెప్పటానికి బ్రహ్మకు శక్యం కాదు.

తే. బలము లేఁబ్రాయమును రూపుఁ గలుగునట్టి । గనపయెద్దు సద్ధర్మ విప్రునకు నిచ్చి
నతఁడు సద్విధి గోదాన మాచరించి । నతని పడసిన గతిఁ గాంచు ననఘచరిత! 460

ప్రతిపదార్థం: అనఘ చరిత!= పుణ్య ప్రవర్తన కలవాడా!; బలము; లేఁబ్రాయమును= లేతవయస్సు; రూపు= రూపం; కలుగు+అట్టి= ఉన్నటువంటి; గనపయెద్దున్= ఎత్తైన, బలిసిన ఎద్దు; సత్+ధర్మ విప్రునకున్= మంచి ధర్మపరుడైన బ్రాహ్మణుడికి; ఇచ్చినతఁడు= దానం చేసినవాడు; సత్+విధిన్= వేదోక్తంగా; గోదానమున్; ఆచరించినతని= చేసినవాడు; పడసిన గతిన్= పొందిన దశను; కాంచున్= పొందగలడు.

తాత్పర్యం: బలం, రూపం, లేతవయస్సు గల గనపయెద్దును ధర్మపరుడైన సద్బ్రాహ్మణునకు దానంచేస్తే వేదోక్తంగా గోదానం చేసినవాడు పొందే సద్గతి పొందగలడు.

క. గోవులు సూర్యుని యుజ్జ్వల । గోవులయ ట్లగుటఁ జేసి గోదానపరుల్
భూవినుతా! సూర్య సదృశు । లై వెలుఁగుదు; రిట్ల చెప్పు నాగమఫణితుల్.' 461

ప్రతిపదార్థం: గోవులు= ఆవులు; సూర్యుని= సూర్యుడియొక్క; ఉత్+జ్వల= ప్రకాశించే; గోవుల కిరణాల; అట్లు; అగుటన్+చేసి= అయినందువలన; గోదానపరుల్= ఆవులను దానం చేసేవారు; భూవినుతా!= లోకంచేత పొగడబడేవాడా! సూర్యసదృశులు+ఐ= సూర్యుడివంటివారై; వెలుఁగుదురు= ప్రకాశిస్తారు; ఆగమ ఫణితుల్= వేదవాక్యాలు; ఇట్లు+అ చెప్పున్= ఇట్లా చెప్పుతున్నాయి.

తాత్పర్యం: ఆవు లంటే సూర్యకిరణాలవంటివి. కనుక గోదానం చేసేవారు సూర్యుడివలె ప్రకాశిస్తా రని ఆగమమార్గాలు చెప్పుతున్నాయి.'

క. అని పలికి వీడుకొలిపిన । మునివర! యజ్జముని చరణముల కెఱఁగి ముదం
బున వచ్చితి' ననె జనకుని । మన మానందరసపూర మయతం బొంగన్. 462

ప్రతిపదార్థం: అని పలికి; వీడుకొలిపినన్= సెలవిప్పించగా; మునివర!= మునిశ్రేష్ఠా!; ఆ+జముని= ఆ యముని; చరణములకున్= పాదాలకు; ఎఱఁగి= నమస్కరించి; ముదరంబునన్= సంతోషంతో; వచ్చితిన్= వచ్చాను; అనెన్= అన్నాడు; జనకుని= తండ్రి; మనము= మనస్సు; ఆనందరస= ఆనందరసమనెడు; పూర= ప్రవాహ; మయతన్= స్వరూపంతో; పొంగన్= పొంగులెత్తగా.

తాత్పర్యం: అని చెప్పి నన్ను పొమ్మనగా ఆ యముడి పాదాలకు నమస్కరించి సంతోషంతో వచ్చాను' అని తండ్రి మనస్సులో ఆనందరసం పొంగిపొరలేటట్లుగా వినిపించాడు.

ఇంద్రునకు బ్రహ్మ చెప్పిన గోదాన విషయక వాక్యము (సం.13-71-5)

వ. అని చెప్పిన విని కుంతీతనయాగ్రజుండు 'గోదాన కర్త లెందేని వసింతు రాలోకం బెట్టి? దెఱింగింపు' మనిన నన్నరదేవునితో దేవవ్రతుండు 'దీనికి బ్రహ్మవాక్యంబులు గల; విట్ల యింద్రుం డడిగిన నతనికి బ్రహ్మ యిట్లనియె. 463

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని చెప్పినన్= అని భీష్ముడుచెప్పగా, విని= ఆలకించి; కుంతీతనయ+అగ్రజుండు= కుంతి కొడుకులలో పెద్దవాడు; గోదానకర్తలు= ఆవులను దానంచేసినవారు; ఎందున్+ఏని= ఎక్కడ; వసింతురు= నివాసం చేస్తారో; ఆలోకంబు= ఆ గోలోకం; ఎట్టిది= ఎట్లాంటిది; ఎఱింగింపుము= తెలియజేయుము; అనినన్=అనగా; ఆ+నరదేవునితోన్= ఆ రాజుతో; దేవవ్రతుండు= భీష్ముడు; దీనికిన్; బ్రహ్మ వాక్యంబులు= బ్రహ్మచెప్పిన సమాధానములు; కలవు= ఉన్నవి; ఇట్లు+అ = ఈ విధంగా; ఇంద్రుండు=ఇంద్రుడు; అడిగినన్= అడుగగా; అతనికిన్= ఇంద్రునికి; బ్రహ్మ= బ్రహ్మ; ఇట్లు+అ= ఈ విధంగా జవాబు చెప్పాడు.

తాత్పర్యం: ఆ విధంగా భీష్ముడు చెప్పిన తరువాత ధర్మరా జన్నాడు 'గోదానం చేసినవా రేలోకాలకు పోతారో చెప్పుము' అని. దానికి భీష్ముడు 'నీవలె పూర్వం ఇంద్రుడు బ్రహ్మ నడిగితే ఆయన చెప్పిన మాటలు వినిపిస్తాను విను' మని ఇట్లా అన్నాడు.

ఆ. 'అడిగి మేలు సేసి; తాలోక మెవ్వరు । నెఱుఁగ కునికిఁ దెల్ల; మేను సువ్ర
తాత్ములైన మునులు నతుల పాతివ్రత్య । సతులు నెఱుఁగుదుము విశాలచిత్త! 464

ప్రతిపదార్థం: విశాలచిత్త!= గొప్ప మనస్సు కలవాడా! అడిగి= ప్రశ్నించి; మేలుచేసితి= మేలు చేశావు; ఆలోకమున్= ఆలోకాన్ని; ఎవ్వరున్= ఎవ్వరూ; ఎఱుఁగక+ఉనికి= తెలియకుండటం; తెల్లము= స్పష్టం; ఏనున్= నేను; సువ్రత+ఆత్ములు= గొప్ప వ్రతాలు చేసే స్వభావం కలవారు; ఐన మునులు= ఐనటువంటి ఋషులు; అతుల= సాటిలేని; పాతివ్రత్య సతులు= పతియే (భర్తే) దైవమని ఆరాధించే శీలవతులు; ఎఱుఁగుదుము= ఆ లోకం గురించి ఎరిగినవాళ్ళం.

తాత్పర్యం: 'ఆలోకం తెలిసినవారు నేను, వ్రతనిష్ఠులైన మునులు, పతివ్రతలైన స్త్రీలు మాత్రమే. కనుక నీ వడిగి లోకానికి మేలు చేశావు. నీ వడగకపోతే ఈ విషయం మాలోనే ఉండి ఎవరికీ తెలిసేది కాదు.

క. విను మయ్యెడఁ గాలక్రమ । మును డప్పియు రోగములును ముదిమియు లే; వ
వ్వినుత స్థానం బవ్యయ । మును గేవల సార సంప్రమోదకరంబున్. 465

ప్రతిపదార్థం: వినుము; ఆ+ఎడన్= ఆ చోట; కాల= కాలంయొక్క; క్రమమును= క్రమం; డప్పియున్= దప్పిక; రోగములునున్= రోగాలు; ముదిమియున్= ముసలితనం; లేవు; ఆ+వినుత= ఆ పొగడదగిన; స్థానంబు= చోటు; న+వ్యయమునున్= నాశనంలేనిది; కేవల= ముఖ్య; సార= సారవంతమైన; సంప్రమోదకరంబున్= మంచి ఆనందం కలిగించేది.

తాత్పర్యం: ఆ లోకంలో కాలక్రమ ముండదు. ఋతువు లుండవు, దప్పి, రోగాలు ముసలితనం లేవు. ఆ ప్రశంసింపదగ్గ లోకం నాశనం లేనిది. స్వచ్ఛమైన ఆనందాన్ని కలిగించేది.

వ. దానిపేరు గోలోకంబు. 466

తాత్పర్యం: దాని పేరు గోలోకం.

క. గురు శుశ్రూషకులును, స । త్యరతులు శమదమ వినిర్మలాత్ములు దుర్భ
క్ష్యరహితులును నిల్తు రను । త్తర మగునచ్చోట గోప్రదానపరులతోన్. 467

ప్రతిపదార్థం: న+ఉత్తరము= అత్యుత్తమమైనది; అగు; ఆ+చోటన్= ఆ గోలోకంలో; గోప్రదాన పరులతోన్= ఆవులను దానం చేసేవారితోపాటుగా; గురు శుశ్రూషకులునున్= గురువులను సేవించేవారున్నూ; సత్యరతులున్= నిజాన్నే చెప్పేవారున్నూ;

శమ, దమ= బయటి ఇంద్రియాలను, లోపలి ఇంద్రియాలను (జయించిన); వినిర్మల+ఆత్ములు= స్వచ్ఛమైన ఆత్మలు కలవారు; దుర్+భక్ష్య రహితులున్= చెడు తిండి తిననివారూ; నిల్తురు= నివసిస్తారు.

తాత్పర్యం: ఆ లోకంలో గోదానం చేసేవారితోపాటుగా, గురువులను సేవించేవారూ, సత్యమే చెప్పేవారూ, అంతరింద్రియ, బహిరింద్రియ జయంద్వారా పరిశుద్ధమైన ఆత్మలు కలవారూ, అపవిత్రాహారం తిననివారూ నివసిస్తారు.'

వ. అని వెండియు. 468

తాత్పర్యం: అని చెప్పి, మరలా (ఇట్లా అన్నాడు)

ఉ. 'దాయధనంబు సంగరవిధా సముపార్జితమున్ సధర్మ కో
పాయసమాహితంబును శుభప్రతిపాదనలబ్ధమున్ మరు
న్నాయక! వెండియుం గలుగు నాయపుఁ జొప్పుల సొమ్ములుం దగన్
గో యజనార్థ సత్క్రియలకుం బెఱసొమ్ముల నైనఁ గీడగున్. 469

ప్రతిపదార్థం: మరుత్+నాయక!= ఇంద్రుడా! (దేవతలరాజా!); గో=ఆవులు; యజన= యజ్ఞం; అర్థ= విషయమైన; సత్ క్రియలకున్= మంచికార్యాలకు; (ఆవులను దానం చేయటమనే యజ్ఞరూపమైన మంచికర్మల కొరకు లేదా గోదాన యజ్ఞం మొదలైన మంచి పనులకొరకు;) దాయ ధనంబు= దాయాదుల సొమ్ము; సంగరవిధా= యుద్ధ విధానంతో; సముపార్జితమున్= సంపాదించినది; స+ధర్మక+ఉపాయ= ధర్మంతో కూడుకొన్న ఉపాయం ద్వారా; సమాహితంబునున్= కూడబెట్టినదీ; శుభప్రతిపాదన= శుభమైన వృత్తి మొదలైన చేష్టద్వారా; లబ్దమున్= లభించిందీ; వెండియున్= ఇంకా; కలుగు= ఉన్న - చెప్పక వదలిన; ఆయము+చొప్పులన్= ఆదాయం పద్ధతులతో లభించిన; సొమ్ములున్= ధనం; తగున్= ఉచితమైనది; పెఱ= ఇతరమైన; సొమ్ములను+ఐనన్= ధనంతో నయితే; కీడు+అగున్= హాని కలుగుతుంది.

తాత్పర్యం: ఆవులను దానం చేయటానికి కావలసిన ధనం పవిత్రంగా సంపాదించినదై ఉండాలి. దాయల ధనం, యుద్ధజయం ద్వారా, ధర్మసాధనలద్వారా, శుభవృత్తులద్వారా సంపాదించిన డబ్బే కావాలి. ఇంకా ఇట్లాంటి పవిత్ర కార్యాల ద్వారా లభించిన ధనం కావాలి తప్ప పెర సొమ్ములు పనికిరావు. దీనివలన కీడు తప్ప మంచి జరుగదు.

క. విను గోలోకంబును గడ । చిన లోకము గలుగ; దూఁది చెప్పెదఁ బుణ్యం
బును గోప్రదాన విధి మిగి । లిన యట్టిది వత్స! యొండు లే దరయంగన్. 470

ప్రతిపదార్థం: విను= వినుము; గోలోకంబును= గోలోకాన్ని; కడచిన= అతిక్రమించిన; లోకము= లోకం; కలుగదు= ఉండదు; ఊఁది= నొక్కి; చెప్పెదన్= చెప్పుతాయి; పుణ్యంబునున్= పవిత్రమైనది; గోప్రదాన విధిన్= ఆవులను దానంచేయటమన్న ధర్మాన్ని; మిగిలిన అట్టిది= అతిక్రమించిన ధర్మం; వత్స!= నాయనా!; అరయంగన్= విచారిస్తే; ఒండు= మరొకటి; లేదు.

తాత్పర్యం: నాయనా! గట్టిగా చెప్పుతున్నాను నమ్ముము. గోలోకాన్ని మించిన పుణ్యలోకం కానీ, గోదానంకంటె మించిన శుభమైన ధర్మం కానీ లేవు.

తే. ఆగమాధ్యయనంబు, వ్రతాభిరతియు, । నైజకర్మ శీలము, గురుపూజనంబు,

మాతృపితృ రక్షణముఁ, బాత్ర మహిమ లప్ర । తర్క్య ఫలదాయి యైన గోదానవిధికి. 471

ప్రతిపదార్థం: అప్రతర్క్య= తర్కించటానికి వీలుకాని; ఫలదాయి= ఫలితాన్నిచ్చే; గోదాన విధికిన్= గోదాన కర్మకు; పాత్రమహిమలు= తగిన గొప్పదానాలు; ఆగమ=వేద; అధ్యయనంబు= చదవటం; వ్రత= వ్రతాలలో; అభిరతియున్= మక్కువయు; నైజ= తన; కర్మ శీలమున్= కర్మలు చేసే స్వభావం; గురు= గురువులకు; పూజనంబున్= ఆరాధన; మాతృ పితృ రక్షణమున్= తల్లిదండ్రులను రక్షించుటయును;

తాత్పర్యం: గొప్ప ఫలితాల నిచ్చే గోదాన క్రియ కర్తవ్యమైన మహిమలు గలవి, వేదాన్ని చదవటం, వ్రతాలపై అభిలాష, స్వభావసిద్ధమైన కర్మల నైజం, గురువులను పూజించటం, తల్లిదండ్రులను పూజించట మన్నవి.'

క. అని నిర్దేశించిన న । వ్వనరుహసంభవుని దివ్యవాక్యంబులు నె

మ్మనమున నిడి గోయజ్ఞము । లనూనవిధి నడపె నింద్రుఁ డమలచరిత్రా! 472

ప్రతిపదార్థం: అమల= పవిత్రమైన; చరిత్రా!= నడవడి కలవాడా!; అని= ఈ విధంగా; నిర్దేశించినన్= సెలవియ్యగా; ఆ+వనరుహ= నీటిలో పుట్టిన పద్మం నుండి; సంభవుని= పుట్టినవాని - బ్రహ్మ; దివ్య = మహత్తరమైన; వాక్యంబులు= మాటలు; నెఱ+మనమునన్= నిండైన మనస్సులో; ఇడి= ధరించి; గోయజ్ఞములు= గోదాన కర్మలు; ఇంద్రుఁడు; అనూన= అధికమైన; విధిన్= శాస్త్రోక్తపద్ధతిలో; నడపెన్= చేశాడు.

తాత్పర్యం: పవిత్ర ప్రవర్తన కలవాడా! బ్రహ్మ చెప్పిన దివ్య వాక్యాలు విని ఇంద్రుడు అదే విధంగా గోయజ్ఞం నిర్వహించాడు.

క. నీవును నవధానముతో । గోవుల మన్నింపు పాత్రకోటి కొసఁగు స

త్సేవిత పుణ్య చరిత్రము । లా వెరవునఁ బోల వెన్నియైనఁ గుమారా!' 473

ప్రతిపదార్థం: కుమారా!= నాయనా!; నీవును= నీవున్నూ; అవధానముతోన్= ఏకాగ్రతతో; గోవులన్= ఆవులను; మన్నింపుము= గౌరవించుము; పాత్ర= అర్హులైన; కోటికిన్= జనసమూహానికి; ఒసఁగు(ము)= దానంచేయుము; సత్+సేవిత= మంచివారిని సేవించేవారి; పుణ్య= పవిత్రమైన; చరిత్రములు= కథలు; ఎన్నిఐనన్= ఎన్నైనా; ఆ వెరవునన్= గోదానమునకు; పోలవు= సరికావు.

తాత్పర్యం: నాయనా! నీవూ నిష్ఠతో గోవులను పూజించుము. తగినవారికి దానంచేయుము. పుణ్యపురుషుల చరిత్రలు కూడా గోదానానికి సరికావు.'

క. అని యిట్లు గోవిశేషము । లనేక భంగులను బాండవాగ్రజునకు శం

తనుసుతుఁడు సెప్పె నన విని । 'మునివర! యేభంగి వాక్యములు మఱి సెల్లెన్?' 474

ప్రతిపదార్థం: గో విశేషములు= ఆవునకు సంబంధించిన విశేషాలు; అనేక భంగులను= అనేక విధాలుగా; పాండవ= పాండవులలో; అగ్రజునకున్= ముందుపుట్టిన ధర్మరాజునకు; శంతను సుతుఁడు= శంతనుడి కొడుకు - భీష్ముడు; చెప్పెను; అనన్= అనగా; విని; మునివర!= మునిశ్రేష్ఠుడా!; ఏ భంగి= ఏ తీరు; వాక్యములు= మాటలు; మఱి= తరువాత; ఇంకా; చెల్లెన్= నడిచాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని ఈ విధంగా గో విశేషా లెన్నో ధర్మరాజుకు భీష్ముడు చెప్పటం విని శ్రోతలైన మహర్షులు సూతుడితో - 'మునివరా! ఇంకా ఏతీరు మాటలు చెల్లాయో వినిపించుము'.

వ. అని యడుగుటయు. 475

తాత్పర్యం: అని అడుగగా.

ఆశ్వాసాంతము

శా. ధర్మాధర్మ విదూర నీతి పరవిద్వచ్చిత్తయోగీ! జగ
న్నిర్మాణ స్థితి తంత్ర సంహరణధూర్నిర్వాహరాగీ! మహా
శర్మాపాదనపాదపద్మ సుతపస్స్వాధ్యాయసద్మా! మనోం
తర్ముద్రాలతికా ఫలత్వలసితా! దాంతి స్ఫుటోద్భాసితా! 476

ప్రతిపదార్థం: ధర్మ+అధర్మ= ధర్మము, అధర్మము రెంటికీ; విదూర= చాలా దూరంగా ఉన్న; నీతిపర= నీతిపరులైన; విద్వత్= పండితుల; చిత్త= మనస్సులలో ఉన్న; యోగీ!= మహాయోగీ!; జగత్= లోక; నిర్మాణ= సృష్టించటం; స్థితితంత్ర= సృష్టిని భద్రంగా రక్షించే ఉపాయం; సంహరణ= లయ కృత్యముల; ధూః= భారమును; నిర్వాహ= నిర్వహించే; రాగీ!= అనురక్తి కలవాడా!; మహా= గొప్ప; శర్మ= సుఖం; ఆపాదన= కలిగించే; పాదపద్మ= తామరపూలవంటి అడుగులు కలవాడా!; సు=మంచి; తపస్= తపస్సు; స్వ+అధ్యాయ= వేదపఠనమే; సద్మా!= గృహంగా కలవాడా; మనః+అంతర్= మనస్సు లోపల; ముద్రా= ఆనందం, లేదా యోగముద్రలన్న; లతికా= తీగకు (పడ్డ); ఫలత్వ= ఫలరూపంతో; లసితా!= అందమైనవాడా!; దాంతి= ఇంద్రియ నిగ్రహంతో ఏర్పడ్డ మనశ్శాంతితో; స్ఫుట= స్పష్టంగా; ఉత్+భాసితా!= పైకి ప్రకాశించేవాడా!

తాత్పర్యం: స్వామీ! నీవు ధర్మాధర్మాలకు అతీతమైన దివ్యవిద్యాపరులైన పండితుల మనస్సులలో ఉన్న యోగీశ్వరుడవు! లేదా - యోగమంటే చిత్తవృత్తములను నిరోధించటం కనుక విద్వాంసుల చిత్తవృత్తులను నిరోధించే సాధనరూపమైన యోగమే నీవు. నీకూ యోగానికీ అభేదం. సృష్టి స్థితి సంహారాలన్న బరువును మోయటంలో అనురాగం, రక్తి కలవాడా! తపస్సులోనూ, వేదాధ్యయనంలోనూ, అంటే వాటిని ఆచరించే వారి హృదయాలే నివాసంగా కలవాడా! ముత్+ర= మోదమును సంతోషాన్ని తెచ్చేది (కలిగించేది) కనుక ముద్ర, చిన్ముద్ర అభయముద్ర ఇట్లాంటి యోగముద్రలన్న లతకు కాచిన పండువంటివాడా! ప్రశాంత మనస్కులైన యోగుల హృదయాలనుండి పైకి లోకంలోకి ప్రకాశం చిమ్మేవాడా!

విశేషం: గతంలో శ్రీకృష్ణుడు యోగీశ్వరేశ్వరుడుగా చెప్పబడ్డాడు. కనుక ఈ సంబోధన సార్థకమౌతున్నది.

పై వాక్యంలో విరక్తి స్వరూపుడైన యోగిగా పిలువబడ్డ భగవంతు డిక్కడ రాగిగా స్తుతించబడుతున్నాడు. ఈ హరిహరస్తుతులన్నీ సమాస భూయిష్ఠమైన రచన కలవి. వేదాంత, యోగశాస్త్ర సంబంధం కలవీ, హరుడు(శివుడు) యోగి హరి రాగి. హరి సగుణమూర్తి కనుక పాదపద్మాలు కలవాడు = (శరీరం ఉన్నవాడుగా స్తుతించబడుతున్నవాడు). మరలా తపస్స్వాధ్యాయ స్వరూపుడంటే నిర్గుణస్వరూపుడై హరుడుగా స్తుతించటం. చివరి రెండు విశేషాలూ కేవల జ్ఞానస్వరూప వర్ణనలు. చిత్-ఆనంద స్వరూప వర్ణనలు.

క. ప్రమద విషాదాది ద్వం । ద్వమలావిహితాంతరంగవాసా! విశ్వా

గమవేద్య సముల్లాసా! శమరమ్య విభాస! నియమ జనిత వికాసా! 477

ప్రతిపదార్థం: ప్రమద= సంతోషం; విషాద=దుఃఖం; ఆది= మున్నుగాగల; ద్వంద్వ= రెండు; మల= దోషం - మలినం; అవిహిత= లేని; అంతరంగ= అంతఃకరణం; వాసా!= నివాసంగా కలవాడా!; విశ్వ= ప్రపంచమనే; ఆగమ= వేదంద్వారా; వేద్య= తెలియదగిన; సముల్లాసా!= ఆనంద, ఉత్సాహ స్వరూపుడా!; శమ= అంతరింద్రియ నిగ్రహం చేత; రమ్య= అందమైన; వి+భాస= విశిష్టమైన ప్రకాశం కలవాడా!; నియమ= యోగనియమాలతో; జనిత= పుట్టిన; వికాసా!= వికాసం కలవాడా!

తాత్పర్యం: సంతోష, దుఃఖాలు అనే ద్వంద్వం లేని మనసులే ఆవాసంగా కలవాడా! సృష్టి అన్నదే వేదం. దానిద్వారా సృష్టించటంద్వారా పరమేశ్వరుడి అనురాగస్వరూపమైన ఆనందోత్సాహాలు తెలుస్తున్నాయి. సృష్టిద్వారానే అతడి ఉనికి తెలుస్తున్నది కనుక అదే వేదం. శమాన్వితులైన మహాత్ములనుండి విశిష్టంగా ప్రకాశిస్తున్నాడు. యోగ నియమాలనుండి వికసించే ఆనందమన్న తామరపూవు భగవంతుడు యోగసాధన లేనివారి హృదయాలలో నిద్రపోతున్నవాడు. యోగులలో మేల్కొంటున్నాడు. ఇదే వికాస మంటే.

విశేషం: శ్రీ రామకృష్ణ పరమహంస వంటివారు లేకపోతే మనకు భగవంతుడి ఉనికి తెలిసేది కాదు. కనుక అట్లాంటివారే భగవంతుడన్న దీపం వెలిగిన గృహాలు. ఆ దీపపు వెలుగు కూడా రమ్యమైనది.

మాలిని.

'అకలుష హృదయాంతర్యాగ సంసిద్ధి మూర్తీ!

వికృతి దశక షట్క స్వీకృతి ప్రౌఢవర్తీ!

సకృపలసదపాంగోత్సా ర్యమాణాశ్రితార్తీ!

సకల నిగమచూడా చారురంగైక వర్తీ! 478

ప్రతిపదార్థం: అకలుష= నిష్కల్మషమైన; హృదయ= హృదయాలలోని; అంతర్యాగ= లోపలియజ్ఞంద్వారా; సంసిద్ధిమూర్తీ!= సిద్ధించిన ఫల స్వరూపం కలవాడా!; వికృతి= వికారాలు; దశక= పది; షట్క= ఆరు; స్వీకృతి= స్వీకరించటంచేత; ప్రౌఢ= పరిపక్వతతో; వర్తీ!= ప్రవర్తించేవాడా!; స+కృప= దయాసహితత్వంతో; లసత్= ప్రకాశించే; అపాంగ= కడకంటి చూపుతో; ఉత్సార్యమాణ= నశింపచేస్తున్న; ఆశ్రిత= ఆశ్రితులైన భక్తుల; ఆర్తీ!= దుఃఖం కలవాడా!; సకల నిగమ= వేదాలన్నిటియొక్క; చూడా= శిరస్సులే; చారు= అందమైన; రంగ= నాట్యరంగస్థలంమీద; ఏక= ముఖ్యమైన; వర్తీ!= నటకుడా!

తాత్పర్యం: అంతర్యాగం, బహిర్యాగమని ఉపాసనలు రెండు రకాలు. బయటచేసే షోడశోపచారపూజలు బహిర్యాగం. జ్ఞానం, వివేక దృష్ట్యా సర్వపూజలు మనస్సులో భావించిచేయటం అంతర్యాగం. ఇదే సిద్ధిని కలిగించేది. కనుక సంసిద్ధిమూర్తీ - అంతర్యాగ ఫలమే సంసిద్ధి ముక్తి. అదే ఆకారంగా కలవాడా! 16 వికారాలను స్వీకరించి కూడా, చెదరకుండా ప్రవర్తించేవాడా! (ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి పంచ భూతాలు (5), జ్ఞానేంద్రియాలు-5, కర్మేంద్రియాలు-5, మనస్సు-1). దయతో తొణికిసలాడుతున్న కడగంటి చూపుతో ఆశ్రితుల దుఃఖాలను చెదరగొట్టేవాడా! సకల వేదాల శిరస్సులనే నాట్యరంగంమీద నాట్యంచేసే ప్రధాన నటకుడైనవాడా! హరిహరనాథా!

విశేషం: శివుడి నాట్యాన్ని ఇట్లా వ్యాఖ్యానించటం చాలా అందంగా ఉన్నది.

ఆశ్వాసాంతాలన్నీ అంత్యానుప్రాసాలంకారంతో అంతమయ్యే సంబోధనలు కలవి. ప్రతి వాక్యము ఒక సంబోధన. ఈ అంత్యానుప్రాసవలననే వాక్యాలు ఎక్కడకు తెగిపోతున్నాయో, ఎంతవరకు సంబోధనో తెలుస్తుంది. లేకపోతే అర్థం చెప్పటం సాధ్యంకాదు. ఒక సంబోధన హరునకు తరువాతిది హరికి అన్వయించేవిగా ఉంటాయి. కొన్నిచోట్ల మొదటిదీ, చివరిదీ హరునకు అన్వయిస్తూ మధ్యలో రెండూ హరి కన్వయిస్తాయి. ఏది ఏదో తెలిసికొనటం పండితులకూ ఇబ్బందిగానే ఉంటుంది.

ఉదాహరణకు చివరి పద్యంలో మొదటి వాక్యం, చివరివాక్యం హరుని సంబోధనలు. మధ్యలోవి రెండు హరి కన్వయించేవి. లేదా అన్ని భగవత్సంబోధనలే. ఈ ఏర్పాటున్నదా అంటే ఉన్నది. లేదా అంటే లేదు. స్పష్టంగా ఉండదు కనుక మూర్తి వర్ణనమున్న సంబోధన సగుణతత్త్వమైన హరికీ, కానిది నిర్గుణతత్త్వమైన హరునకూ అన్వయించి తీరాలి. ఎందుకంటే విరాటపర్వ అవతారికలో హరిహరనాథమూర్తినట్లా వర్ణించాడు కనుక.

'కరుణారసము పొంగి పొరలెడు చాడ్పున । శశిరేఖ నమృతంబు జాలువాఱ

హరినీలపాత్రిక సురభి చందన మున్న। గతి నాభి ధవళపంకజము మెఱయ.'

అన్న ఆ పద్యంలో మొదటిచరణం శివవర్ణన, మూడోచరణమూ శివునకే అన్వయిస్తుంది. 2, 4 చరణాలూ హరి కన్వయించేవి. కాబట్టి ఆశ్వాసాంతాలలోనూ ఇదే పద్ధతి అన్వయిస్తుంది. మాలిని వృత్తలక్షణానికి ఆను.1.388 పద్యం చూడండి.

గద్యము.

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన

శ్రీ మహాభారతంబున నానుశాసనిక పర్వంబునందు ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది మంగళకరమైనదీ, ఉభయ కవిమిత్రుడని ప్రశస్తిని పొందిన కొమ్మనామాత్యపుత్రుడూ, పండితులను సేవించటం వలన ప్రకాశించేవాడూ అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలో ఆనుశాసనిక పర్వంలో రెండవ ఆశ్వాసం.

ఆనుశాసనిక పర్వంలోని రెండవ ఆశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆనుశాసనిక పర్వము - తృతీయాశ్వాసము

శ్రీ మహిమ దానకరుణా । భూమోద్భాసి బహునామ! పుణ్యస్తోమా

రామహృదయధామ! విత‌ । ర్కామేయ విభూతిసీమ హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: హరిహరనాథా!= ఓ హరిహరనాథస్వామీ!; శ్రీ= సంపద; మహిమ= గొప్పతనం; దాన= దానం; కరుణా= దయ అనే వాటి; భూమ= ఎక్కువతనాన్ని; ఉద్భాసి= బాగుగా ప్రకాశింపజేసే; బహునామ!= పెక్కు పేరులు గలవాడా!; పుణ్య= పుణ్యాల; స్తోమ= సముదాయానికి; ఆరామ= పూలతోటవంటి; హృదయ= హృదయమే; ధామ= నివాసమైనవాడా!; వితర్క= గొప్ప ఊహలకు; అమేయ= అందని; విభూతి= మహిమయొక్క; సీమ!= హద్దు గలవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథ స్వామీ! నీ పేర్లన్నీ నీలోని ఐశ్వర్యం, గొప్పతనం, దానం, దయ అనే గుణాలను చక్కగా ప్రకటిస్తూ ఉంటాయి. ఎన్నో పుణ్యాల పూలతోట లయిన హృదయాలలో నీవు నివసిస్తూ ఉంటావు. ఏ తర్కమూ నీ మహిమను అందుకోలేదు.

విశేషం: భగవంతుడికి బహునామాలు. ఏ నామమైనా ఆయన మహాగుణాలయిన దాన దయాదులను ప్రకటిస్తూ భక్తులను ఆకట్టుకొంటుంది. అంటే ఆయనపేరేదీ నేతిబీరకాయవంటిది కాదన్నమాట. ఆ పేరు స్మరిస్తే సంపదో, మహిమో, మహావస్తువో, ఆపదలు తొలగటమో సిద్ధిస్తుందని తాత్పర్యం. ఆయన పుణ్యాత్ముల హృదయాలలో కాపురం ఉంటాడు. అంటే అట్టివారి హృదయాలే నిజమైన దేవాలయా లన్నమాట! కాబట్టి మానవులందరూ పుణ్యకార్యాలు చేసి భగవంతుడిని గుండెలో నిలుపుకొనాలని సూచన. ఆయన మహిమ తర్కానికి అందదు. కనుక తర్కంతో తలలు బ్రద్దలు కొట్టుకొనటంవలన మానవుడు భగవంతుడికి దూరమవుతున్నాడని హెచ్చరిక.

ఇందులో నామకీర్తనా, పుణ్యసాధనా, భగవత్ప్రాప్తి అనేవి ఒకదానికొకటి సాధనాలుగా మనం సంభావించాలి.

ధర్మజునకు భీష్ముం డనుష్ఠేయంబులఁ జెప్పుట (సం.13-74-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు గోవుల మహానుభావంబు విని పాండవాగ్రజుండు భీష్మునితో 'ధర్మంబులు తేటపడ ననుగ్రహించుచుం బుయిలోట వాపి నన్నుం గలిపికొని కృపకు భాజనంబుగాఁ జేయుటం జేసి కొంకక యింకను నడిగెదఁ; దాత్పర్యంబున ననుష్ఠింపవలయునవి యెయ్యవి యెఱింగింపవే!' యనుటయు నతనితో నతండు. 2

ప్రతిపదార్థం: దేవా!= ప్రభూ!; వైశంపాయనుండు= వైశంపాయనుడనే ముని; జనమేజయునకున్= జనమేజయ మహారాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అట్లు= ఆ విధంగా; గోవుల మహానుభావంబున్= ఆవుల గొప్పతనాన్ని; విని= విని; పాండవ+అగ్రజుండు= పాండురాజు కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజు; భీష్మునితోన్= భీష్ముడితో; ధర్మంబులు= ధర్మాలు; తేటపడన్= చక్కగా తెలిసేవిధంగా; అనుగ్రహించుచున్= దయచూపుతూ; పుయిలోట= సంకోచభావాన్ని; పాపి= తొలగించి; నన్నున్= నన్ను; కలిపికొని= మీలోని వాడినిగా చేసికొని; కృపకున్= దయకు; భాజనంబుగాన్= పాత్రమయ్యే విధంగా; చేయుటన్+చేసి= చేయటంవలన; కొంకక= వెనుకాడకుండా; ఇంకనున్= ఇంకా; అడిగెదన్= అడుగుతాను; తాత్పర్యంబునన్= శ్రద్ధ సడలకుండా; అనుష్ఠింపవలయునవి= చేయవలసినవి; ఏ+అవి= ఏవి; ఎఱింగింపవే?= తెలుపవా?; అనుటయున్= అనగా; అతనితోన్= ఆ ధర్మరాజుతో; అతండు= ఆ భీష్ముడు.

తాత్పర్యం: ప్రభూ! వైశంపాయనుడు జనమేజయుడికి ఇట్లా చెప్పుతున్నాడు: ధర్మరాజు గోవుల గొప్పతనాన్ని ఆలకించి భీష్ముడితో ఇట్లా అంటున్నాడు. 'తాతా! నే నడిగిన ధర్మాలన్నీ స్పష్టంగా తెలిసేవిధంగా దయతో చెప్పుతున్నావు. నా మనస్సులోని సంకోచాన్ని తొలగించి నన్ను నీ దయకు పాత్రం చేసికొన్నావు. కనుక సందేహం వదలి ఇంకా అడుగుతున్నాను. శ్రద్ధతో చేయదగిన పను లేవో నాకు చెప్పుము' అనగా భీష్ముడు ధర్మరాజుకు ఇట్లా చెప్పుతున్నాడు.

విశేషం: శాస్త్రాలలో పరిప్రశ్న అని ఒకటి ఉన్నది. మహావిషయాలు తెలిసికొనదలచినవాడు వినయపూర్వకంగా తనకు కావలసిన విషయాలను పెద్దవారిని అడుగుతూ ఉండాలి. 'అడగందే చెప్పరాదు' అని కూడా ధర్మశాస్త్రం శాసిస్తున్నది. కాబట్టి ధర్మరాజు భీష్ముడి దయను కొనియాడుతూ ప్రసన్నుడిని చేసికొంటున్నాడు. పుయిలోటవాపి - మహాయుద్ధంలో పాండవులు భీష్ముడిని కూడా చిత్రహింసకు గురిచేశారు. ఇప్పుడు ఆయననే అడుగవలసి వచ్చింది అని ధర్మరాజు గుండెగుబులు. దానిని భీష్ముడు తొలగించాడు. నన్నుం గలిపికొని - యుద్ధం ముగిసేవరకు భీష్ముడూ ధర్మరాజూ పగవారు. భీష్ముడు దానిని పట్టించుకొనక ధర్మరాజును హృదయానికి దగ్గరగా తీసికొన్నాడు.

సీ. 'విను నియమంబును వేదపాఠంబుఁ ద । ద్ధరణంబు దమము నధ్యాపనంబు
నప్రతిగ్రహమును నాత్మీయకర్మని । ష్ఠయు సకలేంద్రియ జయము సత్య
నిరతియు శ్రుతదాన పరతయు బ్రహ్మ చ । ర్యముఁ బితృశుశ్రూషణమును మాతృ
శుశ్రూషణము గురుశుశ్రూషణము నను । కంపయు గోవ్రత సంపదయును

ఆ. వత్స! యాచరింపవలయునట్టివి' యని । పలుకుటయును నా నృపాలవరుఁడు
'గో ప్రదానవిధి యకుంఠిత కృప నాకు । నెఱుఁగఁ జెప్పవే సమిద్ధబుద్ధి.' 3

ప్రతిపదార్థం: వత్స!= నాయనా!; విను= వినుము; నియమంబును= నియమమున్నూ; వేద పాఠంబున్= వేదాలను నేర్చుకొనటమూ; తత్+ధరణంబు= వానిని వదలకుండా పట్టుకొనటమూ; దమము= మనస్సును అదుపులో పెట్టుకొనటమూ; అధ్యాపనంబున్= వేదాలను బోధించటమూ; అప్రతిగ్రహమునున్= దానాలు పట్టకపోవటమూ; ఆత్మీయ కర్మ నిష్ఠయున్= తన కర్తవ్యాలయందు శ్రద్ధా; సకల+ఇంద్రియ జయమున్= అన్ని ఇంద్రియాలనూ గెలవటమూ; శ్రుత దాన పరతయున్= చదువునందూ; దానమునందూ ఆసక్తి ఉండటమూ; బ్రహ్మచర్యమున్= బ్రహ్మమునందు ప్రవర్తిస్తూ ఉండటమూ; పితృ శుశ్రూషణమును= తండ్రిని సేవించటమూ; మాతృశుశ్రూషణమున్= తల్లిని సేవించటమూ; గురుశుశ్రూషణమున్= గురువులను సేవించటమూ; అనుకంపయున్= దయకలిగి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉండటమూ; గో వ్రత సంపదయును= ఆవులను సేవించటం అనే సంపదా; ఆచరింపవలయునట్టివి= చేయదగినట్టివి; అని= అని; పలుకుటయున్= చెప్పగా; ఆ నృపాలవరుఁడు= ఆ రాజశ్రేష్ఠుడు; సమిద్ధబుద్ధి!= చక్కగా వెలుగొందుచున్న బుద్ధిగల ఓతాతా!; గో ప్రదానవిధి= గోవులను దానంచేసే కార్యాన్ని; నాకున్= నాకు; అకుంఠితకృపన్= ఏ మాత్రమూ మొక్కవోని దయతో; ఎఱుఁగన్+చెప్పవే!= తెలిసే విధంగా చెప్పవయ్యా!

తాత్పర్యం: 'నాయనా! వినుము. నియమమూ, వేదాలను చదవటం, వాటిని హృదయంలో నిలుపుకొనటం, మనస్సును అదుపులో పెట్టుకొనటం, వేదాలను ఇతరులకు నేర్పటం, దానాలు పట్టకపోవటం, తన కర్తవ్యాన్ని శ్రద్ధతో చేయటం, ఇంద్రియాలన్నింటినీ గెలవటం, సత్యంపై ఆసక్తి ఉంచటం, బ్రహ్మచర్యాన్ని పాటించటం, తల్లిదండ్రులను, గురువులను సేవించటం, దయకలిగి ఉండటం, గోవులకు సంబంధించిన వ్రతాలను సమృద్ధిగా చేయటం - ఇవి చేయదగిన పనులు' అని భీష్ముడు చెప్పగా విన్న ధర్మరాజు 'తాతా! నీది మంచి వెలుగొందుతున్న బుద్ధి. గోవులను దానమిచ్చే పద్ధతిని గూర్చి నాకు మిక్కిలి దయతో తెలియజెప్పుము' అన్నాడు.

విశేషం: ఇవన్నీ ఉత్తమ మానవుడు తప్పక చేయవలసిన పనులు. వేదం ధర్మమూలం కాబట్టి దానిని చదవాలి. చదివించాలి. తా నాచరించాలి. ఇతరులచేత ఆచరింపజేయాలి. దానాలు పుచ్చుకొనటంవలన ఇచ్చేవారి పాపాలు సంక్రమిస్తాయి. ఆ కారణంగా పుచ్చుకొనకూడదు. బ్రహ్మచర్యం పాటించాలి. అంటే కామాదిభావాలను దగ్గరకు రానీయరాదు. పితృశుశ్రూషణం - వేదం మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, తల్లీదండ్రీ గురువూ దైవమైనవాడవు కావాలి అని శాసిస్తున్నది. అనుకంప సర్వభూతాల యందు దయకలిగి ఉండటం, ఎందుకంటే అన్నింటియందూ భగవంతుడే కదా నిండి ఉన్నాడు.

వ. అని యడిగిన యక్కురుపతికిం గురుపితామహుం డిట్లనియె. 4

ప్రతిపదార్థం: అని; అడిగిన; ఆ+కురుపతికిన్= ఆ కౌరవమహారాజునకు; కురు పితామహుండు= కురువంశంవారికి తాత అయిన భీష్ముడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఇట్లా అడుగగా భీష్ము డిట్లా చెప్పాడు.

ఆ. 'తనియ మేసి నీరు ద్రావి మందకు వచ్చి । సౌఖ్య మెసఁగఁ బసులు శయన మొంది
యుండ నచట నియతి నుండి మాంధాతృండు । పరమభక్తి నమరగురునిఁ దలఁచి. 5

ప్రతిపదార్థం: పసులు= పశువులు; తనియన్= తృప్తిపడేటట్లుగా; మేసి= మేసి; నీరు= నీటిని; త్రావి= త్రాగి; మందకున్= గోశాలలోనికి; వచ్చి; సౌఖ్యము= సుఖం; ఎసఁగన్= ఎక్కువయ్యేటట్లుగా; శయనము+÷ఒంది= పడుకొని; ఉండన్= ఉండగా; అచటన్= అక్కడ; నియతిన్= నిష్ఠతో; ఉండి= నిలిచి; మాంధాతృండు= మాంధాత అనే రాజు; పరమభక్తిన్= గొప్పభక్తితో; అమరగురునిన్= దేవతలకు గురువైన బృహస్పతిని; తలఁచి= తలపోసి.

తాత్పర్యం: 'ఆవులు కడుపారా మేత మేశాయి. నీరు త్రాగాయి. గోశాలకు వచ్చి సుఖంగా పడుకొన్నాయి. అప్పుడు మాంధాత అక్కడ నిష్ఠతో ఉండి గొప్ప భక్తితో బృహస్పతిని తలచుకొన్నాడు.

విశేషం: మాంధాతకు పశువులమీద ఎంత భక్తి ఉన్నదో దీనివలన తెలుస్తున్నది. మహారాజు అంతఃపురంలో హంసతూలికా తల్పాలమీద సుఖనిద్ర పొందవలసినవాడు, మందలో నిష్ఠతో ఉన్నాడు. అంటే అతడి భక్తి ఎంత గొప్పదో మనం ఊహించుకొనవచ్చును.

వ. ఇట్ల యడుగం గలవాఁడై కరంబులు మొగిచి బహువిధంబులం బ్రస్తుతించిన, నా పురుహూత పురోహితుండు ప్రత్యక్షం బగుటయు, న పుడమితేఁ డమ్మహాత్ముని పాదంబులకుం బ్రణమిల్లి యడిగిన నద్దేవగురుం డన్నర దేవోత్తమున కిట్లనియె. 6

ప్రతిపదార్థం: ఇట్ల= ఈ విధంగానే; అడుగన్ కలవాఁడు+ఐ= అడగదలచినవాడై; కరంబులు= చేతులు; మొగిచి= మోడ్చి; బహువిధంబులన్= పెక్కురీతులతో; ప్రస్తుతించినన్= కొనియాడగా; ఆ పురుహూత పురోహితుండు= దేవేంద్రుడి పురోహితుడైన ఆ బృహస్పతి; ప్రత్యక్షంబు+అగుటయున్= సాక్షాత్కరించగా; ఆ+పుడమితేఁడు= ఆ రాజు; ఆ+మహాత్ముని పాదంబులకున్= ఆ మహాత్ముడి కాళ్ళకు; ప్రణమిల్లి= దండ నమస్కారం చేసి; అడిగినన్= అడుగగా; ఆ+దేవగురుండు=దేవతలకు గురువైన ఆ బృహస్పతి; ఆ+నరదేవ+ఉత్తమునకున్= రాజులలో శ్రేష్ఠుడయిన ఆ మాంధాతకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: నీ వడిగినట్లే అడుగదలచి చేతులు మోడ్చి ఎన్నో విధాలుగా స్తోత్రాలు చేయగా ఆ బృహస్పతి ప్రత్యక్షమయ్యాడు. ఆ రాజు అతడి కాళ్ళమీద పడి నమస్కరించాడు. అప్పుడు అడిగాడు. బృహస్పతి ఆ రాజు కిట్లా చెప్పాడు.

విశేషం: మహా విషయాలు తెలిసికొనదలచినవాడు ఎట్లా మహాత్ములను ప్రసన్నం చేసికొనాలో ఇందులో కవి సూచిస్తున్నాడు. "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా'' అని గీత. కాళ్ళమీద పడటం ప్రణిపాత. అడగటం పరిప్రశ్న. ఈ రెంటివలన సేవకూడా చేశాడని మనం ఊహించుకొనవచ్చును. చక్కని సంప్రదాయం పాటిస్తున్నాడు కనుకనే రాజు నరదేవులలో ఉత్తము డయ్యాడు. కనుకనే దేవగురువు వంటివాడు ప్రసన్నుడై అడిగిన విషయాన్ని వివరించి చెప్పటానికి సుముఖుడయ్యాడు.

బృహస్పతి మాంధాతకుఁ దెలిపిన గోదానవిధి ప్రకారము (సం.13-75-4)

ఆ. పుణ్యదినమునందు భూసురానుజ్ఞతో। నుపవసించి గోవు లున్న మంద
కరిగి పరమ నియతి నయ్యహోరాత్ర మ। గ్గోష్ఠమున వసించి నిష్ఠతోడ. 7

ప్రతిపదార్థం: పుణ్యదినమునందున్= తిథివార నక్షత్రాదులు బాగా ఉన్న రోజున; భూసుర+అనుజ్ఞతోన్= బ్రాహ్మణుడి, పురోహితుడి అనుమతితో; ఉపవసించి= ఉపవాసం చేసి; గోవులు+ఉన్న మందకున్= ఆవులున్న శాలకు; అరిగి= వెళ్ళి; పరమ నియతిన్= గొప్ప నియమంతో; ఆ+అహోరాత్రము= ఆ పగలూ రాత్రీ; నిష్ఠతోడన్= దీక్షతో; ఆ+గోష్ఠమునన్= ఆ గోవుల శాలలో; వసించి= ఉండి.

తాత్పర్యం: గోదానం చేయదలచినవాడు మంచి రోజు చూచుకొని పురోహితుడి అనుమతి పొంది ఉపవాసం చేసి గోవులున్న శాలకు వెళ్ళి గట్టి నియమంతో ఒక రోజల్లా నిష్ఠతో అక్కడ గడపాలి.

విశేషం: ఏ శుభకార్యానికైనా మంచిరోజు అవసరం. అది తప్పక ఫలా న్నిస్తుంది. పురోహితుడు రాబోయే కష్టసుఖాలు ముందే విచారించి తెలియజేస్తాడు. అందుకని అతనితో సంప్రతించటం అవసరం. వ్రతానికి నియమాలు చాలాముఖ్యం. అవి లేకపోతే ఫలం దక్కదు. ఉపవాసంవలన దేహమూ, ఇంద్రియాలూ స్వాధీనమవుతాయి. దానివలన నిష్ఠ చెడకుండా ఉంటుంది.

వ. మఱునాఁడు. 8

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ తరువాతి రోజున.

ఆ. సంగవాభిధాన సత్కాలమునఁ దన । యిచ్చుగోవుఁ బేర నెలమిఁ బిలిచి
యజుఁడు కరుణఁ జెప్పినట్టి యవ్వాక్య ర । త్నముఁ బఠించునది యుదాత్తచరిత! 9

ప్రతిపదార్థం: ఉదాత్త చరిత!= గొప్ప నడవడి కల ఓ రాజా! సంగవ+అభిధాన సత్కాలమునన్= సంగవమనే పేరుగల మంచి వేళలో; తన+ఇచ్చు గోవున్= తా నీయదలచిన ఆవును; పేరన్= పేరుతో; ఎలమిన్= ప్రీతితో; పిలిచి; అజుఁడు= బ్రహ్మ; కరుణన్= దయతో; చెప్పిన+అట్టి= చెప్పిన; ఆ+వాక్యరత్నమున్= ఆ గొప్ప వాక్యాన్ని; పఠించునది= చదవాలి.

తాత్పర్యం: మంచివాడా! సంగవం అనే పేరుగల మంచి సమయంలో తాను ఇవ్వదలచిన ఆవును ప్రీతితో పేరుపెట్టి పిలిచి బ్రహ్మదేవుడు దయతో చెప్పిన మహాకావ్యాన్ని పఠించాలి.

విశేషం: పగటిని ఆరు భాగాలుగా భావిస్తారు. 1. ఉషస్సు, 2. సంగవం, 3.మధ్యాహ్నం, 4.అపరాహ్ణం, 5.సాయంకాలం, 6.నిశాముఖం. ఇందులో రెండవ భాగం అయిన సంగవ కాలం దానయోగ్యమని బృహస్పతి చెప్తున్నాడు. ఆవులను పాలుపితికే సమయం, ఆవులు దూడలతో కలిసి ఉండే కాలం అని దీనికర్థం. సూర్యోదయం అయిన తరువాత మూడు ముహూర్తాల కాలం సంగవకాలం. పేరన్- పెంపుడు జంతువులకు పేర్లు పెట్టటం చాలా ప్రాచీనకాలం నుండీ ఉన్నదన్నమాట.

ఆ. తల్లి గోవు, వృషము దండ్రి, గర్భప్రదే । శంబు దివము, ధరణి సంప్రతిష్ఠ
యని పఠించి యోగ్యుఁడగు విప్రు నర్చించి । పలుకవలయు నీగి కలిమి దెలియ. 10

ప్రతిపదార్థం: గోవు= ఆవు; తల్లి= మా అమ్మ; వృషము= ఎద్దు; తండ్రి= మా నాయన; దివము= స్వర్గం; గర్భప్రదేశంబు= కడుపు; ధరణి= భూమి; సంప్రతిష్ఠ= (నాకు) నిలుకడ; అని; పఠించి= చదివి; యోగ్యుఁడు+అగు విప్రున్= అర్హతగల విద్యావంతుడిని; అర్చించి= పూజించి; ఈగి కలిమి= ఇచ్చే సంకల్పం; తెలియన్= తెలిసేవిధంగా; పలుకవలయున్= పలకాలి.

తాత్పర్యం: 'ఆవు నా తల్లి, ఎద్దు నా తండ్రి, స్వర్గం వీరి గర్భప్రదేశం, ఇది నిలిచి ఉన్న తావే నాకు నిలుకడ ఇచ్చే తావు' అని చదివి దానం గ్రహించటానికి అర్హతగల విద్యగలవాడిని అర్చించి దానమిచ్చే సంకల్పం తనకున్నదని తెలిసే విధంగా పలకాలి.

విశేషం: మూలంలో బ్రహ్మ పలికిన వాక్యం ఈ విధంగా ఉన్నది.

> **"గౌర్మేమాతా వృషభః పితా మే**
> **దివం శర్మ జగతీ మే ప్రతిష్ఠా"** అను. 76. 7

'దివంశర్మ' అనే దానికి నీలకంఠులు - ఆవు, ఎద్దు అనేవి నాకు స్వర్గాన్నీ, ఇహసుఖాన్నీ ఇచ్చుగాక అని వ్యాఖ్యానించారు. దీనిని బట్టి 'గర్భప్రదేశంబు దివము' ఆవు ఎద్దుల గర్భప్రదేశం స్వర్గంలోని సుఖంవంటి సుఖాన్నిస్తుందని సంభావించాలి. అట్లాగే జగతీ - అనే పదానికి 'గోవు' అనే అర్థాన్ని నీలకంఠులు చెప్పారు. గోవే నాకు ప్రతిష్ఠ అని అర్థం. కాగా తిక్కనగారు ధరణి అనే పర్యాయ పదం వాడారు. కనుక ఆవు నిలుచున్న తావు నాకు స్థిరత్వాన్ని కూర్చే భూమి అనే అర్థాన్ని ఆయన సంభావించినట్లుగా ఊహించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యోగ్యుడగు విప్రున్= బ్రాహ్మణ పర్యాయ పదాలలో విప్రశబ్దం విద్యావంతుడిని తెలుపుతుంది. "విద్యయా యాతి విప్రత్వమ్'' అని లోకరూఢి. విద్య అంటే పరమార్థ విద్యయే.

వ. తదనంతరంబ. 11

తాత్పర్యం: ఇట్లా పఠించి చెప్పిన వెంటనే.

క. సారములగు గోవులు మ । ద్ఘోర సకల కల్మషములుఁ ద్రుంచును సౌమ్య
త్వారూఢంబులు శాశ్వత । సారోదారపద మిచ్చి సౌఖ్యముఁ జేర్చున్. 12

ప్రతిపదార్థం: సారములు+అగు గోవులు= చక్కని శక్తి కల ఆవులు; మత్+ఘోర సకల కల్మషములన్= నా భయంకరాలైన అన్ని పాపాలనూ; త్రుంచును= ముక్కలు చేస్తాయి; సౌమ్యత్వ+ఆరూఢంబులు= సాధువర్తనంలో పేరుగొన్న ఆవులు; శాశ్వత సార+ ఉదారపదమున్= అంతం లేని స్థిరమైన గొప్పస్థానాన్ని; ఇచ్చి= కలిగించి; సౌఖ్యమున్= సుఖాన్ని; చేర్చున్= చేరుస్తాయి.

తాత్పర్యం: మంచి సత్తువ గల ఆవులు నా భయంకర పాపాలన్నింటినీ రూపుమాపుతాయి. మంచి సాధుశీలం గల ఆవులు శాశ్వతమూ, సారమూ, మహిమగలదీ అగు స్థానాన్ని ఇచ్చి సుఖాన్ని కూరుస్తాయి.

విశేషం: పాపాలు మనిషిని నరకానికి చేరుస్తాయి. ఆవులు ఆ పాపాలను పటాపంచలు చేస్తాయి. శాశ్వత, సార, ఉదారపదం అంటే మోక్షం. కనుక అక్కడి సౌఖ్యం బ్రహ్మానందం అని భావం.

క. అని పలికి గోవు నిచ్చితి । ననుచు నుదకధారఁ బ్రీతి నవ్విప్రుకరం
బునఁ బోయవలయు నర్ఘ్యం । బని చెప్పుదు రజ్జలంబు నాదిమునీంద్రుల్. 13

ప్రతిపదార్థం: అని; పలికి= చెప్పి; ఆవును; ఇచ్చితిన్= ఇచ్చాను; అనుచున్= అంటూ; ఉదకధారన్= నీటిధారను; ప్రీతిన్= ప్రీతితో; ఆ+విప్రు కరంబునన్= ఆ విద్యావంతుడి చేతిలో; పోయవలయున్= విడవాలి; ఆది ముని+ఇంద్రుల్= తొలుతటి మునివర్యులు; ఆ+జలంబున్= ఆ నీటిని; అర్ఘ్యంబు+అని= పూజకు పనికివచ్చే పవిత్రమైనదని; చెప్పుదురు= చెప్తుతారు.

తాత్పర్యం: ఇట్లా అని గోవు నిచ్చాను. ఆ విద్యావంతుడి చేతిలో ప్రీతితో నీటిధార వదలాలి. అట్లా వదలిన నీరు అర్ఘ్యం అని తొలుతటి మునిశ్రేష్ఠులు చెప్తుతారు.

విశేషం: ఇచ్చితి - ఇది భూతకాలక్రియ. ఇది దీని మీది మమకారాన్ని ఇంతకుముందే కోసివేశాను అన్న స్ఫురణ కలిగిస్తుంది. దానం ధారాపూర్వకంగా చెయ్యాలి. చేతిలోనుండి వదలిన నీరు మళ్ళీ తనకు అందని విధంగా దానం ఇచ్చిన వస్తువు మళ్ళీ తన దగ్గరకు చేరకూడదు అనే స్ఫూర్తి ఇందులో ఉన్నది. అర్ఘ్యం అంటే పవిత్రజలం. ఆదిమునీంద్రులు చాలా ప్రామాణికులు. వారు చెప్పిన మాటలలో పొల్లు ఉండదు అని భావం.

క. విను శిష్యుఁడు వ్రతశీలుం । డనఘుఁడు శాంతుండు దాంతుఁ డక్రోధనుఁ డీ
వినుత ప్రదాన విధికిని । జననాథవరేణ్య! యెఱుఁగు సత్పాత్రంబుల్. 14

ప్రతిపదార్థం: జననాథవరేణ్య!= రాజోత్తమా! విను= వినుము; ఈ వినుత ప్రదాన విధికిని= కొనియాడ దగిన ఈ దాన కార్యానికి; శిష్యుఁడు= విద్యనేర్చుకొనే స్వభావం కలవాడూ; వ్రతశీలుఁడు= పుణ్యకార్యాలు చేయటం శీలంగా ఉన్నవాడూ;

అనఘుఁడు= పాపాలు లేనివాడూ; శాంతుండు= కామమూ, క్రోధము మొదలగు వికారాలు లేనివాడూ; దాంతుఁడు= ఇంద్రియాలమీద అదుపుగలవాడూ; అక్రోధనుఁడు= క్రోధం లేనివాడూ; సత్పాత్రంబుల్= మంచి యోగ్యత కలవారు; ఎఱుఁగు= తెలిసికొనుము.

తాత్పర్యం: నాయనా! రాజశ్రేష్ఠా! గోవులను దానం పుచ్చుకొనటానికి విద్యావంతుడూ, పుణ్యకారాలు చేసేవాడూ, పాపాలు లేనివాడూ, శాంతమైన మనస్సు కలవాడూ, ఇంద్రియాల వికారం లేనివాడూ, క్రోధం లేనివాడూ యోగ్యులు.

విశేషం: శిష్యుడంటే గురుశాసనానికి లోబడి ప్రవర్తించేవాడు. ఎన్ని వ్రతాలు చేసినా ఒక్కపాపం ఆ పుణ్యాన్నంతటినీ కొట్టివేస్తుంది. కనుక వ్రతాలు చేసినా పాపాల జోలికి పోనివాడై ఉండాలి. 'శాంతుండు' అన్న దానిలోనే క్రోధం లేకపోవటం ఉన్నది. మరల 'అక్రోధనుడు' అని అనటం ఎందుకంటే ఎంత శాంతుడైనా క్రోధానికి బలియైపోయే ప్రమాదం ఎక్కువ. కనుక హెచ్చరిక కొరకు పునరుక్తి.

ఆ. ఇవ్విధమున గోవు నిచ్చిన యాతండు । చంద్రలోక వసన సౌఖ్య మొందు'
నని సురేంద్ర మంత్రి యమ్మహీపాలుతో । నాదరమున నిట్టు లనియె మఱియు. 15

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ విధంగా; గోవున్= ఆవును; ఇచ్చిన+ఆతండు= ఇచ్చిన వ్యక్తి; చంద్రలోక వసన సౌఖ్యము= చంద్రలోకంలో నివాసం పొందిన సుఖాన్ని; ఒందున్= పొందుతాడు; అని= అని పలికి; సురేంద్రమంత్రి= దేవేంద్రుడి మంత్రి అయిన బృహస్పతి; ఆ+మహీపాలుతోన్= ఆ రాజు మాంధాతతో; ఆదరమునన్= ఆదరంతో; మఱియున్= ఇంకా; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా గోవును దాన మిచ్చిన వ్యక్తి చంద్రలోకంలో నివసించే సుఖం పొందుతాడు' అని చెప్పి బృహస్పతి ఆ మాంధాతతో ప్రీతితో ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: మాంధాత అడిగిన విషయం బృహస్పతి చెప్పాడు. కానీ విషయంమీద ఉన్న ప్రీతితో అడక్కపోయినా బృహస్పతి మరికొంత విషయాన్ని చెప్పుతున్నాడు.

ఉ. మానవుఁ డోపి యాశ్వయుజ మాసము రెండవు నష్టమిం దగం
బూని దినత్రయంబు పరిపూజిత గోష్ఠతలంబునన్ వ్రతా
ధీనతఁ బెండ యన్నమును ధేనువు మూత్రముఁ బాలుఁ బానముం
గా నియతిన్ వసించి బహు కామ్యఫలంబులఁ బొందు భూవరా! 16

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; మానవుఁడు= మనుష్యుడు; ఓపి= సమర్థుడై; ఆశ్వయుజ మాసము రెండు+అవు+అష్టమిన్= ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం అష్టమినాడు; తగన్= చక్కగా; పూని= సంకల్పించి; దినత్రయంబు= మూడు రోజులు; గోష్ఠతలంబునన్= గోశాలలో; వ్రత+అధీనతన్= వ్రతానికి పూర్తిగా వశమయి; పెండ= పేడ; అన్నమును= అన్నము; ధేనువు మూత్రమున్= ఆవు పంచితం; పాలున్= పాలూ; పానమున్ = త్రాగేదీ; కాన్= కాగా; నియతిన్= నిష్ఠతో; వసించి= ఉండి; బహు కామ్య ఫలంబులన్= పెక్కు కోరిన ఫలాలను; పొందున్= పొందుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజా! మానవుడు ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం అష్టమి మొదలుకొని మూడు రోజులు గొడ్ల సావిడిలో వ్రతనిష్ఠతో ఉండాలి. పేడనే అన్నంగా, మూత్రమే పాలూ నీరుగా నిష్ఠతో నివసించాలి. ఆ విధంగా కోరిన కోర్కెలు ఎన్నింటినో పొందుతాడు.

విశేషం: ఓపి తగన్ అనే మాటలు ఏ కొంచెమూ ఏవగించుకొనరా దనే హెచ్చరికను సూచిస్తాయి. నిజానికి ఆవులు పేడా మూత్రమూ రోగాలన్నీ రూపుమాపే పదార్థాలుగా ఇప్పటి శాస్త్రవేత్తలు కూడా గుర్తిస్తున్నారు.

వ. అని చెప్పె నట్లు బృహస్పతి నిర్దేశించిన తెఱంగున మాంధాతృండు మహీసురులకు గోవుల నిచ్చి యుభయ లోకంబులను వినుతుండయి వెలింగె; నవ్విధం బెఱింగి గో ప్రదానపరులైన భరత దిలీప భగీరథ దాశరథి ప్రభృతి భూపతులు పుణ్యలోకంబులు వడసిరి; పాండవాగ్రజా! నీవును దేవగురూపదిష్టంబు లయిన యివ్వాక్యం బులు భావగతంబులు సేసికొని గో విషయ విధిజ్ఞుండవై విప్రోత్తములకు నుత్తమ గో ప్రచయంబుల ని' మ్మనిన నమ్మనుమండు తాతకుం బ్రీతిం బ్రణామంబు సేసిన, నమ్మహాత్ముండు వెండియు నవ్విభున కిట్లనియె. 17

ప్రతిపదార్థం: అని; చెప్పెన్= చెప్పాడు; అట్లు= ఆ విధంగా; బృహస్పతి నిర్దేశించిన తెఱంగునన్= బృహస్పతి చెప్పిన పద్ధతి ప్రకారం; మాంధాతృండు= మాంధాత; మహీసురులకున్= బ్రాహ్మణులకు; గోవులన్= ఆవులను; ఇచ్చి= దానం చేసి; ఉభయ లోకంబులను= ఈ లోకంలోనూ, పరలోకంలోనూ; వినుతుండు+అయి= ప్రశంసలు పొందినవాడై; వెలంగెన్= ప్రకాశించాడు; ఆ+విధంబు= ఆ పద్ధతిని; ఎఱింగి= తెలిసికొని; గో ప్రదానపరులు+ఐన= ఆవులను దానమిచ్చే ఆసక్తికల; భరత, దిలీప,భగీరథ, దాశరథి, ప్రభృతి భూపతులు= భరతుడు, దిలీపుడు, భగీరథుడు, రాముడు మొదలైన రాజులు; పుణ్యలోకంబులు= పుణ్య లోకాలను; పడసిరి= పొందారు; పాండవ+అగ్రజ!= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజా!; నీవును= నీవుకూడా; దేవగురు+ ఉపదిష్టంబులు+అయిన= దేవగురువు బృహస్పతి చెప్పిన; ఈ+వాక్యంబులు= ఈ మాటలు; భావగతంబులు= భావంలో నిలిచినవిగా; చేసికొని; గో విషయ విధిజ్ఞుండవు+ఐ= ఆవులకు సంబంధించిన కర్తవ్యాలను తెలిసికొన్నవాడవై; విప్ర+ ఉత్తములకున్= శ్రేష్ఠులూ; విద్యావంతులూ అయిన బ్రాహ్మణులకు; ఉత్తమ గో ప్రచయంబులన్= మేలైన ఆవుల మందలను; ఇమ్ము= ఇవ్వుము; అనినన్= అని పలుకగా; ఆ+మనుమండు= ఆ మనుమడు; తాతకున్= తాతకు; ప్రీతితోన్= ప్రేమతో; ప్రణామంబు+ చేసినన్= మ్రొక్కగా; ఆ+మహాత్ముండు= గొప్పహృదయ ధర్మంగల ఆ భీష్ముడు; వెండియున్= ఇంకా; ఆ+విభునకున్= ఆ రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పాడు. మాంధాత బృహస్పతి మాట ప్రకారం శ్రేష్ఠులైన బ్రాహ్మణులకు ఆవులను దానంచేసి ఇహపరలోకాలలో ప్రసిద్ధిపొందాడు. ఆ విధానం తెలిసికొని భరతుడు, దిలీపుడు, భగీరథుడు, రాముడు మొదలైన రాజులు కూడా శ్రద్ధతో గోదానాలు చేసి పుణ్యలోకాలు చేరుకొన్నారు. ధర్మరాజా! నీవు కూడా బృహస్పతి చెప్పిన మాటలను హృదయంలో పదిలపరచుకొని ఆవులకు సంబంధించిన శాస్త్రవిషయాలను చక్కగా తెలిసికొని బ్రహ్మవిద్యలో ఆరితేరిన బ్రాహ్మణులకు మేలైన ఆవులను మందలకొలదీ దానమిమ్ము' అన్నాడు. ఆ మాటలకు ధర్మరాజు ఎంతో ఆనందపడి తాతకు సాష్టాంగ దండప్రణామం చేశాడు. అప్పుడు భీష్ముడు అతనికి ఇంకా ఇట్లా చెప్పాడు.

విశేషం: మాంధాతతోపాటు మరికొందరు పురాతన రాజులను చెప్పటం భావం దృఢపడటం కొరకు. విప్రోత్తములకు అనటం వలన 'విద్యయా యాతి విప్రత్వం' - విద్యచేతనే విప్రత్వం కలుగుతుంది అన్నమాటలనుబట్టి విద్య అంటే పరమార్థ విద్యయే. కనుక అట్టి వారిలో ఉత్తములకు దానమిస్తే దానఫలం ఉత్తమంగా ఉంటుందని సూచన. ఉత్తమ గోవులను అనటంవలన పనికిమాలిన వాటిని వదలించుకొనటానికి దానం ఇవ్వరాదని హెచ్చరిక.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. రేపకడ నీరు ద్రావక । మేపు గొనక మున్న గోవు మిక్కిలి భక్తిన్

భూపాల యిచ్చునది ది । వ్యాపార సుఖంబుఁ బడయ నాత్మఁ దలఁచినన్. 18

ప్రతిపదార్థం: భూపాల!= రాజా!; దివ్య+అపార సుఖంబున్= స్వర్గంలోని అంతులేని సుఖాన్ని; పడయన్= పొందటానికి; ఆత్మన్= హృదయంలో; తలఁచినన్= తలచినట్లైతే; రేపకడన్= ప్రొద్దుననే; నీరు= నీటిని; త్రావక= త్రాగకుండా; మేపుకొనక మున్న= మేత మేయకముందే; మిక్కిలి భక్తిన్= గొప్ప భక్తితో; గోవున్= ఆవును; ఇచ్చునది= ఇమ్ము.

తాత్పర్యం: ధర్మరాజా! స్వర్గ సుఖాలు అపారంగా పొందాలి అనే కోరిక మనసులో ఉంటే ఉదయాన్నే గోవు నీరుత్రాగకముందే మేతమేయకముందే గొప్ప భక్తితో దానము చేయవలయును.

విశేషం: దానం ఒక పవిత్రమైన ఉపాసనవంటిది. అది చేయదలచినవాడు శాస్త్రవిధి నతిక్రమించకూడదు.

క. మొదవులలో నెల్లఁ గపిల । మొదవు వరిష్ఠంబు రాజముఖ్య! నియతిమై

నది విప్రున కిచ్చు టరయఁ । దుది దానంబులకు; నఱకు దురితాటవులన్.' 19

ప్రతిపదార్థం: రాజముఖ్య!= రాజశ్రేష్ఠా!; మొదవులలోన్ ఎల్లన్= ఆవులన్నింటిలో; కపిల మొదవు= పుల్లావు; వరిష్ఠంబు= మేలైనది; నియతిమైన్= నిష్ఠతో; అది= దానిని; విప్రునకున్= విద్యలో ఆరితేరిన వాడికి; ఇచ్చుట= ఇవ్వటం; అరయన్= పరిశీలిస్తే; దానంబులకున్= దానాలకు; తుది= చివరిది; దురిత+అటవులన్= పాపాలనే అడవులను; నఱకున్= నరికివేస్తుంది.

తాత్పర్యం: రాజా! ఆవులలో పుల్లావు చాలా మేలైనది. దానిని నిష్ఠతో విప్రుడికి దానం చేయటం దానాలకు చివరిమెట్టు. అది పాపమనే అడవులను నరికివేస్తుంది.'

విశేషం: గోరోజనం రంగుగల ఆవులను పుల్లావు లంటారు. 'తుది' అంటే మరొకదానం చేయనక్కరలేదని భావం. 'దురిత మనే అటవి' అన్నరూపకంవలన పాపాల చెడ్డఫలితాలు ఎంత గాఢంగా ఉంటాయో భావనకు వస్తుంది.

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు 'కపిలగోవున కీ విశేషం బెట్లు గలిగె నెఱింగింపవే' యనుటయు గాంగేయుం

డతని కిట్లనియె. 20

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని=ఆలకించి; కౌంతేయ+అగ్రజుండు= కుంతికొడుకులలో పెద్దవాడు; కపిల గోవునకున్= పుల్లావుకు; ఈ విశేషంబు= ఈ గొప్పతనం; ఎట్లు= ఏ విధంగా; కలిగెన్= కలిగింది; ఎఱింగింపవే= తెలియజేయుము; అనుట యున్= అనగా; గాంగేయుండు= గంగకొడుకు భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు= ఈ విధంగా; అని యెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ మాట విని ధర్మరాజు 'తాతా! పుల్లావుకు ఆ మహిమ ఎట్లా వచ్చిందో చెప్పుము' అంటే భీష్ము డతడితో ఇట్లా అన్నాడు.

గోవులకుఁ గపిలత్వంబు సిద్ధించిన ప్రకారము (సం.13-76-21)

సీ. 'దేవత లాఁకొని దేవతాజ్యేష్ఠునిఁ । గానంగఁ బోవ నా కమలజన్ముఁ

డమృత మిచ్చిన ముదమారఁగాఁ ద్రావఁ ద । త్పురభిత్వ సంపద సురభి పుట్టె;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నది సౌరభేయుల నధిప! యుత్పాదించె; నొక యప్డు హిమగిరి యుపరితల మ

లంకరించుచు నవి శంక యించుక లేక । యున్నెడ వానిలో నొకటి లేఁగ

ఆ. చన్ను గుడువఁ దదాస్య నిష్యంద మాన । మైన దుగ్ధ ఫేనము పవమాన నిహతిఁ

దూలి తప ముగ్రముగఁ జేయు శూలి మౌళిఁ । బడిన నద్దేవుఁ డధికకోపంబు గదుర. 21

ప్రతిపదార్థం: దేవతలు= దేవలోకంవారు; ఆఁకొని= ఆకలిపొంది; దేవతాజ్యేష్ఠునిన్= బ్రహ్మను; కానంగన్= చూడటానికి; పోవన్= పోతే; ఆ కమలజన్ముఁడు= కమలంలో పుట్టిన ఆ బ్రహ్మ; అమృతమున్= అమృతాన్ని; ఇచ్చినన్= ఇవ్వగా; ముదము+ ఆరఁగాన్= తృప్తితీరేటట్లు; త్రావన్= త్రాగగా; తత్ సురభిత్వ సంపదన్= దాని వాసన ఎక్కువతనానికి; సురభి= కామధేనువు; పుట్టెన్= పుట్టింది; అధిప!= రాజా!; అది= కామధేనువు; సౌరభేయులన్= ఆవులను; ఉత్పాదించెన్= పుట్టించింది; ఒక+అప్డు= ఒక సమయంలో; అవి= ఆ ఆవులు; హిమగిరి ఉపరితలము= మంచుకొండ పై భాగాన్ని; అలంకరిం చుచున్= అందగింపజేస్తూ; శంక= జంకు; ఇంచుక= కొంచెం కూడా; లేక ఉన్న+ఎడన్= లేకుండా ఉన్నప్పుడు; వానిలోన్= ఆ ఆవులలో; ఒకటి= ఒక్కటి; లేఁగ= దూడ; చన్ను కుడువన్= పొదుగులో పాలు త్రాగుతూ ఉంటే; తత్ ఆస్య నిష్యంద మానము+ఐన= దాని మోమునుండి జారుచున్న; దుగ్ధ ఫేనము= పాల నురుగు; పవమాన నిహతిన్= గాలిదెబ్బకు; తూలి= చెదరి; తపము= తపస్సు; ఉగ్రముగన్= తీవ్రంగా; చేయు= చేస్తున్న; శూలి= శివుడి; మౌళిన్= తలమీద; పడినన్= పడగా; ఆ+దేవుఁడు= ఆ ప్రభుడు; అధిక కోపంబు= ఎక్కువ కోపం; కదురన్= కలుగగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: దేవతలకు ఆకలి వేసింది. బ్రహ్మ దగ్గరకు వెళ్ళారు. ఆయన అమృత మిచ్చాడు. వారు తనివితీరా త్రాగారు. ఆ అమృతపు సువాసనకు కామధేనువు పుట్టింది. దానికి ఆవులు పుట్టాయి. అవి ఒకప్పుడు హిమాలయం పై భాగాన అలంకారంగా తిరుగుతున్నాయి. వానిలో ఒక ఆవు లేగ పాలు త్రాగుతూ ఉంటే దానినోటి దగ్గరి నురుగు గాలివాటానికి ఎగిరి అక్కడ తీవ్రంగా తపస్సు చేస్తున్న శివుడి నెత్తిమీద పడింది. శివుడికి చాలా కోపం వచ్చింది.

విశేషం: 'శూలి' అనే పదం సాభిప్రాయం. అది ఆయనకోపానికి అనుగుణంగా వచ్చి పడింది.

క. చిచ్చఱకన్నదరు లెగయ । విచ్చినఁ గపిలత్వ మొందె విబుధప్రకరం

బచ్చెరు వందుచుఁ గన్గొన । నచ్చేరువ సౌరభేయు లమలచరిత్రా! 22

ప్రతిపదార్థం: అమల చరిత్రా!= స్వచ్ఛమైన ప్రవర్తనగల ఓ రాజా!; చిచ్చఱ కన్ను= నిప్పులు గ్రక్కే (మూడవ) కన్ను; అదరులు= నిప్పు కణికలు; ఎగయన్= ఎగిరి పడేటట్లుగా; విచ్చినన్= తెరువగా; ఆ+చేరువ సౌరభేయులు= ఆ దగ్గరలో ఉన్న ఆవులు; విబుధ ప్రకరంబు= దేవతల సముదాయం; అచ్చెరువు+అందుచున్= ఆశ్చర్యపడుతూ; కన్గొనన్= చూస్తూ ఉండగా; కపిలత్వము= గోరోచనం వన్నెను; ఒందెన్= పొందాయి.

తాత్పర్యం: శివుడి అగ్నిమయమైన మూడవ కన్ను నిప్పులు గ్రక్కుతూ తెరుచుకొనేసరికి ఆ ప్రాంతంలో ఉన్న ఆవులన్నీ, దేవతలు ఆశ్చర్యపడుతూ ఉండగా, ఎర్రని రంగును పొందాయి.

విశేషం: పద్యం చిన్న ప్రమాణం. అది హఠాత్తుగా జరిగిన సంఘటనకు వ్యంజకంగా రూపొందింది. 'చిచ్చు' అనే చిన్న శబ్దంలో మూడు చకారాలు ఉన్నాయి. అవి అగ్ని చిటపటలను సూచిస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అవి బిట్టు బెదరఁ దక్కటి । యవియు నదరి బెదరె; నిట్టు లగ్గోవులు వా
ఱె వెసను సోముని పాలికి । నవనీశ్వర! దాని నెఱిఁగి యజుఁ డేతెంచెన్. 23

ప్రతిపదార్థం: అవనీ+ఈశ్వర!= రాజా!; అవి= అట్లా క్రొత్త రంగు వచ్చిన ఆవులు; బిట్టు= పెద్దగా; బెదరన్= భయపడగా; తక్కటి అవియున్= మిగిలినవి కూడా ; అదరి= హడలి; బెదరెన్= భయపడిపోయాయి; ఇట్టులు= ఈ విధంగా; ఆ+గోవులు= ఆ ధేనువులు; పాఱెన్= పారిపోయాయి; వెసను= వెంటనే; దానిన్= ఆ సంగతిని; ఎఱిఁగి= తెలిసికొని; అజుఁడు= బ్రహ్మ; సోముని పాలికిన్= శివుడి దగ్గరకు; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: అట్లా రంగుమారిన ఆవులు బెదరేసరికి తక్కిన ఆవులు బెదరి పారిపోయాయి. ఆ సంగతి తెలిసికొని బ్రహ్మదేవుడు శివుడి దగ్గరకు వచ్చాడు.

విశేషం: తాను సృజించిన గోవులు శివుడి కోపానికి గురి అయ్యాయి కనుక ఆ కోపాన్ని పోగొట్టటం బ్రహ్మ బాధ్యత.

సీ. ఏతెంచి నిభృతిమై నీశ్వరు చరణాంబు । జములకు నెఱఁగి హస్తములు మొగిచి
యమృతసిక్తుఁడ వైతి వఖిలేశ! గోవుల । కెంగిలి లే; దిందుఁ డెట్టు లమృత
మొసఁగు నట్టుల గోవు లొసఁగు దుగ్ధంబులఁ । దద్వత్స పీత దుగ్ధంబు శుచియ
కాన కోపము దక్కి కరుణింపు' మని యొక్క । కమనీయ వృషభంబుఁ గప్ప మిచ్చె;

ఆ. శివుఁడు ప్రియమంది దానిఁ గేతువును వాహ । నంబుగాఁ జేసి సకలజనంబు నెలమి
వృషభకేతనుఁ డనియును, వృషభవాహ । నుం డనియుఁ బేర్కొనఁగ నొప్పియుండె నధిప! 24

ప్రతిపదార్థం: అధిప!= రాజా! ఏతెంచి= వచ్చి; నిభృతిమైన్= నిండుదనంతో; ఈశ్వరు చరణ+అంబుజములకున్= శివుడి పాదములనే పద్మాలకు; ఎఱఁగి= మ్రొక్కి; హస్తములు= చేతులు; మొగిచి= మోడ్చి; అఖిల+ఈశ= సర్వప్రభూ!; అమృత సిక్తుఁడవు= అమృతంతో తడిసినవాడవు; ఐతివి= అయ్యావు; గోవులకున్= ఆవులకు; ఎంగిలి= నోటినుండి జారిన దాని దోషం; లేదు; ఇందుఁడు= చంద్రుడు; ఎట్టులు= ఏ విధంగా; అమృతము= అమృతాన్ని; ఒసంగున్= ఇస్తాడో; అట్టులన్= ఆ విధంగానే; గోవులు= ఆవులు; దుగ్ధంబులన్= పాలను; ఒసఁగున్= ఇస్తాయి; తద్ వత్స పీత దుగ్ధంబున్= వాటి దూడలు త్రావినపాలు కూడా; శుచి+అ= నిర్మలమే; కాన= కనుక; కోపము= కోపాన్ని; తక్కి= వదలి; కరుణింపుము= దయజూడుము; అని= అని పలికి; ఒక్క కమనీయ వృషభంబున్= ఒక అందమైన ఎద్దును; కప్పమున్= కానుకగా; ఇచ్చెన్= ఇచ్చాడు; శివుఁడు= ఈశ్వరుడు; ప్రియము+అంది= సంతోషం పొంది; దానిన్= ఆ ఎద్దును; కేతువును= జెండామీద గుర్తుగా; వాహనంబుగాన్= ఎక్కిరింతగా; చేసి= ఏర్పరచి; ఎలమిన్= ప్రీతితో; సకలజనంబున్= జనులంతా; వృషభకేతనుఁడు=ఎద్దు టెక్కెంగా కలవాడు; అనియును= అనీ; వృషభ వాహనుండు= ఎద్దు వాహనంగా కలవాడు; అనియున్= అనీ; పేర్కొనఁగన్= పేరు పెట్టి వ్యవహరిస్తూ ఉంటే; ఒప్పి+ఉండెన్= చక్కగా ఉన్నాడు.

తాత్పర్యం: రాజా! బ్రహ్మ అట్లా వచ్చి ఈశ్వరుడి కాళ్ళకు మ్రొక్కాడు. చేతులు జోడించి స్వామీ! 'నీవు అమృతంతో తడిశావు. ఆవులకు ఎంగిలి లేదు. చంద్రు డమృతం ఇచ్చినట్లు ఆవులు పాలిస్తాయి. కాబట్టి వాటి దూడలు త్రావిన పాలు కూడా పరిశుద్ధాలే. కనుక కోపం వదలి మమ్మల్ని కరుణించుము' అని ఒక చక్కని ఎద్దును కానుకగా ఇచ్చాడు. శివుడు ప్రీతిపొంది దానిని ధ్వజంమీద గుర్తుగా, వాహనంగా చేసికొని వృషభకేతనుడు, వృషభవాహనుడు అని అందరూ తన్ను పిలుస్తూ ఉంటే సంతోషంతో ఉన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: శంకరుడు బోళావ్యక్తి కదా! వెంటనే కోపం పోగొట్టుకొన్నాడు. ఉచ్ఛిష్టం అంటే తింటున్న పదార్థం వెలుపలికి రావటం. అది ఎంగిలి. దానిని ఆచారనిష్ఠ కలవారు అంటరు. బ్రహ్మ ఆవులకు ఆ దోషం లేదని శివుడికి చెప్పాడు.పైగా ఆ ఆవు పాలూ అమృతమూ ఒకే రకమైనవని కూడా చెప్పాడు.

వ. ఇట్లు ప్రసన్నుండయి గో సంచారం బెందునుం గలుగునట్లుగా ననుగ్రహించిన నా సౌరభేయీ సముదయంబు మగుడ నన్నగంబునకు వచ్చి విచ్చలవిడి వర్తింపంజూచి, తన చూపునం గపిల లయిన గోవులకుం దక్కిన వర్ణంబుల కంటె నుత్తమత్వంబు గలుగ వరం బిచ్చి విరించిని వీడ్కొలిపె; నట్లు గావునం గపిల గోప్రదానంబు గోదాన కల్పంబున కంతకు నధికం బని చెప్పి. 25

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ప్రసన్నుండు+అయి= కోపం పోయినవాడై; గో సంచారంబు= ఆవులు తిరగటం; ఎందునున్= ఎక్కడయినా; కలుగు+అట్లు+కాన్= కలిగే విధంగా; అనుగ్రహించినన్= వరంగా ఇవ్వగా; ఆ సౌరభేయీ సముదయంబు= ఆ ఆవుల మంద; మగుడన్= తిరిగి; ఆ+నగంబునకున్= ఆ కొండకు; వచ్చి; విచ్చలవిడిన్= ఇష్టం వచ్చినట్లుగా; వర్తింపన్= తిరుగుతూ ఉంటే; చూచి= కనుగొని; తన చూపునన్= తన దృష్టిచేత; కపిలలు అయిన గోవులకున్= కపిలవర్ణం పొందిన ఆవులకు; తక్కిన వర్ణంబుల కంటెన్= తక్కిన రంగుల ఆవులకంటె; ఉత్తమత్వంబు= శ్రేష్ఠత్వం; కలుగన్= కలిగేటట్లు; వరంబు= వరాన్ని; ఇచ్చి; విరించిని= బ్రహ్మను; వీడ్కొలిపెన్= పంపించాడు; అట్లు+కావునన్= ఆ తీరు అయినది కనుక; కపిల గోప్రదానంబు= పుల్లావులను దానం చేయటం; గో దాన కల్పంబునకున్= గోవులను దానం చేయటమనే విధానానికి; అంతకున్= మొత్తానికి; అధికంబు= మిన్న; అని; చెప్పి.

తాత్పర్యం: శివు డిట్లా ప్రసన్నుడై గోవులు ఎక్కడైనా ఇచ్చవచ్చినట్లు తిరిగేటట్లుగా వరం ఇచ్చాడు. ఆవుల మంద మరల ఆ కొండకు వచ్చి స్వేచ్ఛగా తిరగటం చూచి, తన చూపునకు కపిలవర్ణం పొందిన ఆవులు తక్కిన రంగుల ఆవులకంటె గొప్పవిగా వర మిచ్చి బ్రహ్మను అతడి లోకానికి పంపాడు. కనుక గోదాన పద్ధతిలో కపిలగోవులను దానం చేయటం గొప్ప విషయం అని చెప్పి.

విశేషం: మహానుభావుల కోపం కూడా విశేషఫలాన్ని ఇస్తుం దనటానికి ఇది ఒక దృష్టాంతం.

క. ఈ కపిలాఖ్యానము సు । శ్లోకము; దీని పఠనంబు శ్రుతముఁ గలిమలో
ద్రేకంబుఁ బాచి సుతుల న । నేక ధనంబులను బెంపు నిచ్చు నరేంద్రా!' 26

ప్రతిపదార్థం: నరేంద్రా!= రాజా!; ఈ కపిలా+ఆఖ్యానము= ఈ కపిలగోవు కథ; సుశ్లోకము= మిక్కిలి పవిత్రమైనది; దీని పఠనంబు= దీనిని చదవటమూ; శ్రుతమున్= వినటమూ; కలిమల+ఉద్రేకంబున్= కలి కల్మషం పెచ్చు పెరగటాన్ని; పాచి=తొలగించి; సుతులన్= కుమారులను; అనేక ధనంబులను= పెక్కు ధనాలను; పెంపున్= గొప్పతనాన్నీ; ఇచ్చున్= ఇస్తుంది.

తాత్పర్యం: రాజా! ఈ కపిల గోవుల కథ చాలా పవిత్రమైనది. దీన్ని చదివినా, విన్నా సకల పాపాల విజృంభణం అణగి పోతుంది. మంచి సంతానాన్ని, గొప్ప ధనాలను ఇది ఇస్తుంది.'

విశేషం: మానవుడు వివేకంతో కోరవలసినవి అనిష్టాన్ని తొలగించుకొనటం, ఇష్టాన్ని కూర్చుకొనటం. అందుకే ఈ పద్యంలో ముందు పాపాలు పటాపంచ లవటాన్నీ, తరువాత సుతధనలాభాన్నీ చెప్పాడు.

వ. అనిన విని ధర్మపుత్త్రుండును దమ్ములును సమ్మోదంబు నొంది భీష్మునకుం బ్రణమిల్లి గోప్రదానంబులు విధి సంపన్నంబులుగాఁ జేయువారై మనంబులం బూని; రప్పితామహుం డప్పాండవాగ్రజు నుద్దేశించి వెండియు నిట్లనియె. 27

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ధర్మపుత్త్రుండును= ధర్మరాజున్నూ; తమ్ములును= తమ్ముళ్ళూ; సమ్మోదంబున్+ఒంది= ఎంతో ఆనందపడి; భీష్మునకున్= భీష్ముడికి; ప్రణమిల్లి= సాష్టాంగ దండం చేసి; గో ప్రదానంబులు= గోవులను మంచి బుద్ధితో ఇవ్వటాలను; విధి సంపన్నంబులుగాన్= శాస్త్ర విధానం నిండుగా ఉండే విధంగా; చేయువారు+ఐ= చేసేవారై; మనంబులన్= హృదయాలలో; పూనిరి= సంకల్పించారు; ఆ+పితామహుండు= ఆ తాత; ఆ+పాండవ+అగ్రజున్= పాండుకుమారులలో పెద్దవాడైన ధర్మరాజును; ఉద్దేశించి= చూచి; వెండియున్= ఇంకను; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: తాత ఇట్లా చెప్పగా ధర్మరాజూ, తమ్ములూ పరమానందం పొందారు. భీష్ముడికి సాష్టాంగ నమస్కారం చేశారు. గోదానాలను శాస్త్రవిధానంతో ఏ లోపం లేకుండా చేయాలని సంకల్పించారు. ఆ తాత మళ్ళీ ధర్మరాజును చూచి ఇట్లా అన్నాడు.

విశేషం: తమ్ములును అనటంవలన మంచిపనులు చేయటంలో వారు ధర్మరాజువంటివారే అనే అర్థం స్ఫురిస్తుంది. ప్రణమిల్లి- ఒక్కొక్క మహావిషయం విన్నప్పుడల్లా వారికి భీష్ముడిమీద గౌరవం ఇనుమడిస్తున్నదని తాత్పర్యం. పితామహుడు - తాతకు మనుమల మీద విశేషానురాగం ఉంటుంది.

సీ. 'సౌదాసుఁ డనఁగ నిక్ష్వాకు కులంబున । జనియించె; నాతఁడు మునివరేణ్యుఁ
డైన వసిష్ఠుని నాత్మపురోహితు । వినతుఁ డై యడిగెఁ బవిత్ర మెద్ది?
యని దాని కాదర మతిశయిల్లఁగ నమ్మ । హాత్ముఁ డిట్లనియెఁ 'బుణ్యాత్మ! వినుము
గోవు పవిత్రంబు గోవు హవిర్జన్మ । భూమి గో వరయఁగా భూతములకు

ఆ. నెల్ల నాధారభూతమౌ నీడ్యవస్తు । వతుల లక్ష్మికి మూల; మత్యంత దురిత
జలనిధికి నోడ; నిర్జర సద్మమునకు । నసఘ! నిచ్చెన సురలకు మనికిపట్టు.' 28

ప్రతిపదార్థం: ఇక్ష్వాకు కులంబునన్= ఇక్ష్వాకుడి కులంలో; సౌదాసుఁడు అనఁగన్= సౌదాసుడనే పేరుతో; జనియించెన్= (ఒక రాజు) పుట్టాడు; ఆతఁడు= ఆ రాజు; మునివరేణ్యుఁడు+ఐన= మునులలో శ్రేష్ఠుడైన; వసిష్ఠునిన్= వసిష్ఠుడిని; ఆత్మ పురోహితున్= తన పురోహితుడిని; వినతుఁడు+ఐ= వినయం కలవాడై; పవిత్రము= పవిత్రమైనది; ఎద్ది= ఏది? అని, అడిగెన్= అడిగాడు; ఆ+మహాత్ముఁడు= దొడ్డబుద్ధి గల ఆ వసిష్ఠుడు; దానికిన్; ఆదరము= ప్రీతి; అతిశయిల్లఁగన్= పెంపొందగా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; పుణ్య+ఆత్మ= ఓయి పుణ్య హృదయుడా!; వినుము; అనఘ!= పాపాలు లేనివాడా; గోవు= ఆవు; పవిత్రంబు= పవిత్రం అయినది; గోవు= ఆవు; హవిస్+జన్మభూమి= హోమపదార్థాలకు పుట్టిన ఇల్లు; అరయఁ గాన్= మెలకువతో చూస్తే; గోవు= ఆవు; భూతములకున్+ఎల్లన్= అన్ని ప్రాణులకు; ఆధార భూతము+ఔ= ఆధారంగా అయిన; ఈడ్య వస్తువు= పూజించదగిన వస్తువు; అతుల లక్ష్మికిన్= సాటిలేని సంపదకు; మూలము= కుదురు; అత్యంత దురిత జనిధికిన్= మిక్కిలి ఘోరమైన పాపాలనే సముద్రానికి; ఓడ; నిర్జరసద్మమునకున్= దేవతల నెలవైన స్వర్గానికి; నిచ్చెన= నిచ్చెన; సురలకున్= దేవతలకు; మనికిపట్టు= నివసించే చోటు.

తాత్పర్యం: ఇక్ష్వాకువంశంలో సౌదాసుడనే రాజు ఉండేవాడు. మునులలో ఉత్తముడూ, తన పురోహితుడూ అయిన వసిష్ఠుడిని ఆ రాజు వినయంతో 'స్వామీ! పవిత్రమైన దేది?' అని అడిగాడు. ఎంతో ప్రీతి పొంది ఆ మహాత్ముడు ఇట్లా అన్నాడు. 'పుణ్యాత్ముడా! వినుము! గోవు పవిత్రమైనది. గోవు హోమద్రవ్యాలకు పుట్టినిల్లు. అన్ని ప్రాణులకూ గోవే ఆధారం. అది పూజ్యమైనది. సాటిలేని సంపదలకు మూలం. మహాపాపా లనే సముద్రాన్ని దాటటానికి ఓడ, స్వర్గానికి నిచ్చెన, దేవతలకు నివాసస్థలం.'

విశేషం: మునివరేణ్యుడు, ఆత్మ పురోహితుడు కనుక తా నడిగే ప్రశ్నకు సరియైన సమాధానం చెప్పగలడని రాజునకు నమ్మకం. మంచి ప్రశ్న అడిగినందుకు వసిష్ఠుడికి ఎంతో ప్రీతి కలిగింది. అందుకనే 'పుణ్యాత్మ' అని సంబోధిస్తున్నాడు. పుణ్యాత్ములకు కాని ఇటువంటి జిజ్ఞాస కలుగదని భావం. వ్యవసాయానికీ, పాడిపంటలకు, యజ్ఞద్రవ్యాలకు గోవే ఆధారం కనుక దానివలననే మానవులకు సుఖశాంతులు వర్ధిల్లుతాయి కనుక ఈ ప్రశంస అస్థాన పతితం కాదు.

వ. అని చెప్పి మఱియును. 29

తాత్పర్యం: వసిష్ఠ డిట్లా చెప్పి మరికొన్ని విషయాలు చెప్పుతున్నాడు.

క. 'పదియును నూఱును వేయును । మొదవులు గలవారు దానములుగా నొకటిం
బదియింటి నూటి నిచ్చిన । నదియు నదియు నదియు నదృశమగు ఫలము నెడన్. 30

ప్రతిపదార్థం: పదియును= పదిన్నీ; నూఱును= వందా; వేయును= వేయీ; మొదవులు= ఆవులు; కలవారు= ఉన్నవారు; దానములుగాన్= దానాలుగా; ఒకటిన్= ఒక దానినీ; పదియింటిన్= పదింటినీ; నూటిన్= నూరింటినీ; ఇచ్చినన్= ఇస్తే; అదియున్= ఆ ఒక్కటి నిచ్చినదానమూ; అదియున్= ఆ పదింటి నిచ్చినదానమూ; అదియున్= ఆ నూరింటి నిచ్చిన దానమూ; ఫలము+ఎడన్= అందించే ఫలం విషయంతో; సదృశము= సమానం; అగున్= అవుతుంది.

తాత్పర్యం: 'పది ఆవులున్నవారు ఒకదానినీ, వంద ఆవులున్నవారు పదింటినీ, వేయి ఆవులున్నవారు నూరింటినీ దానం చేస్తే ఆ మూడు దానాల ఫలమూ సమానం అవుతుంది.

విశేషం: దానం అనేది శక్తినిబట్టి చేయాలి. దానం ముఖ్యం కానీ ఎంత? అనేది ప్రధానం కాదు. ఆ విధంగా ఫలితం సమానం అవుతుంది.

క. విను గోవులను బ్రభాతం । బునఁ దలఁచుట, తద్గుణములు వొగడుట, భక్తిం
గనుఁగొనుట యధిక పుణ్యము । లని యెఱిఁగించు జనములకు నాగమఫణితుల్. 31

ప్రతిపదార్థం: వినుము; ఆగమ ఫణితుల్= వేదకావ్యాలు; జనములకున్= జనాలకు; గోవులను= ఆవులను; ప్రభాతంబునన్= ప్రొద్దున; తలఁచుట= స్మరించటమూ; తత్‌గుణములు= వాని గుణాలను; పొగడుట= కొనియాడటమూ; భక్తిన్= భక్తితో; కనుఁగొనుట= (ఆవులను) చూడటమూ; అధిక పుణ్యములు= ఎక్కువ పుణ్యాలు; అని; ఎఱిఁగించున్= తెలియజేస్తాయి.

తాత్పర్యం: ఉదయకాలంలో ఆవులను తలవటమూ వాటి గుణాలను కొనియాడటమూ, భక్తితో వాటిని చూడటమూ గొప్ప పుణ్యకార్యాలని వేదవాక్యాలు జనాలకు తెలియజేస్తున్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'ఆగమం' అంటే శబ్ద ప్రమాణం. అది అన్ని ప్రమాణాలకంటె మిన్న అయినది. కాబట్టి దీనిలో సంశయించవలసిన దేమీ లేదని భావం. ప్రభాతంబున= అంటే దినారంభంలో, పుణ్యకార్యాలతో రోజుపని ప్రారంభిస్తే రోజంతా పుణ్యంతో నిండుతుందని భావం. 'విను' అనే మాట శ్రద్ధను సూచిస్తుంది.

ఆ. కిల్బిషంబు గోశకృన్మూత్రముల కేవ । పడుట సకలమాంసభక్షి కైన
ఘోరపాప మండ్రు గోమాంస భక్షణ । మబ్జసంభవాదు లైన సురలు. 32

ప్రతిపదార్థం: గో శకృత్+మూత్రములకున్= ఆవు పేడ, పంచితములకు; ఏవపడుట= రోతపడటం; కిల్బిషంబు= పాపం; అబ్జసంభవ+ఆదులు+ఐన= బ్రహ్మ మొదటగా ఉన్న; సురలు= దేవతలు; సకల మాంస భక్షికిన్+ఐనన్= అన్ని జంతువుల మాంసాలు తినేవానికి కూడా; గో మాంస భక్షణము= ఆవుల మాంసం తినటం; ఘోర పాపము= చాలా భయంకరమైన పాపం; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ఆవుల మలమూత్రాలకు రోతపడటం పాపం. అన్ని జంతువుల మాంసాలు తినే వారికైనా ఆవు మాంసం తినటం చాలా ఘోరమైన పాపం అని బ్రహ్మ మొదలైన దేవతలు అంటారు.

క. జనములు దుస్స్వప్నంబులు । గని గో కీర్తనము సేయఁగాఁ దద్దురితం
బునఁ బొరయరు గోమయయుత । వినుతాంబు స్నాన మతిపవిత్రం బనఘా! 33

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముఁడా!; జనములు= మానవులు; దుస్ స్వప్నంబులు= పీడకలలు; కని= పొంది; గో కీర్తనము= ఆవులను పొగడటం; చేయఁగాన్= చేస్తే; తత్ దురితంబునన్= ఆ పాపాన్ని; పొరయరు= పొందరు; గోమయ యుత వినుత+ అంబు స్నానము= ఆవుపేడతో కలిసి ప్రశస్తమైన నీటితో (చేసే) స్నానం; అతి పవిత్రంబు= మిక్కిలి పరిశుద్ధమైనది.

తాత్పర్యం: మానవులు పాడుకలలు కన్నప్పుడు ఆవులను గురించి మంచి మాటలు పలికితే ఆ పాపాలను పొందరు. ఆవుపేడ కలిపిన నీటి స్నానం ఎంతో పరిశుద్ధి నిస్తుంది.

చ. సురభులు, సౌరభేయులును సుస్థితి నాకడ నుండుఁ గాత మేఁ
గరము వినీతి గోగణముఁ గన్గొనుచుండెద నర్థి గో సము
త్కరమును నన్ను నెప్డుఁ గనుఁ గావుత మం చెద గోవులం దలం
తురు బుధబోధితుల్ భయము దోఁచిన చోటులఁ దత్ప్రశాంతికై.' 34

ప్రతిపదార్థం: బుధబోధితుల్= పండితులచే ఉపదేశింపబడినవారు; భయము= భీతి; తోఁచినచోటులన్= ఏర్పడిన తావులలో; తత్ ప్రశాంతికై= అది అణగిపోవటానికి; సురభులు= ఆవులు; సౌరభేయులును= ఆవుదూడలున్నూ; సుస్థితిన్= మంచి నిలుకడతో; నాకడన్= నా దగ్గర; ఉండున్+కాతన్= ఉండుగాక; ఏన్= నేను; కరము= మిక్కిలి; వినీతిన్= వినయంతో; గోగణమున్= ఆలమందను; అర్థిన్= కోరికతో; కన్గొనుచుండెదన్= చూస్తూ ఉంటాను; గో సముత్కరమును= ఆవులమందకూడా; నన్నున్= నన్ను; ఎప్డున్= ఎల్లవేళలా; కనున్ కావుతన్= చూచుగాక; అంచున్= అంటూ; ఎదన్= హృదయంలో; గోవులన్= ఆవులను; తలంతురు= భావిస్తూ ఉంటారు.

తాత్పర్యం: పండితులచే ఉపదేశాలు పొందినవారు, భయాందోళనలు పొందేటప్పుడు వాటిని ఉపశమింపజేసికొనటానికి ఆవులను, దూడలను తమవద్ద సుస్థిరంగా ఉండాలని కోరుకొంటారు. నేను వినయంతో వాటి యోగక్షేమాలను ప్రీతితో చూస్తూ ఉంటాననీ, గో సమూహంకూడా నన్నెపుడూ చల్లగా చూడాలని వారు భావిస్తుంటారు.

వ. అని నిర్దేశించి వెండియు నమ్మునీంద్రుం డా నరేంద్రున కిట్లనియె. 35

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; నిర్దేశించి= చెప్పి; వెండియున్= ఇంకా; ఆ+ముని+ఇంద్రుండు= ఆ మహర్షి శ్రేష్ఠుడు; ఆ నరేంద్రునకున్= ఆ రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఇట్లా చెప్పి ఆ వసిష్ఠ మహాముని సౌదాస మహారాజుతో ఇంకా ఇట్లా అంటున్నాడు.

క. 'అరుణ ధవళ మేచక ధూ । సరవర్ణాకలిత గో విషయదానంబుల్
ఖరకర సురపాగ్ని పవన । పరలోక సుఖముల నిచ్చు వసుధాధీశా! 36

ప్రతిపదార్థం: వసుధా+అధీశా!= రాజా!; అరుణ= ఎరుపు; ధవళ= తెలుపు; మేచక= నలుపు; ధూసర= బూడిదరంగు; అనే; వర్ణ= వన్నెలతో; ఆకలిత= చక్కగా కూడుకొన్న; గో= ఆవుల; విషయ= సంబంధమైన; దానంబుల్= దానాలు; ఖరకర= సూర్యుడి; సురప= ఇంద్రుడి; అగ్ని= అగ్నిదేవుడి; పవన= వాయుదేవుడి; వర= శ్రేష్ఠమైన; లోక= లోకములందలి; సుఖములన్= సుఖాలను; ఇచ్చున్= ఇస్తాయి.

తాత్పర్యం: రాజా! ఎర్రని ఆవుల దానం సూర్యలోక సుఖాన్నీ, తెల్లని ఆవుల దానం ఇంద్రలోక సుఖాన్నీ, నల్లని గోవుల దానం అగ్నిలోక సుఖాన్నీ, బూడిదరంగు ఆవుల దానం వాయులోక సుఖాన్నీ ఇస్తుంది.

విశేషం: నాలుగురంగులూ, నాలుగు లోకాలూ క్రమంగా అన్వయించే విధంగా చెప్పటంవలన ఇందులో క్రమాలంకారం (యథాసంఖ్యాలంకారం) గోచరిస్తున్నది. ఏ రంగు గోవు ఉన్నా దాని దానం ఏదో ఒక పుణ్యలోకాన్నిస్తుంది అనే అర్థం ఇక్కడ ఈ అలంకారంవలన స్ఫురిస్తుంది. కనుక 'అలంకారకృత వస్తుధ్వని' రూపంగా ఈ అలంకారం ఔచిత్యాన్ని సాధించుకొంటున్నది. ఆ లోకాలుకూడా వట్టివికావు 'వరా'లు అంటే కోరదగినవి.

క. విను తక్కిన వర్ణంబులు । జనవర గంధర్వ సిద్ధ సాధ్యాది నివా
స నితాంత సౌఖ్యదము లగు । ననిమిష యోషి త్ప్రియత్వ మన్నియు నిచ్చున్. 37

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; విను= వినుము; తక్కిన వర్ణంబులు= తక్కిన రంగుల ఆవులు (దానాలు); గంధర్వ= గంధర్వులు; సిద్ధ= సిద్ధులు; సాధ్య= సాధ్యులు; ఆది= మొదలైనవారి; నివాస= ఉనికిపట్టుల; నితాంత= ఎడతెగని; సౌఖ్య దములు= సుఖములను ఇచ్చేవి; అగున్= అవుతాయి; అన్నియున్= అన్నిరకాల ఆవులు (ఆవుల దానాలు); అనిమిష యోషిత్ ప్రియత్వము= దేవతా కాంతలకు ప్రియుడయ్యే భావాన్ని; ఇచ్చున్= ఇస్తాయి.

తాత్పర్యం: రాజా! తక్కిన వర్ణాల ఆవుల దానం గంధర్వ, సిద్ధ, సాధ్యనామాలుగల దేవజాతుల లోకాల సుఖాన్ని అనంతంగా ఇస్తాయి. అన్ని రకాల గోవులదానాలు అప్సరఃకాంతలకు వల్లభుడయ్యే భాగ్యాన్ని కలుగజేస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు - వీరిని దేవయోనులు అంటారు. వీరు అటు దేవతలంత మహిమగలవారు కారు. కేవలం మనుష్యులవంటి అల్పశక్తిమంతులూ కారు. అనిమిషులు - రెప్పపాటులేనివారు. అది దేవతల కొక గుర్తు. 'నితాంత' అన్నారు కనుక కొన్ని తరగతుల వారికి అదికూడా అపేక్షణీయమే అవుతుంది.

క. ధేను ప్రమాణ యగు తిల। ధేనువు నిచ్చిన నరుండు దీప్తుండగుఁ బు

ణ్యానూన లోక సంవా। సానందోన్నతిఁ జరించు నప్రతిహతుఁడై. 38

ప్రతిపదార్థం: ధేనుప్రమాణ అగు= ఆవు తూకానికి సరిపడే; తిలధేనువున్= నువ్వుల ఆవును; ఇచ్చిన నరుండు= ఇచ్చే మానవుడు; దీప్తుండు= ప్రకాశించేవాడు; అగున్= అవుతాడు; అప్రతిహతుఁడు+ఐ= ఏ అడ్డూ అదుపు లేనివాడై; పుణ్య= పుణ్యంతో; అనూన= ఏ తక్కువతనమూ లేని; లోక= లోకంలో; సంవాస= చక్కగా ఉండటంవలన కలిగిన; ఆనంద= ఆనందంయొక్క; ఉన్నతిన్= ఎక్కువతనంతో; చరించున్= తిరుగుతూ ఉంటాడు.

తాత్పర్యం: ఆ వెత్తు నువ్వుల ఆవును దానం చేసిన మానవుడు మంచి తేజస్సుతో ఒప్పారుతూ ఉంటాడు. పుణ్యం ఏ మాత్రమూ తక్కువ కాని లోకాల నివాసంవలన కలిగే ఆనందాతిశయంతో విహరిస్తూ ఉంటాడు.

విశేషం: ఇది ప్రత్యామ్నాయ పద్ధతి అంటారు. ఆవులు దానమివ్వటానికి లేనివాడు పుణ్యలోకాలకు అనర్హుడా? అన్న ప్రశ్నకు ఇది సమాధాన మిస్తుంది. 'తిలధేనువు' అంటే నువ్వులతో ఆవు బొమ్మ చేయాలని తాత్పర్యం. 'అనూన' 'ఉన్నతి' అనే పదాలచేత ప్రత్యామ్నాయ పద్ధతి అయినా ఫలం విశేషంగా ఉంటుందనే సూచన వ్యక్తమవుతుంది.

క. బహురూప విశ్వరూపక। మహిత సురూపత్వ దివ్యమహిమ గలుగు గో

మహనీయమూర్తి మన్మతి। సహిత మగుం గాత మనుట సంపద లొసఁగున్.' 39

ప్రతిపదార్థం: బహురూప= పెక్కురూపాలు గల; విశ్వరూపక= సమస్తమైన రూపాలుగల; మహిత= గొప్పతనంగల; సురూపత్వ= చక్కని ఆకారంగల; దివ్య= దేవలోకపు; మహిమ కలుగు= మహిమ ఉన్నట్టి; గో= ఆవులయొక్క; మహనీయమూర్తి= గొప్ప ఆకృతి; మత్+మతి సహితము= నా బుద్ధితో కూడినది; అగున్ కాతన్= అగుకాక; అనుట= అని పలకటం; సంపదలు=సంపదలను; ఒసఁగున్= ఇస్తుంది.

తాత్పర్యం: ఎన్నో రూపాలు, అన్ని రూపాలు కలిగి గొప్పతనం కల చక్కని ఆకారంతో దేవలోకపు మహిమ కలిగి ఉండే ఆవుల మహనీయ రూపం నా బుద్ధిలో నిలిచి ఉండుగాక అనుకొనటం సంపదల నిస్తుంది.'

విశేషం: 'విశ్వరూపక' - అనే పదప్రయోగంవలన గోవునకు విరాట్స్వరూపంతో సామ్యం స్ఫురిస్తుంది.

క. అని ముని చెప్పిన సౌదా। స నరేంద్రుఁడు గో ప్రదాన సక్తాత్ముండై

యనితర సులభావ్యయ సుఖ। జనకస్థానంబు వడసె జనసంస్తుత్యా! 40

ప్రతిపదార్థం: జనసంస్తుత్యా!= జనులచేత స్తుతింప బడే ఓ రాజా!; అని= ఆ విధంగా; ముని= వసిష్ఠముని; చెప్పినన్= చెప్పగా; సౌదాస నర+ఇంద్రుఁడు= సౌదాస రాజు; గో ప్రదాన సక్త+ఆత్ముండు+ఐ= ఆవులను శ్రద్ధతో దానమివ్వటంలో లగ్నమైన మనస్సు కలవాడై; అనితరసులభ= ఇతరులకు తేలికగా దొరకని; అవ్యయ= తరుగులేని; సుఖ= సుఖానికి; జనక స్థానంబు= పుట్టిన చోటును; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: రాజా! ఆ వసిష్ఠు డట్లా చెప్పగా సౌదాస మహారాజు గోవులను శ్రద్ధగా దానం చేసే పనిలో మనస్సును లగ్నం చేసి ఇతరుల కందని నాశనంలేని సుఖం పుట్టేస్థానాన్ని సంపాదించాడు.

విశేషం: దీన్ని ఆఖ్యాయిక అంటారు. అంటే ఒక పుణ్యకార్యం చేసినవాని కథ. దీనివలన మానవులకు గోదాన విషయంలో ప్రచోదన కలుగుతుంది. 'ప్ర' 'సక్త' అనే పదాలు దానంలో ఉన్న విశిష్టతను వ్యక్తం చేస్తున్నాయి. కనుకనే 'అనితర సులభ', 'అవ్యయ' అనే పదాలకు సార్థకత సిద్ధిస్తుంది.

క. అని గంగాపుత్త్రుఁడు గో । వినుత మహిమఁ దెలియఁ జెప్ప విని ధర్మసుతుం
'డనఘచరిత్రా! యిట్లుం । డునె గోవుల పెంపు?' నావుడుం దగ మఱియున్. 41

ప్రతిపదార్థం: అని; గంగాపుత్త్రుఁడు= భీష్ముడు; గో వినుత మహిమన్= గోవుల కొనియాడ దగిన గొప్పతనాన్ని; తెలియన్= తెలిసే విధంగా; చెప్పన్= చెప్పగా; విని; ధర్మసుతుండు= ధర్మరాజు; అనఘ చరిత్రా!= పాపాలులేని నడవడి కల ఓ మహానుభావా!; గోవులపెంపు= ఆవుల గొప్పతనం; ఇట్లు= ఈ విధంగా; ఉండునె= ఉంటుందా? నావుడున్= అని పలుకగా; తగన్= తగునట్లుగా; మఱియున్= ఇంకా.

తాత్పర్యం: ఇట్లా భీష్ముడు గోవుల గొప్పతనాన్ని తెలియజెప్పగా విన్న ధర్మరాజు 'పుణ్యచరిత్రా! గోవుల మహిమ ఇంత గొప్పదా?' అన్నాడు. అప్పుడు మళ్ళీ. (తరువాతి వచనంతో అన్వయం)

విశేషం: 'ఇట్లుండునె' అనే పదబంధం ధర్మరాజు హృదయంలో కలిగిన ఆనందాశ్చర్యాలను అభివ్యక్తం చేస్తున్నది. శ్రోత ప్రీతితో వింటుంటే వక్తకు మరింత ఉత్సాహం కలుగుతుంది. అందుకనే భీష్ముడు ఇంకా చెప్పాలని ఉబలాట పడుతున్నారు.

వ. అమ్మహాత్ముం డమ్మహీపతితో 'గో విశేషం బింకను విను' మని యిట్లనియె. 42

ప్రతిపదార్థం: ఆ+మహాత్ముండు= దొడ్డబుద్ధిగల ఆ భీష్ముడు; ఆ+మహీపతితోన్= ఆ రాజుతో; గో విశేషంబు= గోవుల గొప్పతనం; ఇంకను= ఇంకా; వినుము; అని; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: దొడ్డబుద్ధి గల భీష్ముడు ధర్మరాజుతో ఆవుల గొప్పతనం ఇంకా వినుము అని ఇట్లా చెప్తున్నాడు.

వేదవ్యాసముని శుకునకుఁ దెలిపిన గో ప్రభావ ప్రకారము (సం.13-80-6)

సీ. 'సర్వజ్ఞుఁ డగు పరాశరనందనుని పాద । పద్మంబులకు దృఢభక్తి నెఱఁగి
యతని నందనుఁడు సమంచిత మతియును । నవు శుకుం డెల్ల వస్తువులకంటె
నధికతమంబును యజ్ఞమూలంబును । నగు నది యెయ్యది? యతులకరుణ
నా కెఱింగింపవే' నావుడు నమ్మహి । తాత్ముఁ డివ్విధము మహానుభావ;

తే. మనఘ! యెందు నెక్కాలము నన్యవస్తు । వులకు లేదరయంగ గోవులకుఁ దక్కఁ
బుణ్యతమతయు యాగవిభూతి మూల । కారణత్వంబు వానిక కాక కలవె? 43

ప్రతిపదార్థం: సర్వజ్ఞుఁడు+అగు= అంతయు తెలిసినవాడైన; పరాశరనందనుని= పరాశరుడి కుమారు డగు వ్యాసుడి; పాద పద్మంబులకున్= తామరపూలవంటి అడుగులకు; అతని నందనుఁడు= అతని కొడుకు; సమంచిత మతియును= మన్నింపదగిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బుద్ధి కలవాడు; అవు= అయిన; శుకుండు= శుకుడు; దృఢభక్తిన్=గట్టిదైన భక్తితో; ఎఱఁగి= మ్రొక్కి; ఎల్ల వస్తువులకంటెన్= అన్ని వస్తువులకన్నా; అధికతమంబును= మిక్కిలి గొప్పదీ; యజ్ఞమూలంబును= యజ్ఞాలకు ఆధారమూ; అగునది= అయినది; ఏ+అది?= ఏది? అతులకరుణన్= సాటిలేనిదయతో; నాకున్= నాకు; ఎఱింగింపవే= దయతో తెలుపుమా? నావుడున్= అన్నంతనే; ఆ+మహిత+ఆత్ముఁడు= దొడ్డబుద్ధిగల ఆ వ్యాసుడు; అనఘ!= పాపరహితుడా?; ఈ+విధము= ఇట్టిదైన; మహానుభావము= గొప్ప ప్రభావం; ఎందున్= ఎక్కడా; ఏ+కాలమున్= ఏ కాలంలోనూ; అరయంగన్= పరీక్షించిచూడగా; గోవులకున్= ఆవులకు; తక్కన్= కాక; అన్య వస్తువులకున్= వేరు పదార్థాలకు; లేదు; పుణ్యతమతయున్= అన్నింటికంటె ఎక్కువ పుణ్యం కలది కావటమూ; యాగ విభూతి మూల కారణత్వంబున్= యజ్ఞాల ఐశ్వర్యానికి మొదటి హేతువు కావటమూ; వానికి= ఆ ఆవులకే; కాక; కలవె?= ఉన్నాయా?

తాత్పర్యం: సర్వమూ ఎరిగిన వ్యాసుడి పాదాలకు చెదరని భక్తితో మ్రొక్కి అతడి కుమారుడూ, మంచి బుద్ధి విశేషం కలవాడూ అయిన శుకుడు 'అన్ని వస్తువుల కంటె గొప్పదీ, యజ్ఞాలకు మూలమైనదీ ఏది? దయతో నాకు తెలుపుమా!' అని ప్రార్థించాడు. అప్పుడు వ్యాసుడు 'ఈ విధమైన గొప్ప ప్రభావం ఎక్కడా ఎప్పుడూ ఆవులకు తప్ప మరొకదానికి లేదు. పుణ్యం తుదిమెట్టు అనదగిన లక్షణమూ, యజ్ఞాల సంపదకు మూలకారణం కావటమూ ఆవులకే తప్ప మరొకదానికి కలవా?' (అని చెప్పాడు).

విశేషం: దృఢభక్తి నెఱఁగి - ఏదైనా తెలియ దగిన విషయాన్ని పెద్దల దగ్గర తెలుసుకొనటానికి ప్రణిపాతం - కాళ్ళకు మ్రొక్కటం ఒక సముదాచారం. ఎఱింగింపవే - తెలిసికొనటంలో శుకున కున్న గాఢవాంఛ నిది అభివ్యక్తం చేస్తుంది. అతుల కరుణ - అనేది దీనికి బలా న్నిస్తుంది.

క. అని చెప్పి మఱియు నిట్లను। 'విను గోవులు పరమ నియతి వేధఁ గొలువ నె
మ్మన మలర నతఁడు గనుఁగొని। మును వానికి లేని శృంగములు కల్పించెన్. 44

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; చెప్పి= తెలియజేసి; మఱియున్= ఇంకా; ఇట్లు= ఇట్లా; అనున్= చెప్పాడు; విను= శ్రద్ధతో ఆలకించుము; గోవులు= ఆవులు; పరమనియతిన్= గొప్ప నిష్ఠతో; వేధన్= బ్రహ్మదేవుడిని; కొలువన్= పూజించగా; అతఁడు= బ్రహ్మ; నెఱ+మనము= నిండు హృదయం; అలరన్= ప్రీతి పొందగా; కనుఁగొని= చూచి; మును= ముందు; వానికిన్= ఆ ఆవులకు; లేని= లేనట్టి; శృంగములు= కొమ్ములను; కల్పించెన్= పుట్టించాడు.

తాత్పర్యం: వ్యాసు డిట్లా చెప్పి ఇంకా ఈ విధంగా పలికాడు. 'నాయనా! వినుము. ఆవులు బ్రహ్మను గొప్ప నిష్ఠతో సేవించగా అతడు గుండెనిండుగా సంతోషపడి పూర్వం వాటికి లేని కొమ్ములు సృష్టించాడు.

వ. అట్లు కొమ్ము లొసఁగి సురముని లోకంబు నాలోకించి. 45

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; కొమ్ములు= కొమ్ములను; ఒసఁగి= ఇచ్చి; సుర ముని లోకంబున్= దేవతల మునుల సముదాయాలను; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఆ విధంగా కొమ్ము లిచ్చి దేవతల సముదాయాన్నీ, మునుల సముదాయాన్నీ చూచి (ఇట్లా అన్నాడు).

చ. 'పరమ పవిత్రముల్ యజన భాజనముల్ దము విన్నఁ జూచినన్
దురితచయంబులం దొలఁగఁ ద్రోవఁగఁ జాలుఁ బ్రధానకర్త కు

త్తరగతి లాభవైభవము తంగెటి జున్నుగఁ జేయు గోవు లె

వ్వరు దగ వీనిఁ గొల్తు రనివారణఁ జొత్తురు వారు నాకమున్.' **46**

ప్రతిపదార్థం: పరమపవిత్రముల్= మిక్కిలి పావనమయినవీ; యజనభాజనముల్= యజ్ఞాలకు పాత్రమయినవీ అయిన గోవులు; తమున్= తమను; విన్నన్= విన్నా; చూచినన్= కన్నా; దురిత చయంబులన్= పాపాల రాసులను; తొలఁగన్= తొలగిపోయే విధంగా; త్రోవఁగన్+చాలున్= త్రోసివేయగలవు; గోవులు= ఆవులు; ప్రధానకర్తకున్= యజ్ఞకార్యంలో ముఖ్యుడైన యజమానునకు; ఉత్తరగతి లాభ వైభవము= ఉత్తర లోకాలకు పోవటం అనే లాభపు సంపదను; తంగెటి జున్నుగన్= తంగేటి చెట్టుకు బట్టిన తేనె పట్టువలె; చేయున్= చేస్తాయి; ఎవ్వరు= ఎవరు; తగన్= చక్కగా; వీనిన్= ఈ ఆవులను; కొల్తురు= పూజిస్తారో; వారు= ఆ మనుష్యులు; అనివారణన్= అడ్డులేకుండా; నాకమున్= స్వర్గాన్ని; చొత్తురు= ప్రవేశిస్తారు.

తాత్పర్యం: 'ఆవులు పరమపవిత్రమైనవి. యజ్ఞాలకు మూలకారణం అయినవి. వాటిని గూర్చి విన్నా, వాటిని చూచినా పాపాలను పటాపంచలు చేస్తాయి. యజమానులకు ఉత్తర లోకాలకు పోవటం అనే గొప్పతనాన్ని తంగేటిజున్నుగా సమకూరుస్తాయి. వాటిని శ్రద్ధతో పూజించినవారు అడ్డులేకుండా స్వర్గానికి చేరుకొంటారు.

విశేషం: పరమపవిత్రాలు కనుకనే యజ్ఞభాజనాలు అవుతున్నాయి. తంగెటిజున్ను సులభప్రాప్తికరమూ, రుచికరమూ, హితకరమూ కనుక అందరూ అపేక్షిస్తారు. గోవులను సేవించటంవలన ఉత్తరగతి ఆ విధంగా సిద్ధిస్తుంది. అనివారణన్ - స్వర్గం వారి సొంత ఇల్లువంటి దవుతుం దని భావం.

వ. అనియె గోవుల పావనత్వంబు విశేషించి చెప్పెద వినుము. **47**

ప్రతిపదార్థం: అనియెన్= బ్రహ్మ ఈ విధంగా చెప్పాడు; గోవుల పావనత్వంబు= ఆవుల పవిత్రతను గూర్చి; విశేషించి= ఇంకా ఎక్కువగా; చెప్పెదన్= చెప్పుతాను; వినుము.

తాత్పర్యం: అని బ్రహ్మ చెప్పాడు. వ్యాసుడు గోవుల పావనత్వాన్ని గురించి మరికొన్ని విశేషాలు చెప్పుతాను వినుము' అన్నాడు.

సీ. అమలాత్మ! గోవు మూత్రముఁ బాలు నేయిని । బానార్హ మగు పెండతోన వరుస
మూఁడు దినంబులు మును ద్రావి మఱి మూఁడు । దివసంబులందు వాయువు భుజించి
యవలు నుగ్గుగ ధేనునివహంబు ద్రొక్కించి । వెలవ నత్తెఱఁగు నూకలన కాఁచి
నెలలు మూఁ డత్యంత నియతి నాహారంబు । గొన బ్రహ్మహత్యఁ బోలినవి యైనఁ

తే. బాయుఁ బాపముల్ దివిజు లీపావన క్రి । యా విధానంబునన కాదె యసురగణము
గెలిచి రావులనేయి విప్రులకు నీగి । దాని వేల్చుట ద్రావు టుదాత్తతరము. **48**

ప్రతిపదార్థం: అమల+ఆత్మ= నిర్మలమైన హృదయం కలవాడా!; గోవు మూత్రమున్= ఆవు మూత్రాన్నీ; పాలున్= పాలను; నేయిని= నేతినీ; పాన+అర్హము+అగు= త్రాగుటకు యోగ్యం అయిన; పెండతోన= పేడతో; వరుసన్= వరుసగా; మును= ముందు; మూఁడు దినంబులు= మూడు రోజులు; త్రావి= త్రాగి; మఱి మూఁడు దివసంబులందున్= తరువాతి మూడు రోజులలో; వాయువున్= గాలిని; భుజించి= తిని; యవలు= యవలనే ధాన్యాన్ని; నుగ్గుగన్=రవ్వగా అయ్యేవిధంగా; ధేను నివహంబున్= ఆవులమందతో; త్రొక్కించి; ఆ+తెఱఁగు నూకలన= ఆ విధంగా అయిన నూకలతోనే; వెలవన్= గంజిని;

కాఁచి=కాచి; నెలలు= మాసాలు; మూఁడు= మూడు; అత్యంతనియతిన్= ఎక్కువ నిష్ఠతో; ఆహారంబు= అన్నంగా; కొనన్= తీసికొంటే; బ్రహ్మహత్యన్= బ్రాహ్మణుడిని చంపటాన్ని; పోలినవి= పోలేవి; ఐనన్= అయినా; పాపముల్= పాపాలు; పాయున్= పోతాయి; దివిజులు= స్వర్గంలో పుట్టిన దేవతలు; ఈ పావన క్రియా విధానంబునన= ఇట్టి పవిత్రమైన పని తీరుననే; కాదె= కదా; అసురగణమున్= రక్కసుల గుంపును; గెలిచిరి= గెలిచారు; ఆవులనేయి= ఆవుల నేతిని; విప్రులకున్= వేద విద్యగల బ్రాహ్మణులకు; ఈఁగి= ఇవ్వటమూ; దాని వేల్చుట= దానిని హోమం చేయటమూ; త్రావుట= త్రాగటమూ; ఉదాత్త తరము= చాలా గొప్పది.

తాత్పర్యం: నిర్మలాత్ముడా! ఆవుమూత్రాన్నీ, పాలనూ, నేతినీ, పేడనూ కలిపి ముందు వరుసగా మూడు రోజులు త్రాగాలి. తరువాత మూడు రోజులు ఉపవాసం ఉండాలి. ఆ తరువాత మూడు నెలలు ఆవులు త్రొక్కిన యవలనూకలతో కాచిన గంజిని భోజనంగా గ్రహించాలి. ఇట్లా చేస్తే బ్రహ్మహత్యవంటి పాపాలు కూడా రూపుమాసిపోతాయి. దేవతలు ఈ పని చేసే కదా రాక్షసులమూకలను గెలిచారు. ఆవులనెయ్యిని విద్యావంతులకు దానం చేయటమూ హోమం చేయటమూ, త్రాగటమూ చాలా గొప్ప విషయం.

విశేషం: వాయువు భుజించి - ఉపవాసం ఉండి అని భావం. మహాపాపాలు పోవటం మాత్రమే కాదు స్వర్గసుఖం కూడా లభిస్తుంది. అంటే ఒక పనితో రెండు ప్రయోజనాలు సిద్ధిస్తాయని భావం. దృష్టాంతంగా దేవతల విజయాన్ని చెప్తున్నారు.

క. విమలాంబువుల నుప స్ప । ర్శము నిర్వర్తించి గో ప్రచయ మధ్యమునన్

దమయుతముగ గోమతి చి । త్తమున జపించిన శుచిత్వ ధన మొడఁగూడున్. 49

ప్రతిపదార్థం: విమల+అంబువులన్= స్వచ్ఛమైన నీటితో; ఉపస్పర్శము= ఆచమనం; నిర్వర్తించి= చేసి; గో ప్రచయ మధ్యమునన్= ఆవులమంద నడుమ; దయయుతముగన్= ఇంద్రియాలను అదుపుచేసికొనటంతో పాటుగా; గోమతి= గోమతి అనే మంత్రాన్ని; చిత్తమునన్= హృదయంలో; జపించినన్= జపిస్తే; శుచిత్వ ధనము= పరిశుద్ధత అనే సొమ్ము; ఒడఁగూడున్= సిద్ధిస్తుంది,

తాత్పర్యం: స్వచ్ఛమైన నీటితో ఆచమనం చేసి ఆవులమందనడుమ ఇంద్రియ నిగ్రహంతో 'గోమతి' మంత్రాన్ని హృదయంలో జపిస్తే మానవుడికి పవిత్రత అనే ధనం చేకూరుతుంది.

విశేషం: ఉపస్పర్శం అంటే ఆచమనం. లోపల ఉన్న సూక్ష్మశరీర శుద్ధికొరకు భగవన్నామం మూడు మారులూ అంటూ నీటిని కొంచెంగా లోపలికి పుచ్చుకొనటాన్ని ఆచమనం అంటారు. ఉపస్పర్శం అంటే స్నానం కూడా అని కూడా అర్థం ఉన్నది. కాబట్టి 'స్వచ్ఛమైన నీటిలో స్నానం చేసి' అని కూడా అర్థం చెప్పుకొనవచ్చును. 'దమయుతముగన్' - ఇంద్రియాల అదుపులేకుండా చేసే జపాదులు ఫలాన్నివ్వవు అని భావం. చిత్తమునన్ - జపం మూడు విధాలు. మంత్రాన్ని పైకి, ఇతరులకు వినపడే విధంగా ఉచ్చరిస్తూ జపం చేయటం మొదటి పద్ధతి. పెదవుల కదలిక లేకుండా నోటిలో శబ్దం పైకిరాకుండా చేసే జపం రెండవ పద్ధతి. మంత్రాన్నీ, మంత్రార్థాన్నీ హృదయంలో మాత్రమే భావన చేయటం మూడవది. వీటిలో మూడవది సర్వశ్రేష్ఠమైనది. ఈ పద్యంలో 'చిత్తమున' అనే మాటద్వారా దానినే చెప్పారు. 'శుచిత్వధనము' - మానవుడు సాధారణంగా లోపలా, వెలుపలా ఎన్నో మలినాలతో కూడి ఉంటాడు. అవి అతనిని పాప కూపానికి లాగుతూ ఉంటాయి. స్నానాదులచేత వెలుపలి మలాన్నీ, జపాదులచేత లోపలిమలాన్నీ (మనస్సు) మొదలైన సూక్ష్మదేహపు మలాన్నీ) పోగొట్టుకొంటే అతడు పరమార్థానికి సన్నిహితుడవుతాడు. అందుకని అది ఒక మహాధనంగా ఈ పద్యంలో చెపుతున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **అగ్ని సన్నిధి గోనిచయంబు నడుమ । బ్రాహ్మణుల పాల గోమతీపఠన మాచ**
రించినను విన్నఁ గోర్కి సిద్ధించు; గోవుఁ । గడచినట్టిది లేదు జగత్త్రయమున. 50

ప్రతిపదార్థం: అగ్ని సన్నిధిన్= అగ్ని సమీపంలో; గోనిచయంబు నడుమన్= ఆవుల మంద మధ్యలో; బ్రాహ్మణుల పాలన్= బ్రహ్మజ్ఞానం కలవారి దగ్గర; గోమతీ పఠనము= గోమతి మంత్రాన్ని చదవటం; ఆచరించినను= చేసినా; విన్నన్= విన్నా; కోర్కి= కాంక్ష; సిద్ధించున్= నెరవేరుతుంది; జగత్త్రయమునన్= మూడు లోకాలలో; గోవున్= ఆవును; కడచినట్టిది= మించినట్టిది; లేదు.

తాత్పర్యం: అగ్ని దగ్గరా, ఆవులమందలోనూ, బ్రహ్మజ్ఞానం కలవారిదగ్గరా గోమతీమంత్రాన్ని పఠించినా, విన్నా కోరిన కోరిక నెరవేరుతుంది. మూడులోకాలలో ఆవును మించినది మరొకటి లేదు.

విశేషం: అగ్ని, ఆవు, బ్రాహ్మణుడు పరమ పవిత్ర స్వరూపాలని భావం. వారి దగ్గర చదివిన మంత్రం శీఘ్రంగా ఫలాన్నిస్తుందని భావన. స్వయంగా చదవలేనివారికి కూడా గతి ఉన్నది. అది శ్రవణం ద్వారా సిద్ధిస్తుంది. జగత్త్రయం -స్వర్గం, మర్త్యం, పాతాళం.

క. **అని యి ట్లుపన్యసించిన । జనక వచన రచనఁ గల్గు సార మఖిలముం**
గని శుకుఁడు గోసమారా । ధన తత్పరచిత్తుఁ డయ్యె ధర్మతనూజా!' 51

ప్రతిపదార్థం: ధర్మతనూజా!= ధర్మురి కుమారా!; అని= ఇట్లని; ఇట్లు= ఈ విధంగా; ఉపన్యసించినన్= ప్రమాణపూర్వకంగా చెప్పగా; జనక వచన రచనన్= తండ్రి మాటల కూర్పులో; కల్గు= ఉన్న; సారము= నిగ్గు; అఖిలమున్= మొత్తంగా; కని= తెలిసికొని; శుకుఁడు= శుక మహర్షి; గో సమారాధాన తత్పర చిత్తుఁడు= ఆవులను చక్కఁగా పూజించటంలో చెడని శ్రద్ధగల హృదయం గలవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: ధర్మరాజా! వ్యాసు డిట్లా ప్రీతితో నిరూపించి చెప్పగా తండ్రి మాటలలోని సారమంతా గ్రహించి శుకుడు గోవులను చక్కఁగా ఆరాధించటంలో ఆసక్తిగల మనస్సుకలవా డయ్యాడు.'

విశేషం: సారము - ఒక విషయాన్ని ప్రతిపాదించటానికి సంబంధించిన అనేక విషయాలు ప్రస్తావనకు వస్తాయి. అందులో శ్రోత సారాన్ని గ్రహించాలి. తత్పర, చిత్తుఁడు - అందే లగ్నమైన మనస్సు కలవాడు. మనస్సు లగ్నమైతే తక్కిన రెండు కరణాలు - మాటా, చేష్టా - తప్పక లగ్న మవుతాయి. అప్పుడే ఆరాధన ఫలదాయక మవుతుంది. ఉపన్యసించటం - అంటే ఉప=దగ్గర, న్యసించటం=ఉంచటం, హృదయానికి హత్తుకొనేటట్లు చెప్పటం అని భావం.

వ. **అనిన విని పాండవాగ్రజుండు 'బ్రహ్మ విశ్వంబునకు విభుండు తదీయస్థానంబునకు మీఁదు గోలోకంబని విందు; నట్లుగాఁ గతంబేమి?' యని యడుగుటయు నాపగాతనయుం డతని నాదర భరితుం డగుచు నాలోకించి 'వినుము వివరించెద; విశ్వకర్మ తపో నియతుండయి యజ్ఞార్థంబును మోక్షార్థంబునుంగా నమృతమయ మూర్తియుఁ గామరూపిణియు నగు సురభి యను కన్యకం దన మనోవృత్తి గల్పించి మహాతేజోమయుండగు నొక్కపురుషుని సృజియించిన, దేదీప్యమానుం డగు నాతం డతి మనోహరాకృతి యగు నయ్యతివం గనుంగొని కామమోహితుం డయి యార్తి నొందుటయు నఖిల లోక పావనుండైన చతురాననుండు సన్నిహితుండై 'మార్తో భవ' యని పలికి యతని యార్తత్వం బుడిపి తన పల్కు కారణంబుగా మార్తాండ నామం బొసంగి యన్నారీ**

రత్నంబు నిచ్చి, యన్నెలంతకు నీకును జనియించిన యపత్యంబులు యాగాపవర్గార్థ క్షీర జనకంబులై మదీయ లోకంబునకు నుపరిభాగంబున వర్తింప వరంబిచ్చితి' ననియె; నట్లొందిన యయ్యిరువురకుం బ్రభవించిన సౌరభేయీకులం బా కమలాసను నిర్దేశించినట్టిదై సురాసుర ప్రముఖ నిఖిల జనంబులకు నమస్కార్యంబును సపర్యాభాజనంబును నయి రాజిల్లు నని చెప్పి వెండియు. 52

ప్రతిపదార్థం: అనినన్= ఇట్లు చెప్పగా; విని= ఆలకించి; పాండవ+అగ్రజుండు= పాండుకుమారులలో పెద్దవాడు ధర్మరాజు; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; విశ్వంబునకున్= సమస్తానికి; విభుండు= ప్రభువు; తదీయ స్థానంబునకున్= అతనిదైన నెలవునకు; మీఁదు= పైది; గోలోకంబు= గోవుల లోకం; అని; విందును= వింటున్నాను; అట్లు కాన్= ఆ విధంగా అవటానికి; కతంబు= కారణం; ఏమి అని; అడుగుటయున్= అడిగినంతనే; ఆపగా తనయుండు= నది కొడుకు భీష్ముడు; అతనిన్= ఆ ధర్మరాజును; ఆదర భరితుండు= ప్రీతి నిండినవాడు; అగుచున్= అవుతూ; ఆలోకించి= చూచి; వివరించెదన్= వివరిస్తాను; వినుము; విశ్వకర్మ= దేవతల శిల్పి; తపస్+నియతుండు+అయి= తపస్సునందు నిష్ఠ కలవాడై; యజ్ఞ+అర్థంబును= యజ్ఞాల కొరకున్నూ; మోక్ష+అర్థంబునున్+కాన్= మోక్షంకొరకున్నూ; అమృతమయమూర్తియున్= అమృతమే అంతా అయిన ఆకారం కలదీ; కామ రూపిణియున్= ఇచ్చవచ్చిన రూపం పొందగలదియు; అగు= అయిన; సురభి అను కన్యకన్= సురభి అనే బాలికను; తన మనస్+ వృత్తిన్= తన సంకల్పాన్ని బట్టి; కల్పించి= ఏర్పాటు చేసి (సృష్టించి); మహత్+తేజస్+మయుండు+అగు= గొప్ప తేజస్సుతో నిండిన స్వరూపంగల; ఒక్క పురుషునిన్= ఒక్క మగాడిని; సృజియించినన్= పుట్టించగా; దేదీప్యమానుండు+అగు ఆతండు= కాంతితో ఎక్కువగా విరాజిల్లుతున్న ఆ పురుషుడు; అతి మనస్+హర+ఆకృతి అగు= మిక్కిలిగా మనస్సును ఆకర్షించే రూపంగల; ఆ+అతివన్= ఆ ఇంతిని; కనుంగొని= చూచి; కామ మోహితుండు+అయి= కామంతో ఒడలెరుగనివాడై; ఆర్తిన్= దుఃఖాన్ని; ఒందుటయున్= పొందగా; అఖిల లోక పావనుండు+ఐన= అన్ని లోకాలలో పవిత్రుడయిన; చతుర్+ఆననుండు= నాలుగు మోముల దేవర; సన్నిహితుండు+ఐ= సమీపానికి వచ్చినవాడై; మా+ఆర్తః+భవ= దుఃఖము కలవాడవు కాకుము; అని; పలికి; అతని ఆర్తత్వంబు= అతడి దుఃఖాన్ని; ఉడిపి= పోగొట్టి; తన పల్కు= తన మాట (మార్తో అన్న తన మాట); కారణంబుగాన్= హేతువుగా; మార్తాండ నామంబు= మార్తాండు డనే పేరు; ఒసఁగి= ఇచ్చి; ఆ+నారీ రత్నంబున్= స్త్రీలలో శ్రేష్ఠ అయిన ఆ ఇంతిని; ఇచ్చి= భార్యగా ఇచ్చి; ఆ+నెలంతకున్= ఆ స్త్రీకీ; నీకున్= నీకూ; జనియించిన+అపత్యంబులు= పుట్టిన సంతానాలు; యాగ+అపవర్గ+అర్థ క్షీర జనకంబులు+ఐ= యజ్ఞాలకూ, మోక్షానికీ పనికివచ్చే పాలను పుట్టించేవి అయి; మదీయ లోకంబునకున్= నాదైన సత్యలోకానికి; ఉపరిభాగంబునన్= పై భాగంలో; వర్తింపన్= ఉండటానికి; వరంబు= వరాన్ని; ఇచ్చితిన్= ఇచ్చాను; అనియెన్= అన్నాడు; అట్లు= ఆ విధంగా; ఒందిన= ఏర్పడ్డ; ఆ+ఇరువురకునున్= ఆ ఇద్దరికీ; ప్రభవించిన= పుట్టిన; సౌరభేయీ కులంబు= సురభి సంతానం అయిన ఆవుల సముదాయం; ఆ కమలాసను నిర్దేశించిన+అట్టిది+ఐ= ఆ బ్రహ్మచెప్పిన విధంగా అయినదై; సుర+అసుర ప్రముఖ నిఖిల జనంబులకున్= దేవతలు, రాక్షసులు మొదలగు సకల జనాలకూ; నమస్కార్యంబును= నమస్కరించదగినదీ; సపర్యా భాజనంబును= పూజకు యోగ్యమైనదీ; అయి; రాజిల్లున్= ఒప్పుతున్నది; అని చెప్పి= అని తెలియజేసి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఆ మాట విని ధర్మరాజు భీష్ముడిని ఇట్లా అడిగాడు. 'బ్రహ్మ ఈ సమస్త లోకాల సముదాయానికీ ప్రభువు కదా! గోలోకం ఆయన లోకానికి కూడా పైన ఉంటుందని విన్నాను. దానికి కారణం ఏమిటి?' అంటే భీష్ముడు నిలువెల్లా ఆదరంతో మనుమడిని చూచి 'విను వివరిస్తాను. పూర్వం దేవతల శిల్పి యజ్ఞంకొరకని, మోక్షంకొరకని అమృతమే అయిన స్వరూపంగలదీ, ఇష్టరూపం ధరించగలదీ అయిన సురభి అనే కన్యకను మనస్సుతీరు కనుగుణంగా సృష్టించాడు. అట్లాగే గొప్పతేజోవంతు డయిన ఒక్కమగవాడిని కూడా సృష్టించాడు. తేజస్సుతో వెలిగిపోతున్న ఆ పురుషుడు మనస్సును మరపించివేసే ఆకారంగల ఆ యింతిని చూచి కామభావన

పొంది చెప్పరాని వేదన పొందాడు. లోకాలన్నింటిని పవిత్రం చేయగల బ్రహ్మ అతని దగ్గరకు వచ్చి 'మార్తోభవ' (ఆర్తుడవు కావద్దు) అని పలికి అతడి దుఃఖం పోగొట్టాడు. తానన్న మాట కారణంగా అతడికి 'మార్తాండుడు' అని పేరు పెట్టి ఆ చక్కని యింతిని భార్యగా ఇచ్చి ఈమెకూ నీకూ పుట్టిన సంతానం యాగాలకూ, మోక్షాలకూ కావలసిన పాలను సృష్టిస్తూ నా లోకానికి పై భాగాన ఉండే వరం ఇచ్చాను అన్నాడు. ఆ విధంగా కలిపిన వారిద్దరికీ పుట్టిన సంతానం బ్రహ్మశాసనం మేరకు దేవతలు, రాక్షసులు మొదలైన వారందరికీ నమస్కార యోగ్యమూ, పూజకుపాత్రమూ అయి ఒప్పుతున్నది' అని చెప్పి ఇంకా ఇట్లా అంటున్నాడు.

విశేషం: ఆదర భరితుండు - శిష్యుడు మంచి ప్రశ్నవేస్తే గురువు ఆనందం పొందుతాడు. తపోనియతుండయి తపస్సు అంటే తీవ్రభావన. అది దేన్నయినా సాధిస్తుంది. ఆమె అమృతమయమూర్తి. అతడు మహా తేజోమయుడు కనుక వారి సంతానం అత్యున్నత స్థితి నందటం మహా ఫలసాధనకు కావలసిన వస్తువును అందించటం సంభవించింది. యజ్ఞము కర్మకాండకు సంబంధించినది. దానివలన యజమానుని మూడు కరణాలు - మనస్సు, వాక్కు, చేష్ట అనేవి పరమ పవిత్రాలవుతాయి. అప్పుడు అవి జ్ఞాననిష్ఠకు యోగ్యాలై ముక్తికి కారణా లవుతాయి. కాబట్టి 'యాగాపవర్గార్థ క్షీరజనకములు' అనటం. గోవులు సురలకే కాదు అసురులకు కూడా పూజాస్థానాలు. అంటే గోవులను హింసించేవారు రక్కసులకంటే హీను లని భావం.

క. 'అది కారణముగ గోవులు । తుది ముట్టిన పెంపు గలిగి దురితహరగుణా
స్పదమయి తమ్ము సభక్తిక । హృదయు లగుచుఁ గొలుచు వారి కిష్టము లొసఁగున్.' 53

ప్రతిపదార్థం: అది= ఆ బ్రహ్మదేవుడి ఏర్పాటు; కారణముగన్= హేతువుగా; గోవులు= ఆవులు; తుది ముట్టిన పెంపు= చిట్టచివరకు చేరిన గొప్పతనం; కలిగి= పొంది; దురిత హర గుణ+ఆస్పదము+అయి= పాపాలను పోగొట్టే గుణానికి తావు అయి; తమ్మున్= వానిని; సభక్తిక హృదయులు+అగుచున్= భక్తితో కూడిన భావం కలవారగుచూ; కొలుచువారికిన్= సేవించేవారికి; ఇష్టములు= కోరిన కోర్కెలను; ఒసఁగున్= ఇస్తాయి.

తాత్పర్యం: 'బ్రహ్మచేసిన కట్టడినిబట్టి ఆవులు గొప్పతనపు తుదియంచు చేరుకొని పాపాలను పటాపంచలు చేసే గుణానికి స్థానమై, భక్తితో నిండిన హృదయంతో సేవించే వారికి కోరిన కోర్కెలను ఇస్తున్నాయి.'

విశేషం: గోవుల గొప్పతనం సృష్టికర్త ఏర్పాటువలన సిద్ధించింది. ఆ గొప్పతనం కూడా కడముట్టా లభించింది. కాబట్టి అవి పాపాలను పటాపంచలు చేస్తాయి. కోరిన కోర్కెలను తీరుస్తాయి. 'అగుచున్' అనటంవలన భక్తి నిరంతరంగా సాగుతూనే ఉండాలి అనేది సూచన.

క. అని చెప్పినఁ బాండునృపతి । తనయుఁడు మార్తాండ సురభి దాంపత్యమునన్
మును పుట్టిన ప్రజ యెయ్యది? । వినవలతు మహాత్మ చెప్పవే నా' కనుడున్. 54

ప్రతిపదార్థం: అని= ఇట్లని; చెప్పినన్= భీష్ముడు చెప్పగా; పాండు నృపతి తనయుఁడు= పాండురాజు కొడుకు యుధిష్ఠిరుడు; మహాత్మ!= ఓ మహానుభావా!; మార్తాండ సురభి దాంపత్యమునన్= మార్తాండుడు సురభి అనే వారి సంసార ధర్మంవలన; మును= ముందుగా; పుట్టిన ప్రజ= పుట్టిన సంతానం; ఏ+అది= ఏది?; వినన్ వలతున్= వినగోరుతున్నాను; నాకున్= నాకు; చెప్పవే!= చెప్పుమా!; అనుడున్= అనగా.

తాత్పర్యం: అని చెప్పగా ధర్మరాజు 'మహాత్మా! ఆ మార్తాండుడూ సురభీ సంసారధర్మం నిర్వహించగా ముందుగా పుట్టిన సంతానం ఏదో వినగోరుతున్నాను. దయతో నాకు చెప్పుము' అన్నాడు.

విశేషం: దాంపత్యానికి సంతానమే ఉత్తమ ఫలం. అందుకే 'ప్రజాయై గృహమేధినామ్' - సంతానం కొరకే గృహమేధులు- అని కాళిదాసు అంటాడు. కనుకనే ధర్మ విషయ జిజ్ఞాసగల ధర్మరాజుకు అది తెలియదగిన అంశం అయింది. మహాత్మా! అనే సంబోధనా; చెప్పవే! అనే ప్రార్థనార్థక క్రియా అతని జిజ్ఞాసను చక్కగా అభివ్యక్తం చేస్తున్నాయి. 'నాకు' అనే పదం ఇక్కడ వ్యంజకం. 'ఎంతో ఆసక్తిగల' నాకు అని దాని వ్యంగ్యార్థం. దీన్ని 'అర్థాంతర సంక్రమిత వాచ్యధ్వని' అంటారు.

వ. భీష్ముం డిట్లనియె. 55

తాత్పర్యం: భీష్ముడు ఇట్లా చెప్పాడు.

తే. 'తపము పెంపున సురభి మార్తాండు వలన । ధరణినాథ! యేకాదశాత్మజులఁ బడసె
నిగమ సంకీర్తనీయులు నిఖిలలోక । పతులు వారు బ్రాహ్మణులకుఁ బ్రకృతి సుమ్ము. 56

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; సురభి= సురభి అనే ఆ వనిత; తపము పెంపునన్= తపస్సు గొప్పతనంచేత; మార్తాండువలనన్= మార్తాండుడి నుండి; ఏకాదశ+ఆత్మజులన్= పదకొండు మంది కొడుకులను; పడసెన్= పొందింది; నిగమ సంకీర్తనీయులు= వేదాలకును కొనియాడ దగినవారు; నిఖిల లోక పతులు= అన్ని లోకాలకు ఏలికలు అయిన; వారు= ఆ కుమారులు; బ్రాహ్మణులకున్= బ్రాహ్మణులకు; ప్రకృతి= మూలకారణం; సుమ్ము!= సుమా!

తాత్పర్యం: ఆ సురభి తపస్సు గొప్పతనంతో మార్తాండుడివలన పదకొండు మంది కొడుకులను పొందింది. వారిని వేదాలు కూడా కొనియాడతాయి. లోకాలన్నిటికీ వారు పాలకులు. బ్రాహ్మణులకు మూలకారణం అయినవారు సుమా!

విశేషం: కుమారులు లోకసామాన్యంగా పుట్టినవారు కాదు. తపస్సు మహిమవలన కలిగారు. కనుకనే వేదాలు వారిని కొనియాడు తున్నాయి. లోకాలన్నింటికీ పాలకులయ్యారు. అంతేకాదు బ్రహ్మజ్ఞాన సంపన్నులైన వారికి వీరు ప్రకృతి.

వ. వారల నేకాదశ రుద్రులంగా నెఱుంగుము. 57

ప్రతిపదార్థం: వారలన్= ఆ కుమారులను; ఏకాదశ రుద్రులన్+కాన్= పదకొండు సంఖ్యతో ఒప్పారే రుద్రులనుగా; ఎఱుంగుము= తెలిసికొనుము.

తాత్పర్యం: వారే ఏకాదశ రుద్రులని తెలిసికొనుము.

తరువోజ.

అనఘాత్మ! యజపాదుఁ డన, నహిర్బుధ్న్యుఁ । డనఁ గడు విలసిల్లి, త్ర్యంబకుఁ డీతఁ
డనఁగ, వృషాకపి యన నొప్పి, శంభుఁ । డను పేరి పెంపున, నమరి కపాలి

యనఁగ, రైవతుఁ డన నతులానుభావ । మతిశయిల్లఁగ, హరుఁ డన బహురూపుఁ

డనఁ గీర్తిఁ గని, యుగ్రుఁ డన విశ్వరూపుఁ । డనఁ బేర్చి యా రుద్రు లర్చితు లైరి. 58

ప్రతిపదార్థం: అనఘ+ఆత్మ!= పాపములేని ఆత్మ కలవాడా!; అజపాదుఁడు= అజపాదు డనగా; అహిర్బుధ్న్యుఁడు+అనన్= అహిర్బుధ్న్యుడు అనగా; కడున్= మిక్కిలి; విలసిల్లి= ఒప్పారి; త్ర్యంబకుఁడు; ఈతఁడు= ఇతడు; అనఁగన్= అనగా; వృషాకపి; అనన్= అనగా; ఒప్పి= ఒప్పారి; శంభుఁడు అను పేరి పెంపునన్= శంభుడనే నామము యొక్క మహిమతో; అమరి= ఒప్పి; కపాలి అనఁగన్= కపాలి అనగా; రైవతుఁడు+అనన్= రైవతు డనగా; అతుల+అనుభావము= సాటిలేని గొప్పతనం; అతిశయిల్లఁగన్= పెంపొందగా; హరుఁడు+అనన్= హరుడనగా; బహురూపుఁడు+అనన్= బహురూపుడనగా; కీర్తిన్ కని= కీర్తి పొంది; విశ్వరూపుఁడు+అనన్= విశ్వరూపు డనగా; పేర్చి= అతిశయించి; ఆ రుద్రులు= రుద్రులు అను పేరుగలవారు; అర్చితులు= పూజింపబడేవారు; ఐరి= అయ్యారు.

తాత్పర్యం: పుణ్యాత్మా! అజపాదుడు, అహిర్బుధ్న్యుడు, త్ర్యంబకుడు, వృషాకపి, శంభుడు, కపాలి, రైవతుడు, హరుడు, బహురూపుడు, ఉగ్రుడు, విశ్వరూపుడు అని ప్రసిద్ధికెక్కి ఆ రుద్రులు లోకాలకు పూజ్యులయ్యారు.

వ. తదనంతరంబ సౌరభేయీ ప్రచయంబు ప్రభవించె; నగ్గోకులంబు విశేషం బాకర్ణింపుము. 59

ప్రతిపదార్థం: తత్+అనంతరంబు+అ= ఆ తరువాతనే; సౌరభేయీ ప్రచయంబు= ఆవుల సముదాయం; ప్రభవించెన్= పుట్టింది; ఆ+గోకులంబు విశేషంబు= ఆ ఆవుల సముదాయం విశిష్టత; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ తరువాతనే ఆవుల సముదాయం పుట్టింది. ఆ ఆవుల సముదాయం ప్రత్యేకతను వినుము.

సీ. ఆననంబునను జిహ్వను శృంగముల బల । వైరి, రంధ్రంబుల మారుతుండు,

కకుదంబునందు శ్రీకంఠుండు, పదముల । యందు మరుద్గణ మనఘ! కుక్షి

వహ్ని, చన్నుల సరస్వతి, పెండఁ బంచిత । మున లక్ష్మియును, గీర్తియును గ్రమమున

రుధిరంబునందుఁ జంద్రుఁడు, హృదయంబున । భగుఁడను దేవత, పాల వేధ

తే. వెంద్రుకలయం దనుష్ఠాన వితతి, దోఁక । ధర్ముఁ, డక్షుల సూర్యుండు, చర్మమునఁ ద

పంబు సిద్ధి తేజము సంధిపట్ల సిద్ధు । లునికి గల దటె; గోవు నేమనఁగవచ్చు! 60

ప్రతిపదార్థం: ఆననంబునను= మోమునందు; జిహ్వను= నాలుకయందు; శృంగములన్= కొమ్ములందు; బలవైరి= ఇంద్రుడు; రంధ్రంబులన్= ఇంద్రియ ద్వారాలలో; మారుతుండు= గాలి; కకుదంబునందున్= మూపురంలో; శ్రీకంఠుండు= శివుడు; పదముల అందున్= కాళ్ళయందు; మరుత్+గణము= దేవతల సముదాయం; అనఘ!= పుణ్యాత్మా!; కుక్షిన్= కడుపునందు; వహ్ని= అగ్ని; చన్నులన్= పొదుగులలో; సరస్వతి= చదువుల తల్లి; క్రమమునన్= క్రమంగా; పెండన్= పేడయందు; పంచితమునన్= మూత్రంలోను; లక్ష్మియును= లక్ష్మీదేవి; కీర్తియును= కీర్తి; రుధిరంబునందున్= రక్తంలో; చంద్రుఁడు= చంద్రుడు; హృదయంబునన్= హృదయంలో; భగుఁడు+అనుదేవత= భగుడనే పేరుగల దేవత; పాలన్= పాలలో; వేధ=బ్రహ్మ; వెంద్రుకలయందున్= వెంద్రుకలలో; అనుష్ఠాన వితతి= ఆచారాల సముదాయమూ; తోఁకన్= తోకయందు; ధర్ముఁడు= యమధర్మరాజు; అక్షులన్= కన్నులలో; సూర్యుండు= భాస్కరుడూ; చర్మమునన్= తోలునందు; తపంబు= తపస్సు; సిద్ధి=

కార్యాలు నెరవేరటమూ; తేజము= తేజస్సూ; సంధిపట్లన్= కీళ్ళచోటులందు; సిద్దులు= అణిమ మొదలైన అష్ట సిద్ధులూ; ఉనికి+కలదు+అటె= నివాసముగా ఉన్నాయట; గోవున్= ఆవును; ఏమి+అనఁగన్ వచ్చున్= ఏమనవచ్చును!

తాత్పర్యం: పుణ్యాత్మా! ఆవు మోములో, నాలుకలో, కొమ్ములలో ఇంద్రుడున్నాడు. ఇంద్రియద్వారాలలో వాయుదేవుడున్నాడు. మూపురంలో శివుడు, పాదాలలో దేవతల సముదాయం, కడుపులో అగ్ని ఉన్నారు. పొదుగులో సరస్వతీ, పేడలో లక్ష్మి, మూత్రంలో కీర్తి, రక్తంలో చంద్రుడూ ఉన్నారు. హృదయంలో భగుడనే దేవతా, పాలలో బ్రహ్మ ఉన్నారు. వెంట్రుకలలో ఆచారాల సముదాయమంతా ఉన్నది. తోకలో యముడూ, కన్నులలో సూర్యుడూ ఉన్నారు. చర్మంలో తపస్సు, సిద్ధీ, తేజమూ ఉన్నాయి. కీళ్ళలో అష్టసిద్ధులు ఉన్నాయి. ఇట్టివి గల గోవు మహిమ ఇంతటిది అని చెప్పటం ఎట్లా సాధ్యమవుతుంది?

విశేషం: ఈ పద్యం ప్రకారం గోవు అంటే విశ్వమూ, విశ్వకర్తా, విశ్వభర్తా మొదలైన సర్వమునకూ నివాస భూమి అని తెలుస్తున్నది.అంటే సమస్త విశ్వమూ సూక్ష్మరూపంలో గోవుగా ఉన్నదని భావం. సిద్ధులు - అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం, వశిత్వం అని ఎనిమిది. 'ఏమనఁగవచ్చు' - గోమహిమ మాటల కందనిది అని భావం.

వ. మఱియు నొక్కటి యక్కజం బగునది గో మహానుభావ ప్రకటంబయిన యితిహాసంబు సెప్పెద వినుము. 61

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఒక్కటి= ఒకటి; అక్కజంబు+అగునది= ఆశ్చర్యకరమైనది; గో మహానుభావ ప్రకటంబు+అయిన= గోవుల గొప్పతనాన్ని తెలియజేసేదయిన; ఇతిహాసంబు= ప్రాతగాథ; చెప్పెదన్= చెప్తుతాను; వినుము.

తాత్పర్యం: ఇంకా గోవుల మహిమను తెలియజేసే ఆశ్చర్యకరమైన ఇతిహాసం ఒకటి ఉన్నది. చెప్తుతాను వినుము.

విశేషం: ధర్మరాజు ప్రత్యేకించి అడుగకపోయినా భీష్ముడు ఉత్సాహంతో చెప్పబూనుకొన్నాడు. అంటే విషయం చాలా శ్రద్ధగా వినదగినదని తాత్పర్యం. ఇతిహాసం - తొల్లిటి కథ - ఇతిహాసాలు చెప్పదలచిన విషయానికి ప్రామాణ్యాన్ని సంపాదిస్తాయి.

సుమిత్రుఁ డను మునిచేఁ బోషింపఁబడిన గోవుల ప్రభావము (సం.13-120-1(కుంభ))

తే. త్రిశిఖరం బనుపేరి ధాత్రీధరము ను। పాంతమున రుద్ర కల్పితంబైన కూల
హాభిధాన కల్లోలిని శోభితోప। కంఠయై యొప్పుఁ దత్తీర కాననమున. 62

ప్రతిపదార్థం: త్రిశిఖరంబను పేరి ధాత్రీధరము+ఉపాంతమునన్= త్రిశిఖరం అనే పేరుగల కొండ దగ్గర; రుద్ర కల్పితంబు+ ఐన= రుద్రుడిచేత సృష్టింపబడిన; కూలహా+అభిధాన కల్లోలిని= కూలహ అను పేరుగల నది; శోభిత+ఉపకంఠ+ఐ= శోభతో కూడిన ప్రాంత ప్రదేశాలు కలదై; ఒప్పున్= విరాజిల్లుతూ ఉండేది; తత్+తీర కాననమునన్= దాని ఒడ్డున ఉన్న అడవిలో.

తాత్పర్యం: త్రిఖరం అనే కొండ ఉండేది. దాని సమీపంలో రుద్రుడు సృష్టించిన 'కూలహ' అనేనది చక్కని అందమైన పరిసరాలతో అలరారుతూ ఉండేది. దాని ఒడ్డున ఉన్న అడవిలో. (తరువాతి పద్యంతో అన్వయం)

వ. భృగు వంశ సంభవులగు సంయమీశ్వరులు గొంద ఱాశ్రమంబులు గావించుకొని తపఃపరులై యుండుదు; రందు సుమిత్త్రుం డను పేరం బరఁగి పరమాచారభవ్యుం డగు నొక్క భార్గవునకు నంగిరసుం డను నొక్క

మహాద్విజుండు సఖ్యంబునను సౌజన్యంబునను గో శర్కర యొసంగిన నమ్ముని తన గోవు నయ్యోషధి మేపి పోషించిన నది సుపుష్టయు సుస్వరయు సురూపయునై యొక్క వృషభంబు పొందు వడసి గర్భిణియై మిథునంబు నీనిన. 63

ప్రతిపదార్థం: భృగు వంశ సంభవులు+అగు= భృగు అనే మహర్షి వంశంలో పుట్టినవారగు; సంయమి+ఈశ్వరులు= గొప్ప నిగ్రహంగల వారిలో శ్రేష్ఠులు; కొందఱు= కొంతమంది; ఆశ్రమంబులు= పర్ణశాలలు; కావించుకొని= ఏర్పాటు చేసికొని; తపః పరులు+ఐ= తపస్సే ప్రధానమైన పనిగా గలవారై; ఉండుదురు= ఉండేవారు; అందున్= వారిలో; సుమిత్రుండు+అను= సుమిత్రుడనే; పేరన్= పేరుతో; పరఁగి= ఒప్పి; పరమ+ఆచార భవ్యుండు+అగు+ఒక్క భార్గవునకున్= గొప్ప ఆచారంచేత శుభాలుగల ఒక్క భృగువంశ వ్యక్తికి; అంగిరసుండు, అను+ఒక్క మహాద్విజుండు= అంగిరసుడనే ఒక గొప్ప బ్రాహ్మణుడు; సఖ్యంబునను= చెలిమివలన; సౌజన్యంబునను= మంచితనంచేతనూ, గో శర్కర= గోశర్కర అనే ఒక తీగను; ఒసంగినన్= ఇవ్వగా; ఆ+ముని= ఆ మహర్షి సుమిత్రుడు; తన గోవును= తన ఆవును; ఆ ఓషధిన్= ఆ తీగను; మేపి= తినిపించి; పోషించినన్= పెంచగా; అది= ఆ ఆవు; సుపుష్టయున్= చక్కగా బలిసినదీ; సుస్వరయున్= మంచి నాదం కలదీ; సురూపయున్= మంచి రూపం కలదీ; ఐ= అయి; ఒక్క వృషభంబు పొందు= ఒక ఎద్దు సంపర్కాన్ని; పడసి= పొంది; గర్భిణి+ఐ= గర్భం ధరించినదై; మిథునంబున్= జంటను; ఈనినన్= కనగా.

తాత్పర్యం: భృగువంశంలో పుట్టిన కొందరు మహామునులు పర్ణశాలలు వేసికొని తపస్సునందు శ్రద్ధతో ఉండేవారు. వారిలో సుమిత్రుడని ఒక ముని గొప్ప ఆచార నిష్ఠతో ఉండే ఒక భార్గవుడికి అంగిరసుడనే గొప్ప బ్రాహ్మణుడు గోశర్కర అనే పదార్థం చెలిమివలనా, మంచితనం వలనా ఇచ్చాడు. ఆ పదార్థాన్ని ఆయన తన ఆవుకు మేపగా అది మంచి బలమూ, నాదమూ, రూపమూ పొంది ఏపుగా పెరిగింది. ఒక ఎద్దుతో కలిసి గర్భం తాల్చి పెయ్యను, కోడెదూడను కనింది.

విశేషం: సంయమి+ఈశ్వరులు= 'యమం' అంటే ఇంద్రియ నిగ్రహం. ఇది ఉపలక్షణంగా ఎనిమిది అంగాల యోగమార్గంలో వారు సిద్ధి పొందిన వారని భావించాలి. అందుకే ఈశ్వరులు - శ్రేష్ఠులు, ఆచారభవ్యుడు, విష్ణుసహస్రనామం ధర్మం ఆచారం నుండి పుడుతున్నదని చెప్తున్నది. "ఆచార ప్రభవో ధర్మః" దానిచేత అతడు భవ్యుడు, శ్రేష్ఠుడు అవుతున్నాడు. అందుకనే మహాద్విజుడు చెలిమిచేశాడు. మంచితనాన్ని భావించాడు. కానుక ఇచ్చాడు. సురూప, రూపం అంటే ఏ విధమైన అలంకారాలు లేకపోయినా అలంకారాలవలన కలిగే సౌందర్యం ఉన్నట్లు భాసింపజేసే లక్షణం. 'ఆవేధ్యా రోప్య నిక్షేప్య బన్ధనీయై రభూషితమ్, యేన భూషిత వద్భాతి తద్రూపమితి కథ్యతే".

క. అమ్మిథునము బహుసంతా । నమ్మయ్యెం బెరఁగి క్రమమునను గో నిచయం
బిమ్మెయిఁ బెక్కు సహస్రము । లమ్మునికిం గల్గె గోవు లతఁడును వానిన్. 64

ప్రతిపదార్థం: ఆ+మిథునము= ఆ జంట; బహు సంతానమ్ము= పెక్కు బిడ్డలు గలది; అయ్యెన్= అయింది; ఈ+మెయిన్= ఈ విధంగా; క్రమమునను= క్రమంగా; గో నిచయంబు= ఆవులమంద; పెరఁగి= వృద్ధిపొంది; పెక్కు సహస్రములు= చాలా వేల కొలదిగా; గోవులు= ఆవులు; ఆ+మునికిన్= ఆ సుమిత్రుడనే మునికి; కల్గెన్= ఏర్పడ్డాయి. అతఁడును= ఆ ముని; వానిన్= ఆ ఆవులను.

తాత్పర్యం: ఆ జంట క్రమక్రమంగా పెరిగి పెక్కు వేల ఆవులు ఆ మునికి సొమ్ముగా ఏర్పడ్డాయి. అతడు కూడా వాటిని. (తరువాతి పద్యంతో అన్వయం)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. వేడ్కఁ జూచుచు నెప్పుడు వెనుకఁ దిరిగి । మేపు నీరును గలచోటి కోపి వెలిచి
పాలు గ్రేపులు గుడువ సప్రమదుఁ డగుచుఁ దాను గోస్తన ఫేనంబు ద్రావియుండు. 65

ప్రతిపదార్థం: వేడ్కన్= ప్రీతితో; చూచుచున్= చూస్తూ; ఎప్పుడున్= ఎల్లవేళలా; వెనుకన్= వెనుకవైపుగా; తిరిగి; మేపు= గడ్డీ; నీరు= నీళ్ళూ; కల చోటికి= ఉన్న తావునకు; ఓపి= కష్టాలకు తట్టుకొని; వెలిచి= త్రిప్పి; పాలు= పాలను; క్రేపులు= దూడలు; కుడువన్= త్రాగుతుంటే; సప్రమదుఁడు= నిండైన ఆనందంతో కూడినవాడు; అగుచున్= అవుతూ; తాను; గో స్తన ఫేనంబు= ఆవు చన్నుల దగ్గరి నురుగును; త్రావి= త్రాగి;ఉండున్= ఉండేవాడు.

తాత్పర్యం: ఆ ముని వాటిని ప్రీతితో పరామరిక చేస్తూ ఉండేవాడు. వాటివెంట తిరుగుతూ మంచి పచ్చికా నీరూ కలచోటులలో ఓపికతో త్రిప్పుతూ, దూడలు తల్లుల పాలు త్రాగుతూ ఉంటే పరమానంద పడుతూ తాను మాత్రం ఆ పాలు త్రాగేటప్పుడు వచ్చే నురుగును త్రాగుతూ ఉండేవాడు.

విశేషం: ఉన్నవి కొన్నివేల ఆవులు. వాటికి కావలసిన పచ్చికా నీరూ ఉన్నచోటనే దొరకవు అయినా అవి పుష్టిగా ఉండటమే తన కానందం కనుక పచ్చికా, నీరూ, ఎక్కడ దొరికితే అక్కడకు శ్రమకోర్చి వెళ్ళేవాడు అని 'ఓపి' అన్నమాటకు భావం. ఆవుల పొదుగులలో దూడలు పాలు త్రావటం ఒక మనోజ్ఞమైన దృశ్యం. స్వార్థంలేని వాడికి అది మరింత ఆనంద కారణమవుతుంది. అందుకనే 'సప్రమదుఁడు' తన పుష్టికి నురుగు చాలు. అంటే దూడల నోట్లో దుమ్ముకొట్టే బుద్ధి ఏ మాత్రమూ లేదని భావం.

క. దానన చేసి యతనికిన్ । ఫేనపుఁ డను నామ మొసఁగెఁ బ్రియమున ముని స
మ్మానితుఁ డగు గౌతముఁ డి । ట్లా నిర్మలబుద్ధి గోసమారాధకుఁడై. 66

ప్రతిపదార్థం: ముని సమ్మానితుఁడు= మునుల మన్ననగొన్నవాడు; అగు= అయిన; గౌతముఁడు= గౌతముడనే ఋషి; దానన చేసి= ఆ కారణంచేతనే; అతనికిన్= ఆ సుమిత్రుడికి; ఫేనపుఁడు అను నామము= ఫేనపుడనే పేరును; ప్రియమునన్= ప్రియంతో; ఒసఁగెన్= ఇచ్చాడు; ఇట్లు= ఈ విధంగా; ఆ నిర్మల బుద్ధి= ఆ స్వచ్ఛమైన బుద్ధిగల సుమిత్రుడు; గో సమారాధకుఁడు+ఐ= గోవులను చక్కగా భక్తితో పూజించేవాడై.

తాత్పర్యం: మునుల మన్ననగొన్న గౌతముడనే మహర్షి ఆ సుమిత్రుడికి ఆ కారణంచేతనే (పాలనురుగు త్రాగే కారణం చేతనే) అదే అర్థంగల 'ఫేనపుడు' అనే పేరు పెట్టాడు. ఇట్లా నిర్మలమైన బుద్ధిగల ఆ ముని గోవులను చక్కగా ఆరాధిస్తూ. (తరువాతి వచనంతో అన్వయం)

విశేషం: ముని సమ్మానితుడు కనుక అతని పెద్దతనంవలన అతడు పెట్టిన పేరు అందరికీ ప్రీతిపాత్రమైనదని ధ్వని, బిరుదువంటి ఆ పేరు సుమిత్రుడి స్వభావాన్ని కలుషితం చేయలేదు. కాబట్టే అతడు 'నిర్మలబుద్ధి'.

వ. వర్తిల్లుచుండ నొక్కనాఁడు కామరూపిణు లగు గోవులు కొన్ని కాంతాకారంబులు గైకొని కమనీయంబగు కొలన జలక్రీడలు సలుపుచుండఁ దోడిధేనువు లచ్చట మెలంగి కనుంగొని 'మీ రెవ్వ?' రని మానుష భాషణంబుల నడిగిన నయ్యంగనా జనంబులు. 67

ప్రతిపదార్థం: వర్తిల్లుచుండన్= కాలం గడుపుతుండగా; ఒక్కనాఁడు= ఒక రోజున; కామరూపిణిలు+అగు గోవులు= కోరిన రూపం ధరించగల ఆవులు; కొన్ని; కాంతా+ఆకారంబులు= మంచి రూపవంతులైన స్త్రీల రూపాలను; కైకొని= ధరించి; కమనీయంబు+అగు= మనోహరమైన; కొలనన్= ఒక కొలనిలో; జలక్రీడలు= నీటి యాటలు; సలుపుచున్+ఉండన్= చేస్తూ ఉండగా; తోడి ధేనువులు= తమతోపాటుగా ఉండే ఆవులు; అచ్చటన్= ఆ తావులో; మెలంగి= తిరుగుతూ; కనుంగొని= చూచి; మీరు; ఎవ్వరు; అని; మానుష భాషణంబులన్= మనుష్యుల మాటలతో; అడిగినన్= అడుగగా; ఆ+అంగనా జనంబులు= ఆ సుందరకాంతలు.

తాత్పర్యం: ఆయన అట్లా ప్రవర్తిస్తూ ఉండగా ఒక రోజున కోరిన రూపం ధరించగల కొన్ని ఆవులు చక్కని మగువల రూపాలను ధరించి ఒక అందమైన కొలనులో జలకాలాడుతూ ఉండగా తోడి ఆవులు 'మీరెవ్వరు?' అని మనుష్యుల మాటలతో అడుగగా ఆ కాంతలు. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అంగనలు - అంటే మంచి అందంగల, అంగం= దేహం కలవారు.

తే. **'ఏము గోవుల' మనవుడు 'నిట్టి యద్భు। తానుభావంబు మీ కెట్టు లావహిల్లె?'**
ననిన విని వానితోడ నయ్యతివ లిట్టు। లనిరి 'మా తెఱఁ గేర్పడ వినుఁడు మీరు. 68

ప్రతిపదార్థం: ఏము= మేము; గోవులము= ఆవులం; అనవుడున్= అనగా; ఇట్టి= ఈ విధమైన; అద్భుత+అనుభావంబు= అచ్చెరువు గొల్పే మహిమ; మీకున్; ఎట్టులు= ఏ విధంగా; ఆవహిల్లెన్?= కలిగింది; అనినన్= అనగా; విని; వానితోడన్= ఆ ఆవులతో; ఆ+అతివలు= ఆ సుందర వనితలు; ఇట్టులు= ఈ విధంగా; అనిరి= పలికారు; మీరు; మా తెఱఁగు= మా పద్ధతి; ఏర్పడన్= చక్కగా తెలిసే విధంగా; వినుఁడు= వినండి.

తాత్పర్యం: 'మేము ఆవులం' అన్నాయి. అంటే 'మీకీ ఆశ్చర్యకరమైన గొప్పతనం ఎట్లా కలిగింది?' అని గోవులడుగగా వాటితో ఆ కాంతలు ఇట్లా అన్నారు. 'మా తీరు తేటతెల్లంగా వినండి.'

విశేషం: 'మీకు' మేము గోవులమే కదా! మాకు లేని మహిమ మీ కెట్లా కలిగింది అనే జిజ్ఞాసను ఈ పద్యం వ్యక్తం చేస్తుంది. మీరు - అనేది కూడా వ్యంజకమే. మమ్ములను గూర్చి ఆసక్తితో వినగోరుతున్న మీరు అని అర్థం. అర్థాంతర సంక్రమిత వాచ్యధ్వని అంటారు.

వ. **హవ్య కవ్యంబులకు నతిథిపూజనంబులకు నిజాహారంబులకు సద్ద్విజావలి సంతోషింప నింపారు పాలు వారికిం గురియుదుము, కృషిక్రియా సర్వ నిర్వర్తనంబులకు మా పుత్రులం బనుతు; మా సుకృతంబుల నివ్విశేషంబు కలిగె; మాకును గోలోకంబును సులభంబు; మీ రా సుకర్మంబులు సూచి యసూయ సేయుదురు గావున.69**

ప్రతిపదార్థం: హవ్య కవ్యంబులకున్= హవ్యానికీ, కవ్యానికీ (హవ్యం= దేవతలకిచ్చే పదార్థం; కవ్యం= పితృదేవతలకిచ్చే పదార్థం); అతిథిపూజనంబులకున్= అతిథుల మన్నించటానికీ; నిజ+ఆహారంబులకున్= తమ భోజనాలకూ; సత్+ద్విజ+ఆవలి= ఉత్తమ బ్రాహ్మణుల సముదాయం; సంతోషింపన్= చక్కని తృప్తిపొందే విధంగా; ఇంపు+ఆరు పాలు= శ్రేష్ఠమైన పాలను; వారికిన్= ఆ బ్రాహ్మణులకు; కురియుదుము= ఎక్కువ ప్రమాణంలో అందిస్తాం; కృషి క్రియా సర్వ నిర్వర్తనంబులకున్= వ్యవసాయం మొదలైన అన్ని పనులకు; మా పుత్రులన్= మా సంతానాన్ని కోడెలను, ఎద్దులను; పనుతుము=పంపుతాం; ఆ సుకృతంబులన్= ఆ పుణ్యాలవలన; ఈ+విశేషంబులు= ఈ గొప్పతనాలు; కలిగెన్= కలిగాయి; మాకును= మాకుకూడా;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గోలోకంబును= గోవుల లోకం; సులభంబు= తేలికగా అందుతుంది; మీరు; ఆ సుకర్మంబులు= మంచి పనులు; చూచి; అసూయ+చేయుదురు= అసూయ పొందుతారు; కావునన్= కాబట్టి.

తాత్పర్యం: హవ్యకవ్యాలకూ, అతిథిపూజలకూ, ఆహారానికీ చక్కగా తృప్తిగా వినియోగించుకొనటానికి వీలుగా పాలు సమృద్ధిగా ఉత్తమ బ్రాహ్మణులకు ఇస్తాం. మా సంతానాన్ని వ్యవసాయం మొదలైన పనులు చేయటానికి పంపుతాం. ఆ పుణ్యాలవలన మా కీ విశేషాలు కలిగాయి. మాకు కూడా గోలోకం తేలికగా సిద్ధిస్తుంది. మా పుణ్యకార్యాలు చూచి మీరు అసూయపడతారు. కనుక.

విశేషం: మానవుడు ఎన్నో ఋణాలతో పుడతాడు. అవి తీర్చుకొనటానికి అయిదు యజ్ఞాలు ప్రతిదినమూ చేస్తూ ఉండాలి. అవి బ్రహ్మయజ్ఞం; పితృయజ్ఞం; దేవయజ్ఞం; మనుష్యయజ్ఞం; భూతయజ్ఞం అనేవి ఇందులో ఇంచుమించుగా అన్నింటికీ కావలసిన పదార్థం గోవులు సమర్పిస్తాయి. కనుక ఉత్తమ బ్రాహ్మణులు చేసిన కర్మల ఫలితాలు అవి కూడా పొందుతాయి. ఇక పురుష సంతానం వ్యవసాయానికి ఉపయోగపడుతూ అందరినీ కాపాడుతుంది. అసూయ అంటే గుణాలను దోషాలుగా భావించి చెప్పటం 'అసూయాతు దోషారోపో గుణేష్వపి' - అమ. కురియుదుము - క్రియ వ్యంజకం. వర్షం కురిస్తే జలం ఎంత సమృద్ధిగా ఉంటుందో అంత సమృద్ధిగా పాలు ఇస్తాము అని ధ్వని.

క. క్రేపులు తో రా దుర్గతిఁ । బ్రాపింపఁ గలార యిట్టి భావిచరిత ము
ద్దీపిత బోధమునం గని । మీపై కృపఁ జెప్పవలసె మీకుం దెలియన్. 70

ప్రతిపదార్థం: క్రేపులు= దూడలు; తోన్= వెంటనంటి; రాన్= రాగా; దుర్గతిన్= దుఃఖపు గతిని; ప్రాపింపఁగలార= పొందుతారు; ఇట్టి= ఈ విధమైన; భావిచరితము= రాబోయే స్థితిని; ఉద్దీపిత బోధమునన్= ప్రకాశించే జ్ఞానంతో; కని= చూచి; మీ పై కృపన్= మీమీది అనుగ్రహంతో; మీకున్= మీకు; తెలియన్= తెలిసే విధంగా; చెప్పవలసెన్= చెప్పవలసి వచ్చింది.

తాత్పర్యం: మీ దూడలు మీతో రాగా మీరు చెడుదశను పొందుతారు. మా హృదయాలలో వెలుగొందే జ్ఞానం ఆధారంగా ఈ విషయాన్ని మేము ముందుగా తెలిసికొని మీ మీది దయతో మీకు తెలిసే విధంగా చెప్పవలసి వచ్చింది.

విశేషం: ఉద్దీపిత బోధము - సాధారణంగా భవిష్యత్తు ఎవరికీ తెలియదు. కాని, మహాపుణ్యాత్ములకు తపస్సంపన్నులకూ అది తెలుస్తుంది. ఇది కూడా ఆ కాంతారూప గోవులు చేసిన పుణ్య ఫలమే. రాబోయే అనర్థాన్ని ముందుగా తెలియజెప్పటం పరిహార మార్గాలను అన్వేషించి పాటించటంకొరకు. అదే ఇక్కడ కృప.

వ. అనుటయు నగ్గోవులు దీనాననలై. 71

ప్రతిపదార్థం: అనుటయున్= అన్నంతనే; ఆ+గోవులు= ఆ ఆవులు; దీన+ఆననలు+ఐ= జాలిగొలిపే మోములు గలవై.

తాత్పర్యం: అన్నంతనే ఆ గోవులు దీనమైన మొగాలు కలవై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'గోవులకును గోవులు గతి । గావున మీ రరసి సుగతి గలుగు తెరువు మా
కే విధి నైనను జెప్పం । గా వలదే' యనిన నట్ల కా' కని వారల్. 72

ప్రతిపదార్థం: గోవులకును= ఆవులకు; గోవులు= ఆవులు; గతి= దిక్కు; కావునన్= కాబట్టి; మీరు; అరసి= చక్కగా పరిశీలించి; సుగతి కలుగు తెరువు= మంచి గతి గలిగే మార్గం; మాకున్; ఏ విధిన్ ఐనను= ఏ విధంగానైనా; చెప్పంగాన్ వలదే= చెప్పవద్దా?; అనినన్= అంటే; అట్ల కాక= సరే అట్లాగే; అని; వారల్= ఆ కాంతలు.

తాత్పర్యం: 'గోవులకు గోవులే దిక్కు కనుక మీరు మెలకువతో ఆలోచించి మాకు మంచి గతి కలిగే మార్గం ఎట్లాగైనా చెప్పాలి కదా!' అంటే 'సరే అట్లాగే' అని ఆ కాంతలు (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: మీరు, మాకు అనేవి అర్థాంతర సంక్రమిత వాచ్యాలు. మాతో సమానజాతి అయి, మా యందు కృపగల మీరు, దిక్కుతోచక దుఃఖపడుతున్న మాకు - అని వ్యంగ్యార్థం ఏ విధినైనను ఇది ఒత్తిడితో కూడిన ప్రార్థనను తెలియజేస్తుంది.

తే. **రంతిదేవుండు వేవత్సరములు సేయు । నధ్వరమునకుఁ బశువులై యరుగుఁ; డతఁడు**
విశసనము సేయ గోలోక విభవ మొందఁ । గాంతు' రని నెమ్మిఁ బల్కిన సంతసిల్లి. **73**

ప్రతిపదార్థం: రంతిదేవుండు= రంతి దేవుడనే రాజు; వే వత్సరములు= వేయి యేండ్లు; చేయు+అధ్వరమునకున్= చేసే యజ్ఞానికి; పశువులు+ఐ= పశువులుగా; అరుగుఁడు= వెళ్ళండి; అతఁడు= ఆ రాజు; విశసనము+చేయన్= చంపగా; గోలోక విభవము= గోవుల లోకపు మహిమ; ఒందన్+కాంతురు= పొందగలుగుతారు; అని; నెమ్మిన్= ప్రీతితో; పల్కినన్= పలుకగా; సంతసిల్లి= సంతోషించి.

తాత్పర్యం: 'రంతిదేవుడు వేయి యేండ్లు చేసే యజ్ఞంలో మీరు పశువులుగా వెళ్ళండి. ఆ రాజు మిమ్ములను యజ్ఞంలో బలియిస్తే మీకు గోలోకంలో ఉండే మహిమ కలుగుతుంది' అని ప్రీతితో చెప్పగా ఆ గోవులు సంతోషించి. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **అగ్గోవు లవ్విభు నధ్వరంబునకుఁ బో । నుత్సహించుటయు నం దొక్క గోవు**
'మనము సుమిత్రుని ధన । మాతఁ డనుమతి । సేయక యెట్లు వోఁ జెల్లు?' ననిన
'నాతనిఁ జంపుద మతఁడును గోలోక । మున కేఁగుదెంచుఁగా!' కని కడంగి
చని మునిఁ దేటి చూడను జాల కంతంత । నతిభీతిఁ గ్రమ్మఱి యరుగుటయును

తే. **గొన్ని కపిలధేనువు లతి క్రూరచిత్త । 'లేము వధియించెదము మాకు నేమి మేలు**
సేయు వారలు దగ మీరు సెప్పు?' డనిన । నన్ని మొదవులు నేకవాక్యత్వ మొంది. **74**

ప్రతిపదార్థం: ఆ+గోవులు= ఆ ఆవులు; ఆ+విభు+అధ్వరంబునకున్= ఆ రాజు రంతిదేవుడి యాగానికి; పోన్= పోవటానికి; ఉత్సహించుటయున్= వేడుక పడగా; అందున్= వాటిలో; ఒక్క గోవు= ఒక ఆవు; మనం; సుమిత్రుని ధనము= సుమిత్రుడి సొమ్ము; అతఁడు= ఆ సుమిత్రుడు; అనుమతి+చేయక= ఒప్పుకొనకుండా; ఎట్లు= ఏ విధంగా; పోన్= పోవటం; చెల్లును?= కుదురుతుంది?; అనినన్= అంటే; అతనిన్= ఆ సుమిత్రుడిని; చంపుదము= చంపివేద్దాం; అతఁడును= అతడు కూడా; గోలోకమునకున్= గోవుల లోకానికి; ఏఁగుదెంచున్+కాక= వస్తాడు; అని; కడంగి= పూనుకొని; చని= వెళ్ళి; మునిన్= మునిని; తేటి చూడను+చాలక= నిబ్బరంగా చూడను కూడా శక్తిలేక; అంతన్+అంతన్= దవ్వులనుండియే; అతిభీతిన్= ఎక్కువ భయంతో; క్రమ్మఱి= మరలి; అరుగుటయును= పోగా; కొన్ని కపిల ధేనువులు= కొన్ని పుల్లావులు; అతి క్రూరచిత్తలు= మిక్కిలి

క్రూరమైన హృదయం కలవి; ఏము= మేము; వధియించెదము= చంపుతాము; మాకున్= మాకు; ఏమి= ఏ విధమైన; మేలు= మంచిని; చేయువారలు?= చేస్తారు; తగన్= తగువిధంగా; మీరు; చెప్పుఁడు= చెప్పండి; అనినన్= అనగా; అన్ని మొదవులు= ఆవులన్నీ; ఏకవాక్యత్వము= ఒక అభిప్రాయం కలగటం; ఒంది= పొంది.

తాత్పర్యం: ఆ ఆవులన్నీ రంతిదేవుడి యాగానికి వెళ్ళటానికి సిద్ధపడ్డాయి. అందులో ఒక ఆవు 'మనం సుమిత్రుడి ధనం కదా! అతడి అంగీకారం లేకుండా పోవటం ఎట్లా కుదురుతుంది?' అన్నది. 'అయితే అతడిని చంపుదాం. అతడు కూడా గోలోకానికి వస్తాడు' అని నిర్ణయించుకొని ముని దగ్గరకు బయలుదేరాయి. కాని అతడిని సూటిగా చూడను కూడా చూడ లేక దూరం నుండియే తిరిగి వెళ్ళిపోయాయి. కొన్ని పుల్లావులు హృదయంలో క్రూరత్వం నింపుకొని 'మేము అతడిని చంపుతాం. మాకు మీ రేమి మేలు ఇస్తారు? తగు విధంగా చెప్పండి' అనగా ఆవులన్నీ కూడబలుకుకొని ఒకమాటకు వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'చంపుదము' - ఇది కృతఘ్నతగాదు. వాటిని విడిచి అతడూ, అతడిని విడిచి అవీ ఉండలేవు. కనుక తాము పొందే సద్గతికి అతడుకూడా చేరుకొనాలని మాత్రమే వాటి భావన. దీనిని కవి ముందు స్పష్టం చేస్తాడు. 'తేజిచూడను చాలక' - అతడిని ఫేనపునితనం ఒక మహా తపస్సు. దానితో తాము చంపటమనే చెడు తలంపుతో (లోక సామాన్య దృష్టితో) దరికి చేరలేకపోయాయి. కనీసం కన్నులతో సూటిగా చూడటం కూడా సాధ్యం కాలేదు. 'అతి క్రూరచిత్తత్వం' - సంకల్పం మంచిదయినా చేష్ట లోకం చూపునకు విరుద్ధమైనది. కాబట్టి గుండెలో దయలేకుండా చూచుకొనాలి. కనుక అవి గుండెను బండ చేసికొన్నాయి అని భావం.

ఆ. 'సకల వర్ణ ధేను సమితికి నెల్లను। గపిల గోవు శ్రేష్ఠ గాఁగఁ గపిల
నీగి గో శతంబు నిచ్చిన యట్లుగా। వరము మీకు నిచ్చు వార' మనియె. 75

ప్రతిపదార్థం: సకల వర్ణ ధేను సమితికిన్= అన్ని రంగుల ఆవుల సముదాయానికి; ఎల్లను= అంతా; కపిలగోవు= గోరోచన వర్ణంగల ఆవు; శ్రేష్ఠ= అన్నింటికంటె మిన్న; కాఁగన్= అయ్యేవిధంగాను; కపిలను= పుల్లావును; ఈగి= దానంచేయటం; గోశతంబున్= నూరు ఆవులను; ఇచ్చిన+అట్లుగాన్= ఇచ్చినదానితో సమానం అవునట్లుగాను; మీకున్= మీకు; వరము= వరాన్ని; ఇచ్చువారము= ఇస్తాము; అనియెన్= అన్నాయి.

తాత్పర్యం: 'అన్ని రంగుల ఆవులన్నింటిలో కపిలవర్ణం గలవి మిక్కిలి గొప్పవి అయ్యే విధంగానూ, ఒక కపిలగోవును దానంచేస్తే అది వందగోవుల దానంతో సమానం అయ్యేవిధంగానూ మీకు వరమిస్తాం' అన్నాయి.

వ. అనిన విని కరంబుప్రియంబునం గామరూపిణులైన యగ్గోవులు రూపాంతరంబులు గైకొని యా భృగువంశ వర్యు పాలికిం బోయి 'యేము గోమాతలము; నీదగు గో సమారాధనంబునకు మెచ్చి వరంబిచ్చువారమై వచ్చితి; మిష్టం బెయ్యది యడుగు' మనుటయు నమ్ముని 'యిప్పటి యట్ల యెల్లప్పుడును గోవులవలన భక్తిస్నేహంబులు గలుగ నిం' డనియె నమ్మాటకు నవి 'యట్ల యయ్యెడుఁగాక!' యని పలికి వెండియు నిట్లనియె. 76

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; కరంబు= మిక్కిలి; ప్రియంబునన్= ఇష్టంతో; కామరూపిణులు+ఐన= ఇచ్చవచ్చిన రూపం పొందగల; ఆ+గోవులు= ఆ ఆవులు; రూప+అంతరంబులు= వేరు రూపాలు; కైకొని= ధరించి; ఆ భృగువంశవర్యు పాలికిన్= భృగువంశంలో ఎన్నదగినవాడైన ఆ సుమిత్రుడి దగ్గరకు; పోయి= వెళ్ళి; ఏము= మేము;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గోమాతలము= ఆవుల తల్లులము; నీది+అగు= నీదైన; గోసమారాధనంబునకున్= ఆవుల భక్తితోడి పూజకు; మెచ్చి= ఆనం దపడి; వరంబు= వరాన్ని; ఇచ్చువారము+ఐ= ఇచ్చేవారమై; వచ్చితిమి= వచ్చాము; ఇష్టంబు= ఇష్టమైనది; ఏ+అది=ఏదో; అడుగుము= కోరుకొనుము; అనుటయున్= అనగా; ఆ+ముని= ఆ ముని; ఇప్పటి+అట్లు+అ= ఇప్పటివలెనే; ఎల్ల+అప్పుడున్= సర్వకాలాలలో; గోవులవలనన్= ఆ గోవుల విషయంలో; భక్తి స్నేహంబులు= భక్తీ చెలిమీ; కలుగన్= కలిగేటట్లు; ఇందు= వరం ఇవ్వండి; అనియెన్= అన్నాడు; ఆ+మాటకున్= ఆ మాటకు; అవి= ఆ ఆవులు; భక్తి చెలిమీ; కలుగన్= కలిగేటట్లుగా; ఇండు= వరం ఇవ్వండి; అనియెన్= అన్నాడు; ఆ+మాటకున్= ఆ మాటకు; అని= ఆ ఆవులు; అట్ల= అట్లాగే; అయ్యెడున్+కాక= అవుతుంది; అని; పలికి= మాట్లాడి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాయి.

తాత్పర్యం: ఆ ఆవులు అట్లా చెప్పగా పుల్లావులు విని ఎంతో ప్రీతితో కోరినరూపాలు ధరించగలిగినవి కనుక వేరురూపాలు పొంది ఆ సుమిత్రుడి కడకరిగి 'అయ్యా! మేము గోమాతలం. నీవు చేసే ఈ గో పూజకు సంతోషం కలిగి నీకు వరమివ్వటానికి వచ్చాం. నీ కేది ఇష్టమో దాన్ని కోరుకొనుము' అన్నాయి. అప్పు డా ముని 'ఇప్పటిదానివలెనే నాకు ఆవులమీద భక్తి స్నేహాలు ఎప్పటికీ ఉండేవరం ఇవ్వండి' అన్నాడు. దానికి అవి 'అట్లాగే అవుతుంది' అని ఇంకా ఇట్లా అన్నాయి.

క. ' ఈ లోకం బేటికి? మన । గోలోకంబునకు రమ్ము కులవర!' యనుడుం
'జాలుదునే మద్గో ర । త్నాలి విడిచి యందు రాక' కని ముని పల్కెన్. 77

ప్రతిపదార్థం: కులవర!= కులంలో శ్రేష్ఠుడా!; ఈ లోకంబు= ఈ లోకం; ఏటికిన్= ఎందుకు? మన గో లోకంబునకున్= మనదైన ఆవుల లోకానికి; రమ్ము= రా; అనుడున్= అన్న వెంటనే; మత్ గో రత్న+ఆలిన్= నా గోవులనే రత్నాల వరుసను; విడిచి= వదలి; అందు= ఆ గోలోకం; రాకకున్= రావటానికి; చాలుదునే?= శక్తికలవాడనా?; అని; ముని; పల్కెన్= అన్నాడు.

తాత్పర్యం: 'కులశ్రేష్ఠా! ఈ లోకంతో పనియేమి? మన గోలోకానికి రమ్ము!' అన్నంతనే 'నేనీ గో రత్నాల వరుసను వదలి అక్కడికి రాగలనా?' అని ముని పలికాడు.

విశేషం: 'ఈ లోకంబు ఏటికి' - ఇది విశిష్టమైనదీ, కోరదగినదీ కాదని తాత్పర్యం. 'మన' - నీవు మాతో ఏ మాత్రమూ భేదంలేనివాడవని భావం. చాలుదునే - ఆ లోకం ఎంత గొప్పదయినా నా ప్రాణానికి ఈ గోవులే సర్వస్వం అని అతని అభిప్రాయం.

క. విని యా ధేనువు లాతని । తను వాకసమునకు నెత్తి తమ యోగబలం
బునఁ జైతన్యముఁ బాపి య । వని మీఁదఁ గళేబరంబు వైచి రయమునన్. 78

ప్రతిపదార్థం: విని= ఆలకించి; ఆ ధేనువులు= ఆ ఆవులు; అతని తనువు= ఆ సుమిత్రుడి దేహాన్ని; ఆకసమునకున్= ఆకాశానికి; ఎత్తి; తమ యోగ బలంబునన్= తమ యోగశక్తిచేత; చైతన్యమున్= ప్రాణాన్ని; పాపి= పోగొట్టి; కళేబరంబున్= ప్రాణం లేని దేహాన్ని; అవనిమీఁదన్= నేలమీద; వైచి= వేసి; రయమునన్= వేగంతో.

తాత్పర్యం: ఆ మాట విన్న ఆవులు అతని దేహాన్ని ఆకాశానికి ఎత్తి తమ యోగబలంవలన ప్రాణాలు పోగొట్టి దేహాన్ని క్రిందవేసి వేగంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఆకాశానికి ఎత్తటం అంటే ఊర్ధ్వగతి - ఉత్తమగతి కల్పించటం. యోగబలంచేత ప్రాణశక్తిని దేహంనుండి వేరు చేశాయి. కనుక ఆ ప్రాణశక్తి అంత్యకాలంలో చికాకు పొందలేదు - అనే అంశం ఊహకు వస్తుంది.

క. కొమ్ములఁ గాళ్ళం బిండిగఁ। గ్రుమ్మి మగిడిపోయి పూసగ్రుచ్చిన గతి మున్
తమ్ముం బనిచిన గోవుల। కమ్ముని తెఱఁ గెల్లఁ జెప్పి హర్ష మొనర్చెన్. 79

ప్రతిపదార్థం: కొమ్ములన్= కొమ్ములతో; కాళ్ళన్= కాళ్ళతో; పిండిగన్= పిండి అయ్యేటట్లు; క్రుమ్మి= పొడిచి; మగిడి పోయి= తిరిగి వెళ్ళి; పూసగ్రుచ్చినగతిన్= పూసగ్రుచ్చినట్లుగా; మున్= ముందు; తమ్మున్= తమ్ము; పనిచిన గోవులకున్= పంపిన ఆవులకు; ఆ+ముని తెఱఁగు= ఆ ముని తీరును; ఎల్లన్= అంతా; చెప్పి= వివరించి; హర్షము= ఆనందం; ఒనర్చెన్= కలిగించాయి.

తాత్పర్యం: కొమ్ములతో కాళ్ళతో ఆ దేహాన్ని పిండి పిండి అయ్యేవిధంగా పొడిచి తిరిగివెళ్ళి మునుపు తమ్ము పంపించిన ఆవులకు ఆ ముని తీరును పూసగ్రుచ్చినట్లుగా చెప్పి ఆనందం కలిగించాయి.

విశేషం: కొమ్ముల..... క్రుమ్మి - ఇది ప్రాణం పోయిన తరువాత దేహానికి చేసే సంస్కారం వంటిది. 'పూసగ్రుచ్చిన గతిన్' - ఇది ఒక జాతీయం - ఏ చిన్న అంశాన్నీ వదలకుండా అని దీని భావం.

వ. గోలోకంబునకు ముఖ్యలగు గోమాత లంతయు నెఱింగి తమ కడకుం జనుదెంచిన సుమిత్రు నాదరించి సుదతులై విహరించిన గోవులు మొదలుగా సకల గోవుల తెఱంగు నతని కెఱింగించి 'నీకు నిది మేల కాక' యని పలికి యతనిం బ్రీతునిం జేసి బ్రహ్మ ఘాతిక లయిన యన్ని గోవులకును 'మీ వంశం బశుచి వదనం' బయ్యెడు మని శాపం బిచ్చిన నాధేనువులు రంతిదేవు పాలికిం బోయి సుగతి వేఁడి తమ్ముం బశువులుంగా విశసింపు మని మానుష భాషణంబులం బ్రార్థించుటయు. 80

ప్రతిపదార్థం: గోలోకంబునకున్= గోవుల లోకానికి; ముఖ్యలు+అగు= ప్రధాన వ్యక్తులయిన; గోమాతలు= గోవుల తల్లులు (గోమాతలనబడే వారు); అంతయున్= ఆ విషయమంతా; ఎఱింగి= తెలిసికొని; తమ కడకున్= తమ దగ్గరకు; వచ్చిన సుమిత్రున్= వచ్చిన సుమిత్రుడిని; ఆదరించి= మన్నించి; సుదతులు+ఐ= ఆడవాండ్రై; విహరించిన గోవులు= తిరిగిన ఆవులు; మొదలుగాన్= ఆదిగా; సకల గోవుల తెఱంగున్= అన్ని ఆవుల తీరును; అతనికిన్= ఆ సుమిత్రుడికి; ఎఱింగించి= తెలిపి; నీకున్= నీకు; ఇది= ఇట్లాంటి స్థితి; మేలు+అ= మేలే; కాక= అగుగాక; అని; పలికి; అతనిన్= అతడిని; ప్రీతునిన్= ప్రీతికలవాడినిగా; చేసి= ఒనర్చి; బ్రహ్మఘాతికలు= బ్రాహ్మణుడిని చంపినవి; అయిన అన్ని గోవులకును= అయిన ఆవులన్నింటికీ; మీ వంశంబు= మీ కులం; అశుచి వదనంబు+అయ్యెడున్= శుచిలేని మొగం కలదవుతుంది; అని; శాపంబు= శాపాన్ని; ఇచ్చినన్= ఇవ్వగా; ఆ ధేనువులు= ఆ ఆవులు; రంతిదేవు పాలికిన్= రంతిదేవుడి దగ్గరకు; పోయి= వెళ్ళి; సుగతి= మంచిగతిని; వేఁడి= కోరుకొని; తమ్మున్= తమను; పశువులు+కాన్= యజ్ఞ పశువులుగా; విశసింపుము= చంపుము; అని; మానుష భాషణంబులన్= మనుష్యుల మాటలతో; ప్రార్థించుటయున్= వేడినంత.

తాత్పర్యం: గోలోకంలో ప్రధానస్థితి గల గోమాతలు ఆ విషయమంతా తెలిసికొని తమ దగ్గరకు వచ్చిన సుమిత్రుడిని ప్రేమతో లాలించి స్త్రీలై తిరిగి ఆవులు మొదలుకొని తక్కిన అన్నింటి తీరును అతడికి తెలిపి 'నీకిది మేలే అవుతుంది' అని అతడికి ప్రీతి కలిగించాయి. తరువాత ఆ బ్రాహ్మణుడిని హత్య చేసిన ఆవులన్నింటికీ మీముఖం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నల్లగా అవుతుంది అని శాపం పెట్టాయి. ఆ ఆవులు రంతిదేవుడి దగ్గరకు పోయి 'మాకు మంచిగతి కలిగించుము. మమ్మి నీ యజ్ఞంలో పశువులుగా బలి ఇమ్మి' అని మనుష్యుల మాటలతో ప్రార్థించాయి. అట్లా ప్రార్థించగా.

విశేషం: ఇక్కడ కపిల గోవులకు పాపం ఎట్లా వచ్చింది? అని సందేహం కలుగుతుంది. మేము ఈ పాపం చేశామనే భావన ఉన్న వాటికి - అంటే అహంకారభావన ఉన్నవాటికి పాపం అంటుతుంది. అది లేనివాటికి అంటదు. **"యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య నలిప్యతే; హత్వా పి స ఇమాన్ లోకాన్ న హంతి న నిబధ్యతే"** అన్న గీతావాక్యం దీనికి ప్రమాణం. ఎవనికి అహంకారభావన ఉండదో; బుద్ధి చేసినపనియందు అంటులేకుండా ఉంటుందో వాడు ఈ లోకాలను రూపుమాపినా చంపిన వాడు కాడు. అతడికి పాప బంధం ఉండదు. పశువులుగా యజ్ఞంలో బలియివ్వటం పాప పరిహారార్థమని ఇందు సూచన.

క. 'మిమ్ముఁ దెగఁ జూచి సద్గతి। కెమ్మెయిఁ బోవంగ నేర్తు నే' నని వినయా
ర్ద్రమ్ముగ మ్రొక్కుచుఁ బలికిన। నమ్మానవపతికి నిట్టులను నగ్గోవుల్. 81

ప్రతిపదార్థం: నేను; మిమ్మున్= మిమ్ములను; తెగన్+చూచి= చంపి; సద్గతికిన్= ఉత్తమ స్థితికి; ఏ+మెయిన్= ఏ విధంగా; పోవంగన్ నేర్తున్;= పోగలను?; అని; వినయ+ఆర్ద్రమ్ముగన్= వినయపు చెమ్మ కలిగే విధంగా; మ్రొక్కుచున్= పాదాలకు నమస్కరిస్తూ; పలికినన్= పలుకగా; ఆ+మానవపతికిన్= ఆ రాజునకు (రంతిదేవునకు); ఆ+గోవుల్= ఆ ఆవులు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అన్నాయి.

తాత్పర్యం: 'మిమ్మల్ని చంపి నేను ఉత్తమగతి ఎట్లా పొందుతాను?' అని వినయం ఉట్టిపడే విధంగా మ్రొక్కుతూ పలుకగా ఆ ఆవులు ఆ రాజుతో ఇట్లా అన్నాయి.

విశేషం: వినయార్ద్రమ్ముగన్ - వినయం అణువణువునా నిండినట్లు అని భావం. మ్రొక్కటం అంటే సాధారణంగా సాష్టాంగదండ ప్రణామం చేయటం అని అర్థం. మిమ్మున్, నేనె - అనే పదాలు అర్థాంతర సంక్రమిత వాచ్యాలు - పరమ పూజ్యులైన మిమ్ములను, ప్రాణాలు ఒడ్డి అయినా రక్షించుకొనదగిన మిమ్ములను ఇత్యాద్యర్థం వ్యంగ్యం. అట్లాగే 'గోవులయందు పరమభక్తిగల' నేను అనే అర్థం ఇక్కడ స్ఫురిస్తుంది.

క. జ్ఞానుల యీ పనికై నినుఁ గానఁగఁ బుత్తెంచి, రట్లు గావున సుమనో
మానితగతి నీకును నగు। భానునిభా! నీయశంబుఁ బరఁగు జగములన్. 82

ప్రతిపదార్థం: భానునిభా!= సూర్యుడి వంటివాడా!; జ్ఞానులు+అ= జ్ఞానం కలవారే; ఈ పనికై= ఈ పనికొరకు; నినున్=నిన్ను; కానఁగన్= చూడటానికి; పుత్తెంచిరి= (మమ్ములను) పంపారు; అట్లు కావునన్= కాబట్టి; సుమనస్+మానితగతి= దేవతలు గౌర వించే స్థితి; నీకునున్= నీకు కూడా; అగున్= అవుతుంది; నీ యశంబున్= నీకీర్తికూడా; జగములన్= లోకాలలో; పరఁగున్= వ్యాపిస్తుంది.

తాత్పర్యం: సూర్యసమానుడా! ఈ పనికొరకు జ్ఞానులే నిన్ను చూడవలసినదిగా మమ్మల్ని పంపారు. కాబట్టి దేవతలు కూడా గౌరవించే గతి నీకు సిద్ధిస్తుంది. నీ కీర్తి లోకాలలో వ్యాపిస్తుంది.

విశేషం: భానునిభా! - అనటంవలన సూర్యుడివలె నీవు తత్కాలంలో మమ్ములను బాధించినా అది ఉత్తర కాలంలో సత్ఫల దాయకమే అవుతుంది అన్న అర్థం ప్రతీయమానం అవుతుంది. నీకును - గోహత్య చేసిన నీకును - అని భావం. యశస్సు లోకాలలో ఎంతకాలం ఉంటుందో అంతకాలం ఆ వ్యక్తి పుణ్యలోకాలలో ఉంటాడని శాస్త్రజ్ఞులు చెప్తుతున్నారు. జ్ఞానులు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'జ్ఞానీత్వాత్మైవ మేమతమ్' - జ్ఞాని ఆత్మయే అని నా అభిప్రాయం అన్న గీతావాక్యం ప్రమాణంగా జ్ఞానులు - అందులోను పెక్కండ్రు చెప్పారంటే అది పరమాత్మ పలుకువలె అనుల్లంఘనీయం అని తాత్పర్యం.

క. నావుడు మీలోపల నొక । గోవైనను మోహవశతఁ గూరుటయు మఖం
బావేళఁ బరిసమాప్తము । గావలయును వినుఁడు సమయ కల్పన దెలియన్.' 83

ప్రతిపదార్థం: నావుడున్= అనగా; మీలోపలన్= మీలో; ఒక గోవు+ఐనను= ఒక్క ఆవైనా; మోహవశతన్= మోహానికి లొంగటం; కూరుటయున్= పొందినట్లైతే; మఖంబు= యజ్ఞం; ఆ వేళన్= ఆ సమయంలో; పరిసమాప్తము= పూర్తిగా ముగిసినది; కావలయును= అవ్వాలి; సమయ కల్పన= ఈ ఒడంబడిక ఏర్పాటు; తెలియన్= చక్కగా తెలిసే విధంగా; వినుండు= వినండి.

తాత్పర్యం: అని ఆ ఆవులు అంటే ఆ రాజు 'మీలో ఒక్క ఆవైనా చావుకు వెనుకాడితే వెంటనే నా యజ్ఞం ముగిసిపోవాలి. ఈ ఒడంబడికను మీరు చక్కగా వినండి.'

విశేషం: మోహవశతఁ గూరుట - అయ్యో! నాకీ ఘోరమైన చావు వచ్చిపడిందే అని బాధపడటం.

క. అని యవ్విభుండు పలికిన । విని గోవులు సమ్మతింప విశసించుచు వే
ల్చె నతఁడు యజ్ఞానలమున । ననేక గోచయములం గ్రమాకలనమునన్. 84

ప్రతిపదార్థం: అని= ఇట్లా అని; ఆ+విభుండు= ఆ రాజు; పలికినన్= పలుకగా; విని= ఆలకించి; గోవులు= ఆవులు; సమ్మతింపన్= ఒప్పుకొనగా; అతఁడు= ఆ రంతిదేవుడు; క్రమ+ఆకలనమునన్= శాస్త్ర విధి పద్ధతిలో; అనేక గోచయములన్= పెక్కు ఆవుల మందలను; విశసించుచున్= చంపుతూ; యజ్ఞ+అనలమునన్= యజ్ఞాగ్నిలో; వేల్చెన్= హోమం చేశాడు.

తాత్పర్యం: రా జిట్లా పలుకగా ఆ ఆవులు ఒప్పుకొన్నాయి. ఆ రంతిదేవుడు పెక్కు ఆవుల మందలను విధి ననుసరించి చంపి యజ్ఞపు అగ్నిలో హోమం చేశాడు.

విశేషం: క్రమ+ఆకలనమునన్= అతడు చేసిన పని శాస్త్ర సమ్మతం అనే విషయాన్ని ఈ పదం వ్యక్తం చేస్తుంది. యజ్ఞాలను దేవతలకూ, మనుష్యులకూ పరస్పరం ఉపకారకాలుగా భగవంతుడు సృష్టించాడని భగవద్గీత చెప్తున్నది.

క. ఒకనాఁడు గో వొకటి లేఁ । గకుఁ జన్నిచ్చుచును దానిఁ గనుఁగొని నీ విం
కకటా! యెక్కడఁ జేరెద । వకృపులు వచ్చెదరు చంప' నని పల్కుటయున్. 85

ప్రతిపదార్థం: ఒకనాఁడు= ఒక దినాన; గోవు= ఆవు; ఒకటి= ఒక్కటి; లేఁగకున్= చిన్న దూడకు; చన్ను+ఇచ్చుచును= పాలిస్తూ; దానిన్= ఆ దూడను; కనుఁగొని= చూచి; అకటా!= అయ్యో!; నీవు ఇంకన్= ఇటుపై; ఎక్కడన్= ఏ తావునందు; చేరెదవు?= చేరుతావు?; అకృపులు= దయలేనివారు; చంపన్= చంపటానికి; వచ్చెదరు= వస్తారు; అని; పల్కుటయున్= పలుకగా.

తాత్పర్యం: ఒక రోజున ఒక ఆవు తన చిన్ని దూడకు పాలిస్తూ 'అయ్యో బిడ్డా! దయలేనివారు చంపటానికి వస్తారు. నీ వెక్కడకు పోతావు?' అని పలుకగా. (తరువాతి వచనంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: నిజానికి చావు కోరింది తామే అయినా ఆ ఆవుకు కర్మబద్ధతవలన చావుభయం, దానివలన దుఃఖం కలిగాయి.

గోవులు రంతిదేవు యజ్ఞ పశువులై గోలోకంబునకుఁ బోవుట (సం.13-123-26 (కుంభ))

వ. మహానుభావుండు గావున నప్పలుకులు విని రంతిదేవుం డయ్యాగంబు సుప్రయోగంబుగా సమాప్తంబు గావించెఁ; గొన్ని గోవులు కడమవడి పుడమిన నిలిచె; నధ్వరోపయోగంబు వడసిన గోగణంబులు గోలోకంబునకుం బ్రమోదంబునం బోయెఁ; దదీయ చర్మాస్థి శ్రేణులు తటంబులై తనరం బ్రభూత రక్తమేదః క్లేదంబు లేఱై పాఱి చర్మణ్వతి యను పేరం బరఁగె; నా రంతిదేవ భూపతియును యజ్ఞ సమృద్ధుండై వృద్ధశ్రవుని తోడి సఖ్యంబునం బొలిచి యక్షయ నాకంబున సుశ్లోకుండై యుండె; ఫేనపాఖ్యుండును గోలోకంబున శాశ్వతుండై వసించె' నని చెప్పి భీష్ముండు వెండియు. 86

ప్రతిపదార్థం: మహా+అనుభావుండు= గొప్ప ప్రభావం కలవాడు; కావునన్= కాబట్టి; రంతిదేవుండు= రంతిదేవుడు; ఆ+పలుకులు= ఆ ఆవు మాటలు; విని= ఆలకించి; ఆ+యాగంబు= ఆ యజ్ఞం; సుప్రయోగంబు+కాన్= చక్కగా చేసినదయ్యే విధంగా; సమాప్తంబు= ముగిసినదానిని; కావించెన్= చేశాడు; కొన్ని గోవులు= కొన్ని ఆవులు; కడమ+పడి= మిగిలిపోయి; పుడమిన్+అ= భూమియందే; నిలిచెన్= ఉండిపోయాయి; అధ్వర+ఉపయోగంబు= యజ్ఞంలో ఉపయోగాన్ని; పడసి= పొందిన; గోగణంబులు= ఆవులమందలు; గోలోకంబునకున్= గోలోకానికి; ప్రమోదంబునన్= మంచి ఆనందంతో; పోయెన్= పోయాయి; తదీయ చర్మ+అస్థి శ్రేణులు= వానివైన తోళ్ళు, ఎముకలు అనే వాటి వరుసలు; తటంబులు= ఒడ్డులు; ఐ= అయి; తనరన్= ఒప్పుగా; ప్రభూత రక్త మేదః క్లేదంబులు= చాలా ఎక్కువ అయిన నెత్తురు, మెదడు అనేవాటి తడులు; ఏఱు+ఐ= నది అయి; పాఱి= ప్రవహించి; చర్మణ్వతి+అను పేరన్= చర్మణ్వతి (చర్మములు గలది) అనే పేరుతో; పరఁగెన్= ఒప్పింది; ఆ రంతిదేవ భూపతియును= ఆ రంతిదేవ మహారాజున్నూ; యజ్ఞ సమృద్ధుండు+ఐ= యజ్ఞాల నిండైన సంపద కలవాడై; వృద్ధశ్రవునితోడి సఖ్యంబునన్= ఇంద్రుడితోడి చెలిమితో; పొలిచి= ఒప్పి; అక్షయ నాకంబునన్= తరుగు లేని స్వర్గంలో; సుశ్లోకుండు+ఐ= అందరి పొగడ్తలు అందినవాడై; ఉండెన్= ఉన్నాడు; ఫేనప+ఆఖ్యుండును=ఫేనపుడన్న పేరుగల ఆ సుమిత్రుడున్నూ; గోలోకంబునన్= గోలోకంలో; శాశ్వతుండు+ఐ= ఎల్లవేళల ఉండేవాడై; వసించెన్= ఉన్నాడు; అని= ఇట్లా అని; చెప్పి; భీష్ముండు= భీష్ముడు; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: గొప్ప మహిమగలవాడు కనుక ఆ రంతిదేవుడు ఆ ఆవు మాట విని ఆ యాగాన్ని ఏలోపం లేకుండా ముగించాడు. ఆ విధంగా కొన్ని ఆవులు మిగిలిపోయి భూమిమీదనే నిలిచిపోయాయి. యజ్ఞంలో వినియోగం పొందిన ఆవుల మందలు ఆనందంతో గోలోకానికి వెళ్ళాయి. వాటి చర్మాలూ, ఎముకలూ ఒడ్డులు కాగా వాని నెత్తురు, మెదడులోని తడి ఏరై ప్రవహించి చర్మణ్వతి అనే పేరున ఒప్పింది. రంతిదేవ మహారాజున్నూ యజ్ఞపుపంట పండించుకొని ఇంద్రుడితోడి చెలిమితో సుఖంగా చెడని స్వర్గంలో మంచి కీర్తి పొందుతూ ఉన్నాడు. ఫేనపుడున్నూ గోలోకంలో శాశ్వతంగా నివసించాడు' అని చెప్పి భీష్ముడు ఇంకా ఇట్లా అంటున్నాడు.

విశేషం: ఇందులో యజ్ఞంలో మిగిలిన ఆవులు తప్ప తక్కిన వారంతా సుఖస్థితి పొందటాన్ని వివరించారు. దీనివలన యజ్ఞం సత్ఫలదాయకమే అన్న భావం తెలియవస్తున్నది.

సీ. 'మానవనాథ! యీ ఫేనపాఖ్యానంబు । బదరికాశ్రమమున బాదరాయ
ణుఁడు ప్రీతి నారాయణునకుఁ జెప్పిన నమ్మ । హాత్ముండు గో యజనార్థి యగుచు
నిది గొనియాడంగ విదితమై జగమునఁ । బరఁగెఁ; బుణ్యతమంబు పావనంబు
దీనిఁ బఠియించిన వీనుల నించిన । దురిత వర్గంబులఁ బొరయ వలదు;

తే. పూరు నృపకుల భూషణ! పూత చరిత! నీవు నతిభక్తి గలుగుము గోవులందుఁ
బరమనియతి నీ తంత్రంబు పఠన విధియు । నేత దాకర్ణనంబును నెపుడుఁ జలుపు.' 87

ప్రతిపదార్థం: మానవనాథ!= రాజా!; ఈ ఫేనప+ఆఖ్యానంబున్= ఈ ఫేనపుని కథను, బదరికా+ఆశ్రమమునన్= బదరికాశ్రమంలో; బాదరాయణుఁడు= శ్రీ వ్యాసుడు; ప్రీతిన్= ప్రీతితో; నారాయణునకున్= నారాయణుడనే మునికి; చెప్పినన్= చెప్పగా; ఆ+మహాత్ముండు= ఆ దొడ్డబుద్ధిగలవాడు; గో యజన+అర్థి= గోవుల యజ్ఞం కోరినవాడు; అగుచున్= అవుతూ; ఇది= దీనిని; కొని+ఆడంగన్= ప్రీతితో పలుకగా; జగమునన్= లోకంలో; విదితము+ఐ= అందరికీ తెలిసినదై; పరఁగెన్= ఒప్పింది; పుణ్యతమంబు= అన్నింటికన్నా పుణ్యమైనదీ; పావనంబు= పవిత్రం చేసేదీ అయిన; దీనిన్= దీనిని; ఈ ఫేనపుని కథను; పఠించినన్= శ్రద్ధతో చదివినా; వీనులన్= చెవులయందు; నించినన్= నింపుకొన్నా; దురిత వర్గంబులన్= పాప సముదాయాలలో; పొరయన్= కలిసిపోవటం; వలదు= కలుగదు; పూరు నృప కులభూషణ!= పూరుడు అనే రాజు కులానికి అలంకారమైనవాడా; పూతచరిత!= పవిత్రమైన చరిత్ర కలవాడా!; నీవును= నీవుకూడా; గోవులందున్= గోవుల విషయంలో; అతిభక్తిన్= మిక్కిలి భక్తిని; కలుగుము= పొందుము; పరమనియతిన్= గొప్పనిష్ఠతో; ఈ తంత్రంబు= ఈ క్రియయొక్క; పఠన విధియున్= చదవటమనే పనినీ; ఏతత్+ఆకర్ణనంబును= దీనిని వినటాన్నీ; ఎపుడున్= ఎల్లవేళలా; చలుపు= చేస్తూ ఉండుము.

తాత్పర్యం: 'రాజా! ఈ ఫేనపుని కథను బదరికాశ్రమంలో శ్రీ వేదవ్యాసుడు నారాయణమునికి ప్రీతితో చెప్పాడు. ఆ మహానుభావుడు గో యజ్ఞం చేయగోరి దీనిని గూర్చి అందరకూ తెలుపుతూ ఉండగా అది లోకంలో క్రమంగా అందరికీ తెలిసింది. ఎంతో పుణ్యమైనదీ, పావనమైనదీ అయిన దీనిని చదివినా, విన్నా పాపాల సంగతి కలుగదు. నీవుకూడా గోవుల విషయంలో గొప్ప భక్తి కలిగి ఉండుము. గోవులను సేవించిన విధానాన్ని చదవటం, వినటం ఎప్పుడూ చేస్తూ ఉండుము.'

విశేషం: బాదరాయణుడు నారాయణుడికి బదరికాశ్రమంలో చెప్పాడంటే నరనారాయణులనే మునులలో నారాయణుడు అనుకొనాలి. ఇది మానవులలో రుచి పుట్టటానికి దోహదం చేస్తుంది. పూరునృప కులభూషణ! పూతచరిత్ర! - అనే రెండు సంబోధనలు సాభిప్రాయాలు. పూరుడు స్వార్థం ఏ మాత్రమూ లేకుండా తండ్రికి యౌవనం ఇచ్చి అతడి ముదిమిని గొన్నవాడు - ఆ విధంగా వంశకర్త అయినవాడు. నీవు కూడా అటువంటి వాడవు కనుక సత్కార్యాచరణ నీవు తప్పక చేయగలవాడవే - అనే భావం ఇందులో స్ఫురిస్తుంది. గోవులందు అతిభక్తి కలుగుము - ఈ క్రియా ప్రయోగం ఇప్పుడు వ్యవహారంలో కనబడదు. తంత్రంబు పఠనవిధి - తంత్రంయొక్క పఠనవిధి అని షష్ఠీ తత్పురుషం.

క. అనిన విని 'యట్లు చేసెద । ననఘా! గోమహిమ యిట్టు లాకర్ణింపం
గనియును దనివి సనదు నా । మన; మింకను జెప్ప నీ విమల వాక్యములన్.' 88

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆకర్ణించి (ధర్మరాజు); అనఘా!= పుణ్యాత్ముడా!; అట్లు+అ= అట్లాగే; చేసెదన్= చేస్తాను; గోమహిమ= ఆవుల గొప్పతనం; ఇట్టులు= ఈ విధంగా; ఆకర్ణింపన్ కనియును= వినగలిగి కూడా; నా మనము= నా హృదయం; తనివి+చనదు= తృప్తిపొందదు; నీ విమల వాక్యములన్= స్వచ్ఛమైన నీ మాటలతో; ఇంకను= ఇంకా; చెప్పు= చెప్పుము.

తాత్పర్యం: భీష్ము డట్లా చెప్పిన దానిని విని ధర్మరాజు 'పుణ్యాత్మా! గోవుల మహిమ ఈ విధంగా వినగలిగినా ఇంకా నా మనస్సు తృప్తి పొందలేదు. స్వచ్ఛమైన నీ మాటలతో మరింతగా నాకు దయతో చెప్పుము' (అని ప్రార్థించాడు)

విశేషం: అనఘా! అన్న సంబోధనా, నీ విమలవాక్యములన్' అన్నమాటా ధర్మరాజు జిజ్ఞాస ఎంత ఘనమైనదో అభివ్యక్తం చేస్తున్నాయి.

క. అని ధర్మతనయుఁ డడిగిన । ననయంబుఁ బ్రియంబుఁ బొంది యమరనదీనం
దనుఁ డిట్లను 'సత్యవతీ । తనయుని వాక్యములు సెప్పెదను వినుము నృపా! 89

ప్రతిపదార్థం: అని= ఇట్లని; ధర్మతనయుఁడు= ధర్మరాజు; అడిగినన్= అడుగగా; అమరనదీ నందనుఁడు= దేవనది అయిన గంగ కొడుకు భీష్ముడు; అనయంబున్= మిక్కిలి ఎక్కువగా; ప్రియంబున్= ప్రీతిని; పొంది; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; నృపా!= రాజా!; సత్యవతీ తనయుని వాక్యములు= సత్యవతి కుమారుడైన వ్యాసుడి పలుకులు; చెప్పెదను= చెప్పుతాను; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు అడుగగా భీష్ముడు పట్టరాని సంతోషం పొంది ఇట్లా అన్నాడు. 'నాయనా! వ్యాసుడి మాటలు చెప్పుతాను వినుము.

విశేషం: అమరనదీనందనుడు; సత్యవతీనందనుడు అనే పదాలు ఆ ఇరువురి ఆజన్మ శుద్ధతను తెలియజేస్తాయి.

ఆ. గోవిశేష మర్థి నీవు నన్నడిగిన । యట్ల శుకుఁడు దండ్రి నడిగె; దాని
కాత్మఁ బ్రియముఁ బొంది యా మహాసంయమి । యా సుబుద్ధి కిట్టు లనియె నధిప! 90

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నీవు; అర్థిన్= కోరికతో; గో విశేషము= ఆవుల గొప్పతనాన్ని గురించి; నన్నున్= నన్ను; అడిగిన+ అట్లు+అ= అడిగిన విధంగానే; శుకుఁడు= శుకమహర్షి; తండ్రిన్= తండ్రి అయిన వ్యాసుడిని; అడిగెన్= అడిగాడు; దానికిన్= అట్లా అడిగిన దానికి; ఆత్మన్= హృదయంలో; ప్రియమున్= ప్రీతిని; పొంది; ఆ మహాసంయమి= ఆ గొప్ప నిగ్రహవంతుడు; ఆ సుబుద్ధికిన్= మంచిబుద్ధిగల ఆ శుకునకు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: రాజా! నీవు కోరికతో గోవుల గొప్పతనాన్ని గూర్చి నన్నడిగినట్లే శుకుడు తన తండ్రి నడిగాడు. దానికాయన ఎంతో ప్రీతి పొంది ఆ మహర్షి ఆ సుబుద్ధికి ఇట్లా చెప్పాడు.

విశేషం: మహాసంయమి అనటంవలన అతడు చెప్పే విషయం యొక్క ప్రామాణ్యం స్ఫురిస్తుంది. సుబుద్ధికి అనటంచేత సుబుద్ధులు మాత్రమే చెప్పిన దానిని సార్థకం చేస్తారు అన్నభావం తెలియవస్తున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. స్థావర జంగమాత్మకమైన భూత జా। లంబు సుస్థితి గోగణంబు నాశ్ర
యమునన తత్సంభవమును గోవులయందః। యవి మూల సంతాన మజున; కట్లుఁ
గాక సిద్ధుల సాధ్యగణముల మాత లి। ట్లగుట యెఱింగిన యతఁడు బ్రహ్మ
లోక గోలోకాది లోకాంతరములకుఁ। దనయింటి కరుగు చందమున నరుగుఁ

తే. బరమగతిఁ గోరువారలు పాదముష్టి। యష్టి వాక్చిత్తముల గోవు నభిభవింప
కుండ వలయు నివ్విద్యఁ బద్మోద్భవుండు। సెప్పె నది యాత్మపావన శిష్ట సేవ్య. 91

ప్రతిపదార్థం: స్థావర జంగమ+ఆత్మకము= కదలనివి, కదిలేవి అన్న సుస్థితి గలది; ఐన= అయిన; భూతజాలంబు సుస్థితి= వస్తువుల ప్రాణుల యొక్క సముదాయపు చక్కని స్థితి; గోగణంబు+ఆశ్రయంబునన= గోవుల సముదాయం యొక్క ఆధారం మీదనే; తత్ సంభవంబును= వాని పుట్టుకకూడా; గోవులయందు+అ= ఆవులయందే; అవి= ఆ ఆవులు; అజునకున్= బ్రహ్మకు; మూలసంతానము= మొదటి బిడ్డలు; అట్లున్ కాక= అంతేకాక; సిద్ధుల సాధ్యగణముల మాతలు= ఆవులు సిద్ధులు సాధ్యుల సముదాయాలు అనే దేవజాతి వారి తల్లులు; ఇట్లు= ఈ విధంగా; అగుట= అవటం; ఎఱింగిన+అతఁడు= తెలిసికొన్నవాడు; బ్రహ్మలోక గోలోక+ఆది లోక+అంతరములకున్= బ్రహ్మలోకమూ, గోవుల లోకమూ మొదలైన ఇతరలోకాలకు; తన ఇంటికిన్= సొంత ఇంటికి; అరుగుచందమునన్= వెళ్ళేవిధంగా; అరుగున్= వెళ్ళుతాడు; పరమగతిన్= మిక్కిలి ఉత్తమమైన లక్ష్యాన్ని; కోరువారలు= కోరే మనుష్యులు; గోవును= ఆవును; పాద ముష్టి యష్టి వాక్ చిత్తములన్= కాలితో; పిడికిలితో, కర్రతో, మాటతో, మనస్సుతో; అభిభవింపక= తిరస్కరించక; ఉండవలయున్= ఉండాలి; ఈ+విద్యన్= ఈ విద్యను; పద్మ+ఉద్భవుండు= బ్రహ్మ; చెప్పెన్= ఉపదేశించాడు; అది= ఆ విద్య; ఆత్మపావన= ఆత్మను పవిత్రం చేసేది; శిష్ట సేవ్య= ఉత్తమ ప్రవృత్తి కలవారికి సేవించదగింది.

తాత్పర్యం: నాయనా! సృష్టిలో ఉన్న కదలని పదార్థాలు, కదిలే ప్రాణులు అనే అన్నింటి చక్కని స్థితీ గోవులను ఆశ్రయించినందువలననే కలుగుతున్నది. వాటి పుట్టుకకూడా వాటివలననే ఏర్పడుతున్నది. ఆవులు బ్రహ్మకు తొలిబిడ్డలు. అంతే కాదు; సిద్ధులు, సాధ్యులు మొదలైన దేవయోనిగణాలకు కూడా ఆవులు తల్లులు. ఈ విషయం తెలిసినవాడు బ్రహ్మలోకం, గోలోకం మొదలైన లోకాలకు సొంత ఇంటికి వెళ్ళినట్లు వెళ్ళుతాడు. అత్యుత్తమగతిని కోరేవారు కాలితో, పిడికిలితో, కర్రతో, మాటతో, మనస్సుతో ఆవును తిరస్కరించరాదు. ఇది బ్రహ్మ చెప్పిన విద్య. ఆత్మను పవిత్రం చేసేది, ఉత్తములు సేవించవలసినది.

విశేషం: 'తన ఇంటి కరుగుచందమున' - అంటే సర్వ స్వతంత్రతా భావంతో అని భావం. ఇది ఒక మంచి జాతీయం. పాదముష్టి - వీటివలన గోవును ఏ విధంగానూ హింసింపరాదని సూచన. 'పద్మోద్భవుండు చెప్పెన్' - అంటే ఇది తిరుగులేని శాసనం. దీనిని ధిక్కరించినవాడు దిక్కులేని వాడవుతా డని తాత్పర్యం. ఆత్మపావన, శిష్టసేవ్య అనేవి 'విద్య' అనే స్త్రీలింగ శబ్దానికి విశేషణాలు కావున స్త్రీ లింగరూపాలు.

క. పావనమని శ్రుతి సెప్పిన। యే వస్తువు నాశ్రయించి యెక్కుడయిరి భూ
తావలులకు సుర లట్టిది। గోవు; తదీయ మగు మహిమకున్ గుఱిగలదే? 92

ప్రతిపదార్థం: పావనము= పవిత్రం; అని; శ్రుతి= వేదం; చెప్పిన ఏ వస్తువున్= చెప్పిన ఏ వస్తువును; ఆశ్రయించి= ఆధారం చేసికొని; సురలు= దేవతలు; భూత+ఆవలులకున్= ప్రాణుల సముదాయాలకు; ఎక్కుడు= అధికులు; అయిరి=అయ్యారో;

అట్టి+అది= ఆ విధమైనది; గోవు=ఆవు; తదీయము= దానిది; అగు= అయిన; మహిమకున్= గొప్పతనానికి; గుఱి= హద్దు; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: వేదం పవిత్రమని చెప్పి గోవు నాశ్రయించి దేవతలు తక్కిన అన్ని ప్రాణికోటులకంటె గొప్పవారయ్యారు. కాబట్టి గోవుల మహిమకు హద్దు ఉన్నదా?

క. వీణా కాహళ వేణు । క్వాణ ప్రతిమములు ధేనువర్గధ్వను ల

క్షీణ సుకృతంబు నిర్మల । వాణి తదాకర్ణనంబు వర్ణన విధమున్. 93

ప్రతిపదార్థం: ధేనువర్గధ్వనులు= ఆవుల జాతుల నాదాలు; వీణా కాహళ వేణు క్వాణ ప్రతిమములు= వీణ, బూర పిల్లనగ్రోవి, అనేవాటి నాదాలకు సాటి వచ్చేవి; నిర్మలవాణి= ఆవుల నిర్మలమైన నాదం; తత్+ఆకర్ణనంబు= దానిని వినటమూ; వర్ణ నవిధమున్= వర్ణించటమూ; అక్షీణ సుకృతంబు= తరగని పుణ్యం.

తాత్పర్యం: ఆవుల కంఠనాదాలు వీణా, కాహళ, వేణు నాదాల వంటివి. ఆ ధ్వని అతి స్వచ్ఛమైనది. దానిని వినటమూ, చెప్పుకొనటమూ తరగని పుణ్యాన్ని ఇస్తాయి.

విశేషం: కాహళ= నాలుగు అయిదు లోహపు గొట్టాలు ఒకదానితో ఒకటి బిగించి ఏర్పాటు చేసికొనటానికి వీలుగా ఉండే ఒక వాద్యం.

క. క్షీరము దధియును ఘృతము సు । ధా రూపము లగుట దేవతా ప్రీణన య

జ్ఞారంభంబులు విమలా । చారా! గో దోహ నైక సాధ్యము లయ్యెన్. 94

ప్రతిపదార్థం: విమల+ఆచారా!= మాలిన్యంలేని ప్రవర్తన కలవాడా!; క్షీరము= పాలు; దధియును= పెరుగును; ఘృతము= నేయియు; సుధా రూపములు= అమృతం రూపాలు; అగుటన్= కావటంవలన; దేవతా ప్రీణన యజ్ఞ+ఆరంభంబులు= దేవతలను ప్రీతిపరచే యజ్ఞాలు అనే కార్యాలు; గో దోహన+ఏక సాధ్యములు= ఆవుల పాలు అనే ఒక్కదానిచేతనే సాధించదగినవి; అయ్యెన్= అయ్యాయి.

తాత్పర్యం: విమలాచారా! పాలు పెరుగు నెయ్యి అమృతస్వరూపాలు కనుక దేవతలను తృప్తిపరచే యజ్ఞ కార్యాలు ఆవుల పాలవలన మాత్రమే సాధ్యాలవుతున్నాయి.

విశేషం: విమలాచారా! అనే సంబోధన తాను పెక్కు మంచి విషయాలు యోగ్యతను తెలియజేస్తున్నాయన్న స్ఫూర్తిని కలిగిస్తుంది.

ఆ. శ్రుతులు నౌపనిషద సూక్తులు గో స్వరూ । పంబు లని సరోజభవుఁడు సెప్పె

ధర్మపరత పరమతపము మహాధ్వర । మనఁగఁ బరఁగు గో సమర్చనంబు. 95

ప్రతిపదార్థం: సరోజభవుఁడు= పద్మంలో పుట్టిన బ్రహ్మ; శ్రుతులును= వేదాలు; ఔపనిషద సూక్తులు= ఉపనిషత్తులకు సంబంధించిన మంచి మాటలు; గో స్వరూపంబులు= గోవుల స్వరూపాలు; అని; చెప్పెన్= చెప్పాడు; గో సమర్చనంబు= ఆవులను భక్తితో పూజించటం; ధర్మపరత= ధర్మమే తుది మెట్టు కావటం; పరమతపము= గొప్పతపస్సు; మహా+అధ్వరము= గొప్ప యజ్ఞం; అనఁగన్= అనటానికి; పరఁగున్= ఒప్పును.

తాత్పర్యం: వేదాలూ, జ్ఞాన విషయాలైన ఉపనిషత్తులూ గో స్వరూపాలే అని బ్రహ్మ చెప్పాడు. ఆవులను భక్తితో పూజించటం ధర్మం తుది మెట్టు, గొప్పతపస్సు, మహిమగల యజ్ఞం అనటానికి ఒప్పుతుంది.

విశేషం: శ్రుతులు - వేదాలు నాలుగు భాగాలుగా ఉన్నాయి. అందులో సంహిత, బ్రాహ్మణం, ఆరణ్యకం అనేవి ఒక విభాగంగా, ఉపనిషత్తులు ఒక విభాగంగా చెప్తుతారు. మొదటి విభాగానికి కర్మకాండ అనీ, చివరిదానికి జ్ఞానకాండ అనీ పేరు. బ్రహ్మ చెప్పాడు కనుక తప్పక విశ్వసించాలి అని భావం.

క. ఈ వాక్యంబులు భూదే । వావలి సన్నిధిఁ బఠించు నాతఁడు పుణ్యుం

డై వెలయు; విన్నవారలు । పావనగుణ! తత్క్షణంబ పాతు రఘములన్. 96

ప్రతిపదార్థం: పావనగుణ!= పవిత్రగుణాలుగల శుకా!; ఈ వాక్యంబులు= ఈ మాటలను; భూదేవ+ఆవలి సన్నిధిన్= బ్రాహ్మణుల సముదాయం దగ్గర; పఠించు+ఆతఁడు= శ్రద్ధతో చదివేవాడు; పుణ్యుండు+ఐ= పుణ్యాంకలవాడై; వెలయున్= ఒప్పుతాడు; విన్నవారలు= విన్న మనుష్యులు; తత్ క్షణంబు+అ= అప్పటికప్పుడు; అఘములన్= పాపాలను; పాతురు= పోగొట్టుకొంటారు.

తాత్పర్యం: పావనగుణా! ఈ వాక్యాలు బ్రాహ్మణుల సమీపంలో చదివేవాడు పుణ్యమూర్తి అవుతాడు. విన్నవారు అప్పటి కప్పుడు పాపవిముక్తి పొందుతారు.

తే. గో ఘృతంబు ప్రాశించియు గోకరీష । సువిహిత స్నానుఁ డయ్యు భూదివిజుఁ డధిక

భక్తి నిత్యంబు గోమతీపఠన మాచ । రించియును గల్మషముల నిర్జించు ననఘ! 97

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; భూదివిజుఁడు= బ్రాహ్మణుడు; గో ఘృతంబు= ఆవు నేయి; ప్రాశించియున్= లోపలికి పుచ్చుకొనీ; గోకరీష సువిహిత స్నానుఁడు= ఆవుపేడ కలిసిన నీళ్ళతో చక్కగా చేయబడిన స్నానం కలవాడు; అయ్యున్= అయినీ; అధికభక్తిన్= ఎక్కువ భక్తితో; నిత్యంబు= ప్రతిదినము; గోమతీపఠనము= గోమతీమంత్రాన్ని చదవటం; ఆచరించియును= చేసినీ; కల్మషములన్= పాపాలను; నిర్జించున్= పూర్తిగా గెలుస్తాడు (త్రోసి వేస్తాడు).

తాత్పర్యం: పుణ్యాత్మా! ఆవు నెయ్యి లోపలికి పుచ్చుకొనీ, ఆవుపేడ కలిసిన నీళ్ళతో స్నానంచేసీ, మహాభక్తితో ప్రతిదినమూ గోమతీ పఠనం గావించే బ్రాహ్మణుడు పాపాలన్నింటినీ త్రోసి పారవేస్తాడు.

విశేషం: గో ఘృతం తాగడం వగైరా కాయిక నిష్ఠ. 'భక్తి' మానసనిష్ఠ. గోమతీ పఠనం వాచికనిష్ఠ. ఇట్లా మూడు నిష్ఠలూ కలవటమే త్రికరణశుద్ధి. అది తప్పక సత్ఫలితాన్ని సాధిస్తుంది.

చ. అనిమిషులున్ మహామునులు నయ్యయి పెంపులు గోమతిం బఠిం

చిన సుకృతంబునం గనిరి శ్రీయును శత్రుజయంబుఁ బేర్మియుం

దనయ సమృద్ధియుం గలుగుఁ దత్పఠనంబున బంధుకోటి బం

ధనమునఁ బాయు; మార్గమునఁ దప్పు మృగార్తియుఁ జోరబాధయున్.' 98

ప్రతిపదార్థం: అనిమిషులున్= దేవతలూ; మహామునులు= గొప్ప మునులూ; ఆ+అయి పెంపులు= ఆయా మహిమలు; గోమతిన్= గోమతిని; పఠించిన సుకృతంబునన్= పారాయణం చేసిన పుణ్యంవలన; కనిరి= పొందారు; తత్ పఠనంబునన్= దాన్ని చదవటంవలన; శ్రీయును= సంపదా; శత్రుజయంబున్= పగవారి మీద గెలుపూ; పేర్మియున్= పెద్దతనమూ; తనయ సమృద్ధియున్= బిడ్డలసంపదా; కలుగున్= కలుగుతుంది; బంధుకోటి= పఠించినవారి చుట్టాల సముదాయంకూడా; బంధనమునన్= బంధాలనుండి; పాయున్= విడివడుతుంది; మార్గమునన్= దారిలో; మృగ+ఆర్తియున్= క్రూరజంతువుల పీడా; చోర బాధయున్= దొంగలబాధా; తప్పున్= కలగకుండా ఉంటుంది.

తాత్పర్యం: దేవతలు, మహామునులు గోమతిని పఠించిన పుణ్యం వలననే ఆయా గొప్ప స్థితులను పొందారు. దానిని పఠించటంవలన సంపదా, పగవారిని గెలవటం, అభివృద్ధీ, పుత్రులు ఎక్కువగా కలగటం సిద్ధిస్తాయి. వారి చుట్టాలకు కూడా బంధాలు నశిస్తాయి. ప్రయాణాలలో క్రూరమృగాల బాధా, దొంగలబాధా తప్పిపోతాయి.'

విశేషం: చదివినవాడు తనవారికి కూడా మేలు కూర్చగల సామర్థ్యం పొందటం ఇక్కడ గొప్ప విశేషం.

వ. అనిన విని యమ్మునిపతికి శుకుం డిట్లనియె. 99

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ఆ+మునిపతికిన్= మునులలో గొప్పవాడైన ఆ వ్యాసుడికి; శుకుండు= కొడుకైన శుకమహర్షి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పగా వ్యాసుడితో శుకు డిట్లా అన్నాడు.

వేదవ్యాసముని శుకునకుఁ జెప్పిన కపిల గో మహానుభావము (సం.13-126-2 (కుంభ))

క. తమజాతికిఁ దగుకర్మ। క్షమతలు లేకున్న యట్టి జనములు కపిలా
సమధిక పూజన తద్దా। నము లొనరింతు; రవి వాచు నా దురితంబుల్. 100

ప్రతిపదార్థం: తమజాతికిన్= తమ పుట్టుకకు; తగు= తగిన; కర్మక్షమతలు= కర్మం చేసే యోగ్యతలు; లేక+ఉన్న+అట్టి జనములు= లేనట్టి మానవులు; కపిలా సమధిక పూజన తత్+దానములు= పుల్లావుల గొప్ప పూజలూ; వాటి దానాలు; ఒనరింతురు= చేస్తారు; అవి= ఆ పూజలు, దానాలు; ఆ దురితంబుల్= ఆ పాపాలను; పాచునా= పోగొట్టుతాయా?

తాత్పర్యం: తాము పుట్టిన జాతికి తగిన కర్మల యోగ్యతలు లేని మానవులు కపిల గోవులను మిక్కిలిగా పూజిస్తారు. దానం చేస్తారు. అవి వారి పాపాల నన్నింటినీ పోగొట్టుతాయా?

సీ. అనుటయు 'సందియం బది యేల?' కపిలఁ బూ। జించినఁ, బ్రీతి నిచ్చినను జెడని
యఘములు గల్గునే?' యనియెఁ బరాశర। తనయుఁ డవ్వాక్యంబు విని తదీయ
తనయుండు గపిల కంతటి పెంపురాఁ గతం। బేమి?' నావుడు నమ్మునీశ్వరుండు
విను మని యిట్లను 'ననిమిష సంఘంబు। నొక కారణమునఁ బావకుఁడు మొఱఁగి

తే. యరిగి తనదుగుప్తి యర్థించి గోవుల। నాశ్రయించె నవియు నగ్ని గోప
నంబు సేసె నవ్విధంబున శిఖియున్కి। సుర లెఱింగి రెల్లచోటు నరసి. 101

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనుటయున్= అని శుకు డనగా; పరాశర తనయుఁడు= పరాశరుడి కొడుకు వ్యాసుడు; సందియంబు= సందేహం; అది+ఏల?= ఎందుకు? కపిలన్= పుల్లావును; పూజించినన్= పూజించినా; ప్రీతిన్= ప్రేమతో; ఇచ్చినను= దానమిచ్చినా; చెడని+అఘములు= నాశనం కాని పాపాలు; కల్గునే?= ఉంటాయా?; అనియెన్= అన్నాడు; ఆ+వాక్యంబున్= ఆ మాటను; విని; తదీయ తనయుండు= ఆవ్యాస మునీంద్రుని పుత్త్రుడైన శుకుడు; కపిలకున్= కపిల గోవునకు; అంతటి పెంపు= అంతటి గొప్పతనం; రాన్= రావటానికి; కతంబు= కారణం; ఏమి?= ఏమిటి?; నావుడున్= అనగా; ఆ+ముని+ ఈశ్వరుండు= మునులలో శ్రేష్ఠుడైన ఆ వ్యాసుడు; వినుము; అని; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; పావకుఁడు= అగ్నిదేవుడు; ఒక కారణమునన్= ఒక కారణంగా; అనిమిష సంఘంబున్= దేవతల సంఘాన్ని; మొఱఁగి= కనుగప్పి; అరిగి= వెడలి; తనదుగుప్తి= తన్ను దాచటాన్ని; అర్థించి=కోరి; గోవులన్=ఆవులను; ఆశ్రయించెన్= చేరుకొన్నాడు; అవియున్= ఆ ఆవులున్నూ; అగ్నిన్= అగ్నిని; గోపనంబు+చేసెన్= దాచాయి; సురలు= దేవతలు; ఎల్లచోటున్= అన్ని తావులందునూ; అరసి= వెదకి; శిఖి= అగ్ని; ఆ+విధంబునన్= ఆ విధంగా; ఉన్కి= ఉండటం; ఎఱింగిరి= తెలిసికొన్నారు.

తాత్పర్యం: కుమారు డిట్లా పలుకగా వ్యాసుడు 'నాయనా! నీకు సందేహ మెందుకు? కపిలను పూజించినా దానమిచ్చినా పోనిపాపాలు ఉంటాయా?' అన్నాడు. అప్పుడు శుకుడు తండ్రి మాటలు విని పుల్లావుకు అంతటి మహిమ రావటానికి కారణం ఏమిటి?' అని అడిగాడు. అప్పు డా మునిశ్రేష్ఠుడు వినుము. పూర్వం అగ్నిదేవు డొక కారణంగా దేవతల కన్నుగప్పి తనను దాచుమని గోవుల నాశ్రయించాడు. అవి దాచాయి. దేవతలు అన్నితావులూ వెదకి అగ్ని ఆ విధంగా ఉన్న సంగతి తెలిసికొన్నారు.

విశేషం: శిఖి - శిఖలంటే జ్వాలలు, అవి కలవాడు అగ్ని. నిమిషం అంటే రెప్పపాటు. అది లేనివారు అనిమిషులు= దేవతలు.

వ. ఎఱింగి కూడుకొని గోవులకడకు వచ్చి వానితో 'నగ్ని దాఁచుట యఖిలజగజ్జనంబులకు నహితంబు సేయుట గాదె! చూపకుండుట దగ' దని పలుకుటయుఁ, బుయిలోడి గోవు లప్పావకుం జూపిన, నాసుపర్వులు సంతోషించి వానికి వరం బీవలయునని యవ్వాయు సఖుం బ్రార్థించిన నతండు నగ్గోవుల యందు డాఁగి యుండ నవి కపిలచ్ఛాయం బ్రాపించి యునికిం గనుంగొని గోవుల కెల్లను కపిల యెక్కుడగుటయుం, దదీయారాధనంబునుం దద్దానంబునుం బుణ్యతమంబులై దురితంబుల దమియించి యుత్తమలోకంబుల నిచ్చుటయు వరంబులుగా నిచ్చెనని చెప్పి వెండియు. 102

ప్రతిపదార్థం: ఎఱింగి= తెలిసికొని; కూడుకొని= గుంపులుగా అయి; గోవులకడకున్= ఆవుల దగ్గరకు; వచ్చి; వానితోన్= ఆ ఆవులతో; అగ్నిన్= అగ్నిని; దాఁచుట= కనపడకుండా ఉంచటం; అఖిల జగత్+జనంబులకున్= సమస్తమైన లోకపుజనాలకు; అహితంబు= కీడు; చేయుట+కాదె!= చేయటం కదా!; చూపక+ఉండుట= కనిపింపచేయకుండటం; తగదు= కూడదు; అని; పలుకుటయున్= పలుకగా; గోవులు= ఆవులు; పుయిలోడి= సంకోచించి; ఆ+పావకున్= ఆ అగ్నిదేవుడిని; చూపినన్= చూపగా; ఆ సుపర్వులు= ఆ దేవతలు; సంతోషించి= ఆనందించి; వానికిన్= ఆవులకు; వరంబు= వరం; ఈవలయును= ఇవ్వాలి; అని; ఆ+వాయుసఖున్= వాయువునకు చెలి అయిన అగ్నిదేవుడిని; ప్రార్థించినన్= వేడుకొనగా; అతండు= ఆ అగ్ని; తాను; ఆ+గోవులయందున్= గోవులమధ్య; డాఁగి= దాగి; ఉండన్=ఉండగా; అవి= ఆ ఆవులు; కపిల+ఛాయన్= గోరోచనపు రంగును; ప్రాపించి= పొంది; ఉనికిన్= ఉండటాన్ని; కనుంగొని= చూచి; గోవులకున్+ఎల్లను= అన్నిగోవులకంటె; కపిల= పుల్లావు; ఎక్కుడు= మిన్న; అగుటయున్= కావటాన్నీ; తదీయ+ఆరాధనంబునున్= అట్టి ఆవును పూజించటమూ; తత్+ దానంబున్= దానిని దానమివ్వటమూ; పుణ్యతమంబులు+ఐ= గొప్ప పుణ్యాలై; దురితంబులన్= పాపాలను; దమియించి=

అణగగొట్టి; ఉత్తమ లోకంబులన్= పుణ్యలోకాలను; ఇచ్చుటయున్= ఇవ్వటమూ; వరంబులుగాన్=వరాలుగా; ఇచ్చెన్= ఇచ్చాడు; అని; చెప్పి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: దేవతలు తెలిసికొని గోవుల దగ్గరకు వచ్చి వాటితో 'అగ్నిని దాచటం వలన అన్ని లోకాల జనానికీ కీడు చేయటం కదా! చూపకుండటం తగదు' అని అంటే గోవులు చిన్నబుచ్చుకొని అగ్నిని చూపాయి. దేవతలు సంతోషించి ఆవులకు వరమివ్వాలని అగ్నిని ప్రార్థించగా అతడు ఆ గోవులలో దాగి ఉన్నప్పుడు అవి కపిలవర్ణం పొందటం చూచి 'గోవులన్నింటిలో కపిల మిన్న' అనీ, 'దానిని పూజించటం, దానమివ్వటం గొప్ప పుణ్యకార్యాలై పాపాలను అణగగొట్టి ఉత్తమలోకాలను పొందజేస్తా'యనీ వరాలుగా ఇచ్చాడు అని చెప్పి; ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'పుయిలోడటం' అంటే చేసిన తప్పు గురించి సిగ్గుపడటం అని ఇచ్చట అర్థం.

ఈ సందర్భంలో అగ్ని అనటానికి శిఖి పావకుడు వాయుసఖుడు అనే పదాలు వాడటం గమనించాలి. ఇవన్నీ పవిత్రార్థకాలు. కాబట్టే అగ్ని వరమివ్వగలిగాడని కవి హృదయం.

తే. కపిల యిచ్చిన వానిన కాదు నిజమ। కొన్నవానిని బుణ్యాత్మకుఁడుగఁ జేయు;

నీవుఁ గపిలా సమర్చనా నిరత మాన। సుండ వగు టెంతయును మేలు సువ్రతాత్మ!' 103

ప్రతిపదార్థం: కపిల= పుల్లావు; ఇచ్చినవానిన్+అ= ఇచ్చినవాడినే; కాదు; నిజము+అ= సందియంలేని నిజం; కొన్నవానిని= దానం పుచ్చుకొన్నవాడిని కూడా; పుణ్య+ఆత్మకుఁడుగన్+చేయున్= పుణ్యంగల హృదయం కలవాడిని చేస్తుంది; సువ్రత+ఆత్మ!= మంచి నిష్ఠగల హృదయంగలవాడా!; నీవున్= నీవు కూడా; కపిలా సమర్చనా నిరత మానసుండవు= పుల్లావు పూజలోమిక్కిలి ఆసక్తిగల మనస్సు కల వాడవు; అగుట= కావటం; ఎంతయున్= ఎంతైనా; మేలు= మంచిది.

తాత్పర్యం: కపిలగోవు దానమిచ్చిన వాడినే కాదు. పుచ్చుకొన్నవాడిని కూడా పుణ్యాత్ముడిని చేస్తుంది. మంచి నియమ నిష్ఠలుగల కుమారా! నీవు కూడా కపిల గోవులను ఆసక్తితో పూజించే హృదయం కలవాడవు కావటం మేలు.'

విశేషం: కొన్ని దానాలు పుచ్చుకొన్నవాడు ఇచ్చినవారి పాపాలను కూడా గ్రహించవలసి వస్తుంది. అందుకే తిలదానం మొదలైనవి కొందరు స్వీకరింపరు. ఇక్కడ అటువంటిది లేకపోగా కపిలగోవును పుచ్చుకొన్నవాడు కూడా పుణ్యాత్మకుడు కావటంవలన దాని మహిమ మరింత గొప్పదిగా నిరూపణకు వచ్చింది.

వ. అని చెప్పుటయు నప్పరమమునీశ్వరుతో నమ్ముని కుమార వరుండు 'కపిలా లక్షణం బెఱింగింపవే' యనిన నతం డతని కిట్లనియె. 104

ప్రతిపదార్థం: అని= అట్లు; చెప్పుటయున్= చెప్పగా; ఆ+పరమ ముని+ఈశ్వరుతోన్= ఆ మహర్షి శ్రేష్ఠుడితో; ఆ+ ముని కుమార వరుండు= ముని కుమారులలో మిన్న అయిన శుకుడు; కపిలా లక్షణంబు= కపిల తీరును; ఎఱింగింపవే= తెలియజేయుమా!; అనినన్= అంటే; అతండు= ఆ వ్యాసుడు; అతనికిన్= ఆ శుకునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వ్యాసు డిట్లా చెప్పితే; ఆ మునిశ్రేష్ఠుడితో ఆ కుమారశ్రేష్ఠుడు 'నాయనా! కపిల లక్షణం నాకు దయతో తెలియజెప్పుము' అని అడిగాడు. అప్పు డత డతడితో ఇట్లా అన్నాడు.

తే. కర్ణ శృంగాక్షి ఖుర నాసికా పుటములు । గపిలములు, గుత్తుకయును ముష్కములు గవిల
పట్టు లొందు నెందే నొకపట్టు కపిల । మైనఁ గపిలాత్వ గుణమున కదియ చాలు. 105

ప్రతిపదార్థం: కర్ణ= చెవులు; శృంగ= కొమ్ములు; అక్షి= కన్నులు; ఖుర= గిట్టలు; నాసికాపుటములు= ముక్కుల లోపలిభాగాలు; కపిలములు= గోరోచనం రంగు కలవి; కుత్తుకయును= మెడా; ముష్కములు= అండాలు; కవిలపట్టులు= కపిలవర్ణం స్థానాలు; ఒందును= ఒప్పుతాయి; ఎందేన్= ఎక్కడైనా; ఒకపట్టు= ఒక్కచోటు; కపిలము= గోరోచనం రంగు; ఐనన్= అయినా; కపిలాత్వ గుణమునకున్= కపిల అయ్యే స్థితికి; అది+అ= అదే; చాలున్= చాలును.

తాత్పర్యం: చెవులు, కొమ్ములు, కన్నులు, గిట్టలు, ముక్కులు, మెడ, అండాలు కపిలవర్ణంలో ఉండాలి. వీటిలో ఏ ఒక్కచోటున ఆ రంగు ఉన్నా 'కపిల' అవటానికి అదే చాలు.

విశేషం: ముష్క శబ్దం చేత ఇక్కడ కపిలవర్ణం గల ఎద్దును సంభావించటం సముచితం.

క. మేనెల్లఁ గపిల మైనను । దానిం జెప్పంగ నేల? తగదు కపిలలన్
మానితగుణ! పిదికి కుడువఁ । గా నే బలికైనఁ గాక కట్టఁ బెటికకున్. 106

ప్రతిపదార్థం: మేను= దేహం; ఎల్లన్= అంతా; కపిలము= గోరోచనం రంగు; ఐనను= అయితే; చెప్పంగన్+ఏల?=(దాని గొప్పను గూర్చి) చెప్పనేల?; మానితగుణ!= మన్నన పొందిన గుణాలు కలవాడా!; కపిలలన్= పుల్లావులను; పిదికి= పాలు పిండి; కుడువఁగాన్= త్రాగటం; తగదు= కూడదు; ఏ బలికిన్= ఏ విధమైన బలికి; ఐనన్= అయినా; తగదు= కూడదు; కాక= మరియును; పెటికకున్= బరువునకు; కట్టన్= కట్టటం; తగదు= కూడదు.

తాత్పర్యం: ఇక ఒడలంతా కపిలవర్ణమే అయితే దాని మహిమను గూర్చి చెప్పటమెందుకు? గుణవంతుడా? కపిలలను పాలుపిండి త్రావరాదు. ఏ బలికీ ఉపయోగించరాదు. బరువులు వానిమీద వేసి కట్టరాదు.

విశేషం: పెటిక అంటే ఎద్దుల నడ్డిమీద అటూ ఇటూ బరువుతో నింపిన గోనె మూట. కపిల పూజించదగినది కనుక పాలుతీయటం వంటి సాధారణ కార్యాలు చేస్తే దాని నవమానించటం అవుతుందని తాత్పర్యం.

ఆ. కాలఁ గేలఁ గోలఁ గపిల దండించిన । నరకవాసమునకు నరుగవలయుఁ,
బూరి నీరు లెస్స యారసి యగ్గోవు । సత్కరింప సుగతి సంభవించు. 107

ప్రతిపదార్థం: కాలన్= కాలితో; కేలన్= చేతితో; కోలన్= కర్రతో; కపిలన్= పుల్లావును; దండించినన్= కొడితే; నరకవాసమునకున్= నరకలోకంలో ఉండటానికి; అరుగన్+వలయున్= వెళ్ళవలసి వస్తుంది; పూరి= గడ్డి; నీరు= నీళ్ళు; లెస్స= బాగుగా; ఆరసి= చూచుకొని; ఆ+గోవున్= ఆ ఆవును; సత్కరింపన్= మన్నిస్తే; సుగతి= మంచిగతి; సంభవించున్= కలుగుతుంది.

తాత్పర్యం: కపిలగోవును కాలితో చేతితో కర్రతో కొడితే నరకానికి వెళ్ళవలసి వస్తుంది. మంచిమేతా, నీరూ తగిన సమయాలలో చూచుకొంటూ మన్ననతో కాపాడితే స్వర్గం లభిస్తుంది.

క. అనఘ! కపిలా ప్రదానం । బునకు ఫలం బిట్టి దనఁగబోలునె! కమలా
సనుఁడు మహానంద ప్రదమని వెఱచుచుఁ జెప్పె, దాని నట యే మందున్?' 108

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; కపిలా ప్రదానంబునకున్= కపిలను గొప్పగా దానమివ్వటానికి; ఫలంబు= ఫలం; ఇట్టిది= ఇంత మాత్రమైనది; అనఁగన్ పోలునె?= అనవచ్చునా?; కమల+ఆసనుఁడు= పద్మం కూర్చునే చోటుగా ఉన్న బ్రహ్మదేవుడు; దానిన్= ఆ దానాన్ని; మహా+ఆనంద ప్రదము+అని= పరమానందాన్ని ఇచ్చేదని; వెఱచుచున్= భయపడుతూ; చెప్పెన్= చెప్పాడు; అట= ఆ విషయంలో; ఏమి+అందున్?= ఇక ఏమి చెప్పగలను?

తాత్పర్యం: పుణ్యాత్ముడా! కపిలలను దానం చేయటంవలన కలిగే ఫలం ఇంతమాత్రంగా ఉంటుందని చెప్పరాదు. బ్రహ్మదేవుడు కూడా భయపడుతూ అది మహానందాన్ని కలిగించేది అని చెప్పాడు. ఇంక నే నేమి చెప్పగలను?

విశేషం: 'ప్రదానం' అత్యంతభక్తి శ్రద్ధలతో చేయవలెనని సూచన. వెఱచుచున్= సరిగా చెప్పగలుగుతున్నానా? అని భయం. అంటే నిజానికి మహానందంకంటె గొప్ప ఫలం సిద్ధిస్తుందని భావం. బ్రహ్మదేవుడు కూడా ఆ ఫలాన్ని నిష్కర్షచేసి చెప్పలేడని తాత్పర్యం.

వ. అని వెండియు. 109

తాత్పర్యం: వ్యాసు డిట్లా చెప్పి ఇంకా ఇట్లా అంటున్నాడు.

క. 'వసుధామర గాయత్త్రీ । వసంతములు సత్య గోసువర్ణంబులు నే
కసముద్భవంబు లని తా । పస వర్యులచేత విందుఁ బావనచరితా! 110

ప్రతిపదార్థం: పావనచరితా!= పవిత్రమైన నడవడి కలవాడా!; వసుధా+అమర గాయత్రీ వసంతములు= బ్రాహ్మణులు గాయత్రీ వసంతర్తువు; సత్య గో సువర్ణంబులు= సత్యం ఆవులు బంగారం; ఏక సముద్భవంబులు= ఒక్కదాని నుండే పుట్టాయి; అని; తాపసవర్యులచేతన్= గొప్ప తపస్సంపద కలవారినుండి; విందున్= వింటూ ఉంటాను.

తాత్పర్యం: మంచి నడవడి కల ఓ శుకా! బ్రాహ్మణులు, గాయత్రి, వసంత కాలం, సత్యం, గోవులు, బంగారం, అనేవి ఒకదాని నుండియే పుట్టాయని గొప్ప భావనాపటిమ గలవారు చెప్పగా వింటూ ఉంటాను.

విశేషం: బ్రాహ్మణులు మొదలైనవి ఒకచోట పుట్టటంవలన ఆ అన్నింటికీ మహిమ సమానం అని చెప్పినట్లయింది. తాపసవర్యులచేత అనటంవలన ఈ మాటను ప్రమాణంగా స్వీకరించాలి అనే అర్థం స్ఫురిస్తుంది. 'ల చేత' అనే బహువచన ప్రయోగం ఈ భావాన్ని మరింత గట్టి చేస్తుంది. 'విందును' అనే తద్ధర్మార్థక క్రియవలన ఆ మాట 'ఎప్పటిదో' అని త్రోసివేయరాదన్న సూచన తెలియవస్తుంది. పావన చరితా! అన్న సంబోధన ఇట్టి మహా విషయాలు పావన చరితులకే వినవస్తాయి అన్న అర్థాన్ని స్ఫురింపజేస్తుంది.

ఈ పద్యంలో 'వసంతములు' అనుదానికి 'వసుమతులు' అనే పాఠాంతరం ఉన్నది. వసుమతి అంటే భూమి.

క. కావున భూమియుఁ గనకము । గోవును దానార్హవస్తు కోటికి నెల్లన్
ధీవినుతా! యెక్కు డగుట । నీ విమలోదాత్త బుద్ధి నెలవు కొలుపుమీ!' 111

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధీవినుతా!= బుద్ధిచేత కొనియాడదగినవాడా!; కావునన్= కాబట్టి; భూమియున్= భూమీ, కనకమున్= బంగారమూ; గోవును= ఆవూ; దాన+అర్హ వస్తుకోటికిన్= దానమివ్వదగిన వస్తువుల సముదాయానికి; ఎల్లన్= అన్నింటికీ; ఎక్కుడు+అగుట= గొప్పది కావటం; నీ విమల+ఉదాత్త బుద్ధిన్= నీదైన స్వచ్ఛమూ, ఉన్నతమూ అయిన బుద్ధిలో; నెలవు కొలుపుమీ= నిలిపి ఉంచుకొనుము.

తాత్పర్యం: కాబట్టి భూమీ, బంగారమూ, ఆవూ దానమివ్వదగిన వస్తువులన్నింటికంటె గొప్పవి అని నీ దొడ్డబుద్ధిలో చెదరకుండా నిలుపుకొనుము.'

విశేషం: ధీవినుతా, విమలోదాత్తబుద్ధిన్ - అన్న పదాలచేత ఈ విషయంలో మరొక భావన రావటం బుద్ధి ఔన్నత్యాన్ని చెడగొట్టుతుంది అన్న స్ఫూర్తి కలుగుతుంది.

ఇందులో భూమియు అన్న పదం ఉండటం చేత వెనుకటి పద్యంలో 'వసుమతులు' సరియైన పాఠంగా నిర్ణయించవచ్చు.

క. అని మునిపతి సెప్పినఁ ద । త్తనయుఁడు ప్రియమందె' ననుడు ధర్మసుతుం డే
వినియుండుదు సిరి గోమయ । మున నుండుట; దాని కెద్ది మూల మగునొకో? 112

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; మునిపతి= ముని శ్రేష్ఠుడు (వ్యాసుడు); చెప్పినన్= చెప్పగా; తత్ తనయుఁడు= అతడి కుమారుడు (శుకుడు); ప్రియము+అందెన్= తృప్తి చెందాడు; అనుడున్= అనగా; ధర్మసుతుండు= ధర్మరాజు; ఏన్= నేను; సిరి= లక్ష్మి; గోమయమునన్= ఆవుపేడయందు; ఉండుటన్= ఉండటాన్ని; విని ఉండుదున్= విని ఉన్నాను; దానికిన్= అట్లా ఉండటానికి; మూలము= మొదటి కారణం; ఎద్ది= ఏది; అగునొకో!= అయి ఉంటుందో కదా!

తాత్పర్యం: వ్యాసుడు ఇట్లా చెప్పగా శుకుడు తృప్తి చెందాడు - అన్నమాట విని ధర్మరాజు 'ఆవుపేడలో లక్ష్మి ఉంటుందని నేను విన్నాను. దానికి కారణం ఏమిటో?' అని అడిగాడు.

గో శ్రీ సంవాదము (సం.13-81-2)

వ. అనుటయు గాంగేయుండు 'గో శ్రీ సంవాదం బను నితిహాసంబు విను; మయ్యర్థంబు దేటపడు' నని పలికి యిట్లనియె. 113

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; గాంగేయుండు= గంగ కొడుకు భీష్ముడు; గో శ్రీ సంవాదంబు= ఆవులకు, లక్ష్మికి అయిన సంభాషణ; అను ఇతిహాసంబు= అనే పూర్వగాథను; వినుము; ఆ+అర్థంబు= నీ వడిగిన ఆ విషయం; తేటపడును= స్పష్టం అవుతుంది; అని పలికి= అని చెప్పి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అడుగగా భీష్ముడు 'గో శ్రీ సంవాదం' అనే పూర్వగాథను వినుము. నీ వడిగిన విషయం చక్కగా తెలుస్తుంది' అని ఇట్లా చెప్పాడు.

సీ. 'సిరి ధేనువులలోని కరిగిన 'నెవ్వత?' । వని యవి యడిగిన నమ్మహాత్మ
'శ్రీ నేను మీలో వసింపఁగా వచ్చితి' । ననవుడుఁ 'జంచల వైన నిన్ను
నొల్లము మాలోన నునుపఁగా ననియె న । గ్గోవులు' దాని కద్దేవి వగచి
'యేను బాసిన సర్వదానవకులముఁ గీ । డ్పడియెఁ' బొందిన సురల్ ప్రభుత నొంది;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. రేను వచ్చుట గోరి కాదే తపంబు । లాచరింతురు; నన్నిట్టు లభిభవించు

టుఱవె మీ?' కన్న 'నధ్రువ మొల్ల మనుట । యభిభవమె? నీకుఁ బోలిన యచటి కరుగు.' 114

ప్రతిపదార్థం: సిరి= లక్ష్మి; ధేనువులలోనికిన్= ఆవుల లోనికి; అరిగినన్= పోగా; అవి= ఆ ఆవులు; ఎవ్వతవు?= నీవు ఎవ్వరవు?; అని; అడిగినన్= అడుగగా; ఆ+మహాత్మ= దొడ్డబుద్ధిగల ఆమె; ఏను= నేను; శ్రీన్= లక్ష్మిని; మీలోన్= మీలో; వసింపఁగాన్= ఉండుటకు; వచ్చితిన్= వచ్చాను; అనవుడున్= అన్న వెంటనే; ఆ+గోవులు= ఆ ఆవులు; చంచలవు+ఐన నిన్నున్= చపలస్వభావం కల నిన్ను; మాలోనన్ ఉనుపఁగాన్= మాలో ఉంచుకొనటానికి; ఒల్లము= ఇష్టపడము; అనియెన్= అన్నాయి; దానికిన్= ఆ విషయానికి; ఆ+దేవి= ఆ లక్ష్మీ దేవి; వగచి= దుఃఖపడి; ఏను= నేను; పాసినన్= వదలిపోగా; సర్వదానవ కులమున్= రాక్షసుల కులమంతా; కీడ్పడియెన్= చెడిపోయినది; పొందిన సురల్= నన్ను పొందిన దేవతలు; ప్రభుతన్= గొప్పతనాన్ని; ఒందిరి= పొందారు; ఏను= నేను; వచ్చుట= రావటాన్ని; కోరి కాదే= కోరియే కదా; తపంబులు= తపస్సులు; ఆచరింతురు= చేస్తారు; నన్నున్= అట్టి నన్ను; ఇట్టులు= ఈ విధంగా; అభిభవించుట= అవమానం చేయటం; మీకున్= మీకు; ఉఱవె?= తగునా?; అన్నన్= అనగా; అధ్రువము= చంచలమైన దానిని; ఒల్లము= ఇష్టపడటం; అనుట= అనటం; అభిభవమె?= అవమానమవుతుందా; నీకున్= నీకు; పోలిన అచటికిన్= ఇష్టమైన చోటికి; అరుగు= వెళ్ళుము.

తాత్పర్యం: ఒకప్పుడు లక్ష్మి గోవుల మందలోనికి వెళ్ళింది. ఆవులు 'నీ వెవరవు? అని అడిగాయి. ఆమె 'నేను లక్ష్మిని; మీతో కలిసి ఉందామని వచ్చాను' అన్నది. అప్పు డవి 'నీవు చంచలస్వభావం కలదానవు కనుక మాలో ఉంచుకొనటానికి ఇష్టపడం' అని చెప్పాయి. దానికి ఆమె దుఃఖపడి 'నేను వదలిపోతే రాక్షసులంతా చెడిపోయారు. నేను చేరటంవలన దేవతలు ప్రభుత్వం పొందారు. నా రాకను కోరేకదా మనుజులంతా తపస్సులు చేస్తారు. అట్టి న న్నిట్లా అవమానించటం తగునా? అని అడిగింది. అప్పుడవి 'స్థిరత్వం లేని దానిని మేమిష్టపడం అనటం అవమానమా? నీకు తోచిన చోటికి వెళ్ళుము' అన్నాయి.

విశేషం: లక్ష్మికి చంచల, చపల అనే పేర్లు ఉన్నాయి. **"సిరి దా వచ్చిన వచ్చును. సలలితముగ నారికేళ సలిలము భంగిన్; సిరి దాఁ బోయినఁ బోవును, గరిమ్రింగిన వెలగపండు కరణిని సుమతీ."** అని సూక్తి.

క. అని గోవులు పలికిన సిరి । విని 'మీచే నిట్లు పరిభవింపఁగఁబడి యేఁ

జనిన నను నెవ్వరును గై । కొనరు; శరణ మగుఁడు వేఁడికొనియెద మిమ్మున్. 115

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; గోవులు= ఆవులు; పలికినన్= పలుకగా; విని; సిరి= లక్ష్మి; మీచేన్= మీచేత; ఇట్లు= ఈ విధంగా; పరిభవింపఁగన్+పడి= అవమానం పొంది; ఏన్= నేను; చనినన్= పోతే; ననున్= నన్ను; ఎవ్వరును= ఎవరుకూడా; కైకొనరు= ఆదరించరు; మిమ్మున్= మిమ్ములను; వేఁడికొనియెదన్= ప్రార్థిస్తాను; శరణము+అగుఁడు= ఆశ్రయం ఇవ్వండి.

తాత్పర్యం: అని ఆవులంటే లక్ష్మీదేవి విని 'మీరిట్లా నన్ను అవమానిస్తే నేను ఎక్కడికి వెళ్ళినా నన్నెవరూ తీసికొనరు. మిమ్ములను వేడుకొంటున్నాను నాకు ఆశ్రయం ఇవ్వండి' అన్నది.

తే. మీ సమీపంబునం దున్కి మేలు; దాని । నిండు నా 'కని యడిగిన నెంత యేని

నాదరంబున నగ్గోవు లంతవట్టుఁ గూడి యిట్లను లక్ష్మికిఁ గురువరేణ్య! 116

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురుశ్రేష్ఠుడా!; మీ సమీపంబునందున్= మీ దగ్గర; ఉన్కి= ఉండటం; మేలు= శుభం; దానిన్=అట్లా ఉండటాన్ని; నాకున్= నాకు; ఇందు= అనుగ్రహించండి; అని అడిగినన్= అని అడిగితే; ఎంతయేనిన్= ఎంతో; ఆదరంబునన్= ప్రీతితో; ఆ+గోవులు= ఆ ఆవులు; అంతుపట్టున్= అన్నీ; కూడి= కలిసి; లక్ష్మికిన్= లక్ష్మీదేవితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాయి.

తాత్పర్యం: మీదగ్గర ఉండటం మేలు. నాకది అనుగ్రహించండి' అని అడిగితే ఆ గోవులన్నీ ఒక్క అభిప్రాయంతో ఎంతో ఆదరంతో లక్ష్మీదేవితో ఇట్లా అన్నాయి.

క. 'మా మూత్ర పురీషంబులు । భామా! వేదంబు లెఱుఁగుఁ బావనములు నీ
వీ మేలి వస్తువులఁ బ్రియ । ధామమ వై యుండు మింపు దలకొన మాకున్. 117

ప్రతిపదార్థం: భామా!= ఓ ఇంతీ!; మా మూత్ర పురీషంబులు= మా మూత్రం, మలం అనేవి; పావనములు= పవిత్రమైనవి; వేదంబులు= వేదాలు; ఎఱుఁగున్= (ఈ సంగతిని) తెలిసికొన్నాయి; నీవు; ఈ మేలి వస్తువులన్= ఈ గొప్ప వస్తువులందు; ప్రియధామమవు+ఐ= ప్రియమైన నివాసం కలదానవై; మాకున్= మాకు; ఇంపు= ప్రీతి; తలకొనన్= కలిగే విధంగా; ఉండుము.

తాత్పర్యం: 'లక్ష్మి! మా మల మూత్రాలు పరమ పవిత్రాలని వేదాలకు తెలుసు. నీవు ఈ గొప్ప వస్తువులలో మాకు ప్రీతి కలిగే విధంగా మంచి నివాసం కలదానవై ఉండుము.'

విశేషం: 'మా మూత్ర పురీషములు పానవములు' అనే వాక్య గర్భంలో 'వేదంబు లెఱుఁగు' అనే వాక్యాంతరం ఉండటం ఒక విశేషం. అట్లాంటి వాక్యనిర్మాణంవలన చెప్పదలచిన అంశానికి ఒక దార్ఢ్యం ఏర్పడటం వ్యవహారంలో మనం చూస్తాం.

తే. అనుటయును సిరి 'నాదు పుణ్యమునఁ జేసి । కంటిఁ బడయంగ మీ యనుగ్రహము' ననుచు
నట్లు వసియించె నిది గోమయ ప్రభావ । మూల మిట్టిది గోవు నమోఘ మహిమ. 118

ప్రతిపదార్థం: అనుటయును= అని పలుకగా; సిరి= లక్ష్మి; నాదు పుణ్యమునన్ చేసి= నా పుణ్యంవలన; మీ అనుగ్రహమున్= మీ దయను; పడయంగన్= పొందగా; కంటిన్= కన్నాను; అనుచున్= అంటూ; అట్లు= ఆ విధంగా; వసియించెన్= ఉన్నది; ఇది; గోమయ ప్రభావ మూలము= ఆవుపేడ గొప్పతనానికి మొదటి కారణం; గోవు+అమోఘ మహిమ= ఆవుయొక్క చెడని మహిమ; ఇట్టి+అది= ఇటువంటిది.

తాత్పర్యం: ఆవులు ఆ విధంగా చెప్పగా లక్ష్మి 'నా పుణ్యంచేత మీదయ పొందగలిగాను' అంటూ వాటి మలమూత్రాదులయందు నివసించింది. ఇది ఆవుపేడ గొప్పతానికి మొదలు. ఆవుల చెడని మహిమ ఇటువంటిది.

వ. మఱియు నొక్క విశేషంబు సెప్పెద నాకర్ణింపుము. 119

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఒక్క విశేషంబు= ఒక అసాధారణ విషయాన్ని; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= శ్రద్ధతో వినుము.

తాత్పర్యం: ఇంకా ఒక గొప్ప విషయం చెప్పుతాను వినుము.

ఆ. సురభి తపము సేయ సరసిజాసనుఁడు ప్ర । త్యక్షమై 'మనోరథంబు సెప్పు

మిచ్చు కౌతుకమున వచ్చితి' ననవుడు । నిట్టు లనియె నది మహీశవర్య! 120

ప్రతిపదార్థం: మహీ+ఈశవర్య!= రాజవరేణ్యా!; సురభి= కామధేనువు; తపము+చేయన్= తపస్సు చేయగా; సరసిజ+ఆసనుఁడు= పద్మం ఆసనంగా గల బ్రహ్మ; ప్రత్యక్షము+ఐ= కన్నుల కగపడి; మనస్+రథంబు= కోరిక; చెప్పుము= తెలియజేయుము; ఇచ్చుకౌతుకమునన్= ఇచ్చే వేడుకతో; వచ్చితిన్= వచ్చాను; అనవుడున్= అనగా; అది= ఆ కామధేనువు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: రాజా! కామధేనువు తపస్సు చేస్తే బ్రహ్మ కానవచ్చి 'నీ కోరిక ఏమిటో చెప్పుము; ఇచ్చే వేడుకతో వచ్చాను' - అంటే అది ఇట్లా అన్నది.

విశేషం: 'ఇచ్చు కౌతుకమున' అనటం కామధేనువుకు వరమివ్వగలగటం బ్రహ్మదేవునంతటి వాడికి కూడా ప్రమోద కారణం అన్న సంగతిని సూచిస్తుంది.

క. 'మీ రిట్లు ప్రసన్నమతిన్ । గారవమున వచ్చినంతకంటెను మే లేఁ

గోరంగ వలయునట్టిది । కారుణిక ప్రథమగణ్య! కలదే నాకున్?' 121

ప్రతిపదార్థం: కారుణిక ప్రథమగణ్యా!= దయగల వారిలో మొదట ఎన్నదగిన మహాత్మా!; మీరు= తమరు; ఇట్లు= ఈ విధంగా; ప్రసన్నమతిన్=కలత లేని బుద్ధితో; గారవమునన్= నా మీది మన్ననతో; వచ్చిన+అంతకంటెను= వచ్చినదానికంటె; ఏన్= నేను; కోరంగన్ వలయు+అట్టి+అది= కోరదగినదైన; మేలు= శుభము; నాకున్= నాకు; కలదే?= ఉన్నదా?

తాత్పర్యం: గొప్పదయగల మహాత్మా! మీరు ఈ విధంగా స్వచ్ఛమైన బుద్ధితో మన్ననతో రావటం కంటె నేను కోరదగిన శుభం మరొకటి ఉన్నదా?

విశేషం: కారుణిక ప్రథమగణ్యా! అన్న సంబోధన బ్రహ్మదేవుడి వాత్సల్యాతిశయాన్నీ, సురభి ఆనందాతిశయాన్నీ సూచిస్తుంది.

వ. అనిన నత్యంత సంతుష్ట స్వాంతుండై సురజ్యేష్ఠుండు సురభిం జూచి 'సురలోకాది దివ్య లోకంబుల కెల్లను గోలోకంబు మీఁదుగా వరం బిత్తుంగాక' యని తలంచి యవ్విశేషంబు మున్న తనవలన సిద్ధంబగుట సంస్మృతి గోచరం బగుటయు. 122

ప్రతిపదార్థం: అనినన్= అని పలుకగా; సురజ్యేష్ఠుండు= దేవతలకెల్ల పెద్ద అయిన బ్రహ్మ; అత్యంత సంతుష్ట స్వాంతుండు+ఐ= మిక్కిలి తృప్తి పొందిన మనస్సు కలవాడై; సురభిన్= కామధేనువును; చూచి; సురలోక+ఆది దివ్యలోకంబులకున్= దేవతలలోకం మొదలైన దివ్యలోకాలకు; ఎల్లను= అన్నింటికంటె; గోలోకంబు= గోవుల లోకం; మీఁదు= పై నుండేది; కాన్= అయ్యేటట్లుగా; వరంబున్= వరాన్ని; ఇత్తున్ కాక= ఇస్తాను; అని; తలంచి= భావనచేసి; ఆ+విశేషంబు= ఆ గొప్పతనం; మున్ను+అ= ఇంతకు ముందే; తనవలనన్= తనచేత; సిద్ధంబు+అగుట= ఏర్పడింది కావటం; సంస్మృతి గోచరంబు= స్మరణకు తోచటం; అగుటయున్= కాగా.

తాత్పర్యం: ఆ మాటకు పరమానందం పొంది బ్రహ్మ సురభిని చూచి దేవలోకం మొదలైన ఊర్ధ్వలోకాల కన్నింటికీ గోలోకంపైన ఉండేదిగా వరమిస్తాను అనుకొని, ఆ విషయం ఇంతకుముందే తనచేత ఏర్పడి ఉండటం గుర్తుకు రాగా.

విశేషం: భూలోకము, భువర్లోకము, మహర్లోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము అనేవి ఊర్ధ్వలోకాలు. 'గోలోకం' ఈ అన్నింటికంటె పైగా నిలపటం బ్రహ్మసంకల్పం. దీనివలన గోవు సర్వలోక పూజ్య అన్న మర్యాద ఏర్పడుతుంది.

తే. గోవులకు మేలు సేయంగ గోరు నాదు । చిత్తమున మద్వరంబున సిద్ధమైన
తెఱఁగ యొలసె దైవికమయి దీనిపెంప । యావహించెద నని యిచ్చె నవ్వరంబు. 123

ప్రతిపదార్థం: గోవులకున్= ఆవులకు; మేలు= శుభం; చేయంగన్= చేయటానికి; కోరు= కోరుతున్న; నాదు చిత్తమునన్= నా మనస్సులో; మత్+వరంబునన్= నా భావనయందు; సిద్ధము= ఏర్పడి ఉన్నది; ఐన తెఱఁగు+అ=అయిన విధమే; దైవికము+అయి= పరమాత్మ కూర్పుగా; ఒలసెన్= కలిగింది; దీని పెంపు+అ= దీని గొప్పతనమే; ఆవహించెదన్= కలుగజేస్తాను; అని; ఆ+వరంబున్= ఆ వరాన్ని; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: గోవులకు శుభం కూర్చాలన్న కోరిక కల నా హృదయంలో నా వరానికి ఇంతకుముందే ఏర్పడి ఉన్న తీరు అనుకూలంగా అమరి ఉన్నది. ఈ మహిమనే కలుగజేస్తాను అని ఆ వరం ఇచ్చాడు.

విశేషం: 'దైవికము' లోకాలన్నింటినీ సృష్టిచేసే మహామహిమగల బ్రహ్మకూడా దైవికం అనుకొన్నాడంటే అతడికి కూడా ఒక నియామక శక్తి ఉన్నదన్న విషయం తెలియవస్తుంది. అదే పరమాత్మ. గోవులు సర్వలోకాలకు పూజ్యులు కావటం పరమాత్మ సంకల్పంగా ఈ పద్యం తెలియజేస్తున్నది.

క. వనరుహ సంభవుఁ డత్తెఱఁ । గునఁ దనలోకంబు కంటె గోలోకము స
జ్జన వినుతచరిత! మీఁదై । యునికి వెలుఁగఁజేసి; నది మహోజ్జ్వల మయ్యెన్.' 124

ప్రతిపదార్థం: సత్+జన వినుతచరిత!= మంచివారు కొనియాడదగిన నడవడి కల ఓ ధర్మరాజా!; వనరుహ సంభవుఁడు= పద్మంలో పుట్టినవాడగు బ్రహ్మ; ఆ+తెఱఁగునన్= ఆ విధంగా; గోలోకమున్= ఆవుల లోకాన్ని; తన లోకంబు కంటెన్= తనదైన సత్యలోకం కంటె; మీఁదు+ఐ= పైదై; ఉనికి= ఉండటం; వెలుఁగన్ చేసెన్= ప్రకాశింపజేశాడు; అది= ఆ గోలోకం; మహా+ఉజ్జ్వలము= గొప్ప తేజస్సు కలది; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: ధర్మరాజా! బ్రహ్మ ఆ విధంగా గోలోకం తన సత్యలోకంకంటె పైన ఉండి ప్రకాశించేదిగా చేశాడు. ఆ గోలోకం దీనివలన ఎంతో గొప్పతనం పొందింది.'

వ. అని చెప్పి. 125

తాత్పర్యం: అట్లా చెప్పి.

క. గోవిషయ వాక్యపఠన । శ్రావణ సంశ్రవణములు ధరావర యాయు
శ్రీవిభవకీర్తి సుగతి స । మావహములు దత్పరుండ వగు మిక్కథలన్. 126

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ధరావర!= రాజా!; గో విషయ వాక్య పఠన శ్రావణసంశ్రవణములు= ఆవులకు సంబంధించిన మాటలు చదవటం; వినిపించటం, చక్కగా వినటం అనేవి; ఆయుః శ్రీ విభవ కీర్తి సుగతి సమావహములు= ఆయువునూ, సంపదనూ, ప్రభుత్వాన్నీ, కీర్తినీ, సద్గతినీ కలిగించేవి; ఈ+కథలన్= ఈ కథలయందు; తత్పరుఁడవు+అగుము= శ్రద్ధకలవాడవగుము.

తాత్పర్యం: ధర్మరాజా! గోవులకు సంబంధించిన వాక్యాలను చదవటం, వినిపించటం, వినటం అనేవి ఆయువునూ, సంపదనూ, అధికారాన్నీ, కీర్తినీ, మంచిగతినీ కలుగజేస్తాయి. కాబట్టి ఈ కథలందు శ్రద్ధను పెంపొందించుకొనుము.

విశేషం: తాను చదవాలి. తాను పొందే మహా ప్రయోజనాన్ని ఇతరులకు అందించటంకొరకు చదవలేని వారికి వినిపించాలి. (శ్రావణం) తనకంటె గొప్పవారు మరికొన్ని గొప్ప విషయాలు చెపితే ఆసక్తితో వినాలి (సంశ్రవణం) ఇది భారతీయుల "సర్వే జనాః సుఖినో భవన్తు" అన్న భావానికి సంబంధించిన సంప్రదాయం.

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు శాంతనవుతో 'మహాత్మా! గోవుల మాహాత్మ్యంబు దేటపడం బెక్కు భంగులం జెప్పి నన్నుం గృతార్థుం జేసితి; సర్వయజ్ఞంబులందును దాతవ్యం బత్యంతంబు సువర్ణంబని విందు; వేదంబులు 'సువర్ణ దక్షిణేతి వై' యని చెప్పెడు; భూమియు గోవులుఁ గాంచనంబును నీ విషయంబులైన దానంబులు నుత్తమంబు అని వేదవ్యాసు వచనంబు కలిమి నీవ చెప్పితి; సువర్ణ విశేషంబు వినవలతుం జెప్పవే' యనుటయు నతం డతని కిట్లనియె. 127

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; కౌంతేయ+అగ్రజుండు= కుంతి కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజు; మహాత్మా!= దొడ్డబుద్ధిగలవాడా!; గోవుల మాహాత్మ్యంబు= ఆవుల మహిమ; తేటపడన్= స్పష్టమయ్యే విధంగా; పెక్కు భంగులన్= పలువిధాలుగా; చెప్పి; నన్నున్= నన్ను; కృత+అర్థున్= నెరవేరిన ప్రయోజనం కలవాడినిగా; చేసితి= చేశావు; సర్వ యజ్ఞం బులందును= అన్ని యజ్ఞాలలో; దాతవ్యంబు= ఇవ్వదగినది; అత్యంతంబు= మిక్కిలి అయినది; సువర్ణంబు= బంగారం; అని; విందున్= వింటూ ఉంటాను; వేదంబులు= వేదాలు; సువర్ణ దక్షిణేతి వై = బంగారు కానుక కలదియే అని; చెప్పెడున్= చెపుతూ ఉంటాయి; భూమియున్= భూమీ; గోవులున్= ఆవులూ; కాంచనంబునున్= బంగారమూ; ఈ విషయంబులు+ఐన, దానంబులున్= వీటికి సంబంధించిన దానాలూ; ఉత్తమంబులు= మేలైనవి; అని; వేదవ్యాసు వచనంబు= వేదవ్యాసుడి పలుకు; కలిమి= ఉండటాన్ని; నీవు+అ= నీవే; చెప్పితి= చెప్పావు; సువర్ణ విశేషంబున్= బంగారం గొప్పతనాన్ని; వినవలతున్= వినగోరు తున్నాను; చెప్పవే= చెప్పుమా; అనుటయున్= అంటే; అతండు= ఆ భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: భీష్ముడిట్లా చెప్పగా విని ధర్మరాజు అతడితో 'మహాత్మా! ఆవుల మహిమ చక్కగా తెలియవచ్చే విధంగా ఎన్నో తీరులతో చెప్పి నన్ను ధన్యుడిని చేశావు. యజ్ఞాలన్నింటిలో మిక్కిలి శ్రేష్ఠంగా ఇవ్వదగినది బంగారం అని వింటూ ఉంటాను. వేదాలు కూడా సువర్ణ దక్షిణను కొనియాడుతూ ఉంటాయి. భూమి, ఆవులూ, బంగారమూ, వీటికి సంబంధించిన దానాలూ మిక్కిలి మేలైనవని వేదవ్యాసుడి మాట ఉన్నట్లుగా నీవే చెప్పావు. బంగారం గొప్పతనాన్ని వినాలని ఉన్నది. నాకు దయచేసి చెప్పుము. అంటే అతడి కతడు ఇట్లా అన్నాడు.

విశేషం: కౌంతేయాగ్రజుండు - పెద్దకుమారుడికి తక్కిన వారికంటె ఎక్కువ బాధ్యత ఉంటుంది. శాస్త్రాలు మొదటి కొడుకును ధర్మసంతానం అనీ, తక్కిన వారిని కామసంతానం అనీ చెబుతున్నాయి. వేదాలూ, వేదవ్యాసుడు చెప్పినమాట పొల్లుపోవటానికి వీలులేదు. వాటిని అనాదరం చేయరాదు. కాబట్టి వినాలనే కోరిక ధర్మరాజుకు మిక్కుటంగా కలిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భీష్ముఁడు ధర్మజునకు సువర్ణ దాన మహిమాతిశయంబు సెప్పుట (సం.13-83-6)

సీ. శంతను నృపతి లోకాంతరగతుఁడైన విను తదీయశ్రాద్ధ విధి యొనర్పఁ
బూని గంగాద్వారమున కేఁగి మా తల్లి। గంగ సాహాయ్యంబు గారవమున
నాచరింపంగఁ గ్రియాకలాపం బెల్ల। నడపఁ బిండ ప్రదానంబు సమయ
మగుటయు దర్భ విన్యాస మొనర్ప నం। దంగుళీయక కంకణాంగదములఁ

ఆ. గాంతమైన యొక్క కరము వొడమి యఱ। చేయి సాఁచుటయును జిత్త మద్భు
తంబుఁ బొంద దానిఁ దప్పక చూచి య। య్యధిపు బాహు వగుట యాత్మ నెఱిఁగి. 128

ప్రతిపదార్థం: శంతను నృపతి= శంతను మహారాజు; లోక+అంతర గతుఁడు+ఐనన్= మరొక లోకం పొందినవాడు కాగా; తదీయ శ్రాద్ధవిధి= ఆయన శ్రాద్ధం పని; ఒనర్పన్= చేయటానికి; పూని= సంకల్పించి; గంగా ద్వారమునకున్= గంగ ఒడ్డుకు; ఏఁగి= వెళ్ళి; మా తల్లి= మా అమ్మ; గంగ; సాహాయ్యంబున్= సాయాన్ని; గారవమునన్= ప్రేమతో; ఆచరింపంగన్= చేయగా; క్రియాకలాపంబు= శ్రాద్ధపు పనుల సముదాయము; ఎల్లన్= అంతటినీ; నడపన్= చేయగా; పిండ ప్రదానంబు సమయము= పిండాలిచ్చే వేళ; అగుటయున్= కాగా; దర్భవిన్యాసము= దర్భలను ఉంచటం; ఒనర్పన్= చేస్తే; అందున్= ఆ ప్రదేశంలో; అంగుళీయక కంకణ+అంగదములన్= ఉంగరాలు, చేతి వలయము, బాహుపురి అనే వాటితో; కాంతము= సుందరం; ఐన ఒక్క కరము= అయిన ఒక చేయి; పొడమి= కన్పట్టి; అఱచేయి= అరచేయి; చాఁచుటయును= చాపగా; చిత్తము= హృదయం; అద్భుతంబు+పొందన్= అబ్బురమందగా; దానిన్; తప్పక= కన్నార్పకుండా; చూచి= కనుగొని; ఆ+అధిపు బాహువు+అగుటన్= ఆ రాజు చేయి కావటాన్ని; ఆత్మన్= హృదయంలో; ఎఱిఁగి= తెలిసికొని.

తాత్పర్యం: మా తండ్రి శంతను మహారాజు చనిపోయినపుడు పరలోక క్రియలు చేయటానికి గంగ ఒడ్డుకు వెళ్ళి మా అమ్మ ప్రేమతో సాయం చేస్తూ ఉంటే ఆ క్రియాకలాపమంతా చేస్తున్నప్పుడు పిండాలు పెట్టే సమయంలో ఉంగరాలూ, కంకణమూ, అంగదమూ అనే ఆభరణాలతో మనోహరమైన ఒక హస్తం కన్పట్టి అరచేయి చాచింది. అది చూచి ఆశ్చర్యపడి దానిని రెప్పలార్చకుండా చూచి అది ఆ రాజు చేయియే అని తెలిసికొని. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: లోకాంతరగతుడు - మరొక లోకానికి వెళ్ళినవాడు. చనిపోవుట అనే మాటలో ఇక్కడ నుండి బయలుదేరి మరొక చోటికి పోయాడనే అర్థం. భారతీయుల విశ్వాసానికి సంబంధించినది. శ్రాద్ధవిధి - శ్రద్ధతో చేసేపని శ్రాద్ధం - ఈ పదం చనిపోయినవారి ఉత్తమ గతిని కోరి చేసే ప్రక్రియ అనే అర్థంలో రూఢి పొందింది. పిండ ప్రదానంబు - శ్రాద్ధంలో ఇది ఒక అంగం. చనిపోయిన వారిని మొదలు పెట్టి మూడు తరాల వరకు ఉన్న వారికి మూడు అన్నపుముద్దలు దర్భల మీద ఒక క్రమంతో ఉంచుతారు. - అంటే చనిపోయిన వ్యక్తికీ (చనిపోయి ఉంటే) అతడి తండ్రికీ, అట్లాగే అతడి తండ్రికీ - అన్నమాట. అట్లాగే తల్లి అయితే తల్లికీ, ఆమె అత్తగారికీ, ఆమె అత్తగారికీ - వీరిలో ఎవరైనా బ్రదికి ఉంటే వారికి పిండం పెట్టరాదు. వీరికి క్రమంగా వసు రుద్ర ఆదిత్య రూపాలని వ్యవహారం.

క. జనకుఁడు వేడుకఁ జే సాఁ। చిన యంతన సంతసిల్లి చేతం బిండం
బనుమానింపక యేఁ బె। ట్టిన శాస్త్రవిధాన గతి ఘటింపమి వచ్చున్. 129

ప్రతిపదార్థం: జనకుఁడు = తండ్రి; వేడుకన్= కోరికతో; చే= చేయి; చాఁచిన+అంతన= చాచినంతనే; సంతసిల్లి= మురిసిపోయి; ఏన్= నేను; చేతన్= చేతిలో; పిండంబు= పిండాన్ని; అనుమానింపక= అనుమానం పొందక; పెట్టినన్= పెట్టితే; శాస్త్రవిధాన గతి= శాస్త్రం విధించిన తీరు; ఘటింపమి= కుదరకపోవటం; వచ్చున్= వస్తుంది.

తాత్పర్యం: తండ్రి వేడుకపడి చేయి చాచాడు. నేను మురిసిపోయి అనుమానించకుండా చేతిలో పిండం పెట్టితే శాస్త్రం ఒప్పుకోని స్థితి కలుగుతుంది.

విశేషం: శ్రాద్ధం శాస్త్రాన్ననుసరించి పెట్టాలి. అనుమానాలతో శాస్త్ర ప్రమాణాన్ని పట్టించుకొనకుండా, శాస్త్ర పద్ధతికి విరుద్ధంగా చేస్తే వ్యర్థం అవుతుంది. అప్పుడది శ్రాద్ధమే కానిదవుతుంది.

తే. పితృకరంబునఁ బిండంబు పెట్టు మనదు। శాస్త్ర మంచిత మగు కుశాస్తరణమునన
పెట్టఁ జెప్పు; నట్లగుట 'నేఁ బెట్టఁ జేత'। నని మనంబునఁ దలఁచి వచనము సేసి. 130

ప్రతిపదార్థం: శాస్త్రము; పిండంబు= పిండాన్ని; పితృకరంబునన్= తండ్రి చేతిలో; పెట్టుము= పెట్టు; అనదు= అని చెప్పలేదు; అంచితము+అగు= చక్కనిదైన; కుశ+ఆస్తరణమునన్+అ= దర్భల పరపుపైనే; పెట్టన్= పెట్టటాన్ని; చెప్పున్= విధించింది; అట్లు+ అగుటన్= కాబట్టి; నేన్= నేను; చేతన్= చేతిలో; పెట్టన్= పెట్టను; అని; మనంబునన్= హృదయంలో; తలఁచి= భావించి; వచనము+చేసి= ఆ మాటనే పలికి.

తాత్పర్యం: శాస్త్రం పిండాన్ని తండ్రిచేతిలో పెట్టుమని చెప్పదు. చక్కని దర్భలు పరచిన చోటనే ఉంచాలని చెప్పుతున్నది. కాబట్టి చేతిలో పెట్టను అని నిశ్చయించుకొని ఆ మాటనే పలికి. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: ఇక్కడ పితృ శబ్దానికి కేవలం తండ్రి అని అర్థం కాదు. ఎవరి నుద్దేశించి శ్రాద్ధం పెడుతున్నారో వారు అని అర్థం. వారిని పితృదేవతలు అంటారు. ఆస్తరణం పరచిన చోటు, వచనముచేసి సాధారణంగా వైదిక ప్రక్రియలో చేయబోయే పనిని మనసులో భావన చేయాలి. మాటతో చెప్పాలి. క్రియ చేయాలి. దానినే త్రికరణశుద్ధి అంటారు.

క. అమలంబగు కుశసంస్తర। ణమునం బిండంబు వెట్టినం దోఁచిన హ
స్త మదృశ్యమయ్యె; మత్పితృ। సమితి ముదము మోములం దెసఁగఁ బొడ సూపెన్. 131

ప్రతిపదార్థం: అమలంబు+అగు= పరిశుద్ధమైన; కుశసంస్తరణమునన్= దర్భలు పరచినచోట; పిండంబు= పిండాన్ని; పెట్టినన్= పెట్టగా; తోఁచిన హస్తము= కన్పట్టిన చేయి; అదృశ్యము+అయ్యెన్= కనపడకుండా పోయింది; ముదము= ఎక్కువ అయిన ఆనందం; మోములన్= మొగాలలో; ఎసఁగన్= వ్యాప్తిచెందగా; మత్ పితృ సమితి= నా పితృదేవతల సముదాయం; పొడ+చూపెన్= కన్పట్టింది.

తాత్పర్యం: పరిశుద్ధమైన దర్భలు పరచినచోటనే పిండం పెట్టాను. అప్పుడు కనపడిన చేయి అదృశ్యమైపోయింది. సంతోషంతో విప్పారిన ముఖాలతో మా పితృదేవతలు నా ముందు సాక్షాత్కరించారు.

విశేషం: ధర్మాత్ములు శాస్త్రమార్గాన్ని అవలంబించటమే ఇష్టపడతారు. చేయి చాచటం ఇక్కడ పరీక్షగా మనం భావించాలి. అందులో భీష్ముడు కృతార్థుడయ్యాడు. ఆనందం తొణికిసలాడుతున్న ముఖాలతో పితృసమితి ముఖ్యంగా తండ్రి, తాత, ముత్తాత కనిపించారు. అమలంబు ఏ దోషమూ లేనిదిగా దర్భాసనాన్నీ, తక్కిన వారినీ చూచుకొనటం 'శ్రాద్ధం'లో ఒక సూక్ష్మాంశం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పొడసూపి ధర్మమార్గం । బెడపక 'నీ విట్లు పిండ మిడుటకు హర్షం
బడరినఁ జనుదెంచితి మె । క్కుడు తృప్తిం బొందితిమి ప్రగుణ్యచరిత్రా!' 132

ప్రతిపదార్థం: పొడ+చూపి= కనిపించి; ప్రగుణ్య చరిత్రా!= మిక్కిలిగా మన్నించదగిన నడవడి కలవాడా!; నీవు; ధర్మమార్గంబు= ధర్మపద్ధతిని; ఎడపక= చెడగొట్టక; ఇట్లు= ఈ విధంగా; పిండము= పిండాన్ని; ఇడుటకున్= ఇవ్వటంవలన; హర్షంబు= సంతోషం; అడరినన్= మిక్కుటంగా కలుగగా; చనుదెంచితిమి= వచ్చాము; ఎక్కుడు తృప్తిన్ = చాలా ఎక్కుడైన తృప్తిని; పొందితిమి= పొందాము.

తాత్పర్యం: అట్లా కనిపించి ఆ పితృదేవతలు ఇట్లా అన్నారు. 'ఎంతో మన్నింపదగిన ప్రవర్తనగల ఓ రాజా! నీవు ధర్మమార్గాన్ని చెరపకుండా పిండం పెట్టావు కనుక మాకు పరమానందం కలిగింది. వచ్చాము ఎక్కువ తృప్తిని పొందాము.'

విశేషం: 'ప్రగుణ్య చరిత్రా!' గుణింపదగినది గుణ్యము - గుణించటమంటే అధికం చేయటం. 'ఎక్కువగా మన్నించదగిన' అని తాత్పర్యం.

వ. అని పలికి వెండియు. 133

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికి= మాటాడి; వెండియున్= మరలా.

తాత్పర్యం: వా రిట్లా పలికి ఇంకా (ఇట్లా అన్నారు.)

క. 'భూమికి గోవులకునునై । హేమమిడుట యస్మదీయ హితమును దేవ
స్తోమ ప్రియముం బావన । తా మహనీయంబుఁ జుమ్ము ధర్మవిధిజ్ఞా! 134

ప్రతిపదార్థం: ధర్మవిధిజ్ఞా!= ధర్మవిధులను చక్కగా తెలిసినవాడా!; భూమికిన్= భూమికొరకు; గోవులకునున్+ఐ= ఆవులకొరకూ; హేమము= బంగారాన్ని; ఇడుట= ఇవ్వటం; అస్మదీయ హితమును= మాకు మేలొనరించేదీ; దేవ స్తోమ ప్రియమున్= దేవతల సముదాయానికి ప్రియమైనదీ; పావనతా మహనీయంబున్= పవిత్రతతో గొప్పదైనదీ; చుమ్ము= సుమా!

తాత్పర్యం: 'ధర్మక్రియలు చక్కగా తెలిసిన ఓ భీష్మా! భూమికి గోవులకు బదులుగా నీవు సువర్ణమును ఇవ్వడం మాకెంతో మేలు కూర్చేదీ, దేవతలకు ప్రీతిని కూర్చేదీ, పవిత్రతతో గొప్పదైనదీ అయిన పని సుమా!

విశేషం: దానాలలో భూదానమూ, గోదానమూ మొదలైనవి ఎన్నో ఉన్నాయి. సాధారణంగా ఆయా సందర్భాలలో వాటినే దానం చేయాలి. గతి లేకపోతే ప్రత్యామ్నాయాలు - బదులుగా చేసేవి ఉంటాయి. కానీ సువర్ణదానం గతిలేనప్పుడు చేసేది కాదు. దాన మహిమను ఇనుమడింప జేసేది అని ఈ పద్యభావం. పితృదేవతలు, స్వర్గలోక వాసులైన దేవతలకంటె కొంచెం తక్కువ స్థాయివారు. వీరి నుద్దేశించి ఇచ్చే సువర్ణదానం పై స్థాయివారికి కూడా ప్రీతి కలిగించిందంటే దాని మహిమ ఎంతటిదో ఊహించాలి. భూమికిన్, గోవులకును ఇక్కడ షష్ఠి' దానికి బదులు అనే అర్థాన్నిస్తుంది.

క. పావనము సువర్ణము వం । శావలికిం దనకు నిర్మలాత్మత నిచ్చున్;
నీ వది యెఱిఁగి సకలయ । జ్ఞావసరములను సువర్ణ యాజివ యగుమీ! 135

ప్రతిపదార్థం: పావనము= పవిత్రమైన; సువర్ణము= బంగారం; వంశ+ఆవలికిన్= వంశాల వరుసకూ; తనకున్= తనకూ; నిర్మల+ఆత్మతన్= దోషం లేని బుద్ధిని; ఇచ్చున్= ఇస్తుంది; నీవు; అది= ఆ విషయాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; సకల యజ్ఞ+అవసరములన్= అన్ని యజ్ఞాల సమయాలలో; సువర్ణ యాజివి+అ= బంగారు దక్షిణలతో యజ్ఞం చేసేవాడవు; అగుమీ= కమ్ము.

తాత్పర్యం: సువర్ణం పరమ పవిత్రమైనది. అది ఇచ్చిన వాడికే కాదు తరతరాలుగా ఉన్న వంశంవారందరికీ కల్మషంలేని బుద్ధినిస్తుంది. నీ వది తెలిసికొని అన్ని యజ్ఞాలలో సువర్ణదానం చేస్తూ ఉండుము.

విశేషం: సువర్ణం సృష్టిలో అందరికీ అపేక్షించదగిన వస్తువు. అట్టిదానిని దానం చేయటమంటే మమకారదోషాన్ని చంపుకొనటమన్నమాట. అన్ని అనర్థాలకూ మూలకారణమైన మమకారాన్ని చంపుకొనటానికి అవకాశం ఇస్తున్నది. కాబట్టి దానివలన నిర్మలాత్మత సిద్ధిస్తుంది.

క. అని చెప్పి చనిన నాదగు । మనము సువర్ణ ప్రదాన మహిమ కెలయఁ ద

ద్వినుతా నుష్ఠానపర । త్వ నిరూఢుఁడ నైతి నేను ధర్మతనూజా!' 136

ప్రతిపదార్థం: ధర్మతనూజా!= ధర్మనందనా!; అని చెప్పి= ఇట్లా చెప్పి (పితృదేవతలు) చనినన్= వెళ్ళగా; నాది+అగు మనము= నా హృదయం; సువర్ణ ప్రదాన మహిమకున్= బంగారం గొప్పగా దానం చేయటంలోని గొప్పతనానికి; ఎలయన్= ఆసక్తిపడగా; ఏను= నేను; తద్+వినుత+అనుష్ఠాన పరత్వ నిరూఢుఁడను= మేలైన ఆచరణలో శ్రద్ధ కలవానితనమునందు గట్టిగా నిలుకడ కలవాడిని; ఐతిన్= అయ్యాను.

తాత్పర్యం: ధర్మనందనా! నా పితృదేవతలు ఇట్లా బోధించి వెళ్ళిన తరువాత నా హృదయం సువర్ణదానం విషయంలో ఆరాటపడసాగింది. దానిని నిశ్చలబుద్ధితో చేసే దీక్ష కలవాడ నయ్యాను.'

విశేషం: పెద్దలు చెప్పిన గొప్ప విషయాన్ని ధర్మబుద్ధి కలవాడు శ్రద్ధాసక్తులతో ఆచరించాలి అనేది ఇందులో ధ్వని.

వ. అని పలికి యా భూవల్లభునితో భీష్ముండు వెండియు నిట్లను 'నిది యేను గనినది సువర్ణదాన మహిమ; మఱియును వినినదియుం గల దాకర్ణింపుము. 137

ప్రతిపదార్థం: అని; పలికి= మాటాడి; భీష్ముండు= భీష్ముడు; ఆ+భూవల్లభునితోన్= ఆ రాజుతో; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; ఇది= ఈ సంగతి; నేను= నేను; కనినది= చూచింది; సువర్ణ దానమహిమ= బంగారాన్ని దానం చేయటంలోని గొప్పతనం; మఱియును= ఇంకా; వినినదియున్= విన్నది కూడా; కలదు= ఉన్నది, ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇట్లా చెప్పి భీష్ము డా రాజుతో ఇంకా ఇట్లా అన్నాడు. 'ఇది నేను చూచిన విషయం. సువర్ణ దాన మహిమ ఇంకా విన్నది ఉన్నది. వినుము.

సీ. పరశురాముఁడు గిన్క నిరువది యొక్క మా । అదయుఁడై రాజుల వెదకి వెదకి

వధియించి, కృపపుట్టి వాజిమేధంబు ప్రా । యశ్చిత్తముగఁ జేసి, యంతఁ దనివి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సనక వసిష్ఠాది మునివరేణ్యులఁ గూర్చి । 'కల్మష పంకంబు గడిగి పురుషు
నత్యంత విమలుఁ జేయంగ నెయ్యది యోపు?' ననిన వసిష్ఠుఁ డిట్లనియె నతని

ఆ. 'కనఘ! విను సువర్ణ మగ్నిమయంబు దే । వతలు నగ్నిమయత నతిశయిల్లు
వారు గావునను సువర్ణదానంబు దే । వతల నీగి యట్ల శ్రుతులు సెప్పు. 138

ప్రతిపదార్థం: పరశురాముఁడు; కిన్కన్= కోపంతో; అదయుఁడు+ఐ= దయమాలినవాడై; రాజులన్= రాజులను; ఇరువది+ఒక్కమాఱు= ఇరవై ఒక్కమార్లు; వెదకి వెదకి= బాగా వెదకి; వధియించి= చంపి; కృప+పుట్టి= దయకలిగి; వాజిమేధంబు= అశ్వమేధ యాగాన్ని; ప్రాయశ్చిత్తముగన్= పాపం పోవటానికి చేసే కర్మ విశేషంగా; చేసి= ఆచరించి; అంతన్= ఆ మాత్రంతో; తనివి+చనక= తృప్తి పొందక; వసిష్ఠ+అది మునివరేణ్యులన్= వసిష్ఠుడు మొదలైన మహర్షి శ్రేష్ఠులను; కూర్చి= సమావేశపరచి; కల్మష పంకంబున్= పాపమనే బురదను; కడిగి; పురుషున్= మానవుడిని; అత్యంత విమలున్= మిక్కిలి పరిశుద్ధుడినిగా, చేయంగన్= చేయటానికి; ఏ+అది= ఏది; ఓపున్= చాలును; అనినన్= అంటే; వసిష్ఠుఁడు= వసిష్ఠ మహర్షి; అతనికిన్= ఆ పరశురాముడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అనఘ!= పుణ్యాత్ముడా!; విను= వినుము; సువర్ణము= బంగారము; అగ్నిమయంబు= అగ్నితో నిండింది; దేవతలును= దేవతలు కూడా; అగ్నిమయతన్= అగ్నియే స్వరూపంగా ఉండటంతో; అతిశయిల్లువారు= గొప్పతనం పొంది ఉండేవారు; కావునన్= కనుక; సువర్ణదానంబు= బంగారం దానం చేయటం; దేవతలన్= దేవతలను; ఈగి= ఇవ్వటం; అట్లు+అ= ఆ విధంగానే; శ్రుతులు= వేదాలు; చెప్పున్= చెప్పుతాయి.

తాత్పర్యం: పరశురాముడు కోపంతో రాజులను ఇరువది ఒక్కసార్లు వెదకి వెదకి చంపాడు. చివరకు జాలి పుట్టింది. ప్రాయశ్చిత్తంగా అశ్వమేధయాగం చేశాడు. అయినా తృప్తి కలగలేదు. వసిష్ఠుడు మొదలైన మహర్షుల నందరినీ సమావేశపరచి 'అయ్యలారా! పాపపు బురదను కడిగివేసి పురుషుడిని మిక్కిలి పరిశుద్ధుడినిగా చేయగలది ఏది?' అని అడిగాడు. వసిష్ఠుడు - 'ఓ పుణ్యాత్ముడా! బంగారం అగ్నిమయం. దేవతలూ అగ్ని స్వరూపులే కనుక బంగారాన్ని దానమిస్తే దేవతల నిచ్చినట్లే. వేదాలు కూడా ఇట్లాగే చెప్పుతున్నాయి.

విశేషం: 'వెదకి వెదకి' ఎవ్వరినీ వదలరాదన్న కసితో కూడిన పట్టుదలను ఈ పదం వ్యక్తం చేస్తుంది. 'మునివరేణ్యులన్' తపశ్శక్తి చేత మహా విషయాలను దర్శించిన వారిని. అట్టివారే ఇటువంటి నిర్ణయాలు చేయగలరు. అగ్నిమయత నతిశయిల్లు - అగ్ని సర్వాన్ని కాల్చివేస్తుంది. కనుక పాపాలను కూడా నామరూపాలు లేకుండా చేస్తుందని భావం. 'దేవతలు' పుణ్యాపాపాల అంటు సొంటులు లేనివారు. కేవలం పుణ్యఫలం అనుభవించేవారు; శ్రుతులు సెప్పు - శబ్ద ప్రమాణం కనుక సందేహించరానిదని వ్యంగ్యం.

తే. కావున సువర్ణ మసదృశ । పావనతాస్పదము; దాని భక్తిమెయిన్ వి
ప్రావలి కిచ్చిన యతనికిఁ బావనతం గొఱఁత గలదె పావనమూర్తీ! 139

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; పావనమూర్తీ!= పవిత్ర స్వరూపం కలవాడా!; సువర్ణము= బంగారం; అసదృశ పావనతా+ఆస్పదము= సాటిలేని పవిత్రతకు చోటు; దానిన్= ఆ సువర్ణాన్ని; భక్తిమెయిన్= భక్తితో; విప్ర+ఆవలికిన్= విప్రుల సముదాయానికి; ఇచ్చిన+అతనికిన్= ఇచ్చినవాడికి; పావనతన్= పవిత్రత విషయంలో; కొఱఁత= లోటు; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: ఓ పవిత్రమూర్తీ! బంగారం ఆ విధంగా పవిత్రతకు నిలయమైనది. దానిని భక్తితో వేదవిద్యలో ఆరితేరిన వారికి ఇచ్చేవాడికి పవిత్రత విషయంలో లోపం ఉంటుందా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: పద్యంలో పావనశబ్దం మూడు పర్యాయాలు ఆవృత్తమై కలిగే పవిత్రతయొక్క మహిమను నొక్కి చెప్తున్నది. ఇందులో విప్రశబ్దాన్ని వాడటం ప్రత్యేకంగా గుర్తించదగింది. "విద్యయా యాతి విప్రత్వమ్'' విద్యచేత విప్రత్వాన్ని పొందుతాడని పెద్దలమాట. విద్య అంటే ముక్తి నిచ్చే జ్ఞాన విద్యయే.

క్రిందటి పద్యంలో అనఘ! అనే సంబోధనా, ఆ పద్యంలోని పావనమూర్తీ! అనే సంబోధనా గుర్తించదగినవి. నిజానికి నీ పాపం అశ్వమేధయాగంతోనే నశించింది. నీవు పుణ్యాత్ముడవే. పవిత్రుడవే. అయినా నీ బెంగ పోవటానికి ఉపాయం చెప్తున్నాం అనే తాత్పర్యాన్ని ఈ సంబోధనలు వ్యంజింపచేస్తాయి.

భక్తి మెయిన్ - అనేది శ్రద్ధా విషయకంగా తీసికొనదగిన జాగ్రత్తను గూర్చి హెచ్చరిస్తుంది.

వసిష్ఠుఁడు పరశురామునకుఁ జెప్పిన సువర్ణ మహిమము (సం.13-83-40)

వ. ఏను బ్రహ్మముఖంబున వినినది సువర్ణ విషయంబైన విశేషం బొక్కటి యెఱింగించెద; నవహితుండవై విను'
మని పలికి యమ్మునిపతి యమ్మహాత్మున కిట్లనియె. 140

ప్రతిపదార్థం: ఏను= నేను; బ్రహ్మముఖంబునన్= బ్రహ్మదేవుడి ముఖం నుండి; వినినది= విన్నది; సువర్ణ విషయంబు+ఐన= సువర్ణ సంబంధమైన; విశేషంబు= విశేషం; ఒక్కటి; ఎఱింగించెదన్= తెలుపుతాను; అవహితుండవు+ఐ= పరాకుతనం లేనివాడవై; వినుము; అని పలికి; ఆ+మునిపతి= మునులలో శ్రేష్ఠుడైన ఆ వసిష్ఠుడు; ఆ+మహాత్మునకున్= దొడ్డబుద్ధిగల ఆ పరశురాముడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: నేను బ్రహ్మనోటినుండి విన్న విషయం సువర్ణానికి సంబంధించినది ఒకటి నీకు తెలుపుతాను చెదరని మదితో వినుము. అని ఆ మునిశ్రేష్ఠుడు ఆ మహాత్ముడితో ఇట్లా చెప్పాడు.

విశేషం: 'బ్రహ్మముఖంబునన్' ఇది వేదవాక్యంవలె ఏ కొంచెమూ సందేహం లేకుండా నమ్మదగినదని భావం.

క. గిరిజయు గిరీశుఁడును నొం। డొరువులకై తప మొనర్చి యొకళు లొకళ్లన్
బెరయం బడసి పరమసుఖ। భరితాత్మకు లైరి జగము ప్రమదం బందన్. 141

ప్రతిపదార్థం: గిరిజయున్= పార్వతీదేవీ; గిరి+ఈశుఁడును= పరమేశ్వరుడున్నూ; ఒండొరువులకై= ఒకరికొకరకై; తపము+ఒనర్చి= తపస్సు చేసి; ఒకళులు= ఒకరు; ఒకళ్ళన్= ఒకరిని; బెరయన్+పడసి= పొంది; జగము= లోకము; ప్రమదంబు+అందన్= పరమ సంతోషం పొందునట్లుగా; పరమ సుఖ భరిత+ఆత్మకులు= మహాసుఖంతో నిండిన హృదయాలు కలవారు; ఐరి= అయ్యారు.

తాత్పర్యం: పార్వతీపరమేశ్వరులు ఒకరికొరకు ఒకరు తపస్సు చేసి ఒకరినొకరుగా పొందారు. లోకమంతా మహానందం పొందగా వారు పరమసుఖంతో నిండిన హృదయాలు కలవారయ్యారు.

విశేషం: పార్వతి తపం పంట పరమేశ్వరుడు. పరమేశ్వరుడి తపస్సు పంట పార్వతి. సృష్టిలో మరెక్కడా ఇట్టి స్థితి కానరాదు. ఇక్కడ పరమసుఖం అంటే దాంపత్యసుఖం. ఆ ఆదిమ దంపతుల కామసుఖం జగత్తు కంతటికీ ఆనందదాయకం కావటం కూడా గమనించదగింది. అంటే ఆ దంపతులు జగదానందానికే సమాగమం పొందుతారు తప్ప స్వసుఖాపేక్షతో కాదని భావం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. కొండొకకాలంబునకు నయ్యాదిమ గృహస్థుని తేజం బాపరమగృహిణి నిమిత్తంబుగా రేతో ధాతు రూపంబునం బ్రసన్నంబై యమ్మహేశ్వరు మానస వృత్తిం జేసి యగ్నియందు నిలిచియుండ, నత్తఱిం దారకుం డను నొక్క రక్కసుచేతం బెక్కు విధంబులం బాధలంబడి యనిమిషులును మునులును గమలయోనిం గానంజని యద్దానవుండు తముం బఱచిన పాటెల్ల నెఱింగించిన, నద్దేవుండు వారితో 'దీని నెఱింగి యేను మున్న మీకు శోభనం బయ్యెడు తెఱంగు సమకట్టినవాఁడ; మీ రగ్ని నాశ్రయించి మాకు శుభంబు సేయవలయునని సంప్రార్థనంబు సేయునది; యతండు కర్తవ్యం బెఱుంగు; నరుగుం' డని నియోగించిన సంతోషించి' యట్లు చేసెద' మని యవ్విధాత వీడ్కొని వార లగ్నికడకుం బోవ నుత్సహించి. 142

ప్రతిపదార్థం: కొండొక కాలంబునకున్= కొంత కాలానికి; ఆ+అదిమ గృహస్థుని తేజంబు= మొట్టమొదటి సంసారి అయిన ఆ ఈశ్వరుడి వీర్యం; ఆ పరమ గృహిణి నిమిత్తంబుగాన్= ఆ గొప్ప ఇల్లాలు కారణంగా; రేతస్ ధాతు రూపంబునన్= రేతస్సు అనే మూల పదార్థ రూపంతో; ప్రసన్నంబు+ఐ= జారినదై; ఆ+మహా+ఈశ్వరు మానస వృత్తిన్+చేసి= ఆ పరమేశ్వరుడి భావనచేత; అగ్నియందున్= అగ్నిదేవుడి యందు; నిలిచి+ఉండన్= నిలిచి ఉండగా; ఆ+తఱిన్= ఆ సమయంలో; తారకుండు+ అను ఒక్కరక్కసు చేతన్= తారకుడనే ఒక రాక్షసుడిచేత; పెక్కు విధంబులన్= చాలా విధాలుగా; బాధలన్= బాధలను; పడి= పొంది; అనిమిషులును= దేవతలూ; మునులును= మునులున్నూ; కమలయోనిన్= కమలం జన్మస్థానంగా గల బ్రహ్మను; కానన్= చూడటానికి; చని=వెళ్ళి; ఆ+దానవుండు= ఆ రాక్షసుడు; తమున్= తమ్ము; పఱచిన+పాట్లుఎల్లన్= పెట్టిన కష్టాలన్నింటినీ; ఎఱింగించినన్= తెలుపుకొనగా; ఆ+దేవుండు= ఆ బ్రహ్మదేవుడు; వారితోన్= వారితో; దీనిన్= ఈ సంగతిని; ఎఱింగి= తెలిసి కొని; ఏను= నేను; మున్ను+అ= పూర్వమే; మీకున్= మీకు; శోభనంబు= మేలు; అయ్యెడు తెఱంగు= అయ్యే పద్ధతిని; సమకట్టిన వాఁడన్= ఏర్పాటు చేశాను; మీరు; అగ్నిన్= అగ్నిదేవుడిని; ఆశ్రయించి= చేరుకొని; మాకు; శుభంబు= మంచి; చేయవలయును= చేయాలి; అని; సంప్రార్థనంబు+ చేయునది= చక్కగా వేడుకొనండి; అతండు= ఆ అగ్నిదేవుడు; కర్తవ్యంబు= చేయదగినదానిని; ఎఱుంగున్= ఎరుగును; అరుగుండు= వెళ్ళండి; అని; నియోగించినన్= ఆజ్ఞాపించగా; సంతోషించి= ఆనందం పొంది; అట్లు+అ= ఆ విధంగానే; చేసెదము= చేస్తాము; అని; ఆ+విధాతన్= ఆ బ్రహ్మ దగ్గర; వీడ్కొని= సెలవు తీసికొని; అగ్నికడకున్= అగ్ని దగ్గరకు; పోవన్= వెళ్ళటానికి; ఉత్సహించి= వేడుకపడి.

తాత్పర్యం: కొంతకాలానికి ఆ మొదటి సంసారికి ఆ దొడ్డ ఇల్లాలు కారణంగా వీర్యం వెలువడింది. అతడు దానిని భావన శక్తిచేత అగ్నియందు నిలిపి ఉంచాడు. ఆ సమయంలో తారకాసురు డనే ఒక రాక్షసుడి వలన ఎన్నో బాధలు పడిన దేవతలు మునులు బ్రహ్మదగ్గరకు పోయి తాము పడిన బాధలన్నీ చెప్పుకొన్నారు. ఆ దేవుడు దీని సంగతి తెలిసికొని 'మీకు శుభమయ్యే పద్ధతి ముందే చేసి ఉంచాను. మీరు అగ్ని దగ్గరకు వెళ్ళి వేడుకొనండి. అతడికి ఏమి చేయాలో తెలుసు. వెళ్ళండి.' అని చెప్పగా వారెంతో సంతోషపడి అట్లాగే చేస్తాం అని బ్రహ్మదగ్గర సెలవు తీసికొని అగ్ని దగ్గరకు పోవటానికి ఉత్సాహపడ్డారు.

విశేషం: 'ఆదిమగృహస్థుడు' - పరమేశ్వరుడు జగత్తుకంతటికీ తండ్రి కనుక తొలి గృహస్థు. 'పరమగృహిణి' తన తపశ్శక్తిచేత పరమేశ్వరుడి దేహంలో సగభాగం పొందగలిగిన ఇల్లాలు. రేతస్సు శుక్లం, ధాతువు, మూలపదార్థం - ఇవి శరీర సంబంధంగా ఏడు. చర్మము, మాంసము, మజ్జ, అస్థి, వస, మేదస్సు, శుక్లము. బ్రహ్మదేవుడు భూతం, వర్తమానం, భవిష్యత్తు అనే మూడు కాలాలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ ముందే చేసి ఉంచుతాడు. ప్రసన్నంబై - ప్రస్ఖలితంబై. పాఠాంతరము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. ఆతని యున్నెడ యారసికొని చను । నప్పు డాతండు నిద్రాతిశయము
నూని ప్రచ్ఛన్నుఁడై యుండుట వారలు । గానక యున్నంతఁ, గప్ప యొకటి
యగ్ని పాతాళంబునం దున్కి యెఱిఁగింప । నప్పావకుఁడు డాఁగి పిప్పలమున
కేగెడు నెడ శాపమిచ్చె జిహ్వాస్ఫూర్తి । లేక రసాలి వివేక మెడలి

తే. యుండెడుమ కప్ప లని బొక్కలెండ నెండి । చచ్చియును నీరు వచ్చినఁ జావు బొంకు
సేసి యెలుఁగులు సెలఁగఁగఁ జెలఁగ వరము । వారు కప్పల కిచ్చి రవార్యతేజ! 143

ప్రతిపదార్థం: ఆతని ఉన్న+ఎడ= ఆ అగ్ని ఉన్నతావు; ఆరసికొని=వెదకికొని; చను+అప్పుడు= వెళ్ళే సమయంలో; ఆతండు= ఆ అగ్నిదేవుడు; నిద్రా+అతిశయమున్= నిద్దురమునుంపును; ఊని= పొంది; ప్రచ్ఛన్నుఁడు+ఐ= తెలియరానివాడై; ఉండుటన్= ఉన్నందు వలన; వారలు= ఆ దేవతలు, మునులు; కానక ఉన్నంతన్= గుర్తింపకున్నంతలో; కప్ప ఒకటి= ఒక కప్ప; అగ్ని= వహ్నిదేవుడు; పాతాళంబునందున్= పాతాళలోకంలో; ఉన్కి= ఉండటం; ఎఱిఁగింపన్= తెలుపగా; ఆ+పావకుఁడు= ఆ అగ్ని; డాఁగి= దాగుకొని; పిప్పలమునకున్= రావిచెట్టుకు; ఏగెడు+ఎడన్= వెళ్ళే సమయంలో; జిహ్వా స్ఫూర్తి= నాలుక కదలిక; లేక= లేకుండా; రస+ఆలి వివేకము= రుచుల సముదాయము ఏర్పాటు; ఎడలి= నశించి; కప్పలు= మండూకములు; ఉండెడుమ= ఉండుగాక; అని; శాపము+ఇచ్చెన్= శాపమిచ్చాడు; అవార్యతేజ= అడ్డుకొనరాని వర్చస్సు కలవాడా!; వారు = ఆ దేవతలు; మునులు; బొక్కలు= నేలలోని బొరియలు; ఎండన్= ఎండచేత; ఎండి= వేడెక్కి; (కప్పలు); చచ్చియును= చచ్చికూడా; నీరు= నీళ్ళు; వచ్చినన్= వస్తే; చావు=చావును; బొంకుచేసి= కల్లచేసి; ఎలుఁగులు= చప్పుళ్ళు; చెలఁగఁగన్= పిక్కటిల్లేటట్లుగా; చెలఁగన్= విజృంభించునట్లు; వరము= వరాన్ని; కప్పలకున్= కప్పలకు; ఇచ్చిరి= ఇచ్చారు.

తాత్పర్యం: అగ్నిదేవుడు ఉన్నచోటికి వారు వెదుక్కొంటూ వచ్చారు. అప్పు డతడు నిద్రముంచుకొనిరాగా ఎవ్వరికి కనపడకుండా ఉండటంవలన వారికి కనపడలేదు. ఒక కప్ప అగ్ని దేవుడు పాతాళంలో ఉన్న సంగతిని వారికి తెలియజేసింది. ఆ అగ్నిదేవుడు గుట్టుగా రావిచెట్టు దగ్గరకు పోతూ, 'కప్పలకు నాలుక కదలిక ఉండదు. రుచులు తెలియరావు' అని శాపమిచ్చాడు. దేవతలు, మునులు 'కప్పలు బొరియలలో ఎండలకు ఎండి చచ్చినా నీరు రాగానే చావును అబద్ధం చేసి బెకబెక చప్పుళ్ళతో విజృంభిస్తాయి' అని వరమిచ్చాడు.

విశేషం: జిహ్వాస్ఫూర్తి అంటే రుచి గ్రహించే శక్తి అని గ్రహించాలి.

వ. ఇవ్విధంబున విబుధులు మునులు నమ్మండూకంబు మఱుకువ యుడిపి మఱియును. 144

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; విబుధులు=దేవతలు; మునులు= మునులున్నూ; ఆ+మండూకంబు మఱుకువ= ఆ కప్ప దుఃఖాన్ని; ఉడిపి= తొలగించి; మఱియును= ఇంకా.

తాత్పర్యం: ఇట్లా ఆ దేవతలు, మునులు ఆ కప్ప దుఃఖాన్ని పోగొట్టి ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. అనలుని నన్వేషింపఁగ । వనగజ మొక్కండు రావివలను చతురతం
గనుగీటి చూపవార । వ్వనస్పతిం జేరఁజనఁగ వారని యలుకన్. 145

ప్రతిపదార్థం: అనలునిన్= అగ్నిని; అన్వేషింపఁగన్= వెదకగా; వనగజము= అడవి ఏనుగు; ఒక్కండు= ఒకటి; రావివలను= రావిచెట్టు వైపు; చతురతన్= నేర్పుతో; కనుగీటి= కన్ను కదలజేసి; చూపన్= చూపగా; వారు= ఆ దేవతలూ, మునులూ; ఆ వనస్పతిన్= ఆ చెట్టును; చేరన్+చనఁగన్= సమీపించగా; వారని అలుకన్= తగ్గని కోపంతో.

తాత్పర్యం: అగ్నిని వెదుకుతూ ఉంటే ఒక అడవి ఏనుగు ఒడుపుగా కనుసైగతో రావిచెట్టువైపు చూపింది. వారు ఆ చెట్టును సమీపించారు. (అగ్ని) పట్టరాని కోపంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: పువ్వులు లేకుండా కాయలు కాచే చెట్టును వనస్పతి అంటారు.

వ. అయ్యగ్నిదేవుండు గజంబులకు జిహ్వ దిరుగం బడ శపించుచు శమీగర్భ నివాసి యయ్యె; నది మొదలుగా నగ్నికి శమీగర్భంబునం దుత్పత్తి కలిగె; నద్దివిజులును దాపసులును గజంబులు ప్రతీపజిహ్వంబు లయ్యును సర్వరసజ్ఞానంబు గలిగి మాననీయంబులగు వరంబులంజేసి రాజితంబు లగునట్లుగా ననుగ్రహించి యగ్గజంబు విషాదంబు మాన్చి; రంత నొక్క శుకం బెఱింగింప శమీగర్భంబున నగ్ని యునికి యెఱింగి యందఱుం గ్రందుకొనం గడువేగంబునం బొదివికొనిన, నిదుర సెడుటకుం గోపించి. 146

విశేషం: ఆ+అగ్నిదేవుండు= ఆ అగ్నిదేవుడు; గజంబులకున్= ఏనుగులకు; జిహ్వ= నాలుక; తిరుగన్+పడన్= తిరుగబడే విధంగా; శపించుచున్= శాపమిస్తూ; శమీ గర్భ నివాసి= జమ్మికడుపులో ఉండేవాడు; అయ్యెన్= అయ్యాడు; అది మొదలుగాన్= అది మొదలుకొని; అగ్నికిన్=వహ్నికి; శమీగర్భంబునందున్= జమ్మికడుపులో; ఉత్పత్తి= పుట్టుక; కలిగెన్= ఏర్పడింది; ఆ దివిజులును= ఆ దేవతలున్నూ; తాపసులును= మునులూ; గజంబులు= ఏనుగులు; ప్రతీప జిహ్వంబులు= తిరుగబడిన నాలుక కలవి; అయ్యును= అయికూడా; సర్వ రసజ్ఞానంబు= అన్ని రుచుల తెలివి; కలిగి= ఉండి; మాననీయంబులు+అగు వరంబులన్+చేసి= మన్నింపదగిన వరముల వలన; రాజితంబులు= ఒప్పారేవి; అగు+అట్లుగాన్= అయ్యే విధంగా; అనుగ్రహించి= దయచూపి; ఆ+గజంబు విషాదంబున్= ఆ ఏనుగు దుఃఖాన్ని; మాన్చిరి= పోగొట్టారు; అంతన్= తరువాత; ఒక్కశుకంబు= ఒక చిలుక; ఎఱింగింపన్= తెలుపగా; శమీగర్భంబునన్= జమ్మి గర్భంలో; అగ్ని+ఉనికి= అగ్ని ఉండటం; ఎఱింగి= తెలిసికొని; అందఱున్= అందరూ; క్రందుకొనన్= సందడిహెచ్చుగా; కడు వేగంబునన్= గొప్ప వేగంతో; పొదివికొనినన్= క్రమ్ముకొనగా; నిదుర= నిద్ర; చెడుటకున్= పాడైనదానికి; కోపించి= కోపం పొంది.

తాత్పర్యం: ఆ అగ్ని ఏనుగులకు నాలుక తిరగబడిపోయే విధంగా శపించాడు. జమ్మిగర్భంలో ప్రవేశించి నివసించాడు. దేవతలూ మునులూ ఏనుగులు తిరుగబడిన నాలుకలు కలవి అయినా అన్ని రుచులనూ చక్కగా గ్రహించగలిగి మంచి వరాలతో ఒప్పారే విధంగా వరమిచ్చి ఆ ఏనుగు చింత పోగొట్టారు. అప్పుడొక చిలుక తెలుపగా అగ్ని జమ్మికడుపులో ఉన్న సంగతి తెలిసికొని అందరూ ఒక్క పెట్టున చుట్టుముట్టారు. అగ్ని నిద్ర చెడినందుకు కోపం పొందింది.

విశేషం: "శమీగర్భంబునం దుత్పత్తి కలిగెన్" - జమ్మికొయ్యలను ఒరిపిడి చేస్తే నిప్పు త్వరగా పుట్టుతుంది.

ఆ. జిహ్వ మరలఁ బడఁగఁ జిలుకల నగ్ని శ । పించె ; సురలు సెవుల కించునట్టి
పలుకు వాని కొసఁగి చిలుక నానందింపఁ । జేసి యా కృశానుఁ జేరఁ జనిన. 147

ప్రతిపదార్థం: అగ్ని= అగ్నిదేవుడు; చిలుకలను; జిహ్వ= నాలుక; మరలఁబడఁగన్= తలక్రిందులయ్యేటట్లుగా; శపించెన్= తిట్టాడు; సురలు= దేవతలు; చెవులకున్= చెవులకు; ఇంచు+అట్టి= రుచించునట్టి; పలుకు= మాట; వానికిన్= ఆ చిలుకలకు; ఒసఁగి= ఇచ్చి; చిలుకన్= ఆ చిలుకను; ఆనందింపన్+చేసి= సంతోషపరచి; ఆ కృశానున్= ఆ అగ్నిదేవుడిని; చేరన్ చనినన్= సమీపించగా.

తాత్పర్యం: అగ్ని చిలుకలకు నాలుక తిరుగబడే విధంగా శపించాడు. దేవతలు చెవుల కింపైన పలుకు కలిగే విధంగా అనుగ్రహించి ఆ చిలుకల సంతాపాన్ని పోగొట్టారు. అగ్నిని చేరుకొన్నారు.

వ. అతండు వారి నాలోకించి 'మీ వచ్చిన కార్యం బేమి?' యని యడిగిన వారుఁ దారక దైత్యు చేయు బాధ లెఱింగించి, వాఁ డేమి యుపాయంబునం దెగటాఱు నత్తెఱం గాపాదింపు' మని నిన్నుం బ్రార్థింప వచ్చితి మని పలికి వెండియు. 148

ప్రతిపదార్థం: అతండు= అ అగ్ని; వారిన్= దేవతలను, మునులను; ఆలోకించి= చూచి; మీ వచ్చిన కార్యంబు= మీరు వచ్చిన పని; ఏమి; అని; అడిగినన్= అడుగగా; వారున్= వారును; తారక దైత్యు చేయు బాధలు= తారకు డనే రాక్షసుడు కల్గిస్తున్న బాధలను; ఎఱింగించి= తెలిపి; వాఁడు= ఆ రక్కసుడు; ఏమి ఉపాయంబునన్= ఏ ఉపాయంతో; తెగటాఱున్= చస్తాడో; ఆ+తెఱంగు= ఆ విధానాన్ని; ఆపాదింపుము= ఆచరించుము; అని; నిన్నున్= నిన్ను; ప్రార్థింపన్= వేడుకొనటానికి; వచ్చితిమి= వచ్చాం; అని; పలికి= చెప్పి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: అగ్ని ఆ మునులనూ దేవతలనూ చూచి 'మీరు వచ్చిన పని ఏమిటి?' అని అడిగాడు. వారు తారకాసురుడు పెట్టుతున్న బాధలను తెలిపి, 'వా డే ఉపాయంతో చస్తాడో అది నీవు ఆచరించాలి - అని నిన్ను వేడుకొనటానికి వచ్చాం' అని పలికి ఇంకా.

క. 'మాకుం గుశలము గోరుము; నీకును మే; లివ్విధంబు నీదు మహిమ యీ
లోకంబు లెల్ల మనములఁ । జేకొని కీర్తించునట్లు సేయుము కరుణన్.' 149

ప్రతిపదార్థం: మాకున్= మాకు; కుశలము= క్షేమం; కోరుము= ఆకాంక్షించుము; ఈ+విధంబు= ఈ పద్ధతి; నీకును= నీకుకూడా; మేలు= మంచిది; నీదు మహిమ= నీ గొప్పతనం; ఈ లోకంబులు+ఎల్లన్= ఈ లోకాలన్నీ; మనములన్= మనస్సులలో; చేకొని= గ్రహించి; కీర్తించు+అట్లు= కొనియాడే విధంగా; కరుణన్= దయను; చేయుము.

తాత్పర్యం: 'మా క్షేమాన్ని నీవు కోరుము. ఇది నీకు కూడా మంచిదే. లోకాలన్నీ నీ మహిమను మనస్సులలో నిలుపుకొని కొనియాడే విధంగా దయచూపుము.'

సీ. అనినఁ బ్రసన్నత 'నట్టులు చేసెద । నూఱడుం' డని వారి నూఱడించి
తనయందు వెలుఁగు శంభుని వీర్య మిడియె గం । గా గర్భరూపంబు గాఁగ నాతఁ;
డది యతి పరివృద్ధ మగుటయు ధరియింప । నోర్వక నిర్జర పర్వతంబు
తటమున శరవణస్థంబుగా గంగ యు । త్సృష్ట మొనర్ప నా శిఖరి సతరు

తే. వల్లరీగుల్మకముగ సువర్ణమయత । వెలుఁగ బాలుఁడై వెలిఁగె నవ్వీరగర్భ;
మచ్చటికి వచ్చి కృత్తిక లార్వురును మ । దీయ పుత్రకుఁ డనుచు నెత్తికొని రనఘ! 150

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముఁడా! అనినన్= అంటే; ఆతఁడు= ఆ వహ్ని; ప్రసన్నతన్= దయతో; అట్టులు= ఆ విధంగా; చేసెదన్= చేస్తాను; ఊఱడుండు= శాంతి పొందండి; అని; వారిన్= ఆ దేవతలను, మునులను; ఊఱడించి= శాంతపరచి; తనయందున్= తనలో; వెలుఁగు= ప్రకాశించే; శంభుని వీర్యము= శివుడి రేతస్సును; గంగా గర్భరూపంబు కాఁగన్= గంగకు పిండరూపంగా; ఇడియెన్= ఉంచాడు; అది= ఆ గర్భరూపం; అతిపరి వృద్ధము అగుటయున్= మిక్కిలి ఎక్కువగా పెరిగిపోయింది కావటంవలన; గంగ= గంగానది; ధరియింపన్+ఓర్వక= పట్టుకొనలేక; నిర్జర పర్వతంబు తటమునన్= దేవతలకొండ ఒడ్డున; శరవణస్థంబు= రెల్లుతోటలో నిలుచునది; కాన్= అయ్యేటట్లు; ఉత్సృష్టము ఒనర్పన్= జార్చివేయగా; ఆ శిఖరి= ఆ కొండ; సతరు వల్లరీ గుల్మకముగన్= చెట్లతో; తీవెలతో, పొదలతో పాటుగా; సువర్ణమయతన్= బంగారుతో నిండినదై; వెలుఁగన్= కాంతులు చిమ్మగా; ఆ+వీరగర్భము= వీరుడిదైన ఆ గర్భం; బాలుఁడు+ఐ= కుమారుడై; వెలిఁగెన్= ప్రకాశించింది; అచ్చటికిన్= ఆ తావునకు; వచ్చి= ఏ తెంచి; కృత్తికలు ఆర్వురును= కృత్తికలన్న పేరుగల ఆరుగురు స్త్రీలు; మదీయ పుత్రకుఁడు= నా కొడుకు; అనుచున్= అంటూ; ఎత్తికొనిరి= ఎత్తికొన్నారు.

తాత్పర్యం: పుణ్యాత్ముఁడా! వా రట్లా అన్న వెంటనే అగ్ని అట్లాగే చేస్తాను. మీరు శాంతి పొందండి అని వారిని శాంత పరచి తనలో వెలుగుతున్న శివుడి రేతస్సును గంగలో గర్భరూపంగా వదిలాడు. అది చాలా పెద్దగా పెరిగిన కారణంగా గంగ దానిని మోయలేక మేరుపర్వతం ఒడ్డున ఉన్న ఒక రెల్లు తోటలో నిలిపింది. ఆ పర్వతం చెట్లతో, తీగలతో, పొదలతో బంగారు వన్నెతో మిలమిలలాడింది. ఆ వీరగర్భం ఒక బాలరూపంగా ప్రకాశించింది. అప్పు డక్కడకు వచ్చిన కృత్తిక లారుగురు నా కొడుకంటే నాకొడుకంటూ ముద్దుతో ఆ బాలుడిని ఎత్తుకొన్నారు.

విశేషం: 'నిర్జరపర్వతంబు' - మేరు పర్వతానికి 'సురాలయ' మని పేరు. కనుక అది దేవతల కొండ. శరముల వనము - శరవణము - రెల్లు తోట; వీర గర్భము - వీరుడైన శివుడి రేతస్సుతోనైన గర్భం లేక వీరరూపమైన గర్భం. కృత్తికలు - ఆరు నక్షత్ర రూపాల సముదాయం.

వ. ఇత్తెఱంగున నొక్కట నెత్తికొనుటయు నక్కుమారుండును షణ్ముఖుండై యొక్క పెట్ట సకలకృత్తికా స్తన్యపానం బాచరించె; న ట్లగ్నిసంభవ గాంగేయ కార్తికేయత్వంబు లొందిన యయ్యిందుమౌళితేజంబు పదంపడి బ్రహ్మాది దేవతలు పూజింప దేవసేనాధిపతిత్వంబునం బేర్చి యర్చిర్మహిత యయిన మహాశక్తిం దారకుం బరిమార్చి బృందారక ముని బృందంబుల కానందం బొనర్చె' నని యిట్లప్పరమముని పరశురామునకుం జెప్పి పురహరుం డగు నప్పురుషుండు హిరణ్మయుం డగుటయు 'సద్దేవదేవుండు దాన తనూభవుండై తోఁచుటయుం దథావిధ రేతోధారణంబున వహ్ని హిరణ్యాత్మకరేతో మూర్తియై హిరణ్యరేతుం డనం జనుటయు, నతండు తద్రేతః కలనంబునం దన్మయుం డగుటంజేసి పురహరునకు వహ్నిరేతుం డను నభిధానంబు గలుగుటయుం దేటపఱచి యవ్విధంబున రూపవంతంబైనది కావున సువర్ణంబు జాతరూప నామకంబై పరఁగుటయు నెఱింగించె. 151

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్=ఈ విధంగా; ఒక్కటన్= ఒక్క విధంగా; ఎత్తికొనుటయున్= ఎత్తుకొనగా; ఆ+కుమారుండును= ఆ బాలకుడునూ; షణ్ముఖుండు+ఐ= ఆరుమొగాలు కలవాడై; ఒక్కపెట్ట= ఒక్క మారే; సకల కృత్తికా స్తన్య పానంబు= కృత్తిక

లందరి చనుబాలు త్రాగటం; ఆచరించెన్= చేశాడు; అట్లు= అట్లా; అగ్ని సంభవ గాంగేయ కార్తికేయత్వంబులు= అగ్నిపుత్రుడు గంగ కొడుకు కృత్తికల తనయుడు కావటం; ఒందిన ఆ+ఇందుమౌళి తేజంబు= పొందిన ఆ చంద్రశేఖరుడి వీర్యం; పదం పడి= తరువాత; బ్రహ్మ+ఆది దేవతలు= బ్రహ్మ మొదలైన దేవతలు; పూజింపన్= కొలువగా; దేవసేనా+అధిపతిత్వంబునన్= దేవతలసేనకు నాయకుడవటం ద్వారా; పేర్చి= విజృంభించి; అర్చిర్ మహిత= జ్వాలలతో గొప్పగా వెలుగొందేది; అయిన మహాశక్తిన్= అయిన గొప్ప శక్తి అనే ఆయుధంతో; తారకున్= తారక రాక్షసుడిని; పరిమార్చి= చంపి; బృందారక ముని బృందంబులకున్= దేవతల, మునుల సముదాయాలకు; ఆనందంబు+ఒనర్చెన్= ఆనందాన్ని కలిగించింది; అని; ఇట్లు= ఈ తీరున; ఆ పరమముని= గొప్ప ముని అయిన ఆ వసిష్ఠుడు; పరశురామునకున్= పరశురాముడికి; చెప్పి= తెలియజేసి; పుర హరుండు= త్రిపురాసురులను రూపుమాపినవాడు; అగు= అయిన; ఆ+పురుషుండు= ఆ పరమేశ్వరుడు; హిరణ్మయుండు= బంగారమే స్వరూపమైనవాడు; అగుటయును= కావటమూ; ఆ+దేవదేవుండు= దేవులకు దేవుడైన ఆ శివుడు; తాను+అ= తానే; తనూభవుండు+ఐ= కుమారుడై; తోఁచుటయున్= కన్పట్టటమూ; తథావిధ రేతస్ ధారణంబునన్= ఆ విధమైన శుక్లాన్ని ధరించటంచేత; వహ్ని= అగ్ని; హిరణ్య+ఆత్మక రేతస్ మూర్తి+ఐ= స్వర్ణమయ మైన రేతస్సు ఆకారంగా గలవాడై; హిరణ్యరేతుండు= హిరణ్యరూపమైన రేతస్సు కలవాడు; అనన్+చనుటయున్= అనటానికి వీలైనవాడు కావటమూ; అతండు= ఆ అగ్ని; తద్ రేతస్+కలనంబునన్= ఆ రేతస్సు సంబంధంచేత; తద్+మయుండు= ఆ రేతస్సే స్వరూపమైనవాడు; అగుటన్+చేసి= కావటంవలన; పురహరునకున్= శివుడికి; వహ్నిరేతుండు+అను= అగ్ని రేతస్సుగా కలవాడనే; అభిధానంబు= పేరు; కలుగుటయున్= రావటమూ; తేట పఱచి= స్పష్టంచేసి; ఆ+విధంబునన్= ఆ తీరున; రూపవంతంబు= రూపం కలది; ఐనది= అయింది; కావునన్= కాబట్టి; సువర్ణంబు= బంగారం; జాతరూప నామకంబు= పుట్టిన రూపం కలది అన్న అర్థంతో 'జాతరూపం' అనే పేరుకలది; ఐ= అయి; పరఁగుటయును= ఒప్పారుటయూ; ఎఱింగించి= తెలిపి.

తాత్పర్యం: ఈ విధంగా ఒకేమారు ఆ ఆరుగురూ ఎత్తుకొనటంవలన ఆ కుమారుడు ఆరుముఖాలు ధరించి ఒకేమారు ఆ ఆరుగురు కృత్తికల చనుబాలు త్రాగాడు. ఆ విధంగా అగ్నిపుత్రుడు, గంగాపుత్రుడు, కృత్తికాపుత్రుడు అనే పేర్లు పొందిన ఆ శివుడి తేజస్సు తరువాత బ్రహ్మ మొదలైన దేవతలు పూజింపగా దేవసేనకు నాయకుడై జ్వాలలతో వెలుగొందుతున్న మహాశక్తి అనే ఆయుధంతో తారకుడిని చంపివేశాడు. దేవతలకూ, మునులకూ ఆనందాన్ని కలిగించాడు' అని ఆ వసిష్ఠమహర్షి పరశురాముడికి చెప్పాడు. ఇంకా త్రిపురాసులను మట్టుపెట్టిన ఆ పరమపురుషుడు బంగారమే స్వరూపంగా గలవాడు కావటమూ, ఆ దేవదేవుడు తానే కుమారరూపంతో పుట్టటమూ, అట్టి శుక్లాన్ని ధరించటంచేత అగ్నిదేవుడు బంగారు రూపమైన రేతస్సు కలవాడై హిరణ్యరేతుడు కావటమూ, అట్టి రేతస్సే అతడి స్వరూపం కనుక ఆ అగ్ని శివుడి రేతోరూపుడు కనుక శివుడికి వహ్నిరేతుడనే పేరు కలగటమూ చక్కగా వివరించి స్పష్టం చేశాడు. బంగారానికి ఆ విధంగా రూపం ఏర్పడింది. కనుక దానికి జాతరూపమనే పేరు గలగటం కూడా చెప్పాడు.

విశేషం: నిజానికి సువర్ణ మహిమను వసిష్ఠుడు చెప్పినా ఇందులో కుమారస్వామి కథ రమణీయంగా ఇమిడి ఉన్నది. పరమేశ్వరుడే కుమారస్వామి. భారతీయులు పురుషుడే స్త్రీయందు పుత్రరూపంలో ఉదయిస్తాడని నమ్ముతారు. అగ్ని నుండి పుట్టటంవలన అగ్నిభవుడనీ, గంగయందు పుట్టటంవలన గంగాతనయు డనీ, కృత్తికల స్తన్యం క్రోలటంవలన వారికి పుత్రుడై కార్తికేయుడనీ, శరములవనంలో పుట్టటంవలన శరవణభవుడనీ, ఆరుముఖాలతో ఏకకాలంలో పాలు త్రాగటంవలన షణ్ముఖు డనీ ఎప్పుడూ కుమార స్వరూపంతో ఉండటంవలన 'కుమారస్వామి' అనీ అనేక పర్యాయాలు గర్భరూపంగా జారినవాడు కనుక స్కందుడనీ పేర్లు వచ్చాయి.

క. మహితాత్మక! యేతాదృశ । మహిమంబు సువర్ణ మది సమంచిత తేజో
మహనీయము తద్దానము । మహత్త్వ మా శివుఁడ యెఱుఁగు మాకుం జూడన్. 152

ప్రతిపదార్థం: మహిత+ఆత్మక!= దొడ్డది అయిన బుద్ధికలవాడా!; సువర్ణము= బంగారం; ఏతాదృశ మహిమంబు= ఇటువంటి గొప్పతనం కలది; అది; సమంచిత తేజస్+మహనీయము= చక్కగా ఒప్పారే కాంతితో మన్నన కెక్కింది; తద్+దానము మహత్త్వము= దానిని దానమివ్వటంలోని గొప్పతనాన్ని; మాకున్= మాకు; చూడన్= చూడగా; ఆ శివుఁడు+అ= ఆ సర్వము నెరిగిన శివుడే; ఎఱుఁగున్= తెలియును.

తాత్పర్యం: మహానుభావా! బంగారం మహిమ ఇటువంటిది. దాని కాంతి అపురూపమైనది. దాని దానంలోని గొప్పతనం సర్వజ్ఞుడైన శివుడికే తెలుసు నని మాభావం.

విశేషం: శివుడు అనటంవలన తక్కిన ఎవ్వరికీ పూర్తిగా తెలియదని భావన.

వ. అవ్విశేషంబున నశేష కల్మషంబులం బాసి నరుండు విధూమత్వంబున వెలుంగు శుచియునుం బోలె శుచిత్వ సంపద సొంపారం బెంపారు నని యుపదేశించె నవ్వసిష్ఠ మునివరు వచనంబు లూఁది యమందాదర వర్ణనీయుండై సువర్ణదాన పరంపర లాచరించి. 153

ప్రతిపదార్థం: ఆ+విశేషంబునన్= ఆ గొప్పతనంచేత; అశేష కల్మషంబులన్= అన్ని విధాలైన పాపాలనూ; పాసి= వదలి; నరుండు= మానవుడు; విధూమత్వంబునన్= పొగలేనితనంతో; వెలుంగు శుచియునున్+పోలెన్= ప్రకాశించే అగ్నివలె; శుచిత్వ సంపద= నిర్మలత్వం అనే సంపద; సొంపారన్= ఇంపులు నింపగా; పెంపారున్= గొప్పతనంతో వృద్ధి పొందుతాడు; అని; ఉపదేశించెన్= బోధించాడు; ఆ+వసిష్ఠమునివరు వచనంబులు= ఆ వసిష్ఠమహర్షి మాటలు; ఊఁది= గట్టిగా పట్టుకొని; అమంద+ఆదర వర్ణనీయుండు+ఐ= గొప్ప ఆదరంతో కొనియాడదగినవాడై; సువర్ణ దాన పరంపరలు= బంగారం దానాల వరుసలను; ఆచరించి= చేసి.

తాత్పర్యం: ఆ దానమహిమవలన సర్వపాపాలను పోగొట్టుకొని నరుడు పొగలేని నిప్పువలె పరిశుద్ధ సంపదతో ఒప్పుతాడని బోధించాడు. పరశురాముడు 'ఆ వసిష్ఠమహర్షి మాటలను గట్టిగా హృదయంలో నిలుపుకొని ఎంతో ఆదరంతో సువర్ణదానాలు చేసి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అగ్నికి శుచి అని ఒకపేరు. మాలిన్యం ఏ మాత్రమూ లేనివాడని భావం. అట్లాగే సువర్ణదానాలు చేసినవాడు పాపాలనే మలినాలు ఏ మాత్రమూ లేనివాడై స్వచ్ఛతతో ప్రకాశిస్తాడని తాత్పర్యం.

క. ఆ రాముండు శుచిత్వ । శ్రీ రాజితుఁడయ్యెఁ; నట్లు సేయుము నీవుం
గౌరవముఖ్యా! యది భవ । పారావారఘన యానపాత్రము సుమ్మీ!' 154

ప్రతిపదార్థం: ఆ రాముఁడు= ఆ పరశురాముడు; శుచిత్వ శ్రీ రాజితుఁడు= పరిశుద్ధి అనే సంపదతో విరాజిల్లేవాడు; అయ్యెన్= అయ్యాడు; కౌరవముఖ్యా!= కురువంశం వారిలో శ్రేష్ఠుడా!; నీవున్= నీవుకూడా; అట్లు= ఆ విధంగా; చేయుము= ఆచరించుము; అది= ఆ పని; భవ పారావార ఘన యానపాత్రము= సంసారమనే సముద్రానికి గొప్ప నావ; చుమ్మీ!= సుమా!

తాత్పర్యం: పరశురాము డా విధంగా పాపాలులేనివాడై శుచిత్వ సంపదతో విరాజిల్లాడు. కురువరా! నీవు కూడా అట్లా ఆచరించుము. అది సంసారమనే సముద్రానికి పెద్దనావ సుమా!'

విశేషం: అలం: రూపకం. సంసారం అంటే పుట్టటం చావటం అనే రెండు చక్రాలలో తిరుగుతూ ఉండటం. అది అనంతంగా ఉంటుంది. కనుక సముద్రంతో పోలిక. ఘన యానపాత్రము అనటంవలన ప్రమాదంలేకుండా దాటిస్తుంది అన్న అర్థం వ్యక్తమౌతుంది.

క. అని యనిమిష తటినీ ప్రియ । తనయుఁడు సెప్పటయు ధర్మతనయుఁడు హృదయం
బునఁ బ్రమదము నిండార న । తనితో నతిభక్తి వినయ ధామం బగుచున్. 155

ప్రతిపదార్థం: అని= అట్లా; అనిమిష తటినీ ప్రియ తనయుఁడు= దేవతల నది అయిన గంగ ముద్దుల కొడుకు; చెప్పుటయున్= చెప్పినంతనే; ధర్మతనయుఁడు= ధర్మరాజు; హృదయంబునన్= హృదయంలో; ప్రమదము= ఆనందం; నిండారన్= నిండి ఉండగా; అతనితోన్= ఆ భీష్ముడితో; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; వినయ ధామంబు= వినయానికి నెలవు; అగుచున్= అవుతూ.

తాత్పర్యం: భీష్మ డిట్లా చెప్పగా ధర్మరాజు హృదయంలో సంతోషం పొంగిపొరలింది. అతడు గొప్ప భక్తితో తన ఒడలెల్లా వినయమే కాగా.

విశేషం: ఏదైనా ఒక మహా విషయాన్ని తెలిసికొనగోరేవాడికి ఉండవలసిన లక్షణాలు భక్తి, వినయం, సంతోషం అనే వాటిని ఇక్కడ సూచిస్తున్నారు. 'అనిమిషతటినీ ప్రియతనయుడు' గంగవలె ఆశ్రయించినవారిని పవిత్రులను చేయగలవాడని భావం.

వ. 'పితృ యజ్ఞ ప్రకారం బెఱింగింపవే' యనుటయు నక్కురువరుఁ డన్నరనాథున కిట్లనియె. 156

ప్రతిపదార్థం: పితృ యజ్ఞ ప్రకారంబు= పితృదేవతల పూజా పద్ధతిని; ఎఱింగింపవే?= తెలుపుమా?; అనుటయున్= అన్నంతనే; ఆ+కురువరుఁడు= కౌరవులలో శ్రేష్ఠుడైన ఆ భీష్ముడు; ఆ+నరనాథునకున్= ఆ రాజునకు; ఇట్లు= ఇట్లా; అనియెన్=అన్నాడు.

తాత్పర్యం: 'తాతా! దయచేసి పితృయజ్ఞం ఎట్లా చేయాలో చెప్పవూ?' అని అడుగగా భీష్ముడు ధర్మరాజునకు ఇట్లా చెప్పాడు.

విశేషం: బ్రహ్మయజ్ఞం, పితృయజ్ఞం; దేవయజ్ఞం, భూతయజ్ఞం; మనుష్యయజ్ఞం - అనే వాటిని పంచమహాయజ్ఞాలు అంటారు. మానవుడు వీటిని చేస్తూ ఉండాలి అని ధర్మశాస్త్రం శాసిస్తున్నది. అందులో పితృయజ్ఞం ఎట్లా చేయాలో ధర్మరాజు తెలిసికొనగోరు తున్నాడు.

క. 'పితృపూజ సమగ్ర్యము దై । వత పూజనమునకు మనుజవల్లభ! పితృ దే
వతలఁ గొనియాడుదురు దే । వత లాదిగఁ గల్గు నెల్లవారును భక్తిన్. 157

ప్రతిపదార్థం: మనుజవల్లభ!= రాజా!; దైవత పూజనమునకున్= దేవతల ఆరాధనకంటె; పితృపూజ= పితృదేవతలను పూజించటం; సమగ్ర్యము= మిన్న; దేవతలు+ఆదిగన్= దేవతలు మొదలుగా; కల్గు+ఎల్లవారును= ఉన్న అందరూ; భక్తిన్= భక్తితో; పితృదేవతలన్= పితృ రూపంలో ఉన్న దేవతలను; కొనియాడుదురు= ప్రశంసిస్తారు.

తాత్పర్యం: రాజా! పితృదేవతలను పూజించటం దేవతలను పూజించటం కన్నా మిన్న అయిన పని. ఎందుకంటే దేవతలు మొదలైనవారందరూ భక్తితో పితృదేవతలను స్తుతిస్తూ ఉంటారు.

విశేషం: తరచుగా 'మనుజవల్లభ!' వంటి సంబోధనలు కవి వాడుతూ ఉంటాడు. ఇందులో ఒక సూక్ష్మార్థం ఉన్నది. రాజు అన్నీ చక్కగా తెలిసికొని ఆచరిస్తే ప్రజలు అతడిని అనుసరించి మంచిమార్గంలో నడుస్తారు. "యథా రాజా తథా ప్రజాః " అని గదా సూక్తి.

వ. విశేషించి మనుష్యులకుఁ బిత్రృ సమారాధనంబు సర్వశుభ సాధనంబు. 158

ప్రతిపదార్థం: విశేషించి= మిక్కిలిగా; మనుష్యులకున్= మానవులకు; పిత్ర్య సమారాధనంబు= పితృదేవతలను చక్కగా కొలవటం; సర్వ, శుభ సాధనంబు= అన్ని శుభాలకు సాధనం.

తాత్పర్యం: ప్రత్యేకించి మనుష్యులకు పితృపూజ అన్ని శుభాలకూ సాధనం.

విశేషం: ఈ ఘట్టంలో 'పితృ' శబ్దానికి మరణించిన తన వంశంవారని అర్థం.

భీష్ముఁడు ధర్మజునకుఁ బితృపూజా విధానం బెఱింగించుట (సం.13-87-3)

క. అమవస నమవసఁ బితృయ । జ్ఞము దగఁ బిండ ప్రదాన సహితముగా భ
క్తి మెయిం జేయు నతఁడు ని । త్యముఁ జేసిన వాఁడ యగు సమంచిత చరితా! 159

ప్రతిపదార్థం: సమంచిత చరితా!= చక్కగా ఒప్పారు నడవడిగల ఓ ధర్మరాజా!; అమవసన్ అమవసన్= ప్రతి అమావాస్యనాడును; పిండ ప్రదాన సహితముగాన్= పిండములు పెట్టుటతోపాటుగా; తగన్= పద్ధతి ననుసరించి; భక్తిమెయిన్= భక్తితో; పితృయజ్ఞమున్= శ్రాద్ధమును; చేయు+అతఁడు= చేసేవాడు, నిత్యమున్= ప్రతిదినము; చేసినవాఁడు+అ= చేసినవాడే; అగున్= ఔతాడు.

తాత్పర్యం: చక్కని నడవడిగల ఓ ధర్మరాజా! ప్రతి అమావాస్యనాడూ భక్తితో పిండప్రదానంతో కూడా విధి ననుసరించి శ్రాద్ధం చేసేవాడు నిత్యమూ చేసినవాడే అవుతాడు.

విశేషం: అమావాస్య పితృప్రీతికరమైన దినం. పిండము అంటే మంత్రపూర్వకంగా ఒక్కొక్కరికి ఒక్కొక్కటి చొప్పున దర్భలపై ఉంచే అన్నపు ముద్దలు. నిజానికి పితృయజ్ఞము ప్రతిదినమూ చేయాలి. నెల కొక్కమారు వచ్చే అమావాస్యనాడు చేస్తే నిత్యమూ చేసినట్లే అని చెప్పటంవలన మానవులకు ఆ కార్యం మీద అనురక్తి కలుగుతుంది.

వ. పితృయజ్ఞంబునకుఁ దిథి విశేషంబు సెప్పెద. 160

ప్రతిపదార్థం: పితృయజ్ఞంబునకున్= శ్రాద్ధానికి; తిథి విశేషంబు= ప్రశస్తమైన తిథులను; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: శ్రాద్ధానికి సంబంధించిన తిథుల విశేషాలను చెప్పుతాను.

విశేషం: 'తిథి' అంటే స్థూలంగా 'Date' అని అర్థం. ఇవి పదునైదు. మనం ఇప్పుడు అనుకునే తేదీవంటిదే. అయితే భారతీయుల తిథి సూర్యోదయంతో మొదలై సూర్యోదయం వరకు అనే లెక్కతో ఉండదు. మొత్తానికి రోజులో ఎక్కడో ప్రారంభమై 24 గంటలకు కొంచెం హెచ్చుతగ్గులుగా సాగుతూ ఉంటుంది.

సీ. పాడ్యమిఁ బితృయజ్ఞపరుఁడైనఁ జారుకాం । తాపతి; విదియఁ గాంతలకుఁ దండ్రి'
తదియను జవితిని దా వాజిధనికుండు । పశుభాగి పంచమి బహుసుతుండు,
షష్ఠి భానాత్ముండు, సప్తమిఁ గృషిభాగి, । యష్టమి వాణిజ్య పుష్టుఁడు, వసు
గజ ధర్మవిష్ణు చిత్తజ తిథులం । దేకశత జంతువులను గోచయముఁ గుప్య

తే. ములును దగ బ్రహ్మ వర్చస్వి పుత్రకులును । ధనము గలవాఁడు విను చతుర్దశి రణైక
భాగి పున్నమ నమవస భవ్య సర్వ । కామ్య ఫలభాగి యగుఁ జువ్వె కౌరవేంద్ర! 161

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర= ధర్మజా! పాడ్యమిన్= పాడ్యమి తిథినాడు; పితృ యజ్ఞపరుఁడు= శ్రాద్ధంపై ఆసక్తి కలవాడు; ఐనన్= అయితే; చారు కాంతాపతి= అందమైన భార్యకు భర్త (అవుతాడు); విదియన్= రెండవ తిథినాడు; కాంతలకున్= అందమైన స్త్రీలకు; తండ్రి= జనకుడు (అవుతాడు); తదియను= మూడవ తిథినాడునూ; చవితిని= నాలుగవ తిథియందూ; తాన్= తాను; వాజిధనికుండు= గుర్రాలు ధనంగా కలవాడు; పశుభాగి= పశుసంపద కలవాడు; పంచమిన్= అయిదవ తిథి; బహుసుతుండు= పెక్కుండ్రు కొడుకులు కలవాడు; షష్ఠిన్= ఆరవ తిథియందు; భానాత్ముండు= ప్రకాశించే ఆత్మ కలవాడు; సప్తమిన్= ఏడవ తిథియందు; కృషిభాగి= వ్యవసాయం కలవాడు; అష్టమిన్= ఎనిమిదవ తిథియందు; వాణిజ్య పుష్టుఁడు= వర్తకపు పుష్టి కలవాడు; వసు గజ ధర్మ విష్ణు చిత్తజ తిథులందున్= నవమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి అనే పేర్లుగల తొమ్మిదవ, పదియవ, పదునొకండవ, పండ్రెండవ, పదుమూడవ తిథులందు; ఏక శతజంతువులను= ఒక వంద చొప్పున జంతువులను (ఏక శఫజంతువులను అని పాఠం - ఒంటి గిట్టగల జంతువులను అని అర్థం); గోచయమున్= ఆవుల మందలను; కుప్యములును= లోహ సంపదలను; తగన్= తగినంత; బ్రహ్మవర్చస్వి పుత్రకులును= బ్రహ్మతేజస్సు గల కొడుకులును; ధనము గలవాఁడు= సంపద కలవాడును, విను= వినుము; చతుర్దశిన్= చతుర్దశి అనే పదునాలుగవ తిథి యందు; రణ+ఏక భాగి= యుద్ధం మాత్రమే పొందేవాడు; పున్నమన్= పూర్ణిమయందు; అమవసన్= అమావాస్యయందు; భవ్య సర్వ కామ్య ఫలభాగి= శ్రేష్ఠములైన అన్ని కోర్కెల ఫలాన్ని పొందేవాడు; అగున్= అవుతాడు; చువ్వె= సుమా!

తాత్పర్యం: పాడ్యమినాడు శ్రాద్ధాన్ని ఆసక్తితో పెడితే అందమైన అతివకు భర్త అవుతాడు. విదియనాడు కన్యలకు తండ్రి అవుతాడు. తదియనాడు గుర్రాల ధనంకలవాడూ, చవితినాడు గోధనం కలవాడూ అవుతాడు. పంచమినాడు ఎక్కువమంది కొడుకులు కలవాడు, షష్ఠినాడు చక్కగా ప్రకాశించే బుద్ధికలవాడు, సప్తమినాడు వ్యవసాయ దారుడు, అష్టమినాడు వ్యాపారపుష్టి కలవాడూ అవుతాడు. నవమినాడు ఒంటిగిట్టలు గల పశువులు ధనంగా కలవాడూ, దశమినాడు ఆలమందలు కలవాడూ, ఏకాదశినాడు లోహసంపదలు కలవాడూ, ద్వాదశినాడు బ్రహ్మతేజస్సు గల పుత్రులు కలవాడూ, త్రయోదశినాడు భాగ్యవంతుడూ, చతుర్దశినాడు యుద్ధం మాత్రమే పొందేవాడూ, పూర్ణిమ, అమవస తిథులందు శ్రేష్ఠమైన కోర్కెలు అన్నీ తీరినవాడూ అవుతాడు.

విశేషం: ప్రతి తిథికి ఒక్కొక్క అధి దేవత ఉన్నది. నవమికి వసువులు, దశమికి - ఏనుగులు, ఏకాదశికి యముడు, ద్వాదశికి భృగువు, త్రయోదశికి - మన్మథుడు. ఈ పద్యంలో ఈ తిథులను అధిదేవతల పేర్లతో వ్యవహరించారు. కుప్యమంటే వెండి బంగారం కాక తక్కిన లోహం.

క. అపరంబగు పక్షంబును । నపరాహ్ణము మేలు పితృసమర్చనమున కా
ద్యపుఁ దిథి దశమి చతుర్దశి । నృపవర! యప్పక్షమునను నింద్యతఁ బొరయున్.' 162

ప్రతిపదార్థం: నృపవర!= రాజోత్తమా! పితృసమర్చనమునకున్= పితృదేవతల పూజకు; అపరంబు అగు పక్షంబును= రెండవదైన కృష్ణ పక్షమూ; అపరాహ్ణము= పగటిని అయిదు భాగాలుగా చేస్తే అందులో నాలుగవ భాగమైన కాలమూ; మేలు= శ్రేష్ఠమైనవి; ఆ పక్షమునను= ఆ కృష్ణ పక్షంలో; ఆద్యము+తిథి= మొదటిదైన పాడ్యమి తిథీ; దశమి= పదో తిథీ; చతుర్దశి= పదునాలుగో తిథీ; నింద్యతన్= చెడ్డ స్థితిని; పొరయున్= పొందుతాయి.

తాత్పర్యం: రాజా! కృష్ణపక్షమూ, అపరాహ్ణమూ శ్రాద్ధానికి మంచి సమయాలు. కృష్ణపక్షంలో పాడ్యమి, దశమి, చతుర్దశి తిథులు మంచివి కావు.'

విశేషం: అపరాహ్ణము: అహస్సు అంటే పగటిభాగం. సుమారు పండ్రెండు గంటలనుకొని మూడు భాగాలు చేస్తే మూడవ భాగాన్ని అపరాహ్ణం అంటారు. అంటే సూర్యోదయం ఆరుగంటలకు అయితే మధ్యాహ్నం రెండుగంటల తరువాత కాలం. మరొక విధంగా పగటిని అయిదు భాగాలు చేస్తే ఒక్కొక్కభాగం సుమారు రెండు గంటల ముప్ఫైఆరు నిముషాలు అవుతుంది. ఈ భాగాలు మూడు గడువగా నాలుగవ భాగం అపరాహ్ణం అవుతుంది. ఈ లెక్క ప్రకారం కూడా మధ్యాహ్నం రెండు గంటల తరువాతి కాలమే అపరాహ్ణం. అపరపక్షమంటే కృష్ణపక్షం. పూర్ణిమ తరువాత పాడ్యమి మొదలుకొని అమావాస్యదాకా ఉండే పదునైదు రోజుల కాలం. ఇది నెలలో రెండవ భాగం కనుక 'అపరపక్షం' అంటారు.

క. అనిన విని ధర్మసూనుం । 'డనఘా! యెద్దానఁ బితృసమర్చన మొనరిం
చిన నధిక ఫలంబగు న । వ్వినుత ద్రవ్యములఁ జెప్పవే తెలియంగన్.' 163

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= శ్రద్ధతో ఆలకించి; ధర్మసూనుండు= ధర్ముడి కొడుకు యుధిష్ఠిరుడు; అనఘా!= పుణ్యాత్ముడా!; ఏ+దానన్= దేనితో; పితృసమర్చనన్= పితృదేవతలపూజ; ఒనరించినన్= చేస్తే; అధిక ఫలంబు= ఎక్కువ ఫలం; అగున్= కలుగుతుందో; ఆ+వినుత ద్రవ్యంబులన్= మేలైన ఆ పదార్థాలను; తెలియంగన్= తెలిసే విధంగా; చెప్పవే= దయతో తెలియజేయుము.

తాత్పర్యం: భీష్ముడు చెప్పినది విని ధర్మరాజు 'పుణ్యాత్ముడా! శ్రాద్ధం ఏ వస్తువులతో చేస్తే ఎక్కువ ఫలం వస్తుందో ఆ మేలైన పదార్థాలను తెలియజెప్పుము' అన్నాడు.

వ. అనుటయు దేవవ్రతుం డతని కిట్లనియె. 164

ప్రతిపదార్థం: అనుటయున్= అన్నంతనే; దేవవ్రతుండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా భీష్ముడు ధర్మరాజుకు ఈ విధంగా చెప్పాడు.

క. 'తిలపాయస ఘృతములు పితృ । కలనములకు నుత్తమములు; గవ్యంబు మహా
ఫల; మెదియైనన్ మత్స్యం । బులు మాంసము విహితవిధిఁ బ్రభూత ఫలంబుల్. 165

ప్రతిపదార్థం: తిల పాయస ఘృతములు= నువ్వులు, పరమాన్నము, నేయి; పితృ కలనములకున్= శ్రాద్ధములకు; ఉత్తమములు= శ్రేష్ఠములైనవి; గవ్యంబు= ఆవులనుండి ఏర్పడేది; ఎది+ఐనన్= ఏదైనా; మహాఫలము= గొప్ప ఫలం కలది అవుతుంది; మత్స్యంబులు= చేపలు, మాంసము= మాంసమున్నూ; విహిత విధిన్= శాస్త్రం ప్రకారం; ప్రభూత ఫలంబుల్= దొడ్డ ఫలం కలవి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నువ్వులు, పాయసమూ, నేయి శ్రాద్ధాలకు మేలైన వస్తువులు. ఆవులనుండి ఏర్పడేది ఏదైనా గొప్ప ఫలాన్నిస్తుంది. చేపలు, మాంసమూ శాస్త్రం విధించిన తీరు ననుసరించి దొడ్డఫలా న్నిస్తాయి.

విశేషం: గవ్యము - గోవునుండి వచ్చేది; పాలు, పెరుగు, నేయి, పేడ, మూత్రం - వీటిని పంచ గవ్యాలంటారు. చేపలు, మాంసము - అవి ఆహారంగా ఉపయోగించేవారు మాత్రమే శ్రాద్ధములలో వాడాలి. అందరూ కాదు.

తే. గొఱియనంజుడు ఖడ్గంబు నెఱచి గండ । మృగమునందలి పలలంబు మేఁకమాంస
మొక్కఁడొకటికి ఫలమున నెక్కు డండ్రు । పితృ సమర్చన విదులైన పెద్ద లధిప! 166

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; పితృ సమర్చన విదులు= పితృదేవతల పూజలను గూర్చి చక్కగా తెలిసినవారు; ఐన పెద్దలు= అయిన వృద్ధులు; గొఱియ నంజుడు= గొర్రె మాంసం; ఖడ్గంబు+ఎఱచి= ఖడ్గమృగం మాంసం; గండమృగము నందలి పలలంబు= గండభేరుండం అనే దాని అందలి మాంసం; మేఁక మాంసము= మేక మాంసమూ; ఒకటికిన్= ఒకదాని కంటె; ఒకఁడు= ఒకటి; ఫలమునన్= ఫలం విషయంలో; ఎక్కుడు= మిన్న; అండ్రు= అంటారు.

తాత్పర్యం: గొర్రె, ఖడ్గమృగం, గండ భేరుండం, మేక అనేవాటి మాంసం ఒకదానికంటె ఒకటి మేలైనదని శ్రాద్ధతత్త్వం తెలిసిన పెద్దలు చెప్పుతూ ఉంటారు.

విశేషం: గండ మృగం - నిఘంటువులో దీనికి ఖడ్గమృగం అని అర్థం చూపారు. పద్యంలో అది ముందే ఉన్నది. కనుక గండమృగం అంటే గండ భేరుండ పక్షిగా గ్రహించాలి. నిజానికి దీనిని పక్షి అంటున్నా అది మృగజాతికి చెందినదే అని శబ్దరత్నాకరం చెప్పుతున్నది. ఈ పద్యంలో మాంస పర్యాయ వాచకాలు నంజుడు, ఎఱచి, పలలము అనే వాటిని కవి ప్రయోగించటం విశేషం.

వ. నక్షత్ర విశేషం బాకర్ణింపుము. 167

ప్రతిపదార్థం: నక్షత్ర విశేషంబు= నక్షత్రాలకు సంబంధించిన ప్రత్యేకతను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: శ్రాద్ధం విషయంలో ఏ నక్షత్రం ప్రత్యేకత ఏమిటో చెప్పుతాను వినుము.

సీ. కార్తెఁ బైతృక మగు కర్మ మొనర్ప ని । శ్శత్రుత, రోహిణిఁ, బుత్ర లబ్ధి,
శశితారకమున నోజః ప్రాప్తి యార్ధ్రఁ గ్రూ । రపు వర్తనము, పునర్వసువు నందుఁ
గృషి ఫలోదయ, మనిమిష గురుతార సు । పుష్టి, యాశ్లేష నుత్కృష్ట వీర
తనుజ లాభము, మఖం దనకులమున పెంపు, । పుబ్బ సౌభాగ్య విస్ఫూర్తి సిద్ధి,

తే. యర్యమునితారఁ బెక్కపత్యములు పుట్టు, । హస్తమునఁ గర్మసఫలత, యవులతార
సుందరాకార యుతులగు సుతులఁ గనుట, । యనిలతార వాణిజ్య వర్ధనము గలుగు. 168

ప్రతిపదార్థం: పైతృకము= పితృదేవతలకు సంబంధించినది; అగు కర్మము= అయిన పని (శ్రాద్ధం); కార్తెన్= కృత్తికా నక్షత్రమున్న రోజున; ఒనర్పన్= చేస్తే; నిశ్శత్రుత= పగవారు లేనిస్థితి (కలుగుతుంది); రోహిణిన్= రోహిణియందు; పుత్రలబ్ధి=

కొడుకులు కలగటం; శశితారకమునన్= మృగశిర నక్షత్రంలో; ఓజస్+ప్రాప్తి= బలం కలగటం; ఆర్ద్రన్= ఆర్ద్రలో; క్రూరము+ వర్తనము= దయలేని నడవడి; పునర్వసువునందున్= పునర్వసు నక్షత్రంలో; కృషి ఫల+ఉదయము= సేద్యపు ఫలం పుట్టటం; అనిమిషగురుతారన్= దేవతలగురువు బృహస్పతి నక్షత్రం-పుష్యమిలో; సుపుష్టి= మంచి దేహబలం; ఆశ్లేషన్= ఆశ్లేష నక్షత్రంలో; ఉత్కృష్ట వీర తనుజలాభము= గొప్ప వీరులైన కొడుకులు కలగటం; మఖన్= మఖ అనే నక్షత్రంలో; తన కులమున పెంపు= తన కులంలో అభివృద్ధి; పుబ్బన్= పూర్వఫల్గుని నక్షత్రంలో; సౌభాగ్య విస్ఫూర్తి సిద్ధి= గొప్ప భాగ్యం పెరగటం అనే సిద్ధి; అర్య మునితారన్= సూర్యుడు దేవతగాగల ఉత్తర ఫల్గునీ నక్షత్రమునందు; పెక్కు= ఎక్కువ మంది; అపత్యములు= సంతానములు; పుట్టున్= కలుగును; హస్తమునన్= హస్త అనే నక్షత్రంలో; కర్మసఫలత= పనులు ఫలించటం; అవులతారన్= తరువాతిదైన చిత్త అనే నక్షత్రంలో; సుందర+ఆకార యుతులు= అందమైన రూపంతో కూడినవారు; అగు సుతులన్= అయిన కొడుకులను; కనుట= పొందటం; అనిలతారన్= వాయువు దేవతగాగల స్వాతియందు; వాణిజ్య వర్ధనము= వర్తకం పెంపొందటం; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: పితృకర్మ కృత్తికలో చేస్తే పగవారులేని స్థితి, రోహిణిలో కొడుకులు కలగటం, మృగశిరలో దేహబలం, ఆర్ద్రలో క్రూరత్వం, పునర్వసులో సేద్యపు ఫలం దక్కటం, పుష్యమిలో మంచి పుష్టి; ఆశ్లేషలో గొప్ప శక్తి కల కుమారులు కలగటం, మఖలో వంశాభివృద్ధి; పుబ్బలో సౌభాగ్యం పెరగటం, ఉత్తరలో సంతానం పెంపొందటం, హస్తలో కార్యసిద్ధి, చిత్తలో సుందర పుత్రులు కలగటం, స్వాతిలో వర్తకం అభివృద్ధి అనే ఫలాల నిస్తుంది.

విశేషం: ఒక్కొక్క నక్షత్రానికి ఒక్కొక్క అధిదేవత ఉంటుంది. ఈ పద్యంలో కొన్నింటిని ఆ అధిదేవతల పేర్లతో వ్యవహరించారు. మృగశిర - చంద్రుడు, పుష్యమి - బృహస్పతి; ఉత్తర - సూర్యుడు; స్వాతి- వాయువు, 'పూర్వఫల్గుని'లో మొదటి అక్షరాలను గ్రహించి 'పూఫ' అనటం అది క్రమంగా పుబ్బగా మారటం గుర్తించదగినది. (ఫల్గుని, ఫాల్గునము, ఫల్గునుండు అనే పదాలలో న కారమే కాని ణ కారం కాదన్నది బాగా గుర్తించాలి).

సీ. **వినుము విశాఖ సత్తనయ బహుత్వ మ । నూరాధ రాజాధికార, మైంద్ర**
మునఁ బ్రభుత్వము పెంపు; మూలఁ బూర్వాషాఢ । నారోగ్యమును నుత్తమాతిశయము,
నుత్తరాషాఢ శోకోదయ రహితత్వ, । మభిజిత్తునందు విద్యాభియుక్తి,
శ్రవణ కాలమునఁ బరమ గతి సిద్ధి, ధ । నిష్ఠ రాజ్యము, జలనిధిపతార

తే. **మొదలుగాఁ దారకంబులు మూఁట నఖిల । కార్యఫలములు, సదజావికములు గోవు,**
లవుల మూఁటను గుప్య వృద్ధ్యశ్వకాయు । వులు శుచి శ్రాద్ధకర్తకుఁ గలుగు నధిప!' **169**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వినుము= శ్రద్ధతో ఆలకించుము; విశాఖన్= విశాఖనక్షత్రంలో; సత్ తనయ బహుత్వము= మంచి కొడుకుల పెక్కువ; అనూరాధన్= అనూరాధయందు; రాజ+అధికారము= ప్రభుత్వం; ఐంద్రమునన్= ఇంద్రుడు దేవతగాగల జ్యేష్ఠయందు; ప్రభుత్వము పెంపు= అధికారం పెరగటం; మూలన్= మూలా నక్షత్రంలోను; పూర్వాషాఢన్= పూర్వాషాఢ అనే నక్షత్రంలోను (వరుసగా); ఆరోగ్యమును= రోగాలు లేనితనమూ; ఉత్తమ+అతిశయము= గొప్ప అభివృద్ధి; ఉత్తరాషాఢన్= ఉత్తరాషాఢ నక్షత్రంలో; శోక+ఉదయ రహితత్వము= దుఃఖం కలగటం అనేది లేకపోవటం; అభిజిత్తునందున్= అభిజిత్తులో; విద్యా+అభియుక్తి= మంచి విద్య అలవడటం; శ్రవణ కాలమునన్= శ్రవణ నక్షత్రం ఉన్న వేళయందు; పరమగతి సిద్ధి= మోక్షం సిద్ధించటం; ధనిష్ఠన్= ధనిష్ఠలో; రాజ్యము; జలనిధి ప తార= జలములకు రాజైన వరుణుడి నక్షత్రం శతభిషం; మొదలుగాన్ =మొదలుకొని; తారకంబులు= నక్షత్రములు; మూఁటన్= మూడింటియందు; అఖిల కార్య ఫలములు= అన్ని పనులు నెరవేరటం; సత్

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అజ+అవికములు= మంచి మేకలు, గొఱ్ఱెలు (అనువాటి లాభం); గోవులు= ఆవులు (లభించటం); అవుల మూఁటను= తరువాతి మూడు నక్షత్రాలలో; కుప్యవృద్ధి+అశ్వక+ఆయువులు= లోహముల సంపద పెరగటం; గుఱ్ఱాలు లభించటం, ఆయువు పెరగటం; శుచిశ్రాద్ధ కర్తకున్= పరిశుద్ధుడైన శ్రాద్ధ కర్తకు; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: రాజా! వినుము. విశాఖయందు మంచి పుత్రులు కలగటం, అనూరాధయందు ప్రభుత్వం, జ్యేష్ఠలో అధికారం పెంపొందటం, మూలయందు ఆరోగ్యం, పూర్వాషాఢయందు గొప్ప అభివృద్ధి, ఉత్తరాషాఢయందు శోకం తొలగిపోవటం, అభిజిత్తునందు విద్యాభివృద్ధి, శ్రవణంలో మోక్షం, ధనిష్ఠయందు రాజ్యం, శతభిషంలో కార్యఫలం, పూర్వాభాద్రలో మేకలు గొఱ్ఱెలు వృద్ధి పొందటం, ఉత్తరాభాద్రలో గోసంపద వృద్ధి పొందటం, రేవతి యందు లోహసమృద్ధి, అశ్వినియందు గుఱ్ఱాల లాభం, భరణియందు ఆయువు అనే ఫలాలు నిర్మలుడైన శ్రాద్ధకర్తకు లభిస్తాయి.'

విశేషం: ఐంద్రము - ఇంద్రదేవతాకము - జ్యేష్ఠ; అభిజిత్తు - నక్షత్రాలు ఇరువదియేడు మాత్రమే. కాని కొందరు ఉత్తరాషాఢ, శ్రవణాలకు మధ్య 'అభిజిత్తు' అనే మరొక నక్షత్రాన్ని కూడా లెక్కిస్తారు. ఆ లెక్కన ఇరవై ఎనిమిది. జలనిధి - సముద్రము. దాని రాజు వరుణుడు. అతడు దేవత అయిన నక్షత్రం శతభిషం. అది మొదలుకొని మూడు అంటే శతభిషం, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర. తరువాతి మూడు తారలు రేవతి, అశ్విని, భరణి.

'నక్షత్రేష్టి' అని ఒక మంత్రభాగం ఉన్నది. అందులో నక్షత్రాల వరుస కృత్తికతో ప్రారంభమైనది. ప్రస్తుతం అశ్వినితో మొదలవుతున్న వ్యవహారం ఉన్నది. వైదిక సంప్రదాయా న్ననుసరించి ఈ సందర్భంలో కృత్తికతో ప్రారంభించినట్లు భావించాలి.

'కుప్యం' అంటే వెండి, బంగారు కాక తక్కిన లోహాలు. శుచిశ్రాద్ధకర్త - అనటంవలన శ్రాద్ధానికీ, పవిత్రతకూ గట్టి సంబంధం ఉన్నదని తెలియవస్తున్నది.

వ. అనిన నప్పుడమిఱేఁ డప్పురుషవరునిం 'బితృ పూజనంబులకుఁ బాత్రంబు లెట్టివి గావలయు?' నని యడిగిన నయ్యమరనదీనందనుం డిట్లనియె. 170

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+పుడమిఱేఁడు= ఆ రాజు; ఆ+పురుషవరునిన్= పురుషులలో శ్రేష్ఠుడైన ఆ భీష్ముడిని; పితృపూజనంబులకున్= పితృదేవతల ఆరాధనలకు, పాత్రంబులు= యోగ్యతకలవి; ఎట్టి+అవి= ఏ విధమైనవి; కావలయును= కావాలి; అని; అడిగినన్= అడుగగా; ఆ+అమరనదీ నందనుండు= ఆ గంగకొడుకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఇట్లు చెప్పగా ధర్మరాజు భీష్ముడితో 'పితృదేవతల ఆరాధనకు యోగ్యులు ఎవరు?' అని అడిగితే భీష్ము డిట్లా చెప్పాడు.

క. దైవిక కృత్యంబులకును । భూవర! భూసురుల సూక్ష్మముగ శోధింపం
గా వలదు గాని పితృ పూ । జావిధికిఁ బరీక్ష వలయు సమ్యగ్భంగిన్. 171

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; దైవిక కృత్యంబులకును= దైవ సంబంధమైన కార్యాలకు; భూసురులన్= బ్రాహ్మణులను; సూక్ష్మముగన్=నిశితంగా; శోధింపంగాన్= పరీక్షించటం; వలదు= వద్దు; కాని; పితృ పూజా విధికిన్= శ్రాద్ధపు పనికి; సమ్యక్+భంగిన్= చక్కని తీరున; పరీక్ష= గుణ దోషాలను పట్టిచూడటం; వలయున్= కావాలి.

తాత్పర్యం: రాజా! దేవతాసంబంధమైన పనులలో బ్రాహ్మణులను అణువణువునా పరీక్షించ నక్కరలేదు. కాని, శ్రాద్ధాలకు మాత్రం చాలా గట్టిగా పరీక్ష చేయాలి.

విశేషం: ఇచట భూసురులంటే ఆయా పనులలో మంత్ర తంత్రాలను ప్రయోగించేవారని భావం. బ్రాహ్మణుడిలోని ఏ చిన్న లోపమైనా శ్రాద్ధాన్ని నాశనం చేస్తుందని ధ్వని.

వ. కావున నీ వడిగి మేలు చేసి తాకర్ణింపుము. 172

ప్రతిపదార్థం: కావునన్= కనుక; నీవు; అడిగి= ప్రశ్నించి; మేలు చేసితి= మంచిపని చేశావు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: కనుక నీవు ఈ విషయం అడిగి మంచి చేశావు. వినుము.

తే. కులవయో రూపశీల విద్యల నుదాత్తు । లనఁగఁ దగువారు పంక్తి పావనులు తద్గు

ణమ్ము లారయ లేని జనములు పంక్తి । దూషకులు పైతృకమునకు దోషదూర! 173

ప్రతిపదార్థం: దోషదూర!= తప్పుడు గుణాలకు దూరమైన ఓ ధర్మరాజా!; పైతృకమునకున్= శ్రాద్ధానికి; కుల వయస్ రూప శీల విద్యలన్= కులం; వయస్సు, రూపం, మంచి స్వభావం; గొప్పచదువు అనువాటిచేత; ఉదాత్తులు= గొప్పవారు; అనఁ గన్+తగువారు= అనటానికి యోగ్యత కలవారు; పంక్తి పావనులు= భోజనంచేసేవారి వరుసను పవిత్రం చేయగలవారు; ఆరయన్= పరిశీలించి చూడగా; తత్+గుణమ్ములు= ఆ గుణాలు; లేనిజనములు= లేని మనుష్యులు; పంక్తి దూషకులు= బంతిని (వరుసను) చెడగొట్టువారు.

తాత్పర్యం: మంచికులం, ప్రాయం, అందచందాలు, స్వభావం, విద్య అనే వాటిచేత ఉన్నతులనదగినవారు శ్రాద్ధక్రియలో పంక్తిని పవిత్రం చేసేవారు. ఈ గుణాలు లేనివారు పంక్తిని పాడుచేసేవారు.

విశేషం: 'దోషదూర' అనే సంబోధనలో ఎన్నడూ దోషాలను దగ్గరకు రానివ్వకుము అన్న సూచన తోస్తున్నది. రూపం ఉన్నచోట మంచిగుణాలు ఉంటాయని ఒక భావన. "యత్రాకృతి స్తత్ర గుణాః" శీలం' అంటే అభ్యాసాదులవలన రావటం, పోవటం లేని స్వభావం. ఇచట 'సచ్ఛీలం' అనే అర్థాన్నే గ్రహించాలి. 'ఆరయన్' అనే పదం చేత ఆ గుణాలు లేనితనాన్ని జాగ్రత్తగా పరిశీలించి తెలిసికొనాలని భావం.

వ. మఱియును బంక్తి దూషకులం జెప్పెద నాకర్ణింపుము. 174

ప్రతిపదార్థం: మఱియును= ఇంకా; పంక్తిదూషకులన్= వరుసను పాడుచేసేవారిని; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఇంకా పంక్తిని పాడుచేసేవారిని తెలుపుతాను వినుము.

విశేషం: కలిసి మెలగనివారు - పంక్తిదూషకులు.

సీ. జూదరి గరదుండు వేదంబు సదువని । వాఁడు వడ్డికి నిచ్చువాఁడు గాయ

కుండు గ్రామము పనిఁ గుడుచునాతఁడు గృహ । దాహి కుష్ఠము గల తనువు నాతఁ

డఱుఁ దెవుల్ గొన్నాతఁ డఖిల వస్తువులును । నమ్మెడు నతఁడు సోమమ్ము విక్ర
యించిన యతఁ డబ్ధి సంచార లాభోప । జీవకుం డుర్వీశ సేవకుండు

తే. భార్యయును దాను బుత్రులఁ బంచికొన్న । వాఁడు పసులఁ బెక్కేలెడువాఁడు కపట
కృత్యముల ద్రుచ్చిమిని శిల్పకృతుల బ్రదుకు । వారు పంక్తిదూషకు లండ్రు పౌరవేంద్ర!' 175

ప్రతిపదార్థం: పౌరవేంద్ర!= పురువంశరాజా!; జూదరి= జూదగాడు; గరదుండు= విషం పెట్టేవాడు; వేదంబు+చదువనివాఁడు= వేదాధ్యయనం చేయనివాడు; వడ్డికిన్= ధనాన్ని వడ్డికి; ఇచ్చువాఁడు= ఇచ్చేవాడు; గాయకుండు= పాటలు పాడి పొట్టగడుపుకొనేవాడు; గ్రామము పనిన్= ఊరి పనితో; కుడుచు+ఆతఁడు= జీవనం చేసేవాడు; గృహదాహి= ఇళ్ళకు నిప్పు పెట్టేవాడు; కుష్ఠముగల తనువు+ఆతఁడు= కుష్ఠ రోగంగల శరీరం ఉన్నవాడు; అఱు+తెవుల్ కొన్న+ఆతఁడు= క్షయరోగం కలవాడు; అఖిల వస్తువులును= అన్ని దినుసులను; అమ్మెడు+అతఁడు= అమ్మేవాడు; సోమమ్ము= యజ్ఞంలో ఉపయోగించే సోమరసాన్ని; విక్రయించిన+అతఁడు= అమ్మినవాడు; అబ్ధి సంచార లాభ+ఉపజీవకుండు= సముద్ర ప్రయాణాలతో కలిగిన లాభంతో బ్రతికేవాడు; ఉర్వీ+ఈశసేవకుండు= రాజు కొలువులో ఉన్నవాడు; భార్యయును= పెండ్లామును; తాను; పుత్రులన్= బిడ్డలను; పంచికొన్నవాఁడు= పంచుకొన్నవాడు; పసులన్= పశువులను; పెక్కు= ఎక్కువగా; ఏలెడువాఁడు= పాలించేవాఁడు; కపట కృత్యములన్= వంచన పనులతో; ద్రుచ్చిమిని= దొంగతనంతోను; శిల్పకృతులన్= నేర్పుగల పనులతోను; బ్రదుకువారు= జీవించేవారు; పంక్తిదూషకులు= పంక్తిని చెరచేవారు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: రాజా! జూదగాడు, విషం పెట్టేవాడు, వేదం చదవనివాడు, వడ్డీవ్యాపారి, గాయకుడు, కరణం, ఇళ్ళు కాల్చేవాడు, కుష్ఠరోగి, క్షయరోగి, అన్ని వస్తువులను అమ్మేవాడు, సోమం అమ్మేవాడు, సముద్రవ్యాపారి, రాజోద్యోగి, భార్యా తనూ కన్నకొడుకులను పంచుకొన్నవాడు, వ్యాపారంకొరకు పశువులను పెద్ద సంఖ్యలో పెంచేవాడు, మోసం పనులు, దొంగతనం, శిల్పపు పనులు - వీటితో బ్రదుకు సాగించేవారూ పంక్తి దూషకులు అంటారు.'

విశేషం: యజనం, యాజనం, అధ్యయనం, అధ్యాపనం, దానం, ప్రతిగ్రహం అని బ్రాహ్మణుడికి వేదం నిర్ణయించిన కర్మలు ఆరు. వీటికి విరుద్ధమైనవన్నీ అతడికి దుష్టగుణాలుగా లెక్క. గాయకుడు, శిల్పి ఎట్లా దుష్టులు? అనే అనుమానం కలుగవచ్చును. కేవలం ఆత్మానందంకొరకు, ఇతరుల ఆనందంకొరకు మాత్రమే అయితే అవి దోషాలు కావు. అవి బ్రతుకు తెరువులయితే వాటివలన విహిత కర్మలు చెడతాయి కనుక అవి దోషాలు. భార్యా, తనూ, కొడుకులను పంచుకొనటం అంటే నిత్యమైన దాంపత్య ధర్మాన్ని చెరచటం. అది దోషం.

వ. అని చెప్పి వెండియు. 176

తాత్పర్యం: ఇట్లా చెప్పి ఇంకా అంటున్నాడు.

క. 'తలఁ జీరసుట్టియును జె । ప్పులు దొడిగియుఁ జేసినట్టి భోజనము ఫలం
బలఘుచరిత! పద్మజుఁ డసు । రల భాగం బని విధించెఁ బ్రకటఫణితులన్. 177

ప్రతిపదార్థం: అలఘు చరిత!= గొప్పదైన ప్రవర్తన కలవాడా!; పద్మజుఁడు= బ్రహ్మ; తలన్= నెత్తికి; చీర= వస్త్రము; చుట్టియును= చుట్టుకొని; చెప్పులు= పాదరక్షలు; తొడిగియును= ధరించీ; చేసిన+అట్టి భోజనము ఫలంబు= చేసిన భోజనం ఫలం; అసురల భాగంబు= రాక్షసులకు చెందేది; అని; ప్రకట ఫణితులన్= స్పష్టమైన తీరులతో; విధించెన్= ఏర్పాటు చేశాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దొడ్డ నడవడికల రాజా! తలకు గుడ్డచుట్టి చెప్పులు వేసికొని చేసిన భోజనం ఫలం రాక్షసులకు చెందుతుందని బ్రహ్మ స్పష్టమైన పద్ధతులతో శాసించాడు.

విశేషం: ప్రధానంగా సందర్భాన్నిబట్టి పితృ కర్మలయందు అని సంభావించాలి. ఇతర సమయాలలో కూడా ఇది దోషమే.

తే. **పలుదెఱంగుల వంటకంబులఁ బ్రమాద । జాతమై యశుచిత్వంబు సంభవించి**
నప్పు డసురులు గొంద్రు క్రియా ఫలంబుఁ; । దిలలు పైఁ జల్ల నశుచిత దొలఁగు నండ్రు. 178

ప్రతిపదార్థం: పలు+తెఱంగులన్= పెక్కు విధాలుగా; వంటకంబులన్= శ్రాద్ధంకొరకు ఉంచిన భోజన పదార్థాలమీద; ప్రమాద జాతము+ఐ= పొరపాటువలన పుట్టినదై; అశుచిత్వంబు= మైల; సంభవించిన+అప్పుడు= కలిగినప్పుడు; క్రియా ఫలంబున్= అట్టి వంటకాలతో చేసిన శ్రాద్ధ కర్మల ఫలితాన్ని; అసురులు= రాక్షసులు; కొంద్రు= గ్రహిస్తారు; పైన్= మీద; తిలలు= నువ్వులు; చల్లన్= చల్లితే; అశుచిత= అశుభ్రత; తొలఁగును= పోతుంది; అండ్రు= అంటారు.

తాత్పర్యం: వంటకాలమీద ఎన్నో విధాలుగా మైల సోకవచ్చు. అట్టి వాటితో పితృకర్మంచేస్తే ఆ ఫలం రాక్షసులు దక్కించుకొంటారు. ఆ వంటకాలమీద నువ్వులు చల్లితే ఆ అశుచిత్వం పోతుం దంటారు.

విశేషం: మైలపడ్డ వంటకాలతో శ్రాద్ధం చేయటం వ్యర్థమే కాదు అనర్థదాయకం కూడా అవుతుందని భావం.

క. **శాంతుఁడు సువ్రతశీలుఁడు । దాంతుం డధ్యాపకుండు దయగలవాఁ డ**
త్యంత ప్రబోధ సంప । ద్వంతుఁడు పావనులు భూపవర! పంక్తులకున్. 179

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; శాంతుఁడు= మనస్సును నిలువరించినవాడు; సువ్రతశీలుఁడు= చక్కని వ్రతములు చేసే స్వభావం కలవాడు; దాంతుండు= ఇంద్రియాలపై అదుపు గలవాడు; అధ్యాపకుండు= వేదం చదివించేవాడు; దయగలవాఁడు= ప్రాణులయందు జాలిగలవాడు; అత్యంత ప్రబోధ, సంపద్వంతుఁడు= మిక్కిలి ఎక్కువ అయిన జ్ఞానమనే సంపదగలవాడు; పంక్తులకున్= శ్రాద్ధ భోజనపు వరుసలకు; పావనులు= పవిత్రులు.

తాత్పర్యం: రాజా! శాంతుడు, వ్రతశీలుడు, దాంతుడు, వేదం బోధించేవాడు, ప్రాణులయందు జాలిగలవాడు, పండిన జ్ఞానసంపద గలవాడూ శ్రాద్ధభోజన పంక్తులలో పవిత్రులు.

విశేషం: అంతరింద్రియ నిగ్రహం శాంతి, బహిరింద్రియ నిగ్రహం దాంతి; ప్రబోధం అంటే జ్ఞానం. మోక్ష విషయకమైన బుద్ధి.

క. **వ్యాకరణ ధర్మశాస్త్ర వి । వేకములుఁ బురాణజాత వేదిత్వము బ్ర**
హ్మైకత్వ బోధనము నధి । పా! కలిగినవారు పంక్తిపావనులు గడున్. 180

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; వ్యాకరణ ధర్మశాస్త్ర వివేకములు= శబ్దశాస్త్రం, ధర్మశాస్త్రం అనే వాటిలో ప్రజ్ఞ; పురాణజాత వేదిత్వము= పురాణాల సముదాయం తత్త్వపూర్వకంగా తెలిసి ఉండటమూ; బ్రహ్మ+ఏకత్వ బోధనము= బ్రహ్మం ఒకటే అనే జ్ఞానమూ; కలిగినవారు= ఉన్నవారు; కడున్= ఎక్కువగా; పంక్తి పావనులు= పంక్తిని పవిత్రం చేసేవారు.

తాత్పర్యం: వ్యాకరణజ్ఞానమూ, ధర్మశాస్త్రజ్ఞానమూ, పురాణజ్ఞానమూ, పరమాత్మజ్ఞానమూ కలవారు మిక్కిలిగా పంక్తి పావనులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: వ్యాకరణం శబ్ద బ్రహ్మమును గురించి చెప్పుతుంది. ధర్మశాస్త్రం చేయదగినవాటినీ, చేయరానివాటినీ తెలపటం ద్వారా ఉత్తమత్వాన్ని కలిగిస్తుంది. పురాణాలు వేదార్థాలను చక్కగా వివరిస్తాయి. ఇవి క్రమంగా ఒక దానిద్వారా మరొకటి పుష్టిని పొంది బ్రహ్మజ్ఞానానికి సహకరిస్తాయి. బ్రహ్మజ్ఞానం తుదిమెట్టు. తక్కినవి వరుసగా దానికి పూర్వంలో ఉండే సోపానాలు.

తే. **మేలి గుణములు గనియు నమిత్రజనము। శ్రాద్ధ పాత్రంబుఁ జేయంగఁ జన దమిత్ర**
దత్తమైనది భస్మహుతంబుఁ జౌట। నిడిన విత్తును బోలెనై చెడు నృపాల! 181

ప్రతిపదార్థం: నృపాల!= రాజా!; మేలిగుణములు= ఉత్తమ గుణాలు; కనియును= చూచికూడా; అమిత్రజనమున్= మైత్రిలేని జనాన్ని; శ్రాద్ధ పాత్రంబున్= పితృకర్మలో తగినదిగా; చేయంగన్+చనదు= చేయరాదు; అమిత్రదత్తము= పగవారికి ఇచ్చింది; ఐన+అది= అయిన వస్తువు; భస్మహుతంబున్= బూడిదలో వేసిన హోమ ద్రవ్యమున్నూ; చౌటన్= చవిటినేలలో; ఇడిన విత్తును పోలెన్= పెట్టిన విత్తనంవలె; ఐ= అయి; చెడున్= చెడిపోతుంది.

తాత్పర్యం: రాజా! మంచిగుణాలు ఉన్నా పగవారిని శ్రాద్ధంలో పాత్రం చేయరాదు. పగవారికి ఇచ్చినది బూడిదలో వేసిన హోమద్రవ్యంవలె, చవిటినేలలో విత్తిన బీజంవలె చెడిపోతుంది.

విశేషం: అలం: ఉపమ. "ఏకక్రియం భవేన్మిత్రమ్" - ఒకే విధమైన పనులతో కలసిమెలసి ఉండేవారిని మిత్రము అంటారు. పనులలో విరుద్ధంగా నడచేవారు అమిత్రులు. వారు శ్రాద్ధంలో పంక్తికి పనికిరారు.

క. **మును ముట్ట నెఱిఁగి శ్రాద్ధం। బునకుం గైకొనుట మేలు భూసురునిం గై**
కొని యరసి కాఁ డనిన నా। తని యుమ్మలికంబు సెఱుచు ధార్మికు నైనన్. 182

ప్రతిపదార్థం: భూసురునిన్= బ్రాహ్మణుడిని; మును= ముందుగానే; ముట్టన్= పూర్తిగా; ఎఱిఁగి= తెలిసికొని; శ్రాద్ధంబునకున్= పితృయజ్ఞానికి; కైకొనుట= గ్రహించటం; మేలు= మంచిది; కైకొని= గ్రహించి; అరసి= తరువాత పరీక్షించి; కాఁడు= పనికిరాడు; అనినన్= అంటే; ఆతని+ఉమ్మలికంబు= ఆ బ్రాహ్మణుడి గుండెదిగులు; ధార్మికుని+ఐనన్= ధర్మం తప్పక నడచుకొనే వాడినైనా; చెఱుచున్= చెడగొట్టుతుంది.

తాత్పర్యం: యోగ్యతను ముందే కడదాకా పరీక్షించి బ్రాహ్మణుడిని నియోగించటం మంచిది. అట్లాకాక నియోగించిన తరువాత పరీక్షించి పనికిరాడంటే అతడి వేదన ఎంత ధర్మాత్ముడినైనా పాడుచేస్తుంది.

విశేషం: ఇది చాలా సుకుమారమైన విషయం. పిలిచి అవమానిస్తే ఆ దోషం తనకే త్రిప్పికొడుతుందని గుర్తించి జాగ్రత్త పడాలి.

క. **ఈ తెఱఁగు లెల్ల నెఱిఁగి సు। నీతంబుగ శ్రాద్ధ మధిక నియతి నడపు ని**
ర్ధూత దురితుండు నడచుఁ బ్రి। యాతిశయం బెసఁగ దేవయానమున నృపా!' 183

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; ఈ తెఱఁగులు= ఈ పద్ధతులు; ఎల్లన్= అన్నింటినీ; ఎఱిఁగి= తెలిసికొని; శ్రాద్ధము= పితృయజ్ఞాన్ని; అధిక నియతిన్= ఎక్కువ నిష్ఠతో; సునీతంబుగన్= చక్కగా చేసిన దానినిగా; నడపు నిర్ధూత దురితుండు= నడపునట్టి పూర్తిగా తొలగిపోయిన పాపాలు కలవాడు; ప్రియ+అతిశయంబు= సంతోషం యొక్క ఎక్కువతనం; ఎసఁగన్= వృద్ధిపొందగా; దేవయానమునన్= దేవతల దారిలో; నడచున్= ప్రయాణిస్తాడు.

తాత్పర్యం: రాజా! ఈ పద్ధతులన్నీ చక్కగా తెలిసికొని గొప్ప నిష్ఠతో శ్రాద్ధం చక్కగా ఆచరించే పాపరహితుడు సంతోషం ఉప్పొంగుతుండగా దేవమార్గంలో ప్రయాణిస్తాడు.'

విశేషం: సునీతము. అధిక నియత అనే పదాలు శ్రద్ధ సడలనీయని లక్షణానికి వ్యంజకాలు.

వ. అని చెప్పి శాంతనవుండు కౌంతేయాగ్రజునితో మఱియు నిట్లను 'బ్రహ్మమానస పుత్త్రుండగు నత్రిమునీంద్రు వంశంబునకుం దొడవగు దత్తాత్రేయ నందనుండు నిమినామధేయుండగు సంయమి కొడుకు శ్రీమంతుండను పేరివాఁడు మృతుం డగుటయు. 184

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; చెప్పి= తెలియజేసి; శాంతనవుండు=శంతనుడి కొడుకు భీష్ముడు; కౌంతేయ+అగ్రజునితోన్= కుంతి కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజుతో; మఱియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పుతున్నాడు; బ్రహ్మ మానస పుత్త్రుండు= బ్రహ్మమనస్సునుండి పుట్టిన కొడుకు; అగు అత్రి ముని+ఇంద్రు వంశంబునకున్= అయిన అత్రి మహర్షి వంశానికి; తొడవు+అగు= ఆభరణం అగు; దత్తాత్రేయ నందనుండు= అయిన దత్తాత్రేయుడి కొడుకు, నిమినామధేయుండు= నిమి అనే పేరుగలవాడు; అగు సంయమి కొడుకు= అయిన మహర్షి పుత్రుడు; శ్రీమంతుండు+అను పేరివాఁడు= శ్రీమంతుడనే పేరుగలవాడు; మృతుండు= చనిపోయినవాడు; అగుటయున్= కాగా.

తాత్పర్యం: ఈ విధంగా చెప్పి భీష్ముడు ధర్మరాజుతో ఇంకా ఇట్లా అన్నాడు. 'బ్రహ్మదేవుడి మానసపుత్రుడు అత్రిమహర్షి వంశానికి అలంకారం అనదగిన దత్తాత్రేయుడి కుమారుడు నిమి. అతడి కొడుకు శ్రీమంతు డనేవాడు చనిపోయాడు.

విశేషం: మానసపుత్రుడు - సంకల్పమాత్రంచేత పుట్టినవాడు. సనక సనందనాదులు కూడా ఇట్టివారే.

ఇతిహాసాలు ధర్మవిషయాలను సూటిగా చెప్పుతాయి. అవి హృదయంలో చక్కగా నాటుకొనటానికి కొన్ని కథలమీద సమన్వయించి చూపుతాయి. ఇది అట్టి కథలలో ఒకటి.

క. నిమి యక్కుమారునకు శ్రా । ద్ధము సేయుచు నుండి భక్తిఁ దలఁచినఁ గృప న
త్రిమునీంద్రుఁడు వచ్చి క్రియా । సమీక్షణము సేసె మది నెసఁగు నర్మిలితోన్. 185

ప్రతిపదార్థం: నిమి= నిమిమహర్షి; ఆ+కుమారునకున్= ఆ చనిపోయిన కొడుకునకు; శ్రాద్ధము= పితృయజ్ఞం; చేయుచున్= చేస్తూ; ఉండి; భక్తిన్= భక్తితో; తలఁచినన్= భావించగా; కృపన్= దయతో; అత్రి ముని+ఇంద్రుఁడు= అత్రి మహర్షి; వచ్చి= ఏతెంచి; మదిన్= హృదయంలో; ఎసఁగు= వృద్ధిపొందే; అర్మిలితోన్= ప్రేమతో; క్రియా సమీక్షణము= కర్మయొక్క బాగోగుల పరీక్షను; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: నిమి ఆ కొడుకుకు శ్రాద్ధం చేస్తూ భక్తితో తలచినంతనే అత్రి మహర్షి దయతో వచ్చి పెరుగుతున్న ప్రేమతో కార్యకలాపాన్ని చక్కగా పరికించాడు.

వ. అట్లు పావక క్రియా కలాపం బనుసంధించి యా సంయమివరుండు. 186

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; పావక క్రియా కలాపంబు= పవిత్రం చేసే పనుల సముదాయాన్ని; అనుసంధించి= చక్కగా సమన్వయించి; ఆ సంయమి వరుండు= ఋషిశ్రేష్ఠుడైన ఆ అత్రి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ పవిత్ర క్రియా సముదాయాన్నంతా చక్కగా భావించి యా మహర్షి శ్రేష్ఠుడు.

అత్రిమహాముని నిమి కెఱింగించిన శ్రాద్ధక్రియా విశేషము (సం.13-91-3)

ఆ. 'పరిగృహీతు లైన బ్రాహ్మణుల్ పంక్తి పా। వన వరిష్ఠు లగుట, వారి కిడిన
దర్భ విష్టరములు దక్షిణావర్తంబు। లగుటఁ గ్రియలు దిలసమగ్ర లగుట. 187

ప్రతిపదార్థం: పరిగృహీతులు= శ్రాద్ధమునకు ఎన్నుకొని తెచ్చినవారు; ఐన బ్రాహ్మణుల్= అయిన విప్రులు; పంక్తి పావన వరిష్ఠులు= వరుసను పవిత్రం చేసేవారిలో మిక్కిలి గొప్పవారు; అగుటన్= కావటాన్నీ, వారికిన్= వారికై; ఇడిన= పెట్టిన; దర్భ విష్టరములు= దర్భల ఆసనాలు; దక్షిణ+ఆవర్తంబులు= కుడివైపు మలగినవి; అగుటన్= కావటాన్ని; క్రియలు= ఆయా కర్మ విశేషాలు; తిల సమగ్రలు= నువ్వులు నిండుగా కలవి; అగుటన్= కావటాన్నీ.

తాత్పర్యం: ఎన్నుకొని తెచ్చిన బ్రాహ్మణులు పంక్తి పావనులలో మిక్కిలి శ్రేష్ఠులు కావటం, వారికై పెట్టిన దర్భ ఆసనాలు కుడివైపు మలగినవి కావటం, క్రియలన్నీ నువ్వులతో నిండుదనం కలవి కావటమూ (190వ పద్యంలోని 'ఉగ్గడించి సంభావించెన్' అనే దానితో అన్వయం).

క. అమలినతర దర్భన్యా। సము లెందును దక్షిణంబు సాఁగ నిడిన య
గ్రములు గలిగి యుండుట మం। త్రము లయ్యె విధుల కంచితముగ నడచుటన్. 188

ప్రతిపదార్థం: అమలిన తర దర్భ న్యాసములు= మిక్కిలి స్వచ్ఛములైన దర్భలు ఉంచుటలు; ఎందును= అన్ని చోట్ల; దక్షిణంబు= కుడివైపుగా; సాఁగన్= వ్యాపించేటట్లు; ఇడిన+అగ్రములు= ఉంచిన చివళ్ళు; కలిగి+ఉండుట= కలిగి ఉండటాన్ని; మంత్రములు= వేదమంత్రాలు; ఆ+ఆ విధులకున్= ఆయా శాస్త్ర విధానములకు; అంచితముగన్= చక్కగా కుదిరేటట్లుగా; నడచుటన్= వర్తించటాన్ని.

తాత్పర్యం: స్వచ్ఛమైన దర్భలు ఉంచిన పద్ధతి కుడివైపు సాగిన చివళ్ళు కలిగి ఉండటాన్నీ, మంత్రాలు ఆయా పనులకు తగినట్లుగా నడవటాన్నీ.

ఆ. మునగ యుల్లి యడవి మునగ దుర్మాంసము। లానుగమ్ము మలినమైన యుప్పు
కఱియ జీలకఱ్ఱ కఱివేము గురుజ యిం। గువ ప్రవర్జనీయ కోటి యగుట. 189

ప్రతిపదార్థం: మునగ= మునగకూర; ఉల్లి= ఎర్రగడ్డలు, తెల్ల గడ్డలు; అడవి మునగ= అడవి మునగ అనే శాకము; దుర్మాంసములు= చెడిన మాంసములు; ఆనుగమ్ము= సొరకాయ; మలినము+ఐన ఉప్పు= చెడిన ఉప్పు; కఱియ జీలకఱ్ఱ= నల్లని జీలకర్ర, కఱివేము= కరివేపాకు; గురుజ= ఉత్తుండి అనే ఆకుకూర; ఇంగువ= ఇంగువ అనేవి; ప్రవర్జనీయ కోటి= బొత్తుగా విడువదగిన వస్తువుల సముదాయం; అగుటన్= కావటాన్ని.

తాత్పర్యం: ఆ శ్రాద్ధంలో మునగ, ఉల్లి, అడవి మునగ, చెడుమాంసాలు, సొరకాయ, మలినమైన ఉప్పు, నల్లజీలకర్ర, కరివేపాకు, గురజాకు, ఇంగువ అనే వస్తువులు పూర్తిగా విడచి వేసిన సంగతిని (సంభావించాడు).

క. శునకంబు రజస్వల యగు । వనిత పతితుఁ డంత్యజాతి వాఁ డా క్రియ ప
ట్టున కెయిది తవులఁ జేరక । చనఁ జేయుట నుగ్గడించి సంభావించెన్. 190

ప్రతిపదార్థం: శునకంబు= కుక్క; రజస్వల+అగు వనిత= ముట్టైన స్త్రీ; పతితుఁడు= చెడునడవడి కలవాడు; అంత్యజాతివాఁడు= శూద్రుడు; ఆ క్రియ పట్టునకున్= ఆ శ్రాద్ధకర్మ జరుగుతున్న చోటికి; ఎయిది= వెంటబడి; తవులన్+చేరక= సమీపించక; చనన్+చేయుటన్= పోయేటట్లు చేయటాన్ని; ఉగ్గడించి= వివరించి చెప్పి; సంభావించెన్= కొనియాడాడు.

తాత్పర్యం: కుక్క, ముట్టుత, భ్రష్టుడు, శూద్రుడు, ఆ శ్రాద్ధం జరిగే తావులో తిరుగకుండా చూచుకొనటాన్ని వివరించి చెప్పి కొనియాడాడు.

విశేషం: ఇవన్నీ అక్కడ ఉన్నవి ఉండవలసిన తీరులో ఉండటం, ఉండరానివి ఉండకపోవటం అనే విషయాలను మనం ఉపదేశాలుగా గ్రహించాలి. (187-190)

క. కావున శ్రాద్ధక్రియలకు । భూ వల్లభ! యట్టి భంగి పూజ్యత నిచ్చుం
దా వినిపించెం బితృదే । వావలి నత్రి నిజవంశుఁ డగు నిమికిఁ దగన్. 191

ప్రతిపదార్థం: కావునన్= కనుక; భూవల్లభ!= రాజా!; శ్రాద్ధ క్రియలకున్= పితృదేవతల అర్చన పనులకు; అట్టి భంగి= ఆ పద్ధతి; పూజ్యతన్= మన్ననను; ఇచ్చున్= ఇస్తుంది; అత్రి= అత్రి మహర్షి; తాన్= తాను; నిజవంశుఁడు= తనవంశంలోనివాడు; అగు నిమికిన్= అయిన నిమికి; తగన్= చక్కగా; పితృదేవ+ఆవలిన్= పితృదేవతల వరుసను గూర్చి; వినిపించెన్= వినిపించాడు.

తాత్పర్యం: కాబట్టి భూపాలా! శ్రాద్ధక్రియలకు ఇట్టి విధానం ఎంతో మన్నన నిస్తుంది. అత్రి మహర్షి తనవంశం వాడైన నిమికి పితృదేవత లెవరెవరో చక్కగా తెలియజేశాడు.

వ. అత్తెఱం గెఱింగించెద నత్రి నిమితో నిట్లను శ్రాద్ధంబున నర్యమవరుణ సోమాగ్నులకు భాగంబులు బ్రహ్మ కల్పించె; విశ్వలగు దేవతలు పితృదేవతలతోఁ గూడం దత్క్రియోప యోగ్యతం దోఁతురు వారలకును భాగకల్పనం బొనరించె; దేవతలయందుఁ గొందఱ నూష్మపులయిన మహాభాగులం బితృత్వ నిర్దేశంబున నేర్పరించె; నవ్విరించి వివరించిన నామంబులు సెప్పెద వినుము; బలుండు ధృతి విపాప్ముండు పుణ్యకృత్తు పావనుండు పార్ష్ణిక్షేముండు సమూహుండు దివ్యసానువు వివస్వంతుండు వీర్యవంతుండు హ్రీమంతుండు కీర్తిమంతుండు, కృతుండు విద్యుద్వర్చసుండు సోమవర్చసుండు, సూర్యశ్రీ సోమపుండు సూర్యసావిత్రుండు దత్తాత్ముండు పుండరీయకుం డుష్ణినాభుండు నభోదుండు విశ్వాయువు దీప్తి చమూహరుండు సురేశుండు వ్యోమారి శంకరుండు భవుం డీశుండు కర్తకృతి దక్షుండు భువనుండు దివ్యకర్మకృత్తు గణితుండు పంచవీర్యుం డాదిత్యుండు రశ్మిమంతుండు సప్తకృత్తు సోమపూర్వుండు విశ్వకృత్తు కవి యనుగోప్త సుగోప్త నప్త యీశ్వరుండు జితాత్ముండు మునివీర్యుండు దీప్తరోముండు భయంకరుం డను కర్ముండు ప్రతీతుండు ప్రదాత యంశుమంతుండు శైలాభుండు పరమక్రోధి ధీరోష్ణి భూపతి స్రజుండు వజ్రి వరి వీరలు భాగార్హులని చెప్పి వెండియు. 192

ప్రతిపదార్థం: ఆ+తెఱంగు = ఆ పద్ధతి; ఎఱింగించెదన్= వివరిస్తాను; అత్రి= అత్రి మహర్షి; నిమితోన్= నిమితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; బ్రహ్మ= సృష్టికర్త; శ్రాద్ధంబునన్= శ్రాద్ధంలో; అర్యమ వరుణ సోమ+అగ్నులకున్= సూర్యుడు, వరుణుడు, చంద్రుడు, అగ్ని అనేవారికి; భాగంబులు= పాళ్ళు; కల్పించెన్= ఏర్పాటు చేశాడు; విశ్వలు= విశ్వలనే పేరుగల (విశ్వ శబ్దానికి సర్వులు అనే అర్థం కూడా ఉన్నది); అగు దేవతలు= దివిజులు; పితృదేవతలతోన్= పితృదేవతలతో; కూడన్= కలిసి; తత్+క్రియా+ఉపయోగ్యతన్= ఆ శ్రాద్ధపుపనిలో ఉపయోగింపబడటంతో; తోఁతురు= కానవస్తారు; వారలకును= ఆ విశ్వదేవులనే వారికి కూడా; భాగకల్పనంబు= పాళ్ళ ఏర్పాటు; ఒనరించెన్= చేశాడు; దేవతలయందున్= దేవతలతోను, ఊష్మపులు= వేడిని పీల్చేవారు; అయిన మహాభాగులన్= అయిన గొప్పవారిని; కొందఱన్= కొందరిని; పితృత్వ నిర్దేశంబునన్= పితృదేవతలనే పేరుతో; ఏర్పరించెన్= ఏర్పాటు చేశాడు; ఆ+విరించి= ఆ బ్రహ్మ; వివరించిన నామంబులు= తెలిపిన పేర్లు; చెప్పెదన్= చెప్పుతాను; వినుము; బలుడు, ధృతి, విపాప్ముడు, పుణ్యకృత్తు, పావనుడు, పార్ష్ణిక్షేముడు, సమూహుడు, దివ్యసానువు, వివస్వంతుడు, వీర్యవంతుడు, హ్రీమంతుడు, కీర్తిమంతుడు, కృతుడు, విద్యుద్వర్చసుడు, సోమవర్చసుడు, సూర్యశ్రీ, సోమపుడు, సూర్యసావిత్రుడు, దత్తాత్ముడు, పుండరీయకుడు, ఉష్ణినాభుడు, నభోదుడు, విశ్వాయువు, దీప్తిచమూహరుడు, సురేశుడు, వ్యోమారి, శంకరుడు, భవుడు, ఈశుడు, కర్తకృతి, దక్షుడు, భువనుడు, దివ్యకర్మకృత్తు, గణితుడు, పంచవీర్యుడు, ఆదిత్యుడు, రశ్మిమంతుడు, సప్తకృత్తు, సోమపూర్వుడు, విశ్వకృత్తు, కవి, అనుగోప్త, సుగోప్త, నప్త, ఈశ్వరుడు, జితాత్ముడు, మునివీర్యుడు, దీప్తరోముడు, భయంకరుడు, అనుకర్ముడు, ప్రతీతుడు, ప్రదాత, అంశుమంతుడు, శైలాభుడు, పరమక్రోధి, ధీరోష్ణి, భూపతి, స్రజుడు, వజ్రి, వరి - ఈ పేర్లున్న వీరలు= ఈ చెప్పినవారు; భాగ+అర్హులు= శ్రాద్ధఫలంలో భాగం పొందటానికి; అర్హత కలవారు; అని; చెప్పి= వివరించి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఆ విధానం చెప్పుతాను అని అత్రి నిమితో ఇట్లా అన్నాడు. 'బ్రహ్మ సూర్యుడికి, వరుణుడికి, చంద్రుడికి, అగ్నికి శ్రాద్ధఫలంలో భాగాలు ఏర్పరచాడు. విశ్వేదేవతలు, పితృదేవతలతో కలిసి ఆ పనిలో ఉపయోగ పడతారు. కనుక వారికి కూడా పాళ్ళు ఏర్పాటు చేశాడు. దేవతలలో కూడా ఊష్మపులనే దొడ్డవారున్నారు. వారిని కూడా పితృదేవతలుగా విభాగం చేశాడు. బ్రహ్మ వివరించిన ఆ పేర్లు చెప్పుతాను వినుము; బలుడు, ధృతి, విపాప్ముడు, పుణ్యకృత్తు, పావనుడు, పార్ష్ణిక్షేముడు, సమూహుడు, దివ్యసానువు, వివస్వంతుడు, వీర్యవంతుడు, హ్రీమంతుడు, కీర్తిమంతుడు, కృతుడు, విద్యుద్వర్చసుడు, సోమవర్చసుడు, సూర్యశ్రీ, సోమపుడు, సూర్యసావిత్రుడు, దత్తాత్ముడు, పుండరీయకుడు, ఉష్ణినాభుడు, నభోదుడు, విశ్వాయువు, దీప్తిచమూహరుడు, సురేశుడు, వ్యోమారి, శంకరుడు, భవుడు, ఈశుడు, కర్తకృతి, దక్షుడు, భువనుడు, దివ్యకర్మకృత్తు, గణితుడు, పంచవీర్యుడు, ఆదిత్యుడు, రశ్మిమంతుడు, సప్తకృత్తు, సోమపూర్వుడు, విశ్వకృత్తు, కవి, అనుగోప్త, సుగోప్త, నప్త, ఈశ్వరుడు, జితాత్ముడు, మునివీర్యుడు, దీప్తరోముడు, భయంకరుడు, అనుకర్ముడు, ప్రతీతుడు, ప్రదాత, అంశుమంతుడు, శైలాభుడు, పరమక్రోధి, ధీరోష్ణి, భూపతి, స్రజుడు, వజ్రి, వరి - వీరుకూడా పితృయజ్ఞ ఫలంలో భాగం పొందువారని చెప్పి ఇంకా ఈ విధంగా చెప్పాడు.

క. గిరివన దుర్గము లందును। సరి దుత్తరణంబు నపుడు శ్రాద్ధ విధి సమా
చరణ సమయమున వీరిం। బరికీర్తించిన యతండు వడయు శుభంబుల్. 193

ప్రతిపదార్థం: గిరి వన దుర్గము లందును= కొండలలో, అడవులలో, పోరానితావులలో, సరిత్+ ఉత్తరణంబు+అపుడు= నదులు దాటే వేళలలో, శ్రాద్ధవిధి సమాచరణ సమయమునన్= పితృయజ్ఞం చేసేవేళలలో; వీరిన్= ఈ ఊష్మపులనే దేవతలను; పరికీర్తించిన+ అతండు= చక్కగా స్తుతించినవాడు; శుభంబుల్= శుభాలను; పడయున్= పొందుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కొండలలో అడవులలో పోవశక్యంగాని తావులలో నదులు దాటే వేళలలో శ్రాద్ధసమయాలలో వీరిని స్తుతించిన నరుడు శుభాలను పొందుతాడు.

విశేషం: వీరి అనుగ్రహంవలన ప్రమాదాలు రాకుంటాయి అని భావం.

ఆ. **పూరిపంట ప్రాలు నారుగబియ్యంబు । జంబువున ఫలంబు శ్రాద్ధ కృతికిఁ**
గావు తుమ్మ నేడ్వఁగాదు శ్రాద్ధ క్రియా । చరణ సమయములఁ బ్రశాంతివలయు.' **194**

ప్రతిపదార్థం: పూరిపంట ప్రాలు= పూరిపంట బియ్యం; ఆరుగ బియ్యంబు= ఆరుగల బియ్యం; జంబువున ఫలంబు= నేరేడు పండు; శ్రాద్ధకృతికిన్= శ్రాద్ధం పనికి; కావు= పనికి రావు; శ్రాద్ధ క్రియా+ఆచరణ సమయములన్= శ్రాద్ధకర్మ చేసే సమయాలలో; తుమ్మన్= తుమ్మటం; ఏడ్వన్= ఏడవటం; కాదు= కూడదు; ప్రశాంతి= చక్కని శాంతి; వలయున్= కావాలి.

తాత్పర్యం: గడ్డిపంటల ధాన్యాలు, ఆరుగలు, నేరేడు పండు శ్రాద్ధానికి పనికిరావు. శ్రాద్ధసమయంలో తుమ్మటం, ఏడవటం కూడదు. ప్రశాంతి కావాలి.

విశేషం: 'తుమ్మటం' అప్రయత్నంగా వస్తుంది. దానిపై అదుపు ఉండకపోవచ్చు. అట్టి సందర్భంలో శ్రాద్ధ స్థానం నుండి దూరంగా వెళ్ళి ఆ పని చేసి మరల రావలసి ఉంటుంది. ప్రశాంతి ఉద్వేగం, ఆరాటం మొదలైన లక్షణాలు లేకుండా ఉండటం. కోపతాపాలను రాకుండా చూచుకొనటం మొదలగునవి.

వ. **అనియునుం జెప్పె నని చెప్పి, సరిత్సూనుండు ధర్మజుతో మఱియు నిట్లనియె.** **195**

ప్రతిపదార్థం: అనియునున్= అనికూడా; చెప్పెన్= (అత్రి నిమితో) చెప్పాడు; అని; చెప్పి= తెలియజేసి; సరిత్+సూనుండు= నది కొడుకు భీష్ముడు; ధర్మజుతోన్= ధర్మరాజుతో; మఱియున్; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అత్రి ఈ విషయాలు కూడా చెప్పాడని భీష్ముడు ధర్మరాజుతో ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. **'ఒకతఱి మునివర్యు లొక్కటఁ బెక్కండ్రు । శ్రాద్ధముల్ సేయ భోజ్యములు పెక్కు**
లనుభవించుటఁ దమ కఱుగమి పుట్టుట । యును, బితృదేవతల్ సనిరి సోము
కడ, కట్లు సని తమ కాఱియ సెప్పిన । నతఁడు 'పద్మజుపాలి కరుగుఁ' డనియె;
వా రట్లు కా కని బోరన నరిగి ప । ద్మజునిఁ గాంచి యజీర్ణ దశ యెఱుంగ

తే. **విన్నవించినఁ, దనయొద్ద వెలుఁగుచున్న । యగ్నిఁ జూపి 'యిక్కి డితం డపహరించు'**
ననిన నగ్ని 'మత్సహితులై కొనిన నఱుగఁ । జేయువాఁడ నాహారముల్ సిద్ధ మదియు. **196**

ప్రతిపదార్థం: ఒకతఱిన్= ఒకప్పుడు; మునివర్యులు= మునిశ్రేష్ఠులు; పెక్కండ్రు= చాలామంది; ఒక్కటన్= ఒకేసారి; శ్రాద్ధముల్= పితృయజ్ఞాలు; చేయన్= చేయగా; భోజ్యములు= ఆహారపదార్థాలు; పెక్కులు= చాలా; అనుభవించుటన్= తినగా; తమకున్= తమకు; అఱుగమి= అరగకపోవటం; పుట్టుటయును= పుట్టగా; పితృదేవతల్= పితృదేవతలు; సోము కడకున్= చంద్రుడి దగ్గరకు; చనిరి= వెళ్ళారు; అట్లు= ఆ విధంగా; చని= వెళ్ళి; తమ కాఱియ= తమ వేదనను; చెప్పినన్= చెప్పగా; అతఁడు= ఆ చంద్రుడు; పద్మజు పాలికిన్= బ్రహ్మదగ్గరకు; అరుగుఁడు= వెళ్ళండి; అనియెన్= అన్నాడు; వారు= ఆ

పితృదేవతలు; అట్లు+అ= అట్లే; కాక= అగుగాక; అని; బోరనన్= గబగబా; అరిగి= వెళ్ళి; పద్మజునిన్= బ్రహ్మను; కాంచి= చూచి; అజీర్ణదశ= అరుగని స్థితిని; ఎఱుంగన్= తెలిసే విధంగా; విన్నవించినన్= మనవిచేయగా; తన+ఒద్దన్=తనకడ; వెలుంగుచున్న+అగ్నిన్= ప్రకాశిస్తున్న అగ్ని దేవుడిని; చూపి= చూపించి; ఈ+కీడు= ఈ ఆపదను; ఇతండు= ఈ అగ్ని; అపహరించున్= తొలగిస్తాడు; అనినన్= అంటే; అగ్ని= అగ్నిదేవుడు; మత్+సహితులు+ఐ= నాతో కలిసి ఉన్నవారై; కొనినన్= ఆహారం తీసికొన్నట్లయితే; ఆహారముల్= భోజనాలను; అఱుగన్+ చేయువాఁడన్= జీర్ణంచేస్తాను; అదియున్= అది; సిద్ధము= ఏర్పాటు.

తాత్పర్యం: ఒకసారి చాలమంది మునులు ఒకే సమయంలో శ్రాద్ధాలు చేశారు. భోజన పదార్థాలు ఎక్కువగా తినటంవలన పితృదేవతలకు అగ్నిమాంద్యం (అజీర్ణం అనే జబ్బు) కలిగింది. వారంతా చంద్రుడి దగ్గరకు పోయి తమగోడు విన్నవించుకొన్నారు. చంద్రుడు 'మీరు బ్రహ్మ దగ్గరకు పొండి' అన్నాడు. వా రట్లాగే అని వడివడిగా వెళ్ళి బ్రహ్మను చూచి తమ అజీర్తి విషయం చెప్పారు. ఆయన తన దగ్గర నున్న అగ్నిని చూపి 'ఈ ఆపదను ఇతడు తొలగిస్తాడు' అన్నాడు. అగ్ని 'ఇకపైన మీరు ఆహారాలను నాతో కలిసి తీసికొంటే నేను వాటిని అరిగిస్తాను. ఇది సిద్ధమైన మాట' అన్నాడు.

విశేషం: చంద్రుడికి ఓషధీశుడని పేరు. ఓషధులు రోగాలను తొలగిస్తాయి. అందుకని ముందు పితృదేవతలు అతడి దగ్గరకు వెళ్ళారు. చంద్రుడు బహుశః శాశ్వతమైన ఏర్పాటు కొరకు బ్రహ్మ దగ్గరకు పంపిఉంటాడు.

క. అని పలికినఁ బితృదేవత । లనలుఁడు ముఖ్యుఁడుగ నెపుడు నాహారంబుల్
గొని సుఖ జీర్ణానందం । బు నొందుదురు సూవె భరతభూపవరేణ్యా! 197

ప్రతిపదార్థం: భరత భూపవరేణ్యా!= భరతవంశ రాజులలో ఎన్నదగినవాడా!; అని; పలికినన్= అనగా; పితృదేవతలు; అనలుఁడు= అగ్ని; ముఖ్యుఁడుగన్= ప్రధానుడుగా; ఎపుడున్= ఎల్లవేళలా; ఆహారంబుల్= భోజనాలను; కొని= గ్రహించి; సుఖ జీర్ణ+ఆనందంబున్= సుఖంగా అరగటంవలన కలిగే ఆనందాన్ని; ఒందుదురు= పొందుతున్నారు; చూవె!= సుమా!

తాత్పర్యం: రాజా! అగ్ని ఇట్లా అంటే పితృదేవతలు అగ్నిని ముందుంచుకొని భోజనాలు చేసి సుఖంగా జీర్ణించుకొని ఆనందం పొందుతున్నారు.

విశేషం: "అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః,
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్".

అని గీత - పరమాత్ముడే సర్వప్రాణులలో వైశ్వానరాగ్ని రూపంలో ఉండి నాలుగు విధాలైన పదార్థాలను జీర్ణం చేస్తున్నాడన్న భావాన్ని ఇక్కడ అనుసంధించుకొనవచ్చును. అనలుడు అంటే అలమ్ చాలు అననివాడు. ఎంత పదార్థాన్నైనా కాల్చి వేయగలవాడని ఇక్కడ ఈ శబ్దాన్ని సాభిప్రాయంగా వాడారు.

క. కావున సాగ్నికుఁడయి తగ । నే వాఁడొనరించు శ్రాద్ధ మీడ్యం బది; సం
భావింతురు పెద్దయుఁ బితృ । దేవత లసురులకు రాదు తేఱియుఁ జూడన్. 198

ప్రతిపదార్థం: కావునన్= కనుక; ఏవాఁడు= ఎవ్వడు; స+అగ్నికుఁడు+అయి= అగ్ని కలవాడై; శ్రాద్ధము= పితృయజ్ఞం; ఒనరించున్= చేస్తాడో; అది= అట్లా చేసిన ఆ పని; ఈడ్యంబు= కొనియాడదగింది; పితృదేవతలు; పెద్దయున్= మిక్కిలిగా; సంభావింతురు= మన్నన చేస్తారు; అసురులకున్= రక్కసులకు; తేఱియున్= నెమ్మదితో; చూడన్+రాదు= చూడ వీలుకాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కనుక శ్రాద్ధం అగ్ని పూజలతో కలిపి చేస్తే అది ఎంతో ప్రశస్తమవుతుంది. పితృదేవతలు పరమానందం పొందుతారు. రాక్షసులు అటువైపు కన్నెత్తి చూడనుకూడా రారు.

విశేషం: తద్దినాలలో ముందుగా విచ్ఛిన్నాగ్నిని పునస్సంధానించి ఉపాసిస్తారు.

ఆ. అనఘ! పితృపితామహ ప్రపితామహ । పూజనములు శిష్ట పూర్వకముగఁ
జేయవలయు నియతి దాయ దొడ్గిన జన్ని । దంబుతోడ భక్తిధామ మగుచు. 199

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యవంతుడా!; పితృ పితామహ ప్రపితామహ పూజనములు= తండ్రి, తాత, ముత్తాతల పూజలు; శిష్టపూర్వకముగన్= సదాచారం ముందు ఉండే విధంగా; నియతిన్= నిష్ఠతో, దాయ తొడ్గిన జన్నిదంబుతోడన్= తిరుగబడేటట్లు ధరించిన జందెంతో; భక్తిధామము= భక్తికి నెలవు; అగుచున్= అవుతూ; చేయవలయున్= చేయాలి.

తాత్పర్యం: చక్కని ఆచారంతో, నిష్ఠతో, కుడిభుజానికి మార్చుకొన్న జందెంతో భక్తికి నివాసమా అన్నట్లున్నవాడై తండ్రి, తాత ముత్తాతలకు పూజలు చేయాలి.

విశేషం: జందెం సంధ్యావందనం, యజ్ఞం మొదలైన పనులప్పుడు ఎడమభుజం మీదుగా ధరించాలి. దీనిని 'ఉపవీత స్థితి' అంటారు. పితృక్రియలలో కుడిభుజానికి మార్చుకొనాలి. దీనిని 'ప్రాచీనావీత స్థితి' అంటారు. దేహధర్మాలైన మలమూత్ర విసర్జనాది క్రియల సమయంలో దండలా వేసికొనాలి. దీనిని 'నివీతస్థితి' అంటారు. ఇక్కడ దాయ దొడ్గిన జన్నిదంబుతోడ అంటే 'ప్రాచీనావీత స్థితి' అని భావం. 'పితృ పితామహ ప్రపితామహులు' మరణించినవారికే శ్రాద్ధ క్రియ.

తే. పిండ సంబంధమునఁ బాయుఁ బ్రేతభావ । మది సుగతి నిచ్చు; గయఁ బిండ మట్లు గాన
నరుగునో గయ కొకఁ డైన నని కదా య । నేక పుత్త్రులఁ గోరుదు రిద్ధచరిత! 200

ప్రతిపదార్థం: ఇద్ధ చరిత!= పరిశుద్ధమగు నడవడి కలవాడా!; ప్రేత భావము= ప్రాణుల చావు తరువాత స్థితి; పిండ సంబంధమునన్= పిండం పెట్టిన కారణంగా; పాయున్= పోతుంది; గయన్= గయా క్షేత్రంలో; పిండము= పెట్టిన పిండము; అది; సుగతిన్= మంచి గతిని; ఇచ్చున్= ఇస్తుంది; అట్లు కానన్= ఆ కారణంగా; గయకున్= గయకు; ఒకఁడు+ఐనన్= ఒక్కడైనా; అరుగునో= వెళ్ళునేమో; అని కదా!= అన్న భావంతో కదా!; అనేక పుత్త్రులన్= ఎక్కువ మంది కొడుకులను; కోరుదురు= పొందగోరుతారు.

తాత్పర్యం: మాన్యచరిత్రుడా! చనిపోయిన జీవికి ప్రేతభావం పిండ సంబంధంవలన నశిస్తుంది. గయలో పెట్టిన పిండం ప్రేతభావాన్ని పోగొట్టటమే కాదు పుణ్యగతిని కూడా ఇస్తుంది. అందుకనే ఒక్క కొడుకైనా గయకు వెళ్ళి పిండం పెడతాడన్న ఆశతో మానవులు ఎక్కువమంది కొడుకులను కోరుకొంటారు.

విశేషం: 'గయకు నరుగునో' అంటే పిండ ప్రదానంకొరకు అనే అర్థాన్ని సంభావించాలి. మరణించిన జీవి ప్రేత రూపంలో నరకం అనుభవిస్తాడని మనవారి నమ్మకం. ఆ నరకం నుండి విముక్తి పిండ ప్రదానం ద్వారా కలుగుతుంది. గయలో పిండం పెట్టితే పుణ్యలోకాలు కూడా లభిస్తాయి అని కూడా విశ్వాసం.

క. గౌరి యగు కన్య వరదా । నా రూఢం జేత; నీలమైన వృషభమున్
గారవమున విడుపు ముదం । బారంగాఁ జేయుఁ బితృచయము చిత్తములన్. 201

ప్రతిపదార్థం: గౌరి+అగు కన్యన్= రజస్వల కాని కన్యను; వరదాన+ఆరూఢన్= వరుడికి ఇచ్చుటలో లక్ష్యమైనదానినిగా; చేఁత= చేయటం; నీలము= నల్లని వన్నెకలది; ఐన వృషభమున్= అయిన ఎద్దును; గారవమునన్= దొడ్డబుద్ధితో; విడుపు= వదలుట; పితృచయము చిత్తములన్= పితృదేవతల హృదయాలను; ముదంబు= సంతోషం; ఆరంగాన్= అధికమయ్యేటట్లు; చేయున్= చేస్తాయి.

తాత్పర్యం: రజస్వల కాని కన్యను వరుడికి భార్యగా ఇవ్వటం, నల్లని యెద్దును ఆబోతుగా వదలటమూ అనేవి పితృదేవతలకు ఎంతో ఆనందం కలిగిస్తాయి.

క. శ్రాద్ధంబు ప్రకారంబును। వృద్ధా చార్యోక్తభంగి వివరించితి; నీ

బుద్ధిం దోఁచినదాని స। మిద్ధ గుణోదార! యడుగు మెయ్యది యైనన్.' 202

ప్రతిపదార్థం: సమిద్ధగుణ+ఉదార!= చక్కగా ప్రకాశించు గుణములతో గొప్పవాడా!; వృద్ధ+ఆచార్య+ఉక్త భంగిన్= వృద్ధులైన ఆచార్యులు చెప్పిన తీరున; శ్రాద్ధంబు ప్రకారంబును= శ్రాద్ధం చేయవలసిన విధానాన్ని; వివరించితిన్= తెలిసే విధంగా చెప్పాను; నీ బుద్ధిన్= నీ బుద్ధిలో; తోఁచిన దానిన్= తట్టిన దానిని; ఏ+అది+ఐనన్= దేనికైనా; అడుగుము.

తాత్పర్యం: మేలిగుణాలతో గొప్పవాడవైన రాజా! పెద్దలైన ఆచార్యులమాటల ననుసరించి శ్రాద్ధవిధానాన్ని నీకు వివరించాను. నీ బుద్ధికి తోచిన ఏ విషయమైనా అడుగుము చెప్పుతాను'.

విశేషం: వృద్ధా చార్యోక్తభంగిన్ - వృద్ధులంటే అనుభవంతో ఔగాములను నిర్ణయించుకొనగలవారు: ఆచార్యులు - శాస్త్రవిషయాలను చక్కగా గ్రహించి శిష్యులతో ఆచరింపజేస్తూ తాము ఆచరించేవారు. ఈ సందర్భంలో 'అత్రి' వంటివారు. కనుక ఈ విషయంలో సందేహించరాదని భావం.

క. అని నిర్జరాపగానం। దనుండు పలుకుటయుఁ, బ్రియము దళుకొత్తఁగఁ బాం

డు నృపాలు నగ్రనందనుఁ। డనూన వినయమున నమ్మహామతి తోడన్. 203

ప్రతిపదార్థం: అని; నిర్జర+ఆపగా నందనుండు= దేవతల నదికొడుకు భీష్ముడు; పలుకుటయున్=పలికినంతనే; పాండు నృపాలు+అగ్రనందనుఁడు=పాండురాజు పెద్దకొడుకు; ప్రియము= ప్రీతి; తళుకొత్తఁగన్= అధికం కాగా; అనూన వినయమునన్= ఎక్కువ వినయంతో; ఆ+మహామతితోడన్= దొడ్డబుద్ధిగల ఆ భీష్ముడితో.

తాత్పర్యం: భీష్ము డిట్లా అన్నంతనే ధర్మరాజు ప్రీతి రెట్టింపు కాగా అధికమైన వినయంతో ఆ మహాజ్ఞానితో ఇట్లా అన్నాడు.

విశేషం: నిర్జరాపగానందనుఁడు - పవిత్రత, జ్ఞానం మొదలైన ఉదాత్త లక్షణాలను ఈ పదం స్ఫురింపజేస్తుంది. 'ప్రియము తళుకొత్తంగన్' - ధర్మరాజుకు ఎన్నో విషయాలు తెలిసికొనాలని పట్టరాని ఉత్కంఠ. అయినా పెద్దవాడు, తా నతడితో యుద్ధంచేసి నొప్పించాడు మొదలైన సంకోచా లెన్నో మదిలో ఉన్నాయి. ఈ దశలో ఆ మహానుభావుడే ఏది అయినా అడుగుము - అని ప్రచోదన చేస్తున్నాడు. కనుక ప్రీతి అతిశయించింది. మహామతి - ఏది అడిగినా చెప్పగల సామర్థ్యాన్ని ఇది అభివ్యక్తం చేస్తుంది.

క. 'తప మని యార్యులు సెప్పుదు। రుపవాసవ్రతము; నదియె; యొండు గలదొ సా

రపుఁ దపము తెలఁగు నాకుం। గృప నెఱిఁగింపుము విధూతకిల్బిష!' యనుడున్. 204

ప్రతిపదార్థం: ఆర్యులు= పూజ్యులు; ఉపవాస వ్రతమున్= ఉపవాసమనే నియమాన్ని; తపము= తపస్సు; అని; చెప్పుదురు= తెలుపుతారు; అదియె?= అదేనా?; ఒండు= మరొకటి; కలదొ?= ఉన్నదా?; సారము+తపము తెఱఁగు= చేవగల తపస్సు తీరు; విధూత కిల్బిష!= చక్కగా తొలగించుకొన్న పాపాలు కలవాడా!; నాకున్= నాకు; కృపన్= దయతో; ఎఱిఁగింపుము= తెలుపుము; అనుడున్= అనగా.

తాత్పర్యం: 'పాపాలను పటాపంచలు చేసికొన్న మహానుభావా! ఉపవాస నియమాన్నే తపస్సు అని ఆర్యులు అంటూ ఉంటారు. నిజానికి అదేనా, మరేదైనా ఉన్నదా? చేవగల తపస్సు పద్ధతిని నాకు దయతో తెలుపుము' అంటే.

విశేషం: ఆర్యులు - తమ సత్ప్రవర్తనతో ఇతరులకు మన్నించదగినవారు. 'నాకు' - తెలిసికొనాలనే ఉత్కంఠ అధికంగా ఉన్న నాకు - అని ఇది అర్థాంతర సంక్రమిత వాచ్యధ్వని. కృప, నాకు, విధూతకిల్బిష అనే పదాలు గీత చెప్పిన 'పరిప్రశ్న'ను అభివ్యక్తం చేస్తాయి.

క. అమ్మహాత్ముఁ డిట్టు లనుఁ 'బెక్కు దివసంబు । లుపవసించి యునికి తపము చొప్పె
దాన విను తపస్వి గానేరఁ డది యాత్మ । ఘాత మగుట నరుఁడు గౌరవేంద్ర! 205

ప్రతిపదార్థం: ఆ+మహాత్ముండు= దొడ్డబుద్ధిగల ఆ భీష్ముడు; ఇట్టు= ఇట్లా; అనున్= అన్నాడు; కౌరవ+ఇంద్ర!= కురువంశంవారిలో గొప్పవాడా!; పెక్కు దివసంబులు= ఎక్కువ దినములు; ఉపవసించి ఉనికి= పస్తులు ఉండటం; తపము చొప్పు+ఎ?= తపస్సు పద్ధతియా?; విను= శ్రద్ధగా ఆలకించుము; దానన్= దానిచేత; నరుఁడు= మానవుడు; అది= అట్లా ఉండటం; ఆత్మ ఘాతము= ఆత్మను హింసించటం; అగుటన్= కావటంవలన; తపస్వి= తపస్సు కలవాడు; కానేరఁడు= కాజాలడు.

తాత్పర్యం: అప్పుడు మహానుభావుడైన భీష్ము డిట్లా చెప్పాడు. 'కురువరా! ఎన్నో రోజులు పస్తులుండటం తపస్సు కానే కాదు. అది ఆత్మను హింసించటం. కనుక దానివలన నరుడు తపస్వి కాజాలడు.

విశేషం: పాండురాజు కొడుకులు, ధృతరాష్ట్రుడి కొడుకులు అందరూ కురువంశంలోనివారే కనుక కౌరవులే. కానీ ఈ పదం ధృతరాష్ట్రుల కుమారులకు విడిగా రూఢమైనది. తపము చొప్పె? అన్న ప్రశ్న వ్యతిరేకార్థాన్ని తెలుపుతుంది. కానేకాదని భావం. 'ఆత్మఘాతం కనుక' అని కారణం కూడా చెప్పాడు. ఇక్కడ ఆత్మ అంటే ధర్మసాధనమైన దేహం అనే అర్థాన్ని గ్రహించాలి. 'విను' అనే మాట శ్రద్ధను ద్యోతకం చేస్తున్నది.

క. సత్యంబు బ్రహ్మచర్యము । నిత్యశుచిత మౌన మతుల నియమము దయ శు
ద్ధ త్యాగంబుఁ దపస్సం । పత్త్యాకృతు లండ్రు బుధులు పౌరవముఖ్యా!' 206

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశంవారిలో గొప్పవాడా!; బుధులు= తత్త్వమెరిగినవారు; సత్యంబు= సత్యం; బ్రహ్మచర్యము= బ్రహ్మమునందు ప్రవర్తించటం; నిత్య శుచిత= ఎడతెగని పరిశుద్ధత; మౌనము= మాటలయందు నిగ్రహం; అతుల నియమము= సాటిలేని నిష్ఠ; దయ= భూతములయందు జాలి; శుద్ధ త్యాగంబున్= దోషం లేని దానగుణం; తపస్+సంపత్తి+ఆకృతులు= తపస్సనే మహాభాగ్యపు రూపాలు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: సత్యం, బ్రహ్మచర్యం, ఎడతెగని పరిశుద్ధత, మౌనం, సాటిలేని నిష్ఠ, భూతదయ, మచ్చలేని త్యాగం అనేవి తపస్సంపదయొక్క ఆకారా లని తత్త్వమెరిగినవారు చెప్పుతారు.'

విశేషం: సత్యము - పరతత్త్వానికి విరుద్ధం కానిది; బ్రహ్మచర్యము - బ్రహ్మమంటే వేదం, తత్త్వం - వానియందు ప్రవర్తించటం; శుచిత - బాహ్యశుద్ధి; అంతశ్శుద్ధి; మౌనము - కేవలం వాక్కుని నిలిపివేయటం అని అర్థం కాదు. ముని ధర్మాన్ని - పరమాత్మ చింతనం చేస్తూ దానికి విరుద్ధమైనది పలుక కుండటం; శుద్ధ త్యాగము - వదలివేసిన దానియందు ఏ మాత్రమూ మమకారభావన లేకుండా ఉండటం. సత్యం పలకటం, బ్రహ్మచర్యం పాటించటం ఇత్యాదిగా ఆచరణ సంబంధమైన పదాలను ఇక్కడ కలుపుకొనాలి.

వ. అనిన విని కురుపతి కురుపితామహునితో 'మహాత్మా! దానశీలుని యప్రతిగ్రాహకుని విశేషం బెట్టిది? యెఱింగింపు' మనవుడు నా దేవవ్రతుం 'డీ విషయంబునకు సప్తర్షి వృషాదర్భి సంవాదం బను నితిహాసంబు గల' దని చెప్పి యమ్మనుజపతి కిట్లనియె. 207

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; కురుపతి= కురురాజు; కురుపితామహునితోన్= కౌరవుల తాత అయిన భీష్ముడితో; మహాత్మా!; దానశీలుని= ఇవ్వటమే శీలంగా కలవాడియొక్క; అప్రతిగ్రాహకుని= ఇతరులనుండి దేనినీ దానరూపంగా పుచ్చుకొననివాడియొక్క; విశేషంబు= ప్రత్యేకత; ఎట్టి+అది?= ఏ విధమైనది?; ఎఱింగింపుము= తెలుపుము; అనవుడున్= అనగా; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; ఈ విషయంబునకున్= ఈ సంగతికి; సప్తర్షి వృషాదర్భి సంవాదము= సప్తఋషులకు, వృషాదర్భి అనే వాడికిని అయిన సంభాషణ; అను+ఇతిహాసంబు= అనే పూర్వపు గాథ; కలదు= ఉన్నది; అని; చెప్పి; ఆ+మనుజ పతికిన్= ఆ రాజునకు,ధర్మజునకు; ఇట్లు= ఇట్లా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: భీష్మ డట్లా చెప్పగా వినిన ధర్మరాజు తాతతో 'మహానుభావా! దానశీలుడి విశేషమూ, దానం పుచ్చుకొననివాడి ప్రత్యేకతా ఎట్టిదో నాకు తెలుపుము' అన్నాడు. అప్పుడు భీష్ముడు 'ఈ విషయానికి సప్తర్షి వృషాదర్భి సంవాదం అనే పూర్వపు గాథ ఒకటి ఉన్నది' అని ఇట్లా చెప్పాడు.

విశేషం: ప్రతిగ్రాహకుండు - దానం పుచ్చుకొనేవాడు. కొందరు ఆ పనిచేయరు. వారు అప్రతిగ్రాహకులు; దేవవ్రతుడు భీష్ముడి వ్యవహారనామం. ఇతిహాసం - 'ఇది ఇట్లా ఉండటం' అని ఈ శబ్దానికి అర్థం. పూర్వకాలంలో జరిగిన వృత్తాంతం. కొన్ని ధర్మాలను కథా రూపంతో బోధించటం పురాణేతిహాసాలలో ఒక పద్ధతి. దానిని ఇక్కడ అవలంబిస్తున్నాడు.

సప్తర్షి వృషాదర్భి సంవాదం బను నితిహాసంబు ప్రకారము (సం.13-94-4)

తే. 'కశ్యపాత్రి విశ్వామిత్ర గౌతములును । విను భరద్వాజ జమదగ్నులును వసిష్ఠుఁ
డును జగంబుల నెల్లఁ బేర్కొనిన ఋషులు । వారి సప్తర్షిగణ మండ్రు కౌరవేంద్ర! 208

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కురువంశవరేణ్యా!; కశ్యప+అత్రి విశ్వామిత్ర గౌతములును= కశ్యపుడు, అత్రి, విశ్వామిత్రుడు, గౌతముడు అనువారూ; విను= వినుము; భరద్వాజ జమదగ్నులును= భరద్వాజుడూ, జమదగ్నీ; వసిష్ఠుఁడును= వసిష్ఠుడూ, జగంబులన్= లోకములందు; ఎల్లన్= అంతటా; పేర్కొనిన ఋషులు= ప్రసిద్ధి పొందిన మునులు; వారిన్= వారిని; సప్త+ఋషి గణము= సప్తర్షుల సముదాయం; అండ్రు= అంటారు.

తాత్పర్యం: 'రాజా! కశ్యపుడు, అత్రి, విశ్వామిత్రుడు, గౌతముడు, భరద్వాజుడు, జమదగ్ని, వసిష్ఠుడు అని అన్ని లోకాలలో ప్రసిద్ధి పొందిన ఏడుగురు ఋషులు ఉన్నారు. వారిని సప్తర్షిగణం అంటారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. వసిష్ఠుని దేవి యగు నరుంధతి యెందును నతనితోడన తిరుగు; నయ్యందఱకుం బరిచారికయై గండ యను చేడియ వర్తించుఁ; దద్వల్లభుండగు పశుసఖుండును వారలకుం బరిచారకత్వం బాచరించు; నప్పదుండ్రును దపశ్చరణ పరులై ధరణిం జరించుచుండ నత్యంతఘోర యగు ననావృష్టి దోఁచి జీవసాధనంబు లగు పదార్థంబులు దుర్లభంబులై జనంబులకుఁ బ్రాణంబులు రక్షించుకొనుట దుష్కరంబై చెల్లెం; గశ్యపాదులు నతి క్షుధార్తులై యాహారం బన్వేషించు నెడ శిబిసూనుం డైన యాజ్య నామధేయుండు తొల్లి యజ్ఞదక్షిణార్థం బుగాఁ దన కొడుకు నీలుండను వాని ఋత్విగ్జనంబుల కిచ్చినం దద్వశగతి నుండి కాలం బగుటయు మృతి నొందినం దదీయ శవంబు. 209

ప్రతిపదార్థం: వసిష్ఠునిదేవి= వసిష్ఠుడి పత్ని; అగు అరుంధతి= అయిన అరుంధతి, ఎందును= ఎప్పుడు; అన్ని తావులను; అతని తోడన్+అ= అతడితోనే; తిరుగున్= సంచరిస్తుంది; ఆ+అందఱకున్= వారందరికీ; పరిచారిక+ఐ= సేవకురాలై; గండ అను చేడియ= గండ అనే వనిత; వర్తించున్= తిరుగుతుంది; తద్+వల్లభుండు= ఆమె భర్త; అగు పశుసఖుండును= అయిన పశుసఖు డనేవాడు; వారలకున్= ఆ ఋషులకు; పరిచారకత్వంబు= సేవ; ఆచరించున్= చేస్తూ ఉండేవాడు; ఆ+పదుండ్రును= ఆ పదిమంది; తపస్+చరణపరులు+ఐ= తపస్సు చేయటంలో ఆసక్తికలవారై; ధరణిన్= భూమియందు; చరించుచున్+ఉండన్= తిరుగుతుండగా; అత్యంతఘోర= మిక్కిలి భయం గొలిపేది; అగు+అనావృష్టి= అయిన వానలు లేనిదశ; తోఁచి= ఏర్పడి; జీవ సాధనంబులు= బ్రదకటానికి కావలసినవి; అగు పదార్థంబులు= అయిన వస్తువులు; దుర్లభంబులు+ఐ= ఎంత కష్టపడ్డా దొరకనివై; జనంబులకున్= మనుష్యులకు; ప్రాణంబులు= ప్రాణాలు; రక్షించుకొనుట= కాపాడుకొనటం; దుష్కరంబు+ఐ= సాధ్యంకానిదై; చెల్లెన్= సాగింది; కశ్యప+ఆదులు= కశ్యపుడు మొదలైనవారు; అతి క్షుధా+ఆర్తులు+ఐ= మిక్కిలి ఆకలితో పీడనొందినవారై; ఆహారంబు= అన్నం; అన్వేషించు+ఎడన్= వెదకే సందర్భంలో; శిబి సూనుండు= శిబి కొడుకు; ఐన యాజ్యనామధేయుండు= అయిన యాజ్యుడనే పేరివాడు; తొల్లి= మునుపు; యజ్ఞదక్షిణ+అర్థంబుగాన్= యజ్ఞంలో కానుకగా నొసగుటకై; తనకొడుకు= తన కుమారుడైన; నీలుండు అనువానిన్= నీలు డనే వాడిని; ఋత్విక్+జనంబులకున్= యజ్ఞం చేయించే బ్రాహ్మణులకు; ఇచ్చినన్= ఇవ్వగా; తద్+వశగతిన్= వారి ఆధీనంలో; ఉండి; కాలంబు+అగుటయున్= ఆయువు చెల్లగా; మృతిన్= చావును; ఒందినన్= పొందగా; తదీయశవంబు= వాడి మృతదేహం.

తాత్పర్యం: వసిష్ఠుడి ధర్మపత్ని అరుంధతి అన్నివేళలా అతడితోడనే తిరుగుతుంది. 'గండ' అనే ఆమె, ఆమె భర్త పశుసఖుడనే వాడూ ఆ ఋషులందరికీ సేవచేస్తుండేవారు. ఆ పదిమందీ తపస్సు చేస్తూ ఉంటారు. ఈ విధంగా ఆ పదిమందీ తపస్సు చేసికొంటూ భూమిమీద తిరుగుతూ ఉండగా మహాభయంకరమైన అనావృష్టి ఏర్పడింది. బ్రతకటానికి తగిన పదార్థాలు దొరకక ప్రజలకు ప్రాణాలు రక్షించుకొనటం కూడా అసాధ్యమై పోయింది. కశ్యపుడు మొదలైనవారు ఆకలి పీడించగా అన్నంకొరకు వెదకుతున్నారు. శిబికొడుకు యాజ్యు డనేవాడు మునుపు యజ్ఞ దక్షిణగా తన కొడుకు నీలు డనే వాడిని ఋత్విక్కులకు ఇచ్చాడు. వాడు వారి అధీనంలో ఉండి కాలం కావటంవలన మరణించాడు. వాడి శవం. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సొదపై నుండఁగ వారలు । పదుండ్రునుం జూచి దాని భక్షింపంగా
మదిఁ గోరి చేరి చుట్టుం । బొదివిన సమయమునఁ గాటి పొంత తెరువునన్. 210

ప్రతిపదార్థం: సొదపైన్= కాల్చటానికి పేర్చిన కట్టెలమీద; ఉండఁగన్= ఉండగా; వారలు= ఆ కశ్యపుడు మొదలైనవారు; పదుండ్రునున్= పదిమందీ; చూచి= కనుగొని; దానిన్= ఆ శవాన్ని; భక్షింపంగాన్= తినటానికి; మదిన్= మనస్సులో; కోరి= వాంఛించి; చేరి= దరి కరిగి; చుట్టున్= అన్ని వైపులా; పొదివిన సమయమునన్= మూగిన సమయంలో; కాటి పొంత తెరువు నన్= వల్లకాటి దగ్గరి దారిలో.

తాత్పర్యం: ఆ శవం కట్టెల మీద ఉండగా ఆ పదిమందీ దానిని చూచి తినటానికై దానిచుట్టూ మూగి ఉన్న సమయంలో వల్లకాటి దగ్గరి దారిలో. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. వేఁట వోయి మరలి విభుఁ డొక్కరుఁడు వృషా । దర్భినాముఁ డతుల దానపరుఁడు

పోయి పోయి కాంచి, పోవక నిలిచి, య । మ్మునులతోడ నధిక వినయ మెసఁగ. 211

ప్రతిపదార్థం: వేట= వేటకై; పోయి= వెళ్ళి; మరలి= తిరిగి; విభుఁడు= రాజు; ఒక్కరుఁడు= ఒకడు; వృషాదర్భి నాముఁడు= వృషాదర్భి అనే పేరుగలవాడు; అతుల దాన పరుఁడు= సాటిలేని దానాలయందు ప్రీతికలవాడు; పోయి పోయి= చాలా దూరంపోయి; కాంచి= చూచి; పోవక నిలిచి= పోకుండ ఆగి; అధిక వినయము= ఎక్కువ వినయం; ఎసఁగన్= ఒప్పగా; ఆ+మునులతోడన్= ఆ మునులతో. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: వేఁటకు వెళ్ళి తిరిగి వస్తున్న వృషాదర్భి అనే రాజు - గొప్ప దానాలు ప్రీతిగా చేసేవాడు - వారిని చూచి ముందుకు పోవక ఆగి మిక్కిలి వినయంతో ఆ మునులతో ఇట్లా అన్నాడు.

విశేషం: 'అతులదాన పరుఁడు' - ఇది ముందు కథకు సూచన. అధిక వినయము - ఇది అతని గుర్తింపును సూచిస్తుంది. వారు మహానుభావులన్న విషయం దర్శనంచేతనే తెలిసికొన్నాడని భావం.

క. 'మీ రాఁకలి పెల్లున నా । హారంబుగ శవముఁ గొనుట కడరితి; రిట్లే

లా? రం డిచ్చెద మీ కా । హారంబులు వలసినట్టి' వని తా మఱియున్. 212

ప్రతిపదార్థం: మీరు; ఆఁకలిపెల్లునన్= ఆకలి ఎక్కువకు; ఆహారంబుగన్= భోజన పదార్థంగా; శవమున్= ప్రాణంలేని దేహాన్ని; పీనుగను; కొనుటకున్= తినటానికి; అడరితిరి= సిద్ధపడ్డారు; ఇట్లు= ఈ విధంగా; ఏలా?= ఎందుకు; రండు= నాతో రండి; మీకున్= మీకు; వలసిన+అట్టి+అవి= కావలసినవైన; ఆహారంబులు= భోజనాలు; ఇచ్చెదన్= ఇస్తాను; అని= అని పలికి; తాన్= తాను; మఱియున్= ఇంకా.

తాత్పర్యం: 'మీరు ఆకలి ఎక్కువ కావటంవలన శవాన్ని తినటానికి సిద్ధపడ్డారు. మీకు కోరిన భోజనాలు ఇస్తాను రండి' అని ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: మీరు - అర్థాంతర సంక్రమితవాచ్యధ్వని - మహర్షులూ తపస్సు చేస్తున్నవారూ అయిన మీరు అని భావం.

క. బహువిధముల ధాన్యములును । బహు రసవర్గములు మీకు భక్తి నొసఁగెదన్

బహుతురగ శకట గోగణ । బహుళ బహుగ్రామములును బహుమతి నిత్తున్.' 213

ప్రతిపదార్థం: మీకున్= మీకు; బహువిధముల ధాన్యములును= పెక్కు విధాలైన తిండిగింజలు; బహురసవర్గములున్= పెక్కు రుచుల పదార్థాల సముదాయాలను; భక్తిన్= భక్తితో; ఒసఁగెదన్= ఇస్తాను; బహు తురగ శకట గోగణ బహుళ బహు

గ్రామములును= పెక్కు గుర్రాలు, బండ్లు, ఆలమందలు చాలా ఎక్కువగా ఉన్న పెక్కు ఊళ్ళను; బహుమతిన్= మన్ననతో; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: ఎన్నో ధాన్యాలు, రుచిగల పదార్థాలు, గుర్రాలు, బండ్లు, ఆవులు అధికంగా ఉన్న పెక్కు ఊళ్ళు మీకు భక్తితో మన్ననతో ఇస్తాను.'

విశేషం: పద్యంలో 'బహు' శబ్దం అనేక పర్యాయాలు వాడటం రాజు దానంలోని ఉత్సాహాతిశయాన్ని సూచిస్తుంది. జీవితకాలంలో మీరు ఇట్టి శవభోజనం గురించి ఆలోచనకూడా చేయనక్కరలేని స్థితి కల్పిస్తాననే అతని హృదయం ఇక్కడ వ్యక్తమవుతున్నది. భక్తిన్ బహుమతిన్ అన్న మాటలు, అతని మంచితనానికి నిదర్శనంగా నిలుస్తాయి.

వ. అనిన వార లతని కిట్లనిరి. 214

ప్రతిపదార్థం: అనినన్= అంటే; వారలు= ఆ ఋషులు; అతనికిన్= ఆ వృషాదర్భికి; ఇట్లు= ఈ విధంగా; అనిరి= అన్నారు.

తాత్పర్యం: అని చెప్పగా ఆ ఋషులు అతడితో ఇట్లా అన్నారు.

తే. 'రాజవర! రాజుదెసఁ బ్రతిగ్రహము విషముఁ । గల్లుఁగాఁ జూతు మిట్టులు గాంచి యున్న

యట్టి మాకు నీవిచ్చెదనుట మా వి । ధం బెఱుంగమి యింతియ; తప్పు గాదు.' 215

ప్రతిపదార్థం: రాజవర!= రాజశ్రేష్ఠా!; రాజుదెసన్= రాజువైపునుండి; ప్రతిగ్రహమున్= పుచ్చుకొనుటను; విషమున్= విషమును; కల్లుఁగాన్= కల్లుగానూ; చూతుము= భావిస్తాము; ఇట్టులు= ఈ విధంగా; కాంచి ఉన్న అట్టి మాకున్= భావించి ఉన్న మాకు; నీవు; ఇచ్చెదన్= ఇస్తాను; అనుట= అనటం; మా విధంబు= మా పద్ధతి; ఎఱుంగమి= తెలియకపోవటం; ఇంతియ= ఇంతే; తప్పు= దోషం; కాదు.

తాత్పర్యం: 'రాజా! రాజునుండి పుచ్చుకొనటం విషంగానూ; కల్లుగానూ భావిస్తాం. ఇట్టి భావన కల మాకు నీవు ఏదో ఇస్తాననటం మా సంగతి తెలియకపోవటం మాత్రమే. మీ తప్పు కాదులే.'

విశేషం: విషంతో కల్లుతో సమానంగా రాజు ఇచ్చిన దానిని భావిస్తాం. అంటే ప్రతిగ్రహం ప్రాణాలు తీసేదిగా, ఒకవేళ ప్రాణాలున్నా వివేకాన్ని హరించివేసేదిగా మా భావన అని భావం.

క. అనుడు విషాదము తోడం । జని కృత్రిమ వన ఫలములు సమకట్టి తగన్

జనపతి మంత్రుల ఋషులకుఁ । గొనిపొండని పంప వా రకుంఠిత భక్తిన్. 216

ప్రతిపదార్థం: అనుడున్= అన్నంతనే; జనపతి= రాజు; విషాదము తోడన్= దుఃఖంతో; చని= వెళ్ళి; కృత్రిమ వన ఫలములు= మాయతో ఏర్పడిన అడవి పండ్లు; సమకట్టి= సిద్ధంచేసి; తగన్= తగు విధంగా; మంత్రులన్= మంత్రులను; ఋషులకున్= ఆ పదిమంది ఋషులకొరకు; కొనిపొండు= తీసికొని వెళ్ళండి; అని; పంపన్= పంపగా; వారు = ఆ మంత్రులు; అకుంఠిత భక్తిన్= మొక్కవోని భక్తితో.

తాత్పర్యం: ఋషు లట్లా అనగా రాజు విచారంతో వెళ్ళిపోయి కృత్రిమమైన అడవి పండ్లను చక్కగా సిద్ధంచేసి మంత్రులను 'వీటిని ఆ ఋషులకొరకు తీసికొని వెళ్ళుం'డని పంపాడు. వారు చక్కని భక్తితో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. వానిం దెచ్చి యమ్మహాత్ములకు సమర్పించిన. 217

ప్రతిపదార్థం: వానిన్= ఆ పండ్లను; తెచ్చి; ఆ+మహాత్ములకున్= దొడ్డబుద్ధిగల ఆ మహర్షులకు; సమర్పించినన్= ఇవ్వగా.

తాత్పర్యం: ఆ పండ్లు తెచ్చి ఆ మహానుభావులకు సమర్పించగా.

ఆ. వారు పట్టి చూచి వానివ్రేఁగున హేమ। గర్భకంబు లగుట గాంచి నవ్వి
పుచ్చుకొనక యున్నఁ బోయి భూపతికి న। త్తెఱఁ గమాత్యకోటి యెఱుఁగఁ జెప్పె. 218

ప్రతిపదార్థం: వారు= ఆ ఋషులు; పట్టి చూచి= పరీక్షించి; వాని వ్రేఁగునన్= వాటి బరువునుబట్టి; హేమ గర్భకంబులు= బంగారం కడుపులో ఉన్నవి; అగుటన్= అవటం; కాంచి= తెలిసికొని; నవ్వి; పుచ్చుకొనక+ఉన్నన్= గ్రహించకుంటే; అమాత్యకోటి= మంత్రుల సముదాయం; పోయి= వెళ్ళి; భూపతికిన్= రాజుకు; ఆ తెఱఁగు=ఆ విషయం; ఎఱుఁగన్ చెప్పెన్= తెలియ జెప్పింది.

తాత్పర్యం: ఆ ఋషులు ఆ పండ్లను పట్టుకొని చూచి వాటి బరువునుబట్టి వాటి కడుపులో బంగారం ఉండటం తెలిసికొని నవ్వి పుచ్చుకొనలేదు. మంత్రులు వెళ్ళి రాజుకు ఈ విషయం తెలియజెప్పారు.

విశేషం: నవ్వి - రాజు ఎత్తును గ్రహించగలిగినందుకు, రాజు ఔదార్యం గుర్తించినందుకు, తమ నిష్ఠ చెడనందుకు కలిగిన ఆనందం.

క. విని యతఁడు రాజసంబున। గనలు వొడమి కృత్తి వేల్వఁగాఁ దగువారిం
బనిచిన నప్పుడు హోమం। బున రాక్షసి యోర్తు పుట్టె భూపవరేణ్యా! 219

ప్రతిపదార్థం: భూపవరేణ్యా!= రాజశ్రేష్ఠా!; విని= ఆ సంగతి ఆలకించి; అతఁడు= ఆ వృషాదర్భి; రాజసంబునన్= రజోగుణ ప్రభావంవలన; కనలు+పొడమి= కోపంపుట్టి; కృత్తిన్= కృత్తి అనే రాక్షసిని; వేల్వఁగాన్= హోమంద్వారా తెప్పించటానికి; తగువారిన్= తగిన వారిని; పనిచినన్= ఆజ్ఞాపించగా; అప్పుడు= ఆ సమయంలో; హోమంబునన్= హోమంలో; రాక్షసి= రక్కసి; ఓర్తు= ఒకతె; పుట్టెన్= జనించింది.

తాత్పర్యం: రాజా! ఆ సంగతి తెలిసికొన్న వృషాదర్భికి రాజసంవలన కోపం వచ్చింది. 'కృత్తి'ని హోమం ద్వారా తెప్పించగలవారిని నియోగించాడు. అప్పుడు హోమంలో ఒక రక్కసి పుట్టుకొని వచ్చింది.

విశేషం: రాజసం - రజోగుణ విలక్షణం. ఇది నిష్కారణమైన కోపతాపాలను పుట్టించి చివరకు ఆత్మ వినాశానికి కారణం అవుతుంది. కృత్తి వేల్వన్ - ఇది ఒక క్షుద్ర విద్య. తాంత్రిక ప్రయోగం.

వ. పుట్టియప్పుడమితేని ముందట నిలిచి 'పనియేమి పనుపు' మనిన నతండు ప్రీతుండై 'కశ్యపాదులం గనుపుగొట్టు' మని పనిచిన, నది వార లున్నెడ రోసిపోయె, నంతకు మున్న వారు వనంబున మూలంబులు ఫలంబులు వెదకి తిరుగుచుండ శునస్సఖుండను పరివ్రాజకుండు వచ్చి వారిం గని వందనంబు సేసిన వారలభినందించి; రతండు నమ్మునులం గలిసి యేకార్థుండై సంచరించె; నట్లు చరించు నమ్మహాత్ము లతిక్షుధాన్వితులై తామరతూండ్లు పుచ్చికొని నమలుటకై యొక్క నలినాకరంబునకు సత్వరగతి నరుగుచు నున్న నా రక్కసి యక్కొలని కడ్డంబుగాఁ బోయి పొడసూపి నిలిచిన. 220

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పుట్టి= జన్మించి; ఆ+పుడమితేని ముందటన్= ఆ రాజుముందర; నిలిచి= నిలబడి; పని= కార్యం; ఏమి; పనుపుము= ఆనతివ్వుము; అనినన్= అనగా; అతండు= ఆ రాజు; ప్రీతుండు+ఐ= ప్రీతిపొందినవాడై; కశ్యప+ఆదులన్= కశ్యపుడు మొదలైనవారిని; కనుపు+కొట్టుము= ముక్కలుగా నరుకుము; అని; పనిచినన్= పంపగా; అది= ఆ కృత్తి; వారలు+ఉన్న+ఎడన్= వారున్నచోటును; రోసి పోయెన్= వెదకుతూ పోయింది; అంతకు మున్ను+అ= అంతకుముందే; వారు= ఆ మహర్షులు; వనంబునన్= అడవిలో; మూలంబులు= దుంపలు; ఫలంబులు= పండ్లు; వెదకి= అన్వేషించి; తిరుగుచున్+ఉండన్= తిరుగుతూ ఉండగా; శునస్సఖుండు అను పరివ్రాజకుండు= శునస్సఖుడనే సన్యాసి; వచ్చి; వారిన్= వారిని; కని= చూచి; వందనంబు+చేసినన్= నమస్కరించగా; వారలు= వారు; అభినందించిరి= ప్రీతితో మంచిమాటలు పలికారు; అతండును= ఆయనకూడా; ఆ+మునులన్= ఆ మునులతో; కలసి= కూడుకొని; ఏక+అర్థుండు+ఐ= ఒకే ప్రయోజనం కలవాడై; సంచరించెన్= తిరుగాడాడు; అట్లు= ఆ విధంగా; చరించు+ఆ+మహాత్ములు= తిరుగుతున్న ఆ గొప్ప వ్యక్తులు; అతిక్షుధా+అన్వితులు+ఐ= పిక్కటిల్లిన ఆకలితో కూడిన వారై; తామరతూండ్లు= తామర కాడలలోపలి మెత్తని పదార్థాలను; పుచ్చికొని= తీసికొని; నమలుటకున్+ఐ= నమలటానికై; ఒక్క నలిన+ఆకరంబునకున్= ఒక తామరకొలనికి; సత్వరగతిన్= వేగంగల నడకతో; అరుగుచున్+ఉన్నన్= పోతూ ఉండగా; ఆ రక్కసి= కృత్తిఅనేఆ రాక్షసి; ఆ+కొలనికిన్= ఆ చెఱువుకు; అడ్డంబుగాన్= అడ్డంగా; పోయి= వెళ్ళి; పొడ+చూపి= వారికి కనబడి; నిలిచినన్= నిలువగా.

తాత్పర్యం: కృత్తి పుట్టి ఆ రాజు ముందర నిలిచి 'పని ఏమిటో సెలవివ్వుము' అన్నది. అతడు ప్రీతి పొంది 'కశ్యపాదులను ముక్కలు ముక్కలుగా నరుకుము' అని పంపాడు. అంతకు ముందే మునులు అడవిలో దుంపలూ, పండ్లు వెతుక్కుంటూ తిరుగుతూ ఉండగా శునస్సఖుడనే సన్యాసి వారిని చూచి వందనం చేశాడు. వారు అతడిని మంచిమాటలతో ఆదరించారు. అతడు కూడా ఆ మునులతో తిరుగుతున్నాడు. అట్లా తిరుగుతున్న ఆ మహాత్ములు కడుపు కాల్చివేసే ఆకలితో తామరతూండ్లు అయినా నమలుదామని ఒక సరస్సు దగ్గరికి వడివడిగా వస్తున్నారు. అప్పు డా కృత్తి వారి కడ్డంగా వచ్చి నిలిచింది.

విశేషం: కనుపుగొట్టు అనేమాట 'కసి' ని వ్యక్తంచేస్తుంది. ప్రేగులు కాల్చివేసే ఆకలిలో కూడా వారు ఒక నియమానికి కట్టుబడి ఉండటం వారి మహాత్మత్వాన్ని నిరూపిస్తుంది.

క. ఈ కమలవనము చేరువ। నే కార్యము సేయఁ జూచె? దీ వెవ్వత?' వం
చా కొలను సొరఁగ నమ్ముని। లోకము సేరుటయు నచ్చెలువ యెలుఁ గెసఁగన్. 221

ప్రతిపదార్థం: ఆ మునిలోకము= ఆ మునుల సముదాయము; ఈ కమల వనము చేరువన్= ఈ తామర కొలను దగ్గర; ఏ కార్యము= ఏ పని; చేయన్+చూచెదు?= చేస్తావు?; ఈవు= నీవు; ఎవ్వతవు= ఎవతెవు; అంచున్= అంటూ; ఆ కొలను= ఆ చెరువును; చొరఁగన్= ప్రవేశించటానికి; చేరుటయున్= రాగా; ఆ+చెలువ= ఆ యింతి; ఎలుఁగు+ఎసఁగన్= పెద్ద గొంతుతో.

తాత్పర్యం: ఆ మహర్షులు 'ఈ తామరకొలను దగ్గర ఏమి చేస్తున్నావు?' అంటూ చెరువులో ప్రవేశించబోగా ఆమె పెద్ద గొంతుతో (ఇట్లా అన్నది).

విశేషం: 'ఏం పని' అంటూ కొలనిలోనికి దిగబోయారు - అంటే ఆమె సమాధానం మీద వారికి పెద్ద ఆసక్తి లేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వృషాదర్భి పుత్తెంచిన కృత్తి శునస్సఖునిచే మృతిఁ బొందుట (సం.13-95-48)

వ. 'ఏ నెవ్వత నైతి నేమి? యిక్కొలని కావలియున్న దాన' ననుటయు నమ్మునులు వెల్లనై' యాఁకట నలందురి యుపజీవింప నొండేమియు లేమింజేసి యీ సరోవరంబున బిసంబులు వెతికికొని భక్షించు వారమై వచ్చితి' మనిన నవ్వనిత 'మీ మీ పేళ్ళు సెప్పిమఱి పద్మవనంబు ప్రవేశించువా' రని పలికిన నప్పరమమును లన్నాతి యాతుధాని యగుటయుం గృత్తియగుటయు వధింప వచ్చినది యగుటయు నెఱింగి కశ్యపాదులగు పదుండ్రును దానికి దుర్బోధత్వంబు దోఁచునట్లుగా నిర్వచన సహితంబుగాఁ దమనామంబులు సెప్పి; రప్పాపవర్తన వెఱఁగు పడియుండ శునస్సఖుండు దన యభిధానం బభివ్యక్తంబుగా నుగ్గడించినం గృత్తి 'నీ పేరు దెలియం జెప్ప విదియేమి?' యనవుడు నతండు 'తేటపడం జెప్పియుండం జెప్పవనియెద; విట్లంట తప్పుగాదె? యిట్టి యుద్దండవు మంత్ర దండంబు పాలు వడు' మని బ్రహ్మదండ నిభంబగు నిజహస్తగత దండంబున దాని శిరంబు బెట్టు వ్రేయుచుఁ 'బాపకర్ముఁరాలా! పడు ము భస్మంబ వగు మని నిష్ఠురాక్షరంబుగా నిర్దేశించిన దుర్దశ యగుచుంబడి యా రక్కసి భస్మీభూతయయ్యె; నప్పు డప్పదునొకండ్రునుం బ్రమోదంబునం బయోజషండంబు సొచ్చి. 222

ప్రతిపదార్థం: ఏను= నేను; ఎవ్వతను= ఎవర్తిని; ఐతిని= అయితే; ఏమి?; ఈ+కొలనికావలి+ఉన్నదానన్= ఈ సరస్సుకు కావలిగా ఉన్నదానను; అనుటయున్= అనునంతనే; ఆ+మునులు= ఆ మహర్షులు; వెల్లనై= తెల్లబారి; ఆఁకటన్= ఆకలిచేత; అలందురి= కటకటపడి; ఉపజీవింపన్= బ్రతుకుటకు; ఒండు= మరొకటి; ఏమియున్= ఏదియును; లేమిన్+చేసి= లేకపోవటంవలన; ఈ సరోవరంబునన్= ఈ చెరువులో; బిసంబులు= తామరతూండ్లు; వెతికికొని= త్రుంచుకొని; భక్షించువారము+ఐ= తినేవాళ్ళమై; వచ్చితిమి= వచ్చాము; అనినన్= అనగా; ఆ+వనిత= ఆ ఆడది; మీ మీ పేళ్ళు= మీ మీ పేరులు; చెప్పి; మఱి= తరువాత; పద్మవనంబు= తామరలున్న చోటును; ప్రవేశించువారు= చొరగలరు; అని; పలికినన్= పలుకగా; ఆ+పరమ మునులు= ఆ మహర్షులు; ఆ+నాతి= ఆ స్త్రీ; యాతుధాని= రక్కసి; అగుటయున్= కావటమూ; కృత్తి అగుటయున్= కృత్తి అనే మృత్యుదేవత కావటమూ; వధింపన్ వచ్చినది= చంపటానికి వచ్చింది; అగుటయున్= కావటమూ; ఎఱింగి= తెలిసికొని; కశ్యప+ఆదులు+అగు= కశ్యపుడు మొదలగు; పదుండ్రును= పదిమందీ; దానికిన్ = ఆ రక్కసికి; దుర్బోధత్వంబు= అర్థంకాక పోవటం; తోఁచునట్లుగాన్= వ్యక్తమయ్యే తీరున; నిర్వచన సహితంబుగాన్= అర్థ వివరణతోపాటుగా; తమ నామంబులు= తమ పేర్లు; చెప్పిరి= చెప్పారు; ఆ+పాపవర్తన= పాపపు నడవడిగల ఆ ఇంతి; వెఱఁగుపడి+ఉండన్= ఆశ్చర్యపడి ఉండగా; శునస్సఖుండు= శునస్సఖుడనే సన్న్యాసి; తన అభిధానంబు= తన పేరు; అభివ్యక్తంబుగాన్= చక్కగా తెలిసే విధంగా; ఉగ్గడించినన్= చెప్పగా; కృత్తి; నీ పేరు= నీ నామం; తెలియన్= చక్కగా తెలిసే విధంగా; చెప్పవు= చెప్పలేదు; ఇది; ఏమి?= ఎందుకు; అనవుడున్= అన్నంతనే; అతండు= ఆ ముని; తేటపడన్= స్పష్టమయ్యే విధంగా; చెప్పి ఉండన్= చెప్పి ఉండగా; చెప్పవు= చెప్పలేదు; అనియెదవు= అంటావు; ఇట్లు= ఈ విధంగా; అంట= అనటం; తప్పు కాదె!= దోషం కదా!; ఇట్టి ఉద్దండవు= ఇట్టి పొగరుబోతువు; మంత్ర దండంబు= మంత్రశక్తిగల కర్రకు; పాలు పడుము= వశం కమ్ము; అని; బ్రహ్మదండ నిభంబు= బ్రహ్మ దండంవంటిది; అగు నిజహస్తగత దండంబునన్= అయిన తన చేతిలో ఉన్న కర్రతో; దాని శిరంబు= ఆ కృత్తి తలను; బెట్టు= గట్టిగా; వ్రేయుచున్= కొడుతూ; పాపకర్మురాలా!= పాపపు పనులు చేసేదానా!; పడుము= పడిపో; భస్మంబవు= బూడిదవు; అగుము= అయిపొమ్ము; అని; నిష్ఠుర+అక్షరంబుగాన్= పరుషమైన అక్కరాలు ఉండేవిధంగా; నిర్దేశించినన్= పలుకగా; దుర్దశ+అగుచున్= చెడ్డ స్థితికలది ఔతూ; పడి= క్రిందకు దొరలి; ఆ+రక్కసి= ఆ రాక్షసి; భస్మీభూత= బూడిద అయినది; అయ్యెన్= అయింది; అప్పుడు= ఆ సమయంలో; ఆ పదునొకండ్రునున్= ఆ పదునొకండుమందీ; ప్రమోదంబునన్= మిగుల ఆనందంతో; పయోజషండంబు= తామర వనంలోకి; చొచ్చి= ప్రవేశించి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నే నెవరైతే నేమి? ఈ కొలనుకు కావలిదాన్ని' అనగా ఆ మునులు 'మిక్కిలి ఆకలితో కష్టపడి తినటానికి మరేమీ లేకపోవటంవలన ఈ తామరతూండ్లు తీసికొని తినగోరినవారమై వచ్చాం' అన్నారు. అప్పు డా ఇంతి 'మీ మీ పేర్లు చెప్పిన తరువాతనే కొలనులోకి ప్రవేశించాలి' అంటే ఆ మహర్షులు ఆమె రాక్షసి అనీ, కృత్తి అనీ, తమను చంపటానికి వచ్చిందనీ తెలిసికొని కశ్యపుడు మొదలైన పదిమంది తమ పేర్లు దానికి తెలియరాకుండేటట్లుగా నిర్వచనాలతో కూడ కలిపి చెప్పారు. ఆమె అది తెలిసికొనలేక నిశ్చేష్టురాలైంది. శునస్సఖుడు మాత్రం తన పేరు సూటిగా చెప్పాడు. కృత్తి 'నీ పేరు తెలిసే విధంగా చెప్పవేం?' అన్నది. అప్పు డతడు నేను చక్కగా తెలిసే విధంగా చెప్తే చెప్పవు అంటావు. ఇది తప్పు కదా! నీవు చెడిపెవు. ఇదిగో మంత్రదండానికి వశం కమ్ము!' అని బ్రహ్మదండం వంటి తన చేతి కర్రతో దాని నెత్తిమీద గట్టిగా కొట్టుతూ. 'పాపాత్మురాలా! బూడిదైపో' అని పరుషంగా పలికాడు. దానితో అది భస్మమై కూలి పోయింది. అప్పు డా పదునొక్కండ్రు ఆనందంతో తామరల కొలనులోనికి ప్రవేశించారు.

విశేషం: నిర్వచనం అంటే ఆ అర్థం ఏ ధాతువుమూలంగా వచ్చిందో వివరించటం. ఉదాహరణకు కశ్యపుడు అంటే పశ్యకుడు అన్నింటినీ సూక్ష్మదృష్టితో చూచేవాడు అని అర్థం. ఇది ఒక మహా శాస్త్రం చెప్పిన విద్య కనుక ఆ రక్కసికి అర్థం కాలేదు. శునస్సఖుడు సూటిగా తన పేరు చెప్పగా ఇతరుల ధోరణికంటె భిన్నంగా ఉన్నందువలన నిర్వచనం లేకపోవటం కారణంగా అర్థం కాలేదు. శ్రేయస్కాముడు తన పేరు చెప్పరాదని శాస్త్రం **"ఆత్మనామ గురోర్నామ నామాతికృపణస్య చ శ్రేయస్కామో న గృహ్ణీయాత్ జ్యేష్ఠాపత్య కళత్రయోః"** అని అనుశాసనం. కనుక కృత్తి వారు పేర్లు చెబితే దోషాన్ని నిరూపించి చంపాలనుకొన్నది. అది బెడిసికొట్టటం కొరకు అసలు పేర్లు చెప్పక నిర్వచన సహితంగా చెప్పారు.

తే. బిసము లాదట నందఱుఁ బెటికి రొంపి । వోవ నీటఁ దెమల్చి మోపుగ నమర్చి

తీరమునఁ బెట్టి నియమముల్ దీర్పఁజొచ్చి । తీర్చి యాఁకలి దముఁ గోసి తినఁగఁ గూడి. 223

ప్రతిపదార్థం: అందఱున్= వారంతా; ఆదటన్= ప్రీతితో; బిసములు= తామరతూండ్లను; పెటికి= త్రుంచి; రొంపి= బురద; పోవన్= పోయే విధంగా; నీటన్= నీటిలో; తెమల్చి= జాడించి; మోపుగన్= కట్టగ; అమర్చి= ఏర్పరచి; తీరమునన్= ఒడ్డున; పెట్టి= ఉంచి; నియమముల్= సంధ్యాపూజ మొదలైన విధులను; తీర్పన్+చొచ్చి= చేయబూని; తీర్చి= ఆచరించి; ఆఁకలి= క్షుధ; తమున్= తమను; కోసి తినఁగన్= కోసికొని తింటూ ఉండగా; కూడి= కలిసి.

తాత్పర్యం: అందరూ ప్రీతితో ఆ తామరతూడులను పెకలించి బురద పోయేవిధంగా నీటిలో జాడించి మోపుగా కట్టి ఒడ్డునబెట్టి విధులు తీర్చుకొని ఆకలి తమను తినివేస్తుంటే అందరూ కలిసి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఆకలి వారిని తినివేస్తున్నది - అంటే ఆకలితో ప్రేగులు కాలిపోతున్నాయన్నమాట. ఇక్కడ విశేషం ఏమంటే అంత ఆకలితో ఉన్నా నియమాలు తీర్చుకొన్న తరువాతనే తినబోయారు. ఇది వారి ధర్మనిష్ఠను నిరూపిస్తుంది.

క. కొలను వెడలి బిసము లిడిన । నెలవునకుం బోయి యచట నిగిడించిన చూ

డ్కుల కవి దోఁపక యున్నను । గలయం బరికించి యెట్లుఁ గానక తమలోన్. 224

ప్రతిపదార్థం: కొలను= సరస్సునుండి; వెడలి= వెలుపలికి వచ్చి; బిసములు+ఇడిన నెలవునకున్= తామరతూండ్లు పెట్టిన చోటికి; పోయి= వెళ్ళి; అచటన్= అందు; నిగిడించిన చూడ్కులకున్= పరగించిన చూపులకు; అవి= ఆ తూండ్లు; తోఁ

పక+ఉన్నను= కనపడకపోగా; కలయన్= అన్నివైపుల; పరికించి= జాగ్రత్తగా చూచి; ఎట్లున్= ఏ విధంగానూ; కానక= చూడక; తమలోన్= తమలో.

తాత్పర్యం: వారంతా కొలనునుండి బయటకు వచ్చి తూడులమోపు పెట్టినచోట దృష్టి సారించారు. అవి కనపడకపోగా అన్నివైపులా జాగ్రత్తగా చూచారు. అయినా కనపడలేదు. అప్పుడు వారు తమలో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఒండొరుల శంకించి శపథంబులు పలుకుదుము గాక యని నిశ్చయించి శునస్సఖుని వినువానింగాఁ జేసికొని;
రప్పు డత్రి యిట్లనియె. 225

ప్రతిపదార్థం: ఒండొరులన్= ఒకరినొకరు; శంకించి= అనుమానించి; శపథంబులు= ఒట్టులు; పలుకుదుము కాక= పలుకుదాం; అని; నిశ్చయించి= తీర్మానించి; శునస్సఖునిన్= శునస్సఖుడిని; వినువానిన్+కాన్= వినేవాడినిగా; చేసికొనిరి= చేసికొన్నారు; అప్పుడు= ఆ సమయంలో; అత్రి= అత్రి మహర్షి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వారు ఒకరినొకరు అనుమానించారు. ఒట్టుపెట్టుకొని తమ తప్పులేనితనం నిరూపించుకొందామని నిర్ణయించుకొన్నారు. శునస్సఖుడిని మధ్యవర్తిగా వినటానికి ప్రార్థించారు. అప్పుడు అత్రి మహర్షి ఇట్లా అన్నాడు.

విశేషం: ఇట్లా ఒట్టు పెట్టుకొనే పద్ధతి అన్నిదేశాలలో అన్ని కాలాలలో ఉన్నట్లు తెలియవస్తున్నది. పాపభీతి ఉన్నవారు తప్పుచేసి ఒట్టుపెట్టుకొనరు.

తే. 'మొదవుఁ దన్నుట, రవియభిముఖత దనకుఁ। గలుగు మూత్ర పురీష మోక్షణము సేఁత,
యధ్యయన మనధ్యయనమునందు నడపు। టగు బిసంబులు మ్రుచ్చిలి నట్టు లైన.' 226

ప్రతిపదార్థం: (నేను) బిసంబులు= తూడులు; మ్రుచ్చిలిన+అట్టులు+ఐనన్= దొంగిలించినట్లైతే; మొదవున్= ఆవును; తన్నుట= తన్నటం; తనకున్= తనకు; రవి+అభిముఖత= సూర్యు డెదురుగా ఉండటం; కలుగన్= కలుగగా; మూత్ర పురీష మోక్షణము= మూత్రమును, మలమును వదలటం అనే పని; చేఁత= చేయటం; అనధ్యయనము నందున్= వేదం చదువరాని దినాన; అధ్యయనము= చదవటం; నడపుట= సాగించటం; అగున్= అవుతుంది.

తాత్పర్యం: నేను తామరతూండ్లు దొంగిలిస్తే ఆవును తన్నిన పాపం, సూర్యుడి కెదురుగా మలమూత్రాలను విడచిన పాపం, అనధ్యయన దినం నాడు వేదాలు చదివిన పాపమూ నాకు కలుగుతాయి.

విశేషం: ఇవన్నీ మహాపాపాలు. పాడ్యమి, అష్టమి, పూర్ణిమ, అమావాస్య అనే తిథులు అనధ్యయన దినాలు. అట్లాగే పూజ్యులెవరైనా గురుకులానికి వస్తే ఆ దినాన్ని శిష్టానధ్యయనంగా పరిగణిస్తారు.

వ. అనుటయు వసిష్ఠుండు. 227

ప్రతిపదార్థం: అనుటయున్= అన్నంతనే; వసిష్ఠుండు= వసిష్ఠ మహర్షి.

తాత్పర్యం: అప్పుడు వసిష్ఠు డిట్లా అన్నాడు.

క. శ్రుతి సదువమి; సన్న్యాస । స్థితిఁ గాముకుఁ డగుట; గుక్కఁ జేకొని తిరుగన్

మతి రోయమి నయ్యెడు దు । ర్గతి తూఁడులు మ్రుచ్చిలించు కష్టునకు నగున్.' 228

ప్రతిపదార్థం: తూఁడులు= తామరకాడలు; మ్రుచ్చిలించు కష్టునకున్= దొంగిలించిన నీచుడికి; శ్రుతి= వేదం; చదువమి= చదవకపోవటం; సన్న్యాస స్థితిన్= సన్న్యసించిన దశలో; కాముకుఁడు= స్త్రీ మోహం కలవాడు; అగుట= కావటం; కుక్కన్= కుక్కను; చేకొని= పట్టుకొని; తిరుగన్= తిరుగగా; మతిన్= బుద్ధిలో; రోయమిన్= ఏవగించుకొనకపోవటంవలన; అయ్యెడు దుర్గతి= కలిగే నీచదశ; అగున్= అవుతుంది.

తాత్పర్యం: తామరతూడులు దొంగిలించిన నీచుడికి వేదం చదవకపోయిన పాపం, సన్న్యసించి కామభావన పొందినవాడి పాపం, కుక్కను పట్టుకొని తిరుగుతూ అసహ్యించుకొననివాడికయ్యే దుర్గతీ కలుగుతాయి.'

విశేషం: బ్రాహ్మణుడు నిష్కారణంగా ఆరు అంగాలతోకూడిన వేదం చదవాలని స్మృతి చెప్పింది. కనుక చదవకపోవటం పాపం, 'సన్న్యాసం' అంటే కామక్రోధాది భావాలను పూర్తిగా అవతల ఉంచటం. ఆ స్థితి పొంది కామభావనకు లోబడితే అది రెండింటికీ చెడిన స్థితి అవుతుంది.

వ. అని వెండియు. 229

తాత్పర్యం: అని పలికి వసిష్ఠుడు ఇంకా ఇట్లా అంటున్నాడు.

క. 'సుత నమ్మికొనుట, శరణా । గతుఁ జేకొనకునికి నిచ్చు కారుణికు దరి

ద్రతఁ జూచియు వేఁడుట నగు । గతి బిసములు దాఁచికొనుట గల్గినఁ గల్గున్.' 230

ప్రతిపదార్థం: సుతన్= బిడ్డను; అమ్మికొనుట= అమ్ముకొనటం; శరణ+ఆగతున్= రక్షణ కోరి వచ్చినవాడిని; చేకొనక+ఉనికిన్= కైకొనకుండటం; ఇచ్చు కారుణికు దరిద్రతన్= ఇచ్చే దయగలవాడిలేమిని; చూచియున్= చూచికూడా; వేఁడుటన్= యాచించటంవలన; అగుగతి= అయ్యే దశ; బిసములు= తామరతూండ్లు; దాఁచికొనుట= దాచుకొనటం; కల్గినన్= కలిగితే; కల్గున్= కలుగుతాయి.

తాత్పర్యం: 'కన్న కూతురిని అమ్ముకొనటం, శరణుకోరి వచ్చినవాడిని రక్షించకపోవటం, దాత దరిద్రుడు కావటం చూచికూడా అడుగుకొనటం అనే పాపాలు తూడులు దాచిన వాడికి కలుగుతాయి.'

వ. అనియెఁ; దదనంతరంబ. 231

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; తత్+అనంతరంబు+అ= వెంటనే.

తాత్పర్యం: వసిష్ఠు డిట్లా అన్నాడు. ఆ తరువాత.

చ. 'పలలవృథోపభుక్తి, సభఁ బక్షముఁ బల్కుట, దుష్టదాన, ము

గ్మలి దివసంబునం గవయు కష్టత, విప్రజనంబు లుబ్ధతా

కులితముఁ జేత, యెల్లసరకుం గొని యమ్ముట కాదె తూఁడు తీఁ

గలపొది మ్రుచ్చిలించు' టని కశ్యపసంయమి వల్కె భూవరా! 232

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; కశ్యపసంయమి= కశ్యపుడనే మహర్షి; పలల వృథా+ఉపభుక్తి= మాంసం వ్యర్థంగా తినటం; సభన్= న్యాయస్థానంలో; పక్షమున్= ఒకడివైపు; పల్కుట= మాటాడటం; దుష్టదానము= చెడుదానం; ఉగ్మలిన్= స్త్రీని (భార్యను); దివసంబునన్= పగటియందు; కవయు కష్టత= సంగమించే నీచత్వం; విప్రజనంబున్= చక్కని విద్యగలవారిని; లుబ్ధతా+ఆకులితము= లోభగుణంతో కలత పొందిన వారినిగా; చేఁత= చేయటం; ఎల్లసరకున్= సరుకునంతా; కొని; అమ్మట= అమ్మటం; కాదె= కదా; తూఁడుతీఁగల పొదిన్= తామరతూడు తీగల మోపును; ప్రుచ్చిలించుట= దొంగిలించటం; అని; పల్కెన్= పలికాడు.

తాత్పర్యం: కశ్యపమహర్షి ఇట్లా అన్నాడు. 'మాంసం వ్యర్థంగా తినటం, న్యాయస్థానంలో అన్యాయంగా ఒకడివైపు సాక్ష్యం పలకటం, చెడుదానం, స్త్రీని పగటిపూట కలిసే నీచత, విద్యగల బ్రాహ్మణులను లోభగుణంచేత ఏడిపించటం, సరుకునంతా నిలువచేసి ఎక్కువ లాభాలకు అమ్ముకొనటం ఈ తామరతూడుల మోపు దొంగిలించటం అవుతుంది.

విశేషం: "విద్యయా యాతి విప్రత్వమ్" మోక్షవిద్యవలననే బ్రాహ్మణుడు విప్రుడవుతాడు. ఆ పాపాలు చేసినవాడి కేగతి కలుగుతుందో ఈ దొంగతనం చేసినవాడి కదేగతి అని తాత్పర్యం.

వ. పదంపడి. 233

తాత్పర్యం: తరువాత.

క. జ్ఞాతులయెడ గోవులయెడ । గోతులయెడ ధర్మ మెడలి క్రూరుఁ డగుట కా
ర్యాతుర విప్రోపేక్షా । నీతి బిసము లపహరించు నిపుణత యరయన్. 234

ప్రతిపదార్థం: బిసములు= తామరతూండ్లు; అపహరించు నిపుణత= దొంగిలించే నేర్పు; అరయన్= పరిశీలించగా; జ్ఞాతులయెడన్= బంధువుల విషయంలో; గోవులయెడన్= ఆవుల విషయంలో; గోతులయెడన్= స్త్రీల విషయంలో; ధర్మము= ధర్మాన్ని; ఎడలి= వీడి; క్రూరుఁడు= దయలేనివాడు; అగుట= కావటం; కార్య+ఆతుర విప్ర+ఉపేక్షా నీతి= పని తొందరతో దిగులుగల విద్యావంతులగు బ్రాహ్మణులయెడ ఉదాసీనత పాటించటం అనే నీతి.

తాత్పర్యం: ఈ తామరతూడులను దొంగిలించే నేర్పు ఎటువంటిదంటే బంధువుల విషయంలో, ఆవుల విషయంలో, స్త్రీల విషయంలో ధర్మం తప్పి దయలేనివాడు కావటం, పనిపడి దిగులుగా ఉన్న విప్రులను గూర్చి పట్టించుకొనని నీతివంటిది.'

విశేషం: జ్ఞాతులు, గోవులు, స్త్రీలు, విప్రులు - వీరి యందు చిన్నపాటి దోషాలున్నా పట్టించుకొనకూడదని విదురనీతిలో చెప్పారు. (సం.5.36. 62. తెలుగు. ఉ.2.68)

క. అని పలికి భరద్వాజుం । డను మఱియు 'హవిస్సు గ్రంప నగ్ని నిడుట, యొ
జ్జ నధఃకరించి చదువుట । యను నివి సరియౌ బిసాపహరణంబునకున్.' 235

ప్రతిపదార్థం: అని= ఇట్లని; పలికి= మాట్లాడి; భరద్వాజుండు= భరద్వాజ మహర్షి; మఱియున్= ఇంకా; అనున్= అన్నాడు; హవిస్సు= వేల్చే పదార్థాన్ని; క్రంపన్= కంపయందలి; అగ్నిన్= నిప్పునందు; ఇడుట= ఉంచటం; ఒజ్జన్= గురువును; అధః

కరించి= క్రిందుచేసి; చదువుట= చదవటం; అను+ఇవి= అనే ఈ పనులు; బిస+అపహరణంబునకున్= తామరతూండ్లు దొంగిలించటానికి; సరి= సాటి; ఔన్= అవుతాయి.

తాత్పర్యం: ఇట్లా పలికి భరద్వాజ మహర్షి ఇంకా ఇట్లా అన్నాడు. 'మంత్రంతో పవిత్రమైన పదార్థాన్ని కంపలోని అగ్నిలో పోయటం, గురువును తక్కువచేసి విద్యను నేర్వటం అనే పనులు తామరతూండ్ల దొంగతనానికి సాటి అవుతాయి.'

విశేషం: హవిస్సును ప్రత్యేకంగా ఏర్పరచిన ధార్యాగ్నిలోనే ఉంచాలి. లేకపోతే అది పనికిమాలిన దవుతుంది.

వ. అని పలుకుటయు. 236

తాత్పర్యం: అత డట్లా పలికిన తరువాత.

తే. "ముట్టునను భార్యఁ గవయుట, మూత్రమును బు । రీషమును నీర విడుపు, విద్వేషయుక్తి
యోషి దుపజీవనము మృణాళోత్కరంబు । ముచ్చిలుటఁ బోలు కల్మషములె తలంప.' 237

ప్రతిపదార్థం: ముట్టునను= చెరగుమాసినపుడు; భార్యన్= పెండ్లమును; కవయుట= కలియటం; మూత్రమును= మూత్రాన్నీ; పురీషమును= మలాన్ని; నీరన్= నీటిలో; విడుపు= విడవటం; విద్వేషయుక్తి= పగతోకూడి ఉండటం; యోషిత్+ఉపజీవనము= ఆడదానిపై ఆధారపడి బ్రతకటం; తలంపన్= ఆలోచిస్తే; మృణాళ+ఉత్కరంబు ముచ్చిలుటన్= తామరతూడుల మోపును దొంగిలించటాన్ని; పోలు కల్మషములు+ఎ?= పోలిన పాపాలా?

తాత్పర్యం: 'ముట్టైన భార్యను కలవటం, మలమూత్రాలను నీటిలో వదలటం, పగగొని ఉండటం, స్త్రీపై ఆధారపడి బ్రతకటం ఈ తామరతూడుల దొంగతనానికి సాటియైన పాపాలా!'

విశేషం: ఆ పాపాలకన్నా ఇది మిక్కిలి ఘోరమైన దని భావం.

క. అని జమదగ్ని మఱియు ని । ట్లను 'నన్యోన్యాతిథిత్వ మసహాయపువై
రనిరూఢి, పాఁడి మొదవుం । గనలి యడుచు టీడె బిసనికర చోరతకున్. 238

ప్రతిపదార్థం: అని= ఇట్లా పలికి; జమదగ్ని= జమదగ్ని మహర్షి; మఱియున్= ఇంకా; ఇట్లు= ఇట్లా; అనున్= అన్నాడు; అన్యోన్య+అతిథిత్వము= ఒకడి కొకడు అతిథి కావటమూ, అసహాయము+వైర నిరూఢి= తోడులేని పగను గట్టిగా నిలుపుకొనటమూ; పాఁడిమొదవున్= పాడి ఆవును; కనలి= కోపగించి; అడుచుట= కొట్టటం; బిస నికర చోరతకున్= తామరతూండ్ల మోపు దొంగిలింతకు; ఈడు+ఎ?= సాటియా?

తాత్పర్యం: ఇట్లా చెప్పి జమదగ్ని ఇంకా ఇట్లా అన్నాడు. 'ఒకరి కొకరు అతిథులు కావటం, సాయంలేని పగను నిలుపుకొనటం, పాడి ఆవును కోపించి కొట్టటం అనే పాపాలు ఈ తామరతూండ్ల దొంగతనానికి సాటి అవుతాయా?'

విశేషం: ఆ పాపాలన్నింటిని మించిన పాపం ఇది అని భావం.

వ. అనవుడు గౌతముండు. 239

తాత్పర్యం: అన్న తరువాత గౌతము డిట్లా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'ధృతవేద త్యజనానల। వితతి వృథాత్యాగ సోమ విక్రయ వృషలీ
పతితా దుర్గ్రామాజీ। వితలు బిసస్తేయ కష్టవృత్తికి నెనయే? 240

ప్రతిపదార్థం: ధృత= చేపట్టిన; వేద= వేదాలను; త్యజన= వదలటం; అనల= అగ్నుల; వితతి= సముదాయాన్ని; వృథా= వ్యర్థంగా; త్యాగ= వదలివేయటం; సోమ విక్రయ= సోమరసాన్ని అమ్మటం; వృషలీపతితా= శూద్ర స్త్రీకి మగడు కావటం; దుర్గ్రామ+ఆజీవితలు= చెడ్డ ఊరిలో బ్రతుకుతూ ఉండటం అనే పాపాలు; బిసస్తేయ కష్ట వృత్తికిన్= తూండ్ల దొంగతనమనే నీచపు నడవడికి; ఎన+ఏ?= సాటియా.

తాత్పర్యం: 'చేపట్టిన వేదవిద్యను వదలివేయటం, అగ్నిహోత్రపూజను నిష్కారణంగా మానటం, సోమం అమ్మటం, శూద్రస్త్రీకి మగడు కావటం, చెడ్డ ఊరిలో జీవించటం అనే పాపాలు తామరతూండ్ల దొంగతనానికి సాటి అవుతాయా?'కావని భావం.

వ. అని నిర్దేశించిన విశ్వామిత్రుం డిట్లనియె. 241

ప్రతిపదార్థం: అని= ఇట్లా అని; నిర్దేశించినన్= పలుకగా; విశ్వామిత్రుండు= విశ్వామిత్ర మహర్షి; ఇట్లు= ఇట్లా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అని పలుకగా విశ్వామిత్రు డిట్లా అన్నాడు.

క. 'తగు భృత్యులఁ బ్రోవకునికి। దగని భటులఁ బ్రోపు కపటధార్మికవృత్తిన్
జగతీపతిఁ గొల్చుట లె। స్సగఁ బోలఁగ నేర్చునే బిసస్తైన్యంబున్?' 242

ప్రతిపదార్థం: తగు భృత్యులన్= యోగ్యతకల బంటులను; ప్రోవక+ఉనికి= కాపాడకుండటమూ; తగని భటులన్= పనికిరాని బంటులను; ప్రోపు= రక్షించటం; కపట ధార్మిక వృత్తిన్= మోసపు ధర్మానికి సంబంధించిన నడవడికతో; జగతీపతిన్= రాజును; కొల్చుట= సేవించటం; బిసస్తైన్యంబున్= తామరతూడుల దొంగతనాన్ని; లెస్సగన్= బాగుగా; పోలఁగన్+నేర్చునే?= సాటిరాగలదా?

తాత్పర్యం: పనికి వచ్చే సేవకులను రక్షించక పోవటమూ, పనికిరాని సేవకులను కాపాడటమూ, కపటధర్మపు నడవడితో రాజును సేవించటం అనేవి తామరతూడుల దొంగతనానికి సాటి రాగలవా?

విశేషం: విశ్వామిత్రుడు ఒకప్పుడు రాజర్షి. కనుక భట సంరక్షణ విషయకంగా పలకటం సముచితంగా ఉన్నది.

వ. నావుడు నరుంధతి యల్ల నవ్వుచు. 243

ప్రతిపదార్థం: నావుడున్= అని పలికిన తరువాత; అరుంధతి= వసిష్ఠుడి ధర్మపత్ని అయిన అరుంధతి; అల్లన్= మెల్లగా; నవ్వుచున్= నవ్వుతూ.

తాత్పర్యం: అప్పుడు అరుంధతి మెల్లగా నవ్వుతూ (ఇట్లా అన్నది).

విశేషం: ఇక్కడ నవ్వు హృదయంలోని నిర్మలత్వానికి గుర్తు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'సతతంబు నత్త దూఱుటఁ, బతియెడ దుశ్చిత్త యగుటఁ, బరమాన్నము నొ
క్కత సేవించుట నగు దు। ర్గతి బిసములు డాఁచికొన్న కష్టకుఁ గలుగున్.' 244

ప్రతిపదార్థం: సతతంబున్= ఎల్లవేళలా; అత్తన్= అత్తను; దూఱుటన్= తిట్టటంవలన; పతి ఎడన్= మగని విషయంలో; దుశ్చిత్త= చెడు భావాలు గలది; అగుటన్= కావటంవలనా; పరమ+అన్నమున్= శ్రేష్ఠమైన అన్నం; ఒక్కత= ఒకతే; సేవించుటన్= తినటంవలన; అగు దుర్గతి= అయ్యే పాడుగతి; బిసములు= తామరతూడులు; దాచికొన్న కష్టకున్= దాచుకొన్న నీచురాలికి; కలుగున్= వస్తుంది.

తాత్పర్యం: 'ఎప్పుడూ అత్తను తిట్టటంవలనా, భర్తవిషయంలో చెడు భావాలు గలది కావటంవలనా, మంచిభోజనం ఒక్కతే తినటం వలనా కలిగే పాడుగతి తామరతూడులు దాచుకొన్న నీచురాలికి వస్తుంది.'

విశేషం: 'అత్త' ఇక్కడ ఉపలక్షణం. మగని బంధువులందరినీ గ్రహించాలి. స్త్రీ పుట్టిల్లు విడిచి మెట్టినిల్లు చేరిన పిదప అక్కడివారి నందరినీ ఆత్మీయులుగా భావించి ప్రేమించకపోతే ఆ ఇల్లు నరకప్రాయం అవుతుందని భావం. 'పతియెడ' భార్యాభర్తలు ఒకరి విషయంలో ఒకరు త్రికరణ శుద్ధిగా మంచి భావనతో ఉండాలి. లేకపోతే అది సంసారాన్ని నరకకూపం చేస్తుంది. 'పరమాన్నము' స్త్రీ మాతృ స్వరూపిణి. ఆమె ఆహారాన్ని తనవారికందరికీ పెట్టిన తరువాతనే భుజిస్తుంది. అంతేకాదు **"ఏకః స్వాదు న భుఞ్జీత"** అన్న సూక్తి కూడా రుచిగల పదార్థాన్ని ఒక్కడే తినకూడదని చెప్తున్నది. ఒక్కతే తినటం మాతృధర్మానికి విరుద్ధం. అందుకే ఆమె కష్ట - నీచురాలు.

అరుంధతి స్త్రీ ధర్మసంబంధమైన పలుకులు పలకటం ఉచితం.

సీ. అనుడు 'వంటకము సేసిన యింతి తా మున్ను। గుడుచుట, పనియెడఁ గుటిల యగుట,
బొంకులు పలుకుట, పుత్త్రిక వెలగొని। యిచ్చుట, సుజనుల కెగ్గు సేఁత,
యెట్టి దుర్గతిఁ దెచ్చు నట్టిద కల్గు బి। సావలి మ్రుచ్చిలి నట్టులైన;
నిట్లు గాకయుఁ బుట్టువెల్ల దాస్యంబు నీఁ। గకపోవు నక్కీడు గల నికృష్ట'

తే. యనియె గండ; 'యసంతానుఁ డగుట, గర్భ దాసుఁ డగుట దరిద్రత్వ తప్తుఁ డగుట
చెందుఁ దూఁడులకట్ట మ్రుచ్చిలిన కష్ట। నరుని' కని పల్కెఁ బశుసఖనాముఁ డధిప! 245

ప్రతిపదార్థం: అనుడున్= అన్నంతనే; గండ= గండ అనే సేవకురాలు; బిస+ఆవలిన్= తూడుల కట్టను; మ్రుచ్చిలిన+ అట్టులు+ఐనన్= దొంగిలిస్తే; వంటకము చేసిన ఇంతి= పాకంచేసిన ఆడది; తాన్= తాను; మున్ను= ముందుగా; కుడుచుట= తినటమూ; పనియెడన్= చేసే పనివిషయంలో; కుటిల= చిత్తశుద్ధిలేనిది; అగుట= కావటమూ; బొంకులు= కల్లపలుకులు; పలుకుట= పలకటమూ; పుత్త్రికన్= కన్నబిడ్డను; వెల+కొని= మూల్యం తీసికొని; ఇచ్చుట= ఇవ్వటమూ; సుజనులకున్= మంచివారికి; ఎగ్గు= కీడు; చేఁత= చేయటమూ; ఎట్టి దుర్గతిన్= ఎటువంటి పాడుగతిని; తెచ్చున్= తెస్తాయో; అట్టి+అది+అ= అట్టి పాడు గతియే; కల్గున్= కలుగుతుంది; ఇట్లు+ కాకయున్= ఇంతే కాక; ఆ+కీడు కల నికృష్ట= ఆ దోషం ఉన్న నీచురాలు; పుట్టువు+ఎల్లన్= బ్రతుకంతా; దాస్యంబున్= బానిస తనాన్ని; ఈఁగకపోవున్= తొలగించుకొనలేక పోతుంది; అనియెన్= అన్నది; అధిప!= రాజా!; పశుసఖనాముఁడు= పశుసఖుడనే పేరుగలవాడు; తూడులకట్టన్= తూఁడుల మోపును; మ్రుచ్చిలిన కష్ట నరునికిన్= దొంగిలించిన నీచ మానవుడికి; అసంతానుఁడు= బిడ్డలు లేనివాడు; అగుట= కావటమూ;

గర్భదాసుఁడు= తల్లి గర్భంలో ఉండినప్పటినుండీ బానిస; అగుట= కావటమూ; దరిద్రత్వ తప్తుఁడు= లేమితో కాలిపోయినవాడు; అగుట= కావటమూ; చెందున్= పొందుతాడు; అని; పల్కెన్= పలికాడు.

తాత్పర్యం: గండ అనే సేవకురాలు 'తామరతూడులు దొంగిలించిన నీచురాలికి వంటచేసి ముందుగా తినటం, పనులలో వంచనచేయటం, అబద్ధాలు పలకటం, పుత్రికను సొమ్ముకు అమ్ముకొనటం, మంచివారికి కీడు చేయటం అనే పాపాలు తెచ్చే దుర్గతిని తెస్తుంది. ఇంతే కాక బ్రతుకంతా దాస్యం వదలని స్థితి ఆ నీచురాలికి కలుగుతుంది' అని పలికింది. పశుసఖుడు తామరతూడులు దొంగిలించినవాడు, సంతానం లేనివాడు, గర్భదాసుడు, కూడుగుడ్డలకు చెడినవాడూ అవుతా' డని పలికాడు.

విశేషం: ఇక్కడ సేవకవృత్తిలో ఉన్న ఈ దంపతులు తదనుగుణంగా పలకటం గమనించదగింది. ఋషి ఈ నెపంతో ఆయా వ్యక్తుల ధర్మాలను వ్యంగ్యమార్గంలో సూచించారు.

వ. అని యిట్లందఱుం దన కభిముఖులై పలికిరి; వారితో శునస్సఖుం డిట్లనియె. 246

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా అందఱున్= వారందరూ; తనకున్= తనకు; అభిముఖులు= ఎదురుమొగం కలవారు; ఐ= అయి; పలికిరి= పలికారు; వారితోన్= వారితో; శునస్సఖుండు= శునస్సఖుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా వారందరూ తనవైపు మొగం పెట్టి పలికారు. అప్పుడు శునస్సఖుడు వారితో ఇట్లా అన్నాడు.

క. 'ఛందోజ్ఞున కైనను, దన । నందన నధ్వర ధురీణునకు నైనను నా
నందముగ నిచ్చుటం బో । లుం దూఁడులకట్ట మ్రుచ్చిలుట దలపోయన్.' 247

ప్రతిపదార్థం: తలపోయన్= ఆలోచింపగా; తూఁడులకట్టన్= తామరతూడుల మోపును; మ్రుచ్చిలుట= దొంగలించటం; తననందనన్= తన బిడ్డను; ఛందోజ్ఞునకున్+ఐనన్= వేదా లెరిగిన వాడికిగానీ; అధ్వర ధురీణునకున్= యజ్ఞాలలో ఎక్కువభారం వహించేవాడికి; ఐననున్= కానీ; ఆనందముగన్= సంతోషంగా; ఇచ్చుటన్= దానంచేయటంతో; పోలున్= సాటి అవుతుంది.

తాత్పర్యం: 'బాగా ఆలోచిస్తే తామరతూడుల మోపును దొంగిలించటం తన కూతురిని మంచి వేదవేత్తకో, యజ్ఞభారాలు వహించేవాడికో ఇవ్వటంతో సమానం అవుతుంది.'

విశేషం: ఛందోజ్ఞుడు - ఛందస్సు అంటే వేదం. ఇష్టప్రాప్తికీ, అనిష్ట పరిహారానికీ అలౌకికమైన ఉపాయం చెప్పే మహావాఙ్మయం. దానిని తత్త్వ పూర్వకంగా తెలిసికొనటం చాలా గొప్ప విషయం. అట్టివాడు కోటికొకడు ఉండవచ్చును. అతడికి కన్యను ఇవ్వటమంటే అది అనంత పుణ్యఫలాన్నిస్తుంది.

యజ్ఞ ధురీణుడు - యజ్ఞం చేయాలంటే అంగబలం, అర్థబలం, బుద్ధిబలం, మంత్రాలబలం మొదలైనవి ఎన్నో పుష్కలంగా ఉండాలి. భారతంలో సభాపర్వంలో రాజసూయయాగం ధర్మరాజు చేసిన ధోరణిని చక్కగా వివరించారు. దానిని అనుశీలిస్తే దీని సంగతి తెలుస్తుంది. యజ్ఞం సక్రమంగా నిర్వహిస్తే మహాఫలా న్నిస్తుంది. నిర్వహించలేకపోతే మహాప్రమాదం ముంచుకొని వస్తుంది. కాబట్టి 'ధురీణుడు' - ప్రమాదంలేకుండా గట్టెక్కించగలవాడు - దుర్లభుడు. అట్టివాడికి కన్య నివ్వటం మహాపుణ్య ఫలాన్నిస్తుంది. శునస్సఖుడు ఇప్పటి దొంగతనాన్ని దానితో పోలుస్తున్నాడు!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. అనిన నయ్యందఱును 'బుణ్యమైన కర్మ । మనఘ! శపథంబునకు విషయముగ నీవు
పలికి; తటుగాన బిసలతా ప్రతతి సపహ । రించినాఁడవు; మమ్ముఁ గారింప కిమ్ము. 248

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+అందఱును= వారందరూ; అనఘ!= పుణ్యాత్ముడా!; నీవు; పుణ్యకర్మము= పుణ్యమైన పనిని; శపథంబునకున్= ఒట్టునకు; విషయముగన్= విషయంగా; పలికితి= పలికావు; అటు+కానన్= కాబట్టి; బిసలతా ప్రతతిన్= తామరతూడుల కట్టను; అపహరించినాఁడవు= దొంగలించినవాడవు; మమ్మున్= మమ్ములను; కారింపక= బాధింపక; ఇమ్ము= ఇచ్చివేయుము.

తాత్పర్యం: అత డట్లా అంటే వారంతా 'అయ్యా! నీవు పుణ్యకార్యాన్ని ఒట్టుకు సంగతిగా చేసి మాటాడుతున్నావు. అంటే తామరతూడులు దొంగిలించా వన్నమాట. మమ్ములను బాధించక వాటిని మాకిచ్చివేయుము' అన్నారు.

విశేషం: ఆ ఋషులూ, సేవక దంపతులు పాపాలమీద ఒట్టుపెట్టుకొన్నారు. శునస్సఖుడు పుణ్యంతో పోల్చాడు. అంటే అతడే దొంగిలించాడని నిర్ణయం చేయటానికి అవకాశం కల్పించాడు.

సీ. అనిన 'నిక్కం బిది యందఱు నొండొరు । నేమనియెదరొ? వీ రీబిసముల
పొది యేను దాఁచి చూచెద నని దాఁచితి; । నిదె కొనుఁ' డని దాని నిచ్చి, మీకు
నలిగి వధించుటకై హోమవహ్నిఁ బు । ట్టించి వృషాదర్భి పంచెఁ గృత్తి;
నది మున్న కాంచి రక్షార్థినై వచ్చి యా । రక్కసిఁ జంపితి; నిక్కమునకు

ఆ. వాసవుండ; లోభవర్జనముఖ భవ । త్స ద్గుణములఁ జేసి శాశ్వతంపు
నెలవు గలిగె; రండు నెగయుండు పుణ్యలో । కముల' కని సమాదరమునఁ బలికె. 249

ప్రతిపదార్థం: అనినన్= అని వారు పలుకగా; ఇది= ఈ విషయం; నిక్కంబు= నిజం; వీరు= ఈ ఋషులు; అందఱున్= అందరూ; ఒండొరున్= ఒకరినొకరు; ఏమి; అనియెదరొ= భావిస్తారో; ఈ బిసముల పొది= ఈ తూడుల మోపును; ఏను= నేను; దాఁచి= దాచి; చూచెదన్= చూస్తాను; అని; దాఁచితిన్= దాచాను; ఇదె= ఇదిగో; కొనుఁడు= తీసికొనండి; అని; దానిన్= ఆ మోపును; ఇచ్చి; మీకున్= మీ మీద; అలిగి= కోపించి; వధించుటకున్+ఐ= చంపటానికి; వృషాదర్భి= వృషాదర్భి అనే రాజు; కృత్తిన్= కృత్య అనే రక్కసిని; హోమవహ్నిన్= హోమపు అగ్నిలో; పుట్టించి; పంచెన్= పంపాడు; అది= ఆ విషయం; మున్ను+అ= ముందే; కాంచి= తెలిసికొని; రక్షా+అర్థిని+ఐ= రక్షచేయగోరినవాడినై; వచ్చి= అరుదెంచి; ఆ రక్కసిన్= ఆ రక్కసిని; చంపితిన్= చంపివేశాను; నిక్కమునకున్= నిజానికి; వాసవుండన్= దేవేంద్రుడను; లోభ వర్జన ముఖ భవత్ సద్గుణములన్+చేసి= దురాశవదలటం మొదలైన మీ మంచి గుణాలవలన; శాశ్వతము+నెలవు= ఎన్నటికీ చెడని చోటు; కలిగెన్= సిద్ధించింది; రండు= రండి; పుణ్యలోకములకున్= పుణ్యలోకాలకు; నెగయుండు= పైకి లేవండి; అని; సమాదరమునన్= మిక్కిలి ఆదరంతో; పలికెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ ఋషులు ఆ విధంగా పలుకగా అతడు 'నిజమే ఈ తూడుల విషయంలో మీలో మీరు ఎట్లా సంభావిస్తారో చూడాలని వాటిని నేనే దొంగిలించాను. ఇవిగో తీసికొనండి' అని వాటిని వారి కిచ్చి 'వృషాదర్భి మీమీద కోపంతో మిమ్ములను చంపటానికి హోమాగ్నిలో కృత్యను పుట్టించి పంపాడు. దానిని ముందే తెలిసికొని మిమ్ములను కాపాడటానికి వచ్చి యా రక్కసిని చంపాను. నేను నిజానికి దేవేంద్రుడను. లోభం వదలటం మొదలైన మీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మంచిగుణాలవలన మీకు శాశ్వతలోకాలు సిద్ధించాయి. రండి ఆ పుణ్యలోకాలను అధిరోహించండి' అని ప్రీతితో పలికాడు.

విశేషం: 'ఏమి+అనియెదరో!' - సాధారణంగా ఇటువంటి సందర్భాలలో ఒకరినొకరు శంకిస్తారు. సత్యం తెలిసికొనలేక ఇతరులయందు ద్వేషం పెంచుకొంటారు. అది మానవనైజం. దేవేంద్రుడు దానిని పరీక్షించాడు. "లోభవర్జనముఖ' - లోభం మహాపాపగుణం. అది వదలితే ఫలం శాశ్వత లోకప్రాప్తి. మనుజుడు దీనిని గుర్తించాలి. అల్పవస్తువులమీది లోభంవలన శాశ్వతంగా పాపలోకాలలో నివసించాలి. ఆ కాస్త దుర్గుణాన్ని ప్రయత్నంతో వదలగలిగితే అక్షయపుణ్య లోకాలు లభిస్తాయి. ఇది ఈ కథలోని ఉపదేశం.

వ. అట్లు పలుకుటయు. 250

తాత్పర్యం: అత డట్లు పలికినంతనే.

చ. అనయముఁ బ్రీతిఁబొంది మును 'లట్టుల చేసెద మంచు నింద్రు ప
జ్జన తగ నేఁగి దేవపరిషత్పరిపూజ్యపదస్థులై వెలిం
గి నిఖిలలోక నిత్యపరికీర్తితమూర్తుల నొప్పి; రింతయు
న్వినుము మపరిగ్రహంబు మహనీయత నైనది సూవె భూవరా! 251

ప్రతిపదార్థం: మునులు= ఆ మహర్షులు; అనయమున్= మిక్కిలి; ప్రీతిన్= ప్రీతిని; పొంది; అట్టులు+అ= అట్లే; చేసెదము= చేస్తాం; అంచున్= అంటూ; ఇంద్రు పజ్జన్+అ= ఇంద్రుడి ప్రక్కనే; తగన్= చక్కగా; ఏఁగి= వెళ్ళి; దేవ పరిషత్ పరి పూజ్య పదస్థులు= దేవతల సభలో మిక్కిలి పూజించదగిన స్థానంలో ఉన్నవారు; ఐ= అయి; వెలింగి= ప్రకాశించి; నిఖిలలోక నిత్య పరికీర్తిత మూర్తులన్= అన్ని లోకాలలో ఎప్పుడూ కొనియాడబడే ఆకారాలతో; ఒప్పిరి= ఒప్పారారు; భూవరా!= రాజా!; వినుము= శ్రద్ధగా ఆలకించుము; ఇంతయున్= ఇదంతా; అపరిగ్రహంబు మహనీయతన్= ఇతరుల సొమ్మును దానరూపంలో కూడా గ్రహించని గొప్పతనంవలన; ఐనది= అయింది; సూవె!= సుమా!

తాత్పర్యం: ఆ మునులందరూ ఎంతో ప్రీతి పొంది అట్లాగే చేస్తామని పలికి దేవేంద్రుడి ప్రక్కనే చక్కగా అరిగి దేవలోకంలో పూజించదగిన స్థానాలలో ప్రకాశిస్తూ లోకాలన్నీ మన్నించి కొనియాడే రూపాలతో మెరిసిపోయారు. రాజా! వినుము. ఇదంతా పుచ్చుకొనకపోవటం అనే గుణపు గొప్పతనంవలన కలిగింది సుమా!

విశేషం: దేవపరి.....పదస్థులై; నిఖిల... మూర్తులన్ - అనే దీర్ఘ సమాసాలు వారి గొప్పతనపు ఆధిక్యాన్ని సూచిస్తున్నాయి.

సాధారణంగా ఒకడు దానాదులను తన పాపాలను పోగొట్టుకొనటానికి చేస్తాడు. అంటే అవి పుచ్చుకొనే వాడికి సంక్రమించే ప్రమాదం ఉన్నది. తన పాపాలే తనను పట్టి పల్లారుస్తూ ఉండగా ఇతరుల పాపాలు చుట్టుకొంటే కలిగే నరకయాతన ఎట్టిదో మనం ఊహించవచ్చును. కనుక 'అపరిగ్రహం' మహాపుణ్యంగా చెప్పారు.

క. కావున లోభము విడుచుట । కేవియు సరిగావు గుణము; లీగుణము మహీ
దేవునకు వలయుఁ బెద్దయు । నీ విధమున కమరసంఘ మెంతయు మెచ్చున్.' 252

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; గుణములు= ఇతర గుణాలు; ఏవియున్= ఏవి కూడా; లోభము విడుచుటకున్= లోభాన్ని విడవటానికి; సరి కావు= సాటికావు; ఈ గుణము= ఈ లోభం వదలట మనే గుణం; మహీదేవునకున్= బ్రాహ్మణుడికి; పెద్దయున్= చాలా ఎక్కువగా; కావలయున్= కావాలి; ఈ విధమునకున్= ఈ పద్ధతికి; అమరసంఘము= దేవతల సముదాయం; ఎంతయున్= ఎంతో; మెచ్చున్= మెచ్చుతుంది.

తాత్పర్యం: కాబట్టి లోభాన్ని విడవటానికి మ రేగుణాలూ సాటి రావు. అందునా బ్రాహ్మణుడు దీనిని మరింత శ్రద్ధతో పాటించాలి. దీనిని దేవతలెంతో గొప్పగా భావిస్తారు.'

విశేషం: బ్రాహ్మణుడి బ్రతుకు తక్కిన వర్ణాలవారికంటె ఎంతో కఠోరనియమాలతో కూడింది. తక్కిన వారికి అల్పప్రయత్నంతో కలిగే ఉత్తమ ఫలాలు అతడికి మహా ప్రయత్నంతో గానీ సిద్ధించవు.

వ. అని చెప్పి భీష్ముండు వెండియు. 253

ప్రతిపదార్థం: అని; చెప్పి= వివరించి; భీష్ముండు= భీష్ముడు; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: భీష్మ డిట్లా చెప్పి ఇంకా (వివరిస్తున్నాడు).

ఉ. 'ఈ యితిహాస మార్యసభ నెవ్వఁడు సమ్మతిఁ జెప్పువాఁడు దీ
ర్ఘాయువు శ్రీయు ధర్మము సమంచితకీర్తియు వృద్ధిఁ బొంద సౌ
ఖ్యాయతనాత్ముఁడై మను; సురావలియుం బితృకోటియుం బ్రియ
శ్రీ యలరారఁ గీ డతనిఁ జెందక యుండఁగఁ జేయు నెయ్యెడన్.' 254

ప్రతిపదార్థం: ఎవ్వఁడు= ఏ నరుడు; ఈ ఇతిహాసము= ఈ మునుపటి కథను; ఆర్యసభన్= మంచినడవడిగల వారి సభలో; సమ్మతిన్= మంచిబుద్ధితో; చెప్పున్= చెప్తుతాడో; వాఁడు= అట్టివాడు; దీర్ఘ+ఆయువున్= ఎక్కువ ఆయుర్దాయమూ; శ్రీయున్= సంపదా; ధర్మము= ధర్మమూ; సమంచిత కీర్తియున్= మంచి కొనియాడదగిన కీర్తి; వృద్ధిన్+పొందన్= పెంపొందగా; సౌఖ్య+ఆయతన+ఆత్ముఁడు+ఐ= సౌఖ్యానికి నెలవైన హృదయం కలవాడై; మనున్= బ్రతుకుతాడు; సుర+ఆవలియున్= దేవతల సముదాయమూ; పితృకోటియున్= పితృదేవతల సమూదాయమూ; ప్రియశ్రీ= ప్రీతి సంపద; అలరారన్= చక్కగా కలిగేటట్లుగా; ఏ+ఎడన్= ఎక్కడనూ; కీడు= ఆపద; అతనిన్= అట్టివాడిని; చెందక ఉండఁగన్+చేయున్= రాకుండా చేస్తుంది.

తాత్పర్యం: 'ఈ పాతకథను ఆర్యుల సభలో ప్రవచించేవాడు దీర్ఘమైన ఆయువూ, సంపదా, ధర్మమూ, దొడ్డ కీర్తి పెంపొందగా సౌఖ్యానికి నెలవైన బుద్ధిగలవాడై జీవిస్తాడు. దేవతలూ, పితృదేవతలూ ఎంతో ప్రీతితో అతడి కే ఆపదా ఎటువైపునుండీ రాకుండా చేస్తారు.'

విశేషం: ఇది ఈ కథకు ఫలశ్రుతి. ప్రతికార్యానికి ఒక ఫలం ఉంటుంది. ఫలాన్ని అపేక్షించి పనికి నరుడు ఉపక్రమిస్తాడు. కనుక ఋషులు ఫలాన్ని గూర్చి చెప్తుతూ ఉంటారు. ఆ ఫలం ఉదాత్త మనుష్యులను మరింతగా ఆకర్షిస్తుంది. ఈ కథ చాలా గొప్పది. అప్రతిగ్రహం, లోభం లేకపోవటం అనే మహాగుణాల మహిమను ఇది వక్కాణించింది. విన్నవారు ఆ గుణాలను అలవరచుకొంటారు. ఇక చెప్పినవారి సంగతి చెప్పనక్కర లేదు గదా!

ఇందులో ఇంచుమించు సగానికి పైభాగంలో సుఖలాభాన్ని గురించీ, మిగిలిన దానిలో దుఃఖనాశాన్ని గురించీ చెప్పారు. కేవలం సుఖం లభిస్తే చాలదు. అది లభించిన తృప్తిని చెడగొట్టే కీడుకూడా నశించాలి. అప్పుడే పూర్ణఫలం దక్కినట్లవుతుంది.

ఉపానద్దాన విషయక సూర్య జమదగ్ని సంవాదము (సం.13-97-3)

వ. అనిన విని యజాతశత్రుండు శంతనుపుత్రుతోఁ బితృ కార్యాదులయందు గొడుగులుఁ జెప్పులు నిడుట యుత్తమ ప్రకారం బని చెప్పుదురు; వాని విశేషంబు తెలం గెఱింగింపవే!' యనుటయు నమ్మహాత్ముం డమ్మహీపతి కిట్లను; 'సూర్యజమదగ్ని సంవాదంబను నితిహాసంబు వినుము; దాన నీయడిగినయది తేటపడు, జమదగ్ని మహాముని క్రీడార్థియై శరాసనంబు ధరించి రేణుకాదేవి బాణంబులకట్టఁ గొని తనతోడం జనుదేర నివాసంబు వెడలి యొక్కబయల నయ్యంపపొది నిలువ వైపించికొని దూరాపాతనం బాచరింప నిక్కుసుమకోమలి సని యమ్ము లేఱికొని వచ్చి యిచ్చుచుండు. 255

ప్రతిపదార్థం: అనినన్= అన్న తరువాత; విని; అజాతశత్రుండు= ధర్మరాజు; శంతను పుత్రుతోన్= శంతనుడి కొడుకు భీష్ముడితో; పితృకార్య+ఆదులయందున్= శ్రాద్ధం మొదలైన పనులయందు; గొడుగులు= గొడుగులున్నూ; చెప్పులున్= చెప్పులూ; ఇడుట= దానంచేయటం; ఉత్తమ ప్రకారంబు= మంచిపద్ధతి; అని; చెప్పుదురు= చెప్పుతారు; వాని విశేషంబు తెలంగు= ఆ గొడుగు చెప్పుల మహిమ పద్ధతిని; ఎఱింగింపవే= చెప్పవా; అనుటయున్= అనగానే; ఆ+మహాత్ముండు= ఆ మహాబుద్ధిశాలి; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; సూర్య జమదగ్ని సంవాదంబు= సూర్యుడికి జమదగ్ని మహర్షికి అయిన సంభాషణ; అను ఇతిహాసంబు= అనే ప్రాతకాలపు కథను; వినుము; దానన్= దానివలన; నీ+అడిగిన+అది= నీ వడిగింది; తేటపడున్= స్పష్టమవుతుంది; జమదగ్ని మహాముని= జమదగ్ని అనే ఒక గొప్ప ముని; క్రీడా+అర్థి+ఐ= వినోదించగోరినవాడై; శర+ఆసనంబున్= వింటిని; ధరించి=పట్టుకొని; రేణుకాదేవి= భార్యఅయిన రేణుకాదేవి; బాణంబులకట్టన్= బాణాల పొదిని; కొని= పట్టుకొని; తనతోడన్= తనతోపాటు; చనుదేరన్= రాగా; నివాసంబున్= ఇంటినుండి; వెడలి= వెలుపలికి వచ్చి; ఒక్కబయలన్= ఒక బయలు ప్రదేశంలో; ఆ+అమ్ము+పొదిన్= ఆ అమ్ములకట్టను; నిలువన్= ఉండేటట్లుగా; వైపించుకొని= దూర+ఆపాతనంబు= దూరంగా పడవేయటం; ఆచరింపన్= చేయగా; ఆ+కుసుమకోమలి= పూవులవలె సుకుమారి అయిన ఆమె; చని= వెళ్ళి; అమ్ములు= బాణాలు; ఏఱికొని= ఏరుకొని; వచ్చి= అతడి దగ్గరకు వచ్చి; ఇచ్చుచున్+ఉండున్= ఇస్తూ ఉన్నది.

తాత్పర్యం: తరువాత ధర్మరాజు భీష్ముడిని 'తాతా! శ్రాద్ధాదులలో గొడుగులు, చెప్పులు దానం చేయటం చాలా మంచి పనిగా చెప్పుతారు. వాటి సంగతి చెప్పుము' అని ప్రార్థించాడు. అప్పు డా దొడ్డబుద్ధిగల భీష్ముడు ఆ రాజుతో ఇట్లా అన్నాడు. 'సూర్యజమదగ్ని సంవాదం అనే పురాతన కథ వింటేనే నీ వడిగిన విషయం చక్కగా తెలుస్తుంది వినుము. జమదగ్ని ఒకనాడు వినోదంకొరకు విల్లు పుచ్చుకొని బాణాల పొది తీసికొని భార్య రేణుక వెంటరాగా ఇల్లు వెడలి ఒక బయలులోనికి వచ్చి ఆ కట్టను ఒకచోట నిలువజేసి, దూరంగా బాణాలు పడవేస్తూ ఉన్నాడు. ఆమె ఆ బాణాలు ఏరి తెచ్చి మరల అతడికి అందిస్తూ ఉన్నది.

విశేషం: క్రీడార్థి - హింసకొరకు కాదని సూచన. కుసుమ కోమలి - ఇది రాబోయే కథాంశాన్ని సూచించే విశేషగుణం, బయలు విశాలమైన ప్రదేశం - పొరపాటున ఎవ్వరికీ బాణాలు తగిలే అవకాశం లేదనటాన్ని సూచిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. ఇవ్విధమున వినోదింప నినుఁడు గగన। మధ్యగతుఁ డయ్యె నప్పు డమ్మగువ యమ్ము
లేఱి తేరంగఁబోయి యొక్కింత దడసి। యరుగుదెంచిన నాతఁ డయ్యబలతోడ. 256

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ విధంగా; వినోదింపన్= క్రీడిస్తూ ఉండగా; ఇనుఁడు= సూర్యుడు; గగన మధ్య గతుఁడు= నడిమింటికి వచ్చినవాడు; అయ్యెన్= అయ్యాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+మగువ= ఆ కాంత; అమ్ములు= బాణాలు; ఏఱి= ఏరుకొని; తేరంగన్= తేవటానికి; పోయి= వెళ్ళి; ఒక్క+ఇంత= కొంచెం సేపు; తడసి= ఆలస్యం చేసి; అరుగుదెంచినన్= వస్తే; ఆతఁడు= ఆ జమదగ్ని; ఆ+అబలతోడన్= ఆ ఇంతితో.

తాత్పర్యం: ఈ విధంగా ఆడుకొంటూ ఉండగా సూర్యుడు నడిమింటికి వచ్చాడు. అప్పుడు ఆ రేణుక బాణాలు ఏరి తేవటానికి పోయి కొంచెం జాగుచేసి వస్తే అతడు ఆమెతో (ఇట్లా అన్నాడు).

విశేషం: అబల - ఇది సాభిప్రాయ విశేషణం. మధ్యాహ్న సూర్యుడి వేడిమికి తట్టుకొనలేకపోయిం దన్న భావాన్ని సూచిస్తుంది.

క. 'లోలాక్షి! యచట నిమ్మఱి। యేల తడసి?' తనుడుఁ బేర్చు నినతేజమునన్
నేలకు వేఁడిమి దనికినఁ। జాలన వెసఁ ద్రొక్కఁ దలయుఁజాలఁ దపించెన్. 257

ప్రతిపదార్థం: లోల+అక్షి!= త్రిప్పు కనులదానా!; అచటన్= అక్కడ; ఈ+మఱి= ఇంతసేపు; ఏల?=ఎందుకు?; తడసితి= జాగు చేశావు; అనుడున్= అనగానే; పేర్చు+ఇన తేజమునన్= ఎక్కువ అయిన సూర్యుడి వేడిమికి; నేలకున్= భూమికి; వేఁడిమి= వేడి; తనికినన్= సోకగా; వెసన్= వేగంగా; త్రొక్కన్= త్రొక్కుటకు; చాలను+అ= చాలలేక పోయాను; తలయున్= నెత్తికూడా; చాలన్= ఎక్కువగా; తపించెన్= కాలింది.

తాత్పర్యం: 'లోలాక్షీ! అక్కడ ఇంత జాగుచేశావేమి?' అని అంటే 'సూర్యుడి తేజస్సు తీవ్రమైన కారణంగా నేల వేడెక్కింది. వడివడిగా కాళ్ళూన్చి నడవలేకపోయాను. తలకూడా వేడి ఎక్కింది.

విశేషం: లోలాక్షి! - ఏకాంతంలో భార్యను భర్త సరసంగా పిలిచిన పిలుపు. అంతేకాదు ఆమె పొందిన శ్రమవలన కన్నులు నిశ్చలతను కోల్పోయిన అంశంకూడా ఇక్కడ ఈ పదంచేత తెలియవస్తుంది. క్రింద కాళ్ళు, పైన తలా రెండు వేడివలన వివశం అయ్యాయి అని భావం.

క. ఇమ్మెయి నలంగి యొక వృ। క్షమ్మున క్రీనీడ నిలిచి చనుదెంచుట నా
కిమ్మఱి దడయ వలసె' నని। యమ్ముద్దియ సెప్పెఁ జెమట యడరఁగ మేనన్. 258

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; నలంగి= అలసిపోయి; ఒక వృక్షమ్మున క్రీనీడన్= ఒక చెట్టు క్రింద నీడలో; నిలిచి= నిలుచుండి, చనుదెంచుటన్= రాగా; నాకున్= నాకు; ఈ+మఱి= ఇంతసేపు; తడయన్ వలసెన్= జాగుచేయవలసి వచ్చింది; అని; ఆ+ముద్దియ= ఆ ముద్దరాలు; మేనన్= ఒడలిపై; చెమట= స్వేదం; అడరఁగన్= వ్యాప్తి పొందగా; చెప్పెన్= చెప్పింది.

తాత్పర్యం: ఈ విధంగా ఒక చెట్టు క్రింది నీడలో కొంతసేపు నిలిచి రావటంవలన నా కింతసేపు జాగు చేయవలసి వచ్చింది' అని చెమట ఓడుతున్న దేహం గల ఆ ముద్దరాలు చెప్పింది.

విశేషం: ముద్దియ - ముద్దరాలు, కష్టాన్ని తట్టుకొనలేనితనం దీనివలన వ్యక్తమవుతుంది. చెమట దీనికి సాక్ష్యం.

క. విని 'యే మేమీ! నొంచెనె । యినుఁడు నినుం; దత్ఫలంబు నిప్పుడ కుడువం
గనియెడుఁ గా కస్త్రానల । మునఁ బొదివెద నతని' ననియె ముని కోపమునన్. 259

ప్రతిపదార్థం: విని= ఆ మాట విని; ముని= ఆ జమదగ్ని మహర్షి; కోపమునన్= కోపంతో; ఏమి+ఏమీ= ఏమిటేమిటీ; ఇనుఁడు= సూర్యుడు; నినున్= నిన్ను; నొంచెనె?= కష్టపెట్టాడా?; తత్+ఫలంబు= దానిఫలం; ఇప్పుడు+అ= ఇప్పుడే; కుడువన్+కనియెడున్+కాక= అనుభవిస్తాడు కాక!; అతనిన్= వాడిని; అస్త్ర+అనలమునన్= అస్త్రాల అగ్నిలో; పొదివెదను= ముంచి వేస్తాను; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ మాట విని ముని కోపంతో 'ఏమేమీ సూర్యుడు నిన్ను బాధించాడా? ఆ ఫలం ఇప్పుడే అనుభవిస్తాడు. నా అస్త్రాలమంటలో క్రమ్మివేస్తాను' అన్నాడు.

విశేషం: ఏమేమీ - అనేచోట సంరంభం; ఇప్పుడు - అన్నచోట ఆలస్యం చేయరాదన్న తీవ్రతా మొదలైన భావాలు స్ఫురిస్తూ క్రోధమనే భావాన్ని చక్కగా రూపుకట్టిస్తున్నది ఈ రచన. ఆ మహర్షి తపశ్శక్తి సూర్యుడిని కూడా నిర్ధూమధామం చేయగలదిగా దీనిని బట్టి తెలియవస్తున్నది.

ఉ. దాని నెఱింగి భూసురతఁ దాల్చి వెసం జనుదెంచి యర్కుఁ డ
మ్మానిత సంయమిం గని యమత్సరభావము దోఁప 'రోషమున్
మానుము' నావుడుం 'బలుకు మానుము; నీవటు వాయు; మేసెదన్
భానుని నేలఁ గూల' నని పల్కె మునీంద్రుఁడు శోణితాక్షుఁడై. 260

ప్రతిపదార్థం: అర్కుఁడు= సూర్యుడు; దానిన్= ఆ సంగతి; ఎఱింగి= తెలిసికొని; భూసురతన్= బ్రాహ్మణత్వాన్ని; తాల్చి= ధరించి; వెసన్=వేగంగా; చనుదెంచి= వచ్చి; ఆ+మానిత సంయమిన్= మన్నించదగిన ఆ మహర్షిని; కని= చూచి; అమత్సరభావము= ప్రశాంత లక్షణం; తోఁపన్= కనపడే విధంగా; రోషమున్= క్రోధాన్ని; మానుము= వదలుము; అనుడున్= అనగానే; పలుకు= మాట; మానుము= చాలించుము; నీవు; అటు= అవతలకు; పాయుము= తొలగుము; నేలన్= నేలమీద; కూలన్= కూలేటట్లుగా; భానునిన్= రవిని; ఏసెదన్= కొట్టుతాను; అని; ముని+ఇంద్రుఁడు= మహర్షి శ్రేష్ఠుడు; శోణిత+అక్షుఁడు+ఐ= ఎరుపెక్కిన కనులు కలవాడై; పల్కెన్= పలికాడు.

తాత్పర్యం: ఈ సంగతి తెలిసికొని సూర్యుడు బ్రాహ్మణ వేషం ధరించి వచ్చి మన్నించదగిన ఆ సంయమిని చూచి శాంతస్వభావం కనపడే విధంగా 'క్రోధం చాలించుము' అన్నాడు. అప్పుడు మునివర్యుడు కెంపెక్కిన కనులతో 'చాలించు నీ మాటలు; ప్రక్కకు తొలగుము; ఆ సూర్యుడిని నేలపై కూల నేస్తాను' అన్నాడు.

విశేషం: అమత్సరభావము - వచ్చినది సూర్యుడు. మహర్షి నిష్కారణంగా తనమీద కోపం ప్రదర్శిస్తున్నాడు. అయినా తాను కోపం పొందలేదు. అంటే అతడు సూర్యచంద్రాది దేవతలకు కూడా మన్నింపదగిన మహాత్ముడని భావం. దానినే 'మానితసంయమి' అనే పదంచేత కవి స్పష్టం చేస్తున్నాడు. శోణితాక్షుఁడు - కన్నులెరుపెక్కినాయి. ఇది సాత్త్వికభావం. రౌద్రరస స్ఫూర్తి కిది దోహదం చేస్తుంది.

చ. పలికిన బ్రాహ్మణుం డొదుగఁబాఱక నిల్చి 'మునీంద్ర! యిట్టు లి
ట్టల మగు క్రూరవృత్తికిఁ గడంగుదురే? సవిత్రుండు రశ్మలన్
జల మొసఁగంగ నోషధుల సంపద హవ్యమహత్త్వ మొంది వే
ల్పులకు బలంబు నిచ్చునది లుప్తము గాదె యతండు నొచ్చినన్.' 261

ప్రతిపదార్థం: పలికినన్= అట్లు పలుకగా; బ్రాహ్మణుండు= బ్రాహ్మణవేషధారి అయిన సూర్యుడు; ఒదుగన్+పాఱక= ప్రక్కకు తప్పుకొని పరుగెత్తక; నిల్చి= అక్కడనే ఉండి; ముని+ఇంద్ర!= మునిశ్రేష్ఠా!; ఇట్టులు= ఈ విధంగా; ఇట్టలము= ఎక్కువ; అగు= అయిన; క్రూరవృత్తికిన్= దయలేని నడవడికి; కడంగుదురే?= పూనుకొంటారా?; సవిత్రుండు= సూర్యుడు; రశ్మలన్= కిరణాలతో; జలము= నీటిని; ఒసఁగంగన్= ఇవ్వగా; ఓషధుల సంపద= ధాన్యాల సంపద; హవ్య మహత్త్వము= హోమపదార్థపు మహిమను; ఒంది= పొంది; వేల్పులకున్= దేవతలకు; బలంబున్= సత్తువను; ఇచ్చున్= ఇస్తుంది; అతండు= సూర్యుడు; నొచ్చినన్= బాధపడితే; అది= ఆ పని; లుప్తము= నశించేది; కాదె!= కాదా!

తాత్పర్యం: జమదగ్ని ఇట్లా అంటే ఆ బ్రాహ్మణుడు ప్రక్కకు తప్పుకొని వెళ్ళిపోక నిలిచి 'మునీంద్రా! ఇంత అధికమైన క్రూరపు నడవడికి (మీ వంటివారు) పూనుకొంటారా? సూర్యుడు నీరు ఇస్తే ఓషధులసంపద హవ్యపదార్థపు మహిమను పొంది దేవతలకు బలాన్నిస్తుంది. అట్టి సూర్యుడు బాధపడితే ఆ బలం లోపిస్తుంది కదా!'

విశేషం: వేసవికాలంలో ఎండతీవ్రత లోకం మేలుకొరకే. ఆ తీవ్రతవలననే మేఘాలు ఏర్పడతాయి. వర్షాలు కురుస్తాయి. పంటలు పండుతాయి. తిండి కలిగి మనుష్యులు కండగలవారవుతారు. ఇక్కడ వేల్పులబలం భూమి మీద ప్రాణికోటి బలానికి మూలకారణమని మనం గుర్తించాలి. వేల్పులంటే గాలి, నింగి, నిప్పు, నీరు, నేల అనే పంచభూతాలే అని కూడా గుర్తించాలి. అవి సమస్థితిలో ఉంటే అన్నీ సమస్థితిలోనే ఉంటాయనేది శాస్త్రీయ నిరూపణకు సంబంధించిన విషయం.

చ. అనినను శాంతిలేమికి భయం బెదఁ గూరఁగ మ్రొక్కి యాతఁ 'డే
నినుఁడ సహింపు నావలన నెగ్గులు గల్గినయేని; నీకు నె
మ్మనము దయామయం బని సమస్త జగంబులు సంస్తుతింపఁగా
విని ముదమందుదున్; శరణు వేఁడెదఁ గావుము న న్మునీశ్వరా!' 262

ప్రతిపదార్థం: అనినను= ఇట్లా చెప్పినా; శాంతి లేమికిన్= శాంతి కలగకపోవటానికి; భయంబు= భయం; ఎదన్= హృదయంలో; కూరఁగన్= ఏర్పడగా; ఆతఁడు= ఆ బ్రాహ్మణుడు; మ్రొక్కి= మోకరిల్లి; ఏన్= నేను; ఇనుఁడన్= సూర్యుడను; నావలనన్= నానుండి; ఎగ్గులు= కీడులు; కల్గిన ఏని= కలిగితే; సహింపు= సైపుము; నీకున్= నీకు; నెఱ+మనము= నిండు మనస్సు; దయామయంబు= దయతో నిండింది; అని; సమస్తజగంబులు= అన్ని లోకాలు; సంస్తుతింపఁగాన్= చక్కగా కొనియాడుతుండగా; విని= ఆలకించి; ముదము= సంతసం; అందుదున్= పొందుతూ ఉంటాను; ముని+ఈశ్వరా!= మహర్షి శ్రేష్ఠుడా!; శరణు= రక్షణం; వేఁడెదన్= కోరుతాను; నన్= నన్ను; కావుము= కాపాడుము.

తాత్పర్యం: ఇంత చెప్పినా జమదగ్ని శాంతి పొందలేదు. సూర్యుడు హృదయంలో భయపడి 'మునీశ్వరా! నేను సూర్యుడను. నా వలన నీకు ఏ కీడులు కలిగినా సహించుము. నీ హృదయం దయతో నిండిన దని అన్ని లోకాలు కొనియాడగా విని సంతోషం పొందుతూ ఉంటాను. నిన్ను శరణు కోరుతున్నాను. నన్ను రక్షించుము' (అన్నాడు).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: కల్గినయేని - కలిగి ఉంటే, నిజానికి నేను ఏ దోషమూ చేయలేదని ధ్వని. మరి భయ మెందుకు అంటే మహర్షుల మహిమ అటువంటిది. వారు సకారణంగానైనా అకారణంగానైనా కోపగిస్తే ప్రళయభీకరు లవుతారు - అనే విషయం ఇక్కడ ఉపదేశం.

చ. అనినఁ బ్రశాంతుఁడై తపను నా భృగుముఖ్యుఁడు ప్రీతి గారవిం
చినఁ బ్రమదంబునన్ గొడుగుఁ జెప్పులు మానసవృత్తిఁ దెచ్చి య
మ్మునికడఁ బెట్టి, యత్తరణి ము న్నివి లేవని పల్కి దీన మైఁ
దనుకదు, వీనఁ బాదములఁ దాఁకదు నాదగు వేఁడి యేమియున్. 263

ప్రతిపదార్థం: అనినన్= అంటే; ఆ భృగుముఖ్యుఁడు= భృగువంశంలో శ్రేష్ఠుడైన ఆ జమదగ్ని; ప్రశాంతుఁడు+ఐ= కోపం మొదలైన వికారాలు లేనివాడై; తపనున్= సూర్యుడిని; ప్రీతిన్= ప్రీతితో; గారవించినన్= మన్నింపగా; ఆ+తరణి= ఆ సూర్యుడు; ప్రమదంబునన్= ఆనందంతో; మానసవృత్తిన్= సంకల్ప మాత్రంచేత; గొడుగున్= ఛత్రమునూ; చెప్పులు= చెప్పులనూ; తెచ్చి; ఆ+మునికడన్= ఆ మహర్షి దగ్గర; పెట్టి= ఉంచి; మున్ను= ఇంతకు పూర్వం; ఇవి= ఈ గొడుగూ, చెప్పులూ; లేవు; అని; పల్కి= పలికి; నా దగు వేఁడి= నాదైన వేడి; ఏమియున్= ఏ మాత్రమూ; దీనన్= ఈ గొడుగువలన; మైన్= ఒడలి యందు; తనుకదు= కలుగదు; వీనన్= ఈ చెప్పులవలన; పాదములన్= కాళ్ళను; తాఁకదు= అంటదు.

తాత్పర్యం: సూర్యు డిట్లా అనగా ఆ జమదగ్ని శాంతించాడు. అతడిని మన్నించాడు. అప్పుడు సూర్యుడు సంకల్పమాత్రంచేత గొడుగూ చెప్పులూ సృష్టించి తెచ్చి ఆతడి దగ్గర ఉంచి "ఇవి పూర్వం లేవు. ఈ గొడుగువలన నా వేడి ఏ మాత్రమూ శరీరానికి తాకదు. ఈ చెప్పుల వలన కాళ్ళకు తాకదు" (అన్నాడు).

విశేషం: సూర్యుడి మన్నన ఋషి కోపాన్ని పోగొట్టింది. అతి ప్రశాంతతత సూర్యుడికి సంతోషం కలిగించింది. అందుకే అడగకపోయినా గొడుగూ, చెప్పులూ సృష్టించి ఇచ్చాడు. వాటి ప్రయోజనాలను వివరించాడు.

మ. నయ మిట్లారఁగ నాతపత్రము నుపానద్ద్వంద్వముం జూపి చె
ప్పి యపూర్వంబగు సృష్టిఖేలనమునం బెంపారు నవ్వస్తువుల్
దయ సద్విప్రున కీఁగి యైహిక సుఖౌదాత్త్వంబు నాముష్మిక
ప్రియమున్ దాతకు సుస్థిరంబులుగఁ గల్పించున్ మునీంద్రోత్తమా! 264

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నయము= నేర్పు; ఆరఁగన్= కలుగునట్లుగా; ఆతపత్రమున్= ఎండనుండి రక్షించే గొడుగునూ; ఉపానత్+ద్వంద్వమున్= చెప్పుల జతనూ; చూపి= కనబరచి; చెప్పి= వాటిని గూర్చి వివరించి; ముని+ఇంద్ర+ఉత్తమా!= మునివర్యులలో శ్రేష్ఠుడా!; అపూర్వంబు+అగు= మునుపులేని; సృష్టిఖేలనమునన్= సృజన విలాసంతో; పెంపు+ఆరు= మహిమతో విరాజిల్లు, ఆ+వస్తువుల్= ఆ గొడుగూ, చెప్పులూ అనే వస్తువులను (ఈ వస్తువుల్= అన్న పాఠం మేలైనది); దయన్= దయతో; సత్+విప్రునకున్= దోషంలేని విద్యావంతుడికి; ఈఁగి= ఇవ్వటం; ఐహిక సుఖ+ఔదాత్త్వంబున్= ఈ లోకసంబంధమైన సుఖపు గొప్పతనాన్నీ; ఆముష్మిక ప్రియమున్= పరలోకంలో ఇష్టమైన సుఖాన్నీ; దాతకున్= ఇచ్చేవాడికి; సుస్థిరంబులుగన్= చెడక నిలిచేవాటినిగా; కల్పించున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: ఇట్లా నేర్పు మీరగా గొడుగునూ చెప్పుల జతనూ చూపి వాటి విశేషాన్ని వక్కాణించి, మహర్షివరేణ్యా! అపూర్వమైన సృష్టివిలాసంతో ఏర్పడి వెలుగొందుతున్న ఈ వస్తువులను దయతో మంచి విద్యావేత్తకు దానం చేయటం దాతకు ఇహలోకపు సుఖాధిక్యాన్నీ, పరలోకంలో ప్రియమైన సుఖాన్నీ సుస్థిరంగా చేస్తుంది(అని చెప్పాడు).

విశేషం: ఆతపత్రం - ఎండనుండి రక్షించేది; ఉపానత్- పాదములయందు బంధింపబడేవి, విప్రుడు - 'విద్యయా యాతి విప్రత్వమ్' - విద్యచేత విప్రత్వాన్ని పొందుతాడు. విద్యావంతుడిని లోకం రక్షించుకొంటే అతడు లోకరక్షణకు మార్గం కనుగొని చెప్పుతాడు. కనుక విప్రున కివ్వాలనటం. అందునా సద్విప్రునకు - లోకహితైక కాంక్ష కలవాడే సద్విప్రుడు. సుస్థిరంబులుగన్ - దాత లోకరక్షకుడిని రక్షించే పనిచేశాడు కనుక అతడికి ఇహపరసుఖాలు శాశ్వతంగా ఉంటాయి.

మ. అనినన్ మో మలరన్ దినేశ్వరునిఁ దా నామంత్రితుంజేసి య
మ్మునిశార్దూలుఁడు వల్లభాసహితుఁడై మోదంబునం దేలుచుం
జనియెన్ నాఁడు జనంబు లెల్లను బ్రహర్షం బందుచున్ వానిఁ గై
కొని రవ్వస్తువు లిట్టి వేర్పడఁగ నీకుం జెప్పితిన్ భూవరా! 265

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; అనినన్= అని పలుకగానే; ఆ+ముని శార్దూలుఁడు= మునులలో గొప్పవాడగు ఆ జమదగ్ని; మోము= మొగం; అలరన్= ప్రకాశించగా; దిన+ఈశ్వరునిన్= సూర్యుడిని; తాను= తాను; ఆమంత్రితున్+చేసి= మర్యాదతో మంచిమాటలతో పంపి; వల్లభా సహితుఁడు+ఐ= ప్రియురాలితో కూడినవాడై; మోదంబునన్= సంతోషంతో; తేలుచున్= తేలిపోతూ; చనియెన్= వెళ్ళాడు; జనంబులు+ఎల్లను= ప్రజలందరూ; నాఁడు= అప్పుడు; ప్రహర్షంబు+అందుచున్= పరమానందం పొందుతూ; వానిన్= ఆ గొడుగు, చెప్పులు అనేవాటిని; కైకొనిరి= తీసికొన్నారు; ఆ+వస్తువులు= ఆ వస్తువులు; ఇట్టివి= ఈవిధమైనవి; నీకున్= నీకు; ఏర్పడఁగన్= చక్కగా తెలిసే విధంగా; చెప్పితిన్= చెప్పాను.

తాత్పర్యం: ఓ రాజా! సూర్యు డట్లా చెప్పగా ఆ మహర్షిశ్రేష్ఠుడు మొగం వికసించగా సూర్యుడిని మంచిమాటలతో సాగనంపి, భార్యతోపాటు పరమానందంతో తన తావున కరిగాడు. అది మొదలు జనులంతా ఆ వస్తువులను గొప్ప సంతోషంతో కైకొన్నారు. ఈ వస్తువుల సంగతి నీకు స్పష్టంగా తెలిసే విధంగా చెప్పాను.

విశేషం: మోమలరన్- కృతజ్ఞతను ప్రకటించటం ఆ కాలంలో అంతమాత్రమే. నిజానికి కృతజ్ఞత బయటకు చెప్పదగినది కాదు. గుండెలో పదిలపరచుకొనదగినది. ఈ విషయాన్ని ఈ పదబంధం సూచిస్తుంది. సూర్యుడంతటివాడు ప్రత్యక్షదైవంగా భావనకు వచ్చేవాడు ఎందుకు భయపడ్డాడో 'మునిశార్దూలుడు' అనే పదం వ్యక్తం చేస్తుంది. అట్టి వారి నిగ్రహానుగ్రహాలమీద లోకవృత్తి సాగుతుందని భావం.

చ. దినకరచిత్తసృష్టములు దివ్యమునీశ్వరులాలితంబు లీ
వినుత పదార్థముల్ గరుణ విప్రునకున్ యతి సాధువృద్ధ స
జ్జనులకు నిమ్ము నీ; వది సుసారపు ధర్మము సూవె! దానఁ గ
ల్గును విను! గోకులాకలితలోకము లోనగు పుణ్యలోకముల్. 266

ప్రతిపదార్థం: దినకరచిత్త సృష్టములు= సూర్యుడి మనసుతో సృజింపబడినవి; దివ్య ముని+ఈశ్వర లాలితంబులు= గొప్ప మహర్షిచేత మన్నింపబడినవి (అయిన); ఈ వినుత పదార్థముల్= ఈ కొనియాడదగిన వస్తువులను; కరుణన్= దయతో;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విప్రునకున్= గొప్ప విద్యావంతుడికి; యతి సాధు వృద్ధ సత్+జనులకున్= యతులకు, సాధువులకు, ముదుసలులకు, మంచివారికి; నీవు; ఇమ్ము= దానము చేయుము; అది= ఆ దానం; సుసారము+ధర్మము= గొప్ప సారంగల ధర్మం; చూవె= సుమా!; దానన్= దానిచేత; విను= వినుము; గోకుల+ఆకలిత లోకము= ఆవులమందలతో కూడిన లోకం; లోనగు= మొదలైన; పుణ్యలోకముల్= పుణ్యంగల లోకాలు; కల్గును= లభిస్తాయి.

తాత్పర్యం: రాజా! సూర్యుడు మనస్సుతో సృష్టించినవీ, మహర్షి మన్నించినవీ అయిన ఈ మంచి వస్తువులను విద్యావంతుడికి, యతులకూ, సాధువులకు, పెద్దవయస్సువారికీ, మంచి మానవులకు దానం చేయుము. అది మిక్కిలి సారంగల ధర్మం సుమా! దానితో గోలోకం మొదలైన పుణ్యలోకాలు లభిస్తాయి.

విశేషం: సృష్టించినది లోకబాంధవుడు సూర్యుడు. అదికూడా కేవలం సంకల్పమాత్రంచేత. మొదట గ్రహించి ప్రేమతో ఉపయోగించినది ఒక మహర్షివరేణ్యుడు. తమంత తాము ప్రయోజనాన్నిబట్టి కొనియాడదగినవి. కనుక అనంతపుణ్యాన్ని దాతకు ఇస్తాయి - అని భావం. యతులు - పరమాత్మానుభవంకొరకు యత్నంచేసేవారు; సాధువులు - పరుల మేలును సాధించటానికి ప్రయత్నించేవారు; వృద్ధులు - అశక్తులు, అందుకనే ఇతరులకు ఏ అపకారమూ చేయనివారు. సత్+జనులు- మంచివారు. ఇట్లా వీరిని పేర్కొనటంవలన దానం పాత్రత ఎరిగి చేయాలి - అనే విషయం ప్రతీయమానం అవుతుంది. అపాత్రదానం దాతకు పాతకాన్ని కలిగిస్తుంది. 'చూవె' ఇది నిశ్చయార్థకం. సందేహించవద్దని హెచ్చరిక చేస్తుంది. విను - తాను చెప్తున్న విషయం శ్రద్ధాసక్తులతో వినదగిన దన్న భావాన్ని సూచిస్తుంది.

క. దాన ప్రవణ! యుపాన । ద్దానంబును నాతపత్ర దానము సురస
మ్మాననభాజనములగుట । నానాబుధజనులచే వినంబడు నెపుడున్. 267

ప్రతిపదార్థం: దానప్రవణ!= దానమునందు నిష్ఠకలవాడా!; ఉపాసత్+దానంబును= చెప్పులను ఇవ్వటమూ; ఆతపత్రదానము= గొడుగు నివ్వటమూ; సుర సమ్మానన భాజనములు= దేవతల మన్ననకు పాత్రములు; అగుట= కావటం; నానా బుధ జనులచేన్= ఎందరో పండిత జనులవలన; ఎపుడున్= ఎల్లవేళల, వినన్+పడున్= వినబడుతున్నది.

తాత్పర్యం: దాననిష్ఠగల ఓ రాజా! చెప్పులను, గొడుగును దానమివ్వటం దేవతల మన్ననకు యోగ్యమైనదని ఎందరో పండితవరేణ్యులు చెప్పగా ఎప్పుడూ వింటూ ఉంటాము.

విశేషం: దాన ప్రవణ! - సంబోధన సాభిప్రాయం. 'ఇచ్చే స్వభావం ఉన్నవాడవు కనుక దేవతలు కూడా మన్నించే దానం చేయుము' అని ఇక్కడ అభిప్రాయం. నానాబుధ - ఎవరో ఒకరు చెపితే ప్రమాణం కాకపోవచ్చును. అనేకులు - అందులోను బుధులు, జ్ఞానసంపన్నులు చెప్తున్నారు. వినంబడున్- తద్ధర్మార్థకక్రియ సార్వకాలికత్వాన్ని సూచిస్తున్నది. 'ఎపుడున్' అనేది దానిని మరింత దృఢపరుస్తున్నది.

క. అనిన విని పాండుభూవర తనయోత్తముఁ డిట్టు లనియెఁ దాతకు శూద్రుం
డనఘా! యెమ్మెయిచరితం । బున నిహపర పరమసౌఖ్యములఁ జెందఁగనున్? 268

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; పాండుభూవర తనయ+ఉత్తముఁడు= పాండురాజు కొడుకులలో శ్రేష్ఠుడగు ధర్మరాజు; విని= ఆలకించి; తాతకున్= తాత అయిన భీష్ముడికి; ఇట్టులు= ఇట్లా; అనియెన్= అన్నాడు; అనఘా!= పుణ్యాత్ముడా!; శూద్రుండు= నాలుగవ జాతివాడు; ఏ+మెయి చరితంబునన్= ఏ విధమైన నడవడితో; ఇహ పర పరమ సౌఖ్యములన్= ఈ లోకపు, పరలోకపు పరమసుఖాన్నీ; చెందన్+కనున్?= పొందగలుగుతాడు?

తాత్పర్యం: భీష్ము డిట్లా చెప్పిన తరువాత ధర్మరాజు తాతను ఇట్లా అడిగాడు. 'పుణ్యాత్మా! శూద్రు డెటువంటి నడవడితో ఈ లోకపు, పరలోకపు సుఖాలను పరమసుఖాన్నీ పొందుతాడు?'

విశేషం: 'పాండుభూవర తనయోత్తముఁడు' - భీముడు మొదలైన తక్కిన నలువురకు మహాధర్మాలు తెలిసికొనాలన్న గాఢవాంఛ గానీ, ఏ ప్రశ్న, ఏ సమయంలో, ఏ మహానుభావుడిని ఎట్లా, ఎందుకు అడగాలన్న వివేకంగానీ ఉన్నట్లు దాఖలాలు లేవు. ధర్మరాజు ఆ అయిదుగురిలో ఇట్టి జిజ్ఞాసావివేకాలు సమృద్ధిగా ఉన్న కారణంచేత ఉత్తము డవుతున్నాడు. ధర్మరాజు ప్రశ్నలో ఒక తపన కనిపిస్తుంది. నాలుగవ జాతివాడు ఈ లోకంలో సుఖం పొందాలి. పరలోకంలో సుఖం పొందాలి. పరమసుఖం - అంటే మోక్షసుఖం పొందాలి. దానికి దారిఏదో చెప్పుము - అని తాతను అడుగుతున్నాడు. చివరి జాతివాడికి ఇహపర పరమసౌఖ్యాలను అతడు అపేక్షిస్తున్నాడంటే సర్వమానవ సుఖాపేక్ష అతడికి హృదయంలో నిగూఢవాంఛగా మనం గుర్తించాలి. ప్రశ్నలో ఇంత లోతైన భావం ఉన్నది కనుకనే ముందుగా కవి అతడి ఉత్తమత్వాన్ని పేర్కొని ప్రశంసించాడని మనం గుర్తించాలి.

వ. అనుటయు నతం డతని కిట్లనియె. 269

ప్రతిపదార్థం: అనుటయున్= అనునంతనే; అతండు= భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఆ మాట విని తాత ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

శూద్రున కవశ్యానుష్ఠేయంబైన ధర్మంబు నిరూపించుట (సం.13-164-4)

క. లోక హితార్థంబుగ ముని । లోకోత్తముఁ డాత్మ శిష్యలోకమునకు సు
శ్లోకుఁడు పరాశరుఁడు ధ । ర్మాకారము లెఱుఁగ జెప్పె నంచితచరితా! 270

ప్రతిపదార్థం: అంచితచరితా!= కొనియాడదగిన నడవడి కలవాడా!; ముని లోక+ఉత్తముఁడు= మునుల సముదాయంలో శ్రేష్ఠుడు; సుశ్లోకుఁడు= మంచికీర్తి కలవాడు; అగు; పరాశరుఁడు= పరాశరమహర్షి; లోకహిత+అర్థంబుగన్= సర్వజనుల మేలే ప్రయోజనంగా; ఆత్మ శిష్య లోకమునకున్= తన శిష్యుల సముదాయానికి; ధర్మ+ఆకారములు= ధర్మస్వరూపాలను; ఎఱుఁగన్= తెలిసే విధంగా; చెప్పెన్= ఉపదేశించాడు.

తాత్పర్యం: సాధువర్తనా! మహర్షిశ్రేష్ఠుడు, మంచి కీర్తిగలవాడూ అయిన పరాశరుడు లోకపు మేలే ప్రయోజనంగా తన శిష్యసముదాయానికి ధర్మస్వరూపాలను తెలియజెప్పాడు.

విశేషం: ఇందులో చెప్పగల అర్హత 'ముని లోకోత్తముఁడు, సుశ్లోకుఁడు' అనే విశేషణాలచేత తెలియవస్తున్నది. ఈ చెప్పటంలో వంచనగానీ, స్వార్థంగానీ లేదనే అంశం "లోకహితార్థంబుగ" అనే పదంచేత వ్యక్తమవుతున్నది. 'ఆత్మ శిష్యలోకమునకు' - అనే పదంచేత విద్యాసంప్రదాయం చెప్పినట్లయింది. 'ఎఱుఁగన్' అనే పదంవలన బోధకుడి ప్రజ్ఞ తెలియవస్తున్నది. ఇట్లా విద్యాసమగ్రత, స్వార్థం లేకపోవటం, బోధకతాసామర్థ్యం, సంప్రదాయపరిజ్ఞానం అనే నాలుగు అంశాలు విద్య ఏ స్థాయిలో ఉండాలో ఈ పద్యం ప్రతిపాదిస్తున్నది.

వ. అవ్వాక్యంబులు సెప్పెద నందు భవత్ప్రశ్నవిషయంబయిన యర్థంబు నవగతంబగు నాకర్ణింపుము. 271

ప్రతిపదార్థం: ఆ+వాక్యంబులు= ఆ మాటలు; చెప్పెదన్= చెప్పుతాను; అందున్= వాటిలో; భవత్+ప్రశ్న విషయంబు= నీవు అడిగిన విషయం; అయిన అర్థంబును= అయిన అంశం కూడా; అవగతంబు= తెలియవచ్చేది; అగున్= అవుతుంది; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: ఆ మాటలు చెప్పుతాను. అందులో నీ ప్రశ్న విషయం అర్థం కూడా తెలియవస్తుంది, వినుము.

సీ. కరుణాఢ్యుఁడగు పరాశరమునివరుఁడు శి । ష్యులకు నిట్లను నింద్రియోత్కరంబు
గెలిచి యంతశ్శత్రుకులమైన కామాది । వర్గంబు నోర్చి గర్వంబు వదలి
త్రైవర్ణికులయెడ భావంబు భక్తిమ । యంబుగా శుశ్రూష యాచరించి
శూద్రుఁ డైహిక సుఖసుగతులఁ బడయు వే । దాధీతితపముల నాచరించె
ఆ. నేని నుభయలోక హీనాత్ముఁడగు భూమి । సురనృపాల వైశ్య శూద్రులకును
నధ్యయనము, బలసమగ్రత, వాణిజ్య । మనుచరత్వ మధిక ధనము లరయ. 272

ప్రతిపదార్థం: కరుణా+ఆఢ్యుఁడు= దయచేత గొప్పవాడు; అగు= అయిన; పరాశరమునివరుఁడు= పరాశరుడనే మునిశ్రేష్ఠుడు; శిష్యులకున్= తనవద్ద అధ్యయనం చేసేవారికి; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; శూద్రుఁడు= నాలుగవజాతి వర్ణంవాడు; ఇంద్రియ+ఉత్కరంబున్= ఇంద్రియాల గుంపును; గెలిచి= అదుపులో ఉంచుకొని; అంతః+శత్రు కులము= లోపలి శత్రువుల సముదాయం; ఐన= అయిన; కామ+ఆది వర్గంబున్= కామం మొదలైన వాటి సముదాయాన్ని; ఓర్చి= ఓడించి; గర్వంబున్= గర్వాన్ని; వదలి= వదలిపెట్టి; త్రైవర్ణికుల ఎడన్= మూడు వర్ణాలవారి విషయంలో, భావంబు= హృదయం; భక్తిమయంబు= భక్తితో నిండినది; కాన్= అయ్యేవిధంగా; శుశ్రూష= సేవ; ఆచరించి= చేసి; ఐహికసుఖ సుగతులన్= ఈ లోకపు సుఖాన్ని, ఉత్తమ గతినీ; పడయున్= పొందుతాడు; వేద+అధీతి తపములన్= వేదం చదవటం, తపస్సు అనేవాటిని; ఆచరించెను+ఏని= చేస్తే; ఉభయలోకహీన+ఆత్ముఁడు= రెండు లోకములు పోయిన ఆత్మ కలవాడు; అగున్= అవుతాడు; భూమిసుర నృపాల వైశ్య శూద్రులకును= బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు అనే వారికి; అరయన్= చూడగా; అధ్యయనము= వేదం చదవటం; బలసమగ్రత= బలం నిండుగా ఉండటం; వాణిజ్యము= వ్యాపారము; అనుచరత్వము= సేవకత్వం; అధిక ధనములు= గొప్పధనాలు.

తాత్పర్యం: దయతో గొప్పవాడైన పరాశరముని శిష్యులకు ఇట్లా చెప్పాడు: 'శూద్రుడు ఇంద్రియములపై పట్టు గలిగి, లోపలి శత్రువులైన కామం మొదలైనవాటిని గెలిచి, గర్వం వదలి తక్కిన మూడు వర్గాలవారిపట్ల హృదయం భక్తిమయం చేసికొని సేవ చేసినట్లయితే ఈ లోకపు సుఖాన్నీ, ఉత్తమ గతినీ పొందుతాడు. వేదం చదవటం గానీ తపస్సు గానీ చేస్తే రెండు లోకాలనూ కోల్పోతాడు. బ్రాహ్మణుడికి అధ్యయనము, రాజునకు బలము నిండుగా ఉండటమూ, వైశ్యునకు వాణిజ్యమూ, శూద్రునకు సేవకత్వమూ గొప్పధనాలు.

విశేషం: అంతశ్శత్రువులు - కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము. త్రైవర్ణికులు - బ్రాహ్మణ వైశ్య, శూద్రులు; ఈ పద్యంలో 'సేవ' అంటే ఆంగ్లంలో 'Service' వృత్తులు అని అర్థం. వృత్తిధర్మాలు అయిన కమ్మరం, కుమ్మరిపని మొదలైనవాటితో వ్యవసాయాదులకు కావలసిన వస్తుసముదాయాన్ని సమాజానికి అందించటమే సేవ.

సుగతి అనేచోట స్వర్గసుఖము, మోక్షసుఖము - రెంటినీ గ్రహించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఇవి శాస్త్రదృష్టమార్గము । లవనిసురప్రభృతు లీ సదాచారంబుల్

సువిహితములుగా నడపిన । భువనద్వయమునను బడయఁ బోలుం బెంపుల్. 273

ప్రతిపదార్థం: ఇవి= ఈ ధర్మాలు; శాస్త్ర దృష్ట మార్గములు= శాస్త్రం చూపిన పద్ధతులు; అవనిసుర ప్రభృతులు= బ్రాహ్మణులు మొదలైనవారు; ఈ సత్+ఆచారంబుల్= ఈ మంచి ఆచారాలను; సువిహితములుగాన్= చక్కగా అనుష్ఠింపబడినవిగా; నడపినన్= సాగజేస్తే; భువనద్వయమునను= రెండు లోకాలలోను, పెంపుల్= మహిమలను; పడయన్+ పోలున్= పొందవచ్చును.

తాత్పర్యం: ఇవి శాస్త్రం చూపిన మార్గాలు. బ్రాహ్మణులు మొదలైనవారు ఈ సదాచారాలను చక్కగా పాటిస్తే రెండులోకాలలోను గొప్పతనం పొందవచ్చును.

విశేషం: శాస్త్రం - ఏది కార్యము, ఏదికాదు అనే నిర్ణయానికి శాస్త్రమే ప్రమాణమని గీత చెప్పింది.

తే. ఇట్లు గా కాత్మధర్మంబు లెడల విడిచి । వర్ణములు నాలుగింట నెవ్వారలైన

దొలఁగ ద్రొక్కినఁ బాటిల్లు దుష్టగతులు । మన్నకాలంబు పదపడి చన్నయపుడు. 274

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కాక= కాకుండా; వర్ణములు= వర్ణాలు; నాలుగింటన్= నాలుగింటిలో; ఏ+వారలు+ఐనన్= ఎవరైనా; ఆత్మధర్మంబులు= తమ ధర్మాలను; ఎడలన్+విడిచి= తప్పునట్లుగా వదలి; తొలఁగన్+త్రొక్కినన్= తొలగునట్లు నడిస్తే; మన్నకాలంబున్= బ్రతికినంత కాలమునూ; పదపడి= తరువాత; చన్నయపుడున్= మరణించినపుడూ; దుష్టగతులు= చెడుగతులు; పాటిల్లున్= వస్తాయి.

తాత్పర్యం: ఇట్లా కాక నాలుగు వర్ణాలలో ఎవరైనా వారి స్వధర్మాలను విడిచిపోతే బ్రతికినప్పుడు, చచ్చిన తరువాత వారికి చెడుగతులు కలుగుతాయి.

విశేషం: బ్రతికినపుడు చెడుగతి అంటే - సమాజం మన్నింపకపోవటం మొదలైనది. దానివలన పాపకార్యాలు చేయవలసివస్తే నరకం కలగటం మొదలైనవి పరత్ర చెడుగతులు.

వ. అని పలికి శౌచవిధి యెఱిఁగింపం దలంచి యిట్లనియె. 275

ప్రతిపదార్థం: అని; పలికి= చెప్పి; శౌచవిధి= శుచిత్వం ఏర్పడే విధానం; ఎఱిఁగింపన్= తెలపటానికి; తలంచి= తలపోసి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు ఇట్లా చెప్పి, శుచిత్వపు విధానం చెప్పగోరి ఇట్లా అన్నాడు.

విశేషం: శౌచం అంటే - దేహంలోపలా, వెలుపలా కలిగే మాలిన్యం పోవటం. 'శుచి' అంటే పరిశుద్ధుడు, పరిశుద్ధము అని అర్థం. అట్టివాని / దాని భావం శౌచం. అది ఎట్లా ఏర్పడుతుందో ఆ పద్ధతిని 'శౌచవిధి' అంటారు. మానవజాతి సర్వకాల సర్వావస్థలలో శౌచాన్ని అపేక్షిస్తుంది.

క. మూత్ర పురీషోత్సృష్టికి । రాత్రి పగలు దక్షిణోత్తర దిశాముఖతా
సూత్రణము వలయునది సం । ధ్యా త్రయమును నుత్తరంబ యగు నప్పనికిన్. 276

ప్రతిపదార్థం: మూత్ర పురీష+ఉత్సృష్టికిన్= మూత్రము, మలము అనువాటిని విసర్జించటానికి; రాత్రి= రాత్రి సమయమున; పగలు= పగటి సమయమున; దక్షిణ+ఉత్తర దిశా ముఖతా+ఆసూత్రణము= దక్షిణం, ఉత్తరం దిక్కులవైపు ముఖం ఉంచటం అనే విధానం; వలయునది= ఆచరించాలి; సంధ్యాత్రయమును= సంధ్యలు మూడింటియందునూ; ఆ+పనికిన్= ఆ పనికి; ఉత్తరంబు+అ= ఉత్తర దిక్కే; అగున్= కావాలి.

తాత్పర్యం: మానవుడు మలమూత్రాలు వదిలేటప్పుడు రాత్రివేళ దక్షిణదిక్కుగా, పగటివేళ ఉత్తరదిక్కుగా ముఖం ఉంచి చేయాలి. మూడు సంధ్యలలో ఉత్తరంవైపే ముఖం ఉంచటం ఆ పనికి తగినది.

విశేషం: ప్రకృతిలో కొన్ని సమయాలలో కొన్ని ప్రదేశాలలో విశేషశక్తులు ఉండటం మనం గమనిస్తున్నాం. గాలి సాధారణంగా ఒక వైపునుండి వీచటం, సూర్యచంద్రులు ఒకవైపున కొన్ని సమయాలలో కనబడటం మొదలైనవి ప్రత్యక్షవిషయాలు. ఈ వాయువు, సూర్యచంద్రులు మొదలైనవి మనకు ఎన్నో ప్రయోజనాలు - మరెక్కడా లభించనివాటిని ఇస్తున్నాయి. కనుక వాటిని దేవతలుగా భారతీయులు భావిస్తున్నారు. అందువలన వాటివైపు తిరిగి మలమూత్రాదులు విడవటం దేహానికి ప్రమాదం కలిగిస్తుంది కాబట్టి ఈ పనికి దిక్కులు నిర్దేశించారు.

సంధ్యాత్రయము - 'సంధ్య' అంటే రెండు కాలాల కలయిక. రాత్రినీ, పగటినీ కలిపేది ప్రాతస్సంధ్య, పగటినీ, రాత్రినీ కలిపేది సాయంసంధ్య, పగలు పూర్వాహ్ణాన్నీ, అపరాహ్ణాన్నీ కలిపేది మధ్యాహ్నసంధ్య.

క. పలుకవలదు శౌచక్రియ । సలుపక మును, సలుపునపుడు జలములు దొడలం
జిలుకుట యొప్పదు మృత్తిక । వలయు నపానంబునం ద్రివారంబు లిడన్. 277

ప్రతిపదార్థం: శౌచక్రియ = శుచిత్వపు పని; చలుపక మును= చేయకముందు; పలుకవలదు= మాటాడరాదు; చలుపు+అపుడు= ఆ పనిచేసే సమయంలో; తొడలన్= తొడలమీద; జలములు= నీళ్ళు; చిలుకుట= కొంచెంగా చల్లటం; ఒప్పదు= తగదు; అపానంబునన్= పృష్ఠభాగంలో; మృత్తికన్= మట్టిని; త్రివారంబులు= మూడుసార్లు; ఇడన్+వలయున్= ఉంచాలి.

తాత్పర్యం: మలమూత్రాలు వదలిన తరువాత శుద్ధిచేసుకొనకుండా మాటాడరాదు. శుద్ధికొరకు తొడలమీద నీళ్ళు చిలకటం పనికిరాదు. ముడ్డిని మూడుసార్లు మట్టితో తోమాలి.

విశేషం: 'అపానంబునన్' - అనటంవలన ఇది మలవిసర్జనకు సంబంధించినదిగా గుర్తించాలి. ఊరక నీళ్ళు చల్లితే 'అశుద్ధం' కణాలు అక్కడే ఉండి పోతాయి. అది తనకూ, తన సమీపంలో ఉన్నవారికీ జుగుప్సను కలిగిస్తుంది. అందుకని మట్టితో మూడుసార్లు శుద్ధి చేసుకొనాలి.

క. గుదతలము నొవ్వఁ దోమినఁ । గదురును రోగంబు లేపగంధాపగమ
ప్రదమగు కొలఁదిన శౌచము । సదురుగ నా చెప్పినట్ల సలుపఁగ వలయున్. 278

ప్రతిపదార్థం: గుదతలము= ముడ్డిపైభాగం; నొవ్వన్= నొప్పిపుట్టే విధంగా; తోమినన్= తోమితే; రోగంబు= జబ్బు; కదురును= కలుగుతుంది; లేప, గంధ, అపగమ ప్రదము= అంటిన చెడువాసన తొలగటాన్ని కలిగించునది; అగుకొలఁ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దిన= అయినంత మాత్రమే; శౌచము= శుభ్రం చేయటం, చదురుగన్= చక్కగా; నా చెప్పిన+అట్లు+అ= నేను చెప్పినట్లే, చలుపఁగవలయున్= చేయాలి.

తాత్పర్యం: ముడ్డిని నొప్పిపుట్టే విధంగా తోమరాదు. అలాచేస్తే రోగం కలుగుతుంది. అంటిన చెడువాసన తొలగటాన్ని కూర్చే అంత మాత్రం తోమటం సుకుమారంగా నేను చెప్పినట్లు చేయాలి.

విశేషం: మట్టితో తోమే సమయంలో తీసికొనవలసిన జాగ్రత్తలు చెప్పుతున్నారు. పుండయ్యే - విధంగా తోమరాదు అని భావం.

తే. అంబరంబున శౌచజలంబు వడుట । చెట్ట; శౌచ మల్లల్లన చేఁత మేలు;

వామకరశుద్ధి దొల్తఁ ద్రివార మృత్తి । కా కలనమునఁ దద్ద సేయంగ వలయు. 279

ప్రతిపదార్థం: శౌచజలంబు= శుద్ధికొరకు వాడిన నీరు; అంబరంబునన్= ఆకాశంలో (కట్టిన బట్టమీద); పడుట= పడటం; చెట్ట= చెడ్డది; శౌచము= శుద్ధి; అల్లన్+అల్లన్+అ= మెల్లమెల్లగానే; చేఁత= చేయటం; మేలు= మంచిది; తొల్తన్= మొదట; వామకరశుద్ధి= ఎడమచేతిని కడుగుకొనటం; త్రివార మృత్తికా+ఆకలనమునన్= మూడుసార్లు మట్టిని పట్టించటంచేత; తద్దన్= అత్యంతమూ; చేయంగన్+వలయున్= చేయాలి.

తాత్పర్యం: పృష్ఠం కడిగే నీళ్ళు చిందరవందరగా పడటం మంచిది కాదు. కడుగుకొనటం మెల్లమెల్లగా చేయటం మంచిది. ఆ తర్వాత ముందు ఎడమచేతిని మూడుసార్లు మట్టితో తోమి చక్కగా కడుగుకొనాలి.

విశేషం: ముడ్డికడిగిన నీళ్ళు మలంతో నిండి ఉంటాయి కదా! అవి అన్నివేపులా చిందే విధంగా చేస్తే ఆ మల అణువులు పరిసరాలలో వ్యాపించి కాలుష్యాన్ని కలిగిస్తాయి. ఈనాడు మనం ఎక్కువగా అనుకొంటున్న వాతావరణకాలుష్యనివారణకు ఇతిహాసకర్త మార్గాలు సూచిస్తున్నారు. పృష్ఠశుద్ధి అయిన తరువాత, ముందు ఎడమచేతిని మూడుసార్లు మట్టితో తోమాలి. మలం పోవటం, మలకణాలు పోవటం, దుర్వాసన పోవటం అనేవాటికై కావచ్చును - మూడు పర్యాయాలు తోమటం. అంబురంబున అంటే కట్టిన బట్టమీద అనికూడా చెప్పవచ్చు.

క. కుడిచేతఁ బిదప డా చేఁ । గడిగి పొరిన్ సప్తమృత్తికా కలనమునఁ

గడుగునది కరయుగము; మఱి । కడుగవలయు గుహ్య మల్పక మృదాకలనమునన్. 280

ప్రతిపదార్థం: పిదపన్= పిమ్మట; కుడిచేతన్= కుడిచేతితో; డాచేన్= ఎడమచేతిని; కడిగి= శుద్ధిచేసి; పొరిన్= మరల, సప్తమృత్తికా కలనమునన్= ఏడు మట్టిముద్దలను ఉపయోగించటం ద్వారా; కరయుగమున్= రెండు చేతులను; కడుగునది= కడగాలి; మఱి= తరువాత; అల్పకమృత్+ఆకలనమునన్= కొంచెపు పాటి మట్టిని ఉపయోగించటంతో; గుహ్యమున్= అపానస్థలాన్ని; కడుగవలయున్= కడగాలి.

తాత్పర్యం: తరువాత కుడిచేతితో ఎడమచేతిని కడగాలి. తరువాత ఏడు మట్టిముద్దలను ఉపయోగించి రెండుచేతులను శుద్ధి చేసికొనాలి. తరువాత మళ్ళీ అపానస్థలాన్ని కొంచెం మట్టితో కడగాలి.

క. ఇమ్మెయి గుహ్యతలము శు । ద్ధమ్ముగ నొనరించి కేల్ పదంపడి జలధా

తమ్ముగఁ జేసి సముత్థా । నమ్ము పిదపఁ బాదశోధనము సేయఁదగున్. 281

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; గుహ్యతలమున్= గుదం పై భాగాన్ని; శుద్ధమ్ముగన్+ఒనరించి= శుభ్రంచేసి; పదంపడి= తరువాత; కేల్= చేతిని; జలధౌతమ్ముగన్= నీటితో కడుగబడిన దానిని; చేసి; సముత్థానము పిదపన్= లేచిన తరువాత; పాదశోధనము= కాళ్ళు కడుగుకొనటం; చేయన్+దగున్= చేయాలి.

తాత్పర్యం: ఇట్లా గుదతలం శుభ్రం చేసికొన్న తరువాత చేతులు నీటితో చక్కగా కడుగుకొని, లేచి నిలబడి, పాదాలు శుభ్రంగా కడుగుకొనాలి.

విశేషం: మలవిసర్జన చేసిన ప్రాంతమంతా అశుద్ధంగా ఉంటుంది. కనుక ఆ సూక్ష్మక్రిములు పాదాలనుండి దేహంలోకి ప్రవేశించకుండా పాదాలు కడుగుకొనటాన్ని ఇక్కడ ఆదేశించారు.

క. జనములు సూచుచునుండఁగ । జనదు మలము మూత్రమును విసర్జింపఁగ, న

ప్పనులకు శౌచాచరణం । బునకు నవశ్యంబు నోలములు గావలయున్. **282**

ప్రతిపదార్థం: జనములు= జనాలు; చూచుచున్+ఉండఁగన్= చూస్తూ ఉండగా; మలమున్= మలాన్ని; మూత్రమును= మూత్రాన్నీ; విసర్జింపఁగన్= వదలటం; చనదు= కూడదు; ఆ పనులకున్= ఆ రెండు పనులకున్నూ; శౌచ+ఆచరణంబునకున్= శుద్ధి పనికీ; అవశ్యంబున్= తప్పనిసరిగా; ఓలములు= మరుగు తావులు; కావలయున్= ఉండాలి.

తాత్పర్యం: బహిరంగ స్థలాలలో మలమూత్రాదులు వదలరాదు. ఆ పనులకూ, వాటి శుద్ధి పనికీ చెట్లు మొదలైనవి గల మరుగుతావులు ఉండాలి.

విశేషం: స్త్రీ పురుషుల లింగాలకు 'గుహ్యం' అని ఒక వ్యవహారం. అంటే గుట్టుగా ఉంచవలసినది అని అర్థం. మలమూత్ర విసర్జనాలు జనాలు చూస్తుండగా చేస్తే అది చూచేవారికి జుగుప్స పుట్టిస్తుంది. శుచికర్మకూడా మరింత ఏవగింపు కలిగిస్తుంది. కనుక మరుగుచోట్లను నిర్దేశించారు. చెట్లనడుమ తావులైతే వాతావరణకాలుష్యం తగ్గిపోయే అవకాశం ఉంటుంది.

క. ఆపత్సమయంబున శౌ । చాపాదన మిట్టి భంగి నబ్బమి మలసం

లేపన గంధము వోపఁ గ్రి । యాపరుఁడై చేయునది మృదాకలనంబున్. **283**

ప్రతిపదార్థం: ఆపత్సమయంబునన్= ఆపదవేళలో; శౌచ+ఆపాదనము= శుద్ధిని కలిగించటం; ఇట్టి భంగిన్= ఈ విధంగా; అబ్బమిన్= కుదరకపోవటంచేత; మల సంలేపన గంధము= మలం అంటటంవలన అయిన వాసన; పోవన్= పోయే విధంగా; మృత్+ఆకలనంబున్= మట్టిని అంటించటంచేత; క్రియాపరుఁడు+ఐ= పనియందు శ్రద్ధ కలవాడై; చేయునది= చేయాలి.

తాత్పర్యం: ఆపదవేళలో ఇంతగా శుద్ధి కుదరకపోతే మలం అంటిన వాసన పోయే విధంగా శ్రద్ధతో మట్టితో కడుగుకొనాలి.

విశేషం: ప్రాచీన ఋషులు ధర్మాలు బండగా నిర్దయతో చెప్పరు. పరిస్థితులు అన్నీ అనువుగా ఉంటే ధర్మలోపం చేయరాదు. అనుకూలించని వేళలో ధర్మం పేరుతో శరీరాన్నీ, మనస్సునూ హింసించకూడదు. ఇది ఋషిమార్గం. ఆపదసమయం అంటే చెప్పిన విధంగా శుద్ధక్రియ చేయటానికి అనువుకాని వేళ అని భావం. క్రియాపరుడు= పనిలో శ్రద్ధలోపించనివాడు.

సీ. బుద్బుద విరహితంబుగ వారిఁ గరమున । గొనకొని పొరి దెందమునకుఁ జేరు

నట్లుగ నిశ్శబ్దమై యుండ ముమ్మాఱు । ద్రావి యిన్మాఱు తిర్యగ్విధమున

నాస్యంబు దొడసి నీ రంఘ్రుల శిరమునఁ। బ్రోక్షించి యోష్ఠ సంపుటము ముట్టి

నాసికాపుటములు నయనముల్ సెవులు మూఁ। పులు హృదయము నాభితలము మౌళి

ఆ. ముట్టవలయు హస్తములు పాదయుగమధ్య। గతములుగ నుద ఙ్ముఖత్వ మొండెఁ

బ్రాఙ్ముఖత్వ మొండెఁ బ్రాపించి యిమ్మెయి। నాచమనము సేయు టార్యమతము. 284

ప్రతిపదార్థం: బుద్బుద విరహితంబుగన్= బుడగలు లేకుండునట్లుగా; వారిన్= నీటిని; కరమునన్= చేతితో; గొనకొని= ప్రయత్నించి; పోరిన్= క్రమంగా; డెందమునకున్= గుండెకు; చేరు+అట్లు+కన్= చేరే విధంగా; నిశ్శబ్దము+ఐ= చప్పుడు లేనిదై; ఉండన్= ఉండగా; మూడు+మాఱు= మూడు సారులు; త్రావి= త్రాగి; ఇన్+మాఱు= రెండుమార్లు; తిర్యక్+విధమునన్= అడ్డంగా; ఆస్యంబున్= మొగమును; తొడసి= తుడిచి; నీరు= నీళ్ళు; అంఘ్రులన్= కాళ్ళమీదా; శిరమునన్= తలపైనా; ప్రోక్షించి= చిలుకరించి; ఓష్ఠ సంపుటమున్= పెదవుల మొగ్గవంటి స్థితిని; ముట్టి= తాకి; నాసికాపుటములు= ముక్కురంధ్రములు; నయనముల్= కన్నులు; చెవులు; మూఁపులు= భుజాలు; హృదయము= వక్షస్సు; నాభితలము= బొడ్డు; మౌళి= తల; ముట్టవలయున్= తాకాలి; హస్తములు= చేతులు; పాదయుగమధ్యగతములుగన్= కాళ్ళజంటనడుమ ఉన్నవిగా; ఉదక్+ముఖత్వము= ఉత్తరపు మోము అగుట; ఒండెన్= కానీ; ప్రాక్+ముఖత్వము= తూర్పు మొగం కావటం; ఒండెన్= కానీ, ప్రాపించి= పొంది; ఈ+మెయిన్= ఈ విధంగా; ఆచమనము= ఆచమనం అనే క్రియను; చేయుట= చేయటం; ఆర్యమతము= ఆర్యులకు సమ్మతమైనది.

తాత్పర్యం: బుడగలులేని నీరు చేతిలో చక్కగా గ్రహించి మెల్లగా గుండె దగ్గరకు చేరేవిధంగా చప్పుడు లేకుండా మూడుమారులు గ్రహించాలి. రెండుసార్లు అడ్డంగా నోటిని తుడుచుకొనాలి. నీళ్ళు కాళ్ళమీద, తలమీద చిలుకరించుకొనాలి. నోటిని చేతితో తాకాలి. ముక్కు, కన్నులు, చెవులు, భుజాలు, హృదయం, బొడ్డు శిరస్సు- వీటిని తాకాలి. చేతులు రెండు కాళ్ళకు మధ్య ఉంచుకొని, ఉత్తరపు మొగంగా గానీ తూర్పు మొగంగాగానీ కూర్చుండి ఈ విధంగా ఆచమనం చేయాలి. ఇది ఆర్యులు సమ్మతించిన పద్ధతి.

విశేషం: ఇంతవరకు బాహ్యాశౌచం చెప్పారు. ఇప్పుడు అంతరశౌచం చెప్పుతున్నారు. అందులో మొదటిది ఆచమనక్రియ. ఇది మూడు విధాలు. శ్రౌతం, స్మార్తం, పౌరాణం అని వాటి పేర్లు. మూడు విధానాలలో ప్రక్రియ ఇంచుమించుగా ఒక్కటే. ఉచ్చరించే మంత్రాదులలోనే మార్పులు.

తిర్యగ్విధమునన్ - పెదవులపై ఒక అంచునుండి మరొక అంచువరకు అడ్డంగా తుడవటం. ఆచమనం చేసేటప్పుడు ఉత్తరదిక్కుగా గానీ, తూర్పుదిక్కుగా గానీ మొగంపెట్టి కూర్చోవాలి.

ఈ ప్రక్రియవలన ఫలాలు తరువాతి పద్యంలో చెప్పుతున్నారు.

సీ. ముమ్మాటి జలపానమున నోలి ఋగ్యజు। స్సామవేదంబులు సంతసిల్లుఁ

దొలితొలి వక్త్రంబు దొడయ నధర్వ హ। ర్షంబును రెండవసారె ధర్మ

శాస్త్ర తోషేతిహాస ప్రమోద పురాణ। సంప్రీతులును గల్గుఁ జరణయుగముఁ

బ్రోక్షింపఁ బుండరీకాక్షుండు ప్రియమందు। నయనంబు లంటిన నలినహితుఁడు

తే. సమ్మదంబునఁ దేలు నాచమన సంప్ర। యోగ మిట్టిది వస్త్రయజ్ఞోపవీత
ధరణముల నన్నపానతంత్రముల మున్ను। సేసి పిదపను నిది యనుష్ఠింపవలయు. 285

ప్రతిపదార్థం: ముమ్మాటి జలపానమునన్= మూడుమారులు నీరు త్రావటంచేత; ఓలిన్= వరుసగా; ఋక్+యజుస్+సామవేదంబులు= ఋక్కు, యజుస్సు, సామము అనే వేదాలు; సంతసిల్లున్= సంతోషిస్తాయి; తొలితొలిన్= మొదటిసారిగా; వక్త్రంబు= నోటిని; తొడయన్= తుడువగా; అధర్వ హర్షంబునున్= అధర్వవేదం ఆనందించటమూ; రెండవుసారెన్= రెండోమారు; తొడయన్= తుడువగా; ధర్మశాస్త్ర తోష ఇతిహాస ప్రమోద పురాణ సంప్రీతులును= ధర్మశాస్త్రం సంతోషించటం, ఇతిహాసం ఆనందించటం, పురాణం ప్రీతి పొందటం; కల్గున్= కలుగుతాయి; చరణయుగమున్= కాలిజంటను (పై); ప్రోక్షింపన్= నీటిని చిలుకరింపగా; పుండరీక+అక్షుండు= పద్మములవంటి కన్నులుగల శ్రీమహావిష్ణువు; ప్రియము+అందున్= ప్రీతి పొందుతాడు; నయనంబులు= కనులు; అంటినన్= తాకితే; నలినహితుఁడు= పద్మముల బంధువు-సూర్యుడు; సమ్మదంబునన్= పరమానందంతో; తేలున్= తేలిపోతాడు; ఆచమన సంప్రయోగము= ఆచమనపు చక్కని విధానం; ఇట్టిది= ఇటువంటిది; వస్త్ర యజ్ఞోపవీత ధరణములన్= బట్టలు, జందెము తాల్చుటను; అన్నపాన తంత్రములన్= భోజనము, నీరు పుచ్చుకొనటం మొదలైన పనులను; మున్ను= ముందు; చేసి; పిదపను= తరువాత, ఇది= ఈ ఆచమన కార్యం; అనుష్ఠింపవలయున్= ఆచరించాలి.

తాత్పర్యం: మూడు మారులు నీరు పుచ్చుకొనటంవలన క్రమంగా ఋక్కు, యజుస్సు, సామం అనే వేదాలు సంతసిస్తాయి. మొదటిసారి నోరు తుడవటంవలన అధర్వవేదం హర్షం పొందుతుంది. రెండవసారి తుడవటం వలన ధర్మశాస్త్రం, ఇతిహాసం, పురాణం అనేవి పరమానందం పొందుతాయి. కాళ్ళపై నీళ్ళు చిలుకరించటం వలన విష్ణువు, కనులను తాకటంవలన సూర్యుడు ఆనందిస్తాడు. ఆచమన విధానం ఇటువంటిది. వస్త్రాలు, జందెము తాల్చినప్పుడు, అన్నపానాల వేళలలోను ముందు ఆచమనం చేసి తరువాత కూడ ఈ ఆచమన కార్యం చేయాలి.

విశేషం: ఆచమనం నాలుగు వేదాలకు, ధర్మశాస్త్రాలకు, విష్ణుసూర్యులకు ఆనందం కలిగిస్తుందని ఈ పద్యం చెప్తుతున్నది. ఇట్లా చెప్పటంవలన ఆ పనియందు ఆదరం కలుగుతుంది. ఆచమనప్రక్రియ శ్రమలేకుండా ఒకటి రెండు నిముసాలలో చేయవచ్చును. ఫలితం అనంతంగా ఉంటుందని ఈ పద్యం ప్రతిపాదిస్తున్నది. సాధారణంగా సూక్ష్మక్రిముల వ్యాప్తిని నిరోధించే ఒక ప్రక్రియగా, అంతశ్శుద్ధికొరకు దీనిని ఆచరించవచ్చును.

తే. ఆస్యశుద్ధి యొనర్చిన యపుడు వోక। భక్ష్యభోజ్య లవంబులు పండ్ల నడుమ
నిలిచి పదపడి పోవుట గలిగెనేని। నాచమన మాక్షణంబ చేయంగవలయు. 286

ప్రతిపదార్థం: ఆస్యశుద్ధి = నోటి శుభ్రత; ఒనర్చిన అపుడు= చేసినప్పుడు; పోక= పోక; భక్ష్య భోజ్య లవంబులు= కొరికి నమలి తిన్న పదార్థాల కణాలు; పండ్ల నడుమన్= పండ్ల మధ్య; నిలిచి= ఉండి, పదంపడి= తరువాత; పోవుట= వెడలిపోవటం; కలిగెన్+ఏని= కలిగితే; ఆ క్షణంబు+అ= అప్పటికప్పుడు; ఆచమనము= ఆచమనం అనే పనిని; చేయంగవలయున్= చేయాలి.

తాత్పర్యం: నోటిని శుభ్రం చేసికొన్నప్పుడు అంతకుముందు తినిన పదార్థాలు పండ్లమధ్య నిలిచిపోయి తరువాత బయటకు వస్తే ఆ క్షణంలోనే ఈ ఆచమనకార్యాన్ని చేయాలి.

వ. శౌచవిధి సమస్త వర్ణసామాన్య ధర్మంబు, శూద్రునకు నాచమనం బోష్ఠపుటం బొకమరి ప్రోక్షించుకొనుటయు, దానిం గరంబున నడ్డం బొకమరి దొడయుటయు నింతియ. 287

ప్రతిపదార్థం: శౌచవిధి= శుచిత్వపు పని; సమస్త వర్ణ సామాన్య ధర్మంబు= అన్ని వర్ణాలకు సమానంగా ఉండే ధర్మం; శూద్రునకున్= శూద్రవర్గం వాడికి; ఆచమనంబు= ఆచమనపు పని; ఓష్ఠపుటంబు= పెదవుల దొప్పను; ఒకమరి= ఒకమారు; ప్రోక్షించుకొనుటయున్= నీరు చల్లుకొనటం; దానిన్= నోటిని; కరంబునన్= చేతితో; ఒకమరి= ఒకమారు; అడ్డంబు= అడ్డంగా; తొడయుటయున్= తుడవటం; ఇంతియ= ఇంతే.

తాత్పర్యం: పైన తెలిపిన శౌచకార్యం అన్ని వర్గాలవారు సాధారణంగా ఆచరించవలసిన ధర్మం. శూద్రునకు ఆచమనం అంటే పెదవులమీద నీరు ఒకమారు చిలుకరించుకొనటమూ, నోటిని అడ్డంగా చేతితో ఒకమారు తుడుచుకొనటమూ - ఇంతే.

క. తాను శుచిత్వం బేమిట । నైనను నేమఱక నియతి నతులితశుశ్రూ
షానిరతుండై శూద్రుఁడు । మానిత విప్రులకు నోడి మనఁగా వలయున్. 288

ప్రతిపదార్థం: శూద్రుఁడు= నాలుగవ వర్గపు వ్యక్తి; ఏమిటన్+ఐనన్= ఏ విధంగానైనా; తాను; శుచిత్వంబు= శౌచాన్ని; ఏమఱక= ఉపేక్షించక; నియతిన్= నిష్ఠతో; అతులిత= శుశ్రూషా నిరతుండు+ఐ= సాటిలేని సేవాభావంలో శ్రద్ధ కలవాడై; మానిత విప్రులకున్= మాన్యతగల విద్యావంతులకు; ఓడి= వినయం కలిగి; మనఁగావలయున్= జీవించాలి.

తాత్పర్యం: శూద్రుడు ఏ విధంగానైనా శుచిత్వాన్ని నిష్ఠతో సాధించి సాటిలేని సేవాభావంతో గొప్పవిద్యావంతులయెడ వినయం కలిగి జీవిస్తూ ఉండాలి.

విశేషం: "విద్యయా యాతి విప్రత్వం" - విప్రుడంటే గొప్ప విద్యలను శ్రద్ధతో ఆర్జించి బుద్ధితో జగత్ క్షేమానికై వినియోగించేవాడు. సంఘంలో తక్కిన వ్యక్తులు అట్టివారికి తోడ్పడటంవలన మేలు జరుగుతుంది. ఇక్కడ 'శుశ్రూషా' శబ్దాన్ని ఆ విధంగా సమన్వయం చేసికొనాలి. జాతిమాత్రంచేత ఆరాధించనక్కరలేదనే విషయాన్ని 'విప్ర' శబ్దం సూచిస్తున్నది. అందులోని విశేషార్థాన్ని సంభావించాలి. అంతేకాదు. శుశ్రూష అంటే సేవ. అంటే వృత్తి ధర్మాలు; కమ్మరి, కుమ్మరి, వడ్రంగం మొదలైనవి అనికూడా గ్రహించాలి. ఓడి అంటే అహంకార లక్షణం లేకుండా భావం.

సీ. అవనీసురుఁడు జపయజ్ఞుఁ డధ్యయనోప । జీవి తపశ్శోభి; భూవరుండు
ప్రారంభయజ్ఞుండు పరమదండోప జీ । వకుఁడు పాలనశోభి; వైశ్యుఁడమల
హవ్యయజ్ఞుఁడు విక్రయాజీవి యాతిథ్య । పరిశోభి, శూద్రుండు పరిచరత్వ
యజ్ఞుండు శుశ్రూషణాజీవి దక్షత్వ । శోభి; యట్టులు గాని చొప్ప లఖిల

ఆ. వర్ణజాతులకు నవశ్యంబు; నాలవ । వాని కెమ్మెయిం ద్రివర్ణభక్తి
వలయు నడప యతులవలన విశేషించి । నిత్యభజనపరత కృత్య మరయ. 289

ప్రతిపదార్థం: అవనీసురుఁడు= బ్రాహ్మణుడు, జపయజ్ఞుఁడు= జపరూపమైన యజ్ఞం కలవాడు; అధ్యయన+ఉపజీవి= వేదాలను అర్థంతోపాటు గ్రహించటమే బ్రదుకుతెరువుగా గలవాడు; తపస్+శోభి= తపస్సుతో ప్రకాశించేవాడు; భూవరుండు= రాజు; ప్రారంభయజ్ఞుండు= పూనికయే యజ్ఞంగా గలవాడు; పరమదండ+ఉపజీవకుఁడు= శ్రేష్ఠమైన దండనీతియే బ్రతుకు తెరువైనవాడు; పాలనశోభి= ఏలటంతో రాణించేవాడు; వైశ్యుఁడు= మూడవ వర్ణంవాడు; అమల హవ్యయజ్ఞుఁడు= దోషంలేని హోమద్రవ్యం యజ్ఞంగా గలవాడు; విక్రయ+ఆజీవి= అమ్మకం బ్రదుకుతెరువైనవాడు; అతిథ్య పరిశోభి= అతిథుల పూజతో ప్రకాశించేవాడు; శూద్రుండు= నాలుగవ వర్ణంవాడు; పరిచరత్వ యజ్ఞుండు= సేవకభావం యజ్ఞంగా గలవాడు; శుశ్రూషణ+ఆజీవి= సేవయే బ్రదుకుతెరువుగా గలవాడు; దక్షత్వశోభి= సమర్థతతో విరాజిల్లేవాడు; అట్టులు= ఆ విధము; కాని చొప్పులు= కాని విధానాలు; అఖిల వర్ణ జాతులకున్= అన్ని వర్ణాలలో పుట్టినవారికి; అవశ్యంబు= వశముకానివి; నాలవవానికిన్= నాలుగవ వర్ణంలో పుట్టిన వ్యక్తికి; అరయన్= భావిస్తే; ఏ+మెయిన్= ఎట్లాగయినా, త్రివర్ణభక్తి= మూడు వర్ణాలవారియందు అనురాగం; నడపన్= సాగించటం; వలయున్= కావాలి; విశేషించి= మీదు మిక్కిలి; యతులవలనన్= పరమార్థం కొరకు యత్నం చేసే వారియెడల; నిత్య భజన పరత= ఎల్లప్పుడు సేవచేసే ఆసక్తి; కృత్యము= చేయదగిన పని.

తాత్పర్యం: బ్రాహ్మణుడికి జపమే యజ్ఞం. అధ్యయనమే బ్రదుకుతెరువు. తపస్సు శోభ తెస్తుంది. క్షత్రియుడికి ప్రయత్నం యజ్ఞం, దండనీతి బ్రదుకుతెరువు. పాలనం శోభ తెస్తుంది. వైశ్యుడికి హవ్యం యజ్ఞం. అమ్మకం బ్రదుకుతెరువు. ఆతిథ్యం శోభ తెస్తుంది. శూద్రుడికి సేవలందించటం యజ్ఞం. సేవలే అతడి బ్రతుకుతెరువు. పనిలో సామర్థ్యం వన్నె తెస్తుంది. వీటికంటె వేరైన విధానాలు ఆయావర్ణాలవారికి వశంకానివి. నాలుగవవర్ణం వాడు తక్కిన మూడు వర్ణాలవారియందు అనురాగం కలిగి నడుచుకొనాలి. ప్రత్యేకించి యతుల విషయంలో ఎల్లప్పుడు అనురాగం కలిగి ఉండటం అతడి కర్తవ్యం.

విశేషం: జపయజ్ఞుడు - మంత్రాన్ని పలుమారులు నిష్ఠతో హృదయంలో ఆవృత్తి చేయటం జపం. యజ్ఞమంటే పరమశ్రద్ధతో చేసే పవిత్ర కార్యం. జపయజ్ఞం; ఇది పరమార్థ సాధనకు ఉపకరిస్తుంది. దీనికి అధ్యయనమూ తపస్సూ విశిష్టతను చేకూరుస్తాయి. కాబట్టి బ్రాహ్మణుడు ఐహికసుఖాపేక్ష లేనివాడై తనకు, తన పరిధిలో ఉన్నవారికి పరమసుఖం కలిగే సుకృత్యాలు - జప అధ్యయన తపస్సులు చేస్తూ ఉండాలి.

రాజ, వైశ్య, శూద్రులు తమ నియతధర్మాలద్వారా ఐహికసుఖం అందరికీ సాధించాలి. ఈ విధంగా నాలుగు వర్ణాలవారు అన్యోన్యభావనతో ఇహపరాలను సాధించటం ఆర్షధర్మం కాంక్షించిన విజయం.

హవ్యయజ్ఞుడు - అంటే హోమద్రవ్యాలను యజ్ఞాలను చేసేవారికి అందించటమే యజ్ఞంగా కలవాడని భావన చేయవచ్చును.

పరిచరత్వం, శుశ్రూషణ - ఇవి వృత్తిధర్మాలు. చాకలి, మంగలి, కమ్మరి మొదలైనవారి పనులు.

యతులు - యత్నశీలం కలవారు. లౌకికమైన ప్రవృత్తి లేక పరమార్థమందే ప్రయత్నం కలవారు. వారి విషయంలో సర్వవర్ణాలవారు భక్తికలిగి ఉండాలి.

క. యతి సర్వాశ్రమ చరణ। స్థితులకు నుత్కృష్టుఁ డతని తెరవూఁదిన శ
క్తత కలిగినవారు శ్రుతి। స్మృతి విహితాచారులగుట మే లరయంగన్. **290**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అరయంగన్= పరికింపగా; యతి= సన్న్యాసి; సర్వ+ఆశ్రమ చరణ స్థితులకున్= అన్ని ఆశ్రమాల పనుల దశలకంటె; ఉత్కృష్టుఁడు= అధికమైన స్థితికలవాడు; అతని తెరువు= అతడి మార్గం; ఊఁదిన శక్తత కలిగినవారు= అవలంబించిన శక్తికలవారు; శ్రుతి స్మృతి విహిత+ఆచారులు= వేదాలు, ధర్మశాస్త్రాలు బోధించిన ఆచారాలు కలవారు; అగుట= కావటం; మేలు= మంచిది.

తాత్పర్యం: యతి అన్ని ఆశ్రమాలవారికంటె మిన్న అయినవాడు. ఆ మార్గం అవలంబించి సమర్థతతో నిర్వహింపదలచినవారు వేదాలు, ధర్మశాస్త్రాలు చెప్పిన ఆచారాలను పాటించటం మేలు.

విశేషం: యతిధర్మాలు చాలా క్లిష్టమైనవి. అవి పాటించకపోతే ఆ ఆశ్రమం స్వీకరించటం మంచిది కాదని హెచ్చరిక.

సీ. ప్రియవాదితయును శాంతియును దాంతియు ననా । లస్యంబు నతుల శీలంబు గలిగి
నా కిది వలయు దీన సుదుస్తరంబును । ఘోరంబు నైన సంసారజలధిఁ
గడతు నేనని భిక్షుకజనంబులకు నెవ్వి । హితము లప్పనులు సంతతముఁ జేయు
చడుగులొత్తుచు నిష్ఠ మడుగుచు నీచత । ననుచరించుచు ధర్మమున నుపార్జి

ఆ. తంబులైన యట్టి ద్రవ్యసంచయములఁ । దృప్తి సేసి దేహగుప్తి నడపి
పగలు రేయు నాక పరిచర్య నొనరించి । శూద్రుఁడిహపరముల సుఖము వడయు. 291

ప్రతిపదార్థం: ప్రియవాదితయునున్= ప్రియంగా పలకటమూ; శాంతియునున్= కామక్రోధాదులు లేకుండటమూ; దాంతియున్= ఇంద్రియముల అదుపు కలిగి ఉండటం; అనాలస్యంబున్= సోమరితనం లేకుండా ఉండటం; అతుల శీలంబున్= సాటిలేని మంచి నడవడి; కలిగి; నాకున్= నాకు; ఇది= ఈ లక్షణం; వలయున్= ఆవశ్యకము; దీనన్= దీనిచేత; సుదుస్తరంబును= మిక్కిలిగా దాట శక్యం కానిదీ; ఘోరంబున్= భయంకరమైనదీ; ఐన= అయినట్టి; సంసారజలధిన్= సంసారమనే సముద్రాన్ని; నేను; కడతున్= దాటుతాను; అని; భిక్షుక జనంబులకున్= బిచ్చమెత్తుకొని జీవించే జనులకు; ఎవ్వి= ఏవి; హితములు= మేలయినవో; ఆ+పనులు= ఆ కార్యాలు; సంతతమున్= ఎల్లప్పుడు; చేయుచున్= చేస్తూ; అడుగులు+ఒత్తుచున్= మహాత్ముల పాదసేవ చేస్తూ; నిష్ఠన్= నిష్ఠతో; మడుగుచున్= శుద్ధుడవుతూ; నీచతన్= తక్కువతనంతో; అనుచరించుచున్= మెలగుతూ; అనుసరిస్తూ; ధర్మమునన్= ధర్మమార్గంతో; ఉపార్జితంబులు= సంపాదించినవి; ఐన అట్టి ద్రవ్య సంచయములన్= అయిన వస్తువుల సముదాయాలతో; తృప్తిచేసి= తృప్తిపడి; దేహగుప్తిన్= దేహరక్షణను; నడపి= ప్రవర్తింపజేసి; పగలు రేయున్= ఇది పగలు, ఇది రాత్రి; నాక= అనక; పరిచర్యన్= సేవను; ఒనరించి= చేసి; శూద్రుఁడు= నాలుగవ వర్ణం వ్యక్తి; ఇహపరములన్= ఈ లోకంలోనూ, పరలోకంలోనూ; సుఖము= సుఖాన్ని; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: ప్రియమైన మాటా, శాంతీ, ఇంద్రియనిగ్రహమూ, సోమరితనం లేకపోవటం, మంచి శీలమూ కలిగి ఉండటం ఆవశ్యకం. ఈ లక్షణం చేత ఈ దాట శక్యంకాని, భయంకరమైన సంసారం దాటుతానన్న భావంతో భిక్షుకజనాలకు ఏవి కర్తవ్యాలో అవి నిరంతరం చేస్తూ మహాత్ములకు పాదసేవ చేస్తూ నిష్ఠతో శుద్ధుడై, అహంకారంలేనివాడై ధర్మంతో సాధించిన వస్తువులతో దేహపోషణ చేసికొంటూ, పగలనక, రాత్రి అనక పరిచర్య చేస్తూ శూద్రుడు ఇహపర సుఖాలను పొందుతాడు.

విశేషం: అనాలస్యంబు - అలసభావం లేకపోవటం. అలసుడంటే పనుల విషయంలో శ్రద్ధ లేనివాడు, మమకారాన్ని నీచత - ఇది అహంకారాన్ని చంపే పద్ధతి, నీచత అంటే తన్ను గురించి గొప్పగా భావించకుండటం. పగలు, రేయు నాక - సర్వ కాలాలలో అవసరాన్నిబట్టి, ఆయా పనులకు సిద్ధంగా ఉండాలని తాత్పర్యం.

క. దానోపవాసముల స। న్మానితగతి లేదు శూద్రునకు యతి దెస స
మ్మాననమునఁ దత్పూజా। ధీనరతిం గాని యెన్ని తెరువులఁ జూడన్. 292

ప్రతిపదార్థం: శూద్రునకున్= శూద్రుడికి; ఎన్ని తెరువులన్= ఎన్ని మార్గాలతో; చూడన్= చూచినా; యతిదెసన్= యతిపట్ల; సమ్మాననమునన్= మన్ననతోనూ; తత్+పూజా+అధీనరతిన్= అతడిని పూజించటానికి వశమవటంలోని ప్రీతితోను; కాని= కాక; దాన+ఉపవాసములన్= దానమూ, ఉపవాసమూ అనే వాటితో; సత్+మానిత గతి= చక్కని మన్నింపబడిన గతి; లేదు.

తాత్పర్యం: శూద్రుడికి యతిపట్ల గౌరవమూ, అతడి పూజకు వశమైన ప్రీతి అనే వాటితోనే కానీ ఎన్నివిధాలుగా చూచినా దానమూ, ఉపవాసమూ అనే వాటితో మంచి మన్నన పొందే అవకాశం లేదు.

విశేషం: యతికి సమ్మానమూ, పూజ అంటే పరమార్థానికి, పరమాత్మకూ సేవ చేయటం అని భావం.

తే. తెరువుఁ దప్పి తూఁగాడుచు నరుగుదెంచు। యతిఁ గనుంగొని మనమున నడరు పొడమ
నెదురుకొని డప్పి తీర్చి సమ్మదముసేఁత। శూద్రునకు ధర్మవిధి యని శ్రుతులు చెప్పు. 293

ప్రతిపదార్థం: తెరువున్= దారిని; తప్పి; తూఁగాడుచున్= అలసతతో తూగిపోతూ; అరుగుదెంచు యతిన్= వచ్చే సన్న్యాసిని; కనుంగొని= చూచి; మనమునన్= హృదయంలో; అడరు= తొందర; పొడమన్= కలుగగా; ఎదురుకొని= ఎదురువెళ్ళి; డప్పి తీర్చి= దాహంతీర్చి; సమ్మదము చేఁత= ఆనందం కలిగించటం; శూద్రునకున్= శూద్రుడికి; ధర్మవిధి= ధర్మంతో కూడిన కర్తవ్యం; అని; శ్రుతులు= వేదాలు; చెప్పున్= చెప్పుతున్నాయి.

తాత్పర్యం: దారితప్పి అలసతతో తూగిపోతూ వస్తున్న అతడిని చూచి హృదయంలో తొందర పుట్టగా ఎదురేగి, అతడి శ్రమను పోగొట్టి సంతోషపెట్టటం శూద్రునకు ధర్మపు కర్తవ్యం అని వేదాలు చెప్పుతున్నాయి.

విశేషం: అడరు పొడమన్ - ఆలస్యంచేస్తే ఏమై పోతాడో అనే భీతితో కూడిన తొందరతో ఆదరించాలి అని భావం. డప్పి - దాహం, శ్రమ; తెరువు తప్పాడు కనుక దేహశ్రమ, మనఃక్లేశం రెండూ ఉంటాయి. ఆదరణవలన అమితానందం కలుగుతుంది.

చ. యతి రుజఁ బొందినం దొలఁగ। నౌషధ కృత్యముఁ బథ్యమై సమం
చితమగు నట్టి భోజనము సేర్చుటయున్ మలమూత్రముల్ జుగు
ప్సితములు గాని భంగిగల చిత్తముతో జలకార్య మోపి వ
ర్ణితముగఁ జేఁతయుం గల చరిత్రము శూద్రున కిచ్చు సద్గతిన్. 294

ప్రతిపదార్థం: యతి= సన్న్యాసి; రుజన్= జబ్బును; పొందినన్= పొందితే; తొలఁగన్= పోవటానికి; ఔషధ కృత్యమున్= మందు ఇవ్వటమూ; పథ్యము+ఐ= దేహానికి హితం చేసేదై; సమంచితము= మంచిదీ; అగు+అట్టి భోజనము= అయినట్టి ఆహారము; చేర్చుటయున్= అందివ్వటమూ; మలమూత్రముల్= మలము, మూత్రము; జుగుప్సితములు= ఏవగింపు కలిగించేవి;

కాని భంగికల చిత్తముతోన్= కాని తీరు అయిన హృదయంతో; జలకార్యము= నీటిపని (శుద్ధిచేయటం); ఓపి= సహించి; వర్ణితముగన్= జనాలు కొనియాడే విధంగా; చేఁతయున్= చేయటమూ; కలచరిత్రము= కలనడవడి; శూద్రునకున్= శూద్రుడికి; సద్గతిన్= మంచిగతిని; ఇచ్చున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: యతికి జబ్బుచేస్తే మందు ఇవ్వటం, హితమైన మంచి భోజనం పెట్టటం; మలమూత్రాలను ఏవగించుకొనకుండా ఎత్తిపారవైచినీటితో శుద్ధిచేయటం జనాలు కొనియాడే విధంగా చేయగల నడవడి శూద్రుడికి సద్గతిని సమకూరుస్తుంది.

విశేషం: 'చిత్తముతో, ఓపి, వర్ణితములుగా' అనే పదాలు సేవలోని త్రికరణశుద్ధిని అభివ్యక్తం చేస్తున్నాయి. కేవలం మెప్పుకొరకు చేయరాదనే హెచ్చరికను కూడా ప్రతీయమానం చేస్తున్నాయి.

సర్వసంగపరిత్యాగం చేసిన యతికి అవశదశలో సేవకు మరొక దిక్కు ఉండదు కనుక దీనిని ఇంత నొక్కి చెప్పుతున్నారు. నరసేవ నారాయణసేవగా భారతీయ ఋషులు భావించారనటానికి ఇది నిదర్శనం.

క. ఏ విధమున నోపిన యతి। భావము దుఃఖంబు వాపుపని సాదర చే
తోవృత్తిఁ బూని చేయం। గావలయును శూద్రుఁడది సుగతి నొందించున్. 295

ప్రతిపదార్థం: శూద్రుఁడు= శూద్రుడు; ఏ విధమునన్= ఏ విధంగా; ఓపినన్= శక్తి ఉంటే (ఆ విధంగా); యతి భావము దుఃఖంబు= యతి యొక్క హృదయంలోని దుఃఖాన్ని; పాపు పని= పోగొట్టే పనిని; సాదరచేతస్+వృత్తిన్= ఆదరంతో కూడిన మనస్సు ప్రవర్తనతో; పూని= యత్నపడి; చేయన్+కాన్+వలయును= చేయాలి; అది= అట్లా చేయటం; సుగతిన్= మంచిగతిని; ఒందించున్= పొందిస్తుంది.

తాత్పర్యం: శూద్రుడు శక్తి ఉన్న విధంగా యతి హృదయంలోని దుఃఖాన్ని పోగొట్టే పనిని ఆదరంగల బుద్ధితో చేయాలి. అది సుగతిని కలిగిస్తుంది.

సర్వవర్ణ సామాన్యధర్మ నిరూపణ ప్రకారము (సం.13-152-1 (కుంభ))

వ. అని చెప్పి సర్వజాతి సామాన్యంబులగు ధర్మంబు లెఱింగించు నాదరంబున నమ్మునివరుం డిట్లనియె. 296

ప్రతిపదార్థం: అని; చెప్పి= తెలియజేసి; ఆ+మునివరుఁడు= ఆ మునిశ్రేష్ఠుడు (పరాశరుడు); సర్వజాతి సామాన్యంబులు= అన్ని జాతులకు సమానంగా ఉండేవి; అగు ధర్మంబులు= అయిన ధర్మాలు; ఎఱింగించు+ఆదరంబునన్= తెలిపే కుతూహలంతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్ = పలికాడు.

తాత్పర్యం: ఇట్లా చెప్పి, అన్ని జాతులవారికి సమానంగా ఉండే ధర్మాలు చెప్పాలనే వేడుకతో ఆ మునిశ్రేష్ఠుడు పరాశరు డిట్లా చెప్పాడు.

సీ. పరధనంబుల కాసపడక యొడ్లను। దనయట్ల కాఁజూచుచు నఖిల వస్తు
వులుఁ దోఁచు నడఁగు వీచుల చందమున మెఱుం। గులభంగి నని కనుఁగొనుచు నెందు

నాసక్తిలేక భూతాలిపై దయ కల్గి । నడచుట హితము తోనడచుఁ జేసి

నది మేల చేయుట చదురు కీ డవశతఁ । దొడరఁ బ్రాయశ్చిత్త దోహలమున

తే. వేగ తొలఁగించు టొప్పెడు వెరవ యెమ్ము । లేని జంతువుఁ జంపి త్రిస్నానములను

ద్వాదశ ప్రాణసంయమ నాదరమున । నొక్క యుపవాసమునఁ బాపయుక్తి వాయు. 297

ప్రతిపదార్థం: పరధనములకున్= ఇతరుల సొమ్ములకు; ఆసపడక= ఆశపొందక; ఒడ్లను= ఇతరులను; తనఅట్లు+అ+కాన్= తనవలెనే; చూచుచున్= భావిస్తూ; అఖిలవస్తువులున్= సమస్తమైన వస్తువులూ; తోఁచు అడఁగు వీచుల చందమునన్= పైకి కనిపిస్తూ అడగిపోయే తరంగాల విధంగా; మెఱుంగులభంగిన్= మెరుపులలాగా; అని కనుఁగొనుచున్= పరికిస్తూ; ఎందున్= దేనిమీదా; ఆసక్తి= తగులుపాటు; లేక; భూత+ఆలిపైన్= ప్రాణుల సముదాయంమీద; దయ కల్గి= దయపెట్టుకొని; నడచుట= ప్రవర్తించటం; హితము= మేలు; తోన్= తనతోపాటు; నడచున్= వస్తుంది; చేసిన+అది= చేసే పని; మేలు+అ= ఇతరులకు శుభమైనదే; చేయుట= చేయటం; చదురు= సరియైనది; అవశతన్= తన వశం తప్పటంవలన; కీడు= తప్పు పని; తొడరన్= కలిగితే; ప్రాయశ్చిత్త దోహలమునన్= ప్రాయశ్చిత్తం మీది ఉత్సాహంతో; వేగ= వెనువెంటనే; తొలఁగించుట= పోగొట్టుకొనటం; ఒప్పెడు వెరవు+అ= ఒప్పునట్టి కార్యము; ఎమ్మ్లేని జంతువున్= ఎముకలేని జంతువును; చంపి= చంపిన కారణంగా; త్రిస్నానములను= మూడు స్నానాలచేత; ద్వాదశ ప్రాణ సంయమన+ఆదరమునన్= పండ్రెండు మార్లు ప్రాణాయామం చేసే ఆదరంచేత; ఒక్క ఉపవాసమునన్= ఒక రోజు భోజనం మానివేయటంచేత; పాపయుక్తి= పాపపు తగులును; పాయున్= తొలగించుకొంటాడు.

తాత్పర్యం: ఇతరుల సొమ్ముల కాసపడరాదు. ఇతరులను తనతో సమానంగా భావించాలి. కనపడే వస్తువులన్నీ వచ్చిపోయే తరంగాలవంటివి - అని భావించి వాటిపై మమకారం వదలాలి. ప్రాణులన్నిటిమీదా దయకలిగి ఉండాలి. చేసిన మేలే మనతో వస్తుంది. చేసే పని ఇతరులకు మేలైన దైతేనే చేయాలి. పొరపాటున చెడుపని చేస్తే వెనువెంటనే ప్రాయశ్చిత్తం చేసికొని తొలగించుకొనాలి. ఎముకలులేని జంతువును చంపితే మూడుస్నానాలూ, పండ్రెండు ప్రాణాయామాలూ, ఒక ఉపవాసమూ చేస్తే ఆ పాపం పోతుంది.

విశేషం: తరంగం, మెరుపు క్షణంలో పుట్టి క్షణంలో నశిస్తాయి. సృష్టిలో సర్వవస్తువులూ అటువంటివే. కాబట్టి అనిత్యాలైన వాటిమీద ఆసక్తి తొలగించుకొని నిత్యమైన పరతత్త్వంమీద దృష్టి నిలపాలనే ఉపదేశం ఇక్కడ తోస్తుంది.

కీడు అవశతన్ తొడరన్ - దీనివలన బుద్ధిపూర్వకంగా చేసే పాపాలకు ప్రాయశ్చిత్తం లేదని చెప్పినట్లయింది. స్నానం బాహ్యశుద్ధినీ, ప్రాణాయామాలు నాడీమండలశుద్ధినీ, ఉపవాసం - అంతశ్శుద్ధినీ కలిగిస్తాయని భావం.

ఆ. అస్థి కలిగి హీనమగుజంతు వైనఁ ద । ద్ద్విగుణవృత్తి వలయుఁ బ్రగుణజంతు

వునకు నలుమడించుకొనునది నరమాత్ర । హింస యష్టగుణ కృతీహఁ బాయు. 298

ప్రతిపదార్థం: అస్థి= ఎముక; కలిగి= ఉండి; హీనము= తక్కువది; అగు జంతువు= అయిన జంతువు; ఐనన్= అయితే; తత్+ద్విగుణవృత్తి= దానికి రెట్టింపు పని; వలయున్= కావాలి; ప్రగుణజంతువునకున్= ఇంకా ఎక్కువ గుణంగల జంతువు విషయంలో; నలుమడించుకొనునది= నాలుగు రెట్లు చేసికొనాలి; నరమాత్రహింస= సాధారణ మానవుడి హింస; అష్టగుణ కృతి+ఈహన్= ఎనిమిదిరెట్ల ప్రాయశ్చిత్తపు పని యందలి కోరికతో; పాయున్= పోతుంది.

తాత్పర్యం: ఎముక ఉండిన తక్కువ జాతి జంతువును చంపితే ప్రాయశ్చిత్తం రెండు రెట్లు చేసికొనాలి. పెద్ద జంతువైతే నాలుగు రెట్లు, మానవమాత్రుడిని హింసిస్తే ఎనిమిది రెట్లు ప్రాయశ్చిత్తంతో ఆ పాపం పోతుంది.

విశేషం: ఎముకలేని జంతువు విషయం మొదటి పద్యంలో చెప్పారు. ఎముక ఉన్న జంతువును చంపితే దానికి ప్రాయశ్చిత్తం రెండు స్నానాలు, 24 ప్రాణాయామాలు, రెండు ఉపవాసాలు.

పెద్ద జంతువైతే నాలుగు స్నానాలు, నలభై ఎనిమిది ప్రాణాయామాలు, నాలుగు ఉపవాసాలు; మానవహింసచేస్తే ఎనిమిది స్నానాలు, తొంభై ఆరు ప్రాణాయామాలు, ఎనిమిది ఉపవాసాలు ప్రాయశ్చిత్తం.

అయితే ఇవన్నీ పొరపాటున జరిగిన పాపానికి మాత్రమే. బుద్ధిపూర్వకమైన హింసకు మహానరకయాతన అనుభవించవలసినదే.

క. హీననరునట్ల గుఱ్ఱము । నేనుఁగును మనుష్యవధ మనేకాబ్దికభి
క్షానిరతి ప్రభృతి సుక । ర్మానుష్ఠానములఁ గాని యఱుగ దలఁతులన్. 299

ప్రతిపదార్థం: గుఱ్ఱమును= గుర్రమూ; ఏనుఁగును= ఏనుగునూ; హీననరు+అట్లు+అ= సాధారణ మానవుడివలెనే; మనుష్య వధము= గొప్ప మనుష్యుడిని చంపటం, అనేక+అబ్దిక భిక్షా నిరతి ప్రభృతి సుకర్మ+అనుష్ఠానములన్= పెక్కు ఏండ్లకు సంబంధించిన, బిచ్చమెత్తుకొనుట మొదలైన మంచి పనులను చేయటంవలన; కాని; అలఁతులన్= తక్కువ వాటిచేత; అఱుగదు= నశించదు.

తాత్పర్యం: గుర్రాన్నీ ఏనుగునూ చంపిన పాపానికి ప్రాయశ్చిత్తం సాధారణ జనుడిని చంపిన దానికి వలెనే చేసికొనాలి. విశిష్టులైన మనుజులను చంపితే కలిగే పాపం ఎన్నో ఏండ్లు బిచ్చమెత్తటం మొదలైన సత్కర్మాలవలననే కానీ తక్కువ రకపు ప్రాయశ్చిత్తాలతో పోదు.

విశేషం: ఆబ్దిక - అబ్ద సంబంధమైన, ఏండ్లకు సంబంధించిన అని భావం. బిచ్చమెత్తుకొని దేహాన్ని పోషించుకొనటం ఒక విధమైన ప్రాయశ్చిత్తం. బిచ్చమెత్తుకొనటమంటే మానాభిమానాలను సర్వదా సర్వథా వదలివేసికొనటమన్నమాట. అది మనిషి హృదయంలో గొప్ప సంస్కారాన్ని సమకూరుస్తుంది.

తే. కల్లు ద్రావుట గురుతల్పగమన మధిక । పాతకము లివి ప్రాణముల్ వాయఁబెట్టి
చేయు ప్రతికారములఁ గాని చెడవు గోధ । రాద్యధిక దానములనైన నఱుగ వండ్రు. 300

ప్రతిపదార్థం: కల్లు= మద్యము; త్రావుట= త్రాగటము; గురుతల్ప గమనము= గురువు భార్యను పొందటం; అధిక పాతకములు= మిక్కిలి దొడ్డ పాపాలు; ఇవి; ప్రాణముల్= ప్రాణాలను, పాయన్+పెట్టి= పోవటానికైనా సిద్ధంచేసి; చేయు ప్రతికారములన్= చేసే ప్రాయశ్చిత్తాలతో; కాని; చెడవు= నశింపవు; గో ధరా+ఆది+అధిక దానములన్+ఐనన్= గోవులను, భూమిని, ఇంకా గొప్ప వస్తువులను మొదలైన వాటిని దానంచేయటంవలన కూడా; అఱుగవు= నశింపవు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: మద్యపానమూ, గురుభార్యను కలియటం అనేవి మహాఘోరపాపాలు. ప్రాణాలైనా బలిపెట్టి చేసే ప్రాయశ్చిత్తాలతోగానీ అవి నశింపవు. గోదాన భూదానాదులతో కూడా అవి నశింపవంటారు.

విశేషం: మద్యపానంవలన మనిషిలో యుక్తాయుక్తవివేకజ్ఞానం అంతరిస్తుంది. దానివలన అతడు ఎంత పాడుపనిచేయటానికైనా సంకోచించడు. గురుపత్ని తల్లికంటె మన్నింపదగినది. ఆమెతో రమించటమంటే తల్లి భావనయే హృదయంనుండి తొలగించివేయటం. కనుక ఇవి మహాపాతకాలు. ప్రాయశ్చిత్తవిధిలో ప్రాణాలు పోయే స్థితి ఉన్నా సంకోచపడక చేసికొంటేనే ఈ పాపాలు పోతాయి. ఆ ప్రయత్నం లేకపోతే మానవత్వమే లేనివాడని భావం.

క. ఇవి యెఱిఁగి యెపుడు పరలో। కవిభీతి మనంబునందుఁ గల్గి సకలభూ
తవిషయదయ నూనిన య। ట్టి వాఁడు కీడెల్లఁ బోనడిచి మేలొందున్. 301

ప్రతిపదార్థం: ఇవి= ఈ విషయాలు; ఎఱిఁగి= తెలిసికొని; ఎపుడున్= సర్వకాలాలలో; పరలోక విభీతి= పరలోక సంబంధమైన పెనుభయం; మనంబునందున్= హృదయంలో; కల్గి= ఉంచుకొని; సకల భూత విషయ దయన్= అన్ని ప్రాణుల యెడలను దయను; ఊనిన అట్టివాఁడు= గట్టిగా పదిలపరచుకొన్నవాడు; కీడు+ఎల్లన్= పాపమంతటినీ; పోన్= పోవునట్లు; అడిచి= అణగగొట్టి; మేలు= శుభాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: ఈ విషయాలు తెలిసికొని, హృదయంలో పరలోక సంబంధమైన భయాన్ని నిలుపుకొని, ఎల్లవేళలా అన్ని ప్రాణుల యెడల దయ కలిగి ఉండేవాడు పాపాల నన్నింటినీ పోగొట్టుకొని శుభం పొందుతాడు.

విశేషం: పరలోకం ప్రత్యక్షం కాదు కనుక చాలామందికి అది లేదని వెర్రి భావన. కాని కొంచెం ఆలోచిస్తే ఇందులోని భ్రమ తొలగి పోతుంది. భవిష్యత్తు అంతా అప్రత్యక్షమే కదా! కాని దానికొరకు లక్షలు, కోట్లు సంపాదిస్తాడు మానవుడు. అట్లాగే ప్రత్యక్షం కాకపోయినా పుణ్యఫలాలను, పాపఫలాలను అనుభవించవలసిన పరలోకం ఉందని నమ్మినవాడు. 'వి' భీతితో ఉంటాడు. ఇది విశేషభయం. ఎందుకంటే ఫలితం ప్రతీకారం లేనిదై ఉంటుంది. కనుక ముందే జాగ్రత్త పడాలి అని 'వి' అనే ఉపసర్గ ఉపదేశిస్తుంది.

"సకల భూత......'' పాపాలన్నీ స్వార్థం కారణంగా ఏర్పడతాయి. భూతదయ స్వార్థాన్ని రూపుమాపుతుంది. కనుక అది పాపాలు చేయకుండా ఉండటానికి గొప్ప సాధనం.

'ఎపుడు' - జీవితకాలమంతా పుణ్యం చేసినా ఒక్క క్షణంలో చేసిన పాపం కుండెడు పాలలో చిన్న విషపు బొట్టువలె సర్వనాశనం చేస్తుంది. కనుక 'చిన్న' పాపమే కదా! క్షణకాలమే కదా!' అనే ఊరట పాపం విషయంలో పనికిరాదని హెచ్చరిక.

క. ఈ నెఱిఁ గైకొని శూద్రుం। డైనను గ్రమవృత్తి నవ్యయంబగు పదముం
గానం బడయుట గల్గును। వానికి నియమముల త్రోవ వలవక యునికిన్. 302

ప్రతిపదార్థం: వానికిన్= అతడికి; నియమముల త్రోవ= నియమాల మార్గం; వలవక ఉనికిన్= ఏర్పడని కారణంగా; ఈ నెఱిన్= ఈ ధర్మసూక్ష్మాన్ని; కైకొని= చేపట్టి; శూద్రుండు+ఐనన్= శూద్రుడైనా; క్రమవృత్తిన్= క్రమప్రవర్తనతో; అవ్యయంబు= నాశనము కానిది; అగు= అయిన; పదమున్= స్థానాన్ని; కానన్+పడయుట= పొందగలుగుట; కల్గును= కలుగుతుంది.

తాత్పర్యం: శూద్రుడికి అతి కఠోరమైన నియమనిష్ఠలు విధించని కారణంగా ఈ చెప్పిన ధర్మసూక్ష్మాన్ని అతడు ఆచరించి, క్రమపద్ధతిలో శాశ్వతమైన పదాన్ని పొందే అవకాశం ఉంది.

విశేషం: పూర్వం చెప్పిన ధర్మాలను జాగ్రత్తగా పాటించిన శూద్రుడు క్రమంగా పై వర్ణాలలో పుట్టి తుదకు పరమపదాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పొందగలుగుతాడని పద్యభావం. అంటే పై వర్ణాలవారు ఎంతో ప్రయాసతో అధిక నియమనిష్ఠలతో పొందే మహాప్రయోజనాన్ని శూద్రుడు ఈ ఆచార్యనిష్ఠచేత పొందగలుగుతాడని అభిప్రాయం.

వ. అని నిర్దేశించి యరిష్టంబు లెఱిఁగింప ననుకంప పుట్టుటయు. 303

ప్రతిపదార్థం: అని= ఇట్లని; నిర్దేశించి= చక్కగా తెలియజేసి; అరిష్టంబులు= కీడులు; ఎఱిఁగింపన్= తెలుపటానికి; అనుకంప= దయ; పుట్టుటయున్= కలుగగా.

తాత్పర్యం: ఇట్లా చెప్పి, ఆ పరాశరుడు కీడులను గూర్చి చెప్పాలని దయపుట్టి (ఇట్లా చెప్పాడు)

విశేషం: అరిష్టాలంటే ఇక్కడ రాబోయే అశుభాలను సూచించే శకునాలవంటివి.

సీ. పురుషు హిరణ్మయు నరుఁడెవ్వఁ డుత్తర। మునఁ గాంచు దక్షిణముఖత నుండ
నతనికి వర్షత్రయమున మృత్యువు వచ్చు;। రవి మండలంబు నిష్ప్రభము గాఁగఁ
గనిన రెండేఁడులఁ; గౌముదిఁ దననీడఁ। దూఁటు చూచిన నొక్క యేఁట; నది వి
మౌళియై యున్న షణ్మాసమాత్రంబునఁ;। గర్ణముల్ గరములఁ గదియ మూసి

ఆ. కొనిన యపుడు ఘ్రోత వినకున్న నెలనాళ్ళఁ;। గర్ణములును నాసికయును బట్టు
కదల వికృత వర్ణకత పండ్లఁ గన్నులఁ। గలుగ నాఁడ మరణ మొలయునండ్రు. 304

ప్రతిపదార్థం: నరుఁడు= మనిషి; ఎవ్వఁడు= ఎవడు; హిరణ్మయున్= బంగారం రూపంగల; పురుషున్= పురుషుని; దక్షిణముఖతన్= దక్షిణమువైపు మొగం ఉంచినవాడై; ఉండన్= ఉండగా; ఉత్తరమునన్= ఉత్తరదిక్కున; కాంచున్= చూస్తాడో; అతనికిన్= అట్టి మనిషికి; వర్షత్రయమునన్= మూడేండ్లలో; మృత్యువు= చావు; వచ్చున్= వస్తుంది; రవిమండలంబు= సూర్యబింబం; నిష్ప్రభము కాఁగన్= వన్నెలేనిదై యుండగా; కనినన్= చూస్తే; రేండేఁడులన్= రెండు సంవత్సరాలలో(మృత్యువు వస్తుంది); కౌముదిన్= వెన్నెలలో; తననీడన్= తన నీడలో; తూఁటు= రంధ్రాన్ని; చూచినన్= చూస్తే; ఒక్క+ఏఁటన్= ఒక్క సంవత్సర కాలంలో (మృత్యువు వస్తుంది); అది= తననీడ; విమౌళి+ఐ ఉన్నన్= తలలేనిదై ఉంటే; షట్+మాస మాత్రంబునన్= ఆరు నెలల కాలంలోనే (మృత్యువు వస్తుంది); కర్ణముల్= చెవులు; కరములన్= చేతులతో; కదియన్= బిగించినట్లు; మూసికొనిన+అపుడు= మూసుకొన్నప్పుడు; ఘ్రోఁత= ఒక విధమైన నాదం; వినక+ఉన్నన్= వినకుంటే; నెలనాళ్ళన్= నెలరోజులలో (మృత్యువు వస్తుంది); కర్ణములును= చెవులునూ; నాసికయును= ముక్కున్నూ; పట్టు= బిగింపు, కదలన్= కదిలితే; పండ్లన్= దంతాలలో; కన్నులన్= కన్నులలో; వికృత వర్ణకత= వికారపు రంగు కలగటం; కలుగన్= ఏర్పడితే; నాఁడు+అ= ఆ రోజుననే; మరణము= చావు; ఒలయును= కలుగును; అండ్రు= అంటారు.

తాత్పర్యం: నరుడు హిరణ్మయపురుషుడు దక్షిణంవైపు మొగం పెట్టి ఉత్తరందిక్కున ఉండటం చూస్తే మూడేండ్లలో మరణిస్తాడు. సూర్యబింబం కాంతి తప్పి ఉండటం చూస్తే రెండేళ్ళలో మృతి పొందుతాడు. వెన్నెలలో తన నీడలో రంధ్రాన్ని చూస్తే ఒక సంవత్సరకాలంలో ఆయువు తీరినవాడవుతాడు. తననీడ తలలేనిదై కనపడితే ఆరు నెలలలో వెళ్ళిపోతాడు. చెవులను చేతులతో గట్టిగా మూసుకొన్నప్పుడు నాదం వినకపోతే నెలనాళ్ళలో చావు పొందుతాడు. చెవులు, ముక్కు పట్టు సడలి, పండ్లలో, కన్నులలో వికారపు వర్ణం కానవస్తే ఆ రోజే మరణిస్తాడు అంటారు.

విశేషం: హిరణ్మయపురుషుడంటే సూర్యబింబంలో ఉండే శ్రీమన్నారాయణుడు. సూర్యుడు ఉత్తరాన ఉదయించటం అనర్థదాయకం కదా!

వ. అట్లు వర్తిల్లు నరిష్టంబులం దెయ్యవి దోఁచినం గలంకం బొరయని యంతరంగంబుతోడఁ దృష్ణాకలితంబైన సంసారంబునందలి వ్యాసంగంబు వదలి హృదయం బేకాగ్రంబు గావించి మునీంద్ర నిర్దిష్ట నిర్మలధ్యాన కర్మంబులం దగిలి యుండె నేనిం గాలాంతకప్రసాదంబు పడయుం దెలివికొఱంతం గాలగోచరత్వంబు నొంది వైశ్య రాజన్య విప్రకులంబులం దత్తద్విధ సంపత్సమృద్ధంబులుఁ బ్రబుద్ధంబులు నగు వంశంబులం గ్రమంబున జనించి. **305**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; వర్తిల్లు+అరిష్టంబులందున్= ప్రవర్తించే అరిష్టాలలో; ఏని+అవి= ఏవి; తోఁచినన్= కన పడినా; కలంకన్= కలత; పొరయని అంతరంగంబుతోడన్= పొందని హృదయంతో; తృష్ణాకలితంబు= ఆశలతో కూడినది; ఐన= అయినట్టి; సంసారంబునందలి వ్యాసంగంబు= సంసారంలోని తగులాన్ని; వదలి= విడిచి; హృదయంబు= మనస్సును; ఏక+అగ్రంబు= చెదరని దానిని; కావించి= చేసి; ముని+ఇంద్ర నిర్దిష్ట నిర్మల ధ్యాస కర్మంబులన్= మునిశ్రేష్ఠులు తెలియజెప్పిన మచ్చలేని ధ్యానపు కార్యములలో; తగిలి ఉండెన్+ఏనిన్= ఆసక్తుడై ఉంటే; కాల+అంతక ప్రసాదంబు= కాలాన్ని అంతంచేసే దైవంయొక్క అనుగ్రహాన్ని; పడయున్= పొందుతాడు; తెలివి కొఱంతన్= తెలివితక్కువచేత; కాల గోచరత్వంబున్= కాలుడికి కనపడటం (మరణించటం); ఒంది= పొంది; వైశ్య, రాజన్య విప్రకులంబులన్= కోమటుల, క్షత్రియుల, విప్రుల కులాలలో; తత్+తత్+విధ సంపత్+ సమృద్ధంబులున్= ఆయా విధాల సంపదలతో నిండుతనం కలవీ; ప్రబుద్ధంబులున్= జ్ఞానసంపద కలవీ; అగు వంశంబులన్= అయిన వంశాలలో; క్రమంబునన్= వరుసగా; జనించి= పుట్టి.

తాత్పర్యం: ఆ విధంగా ఉండే అరిష్టాలలో ఏవి తోచినా మనుజుడు కలత పొందని హృదయంతో ఆశల దాహం కలదైన సంసారంమీది లంపటాన్ని వదలివైచి మనస్సును కుదుటపరచుకొని మునివర్యులు చెప్పిన నిర్మలధ్యాన కార్యాలలో ఆసక్తి కలిగి ఉంటే కాలరూప పరమాత్ముడి అనుగ్రహం పొందుతాడు. ఒకవేళ దానికి వలసిన తెలివి చాలకపోతే మరణించి వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాలలో ఆయా విధాల సంపదల నిండుతనమూ, జ్ఞానసంపదా కల వంశాలలో క్రమంగా పుట్టి (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అంతకాలంలో చేసిన ధ్యానఫలంగా ఉత్తమవంశాలలో ఉన్నత సంపదలు కలచోట జన్మిస్తాడు. **"శుచీనాం శ్రీమతాం గేహే యోగ భ్రష్టోఽభిజాయతే"** అనే భగద్వాక్యాన్ని ఇక్కడ సమన్వయం చేసికొనాలి.

క. అయ్యై కర్మంబుల దెస । నెయ్యం బెసలారఁ గలిగి నియమ నిరూఢుం
డియ్యన యన సుకృతంబుల । నయ్యెడు సౌఖ్యంబు నిహమునందుఁ బరమునన్. **306**

ప్రతిపదార్థం: ఈ+అన= ఈతడు; ఆ+ఆ+కర్మంబుల దెసన్= ఆయా పనులయెడ; నెయ్యంబు= ప్రేమ; ఎసలారన్= అతిశయించగా; కలిగి= ఏర్పడి; నియమ నిరూఢుండు= నియమములతో చెక్కు చెదరనివాడు; అనన్= అనునట్లుగా; సుకృతంబులన్= పుణ్యములతో; అయ్యెడు సౌఖ్యంబున్= అయ్యే సుఖాన్ని; ఇహమునందున్= ఈ జన్మలోను; పరమునన్= పరంలోను.

తాత్పర్యం: ఆయా కార్యవిశేషాలలో ప్రేమ అతిశయించగా ఏర్పడి అతడు నియమాలయందు దృఢమైన ఆదరం కలవాడన్న ప్రతిష్ఠ పొంది, పుణ్యకార్యాలవలన ఏర్పడే సుఖాన్ని ఇహపరలోకాలలో (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అనుభవించుచు గమనంబు నాగమనము । నాచరించుచు బ్రహ్మసభాంతమైన
పుణ్యలోక నికాయంబుఁ బొంది యెల్ల । నెఱిఁగి యూహించి యిట్లని యెడఁ దలంచు. 307

ప్రతిపదార్థం: అనుభవించుచున్= అనుభవిస్తూ; గమనంబున్= పోవటమూ; ఆగమనమున్= రావటము; ఆచరించుచున్= చేస్తూ; బ్రహ్మసభా+అంతము= బ్రహ్మయొక్క సభ తుదిగా; ఐన= అయిన; పుణ్యలోక నికాయంబున్= పుణ్యలోకాల సముదాయాన్ని; పొంది= చేరుకొని; ఎల్లన్= అంతటినీ; ఎఱిఁగి= తెలిసికొని; ఊహించి= భావించి; ఇట్లు+అని= ఈ విధంగా; ఎడన్= హృదయంలో; తలంచున్= భావిస్తాడు.

తాత్పర్యం: (ఇహపరసుఖాలను) అనుభవిస్తూ బ్రహ్మసభ చివరగా ఉన్న పుణ్యలోకాల కన్నింటికీ రాకపోకలు గావిస్తూ నిండైన జ్ఞానం పొంది తన భావనతో ఈ విధంగా హృదయంలో తలపోస్తాడు.

క. 'ఇవి యెల్ల నశాశ్వతములు । భవమరణాకలితములును; బటుసంసారో
ద్భవదుఃఖయుక్తములు; సుఖ । లవయుతములు వీని యందు లౌల్యంబేలా?' 308

ప్రతిపదార్థం: ఇవి= ఈ లోకాలు; ఎల్లన్= అన్నీ; అశాశ్వతములు= నిత్యములు కానివి; భవ మరణ+ఆకలితములును= పుట్టుక; చావులతో కూడినవి; పటు సంసార+ఉద్భవ దుఃఖ యుక్తములు= గట్టిదైన అజ్ఞానంవలన పుట్టిన దుఃఖంతో కూడినవి; సుఖ లవ యుతములు= సుఖంయొక్క లేశంతో కూడినవి; వీనియందున్= ఇట్టి వీటిమీద; లౌల్యంబు= ఆశ; ఏలా?= ఎందుకు?

తాత్పర్యం: 'ఇవన్నీ ఎప్పటికైనా నశించేవి. పుట్టుక చావు అనే వాటితో కూడినవి. గట్టిదైన అజ్ఞానంతో ఏర్పడే దుఃఖాన్ని అంటిపెట్టుకొని ఉండేవి. కొంచెపాటి సుఖం మాత్రం కలవి. వీటిమీద మమకారం ఎందుకు?'

విశేషం: ఇక్కడ నాలుగు దోషాలను పేర్కొన్నారు. 1. అనిత్యత; 2.చావుపుట్టుకలుండటం; 3.దుఃఖ బహుళత; 4. సుఖస్వల్పత్వం. వివేకం కలవాడు ఈ దోషాలలో ఏ ఒక్కటి ఉన్నా అపేక్షించడు. అన్నీ కలిసి ఉంటే ఇక చెప్పనేల?

"ఆబ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోఽర్జున" అని భగవద్వాక్యం. 'అర్జునా! బ్రహ్మలోకం వరకు సర్వలోకాలు మరల తిరిగి రావలసినవే' దీనిని ఇక్కడ అనుసంధించికొనాలి. వివేకధనుడు అపేక్షించేది పునరావృత్తిరహిత శాశ్వత ఆనందైకధామం.

వ. అని తలంచి యపునర్భవకారియు ననధికంబును నచలంబును నగు ధర్మంబు కోరుచుండు నకృతకర్మఫలంబు నొందను గృతకర్మ ఫలంబు తొలంగను నెవ్వరికి వశంబు కామి ధ్రువం బగుటం జేసి కృతకర్మవిశేషంబున నతండు వాసవాది వరిష్ఠసహవాసంబున వర్తించి. 309

ప్రతిపదార్థం: అని= ఇట్లు; తలంచి= భావించి; అపునర్+భవ కారియున్= తిరిగి పుట్టటం కలిగించనిదిన్నీ; అనధికంబును= తనకంటె మిన్న అయినది లేనిదీ; అచలంబును= ఊగిసలాట లేనిదియు; అగు= అయిన; ధర్మంబు= ధర్మాన్నీ; కోరుచుండున్= కోరుతూ ఉంటాడు; అకృత కర్మఫలంబున్= చేయని పని ఫలాన్ని; ఒందను= పొందటానికీ; కృతకర్మఫలంబు= చేసిన పనుల

ఫలాన్ని; తొలంగను= వదలటానికీ; ఎవ్వరికిన్= ఎట్టివారికినీ; వశంబు కామి= సాధ్యం కాకపోవటం; ధ్రువంబు= నిశ్చయం; అగుటన్+చేసి= కావటంవలన; కృతకర్మ విశేషంబునన్= చేసిన పుణ్యకర్మలవలన; అతండు= అట్టి జనుడు; వాసవ+ఆది వరిష్ఠ సహవాసంబునన్= దేవేంద్రుడు మొదలైన మహాత్ములతో కలిసి ఉండటంతో; వర్తించి= మెలగి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఇట్లు తలపోసి మరల పుట్టుక కలిగించునదీ, తన కంటె మిన్న అయినది లేనిదీ, మిక్కిలి స్థిరమైనదీ అయిన ధర్మాన్ని కోరుతూ ఉంటాడు. చేయని పనికి ఫలం పొందటంగానీ, చేసిన కర్మఫలం పొందకపోవటానికి గానీ ఎవరికీ సాధ్యం కాదనేది నిశ్చయం కనుక, చేసిన పుణ్యకర్మంవలన అతడు దేవేంద్రుడు మొదలైన మహాత్ముల సహవాసంతో కొంతకాలం ఉంటాడు.

తే. **పుణ్యఫలకాలమున యంతమున నితాంత । సంప్రబుద్ధ జనంబు వంశమునఁ బుట్టి**
బ్రహ్మసంస్కారముల నెల్లఁ బడసి యతిథి । దేవ పితృకోటులకుఁ బరితృప్తి చేసి. 310

ప్రతిపదార్థం: పుణ్యఫలకాలమున అంతమునన్= పుణ్యముల ఫలం అనుభవించే కాలం చివర; నితాంత సంప్రబుద్ధ జనంబు వంశమునన్= చాలా అధికమైన జ్ఞానం గల జనాల వంశంలో; పుట్టి= జన్మించి; బ్రహ్మ సంస్కారములన్= బ్రాహ్మణ సంస్కారములను; ఎల్లన్= అన్నింటినీ; పడసి= పొంది; అతిథి దేవ పితృ కోటులకున్= అతిథులు, దేవతలు, పితృదేవతలు అను వారి సముదాయములకు; పరితృప్తిచేసి= మిక్కిలి తృప్తి గావించి.

తాత్పర్యం: పుణ్యఫలం ముగిసే సమయంలో గొప్ప జ్ఞానసంపద గలవారి వంశంలో పుట్టి, బ్రహ్మవేత్తలు పొందే సంస్కారాలన్నీ పొంది, అతిథులకు, దేవతలకు, పితృదేవతలకు మిక్కిలి తృప్తి కలిగించి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇందులో విప్రుడు ఆచరించవలసిన పంచమహాయజ్ఞాలను సూచించారు. 'బ్రహ్మసంస్కారములు' అనటంవలన (1)బ్రహ్మయజ్ఞం (2) భూతయజ్ఞం అనేవి; అతిథి తృప్తివలన (3) మనుష్య యజ్ఞం దేవతల తృప్తివలన (4) దేవయజ్ఞం, పితృతృప్తివలన; (5) పితృయజ్ఞం అనేవి సిద్ధిస్తున్నాయి. భారతీయులు తల్లి గర్భంలో బీజం పడకముందు నుండి శరీరం బూడిదయ్యేవరకు చేసుకొనే సంస్కారాలు అనేకం ఉన్నాయి. గర్భాదానము, పుంసవనము, సీమంతము, జాతకర్మ నామకరణము, చూడాకర్మ, కేశఖండనము, ఉపనయనము, వివాహము మొదలైనవి.

తే. **భార్య పుత్రు లాదిగఁ గల పాశసంచ । యంబు నిరసించి యతిధర్మ మాచరించి**
యిలు వెడలి గురుశుశ్రూష నలఘు సాంఖ్య । యోగ శాస్త్ర రహస్యైకయోగ మొంది. 311

ప్రతిపదార్థం: భార్య= పెండ్లము; పుత్రులు= సంతానం; ఆదిగన్= మొదలుగా; కల= ఉన్న; పాశసంచయంబు= పాశాల సముదాయాన్ని; నిరసించి= త్రోసివేసి; యతి ధర్మము= సన్న్యాసి ధర్మాన్ని; ఆచరించి= చక్కగా నిర్వహించి; ఇలు= ఇంటినుండి; వెడలి= బయటకు వచ్చి; గురు శుశ్రూషన్= గురువుల సేవతో; అలఘు సాంఖ్య యోగ శాస్త్ర రహస్య+ఏక యోగము= గొప్పవైన సాంఖ్యము, యోగము అనే శాస్త్రాల గుట్టులను ఒక్కటిగా కలిపి అనుభవించటాన్ని; ఒంది= సాధించి.

తాత్పర్యం: భార్యాపుత్రులు మొదలైన బంధాల నన్నింటిని తెగగోసి వేసికొని, సన్న్యాసి ధర్మాన్ని చక్కగా పాటించి, ఇంటినుండి బయటపడి, గురువుల సేవతో గొప్పవైన సాంఖ్యయోగశాస్త్రాల రహస్యాలను ఒక్కటిగా చేసికొని అనుభవించి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: భార్య మొదలైనవారు పాశాలు - కట్టి పడవేసే త్రాళ్ళవంటివారు. ఎందుకంటే వారి రక్షణ, పోషణ భారంతోనే కాలమంతా గడచిపోతుంది. ఆ పనులతోనే పుణ్యపాపాల బంధాలు పెరిగిపోతాయి. పరమార్థచింతనకు అవకాశం ఉండదు.

యతిధర్మం - సంగం త్యజించటం. సమ్+న్యాసం= చక్కగా తీసి అవతల ఉంచటం. దేనిని అంటే సంగాన్ని. అదే సర్వానర్థ మూలకారణం. 'సతిన్యాసః' అని కూడా మరొక అర్థం చెప్పుతాను. సత్స్వరూపుడైన భగవంతుడియందు అన్నింటినీ - తను, మనో, ధన, ప్రాణాదులను చక్కగా అర్పణ చేయటం అని దానికర్థం.

శుశ్రూష - శ్రవణం మీది ఇచ్ఛ. పరమార్థం వినాలనే కోరిక - క్రమంగా ఆ కోరికతో చేసేసేవ శుశ్రూష అయింది.

సాంఖ్యం - సంఖ్యా సంబంధమైనది. తత్త్వాలలెక్క అని స్థూలంగా అర్థం. పంచభూతాలు, పంచ ఇంద్రియాలు, పంచ తన్మాత్రలు, పంచ కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారం అనే ఇరవైనాలుగు తత్త్వాల చక్కని జ్ఞానం సాంఖ్యం.

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులనే ఎనిమిది అంగాలతో కూడిన చిత్తవృత్తి నిరోధరూపమైన విద్య యోగం.

ఈ రెంటి సమన్వయం ఏకయోగం - దీనివలన నరుడు జననమరణరూప సంసారచక్రం నుండి ముక్తి పొందుతాడు. ఇది భారతీయుల తత్త్వవిద్య. అయితే ఈ సాధన శరీరం రాలిపోయేవరకు సాగాలి.

సీ. **పుణ్యంబులైన యరణ్యంబులను శూన్య । గృహముల దేవతాగృహములందు**
గుహలను నిలుచుచుఁ గుడుపు భిక్ష నొనర్చి । యొకచోట మరగక యొల్లమియును
వలపును నెడలి నిర్ద్వంద్వత పాటించి । మమత యహంకృతి మాని నిత్య
తృప్తాత్ముఁడును జనాధీనత్వరహితుండు ।నై గమ్యదిశ యొక్కఁ డనఁగ లేక

ఆ. **మెలఁగుచుండి పక్వఫలము తొడిమఁ బాయు । పగిది గుణచయంబుఁ బాసి యక్ష**
యంబు నచలమును నిరామయంబును నగు । పదముఁ జెందు శుద్ధభావ మెసఁగ. **312**

ప్రతిపదార్థం: పుణ్యంబులు= పవిత్రములు; ఐన= అయినట్టి; అరణ్యంబులను= అడవులయందు; శూన్య గృహములన్= జనాలు లేని పాడుబడ్డ కొంపలందు; దేవతాగృహములందున్= దేవాలయాలయందు; గుహలను= కొండగుహలలోను; నిలుచుచున్= ఉంటూ; కుడుపు= తిండిని; భిక్షన్= బిచ్చంతో; ఒనర్చి= చేసి; ఒక చోటన్= ఒక తావున; మరగక= అలవాటు పడక; ఒల్లమియును= ఇష్టపడకపోవటాన్ని; వలపును= ఇష్టపడటాన్ని; ఎడలి= వదలివేసి; నిర్ద్వంద్వత= ఇష్టానిష్టాలు, రాగద్వేషాలు మొదలైన జంటలు లేనితనాన్ని; పాటించి= ఆచరించి; మమత= మమకారాన్ని (వస్తువులు మొదలగువాటియందు నాది అనే భావాన్ని); అహంకృతి= అహంకారాన్ని (నేను - అనే భావాన్ని); మాని= వదలి; నిత్య తృప్త+ఆత్ముఁడును= ఎల్లవేళల తృప్తి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పొందిన హృదయం కలవాడును; జన+అధీనత్వ రహితుండును=జనులకు వశం కావటంలేనివాడును; ఐ= అయి; గమ్యదిశ= వెళ్ళదగిన దిక్కు; ఒక్కఁడు= ఇది; అనఁగన్= అనటానికి; లేక= లేకుండా; మెలఁగుచుండి= తిరుగుతూ; పక్వఫలము= బాగా పండిన పండు; తొడిమన్= తొడిమను; పాయు పగిదిన్= వదలి రాలిపోయే విధంగా; గుణచయంబున్= గుణముల సముదాయాన్ని; పాసి= వదలి; అక్షయంబున్= నాశనంకానిదీ; అచలమును= కదలికలేనిదీ; నిరామయంబును= ఏ రోగమూ లేనిదీ; అగు= అయిన; పదమున్= స్థానాన్ని; శుద్ధభావము= నిర్మలత్వం; ఎసఁగన్= అతిశయింపగా; చెందున్= పొందుతాడు.

తాత్పర్యం: పవిత్రాలైన అడవులలో, జనాలులేని ఇండ్లలో, దేవాలయాలలో, కొండ గుహలలో ఉంటూ భిక్షమెత్తిన తిండి తింటూ ఒకచోటికి అలవాటుపడక రాగద్వేషాలు వదలివేసి ద్వంద్వాలను తొలగించుకొని, అహంకార మమకారాలను రూపుమాపి, నిత్యతృప్తిగల హృదయంతో జనులకు వశంకాని స్థితితో ఒక గమ్యం అనేది లేకుండా తిరుగుతూ బాగా పండిన పండు తొడిమనుండి రాలిపోయిన విధంగా సత్త్వరజస్తమోగుణాల నెలవైన దేహాన్ని వదలివేసి, శుద్ధభావంతో నాశనంకానిదీ, స్థిరమైనదీ, ఏ తెగులూ లేనిదీ అయిన శాశ్వతపదాన్ని పొందుతాడు.

విశేషం: సన్న్యాసి ధర్మాన్ని ఇందులో వివరించి చెప్పారు. నెలవుమీద, తిండిమీద, మనోభావాలమీద ఏ విధమైన ప్రవృత్తి ఉండాలో వివరించారు. 'ఒకచోట మరగక' - ఒక స్థానాన్ని ఎన్నుకుంటే ఒక సంసారం ప్రారంభమవుతుంది. గమ్యం కూడదు. ఇది గమ్యం అనుకొంటే ఏదో ఫలాభిలాష ఉంటుందన్న మాట. 'గుణచయంబున్ పాసి'' గుణాతీత స్థితిని పొంది, గుణాలు బంధకారణాలు. కాబట్టి వాటికి లోబడకుంటేనే ముక్తి. అక్షయశబ్దాన్ని సత్తుకు 'అచల' శబ్దాన్ని చిత్తుకూ, నిరామయశబ్దాన్ని ఆనందానికీ సూచకాలుగా భావించి సచ్చిదానందాత్మక శాశ్వత పదం పొందుతాడనే అర్థాన్ని ఇక్కడ గ్రహించాలి. అది పరమాత్మ సాయుజ్యరూపమైనది.

వ. అని చెప్పి. 313

ప్రతిపదార్థం: అని= ఇట్లా; చెప్పి= బోధించి.

తాత్పర్యం: అని బోధించి (తరువాతి పద్యంతో అన్వయం)

క. భిక్షుకుఁ డిమ్మెయి నీడముఁ । బక్షి విడుచునట్లు మాయఁబాసి యభేద్యం
బక్షర మను తత్త్వంబును । సాక్షాత్కృతిఁ గూర్చి నిలుచు శాశ్వత పదవిన్. 314

ప్రతిపదార్థం: భిక్షుకుఁడు= సన్న్యాసి; ఈ+మెయిన్= ఈ విధంగా; పక్షి; నీడమున్= గూడును; విడుచు+అట్లు= విడిచే విధంగా; మాయన్= మాయను; పాసి= వదలి; అభేద్యంబు= భేదింపరానిది; అక్షరము= నాశనము కానిదను అర్థముగల అక్షరము; అను= అనే; తత్త్వంబును= తత్త్వాన్ని; సాక్షాత్కృతిన్= ప్రత్యక్షం కావటాన్ని; కూర్చి= ఏర్పరచుకొని; శాశ్వతపదవిన్= నిత్యమైన స్థానంలో; నిలుచున్= ఉంటాడు.

తాత్పర్యం: సన్న్యాసి ఈ విధంగా గూడు వదలిన పక్షివలె మాయను వదలివైచి, భేదింపరాని అక్షరం అనే తత్త్వాన్ని ప్రత్యక్షం చేసికొని, శాశ్వతపదవిలో నిలుస్తాడు.

విశేషం: మాయ - ప్రకృతి అనే తత్త్వాన్ని మాయ అని వ్యవహరిస్తారు. అక్షరము అను తత్త్వంబును - పరమాత్మతో అభిన్నంగా అయిన స్థితిని. దీనినే ముక్తి అంటారు.

వ. అమ్మహానుభావుండు సంసార సాగరంబు గడచుటయ కాదాశ్రితులనుం గడపం జాలియుండు. 315

ప్రతిపదార్థం: ఆ+మహానుభావుండు= అట్టి గొప్ప అనుభావంకల వ్యక్తి; సంసారసాగరంబు = సంసారమనే మహాసముద్రాన్ని; కడచుట+అ= దాటడమే; కాదు; ఆశ్రితులనున్= తన్ను చేరినవారిని; కడపన్= దాటించుటకు; చాలి ఉండున్= సమర్థుడై ఉంటాడు.

తాత్పర్యం: ఆ మహాత్ముడు సంసారసముద్రాన్ని దాటటమే కాదు, తన్నాశ్రయించిన వారిని కూడా దాటించగలుగుతాడు.

విశేషం: సంసారము - జననమరణ రూపమైన తిరుగుడు వ్యవహారం. ఇది మహా దుస్తరం కనుక సముద్రంతో పోలుస్తారు. "స్వయం తీర్త్వా పరాంస్తారయతి'' అని శాస్త్రవాక్యం. తాను దాటి ఇతరులను దాటిస్తాడు - దీనిని ఇక్కడ సమన్వయించుకోవాలి. నిజానికి సంసారసాగరం నుండి దాటింపజేయగలవాడు పరమాత్మ ఒక్కడే. మళ్ళీ ఆ సామర్థ్యం సంపూర్ణ జ్ఞానసంపదగల గురువునకు మాత్రమే ఉంటుంది. "గురుర్బ్రహ్మ గురుర్విష్ణు ర్గురు ర్దేవో మహేశ్వరః'' గురుః సాక్షాత్ పర బ్రహ్మ తస్మై శ్రీగురవే నమః'' అని భారతీయులు విశ్వసించి గురుని స్తుతిస్తారు.

ఉ. కావున భిక్షుఁ జెంది ప్రియకారిత శూద్రుఁడు గొల్చునేని సం
భావితుఁ డైన యాతని కృపారసమాని తదీయ సంగ వి
ద్రావిత కల్మషుండయి చిరక్రమవృత్తిత నూయి గ్రొచ్చి నీ
ర్వావిరి గన్నయట్టులు శివంబగు తత్త్వము గాంచు నెమ్మెయిన్. 316

ప్రతిపదార్థం: కావునన్= కనుక; శూద్రుఁడు= నాలుగవజాతివాడు; ప్రియకారితన్= ప్రియములు చేసే ప్రవృత్తితో; భిక్షున్= సన్న్యాసిని; చెంది= ఆశ్రయించి; కొల్చున్+ఏని= సేవిస్తే; సంభావితుఁడు= మన్నింపబడినవాడు; ఐన= అయిన; ఆతని= ఆ సన్న్యాసియొక్క; కృపారసము=దయ అనే రసాన్ని; ఆని= పుచ్చుకొని; తదీయ సంగ విద్రావిత కల్మషుండు= అతనిదైన సంబంధంచేత దూరంగా తరిమివేయబడిన పాపాలు కలవాడు; అయి= అయి; చిరక్రమ వృత్తితన్= బహుకాలం క్రమమైన ప్రవర్తనతో; నూయి= బావి; గ్రొచ్చి= త్రవ్వి; నీర్= నీటిని; వావిరి= సమృద్ధిగా; కన్న+అట్టులు= పొందే విధంగా; ఏ+మెయిన్= ఎట్లాగైనా (తప్పక); శివంబు= మంగళప్రదము; అగు= అయిన; తత్త్వమున్= తత్త్వమును; కాంచున్= పొందుతాడు.

తాత్పర్యం: కనుక శూద్రుడు ప్రియములుచేస్తూ సన్న్యాసిని సేవిస్తే గొప్ప మన్ననగల అతని దయారసం ఆస్వాదించి అతడి సంగంవలన పాపాలన్నీ పటాపంచలు కాగా ఎంతో కాలం కష్టపడి నూయి త్రవ్వి నీరు సమృద్ధిగా పొందిన విధంగా శివతత్త్వాన్ని (శాశ్వతపదవిని) పొందుతాడు.

విశేషం: ఇది పరమసులభమైన మార్గం. సన్న్యాసి అష్టకష్టాలు పడి పొందిన మహాఫలాన్ని శూద్రుడు తత్సేవవలన పొందుతున్నాడు. శివంబగు తత్త్వము - అక్షయశాశ్వతమోక్ష సామ్రాజ్యం. చిరక్రమవృత్తితన్ - క్రమంగా వైశ్యాది జన్మలు అనే సోపానాలను విజయవంతంగా కడచి - అని భావం.

తే. అఖిల జనులకుఁ బరమ పదాభిలాష । వృత్తి సామాన్య; యది యొండు వెంట శూద్ర
జనములకు నెట్లు వొరలిన సఫల గాదు । దాని భిక్షుకసేవ సత్ఫలతఁ గూర్చు. 317

ప్రతిపదార్థం: అఖిల జనులకున్= అన్ని వర్ణాల వారికీ; పద+అభిలాష వృత్తి= శాశ్వతమైన మోక్ష స్థానం కోరిక ఉండటం; సామాన్య= సాధారణమైనది; ఎట్లు= ఏ విధంగా; పొరలినన్= తిరుగుళ్ళు పడినా; ఒండు వెంటన్= మరొక విధంగా; అది= ఆ పరమ పదంపైన కోరిక; శూద్రజనులకున్= శూద్రవర్ణంవారికి; సఫల= ఫలంతో కూడినది; కాదు; భిక్షుకసేవ= సన్న్యాసులను సేవించటం; దానిన్= ఆ కోరికను; సత్ఫలతన్= మంచిఫలం పొందటాన్ని; కూర్చున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: పరమపదంమీద వాంఛతో ఉండటం జనులందరికీ సమానవిషయమే. ఎంత కష్టపడినా శూద్రులకు అది మరొక మార్గంలో సఫలం కాదు. సన్న్యాసిసేవ దానిని సఫలం చేస్తుంది.

పరాశరమునిప్రణీత ధర్మవిశేషంబు భీష్ముండు ధర్మజునకుం జెప్పుట (సం.13-153-1 (కుంభ))

తే. వర్ణములకెల్ల నింద్రియ వ్యాప్తి నిగ్ర । హంబు వలయు నియ్యది గన్నయంతఁ దృప్తిఁ
బొంది యొండాసపడకున్న నొందు సాధు । జనులు వెదకు ననామయ సత్పదంబు. 318

ప్రతిపదార్థం: వర్ణములకున్= జాతులకు; ఎల్లన్= అన్నింటికీ; ఇంద్రియ వ్యాప్తి నిగ్రహంబు= ఇంద్రియముల వ్యాప్తిని అరికట్టటం; వలయున్= కావాలి; ఈ+అది= ఇది; కన్న+అంతన్= పొందినంతనే; తృప్తిన్= తనివిని; పొంది; ఒండు= మరియొకటి; ఆసపడక= ఆశింపక; ఉన్నన్= ఉంటే; సాధుజనులు= సన్న్యాసులు; వెదకు అనామయ సత్ పదంబు= వెదకే ఏ జాడ్యమూ లేని బ్రహ్మపదం; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: అన్ని వర్ణాలవారికీ ఇంద్రియాలు వ్యాపించటాన్ని అరికట్టటం కర్తవ్యం. దానిని సాధించి మరొకటి కోరకుండేవాడు సాధుజనులు వెదకే తెవులులేని బ్రహ్మపదాన్ని పొందుతాడు.

విశేషం: ఇంద్రియాలు - చర్మము, కన్నులు, చెవులు, ముక్కు, నాలుక - ఇవి క్రమంగా స్పర్శ; రూపం, శబ్దం, గంధం, రసం - అనే వాటి కొరకు వెంపరలాడుతూ ఉంటాయి. అవి సక్రమంగా లభించకపోతే అక్రమంగానైనా సాధించటానికి ప్రయత్నిస్తాయి. ఆ విధంగా ఇంద్రియాలు విషయాలపై ప్రసరించటం బంధకారణం అవుతుంది. వాటిని సాగకుండా నిలుపటం బ్రహ్మప్రాప్తి కారణం అవుతుంది.

అనామయసత్పదంబు - బ్రహ్మపదం - పరమాత్మలో ఐక్యం కావటం. ఇవికాక తక్కిన బ్రహ్మలోకాదులన్నీ రాకపోకలతో అనిత్యాలు కావటంవలన దోషం కలవి. వివేకవంతుడు వాటికొరకు వెదకడు.

తే. పరమమైన యీ ధర్మంబు వట్టి పాప । యోనులగు కామినులును వైశ్యులును శూద్రు
లును సుగతి గాంతు రనిన సజ్జనతఁ బరఁగు । బ్రాహ్మణులకు రాజులకును బ్రాఁతె సుగతి? 319

ప్రతిపదార్థం: పరమము= మిక్కిలి గొప్పది; ఐన ఈ ధర్మంబు= అయిన ఈ ధర్మాన్ని; పట్టి= ఆధారంగా గ్రహించి; పాప యోనులు= పాపపు జన్మకారణం కలవారు; అగు= అయిన; కామినులును= స్త్రీలు; వైశ్యులును= మూడవ వర్ణంవారు; శూద్రులును= నాలుగవ వర్ణం వారును; సుగతి= మంచిగతిని; కాంతురు= పొందుతారు; అనినన్= అంటే; సత్+జనతన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మంచి జనుడి భావంతో; పరఁగు= ఒప్పే; బ్రాహ్మణులకున్= బ్రాహ్మణులకూ, రాజులకున్= క్షత్రియులకున్నూ; సుగతి= మంచిగతి; బ్రాఁతి+ఎ= దుర్లభమా? కాదని భావం.

తాత్పర్యం: ఎంతో శ్రేష్ఠమైన ఈ ధర్మాన్ని అవలంబించి పాపపు జన్మకారణాలుగల స్త్రీలు, వైశ్యులు, శూద్రులు కూడా సుగతి పొందుతారంటే సజ్జనులైన బ్రాహ్మణులకు, క్షత్రియులకు సుగతి దుర్లభమా?

విశేషం: స్త్రీలు, వైశ్యులు, శూద్రులు - పూర్వజన్మంలోని పాపకర్మవలన ఆ స్థితిని పొందారని కర్మసిద్ధాంత భావన. అట్లాగే మునుపటి జన్మలందలి పుణ్యకర్మఫలంగా మొదటి రెండు వర్ణాలలో జన్మిస్తారని భావన. ఈ విధంగా ఈ పాపపుణ్యాలు జన్మకు యోనులు కారణాలు. అంతేకానీ ఇప్పుడు వారు పాపాత్ములు, వీరు పుణ్యాత్ములు అని విభాగం చేయటం సరికాదు.

వ. అని చెప్పి వెండియు. 320

తాత్పర్యం: పరాశరు డిట్లా చెప్పి, ఇంకా విశేషించి బోధిస్తున్నాడు.

సీ. బోధ మక్షీణపాపునకుఁ గల్గదు సద్గు । రుండు సెప్పంగ సంశ్రుతములైన
పనులఁ బాపంబులు వాసిన నిర్మల । జ్ఞానోదయం బగు దాన గర్వ
ముదయింప వచ్చిన నుడుపంగవలయు గ । ర్వంబున గురుసమారాధనంబు
వదలిన నా బోధవైభవ మెడలిన । యంతటఁ బోక కీ డావహిల్లుఁ

ఆ. బరమబోధమునకు ఫల ముపశాంతిగా । నెఱిఁగి యెంతబోధ మెక్కు డయ్యె
నంతశాంతుఁ డగుచు ననవరతంబును । గురునిఁ గొలిచి మేలు పురుషుఁ డొందు. 321

ప్రతిపదార్థం: అక్షీణ పాపునకున్= నశించని పాపాలు కలవాడికి; బోధము= జ్ఞానం; కల్గదు= ఏర్పడదు; సత్+గురుండు= ఉత్తముడైన గురువు; చెప్పంగన్= బోధింపగా; సంశ్రుతములు= చక్కగా వినవచ్చినవి; ఐన పనులన్= అయిన కార్యములతో; పాపంబులు= పాపాలు; పాసినన్= నశిస్తే; నిర్మల జ్ఞాన+ఉదయంబు= స్వచ్ఛమైన జ్ఞానం పుట్టటం; అగున్= అవుతుంది; దానన్= దానిచేత; గర్వము= పొగరు; ఉదయింప వచ్చినన్= పుట్టబోతే; ఉడుపంగవలయున్= మాన్పాలి; గర్వంబునన్= పొగరుతో; గురు సమారాధనంబు= గురువుల చక్కని పూజ; వదలినన్= మానివేస్తే; ఆ బోధ వైభవము= ఆ జ్ఞానపు మహిమ; ఎడలిన అంతటన్= పోయినంతటితో; పోక= పోవక; కీడు= ఆపద; ఆవహిల్లున్= కలుగుతుంది; పరమబోధమునకున్= గొప్పదియైన జ్ఞానానికి; ఫలము= ప్రయోజనం; ఉపశాంతి= మిడిసిపాటు లేకపోవటం; కాన్= కావటం; ఎఱిఁగి= తెలిసికొని; బోధము= జ్ఞానము; ఎంత= ఎంతగా; ఎక్కుడు= అధికం; అయ్యెన్= అవుతుందో; అంత= అంతగా; శాంతుఁడు= ఓర్పుగలవాడు; అగుచున్= అవుతూ; అనవరతంబును= ఎల్లప్పుడు; గురునిన్= జ్ఞానబోధ చేసిన వ్యక్తిని; కొలిచి= సేవించి; పురుషుఁడు= మనుజుడు; మేలు= శుభాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: పాపం తరుగనివాడికి జ్ఞానం కలుగదు. సద్గురువు బోధించిన పనులు చక్కగా ఆచరిస్తే పాపాలు పోతాయి. అప్పుడు నిర్మలమైన జ్ఞానం కలుగుతుంది. అయితే దానివలన గర్వం ఏర్పడితే దానిని రూపుమాపాలి. గర్వంతో గురుపూజ మానితే జ్ఞానం నశించటమే కాదు, ఆపద కూడా కలుగుతుంది. గొప్పజ్ఞానానికి ఫలం మిడిసిపడకుండటం అని తెలిసికొని, జ్ఞానం ఎంతగా పెరుగుతుందో శాంతి నంతగా పెంచుకొనాలి. కనుక ఎల్లప్పుడు గురుసేవ చేస్తూ నరుడు మేలు పొందుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: తెలివివలన గర్వం పొందటం మానవుడి పెద్ద బలహీనత. దాని దుష్ఫలితాన్ని ఈ పద్యంలో చక్కగా తెలియజేశారు. భారతీయ సంప్రదాయంలో గురువు తెప్పవంటివాడు. గురువు సాక్షాత్తు పరబ్రహ్మ. అతడిని పట్టుకొనటం, వదలిపెట్టటం అనేవి ఉండవు. ఈ రహస్యాన్ని ఇందులో మనం చక్కగా గ్రహించాలి.

సీ. రక్షించునది యుదరంబు శిశ్నము ధృతిఁ । బాణిపాదములు దృక్పాటవములు
వినుఁ డింద్రియంబుల మనమును మనమున । బుద్ధి నిట్లైనఁ బ్రబోధవికచ
హృదయస్థుఁడై ధూమ మెడలిన శిఖివోలె । వెలుఁగు దేవునిఁ జూచు వెరవు గలుగు
యుక్తుండు గాకేల యొదవు మహేశ్వరుఁ । గనుట? యుక్తాత్ముండు గనును భక్తి

తే. నట్టి భంగికిఁ జాలిన యట్టిఁడైన । వికృతిషోడశకంబును ప్రకృతి సప్త
కంబు మూలప్రకృతిఁ జిత్తకలన నరయ । వికృతియును బ్రకృతియుఁ గాని విభునిఁ గాంచు. 322

ప్రతిపదార్థం: ఉదరంబు= పొట్టను; శిశ్నమున్= గుహ్యమును; ధృతిన్= బుద్ధిశక్తితో; రక్షించునది= కాపాడాలి; పాణిపాదములు= చేతులు, కాళ్ళు; దృక్+పాటవములు= చూపునందలి పటుత్వాలను; రక్షించునది= కాపాడాలి; వినుఁడు= ఆలకించండి; ఇంద్రియంబులన్= ఇంద్రియాలతో; మనమును= మనస్సును; మనమునన్= మనస్సుతో; బుద్ధిని; రక్షించునది= చెడకుండ చూచుకొనాలి; ఇట్లు= ఈ విధంగా; ఐనన్= అయితే; ప్రబోధ వికచ హృదయస్థుఁడు= గొప్ప ఉపదేశంతో వికసించిన హృదయంలో ఉన్నవాడు; ఐ= అయి; ధూమము= పొగ; ఎడలిన= పోయిన; శిఖిపోలెన్= అగ్నివలె; వెలుఁగు దేవునిన్= ప్రకాశించే పరమాత్మను; చూచు వెరవు= చూచే అవకాశం; కలుగున్= కలుగుతుంది; యుక్తుండు= యోగముకలవాడు; కాక= కాకుండా; మహేశ్వరున్= పరమాత్మను; కనుట= పొందటం; ఏల= ఎందుకు; ఒదవున్?= కలుగుతుంది?; యుక్త+ఆత్ముండు= యోగం సిద్ధించిన హృదయం కలవాడు; భక్తిన్= భక్తిని; కనును= పొందుతాడు; అట్టి భంగికిన్= అట్టి పద్ధతికి; చాలిన అట్టిఁడు= సమర్థుడు; ఐనన్= అయితే; వికృతిషోడశకంబును= వికారముల పదునారింటిని; ప్రకృతి సప్తకంబున్= ప్రకృతుల ఏడింటిని; మూలప్రకృతిన్= మూలమైన ప్రకృతిని; చిత్తకలనన్= చిత్తపు కూడిక చేత; అరయన్= పరీక్షింపగా; వికృతియును= వికృతిస్వరూపుడు; ప్రకృతియున్= ప్రకృతి స్వరూపుడును; కాని= కానట్టి; విభునిన్= పరమాత్మను; కాంచున్= దర్శిస్తాడు.

తాత్పర్యం: వినండి. మానవుడు కడుపును, లింగాన్నీ, కాళ్ళు చేతులను, దృష్టిశక్తులనూ కాపాడుకొనాలి. ఇంద్రియాలతో మనస్సును, మనస్సుతో బుద్ధిని రక్షించుకొనాలి. ఇట్లా అయితే సుజ్ఞానంతో వికసించిన అతడి హృదయంలో నెలకొని ఉన్నవాడు, పొగలేని అగ్నివలె వెలుగొందుతున్నవాడు అయిన పరమాత్మను దర్శించే అవకాశం కలుగుతుంది. యోగసిద్ధి పొందనివాడికి మహేశ్వరుడిని కనుగొనటం ఎట్లా సాధ్యమవుతుంది? యోగసిద్ధి పొందిన వాడికి భక్తి ఏర్పడుతుంది. ఆ విధానానికి సమర్థుడైన వాడు పదహారు వికారాలను, ఏడు ప్రకృతులను మూలప్రకృతినీ చిత్తంలో చక్కగా కూర్చుకొని, వికృతి కానివాడు, ప్రకృతి కానివాడు అయిన పరమాత్మను సందర్శిస్తాడు.

విశేషం: ఇది ఆధ్యాత్మికవిద్య. కడుపు, శిశ్నము, మొదలైన వాటిని రక్షించుకొనటమంటే భుక్తి విషయంలో, రక్తి విషయంలో లౌల్యం లేకుండా ఉండటం. అట్లాగే అకృత్యాలు చేయకుండటం, అగమ్యస్థలాలకు పోకపోవటం, పాణిపాదాలను రక్షించుకొనటం. ఇంద్రియాలను విచ్చలవిడిగా ప్రవర్తించనీయకపోతే మనస్సు అదుపులోనికి వస్తుంది. అంటే సంకల్పవికల్పాలు నశిస్తాయి. మనస్సు అదుపులోనికి వస్తే బుద్ధి తన అధీనంలో ఉంటుంది. అంటే పరమార్థ సంబంధమైన నిర్ణయాలే చేస్తుంది. కానీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇహసుఖసంబంధ నిర్ణయాలు చేయదు. ప్రబోధం అంటే గురువు ఉపదేశించిన జ్ఞానం. దానిచేత అంతవరకు హృదయంలో ఉన్నా, ఉన్నట్లు తెలియరాని పరమాత్మ ఉనికి తెలుస్తుంది. దానికి ఉపమానం పొగపోయిన శిఖి. పొగ దట్టంగా క్రమ్మితే అగ్ని సరిగా కనబడదు కదా! ఇక్కడ జ్ఞానాగ్ని అటువంటిది. వికృతి షోడశకంబు - అంటే పంచ ఇంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, పంచతన్మాత్రలు - శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు. మనస్సు ఈ పదునారింటి సముదాయం. ప్రకృతి సప్తకం అంటే పంచభూతాలు - పృథివి, నీరు, నిప్పు, గాలి, నింగి, మహత్తు, అహంకారం అనేవి మూలప్రకృతి - ఈ అన్నింటికీ మూలకారణమైన హిరణ్యగర్భుడు. ఈ మొత్తం ఇరవైనాలుగు తత్త్వాలు భక్తితో వికసించిన హృదయం కలవాడికి చిత్తంలో విస్పష్టంగా భాసిస్తాయి. 16+8గా అయిన వికృతి ప్రకృతులకు అతీతంగా ఉన్న పరమాత్మ దర్శనం అప్పుడు సిద్ధిస్తుంది.

క. ఇది సాంఖ్యానము దీనిని । మది కలవడఁ జేసికొనుచు మఱవక గురు ని
ర్మదుఁడై కొలువఁగఁ గేవల । పదము నతని కరుణ పెంపు ప్రకటము సేయున్. 323

ప్రతిపదార్థం: ఇది; సాంఖ్యానము= జ్ఞానము; దీనిని= ఈ జ్ఞానాన్ని; మదికిన్= మనస్సునకు; అలవడన్+చేసికొనుచున్= అభ్యాసం ద్వారా గట్టి చేసికొంటూ; గురున్= గురువును; మఱవక= మరచిపోక; నిర్మదుఁడు+ఐ= పొగరులేనివాడై; కొలువఁగన్= సేవింపగా; అతని కరుణ పెంపు= అతడి దయయొక్క ఎక్కువతనం; కేవల పదమున్= కైవల్యం అనే స్థానాన్ని; ప్రకటము+చేయున్= వెల్లడి చేస్తుంది.

తాత్పర్యం: ఇది జ్ఞానమార్గం. దీనిని హృదయంలో పదిలపరచుకొంటూ గురువును మరచిపోక, పొగరులేనివాడై సేవిస్తూ ఉంటే అతడి దయ కైవల్యాన్ని చక్కగా తెలుపుతుంది.

విశేషం: సాంఖ్యానము -సమ్యక్ఖ్యానం చక్కని తెలివి అని అర్థం. అంతేకాక సంఖ్యాసంబంధమైనది. తత్త్వముల సంఖ్యను వివరించటం ద్వారా తెలివిని ప్రసాదిస్తుంది కనుక సాంఖ్యం. కేవలుడు అంటే ఏ విధమైన అంటుసొంటులు, ద్వంద్వాలు లేకుండా తనకు తానే స్వతంత్రుడు, శుద్ధుడు, బుద్ధుడు, ఆనందస్వరూపుడు అయిన పరమాత్మ. అతడి పదం కేవలపదం. అంటే జీవ బ్రహ్మైక్యరూపమైన పరమగతి - అని తాత్పర్యం. గురువు అనుగ్రహం లేకపోతే అది తెలియరాదు. గురువే సాక్షాత్తు పరబ్రహ్మము. కనుక గురువును మరవరాదు. గురువు విషయంలో గర్వాదులను పొందరాదు - అని ఈ పద్యంలో హెచ్చరిక చేస్తున్నారు.

తే. భిక్షుభావంబుఁ బొంది యీ శిక్ష యూఁది । మెలఁగు నర్హత త్రైవర్ణికులకుఁ గలదు
శూద్రునకు భిక్షుసంసర్గ సులభ మమల । పదము వానికి భిక్షుతఁ బరఁగఁ జనదు. 324

ప్రతిపదార్థం: భిక్షు భావంబున్= సన్న్యాసితనాన్ని; పొంది= అవలంబించి; ఈ శిక్ష= ఈ అభ్యాసం; ఊఁది= గట్టిగా పట్టుకొని; మెలఁగు+అర్హత= ప్రవర్తించే యోగ్యత; త్రైవర్ణికులకున్= మొదటిమూడు వర్ణాలవారికి; కలదు= ఉన్నది; శూద్రునకున్= నాలుగవ వర్ణంవాడికి; అమల పదము= స్వచ్ఛమైన కైవల్యపదం, భిక్షు సంసర్గ సులభము= సన్న్యాసుల సహవాసంచేత తేలికగా లభించునది; వానికిన్= ఆ శూద్రుడికి; భిక్షుతన్= సన్న్యాసి ధర్మంతో; పరఁగన్= ప్రవర్తించటం; చనదు= కూడదు.

తాత్పర్యం: సన్న్యాసిభావాన్ని పొంది ఈ అభ్యాసాన్ని గట్టిగా పట్టుకొని ప్రవర్తించే అర్హత మూడు వర్ణాలవారికి ఉన్నది. శూద్రుడికి ఆ కైవల్యపదం సన్న్యాసినంటిపెట్టుకొని ఉండటం వలననే తేలికగా లభిస్తుంది. అతడు సన్న్యాసి ధర్మాన్ని స్వీకరించకూడదు.

క. పరమజ్ఞానుల యొద్దను । బరఁగిన నజ్ఞుఁడును బోధభరితుఁడగు నిరం
తర మేరుసమీపస్థితి । హిరణ్యరుచిఁ గాక మెసకమెసఁగిన పగిదిన్. 325

ప్రతిపదార్థం: నిరంతర మేరు సమీప స్థితిన్= ఎల్లవేళల మేరుపర్వతం దగ్గర ఉండటం చేత; కాకము= కాకి; హిరణ్యరుచిన్= బంగారు వన్నెతో; ఎసకము= అతిశయము; ఎసఁగిన పగిదిన్= పెంపొందిన విధంగా; పరమ జ్ఞానుల+ఒద్దను= గొప్ప జ్ఞానం కలవారికడ; పరఁగినన్= మెలగితే; అజ్ఞుఁడును= ఏమియు తెలియనివాడు కూడా; బోధభరితుఁడు= జ్ఞానంతో నిండినవాడు; అగున్= అగును.

తాత్పర్యం: ఎల్లవేళలా బంగారు కొండ దగ్గర ఉండటంచేత కాకి కూడా బంగారు వన్నెతో మిలమిలలాడిన విధంగా గొప్ప జ్ఞానం కలవారిదగ్గర మెలగిన తెలియనివాడు కూడా జ్ఞానపూర్ణు డవుతాడు.

విశేషం: ఇది భ్రమరకీటకన్యాయం వంటిది. పరుసవేది ఇనుమును బంగారు చేయటం వంటిది. ఆరు నెలలు కలిసి ఉంటే వారు వీరవుతారనే తెలుగు సామెత కూడా దీనిని నిరూపిస్తుంది.

క. గురు శుశ్రూషా మహిమం । గరుణఁ జతుర్వర్ణ హితముగా నిమ్మాడ్కిం
బరివర్ణితంబు సేసెం । బరాశర మునీశ్వరుండు పౌరవముఖ్యా! 326

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశ శ్రేష్ఠుడా!; పరాశర ముని+ఈశ్వరుండు= పరాశరుడనే మునిశ్రేష్ఠుడు; ఈ+మాడ్కిన్= ఈ విధంగా; కరుణన్= దయతో; చతుర్+వర్ణ హితముగాన్= నాలుగు వర్ణాలవారికి మేలు కలిగే తీరున; గురు శుశ్రూషా మహిమన్= గురువులను సేవించటంవలన కలిగే గొప్ప స్థితిని; పరివర్ణితంబు= నిండుగా చెప్పబడిన దానినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ధర్మరాజా! పరాశరమహర్షి ఈ విధంగా కరుణతో నాలుగు వర్ణాల వారికి మేలు కలిగే విధంగా గురుసేవ గొప్పతనాన్ని వివరించి చెప్పాడు.

విశేషం: మునీశ్వరుడు అనటంచేత అతడి మాట ప్రమాణంగా తీసికొనదగినదని సూచన. 'కరుణన్' అనటంవలన ఇట్లా చెప్పటంలో స్వార్థచింతన లేదనటం తెలియవస్తుంది. 'హితము' అనటంవలన ఒకవేళ పైకి ఇది కటువుగా ఉన్నా, ఔషధంవలె ఆచరిస్తే మేలు చేసేది - అన్న స్ఫూర్తి కలుగుతుంది. పరివర్ణితంబు అన్నచోట ఉపసర్గ 'పరి' అనేది - 'ఇది తుదిమాట. దీనికి వికల్పాలు లేవు' అనటాన్ని స్ఫురింపజేస్తుంది. ఇట్లా ఈ చిన్న పద్యం వ్యంగార్థపుష్టమై కావ్యధర్మశోభితమై అలరారుతున్నది.

వ. అని సకల ధర్మోపదేశధుర్యుండైన భీష్ముండు పరాశర మునివర్యు వాక్యసంచయంబు సెప్పినం బరితుష్టుండయి పరమ వినయంబునం బాండవాగ్రజుం డక్కురుకులాగ్రగణ్యుతో 'నరులు సురలకు వంద్యులగు వారును గలరని విందు వారల వర్తనంబెట్టి దెఱింగింపు' మనిన నతం డతని కిట్లనియె. 327

ప్రతిపదార్థం: అని= ఇట్లు; సకల ధర్మ+ఉపదేశధుర్యుండు=అన్ని ధర్మాలను ఉపదేశించటంలో సమర్థుడు; ఐన భీష్ముండు= అయిన భీష్ముడు; పరాశర మునివర్యు వాక్య సంచయంబు= పరాశరమహర్షి యొక్క వాక్యాల సముదాయాన్ని; చెప్పినన్= చెప్పగా; పరితుష్టుండు+అయి= మిక్కిలి ఆనందించినవాడు అయి; పాండవ+అగ్రజుండు= పాండుకుమారులలో పెద్దవాడు

అయిన ధర్మరాజు; పరమ వినయంబునన్= మిక్కిలి వినయంతో; ఆ+కురు కుల+అగ్రగణ్యుతోన్= కురువంశంలో మొదట లెక్కింపదగిన ఆ భీష్ముడితో; సురలకున్= దేవతలకు కూడా; వంద్యులు= మన్నింపదగినవారు; నరులు= మానవులు; కలరు= ఉన్నారు; అని; విందున్= వింటున్నాను; వారల వర్తనంబు= అట్టివారి నడవడి; ఎట్టిది?= ఏ విధమైనది?; ఎఱింగింపుము= తెలియజేయుము; అనినన్= అంటే; అతండు= ఆ భీష్ముడు; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు= ఇట్లా; అనియెన్ = అన్నాడు.

తాత్పర్యం: ధర్మాలన్నింటిని చక్కగా తెలియజెప్పటంలో నేర్పుగల ఆ భీష్ముడు ఈ విధంగా పరాశరమునీంద్రుడి వాక్యాలను తెలుపగా పరమానందం పొంది ధర్మరాజు మహా వినయంతో భీష్ముడితో 'ఆర్యా! దేవతలు కూడా మ్రొక్కదగిన నరులుంటారని విన్నాను. అట్టివారి నడవడి యెటువంటిదో తెలియజెప్పుము.' అంటే భీష్ము డతనితో ఇట్లా అన్నాడు.

విశేషం: సురలు నరులకు వంద్యులు. ఇది సహజవ్యవహారం.కాని, సురలకు కూడా వంద్యులయిన నరులున్నారట. ఇది విశేష వ్యవహారం. ధర్మరాజుకు అట్టివారి నడవడిని గురించి తెలిసికొనాలనిపించింది.

సీ. 'ఇట్లు మాతలి యమరేంద్రుని నడిగిన । ధర్మార్థ కామముల్ ధర్మచరిత
వర్తనఁ జెల్లించువారు, వామాక్షులు । గోరఁగాఁ దగు రూపగుణ సమృద్ధి
గలిగియు వర్జితకాము లయ్యెడు వారు । విద్యాధనైశ్వర్యవిషయ గర్వ
విరహితులగువారు విజితేంద్రియులు నిజ । దారతృప్తులుఁ దపోధనము గాఢ

తే. తత్పరతఁ గూర్చు ఘనులు సత్యవ్రతులును । బరమశౌచులు బహుకార్యపరత లేని
గూఢధర్ములు సన్న్యాస కోవిదులును । దనకు నభివంద్యు లగుట యతండు సెప్పె. 328

ప్రతిపదార్థం: ఇట్లు= ఇదే విధంగా; మాతలి= ఇంద్రుడి సారథి అయిన మాతలి; అమర+ఇంద్రునిన్= దేవేంద్రుడిని; అడిగినన్= అడిగితే; అతండు= ఆ ఇంద్రుడు; ధర్మ+అర్థ కామముల్= ధర్మము, అర్థము, కామము అనే పురుషార్థాలను; ధర్మచరిత వర్తనన్= ధర్మమును నడిపే ప్రవర్తనతో; చెల్లించువారు= సాగింపజేసేవారు; వామ+అక్షులు= చక్కని కనులుగల ఆడువారు; కోరఁగాన్= వాంఛింపగా; తగు రూప గుణ సమృద్ధి= తగిన అందమూ, సద్గుణ సంపదా; కలిగియున్= ఉండి కూడా; వర్జిత కాములు= వదలిన కామం కలవారు; అయ్యెడువారు= అయ్యేవారు; విద్యా ధన+ఐశ్వర్య విషయ గర్వ విరహితులు= చదువు, సంపద, ప్రభుత్వము అనే విషయాలవలన ఏర్పడే గర్వంలేనివారు; అగువారు= అయినవారు; విజిత+ఇంద్రియులు= గెలువబడిన ఇంద్రియములు గలవారు; నిజ దార తృప్తులు= తమ భార్యలతో తృప్తి చెందేవారు; గాఢ తత్పరతన్= చెదరని పట్టుదలతో; తపోధనమున్= తపస్సు అనే ధనాన్ని; కూర్చు ఘనులు= కూడబెట్టే గొప్పవారు; సత్యవ్రతులును= సత్యమునందు నిష్ఠ కలవారు; పరమశౌచులు= గొప్ప పరిశుద్ధత కలవారు; బహు కార్యపరత= పెక్కు కార్యాలలో ఆసక్తి; లేని గూఢ ధర్ములు= లేకుండా గుట్టుగా ధర్మం ఆచరించేవారు; సన్న్యాస కోవిదులును= సన్న్యాస ధర్మంలో సర్వమూ తెలిసి ఆచరించేవారు; తనకున్= తనకు; అభివంద్యులు= నమస్కరింపదగినవారు; అగుటన్= కావటం; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'ఇదే విధంగా మాతలి దేవేంద్రుడిని అడిగాడు. అతడు ఇట్లా చెప్పాడు. ధర్మ, అర్థ, కామ పురుషార్థాలను ధర్మం తప్పని నడవడితో ఆచరించేవారు, సుందరాంగులు స్వయంగా కోరినా, తమకు తగిన రూపము, శక్తి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంపదలు ఉన్నా కామాన్ని వదలి మెలగేవారూ, విద్యాగర్వం, ధనగర్వం, ప్రభుత్వగర్వం మొదలైనవి లేనివారు, ఇంద్రియములపై గట్టి అదుపు కలవారు, తమ భార్యలతో తృప్తిపొందేవారు, దృఢమైన పట్టుదలతో తపస్సు అనే ధనాన్ని కూడబెట్టే మహాత్ములు, సత్యనిష్ఠ కలవారు, వెలుపలిలోపలి పరిశుద్ధతను సాధించేవారు, అనేక కార్యాల తగులం లేక గుట్టుగా ధర్మం ఆచరించేవారూ, నిజమైన సన్న్యాసధర్మాలను నేర్పుతో పాటించేవారు తనకు మ్రొక్కదగినవారు.

విశేషం: వీటికి క్రమంగా రఘువంశరాజులు, అర్జునుడు లేక ప్రవరుడు, జనకుడు, హరిశ్చంద్రుడు, శిబిచక్రవర్తి, శ్రీరామచంద్రుడు మొదలగువారు ఉదాహరణ ప్రాయులు.

వ. అనిన విని ధర్మతనయుండు 'తటాక నిర్మాణ రూపంబగు ధర్మంబు విశేషంబు వినవలతుం జెప్పవే' యనుటయు ననిమిషనదీనందనుం డాదరభరితుండై. 329

ప్రతిపదార్థం: అనినన్= అంటే; విని= ఆలకించి; ధర్మతనయుండు= ధర్ముని కుమారుడు; తటాక నిర్మాణ రూప ధర్మంబు విశేషంబు= చెరువును నిర్మించటం అనే ధర్మంలోని గొప్పతనం; వినవలతున్= వినటానికి ఇష్టపడుతున్నాను; చెప్పవే= దయతో వివరించుము; అనుటయున్= అంటే; అనిమిష నదీనందనుండు= దేవతల నది అయిన గంగ కొడుకు; ఆదర భరితుండు+ఐ= ఆదరంతో నిండినవాడై.

తాత్పర్యం: తరువాత ధర్మరాజు 'చెరువు త్రవ్వించటం అనే ధర్మంలోని గొప్పతనం తెలిసికొనాలని ఉన్నది తాతా! చెప్పుతావా?' అంటే భీష్ముడు నిండైన ఆదరంతో ఇట్లా అన్నాడు.

విశేషం: తటాకం - నీటికి సంబంధించినది. భీష్ముడు నదీనందనుడు. నది నీటికి నెలవు కదా! అందుకని ఆయనకు ఈ ప్రశ్న మరింత ఆనందాన్ని కలిగించింది.

భీష్ముఁడు ధర్మజునకుఁ దటాక నిర్మాణ ఫలవిశేషంబు సెప్పుట (సం.13-92-1)

సీ. దేవ తిర్యఙ్నరస్థావరాశ్రయము త। టాకంబు వినుము మట్లుఁ గాక యందు
గోకులంబులు నీరు గొని దాని కర్తకు। లము నెల్లఁ బుణ్యలోకమున కనుచు
నీ లోకమున శ్రీయు నెక్కుడు కీర్తియు। నతనికిఁ జేయు వర్షాగమమున
సీతున వేసవిఁ జెఱువులో నీరున్న। నగ్నిహోత్రాదిమయజ్ఞ వాజ

ఆ. పేయఫలములోలి నాయన కగుఁ గట్టఁ। దగిన తరువు లిడిన సుగతి గలుగు
నిహసుఖంబుఁ బొందు విహగాది బహుభూత। వాససౌఖ్య మతఁడు సేసెఁ గాన. 330

ప్రతిపదార్థం: వినుము= ఆలకించుము; తటాకంబు= జలాశ్రయం (చెరువు); దేవ తిర్యక్+నర స్థావర+ఆశ్రయము= దేవతలకు, పశువులకు, పక్షులకు, నరులకు, కదలికలేని వస్తువులకు ఆశ్రయము; అట్లున్+కాక= అంతేకాక; అందున్= దానిలో; గోకులంబులు= ఆవుల మందలు; నీరు= నీటిని; కొని= త్రావి; దాని కర్త కులమున్= ఆ చెరువు త్రవ్వించినవాడి కులమును; ఎల్లన్=అంతటినీ; పుణ్యలోకమునకున్= పుణ్యలోకానికి; అనుచున్= పంపుతాయి; ఈ లోకమునన్= ఈ

లోకంలో; శ్రీయున్= సంపదను; ఎక్కుడు కీర్తియున్= అధికమైన కీర్తిని; అతనికిన్= ఆ కర్తకు; చేయున్= కలిగిస్తాయి; వర్షా+ఆగమమునన్= వానకాలము రాకయందూ; సీతునన్= చలికాలంలోనూ; వేసవిన్= వేసవికాలంలోనూ; చెఱువులోన్= తటాకంలో; నీరు= జలం; ఉన్నన్= ఉంటే; ఆయనకున్= త్రవ్వించిన ఆ వ్యక్తికి; అగ్నిహోత్ర+ఆదిమ+యజ్ఞ వాజపేయ ఫలములు= అగ్ని హోత్రం మొదలుగాగల యజ్ఞాలూ, వాజపేయ యాగం మొదలైన వాని ఫలాలు; ఓలిన్= వరుసగా; అగున్= సిద్ధిస్తాయి; కట్టన్= కట్ట మీద; తగిన తరువులు= యోగ్యమైన చెట్లు; ఇడినన్= నాటితే; అతఁడు= ఆ కర్త; విహగ+ఆది బహు భూత వాస సౌఖ్యము= పక్షులు మొదలైన పెక్కు ప్రాణుల నివాసం అనే సుఖాన్ని; చేసెన్= చేశాడు; కానన్= కనుక (అతడికి); సుగతి= పరంలో మంచిగతి; కలుగున్= కలుగుతుంది; ఇహసుఖంబున్= ఈ లోకపు సుఖాన్ని కూడా (అతడు); పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: వినుము. చెరువు దేవతలకు, పశువులకు, పక్షులకు, రాయి రప్పవంటి స్థావరాలకు నెలవైనది. అంతేకాదు. అందులో నీరు త్రావి ఆవులమందలు దాని కర్త కులాన్నంతటినీ పుణ్యలోకాలకు పంపుతాయి. ఈ లోకంలో గొప్ప సంపదనూ, చెడని కీర్తినీ కలిగిస్తాయి. వానకాలంలో, చలికాలంలో, ఎండకాలంలో చెరువులో నీళ్ళుంటే మహాయజ్ఞాలు చేసిన ఫలం ఆ కర్తకు లభిస్తుంది. కట్టమీద తగిన చెట్లు నాటితే పక్షులు మొదలైన ప్రాణికోటికి నిలువనీడనిచ్చి సుఖం కూర్చినవాడు ఔతాడు కనుక అతడికి ఇహపర సుఖాలు కలుగుతాయి.

విశేషం: ఈనాడు మనం ఎక్కువగా అనుకొంటున్న పర్యావరణ సమతౌల్యభావన ఇందు చూడవచ్చును.

క. సలిలాశయములు చేసిన । నలఘుప్రియ మందుఁ బితృచయము లూర్ధ్వగతుల్
గలుగును దానం దమ కను । తలఁపున నది గోరుచుండు ధర్మతనూజా! 331

ప్రతిపదార్థం: ధర్మతనూజా!= ధర్మనందనా!; పితృచయములు= పితృదేవతలు; సలిల+ఆశయములు= నీటి కొలకులు; చేసినన్= నిర్మిస్తే; అలఘు ప్రియము= మిక్కిలి ప్రియమును; అందున్= పొందుతారు; దానన్= దానివలన; తమకున్= తమకు; ఊర్ధ్వగతుల్= పైలోకపు గమనములు; కలుగును= సిద్ధిస్తాయి; అను తలఁపునన్= అనే భావంతో; అది= తటాక నిర్మాణాన్ని; కోరుచుండున్= కోరుతూ ఉంటారు.

తాత్పర్యం: ధర్మరాజా! పితృదేవతలు తమ వంశంవారు చెరువులు త్రవ్విస్తే పరమానందం పొందుతారు. దానివలన తమకు ఉత్తమ లోకాలకు పోయే వీలు కలుగుతుందని దాని నెప్పుడూ కోరుతూ ఉంటారు.

తే. ఛాయ నతిథి వర్గంబుఁ బుష్పముల సురగ । ణంబుఁ బండులఁ బితృనివహంబుఁ బ్రమద
మందఁ జేయు వృక్షంబు లట్లగుట వృక్ష । రోపణ క్రియ మేటి ధర్మువు కుమార! 332

ప్రతిపదార్థం: కుమార!= నాయనా!; వృక్షములు= చెట్లు; ఛాయన్= తమ నీడతో; అతిథివర్గంబున్= అతిథుల సముదాయాన్ని; పుష్పములన్= పూవులతో; సురగణంబున్= దేవతల సముదాయాన్నీ; పండులన్= పండ్లతో; పితృ నివహంబున్= పితృదేవతల గణాన్నీ; ప్రమదము= అధికానందం, అందన్+చేయున్= కలిగిస్తాయి; అట్లు= ఆ విధం; అగుటన్= కావటంవలన; వృక్షరోపణ క్రియ= చెట్లు నాటటం అనే పని; మేటి ధర్మువు= గొప్ప ధర్మం.

తాత్పర్యం: నాయనా! చెట్లు తమనీడతో అతిధులకూ, పువ్వులతో దేవతలకు, పండ్లతో పితృదేవలకూ పరమానందం కలిగిస్తాయి. కనుక చెట్లు నాటటమనే పని గొప్ప ధర్మం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఒక చెట్టు నాటితే మూడు లోకాలవారు తృప్తి పొందటాన్ని ఋషులు భావించిన సంగతిని మనం అనుక్షణం స్మరించాలి. ఈనాటి వృక్షరక్షణతత్పరతతో పోల్చి చూడవచ్చును.

క. అనిన విని ప్రీతుఁడై య। జ్జన విభుఁడు గృహస్థధర్మ సాకల్యజ్ఞా
న నిరూఢి నాదు చిత్తం। బున నొలయింపు భవదీయ పుణ్యఫణితులన్. 333

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ప్రీతుఁడు+ఐ= ఆనందించినవాడై; ఆ+జనవిభుఁడు= ఆ రాజు, ధర్మజుడు; గృహస్థ ధర్మ సాకల్య జ్ఞాన నిరూఢిన్= గృహస్థుడి ధర్మపు సమగ్రమైన జ్ఞానంయొక్క ప్రసిద్ధిని; భవదీయ పుణ్యఫణితులన్= నీవైన పవిత్ర వాక్కులతో; నాదు చిత్తంబునన్= నా హృదయంలో; ఒలయింపు= ప్రవేశపెట్టుము.

తాత్పర్యం: ఆ మాటలు విని ఆనందించిన ధర్మరాజు 'గృహస్థ ధర్మానికి సంబంధించిన నిండైన ప్రసిద్ధిని నీ పుణ్యవాక్యాలతో నా హృదయంలో ప్రవేశపెట్టుము' అని అడిగాడు.

క. అనవుడుఁ దాత యలరి య। మ్మనుమనితో నిట్టు లనియె మహియును విష్ణుం
డును జేసిన సంవాదము। విను మది నీ కోర్కిఁ దీర్చు విశ్రుత కీర్తీ! 334

ప్రతిపదార్థం: అనవుడున్= అన్నంతనే; తాత; అలరి= సంతోషపడి; ఆ+మనుమనితోన్= మనుమడైన ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; విశ్రుతకీర్తీ!= ప్రసిద్ధికెక్కిన కీర్తిగలవాడా!; మహియును= భూదేవియు; విష్ణుండును= విష్ణువును; చేసిన సంవాదము= చేసిన సంభాషణము; వినుము; అది= ఆ ప్రసంగం; నీ కోర్కిన్= నీ కోరికను; తీర్చున్= నెరవేరుస్తుంది.

తాత్పర్యం: అన్నంతనే తాత ఆ మనుమడితో ఇట్లా అన్నాడు. 'ప్రసిద్ధమైన కీర్తిగల ధర్మరాజా! మునుపు భూదేవికి విష్ణువుకు అయిన సంవాదం వినుము. అది నీ కోరికను తీరుస్తుంది.

విశేషం: భూవిష్ణు సంవాదరూప ఇతిహాసప్రకటన ఆదరాతిశయంకొరకని గుర్తించాలి.

తే. నన్ను నీ వడిగిన యట్లు వెన్నుఁ డర్థి। బుజ్జవంబులు మున్నుగ భూమిదేవి
నడిగె; దానికిఁ బ్రియమంది యమ్మహాను। భావ యిట్లని చెప్పెఁ దద్భావ మలర. 335

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను; నీవు; అడిగిన+అట్లు= అడిగిన విధంగా; వెన్నుఁడు= కృష్ణుడు; అర్థిన్= కోరికతో; బుజ్జవంబులు= లాలనలు; మున్నుగన్= ముందు కలుగునట్లుగా; భూమిదేవిన్= భూదేవిని; అడిగెన్= అడిగినాడు; దానికిన్= ఆ అడగటానికి; ప్రియము+అంది= సంతోషపడి; ఆ+మహానుభావ= గొప్ప ప్రభావంగల ఆ భూమి; తత్+భావము= ఆ విష్ణుడి హృదయం; అలరన్= ప్రీతి పొందగా; ఇట్లు+అని= ఈ విధంగా; చెప్పెన్= చెప్పినది.

తాత్పర్యం: నన్ను నీవడిగినట్లుగా కృష్ణుడు ముందు ప్రేమవాక్యాలతో బుజ్జగించి భూదేవిని అడిగాడు. దానికి ప్రీతిచెంది, ఆ మహానుభావునికి, అతడి హృదయం ప్రీతిపొందే విధంగా ఇట్లా చెప్పింది.

విశేషం: బుజ్జవంబులు - విష్ణువు సర్వమూ తెలిసినవాడు. ప్రేమతో భూదేవితో చెప్పించాలని అతడికి కోరిక కలిగింది. అందుకని లాలన మాటలు చాలా పలికాడు.

క. 'దేవా ! హుతవహపరిచ । ర్యావిధి యొనరించి బలిసమాచరణము భ

క్త్యావేశంబునఁ జేయఁగ । దైవతసంఘంబు సమ్మదంబునఁ దేలున్. 336

ప్రతిపదార్థం: దేవా!= ప్రభూ!; హుతవహ పరిచర్యా విధి= అగ్నిసేవ అనే కార్యం; ఒనరించి= చేసి; బలిసమాచరణము= బలివేయటం అనే మంచి పనిని; భక్తి+ఆవేశంబునన్= భక్తి ఒడలంతయు నిండునట్లుగా; చేయఁగన్= చేస్తే; దైవత సంఘంబు= దేవతల సముదాయం; సమ్మదంబునన్= మిక్కిలి ఆనందంతో; తేలున్= తేలుతుంది.

తాత్పర్యం: 'ప్రభూ! గృహస్థుడు అగ్ని ఆరాధన చేయాలి. భూతాలకు బలిని ఒడలంతా నిండిన భక్తితో చేయాలి. దానివలన దేవతల సముదాయం పరమానందంలో తేలుతుంది.

విశేషం: అగ్ని అర్చన శాస్త్రీయమైన ప్రక్రియ. అగ్నిలో హుతమైన మంచి పదార్థాల శక్తి వాతావరణంలో లీనమై పరిసరాలను కాలుష్యం నుండి రక్షిస్తుంది. ఆ వాసన పీల్చిన ప్రాణులన్నింటికీ ఆ శక్తి సంక్రమిస్తుంది.

భారతీయులు 'చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష' అనే భావం కలవారు కారు. అందరికీ అన్నీ సుఖంగా ఉంటేనే తమకు సుఖం అనే భావన వారిది. ఆ దృష్టితో చీమలు మొదలుకొని వీలైనంత ఎక్కువ పరిధిలో ప్రాణులకు ఆహారం అందించి తాము తింటారు. దీనికే 'భూతదయ' అని పేరు. "నితాంతాపారభూతదయ" ప్రసాదించుమని భాగవతప్రార్థన. అన్నింటిలో పరమాత్మను చూసే లక్షణం కూడా ఇందులో గోచరిస్తుంది. పైగా ఇచట పలుకుతున్నది భూమాత - అన్ని జీవుల ఆకలి తీర్చటమే ఆమె ప్రగాఢ వాంఛ.

తే. అన్నమున దుగ్ధమునఁ బండ్లనైన మూల । కోటి నైనను దనుపారు నీటనైన

నిత్యమును జేయునది పితృకృత్య మోపి । వైశ్వదేవ మవశ్య నిర్వాహ్య మనఘ! 337

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; అన్నమునన్= అన్నంతో గానీ; దుగ్ధమునన్= పాలతో గానీ; పండ్లన్+ఐనన్= ఫలాలతో గానీ; మూలకోటిన్= దుంపల సముదాయంతో; ఐననున్= కానీ; తనుపారు నీటన్= మంచి చల్లని నీటితో; ఐనన్= కానీ; ఓపి= సహించి; పితృకృత్యము= పితృదేవతల పని అయిన తర్పణం; నిత్యమును= ప్రతిదినమూ; చేయునది= చేయాలి; వైశ్వదేవము= వైశ్వదేవమనే కర్మ; అవశ్య నిర్వాహ్యము= తప్పని సరిగా చేయవలసినది.

తాత్పర్యం: అన్నం, పాలు, పండ్లు, దుంపలు, చల్లని నీరు - అనే వీటిలో దేనితోనైనా ప్రతిదినము పితృదేవతలకు తర్పణం చేయాలి. 'వైశ్వదేవం' అనే కర్మ తప్పని సరిగా ఆచరించాలి.

విశేషం: పితృకృత్యము - పితృయజ్ఞం. ఇది ప్రతిదినం చేయవలసిన అయిదు యజ్ఞాలలో ఒకటి. 'వైశ్వదేవం' - విశ్వదేవులనే వారికి ప్రీతి కలిగించే ఒక వైదికకార్యం. ఇది దేవయజ్ఞంలో భాగం.

ఈ యజ్ఞాలన్నీ ఆధునికదృష్టితో శాస్త్రీయ ప్రయోజనాలను కలిగించటం పరిశీలించవచ్చును. వాతావరణ సమతౌల్య సాధనకు, త్యాగబుద్ధిని పెంపొందించటానికి ఇవి నిమిత్తాలుగా మనం సంభావించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఆ చేత పిదప దానం । బాచరణీయంబు శక్తి కనుగుణముగ భి
క్షాచర్య సేయు విప్రుల । వేచి యిడఁగవలయు నెపుడు వేగమ భిక్షల్. 338

ప్రతిపదార్థం: ఆ చేత పిదపన్= ఆ పని తరువాత; శక్తికిన్= తన ఓపికకు; అనుగుణముగన్= తగినట్లుగా; దానంబు= ఈవి; ఆచరణీయంబు= చేయదగినది; ఎపుడున్= ఎల్లవేళల; భిక్షాచర్య= బిచ్చమెత్తుకొనటం; చేయు విప్రులన్= చేసే విద్యావంతులను; వేచి= కనిపెట్టుకొని ఉండి; వేగము+అ= ఆలస్యం చేయకుండా; భిక్షల్= భిక్షలను; ఇడఁగవలయున్= ఇవ్వాలి.

తాత్పర్యం: వైశ్వదేవం తరువాత తన శక్తి మేరకు దానాలు చేయాలి. బిచ్చమెత్తుకొనే విద్యావంతులైన బ్రాహ్మణులను ఎదురుచూచి వేగంగా భిక్షలివ్వాలి.

విశేషం: దీనిని మనుష్యయజ్ఞం అంటారు. ఇది ఒక విధమైన "సోషలిజం". 'అందరూ సుఖపడాలి' అనే తత్త్వం ఇందులో మనకు గోచరిస్తుంది. ఇతరులకు పెట్టకుండా తినే తిండి అతి నికృష్టమైనదిగా భారతీయ ఋషులు భావించటంలోని సామాజికదృష్టిని మనం గుర్తించి "అతిసంచయేచ్ఛ" వదలుకొనటం కర్తవ్యమని ఇటువంటి అంశాలవలన తెలిసివస్తుంది.

"దానే నారాతీనపానుదన్త" అని మహానారాయణోపనిషత్తు చెప్పుతున్నది. దానంతో శత్రువులు తొలగిపోతారట.

తే. అప్పటికి వారు లేకున్న నగ్రమగ్ని । ముఖమునందైన నిడునది సఖుల బంధు
జనుల నతిథుల గురుల భోజనవిధాన । తృప్తులుగఁ జేసి బలివిధిఁ దీర్పవలయు. 339

ప్రతిపదార్థం: అప్పటికిన్= ఆ సమయానికి; వారు= యాచకులైన ఆ విప్రులు; లేక+ఉన్నన్= లేకపోతే; అగ్రము= అన్నంలో మొదటి భాగాన్ని; అగ్నిముఖమునందున్= హోమంలో; ఐనన్= అయినా; ఇడునది= ఉంచాలి; సఖులన్= మిత్రములను; బంధు జనులన్= చుట్టాలను; అతిథులన్= భోజనం వేళకు వచ్చిన అన్నార్థులను; గురులన్= గురువులను; భోజన విధాన తృప్తులుగన్= అన్నం పెట్టటంచేత తృప్తిపడిన వారినిగా; చేసి= కావించి; బలివిధిన్= బలికార్యాన్ని; తీర్పవలయున్= తీర్చాలి.

తాత్పర్యం: భోజనసమయానికి విద్యావంతులైన బ్రాహ్మణోత్తములు రాకపోతే వండిన పదార్థాలలో ముందు భాగాన్ని హోమకుండంలోనైనా వేయాలి. తరువాత మిత్రులను, చుట్టాలను, అతిథులను, గురువులను అన్నంపెట్టి తృప్తిపరచాలి. పిదప బలికార్యం చేయాలి.

విశేషం: బలికార్యం అంటే పక్షులకు, పశువులకు అన్నంలో కొంతభాగం ఇవ్వాలని భావన. దీనిని తరువాత వివరిస్తున్నారు.

వ. బలు లుభయ ప్రకారంబులు; వానియందు ధర్మాధర్మౌషధి వనరక్షోజనాది విషయంబైన శ్రౌతబలి యేను మున్ను నిర్దేశించినది; యిప్పుడు చెప్పినయది పశుపక్షి చండాల ప్రభృతి గోచరంబగు స్మార్తబలి' యని నిర్దేశించి వెండియు. 340

ప్రతిపదార్థం: బలులు= 'బలి' అనేది; ఉభయ ప్రకారంబులు= రెండు విధాలైనవి; వానియందున్= వానిలో; ధర్మ+అధర్మ+ఓషధి వన, రక్షస్, జన+ఆది విషయంబు= ధర్మానికి అధర్మానికి; ఓషధులు, అడవులు, రక్షస్సులనే జనాలు మొదలైనవాటికి సంబంధించినది; ఐన= అయిన; శ్రౌతబలి= శ్రుతి - వేదం చెప్పిన బలి; ఏను= నేను; మున్ను= ముందు; నిర్దేశించినది=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెప్పినది; ఇప్పుడు; చెప్పినయది= చెప్పినది; పశు పక్షి చండాల ప్రభృతి గోచరంబు= జంతువులు, పక్షులు, చండాలురు మొదలైనవారికి సంబంధించినది; అగు= అయిన; స్మార్తబలి= స్మృతి, ధర్మశాస్త్రం చెప్పిన బలి; అని, నిర్దేశించి= చెప్పి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: బలులు రెండు రకాలు. వాటిలో ఇదివరకు నేను చెప్పిన శ్రౌతబలి. అది ధర్మానికి, అధర్మానికి ఓషధులకు, అడవులకు, రక్షస్సులకు మొదలైన వాటికి సంబంధించినది. ఇప్పుడు చెప్పినది స్మార్తబలి. ఇది పశువులకు, పక్షులకు, చండాలురు మొదలైన వారికి సంబంధించినది - అని వివరించి ఇంకా ఇట్లా చెప్పింది.

విశేషం: వైశ్వదేవానికి పూర్వం ఒక బలి తరువాత ఒక బలి అని చెప్పారు. వాటి విభాగం విషయాన్ని ఇక్కడ చక్కగా వివరించారు.

ఆ. **విను గృహస్థధర్మవిధ మిది యీ భంగి । నడపి పిదప భోజనంబు సేయ**

వలయు విప్రుఁ డిట్టి వాఁడొందు నిహపర । సౌఖ్యసంపదలఁ బ్రశస్తచరిత!' **341**

ప్రతిపదార్థం: ప్రశస్తచరిత!= కొనియాడబడిన ప్రవర్తన కలవాడా!; విను= వినుము; గృహస్థ ధర్మ విధము= గేస్తుని ధర్మపు పద్ధతి; ఇది; ఈ భంగిన్= ఈ పద్ధతిని; నడపి= సాగించి; పిదపన్= పిమ్మట; విప్రుఁడు= విద్యావంతుడు; భోజనంబు+ చేయవలయున్= భోజనం చేయాలి; ఇట్టివాఁడు= ఇటువంటివాడు; ఇహ పర సౌఖ్య సంపదలన్= ఈ లోకపు పరలోకపు సుఖాల సంపదలను; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: సత్ప్రవర్తన కల ఓ కృష్ణా! ఇది గృహస్థధర్మం. ఈ పద్ధతిని సాగించి విప్రుడు భోజనం చేయాలి. ఇట్టివాడు ఇహపరసుఖాలను పొందుతాడు.'

విశేషం: ఇది భూదేవి కృష్ణుడికి చెప్పినమాట. తరువాతి పద్యంలో కృష్ణు డట్లా చేశాడని చెప్తున్నారు. కాబట్టి ఇక్కడ విప్రశబ్దం విశేషార్థంలో - 'ఉత్తమ జ్ఞానవృద్ధుడు' - అనే అర్థంలో వాడినట్లు గుర్తించాలి.

క. **అని చెప్పినఁ గృష్ణుఁడు నె । మ్మన మలర గృహస్థవిధి సమాచరణము ని**

ష్ఠ నడపెఁ గర్మ శ్రద్ధా । ఘన! నీవును నట్ల నడపు గార్హస్థ్యంబున్. **342**

ప్రతిపదార్థం: అని; చెప్పినన్= చెప్పగా; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; నెఱ+మనము= నిండు హృదయం; అలరన్= సంతోషింపగా; గృహస్థ విధి సమాచరణము= యజమానధర్మపు ఆచారాలను; నిష్ఠన్= పట్టుదలతో; నడపెన్= నడిపాడు; కర్మ శ్రద్ధాఘన!= కర్మములయందు శ్రద్ధచేత గొప్పవాడా!; నీవును= నీవు కూడా; అట్లు+అ= అట్లాగే; గార్హస్థ్యంబున్= గృహస్థధర్మాన్ని; నడపు= సాగించుము.

తాత్పర్యం: అని చెప్పగా కృష్ణుడు హృదయంలో ఎంతో సంతోషించి గృహస్థధర్మ ఆచారాలను నిష్ఠతో నిర్వహించాడు. ధర్మరాజా! నీవు కూడా కర్మశ్రద్ధ అధికంగా కలవాడవు కనుక గృహస్థధర్మాన్ని చక్కగా నిర్వహించుము.

విశేషం: నిజానికి కృష్ణుడికి ఈ లౌకికధర్మాలతో పని లేదు. కాని లోకసంగ్రహంకొరకు, లోకులకు ప్రమాణబుద్ధి ఏర్పడటం కొరకు ఆచరించినట్లు చెప్పినారని మనం గ్రహించాలి. "యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరో జనః'' అనే గీతావాక్యం ఇట స్మరించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అది దురితనిరాసము న । భ్యుదయానందంబు జేయుఁ బుణ్యయశస్సం
పద నిచ్చు నూర్ధ్వలోక । ప్రదమగు దానిఁ గొనియాడు భరతవరేణ్యా!' 343

ప్రతిపదార్థం: భరతవరేణ్యా!= భరతవంశంలో శ్రేష్ఠుడా!; అది= ఆ గృహస్థధర్మం; దురిత నివాసము= పాపాలను పోగొట్టేది; అభ్యుదయ+ఆనందంబున్= శుభంతో కూడిన ఆనందాన్ని; చేయున్= కలిగిస్తుంది; పుణ్య యశః+సంపదన్= పుణ్యమైన కీర్తి అనే సంపదను; ఇచ్చున్= ఇస్తుంది; ఊర్ధ్వ లోక ప్రదము= పై లోకాలను భద్రంగా ఇచ్చేది; అగున్= అవుతుంది; దానిన్= అట్టి గృహస్థ ధర్మాన్ని; కొనియాడు= మనస్సులో ప్రశంసించుము.

తాత్పర్యం: ధర్మజా! గృహస్థధర్మం పాపాలను పటాపంచలు చేస్తుంది. ఈ లోకంలో శుభాలన్నీ కూర్చి ఆనందం కలిగిస్తుంది. పవిత్రమైన కీర్తి అనే సంపదను ప్రసాదిస్తుంది. పుణ్యలోకాలను చక్కగా కూరుస్తుంది. కనుక దానిని గొప్పగా భావించుము'.

విశేషం: నాలుగు ప్రయోజనాలను ఇక్కడ చెప్పుతున్నారు. 1.పాపాలు పోవటం; 2. ఐహిక ఆనందం కలగటం; 3.పుణ్యకీర్తి లభించటం; 4. ఉత్తమలోకాలు సిద్ధించటం. ఇవి ఒక దానికొకటి కారణకార్యసంబంధం కలవి. కొనియాడటమంటే దాని మహిమను ఎల్లప్పుడు భావిస్తూ ఆచరిస్తూ ఉండటం అనే అర్థాన్ని భావించాలి.

వ. అని యిట్లు భీష్ముండు భీమాగ్రజునకు గృహస్థ ధర్మప్రకారం బెఱింగించెనని చెప్పుటయు నప్పౌరవకులోత్తముల సంప్రశ్నోత్తరంబులు మఱి యెత్తెఱంగునం జెల్లెం? జెప్పవే యనుటయు. 344

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; భీష్ముండు= భీష్ముడు; భీమ+అగ్రజునకున్= భీముడి అన్న అయిన ధర్మరాజునకు; గృహస్థధర్మ ప్రకారంబు= గృహస్థుడి ధర్మపు విధానం; ఎఱింగించెన్= తెలిపాడు; అని; చెప్పుటయున్= చెప్పగా; ఆ+పౌరవ కుల+ ఉత్తముల సంప్రశ్న+ఉత్తరంబులు= పూరువంశంలో అతిశ్రేష్ఠులగు ఆ ధర్మరాజ శాంతనవుల మంచి ప్రశ్నలు, సమాధానములు; మఱి= ఇంకా; ఏ+తెఱంగున్= ఏ విధంగా; చెల్లెన్= సాగెను; చెప్పవే= దయచేసి తెల్పుము; అనుటయున్= అనగా.

తాత్పర్యం: అని ఈ విధంగా భీష్ముడు ధర్మరాజునకు గృహస్థాశ్రమ ధర్మవిధానం చెప్పాడని చెప్పగా జనమేజయుడు ఇంకా ఆ పూరువంశ శ్రేష్ఠుల ప్రశ్నసమాధానములు ఏ విధంగా సాగాయో తెల్పుమని కోరాడు.

విశేషం: అది పౌరవకులం - పూరు చక్రవర్తి చాలా గొప్ప వ్యక్తి. అతని కులం, అందులో ఉత్తములు - అనటంచేత పాఠకుడు ఎంత అవధానబుద్ధితో వినాలో హెచ్చరిక చేసినట్లయినది. అవి వట్టి ప్రశ్నలు కావు. 'సు' ప్రశ్నలు - మానవ సమాజం చక్కగా భావించదగిన ప్రశ్నలు. 'చెప్పవే' అనేది పరిప్రశ్నరూప ప్రార్థన.

ఆశ్వాసాంతము

చ. అపగత కామరోష హృదయాంతర ఖేలన కల్య! నిర్జపా
జప మహిత ప్రతైక పర సంగధురాధిక లౌల్య! చంద్రమ

స్తపనమయాక్ష! కౌస్తుభనితాంతరుచి స్ఫురితాస్థిదామ దీ

ప్తి పటల చారువక్ష! మునిధీస్ఫుట భావిత! దేవ సేవితా! 345

ప్రతిపదార్థం: అపగత కామరోష హృదయ+అంతర ఖేలన కల్య!= తుడిచి పెట్టుకొనిపోయిన కామం, క్రోధం గల హృదయం లోపల ఆడుకొనటంలో నేర్పరీ!; నిర్జపా జప మహిత వ్రత+ఏక పర సంగ ధురా+అధిక లౌల్య!= 'అజపా' మంత్రం జపం చేయటమనే గొప్ప దీక్షలో గొప్ప ఆసక్తికలవారికి సంబంధించిన భారం విషయంలో గొప్ప ఆసక్తి కలవాడా!; చంద్రమస్+తపన మయ+అక్ష= చంద్రుడు, సూర్యుడు అనే రూపాల కన్నులు కలవాడా!; కౌస్తుభ నితాంతరుచి స్ఫురిత అస్థిదామ దీప్తి పటల చారువక్ష!= కౌస్తుభమణి యొక్క గొప్ప కాంతితో విరాజిల్లే ఎముకలదండ దీప్తుల సముదాయంతో అందమైన ఎదురురొమ్ము కలవాడా!; ముని ధీ స్ఫుట భావిత!= మహర్షుల బుద్ధిచేత స్పష్టంగా భావింపబడే దేవా!; దేవ సేవితా!= దేవతలచేత సేవింపబడే ప్రభూ!

తాత్పర్యం: స్వామీ! కామక్రోధాదులు లేని హృదయాలలో క్రీడించటంలో నీవు నేర్పరివి. అజపా గాయత్రీమంత్రం జపించటమే గొప్ప వ్రతంగా గలవారి సర్వభారాలు వహించటంలో ఆసక్తి కలవాడవు. చంద్రుడు, సూర్యుడు నీ కన్నులు. కౌస్తుభమహాకాంతులతో తళతళలాడే అస్థిమాలా కాంతులతో అందమైన వక్షస్థలం నీది. మహర్షుల బుద్ధులు నిన్ను చక్కగా భావిస్తాయి. దేవతలందరు నిన్ను సేవిస్తూ ఉంటారు.

విశేషం: ఈ విశేషణాలు హరికీ, హరుడికీ సమంగా సరిపోతాయి. కౌస్తుభమణి హరిది, అస్థిమాల హరుడిది. తత్త్వదృష్టితో రెండూ ఒకటే.

'అజపా' గాయత్రీ అని ఒక మంత్రం. అది పరమాత్మను వర్ణిస్తుంది. ఆ జపం చేసేవారి సర్వభారాలను - యోగక్షేమాలను భగవంతుడు ఆసక్తితో వహిస్తాడు.

మునులంటే కేవలం భావనామయంగా భగవంతుడిని దర్శించేవారు. వాక్కులు, మనస్సు అతడిని అందజాలవని శ్రుతి చెప్పుతున్నది కదా!

క. సత్త్వాధిష్ఠాన కృత శు । భత్త్వ ప్రకటాభిధాన! భక్తాధీనా!

తత్త్వం పదార్థరూపా! తత్త్వ సదనదీప! ధూత దైత్యాటోపా! 346

ప్రతిపదార్థం: సత్త్వ= సత్తగుణానికి; అధిష్ఠాన= ఆధారం కాబట్టి; కృత= చేయబడిన; శుభత్వ= మంగళాన్ని; ప్రకట= తెలియజేసే; అభిదాన!= పేరుగలవాడా!; భక్త+అధీనా!= భక్తులకు వశమైనవాడా!; తత్+త్వం పదార్థరూపా!= అది నీవు అనే పదాల అర్థమైనవాడా!; తత్త్వసదనదీప!= బ్రహ్మ భావమనే మహాగృహానికి దీపమైనవాడా!; ధూత దైత్య+ఆటోపా!= ఎగురగొట్టబడిన దైత్యుల గర్వం కలవాడా!

తాత్పర్యం: స్వామీ! నీ పేర్లు సత్త్వగుణానికి ఆధారాలు. వాటివలన మానవులకు కలిగే శుభాలను స్పష్టం చేస్తూ ఉంటాయి. నీవు భక్తులకు వశం అయినవాడవు. 'తత్' "త్వం" అనే పదాలకు అర్థమైనవాడవు నీవు. బ్రహ్మభావ భవనానికి నీ వొక మహాదీపం. దైత్యుల మిడిసిపాటును తుక్కుదూగరగా కొట్టివేస్తావు.

విశేషం: భగవంతుడి పేర్లన్నీ - శివనామాలుగానీ, విష్ణునామాలుగానీ సత్త్వగుణంతో నిండారి, శుభాన్ని కలిగిస్తూ ఉంటాయి. అందుకే ఆ నామాలను పారాయణ చేస్తూ ఉంటారు.

అటువంటి భక్తులకు భగవంతుడు వశమై పోతాడు. నిజానికి భగవంతుడు మహావిషయం. భక్తుడు అల్పవిషయం. అయినా భగవంతుడు భక్తుడి వశంలో ఉండటానికి ఇష్టపడతాడు. వాత్సల్యపూర్ణుడైన తండ్రి సర్వసమర్థుడై ఉండి కూడా కుమారుడిని వీపుమీద ఎక్కించుకొని మోసినట్లు ఈ అంశాన్ని సంభావించాలి. తత్ - ఆ పరమాత్మ; త్వమ్ - నీవు - జీవుడు, ఈ రెండూ జ్ఞానానికి ఒకటే. నీవే బ్రహ్మవు అని వేదాలు ఘోషిస్తూ ఉన్నాయి.

'తత్' అంటే బ్రహ్మపదార్థం - 'తత్త్వం- అంటే బ్రహ్మపదార్థ భావన. దానికి పరమాత్మ దీపం - అంటే బ్రహ్మము సంగతి నరుడికి తెలియజేప్పే జ్ఞానం కలవాడని భావం.

దైత్యులు - అంటే అఖండ చైతన్యాన్ని గుర్తించలేక ఖండబుద్ధితో అల్పాత్ములైనవారు. వారి గర్వాన్ని నాశనంచేయటమంటే అల్పజ్ఞానాన్ని ముక్కలుగా చేసి వేయటం.

మాలిని :

జగదవన వినోదా! సత్యజాత ప్రమోదా!
సగుణ విగుణ భంగీ! సంయమారామ సంగీ!
విగత వికృత మూర్తీ! విశ్వభూత ప్రవర్తీ!
సుగమగహన భూమా! సోమపింఛాభిరామా! **347**

ప్రతిపదార్థం: జగత్+అవన వినోదా!= లోకాల రక్షణం చేయటమే వినోదం అయినవాడా!; సత్య జాత ప్రమోదా!= సత్యం నుండి పుట్టిన పరమానందం కలవాడా!; సగుణ విగుణ భంగీ!= సగుణం, విగుణం అనే రెండు పద్ధతులు కలవాడా!; సంయమ+ఆరామ సంగీ!= ఇంద్రియ నిగ్రహం అనే ఉద్యానవనంతో (సంగం) సంబంధం కలవాడా!; విగత వికృత మూర్తీ!= పోయిన వికారాలుగల స్వరూపం కలవాడా!; విశ్వ భూత ప్రవర్తీ!= సమస్త భూతములను ప్రవర్తింపజేయువాడా! సుగమగహన భూమా!= తేలికగా పొందదగినదీ, పొందరానిదీ, అయిన మహిమ కలవాడా!, సోమ ఫింఛ+అభిరామా!= చంద్రుడు, నెమలి పింఛములతో అందమైనవాడా!

తాత్పర్యం: దేవా! నీకు లోకాలను రక్షించటమే వినోదం. సత్యగుణం నుండి పుట్టిన ఆనందం నీ స్వరూపం. సగుణం, విగుణం అనే రెండు పద్ధతులు నీకు ఉన్నాయి. ఇంద్రియాలపై నిగ్రహం అనే పూలతోట నీ నెలవు. నీకు ఏ వికారాలూ లేవు. సర్వప్రాణులు, స్థావరాలు నీవలననే ప్రవర్తిస్తున్నాయి. నీ మహిమ కొందరకు సులభం, కొందరకు దుర్లభం. నీవు చంద్రుడిని, నెమలి పింఛాన్ని ధరించి సౌందర్యంతో విరాజిల్లుతున్నావు.

విశేషం: అవనం - రక్షణ. ఇందులో సృష్టి, పోషణ, వినాశం అన్నీ ఉన్నాయి. సృష్ట్యాదులు పరమాత్మకు వినోదాలు.

సత్యాజాత ప్రమోదా! - వస్తూ పోతూఉండే ఆనందం అసత్యజ్ఞానంవలన కలుగుతుంది. అది అనిత్యం కనుక ఆపేక్షణీయం కాదు. ఇక పరమాత్మవలన కలిగే జ్ఞానం సత్యంనుండి ఏర్పడుతుంది. 'సత్యం- అంటే సర్వకాల సర్వావస్థలలో సర్వులకూ ఏకాకారంగా ఉండేది.

సుగుణవిగుణ భంగీ! - పరమాత్మ నిజానికి నామరూపాదులు లేనివాడు. నామరూపాదులే గుణాలు. అవి లేని భంగి నిర్గుణం. కాని లీలామాత్రంగా అవతారాలు ధరించి నామరూపాదులతో వ్యవహారం చేస్తాడు. అది సగుణభంగి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇంద్రియాలు ఐహిక విషయాలనే అందిస్తాయి. అది సుఖదుఃఖాత్మకం. ఇక్కడి సుఖం కూడా కేవలం తాత్కాలికం. కాబట్టి నిత్యానందం కావాలంటే ఇంద్రియాలను విషయాలపై ప్రసరింపనివ్వకూడదు. అటువంటి నిగ్రహం కలవారి హృదయమే భగవదారామం. పుట్టటం, పెరగటం, మార్పులు పొందటం, పరిక్షయం పొందటం, నశించటం మొదలైన వికారాలన్నీ జీవలక్షణాలు. దేవుడి కవేవీ ఉండవు. అవి ఉండటం దుఃఖలక్షణం. లేకపోవటం ఆనందలక్షణం.

సుగమగహన భూమా! - పరమేశ్వరుడి మహిమ జ్ఞానం కలవారికి సులభం. అది లేనివారికి దుర్లభం.

స్వామి హరిహరరూపుడు - హరియై నెమలి పింఛాన్ని శిరస్సు మీద అలంకారంగా ధరిస్తాడు. హరుడై చంద్రకళను ధరిస్తాడు. నెమలి పింఛంలో ఎన్నో రంగులు, మురిపించే ఆకారాది విశేషాలు ఉన్నాయి. కనుక అది సృష్టిలో ఉండే సౌందర్యానికి ప్రతీక. అట్లాగే చంద్రరేఖ. అట్టి మహాసౌందర్య ప్రతీకను పరమాత్మ అనంతమైన తన దేహంలో ఒక్క చిన్న ప్రదేశంలో ధరిస్తాడు. అంటే విశ్వసౌందర్యమంతా ఆయనకు ఒక చిన్న ఆభరణంవంటిదని భావం. ఆ ఆభరణంతో ఆ పరమాత్మ సమస్త ప్రాణికోటికి ఆనంద ప్రదాత అవుతాడు.

గద్యము

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున నానుశాసనిక పర్వంబునందు దృతీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది మంగళకరమైనది. ఉభయ కవిమిత్రుడని ప్రశస్తిని పొందిన కొమ్మనామాత్యపుత్రుడూ, పండితులను సేవించటం వలన ప్రకాశించేవాడూ అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలో ఆనుశాసనిక పర్వంలో మూడవ ఆశ్వాసం.

ఆనుశాసనిక పర్వంలోని మూడవ ఆశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆనుశాసనిక పర్వము - చతుర్థాశ్వాసము

శ్రీ పరమ మహిమనిశ్చల । తాపాదనకేళి కౌతు కాతిశయ మనో

వ్యాపారనిరూఢ స్తు । త్యాపాంగవిలాస లలిత! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= లక్ష్మి, విషం అనే వాని; పరమ= గొప్పదైన; మహిమ= అతిశయం చేత; కలిగిన; నిశ్చలతా= కదలిక లేనితనాన్ని; ఆపాదన= కలిగించునట్టి; కేళి= ఆటయందు; కౌతుక= వేడుకయొక్క; అతిశయ= ఎక్కువతనం గల; మనస్, వ్యాపార= భావన అనే పనిచేత; నిరూఢ= సుస్థిరమైన; స్తుత్య= కొనియాడదగిన; అపాంగ= కడగంటి చూపుయొక్క; విలాస= లీలచేత; లలిత= మనోహరమైన వాడా!; హరిహరనాథా!= హరిహరనాథదేవా!

తాత్పర్యం: స్వామీ! లక్ష్మిని, విషాన్ని ధరించి నీవు మోహం (నిశ్చలత) పొందావు. అది నీకొక క్రీడ. దానివలన నీ మనోవ్యాపారం ఏ కొంచెమూ చలనం లేనిదయింది. దానితో నీ కడగంటి చూపులలో ఏదో వర్ణింపరాని సౌందర్య విలాసం తాండవిస్తున్నది.

విశేషం: అలం: శ్లేష. సగం మూసిన పరమాత్మ కన్నులు పరమ మనోహరంగా ఉన్నాయి. ఆ మనోహరతకు కారణం అయనకు కలిగిన స్తబ్ధతగా కవి ఉత్ప్రేక్షిస్తున్నాడు. ఆ స్తబ్ధత హరి లక్ష్మిని, హరుడు కాలకూటాన్ని ధరించిన కారణంగా ఏర్పడినట్లు కూడా ఊహిస్తున్నాడు. అయితే ఇది భగవంతుడికి ప్రమోదం. అదే సాధారణ మానవుడికైతే ప్రమాదం.

ధూపదీపనైవేద్యంబుల ఫలవిశేషము భీష్ముఁడు ధర్మజునకుఁ జెప్పుట (సం.13-155-1(కుంభ))

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా!= ప్రభూ!; వైశంపాయనుండు= వైశంపాయనుడు; జనమేజయునకున్= జనమేజయ మహారాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ప్రభూ! వైశంపాయన మహర్షి జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

తే. అట్లు గృహమేధి ధర్మతత్త్వావగమము । దనకుఁ గలుగంగఁ జేసిన తాత కెఱఁగి

మనుమఁ డూర్జితభక్తియు వినయగౌర । వంబు సమధికతావైభవంబుఁ బొంద. 3

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; తనకున్= తనకు; గృహమేధి; ధర్మ, తత్త్వ+అవగమము= గృహస్థుడి ధర్మాల తత్త్వం చక్కగా తెలియటం; కలుగంగన్+చేసిన తాతకున్= కలుగజేసిన తాత భీష్ముడికి; ఎఱఁగి= మ్రొక్కి; మనుమఁడు= మనుమడైన

ధర్మరాజు; ఊర్జిత భక్తియున్= గొప్పదైనభక్తీ; వినయ గౌరవంబున్= వినయంతో కూడిన గౌరవమూ; సమధికతా వైభవంబున్= మిక్కిలి ఎక్కువ కావటంలోని గొప్పతనాన్నీ; పొందన్= పొందగా.

తాత్పర్యం: ఆ విధంగా తనకు గృహస్థధర్మంయొక్క నిజస్వరూపం చక్కగా తెలియజేసిన తాతకు (మ్రొక్కి మనుమడు ధర్మరాజు మహాభక్తీ, వినయగౌరవమూ చాలా ఎక్కువ కాగా (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఎఱఁగి - ప్రణిపాతం శాస్త్రం విధించిన మర్యాద, జ్ఞానదాతలకు సమయానుగుణంగా మ్రొక్కటం కర్తవ్యం. 'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా' - 'జ్ఞానాన్ని ప్రణిపాతంచేతా, పరిప్రశ్నచేతా, సేవచేతా తెలిసికొమ్ము' అంటుంది గీత.

వ. 'మహాత్మా! సుమనోధూపదీప నైవేద్యంబు లుత్తమం బులగు పూజాసాధనంబు లని వానిఁగొని దేవతలం బూజింతురు; తద్విశేషం బెఱిఁగింపవే' యని యడుగుటయు నం డాదరభరితుం డయి 'దీని శుక్రుండు బలి దానవేంద్రునకు బలి మనువునకు, మనువు సువర్ణుండను తపోధనునకు సువర్ణుండు నారదునకుం జెప్పి, రప్పరమముని నాకుం జెప్పె నత్తెఱంగు సెప్పెద నాకర్ణింపు' మని పలికి యప్పుడమిఱేని కిట్లనియె. 4

ప్రతిపదార్థం: మహాత్మా!= గొప్ప బుద్ధి విశేషం గల మహానుభావా! సుమనస్+ధూప, దీప, నైవేద్యంబులు= పూలు, పొగ వేయటమూ, దీపమూ, ఆహారం సమర్పించటమూ; ఉత్తమంబులు= మేలయినవి; అగు పూజాసాధనంబులు= అయిన పూజా వస్తువులు; అని; వానిన్= వానిని; కొని= గ్రహించి; దేవతలన్= దేవతలను; పూజింతురు= పూజ చేస్తారు; తత్+విశేషంబు= వాని మహిమను; ఎఱింగింపవే= దయతో చెప్పుము; అని; అడుగుటయున్= అడుగగా; అతండు= ఆ భీష్ముడు; ఆదరభరితుండు= ఆదరంతో నిండినవాడు; అయి; దీనిన్= ఈ విషయాన్ని; శుక్రుండు= రాక్షసగురువైన శుక్రాచార్యుడు; బలి, దానవ+ఇంద్రునకున్= బలి అనే రాక్షసరాజుకూ; బలి= ఆ బలి చక్రవర్తి; మనువునకున్= మనువునకూ; మనువు= ఆ మనువు; సువర్ణుండు= సువర్ణుడు; అను= అనే; తపస్+ధనునకున్= తపస్సు ధనంగా గల ఒక ఋషికీ; సువర్ణుండు= సువర్ణుడు; నారదునకున్= నారదమహర్షికీ; చెప్పిరి= ఉపదేశించారు; ఆ+పరమముని=ఆ మహర్షి; నాకు; చెప్పెన్= బోధించాడు; ఆ+తెఱంగు= ఆ విధానాన్ని; చెప్పెదను= చెబుతాను; ఆకర్ణింపుము= శ్రద్ధగా చెవులొగ్గి వినుము; అని; పలికి= మాట్లాడి; ఆ+పుడమి ఱేనికిన్= ఆ రాజుకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'మహాత్మా! పూలు, ధూపమూ, దీపమూ, నైవేద్యమూ మేలైన పూజా సాధనాలని వానితో దేవతలను పూజిస్తారు. వాటి విశేషం చెప్పవా?' అని ధర్మరాజు అడిగితే భీష్ముడు ఆదరంతో నిండినవాడై 'ఈ విషయాన్ని శుక్రుడు బలికీ, అతడు మనువునకూ, అతడు సువర్ణుడనే తాపసికీ, అతడు నారదుడికీ చెప్పారు. ఆ మహర్షి నాకు చెప్పాడు. అది నీకు చెప్పుతాను. శ్రద్ధగా వినుము' అని ఆ రాజునకు ఇలా చెప్పాడు.

విశేషం: ఈ విషయాన్ని ఎవరు ఎవరికి చెప్పారో ఇక్కడ చెబుతున్నారు. దీనినే సంప్రదాయం అంటారు. ఇందులో బలి - రాక్షసుడు, మనువు- మానవమూల పురుషుడు, సువర్ణుడు తపోధనుడు అంటే మానవులలో అతిశ్రేష్ఠుడు. నారదుడు దేవర్షి - అంటే ఇది అన్ని జాతులవారికి, అన్ని లోకాలవారికీ మానవులలో సామాన్యులకూ, సర్వశ్రేష్ఠులకూ సంబంధించిన మహావిషయం - అనే హెచ్చరిక తెలియవస్తున్నది.

సీ. 'ఓషధు లమృత మయ్యుత్తమ వస్తు సం। తతిలోనఁ బుష్పవంతములు మేలు;

పుష్పముల్ గొని సురపూజ లొనర్చిన। మానవులకు మంచి మనసు గలుగు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నట్లు గావున సుమనోऽభిధానము పుష్ప । ములకయ్యెఁ దద్ద్రవ్యపూజ లిచ్చు

నరుల కోర్కులు సుమనస్కతఁ దీర్చుట । నమరులు సుమనస్కు లనఁగఁ జనిరి;

ఆ. కంపు రూపుఁ దెలుపుఁ గలిగి యకంటక । భూరుహాదులందుఁ బుట్టినట్టి

పుష్పములఁ బ్రియంబుఁ బొంది కైకొంద్రు, ని । ర్జరులు పూజనములఁ గురువరేణ్య! 5

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశంలో ఎన్నదగినవాడా!; ఓషధులు= ఒకజాతి చెట్లు; అమృతము= అమృతం వంటివి; ఆ+ఉత్తమ వస్తు సంతతిలోనన్= ఆ మేలైన వస్తు సముదాయంలో; పుష్పవంతములు= పూలు కలవి; మేలు= గొప్పవి; పుష్పముల్= పూవులను; కొని= గ్రహించి; సురపూజలు= దేవతల పూజలు; ఒనర్చినన్= చేస్తే; మానవులకున్= మనుష్యులకు; మంచి మనసు= మంచిదైన హృదయం; కలుగున్= కలుగుతుంది; అట్లు= ఆ విధం; కావునన్= అవటంచేత; పుష్పములకున్= పూవులకు; సుమనస్+అభిధానము= 'సుమనస్సు' అనే పేరు; అయ్యెన్= ఏర్పడింది; తత్+ద్రవ్య, పూజలు= ఆ వస్తువులతో పూజలు; ఇచ్చు, నరుల కోర్కులు= ఇచ్చే మానవుల కోరికలను; సుమనస్కతన్= మంచి మనస్సు ఉండటంతో; తీర్చుటన్= తీర్చటంచేత; అమరులు= దేవతలు; సుమనస్కులు= మంచి మనస్సు కలవారు అనే అర్థంగల సుమనస్కులు; అనఁగన్+చనిరి= అన్న పేరు కలవారయ్యారు; కంపు= మంచి వాసనా; రూపున్= చక్కని అందమూ; తెలుపున్= తెల్లదనమూ; కలిగి= కలిగి; అకంటక, భూరుహ+ఆదులందున్= ముళ్ళులేని చెట్లు మొదలగు వానియందు; పుట్టిన+అట్టి, పుష్పములన్= పుట్టిన పూవులతో; ప్రియంబున్= ప్రేమను; పొంది; నిర్జరులు= దేవతలు; పూజనములన్= పూజలను; కైకొంద్రు= గ్రహిస్తారు.

తాత్పర్యం: 'కురువరా! ఓషధులు అమృతం వంటివి. ఆ మేలిజాతి వస్తువులలో పూలు పూచే చెట్లు మరింత మేలైనవి. పూలతో దేవతలను పూజించే నరులకు మంచి మనస్సు కలుగుతుంది. కనుకనే పూలకు 'సుమనస్సులు' అనే పేరు కలిగింది. ఆ వస్తువులతో పూజించే మానవుల కోర్కెలను మంచి బుద్ధితో తీరుస్తారు కనుక దేవతలకు కూడ 'సుమనస్కులు' అనే పేరు కలిగింది. మంచి వాసనా, మంచి రూపమూ, తెల్లదనమూ కలిగి ముళ్ళు లేని చెట్లనుండీ, తీగెలనుండీ పువ్వులను గ్రహించి పూజ చేస్తే దేవతలు ప్రియమంది ఆ పూజలను గ్రహిస్తారు.

విశేషం: ఓషధులు అంటే మందుచెట్లు. పువ్వులలో ఔషధగుణాలు చాలా ఉంటాయి. అందుకనే ఫ్లోరల్ మెడిసిన్స్ వ్యాప్తిలోకి వచ్చాయి. ప్రాచీనులు పూలలోని ఔషధీయ గుణాలను కనిపెట్టి, మనుష్యులకు వాటితో ఎక్కువ సాంగత్యం కలగటం కోసం పూజాద్రవ్యాలుగా నిర్ణయించారు. పుష్పంలో వికసించే గుణాన్నీ, వాసననూ, అందాన్నీ చూస్తూ ఉండే మనిషి ఎల్లప్పుడూ వాటినే భావించటం చేత మంచి గుణాలు కలవాడవటం సహజం. ఆ దృష్టితో పూలను 'సుమనస్సులు' అనటం చాలా గొప్ప విషయం. 'కంపు' అనే పదాన్ని ప్రాచీన కాలంలో 'సువాసన' అనే అర్థంలో వాడారు. ఇప్పుడు అది దుర్వాసనకు పర్యాయపదం అయింది. భూరుహ ఆదులలో తీగలు, చిన్నచెట్లు ఉంటాయి. సాధారణంగా శరీరం లోపలికి వెళ్ళకుండా ఆరోగ్యాన్నీ, తుష్టినీ, పుష్టినీ కలిగించే పూలు గొప్పవనటంలో ఆశ్చర్యం లేదుకదా!

క. నలినంబులు జాజులునుం । దులసీదళములుఁ బ్రభూతతోషము గీర్వా

ణులకుం జేయును, యక్షా । దులకు జలోద్భవము లెల్లఁ దుష్టి యొనర్చున్. 6

ప్రతిపదార్థం: నలినంబులు= తామరపూలూ; జాజులునున్= జాజిపూలూ; తులసీదళములున్= తులసీదళాలు; గీర్వాణులకున్= దేవతలకు; ప్రభూత తోషమున్= మిక్కిలి ఎక్కువ ఆనందాన్ని; చేయును= కలిగిస్తాయి; యక్ష+ఆదులకున్= యక్షులు మొదలైనవారికి; జల+ఉద్భవములు= నీటిలో పుట్టిన పూలు; ఎల్లన్= అన్నీ; తుష్టి= ఆనందాన్ని; ఒనర్చున్= చేస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తామరలూ, జాజులూ, తులసీదళాలు దేవతలకు పరమానందం కలిగిస్తాయి. నీటిపూలు యక్షులు మొదలగు వారికి సంతోషం కూరుస్తాయి.

విశేషం: తులసీదళములు - సాధారణంగా మూడు ఆకుల సముదాయంగా ఉన్నవానిని 'దళాలు' అంటారు. జలోద్భవములు- నీటిపూలు - పైన తామరలను చెప్పారు కనుక తక్కిన నీటి పూలను ఈ పదంచేత గ్రహించాలి. యక్ష+ఆదులు= యక్షులు, కిన్నరులు, కింపురుషులు, రక్షస్సులు, భూతములు, విద్యాధరులు, అప్సరసలు, గంధర్వులు మొదలైనవారిని దేవయోనులు అంటారు. Semi Gods అని వీరికి వ్యవహారం. మనుజులకంటె కొంచెం పై స్థాయికి, దేవతలకంటె క్రింది స్థాయికి చెందిన వారు.

క. అరుణంబులును సకంటక । తరుభవములుఁ గటుకగంధధామములు నొన

ర్తురు శాత్రవాభిచారిక । కరణమున నధర్వమాంత్రికతఁ గుసుమంబుల్. 7

ప్రతిపదార్థం: అరుణంబులును= ఎర్రనివీ; సకంటక, తరు, భవములున్= ముళ్ళుగల చెట్లనుండి పుట్టినవీ, కటుకగంధ ధామములు= ఘాటైన వాసనలకు తావు అయినవీ; అయిన; కుసుమంబుల్= పూవులను; అధర్వమాంత్రికతన్= అధర్వవేదపు మంత్రాల సంబంధంతో; శాత్రవ+ఆభిచారిక, కరణమునన్= పగవారిని పరిమార్చు ప్రయోగాలలో; ఒనర్తురు= ఉపయోగిస్తారు.

తాత్పర్యం: ఎర్రనివీ, ముళ్ళచెట్లనుండి పుట్టినవీ, ఘాటైన వాసన కలవీ అయిన పువ్వులను క్షుద్రప్రయోగాలలో అధర్వమంత్రాల కూర్పుతో ఉపయోగిస్తారు.

విశేషం: అభిచారిక కరణము - చేతబడి మొదలైన క్షుద్రప్రయోగాలు. పగవారిని రూపుమాపే క్షుద్రమంత్రాలు అధర్వవేదంలో ఉన్నాయని చెప్పుతారు. క్షుద్రప్రయోగాలలో ఉపయోగించేవాటిని దేవతాపూజలకు వినియోగించరాదని ఇక్కడ సూచన.

తే. భూతరక్షోగణములకు భూపవర్య! తీక్ష్ణగంధపుష్పంబులు తృప్తిఁజేయు

నలుపుఁదెలుపుఁ గలిగి పరిమళసుకాంతి । భరితములు నగు పువ్వులు నరుల మెచ్చు. 8

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజా!; తీక్ష్ణ, గంధ పుష్పంబులు= ఘాటైన వాసన గల పూలు, భూత, రక్షస్+గణములకున్= భూతముల, రక్షస్సుల గణాలకు, తృప్తిన్ చేయున్= తృప్తిని కలిగిస్తాయి; నలుపున్= నల్లదనమూ; తెలుపున్= తెల్లదనమూ; కలిగి= ఉండి; పరిమళ, సుకాంతి, భరితములు= మంచివాసనా, చక్కని కాంతీ అనే వాటితో నిండినవి; అగు పువ్వులు= అయిన పూలు; నరులమెచ్చు= నరులకు ఇష్టమైనవి.

తాత్పర్యం: రాజా! ఘాటైన వాసనగల పూలు భూతాలకు, రక్షస్సులకూ ప్రీతిగొలుపుతాయి. నలుపు, తెలుపూ గలిగి మంచి వాసనా, కాంతి ఉన్న పూలు మనుష్యులకు ఇష్టం అయినవి.

విశేషం: పూవులయందలి ఇష్టానిష్టాన్ని బట్టి మనుష్యులలోనే ఎవరు ఏ వర్గానికి చెందిన వారో నిర్ణయింపవచ్చును.

క. విను దేవాలయమునఁ బిత్రృ । వనమునఁ బుట్టు కుసుమములు వలదు వివాహం

బునకు శాంతికపౌష్టిక । వనితాజనరంజనాది వర్తనములకున్. 9

ప్రతిపదార్థం: విను= వినుము; దేవ+ఆలయమునన్= గుడియందూ; పితృవనమునన్= వల్లకాటియందూ; పుట్టు కుసుమములు= పుట్టే పువ్వులు; వివాహంబునకున్= పెండ్లికీ; శాంతిక, పౌష్టిక, వనితా, జన, రంజన+ఆది, వర్తనములకున్= శాంతికర్మలకు; పుష్టికర్మలకూ; స్త్రీలను ఆనందపరచటం మొదలైన పనులకూ; వలదు= వద్దు.

తాత్పర్యం: రాజా! వినుము. దేవాలయంలో, వల్లకాటిలో పుట్టిన పూలను పెండ్లిండ్లకూ, శాంతికర్మలకు, పుష్టికర్మలకూ, స్త్రీలను ఆనందపరచే పనులకూ ఉపయోగించవద్దు.

విశేషం: దేవాలయంలో పువ్వులు దేవతల సొమ్ము. అవి మనం తెచ్చుకుంటే దైవద్రోహం చేసినట్లు. శ్మశానం సర్వాసహ్యానిధానం. అందుకోసం అక్కడి పూలు మనస్సునకు ఉద్వేగం పుట్టిస్తాయి. దేవతలకు, గ్రహాదులకు కోపతాపాలు రాకుండా చేసేవి శాంతిక కర్మలు. ఆయువు, ధనము, ఆరోగ్యమూ మొదలైన వాటి పుష్టికోసం చేసే కర్మలు పౌష్టికాలు.

తే. కుసుమముల గంధమున దేవకోటి, వాని। దర్శనంబున యక్షులు; దదుపభోగ
మున భుజంగప్రతాన మీమూఁడు దెఱఁగు। లను మనుష్యులు ప్రియమందు టనఘ! కలుగు. 10

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; కుసుమముల గంధమునన్= పూలవాసనతో; దేవకోటి= దేవతల సముదాయమూ; వాని, దర్శనంబునన్= వానిని చూడటంచేత; యక్షులు= యక్షులనే దేవజాతివారూ; తత్+ఉపభోగమునన్= వాని అనుభవంచేత; భుజంగ, ప్రతానము= నాగులనే వారి సముదాయమూ; ఈ మూఁడు తెఱఁగులను= ఈ మూడు పద్ధతులద్వారా; మనుష్యులు= మానవులూ; ప్రియము+అందుట= ప్రీతి పొందటం; కలుగున్= సంభవిస్తుంది.

తాత్పర్యం: అనఘా! పూలవాసనలతో దేవతలు, వాటి దర్శనంతో యక్షులూ, వాటి అనుభవంతో సర్పములూ, ఈ మూడు పద్ధతులతో మానవులు ప్రీతి పొందుతారు.

విశేషం: పువ్వులు సర్వజాతులనూ ఏదో ఒక రూపంతో సంతృప్తి పరుస్తాయని భావం. క్రూరతలో పేరుగొన్న పాములు కూడా పూవులవలన ప్రీతి పొందుతాయంటే తక్కిన వాటి సంగతి చెప్పనేల? ఈ విధంగా అర్థాపత్తి అలంకార ధ్వని ఇక్కడ ఉన్నది.

క. దేవత లర్హ కుసుమ పూ। జావిధిఁ బ్రియ మంది యపుడ జనులయెడల సం
భావించి వారి కోర్కులు। గావింతురు సఫలములుగఁ గౌరవనాథా! 11

ప్రతిపదార్థం: కౌరవనాథా!= కౌరవుల రాజా!; దేవతలు= స్వర్గంలో ఉన్నవారు; అర్హ, కుసుమ, పూజా, విధిన్= తగిన పూల పూజ అనే పనితో; ప్రియము+అంది= ప్రీతి చెంది; అపుడు+అ= అప్పుడే; జనుల ఎడలన్= జనుల విషయంలో; సంభావించి= మంచి తలపులు ఏర్పరచుకొని; వారి కోర్కులు= వారి కోరికలను; సఫలములుగన్= ఫలవంతాలుగా; కావింతురు= చేస్తారు.

తాత్పర్యం: రాజా! దేవతలు తగిన పూలతో చేసిన పూజలతో ప్రీతిచెంది, అప్పటికప్పుడు ఆ జనుల విషయంలో మంచిమనసు కలవారై, వారి కోరికలను ఫలవంతాలుగా చేస్తారు.

విశేషం: అపుడ, సంభావించి -। అనే పదాలను జాగ్రత్తగా గమనించాలి. పూలపూజ సద్యఃఫలదాయకం అని భావన.

తే. సల్లకీజాత నిర్యాస మెల్ల దేవ। తలకు మే లంతకంటె గుగ్గిలము లెస్స
యగరు గంధర్వ యక్షోరగాదులకుఁ బ్రి। యంబు ధూపదానము నెడ నధిపవర్య! 12

ప్రతిపదార్థం: అధిపవర్య!= రాజవరేణ్యా!; ధూపదానము+ఎడన్= పొగవేయటం విషయంలో; ఎల్ల దేవతలకున్= దేవతలందరికీ; సల్లకీ, జాత, నిర్యాసము= అందుగు చెట్టునుండి తీసిన పొడి; మేలు= మంచిది; అంతకంటెన్= దానికంటె; గుగ్గిలము= గుగ్గిలం అనే ధూపం పొడి; లెస్స= మేలైనది; అగరు= అగరు; గంధర్వ, యక్ష+ఉరగ+ఆదులకున్= గంధర్వులు, యక్షులు, నాగులు మొదలగువారికి; ప్రియంబు= ప్రీతికరం.

తాత్పర్యం: రాజా! ధూపం ఇచ్చే విషయంలో అందుగు చెట్టు నుండి తీసిన పొడి దేవతలందరికీ మేలైనది. దానికంటె గుగ్గిలం మరింత మంచిది. అగరు గంధర్వులకు, యక్షులకు, నాగులకు ప్రీతికరమైనది.

వ. ధూపదానంబులయందు నధికతరంబు కర్పూరధూపం' బని చెప్పి మఱియును. 13

ప్రతిపదార్థం: ధూపదానంబులయందున్= పొగవేయటంలో; అధికతరంబు= మిక్కిలి ఎక్కువ అయినది; కర్పూరధూపంబు= కప్పురపు పొడి పొగ వేయటం; అని, చెప్పి= తెలిపి; మఱియును= ఇంకా.

తాత్పర్యం: పొగవేసే విషయంలో అన్నింటికంటె మిన్న అయినది కర్పూరధూపం' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

క. సమధురమును గటువును దీ। క్ష్ణమునగు గంధముల ధూపకలన వరుస హృ
ద్యములు సురయక్ష రక్ష। స్సమితులకును దత్ప్రకారజాతులకు నృపా! 14

ప్రతిపదార్థం: నృపా!= రాజా!;సమధురమును= తీయదనం కలదీ; కటువును= కారం కలదీ; తీక్ష్ణమున్= చాలా ఘాటైనదీ; అగు గంధముల, ధూపకలన= అయిన వాసనల పొగ పొడి సంబంధం; వరుసన్= వరుసగా; సుర, యక్ష, రక్షస్+సమితులకును= దేవతలయ, యక్షుల, రక్షస్సుల సముదాయాలకు; తత్, ప్రకార, జాతులకున్= అటువంటి జాతుల వారికీ; హృద్యములు= మనోహరం అయినవి.

తాత్పర్యం: రాజా! తీపి, కారం, ఘాటు అయిన ధూపాలు వరుసగా దేవతలకు, యక్షులకు, రక్షస్సులకు అటువంటి జాతులవారికి ప్రీతికరమైనవి.

తే. తగినయట్టి ధూపము దేవతలకు నిచ్చి। పరమపుష్టియు నాయువుఁ బడయుఁ గర్త
యక్ష గంధర్వపన్నగ రాక్షసులును। ధూపమున మెచ్చి కోర్కు లిత్తురు కుమార! 15

ప్రతిపదార్థం: కుమార!= నాయనా!; కర్త - ఆయా పూజలు చేసే వ్యక్తి; దేవతలకున్= దేవతలకు; తగిన+అట్టి, ధూపము= వారివారికి తగిన ధూపం; ఇచ్చి= సమర్పించి; పరమ పుష్టియున్= గొప్ప దేహపాటవాన్నీ; ఆయువున్= ఆయువునూ; పడయున్= పొందుతాడు; యక్ష, గంధర్వ, పన్నగ, రాక్షసులును= యక్షులు, గంధర్వులు, నాగులు, రాక్షసులూ; ధూపమునన్= వారివారికి నిర్దేశించిన ధూపంచేత; మెచ్చి= సంతోషించి; కోర్కులు= కోరికలను; ఇత్తురు= ఇస్తారు.

తాత్పర్యం: నాయనా! తగిన ధూపం దేవతలకు వేసి కర్త మిక్కిలి పుష్టినీ, ఆయువునూ పొందుతాడు. యక్షులు, గంధర్వులు, నాగులూ, రక్షస్సులూ ధూపంవలన మెచ్చి, కోర్కెలను సఫలం చేస్తారు.

విశేషం: ధూపద్రవ్యాలలో ఉండే విశిష్టమైన ఔషధగుణం వేసినవాడికీ, పరిసరాలలో ఉన్నవారికీ సంక్రమించి వారిలో రోగనిరోధక శక్తిని పెంచటం మొదలైన వానిచేత పుష్టినీ, ఆయువునూ పెంపొందిస్తుందని శాస్త్రీయంగా భావన చేయవచ్చును.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మలయజము నగరు మఱియుం। గలుగు సురభివస్తువులు నికామప్రియదం
బులు వైహారికధూపం। బులయెడ మానవులచిత్తములకు నరేంద్రా! 16

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= మానవాధీశా!; వైహారిక ధూపంబుల యెడన్= వేడుకగా వేసుకొనే ధూపాల విషయంలో; మలయజమున్= మంచిగంధమూ; అగరు= అగరు; మఱియున్= ఇంకా; కలుగు వస్తువులు= ఆ విధంగా ఉండే వస్తువులు; మానవచిత్తములకున్= మనుష్యుల హృదయాలకు; నికామ, ప్రియదంబులు= మిక్కిలి ప్రీతిని కలిగించేవి.

తాత్పర్యం: రాజా! గంధపుపొడి, అగరు, సాంబ్రాణి వంటి వస్తువులు వేడుకకోసం ధూపం వేసుకొనేవారి హృదయాలకు ఎంతో ప్రీతిని కలిగిస్తాయి.

విశేషం: ధర్మం అతిక్రమించని భోగదృష్టి ప్రాచీనుల అభిప్రాయంతో త్యజింపదగినది కాదని దీనివలన గుర్తించవచ్చును.

ఆ. దైవతార్చ లపుడు తామసభూత ర। క్షోముఖంబు లైన కుత్సితంపు
జాతులెల్ల దీపసన్నిధి నడఁగు న। ట్లగుట దీపదాన మధికఫలము. 17

ప్రతిపదార్థం: దైవత+అర్చల+అపుడు= దేవతలను పూజించే సమయాలలో; తామస, భూత, రక్షస్+ముఖంబులు= తమోగుణం కల భూతాలు, రక్షస్సులు మొదలయినవి; ఐన= అయిన; కుత్సితము+జాతులు= చెడు బుద్ధులుగల జాతులు; ఎల్లన్=అన్నీ; దీపసన్నిధిన్= దీపం దగ్గర; అడఁగున్= నశించిపోతాయి; అట్లు= ఆ విధం; అగుటన్= కావటం వలన; దీపదానము= దీపం దేవుడికి ఇవ్వటం; అధికఫలము= ఎక్కువ ఫలం (ఇచ్చేది).

తాత్పర్యం: దేవతల పూజలు చేసే సమయాలలో తమోగుణం గల భూతాలు మొదలైన చెడు బుద్ధులతో ఉండే జాతులన్నీ దీపం దగ్గర నశించిపోతాయి. కాబట్టి దీపదానం ఎంతో ఎక్కువ ఫలం కలది అవుతుంది.

విశేషం: దేవతలు సత్త్వగుణ ప్రధానులు. రజస్తమోగుణాల విజృంభణగల రక్షఃపిశాచాదులు వారికి ద్రోహం చేయటానికి సిద్ధపడుతూ ఉంటాయి. అవి వినాశనం పొందటానికి దీపం వెలిగిస్తాం. దీపం జ్ఞానానికి ప్రతీక. చీకటి అజ్ఞానానికి ప్రతీక.

క. ఆలోకదాన మున భూ। పాల! పరఁగు దీప మీగి భావము సద్ధ
ర్మాలోకనశీలంబగు। నా లెస్స యొనర్చినట్టి యతనికి నధిపా! 18

ప్రతిపదార్థం: భూపాల!= రాజా!; దీపము= దీపాన్ని; ఈగి= ఇవ్వటం; ఆలోకదానము= వెలుగును ప్రసాదించటం; అనన్= అనగా; పరఁగున్= ఒప్పుతుంది; అధిపా!=రాజా!; ఆ, లెస్స= ఆ మంచిపని; ఒనర్చిన+అట్టి+అతనికిన్= చేసిన వ్యక్తికి; భావము= హృదయం; సత్+ధర్మ+ఆలోకన, శీలంబు= మంచిధర్మాలను చేసే స్వభావం కలది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: రాజా! దీపం ఇవ్వటమంటే వెలుగును ప్రసాదించటం అన్నమాట. ఆ మంచిపని చేసిన వ్యక్తికి హృదయం గొప్పవైన పరమాత్మధర్మాలను చూచే స్వభావం కల దవుతుంది.

విశేషం: 'సత్' పరమాత్మ లక్షణం. దానికి సంబంధించిన ధర్మాలను చూడటమే శీలంగా గల దవుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. ఘృతము సాలమి వర్తి నికృష్ట యగుట । దగ సమర్పించి పెంచుట ధరణినాథ!
కాని యవి దీపదాన విధానమునఁ బ్ర । కాశవస్తువు దృఢదీప్తికముగ వలయు.' 19

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; ఘృతము= నెయ్యి; చాలమి= చాలకపోవటం; వర్తి= వత్తి; నికృష్ట= హీనమైనది; అగుట= కావటం; దగ= తాపము; సమర్పించి= ఏర్పరచి; పెంచుట= పెంచటమూ; దీపదానవిధానమునన్= దీపం ఇచ్చే విధానంలో; కాని+అవి= కూడని పనులు; ప్రకాశవస్తువు= వెలుగు అనే వస్తువు; దృఢ, దీప్తికముగన్= గట్టి జ్వాల కలదిగా; వలయున్= ఉండాలి.

తాత్పర్యం: రాజా! నేయి తక్కువగా ఉంచటం, వత్తి బలంలేనిదికావటం, కొంచెం వెలిగించి పెట్టటం - దీపం పెట్టటంలో కూడని పనులు. వెలుగు గట్టి జ్వాల కలదై ఉండాలి.

వ., అని వెండియు. 20

ప్రతిపదార్థం: అని; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: అని భీష్ము డింకా ఇట్లా చెప్పాడు.

క. 'ఒరు లిచ్చినదీపం బప । హరించి తత్పాతకమున నంధుండగు భూ
వర! రథ్యాసభ గుడిపై । గిరి దీపంబిడి విభూతికిం బాత్రమగున్. 21

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; ఒరులు= ఇతరులు; ఇచ్చిన దీపంబు= దేవుడికి సమర్పించిన దీపాన్ని; అపహరించి= దొంగిలించి; తత్+పాతకమునన్= ఆ పాపంచేత; (ఆ పని చేసినవాడు); అంధుండు+అగున్= గ్రుడ్డివాడవుతాడు; రథ్యాసభన్= బాటలోని చావడిలో; గుడిపైన్= గుడిపైన; గిరిన్= కొండమీద; దీపంబు+ఇడి= దీపాన్ని ఉంచి; విభూతికిన్= ఐశ్వర్యానికి; పాత్రము+అగున్= యోగ్యుడౌతాడు.

తాత్పర్యం: రాజా! ఇతరులు దేవుడి కిచ్చిన దీపం దొంగిలించితే ఆ పాతకంవలన నరుడు గ్రుడ్డివాడవుతాడు. బాటలోని చావడిలో, దేవాలయంమీదా, కొండమీదా దీపం పెట్టిన వ్యక్తి ఐశ్వర్యానికి పాత్రుడౌతాడు.

విశేషం: దీపం హరించట మంటే దొంగిలించటం, ఆర్పివేయటం - అని రెండర్థాలు గ్రహించవచ్చును. వెలుగును తిరస్కరిస్తున్నా డన్నమాట. అది గ్రుడ్డివాని చేష్ట. కాబట్టి అంధుడవుతాడని భావం. చావడి మొదలైన చోట్ల పెట్టిన దీపం ఎక్కువమందికి ఉపయోగపడుతుంది

తే. ఆలనేయి ముఖ్యము; మహిషాదిమేష । జనిత ఘృతములుఁ దైలంబు మనుజనాథ!
మధ్యమము లగు; మేదోఽస్థి మాంసరసము । లరయ నింద్యముల్ దీపసమర్పణమున. 22

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; దీపసమర్పణమునన్= దీపం పెట్టటంలో; ఆలనేయి= ఆవులనెయ్యి; ముఖ్యము= అతిశ్రేష్ఠము; మహిష+ఆది, మేష, జనిత ఘృతములు= గేదె మొదలయినవానినుండి, గొర్రెనుండి పుట్టిన నేతులు; తైలంబు= నువ్వులనూనె; మధ్యమములు= మధ్యరకానివి; అగున్= అవుతాయి; మేదస్+అస్థి, మాంస, రసములు= మేదస్సు; ఎముకలు, మాంసము అనువాని రసములు; అరయన్= పరిశీలించగా, నింద్యముల్= తుచ్ఛములు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: రాజా! దీపం పెట్టటానికి ఆవునెయ్యి చాలా మంచిది. గేదె, మేక, గొఱ్ఱె మొదలగువాటి నేతులు, నువ్వుల నూనె రెండవపద్ధతివి. క్రొవ్వు మొదలైన రసాలు పనికిమాలినవి.

విశేషం: క్రొవ్వొత్తులు దేవతార్చనలో వాడరాదని ఇది చెబుతున్నది.

క. **జ్యోతి స్సాలోక్య కులో । ద్ద్యోతన మహిత ప్రకాశయోగంబులు, పు**
త్రా! తెచ్చు దీపదానము । దాత కొసఁగు నమరపూజిత సుఖత్వంబున్. **23**

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; జ్యోతిస్+సాలోక్య= జ్యోతిర్లోకాలతో సమానలోకాలను పొందటం; కుల+ఉద్ద్యోతన= కులాన్ని వెలుగొందజేయటం; మహిత, ప్రకాశ, యోగంబులు= గొప్ప వెలుగు - జ్ఞానం పొందే యోగం కలగటం అనే వాటిని; దీపదానము= దీపం పెట్టటం; తెచ్చున్= తెస్తుంది; దాతకున్= దీపం ఇచ్చినవానికి; అమరపూజిత సుఖత్వంబున్= దేవతలచేత పూజింపబడే మహాసుఖాన్ని; ఒసఁగున్= ఇస్తుంది.

తాత్పర్యం: నాయనా! దీపదానం జ్యోతిర్లోకాల సమానస్థితిని, కులం వెలుగొందటాన్నీ, మహాజ్ఞానాన్నీ ప్రసాదిస్తుంది. దీపదానం చేసినవాడికి దేవతలు పూజించటం అనే సుఖం కలుగుతుంది.

క. **దేవతలకు నగ్రపుసం । భావన నుపహార మిచ్చి పదపడి కుడువం**
గా వలయు నట్టు సేయని । ధీవిరహితుఁ డసుర యగుట దెల్లం బధిపా! **24**

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; దేవతలకున్= దేవతలకు; అగ్రము+సంభావనన్=మొట్టమొదటి మర్యాదతో; ఉపహారము= నైవేద్యము; ఇచ్చి; పదపడి= తరువాత; కుడువన్+కాన్+వలయున్= తాను భుజించాలి; అట్టు= ఆ విధంగా; చేయని ధీ విరహితుఁడు= చేయని బుద్ధి లేనివాడు; అసుర= రక్కసుడు; అగుట= కావటం; తెల్లంబు= స్పష్టం.

తాత్పర్యం: రాజా! దేవతలకు మొదట గౌరవంతో నైవేద్యం ఇచ్చి, తరువాత తాను అన్నం భుజించాలి. అట్లా చేయని బుద్ధిహీనుడు రాక్షసు డవటం తథ్యం.

విశేషం: 'తైర్దత్తా న ప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః' - 'వారిచ్చినవి వారికి పెట్టకుండా తినేవాడు దొంగయే' అని గీత చెప్పుతున్నది. మానవుడు తినే, అనుభవించే సర్వపదార్థాలు దేవతల వలన వచ్చినవే. ఆ కృతజ్ఞతను నివేదించుకోవటమే నివేదనలోని ఆంతర్యం.

వ. **కావున.** **25**

తాత్పర్యం: కనుక.

క. **తనయింటఁ గలుగు నన్నము । మును దేవతలకు నివేద్యముగఁ జేసి ప్రణా**
మనియమసహిత సమర్పణ । మునఁ గృతకృత్యుఁడుగ వలయుఁ బురుషుం డనఘా! **26**

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; పురుషుండు= మానవుడు; తనయింటన్= తన గృహంలో; కలుగు+అన్నమున్= ఉన్న అన్నాన్ని, మును= ముందుగా; దేవతలకున్= దేవతలకు; నివేద్యముగన్= సమర్పించబడినదానినిగా; చేసి= ఒనర్చి;

ప్రణామ నియమ సహిత సమర్పణమునన్= మ్రొక్కటం అనే నియమంతో కూడిన చక్కని అర్పణతో; కృతకృత్యుఁడు= నెరవేరిన పని కలవాడు; కన్+వలయున్= కావాలి.

తాత్పర్యం: రాజా! నరుడు తన యింటిలో చేసికొన్న అన్నాన్ని ముందు దేవతలకు నమస్కారపూర్వకంగా సమర్పించి కృతకృత్యుడు కావాలి.

విశేషం: ప్రణామనియమం భక్తిపూర్వక సమర్పణను తెలియజేస్తుంది.

వ. పూజకుండు శక్తి సంపన్నుం డయి యొనర్చిన. 27

ప్రతిపదార్థం: పూజకుండు= అర్చన చేసేవాడు; శక్తి సంపన్నుండు= శక్తి అనే సంపద నిండుగా కలవాడు; అయి; ఒనర్చిన= చేసినట్టి.

తాత్పర్యం: అర్చన చేసే వ్యక్తి శక్తి నిండుగా వినియోగించి చేసినట్టి. (తరువాతి పద్యంతో అన్వయం)

క. తిలపిష్టము దధిదుగ్ధం । బులు మఱియును ధూపములును బుణ్యపరిమళం
బులునగు పదార్థములు విబు । ధులకుం బ్రియ మొసఁగు బలివిధులఁ గురుముఖ్యా! 28

ప్రతిపదార్థం: కురుముఖ్యా!= కౌరవవంశంలో శ్రేష్ఠుడా!; బలివిదులన్= నైవేద్యం పనులలో; తిలపిష్టము= తెలకపిండి; దధి, దుగ్ధంబులు= పెరుగు, పాలు; మఱియును= ఇంకా; ధూపములును= ధూపాలు; పుణ్య, పరిమళంబులును= పవిత్రమైన సువాసనలు కలవీ; అగు పదార్థములు= అయిన వస్తువులు; విబుధులకున్= దేవతలకు; ప్రియము= ప్రీతిని; ఒసఁగున్= కలిగిస్తాయి.

తాత్పర్యం: కురువరా! నివేదనక్రియలలో నువ్వులపిండి, పెరుగు, పాలు, ఇంకా మంచి సువాసనలు గల వస్తువులు దేవతలకు ప్రీతిని కలిగిస్తాయి.

క. ఉపహారసమర్చకుఁడగు । సుపురుషు గృహదైవతములు శుభములఁ గూర్చున్
నృపవర! తత్కర్మరహితుఁ । గృపలేక నితాంతవిఫలకృత్యుం జేయున్. 29

ప్రతిపదార్థం: నృపవర!= రాజశ్రేష్ఠా!; ఉపహార సమర్చకుఁడు= నైవేద్యంతో చక్కగ పూజ చేసేవాడు; అగు సుపురుషున్= అయిన మంచి మనిషిని; గృహదైవతములు= ఇలవేల్పులు; శుభములన్= శుభములతో; కూర్చున్= కూడినవాడినిగా చేస్తారు; తత్+కర్మ రహితున్= ఆ పని లేనివానిని; కృప= దయ; లేక= లేకుండా; నితాంత విఫల కృత్యున్= ఎల్లవేళల చెడిన పనులు గలవానినిగా; చేయున్= చేస్తారు.

తాత్పర్యం: రాజా! నివేదనతో అర్చించే వ్యక్తికి ఇంటి దేవతలు సకలశుభాలు కలిగిస్తారు. ఆ పని చేయనివాడిని దయమాలి ఎల్లవేళలా చెడిన పనులు కలవాడినిగా చేస్తారు.

విశేషం: 'దేవతలు ఇంత రాగద్వేషాలతో ఉంటారా?' అని మనం శంకించనక్కరలేదు. నిజానికి శుభములు కలగటం, పనులు చెడటం అనేది మన మనశ్శక్తి మీద ఆధారపడి ఉంటుంది. భక్తిపూర్వక దేవతార్చన ఆ మనశ్శక్తికి పుష్టినిస్తుంది.

ఆ. రక్తమాంస సహిత భక్త పిండముల ను। ల్లసితలోహితాక్త లాజములను
సురను బలియొనర్ప నురగయక్షాసుర। ప్రముఖ భూతములు శుభంబు లొసఁగు. 30

ప్రతిపదార్థం: రక్త, మాంస, సహిత, భక్త, పిండములన్= నెత్తుటితో మాంసంతో కూడిన అన్నపుముద్దలను; ఉల్లసిత, లోహిత+అక్త, లాజములను= చక్కగా ప్రకాశించేవి, ఎరుపుతో కూడినవి అయిన పేలాలను; సురను= కల్లును; బలి+ ఒనర్పన్= నివేదన చేస్తే; ఉరగ, యక్ష, అసుర, ప్రముఖ, భూతములు= పాములు, యక్షులు, రక్షస్సులు మొదలైన భూతాలు, శుభంబులు= మేళ్ళను; ఒసఁగున్= ఇస్తాయి.

తాత్పర్యం: రక్తం, మాంసం అనే వాటితో కూడిన అన్నపుముద్దలను, బాగా మెరిసిపోతున్న ఎఱ్ఱదనంతో కూడిన పేలాలను, కల్లును ఉపహారంగా ఇస్తే నాగులు, యక్షులు, రాక్షసులు మొదలైన భూతాలు మేలు నిస్తాయి.

విశేషం: ఈ విధమైన బలులు నింద్యాలు. అయినా లోకుల మనస్తత్వాని కనుగుణంగా ఇక్కడ చెప్పినట్లు భావించాలి.

క. సౌమ్యాసౌమ్యబలులు విను। సౌమ్యాసౌమ్య ప్రకార జనకృత్యంబుల్
సౌమ్యనృపోత్తమ। యయ్యై। కామ్యముఁ దత్తత్ప్రపూజ్య కరణిం జేయున్. 31

ప్రతిపదార్థం: సౌమ్య నృప+ఉత్తమ!= మంచి హృదయం గల రాజవరేణ్యా!; విను= ఆలకించుము; సౌమ్య+అసౌమ్యబలులు= మంచివి, చెడ్డవి అయిన నివేదనలు; సౌమ్య+అసౌమ్య ప్రకార జన కృత్యంబుల్= మంచివారు, చెడ్డవారు అయిన జనులు చేసే పనులు, తత్+తత్+ప్రపూజ్య కరణిన్= ఆయా పూజలందుకొనేవారి విధంగానే, ఆ+ఆ+కామ్యమున్= ఆయా కోరికను; చేయున్= సిద్ధింపజేస్తాయి.

తాత్పర్యం: ఉత్తమనృపా! మంచి ప్రవృత్తికలవారు మంచి బలులను, దుష్టప్రవృత్తి కలవారు ఉగ్రమైన బలులను ఆయా దేవతల ధోరణిలోనే చేస్తూ ఉంటారు. దానికి అనుగుణంగానే ఫలితాలను పొందుతారు.

విశేషం: పైన చెప్పిన తిలపిష్టము మొదలైనవి సౌమ్యబలి. రక్తమాంస సహితమైనది అసౌమ్యబలి. సత్త్వగుణసంపన్నులు మొదటిదానిని, అది లేనివారు రెండవరకపు బలిని వారివారి దేవతల స్వభావాలకు అనుగుణంగా ఇస్తారు. ఆయా దేవతాదులు తదనుగుణంగానే ఫలితాలను ప్రసాదిస్తారు. అంటే సౌమ్యబలినే మానవుడు ఆదరించాలి అని సూచన.

క. అగ్రప్రదాయి వర్ణస। మగ్రుఁడు బలయుతుఁడు బుద్ధిమంతుఁడు లోకా
నుగ్రహ పాత్రము శాత్రవ। నిగ్రహశక్తుండుఁ దత్త్వనిష్ఠుండు నగున్.' 32

ప్రతిపదార్థం: అగ్రప్రదాయి= మొదటిదైన సౌమ్యబలిని దేవతలకు సమర్పించేవాడు; వర్ణసమగ్రుఁడు= చక్కని వన్నె నిండుగా గలవాడు; బలయుతుఁడు= గొప్పబలంతో కూడినవాడు; బుద్ధిమంతుఁడు= శ్రేష్ఠమైన బుద్ధి కలవాడు; లోక+అనుగ్రహ, పాత్రము= లోకుల దయకు పట్టయినవాడు; శాత్రవ నిగ్రహ శక్తుండున్= పగవారిని నిలువరించటంలో సమర్థుడూ; తత్త్వనిష్ఠుండున్= పరమాత్మ తత్త్వంలో నిష్ఠ కలవాడూ, అగున్= అవుతాడు.

తాత్పర్యం: సౌమ్యబలిని ఇచ్చేవాడు మంచి వన్నె కలవాడూ, బలం కలవాడూ, బుద్ధి కలవాడూ, లోకానుగ్రహానికి పాత్రమయిన వాడూ, పగవారిని అణచివేసే సమర్థత కలవాడూ, పరతత్త్వంలో నిష్ఠ కలవాడూ అవుతాడు.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: సౌమ్యబలి ఫలితాలను వర్ణించారు. అంటే మనుజులు దానియందే ఆదరం కలవారు కావాలని హెచ్చరిక. అసౌమ్యబలి ఈ ఫలితాలకంటె వేరైన దుష్టఫలితాల నిస్తాయని కూడా సూచన. కనుక జంతుబలి భారతధర్మం కాదని మనం గుర్తించాలి.

వ. అనిన విని యజాతశత్రుండు గంగాపుత్రుతో 'సుమనోధూపదీపబలిప్రదానంబుల ఫలవిశేషంబు లింకను వినవలతుం జెప్పవే' యనుటయు నప్పురుషవరుండా కురువంశవరున కిట్లను 'నహుషవృత్తాంతంబున నది విస్పష్టంబగు వినుము చెప్పెద. 33

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; అజాతశత్రుండు= పుట్టనిశత్రువులు కల ధర్మరాజు; గంగాపుత్రుతోన్= గంగకొడుకైన భీష్మునితో; సుమనస్+ధూప, దీప, బలి ప్రదానంబుల, ఫల విశేషంబులు= పూలు, ధూపము, దీపము, నైవేద్యమివ్వటం అనే వాటి ఫలాల మహిమలను; ఇంకను= ఇంకా ; వినవలతున్= వినటానికి కోరుతున్నాను; చెప్పవే= చెప్పవా; అనుటయున్= అన్నంతనే; ఆ+పురుషవరుండు= పురుషులలో శ్రేష్ఠుడైన ఆ భీష్ముడు; ఆ కురువంశవరునకున్= కురువంశంలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; నహుషవృత్తాంతంబునన్= నహుషుడి కథలో; అది= ఆ విషయం; విస్పష్టంబు= తేటతెల్లం; అగున్= అవుతుంది; వినుము= శ్రద్ధతో వినుము; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీష్ముడితో 'పూలూ, ధూపమూ, దీపమూ, నివేదనా అనేవాటి మహాఫలితాలను ఇంకా వినాలని ఉంది. తాతా! చెప్పవా' అని అడిగితే ఆ మహాపురుషుడు ఆ కురువంశశ్రేష్ఠుడితో ఇట్లా అన్నాడు 'నహుషుడి కథలో ఆ విషయం తేటతెల్లం అవుతుంది. వినుము చెప్పుతాను.

విశేషం: అడిగేవాడు అజాతశత్రుడు. చెప్పేవాడు గంగాపుత్రుడు. విషయం ఎంత ప్రమాణభూతమయినదో పరిశీలించండి అని పాఠకుడికి ఒక హెచ్చరిక. వినుము అనే మాటలో అవధానబుద్ధితో అనే ధ్వని ఉంటుంది.

భీష్ముఁడు ధర్మజునకు నహుషుని ధూపదీపదానవిశేషంబు చెప్పుట (సం.13-156-1 (కుంభ))

సీ. నహుషుఁడు భూపాలనము సేయుచుండి రా । జస మించుకయు లేక సత్త్వనిష్ఠఁ
బుష్పంబులను ధూపముల దీపముల నివే । ద్యంబుల నమరుల కర్చ లిచ్చుఁ
బితృసంతతికి దీనఁ బ్రీతి యొనర్చు రా । క్షస యక్షభూతభుజంగమాది
తర్పణంబులు నర్హతానిరూఢములు గా । నివి గొని యొనరించు నిట్లు నిత్య

తే. నిరతిఁ జెల్లించి తత్ఫలపరిణతి ప్ర । దీప్త తేజోవిశేష సంప్రాప్తదేవ
రాజ్యుఁడై సురమునిగణ పూజ్యభావ । మహిమఁ బొందియు దీనిఁదా మఱవఁ డధిప! 34

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; నహుషుఁడు= నహుషచక్రవర్తి; భూపాలనము= భూమిని పాలించుటను; చేయుచున్+ఉండి= చేస్తూ ఉండి; రాజసము= పొగరు; ఇంచుకయున్= కొంచెమైనా; లేక; సత్త్వనిష్ఠన్= సత్త్వగుణంలో చెదరుపాటు లేనితనంతో; పుష్పంబులను= పూలతో; ధూపములన్= ధూపములతో; దీపములన్= దీపాలతో; నివేద్యంబులన్= నైవేద్యాలతో; అమరులకున్= దేవతలకు; అర్చలు= పూజలు; ఇచ్చున్= ఇచ్చేవాడు; దీనన్= దీనితో; పితృసంతతికిన్= పితృదేవతలకు; ప్రీతి+ఒనర్చున్= ప్రీతి

చేసేవాడు; రాక్షస, యక్ష, భూత, భుజంగమ+ఆది తర్పణంబులు= రక్షస్సులు, యక్షులు, భూతములు, నాగదేవతలు మొదలగు వాని తర్పణాలను (తృప్తి కలిగించే క్రియలను); అర్హతా నిరూఢములు కాన్= యోగ్యతకు చక్కగా సరిపడేవిగా; ఇవి= పూలు మొదలైన వానిని; కొని= తీసికొని; ఒనరించున్= చేస్తూ ఉండేవాడు; ఇట్లు= ఈ విధంగా; నిత్యనిరతిన్= ప్రతిదినపు నిష్ఠతో; చెల్లించి= ఆచరించి; తత్ ఫల పరిణతి ప్రదీప్త, తేజస్+ విశేష సంప్రాప్త దేవ రాజ్యుఁడు= దాని ఫలపు పాకం చేత మిక్కిలి వెలుగొందే తేజస్సుయొక్క మహిమచేత పొందబడిన దేవతల రాజ్యం గలవాడు; ఐ= అయి; సురముని గణ పూజ్య భావ మహిమన్= దేవతలు, మునులు - అనువారి సముదాయాలకు గౌరవించబడే భావపు మహిమను; పొందియున్= పొంది కూడా; దీనిన్= ఈ పూజావిధానాన్ని; తాన్= తాను; మఱవఁడు= మరచిపోలేదు.

తాత్పర్యం: రాజా! నహుషుడు భూమినేలుతూ పొగ రేమాత్రమూ లేకుండా సత్యనిష్ఠతో పూలు, ధూపమూ, దీపములూ, నైవేద్యాలు అనేవాటితో దేవతలకు పూజలు చేస్తూ ఉండేవాడు. అట్లాగే పితృదేవతలకు, రాక్షసులకు, యక్షులకు, భూతాలకు, సర్పాలు మొదలైనవాటికి తర్పణాలు, యోగ్యత ననుసరించి పూలు మొదలైనవాటితో చేస్తూ ఉండేవాడు. ఇది ఏనాడూ మానకుండా చేసి, దాని ఫలంగా పాకానికి వచ్చిన గొప్ప తేజస్సుతో దేవరాజ్యాన్ని పొందగలిగాడు. దేవతలు, మునులు అతడిని పూజించే మహిమను పొంది కూడా అతడు దీనిని మరువలేదు.

విశేషం: నిత్యనిరతి - మనం ఆహారం ఏ విధంగా ప్రతిదినమూ తీసుకుంటామో ఆ విధంగానే దేవతలకు అందించాలని భావన. తాను తింటూ దేవతలను పస్తుంచరాదని హెచ్చరిక. పొందియున్- సాధారణంగా సిద్ధిపొందినవాడు సాధన చేయనక్కరలేదు. లేదా సిద్ధిపొందిన తరువాత గర్వం తలకెక్కుతుంది. ఈ రెండు కారణాలుగా మరచే అవకాశం ఉన్నా మరవలేదని భావన.

క. **సురలఁ బితృదేవతలఁ ద । త్పరతను మున్నెట్టు లట్ల పన్నుగ సమ్య**
క్పరితృప్తులఁగా జేయుం । బరమకుసుమధూపదీప బలిదానములన్. **35**

ప్రతిపదార్థం: సురలన్= దేవతలను; పితృదేవతలన్= పితరులు అనే దేవతలను; తత్పరతను= వారియందే భావం నిలిచే విధంగా (శ్రద్ధతో); మున్ను= ముందు; ఎట్టులు= ఎట్లో; అట్లు+అ= అట్లే; పన్నుగన్= చక్కగా; పరమ కుసుమ, ధూప, దీప, బలి దానములన్= శ్రేష్ఠమైన పూలు, ధూపములూ, దీపములూ, నైవేద్యములు అనే వాటి దానాలతో; సమ్యక్, పరితృప్తులన్ కాన్= చక్కగా, నిండుగా తృప్తి పొందినవారినిగా; చేయున్= చేస్తూ ఉండేవాడు.

తాత్పర్యం: దేవతలను, పితరులను శ్రద్ధతో దేవరాజ్యం పొందక ముందు చేసినట్లుగానే మంచిపూలు, ధూపాలు, దీపాలు, నైవేద్యాలు అనేవాటితో చక్కగా నిండుగా తృప్తి పరచేవాడు.

తే. **దానఁజేసి తదీయ మహానుభావ । మంత కంతకు నగ్గల మగుటకతనఁ**
దగియె మునివరవాహనత్వంబు నమ్మ । హాద్యుతికి వేయునేల యవద్యరహిత! **36**

ప్రతిపదార్థం: అవద్యరహిత!= దోషాలు లేనివాడా!; దానన్+చేసి= దానివలన; తదీయ, మహ+అనుభావము= అతడి గొప్పమహిమ; అంతకున్+అంతకున్= ఇంకా ఇంకా; అగ్గలము= అధికం; అగుట కతనన్= అయిన కారణంగా; ఆ+మహాద్యుతికిన్= ఆ గొప్ప తేజశ్శాలికి; మునివరవాహనత్వంబు= మునిశ్రేష్ఠుల వాహనం కలగటం; తగియెన్= ఏర్పడినది; వేయున్= వేయి మాటలు; ఏల?= ఎందుకు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నిర్మలచిత్తుడా! దానిచేత ఆతడి గొప్ప మహిమ అంతకంతకూ పెరిగిపోయింది. ఆ కారణంగా ఆ మహాతేజశ్శాలి మునులు మోసే వాహనం కలవా డవటం సమకూడింది. వేయి మాటలేల?

విశేషం: అవద్యం - పలుకరానిది - దోషం - అది లేనివాడు అవద్యరహితుడు. 'మునివరవాహనత్వంబు' అన్నచోట 'వర' శబ్దం మరింత ప్రకృతార్థాన్ని పుష్టం చేస్తున్నది.

క. విను మనుజేంద్రుల కెవ్వరి । కిని లేని విశేష మతనికిం గలుగుట గ
ర్వనిరూఢి నొంది దుర్వ । ర్తనపరుఁడై యాతఁ డజగరత్వముఁ బొందెన్. 37

ప్రతిపదార్థం: విను= వినుము; మనుజ+ఇంద్రులకున్= రాజులకు; ఎవ్వరికిని= ఎవ్వరికీ; లేని విశేషము= లేని మహిమ; అతనికిన్= ఆ నహుషునకు; కలుగుటన్= కలగటంచేత; గర్వ నిరూఢిన్= పొగరు సడలని స్థితిని; ఒంది= పొంది; ఆతఁడు= ఆ నహుషుడు; దుర్వర్తనపరుఁడు= చెడు నడవడియందు పట్టుదలకలవాడు; ఐ= అయి; అజగరత్వమున్= పెనుబాము అవటం; పొందెన్=పొందాడు.

తాత్పర్యం: రాజా! వినుము. ఏ రాజుకూ లేని గొప్పతనం అతడికి కలిగిన కారణంగా చెదరని గర్వం పొంది ఆతడు తప్పుదారిని బట్టి పెనుబామై పోయాడు.

విశేషం: దుర్వర్తన - ఇంద్రుడి భార్య శచిని కోరటం అనేది; పరుఁడు= బృహస్పతి వంటి మహానుభావులు ఎంత బోధించినా తలకెక్కని మొండి పట్టుదల గలవాడు.

వ. అట్టియెడఁ బూర్వంబునం జేసిన పుష్పాదిదాన పుణ్యవిశేషంబుల మహానుభావంబువలన నవ్వసుమతీశ్వరు శపించిన మునీశ్వరుండు సదయుండయి శాపమోక్షంబు నిర్దేశించెఁ 'దత్ఫలవిశేషంబునన యశేషదోష నిరసననిపుణుండ వగు నీవప్పుణ్యానుష్ఠానంబున కొదవి' తని చెప్పి వెండియు. 38

ప్రతిపదార్థం: అట్టియెడన్= అట్టి సందర్భంలో; పూర్వంబునన్= మునుపు; చేసిన= చేసినట్టి; పుష్ప+ఆది, దాన పుణ్యవిశేషంబుల= పూవులు మొదలగు వాటి దానంవలన అయిన పుణ్యమహిమల; మహా+అనుభావంబువలనన్= గొప్ప శక్తివలన; ఆ+వసుమతీ+ఈశ్వరున్= ఆ భూప్రభువును; శపించిన; ముని+ఈశ్వరుండు= శపించిన మునిశ్రేష్ఠుడు; సదయుండు+అయి= దయతో కూడినవాడై; శాపమోక్షంబున్= శాపం విడుదలను; నిర్దేశించెన్= చెప్పాడు; తత్+ఫల విశేషంబునన్+అ= ఆ ఫలం యొక్క విశేషం చేతనే; అశేష దోష నిరసన నిపుణుండవు= సమస్తమైన దోషాలను త్రోసివేయటంలో నేర్పుగలవాడవు; అగు నీవు= అయిన నీవు; ఆ+పుణ్య+ అనుష్ఠానంబునకున్= ఆ పుణ్యకార్యం ఆచరణకు; ఒదవితి(వి) = సిద్ధపడ్డావు; అని; చెప్పి= తెలియజేసి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఆ పరిస్థితిలో అంతకుమునుపు చేసిన పూలు మొదలైన దానాల పుణ్యమహిమల గొప్పశక్తిచేత ఆ రాజును శపించిన మహర్షి దయగలవాడై శాపం తీరే విధానాన్ని సూచించాడు. 'ఆ ఫలవిశేషంచేతనే సమస్త పాపాలను దూరంచేసే నేర్పుగల నీవు ఆ పుణ్యకార్యం ఆచరించటానికి పూనుకున్నావు' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: శాపమోక్ష ప్రదానం చేయటానికి వీలులేనంత మహాపాపం చేసినా చేసినా, పుణ్యవిశేషం వలన అది ప్రయోజనం కలిగించిందనీ చెప్పటం వలన పుష్పాదిదానాల మహిమకు సాటిలేనితనం చెప్పినట్లయింది.

తే. పాండవాగ్రజ! నహుషుండు బ్రహ్మసభకు । నాత్మగృహమున కరిగినయట్ల యరిగె;

నట్టి పెంపును జనవిభుం డవ్విశిష్ట । దానఫలమునఁ జూవె పొందంగఁ బడసె. 39

ప్రతిపదార్థం: పాండవ+అగ్రజ!= పాండుకుమారులలో పెద్దవాడా!; నహుషుండు= నహుషచక్రవర్తి; బ్రహ్మసభకున్= బ్రహ్మదేవుడి సభకు; ఆత్మగృహమునకున్= తనయింటికి; అరిగిన+అట్లు+అ= వెళ్ళినట్లే; అరిగెన్= వెళ్ళాడు; జనవిభుండు= ఆ రాజు; అట్టి పెంపును= అట్టి గొప్పతనాన్ని; ఆ+విశిష్ట దాన ఫలమునన్= ఆ గొప్పదాన ఫలంచేతనే; పొందంగన్ పడసెన్= పొందగలిగాడు; చూవె= సుమా!

తాత్పర్యం: ధర్మరాజా! నహుషుడు బ్రహ్మసభకు సొంత ఇంటికి వెళ్ళినట్లుగా వెళ్ళాడు. ఆ రాజు మహిమను ఆ మహా దాన ఫలంచేతనే కదా పొందగలిగాడు!'

విశేషం: బ్రహ్మసభకు వెళ్ళటమంటే భూలోకం మొదలైన ఆరు లోకాలు దాటి ఏడవదైన సత్యలోకానికి వెళ్ళటం. అంటే స్వర్గం పొందటానికి చేసిన పుణ్యానికి సుమారు ఆరురెట్ల పుణ్యం చేస్తే అది లభిస్తుంది. అందులోను బెరుకుతో, జంకుతో కాకుండా సొంత ఇంటికి వెళ్ళినట్లు అంటే ఆ పుణ్యం ఇంకా ఎంత గొప్పది కావాలో ఆలోచించదగిన విషయం. అంత పుణ్యాన్ని దేవతలకు పుష్పాదిదానంచేత మానవుడు సంపాదిస్తాడని కథాతాత్పర్యం.

క. అని పలికి భీష్ముఁడిట్లను । 'విను మెందును దీపదానవిధి మే లనిశం

బును జేయ నూర్ధ్వలోకం । బును గర్తకుఁ బరమదివ్య బోధము నిచ్చున్. 40

ప్రతిపదార్థం: అని; పలికి; భీష్ముఁడు; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; వినుము= ఆలకించుము; ఎందును= అన్నింటిలో; దీపదాన విధి= దీపం ఇవ్వటం అనే పని; మేలు= శ్రేష్ఠమైనది; అనిశంబును= ఎల్లవేళల; చేయన్= చేయగా; కర్తకున్= చేసినవాడికి; ఊర్ధ్వలోకంబును= పై లోకాన్నీ; పరమ దివ్య బోధమున్= మిక్కిలి గొప్పదైన జ్ఞానాన్నీ; ఇచ్చున్= ఇస్తుంది.

తాత్పర్యం: ఇట్లా చెప్పి భీష్మ డింకా ఇట్లా అన్నాడు. 'అన్ని విషయాలలో దీపదానం చాలా శ్రేష్ఠమైనది. అది చేసినవాడికి పై లోకాలను, గొప్పది, మహిమగలదీ అయిన జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

విశేషం: ఊర్ధ్వలోకం పుణ్యానుభవానికి సంకేతం. జ్ఞానం కైవల్యాన్ని ప్రసాదిస్తుంది. దీపం ఇచ్చే వెలుగు భగవత్తత్త్వాన్ని ప్రస్ఫుటం చేస్తుందని తాత్పర్యం. అంతేకాక 'తమసోమా జ్యోతిర్గమయ' అన్న ఉపనిషద్వాక్యం కూడా ఇక్కడ సమన్వయిస్తుంది.

క. ఎన్ని నిమిషములు దైవత । సన్నిధి వెలుఁ గంగఁ జేయు జనుఁడు ప్రదీపం

బన్ని సురవత్సరములు సు । ఖోన్నతి సన్నుతుల నాతఁ డొప్పు దివమునన్. 41

ప్రతిపదార్థం: జనుఁడు= మనిషి; ప్రదీపంబు= పెద్దదీపాన్ని; దైవతసన్నిధిన్= దేవత సమీపంలో; ఎన్ని నిమిషములు= ఎన్ని నిముషములకాలం; వెలుఁగంగన్+చేయున్= వెలుగునట్లు చేస్తాడో; అన్ని సుర వత్సరములు= అన్ని దేవతల ఏండ్లు; ఆతఁడు= ఆ మనిషి; సుఖ+ఉన్నతిన్= సుఖంయొక్క పెక్కువతో; సన్నుతులన్= మంచి ప్రశంసలతో; దివమునన్= స్వర్గంలో; ఒప్పున్= వెలుగొందుతాడు.

తాత్పర్యం: మనిషి దేవుడిదగ్గర ఎన్ని నిముసాలు పెద్దదీపం వెలిగించి ఉంచుతాడో అన్ని దేవసంవత్సరాల కాలం స్వర్గంలో అధికసుఖంతో చక్కని ప్రశంసలతో ప్రకాశిస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మనుజుల సంవత్సరం దేవతల కొకరోజు. అంటే మనుషుల మూడువందల అరవై ఏండ్లు దేవతలకొక సంవత్సరం అన్నమాట.

క. అనిన విని ధర్మజుఁడు శం । తనుతనయుని తోడ విప్రధనము హరిం
చిన యాతఁ డేగతిం జను? । ననుటయు నతఁ డిట్టు లనియె నన్నరపతికిన్. 42

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ధర్మజుఁడు= ధర్మరాజు; శంతనుతనయునితోడన్= శంతనుడి కొడుకైన భీష్ముడితో; విప్రధనము= మహావిద్యావంతుడి సొమ్ము; హరించిన+ఆతఁడు= దొంగిలించిన వ్యక్తి; ఏ గతిన్= ఏ దారిలో; చనున్?= పోతాడు?; అనుటయున్= అన్నంతనే; ఆతఁడు= ఆ భీష్ముడు; ఆ+నరపతికిన్= ఆ రాజునకు; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఆ మాట విన్న తరువాత భీష్ముడితో ఇట్లా అన్నాడు 'విప్రుడి సొమ్ము దొంగిలించినవాడి గతి ఏమిటి?' అంటే భీష్ము డా రాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: 'విద్యయా యాతి విప్రత్వమ్' అన్న వాక్యాన్ని బట్టి పరమార్థజ్ఞానం పుష్కలంగా కలవాడే విప్రుడు.

క. దురితము లనేకములు గల । వరయఁగ లోకమున వాని యన్నిటికంటెన్
ధరణిసురధనము పాపపుఁ । దెరువునఁ గొనుటధిక మండ్రు ధీరవిచారా! 43

ప్రతిపదార్థం: ధీరవిచారా!= బుద్ధి విశేషంతో కూడిన వివేకం కలవాడా!; అరయఁగన్= పరిశీలించి చూడగా; లోకమునన్= లోకంలో; దురితములు= పాపాలు; అనేకములు= పెక్కులు; కలవు= ఉన్నాయి; వాని; అన్నిటికంటెన్= ఆ అన్నింటికంటె; ధరణిసుర ధనము= బ్రాహ్మణుడి సొమ్ము; పాపము+తెరువునన్= పాపపుపద్ధతిలో; కొనుట= గ్రహించుట; అధికము= పెద్దది; అండ్రు= అంటారు.

తాత్పర్యం: వివేకంతో కూడిన విచారం కల ఓ ధర్మరాజా! పరిశీలిస్తే లోకంలో పాపాలు లెక్కలేనన్ని ఉన్నాయి. ఆ అన్నింటిలో బ్రహ్మజ్ఞానసంపన్నుడి సొమ్ము పాపపు పద్ధతిలో దొంగిలించటం చాలా పెద్దది అంటారు.

విశేషం: 'ధీరవిచారా!' అనే సంబోధనలో 'ఇది చాలా సూక్ష్మబుద్ధితో విచారించి నిర్ణయించవలసిన అంశం' అనే సూచన వ్యక్తం అవుతుంది.

క. భూసుర ధనాపహరణము । చేసినఁ గులనాశమగుట సిద్ధము; దానం
జేసి యగును జండాల । త్వాసంగము నపరభవము నందు నరేంద్రా! 44

ప్రతిపదార్థం: నరేంద్రా!= రాజా!; భూసుర, ధన+అపహరణము= బ్రాహ్మణుడి సొమ్ము దొంగిలించటం; చేసినన్= చేస్తే; కులనాశము= కులమంతా నశించటం; అగుట= కావటం; సిద్ధము= తప్పక జరుగుతుంది; దానన్+చేసి= దానివలన; అపర భవమునందున్= మరు పుట్టుకలో; చండాలత్వ+ఆసంగము= చండాలుడగుటతోడి దృఢమైన సంబంధం; అగును= అవుతుంది.

తాత్పర్యం: రాజా! బ్రహ్మజ్ఞానం కలవాడి సంపదను దొంగిలిస్తే కులనాశనం తప్పక జరుగుతుంది. అంతేకాదు- మరు పుట్టుకలో తప్పనిసరిగా చండాలు డయ్యే స్థితి కలుగుతుంది.

విశేషం: తన పాపం తనతో ఆగదు. తనతో చుట్టరికం గల వారినందరినీ అంత మొందిస్తుంది. అంటే అది ఎంత ఘోరకృత్యమో సంభావించాలి.

వ. ఒక్క యితిహాసంబు సెప్పెద నాకర్ణింపుము. 45

ప్రతిపదార్థం: ఒక్క+ఇతిహాసంబు= ఒక పురాతన కథను; చెప్పెదను= చెబుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: దీనికి సంబంధించిన ఒక ప్రాతకాలపు వృత్తాంతాన్ని వివరిస్తాను వినుము.

ఆ. క్షత్ర బంధుఁ డనఁగఁ గలఁ డొక్క నరపతి । యతఁడు మాలవాని నధికదుఃఖ
భాగిఁ గాంచె గాలిఁ బఱచు విప్రక్షేత్ర । తలము రేణువునకుఁ దలఁగి చనఁగ. 46

ప్రతిపదార్థం: క్షత్రబంధుఁడు+అనఁగన్= క్షత్రబంధు డనే పేరుగల; ఒక్క, నరపతి= ఒకరాజు; కలఁడు= ఉన్నాడు; అతఁడు= ఆ రాజు; అధిక దుఃఖభాగిన్= మిక్కిలి దుఃఖం అనుభవిస్తున్న; మాలవానిన్= చండాలుని; గాలిన్= గాలిచేత; పఱచు విప్రక్షేత్రతలము రేణువునకున్= ఎగిరి వచ్చుచున్న బ్రాహ్మణుడి పొలంలోని దుమ్ము కణానికి; తలఁగి= తప్పుకొని; చనఁగన్= పోతూ ఉండగా; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: క్షత్రబంధుడనే రాజొకడు ఉన్నాడు. ఒకనా డతడు బ్రాహ్మణుడి పొలంనుండి గాలికి ఎగిరి వస్తున్న రేణువుని తప్పుకొని వెళుతున్నవాడు, మహాదుఃఖంతో ఉన్నవాడు అయిన ఒక మాలవాడిని చూచాడు.

క. కని యీ ధూళికిఁ గడు రో । సిన కారణమేమి? యనుడుఁ జెప్పె నతనికి
ట్లని యమ్మాలఁడు 'దొలుబా । మున నేనొక విప్రుకొడుక మునులు నుతింపన్. 47

ప్రతిపదార్థం: కని= చూచి; ఈ ధూళికిన్= ఈ దుమ్మునకు; కడున్= ఎక్కువగా; రోసిన కారణము= రోతపడిన హేతువు; ఏమి?= ఏమిటి?; అనుడున్= అనగా; ఆ+మాలఁడు= ఆ మాలవాడు; అతనికిన్= ఆ క్షత్రబంధునకు; ఇట్లు+అని= ఈ విధంగా; చెప్పెన్= చెప్పాడు; తొలుబామునన్= పూర్వజన్మలో; నేను; ఒక, విప్రుకొడుకన్= ఒక బ్రాహ్మణుడి కుమారుడిని; మునులు= మహర్షులు; నుతింపన్= కొనియాడునట్లుగా.

తాత్పర్యం: చూచి, ఆ రాజు 'ఆ ధూళికి అంతగా రోతపడుతున్నావు కారణమేమి' టని అడిగాడు. అప్పుడతడు ఇట్లా చెప్పాడు 'నేను పూర్వజన్మలో ఒక బ్రాహ్మణుడి కుమారుడిని. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. పరమనిష్ఠతోడ బ్రహ్మచర్యవ్రత । మాచరింతు; భిక్షితాన్న మొక్క
నాఁడు వేడ్కఁ బుణ్యనది తీరమున భుజిం । పంగఁ దలఁచి చనఁగఁ బాప మడరి. 48

ప్రతిపదార్థం: పరమనిష్ఠతోడన్= గొప్ప నిలుకడతో; బ్రహ్మచర్య వ్రతము= బ్రహ్మమునందు ప్రవర్తించటం అనే వ్రతాన్ని; ఆచరింతున్= చేస్తూ ఉన్నాను; ఒక్కనాఁడు= ఒకరోజున; పుణ్యానది తీరమునన్= పుణ్యమైన నది ఒడ్డున; భిక్షిత+అన్నమున్= బిచ్చమెత్తిన అన్నాన్ని; భుజింపంగన్= తినటానికి; తలఁచి= సంకల్పించి; చనఁగన్= వెళ్ళగా; పాపము= పాపం; అడరి= పండి.

తాత్పర్యం: (మునులు కొనియాడే విధంగా) బ్రహ్మచర్యవ్రతం ఆచరిస్తున్నాను. ఒకరోజున పుణ్యమైన నది ఒడ్డున బిచ్చమెత్తిన అన్నం తినటానికి సంకల్పించి వెళ్ళాను. ఇంతలో నా పాపం పండింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: వెనుకటి పద్యంలోని 'మునులునుతింపన్' అనేది ఈ పద్యంలోని 'బ్రహ్మచర్యవ్రతం' - బ్రహ్మమంటే వేదం. దాని అధ్యయనంలో ప్రవర్తించటం. అందులో అనేక నియమాలు ఉన్నాయి. భిక్షమెత్తిన అన్నం భుజించటం అందులో ఒక నియమం.

క. ధరణీదేవక్షేత్రము । పరాగపటలంబు బహుళ పవనంబుగతిం

బరఁగి నరనాథ! నాదగు । కరంబు నన్నమునఁ బట్టె గడుసాంద్రముగన్. 49

ప్రతిపదార్థం: నరనాథ!=రాజా!; ధరణీ దేవ క్షేత్రము, పరాగ, పటలంబు= బ్రాహ్మణుడి పొలంలోని ధూళి సముదాయం; బహుళ పవనంబుగతిన్= ఎక్కువ అయిన గాలివాటంచేత; పరఁగి= వ్యాపించి; నాది+అగు= నాదైన; కరంబు+అన్నమునన్= చేతిలోని అన్నంమీద; కడుసాంద్రముగన్= చాలా దట్టంగా; పట్టెన్= పట్టింది.

తాత్పర్యం: రాజా! నా పాపం పండి బ్రాహ్మణుడి భూమిలోని ధూళి గాలివాటానికి ఎగిరివచ్చి, నాచేతిలో ఉన్న అన్నంమీద మిక్కిలి దట్టంగా పట్టింది.

విశేషం: కరంబు నన్నమున - చేతినే పాత్రగా ఉపయోగించటం కూడా ఒక విధమైన బ్రహ్మచర్య వ్రత నియమం. ఈ సందర్భంలో కరపాత్ర స్వాములవారిని స్మరించవచ్చును.

క. ఆ ధూళితోడఁ గుడిచిన । నీ దుర్జన్మంబు వచ్చె: నిది యెఱిఁగెడు సం

వేదనము పూర్వపుణ్య ఫ । లోదయమునఁ గలిగె; నిన్న యొక కలగంటిన్. 50

ప్రతిపదార్థం: ఆ ధూళితోడన్= ఆ దుమ్ముతోపాటు; కుడిచినన్= తినగా; ఈ దుర్జన్మంబు= ఈ పాడు పుట్టుక; వచ్చెన్= వచ్చినది; ఇది=దీనిని; ఎఱిఁగెడు సంవేదనము= తెలిసికొనే జ్ఞానము; పూర్వ పుణ్య ఫల+ఉదయమునన్= తొలి పుట్టువులోని పుణ్యఫలం పుట్టుకవలన; కలిగెన్= ఏర్పడింది; నిన్న= నిన్నటిరోజున; ఒక కలన్= ఒక స్వప్నమును; కంటిన్= కన్నాను.

తాత్పర్యం: ఆ ధూళితోపాటు అన్నం తినగా ఈ పాడు పుట్టుక నాకు కలిగింది. ఇది తెలిసికొనే జ్ఞానం మునుపటి జన్మలోని పుణ్యం పండిన కారణంగా కలిగింది. నిన్న నాకొక కల వచ్చింది.

విశేషం: సాధారణంగా పూర్వజన్మ జ్ఞానం ఉండటం అరుదు. అందునా పాపఫలానుభవంలో ఉన్న వాడికి కలగటం మరీ వింత. అందుకే మునులు మెచ్చే విధంగా బ్రహ్మచర్యవ్రతం నడపిన విషయాన్ని ముందు ప్రస్తావించారు. ఆ అంశాన్ని ఇక్కడ అనుసంధించుకోవాలని సూచించారు.

వ. దానిం జెప్పెద నవధరింపుము. 51

ప్రతిపదార్థం: దానిన్= ఆ కలను; చెప్పెదను= చెబుతాను; అవధరింపుము= దయతో వినుము.

తాత్పర్యం: ఆ కలను గురించి వివరిస్తాను. దయతో వినుము.

క. ఒక విప్రవరుఁడు ననుఁగని । 'యకటకటా! యనుచు నిలిచి యడలకు మీ దుః

ఖకలాప మెల్లి వాయును । సకలంబును క్షత్రబంధుసంవాదమునన్.' 52

ప్రతిపదార్థం: ఒక విప్రవరుఁడు= ఒక బ్రాహ్మణశ్రేష్ఠుడు; ననున్= నన్ను; కని= చూచి; అకటా+అకటా!= అయ్యయ్యో!; అనుచున్= అంటూ; నిలిచి; అడలకుము= కుమిలిపోకుము; ఈ దుఃఖకలాపము= ఈ ఏడ్పుల సముదాయం; సకలంబును= అంతా; ఎల్లి= రేపు; క్షత్రబంధు సంవాదమునన్= క్షత్రబంధుడితో చేసే ప్రసంగం చేత; పాయును= తొలగి పోతుంది.

తాత్పర్యం: ఒక బ్రాహ్మణశ్రేష్ఠుడు నన్ను చూచి 'అయ్యయ్యో! దుఃఖపడకుము. ఈ దుఃఖమంతా రేపు క్షత్రబంధు సంవాదంతో నశించిపోతుంది.'

క. అనియె ననిచెప్పి వీడ్కొని । చని మృతుఁడై తొంటి బహుళసత్కర్మంబుల్
దను నుత్తమ పదమునకుం । గొనిపోయిన నిత్యసౌఖ్యకుండై యుండెన్. 53

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అని; చెప్పి; వీడ్కొని= సెలవు తీసికొని; చని= వెళ్ళి; మృతుఁడు+ఐ= చనిపోయినవాడై; తొంటి బహుళ సత్+కర్మంబుల్= పూర్వజన్మలోని పెక్కు పుణ్యకార్యాలు; తనున్= తనను; ఉత్తమపదమునకున్= ఉత్తమస్థానానికి; కొనిపోయినన్= తీసికొనిపోగా; నిత్య, సౌఖ్యకుండు+ఐ= శాశ్వతమైన సౌఖ్యం కలవాడై; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: అని చెప్పాడు' అని పలికి అతడి దగ్గర సెలవు తీసికొని వెళ్ళి మరణించి, పూర్వపు పుణ్యకర్మలు తనను ఉత్తమపదానికి కొనిపోగా శాశ్వతసుఖం కలవాడై ఉన్నాడు.

విశేషం: నిత్యసౌఖ్యం - పునరావృత్తిలేని మోక్షసుఖం.

వ. అనిన విని యజాతశత్రుండు గంగాపుత్త్రుతో 'నాకలోకం బేకప్రకార మనోహారియై యుండునో? బహుప్రకార ప్రమోదియై వెలుంగునో? యెఱింగింపవే!' యనుటయు నతండు 'పుణ్యకర్మంబు లనేకవిధంబులు గావే? కావునం దత్త దనురూపానేకస్థానంబై నాకంబు నిశ్శోకంబును నస్తోకసుఖకరంబును నై కరం బొప్పుచుండు గౌతమ శతక్రతుసంవాదం బను నితిహాసంబు విను మది భవదీయ ప్రశ్నంబునకుఁ బ్రాదేశవిశదీకరణం బగు నుత్తరంబై యుండెడు; గౌతముండను మహాద్విజుండు వనంబునం దపంబు సేయుచుండి శుండాల శిశువుం దల్లిలేనిదాని నొక్కెడం గని కారుణ్యంబు వొడమి పుత్త్రునింబోలెఁ బెనిచె; నయ్యేనిక కొదమ కాలక్రమంబున మేటి యేనుంగయి వెలంగుచుండె; నక్కాలంబున భూపాలనంబు సేయు ధృతరాష్ట్రుండను రాజు నాకారంబు దాల్చి నాకపతి యయ్యెడకు వచ్చి యవ్వారణపతిం బట్టి తనకుం గొనిపోవువాఁడై దీని నాకిమ్మని యమ్మునిపతి నడుగుటయు నతండు. 54

ప్రతిపదార్థం: అనినన్= అంటే; విని; అజాతశత్రుండు= ధర్మరాజు; గంగాపుత్రుతోన్= భీష్ముడితో; నాకలోకంబు= స్వర్గలోకం; ఏక ప్రకార మనస్+హారి= ఒకే విధంగా మనస్సును ఆకర్షించేది; ఐ= అయి; ఉండునో?= ఉంటుందా?; బహుప్రకార; ప్రమోది పెక్కు తీరుల ఆనందం కలిగించేది; ఐ= అయి; వెలుంగునో?= ప్రకాశిస్తుందో?; ఎఱింగింపవే!= తెలుపుమా!; అనుటయున్= అంటే; అతండు= ఆ భీష్ముడు; పుణ్యకర్మంబులు= పుణ్యఫలాన్నిచ్చే పనులు; అనేకవిధంబులు= పెక్కుతీరులైనవి; కావే?= కావా?; కావునన్= కాబట్టి; తత్, తత్, అనురూప+అనేక స్థానంబు= వాని వానికి తగిన పెక్కు తావులు కలది; ఐ= అయి; నాకంబు= స్వర్గం; నిస్+శోకంబును= శోకంలేనిదీ; అస్తోకసుఖ కరంబును= మిక్కిలి అధికమైన సుఖాన్ని కలిగించేదీ; ఐ= అయి; కరంబు= మిక్కిలిగా; ఒప్పుచున్+ఉండున్= ఒప్పుతూ ఉంటుంది; గౌతమ శతక్రతు, సంవాదంబు= గౌతముడికి,

దేవేంద్రుడికి అయిన సంభాషణం; అను+ఇతిహాసంబు= అనే పురాతన కథ; వినుము; అది; భవదీయ ప్రశ్నంబునకున్= నీదైన ప్రశ్నకు; ప్రాదేశ విశదీకరణంబు= కొంతభాగం స్పష్టం చేసేది; అగు+ఉత్తరంబు= అయిన సమాధానం; ఐ= అయి; ఉండెడున్= ఉంటుంది; గౌతముండు+అను, మహా ద్విజుండు= గౌతముడనే గొప్ప బ్రహ్మవేత్త; వనంబునన్= అడవిలో; తపంబు= తపస్సు; చేయుచున్+ ఉండి= చేస్తూ ఉండి; శుండాల శిశువున్= ఏనుగుపిల్లను; తల్లి లేనిదానిని; ఒక్క+ఎడన్= ఒకచోట; కని= చూచి; కారుణ్యంబు= జాలి; ఒడమి= పుట్టి; పుత్త్రునిన్+పోలెన్= కొడుకొనువలె; పెనిచెన్= పెంచాడు; ఆ+ఏనిక కొదమ= ఆ గున్న ఏనుగు; కాలక్రమంబునన్= కాలం గడుస్తూ ఉండగా; మేటి ఏనుంగు= పెద్ద ఏనుగు; అయి; మెలంగుచున్+ఉండెన్= తిరుగుతూ ఉంది; ఆ+కాలంబునన్= ఆ కాలంలో; భూపాలనంబు= భూమినేలటం; చేయు ధృత రాష్ట్రుండు= చేసే ధృతరాష్ట్రుడు; అనురాజు+ఆకారంబు= అనే రాజు ఆకారం; తాల్చి= ధరించి; నాకపతి= స్వర్గపు ఏలిక-ఇంద్రుడు; ఆ+ఎడకున్= ఆ చోటికి; వచ్చి= ఏతెంచి; ఆ+వారణపతిన్= ఆ ఏనుగురాజును; పట్టి= పట్టుకొని; తనకున్= తనకోసం; కొనిపోవువాఁడు= తీసికొని పోయేవాడు; ఐ= అయి; దీనిన్= దీనిని; నాకున్= నాకు; ఇమ్ము= ఇవ్వు; అని; ఆ+మునిపతిన్= ఆ మునిశ్రేష్ఠుడిని; అడుగుటయును= అడుగగా; అతండు= ఆ గౌతముడు.

తాత్పర్యం: అని చెప్పగా విని ధర్మరాజు భీష్ముడితో 'స్వర్గము ఒకే విధమైన ఆనందం కలదియా? పెక్కుతీరుల ఆనందం కలిగించేదై ప్రకాశిస్తుందా?' అని అంటే భీష్ముడు 'పుణ్యకర్మలు పెక్కుతీరులైనవి కదా! కనుక ఆయా కర్మలకు తగిన పెక్కుతావులు కలదై స్వర్గం దుఃఖం లేనిదీ, అమితమైన సుఖాన్ని కలిగించేదీ అయి ఎంతో ఒప్పుతూ ఉంటుంది. గౌతమదేవేంద్ర సంవాదం అనే ఒక ఇతిహాసం చెప్తుతాను వినుము. అది నీ ప్రశ్నకు కొంతవరకు విశదపరిచే సమాధానం అవుతుంది. గౌతముడనే ఉత్తమబ్రాహ్మణుడు అరణ్యంలో తపస్సు చేస్తూ ఉన్నాడు. ఆయనకు ఒకనాడు తల్లిలేని ఏనుగు పిల్ల ఒకటి కానవచ్చింది. దానిమీద జాలిపుట్టి దానిని తన కొడుకువలె పెంచాడు. ఆ ఏనుగుగున్న కాలక్రమాన శ్రేష్ఠమైన ఏనుగై తిరుగుతూ ఉంది. ఆ కాలంలో భూమి నేలుతున్న ధృతరాష్ట్ర డనే రాజు రూపం ధరించి దేవేంద్రుడు ఆ చోటికి వచ్చి ఏనుగును పట్టి తనకొరకు తీసికొని పోయే తలపుతో 'దీనిని నా కి 'మ్మని మునివరుడిని అడిగాడు. అప్పుడతడు.

విశేషం: ప్రాదేశము - చూపుడు వ్రేలిని, బొటన వ్రేలిని చాచి పట్టిన కొలత. జాన వంటిది. ఇక్కడ కొంతభాగానికి సంబంధించిన అని అర్థం. స్వర్గం - శోకం లేనిది - అంతమాత్రమే కాదు. గొప్ప సుఖాన్ని కూర్చేది.

తే. **'ఇధ్మములు దెచ్చి యిచ్చు నే నిచట లేని । సమయమునఁ గాఁచు నీ పర్ణశాల మర్త్య**
బుద్ధియుత మిది యీ దంతిఁ బుత్త్రుఁబోలెఁ । బెనిచినాఁడ నీకీఁజాల మనుజనాథ! 55

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; ఇది= ఈ ఏనుగు; ఇధ్మములు= అగ్నిహోత్రపు పుడకలను; తెచ్చి ఇచ్చున్= తెచ్చి ఇస్తుంది; నేను; ఇచటన్= ఇక్కడ; లేని సమయమునన్= లేని వేళలో; ఈ పర్ణశాలన్= ఈ గుడిసెను; కాఁచున్= రక్షిస్తుంది; మర్త్య, బుద్ధి, యుతము= మనిషిబుద్ధి వంటి బుద్ధితో కూడినది; ఈ దంతిన్= ఈ ఏనుగును; పుత్త్రున్ పోలెన్= కన్న కొడుకును వలె; పెనిచినాఁడన్= పెంచినవాడను; నీకున్= నీకు; ఈన్+చాలన్= ఇవ్వలేను.

తాత్పర్యం: రాజా! ఈ ఏనుగు నాకు అగ్నిహోత్రం చిదుగులను తెచ్చి ఇస్తుంది. నేనిక్కడ లేని వేళలలో ఈ పర్ణశాలను కాపాడుతూ ఉంటుంది. దీని బుద్ధి మనుష్యుల బుద్ధి వంటిది. దీనిని నా కన్నకొడుకువలె పెంచాను. నీ కివ్వలేను.

విశేషం: మనుజనాథ! అనే సంబోధనలో రెండు భావాలు స్ఫురిస్తాయి. నీవు మహారాజువై యుండి నా సొమ్ముకు ఆశపడరాదు అని ఒక భావం. 'రత్నహారీ తు పార్థివః' - అని ఉన్నా దయచేసి నన్ను నిర్బంధించకుము. దానిపై నా మమకారం అటువంటిది - అని రెండవ భావం.

ఇంద్రునకు గౌతమునితో నైన సంవాదము (సం.13-159-11 (కుంభ))

వ. అనుటయు నా కృత్రిమజనవిభుండు. 56

ప్రతిపదార్థం: అనుటయున్= అన్నంతనే; ఆ కృత్రిమ జనవిభుండు= మారురూపం గల ఆ రాజు.

తాత్పర్యం: అన్నంతనే మారురూపం గల ఆ రాజు.

చ. 'మునులకు నేనుఁ గేటికి? నమూల్యపుగోవులఁ బుచ్చికొమ్ము వే
యనఘ! పసిండి నీ వలసినంతయు నిచ్చెద' నన్న 'శైశవం
బున నిది తల్లి లేకునికిఁ బుట్టిన యక్కటికంబు పెంపునం
బెనుచుటఁ జేసి దీనిపయిఁ బ్రేమము నామదిఁగల్గు భూవరా! 57

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముఁడా!; మునులకున్= వైరాగ్యంతో ఉండవలసిన మునులకు; ఏనుఁగు=ఏనుగు; ఏటికిన్?= ఎందుకు?; అమూల్యము+గోవులన్= వెలకట్టరాని; ఆవులను; వేయి= వేయింటిని; పుచ్చికొమ్ము= తీసికొమ్ము; పసిండిన్= బంగారమును; నీవలసిన+అంతయున్= నీవు ఇష్టపడినంత; ఇచ్చెదన్= ఇస్తాను; అన్నన్= అంటే; భూవరా!= రాజా!; శైశవంబునన్= పసితనంలో; ఇది= ఈ ఏనుగు; తల్లి లేక+ఉనికిన్= తల్లిలేకుండటం వలన; పుట్టిన+అక్కటికంబు పెంపునన్= పుట్టిన జాలియొక్క ఎక్కువతనంతో; పెనుచుటన్+ చేసి= పెంచటంవలన; దీనిపయిన్= దీనిమీద; ప్రేమము= వాత్సల్యము; నామదిన్= నా హృదయంలో; కల్గున్= ఉన్నది.

తాత్పర్యం: 'పుణ్యవంతుడా! మునులకు ఏనుగెందుకు? వెలకట్టలేని ఆవులను వేయినిస్తాను. నీవు కావలసినంత బంగారం ఇస్తాను. తీసికొమ్ము' అనగా 'రాజా! పసితనంలో ఇది తల్లిలేకుండటంవలన కలిగిన జాలితో దీనిని పెంచిన కారణంగా దీనిమీద వాత్సల్యం నా హృదయంలో కలిగింది.

విశేషం: మునులకు ఏనుఁగేటికి - అంటే ఏనుగులు రాజైన నావంటివానికి ఉండాలి అని భావం. ముని అంటే మోక్షపరాయణుడు. ఏనుగు దానికి విఘ్నకారి కావచ్చును. అయితే గోవులు, బంగారం కావా? అంటే అవి ఆశ్రమ నిర్వహణకు ఏనుగుకంటె మిన్నగా ఉపకరిస్తాయనే భావంతో పలుకుతున్నాడు.

క. కావున నొల్లను బదివే । ల్గోవుల నిచ్చినను నిష్కకోటి యొసఁగినం
బోవయ్య యేను మొఱయిడఁ । గా వావిరిఁ గొనఁగఁ దగునె కరిపతి నీకున్?' 58

ప్రతిపదార్థం: కావునన్= కనుక; పదివేల్= పదివేల; గోవులన్= ఆవులను; ఇచ్చినను= ఇచ్చినా; నిష్కకోటి= కోటిబంగారు నాణాలు; ఒసఁగినన్= ఇచ్చినా; ఒల్లను= ఇష్టపడను; పోవయ్యా; ఏను= నేను; మొఱ ఇడగాన్= మొత్తుకుంటూ ఉంటే; వావిరిన్= ఒత్తిడి చేసి; నీకున్= నీకు; కరిపతిన్= ఏనుగును; కొనఁగన్+తగునె?= గ్రహింపదగునా? తగదని భావం.

తాత్పర్యం: పదివేల ఆవులనిచ్చినా, కోటి బంగారు నాణాల నిచ్చినా నేనిష్టపడను. వెళ్ళుము. నేను మొత్తుకొంటుంటే నీవు ఒత్తిడి చేసి ఏనుగును తీసికొని పోవటం తగునా?'

క. అని మునిపతి పలికిన న । జ్జనపతి 'వాహనము గాఁగ సామజముం గై
కొనఁదగదె రాజునకు ని । ట్లనఁదగునే నీకు? విడువు హస్తిఁ బ్రియమునన్.' 59

ప్రతిపదార్థం: అని; మునిపతి= మునివర్యుడు; పలికినన్= పలికితే; ఆ+జనపతి= ఆ రాజు; వాహనము= ఎక్కిరింత; కాఁగన్= కావటానికి; సామజమున్= ఏనుగును; కైకొనన్= గ్రహించటం; రాజునకున్= రాజునకు; తగదె?= కూడదా?; రాజునకున్= రాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనన్= పలకటం; నీకున్= నీకు; తగునే?= యుక్తమా?; హస్తిన్= ఏనుగును; ప్రియమునన్= ఇష్టపూర్వకంగా; విడుము= వదలుము.

తాత్పర్యం: అని ముని అంటే రాజు 'వాహనంగా ఏనుగును గ్రహించటం రాజుకు తగని పనియా? రాజుతో ఇట్లా అనటం నీకు తగునా? ఇష్టంతో ఏనుగును వదలిపెట్టుము' అన్నాడు.

విశేషం: 'రత్నహారీ తు పార్థివః' అని న్యాయం. శ్రేష్ఠమైన వస్తువులను రాజు గ్రహించవచ్చునని దీని తాత్పర్యం. ఈ న్యాయాన్ని హృదయంలో భావిస్తూ 'రాజునకు కైకొన తగదా? రాజుతో ఇట్లా పలుకవచ్చునా?' అని అంటున్నాడు. 'నా విష్ణుః పృథీవీపతిః' - విష్ణ్వంశలేనివాడు రాజు కాజాలడు' - అన్న న్యాయాన్ని ఇక్కడ కూడ అనుసంధించుకోవాలి. ప్రియమునన్ - ఇష్టంతో - ఇష్టపడి ఇవ్వకపోతే బలాత్కరించవలసి వస్తుందన్న సూచన ఇక్కడ వ్యంగ్యం. తరువాతి పద్యంలో దీనిని కవి మరింత స్పష్టం చేస్తున్నాడు.

వ. అని రాజసంబు దోఁపం బలుకుటయు నప్పరమద్విజుండు పుయిలోట దక్కి యిట్లనియె. 60

ప్రతిపదార్థం: అని; రాజసంబు= పొగరు; తోఁపన్= తెలియనట్లుగా; పలుకుటయున్= పలికితే; ఆ+పరమద్విజుండు= ఆ ఉత్తమ బ్రాహ్మణుడు; పుయిలోట= సంకోచం; తక్కి= వదలి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని పొగరు తెలిసే విధంగా పలికితే ఆ ఉత్తమ బ్రాహ్మణుడు సంకోచం వదలి ఇట్లా అన్నాడు.

విశేషం: రాజసం - రజోగుణంవలన ఏర్పడినది. సందర్భాన్ని బట్టి 'పొగరు'. దీనివలననే వెనుకటి పద్యంలో 'బెదరింపు' ను ఊహించాము.

తే. 'పుణ్యకర్ములు హర్షంబుఁ బొందఁగనుట । పాపకర్ములు శోకార్తి పాలుపడుట
యెచటఁ గల్గు నజ్జముసభ కేఁగుదెమ్ము । దంతి నచ్చట నిచ్చెద ధరణినాథ!' 61

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; ఎచటన్= ఎక్కడ; పుణ్యకర్ములు= పుణ్యమైన కర్మలు గలవారు; హర్షంబున్= సంతోషమును; పొందన్+కనుట= పొందగలుగుట; పాపకర్ములు= పాపపు పనులు చేసేవారు; శోక+ఆర్తి పాలుపడుట= దుఃఖపు పీడకు పాలుకావటమూ; కల్గున్= అవుతుందో; ఆ+జము సభకున్= అట్టి యుముడి లోకానికి; ఏఁగుదెమ్ము= రమ్ము; అచ్చటన్= ఆ తావున; దంతిన్= ఏనుగును; ఇచ్చెదన్= ఇస్తాను.

తాత్పర్యం: 'పుణ్యకర్మలు చేసేవారు ప్రమోదాన్నీ, పాపపుపనులు చేసేవారు పరమదుఃఖాన్నీ పొందే చోటు యమలోకం ఉన్నదే - అక్కడకు రమ్ము నీ కీ ఏనుగు నిస్తాను.'

విశేషం: యముడు మానవుల పాపపుణ్యాలను నిర్ణయించి శోకాన్నీ సంతోషాన్నీ తగిన ప్రమాణంలో ప్రసాదిస్తూ ఉంటాడు. అక్కడ 'నీ, నా' పుణ్యపాపాలు తేలుతాయని తాత్పర్యం.

వ. అనుటయు నతండు. **62**

తాత్పర్యం: అనగా ఆ ఇంద్రుడు.

సీ. వినుము నాస్తికు లగు జనులుఁ బాపాత్మకు । లునుగాక యేను వత్తునె మునీంద్ర!
యచటికి?' నన్న 'నయ్యముఁడు పుణ్యుఁడు తదీ । యాదరం బొప్పదే?' యనియె విప్రుఁ
డమ్మాట కవ్విభుం 'డప్పఁ బ్రోచునతండుఁ । దల్లికిఁ దండ్రి కత్యంతభక్తి
గలవాఁడు నమ్మేలు గనునందు రా నొల్ల' । నని పల్కెఁ బల్కిన నత్తపస్వి

తే. 'రమ్ము మందాకినికిఁ దత్తటమ్ము పొంత । హస్తి విడిచెద' ననుమాట యాడ నాతఁ
'డతిథిశిష్టాన్నభోజులు న ప్రతిగ్ర । హులును గం ద్రది సరకు సేయుదునె యచటు?' **63**

ప్రతిపదార్థం: ముని+ఇంద్ర!= మునివరా!; వినుము; నాస్తికులు= పరలోకము లేదనువారు; అగు జనులున్= అయిన జనులూ; పాప+ఆత్మకులును= పాపపు హృదయం కలవారూ; కాక =తక్క; ఏను= నేను; అచటికిన్= ఆ తావునకు; వత్తునె?= వస్తానా?; అన్నన్= అంటే; విప్రుఁడు= జ్ఞానవంతుడైన ఆ ముని; ఆ+యముఁడు= ఆ యమధర్మరాజు; పుణ్యుఁడు= పుణ్యం కలవాడు; తదీయ+ఆదరంబు= అతడిదైన ఆదరం; ఒప్పదే?= చెల్లదా?; అనియెన్= అన్నాడు; ఆ+మాటకున్= ఆ పల్కునకు; ఆ+విభుండు= ఆ రాజు; అతండు= ఆ యముడు; అప్పన్= అక్కను; ప్రోచున్= రక్షిస్తాడు; తల్లికిన్= అమ్మకు; తండ్రికిన్= తండ్రికీ; అత్యంతభక్తి= మిక్కిలి ఎక్కువ భక్తి; కలవాఁడు= ఉన్నవాడు; ఆ+మేలు= దానివలన అయ్యే మంచిని; కనున్= పొందుతాడు; అందున్= అచటికి; రాన్= రావటానికి; ఒల్లను= ఇష్టపడను; అని; పల్కెన్= పలికాడు; పల్కినన్=పలుకగా; ఆ+తపస్వి= ఆ తాపసుడు; మందాకినికిన్= ఆకాశగంగ దగ్గరకు; రమ్ము= రా; తత్+తటమ్ముపొంతన్= దాని ఒడ్డు దాపున; హస్తిన్= ఏనుగును; విడిచెదన్= వదలుతాను; అనుమాట= అన్న పలుకు; ఆడన్= పలుకగా; ఆతఁడు= ఆ రాజు; అది= ఆ గంగ ఒడ్డును; అతిథి శిష్ట అన్న భోజులు= అతిథులు తినగా మిగిలిన అన్నాన్ని తినేవారు; అప్రతిగ్రహులును= దానం సొమ్ము పుచ్చుకోనివారున్నూ; కంద్రు= పొందుతారు; అచటు= ఆ తావు; సరకు+చేయుదునె?= లెక్క చేస్తానా?

తాత్పర్యం: మునీంద్రా! వినుము. నాస్తికులు, పాపాత్ములు అక్కడకు పోతారుగానీ నేను వస్తానా?' అన్నాడు. అప్పుడు ఋషి 'ఆ యముడు పుణ్యాత్ముడు గదయ్యా! అతడిని ఆదరింపవద్దా? అంటే ఆ మాట విని రాజు ఆ యముడు అక్కను కాపాడుతూ ఉంటాడు. తల్లిదండ్రులంటే ఎంతో భక్తి కలవాడు. ఆ పుణ్యం పొందుతాడు. కనుక అతడి దగ్గరకు రా' నన్నాడు. అప్పుడు ఆ తాపసి 'పోనీ గంగ ఒడ్డుకు రమ్ము! అక్కడ ఏనుగును నీకు వదలుతాను' అంటే 'అతిథులు తినగా మిగిలిన భోజనం తినేవారు. దానాలు ముట్టనివారూ అక్కడకు పోతారు. నేను దానిని లెక్క చేస్తానా?' అన్నాడు.

విశేషం: యముడి విషయంలో పాపపుణ్యాలు రెండూ చెప్పారు. యముడి అక్క కాళింది. తల్లిదండ్రులు ఛాయాసూర్యులు. తల్లివంటి అక్కను, తల్లిదండ్రులను భక్తితో సేవించటం అనే మహాపుణ్యం వలన అతడికి యమత్వం సిద్ధించిందని సూచన. అతిథులు తినగా మిగిలిన అన్నాన్ని 'విఘసం' అంటారు. దానిని భుజించటం మహాపుణ్యంగా పరిగణించారు.

క. అనినను ముని 'మేరు వనం । బున నీ కొప్పింతు గజముఁ బోద' మనుడు న
జ్జననాథవరేణ్యుండా । తని మోమునఁ జూడ్కి నిగుడ దరహాసముతోన్. 64

ప్రతిపదార్థం: అనినను= అంటే; ముని= ఆ మహర్షి; మేరువనంబునన్= మేరుపర్వతపు తోటలో; నీకున్= నీకు; గజమున్= ఏనుగును; ఒప్పింతున్= అప్పగిస్తాను; పోదము= పోదాము; అనుడున్= అనగా; ఆ+జననాథ, వరేణ్యుండు= ఆ రాజశ్రేష్ఠుడు; అతని మోమునన్= అతడి మొహం మీద; చూడ్కి= చూపు; నిగుడన్= నిలుచునట్లుగా; దరహాసముతోన్= చిరునవ్వుతో.

తాత్పర్యం: అప్పుడు ఆ గౌతమముని 'మేరుపర్వతం తోటలో నీకు ఏనుగు నిస్తాను పోదాము' అంటే ఆ రాజు అతడి మోముపై చూపు నిలిపి, చిరునవ్వుతో ఇట్లా అన్నాడు.

క. 'మృదువులు సత్యోపేతులు । సదయులు భూతహితు లందుఁ జనుజనములు నా
కది యేల వేడ్కనిదె వ । చ్చెద నొండొకమంచి చోటు సెప్పు' మనవుడున్. 65

ప్రతిపదార్థం: అందున్= అచ్చటికి; చను జనములు= వెళ్ళే జనులు; మృదువులు= మెత్తని మనస్సు కలవారు; సత్య+ఉపేతులు= సత్యవ్రతంతో కూడినవారూ; సదయులు= దయతో కూడినవారు; భూతహితులు= ప్రాణులకు మేలు చేసేవారు; నాకున్= నాకు; అది= ఆ చోటు; ఏల?= ఎందుకు? ఒండొక మంచిచోటు= మరొక్క ఉత్తమస్థలాన్ని; చెప్పుము= పేర్కొనుము; వచ్చెదన్= వస్తాను; అనవుడున్= అన్నంతనే.

తాత్పర్యం: అక్కడికి వెళ్ళే జనాలు మెత్తటి హృదయం, సత్యవ్రతం, దయ, ప్రాణులయందు హితబుద్ధీ కలవారు. అది నాకెందుకు? ఇంకేదైనా మంచిచోటు చెప్పుము. వస్తాను. అనగా (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: నాకు ఇది వ్యంగ్యంగా 'అది చాలా తక్కువ పుణ్యం. నేను దానికంటె మహోన్నత పుణ్యం చేసినవాడను' అనే భావాన్ని తెలుపుతున్నది.

క. 'నారదమునినాయకుని వి । హారస్థలమైన వనమునం దిచ్చెద నీ
వారణము నచట కిన్నర । ధీరమ్యం బప్సరో మతి ప్రియ మనఘా!' 66

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్మా!; నారదముని నాయకుని= నారదుడనే మునిశ్రేష్ఠుడి యొక్క; విహారస్థలము= తిరుగాడేచోటు; ఐన వనమునందున్= అయిన ఉద్యానంలో; ఈ వారణమున్= ఈ ఏనుగును; ఇచ్చెదన్= ఇస్తాను; అచటు= ఆ తావు; కిన్నర ధీ రమ్యంబు= కిన్నరుల బుద్ధితో మనోహరమైనది; అప్సరస్ మతి ప్రియము= అప్సరసల హృదయానికి ఇష్టమైనది.

తాత్పర్యం: 'పుణ్యాత్మా! నారదుడు విలాసంగా తిరిగే పూదోటలో ఈ ఏనుగు నిస్తాను. అది కిన్నరుల బుద్ధికి రమణీయమైనది. అప్సరసల హృదయానికి ప్రియమైనది.'

సీ. అనిన గౌతము పల్కు విని 'గీతనృత్యాది । చతురులై దేవతా సన్మునీంద్ర
హర్షంబు గావించునట్టి వారచ్చటి । కరుగుదు రేనొల్ల నచ్చ' టనియె

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నరపతి; 'యుత్తరకురుభూము లనిమిష । కమనీయములు సర్వకామ్యవర్షి
యగునందు వాసవుఁ డట వచ్చి కరినొప్పఁ । గొను' మని పలికె నమ్మునివరుండు

తే. 'కామహింసా రహితులకుఁ గాక నాకుఁ దరమె తత్ప్ర దేశం?' బని దర్పఫణితి
నాడెఁ బతి; దాని కాభూసురాగ్రగణ్యుఁ । 'డిందుగృహమున నిత్తు రమ్మిభము' ననుడు. 67

ప్రతిపదార్థం: అనిన గౌతము పల్కున్= ఇట్లా అనిన గౌతముడి మాటను; విని= ఆలకించి; నరపతి= రాజు, గీత నృత్య+ఆది చతురులు= పాట, ఆట మొదలైనవాటిలో నేర్పు కలవారు; ఐ= అయి; దేవతా సత్+ముని+ఇంద్ర హర్షంబున్= దేవతలకు, మంచి మునులకు ఆనందాన్ని; కావించు+అట్టివారు= కలిగించేవారు; అచ్చటికిన్= ఆ ప్రదేశానికి; అరుగుదురు= వెళ్తారు; ఏను= నేను; అచ్చటు= ఆ చోటు; ఒల్లను= ఇష్టపడను; అనియెన్= అన్నాడు; ఆ+మునివరుండు= ఆ మునిశ్రేష్ఠుడు; ఉత్తర కురుభూములు= ఉత్తరదిక్కుగా ఉన్న కురుదేశాలు; అనిమిష, కమనీయములు= దేవతలు కూడ కోరునట్టివి; అందున్= ఆ చోట; వాసవుఁడు= ఇంద్రుడు; సర్వ కామ్య వర్షి= అన్ని కోరికలను వర్షించేవాడు; అగున్= అవుతాడు; అటన్= అక్కడకు; వచ్చి= ఏతెంచి; కరిన్= ఏనుగును; ఒప్పన్= ఒప్పునట్లుగా; కొనుము= స్వీకరించుము; అని; పలికెన్= చెప్పాడు; పతి= రాజు; తత్+ప్రదేశంబు= ఆ తావు; కామ హింసా రహితులకున్= కామము, హింస లేనివారికి; కాక= తక్క; నాకున్= నాకు; తరమె?= యోగ్యమా?; అని; దర్పఫణితిన్= గర్వపు ధోరణిలో; ఆడెన్= పలికాడు; దానికిన్= దానికి; ఆ భూసుర+అగ్రగణ్యుఁడు= ఆ బ్రాహ్మణవరేణ్యుడు; ఇందుగృహమునన్= చంద్రుడి ఇంటిలో; ఇభమున్= ఏనుగును; ఇత్తున్= ఇస్తాను; రమ్ము= రా; అనుడున్= అనగా.

తాత్పర్యం: అనిన గౌతముడి పలుకు విని రాజు 'ఆటపాటలలో నేర్పుకలిగి దేవతలకు, గొప్ప మునులకు ఆనందం కలిగించే వారు అచ్చటికి వెళ్తారు. ఆ చోటు నేనిష్టపడను' అన్నాడు. అప్పుడు ముని 'ఉత్తరకురుభూములు దేవతలకు కూడా ఇష్టమైనవి. దేవేంద్రుడు అక్కడ అందరి కోరికలను తనివితీరా తీరుస్తాడు. అచటికి వచ్చి ఏనుగును తీసికొమ్ము' అన్నాడు. రాజు 'అది కామము, హింస లేనివారికే కానీ నాకు కాదు' అని గర్వపు ధోరణిలో పలికాడు. అప్పుడు గౌతముడు 'పోనీ, చంద్రుడి ఇంటిదగ్గర ఏనుగునిస్తాను రమ్ము' అన్నాడు.

విశేషం: దర్పఫణితి అనేమాటచేత ముని పేర్కొంటున్న పుణ్యలోకాలన్నీ తన పుణ్యానికి లొచ్చు అన్నభావం స్ఫురిస్తుంది.

క. 'దానరతులు సక్షము లా । దానవిముఖు లందుఁ బోవు తరము జనులు నా
కానెలవు నెలవు కా' దని । మానవపతి పలుక ముని సమధురవచనుఁడై. 68

ప్రతిపదార్థం: దానరతులు= దానంపై మిక్కిలి ప్రీతి కలవారు; సక్షములు= సహనం కలవారు; ఆదానవిముఖులు= దానం పుచ్చుకొనటం ఇష్టంలేనివారు; అందున్= అచటికి; పోవు తరము జనులు= పోయే అర్హతగల జనాలు; నాకున్= నాకు; ఆ నెలవు= ఆ చోటు; నెలవుకాదు= నివాసయోగ్యం కాదు; అని; మానవపతి= రాజు, పలుకన్= పలుకగా; ముని= మహర్షి; సమధుర వచనుఁడు= తీయని మాటలు కలవాడు; ఐ= అయి.

తాత్పర్యం: 'దానం మీద ప్రీతి, గొప్ప ఓర్పుకలవారు, దానం పుచ్చుకొనటంమీద అనిష్టం కలవారు అనగా అపరిగ్రహులు అందు పోయే అర్హత కలవారు. నా కా చోటితో పనిలేదు' అని పలుకగా; ముని తీయని మాటలతో.

వ. అన్నరునాథుతోడ. 69

తాత్పర్యం: ఆ ముని ఆ రాజుతో ఇట్లా అన్నాడు.

సీ. 'రవిపాల నిచ్చెద రమ్ము కుంజరముఁ జే। కొనుటకు' ననిన నజ్జనవిభుండు
'నుతతపస్స్వాధ్యాయరతులకు గంతవ్య। మచ్చోటు నాకేల?' యనుడు 'వరుణు
పురిఁ గుంభిఁ గైకొను పొద' మన్న మునిఁ జూచి। 'యగ్నిహోత్రము నిష్టియజనములును
గలవా రరుగుదురు గాక యన్నెలవొల్ల'। ననియాడె; భూపతి యతని కాతఁ

తే. 'డింద్రుకడ మర్త్య కోటికి నిష్ట మచట। గౌరు నీకిత్తు నని' చెప్పె 'శూరయాజి
వేదిశతవర్షపురుషులు వోదురందు। దాని నేఁగోర' నని పల్కెఁ ధరణివిభుఁడు. 70

ప్రతిపదార్థం: రవిపాలన్= సూర్యుడివద్ద; ఇచ్చెదన్= ఇస్తాను; కుంజరమున్= ఏనుగును; చేకొనుటకున్= తీసికొనటానికి; రమ్ము; అనినన్= అనగా; ఆ+జనవిభుండు= ఆ రాజు; ఆ+చోటు= ఆ స్థలము; నుత తపస్+స్వాధ్యాయ రతులకున్= మెచ్చదగిన తపస్సు, వేదములను పఠించుట అను వాటియందు ప్రీతి కలవారికి; గంతవ్యము= పోదగినది; నాకున్= నాకు; ఏల?= ఎందుకు?; అనుడున్= అన్నంతనే; వరుణుపురిన్= వరుణుడి పట్టణంలో; కుంభిన్= ఏనుగును; గైకొను= గ్రహించుము; పొదము= పద; అన్నన్= అంటే; మునిన్= మునిని; చూచి; అగ్నిహోత్రమును= అగ్నిచేత ఆరాధనము; ఇష్టియజనములును= యజ్ఞయాగాదులు; కలవారు= ఉన్నవారు; అరుగుదురు కాక= వెళ్తారుగానీ; ఆ+నెలవు= ఆచోటు; ఒల్లను= ఇష్టపడను; అని; భూపతి=రాజు; ఆడెన్= పలికాడు; అతనికిన్= ఆ రాజునకు; ఆతఁడు= ఆ ముని; ఇంద్రుకడన్= దేవేంద్రుడియొద్ద; మర్త్యకోటికిన్= మానవుల సముదాయానికి; ఇష్టము= ప్రీతి; అచటన్= అక్కడ; గౌరున్= ఏనుగును; నీకున్= నీకు; ఇత్తున్= ఇస్తాను; అని; చెప్పెన్= చెప్పాడు; ధరణి విభుఁడు= రాజు; అందున్= అచటికి; శూర, యాజి, వేది, శతవర్షపురుషులు= శూరులు; యజ్ఞాలు చేసేవారు, వేదములను అధ్యయనం చేసినవారు, నూరేండ్లు జీవించిన జనులు; పోదురు= వెళ్తారు; దానిన్= దానికి; నేన్= నేను; కోరను= ఇష్టపడను; అని; పల్కెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ మునిరాజుతో రావయ్యా! సూర్యుడి దగ్గర నీకు ఏనుగునిస్తాను. తీసికొమ్ము' అంటే రాజు 'మెచ్చదగిన తపస్సు, వేదాధ్యయనము ప్రీతిగా చేసేవారికి అది వెళ్ళదగినచోటు. అది నాకెందుకు?' అన్నాడు. 'పోనీ వరుణుడి నగరంలో ఏనుగును తీసికొమ్ము' అంటే 'అగ్నిహోత్రము, యజ్ఞాలు కలవారు అక్కడకు పోతారు. ఆ చోటు నా కిష్టం లే'దన్నాడు. 'అయితే ఇంద్రుడి నెలవు మనుష్యుల కందరికీ ఇష్టం. అచట ఏనుగునిస్తాను' అని ముని అంటే శూరులు, యాజులు, వేదాధ్యయనపరులు, నూరేండ్లు జీవించినవారు అక్కడకు పోతారు. అది నేను కాంక్షించను' అన్నాడు రాజు.

విశేషం: వేది - వేదము కలవాడు.

వ. అని పలికిన నప్పరమతపోధనుండు. 71

ప్రతిపదార్థం: అని; పలికినన్= పలుకగా; ఆ+పరమతపస్+ధనుండు= మహాతపస్సే ధనంగా గల ఆ గౌతముడు.

తాత్పర్యం: అని పలుకగా ఆ మహర్షి.

క. 'రదిఁగొను మచ్చోటను వే । పొద ప్రాజాపత్యలోకమున' కనవుడు 'నా
కది యేల? యశ్వమేధుల । పద' మనియెం బతి తపస్విపతి యాతనితోన్. 72

ప్రతిపదార్థం: రదిన్= ఏనుగును; ఆ+చోటను= ఆ ప్రదేశంలో; కొనుము= గ్రహించుము; ప్రాజాపత్యలోకమునకున్= ప్రజాపతి (బ్రహ్మ) దైవలోకానికి; వే= శీఘ్రముగా; పొద= పద; అనవుడున్= అంటే; అన్నంతనే; పతి= రాజు; అది= ఆ లోకము; అశ్వమేధుల పదము= అశ్వమేధాలు చేసేవారి స్థానం; నాకున్= నాకు; ఏల?= ఎందుకు?; అనియెన్= అన్నాడు; తపస్విపతి= మునివరుడు; అతనితోన్= అతడితో.

తాత్పర్యం: 'పోనీ బ్రహ్మలోకానికి శీఘ్రమే పద, ఏనుగును తీసికొమ్ము' అన్నాడు. 'అది అశ్వమేధాలు చేసేవారికి నెలవయ్యా! నాకెందుకు?' అన్నాడు రాజు.

చ. 'అపగత మోహశోక మగునట్టిది గోగణలోక మిత్తు మ
ద్ద్విపవరు నందు నీ' 'కనినఁ 'దీర్థనిషేవులు గోప్రదానపు
ణ్యపరులు బ్రహ్మచర్యనియమాఢ్యులు నచ్చటి కేఁగువారు దా
ని పయిఁ బ్రియంబు నాదు మది నెక్కొన దక్కడ కేల వచ్చెదన్? 73

ప్రతిపదార్థం: అపగతమోహ శోకము= పోయిన అజ్ఞానము దుఃఖము కలది; అగు+అట్టి+అది= అయినట్టి; గోగణ లోకము= గోవుల సముదాయం ఉండే లోకం; అందున్= అక్కడ; మత్ ద్విపవరున్= నా ఏనుగును; నీకున్= నీకు; ఇత్తున్= ఇస్తాను; అనినన్= అంటే; అచ్చటికిన్= అక్కడకు; ఏఁగువారు= వెళ్ళేవారు; తీర్థ, నిషేవులు= పుణ్యస్థలాలను శ్రద్ధతో సేవించేవారు; గో ప్రదాన పుణ్యపరులు= ఆవులను గొప్పగా దానం ఇచ్చే పుణ్యంమీద ఆసక్తి కలవారు; బ్రహ్మచర్యనియమ+ఆఢ్యులు= బ్రహ్మచర్యం నియమాలు పాటించి ఘనత కెక్కినవారు; దానిపయిన్= దానిమీద; నాదు మది= నా మనస్సు; నెక్కొనదు= తగులదు; అక్కడకున్= ఆచోటికి; ఏల= ఎందుకు; వచ్చెదన్?= వస్తాను?

తాత్పర్యం: ఆ ముని, రాజుతో 'అయ్యా! శోకంగాని మోహంగానీ ఇసుమంత కూడా లేని గోలోకంలో నీకు నా యేనుగు నిస్తాను రమ్ము' అన్నాడు. రాజు 'తీర్థాలు సేవించేవారు, గోదానపుణ్యం మీద గొప్ప ఆసక్తి కలవారు, బ్రహ్మచర్యవ్రతం నియమంతో నుతికెక్కినవారూ అక్కడకు పోయేవారు. దానిమీద నా మనస్సు ప్రీతి పడదు. అక్కడి కెందుకు వస్తాను?' అన్నాడు.

సీ. అని ధృతరాష్ట్రుఁ డాడిన ముని 'శీతోష్ణ । సుఖదుఃఖ మిత్రారి ముఖములైన
బహువిధద్వంద్వముల్ పరఁగవు బ్రహ్మలో । కమున నయ్యెడ సామజము హరింతు
గాని 'ర మ్మనుడు నమ్మానవపతి 'యసం । గులుఁ గృతాత్ములు వ్రతాచలితమతులు
నధ్యాత్మనిరతులు నందుఁ బోదురుగాక । యచ్చటు గాన శక్యంబె నాకు

తే. నవని సురవర్య!' యన రాజు నతఁడు సూచి । ముని మహత్తరుఁడే' నిన్ను ననిమిషేంద్రుఁ
గా నెఱింగితి నెల్లలోకములఁ దిరుగు । దెచటనైనఁ బొందదు గదా యెగ్గు నిన్నుఁ. 74

ప్రతిపదార్థం: అని= ఇట్లు; ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; ఆడినన్= పలుకగా; ముని= మహర్షి; బ్రహ్మలోకమునన్= బ్రహ్మదేవుడి లోకంలో; శీత+ఉష్ణ సుఖదుఃఖ మిత్ర+అరిముఖములు= చలి, వేడి, సుఖం- దుఃఖం, చెలి-పగవాడు మొదలైనవి; ఐన, బహువిధ ద్వంద్వముల్= అయిన పెక్కు తీరుల జంటలు; పరఁగవు= కలుగవు; ఆ+ఎడన్= ఆ తావున; సామజమున్= ఏనుగును; హరింతు కాని= తీసికొందువుగాని; రమ్ము; అనుడున్= అంటే; ఆ+మానవపతి= ఆ రాజు; అసంగులు= సంగము లేనివారు; కృత+ఆత్ములు= ఆత్మను సాధించినవారు; వ్రత+అచలిత మతులు= వ్రతములయందు ఏ కొంచెం కదలని బుద్ధి కలవారు; అధ్యాత్మ నిరతులు= పరమార్థ విద్యయందు నిష్ఠకలవారు; అందున్= అచటికి; పోదురుకాక= పోతారు; అచ్చటు= ఆ తావు; కానన్=చూడటానికి; నాకున్= నాకు; శక్యంబు+ఎ?= సాధ్యమా?; అవనిసురవర్య!= బ్రాహ్మణోత్తమా!; అనన్= అనగా; రాజున్= రాజును; మునిమహత్తరుఁడు= మునులలో మిక్కిలి గొప్పవాడయిన; అతఁడు= ఆ గౌతముడు; చూచి; నిన్నున్= నిన్ను; అనిమిష+ఇంద్రున్కాన్= దేవతల ప్రభువుగా; ఏన్= నేను; ఎఱింగితిన్= గుర్తించాను; ఎల్లలోకములన్= అన్ని లోకాలలో; తిరుగుదు=సంచరిస్తూ ఉంటావు; ఎచటన్ ఐనన్= ఎక్కడైనా; నిన్నున్; ఎగ్గు= కీడు; పొందదు కదా= చేరదు కదా!

తాత్పర్యం: అని ధృతరాష్ట్రు డనగా ముని 'శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, మిత్రశత్రువులు అని ఈ తీరైన పెక్కు జంటభావాలు లేని తావు బ్రహ్మలోకం. అక్కడ ఏనుగును తీసికొమ్ము రమ్మ' అన్నాడు. అప్పుడు రాజు 'సంగం లేనివారు, ఇంద్రియనిగ్రహం కలవారు, వ్రతాలయందు నిష్ఠ కలవారు, అధ్యాత్మవిద్యయందు పరమాసక్తి కలవారు అచటి కరుగువారు. అది చూడటం నాకు సాధ్యమా?' అన్నాడు. అంత రాజును ముని పరిశీలించి చూచి 'నిన్ను దేవేంద్రుడిగా గుర్తించాను. నీ వన్ని లోకాలు తిరుగుతూ ఉంటావు. ని న్నే కీడూ పొందదు గదా!' అన్నాడు.

విశేషం: అసంగులు - సంగం అంటే వస్తువులు మొదలైనవాటి యందు ప్రీతి. లంపటం. ఇది మమకారాన్ని కలిగించి సర్వానర్థాలకు మూలకారణం అవుతుంది. సంగం వలన కామం, దానివలన క్రోధం, దానివలన సమ్మోహం, దానివలన స్మృతి నశించటం, బుద్ధినాశనం కలుగుతాయని భగవద్గీత చెప్తున్నది. అట్టి పరమనీచమైన 'సంగం' లేనివారు అసంగులు. కృతాత్ములు - ఆత్మను సాధించినవారు. ఇంద్రియాలను, మనస్సును స్వాధీనపరచుకొని పరమాత్మజ్ఞానం చక్కగా పొందినవారు. ద్వంద్వములు - విరుద్ధ భావాల జంటలు - వీటిలో ఒకటి కలిగినపుడు శోకాన్నీ, మరొకటి కలిగినప్పుడు ఆనందాన్నీ మానవుడు పొందుతూ ఉంటాడు. ఈ రెండూ లేని స్థితి పరమోత్తమమైనది. అట్టి ద్వంద్వాలు బ్రహ్మలోకంలో ఉండవు.

చ. అనవుడు మ్రొక్కి యింద్రుఁడు 'మహాత్మ! మతంగజ హేతు వాదవ
ర్తను ననుఁ బంపు నీ పనుపు దక్కొని చేసెద' నన్నఁ 'బుత్త్రుఁ డీ
వనకరి నాకు సాధుజనవత్సల! యిమ్ము కరంబు నెమ్మి దీ
ని' ననియె సాంత్వనంబుగ మునిప్రవరుండు గులప్రదీపకా! 75

ప్రతిపదార్థం: అనవుడున్= అన్నంతనే; ఇంద్రుఁడు= దేవరాజు; మ్రొక్కి= నమస్కరించి; మహా+ఆత్మ!= దొడ్డబుద్ధి కలవాడా!; మతంగజ, హేతు, వాద, వర్తనున్= ఏనుగు నిమిత్తంగా వాదాన్ని నడపిన; ననున్= నన్ను; పంపు= ఆజ్ఞాపించుము; నీ పనుపున్= నీ ఆదేశాన్ని; తక్కొని= ప్రయత్నపడి; చేసెదన్= చేస్తాను; అన్నన్= అంటే; మునిప్రవరుండు= మునివర్యుడు; సాధుజనవత్సల!= మంచివారియందు పుత్రప్రేమ కలవాడా!; ఈ వనకరి= ఈ అడవి ఏనుగు; నాకున్= నాకు; పుత్త్రుఁడు=కొడుకు; కరంబు నెమ్మిన్= మిక్కిలి ప్రేమతో; దీనిన్= దీనిని; ఇమ్ము; అని; సాంత్వనంబుగన్= బతిమాలుతూ; కులప్రదీపకా!= కులాలను చక్కగా ప్రకాశింప చేసేవాడా!; అనియెన్= అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ముని అట్లా అన్నంతనే దేవేంద్రుడు 'మహాత్మా! ఏనుగు నెపంగా వాదాన్ని ప్రవర్తింపజేసిన నన్ను ఆజ్ఞాపించుము. నీ ఆజ్ఞను దలదాల్చి నిర్వహిస్తాను' అంటే 'సాధుజనవత్సలా! దేవేంద్రా! ఈ అడవి ఏనుగు నా బిడ్డ. దీనిని మిక్కిలి ప్రేమతో నాకిమ్మ' అని బతిమాలుతూ మునివరేణ్యుడు అన్నాడు కులప్రదీపకుడవైన ధర్మరాజా!

వ. అనిన విని యింద్రుం డిట్లనియె. 76

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని= ఆలకించి; ఇంద్రుండు= దేవేంద్రుడు; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా విని ఇంద్రు డిట్లా అన్నాడు.

తే. 'కరి చెలంగి నీమీఁదఁ బుష్కరము సాఁచి । మూరుకొనియెడు నడుగుల మ్రోల నిల్చి
ముద్దు గురియుచుఁ బలుమఱు మ్రొక్కు నిట్టి । దాని నిన్నేల పాపుదు మాననీయ! 77

ప్రతిపదార్థం: మాననీయ!= మన్నించదగినవాడా!; కరి= ఏనుగు; చెలంగి= పొంగిపోయి; నీ మీఁదన్= నీపై; పుష్కరము= తొండాన్ని; చాఁచి= ప్రసరింపచేసి; మూరుకొనియెడున్= తలను వాసన చూస్తున్నది; అడుగుల మ్రోలన్= పాదాల దగ్గర; నిల్చి= నిలబడి; ముద్దు కురియుచున్= ప్రేమను ఒలకపోస్తూ; పలుమఱున్= పెక్కుమారులు; మ్రొక్కున్= మ్రొక్కుతున్నది; ఇట్టిదానిన్= ఇట్టిదానిని; నిన్నున్= నిన్ను; ఏల= ఎందుకు; పాపుదున్= విడదీస్తాను?

తాత్పర్యం: 'మాననీయా! ఈ ఏనుగు ఆనందంతో పొంగిపోతూ నీమీద తొండం చాచి మూర్ధాఘ్రాణం చేస్తున్నది. పాదాలదగ్గర నిలిచి ప్రేమను ఒలకబోస్తూ నీకు పెక్కుసార్లు మ్రొక్కుతున్నది. ఇట్టి దీనినీ, నిన్నూ నేను ఎందుకు విడదీస్తానయ్యా?

మ. ననునే డాఁచెద నన్న నేబుధులుఁ గానంజాల రక్షీణబో
ధన సంపత్తి నెఱింగి తేర్పడ మునీంద్రా! రండు నీవున్ భవ
త్తనయుండీ కరియున్ నితాంతసుఖ నిత్యంబైన నాకంబునం
దనపాయస్థితి మత్సఖిత్వమునఁ బెంపారం బ్రవర్తింపఁగన్.' 78

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= మునిశ్రేష్ఠుడా!; ననున్= నన్ను; నేన్= నేను; డాఁచెదను= గుప్తపరచుకుంటాను; అన్నన్= అంటే; ఏ బుధులు= ఏ దేవతలు; కానన్, చాలరు= తెలిసికొనలేరు; అక్షీణ బోధన సంపత్తిన్= తరుగని జ్ఞానం అనే సంపదతో; ఏర్పడన్= స్పష్టంగా; ఎఱింగితి(వి)= తెలిసికొన్నావు; నీవున్= నీవూ; భవత్ తనయుండు= నీ కొడుకు; ఈ కరియున్= ఈ ఏనుగున్నూ; నితాంతసుఖ నిత్యంబు= చెడని సుఖంతో శాశ్వతం; ఐన నాకంబు+నందున్= అయిన స్వర్గంలో; అనపాయ స్థితిన్= అపాయము (ఎడబాటు) లేని స్థితితో; మత్ సఖిత్వమునన్= నా చెలిమితో; పెంపు+ఆరన్= మన్నన కలుగునట్లుగా; ప్రవర్తింపఁగన్= ఉండటానికి; రండు= రండి.

తాత్పర్యం: మునివర్యా! నన్ను నేను గోప్యం చేసికొనదలచితే ఏ దేవతలు కనుగొనలేరు. కాని నీవు తరగని జ్ఞాన సంపదతో నన్ను గుర్తుపట్టావు. నీవూ నీ కొడుకైన ఈ ఏనుగు స్వర్గంలో మరల తిరిగి రానక్కరలేని స్థితితో నా చెలిమితో మన్ననగా ప్రవర్తించటానికి రండి.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: నితాంతసుఖ నిత్యము - దుఃఖం మందుకైనా ఉండదని భావం. అనపాయస్థితిన్ 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి' - పుణ్యం క్షీణిస్తే జనులు మరల భూలోకానికి వస్తారు - అని గీత. 'మీకు అట్టి స్వర్గపు ఎడబాటు ఉండదు' అని తాత్పర్యం. మత్, సఖత్వమునన్ - స్వర్గంలో తక్కినవారివలె నిన్నొక సామాన్య వ్యక్తిగా చూడను. నాకు సమప్రాణుడిగా చూస్తాను అని వక్కణ. 'సమప్రాణః సఖా మతః' - తన ప్రాణంతో సమానంగా ఎవరిని పరిగణించి వ్యవహరిస్తాడో అతడే సఖుడు.

ఆ. అనుడు సంతసిల్లి యట్ల కాకనిన న । మ్ముని వరుండుఁ గరియు మున్ను గాఁగ
నేఁగె దివమునకు మహేంద్రుండు సమ్మోద । భరితుఁడగుచుఁ గురునృపాల వర్య! 79

ప్రతిపదార్థం: కురునృపాలవర్య= కురు రాజోత్తమా!; అనుడున్= అన్నంతనే; సంతసిల్లి= ఆనందించి; అట్లు+అ= అట్లే; కాక= అగుగాక!; అనినన్= అనగా; మహేంద్రుండు= దేవరాజ్యాధిపతి; ఆ+మునివరుండున్= ఆ మునిశ్రేష్ఠుడునూ; కరియున్= ఏనుగునూ; మున్ను= ముందు; కాఁగన్= అగునట్లుగా; దివమునకున్= స్వర్గానికి; సమ్మోద భరితుఁడు= పరమానందంతో నిండినవాడూ; అగుచున్= అవుతూ; ఏఁగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అప్పుడా ముని అట్లాగే అనగా దేవేంద్రుడు, ఆ మహర్షినీ, ఏనుగునూ ముందు పెట్టుకొని పరమానందం నిండినవాడై స్వర్గానికి వెళ్ళాడు.

విశేషం: మున్ను కాగన్ - ఇది అత్యంత గౌరవాన్ని ప్రస్ఫుటీకరిస్తుంది. సమ్మోదభరితుడు - నిజంగా పరమానందం పొందవలసినవారు మునీ, ఏనుగూ. ఎందుకంటే వారి పుణ్యం పండి శాశ్వతసుఖ లోకాలకు పయనిస్తున్నారు. కాని తీసికొని వెళుతున్న సర్వసుఖదాత ఇంద్రుడు పరమానందం పొందుతున్నాడంటే మహాపుణ్యాత్ముల రాకవల్లనే దేవలోకం సుస్థిరమవుతుంది. తన పదవి భద్రంగా ఉంటుంది - అన్న భావం అతడికి కలిగించిందనే అర్థం ఇక్కడ వ్యక్తమవుతున్నది.

క. అనిన విని భీష్ముతో న । జ్జనపతి యిట్లనియెఁ 'దపము సారపు ధర్మం
బని యూఁది మీరు సెప్పుదు । రనఘా! లేకుండునే తదధికం బొకఁడున్?' 80

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ఆ+జనపతి= ఆ ధర్మరాజు; భీష్ముతోన్= భీష్మునితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అనఘా!= పుణ్యాత్మా!; తపము= తపస్సు; సారము+ధర్మంబు= అన్ని ధర్మాల సారం వంటిది; అని; మీరు= తమరు; ఊఁది= నొక్కి; చెప్పుదురు= చెపుతూ ఉంటారు; తత్+అధికంబు= దానికంటె ఎక్కువ అయినది; ఒకఁడున్= ఒక్కటి కూడా; లేక+ఉండునే= లేకుండా ఉంటుందా?

తాత్పర్యం: అని చెపితే విని ధర్మరాజు భీష్మడితో ఇట్లా అన్నాడు. 'మహాత్మా! మీరు తపస్సును సారమైన ధర్మంగా నొక్కి చెప్పుతూ ఉంటారు. దానిని మించిన ధర్మం మరొకటి లేదా?'

వ. అనుటయు నా దేవవ్రతుం డానరదేవోత్తము నర్మిలి నాలోకించి. 81

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; ఆ నరదేవ+ఉత్తమున్= రాజులలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజును; అర్మిలిన్= ప్రేమతో; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అనగా ఆ దేవవ్రతుడు ఆ రాజశ్రేష్ఠుడిని ప్రేమతో చూచి (ఇట్లా చెప్పాడు)

విశేషం: దేవవ్రతుడు భీష్ముడి పుట్టుపేరు; అర్మిలిన్-ఉత్తమప్రశ్న అడిగినందుకు కలిగిన ఆనందాన్ని ఇది అభివ్యక్తం చేస్తుంది.

భగీరథునకు బ్రహ్మతో నైన సంవాదప్రకారము (సం.13-160-1 (కుంభ))

సీ. వినుము ధర్మము లెల్ల వినుతకృత్యంబుల । తప మెన్ని యెన్నఁగా ధర్మ మెందుఁ
గలదు?; తపం బనఁగా నియతాశన । త్వము; భగీరథుఁడు పద్మజుని సభకు
నరిగిన నతనితో నద్దేవుఁ డిందుల । కతుల నిర్మలతపమాచరింప
కరుగుదేరంగ నెవ్వరికిని రాదెట్లు । వచ్చితో? యనిన నవ్వసుమతీశుఁ

తే. దేను గోదానములును భూదానములును । గన్యకాదానములుఁ దీర్థకలనములును
రాజసూయాశ్వమేధాధ్వరములుఁ బెక్కు । సేసినాఁడ వచ్చుట దానఁజేసి కాదు. 82

ప్రతిపదార్థం: వినుము; ధర్మములు= ధర్మాలు; ఎల్లన్= అన్నీ; వినుత కృత్యంబులు+అ= కొనియాడదగిన పనులే; తపము= తపస్సును; ఎన్ని= పరిగణించి; ఎన్నఁగాన్= లెక్కించుటకు; ధర్మము= ధర్మం; ఎందున్= ఎక్కడ; కలదు?= ఉంది?; తపంబు= తపస్సు; అనఁగాన్= అంటే; నియత+అశనత్వము= నియమంతో కూడిన భోజనం తీసికోవటం; భగీరథుఁడు= భగీరథుడనే రాజు; పద్మజుని సభకున్= బ్రహ్మసభకు; అరిగినన్= పోగా; అతనితోన్= అతడితో; ఆ+దేవుఁడు= ఆ బ్రహ్మదేవుడు; ఇందులకున్= ఇక్కడికి; అతుల నిర్మల తపము= సాటిలేని దోషములేని తపస్సు; ఆచరింపక= చేయక; అరుగుదేరంగన్= రావటానికి; ఎవ్వరికిని= ఎట్టివారికైనా; రాదు= కాదు; ఎట్లు= ఏ విధంగా; వచ్చితి+ఓ?= వచ్చావో?; అనినన్= అంటే; ఆ+ వసుమతీ+ఈశుఁడు= ఆ రాజు; ఏను= నేను; గోదానములును= గోవుల దానాలూ; భూదానములును= భూముల దానాలూ; కన్యాదానములున్= కన్యకల దానాలూ; తీర్థ కలనములును= తీర్థాలకు పోవటం అనే పనులూ; రాజసూయ+ అశ్వమేధ+అధ్వరములున్= రాజసూయము, అశ్వమేధము అనే యజ్ఞాలూ; పెక్కు= ఎక్కువ; చేసినాఁడన్= చేసినవాడిని; వచ్చుట= ఇక్కడికి రావటం; దానన్ చేసి= దానివలన; కాదు.

తాత్పర్యం: వినుము. ధర్మాలన్నీ కొనియాడదగిన కార్యాలే. తపస్సును చెప్పి చెప్పగల ధర్మం ఎక్కడ ఉన్నది? తపస్సు అంటే నియమంతో భోజనం గ్రహించటం. భగీరథుడనే రాజు బ్రహ్మసభకు పోతే ఆ బ్రహ్మదేవుడు 'ఇక్కడకు సాటిలేనిదీ, స్వచ్ఛమైనదీ అయిన తపస్సు చేయకుండా రావటం ఎవ్వరికీ సాధ్యంకాదు. నీవు ఎట్లు వచ్చావో?' అన్నాడు. అపు డా రాజు 'నేను గోదానాలూ, భూదానాలూ, కన్యాదానాలూ, తీర్థయాత్రలూ, రాజసూయయాగాలూ, అశ్వమేధపుయజ్ఞాలూ ఎన్నో చేశాను. కాని ఇక్కడకు రావటం వాటివలన కాదు.

మ. అవనీదేవత లొక్కెడం గ్రతువిధి వ్యాసక్తు లై యుండఁ ద
త్ప్రవిఘాతంబులు దోఁచె నేను రణసంరంభంబునన్ వారి కు
త్సవ మొందించితి వానిఁబాపి ముదమొందన్ వారు నన్ బ్రహ్మపా
ల వరిష్ఠావ్యయ సౌఖ్య మొందు మని లీలం జెప్పినన్ వచ్చితిన్. 83

ప్రతిపదార్థం: అవనీదేవతలు= బ్రాహ్మణులు; ఒక్క+ఎడన్= ఒకచోట; క్రతు విధి వ్యాసక్తులు= యజ్ఞం పనిలో మిక్కిలి ఆసక్తి కలవారు; ఐ= అయి; ఉండన్= ఉండగా; తత్ ప్రవిఘాతంబులు= దానికి మహావిఘ్నాలు; తోఁచెన్= కన్పట్టాయి; నేను;

రణసంరంభంబునన్= యుద్ధపు ఆర్భాటంతో; వానిన్= ఆ విఘ్నాలను; పాపి= తొలగించి; వారికిన్= ఆ బ్రాహ్మణులకు; ఉత్సవము= ఆనందము; ఒందించితిన్= కలిగించాను; వారు= ఆ బ్రాహ్మణులు; ముదము+ఒందన్= సంతోషం కలుగగా; నన్= నన్ను; బ్రహ్మపాలన్= బ్రహ్మదేవుడి దగ్గర; వరిష్ఠ+అవ్యయ సౌఖ్యము= మిక్కిలి శ్రేష్ఠమైన నాశనములేని సుఖాన్ని; ఒందుము= పొందుము; అని; లీలన్= విలాసంగా; చెప్పినన్= చెప్పితే; వచ్చితిన్= వచ్చాను.

తాత్పర్యం: బ్రాహ్మణులంతా ఒకచోట యజ్ఞకార్యంలో నిమగ్నులై ఉన్నారు. అప్పుడు ఆ పనికి ఎన్నో అవరోధాలు కలిగాయి. నేను యుద్ధం ఉద్ధృతంగా చేసి, ఆ ఆటంకాలను తొలగించి, వారి కానందం కలిగించాను. వారు నన్ను బ్రహ్మదగ్గర మిక్కిలి ఉత్తమం అయినదీ, ఎన్నటికీ తరిగిపోనిదీ అయిన ఆనందం పూర్ణసౌఖ్యంతో పొందవలసిందిగా లీలతో చెప్పారు, వచ్చాను.

విశేషం: లీలన్= బ్రహ్మదగ్గర సుఖం పొందుమని వారు విలాసంగా చెప్పారు. అనగా వారు బ్రహ్మను కూడా శాసింపగల మహిమగల వారని భావం.

తే. ఆఁకలియు నీరువట్టును నాదరింప । కేను విప్రులపని సేసి యిట్టిమహిమఁ

గంటి నియతాశనత్వమ కాక తప మ । నంగ వేఱొండె? ధర్మాభినంద్యహృదయ!' 84

ప్రతిపదార్థం: ధర్మ+అభినంద్య హృదయ!= ధర్మంచేత కొనియాడబడిన హృదయం కల మహానుభావా!; ఆఁకలియున్= ఆకలినీ; నీరువట్టును= దప్పికనూ; ఆదరింపక= లెక్కచేయక; ఏను= నేను; విప్రుల పని= బ్రాహ్మణోత్తముల పనిని; చేసి; ఇట్టి మహిమన్= ఇటువంటి గొప్పతనాన్ని; కంటిన్= పొందాను; నియత+అశనత్వము+అ= నిగ్రహించబడిన భోజనం కలతనమే; కాక; తపము= తపస్సు; అనంగన్= అనగా; వేఱు= ఇతరము; ఒండు+ఎ?= ఒకటి కలదా?

తాత్పర్యం: మహానుభావా! ఆకలినీ, దప్పినీ లెక్కచేయక విప్రవర్యుల కార్యాన్ని నిర్వహించి ఇట్టి మహిమ పొందగలిగాను. తపస్సు అంటే ఆహారంలోని నియమం కాక మరొకటి ఉన్నదా? నీ హృదయాన్ని ధర్మాలన్నీ కొనియాడుతాయి కదా!'

చ. అనుటయు బ్రహ్మ యవ్విభున కర్చన లిచ్చి తగంగ గారవిం

చె నధిప! నీవు విప్రుల భజింపుము సంయమితాశనుండవై

యని దివిజాపగాసుతుఁడు సాదరభాషణ వృత్తిఁ జెప్పిన

న్విని ముదమంది ధర్మజుఁడు నెమ్మి దలిర్పఁగ నమ్మహాత్ముతోన్. 85

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అనుటయున్= అని చెప్పగా; బ్రహ్మ; ఆ+విభునకున్= ఆ రాజునకు; అర్చనలు= పూజనలు (మన్ననలు); ఇచ్చి= ఒసగి; తగంగన్= తగు తీరున; గారవించెన్= మర్యాద చేశాడు; నీవును= నీవుకూడా; సంయమిత+ అశనుండవు= నిండుగా అదుపుగల భోజనం కలవాడవు; ఐ= అయి; విప్రులన్= ఉత్తమ విద్యావంతులగు బ్రాహ్మణులను; భజింపుము= సేవించుము; అని; దివిజ+ఆపగాసుతుఁడు= దేవలోకంలో పుట్టిన నదియొక్క కొడుకు; సాదర భాషణ వృత్తిన్= ప్రీతితో కూడిన మాటల ప్రవర్తనతో; చెప్పినన్= ఉపదేశించగా; ధర్మజుఁడు= ధర్మరాజు; విని, ముదము= సంతోషము; అంది= పొంది; నెమ్మి= ప్రేమ; తలిర్పఁగన్= పుట్టగా; ఆ+మహాత్ముతోన్= మహాత్ముడైన ఆ భీష్ముడితో.

తాత్పర్యం: భగీరథు డట్లా చెప్పగా బ్రహ్మ ఆ రాజును గొప్పగా మన్నించి తగు విధంగా గౌరవించాడు. రాజా! నీవు కూడా భోజనవిషయంలో చెడని నిష్ఠ కలవాడవై విప్రులను సేవించుము' అని భీష్ముడు ఆదరపూర్వకంగా చెప్పితే, విని, పరమానందం పొంది, ధర్మరాజు ప్రేమ చిగురించగా ఆ మహాత్ముడితో ఇట్లా అన్నాడు.

విశేషం: దివిజాపగాసుతుడు - అతడు చెప్పే విషయాలన్నీ అతడి తల్లి అమృతహృదయంవలె అమృతాయమానంగా ఉన్నాయని స్ఫురించే అర్థం. సాదరభాషణవృత్తిన్ - భీష్ముడి మాటలలో అనాదరభావం వెదకిచూచినా లేదు. అందుకనే ఇంకా ఇంకా ధర్మరాజు అడుగగలుగుతున్నాడు.

క. 'పురుషుఁడు శతాయు వనుశ్రుతి । పురుషవరా! బాలురైనఁ బొందుదురు మృతిం
జిరమగు నేమిట నాయు వ । చిరమగు నెద్దానఁ? దెలియఁజెప్పుము కరుణన్.' 86

ప్రతిపదార్థం: పురుషవరా!= పురుషశ్రేష్ఠా!; శ్రుతి= వేదం; పురుషుఁడు= మానవుడు; శత+ఆయువు= నూరేండ్ల ఆయువు కలవాడు; అనున్= అంటున్నది; బాలురు= చిన్నవయస్సువారు; ఐనన్= కూడా; మృతిన్= చావును; పొందుదురు= పొందుతూ ఉంటారు; ఏమిటన్= దేనిచేత; ఆయువు= జీవితకాలం; చిరము= ఎక్కువకాలం కలది; అగున్= అవుతుంది?; ఏ+దానన్=దేని చేత; అచిరము= తక్కువకాలం కలది; అగున్= అవుతుంది; కరుణన్= దయతో; తెలియన్= నాకు తెలిసేటట్లుగా, చెప్పుము.

తాత్పర్యం: 'మహాత్మా! వేదం పురుషుడు నూరేండ్ల బ్రదుకు కలవాడని అంటున్నది. కానీ చిన్నతనంలోనే కొందరు మరణిస్తున్నారు. దేనిచేత ఆయువు వృద్ధి పొందుతుంది? దేనిచేత తరిగిపోతుంది? దయతో నాకు తెలియజెప్పుము.'

వ. అనుటయు నయ్యఖిలధర్మవేది యవ్విభున కిట్లనియె. 87

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+అఖిలధర్మవేది= సమస్త ధర్మాలు తెలిసిన ఆ దేవవ్రతుడు; ఆ+విభునకున్= ఆ రాజునకు; ఇట్లు= ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని అడిగితే సర్వధర్మాలు తెలిసిన ఆ శంతనుకుమారుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తే. 'అనఘ! ఆచార మాయువుఁ బెనుచు నదియ । కాదు శ్రీయును గీర్తియుం గలుగఁ జేయు
విను దురాచారుఁ డాయువు పెనుపుఁ బొందఁ । డతని సర్వభూతంబులు నభిభవించు.' 88

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; ఆచారము= సత్ప్రవర్తనము; ఆయువున్= జీవితకాలాన్ని; పెనుచున్= పెంచుతుంది; అది+అ+కాదు= అంతేకాదు; కాదు; శ్రీయును= సంపదను; కీర్తియున్= కీర్తినీ; కలుగన్+చేయున్= కలిగేటట్లు చేస్తుంది; విను= వినుము; దురాచారుఁడు= చెడు నడవడి కలవాడు; ఆయువు పెనుపున్= ఆయువు యొక్క వృద్ధిని; పొందఁడు= చెందదు; అతనిన్= అట్టివాడిని; సర్వభూతంబులు= అన్ని భూతాలు; అభిభవించున్= ఛీ కొట్టుతాయి.

తాత్పర్యం: 'పుణ్యాత్ముడా! ఆచారం ఆయువును పెంచుతుంది. అంతేకాదు - సంపదను, కీర్తినీ కలిగిస్తుంది. ఇక దురాచారుడు ఆయుర్వృద్ధిని పొందలేడు. సర్వభూతాలూ వాడిని తిరస్కరిస్తాయి.

విశేషం: ఆచారమంటే శాస్త్రం చెప్పిన విధంగా నడచుకొనటం, సర్వభూతాలు - భూమి మొదలైన పంచభూతాలు లేక సర్వప్రాణులు, పదార్థాలు. అభిభవించు - అవి తిరస్కరిస్తే బ్రదుకు లేదని భావం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కావున నాచారపరత ।భూవర! మేల్ సాధుజనులు వోవు తెరువు సం
భావించుట యాచారము । దా వర్ణాశ్రమ సమర్థ్వతం బరఁగు నృపా! 89

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; కావునన్= కాబట్టి; ఆచారపరత= ఆచారంలో నిష్ఠ; మేల్= మంచిది; సాధుజనులు= ఉత్తములైన మనుష్యులు; పోవు తెరువు= నడచే దారిని; సంభావించుట= చక్కగా తెలిసికొని ప్రవర్తించటం; ఆచారము= ఆచారం; నృపా!= రాజా!; తాన్= అది; వర్ణ+ఆశ్రమ సమర్థ్వతన్= వర్ణములు, ఆశ్రమములు అనువాని కనుగుణ మైనదై; పరఁగున్= ఒప్పుతుంది.

తాత్పర్యం: రాజా! కనుక ఆచారం గట్టిగా పాటించటం మంచిది. ఉత్తమపురుషులు పోయే మార్గాన్ని చక్కగా తెలిసికొని నడచుకొనటమే ఆచారం. అది వర్ణధర్మాలకు, ఆశ్రమధర్మాలకు అనుగుణమై ఉంటుంది.

విశేషం: ధర్మాలన్నీ స్వయంగా తెలిసికొనటం తేలికకాదు. అందుకని పురాణేతిహాసాలలో మహానుభావులైన వారు ఆయా సందర్భాలలో ఎలా ప్రవర్తించారో చక్కగా తెలిసికొని ఆ విధంగా ఆచరించాలని ఇక్కడ సూచన. వేదం 'అథ యది తే కర్మ విచికిత్సా, వృత్తి విచికిత్సా స్యాత్' - నీకు కర్మములో గానీ, నడవడిలో గానీ సందేహము కలిగితే - ఇత్యాదివాక్యాలలో ఈ అంశాన్ని చక్కగా నిరూపించింది.

ఆ. గురునిమాట సరకు గొనమి దుశ్శీలత । పిట్ట పుడుక గోరు పిసుకఁ ద్రుంపఁ
గఱవ మరుగు టుదయకాలాస్తమయ సమ । యముల భానుఁ జూచు టాయు వడఁచు. 90

ప్రతిపదార్థం: గురునిమాట= గురువు వాక్యాన్ని; సరకు+కొనమి= లెక్కచేయకపోవటం; దుస్+శీలత= చెడు నడవడి కలిగి ఉండటం; పిట్ట= పక్షిని; పుడుక= పుడకనూ; గోరున్= గోటినీ; పిసుకన్= పిసుకగా; త్రుంపన్= త్రుంచగా; కఱవన్= కొరకగా; మరుగుట= అలవాటుపడుతూ; ఉదయకాల+అస్తమయ సమయములన్= సూర్యుడు ఉదయించే కాలంలోనూ; అస్తమించే కాలంలోనూ, భానున్= సూర్యుడిని; చూచుట= చూడటమూ; ఆయువు= జీవితకాలాన్ని; అడఁచున్= అణచివేస్తుంది.

తాత్పర్యం: గురువులమాటను లెక్కచేయకపోవటం, చెడు నడవడితో మెలగటం, పిట్టను పిసకటానికీ, పుడకను త్రుంచటానికీ, గోళ్ళను కొరకటానికీ అలవాటు పడటం; ఉదయ అస్తమయ కాలాలలో సూర్యుడిని చూడటం ఆయువును హరించివేస్తాయి.

విశేషం: పిట్ట.... ఇక్కడ క్రమాన్వయం. పిట్ట, పిసుకన్, పుడుక... ద్రుంపన్, గోరు - కఱవన్ - మరుగుట అని అన్వయం.

క. విను క్రోధంబును హింసయు । నన్నృతంబును లేమి సంధ్య లైనం దదుపా
సనము సురపూజనము రే - పొనరించుట చిరతరాయు వొనరించు నృపా! 91

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; విను= జాగ్రత్తగా ఆలకించుము; క్రోధంబును= తీవ్రమైన కోపమూ; హింసయున్= ఇతరులను పీడించటం; అనృతంబును= అసత్యమూ; లేమి= లేకపోవటం ; సంధ్యలు=సంధ్యాకాలాలు; ఐనన్= కలిగినప్పుడు; తత్+ ఉపాసనము= ఆ సంధ్యాదేవిని పూజించటము; రేపు= ప్రతి ఉదయకాలమునందు; సురపూజనము= దేవతలను అర్చించటము; చిరతర+ఆయువు= మిక్కిలి ఎక్కువ ఆయువును; ఒనరించున్= కలిగిస్తాయి.

తాత్పర్యం: రాజా! జాగ్రత్తగా వినుము. క్రోధం, హింస, అసత్యం అనే వాటిని లేకుండా చూచుకొనాలి. సంధ్యాకాలం వచ్చినప్పుడు ఉపాసించాలి. ప్రతి ఉదయం దేవతలను అర్చించాలి. ఈ పనులు ఆయువును పెంపొందిస్తాయి.

క. పరదారగమన మొప్పదు, । పురుషున కది యెల్ల పాపములకంటె నరే
శ్వరవర! యాయుస్సంక్షయ । కరంబు దద్వర్జనంబు గడు మే లరయన్. 92

ప్రతిపదార్థం: నర+ఈశ్వర వర!= రాజవరేణ్యా!; పురుషునకున్= మానవుడికి; పరదార గమనము= ఇతరుల భార్యలను పొందటం; ఒప్పదు= తగదు; అది= పరదారగమనం; ఎల్ల పాపముల కంటెన్= అన్ని పాపాలకంటె; ఆయుస్+సంక్షయ కరంబు= ఆయువును మిక్కిలిగా నాశనం చేసేది; తత్+వర్జనంబు= దానిని వదలటం; అరయన్= పరికించితే; కడున్= మిక్కిలి; మేలు= శ్రేష్ఠము.

తాత్పర్యం: రాజా! ఇతరుల భార్యలను పొందటం కూడదు. అది అన్ని పాపాలకంటే ఎక్కువగా ఆయువును కుదించి వేస్తుంది. దానిని వదలటం ఎంతో మంచిది.

విశేషం: పురుషపరంగా పరదారగమనం గురించి చెప్పారు. అట్లాగే స్త్రీపరంగా పరపురుషగమనం కూడా ఉపలక్షణంగా ఇక్కడ గ్రహించవచ్చును.

క. పరదారలయందును సఖి । గురువృద్ధ నృపాలబాలకుల బాంధవభూ
సుర వైద్య భృత్య బుధ నా । గరికుల సతు లాయువునకుఁ గడుఁ జే టనఘా! 93

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; పరదారలయందును= ఇతరుల సతుల విషయంలో కూడా; సఖి= మిత్రుడు; గురు= గురువు; వృద్ధ= పెద్దవాడు; నృపాల= రాజు; బాలకుల= పిన్నవారి యొక్క; బాంధవ= చుట్టాలు; భూసుర= బ్రాహ్మణులు; వైద్య= వైద్యులు; భృత్య= సేవకులు; బుధ= పండితులు, నాగరికుల= నగరాధికారులు (నగరంలో ఉండేవారు) అనే ఇట్టివారియొక్క; సతులు= భార్యలు; ఆయువునకున్= బ్రదుకునకు; కడున్= మిక్కిలిగా; చేటు= కీడు.

తాత్పర్యం: పరభార్యలలో కూడా మిత్రుడు, గురువు, పెద్దవాడు, రాజు, బాలుడు, చుట్టము, బ్రాహ్మణుడు, వైద్యుడు, సేవకుడు, పండితుడు, నాగరికుడు అనువారి భార్యలు మరింత ఎక్కువగా ఆయువునకు కీడు చేస్తారు.

విశేషం: ఇది ఊరకే హెచ్చరికకొరకు చెప్పినమాట. ఎవరి సంపర్కమైనా అట్టిదే.

వ. అని చెప్పి. 94

తాత్పర్యం: ఇట్లా వివరించి.

క. మేలివి గీడివి యని భూ । పాలక! యేఁ జెప్పినట్టి పను లెఱుఁగుము నీ
పోలిన యాయువు పెనుపం । జాలు ననియు నపహరింప శక్తము లనియున్. 95

ప్రతిపదార్థం: భూపాలక!= రాజా!; ఇవి; మేలు= శ్రేష్ఠములు; ఇవి; కీడు= చెడ్డవి; అని; ఏన్= నేను; చెప్పిన+అట్టి, పనులు= చెప్పిన కార్యములు; నీ పోలిన ఆయువున్= నీవు భావించిన ఆయువును; పెనుపన్= పెంచుటకు; చాలున్= చాలును;

అనియున్= అనీ; అపహరింపన్= తగ్గించివేయుటకు; శక్తములు= సమర్థములు; అనియున్= అనీ; ఎఱుఁగుము= తెలిసికొనుము.

తాత్పర్యం: రాజా! నేను చెప్పినట్టి పనులలో మంచివి ఆయువును పెంచేవి అనీ, కీడైనవి ఆయువును త్రుంచేవి అనీ తెలిసికొనుము.

తే. తగనియది యెద్దియైన వ్రతంబు పూని । మాన నోచిన నాయువు మాల్పకుండు
నంతటన పోవ దాయు వత్యంతవృద్ధిఁ । జేయుఁ దగినది సేసినఁ జెప్పనేల? 96

ప్రతిపదార్థం: తగని+అది= కూడనిది; ఎద్ది= ఏది; ఐనన్= అయినా; వ్రతంబు= వ్రతము; పూని=సంకల్పించి; మానన్= మానినా; నోచినన్= నోచినా; ఆయువున్= ఆయువును; మాల్పక= చెడగొట్టక; ఉండున్= ఉంటుంది; అంతటన్+అ= అంత మాత్రాన; పోవదు= పోదు; ఆయువు= బ్రదుకును; అత్యంత వృద్ధిన్= మిక్కిలి పెరిగినదానిని; చేయున్= చేస్తుంది; తగిన+అది= తగినది; చేసినన్= చేస్తే; చెప్పన్ ఏల?= చెప్పటం ఎందుకు?

తాత్పర్యం: తనకు కూడనిదైనా ఒక వ్రతాన్ని సంకల్పించి మానినా, నోచినా ఆయువును చెడకుండా చూస్తుంది. అంతేకాదు, ఆయువును ఎక్కువగా పెంపొందిస్తుంది. అంటే ఇక తగిన వ్రతం చేస్తే కలిగే ఫలం ఏమిటో చెప్పనేల?

వ. అని పరిభాషించి. 97

తాత్పర్యం: అని పలికి.

క. దేవగృహము కడ వీథిని । గోవాటమునందు రచ్చకొట్టము పొంతన్
భూవర! సస్యములను వి । ష్ఠావిసృజన మొప్పదండ్రు చారిత్రవిదుల్. 98

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; చారిత్రవిదుల్= నడవడిని గూర్చి ఎరిగినవారు; దేవగృహము కడన్= దేవాలయం దగ్గర; వీథిని= నలుగురు నడిచే బాటలో; గోవాటమునందున్= గోవుల శాల సమీపంలో; రచ్చకొట్టము పొంతన్= రచ్చ సావడి దరిని; సస్యములను= పంటలదగ్గరా; విష్ఠావిసృజనము= మలం వదలటం; ఒప్పదు= కూడదు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ఆచారం తెలిసినవారు దేవాలయం దగ్గరా, వీథిలోను, గోశాల దగ్గరా, రచ్చసావడి దరినీ, పంటలమీదా మలవిసర్జనం చేయరాదని చెప్తుతారు.

ఆ. ప్రాఙ్ముఖుండు నార్ద్రపాదుండు నై భోజ । నంబు సేఁత మే లనంగ విందు
నిలిచియుండి కుడుపు నింద్య మమ్మెయి మూత్ర । సర్జనంబుఁ బాపసరణి యండ్రు. 99

ప్రతిపదార్థం: ప్రాక్+ముఖుండున్= తూర్పుదిక్కు మొగమైనవాడు; ఆర్ద్రపాదుండున్= తడికాళ్ళు కలవాడును; ఐ= అయి; భోజనంబు+చేఁత= అన్నం తినటం; మేలు=శ్రేష్ఠము; అనంగన్= అని చెప్పగా; విందున్= వింటూ ఉన్నాను; నిలిచి ఉండి= నిలబడి; కుడుపు= తినటం; నింద్యము= దోషము; ఆ+మెయిన్= అదే విధంగా; మూత్ర సర్జనంబున్= మూత్రం వదలటం కూడా; పాపసరణి= పాపపు పద్ధతి; అండ్రు= అంటారు.

తాత్పర్యం: తూర్పుమొగం అయినవాడు, కడుగుకొన్న కాళ్ళు కలవాడునై భోజనం చేయటం చాలా మంచిదని విన్నాను. నిలిచియుండి భోజనం చేయటం తప్పు. అట్లాగే నిలిచి మూత్రం వదలటం కూడా పాపపు పద్ధతి అని చెప్తుతారు.

విశేషం: ఆర్ద్రపాదుడు - తడికాళ్ళు కలవాడు - అంటే భోజనానికి ముందు కాళ్ళు కడుగుకొనాలని అర్థం.

క. అనలము గోవును బ్రాహ్మణుఁ జన దెంగిలితోడ ముట్టఁ జంద్రార్కులఁ జూ

దను నమ్మెయిఁ దగ దాసన । మును గాంస్యము ననఘ! భిన్నములు వర్జ్యంబుల్. 100

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; అనలమున్= అగ్నిని; గోవును= ఆవును; బ్రాహ్మణున్= బ్రహ్మజ్ఞానము కలవాడిని; ఎంగిలితోడన్= ఎంగిలితో; ముట్టన్= తాకుట; చనదు= కూడదు; ఆ+మెయిన్= అదే విధంగా; చంద్ర+అర్కులన్= చంద్రుడినీ, సూర్యుడినీ; చూడను= చూడటం కూడా; తగదు= పనికిరాదు; ఆసనమును= పీటా; కాంస్యము= కంచుపాత్రా; భిన్నములు= పగిలిపోయినవి; వర్జ్యంబుల్= విడువదగినవి.

తాత్పర్యం: అగ్నిని, ఆవును, బ్రాహ్మణుడిని ఎంగిలితో ముట్టరాదు. అట్లాగే ఎంగిలితో చంద్రుడిని, సూర్యుడిని చూడరాదు. పగిలిపోయిన ఆసనాన్నీ, కంచుపాత్రను విడిచివేయాలి.

ఆ. వృద్ధు వచ్చునపుడు విను బాలు ప్రాణంబు । లెగయఁజూచి యతని కెదురు లేచి

ప్రణతిఁ జేసెనేనిఁ బాదునఁబడి యవి । దొంటి యట్ల నిలుచు దురితదూర! 101

ప్రతిపదార్థం: దురితదూర!= పాపాలకు దూరమైనవాడా!; విను= వినుము, వృద్ధు= పెద్దవాడు; వచ్చు+అపుడు= వచ్చే సమయంలో; బాలు ప్రాణంబులు= చిన్నవాని ప్రాణాలు; ఎగయున్= పైకి లేచుటకు; చూచి; అతనికిన్= ఆ పెద్దవానికి; ఎదురు=ఎదురుగా; లేచి; ప్రణతిన్= నమస్కారమును; చేసెన్, ఏనిన్= చేసినట్లైతే; పాదునన్= మూలస్థానంలో; పడి; తొంటి+అట్లు+అ= ముందటి విధంగానే; నిలుచున్= నిలుస్తాయి.

తాత్పర్యం: దురితదూరా! పెద్దవాడు ఎదురుగా వస్తున్నప్పుడు చిన్నవాడి ప్రాణాలు పైకి లేచిపోవటానికి చూచి, అతడికి ఎదురుగా లేచి నమస్కారం చేస్తే మళ్ళీ అవి తమ కుదుళ్ళలో మునుపటివలె చేరుకొని నిలిచి ఉంటాయి.

విశేషం: దీనినే ప్రత్యుత్థానం అంటారు. పెద్దవారికి లేచి ఎదురువెళ్ళటం, అభివాదనం కూడా ఇటువంటిదే. నామగోత్రాలు చెప్పి పెద్దవారికి నమస్కరించటం.

తే. అధ్యయనమున మస్తకం బంటుటయును । నిద్రయును నశుచితతోడ నింద్యకోటి

శిరము గోకంగఁ దగ దిరుచేత మస్త । కంబు తైలంబుఁ బూయఁగాఁ గాదు మేన. 102

ప్రతిపదార్థం: అధ్యయనమునన్= వేదాలు చదివే సమయంలో; మస్తకంబు= తలను; అంటుటయును= తాకుట; అశుచితతోడన్= శౌచము లేకుండా; నిద్రయును= నిద్రించటమూ; నింద్యకోటి= దోషసముదాయంలోనివి; ఇరుచేతన్= రెండు చేతులతో; శిరమున్= తలను; గోకంగన్= గీరటం; తగదు= కూడదు; మస్తకంబు తైలంబు= తలమీది నూనెను; మేనన్= ఒంటిమీద; పూయఁగాన్= పూయటం; కాదు= కూడదు.

తాత్పర్యం: వేదం చదువుతూ తలను తాకరాదు. పరిశుభ్రత లేకుండా నిద్రపోరాదు. ఇవి దోషాల వరుసలోనివి. రెండు చేతులతో తల గోకరాదు. తలమీది నూనెను ఒంటికి పూసుకోరాదు.

సీ. వైరనిర్బంధంబు వలవదు గురునితో । నతఁడు కోపించిన ననుసరించి

తేర్చుట మేలు నిందించుట గురునెడ । నన్నృతమాడుట మాయు వపహరించు

విప్రగోక్షత్రియ వృద్ధ దుర్బల భార । వహ గర్భిణులకు నీవలయుఁ దెరువు
మాన్యభూదేవుని మంగళంబుల వన । స్పతులను వలగొని చనఁగవలయుఁ

తే. బంచదశిని జతుర్దశిఁ బద్మమిత్ర । వసుతిథుల జన్మతిథులందు వలయు బ్రహ్మ
చర్య మడుగు లొండొంటితోఁ జనదు తోమ । దోషములు గొండియముఁ గ్రూరభాషణంబు. 103

ప్రతిపదార్థం: గురునితోన్= గురువుతో; వైరనిర్బంధంబు= పగతోడి పట్టుదల; వలవదు= వద్దు; అతఁడు= గురువు; కోపించినన్= కోపం చెందినా; అనుసరించి= వెంటపడి; తేర్చుట= ప్రసన్నుడిని చేయటం; మేలు= మంచిది; నిందించుట= తిట్టటం; గురు+ఎడన్= గురువు విషయంలో; అనృతము= అబద్ధం; ఆడుట= పలకటం; ఆయువున్= జీవితకాలాన్ని; అపహరించున్= తొలగిస్తుంది; విప్ర= బ్రాహ్మణులకు; గో= ఆవులకు; క్షత్రియ= దేశాలనేలే రాజులకు; వృద్ధ= పెద్దవారికి; దుర్బల= ఒడలియందు సత్తువలేని వారికీ; భారవహ= బరువులు మోస్తున్నవారికి; గర్భిణులకున్= గర్భవతులైన స్త్రీలకు; తెరువున్= దారిని; ఈన్+వలయున్= ఇవ్వాలి; మాన్యభూదేవునిన్= పూజింపదగిన బ్రాహ్మణుడిని; మంగళంబులన్= మంగళం కలిగించే గోవు మున్నగువానిని; వనస్పతులను= మంచి చెట్లను; వలగొని= ప్రదక్షిణం చేసి; చనఁగన్ వలయున్= వెళ్ళాలి; పంచదశిని= పూర్ణిమ అమావాస్య దినాలలో; చతుర్దశిన్= చతుర్దశి తిథియందు (పక్షంలో పదునాలుగవ దినం); పద్మమిత్ర వసు తిథులన్= ద్వాదశి; అష్టమి తిథులందు, జన్మతిథులందున్= పుట్టిననాటి తిథులందు; బ్రహ్మచర్యము= భార్యాసంగమం చేయకుండటం మొదలైన బ్రహ్మచర్యధర్మం; వలయున్= పాటించాలి; అడుగులు= పాదాలను; ఒండొంటితోన్= ఒకదానితో మరొకదానిని; తోమన్= తోముట; చనదు= కూడదు; కొండియమున్= చాడీ, పితూరీలు చెప్పటం; క్రూరభాషణంబు= పరుషంగా పలకటం; దోషములు= తప్పుడు పనులు.

తాత్పర్యం: గురువుతో వదలని శత్రుభావం కూడదు. అతడు కోపించినా అనుసరించి ప్రసన్నుడిని చేసికొనటం మంచిది. గురువును నిందించటం, అతడి విషయాలలో అబద్ధాలు చెప్పటం ఆయువును బాగా తగ్గించి వేస్తాయి. దారిలో నడుస్తున్నప్పుడు ఎదురుగా ఉత్తమబ్రాహ్మణులు, ఆవులు, క్షత్రియులు, ముసలివారు, బలహీనులు, బరువు మోసేవారు, గర్భవతులు వస్తుంటే తాను తప్పుకొని వారికి దారి ఇవ్వాలి. పూజింపదగిన బ్రాహ్మణుడు, మంగళవస్తువులు, చెట్లు కనబడితే వాటికి ప్రదక్షిణం చేసి వెళ్ళాలి. పూర్ణిమ అమావాస్యలలో, చతుర్దశినాడు, ద్వాదశి, అష్టమి తిథులలో, జన్మతిథినాడూ బ్రహ్మచర్యం పాటించాలి. కాళ్ళు ఒకదానితో ఒకటి తోమరాదు. చాడీలు చెప్పటం, పరుషంగా పలకటం దోషాలు.

విశేషం: పద్మమిత్రుడంటే సూర్యుడు - ద్వాదశాదిత్యులు కనుక పద్మమిత్రతిథి అంటే ద్వాదశి: వసువు లెనమండుగురు. కనుక అష్టమి.

తే. అంగహీను దరిద్రు విద్యావిహీను । రూపహీనునిఁ దెగడుట పాప మండ్రు
వేద దేవతానిందలు వేతనార్థ । కముగ జోస్యంబు నడపుట కల్మషములు. 104

ప్రతిపదార్థం: అంగహీనున్= అవయవాలు పోయినవాడిని; దరిద్రున్= బీదవాడిని; విద్యావిహీనున్= చదువులేనివాడిని; రూపహీనునిన్= అందచందాలు లేనివాడిని; తెగడుట= నిందించటం; పాపము= పాపం; అండ్రు =అంటారు; వేద దేవతానిందలు= వేదాలను, దేవతలను నిందించటం, వేతన+అర్థకముగన్= బత్తెం కోసం; జోస్యంబు= జ్యోతిషమును; నడపుట= సాగించటం; కల్మషములు= పాపాలు.

తాత్పర్యం: అవయవాలు లోపించినవాడినీ, లేమితో బాధపడేవాడినీ, చదువురానివాడినీ, అందచందాలు లేనివాడినీ నిందించటం పాపం. వేదాలను, దేవతలను తూలనాడటం, బత్తెంకోసం జోస్యం చెప్పటం పాపాలు.

విశేషం: 'అంగహీనున్' ఇత్యాది-సాధారణంగా 'ఆ కుంటివాడు, ఈ గ్రుడ్డివాడు, దరిద్రుడు, చదువూ సంధ్యాలేని మూర్ఖుడు' ఇత్యాదిగా మాటలు వింటూ ఉంటాం. ఈ వైఖరి పాపంగా భారతం చెబుతున్నది. నిజానికి ఈ అవలక్షణాలు వారు స్వయంగా అప్పుడు చేసుకున్న తప్పులు కావు. పూర్వజన్మపు పాపఫలాలు. అట్టివాడిని నిందిస్తే అట్టి తప్పే తానూ చేసినట్లు అవుతుంది. అట్టి ఫలాలనే అనుభవించ వలసి వస్తుంది.

సీ. దంతధావనము మూత్రపురీష సర్జనం । బులు మౌనియై చేయవలయు; నుభయ
సంధ్యల నిద్రింపఁ జనదు; తండ్రికి రేపు । మ్రొక్కి యాచార్యవిప్రులకు వరుస
మఱి మ్రొక్కునది; వీరి కెఱఁగుట దక్కదే । వార్చనంబునకు మున్నన్యుకడకుఁ
జనఁగాదు; గర్భిణీసంయోగ । మొప్పదు । పరిణయంబునకు మున్ సురతసుఖము
తే. ననుభవించిన నవకీర్ణ యందు రట్టి । యఘము వోవుఁ బ్రాయశ్చిత్త మాచరింప
నుత్తరము పడమర దలయుఁగ శయింపఁ । దగదు శీర్ణతల్పంబు నిద్రయును గీడు. 105

ప్రతిపదార్థం: దంతధావనము= పండ్లు తోముట; మూత్రపురీష సర్జనంబులు= మూత్రం, మలం వదలటాలు; మౌని= మౌనం కలవాడు; ఐ= అయి; చేయువలయున్= చేయాలి; ఉభయ సంధ్యలన్= రెండు సంధ్యవేళలలోను; నిద్రింపన్+చనదు= నిద్రపోరాదు; రేపు= ఉదయకాలంలో; తండ్రికిన్= తండ్రికి; మ్రొక్కి= నమస్కరించి; ఆచార్య విప్రులకున్= వేదవిద్యలు నేర్పే గురువునకు, ఉత్తమ విద్యగల బ్రాహ్మణుడికి; వరుసన్= క్రమంగా; మఱి= తరువాత; మ్రొక్కునది= నమస్కరించాలి; వీరికిన్= వీరికి; ఎఱఁగుట= నమస్కరించటం; తక్క= తప్ప; దేవ+అర్చనంబునకున్= దేవతల పూజకు; మున్ను= ముందు; అన్యుకడకున్= ఇతరుల యొద్దకు; చనన్+కాదు= పోరాదు; గర్భిణీ సంయోగము= గర్భవతియైన భార్యను కలవటం; ఒప్పదు= కూడదు; పరిణయంబునకున్= పెండ్లికి; మున్= మునుపు; సురతసుఖమున్= రతిసుఖాన్ని; అనుభవించినన్= అనుభవిస్తే; 'అవకీర్ణ' అందురు= 'అవకీర్ణ' అని పిలుస్తారు; అట్టి అఘము= అటువంటి పాపం; ప్రాయశ్చిత్తము+ఆచరింపన్= ప్రాయశ్చిత్తం చేసుకుంటే; పోవున్= పోతుంది; ఉత్తరము= ఉత్తరం వైపు; పడమర= పడమటి దిక్కుగాను; తలయున్+కన్=తల ఉండే విధంగా; శయింపన్ తగదు= పడుకొనరాదు; శీర్ణతల్పంబు, నిద్రయును= శిథిలమైన ప్రక్కగల నిద్రకూడా; కీడు= చెడ్డది.

తాత్పర్యం: పండ్లు తోముట, మూలమూత్రాలను వదలటం మౌనంతో చేయాలి. రెండు సంధ్యలలో నిద్రపోరాదు. ప్రతిదినం ఉదయకాలంలో తండ్రికి, ఆచార్యుడికీ, ఉత్తమ బ్రాహ్మణుడికి నమస్కరించాలి. ఇట్లా నమస్కరించటం తప్ప దేవతార్చనకు ముందు ఎవరి దగ్గరకూ వెళ్ళరాదు. గర్భవతియైన భార్యతో సంగమం పొందరాదు. పెండ్లికి ముందు స్త్రీ సుఖం పొందితే అట్టి వ్యక్తిని అవకీర్ణ అంటారు. ఆ పాపానికి ప్రాయశ్చిత్తం చేసికొనాలి. ఉత్తరంవైపు పడమటివైపు తలపెట్టి పడుకొనరాదు. కుక్కి మంచంమీద నిద్రపోవటం చేటు.

విశేషం: తండ్రికి - దీనిని ఉపలక్షణంగా తీసికొని 'తల్లికి' కూడా నమస్కరించటం విధి అని గ్రహించాలి. అవకీర్ణ - ఇది స్త్రీ పురుషు లిద్దరికీ వర్తిస్తుందని గ్రహించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. సిత పీతంబులు ధార్యము । లతులమతీ! కుసుమకోటియందుఁ గృతస్నా

నత రే పాపము శుచితా । చ్యుతుఁడగు సుస్నాతుఁడేని నొడలు దొడసినన్. 106

ప్రతిపదార్థం: అతులమతీ!= సాటిలేని బుద్ధి విశేషం కల ఓ ధర్మరాజా!; కుసుమకోటియందున్= పూలసముదాయంలో; సిత, పీతంబులు= తెల్లనివి, పసుపు వన్నె కలవీ; ధార్యములు= ధరింపదగినవి; రే= రాత్రియందు; కృతస్నానత= స్నానం చేసినవాడు కావటం; పాపము= పాపం; సుస్నాతుఁడు ఏనిన్= చక్కగా స్నానం చేసినవాడైనా; ఒడలు= దేహాన్ని; తొడసినన్= నీటితో తుడిచినా; శుచితాచ్యుతుఁడు= పరిశుద్ధతనుండి జారినవాడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: పువ్వులలో తెల్లనివీ, పచ్చని వన్నె కలవీ ధరింపదగినవి. రాత్రివేళ స్నానం పాపం. రాత్రివేళ స్నానం చేసినా, ఒళ్ళు నీటితో తుడిచినా శుచిత్వం నుండి జారినవాడవుతాడు.

తే. నీళ్ళ నాడక మును పూఁత నిందితంబు । సీర తడితో విదిర్చుట సెట్ట; యొరులు

గట్టి విడిచిన వస్త్రంబు గట్టఁ గాదు । మడత మార్చు టొప్పదు కడుమాపు డైన. 107

ప్రతిపదార్థం: నీళ్ళన్+ఆడక మును= స్నానం చేయకముందు; పూఁత (మేనికి సుగంధ ద్రవ్యాలు) పూసుకొనటం; నిందితంబు= దోషం, చీర= వస్త్రాన్ని; తడితోన్= తడితో; విదిర్చుట= విదిలించటం; చెట్ట= చెడుపని; ఒరులు= ఇతరులు; కట్టి= ధరించి; విడిచిన వస్త్రంబున్= విడిచిన బట్టను; కట్టన్= కట్టటం; కాదు= కూడదు; కడు మాపుడు+ఐనన్= బాగా మాసిపోయినదైనా; మడతన్= మడిబట్టను; మార్చుట= మార్చటం; ఒప్పదు= పనికిరాదు.

తాత్పర్యం: స్నానం చేయకుండా మైపూతలు వాడటం దోషం. బట్టను తడితో విదిలించటం చెడ్డపని. ఇతరులు కట్టినబట్టను కట్టరాదు. బాగా మాసినా మడిబట్టలను మార్చరాదు.

విశేషం: మడత - ఇత్యాది. ప్రత్యేకించి దేవతాపూజ మొదలైన పనులకొరకు తడిపి ఆరేసిన వస్త్రాలను మడతలు అంటారు. అవి మాసినాయని వాటిని తీసివేసి మామూలు వస్త్రాలు ధరించి పూజాదికాన్ని చేయరాదని భావం.

క. వలవదు వటపిప్పలముల । ఫలములు నమలంగ మేడిపండ్లును దగ; దా

వుల మేకల నెమిళుల యెఱ । చులుఁ గానివి యవిహితంపుఁ జోటుల నధిపా! 108

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; వట పిప్పలముల ఫలములు= మర్రి, పిప్పలి పండ్లు; నమలంగన్= నమలటం; వలవదు= కూడదు; మేడిపండ్లును= మేడిచెట్టు పండ్లు కూడా; తగదు= తినరాదు; ఆవుల, మేఁకల, నెమిళుల+ఎఱచులున్= ఆవుల, మేకల, నెమళ్ళ మాంసాలు; అవిహితము+చోటులన్= పగ ఉన్న తావులలో; కానివి= చేయరానివి.

తాత్పర్యం: రాజా! మర్రిపండ్లు, పిప్పళ్ళు, మేడిపండ్లు తినరాదు. శత్రుస్థానాలలో ఆవుల, మేకల, నెమళ్ళ మాంసాలు పనికి రానివి.

క. విను మొరు మూ చూ । చిన భోజ్యము నింద్య; మన్యచిత్తము తోడం

గొనఁదగ దాహారము; పా । త్తునఁ గుడుచుట యఘము గూడు దూషించుటయున్. 109

ప్రతిపదార్థం: వినుము= విను; ఒరు మూ చూచిన భోజ్యము= ఇతరుడు వాసన చూచిన ఆహారపదార్థము; నింద్యము= చెడినది (గా భావింపదగినది); ఆహారము= భోజనం; అన్యచిత్తముతోడన్= పరధ్యానంతో; కొనన్= తీసికొనటం (తినటం); తగదు= కూడదు; పొత్తునన్= ఒక్కకంచంలో; కుడుచుట= తినటము; కూడున్= తినే పదార్థాన్ని; దూషించుటయున్= నిందించటమూ; అఘము= పాపం.

తాత్పర్యం: "ఇతరులు వాసన చూచిన భోజనం నిందించదగినది. పరధ్యానంతో ఆహారము తీసికొనదగదు. ఒకేపాత్రలో ఇతరులతో కలిసి (పొత్తున) భుజించడం కూటిని దూషించడం పాపాలు"

విశేషం: మూ చూచిన ఇట్టి పదార్థాన్ని ఉచ్ఛిష్టం అంటారు. పరుడు వాసన చూచిన అన్నంలో వాడి అంతర్గత శరీరదోషాలు దానితో సంక్రమించే అవకాశం ఉంటుంది. అన్యచిత్తము - అన్నం మనస్సును, దేహాన్నీ చక్కగా పెంచుతుంది. పరధ్యానంతో ఉంటే ఆ ప్రయోజనాలు చెడిపోతాయి. ఒకే కంచంలో భుజించడం. ఇది ఆరోగ్యానికి మంచిదికాదు.

క. చేతఁగొని యుప్పు నమలుట, రాతిపయిని నుప్పు గొనుట, రాత్రి దధిమధూ
పేతంబుగఁ గుడుచుట, ధ । ర్మేతరములు; రేయి సక్తు వెగ్గు నరేంద్రా! 110

ప్రతిపదార్థం: నరేంద్రా! = రాజా!; ఉప్పున్= లవణాన్ని; చేతన్= చేతిలో; కొని= తీసికొని; నమలుట= నమలటం; రాతిపయినిన్ ఉప్పున్= రాతిమీద ఉన్న ఉప్పును; కొనుట= తినటం; రాత్రి= రేయి వేళ; దధి, మధు+ఉపేతంబుగన్= పెరుగు, తేనెలతో కలసి ఉండునట్లుగా; కుడుచుట= తినటం; ధర్మ+ఇతరములు= అధర్మాలు; రేయి= రాత్రిపూట; సక్తువు= పేలపిండి; ఎగ్గు= కీడు చేస్తుంది.

తాత్పర్యం: చేతితో ఉప్పును గ్రహించి నమలటమూ, రాతిమీద ఉన్న ఉప్పును తినటమూ, రాత్రిపూట పెరుగు, తేనెలతో భుజించటమూ దుష్టకార్యాలు. రాత్రివేళ పేలపిండి కీడు చేస్తుంది.

విశేషం: ఉప్పు చాలా శీఘ్రముగా రోగక్రిములను ఆకర్షిస్తుంది. కనుక ఇతరుల చేతినుండి, బాగా సూక్ష్మక్రిములు వ్యాపించే రాయి మొదలైనవాటినుండి తీసికొనవద్దని నిషేధించి ఉంటారు. పెరుగు, తేనెలు తేలికగా జీర్ణం కాని పదార్థాలు కాబట్టి వాటిని రాత్రివేళ తింటే అజీర్ణరోగం రావచ్చును.

క. ఒకళులు సూచినయది వా । రికిఁ బెట్టక నమలుటయును బ్రీతిం దన పం
క్తికిఁ దెచ్చిన చుట్టలు వే । ఱొక భంగిం గుడువఁ గుడుపు నుఱు విషభుక్తిన్. 111

ప్రతిపదార్థం: ఒకళులు= ఇతరులు; చూచిన+అది= చూచిన ఆహారపదార్థాన్ని; వారికిన్= వారికి; పెట్టక= పెట్టకుండా; నమలుటయున్= తినటమూ; ప్రీతిన్= ప్రేమతో; తన పంక్తికిన్= తన వరుసకు; తెచ్చిన చుట్టలు= తెచ్చిన చుట్టాలు; వేఱు+ఒక భంగిన్= మరొక పద్ధతిలో; కుడువన్= తింటూ ఉంటే; కుడుపున్= తాను తినటమూ; విషభుక్తిన్= విషం తినటాన్ని; ఉఱున్= పోలుతుంది.

తాత్పర్యం: ఇతరులు చూచిన పదార్థాన్ని వారికి పెట్టకుండా తానొక్కడే తినటమూ, ప్రేమతో తన పంక్తికి వచ్చిన చుట్టాలు హీనమైన పదార్థాలు తింటూ ఉండగా తాను మేలి పదార్థాలు తినటమూ విషం తినటంతో సమానం అవుతాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ భారతధర్మం చాలా సూక్ష్మంగా ఆలోచింపదగినది. 'చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష' అన్న భావాన్ని భారతధర్మం ఎన్నటికీ అంగీకరించదు. 'అందరి సుఖమే ఆత్మసుఖం' అనే ధోరణి భారతీయులది.

క. నేయు మధువు సక్తువు దధి । పాయసము జలంబు భుక్తపరిశిష్టము భూ
నాయక! యేరికి నిడఁ దగ । దాయువు పెంపారఁ గోరు టాత్మఁ గలిగినన్. 112

ప్రతిపదార్థం: భూనాయకా!= రాజా!; ఆయువు= బ్రదుకు కాలం; పెంపారన్= అభివృద్ధి చెందటం; కోరుట= కోరటం; ఆత్మన్= బుద్ధిలో; కలిగినన్= కలిగితే; నేయున్= నేతిని; మధువున్= తేనెనూ; సక్తువున్= పేలపిండినీ; దధి= పెరుగునూ; పాయసమున్= పరమాన్నాన్నీ; జలంబు= నీటినీ; భుక్తపరిశిష్టమున్= తినగా మిగిలిన వీటిని; ఏరికిన్= ఎవరికీ; ఇడన్ తగదు= పెట్టరాదు.

తాత్పర్యం: రాజా! ఆయువును పెంచుకొనే కోరిక ఆత్మలో ఉంటే, నేయి, పేలపిండి, పెరుగు, పాయసం, నీరు - అనే వస్తువులలో తినగా మిగిలినవాటిని ఎవరికీ పెట్టరాదు.

విశేషం: తాను తినగా మిగిలినదానిని 'ఉచ్ఛిష్టం' అంటారు. ఎంగిలి అని కూడా దానికి వ్యవహారం. దానిలో తన శరీరరోగ దోషాలు సంక్రమిస్తాయి. పైన పేర్కొన్న పదార్థాలతో ఆ దోషం మరింత ఎక్కువగా ఉండే లక్షణాన్ని సంభావించి ఈ నిషేధం చెప్పి ఉంటారు.

తే. అంగుళాగ్రముల్ చిటికెనలందు మొదళు । లనఘ! దేవర్షి తీర్థము లనఁగఁ బరఁగు
వరుస వలకేలి యుప్పలవాయి పైతృ । కంపుఁదీర్థంబు తర్పణకార్యమునకు. 113

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; తర్పణ కార్యమునకున్= తర్పణం అనే పనికి; అంగుళ+అగ్రముల్= వ్రేళ్ళకొనలు; చిటికెనలందున్= చిటికెన వ్రేళ్ళయందు; మొదళులు= మొదటి భాగాలు; వరుసన్= వరుసగా; దేవ+ఋషి తీర్థములు= దేవతీర్థములు; ఋషి తీర్థములు; అనఁగన్+పరఁగున్= అన్న పేరుతో ఒప్పుతాయి; వలకేలి= కుడిచేతి; ఉప్పలవాయి= చూపుడు వ్రేలికి బొటనవ్రేలికి మధ్యనున్న భాగం; పైతృకము+తీర్థంబు= పితృదేవతల తీర్థం.

తాత్పర్యం: పుణ్యాత్మా! తర్పణకార్యాలలో వ్రేళ్ల తుదలను దేవతీర్థం అంటారు. చిటికెనవ్రేళ్ళ మొదటి భాగాలను ఋషితీర్థాలంటారు. కుడిచేతిలో చూపుడు, బొటన వ్రేళ్ళ మధ్యభాగాన్ని పితృతీర్థం అంటారు.

విశేషం: దేవతలకు తర్పణం చేసేటప్పుడు వ్రేళ్ళ చివళ్ళమీదుగా నీళ్ళు వదలాలి. ఋషులకు తర్పణం చేసే సమయంలో చిటికెన వ్రేళ్ల మొదటి కణుపుల మీదుగా నీళ్ళు వదలాలి. పితృదేవతల తర్పణంలో బొటనవ్రేలికి చూపుడు వ్రేలికి నడుమ ప్రదేశంనుండీ నీళ్ళు వదలాలి అని పద్యం తాత్పర్యం. తీర్థం అంటే పవిత్రస్థలం.

క. ఆచమనపూర్వకంబుగ । నాచరణీయంబు సర్వ మగుతర్పణమున్
వాచః పరుషత క్రోధం । బాచార విధిజ్ఞు లఘము లండ్రు కుమారా! 114

ప్రతిపదార్థం: కుమారా!= నాయనా!; సర్వము= అన్నివిధములది; అగు తర్పణమున్= అయిన తర్పణమూ; ఆచమన పూర్వకంబుగన్= 'ఆచమనం' అనే కార్యం ముందు కలిగేటట్లుగా; ఆచరణీయంబు= చేయదగింది; ఆచార విధిజ్ఞులు= ఆచారం విధానాలను చక్కగా తెలిసినవారు; వాచఃపరుషత= మాటలలో పరుషత్వమూ; క్రోధంబు= కోపము; అఘములు= పాపాలు; అండ్రు= అంటారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అన్ని విధములైన తర్పణాలనూ ఆచమనం చేసిన తరువాతనే చేయాలి. ఆచారాల విధానాలు ఎరిగినవారు మాటలలో కటువుతనమూ, కోపమూ పాపాలని అంటారు.

విశేషం: ఆచమనం - కేశవాది నామాలు ఉచ్చరిస్తూ మూడు మారులు చిన్న ప్రమాణంలో నీరు పుచ్చుకోవటం. ఆచమనం చేసిన తరువాతనే తర్పణం చెయ్యాలి - అని తాత్పర్యం. పరుషంగా పలకటం, క్రోధం తాల్చటం ఎప్పుడూ పాపాలే కానీ సందర్భాన్ని బట్టి తర్పణాది కార్యాల సమయంలో వాటిని ఏ మాత్రమూ దరిచేరనీయరాదన్న సూచన తెలియవస్తున్నది.

క. దినమున సురతం బెయ్యెడఁ । జనదు; చెడిపఁ గన్యఁ గవయఁ జనదు; పతిత నం
టని దాని నగ్నఁ జూడం । జన దుమిసిన వార్పకునికి సక్షుతుఁడైనన్. 115

ప్రతిపదార్థం: దినమునన్= పగటివేళ; సురతంబు= భార్యను కలియుట; ఏ+ఎడన్= ఎన్నటికినీ; చనదు= కూడదు; చెడిపన్= చెడిపోయినదానిని; కన్యన్= వివాహము కానిదానినీ; కవయున్= కూడటం; చనదు= పనికిరాదు; పతితన్= శీలం చెడిన కాంతను; అంటనిదానిన్= ముట్టయినదానిని; నగ్నన్= బట్టలు లేనిదానిని; చూడన్+చనదు= చూడరాదు; ఉమిసినన్= ఉమ్మి వేసినా;సక్షుతుఁడు= తుమ్ము కలవాడు; ఐనన్= అయినా; వార్పక+ఉనికి= ఆచమనం చేయకపోవటం; చనదు= కూడదు.

తాత్పర్యం: పగటివేళ భార్యను కలియరాదు. శీలం చెడిన స్త్రీని, కన్యను కూడరాదు. పతితను, రజస్వలను, నగ్నంగా ఉన్న స్త్రీని చూడరాదు. ఉమ్మినప్పుడు, తుమ్మినప్పుడు ఆచమనం చేయకపోవటం తప్పు.

ఆ. అట్టియెడలఁ దనకు నాచమనము దొర । కొనకయున్న సూర్యుఁ గనుచుఁ బ్రణవ
కలనతోడఁ గూడ వలచెవి ముట్టుట । శుచిత నిచ్చు నండ్రు సూరిజనులు. 116

ప్రతిపదార్థం: అట్టి+ఎడలన్= అటువంటి సందర్భాలలో; తనకున్= తనకు; ఆచమనము= ఆచమనం చేయటం; దొరకొనక+ ఉన్నన్= కుదరకపోతే; సూర్యున్= సూర్యుడిని; కనుచున్= చూస్తూ; ప్రణవకలనతోడన్= ఓంకారం పలకటంతో; కూడన్= కూడగా; వలచెవి= కుడిచెవి; ముట్టుట= తాకటం; శుచితన్= పవిత్రతను; ఇచ్చున్= ఇస్తుంది; అని; సూరిజనులు= పండితులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: అటువంటి సందర్భాలలో ఆచమనం చేయటం సాధ్యం కాకపోతే సూర్యుడిని చూస్తూ, ఓంకారాన్ని పలుకుతూ, కుడిచెవిని తాకటం పవిత్రతను కలిగిస్తుందని పండితులు చెప్తారు.

ఆ. భగిని గురుని మిత్త్రుఁ బండితు వంశజుఁ । బేదపడినఁ దెచ్చి ప్రియముతోడఁ
దనగృహమున కల్మి కనురూపముగఁ బ్రోపు । పెనుపు సేయు నాయువునకు సిరికి. 117

ప్రతిపదార్థం: భగినిన్= సోదరిని; గురునిన్= గురువునూ; మిత్త్రున్= చెలికానినీ; పండితున్= పాండిత్యము కలవాడినీ; వంశజున్= తన వంశంలో పుట్టినవాడినీ, పేదపడినన్= పేదతనం పొందితే; ప్రియముతోడన్= ప్రీతితో; తెచ్చి= తీసికొని వచ్చి; తన గృహమున కల్మికిన్= తన ఇంటిలోని సంపదకు; అనురూపముగన్= తగినవిధంగా; ప్రోపు= పోషించటం; ఆయువునకున్= ఆయుస్సునకూ; సిరికిన్= సంపదకూ; పెనుపు= వృద్ధిని; చేయున్= చేస్తుంది.

తాత్పర్యం: సోదరి, గురువు, చెలికాడు, పండితుడు, జ్ఞాతి - అనేవారు దిక్కులేనివారయితే వారిని తీసికొని వచ్చి ప్రేమతో తన సంపద కనురూపంగా పోషించటం ఆయువునూ, సంపదనూ వృద్ధి చేస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ పనివలన ఆయువే కాదు. సంపద కూడా వృద్ధి పొందటం విశేషం. చాలామంది మరొకరిని పోషించవలసి వస్తే సంపద తరిగిపోతుందనుకుంటారు. కానీ అది నిజం కాదు. సౌజన్యసంపదవలన ఆర్థిక సంపద కూడా అభివృద్ధి అయ్యే అవకాశాలు ఎన్నో ఉంటాయి.

క. **పారావతములు శుకములు । శారికలును బుష్పలతలు జనవర! పసిఁడిం**
దారమున నైన ముట్టులు । నారయ గృహమంగళంబు లాదర్శములున్. **118**

ప్రతిపదార్థం: జనవర!= రాజా! పారావతములు=పావురాలు; శుకములు= చిలుకలు; శారికలును= గోరువంకలు; పుష్పలతలు= పూలతీగలు; పసిఁడిన్ దారమునన్= బంగారు తీగతో; ఐన ముట్టులు= ఏర్పడిన వస్తువులు; ఆదర్శములున్= అద్దాలు; అరయన్= పరిశీలించగా; గృహమంగళంబులు= ఇంటికి శుభం కలిగించే వస్తువులు.

తాత్పర్యం: రాజా! పావురాలు, చిలుకలు, గోరువంకలు, పూలతీగెలు, బంగారు తీగల వస్తువులు, అద్దాలు ఇంటిలో మంగళవస్తువులు.

తే. **గ్రువ్వ గ్రద్ద దివ్వారుపుఁ బ్రువ్వు గూబ । యిల్లు సొచ్చిన శాంతి సేయింప వలయుఁ**
జదువుఁ గుడుపును సందెలఁ జనదు రాత్రి । యైనఁ బితృకార్యములు సేయు టఘముఁ జేయు. **119**

ప్రతిపదార్థం: గ్రువ్వ= అడవి పావురము; గ్రద్ద= గ్రద్ద; దివ్వారుపు+ప్రువ్వు= దీపం ఆర్పే పురుగు; గూబ= గుడ్లగూబ; ఇల్లు= ఇంటిలోనికి; చొచ్చినన్= ప్రవేశిస్తే; శాంతి= మంత్రపూర్వకమైన కీడు తొలగే క్రియను; చేయింపన్ వలయున్= చేయించాలి; చదువున్= పఠనమును; కుడుపును= భోజనము; సందెలన్= సంధ్యాసమయాలలో; చనదు= చేయరాదు; రాత్రి; ఐనన్= అయితే; పితృకార్యములు - శ్రాద్ధములు; చేయుట= చేయటం; అఘమున్= పాపాన్ని; చేయున్= చేస్తుంది.

తాత్పర్యం: గువ్వ, గ్రద్ద, దీపం ఆర్పే పురుగు, గూబ ఇంటిలో ప్రవేశిస్తే శాంతి చేయించాలి. సంధ్యలలో చదవటం, తినటం పనికిరాదు. రాత్రివేళ శ్రాద్ధాలు చేయటం పాపం కలిగిస్తుంది.

క. **కులమును రూపము శీలముఁ । గల కన్య వరించి యందుఁ గనిన యపత్యం**
బులకుఁ దగ నడపునది మం । గళములు కృతదైవపైతృక క్రియుఁ డగుచున్. **120**

ప్రతిపదార్థం: కులమును= మంచి వంశము; రూపమున్= చక్కని అందచందాలు; శీలమున్= ఉత్తమమైన నడవడీ; కల కన్యన్= ఉన్న కన్నెను; వరించి= ఎన్నుకొని వివాహం ఆడి; అందున్= ఆమెయందు; కనిన+అపత్యంబులకున్= కన్న సంతానానికి; కృత, దైవ, పైతృక క్రియుఁడు= దైవకార్యాలు, పితృకార్యాలూ నిర్వహించినవాడు; అగుచున్= అవుతూ; మంగళములు= శుభకార్యములు; తగన్= తగువిధంగా; నడపునది= చేయాలి.

తాత్పర్యం: మంచి కులమూ, రూపమూ, శీలమూ గల కన్యను వరించి ఆమెయందు పొందిన సంతానానికి, ముందు దైవకార్యాలు, పితృకార్యాలు ఆచరించినవాడై శుభకార్యాలు నిర్వహించాలి.

విశేషం: మంగళములు - వివాహం మొదలైనవి, అపత్యం - 'న పతన్తి అనేన పితరః నరకే' అని ఈ శబ్దానికి వ్యుత్పత్తి. పితరులు దీనిచేత నరకంలో పడరు.

తే. వలయుఁ బ్రాఙ్ముఖోదఙ్ముఖత్వముల నొకటి। తారకంబులుఁ దిథులును వారములును

జోస్యు లెఱిఁగించినవి మేలు సువ్రతైక। లోల! మంగలి పనికిని దైలమునకు. 121

ప్రతిపదార్థం: సువ్రత+ఏకలోల!= శ్రేష్ఠములైన వ్రతములయందు మాత్రమే ఆసక్తి కల ఓ ధర్మరాజా!; మంగలిపనికిని= క్షౌరమునకు; తైలమునకున్= తలంటుపనికిని; ప్రాక్+ముఖ, ఉదక్+ముఖత్వములన్= తూర్పుమొగం, ఉత్తరపుమొగం కావటములలో; ఒకటి= ఒక్కటి; వలయున్= ఉండాలి; తారకంబులున్= నక్షత్రాలు; తిథులును= తిథులును; వారములును= వారాలూ; జోస్యులు= జ్యోతిశ్శాస్త్ర వేత్తలు; ఎఱిఁగించినవి= తెలిపినవి; మేలు= మంచివి.

తాత్పర్యం: రాజా! నీవు మంచివ్రతములయందు మాత్రమే మిక్కిలి ఆసక్తి కలవాడవు. కనుక వినుము. క్షురకర్మ, అభ్యంగస్నానం అనే పనులకు తూర్పునకు గానీ, ఉత్తరానికి గానీ మొగంపెట్టి కూర్చొనాలి. ఏ నక్షత్రాలు, తిథులు, వారాలు మేలైనవో జ్యోతిష్కులు చెప్పిన వాటిని తెలిసికొని పాటించాలి.

క. వినుము సపిండీకరణ। మ్మున నేకోద్దిష్టమునను భోజనవిధి వ

ర్జన మొప్పు; నామతింపక। చన దామెతఁ గుడువఁ బోవ సజ్జనవినుతా! 122

ప్రతిపదార్థం: సజ్జన వినుతా!= సజ్జనుల మంచి నుతికల ఓ ధర్మరాజా!; వినుము= విను; సపిండీకరణమ్మునన్= సపిండీకరణం అనే క్రియ జరిగిన రోజున; ఏక+ఉద్దిష్టమునను= ఏకోద్దిష్టశ్రాద్ధం చేసిన రోజున; భోజనవిధి వర్జనము= భోజనం పనిని మానటం; ఒప్పున్= మేలవుతుంది; ఆమతింపక= పిలువకుండా; ఆమెతన్= విందును; కుడువన్= తినటానికి; పోవన్= పోవటం; చనదు= కూడదు.

తాత్పర్యం: రాజా! వినుము. సపిండీకరణం, ఏకోద్దిష్టశ్రాద్ధం చేసిన రోజులలో భోజనం మానటం మంచిది. పిలువకుండా విందుభోజనాలకు పోరాదు.

విశేషం: సపిండీకరణం - క్రొత్తగా చనిపోయినవారికి పెట్టిన పార్వణపు పిండాన్ని (అన్నపుముద్దను) వారి పూర్వులు, చనిపోయినవారు ఆయన తండ్రి, తాతలకు ఉద్దేశించిన పిండాలతో కలపటం అనే శ్రాద్ధక్రియ. వారిని క్రమంగా వసు, రుద్ర, ఆదిత్యరూపాలు అంటారు. ఏక+ఉద్దిష్టశ్రాద్ధం అంటే ఒక వ్యక్తి మరణించిన పదవరోజున అతడిని మాత్రం ఉద్దేశించి చేసే శ్రాద్ధం. సాధారణంగా ఇతర శ్రాద్ధాలలో వర్గానికి శ్రాద్ధం పెట్టుతారు. వర్గం అంటే పితృ, పితామహ, ప్రపితామహులు ఇత్యాది.

క. తల్లికిఁ దండ్రికి సుతులకు। నెల్ల విధంబులను వలయు హితములు సెప్పన్

మల్లకుఁడు గాక కర్జము। సల్లభ్యము గాఁగఁ జూచి సౌజన్యనిధీ! 123

ప్రతిపదార్థం: సౌజన్యనిధీ!= మంచితనపు గనియైన ఓ ధర్మరాజా!; మల్లకుఁడు= కఠినచిత్తం కలవాడు; కాక= కాకుండా; కర్జము= కార్యము; సత్+లభ్యము= చక్కగా పొందదగినది; కాఁగన్= అయ్యేటట్లు; చూచి= పరీక్షించి; తల్లికిన్= అమ్మకు; తండ్రికిన్= తండ్రికి; సుతులకున్= కొడుకులకు; ఎల్లవిధంబులను= అన్ని తీరులలో; హితములు= మంచిమాటలు; చెప్పన్ వలయున్= తెలుపదగును.

తాత్పర్యం: కఠినహృదయుడు కాకుండా, కార్యాన్ని చక్కగా సాధించే తలపుతో, తల్లికైనా, తండ్రికైనా, కొడుకులకైనా

మేలైన ఉపదేశాలు చేయవచ్చు.

విశేషం: సుతులకు అన్నదానిలో అవసరాన్ని బట్టి సుతలను కూడా కలుపుకొనాలి.

సీ. **క్షత్రియుం డశ్వంబు గజమును రథమును । నెక్కు నేర్పులు గనుఁ బెక్కు గఱచి**
నానాయుధాభ్యాస నైపుణంబునఁ బొల్చి । యుద్ధతంత్రములకు నోహటింప
కుండెడు మదిఁ బేర్చి దండనీతికి బోధ । కంబగు నట్టి శాస్త్రంబు మొదలు
గాఁగ గాంధర్వంబు గామమంత్రంబు లో । నుగ శాస్త్రముల నెల్లఁ దగిన భంగి

ఆ. **నలవరించి మున్న యధ్యయనంబునఁ । జొరవ గలిగి ధర్మచరణవేది**
యై ప్రజాభిరక్ష యధ్వరకరణంబు । వలను మెఱసి నడవవలయు నధిప! **124**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; క్షత్రియుండు= క్షత్రజాతివాడు; అశ్వంబున్= గుర్రాన్నీ; గజమును= ఏనుగును; రథమును= రథాన్నీ; ఎక్కు నేర్పులు= ఎక్కేనేర్పులను; కనున్= పొందుతాడు; పెక్కు= అనేకములను; కఱచి= నేర్చుకొని; నానా+ఆయుధ+ అభ్యాస నైపుణంబునన్= పెక్కైన ఆయుధాల ప్రయోగాల యందలి పాండిత్యంతో; పొల్చి= రాణించి; యుద్ధతంత్రములకున్= పోరులలోని మెలకువ పనులకు; ఓహటింపక= వెనుదీయక; ఉండెడు మదిన్= ఉండే బుద్ధితో; పేర్చి= అతిశయించి; దండనీతికిన్= రాజనీతికి (శిక్షాస్మృతికి); బోధకంబు= ఉపదేశం చేసేది; అగు+అట్టి శాస్త్రంబు= మొదలుకాఁగన్= మొదటిది అయ్యేటట్లుగా; గాంధర్వంబు= సంగీతాన్ని; కామతంత్రంబు= కామశాస్త్రము, లోనుగన్= మొదలుగా; శాస్త్రములన్, ఎల్లన్= సకల శాస్త్రాలను; తగిన భంగిన్= ఉచితమైన పద్ధతిలో; అలవరించి=పట్టుకొని; మున్ను+అ= ముందే; అధ్యయనంబునన్= వేదం నేర్పటంలో; చొరవ= మంచి ప్రవేశం; కలిగి= పొంది; ధర్మ చరణ వేది= ధర్మపు ప్రవర్తనను చక్కగా తెలిసినవాడు; ఐ= అయి; ప్రజా+అభిరక్ష= ప్రజలను నిండుగా కాపాడుట; అధ్వకరణంబు= యజ్ఞాలు చేయటం అనువాటిలో; వలను= నేర్పు; మెఱసి= అతిశయించి; నడవవలయున్= నడవాలి.

తాత్పర్యం: రాజా! క్షత్రియుడు గుర్రాన్నీ, ఏనుగునూ, రథాన్నీ ఎక్కే నేర్పులను సాధించాలి. ఎన్నో విద్యలు నేర్చి సర్వాయుధాల ప్రయోగంలోని ప్రావీణ్యంతో ప్రకాశించాలి. శత్రువుల యుద్ధతంత్రాలకు బెదరిపోకుండా గుండెను దిటవు చేసికొనాలి. దండనీతికి మొదలైన అర్థశాస్త్రం వంటి శాస్త్రాలను, సంగీతవిద్యను, కామశాస్త్రాన్నీ ఇంకా తక్కిన సర్వశాస్త్రాలనూ తగిన విధంగా అభ్యాసం చేయాలి. వేదం చదవటంలో చక్కని నిపుణతను సాధించి, ధర్మప్రవృత్తిని బాగుగా ఎరిగినవాడై, ప్రజలను చక్కగా ఏలటం, యజ్ఞకార్యాలను మెలకువతో చేయటం అనే పనులలో ప్రావీణ్యం గడించాలి.

విశేషం: ఒక్క మాటలో క్షత్రియుడు సర్వవిషయాలలో అందరికంటె మిన్న అయిన పాండిత్యం గడించాలని భావం. అప్పుడు అతడు ఇతరులపై ఆధారపడవలసిన అవసరం ఉండదు. ఇతరుల వంచనకు లోబడని స్థితీ, దానివలన స్థిరత్వమూ సిద్ధిస్తాయి.

క. **విను వర్ణాచారంబుల । ననఘ! యిచటఁ దెలుపఁ దొడఁగ నైనను మును లీ**
పను లాయుర్వృద్ధికరము । లనుట కతన వలసె నీకునై చెప్పంగన్. **125**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; విను= ఆలకించుము; ఇచటన్= ఇక్కడ; వర్ణ+ఆచారంబులన్= వర్ణముల ఆచారాలను; తెలుపన్= తెలుపటానికి; తొడఁగను= సిద్ధపడను; ఐనను= అయినా; మునులు= మహర్షులు; ఈ పనులు= పైన చెప్పిన పనులు; ఆయుర్ వృద్ధికరములు= ఆయువును పెంపొందించునవి; అనుట కతనన్= అనటం కారణంగా; నీకున్+ఐ= నీకోసం; చెప్పంగన్ వలసెన్= చెప్పవలసి వచ్చింది.

తాత్పర్యం: రాజా! ఇక్కడ వర్ణాచారాలను చెప్పటం నా తలపు కాదు. అయినా మునులు పై చెప్పిన క్షత్రియ ధర్మాలు ఆయువును వృద్ధి పరచేవి అని చెప్పటంవలన వీటిని నీకోసం చెప్పవలసి వచ్చింది.

సీ. అధిప! రజస్వల నంటుట కల్మష । మాచరితస్నాన యైన సతిఁ జ
తుర్థదినంబున దోషాసమయమునఁ । జెందంగఁ దగు నండ్రు గొంద ఱార్యు
లేనవునాఁ డొంద నింతియు షష్ఠాహ । మునఁ బొంద మగవాఁడు బుట్టు వినుము
మఱియును సమవిషమములగు దివసంబు । లందోలిఁ బురుషుండు నంగనయును

తే. సంభవింతు రిట్టులు షోడశంబు దాఁక । నెల్లనాఁడును బుతుశక్తి యెడలకుండ
నెట్టి కార్యము గల్గిన బుతుమతీస । మాగమము దప్పనీకున్న నాయు వెక్కు. 126

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; రజస్వలన్= ముట్టయిన స్త్రీని (భార్యను); అంటుట= తాకుట; కల్మషము= పాపము; కొందఱు= కొందరు; ఆర్యులు= పూజ్యులు; ఆచరితస్నాన= చేసిన స్నానం కలది; ఐన సతిన్= అయిన భార్యను; చతుర్థదినంబునన్= నాలుగవరోజున, దోషా సమయమునన్= రాత్రివేళ; చెందంగన్= పొందటం; తగును= కూడును; అండ్రు= అంటారు; ఏనవునాఁడు= ఐదవరోజున; ఒందన్= కలసినట్లయితే; ఇంతియున్= స్త్రీ శిశువు; షష్ఠ+అహమునన్= ఆరవరోజున; పొందన్= పొందితే; మగవాఁడున్= మగశిశువూ; పుట్టున్= పుట్టుతారు; వినుము= ఆలకించుము; మఱియును= ఇంకనూ; సమవిషమములు= సరి, బేసి సంఖ్యలు; అగు దివసంబులందున్= అయిన రోజులలో; ఓలిన్= క్రమంగా; పురుషుండున్= మగవాడు; అంగనయును= స్త్రీయు; సంభవింతురు= పుట్టుతారు; ఇట్టులు= ఈ విధంగా; షోడశంబుదాఁకన్= పదునారవ రోజువరకు; ఎల్లనాఁడును= ప్రతిదినమూ; బుతుశక్తి= రజస్సుయొక్క శక్తి; ఎడలక+ఉండన్= పోకుండా; ఎట్టి కార్యము= ఎటువంటి పని; కల్గినన్= కలిగినా; బుతుమతీ సమాగమము= బుతువుగల భార్యతోడి కలయికను; తప్పనీక+ఉన్నన్= తప్పిపోకుండా ఉంటే; ఆయువు= జీవితకాలం; ఎక్కున్= వృద్ధి పొందుతుంది.

తాత్పర్యం: రజస్వల నంటటం పాపం. స్నానం చేసిన భార్యను నాల్గవదినాన రాత్రివేళ పొందాలి అని కొందరు పూజ్యులు అంటారు. అయిదవనాడు సమాగమం పొందితే స్త్రీ శిశువూ, ఆరవనాడు పొందితే మగశిశువు కలుగుతారు. ఇంకా వినుము. సరిరోజులలో భార్యను కలిసినట్లైతే మగపిల్లవాడూ, బేసి రోజులలో స్త్రీ శిశువూ కలుగుతారు. ఈ విధంగా పదహారవ రోజు వరకు స్త్రీ బుతువు వ్యర్థం కాకుండా, ఎన్ని పనులున్నా పురుషుడు బుతువుగల భార్యను పొందుతూఉంటే ఆయువు పెరుగుతుంది.

క. విను మాచార మవశ్యం । బును నడపఁగ వలయు ధర్మమున కది మూలం
బనఘా! ధర్మం బాయువుఁ । బెనుచును లక్ష్మిని యశంబుఁ బెంపొందించున్. 127

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; వినుము= ఆలకించుము; ఆచారము= చక్కని; క్రమబద్ధమైన నడవడిని; అవశ్యంబును= తప్పనిసరిగా; నడపఁగన్ వలయున్= ప్రవర్తింపజేయాలి; అది= ఆ ఆచారం; ధర్మమునకున్= ధర్మానికి; మూలంబు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కుదురు; ధర్మంబు= ధర్మము; ఆయువున్= బ్రతికే కాలాన్ని; పెనుచును= వృద్ధి చేస్తుంది; లక్ష్మిని= సంపదను, యశంబున్=కీర్తిని; పెంపొందించున్= పెరిగేటట్లు చేస్తుంది.

తాత్పర్యం: అనఘా! వినుము. ఆచారాన్ని తప్పనిసరిగా నడిపించాలి. అది ధర్మానికి కుదురు. ధర్మం ఆయువును పెంచుతుంది. సంపదను, కీర్తిని వృద్ధి చేస్తుంది.

తే. ఇన్ని యాచారములలోన నెక్కు డండ్రు। సకలభూతంబు లందును సదయుఁ డగుట
యాదిమును లట్లు గావున నఖిలవర్ణ। ములకు దయకల్మి పెద్దయు వలయుగుణము. 128

ప్రతిపదార్థం: ఆదిమునులు= మొట్టమొదటి జ్ఞానసంపన్నులు; ఇన్ని+ఆచారములలోనన్= ఆ అన్ని ఆచారాలలో; సకలభూతంబు లందును= సమస్త ప్రాణులయందు; సదయుఁడు= దయతో కూడినవాడు; అగుట= కావటం; ఎక్కుడు= మిన్న; అండ్రు= అంటారు; కావునన్= కనుక; అఖిలవర్ణములకున్= అన్నివర్ణాలవారికి, అన్ని వర్ణాలవారి విషయంలో; దయకల్మి= దయకలిగి ఉండటం; పెద్దయున్= మిక్కిలి పెద్దదైన; వలయు గుణము= ఉండవలసిన గుణం.

తాత్పర్యం: ఆదిమునులు ఆచారాలన్నింటిలో సర్వభూతాలపై దయ మిన్న అయిన దంటారు. కాబట్టి అన్ని వర్ణాల వారికీ అన్ని వర్ణాలవారి విషయంలో దయ కలిగి ఉండటం పెద్దగా ఉండవలసిన గుణం.

క. ఈ యాచారాధ్యాయం। బాయుశ్శ్రీకీర్తికారి యగుఁ బాపంబుల్
వాయం జేయును బృథివీ। నాయక! సద్భక్తిఁ జదివినను దగ వినినన్. 129

ప్రతిపదార్థం: పృథివీనాయక!= రాజా!; ఈ ఆచార+అధ్యాయంబు= ఈ ఆచారసంబంధమైన గ్రంథవిభాగం; సత్+భక్తిన్= మంచి భక్తితో; చదివినను= చదివినా; తగన్= బాగుగా; వినినన్= విన్నా; ఆయుస్, శ్రీ, కీర్తి కారి= ఆయువును; సంపదను, కీర్తిని కలిగించేది; అగున్= అవుతుంది; పాపంబుల్= పాపాలను; పాయన్ చేయున్= పోగొట్టుతుంది.

తాత్పర్యం: రాజా! ఈ ఆచారాధ్యాయమును మంచి భక్తితో చదివినా, తగువిధంగా విన్నా ఆయువు, సంపద, కీర్తి కలుగుతాయి. పాపాలను పోగొట్టుతుంది.

తే. అనిన బ్రీతుఁడై పాండునృపాగ్రతనయుఁ। డమరతటినీతనూజుతో నన్నదమ్ము
లేమివిధమునఁ దమలోన నెనసి నడచు। వార? లెఱిఁగింపు' మనుటయు గారవమున. 130

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; పాండు నృప+అగ్రతనయుఁడు= పాండురాజు పెద్దకొడుకు; ప్రీతుఁడు= ప్రీతి పొందినవాడు; ఐ= అయి; అమరతటినీ తనూజుతోన్= దేవనది కుమారుడగు భీష్ముడితో; అన్నదమ్ములు= సోదరులు; ఏమి విధమునన్= ఏ తీరున; తమలోనన్= తమలో; ఎనసి= పొందిక కలిగి; నడచువారలు?= ప్రవర్తిస్తారు?; ఎఱిఁగింపుము= తెలుపుము; అనుటయున్= అంటే; గారవమునన్= ప్రీతితో.

తాత్పర్యం: అని చెప్పగా ధర్మరాజు ప్రీతిపొంది, భీష్ముడితో 'అన్నదమ్ము లేవిధంగా తమలో తాము పొందిక కలిగి ప్రవర్తించవలెనో తెలుపుమా!' అనగా భీష్ముడు ప్రేమతో.

వ. అతం డతని కిట్లనియె. 131

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అతండు= భీష్ముడు; అతనికిన్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

క. 'విను భక్తియు వెఱపుఁ గలిగి । యనుజన్ములు పెద్దవాని నారాధింపన్
జనవర! యతండుఁ దమ్ములఁ । గొనియాడన్ సిరికిఁ బ ట్టగుదు రుజ్జ్వలులై. 132

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; విను= ఆలకించుము; అనుజన్ములు= తమ్ములు; భక్తియున్= గౌరవభావము; వెఱపున్=భయము; కలిగి; పెద్దవానిన్= అన్నను; ఆరాధింపన్= కొలువగా; అతండున్= అన్న కూడా; తమ్ములన్= తమ్ములను; కొనియాడన్= మన్నించగా; ఉజ్జ్వలులు= చక్కని ప్రకాశము కలవారు; ఐ= అయి; సిరికిన్= సంపదకు; పట్టు= స్థానం; అగుదురు= అవుతారు.

తాత్పర్యం: 'రాజా! వినుము. తమ్ములు అన్నయెడ భయభక్తులు కలిగి ఆరాధించాలి. అన్న తమ్ములను మన్నిస్తూ ఉండాలి. ఇట్లా అయితే ఆ అన్నదమ్ములు లోకంలో ప్రకాశిస్తూ సంపదకు స్థానం అవుతారు.

విశేషం: భక్తి, వెఱపు - 'పితృసమో జ్యేష్ఠః' - పెద్దవాడు తండ్రితో సమానుడు - కనుక తండ్రియందువలె భక్తి, ఏ తప్పుచేస్తే, ఏ విధమైన కోపం వస్తుందో అన్న భయమూ, అన్నయెడల కలిగి ఉండాలని తాత్పర్యం.

క. అనుజుఁ డొకఁడు వెంగలియై । నను దప్పెడుఁ గాని పెద్దనకుఁ గార్యజ్ఞా
ననిరూఢి లేక తక్కిన । ననుజన్ములు సిక్కువడుదు రవనీనాథా! 133

ప్రతిపదార్థం: అవనీనాథా!= రాజా!; అనుజుఁడు= తమ్ముడు; ఒకఁడు= ఒక్కడు; వెంగలి= బుద్ధిలేనివాడు; ఐనను= అయినా; తప్పెడున్= తప్పిపోతుంది; కాని= కానీ; పెద్ద+అనకు= జ్యేష్ఠుడికి; కార్య , జ్ఞాన నిరూఢి= పనులకు సంబంధించిన చక్కని తెలివి స్థిరంగా ఉండటం; తక్కినన్= చెడితే; అనుజన్ములు= తమ్ములు; చిక్కు+పడుదురు= ఇబ్బందుల పాలవుతారు.

తాత్పర్యం: రాజా! తమ్ము డొకడు బుద్ధిహీనుడైనా పెద్ద ప్రమాదం లేదు. కానీ అన్న కార్యజ్ఞానం దృఢంగా లేనివాడైతే తమ్ముళ్ళు ఇబ్బందుల పాలవుతారు.

విశేషం: అన్న నాయకుడు - నడపువాడు, తమ్ముళ్ళు - నేయులు నడపబడేవారు. నాయకుడు బుద్ధిహీను డయితే నడపబడే వారికి నాశనమే గతి - అని తాత్పర్యం.

చ. జనవర! యన్నదమ్ములు ప్రసన్నమతిం గలకల్మి పంచి కు
డ్చిన వినుతించు లోకములు; శ్రీయుఁ బొరింబొరిఁ బెంపు నొందు; లో
భనిరతిఁ బెద్ద కాసపడి పాడి దొఱంగినఁ బ్రాణగొడ్డపుం
బనులగు నవ్విధంబు మనపడ్డది కాదె జగం బెఱుంగఁగన్! 134

ప్రతిపదార్థం: జనవర!= రాజా! అన్న+తమ్ముడు= అన్నయును, తమ్ముడును; ప్రసన్నమతిన్= దుష్టభావాలు లేని బుద్ధితో; కల కల్మిన్= ఉన్న సంపదను; పంచి= చక్కగా విభాగించుకొని; కుడ్చినన్= అనుభవిస్తే; లోకములు= లోకాలు (జనులు); వినుతించున్= కొనియాడుతాయి; పొరిన్ పొరిన్= క్రమంగా; శ్రీయున్= సంపద కూడా; పెంపున్=వృద్ధిని; ఒందున్=పొందుతుంది; లోభనిరతిన్= పిసినిగొట్టుతనపు పట్టుదలతో; పెద్దకున్= అధికభాగానికి; ఆసపడి= కోరిక పొంది; పాడి= న్యాయం; తొఱంగిన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వదలివేస్తే; ప్రాణగొడ్డము+పనులు= ప్రాణానికి ముప్పుతెచ్చే పనులు; అగున్= అవుతాయి; ఆ+విధంబు= ఆ తీరు; జగంబు= లోకము; ఎఱుంగన్= తెలియునట్లుగా; మన పడ్డ+అది, కాదె!= మనం అనుభవించినదే కదా!

తాత్పర్యం: రాజా! అన్నదమ్ములు కలతలు లేని బుద్ధితో ఉన్న సంపదను చక్కగా పంచుకొని అనుభవించాలి. అప్పుడు లోకులు మెచ్చుతారు. సంపద కూడా క్రమంగా వృద్ధి పొందుతుంది. అట్లాకాక ఒకడు అత్యాశతో ఎక్కువ భాగాన్ని ఆపేక్షిస్తే ప్రాణాంతకపు పనులు ఏర్పడుతాయి. లోకమంతా ఎరిగినవిధంగా అది మనం అనుభవించిందే కదా!

విశేషం: ఇక్కడ వ్యంగ్యంగా భీష్ముడు ధృతరాష్ట్రుడి తప్పిదాన్ని సూచిస్తున్నాడు. ప్రసన్నమతి - ఉన్న సంపదలో ఒకడు నిష్కారణంగా ఎక్కువభాగాన్ని అపేక్షించటం కుళ్ళుబుద్ధి. నాకెంత అధికారం ఉన్నదో వాడికి కూడా అంతే ఉంది అనుకోవటం సమబుద్ధి.

తే. తండ్రి పిమ్మట నన్నయ తండ్రి పిన్న। వారలకు నెల్ల నాతనివనిత తల్లి
తల్లికడచన్న నని చెప్పి తాత మఱియు। మనుమనికి నిట్టులను నభిమన్యుపౌత్ర! 135

ప్రతిపదార్థం: తండ్రి పిమ్మటన్= తండ్రి తరువాత; అన్న+అ= అన్నయే; పిన్నవారలకున్= తమ్ములకు; ఎల్లన్= అందరికీ; తండ్రి= నాయన; తల్లి కడచన్నన్= అమ్మ చనిపోతే; ఆతని వనిత= అన్న భార్య; తల్లి= అమ్మ; అని; చెప్పి= బోధించి; అభిమన్యుపౌత్ర!= అభిమన్యుడి మనుమడవగు ఓ జనమేయా! తాత= తాత అయిన భీష్ముడు; మఱియున్= ఇంకా; మనుమనికిన్= మనుమడైన ధర్మరాజునకు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= చెబుతున్నాడు.

తాత్పర్యం: జనమేజయా! తండ్రి తరువాత అన్నయే తమ్ము లందరికీ తండ్రి. తల్లి చనిపోయిన పిమ్మట అన్న భార్యయే వారికి తల్లి అని చెప్పి, జనమేజయా! తాతయైన భీష్ముడు ఆ మనుమడికి ఇంకా ఇట్లా బోధించాడు.

విశేషం: 'అభిమన్యు పౌత్ర!' ఇది జనమేజయుడికి వైశంపాయనుడు చేసిన సంబోధన. అభిమన్యుడు లోకోత్తరవీరుడు. అతడి పౌత్రుడిగా తనను పిలిస్తే జనమేజయుడికి పరమానందం.

క. మానవనాయక! యగ్రజుఁ డైనను ననుజన్ముఁ డేని నన్యాయంబుం
బూని సహోదరులకుఁ గీ। డైన నతఁడు దండ్యుఁ డందు రవనీపతికిన్. 136

ప్రతిపదార్థం: మానవనాయక!= జననాయకా!; రాజా!; అగ్రజుఁడు= అన్న; ఐనను= అయినా; అనుజన్ముఁడు= తమ్ముడు; ఏనిన్= అయినా; అన్యాయంబున్= న్యాయవిరుద్ధం అయినదానిని; పూని= పట్టుకొని; సహ+ఉదరులకున్= అన్నదమ్ములకు; కీడు= ప్రమాదం చేసేవాడు; ఐనన్= అయితే; అవనీపతికిన్= రాజునకు; దండ్యుఁడు= దండింప బడదగినవాడు; అందురు= అంటారు.

తాత్పర్యం: రాజా! అన్నగానీ తమ్ముడు గానీ న్యాయం తప్పి అన్నదమ్ములకు కీడుచేస్తే వాడు రాజునకు శిక్షార్హుడవుతాడు.

విశేషం: 'మానవనాయక!' అన్న సంబోధనవల్ల ఇది చక్కగా గుర్తించి నీ ఏలుబడిలో ఇట్టి వాటిని పరిశీలించాలి అని సూచన.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని సహోదరప్రకారంబు సెప్పి వెండియు. 137

ప్రతిపదార్థం: అని; సహోదర ప్రకారంబు= అన్నదమ్ముల తీరు; చెప్పి= తెలిపి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: అని అన్నదమ్ములు వ్యవహరించవలసిన విధానాన్ని బోధించి, ఇంకా ఇట్లా అంటున్నాడు.

క. విను మప్పఁ దల్లియట్లుగఁ; గొని నడపఁగ వలయుఁ జన్ను గుడిపి పెనిచె నె
వ్వనిత యదియు నాతనికిని । జననీసమ యండ్రు బుధులు సౌజన్యనిధీ! 138

ప్రతిపదార్థం: సౌజన్యనిధీ!= మంచితనపు గనియైన వాడా!; వినుము= ఆలకించుము; అప్పన్= అక్కను; తల్లి+అట్లుగన్= తల్లివలెనే; కొని= భావించి; నడపఁగన్+వలయున్= చెల్లించాలి; ఏ+వనిత+= ఏ స్త్రీ; చన్ను కుడిపి= చనుపాలుత్రావించి, పెనిచెన్= పెంచినదో; అదియున్= ఆ స్త్రీ కూడా; అతనికిన్= ఆ పాలు త్రావినవాడికి; జననీసమ= తల్లితో సమానురాలు; అని; బుధులు= జ్ఞానము కలవారు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: సుజనుడా! అక్కను తల్లివలె భావించి మన్నించాలి. అట్లాగే పసితనంలో చన్నిచ్చి పెంచిన స్త్రీ కూడా తల్లితో సమానురాలే అని పండితులు చెప్తుతారు.

విశేషం: స్థూలంగా ధర్మరాజు అన్నదమ్ముల సంగతి అడిగినా ఆ వరుసలోని వారినిగూర్చి కూడా భీష్ముడు చెప్పటం భావగ్రాహి లక్షణం.

క. జనకుం డధికుఁ డుపాధ్యా । యునకుఁ బదిమడుంగు లెక్కు డుర్వీనాథా!
జనకునకు దశ గుణంబులు । జనని గురుత్వమున నిది ప్రశస్తము శ్రుతులన్. 139

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= రాజా!; జనకుండు= కన్నవాడు; ఉపాధ్యాయునకున్= చదువుచెప్పువాడికంటె; పది మడుంగులు= పదిరెట్లు; అధికుఁడు= ఎక్కువవాడు; జనని= తల్లి; జనకునకున్= తండ్రికంటె; గురుత్వమునన్= గొప్పతనంలో; దశగుణంబులు= పదిరెట్లు; ఎక్కుడు= మిన్న అయినది; ఇది= ఈ సంగతి; శ్రుతులన్= వేదాలలో; ప్రశస్తము= ప్రశంసకు వచ్చింది.

తాత్పర్యం: రాజా! ఉపాధ్యాయుడికంటె తండ్రి పదిరెట్లు ఎక్కువ మాన్యుడు. తండ్రికంటె తల్లి పదిరెట్లు గౌరవంలో మిన్న అయినది. వేదాలు ఈ విషయాన్ని ప్రశంసించాయి.

క. జననీజనకులచే నగు । జననం బాగమము దను విషయ మని చెప్పున్
విను మాచార్యు వలన నొం । దిన పు ట్టజరామరంబు దివ్యంబునగున్. 140

ప్రతిపదార్థం: ఆగమము= వేదము; జననీజనకులచేన్= తల్లిదండ్రులచేత; అగు జననంబు= అయిన పుట్టుక; తను విషయము= దేహమునకు సంబంధించినది; అని; చెప్పున్= చెప్తుతున్నది; వినుము= ఆలకించుము; ఆచార్యునివలనన్= గురువువలన; ఒందిన పుట్టు= కలిగిన జన్మ; అజరామరంబు= ముదిమి, చావు లేనిది; దివ్యంబున్= దేవలోక సంబంధం కలది; అగున్= అగును.

తాత్పర్యం: రాజా! తల్లిదండ్రులవలననైన జన్మ దేహసంబంధి అని వేదం చెప్తుతున్నది. ఆచార్యుడివలన నైన పుట్టుక ముసలితనమూ, చావులేనిది, దివ్యమైనది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఆచార్యుడు - శాస్త్రార్థాల నన్నింటినీ తనలో నింపుకొని వాటిని శిష్యుడితో ఆచరింపజేస్తూ స్వయంగా ఆచరించేవాడు ఆచార్యుడు.

'ఆచినోతి హి శాస్త్రాణి ఆచారే స్థాపయత్యపి,
స్వయ మాచరతే యస్తు స ఆచార్య ఇతి స్మృతః'

ఆచార్యవాన్ పురుషోవేద' అని శ్రుతి. ఆచార్యుడు గల పురుషుడే తత్త్వాన్ని తెలిసికొనగలడు. తల్లిదండ్రులు బంధహేతువైన దేహాన్నిస్తున్నారు. ఆచార్యుడు ఆ దేహసంబంధం లేని స్థితిని - మోక్షాన్ని ప్రసాదిస్తున్నాడు. కనుక ఆ పుట్టుక అజరామరమూ దివ్యమూ అవుతున్నది.

వ. కావున గౌరవంబున నాచార్యుండు సర్వాధికుండు. 141

ప్రతిపదార్థం: కావునన్= కనుక; గౌరవంబునన్= మాన్యతలో; ఆచార్యుండు= గురువు; సర్వ+అధికుండు= అందరికంటె ఎక్కువ అయినవాడు.

తాత్పర్యం: కనుక గౌరవంలో ఆచార్యుడు అందరికంటె మిన్న.

విశేషం: 139వ పద్యంలో చెప్పిన ఉపాధ్యాయుడు, 140వ పద్యంలో చెప్పిన ఆచార్యుడు ఒకరే అనుకోరాదు. ఉపాధ్యాయుడంటే లోకపు చదువులను చెప్పేవాడనీ, ఆచార్యుడు పరమార్థాన్ని బోధిస్తాడని తెలిసికోవాలి. లేకపోతే 'జనకుడు ఉపాధ్యాయునకు పది మడుంగులు' అన్న వాక్యానికీ 'గారవంబున ఆచార్యుండు సర్వాధికుండు' అన్న మాటకూ పరస్పరవైరుద్ధ్యం సిద్ధిస్తుంది.

క. అని యిట్లు సుప్రసంగం । బున గురుజన తారతమ్యములు సెప్పినఁ దా
విని శంతనుతనయున కి । ట్లనుఁ బాండు నృపాగ్రతనయుఁ డతులిత భక్తిన్. 142

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; సుప్రసంగంబునన్= మంచి ప్రసంగాన్ని బట్టి; గురుజన తారతమ్యంబులు= మన్నించ దగిన జనములలోని ఎక్కువతక్కువలను; చెప్పినన్= చెప్పగా; తాన్= తాను; విని= ఆలకించి; పాండు, నృప+అగ్ర తనయుఁడు= పాండురాజు పెద్దకొడుకు ధర్మజుడు; శంతనుతనయునకున్= శంతనుడి కుమారుడైన భీష్మడితో; అతులితభక్తిన్= సాటిలేని భక్తితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: అని మంచి ప్రసంగంలో గురుజనుల ఎక్కువతక్కువలను గూర్చి చెప్పగా ధర్మరాజు సాటిలేని భక్తితో భీష్మడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అతులిత భక్తిన్ - సర్వాధికుడైన ఆచార్యుడి స్థానంలో భీష్మడిని ధర్మరాజు సంభావించిన తీరు దీనివలన తెలియ వస్తున్నది.

క. 'భూసురులకు నృపులకు నుప । వాసము దగుఁ గాని యన్యవర్ణులకుఁ దదీ
యాసక్తి కలిమి పెద్దయు । దోసంబని విందు ధర్మధుర్యస్వాంతా! 143

ప్రతిపదార్థం: ధర్మ ధుర్య స్వాంతా!= ధర్మమును భరించు హృదయంకల ఓ తాతా!; భూసురులకున్= బ్రాహ్మణులకు; నృపులకున్= రాజులకు; ఉపవాసము= పస్తు ఉండటం; తగున్= చెల్లుతుంది; కాని; అన్యవర్ణులకున్= వేరు వర్ణాల వారికి;

తదీయ+ఆసక్తి కలిమి= దానిదైన తగులం ఉండటం; పెద్దయున్= అధికమైన; దోసంబు= తప్పు; అని; విందున్= వింటూ; ఉంటాను.

తాత్పర్యం: 'బ్రాహ్మణులకు, క్షత్రియులకు ఉపవాసము మంచిది. తక్కిన వర్ణాల వారికి కాదు. ఉపవాసాలమీద ఆసక్తి ఉండటం పెద్దదోషం అని నేను వింటూ ఉంటాను.

విశేషం: కృషి గోరక్ష, వాణిజ్యమూ, వృత్తులూ చేసికొనే జాతులవారు ఉపవాసాదుల జోలికిపోతే అది వృత్తి ధర్మానికి అడ్డుగా నిలుస్తుందని భావం.

భీష్ముఁడు ధర్మరాజున కుపవాసవిధివిశేషంబు సెప్పుట (స.13-163-3 (కుంభ))

వ. ఉపవాసవిధియోగ్యతయును దత్ఫల విశేషంబును వినవలతుం జెప్పవే యనుటయు నప్పురుషవరుం డప్పుడమి తేనితో, 'దీని నీవు నన్నడిగినట్ల యే నంగిరసు నడిగిన నమ్మునిపతి నాకుం జెప్పె నత్తెఱంగుఁ జెప్పెద నాకర్ణింపు' మని పలికి యిట్లనియె. 144

ప్రతిపదార్థం: ఉపవాసవిధి యోగ్యతయును= ఉపవాస నియమానికి తగినతనాన్ని; తద్‌ఫల విశేషంబును= దాని ఫలంయొక్క గొప్పతనాన్నీ; విన వలతున్= వినగోరుతున్నాను; చెప్పవే= దయతో చెప్పుము; అనుటయున్= అనగా; ఆ+పురుషవరుండు= ఆ మనుజశ్రేష్ఠుడు; ఆ+పుడమితేనితోన్= ఆ రాజుతో; దీనిన్= దీనిని; నీవు; నన్నున్; అడిగిన+అట్లు+అ= అడిగిన విధంగానే; ఏను= నేను; అంగిరసున్= అంగిరసుడనే మహర్షిని; అడిగినన్= అడిగితే; ఆ+మునిపతి= ఆ మహర్షి; నాకున్= నాకు; చెప్పెన్= బోధించాడు; ఆ+తెఱంగున్= ఆ పద్ధతిని; చెప్పెదన్= చెప్తాను; ఆకర్ణింపుము= చెవు లొగ్గి వినుము; అని; పలికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఉపవాస విధికి యోగ్యత, దాని గొప్పఫలము అనే వాటిని గూర్చి వినగోరుతున్నాను. చెప్పవూ!' అని అడిగితే భీష్మ డా రాజుతో ఇట్లా అన్నాడు. ఈ విషయం గురించి నీ వడిగినట్లే నేను అంగిరసు డనే మహర్షి నడిగాను. ఆయన నాకు చెప్పిన సంగతి నీకు వినిపిస్తాను. వినుము' అని ఇట్లా అన్నాడు.

క. రాత్రిత్రయంబు బ్రహ్మ । క్షత్రియులకు నుపవసింపఁ జనుఁ దదధికమున్
గాత్రస్థితిఁ దప్పింపని । మాత్ర నయిన మేలు కురుసమాజవరేణ్యా! 145

ప్రతిపదార్థం: కురుసమాజ వరేణ్యా!= కురువంశంలో గొప్పవాడా!; బ్రహ్మక్షత్రియులకున్= బ్రాహ్మణులకు, రాజులకు; రాత్రిత్రయంబు= మూడు రాత్రులు; ఉపవసింపన్= పస్తు ఉండటం; చనున్= తగును; తద్+అధికమున్= అంత కెక్కువ కూడా; గాత్ర స్థితిన్= దేహము స్థితిని; తప్పింపని మాత్రన్= చెడగొట్టని ప్రమాణం; అయినన్= అయితే; మేలు= మంచిది.

తాత్పర్యం: ధర్మరాజా! బ్రాహ్మణులు, క్షత్రియులు మూడు రాత్రులు ఉపవాసం చేయదగును. శరీరస్థితి చెడకుండా ఉంటే అంతకంటె ఎక్కువ చేసినా మంచిదే.

విశేషం: రాత్రిత్రయంబు అంటే మూడు పగళ్ళూ, మూడు రాత్రులూ అని భావం. గాత్రస్థితి - 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్' 'శరీరం మొదటి ధర్మసాధనం కదా!' అన్నారు. కనుక ఏ మాత్రమూ శరీరాన్ని భంగించేది కారాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విను వైశ్యులకును శూద్రుల । కును నాలుగు కుడుపు లుడుగు కొలఁదికి మిగులం

జన దుపవసింప నుపవా । సనిరూఢత పెంపు కల్మషము వారలకున్. 146

ప్రతిపదార్థం: విను= వినుము; వైశ్యులకున్= కోమటివారికిని; శూద్రులకున్= శూద్రులకునూ; నాలుగు కుడుపులు= నాలుగు భోజనాలు; ఉడుగు కొలఁదికిన్= వదలే లెక్కకు; మిగులన్= మించేటట్లుగా; ఉపవసింపన్ చనదు= ఉపవాసం ఉండ రాదు; ఉపవాస, నిరూఢత పెంపు= ఉపవాసమునందలి పట్టుదలను పెంచుకొనటం; వారలకున్= ఆ రెండువర్ణాల వారికి; కల్మషము= పాపం.

తాత్పర్యం: వైశ్యులు, శూద్రులు నాలుగు భోజనాలు వరకు మానవచ్చును. అంతకుమించి ఉపవాసపు పట్టుదలను పెంచుకొనటం వారికి పాపం.

విశేషం: నాలుగు కుడుపులు ఉడుగుట అంటే రెండు పగళ్ళూ, రెండు రాత్రిళ్ళు ఉపవాసం ఉండవచ్చునని భావం.

ఆ. పౌర్ణమాసిఁ బూర్వపక్షాష్టమీ చతు । ర్దశుల నుభయపక్ష వశత వచ్చు

షష్ఠిఁ బంచమిని సునిష్ఠమై నుపవాస । మున్న వివిధశుభము లొలయు నండ్రు. 147

ప్రతిపదార్థం: పౌర్ణమాసిన్= పూర్ణిమనాడు; పూర్వపక్ష+అష్టమీ, చతుర్దశులన్= శుక్లపక్షంలోని అష్టమినాడు, చతుర్దశినాడూ; ఉభయపక్షవశతన్= రెండుపక్షాలకు వశమై; వచ్చు షష్ఠిన్= వచ్చే షష్ఠినాడు; పంచమిని= పంచమితిథియందు; సునిష్ఠమైన్= దృఢమైన నిష్ఠతో; ఉపవాసము= పస్తు; ఉన్నన్= ఉంటే; వివిధశుభములు= పెక్కు రకాల మేళ్ళు; ఒలయును= కలుగును; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పూర్ణిమనాడు, శుక్లపక్ష అష్టమి, చతుర్దశి తిథులయందు, శుక్లకృష్ణ పక్షాలలో షష్ఠి, పంచమి తిథులయందూ, చెదరని నియమంతో ఉపవాసం ఉంటే ఎన్నోవిధాల శుభాలు కలుగుతాయని అంటారు.

విశేషం: 'సునిష్ఠమైన్= ఉపవాసం విషయంలో చాలామంది సర్దుబాటు ధోరణిలో ఉంటారు. దంభంకొరకు ఉపవాసాలు చేస్తారు. అవి పనికి మాలినవని ఈ పద్యం హెచ్చరిస్తున్నది.

సీ. ఏకభుక్తవ్రత మెంతయు నిష్ఠ మా । సం బెల్ల నడపిన సద్ద్విజుండు

సుభగాకృతియు రూపశోభితాంగనయు స । త్సుతులును ధనధాన్యతతులు భోగ

ములు సద్గుణంబులు భూరియశంబును । మొదలైన బహుశుభంబులకుఁ బాత్ర

మగు నేఁడుకాల మయ్యతులవ్రతము సల్పి । యఖిల భూలోకసౌఖ్యములుఁ ద్రిదివ

తే. మోదమును గండ్రు రెండును మూఁడు నాల్గు । నీ క్రమంబున నోపిన ట్లెక్కినట్టి

దినము లెడ పెట్టి కుడుచుచు ధృతి నొకేఁడు । నడపువారల తెఱఁగు లేర్పడఁగ వినుము. 148

ప్రతిపదార్థం: ఏకభుక్త వ్రతము= ఒక పూట భోజనం చేసే వ్రతాన్ని; ఎంతయున్= మిక్కిలి; నిష్ఠన్= నియమంతో; మాసంబు=నెల; ఎల్లన్= అంతా; నడపిన సత్ ద్విజుండు= చేసిన ఉత్తమబ్రాహ్మణుడు; సుభగ+ఆకృతియున్= అందమైన ఆకారం; రూప శోభిత+ అంగనయున్= గొప్ప సౌందర్యంతో విరాజిల్లే భార్య; సత్సుతులును= మంచి పుత్రులు; ధన ధాన్య

తతులు= ధనములు; ధాన్యాలు అనే వాటి రాశులు; భోగములు=సుఖాలు; సత్+గుణంబులు= మంచి గుణాలు; భూరి యశంబును= అధికమైన కీర్తి; మొదలు+ఐన= మొదలైన; బహుశుభంబులకున్= పెక్కు మంగళములకు; పాత్రము= యోగ్యతకలవాడు; అగున్= అగును; ఏఁడుకాలము= ఒక్క సంవత్సరకాలం; ఆ+అతుల వ్రతం= సాటిలేని ఆ వ్రతాన్ని; సల్పి= ఆచరించి; అఖిల భూలోక సౌఖ్యములు= సమస్తములైన భూలోకమందలి సుఖాలనూ; త్రిదివ మోదమును= స్వర్గంలోని ఆనందాన్నీ; కంద్రు= పొందుతారు, రెండును= రెండు రోజులు; మూఁడును= మూడు రోజులు; నాల్గున్= నాలుగు దినములు; ఈ క్రమంబునన్= ఈ వరుసలో; ఓపిన+అట్లు= శక్తి ఉన్న విధంగా; ఎక్కిన+అట్టి దినములు= పెరిగిన రోజులు; ఎడ పెట్టి= వ్యవధానం ఉంచి; కుడుచుచున్= తింటూ; ధృతిన్= ధైర్యగుణంతో; ఒక+ఏఁడు= ఒక్క ఏడాదికాలం; నడపువారల తెఱఁగులు= జరిపేవారి విధానాలు; ఏర్పడఁగన్= స్పష్టమయ్యే విధంగా; వినుము= వినుము.

తాత్పర్యం: రోజుకు ఒకమారు మాత్రమే భుజించటం అనే వ్రతాన్ని ఎంతో నిష్ఠతో ఒక నెలరోజులు చేసిన ఉత్తమ బ్రాహ్మణుడు మంచిరూపమూ; అందచందాలు గల భార్య; గుణవంతులైన కొడుకులూ; ధనధాన్యాలూ; సుఖాలూ, మంచిగుణాలూ; గొప్ప కీర్తి మొదలైన పెక్కు శుభాలకు పాత్ర మవుతాడు. ఈ సాటిలేని వ్రతాన్ని ఒక్క సంవత్సరకాలం చేసిన భూలోక సుఖాలన్నింటినీ, స్వర్గసుఖాలనూ పొందుతారు. అట్లాగే రెండురోజులు, మూడురోజులు, నాలుగురోజులు, ఈవిధంగా శక్తిమేరకు ఎక్కువ రోజులు వ్యవధానం ఉంచి తింటూ ధైర్యంతో ఒక సంవత్సరం వ్రతం చేసేవాళ్ళ పద్ధతులు వివరిస్తాను వినుము.

విశేషం: రూపశోభిత+అంగన= ఆవేధ్యము, ఆరోప్యము, విక్షేప్యము, బంధనీయము - అని నాలుగు విధాలైన ఆభరణాలు ధరించకపోయినా, ధరించినట్లు ప్రకాశించే అందాన్ని రూపం అంటారు. (ఆవేధ్యారోప్యనిక్షేప్య బంధనీయై రభూషితం, యేన భూషితవద్భాతి తద్రూపమితి కథ్యతే) అంగన - అన్న శబ్దంకూడా శ్రేష్ఠమైన అంగములు కలది అనే అర్థాన్నిస్తుంది.

క. ఎక్కుడు దినముల శుభములు । నెక్కు నఖిలవైభవములు నెక్కు దినమునం
దక్కక యుండెడు కాలము । నెక్కు మహాత్మతయు నెక్కు నిభపురనాథా! 149

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= హస్తిపురప్రభూ!; ఎక్కుడు దినములన్= అధికమైన దినములతో; శుభములున్= మంగళములునూ; ఎక్కున్= అధికం అవుతాయి; అఖిల వైభవములున్= సమస్తమైన భోగభాగ్యాలు కూడా; ఎక్కున్= మెండవుతాయి; దినమునన్= రోజులో; తక్కక+ఉండెడు కాలమున్= వ్యర్థమై పోకుండే కాలం; ఎక్కున్= పెరుగుతుంది; మహాత్మతయున్= గొప్ప ఆత్మ కలిగే తనంకూడా; ఎక్కున్= వృద్ధి అవుతుంది.

తాత్పర్యం: ధర్మరాజా! ఉపవాసదినాలు పెరిగిన కొలదీ శుభములు పెరుగుతాయి. సమస్తవైభవాలు అధికమవుతాయి. దినములో వ్యర్థం కాకుండా పోయేకాలం వృద్ధి అవుతుంది. మహాత్మత కూడా అతిశయం అవుతుంది.

విశేషం: తక్కక ఉండెడు కాలము - తక్కుట - తప్పిపోవటం - అంటే వ్యర్థం కావటం - అట్లా కాకుండా ఉండేకాలం పెరుగుతుంది.

తే. వత్సరం బెల్లఁ బక్షోపవాసనియతిఁ । గడపు నతనికిఁ బుణ్యలోకంబు లెల్ల
వాసభూములు మాసోపవాసవృత్తి । యైన బ్రహ్మలోకంబు సౌఖ్యంబు గలుగు. 150

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వత్సరంబు= ఒక ఏడు; ఎల్లన్= అంతా; పక్ష+ఉపవాస నియతిన్= పదునైదు రోజులకాలం ఉపవాసనియమంతో; కడపు+అతనికిన్= సాగించేవాడికి; పుణ్యలోకంబులు= ఉత్తమలోకాలు; ఎల్లన్= అన్నీ; వాసభూములు= నివాసం ఉండే తావులు; మాస+ఉపవాస వృత్తి= నెలరోజులు ఉపవాసం చేసేవాడు; ఐనన్= అయితే; బ్రహ్మలోకంబు సౌఖ్యంబు= బ్రహ్మలోకంలో ఉండే పరమసుఖం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఒక ఏడాదిపక్షం రోజుల చొప్పున ఉపవాస నిష్ఠతో గడిపేవాడికి పుణ్యలోకాలన్నీ నివాసభూము లవుతాయి. నెలరోజులు చొప్పున ఉపవాసం చేసేవాడికి బ్రహ్మలోకపు సుఖం లభిస్తుంది.

విశేషం: పక్షోపవాసం అంటే నెలలో ఒక పదునైదురోజులు ఉపవసించటం. పదునైదురోజులు భోజనం చేయటం అన్న వరుస అనీ, మాసోపవాసం అంటే ఒక నెల ఉపవాసం ఉండి తరువాతి నెల భుజించటం అనే క్రమాన్ని పాటించటం అనీ భావించాలి. మొదటిదానిలో 12 పక్షాలు ఉపవాసం 12 పక్షాలు భోజనం, రెండవదానిలో 6 మాసాలు ఉపవాసం 6 మాసాలు భోజనం అని తాత్పర్యం.

ఆ. ఎంత నిష్ఠ గలిగె నేనియు మాసంబు । లోనియంద యెక్కుడైన దినము
లధిప! యుపవసింపనగుఁ గాని మాసాధి । కోపవాసవృత్తి పాపమండ్రు. 151

ప్రతిపదార్థం: అధిప!= రాజా! ఎంతనిష్ఠ= ఎంతటి నిలుకడ (పట్టుదల); కలిగెన్+ఏనియున్= కలిగినప్పటికీ; మాసంబులోని+ అందు+అ= మాసంలోపలనే; ఎక్కుడు+ఐన దినములు= ఎక్కువ రోజులు; ఉపవసింపన్= భోజనం మాని ఉండటం; అగున్ కాని= తగునుకానీ; మాస+అధిక+ఉపవాస వృత్తి= నెలకుమించి ఉపవాసం ఉండటం; పాపము= పాపం; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ఎంత కఠిననిష్ఠ ఉన్నా నెలకులోబడిన కాలంలోనే ఎక్కువ రోజులు ఉపవసించాలి. నెలకు మించిన రోజులు ఉపవాసం ఉండటం పాపం అంటారు.

వ. యుగసామర్థ్యంబుననుం బురుషమహానుభావవిశేషంబుననుంజేసి యుపవాసవ్రతంబు మహాధికకాలకృతం బయినను గీడుం జేయక యత్యంతఫలప్రదంబై యుండు. 152

ప్రతిపదార్థం: యుగ సామర్థ్యంబుననున్= కృతం మొదలైన యుగాల శక్తివలనా; పురుష మహా+అనుభావవిశేషంబుననున్+చేసి= వ్యక్తియొక్క గొప్ప ప్రభావపు మహిమవలనా; ఉపవాసవ్రతంబు= ఉపవాసం అనే వ్రతం; మహా+అధిక కాల కృతంబు= చాలా ఎక్కువ కాలం చేయబడినది; అయినను= అయినా; కీడున్= ఆపద; చేయక= చేయక; అత్యంత ఫల ప్రదంబు= చాలా ఎక్కువ ఫలాన్ని ఇచ్చేది; ఐ= అయి; ఉండున్= ఉంటుంది.

తాత్పర్యం: యుగాలశక్తినిబట్టి, మనిషి సామర్థ్యంలోని విశేషాన్నిబట్టీ ఉపవాసవ్రతం చాలా ఎక్కువకాలం చేసేది అయినా ప్రమాదం చేయక అత్యధికఫలాన్ని ఇచ్చేదై ఉంటుంది.

విశేషం: యుగాలకు సంబంధించిన కాలప్రమాణము, శక్తిప్రమాణమూ, ఆయుఃప్రమాణమూ వేర్వేరుగా ఉంటాయి. ధర్మరాజాదులు 125 సంవత్సరములు బ్రదికినట్లుగా భారతంలో ప్రమాణాలు ఉన్నాయి. అది ద్వాపరయుగం.

తే. మాతకును వేదమునకు ధర్మంబునకును । బరములగు గురుశాస్త్ర లాభములు లేవు;
తపము లే దుపవాసవ్రతంబుకంటె । నధిక మైనది యండ్రు మహాత్ము లనఘ! 153

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; మహాత్ములు= దొడ్డబుద్ధికలవారు; మాతకును= తల్లికీ; వేదమునకున్= శ్రుతికీ; ధర్మంబునకును= ధర్మానికీ; పరములు= మించినవి; అగు= అయిన; గురు శాస్త్ర లాభములు= గురువు, శాస్త్రము, లాభము అనేవి; లేవు; ఉపవాసవ్రతంబు కంటెన్= ఉపవాసం అనే నియమం పాటించటం కంటె; అధికము= గొప్పది; ఐనది= అయినట్టిది; తపము= తపస్సు; లేదు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పుణ్యాత్మా! మహాత్ములు తల్లిని మించిన గురువూ, వేదాన్ని మించిన శాస్త్రమూ, ధర్మాన్ని మించిన లాభమూ అట్లాగే ఉపవాసవ్రతాన్ని మించిన తపస్సూ లేదని చెప్పుతారు.

విశేషం: తల్లి మున్నగు వారి వరుసలో చెప్పటం వలన ఉపవాసవ్రతం తల్లినీ, వేదాన్నీ, ధర్మాన్నీ గౌరవించిన స్థాయిలో గౌరవించ దగినదనే అర్థం స్ఫురిస్తుంది. తుల్యయోగితాలంకారాన్ని భావించాలి.

తే. పావనంబులలో నెల్ల బ్రాహ్మణుండు । పరమపావన మను శ్రుతి పౌరవేంద్ర!
యట్లు గావున భూదేవతార్చనంబు । భక్తి సంభృతముగ నడపంగ వలయు. 154

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర!= పురువంశమువారిలో గొప్పవాడా!; పావనములలోన్= పవిత్రమైన వాటిలో; ఎల్లన్= అన్నింటికంటె; బ్రాహ్మణుండు= బ్రహ్మజ్ఞానం చక్కగా కల వ్యక్తి; పరమపావనము= మిక్కిలి పవిత్రమైన విషయము; అని; శ్రుతి= వేదం; అనున్= చెప్పుతుంది; అట్లు= ఆ విధం; కావునన్= కావటంచేత; భూదేవతా+అర్చనంబు= బ్రహ్మజ్ఞానసంపద కలవాడిని పూజించటం; భక్తి సంభృతముగన్= భక్తితో నిండిన తీరులో; నడపంగన్ వలయున్= చేయాలి.

తాత్పర్యం: రాజా! పవిత్రములైన అన్నింటిలో బ్రాహ్మణుడు పరమపవిత్రం అని వేదం చెప్పుతున్నది. కనుక అట్టి బ్రాహ్మణుడిని మన్నించటం నిండైన భక్తిభావంతో చేయాలి.

విశేషం: ఇట్టి పట్టులలో కేవల జన్మభావంచేతనే కలుగుతుందని అనుకోరాదు. బ్రాహ్మణ, విప్ర, శ్రోత్రియ మున్నగు శబ్దాలకుండే విశిష్టార్థాన్ని భావించి ఆ లక్షణాలున్న వ్యక్తినే గ్రహించాలి.

వ. అప్రసక్తం బైనను నీయర్థంబు వినవలయు నట్టిది గావునం జెప్పితి' నని పలికి వెండియు. 155

ప్రతిపదార్థం: అప్రసక్తంబు= ప్రసంగానికి సంబంధించినదికానిది; ఐనను= అయినప్పటికి; ఈ+అర్థంబు= ఈ విషయం; వినవలయు+అట్టి+ఇది= వినవలసింది; కావునన్= కనుక; చెప్పితిన్= నీకు చెప్పాను; అని; పలికి= చెప్పి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఇది సందర్భానికి తగినమాట కాదు అయినా వినదగినది కనుక నీకు తెలిపాను' అని ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: ఇది వక్త జాగరూకతను పట్టి ఇచ్చే వైఖరి. ఇక్కడ సందర్భం ఉపవాసవ్రత విషయం. కనుక ఇది అప్రస్తుతప్రసంగం. అయినా వెనుకటి పద్యంలో తల్లి, వేదం, ధర్మం, ఉపవాసం - అనే వాటిని మహావిషయాలుగా చెప్పిన కారణంగా ఆ వరుసలో పరమపవిత్రుడు బ్రాహ్మణుడు అని చెప్పవలసి వచ్చింది.

చ. 'అనశననిష్ఠఁజేసి సుర లాదిమునుల్ మహితానుభావులై
రనఘ! సహస్రవర్ష సమనంతర కల్పితమైన యేకభు

క్తనియమతంత్రమున్ నడపి గాధితనూజుఁడు బ్రాహ్మణత్వముం

గనియె మహోపవాసములఁ గాని ఫలంబులు లేవు భూవరా! 156

ప్రతిపదార్థం: అనఘ!= ఉత్తముడా!; సురలు= దేవతలు; ఆదిమునులు= ఆదికాలపు మహర్షులు; అనశననిష్ఠన్‌చేసి= ఆహారం తీసికొనకపోవటం (ఉపవాసం) అనే నిష్ఠతో; మహిత+అనుభావులు= మిక్కిలి గొప్ప ప్రభావం కలవారు; ఐరి= అయ్యారు; గాధి తనూజుఁడు= గాధి కొడుకైన విశ్వామిత్రుడు; సహస్ర వర్ష సమనంతర కల్పితము= వేయి ఏండ్లు అడ్డు లేనిదిగా చేసికొనబడినది; ఐన ఏక భుక్త నియమ తంత్రమున్= అయిన ఒక పూట భోజనం అనే నియమంతో కూడిన విధానాన్ని; నడపి= సాగించి; బ్రాహ్మణత్వమున్= బ్రాహ్మణుడు కావటాన్ని; కనియెన్= పొందాడు; భూవర!= రాజా!; మహా+ఉపవాసములన్= గొప్ప ఉపవాసాలతో; కాని ఫలంబులు= సిద్ధించని ప్రయోజనాలు; లేవు= లేవు.

తాత్పర్యం: పుణ్యాత్మా! దేవతలు, ఆదిమునులు, ఉపవాసనియమంచేతనే గొప్ప ప్రభావం కలవా రయ్యారు. విశ్వామిత్రుడు వేయి ఏండ్లు ఒక్కరోజు కూడా విఘాతం లేకుండా ఒక పూట భోజనం అనే నియమవిధిని నిర్వహించి బ్రాహ్మణత్వాన్ని పొందగలిగాడు. కనుక, రాజా! గొప్ప నిష్ఠతో కూడిన ఉపవాసాలవలన పొందరాని ప్రయోజనాలు లేవు.

విశేషం: సాధారణంగా మానవుడు ధర్మసూత్రాలకు దృష్టాంతాలను దర్శింపగోరుతాడు. ఆ మనస్తత్త్వాన్ని గుర్తించిన వ్యాసభగవానులు ఉపవాసనిష్ఠకు విశ్వామిత్రుడి దృష్టాంతాన్ని అనుసంధించారు.

క. కావున నుపవాసవ్రత । సేవనము శరీరమునకుఁ జిత్తంబునకుం

బావన మైహిక మహిమయు । దేవనిలయ సుఖము నివ్విధిన్ సమకూరున్. 157

ప్రతిపదార్థం: కావునన్= కనుక; ఉపవాస వ్రత సేవనము= ఉపవాసం అనే వ్రతాన్ని సేవించటం; శరీరమునకున్= దేహానికీ; చిత్తమునకున్=మనస్సుకూ; పావనము= పవిత్రతను కలిగించేది; ఈ+విధిన్= ఈ పనివలన; ఐహిక మహిమయున్= ఈ లోకపు గొప్పతనమూ; దేవ నిలయ సుఖమున్= దేవలోకపు సుఖమున్నూ; సమకూరున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: కనుక ఉపవాసవ్రతాన్ని ఆచరించటం శరీరానికీ, మనస్సుకూ పవిత్రతను చేకూరుస్తుంది. దీనివలన ఈ లోకంలో గొప్పతనమూ, దేవలోకపు సుఖమూ అబ్బుతాయి.

విశేషం: ఇది శాస్త్రీయంగా నిరూపణ పొందిన విషయం. ఈనాడు యోగ అభ్యాసం చేసి ఆరోగ్య పరిరక్షణ చేసికొనగోరే వారంతా వారానికి ఒకరోజు ఉపవాసం ఉంటున్నారు. దానివలన శరీరం తేలిక కావటం, హృదయంలో మంచి భావాలు కలగటం అనుభవంలో ఉన్నట్లు వ్యక్తం చేస్తున్నారు. మంచి భావాలు కలగటమే సౌమనస్యం - దేవత్వం.

క. పరమగు నీవ్రతమున కం । గిరసుఁడు దర్శకుఁడు దత్సుగీత విధమునన్

నరు లెవ్వరు దర్శకులగు । దురు వారిం బొరయ వేమి దుఃఖములు నృపా! 158

ప్రతిపదార్థం: నృపా!= రాజా!; పరము= మిక్కిలి గొప్పది; అగు+ఈ వ్రతమునకున్= అయిన ఈ ఉపవాస వ్రతానికి; అంగిరసుఁడు= అంగిరసుడనే మహాముని; దర్శకుఁడు= ద్రష్ట (మొదట భావించి లోకానికి తెలియజెప్పినవాడు); తద్+సుగీత

విధమునన్= అతడు చక్కగా తెలియజెప్పిన తీరున; నరులు= మానవులు; ఎవ్వరు= ఎవ్వరైతే; దర్శకులు= ప్రవర్తకులు; అగుదురు= అవుతారో; ఏమి దుఃఖములు=ఎటువంటి దుఃఖాలు; వారిన్= వారిని; పొరయవు= అంటవు.

తాత్పర్యం: రాజా! మిక్కిలి శ్రేష్ఠమైన ఈ ఉపవాసవ్రతానికి అంగిరసుడు ద్రష్ట. అతడు చక్కగా వివరించిన తీరున దీనిని ప్రవర్తింపజేసే వారిని ఏ దుఃఖాలూ అంటవు.

విశేషం: దర్శకుడు - ఋషి అని భావించాలి. 'ఋషిశ్చ కిల దర్శనాత్' - ఒక మహా విషయాన్ని కనిపెట్టి ప్రచారంలోనికి తెచ్చే వ్యక్తిని దర్శకుడు, ద్రష్ట, ఋషి అంటారు.

క. ఈ తంత్రంబు పఠించినఁ । బ్రీతి వినినఁ బాయు బహుదురితములు దిర్య
గ్జాతుల భాష లెఱింగెడు । నాతెలి వగు నపరభవమునందు నరులకున్. 159

ప్రతిపదార్థం: ఈ తంత్రము= ఈ కార్యవిధానము; పఠించినన్= చదివినా; ప్రీతిన్= ప్రీతితో; వినినన్= విన్నా; బహుదురితములు= పెక్కు పాపములు; పాయున్= పోతాయి; నరులకున్= మానవులకు; అపరభవమునందున్= మరుజన్మలో; తిర్యక్+జాతుల భాషలు= పశువుల, పక్షుల జాతులభాషలు; ఎఱింగెడు+ఆ తెలివి= తెలిసికొనే జ్ఞానం; అగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఈ కార్యవిధానం చదివినా విన్నా అన్ని పాపాలు నశిస్తాయి. మానవులకు మరుజన్మలో పశువుల, పక్షుల భాషలు తెలిసికొనే తెలివి అబ్బుతుంది.

విశేషం: దీనిని ఫలశ్రుతి అంటారు. ఇది ప్రాచీన పురాణాదులలో ఒక్కొక్క ఘట్టం ముగిసిన తరువాత సాధారణంగా అనుసంధిస్తూ ఉంటారు. దీనివలన పాఠకుడిలో తెలిసికొనాలనే కుతూహలం పెరుగుతుంది. ఆచరణకు దోహదం కలుగుతుంది. పశుపక్ష్యాదుల భాషలలో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. భవిష్యత్తు, నష్టవస్తుప్రశ్న మొదలైనవాటికి శకునాలను చూడటం అనాదిగా అన్ని దేశాలలోనూ ఉన్నది.

వ. అనిన విని ధర్మజుండు సర్వధర్మజ్ఞానమాననీయునితో 'యజ్ఞకర్త యగుట మేలని మీరు పెక్కెడలం జెప్పితిరి; యజ్ఞంబు ధనధాన్యవిభవ సహాయసంపన్నులకుం దక్కం దక్కటివారలకుం జేయ శక్యంబు గామి దెల్లం బెల్లవారికి ననుష్ఠింపనయ్యెడు నట్టి పుణ్యకర్మం బెయ్యది యుపదేశింపవే' యనుటయు నమ్మహీపతికి నమ్మహితాత్ముం డిట్లనియె. 160

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ధర్మజుండు= ధర్ముడి కొడుకు యుధిష్ఠిరుడు; సర్వ ధర్మ జ్ఞాన మాననీయునితోన్= అన్ని ధర్మాల తెలివిచేత గౌరవం పొందదగిన భీష్ముడితో; యజ్ఞకర్త= యజ్ఞాలు చేసేవాడు; అగుట= కావటం; మేలు= మంచిది; అని; మీరు= తమరు; పెక్కు+ఎడలన్= చాలా తావులలో; చెప్పితిరి= చెప్పి ఉన్నారు; యజ్ఞంబు= యజ్ఞం అనేది; ధన ధాన్య విభవ సహాయ సంపన్నులకున్= ధనము, ధాన్యము, వస్తువులు పుష్కలంగా ఉండటం, తోడుపడేవారు అనే సంపదలు కలవారికి; తక్కన్= కాక; తక్కటివారలకున్= మిగిలినవారికి; చేయన్= ఆచరించటం; శక్యంబు+కామి= సాధ్యం కాకపోవటం; తెల్లంబు= స్పష్టము; ఎల్లవారికిన్= అందరికీ; అనుష్ఠింపన్+అయ్యెడు+అట్టి పుణ్యకర్మంబు= ఆచరించదగిన పుణ్యకార్యం; ఏ+అది= ఏదో; (దానిని); ఉపదేశింపవే= తెలుపుమా; అనుటయున్= అన్నంతనే; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు; ఆ÷మహిత+ఆత్ముండు= దొడ్డబుద్ధిగల ఆ భీష్ముడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని ధర్మరాజు 'సర్వధర్మాల జ్ఞానంతో మన్నించ దగినవాడైన భీష్ముడితో ఇట్లా అన్నాడు. యజ్ఞకర్త కావటం ఉత్తమం అని మీరు పెక్కుచోట్ల చెప్పారు. యజ్ఞం ధనము, ధాన్యమూ, ఐశ్వర్యమూ, సహాయులు అత్యధికంగా ఉన్నవారికి తప్ప తక్కినవారికి చేయటం సాధ్యం కాదనే విషయం అందరకూ తెలిసినదే. మరి అందరూ చేయదగిన పుణ్యకర్మం ఏదో నాకు బోధింపరూ!' అనగా ఆ రాజునకు ఆ మహాత్ము డిట్లా చెప్పాడు.

విశేషం: దీనివలన ధర్మరాజు హృదయౌన్నత్యం తెలియవస్తున్నది. సర్వమానవ ఉద్ధరణతాత్పర్యం అతడికి కలదని తెలియవస్తున్నది. ఇది ఒక విధంగా భారతకర్త హృదయతాత్పర్యం. ఆ పుణ్యాకార్యం యజ్ఞం ఇచ్చే ఉత్కృష్టఫలం వంటి ఫలాన్ని ఇవ్వాలని కూడా సందర్భాన్ని బట్టి అడిగేవాడి తాత్పర్యం.

క. 'నరవర! యర్థంబులునుం । బరివారము లేకయును శుభస్థితిఁ జేయన్
దొరకొని యుండుట గని యం । గిరసుం డుపవాసముం బ్రకీర్తించెఁ దగన్. 161

ప్రతిపదార్థం: నరవర!=రాజా!; అర్థంబులునున్= ధనాలు, వస్తువులూ; పరివారము= సేవకుల సముదాయము; లేకయును= లేకున్నా; శుభస్థితిన్= శుభమైన స్థితిలో; చేయన్= ఆచరించటానికి; దొరకొని+ఉండుట= అనువై ఉండటం; కని= భావించి; అంగిరసుండు= అంగిరసుడనే మహాముని; ఉపవాసమున్= ఉపవాసాన్ని; తగన్= చక్కగా; ప్రకీర్తించెన్= బాగా కొనియాడాడు.

తాత్పర్యం: 'రాజా! అర్థబలమూ, అంగబలమూ లేకున్నా ఏ లోపమూ లేకుండా చేయటానికి కుదురుతుందని గమనించి, అంగిరసుడు ఉపవాసాన్ని మిక్కిలిగా కొనియాడాడు.

విశేషం: ఉపవాసం అతి సులభంగా చేయదగినదీ, యజ్ఞఫలంవంటి ఫలాన్నిచ్చేదీ అని ఫలితార్థం.

క. ఉపవాసాయాసంబును । నృపముఖ్యా! దుస్సహముగ నీవు దలఁచి య
జ్ఞపరత్వము దుర్ఘట మను । నెపమిడి యి ట్లడిగి తని మనీషం గంటిన్. 162

ప్రతిపదార్థం: నృపముఖ్యా!= రాజోత్తమా!; ఉపవాస+ఆయాసంబును= పస్తు ఉండటంలోని శ్రమను; దుస్సహముగన్= ఓర్వశక్యం కాని దానినిగా; నీవు; తలఁచి= భావించి; యజ్ఞపరత్వము = యజ్ఞాలపై శ్రద్ధ కలిగి ఉండటం; దుర్ ఘటము= కూర్పరానిది; అను నెపము= అను మిషను; ఇడి= పెట్టి; ఇట్లు= ఈ విధంగా; అడిగితి(వి)= అడిగినావు; అని; మనీషన్= భావనాబలంతో; కంటిన్= గుర్తించాను.

తాత్పర్యం: పస్తు ఉండటంలోని శ్రమ సహింపరానిది కదా! అని - యజ్ఞం చేయటం ఎంతో కష్టంతో సాధ్యమయ్యే పని అనే నెపం పెట్టి ఇట్లా అడిగావని నేను భావనతో తెలిసికొన్నాను.

విశేషం: ప్రశ్నించేవారి హృదయగతం తెలిసికొనటం వక్త యొక్క మహాగుణం. అట్టివారినే ఇంగితజ్ఞుడు అంటారు. భీష్ముడు పరమవివేకం కలవాడు కనుక ధర్మరాజు ఇంగితాన్ని పట్టుకొనటమే కాదు బట్టబయలు కూడా చేశాడు.

వ. అనశనవ్రతంబు లందును జులుకని తెఱం గెఱింగించెద. 163

ప్రతిపదార్థం: అనశన= ఆహారం మానటం; వ్రతంబులందును= వ్రతాలలో కూడా; చులుకని= తేలిక; తెఱంగు= పద్ధతి; ఎఱింగించెదన్= తెలుపుతాను.

తాత్పర్యం: ఉపవాసవ్రతంలో కూడా తేలిక పద్ధతిని తెలుపుతాను.

విశేషం: ఇది శ్రీవ్యాసుల అపారకరుణకు మచ్చు తునక.

చ. పగలును రేయుఁ గుడ్చి జలపానము లోనుగఁ గుడ్చునప్డు తు
ష్టిగ నొనరించి మర్త్యుఁ డొకటిన్ నడుమన్ మఱి యెప్డు నంటకే
మిగతిని బాపముం బొరయమిం దలకొల్పుచు హోమకార్యముం
దగుమెయిఁ జేయుచున్న విను తంగెటిజున్నగు నూర్ధ్వలోకముల్. 164

ప్రతిపదార్థం: మర్త్యుండు= మానవుడు; పగలును= పగటి భాగంలోను; రేయిన్=రాత్రియందు; కుడ్చి= భుజించి; జలపానము లోనుగన్= నీరు త్రావుట మొదలుగ; కుడ్చు+అప్డు= తినే సమయంలో; తుష్టిగన్= తృప్తిగ; ఒనరించి= చేసి; నడుమన్= ఆ రెండు భోజనాలకు మధ్య; ఒకటిన్= ఏ ఒక్కదానినీ; మఱి= ఇక; ఎప్డున్= ఎప్పుడూ; అంటక= ముట్టక; ఏమి గతినిన్= ఏ విధంగానూ; పాపమున్= పాపమును; పొరయమిన్= పొందకపోవటాన్ని; తలకొల్పుచున్= చేస్తూ; హోమకార్యమున్= అగ్నిహోత్రపు అర్చనను; తగు మెయిన్= తగు విధంగా; చేయుచున్= చేస్తూ; ఉన్నన్= ఉంటే; విను= ఆలకించుము; ఊర్ధ్వలోకముల్= పై లోకాలు; తంగెటి జున్ను= తంగెటి జున్నువంటివి; అగున్= అవుతాయి.

తాత్పర్యం: పగలు ఒకమారు, రాత్రి ఒకమారు నీటితోపాటు తృప్తిగా భుజిస్తూ మధ్యలో మరి ఏమీ ముట్టుకొనకుండా ఏ విధమైన పాపం అంటకుండా చూచుకొంటూ హోమకార్యం తగిన విధంగా చేస్తూ ఉంటే పుణ్యలోకాలు తంగెటిజున్నువలె అందుతాయి.

విశేషం: తంగేటి చెట్టుమీది తేనె పెర ఎంత తేలికగా అందుబాటులో ఉంటుందో అంత సులభంగా పుణ్యలోకాలు అందుతాయని తాత్పర్యం. దినానికి నియతసమయాలలో రెండు భోజనాలు చేయటం, మధ్య నీటితో సహా ఏమీ ముట్టకపోవటం, పాపపు పనులు చేయకపోవటం, అగ్నిహోత్రాన్ని అర్చించటం - అనే ప్రవర్తన కూడా ఉపవాసం వంటిదే అవుతుందని భావం.

వ. ఇది మేలితెఱంగు గొందఱు దుష్కరంబుగాఁ దలంతు రట్టివారలు దమయోపినభంగుల నంగిరసుం డుపదేశించిన యుపవాస వ్రతవిశేషంబు లనుష్ఠించు వా రని చెప్పిన నప్పౌరవోత్తముం డయ్యుత్తమ బోధనిధికి నమస్కరించి యధ్యాత్మక విద్యాబోధక ప్రకారంబులగు వాక్యసంచయంబులు పెక్కెడలం గృష్ణద్వైపాయనాది మునీంద్రులును గృష్ణుండును నాకర్ణింప నుపన్యసించితిరి కృష్ణశ్రోతృత్వంబు మహార్ఘతమంబు గృష్ణుని యున్న రూ పెఱుంగుటయు నత్యంతసంభావనీయంబు. 165

ప్రతిపదార్థం: ఇది= ఇప్పుడు చెప్పినది; మేలితెఱంగు= ఉత్తమపద్ధతి; కొందఱు=కొందరు; దుష్కరంబుగాన్= చేయశక్యంబు కానిదిగా; తలంతురు= అనుకొంటారు; అట్టివారలు= ఆ విధమైన మనుష్యులు; తమ ఓపిన భంగులన్= తమకు చేతనైన పద్ధతులతో; అంగిరసుండు= అంగిరసుడనే ముని; ఉపదేశించిన ఉపవాస వ్రత విశేషంబులు= ఉపవాసం అనే వ్రతంలోని ఇతర పద్ధతులను; అనుష్ఠించువారు= ఆచరించవలసిన వారు; అని; చెప్పినన్= చెప్పగా; ఆ+పౌరవ+ఉత్తముండు= పురువంశంలో శ్రేష్ఠుడైన ధర్మరాజు; ఆ+ఉత్తమబోధ నిధికిన్= మిక్కిలి మేలైన జ్ఞానపురాశి అయిన భీష్మునికి; నమస్కరించి= ప్రణామం చేసి; అధ్యాత్మక విద్యా బోధక ప్రకారంబులు= తత్త్వసంబంధమైన విద్యను తెలియపరచే విధానాలు కలవి; అగు వాక్య

సంచయంబులు= అయిన మాటల సముదాయాలను; పెక్కు+ఎడలన్= పలుతావులలో; కృష్ణ ద్వైపాయన+ఆది ముని+ఇంద్రులును= శ్రీ వేదవ్యాసుడు మొదలగు మునిశ్రేష్ఠులూ; కృష్ణుండును= వాసుదేవుడునూ; ఆకర్ణింపన్= వింటూ ఉండగా; ఉపన్యసించితిరి= వివరించి చెప్పారు; కృష్ణశ్రోతృత్వంబు= కృష్ణుడు వినేవాడు కావటం; మహా+అర్హతమంబు= మిక్కిలి యోగ్యమైన విషయం; కృష్ణుని ఉన్నరూపు= శ్రీకృష్ణుడి యథార్థతత్త్వం; ఎఱుంగుటయున్= తెలిసికొనటం కూడా; అత్యంత సంభావనీయంబు= మిక్కిలి చక్కగా భావించదగింది.

తాత్పర్యం: ఇది ఉత్తమపద్ధతి. కొందరు దీనిని కూడా కష్టమైనదిగా భావిస్తారు. అట్టివారు తమ శక్తి ననుసరించి అంగిరసుడు చెప్పిన ఉపవాసవ్రత పద్ధతులను ఆచరించాలి అని చెప్పగా ఆ ధర్మరాజు ఉత్తమజ్ఞానఖని అయిన భీష్ముడికి నమస్కరించి 'తత్త్వవిద్యను చక్కగా తెలిపే వాక్యాలను పెక్కుతావులలో వేదవ్యాసుడు మొదలైన మహామునులు, శ్రీకృష్ణుడు వింటూ ఉండగా వివరించారు. శ్రీకృష్ణుడు శ్రోత కావటం మిక్కిలి యోగ్యమైన విషయం. కృష్ణుడి నిజతత్త్వం తెలిసికొనటం కూడా మిక్కిలి భావించదగిన విషయం.

ఆ. ఎవ్వఁ డెఱుఁగఁబడిన నెఱుఁగంగఁ బాలివి। యైన యెల్ల యవియు నవగతంబు
లగుట యీ పరాశరాత్మజుఁ డాశ్రిత। కోటి కర్థిఁ గృష్ణు గుఱిచి చెప్పె. 166

ప్రతిపదార్థం: ఈ పరాశర+ఆత్మజుఁడు= పరాశరుడికి కుమారుడైన వేదవ్యాసుడు; ఎవ్వఁడు= ఎవరైతే; ఎఱుఁగఁబడినన్= తెలియబడితే; ఎఱుఁగంగన్= తెలియటానికి; పాలివి= లక్ష్యమైనవి; ఐన ఎల్ల+అవియున్= అయినవన్నీ; అవగతంబులు= తెలియబడినవి; అగుట= కావటం; ఆశ్రితకోటికిన్= తనను ఆశ్రయించినవారి సమూహాలకు; అర్థిన్= కోరికతో; కృష్ణున్+గుఱిచి= కృష్ణుడి గూర్చి; చెప్పెన్= బోధించాడు.

తాత్పర్యం: ఈ వేదవ్యాసుడు 'ఎవరిని తెలిసికొంటే సృష్టిలోని తెలియదగిన విషయాలన్నీ తెలుస్తాయో అట్టివాడు శ్రీకృష్ణుడు' అని ఆశ్రయించిన వారి కందరికీ తెలియచెప్పాడు.

విశేషం: 'ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానమ్' అని ఉపనిషత్తు. ఒకదాని ఎఱుకచేత అన్నింటి జ్ఞానం కలుగుతుంది. ఆ ఒకటి పరమాత్మ తత్త్వం. అది కృష్ణరూపంలో ఉన్నదని వ్యాసతాత్పర్యం.

క. కావున నధ్యాత్మక వా। క్యావలికిం జేరుగడ మహామహిమపదం
బై విలసిల్లెడుఁ గృష్ణుఁడ। యే వినఁగా వలతు నమ్మహితవాక్యంబుల్.' 167

ప్రతిపదార్థం: కావునన్= కనుక; కృష్ణుఁడు+అ= కృష్ణుడే; అధ్యాత్మక వాక్య ఆవలికిన్= తత్త్వం తెలిపే వాక్యాల పంక్తులకు; చేరుగడ= చివరిలక్ష్యమూ; మహామహిమపదంబు= గొప్ప ప్రభావంతో కూడిన స్థానమూ; ఐ= అయి; విలసిల్లెడున్= ప్రకాశిస్తున్నాడు; ఆ+మహిత వాక్యంబుల్= అట్టి పూజ్యతగల వాక్యాలను; ఏన్= నేను; వినఁగాన్ వలతున్= వినగోరుతున్నాను.

తాత్పర్యం: కాబట్టి కృష్ణుడే జ్ఞానం బోధించే వాక్యాలకు చివరి లక్ష్యం. అతడే గొప్ప మహిమకు స్థానం అయి విరాజిల్లుతున్నాడు. అట్టి తత్త్వజ్ఞాన వాక్యాలను నేను వినగోరుతున్నాను.'

విశేషం: ఆత్మ అంటే శరీరం - అధ్యాత్మ అంటే శరీరంలో ఉన్న తత్త్వం. అతడినే 'దేహి' అంటారు. పరమాత్మ - దానికి సంబంధించినది అధ్యాత్మకం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి యింకను నధ్యాత్మవిద్యావివరణంబు లగు వాక్యంబు లనుగ్రహింపవలయు నని సంప్రార్థనంబు సేసిన నప్పార్థివాగ్రగణ్యుతో నక్కురువరేణ్యుండు హరసనత్కుమార సంవాదంబు సెప్పెద నది యధ్యాత్మ విద్యోపకార ప్రకారంబు లైన యుపన్యాసంబుల నొప్పియుండు విను మని యిట్లనియె. 168

ప్రతిపదార్థం: అని; పలికి= మాట్లాడి; ఇంకనున్= ఇంకా; అధ్యాత్మవిద్యా వివరణంబులు= పరమార్థవిద్యను స్పష్టం చేసేవి; అగు వాక్యంబులు= అయిన వచనాలను; అనుగ్రహింపవలయును= నాకు దయతో బోధించాలి; అని; సంప్రార్థనంబు+చేసినన్= వినయంతో అడుగగా; ఆ+పార్థివ+అగ్రగణ్యుతోన్= రాజశ్రేష్ఠుడగు ఆ ధర్మజుడితో; ఆ+కురువరేణ్యుండు= కురువంశంలో ఉత్తముడైన ఆ భీష్ముడు; హరసనత్కుమార సంవాదంబు= శివుడికి; సనత్కుమారుడికి అయిన సంభాషణాన్ని; చెప్పెదన్= చెప్పుతాను; అది= ఆ ఘట్టం; అధ్యాత్మ విద్యా+ఉపకార ప్రకారంబులు= పరమార్థాన్ని తెలిపేవిద్యకు పనికివచ్చే తీరులుగలవి; ఐన ఉపన్యాసంబులన్= అయిన ప్రసంగాలతో; ఒప్పి= అలరారి; ఉండున్= ఉంటుంది; వినుము= ఆలకించుము; అని; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని ఇంకా పరమార్థాన్ని వివరించే వాక్యాలను నాకు దయచేయుము - అని చక్కగా ప్రార్థిస్తే ఆ రాజుతో ఆ భీష్ముడు 'హరసనత్కుమార సంవాదం అనే విషయం వివరిస్తాను. అది పరమార్థవిద్యకు ఉపకరించే తీరులు గల ప్రసంగాలతో అలరారి ఉంటుంది. వినుము.' అని ఇట్లా చెప్పాడు.

విశేషం: భీష్ముడు పరమార్థాన్ని గురించి తనకు తోచిన దానిని చెప్పటానికి పూనుకొనలేదు. హరసనత్కుమార సంవాదం చెప్పుతానన్నాడు. అంటే మహావిషయాలు పరమప్రామాణికుల వాక్యాలుగా ఉంటే తప్ప గ్రాహ్యాలు కావని తాత్పర్యం. దీనినే శబ్దప్రమాణం అంటారు.

హరసనత్కుమారసంవాదప్రకారము (సం.13-165-5 (కుంభ))

చ. హరుఁడు సనత్కుమారుకడ కర్థిమెయిం జనుదేర నమ్మునీ
శ్వరుఁ డుచితాసనాదు లుపచారవిధిజ్ఞతఁ దా నొనర్చి యా
దరభరితాత్ముఁడై 'యభిమతం బగు కార్య మనుగ్రహింపు త
త్పరమతి నిర్వహింతుఁ దగ దానిఁ ద్రిలోచన! మృత్యుమోచనా! 169

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు; సనత్కుమారు కడకున్= సనత్కుమారుడనే ముని దగ్గరకు; అర్థిమెయిన్= కోరికతో; చనుదేరన్= రాగా; ఆ+ముని+ఈశ్వరుఁడు= ఆ మునిశ్రేష్ఠుడు; ఉపచార విధిజ్ఞతన్= సేవలవిధానం చక్కగా తెలిసిన భావంతో; ఉచిత+ఆసన+ ఆదులు= తగిన ఆసనం మొదలైన వాటిని; తాన్= తాను; ఒనర్చి= చేసి; ఆదరభరిత+ఆత్ముఁడు+ఐ= ఆదరంతో నిండిన హృదయం కలవాడై; త్రిలోచన!= ముక్కంటీ!; మృత్యు మోచనా!= మృత్యువునుండి విడిపింప జేయువాడా!; అభిమతంబు= ఇష్టము; అగు కార్యము= అయినపని; అనుగ్రహింపుము= దయతో చెప్పుము; తత్పరమతిన్= అదే పరమలక్ష్యం అన్న బుద్ధితో; తగన్= తగినవిధంగా; దానిన్= దానిని; నిర్వహింతున్= చేస్తాను.

తాత్పర్యం: శివుడు సనత్కుమారుడి దగ్గరకు రాగా ఆ మహర్షి అతిథిమర్యాదలు చక్కగా తెలిసినవాడు కనుక తగు విధమైన ఆసనాదులను కూర్చి ఆదరంతో నిండిన బుద్ధితో 'త్రిలోచనా! మృత్యుమోచనా! నీకేది ఇష్టమో దానిని దయతో చెప్పుము. దానియందు పరమశ్రద్ధగల బుద్ధితో చక్కగా చేస్తాను' అన్నాడు.

విశేషం: హరుడు త్రిలోచనుడు - సూర్యచంద్రాగ్ని రూపనేత్రాలు కలవాడు. అంటే సర్వకాలాలలో సర్వవిషయకదర్శనజ్ఞానం కలవాడు. మృత్యుమోచనుడు - మృత్యువంటే అధ్యాత్మపరిభాషలో అజ్ఞానం. దానిని విడిపించేవాడు. అంటే అన్నింటిని దర్శిస్తూ అన్నింటి జ్ఞానం సమగ్రంగా కలిగినవాడని భావం. సనత్కుమారుడు తత్త్వజ్ఞాని కనుక అర్థాలు స్ఫురించే విధంగా సంబోధించాడు.

తే. అనిన 'నీతోడ గోష్ఠికి నర్థిపుట్టి । యరుగుదెంచితిఁ దమ్ముఁడ!' యని ప్రమోద

మెసఁగఁ బల్కి యప్పరమేశుఁ డిట్టు లనియె । నఖిలలోకార్చితుం డగు నతనితోడ. 170

ప్రతిపదార్థం: అనినన్= అంటే; ఆ+పరమ+ఈశుఁడు= ఆ మహేశ్వరుడు; తమ్ముఁడ!= ఓయి తమ్ముడా!; నీతోడన్= నీతో; గోష్ఠికిన్= మంచిమాటలు మాట్లాడుకొనటానికి; అర్థి= కోరిక; పుట్టి= కలిగి; అరుగుదెంచితిన్= వచ్చాను; అని; ప్రమోదము= పరమానందం; ఎసఁగన్= అతిశయించే విధంగా; పల్కి= పలికి; అఖిలలోక+అర్చితుండు= సమస్తలోకాల మన్ననగొన్నవాడు; అగు+అతనితోడన్= అయిన ఆ సనత్కుమారుడితో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని ముని పలికితే పరమేశ్వరుడు 'తమ్ముడా! నీతో ప్రసంగం చేయాలనే కోరిక పుట్టి వచ్చాను' అని పరమానందం అతిశయించే విధంగా పలికి, సర్వలోకాలు పూజించే ఆ సనత్కుమారుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: తమ్ముడ!- మహేశ్వరుడికి రుద్రుడనే పేరు ఉన్నది. ఆ దశలో అతడు బ్రహ్మ సృష్టించిన బాలుడు. సనకుడు, సనందుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు అనే పలువురు బ్రహ్మమానసపుత్రులు - కనుక సోదరసంబంధం. అఖిలలోకార్చితుడు - తనకు తమ్ముడైనా జ్ఞానవిశేషాన్ని బట్టి సర్వలోకాలూ అర్చించే మహిమ కలవాడు కనుక సర్వజ్ఞుడైన పరమేశ్వరుడు కూడా స్వయంగా వచ్చాడని హేతుదర్శనం.

క. 'ధ్యానమున దర్శనీయం । బైనది యే వస్తు? వెన్ని యనఘచరిత! స

మ్మానితతత్త్వంబులు? సం । ఖ్యానము యోగంబు నెట్టి గతులం జెల్లున్?' 171

విశేషం: అనఘచరిత!= పుణ్యప్రవర్తన కల ఓ మునీ!; ధ్యానమునన్= ధ్యానంలో; దర్శనీయంబు= చూడదగినది; ఐనది= అయినది; ఏ వస్తువు?; సమ్మానిత తత్త్వంబులు= చక్కగా భావించదగిన తత్త్వాలు; ఎన్ని?; సంఖ్యానము= జ్ఞానము; యోగంబు= యోగమూ; ఎట్టి గతులన్= ఏ పద్ధతులతో; చెల్లున్= ప్రవర్తిస్తాయి?

తాత్పర్యం: 'పుణ్యాత్మా! ధ్యానంలో చూడదగిన వస్తు వేది? చక్కగా భావించదగిన తత్త్వాలు ఎన్ని? జ్ఞానమూ, యోగమూ ఏ విధంగా ప్రవర్తిస్తాయి?

వ. చెప్పుము. మఱియు నధ్యాత్మవిషయంబులగు విశేషంబులును వివరింపు మనుటయు నయ్యంభోజసంభవుం డయ్యభవున కిట్లనియె. 172

ప్రతిపదార్థం: చెప్పుము= తెలియచెప్పుము; మఱియున్= ఇంకా; అధ్యాత్మవిషయంబులు= తత్త్వానికి సంబంధించినవి; అగు విశేషంబులు= అయిన ప్రత్యేకించి తెలిసికొనదగిన విషయాలు; వివరింపుము= తెలియజెప్పుము; అనుటయున్= అన్నంతనే; ఆ+అంభోజ సంభవుండు= పద్మంలో పుట్టినబ్రహ్మ (కుమారుడగు సనత్కుమారుడు); ఆ+అభవునకున్= ఆ రుద్రుడికి; ఇట్లు+ఇట్లా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: చెప్పుము. ఇంకా తత్త్వవిషయాలు తెలియచెప్పుము' అనగా సనత్కుమారుడు శివుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: అధ్యాత్మం - ఆత్మ అంటే ఇక్కడ దేహం. దేహంలో ఉన్నతత్త్వం అధ్యాత్మం. వక్త్ర అంభోజ సంభవుండు - అనగా బ్రహ్మ - అతడి మానసపుత్రుడైన సనత్కుమారుడు 'ఆత్మా వై పుత్రనామాసి' అనే న్యాయంచేత అతడే అవుతున్నాడు. శ్రోత అభవుడు - పుట్టుకలేనివాడు - వారి వాక్యాలు పరమాదరంతో గ్రహించదగిన వని సూచన. ప్రమాణబుద్ధిని కలిగించటం కోసం ఇటువంటి పదాలను ప్రయోగించారు.

క. అరయఁగఁ దత్త్వము లనునవి । యిరువది నాల్గండ్రు గొంద ఱిభదనుజహరా!

యిరువది మూఁ డనుటయుఁ గల । దిరువది యేనండ్రు వానినే యెట్లనినన్. 173

ప్రతిపదార్థం: ఇభదనుజహరా!= ఏనుగు రక్కసుడి రూపుమాపిన ఓ శివా!; కొందఱు= కొంతమంది; తత్త్వములు= భావములు; అనునవి= అనేవి; ఇరువదినాల్గు= ఇరవై నాలుగు; అండ్రు= అంటారు; ఇరువదిమూఁడు= ఇరవైమూడు; అనుటయున్= అనటం కూడా; కలదు= ఉన్నది; వానిన్+ఏ= ఆ తత్త్వాలనే; ఇరువదియేను= ఇరవై అయిదు; అండ్రు= అంటారు; ఎట్లు= ఏ విధంగా; అనినన్= అనగా.

తాత్పర్యం: శివా! తత్త్వాలు ఇరవై నాలుగని కొందరూ, ఇరవై మూడని కొందరూ, ఇరవై అయిదని కొందరూ అంటారు. ఎట్లాగంటే.

విశేషం: దీనిని సాంఖ్యం అంటారు. ఇందులో లెక్క ఉంటుంది కనుక. తత్త్వం అంటే 'దానితనం' అని శబ్దార్థం. అయితే ఇక్కడ ఇది ఒక పరిభాష. ఆ శబ్దంతోనే దానిని వ్యవహరించటం మంచిది.

క. ఇరువది మూఁ డనువార । ల్గిరిజేశ్వర! ప్రాకృతుల్ మలీమసవిధ మ

త్తెరువు మనోబుద్ధులు వా । రరయఁగ నొక్కండ యందు రది యట్లుండెన్. 174

ప్రతిపదార్థం: గిరిజా+ఈశ్వర!= గిరిజానాథా!; ఇరువదిమూఁడు= ఇరవైమూడు; అనువారల్= అనేవారు; ప్రాకృతుల్= నిండు జ్ఞానం లేని పామరులు; ఆ+తెరువు= ఆ పద్ధతి; మలీమసవిధము= మలినమైనదారి; వారు= ఆ మార్గంవారు; అరయఁగన్= పరికింపగా; మనస్+బుద్ధులు= మనస్సు, బుద్ధి అనేవి; ఒక్కండు+అ= ఒక్కటే; అందురు= అంటారు; అది; అట్లు= ఆ విధంగా; ఉండెన్= ఉన్నది.

తాత్పర్యం: శివా! తత్త్వాలు ఇరవైమూడు అనేవారు పామరులు. అది మలినమైన పద్ధతి. వారు మనస్సు, బుద్ధి ఒక్కటే అంటారు. అది అట్లా ఉండనిమ్ము.

విశేషం: మనస్సు - సంకల్పవికల్పాల రూపమైన బుద్ధి - నిశ్చయాత్మకమైనది. ఇట్లా చక్కగా రెండింటిస్థితి తెలుస్తూ ఉంటే ఒక్కటే అనటం సరికాదు. అందుకనే అది మలినమైన మార్గం. పామరమార్గం.

క. ఇరువది నాల్గనువారలు । నరసి మనశ్శుద్ధి బుద్ధి యను కాన్పున న

ప్పరుసునఁ బలికెద రేఁ గను । తెరువున విను తత్త్వవిధము దేవస్తుత్యా! 175

ప్రతిపదార్థం: దేవస్తుత్యా!= దేవతలచేత కొనియాడబడే పరమేశ్వరా!; ఇరువదినాల్గు+అనువారలు= తత్త్వాలు ఇరవై నాలుగు అనేవారు; మనస్+శుద్ధి= మనస్సు నిర్మలంగా ఉండటం; బుద్ధి; అను కాన్పునన్= అనే దృష్టితో; ఆ+పరుసునన్= ఆ విధంగా

పలికెదరు= చెప్పుతారు; ఏన్= నేను; కను తెరువునన్= చూచేదారిలో; తత్త్వవిధము= తత్త్వాలస్థితిని గూర్చి; విను= ఆలకించుము.

తాత్పర్యం: పరమేశ్వరా! ఇరవై నాలుగు అనేవారు మనస్సుయొక్క పరిశుద్ధతయే బుద్ధి అనే దృష్టితో అట్లా అంటారు. నేను చూచే మార్గంలో తత్త్వాల సంగతిని వివరిస్తాను. వినుము.

విశేషం: మనస్సు నిరంతరం చలనశీలం అయింది. అది ఒకటి. అది నిశ్చయాన్ని పొందినప్పుడు చలనరూపమైన దోషం ఉండదు. కనుక అప్పుడు దానికి 'బుద్ధి' అనే మరొక స్థితి ఏర్పడుతుంది. ఈ విధంగా మనస్సు వేరు, బుద్ధి వేరు అని పరిగణించేవారు తత్త్వాలు ఇరవై నాలుగంటారు అని పద్యతాత్పర్యం.

తే. పంచవింశ మధిష్ఠానభావ మొంది । విలసనము నిచ్చుఁ దగఁ జతుర్వింశతికిని;
దన్నకని తనయంద డిందఁగఁ జేయు । దాన నప్పిండు గలయది లేనియదియు. 176

ప్రతిపదార్థం: పంచవింశము= ఇరవై అయిదోతత్త్వము; అధిష్ఠాన భావము= అన్నింటికీ ఆధారం అయ్యే భావాన్ని; ఒంది= పొంది; తగన్= తగువిధంగా; చతుర్+వింశతికిని= ఇరువది నాల్గింటి సముదాయానికి; విలసనమున్= ప్రకాశాన్ని; ఇచ్చున్= ఇస్తుంది; తన్నున్+అ= తననే; కని= చూచి; తనయందున్+అ= తనయందే; డిందఁగన్= లీనమైపోయే విధంగా; చేయున్= చేస్తుంది; దానన్=ఆ కారణంగా; ఆ+పిండు= ఆ ఇరవై నాల్గింటి సముదాయం; కల+అది= ఉన్నదీ; లేని+అదియున్= లేనిదీ (అవుతుంది)

తాత్పర్యం: 'అధిష్ఠానం' అనే రూపంలో ఇరవై అయిదవ తత్త్వం ఉన్నది. అది తక్కిన ఇరవైనాల్గింటికీ ఒక స్థితిని కల్పిస్తుంది. ఆ ఇరవై నాలుగూ దానిని చూచి దానియందే లీనమై పోయేటట్లుగా అది చేస్తుంది. కనుక అవి ఉండటమూ, లేకపోవటమూ రెండూ సంభవమే.

విశేషం: అధిష్ఠానం అంటే ఆధారం. ఇరవై నాలుగింటినీ పట్టి నిలిపేది అని భావం. కనుకనే ఆ తక్కిన ఇరవైనాలిగింటికీ అది 'ఉనికి - లేక ప్రకాశం' అనే స్థితిని కల్పిస్తుంది. అయితే ఈ ఇరవైనాలుగూ దానిని చూచి దానిలో 'లీనం' అయిపోతాయి. లీనం అయిపోవటమంటే నామరూపాలు లేకుండా పోవటం. ఒక నది సముద్రంలో కలవటానికి ముందువరకు నది. సముద్రంలో కలిసిన తరువాత ఆ పేరుగాని, దాని గుణాలుగానీ ఏమీ మిగలవు. ఆ స్థితికి లీనం అవటం అని వ్యవహారం. ప్రస్తుతం ఇరవైనాలుగు తత్త్వాలు విడిగా ఉన్నంతవరకూ అవి 'ఉన్నట్లు'; ఇరవై అయిదవ తత్త్వంలో 'లీన' మయినప్పుడు అవి లేనట్లు. ఈ ఇరవై అయిదవ తత్త్వాన్నే 'పరమాత్మ' అంటారు.

వ. చతుర్వింశతి తత్త్వంబులు వివరించెద. 177

ప్రతిపదార్థం: చతుర్+వింశతితత్త్వంబులు= ఇరవై నాలుగు తత్త్వాలను; వివరించెదన్= తెలియచెప్పుతాను.

తాత్పర్యం: ఇరవై నాలుగు తత్త్వాలను వివరిస్తాను.

తే. అవధరింపుము భూతంబు లయిదుఁ దద్గు । ణములుఁ బది యింద్రియములు మనంబు బుద్ధి
యును మహేశ! యహంకారమును బ్రకృతియు । నాఁగఁ దత్త్వంబు లిరువది నాల్గు వొలుచు. 178

ప్రతిపదార్థం: మహా+ఈశ!= పరమేశా!; అవధరింపుము= దయతో వినుము; భూతంబులు= భూతము అనే పేరుగలవీ; తత్+గుణాలు= వాటి గుణాలు; అయిదున్= అయిదూ; ఇంద్రియములు= ఇంద్రియాలు అనే పేరు గలవి; పది= పదీ;

మనంబు= మనస్సు; బుద్ధియును= బుద్ధీ; అహంకారమును= అహంకారమూ; ప్రకృతియున్= ప్రకృతీ; నాఁగన్= అనగా; తత్త్వంబులు= తత్త్వాలు; ఇరువదినాల్గు= ఇరవై నాల్గు; పొలుచున్= ఒప్పుతూ ఉంటాయి.

తాత్పర్యం: పరమేశ్వరా! అయిదు భూతాలు, అయిదైన వాటి గుణాలు, పది ఇంద్రియాలూ, మనస్సు, బుద్ధి, అహంకారమూ, ప్రకృతీ ఇవి ఇరవై నాలుగు తత్త్వాలు.

విశేషం: 1.నేల, 2.నీరు, 3.నిప్పు, 4.గాలి, 5.నింగి ఇవి అయిదు భూతాలు - భూతం అంటే ఉన్నది. అనాదిగా ఉన్నది అని స్థూలంగా అర్థం.

వాటి గుణాలు :1.గంధం (నేల), 2.రసం (నీరు), 3.రూపం (నిప్పు), 4. స్పర్శ (గాలి), 5. శబ్దం (నింగి)

పది ఇంద్రియాలు: అయిదు కర్మేంద్రియాలు + అయిదు జ్ఞానేంద్రియాలు.

1. వాక్కు, 2. చేతులు, 3.కాళ్ళు, 4. మలం విసర్జించే అవయవం, 4. జననేంద్రియం. ఇవి ఆయా పనులను చేస్తూ ఉంటాయి. కనుక కర్మేంద్రియాలు అంటారు.

1. చర్మము, 2. కన్ను, 3. చెవి, 4.నాలుక, 5. ముక్కు ఇవి వెలుపలి పదార్థాదుల స్పర్శాది లక్షణాలను జీవికి తెలియజేస్తాయి. కనుక జ్ఞానేంద్రియాలు.

5+5+5+5=20. ఇవిగాక 1.మనస్సు, 2.బుద్ధి, 3.అహంకారము, 4.ప్రకృతి - అనేవి నాలుగు (20+4=24) కలిపితే ఇరవైనాలుగు.

అయి దయిదుగా ఉన్న వాటికి క్రమసంబంధం చూచుకోవాలి. అంటే ఒక భూతం, ఒక గుణం, ఒక జ్ఞానేంద్రియం పరస్పర సంబంధం కలిగి ఉంటాయి. అది ఈ క్రింది విధంగా అనుసంధించుకొనాలి.

	భూతం	**గుణం**	**జ్ఞానేంద్రియం**
1.	నేల	గంధం	ముక్కు
2.	నీరు	రసం	నాలుక
3.	నిప్పు	రూపం	కన్ను
4.	గాలి	స్పర్శ	చర్మం
5.	నింగి	శబ్దం	చెవి

కర్మేంద్రియాలు ఈ అన్నింటికీ తగిన విధంగా సహకరిస్తూ తమ పనులు చేసికొంటాయి.

(21) మనస్సు: వచ్చే భావాలు, పోయే భావాలు అనేవాటి సముదాయరూపమైనది.

(22) బుద్ధి : నిశ్చయాత్మక - అంటే ఒక పనికి నిర్ణయం కుదిరిన దశలో దానిని బుద్ధి అంటారు.

(23) అహంకారం : 'నేను' అనే భావం. నేను చేస్తున్నాను, నేను చూస్తున్నాను - అనే భావం దేనివలన ఏర్పడుతున్నదో

దానిని 'అహంకారం' అంటారు.

(24) ప్రకృతి : పై అన్నింటికీ మూలకారణమైన తత్త్వం. దీనినే 'మాయ' అని కూడా అంటారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఆ చతుర్వింశతి తత్త్వంబుల నధిష్ఠించి యుండు తత్త్వంబు నిర్దేశించెద. 179

తాత్పర్యం: ఆ ఇరువది నాలుగు తత్త్వాలకూ ఆధారరూపంగా ఉండే తత్త్వాన్ని చెప్పుతాను.

క. దేహం బనియెడ నెరవున । నూహించును బుధుఁడు దాననుండుం గాష్ఠ

స్వాహాప్రియు క్రియఁ బురుషుఁడు । సోఽహ మనిన కాన్పు రుద్ర! యతనిఁ గను టగున్. 180

ప్రతిపదార్థం: బుధుఁడు = జ్ఞానం కల పండితుడు; దేహంబు= శరీరం; అని; ఎడన్= ఒక తావును; నెరవునన్= సముదాయ రూపంలో; ఊహించును= భావిస్తాడు; దానన్= ఆ దేహంలో; కాష్ఠ స్వాహాప్రియు క్రియన్= కట్టెలోని అగ్నివలె; పురుషుఁడు= పురుష డనబడే ఇరవై అయిదవ తత్త్వం; ఉండున్= ఉంటుంది; రుద్ర!= ఓ పరమేశ్వరా!; సః+అహమ్= అతడే నేను; అనిన కాన్పు= అనే దృష్టి; అతనిన్= ఆ పురుషుడిని; కనుట= దర్శించటం; అగున్= అవుతుంది.

తాత్పర్యం: రుద్రా! జ్ఞాని పై ఇరువదినాల్గింటి సముదాయాన్ని దేహం అని భావిస్తాడు. అందులో 'పురుషుడు' కట్టెలో నిప్పు ఉన్నట్లు ఉంటాడు. అతడే 'నేను' అనే జ్ఞానం పొందటమే ఆ పురుషుడిని దర్శించే విధానం.

విశేషం: శ్రీ శంకరులు నిరూపించిన అద్వైతసిద్ధాంత రహస్యమంతా ఈ పద్యంలో మనకు స్పష్టం అవుతుంది. పైన చెప్పిన ఇరవైనాలుగు తత్త్వాల సముదాయాన్ని దేహం అంటారు. 'పురుషుడు' అనబడే ఇరవై అయిదవ తత్త్వం అందులోనే ఉంటుంది. ఆత్మని+అధి= 'దేహమును ఆధారంగా చేసికొని ఉండేది - అధ్యాత్మమ్ అని అధ్యాత్మ శబ్దాని కర్థం. దేహంలో పురుషుడు ఉండే స్థితిని చక్కగా తెలియటం కోసం ఒక ఉపమానం ద్వారా తెలియజేస్తున్నాను. దేహం కట్టెవంటిది. అందులో ఉండే పురుషుడు అగ్నివంటివాడు. అగ్నికి రెండుదశలు. 1. వ్యక్తదశ. కట్టె కాలుతున్నప్పుడు అగ్ని కంటికి తెలియవస్తుంది. 2. అవ్యక్త దశ. కట్టెలో గూఢంగా అగ్ని ఉండే దశ. కనుకనే ఒక కట్టెను మరొక కట్టెతో మథిస్తే అగ్ని పుట్టుతున్నది. ఈ విధంగా పైకి కనపడకుండా ఉన్నట్లు తెలియవచ్చే దశను అవ్యక్తదశ అంటారు. పురుషుడు దేహంలో ఈ రెండు స్థితులలో దేహానికి ఆధారమై ఉంటాడు. అనగా ఆ 'పురుషతత్త్వం' ఉన్నది కనుకనే ప్రకృతి మొదలైన ఇరవైనాలుగు తత్త్వాల సముదాయం ఉన్నది. అది లేకపోతే ఇది లేదు - అన్న స్థితిలో ఉన్నాడు. జీవుడు ఆ పురుషుడిని సంసారబంధం లేకపోవటం అనే పరమప్రయోజనాన్ని అపేక్షించి తెలిసికొనాలి. దానికి మార్గాన్ని ఇక్కడ సులభపద్ధతిలో చెప్పుతున్నారు. 'అహమ్' అంటే నేను - అంటే ఇరవైనాలుగు తత్త్వాల సముదాయరూపమైన జీవుడు. 'సః' - అంటే ఇరువది యైదవ తత్త్వంగా ఉండే పరమాత్మ. అది నేనే, నేనే అది - అన్న వివేకం పొందటమే పరమాత్మను చూడటం. దానివలన జీవుడికి పరమాత్మతతో ఒక్కటి అయ్యే స్థితి కలుగుతున్నది. దానినే మోక్షం అంటారు. అద్వైతసిద్ధి అంటే ఇదే. ద్వి - రెండు, 'ద్వితా' - రెండు ఉండటం. దాని భావం - ద్వైతం అది లేని స్థితి - అద్వైతం - ఇక్కడ రెండు అంటే (1) .జీవుడు, (2) పరమాత్మ.

క. ఈ నెఱి నిలుచుట గలుగదు । మానేర్ష్యావంతు లైన మానవులకు ని

ష్ఠానూన తపోవర్తకు । లైనను గార్హస్థ్యబహుముఖాత్మకు లగుటన్. 181

ప్రతిపదార్థం: నిష్ఠా+అనూన తపస్+వర్తకులు= ఏ కొంచెం చెదరని తక్కువకాని తపస్సును ప్రవర్తింపజేసేవారు; ఐనను= అయినా; గార్హస్థ్యబహుముఖ+ఆత్మకులు= గృహస్థధర్మంలో పెక్కురీతులైన భావాలు కలవారు; అగుటన్= కావటంవలన; మాన+ఈర్ష్యావంతులు= అభిమానమూ, ఈర్ష్య అనే భావాలు కలవారు; ఐన మానవులకున్= అయిన మనుష్యులకు; ఈ నెఱి= ఈ వివేకం; నిలుచుట= స్థిరంగా ఉండటం; కలుగదు= కలగదు.

తాత్పర్యం: గృహస్థులు పెక్కుభావాలు కలవారు కావటంవలన చెడని దీక్షగల తపస్సులో ప్రవర్తిస్తున్నవారైనా ఈర్ష్య, దురభిమానం గల మానవులకు ఈ వివేకం ఎక్కువకాలం నిలవదు.

విశేషం: 'అతడే నేను' అనుకొన్నాం కదా! మరి మనకు మోక్షం సిద్ధించటం లేదేమి? - అనే ప్రశ్నను సంభావించి సమాధానం చెప్తుతున్నారు. మోక్షం ఈ వివేకం స్థిరంగా సర్వకాల సర్వావస్థలలో చెడకుండా ఉన్నవారికి మాత్రమే సిద్ధిస్తుంది. దీనికి 'విక్షేపాలు- భంగం కలిగించేవి - పెక్కులు. 1.గార్హస్థ్యబహుముఖాత్మకత - గృహస్థధర్మంలో ఉండటంవలన అనేకభావాలను చూడవలసి రావటం. 2. మానం - అంటే అహంకారం. దురభిమానం. నేనే సర్వానికీ కర్తను - అనే దుష్టమైన ఆలోచన, 3. ఈర్ష్య -ఇతరుల విశిష్టతను చూచి సహింపలేకపోవటం మొదలగునవి. ఇవన్నీ తనను తాను లయం చేసికొని పరమాత్మలో కలిసిపోవటానికి అడ్డుపడే లక్షణాలు. ఇవి తొలగాలంటే 'నిష్ఠానూన తపస్సు' కావాలి. కానీ సాధన ఉన్నా ప్రతిబంధకాలైన ఈర్ష్యాదులను తొలగించుకొనకపోతే సాధన బూడిదలో పోసిన పన్నీరువంటి దవుతుంది. ఎందుకంటే 'సోహ౭మ్' అనే వివేకం 'నిలుచుట కలుగదు' కనుక.

వ. శ్రుతి పురుషు నమృతార్థ తత్త్వంబనియు బ్రహ్మం బనియు నిర్దేశించు. 182

ప్రతిపదార్థం: శ్రుతి= వేదం; పురుషున్= పురుషు డనే తత్త్వాన్ని; అమృత+అర్థ తత్త్వంబు= అమృతం అనే అర్థంగల తత్త్వం; అనియున్= అనీ; బ్రహ్మంబు= బ్రహ్మము; అనియున్= అనీ; నిర్దేశించున్= తెలియచేస్తున్నది.

తాత్పర్యం: వేదం 'పురుష' తత్త్వాన్ని అమృతార్థతత్త్వమనీ బ్రహ్మమనీ తెలియజేస్తున్నది.

విశేషం: 'అమృతం' అంటే చావు లేనిది. ఆ అర్థంగల తత్త్వం అమృతార్థతత్త్వం - 'అవినాశి తు తద్విద్ధి' అని భగవద్గీత. బ్రహ్మము అనగా పెద్దది అని శబ్దార్థం. దీనికంటె మించినది, పెద్దది వ్యాపించినదీ మరొకటి లేదు కనుక 'బ్రహ్మము' అనే పదం సార్థకమైనది. శ్రుతి అనగా శబ్దప్రమాణం. అనగా ఇతర ప్రమాణాల ద్వారా తెలియరాని అంశాలను తెలియజెప్పేది. అది తిరుగులేని ప్రమాణం.

తే. అన్ని తత్త్వంబులకు నమృతార్థతత్త్వ। మెక్కు డది ఈశ్వరంబు ననీశ్వరంబు
సత్యపాకంబు నతిరహస్యంబు దానిఁ। గనిన మృత్యుజాలము చిక్కు గడవవచ్చు. 183

ప్రతిపదార్థం: అమృత+అర్థతత్త్వము= అమృతం అనే అర్థం గల తత్త్వం; అన్ని తత్త్వంబులకున్= ముందు చెప్పిన ఇరవై నాలుగు తత్త్వాలకంటె; ఎక్కుడు= గొప్పది; అది= ఆ తత్త్వం; ఈశ్వరంబు= అన్నింటికీ ప్రభువు; అనీశ్వరంబు= మరియొక ప్రభువు లేనిది; సత్యపాకంబు= సత్యం పండిన రూపం; అతి రహస్యంబు= మిక్కిలి గోప్యమైనది; దానిన్= ఆ తత్త్వాన్ని; కనినన్= కనుగొంటే; మృత్యుజాలము చిక్కు= మరణం అనే వలలో చిక్కటం; కడవన్ వచ్చున్= దాటవచ్చును.

తాత్పర్యం: ఈ అమృతార్థతత్త్వం అన్ని తత్త్వాలకు మించినది. అది అన్నింటినీ శాసించేది. దానికి మరొక శాసకుడు లేడు. సత్యం పండిన స్వరూపం. మిక్కిలి రహస్యమైనది. దానిని తెలిసికొంటే మృత్యువు వలనుండి దాటవచ్చును.

విశేషం: ఈశ్వరము - తక్కిన ఇరవై నాలుగు తత్త్వాలు దీని అధీనంలో ప్రభువువద్ద సేవకుడివలె ప్రవర్తిస్తాయి అని భావం. అనీశ్వరంబు - దీనిని శాసించే మిన్న అయిన తత్త్వం మరొకటి లేదని భావం. సత్యపాకంబు - పరమసత్యం అని భావం. అంటే మూడుకాలాలలో, సర్వదేశాలలో ఏ యితర ప్రమాణం చేతనూ త్రోసివేయరానిది అని భావం. అతి రహస్యం - దీని గుట్టు తెలిసికొనటం ఎంతవారికీ సాధ్యం కాదని భావం. ఇక్కడ మృత్యువంటే అజ్ఞానము, సంసారము అనే పేర్లతో వ్యవహరించబడే దశ. దాని తగులం దీనివలన రూపుమాసిపోతుందని భావం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అనఘ! యనులోమమునఁ దోఁ । పును బ్రతిలోమమున లయము వొందుటయును గ
ల్గును సర్వతత్త్వముల కవి । యెనయిక బ్రహ్మమును గలయు టేకత్వ మగున్. 184

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; సర్వతత్త్వములకున్= తత్త్వాలన్నింటికీ; అనులోమమునన్= పైనుండి క్రిందికి అనే విధానంచేత; తోఁపును= కన్పడటం అనే స్థితీ (సృష్టి); ప్రతిలోమమునన్= క్రిందినుండి పైకి పోవుట అనే విధానం చేత; లయము= ఒకదానిలో ఒకటి కలిసిపోవటం; పొందుటయును= పొందటమూ; కల్గును= ఏర్పడుతున్నది; అవి= ఆ తత్త్వాలు; ఎనయిక= ఒక్కటి కావటం; బ్రహ్మమును= 'బ్రహ్మము' అనే ఇరవై అయిదవ తత్త్వాన్ని; కలియుట= కలసిపోవటం; ఏకత్వము= ఒక్కటి కావటం; అగున్= అవుతుంది.

తాత్పర్యం: అనఘా! తత్త్వాలన్నీ పైనుండి క్రిందికి అనే తీరులో ఏర్పడితే 'సృష్టి' అంటారు. క్రిందినుండి పైకి అనే పద్ధతిలో కలసిపోతే 'లయం' అంటారు. అవి అన్నీ కలిపి బ్రహ్మమును చేరుకొనటమే 'ఏకత్వం' అవుతుంది.

విశేషం: అనులోమం - అంటే - బ్రహ్మము - ప్రకృతి - అహంకారము - బుద్ధి - మనస్సు - పంచభూతాలు -పంచగుణాలు - పంచేంద్రియాలు - అనే వరుసలో ఏర్పడటం. దీనిని సృష్టి అంటారు. ఇంద్రియాలు గుణాలలో, అవి భూతాలలో, అవి మనస్సులో, అవి బుద్ధిలో, అది అహంకారంలో, అది ప్రకృతిలో, అది బ్రహ్మలో క్రమంగా లీనం కావటటం ప్రతిలోమ విధానం. దీనిని 'లయప్రక్రియ' అంటారు. ఇట్లా చివరకు బ్రహ్మము ఒక్కటే ఉండే స్థితిని 'ఏకత్వం' అని వ్యవహరిస్తారు. దీనిని సాధకుడు అంతరంగంలో సాధించి చెదరకుండా నిలుపుకొనటం మోక్షం.

తే. ఉత్తమశ్రద్ధ లేకున్నఁ జిత్త మేక । ముఖము గాకున్న నింద్రియముల జయింప
కున్న వేదంబు చదువకయున్న నతని । కీ పరిజ్ఞాన మీఁ దగ దిద్ధచరిత! 185

ప్రతిపదార్థం: ఇద్ధచరిత!= చక్కగా ప్రకాశిస్తున్న నడవడికలవాడా!; ఉత్తమశ్రద్ధ= శ్రేష్ఠమైన హృదయసమర్పణ; లేక+ఉన్నన్= లేకుంటే; చిత్తము= మనస్సు; ఏకముఖము= ఆ ఒక వస్తువునందు లగ్నం అయినది; కాకున్నన్= కాకపోతే; ఇంద్రియములన్= ఇంద్రియాలను; జయింపక+ఉన్నన్= గెలువకపోతే; వేదంబు= శ్రుతిని; చదువక+ఉన్నన్= చదువకపోతే; అతనికిన్= అట్టివాడికి; ఈ పరిజ్ఞానమున్= ఈ సమగ్రమైన జ్ఞానాన్ని; ఈన్ తగదు= ఇవ్వరాదు.

తాత్పర్యం: పరమేశ్వరా! శ్రేష్ఠమైన శ్రద్ధలేనివాడికీ, చిత్తాన్ని ఏకాగ్రంగా నిలుపలేనివాడికీ, ఇంద్రియాలను గెలువని వాడికీ, వేదం చదువనివాడికి ఈ మహాజ్ఞానాన్ని ఇవ్వరాదు.

విశేషం: 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం, తత్పరః సంయతేన్ద్రియః' అని భగవదనుశాసనం. శ్రద్ధకలవాడూ, తత్పరుడు, ఇంద్రియ నిగ్రహం కలవాడూ జ్ఞానం పొందుతాడు. ఈ పద్యంలో ఈ అంశాలను క్రమంగా పేర్కొన్నారు. తత్పరత్వమే ఏకాగ్రత. శ్రద్ధ అంటే హృదయాన్ని లక్ష్యంమీదనే ఉంచటం. ఈ మహాజ్ఞానాన్ని ఇవ్వరాదు అనటంలో జ్ఞానం విలువ తెలియచెప్పటం ప్రధానలక్ష్యం.

వ. అని చెప్పి తదనంతరంబ యధ్యాత్మంబుల నధిభూతంబుల నధిదైవంబుల నుపన్యసించె నా సనత్కుమారుండు
దత్ప్రపంచంబు నారదునకుం జెప్పుట యేను నీకెఱింగించి యప్పరిపాటి నిన్ను మున్న వినిపించితి ధర్మనందనా!
యమ్మునిపతి మఱియు నప్పశుపతితో నిట్లనియె. 186

ప్రతిపదార్థం: అని; చెప్పి= తెలిపి; తద్+అనంతరంబు+అ= ఆ పిమ్మట; అధ్యాత్మంబులన్= దేహాన్ని ఆశ్రయించిన వాటిని గూర్చి; అధిభూతంబులన్= ప్రాణులనాశ్రయించి ఉన్నవాటిని; అధిదైవంబులన్= దేవతల నాశ్రయించి ఉన్నవాటిని; ఉపన్యసించెన్= చక్కగా వివరించాడు; ఆ సనత్కుమారుండు= ఆ సనత్కుమారుడు; తద్+ప్రపంచంబున్= విషయాల విస్తరాన్ని; నారదునకున్= నారదమహర్షికి; చెప్పుట; ఏను= నేను; నీకున్= నీకు; ఎఱింగించి= తెలిపి; ఆ+పరిపాటిన్= ఆ క్రమాన్ని; నిన్నున్= నీకు; మున్ను+అ= ఇంతకుముందే; వినిపించితిన్= తెలియజెప్పాను; ధర్మనందనా!= ధర్మరాజా!; ఆ+మునిపతి= మునులలో ఉత్తముడైన ఆ సనత్కుమారుడు; మఱియున్= ఇంకా; ఆ+పశుపతితోన్= ఆ పరమేశ్వరుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్=అన్నాడు.

తాత్పర్యం: తరువాత సనత్కుమారుడు ఆధ్యాత్మములనూ, అధిభూతాలను, అధిదైవాలను గురించి వివరించి చెప్పాడు. ధర్మరాజా! ఆ సనత్కుమారుడు ఆ వివరాలనన్నింటినీ నారదుడికి తెలియజెప్పా డని ఆ క్రమమంతా ఇంతకుముందే నీకు చెప్పాను. తరువాత ఆ మునిశ్రేష్ఠుడు పరమేశ్వరుడితో ఇట్లా అన్నాడు.

ఆ. సకల జంతువులకు సామాన్య మధ్యాత్మ । మాదిగాఁగ గల్గు నంతవట్టు
నిట్లు గాఁగ నెఱుఁగు టెఱుఁగుట యొండుమైఁ । గనుట యెఱుక గాదు కామదమన! 187

ప్రతిపదార్థం: కామదమన!= కాముడిని అణచిన ఓ శంకరా!; సకలజంతువులకున్= అన్ని ప్రాణులకు; అధ్యాత్మము+ ఆదిగాఁగన్= అధ్యాత్మము మొదలుగా; కల్గు+అంతవట్టున్= ఉన్న అది అంతా; సామాన్యము= సమానంగా ఉండేదే; ఇట్లు= ఈ విధంగా; కాఁగన్= అవటం; ఎఱుఁగుట= తెలిసికొనటం; ఎఱుఁగుట= నిజమైన తెలివి; ఒండుమైన్= మరొకవిధంగా; కనుట= చూడటం; ఎఱుక= జ్ఞానము; కాదు.

తాత్పర్యం: శంకరా! అధ్యాత్మం మొదలైనది సర్వప్రాణులకు సమానంగా ఉండేది. ఇట్లా తెలిసికొనటమే నిజమైన జ్ఞానం. మరొకవిధమైనది జ్ఞానం కాదు.

విశేషం: ఇంతవరకు చెప్పిన అధ్యాత్మజ్ఞానం ఎవరికో ఒకరికి సంబంధించినది కాదు. సమస్తప్రాణికోటికీ సంబంధించినది - అని తెలిసికొనటమే నిజమైన జ్ఞానం. దీనివలన సర్వప్రాణికోటియందూ ఆత్మతత్త్వం నిండి ఉన్నది అనే మహావిషయం స్పష్టం చేసినట్లయింది.

క. విను మధ్యాత్మప్రభృతులు । గనిరే? మున్నమరదనుజ గంధర్వులునుం
గనుటయుఁ గల్గునె? బ్రహ్మం । బున నున్న నిజంబు తత్ప్రబోధం బసదే? 188

ప్రతిపదార్థం: వినుము; అమర దనుజ గంధర్వులున్= దేవతలు, రాక్షసులు, గంధర్వులు; మున్ను= పూర్వం; అధ్యాత్మ ప్రభృతులు= అధ్యాత్మం మొదలైన విషయాలను; కనిరే?= తెలిసికొన్నారా? బ్రహ్మంబునన్+ఉన్న నిజంబు= బ్రహ్మములో ఉన్న సత్యాన్ని; కనుటయున్= ఇకముందు తెలిసికొనటమూ; కల్గునె?= కలుగుతుందా?; తద్+ప్రబోధంబు= దానిని తెలియజెప్పటం; అసదు+ఏ?= తక్కువదియా?

తాత్పర్యం: ఓయి సర్వజ్ఞా! దేవతలుగానీ, రాక్షసులుగానీ, గంధర్వులు గానీ మునుపు ఈ అధ్యాత్మం మొదలైన విషయాలు తెలిసికొనగలిగారా? బ్రహ్మముయొక్క నిజతత్త్వం తెలిసికొనటం సాధ్యమా? దానిని తెలియజెప్పటం తేలిక పనియా?

విశేషం: బ్రహ్మజ్ఞానం అనంతమైనది. దేవతాదులకు కూడా తెలియదగినది కాదు. తెలిసికొనటం, తెలియజెప్పటం రెండూ దుష్కరాలే అని తాత్పర్యం. దేవతలు సత్త్వగుణానికీ, రాక్షసులు తమోగుణానికీ, గంధర్వులు రజోగుణానికీ ప్రతీకలుగా భావిస్తే పరమాత్మతత్త్వం గుణాతీతమైనది అనే భావన సిద్ధిస్తుంది.

క. ఓం కారవాచ్య మది యన । హంకార నిరూఢ భావనారాధ్యము ని
ష్పంక మశీత మనుష్ణము । శంకర మఖిలంబునకుఁ దృషాహరము శివా! **189**

ప్రతిపదార్థం: శివా= శంకరా!; అది= ఆ బ్రహ్మము-తత్త్వం; ఓంకారవాచ్యము= 'ఓమ్' అనే ప్రణవముచేత చెప్పదగినది; అనహంకార నిరూఢ భావనా+ఆరాధ్యము= అహంకారం పూర్తిగా నశించిన భావనకు ఆరాధించదగినది; నిష్పంకము= ఎట్టి మాలిన్యము లేనిది; అశీతము= చల్లదనము లేనిది; అనుష్ణము = వేడి లేనిది; అఖిలంబునకున్= సృష్టిలో సమస్తమైన దానికి; శంకరము= శుభాన్ని కలిగించేది; తృషాహరము= దాహాన్ని తొలగించి వేసేది.

తాత్పర్యం: శివా! ఆ బ్రహ్మతత్త్వం ఓంకారంచేత మాత్రమే చెప్పదగినది. అహంకారం బొత్తిగా లేని వారి భావనచేత మాత్రమే ఆరాధించబడేది. ఏ మాలిన్యమూ లేనిది. ద్వంద్వాలకు అతీతమైనది. సర్వమునకు శుభాన్ని కలిగించేది. అందరి దాహాలు తీర్చునట్టిది.

విశేషం: 'ఓంకారం' దీనిని ప్రణవం అంటారు. ఇది పరబ్రహ్మమునకు వాచకం. ఆకార ఉకార మకారాల సముదాయం ఓంకారం. దీని పరిపూర్ణమైన అర్థాన్ని మాండూక్యోపనిషత్తు వివరిస్తున్నది. అహంకారం ఉన్నవాడికి తానూ, ప్రపంచమూ మాత్రమే కనిపిస్తాయి. పరమాత్మ ఉనికినే అతడు పసికట్టలేడు. సృష్టిలోని సర్వపదార్థాలలో ఏదో దోషం ఉండనే ఉంటుంది. చివరకు హరిహరబ్రహ్మలు కూడా పరమాత్మ తంత్రానికి లోబడినవారే కావటం గుర్తిస్తే వారిలో అస్వతంత్రత అనే దోషం ఉన్నది. ఇక తక్కిన జీవకోటి సంగతి చెప్పనేల? కానీ పరమాత్మకు అట్టిదోషమేమీ లేదని 'నిష్పంకము' అనే శబ్దం తెలియచేస్తున్నది.

అశీతము, అనుష్ణము - అనే పదాలలోని శీతత్వ ఉష్ణత్వాలు ద్వంద్వాలకు సంకేతాలు. సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, లాభనష్టాలు మొదలయినవి ద్వంద్వాలు. అవి సుఖంతోపాటు దుఃఖానికి కూడా కారణాలవుతాయి. పరమాత్మ ద్వంద్వాతీతుడు కనుక ఆనందైక ఘనుడని ఉపనిషత్తులు చెప్తున్నాయి.

శంకరము - సమస్తప్రాణికోటికీ శుభాన్ని కూర్చేది - ఇక్కడ 'శమ్' అంటే దేశకాల పాత్రములకు అతీతమైన పరమానందం అనే అర్థం గ్రహించాలి.

తృషాహరము - జ్ఞానలాభం పొందిన సాధకుడు మరి దేనినీ అపేక్షించడు. అపేక్ష దుఃఖానికి కారణం. అనపేక్షత పరమ సుఖదాయకం. ఇట్లా ఈ పద్యంలో పరమాత్మ లక్షణాలను ప్రపంచించారు.

తే. అప్రమేయ మవిజ్ఞేయ మచల మాది । విరహితంబు నితాంతంబు విమల మవ్య
యంబు పుండరీకాక్ష మనక్షవిషయ । మచ్యుతము సదసత్పరమైక్యభాసి. **190**

ప్రతిపదార్థం: అప్రమేయము=ఊహకందనిది; అవిజ్ఞేయము= తెలియశక్యముకానిది; అచలము= కదలికలేనిది; ఆది విరహితంబు= మొదలులేనిది; నితాంతంబు= అన్నింటికంటె మిన్న అయినది; విమలము= దోషములు లేనిది; అవ్యయంబు= ఎట్టిమార్పులు లేనిదీ; పుండరీక+అక్షము= పద్మములవంటి కన్నులు కలది; అనక్షవిషయము= ఇంద్రియములకు విషయముకానిది; అచ్యుతము= జారుపాటు లేనిది; సత్+అసత్ పరమ+ఐక్య భాసి= ఉన్నది లేనిది అనువాటి గొప్ప ఏకత్వముచేత ప్రకాశించేది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ బ్రహ్మము ఊహ కందనిది. తెలియ శక్యము కానిది, కదలిక లేనిది, మొదలు లేనిది, అన్నింటి కంటె మిన్న అయినది, దోషములు లేనిది, ఎట్టిమార్పులు లేనిది, పద్మములవంటి కన్నులు కలది, ఇంద్రియములకు తెలియరానిది, చ్యుతి లేనిది. సదసత్తుల గొప్ప కలయికలో భాసించేది.

విశేషం: అప్రమేయము - మేయము అనగా కొలవదగినది, ప్రమేయము - గొప్పగా కొలవదగినది - అది కానిది అప్రమేయం. పొడవు, ఎత్తు, వెడల్పు మొదలైన ప్రమాణాలు చెప్పరానిది అని భావం.

అవిజ్ఞేయము : ఇతరమైన అనుమానాది ప్రమాణాల ద్వారా తెలిసికొన జాలనిది.

అచలము : స్థిరమైనది. చలనం ఉంటే ఉన్నచోటు, పోయే చోటు మొదలైనవి భావాలు ఉంటాయి. ఉంటే కొలతలు మొదలైనవి ఏర్పడుతాయి. అవి లేవు కనుక అచలము.

ఆదివిరహితంబు : ఆదిశబ్దం మధ్య, అంతశబ్దాలను కూడా సూచిస్తున్నది. ఆది, మధ్య, అంతం అనే దేశకాలభేదాలు లేనిది.

నితాంతంబు : అన్నింటికంటె అధికమైనది. అందుకనే దానిని 'బ్రహ్మము' అంటారు.

విమలము : స్వచ్ఛమైనది. మలం (దోషం) లేనిది. ఉత్పత్తి, స్థితి, వినాశనం మొదలైన వికారాలే మలాలు. అవి లేనిది.

అవ్యయంబు : వ్యయం అనగా తరుగుదల. ఏదో ఒక కారణంగా స్థితిలో వచ్చే క్షీణత - అది లేనిది, పుండరీక+అక్షము= పుండరీకం అనగా హృదయం అనే పద్మం. అందులోనికి వ్యాపించి ఉండేది. వేదమంత్రం హృదయకుహరంలోని సన్ననిరంధ్రంలోని అతిసూక్ష్మమైన అగ్నిజ్వాల నడిమి ప్రదేశం పరమాత్మ స్థానమని అభివర్ణించింది.

అనక్షవిషయము : ఇంద్రియాలకు విషయం కానిది అంటే ఇంద్రియాలచేత తెలియరానిది. ఇంద్రియాలంటే కన్ను, ముక్కు మొదలైనవి రూపగంధాదులను గ్రహిస్తాయి. ఆ అన్నింటికీ అతీతమైనది కనుక ఆత్మతత్త్వం ఇంద్రియాతీతమైనది.

అచ్యుతము : చ్యుతి అంటే జారుపాటు మార్పు అట్టిదేమీ లేనిది.

సత్+అసత్+పరమ+ఐక్యభాసి : సత్ ఉన్నది, అసత్ అంటే లేనిది. ఉన్నది పరమాత్మతత్త్వం, లేనిది జగత్తత్త్వం. ఈ రెంటియొక్క పరమమైన - అత్యుత్కృష్టమైన ఐక్యం - ఏకత్వం - ఒక్కదానితనం - దానితో ప్రకాశించేవాడు. జీవాత్మ పరమాత్మల ఏకత్వం పరిపూర్ణంగా సిద్ధించినపుడు కొంతకాలం ఆ ఏకత్వం లేకుండా దానికోసం సాధనచేసిన వ్యక్తికి ప్రకాశరూపంలో తెలియవచ్చేది.

ఈ పద్యం ఉపనిషదాదులు అనేకయుక్తులతో నిరూపించటానికి ప్రయత్నించే పరమాత్మతత్త్వాన్ని అక్షరరూపంలో వ్యక్తం చేస్తున్నది.

క. అది నారాయణుఁ డొకనికి । విదిత మతనివలన సురలు వివిధమునులు ని
ర్మదసిద్ధసాధ్యగణములు । మొదలగు నర్హుల సుబోధముల పొలమయ్యెన్. 191

ప్రతిపదార్థం: అది= ఆ పరతత్త్వం; నారాయణుఁడు= శ్రీమన్నారాయణుడు; ఒకనికిన్= ఒక్కడికి; విదితము= తెలిసినది; అతనివలనన్= ఆ నారాయణుడివలన; సురలు= దేవతలు; వివిధ మునులు= వేరువేరు విధాలకు చెందిన మునులు; నిర్మద సిద్ధ సాధ్య గణములు= మదంలేని సిద్ధులు సాధ్యులు అనేవారి సముదాయాలు; మొదలగు+అర్హుల సుబోధముల పొలము= మొదలైన యోగ్యత గల జ్ఞానములకు సంబంధించిన క్షేత్రం; అయ్యెన్= అయినది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ పరతత్త్వం నారాయణుడి కొక్కడికే మొదట తెలిసింది. అతడివలన దేవతలు, మునులు, సిద్ధులు, సాధ్యులు మొదలగు యోగ్యతగలవారి జ్ఞానపు పొలం అయింది.

విశేషం: నారాయణుడు - పరమాత్మ స్వరూపంయొక్క సగుణరూపం మొదటి వెలుగు నారాయణుడు. అంటే పరమాత్మ నిర్గుణబ్రహ్మం. నారాయణుడు సగుణబ్రహ్మం అని భావం. 'సగుణం' అనగా సాధకుల తెలివికొరకు నామరూపాదులు పొందిన తత్త్వం. సురలు అనగా బ్రహ్మాదులు వివిధమునులు - బ్రహ్మాది లోకాలకు సంబంధించిన సనత్కుమారుడు, నారదుడు మొదలైనవారు.

నిర్మద, అర్హులు అనే మాటలవలన కేవలం సిద్ధాది పరిగణనకు వచ్చినవారందరికీ ఆ తత్త్వం తెలియవచ్చేది కాదన్న అర్థం తెలియవస్తున్నది.

దీనినే సంప్రదాయం లేదా గురుపరంపర అంటారు. ఈ రెండూ లేని విద్యలు అనాదివిద్యలు కావు. ఆత్మతత్త్వం అనాది విద్య. అనంతవిద్యలు కావు. ఆత్మతత్త్వం అనాదివిద్య. అనంతవిద్య అని నిరూపించటానికి ఈ పరంపరను చెప్పటం పరిపాటి.

వ. అట్లయిన నా తత్త్వంబు దృశ్యత్వంబు నిరూఢంబుగా దెట్లనిన వినుము బంద విముక్తుండు కదా కనువాఁడు. 192

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; అయినను= అయినా; ఆ తత్త్వంబు; దృశ్యత్వంబు= ఆ పరమాత్మ తత్త్వం కనపడేతనం; నిరూఢంబు= స్పష్టంగా తెలియవచ్చేది; కాదు; ఎట్లు= ఏ విధంగా; అనినన్= అనగా; వినుము= వినుము; బంధవిముక్తుండు= బంధంనుండి విడివడినవాడు; కదా; కనువాఁడు= చూచేవాడు.

తాత్పర్యం: అట్లా అయినా ఆ తత్త్వం కనపడేది కావటం జరుగదు. వినుము. ఎందుకంటే, బంధంనుండి విముక్తి పొందినవాడే కదా చూచేవాడు.

విశేషం: నారాయణుడు మొదలుకొని మహాజ్ఞానసంపన్నుల చక్కని తెలివికి పొలమైనా ఆ పరతత్త్వం కంటికి కనబడదు. ఎందుకంటే అది శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం వంటి విషయం కాదు. ఇంద్రియాలు వాటిని వాటి వికారాలను మాత్రమే చూస్తాయి. ఇక్కడ 'చూచువాడు' అనగా పరతత్త్వదర్శనం చేయగలవాడు అని అర్థం. పైన చెప్పిన ఇరవైనాలుగు తత్త్వాలలో చిక్కటమే బంధం. దానినుండి బయటపడటమే విముక్తి. ఇరవైనాలుగు తత్త్వాలలో చిక్కుకొన్నవాడికి అవే కనిపిస్తాయి. కాని వాటి కతీతంగా 'పెంజీకటి కవ్వల నెవ్వం డేకాకృతియై' అన్నట్లు ఉన్నది కనిపించదు. దానికి బంధవిముక్తి సాధనం - అని భావం. ఈ భావాన్ని మరింత స్పష్టంగా చెప్పుతున్నారు.

చ. స్మరహర! పొందు నింద్రియసమాజయుగంబు మనంబు బుద్ధియుం
బరువడిమై నహంకరణబంధము వాసిన జీవుఁ దత్సము
త్కరసహితంబుగా నతఁడు దాఁ బరతత్త్వమునందు లీనతం
బొరయును, దాని నెవ్వరు ప్రబోధముగాఁ గనువారు? సెప్పుమా! 193

ప్రతిపదార్థం: స్మరహర!= మన్మథుడిని హరించిన ఓ శంకరా!; పరువడిమైన్= మిక్కిలి వేగంతో; అహంకరణ బంధము= అహంకారం అనే బంధం; పాసిన జీవున్:= వదలిన జీవుడిని; ఇంద్రియసమాజయుగంబు= ఇంద్రియాల సముదాయపు జంట; మనంబు= మనస్సు; బుద్ధియున్= బుద్ధీ; పొందున్= పొందుతాయి (జీవుడిలో చేరుకొంటాయి); అతఁడు= ఆ జీవుడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తద్+సముత్కర సహితంబుగాన్= ఆ సముదాయంతో పాటు; పరతత్త్వమునందున్= అన్నింటికంటె వేరుగా మిన్నగా ఉండే పరమాత్మ తత్త్వంలో; లీనతన్= కలిసిపోవటాన్ని; పొరయును= పొందుతాడు; దానిన్= అట్టి పరతత్త్వాన్ని; ఎవ్వరు= ఎవరు; ప్రబోధముగాన్= చక్కగా తెలియవచ్చే విధంగా; కనువారు?= చూచేవారు? చెప్పుమా?= చెప్పుము.

తాత్పర్యం: శివా! అహంకారాన్ని వదలిన జీవుడిలో రెండు విధాలైన ఇంద్రియాలూ, మనస్సూ, బుద్ధీ లీనమైపోతాయి. అట్లా లీనమైన ఆ అన్నింటితోపాటు జీవుడు పరతత్త్వంలో లీనమైపోతాడు. ఇక పరతత్త్వాన్ని చూచేదెవరో చెప్పుము.

విశేషం: 'చూడటం' అంటే చూచేవాడు (ద్రష్ట) చూడబడేది (దృశ్యం) కన్ను ప్రసరించటం (దర్శనం) అనే మూడు ఉండాలి. పరతత్త్వం విషయంలో ఈ మూడు ఉండే అవకాశం లేదని ఈ పద్యం చెప్తుతున్నది. ఎట్లా గంటే పరతత్త్వ విషయంలో మొదట 'నేను' అనే భావం (అహంకారం) జారిపోతున్నది. దానితో జీవుడియందున్న రెండు విధాలైన ఇంద్రియాల గుంపులు, మనస్సు, బుద్ధీ అనే పండ్రెండు తత్త్వాలు తమ ఉనికిని కోల్పోతాయి. అనగా నీళ్ళల్లోవేసిన ఉప్పురాయివలె కలిసిపోతాయి. అహంకారం+పది ఇంద్రియాలు+మనస్సు+బుద్ధి అనే పదమూడు కలిసిపోయిన ఆ జీవుడు. సముద్రంలో చేరిన నదివలె ప్రత్యేకస్థితి లేకుండా పరతత్త్వంలో కలిసిపోతాడు. అనగా అక్కడ నిశ్చలంగా, నిలకడగా, నిర్వికారంగా, నిరంజనంగా ఉండేది పరతత్త్వం ఒక్కటే. అప్పుడు చూచేవాడూ, చూడబడేది, చూడటమూ అంతా ఆ పరతత్త్వమే. కాగా దానికంటె ఇతరుడు చూచేవాడు ఉండటం ఎట్లా సాధ్యం? అని పద్యతాత్పర్యం.

ఇంద్రియ సమాజయుగంబు - అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు. ఇంద్రియాల లయం చెప్పటవలన ఇంద్రియగుణాలు, వాటి కాధారభూతాలైన పంచభూతాలు అనేవాటి లయం కూడా చెప్పినట్లే అయింది.

క. భూతము లన్నియు నడఁగిన । యాతఱిఁ దనుఁ దాన కనుచు నంజనరహిత

త్వాతిశయ మెసఁగ వెలిఁగెడు । నాతెలి వాతత్త్వమునకు నమరు మహేశా! 194

ప్రతిపదార్థం: మహా+ఈశా!= పరమేశ్వరా!; భూతములు= నేల మొదలైన భూతములు; అన్నియున్= అన్నీ; అడఁగిన+ఆ తఱిన్= లీనమై పోయిన ఆ సమయంలో, తనున్= తనను; తాను+అ= తానే; కనుచున్= చూస్తూ; అంజన రహితత్వ+అతిశయము= అంటులేనితనంవలన అయ్యే మహిమ; ఎసఁగన్= ఒప్పగా; వెలిఁగెడు+ఆ తెలివి= ప్రకాశించే ఆ జ్ఞానం; ఆ తత్త్వమునకున్= ఆ విధంగా లీనమైన జీవుడనే తత్త్వానికి; అమరున్= ఏర్పడుతున్నది.

తాత్పర్యం: పరమేశ్వరా! ఈ విధంగా పంచభూతాలు మొదలుకొని మనస్సు, బుద్ధి మొదలైనవన్నీ స్వరూపం కోల్పోయిన తరువాత జీవుడు తనను తానే చూస్తూ ఏ విధమైన అంటూ లేకుండా పరతత్త్వమే అటు వెలిగే స్థితిని పొందుతాడు.

విశేషం: ఈ స్థితినే 'అద్వైతం' అంటారు. అనగా రెండూలేని స్థితి జీవదేవభేదం లేని స్థితి. దానినే 'సోஹమ్' అదే నేను అనే భావనతో వ్యవహరిస్తారు. 'తత్త్వమసి' 'అయమాత్మా బ్రహ్మ,' 'ప్రజ్ఞానం బ్రహ్మ' మొదలైన మహావాక్యాల తాత్పర్య స్థితిలో ఉండటం.

ఆ. అని సనత్కుమారుఁ డభవుతో మఱియు ని । ట్లనియె దేహవర్తులైన దైవ

తముల నెల్ల నాదరమున నాకర్ణింపు । మేర్పరింతు యోగహితము గోరి. 195

ప్రతిపదార్థం: అని= ఇట్లు చెప్పి; సనత్కుమారుఁడు= సనత్కుమార మహర్షి; మఱియున్=ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అభవుతోన్= శివుడితో; అనియెన్= అన్నాడు; యోగహితమున్= యోగపు మేలును; కోరి= వాంఛించి; దేహవర్తులు= దేహంలో తిరిగేవి; ఐన దైవతములన్= అయిన దేవతా స్వరూపాలను; ఎల్లన్= అన్నింటినీ; ఏర్పరింతున్= విడివిడిగా వివరిస్తాను; ఆదరమునన్= శ్రద్ధతో; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని చెప్పి, సనత్కుమారుడు శివుడితో ఇంకా ఇట్లా అంటున్నాడు. 'శివా! యోగం చక్కగా తెలియటం కొరకు దేహంలో ఉండే దైవతాల నన్నింటినీ వివరిస్తాను. ప్రీతితో వినుము.

విశేషం: దైవతం అనగా ఏదో ఒక విశిష్టలక్షణంతో వెలుగొందే తత్త్వం. ఉదాహరణకు కన్ను, ముక్కు, చెవి మొదలైనవి. ఎందుకంటే కంటికుండే దర్శనసామర్థ్యం మరి దేనికీ, ఎక్కడా ఎప్పుడూ ఉండదు. అట్లాగే తక్కినవి కూడా. ఈ దృష్టితో భారతీయులు చెప్పుకొనే ముక్కోటి దేవతలను మనదేహంలోనే వివేకంతో దర్శించవచ్చును. అట్లా దర్శించటంవలన యోగం పరిపాకదశకు వస్తుంది. యోగం అనే మాటకు కలయిక అని ఒక అర్థం - జీవబ్రహ్మముల ఏకత్వమే ఇక్కడ సందర్భాన్ని బట్టి యోగం. దానికి హితం అంటే ఆ భావన అభ్యాసపాటవంచేత గట్టిపడటం.

సనత్కుమారుఁడు శివునకు దేహాంతర్గతదైవతములం దెలుపుట (సం.13-167-1(కుంభ))

సీ. జిహ్వ సోముఁడు వాణి శిఖి ప్రాణమున గాడ్పు। దానంబునందు శతహ్రదాలి
వ్యానస్తనాంతరవర్తులై పర్జన్య। గగనముల్ బలమునఁ గౌశికుండు
మతి నపానమున సమానంబునందు నీ। శాన మిత్రాప్సరస్సమితు లక్షు
లందు సూర్యుఁడు మేన నంఘ్రులఁ జెవి భూమి। ధరణిధరుండు దిక్తతి యుపస్థ

తే. మునఁ బ్రజాపతి బుద్ధి యం దనఘ! బ్రహ్మ। యుండు నింతకు బుధ్యమానుం డనంగ
వెలుఁగు నాత్మ యధిష్ఠాత విను ప్రబుద్ధుఁ। డన నబుద్ధుండు నా నొప్పు నతఁడు మఱియు. 196

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా! జిహ్వన్= నాలుకయందు; సోముఁడు= చంద్రుడు; వాణి= వాగ్దేవత; శిఖి= అగ్ని; ప్రాణమునన్= ప్రాణం అనే వాయువునందు; గాడ్పు= వాయుదేవుడు; ఉదానంబునందున్= ఉదానం అనే వాయువులో; శతహ్రద+ఆలి= మెరుపుల వరుస; వ్యాన స్తన+అంతర వర్తులు= వ్యానం అనే వాయువులోను; రొమ్మునడిమి భాగంలోను తిరుగువారు; ఐ= అయి; పర్జన్య గగనముల్= ఇంద్రుడు ఆకాశమూ అనేవి; బలమునన్= బలంలో; కౌశికుండు= ఇంద్రుడు; మతిన్=బుద్ధియందు; అపానమునన్= అపానమనే వాయువునందు; సమానంబునందున్= సమానం అనే వాయువులోను; ఈశాన మిత్ర అప్సరస్+ సమితులు= ఈశానుడు, సూర్యులు, అప్సరసల సముదాయము; అక్షులందున్= కన్నులలో; సూర్యుఁడు; మేనన్= ఒడలియందు; అంఘ్రులన్= కాళ్ళలో; చెవిన్= చెవియందు; భూమి; ధరణిధరుండు= విష్ణువు; దిక్తతి= దిక్కుల సముదాయము; ఉపస్థమునన్= జననేంద్రియములో; ప్రజాపతి= బ్రహ్మ; బుద్ధిఅందున్= బుద్ధిలో; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; ఉండున్= ఉంటారు; ఇంతకున్= దీని కంతటికి; అధిష్ఠాత= ఆక్రమించి సర్వాధికారి అయి ఉండేవాడు; బుధ్యమానుండు= తెలియబడేవాడు; అనంగన్= అనగా; వెలుఁగు+ఆత్మ= వెలుగునట్టి పరమాత్మ; మఱియున్= ఇంకా; విను= వినుము; అతఁడు= ఆ పరమాత్మ; ప్రబుద్ధుఁడు= సర్వము చక్కగా ఎరిగియున్నవాడు; అనన్= అనగాను; అబుద్ధుండు= ఏమియు తెలియనివాడు; నాన్= అనగాను; ఒప్పున్= ఒప్పుతూ ఉంటాడు.

తాత్పర్యం: శివా! వినుము. నాలుకయందు చంద్రుడు, వాక్కు, అగ్ని ఉంటాయి. ప్రాణవాయువులో వాయువు, ఉదానవాయువులో మెరపులు, వ్యానంలో వర్షాదేవత, రొమ్ముసందు ఆకాశం, బలంలో ఇంద్రుడు, బుద్ధిలో ఈశానుడు, అపానం అనే వాయువులో ద్వాదశాదిత్యులు, సమానం అనే వాయువులో అప్సరసలు, కన్నులలో సూర్యుడు, దేహం మొత్తం భూమి, పాదాలలో విష్ణువు, చెవిలో దిక్కుల సముదాయము, జననేంద్రియంలో ప్రజాపతి, బుద్ధియందు బ్రహ్మ ఉంటారు. ఈ అన్నింటికీ తెలియబడే ఆత్మ అధిష్ఠాత (సర్వశక్తిమంతుడైన అధికారి). అతడు ప్రబుద్ధుడు, అబుద్ధుడు అని రెండు విధాలుగా ఉంటాడు.

విశేషం: ఇక్కడ విశేషంగా తెలిసికొనదగిన విషయాలు కొన్ని ఉన్నాయి. దేహంలో అయిదు విధములైన వాయువులున్నాయి. వాటికి నిర్దిష్టమైన స్థానాలున్నాయి. పట్టిక ద్వారా వాటిని తెలుసుకొందాం.

	వాయువులు	**స్థానాలు**
1.	ప్రాణము	హృదయం
2.	అపానము	గుదము
3.	వ్యానము	సర్వశరీరము
4.	ఉదానము	కంఠము
5.	సమానము	నాభి

ప్రజాపతి - అంటే స్థూలంగా బ్రహ్మ అనే అర్థం. కాని దక్షుడు, కశ్యపుడు మొదలైన ఆది సృష్టికర్తలను ఇక్కడ ప్రజాపతి శబ్దంచేత గ్రహించాలి. బ్రహ్మ అనగా వారికి కూడ పుట్టుక నిచ్చిన చతుర్ముఖుడు. బుధ్యమానుఁడు - తెలియబడుచున్నవాడు; ప్రబుద్ధుడు - మేలుకొన్నవాడు. అంటే వ్యక్తస్వరూపం. అబుద్ధుడు - మేలుకొననివాడు - అవ్యక్తస్వరూపం. అనగా ఆత్మ వ్యక్తమనీ అవ్యక్తమనీ రెండు దశలతో ఒక్కటియే అయి ఉంటుందని భావం.

క. ఈ దైవతముల నన్నిటి । నాదరమునఁ గనుచు యోగి యచలితనిష్ఠన్
వేదమయా! మూర్ధగతుం । డై దక్షతపేర్మి నిలుపుఁ బ్రాణము లచటన్. 197

ప్రతిపదార్థం: వేదమయా!= వేదమే స్వరూపమైన పరమేశ్వరా!; యోగి= యోగం కలవాడు; ఈ దైవతములన్= ఈ దేవతా స్వరూపాలను; అన్నిటిన్= అన్నింటినీ; ఆదరమునన్= ప్రీతితో; కనుచున్= చూస్తూ; అచలిత నిష్ఠన్= ఏ కొంచెమూ కదలికలేని నిష్ఠతో; మూర్ధగతుండు= తలలోనికి ప్రవేశించినవాడు; ఐ= అయి; దక్షత పేర్మిన్= సామర్థ్యపు మహిమతో; అచటన్= శిరస్సునందు; ప్రాణములు= ప్రాణాలను; నిలుపున్= నిలుపుతాడు.

తాత్పర్యం: వేదమయుడవైన పరమేశ్వరా! యోగి ఈ దేవతలందరినీ ఆదరంతో చూస్తూ ఏ కొంచెమూ చెదరని నిష్ఠతో శిరస్సులోనికి ప్రవేశించి, తన సమర్థతను పండించుకొని, ప్రాణాలను శిరస్సునందు నిలుపుతాడు.

విశేషం: ఇందులో యోగసిద్ధికి సంబంధించిన మూడు ప్రధానాంశాలను చెప్పుతున్నారు. 1. దైవతస్వరూపాలను చూడటం, 2. అట్లా చూస్తూ తాను సూక్ష్మశరీరంతో శిరస్సులోనికి చేరుకొనటం, 3. దేహంలో అక్కడక్కడ నిలిచి ఉన్న ప్రాణాలను శిరస్సులోనికి తెచ్చి నిలపటం. యోగపరంగా ఇక్కడ శిరస్సు అంటే 'సహస్రారకమలం' అని భావించాలి. అది పరమాత్మ స్థానం. పరమాత్మ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తక్కిన సర్వదేవతాస్వరూపాలకంటె విశిష్టమైనది. నిత్యము, సత్యము, ఆనందము మొదలైన సంజ్ఞలు కలది. అనగా తక్కిన దైవతములకు ఆ స్థితి లేదు. కనుక వాటిని 'చూడటం' అంటే వాటి తక్కువ స్థితిని నిర్ణయించుకొని, వాటిని అపేక్షించకుండా ఉండటం. వాటిని అపేక్షిస్తే యోగి ఆయా స్థానాలలోనే నిలిచిపోతాడు. వాటి గతే అతడిదీ అవుతుంది. ప్రాణాలను అక్కడ నిలపటం అంటే అనిత్యదశలో ఉన్నవాటికి నిత్యదశను కూర్చటం. దానివలన యోగి సర్వాన్నీ పరమాత్మలో లయం చేసి, తానూ లయమై పరమాత్మ తానయ్యే స్థితిని పొందుతాడని తాత్పర్యం. దీనికి 'దక్షతపేర్మి' కావాలి. ఎందుకంటే యోగం అభ్యసించేవాడికి ఏవో చిన్నచిన్న శక్తులు ఏర్పడుతాయి. వాటికి ప్రలోభపడితే వాడు పొందేది సర్వనాశనమే. అనగా మూర్ధగతుడయ్యే స్థితికానీ, ప్రాణాలను అక్కడ నిలిపే స్థితిగానీ సిద్ధించదు.

తే. అపుడు బుధ్యమానునిఁగను నవ్వరిష్ఠ । తత్త్వ మవ్యక్త మండ్రు తద్దర్శియగుఁ బ్ర
బుద్ధుఁ డాతని నతని నబుద్ధుఁ డెఱుఁగు । చుండు నివి యాత్మదశ లతఁ డొకఁడ యనఘ! 198

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యమూర్తీ!; అపుడు= ఆ సమయంలో; బుధ్యమానునిన్= తెలియబడేవాడిని; కనున్= చూస్తాడు; ఆ+వరిష్ఠ తత్త్వము= మిక్కిలి గొప్పదైన ఆ తత్త్వాన్ని; అవ్యక్తము= తెలియబడనిది; అనే అర్థంగల 'అవ్యక్తం' అని; అండ్రు= అంటారు; ప్రబుద్ధుఁడు= ప్రబుద్ధుడనే ఆత్మస్వరూపుడు; తద్+దర్శి= అతడిని చూచేవాడు; అగున్= అవుతాడు; ఆతనిన్= ఆ తెలియబడే వాడిని; అతనిన్= ఆ తెలిసికొన్నవాడిని; అబుద్ధుఁడు= అబుద్ధుడనే ఆత్మతత్త్వం; ఎఱుఁగుచుండున్= తెలిసికొంటాడు; ఇవి= ఈ చెప్పినవి; ఆత్మదశలు= ఆత్మలోని వేరువేరు అవస్థలు; అతఁడు= ఆ పరమాత్మ; ఒకఁడు+అ= ఒక్కడే.

తాత్పర్యం: యోగి అపుడు తెలియబడేవాడిని - అంటే 'వ్యక్త' బ్రహ్మమును చూస్తాడు. అట్లా చూచిన విశేషస్థితిని 'అవ్యక్తం' ప్రబుద్ధుడు దానిని దర్శిస్తాడు. ఆ వ్యక్త, అవ్యక్త స్వరూపాలను రెండింటినీ అబుద్ధుడు తెలిసికొంటాడు. నిజానికి బుధ్యమానుడు, ప్రబుద్ధుడు, అబుద్ధుడు అనేవి దశలలో భేదాలే తప్ప ఆత్మ ఒక్కటే సుమా!

విశేషం: బ్రహ్మతత్త్వం అనుభూతికి వచ్చినపుడు తెలిసేది, తెలిసేవాడూ, తెలియటం అనే దశాభేదాలు ఉండవని భావం.

క. ఇవ్విధము గాంచు యోగికి । నెవ్వరు సరిగారు యతు లనేకు లచలులై
యవ్వస్తువు గోరుదు రది । దవ్వొరులకు యోగితతికిఁ దక్క మహేశా! 199

ప్రతిపదార్థం: మహేశా!= పరమేశ్వరా!; ఈ విధమున్= ఈ పద్ధతిని; కాంచు యోగికిన్= దర్శించే యోగికి; ఎవ్వరున్= ఎవ్వరునూ; సరికారు= సాటికారు; యతులు= యత్నం శీలంగా గలవారు; అనేకులు= ఎంతోమంది; అచలులు= నిష్ఠ చెదరనివారు; ఐ= అయి; ఆ+వస్తువున్= ఆ పరతత్త్వమనే వస్తువును; కోరుదురు= కోరుతూ ఉంటారు; అది= ఆ తత్త్వం; యోగితతికిన్= యోగుల సముదాయానికి; తక్కన్= కాక; ఒరులకున్= ఇతరులకు; దవ్వు= దూరమైనది.

తాత్పర్యం: పరమేశ్వరా! ఈ విధానాన్ని చూచే యోగికి సాటి వచ్చేవారు ఉండరు. ఎందరో పరమనిష్ఠతో దానికొరకు ప్రయత్నిస్తూ ఉంటారు. కానీ అది యోగులకు తప్ప మరెవ్వరికీ అందుబాటులో ఉండదు.

విశేషం: 'ఎవ్వరు సరికారు' అంటే అతడు బ్రహ్మవేత్త కనుక బ్రహ్మమే అయి, అసదృశస్థితిని పొందుతాడని భావం.

ఆ. క్షరుఁడు నక్షరుండుఁ బరుఁడును నందు ర । వ్వినుతదశలఁ బంచవింశకుఁడు ప్ర
బుద్ధనాముఁ డతఁ డబుద్ధునిఁ గనుఁ బురు । ష విధముగను బ్రకృతిసంగ మెఱుఁగు. 200

ప్రతిపదార్థం: ఆ+వినుతదశలన్= కొనియాడదగిన ఆ దశలయందు; క్షరుఁడున్= క్షరుడన్నపేరుగలవాడు; అక్షరుండున్= అక్షరుడన్న పేరు గలవాడు; పరుఁడును= పరుడన్న పేరుగలవాడు; అందురు= అంటారు; పంచవింశకుండు= ఇరువది యైదవవాడు; ప్రబుద్ధనాముండు= ప్రబుద్ధుడనే పేరుగలవాడు; అతఁడు= ఆ ప్రబుద్ధుడు; అబుద్ధునిన్= అబుద్ధుడనే వాడిని; పురుషవిధముగను= పురుషుడి తీరున; కనున్= చూస్తాడు; ప్రకృతిసంగము= ప్రకృతి అనే తత్త్వంతోడి కలయికను; ఎఱుఁగున్= పొందుతాడు.

తాత్పర్యం: ఆత్మతత్త్వం క్షర, అక్షర, పర అనే పేర్లతో వేరువేరు దశలలో ఉంటుంది. ఇరువదియైదవ తత్త్వమైన వాడికి పేరు ప్రబుద్ధుడు. అతడు అబుద్ధుడిని పురుషుడి తీరున చూస్తాడు. ప్రకృతితో కలయికను పొందుతాడు.

విశేషం: గీతావాక్యాన్ననుసరించి క్షరమంటే సర్వభూతాలు. అక్షరమంటే ఈ అన్నింటికీ మూలమైన కూటస్థతత్త్వం. పరమంటే ఈ రెంటికీ అతీతమైన పురుషోత్తమతత్త్వం. గీతలో పదునైదవ అధ్యాయం పురుషోత్తమ ప్రాప్తియోగం. 16,17,18 శ్లోకాలలో ఈ అంశాల వివరణ ఉన్నది. ఇక్కడ పురుషుడంటే పరమాత్మ అనియే అర్థం. ప్రకృతి అంటే మాయ. దానితో సంగం ఉంటే పరమేశ్వరుడని పురుషుడికి పేరు. లేకుంటే సదాశివుడని పేరు.

క. విను షడ్వింశుఁ డబుద్ధుం । డనఁ జను వాఙ్మనసములకు నందక యునికిం
దనుఁగా నాతత్త్వంబుం । గనిన ప్రబుద్ధుండ యతఁడు కామధ్వంసీ! 201

ప్రతిపదార్థం: కామధ్వంసీ!= కాముడి రూపుమాపిన ఓ శివా!; విను= ఆలకించుము; షడ్వింశుఁడు= ఇరవై ఆరవ తత్త్వంగా లెక్కించబడు ఆ పరమాత్మ; వాక్+మనసములకున్= మాటకు, మనస్సుకు; అందక= దొరకక; ఉనికిన్= ఉండటంవలన; అబుద్ధుండు= అబుద్ధుడు; అనన్= అనగా; చనున్= ఒప్పుతాడు; ఆ తత్త్వంబున్= ఆ ఇరవై ఆరవ తత్త్వాన్ని; తనుఁగాన్= తానేగా; కనిన ప్రబుద్ధుండు+అ= చూచిన ప్రబుద్ధుడనే ఇరవై అయిదవ తత్త్వమే; అతఁడు= ఆ ఇరవై ఆరవ తత్త్వం రూపమైనవాడు.

తాత్పర్యం: శివా! ఇరవై ఆరవతత్త్వానికి అబుద్ధుడని వ్యవహారం. ఎందుకనగా అది మాటకూ, మనస్సుకూ అందదు. ఇరవై అయిదవ ప్రబుద్ధ తత్త్వం. అది - అనగా ఆ ఇరవై ఆరవ తత్త్వం అయిన అబుద్ధుడు తానే అని గుర్తిస్తే అవి రెండూ ఒకటి అవుతాయి.

విశేషం: స్థూలంగా ఇరవై అయిదవ తత్త్వం అనగా జ్ఞానం పొందిన జీవాత్మ అనీ, ఇరవై ఆరవతత్త్వం పరమాత్మఅనీ, 'అది నేనే' అనుకొన్నప్పుడు ఆ రెండూ ఒకటే అవుతాయనీ, అదే కైవల్యమనీ అద్వైతమనీ మనం గుర్తించవచ్చును.

క. వేఱుగఁ గనినం బ్రకృతికిఁ । జూఱ విడిచినట్ల తనదు సుజ్ఞానము న
క్కాఱు విడిచి తనకంటెను । మీఱ నొకటి లేమి గాన్పు మెయికొనవలయున్. 202

ప్రతిపదార్థం: వేఱుగన్= అబుద్ధుడు తన కంటె భిన్నమైనదిగా; కనినన్= చూస్తే; తనదు సుజ్ఞానము= తనదైన మంచి జ్ఞానాన్ని; ప్రకృతిన్= 'మాయ' అనే పేరుగల ప్రకృతికి; చూఱ విడిచిన+అట్లు+అ= ధారపోసినట్లే; ఆ+కాఱు= ఆ అజ్ఞానాన్ని; విడిచి= వదలి; తనకంటెను= తనకంటె; మీఱన్= మించిపోయిదిగా; ఒకటి= వేరొకటి; లేమి= లేకుండుటను; కాన్పు= పొందటం; మెయికొనవలయున్= అంగీకరించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ప్రబుద్ధుడు అబుద్ధుడిని తనకంటె వేరుగా చూస్తే తాను పొందిన ఉత్తమజ్ఞానమంతా ప్రకృతికి ధారపోసినట్లే అవుతుంది. అట్లాకాక, ఆ అజ్ఞానాన్ని తొలగించుకొని తనకంటె మించినది మరొకటి లేదు అనే జ్ఞానాన్ని సమ్మతించాలి.

విశేషం: అద్వైతస్థితిని ఇందులో చక్కగా విశదీకరించారు. జీవాత్మ పరమాత్మలు వేరు అనుకొనటమే అజ్ఞానం. వేరుకాదు అనుకొనటమే సుజ్ఞానం. అజ్ఞానం బంధానికీ, సుజ్ఞానం మోక్షానికీ హేతువులు.

వ. అని చెప్పి. 203

తాత్పర్యం: అని బోధించి.

తే. తత్త్వమునఁగల్గు మూఁ డవస్థలను దెల్ల । ముగ భవద్భవ్యసన్నిధి నిగదనమునఁ
గూర్చు టఖిలేశ! నీ వెఱుంగుటయు నాకు । నెల్ల యోగిజనంబులు నెఱుఁగు టయ్యె.' 204

ప్రతిపదార్థం: అఖిల+ఈశ!= సర్వమునకు ప్రభువైన ఓ శంకరా!; తత్త్వమునన్= తత్త్వంలో; కల్గు మూఁడు+అవస్థలను= ఉండే మూడు దశలను; భవత్ భవ్య సన్నిధిన్= నీదైన పరమోత్తమ సన్నిధానంలో; తెల్లముగన్= స్పష్ట మయ్యేవిధంగా; నిగదనమునన్= పలుకునందు; కూర్చుట= కూర్చటమూ; నీవు, ఎఱుంగుటయున్= తెలిసికొనటమూ; నాకున్= నాకు; ఎల్ల యోగి జనంబులు= యోగం పండిన జనాలందరూ; ఎఱుఁగుట= తెలిసికొనటంగా; అయ్యెన్= అయినది.

తాత్పర్యం: సర్వేశా! తత్త్వంలో ఉండే మూడు దశలను నేను నీ దివ్యసన్నిధానంలో స్పష్టంగా చెప్పటం, నీవు వినటం అనేవి నాకు యోగిజనాలందరూ తెలిసికొన్నట్లయింది.'

విశేషం: నిజానికి పరమేశ్వరుడు సర్వజ్ఞుడు. సనత్కుమారుడి వలన అతడు క్రొత్తగా తెలిసికొనవలసింది ఏమీ లేదు. కాగా లోకానుగ్రహబుద్ధితో అతడు అడగటం, ఇతడు చెప్పటం జరిగింది. కనుక యోగిజనాలందరూ తెలిసికొన్నట్లయింది అంటున్నాడు.

వ. అని పలికి 'మునిజనకృత్యంబులు వివరించెద నవధరింపు' మనుమాటయు సువ్యక్తంబుగా నాడి యాక్రీడా తపస్వికి నప్పరమయశస్వి యిట్లనియె. 205

ప్రతిపదార్థం: అని; పలికి= మాట్లాడి; మునిజనకృత్యంబులు= మునులైన జనులు చేయవలసిన పనులు; వివరించెదన్= చక్కగా తెలియజేస్తాను; అవధరింపుము= శ్రద్ధతో వినుము, అను మాటయున్= అనే మాటను; సువ్యక్తంబుగాన్= చాలా స్పష్టమైన తీరులో; ఆడి= పలికి; ఆ క్రీడాతపస్వికిన్= విలాసంగా తపస్సు చేసికొనే ఆ పరమేశ్వరుడికి; ఆ+పరమయశస్వి=గొప్ప కీర్తిగల ఆ సనత్కుమారుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా చెప్పి 'మునిజనుల పనులు వివరిస్తాను. దయతో వినుము' అనే మాటను చక్కగా తెలియునట్లుగా పలికి, క్రీడాతపస్వి అయిన శివుడితో మహాకీర్తిగల ఆ సనత్కుమారుడు ఇట్లా అన్నాడు.

విశేషం: ఇక్కడ ఒక ధర్మరహస్యం ఉన్నది. మునిజనకృత్యాలు శివుడు అడుగలేదు. అడుగని విషయం అడగనివాడికి చెప్పరాదని ధర్మశాస్త్రం. మరి సనత్కుమారు డీ ప్రసంగం ఎట్లా తెచ్చాడు? అన్న శంకకు సమాధానప్రాయంగా 'అనుమాటయు

సువ్యక్తంబుగా నాడి', 'క్రీడాతపస్వి', 'పరమయశస్వి' అనే పదబంధాలను కవి కూర్చాడు. ఆ ధర్మం కేవలం సాధారణ మానవులకు సంబంధించినది. గురుశిష్యభావం ఉన్నచోట మాత్రమే పాటించవలసినది. ఇక్కడ అటువంటిది లేదు - అని చెప్పటం పై మాటల తాత్పర్యం.

క. ముని వనమున శూన్యాలయ । మున నైన గుహానికేతమున నేనిని నా

సనబంధధీరుఁడై మన । మునఁ గొని యింద్రియము విషయమునఁ బెడఁబాపున్. 206

ప్రతిపదార్థం: ముని= ముని అయినవాడు; వనమునన్= అడవియందో; శూన్య+ఆలయమునన్+ఐనన్= జనంలేని ఇంటియందో, గుహానికేతమునన్+ఏనినిన్= కొండగుహ అనే నివాసంలోనో; ఆసన బంధ ధీరుఁడు= కూర్చుండే తీరునందు చెదరని స్థితి కలవాడు; ఐ= అయి; ఇంద్రియమున్= ఇంద్రియాన్ని; మనమునన్= మనస్సులోనికి; కొని= గ్రహించి; విషయమునన్= విషయంనుండి; పెడన్ పాపున్= దూరం చేస్తాడు.

తాత్పర్యం: ముని అడవియందో, జనసంచారం లేని పాడుకొంపలోనో, కొండగుహలోనో ఏ మాత్రమూ పట్టు తప్పని ఆసనస్థితి కలవాడై, ఇంద్రియాన్ని మనస్సులో లయింపజేసి, విషయంనుండి దూరం చేస్తాడు.

విశేషం: ఉన్న స్థానం యోగప్రతిబంధకం కాకూడదు. అందుకని అడవి మొదలైనవి. ఆసనం అంటే కూర్చుండే తీరు. శరీరాన్ని నిశ్చలం చేయకపోతే మనస్సు అతిచంచలం అవుతూ ఉంటుంది. అందుకని ఆసనబంధధీరత్వం. ఇంద్రియం జాత్యేకవచనం. ఇంద్రియాలు అయిదింటినీ గ్రహించాలి. అట్లాగే శబ్దస్పర్శరూప రసగంధాలు అయిదు. విషయాలవైపు ప్రసరించే యింద్రియాలను మనస్సులో త్రొక్కిపెట్టాలి. అప్పుడే యోగం కుదురుతుంది.

క. గురు నుపదేశము నడపుం । బురహర! విణ్మూత్ర వేగముల నాఁకలితోఁ

బొరయం డయ్యభ్యసనము । గురువుగ నాహార మెపుడుఁ గొనఁ డే చవులన్. 207

ప్రతిపదార్థం: పురహర!= శివా!; గురు+ఉపదేశము= గురువు చెప్పిన బోధ; నడపున్= సాగిస్తాడు; విట్+మూత్ర వేగములన్= మలము, మూత్రము అనేవాటి తొందరలను; ఆఁకలితోన్= ఆకలితో పాటు; పొరయఁడు= పొందడు; ఆ+అభ్యసనము= ఆ అభ్యాసం; గురువుగన్= పెద్దది అయ్యేటట్లుగా; ఏ చవులన్= ఎట్టి రుచులతోను; ఆహారమున్= ఆహారాన్ని; ఎపుడున్= ఎప్పుడూ; కొనఁడు= గ్రహించడు.

తాత్పర్యం: గురువు బోధించిన పద్ధతిని పాటిస్తాడు. మలమూత్రముల వేగాన్నీ, ఆకలినీ పొందడు. దానికి అనుగుణంగా రుచి పాకాలను మరచి, ఎప్పుడూ ఆహారం గ్రహించని అభ్యాసం చేస్తాడు.

విశేషం: ఆసనబంధ ధీరతకు ఆటంకమైన మలమూత్ర విసర్జన అవసరం లేని స్థితిని ఉపవాసాదులద్వారా అభ్యసించి నిశ్చలంగా ఉండగలుగుతాడని తాత్పర్యం.

క. కుడిచిన యప్పుడ యోగము । దొడఁగుటయును వలదు; మనసు దూలకయుండన్

మృడ! వినుము బుద్ధిగొని యె । క్కుడు నిష్ఠను వలయు దానిఁ గుదియింపంగన్. 208

ప్రతిపదార్థం: మృడ!= ఓ శివా!; వినుము; కుడిచిన+అప్పుడు+అ= భోజనం చేసిన వెంటనే; యోగము= యోగాన్ని; తొడఁగుటయును= మొదలుపెట్టటం; వలదు= వద్దు; బుద్ధిన్= బుద్ధిని; కొని= పట్టుకొని; ఎక్కుడు నిష్ఠను= అధికమైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెదరని తనంతో; మనసు; తూలక+ఉండన్= తూలిపోకుండా; దానిన్= దానిని; కుదియింపంగన్= నొక్కి పెట్టటం; వలయున్= చేయాలి.

తాత్పర్యం: శివా! తిన్న వెంటనే యోగాభ్యాసాన్ని మొదలు పెట్టరాదు. బుద్ధితో మనసు చెదరకుండా ఎక్కువ నిష్ఠతో దానిని అణచిపెట్టాలి.

విశేషం: మనస్సు అంటే సంకల్ప వికల్పాలు, బుద్ధి అనగా నిశ్చయాత్మకమైన దశ. యోగం అంటేనే చిత్తవృత్తులను అరికట్టటం. కనుక మనస్సును అణచివేయటం అంటే అమనస్కదశ. ఇది యోగంలో ఒక స్థాయి.

క. అది గుదిసిన విజ్ఞానము । గదలక నిర్వాత దీపకాంతియుఁ బోలెం
బొదలును జిత్తంబును నుప । లదశాసంప్రాప్తి నిశ్చలం బగు దానన్. 209

ప్రతిపదార్థం: అది= ఆ మనస్సు; కుదిపినన్= అణగిపోతే; విజ్ఞానము= విశేషమైన జ్ఞానం; కదలక= చలనంలేక; నిర్వాత దీప కాంతియున్ పోలెన్= గాలి లేనిచోట వెలుగు వలె; పొదలును= ఉంటుంది; దానన్= దానిచేత; చిత్తంబును= మనస్సు కూడా; ఉపల దశా సంప్రాప్తి= రాతివంటి స్థితిని పొందటం చేత; నిశ్చలంబు= చలనంలేనిది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: మనస్సు అణగితే విజ్ఞానం గాలిలేనిచోట దీపంవలె కదలకుండా ఉంటుంది. దానివలన చిత్తము కూడా రాతివలె నిశ్చలంగా ఏర్పడుతుంది.

విశేషం: చిత్తచలనం అనగా లక్ష్యంమీదినుండి ఇతర విషయాలకు జరగటం. కదిలే సూదిలో దారం ఎక్కించటంవలె అటువంటి చిత్తంలో యోగాన్ని పొందటం అసాధ్యం. కనుక యోగాభ్యాసం చేసేవాడు చిత్తాన్ని స్థాణువుగా మలచుకోవటం అవసరమని పద్య తాత్పర్యం.

తే. అనఘ! నిర్జన నిశ్శబ్దమైన యట్టి । చోటు హృదయస్థుఁ డగు దేవుఁ జూచుపనికి
వలయు; లేకున్న శబ్దసంకలిత మేని । సజ్జనాన్విత స్థల మార్యసమ్మతంబు. 210

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; నిర్జన నిశ్శబ్దము= జనులు లేనిది, సవ్వడిలేనిది; ఐన అట్టి చోటు= అయిన తావు; హృదయస్థుడు= హృదయంలో ఉన్నవాడు; అగు దేవున్= అయిన దేవుడిని; చూచు పనికిన్= చూచేపనికి; వలయున్= కావాలి; లేక+ఉన్నన్= అట్టిది లేకపోతే; శబ్దసంకలితము+ఏని= సవ్వడితో కూడినది అయితే; సత్+జన+అన్విత స్థలము= మంచి జనులతో కూడిన తావు; ఆర్య సమ్మతంబు= ఆర్యులకు ఇష్టమైనది.

తాత్పర్యం: శివా! హృదయంలో ఉన్న దేవుడిని చూచే పనికి జనాలు, సవ్వడులు లేని తావు కావాలి. ఒకవేళ అట్టితావు లభించక సవ్వడి ఉన్న తావు అయితే మంచివారు ఉన్నది మేలని ఆర్యులు చెప్పుతారు.

విశేషం: జనసంచారం, వివిధాలైన సవ్వడులు విషయాలవైపు ఇంద్రియాలను, మనస్సునూ లాగివేస్తాయి. యోగం భంగపడుతుంది. కనుక నిర్జన, నిశ్శబ్ద స్థానాన్ని నిర్దేశిస్తున్నారు. అయితే అట్టిది దుర్లభం. కనుక సత్+జనులు= సత్ అంటే పరమాత్మయొక్క ఒక లక్షణమైన అస్తిత్వం. దానియందు ఉండే జనులు సజ్జనులు. వారున్న తావు శబ్దసంకలితమైనా అది పరమాత్మపరమే అవుతుంది కనుక యోగం భంగం కాదు. ఆర్యులు అనగా ఒక ప్రత్యేకమైన జీవనవిధానం కలవారు. ఇది జాతి కాదు. స్వభావం. హృదయస్థుడు 'ఈశ్వరః సర్వ భూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి' అని గీత. పద్మకోశంవలె ఉండే హృదయంలో నీవారపు ముల్లువలె ఉండే సన్నని రంధ్రంలోని అగ్నిజ్వాలలో చివరిభాగంలో సదాశివుడు ఉంటాడని వేదమంత్రం చెప్పుతున్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విను తమము నిస్తమముఁ జే। తనారహిత చేతనా సుధామయతా స్థా

ననిరూఢము నగు తత్త్వము। గను నిన్నియుఁ గలుగు యోగి కరుణామూర్తీ! 211

ప్రతిపదార్థం: కరుణామూర్తీ!= దయామూర్తీ! విను= వినుము; తమము= అజ్ఞానరూపమైన చీకటి; నిస్తమమున్= చీకటిలేని స్థితి; చేతనారహిత చేతనాసుధామయతా స్థాన నిరూఢము= చైతన్యములేనిది, చైతన్యము అనే అమృతముతో నిండినది అయిన చోటుగా దృఢపడినది; అగు తత్త్వమున్= అయిన పరమాత్మ తత్త్వాన్ని; ఇన్నియున్= పై చెప్పిన లక్షణాలన్నీ; కలుగు యోగి= కల యోగి; కనును= దర్శిస్తాడు.

తాత్పర్యం: కరుణామూర్తీ! వినుము. చీకటి, చీకటిలేనిది, చైతన్యము లేనిది, చైతన్యమే అమృతస్వరూపం అయినది అయిన తత్త్వాన్ని పై లక్షణాలన్నీ ఉన్న యోగి దర్శిస్తాడు.

విశేషం: ఇందులో తమము - నిస్తమము; చేతనారహితము - చేతనాసహితము - అని తత్త్వానికి రెండేసి విరుద్ధధర్మాలు చెప్పారు. దీనిని సరిగా సమన్వయించుకోవాలి. తమము అనగా అజ్ఞానులకు అది ఒక భయంకరమైన చీకటి. అనగా దానిని గురించి వారేమాత్రము తెలిసికొనలేరు. నిస్తమము అనగా జ్ఞానవంతులకు అదే ఒక మహాజ్యోతి. అందులో వారు సర్వాన్నీ దర్శిస్తారు. అట్లాగే పరతత్త్వం సృష్టిలోని ఇతర పదార్థాల వంటి చైతన్యం - చేతనధర్మం - కదలిక మొదలైన లక్షణాలు లేనిది కనుక చేతనారహితం. సృష్టిలోని బ్రహ్మ మొదలు అతినీచమైన పదార్థం వరకు ఉండే సర్వానికి చైతన్యాన్ని ప్రసాదించేది కమక చైతన్యరూపమైన అమృతస్థితియే స్వభావమైన తావు. పై లక్షణాలు (206-210 పద్యాలలో చెప్పినవి) కల యోగికి ఆ పరతత్త్వం గోచరిస్తుంది.

క. మదనహరా! యోగనిరతు। లది గని దుఃఖముల దొఱఁగి యజరామరతా

స్పదమగు నెలవుల నిలుతురు। పొదలుదు రణిమాదిచయ విభూతిపదమునన్. 212

ప్రతిపదార్థం: మదనహరా!= మన్మథుడిని హరించిన ఓ పరమేశ్వరా!; యోగనిరతులు= యోగమునందు నిష్ఠకలవారు; అది=దానిని; కని=చూచి; దుఃఖములన్= దుఃఖాలను; తొఱఁగి= తొలగించుకొని; అజర+అమరతా+ఆస్పదము= ముదిమి, చావు లేనితనానికి వీలుకలవి, అగు నెలవులన్= అయిన తావులలో; నిలుతురు= శాశ్వతంగా ఉంటారు; అణిమ+ఆది చయ విభూతి పదమునన్= అణిమ మొదలైన అష్టసిద్ధుల సముదాయపు ఐశ్వర్యం ఉన్న తావునందు; పొదలుదురు= తిరుగుతూ ఉంటారు.

తాత్పర్యం: శంకరా! యోగనిష్ఠ కలవారు ఆ తత్త్వాన్ని అందుకొని, దుఃఖాలన్నింటినీ తొలగించుకొని, చావు, ముదిమి లేని తావులలో శాశ్వతంగా ఉంటారు. అణిమ మొదలైన సిద్ధుల సంపదలతో విహరిస్తూ ఉంటారు.

విశేషం: దుఃఖాలు - జన్మదుఃఖం, జరాదుఃఖం, మృత్యుదుఃఖం మొదలైనవి, ఎక్కడ ఇంద్రియాలు సుస్థితి లేకుండా కష్టపడుతూ ఉంటాయో అది 'దుఃఖం' - దుర్గతి పొందిన ఇంద్రియస్థితి కలది అని దీనికి అర్థాన్ని సంభావించాలి. అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం, వశిత్వం - అనేవి అష్టసిద్ధులు. ఇవి యోగికి సిద్ధిస్తాయి. అయితే ఐహికసుఖాపేక్షతో గానీ, ప్రదర్శనకు గానీ వీటిని వినియోగిస్తే వాడు తత్క్షణమే యోగభ్రష్టుడవుతాడు. వీటిద్వారా పరమాత్మ దర్శనాన్ని సుదృఢం చేసికొనటమే ఉత్తమలక్ష్యం.

వ. అని మఱియును. 213

తాత్పర్యం: సనత్కుమారుడు ఈ విధంగా చెప్పి ఇంకా ఇట్లా అంటున్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. యక్షగంధర్వసిద్ధ సాధ్యాది భూత। కోటికంటెను మిగిలి యోగులు నిజేచ్ఛఁ
బరఁగుదురు భవ్యయోగతత్పరుల మేము। నిట్టు లగుట యోగీశ! నీ యెఱుఁగు పనియ. 214

ప్రతిపదార్థం: యోగి+ఈశ!= యోగులకుప్రభువైన ఓ పరమాత్మా!; యోగులు= యోగసిద్ధి పొందినవారు; యక్ష గంధర్వ సిద్ధ సాధ్య+ఆది భూతకోటికంటెను= యక్షులు, గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు మొదలైన ప్రాణుల సముదాయంకంటె కూడా; మిగిలి= అతిశయించి; నిజ+ఇచ్ఛన్= తమ ఇష్టాన్నిబట్టి; పరఁగుదురు= ప్రవర్తిస్తూ ఉంటారు; భవ్య యోగ తత్పరులము= మిక్కిలి శ్రేష్ఠమైన యోగమునందు మాత్రమే బుద్ధిగలవారము; ఏమును= అయిన మేము కూడ; ఇట్టులు= ఈ విధంగా; అగుట= కావటం; నీ+ఎఱుఁగు పని+÷అ= నీవెరిగిన కార్యమే.

తాత్పర్యం: యోగినాథా! యోగులు సిద్ధులు మొదలైన దేవజాతులకంటె మించిపోయి తమ ఇష్టాన్ని బట్టి ప్రవర్తిస్తూ ఉంటారు. భవ్యమైన యోగమునందు చెడని నిష్ఠ గల మేము కూడా అట్లా కావటం నీకు తెలిసిన విషయమే కదా!

విశేషం: విద్యాధరులు, అప్సరసలు, యక్షులు, రక్షస్సులు, గంధర్వులు, కిన్నరులు, పిశాచులు, గుహ్యకులు, సిద్ధులు, సాధ్యులు వీరిని దేవయోనులు అంటారు. వీరు దేవతలకు మానవులకు మధ్యవారు. ఆంగ్లంలో వీరిని semi gods అంటారు. మేము అటువంటివారమే అని చెప్పటం నిదర్శనంకొరకే కానీ అహంకారదృష్టితో కాదు. ఇది ఫలశ్రుతివలె రుచి పుట్టించటానికి చేసిన ప్రసంగం. 'మేము' అనే బహువచనం కూడా అటువంటిదే. దానిని క్రింది భాగంలో వివరిస్తున్నారు.

వ అని సహజన్ము లయిన సనక సనందన సనత్సుజాతులం దలఁపించిన వాఁడయి వెండియు. 215

ప్రతిపదార్థం: అని= ఇట్లా చెప్పి; సహజన్ములు= కలిసిన పుట్టుక కలవారు; అయిన సనక సనందన, సనత్సుజాతులన్= సనకుడు, సనందనుడు, సనత్సుజాతుడు అనేవారిని; తలఁపించినవాఁడు= స్మరింపచేసినవాడు; అయి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఇట్లా చెప్పి, తన తోబుట్టువు అయిన సనకుడు, సనందనుడు, సనత్సుజాతుడు అనేవారిని తలపింప చేసి ఇంకా ఇట్లా అన్నాడు.

తే. యోగధర్మంబు కంటెను నుత్తమంబు। గలుగ నేరదు ధర్మ మొక్కటియు నపున
రాగమం బగు పదమున కరయ నిదియ। మేటి నిచ్చెన సంయమికోటి కెల్ల. 216

ప్రతిపదార్థం: యోగధర్మంబుకంటెను= యోగం అనే ధర్మంకంటె; ఉత్తమంబు= గొప్పది (అగు); ధర్మము= ధర్మం; ఒక్కటియున్= ఒక్కటికూడా; కలుగన్‌నేరదు= ఉండజాలదు; ఇది+అ= ఇదే; అరయన్= పరిశీలించగా; సంయమకోటికిన్+ఎల్లన్= ఇంద్రియ నిగ్రహాదులు కలవారందరికీ; అపునర్+ఆగమంబు+అగు= తిరిగివచ్చుటలేనిదైన; పదమునకున్= స్థానానికి; మేటినిచ్చెన= గొప్ప నిచ్చెన.

తాత్పర్యం: యోగధర్మంకంటె ఉత్తమమైన ధర్మం ఒక్కటి కూడా లేదు. మునుల సముదాయం తిరిగిరాక లేని స్థానాన్ని చేరుకొనటానికి ఇదే మేటినిచ్చెన.

విశేషం: 'సంయమికోటి' అనటంవలన ఆ స్థాయికి ఎదగలేనివారికి కర్మభక్తిజ్ఞాన మార్గాలు ఉన్నాయి అని సూచించినట్లయినది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. యోగంబుతెలుఁగు సెప్పితి । భోగివరాభరణ! సాంఖ్యమును జెప్పెదఁ ద
ద్భాగులగు నైష్ఠికులు భవ । సాగరముం గడతు రైక్యసంబోధమునన్. 217

ప్రతిపదార్థం: భోగివర+ఆభరణ!= శ్రేష్ఠమైన సర్పాలు భూషణాలుగా గల ఓ శివా!; యోగంబు తెలుఁగు= యోగం విధానాన్ని; చెప్పితిన్= చెప్పాను; సాంఖ్యమునున్= జ్ఞానమార్గాన్ని; చెప్పెదన్= చెప్పుతాను; తద్+భాగులు= దానిని భజించేవారు; అగు నైష్ఠికులు= అయిన నిష్ఠకలవారు; ఐక్య సంబోధమునన్= ఆ రెంటి కలయికను చక్కగా తెలియటంవలన; భవసాగరమున్= సంసారమనే సముద్రాన్ని; కడతురు= దాటుతారు.

తాత్పర్యం: శివా! ఇంతవరకు యోగమార్గాన్ని వివరించాను. ఇంక సాంఖ్యాన్ని చెప్పుతాను. దానిని సేవించే నిష్ఠ కలవారు యోగమూ, సాంఖ్యమూ ఒక్కటే అనే భావంతో సంసారసముద్రాన్ని దాటుతారు.

విశేషం: పైన యోగమే తప్ప అపునరాగమనస్థితికి మరొక ధర్మం లేదన్నారు. ఇంక సాంఖ్యం చెప్పట మెందుకు? అనే శంక కలుగుతుంది. దానిని తొలగించటానికి యోగము - సాంఖ్యము ఒక్కటే అనే భావాన్ని ఇందులో ముందుగా ప్రస్ఫుటం చేస్తున్నారు. 'ఏకం యోగం చ సాంఖ్యం చ యః పశ్యతి స పశ్యతి' (5-5) అని గీతావాక్యం. యోగమూ, సాంఖ్యమూ ఒక్కటే అని ఎవడు భావిస్తాడో వాడే సరియైన భావుకుడు - అని అర్థం.

సనత్కుమారుఁడు రుద్రునకు సాంఖ్యయోగంబు తెలం గెఱింగించుట (సం.13-168-1(కుంభ))

వ. కావున నత్యాదరంబున నాకర్ణింపు' మని పలికి యిట్లనియె. 218

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అత్యాదరంబునన్= మిక్కిలి ఆదరంతో; ఆకర్ణింపుము= వినుము; అని; పలికి= చెప్పి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: కాబట్టి మిక్కిలి శ్రద్ధతో వినుము' అని ఇట్లా అన్నాడు.

విశేషం: ఇక్కడ అత్యాదరం శ్రోతకు శివుడికి కాదు. అత్యాదరంతో వినటం ఏల? - అనగా యోగం పరమోత్తమధర్మం అన్నారు. దాని తరువాతిదిగా చెప్పేదానిని ఎందుకు పట్టించుకోవాలి అనే శంకను విడనాడాలి. ఎందుకంటే యోగమూ, సాంఖ్యమూ ఒక్కటిగానే దర్శించాలి కనుక.

ఆ. 'ఇంద్రియములకంటె నీశాన! మన మహం । కారతత్త్వ మంతకంటె, దాని
కంటె బుద్ధి, బుద్ధికంటెఁ బ్రకృతి యెక్కు । డిన్నిటికిని బురుషుఁ డెక్కు డరయ. 219

ప్రతిపదార్థం: ఈశాన!= ఈశ్వరా!; ఇంద్రియములకంటెన్= చర్మము, కన్ను, చెవి, నాలుక, ముక్కు - అనేవాటికంటె; మనము= మనస్సు; అంతకంటెన్= దానికంటె; అహంకారతత్త్వము= 'నేను' అనే భావన పుట్టే తత్త్వమూ; దానికంటెన్= దానికంటె; బుద్ధి= నిశ్చయాత్మకమైన బుద్ధి అనే తత్త్వమూ; బుద్ధికంటెన్= బుద్ధికంటె; ప్రకృతి= ప్రకృతి అనే తత్త్వమూ; ఎక్కుడు= మిన్న అయినవి; అరయన్= పరిశీలించి చూడగా; పురుషుఁడు= పురుషుడు అనే తత్త్వం; ఇన్నిటికిన్= ఈ అన్నింటికీ; ఎక్కుడు= అధికమైనది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ఈశ్వరా! ఇంద్రియాలకంటె మనస్సు, దాని కంటె అహంకారతత్త్వం, దానికంటె బుద్ధి, దానికంటె ప్రకృతి ఎక్కువ. వీటన్నిటికంటె పురుషుడు మిన్న.

విశేషం: శబ్ద స్పర్శ రూపరస గంధాలను గ్రహించి మనస్సు కందించేవి ఇంద్రియాలు. సంకల్పవికల్పాల పుట్ట మనస్సు. నేను చూస్తున్నాను, నేను వింటున్నాను - అన్నతీరుగా వ్యవహరించే తత్త్వం 'అహంకారం'. మనస్సు, అహంకారమూ అందించే విషయాలను తెలిసికొని, నిశ్చయాలను కలిగించేది బుద్ధి. దానికి పై మెట్టున ఈ అన్నింటికీ మూలకారణమై ఉండే మాయను 'ప్రకృతి' అంటారు. ఈ అన్నింటికి పై స్థాయిలో 'పురం' అనే వ్యవహారం గల దేహంలో సాక్షి మాత్రంగా శయనించి ఉండే తత్త్వం పురుషుడు. ఇంద్రియాదులు క్రమంగా మెట్లు. 'పురుషుడు' ఇన్నిటిని ఎక్కాడు అని విడిగా చెప్పటం వలన ఇది 'గమ్యం' - అందవలసిన చోటు అని చెప్పినట్లయింది.

తే. **అంబరాది భూతములు శబ్దాది గుణము । లింద్రియము లిరుదెఱఁగు బాలేందుమౌళి!**
మన మహంకారబుద్ధు లిట్లొనరి ప్రకృతిఁ । గలయఁ దత్త్వచతుర్వింశకత్వ మొందు. **220**

ప్రతిపదార్థం: బాల+ఇందుమౌళి!= బాలచంద్రుడు శిరోభూషణంగా ఉన్న ఓ పరమేశ్వరా!; అంబర+ఆది భూతములు= ఆకాశం మొదలైన భూతాలు (5); శబ్ద+ఆది గుణములు= శబ్దం మొదలైన గుణాలు (5); ఇరు+తెఱఁగు= రెండు విధాలయిన; ఇంద్రియములు= ఇంద్రియాలు (10); మనము= మనస్సు (1); అహంకారబుద్ధులు= అహంకారం అనే తత్త్వమూ; బుద్ధి అనే తత్త్వమూ (2); ఇట్లు= ఈ విధంగా; ఒనరి= కూడి; ప్రకృతిన్= ప్రకృతి అనే తత్త్వంలో; కలయన్= కలియగా; తత్త్వచతుర్+ వింశకత్వంబు= తత్త్వాల ఇరువది నాల్గింటితనము; ఒందున్= ఏర్పడుతుంది.

తాత్పర్యం: శివా! ఆకాశం మొదలైన భూతాలు ఐదు. వాటి గుణాలైన శబ్దం మొదలైనవి అయిదు. రెండు విధాల ఇంద్రియాలు పదీ, మనస్సు, అహంకారం, బుద్ధి అనే మూడూ, ప్రకృతి అనే ఒక తత్త్వమూ కలిసి మొత్తం ఇరువది నాలుగు తత్త్వాలు అవుతాయి.

విశేషం: 1. భూతాలు : ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి.

2. గుణాలు : శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము.

3. ఇంద్రియాలు : (1) కర్మేంద్రియాలు: 1. వాక్కు, 2. చేయి, 3. కాలు, 4.విసర్జనేంద్రియము, 5.జననేంద్రియము, (2) జ్ఞానేంద్రియాలు: 1.చర్మము, 2. కన్ను, 3. చెవి, 4. నాలుక, 5.ముక్కు.

క. **చేతనుఁ డగు పురుషుని ని । శ్చేతనయగు ప్రకృతి వొంది చేతనతాప్ర**
స్ఫీత యగుం బెఱతత్త్వము । లాతత్త్వం బను మహాబ్ధియందలి తరఁగల్. **221**

ప్రతిపదార్థం: చేతనుఁడు= ప్రాణశక్తి కలవాడు; అగు పురుషునిన్= అయిన పురుషుడనే తత్త్వాన్ని; నిశ్చేతన= ప్రాణశక్తి లేనిది; అగు ప్రకృతి= అయిన ప్రకృతి; పొంది= చేరుకొని; చేతనతా ప్రస్ఫీత= ప్రాణశక్తితో మిక్కిలి శక్తి గలది; అగున్= అవుతుంది; పెఱతత్త్వములు= మిగిలిన ఇరవై మూడు తత్త్వాలు; ఆ తత్త్వంబు= ఆ ఇరవై నాలుగవదైన ప్రకృతి; అను మహా+అబ్ధియందలి తరఁగల్= అనే మహాసముద్రంలోని తరంగాలు.

తాత్పర్యం: చైతన్యం గల 'పురుషుడు' అనే తత్త్వాన్ని ఆశ్రయించి, చైతన్యం లేని ప్రకృతి చైతన్యం పుష్టిగా కలది అవుతుంది. తక్కిన తత్త్వాలు ఆ తత్త్వం అనే మహాసముద్రంలోని తరంగాలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ప్రకృతి మొదలూ పంచభూతాలవరకు ఉండే ఇరవైనాలుగు తత్త్వాలు సహజసిద్ధంగా చైతన్యం లేనివి. సహజసిద్ధము, నిత్యమూ అయిన చేతనధర్మం - ఇరవై అయిదవదైన పురుషతత్త్వానికి మాత్రమే ఉన్నది. చైతన్యం లేని ప్రకృతి, చైతన్యం గల పురుషుడిని పొంది అయస్కాంతాన్ని పొందిన ఇనుము అయస్కాంత ధర్మాన్ని పొందినట్లుగా చైతన్యం కలది అవుతుంది. ప్రకృతి ఒక మహాసముద్రంవంటి దయితే తక్కిన బుద్ధి మొదలైనవి అందలి తరంగాలు. అనగా ప్రకృతికి సంక్రమించిన చేతనధర్మం వాటికి కూడా ఏర్పడుతుంది. ఏర్పడుతుంది అనగా పోయే అవకాశం కూడా ఉన్నదని అర్థం. ప్రకృతి మొదలైనవాటి చైతన్యం నిత్యం కాదని తాత్పర్యం.

క. గుణములఁ బొందఁడు పురుషుఁడు । గుణమహితా! ప్రకృతి యిచ్చు గుణముల కేమే
గుణములు దానను గుణులై । గుణిత్వ మా నిర్గుణాత్మకున కొలయించున్. 222

ప్రతిపదార్థం: గుణమహితా!= గుణాలచేత గొప్పతనం పొందినవాడా!; పురుషుఁడు= పురుషుడనే తత్త్వం; గుణములన్= గుణాలను; పొందఁడు= పొందడు; ప్రకృతి= ప్రకృతి అనే తత్త్వం; గుణములకున్= గుణాలకు; ఏమి+ఏన్= ఏవైనా; గుణములు= గుణాలను; ఇచ్చున్= ఇస్తుంది; దానను= దానిచేత; గుణులు+ఐ= గుణాలు కలవియై; ఆ నిర్గుణ+ఆత్మకునకున్= గుణాలు లేని స్వభావం కల ఆ పురుషుడికి; గుణిత్వము= గుణములు కలవా డగుటను; ఒలయించున్= కలిగిస్తాయి.

తాత్పర్యం: శివా! పురుషుడికి ఏ గుణాలూ లేవు. ప్రకృతియే గుణాలకు ఏవైనా గుణాలను ఇస్తుంది. దానిచేత తక్కిన తత్త్వాలు గుణాలు కలవియై గుణాలు లేని పరమాత్మకు గుణాలు కలిగిన స్థితిని కలిగిస్తాయి.

విశేషం: గుణాలంటే సత్త్వము, రజస్సు, తమస్సు - అనేవి. ఇవి ప్రకృతికి సంబంధించినవి. ఇవి తక్కిన భూతాదులకు రుచి, రంగు, వాసన మొదలైన గుణాలను కల్పిస్తాయి. ఆ విధంగా అన్నీ గుణాలు కలవి అవుతాయి. ఈ గుణాలుగల ఇరవైనాలుగు తత్త్వాలు గుణాలు లేని పురుషుడిని చేరటంవలన అతడు కూడా 'గుణి' - గుణాలు కలవాడు అవుతున్నాడు. గాజుపాత్రలో రంగునీరు పోస్తే గాజుపాత్ర రంగు కలదిగా కనిపిస్తుంది. నీరు తీసివేస్తే రంగులేనితనం తెలియవస్తుంది. ఇట్టిది పరమాత్మ తత్త్వం. నీటికి ఆధానం చేసిన రంగుమాత్రం సాధారణంగా నీటిని వదలిపోదు. కనుక ప్రకృతి మొదలైనవాటి గుణిత్వము అటువంటిది.

తే. వీని నెల్ల నసత్కోటిగా నెఱింగి । కొనుచుఁ బ్రకృతి నుపేక్షించి తనకుఁ దాన
కాని యొండెద్దియును లేమి గాంచినపుడు । పురుషుఁ డపగత ధూమాగ్నిఁ బోలి వెలుఁగు. 223

ప్రతిపదార్థం: వీనిన్ ఎల్లన్= వీటి నన్నింటిని; అసత్ కోటిగాన్= సత్యము కాని వాటి సముదాయంగా; ఎఱింగికొనుచున్= తెలిసికొంటూ; ప్రకృతిన్= ప్రకృతిని; ఉపేక్షించి= పట్టించుకొనకుండా; తనకున్= తనకు; తాను+అ= తానే; కాని; ఒండు= మరియొకటి; ఎద్దియును= ఏదీ కూడా; లేమి= లేకపోవటాన్ని; కాంచిన+అపుడు= గుర్తించినపుడు; పురుషుఁడు= మానవుడు; అపగత ధూమ+అగ్నిన్= తొలగిన పొగగల నిప్పును; పోలి; వెలుఁగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: ఈ అన్నింటిని సత్పదార్థానికి వేరైనవిగా తెలిసికొంటూ ప్రకృతిని పట్టించుకొనకుండా తనకు తానే కానీ మరొకటి ఏమీ లేదు అని గుర్తించినపుడు సాధకుడైన పురుషుడు పొగలేని నిప్పువలె ప్రకాశిస్తాడు.

విశేషం: ఇక్కడ పురుషుడు ఇరవై అయిదవ తత్త్వమైన పరమాత్మ కాదు. సాధకుడైన పురుషుడు. కానీ ఆ స్థితిలో ఆ పురుషుడితో ఈ పురుషుడు అభిన్నుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. అట్లు గాక యహంకార మావహిల్లి । ప్రకృతి దానని సృష్టికిఁ బ్రలయమునకుఁ
గర్త యైన వికారాత్మకత్వ మొందుఁ । బ్రకృతివికృతులు గాని యా ప్రభువు నపుడు. 224

ప్రతిపదార్థం: అట్లు+కాక= ఆ విధంగా కాక; అహంకారము= 'నేను' అనేభావం; ఆవహిల్లి= కలిగి, ప్రకృతి; తాను= తానే; అని; సృష్టికిన్= ఉత్పత్తికి; ప్రళయమునకున్= వినాశానికి; కర్త= చేయువాడు; ఐనన్= అయితే; అపుడ= ఆ సమయంలో; ప్రకృతి వికృతులు= ప్రకృతిగాని, వికృతిగాని, కాని= కానట్టి; ఆ ప్రభువును= ఆ ఆత్మరూపుడైన ప్రభువును; వికార+ఆత్మకత్వము= వికారం స్వభావంగా ఉండే లక్షణం; ఒందున్= పొందుతుంది.

తాత్పర్యం: అట్లా కాక, సాధకుడైన పురుషుడు అహంకారం కలగటంవలన ప్రకృతియే తానని భావించి, సృష్టికీ ప్రళయానికీ కర్త అయితే ప్రకృతిగానీ వికృతిగానీ కాని ఆ ప్రభువును వికారస్థితి పొందుతుంది.

విశేషం: వేదాంత పరిభాషలో 'జీవుడు' ఇక్కడ ఇరవై అయిదవతత్త్వంగా పరిగణింపబడే పురుషుడు. అతడికి పైవైపు ఇరవై ఆరవ తత్త్వం 'పరమాత్మ' ఉన్నది. క్రిందివైపు ఇరవైనాలుగవ తత్త్వం ప్రకృతి ఉన్నది. ప్రకృతితోపాటు తక్కిన ఇరవైమూడు తత్త్వాలూ ఉన్నాయి. ఇప్పుడు ఈ జీవుడు పైవైపు చూచి ప్రకృత్యాదులతో తనకు సంబంధం లేదనుకొంటే అతడు ఇరవై ఆరవ తత్త్వం లక్షణాలు పొంది ఏకాత్ముడై వెలుగుతాడు. దీనిని 223వ పద్యంలో చెప్పారు. అట్లాకాక క్రిందివైపు ఒరిగి, ప్రకృతితో తాదాత్మ్యం పొందితే 'సంసారం' అనే జగత్తుకు కర్త అవుతాడు. (224వ పద్యం). ఇది బంధహేతువు. అది మోక్షహేతువు. దీనినే మరింత స్పష్టంగా తరువాతి పద్యంలో చెప్పుతున్నారు.

క. ధృతి పూనమిఁ బ్రకృతికి వశ । గతుఁ డగుచు దమోమయత్వకలితం బగు న
వ్వితతాసుఖితత్వము సుఖ । మతిఁ బురుషుం డనుభవించు మదనధ్వంసీ । 225

ప్రతిపదార్థం: మదనధ్వంసీ!= మన్మథుడిని సంహరించినవాడా! శివా!; ధృతి= ధైర్యాన్ని; పూనమిన్= అవలంబింపక పోవటం చేత; పురుషుండు= జీవుడు; ప్రకృతికిన్= ప్రకృతికి; వశగతుఁడు+అగుచున్= లొంగిపోతూ; తమో మయత్వకలితంబు+అగు= తమోగుణంతో కూడుకొనినదైన; ఆ+వితత+అసుఖితత్వము=ఎడతెగని ఆ దుఃఖం కలవాని స్వభావాన్ని; సుఖమతిన్= సుఖం అనుకొనే భావనతో; అనుభవించున్= అనుభవిస్తాడు.

తాత్పర్యం: ఓ శివా! ధైర్యాన్ని అవలంబింపక పోవటం వలన జీవుడు ప్రకృతికి లొంగిపోతూ తమోగుణంతో కూడుకొన్న దుఃఖమయమైన సంసారస్థితిని సుఖమనే భావనతో అనుభవిస్తూ ఉంటాడు.

క. నేరిమి దాని నుపేక్షం । జేరుప షడ్వింశభావసిద్ధిఁ బొరయు గౌ
రీరమణ! పంచవింశుఁడు । సారామల నిపుణమతిఁ బ్రసన్నాత్మకుఁడై. 226

ప్రతిపదార్థం: గౌరీరమణ!= పార్వతీహృదయేశా!; పంచవింశుఁడు= ఇరవైఅయిదవ తత్త్వం వాడైన పురుషుడు (జీవుడు); సార+అమల నిపుణమతిన్= సారమైనదీ, మలినం లేనిదీ, నేర్పుగలదీ అయిన బుద్ధితో; ప్రసన్న+ ఆత్మకుఁడు= ఏ మాలిన్యమూ లేని ఆత్మకుడు; ఐ=అయి; నేరిమిన్= నేర్పుతో; దానిన్= ఆ ప్రకృతిని; ఉపేక్షన్= ఒప్పరికించటంలో; చేరుపన్= చేరిస్తే; షట్+వింశ భావ సిద్ధిన్= ఇరవై ఆరవభావం ఏర్పడటాన్ని; పొరయున్= పొందుతాడు.

తాత్పర్యం: పార్వతీపతీ! ఇరవై అయిదవ తత్త్వం వాడైన జీవుడు సారమైనదీ, మలినం లేనిదీ, నేర్పు గలదీ అయిన బుద్ధితో ప్రసన్నమైన ఆత్మ కలవాడై నేర్పుతో ఆ ప్రకృతిని పట్టించుకొనక ఉంటే ఇరవై ఆరవ తత్త్వపు సిద్ధిని పొందుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇది బహుక్లిష్టమైన సాధన. దీనికి బుద్ధి ఎట్లా ఉండాలో చాలా జాగ్రత్తగా పరిశీలించవలసిందిగా కవి హెచ్చరిస్తున్నాడు. అది సారం కలది కావాలి. అనగా సర్వభావాలను కాచి వడబోసి నిగ్గు తేల్చుకున్న స్థితి బుద్ధిలో ఏర్పడాలి. ఒక్కసారి ఏర్పడితే చాలదు. దానిలో ప్రకృతివైపు మొగ్గజేసే మలినలక్షణాలు రాకుండా చూచుకోవాలని 'అమల' శబ్దం దీనిని సూచిస్తుంది. అయినా ప్రయోజనం సిద్ధించకపోవచ్చును - నేర్పు లేదు కనుక. 'నేర్పు' అనగా నిరంతర సాధనతో వచ్చే క్రియాపాటవం. ఇవన్నీ ఉన్నా మరే కారణం చేతనైనా ప్రసన్నత లోపిస్తే సిద్ధి దూరమవుతుంది. ఈ విధంగా సాధన విషయంలో ఎంత జాగరూకత ఉండాలో ఈ పద్యం వివరిస్తున్నది.

క. సత్త్వాశ్రయమునఁ బురుషుఁడు । దత్త్వాశ్రయమునను సత్త్వతత్త్వముల వివే
కిత్వాలేపత్వములన । విత్త్వముఁ జిత్త్వంబు నొందు విశ్వాధారా! 227

ప్రతిపదార్థం: విశ్వ+ఆధారా!= విశ్వానికంతటికి పట్టుగొమ్మ అయిన ఓ విశ్వరూపా!; పురుషుడు= పురుషనాముడైన ఇరవై అయిదవతత్త్వం వాడు; సత్త్వ+ఆశ్రయమునన్= సత్త్వగుణాన్ని అవలంబించినందువలనను; తత్త్వ+ఆశ్రయమునను= తత్త్వాన్ని ఆశ్రయించినందువలనను, సత్త్వ తత్త్వముల వివేకిత్వ+అలేపత్వములన్+అ= సత్త్వము, తత్త్వము అనేవాటి స్పష్టమైన జ్ఞానం పొందటం, వాటి అంటు లేకుండటం అనేవాటి వలన; విత్త్వము= జ్ఞానమును; చిత్త్వంబున్= 'చిత్' స్వరూపం కలిగి ఉండటాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: సర్వాధారా! పురుషుడు సత్త్వాన్ని ఆశ్రయించి, తత్త్వాన్ని ఆశ్రయించి, ఆ రెండింటిని చక్కగా తెలిసికొనటం, వాటి అంటు లేకుండా చూచుకొనటం అనే పనులవలన తెలిసినవాడు, చైతన్యవంతుడూ అవుతాడు.

విశేషం: సత్త్వం అనగా ఉండటం - అస్తిత్వం. తత్త్వం అనగా జ్ఞానం. ఈ రెండింటిని చక్కగా పరిశీలించి చూచుకొంటే మొదటి దానివలన వివేకిత్వం - అనగా నిత్యం, అనిత్యం అనేవాటి చక్కని జ్ఞానం, రెండవదానివలన, అలేపత్వం - అనగా అంటులేనితనం కలుగుతుంది. విత్+త్వ, చిత్+త్వములు రెండూ పరమాత్మ రెండు లక్షణాలు.

క. నానా త్వైకత్వము ల । జ్ఞానజ్ఞానజము లనపజయ! కండ్రు బుధుల్
వాని నవిద్యయు విద్యయుఁ గా నివి విను పంచవింశకస్థావస్థల్. 228

ప్రతిపదార్థం: అనపజయ!= ఓటమి ఎరుగని ఓ దేవా!; నానాత్వ+ఏకత్వములు= పెక్కులగుట, ఒక్కటియగుట అనేవి; అజ్ఞాన జ్ఞానజములు= అజ్ఞానం వలనా, జ్ఞానం వలనా పుట్టేవి; బుధుల్= జ్ఞానవంతులు; వానిన్= ఆ రెండింటిని; అవిద్యయున్= అవిద్యగాను (అజ్ఞానంగానూ); విద్యయున్+కాన్= విద్యగానూ (జ్ఞానంగానూ); కండ్రు= చూస్తారు; విను= వినుము; ఇవి= ఈ రెండు; పంచవింశకస్థ+ అవస్థల్= ఇరువదియైదవ తత్త్వంలో ఉన్నవాడి దశలు.

తాత్పర్యం: మహేశా! పెక్కు లగుట అజ్ఞానం వలన కలిగిన స్థితి. ఒక్కటి కావటం జ్ఞానంవలన కలిగే స్థితి. పండితులు దీనినే అవిద్య, విద్య అంటారు. ఈ రెండూ ఇరవై అయిదవతత్త్వం వాడైన జీవుడి దశలు.

విశేషం: జీవుడు ప్రకృతితో తాదాత్మ్యం పొందితే విశ్వమంతా అనేక వస్త్వాదులతో ఉన్నట్లు భాసిస్తుంది. ఇరవై ఆరవ తత్త్వంతో తాదాత్మ్యం పొందితే 'ఏకత్వం' సిద్ధిస్తుంది. మొదటిది అజ్ఞానంవలనా, రెండవది జ్ఞానంవలనా సిద్ధిస్తాయి. వీటికే అవిద్య, విద్య అని కూడా పేర్లు. ఇరవై అయిదవ తత్త్వంవాడైన జీవుడికి, ఈ రెండు దశలూ కలిగే అవకాశం ఉన్నది. అవిద్య బంధానికి కారణం. విద్య మోక్షానికి కారణం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విద్యామయషడ్వింశుఁడు । విద్యావిద్యావిభేదవిరహితుఁ డజరుం

డాద్యుఁ డనంతుం డచ్యుతుఁ । డద్యతనుఁ డనాది కేవలాత్మకుఁ డరయన్.' 229

ప్రతిపదార్థం: అరయన్= పరీక్షించగా; విద్యామయ షడ్వింశుఁడు= విద్యయే స్వరూపంగా గల ఇరవై ఆరవ తత్త్వం వాడు; విద్యా+ అవిద్యా, విభేదరహితుఁడు= విద్య, అవిద్య అనే వేర్వేరు భేదాలు లేనివాడు; అజరుండు= ముదిమి లేనివాడు; ఆద్యుఁడు= మొట్ట మొదటివాడు; అనంతుండు= అంతంలేనివాడు; అచ్యుతుఁడు= ఏ విధమైన జారుపాటు లేనివాడు; అద్యతనుఁడు= ఇప్పటివాడు; అనాది= తనకొక మొదలు లేనివాడు; కేవల+ఆత్మకుఁడు= తనకు తానే అయినవాడు.

తాత్పర్యం: పరికించగా విద్యయే స్వరూపంగా గల ఇరవై ఆరవతత్త్వంవాడు విద్య, అవిద్య అనే దశలు లేనివాడు, ముసలితనం లేనివాడు, మొట్టమొదటివాడు, అంతంలేనివాడు, ఏ విధమైన మార్పు లేనివాడు. ఇప్పటివాడు, మొదలు లేనివాడు, తనకు తానే అయినవాడు'.

విశేషం: ఇరవై ఆరవతత్త్వంవాడి తత్త్వాన్ని ఇక్కడ వక్కాణిస్తున్నారు. 'ఏకత్వం' విద్య అని పైన చెప్పారు. ఆ ఏకత్వస్వరూపుడే అతడు. ఇరవై అయిదవ తత్త్వం వాడికి రెండు దశలు - అవిద్య, విద్య అని ఉన్నాయని వెనుకటి పద్యంలో చెప్పారు. ఆ దశలు ఇతడికి లేవు. ఆ దశలు ఉన్నవానికి సృష్టిలో సర్వపదార్థాలవలె చివికి జీర్ణించిపోయే స్థితి ఉంటుంది. ఇతడికి అట్టి స్థితి లేదు కనుక అజరుడు. 'జర' - ముదిమి ఉంటే తరువాతి స్థితి చావు. అది రెండు దశలున్న వాడికి ఉంటుంది. ఇతడికి ఉండదు. కనుక అనంతుడు. 'చ్యుతి' అంటే మార్పు. మార్పు అంటే సృష్టికి పూర్వం నుండీ ఉన్నవాడు అద్యతనుఁడు - అనగా అప్పుడు ఎట్లా ఉన్నాడో ఇప్పుడు ఇట్లాగే ఉన్నవాడు. దీనినిబట్టి ఎప్పుడూ ఏకస్వరూపంతో ఉండేవాడు అన్న అర్థం సిద్ధిస్తుంది. 'అనాది' - ఆది అంటే ఇక్కడ పుట్టుక. అది లేనివాడు - అది లేకపోతే స్థితి, చావు అనీ మరో రెండు దశలు ఉండవు. కేవలాత్మకుఁడు-తనకు తానే అయినవాడు. అనగా తన స్థితికి ఆధారం, కారణం మొదలైనవిగా మరొకటి లేనివాడు. ఏకస్వరూపుడు అని అర్థం.

ఆ. అని యుపన్యసించి యమ్మునిపతి యను । శంభుతోడ మఱియు 'సాంఖ్యయోగ

శిష్టమానసుల కరిష్టపరిజ్ఞాన । వైభవాతిశయము వలసియుండు. 230

ప్రతిపదార్థం: అని= ఇట్లని; ఉపన్యసించి= తెలిసేటట్లుగా చెప్పి; ఆ+మునిపతి= మునులలో గొప్పవాడగు ఆ సనత్కుమారుడు; శంభుతోడన్= శివుడితో; మఱియున్= ఇంకా; అనున్= అంటున్నాడు; సాంఖ్య, యోగ, శిష్ట, మానసులకున్= సాంఖ్యమనే యోగంలో శిక్షణ పొందిన మనస్సు కలవారికి; అరిష్ట, పరిజ్ఞాన వైభవ+అతిశయము= కీడుల చక్కని జ్ఞానపు సంపదయొక్క ఎక్కువతనం; వలసియుండున్= కావాలి.

తాత్పర్యం: ఇట్లా చక్కగా తెలియజెప్పి, సనత్కుమారుడు శివుడితో ఇట్లా అంటున్నాడు. 'సాంఖ్యయోగంలో శిక్షణ పొందిన మనస్సు కలవారు కీడులను గురించి చక్కని జ్ఞానం పొంది ఉండాలి.

విశేషం: అరిష్టాలంటే యోగాన్ని పాడు చేసే విషయాలు. అవి తెలిసికొనకపోతే యోగం చెడి, సాధకుడు భ్రష్టుడవుతాడు.

వ. ఎట్లనిన దృష్టారిష్టవికృతులయి యా సుకృతుల విచ్ఛిన్నాత్మాను సంధానంబునం దదీయ దురవస్థం ద్రోవంజాలుదు రరిష్టంబు లవధరింపు' మను పలుకు పలికి 'వాని నెల్లను వివరించెద'; నని పరాశర

సంయమీశ్వరుండు శిష్యుల కుపదేశించిన విధంబులైయుండు నంతవట్టును మును నీ వాకర్ణించి తని యమ్మునివరుండు మఱియు నమ్మహాదేవుతో 'నరిష్టంబులం గాంచి యోగిజనంబులు సర్వాంగధారణ సహితంబును బరమహితంబును నగు ననేకత్వాకలన కృత్యంబున మృత్యువు జయింతు' రని నిర్దేశించి.231

ప్రతిపదార్థం: ఎట్లు= ఏ విధంగా; అనినన్= అంటే; దృష్ట+అరిష్ట వికృతులు= చూడబడిన అరిష్టాలు, వికారాలు కలవారు; అయి; ఆ+సుకృతులు= ఆ పుణ్యాత్ములు; అవిచ్ఛిన్న+ఆత్మ+అనుసంధానంబునన్= ఎడతెగకుండా ఆత్మను కూర్చుకొనటం చేత; తదీయ దురవస్థన్= ఆ అరిష్టాలవలన ఏర్పడే పాడుదశను; త్రోవన్= త్రోసివేయటానికి; చాలుదురు= సమర్థులవుతారు; అరిష్టంబులు= కీడులు; అవధరింపుము= దయతో వినుము; అను పలుకు= అనే మాట; పలికి; వానిన్= వాటిని; ఎల్లను= అన్నింటిని; వివరించెదను= తెలియచెప్పుతాను; అని; పరాశర సంయమి+ఈశ్వరుండు= పరాశరుడనే మహర్షిశ్రేష్ఠుడు; శిష్యులకున్= తనకడ అధ్యయనం చేసేవారికి; ఉపదేశించిన విధంబులు= బోధించిన పద్ధతులు; ఐ+ఉండు+అంతవట్టును= అయి ఉండే అంతవరకు; మును= తొల్లి; నీవు; ఆకర్ణించితి(ని)= విన్నావు; అని; ఆ+మునివరుండు= ఆ మునిశ్రేష్ఠుడు; మఱియున్= ఇంకా; ఆ+మహాదేవుతోన్= ఆ మహాదేవుడు శంకరుడితో; అరిష్టంబులన్= కీడులను; కాంచి; యోగిజనంబులు= యోగం అభ్యసించే మనుజులు; సర్వ+అంగ ధారణ సహితంబునున్= అన్ని అంగాలను పట్టి నిలపటంతో కూడినదీ; పరమ హితంబును= మిక్కిలి మేలు చేసేదీ; అగు= అయిన; అనేకత్వ+ఆకలన కృత్యంబునన్= పెక్కు లగుటను ఒక్కటిగా చేయటం అనే పనితో; మృత్యువున్= చావును; జయింతురు= గెలుస్తారు; అని; నిర్దేశించి= తెలియచెప్పి.

తాత్పర్యం: ఏ విధంగా అనగా అరిష్టాలను, వికారాలు తెలిసికొని పుణ్యాత్ములు ఎడతెగకుండా ఆత్మను కూర్చుకొనటం ద్వారా వాటివలన కలిగే చెడుదశను త్రోసి వేయగలుగుతారు. కనుక కీడును తెలిసికొనాలి.' అని పలికి, 'వాటిని వివరిస్తాను' అని 'మునుపు పరాశరమహర్షి శిష్యులకు చెప్పిన విషయాలుగా ఉన్నాయి. అంతవరకు నీవు విని ఉన్నావు' అని సనత్కుమారుడు ఇంకా మహాదేవుడితో ఇట్లా అన్నాడు. 'అరిష్టాలను తెలిసికొని యోగిజనాలు అన్ని అంశాలను పట్టి నిలపటం అనే పనితో కూడినదీ, మిక్కిలి మేలైనదీ అయిన అనేకము లవటం అనేదానిని ఏకస్వరూపంలోనికి తేవటం అనే క్రియద్వారా మృత్యువును గెలుస్తారు' అని చెప్పి (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఆత్మను అనుసంధించటం అనే పని అవిచ్ఛిన్నంగా జరగాలి. లేకపోతే భ్రష్టత కలుగుతుంది. అనేకత్వ+ఆకలన, కృత్యంబుగనన్= అనేకాలంటే 24 తత్త్వాలు. వాటి 'ఆకలనం' అనగా కలపటం - ఒక్కటి చేయటం. అనేకత్వం అవిద్య అని పైన తెలిపారు. కనుక ఆ స్వరూపాన్ని చక్కగా తెలిసికొనటం అని కూడా ఇక్కడ అర్థంగా భావించవచ్చును. అవిద్య కూడా తెలియదగినదే. దానివలన మృత్యువును తరించాలి అని వేదానుశాసనం. 'అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా అమృతమశ్నుతే' అని ఉపనిషద్వాక్యం. ఈ దృష్టితో ఈ పద్యంలో ఈ వాక్యపూర్వార్థాన్ని సమన్వయించినట్లుగా భావించాలి.

క. జలమున మీను నుదుంబర । ఫలమున మశకములుఁ బోలెఁ బ్రకృతిం దా ని
మ్ముల నునికి తెలిసి వేర్పా ।టలవఱిచిన పురుషుఁ డవ్యయత్వము పొందున్. 232

ప్రతిపదార్థం: జలమునన్= నీటిలో; మీనున్= చేపయూ; ఉదుంబర ఫలమునన్= మేడిపండులో; మశకములున్= పురుగులు; పోలెన్= వలె; ప్రకృతిన్= ప్రకృతిలో; తాను= జీవుడు; ఇమ్ములన్= చక్కగా; ఉనికి= ఉండటం; తెలిసి= ఎరిగి; వేర్పాటు= వేరు కావటం, అలవఱిచిన పురుషుఁడు= అభ్యాసం చేసిన జీవుడు; అవ్యయత్వము= అవ్యయుడైన పరమాత్మ స్థితిని; పొందున్=

పొందుతాడు.

తాత్పర్యం: నీటిలో చేపా, మేడిపండులో పురుగులూ ఉన్నట్లుగా తాను ప్రకృతిలో ఉన్నానని తెలిసికొని, దానినుండి వేరుకావటం అభ్యాసం చేసి, సిద్ధిపొందిన పురుషుడు అమృతత్వస్థితి పొందుతాడు.

విశేషం: నీటిలో చేప ఉన్నది కాని నీరే చేపకాదు. మేడిపండులో పురుగులు ఉన్నాయి. కానీ పండే పురుగులు కాదు. తనను ఆవరించిన నీరు, పండువంటి ప్రకృతిధర్మాలు తనకంటె వేరైనవి అని గుర్తించటం, తన నిజస్థితి ఏమో పరికించి అది తానే అనే భావాన్ని అనుసంధించుకొనటం సాధకుడి కృత్యాలు. సాధన సిద్ధిదశకు వస్తే కలిగే ఫలం అవ్యయత్వం. అవ్యయుడు ఇంతవరకు చెప్పిన ఇరవై ఆరవతత్త్వం వాడు - పరమాత్మ. అది కావటం అవ్యయత్వం. దీనికే కైవల్యం, మోక్షం మొదలైన వ్యవహారాలు ఉన్నాయి. ఇందులో 'విద్యయా అమృత మశ్నుతే' అనే రెండవవాక్య భాగార్థాన్ని సమన్వయించి చూపారు. ఇక్కడ 'వేర్పాటే' విద్య.

తే. **కమలదళమున నున్న జలము విధమునఁ । బ్రకృతినుండి తదీయసంబంధవికృతి**
లేని తనుఁ గని వెలుఁగు నిర్లేపనిశ్చ । లాజరామరపదవి జీవాహ్వయుండు. **233**

ప్రతిపదార్థం: జీవ+ఆహ్వయుండు= జీవుడనే పేరుగలవాడు; కమలదళమునన్= తామరాకుమీద; ఉన్న జలము విధమునన్= ఉన్న నీటివలె; ప్రకృతిన్= ప్రకృతియందు; ఉండి; తదీయసంబంధ వికృతి= దానికి సంబంధించిన వికారము; లేని= లేనట్టి; తనున్= తనను; కని= కాంచి; నిర్లేప నిశ్చల+అజర+అమర పదవిన్= అంటులేనిది, కదలికలేనిది, ముదిమిలేనిది, చావులేనిది అగు స్థానమునందు; వెలుఁగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: జీవుడు తామరాకుమీద నున్న నీటివలె ప్రకృతియందు ఉండి దానికి సంబంధించిన వికారాలు లేకుండా ఉన్న తనను చూచుకొని అంటు, కదలిక, ముదిమి, చావు లేని స్థానంలో వెలుగొందుతాడు.

విశేషం: నీటిలో చేప ఉండటం, తామరాకు మీద నీరుండటం అనే రెండు దృష్టాంతాలు బంధానికీ మోక్షానికీ ప్రతీకలు. నీటిలోని చేపకు (232వ పద్యంలో చెప్పిన సంగతి) నీటి సంపర్కం - అంటు ఉంటుంది. ప్రకృతిలోని జీవుడికి అటువంటి సంబంధం ఉంటే అంటు - దానివలన చలనమూ, దానివలన జర, దానివలన మరణమూ అనే వికారాలు సిద్ధిస్తాయి. ఇక తామరాకుమీద నీరు, తామరాకు సంపర్కం లేకుండా ఉంటుంది. అనగా 'నిర్లేప' స్థితి దానికి ఉంటుంది. దానివలన చలనాది వికారాలు కలుగవు. అదే అవ్యయత్వం.

ఆ. **ప్రకృతి నిట్లు వాసి పంచవింశుండు ష । డ్వింశభావమొంది విమలశివ ని**
రంజన స్వరూపుఁడై వెలుఁగొందు న । త్తెఱఁగు ముక్తియండ్రు దేవదేవ! **234**

ప్రతిపదార్థం: దేవదేవ!= దేవులకు దేవుడవైన ఓ మహాదేవా!; పంచవింశుండు= ఇరవై అయిదవవాడు అయిన జీవుడు; ఇట్లు= ఈ విధంగా; ప్రకృతిన్= ఇరవైనాలుగవ తత్త్వం అయిన ప్రకృతిని; పాసి= వదలి; షడ్వింశభావము= ఇరవైఆరవ తత్త్వం అయిన పరమాత్మ భావాన్ని; ఒంది= పొంది; విమల శివ నిరంజన స్వరూపుఁడు+ఐ= నిర్మలము, మంగళము, ఇతరముల అంటు లేనిది అయిన స్వరూపం కలవాడై; వెలుఁగు+ఒందున్= ప్రకాశిస్తాడు; ఆ+తెఱఁగు= ఆ తీరును; ముక్తి= మోక్షం; అండ్రు= అంటారు.

తాత్పర్యం: జీవుడు ఈ విధంగా ప్రకృతిని వదలివేసి పరమాత్మతనాన్ని పొంది, విమలము, శుభము, అంటులేని స్వరూపం కలవాడై ప్రకాశిస్తాడు. దేవదేవా! ఈ స్థితినే ముక్తి అంటారు.

విశేషం: ప్రకృతిని పాసి - అనగా ప్రకృతితోపాటు వెనుక ఉన్న ఇరవైమూడు తత్త్వాలను వదలి అనే అర్థం భావించాలి. షడ్వింశుడు - ఈ ఇరవై అయిదు తత్త్వాలకు అతీతంగా ఉండే పరమాత్మ. ప్రకృతి సంపర్కం వదలితే జీవాత్మ పరమాత్మే అవుతాడు. ఇదే అద్వైతం. పరమాత్మ లక్షణాలు మూడింటిని ఇక్కడ చెప్పారు. 1.విమలత్వం - మలం అంటే జీవపరంగా అజ్ఞానదోషం. అది లేనితనం. 2.శివత్వం - అనగా మంగళస్వరూపం. కేవలం జీవుడు పెరగటం. తరగటం మొదలైన స్థితులతో కూడినవాడు కనుక అక్కడ కేవల శుభత్వం ఉండదు. పరమాత్మకు అట్టిదిలేదు. 3.నిరంజనత్వం - ప్రకృతితో కలిసి గుణాదుల సోకు పొందటం జీవలక్షణం. అది దోషం. తామరాకుమీద నీటి బొట్టువలె అంటకుండా ఉండటం నిరంజనత్వం.

క. ఈ పరిబోధం బభవా! కాపిల మస్మద్గురుండు గపిలుఁ డతని శి
క్షాపరిణతి బహుశిష్యులు । దీపితవిజ్ఞానులైరి దృఢనిశ్చయతన్. 235

ప్రతిపదార్థం: అభవా!= జన్మమే లేని ఓ శివా! ఈ పరిబోధంబు= ఈ సమగ్రమైన జ్ఞానం; కాపిలము= కపిలమహర్షి ప్రసాదించినది; అస్మత్ గురుండు= నా గురువు; కపిలుఁడు= కపిలమహర్షి; అతని శిక్షా పరిణతిన్= అతడి బోధన పాకంచేత; బహుశిష్యులు= పెక్కుమంది శిష్యులు; దృఢనిశ్చయతన్= చెదరని నిశ్చయబుద్ధి కలగటం చేత; దీపితవిజ్ఞానులు= వెలుగొందే విజ్ఞానం కలవారు; ఐరి= అయ్యారు.

తాత్పర్యం: శివా! ఈ చక్కని జ్ఞానాన్ని కపిలమహర్షి లోకానికి అనుగ్రహించాడు. అతడు నా గురువు. అతడి బోధన పాకంచేత పెక్కుమంది శిష్యులు చెదరని నిశ్చయబుద్ధి కలవారై ప్రకాశించే విజ్ఞానం కలవారయ్యారు.

విశేషం: గురువు విశిష్టత ఇక్కడ తెలియవస్తున్నది.

క. ఏనును శిష్యుల కీ వి । జ్ఞానము పెక్కండ్రకుం బ్రసన్నమతిని గా
ఢానూనంబుగఁ దెలిపితి । మానిత మది దివ్యమునిసమాజముచేతన్. 236

ప్రతిపదార్థం: ఏనును= నేను కూడా; శిష్యులకున్= అధ్యయనం చేసేవారికి; పెక్కండ్రకున్= చాలామందికి; ప్రసన్నమతిని= ప్రసన్నమైన బుద్ధితో; ఈ విజ్ఞానమున్= ఈ సాంఖ్యరూప విశేషజ్ఞానాన్ని; గాఢ+అనూనంబుగన్= గట్టిగా తక్కువతనం లేని విధంగా; తెలిపితిన్= బోధించాను; అది= ఆ విజ్ఞానం; దివ్యముని సమాజముచేతన్= దేవతలమునుల సముదాయంచేత; మానితము= మన్నన కెక్కింది.

తాత్పర్యం: దేవా! నేను కూడా ఈ విజ్ఞానాన్ని పెక్కుమంది శిష్యులకు ప్రసన్నమైన బుద్ధితో దృఢంగా, తక్కువతనం లేకుండా బోధించాను. దివ్యమును లెందరో దీనిని మన్నించారు.

విశేషం: విద్యకు అధీతి, బోధ, ఆచరణ; ప్రచారణ - అని నాలుగు దశలు. క్రిందటి పద్యంలో నా గురువు కపిలుడు, ఆతని శిష్యులు దీపిత విజ్ఞానులైరి అనేమాటలచేత అధ్యయనం, ఆచరణం అనే దశలు తెలియవచ్చాయి. ఈ పద్యంలో 'నేను చెప్పాను' అన్నదానిచేత బోధ, ప్రచారణ అనే దశలు ప్రసక్తాలయ్యాయి. ఇట్లా సంప్రదాయం తెలుపటానికే ఈ ప్రసంగం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కాని ఆత్మోత్కర్షను చాటుకొనటానికి కాదు. 'గాఢ అనూనంబుగన్' అనటం కూడ ఉపదేశం ఎట్లా ఉండాలో తెలియచేయటాని కని గుర్తించాలి.

వ. గార్గ్య గౌతమ కాత్యాయనాదులు దీనన చేసి దీప్తబోధులయి వీతాతంకులును విజ్వరులును నిర్లేపులును నిర్భరానందులు నైరని చెప్పి వెండియు నిట్లనియె. 237

ప్రతిపదార్థం: గార్గ్య, గౌతమ, కాత్యాయన+ఆదులు= గార్గ్యుడు, గౌతముడు, కాత్యాయనుడు మొదలైనవారు; దీనన్+అ చేసి= ఈ జ్ఞానంచేతనే; దీప్తబోధులు= ప్రకాశించే జ్ఞానం కలవారు; అయి; వీత+అతంకులును= పోయిన అవరోధాలు కలవారు; విజ్వరులును= నశించిన మనస్సంబంధి రోగాలు కలవారు; నిర్లేపులును= తొలగిన ప్రకృతిసంపర్కం కలవారున్నూ; నిర్భర+ ఆనందులును= పరిపూర్ణమైన ఆనందం కలవారున్నూ; ఐరి= అయ్యారు; అని; చెప్పి; వెండియున్= ఇంకా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నారు.

తాత్పర్యం: గార్గ్యుడు, గౌతముడు, కాత్యాయనుడు మొదలైనవారు ఈ జ్ఞానంచేతనే చక్కగా వెలుగొందే జ్ఞానం కలవారై, ఆతంకాలు పోయినవారు, మనస్సులోని శంకలు నశించినవారు, ప్రకృతి సంపర్కం వదలినవారు, నిండైన ఆనందం పొందినవారు అయ్యారు.' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: ఇందులో జ్ఞానలబ్ధి ఫలితాలను సోపానక్రమంలో చెప్పారు. మొదటిదశ గురువువలన వినటం, తరువాత మననం నిదిధ్యాస చేయటం - దీప్తబోధులు అన్నంతవరకు ఈ మూడు మెట్లు ఉన్నట్లు భావించాలి. మధ్యలో అరిష్టాలు వస్తాయని ఇంతకుముందు చెప్పారు. వాటిని తొలగించుకొనటం నాలుగవ మెట్టు. బయటినుండి కలిగేవి కాక, లోపల కలిగే వికారాలే జ్వరాలు, వాటిని తొలగించుకొనటం విజ్వరత్వం - అయిదవమెట్టు, ఆరవమెట్టు సిద్ధి - ప్రకృతితో లేపం లేకుండా ఉండటం - నిర్లేపత్వం. చివరిది ఫలరూపం. అదే నిర్భరానందం. ఇట్లా వారయ్యారని చెప్పటం సాధకుడు ఇట్లా కావాలి - అని చెప్పటానికి ఉపలక్షణం. ఈ విధంగా మహావిద్యయొక్క దశాభేదాలను ఈ వచనం పరమరమణీయంగా తెలుపుతున్నది.

క. సంగము బంధ మఖిల ని । స్సంగత మోక్షంబు బహువిచారము లేలా?
పింగజటాజూట కలిత! గంగాబాలేందు మహిత! గౌరీసహితా!' 238

ప్రతిపదార్థం: పింగ జటాజూట కలిత!= పచ్చని జడల ముడులతో కూడినవాడా!; గంగా బాల+ఇందు మహిత!= గంగానదితో, లేతచందురుడితో విరాజిల్లువాడా!; గౌరీసహితా!= పార్వతి సగభాగంగా గల పరమశివా!; బహువిచారములు= పెక్కు ఆలోచనలు; ఏలా?= ఎందుకు?; సంగము= ప్రకృతితో కలయిక; బంధము= కట్టు; నిస్+సంగత= సంగం లేకుండటం; మోక్షంబు= విడుదల.

తాత్పర్యం: శివా! పెక్కు విచారాలు ఏల? జీవుడు ప్రకృతితో అంటిపెట్టుకొని ఉండటమే బంధం. ఆ విధమైన సంపర్కం లేకుండటమే మోక్షం.'

విశేషం: పద్యంలో శివుడికి చేసిన మూడు సంబోధనలు పైకి పద్యపూరణం కోసంగా కనిపిస్తాయి. కానీ పరిశీలించి చూస్తే తత్త్వస్ఫోరకాలు. శివుడి జటాజూటం 'వ్యోమం' - అనగా ఆకాశం. గంగానది జలదేవత, చంద్రుడు - జ్యోతి స్వరూపం, పార్వతి- భూతత్త్వం. ఈ విధంగా శివుడి విశ్వవ్యాపకత అనే ధర్మాన్ని కవి తెలుపుతున్నాడు. అంతేకాదు ఇరవై ఆరవతత్త్వం అయిన పరమాత్మవు నీవు. లోకానుగ్రహం కొరకు నా చేత ఈ యోగసాంఖ్యమార్గాలను చెప్పించినావు అనే స్ఫూర్తికి ఈ సంబోధనలు సహకరిస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరమాత్మ - జీవుడు - ప్రకృతి. క్రిందివైపు ప్రసరించటం సంగం. అదే బంధం. పైపైపు ప్రసరించటం నిస్సంగత - అదే మోక్షం. ఇది ఈ విద్యకు ఉపసంహారవాక్యం.

క. అని యిట్లు శివునకును న । మ్మని విజ్ఞాపించి గగనమున కెగసి వెసం
జనియె శివుండును నిజది । వ్య నిరర్గళ చిత్తపథ విహారుం డయ్యెన్. 239

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; ఆ+ముని= ఆ సనత్కుమార మహర్షి; శివునకును= పరమేశ్వరుడికి; విజ్ఞాపించి= విన్నవించి; గగనమునకున్= ఆకాశానికి; ఎగసి= ఎగిరి; వెసన్= వేగంగా; చనియెన్= వెళ్ళాడు; శివుండును= శంకరుడు కూడా; నిజ దివ్య నిరర్గళ చిత్త పథ విహారుండు= తనదైన దివ్యము, అడ్డులేనిదీ అయిన మనస్సునకు సంబంధించిన మార్గంలో విహరించేవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: అని ఈ విధంగా ఆ మహర్షి శివుడికి యోగసాంఖ్యాలను విన్నవించి, ఆకాశాని కెగిరి వేగంగా వెళ్ళిపోయాడు. శివుడు కూడా తన దివ్యమూ, అడ్డులేనిదీ అయిన చిత్తపథంలో విహారం కలవా డయ్యాడు.

విశేషం: చిత్తపథం - హృదయపుండరీకం అనేస్థానం అని సంభావించాలి. 'సనత్కుమారుడు ఆకాశాని కెగిరాడు. శివుడు చిత్తపథంలో విహరించాడు' అన్న ఈ మాటలలో వారిద్దరి ఏకత్వాన్ని గుర్తించాలి. ఆకాశం అంటే 'దహరాకాశం' హృదయంలో సదాశివస్థానమైన చోటు. శివుడిదీ అదే. ఈ విధంగా ఇద్దరూ వెళ్ళినచోటు ఒక్కటే. అనగా ఇద్దరూ ఒక్కటే అని తాత్పర్యం.

క. అని చెప్పిన భీష్మున కి । ట్లను ధర్మతనూజుఁ డెక్కుడైన శుచిత్వం
బొనరింపఁ జాలు తీర్థం । బనఘా! యెఱిఁగింపవే దయం దెల్లముగన్. 240

ప్రతిపదార్థం: అని; చెప్పినన్= చెప్పగా; ధర్మతనూజుఁడు= ధర్ముడి కుమారుడైన యుధిష్ఠిరుడు; భీష్మునకున్= భీష్ముడితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు; అనఘా!= పుణ్యాత్మా!; ఎక్కుడు= ఎక్కువ; ఐన శుచిత్వంబు= అయిన పవిత్రతను; ఒనరింపన్ చాలు తీర్థంబు= చేయగల పుణ్యస్థానం ఏదో; దయన్= దయతో; తెల్లముగన్= స్పష్టమయ్యే విధంగా; ఎఱిఁగింపవే!= తెలుపుమా!

తాత్పర్యం: ఈ విధంగా చెప్పిన భీష్ముడితో ధర్మరాజు ఇట్లా అన్నాడు. 'అనఘా! మిక్కిలి ఎక్కువ పవిత్రతను కలిగించ గల తీర్థం ఏదో దయతో స్పష్టంగా తెలుపవూ!'

సీ. అనవుడు నాతఁ దమ్మనుజవల్లభుతోడ । 'వినుము తీర్థము లెల్లవియును మేల;
సత్యాభిధానమై శౌచాతిశయముఁజే । యఁగఁ జాలు మానసంబైన తీర్థ
మది ధృతి యనుమహాహ్రదమున శోభిల్లుఁ । దమము రజస్సును దఱియఁ ద్రోచి
కొనుచు సత్యము నూఁతగొని చొచ్చి యాచరి । తస్నానుఁడై శుచిత్వమున వెలుఁగు

ఆ. నరుఁడు వీతరాగ పరిహృతేంద్రియ దృఢ । వ్రతలసద్వివేకు లతిశయిల్లు
విమలతీర్థములు సవినయత వారలఁ । జెందుటయును దీర్థసిద్ధి యధిప! 241

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనవుడున్= అన్నంతనే; ఆతఁడు= ఆ భీష్ముడు; ఆ+మనుజవల్లభుతోడన్= ఆ రాజుతో; అధిప!= రాజా!; వినుము= ఆలకించుము; తీర్థములు= పవిత్రస్థలములు; ఎల్ల+అవియును= అన్నీ; మేలు+అ= మేలైనవే; మానసంబు= మనస్సునకు సంబంధించినది; ఐన తీర్థము= అయిన తీర్థం; సత్య+అభిధానము= 'సత్యం' అనే పేరుగలది; ఐ= అయి; శౌచ+అతిశయమున్= పవిత్రతయొక్క ఎక్కువతనాన్ని; చేయఁగన్+చాలున్= చేయగలుగుతుంది; అది= ఆ తీర్థం; ధృతి= ధీరత; అను మహాహ్రదమునన్= అనే పెద్దజలాశయంలో; శోభిల్లున్= ప్రకాశిస్తుంది; తమమున్= తమస్సు అనే గుణాన్నీ; రజస్సు= రజస్సు అనే గుణాన్నీ; తఱియన్= దూరమైపోయే విధంగా; త్రోచికొనుచున్= నెట్టివేసికొంటూ; నరుఁడు= మానవుడు; సత్యమున్= సత్యగుణాన్ని, ఊఁత= ఆధారంగా; కొని= గ్రహించి; చొచ్చి= ప్రవేశించి; ఆచరిత స్నానుఁడు= చేయబడిన స్నానం గలవాడు; ఐ= అయి; శుచిత్వమునన్= పరిశుద్ధతతో; వెలుఁగున్= ప్రకాశిస్తాడు; వీత రాగ పరిహృత+ఇంద్రియ దృఢ వ్రత లసత్ వివేకులు= వదలిన విషయప్రీతి, తొలగించబడిన ఇంద్రియాలూ, చెదరని నియమనిష్ఠలూ గల వివేకవంతులు; అతిశయిల్లు విమల తీర్థములు= మిక్కిలిగా వెలుగొందే స్వచ్ఛమైన పవిత్రస్థానాలు; సవినయతన్= వినయంతోపాటు; వారలన్= అట్టివారిని; చెందుటయును= ఆశ్రయించటం కూడా; తీర్థసిద్ధి= తీర్థంవలన కలిగే సిద్ధియే.

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా అడిగినంతనే భీష్ముడతడికి ఇట్లా చెప్పాడు. 'రాజా! తీర్థాలన్నీ మేలైనవే. మానసతీర్థం ఒకటి ఉన్నది. దాని పేరు 'సత్యం'. అది మిక్కిలి పవిత్రతను కలిగిస్తుంది. 'ధృతి' అనే మహా జలాశయంలో అది విరాజిల్లుతూ ఉంటుంది. తమస్సు, రజస్సు అనే రెండు గుణాలను దూరంగా తొలగించుకొంటూ, సత్యాన్ని ఊతకర్రగా తీసికొని దానిలోనికి ప్రవేశించి స్నానం చేసినవాడు పరిశుద్ధతతో ప్రకాశిస్తాడు. రాగద్వేషాలు వదలి, ఇంద్రియాల వికారాలను తొలగించుకొని, ఏమాత్రమూ సడలని వ్రతం పాటిస్తూ వివేకం కలిగిన మహాత్ములు కూడా గొప్ప నిర్మలతీర్థాలే. వారిని వినయపూర్వకంగా ఆశ్రయించటం కూడా తీర్థాలవలనకలిగే సిద్ధిని కలిగిస్తుంది.

విశేషం: మనస్సులో పుట్టే వికారాలు తమస్సు, రజస్సు అనే గుణాల వలన కలుగుతాయి. తమస్సు ఆవరణశక్తి. అనగా దేనినీ చూడనీయదు. రజస్సు విక్షేపశక్తి. ఎక్కడా నిలువనీయదు. ఈ రెండింటినీ దూరంగా తోసివేస్తే తప్ప మనస్సు తీర్థం కాదు. దానికి సముద్రమంత ధైర్యం కావాలి. తీర్థమంటే తరింపచేసేది. నీటిలోనికి దిగేవాడికి లోతు తెలియటం మొదలైన ప్రయోజనాల కొరకు ఒక ఊత - ఆధారదండం ఉండాలి. ఇక్కడ అదే సత్యం, లేదా సత్త్వగుణం. దీనివలన నరుడు లోపలా, వెలుపలా, నిండైన పరిశుద్ధత కలవాడవుతాడు. మరొకరకపు తీర్థాలు కూడా ఉన్నాయి. అవి కదలేవి, ప్రాణవంతమైనవి. వారు 'వివేకులు' - రాగద్వేషాలను తొలగించుకొన్నవారు. ఇంద్రియవికారాలకు లోబడనివారు, చెదరని నియమ నిష్ఠలుకలవారు, సత్యమేదో, అసత్యమేదో విడమరచి చూడగలవారు అయిన మహాపురుషులు ఆ తీర్థాలు. వారలను ఆశ్రయించటంవలన కూడా తీర్థఫలం సిద్ధిస్తుంది. ఇందులో మొదటిది కొంచెం క్లిష్టమైన పద్ధతి. రెండవది కొంచెం సులభపద్ధతి. దయతో వ్యాసభగవానుడు మధ్యమాధికారుల కొరకు ఈ రెండవ తీర్థాన్ని కూడా ఇక్కడ అనుగ్రహిస్తున్నారు. ఇంతకు మునుపు చెప్పిన యోగమూ, సాంఖ్యమూ ఎంతో శక్తిసంపన్నత కలవారికి తప్ప సాధ్యంకానివి. అంత స్థాయికి ఎదగలేనివారి గతి ఏమిటి? అన్న ప్రశ్నకు ఈ పద్యం సమాధానరూపంగా దారి చూపుతుంది. అందుకొరకే దాని కనుబంధంగా ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది.

క. దమమును దపము నహింసయు । శమమును దీర్థముల వాన శౌచాతిశయం
బమలగుణ! కలుగు రిత్తజ । లములం దోఁగిన శుచిత్వలాభము గలదే?' 242

ప్రతిపదార్థం: అమలగుణ!= స్వచ్ఛమైన గుణములు గల ఓ ధర్మరాజా!; దమమును= ఇంద్రియనిగ్రహమూ; తపమున్= తపస్సూ; అహింసయున్= ఇతరులను పీడించకుండటమూ; శమమును= శాంతి (మనస్సు ఉద్వేగపడకుండటమూ);

తీర్థములు+అ= తీర్థములే; వానన్= వాటిచేత; శౌచ+అతిశయంబు= పరిశుద్ధత యొక్క ఎక్కువతనము; కలుగున్= కలుగుతుంది; రిత్తన్= ఊరకయే (వ్యర్థంగా); జలములన్= నీటిలో; తోఁగినన్= మునిగితే; శుచిత్వలాభము= పరిశుద్ధత అనే లాభం; కలదు+ఏ?= ఉంటుందా?

తాత్పర్యం: ధర్మరాజా! ఇంద్రియాలను అదుపుచేసికొనటం, దేహాన్నీ, మనస్సునూ నియమనిష్ఠలద్వారా ఎండగట్టటం, ఇతరప్రాణాలను హింసించకుండటం, మనస్సులో ఉద్వేగం రాకుండా చూచుకొనటం అనేవి కూడా తీర్థాలే. వాటిచేత ఎక్కువ శుద్ధత కలుగుతుంది. ఊరకే నీటిలో మునిగితే పరిశుద్ధత కలుగుతుందా?'

విశేషం: దేహపు పై భాగం శుద్ధం అయినంత మాత్రాన చాలదు. అంతశ్శుద్ధి కావాలి. అది జలాదులతో ఏర్పడదు.

వ. అని వెండియు. 243

తాత్పర్యం: ఇట్లా చెప్పి ఇంకా ఇట్లా అంటున్నాడు.

క. 'దొరకొననివానిఁ గోరక । దొరకొనినందును మమత్వతుష్టహృదయతం
బొరయక విగతస్పృహులగు । పురుషులు శుచు లేల తీర్థములు వారలకున్?' 244

ప్రతిపదార్థం: దొరకొననివానిన్= అందనివానిని; కోరక= అపేక్షింపక; దొరకొనిన+అందును= అందినవాటియందును; మమత్వతుష్ట హృదయతన్= నాది అనే భావమూ, ఆనందపు పొంగు కలిగిన హృదయం కలవాడు కావటాన్ని; పొరయక= పొందక; విగత స్పృహులు= నశించిన వాంఛకలవారు; అగు పురుషులు= అయిన నరులు; శుచులు= పరిశుద్ధులు; వారలకున్= అట్టివారికి; తీర్థములు= తరింపచేసే పుణ్యజలాలు; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: 'దొరకని వాటిని కోరక, దొరికిన వాటియందు మమకారము, తుష్టి అనే లక్షణాలను పొందక, ఆశను విడనాడి బ్రదికే నరులు పవిత్రులు. వారికి వేరైన తీర్థాలెందుకు?'

విశేషం: మమత్వం - అనగా నాది అనే భావన. తుష్టి - అనగా పొంగిపోవటం - ఈ రెండింటినీ వదలాలి. ఎందుకనగా మమత్వ మేర్పడితే - రక్షణయందు, నాశమునందు దుఃఖం కలుగుతుంది. వస్తుగతతుష్టి వస్తునాశంతో దుఃఖంగా మారుతుంది.

క. అనినఁ బ్రియమంది తాతకు । మనుమఁడు ప్రణమిల్లి 'బోధమహితా! యేవ
ర్తనమున నుత్తమపదముం । గను నం; ద్రది యెఱుఁగఁ జెప్పు కరుణ దలిర్పన్. 245

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ప్రియము+అంది= తృప్తిపడి; మనుమఁడు= మనుమడైన ధర్మరాజు; తాతకున్= తాతకు; ప్రణమిల్లి= దండ నమస్కారం చేసి; బోధమహితా!= జ్ఞానంచేత గొప్పవాడా!; ఏ వర్తనమునన్= ఎట్టి నడవడితో; ఉత్తమపదమున్= మేలైన స్థానాన్ని (మనుష్యుడు); కనున్= పొందుతాడు; అంద్రు= అంటారో; అది= దానిని; కరుణ= దయ; తలిర్పన్= చిగురించగా; ఎఱుఁగన్= తెలిసేటట్లుగా; చెప్పు= బోధించుము.

తాత్పర్యం: అనగా సంతృప్తి చెంది మనుమడు ప్రణామం చేసి, తాతతో ఇట్లా అన్నాడు. 'జ్ఞానమహితా! ఎట్టి ప్రవర్తనతో మనుష్యుడు ఉత్తమపదం చేరుకొంటా డంటారో దానిని నాకు దయ చిగురించగా బోధించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ప్రణమిల్లి - ఇది ప్రాతకాలపు కృతజ్ఞతాభివ్యక్తి ధోరణి. అంతేకాదు 'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా' అని గీత. ప్రణిపాతం అంటే కాళ్ళకు మ్రొక్కటం.

వ. మృతుండు మేను విడిచి యెయ్యది సహాయంబుగాఁ జను నదియును వినవలతు' నని యడిగిన నమ్మహానుభావుం డా భూవల్లభున కిట్లనియె. 246

ప్రతిపదార్థం: మృతుండు= మరణించినవాడు; మేను= దేహాన్ని; విడిచి= వదలివైచి; ఏ+అది= ఏది; సహాయంబుగాన్= ఊతగా; చనున్= వెళ్తాడో; అదియునున్= దానిని కూడా; వినవలతున్= వినగోరుతున్నాను; అని; అడిగినన్= అడిగితే; ఆ+మహానుభావుండు= గొప్ప సమర్థతగల ఆ భీష్ముడు; ఆ భూవల్లభునకున్= ఆ రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: మరణించినవాడు దేహాన్ని వదలి ఏ తోడుగా వెళ్ళుతాడు? ఆ విషయం కూడా వినగోరుతున్నాను.' అని అడుగగా ఆ మహానుభావుడు ఆ రాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇది చాలా క్లిష్టమైన ప్రశ్న - ఎందుకనగా బ్రతికి ఉన్నవాడికి మరణం తరువాత ఏమి అవుతుందో తెలియదు. మరణించిన తరువాత జీవుడి అనుభవం ఎటువంటిదో చెప్పటానికి అవకాశం లేదు. కనుక భీష్ముడు దీనికి సూటిగా సమాధానం చెప్పటం లేదు.

క. 'నీ యడిగిన గూఢములగు । నీ యర్థము లెఱుఁగఁ జెప్ప నింద్రగురుఁడు గా
కేయెడల నొరుఁడు గలఁడే. యాయన యిట వచ్చు నిపుడ యడుగుము ప్రీతిన్.' 247

ప్రతిపదార్థం: నీ+అడిగిన గూఢములు+అగు+అర్థములు=నీవడిగిన మిక్కిలి రహస్యములైన ఈ విషయాలు; ఎఱుఁగన్= తెలిసే విధంగా; చెప్పన్= చెప్పటానికి; ఇంద్రగురుఁడు= దేవేంద్రుడి గురువైన బృహస్పతి; కాక= తప్ప; ఏ+ఎడలన్= ఏ తావులోనైనా; ఒరుఁడు= ఇతరుడు; కలఁడు+ఏ?= ఉంటాడా?; ఆయన= ఆ బృహస్పతి; ఇటన్= ఇక్కడకు; ఇపుడు+అ= ఇప్పుడే; వచ్చున్= వస్తాడు; ప్రీతిన్= ప్రీతితో; అడుగుము= అడుగు.

తాత్పర్యం: 'నీవడిగిన అర్థం చాలా గూఢమైనది. దీనిని తెలియచెప్పగలవాడు బృహస్పతి తప్ప మరొక డున్నాడా? ఆయన ఇప్పుడే ఇక్కడకు వస్తాడు. ప్రీతితో అడుగుము.'

విశేషం: ఇంద్రగురుడు - బృహస్పతి అనగా అతడికి తెలియని అర్థాలు లేవని భావం. సంకల్పమాత్రం చేత భీష్ముడు బృహస్పతితో సన్నిహితత్వం కల్పించుకొన్నాడు. అనగా జ్ఞానసంపన్నులకు బృహస్పతి మొదలైనవారు నిత్యసన్నిహితంగా ఉంటారని భావం. 'బుద్ధిలో బృహస్పతి' అని నానుడి. కనుక అతడు ఎంత నిగూఢమైన విషయమైనా చెప్పగలుగుతాడు.

క. అను సమయంబున నయ్యెడ । ననిమిష గురుఁ డరుగుదెంచె నతనికిఁ గుంతీ
తనయాగ్రజుండుఁ దమ్ములు । జనపతులును గేశవుండు సద్భక్తిమెయిన్. 248

ప్రతిపదార్థం: అను సమయంబునన్= అంటున్నవేళలో; ఆ+ఎడకున్= ఆ చోటికి; అనిమిషగురుఁడు= దేవతల గురువైన బృహస్పతి; అరుగుదెంచెన్= విచ్చేశాడు. అతనికిన్= అతడికి; కుంతీతనయ+అగ్రజుండున్= కుంతికొడుకులలో పెద్దవాడైన ధర్మరాజూ; తమ్ములున్= తమ్ము లయిన భీమాదులు; కేశవుండున్= శ్రీకృష్ణుడూ; సత్+భక్తిమెయిన్= మంచిభక్తితో.

తాత్పర్యం: అనే సమయంలో అక్కడకు బృహస్పతి విచ్చేశాడు. అతడికి ధర్మరాజు తమ్ములు, రాజులు, కృష్ణుడూ సద్భక్తితో (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఎదుర్కొని ప్రణామపూర్వకంబుగా సముచితోపచారంబులం బ్రీతాత్మునిం జేసి యాసీనుండై యున్నెడం గురుపతి యగ్గురునిం గురుపితామహు నడిగినయట్ల యడిగిన నతం డతని కిట్లనియె. 249

ప్రతిపదార్థం: ఎదుర్కొని= ఎదురేగి; ప్రణామ పూర్వకంబుగాన్= నమస్కారం మొదటి ఉపచారంగా; సముచిత+ఉపచారంబులన్= చక్కగా తగిన సేవలతో; ప్రీత+ఆత్మున్= ప్రీతి పొందిన హృదయం కలవాడినిగా; చేసి; ఆసీనుండు= కూర్చున్నవాడు; ఐ= అయి; ఉన్న+ఎడన్= ఉన్నసమయంలో; కురుపతి= ధర్మరాజు; ఆ+గురునిన్= దేవగురువైన ఆ బృహస్పతిని; కురు పితామహున్= కౌరవులకు తాత అయిన భీష్ముడిని; అడిగిన+అట్లు+అ= అడిగినట్లే; అడిగినన్= అడుగగా; అతండు= ఆ బృహస్పతి; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఎదురేగి నమస్కరించి తగిన అర్ఘ్యపాద్యాదు లర్పించటం అనే సేవలు చేసి తృప్తిపరచి అతడు కూర్చున్న తరువాత ధర్మరాజు ఆ దేవగురువును తన తాత నడిగినట్లే అడుగగా అత డతడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'తనకుఁ దాన కలఁడు జననంబు నప్పుడు । మరణమునను సుగతి నరకములను
దల్లి దండ్రి దక్కు నెల్లబంధులు శరీ । రంబు ననుగమించి క్రమ్మఱుదురు. 250

ప్రతిపదార్థం: జననంబు+అప్పుడు= పుట్టుక సమయంలో; మరణమునను= చావునందూ; సుగతి నరకములను= పుణ్యగతి, నరకం అనేవాటియందూ; తనకున్= తనకు (జీవుడికి)÷; తాను+అ= తానే; కలఁడు= ఉన్నాడు; తల్లి= అమ్మ; తండ్రి= నాయన; తక్కన్; ఎల్లబంధులు= మిగిలిన చుట్టాలందరు; శరీరంబున్= శరీరాన్ని; అనుగమించి= వెంటనంటి వెళ్ళి; క్రమ్మఱుదురు= మరలి వస్తారు.

తాత్పర్యం: 'పుట్టినప్పుడు, గిట్టినప్పుడు పుణ్యపాపాల ఫలాల భూము లయిన స్వర్గం, నరకం అనే వాటియందు తనకు తానే ఉంటాడు. తల్లి, తండ్రి, మిగిలిన బంధువులు శరీరాన్ని వెంటనంటి తిరిగి వెళ్ళిపోతారు.

విశేషం: శరీరం అనగా ఇక్కడ ప్రాణం లేని కళేబరం. దానిని కాల్చటమో, పూడ్చటమో చేసిన తరువాత వారు వెంటనంటి పోయేది ఏమీ ఉండదు. కనుక బంధువులు వెనుకకు తిరిగి వెళ్ళిపోతారు.

క. ఉత్తమపథంబు ధర్మా । యత్తము, ధర్మంబు మృతుల కధిప! సహాయం
బెత్తెఱఁగున ధర్మక్రియఁ । జిత్తంబునఁ జేర్పవలయు జీవించుతఱిన్. 251

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఉత్తమపథంబు= మేలైన త్రోవ; ధర్మ+ఆయత్తము= ధర్మానికి వశమైనది; మృతులకున్= మరణించిన వారికి; ధర్మంబు= ధర్మము; సహాయంబు= తోడు; ఏ+తెఱఁగునన్= ఏ విధంగానైనా; జీవించు తఱిన్= బ్రతికి ఉన్నప్పుడే; ధర్మక్రియన్= ధర్మమనే క్రియను; చిత్తంబునన్= హృదయంలో; చేర్పవలయున్= చేర్చాలి.

తాత్పర్యం: రాజా! మేలుత్రోవ ధర్మంమీద ఆధారపడి ఉంటుంది. చచ్చినవారికి ధర్మమే తోడుగా వస్తుంది. కనుక బ్రతికి ఉన్నప్పుడే ధర్మకార్యాలను హృదయంలో పదిలపరచుకొనాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: జీవించుతఱిన్= చనిపోయి సాధించేదేమీ లేదు. ధర్మక్రియను చిత్తంలో చేర్చటమంటే సంకల్పరూపంలో ఉంచుకొనాలి. తదనుగుణంగా ఆచరించాలి - అని భావం.

క. అది లేనివాఁడు నరకా । స్పదుఁ డగు నటుగాన ధర్మపరుఁ డగుటయ యొ
ప్పిదము మనుజునకు నేఁ జె । ప్పెద మఱియును వలయువానిఁ బ్రీతి నడుగుమీ'. 252

ప్రతిపదార్థం: అది= ఆ ధర్మం; లేనివాఁడు= లేని వ్యక్తి; నరక+ఆస్పదుఁడు= నరకమనే తావు కలవాడు; అగున్= అవుతాడు; అటు= ఆ విధం; కాన= కనుక; మనుజునకున్= మనిషికి; ధర్మపరుఁడు= ధర్మమునందు మిక్కిలి శ్రద్ధ కలవాడు; అగుట+అ= కావటం; ఒప్పిదము= తగినది; మఱియున్= ఇంకా; వలయువానిన్= కావలసిన వాటిని; ప్రీతిన్= ప్రీతితో; అడుగుమీ= అడుగుము; నేన్= నేను; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: ధర్మం లేనివాడు నరకానికి పోతాడు. కనుక ధర్మపరుడు కావటమే మనిషికి మంచిది. ఇంకా నీకు కావలసిన వాటిని ప్రీతితో నడుగుము. నేను చెప్పుతాను'.

వ. అనిన నజ్జనపతి 'శరీరంబు విడిచి చనియెడు జీవుని ధర్మం బె ట్లనుగమించు?' ననుటయు నయ్యాం గిరసుండు. 253

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+జనపతి= ఆ రాజు; శరీరంబు= దేహం; విడిచి= వదలి; చనియెడు జీవునిన్= వెళ్ళే జీవుడిని; ధర్మంబు= ధర్మం; ఎట్లు= ఏ విధంగా; అనుగమించున్?= వెంటనంటి పోతుంది? అనుటయున్= అనగా;; ఆ+అంగిరసుండు= ఆ బృహస్పతి.

తాత్పర్యం: అని చెప్పిన తరువాత ఆ ధర్మరాజు 'దేహం విడిచి వెళ్ళే జీవుడిని ధర్మం ఎట్లా అంటి వెళ్తుంది? అని అడిగాడు. అప్పుడు ఆ బృహస్పతి ఇట్లా చెప్పాడు.

తే. 'భూత పంచక శక్తులు బుద్ధియును స । ధర్మకంబుగ జీవుతోఁ దగిలి యరుగు'
ననుడు 'రేతఃప్రకార మె?' ట్లనియె నృపతి; । యతని కిట్లని చెప్పె నయ్యమరమంత్రి. 254

ప్రతిపదార్థం: భూతపంచక శక్తులు= భూతాల అయిదింటి శక్తులు; బుద్ధియును= బుద్ధీ; సధర్మకంబుగన్= ధర్మంతోపాటుగా; జీవుతోన్= జీవుడితో; తగిలి= వెంటబడి; అరుగున్= పోతాయి; అనుడున్= అన్నంతనే; నృపతి= రాజు; రేతస్+ప్రకారము= వీర్యం యొక్క పద్ధతి; ఎట్లు= ఏ విధము?; అనియెన్= అన్నాడు; ఆ+అమరమంత్రి= దేవతల మంత్రి అయిన ఆ బృహస్పతి; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు+అని= ఈ విధంగా; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'అయిదు భూతాల శక్తులు అయిన శబ్దస్పర్శ రూపరస గంధాలు, బుద్ధి, ధర్మం అనేవి కలిసి జీవుడిని అనుసరించి వెళ్తాయి' అనగా ధర్మరాజు రేతస్సు పద్ధతి ఏమిటి?' అని అడిగాడు. అప్పుడు బృహస్పతి అతడి కిట్లా చెప్పాడు.

తే. దేహగత భూప్రభృతి పంచదేవతలును । మనసు నన్నసంతృప్తిఁ బొందిన నృపాల!
కల్గు రేతస్సు పురుషుండుఁ గామినియును । బొందఁగా నది గర్భత్వ మొందుఁ జువ్వె. 255

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నృపాల!= రాజా!; దేహగత భూ ప్రభృతి, పంచ దేవతలును= దేహంలో ఉన్న భూమి మొదలైన అయిదు దేవతలు; మనసున్= మనస్సూ; అన్న సంతృప్తిన్= అన్నంతో మిక్కిలి సంతృప్తిని; పొందినన్= పొందితే; రేతస్సు= 'వీర్యం' అనే పదార్థం; కల్గున్= ఏర్పడుతుంది; పురుషుండున్= మగవాడూ; కామినియును= స్త్రీయు; పొందఁగాన్= కలియగా; అది= ఆ రేతస్సు; గర్భత్వము= పిండం కావటం; ఒందున్= పొందుతుంది; చువ్వె= సుమా!

తాత్పర్యం: దేహంలో ఉన్న భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే అయిదు భూతాలూ, మనస్సు అనేవి అన్నంతో - నిండైన తృప్తిని పొందితే 'రేతస్సు' అనే పదార్థం కలుగుతున్నది. స్త్రీపురుషుల కలయికవలన అది గర్భంగా ఏర్పడుతుంది.

విశేషం: స్త్రీ అయినంత మాత్రాన గర్భం ఏర్పడదనీ ఆమె కామభావం కలిగి గర్భం ధరించే సామర్థ్యం కలిగినదై ఉండాలి అనే సూచన 'కామిని' అనే శబ్దంలో ఉన్నది. దీనిని బట్టి పురుషుడు కూడా 'కాముకుడు' అయి ఉండాలనే అర్థం సిద్ధిస్తున్నది.

వ. అని చెప్పి మఱియును. 256

ప్రతిపదార్థం: అని చెప్పి; మఱియును= ఇంకా.

తాత్పర్యం: ఇట్లా చెప్పి బృహస్పతి ఇంకా ఇట్లా అంటున్నాడు

తే. 'పుణ్యపాపానుగుణభంగిఁ బుట్టి సౌఖ్య । దుఃఖమయ సంసరణమునఁ దొడరు నరుఁడు
వినుము కేవల ధర్మవర్తనసుఖైక । భాజనత నొందు ధర్మైకపరత మేలు. 257

ప్రతిపదార్థం: నరుఁడు= జనుడు; పుణ్యాపాప+అనుగుణభంగిన్= పుణ్యమునకు, పాపమునకు తగిన విధంగా; పుట్టి= జనించి; సౌఖ్య, దుఃఖమయ సంసరణమునన్= సుఖంతో, దుఃఖంతో నిండిన సంసారంలో; తొడరున్= ప్రవేశిస్తాడు; వినుము; కేవల ధర్మవర్తనన్= అధర్మపు వాసనకూడా లేని ధర్మపు నడవడితో; సుఖ+ఏక, భాజనతన్= సుఖానికి మాత్రమే పాత్ర మవటాన్ని; ఒందున్= పొందుతాడు; ధర్మ+ఏక పరత= ధర్మమునందు మాత్రమే శ్రద్ధ కలిగి ఉండటం; మేలు= మంచిది.

తాత్పర్యం: 'నరుడు పుణ్యానికి తగిన విధంగా సుఖమయ సంసారంలో ప్రవేశిస్తాడు. పాపాల కనుగుణంగా దుఃఖమయసంసారంలో ప్రవేశిస్తాడు. అట్లాకాక ధర్మప్రవర్తన మాత్రమే అవలంబిస్తే సుఖానికి మాత్రమే పాత్రమవుతాడు. కనుక ధర్మమునందు మాత్రమే శ్రద్ధ కలిగి ఉండటం మేలైన పని.

విశేషం: సృష్టిలో మానవప్రవృత్తిలో ఒక విచిత్రమైన స్థితి ఉంటుంది. పుణ్యఫలం కోరుకొంటాడు. పుణ్యం చేయటానికి ఇష్టపడడు. పాపఫలం వద్దంటాడు. పాపాలు మాత్రం చేస్తూ ఉంటాడు. అయితే ఇష్టానిష్టాలతో సంబంధం లేకుండా కర్మల కనుగుణంగా సుఖదుఃఖమయ సంసారం పొందక తప్పదు. సుఖదుఃఖాలు రెండూ అనిత్యాలే. నిత్యసుఖంకోసం ధర్మం మాత్రమే ఉన్న ప్రవృత్తిని పొందా లంటున్నారు శ్రీవ్యాసులు.

క. జనవర! కృమిగర్దభముఖ । జననంబులఁ బొంది నరకసంవాసముఁ జెం
దు నధికపాపాత్ముండగు । మనుజుఁడు కర్మ సవిశేషమహిమఁ దెలిపెదన్. 258

ప్రతిపదార్థం: జనవర!= రాజా! అధిక పాప+ఆత్ముండు= ఎక్కువ పాపాలలో నిండినవాడు; అగు మనుజుఁడు= అయిన నరుడు; కృమి, గర్ధభ, ముఖ, జననంబులన్= పురుగు, గాడిద మొదలైన పుట్టుకలను; పొంది; నరక సంవాసమున్= నరకంలో

నివసించటాన్ని; చెందును= చెందుతాడు; కర్మ సవిశేష మహిమన్= ఆయాకర్మల విశేషంతో కూడిన ఎక్కువతనాన్ని; తెలిపెదన్= తెలుపుతాను.

తాత్పర్యం: రాజా! ఎక్కువ పాపం హృదయంలో నిండినవాడు పురుగు, గాడిద మొదలైన పుట్టుకలతో నరకంలో నివాసం చేస్తాడు. కర్మల విశేషమహిమను తెలుపుతాను. వినుము.

క. జననీజనక గురులయెడ । నొనరించిన మేలుఁ గీడు నొదవించు సుఖం
బునకును దుఃఖమునకు నిం । తని కొలఁది యిడన్ వశంబె యజునకు నైనన్? 259

ప్రతిపదార్థం: జననీ జనక గురుల యెడన్= తల్లి, తండ్రి, గురువు - వీరి విషయంలో; ఒనరించిన మేలున్= చేసిన మంచిపనీ; కీడున్= అపచారమూ; ఒదవించు సుఖంబునకున్= కలిగించే సుఖానికీ; దుఃఖమునకున్= దుఃఖానికీ; కొలఁది= ప్రమాణము; ఇంత= ఈ మాత్రము; అని; ఇడన్= పెట్టటం; అజునకున్= బ్రహ్మకు; ఐనన్= అయినా; వశంబు+ఎ?= సాధ్యమా?

తాత్పర్యం: తల్లిదండ్రుల విషయంలో గురువు విషయంలో చేసిన మేలు కూర్చే సుఖానికీ, కీడు కూర్చే దుఃఖానికి కొలత ఇంత అని చెప్పటం బ్రహ్మకైనా సాధ్యమా?

క. మాతృపితృగురులు దక్కఁగ । నే తెరువునఁ బాప మొలసె నేనియు దానిం
బాతురు ప్రాయశ్చిత్త । స్ఫీతులు దద్విషయమైనఁ జెడ దల్పములన్. 260

ప్రతిపదార్థం: మాతృపితృ గురులు= తల్లీ, తండ్రీ, గురువూ; తక్కఁగన్= కాక; ఏ తెరువునన్= ఏ దారిలోనైనా; పాపము= పాపం; ఒలసెన్ ఏనియున్= కలిగినట్లయితే; దానిన్= దానిని; ప్రాయశ్చిత్త స్ఫీతులు= ప్రాయశ్చిత్తం చేత పుష్టి పొందినవారు; పాతురు= తొలగించుకొంటారు; తద్+విషయము= తల్లి, తండ్రి, గురువు అనేవారి సంబంధం కలది; ఐనన్= అయితే; అల్పములన్= తక్కువవాటిచేత; చెడదు= నశింపదు.

తాత్పర్యం: తల్లి, తండ్రి, గురువు అనేవారుకాక తక్కిన ఏ విషయంలోనైనా పాపం కలిగితే తగిన విధమైన ప్రాయశ్చిత్తం చేసికొని పోగొట్టుకొంటారు. వారి విషయంలో మాత్రం పాపం సులభంగా పోదు.

విశేషం: ప్రాయశ్చిత్తం - తెలియక చేసిన తప్పును పరిహరించుకొనే వ్రతమూ, దానమూ మొదలైనవి.

క. కొలు చపహరించు నన్నరుఁ । డెలుకయుఁ బందియును నైన యీ దుర్జననం
బులఁ బొందు నంతఁ బాపము । వొలియక యాతనికిఁ గుక్కపుట్టువుఁ గల్గున్. 261

ప్రతిపదార్థం: కొలుచు= ధాన్యము; అపహరించు+ఆ+నరుఁడు= దొంగిలించే ఆ మనిషి; ఎలుకయున్= ఎలుకా; పందియునున్= పందీ; ఐన ఈ దుర్జననంబులన్= అయిన ఈ పాడు పుట్టుకలను; పొందున్= పొందుతాడు; అంతన్= దానితో; పాపము= పాపం; పొలియక= నశించక; అతనికిన్= వాడికి; కుక్కపుట్టువున్= కుక్కపుట్టుకకూడా; కల్గున్= కలుగుతుంది.

తాత్పర్యం: ధాన్యం దొంగిలించిన మనిషి ఎలుక, పంది మొదలైన పుట్టుకలు పొందుతాడు. దానితో పాపం పోక, అతడికి కుక్క పుట్టుక కలుగుతుంది.

క. **పరదారగమన దోషము । వరుసన వృకకంక గృధ్ర వలిముఖ శవభు**
క్తిరతంబులైన భవములఁ । బొరయించుం గృమియుఁగాఁగఁ బుట్టించుఁ దుదిన్. **262**

ప్రతిపదార్థం: పరదార గమన దోషము= ఇతరుల ధర్మపత్నులను పొందటం అనే పాపం; వరుసన్+అ= క్రమంగా; వృక= తోడేలు; కంక= రాబందులు; గ్రద్ధ= గ్రద్దలు; వలిముఖ= కోతుల; శవభుక్తి= శవాలను తినటంలో; రతములు= ప్రీతి కలవి; ఐన భవములన్= అయిన పుట్టుకలను; పొరయించున్= కలిగిస్తుంది; తుదిన్= కడకు; కృమియున్= బురదలో తిరుగు పురుగు; కాఁగన్= అయ్యేటట్లుగా; పుట్టించున్= పుట్టిస్తుంది.

తాత్పర్యం: పరులభార్యలను పొందటం అనే పాపం తోడేలు, రాబందు, గ్రద్ద, కోతి, శవాల తిండి యందు ప్రీతిగల జంతువు పుట్టుకలను కలిగిస్తుంది. చివరకు పురుగు పుట్టుక కూడా పొందిస్తుంది.

సీ. **తనయ నొక్కని కిచ్చి మనసు మరలఁబడి । యన్యున కిచ్చిన యట్టివాఁడు**
కృమియగు; దేవకార్యము సేసి మఱి పైతృ । కంబు సేయక భోజనంబు సేయు
నతఁడు కాకం బగు; నన్నఁ దిట్టినఁ గ్రౌంచ । మై పుట్టు; బ్రహ్మకులాభిజాతఁ
గవసి శూద్రుఁడు నరకపుగుంట పుర్వగు । నంతకు కింకరు లంటఁ బట్టి

తే. **కట్టికొనిపోయి కోసియుఁ గాల్చియును గృ తఘ్ను నుగ్రకంటక సముదయము మీఁదఁ**
క్రంద నదిమియు మఱియు దుఃఖములఁ బెట్టు । తెఱఁగు లెన్ని యన్నింటను బఱతు రధిప! **263**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; తనయన్= కూతురిని; ఒక్కనికిన్= ఒకవ్యక్తికి; ఇచ్చి= దానం చేసి (కన్యాదానం చేసి); మనసు= మనస్సు; మరలఁబడి= తిరుగబడి; అన్యునకున్= మరియొకనికి; ఇచ్చిన+అట్టివాఁడు= ఇచ్చిన వ్యక్తి; కృమి= పురుగు; అగున్= అవుతాడు; దేవకార్యము= దేవతల ఆరాధనము; చేసి= ఆచరించి; మఱి= అటుపైన; పైతృకంబు= పితృకార్యం; చేయక= కావించక; భోజనంబు+చేయు+అతఁడు= భోజనం చేసేవాడు; కాకంబు= కాకి; అగున్= అవుతాడు; అన్నన్= అన్నను; తిట్టినన్= నిందిస్తే; క్రౌంచము= క్రౌంచమనే పక్షి; ఐ= అయి; పుట్టున్= జన్మిస్తాడు; బ్రహ్మ కుల+అభిజాతన్= బ్రాహ్మణకులంలో చక్కగా పుట్టిన స్త్రీని; కవసి= కూడి; శూద్రుఁడు= నాల్గవ కులంవాడు; నరకము+గుంటపుర్వు= నరకం అనే గుంటలోని క్రిమి; అగున్= అవుతాడు; కృతఘ్నున్= చేసిన మేలును మరచేవాడిని; అంతకు కింకరులు= యముడి భటులు; అంటన్ పట్టి= గట్టిగా పట్టుకొని; కట్టికొనిపోయి= కట్టివైచి తీసికొనిపోయి; కోసియున్= ముక్కలుగా చేసి; కాల్చియును= మంటలలో మాడ్చివైచి; ఉగ్ర కంటక సముదయముమీఁదన్= భయంకరమైన ముండ్ల మొత్తాల మీద; క్రందన్= కందిపోయే విధంగా; అదిమియున్= నొక్కిపెట్టి; మఱియున్= ఇంకా; దుఃఖములన్= కష్టాలను; పెట్టు; తెఱఁగులు= పెట్టే పద్ధతులు; ఎన్ని= ఎన్నికలవో; అన్నింటను= అన్నింటిచేతను; పఱతురు= బాధిస్తారు.

తాత్పర్యం: రాజా! ముందు ఒకడికి బిడ్డను కన్యాదానం చేసి, మనస్సు త్రిప్పుకొని మరొకడికి ఇచ్చేవాడు పురుగు అవుతాడు. దేవతారాధన చేసి పితృకార్యం చేయకుండా భోజనం చేసేవాడు కాకిగా పుట్టుతాడు. అన్నను నిందిస్తే క్రౌంచపక్షి అవుతాడు. బ్రాహ్మణస్త్రీని పొందిన శూద్రుడు నరకమనే గుంటలో పురు గవుతాడు. కృతఘ్నుడిని యమకింకరులు గట్టిగా పట్టి కట్టి కోసి కాల్చి, ఘోరమైన ముండ్లకంపలమీద వేసి నొక్కి ఇంకా బాధలు పెట్టే తీరు లెన్నో అన్నింటిచేతా పీడిస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ధనవాంఛ నిరాయుధుఁ జం। పిన గాడిద మొదలు గాఁగఁ బెక్కులు తిర్య
గ్జననంబులఁ బొందును శ। స్త్ర నిహతిఁ దోడ్తోడ మరణదశ వాటిల్లున్. 264

ప్రతిపదార్థం: ధనవాంఛన్= ధనంమీద కోరికతో; నిరాయుధున్= ఆయుధం లేనివాడిని; చంపినన్= చంపితే; గాడిద మొదలు కాఁగన్= గాడిద మొదలైన; పెక్కులు= ఎక్కువ సంఖ్యగల; తిర్యక్+జననంబులన్= పశువులు, పక్షులు మొదలైన పుట్టుకలను; పొందును= పొందుతాడు; శస్త్రనిహతిన్= ఆయుధాల దెబ్బచేత; తోడు+తోడన్= మీదమీద; మరణదశ= చావు; పాటిల్లున్= కలుగుతుంది.

తాత్పర్యం: ధనం మీద ఆశతో ఆయుధం లేనివాడిని చంపితే గాడిద మొదలయిన నీచజంతువుల, పక్షుల పుట్టుకలు ఎన్నో వస్తాయి. మాటిమాటికి ఆయుధపు దెబ్బతో చావు కలుగుతూ ఉంటుంది.

ఆ. ఆఁడుదానిఁ జంపినతఁ డేక వింశతి। దూష్య నరకవాసదుఃఖ మొందు
నన్నదధిపయోఘృతాపూపహరణముల్। మక్షికాదికీటమయత సేర్చు. 265

ప్రతిపదార్థం: ఆఁడుదానిన్= అబలను; చంపిన+అతఁడు= చంపినవాడు; ఏకవింశతి దూష్య నరక వాస దుఃఖము= ఇరవైయొక్క సంఖ్య గల నీచమైన నరకాలలో ఉండటం అనే దుఃఖాన్ని; ఒందున్= పొందుతాడు; అన్న= అన్నము; దధి= పెరుగు; పయస్= పాలు; ఘృత= నేయి; అపూప= భక్ష్యాలు అనేవాటి; హరణముల్= దొంగిలింతలు; మక్షికా+ఆది కీటమయతన్= ఈఁగ మొదలైన నీచపు పురుగులయ్యే దశలోనికి; చేర్చున్= చేరుస్తాయి.

తాత్పర్యం: స్త్రీని చంపితే ఇరవై ఒక్క విధాల నరకాలలో ఉండే దుఃఖం కలుగుతుంది. అన్నము, పెరుగు, పాలు, నెయ్యి, తినుబండారాలు అనే వాటి దొంగతనాలు ఈఁగ మొదలైన పురుగుల పుట్టుకలలో చేరుస్తాయి.

విశేషం: ఏకవింశతి నరకాలు - తామిస్రము, లోహశంకువు, మహానిరయము, శాల్మలి, రౌరవము, కుంభలము, పూతిమృత్తికము, కాలసూత్రము, సంఘాతము, లోహితోదము, సవిషము, సంప్రపాతనము, మహానరకము, కాకోలము, సంజీవనము, మహాపథము, అవీచి, అంధతామిస్రము, కుంభీపాకము, అసిపత్రవనము, తాపనము.

ఆ. ఫలము నినుము వెండిఁ బసిఁడి మ్రుచ్చిలికొన్నఁ। గ్రోఁతి వాయసంబు గ్రువ్వ నీచ
కృమియు నగు సదంబరము హరించిన శశ। జనన మొందు నరుఁడు మనుజనాథ! 266

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; నరుఁడు= మానవుడు; ఫలమున్= పండును; ఇనుమున్= ఇనుమును; వెండిన్= వెండిని; పసిఁడిన్= బంగారాన్ని; మ్రుచ్చిలికొన్నన్= దొంగిలిస్తే; క్రోఁతి= కోతి; వాయసంబు= కాకి; గ్రువ్వ= పావురము; నీచ కృమియున్= తక్కువజాతి పురుగూ; అగున్= అవుతాడు; సత్+అంబరమున్= మంచి వస్త్రమును; హరించినన్= ఎత్తుకొనిపోతే; శశజననము= కుందేటి పుట్టువును; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: రాజా! నరుడు పండు, ఇనుము, వెండి, బంగారం అనే వాటిని దొంగిలిస్తే వరుసగా కోతి, కాకి, గువ్వ, పురుగు అనే జన్మలు పొందుతాడు. ఇతరుల బట్టలను అపహరిస్తే కుందేలుగా పుట్టుతాడు.

విశేషం: 'సదంబరము' - చినిగిన పాతలు బయట పారవేస్తే అవసరానికి వాటిని వాడుకొనటం తప్పుకాదని భావం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. నమ్మి యిల్లడవెట్టిన సొమ్ముఁ గొనిన । మీను లోనగు నీచపు యోనులందుఁ

బుట్టు; గంధవస్తువులు గొన్నట్టివాఁడు । వినుము మఱు పుట్టువునఁ జుంచుతనము నొందు. 267

ప్రతిపదార్థం: నమ్మి= విశ్వాసం ఉంచి; ఇల్లడ+పెట్టిన సొమ్మున్= తనవద్ద దాచి ఉంచిన సొమ్మును; కొనినన్= తనది చేసికొంటే; మీను= చేప; లోనగు+నీచము+యోనులందున్= మొదలైన నీచపు కడుపులలో; పుట్టున్= పుట్టుతాడు; వినుము; గంధవస్తువులు= సుగంధ ద్రవ్యాలను; కొన్న+అట్టివాఁడు= దొంగిలించేవాడు; మఱుపుట్టువునన్= మరుసటి జన్మలో; చుంచుతనము= చుంచు కావటాన్ని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: తనయందు నమ్మకం ఉంచి ఇతరులు దాచుకొన్న సొమ్మును అపహరిస్తే చేప మొదలైన నీచజన్మలు కలుగుతాయి. పరిమళద్రవ్యాలను దొంగిలిస్తే కంపెలుక అవుతాడు.

తే. వనిత లీపాపములు సేసి వానివాని । పత్నులై జనియింతురు; పాపభీతిఁ

దెరువు తప్పక నడచిన నరులు సౌఖ్య । మందుదురు రెండు లోకంబు లందు నధిప!' 268

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వనితలు= స్త్రీలు; ఈ పాపములు= పైన చెప్పిన పాపాలను; చేసి= చేసిన కారణంగా; వానివాని పత్నులు= పైన చెప్పిన నీచజన్మలు కలవారి భార్యలు; ఐ= అయి; జనియింతురు= పుట్టుతారు; పాపభీతిన్= పాపంవలన భయంతో; తెరువు= మంచిమార్గం; తప్పక= తప్పకుండా; నడచిన నరులు= ప్రవర్తించిన మనుష్యులు; రెండు లోకంబులందున్= ఈ లోకము, పరలోకము అనే రెండు లోకాలలో; సౌఖ్యము= సుఖాన్ని; అందుదురు= పొందుతారు.

తాత్పర్యం: స్త్రీలు పైన పేర్కొన్న పాపాలను చేస్తే పురుషులు చేసిన పాపాల ఫలితాలుగా చెప్పిన నీచజన్మల వారి భార్యలై పుట్టుతారు. పాపం కలుగుతుందన్న భయంతో ధర్మమార్గం తప్పకుండా నడచుకొన్నవారు ఇహపరలోకాలలో సుఖాన్ని అనుభవిస్తారు.'

విశేషం: ఇక్కడ తెరువు అనగా ధర్మశాస్త్రం నిర్ణయించిన పద్ధతి.

వ. అని చెప్పి యిట్లనియె; 'నేనుం గొన్ని తెఱఁగు లెఱింగించితి మఱియు ననేక పదార్థాపహరణంబులకు బహువిధంబులగు ఫలంబులు వాటిల్లు వాని నెల్లను శాస్త్రాంతరశ్రవణంబున నెఱింగెదు గాక' యనిన విని యక్కురుపతి బృహస్పతితోఁ 'బాపంబులం బాపికొనుతెఱం గెఱింగింపవే' యనుటయు నతం డతని కిట్లనియె. 269

ప్రతిపదార్థం: అని; చెప్పి= తెలిపి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; నేనున్= నేను; కొన్ని తెఱఁగులు= కొన్ని పద్ధతులను; ఎఱింగించితిన్= తెలిపాను; మఱియున్= ఇంకా; అనేక పదార్థ+అపహరణంబులకున్= పెక్కు వస్తువుల దొంగతనాలకు; బహువిధంబులు= పెక్కుతీరులు; అగు= అయిన; ఫలంబులు= శిక్షలుగా అయ్యే ఫలాలు; వాటిల్లున్= కలుగుతాయి; వానిన్= వానిని; ఎల్లను= అన్నింటినీ; శాస్త్ర+అంతర శ్రవణంబునన్= వేరుశాస్త్రాల వినికిడిచేత; ఎఱింగెదు కాక= తెలిసికొంటావు; అనినన్= అనగా; విని= ఆలకించి; ఆ+కురుపతి= ఆ కురురాజు యుధిష్ఠిరుడు; బృహస్పతితోన్= దేవమంత్రి అయిన బృహస్పతితో; పాపంబులన్= ఈ దోషాలను; పాపికొనుతెఱంగు= పోగొట్టుకొనే దారి; ఎఱింగింపవే= దయచేసి తెలుపుమా!; అనుటయున్= అన్నంతనే; అతండు= ఆ బృహస్పతి; అతనికిన్= ఆ ధర్మరాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: బృహస్పతి ఇట్లా చెప్పి ఇంకా ఈ విధంగా అన్నాడు. 'నేను కొన్ని తీరులను తెలిపాను. ఇంకా అనేక వస్తువుల దొంగతనాలకు కలిగే ఫలాలు పెక్కుతీరులలో ఉన్నాయి. వాటి నన్నింటినీ ఇతర శాస్త్రాలను వినటం ద్వారా నీవు తెలిసికొందువుగాక!' అనగా విని ధర్మరాజు బృహస్పతితో 'ఈ పాపాలను పోగొట్టుకొనే విధం తెలుపవూ!' అని అడిగితే అత డతడితో ఇట్లా అన్నాడు.

క. విను దానంబులఁ బాపము । లనఘా! చెడు దానములకు నన్నిటికిని స
జ్జన సేవ్య! యన్నదానము । మును లధికం బండ్రు పాపములఁ బాపునెడన్. 270

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; విను= ఆలకించుము; పాపములు= చెడుపనుల దోషాలు; దానంబులన్= దానాలతో; చెడున్= నశిస్తాయి; సత్+జన సేవ్య= ఉత్తమ జనులచేత సేవించబడేవాడా!; మునులు= జ్ఞానసంపన్నులు; పాపములన్= పాపాలను; పాపు+ఎడన్= పోగొట్టే విషయంలో; అన్నదానము= అన్నం పెట్టటం; దానములకున్= దానాలకు; అన్నిటికిన్= అన్నింటికీ; అధికంబు= మిన్న అయినది; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పుణ్యాత్ముడా!; పాపాలు దానాలతో నశిస్తాయి. పాపాలను పోగొట్టే విషయంలో అన్ని దానాలకంటె అన్నదానం గొప్పదని మును లంటారు.

విశేషం: ధర్మరాజు హృదయంలో 'నేను యుద్ధంలో ఎందరిచావుకో కారణమయ్యాను. ఆ పాపాల చెడు ఫలితాలు నాకు కలుగుతాయా' అన్న శంక ప్రశ్నలో అభివ్యక్తం అవుతున్నది. దానిని తొలగించటం కొరకు 'అనఘా! సజ్జనసేవ్య!' అనే రెండు సంబోధనలను చిన్న పద్యంలో తిక్కన నిక్షేపించాడు.

అన్నదానం గొప్పది. దీనికి రెండు కారణాలను మనం భావించవచ్చును. 1. ఏ ఇతర దానంలోనూ 'చాలు' అనే మాట ఉండదు. అన్నదానం ఒక్కటే 'చాలు' అనిపించే దానం. 2. అన్నం శరీరాన్ని పోషిస్తుంది. శరీరం మొదటి ధర్మసాధనం. ('శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్' అంటాడు కాళిదాసు). దానాలు పాపాలను ఎట్లా పోగొట్టగలవు? - అని కొందరు శంకిస్తారు. పాపం స్వార్థపు ముద్దుబిడ్డగదా! దానం స్వార్థాన్ని రూపుమాపుతుంది కదా! ఆ విధంగా దానం పాపనాశకం అవుతుంది.

క. న్యాయార్జిత మగు నన్నము । వేయింటికిఁ బెట్టవలయు విప్రజనము హ
ర్షాయత్తంబుగ దానం । బాయని పాపములు గలవె? పౌరవముఖ్యా! 271

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశం వారిలో ఉత్తముడా!; న్యాయ+ఆర్జితము= ధర్మమార్గంతో సంపాదించినది; అగు+ అన్నమున్= అయిన అన్నాన్ని; వేయింటికిన్= వేయి సంఖ్యగల వారికి; విప్రజనము= వేదవిద్యలు నిండుగా గల జనం; హర్ష+ ఆయత్తంబుగన్= ఆనందానికి వశమయ్యే విధంగా; పెట్టవలయున్= పెట్టాలి; దానన్= దానిచేత; పాయనిపాపములు= నశించని పాపాలు; కలవె?= ఉన్నాయా?

తాత్పర్యం: ధర్మరాజా! ధర్మమార్గంలో సంపాదించిన అన్నాన్ని వేయిమంది విద్వజ్జనులు పరమానందం పొందే విధంగా పెట్టాలి. దానితో పోని పాపాలు ఉంటాయా?

విశేషం: తాను కష్టపడి ధర్మమార్గంలో సంపాదించిన అన్నమే సత్పాత్రమందు చేరినదై సత్ఫలితాన్నిస్తుందనే హెచ్చరిక న్యాయార్జితము, విప్రజనము మొదలైన పదాలలో గుట్టుగా ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. తిరిసి యేనియు నన్నంబు దెచ్చి శిథిలు । లైన విప్రుల యాఁకలి నపహరించు

పురుషుఁ డూర్ధ్వలోకంబుల పురుషవరుల । కర్చనీయుఁడై వెలుఁగుచు నంద యుండు. 272

ప్రతిపదార్థం: తిరిసి, ఏనియున్= బిచ్చమెత్తి అయినా; అన్నంబు= అన్నాన్ని; తెచ్చి= సాధించి; శిథిలులు= బక్కచిక్కినవారు; ఐన విప్రుల ఆఁకలిన్= అయిన విద్వాంసుల ఆకలిని; అపహరించు పురుషుఁడు= తీర్చే మనుష్యుడు; ఊర్ధ్వలోకంబుల పురుష వరులకున్= పైనున్న పుణ్యలోకాలయందలి జనులకు; అర్చనీయుఁడు= పూజించదగినవాడు; ఐ= అయి; వెలుఁగుచున్= ప్రకాశిస్తూ; అందున్+అ= అక్కడనే; ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: బిచ్చ మెత్తి అయినా అన్నం సంపాదించి, బ్రదుకుచెడిన విద్యావంతులైన వారి ఆకలి తీర్చేవాడు పైన ఉత్తమలోకాలలో ఉన్న పురుషశ్రేష్ఠులకు మన్నించదగినవాడై అక్కడనే శాశ్వతంగా ఉంటాడు.

విశేషం: శిథిలులు - శరీరసౌష్ఠవమూ, సంపద సౌష్ఠవమూ రెండూ చెడినవారు, విప్రులు - విద్యయా యాతి విప్రత్వం. జ్ఞానదాయకమైన విద్యనేర్చి, ఇతరులకు అందించే పుణ్యాత్ములు విప్రులు. అంద - అందే అవధారణార్థకంచేత శాశ్వతంగా అనే అర్థం సిద్ధిస్తుంది.

క. వేదాధ్యయనార్థ ప్రతి । పాదనమున విప్రవరుఁడు బ్రహ్మ విషయ స

ద్భూదానంబుల నరపతి । యే దురితము లైనఁ గౌరవేశ్వర! పాచున్. 273

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వర!= కురువంశ ప్రభూ!; విప్రవరుఁడు= విప్రులలో శ్రేష్ఠుడైనవాడు; వేద+అధ్యయన అర్థ ప్రతిపాదనమునన్= వేదం పఠించటం, అర్థాన్ని ఇతరులకు తెలపటం అనే క్రియతోను; నరపతి= రాజు; బ్రహ్మ విషయ సత్+భూదానంబులన్= బ్రాహ్మణుడి విషయంలో చక్కని భూమిని దానంచేసే పనులచేత; ఏ దురితములు= ఎట్టి పాపాలను; ఐనన్= అయినా; పాచున్= పోగొట్టుకొంటారు.

తాత్పర్యం: ధర్మరాజా! బ్రాహ్మణుడు వేదం అధ్యయనం చేయటం, అర్థజ్ఞానాన్ని లోకానికి సమర్పించటం అనే పనిచేతా, రాజు అటువంటి విద్యావంతులకు మంచి భూమిని ఇవ్వటంఅనేపనిచేతా ఎటువంటి పాపాలనైనా పోగొట్టు కొంటారు.

విశేషం: భారతీయ ఋషిధర్మంలో బ్రహ్మక్షత్రియ వర్ణాల బాధ్యత ఎంతో బరువైనది. వారు సుస్థితిలో ఉంటే తక్కిన జనాలందరినీ పరిరక్షించగల వారవుతారు. "లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు" అనే ఆశంసలోని తాత్పర్యం ఇదే.

తే. నేర్చి యలజడిఁ బడిన వాణిజ్య విధులఁ బడసి వైశ్యుఁ డన్నంబిడి పడయు సుగతి

చచ్చునంతలు వడి సిరి దెచ్చికొని చ । తుర్థులన్నంబు వెట్టి కాంతురు దివంబు. 274

ప్రతిపదార్థం: వైశ్యుండు= కోమటి; నేర్చి= చక్కని నేర్పు కలిగి; అలజడిన్= ఆపదలో; పడిన వాణిజ్యవిధులన్= పడినట్టి వర్తకపు పనులయందు; పడసి= సంపాదించి; అన్నంబు= భోజనంబు; ఇడి= పెట్టి; సుగతిన్= మంచి గతిని; పడయున్= పొందుతాడు; చచ్చు+అంతలు= ప్రాణం పోయే అంతలుగా; పడి= పాట్లుపడి; సిరిన్= సంపదను; తెచ్చికొని= సంపాదించి; చతుర్థులు= నాలుగవ జాతివారు; అన్నంబు+పెట్టి= అన్నం పెట్టి; దివంబున్= స్వర్గాన్ని; కాంతురు= పొందుతారు.

తాత్పర్యం: వైశ్యుడు చక్కని నేర్పుతో ఆపదలందు చిక్కుకొన్న వర్తకపు పనులతో సంపాదించి అన్నంపెట్టి సుగతికి చేరుతాడు. ప్రాణాంతకమైన పాట్లుపడి ధనం సంపాదించి శూద్రులు అన్నదానం చేసి స్వర్గం చేరుకొంటారు.

విశేషం: అలజడిఁబడిన వాణిజ్యవిధులు - వర్తకం చాలా గందరగోళమైన వృత్తి. ఏ క్షణంలో నష్టం వచ్చి ఉన్నదంతా ఊడ్చుకొని పోతుందో ఎవరూ చెప్పలేరు. ఆ విధంగా మనస్తాపం కలిగించే వృత్తిలో సంపాదించి కూడా అన్నదానం చేయాలని భావన. అట్లాగే శూద్రుడు శుశ్రూషాపరుడై ఒక్కొక్క సమయంలో ప్రాణాలకు కూడా తెగించి పనులు చేయవలసి వస్తుంది. అయినా అన్నదానం చేయాలి - అని బోధ.

తే. దివము వంధ్యంబు గాకుండఁ దివిరి యన్న। పానదానంబు లొదవిన భంగిఁ జేసి
మఱి భుజించుటఁ బోలెడు మహితధర్మ। కార్య మొండొకఁ డెందును గలదె యరయ.' 275

ప్రతిపదార్థం: దివము= స్వర్గం; వంధ్యంబు= వట్టిపోయినది; కాక+ఉండన్= కాకుండా; తివిరి= ప్రయత్నించి; అన్నపాన దానంబులు= అన్నం, నీరు అనే దానాలు; ఒదవిన భంగిన్= సాధ్యమైన తీరులో; చేసి; మఱి= ఆ పిమ్మట; భుజించుటన్= తినటాన్ని; పోలెడు మహిత ధర్మ కార్యము= పోలే గొప్ప ధర్మమైన పని; ఒండు+ఒకఁడు= మరొకటి; ఎందును= ఎక్కడైనా; అరయన్= పరికింపగా; కలదు+ఎ?= ఉన్నదా?

తాత్పర్యం: స్వర్గం వట్టిపోకుండా గట్టి ప్రయత్నంచేసి, తన కున్నంతలో అన్నపానాలు దానంచేసి తినటం అనే దానితో సాటికి వచ్చే సమున్నత ధర్మకార్యం మరొకటి ఎంత వెదకినా ఉంటుందా?

విశేషం: స్వర్గం వట్టిపోవటమంటే అక్కడకు వెళ్ళే పుణ్యాత్ములు లేకపోవటం. అన్నదానం మెండుగా చేసినవారు స్వర్గాన్ని వట్టిపోకుండా చేస్తారని భావం.

తే. అన్నదానంబు ధర్మంబు లన్నిటికిని। ముఖ్య మింత యెఱుఁగు కురుముఖ్య!' యనుడు
ననిమిషాధిప మంత్రికి నమ్మహీశుఁ। డిట్లనియె భక్తి వినయంబు లెసక మెసఁగ. 276

ప్రతిపదార్థం: కురుముఖ్య!= కౌరవశ్రేష్ఠా!; అన్నదానంబు= అన్నం పెట్టటం; ధర్మంబులు= ధర్మాలు; అన్నిటికిని= అన్నింటికీ; ముఖ్యము= ప్రధానము; ఇంత= ఈ మాత్రం; ఎఱుఁగు= తెలిసికొనుము; అనుడున్= అనినంతనే; అనిమిష+అధిప మంత్రికిన్= దేవతల రాజు అయిన దేవేంద్రుడి మంత్రి బృహస్పతికి; ఆ+మహీ+ఈశుఁడు= ఆ రాజు; భక్తి వినయంబులు= భక్తి, వినయము అనేవి; ఎసక మెసఁగన్= ఎక్కువ కాగా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: కురువరా! అన్నదానం ధర్మాలన్నింటికీ ముఖ్యమైనది. ఈ మాత్రం తెలిసికొనుము' అనగా ధర్మరాజు భక్తివినయాలు పెంపొందుతూ ఉండగా బృహస్పతితో ఇట్లా అన్నాడు.

క. 'ధ్యానం బింద్రియవృత్తుల। మానించు టహింస గురుసమర్చన విధి ని
త్యానుష్ఠానము దప మను। వీనఁ బరమసేవ్య మెద్ది వినఁగా వలతున్. 277

ప్రతిపదార్థం: ధ్యానంబు= మనస్సును ఏకాగ్రం చెయ్యటం; ఇంద్రియవృత్తులన్= ఇంద్రియాల తిరుగుళ్ళను; మానించుట= నిలవరించటం; అహింస= ఇతర జీవులను పీడించకుండటం; గురు సమర్చన విధి= గురువులను పూజించటమనే పని;

నిత్య+అనుష్ఠానము= ప్రతిదినము దేవతార్చనాదులను శ్రద్ధతో చేయటం; తపము= తపస్సు; అను వీనన్= అనే వీనియందు; పరమ సేవ్యము= మిక్కిలి గొప్పగా సేవింపదగినది; ఎద్ది= ఏది?; వినఁగాన్+వలతున్= వినగోరుతున్నాను.

తాత్పర్యం: 'ధ్యానం, ఇంద్రియ నిగ్రహం, అహింస, గురువులను ఆరాధించటం, నిత్యకర్మములను శ్రద్ధతో ఆచరించటం, తపస్సు - అనే వీటిలో మిక్కిలి గొప్పగా సేవింపదగిన దేదో వినగోరుతున్నాను.

వ. వినిపింపు' మనిన నమ్మహాత్ముండు. 278

ప్రతిపదార్థం: వినిపింపుము= చెప్పుము; అనినన్= అంటే; ఆ+మహాత్ముండు= దొడ్డబుద్ధి గల ఆ బృహస్పతి.

తాత్పర్యం: నాకు తెలియజెప్పుము' అనగా దొడ్డబుద్ధి గల ఆ బృహస్పతి (తరువాతి పద్యంతో అన్వయం)

క. ఈ యాఱును మంచి తెరువు । లై యుండు నహింస యున్నయైదిటికిఁ బవి
త్రాయతన మట్లు గాకయు । నేయుత్తమధర్మములను నిది వెలిఁగించున్.' 279

ప్రతిపదార్థం: ఈ+ఆఱును= ఈ ఆరూ కూడా; మంచి తెరువులు= మంచిదారులు; ఐ= అయి; ఉండున్= ఉంటాయి; అహింస= అన్యులను పీడించకుండా ఉండటం; ఉన్న ఐదిటికిన్= మిగిలిన అయిదింటికీ; పవిత్ర+ఆయతనము= పవిత్రమైన స్థానము; అట్లు కాకయున్= అంతేకాకుండా; ఏ+ఉత్తమధర్మములను= ఏ గొప్ప ధర్మాలనైనా, ఇది= ఈ అహింస; వెలిఁగించున్= ప్రకాశింపజేస్తుంది.

తాత్పర్యం: ఈ ఆరూ మంచి దారులే. అహింస తక్కిన అయిదింటికీ పవిత్రమైన స్థానం. అంతే కాదు. అహింస ఏ ఉత్తమధర్మాలనైనా ప్రకాశింపజేస్తుంది.

విశేషం: 'అహింసా పరమో ధర్మః' అని సూక్తి. మరొకదానిని హింసించటమంటే పరమాత్మను హింసించటమే. ఎందుకంటే పరమాత్మ అన్నింటియందు ఏకరూపంలో ఉన్నాడు కదా!

వ. అని పలికి యామంత్రణంబు సేసి వాసవమంత్రి యమరనగరంబునకుం జనియెఁ; దదనంతరంబ. 280

ప్రతిపదార్థం: అని; పలికి= మాట్లాడి; ఆమంత్రణంబు+చేసి= వెళ్ళి వస్తానని చెప్పి; వాసవమంత్రి= దేవేంద్రుడి మంత్రి= బృహస్పతి; అమరనగరంబునకున్= దేవతల నగరం అయిన అమరావతికి; చనియెన్= వెళ్ళాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: బృహస్పతి ఇట్లా చెప్పి వీడ్కోలు మాటలు పలికి దేవతల నగరానికి వెళ్ళాడు. ఆ తరువాత.

ఆ. ధర్మనందనుఁడు పితామహుతో 'సర్వ । దేవతలును భూమి దేవతలును
మునివరులు నహింస గొని యాడుదురు దాని । తెఱఁగు సెప్ప నాకుఁ దేటపడఁగ.' 281

ప్రతిపదార్థం: ధర్మనందనుఁడు= ధర్మునిపుత్రుడు - యుధిష్ఠిరుడు; పితామహుతోన్= తాతతో; సర్వదేవతలును= అందరు దేవతలునూ; భూమిదేవతలును= భూమియందు ఉన్న దేవతలైన బ్రహ్మజ్ఞానసంపన్నులూ; మునివరులున్= మునులలో శ్రేష్ఠులైనవారూ; అహింసన్= అహింసను; కొనియాడుదురు= గొప్పగా చెప్పుతారు; దాని తెఱఁగు= దాని పద్ధతి; నాకున్= నాకు; తేటపడఁగన్= తెల్లం అయ్యే విధంగా; చెప్పు= బోధించుము.

తాత్పర్యం: అప్పుడు ధర్మరాజు తాతతో ఇట్లా అన్నాడు. 'దేవతలు అందరూ, అట్లాగే భూమిలోని దేవతలైన బ్రాహ్మణులు, మునిశ్రేష్ఠులూ అహింసను ప్రశంస చేస్తూ ఉంటారు. దాని సంగతి నాకు స్పష్టమయ్యే విధంగా బోధించుము.'

వ. అనుటయు నమ్మహనీయుం డమ్మనుజపతిం బరమాదరంబున నాలోకించి. 282

ప్రతిపదార్థం: అనుటయున్= అనగానే; ఆ+మహనీయుండు= దొడ్డవ్యక్తి అయిన ఆ భీష్ముడు; ఆ+మనుజపతిన్= ఆ రాజును; పరమ+ఆదరంబునన్= మిక్కిలి ప్రీతితో; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అన్నంతనే ఆ మహానుభావుడు భీష్ముడు ఆ రాజును మిక్కిలి ప్రీతితో చూచి (తరువాతి పద్యంతో అన్వయం.

భీష్ముఁడు ధర్మజునకు నహింసాస్వరూప నిరూపణంబు సేయుట (సం.13-176-6 (కుంభ))

ఆ. 'దంతియడుగు లోనఁ దక్కిన జంతుచ । యంబు నడుగు లెల్ల నడఁగి యుండు
నట్ల ధర్మకోటు లన్నియు లోనగు । నిద్ధగుణ! యహింస కింత నిజము. 283

ప్రతిపదార్థం: ఇద్ధగుణ!= మిక్కిలి ప్రకాశించు గుణములు గలవాడా!; దంతి అడుగులోనన్= ఏనుగు పాదంలో; తక్కిన జంతుచయంబు+ అడుగులు= మిగిలిన జంతువుల సముదాయం అడుగులు; ఎల్లన్= అన్నీ; అడఁగి= లోబడి; ఉండు+అట్లు+అ= ఉండే విధంగానే; ధర్మకోటులు= ధర్మాల సముదాయాలు; అన్నియున్= అన్నీ; అహింసకున్= అహింస అనే ధర్మానికి, లోన్ అగున్= లోబడి ఉంటాయి; ఇంత= ఇది అంతా, నిజము= సత్యము.

తాత్పర్యం: 'ధర్మరాజా! ఏనుగు అడుగులో అన్ని జంతువుల అడుగులు ఇమిడి ఉండే తీరున అహింస అనే ధర్మంలో సర్వధర్మాలు లోబడి ఉంటాయి. ఇది సత్యం.

విశేషం: ఇక్కడ అడుగు అంటే పాదపు గుర్తు. ఈ ఉపమానంవలన అహింసను పాటిస్తే అన్ని ధర్మాలను పాటించినట్లే అనే అర్థం వ్యక్తమవుతుంది.

వ. అదియును. 284

తాత్పర్యం: ఆ అహింస అనేది కూడా (తరువాతి పద్యంతో అన్వయం)

క. అరయఁగ నాలుగు విధములఁ । బరఁగుఁ జతుష్పాదవృత్తిఁ బరఁగిన గోవున్
దొరయుచు నం దొకఁ డెడలిన । నరవర! సద్ధర్మవర్తనము గుంటువడున్. 285

ప్రతిపదార్థం: నరవర!= మనుజశ్రేష్ఠా!; చతుస్+పాద వృత్తిన్= నాలుగు పాదాల వర్తనతో; పరఁగిన గోవున్= ఒప్పిన ఆవును; దొరయుచున్= పోలుతూ; అరయఁగన్= పరిశీలించగా; నాలుగు విధములన్= నాలుగు తీరులలో; పరఁగున్= ఉంటుంది; అందున్= వాటిలో; ఒకఁడు= ఒకటి; ఎడలినన్= తొలగినా; సత్+ధర్మవర్తనము= శ్రేష్ఠమైన ధర్మపు నడక; కుంటు+పడున్= కుంటు పడుతుంది.

తాత్పర్యం: రాజా! నాలుగుకాళ్ళ నడకగల ఆవువలె ఆ అహింస కూడా నాలుగు తీరులలో ఉంటుంది. అందులో ఏ ఒక్కటి లోపించినా శ్రేష్ఠమైన ధర్మపు సాగుదల కుంటుపడుతుంది.

తే. మనసునను వాక్కునను గాయమునను హింస । నడపు మాంసంబు దినుటతో నాలుగయ్యెఁ
దెఱఁగు లవి సువ్వె హింస వర్తింపఁ జేయుఁ । గాన కడుఁ గీడు మాంసభక్షణము దలఁప. 286

ప్రతిపదార్థం: మనసునను= మనస్సుచేత; వాక్కునను= మాటచేత; కాయమునను= దేహంచేత; హింస నడపు= హింస చేయటం; మాంసంబున్= మాంసాన్ని; తినుటతోన్= తినటంతో; అవి; తెఱఁగులు= పద్ధతులు; నాలుగు= నాల్గు; అయ్యెన్= అయినవి; సువ్వె= సుమా!; తలఁపన్= భావించగా; హింసన్= పీడను; వర్తింపన్+చేయున్= కలుగజేస్తుంది; కానన్= కనుక; మాంసభక్షణము= మాంసం తినటం; కడున్= మిక్కిలి; కీడు= దోషము.

తాత్పర్యం: మనసుచేత, మాటచేత, దేహంచేత హింసచేయటం, మాంసం తినటం అనేదానితో కలిపి ఆ పద్ధతులు నాలు గైనాయి. హింసను కలిగిస్తుంది కనుక మాంసభోజనం చాలా పెద్ద దోషం.

విశేషం: ఇతరులను గురించి చెడుగా భావించటం మనోహింస, దురుసుమాటలు పలకటం వాక్హింస, కొట్టటం మొదలైనది కాయహింస.

క. ఈ నాలుగు దెఱఁగుల దగ । మానుట యేఁ జెప్పినట్టి మహితాహింసా
నూనచతుర్విధములు మాం । సానేకరుచి ప్రమగ్నుఁ డది యెట్లుడుగున్? 287

ప్రతిపదార్థం: ఈ నాలుగు+తెఱఁగులన్= ఈ నాలుగు పద్ధతులను; తగన్= తగినట్లుగా; మానుట= మానటం; ఏన్=నేను; చెప్పిన+అట్టి= చెప్పిన; మహిత+అహింసా+అనూన చతుర్+విధములు= గొప్పది అయిన అహింసయొక్క తక్కువకాని నాల్గు పద్ధతులు; మాంస+అనేక రుచి ప్రమగ్నుఁడు= మాంసపు పెక్కు విధములైన రుచులలో బాగా మునిగినవాడు; అది= ఆ ఆహింసను; ఎట్లు= ఏ విధంగా; ఉడుగున్?= మానుతాడు?

తాత్పర్యం: ఈ నాలుగు విధాలైన హింసలను మానటమే నేను చెప్పిన అహింసలోని నాలుగు గొప్ప పద్ధతులు. మాంసపు రుచులను బాగా మరగినవాడు దాని నెట్లా వదలుతాడు?

క. కావున మాంసముపైఁ దగు । లే విధమున నుడుగుటయ యహింసారూపం
బై వఱలుఁ జుమీ భూవర!' నావుడు నక్కురువిభుఁడు వినయమయుఁడగుచున్. 288

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; కావునన్= కనుక; ఏ విధమునన్= ఏ విధంగానైనా; మాంసముపైన్= నంజుడుమీద; తగులు= ప్రీతి; ఉడుగుట+అ= వదలటమే; అహింసారూపంబు= అహింస అనే తీరు గలది; ఐ= అయి; వఱలున్= ఒప్పుతుంది; చుమీ= సుమా!; నావుడున్= అన్నంతనే; ఆ+కురువిభుఁడు= ఆ కురువంశరాజు; వినయమయుఁడు= వినయంతో నిండినవాడు; అగుచున్= అవుతూ.

తాత్పర్యం: రాజా! కనుక ఏ విధంగా నైనా సరే మాంసంమీద ప్రీతి వదలుకొనటమే అహింసగా ఒప్పుతుంది సుమా!' అని అనగా ఆ కౌరవరాజు వినయం నిండిన వాడవుతూ (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. 'మాంసంబు పితృదేవతలకుం బ్రియంబు శ్రాద్ధంబు మాంసముఖ్యంబుగా నడపవలయుననిి చెప్పదురు. వధింపక మాంసలాభం బెట్లు గలుగు?' ననుటయు ననిమిషనదీనందనుం డానరనాథున కిట్లనియె. 289

ప్రతిపదార్థం: మాంసంబు= నంజుడు; పితృదేవతలకున్= పితరులు అనే దేవతలకు; ప్రియంబు= ఇష్టమైనది; శ్రాద్ధంబు= శ్రాద్ధం అనే పని; మాంసముఖ్యంబుగాన్= మాంస ప్రధానంగా; నడపవలయున్= సాగించాలి; అని; చెప్పుదురు= చెప్తూతూ ఉంటారు; వధింపక= చంపక; మాంసలాభంబు= మాంసం దొరకటం; ఎట్లు= ఏ విధంగా; కలుగున్?= కలుగుతుంది?; అనుటయున్= అని పలికితే; అనిమిష నదీనందనుండు= దేవతలనది అయిన గంగయొక్క కుమారుడు భీష్ముడు; ఆ నరనాథునకున్= ఆ రాజునకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: 'మాంసం పితృదేవతలకు చాలా ఇష్టమైనది. శ్రాద్ధాన్ని మాంసం ప్రధానద్రవ్యంగా సాగించాలి అంటారు. చంపకపోతే మాంసం దొరకటం ఎట్లాగు?' అంటే భీష్ముడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇది ధర్మానికి సంబంధించిన శంక. ఇట్టి శంకలను అడిగే సమయంలో సాధారణంగా చాలామంది పలుకులలో పొగరు పొడచూపుతుంది. అది వక్త కోపానికి కారణం అవుతుంది. అందుకనే వెనుకటి పద్యంలో ధర్మరాజులో అట్టి 'అవినయం' ఏ మాత్రం లేదు. కేవలం తెలిసికొనాలనే కోరిక మాత్రమే ఉందని చెప్పటానికై వినయమయుండగుటను చెప్పారు.

తే. 'వాజిమేధంబుకంటెను బూజనీయ । కర్మ మందురు మాంస భక్షణము విడుపు
వినుము చంపుటయును జంపఁ బనుచుటయును । గల్మషంబుల కెల్ల నగ్గలము లధిప! 290

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; మాంసభక్షణము విడుపు= మాంసాన్ని తినటం మానటం; వాజిమేధంబుకంటెను= అశ్వమేధయాగం కంటె; పూజనీయ కర్మము= మన్నింపదగిన పని; అందురు= అంటారు; వినుము; చంపుటయును= చంపటమూ; చంపన్= చంపటానికి; పనుచుటయును= పంపటమూ; కల్మషంబులకున్= పాపాలకు; ఎల్లన్= అన్నింటికీ; అగ్గలములు= అధికమైనవి.

తాత్పర్యం: 'రాజా! మాంసభోజనం వదలటం అశ్వమేధయాగంకంటే కూడా పూజింపదగిన పని అంటారు. వినుము. చంపటమూ, చంపించటమూ అనే పనులు పాపాలన్నింటికంటె అధికమైనవి.

క. పితృకార్యయజ్ఞముఖముల । శ్రుతిచోదిత హింసఁ గీడు సొరనేరదు వి
శ్రుతగుణ మాంసము చవిగో । రి తినం బ్రాణిఁ దెగటార్చు క్రియఁ బాపమగున్. 291

ప్రతిపదార్థం: విశ్రుతగుణ!= కొనియాడబడిన గుణములు కలవాడా!; పితృకార్య యజ్ఞముఖములన్= శ్రాద్ధము, యజ్ఞము మొదలైన వాటియందు; శ్రుతిచోదిత హింసన్= వేదం చెప్పిన హింసచేత; కీడు= దోషం; చొరన్+నేరదు= ప్రవేశింపజాలదు; మాంసము చవి= మాంసపు రుచి; కోరి= వాంఛించి; తినన్= తినటంకొరకు; ప్రాణిన్= ప్రాణంగల జంతువును; తెగటార్చు క్రియన్= చంపే పనిచేత; పాపము= దోషం; అగున్= ఔతుంది.

తాత్పర్యం: రాజా! శ్రాద్ధాలలో, యజ్ఞాలలో వేదం తెలిపిన హింసచేత దోషం కలుగబోదు. మాంసపురుచి మరిగి తినటానికై ప్రాణిని చంపే పనివలన పాపం కలుగుతుంది.

క. తను నమలిన వాని నమలు । నని మాంసము తెలుఁగు సెప్పు నాగమములు గా
వునఁ దద్భక్షణ ముడిగిన । ననఘ! తపంబునకుఁ జాలు నది యొక్కండున్. 292

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; ఆగమములు= శాస్త్రములు, వేదములు; తనున్= తన్ను; నమలినవానిన్= నమలినవాడిని; నమలును= నములుతుంది; అని; మాంసము తెఱఁగు= మాంసం తీరును; చెప్పున్= చెప్పుతూ ఉంటాయి; కావునన్= కనుక; తద్+భక్షణము= దానిని తినటం; ఉడిగినన్= మానితే; అది= ఆ మానటం; ఒక్కండును= ఒక్కటీ; తపంబునకున్= తపస్సునకు; చాలున్= చాలుతుంది.

తాత్పర్యం: మాంసం తన్నెవరు నములుతారో వారినే నములుతుంది - అని ఆగమాలు చెప్పుతున్నాయి. కనుక, రాజా! ఆ మాంసపు తిండి ఒక్కటీ మానితే అదే తపస్సునకు సరిపోతుంది.

విశేషం: మాంసభక్షణం అన్యహింసే కాదు, ఆత్మహింస కూడా అవుతుందని భావం.

క. **జనవర! మాంసముచవిఁ గడ । చిన చవు లరయంగ లేమిఁ జేసి చవి యెఱిం**
గినవాఁ డది యుడిగిన నా । తని దేవసమానుఁ డండ్రు ధర్మవిధిజ్ఞుల్. **293**

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; మాంసము చవిన్= మాంసపు రుచిని; కడచిన చవులు= మీరిన రుచులు; అరయంగన్= పరిశీలించగా; లేమిన్+చేసి= లేకపోవటంవలన; చవి+ఎఱింగినవాఁడు= రుచి తెలిసినవాడు; అది= మాంసభోజనాన్ని; ఉండిగినన్= వదలివేస్తే; అతనిన్= అట్టివాడిని; ధర్మవిధిజ్ఞుల్= ధర్మం పద్ధతులు బాగా తెలిసినవారు; దేవసమానుఁడు= దేవతలతో సాటి అయినవాడు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: రాజా! మాంసం రుచిని మించిన రుచులు ఎంత వెదకినా లేని కారణంగా ఆ రుచి మరగినవాడు దానిని మానితే అట్టివాడిని ధర్మశాస్త్రాలు చక్కగా తెలిసినవారు దేవతలతో సమానుడు అంటారు.

విశేషం: రుచి తెలియనివాడు మాంసం జోలికి పోక పోవటం గొప్ప విషయం కాదు. రుచి తెలిసినవాడు మానటం ఎంతో గొప్ప విషయం - అని భావం.

ఉ. **ప్రూనను ఱాతనుం గలదె మాంసము ప్రాణుల మేనఁగాక? య**
మ్మేనుల నొంచునప్డు తమ మేనులు సోఁకినమాత్ర నెట్లగున్
దానిఁ దలంపఁగా వలదె? తానది మానిన హింసలన్నియున్
మానవె? యంచు నుత్తముఁడు మాంసము మాను దయార్ద్రచిత్తుఁడై. **294**

ప్రతిపదార్థం: మాంసము= నంజుడు; ప్రాణులమేనన్= ప్రాణంగల జంతువుల దేహంలో; కాక= తప్ప; ప్రూనను= చెట్టునందు; ఱాతనున్= రాతియందు; కలదె?= ఉన్నదా?; ఆ+మేనులన్= ఆ దేహాలను; నొంచు+అప్డు= పీడించే సమయంలో; తమ మేనులు= తమ దేహాలు; సోఁకిన మాత్రన్= తాకినంత మాత్రాన; ఎట్లు= ఏ విధంగా; అగున్= అవుతుందో; దానిన్= దానిని; తలంపన్+కాన్= తలపోయటం; వలదె?= వద్దా?; తాన్= తాను; అది= ఆ హింసను; మానినన్= మానితే; హింసలు= పీడలు; అన్నియున్= అన్నీ; మానవె?= మానవా?; అంచున్= అని భావిస్తూ; ఉత్తముఁడు= గొప్పవాడు; దయా+ఆర్ద్ర చిత్తుఁడు= దయతో మెత్తనైన మనస్సు కలవాడు; ఐ= అయి; మాంసమున్= మాంసాన్ని; మానున్= ఆపివేస్తాడు.

తాత్పర్యం: ప్రాణుల దేహంలోనే కానీ మాంసం ప్రూనులోను, రాతిలోను లేదు కదా! ఆ దేహాలను పీడించే సమయంలో తమ దేహాలకు ఏదైనా తగిలితే తనకు నొప్పి కలుగుతున్నది కదా! కనీసం దానినైనా భావించాలి కదా!

కనుక మాంసంకొరకు హింస మానితే అన్ని హింసలూ మానినట్లే - అని ఉత్తముడు భావించి, దయ కలవాడై మాంసం తినటం మానుతాడు.

ఆ. మాంస మానకునికి మనుజేశ! ప్రాణివ । ధాభిరతి దొఱంగు టగుటఁ జేసి
యట్టివాని కభయ మఖిలభూతంబుల । వలన నెపుడు నెందుఁ గలిమి నిజము. 295

ప్రతిపదార్థం: మనుజ+ఈశ!= రాజా!; మాంసము= ఎరచి; ఆనక= తినక; ఉనికి=ఉండటం; ప్రాణివధ+అభిరతిన్= ప్రాణంగల జంతువులను చంపటంమీద ప్రీతిని; తొఱంగుట= వదలివేయటం; అగుటన్+చేసి= కాబట్టి; అట్టి వానికిన్= ఆ విధంగా మాంసం మానిన వాడికి; అఖిల భూతంబులవలనన్= అన్ని భూతాలవలనను; ఎపుడున్= ఎల్లవేళలా; ఎందున్= అన్నిప్రదేశాలలో; అభయము= భయంలేని స్థితి; కలిమి= కలగటం; నిజము= సత్యం.

తాత్పర్యం: రాజా! మాంసం ముట్టకపోవటం అంటే ప్రాణులను వధించే ప్రీతిని వదలటమే. కనుక, అట్టివాడికి అన్నివేళలలో, అన్ని తావులలో, అన్ని భూతాలవలన అభయం కలగటం సత్యం.

విశేషం: భూతములు చరములు, అచరములు అనే వ్యవహారంగల సర్వపదార్థాలు. ఎందున్, ఎపుడు, అఖిలభూతంబుల వలన అవి ఈ మూడింటినీ చెప్పటం వలన దేశకాలపాత్రలవలన అట్టివారికి భయం కలుగదని భావం.

క. స్వాయంభువుఁ డను మనువును । నీ యర్థము సెప్పె లోకహితముగ మార్కం
డేయాదులు మాంసముడుగు । టాయుశ్శ్రీ రూపకారి యగు నని రధిపా! 296

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; స్వాయంభువుఁడు= స్వాయంభువనామం కలవాడు; అను మనువును= అనే మనువు కూడా; ఈ+అర్థము= ఈ విషయాన్ని; లోకహితముగన్= లోకానికి మేలైన విధంగా; చెప్పెన్= బోధించాడు; మార్కండేయ+ఆదులు= మార్కండేయ మహర్షి మొదలైనవారు; మాంసము= మాంస భోజనం; ఉడుగుట= మానటం; ఆయుస్+శ్రీ రూపకారి= ఆయువును, సంపదను, సౌందర్యాన్నీ కలిగించేది; అగున్= అవుతుంది; అనిరి= అన్నారు.

తాత్పర్యం: స్వాయంభువుడనే మనువు కూడా ఈ విషయాన్నే లోకానికి మేలు కలిగే విధంగా చెప్పాడు. మార్కండేయుడు మొదలైన చిరంజీవులైన మహర్షులు కూడా మాంసపుతిండి మానటం ఆయువును, సంపదను, అందచందాలను పెంపొందిస్తుందని అన్నారు.

విశేషం: తాత్పర్యంగా మాంస భోజనం ఆయువు మొదలైన వాటిని హరిస్తుందనే అర్థం గ్రహించాలి. మనువు మానవజాతి మూల పురుషుడు, మార్కండేయాదులు చిరంజీవులు. అట్టివారి ఉపదేశం వదలరానిది అని భావం.

క. విను మాంసము గోరు నరుఁడు । దనుజుఁడ చూవె! మును దేవతలు మాంసంబుం
దిను టుడిగి కాదె దానవ । జనితభయముఁ బోవఁ ద్రోవఁ జాలిరి వత్సా! 297

ప్రతిపదార్థం: వత్సా!= కుమారా!; విను= శ్రద్ధగా ఆలకింపుము; మాంసమున్= మాంసాన్ని; కోరు నరుఁడు=కోరే మనుష్యుడు; దనునజుఁడు+అ= రాక్షసుడే; చూవె!= సుమా!; మును= పూర్వం; దేవతలు= దేవలోకంవారు; మాంసంబున్= మాంసాన్ని; తినుట= తినటం; ఉడిగి= మాని; కాదె?= కదా!; దానవజనిత భయమున్= దానవులవలన పుట్టిన భయాన్ని; పోవన్= పోయేవిధంగా; త్రోవన్= త్రోసివేయటానికి; చాలిరి= సమర్థులయ్యారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కుమారా! శ్రద్ధగా వినుము. మాంసం తినగోరే మనుష్యుడు రక్కసుడే సుమా! పూర్వం దేవతలు మాంసభోజనం విడిచియే కదా - రాక్షసులవలన కలిగిన భయాన్ని పోద్రోలగలిగారు!

క. దానము ధర్మము దప మి । జ్యానిష్ఠ యనంగఁ గల్గు సత్క్రియ లెల్లన్

మానవనాథ! యహింసా । నూనాకృతు లండ్రు శ్రుతుల నూనిన పెద్దల్. 298

ప్రతిపదార్థం: మానవనాథా!= రాజా!; శ్రుతులన్= వేదాలను; ఊనిన= పట్టుకొన్న; పెద్దల్= జ్ఞానం పండిన వృద్ధులు; దానము= ఇవ్వటం; ధర్మము= సత్కార్యములు చేయటం; తపము= శరీరాన్ని నియమనిష్ఠలతో శుష్కింపజేయటం; ఇజ్యానిష్ఠ= యజ్ఞాలయందు దృఢమైన దీక్ష కలిగి ఉండటం; అనంగన్= అనగా; కల్గు సత్+క్రియలు= ఉండే మంచి పనులు; ఎల్లన్= అన్నీ; అహింసా+అనూన+ ఆకృతులు= అహింసకంటె తక్కువ కాని కార్యాలు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: రాజా! వేదార్థం చక్కగా తెలిసిన జ్ఞానసంపన్నులు దానము, ధర్మము, తపస్సు, యజ్ఞనిష్ఠ అనే ఉత్తమ క్రియలన్నీ అహింసకు తక్కువ కాని కార్యాలే అంటారు.

క. శతవర్షదుష్కరతపః । కృతి నంజుడు దినమి నగు సుకృత మివి రెండున్

మతిఁ దలఁప నొక్కరూ పని । శ్రుతివేదులు సెప్పుదురు కురుక్షితినాథా! 299

ప్రతిపదార్థం: కురుక్షితినాథా!= కురుదేశపు ప్రభూ!; శతవర్ష దుష్కరతపస్+కృతి= నూరేండ్లు చేయనలవికాని తపస్సు చేయటం; నంజుడు= మాంసం; తినమిన్= తినకపోవటంచేత; అగు సుకృతము= కలిగే పుణ్యమూ; ఇవి రెండున్= రెండూ; మతిన్= బుద్ధిలో; తలఁపన్= భావిస్తే; ఒక్క రూపు= ఒకే విధమైనవి; అని; శ్రుతివేదులు= వేదం తెలిసినవారు; చెప్పుదురు= వక్కాణిస్తారు.

తాత్పర్యం: నూరేండ్లు చేయనలవికాని తపస్సు చేయటమూ, మాంసం తినకపోవటంవలన కలిగే పుణ్యమూ- ఈ రెండూ ఒకే విధమైనవని వేదవేత్తలు చెప్పుతారు.

విశేషం: వేదానుశాసనం అంటే తిరుగులేనిమాట. మాంసం మానటం అనే ఒక్క సులభసాధ్యమైన పనితో నూరేండ్లు ఘోరమైన తపస్సు చేస్తే కలిగే పుణ్యం సాధించటం వివేకం గలవాడి పని కదా!

క. తపముల దానంబుల బ్ర । హ్మపురి నివాసంబు దప్పదనరాదు, జనా

ధిప! మాంసము నమలని పు । ణ్యపురుషునకు సులభ మందు రా నెల వార్యుల్. 300

ప్రతిపదార్థం: జన+అధిప!= రాజా!; తపములన్= తపస్సులచేతను; దానంబులన్= దానములచేత; బ్రహ్మపురి నివాసంబు= బ్రహ్మదేవుడి పట్టణంలో ఉండే మహాభాగ్యం; తప్పదు= తప్పక కలుగుతుంది; అనరాదు= అనటానికి వీలులేదు; ఆర్యుల్=ఉత్తమ పురుషులు; మాంసము= నంజుడు; నమలని పుణ్య పురుషునకున్= తినని పుణ్యంగల జనునకు; ఆ నెలవు= ఆ తావు; సులభము= తేలికగా దొరుకునది; అందురు= అంటారు.

తాత్పర్యం: రాజా! తపములు, దానములు అనే వాటిచేత బ్రహ్మలోక నివాసం తప్పదు అనరాదు. కానీ ఆర్యులు మాంసం తినని పుణ్యపురుషుడికి ఆ నెలవు తేలికగా లభిస్తుందని చెప్పుతారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: మాంసభోజనం చేయకపోవటం తపస్సులచేతను, దానాలచేతను పొందే పుణ్యవిశేషంకంటె గొప్పది అని తాత్పర్యం.

తే. అధిప! యాషాఢముఖ్యంబు లైన నెలలు । నాలుగింటను మాంసంబు నమల కుడుగు
టాయురారోగ్య బలకీర్తు లను ఫలములు । నాలుగింటిని నిచ్చు నన్నరున కండ్రు. 301

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఆషాఢ ముఖ్యంబులు= ఆషాఢం మొదలుగా గలవి; ఐన నెలలు= అయిన నెలలు; నాలుగింటను= నాలిగింటిలోను; మాంసంబు= నంజుడును; నమలక= తినక; ఉడుగుట= మానటం; ఆయుస్+ఆరోగ్య బల కీర్తులు= ఆయువు, ఆరోగ్యం, బలం, కీర్తి; అను ఫలములు= అనే ఫలితాలను; నాలుగింటిని= నాలిగింటిని; ఆ+నరునకున్= ఆ మనిషికి; ఇచ్చున్= లభిస్తాయి; అండ్రు= అంటారు.

తాత్పర్యం: రాజా! ఆషాఢం మొదలైన నాలుగు నెలలలో మాంసం తినటం మానటం ఆయువు, ఆరోగ్యం, బలం, కీర్తి అనే నాలుగు ఫలాలు ఆ మనిషికి కలిగిస్తుందని చెప్తుతారు.

విశేషం: ఆషాఢముఖ్యం అయిన నెలలు - ఆషాఢం, శ్రావణం, భాద్రపదం, ఆశ్వయుజం. ఈ నాలుగూ సాధారణంగా వర్షం పడే సమయం. రోగాలు ప్రబలుతాయి. ఆ దృష్టితో కూడా మాంసం మానటం మంచిది.

ఋషులు దయామూర్తులు. ఇంతకు ముందు పూర్తిగా మాంసం మాను మన్నారు. అది బొత్తిగా సాధ్యం కాకపోతే కనీసం ఈ నాలుగు నెలలైనా మాను మంటున్నారు.

ఆ. సగర నల దిలీప నృగ భగీరథ ముఖ్య ।నృపులు వార్షికంపు నెలలు నాల్గు
మాంసభక్షణంబు మానుట నుభయ లో । కంబులందుఁ బెంపుఁ గాంచి రండ్రు.' 302

ప్రతిపదార్థం: సగర నల దిలీప నృగ భగీరథ ముఖ్య నృపులు= సగరుడు, నలుడు, దిలీపుడు, నృగుడు, భగీరథుడు మొదలైన రాజులు; వార్షికము+నెలలు= వర్షాకాలపు నెలలు; నాల్గున్= నాలుగునూ; మాంసభక్షణంబు= మాంసం తినటం; మానుటన్= మానటంవలన; ఉభయ లోకంబులందున్= రెండు లోకాలలోను; పెంపున్= గొప్పతనాన్ని; కాంచిరి= పొందారు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: సగరుడు, నలుడు, దిలీపుడు, నృగుడు, భగీరథుడు మొదలైన మహాచక్రవర్తులందరూ వర్షాకాలం నాలుగు నెలలు మాంసం తినటం మానివేసి, ఇహపరలోకాలలో గొప్పతనం పొందారని చెప్తుతారు.'

వ. అనిన విని యజాతశత్రుండు శంతనుపుత్త్రుతో 'నిమ్మెయి మహనీయంబయిన మాంసవర్జనంబు వాటించి తక్కిన యపూపాదులు ఫలప్రభృతులు నగు భక్ష్యంబు లాచరించి యేల వర్తింప రెల్ల జనంబులు?' ననుటయు. 303

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; అజాత శత్రుండు= పుట్టని పగవారుగల ధర్మరాజు; శంతను పుత్త్రుతోన్= శంతనుడి కొడుకైన భీష్ముడితో; ఈ+మెయిన్= ఈ విధంగా; మహనీయంబు= గొప్పది; అయిన మాంసవర్జనంబు= అయిన మాంసం వదలటం; పాటించి= ఆచరించి; తక్కిన అపూప+ఆదులు= మిగిలిన పిండివంటలు మొదలైనవి; ఫలప్రభృతులు= పండ్లు మొదలైనవి; అగు భక్ష్యంబులు= అయిన తినుపదార్థాలను; ఆచరించి= తిని; ఎల్లజనంబులు= జనులందరు; ఏల= ఎందుకు; వర్తింపరు?= ప్రవర్తించరు; అనుటయున్= అనగా.

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు భీష్ముడితో 'ఈ విధంగా మిక్కిలి గొప్పదైన మాంసం విడనాడటం పాటించి తక్కిన పిండివంటలు, పండ్లు మొదలైన తినుపదార్థాలతో జనులంతా ఎందుకు ప్రవర్తించరు?' అనగా (తరువాతి పద్యంతో అన్వయం.)

మాంసభక్షణ మందలి రుచివిశేషంబు మానుట దుష్కరంబని చెప్పుట (సం.13-178-7 (కుంభ))

సీ. అతనికి నతఁ డిట్టులను మాంసముల చవి । మరగినవానికి మాన వశమె?
యట్లు గాకయు సురతాసక్తునకు బల । మొలయు నధ్వశ్రాంతుఁ డుల్లసిల్లు
క్షతము శీఘ్రమున లోపితమగుఁ గృశునకుఁ । బుష్టి వేగమ వచ్చు భూపవర్య!
విను మాంసభక్షణంబున నపూప ఫలాదు । లం దవ్విశేషంబు లరయఁగలవె?

తే. మాంస మానిన దోషంబు మహిత దాన । విధులఁ బాయు దివిజపితృవిధివిశిష్ట
మైన యెఱచి గీడొలయదు యజ్ఞములకుఁ । బశువిధానంబు వేదంబు పనుపు గాన. 304

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ ధర్మరాజునకు; అతఁడు= ఆ భీష్ముడు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= చెప్పాడు; మాంసముల చవి= నంజుడుల రుచి; మరగినవానికిన్= అలవాటు పడిన వ్యక్తికి; మానన్= మానటం; వశమె?= సాధ్యమా?; అట్లు+కాకయున్= అంతేకాక; భూపవర్య!= రాజోత్తమా!; మాంసభక్షణమునన్= మాంసం తినటంవలన; సురత+ఆసక్తునకున్= మిథునకర్మయందు తగులం కలవాడికి; బలము= సత్తువ; ఒలయున్= కలుగుతుంది; అధ్వశ్రాంతుఁడు= బాటయందు అలసినవాడు; ఉల్లసిల్లున్= ఉత్సాహం పొందుతాడు; క్షతము= గాయం; శీఘ్రమునన్= తొందరలో; లోపితము= పోయినది; అగున్= అవుతుంది; కృశునకున్= బక్కచిక్కినవాడికి; పుష్టి= శక్తి; వేగము+అ= వేగమే; వచ్చున్= వస్తుంది; విను= ఆలకించుము; అపూప ఫల+ఆదులందున్= పిండి వంటలు, పండ్లు మొదలగు వాటిలో; ఆ+విశేషంబులు= ఆ గొప్పతనాలు, అరయన్= పరిశీలింపగా; కలవె?= ఉన్నాయా?; మాంసము= ఎరచి; ఆనిన దోషంబు= తిన్న తప్పు; మహితదాన విధులన్= గొప్పవైన దానకార్యాలచేత; పాయున్= తొలగుతుంది; యజ్ఞములకున్= జన్నాలకు; పశువిధానంబు= పశువులను ఉపయోగించే పద్ధతి; వేదంబు పనుపు= వేదం చెప్పిన శాసనం; కానన్= కనుక; దివిజ పితృవిధి విశిష్టము= దేవతలకు, పితృదేవతలకు సంబంధించిన కార్యాలలో మన్నన గొప్పది; ఐన+ఎఱచిన్= అయిన మాంసంతో; కీడు= దోషం; ఒలయదు= కలుగదు.

తాత్పర్యం: ఆ ధర్మరాజుతో భీష్ము డిట్లా అన్నాడు. 'మాంసాల రుచి మరగినవారికి మానటం సాధ్యమా? అంతే కాదు. మాంసం తినటంవలన రతిమీద ప్రీతిగలవాడికి బలం కలుగుతుంది. ప్రయాణం చేసి అలసినవాడికి ఉత్సాహం కలుగుతుంది. గాయాలు తొందరగా మానుతాయి. చిక్కినవాడికి పుష్టివేగంగా కలుగుతుంది. పిండివంటలలో పండ్లలో ఈ విశేషాలు లేవు కదా! మాంసం తింటే కలిగే పాపం గొప్ప దానకార్యాలతో పోతుంది. యజ్ఞాలలో పశువును ఉపయోగించటం వేదం అనుశాసనం కనుక దైవపితృకార్యాలలో ఉపయోగించిన మాంసంవలన దోషం కలుగదు.

వ. ఇట్లు గాన నంజుడు నమలుటయు నధికదోషంబులు గాని యెడలునుం గలిగియుండు; నగస్త్యుండు రాజులకు వేఁట విధించెం గావునం గుతూహలంబుఁ గోపంబు ననియెడు భావంబులం బొరయక లోకరక్షణార్థంబుగాఁ

గ్రూరమృగ వధంబును స్వహస్తవిక్రమార్జిత మాంసంబున దేవపితృప్రీణనం బొనర్చుటకుం గాఁ బక్షి మృగమారణంబును జేయు భూనాయకుండు దురితంబులం బొరయకుండు విశేషంబు వినుము. 305

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధం; కానన్= కావున; నంజుడు= మాంసం; నమలుటయున్= తినటంకూడా; అధిక దోషంబులు= ఎక్కువ తప్పులు; కాని+ఎడలునున్= కాని సందర్భాలు కూడా; కలిగి యుండున్= ఉన్నాయి; అగస్త్యుండు= అగస్త్య మహర్షి; రాజులకున్= ప్రజల నేలే వారికి; వేఁట= జంతువులను చంపటం; విధించెన్= శాసించాడు; కావునన్= కనుక; కుతూహలంబున్= వేడుక; కోపంబున్= కోపము; అనియెడు భావంబులన్= అనే భావాలను; పొరయక= పొందక; లోక రక్షణ+అర్థంబుగాన్= లోకాలను రక్షించటం ప్రయోజనంగా; క్రూర మృగ వధంబును= క్రూర జంతువులను చంపటమూ; స్వహస్త విక్రమ+ఆర్జిత మాంసంబునన్= తనచేతి పరాక్రమంతో సంపాదించిన మాంసంతో; దేవ పితృ ప్రీణనంబు= దేవతల, పితృదేవతల ప్రీతిని; ఒనర్చుటకున్+కాన్= చేయటానికిగాను; పక్షి మృగ మారణంబును= పక్షులను, మృగాలను చంపటాన్ని; చేయు భూనాయకుండు= చేసే రాజు; దురితంబులన్= పాపాలను; పొరయక+ఉండున్= పొందకుంటాడు; విశేషంబు= ప్రత్యేకమైన సంగతి; వినుము.

తాత్పర్యం: ఇట్లు గాన మాంసం తినటం పెద్ద తప్పు కాని సందర్భాలు కూడా ఉంటాయి. అగస్త్యుడు రాజులకు వేటను విధిగా చెప్పాడు. కాబట్టి వేడుక, కోపము అనే భావాలకు చిక్కకుండా లోకరక్షణకొరకు క్రూరమృగాలను చంపటం, తన చేతిబలంతో సంపాదించిన మాంసంతో దేవపితృదేవతలకు ప్రీతికావించుటకొరకు పక్షులను, పశువులను చంపే రాజు పాపాలలో పడడు. ఒక విశేషం వినుము.

ఆ. అన్యమాంసమున నిజాంగమాంసంబుఁ బో। షింతు ననుటకంటెఁ జెట్టలేదు
మాంసభక్షణంబు మానుటకంటెను। మేలు లేదు కర్మజాలకమున. 306

ప్రతిపదార్థం: అన్యమాంసమునన్= ఇతర ప్రాణి మాంసంతో; నిజ+అంగ మాంసంబున్= తన దేహంలోని మాంసాన్ని; పోషింతున్= పెంపొందిస్తాను; అనుటకంటెన్= అనటంకంటె; చెట్ట= పాపం; లేదు; మాంసభక్షణంబు= మాంసం తినటం; మానుటకంటెను= మానుటకంటె; కర్మజాలకమునన్= కర్మముల సముదాయంలో; మేలు= మంచిపని; లేదు.

తాత్పర్యం: ఇతరప్రాణి మాంసంతో తన దేహంలోని మాంసాన్ని పెంపొందిస్తాను - అనటంకంటె పాపం మరొకటి లేదు. మాంసం తినటం మానటంకంటె కర్మముల సముదాయంలో మేలైనది మరొకటి లేదు.

తే. మాంసభక్షణ దోషంబు మాను దాన। మహిమ ననుటయు మాంసంబు మఱి భుజింప
కున్నఁ జూవె; ధర్మము లెవ్వియును దలంప। దయకు సదృశంబులే? కురుధరణినాథ! 307

ప్రతిపదార్థం: కురుధరణినాథ!= కురుదేశ ప్రభూ!; మాంసభక్షణ దోషంబు= మాంసం తినటంవలన కలిగే పాపం; దానమహిమన్= దానపు గొప్పతనంచేత; మానున్= పోతుంది; అనుటయున్= అనటం కూడా; మఱి= పిదప; మాంసంబు= మాంసం; భుజింపక+ ఉన్నన్= తినకుంటేనే; చూవె!= సుమా!; తలంపన్= భావింపగా; ధర్మములు= ధర్మాలు; ఎవ్వియును= ఏవి అయినా; దయకున్= కరుణకు; సదృశంబులే?= సాటి అగునా?

తాత్పర్యం: రాజా! మాంసం తినటంవలన కలిగే పాపం దానాల మహిమవలన పోతుంది అనటంకూడా ఇక అటుపై మాంసం తినకుంటేనే సుమా! ధర్మా లేవైనా దయకు సాటి అవుతాయా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ప్రాయశ్చిత్తాలు ఉన్నాయి కదా! అని పాపాలు చేయటంవలన దోషాలు ప్రాయశ్చిత్తాలవలన కూడా పోవు.

తే. ఆత్మ సదృశత ప్రాణభయంబునందుఁ । బ్రాణులకు నెల్లఁ గని మాంసభక్షణంబు
మాను దయ నార్ద్రమానసుండైన పురుషుఁ । డాతనికి బ్రహ్మలోకాదు లాటపట్టు. 308

ప్రతిపదార్థం: దయన్= జాలితో; ఆర్ద్రమానసుండు= మెత్తని హృదయంగలవాడు; ఐన పురుషుఁడు= అయిన నరుడు; ప్రాణులకున్= ప్రాణంగలవాటికి; ఎల్లన్= అన్నింటికీ; ప్రాణభయంబునందున్= ప్రాణం విషయంలోని భయమునందు; ఆత్మసదృశతన్= తన పోలికను; కని= చూచి; మాంసభక్షణంబు= మాంసం తినటం; మానున్= మానివేస్తాడు; ఆతనికిన్= అట్టివాడికి; బ్రహ్మలోక+ఆదులు= బ్రహ్మలోకం మొదలైనవి; ఆటపట్టు= ఆడుకొనే చోటు.

తాత్పర్యం: దయతో మెత్తని హృదయంకల నరుడు ప్రాణులన్నింటికీ ప్రాణభయంలో తనవంటి స్థితినే చూచి మాంసం తినటం మానివేస్తాడు. అతడికి బ్రహ్మలోకం మొదలైనవి క్రీడారంగాలు.

విశేషం: ఆటపట్టులో స్వేచ్ఛగా ఆనందంతో తిరిగే విధంగా అట్టివాడు బ్రహ్మలోకాదులలో విహరిస్తాడని భావం.

క. భూతముల కలుగు నతనికి । భూతము లఖిలములు నలుగు భూతహితార్థీ!
భూతముల కభయ మిచ్చిన । పూతాత్మున కభయ మిచ్చు భూతావలియున్. 309

ప్రతిపదార్థం: భూతహిత+అర్థీ!= ప్రాణుల మేలు కోరేవాడా!; భూతములకున్= ప్రాణుల విషయంలో; అలుగు+అతనికిన్= పగపెట్టుకొనేవాడికి; భూతములు=ప్రాణులు; అఖిలములు= అన్నీ; అలుగున్= పగ కలిగి ఉంటాయి; భూతములకున్= ప్రాణులకు; అభయము= భయం లేని తనాన్ని; ఇచ్చిన పూత+ఆత్మునకున్= ఇచ్చిన పవిత్ర హృదయుడికి; భూత+ఆవలియున్= ప్రాణుల వరుసలు కూడా; అభయము= అభయాన్ని; ఇచ్చున్= ఇస్తాయి.

తాత్పర్యం: ధర్మరాజా! ప్రాణుల విషయంలో పగ గలిగి ఉన్న వాడియెడల ప్రాణులు కూడా శత్రుభావంతోనే ఉంటాయి. ప్రాణులకు అభయం ఇచ్చే పవిత్రహృదయుడికి అవి కూడా అభయం ఇస్తాయి.

ఆ. దానమును దపంబు ధర్మంబు యజ్ఞంబు । శౌచ మంత్రతంత్ర సత్యములును
బుధు లహింస రూపములు గాఁగఁ జెప్పుట । నెల్లకల్మి సుమ్మహింస కలిమి. 310

ప్రతిపదార్థం: బుధులు= వివేకంగలవారు; దానమును= ఈగిని; తపంబున్= తపస్సును; ధర్మంబున్= ధర్మమును; యజ్ఞంబున్= యజ్ఞాన్నీ; శౌచ మంత్ర తంత్ర సత్యములును= శుద్ధి మంత్రము, అనుష్ఠానము, సత్యము అనువాటిని; అహింసరూపములు= అహింస యొక్క మరొక రూపములు; కాఁగన్= అవటాన్ని; చెప్పుటన్= చెప్పటంచేత; అహింస కలిమి= అహింస ఉండటం; ఎల్లకల్మి= అన్నింటి సంపదయే; సుమ్మ!= సుమా!

తాత్పర్యం: వివేకవంతులు దానం, ధర్మం, తపస్సు, యజ్ఞం, పరిశుద్ధత, మంత్రం, అనుష్ఠానం, సత్యం - ఇవన్నీ అహింసరూపాలే అని చెప్పటంవలన అహింస అనే సంపద ఉంటే అన్ని సంపదలు ఉన్నట్లే.

క. నరనాథ! యహింసా గుణ । పరిగణనము గొంత మాత్రఁ బలికితి ధర్మో
త్తర యగు నహింస మేలిమి । యరయుం గడుఁ బెద్ద దాని నలవఱుపు మదిన్.' 311

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నరనాథ!= ప్రజాపాలకా!; అహింసా గుణ పరిగణనము= అహింస అనే గుణాల లెక్క; కొంతమాత్రన్= కొంతమాత్రమే; పలికితిన్= చెప్పాను; ధర్మ+ఉత్తర= ధర్మం తుదిగా ఉన్నది; అగు+అహింస మేలిమి= అయిన అహింస యొక్క గొప్పతనం; అరయన్= పరికించగా; కడున్= మిక్కిలి; పెద్ద= ఎక్కువ అయినది; దానిన్= దానిని; మదిన్= హృదయంలో; అలవఱుపు= అభ్యాసం చేయుము.

తాత్పర్యం: రాజా! అహింసయొక్క మహిమను కొంతమాత్రమే చెప్పాను, అది ధర్మమే పర్యవసానంగా గలది. దాని మహిమ పరిశీలించి చూస్తే చాలా గొప్పది. కనుక దానిని హృదయంలో అభ్యాసం చేయాలి.'

ఆ. అనిన సంతసిల్లి యమ్మహీపతి తాత । కధికభక్తి మ్రొక్కి 'యస్మదీయ
సంగరంబునందుఁ జచ్చినవారల । కేది గతియొ నాకు నెఱుఁగఁ జెప్పు. 312

ప్రతిపదార్థం: అనినన్= అనగా; సంతసిల్లి= ఆనందపడి; ఆ+మహీపతి= ఆ రాజు; తాతకున్= తాత అయిన భీష్ముడికి; అధికభక్తిన్= ఎక్కువ అయిన భక్తితో; మ్రొక్కి= పాదనమస్కారం చేసి; అస్మదీయ సంగరంబునందున్= మాదైన యుద్ధంలో; చచ్చినవారలకున్= మరణించినవారికి; ఏది; గతియొ=గతియో; నాకున్; ఎఱుఁగన్= తెలిసేవిధంగా; చెప్పు= చెప్పుము.

తాత్పర్యం: అనగా సంతోషించి ధర్మరాజు మిక్కుటమైన భక్తితో తాతకు దండనమస్కారం చేసి 'మాదైన యుద్ధంలో చచ్చినవారు ఎక్కడికి పోతారో నాకు తెలియజెప్పుము. (అని అడిగాడు)

క. బ్రదుకును జావును సుఖదుః । ఖదములుగా జంతుకోటి కరుణామూర్తీ!
మదిఁ దలఁచుఁ బ్రాణలాభము । వదలు టరిదిగాన నట్టివారి నడిగితిన్.' 313

ప్రతిపదార్థం: కరుణామూర్తీ!= జాలియే రూపమైన ఓ తాతా!; జంతుకోటి= ప్రాణుల సముదాయం; బ్రదుకును= జీవించి ఉండటాన్నీ; చావును= మరణాన్నీ; సుఖదుఃఖదములుగాన్= సుఖాన్నీ, దుఃఖాన్నీ ఇచ్చేవిగా; మదిన్= హృదయంలో; తలఁచున్= భావిస్తుంది; ప్రాణలాభము= ప్రాణం పొందటం అనేదానిని; వదలుట= విడిచిపెట్టటం; అరిది= చాలా అపురూపమైన విషయం; కానన్= కనుక; అట్టివారిన్= ఆ విధంగా ప్రాణం వదలినవారిని గూర్చి; అడిగితిన్= అడిగాను.

తాత్పర్యం: దయామూర్తీ! ప్రాణులు బ్రదుకు సుఖమిచ్చేదనీ, చావు దుఃఖాన్నీ కలిగిస్తుందనీ మనస్సులో భావిస్తూ ఉంటారు. ఉన్న ప్రాణాన్ని వదలుకొనటం చాలా అరుదు. కనుక అట్టివారిని గూర్చి అడిగాను.

విశేషం: సర్వప్రాణకోటికీ మిక్కిలి ప్రియమైనది ప్రాణం. యుద్ధానికి రావటమంటే దానిని చేజేతులా వదలుకొనటానికి సిద్ధపడటమే కదా! ఇది చాలా అరుదైన విషయం. ప్రాణంకంటె మిన్నగా దేనిని ఆశించి జనులు యుద్ధాలలో మరణిస్తారు? అని ధర్మరాజు ఆంతర్యం. 'కరుణామూర్తీ!' అనే సంబోధన చాలా అర్థవంతం. 'యుద్ధంలో నిన్ను నేను రూపుమాపదలచాను. అట్టి నాయందు ఏ విధమైన ద్వేషం పూనక నేను అడిగిన ధర్మాలన్నీ ఆప్యాయంగా చెప్పుతున్నావు. ఇంతకంటె కరుణకు నిదర్శనం ఏమిటి?'అనిస్ఫూర్తి.

క. అనుటయు 'లెస్సగఁ దలఁచితి । విను మొక కీటంబునకును వేదవ్యాసం
బున లోకహితమొనర్చిన । మునికి నయిన సత్కథనము మునినుతచరితా! 314

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; మునినుతచరితా!= మునులు కొనియాడే నడవడిగలవాడా!; లెస్సగన్= మేలుగా; తలఁచితి= భావించావు; ఒక కీటకంబునకును= ఒక పురుగునకూ; వేదవ్యాసంబునన్= వేదాలను విడమరచి చూపటంతో; లోకహితము= లోకం మేలు; ఒనర్చిన మునికిన్= చేసిన మహర్షికీ; అయిన సత్+కథనమున్= జరిగిన మంచి ప్రసంగాన్ని; విను= ఆలకించుము.

తాత్పర్యం: అని అంటే 'మంచివాడా! నీవు చాలా చక్కగా భావించావు. ఒక పురుగునకూ, వేదవ్యాసమహర్షికీ జరిగిన సంభాషణ చెప్పుతాను వినుము.

విశేషం: 'మునినుతచరితా!' అనే సంబోధనపై 'కరుణామూర్తీ' అనే సంబోధనకు సమాధానగర్భితమైనది. 'నీవు యుద్ధంచేయటం లోకసామాన్య విషయంకాదు. దానిని గూర్చి నీవు పశ్చాత్తాపం పొందటమే. నీ శీలం మునులకు కూడా ప్రశంసనీయం అని చెప్పుతున్నది' అనే స్ఫూర్తిని అందులో అందుకొనాలి. వేద... మునికిన్ అని సాగదీయటం గౌరవవిశేషాన్ని అభివ్యక్తం చేయటం కొరకు.

వ. దాన నీ యడిగిన యర్థంబు తెల్లం బగు' నని పలికి భీష్ముం డిట్లనియె. 315

ప్రతిపదార్థం: దానన్= ఆ సంభాషణచేత; నీ+అడిగిన అర్థంబు= నీవడిగిన విషయం; తెల్లంబు= స్పష్టం; అగున్= అవుతుంది; అని; పలికి= మాటాడి; భీష్ముండు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ సంభాషణచేత నీవడిగిన విషయం స్పష్టంగా తెలుస్తుంది' అని పలికి భీష్ము డిట్లా అన్నాడు.

క. శకటపథంబునఁ గీటం । బొకటి వెసం బాఱఁ గాంచె యోగీంద్రుఁడు జం
తుకలాప మానసదశా । ప్రకార సంవేది బాదరాయణుఁ డధిపా! 316

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; యోగి+ఇంద్రుఁడు= యోగులలో శ్రేష్ఠుడు; జంతు కలాప మానస దశా ప్రకార సంవేది= జంతువుల సముదాయపు హృదయాలలోని దశల తీరులను చక్కగా తెలిసికొనేవాడు; బాదరాయణుఁడు= శ్రీ వేదవ్యాసుడు; శకటపథంబునన్= బండిదారిలో; కీటకంబు= పురుగు; ఒకటి= ఒకటి; వెసన్= వడిగా; పాఱన్= పరుగెత్తుతూ ఉండగా; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: యోగులలో శ్రేష్ఠుడు, జంతువుల హృదయాల తీరులను చక్కగా తెలిసికొనగలవాడు అయిన వేదవ్యాసుడు బండ్లు నడచేదారిలో ఒక పురుగు వేగంగా పరుగుతీస్తూ ఉండగా చూచాడు.

విశేషం: బాదరాయణుడు - బదరీవనం (రేగుతోట) స్థానంగా కలవాడు యోగీంద్రుడు కనుకనే జంతువుల హృదయభావాలను తెలిసికొనగలుగువాడని భావన.

వ. కాంచి నిరూపించి యాకృష్ణద్వైపాయనుం డక్కీటకంబుతో 'నీవు భయంబున రయం బెసఁగం బాఱెదవు కారణం బేమి?' యని యడిగిన నది యమ్మునీంద్రున కిట్లనియె. 317

ప్రతిపదార్థం: కాంచి= చూచి; నిరూపించి= తనవలన ప్రమాదం కలుగదని దానికి నమ్మకం కలిగించి; ఆ+కృష్ణద్వైపాయనుండు= ఆ వ్యాసమహర్షి; ఆ+కీటకంబుతోన్= ఆ పురుగుతో; నీవు; భయంబునన్= భీతితో; రయంబు= వేగం; ఎసఁగన్= ఎక్కువ

అయ్యే విధంగా; పాఱెదవు= పరుగెత్తుతున్నావు; కారణంబు= హేతువు; ఏమి?; అని అడిగినన్= అడిగితే; అది= ఆ పురుగు; ఆ+ముని+ఇంద్రునకున్= ఆ మహర్షిశ్రేష్ఠుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: చూచి, దానిని ఆపి, ఆ వ్యాసభగవానుడు ఆ పురుగుతో 'నీవు భయంతో మిక్కిలి వేగంతో పారిపోతున్నావు. దీనికి కారణం ఏమిటి?' అని అడిగితే ఆ పురుగు ఆ మునిశ్రేష్ఠుడితో ఇట్లా అన్నది.

విశేషం: కృష్ణద్వైపాయనుడు - నల్లనివాడు, ద్వీపం స్థానంగా కలవాడు; యమునానది ద్వీపంలో సత్యవతీపరాశరులకు పుట్టి అక్కడ ఉంటూ ఉంటాడు. బదరికావనంలో కూడా ఉంటాడు.

తే. 'తెప్పతెరలంగ బండు లేతెంచుచున్న । యవి మహాత్మ! తన్నేమిజాతారవములఁ
గడఁక నెడ్లను దఱిమి రొప్పెడు నరాలి । యులివు విని యుల్లమునఁ గడునులుకు పుట్టి. 318

ప్రతిపదార్థం: మహాత్మ!= దొడ్డబుద్ధిగలవాడా!; తెప్పతెరలంగన్= మిక్కిలి వేగంగా; బండులు= బండ్లు; ఏతెంచుచున్న+అవి= వస్తున్నాయి; తత్+నేమి జాత+ఆరవములున్= వాటి చక్రపు పట్టాలనుండి పుట్టిన పెనురొదలు; కడఁకన్= మిక్కిలి పూనికతో; ఎడ్లను= ఎద్దులను; తఱిమి= వెంటబడి; రొప్పెడు నర+ఆలి ఉలివున్= తోలే జనసముదాయాల నాదాన్నీ; విని; ఉల్లమునన్= గుండెలో; కడున్= ఎక్కువ అయిన; ఉలుకు= గుబులు; పుట్టి= కలిగి.

తాత్పర్యం: 'మహాత్మా! మీద మీద వేగంగా బండ్లు వస్తున్నాయి. వాటి పట్టాల చప్పుళ్లు, ఎడ్లను పూనికతో తోలే జనాల అరుపులు విని నా గుండెలో గుబులు పుట్టింది.

వ. బ్రదుకును జావును బరమసుఖంబును నత్యంత దుఃఖంబునుం గాదె? కావున. 319

ప్రతిపదార్థం: బ్రదుకును= జీవితమూ; చావును= మరణమూ; పరమసుఖంబునున్= మిక్కిలి సుఖమూ; అత్యంత దుఃఖంబునున్= మిక్కిలి ఎక్కువ దుఃఖమూ; కాదె?= కదా!; కావునన్= కనుక.

తాత్పర్యం: బ్రదుకు ఎంతో సుఖమైనది. చావు మిక్కిలి దుఃఖాన్ని కలిగించేది కదా! కనుక. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. క్రందున మేను సిదియు నను । కొందల పాటొంది ప్రాణగొడ్డమగుటఁ ద
ప్పం దొలఁగఁ బాఱెదను ముని । బృందారక! యసదె ప్రాణభీతి దలంపన్?' 320

ప్రతిపదార్థం: క్రందునన్= ఒత్తిడిలో; మేను= దేహం; చిదియున్= నలిగిపోతుంది; అను కొందలపాటు= అనే కంగారు; ఒంది= పొంది; ప్రాణగొడ్డము= ప్రాణం పోయేపని; అగుటన్= కావటంవలన; తప్పన్= తప్పించుకొనటానికి; తొలఁగన్+పాఱెదను= తొలగిపోతున్నాను; ముని బృందారక!= మునివరా!; తలంపన్= ఆలోచిస్తే; ప్రాణభీతి= ప్రాణానికి సంబంధించిన భయం; అసదె?= తక్కువదా?

తాత్పర్యం: సందడిలో దేహం నలిగిపోతుందనే కంగారుతో ప్రాణంపోయే పని కనుక తప్పించుకొని తొలగి పోతున్నాను. భావిస్తే ప్రాణభీతి ప్రాణికి తక్కువది కాదు కదా!'

చ. అన విని దాని కిట్టులను నమ్మహితాత్మకుఁ డెంతలెస్స? నీ
మనికి దలంప నింద్రియసమాజసుఖంబులఁ బొందఁ గీటము
ల్గను టదిలేదు దుఃఖబహుళం బిది యీ యొడ లేల? చావు నీ
కనయము సౌఖ్యకారియగు నత్తెఱఁ గీవు దలంచి చూడుమా!' 321

ప్రతిపదార్థం: అనన్= అనగా; విని; ఆ+మహిత+ఆత్మకుఁడు= మిక్కిలి గొప్ప ఆత్మకల ఆ వ్యాసుడు; దానికిన్= ఆ పురుగునకు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అన్నాడు; తలంపన్= భావింపగా; నీ మనికి= నీ బ్రదుకు; ఎంత= ఏ మాత్రం; లెస్స?= మేలైనది? కీటముల్= పురుగులు; ఇంద్రియ సమాజ సుఖంబులన్= ఇంద్రియాల సముదాయంవలన కలిగే సుఖాలను; పొందన్+కనుట= పొందగలగటం; అది= అనేది; లేదు; ఇది+ఈ+ఒడలు= ఈ దేహం; దుఃఖబహుళంబు= దుఃఖాలు పెల్లుగా గలది; ఏల?= ఇట్టిది నీ కెందుకు?; నీకున్= నీకు; చావు= మరణం; అనయము= ఎల్లప్పుడు; సౌఖ్యకారి= సుఖాన్ని కలిగించేది; అగున్= అవుతుంది; ఈవు= నీవు; ఆ+తెఱఁగు= ఆ పద్ధతిని; తలంచి= భావించి; చూడుమా!= చూడుము.

తాత్పర్యం: అన్నమాట విని ఆ మహానుభావుడు దానితో ఇట్లా అన్నాడు. నీ బ్రదుకు ఎంత మేలైనది? పురుగులు ఇంద్రియసుఖాలు పొందే వీలు అంతగా లేదు కదా! పెక్కు దుఃఖాలకు తావైన ఈ దేహం ఎందుకు? నీకు చావే సుఖం కలిగిస్తుంది. ఆ పద్ధతి ఆలోచించి చూడుము.'

విశేషం: తత్త్వం గ్రహించటానికే ఈ ధోరణి కాని నిజంగా దాని చావు వ్యాసుడు కోరుతున్నాడని అర్థం గ్రహించరాదనటం కొరకు "మహితాత్మకుఁడు" అనే పదాన్ని కవి ప్రయోగించాడు.

వ. అనుటయు నక్కీటంబు. 322

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; ఆ+కీటంబు= ఆ పురుగు.

తాత్పర్యం: అని అనగా ఆ పురుగు ఇట్లా అంటున్నది.

తే. 'అనఘ! కీటంబులకు విషయజములైన । సౌఖ్యములఁ బొంద లే దను చదువు గలదె?
వినుము తమతమ తెరువుల ననుభవింపఁ । గలదు చావును భీతికిఁ గారణంబు. 323

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; కీటంబులకున్= పురుగులకు; విషయజములు= శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనే విషయాలవలన పుట్టేవి; ఐన సౌఖ్యములన్= అయిన సౌఖ్యాలను; పొందన్= పొందుటకు; లేదు= అవకాశం లేదు; అను చదువు= అనే విద్య; కలదె?= ఉన్నదా?; వినుము; తమతమతెరువులన్= తమ తమదారులలో; అనుభవింపన్= అనుభవించటానికి; కలదు= వీలు ఉన్నది; చావును= చావు కూడా; భీతికిన్= భయానికి; కారణంబు= హేతువు.

తాత్పర్యం: 'మహాత్మా! పురుగులకు విషయసుఖాలు పొందే వీలులేదనే విద్య ఉన్నదా? అవి కూడా తమతమ దారులలో సుఖాల ననుభవిస్తాయి. అట్లాగే చావు భయానికి కారణం అవుతుంది.

వ. నీవు నా మనం బరసి; తింతియ కాక యింత యెఱుంగవే? యది యట్లుండె నా తెఱం గవధరింపు; మేను దొలుమేన నొక్క శూద్రుండ ధనవంతుండ. 324

ప్రతిపదార్థం: నీవు; నా మనంబు= నా హృదయాన్ని; అరసితి(వి)= పరీక్షించావు; ఇంతియ= ఇంతే; కాక; ఇంత= ఈ మాత్రం; ఎఱుంగవే?= తెలియవా? అది= ఆ విషయం; అట్లు= ఆ విధంగా; ఉండెన్= ఉన్నది; నా తెఱంగు= నా తీరు; అవధరింపుము= చక్కగా వినుము; ఏను= నేను; తొలుమేనన్= పూర్వదేహంలో; ఒక్కశూద్రుండన్= ఒక నాల్గవజాతివాణ్ణి; ధనవంతుండన్= శ్రీమంతుణ్ణి;

తాత్పర్యం: నీవు నా మనస్సును పరీక్షించావు కాని ఈ చిన్న విషయం నీకు తెలియనిదా? అది అట్లా ఉండనిమ్ము. నా సంగతి వినుము. నేను వెనుకటి జన్మలో ఒక శూద్రుడను. గొప్ప ధనం కలవాడను. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **ఆచారహీనత యతిలోభ మన్యధ । నాపేక్ష క్రూరత యవినయంబు**
మొదలైన దుర్గుణంబులకు నెల్లను నెల । వైయుండి మాతకు నధికభక్తిఁ
బ్రీతి యెప్పుడు నొనరింతు; బ్రాహ్మణమాత్రుఁ । డతిథి యొక్కరుఁ డొక యప్పు డరుగు
దెంచిన నతనిఁ బూజించితి నది కార । ణముగ జాతిస్మరణంబు గలిగె

తే. **మంచికర్మము సుఖము నొందించు టిపుడు । గాన వచ్చె మునీశ్వర! కరుణ నాకు**
నత్తెఱం గెఱింగింపవే!' యతివిశదము । గాఁగ ననవుడు నాతండు గారవమున. **325**

ప్రతిపదార్థం: ఆచారహీనత= మంచి నడవడి లేకపోవటం; అతిలోభము= మిక్కిలి పిసినిగొట్టుతనం; అన్య ధన+అపేక్ష= ఇతరుల సొమ్ముపై కోరిక, క్రూరత= దయలేనితనం; అవినయంబు=పెద్దలయెడల నమ్రత లేకపోవటం; మొదలు+ఐన దుర్గుణంబులకున్= మొదలైన చెడు గుణాలకు; ఎల్లను= అన్నింటికీ; నెలవు= నివాసపుచోటు; ఐ; ఉండి= (కూడ); మాతకున్= తల్లికి; అధికభక్తిన్= మిక్కిలి భక్తితో; ఎప్పుడున్= ఎల్లవేళలా; ప్రీతిన్= ప్రియాన్ని; ఒనరింతున్= చేసేవాడిని; ఒక+ అప్పుడు= ఒక సమయంలో; బ్రాహ్మణమాత్రుఁడు= కేవలం పుట్టుకచేత బ్రాహ్మణుడైనవాడు; అతిథి= తిథి నియమంలేకుండా వచ్చినవాడు; ఒక్కరుఁడు= ఒకడు; అరుగుదెంచినన్= రాగా; అతనిన్= అతడిని; పూజించితిన్= గౌరవించాను; అది= ఆ పూజ; కారణముగన్= కారణంగా; జాతి స్మరణంబు= పూర్వజన్మజ్ఞానం తలపగలగటం; కలిగెన్= కలిగింది; ముని+ఈశ్వర!= మునిశ్రేష్ఠా; మంచి కర్మము= మంచిపని; సుఖమున్= సుఖాన్ని; ఒందించుట= కలిగించటం; ఇపుడు= ఇప్పుడు; కానవచ్చెన్= తెలియవచ్చింది; ఆ+తెఱంగు= ఆ పద్ధతి; నాకున్= నాకు; కరుణన్= జాలితో; అతి విశదము= తేటతెల్లం; కాఁగన్= అయ్యేవిధంగా; ఎఱింగింపవే!= తెలుపుమా!; అనవుడున్= అని అంటే; ఆతండు= ఆ వేదవ్యాసుడు; గారవమునన్= ప్రీతితో.

తాత్పర్యం: ఆచారం లేకపోవటం, అత్యాశ, ఇతరుల ధనాన్ని కోరటం, క్రౌర్యం, వినయం పాటించకపోవటం మొదలైన చెడు లక్షణాలకు నివాసభూమిగా ఉన్నాను. అయినా తల్లికి ఎక్కువ భక్తితో ఎప్పుడూ ప్రీతి కలిగించాను. ఒకనాడు ఒక బ్రాహ్మణుడు అతిథిగా వస్తే అతడిని గౌరవించాను. దానివలన పూర్వజన్మస్మరణ కలిగింది. మంచి కర్మం సుఖం కలిగిస్తుంది - అనే సంగతి ఇప్పుడు నాకు తెలిసింది. మునీశ్వరా! దయతో నాకా విషయం తేటతెల్లంగా చెప్పుము' అంటే అతడు బుజ్జగింపుతో. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: ఎన్ని దుర్గుణాలున్నా మంచిపని వ్యర్థం కాదని ఈ పద్యం చెప్తున్నది.

వ. ఆ జంతువుం గనుంగొని 'నీవు సెప్పనేల? దుష్కర్మకోటివలనం గీటంబ వగు టెఱింగితి భవదాచరితంబు లైన సత్కర్మంబులుం గాంచితి నమ్మేలునకు సంతోషించి కాదె నీతో సంభాషించితి! మదీయ తపోవిశేషంబున నీదయిన కీటత్వం బపనయించెద విషాదం బపనయింపుము; తపోబలంబును గడచినబలంబులుం గలవే? మనుష్యజన్మంబు నొంది మేలొనర్చెద ననుకోర్కి నీకుం బుట్టుట మేలు; మానవులకుం గర్మభూమికృతంబులైన సదసత్కర్మంబులం జూవె దేవతలును గీటంబులు నగుట వాటిల్లెడు' నని పలికి వెండియు. 326

ప్రతిపదార్థం: ఆ+జంతువున్= ఆ ప్రాణిని; కనుంగొని= చూచి; నీవు; చెప్పన్+ఏల?= చెప్పటం ఎందుకు? దుష్కర్మ కోటివలనన్= పాపపు పనుల ఎక్కువతనంవలన; కీటంబవు= పురుగువు; అగుట= కావటం; ఎఱింగితిన్= తెలిసికొన్నాను; భవత్+ఆచరితంబులు= నీవు చేసినట్టివి; ఐన సత్+కర్మంబులున్= అయిన పుణ్యకార్యాలు కూడా; కాంచితిన్= పరికించాను; ఆ+మేలునకున్= ఆ మంచిపనికి; సంతోషించి= ఆనందించి; కాదె!= కదా!; నీతోన్= నీతో; సంభాషించితిన్= ప్రసంగం చేశాను; మదీయ తపస్+ విశేషంబునన్= నాదైన గొప్పదగు తపస్సుచేత; నీ+అది= నీకు సంబంధించినది; అయిన కీటత్వంబు= అయిన పురుగుతనం; అపనయించెదన్= పోగొట్టుతాను; విషాదంబు= దుఃఖం; అపనయింపుము= తొలగించుకొనుము; తపస్+బలంబును= తపస్సు శక్తిని; కడచిన బలంబులున్= మించిన బలాలు; కలవే?= ఉన్నవా?; మనుష్య జన్మంబున్= మానవుడి పుట్టుకను; ఒంది= పొంది; మేలు= మంచిపని; ఒనర్చెదన్= చేస్తాను; అను కోర్కి= అనే కోరిక; నీకున్= నీకు; పుట్టుట= కలగటం; మేలు= మంచిది; మానవులకున్= మనుష్యులకు; కర్మభూమి కృతంబులు= కర్మలకు సంబంధించిన భూమియందు చేసినట్టివి; ఐన సత్+అసత్+ కర్మంబులన్= మంచి చెడు పనులచేత; చూవె!= సుమా!; దేవతలును= దేవలోకంవారు; కీటంబులును= పురుగులు మొదలగు జంతువులును; అగుట= కావటం; పాటిల్లెడున్= సంభవిస్తుంది; అని; పలికి= మాట్లాడి; వెండియున్= ఇంకా.

తాత్పర్యం: ఆ జంతువు చూచి, 'నీవు చెప్పటం ఎందుకు? పాపాల సముదాయంవలన నీవు పురుగు అయిన సంగతి నాకు తెలుసు. నీవు చేసిన పుణ్యకార్యాలు కూడా నేను గుర్తించాను. ఆ మంచిపనికి సంతోషించి కదా - నీతో సంభాషణ చేశాను! నాదైన గొప్ప తపస్సు చేత నీ పురుగుతనాన్ని పోగొడతాను. నీవు విచారం మానుము. తపశ్శక్తిని మించిన శక్తులు లేవు. మనుష్యజన్మం పొంది మంచి పనులు చేస్తాననే కోరిక నీకు కలగటం కూడా మంచిదే. ఇది కర్మభూమి. మనుష్యులు ఇక్కడ చేసిన మంచిపనులవలన దేవతలవుతారు. పాపకార్యాలవలన పురుగులుగా పుట్టుతారు అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

క. సుకృతము లమ్మెయిఁ గల్గుట । నకట! జనిస్మృతియుఁ గల్గె నస్మత్సంద
ర్శకతయు నీకు నొదవె నో । డకు మున్నతపదము నిచ్చుటకు మెయికొంటిన్. 327

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ విధంగా; సుకృతములు= మంచి పనులు; కల్గుటన్= కలిగిన కారణంగా; అకట!= అయ్యో!; జనిస్మృతియున్= పూర్వపు పుట్టుక గుర్తు రావటం; కల్గెన్= కలిగింది; అస్మత్+సందర్శకతయున్= నన్ను చక్కగా చూడగలగటం కూడా; నీకున్= నీకు; ఒదవెన్= కలిగింది; ఓడకుము= భయపడకుము; ఉన్నతపదమున్= గొప్ప స్థానం; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; మెయికొంటిన్= అంగీకరించాను.

తాత్పర్యం: ఆ పుణ్యాలు కలగటంవలననే నీకు పూర్వజన్మ గుర్తుకు రావటం, నన్ను చూడగలగటం కలిగాయి. సంకోచపడకుము. నీకు ఉన్నత స్థానం ఇవ్వటానికి అంగీకరించాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అత్తెఱం గాకర్ణింపుము. 328

ప్రతిపదార్థం: ఆ+తెఱంగు= ఆ పద్ధతి; ఆకర్ణింపుము= చక్కగా చెవులబెట్టు.

తాత్పర్యం: ఆ తీరు వినుము.

వేదవ్యాసుఁడు గీటంబునకు నుత్తమజన్మంబులు గలుగ ననుగ్రహించుట (సం.13-180-1(కుంభ))

ఆ. నీచ శూద్రవైశ్య నృపజన్మములఁ గ్రమ । వృత్తి నొందు మెపుడుఁ జిత్తమునకుఁ
బు ట్టెఱుంగునట్టి పోఁడిమి నొసఁగితి । ధర్మపరుఁడు వగుదు దానఁ జేసి.' 329

ప్రతిపదార్థం: నీచ శూద్ర వైశ్య నృప జన్మములన్= మనుష్యజన్మకంటె క్రిందివైన గోజన్మ మొదలైనది, శూద్రజన్మ, వైశ్యజన్మ, క్షత్రియుడి పుట్టుక అనే వాటిని; క్రమవృత్తిన్= క్రమమైన తీరుతో; ఒందుము= పొందుము; ఎపుడున్= అన్ని జన్మల సమయాలలోను; చిత్తమునకున్= హృదయానికి; పుట్టు= పుట్టుక; ఎఱుంగు+అట్టి పోఁడిమిన్= తెలిసికొనగల సమర్థతను; ఒసఁగితిన్= ఇచ్చాను; దానన్+చేసి= దానివలన; ధర్మపరుఁడవు= ధర్మమునందు మిక్కిలి ఆసక్తికలవాడవు; అగుదు(వు)= ఔతావు.

తాత్పర్యం: జంతుజన్మలు, శూద్ర, వైశ్య, క్షత్రియ జన్మలు క్రమంగా పొందుము. ఆ అన్ని జన్మలలో నీ హృదయానికి పూర్వజన్మజ్ఞానం కలిగే శక్తి ఇచ్చాను. దాని వలన ధర్మశ్రద్ధకలవాడవు కమ్ము.'

విశేషం: పుట్టెఱుంగుట అంటే ఈ పుట్టుకకు కారణం ఏమిటో తెలియటం. అది తెలిస్తే పాపాచరణకు జీవుడు సిద్ధపడడు.

క. అని సాత్యవతేయుఁడు గృప । నెనసి సుధాధారఁ బోలు నీక్షణముం ద
త్తనువున నిగిడించిన న । మ్మునిపతిఁ గీర్తించె భూతములు ప్రీతములై. 330

ప్రతిపదార్థం: అని= ఇట్లు పలికి; సాత్యవతేయుఁడు= సత్యవతి కుమారుడగు వ్యాసుడు; కృపన్= దయను; ఎనసి= పొంది; సుధాధారన్= అమృతధారను; పోలు+ఈక్షణమున్= పోలునట్టి చూపును; తద్+తనువునన్= అతడి దేహంమీద; నిగిడించినన్= పరపగా; ఆ+మునిపతిన్= మహర్షులలో శ్రేష్ఠుడైన ఆతడిని; భూతములు= ప్రాణులు; ప్రీతములు= ప్రేమకలవి; ఐ; కీర్తించెన్= కొనియాడినవి.

తాత్పర్యం: ఇట్లా పలికి, వ్యాసుడు దయ పూని అమృతధారవంటి చూపును ఆ పురుగు దేహంమీద సారించాడు. అప్పుడు సర్వభూతాలు ప్రీతిపొంది, ఆ మహర్షిని కొనియాడాయి.

క. అక్కీటంబును భక్తిన్ । మ్రొక్కి శిరం బతని పాదముల మోపి మనం
బెక్కుడు ప్రమోదమునఁ గడుఁ । జొక్కఁగఁ దదనంతరమ యసువులం దొఱఁగెన్. 331

ప్రతిపదార్థం: ఆ+కీటంబును= ఆ పురుగు కూడా; భక్తిన్= భక్తితో; మ్రొక్కి= చాగిలపడి; శిరంబు= తల; అతని పాదములన్= అతడి పాదాలమీద; మోపి= ఆనించి; మనంబు= మనస్సు; ఎక్కుడు ప్రమోదమునన్= ఎక్కువ అయిన గొప్ప ఆనందంతో; కడున్= మిక్కిలిగా; చొక్కఁగన్= పరవశించగా; తద్+అనంతరము+అ= ఆ వెనువెంటనే; అసువులన్= ప్రాణాలను; తొఱఁగెన్= వదలినది.

తాత్పర్యం: ఆ పురుగు భక్తితో చాగిలపడి, తల నతడి పాదాల దగ్గర ఆన్చి, హృదయం ఆనందంతో ఎంతో పరవశించిపోతూ ఉండగా వెనువెంటనే ప్రాణాలు వదలింది.

వ. కారుణికత్వధుర్యుం డగు నప్పారాశర్యుం డట్లవలీల మేలొనర్చి కీటంబుం గృతార్థంబుంజేసి నిజేచ్ఛం జనియె నదియు నమ్మహానుభావు నిర్దేశించిన తెఱంగున జనియించుచు ననేకపుణ్యంబు లాచరించుచు నృపజన్మంబునం బూజ్యంబైన రాజ్యంబు నొంది. 332

ప్రతిపదార్థం: కారుణికత్వ ధుర్యుండు= దయకలిగి ఉండటంలో మిక్కిలి గొప్పవాడు; అగు+ఆ+పారాశర్యుండు= అయిన ఆ పరాశరమహర్షి కుమారుడగు వ్యాసుడు; అట్లు= ఆ విధంగా; అవలీలన్= మిక్కిలి తేలికగా; మేలు= శుభం; ఒనర్చి= కలిగించి; కీటంబున్= పురుగును; కృత+అర్థంబున్= నెరవేరిన ప్రయోజనంకల దానిని; చేసి; నిజ+ఇచ్ఛన్= తన ఇష్టమును అనుసరించి; చనియెన్= వెళ్ళాడు; అదియున్= ఆ పురుగున్నూ; ఆ+మహా+అనుభావు నిర్దేశించిన; తెఱంగునన్= ఆ మహాత్ముడు తెలియజెప్పిన తీరున; జనియించుచున్= పుట్టుతూ; అనేక పుణ్యంబులు= పెక్కు పుణ్యాలు; ఆచరించుచున్= చేస్తూ; నృపజన్మంబునన్= క్షత్రియ జన్మంలో; పూజ్యంబు= ఎక్కువ మన్నించదగినది; ఐన రాజ్యంబున్= అయిన రాజ్యాన్ని; ఒంది= పొంది.

తాత్పర్యం: దయాశాలి అయిన వ్యాసుడు ఆ విధంగా మిక్కిలి సులభంగా మేలుచేసి, ఆ పురుగును కృతార్థం చేసి తన ఇచ్చచొప్పున వెళ్ళాడు. అది కూడా ఆ మహాత్ముడు చెప్పిన తీరున పుట్టుతూ; ఎన్నో పుణ్యాలు చేస్తూ రాజజన్మంలో మహనీయమైన రాజ్యం పొంది. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఏనుంగు నెక్కి పెక్కేనుంగు లిరుగడ । రాఁ దురంగంబుల రమణ యొప్ప
గొడుగులుం బడగలు ముడివడ గాయక । వందిపాఠకుల రవంబు లెసఁగ
భూషణంబుల రత్నపుంజంబు దీప్తులు । దిక్కుల నెల్లను దీఁటుకొనఁగ
సామంతకవిజన సీమంతినీముఖ । పరివారవైభవస్ఫురణ మలర

తే. దేవపతి వోలె సాత్యవతేయు నాశ్ర । మమున కేతెంచి తత్పాదకమల మాత్మ
ముకుట సంగతముగఁ జాఁగి మ్రొక్క గరుణ । నాతఁ డెత్తి తన్మస్తక మక్కుసేర్చె. 333

ప్రతిపదార్థం: ఏనుంగున్= ఏనుగును; ఎక్కి; పెక్కు= చాలా; ఏనుంగులు= ఏనుగులు; ఇరుగడన్= రెండువైపులా; రాన్= రాగా; తురంగంబుల రమణ= గుర్రాల సొంపు; ఒప్పన్= అందగించగా; గొడుగులున్= తెల్లని గొడుగులు; పడగలున్= జెండా గుర్తులు; ముడివడన్= చిక్కుపడుచుండగా; గాయక వంది పాఠకుల రవంబులు= పాటగాండ్రయొక్క, స్తోత్రపాఠకులయొక్క నాదాలు; ఎసఁగన్= అతిశయించగా; భూషణంబుల రత్నపుంజంబు దీప్తులు= ఆభరణాలయందలి రత్నాలరాసుల కాంతులు; దిక్కులన్= దిక్కులందు; ఎల్లను= అంతటా; దీఁటుకొనఁగన్= నిండుకొనగా; సామంత= సామంతరాజులు; కవిజన= కవిజనులు; సీమంతినీ= సుందరాంగులు; ముఖ= మొదలైన; పరివార= వెంటనంటి యుండేవారి; వైభవ స్ఫురణము= విభవపు స్ఫూర్తి; అలరన్= ఒప్పారగా; దేవపతి పోలెన్= దేవేంద్రుడివలె; సాత్యవతేయు+ఆశ్రమమునకున్= వ్యాసుడి ఆశ్రమానికి; ఏతెంచి= వచ్చి; తద్+పాదకమలము= అతడి పాదం అనే పద్మాన్ని; ఆత్మ ముకుట సంగతముగన్= తన కిరీటంతో తాకినదిగా; చాఁగి= సాష్టాంగపడి; మ్రొక్కన్= నమస్కరించగా; ఆతఁడు= ఆ వేదవ్యాసుడు; కరుణన్= దయతో; ఎత్తి= లేవదీసి; తద్+మస్తకము= అతడి తలను; అక్కు= రొమ్మున; చేర్చెన్= చేర్చాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పెద్ద ఏనుగు నెక్కి, రెండువైపుల ఎన్నో ఏనుగులు రాగా, గుఱ్ఱాల సొంపులు ఒప్పుతుండగా, గొడుగులు, జెండాలు ముడివడుతుండగా, గాయకులు, స్తోత్రాలవాళ్ళు చేసే ధ్వనులు మిన్నుముట్టుతుండగా, ఆభరణాల రత్న సముదాయాల కాంతులు దిక్కులందు వ్యాపించగా, సామంతులు, కవులు, పుణ్యస్త్రీలు మొదలైన పరివారపు వైభవం ఒప్పుతుండగా దేవేంద్రుడివలె వ్యాసుడి ఆశ్రమానికి వచ్చి, అతడి పాదపద్మాలకు తన కిరీటం తాకే విధంగా సాష్టాంగ దండప్రణామం చేయగా దయతో ఆతడు అతడిని పైకి లేవదీసి, ఆతడి తలను తన రొమ్మున హత్తుకొన్నాడు.

విశేషం: ఒక చిన్న మంచిపనివలన ఎంత మహాఫలం పొందవచ్చునో చెప్పటానికి సుదీర్ఘమైన ఈ పద్యాన్ని కవి ప్రయోగించారు. ఇది ఇతరుల స్ఫూర్తికి దోహదం చేస్తుంది.

వ. ఇ ట్లత్యాదరంబున సంభావించి శిష్యజనంబు నియోగించి. 334

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అత్యాదరంబునన్= మిక్కిలి ప్రేమతో; సంభావించి= మన్నించి; శిష్యజనంబున్= శిష్యులైన వారిని; నియోగించి= ఆదేశించి.

తాత్పర్యం: ఇట్లు మిక్కిలి ప్రేమతో మన్నించి, శిష్యులను ఏర్పాటు చేసి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. రాజన్య సముచితంబగు । పూజావిధి యాచరించి పురుషోత్తమ! నీ
వీజన్మంబున సన్ముని । రాజికి వెఱఁ గగు తపశ్చరణ మొందవనా! 335

ప్రతిపదార్థం: రాజన్య సముచితంబు= రాచబిడ్డకు తగినది; అగు పూజావిధి= అయిన మన్నన కార్యం; ఆచరించి= చేసి; పురుష+ఉత్తమ!= పురుషులలో శ్రేష్ఠుడా!; నీవు; ఈ జన్మంబునన్= ఈ పుట్టుకలో; సత్+మునిరాజికిన్= ఉత్తములైన మునుల వరుసకు; వెఱఁగు= ఆశ్చర్యం కలిగించేది; అగు తపస్+చరణము= అయిన తపస్సును చేయటం; ఒందవనా!= పొందుమయ్యా!

తాత్పర్యం: రాజకుమారుడికి తగిన మర్యాదలు చేసి 'ఉత్తమపురుషుడా! నీవు ఈ జన్మంలో ఉత్తమ మునులకు కూడా ఆశ్చర్యం గొలిపే తపస్సు చేయవయ్యా!

క. గోవులకై యొండెను వి । ప్రావలికై యొండె నిర్భరాహవకేలీ
ప్రావీణ్యము మెఱసి విడువు । నీ వసువులు దాన నధిక నిర్మలత యగున్. 336

ప్రతిపదార్థం: గోవులకున్+ఐ= ఆవులకొరకు; ఒండెను= కాని; విప్ర+ఆవలికిన్+ఐ=విద్వజ్జనులైన బ్రాహ్మణులకొరకు; ఒండెను= కానీ; నిర్భర+ఆహవ కేలీ ప్రావీణ్యము= నిండైన యుద్ధపు ఆటలో మిక్కిలి నేర్పు; మెఱసి= ప్రకాశింపజేసి; నీవు; అసువులు= ప్రాణాలు; విడువు= వదలుము; దానన్= దానిచేత; అధిక నిర్మలత= ఎక్కువ దోషంలేని స్థితి; అగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఆవులకొరకు గానీ, విప్రులకొరకుగానీ గొప్ప యుద్ధనైపుణ్యం వెలువడజేసి, నీవు ప్రాణాలు వదలుము. దానితో నీకు మిక్కిలి నిర్మలత్వం కలుగుతుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: గోవులు దేహపుష్టికీ, విప్రులు బుద్ధిపుష్టికీ తగిన వస్తుభావాలను ప్రజలకు అందిస్తూ ఉంటారు. కనుక వారికొరకు ప్రాణత్యాగం చేయటం పవిత్రకర్తవ్యంగా ప్రాచీనులు భావించారు. పైగా విప్రు డంటే అధ్యాత్మవిద్యాసంపన్నుడు.

వ. ఇట్లు నిష్కల్మషత్వంబు సిద్ధించిన. 337

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నిస్+కల్మషత్వంబు= పాపంలేనితనం; సిద్ధించినన్= ఏర్పడితే.

తాత్పర్యం: ఈ విధంగా దోషంలేనితనం సిద్ధిస్తే. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ధరణీసురజనన మహిమ । దొరకొను నీ 'కని విధించి దుర్దాంతరిపు
స్ఫురణహరణపరిణతు న । న్నరపతి వీడ్కొల్పె మునిజనంబులు వొగడన్. 338

ప్రతిపదార్థం: ధరణీసుర జనన మహిమ= బ్రాహ్మణ జన్మ అనే గొప్ప స్థితి; నీకున్= నీకు; దొరకొనున్= లభిస్తుంది; అని; విధించి= ఆజ్ఞాపించి; దుర్దాంతరిపు స్ఫురణ హరణ పరిణతున్= అణపశక్యం కాని శత్రువుల విజృంభణను పోగొట్టటంలో పాండిత్యంగల; ఆ+నరపతిన్= ఆ రాజును; మునిజనంబులు= మునులు; పొగడన్= కొనియాడగా; వీడ్కొల్పెన్= పంపించాడు.

తాత్పర్యం: బ్రాహ్మణజన్మ అనే మహనీయస్థితి నీకు కలుగుతుంది' అని చెప్పి అణపశక్యం కాని శత్రువులను రూపుమాపే ప్రజ్ఞగల ఆ రాజును మునులు కొనియాడుతూ ఉండగా పంపాడు.

విశేషం: దుర్దాంతరిపులు - అంతరంగశత్రువులు కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్యాలు. ఈ శత్రువులను రూపుమాపే ప్రజ్ఞకలవాడే బ్రహ్మణశబ్దం పొందుతాడని స్ఫురించే అర్థం.

తే. అతఁడు నానంద సంభరితాంతరంగుఁ । డగుచు దండప్రణామంబు లాచరించి
యరిగి యమ్ముని చెప్పిన యట్ల చేసి । భూమిసురజన్మలాభంబుఁ బొందె నధిప! 339

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అతఁడును= ఆ రాజు కూడా; ఆనంద సంభరిత+అంతరంగుఁడు= ఆనందంతో బాగా నిండిన హృదయం కలవాడు; అగుచున్= అవుతూ; దండ ప్రణామంబులు= సాష్టాంగనమస్కారాలు; ఆచరించి= చేసి; అరిగి= వెళ్ళి; ఆ+ముని= ఆ మహర్షి; చెప్పిన+అట్లు+అ= చెప్పినట్లే; చేసి= ఆచరించి; భూమిసుర జన్మ లాభంబున్= బ్రాహ్మణజన్మమనే ప్రయోజనాన్ని; పొందెన్= పొందాడు.

తాత్పర్యం: రాజా! అతడున్నూ ఆనందంతో నిండిన అంతరంగం కలవాడై సాష్టాంగనమస్కారాలు చేసి వెళ్ళి ఆ ముని చెప్పినట్లే ఆచరించి, బ్రాహ్మణజన్మ పొందాడు.

విశేషం: దండప్రణామం - దండం అంటే కర్ర. దానివలె నేలకు దేహాన్ని ఆన్చి చేసే నమస్కారం. దీనివలన 'నేను సర్వావయవాలతో నీకు విధేయుడనై ఉంటా' నని చెప్పినట్లవుతుంది.

వ. ఇవ్విధంబున సద్విజుండై. 340

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ తీరున; సత్+ద్విజుండు= ఉత్తమ బ్రాహ్మణుడు; ఐ= అయి.

తాత్పర్యం: ఈ విధంగా ఉత్తమబ్రాహ్మణుడై. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ద్విజుడంటే రెండు జన్మలు గలవాడు. మాతృగర్భం నుండి పుట్టట ఒక జన్మ. ఉపనయనాది సంస్కారాలతో రెండవ జన్మ. "సంస్కారా ద్విజ ఉచ్యతే" - సంస్కారంవలన ద్విజుడు అనబడతాడు.

క. పుణ్య స్థలముల నెల్ల న । గణ్యము లగు యూపములు ప్రకాశములుగఁ గ
ర్మణ్యతయు వివిధ రత్న హి । రణ్యాదిక దానములును బ్రస్తుతి కెక్కన్. 341

ప్రతిపదార్థం: పుణ్యస్థలములన్= పవిత్రమైన క్షేత్రాలలో; ఎల్లన్= అన్ని చోటులందు; అగణ్యములు= లెక్క పెట్ట శక్యము కానివి; అగు యూపములు= అయిన కట్టుకొయ్యలు (యజ్ఞపశువును కట్టివేసే స్తంభాలు); ప్రకాశములుగన్= అందరకు తెలిసే విధంగా; కర్మణ్యతయున్= కర్మమందు నిష్ఠయు; వివిధ రత్న హిరణ్య+ఆది దానములు= అనేకములైన రత్నాలు, సువర్ణాలు మొదలైన దానములతో; ప్రస్తుతికిన్= గొప్ప ప్రశంసకు; ఎక్కన్= ఎక్కునట్లుగా.

తాత్పర్యం: పుణ్యక్షేత్రాలన్నింటిలో లెక్కలేనన్ని యూపస్తంభాలు, అందరకూ కనపడే విధంగా కర్మమందు నిష్ఠ, అనేక రత్నాలు, సువర్ణాలు మొదలైన దానాలతో ప్రశంస కెక్కగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అధ్వరంబు లనేకంబు లాచరించి । యతఁడు మఱియును బాదరాయణునిఁ గాంచె
సదయచిత్తత నప్పరాశరసుతుండు । వీడుకొలుపంగఁ జని యశోవిభవ మెసఁగ. 342

ప్రతిపదార్థం: అధ్వరంబులు= యజ్ఞాలు; అనేకంబులు= పెక్కులు; ఆచరించి= చేసి; అతఁడు= ఆ వ్యక్తి; మఱియును= మరొక మారు; బాదరాయణునిన్= వేదవ్యాసుడిని; కాంచెన్= సందర్శించాడు; ఆ+పరాశరసుతుండు= పరాశరుడి కుమారుడు వ్యాసుడు; సదయచిత్తతన్= దయతో కూడిన హృదయం కలవాడితనంతో; వీడుకొలుపంగన్= సెల వొసంగి పంపగా; చని= వెళ్ళి; యశోవిభవము= కీర్తియొక్క వైభవం; ఎసఁగన్= వృద్ధి పొందగా.

తాత్పర్యం: యజ్ఞా లెన్నో చేసి, అతడు మరొక మారు శ్రీ వేదవ్యాసులను సందర్శించాడు. ఆ మహర్షి మిక్కిలి దయగల హృదయంతో పంపగా వెళ్ళి, కీర్తిధనం వృద్ధిపొందగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వ్రతశీలతఁ బరఁగి తుదిన్ । శతమఖునకు నగ్గలంపు సఖుఁడై యమరా
ర్చిత సంస్తుతభవ్యపద । స్థితి నవ్యయ పరమసౌఖ్య సిద్ధిం దనరెన్. 343

ప్రతిపదార్థం: వ్రతశీలతన్= వ్రతములయందు శీలం కల తనంతో; పరఁగి= ఒప్పారి; తుదిన్= కడకు; శతమఖునకున్= దేవేంద్రుడికి; అగ్గలము+సఖుఁడు= గొప్పమిత్రుడు; ఐ= అయి; అమర+అర్చిత సంస్తుత భవ్య పద స్థితిన్= దేవతలచేత పూజింపబడి కొనియాడదగిన, శ్రేష్ఠమైన స్థానంలోని ఉనికిచేత; అవ్యయ పరమ సౌఖ్య సిద్ధిన్= ఎన్నటికి తరుగువోని అత్యుత్తమ సుఖం కలగటంతో; తనరెన్= ఒప్పారాడు.

తాత్పర్యం: వ్రతం శీలంగా గలవాడై, చివరకు దేవేంద్రుడికి గొప్ప మిత్రం అయి, దేవతలు పూజించే కొనియాడదగిన శ్రేష్ఠమగు స్థానంలో ఉండి, తరుగువోని పరమసుఖం సిద్ధించినవాడై ప్రకాశించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: 'శీలం' అంటే స్వభావం. వ్రతాలు చేయటం అతడికి స్వభావంగా అయిందని భావం. శతమఖ శబ్దం సార్థకం. ఈతడు పెక్కు యజ్ఞాలు చేశాడు. నూరు యజ్ఞాలు చేసినవాడు దేవేంద్రు డవుతాడు. కనుక ఇతడు అతడికి సఖుడైనాడు. అంతేకాదు, ఇన్ని యజ్ఞాలు చేసికూడా మంచితనంచేత దేవేంద్రుడికి అసూయాస్థానం కాలేదు. సఖు డంటే సమప్రాణుడు.

వ. అని చెప్పి భీష్ముండు. 344

ప్రతిపదార్థం: అని; చెప్పి; భీష్ముండు= భీష్ముడు.

తాత్పర్యం: అని చెప్పి భీష్ముడు (తరువాతి పద్యంతో అన్వయం).

క. మనుజేంద్ర! కురుక్షేత్రం । బున నద్భుతఘోరసమరమున నమ్మాడ్కిం
దనువులు దొఱఁగిన నృపులకు । ననంత సుఖగతులు గల్గు టనుమానంబే? 345

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్ర!= రాజా!; కురుక్షేత్రంబునన్= కురుక్షేత్రంలో; అద్భుత, ఘోర సమరమునన్= అద్భుతం, భయంకరం అయిన యుద్ధంలో; ఆ+మాడ్కిన్= ఆ విధంగా; తనువులు= దేహాలు; తొఱఁగిన నృపులకున్= వదలిన రాజులకు; అనంతసుఖగతులు= అంతంలేని సుఖ స్థితులు; కల్గుట= కలగటం; అనుమానంబే?= సందేహమా?

తాత్పర్యం: రాజా! కురుక్షేత్రంలో అద్భుతభయంకర యుద్ధంలో దేహాలు వదలిన రాజులకు అనంత సుఖాలుగల గతులు కలగటంలో అనుమానం ఏమీ లేదు.

వ. భవదీయబంధు లందఱు నూర్ధ్వలోక ప్రాప్తుల; నీ వేమియు ననుమానింపకు' మని పలికినం బాండవాగ్రజుండు పరమసంతోషభరితాంతఃకరణుండై సురసరిత్సూనుతో 'విద్యా తపోదానంబులలో నెయ్యది విశేషం బెఱింగింపవే!' యనుటయు నమ్మహీపతి నమ్మహామతి గౌరవంబునం గనుంగొని. 346

ప్రతిపదార్థం: భవదీయబంధులు= నీ చుట్టాలు; అందఱున్= అందరూ; ఊర్ధ్వలోక ప్రాప్తులు+అ= పై పుణ్యలోకాలను పొందినవారే; నీవు; ఏమియున్= ఏమీ; అనుమానింపకుము= సందేహించవద్దు; అని; పలికినన్= పలికితే; పాండవ+అగ్రజుండు= పాండుడి కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజు; పరమ సంతోష భరిత+అంతఃకరణుండు+ఐ= గొప్ప సంతోషంతో నిండిన హృదయం కలవాడై; సురసరిత్+సూనుతోన్ దేవతలనది గంగ కొడుకు భీష్ముడితో; విద్యా తపస్+దానంబులలోన్= విద్య, తపస్సు, దానం - అనే వాటిలో; ఏ+అది= ఏది; విశేషంబు?= గొప్పది; ఎఱింగింపవే?= దయతో చెప్పుము!; అనుటయున్= అనగా; ఆ+మహీపతిన్= ఆ రాజును; ఆ+మహామతి= గొప్పబుద్ధిశాలి అయిన భీష్ముడు; గౌరవంబునన్= దొడ్డబుద్ధితో; కనుంగొని= చూచి.

తాత్పర్యం: నీ చుట్టాలందరూ పైనున్న ఉత్తమలోకాలను పొందినవారే. నీ వేమీ అనుమానపడకుము అని చెప్పగా ధర్మరాజు పరమసంతోషంతో నిండిన హృదయం కలవాడై భీష్ముడితో 'విద్య, తపస్సు, దానం అనే వాటిలో ఏది గొప్పది? దయ చేసి తెలుపుము' అనగా ఆ రాజును ఆ బుద్ధిశాలి మన్ననతో చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: గౌరవం - అంటే గురుభావం. ఇక్కడ ఆ అర్థాన్ని గ్రహింపరాదు. అడిగినది గొప్ప విషయం కనుక అడిగిన వాడియందు గొప్పవాడు అనే భావన కలిగిందనే అర్థం గ్రహించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **'వ్యాసమైత్రేయ పుణ్యసంవాద మనఘ! వినిన నీ ప్రశ్నమున కది విశదమైన**
యుత్తరంబగు నేకాగ్రచిత్తవృత్తి । వగుమ! నీ 'వని పల్కి యిట్లనియె నధిప! 347

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; వ్యాస మైత్రేయ పుణ్యసంవాదము= వ్యాసుడు, మైత్రేయుడు అనేవారి పవిత్రమైన సంభాషణం; వినినన్= వింటే; అది; నీ ప్రశ్నమునకున్= నీ ప్రశ్నకు; విశదము= స్పష్టము; ఐన+ఉత్తరంబు= అయిన సమాధానం; అగున్= అవుతుంది; నీవు; ఏక+అగ్ర చిత్తవృత్తివి= చెదరని మనస్సుతీరు కలవాడవు; అగుము!= కమ్ము!; అని; పల్కి= పలికి; అధిప= రాజా!; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: పుణ్యాత్మా! వ్యాసమైత్రేయ సంవాదం వింటే అది నీ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం అవుతుంది. మనస్సును చెదరనీయకుము' అని భీష్ముడు పలికి ఇట్లా అన్నాడు జనమేజయమహారాజా!

విశేషం: ఇక్కడ అధిప! అనే సంబోధన జనమేజయుడికి సంబంధించినది, అనఘ- ధర్మరాజుకు సంబోధన వక్తలు క్రమంగా వైశంపాయనుడు, భీష్ముడు.

వ్యాసమైత్రేయ సంవాదము భీష్ముఁడు ధర్మరాజునకుఁ జెప్పుట (సం.13-182-1(కుంభ))

సీ. **'వ్యాసమునీంద్రుండు వారాణసీపురి । కరిగి మున్ మైత్రేయుఁ డచట నునికి**
నాతని యున్నెడ కప్రకాశతఁ జన్న । నెఱిఁగి యమ్మహితాత్ముఁ డెఱిఁగి భక్తిఁ
బూజించి యుత్కృష్టభోజనంబునఁ దృప్తి । సేసిన నధికవికాసరుచిర
ముఖుఁడైన యమ్మహామునిఁ జూచి 'మోదమ । గ్గలమయి మీయందుఁ గానఁబడియెఁ

తే. **గారణంబేమొకో?' యని గారవమున । నాతఁ డడిగిన నతఁ డధికాదరమునఁ**
'దపము శ్రుత మాదిగాఁ గల ధర్మకోటి । లోన నెల్లను నధికంబు దాన' మనియె. 348

ప్రతిపదార్థం: వ్యాసముని+ఇంద్రుండు= వ్యాసమహర్షి; వారాణసీ పురికిన్= కాశీపట్టణానికి; అరిగి= వెళ్ళి, మున్= ముందుగా; మైత్రేయుఁడు= మైత్రేయుడనే ముని; అచటన్= ఆ తావున; ఉనికిన్= ఉండటంవలన; ఆతని+ఉన్న+ఎడకున్= ఆతడున్నచోటునకు; అప్రకాశతన్= గూఢంగా; చన్నన్= పోగా; ఆ+మహిత+ఆత్ముఁడు= దొడ్డ ఆత్మశక్తిగల ఆ ముని; ఎఱిఁగి= తెలిసికొని; భక్తిన్= భక్తితో; ఎఱిఁగి= దండ ప్రణామం చేసి; పూజించి= పూజ గావించి; ఉత్కృష్ట భోజనంబునన్= మేలైన ఆహారంతో; తృప్తి+చేసినన్= తృప్తి కలిగించగా; అధిక వికాస రుచిర ముఖుఁడు= ఎక్కువగా వికసించిన అందమైన ముఖం కలవాడు; ఐన ఆ+మహామునిన్= అయిన ఆ గొప్ప మునిని; చూచి; మీయందున్= మీయందు; మోదము= ఆనందము; అగ్గలము+అయి= ఎక్కువ అయి; కానన్+ పడియెన్= కనపడుతున్నది; కారణంబు= హేతువు; ఏమి+ఒకో!= ఏదో కదా!; అని; గారవమునన్= గౌరవంతో; ఆతఁడు= ఆ మైత్రేయుడు; అడిగినన్= అడిగితే; అతఁడు= ఆ వ్యాసుడు; అధిక+ఆదరమునన్= మిక్కిలి ప్రీతితో; తపము= తపస్సు; శ్రుతము= విద్య; ఆదిగాన్= మొదలుగా; కల ధర్మకోటి లోనన్= కల ధర్మాల సముదాయంలో; ఎల్లను= అన్నింటియందు; దానము= త్యాగం, ఇవ్వటం అనేది; అధికంబు= గొప్పది; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వ్యాసమహర్షి కాశీనగరానికి వెళ్ళాడు. అక్కడ అంతకుముందే ఉన్న మైత్రేయమహర్షి దగ్గరకు గుట్టుగా వెళ్ళాడు. ఆ మహానుభావుడు గుర్తుపట్టాడు. పరమభక్తితో చాగిలపడి నమస్కరించి పూజించి, శ్రేష్ఠమైన భోజనం

పెట్టి, తృప్తిపరచాడు. దానితో వ్యాసుడి ముఖం ఎంతో విప్పారి ఆనందంతో సుందరమయింది. అది చూచి మైత్రేయుడు 'మీయందు ఆనందం అత్యధికంగా కానవస్తున్నది. కారణం ఏమిటో?' అని మర్యాద ఉట్టిపడుతూ ఉండగా అడిగాడు. అప్పుడు వ్యాసుడు మరింత ఆదరంతో 'తపస్సు విద్య మొదలైన ధర్మాలన్నింటిలో దానం గొప్పది' అన్నాడు.

విశేషం: అప్రకాశతన్ - తానెవరో తెలియనీయకుండా వ్యాసుడు వెళ్లాడు. మహానుభావులను ఎట్లాగైనా మన్నిస్తారు. సాధారణ వ్యక్తిగా వెళ్ళినప్పుడు చేసే మర్యాద తీరునుబట్టి మనిషి హృదయౌన్నత్యం తెలుస్తుంది.

వ. అని మఱియును. 349

తాత్పర్యం: అని ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'దానార్హవస్తువులలో । మానిత మన్నంబ యన్నమయము లసువులున్
మేనుఁ దదీయబలంబును । గాన బుధులు దానిఁ దద్ద గైకొంద్రు మదిన్. 350

ప్రతిపదార్థం: దాన+అర్హవస్తువులలోన్= దానానికి తగిన పదార్థాలలో; అన్నంబు+అ= అన్నమే; మానితము= ఎక్కువ మన్నింపబడినది (గొప్పది); అసువులున్= ప్రాణాలు; మేనున్= దేహమూ; తదీయబలంబును= ఆ దేహానికి చెందిన శక్తీ; అన్నమయములు= అన్నం యొక్క స్వరూపాలే; కానన్= కనుక; బుధులు= వివేకంగలవారు; దానిన్= ఆ అన్నాన్ని; మదిన్= హృదయంలో; తద్దన్= ఎక్కువగా (గొప్పది అనే భావంతో); కైకొంద్రు= గ్రహిస్తారు.

తాత్పర్యం: 'దానం ఇవ్వదగిన వస్తువులలో అన్నమే గొప్పది. ప్రాణాలూ, దేహమూ, దాని బలమూ అన్నం స్వరూపాలే. కనుక పండితులు దానిని మనస్సులో గొప్పదిగా భావిస్తారు.

విశేషం: "అన్నమయం హి సౌమ్య మనః" - సౌమ్యుడా 'మనస్సు అన్నమయం కదా!' అని ఉపనిషద్వాక్యం. అన్నం రక్తం, మాంసం మొదలైన ధాతువులుగా మారు ప్రక్రియను ఆధునికవిజ్ఞానశాస్త్రంతోపాటు ప్రాచీన ఋషులు కూడా సందర్శిం చారనటానికి ఈ పద్యం నిదర్శనం.

క. తప ముల్లము కల్మషముల । నపగతములఁ జేయు విద్య కాస్పదమగు నా
తపసి మహితదానంబున । నుపచితమగు విద్య దపము నుత్కర్షించున్. 351

ప్రతిపదార్థం: తపము= తపస్సు; ఉల్లము కల్మషములన్= మనస్సులోని మాలిన్యాలను; అపగతములన్= తొలగిపోయే వాటినిగా; చేయున్= చేస్తుంది; విద్యకున్= మోక్షసంబంధమైన జ్ఞానానికి; ఆస్పదము= తావు; అగున్= అవుతుంది; ఆ తపసి మహితదానంబునన్= ఆ తాపసుడు చేసిన గొప్ప దానంవలన; విద్య; ఉపచితము= చక్కగా పెంపొందినది; అగున్= అవుతుంది; తపమున్= తపస్సును; ఉత్కర్షించున్= గొప్పదానినిగా చేస్తుంది.

తాత్పర్యం: తపస్సు మనస్సులోని మాలిన్యాల నన్నింటిని తొలగించి వేస్తుంది. విద్యకు అవకాశం కల్పిస్తుంది. ఆ తపసి చేసిన గొప్ప దానంవలన విద్య పెంపొందుతుంది. ఆ విద్య తపస్సును వృద్ధిచేస్తుంది.

విశేషం: తపస్సు అంటే కఠోరములైన నియమాలచేత శరీరాన్ని శుష్కింపజేయటం. దీనివలన మనస్సు వికారాలు నశిస్తాయి. "సరసాహారము రాగహేతువు" అని కదా కవివాక్కు. కనుక ఆహార నియమంవలన మనస్సు అదుపులోనికి వస్తుంది. దుష్ట భావాలు జారిపోతాయి. విద్య అంటే అధ్యాత్మవిద్యయే. మాలిన్యాలు జారిపోయిన మనస్సులోనే అధ్యాత్మవిద్య నిలుస్తుంది. దానం అంటే వస్తుత్యాగం. అది మమకారదోషాన్ని తొలగించి వేస్తుంది. మమకారం బంధానికి కారణం. కనుక తపస్సు చేసి హృదయంలో విద్యను పదిలపరచుకొన్నవాడు దానం చేస్తే అది 'మహితం' - గొప్పది అవుతుంది. దానివలన విద్య మరింత పెరుగుతుంది. అది లోక లోకేశ్వరతత్త్వాలను చక్కగా నిరూపిస్తూ మరల తపస్సును చక్కగా పోషిస్తుంది. ఇట్లా ఇది ఒక మహనీయచక్రం.

క. **కాన తపంబును విద్యయు । దానౌదాత్త్య ప్రవర్ధితంబులు విద్యా**
నూనత్వం బచ్యుతు గను । దానికి దీపంబు సద్వ్రతప్రవణులకున్. 352

ప్రతిపదార్థం: కాన= కాబట్టి; తపంబును= తపస్సును; విద్యయున్= అధ్యాత్మ జ్ఞానమూ; దాన+ఔదాత్త్య ప్రవర్ధితంబులు= దానపు గొప్పతనంచేత పెంపొందింపబడినవి; సద్వ్రతప్రవణులకున్= మంచి వ్రతాలయందు నిష్ఠ కలవారికి; విద్యా+అనూనత్వంబు= విద్యయొక్క తక్కువకానితనం; అచ్యుతున్= పరమాత్మను; కనుదానికిన్= చూచేదానికి; దీపంబు= చక్కని జ్యోతి.

తాత్పర్యం: కనుక తపస్సూ, విద్యా దానం మహిమచేత పెంపొందుతాయి. విద్యలో లోపం లేకపోవటం చక్కని వ్రతనిష్ఠకలవారికి పరమాత్మను చూపించే దీపం అవుతుంది.

ఉ. **కావున నన్నదానమునఁ గా కెటలుండు మహాప్రమోద? మ**
త్యావిలచిత్తుఁ డైనను మహత్తరదానమునన్ విశుద్ధ స
ద్భావత నొందు నిక్క' మని పల్కె నరేంద్ర! తపంబు విద్యయున్
దైవత పూజనీయములు దానము వానికిఁ బోషకంబగున్.' 353

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; అన్నదానమునన్= అన్నదాన విషయంలో; మహాప్రమోదము= పరమానందం; కాక= కలుగకుండా; ఎటులు= ఏ విధంగా; ఉండున్?= ఉంటుంది?; అతి+ఆవిల చిత్తుఁడు= మిక్కిలి మలినమైన చిత్తం కలవాడు; ఐనను= అయినా; మహత్తర దానమునన్= మిక్కిలి గొప్పదైన (అన్న) దానంచేత; విశుద్ధ సత్+భావతన్= నిర్మలమైన మంచిభావం కల తనాన్ని; ఒందున్= పొందుతాడు; నిక్కము=సత్యము; అని; నరేంద్ర!= రాజా!; పల్కెన్= (వ్యాసుడు) పలికాడు; తపంబున్= తపస్సు; విద్యయున్= విద్య; దైవత పూజనీయములు= దేవతలకు(కూడా) పూజింపదగినవి; దానము= దానం; వానికిన్= ఆ రెండింటికీ; పోషకంబు= పుష్టి కలిగించేది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: కాబట్టి అన్నదానంచేత పరమానందం తప్పక కలుగుతుంది. పరమదుష్టభావాలు కలవాడైనా గొప్పదైన ఈ దానంచేత నిర్మలమూ, మంచిదీ అయిన భావం కలవాడవుతాడు. ఇది సత్యం' అని వ్యాసుడు చెప్పాడు. రాజా! తపస్సు, విద్య దేవతలు కూడా మన్నించే విషయాలు. దానం వాటిని చక్కగా పెంచుతుంది.

విశేషం: వేదం "తస్మా దన్నం దదన్సర్వాణ్యేతాని దదాతి" అంటున్నది. అన్నదానం చేస్తే అన్ని దానాలూ చేసినట్లే.

క. **అని శాంతనవుఁడు సెప్పిన । విని కౌంతేయాగ్రజుండు 'విమలమతీ! యం**
గనల సమాచారంబులు । వినంగ నే వలతుఁ జెప్పవే తెలియంగన్?' 354

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; శాంతనవుఁడు= శంతనుడి కుమారుడు భీష్ముడు; చెప్పినన్= చెప్పగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతికొడుకులలో పెద్దవాడు యుధిష్ఠిరుడు; విని= ఆలకించి; విమలమతీ!= స్వచ్ఛమైన బుద్ధిగల ఓ తాతా!; అంగనల సమాచారంబులు= స్త్రీలకు సంబంధించిన చక్కని ఆచారాలు; నేన్= నేను; వినంగన్= వినటానికి; వలతున్= ఇష్టపడుతున్నాను; తెలియంగన్= తెలిసే తీరున; చెప్పవే!= చెప్పుమా!

తాత్పర్యం: ఇట్లా భీష్ముడు చెప్పగా విని ధర్మరాజు 'విమలమతీ! స్త్రీల సమాచారాలు వినగోరుతున్నాను. చక్కగా తెలిసే విధంగా నాకు చెప్పుమా! (అన్నాడు)

వ. అనిన నతండు 'కైకేయీ శాండిలీ సంవాదంబున నిది దెల్లంబగుఁ జెప్పెద విను' మని యిట్లనియె. 355

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అతండు= ఆ భీష్ముడు; కైకేయీ శాండిలీ సంవాదంబునన్= కైకేయి, శాండిలి అనే వారి సంభాషణలో; ఇది= నీ వడిగిన విషయం; తెల్లంబు= చక్కగా తెలిపేది; అగున్= అవుతుంది; చెప్పెదన్= చెప్పుతాను; వినుము; అని; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అంటే భీష్ముడు 'కైకేయీ శాండిలీ సంవాదంలో నీ వడిగిన విషయం స్పష్టమవుతున్నది. చెప్పుతాను వినుము' అని ఇట్లా చెప్పాడు.

తే. సుమన యనియెడు కైకేయి యమరపురము । నందు శాండిలిఁ గని 'భవ్యమైన దివ్య
పదవి యే వర్తనమునఁ జొప్పడియె నీకు? । నతివ! చెప్పుము నా కని యడిగె నధిప! 356

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; సుమన; అనియెడు కైకేయి= అనే పేరుగల కేకయ రాజపుత్రి; అమరపురమునందున్= దేవతల పట్టణం అయిన అమరావతిలో; శాండిలిన్= శాండిలి అనే ఇంతిని; కని= చూచి; అతివ!= కాంతా!; భవ్యము= మిక్కిలి గొప్పది ఐన దివ్యపదవి= అయిన దేవలోకపు స్థానం; నీకున్= నీకు; ఏ వర్తనమునన్= ఎట్టి నడవడివలన; చొప్పడియెన్?= కలిగింది?; నాకున్= నాకు; చెప్పుము= తెలుపుము; అని; అడిగెన్= అడిగింది.

తాత్పర్యం: కేకయరాజపుత్రి సుమన అమరావతిలో శాండిలిని చూచి 'కాంతా! ఇంత శ్రేష్ఠమైన దేవలోక నివాసం నీకు ఏ నడవడితో కలిగిందో నాకు చెప్పుము' అని అడిగింది.

వ. అని యడిగిన యాయమ కయ్యంగన యిట్లనియె. 357

ప్రతిపదార్థం: అని; అడిగిన+ఆ+అమకున్= అడిగిన ఆ ఇంతికి; ఆ+అంగన= ఆ స్త్రీ - శాండిలి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పింది.

తాత్పర్యం: అని అడిగిన సుమనకు శాండిలి ఇట్లా చెప్పింది.

సీ. 'మామకు నత్తకు మార్పల్క దేవ పి । త్రతిథిపూజనములయందు సోలయ,
నిలువడిఁ దలవాకి లెప్పుడు నెఱుఁగక । పెలుచ నవ్వక శుద్ధి వెలయ విప్ర
భిక్ష యోపిక కల్గి పెట్టుచు వర్తింతు । వలయు కార్యములకు వెలఁది! మగుడఁ
బతివచ్చునప్పుడు భక్తియు వేడ్కయుఁ । బొదల నాసనపాద్యములను సుముఖ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. భావమునను సేవ వాటింతు, బిడ్డల । శిక్ష వదలఁ, దిట్టఁ జెట్టఁ గనియు,
నాకు వేఱ ప్రియ మనఁగ లేదు; పతిమెచ్చు । వంటకములు చవిగ వండి యిడుదు. 358

ప్రతిపదార్థం: మామకున్= భర్తతండ్రికి; అత్తకున్= మగని తల్లికి; మారు+పల్కన్= ఎదురుమాట చెప్పను; దేవ పితృ+అతిథి పూజనములయందున్= దేవతల, పితృదేవతల, అతిథుల పూజలలో; సొలయన్= విముఖురాలను కాను; ఇలువడిన్= మంచినడతతో; తలవాకిలి= వీథివాకిలి; ఎప్పుడున్= ఎప్పుడూ; ఎఱుఁగక= తెలియక; పెలుచన్= పెద్దగా; నవ్వక; శుద్ధి= పరిశుద్ధత; వెలయన్= చక్కగా కలుగగా; విప్రభిక్ష= మంచి విద్య కలవారికి భిక్షను; ఓపిక= సహనం; కలిగి; పెట్టుచున్= పెట్టుతూ; వెలఁది!= ఓ ఇంతీ!; వలయు కార్యములకున్= చేయవలసిన పనులకు; మగుడన్= తిరిగి; వర్తింతున్= నడచుకొంటాను; పతి= మగడు; వచ్చు+ అప్పుడు= ఇంటికి వచ్చే సమయంలో; భక్తియున్= నిండైన గౌరవమూ; వేడ్కయున్= ఉత్సాహభావం; పొదలన్= కలుగగా; ఆసన పాద్యములను= ఆసనమును, కాళ్ళు కడుగుకొనటానికి నీటిని; సుముఖ భావమునను= అనుకూలభావంతో; సేవ= పరిచర్య; పాటింతున్= కూర్చుతాను; బిడ్డలశిక్షన్= బిడ్డలను తీర్చిదిద్దటాన్ని; వదలన్= విడువను; చెట్టన్= చెడును; కనియున్= చూచి; కూడా; తిట్టన్= నిందించను; నాకున్= నాకు; వేఱు+అ= మరొకటి అయిన; ప్రియము= ఇష్టము; అనఁగన్= అనటానికి; లేదు; పతి మెచ్చు వంటకములు= భర్త మెచ్చే పాకాలు; చవిగన్= రుచిగా; వండి; ఇడుదున్= పెట్టుతాను.

తాత్పర్యం: అత్తమామలకు ఎదురు చెప్పను. దేవపూజలు, శ్రాద్ధములు, అతిథి సపర్యలు అనే పనులలో ఎడమొగం పెట్టను. మంచి నడవడికతో ఉంటాను. వీథివాకిలి తెలియకుండా ఉంటాను. పకపకా నవ్వను. పరిశుద్ధ బుద్ధితో విద్యగలవారికి భిక్షపెట్టుతూ తక్కిన పనులు చూచుకొంటాను. భర్త ఇంటికి వచ్చినప్పుడు పీట వెయ్యటం, కాళ్ళకు నీళ్ళు ఇవ్వటం - మొదలైన పనులు నేనే అనుకూలభావంతో చేస్తాను. బిడ్డలను తీర్చిదిద్దటం అనే పనిని వదలను. ఎక్కడైనా చెడ్డతనం కనిపించినా తిట్టను. నాకు ప్రియమైన దంటూ వేరే ఏమీ లేదు. భర్త ఇష్టపడే వంటలు చేసి పెట్టుతూ ఉంటాను.

విశేషం: 'తలవాకిలి ఎఱుఁగను' అంటే 'వికారభావంతో వీథిజనాలను చూడను' అని భావం. పగలబడి నవ్వటం కొన్ని సందర్భాలలో అవతలి వారికి ఉద్వేగం పుట్టించవచ్చు. శుద్ధి వెలయన్ - ఇక్కడ శుద్ధి బాహ్యాభ్యంతరాలకు సంబంధించినది. స్నానాదులవలన బాహ్యశుద్ధీ, కోపతాపాలు లేనితనంతో ఆంతరశుద్ధీ ఏర్పడుతాయి. 'సుముఖభావం' - భార్యాభర్తల అనురాగం త్రికరణశుద్ధితో కూడినది కావాలి - అని సూచన. చెట్టఁ గనియుఁ దిట్టన్ - ఇది హృదయపు సమస్థితిని, సృష్టిలోని తీరు తెన్నులను నిర్వికారంగా చూడగల హృదయౌన్నత్యాన్నీ సూచిస్తుంది. భారతీయదాంపత్యం మహిమను ఈ పద్యం తెలుపుతుంది. ఇందులోని పవిత్రప్రవర్తన పురుషుడికి కూడా అన్వయించుకొనాలి.

చ. వరుఁ డొక వెంట నెన్నఁడు ప్రవాసగతుం డగు నాఁటఁ గోలె న
ప్పురుషుఁడు వచ్చునంతకును బూవులు పూఁతలు మేలిచీర లా
భరణము లెక్కుడుం జవులపాకవిశేషము లాదరింప నె
ప్పురుసునఁ గొల్చుఁ గూడురువ బంధులకున్ దగ నెమ్మి సల్పుదున్. 359

ప్రతిపదార్థం: వరుఁడు= మగడు; ఒక వెంటన్= ఒక పనిమీద; ఎన్నఁడు= ఏనాడు; ప్రవాసగతుండు= పరదేశం పోయినవాడు; అగున్= అవుతాడో; నాఁటన్+కోలెన్= ఆ దినం మొదలుకొని; ఆ+పురుషుఁడు= ఆ మగవాడు (భర్త); వచ్చు+అంతకును=

వచ్చేవరకు; పూవులు= పూలు; పూఁతలు= సుగంధ ద్రవ్యాల పూతలు; మేలిచీరలు= మేలైన వస్త్రాలు; ఆభరణములు= నగలు; ఎక్కుడున్= ఎక్కువ అయిన; చవుల పాక విశేషములు= రుచిగల వంటలు; ఆదరింపన్= ఇష్టపడను; ఏ+పరుసునన్= ఏ విధంగాను; కొల్చున్= ధాన్యాన్ని; కూడు= అన్నాన్ని; ఉరువన్= పారవేయను (వ్యర్థంచేయను); బంధువులకున్= చుట్టాలకు; తగన్= తగు విధంగా; నెమ్మి= ప్రీతిని; సల్పుదున్= చేస్తాను.

తాత్పర్యం: భర్త ఏ పనిమీదనైన పొరుగూళ్ళకు పోతే, ఆనాటినుండి తిరిగి వచ్చేవరకు పూవులు, మైపూతలు, మంచి చీరలు, నగలు, రుచి పాకాల భోజనపదార్థాలు ఆదరింపను. ఏ విధంగానూ ధాన్యపు గింజలను, అన్నాన్నీ వ్యర్థపరచను. బంధువులకు తగు విధంగా ప్రీతి కలిగిస్తాను.

విశేషం: కామభావాన్ని అదుపులో ఉంచుకొనే ప్రయత్నం ఇందులో ప్రస్తావనకు వచ్చింది. 'తగన్' నెమ్మిసల్పుదున్ - అనే చోట 'తగన్' అనే పదం చాలా జాగ్రత్తగా చూడదగినది. ధర్మేతరమైన ప్రీతి బంధువులు కోరితే - అనే శంకను ఈ మాట పరిహరిస్తుంది.

క. గోవులు మొదలగు తిర్య । గ్జీవుల సుఖవృత్తు లరసి చెల్లింతు గృహ
శ్రీ వర్తనంబునకుఁ బతి । భావము సంకటపడంగఁ బలుక నొకటియున్. 360

ప్రతిపదార్థం: గోవులు= ఆవులు; మొదలు+అగు తిర్యక్+జీవుల సుఖ వృత్తులు= మొదలైన పశువులు, పక్షులు అనే ప్రాణుల సుఖమైన బ్రదుకులను; అరసి= చక్కగా తెలిసికొని; చెల్లింతున్= నడిపిస్తాను; గృహశ్రీ వర్తనంబునకున్= ఇంటి సంపద సాగుదలకు; పతి భావము= భర్త మనస్సు; సంకట పడంగన్= చికాకుపడే విధంగా; ఒకటియున్= ఒక్కమాట కూడా; పలుకన్= మాటాడను.

తాత్పర్యం: ఆవులు మొదలైన ప్రాణుల సుఖజీవనాన్ని పరీక్షించి సాగిస్తాను. ఇంటి సంపద సాగుబడి విషయంలో భర్త హృదయం కలతపడే విధంగా ఒక్కమాట కూడా పలుకను.

విశేషం: 'గృహిణీ గృహముచ్యతే' - 'ఇల్లాలే ఇల్లు' అని దాని భావం. దాని కనుగుణంగా ఈ పద్యం బాధ్యతను స్మరింపజేస్తుంది.

తే. అగ్ని యోపి రక్షింతు రహస్యమైన । దాని వెలిపుచ్చ గర్భంబు దాల్చియున్న
యపుడు వాచవు లెల్లను నవులఁ బెట్టి । దాని కెయ్యవి పథ్యముల్ వానిఁ గొందు'. 361

ప్రతిపదార్థం: అగ్ని= అగ్నిహోత్రాన్ని; ఓపి= సహనం దాల్చి; రక్షింతున్= కాపాడుతాను; రహస్యము= ఇతరులకు తెలియరానిది; ఐనదానిన్= అయిన దానిని; వెలిపుచ్చన్= బయటపెట్టను; గర్భంబు= కడుపు; తాల్చి ఉన్న+అపుడు= ధరించి ఉన్న సమయంలో; వాచవులు= నోటి రుచులు; ఎల్లను= అన్నింటినీ; అవులన్= అవతల (దూరంగా); పెట్టి= ఉంచి, దానికిన్= గర్భానికి (కడుపులో ఉన్న బిడ్డకు); ఏ+అవి= ఏయే పదార్థాలు; పథ్యముల్= హితం కలిగించేవో; వానిన్= వాటిని; కొందున్= తీసికొంటాను.

తాత్పర్యం: భర్త నిత్యాగ్నిహోత్రి కనుక ఆ అగ్నిని ఓపికతో కాపాడుతూ ఉంటాను. రహస్యాన్ని బయటపెట్టను. కడుపుతో ఉన్నపుడు నోటి రుచుల నన్నింటినీ దూరంగా ఉంచి, బిడ్డ కేవి మేలు చేస్తాయో వాటినే భుజిస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అని చెప్పి యట్టి చందం । బున నడచిన సతికి లోకములు రెండును సౌ

ఖ్యనిరూఢి యొసఁగు; బొగ డొం । దు నరుంధతి వోలె నవ్వధూటి నరేంద్రా! 362

ప్రతిపదార్థం: అని; చెప్పి= బోధించి; నర+ఇంద్రా!= రాజా!; అట్టి చందంబునన్= ఆ తీరున; నడచిన సతికిన్= ప్రవర్తించిన పతివ్రతకు; లోకములు= లోకాలు; రెండును= రెండుకూడా; సౌఖ్యనిరూఢి= సుఖపు గట్టి స్థితిని; ఒసఁగున్= ఇస్తాయి; ఆ+వధూటి= అట్టి స్త్రీ; అరుంధతి పోలెన్= వసిష్ఠుడి ధర్మపత్ని అరుంధతివలె; పొగడు= ప్రశంస; ఒందున్= పొందుతుంది.

తాత్పర్యం: అని చెప్పింది. రాజా! ఆ విధంగా ప్రవర్తించిన ఉత్తమవనిత ఇహపరలోకాలలో రెండింటిలో శాశ్వత సుఖం పొందుతుంది. ఆ ఇల్లాలు అరుంధతివలె ప్రశంస కెక్కుతుంది.

విశేషం: ఇక్కడ సుమన వాక్యం పూర్తిచేయటం కనపడుటలేదు. కనుక "అని చెప్పె నట్టి" అనే పాఠం గ్రహించటం మేలు. తరువాతి దంతా అప్పుడు భీష్ముడి వాక్యం అవుతుంది.

క. 'నృప! యీ యాఖ్యానము ప । ర్వపు దినమున భక్తిఁ జదువువారలు విను పు

ణ్య పురుషులును నాయుశ్శ్రీ । లపరిమితము లొంది యమరు లగుదురు పిదపన్

ప్రతిపదార్థం: నృప= రాజా!; ఈ+ఆఖ్యానము= ఈ కథ; పర్వము+దినమునన్= పండుగనాడు; భక్తిన్= భక్తితో; చదువు వారలు= చదివేవారు; విను= ఆలకించు; పుణ్య పురుషులును= పుణ్యంగల మనుష్యులు (అవుతారు); ఆయుస్+శ్రీలు= ఆయువు, సంపద; అపరిమితములు= మేర లేనంతటివి; ఒంది= పొంది; పిదపన్= మరణం తరువాత;అమరులు= దేవతలు; అగుదురు= అవుతారు.

తాత్పర్యం: 'రాజా! ఈ కథను పర్వపురోజులలో భక్తితో చదివేవారు పుణ్యపురుషులౌతారు. మేరలేని ఆయువును సంపదను పొందుతారు. కడకు దేవత లవుతారు.'

వ. అనిన విని ధర్మనందనుండు 'సర్వశాస్త్రసారంబై శ్రేష్ఠంబగు ననుష్ఠేయం బెయ్యది? పితామహా! యనుగ్రహింపు'మని యభ్యర్థించిన నాపగేయుండు కృపావిధేయుండై 'నారదపుండరీక సంవాదం బాకర్ణింపుము దాన నీయడిగిన యర్థంబు తెలియును దీర్థపరుండును జపతత్పరుండును బుండరీకాభి ధానుండును నైన మహాద్విజుం డొక్కయెడ నారదమహామునిం గని భక్తింబ్రణతుండై యిత్తెఱంగునన యడుగ నతం డతని కిట్లనియె. 364

ప్రతిపదార్థం: అనినన్= అంటే; విని; ధర్మనందనుండు= ధర్మపుత్రుడు; సర్వశాస్త్ర సారంబు+ఐ= అన్ని శాస్త్రాల సారమై; శ్రేష్ఠంబు+అగు= మిక్కిలి గొప్పదైన; అనుష్ఠేయంబు= చేయవలసిన కార్యం; ఏ+అది?= ఏది?; పితామహా= తాతా!; అనుగ్రహింపుము= ప్రసాదించుము; అని; అభ్యర్థించినన్= వినయంతో కోరగా; ఆపగేయుండు= నదికొడుకు భీష్ముడు; కృపా విధేయుండు+ఐ= దయకు లోబడినవాడై; నారద పుండరీక సంవాదము= నారదుడు, పుండరీకుడు అనేవారి సంభాషణ; ఆకర్ణింపుము= వినుము; దానన్= దానియందు; దానిచేత; నీ+అడిగిన అర్థంబు= నీవు అడిగిన విషయం; తెలియును= తెలుస్తుంది; తీర్థపరుండును= పుణ్యస్థలాలయందు పరమాదరం కలవాడు; జపతత్పరుండును= జపంమీద మిక్కిలి శ్రద్ధకలవాడూ; పుండరీక+అభిధానుండును= పుండరీకుడు అనే పేరుగలవాడు; ఐన మహాద్విజుండు= అయిన గొప్ప బ్రాహ్మణుడు; ఒక్క+ఎడన్= ఒకచోట; నారద మహామునిన్= నారద మహర్షిని; కని= చూచి; భక్తిన్= భక్తితో; ప్రణతుండు+ఐ= చాగి మ్రొక్కినవాడై;

ఈ+తెఱంగునన్+అ= నీవు అడిగిన ఈ తీరుననే; అడుగన్= అడిగితే; అతండు= ఆ నారదుడు; అతనికిన్= ఆ పుండరీకుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అన్నమాట విని ధర్మరాజు 'అన్ని శాస్త్రాల సారము, మిక్కిలి గొప్పదీ అయిన ఆచరణ ఏమిటి? తాతా! దయచేసి చెప్పుము.' అని కోరాడు. భీష్ముడు మిక్కిలి దయకు లోబడినవాడై 'నారదపుండరీక సంవాదం వినుము. దానివలన నీవడిగిన విషయం తెల్లమవుతుంది. తీర్థాలు సేవించటం, జపంచేసికొనటం శీలంగాగల పుండరీకుడనే మహర్షి ఒక చోట నారదుడిని చూచి భక్తితో మ్రొక్కి నీ వడిగినట్లే అడిగాడు. అపుడు నారదు డిట్లా చెప్పాడు.

విశేషం: మీద మీద ప్రశ్నలడుగుతున్నా భీష్ముడు సంతోషంతో ఓపికతో సమాధానాలు చెపుతూనే ఉన్నాడు. విసుగు చెందటంలేదు. అదే అతడి "కృపావిధేయత''

నారదపుండరీక సంవాదం బను పరమేతిహాసప్రకారము (సం.13-186-1 (కుంభ))

సీ. **'పరమేష్ఠి చెప్పిన పరమధర్మం బల్ప। ఫణితి మహార్థంబు భవ్యమతికి**
శ్రోతవ్యమును బరిజ్ఞాతవ్యమును దాని। విను ప్రకృతికిఁ బర మనఁగఁ బడిన
యిరువ దేనగుతత్త్వ మరయంగ జీవాత్ముఁ। డాతండ సర్వభూతాత్మకుండు
నరుఁడన వెలుఁగు నప్పురుషుని వలనన। కలిగి నారములన వెలసినట్టి

తే. **యన్యతత్త్వంబు లతనికి నయన మగుట। నతఁడు నారాయణుం డన నతిశయిల్లు**
విశ్వమును దనయంద యావిర్భవింప। విలయ మొంద నద్దేవుండు విభుతఁ బొల్చు. **365**

ప్రతిపదార్థం: పరమేష్ఠి= బ్రహ్మ; అల్పఫణితిన్= సులభమైన తీరున; చెప్పిన పరమధర్మంబు= చెప్పిన మిక్కిలి శ్రేష్ఠమైన ధర్మం; మహత్+అర్థంబు= గొప్ప అర్థం కలది; భవ్యమతికిన్= ఉత్తమ బుద్ధికలవాడికి; శ్రోతవ్యమును= వినదగినది; పరిజ్ఞాతవ్యమును= నిండుగా తెలియదగినది; దానిన్= దానిని; విను(ము)= ఆలకించుము; ప్రకృతికిన్= ప్రకృతి అనే తత్త్వానికి; పరము= తరువాతిది; అనఁగన్+పడిన= అనబడిన; ఇరువది+ఏను+అగుతత్త్వము= ఇరవై అయిదవ తత్త్వం; అరయంగన్= పరిశీలించగా; జీవ+ ఆత్ముఁడు= జీవుడనే ఆత్మ; ఆతండు+అ= అతడే, సర్వభూత+ఆత్మకుండు= అన్ని భూతాల స్వరూపం అయినవాడు; నరుఁడు= మానవుడు; అనన్= అనే పేరుతో; వెలుఁగన్= ప్రకాశిస్తాడు; ఆ+పురుషుని వలనన్+అ= అట్టి నరుడనే పురుషుడివలననే; కలిగి= ఏర్పడి; నారములు= నరసంబంధమైనవి అనే అర్థంతో 'నారములు' అనన్= అనగా; వెలసిన+అట్టి అన్యతత్త్వంబులు= రూపు గొన్నట్టి ఇతర తత్త్వాలు; అతనికిన్= ఆ పురుషుడికి; అయనము= స్థానము; అగుటన్= కావటంవలన; అతఁడు= ఆ పురుషుడు; నారాయణుండు= నారాయణుడు; అనన్= అనగా; అతిశయిల్లున్= ఒప్పుతాడు; ఆ+దేవుండు= ఆ దేవుడు; విశ్వమును= ఈ సమస్తమైన ప్రపంచాల సముదాయాన్ని; తనయందున్+అ= తన యందే; ఆవిర్భవింపన్= పుట్టగా; విలయము= కలిసిపోవటం; ఒందన్= పొందగా; విభుతన్= విభుడు అనే భావంతో; పొల్చున్= విరాజిల్లుతాడు.

తాత్పర్యం: 'బ్రహ్మ సులభమైనతీరులో గొప్ప అర్థంతో చెప్పిన పరమధర్మం ఒకటి ఉన్నది. అది పుణ్యబుద్ధి కలవాడు వినదగినది. పరిపూర్ణంగా తెలియదగినది. దానిని వినుము. ప్రకృతి అనే ఇరవైనాలుగవ తత్త్వం ఒకటి ఉన్నది. దానికి తరువాతి తత్త్వం జీవాత్మ. అతడు సర్వభూతాల స్వరూపం అయినవాడు. 'నరుడు' అతడి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ్యవహారనామం. అతడివలన ఏర్పడిన తక్కిన తత్త్వాలన్నీ నారములు. అతడు నారములు స్థానంగా గలవాడు. కనుక, నారాయణుడు (నార+అయన). ఆ ప్రభువు విశ్వమంతటినీ పుట్టిస్తూ మరల తనలో లీనం చేస్తూ 'విభుడు' అవుతున్నాడు.

విశేషం: పూర్వం యోగసాంఖ్యాల సందర్భంగల హరసనత్కుమార సంవాదంలో ఇరవై అయిదు తత్త్వాలు ప్రస్తావనకు వచ్చాయి. పంచభూతాలు మొదలుకొని ప్రకృతివరకు ఉండే ఇరవై నాలుగు తత్త్వాలు ఇరవై అయిదవది అయిన 'నర' (జీవాత్మ) తత్త్వం వలన ఏర్పడటంవలన నారములు. జీవాత్మ వీటికి (అయనం) స్థానమైనవాడు కనుక నారాయణుడు. సృష్టి ఏర్పడటమూ, లీనమైపోవటమూ అతడియందే జరుగుతాయి. దృష్టాంతంగా నీటిని గ్రహించవచ్చును ఉన్నదంతా జలము కాగా సుడి, బుడగ, తరంగం మొదలైన పేర్లు నీటిలోని స్థితిభేదాలను బట్టి ఏర్పడుతున్నాయి. కాని నీటినుండి బుడగను, సుడినీ, తరంగాన్నీ వేరుచేయలేం. ఎందుకంటే అది నీరే తప్ప మరొకటి కాదు కనుక. ఈ పద్యంలోని ఈ రహస్యాన్ని ఈ దృష్టాంతం ద్వారా చక్కగా పట్టుకొనవచ్చును.

ఈ జీవాత్మ స్వరూపాన్ని వ్యష్టిగా, సమష్టిగా దర్శించాలి. ఒక్కొక్క వ్యక్తిలో చూస్తే వ్యష్టి దర్శనం. విశ్వమంతా ఒక్కటిగా భావించి చూస్తే సమష్టి దర్శనం.

క. పరమ బ్రహ్మం బనఁగాఁ । బరతత్త్వం బనఁగఁ బరమపద మనఁగా నీ
శ్వరుఁ డన విష్ణుఁ డన జగ । ద్భరితత నారాయణుండు దా వెలుఁగొందున్. 366

ప్రతిపదార్థం: నారాయణుండు= ఆ నారాయణుడు; పరమ బ్రహ్మంబు= అంతకంటె మరొక దశలేని బ్రహ్మము; అనన్+కాన్= అనగా; పరతత్త్వంబు= దానికి మించిన తత్త్వం లేదనే పరతత్త్వం; అనన్+గన్= అనగా; పరమపదము= దానిని మించిన ఉన్నత స్థానం లేదనే అర్థంగల పరమపదం; అనఁగాన్= అనగా; ఈశ్వరుఁడు= అన్నింటికీ ప్రభువు అనే అర్థంగల ఈశ్వరుడు; అనన్= అనగా; విష్ణుఁడు= అంతటా వ్యాపించినవాడు అనే అర్థంగల విష్ణుడు; అనన్= అనగా; జగత్+భరితతన్= విశ్వమంతా నిండిన తనంతో; తాన్= తాను; వెలుఁగు+ఒందున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: ఆ నారాయణుడు పరమబ్రహ్మము. పరతత్త్వము, పరమపదము, ఈశ్వరుడు, విష్ణువు - అనే పేర్లతో విశ్వమంతా నిండి వెలుగుతూ ఉంటాడు.

విశేషం: 'బ్రహ్మం' అంటే బృహత్తు - పెద్దది అని అర్థం. 'పరబ్రహ్మం' అంటే దానికంటె పెద్దది మరొకటి ఉండదని భావం. 'తత్త్వం' అంటే స్థూలంగా పదార్థం. పరతత్త్వం అన్నింటికి మించిన దశలో ఉండే భావం.

ఆ. అతఁడు వాసుదేవుఁ డన నాత్మ యనఁగ వే । దాంతవాక్యబోధ్యుఁడై వెలుంగు
నరుల కప్పదములు నామాంతరంబు ల । ర్థాంతరంబు లేని యట్టి వనఘ! 367

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; అతఁడు= ఆ నారాయణుడు; వాసుదేవుఁడు= వాసుదేవుడు; అనన్= అనగా; ఆత్మ; అనఁగన్= అనగా; వేదాంతవాక్య బోధ్యుఁడు+ఐ= ఉపనిషత్తుల వాక్యములతో తెలియవచ్చేవాడై; వెలుంగున్= ప్రకాశిస్తాడు; నరులకున్= 'నరులు' అనబడేవారికి; ఆ+పదములు= ఆ మాటలు; నామ+అంతరంబులు= మరియొక పేర్లు; అర్థ+అంతరంబు= వేరొక అర్థం; లేని+అట్టి+అవి= లేనట్టివి.

తాత్పర్యం: ఆ నారాయణుడే వాసుదేవుడు, ఆత్మ అనే పేర్లతో ఉపనిషత్తుల మాటలచేత తెలియవస్తూ ఉంటాడు. నరుడికి కూడా అవి వేరు పేర్లు. కాని అర్థంలో మాత్రం భేదం లేనివి.

విశేషం: వాసుదేవుడు - వస్= ఉండటం; దివ్= ప్రకాశించటం - అనే రెండు ధాతువులనుండి ఏర్పడిన వాసు, దేవ అనే రెండు పేర్ల సముదాయవాచకం. "ఎల్లయందును దా వసియించు టెల్లయును తనయందు వసియించు టండ్రు వాసుదేవు డని పేరి కర్థంబు" అని భారతంలో మరొక సందర్భంలో చెప్పారు. అన్నియెడలా, అన్ని వేళలా ఉంటూ ప్రకాశించే తత్త్వాన్ని వాసుదేవు డంటారు. "అత" అని ధాతువు. సంతతగమనం కలది అని దాని కర్థం. దాని నుండి ఏర్పడిన శబ్దం 'ఆత్మ'. అంతటా వ్యాపించి ఉండేది - అని దానికి అర్థం. ఈ విధంగా నరనారాయణులకు నామభేదమే కాని అర్థభేదం లేదని తాత్పర్యం. అమ్మ, తల్లి, మాత అనీ శబ్దాలు వేరయినా అవి చెప్పే అర్థం ఒక్కటే కదా!

ఆ. సర్వశాస్త్రవాక్యసమితి నాలోకించి । మఱియు దృఢవిచారమహిమఁ దెలిసి
నిశ్చయింపఁబడియె నిష్ఠ నారాయణు । నెపుడుఁ దలఁపవలయు నిది యొకండ. 368

ప్రతిపదార్థం: సర్వశాస్త్రవాక్యసమితిన్= అన్ని శాస్త్రాల వాక్యాల సముదాయాన్ని; ఆలోకించి= చూచి; మఱియున్= ఆపైన; దృఢ విచారమహిమన్= గట్టిదైన ఆలోచన యొక్క గొప్పతనంతో; తెలిసి= తెలిసికొని; ఇది; ఒకండు+అ= ఒక్కటే; నిశ్చయింపన్+పడియెన్= నిర్ణయింపబడింది. ఎపుడున్= ఎల్లవేళలా; నిష్ఠన్= గురితప్పకుండా; నారాయణున్= నారాయణ తత్త్వాన్ని; తలఁప వలయున్= భావిస్తూ ఉండాలి.

తాత్పర్యం: సర్వశాస్త్రాల వాక్యాలను పరిశీలించి, గట్టి వివేకంతో దానిని చక్కగా తెలిసికొని ఇది ఒక్కటే నిర్ణయించబడింది. ఎల్లవేళలా నిష్ఠతో నారాయణుడిని స్మరిస్తూ ఉండాలి.

విశేషం: సర్వశాస్త్రసమితి నాలోకించటం - శ్రవణం, దృఢవిచార మహిమను తెలిసికొనటం - మననం; నిశ్చయించటం - నిదిధ్యాసనం. జ్ఞానానికి ఈ మూడు క్రమదశలు. జ్ఞానం ఎప్పుడూ అందరికీ ఏకాకారంగా ఉంటుంది. దానినే 'ఒకండ' అనే పదంతో చెప్పారు. ఇదే అద్భుతమైన మహార్థాన్ని అల్పఫణితితో చెప్పే తీరు. (365వ పద్యం చూడండి)

వ. కావున. 369

తాత్పర్యం: కనుక.

క. పరమానుష్ఠేయం బిది । నరోత్తమా! నీవు నెపుడు నారాయణుఁ ద
త్పరతఁ దలఁపు చొరకు సవి । స్తర శాస్త్రార్థముల క్రందుఁ దలపోఁతలకున్. 370

ప్రతిపదార్థం: నర+ఉత్తమా!= మానవశ్రేష్ఠుడా!; ఇది= నేను చెప్పినది; పరమ+అనుష్ఠేయంబు= అన్నింటిని మించి ఆచరించదగినది; నీవున్= నీవు కూడా; తత్+పరతన్= అదే లక్ష్యంగా; ఎపుడున్= ఎల్లవేళలా; నారాయణున్= నారాయణుడిని; తలఁపు= భావించుము; సవిస్తర శాస్త్ర అర్థముల క్రందున్= చాలా వ్యాపించిన శాస్త్ర చర్చల గందరగోళంలో; తలపోఁతలకున్= ఊహలకు; చొరకు= ప్రవేశింపకుము.

తాత్పర్యం: మనుజవరా! ఇదే అనుష్ఠింపవలసిన వాటిలో అన్నింటికంటె ఉత్తమమైనది. కనుక నీవు కూడా నారాయణుడిని పరమశ్రద్ధతో భావించుము. విస్తృతంగా ఉన్న శాస్త్రచర్చల గందరగోళంలోని ఊహలు చేయటానికి ప్రవేశించకుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఏది తెలిసికొంటే సర్వమూ తెలుస్తుందో అది తెలిసికొన్న తరువాత శాస్త్రచర్చలు ప్రారంభించటం వ్యర్థమే కాదు అనర్థం కూడా. క్రొత్తది రాదు. ఉన్నది పోతుంది. అని ఈ పద్యంలో ద్వితీయార్థం హెచ్చరిస్తున్నది.

క. విను మొక యించుక సేపై । నను నారాయణునిఁ దలఁచినను సుగతిఁ గనున్

మనుజుఁ డనిన మదినెప్పుడు । నునిచిన యాతనికి బ్రాతె? యుత్తమధిషణా! 371

ప్రతిపదార్థం: ఉత్తమధిషణా!= గొప్ప మేధకలవాడా!; వినుము; ఒక+ఇంచుకసేపు+ఐనను= చాలా కొంచెం కాలం అయినా; నారాయణునిన్= నారాయణుడిని; తలఁచినను= భావించినా; మనుజుఁడు= నరుడు; సుగతిన్= మంచిగతిని; కనున్= పొందుతాడు; అనినన్= అనగా; మదిన్= హృదయంలో; ఎప్పుడున్= ఎల్ల వేళలా; ఉనిచిన అతనికిన్= నిక్షేపించుకొన్నవాడికి; బ్రాతె?= తక్కువ అవుతుందా?

తాత్పర్యం: మహా మేధావీ! కొంచెం సేపైనా నారాయణుడిని తలపోస్తే మనుజుడికి సుగతి కలుగుతుంది - అంటే ఎల్లవేళలా హృదయంలో నారాయణుడిని నిక్షేపించుకొన్నవాడికి సుగతి తక్కువ అవుతుందా?

విశేషం: అమృతం ఏ కొంచెం భుజించినా అమరత్వం సిద్ధిస్తుంది. అట్లాగే నారాయణస్మరణ ఫలాన్ని కూడా భావించవచ్చును.

క. ప్రణుత యగు 'నమోనారా । యణాయ' యను నక్షరాలి నంతప్రాప్తి

క్షణమున జిహ్వకుఁ దెచ్చినఁ । బ్రణవార్థం బైన పదముఁ బడయుదురు నరుల్. 372

ప్రతిపదార్థం: ప్రణుత= మిక్కిలి ప్రశస్తమైనది; అగు= అయిన; 'నమోనారాయణాయ= నారాయణ దేవునకు నమస్సు' అనే అర్థంగల నమోనారాయణాయ; అను అక్షర+ఆలిన్=అనే అక్షరాల వరుసను; మంత్రాన్ని; అంతప్రాప్తి క్షణమునన్= తుది గడియలు వచ్చిన వేళలలో; జిహ్వకున్= నాలుకకు; తెచ్చినన్= తెస్తే; నరుల్= మానవులు; ప్రణవ+అర్థంబు= ఓంకారానికి అర్థం; ఐన పదమున్= అయిన పరమస్థానాన్ని; పడయుదురు= పొందుతారు.

తాత్పర్యం: మరణకాలంలో 'నమోనారాయణాయ' అనే మంత్రాన్ని పలికితే నరులు ప్రణవానికి అర్థమైన పరమపదాన్ని పొందుతారు.

విశేషం: "ఓమ్" అనేది ప్రణవం. ఓమ్ శబ్దానికి అర్థం పరమాత్మ. "అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరమ్, యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః" అని గీత. 'మరణకాలంలో నన్నే స్మరిస్తూ దేహం వదలినవాడు నా భావాన్నే పొందుతాడు. ఇందు సందియంలేదు.' నా భావం అంటే పరమాత్మ భావం. ఆ శ్లోకభావాన్నే ఈ పద్యం చెప్పుతున్నది.

క. నారాయణ పదవాచ్యం । బారయ బ్రహ్మంబు దాని ననిశము వినియున్

సారమతిం దలఁచియు నిం । పారఁగఁ బొగడియు రమించు టతులహిత మగున్. 373

ప్రతిపదార్థం: ఆరయన్= చక్కగా విచారింపగా; నారాయణ పదవాచ్యంబు= నారాయణ అనే శబ్దం చేత చెప్పబడేది; బ్రహ్మంబు= బ్రహ్మమే; దానిన్= ఆ బ్రహ్మమును; అనిశము= ఎల్లవేళలా; వినియున్= విని; సారమతిన్= పదునైన బుద్ధితో; తలఁచియున్= భావించి; ఇంపారఁగన్= చక్కగా; పొగడియున్= కొనియాడి; రమించుట= ఆనందపడటం; అతుల హితము= సాటిలేని మేలు; అగున్= అవుతుంది.

తాత్పర్యం: 'నారాయణ' శబ్దం చెప్పేది బ్రహ్మమునే. దానిని ఎల్లవేళలా వింటూ, పదునైన బుద్ధితో భావిస్తూ చక్కగా కీర్తిస్తూ ఆనంద మందటం సాటిలేని మేలు అవుతుంది.

విశేషం: ఇక్కడ కూడా శ్రవణ, మనన, నిదిధ్యాసలను చెప్పారు. హృదయమందిరంలో ఆ భావం చక్కగా కుదురుకొనటమే నిదిధ్యాసనం. 'రమించటం' అనే శబ్దంలో ఆ భావాన్ని మనం గ్రహించాలి. లోకవిషయజ్ఞానానికి 'మతి' చాలును. పరతత్త్వ జ్ఞానానికి 'సారమతి' కావాలి. సారమతి అంటే ఏది నిత్యమో ఏది అనిత్యమో నిర్ణయించి నిష్కర్షగా చెప్పగల బుద్ధి.

తే. విందు నారాయణ పరాయణుండు పాత । కముల గెలిచి వెలుంగుటె కాదు తన్ను
నాశ్రయించినవారికి నతులమైన । వెలుఁగు నొసఁగంగఁ జాలుట వేధచేఁత. 374

ప్రతిపదార్థం: విందు= వినండి; నారాయణ పరాయణుండు= నారాయణుడే పరమగతి అనే నిర్ణయం కలవాడు; పాతకములన్= పాపాలను; గెలిచి= జయించి; వెలుంగుట+ఎ= ప్రకాశించటమే; కాదు; తన్నున్= తనను; ఆశ్రయించినవారికిన్= చేరుకొన్నవారికి; అతులము+ఐన= సాటిలేనిదైన; వెలుఁగున్= జ్ఞానం అనే వెలుగును; ఒసఁగంగన్= ఇవ్వటానికి; చాలుట= సమర్థుడు కావటం; వేధచేఁత= బ్రహ్మచేసిన పని.

తాత్పర్యం: వినండి, నారాయణుడే పరదైవంగా కలవాడు పాతకాలను కాలరాచి ప్రకాశించటమే కాదు, తన్ను చేరుకొన్నవారికి కూడా సాటిలేని ఆ జ్యోతిని ప్రసాదించగలగటం బ్రహ్మచేసిన ఏర్పాటు.

విశేషం: "స్వయం తీర్త్వా పరాం స్తారయతి" అని సూక్తి. తానుదాటి ఇతరులను దాటిస్తాడు. అంటే తనకు ఇతరులకు గురుశిష్య భావం ఉంటుంది. భారతీయతత్త్వంలో గురువు పరబ్రహ్మమే.

క. చతురాశ్రమముల లోపల । నతులమతీ! యెందు నిలిచి నతనికి భక్తిన్
మతిఁ గేశవుఁ గూర్పక స । ద్గతి పెఱకర్మముల నేల కల్గఁగ నేర్చున్? 375

ప్రతిపదార్థం: అతులమతీ!= సాటిలేని బుద్ధికలవాడా!; చతుర్+ఆశ్రమముల లోపలన్= నాలుగు ఆశ్రమాలలో; ఎందున్= దేనిలో; నిలిచిన+అతనికిన్= ఉన్నవాడికైనా; భక్తిన్= భక్తితో; మతిన్= బుద్ధియందు; కేశవున్= నారాయణుడిని; కూర్పక= నిలుపక; సత్+గతి= ఉత్తమ స్థితి; పెఱకర్మములన్= వేరు కర్మములతో; ఏల?= ఎట్లు?; కల్గఁగన్+నేర్చున్?= కలుగుతుంది?

తాత్పర్యం: మహాబుద్ధిశాలీ! నాలుగాశ్రమాలలో దేనియం దున్నవాడికైనా మదిలో కేశవుడిని నిలుపకపోతే ఇతర కర్మల ద్వారా ఉత్తమగతి ఎట్లా కలుగగలదు?

విశేషం: చతురాశ్రమములు: 1.బ్రహ్మచర్యం, 2.గార్హస్థ్యం, 2. వానప్రస్థం, 4.సన్న్యాసం. ఆశ్రమధర్మనిష్ఠ ఉండవలసినదే. నారాయణ స్మరణ లేకపోతే ఆ నిష్ఠ ఉత్తమగతి నీయజాలదని భావం.

క. కను టరిది యొండుమెయి వి । ష్ణుని భక్తిం గనుము నీవు సువ్రత! యద్దే
వుని వినుము భక్త వత్సలుఁ । డను నామము గలిమి దృశ్యుఁ డగు భక్తులకున్.' 376

ప్రతిపదార్థం: సువ్రత= చక్కని నియమ పాలనగల మనిషీ!; ఒండు మెయిన్= మరొక విధంగా; విష్ణునిన్= నారాయణుడిని; కనుట= చూడటం; అరిది= అసాధ్యం; నీవు; భక్తిన్= భక్తితో; కనుము= చూడుము; ఆ+దేవునిన్= ఆ దేవుడిని గూర్చి;

వినుము; భక్త వత్సలుఁడు= భక్తులయందు బిడ్డలయందలి భావం ఉన్నవాడు అని అర్థంగల భక్తవత్సలుడు; అను నామము= అనే పేరు; కలిమి= ఉండటంవలన; భక్తులకున్= భక్తులకు; దృశ్యుఁడు= చూడబడేవాడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: ఉత్తమవ్రతుడా!; మరొక విధంగా విష్ణువును చూడజాలము. భక్తితో దర్శించుము. ఆ దేవుడిని గూర్చి వినుము. 'భక్తవత్సలుడు' అనే నామం ఆయనకు ఉన్నందువలన అతడు భక్తులకు కానవస్తాడు'.

విశేషం: నిజానికి పరమాత్మను చర్మనేత్రాలతో చూడటం సాధ్యం కాదు. అయినా అతడి దయవలన కృష్ణాదిరూపంలో భక్తులు చూస్తూ ఉంటారు. 'వివేకచూడమణి' స్వస్వరూపానుసంధానమే భక్తి అంటున్నది. కనుక భక్తి అంటే తత్త్వజ్ఞానమే.

క. అని నారదుఁ డుపదేశిం । చిన నానైష్ఠికుఁడు నియతచిత్తుండై వి

ష్ణుని నర్చించు సభక్తిక । మననవిశేషమున నెపుడు మనుజాధీశా! 377

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= రాజా!; అని= ఈ విధంగా; నారదుఁడు= నారదమహర్షి; ఉపదేశించినన్= బోధించగా; ఆ నైష్ఠికుఁడు= గొప్పనిష్ఠ కల ఆ పుండరీకుడు; నియత చిత్తుండు+ఐ= చెదరని హృదయం కలవాడై; సభక్తిక మనన విశేషమునన్= భక్తితో కూడిన నిరంతరభావన యొక్క అతిశయంతో; ఎపుడున్= ఎల్లవేళలా; విష్ణునిన్= నారాయణుడిని; అర్చించున్= పూజిస్తూ ఉండేవాడు.

తాత్పర్యం: రాజా! ఈ విధంగా ఈ నారదుడు బోధిస్తే ఆ నిష్ఠాపరుడు చెదరని చిత్తంతో భక్తిగల మననంతో ఎల్లవేళలా నారాయణుడిని అర్చిస్తూ ఉంటాడు.

విశేషం: 'అర్చించున్' అనేది తద్ధర్మక్రియ. అర్చించటం శీలంగా ఏర్పడాలని అది సూచిస్తుంది.

తే. శంఖచక్రగదాధరు శార్ఙ్గిఁబుండ । రీకదళసన్నిభాక్షుఁ గిరీటకుండ

లాభిరాము శ్రీవత్ససంశోభివక్షుఁ । గౌస్తుభోజ్జ్వలుఁ గలలోనఁ గను నతండు. 378

ప్రతిపదార్థం: శంఖచక్ర గదాధరున్= పాంచజన్యమనే శంఖాన్నీ, సుదర్శనం అనే చక్రాన్నీ, కౌమోదకి అనే గదను ధరించినవాడికి; శార్ఙ్గిన్= శార్ఙ్గం అనే విల్లు కలవాడిని; పుండరీక దళ సన్నిభ+అక్షున్= పద్మపు రేకులను పోలిన కన్ను లున్న వాడిని; కిరీట కుండల+అభిరామున్= కిరీటమూ, కుండలములు అనే వాటితో చూడముచ్చట అయిన వాడిని; శ్రీవత్స సంశోభివక్షున్= శ్రీవత్సమనే పుట్టుమచ్చతో అందమైన రొమ్ము కలవాడిని; కౌస్తుభ+ఉజ్జ్వలున్= కౌస్తుభ మనే మణి కాంతులతో వెలిగిపోవుచున్నవాడిని; కలలోనన్= కలలో; కను+అతండు= చూచేవాడు.

తాత్పర్యం: శంఖము, చక్రము, గద, శార్ఙ్గము అనేవాటిని నాలుగు చేతులతో ధరించిన స్వామి, పద్మపత్రముల వలె విశాలమైన ఆర్ద్రమైన కన్నులతో విరాజిల్లువాడు, కిరీటకుండల కాంతులతో చూడముచ్చట అయినవాడు, శ్రీవత్సమనే పుట్టుమచ్చతో విరాజిల్లు రొమ్ము కలవాడు, కౌస్తుభమణి కాంతులతో వెలిగిపోయేవాడు అయిన శ్రీమన్నారాయణుడిని కలలో చూచినవాడు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: శంఖం నాదానికీ, చక్రం కాలానికీ, గద ఆనందం కలిగించటానికీ, (గదకు కౌమోదకి అని పేరు!) శార్ఙ్గం - ధనుస్సు, దుష్టశిక్షణ, శిష్టరక్షణకూ సంకేతాలు. పుండరీకం సర్వతోముఖప్రసరణశీలానికి సంకేతం. కిరీటం సార్వభౌమత్వానికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతం, కుండలాలు - కర్ణాభరణాలుగా జ్ఞానానికి సంకేతం, శ్రీవత్సం - పుట్టుమచ్చ. ఇది సౌందర్యానికి ద్యోతకం. కౌస్తుభం - అనన్య సాధారణజ్ఞాన జ్యోతిస్సుకు సంకేతం. (ఇట్లా భావించవచ్చును.)

క. చిరకాలంబున సాక్షా । త్కరణంబును గల్గు దానఁ గానని పదముం
బొరయని శుభముం గలవే? । కురువర! నీవు నతిభక్తిఁ గొలువుము విష్ణున్. 379

ప్రతిపదార్థం: చిరకాలంబునన్= పెద్దకాలంలో; సాక్షాత్+కరణంబును= ప్రత్యక్షం కావటాన్ని; కల్గున్= పొందుతాడు; దానన్= దానిచేత; కానని పదమున్= కనపడని స్థానం; పొరయని శుభమున్= పొందని శుభమూ; కలవే?= ఉంటాయా? కురువర!= కురురాజా!; నీవును= నీవుకూడా; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; విష్ణున్= విష్ణువును; కొలువుము= సేవించుము.

తాత్పర్యం: బహుకాలం ఆ రూపం మనస్సులో నిలిచిపోయిన వాడవుతాడు. దానిచేత చూడని పదమూ, పొందని శుభమూ ఉండదు. రాజా! నీవుకూడా పరమభక్తితో విష్ణువును సేవించుము.

క. అనిన విని హర్షపూరం । బునఁ జిత్తము దేల ధర్మపుత్త్రుం డా శం
తను సుతునకుఁ బ్రణమిల్లెం । దనువునఁ బులకాంకురప్రతతి జాదుకొనన్. 380

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; హర్షపూరంబునన్= ఆనందపు ప్రవాహంలో; చిత్తము= హృదయము; తేలన్= తేలిపోగా; ధర్మపుత్త్రుండు= ధర్మరాజు; తనువునన్= దేహంమీద; పులక+అంకుర ప్రతతి= పులకలమొలకల సముదాయం; జాదుకొనన్= వ్యాపించగా; శంతను సుతునకున్= శంతనుడి కుమారు డగు భీష్ముడికి; ప్రణమిల్లెన్= సాష్టాంగ నమస్కారంచేశాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని ఆనందలహరిలో హృదయం తేలిపోతూ ఉండగా ధర్మరాజు ఒడలంతా పులకలు వ్యాపించగా భీష్ముడికి ప్రణామం చేశాడు.

విశేషం: పరమానందం మొదలైన భావాలు కలిగినపుడు శరీరంమీద రోమాలు నిక్కపొడుచుకొనే స్థితిని రోమాంచం అంటారు. దానినే పులకాంకురప్రతతిగా ఇక్కడ చెప్పారు.

విశేషం: పరమానందం మొదలైన భావాలు కలిగినపుడు శరీరంమీద రోమాలు నిక్కపొడుచుకొనే స్థితిని రోమాంచం అంటారు. దానినే పులకాంకురప్రతతిగా ఇక్కడ చెప్పారు.

వ. ప్రణమిల్లి యతనితో 'దానప్రియవచనంబుల రెంటియందును నధికరంజనంబెయ్యది? చెప్పవే' యనుటయు నద్దేవవ్రతుం డన్నరదేవోత్తమున కిట్లను 'రెండును మంచి తెఱంగుల యెదిరిచందం బెఱింగి నడపునది దానంబు రంజకం బగుటం దెలుపవలవదు సామవాదంబు గుణంబు దెల్లంబగునట్టి యితిహాసంబు వినుము చెప్పెద, బుద్ధి సంపన్నుండగు నొక్కబ్రాహ్మణుండు విజనంబగు వనంబునం గార్యవశంబున మెలంగఁ దన్మాంసం బాహారంబు గొనుటకయి దారుణుం డగు దానవుం డతనిం బట్టికొనిన సాంత్వనభాషణంబులు ప్రయోగించు వాఁ డయి యవ్విప్రుండు గలంకయుఁ గొందలంబును లేని డెందంబుతో నద్దానవు నాననంబు గనుంగొనిన నాధైర్యధుర్యుం గనుంగొని తదీయంబగు నుదాత్తత్వంబునం జిత్తంబు రంజిల్లి యద్దనుజుం డద్ధరాదివిజునితో

'మదీయంబగు ప్రశ్నంబునకు సదుత్తరం బిచ్చితేని నిన్ను విడిచెద' నను పలుకు పలికి తన శరీరంబు డయ్యుటకు వెలుకం బాఱుటకుం గారణంబేమి? యని యడిగిన నమ్మహీసురవరుండు వేగిరపడక కొండొకసేపు విచారించి 'మహాపురుషా! నీ యట్టి కృపాపరుం డడుగం దోఁచిన తెఱంగునం జెప్పుట మేలు కాదె? యాకర్ణింపు' మని సౌముఖ్యంబు నొంది. 381

ప్రతిపదార్థం: ప్రణమిల్లి= సాష్టాంగ నమస్కారంచేసి; అతనితోన్= ఆ భీష్ముడితో; దాన ప్రియవచనంబులన్= దానము, ప్రియంగా పలకటం అనే; రెంటియందును= రెండింటిలో; అధిక రంజనంబు= ఎక్కువ ప్రీతి కలిగించేది; ఏ+అది?= ఏది?; చెప్పవే!= దయతో చెప్పవూ!; అనుటయున్= అనగా; ఆ+దేవవ్రతుండు= ఆ భీష్ముడు; ఆ+నరదేవ+ఉత్తమునకున్= ఆ రాజశ్రేష్ఠుడికి; ఇట్లు= ఈ విధంగా; అనున్= చెప్పుతున్నాడు; రెండును= నీవు చెప్పిన ఆ రెండూ; మంచి తెఱంగులు+అ= మంచి పద్ధతులే; ఎదిరి చందంబు= ఎదుటివాడి తీరు; ఎఱింగి= తెలిసికొని, నడపునది= చేయవలె; దానంబు= దానం; రంజకంబు= ప్రీతికలిగించేది; అగుటన్= కావటం; తెలుపన్+వలవదు=తెలుప నక్కరలేదు; సామవాదంబు గుణంబు= ప్రియమైన మాటల గుణం; తెల్లంబు= స్పష్టం; అగు+అట్టి ఇతిహాసంబు= అయిన ప్రాత కాలపు కథ; చెప్పెదన్= చెప్పుతాను; వినుము; బుద్ధి సంపన్నుండు= బుద్ధి సమృద్ధిగా కలవాడు; అగు+ఒక్క బ్రాహ్మణుండు= అయిన ఒక బ్రాహ్మణుడు; విజనంబు= జనం లేనిది; అగు వనంబునన్= అయిన అడవిలో; కార్యవశంబునన్= పనికి లోబడి; మెలంగన్= తిరుగుతూ ఉండగా; తద్+మాంసంబు= ఆతడి మాంసం; ఆహారంబు= భోజనం; కొనుటకున్+అయి= తీసికొనటానికి; దారుణుండు+అగు= కరకువాడు అయిన; దానవుండు= రాక్షసుడు; అతనిన్=అతడిని; పట్టికొనినన్= పట్టుకొనగా; సాంత్వన భాషణంబులు= మెత్తని మాటలు; ప్రయోగించువాఁడు+అయి= ఉపయోగించేవాడై; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; కలంకయున్= కలతపాటు; కొందలంబును= సంక్షోభం; లేని డెందంబుతోన్= లేని హృదయంతో; ఆ+దానవు+ఆననంబు= ఆ రక్కసుడి మొగం; కనుంగొనినన్= చూడగా; ఆ ధైర్యధుర్యున్= గుండె నిబ్బరంలో గట్టివాడైన ఆ బ్రాహ్మణుడిని; కనుంగొని= చూచి; తదీయంబు= అతడిది; అగు+ఉదాత్తత్వంబునన్= అయిన గొప్పతనంచేత; చిత్తంబు= హృదయం; రంజిల్లి= ప్రీతిచెంది; ఆ+దనుజుండు= ఆ రాక్షసుడు; ఆ+ధరాదివిజునితోన్= ఆ బ్రాహ్మణుడితో; మదీయంబు= నాదయినది; అగు ప్రశ్నంబునకున్= అయిన ప్రశ్నకు; సత్+ఉత్తరంబు= మంచి సమాధానం; ఇచ్చితి+ఏని= ఇస్తే; నిన్నున్=నిన్ను; విడిచెదన్=వదలుతాను; అనుపలుకు= అనే మాట; పలికి; తన శరీరంబు= తన ఒడలు; డయ్యుటకున్= కృశించిపోవటానికి; వెలుకన్+పాఱుటకున్= పాలిపోవటానికి; కారణంబు= హేతువు; ఏమి?= ఏది?; అని; అడిగినన్= ఆ+మహీసుర వరుండు= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు; వేగిరపడక= తొందరపడక; కొండొకసేపు= కొంతసేపు; విచారించి= ఆలోచించి; మహాపురుషా!= గొప్పవాడా!; నీ+అట్టి కృపాపరుండు= నీవంటి దయాశీలి; అడుగన్= అడుగగా; తోఁచిన తెఱంగునన్= ఊహకు వచ్చిన విధంగా; చెప్పుట= చెప్పటం; మేలు= మంచిది; కాదె!= కాదా!; ఆకర్ణింపుము= వినుము; అని; సౌముఖ్యంబు= అనుకూలభావాన్ని (మంచి మోము కలిగిన తనాన్ని); ఒంది= పొంది.

తాత్పర్యం: నమస్కరించి భీష్ముడితో 'దానము, ప్రియభాషణము అనే రెంటిలో ఏది ఎక్కువ ప్రీతి కలిగిస్తుంది? చెప్పవూ? అని అడిగితే భీష్ము డా రాజుతో ఇట్లా అన్నాడు. ఆ రెండూ మంచి పద్ధతులే. 'అవతలివాడి తీరెరిగి నడపాలి. 'దానం ప్రీతికరమైనది' అనేదానిని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. మంచిమాటల గుణాన్ని తెలిపే పురాతనకథ ఒకటి చెప్పుతాను వినుము. బుద్ధిశాలి అయిన ఒక బ్రాహ్మణుడు జన సంచారంలేని అడవికి పనిమీద వెళ్ళాడు. ఒక కరకురక్కసి అతడి మాంసం తినగోరి, అతడిని పట్టుకొన్నాడు. ఆ బ్రాహ్మణుడు మంచిమాటలు ప్రయోగించేవాడయి, ఏ విధమైన కలతపాటులేని గుండెతో ఆ రాక్షసుడి మొగం చూస్తున్నాడు. ఆ రక్కసుడు ఆ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధైర్యశాలిని చూచి, అతడి గుండె నిబ్బరానికి హృదయంలో సంతోషించి, 'నా ప్రశ్నకు తగిన మంచి సమాధానం చెప్పితే నిన్ను వదలుతాను' అని 'నా శరీరం కృశించి పోవటానికి, పాలిపోవటానికి కారణం ఏమిటి?' అని అడిగాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు తొందరపడక కొంతసేపు విచారించి, 'మహాపురుషా! నీ వంటి దయాశాలి అడిగితే తోచిన విధానం చెప్పటం మేలు కదా! వినుము.' అని మంచి మొగంతో అనుకూల భావం పొంది (ఇట్లా అన్నాడు).

సీ. 'చుట్టాల నీదగు చెట్టతనంబునఁ । బాసి పశ్చాత్తాపపరుఁడ వగుట,
లేమి గల్గిన దుర్లభామేయధనములు । గోరుట మొగమోటగూరి యొరుని
చేఁ బడ్డ నిన్ను గెల్చితి నని యాతఁ డు । బ్బుట కృప, నుపకారమునకుఁ బాత్ర
ముగ నీవు చేసిన పురుషుఁ డా మేల్ దన । యలఘుపౌరుషమునఁ గలిగె ననుట.

ఆ. కుమతిజనులు నీదు గుణములు గొనియాడ । సిగ్గుపడుచు బుధులచేతఁ బొగడు
గాన మరుగుచునికి, వీనిలో నొక్కట । గార్శ్య పాండురతలు గలుగు ననఘ!' 382

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; చుట్టాలన్= బంధువులను; నీ+అది= నీది; అగు చెట్టతనంబునన్= అయిన చెడ్డతనంతో; పాసి= వదలి; పశ్చాత్+తాపపరుఁడవు= వెనుక బాధపడినవాడవు; అగుట= కావటం; లేమి= దారిద్ర్యము; కల్గినన్= కలిగితే; దుర్లభ+అమేయ ధనంబులు= ఎంత కష్టపడినా దొరకని సొమ్ములను; కోరుట= కోరటం; మొగమోట= సంకోచం; కూరి= పొంది; ఒరునిచేన్= ఇతరునిచేత; పడ్డ= పాట్లుపడిన; నిన్ను; గెల్చితిని= జయించాను; అని; ఆతఁడు= ఆ ఇతరుడు; ఉబ్బుట= పొంగిపోవటం; కృపన్= జాలితో; ఉపకారమునకున్= మేలునకు; పాత్రముగన్= స్థానంగా; నీవు చేసిన పురుషుఁడు= నీవు చేసిన జనుడు; ఆ మేల్= ఆ మేలు; తన అలఘు పౌరుషమునన్= తనదైన గొప్ప మగతనంతో; కలిగెన్= కలిగింది; అనుట= అనటం; కుమతిజనులు= చెడుబుద్ధిగల మనుష్యులు; నీదు గుణములు= నీ మంచి లక్షణాలను; కొనియాడన్= ప్రశంసచేయగా; సిగ్గుపడుచున్= బిడియం పొందుతూ; బుధులచేతన్= విద్వాంసులవలన; పొగడు=పొగడ్త; కానన్= పొందటానికి; మరుగుచున్+ఉనికి= అలవాటు పడుతూ ఉండటం; వీనిలోన్= వీటిలో; ఒక్కటన్= ఒక్కదానిచేత; కార్శ్యపాండురతలు= క్షీణించటం, పాలిపోవటం అనే లక్షణాలు; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: 'బంధువులను నీ చెడు స్వభావంతో వదలి తరువాత బాధపడటం, దారిద్ర్యం కలిగినపుడు ఎన్నటికీ లభించని గొప్పధనాలు కోరటం, మొగమోటంవలన పరుడు పెట్టిన బాధలను నీ వనుభవించగా వాడు నేను జయించానని పొంగిపోవటం, జాలితలచి నీవు మేలు చేయగా ఆ మేలు పొందినవాడు అది తన పరాక్రమమే అని చెప్పటం, పాడుబుద్ధికలవారు నిన్ను పొగడుతూ ఉంటే సిగ్గుపడుతూ పండితుల మెప్పు కొరకు చూస్తూ ఉండటం - వీటిలో ఒకదానిచేత కృశించటం, పాలిపోవటం కలుగుతాయి.'

వ. అని వెండియు. 383

తాత్పర్యం: ఇట్లా చెప్పి ఇంకా అంటున్నాడు.

సీ. 'ఉచితంబుగా నెఱి నుగ్గడించిన మాట । సభ యియ్యకొనమి, వల్లభకు నీదు
తప్పు తెల్లంబయి తాపంబుఁ బొందంగఁ । దేర్పంగనేరక త్రిప్పికొనుట,

నీ సొమ్మునకు నొరుఁ డాసించుచుండంగ । దానికిఁ దగ రక్ష దలఁచుచునికి,

దులువ పిమ్మట నిన్ను దూషించు పలుకులు । కులజులు నిజముగాఁ గొనుట, నీవు

తే. మానుషంబుల నడపంగ మాయకానిఁ । గాఁగఁ జెలులు గాంచుట, వగ కలిమి పేర్మి

దాని వెలిపుచ్చ నోపమి, వీన నొకటఁ । గార్శ్య పాండురత్వంబులు గలుగు ననఘ! 384

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యపురుషుడా! ఉచితంబుగాన్= తగు విధంగా; నెఱిన్= చక్కగా; ఉగ్గడించిన మాట= పలికిన పలుకును; సభ= పెద్దలున్న తావు (న్యాయస్థానం); ఇయ్యకొనమి= ఒప్పుకొనకపోవటం; వల్లభకున్= భార్యకు (ప్రియురాలికి); నీదు తప్పు= నీ నేరం; తెల్లంబు= స్పష్టంగా తెలిసినది; అయి; తాపంబున్= దుఃఖం; పొందంగన్= పొందగా; తేర్పంగన్= సముదాయించటానికి; నేరక= సాధ్యపడక; త్రిప్పికొనుట= మరలిరావటం; నీ సొమ్మునకున్= నీ ధనానికి; ఒరుఁడు= వేరువాడు; ఆసించుచుండంగన్= కోరుతూ ఉండగా; దానికిన్= ఆ సొమ్మునకు; తగన్= తగు విధంగా; రక్ష= రక్షణ; తలఁచుచున్+ఉనికి= ఆలోచిస్తూ ఉండటం; తులువ= దుర్మార్గుడు; పిమ్మటన్= నీ వెనుక (చాటుగా); నిన్నున్= నిన్ను; దూషించు పలుకులు= నిందించే మాటలను; కులజులు= నీ బంధువులు; నిజముగాన్= సత్యంగా; కొనుట= గ్రహించటం; నీవు; మానుషంబులన్= పౌరుషపు పనులను; నడపంగన్= చేయగా; మాయకానిన్+కాఁగన్= మాయలు చేసేవాడినిగా; చెలులు= నీ మిత్రులు; కాంచుట= చూడటం; వగ కలిమి పేర్మిన్= పెను దుఃఖం కలగటంవలన; దానిన్= దానిని; వెలిపుచ్చన్+ఓపమి= బయటపెట్టుకొనలేకపోవటం; వీనన్= వీటిలో; ఒకటన్= ఒకదానిచేత; కార్శ్య పాండురతలు= చిక్కిపోవటం, వెలవెలబోవటం; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: 'నీవు తగు విధంగా పలికినదానిని సభ (పెద్దల సంఘం) ఒప్పుకొనకపోవటం, నీ తప్పు నీ భార్యకు తెలిసి ఆమె కుమిలిపోతూ ఉంటే నీవు సముదాయించలేకపోవటం, నీ సొమ్మును కొట్టివేయాలని ఇతరుడు కనిపెట్టుకొని ఉంటే దానికి ఏది దిక్కు? - అని నీవు ఆలోచిస్తూ ఉండటమూ, దుర్మార్గుడు చాటున నిన్ను గూర్చి చేసిన నిందలను నీ బంధువులు నిజాలని భావించటం, నీవు దొడ్డపనులు చేస్తూ ఉంటే నీ చెలికాండ్రు నిన్ను మాయలవాడినిగా భావించటం, నీ హృదయంలో ఉన్న పెనుదుఃఖాన్ని బయట పెట్టుకొనకపోవటం - వీటిలో ఒకటి క్షీణతకూ, పాలిపోవటానికీ కారణం.'

తీ. అని మఱియును. 385

తాత్పర్యం: ఇట్లా చెప్పి ఇంకా చెప్పుతున్నాడు.

సీ. 'భార్య పుత్రకుఁ డల్లు డార్యవృత్తము లేమిఁ । గ్రుమ్మరించుట, జనకుండు దల్లి

సోదరుల్ నవయుట, యుర్వీసురుని గోవుఁ । దొలుమేనఁ జంపుట, దుష్టబుద్ధి

భూసురదేవార్థములు పుచ్చికొనుట, య । ర్థము గోలుపోక, బాంధవుల చావు,

బాలిశు మొగమోటఁ బనికొనఁగాఁ దన । యశమున కంతరాయంబు గలిమి,

తే. పెద్దకాలంబు యత్నసంపీడ నొంది । చెల్లఁ జేసిన పని యొక్క పొల్లపగతు

చే నసిద్ధతఁ బొందుట, వీన నొకటఁ । గార్శ్యపాండురత్వంబులు గలుగు ననఘ! 386

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భార్య= పత్ని; పుత్రకుఁడు= కొడుకు; అల్లుఁడు= బిడ్డ మగడు; ఆర్యవృత్తము= మంచి నడవడి; లేమిన్= లేకపోవటంవలన; క్రుమ్మరించుట= తిప్పలు పెట్టటం; జనకుండు= తండ్రి; తల్లి= అమ్మ; సోదరుల్=అన్నదమ్ములు; నవయుట= రోగం మొదలైనవాటిచేత కృశించిపోవటం; తొలుమేనన్=పూర్వజన్మలో; ఉర్వీసురుని గోవున్= బ్రాహ్మణుడి ఆవును; చంపుట= చంపటం; దుష్టబుద్ధిన్= పాపపుబుద్ధితో; భూసుర దేవ+అర్థములు= బ్రాహ్మణుల, దేవతల సొమ్ములు; పుచ్చికొనుట= తీసికొనటం; అర్థము కొలుపోక= ధనం పోగొట్టుకొనటం; బాంధవుల చావు= చుట్టాల మరణం; మొగమాటన్= ఇతరుల ఒత్తిడికి లొంగిన కారణంగా; బాలిశున్= నీచుడిని; పనికొనఁగాన్= ఉద్యోగంలో నియమించగా; తన యశమునకున్=తన కీర్తికి; అంతరాయంబు+ కలిమి= ఆటంకం కలగటం; పెద్దకాలంబు= చాలాకాలం; యత్న సంపీడన్= ప్రయత్నంలో పడరాని పాటును; ఒంది= పొంది; చెల్లన్= నెరవేరునట్లుగా; చేసినపని; ఒక్క పొల్ల పగతుచేన్= ఒకే ఒక్క నీచుడైన పగవాడిచేత; అసిద్ధతన్= నెరవేరని స్థితిని; పొందుట= పొందటం; వీనన్= వీటిలో; ఒకటన్= ఒకదానిచేత; కార్శ్య పాండురత్వంబులు= క్షీణత ఒడలు కళ తప్పటం అనేవి; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: 'పెండ్లము, కొడుకు, అల్లుడు మంచి నడవడి లేనివారై త్రిప్పలు పెట్టటం, తండ్రి, తల్లి, అన్నదమ్ములు రోగాదులచే కృశించటం, పూర్వజన్మలో బ్రాహ్మణుడి ఆవును చంపటం, పాపభావంతో బ్రాహ్మణులసొమ్ము, దేవుడి సొమ్ము అపహరించటం, ధనం పోగొట్టుకొనటం, చుట్టాలు చావటం, పనికిమాలినవాడిని పనిలో పెట్టుకొని పేరు పాడుచేసికొనటం, ఎంతో కాలం ఎన్నో ప్రయత్నాలు చేసి ఒక కొలిక్కి తెచ్చిన పనిని నీచుడైన పగవాడు పాడుచేయటం, వీటిలో ఒకదానిచేత మనిషి కృశిస్తాడు, పాలిపోతాడు.'

విశేషం: తొలుమేనన్- చేసిన పాపం జన్మజన్మాలకు వెంటనంటి వస్తుంది. ఇట్టివాటిని మహానుభావులు జ్యోతిషం మొదలైనవాటి ద్వారా తెలిసికొని, తెలియజేస్తారు.

క. అని యిట్లేర్పడఁ జెప్పిన । విని యద్దనుజపతి మెచ్చి విడిచెం గుంతీ
తనయాగ్రజ! భూసుర సాం । త్వన మిట్టిది; యడుగు మింక వలసినదానిన్.' 387

ప్రతిపదార్థం: కుంతీ తనయ+అగ్రజ!= కుంతికొడుకులలో పెద్దవాడా!; అని; ఇట్లు= ఈ విధంగా; ఏర్పడన్= వివరించి; చెప్పినన్= చెప్పగా; విని=ఆలకించి; ఆ+దనుజపతి= ఆ రక్కసిరేడు; మెచ్చి= మెచ్చుకొని; విడిచెన్= (ఆ బ్రాహ్మణుడిని) విడిచిపెట్టాడు; భూసుర సాంత్వనము= బ్రాహ్మణుల ప్రియభాషణం; ఇట్టి+అది= ఇటువంటిది; ఇంకన్= ఇంకా; వలసినదానిన్= కోరిన దానిని; అడుగుము.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ విధంగా ఆ బ్రాహ్మణుడు స్పష్టంగా చెప్పాడు. అది విని ఆ రాక్షసుడు మెచ్చుకొని, అతడిని విడిచిపెట్టాడు. మంచిమాటల తీరు ఇటువంటిది. ఇంకేమి కావాలో అడుగుము.'

విశేషం: ప్రియభాషణం ప్రాణాలు దక్కించింది. ఇంతకంటె మరొక లాభం పెద్దది ఏముంటుంది? - అని భావం.

వ. అనిన నజాతశత్రుండు గంగాపుత్త్రువదనంబునం జూడ్కి నిలిపి మోడ్చి కరంబులు శిరంబునం గదియించి.388

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అజాతశత్రుండు= ధర్మరాజు; గంగాపుత్త్రువదనంబునన్= భీష్ముడి మొగంవైపు; చూడ్కిన్= చూపును; నిలిపి; మోడ్చిన కరంబులు= జోడించిన చేతులు; శిరంబునన్= తన తలపైన; కదియించి= కూర్చి.

తాత్పర్యం: అనగా ధర్మరాజు భీష్ముడి ముఖంమీద చూపు నిలిపి, చేతులు మోడ్చి తలపై పెట్టుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇది పరమగౌరవాన్ని సూచిస్తుంది. భీష్ముడు, వృద్ధుడు, యుద్ధంలో అలసినవాడు, అంపశయ్యమీద ఉన్నవాడు, ఏ క్షణంలోనయినా ప్రాణత్యాగం చేయటానికి సిద్ధంగా ఉన్నవాడు. అయినా పరమవాత్సల్యంతో ఇంకా అడుగుము, ఇంకా అడుగుము-అంటున్నాడు. ఈ స్థితికి ధర్మరాజు హృదయం ఎంత ఆర్ద్రమై పోయిందో ఇటువంటి మాటలవలన తెలియవస్తుంది.

తే. 'మమ్ము సంసారవార్ధి పారమ్ముఁ జేర్చు । యానపాత్రంబు నీ కరుణాతిశయమ
యఖిలకల్మషములఁ బాపునట్టి దాని । వినఁగఁ గోరెద నొక పురావృత్త మనఘ! 389

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; మమ్మున్= మమ్మలను; సంసారవార్ధి పారమ్మున్= సంసారం అనే మహాసముద్రపు ఒడ్డును; చేర్చు యానపాత్రము= చేర్చే ఓడ; నీ కరుణా+అతిశయము+అ= నీ దయయొక్క పెక్కువయే; అఖిల కల్మషములన్= అన్ని పాపాలను; పాపు+అట్టిదానిన్= పోగొట్టేదానిని; ఒక పురావృత్తము= ఒక ప్రాతకాలపు గాథను; వినఁగన్= వినటానికి; కోరెదన్= కోరుతున్నాను.

తాత్పర్యం: 'మహాత్మా! మమ్మలను సంసారం అనే మహాసముద్రం ఒడ్డుకు చేర్చే ఓడ నీ దయావిశేషమే! అన్ని పాపాలను హరించే ఒక ప్రాతకాలపు గాథను వినగోరుతున్నాను.

విశేషం: సంసారం అంటే పరమాత్మజ్ఞానం లేక చావుపుట్టుకల చక్రంలో ఎడతెగకుండా సంచరించటం.

క. మునిమనుజపతుల సన్నిధి । నిను నీ కృష్ణుండు మాననీయచరిత! వే
డ్క నుపాసించుచు నున్నాఁ । డనుత్తమప్రీతి దాని నాకర్ణింపన్. 390

ప్రతిపదార్థం: మాననీయ చరిత!= మన్నింపదగిన నడవడి కలవాడా!; ఈ కృష్ణుండు= ఈ వాసుదేవుడు; ముని మనుజపతుల సన్నిధిన్= మునులు; రాజులు మొదలగువారి సమీపంలో; అనుత్తమ ప్రీతిన్= మిక్కిలి గొప్పదైన ప్రేమతో; దానిన్= నేనడిగిన దానిని; ఆకర్ణింపన్= వినటానికి; నినున్= నిన్ను; వేడ్కన్= కుతూహలంతో; ఉపాసించుచున్= శ్రద్ధతో దగ్గరగా కూర్చున్నవాడు అవుతూ; ఉన్నాడు.

తాత్పర్యం: మాననీయచరితా! ఈ శ్రీకృష్ణుడు మునులయొక్క, రాజులయొక్క సమక్షంలో నీవు చెప్పేదానిని వినటానికై నిండైన ప్రీతితో వేడుకతో నిన్ను ఉపాసిస్తూ ఉన్నాడు.

విశేషం: ఉపాసన - అంటే దగ్గర కూర్చోవటం అని శబ్దార్థం. శ్రద్ధాసక్తులతో కొలవటం అని రూఢ్యర్థం.

క. సమ్మోదమ్మున నేనుం । దమ్ములునుం దేల సత్కథాకథన పర
త్వ మ్మాదరింపు మునివ । ర్గమ్ము నృపచయమ్ము పులకరాజి వహింపన్.' 391

ప్రతిపదార్థం: నేనున్= నేనూ; తమ్ములున్= మా తమ్ముళ్ళూ; సమ్మోదమ్మునన్= మిక్కిలి ఆనందంతో; తేలన్= తేలునట్లుగా; మునివర్గమ్మున్= మునుల సముదాయమూ; నృపచయమ్మున్= రాజుల సముదాయమూ; పులకరాజి= రోమాంచం; వహింపన్= ధరింపగా; సత్+కథా కథన పరత్వమ్మున్= మంచి కథ చెప్పటంలోని ఆసక్తిని; ఆదరింపుము= ప్రీతితో గ్రహించుము.

తాత్పర్యం: నేనూ, మా తమ్ముళ్ళూ పరమానందంలో తేలిపోయే విధంగా మునులూ, రాజులూ పులకాంకురాలు పొందగా మంచికథ చెప్పటంలోని ఆసక్తిని ఆదరించుము.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనుటయు భీష్ముండు. 392

తాత్పర్యం: అనగా భీష్ముడు (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పుణ్యం బగు నితిహాస మ। గణ్యగుణా! నీకుఁ జెప్పఁ గను సుకృతముఁ గా
రుణ్యనిధి సర్వలోక శ। రణ్యుఁడు గృష్ణుండు విను వరంబుఁ బడసితిన్. 393

ప్రతిపదార్థం: అగణ్యగుణా!= లెక్కింపజాలనన్ని మంచి గుణాలు కలవాడా!; పుణ్యంబు= మేలైనది; అగు+ఇతిహాసము= అయిన పురాతన కథ; నీకున్= నీకు; చెప్పన్= చెప్పటానికి; కను సుకృతము= పొందే పుణ్యాన్నీ; కారుణ్యనిధి= దయకు గనీ; సర్వలోక శరణ్యుఁడు= అన్నిలోకాలకు రక్షకుడైనవాడూ అగు; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; విను వరంబున్= వినే వరాన్నీ, పడసితిన్= పొందాను.

తాత్పర్యం: 'గుణనిధీ! పుణ్యమైన పురాతనచరిత్రను నీకు చెప్పే పుణ్యాన్నీ, దయాసముద్రుడూ, అన్ని లోకాలకు రక్షకుడూ అయిన శ్రీకృష్ణపరమాత్మ వినే వరాన్నీ పొందాను.

విశేషం: శ్రీకృష్ణుడు 'సర్వము తాను అయినవాడు'. అతడు నిలుకడగా ఉండి వినటం ఎంత భాగ్యం! ధర్మరాజు ఆ కృష్ణుడి అనుగ్రహం పరిపూర్ణంగా పొందినవాడు. అతడికి చెప్పటం ఎంత పుణ్యవిశేషం! భీష్ముడు దీనిని అభివ్యక్తం చేస్తున్నాడు.

క. పారాశర్యాదిమునులు। నీ రాజన్యులును వినికి యెంతకు లేదీ
గారాము నాకుఁ బరమో। దారపదావాప్తి గాదె ధర్మతనూజా! 394

ప్రతిపదార్థం: ధర్మతనూజా!= యమధర్మరాజు ముద్దుబిడ్డా! పారాశర్య+ఆది మునులున్= వ్యాసుడు మొదలైన మహర్షులు; ఈ రాజన్యులును= ఈ రాజవంశాలవారు; వినికి= వినటం; నాకున్= నాకు; ఈ గారాము= ఈ గౌరవం; ఎంతకున్= ఎంతకు; లేదు; పరమ+ఉదార పద+అవాప్తి= అతిశ్రేష్ఠము, మహిమగలదీ అయిన పదం పొందటం; కాదె!= కదా!

తాత్పర్యం: ధర్మరాజా! శ్రీ వేదవ్యాసులు మొదలైన మహర్షులు, ఈ రాజవంశంవారూ వినటంవలన నా గౌరవం ఎంత ఉన్నతమైనదో చెప్పటానికి వీలులేనిది, పరమపదం పొందటమే కదా!

విశేషం: వేదవ్యాసుడు అష్టాదశ పురాణాదులకు కర్త. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అనదగినవాడు, తక్కినవారు కూడా ఇంచుమించు అంతటివారు. ఉత్తమజన్మతో యుద్ధాలలో సర్వమూ త్యాగం చేయటానికి సిద్ధపడిన మహోన్నతవ్యక్తిత్వం కలవారు రాజన్యులు. వీరంతా సావధానంగా వింటూ ఉంటే చెప్పే అదృష్టం ఎంతటిదో చెప్పగలమా! - అనే భావం "ఎంతకు లేదు"? అనే పదాలలో గోచరిస్తుంది.

వ. నీ యడిగిన యట్టిదానికి నొక యితిహాసంబు గలదది యుమామహేశ్వర సంవాదం బనం బరఁగుఁ బౌరవోత్తమా! యప్పురావృత్తంబు ప్రవర్తించుటకుం గతంబైన కథ మున్ను సెప్పి, మఱి దానిం జెప్పిన నొప్పియుండుం గావున నప్పరిపాటిం జెప్పెద నవధానపరుండవయి యాకర్ణింపు'మని పలికి, హరికిం బరమభక్తిం బ్రణమిల్లి, యప్పాండవముఖ్యు ముఖచంద్రికం దనవిలోచనచకోరంబు లాన నమ్మానవపతికి నమ్మాననీయమతి యిట్లనియె. 395

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నీ+అడిగిన+అట్టిదానకిన్= నీవడిగిన దానికి; ఒక ఇతిహాసంబు= ఒక పూర్వకథ; కలదు= ఉన్నది; అది; ఉమామహేశ్వర సంవాదంబు= ఉమ, మహేశ్వరుడు అనే వారి సంభాషణం; అనన్= అనగా; పర(గున్= ఒప్పుతున్నది; పౌరవ+ ఉత్తమా!= పూరువంశం వారిలో శ్రేష్ఠుడా; ఆ+పురావృత్తంబు=ఆ మునుపటి కథ, ప్రవర్తించుటకున్= జరుగుటకు; కతంబు= కారణం; ఐన కథ= అయిన వృత్తాంతం; మున్ను= ముందుగా; చెప్పి; మఱి= తరువాత; దానిన్= దానిని; చెప్పినన్= చెప్పి నట్లయితే; ఒప్పి+ఉండున్= తగిన విధంగా ఉంటుంది; కావునన్=కనుక; ఆ+పరిపాటిన్= ఆ వరుసలో; చెప్పెదన్= చెప్పుతాను; అవధాన పరుండవు= ఏకాగ్రత కలవాడవు; అయి; ఆకర్ణింపుము= వినుము; అని; పలికి; హరికిన్= కృష్ణుడికి; పరమభక్తిన్= గొప్పభక్తితో; ప్రణమిల్లి= నమస్కరించి; ఆ+పాండవముఖ్యు ముఖ చంద్రికన్= పాండుకుమారులలో మొదటివాడైన ధర్మరాజు ముఖమనే వెన్నెలను; తన విలోచన చకోరంబులు= తన కనులు అనే చకోరపక్షులు; ఆనన్= ఆస్వాదిస్తూ ఉండగా; ఆ+మానవ పతికిన్= ఆ రాజునకు; ఆ+మాననీయమతి= మన్నించదగిన బుద్ధివిశేషంగల ఆ భీష్ముడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: నీ వడిగిన దానికొక కథ ఉన్నది. దానిని ఉమామహేశ్వర సంవాదం అంటారు. అది ఏర్పడటానికి కారణం ముందు చెప్పి, తరువాత దానిని చెప్పితే మేలుగా ఉంటుంది. ఆ వరుసలో చెప్పుతాను - శ్రద్ధగా వినుము.' అని మహాభక్తితో కృష్ణుడికి నమస్కరించి, ధర్మరాజు మోము వెన్నెలలను తన కన్నులనే చకోరాలు ఆస్వాదిస్తూ ఉండగా (ధర్మరాజు ముఖాన్ని మిక్కిలి ప్రీతితో చూస్తూ) భీష్ముడు ఆ రాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: ఒక మహాపుణ్యకథను ఒక మహాబుద్ధిశాలికి సాక్షాత్తు శ్రీకృష్ణుడి సన్నిధానంలో చెప్పుతున్నాను' అనే అనందం భీష్ముడిలో పట్టశక్యం కాని ప్రమాణంలో ఉన్నదని 'ముఖచంద్రిక' - విలోచనచకోర' రూపకాలు అభివ్యక్తం చేస్తున్నాయి.

భీష్ము(డు ధర్మజునకు శ్రీకృష్ణుని చరిత్రంబు చెప్పుట (సం.13-203-1 (కుంభ))

క. తనయునిఁ బడయుటకై తప । మొనరింపఁగ రుక్మిణియు సముత్సుకవృత్తిం
దనతో రాఁ దుహినాద్రికిఁ । జనియెం గృష్ణుండు మునులు సంతస మందన్. 396

ప్రతిపదార్థం: కృష్ణు(డు= శ్రీకృష్ణుడు; తనయునిన్= కుమారుడిని; పడయుటకున్+ఐ= పొందటంకొరకు; తపము= తపస్సు; ఒనరింప(గన్= చేయటానికి; రుక్మిణియున్= రుక్మిణీదేవి కూడా; సముత్సుక వృత్తిన్= మిక్కిలి వేడుక కల భావంతో; తనతోన్= తనతో; రాన్= రాగా; మునులు= మహర్షులు; సంతసము= సంతోషం; అందన్= పొందగా; తుహిన+అద్రికిన్= మంచుకొండకు; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు కుమారుడిని పొందగోరి, తపంచేయటంకొరకు రుక్మిణి కూడా వేడుకతో రాగా మునులు ఆనందపడగా హిమవత్పర్వతానికి వెళ్ళాడు.

విశేషం: కృష్ణుడికి ఇదొకలీల. లోకానికి బోధించే పద్ధతులలో తాను ఆచరించటం ఒక పద్ధతి.

వ. ఇట్లు చని, ద్వాదశవార్షిక వ్రతక్లిష్టుండై యున్న కృష్ణుం గాన మునీంద్రులు నారదపర్వత వ్యాసవాల్మీకి దేవల కాశ్యప ప్రభృతులు శిష్యవర్గంబుతో వచ్చినవారలం బాద్యాసనాది సముచితార్చనంబుల సంభావించిన వార లద్దేవునిం బరివేష్టించి పుణ్యగోష్ఠి నడపుచున్న సమయంబున. 397

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; చని= వెళ్ళి; ద్వాదశ వార్షిక వ్రత క్లిష్టుండు+ఐ= పండ్రెండు ఏండ్ల వ్రతంతో మిక్కిలి కష్టపడి ఉన్నవాడై; ఉన్న కృష్ణున్= ఉన్న శ్రీకృష్ణుడిని; కానన్= చూడటానికి; ముని+ఇంద్రులు= మునిశ్రేష్ఠులు; నారద పర్వత వ్యాస వాల్మీకి దేవల కాశ్యప ప్రభృతులు= నారదుడు; పర్వతుడు, వ్యాసుడు, వాల్మీకి, దేవలుడు, కాశ్యపుడు మొదలైనవారు; శిష్యవర్గంబుతోన్= శిష్యుల సముదాయంతో; వచ్చినన్= రాగా; వారలన్= వారిని; పాద్య+ఆసన+ఆది సముచిత+అర్చనంబులన్= కాళ్ళకు నీరు; కూర్చుండే పీట మొదలైన తగిన పూజలతో; సంభావించినన్= మర్యాద చేయగా; వారలు= ఆ మునులు; ఆ+దేవునిన్= ఆ దేవుడిని; పరివేష్టించి= చుట్టుకొని కూర్చుండి; పుణ్యగోష్ఠి= పవిత్రమైన సంభాషణ; నడపుచున్= సాగిస్తూ; ఉన్న సమయంబునన్= ఉన్న వేళలో.

తాత్పర్యం: ఇట్లా వెళ్ళి, పండ్రెండు ఏండ్ల వ్రతంచేసి, బాగా నలిగి ఉన్న కృష్ణుడిని చూడటానికి నారదుడు, పర్వతుడు, వ్యాసుడు, వాల్మీకి, దేవలుడు, కాశ్యపుడు మొదలైన మునులు శిష్యులతోపాటు రాగా, వారికి తగిన ఉపచారాలు చేసిన తరువాత వారందరూ కృష్ణుడిని చుట్టుకొని సద్విషయాలు మాటాడుకొంటూ ఉన్న సమయంలో.

తే. **అతని ముఖమున వెడలి మహాగ్ని యమ్మ । హీధరము విపినంబుల నేర్చెఁ బక్షి**
మృగయుతంబుగ సిద్ధసాధ్యగణములు స । మాకులత్వంబుఁ బొందఁ బెల్లడరి యధిప! **398**

ప్రతిపదార్థం: మహా+అగ్ని= గొప్ప అగ్ని; అతని ముఖమునన్= అతడి ముఖంనుండి; వెడలి= వెలువడి; ఆ+మహీధరము విపినంబులన్= ఆ కొండ అడవులను; పక్షి మృగ యుతంబుగన్= పక్షులు, జంతువులు అనే వాటితోపాటుగా; సిద్ధసాధ్యగణములు= సిద్ధులు, సాధ్యులు అనే దేవజాతివారి గుంపులు; సమాకులత్వంబున్= మిక్కిలి కలతపాటు; పొందన్= పొందగా; పెల్లు= పెద్దగా; అడరి= వ్యాపించి; ఏర్చెన్= కాల్చింది.

తాత్పర్యం: అతడి ముఖంనుండి గొప్ప అగ్ని వెలువడి మృగాలు, పక్షులు, సిద్ధులు, సాధ్యులు మొదలైన వారంతా గుండెలలో తీవ్రమైన ఆందోళన పొందుతూ ఉండగా పెద్దగా వ్యాపించి, ఆ కొండ అడవులను కాల్చివేసింది.

విశేషం: మృగాలు, పక్షులు అనే క్రింది జాతి ప్రాణులను, సిద్ధులు, సాధ్యులు అనే దేవజాతి వారినీ చెప్పటంచేత తక్కిన అన్ని విధాల ప్రాణుల సంగతీ చెప్పినట్లయింది.

క. **ఆ కృష్ణుఁడు నిజసౌమ్యా లోకనమున నాశిఖిని మలుఁగఁ జేసెం బూ**
ర్వాకారత నవ్వనము ని । రాకులతం బొల్చె నది మహాద్భుత మయ్యెన్. **399**

ప్రతిపదార్థం: ఆ కృష్ణుఁడు= ఆ కృష్ణభగవానుడు; నిజ సౌమ్య+ఆలోకనమునన్= తనదైన మంచి చూపుతో; ఆ శిఖినిన్= ఆ అగ్నిని; మలుఁగన్= ఆరిపోయే విధంగా; చేసెన్= చేశాడు; ఆ+వనము= ఆ అడవి; పూర్వ+ఆకారతన్= మునుపటి రూపంతోడనే; నిరాకులతన్= ఏ కలతపాటు లేని తనంతో; పొల్చెన్= ప్రకాశించింది; అది= ఆ సంగతి; మహా+అద్భుతము= గొప్ప ఆశ్చర్యం కలిగించేది; అయ్యెన్= అయినది.

తాత్పర్యం: కృష్ణుడు తన శుభమైన చూపుతో ఆ మంటను మరలింపజేశాడు. ఆ అడవి మునుపటి విధంగానే ఏ వికారమూ లేని దయింది. అది అందరకూ ఎంతో అబ్బురం అయి కనిపించింది.

విశేషం: ఈ విషయం కృష్ణుడికి సర్వభూతాలపై ఉన్న అధికారాన్ని సూచిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. దాని కమ్మును లెల్లఁ జిత్తమున భయము । విస్మయంబును బెనఁగొన వెఱఁగుపాటు
గదిరి చిత్రరూపంబుల కరణి నుండ । వారిఁ గన్గొని రుక్మిణీవల్లభుండు. 400

ప్రతిపదార్థం: దానికిన్= ఆ సంఘటనకు; ఆ+మునులు= ఆ మహర్షులు; ఎల్లన్= అందరూ; చిత్తమునన్= హృదయంలో; భయము= భీతి; విస్మయంబును= ఆశ్చర్యం; పెనఁగొనన్= అల్లుకొని పోగా; వెఱఁగుపాటు= చేష్టలుడిగిన స్థితి; కదిరి= వ్యాపించి; చిత్రరూపంబుల కరణిన్= చిత్రపటంలోని ఆకారాల విధంగా; ఉండన్= ఉండగా; రుక్మిణీ వల్లభుండు= రుక్మిణి ప్రియుడు - కృష్ణుడు; వారిన్= వారిని; కన్గొని= చూచి.

తాత్పర్యం: ఆ సంఘటనకు గుండెలో గుబులూ, అచ్చెరువూ కలుగగా, ఆ మునులందరూ నిశ్చేష్టత పొంది బొమ్మలోని రూపాలవలె ఉండగా, కృష్ణుడు వారిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: చిత్రపటంలో ఒక భావం తోచే విధంగా గీసిన బొమ్మ ఏ మార్పూ లేక అట్లాగే ఉంటుంది. సాధారణదశలో ప్రాణులు అట్లా ఉండటం అసాధ్యం. తీవ్రమైన భయాదులవలన అట్టి స్థితి సహజంగా ఏర్పడుతుంది. దీనినే 'స్తంభం' అనే భావంగా అలంకార శాస్త్రం చెప్పుతున్నది.

వ. 'మీరీ యనలంబు తెఱం గేమిగా నెఱింగితి? రున్న రూపెఱింగింపవలయు' ననుటయు వారలు సభక్తికంబులగు చిత్తంబులతోడ. 401

ప్రతిపదార్థం: మీరు= మీరలు; ఈ+అనలంబు తెఱంగు= ఈ అగ్నితీరు; ఏమిగాన్= ఏ విధమైనదిగా; ఎఱింగితిరి?= తెలిసికొన్నారు; ఉన్నరూపు= ఉన్న విధం; ఎఱింగింపవలయున్= తెలుపవలె; అనుటయున్= అన్నంతనే; వారలు= ఆ మునులు; సభక్తికంబులు= భక్తితో కూడినవి; అగు చిత్తంబులతోడన్= అయిన హృదయాలతో.

తాత్పర్యం: 'మీరీ అగ్ని తీరు ఏమిగా తెలిసికొన్నారు? ఉన్నది ఉన్నట్లు చెప్పండి' అంటే వారు భక్తితో నిండైన హృదయాలతో (ఇట్లా అంటున్నారు).

క. 'దేవా! విశ్వము గలుగుట । నీవలనన; యడఁగుటయును నీయందు భవ
ద్భావాధీనమ సకల । స్థావరజంగమ సమాహితత్వం బెల్లన్. 402

ప్రతిపదార్థం: దేవా!= ప్రభూ!; విశ్వము= ఈ లోకాల సముదాయం; కలుగుట= ఏర్పడటం; నీవలనన్+అ= నీవలననే; అడఁగుటయును= లీనమై పోవటం; నీ అందున్+అ= నీయందే; సకల స్థావర జంగమ సమాహితత్వంబు= సమస్తమైన స్థిరంగా ఉండే భూతాలయొక్క, కదిలే ప్రాణులయొక్క స్థితి; ఎల్లన్= అంతా; భవత్+భావ+అధీనము+అ= నీ సంకల్పానికి వశమైనదియే.

తాత్పర్యం: ప్రభూ! ఈ విశ్వమంతా ఏర్పడటం నీవలననే; అణగిపోవటం నీయందే. కదలనివి, కదలేవి అయిన సమస్తభూతాల ప్రవృత్తి అంతా నీ సంకల్పానికి వశమైనదే.

తే. నీవు మమ్ము బోధింపఁగా నేర్తుగాక । యిమ్మహానలస్ఫురణంబు నిట్టి దనఁగ
నేము నేర్తుమె? యేమియో యెఱుఁగ కునికిఁ । గాదె నివ్వెఱ పడితిమి? కమలనాభ!' 403

ప్రతిపదార్థం: కమలనాభ!= కమలము బొడ్డునందు గల ఓ సర్వాధారా!; నీవు; మమ్మున్= మమ్ములను; బోధింపఁగాన్= తెలుపగా; నేర్తు(వు); కాక= నేర్చెదవు గానీ; ఈ+మహా+అనల స్ఫురణంబున్= ఈ గొప్ప అగ్ని వెలువడటం; ఇట్టి+అది= ఇటువంటిది; అనఁగన్= అనుటకు; ఏము= మేము; నేర్తుము+ఎ?= సమర్థుల మగుదుమా?; ఏమియో?= అది ఏమో?; ఎఱుఁగక+ఉనికిన్= తెలియకపోవటంవలన; కాదె!= కదా!; నివ్వెఱపడితిమి?= నిశ్చేష్టులం అయ్యాము?

తాత్పర్యం: నీవు మాకు తెలుపగలవు గానీ, ఈ అగ్ని వెలువడటం ఏమిటో మేము తెలిసికొనగలమా? అది ఏమో తెలియకనే కదా! మేము నిశ్చేష్టులం అయ్యాము!

వ. అనుటయు భవదీయ చేతఃప్రసన్నతగాదె జగంబుల వర్తనంబునకు నాధారంబు. 404

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; భవదీయచేతస్+ప్రసన్నత= మీదైన హృదయాల నిర్మలత్వం; కాదె= కదా!; జగంబుల వర్తనంబునకున్= లోకాల సాగుదలకు; ఆధారంబు= ఆధారం.

తాత్పర్యం: అని ఆ మహర్షులు అనినంతనే కృష్ణుడు 'మీ హృదయాలు ప్రసన్నంగా ఉండటమే కదా లోకాల సాగుదలకు ఆధారం! (అన్నాడు).

విశేషం: "సంతో భూమిం తపసా ధారయంతి" అని సూక్తి. 'సజ్జనులు తమ తపస్సుచేత భూమిని పట్టి నిలుపుతారు.' శ్రీకృష్ణుడు ఇక్కడ ఈ వాక్యార్థాన్ని సమన్వయించాడు.

క. కావున మీకుం బ్రియముగ । నీ వహ్ని తెఱంగు దెలియ నెఱిఁగించెదఁ జి
త్తావిలత విడువుఁ డని కమ । లావరుఁ డిట్లనియె వారలకుఁ గురువర్యా! 405

ప్రతిపదార్థం: కావునన్= కనుక; మీకున్= మీకు; ప్రియముగన్= ప్రీతి కలిగే విధంగా; ఈవహ్నితెఱంగు= ఈ అగ్ని తీరు; తెలియన్= తెలిసే విధంగా; ఎఱిఁగించెదన్= తెలుపుతాను; చిత్త+ఆవిలత= హృదయంలోని కలతపాటు; విడువుఁడు= వదలండి, అని; కురువర్యా= ధర్మరాజా!; కమలా వరుఁడు= లక్ష్మీవల్లభుడైన కృష్ణుడు; వారలకున్= వారికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: కనుక మీకు ప్రియంగా ఈ అగ్ని తీరు తెలియజెప్పుతాను. మీ హృదయాలలోని ఆవేగాన్ని తొలగించుకొనండి' అని కృష్ణుడు వారితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇప్పుడు వాసుదేవరూపంలో ఉన్నా ఆయన ఎప్పుడూ లక్ష్మీవల్లభుడే! రుక్మిణియే ఇప్పుడు లక్ష్మి.

వ. ఒక దానవుఁడు జగన్నా । శకుఁ డిత్తఱిఁ గలఁడు వానిఁ జంపుట కేఁ బూ
నక యునికి గలిగె వాఁ డ । స్త్రకళావిదుఁ డగుట నా కతంబున నగుటన్. 406

ప్రతిపదార్థం: ఈ+తఱిన్= ఈ సమయంలో; జగత్+నాశకుఁడు= జగత్తును నశింపజేసేవాడు; ఒక దానవుఁడు= ఒక రాక్షసుడు; కలఁడు= ఉన్నాడు; వాఁడు= అతడు; అస్త్ర కళా విదుఁడు= అస్త్రములను కళను చక్కగా ఎరిగినవాడు; అగుట= కావటం; నా కతంబునన్= నా కారణంగా; అగుటన్= కావటంవలన; ఏన్= నేను; వానిన్= వాడిని; చంపుటకున్= చంపటానికి; పూనక= సిద్ధపడక; ఉనికి= ఉండటం; కలిగెన్= కలిగింది.

తాత్పర్యం: ఈ సమయంలో లోకాలను నశింపజేసే రాక్షసుడు ఒకడున్నాడు. వాడు అస్త్రవిద్యలో నేర్పరి కావటం నావలననే అయిన కారణంగా వాడిని నేను చంపటానికి సిద్ధపడలేదు.

విశేషం: విద్యనేర్పినవాడు తండ్రి అవుతాడు. తండ్రి కొడుకును చంపటం సాధ్యం కాదు కదా! అంతేకాక విషవృక్షమైనా స్వయంగా పెంచి త్రుంచలేరని కాళిదాసోక్తి. "విషవృక్షోఽపి సంవర్ధ్య స్వయం ఛేత్తు మసాంప్రతమ్".

క. **కడుఁ గ్రొవ్వి వాఁడు లోకము। నుడుకులఁ బెట్టంగ విసివి యుగ్రతపమునం**
గొడుకుఁ బడసి యద్దనుజునిఁ। బొడవడఁగింపం దలంచి భూరివ్రతమున్. **407**

ప్రతిపదార్థం: వాఁడు= ఆ రక్కసుడు; కడున్= మిక్కిలిగా; క్రొవ్వి= బలిసి; లోకమున్= జగత్తును; ఉడుకులన్= బాధలలో; పెట్టంగన్= పెట్టగా; విసివి= విసుగుచెంది; ఉగ్రతపమునన్= ఘోరమైన తపస్సుతో; కొడుకున్= కుమారుడిని; పడసి= పొంది; ఆ దనుజున్= ఆ రాక్షసుడిని; పొడవు+అడఁగింపన్= చంపటానికి; తలంచి= సంకల్పించి; భూరివ్రతమున్= గొప్ప వ్రతాన్ని.

తాత్పర్యం: కానీ ఆ రాక్షసుడు క్రొవ్వి, లోకాలను త్రిప్పులబెడుతున్నాడు. విసుగుపుట్టి, ఘోరమైన తపస్సుతో కొడుకును పొంది ఆ రాక్షసుడిని చంపటానికి సంకల్పించి మహావ్రతాన్ని. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **నడప మదాత్మ యగ్నియయి నా వదనంబున నిర్గమించె యె**
క్కుడుపడి పద్మగర్భుకడకుం జనె నమ్మహితుండు మన్మథుం
గొడుకుగఁ బంచి వే తను మగుడ్పఁగ వచ్చెఁ గడంగి పోవున
ప్పుడు వనమేర్చె నేను గృపఁ బూర్వవిధం బొడఁగూడఁ జూచితిన్. **408**

ప్రతిపదార్థం: నడపన్= సాగింపగా; మత్+ఆత్మ= నా ఆత్మ; అగ్ని= వహ్ని; అయి; నా వదనంబునన్= నా నోటినుండి; నిర్గమించి= వెలువడి; ఎక్కుడు+పడి= పెద్దదై; పద్మగర్భుకడకున్= బ్రహ్మదగ్గరకు; చనెన్= వెళ్ళినది; ఆ+మహితుండు= ఆ గొప్పవాడు; మన్మథున్= మన్మథుడిని; కొడుకుగన్= నా కుమారుడిగా; పంచి= పంపి; వే= వడిగా; తనున్= తన్ను; మగుడ్పఁగన్= మరలింపగా; వచ్చెన్= వచ్చినది; కడంగి= ప్రయత్నపడి; పోవు+అప్పుడు= తిరిగి పోయే సమయంలో; వనము= అడవి; ఏర్చెన్= కాల్చివేసింది; నేను; కృపన్= జాలితో; పూర్వవిధంబు= తొల్లిటి తీరు; ఒడఁగూడన్= ఏర్పడునట్లుగా; చూచితిన్= చేశాను.

తాత్పర్యం: (గొప్పవ్రతం) సాగించగా నా ఆత్మ అగ్ని అయి నా ముఖం నుండి బయటకు వచ్చింది. అది క్రమంగా బాగా పెరిగి, బ్రహ్మదగ్గరకు వెళ్ళింది. ఆ మహానుభావుడు మన్మథుడిని నా కుమారుడిగా పంపి, దానిని మరలించాడు. అది తిరిగి పోతూ ఈ అడవిని కాల్చివేసింది. నేను జాలిపుట్టి, మరల దానికి మొదటిరూపు కల్పించాను.

విశేషం: సృష్టి వ్యవహారమంతా బ్రహ్మ పని. అందుకని అగ్ని అక్కడకు వెళ్ళింది. తిరిగిపోతూ కాల్చటం ఎందుకు? అంటే అది దాని స్వభావం.

వ. **ఇది యద్దహనంబు తెఱం' గని చెప్పి యప్పరమపురుషుం డమ్మునివరులతో మఱియును.** **409**

ప్రతిపదార్థం: ఇది; ఆ+దహనంబు తెఱంగు= ఆ అగ్ని తీరు; అని; చెప్పి; ఆ+పరమ పురుషుండు= ఆ పరమాత్మ; ఆ+ముని వరులతోన్= మహర్షిశ్రేష్ఠులగు నారదాదులతో; మఱియును= ఇంకా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ అగ్ని ఏర్పడిన విధం ఇది' అని చెప్పి ఆ పరమాత్మ ఆ మహర్షులతో ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: ఒక మహారాజు ప్రియమైన సేవకుడి పెండ్లిలో పల్లకీ ప్రక్కన నడుస్తాడు. అయినా అతడు మహారాజే. పరమాత్మ అవతారరూపంలో వేరు నామరూపాలు పొందినా పరమాత్మయే. ఈ దృష్టితో ఇక్కడ పరమపురుష శబ్దాన్ని తిక్కనగారు ప్రయోగించారు.

సీ. **'లోకత్రయంబున మీకు నవిదితంబు । లేదు త్రికాల సంవేదులార!**
యుత్తమం బగు పురావృత్తంబు చెప్పి కృ । తార్థుఁ జేయుండు న న్ననిన వారు
సవినయంబుగఁ గృతాంజలు లయి 'మమ్మింత । పెద్ద సేయుదె? నీవు పెద్దలకును
బెద్ద వయత్నసంభృతజగత్త్రయుఁడవు । విశ్వప్రకారసంవిదుఁడ వేము

తే. **నీ యెఱుంగని యితిహాస మేయుగమున । నెఱిఁగి చెప్పుదు? మనవుడుఁ జిఱుతనగవు**
మోమునకుఁ జెన్ను సేయ నమ్మురహరుండు । వారలకు నిట్టులనుఁ గురువంశ వర్య! **410**

ప్రతిపదార్థం: త్రికాల సంవేదులార!= మూడుకాలాలను చక్కగా తెలిసిన విజ్ఞులారా!; లోకత్రయంబునన్= మూడు లోకాలలో; మీకున్= మీకు; అవిదితంబు= తెలియనది; లేదు; ఉత్తమంబు= శ్రేష్ఠమైనది; అగు పురావృత్తంబున్= అయిన ఇతిహాసాన్ని; చెప్పి; నన్నున్= నన్ను; కృతార్థున్= నెరవేరిన కోరిక కలవాడినిగా; చేయుండు= చేయండి; అనినన్= అనగా; వారు= ఆ మునులు; సవినయంబుగన్= వినయంతో; కృత+అంజలులు= పట్టిన దోసిలి కలవారు; అయి; మమ్మున్= మమ్ములను; ఇంత= ఇంతగా; పెద్ద+చేయుదె?= గొప్పవారిని చేస్తావా?; నీవు; పెద్దలకును= మహావృద్ధులకుకూడా; పెద్దవు= పెద్దవాడవు; అయత్న సంభృతజగత్+ త్రయుఁడవు= ఏ ప్రయత్నంలేకయే చక్కగా భరింపబడిన మూడు లోకాలు కలవాడవు; విశ్వ ప్రకార సంవిదుడవు= విశ్వపుతీరును చక్కగా తెలిసినవాడవు; ఏము= మేము; నీ ఎఱుంగని ఇతిహాసము= నీ వెరుగని కథను; ఏ యుగమునన్= ఏ యుగంలో; ఎఱిఁగి= తెలిసికొని; చెప్పుదుము?= చెప్తాము; అనవుడున్= అని పలుకగా; ఆ+మురహరుండు= మురాసురుని సంహారం చేసిన ఆ కృష్ణుడు; చిఱుతనగవున్= చిన్న నవ్వు; మోమునకున్= ముఖానికి; చెన్ను+చేయన్= సొంపు కూర్చగా; కురువంశవర్య!= కురువంశంలో ఉత్తముడా!; వారలకున్= ఆ మునులకు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు.

తాత్పర్యం: 'మీరు మూడు కాలాలు తెలిసినవారు. మూడు లోకాలలో మీకు తెలియనిది లేదు. నాకొక ఉత్తమ ఇతిహాసం చెప్పి నా కోరిక తీర్చండి' అనగా వారు వినయంతో చేతులు జోడించి, 'నీవు మమ్మ ఇంత గొప్ప చేస్తే ఎట్లాగు? నీవు పెద్దలకు పెద్దవు. లోకాల నన్నింటినీ అవలీలగా భరించగలవాడవు. విశ్వపు తీరుతెన్నులు చక్కగా తెలిసినవాడవు. నీకు తెలియని ఏ కథను మేము ఏ యుగంలో తెలిసి చెప్పగలవారము?' అన్నారు. అప్పుడు కృష్ణుడు చిరునగవు మొగానికి వింత శోభ కలిగిస్తూ ఉండగా వారితో ఇట్లా అన్నాడు.

విశేషం: పెద్దలకు పెద్ద - పెద్దలు సృష్టి స్థితి లయ కర్తలు - బ్రహ్మ విష్ణు మహేశ్వరులు - వారికి పెద్ద పరమాత్మ అని తాత్పర్యం. కృష్ణుడు త్రికాలాలను, త్రిలోకాలను తెలిసినవారినిగా మునులను పేర్కొన్నాడు. వారు ప్రతిగా త్రిమూర్తులకు అతీతమైన పరమాత్మ స్వరూపుడిగా, త్రిలోకాలకంటె మించి ఉన్న విశ్వమయుడుగా పేర్కొన్నారు. 'చిరునగవు'లో తరువాత తాను చెప్పబోయే విషయం లీలామాత్ర మనే సూచన ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'మానుషయోని జనించితిఁ। గాన మదీయ మగు బుద్ధిగౌరవము దదీ
యానుగుణత్వోపహితము। గా నెఱుఁగుఁడు మీరు సెప్పు కత విను టసదే?' 411

ప్రతిపదార్థం: మానుషయోనిన్= మనుష్య గర్భంలో; జనించితిన్= పుట్టాను; కానన్= కనుక; మదీయము= నాది; అగు బుద్ధి గౌరవము= అయిన బుద్ధిగొప్పతనం; తదీయ+అనుగుణత్వ+ఉపహితము=దానికి తగిన విధంగా ఏర్పడినది; కాన్= అగుటను; ఎఱుఁగుఁడు= తెలిసికొనండి; మీరు; చెప్పు కత= చెప్పే కథ; వినుట= వినటం; అసదే?= చిన్న విషయమా?

తాత్పర్యం: మనుష్యగర్భంలో పుట్టాను. కనుక, నా బుద్ధిస్థితి దానికి తగిన విధంగానే ఉన్నది - అని తెలిసికొనండి. మీరు చెప్పేకథ నాకు చిన్నదెట్లా అవుతుంది?

చ. అనుటయు వారలందఱుఁ బ్రియంబున దానికి నియ్యకొన్న నె
మ్మనములతోడ 'నీ పనికి మాన్యచరిత్రుఁడు నారదుండ త
క్కిన పెఱవారు చాలరు ప్రకీర్త్యవివేకుఁడు కృష్ణు దర్థితో
వినఁగఁ బురాతనంబయిన వృత్తము నమ్ముని చెప్పు టొప్పగున్. 412

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; వారలు= ఆ మునులు; అందఱున్= అందరూ; దానికిన్= దానికి; ఇయ్యకొన్న నెఱ+మనములతోడన్= ఒప్పుకొన్న నిండు హృదయాలతో; ఈ పనికిన్= ఈ కథ చెప్పటం అనే పనికి; మాన్యచరిత్రుఁడు= మన్నన కెక్కిన నడవడి కలవాడు; నారదుండు+అ= నారదుడే; తక్కిన పెఱవారు= మిగిలిన ఇతరులు; చాలరు= సమర్థులు కారు; ప్రకీర్త్యవివేకుఁడు= మిక్కిలి కొనియాడదగిన వివేకంగలవాడు; కృష్ణుఁడు; అర్థితోన్= కోరికతో; వినఁగన్= వింటూ ఉంటే; పురాతనంబు= ప్రాత కాలానిది; అయిన వృత్తమున్= అయిన సంగతిని; ఆ+ముని= ఆ నారద మహర్షి; చెప్పుట=చెప్పటం; ఒప్పు= మంచిది; అగున్= అవుతుంది.

తాత్పర్యం: కృష్ణు డట్లా అనగా వారందరూ అంగీకరించిన హృదయాలతో 'ఈ పనికి సమర్థుడు నారదుడే. అతడి నడవడి ఎంతో మన్నన కెక్కినది. తక్కినవారు దీనికి చాలరు. లోకమంతా పెద్ద ఎత్తున కొనియాడే వివేకంకల శ్రీకృష్ణుడు వింటూ ఉంటే పూర్వకథను ఆ ముని చెప్పటమే బాగుంటుంది.'

చ. అని తగ నేక వాక్యతఁ బ్రియంబున నాతనితోడ నీవు మున్
కనినది విన్నయట్టిది ప్రకామకుతూహల చిత్తుఁ డైన కృ
ష్ణుని వినిపింపు నావుడు మనోజ్ఞ కథాకథనంబునందు వే
డ్క నిగుడ నమ్మునీంద్రుఁడు వికాసమునన్ మొగ ముల్లసిల్లఁగన్. 413

ప్రతిపదార్థం: అని; తగన్= బాగుగా; ఏకవాక్యతన్= ఒక్కమాట అగునట్లుగా; ప్రియంబునన్= ప్రీతితో; ఆతనితోడన్= ఆ నారదుడితో; నీవు; మున్= మునుపు; కనినది= చూచినది; విన్న+అట్టి+అది= విన్నది; ప్రకామ కుతూహల చిత్తుఁడు= పెద్దకోరికతో వేడుక కల హృదయం కలవాడు; ఐన కృష్ణునిన్= అయిన కృష్ణుడిని(కి); వినిపింపు= చెప్పుము; నావుడున్= అని పలుకగా; ఆ+ముని+÷ఇంద్రుఁడు= ఆ మునిశ్రేష్ఠుడు; మనోజ్ఞ కథాకథనంబునందున్= హృదయాన్ని మురిపించే కథను చెప్పటంలో; వేడ్క= ఉత్కంఠ; నిగుడన్= వ్యాపించగా; మొగము= ముఖం; వికాసమునన్= విప్పారుటతో; ఉల్లసిల్లఁగన్= ప్రకాశించగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని ఒక్కమాటగా నారదుడితో ఇట్లా అన్నారు. 'నీవు మునుపు చూచినది, లేక వినినది అయిన వృత్తాంతం ఎంతో కోరికతో ముచ్చట పడుతున్న కృష్ణుడికి చెప్పుము'. అప్పుడు నారదుడు వేడ్క పుట్టి, ముఖం వికాసంతో వెలుగొందుతూ ఉండగా (ఇట్లా అన్నాడు).

ఉమామహేశ్వర సంవాదంబను నితిహాసంబు (సం.13-205-1 (కుంభ))

క. నారాయణ సౌహార్దో। దారత్వవిభూతి మున్న తనకుఁ గలిమి న
న్నారాయణుని మనోరథ। మారం బూరించె శంకరాంబికల కథన్. 414

ప్రతిపదార్థం: నారాయణ సౌహార్ద+ఉదారత్వ విభూతిన్= నారాయణుని చెలిమిలోని గొప్పతనపు సంపద; మున్ను+అ= ముందే తనకున్= తనకు (నారదుడికి); కలిమిన్= ఉండటంవలన; ఆ+నారాయణుని మనస్+రథము= ఆ నారాయణుడి కోరికను; శంకర+అంబికల కథన్= పరమేశ్వరుడు, అంబిక అనే వారి కథతో; ఆరన్= తనివి తీరా, పూరించెన్= నింపాడు.

తాత్పర్యం: 'నారాయణుని చెలిమి' అనే మిక్కిలి గొప్ప సంపద తనకు పూర్వమే ఉండటంవలన ఉమామహేశ్వరుల కథలతో ఆ నారాయణుడి కోరికను తనివితీరా నారదుడు పూరించాడు.

విశేషం: లోకసామాన్యంగా 'సౌహార్ద' శబ్దానికి 'చెలిమి' అని అర్థం. ఇక్కడ విశేషంగా నారాయణుడి హృదయంలో పదిలపరచుకొన్న స్థితిచేత అనే అర్థం సంభావించాలి.

వ. అత్తెఱంగు వివరించెద నట్లు సమస్త సంయమిసంఘంబును బ్రస్తుతి పూర్వకంబుగా నియోగింపం బ్రియంబునం బురాతన కథాకథనంబునకుం బూని యద్దేవముని యద్దేవకీనందనునకు వందనం బాచరించి తదభివందనంబు వడసి యవ్విభున కిట్లనియె. 415

ప్రతిపదార్థం: ఆ+తెఱంగు= ఆ పద్ధతిని; వివరించెదన్= విశేషంగా తెలియజేస్తాను; అట్లు= ఆ విధంగా; సమస్త సంయమి సంఘంబును= మునుల సముదాయమంతా; ప్రస్తుతి పూర్వకంబుగాన్= ప్రశంస మొదలుగా; నియోగింపన్= నియమించగా; ఆ+దేవముని= దేవలోకపు మునియైన ఆ నారదుడు; పురాతన కథాకథనంబునకున్= పూర్వకాలపు కథను చెప్పటానికి; ప్రియంబునన్= ప్రీతితో; పూని= సంకల్పించి; ఆ+దేవకీనందనునకున్= దేవకి కొడుకైన శ్రీకృష్ణుడికి; వందనంబు= నమస్కారం; ఆచరించి= చేసి; తద్+అభివందనంబు= అతడి నమస్కారం; పడసి= గ్రహించి; ఆ+విభునకున్= ఆ దేవుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఆ తీరు వివరంగా చెప్పుతాను. ఆ విధంగా మునులందరూ ప్రశంసతోపాటు తనను నియమించగా నారదుడు సంతోషంతో ఇతిహాసం చెప్పటానికి పూనుకొని, ముందు శ్రీకృష్ణుడికి నమస్కారం చేసి, అతడి ప్రతినమస్కారం గ్రహించి, అతడితో ఇట్లా అన్నాడు.

తే. తీర్థభజనంబునకు నెందుఁ దిరుగుచుండి। యిత్తుషారనగంబున కేను వచ్చి
కంటి రమణీయ మగు కేలికావనంబు। సకలతరువల్లరీగుల్మచారుతలము. 416

ప్రతిపదార్థం: ఏను= నేను; తీర్థ భజనంబునకున్= పుణ్యస్థలాలను సేవించటానికి; ఎందున్= అన్ని చోటులందు; తిరుగుచున్+ఉండి= తిరుగుతూ; ఈ+తుషార నగంబునకున్= ఈ మంచుకొండకు; వచ్చి= ఏతెంచి; సకల తరు వల్లరీ

గుల్మ చారు తలము= అన్ని విధములైన చెట్లు, తీగెలు, పొదలు అనేవాటితో అందమైన చోటు; రమణీయము= మనోజ్ఞమైనది; అగు కేలికావనంబున్= అయిన ఉద్యానవనాన్ని; కంటిన్= చూచాను.

తాత్పర్యం: నేను పుణ్యస్థలాలు సేవిస్తూ, అన్ని స్థలాలు తిరుగుతూ, ఈ హిమవత్పర్వతానికి వచ్చి, చూడముచ్చట అయినది. అన్ని రకాల చెట్లు, తీగెలు, పొదలు అనే వాటితో సుందరంగా ఉన్నదీ అయిన ఒక ఉద్యానవనాన్ని చూచాను.

విశేషం: "భజ సేవాయామ్" అని ధాతువు కనుక భజనం అంటే సేవించటం.

క. కోకిలకుల గంధర్వా। నీకధ్వను లెనసి బెరసి నిగుడఁగ నమరీ
లోకభ్రమరీమండలి। కా కలకలనాదములును గలిసి చెలంగన్. 417

ప్రతిపదార్థం: కోకిల కుల గంధర్వ+అనీక ధ్వనులు= కోకిలలగుంపుల యొక్క, గంధర్వుల సముదాయాలయొక్క నాదాలు; ఎనసి= విజృంభించి; బెరసి= కలిసిపోయి; నిగుడఁగన్= వ్యాపించగా; అమరీ= దేవతాస్త్రీ; లోక= సముదాయంయొక్క; భ్రమరీ= ఆడు తుమ్మెదల; మండలికా= గుంపులయొక్క; కలకలనాదములును= అవ్యక్తమధుర నాదములు; కలిసి= ఒకదానితో ఒకటి కలిసి; చెలంగన్= వ్యాపించగా.

తాత్పర్యం: కోకిలల నాదాలు, గంధర్వుల గానాలు, దేవకాంతల రాగాలు, ఆడు తుమ్మెదల అవ్యక్తమధుర గీతాలు కలిసి విజృంభించగా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. ఒప్పు నవ్వనంబునం గనక స్థలంబున శార్దూల చర్మవసన భుజగాభరణ భసితాంగరాగ విరచితాలంకార చారు దివ్యదేహుం డగు మహాదేవుండు సుర సిద్ధసాధ్య విద్యాధర మునిపుంగవ భూతగణ పరివృతుం డయి యున్న నప్పేరోలగంబున నేనును సముచితప్రకారంబున నయ్యనిరూపణీయప్రకారుం గొల్చి యుండితి నట్టి సమయంబున. 418

ప్రతిపదార్థం: ఒప్పు+ఆ+వనంబునన్= ఒప్పారే ఆ పూదోటలో; కనక స్థలంబునన్= బంగారు తాపడం గల తావున; శార్దూల= పులియొక్క; చర్మ= తోలు అనే; వసన= వస్త్రం; భుజగ= పాములనే; ఆభరణ= నగలు; భసిత= విభూతి అనే; అంగరాగ= మైపూతలతో; విరచిత= చేయబడిన; అలంకార= శృంగారం గల; చారు= మనోహరమైన; దివ్య= మిక్కిలి ఉత్తమమైన; దేహుండు+అగు= దేహం కలవాడైన; మహాదేవుండు= పరమేశ్వరుడు; సుర= దేవతల; సిద్ధ=సిద్ధుల; సాధ్య= సాధ్యుల; విద్యాధర= విద్యాధరుల; మునిపుంగవ= మహర్షివరేణ్యుల; భూత= భూతముల; గణ= గుంపులచేత; పరివృతుండు+ అయి= చుట్టబడినవాడై; ఉన్నన్= ఉండగా; ఆ+పేరు+ఓలగంబునన్= ఆ పెద్ద సభలో; నేనును= నేను కూడా; సముచిత ప్రకారంబునన్= తగిన తీరున; ఆ+అనిరూపణీయ ప్రకారున్= ఇట్టివాడని భావించరాని ధోరణిలో గల ఆ సదాశివుడిని; కొల్చి= సేవించి; ఉండితిన్= ఉన్నాను; అట్టి సమయంబునన్ = ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ విధంగా ఒప్పారే ఆ ఉద్యానంలో బంగారు తాపిన ప్రదేశంలో పులితోలు అనే వస్త్రం, సర్పాల ఆభరణాలు, విభూతి మైపూతలతో అలంకరించుకొనిన అతిశ్రేష్ఠమైన దేహంగల ఆ మహాదేవుడు దేవతలు, సిద్ధులు, సాధ్యులు, విద్యాధరులు, మునివరులు, భూతములు అనే వారి గుంపులు చుట్టి రాగా కొలువున్న ఆ పెద్ద సభలో నేను కూడా తగు తీరున నిరూపించరాని తీరుతెన్నులుగల ఆ స్వామిని కొల్చి ఉన్నాను. ఆ సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: సాధ్యులు మొదలయినవారు దేవయోనులనే జాతులవారు. "అనిరూపణీయ ప్రకారుఁడు" ఇది పరమాత్మ లక్షణం. మాట, మనసు, చేష్ట అనేవి ఏ విధంగా, ఎందుకు, ఎప్పుడు ఉంటాయో ఎవ్వరికీ తెలియరానివాడు.

సీ. పుణ్యాంగనాకారములు దాల్చి పుణ్య న । దీ నివహంబులు దిశలు గొల్చి
చనుదేర శంకరసదృశ పరిష్కార । కల్యాణతను వైన గౌరి వచ్చి
వెనుక దిక్కున మెలుపునఁ జేరి మోమున । కలఁతిన వ్వినుమడి చెలువు నొసఁగఁ
దమ్మితేకుల నుల్లసమ్మాడు తన మృదు । కర యుగ్మమునను శంకరుని నేత్ర

తే. యుగ్మ మల్ల మూసి యున్నంత లోక మ । నర్క చంద్రతారకాగ్నిహీనమై మ
హాంధకారమగ్న మగుటయు సంక్షోభ । మందె భూతసముదయంబు లెల్ల. 419

ప్రతిపదార్థం: పుణ్యనదీ నివహంబులు= పుణ్యాలైన నదుల సముదాయములు; దిశలు= దిక్కులు; పుణ్య+అంగనా+ఆకారములు= పుణ్యస్త్రీల ఆకారాలు; తాల్చి= ధరించి; కొల్చి= సేవించి; చనుదేరన్= రాగా; శంకర సదృశ పరిష్కార కల్యాణ తనువు= శంకరుడి అలంకారములను పోలిన అలంకారములతో శుభమైన మేను గలది; ఐన గౌరి= అయిన పార్వతీదేవి; వచ్చి= ఏతెంచి; వెనుక దిక్కునన్= వెనుక వైపు; మెలుపునన్= నేర్పుతో; చేరి= సమీపించి; మోమునకున్= మొగానికి; అలఁతి నవ్వు= చిన్న నగవు; ఇనుమడి చెలువున్= రెట్టింపు శోభను; ఒసఁగన్= ఇవ్వగా; తమ్మితేకులన్= పద్మపత్రాలను; ఉల్లసమ్ము+ఆడు= ఎకసెక్కం చేసే; తన మృదు కరయుగ్మమునను= తన మెత్తని చేతుల జంటచేత; శంకరుని నేత్ర యుగ్మము= శివుడి కన్నుల జంటను; అల్లన్= మెల్లగా; మూసి; ఉన్న+అంతన్= ఉన్నంతలో; లోకము= జగము; అనర్క చంద్ర తారక+అగ్ని+ఐ= సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు అగ్ని లేనిదై; మహా+అంధకార మగ్నము= పెనుచీకటిలో మునిగినది; అగుటయున్= కాగా; భూతసముదయంబులు= ప్రాణుల గుంపులు; ఎల్లన్= అన్నీ; సంక్షోభము= కలతపాటును; ఒందెన్= పొందాయి.

తాత్పర్యం: పుణ్యనదులు, దిక్కులు స్త్రీరూపాలు ధరించి సేవించిరాగా, శివుడి అలంకారంవంటి అలంకారంతో శుభమైన దేహంగల పార్వతి మెల్లగా వెనుకవైపునుండి సమీపించి చిరునవ్వు ముఖానికి రెట్టింపు సౌందర్యాన్ని కలిగిస్తూ ఉండగా, తమ్మిరేకులను పరిహాసం చేసే తనచేతుల జంటతో శివుడి కనుల జంటను మెల్లగా మూయగా, జగమంతా సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, అగ్నిలేనిదై పెనుచీకటిలో మునిగిపోయింది. అప్పుడు ప్రాణికోటులన్నీ కళవళపడ్డాయి.

విశేషం: ఇందరి ముందర ఈ పరిహాసధోరణి సముచితమా? అని కొందరికి శంక కలుగవచ్చును. పార్వతీపరమేశ్వరులు జగత్పితరులు. పిల్లలముందు తల్లిదండ్రులు పిల్లల వినోదంకొరకు ఇట్లా ప్రవర్తించటం సహజమే. అంతేకాదు. శంకరుడి నేత్రాలు సర్వలోకాలకు వెలుగునిచ్చే దివ్యజ్యోతులని నిరూపించటం కూడా లోకమాత ఉద్దేశం కావచ్చును.

ఉ. అప్పుడు ఫాలలోచనము నప్పరమేశుఁడు విచ్చె విచ్చినం
గప్పెఁ దదగ్నిజిహ్వలు నగం బఖిలంబును గౌరిదేవి య
ట్లొప్పమి తండ్రి కైనఁ గని యుల్లము బెగ్గిల నీశునంఘ్రులం
గప్పఁగ మౌళిభూషణము కాంతి ప్రణామముఁ జేసెఁ జేసినన్. 420

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ఆ+పరమ+ఈశుఁడు= ఆ మహేశ్వరుడు; ఫాలలోచనమున్= నొసటి కన్నును; విచ్చెన్= తెరిచాడు; విచ్చినన్= తెరువగా; తద్+అగ్ని జిహ్వలు= దాని అగ్ని జ్వాలలు; నగంబు= కొండను; అఖిలంబును= మొత్తాన్ని; కప్పెన్= కప్పివేసినాయి; అట్లు= ఆ విధంగా; ఒప్పమి= కీడు; తండ్రికిన్= తన తండ్రి అయిన హిమవంతుడికి; ఐనన్= కాగా; కని= చూచి; గౌరిదేవి= పార్వతీదేవి; ఉల్లము= హృదయం; బెగ్గిలన్= దిగు లొందగా; మౌళి భూషణము కాంతి= శిరస్సునందలి ఆభరణం కాంతి; ఈశు+అంఘ్రులన్= ఈశ్వరుడి పాదాలను; కప్పఁగన్= కప్పివేయగా; ప్రణామమున్= నమస్కారము; చేసెన్= చేసినది; చేసినన్= చేస్తే.

తాత్పర్యం: అప్పుడు పరమేశ్వరుడు నొసటి కంటిని తెరిచాడు. దానితో ఆ కంటిమంటలు కొండనంతటినీ పొదివివేశాయి. ఆ విధంగా తండ్రికి ఆపద సంభవించగా పార్వతి గుండెలో దిగులుపడి, తన శిరస్సునందలి అలంకారపు కాంతి శివుడి పాదాలను కప్పగా చాగిలబడి నమస్కరించింది. అట్లా నమస్కరించగా. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: శిరోభూషణం చంద్రరేఖ కావచ్చును.

ఆ. **హరుఁడు కరుణఁ జూడ నా హిమవన్నగ । దాహ ముడిగి శోభితత్వ మొలసె**
నార్య పరమవిస్మయముఁ బొంది యాసర్వ । భువనకర్తతోడ సవినయముగ. **421**

ప్రతిపదార్థం: హరుఁడు= శివుడు; కరుణన్= దయతో; చూడన్= చూడగా; ఆ+హిమవత్+నగ దాహము= ఆ మంచుకొండ మంట; ఉడిగి= పోయి; శోభితత్వము= శోభగలదానితనం; ఒలసెన్= కలిగింది; ఆర్య= పార్వతి; పరమ విస్మయమున్= గొప్ప ఆశ్చర్యం; పొంది; ఆ+సర్వ భువన కర్తతోడన్= అన్ని లోకాలకు కర్త అయిన ఆ శివుడితో; సవినయముగన్= వినయంతో పాటుగా.

తాత్పర్యం: శివుడు దయతో చూడగా ఆ మంచుకొండ మంట చల్లారి, మరల శోభతో అలరారినది. పార్వతి పరమాశ్చర్యం పొంది, సర్వలోకాలకు నిర్మాత అయిన ఆ శివుడితో వినయంతో. (ఇట్లా అన్నది)

సీ. **నిటలంబుకను దెఱచుటకుఁ గారణమేమి । సర్వేశ! యిది రహస్యంబు గాక**
యున్నేనిఁ జెప్పవే!' యన్న నద్దేవుండు । 'కాంత! నీ కెఱిఁగింపఁగాని యట్టి
పని యెందుఁ గల్గునే? వినుము లోకాత్మక । త్వము నాకుఁ గల్గుట వలనఁ జేసి
నన్నేది వొందిన నన్నిలోకంబుల । నది వొందుఁ గాన నాయంబకములు

తే. **నీవు మూయఁగఁ దిమిరంబు నిఖిలలోక । చయముఁ గప్పిన భూతముల్ భయముఁ బొందె**
నీ కరంబులు ద్రోవక చీఁకటియును । జెఱుచుటకు ఫాలనేత్రంబు దెఱవవలసె.' **422**

ప్రతిపదార్థం: సర్వ+ఈశ!= సర్వమునకు ప్రభువైన ఓ మహేశా! నిటలంబు కను= నొసటికన్ను; తెఱచుటకున్= తెరవటానికి; కారణము= హేతువు; ఏమి?; ఇది= ఈ విషయం; రహస్యంబు= గుట్టయినది; కాక+ఉన్నన్+ఏనిన్= కాకపోతే; చెప్పవే!= దయతో చెప్పుము!; అన్నన్= అనగా; ఆ+దేవుండు= ఆ దేవుడు; కాంత!= ఓ ప్రియురాలా!; నీకున్= నీకు; ఎఱిఁగింపన్= తెలుపుటకు; కాని+అట్టిపని= కూడనిపని; ఎందున్= ఎక్కడైనా; కల్గునే?= ఉంటుందా?; వినుము= ఆలకించుము; నాకున్= నాకు;

లోక+ఆత్మకత్వము= లోకములన్నీ నేనే అయిన భావం; కల్గుటవలనన్+చేసి= కలగటంవలన; నన్నున్= నన్ను; ఏది= ఏమి; పొందినన్= పొందినా; అన్ని లోకంబులన్= లోకాలన్నింటినీ; అది; పొందున్= పొందుతుంది; కానన్+కనుక; నా+అంబకములు= నా కన్నులు; నీవు; మూయంగన్= కప్పగా; తిమిరంబు= చీకటి; నిఖిల లోకచయమున్= అన్ని లోకాల సముదాయాన్ని; కప్పినన్= ఆవరించగా; భూతముల్= ప్రాణులు; భయమున్= భయాన్ని; పొందెన్= పొందాయి; నీ కరంబులు= నీ చేతులను; త్రోవక= తొలగించక; చీకటియును= చీకటిని; చెఱచుటకున్= పోగొట్టటానికి; ఫాలనేత్రంబు= నొసటి కంటిని; తెఱవన్+వలసెన్= తెరువవలసి వచ్చింది.

తాత్పర్యం: 'సర్వేశా! నొసటికన్ను తెరవటానికి కారణం ఏమిటి? ఇది రహస్యం కాకపోతే చెప్పుము' అని గౌరి అడుగగా కాంతా! నీకు తెలుపరానిపని ఎక్కడైనా ఉంటుందా? వినుము. ఈ లోకాలన్నీ నా స్వరూపాలే కనుక నా కేది కలిగితే లోకాలన్నింటికీ అదే కలుగుతుంది. నీవు నా కన్నులు మూయగా చీకటి అన్ని లోకాలను ఆవరించింది. భూతాలు భయం పొందాయి. నీ చేతులు తొలగించకుండా చీకటిని పోగొట్టటం కొరకు నా నుదుటికంటిని తెరవవలసి వచ్చింది.

విశేషం: చేతులు తొలగించకుండటం ముచ్చట తీర్చటంకొరకు. చేతులు తోసివేస్తే పార్వతి మనస్సు కష్టపడుతుంది. లోకాల భయం తొలగించటం తత్క్షణకర్తవ్యం. అందు కని మూడవ కన్ను తెరవటం.

వ. అనిన విని యంబిక తనకు నడుగవలయునట్టివి యడుగుటకు నది యవసరంబుగాఁ గనికొని యక్కపర్ది కిట్లనియె. 423

ప్రతిపదార్థం: అనినన్= అంటే; విని; అంబిక= పార్వతి; తనకున్= తనకు; అడుగవలయు+అట్టి+అవి= అడుగవలసినవి; అడుగుటకున్= అడగటానికి; అది; అవసరంబుగాన్= తగిన సమయంగా; కనికొని= భావించి; ఆ+కపర్దికిన్= ఆ శివుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: అని చెప్పగా విని పార్వతి తా నడుగవలసినవి అడగటానికి అది తగిన సమయంగా భావించి, శివుడితో ఇట్లా అన్నది.

విశేషం: అంబిక - అన్ని లోకాలకు తల్లి. కపర్ది - శివుడి జటల సముదాయిన్ని కపర్దం అంటారు. అది కలవాడు కపర్ది. ఆకాశమంతా ఆయన జడల సముదాయం. అందుకనే ఆయనను వ్యోమకేశు డనికూడా అంటారు.

క. 'నాలుగు ముఖములు నీకు । న్ఫాలనయన! కలుగఁ గారణం బేమి? మధు
శ్రీలాలిత్యాస్పద వా । క్యాలీకలనమున నాకు నానతి యీవే!' 424

ప్రతిపదార్థం: ఫాలనయన!= నొసటిపై కన్నుగల ఓ శివా!; నాలుగు ముఖములు= నాలుగు మోములు; నీకున్= నీకు; కలుగన్= ఉండటానికి; కారణంబు= కారణం; ఏమి; మధు= తేనెయొక్క; శ్రీ= సంపదయొక్క; లాలిత్య= ఇంపునకు;ఆస్పద= తావు అయిన; వాక్య= మాటల; ఆలీ= వరుసయొక్క; కలనమునన్= కూర్పుతో; నాకున్= నాకు; ఆనతి+ఈవే= చెప్పవూ!

తాత్పర్యం: 'నిటలాక్షా! నీకు నాలుగు మొగాలు ఎందుకు ఉన్నాయో తేనెవంటి మాటల కూర్పుతో సెలవివ్వవూ!'

విశేషం: నిజానికి శివుడికి అయిదు ముఖాలు. ఇక్కడ సాధారణంగా ఉండే ముఖం కాక తక్కిన నాలుగు ముఖాల సంగతి అడుగుతున్నట్లు భావించాలి. సద్యోజాతం, వామదేవం, అఘోరం, తత్పురుషం, ఈశానం అనేవి ఆ అయిదు ముఖాలకుపేర్లు.

వ. అనిన విని యమ్మహాదేవికి నద్దేవుం డిట్లను 'దైత్యులు సుందోపసుందులన నిర్వురు గలరు. వార లవార్య భుజవీర్య శౌర్యసంపన్నులు నస్త్రశస్త్రావధ్యులునై యుండుదురు. వారల వినాశంబునకై మయుండు లోకంబులం గల ఒప్పులం దెల్ల నుత్తమసారంబులు దిలప్రమాణంబు లాహరించి యొక్క కామినిం గావించి తిలోత్తమ యను పేరిడి నాకడకుం దెచ్చిన నచ్చెలువ నాకుం బ్రదక్షిణంబుగా వచ్చునెడ నేనిది దేవకార్యంబు సేయ నోపుఁ బొమ్మను తలంపుతో నత్తరుణి తిరిగిన దిక్కుదిక్కున కొక్కొక్క మొగంబు దాల్చి దానిం బరీక్షించితి; నాటంగోలెఁ జతుర్ముఖుండనై యుండుదు.' 425

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ఆ+మహాదేవికిన్= ఆ పార్వతికి; ఆ+దేవుండు= ఆ పరమేశ్వరుడు; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; దైత్యులు= దితి కొడుకులైన రక్కసులు; సుంద+ఉపసుందులు= సుందుడు, ఉపసుందుడు; అనన్= అనగా; ఇర్వురు= ఇద్దరు; కలరు= ఉండేవారు; వారలు= వారు; అవార్య= నిలువరింపరాని; భుజ= చేతుల; వీర్య= సత్తువయొక్క; శౌర్య= పరాక్రమంయొక్క; సంపన్నులును= సంపద కలవారు; అస్త్ర శస్త్ర+అవధ్యులును= అస్త్రాలకు, ఆయుధాలకు చంపరానివారు; ఐ= అయి; ఉండుదురు= ఉండేవారు; వారల వినాశంబునకై= వారల చావుకొరకు; మయుండు= విశ్వకర్మ; లోకంబులన్= లోకాలలో; కల ఒప్పులందున్= ఉన్న అందాలలో; ఎల్లన్= అన్నింటిలో; ఉత్తమ సారంబు= మేలైన స్థిరభాగాలను; తిలప్రమాణంబులు= నూవుగింజలంత కొలత కలవాటిని; ఆహరించి= తెచ్చి; ఒక్క కామినిన్= ఒక కాంతను; కావించి= చేసి; తిలోత్తమ; అను పేరు= అనే పేరు; ఇడి= పెట్టి; నా కడకున్= నా వద్దకు; తెచ్చినన్= తేగా; ఆ+చెలువ= ఆ ఇంతి; నాకున్= నాకు; ప్రదక్షిణంబుగాన్= వలగొనునట్లుగా; వచ్చు+ఎడన్= వచ్చే సమయంలో; నేను; ఇది= ఈమె; దేవకార్యంబు= దేవతలపనిని; చేయన్+ఓపున్= చేయగలదు; పొమ్ము; అను తలంపుతోన్= అనే భావనతో; ఆ+తరుణి= ఆ యువతి; తిరిగిన దిక్కు దిక్కునకున్= తిరిగిన ప్రతి దిక్కునకు; ఒక్క+ఒక్క మొగంబు= ఒక్కొక్క మొగం; తాల్చి= ధరించి; దానిన్= ఆమెను; పరీక్షించితిన్= చూచాను; నాటన్+కోలెన్= ఆ దినం మొదలుగా; చతుర్+ముఖుండను+ఐ= నాలుగు ముఖాలు కలవాడనై; ఉండుదున్= ఉంటున్నాను.

తాత్పర్యం: అంటే విని పరమేశ్వరుడు పార్వతికి ఇట్లా చెప్పాడు. 'సుందుడు', 'ఉపసుందుడు' అనే రక్కసులిరువురు ఉండేవారు. వారి భుజశక్తీ, శౌర్యమూ తిరుగులేనివి. అస్త్రాలకు, శస్త్రాలకు చంపరానివారుగా ఉండేవారు; వారిని చంపటంకొరకు విశ్వకర్మ అన్ని లోకాలలో ఉన్న అంద చందాల నన్నింటినీ నూవుగింజ అంత లెక్కలో తెచ్చి, ఒక కామినిగా చేసి, తిలోత్తమ అని పేరు పెట్టి, నా వద్దకు తెచ్చాడు. ఆమె నా చుట్టు ప్రదక్షిణంగా తిరిగింది. నేనాకాంత దేవకార్యం చేస్తుందిలెమ్ము - అని ఆమె తిరిగిన ప్రతిదిక్కుకు ఒక్కొక్క మొగం పెట్టి చూచాను. ఆనాటినుండి నాలుగు మోములవాడనై ఉన్నాను.'

విశేషం: అస్త్రం అంటే మంత్ర ప్రయోగంగల ఆయుధం. శస్త్రం అంటే సాధారణమైన ఆయుధం. వీర్యం అంటే దేహశక్తి. శౌర్యం మనశ్శక్తి. ప్రదక్షిణం అంటే పూజ్యవ్యక్తులను, వస్తువులను తనకు కుడిచేతివైపుగా ఉంచుకొని తిరిగిరావటం. దీనివలన సర్వస్వరూపభావన కలుగుతుంది. 'కామం కలది, కామం కలిగించేది' అని 'కామిని' శబ్దానికి రెండర్థాలను ఇక్కడ భావించవచ్చును. శివుడు దిక్కు కొక మొగం పెట్టుకొని చూడటం వ్యామోహంతో కాదు. ఆమె సామర్థ్యాన్ని పరీక్షించటంకొరకు.

చ. అన విని గౌరి 'నీకు భువనాధిప! కంఠమునందుఁ గప్పు గ
ల్గిన కత మేమి? నాకు నెఱిఁగింపుము' నావుడు దేవదైత్యు లం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బునిధి సుధార్థమై తరువఁ బుట్టి విషంబు త్రిలోకభీకరం
బనితరసాధ్యమై యొదవె; నత్తఱిఁ దాల్చితి దానిఁ గుత్తుకన్. 426

ప్రతిపదార్థం: అనన్= అనగా; విని; గౌరి= పార్వతి; భువన+అధిప!= సర్వలోక ప్రభూ!; నీకున్= నీకు; కంఠమునందున్= మెడయందు; కప్పు= నలుపు; కల్గిన కతము= కలిగిన కారణం; ఏమి?; నాకున్= నాకు; ఎఱిఁగింపుము= తెలుపుము; నావుడున్= అన్నంతనే; దేవదైత్యులు= దేవతలు, రాక్షసులు; సుధా+అర్థము+ఐ= అమృతంకొరకు; అంబునిధిన్= సముద్రాన్ని; తరువన్= చిలుకగా; విషంబు= విషం; పుట్టి; త్రిలోకభీకరంబు= మూడు లోకాలకు భయం పుట్టించేది; అనితరసాధ్యము+ఐ= ఇతరులకు లొంగనిదై; ఒదవెన్= కలిగింది; ఆ+తఱిన్= ఆ సమయంలో; దానిన్= ఆ విషాన్ని; కుత్తుకన్= కంఠంలో; తాల్చితిన్= పెట్టుకొన్నాను.

తాత్పర్యం: అప్పుడు పార్వతి జగదీశా! నీకు కంఠంలో నలుపెందుకు కలిగింది?' అని అడిగితే శివుడు 'దేవతలు రక్కసులు అమృతం కొరకు సముద్రాన్ని చిలికారు. అప్పుడు ముల్లోకాలకు భయం కలిగిస్తూ ఎవ్వరికీ అణపరానిదై విషం పుట్టింది. నేను దానిని కంఠంలో పెట్టుకొన్నాను.

విశేషం: నిజానికి ఈ విషయం పార్వతికి తెలియనిది కాదు. 'మ్రింగుమనె సర్వమంగళ' అని భాగవతం. ఈ ప్రశ్నలన్నీ అడగటం లోకానుగ్రహంకొరకు మాత్రమే అని మనం గుర్తించాలి.

తే. అట్లు కంఠంబునందు మహావిషంబు । దాల్చి నీలత గల్గిన దానఁ జేసి
కమలజాది సురులు నీలకంఠుఁ డంచు । నన్నుఁ గొనియాడి రప్పుడు నలినవదన!' 427

ప్రతిపదార్థం: నలినవదన!= పద్మంవంటి మోముగల ఓ భవానీ!; అట్లు= ఆ విధంగా; కంఠంబునందున్= గొంతుకలో; మహావిషంబు= ఘోరమైన విషం; తాల్చి= ధరించి; నీలత= నలుపు; కల్గినదానన్+చేసి= కలిగిన కారణంగా; కమలజ+ఆది సురులు= బ్రహ్మ మొదలైన దేవతలు; నీలకంఠుఁడు= నీలకంఠుడు; అంచున్= అంటూ; అప్పుడు= ఆ సమయంలో; నన్నున్= నన్ను; కొనియాడిరి= ప్రశంసించారు.

తాత్పర్యం: పార్వతీ! ఆ విధంగా గొంతుకలో భయంకరమైన విషం ధరించిన కారణంగా నలుపు ఏర్పడింది. బ్రహ్మమొదలైన దేవతలు నీలకంఠుడని నన్ను కొనియాడారు.'

విశేషం: నల్లని మచ్చ నిజానికి ప్రశంసకు పట్టుకాదు. కానీ లోకరక్షణకు గుర్తుగా నిలిచిన కారణంగా ప్రశంస కలిగింది.

వ. అని చెప్పి శంకరుం 'డింక నేమి యడుగవల?' తడుగు మనుటయుఁ 'బినాకం బెల్ల యాయుధంబులకంటె మెచ్చి పట్టుదు దీనికిం గతంబెయ్యది?' యని యడిగిన నా మృడుం డామృడాని కిట్లనియె. 428

ప్రతిపదార్థం: అని; చెప్పి; శంకరుండు= శివుడు; ఇంకన్= ఇంకా; ఏమి= ఏది; అడుగన్+వలతు= అడుగగోరుతున్నావో; (దానిని); అడుగుము; అనుటయున్= అనినంతనే; పినాకంబు= పినాకం అనే ధనుస్సును; ఎల్ల+ఆయుధంబులకంటెన్= ఆయుధాల న్నింటికంటె; మెచ్చి; పట్టుదు= తాల్చుతూ ఉంటావు; దీనికిన్= దీనికి; కతంబు= కారణం; ఏ+అది= ఏది; అని; అడిగినన్= అడిగితే; ఆ మృడుండు= ఆ శివుడు; ఆ మృడానికిన్= ఆ పార్వతికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని చెప్పి శంకరుడు 'ఇంకా ఏమి అడుగగోరావో అడుగుము' అంటే పార్వతి 'నీవు పినాకాన్ని అన్ని ఆయుధాలకంటె ఎక్కువ ఇష్టంతో పట్టుకొని ఉంటావు. దీనికి కారణం ఏమిటి? అని అడిగితే శివుడు భవానికి ఇట్లా అన్నాడు.

సీ. ఆదియుగంబున నబల! కణ్వుం డను । సంయమి తపము నిష్ఠానిరూఢి
మెయిఁ జేయఁ బెరిఁ గె వల్మీకంబు దనువు ము । నుంగ నప్పుట్ట వేణువును బుట్టె
విను లోకసామాన్యఘనత గాకుండ మ । హాద్భుతాయామంబు నధికమైన
పరిణాహమును గల్గె బ్రహ్మ యమ్మునికిఁ బ్ర । త్యక్షమై వరమిచ్చె నతనిమీఁదఁ

ఆ. బెరిఁగియున్న వెదురు గరమర్థిఁ దాఁ బుచ్చి । కొని జగద్ధితంబు గోరి చేసె
నాకు విష్ణునకుఁ బినాకశార్ఙ్గము లగ్ర । ఖండమున నొనర్చె గాండివంబు. 429

ప్రతిపదార్థం: అబల!= ఓ ఇంతీ!; ఆదియుగంబునన్= మొదటి యుగంలో; కణ్వుండు అను సంయమి= కణ్వుడనే గొప్ప నిగ్రహం కల ముని; నిష్ఠానిరూఢి మెయిన్= నిష్ఠ చెదరని స్థితితో; తపము= తనస్సు; చేయన్= చేయగా; తనువు= ఒడలు; మునుంగన్= మునుగునట్లుగా; వల్మీకంబు= పుట్ట; పెరిగెన్= పెరిగింది; ఆ+పుట్టన్= ఆ పుట్టనుండి; వేణువును= వెదురును; పుట్టెన్= పుట్టింది; విను= వినుము; లోకసామాన్యఘనత= లోకంలో సాధారణమైన గొప్పతనం; కాక+ఉండన్= కాకుండా; మహా+అద్భుత+ఆయామంబున్= చాలా ఆశ్చర్యకరమైన పొడవూ; అధికము= ఎక్కువది; ఐన పరిణాహమును= అయిన వెడల్పు; కల్గెన్= కలిగినవి; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; ఆ+మునికిన్= ఆ మునికి; ప్రత్యక్షము+ఐ= సాక్షాత్కరించి; వరము= కోరిన దానిని; ఇచ్చెన్= అనుగ్రహించాడు; అతనిమీఁదన్= అతడిపై; పెరిఁగి+ఉన్న వెదురు= పెరిగి ఉన్న వెదురు; కరము= మిక్కిలి; అర్థిన్= కోరికతో; తాన్= తాను; పుచ్చికొని= తీసికొని; జగత్+హితంబు= లోకాలకు మేలు; కోరి= కాంక్షించి; నాకున్= నాకు; విష్ణునకున్= విష్ణుడికి; పినాక శార్ఙ్గములు= పినాకం అనే వింటినీ, శార్ఙ్గం అనే వింటినీ; అగ్రఖండమునన్= పై ముక్కతో; గాండీవంబున్= గాండీవమనే ధనుస్సునూ; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: మొదటిదైన కృతయుగంలో కణ్వుడు అనే మహర్షి మహానిష్ఠతో తపస్సు చేశాడు. అతడి ఒడలు మునిగిపోయే విధంగా పెద్ద పుట్ట పెరిగింది. దానిమీద ఒక వెదురు కూడా పుట్టింది. ఏదో లోకసాధారణమైన గొప్పదనంతో కాకుండా మహాశ్చర్యం కలిగించే పొడవూ, మిక్కిలి వెడల్పూ దానికి కలిగాయి. బ్రహ్మ ఆ మహర్షికి ప్రత్యక్షమై వరమిచ్చాడు. ఆ వెదురు తాను తీసికొని, లోకాల మేలు కాంక్షించి నాకు పినాకాన్నీ, విష్ణువుకు శార్ఙ్గం అనే వింటినీ, చివరి తునుకతో గాండీవాన్నీ చేశాడు.

వ. ఇవ్విధంబున విండ్లు మూఁడు గావించి లోకహితం బాచరించి యవ్విరించి యమ్మూఁడవ విల్లు దాఁ గైకొని తనలోకంబునకుం జనియె నిది పినాకంబు సంభావనీయంబైన తెఱం' గని చెప్పిన. 430

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; విండ్లు= ధనుస్సులు; మూఁడు= మూడింటిని; కావించి= నిర్మించి; లోకహితంబు= లోకపు మేలు; ఆచరించి= చేసి; ఆ+విరించి= ఆ బ్రహ్మ; ఆ+మూఁడవ విల్లు= ఆ మూడవదైన గాండీవం అనే వింటిని; తాన్= తాను; కైకొని= గ్రహించి; తనలోకంబునకున్= తనదైన సత్యలోకానికి; చనియెన్= వెళ్ళాడు; ఇది; పినాకంబు=పినాకమనే ధనుస్సు; సంభావనీయంబు= మన్ననగొన్నది; ఐన తెఱంగు= అయిన తీరు; అని; చెప్పినన్= చెప్పగా.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా మూడు విండ్లు చేసి లోకాలకు మేలు కావించి, ఆ బ్రహ్మ ఆ మూడవ వింటిని తాను గ్రహించి, తన లోకానికి వెళ్ళాడు. పినాకాన్ని ఎక్కువగా మన్నించటానికి గల కారణం ఇది అని చెప్పగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. విని గిరితనూజ 'పెఱ వా । హనముల నొల్లక వృషంబు నఖిలేశ్వర! నె
మ్మనమునఁ గైకొని యెక్కుదు । వినఁగా నే వలతుఁ జెప్పవే కారణమున్?' 431

ప్రతిపదార్థం: విని= ఆలకించి; గిరితనూజ= కొండబిడ్డ పార్వతి; అఖిల+ఈశ్వర!= సర్వేశ్వరా!; పెఱ వాహనములన్= ఇతరములగు ఎక్కిరింతలను; ఒల్లక= ఇష్టపడక; వృషంబున్= ఎద్దును; నెఱ+మనమునన్= నిండు హృదయంతో; కైకొని= ఆదరించి; ఎక్కుదు(వు)= ఎక్కుతావు; కారణమున్= కారణాన్ని; వినఁగాన్= వినటానికి; ఏన్= నేను; వలతున్= కోరుతున్నాను; చెప్పవే= చెప్పుము.

తాత్పర్యం: అంటే విని పార్వతి 'సర్వేశ్వరా! ఇతరవాహనాలను ఇష్టపడక నిండు మనస్సుతో ఆదరించి ఎద్దును ఎక్కుతూ ఉంటావు. కారణం వినాలనే కోరికతో ఉన్నాను. దయతో చెప్పుము' అన్నది.

వ. అనిన నద్దేవుఁ డమ్మహాదేవి కిట్లనియె. 432

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+దేవుఁడు=ఆ దేవుడు; ఆ+మహాదేవికిన్= ఆ మహాదేవి పార్వతికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా శివుడు పార్వతితో ఇట్లా అన్నాడు.

సీ. హిమవన్నగంబునం దేను లోకహితార్థ । మైన మహాతప మాచరింప
గోవులు చుట్టుఁ దేఁకువ సెడి తిరిగి నన్ । సంకట పెట్టినఁ బంకజాక్షి!
కోపించిచూడ సంతాపాకులత్వంబుఁ । బొందె గోకుల మరవిందభవుఁడు
నమరులుఁ జనుదెంచి ప్రార్థించి వృషముఁ గా । నిక యిచ్చి కరుణ జనింపఁ బలికి

తే. నాకు గోపతి యనియెడు నామ మిచ్చి । రపుడు గోబాధ మాన్చి రయ్యమలవృషము
వాహనముఁ గేతువునుగా శివప్రచార । మాచరింతు నెల్లెడ నది యాది గాఁగ.' 433

ప్రతిపదార్థం: పంకజాక్షి!= తామరవంటి కనులుగల ఓ భవానీ!; హిమవత్+నగంబునందున్= మంచుకొండమీద; ఏను= నేను; లోకహిత+అర్థము= లోకముమేలు ప్రయోజనంగా గలది; ఐన మహా తపము= అయిన గొప్ప తపస్సు; ఆచరింపన్= చేస్తూ ఉండగా; గోవులు= ఆవులు; చుట్టున్= అన్నివైపుల; తేఁకువ+చెడి= భయంపోయి; తిరిగి= సంచరించి; నన్= నన్ను; సంకట పెట్టినన్= కష్టపెట్టితే; కోపించి= కోపం పొంది; చూడన్= చూడగా; గోకులము= ఆవులమంద; సంతాప+ఆకులత్వంబున్= దుఃఖంచేత కలతపడిన తనాన్ని; పొందెన్= పొందినది; అరవిందభవుఁడును= బ్రహ్మయు; అమరులున్= దేవతలు; చనుదెంచి= వచ్చి; ప్రార్థించి= ప్రార్థనచేసి; వృషమున్= ఎద్దును; కానిక= కానుకగా; ఇచ్చి= ఒసగి; కరుణ= దయ; జనింపన్= కలుగునట్లుగా; పలికి= మాటాడి; నాకున్= నాకు; గోపతి; అనియెడు నామము= అనే పేరు; ఇచ్చిరి= ఇచ్చారు; అపుడు= ఆ సమయంలో;

గోబాధ= ఆవుల బాధను; మాన్చిరి= పోగొట్టారు; ఆ+అమలవృషము= దోషంలేని ఆ ఎద్దు; వాహనమున్= వాహనం; కేతువును= ధ్వజమునూ; కాన్= కాగా; అది= ఆ సమయం; ఆది కాఁగన్= మొదలుగా; ఎల్ల+ఎడన్= అన్ని తావులందు; శివ ప్రచారము= మంగళమైన సంచారం; ఆచరింతున్= చేస్తూ ఉంటాను.

తాత్పర్యం: నేను లోకాల మేలుకొరకు మంచుకొండమీద గొప్ప తపస్సు చేస్తూ ఉండగా చుట్టూ ఆవులు చేరి, భయం తీరి తిరుగుతూ నన్ను కష్టపెట్టాయి. అప్పుడు నేను కోపించి చూడగా అవి బాధపడ్డాయి. బ్రహ్మ, దేవతలు వచ్చి నన్ను ప్రార్థించి, దయపుట్టే మాటలు పలికి, నాకొక ఎద్దును కానుకగా ఇచ్చి, 'గోపతి' అనే పేరు పెట్టి గోవుల బాధ తీర్చారు. అది మొదలు నేనా ఎద్దును వాహనంగా, ధ్వజంగా చేసికొని శుభమైన సంచారం అన్ని తావులలో చేస్తూ ఉన్నాను.'

విశేషం: శివుడికి ఏ కోరికాలేదు. మరి తపస్సు ఎందుకంటే లోకం మేలుకొరకే.

వ. అనుటయు నంబిక యప్పరమేశుతో 'నీవు పరమ శుచులును రమణీయంబులు నగు నివాసంబుల వసియింపక యశుచియుఁ గేశాస్థికపాల దుర్గంధదుర్దర్శంబునైన శ్మశానంబున నునికికిఁ గతంబేమి?' యనిన నతం డిట్లనియె. 434

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; అంబిక= పార్వతి; ఆ+పరమ+ఈశుతోన్= ఆ మహేశ్వరుడితో; నీవు; పరమ శుచులును= మిక్కిలి పరిశుభ్రంగా ఉండేవీ; రమణీయంబులును= అందంగా ఉండేవీ; అగు నివాసంబులన్= అయిన నెలవులందు; వసియింపక= ఉండక; అశుచియున్= శుభ్రతలేనిదీ; కేశ= వెండ్రుకలు; అస్థి= ఎముకలు; కపాల= పుర్రెలు; దుర్గంధ= పాడుకంపు అనే వాటితో; దుర్దర్శంబున్= చూడరానిదీ; ఐన శ్మశానంబునన్= అయిన వల్లకాటిలో; ఉనికికిన్= ఉండటానికి; కతంబు= కారణం; ఏమి; అనినన్= అనగా; అతండు= ఆ శివుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అనగా పార్వతి పరమేశ్వరుడితో 'గొప్ప శుచి కలవీ, మనోహరమైనవీ అయిన నెలవులలో ఉండక శుభ్రతలేనిదీ, జుట్టు, ఎముకలు, పుర్రెలు, కంపు అనువాటితో చూడరాని వల్లకాటిలో నీవు ఉండటానికి కారణం ఏమిటి? అని అడిగింది. అప్పుడు శివు డిట్లా అన్నాడు.

శివుఁడు పార్వతికిఁ దనశ్మశానవాసతకుఁ గారణంబు చెప్పుట (సం13-207-1(కుంభ))

ఉ. 'క్రూరపు భూతముల్ జనుల ఘోరవిధంబుల ముట్టి యెప్పుడున్
మారణ మాచరింపఁగ సమస్తజనంబులు నాశ మొందఁగా
వారిజసంభవుం డెఱిఁగి వచ్చి ననుం దగఁ గాంచి తత్ప్రతీ
కారము సేఁతకై వినయగౌరవ మొప్పఁగ వేఁడె; వేఁడినన్. 435

ప్రతిపదార్థం: క్రూరము+భూతముల్= క్రూరమైన ప్రాణులు; జనులన్= జనులను; ఘోరవిధంబులన్= భయంకరమగు తీరులతో; ముట్టి= తాకి; ఎప్పుడున్= ఎల్లవేళలా; మారణము= వధ; ఆచరింపఁగన్= చేయగా; సమస్తజనంబులు= అందరు జనులు; నాశము+ఒందఁగాన్= నాశం పొందగా; వారిజ సంభవుండు= పద్మమునపుట్టిన బ్రహ్మ; ఎఱిఁగి= తెలిసికొని; వచ్చి= ఏతెంచి; ననున్= నన్ను; తగన్= తగు విధంగా; కాంచి= తూచి; తద్+ప్రతీకారము+చేఁతకున్+ఐ= దానికి ప్రతిక్రియచేయటం కొరకు; వినయగౌరవము= వినయంతో కూడిన గౌరవము; ఒప్పఁగన్= ఒప్పగా; వేఁడెన్= ప్రార్థించాడు; వేఁడినన్= ప్రార్థించగా.

తాత్పర్యం: క్రూరభూతాలు జనులను ఘోరంగా తాకి, వధ చేశాయి. సమస్తజనాలు నశిస్తున్నారు. బ్రహ్మ అది తెలిసికొని నా కడకు వచ్చి, నన్ను తగు విధంగా చూచి, దానికి మారుచేత చేయవలసిందిగా నన్ను వేడుకొన్నాడు. అట్లా ప్రార్థిస్తే. (తరువాతి వచనంతో అన్వయం).

విశేషం: తగన్ - సముచితమర్యాదతో, అభివాదనం మొదలైన పనులుచేసి అని భావం.

వ. నిశ్చితంబుగా నొక్కెడనుండి లోకంబులు రక్షింపవలయు నని తలంచితి నట్టియెడ. 436

ప్రతిపదార్థం: నిశ్చితంబుగాన్= నిర్ణయింపబడినదిగా; ఒక్క+ఎడన్= ఒక్కచోట; ఉండి= నిలిచి; లోకంబులు= లోకాలను; రక్షింపవలయున్= కాపాడాలి; అని; తలంచితిన్= తలపోశాను; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: నిర్ణయించుకొనిన ఒక ప్రదేశంలో ఉండి లోకాలను కాపాడాలని భావించాను. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. మోక్షపరులు శుచిస్థానముగఁ బ్రశంస । సేయుదురు విజనత్వవిశేష మెఱిఁగి
కాన యింపై శ్మశానంబు మానసమున । నొలసెఁ గావున నయ్యెడ నునికి గలిగె. 437

ప్రతిపదార్థం: మోక్షపరులు= మోక్షమునందు ఆసక్తికలవారు; శుచిస్థానముగన్= పవిత్రమైన స్థానంగా; విజనత్వ విశేషము= జనాలు లేని ప్రత్యేకస్థితిని; ఎఱిఁగి= తెలిసికొని; ప్రశంస+చేయుదురు= గొప్పగా చెప్తుతారు; కాన= కనుకనే; ఇంపు+ఐ= ఇష్టమైనదై; శ్మశానంబు= వల్లకాడు; మానసమునన్= మనస్సులో; ఒలసెన్= మెదలినది; కావునన్= కనుక; ఆ+ఎడన్= ఆ తావున; ఉనికి= ఉండటం; కలిగెన్= కలిగింది.

తాత్పర్యం: మోక్ష మందు ఆసక్తికలవారు జనాలులేని కారణంగా పవిత్రస్థానం అని శ్మశానాన్ని పొగడుతారు. కనుక నాకు వల్లకాటిమీద మనస్సు కలిగింది. అక్కడ ఉండటం అందువలన కలిగింది.

విశేషం: కేశాదులు శుచిత్వానికి భంగాలు కావు. జనసంచారంవలననే దుష్టభావాలు వ్యాపించి, శుచిత్వం నశిస్తుంది. వస్తుశౌచం కాదు. భావశౌచం ముఖ్యం అని ఈ పద్యం ప్రతిపాదిస్తున్నది.

చ. అచటన యుండి లోకముల నన్నిటి నాత్మఁ దలంచి రక్ష సే
యుచు విహరింతు, భూతచయ మొక్కటఁ గూడి చరించుచున్కికిం
బ్రచురకుతూహలుండ నయి రాగముఁ బొందుదు నట్లుగాన నా
కచటు నివాసమయ్యె విను మన్యతలంబులు దానిఁ బోలునే?' 438

ప్రతిపదార్థం: అచటన్+అ= అక్కడనే; ఉండి= నెలకొని; లోకములన్= లోకాలను; అన్నిటిన్= అన్నింటినీ; ఆత్మన్= ఆత్మలో; తలంచి= భావించి; రక్ష= రక్షణ; చేయుచున్= చేస్తూ; విహరింతున్= తిరుగుతూ ఉంటాను; భూతచయము= ప్రాణుల సముదాయం; ఒక్కటన్= ఒక్కచోట; కూడి= కలిసి; చరించుచున్+ఉన్కికిన్= తిరుగుతూ ఉండటానికి; ప్రచుర కుతూహలుండను= మిక్కిలి వేడుక కలవాడను; అయి; రాగమున్= ప్రీతిని; పొందుదున్= పొందుతూ ఉంటాను; అట్లు+కానన్= అట్లు కనుక; నాకున్= నాకు; అచటు= ఆ తావు; నివాసము=ఉండే నెలవు; అయ్యెన్= అయినది; వినుము; అన్యతలంబులు= వేరుచోట్లు; దానిన్= ఆ శ్మశానాన్ని; పోలునే= పోలునా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అక్కడనే ఉండి లోకాలను మనస్సులో భావించి, రక్షణ చేస్తూ ఉంటాను. సర్వభూతాలు ఒక్కచోట ఉండి కలిసి తిరుగుతూ ఉంటాయి కనుక మిక్కిలి వేడుకతో ప్రీతి పొందుతూ ఉంటాను. కనుక నా కది నివాసమైనది. పెరతావులు దానిని పోలవు గదా!'

విశేషం: సర్వప్రాణులూ మరణం తరువాత ఉచ్చనీచ భేదాలు లేకుండా తిరగేతావు కనుక శ్మశానం శివుడికి ప్రీతిపాత్రమైనదని భావం.

తే. అనిన భసితాంగరాగంబు నస్థి ఫణధ । రాభరణములుఁ బరశుశూలాయుధములు
నై మహోగ్రతభీకరమైన రూప । మభవ! యేల కైకొంటి వీ?' వనియె గిరిజ. 439

ప్రతిపదార్థం: అనినన్= అని శివుడు చెప్పగా; గిరిజ= పార్వతి; అభవ!= శివా!; భసిత+అంగరాగంబు= బూడిద అనే మైపూతా; అస్థి ఫణధర+ఆభరణములు= ఎముకలు, పాములు అనే ఆభరణాలూ; పరశు శూల+ఆయుధములు= గండ్రగొడ్డలి, శూలము అనే ఆయుధాలున్నూ; ఐ= అయి; మహా+ఉగ్రతన్= మిక్కిలి తీవ్రతగల; భీకరము= వెరపు పుట్టించేది; ఐన రూపము= అయిన రూపాన్ని; ఈవు= నీవు; ఏల?= ఎందుకు?; కైకొంటివి= గ్రహించావు?; అనియెన్= అన్నది.

తాత్పర్యం: అని శివుడు పలుకగా పార్వతి 'బూదిపూత, ఎముకల, పాముల ఆభరణాలు, గొడ్డలి, శూలం అనే ఆయుధాలు అనేవాటితో మిక్కిలి తీవ్రతగల భయంకరమైనరూపం ఎందుకు ధరించావు? అని అడిగింది.

విశేషం: అభవుఁడు - పుట్టుకలేనివాడు అంటే తక్కిన వికారాలు కూడా లేనివాడని భావం.

వ. అనుటయు నమ్మహేశ్వరుం డాపరమేశ్వరితోడ. 440

ప్రతిపదార్థం: అనుటయున్= అని పలుకగా; ఆ+మహా+ఈశ్వరుండు= ఈ పరమేశ్వరుడు; ఆ పరమ+ఈశ్వరితోడన్= లోకాలన్నీ ఏలే ఆ పార్వతితో.

తాత్పర్యం: అప్పుడు శివుడు పార్వతితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఈ ఘట్టంలో పార్వతికి 'పరమేశ్వరి' వంటి పేర్లు వాడటంలో ఒక రహస్యం ఉన్నది. ఆమె ప్రశ్నలన్నీ స్వజ్ఞానం కొరకు కాదు. లోకాలకు తెలిపే మార్గం మాత్రమే ఇది. ఇది గుర్తించవలసిన విషయం.

సీ. 'లోకస్వరూపంబు లోలాక్షి! రెండు వి । ధమ్ములు శీత ముష్ణమ్ము నాఁగఁ
జనునివి రెంటను సకలంబు గ్రథితమై । యుండు సౌమ్యాగ్నేయయోగకలిత
మఖిలజగంబు సౌమ్యము విష్ణుఁ డాగ్నేయ । మేను వహింతు మియ్యిరుదెఱంగు
లెనయుటఁ గొని భరియింతు నీ విశ్వంబుఁ । గావున నాగ్నేయ భావరూఢ

తే. యైన యాకృతి లోకహితార్థముగ వ । హించినాఁడ నింకెయ్యది యీవు నన్ను
నడిగె దడుగుము' నావుడు నార్య 'సోముఁ । దలఁ బ్రియంబున నేటికిఁ దాల్చి? తనియె. 441

ప్రతిపదార్థం: లోల+అక్షి!= విలాసపు చూపులు కల ఓ కాంతా!; లోక స్వరూపంబు= లోకం తీరు; రెండు విధమ్ములు= రెండు రకాలు; శీతము= చల్లనిది; ఉష్ణము= వేడిది; నాఁగన్= అనగా; చను+ఇవి= సాగే ఇవి; రెంటన్= రెంటియందు; సకలంబు= అంతా; గ్రథితము= కూర్చబడినది; ఐ= అయి; ఉండున్= ఉంటుంది; అఖిలజగంబు= సమస్త లోకమూ; సౌమ్య+ఆగ్నేయ యోగ కలితము= చంద్రుడి భావం; అగ్నిభావం అనే వాటి కలయికతో కూడినది; సౌమ్యము= సోమలక్షణం గలదానిని; విష్ణుఁడు= విష్ణువు; ఆగ్నేయము= అగ్ని సంబంధం అయిన దానిని; ఏను= నేను; వహింతుము= పట్టుకొని ఉంటాము; ఆ+ఇరు తెఱంగులు= ఆ రెండు తీరులు; ఎనయుటన్= కలిసి ఉండటాన్ని; కొని= గ్రహించి; ఈ విశ్వంబున్= ఈ సమస్త లోకాల సముదాయాన్ని; భరియింతున్= భరిస్తూ ఉంటాను; కావునన్= కనుక; ఆగ్నేయ భావ రూఢ= అగ్ని సంబంధంగల భావంతో గట్టిగా నిలిచి ఉన్నది; ఐన+ఆకృతి= అయిన ఆకారాన్ని; లోకహిత+అర్థముగన్= లోకం మేలు ప్రయోజనంగా; వహించినాఁడన్=భరించాను; ఈవు=నీవు; ఇంకన్= ఇంకా; ఏ+అది= ఏది; నన్నున్= నన్ను; అడిగెదు= అడుగుతావో; అడుగుము; నావుడున్= అని పలుకగా; ఆర్య= పార్వతి; సోమున్= చంద్రుడిని; తలన్= తలమీద; ప్రియంబునన్= ఇష్టంతో; ఏటికిన్= ఎందుకు; తాల్చితి?= పెట్టుకొన్నావు?; అనియెన్= అన్నది.

తాత్పర్యం: 'వనితా! లోకస్వరూపం రెండు రకాలు. చల్లదనం, వెచ్చదనం అనే ఈ రెండు విధాలతో సకలమూ కూర్చబడి ఉంటుంది. ఈ జగత్తంతా సౌమ్యము, ఆగ్నేయము అనే రెంటి కలయికతో కూడి ఉన్నది. సౌమ్యమైన దానిని విష్ణువూ, ఆగ్నేయమైన దానిని నేను భరిస్తూ ఉంటాము. ఆ రెంటినీ కలిపి ఈ విశ్వాన్ని నేను వహిస్తూ ఉంటాను. కనుక అగ్నిసంబంధమైనభావంలో పాతుకొనిపోయిన ఆకారం లోకంమేలుకొరకు తాల్చాను. ఇంకా ఏమి అడగాలో అడుగుము.' అంటే పార్వతి 'నీవు చంద్రుడిని ప్రేమతో తలపై ధరించటానికి కారణం ఏమిటి? అని అడిగింది.

విశేషం: సౌమ్యం - సోముడితనం, చల్లదనం, ఆహ్లాదకత మొదలైనవి. ఆగ్నేయం - అగ్ని సంబంధమైనది. వెచ్చదనం, భీకరత్వం మొదలైనది. ఇక్కడ ఇద్దరిని చెప్పినా నిజానికి తత్త్వం ఒక్కటే. సౌమ్యం ఉన్నచోటు విష్ణువనీ, ఆగ్నేయం ఉన్నచోటు శివుడనీ వ్యవహార భేదమే కానీ వస్తుభేదం లేదని గుర్తించాలి. దానికి "అయ్యిరు తెఱంగు లెనయుటఁ గొని భరియింతు నీ విశ్వంబు'' అనే వాక్యం ప్రమాణం.

చ. **అనవుడు దక్షుయజ్ఞమున కల్గిననాఁడు సురాలి కేను బీ**
డన మొనరించుచోట వికటంబుగ సోముని మేను ద్రొక్కఁగా
నను శరణంబు వేఁడిన మనంబున నక్కటికంబు పుట్టి చే
సిన దురితంబు సోమునిట సేయకపోదని మౌళిఁ దాల్చితిన్.' **442**

ప్రతిపదార్థం: అనవుడున్= అనగా; దక్షుయజ్ఞమునకున్= దక్షుడు చేసిన యజ్ఞానికి; అల్గిననాఁడు= కోపగించినప్పుడు; సుర+ఆలికిన్= దేవతల గుంపునకు; ఏను= నేను; పీడనము= బాధ; ఒనరించుచోటన్= చేసే తావున; సోమునిమేను= చంద్రుడి దేహాన్ని; వికటంబుగన్= అడ్డదిడ్డంగా; త్రొక్కగాన్= త్రొక్కివేయగా; ననున్= నన్ను; శరణంబు= రక్షణ; వేఁడినన్= ప్రార్థించగా; మనంబునన్= హృదయంలో; అక్కటికంబు= జాలి; పుట్టి= కలిగి; చేసిన దురితంబు= చేసిన కీడు; సోమున్= చంద్రుడిని; ఇటు= ఈ విధంగా; చేయక= చేయకుండా; పోదు= నశించదు; అని; మౌళిన్= తలమీద; తాల్చితిన్=ధరించాను.

తాత్పర్యం: పార్వతి అట్లా అడుగగా శివుడు చెప్తున్నాడు. 'దక్షయజ్ఞంలో నేను కోపగించినపుడు దేవతల నందరినీ హింసించాను. ఆ సందర్భంలో చంద్రుడి దేహాన్ని అడ్డదిడ్డంగా త్రొక్కివేశాను. అతడు నన్ను శరణు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కోరాడు. మనస్సులో జాలి కలిగి చంద్రుడికి చేసిన కీడు ఇట్లా చేస్తే కానీ పోదని భావించి తలపై ధరించాను.'

చ. అన విని కొల్చి యున్న మునులందఱు నీశుదయావిశేషము
న్మనముల మెచ్చి పొంగి యభినందనపూర్వము గాఁగ భక్తియున్
వినయము నుల్లసిల్లఁ బదివేల విధంబులఁ బ్రస్తుతించి ర
య్యనుపమధాము గౌరి సమయం బిది నా కని మోడ్పుఁ గేలితోన్. 443

ప్రతిపదార్థం: అనన్= అని చెప్పగా; విని= ఆలకించి; కొల్చి ఉన్న మునులు= సేవించి ఉన్న మునులు; అందఱున్= అందరూ; ఈశు దయా విశేషమున్= ఈశ్వరుడి దయయందలి మహిమను; మనములన్= హృదయాలలో, మెచ్చి= గొప్పగా భావించి; పొంగి= ఆనందపు ఉబ్బు పొంది; అభినందనపూర్వము గాఁగన్= మంచిమాటలు ముందు ఉండునట్లుగా; భక్తియున్= భక్తీ; వినయమున్= అణకువా; ఉల్లసిల్లన్= ప్రకాశిస్తూ ఉండగా; పదివేల విధంబులన్= పదివేల తీరులతో; ప్రస్తుతించిరి= కొనియాడారు; గౌరి= పార్వతి; ఆ+అనుపమధామున్= సాటిలేని నెలవుగల ఆ శివుడిని; ఇది; నాకున్= నాకు; సమయము= తగువేళ; అని; మోడ్పు+ కేలితోన్= మోడ్చిన చేతితో.

తాత్పర్యం: ఇట్లా చెప్పగా విని మునులందరూ ఈశ్వరుడి దయను, దొడ్డతనాన్ని హృదయాలలో మెచ్చుకొని పొంగి మంచిమాటలతో, భక్తివినయాలతో, పదివేల పద్ధతులతో ప్రశంస చేశారు. గౌరి శివుడితో 'ఇది నాకు సమయం' అని చేతులు జోడించి (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇది ఘట్టానికి ఉపసంహారవాక్యం. శివుడి పనులన్నీ పరమదయకు ప్రతీకాలే. అందులో అపకారం చేసిన చంద్రుడిని రక్షణ కోరినంతమాత్రాన నెత్తిన పెట్టుకొనటం దయకు పరాకాష్ఠ. దీనినే మునులు సంభావించారు.

తే. లోలలోచన దీప్తులు బాలచంద్ర । భూషణుని వదనంబునఁ బొలయ మునుల
మానసంబులు సంప్రీతి నూన సాంత్వ । నస్వరంబుగ నిట్లను నలిననాభ! 444

ప్రతిపదార్థం: నలిననాభ!= పద్మము బొడ్డునందుగల దేవా!; లోలలోచన దీప్తులు= విలాసంగా కదలాడే కన్నుల కాంతులు; బాలచంద్ర భూషణుని వదనంబునన్= శివుడి ముఖాన; పొలయన్= వ్యాపించగా; మునుల మానసంబులు= మునుల హృదయాలు; సంప్రీతిన్= నిండైన తృప్తిని; ఊనన్= తాల్పగా; సాంత్వన స్వరంబునన్= మెత్తని కంఠనాదంతో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నది.

తాత్పర్యం: కృష్ణా! విలాసంగా కదిలే కన్నుల కాంతులు శివుడి ముఖంమీద తిరుగుతుండగా; మునుల హృదయాలు నిండు తృప్తిని తాల్పగా మెత్తని స్వరంతో ఇట్లా అన్నది.

విశేషం: ఇక్కడ కవి పూర్వ సంభావితార్థాన్ని కొంత స్పష్టం చేస్తున్నారు. "మునుల మానసంబులు సంప్రీతిమానన్" అంటే ఉమ ప్రశ్నలు వారి సంతృప్తి కొరకే అని భావం.

క. 'వర్ణాశ్రమ ధర్మము లభి । వర్ణింపుము వేదనిరతవత్సల! యవి నా
కర్ణములతో నఖిలజన । కర్ణంబులఁ బొంది పుణ్యకర్తృత యొసఁగున్.' 445

ప్రతిపదార్థం: వేదనిరతవత్సల!= వేదములయందు చెడని పుత్రప్రేమగల ఓ శంకరా!; వర్ణ+ఆశ్రమ ధర్మములు= వర్ణములు, ఆశ్రమములు అనేవాటి ధర్మాలు; అభివర్ణింపుము= చక్కగా తెలుపుము; అవి; నా కర్ణములతోన్= నా చెవులతో పాటు; అఖిల జనకర్ణంబులన్= జనులందరి చెవులను; పొంది= చేరి; పుణ్యాకర్తృత= పుణ్యానికి కర్తలయ్యే స్థితిని; ఒసఁగున్= ఇస్తాయి.

తాత్పర్యం: శివా! వర్ణముల, ఆశ్రమముల ధర్మాలను చక్కగా తెలియజెప్పుము. అవి నా చెవులతోపాటు మానవులందరి చెవులలో ప్రవేశించి వారికి పుణ్యం చేసిన తనాన్ని ఇస్తాయి.'

విశేషం: వర్ణములు - బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రజాతులు; ఆశ్రమాలు - బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసములు.

వ. అనియెననియిట్లు గౌరి లోక హితార్థంబుగా వర్ణాశ్రమధర్మంబులు పరమేశ్వరు నడుగుటయు నారదముని
కృష్ణునకుం జెప్పిన తెఱంగు భీష్ముండు ధర్మజునకుం జెప్పుట యుపన్యసించిన నాకర్ణించి. 446

ప్రతిపదార్థం: అనియెన్= అని పలికినది; అని; ఇట్లు= ఈ విధంగా; గౌరి= పార్వతి; లోకహిత+అర్థంబుగాన్= లోకం మేలుకొరకని; వర్ణ+ఆశ్రమ ధర్మంబులు= వర్ణాలు, ఆశ్రమాలు అనేవాటి ధర్మాలను; పరమేశ్వరున్=శివుడిని; అడుగుటయున్= అడగటాన్ని; నారదముని= నారదమహర్షి; కృష్ణునకున్=కృష్ణుడికి; చెప్పిన తెఱంగు= చెప్పినతీరు; భీష్ముండు= భీష్ముడు; ధర్మజునకున్= ధర్మరాజునకు; చెప్పుట= చెప్పటం; ఉపన్యసించినన్= తెలుపగా; ఆకర్ణించి= విని.

తాత్పర్యం: అని పలికింది. అని ఈ విధంగా పార్వతి లోకం మేలుకొరకు వర్ణాశ్రమ ధర్మాలను పరమేశ్వరుడిని అడగటాన్ని నారదమహర్షి కృష్ణుడికి చెప్పినతీరు భీష్ముడు ధర్మరాజునకు వివరించటాన్ని చక్కగా తెలిపితే విని. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఇక్కడ తెలిపినవాడు వైశంపాయనుడు. విన్నవాడు జనమేజయుడు. ఇక్కడ వక్తృశ్రోతల జంటలు నాలుగు ఉన్నాయి.

వైశంపాయనుడు	-	జనమేజయుడు;
భీష్ముడు	-	ధర్మరాజు;
నారదుడు	-	కృష్ణుడు;
శివుడు	-	పార్వతి.

పార్వతికి చెప్పినాడని నారదుడు కృష్ణుడికి తెలిపిన విషయాన్ని భీష్ముడు ధర్మరాజునకు వివరించాడని వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పాడు. నిజానికి మరొక జంట కూడా ఉన్నది. సూతుడు - శౌనకాది మునులు. ఇది సమన్వయం.

క. మునివర! నాదగు చిత్తం । బునఁ గౌతూహలము చాల మొలతెంచి తలి
ర్చున నెలరారెడు నేర్పడ । వినిపింపుము మీది కథ సవిస్తారముగన్. 447

ప్రతిపదార్థం: మునివర!= ఓ వైశంపాయనా!; నాది+అగు= నాయొక్క; చిత్తంబునన్= హృదయంలో; కౌతూహలము= వేడుక; చాలన్= ఎక్కువగా; మొలతెంచి= పుట్టి; తలిర్చునన్= చిగురు తొడగటంతో; ఎలరారెడున్= వికాసం పొందుతున్నది. మీఁది కథ= తరువాతి వృత్తాంతం; సవిస్తారముగన్= పెంపొందించిన రూపం కలుగునట్లుగా; ఏర్పడన్= తెలిసేవిధంగా; వినిపింపుము= వినిపించుము.

తాత్పర్యం: మునివరా! నా హృదయంలో వేడుక మొలకెత్తి చిగురుతొడిగి పెంపుతో ఉన్నది. తరువాతి కథ విస్తారంగా తెలిసేవిధంగా వినిపించుము.

వ. అని యడుగుటయు. 448

తాత్పర్యం: అని అడుగగా.

ఆశ్వాసాంతము

మ. స్ఫుటతత్త్వోదయ సంభృతైకమధురా! భూతైకరక్షాధురా!
తటినీ పింఛమనోజ్ఞమౌళిలలితా! దాంతాత్మసంకీలతా!
త్రుటితాపత్త్వ సమున్నతాశ్రితజనా! దూరాంజనా! సువ్రతో
త్కటశీలావనలోల! దివ్యహృదయా! ధర్మప్రసన్నోదయా! 449

ప్రతిపదార్థం: స్ఫుట= స్పష్టంగా తెలిసిన; తత్త్వ= జ్ఞానం యొక్క; ఉదయ= పుట్టుకచేత; సంభృత= చక్కగా పొందబడిన; ఏక= ఒకటే అయిన; మధురా!= ఆనందపు తీపి కలవాడా!; భూత+ఏక రక్షాధురా!= ప్రాణులను కేవలభావంతో రక్షించే బరువు కలవాడా!; తటినీ= నది; పింఛ= నెమలిపురి అనే వాటితో; మనోజ్ఞ= సుందరమైన; మౌళి= శిరస్సుతో; లలితా!= సుకుమారమైనవాడా!; దాంత+ఆత్మ సంకీలతా!; ఇంద్రియ నిగ్రహంగల హృదయంగలవారిచేత కూర్పబడేవాడా!; త్రుటిత+ఆపత్త్వ సమున్నత+ ఆశ్రితజనా!= తొలగించబడిన, విపత్తులు గల్గి యుండటంచేత, గొప్పవారైన, ఆశ్రయించినజనులు గలవాడా! దూర+అంజనా!= దూరమైన అంటు (లంపటం) కలవాడా!; సువ్రత+ఉత్కటశీల+అవనలోల!= మంచి ఆచారాలతో కూడిన గొప్ప స్వభావంగలవారిని రక్షించటంలో ఆసక్తిగల దివ్యమైన హృదయం కలవాడా!; ధర్మప్రసన్న+ఉదయా!= ధర్మంచేత ప్రసన్నమయ్యే హృదయం కలవాడా!

తాత్పర్యం: స్వామీ! హరిహరనాథా! నీవు స్పష్టంగా తెలిసిన జ్ఞానంచేత బాగా నిండిన ఆనందం కలవాడవు, ప్రాణులను రక్షించే కేవలభావం కలవాడవు. గంగానది, నెమలిపింఛం అనేవాటితో సుందరమైన శిరస్సుతో సుకుమారమైనవాడవు. యోగులు అనుసంధించుకొనే దైవానివి. ఆపదలు తొలగి ఉదాత్తులయిన ఆశ్రితజనాలు కలవాడవు. సంసారాదుల లంపటాలు ఏమీ లేనివాడవు. చక్కని ఆచారనిష్ఠగల స్వభావం కలవారిని రక్షించటానికై వెంపరలాడే దివ్యహృదయం కలవాడవు. మనుష్యుల ధర్మాచరణంచేత ప్రసన్నమయ్యే హృదయం కలవాడవు.

విశేషం: 'తటినీ పింఛ' అనే చోటమాత్రమే హరుడు, హరి కానవస్తారు. తక్కిన సంబోధనలన్నీ ఉభయ సాధారణాలు.

భగవదానందం చక్కగా తెలిసినవారికి మాత్రమే కలుగుతుందని మొదటి సంబోధన తాత్పర్యం.

దాంతాత్ములంటే యోగులు. వారు ఎడతెగకుండా ధ్యానంలో పరమాత్మను అనుసంధించుకొంటూ ఉంటారు.

జన్మము, జర మొదలైన భయంకరమైన ఆపదలు తునుకలుగా చీలిపోయినపుడు వారు 'సమున్నతులు' - మిక్కిలి ఎత్తైనవారు. అంటే పరమాత్మస్వరూపులే అవుతారు. ఆ విధంగా ఆశ్రితులను చేసేవాడు స్వామి అని 'త్రుటిత' - ఇత్యాది సంబోధన తాత్పర్యం.

మానవుడు ధర్మం ఆచరిస్తే పరమాత్మ హృదయం ప్రసన్నమవుతుంది. కనుక ధర్మాచరణమే మానవకర్తవ్యం అనే బోధ చివరి సంబోధనలో తెలియవస్తుంది.

క. దేహాభిమాన సంభృత । మోహతమోనిరసనాభిముఖ! భూరివివే

కాహీన మహాసత్త్వ స । మాహిత చిన్మాత్రరూప! మధురిమ సుభగా! 450

ప్రతిపదార్థం: దేహ=శరీరమునందు; అభిమాన= నేను అనే అభిమానంతో; సంభృత= నిండిన; మోహ= అజ్ఞానం అనే; తమః = చీకటిని; నిరసన= పారద్రోలుటయందు; అభిముఖ!= అనుకూలత కలవాడా!; భూరి= గొప్ప; వివేక= జ్ఞానంతో కూడిన; అహీన= తక్కువతనంలేని; మహాసత్త్వ= గొప్ప సత్త్వగుణం కలవారియందు; సమాహిత= చక్కగా ఉంచబడిన; చిత్+మాత్ర రూప!= జ్ఞానం మాత్రమే అయిన రూపంగలవాడా!; మధురిమ సుభగా!= ఆనందమనే మాధుర్యంతో సుందరమైనవాడా!

తాత్పర్యం: స్వామీ! 'దేహమే నేను' అనే భావమే అజ్ఞానం. దానితో నిండి మోహమనే చీకటిని త్రోసివేయటంలో నీవు అనుకూలుడవు. గొప్ప జ్ఞానం కలిగిన మహానుభావులలో నెలకొని ఉన్న జ్ఞానాకారుడవు. ఆనందంతో సుందరుడవు.

విశేషం: 'దేహాభిమానం' అనగా 'నశించే దేహమే నేను' అనే భావన. దీనితో నిండిపోయి ఉంటుంది అజ్ఞానం. అది భయంకరమైన కారుచీకటివంటిది. అందులోపడి దిక్కుతోచనివారు భక్త్యాదులచేత సేవిస్తే, పరమాత్మ దానిని రూపుమాపటానికి సిద్ధంగా ఉంటాడు.

అజ్ఞానం నశించి తరువాత జ్ఞానాన్ని సాధించాలి. అది ఏదో కొంచెం పాటిదైతే లాభంలేదు. భూరివివేకం కావాలి. అది కలవారు "మహాసత్త్వులు'' అవుతారు. ఇందులో రెండర్థాలు భావించవచ్చును. గొప్ప సత్త్వగుణం కలవారు. గొప్ప గుండెబలం కలవారు అని ఆ రెండర్థాలు. గొప్ప సత్త్వమంటే శుద్ధతత్త్వం. గొప్ప హృదయబలం అంటే జగత్తును త్రోసివేయగల పరమాత్మను పట్టుకొనగల ధీమా! అది కలవారి హృదయంలో జ్ఞానైకస్వరూపంతో భగవంతుడు ఉంటాడు.

అజ్ఞానాన్ని రూపుమాపి, జ్ఞానాన్ని హృదయంలో పదిలపరచుకొంటే లభించే ఫలం పరమానందం. అది పరమాత్మ స్వరూపమే. దానితో అతడు సుందరుడు. ఇందులో ఈ విధంగా పరమాత్మ ధర్మాలు అయిన సత్, చిత్, ఆనందస్వరూపాలు మూడు రూపుదిద్దుకొన్నాయి.

మాలిని :

త్వరిత విహిత గాఢధ్యాయి సంమోదవాదా!

స్ఫురదరి దృఢశూల స్ఫూర్తి సంశస్తహస్తా!

తరణి శశిమయత్వోదారతా చిత్రనేత్రా!

పరమ నియతనిష్ఠాభవ్యహృత్పద్మసద్మా! 451

ప్రతిపదార్థం: త్వరిత= తొందరగా; విహిత= చేయబడిన; గాఢ= తీవ్రమైన; ధ్యాయి=ధ్యానంగలవారి; సంమోద=ఆనందంతో కూడిన; వాదా!=పలుకులు కలవాడా!; స్ఫురత్= తళతళలాడుచున్న; అరి=చక్రము; దృఢ= గట్టిదైన; శూల= శూలము అనే వాటి; స్ఫూర్తి= కదలికచేత; సంశస్త= మిక్కిలి కొనియాడదగిన; హస్తా!= చేతులు కలవాడా!; తరణి శశిమయత్వ= సూర్యచంద్ర

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

భావాల; ఉదారతా= గొప్పతనంతో; చిత్రనేత్రా!= విచిత్రములైన కనులు కలవాడా!; పరమ= మిక్కిలి శ్రేష్ఠమైన; నియత= పట్టుతప్పని; నిష్ఠా= నిష్ఠచేత; భవ్య= మిక్కిలి గొప్పదైన; హృత్+పద్మ సద్మా!= హృదయమనే పద్మం స్థానం అయినవాడా!

తాత్పర్యం: హరిహరదేవా! నీవు తొందరతో కూడి చేసిన తీవ్రధ్యానం కలవారి ఆనందవాక్కులే స్వరూపంగా కలవాడవు. తళతళళాడే చక్రమూ, గట్టిదైన త్రిశూలమూ అనే వాటి కదలికలతో ప్రశస్తమైన చేతులు కలవాడవు. సూర్యచంద్ర రూపాలయిన మహోదాత్త చిత్రనేత్రాలు కలవాడవు. మహానిష్ఠచేత భవ్యమైన హృదయపద్మం స్థానం అయినవాడవు.

విశేషం: పరమాత్మదర్శనం చేసినవారు సామగానాలు చేస్తూ పారవశ్యంతో ఉంటారని వేదం (తైత్తిరీయ ఉపనిషత్తు) వివరించింది. చక్రం విష్ణువుచేతిలో, శూలం శివుడిచేతిలో ఉండటం ప్రసిద్ధమే. ఏకత్వం కొరకు'చక్రమనే శూలం' వంటి అర్థాన్ని భావించవచ్చును. సూర్యుడు, చంద్రుడు కన్నులవటం ఉభయ సాధారణం. పట్టుతప్పని నిష్ఠగల భవ్యుల హృదయాలే పరమాత్మ గోచరించే తావులు. కనుక అటువంటి హృదయం సాధించండని కవి వ్యంగ్యోపదేశం.

గద్యము :

ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున నానుశాసనిక పర్వంబునందుఁ జతుర్థాశ్వాసము.

తాత్పర్యం: ఇది శ్రీమంతుడు, ఉభయకవిమిత్రుడు, కొమ్మనమంత్రి కుమారుడు, బుధులను సేవించటంచేత ప్రకాశించేవాడు అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలోని ఆనుశాసనికపర్వంలో నాలుగవ ఆశ్వాసం.

ఆనుశాసనికపర్వంలో చతుర్థాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆనుశాసనిక పర్వము - పంచమాశ్వాసము

శ్రీకాళీత్వాదరసు। శ్లోకాలోకన విలాస సుస్థిర భవనా!

శోకముదాద్యవధూతి। వ్యాకోశ వివేక భవన! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీకాళీత్వ = లక్ష్మీ పార్వతీ భావములందలి; ఆదర = మన్ననచే; సుశ్లోక = వాసిగాంచిన; ఆలోకనవిలాస = చూపుల యొక్క సొబగులకు; సుస్థిర భవనా! = శాశ్వత నివాసమైనవాడా!; శోక = దుఃఖం; ముత్+ఆది (ముదాది) సంతోషం మొదలైన జంటల యొక్క; అవధూతి = వినాశంతో, నిర్మూలనంతో; వ్యాకోశ = విస్ఫారిన; వివేక భవన! = విజ్ఞానమునకు నెలవైన వాడా!; హరిహరనాథా! = ఓ హరిహరనాథుడనే పరబ్రహ్మమా!

తాత్పర్యం: హరిహరనాథా! భక్తుల మీద ప్రసరించే నీ కటాక్ష వీక్షణాలు సకలైశ్వర్యాలకూ, సమస్త సన్మంగళాలకూ నిశ్చలాలైన నిలయాలు. సుఖ దుఃఖాదులైన ద్వంద్వాల యొక్క నిర్మూలనం వలన నీవు వికసించిన విజ్ఞానానికి నెలవై ఉన్నావు స్వామీ!

విశేషం: కవిబ్రహ్మ తిక్కన సోమయాజి హరిహరనాథాంకితంగా తాను రచించిన భారత సంహితలోని ప్రతి పర్వ ఆశ్వాసాద్యంత పద్యాలలో భేదం లేని భక్తితో శివకేశవులను స్తుతించాడు. మాకందం వంటి ఈ కందపద్యంలో శ్రీత్వ కాళీత్వములందు ఆదరమేదురములైన దృగ్విలాసాలు కలవాడుగా హరిహరనాథుడిని ఆ మహనీయుడు కీర్తించాడు.

శ్రీత్వ మనగా లక్ష్మీభావం. కాళీత్వ మనగా గౌరీ భావం. భావ మనగా ధర్మం. రమా గౌరీ భావము లేవనగా క్రమంగా సకలైశ్వర్య ప్రదాయకత్వం, సకల సన్మంగళ ప్రదత్వం. ఆ రెంటినీ హరిహరనాథుడు తన దృక్ప్రసారంతో భక్తులకు అనుగ్రహిస్తున్నాడని తాత్పర్యం.

అంతేకాదు. సుఖదుఃఖాది ద్వంద్వ నిరాకృతితో ఆ పరమేశ్వరుడు విస్తరిల్లిన విజ్ఞానమునకు ఉనికిపట్టైన వాడు గనుక ఆశ్రిత వర్గమునకు ముక్తిని ప్రసాదిస్తున్నాడని భావం. ఈ రీతిగా ఆయన భక్తులకు ఇహపరసౌఖ్యవిధాయకుడని చెప్పినట్లైనది.

శివుఁడు పార్వతికి వర్ణాశ్రమాచారంబుల తెఱఁగెఱిఁగించుట. (సం.13-128-28(అను-1-15).

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా! = ఓ హరిహరనాథా!; వైశంపాయనుండు = వేదవ్యాస మహర్షి శిష్యుడైన వైశంపాయనుడనే పేరుగల పౌరాణికుడు; జనమేజయునకున్ = పరీక్షిన్మహారాజపుత్రుడైన జనమేజయ మహారాజునకు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వ్యాసభగవానుడి శిష్యుడైన వైశంపాయనుడనే పౌరాణికుడు పరీక్షిన్మహారాజు కుమారుడైన జనమేజయ మహారాజుతో ఈ విధంగా పలికాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. అట్లు గంగాత్మజుండు ధర్మాత్మజునకుఁ । జెప్పి యిట్లనుఁ 'గౌరవశ్రేష్ఠ! పద్మ
నాభుతో నవ్విధంబున నారదుండు । పార్వతీదేవి ప్రశ్న ముపన్యసించి. 3

ప్రతిపదార్థం: అట్లు = ఆ ప్రకారంగా; గంగా+ఆత్మజుండు = గంగాదేవి తనయుడైన భీష్ముడు; ధర్మ+ఆత్మజునకున్ = యముడి కుమారుడైన యుధిష్ఠిరుడికి; చెప్పి = వచించి; ఇట్లు+అనున్ = ఈ విధంగా అన్నాడు; కౌరవ శ్రేష్ఠ! = కురువంశజులలో ఉత్తముడవైన ధర్మజా!; పద్మనాభుతోన్ = నళినము నాభియందుగల నారాయణుడితో- అనగా శ్రీకృష్ణుడితో; ఆ+విధంబునన్ = ఆ తీరున; నారదుండు = నారద మహర్షి; పార్వతీ దేవి ప్రశ్నము = గౌరీదేవి యొక్క ప్రశ్నను; ఉపన్యసించి = ఉగ్గడించి; (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: ఆ ప్రకారం గంగాపుత్రుడైన భీష్ముడు ధర్మనందనుడితో చెప్పి, ఇంకా ఇట్లన్నాడు. 'కురుకులోత్తమా! ధర్మజా! శ్రీకృష్ణుడితో నారదుడు ఆ విధంగా పార్వతీదేవి శివుడిని ఏమడిగిందో చెప్పి.

వ. ఇట్లనియె నప్పర్వతరాజపుత్రి ప్రార్థించిన నప్పరమేశ్వరుండు పరమాదర భరితుండై. 4

ప్రతిపదార్థం: ఇట్లు+అనియెన్ = ఈ విధంగా అన్నాడు; ఆ+పర్వతరాజపుత్రి = ఆ నగాధిరాజైన హిమవంతుడి కూతురు గిరిజాదేవి; ప్రార్థించినన్ = వర్ణాశ్రమ ధర్మాలు చెప్పుమని మిక్కిలి వేడుకొనగా; ఆ+పరమ+ఈశ్వరుండు = ఆ దేవాధిదేవుడైన శంభుడు; పరమ+ఆదర+భరితుండు+ఐ = గొప్ప గౌరవబుద్ధితో నిండిన వాడై.

తాత్పర్యం: నారదమౌని శ్రీకృష్ణభగవానుడితో ఇట్లా అన్నాడు. 'ఆ విధంగా ఆ శైలరాజతనయ వర్ణాశ్రమధర్మాలు చెప్పుమని తనను మిక్కిలి వేడుకొనగా మహేశ్వరుడు పరమాదరంతో.

సీ. అజుఁడు మున్ లోకహితార్థంబుగా బ్రాహ్మ । ణులను సృజించి రాజులను వైశ్యు
లను శూద్రులను గ్రమం బొనరంగఁ గల్పించె; । నాజాతులకు నోలి నతని ముఖము
బాహులు నూరులుఁ బదములు సంభవ । స్థానంబు లగుటయుఁ, దారతమ్య
భాగిను లగునని పార్వతి కాతండు । తత్తదాచరణీయ ధర్మములును

ఆ. వినుము విస్తరించె; విప్రులు లోకధా । రకులు; వారియెడఁ బరాభవంబు
సేత యెల్ల చేటుఁ జేయు; సమ్మాన దా । నములు సకల శోభనము నొనర్చు. 5

ప్రతిపదార్థం: వినుము = దేవీ! నీవు నన్నడిగిన వర్ణాశ్రమాచార విధ మెట్లాంటిదో వివరిస్తాను ఆలకించుము; అజుఁడు = బ్రహ్మదేవుడు; మున్ = మునుపు; లోక హిత+అర్థంబుగాన్ = జగత్తుకు మేలు చేకూర్చటం కొరకు; బ్రాహ్మణులను = నాల్గు వర్ణాలలో మొదటివర్ణం వారైన విప్రులను; సృజించి = పుట్టించి; రాజులను = క్షత్రియులనే రెండవ వర్ణంవారిని; వైశ్యులను = కోమటులనే మూడవ వర్ణంవారినీ; శూద్రులను = శూద్రులనే చతుర్థజాతివారినీ; క్రమంబు+ఒనరంగన్ = వరుస తప్పకుండ; కల్పించెన్ = ఉద్భవింప జేశాడు; ఆ జాతులకున్ = ఆ బ్రాహ్మణాది వర్ణముల వారికి; ఓలిన్ = క్రమంగా; అతని ముఖము = ఆ పరమేష్ఠి వదనం; బాహులున్ = భుజములు; ఊరులున్ = తొడలు; పదములున్ = చరణాలు; సంభవస్థానంబులు+అగుటయున్ = జన్మ ప్రదేశాలు కావటం వలన; తారతమ్య భాగినులు+అగున్ = ఆ బ్రాహ్మణ ప్రముఖ జాతులు న్యూనాధిక్యములు, ఎక్కువ తక్కువ అనే తేడాలు కలవి అయినాయి; అని = అంటూ; పార్వతికిన్= శైలజకు;

ఆతండు= ఆ చంద్రశేఖరుడు; తత్+తత్= ఆయాజాతుల వారి యొక్క; ఆచరణీయ = ఆచరించదగిన; ధర్మములును = విధులు; విస్తరించెన్ = విపులంగా తెలిపాడు; విప్రులు= భూసురులు; లోక ధారకులు = లోకమును ధరించేవారు, సమాజానికి ఆధారభూతులు; వారి+ఎడన్ = అట్టి భూసురుల విషయమున; పరాభవంబు+చేత = సలిపే అవమానం; ఎల్ల చేటున్+చేయున్ = మిక్కిలి కీడు చేస్తుంది; సమ్మానదానములు = ఆ మహనీయులకు చేసే సత్కారాలు, ఇచ్చే దానాలు; సకల శోభనమున్+ఒనర్చున్ = అన్ని శుభాలను కలిగిస్తాయి.

తాత్పర్యం: అపర్ణా! ఆలకించు. పూర్వం బ్రహ్మదేవుడు లోకానికి మేలు చేయాలని నాల్గు వర్ణాలను సృజించాడు. తొలుత మహీసురులను, తరువాత క్షత్రియులను, పిదప వైశ్యులను, ఆవల శూద్రులను జన్మింప జేశాడు. విధాత ముఖం నుండి విప్రులు, బాహువులనుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదాలనుండి శూద్రులు పుట్టారు. ఈ రీతిగా వారివారి సంభవస్థానాలు బ్రహ్మ యొక్క వేరువేరు శరీర భాగాలు కావడం వల్ల ఆ నాలుగు జాతులవారిలో ఎక్కువ తక్కువ తేడాలు ఏర్పడ్డాయి. అందుచేతనే బ్రాహ్మణాది జాతులవారు ఆచరించవలసిన ధర్మాలలో గూడా వ్యత్యాసాలున్నవి అంటూ హరుడు ఆయాజాతులవారి విధులను హైమవతికి వివరించాడు. గౌరీ! భూసురులు లోకమునకు ఆధారభూతులు. వారిని అవమానిస్తే కీడు మూడుతుంది. వారికి చేసే సత్కారాలు, సలిపే దానాలు సకల శుభాలు సమకూరుస్తాయి.

చ. **ప్రియ మఱి యజ్ఞునేనియు దరిద్రుని నేనియు విప్రుఁ గందఁ జే**
త యుభయలోక సౌఖ్యములు దవ్వుగఁ జేయుఁ; దదీయమైన నిం
దయు నను బెట్టు దిట్టుట, యధర్మత నాతని సొమ్ము పుచ్చి కొం
టయును మదర్థముంగొనుట; డాఁపక చెప్పితి; నిక్క మింతయున్.' **6**

ప్రతిపదార్థం: ప్రియము+అఱి = ప్రేమ నశించి, పగగొని; అజ్ఞున్+ఏనియున్ = ఏమీ తెలియనివాడైనప్పటికినీ; దరిద్రునిన్+ఏనియున్ = పేదవాడైనప్పటికినీ; విప్రున్ = బ్రాహ్మణుడిని; కందన్+చేఁత = బాధించట మనేది; ఉభయలోక సౌఖ్యములు = ఇహపరాలకు సంబంధించిన సుఖాలను; దవ్వగన్+చేయున్ = దూరం చేస్తుంది; తదీయము+ఐన = ఆ విప్రుడికి సంబంధించినట్టి; నిందయున్ = దూషణం కూడ; ననున్ = ఈశ్వరుడనైన నన్ను; బెట్టు = మిక్కిలి; తిట్టుట = నిందించటమే అవుతుంది; అధర్మతన్ = ధర్మ విరుద్ధంగా; ఆతని సొమ్ము = ఆ బ్రాహ్మణుడి ద్రవ్యం; పుచ్చికొంటయును = గ్రహించటం కూడ; మత్+అర్థమున్ = నా ధనమును; కొనుట = స్వీకరించటమే అవుతుంది; డాఁపక = ఈ విషయం రహస్యంగా ఉంచక; చెప్పితిన్ = నీకు తెలిపినాను; ఇంతయున్ = నేను చెప్పినదెల్ల; నిక్కము = నిజం.

తాత్పర్యం: ఉమా! పగవహించి ఏమియు తెలియని వాడైనప్పటికినీ, బీదవాడైనప్పటికినీ బ్రాహ్మణుడిని బాధించరాదు. అతడిని వేధించేవాళ్ళు ఇహపరలోక సౌఖ్యాలకు దూరమై పోతారు. బ్రాహ్మణుడిని దూషించటం నన్ను దూషించటమే సుమా! అన్యాయంగా అతడి సొమ్ము కాజేయడం నా ద్రవ్యాన్ని అపహరించటమే అవుతుంది. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచక నీకు చెప్పినాను. నేను చెప్పినదంతా సత్యమే.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: "విప్రుసొమ్ము కంటె విషము మేలు" - ఇత్యాది సూక్తులు సంఘంలో బ్రాహ్మణుడి కున్న గౌరవాన్ని చాటుతాయి.

వ. అని పలికి యిట్లనియె. 7

ప్రతిపదార్థం: అని పలికి = అని వచించి; ఇట్లు+అనియెన్ = మరల పరమేశ్వరుడు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈశ్వరుడు మహేశ్వరితో అట్లు పలికి మళ్ళీ ఇట్లా అన్నాడు.

సీ. 'అధ్యయనంబును యజనంబు దానంబు । నధ్యాపనంబును యాజనముఁ బ్ర
తిగ్రహంబును బ్రశాంతియుఁ దపస్సత్యశౌ । చంబులు విప్రధర్మంబు లాప
దలఁ దక్క నతనికి వలవదు వాణిజ్య: । మగ్నికార్యంబు, శూద్రాన్నవర్జ
నము, నిజదార సంగమ నియమంబును, । నిరుప్రొద్దు గుడుపును, హింస లేమి

ఆ. యును, నివాస శుద్ధియును, నతిథిప్రియ । త్వంబు బ్రాహ్మణులకు వలయుఁ; దపము
పేర్మి సాధనముగ ధర్మమూలముగ వా । రల సృజించెఁగాదె నలినభవుఁడు. 8

ప్రతిపదార్థం: అధ్యయనంబును = వేదాలను గురుముఖంగా చదవటం; యజనంబున్ = యజ్ఞ యాగాది కర్మలు చేయటం; దానంబున్ = గోవు, భూమి మొదలైన వాటిని యోగ్యులైన వారి కివ్వటం; అధ్యాపనంబును = వేదాది విద్యలను అన్యులకు నేర్పడం; యాజనమున్ = యజ్ఞయాగాదులు తాను చేయించటం; ప్రతి గ్రహంబును = దానాదులు పుచ్చుకొనటం; ప్రశాంతియున్ = కామక్రోధాది విరహితమైన మనస్సుతో నిమ్మళంగా ఉండటం; తపః = శాస్త్రోక్తమైన కర్మలకు అర్హత; సత్య = నిజం పలికే నియమం; శౌచంబులు = శాస్త్రోక్త కర్మాచరణ యోగ్యత, పవిత్రతలు; విప్రధర్మంబులు = బ్రాహ్మణధర్మాలు; ఆపదలన్+తక్కన్ = కష్టాలలో దప్ప; అతనికిన్ = విప్రుడికి; వాణిజ్యము = వ్యాపారం, వర్తకం; వలవదు = తగదు; అగ్ని కార్యంబు = హోమ మొనర్చుట; శూద్ర+అన్న వర్జనము = శూద్రులొసగిన అన్నమును భుజించక వదలివేయటం; నిజదారసంగమ నియమంబును = తన పెండ్లముతోనే కూడునట్టి నియమం అనగా అన్యకాంతాసక్తి లేకుండటం; ఇరుప్రొద్దుకుడుపును = రెండు పూటల మాత్రమే భుజించటం; హింసలేమియును = ప్రాణులను హింసించకుండుట-అనగా అహింసావ్రతపాలనం; నివాస శుద్ధియును = గృహమును శుభ్రంగా ఉంచుకొనటం; అతిథి ప్రియత్వంబున్ = భోజన సమయాన ఇంటికి వచ్చిన వారిని ఆదరించటం; బ్రాహ్మణులకున్ = భూసురులకు; వలయున్ = తగును; తపము పేర్మి = తపస్సు యొక్క ఆధిక్యం; సాధనముగన్ = సర్వకార్యసాధనంగా; ధర్మమూలముగన్ = ధర్మమునకు ఆధారంగా; వారలన్ = భూదేవులను; నలిన భవుఁడు = పద్మమునుండి జనించిన బ్రహ్మ; సృజించెన్+కాదు+ఎ = సృష్టిచేశాడు గదా.

తాత్పర్యం: వేదాలను గురుముఖంగా నేర్చి వల్లించటం, యజ్ఞాలు చేయటం, పాత్రులైనవారికి దానాలివ్వటం, వేదాది విద్యలను ఇతరులకు బోధించటం, యజ్ఞయాగాది కర్మలు చేయించటం, యాగం చేసినట్టి యజమానులిచ్చే దానాలు పరిగ్రహించటం, ప్రశాంతచిత్తంతో ఉండటం, తపమాచరించటం, సత్యవాఙ్నియమం, మనోవాక్కాయము లందు పరిశుద్ధుడుగా ఉండటం విప్రులధర్మాలు. ఇడుమలలో తప్ప బ్రాహ్మణుడికి వర్తకం ఏమాత్రం తగదు. భూసురుడు నిత్యాగ్నిహోత్రిగా ఉండాలి. అంటే ప్రతినిత్యం హోమకార్యం నిర్వర్తించాలి. శూద్రులు పెట్టే తిండి తినగూడదు. తన భార్యతోనే కాపురం చెయ్యాలి కాని పరాంగనల పొందు పనికిరాదు. రెండు పూటల మాత్రమే భుజించాలి. ఇంటిని పరిశుద్ధంగా ఉంచుకొనాలి. భోజనవేళకు వచ్చిన అతిథి అభ్యాగతులను ప్రీతితో ఆదరించాలి.

ఇవి బ్రాహ్మణ ధర్మాలు. తపస్సమృద్ధియే సకల కార్యసాధనంగా, ధర్మమునకు ఆధారభూతులుగా బ్రాహ్మణుల్ని బ్రహ్మదేవుడు సృజించాడు.

విశేషం: "బ్రాహ్మణ క్షత్రియ విశాం శూద్రాణాం చ పరంతప,
కర్మాణి ప్రవిభక్తాని స్వభావ ప్రభవై ర్గుణైః." -- (భగ. 18-41)

ప్రాచీన కర్మలమూలంగా ఏర్పడే సత్త్వాది గుణాలను బట్టి ఆయా వర్ణాల వారు చేయదగిన కర్మలను శాస్త్రాలు విభజించి చెప్పాయి అంటూ ఉపక్రమించి వాసుదేవుడు అర్జునుడికి విప్రధర్మ మెట్లాంటిదో ఈ క్రింది విధంగా గీతలో ఉగ్గడించాడు.

"శమో దమ స్తప శ్శౌచం క్షాంతి రార్జవ మేవ చ,
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రాహ్మం కర్మ స్వభావజమ్." -- (భగ. 18-42)

"శమం, దమం, తపం, శౌచం, క్షాంతి, ఆర్జవం, జ్ఞానం, విజ్ఞానం, ఆస్తిక్యం అనేవి బ్రాహ్మణులకు సంబంధించిన సహజ కర్మలు, ధర్మాలు" -- అని.

ఆ. క్షత్రియులకు విప్రసంరక్ష ముఖ్యధ । ర్మంబు; ధరణి వారి రక్షణమునఁ
గాని బ్రదుక; దమ్మహానుభావుల పాల । నంబు సేయ శోభనంబు నొందు. 9

ప్రతిపదార్థం: క్షత్రియులకున్ = రెండవజాతి వారైన రాచవారికి; విప్రసంరక్ష = బ్రాహ్మణులను బాగా కాపాడటం; ముఖ్య ధర్మంబు= ప్రధానమైన ధర్మం; ధరణి = పుడమి; వారి రక్షణమునన్+కాని = ఆ క్షత్రియులు కాపాడటం వలననే తప్ప; బ్రదుకదు= జీవించదు; ఆ మహా+అనుభావులు+అ= ఆ గొప్ప సామర్థ్యం గల క్షత్రియులే; పాలనంబు+చేయన్= ఏలుబడి సాగించగా; శోభనంబున్+ఒందున్= శుభములు పొందుతుంది.

తాత్పర్యం: క్షత్రియులకు బ్రాహ్మణ సంరక్షణమే ప్రధాన ధర్మం. రాచవారి సంరక్షణలోనే ధరణికి సర్వతోముఖాభివృద్ధి సమకూడుతుంది. మిక్కిలి సామర్థ్యం గల క్షత్రియులు ఏలుబడి సాగించగా పుడమికి సకల శుభాలు సంప్రాప్త మవుతాయి.

విశేషం: "శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్,
దాన మీశ్వర భావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్. " -- (భగ. 18-43)

శౌర్యం, తేజస్సు, ధృతి, దాక్ష్యం అనగా నేర్పు, యుద్ధమునందు అపలాయనం, దానం, ఈశ్వరభావం అంటే అన్యులను శాసించగల సామర్థ్యం - ఇవి క్షత్రియసాధారణ కర్మలుగా, ధర్మాలుగా భగవద్గీత ప్రబోధించింది.

నరులలో నేను నరాధిపుడిని అని భగవానుడు ఉగ్గడించడం చేత సాధు సంరక్షణమే భగవదవతార ప్రయోజనం గనుక సాధువులైన భూసురులను కాపాడటం రాజులకు ముఖ్యమైన ధర్మంగా, ప్రధాన కర్తవ్యంగా ఈ పంచమవేదం నిర్ణయించింది.

క. రమణీ! యధ్యయనము యజ । నము దానము సాధుపోషణము దుర్జనులన్
దమియించుటయు సముత్సా । హము కల్మియు ధృతియు నృపుల కగు ధర్మంబుల్. 10

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: రమణీ! = ఓ కాత్యాయనీ!; అధ్యయనము = శస్త్రాస్త్రవిద్యలు అభ్యసించటం; యజనము = యాగాలు చేయించటం; దానము = తగినవారికి వస్తువుల నొసంగటం; సాధుపోషణము = సత్పురుషులను వృద్ధి పొందించటం; దుర్జనులన్ = దుర్మార్గులను; దమియించుటయున్ = అణచివేయటం; సముత్సాహము కల్మియున్ = మంచి ఉత్సాహం కలిగి ఉండటం; ధృతియున్ = ధైర్యం; నృపులకున్ = రాజులకు, క్షత్రియులకు; అగు = తగిన; ధర్మంబుల్ = ధర్మాలై ఉన్నవి - లేదా ధర్మంబులు+అగున్ = ధర్మములై ఉన్నవి అని కూడ అర్థం చెప్పవచ్చు.

తాత్పర్యం: దేవీ! వేదశాస్త్రాలు అనగా ధనుర్వేదం, నీతిశాస్త్రం మొదలైన విద్యలు అభ్యసించటం, యజ్ఞయాగాది క్రతువులు చేయించటం, అర్హులకు దానా లివ్వటం, సత్పురుషులను సాకటం, దుష్టులను అణచివేయటం, మిక్కిలి ఉత్సాహం కలిగి ఉండటం అనేవి రాజధర్మాలు.

విశేషం: రాజులకు ఉండవలసిన ప్రభు మంత్రోత్సాహ శక్తులలో ఉత్సాహ మొకటి.

తే. **శస్త్ర జీవికయును నరిషష్ఠ భాగ । మా హరించుటయును భృత్యు నరయుటయును**
బ్రజ వివాదంబు వినుచోటఁ బక్షపాతి । గామియును రాజులకుఁ గృత్యకర్మకోటి. **11**

ప్రతిపదార్థం: శస్త్ర జీవికయునున్ = ఆయుధాలే జీవనోపాయంగా గలిగి ఉండటం, వేటాడటం, వైరులను సంహరించటం అనేవి రాజులకు శాస్త్ర విహితకృత్యాలు కనుక వారు శస్త్రజీవులు; అరి = కప్పముగా, పన్నుగా; షష్ఠ భాగము = ఆదాయంలో ఆరవపాలు; ఆహరించుటయునున్ = గ్రహించటం - శాత్రవులను జయించి వారి సంపదలో ఆరవభాగం కప్పంగా గైకొనటమేకాక, తన ఏల్బడిలోని ప్రజలరాబడిలోనుండి ఆరవపాలు పన్నుగా వసూలు చేయటం; భృత్యున్ = సేవకుడిని; అరయుటయును = పరిపోషించటం; ప్రజవివాదంబు = తన రాజ్యంలో ప్రజలనడుమ ఏర్పడిన తగవులు; వినుచోటన్ = ఆలకించేటప్పుడు; పక్షపాతి కామియును = ఒకవైపు మొగ్గకుండటం అనునవి; రాజులకున్ = దొరలకు; కృత్యకర్మకోటి = చేయదగిన పనుల యొక్క మొత్తమై ఉన్నది.

తాత్పర్యం: ఆయుధాలపై ఆధారపడి బ్రతుకుతెరువు సాగించటం, శత్రురాజులను ఓడించి వారి సంపదలో ఆరవభాగం కప్పంగా గైకొనటం, మరియు తమ రాజ్యంలోని ప్రజల ఆదాయంలో నుండి ఆరవపాలు పన్నుగా గ్రహించటం, తమను కొలిచియున్న సేవకులను పోషించటం, ప్రజల నడుమ ఏర్పడ్డ తగవులు తీర్చేటపుడు పక్షపాతం వహించకుండా న్యాయనిర్ణయం చేయడం రాజులకు శాస్త్రవిహిత కర్తవ్య కర్మలు.

సీ. **వణిజులు లోక ప్రవర్తనంబుల కెల్ల । నుపకారకులు; గృషియును ననేక**
భంగి బేహారంబుఁ బసులఁ బెంచుటయుఁ గృ । త్యంబులు; వారల కధ్యయనము
యజనంబు దానంబు నర్హ కర్మంబులు; । త్రైవర్ణిక ద్విజత్వమ్ము కతన
నాతిథ్యములు విధేయములు; వారికిఁ దిల । గంధరసముల విక్రయము దగదు;

తే. **మూఁడు జాతుల శుశ్రూషమూల కార్య । గతి తదుపయుక్తి శూద్రుల కలిమి నడచు;**
వారు శుశ్రూషకులు; విప్రవందనంబు । వినయ మక్రూరు లగుట తద్విహిత కృతులు. **12**

ప్రతిపదార్థం: వణిజులు = వ్యాపారం చేసే వైశ్యులు; లోక ప్రవర్తనంబులకున్+ఎల్లన్ = లోకవ్యవహారాలన్నింటికినీ; ఉపకారకులు = మేలు చేసేవారు; కృషియునున్ = సేద్యము; అనేక భంగి బేహారంబున్ = పలు తెరగులైన వ్యాపారాలూ, పసులన్ = పశువులను; పెంచుటయున్ = పోషించటమూ; కృత్యంబులు = వారు చేయదగిన పనులు; త్రైవర్ణిక ద్విజత్వమ్ము కతనన్ = మొదటి మూడు వర్ణములకు విహితమైన యజ్ఞోపవీత ధారణాది హేతువుచేత; వారలకున్ = ఆ వైశ్యులకు; అధ్యయనమున్ = గురుముఖమున వేదాలు పఠించటం; యజనంబున్ = యజ్ఞాలు చేయటం; దానంబున్ = గోభూదానాలు పాత్రుల కొసగటం; అర్హకర్మంబులు = తగిన కృత్యాలు; ఆతిథ్యములు = అతిథి సత్కారాలు; విధేయములు = వారు చేయదగినవి; వారికిన్ = ఆ వైశ్యులకు; తిలగంధరసముల = నువ్వులు, గంధములు, రసములు వీటియొక్క; విక్రయము = అమ్మకం; తగదు = కూడదు; మూఁడు జాతుల శుశ్రూషమూల కార్యగతి= బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులనెడి త్రైవర్ణికుల సేవా మూలకమైన పనుల చొప్పుతో; తత్+ ఉపయుక్తిన్= ఆ త్రైవర్ణికులకు ఉపయోగపడుటతో; శూద్రులకలిమి= శూద్రులయొక్క ఉనికి; నడచున్= సాగుతుంది; వారు = ఆ శూద్రులు; శుశ్రూషకులు= సేవించునట్టివారు; విప్రవందనంబు= బ్రాహ్మణులకు నమస్కరించటం; వినయము= అణకువ, విధేయత; అక్రూరులు+అగుట= కఠినులుగాక సౌమ్యులై ఉండటం; తత్ విహిత కృతులు= ఆ శూద్రులకు తగిన ధర్మములు, పనులు.

తాత్పర్యం: వైశ్యులు లోక వ్యవహారా లన్నింటికీ ఉపకరించేవారు. వ్యవసాయం, పలురకాలయిన వ్యాపారాలు, పశుపోషణ వీరికి విధి విహిత కృత్యాలు. బ్రాహ్మణ క్షత్రియులవలె వీరున్నూ మాతృగర్భం నుండి జన్మించటం, ఉపనయన సంస్కారం పొందటం అనే రెండు జన్మలు కలవారు కనుక ద్విజులు. ద్విజ ధర్మములైన వేద విద్యాభ్యాసం, యజ్ఞాలు చెయ్యటం, గో భూదానాలు ఇవ్వటం, అతిథులను సత్కరించటం ఈ మొదలైనవి వీరికి ఆచరణీయ కృత్యాలు. వైశ్యులు తిలగంధ రసాలు విక్రయించరాదు. శైలజా! మరి శూద్రుల ధర్మం బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు సేవ చెయ్యటం. వారికి అన్నివిధాల ఉపకరించటం. బ్రాహ్మణులకు ప్రణమిల్లటం, వినయపరులై, సౌమ్యులై మెలగటం వారి ధర్మాలు.

విశేషం: మాతృ గర్భమున జన్మించటం, ఉపనయన సంస్కారమున పవిత్ర జన్మను పొందటం అనే రెండు జన్మలు కలవాడు ద్విజుడు. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు ద్విజశబ్ద వాచ్యులు.

> "కృషి గోరక్ష వాణిజ్యం వైశ్యం కర్మ స్వభావజమ్,
> పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాఽపి స్వభావజమ్." -- (భగ. 18-44)

వ్యవసాయం, పశుసంరక్షణ, వర్తకం వైశ్యులకు సహజ కర్మ. జీవనోపాయం కూడ. అట్లాగే త్రైవర్ణికులకు అనగా బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు పరిచర్య గావించడం శూద్రుడికి సహజ కర్మ. అది వాడి బ్రతుకు తెరువుగూడ - అని గీతోపనిషత్తు వర్ణధర్మాలు నిర్దేశించింది.

క. తన తన వర్ణంబునకుఁ ద। గిన యాచారంబు నడపి కిల్బిష రహితుం
డనఁ బరఁగు నెల్లవారికి। విను మున్మును జన్మ సౌఖ్య విభవము గల్గున్. 13

ప్రతిపదార్థం: విను = ఓ గౌరీ! ఆలకించుము; తన తన వర్ణంబునకున్ = తాను జన్మించిన కులానికి; తగిన = యుక్తమైన; ఆచారంబు = అనుష్ఠానం; నడపి = అనుష్ఠించి; కిల్బిష రహితుండు = పాపంలేనివాడు; అనన్ = అని లోకం మెచ్చగా; పరఁగు = ఒప్పునట్టి; ఎల్ల వారికిన్ = ప్రతివారికిన్నీ; మున్మును = ముందుముందు; జన్మ సౌఖ్య విభవము = ఎత్తిన జన్మల వలన పరమ సుఖం; కల్గున్ = లభిస్తుంది

తాత్పర్యం: గౌరీ! వినుము, తన తన కులానికి తగిన ఆచారం పాటించి పాపరహితుడైన ప్రతివాడు తనకు మున్ముందు కలుగబోయే జన్మలో పరమ సుఖాన్ని చూరగొంటాడు.

విశేషం: "స్వేస్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః,
స్వకర్మ నిరత స్సిద్ధిం యథా విందతి తచ్ఛృణు." -- (భగ. 18-45)

మనుష్యులు తమ తమ వర్ణాలకు అనుగుణమైన ధర్మాలను ఆదరంతో ఆచరిస్తే పరమ పద ప్రాప్తిరూప ఫలసిద్ధిని పొందుతారు.

"యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వమిదం తతమ్,
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః." -- (భగ. 18-46)

ప్రపంచ సృష్టి స్థితి లయాలకు మూలమై విశ్వమంతటా వ్యాపించియున్న పరమాత్మను స్వధర్మానుష్ఠానంతో ఆరాధిస్తే పరమ పద ప్రాప్తి కల్గుతుంది అంటూ గీతలో భగవంతుడు చాటిన సంగతే ఈ కందంలో పొందుపరచబడింది.

వ. ఇవి వర్ణ ధర్మ ప్రకారంబు; లింక నాశ్రమ ధర్మంబులు వివరించెద నాకర్ణింపు' మని పలికి పార్వతికి పరమేశ్వరుం డిట్లనియె. 14

ప్రతిపదార్థం: ఇవి వర్ణ+ధర్మ ప్రకారంబులు = ఇవి బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణాలకు సంబంధించిన ధర్మ విధానాలు; ఇంకన్ = ఇక; ఆశ్రమధర్మంబులు = ఆశ్రమ ధర్మాలను; వివరించెదన్ = వక్కాణిస్తాను; ఆకర్ణింపుము = ఆలకించుము; అని పలికి = అని వచించి; పరమ+ఈశ్వరుండు= చంద్రశేఖరుడు; పార్వతికిన్= సర్వమంగళకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు;

తాత్పర్యం: పార్వతీ! వర్ణ ధర్మ రీతు లిట్లాంటివి. ఇక ఆశ్రమ ధర్మాలు విశదపరుస్తాను వినుము' అంటూ పరమేశ్వరుడు ఆమెకు చెప్పటానికి ఉపక్రమించాడు.

విశేషం: ఆశ్రమములు నాలుగు. బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్న్యాసము.

సీ. బ్రహ్మ చర్య వ్రత పరమ నిష్ఠయు, గురు । నాశ్రయించుటయు, నధ్యయన కృతియు,
నగ్ని కార్యంబు, గుర్వర్థ సంచారంబు, । భైక్షచర్యయుఁ గమలాక్షి! బ్రహ్మ
చారి ధర్మంబు; లాశ్రమములకెల్ల నా । శ్రయణీయమై గృహస్థత్వ మొప్పు;
శౌచంబు, నిజదార సంతుష్టియును, బంచ । యజ్ఞంబులును, నిగమాభిరతియు,

తే. దాన హోమ దయాతిథి మాననములు । వలయు గృహమేధికిని; వనవాస వన్య
భోజన బ్రహ్మచర్య జటాజిన ప్ర । ధారణములు వానప్రస్థ ధర్మకోటి. 15

ప్రతిపదార్థం: కమల+అక్షి! = తామర రేకుల వంటి కన్నులు గలదానా! గౌరీ!; బ్రహ్మచర్య వ్రత పరమనిష్ఠయున్ = బ్రహ్మ చర్యమనే నియమంలో మిక్కిలి శ్రద్ధ; గురున్ = ఆచార్యుడిని; ఆశ్రయించుటయున్ = విద్యకొరకు సేవించటం; అధ్యయన కృతియున్ = గురువుకడ విద్యాభ్యాసమనే పని; అగ్ని కార్యంబున్ = అగ్నిని ఉపాసించటం-హోమాదులు సల్పటం; గురు+అర్థ

సంచారంబు = గురువు పని నిర్వహించటానికై తిరగటం; భైక్ష చర్యయున్ = భిక్షాటనం-మధుకరవృత్తి నవలంబించటం; బ్రహ్మచారి ధర్మంబులు = బ్రహ్మచారి యొక్క విధులు; ఆశ్రమములకున్+ఎల్లన్ = అన్ని ఆశ్రమాలకు; ఆశ్రయణీయము+ఐ = ఆశ్రయించుటకు తగినదై; గృహస్థత్వము = గృహస్థుగా ఉండటం-గృహస్థాశ్రమం; ఒప్పున్ = విలసిల్లుతుంది; శౌచంబున్ = పరిశుద్ధత; నిజదార సంతుష్టియును = తన పత్నితోనే సంతృప్తి చెందడం; పంచ యజ్ఞంబులును = దేవయజ్ఞం, భూతయజ్ఞం, పితృ యజ్ఞం, బ్రహ్మ యజ్ఞం, మనుష్య యజ్ఞం అనే అయిదు మహా యజ్ఞాలు నిర్వహించటం; నిగమ+అభిరతియున్ = వేద విద్యాభ్యాసమందు మిక్కిలి ఆసక్తి; దాన = వలసిన వారికి గోవులు భూములు ఇవ్వటం; హోమ = అగ్నికార్యం; దయా = కృప; అతిథి మాననములు = ఇంటికి వచ్చిన అతిథి అభ్యాగతులను ఆదరించటం; గృహమేధికిని = గృహస్థాశ్రమం స్వీకరించిన వాడికి; వలయున్ = అనుసరించ దగిన ధర్మాలు; వనవాస = అరణ్యంలో నివసించటం; వన్య భోజన = ఆడవిలో లభించే కందమూలఫలాలను భుజించటం; బ్రహ్మచర్య = వనితాసంగమం వదలటం; జటా+అజిన ధారణములు = జడలు తాల్చటం, చర్మాలు ధరించటం; వాన ప్రస్థ ధర్మ కోటి = వానప్రస్థాశ్రమంలో ఉన్నవారు ఆచరించవలసిన ధర్మాల యొక్క సముదాయమై ఉన్నది.

తాత్పర్యం: బ్రహ్మచర్య వ్రతం అవలంబించటంలో గొప్ప నిలుకడ, గురుదేవుడిని ఆశ్రయించటం, వేదపాఠంలో ఆసక్తి గల్గి ఉండటం, హోమాలు సల్పటం, గురుని కార్యం నెరవేర్చుటకై సంచరించటం, భిక్షాన్నం భుజించటం అనేవి బ్రహ్మచారి యొక్క ధర్మాలు. దేవీ! అన్ని ఆశ్రమాలవారికి ఆధారభూతమై గృహస్థాశ్రమం ఒప్పారుతున్నది. పరిశుద్ధత పాటించటం, తన భార్యతోనే సంతృప్తి చెందటం, ప్రతినిత్యం దేవయజ్ఞం, భూతయజ్ఞం, పితృ యజ్ఞం, బ్రహ్మ యజ్ఞం, మనుష్యయజ్ఞం అనే పంచ యజ్ఞాలు నిర్వర్తించటం, వేదమునందు ఆసక్తి, దానం, హోమం, దయ, అతిథిపూజ గృహస్థుడికి ఆచరణీయాలైన ధర్మాలు. అడవిలో నివసించటం, అక్కడ లభించే కందమూలాదులు భక్షించటం, బ్రహ్మచర్య వ్రతపాలనలో నిష్ఠ అనగా స్త్రీ సంగమవివర్జనం, జడలు తాల్చటం, చర్మాలు ధరించటం వానప్రస్థాశ్రమంలో ఉన్నవారియొక్క ధర్మాలు.

చ. **కినియమి, సంగవర్జన, మకించన భావము, తాల్మి, విప్రవా**
సనము, ప్రశాంతి, యార్జవము, శౌచము, సద్వ్రతనిష్ఠ, భైక్షభో
జన, మిల నిద్రసేఁత, కృప, సంతత తత్త్వ విచింతనంబు మా
నిని! యతి ధర్మముల్ శ్రుతి గణించిన భంగిన యేను జెప్పితిన్. **16**

ప్రతిపదార్థం: మానిని! = ఆత్మాభిమానం గల చెలీ!; కినియమి = కోపపడకుండటం; సంగవర్జనము = ఇంద్రియ విషయాల అణచివేత అంటే పరమాత్మ కన్నా భిన్నమైన వస్తువులతో సంబంధం లేకుండటం; అకించన భావము = ఏమియూ లేనివాం డై ఉండటం (ధనాదులందు ప్రీతి మానటం); తాల్మి = ఓర్పు; విప్రవాసనము = దేశాంతరమున నివసించటం లేదా బ్రాహ్మణులతో కూడి నివసించటం; ప్రశాంతి = నిమ్మళంగా ఉండటం; ఆర్జవము = ఋజుప్రవర్తన, సరియగు నడత; శౌచము = పరిశుద్ధత; సద్వ్రత నిష్ఠ = మంచి వ్రతాలను ఆచరించటంలో నిలుకడ అనగా అహింస మొదలైన నియమాలలో శ్రద్ధ; భైక్ష భోజనము = భిక్షించి తెచ్చుకొన్న అన్నం ఆరగించటం; ఇలన్ = నేలమీద; నిద్రసేఁత = పరుండటం, నిదురించటం; కృప = కనికరం; సంతత తత్త్వ విచింతనంబు = ఎల్లప్పుడు తత్త్వవిచారం సల్పుతుండటం; యతిధర్మముల్ = సన్న్యాసికి తగిన ధర్మాలు; శ్రుతి = వేదం; గణించినభంగిన్+అ = చెప్పిన విధంగానే; ఏను = నేను; చెప్పితిన్ = నీకు తెలిపాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కోపపడకుండా ఉండటం, ఇంద్రియ విషయాలను అణచివేయటం అనగా పరమాత్మకంటె ఇతరములైన విషయాలతో సంబంధం వదలటం, ఇతర దేశాలలో వర్తించటం లేదా బ్రాహ్మణులతో కలసి నివసించటం, సహనం, చక్కని నడత, పరిశుద్ధత, ఉత్తమ వ్రతాలు ఆచరించటంలో ఆసక్తి, భిక్షాన్నంతో జీవించటం, భూమి మీద శయనించటం, కారుణ్యం, ఎల్లవేళల ఆత్మతత్త్వ విచారం అన్నవి సన్న్యాసి యొక్క ధర్మాలు. శైలజా! వేదాలలో చెప్పబడిన ఈ ధర్మాలను నీకు తెలిపాను.

విశేషం: సంగ వర్జన మనగా పరమాత్మ కంటె వేరైన వస్తువులతో సంబంధం లేకుండటంగా -

"మత్కర్మ కృ న్మత్పరమో మద్భక్త స్సంగవర్జితః,
నిర్వైర స్సర్వభూతేషు యస్స మా మేతి పాండవ." - అని భగవద్గీత వెల్లడించింది.

"అకించనోఽ నన్యగతి శ్శరణ్య, త్వత్పాదమూలం శరణం ప్రపద్యే" నిన్ను చేరడానికి వలసిన కర్మ భక్తి జ్ఞానాలలో ఏ ఒక్కటీ బొత్తిగా లేనివాడిని. నిన్నే శరణు వేడుతున్నాను. నన్ను కాపాడు మన్న యామునాచార్యుల వారి నైచ్యానుసంధాన ప్రదర్శకమైన ఈ శ్లోకం మనకు స్తోత్రరత్నంలో(22) కనిపిస్తుంది.

వ. అని యిట్లాశ్రమ ధర్మంబులు సెప్పిన విని యప్పరమేశ్వరుతోఁ బార్వతి 'తపంబు తపంబనుచు మునిజనంబు లాచరింతురు; దాని తెఱం గెఱింగింపవే' యనిన నద్దేవుం డిట్లనియె. 17

ప్రతిపదార్థం: అని+ఇట్లు = అంటూ ఈ ప్రకారంగా; ఆశ్రమ ధర్మంబులు = చతురాశ్రమాలకు సంబంధించిన ధర్మాలు; చెప్పినన్ = శంకరుడు తెల్పగా; విని = ఆలకించి; ఆ+పరమేశ్వరుతోన్ = ఆ పరమ శివుడితో; పార్వతి = హిమవంతుడి కూతురైన ఉమాదేవి; తపంబు తపంబు+అనుచున్ = తపస్సు తపస్సుఅంటూ; మునిజనంబులు = మౌనులు; ఆచరింతురు = చేస్తారు; దానితెఱంగున్ = ఆ తపస్స్వరూపమును; ఎఱింగింపవు+ఏ = తెల్పుమా; అనినన్ = అని పార్వతి ప్రశ్నించగా; ఆ దేవుండు = భగవంతుడైన శంభుడు; ఇట్లు+అనియెన్ = ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ముందు పేర్కొన్న విధంగా ఆశ్రమ ధర్మాలను తెల్పగా విని పార్వతి శివుడితో 'తపస్సు తపస్సు అంటూ ఆసక్తితో మునీశ్వరులు తపస్సు చేస్తారు. దాని స్వరూప మెట్లాంటిదో ఎరిగింపు మని వేడగా అత డిట్లా అన్నాడు.'

శివుండు పార్వతికిఁ దపస్స్వరూపంబు చెప్పుట. (సం.13-580-15 (అను.1)).

సీ. భోగార్థులై తపంబునకుఁ జొత్తురు; తపం । బనఁగ వానప్రస్థు లాచరించు
ధర్మంబు; లింద్రియ కర్మ నిగ్రహముతో । నుభయకాలములను యోగసేవ
ఫలకాంక్షఁ జేత తపస్స్వరూపంబుగా । నడపి కాలం బైన నాకమునకు
నరిగి తద్భోగంబు లనుభవింతురు; పుణ్య । మవసిత మగుడు మర్త్యత్వ మొంద

తే. వత్తు; రధికనియతి నుపవాసములను । జపముఁ బంచాగ్ని మధ్య వాసంబు గలుగు
తపముఁ గల దప్సరః ప్రియత్వం బొనర్చుఁ । గర్త కది; వాఁడుఁ దుది వచ్చుఁగాని మరలి.' 18

ప్రతిపదార్థం: భోగ+అర్థులు+ఐ = సుఖాలు అనుభవించవలెనన్న కోరిక గలవారై; తపంబునకున్+చొత్తురు = తపస్సు చేయటానికి పూనుకొంటారు; తపంబు+అనఁగన్ = తపస్సంటే; వానప్రస్థులు = వాన ప్రస్థమనే ఆశ్రమంలో ఉన్నవారు;

ఆచరించుధర్మంబులు = చేసేటటువంటి పుణ్యాలు; ఇంద్రియ కర్మ నిగ్రహముతోన్ = ఇంద్రియాలయొక్క వ్యాపారాలు అరికట్టుతూ; ఉభయ కాలములను = రెండు వేళలలో అనగా ఉదయసాయంకాలాలలో; యోగసేవ = యోగాభ్యాసం; ఫలకాంక్షన్+చేత = ప్రయోజనాపేక్షతో చేయటం; తపస్+స్వరూపంబుగాన్+నడపి = తపశ్చర్యగా కొనసాగించి; కాలంబు+ఐనన్ = కాలం కాగానే అనగా మరణం సంప్రాప్తించగా; నాకమునకున్ = స్వర్గలోకానికి; అరిగి = వెళ్ళి; తద్+భోగంబులు = ఆ స్వర్గలోకసౌఖ్యాలు; అనుభవింతురు = భుజిస్తారు; పుణ్యము = తాము చేసిన పుణ్యం; అవసితము+అగుడున్ = ముగియగానే; మర్త్యత్వము+ ఒందన్ = మానవులై జన్మించటానికి; వత్తురు = దివినుండి భువికి దిగి వస్తారు; అధిక నియతిన్ = మిక్కిలి నియమంతో; ఉపవాసములను = పస్తులుండటం; జపమున్ = మంత్రములను జపించటం; పంచ+అగ్ని మధ్యావాసంబున్ = ఐదగ్నుల నడుమ ఉండటం; కలుగుతపమున్ = కలిగినట్టి కఠోరతపస్సు; కలదు = ఉన్నది; అది = ఆ ఘోరతపస్సు; కర్తకున్ = చేసేవాడికి; అప్సరః ప్రియత్వంబు+ఒనర్చున్ = అప్సరసలకు (దేవతాస్త్రీలకు) వల్లభు డయ్యేటట్లు చేస్తుంది; వాఁడు = ఆ తపశ్శాలి; తుదిన్=చివరకు; మరలి వచ్చున్+కాని = తిరిగి భూతలానికి రాగలడే కాని స్వర్గంలో స్థిరంగా ఉండడు.

తాత్పర్యం: భోగాలను వాంఛించి తపస్సు చేయడానికి పూనుకొంటూ ఉంటారు. వానప్రస్థాశ్రమంలో ఉన్నవారు చేసే పుణ్యకర్మలే సుమా తపస్సు. ఇంద్రియ వ్యాపారాలను మాని ప్రాతస్సాయంకాలాలలో ఫలాపేక్షతో యోగాభ్యాసాన్ని తపస్సు మాదిరిగా నడిపి ఆయుస్సు చెల్లగా స్వర్గానికి పోయి అక్కడి సుఖాలు అనుభవిస్తారు. ఆర్జించిన పుణ్యం కాస్తా ముగియగానే మర్త్య లోకానికి తిరిగివస్తారే తప్ప అక్కడ శాశ్వతంగా ఉండరు. మిక్కిలి నియమంతో నిరాహారులై మంత్రజపంచేయటం, ఐదగ్నులమధ్య వేసవిలో ఉండటంవంటి ఘోరతపస్సులు కూడ ఉన్నాయి. అట్లాంటి తపస్సు కర్తకు దేవతాంగనలతో సంయోగం సమకూరుస్తుంది. అయినప్పటికి వాడు తపస్సుచేత ఆర్జించిన పుణ్యం కాస్తా ఫలభోగంతో నశించగానే తిరిగి భూలోనికి వస్తాడు.'

విశేషం: ఈ విషయాన్ని భగవద్గీత ఇట్లా చాటింది.

"త్రైవిద్యా మాం సోమపాః పూత పాపా
యజ్ఞై రిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే,
తే పుణ్య మాసాద్య సురేంద్ర లోకం
అశ్నన్తి దివ్యాన్ దివి దేవభోగాన్." (భగ. 9-20)

"తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి,
ఏవం త్రయీధర్మ మను ప్రపన్నా
గతాగతం కామ కామా లభంతే." (భగ. 9-21)

కేవలం కర్మనిష్ఠాపరులు ఇంద్రాది దేవతలను ఉద్దేశించి యజ్ఞయాగాలు సల్పి స్వర్గం చేరి అక్కడ ఇంద్రభోగాలు అనుభవిస్తారు. స్వర్గాది ఫలాలు అపేక్షించి కర్మలు చేసేవారు వాటిని అక్కడ అనుభవించి తమ పుణ్యం క్షీణించగానే భూలోకానికి తిరిగి వస్తారు. పంచాగ్నులు - నాల్గువైపుల గనగన మండే అగ్గిగుండాలు, నడినెత్తిన ప్రచండ సూర్యుడు - ఈమధ్య నిలిచి వేసవిలో సాగించే కాయక్లేశ యుతమైన కఠోర తపస్సు శీఘ్ర ఫలసిద్ధికి కారణం. శివుడిని గూర్చి పార్వతి సాగించిన తపస్సు ఇట్లాంటిదే.

వ. అని చెప్పి మఱియు, 19

తాత్పర్యం: ఈ విధంగా పార్వతికి తెలిపి మరలా పరమేశ్వరు డిట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. 'దారయుతంబుగా నడచు తాపసముఖ్యు లహింస పేర్మికై
కారుణికత్వ మగ్గలము గల్గి తలంతురు సర్వజీవులుం
దారును నొక్కరూపుగఁ బదంపడి పుత్త్ర కళత్త్రయుక్తిఁ బెం
పారుదు రూర్ధ్వ లోకమున నజ్జనమున్ మఱివచ్చుఁ గ్రమ్మఱన్.' 20

ప్రతిపదార్థం: దారయుతంబుగన్ = ధర్మపత్నితోపాటు; నడచు = తపశ్చర్యతో మెలగే; తాపసముఖ్యులు = మునులలో శ్రేష్ఠులు; అహింస పేర్మికై = అహింసయొక్క గొప్పతనముకై; కారుణికత్వము = దయాస్వభావం; అగ్గలము+కల్గి = మిక్కిలి కలిగి; సర్వజీవులున్ = సమస్త ప్రాణులున్నూ; తారును = తామున్నూ; ఒక్కరూపుగన్ = ఒకేవిధమని; తలంతురు = భావిస్తారు; పదంపడి = పిదప; పుత్రకళత్రయుక్తిన్ = కొడుకులతో, భార్యలతో కూడి; ఊర్ధ్వలోకమునన్ = పై లోకంలో-స్వర్గంలో; పెంపారుదురు = ఒప్పుతుంటారు; మఱి = పిదప; ఆ+జనమున్ = అట్టివారు కూడ, క్రమ్మఱన్ = తిరిగి; వచ్చున్ = భూలోకానికి పునర్జన్మమెత్తడానికి వస్తారు.

తాత్పర్యం: 'భార్యలతో మెలగే మునివర్యులు అహింసావ్రతం యొక్క గొప్పతనం గుర్తెరిగి మిక్కిలి దయాగుణం కలవారై, సమస్తప్రాణులు తమవంటివే యని భావిస్తారు. ఆయుష్కాలం తీరిన పిమ్మట వారు ఆలుబిడ్డలతో కూడి పుణ్యలోకాలకు వెళ్ళి అక్కడ పుణ్యఫలాలైన సౌఖ్యాలు అనుభవిస్తారు. తమ పుణ్యం క్షీణించగానే వారు అక్కడినుండి మరలి భూలోకానికి వచ్చి మనుష్యులుగా పుట్టుతారు.'

వ. అనిన భవాని 'వనవాసవ్రతవిశేషంబులుం, దదీయఫల ప్రకారంబులు నేర్పడ నానతీయవే' యనుటయు నభవుండు భరితాదరుండై. 21

ప్రతిపదార్థం: అనినన్ = అని శివుడు పల్కగా; భవాని = పార్వతి; వనవాస వ్రతవిశేషంబులున్ = వనవాస నియమాలలోని ఘనతలనూ; తదీయఫల ప్రకారంబులు = ఆ వనవాస వ్రత ఫలముల యొక్క విధములనూ; ఏర్పడన్ = స్పష్టంగా; ఆనతీయవు+ఏ = సెలవిమ్మా; అనుటయున్ = అని అడుగగా; అభవుండు = పరమేశ్వరుడు; భరిత+ఆదరుండు+ఐ = నిండిన ఆదరంకలవాడై - భార్య పట్ల మిక్కిలి మన్నన కలవాడై (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: అని సాంబశివుడు పల్కగా ఉమాదేవి 'వనవాస వ్రతాచరణలోని ఘనతనూ, ఆ వ్రత ఫలాలనూ సెలవియ్యం' డని ప్రార్థించగా పరమేశ్వరుడు పత్నియందలి పరమాదరంతో ఇట్లా అన్నాడు.

సీ. 'ఉపవాసములు మౌన మూర్వీశయత్వ మా । సన మూర్ధ్వ బాహుక స్థాపనంబు
నియమితా హారత్వ నిష్ఠ క్రమంబున । శశి మరుద్వృక్ష వాసముల నిలుపు
గంధర్వ దేవ నాగస్థానముల నునికి । యును బహుసౌఖ్య సంయుతము గాఁగ
నానా సహస్రాబ్ద మాననీయంబుగఁ । గావించు సంక్షేపగణనఁ గొన్ని

తే. మహితనియతులు సెప్పితి; మఱియు నేమి । వ్రతము సల్పినఁ బాప నిర్వర్ణ మగుటఁ
బుణ్యగతికల్మి దప్ప దరణ్యవాసి; కడుగు మింకను వలసిన యట్టి' వనుడు. 22

ప్రతిపదార్థం: ఉపవాసములు = నిరాహారములు; మౌనము = మాట్లాడకుండటం, వాఙ్నియమం; ఉర్వీశయత్వము = నేలమీద పరుండటం; ఆసనము = యోగాసనాలలో కూర్చోవటం; ఊర్ధ్వబాహుక స్థాపనంబున్ = క్రిందికి దించకుండా చేతులు పైకెత్తి పట్టటం; నియమిత+ఆహారత్వ నిష్ఠ = నిర్ణయించిన వేళలోనే ఆహారం స్వీకరించే నియమం; క్రమంబునన్ = వరుసగా (వానప్రస్థుడిని), శశి, మరుత్, యక్ష వాసములన్ నిలుపున్ = చంద్రుడు, వాయువు, యక్షులు అనువారి లోకాలలో చేరుస్తుంది; గంధర్వ దేవ నాగస్థానములన్ = గంధర్వలోకం, దేవలోకం, పాతాళలోకం అనే లోకాలలో; బహుసౌఖ్యసంయుతము+కాఁగన్ = అనేక సుఖాలతో కూడునట్లు; నానా సహస్ర+అబ్ద+మాననీయంబుగన్ = పెక్కువేల సంవత్సరాలు ఆదరించబడేటట్లుగా; ఉన్కియును కావించున్ = ఉండునట్లు చేస్తుంది; సంక్షేపగణనన్ = క్లుప్తంగా లెక్కించి; కొన్ని మహిత నియతులు = గొప్పవైన కొన్ని వ్రతనియమాలు; చెప్పితిన్ = నీకు తెల్పినాను; మఱియున్ = ఇంకను; ఏమివ్రతము సల్పినన్ = ఎట్టి వ్రతం ఆచరించినా; పాపనిర్హరణము+అగుటన్ = పాపం నశించటం చేత; పుణ్యగతి కల్మి = పుణ్యస్థితి సమకూడటం; అరణ్యవాసికిన్ = వనంలో నివసించేవాడికి, వానప్రస్థుడికి; తప్పదు = కలుగక మానదు; ఇంకను= మరియును; వలసిన+అట్టివి = నీకు కావలసిన విషయాలు; అడుగుము = నన్ను ప్రశ్నించుము; అనుడున్ = అని శంభుడు వచించగా. (పార్వతి అడిగిందని తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: ఉపవాసాలు సల్పటం, మాట్లాడకుండా ఉండటం, నేల మీద పండుకొనటం, యోగాసనాలలో ఉండటం, చేతులు మీది కెత్తి పట్టటం, నియమిత వేళలలో ఆహారం మితంగా స్వీకరించటం అనే నియమాలకు ఫలంగా వరుసగా చంద్ర, వాయు, యక్ష, గంధర్వ, నాగ లోక నివాసాలు సంప్రాప్తిస్తాయి, ఆయా లోకాలలో అనేక సంవత్సరాలు బహువిధ సౌఖ్యాలు అనుభవించే భాగ్యం వానప్రస్థుడికి కలుగుతుంది. ఈ రీతిగా సంగ్రహంగా నీకు కొన్ని వ్రతానుష్ఠాన ఫలాలు తెలిపాను. ఎట్టి వ్రతాలు అనుష్ఠించినా వానప్రస్థుడికి పాపాలు తొలగి పుణ్యగతులు లభించడం తప్పదు. గిరిజా! ఇంకా నీవు అడుగ దలచిన విషయాలుంటే అడుగు'మంటూ పరమేశ్వరుడు పలికాడు.

క. 'యాయావరుల నమరవం । ద్యా! యేర్పడఁ జెప్పు మనియె నంబిక; దేవుం
డాయమ కిట్లనుఁ' దీర్థప । రాయణు లుపవాసవిధి సమధికులు వారల్. 23

ప్రతిపదార్థం: అంబిక = గౌరీదేవి; అమరవంద్యా! = దేవతలచే కొనియాడబడువాడా!; యాయావరులన్ = ఇల్లిల్లు తిరిగి, పొలాలలో సంచరించి ధాన్యం గడించి బ్రదికే విరాగులను గూర్చి; ఏర్పడన్ = స్పష్టంగా; చెప్పుము+అనియెన్ = తెల్పుమని ప్రశ్నించింది; దేవుండు = భగవంతుడైన శివుడు; ఆ+అమకున్ = ఆ తల్లికి, ఉమకు; ఇట్లు+అనున్ = ఈ విధంగా చెప్పాడు; వారల్ = యాయావరులు; తీర్థ పరాయణులు = తీర్థయాత్రలందు శ్రద్ధకలవారు; ఉపవాసవిధిసమధికులు = ఉపవాసా లుండటంలో కడు దొడ్డవారు.

తాత్పర్యం: గౌరీదేవి పరమేశ్వరుడిని చూచి 'దేవతలచే నమస్కరింపబడు ప్రాణేశ్వరా! ఇల్లిల్లుతిరిగి, చేలలో సంచరించి గడించిన ధాన్యంతో జీవించే విరాగులను గూర్చి తేటతెల్లంగా తెల్పండి' అని అడిగింది. అందుకు తేజస్స్వరూపుడైన ఈశానుడు 'హైమవతీ! నీ వడిగిన యాయావరులు దేశద్రిమ్మరులు. తీర్థయాత్రలు సల్పటంలో మిక్కిలి శ్రద్ధాసక్తులు కలవారు. ఉపవాస నియమాలలో కడు గొప్పవారు.

వ. అది యెట్లంటేని. 24

తాత్పర్యం: అ దెట్లంటావా? అయితే వినుము.

క. నానాతీర్థ సతత సు । స్నానంబులఁ బల్లలైన జడలును భిక్షా
నూనోపవాస కృశమగు । మేనులునై వారితపము మిక్కిలి మెఱయున్. 25

ప్రతిపదార్థం: నానాతీర్థ = అనేక పుణ్యతీర్థాలలో; సతత = ఎడతెగని; సుస్నానంబులన్ = పవిత్ర స్నానాల చేత; పల్లలు+ఐన = ఎరుపు మించిన తెలుపురంగు గల; జడలును = తైల సంస్కారం లేక మెలివడిన తల వెంట్రుకలునూ; భిక్షా = భిక్షాన్నం వలననూ; అనూన = అధికములైన; ఉపవాస = పస్తులుండటం చేతను; కృశము+అగు = శుష్కించిన; మేనులున్+ఐ = శరీరాలు గలిగినదై; వారితపము = యాయావరుల యొక్క తపస్సు; మిక్కిలి మెఱయున్ = ఎక్కువగా ప్రకాశిస్తుంది.

తాత్పర్యం: యాయావరులు అనేక పుణ్యతీర్థాలలో నిరంతరం పవిత్ర స్నానాలు చేస్తూ ఉంటారు. అందువలన వారి తల వెంట్రుకలు జడలు గట్టి ఎరుపుమించిన తెలుపు రంగు కలిగి ఉంటాయి. భిక్షాన్నం తినటం వలననూ, మితిలేని ఉపవాసాలు చేయడం వల్లనూ వారి దేహాలు బక్కచిక్కి ఉంటాయి. కాని' వారి తపస్సు వెలుగులు విరజిమ్ముతూ ఉంటుంది.

క. మాసోపవాస విధులం । జేసి తృణజ ధాన్యభుక్తి సెల్లింతురు వా
రేసురలకు లేని సుఖా । వాసమ్ములఁ జరితములను వఱలుదురు తుదిన్.' 26

ప్రతిపదార్థం: మాస+ఉపవాస విధులన్+చేసి = నెలనెలా ఉపవాసం సల్పే నియమాలచేత; తృణధాన్యభుక్తి+చెల్లింతురు = నివ్వరివడ్ల బియ్యపన్నం భుజిస్తారు; ఏ సురలకున్+లేని = ఎట్టి దేవతలకూ లేనట్టి; సుఖ+ఆవాసమ్ములన్ = సౌఖ్యస్థానాలలో; చరితములన్ = సంచారముల చేత; తుదిన్ = కడపట; వఱలుదురు = వెలిగెదరు.

తాత్పర్యం: ఒక్కొక్క నెల రోజులపాటు ఉపవాసాలుండి ఆ పుణ్యపురుషులు నివ్వరివడ్ల దంపుడు బియ్యపన్నం భుజించి జీవితం సాగిస్తారు. కడపట ఏ దేవతలకు లభించని సుఖస్థానాలలో నడయాడుతూ వారు ప్రకాశిస్తారు.'

వ. అనిన విని యవ్వనితారత్నంబు 'వైఖానసుల విధంబు వివరింపు' మనుటయు న వ్విరూపాక్షుండు. 27

ప్రతిపదార్థం: అనినన్ = అని పరమేశ్వరుడు చెప్పగా; విని = ఆలకించి; ఆ+వనితా రత్నంబు = స్త్రీలలో శ్రేష్ఠురాలైన ఆ దుర్గాదేవి; వైఖానసుల విధంబున్ = వైఖానసులు అనే వారి యొక్క వైనం; వివరింపుము = తెలుపుము; అనుటయున్ = అని అడుగగా; ఆ+విరూప+అక్షుండు = త్రినేత్రుడైన ఆ శంకరుడు (ఇట్లా అనియెన్ - అని తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: పరమేశ్వరుడు పలుకగా విని మహిళామణి అయిన పరమేశ్వరి 'నాథా! వైఖానసు లనగా ఎట్లాంటివారు? వారి స్వరూప మేమిటో చెప్పు'మని అడుగగా శివుడు.

సీ. 'వైఖానసులు ఖరవ్రతు; లెట్టులంటేని । శిలఁ దృణధాన్యముల్ చిదుక నడచి
కొందఱు పండులఁ గొఱికి కొందఱు గన్న । గుఱుముల గువ్వల తెఱఁగు దోఁప
నప్పటి కప్పటి కాననంబున వైచి । కొని కొంద ఱాకు లెండినవి యేఱి
కొని కొంద ఱంబువుల్ గొని కొంద ఱనిలంబు । గొంద ఱాహారంబు గొందు; రట్లుఁ

తే. గాక యాహారపరులును గలరు; వార । లింద్రునకుఁ బూజనీయులై యెక్కుడైన
పదవిఁ జిరకాల బహుసౌఖ్యభాగు లగుదు' । రని మహేశ్వరుఁ డుమకు నిట్లనియె మఱియు. 28

ప్రతిపదార్థం: వైఖానసులు = వైఖానసు లనేవారు; ఖర వ్రతులు = కఠిన నియమాలు కలవారు; ఎట్టులు+అంటేని = ఎట్లనగా; శిలన్ = రాతిమీద; తృణ ధాన్యముల్ = నివ్వరివడ్లు మొదలైన గడ్డి ధాన్యాలను; చిదుకన్+అడచి = పొట్టురాలేటట్లు కొట్టి; కొందఱు = కొంతమంది; పండులన్ = దంతములతో; కొఱికి = పదార్థాలను నమలి; కొందఱు = మరికొంతమంది; కన్నగుఱుములన్ = కనిపించిన గింజలను; గువ్వల తెఱఁగు+తోఁపన్ = పక్షులతీరు గోచరించగా; అప్పటికిన్+అప్పటికిన్ = ఆవేళ కావేళకు; ఆననంబునన్ వైచికొని = నోటిలో వేసికొని; కొందఱు = వేఱొక కొందరు; ఎండినవి ఆకులు = ఎండి నేల రాలిన ఆకులను; ఏఱికొని కొందఱు = ఎత్తుకొని కొందరు; అంబువుల్ = నీళ్ళు; కొని = గ్రహించి, త్రాగి; కొందఱు = కొంతమంది; అనిలంబున్ = గాలిని (పీల్చుకొని); కొందఱు = కొంతమంది; ఆహారంబు కొందురు= భుజిస్తారు; అట్లున్+కాక = ఆ మాదిరిగా కాక అనగా పవన పర్ణాంబు భక్షులే కాకుండా; ఆహార పరులును = అన్నం ఆరగించేవారు కూడ; కలరు = ఉన్నారు; వారలు = ఆ మహనీయులు; ఇంద్రునకున్ = దేవతా వల్లభుడికి; పూజనీయులు+ఐ = పూజించదగిన వారై; ఎక్కుడు+ఐన+పదవిన్ = ఉన్నతమైన స్థానంలో; చిరకాల = దీర్ఘ కాలం; బహుసౌఖ్యభాగులు+అగుదురు+అని = పెక్కు సుఖాలు అనుభవిస్తారని చెప్పి; మహేశ్వరుఁడు = పరమ శివుడు; ఉమకున్ = పార్వతికి; మఱియున్ = ఇంకనూ; ఇట్లు+అనియెన్ = ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: వైఖానసు లనేవారు కఠోరనియమాలు కలవారు. వారిలో కొందరు నివ్వరివడ్లు మొదలైన తృణధాన్యాలను తెచ్చి రాతిమీద నలగగొట్టి లేదా రోటిలో వేసి దంచుకొని తింటారు. కొందరు పండ్లు మొదలైన వాటిని పళ్ళతో కొరికి తింటారు. కొందరు కంటికి కనిపించిన గింజలను పక్షులమాదిరిగా అప్పటికప్పుడు నోటిలో వేసికొంటారు. కొందరు ఎండుటాకులను ఏరుకొని తింటారు. కొందరు నీళ్ళు త్రాగి బ్రతుకుతారు. గాలిని మాత్రమే పీల్చి కొందరు జీవిస్తారు. ఆహారం భుజించేవారు కూడ కొంద రున్నారు. వీరందరూ దేవేంద్రుడికి కూడా పూజించదగిన వారై చాలకాలం పలురకాల సౌఖ్యాలు అనుభవిస్తూ ఉన్నతపదవులలో విరాజిల్లుతుంటారు' అని మహాదేవుడు మహేశ్వరికి చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

వ. 'ఇవి యెల్లను వానప్రస్థ నియమ నిష్ఠా భేదంబులు; తపంబు తపంబని మును లాచరింతురు దాని తెఱం గెఱింగింపు మని నీవు తొల్త నడిగిన విధంబునం దొడంగి నా చెప్పిన విధంబు లన్నియుం దపంబను శబ్దంబున కర్థంబులైయుండు'నని చెప్పి 'యంగుష్ఠ ప్రమాణదేహులు మృగాజిన వసనులు నిర్ద్వంద్వులు నై వాలఖిల్యు లను పేరం బ్రసిద్ధులగు మునులు దినకర దీప్తులతోడం గూడి వర్తించుచుండుదురు; వారల తపో వైభవంబునం గాదె జగంబులు సుస్థిరంబులై యున్నయవి; యొండుమెయి దుర్లభంబు లైనట్టివి తపంబున సులభంబులగుం; దపంబు గడచిన ధర్మంబుగలదే?'యని పలికి యాదరాతిశయంబున శివుండు శైలేంద్రతనయతో 'ధర్మంబులు మఱియు నెఱింగించెద; నవహితవై యాకర్ణింపు'మని యిట్లనియె. 29

ప్రతిపదార్థం: ఇవి+ఎల్లను = ఈ చెప్పినవన్నీ; వానప్రస్థ నియమనిష్ఠా భేదంబులు = వానప్రస్థాశ్రమాలలో ఉన్నవారియొక్క వ్రత నిష్ఠలలోని తేడాలు; తపంబు తపంబు+అని = తపస్సు తపస్సు అంటూ; మునులు; ఆచరింతురు = చేస్తారు; దాని తెఱంగు = ఆ తపోవిధానం ఎఱింగింపుము; అని; నీవు; తొల్తన్ = మొదట; అడిగిన విధంబునన్ = ప్రశ్నించిన ప్రకారం;

తొడంగి = పూనుకొని; నా చెప్పిన = నేను వచించిన; విధంబులు+అన్నియున్; తపంబు+అను = తపస్సు అనేటటువంటి; శబ్దంబు నకున్ = మాటకు; అర్థంబులు+ఐ+ఉండున్; అని చెప్పి = అని శివుడు వచించి; అంగుష్ఠ ప్రమాణ దేహులు = బొటన వ్రేలెడు పొడవున్న శరీరం కలవారు; మృగ+అజినవసనులు = జింకతోళ్ళు వస్త్రములుగా కలవారు, అనగా జింక చర్మాలు ధరించేవారు; నిర్ద్వంద్వులున్+ఐ = సుఖ దుఃఖములు అనే జంటలకు లోబడనివారై; వాలఖిల్యులు+అను పేరన్ = వాలఖిల్యులు అనే నామంతో; ప్రసిద్ధులు+అగు మునులు = ప్రఖ్యాతులైన మౌనులు; దినకర దీప్తుల తోడన్ కూడి = సూర్యకిరణ తేజంతో కూడినవారై; వర్తించుచున్+ఉండుదురు = లోకంలో మెలగుతుంటారు; వారల తపః+వైభవంబునన్+కాదు+ఎ = ఆ వాలఖిల్యుల తపస్సు యొక్క మహిమవలననేకదా; జగంబులు = లోకాలు; సుస్థిరంబులు+ఐ = గట్టి నిలుకడ గలవై; ఉన్న+అవి = ఉన్నాయి; ఒండు మెయిన్ = మరొక మార్గంలో; దుర్లభంబులు+ఐన+అట్టివి = పొందుటకు శక్యంకానివి; తపంబునన్; సులభంబులు+అగున్ = సులువుగా పొంద తగినవి అవుతాయి; తపంబుక+డచిన = తపస్సునకు మించిన; ధర్మంబు; కలదు+ఏ? = ఉన్నదా? (లేదని తాత్పర్యం); అని పలికి = అంటూ ఈశ్వరుడు వచించి; ఆదర+అతిశయంబునన్ = మిక్కిలి మన్ననతో; శివుండు; శైల+ఇంద్ర తనయతోన్= పర్వతరాజ పుత్రికతో; ధర్మంబులు; మఱియున్ = ఇంకనూ; ఎఱింగించెదన్; అవహితవు+ఐ= సావధానచిత్తవై; ఆకర్ణింపుము = వినుము; అని, ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'దేవీ! నే నింతవరకు చెప్పిన వన్నీ వానప్రస్థాశ్రమ నియమాలలోని విశేషాలు. తపస్సు తపస్సు అంటూ మునీశ్వరులు ఆసక్తితో ఆచరిస్తారే ఆ తప స్స్వరూప మెట్లాంటిదో వ్యాఖ్యానించు మని మునుపు నీ వడిగావు. కనుక నేను చెప్పినవన్నీ తపస్సు క్రిందికే వస్తాయి. మరి బొటనవ్రేలంత శరీరాలు గలిగిన వాలఖిల్యులనే మునీశ్వరు లున్నారు. వారు మిక్కిలి ప్రసిద్ధులు. జింక చర్మాలు వస్త్రాలుగా ధరిస్తారు. సుఖదుఃఖాదులైన ద్వంద్వాలకు వారు అతీతులు. సూర్య కిరణ కాంతులతో కూడి సన్మార్గము నాశ్రయించి ప్రవర్తిస్తుంటారు. వారి తపోమహిమ వలన లోకాలు నిశ్చలంగా నిలిచి ఉన్నాయి. ఇతర సాధనాలతో సమకూడని ప్రయోజనాలు తపస్సాధన వలన తేలికగా సిద్ధిస్తాయి. తపస్సును మించిన ధర్మం మరొకటి లే'దని తెల్పి పరమాదరంతో పరమేశ్వరుడు పార్వతితో, 'తరుణీ! మరి కొన్ని ధర్మాలు తెల్పుతాను సావధానచిత్తవై విను'మని ఇట్లా అన్నాడు.

విశేషం: శ్రీమన్నారాయణ స్వరూపుడైన సూర్యభగవానుడు చైత్రం మొదలు ఫాల్గున మాస పర్యంతం ఒక్కో నెలలో ఒక్కో పేరుతో ఆర్గురు అనుచరులతో కూడిన వాడై తనను ఉపాసించే వారి పాపాలు పోకారుస్తాడు. తనకు అభిముఖంగా అరవైవేలమంది వాలఖిల్య మహర్షులు స్తుతిస్తూ అరుగుతుండగా సంచరిస్తాడని భాగవతపురాణం చెప్పుతోంది. వాలఖిల్యులు వియన్మార్గంలో సూర్యకిరణాలతోపాటు సాగిపోతూ సంచరిస్తారని భావం.

ఉ. **అంబుజసూతి యేర్పడ గృహస్థ సమర్థముగాఁ బ్రవృత్తి ధ**
ర్మంబు నొనర్చెఁ; నార్యజన మాన్యము దాని తెఱంగు చాల సూ
క్ష్మం; బతి కాంక్షలేక తగుకాలమునన్ సమచిత్తవృత్తి ని
త్యంబును ధర్మముఖ్యముగ నర్థముఁ గామముఁ జల్పు టొప్పగున్. **30**

ప్రతిపదార్థం: అంబుజసూతి = పద్మమునుండి పుట్టిన బ్రహ్మదేవుడు; ఏర్పడన్ = స్పష్టంగా; గృహస్థ సమర్థముగాన్ = గృహస్థుడికి తగినట్లుగా; ప్రవృత్తి ధర్మంబున్ = ఐహిక ఫలసాధనమైన ప్రవృత్తి రూపవైదిక ధర్మాన్ని; ఒనర్చెన్ = చేశాడు; దానితెఱంగు = ఆ ప్రవృత్తి ధర్మం యొక్క స్వరూపం; ఆర్యజనమాన్యము = పెద్దలచేత ఆదరించబడింది; చాల సూక్ష్మంబు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

= ఆ ధర్మం దురవ గాహం, అగోచరం, మిక్కిలి సున్నితం; అతి కాంక్షలేక = మిక్కిలి ఆశలేక; సముచిత వృత్తిన్ = సరి అయిన మనో వర్తనతో; తగుకాలమునన్ = తగిన సమయంలో; నిత్యంబును = ప్రతిదినం; ధర్మ ముఖ్యముగన్ = ధర్మమే ప్రధానంగా, ధర్మానికి విరుద్ధం గాకుండా; అర్థమున్ = అర్థ పురుషార్థాన్ని, ద్రవ్యాన్ని; కామమున్ = కామ పురుషార్థాన్ని, సుఖానుభవాన్ని; చల్పుట = సాధించుట; ఒప్పు+అగున్ = తగును.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు గృహస్థుడికి తగినట్లు ప్రవృత్తి ధర్మాన్ని కల్పించాడు. అది పెద్దలందరిచేత ఆదరించబడింది. ఆ ప్రవృత్తి ధర్మం మిక్కిలి సూక్ష్మ మైనది. పేరాసలేక సమచిత్తంతో యుక్తకాలంలో ధర్మమే ప్రధానంగా భావించి ద్రవ్యార్జన చేయాలి. ఆర్జించిన ధనంతో ధర్మానికి అవిరుద్ధంగా భోగాలు అనుభవించాలి - అనగా కోరికలు తీర్చుకొనాలి. ఇట్లా అర్థకామపురుషార్థాలు గృహస్థు సాధించటం సమంజసం.

చ. అతఁడు నివృత్తి ధర్మము ప్రయత్నమునన్ వివరించె మోక్షణో
ద్యత మది తత్ప్రకారములు దాంతియు భూతచయంబుపై దయా
రతియును సత్యదృష్టియు విరాగత యింద్రియకోటికిన్ దృఢ
స్థితముగఁ జేసి యోగనిరతిం బరిశాంతి యొనర్చికొంటయున్. 31

ప్రతిపదార్థం: అతఁడు = సృష్టికర్త అయిన బ్రహ్మ; నివృత్తి ధర్మము = మోక్షఫల సాధనమైన నివృత్తిరూప ధర్మాన్ని; ప్రయత్నమునన్ = పూనికతో; వివరించెన్ = వెల్లడించాడు; అది = ఆ నివృత్తి ధర్మం; మోక్షణ+ఉద్యతము = ముక్తి కొరకైన యత్నం; దాంతియున్ = బహిరింద్రియ నిగ్రహం; భూతచయంబు పైన్ = ప్రాణుల సమూహం మీద; దయారతియున్ = దయాగుణంలో పరమ ప్రీతియూ; సత్య దృష్టియున్ = సత్యమునందు చూపు; విరాగత = ఆత్మేతరములందు విరక్తి; దృఢస్థితముగన్+చేసి = ఏమాత్రం చలించకుండేటట్లు చేసి-గట్టి నిలుకడ కలిగించి; యోగనిరతిన్ = యోగమందు ఆసక్తిచేత; ఇంద్రియ కోటికిన్ = ఇంద్రియముల సమూహానికి; పరిశాంతి+ఒనర్చి కొంటయున్ = సంపూర్ణమైన ఉపశమనం కలిగించు కొనటం; తత్ప్రకారములు = ఆ నివృత్తి ధర్మస్వరూపాలు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు నివృత్తి ధర్మాన్ని పూనికతో వివరించాడు. ఆ నివృత్తి ధర్మం ముక్తి ఫలసాధనం. వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ అనే అయిదు కర్మేంద్రియాలను యోగ్య కర్మలలో ప్రవర్తింపజేయటం, జీవుల సముదాయంపై దయగలిగి ఉండటం, సత్యముపై దృష్టి ఉంచటం, ఆత్మకంటె ఇతరములైన వాటియందు విరక్తి, యోగకౌశలంవలన ఇంద్రియాలకు చలనం మాన్పి, గట్టి నిలుకడ కూర్చి వాటికి సంపూర్ణమైన శాంతి నొసంగటమే ఆ నివృత్తి ధర్మ ప్రకారమై ఉన్నది.

వ. అని మఱియును. 32

తాత్పర్యం: అని పలికి శంకరుడు మరల ఇట్లా అన్నాడు.

తే. 'క్షుత్పిపాసలచేఁ గడుఁ గుందినట్టి । యతిథి వచ్చినఁ బ్రియమున నతని దప్పి
వోవునట్లుగ సముచితభోజనంబు । వెట్టు టెల్ల పుణ్యములకుఁ బెద్ద తలఁప. 33

ప్రతిపదార్థం: క్షుత్ పిపాసలచేన్= ఆకలి దప్పులచేత; కడున్ = మిక్కిలి; కుందినట్టి = డస్సినటువంటి; అతిథి =

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆగంతుకుడు; వచ్చినన్ = రాగా; ప్రియమునన్= ప్రేమతో; అతని డప్పి = అతని యొక్క శ్రమ; పోవునట్లుగన్ = తొలగేటట్లు; సముచిత భోజనంబు= మిక్కిలి తగిన భోజనం; పెట్టుట; ఎల్ల పుణ్యములకున్= అన్ని ధర్మాలలోనికి; తలంపన్= భావించగా; పెద్ద= దొడ్డది.

తాత్పర్యం: ఆకలి దప్పులతో నొచ్చి యింటికి వచ్చిన అతిథికి ఆదరంతో అన్నం పెట్టి అతడి బడలిక తీర్చడం పుణ్యాలన్నింటిలో గొప్ప పుణ్యం.

విశేషం: అతిథిః తిథులతో నిమిత్తం లేకుండ ఆకలి దప్పులు తీర్చుకొనటానికి వచ్చినవాడు, భోజన సమయానికి వచ్చినవాడు.

క. దీనికి నఖిలాశ్రమ సువి । ధానంబులకును గృహస్థతయ నెల వగుటన్
దాని పదాఱవ పాలి స । మానముగా దరయ నాశ్రమం బెయ్యదియున్.' 34

ప్రతిపదార్థం: దీనికిన్ = ఈ చెప్పిన అతిథి సుకృతానికి; అఖిల+ఆశ్రమ సువిధానంబులకున్ = బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమములనే నాలుగు ఆశ్రమాల యొక్క మంచి పద్ధతులకును; గృహస్థతయ = గార్హస్థ్య ధర్మమే; నెలవు+అగుటన్ = ఉనికిపట్టు కావటంచేత; ఆశ్రమంబు+ఎయ్యదియున్ (ఏ+అది = ఏయది, ఎయ్యది) = ఏ యాశ్రమం కూడ; అరయన్ = పరికించగా; దాని పది+ఆఱవపాలి= ఆ గృహస్థాశ్రమ ధర్మము యొక్క షోడశాంశమునకు కూడ; సమానము+కాదు= సాటిరాదు.

తాత్పర్యం: సఖీ! ఈ చెప్పిన అతిథి సత్కారానికీ, తక్కిన ఆశ్రమాల మనుగడకూ (ఉనికికీ) గృహస్థాశ్రమమే ఆధారం కనుక ఏ ఆశ్రమం కూడ దీని పదారవభాగానికి గూడ సమానం కాదు. అనగా చతురాశ్రమాలలో గృహస్థాశ్రమమే కడుదొడ్డదని భావం.'

క. అన విని 'గృహస్థునకు నే । పనిముఖ్యం?' బనియె గిరిజ; పశుపతి 'జననీ
జనకారాధన మతనికి । ననుపమ మగునట్టి ధర్మ' మని రూపించెన్. 35

ప్రతిపదార్థం: అనన్+విని = అని చెప్పగా ఆలించి; గిరిజ = పార్వతి; గృహస్థునకున్ = సంసారికి; ఏ పని ముఖ్యంబు+అనియెన్ = ఏ కార్యం ప్రధానమని అడిగింది. (అందుకు); పశుపతి= శివుడు; అతనికిన్ = గృహస్థునకు; జననీజనక+ఆరాధనము = తలి దండ్రులను పూజించటం; అనుపమము+అగునట్టి = పోలిక లేనట్టి; ధర్మము+అని = పుణ్య కార్యమని; రూపించెన్ = నిర్ణయించాడు.

తాత్పర్యం: పరమశివుడి పలుకులు విని పార్వతి 'ప్రాణేశ్వరా! గృహస్థుడికి ఏ పని ముఖ్యం?' అని ప్రశ్నించింది. 'అతడికి తలిదండ్రులపూజ ముఖ్యమైన' దని శివుడు బదులు పలికాడు.

వ. అ ద్దేవుండు వెండియు. 36

తాత్పర్యం: భగవంతుడైన శివు డింకా (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం)

క. 'పతి భక్తి ముఖ్య ధర్మము । సతి' కనవుడు, దేవి 'నరుఁడు జననీ జనకుల్
మృతు లైనను, నాతి విగత । పతిత్వ మొందినను జేయు పను లెయ్యవియో?' 37

ప్రతిపదార్థం: సతికిన్ = భార్యకు; పతి భక్తి = మగని యందు భక్తి; ముఖ్య ధర్మము = ప్రధానమైన ధర్మం; అనవుడున్ = అని శంభుడు చెప్పగా; దేవి = గౌరి; నరుఁడు = మనుష్యుడు; జననీ జనకుల్ = మాతా పితలు; మృతులు+ఐనన్ = చని పోయినను; నాతి = స్త్రీ; విగత పతిత్వము+ఒందినను = పెనిమిటిని కోల్పోయినను; చేయుపనులు = ఆచరించవలసిన కార్యాలు; ఏ+అవి+ఓ(ఎయ్యవియో)? = ఎట్టివో? (అని అడిగింది).

తాత్పర్యం: 'సతికి పతిసేవే ప్రధాన కర్తవ్య' మని పరమశివుడు పలుకగా భవాని 'నాథా! గృహస్థు తలిదండ్రులను, భార్య భర్తను కోల్పోయి నపుడు వారు చేయవలసిన పను లేమిటో సెలవిం' డని కోరింది.

వ. అనుటయు నభవుండు 'వారి వర్తనంబు లెఱింగించెద విను' మని యిట్లనియె. 38

ప్రతిపదార్థం: అనుటయున్ = అని కోరగా; అభవుండు = శంకరుడు; వారి వర్తనంబులు = వారు నిర్వహించవలసిన విధులు; ఎఱింగించెదన్; వినుము; అని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: పార్వతి ప్రశ్న విని శంకరుడు, 'ఉమా! నీవు అడిగిన వారి కర్తవ్య కర్మ లేమిటో తెలుపుతాను విను' మని ఇట్లా అన్నాడు.

క. 'దేవాతిథి పితృ పూజలు । గావించుట భావశుద్ధి కలిమి నరునకున్
దేవీ! వలయును వారికి । నే విధమున బ్రహ్మచర్య మేమఱమి తగున్.' 39

ప్రతిపదార్థం: దేవ+అతిథి+పితృపూజలు = దేవతల యొక్క, అతిథుల యొక్క, పితృ దేవతలయొక్క పూజలు; కావించుట = చేయుట; నరునకున్ = మనుజుడికి; భావ శుద్ధి కలిమి = భావంలో నిర్మలత్వం ఉండడం; వలయును= కావాలి; దేవీ!= ప్రియురాలా!; ఏ విధమునన్ = ఏ రీతిగానైనా; వారికిన్ = పతివిహీనలకు, విధవరాండ్రకు; బ్రహ్మచర్యము = బ్రహ్మచర్యవ్రతపాలనం; ఏమఱమి = మఱవకుండటం; తగున్ = ఒప్పును.

తాత్పర్యం: 'ప్రియురాలా! దేవతల, పితృదేవతల, అతిథుల పూజలు సక్రమంగా నడపటం చిత్తశుద్ధి కల్గి ఉండటం నరులకు ముఖ్యం. బ్రహ్మచర్య వ్రతాన్ని ఏ విధంగానైనా ఏమరకుండటం విధవలకు యుక్తం.

వ. అని నిర్దేశించి మఱియును. 40

తాత్పర్యం: అని నిర్ణయపూర్వకంగా చెప్పి పరమేశ్వరుడు ఇంకా (ఇట్లా అన్నాడు అని తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. 'పంచపర్వ సురత పరిహృతితో నిజ । దార తృప్తుఁ డగుచు ధాన్యకోటి
పక్షి యెలుక దినిన బ్రతుకుఁగాఁ గను గృహ । పతికి నశ్వమేధ ఫలము గలుగు.' 41

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పంచపర్వ = అయిదు పర్వములందు అనగా అష్టమి, చతుర్దశి, పూర్ణిమ, అమావాస్య, సూర్యసంక్రాంతి దినములందు; సురత పరిహృతితోన్ = సంభోగం వర్జించటంతో పాటు; నిజదారతృప్తుఁడు+అగుచున్ = తన భార్యతో సంభోగించి సంతుష్టి చెందుతూ; ధాన్యకోటిన్ = తన యింటిలోని ధాన్య సమూహమును; పక్షి = పిట్ట; ఎలుక = మూషికం; తినినన్ = తింటే; బ్రతుకుకున్ +గాక = అవి తిని జీవించుగాక; అను = అని పల్కునట్టి; గృహపతికిన్ = ఇంటియజమానుడికి-గృహస్థుడికి; అశ్వమేధ ఫలము = అశ్వమేధ యాగం చేస్తే లభించే ఫలం; కలుగున్ = లభిస్తుంది.

తాత్పర్యం: 'నెలలో వచ్చే అష్టమి, చతుర్దశి, పున్నమ, అమావాస్య, రవి సంక్రాంతి తిథులందు సంగమం వదలి, కేవలం తన భార్య కలయికతోనే సంతృప్తి చెందుతూ, తన గృహంలోని ధాన్యరాశిని పక్షులు, ఎలుకలు తింటుంటే వాటిని హింసించకుండా, అవిగూడ తిని బ్రదుకు గాక అని భావించే గృహమేధి అశ్వమేధయాగం చేసినవారు పొందే ఫల మెంతటిదో, అంతటి ఫలాన్ని పొందుతాడు.'

విశేషం: పై పద్యంలోని మూడవ పాదం "పక్షి యెలుక దినిన బ్రతుకుఁగాఁగను గృహపతికి" అని ఉన్నప్పుడు ఆ పాఠానికి ధాన్యకోటిని పక్షులు, ఎలుకలు కేవలం జీవించడానికి మాత్రమే తిన్న చందంగా, కేవలం భోగకాంక్షతో గాకుండా బ్రతుకు వెళ్ళబుచ్చడానికే ఆహారం స్వీకరించే గేస్తు హయమేధయాగ ఫలాన్ని పొందుతాడని అర్థం చెప్పుకోవచ్చును.

వ. అని చెప్పి. 42

తాత్పర్యం: ఈ విధంగా పలికి.

ఆ. 'ఎచట మెలఁగె నేమి యెట్లుండె నేమి దా । నేమి సేసె నేమి యెల్ల సంగ
ములును విడిచి కుడుపు వలన నియతి గల్గు । యతికి మోక్షవీథి యాటపట్టు'. 43

ప్రతిపదార్థం: ఎచటన్ = ఎక్కడ; మెలఁగెన్+ఏమి = ఎట్లు ప్రవర్తించినా; ఎట్లు+ఉండెన్+ఏమి = ఎక్కడ నివసించినా; తాన్ = తాను; ఏమిచేసినన్+ఏమి = ఎట్టి పనులు చేసినా; ఎల్ల సంగములును విడిచి = సర్వ సంగపరిత్యాగ మొనర్చి; కుడుపు వలనన్ = ఆహార విషయంలో; నియతి+కల్గు = నియమమున్న; యతికిన్ = సన్న్యాసికి; మోక్షవీథి = ముక్తి పథం; ఆట పట్టు = క్రీడారంగం, విహార స్థలం, సులభసాధ్యం.

తాత్పర్యం: 'ఎక్కడ ఎట్లా ప్రవర్తించినా, ఎట్లా ఉన్నా, ఎట్టి పనులు చేసినా సర్వ సంగములనూ పరిత్యజించి, ఆహార విషయంలో నియమ మున్న యతీశ్వరుడికి ముక్తి కరతలామలకం.'

వ. అనిన విని సంప్రీతయై శైలరాజపుత్రి పురహరునితో 'రాజనువానికి భూజనంబుల యట్ల శరీరంబును భోజనాదులును నట్లయుండియు నతం డెల్లవారలచే మ్రొక్కు గొనుటకు, నిగ్రహానుగ్రహం బులకుం జాలి సర్వాధికత్వంబున శోభిల్లు దానికిం గారణం బేమి ? యెఱింగింపవే' యనుటయు నీశానుం డిట్లనియె.44

ప్రతిపదార్థం: అనినన్+విని = అని శంకరుడు చెప్పగా ఆలకించి; సంప్రీత+ఐ = సంతోషించినదై; శైలరాజపుత్రి = హిమవంతుడి కూతురైన సర్వమంగళ; పురహరునితోన్ = త్రిపుర ధ్వంసకుడైన రుద్రుడితో; రాజు+అనువానికిన్ = ప్రభువనే వాడికి; భూజనంబుల+అట్ల = పుడమిలోని జనుల వలెనే; శరీరంబును = దేహమూ; భోజన+ఆదులును = ఆహారం మొదలైనవి; అట్లు+అ+ఉండియున్ = భూమియందలి నరుల వలెనే ఉన్నప్పటికినీ; అతండు = రాజు; ఎల్లవారలచేన్ = మనుష్యులందరి చేత; మ్రొక్కు కొనుటకున్ = నమస్కారాలు స్వీకరించడానికినీ; నిగ్రహ+అనుగ్రహంబులకున్ = శిక్షించుటకునూ,

రక్షించుటకునూ; చాలి = సమర్థుడై; సర్వ+అధికత్వంబునన్ = అందరికంటె అధికుడై; శోభిలున్ = ప్రకాశిస్తాడు; దానికిన్ = అట్లా రాజు వెలుగొందటానికి; కారణంబు+ఏమి? = హేతువేమిటి?; ఎఱింగింపవు+ఏ = తెలుపుమా; అనుటయున్ = అని అంబిక అడుగగా; ఈశానుండు = శివుడు; ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పరమశివుడు అట్లా పలుకగా సంతోషించి పార్వతీదేవి ఆయనతో 'సర్వజ్ఞా! రాజనేవాడికి లోకం లోని నరులకు వలెనే శరీరమున్నది. వారికి వలెనే భోజనమజ్జనాదులు కూడ సాగుతాయి. అయినప్పటికీ రాజు తక్కిన వారికంటె అధికుడై అందరి వందనాలు అందుకొంటాడు. ప్రజలను దండించటానికీ, పరిరక్షించటానికీ అతడు సామర్థ్యం కలిగి ఉంటాడు. ఇందుకు కారణమేమిటో వివరించండి-' అని వేడగా మహేశ్వరుడిట్లా అన్నాడు.

శివుఁడు పార్వతికి రాజత్వ మహిమాతిశయంబు చెప్పుట. (సం.13-అను- 1-15-895)

సీ. **'అధికపుఁదపమున నైనది రాజత్వ; । మట్లు గావునఁ బేర్మి నతిశయిల్లు;**
జనములచే మ్రొక్కుగొనుటకు నిగ్రహం । బునకు ననుగ్రహంబునకు శక్తుఁ
డై యుండు నతఁడు; తదీయ సునీతియ । విను ముదమున రాజు వినయపరునిఁ
జేసి యెల్లజనంబు శిక్షించు, నింద్రియ । జయమును నరివర్గజయముఁ బడయు,

తే. **నెఱిఁగి యుపధా విశుద్ధుల నిడు నమాత్య । పదవి, కనురక్త సారవద్బలముఁ బ్రోచు;**
హితవరుల మిత్త్రులుగఁ గొను నిలకు మేలొ । నర్చు, దుర్గంబు రక్షించుఁ, గూర్చు ధనము. **45**

ప్రతిపదార్థం: రాజత్వము = రాజగుట, రాచరికం; అధికము+తపమునన్ = మిక్కుటమైన తపస్సు చేత; ఐనది = లభిస్తుంది; అట్లు+కావునన్ = తపశ్చర్యయే దొరతనానికి హేతు వవటం చేత ; అతఁడు = ప్రభువు, పేర్మిన్ = గౌరవంతో; అతిశయిల్లున్ = పెంపొందుతాడు; జనములచేన్ = ప్రజలచేత; మ్రొక్కున్+కొనుటకున్ = వందనాలు స్వీకరించటానికి; నిగ్రహంబునకున్ = దండించటానికి; అనుగ్రహంబునకున్ = దయదలచి కాపాడటానికి; శక్తుఁడు+ఐ+ఉండున్ = చాలినవాడై, దక్షుడై ఉంటాడు; విను = గౌరీ! చెవి యొగ్గి ఆలకించుము; తదీయ సునీతి+అ = వాని యొక్క మంచినీతియే; ముదమునన్ = సంతోషంతో; రాజున్ = నృపాలుడిని; వినయపరునిన్+చేసి = అడకువ కలవాడినిగా ఒనర్చి; ఎల్ల జనంబున్ = సమస్త ప్రజలను; శిక్షించున్ = అణకువ గలవారినిగా చేస్తుంది; ఇంద్రియ జయమును = ఇంద్రియముల యొక్క గెలుపును; అరివర్గ జయమున్ = శాత్రవ సమూహము యొక్క గెలుచుటను; పడయున్ = పొందుతుంది; ఉపధా విశుద్ధులన్ = గుణశీల పరీక్షలో నెగ్గిన పవిత్రులైన వారిని; ఎఱిఁగి = తెలిసి; అమాత్యపదవికిన్+ఇడున్ = మంత్రి పదవులలో నిలుపుతుంది; అనురక్త = తనయందు అనురాగం గల; సారవత్ = చేవ గలిగిన; బలమున్ = సైన్యమును; ప్రోచున్ = కాపాడుతుంది; హితవరులన్ = తనకు మేలుచేయటంలో ఆసక్తి కలవారిని; మిత్రులుగన్ = స్నేహితులుగా; కొనున్ = స్వీకరిస్తుంది; ఇలకున్ = ధరణికి, జనులకు; మేలు+ఒనర్చున్ = క్షేమం కలిగిస్తుంది; దుర్గంబున్= కోటను, రక్షించున్ = కాపాడుతుంది; ధనమున్ = విత్తాన్ని; కూర్చున్ = సమకూరుస్తుంది, చేరుస్తుంది.

తాత్పర్యం: 'చేసిన తపస్సుకు ఫలంగా రాజుగా జన్మించడం జరుగుతుంది. కనుక రాజు గౌరవపాత్రుడై వెలుగొందుతాడు. భూపతి జనుల నమస్కారాలు గైకొనడానికి, వారిని దండించటానికి, దయతో కాపాడటానికి తగిన వాడై ఉంటాడు. అత డనుసరించే మంచినీతి అతడిని అణకువ కలవాడినిగా తీర్చిదిద్ది ప్రజలందరినీ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నీతిమార్గంలో నడిపిస్తుంది. ఆ నీతివలననే భూవల్లభుడు ఇంద్రియజయం, శాత్రవ జయం పొందుతాడు. చక్కగా యోచించి గుణశీలపరీక్షలో ఉత్తీర్ణులైన పవిత్రులను మాత్రమే మంత్రి పదవులలో నియమిస్తాడు. తనయందు ప్రేమ విశ్వాసాలున్న, చేవగలిగిన సేనలను దయతో పోషిస్తాడు, తనకు మేలుచేసే వారినే 'స్నేహితులుగా చెంతకు చేర్చు కొంటాడు. ఆత డనుసరించే నీతి జనులకు క్షేమం కలిగిస్తుంది. దుర్గాన్ని రక్షిస్తుంది. ధనాన్ని సమకూరుస్తుంది.

విశేషం: జ్ఞానేంద్రియాలు : కన్ను, ముక్కు, చెవి, చర్మం, నాలుక

కర్మేంద్రియాలు : వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థ.

పాయువు అనగా మల ద్వారం; ఉపస్థ అనగా మూత్రద్వారం. ఇవి పది. మనస్సు ఒకటి మొత్తం ఇంద్రియాలు పదకొండు. వాటిని జయించట మంటే అవి అసన్మార్గంలో చరించకుండా సన్మార్గంలో వర్తించేటట్లు చూడటం.

వ. ఇవ్విధంబున సప్తాంగ సంపన్నత్వంబు నొంది. 46

ఇవ్విధంబునన్= పై పద్యంలో నిరూపించిన విధంగా.

తాత్పర్యం: రాజు ఈ విధంగా సప్తాంగ సంపత్తి పొందినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: సప్త+అంగములు = సప్తాంగములు

1.రాజు, 2.అమాత్యుడు, 3.మిత్రుడు, 4.బొక్కసం, 5.రాజ్యం, 6.దుర్గం, 7. సైన్యం

"స్వామ్యమాత్య సుహృత్కోశ రాష్ట్ర దుర్గ బలాని చ" అని ఈ విషయాన్నే అమరకోశం వివరించింది.

క. చేయఁ డపాత్రవ్యయములు। సేయుం బాత్రవ్యయంబు సేయున్ నిజ ర
క్షాయత్న మెల్లతెఱఁగులఁ। బాయక ధర్మంబు సేయుఁ బాపము దొఱఁగున్. 47

ప్రతిపదార్థం: అపాత్రవ్యయములు చేయఁడు = అనర్హములైనవాటికి డబ్బు వెచ్చించడు; పాత్ర వ్యయంబు+చేయున్ = తగినవాటికే వెచ్చిస్తాడు; నిజరక్షాయత్నము = తనను కాపాడుకొనే ప్రయత్నం; ఎల్ల తెఱఁగులన్ = అన్నివిధాల; చేయున్ = చేస్తాడు; పాయక = ఉడుగక, మానక; ధర్మంబు+చేయున్ = పుణ్యకార్యాలు ఆచరిస్తాడు; పాపంబు+తొఱఁగున్ = పాప కృత్యాలు మానుతాడు.

తాత్పర్యం: ప్రభువైనవాడు చేయదగని వ్యయం చెయ్యడు. అర్హమైన వాటికి వెచ్చించడంలో వెనుకంజ వేయడు. తన్ను సకలవిధాల సంరక్షించుకొనటంలో ఏమరుపాటు వహించడు. పుణ్యకార్యాలు చేస్తాడు. పాపకార్యాలు మానుతాడు.

ఆ. ఆచరించు దండ మక్రోధకాముఁడై। చారదృష్టిఁ జూచు శత్రు కృత్య
ములను, నాత్మదేశ పుర పరివారవి। ధముల సత్యభాషణముల నెగడు. 48

ప్రతిపదార్థం: అక్రోధకాముఁడు+ఐ = కోపం, ప్రేమ లేనివాడై; దండము = శిక్ష; ఆచరించున్ = విధిస్తాడు; శత్రుకృత్యములను = విరోధులుచేసే పనులను; ఆత్మదేశ = తనదేశమందలి; పుర = పట్టణాలలోని; పరివార = బలగముయొక్క; విధములన్

= తీరు తెన్నులను, పోకడలను; చారదృష్టిన్ = వార్తలు తెచ్చే వేగుల వాండ్రు అనే కళ్ళతో; చూచున్ = కనుగొంటాడు; సత్యభాషణములన్ = సత్యవాక్యము లాడుతూ; నెగడున్ = వెలుగొందుతాడు.

తాత్పర్యం: న్యాయవిచారణ సలిపి శిక్ష విధించేటప్పుడు పరాయివాడని ఒకడిపై కోపంగాని, తనవాడని మరొకడిపై ప్రేమగాని చూపడు. తనకు విరోధులైన ఇరుగు పొరుగు రాజ్యాలలోనివారు చేసే పనులనూ, తన రాజ్యమందలి జనులూ, పట్టణాలలోని ప్రజలూ, తన సేవకులూ తననుగూర్చి ఏమనుకొంటున్నారో వేగులవాండ్రు అనే కన్నులతో చూచి తెలుసుకొంటాడు. సత్యవాక్పరిపాలకుడై విఖ్యాతి వహిస్తాడు.

క. ఉద్యోగము ప్రియవాదిత ।విద్యాపరినిష్ఠ సంధి విగ్రహ విహతా
వద్యత దీనానాథ వి । పద్యాపన మాజ్ఞవెరవు వాటించుఁ దగన్. 49

ప్రతిపదార్థం: ఉద్యోగము = ప్రయత్నం; ప్రియవాదిత = ప్రేమగా మాట్లాడటం; విద్యాపరినిష్ఠ = విద్యలయందు మిక్కిలి అక్కర; సంధి విగ్రహ విహత+అవద్యత = సంధి విగ్రహాలనే తంత్రాల చేత దోషాలు పోగొట్టుకొనటం; దీన+అనాథ+ విపద్+యాపనము = దీనుల యొక్క, దిక్కులేని వారి యొక్క ఆపదలను తొలగించటం; ఆజ్ఞ వెరవు = ఆజ్ఞ లివ్వటంలో నేర్పు; తగన్ = ఒప్పిదంగా, పాటించున్ = ప్రభువు అనుసరిస్తాడు.

తాత్పర్యం: రాజైనవాడు యత్న పరుడు కావాలి. ప్రియంగా సంభాషించాలి. విద్యలయందు శ్రద్ధాసక్తులు గలిగి ఉండాలి. సంధి విగ్రహం మొదలైన షట్తంత్ర ప్రయోగనైపుణివల్ల ఏర్పడ్డ చిక్కులు తొలగించుకొనాలి. దీనుల యొక్క, దిక్కుమాలినవారి యొక్క ఆపదలు తొలగించాలి; ఆజ్ఞలిడి పనులు చేయించటంలో చాతుర్యం ప్రదర్శించాలి. ఇవి రాజులు అనుసరించ వలసిన ధర్మాలు.

ఆ. కయ్యమునకు నెపుడుఁ గాలు ద్రవ్వఁడు, తగ । వైన రణము శూరుఁడై యొనర్చు;
యజ్ఞ దాన విధి పరాయణుఁడై యుండు । ని త్తెఱంగు వృత్త ముత్తమంబు. 50

ప్రతిపదార్థం: కయ్యమునకున్ = యుద్ధమునకు; ఎపుడున్ = ఏ వేళనూ; కాలుద్రవ్వఁడు = సిద్ధపడడు; తగవు+ఐన+రణమున్ = న్యాయమైన సంగ్రామాన్ని; శూరుఁడు+ఐ = వీరుడై; ఒనర్చున్ = చేస్తాడు; యజ్ఞ దాన విధి పరాయణుఁడు+ఐ = యాగాలు, దానాలు చేయటంలో శ్రద్ధాసక్తులు కలవాడై ; ఉండున్ = ఉంటాడు; ఈ+తెఱంగు వృత్తము = ఈ విధమైన నడవడిక; ఉత్తమంబు = శ్రేష్ఠం.

తాత్పర్యం: ప్రభువైన వాడు తనకు తానుగా అకారణంగా జగడానికి ఎప్పుడూ సిద్ధ పడడు. ధర్మంగా యుద్ధం చేయవలసివచ్చినపుడు వెనుకడుగు వేయడు. యజ్ఞము లొనర్చటంలో, దానాలు చేయటంలో శ్రద్ధాసక్తులు కలిగి ఉంటాడు. రాజుకు ఇటువంటి ప్రవర్తనమే సముచితం.

విశేషం: 'కయ్యమునకు కాలుద్రవ్వ' వంటి జాతీయాలకు, నుడికారాలకు తిక్కన రచన కాణాచి.

క. ఈ నీతులకు విరుద్ధము । లైన పనుల నరకములకు నరుగు నృపతి పా
పానీత దుఃఖ మొకతతి । మాను నొరుల కతని కెపుడు మానక యుండున్. 51

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నృపతి = రాజు; ఈ నీతులకున్ = ఈ న్యాయ కార్యాలకు; విరుద్ధములు+ఐన = వ్యతిరిక్తాలైన; పనులన్ = పనులు చేయటంవలన; నరకములకున్+అరుగున్ = దుర్గతుల పాలవుతాడు; పాప+ఆనీత దుఃఖము = పాపకార్యాలు చేయటం చేత కలిగిన దుఃఖం; ఒరులకున్ = ఇతరులకు; ఒకతఱిన్ = ఒకప్పుడు; మానున్ = తొలగిపోతుంది; అతనికిన్ = రాజుకు మాత్రం; ఎపుడున్ = ఎట్టి సమయమందునూ; మానక+ఉండున్ = విడువకుండా ఉంటుంది.

తాత్పర్యం: రాజైన వాడు పూర్వోక్తమైన న్యాయానికి విరుద్ధములైన పనులు చేస్తే నరకాల పాలవుతాడు. పాపం వల్ల కలిగే దుఃఖాలు ఒకప్పుడు ఇతరులను వదల వచ్చును గాని రాజును మాత్రం ఎన్నటికీ వదలవు.

ఆ. భావశుద్ధి గలిగి యీ వినీతులఁ బూని। ప్రజల కెవ్వఁ డతుల రక్షణంబు
సేయు నట్టి విభుఁడు సిరియును గీర్తియుఁ। గాంచుఁ బుణ్యలోక గతియుఁ బడయు.' 52

ప్రతిపదార్థం: భావశుద్ధి+కలిగి = నిర్మలమైన మనస్సు గలిగి; ఈ+వినీతులన్+పూని = ఈ చెప్పబడిన న్యాయపద్ధతుల ననుసరించి; ఎవ్వఁడు = ఏ రాజు; ప్రజలకున్ = జనులకు; అతుల రక్షణంబు = సాటిలేని సంరక్షణ; చేయున్ = కలిగిస్తాడో; అట్టి విభుఁడు = అటువంటి ప్రభువు; సిరియున్ = సంపదయు; కీర్తియున్ = యశస్సునూ; కాంచున్ = పొందుతాడు; పుణ్యలోక గతియున్ = ఉత్తమలోక నివాసం; పడయున్ = పొందుతాడు.

తాత్పర్యం: ఏ రాజు చిత్తశుద్ధితో ఈ చెప్పిన నీతుల్ని అనుసరించి ప్రజలను రక్షిస్తాడో ఆ రాజు ఐశ్వర్యమునూ, యశస్సునూ పొందగలడు. మరణానంతరం పుణ్యలోకాలకు వెళ్ళుతాడు.'

క. అనుటయు 'ధర్మ రహస్యము। వినఁ గోరెద' ననిన శాంభవికి శంభుం డి
ట్లనియె 'నహింస రహస్యం। బనఁ బరఁగును ధర్మజాత మఖిలమునందున్.' 53

ప్రతిపదార్థం: అనుటయున్ = అని శివుడు పలుకగా; ధర్మ రహస్యమున్ = ధర్మ మందలి మర్మమును, ధర్మ సూక్ష్మాన్ని; వినన్+కోరెదన్ = వినుటకు కుతూహల పడుతున్నాను; అనిన శాంభవికిన్ = అని అడిగిన అంబికకు; శంభుండు = పరమేశ్వరుడు; ఇట్లు+అనియెన్ = ఈ విధంగా చెప్పాడు; అహింస = ప్రాణులను బాధించకుండుట; ధర్మజాతము+ అఖిలము+అందున్ = సమస్తమైన ధర్మ సమూహంలో; రహస్యంబు+అనన్ = రహస్యమని చెప్పుటచేత; పరఁగును = ఒప్పును.

తాత్పర్యం: అని శివుడు వచింపగా పార్వతీదేవి 'నాథా! ధర్మ రహస్యం వినవలెనని కుతూహల పడుతున్నాను' అన్నది. అందుకు శంకరుడు 'దేవీ! సకల ధర్మ సమూహమునందు జీవులను హింసించకుండటమే పరమ ధర్మ'మని పలికాడు.

వ. అనిన విని యా జగన్మాత యవ్విశ్వధాతతో 'హింసావర్జనం బే జనులకుం జెల్లదని చూచెద; నహింస తెఱం గెఱింగింపవే' యనిన నద్దేవుం 'డది నీ తలంచినట్లు; నేలం బిపీలికా ప్రముఖంబుల నాకసంబున మశకాదుల మఱియుం బేను నల్లి సీరపేను లోనైన జంతువులం జంపక యెవ్వరికి మానరా; దట్లు గావున.54

ప్రతిపదార్థం: అనినన్ విని = అని శంభుడు పల్కగా ఆకర్ణించి; ఆ జగత్+మాత = లోకాలకు తల్లిఅయిన పార్వతి; ఆ విశ్వధాతతోన్ = ప్రపంచాన్ని ధరించే (పోషించే) పరమేశ్వరుడితో; హింసా వర్జనంబు = హింసను మానటం; ఏ జనులకున్

= ఎవ్వరికినీ; చెల్లదు+అని = శక్యం కాదు అని; చూచెదన్ = భావిస్తాను; అహింస తెఱంగు = అహింసావిధానమును, స్వరూపాన్ని; ఎఱింగింపవు+ఏ = తెలుపుమా; అనినన్ = అని వేడగా; ఆ+దేవుండు= ఆ ధూర్జటి; అది = అహింస అనేది; నీ తలంచినట్లు+అ = నీవు భావించినట్లే దుస్సాధ్యం; నేలన్ = భూమిమీద ; పిపీలికా ప్రముఖంబులన్ = చీమలు మొదలైన వాటిని; ఆకసంబునన్ = అంబరంలో; మశక+ఆదులన్ = దోమలు మొదలైన వాటినీ; మఱియున్ = ఇంకనూ; నల్లి = మత్కుణం; సీరపేను = చీరపేను = బట్టను అంటుకొని ఉండే తెల్లని పేను; లోనైన = (లోను+ఐన) = మొదలైన; జంతువులన్ = ప్రాణులను, చంపక; ఎవ్వరికిన్ = ఎంతటి వారికినీ; మానన్ రాదు = విడిచి పెట్టుటకు వీలుకాదు; అట్లు+కావునన్ = అందుచేత; (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అని ఈశ్వరు డనగా విని ఆ జగజ్జనని జగద్రక్షకుడైన సదాశివుడితో 'ప్రాణేశ్వరా! హింస చేయకుండటం ఎవ్వరికినీ శక్యం కాదని భావిస్తాను. అహింసా స్వరూపం ఎట్లాంటిదో తెలుపవలసింది' అని వేడగా శివుడు 'ప్రేయసీ! నీ వన్నట్లుగానే నేలమీద చీమలు మొదలైన వాటినీ, గగనంలో దోమలు మొదలైన వాటినీ, తల వెంట్రుకలలో పేలనూ, మంచముల నాశ్రయించుకొన్న నల్లులనూ, వస్త్రాలనంటి పెట్టుకొన్న చీర పేలూ మొదలైన కీటకాలను చంపకుండా ఉండటం ఎవ్వరికినీ సాధ్యం కాదు. అందుచేత

చ. **ఫలము దళంబునుం దొడిమఁ బాయుట, రాలిన వానిఁ గొంచు నా**
కలి కెరవేసి గోరసము కార్యమునట్టుల నిర్వహించి బు
ద్ధులు వెలిలేక నిశ్చలతఁ దోయజపత్రనిభాక్షి! చిత్రరూ
పులొకో యనంగ నుండు శమ పుణ్యులు సూవె యహింసనాత్మకుల్. **55**

ప్రతిపదార్థం: తోయజ పత్రనిభ+అక్షి = కమల దళములతో సమానములైన కన్నులుగల గౌరీ!; ఫలము = పండూ; దళంబునున్ = ఆకూ; తొడిమన్+పాయుటన్ = వృంతమును వీడటం వల్ల, కాడను వదలడం చేత; రాలిన వానిన్ = చెట్టునుంచి క్రింద పడిన ఆ ఫలపర్ణాలను; కొంచున్ = గ్రహిస్తూ; ఆఁకలికిన్ = క్షుత్తునకు; ఎరవేసి = ఆహారమొనర్చి; గోరసము కార్యము = ఆవుపాలు లేక పెరుగు లేక మజ్జిగ అనువాటిని త్రాగడం అనే పనిని; అట్టులన్ = నేలరాలిన పండ్లను ఆకులను భక్షించినట్లే; నిర్వహించి = చేసి (ఆకలిని ఫలపర్ణాలతో, దప్పికను గోక్షీరాదులతో తీర్చుకొని); బుద్ధులు = తలంపులు; వెలిలేక = బహిర్విషయాల మీదికి వెళ్ళకుండా అనగా ఆత్మేతర విషయములందు ప్రవర్తించకుండా; నిశ్చలతన్ = చలనం లేక; చిత్ర రూపులు+ఒకొ+అనంగన్ = పటాలలోని బొమ్మలు కాబోలు అనునట్లు; ఉండు = ఉన్నట్టి; శమ పుణ్యులు = అంతరింద్రియనిగ్రహం గలిగిన పుణ్యాత్ములు; అహింసన+ఆత్మకుల్+చూవె = జీవహింస సల్పనట్టి స్వభావం కలవారు సుమా!

తాత్పర్యం: ఫలాలు, ఆకులు బాగుగా పండి చెట్ల తొడిమల నుండి తమంతట తామే నేలమీద రాలగా వాటిని తిని ఆకలి తీర్చుకొంటూ, ఆవుపాలో, పెరుగో, మజ్జిగో త్రాగి దప్పిక బాపుకొంటూ ఇతర విషయాల మీదికి బుద్ధులు పోనీయకుండా, చిత్తరువులలోని బొమ్మల మాదిరి చలనరహితులై, అంతరింద్రియాలను జయించిన మహనీయులే సుమా అహింసా స్వభావులు!

విశేషం: సూవె అనే పదం సహజ సరళానిది కాదు. చూవె, చూడవే, చూడవే, చూ అనేవి గసడదవాదేశ సంధివల్ల సూ గా మారుతాయి. చూవె-సూవె చుమా-సుమా, చుమీ, సుమ్మీ చూ- సూ- ఇవి నిశ్చయార్థకములైన అవ్యయాలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. అదియ శ్రుతిచేత ధర్మ రహస్య మనఁగఁ । బడియె' నని చెప్పి మఱియును భవుఁడు దేవి
కిట్టులను 'నట్లుగాక యహింస తెఱఁగు । గలదు వినుము విశేషించి కమలనయన! 56

ప్రతిపదార్థం: కమలనయన! = తామర రేకుల వంటి కన్నులు గల కాంతామణీ!; అదియ = హింస చేయకుండటమే; శ్రుతి చేతన్ = వేదం చేత; ధర్మ రహస్యము+అనఁగన్+పడియెన్ = ధర్మ రహస్యమని నుడువబడింది; అని చెప్పి = అని వచించి; మఱియును = ఇంకా; భవుఁడు = మహా దేవుఁడు; దేవికిన్ = భగవతిఅయిన కాత్యాయనికి; ఇట్టులు+అనున్ = ఈ విధంగా అన్నాడు; అట్లు+కాక = ఇంతకు ముందు చెప్పబడినట్లేగాక; విశేషించి = ప్రత్యేకించి; అహింస తెఱఁగు+కలదు = అహింసా విధాన మున్నది; వినుము = ఆలకించుము.

తాత్పర్యం: కాత్యాయనీ! ఈ అహింస అనేదే ధర్మ రహస్యమని వేదంలో చెప్పబడింది' అని పల్కి శివదేవుడు భవానితో ఇట్లన్నాడు. 'దేవీ! అహింస అనేది వేరే విధంగా కూడ ఉన్నది. చెపుతాను వినుము.

తే. విధి వశంబున మృతిఁ బొందు వివిధ జంతు । నిచయమం దనహంకార నిష్ఠుఁడైనఁ
బురుషుఁ గల్మష మేమియుఁ బొందనేర; । దెట్టు లంటేని విను మది యేర్పరింతు. 57

ప్రతిపదార్థం: విధివశంబునన్ = దైవాధీనంగా; మృతిన్+పొందు = మరణం చెందునట్టి; వివిధ జంతునిచయము+అందున్ = రకరకాల ప్రాణి సముదాయంలో; అనహంకార (న+అహంకార) నిష్ఠుఁడు+ఐన+పురుషున్ = నేను, నాది అని గర్వించకుండే వాడిని; కల్మషము = పాపం; ఏమియున్ = ఇసుమంతయు; పొందన్+ నేరదు = చెందజాలదు; ఎట్టులు+అంటేనిన్ = అదెట్లంటే; వినుము = ఆలకించుము; అది = ఆ విషయం; ఏర్పరింతున్ = వివరిస్తాను.

తాత్పర్యం: దైవాధీనంగా చనిపోతున్న ప్రాణి కోటిలో అహంకార రహితుడైన పురుషుడిని పాపం ఏమాత్రం అంటుకొనదు. అదెట్లంటే అహింసా స్వరూపాన్ని వివరిస్తాను పార్వతీ! వినుము.

విశేషం: అహంకారము - దేహమే ఆత్మ అనే అభిమానం. ఈ దేహానికి చెందిన ఆలుబిడ్డలు, మిత్రులు, గృహక్షేత్రాదులు తనవనే బుద్ధి. ఇదే అహంకారమంటే. ఇది లేకుండటం అనహంకారం. అందలి నిలుకడ అనహంకారనిష్ఠ. అది కలవాడు అనహంకారనిష్ఠుడు. అంతా విధి వశమై ప్రవర్తిస్తుంది. అన్నింటికి కర్త సర్వేశ్వరుడు. నేను నిమిత్త మాత్రుడిని అని భావించే వాడు అనహంకార నిష్ఠుడు. కర్మ ఫలమందు కర్తృత్వభోక్తృత్వబుద్ధి లేనివాడు హింస చేసినా అతడు చెయ్యనివాడే.

సీ. దివియలోఁ బడుఁ బ్రువ్వు, దివియ యెత్తినవారిఁ । బాపంబు వొందునే, యోపి దున్న
నాఁగేటిమొనఁ జచ్చు నానావిధ ప్రాణు । లన్నరుఁ బొందునే యఘము? వారు
తమపనుల్ సేయ విధాతృవశమున నా । యువు దెగినట్టి జంతువులు సచ్చు;
నేము సంపితి మని యించుకేనియు నహం । కారంబు వారికిఁ గలుగ; దట్లు

తే. గానఁ జావె వారిఁ గల్మష మొందదు; । పుణ్యపాపములకు బుద్ధి మూల'
మని శివుండు మఱియు నను 'హింసవోలెనై । యధిక ధర్మమైన విధము వినుము. 58

ప్రతిపదార్థం: ప్రువ్వు = పురుగు; దివియలోన్ = దీపంలో; పడున్ = కాలి నశిస్తుంది; దివియ+ఎత్తిన వారిన్ = ఆ దీపం పెట్టినవారిని; పాపంబు = పాతకం; పొందున్+ఏ? = చెందుతుందా? లేదని భావం; ఓపి = నేర్పుకలిగి, సమర్థుడై; దున్నన్

= పొలం దున్నగా; నాఁగేటి మొనన్ = నాగలి యొక్క ఇనుప కర్రు మొన గ్రుచ్చుకొని; నానా విధ ప్రాణులు+చచ్చున్ = పలు రకాలైన జీవులు - లద్ది పురుగులు, వాన పాములు మొదలైన మట్టి పొరలలోని ప్రాణులు, కీటకాదులు చచ్చిపోతాయి; ఆ +నరున్ = అరక తోలుతున్న సేద్యగాడిని; అఘము = పాపం, కిల్బిషం; పొందును+ఏ? = పొందుతుందా? పొందదని తాత్పర్యం; వారు = మనుష్యులు; తమ పనుల్+చేయన్ = తమతమ కార్యాలు నిర్వహించే వేళలలో; విధాతృవశమునన్ = దైవవిధిచేత; ఆయువు తెగిన+అట్టి = ఆయుష్కాలం ముగిసినటువంటి; జంతువులు = ప్రాణులు; చచ్చున్ = చనిపోతూ ఉంటాయి; ఏము = మేము; చంపితిమి+అని = వధించామని; అహంకారంబు = కర్తృత్వం; వారికిన్ = ఆయా పనులు చేసికొంటున్న నరులకు; ఇంచుక+ఏనియున్ = కొంచెం కూడ; కలుగదు = జనించదు; అట్లు+కానన్ = అందుచేత; చూవె = సుమా!; వారిన్ = ఆ పని పాటులలో నిమగ్నులైన మనుజులను; కల్మషము = పాపం, దురితం, ఒందదు = చెందదు; పుణ్యాపాపములకున్ = సుకృత దుష్కృతాలకు; బుద్ధి = బుద్ధియే; మూలము+అని = హేతువంటూ, కారణమంటూ; శివుండు = పశుపతి; మఱియున్ = ఇంకనూ; అనున్ = చెప్పుతున్నాడు; హింస పోలెన్+ఐ = హింసవలె ఉండి కూడ; అధిక ధర్మము = అది పరమ ధర్మం; ఐన విధము = ఐనట్టి తీరు; వినుము = గౌరీ! నీవు వినుము.

తాత్పర్యం: దీపాలలో పడి పురుగు లనేకం చస్తుంటాయి. దీపం పెట్టిన వాడికి ఆ పాపం సంప్రాప్తించటం లేదు. సేద్యగాడు అరకతో పొలం దున్నేటపుడు నాగలి కర్రు తగిలి మట్టి పొరలలోని జీవులెన్నో చనిపోతున్నాయి. ఆ పాతకం హాలికుడికి సంభవించటం లేదు గదా! మనుష్యులు తమతమ పనులు చేసికొంటున్నప్పుడు వాటి వాటి ఆయువుతీరి ప్రాణులెన్నో చస్తుంటాయి. వాటి చావుకు తాము కారణమని ఆ జనులు తలపోయరు కనుకనే వారికి జీవహింసాదోషం కలగటం లేదు. సఖీ! పాపపుణ్యాలు కలగటానికి బుద్ధియే కారణం' అని ఈశ్వరుడు మహేశ్వరికి చెప్పి 'ఇది హింసాస్వరూపంతో ఉన్నప్పటికినీ అహింసా ధర్మమైన విధం ఎట్లో వివరిస్తాను వినవలసిం' దని ఇట్లా అన్నాడు.

విశేషం: పాపపుణ్యాలకు మూలం మనస్సే అనే ఉపనిషదర్థం ఈ పద్యంలో పేర్కొనబడింది.

క. **దైవగతిఁ జేసి తమకుం । జావవలసి గోవు లొండు చా వొల్లక స**
ద్భావమున రంతిదేవుని । కావించు మఖమునఁ బశుతఁ గైకొని నెమ్మిన్. **59**

ప్రతిపదార్థం: గోవులు = ఆవులు; దైవగతిన్+చేసి = విధి విధానం అనుసరించి; తమకున్ = తమకు (ధేనువులకు) చావన్ వలసి = మృతి తప్పనందున; ఒండు చావు+ఒల్లక = మరొక విధమైన మరణాన్ని అంగీకరించక; సద్+భావమునన్ = మంచి మనసుతో; రంతిదేవుని కావించు = రంతిదేవు డనే రాజు చేయునట్టి; మఖమునన్ = యజ్ఞంలో; పశుతన్+కైకొని = పశుత్వము వరించి; నెమ్మిన్ = ప్రీతితో. (అతడి చెంతకు వచ్చాయని తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: విధివశాన తమకు చావు మూడినందున గోవులు మరొక విధంగా మరణించటానికి సమ్మతించక రంతిదేవు డనే రాజు చేస్తున్న యాగంలో బలిపశువులు కావటానికి ప్రీతి వహించి.

వ. **అనేక సహస్రంబు లరుదెంచి.** **60**

తాత్పర్యం: పెక్కువేలు వచ్చి.

క. తము విశసించుట కా భూ । రమణుని వేడంగ నతఁడు రాజీవాక్షీ!
క్రమమున విశసింపఁగఁ జ । ర్మములు దరులు గాఁగఁ బాఱె రక్తము నదియై. 61

ప్రతిపదార్థం: రాజీవ+అక్షీ! = పద్మములవంటి నేత్రములుగలదానా!; తమున్ = తమ్ము; విశసించుటకున్ = యాగంలో చంపుటకు; ఆ భూరమణునిన్ = ఆ మహీపతిని; వేడంగన్ = ప్రార్థించగా; అతఁడు = ఆ రాజు; క్రమమునన్ = వరుసగా; విశసింపఁగన్ = వాటిని సంహరించగా; చర్మములు = ఆ ధేనువుల తోళ్ళు; దరులు+కాఁగన్ = గట్లుకాగా; రక్తము = నెత్తురు; నది+ఐ = ఏరై; పాఱెన్ = ప్రవహించింది.

తాత్పర్యం: తమ్ము యజ్ఞంలో విశసించుమని వేలకొలది ఆవులు వచ్చి రంతిదేవ మహారాజును వేడుకొన్నవి. రంతిదేవుడు ఆ ధేనువులు కోరినట్లు వాటిని యాగంలో విశసించాడు. ఆ గోవుల చర్మాలు గట్లు కాగా, వాటి నెత్తురు ఏరై పారింది.

క. ఆచర్మణ్వతి యను నది । గోచరమే వర్ణనమునకుం బ్రియ మగు కం
పై చవిచేయం బొలిచి య । నీచమహిత సలిల మయ్యె నెత్తురు సుదతీ! 62

ప్రతిపదార్థం: సుదతీ! = మంచి దంతములు గలదానా!; ఆచర్మణ్వతి+అను నది = చర్మణ్వతి అనేపేరు గల ఆ యేరు; వర్ణనమునకున్ = కొనియాడటానికి; గోచరమే = శక్యమా? కాదని భావం; నెత్తురు = ధేనురక్తము; ప్రియము+అగు = ఇష్టమైన; కంపు+ఐ = పరిమళం కలదై; చవి చేయన్ = రుచిగొల్పగా; పొలిచి = ఒప్పి; అనీచ = అల్పముగాని; మహిత = పూజ్యమైన; సలిలము+అయ్యెన్ = జల మైనది.

తాత్పర్యం: చక్కని పలువరుసగల శర్వాణీ! ఆ చర్మణ్వతీనదిని వర్ణించుటకు సాధ్యం గాదు. నదిలోని రక్తం పావన జలమై, రుచికరమై, కమ్మని పరిమళాలు వెదజల్లుతుంటుంది.

క. స్నానమునఁ బానమున నా । కానందము సేయు నమ్మహానది; గోసం
తానము దివికి నరిగె; న । మ్మానవపతిఁ జెప్పనేల? మధురాలాపా! 63

ప్రతిపదార్థం: మధుర+ఆలాపా! = ఇంపైన పలుకులు కలదానా!; ఆ+మహానది = గొప్పనదిఅయిన చర్మణ్వతి; స్నానమునన్ = తన జలాలలో స్నానమాడుటచేతను; పానమునన్ = తన నీరు త్రాగటం చేతను; నాకున్ = నాకు; ఆనందము+చేయున్; సంతోషం కలిగిస్తుంది; గోసంతానము = ధేనుసముదాయం; దివికిన్ = స్వర్గానికి; అరిగెన్ = వెళ్ళింది; ఆ+మానవపతిన్ = నరపాలకుడూ, యజ్ఞమునకు యజమానుడు అయిన ఆ రంతిదేవుడిని గూర్చి; చెప్పన్+ఏల? = చెప్పుటెందుకు?

తాత్పర్యం: ఇంపుగ మాటలాడే గౌరీ! చర్మణ్వతీ నదిలో స్నానమాడటం వలన, ఆ నదీజలములు త్రాగటం వలన నా కెంతో ఆనందం కలుగుతుంది. యజ్ఞంలో విశసించబడిన గోవులన్నీ స్వర్గం చేరాయి. మరి యాగ మొనర్చిన రంతిదేవ మహారాజు పుణ్యగతి ఇట్టిదని చెప్ప వలసిన అవసర మేమున్నది? (అత డుత్తమగతులు పొందాడని తాత్పర్యం.)

క. పరబలముపై నడరి నె । త్తురు వఱ్ఱులు వాఱఁ జంపుదురు దురమున న
ప్పురుసదనంబును బుణ్యో । త్తర మని వేదములు సెప్పఁ దనుతరమధ్యా! 64

ప్రతిపదార్థం: తనుతరమధ్యా! = మిక్కిలి సన్నని నడుముగల దానా!; పరబలముపైన్ = శత్రుసైన్యం మీద; అడరి = విజృంభించి; నెత్తురు = రక్తం; వఱ్ఱులు+పాఱన్ = ప్రవాహా లయ్యేటట్లుగా; దురమునన్ = యుద్ధంలో; చంపుదురు = వధిస్తారు; ఆ+పరుసఁదనంబును = ఆ కాఠిన్యం కూడా, ఆ కర్కశత్వం కూడ; పుణ్య+ఉత్తరము+అని = పుణ్యాలలో మేలైనదని; వేదములు = శ్రుతులు; చెప్పున్ = వచిస్తున్నాయి.

తాత్పర్యం: మిక్కిలి సూక్ష్మమైన నడుము గల సుందరీ ! శత్రుసేనలపై విరుచుకపడి రక్తం వరదలై పారేటట్లుగా యుద్ధంలో సంహరిస్తారు. ఆ క్రూరకర్మ సైతం పుణ్యాలలో మేటిఅని వేదాలు వక్కాణిస్తున్నాయి.

విశేషం: "హతో వా ప్రాప్స్యసే స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్,
తస్మా దుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః. (భగ. 2-37)
సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ,
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి." (భగ. 2-38)

శత్రువులచేతిలో నీవు చస్తే మోక్షాన్ని పొందుతావు. నీవు శాత్రవులను జయిస్తే రాజ్యాన్ని అనుభవిస్తావు. కనుక యుద్ధానికి సిద్ధపడుము. సుఖదుఃఖాలను, లాభ నష్టాలను, జయాపజయాలను సమానమైనవిగా భావించి కర్తవ్యబుద్ధితో యుద్ధం ఆరంభించుము. నీకు పాపం రాదు - అని గీత చాటుతున్నది. సంగ్రామంలో శాత్రవవధ, యజ్ఞంలో జంతుహింస పుణ్య హేతువు లని శ్రుతులు ఘోషిస్తున్నాయి.

క. పోరుల యందలి మరణము । మారణముం బుణ్యలోక మహిత మహిమకుం
గారణ; మెఱుఁగు మహింసా । కారం బిట్టి దని నీవ కమలదళాక్షీ!' 65

ప్రతిపదార్థం: కమల దళ+అక్షీ! = పద్మ పత్రములవంటి నయనములు కలదానా!; పోరుల+అందలి = యుద్ధాలలోని; మరణము = చావు; మారణమున్ = చంపటమూ; పుణ్యలోక మహిత మహిమకున్ = స్వర్గాది ఉత్తమ లోకాలలోని పూజ్యమైన గొప్పతనానికి (అనుభవించటానికి); కారణము = హేతువు; అహింసా+ఆకారంబు = అహింస యొక్క స్వరూపం; ఇట్టిది+అని = ఇట్లాంటిదని; నీవు+అ = నీవే; ఎఱుఁగుము = తెలిసికొనుము.

తాత్పర్యం: తామర రేకులవంటి కన్నులు గలదానా! యుద్ధాలలో చావటం గాని, చంపటంగాని స్వర్గాది పుణ్యలోకాలలో పూజ్యమైన మహిమను పొందటానికి కారణం. అహింసా స్వరూప మిటువంటిదని దేవీ! నీవు గ్రహించుము.'

సీ. అని చెప్పి వెండియు హరుఁడు పార్వతితోడ । నిట్లను 'వేఁటకు నెలయు టఘము
కాదు; సస్యములు మృగములచేత నశించు; । జగమెల్ల నిర్మనుష్యంబు గాఁగఁ
గోరు మృగము; లది కారణంబుగ మృగ । హతి రాజులకు ధర్మమయ్యె; నట్లు
గాక మృగములకుఁ గలుగు సద్గతి రాజు । చే మృతిఁ బొందినఁ జెలువ! వినుము

తే. దండ్యు దండింపకుండు, ట దండ్యు దండ । నంబు గూర్చుట, విప్రమనంబు నొచ్చు
నట్టి పనిసేఁతయును విను మనపరాధి । తనువు నొంచుట సూ హింస ధరణిపతికి'. 66

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అనిచెప్పి = అని పల్కి; హరుఁడు = ఈశ్వరుఁడు; వెండియున్ = మరల; పార్వతి తోడన్ = గిరి పుత్రికతో; ఇట్లు+అనున్ = ఈ రీతిగా పలికాడు; వేఁటకున్ = జంతువుల వేటకు; ఎలయుట = ఉద్యమించటం, ఉన్ముఖుడు కావటం; అఘము కాదు = పాపం కాదు; సస్యములు = పైరులు; మృగములచేతన్ = జంతువుల చేత ; నశించున్ = నాశన మవుతాయి; మృగములు = జంతువులు; జగము+ఎల్లన్ = లోక మంతా; నిః+మనుష్యంబు+కాఁగన్+కోరున్ = మనుష్యులు లేకుండా ఉండాలని వాంఛిస్తాయి; అది కారణంబుగన్ = ఆ హేతువుచేత; మృగహతి = జంతువులను చంపటం; రాజులకున్ = దొరలకు; ధర్మము+అయ్యెన్ = న్యాయమయింది; అట్లు+కాక = అంతేగాక; రాజుచేన్ = నృపతిచేత; మృతిన్+పొందినన్ = మరణం చెందితే; మృగములకున్ = జంతువులకు; సత్+గతి+కలుగున్ = పుణ్యలోక ప్రాప్తి కలుగుతుంది; చెలువ! = ఓ సుందరీ! వినుము = ఆలకించుము; దండ్యున్ = దండింపదగినవాడిని; దండింపక+ఉండుట = శిక్షించక మానటం; అదండ్యున్ = దండింప తగని వాడిని; దండనంబు+కూర్చుట = శిక్ష విధించటం; విప్రుమనంబు = బ్రాహ్మణుడి హృదయం; నొచ్చునట్టి = బాధ చెందునట్టి; పని+చేఁతయున్ = పని చేయటం; అనపరాధి (న+అపరాధి) = తప్పుచేయని వాడి యొక్క; తనువున్ నొంచుట = శరీరాన్ని బాధించటం; ధరణి పతికిన్ = భూభర్తకు; హింస+సూ! = హింసను కావించుటయే సుమా!

తాత్పర్యం: అని చెప్పి శర్వుడు శర్వాణితో మళ్ళీ ఇట్లన్నాడు. 'దాక్షాయణీ! రాజులకు జంతువులను వేటాడటం వలన పాపం రాదు. మృగాలు పైర్లను నాశనం చెయ్యడమేగాక లోకంలో మానవు లెవ్వరూ ఉండగూడదని కోరుకుంటాయి. కాబట్టి వాటిని సంహరించటమే రాజులకు పుణ్యకార్యం. అంతే గాక రాజుల చేతిలో హతమయ్యే మృగాలకు పుణ్యగతులు కలుగుతాయి. దండింపదగిన వారిని దండించకున్నా, దండింప తగని వారిని దండించినా, బ్రాహ్మణుడి మనస్సు నొప్పించినా, తప్పు చేయని వాడి శరీరాన్ని బాధించినా రాజు హింస చేసిన వాడే అవుతున్నాడు సుమా!'

వ. అని బోధించి. 67

తాత్పర్యం: అని తెలియజెప్పి.

క. 'భూసురుల కలుక వుట్టం । జేసి నహుష ముఖ్య నృపులు చెడుట ప్రసిద్ధం
బాసురపతి విప్రునలుకఁ । గాసిఁ బడఁడె? తెలచి పడసెఁ గాదె నయనముల్? 68

ప్రతిపదార్థం: నహుష ముఖ్య నృపులు = నహుషుడు మొదలైన రాజులు; భూసురులకున్ = బ్రాహ్మణులకు; అలుక = కోపం; పుట్టన్+చేసి = జనింప జేసి; చెడుట = నశించటం; ప్రసిద్ధంబు = లోక మెరిగిన విషయమే; ఆ సురపతి = ఆ దేవేంద్రుడు; విప్రు+అలుకన్ = బ్రాహ్మణుడి ఆగ్రహంచేత; గాసిన్+పడఁడు+ఎ? = వ్యధ చెందలేదా?; తెలచి = ఆ దేవతావల్లభుడు వేడుకొని; నయనముల్ = నేత్రాలు; పడసెన్+కాదు+ఎ? = పొందలేదా? పొందినాడని భావం.

తాత్పర్యం: నహుషుడు మున్నగు నరపతులు పెక్కుమంది బ్రాహ్మణులకు కోపం కలిగించి చెడిపోవటం లోకాని కంతా తెలుసు. దేవేంద్రు నంతటి వాడు గౌతమ మహర్షి శాపం వలన వెతలపాలు కాలేదా? తన తప్పును క్షమింపవేడుకొని సురపతి ఆ మునీంద్రుడి కృపతో కన్నులను పొందలేదా?

విశేషం: నహుషుడు చెడిన వృత్తాంతం:

అధికార మదమత్తుడైన నహుష చక్రవర్తిని క్షణకాలంలో స్వర్గ పద భ్రష్టుడిని చేశాడు అగస్త్య మహర్షి. దేవేంద్రుడు

బ్రహ్మహత్యాపాతకం వలన స్వర్గ సింహాసనాధిపత్యం కోల్పోయి నిషధాచలంలో తలదాచుకొంటున్నాడు. సుర రాజ్యాన్ని ఏలదగ్గవాడు మానవపతి నహుషుడే అని మునీంద్రులు నిర్ణయించారు. యమ వరుణాది దేవతలు తమ శక్తి ప్రభావాలను అతడికి పంచియిచ్చి దేవరాజ్యానికి అధిపతిని చేశారు. అతడు దేవ భోగాలు అనుభవిస్తూ కొంతకాలానికి మదోన్మత్తుడై లావణ్యవతి శచీదేవిని చూచి ఆమె కొరకు చెప్పి పంపుతాడు. అతడి బారినుంచి తన్ను రక్షించుమని శచీదేవి బృహస్పతిని వేడుకొన్నది. బృహస్పతి ఆమెకు ఆశ్రయమిస్తాడు. ఇది తెలిసి నహుషుడు శచిని తన దగ్గరకు పంపుమని గురుడిని ఆదేశిస్తాడు. బృహస్పతి సూచన మేరకు శచీదేవి తనకు కొంచెం గడువు కావాలని, ఈ లోపల ఇంద్ర ప్రాభవానికి తగినట్లు సప్తర్షులు మోసే అందలంలో అతడు ఊరేగటం తనకు అభిలషణీయమని నహుషుడికి చెప్పి పంపుతుంది. ఆమె మీది వ్యామోహంతో నహుషుడు ఆ పని చేస్తాడు. తేజో హీనుడవుతాడు. పల్లకిమోస్తున్న సప్తర్షులు 'గోసంప్రోక్షణంలో చెప్పబడిన మంత్రాలు నీకు ప్రమాణ భూతములా' అని అడిగినప్పుడు 'ఏంతమాత్రం కావు' అని అతడు సమాధాన మిస్తాడు. అప్పుడు అగస్త్య మహర్షి 'పెద్దలు అభినందించిన మంత్రాలను నిందించటం అజ్ఞానం' అనగానే నహుషుడు కోపించి అతని తలను తన కాలితో తంతాడు. అగస్త్యుడు పట్టరాని ఆగ్రహంతో 'నహుషా! పూజనీయులైన మహర్షులచే నీ అందలం మోయించావు. వారు కొనియాడుతున్న మంత్రాలను దూషించావు. అంతేగాక నన్ను అవమానించావు. కనుక పదభ్రష్టుడవై బహు వత్సరాలు భూలోకంలో సర్పరూపంలో పడి ఉండు' మని శాపమిస్తాడు. నహుషుడు తనకు పూర్వస్మృతి చెడకుండా ఉండేటట్లున్నూ, శాపం తొలగేందుకు ఉపాయమున్నూ ప్రసాదించుమని అగస్త్యుణ్ణి వేడుకొంటాడు. 'నీ అడిగిన ప్రశ్నలకు ఏ ఉత్తముడు సరియైన సమాధానాలిస్తాడో అతడివలన నీకు శాపాంత మవుతుం' దని ఆ మునీంద్రుడు కరుణిస్తాడు.

నహుషుడు శాపఫలంగా వెంటనే హిమాలయప్రాంత భూతలంలో అజగరమై పడి ఉంటాడు. అరణ్యవాస కాలంలో భీముడు ఒంటరిగా వేటకని వెళ్ళి ఆ అజగరం చేత బంధితు డవుతాడు. తమ్ముడిని వెదకుతూ ధర్మరాజు అక్కడికి వచ్చి భీముడిని విడిచి పెట్టుమని ఆ మహాసర్పాన్ని కోరుతాడు. అజగర రూపుడైన నహుషుడు తన వృత్తాంతాన్ని వినిపించి 'తన ప్రశ్నలకు సమాధాన మిచ్చి శాపం బాపు'మని పల్కుతాడు. అతని ప్రశ్నలన్నింటికి ధర్మజుడు తగిన జవాబులిచ్చి అతనికి శాపవిముక్తి కలిగిస్తాడు. దివ్యరూపధరుడైన నహుషుడివలన అధ్యాత్మ రహస్యాలు గ్రహించి ధర్మతనయుడు తమ్ముడితో కలసి వెడలిపోతాడు. బ్రాహ్మణుడి ఆగ్రహంవలన నహుషుడికి పట్టిన దుర్గతీ, అతడి అనుగ్రహం వలన లభించిన శాపవిముక్తీ ఆరణ్యపర్వంలోని అజగరోపాఖ్యానంలో తెలుపబడ్డాయి.

క. కావున విప్రారాధకుఁ । డై వెలయు విభుండు రాష్ట్ర మతనిధనము సై
న్యావలి బంధుల విప్రుల । దీవనలం బొదలు నింత తెల్లము దేవీ!' 69

ప్రతిపదార్థం: దేవీ! = ప్రాణేశ్వరీ!; కావునన్ = కాబట్టి; విప్ర+ఆరాధకుఁడు+ఐ = బ్రాహ్మణులను పూజించేవాడై; విభుండు = = రాజు; వెలయున్ = వెలుగొందుతాడు; రాష్ట్రము = రాజ్యం; అతని ధనము = ఆ ప్రభువు యొక్క విత్తం; సైన్య+ఆవలి = సేనా సమూహం; బంధువుల = చుట్టాల యొక్క; విప్రుల = భూసురుల యొక్క; దీవనలన్ = ఆశీర్వాదములచే; పొదలున్ = వృద్ధి పొందుతుంది; ఇంత తెల్లము = ఈ విషయం విస్పష్టం.

తాత్పర్యం: ప్రియురాలా! కాబట్టి రాజు బ్రాహ్మణులను సేవించటం వలననే ప్రకాశిస్తాడు. అతడి రాజ్యం, ధనం, సైన్య సముదాయం, చుట్టాల యొక్క, విప్రులయొక్క ఆశీస్సుల వల్ల వృద్ధి చెందుతాయి. ఇది విస్పష్టమైన విషయం.'

వ. అని నిర్దేశించి కపర్ది గౌరితో వెండియు. 70

ప్రతిపదార్థం: అని నిర్దేశించి = అంటూ నిర్ణయపూర్వకంగా చెప్పి; కపర్ది = శివుడు; గౌరితోన్; వెండియున్ = మరల.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని నిర్ణయించి చెప్పి శంకరుడు గౌరితో మళ్ళీ ఇట్లా అన్నాడు.

ఆ. 'పరమ మంత్రవిధులఁ బశువులు యూపంబు । లందుఁ గట్టఁబడి మహాశుచిత్వ
విభవ మొందు విహిత విశసన క్రియ మేను । విడిచి దివ్యసుఖము వడయుఁ బొలఁతి! 71

ప్రతిపదార్థం: పొలఁతి! = ఓ వనితా!; పశువులు = బలినొసగుటకు తీసుకు రాబడిన పశువులు; పరమ మంత్ర విధులన్ = శ్రేష్ఠములైన మంత్ర కలాపములతో; యూపంబులందున్ = యూపస్తంభాలయందు; కట్టన్+పడి = బంధించబడి; మహా శుచిత్వ విభవమున్ = పరమ పావనత్వమహిమను; ఒందున్ = పొందును; విహిత విశసన క్రియన్ = శాస్త్ర సమ్మతమైన సంహార క్రియచేత; మేనున్ = శరీరమును; విడిచి = వదలి; దివ్యసుఖమున్ = స్వర్లోకసౌఖ్యాన్ని; పడయున్ = పొందును.

తాత్పర్యం: 'అపర్ణా! ధేనువులు యాగశాలలో యూప స్తంభాలకు మంత్రాలతో బంధించబడి పరమ పవిత్రాలవుతున్నవి. శాస్త్ర సమ్మతంగా వధించబడి శరీరం విడిచి స్వర్గలోకంలో దివ్యసుఖాలు అనుభవిస్తాయి.

విశేషం: యూపము = యజ్ఞ పశువును కట్టుటకై పాతిన కొయ్య.

క. హోమ విధులఁ దన్మాంసము । లామిషములు గాఁగ నొసఁగి యమరుల నగ్ని
ష్టోమాదులఁ బ్రోవఁగఁ బర । మామిత సౌఖ్యములు గల్గు యజమానులకున్. 72

ప్రతిపదార్థం: హోమ విధులన్ = హోమ కార్యాలలో; తత్+మాంసము = యజ్ఞపశువుల మాంసము; ఆమిషములు కాఁగన్ = భోగ్యవస్తువులుగా; ఒసఁగి = సమర్పించి; అమరులన్ = దేవతలను; అగ్నిష్టోమ+ఆదులన్ = వసంతకాలంలో సల్పే అగ్నిష్టోమం మొదలైన యాగాలచే; ప్రోవఁగన్ = పోషించగా; యజమానులకున్ = యాగములు చేసేవారికి; పరమ+అమిత+సౌఖ్యములు = శ్రేష్ఠమైన మితిమీరిన సుఖాలు (మోక్షం); కల్గున్ = లభిస్తాయి.

తాత్పర్యం: అగ్నిష్టోమం మొదలైన యజ్ఞాలలో హోమాదుల ద్వారా దేవతలకు భోగ్యవస్తువుగా పశుమాంసం సమర్పించి తృప్తికలిగించటం వల్ల, యజ్ఞకర్తకు అమరులవల్ల అమితమైన ఉత్తమమైన సౌఖ్యాలు కలుగుతాయి.

క. శ్రుతి విహితహింస హింసగ । మతిఁ దలఁపఁగ రాదు ముని సమాజం బిది దు
ష్కృత తతిఁ బాపెడు పరమ సు । కృతమని కొనియాడుఁ గాన గీర్వాణనుతా! 73

ప్రతిపదార్థం: గీర్వాణనుతా! = దేవతలచే కొనియాడబడే గౌరీ!; శ్రుతి విహిత హింస = వేదంచేత విధించబడిన హింస; ఇది= ఇద్ధి; దుష్కృత తతిన్ = పాపసమూహాన్ని; పాపెడు = తొలగించే; పరమసుకృతము+అని = మహా పుణ్య కర్మఅని; ముని సమాజంబు = మునుల సంఘం; కొనియాడున్+కాన = మెచ్చుతున్నారు గనుక; హింసగన్ = హింసాకార్యంగా; మతిన్ = మనస్సునందు; తలఁపఁగన్ +రాదు = భావించకూడదు.

తాత్పర్యం: గౌరీ! యజ్ఞాలలో చేసే పశుహింస హింసకాదని వేదాలు శాసిస్తున్నాయి. యాగాలలోని పశుహింస పాపాలను పటాపంచలు గావించే పుణ్యకార్యమని మునీశ్వరులు కొనియాడుతున్నారు. కనుక పశువధను హింసాకార్యంగా భావించరాదు.'

ఆ. అని యహింస తెఱఁగు లన్నియు నెఱిఁగించి । 'యింక నేమి వినఁగ నిచ్చసేసె?'
దనిన రుద్రు నడిగె నద్రిజ 'జనుల జీ । వనము తెఱఁగు లెల్ల వనజనాభ!' 74

ప్రతిపదార్థం: అని = అంటూ; అహింస తెఱఁగులు+అన్నియున్ = అహింస యొక్క స్వరూపాలు సమస్తం; ఎఱిఁగించి = పార్వతికి తెల్పి; ఇంకన్ = ఇటుపై; ఏమి వినఁగన్ = ఏమి ఆలకించవలెనని; ఇచ్చ+చేసెదు? = వాంఛిస్తున్నావు?; అనినన్ = అని శంభుడు పల్కగా; వనజనాభ! = కమలములవంటి కన్నులుగల శ్రీకృష్ణా!; అద్రిజ = కొండకూతురు ఉమాదేవి; జనుల = మానవుల యొక్క; జీవనము తెఱఁగులు+ఎల్లన్ = జీవన విధానము లన్నింటినీ, బ్రతుకు తెరువు లెల్ల; రుద్రున్ = శంకరుడిని; అడిగెన్ = ప్రశ్నించింది.

తాత్పర్యం: ఈశ్వరుడు అహింస యొక్క స్వరూప స్వభావా లన్నింటినీ తెలిపి, 'గౌరీ! నీ వింకా ఏమి వినాలని అభిలషిస్తున్నావు?' అని అడిగాడు. ఆమె 'నాథా! జగములోని జనుల జీవన విధానా లెట్టివో చెప్పు' మని రుద్రుడిని కోరింది శ్రీకృష్ణా! అని నారదుడు కృష్ణుడితో అన్నాడు.

సీ. **అడిగిన నద్దేవి కద్దేవుఁ డిట్లనుఁ । ' గాంత! మానుష్యంబు కర్మభూమి;**
సుఖదుఖమూలముల్ సురతిర్యగాత్మక । త్వంబు; లట్లగుట విత్తంబు వలయు
మనుజుల; కెట్లన్న విను ధర్మకామముల్ । విత్తసాధ్యంబులు; విద్య వార్త
సేవ కార్షత యర్థసిద్ధికి మూలముల్; । విద్యవానికి ననవద్యతయును'

ఆ. **గర్షకునకు నేల కాల మెఱుంగుట, । జట్టికాని కేది సంభవించె**
నందు విలువ మొదలునగు లాభమును నెడ । వ్యయము గల్గుటయు శివ ప్రదములు. **75**

ప్రతిపదార్థం: అని+అడిగినన్ = అని అపర్ణ ప్రశ్నించగా; ఆ దేవికిన్ = ఆ స్వప్రకాశ స్వరూపిణికి; ఆ దేవుఁడు = సర్వజ్ఞుడైన త్రిలోచనుడు; ఇట్లు+అనున్ = ఈ రీతిగా వచించాడు; కాంత = ఓ రమణీ! మానుష్యంబు = మనుష్యత్వం, మనుజలోకం; కర్మభూమి = కర్మలాచరించే చోటు; సుర+తిర్యక్+ఆత్మకత్వంబులు = దేవతల యొక్క, పశు పక్ష్యాదుల యొక్క జన్మాలు; సుఖదుఃఖమూలముల్ = వరుసగా సుఖానికి, దుఃఖానికి కారణాలు (స్థానాలు); అట్లు+అగుటన్ = అందుచేత; మనుజులకున్ = నరులకు; విత్తంబు = ద్రవ్యం; వలయున్ = కావాలి, అవసరం; ఎట్లు+అన్నన్ = ఎందుకంటే; విను = ఆలకించుము; ధర్మ కామముల్ = ధర్మ కామ పురుషార్థాలు అనగా పుణ్యకార్యాలు చెయ్యటం, కోరికలు తీర్చుకోవటం అనేవి; విత్తసాధ్యంబులు = డబ్బు చేతనే పొందతగినవి; విద్య = చదువు; వార్త = వాణిజ్యం సల్పుట; సేవ = దాస్యం, పనులు చెయ్యటం; కార్షత = కృషీవలత్వం, వ్యవసాయంచెయ్యడం; అర్థ సిద్ధికిన్ = డబ్బు రాబడికి, ధనం లభించటానికి; మూలముల్ = హేతువులు; విద్య వానికిన్ = చదువుగలవాడికి, విద్యావంతుడికి; అనవద్యతయును = ఆచారాదులచేత నిందారాహిత్యం, మాట పడకుండటం; కర్షకునకున్ = సేద్యం చేసేవాడికి; నేల, కాలము+ఎఱుంగుట = భూసారం, విత్తుటకు తగిన ఋతువేదో తెలియటం; జట్టి కానికిన్ = వర్తకుడికి; ఏది = ఏ వస్తువు, ఏ సరకు; సంభవించెన్ = లభిస్తుందో; అందున్ = ఆ ప్రదేశంలో; విలువన్ = కొనుటకు; మొదలు = మూలధనం; అగులాభమును = సమకూడే ఆదాయం; ఎడవ్యయము = అందుకు అయ్యేఖర్చులు; కల్గుటయున్ = కలగటం; శివ ప్రదములు = శుభాన్నిస్తాయి.

తాత్పర్యం: పార్వతి ఆ విధంగా అడిగినప్పుడు శివుడిట్లా అంటున్నాడు. 'దేవీ! మానవలోకం కర్మ భూమి. దేవత్వం సుఖాలకూ, పశుపక్ష్యాదులుగా జన్మించటం దుఃఖా లనుభవించడానికీ కారణ మవుతున్నాయి. అందువల్ల మనుష్యులకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధనం కావాలి. ఎందుకంటే పుణ్యకార్యాలు ఆచరించవలెనన్నా, కోరికలు తీర్చుకొనాలన్నా ధనం అవసరం. విద్యగలవాడికి నిందా రాహిత్యం, సేద్యం చేసికొనే వాడికి పొలము యొక్కసారం, విత్తేసమయం అనగా ఋతుధర్మం తెలిసి ఉండటం, వర్తకుడికి ఆయాతావులలో దొరికే సరుకులను అక్కడ కొనుగోలు చెయ్యటానికి మూలధనం (పెట్టుబడి), పెట్టుబడితో వచ్చే లాభం, అందుకు అయ్యే వ్యయం తెలియడం శుభాన్ని కలిగిస్తాయి.

విశేషం: "చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః"

సత్త్వరజస్తమోగుణాలు, వాటికి తగ్గ శమదమాది కర్మలూ విభాగించి నేనే బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులను సృష్టించాను అని భగవానుడు గీతలో ఉగ్గడిస్తూ --

"శమో దమ స్తప శ్శౌచం క్షాన్తి రార్జవ మేవ చ,
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రాహ్మం కర్మ స్వభావజమ్." (భగ. 18-42)

శమం (బాహ్యేంద్రియనిగ్రహం), దమం (మనోనిగ్రహం), తపస్సు, శౌచం, ఆర్జవం (త్రికరణశుద్ధి), జ్ఞానం, విజ్ఞానం, ఆస్తిక్యం - అనేవి బ్రాహ్మణుడికి స్వభావంతో పుట్టిన కర్మలుగా పేర్కొన్నాడు. ఆలాగే-

"కృషి గోరక్ష వాణిజ్యం వైశ్యం కర్మ స్వభావజమ్,
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్".

వ్యవసాయం, పశు సంరక్షణ, వర్తకం వైశ్యుడికి సహజలక్షణాలనీ, బ్రాహ్మణాది వర్ణాలకు సేవచేయడమే శూద్రుడికి సహజ ధర్మమూ, జీవిక అనీ పరమాత్మ గీతలో చెప్పటం జరిగింది. 66వ పద్యంలో రాజధర్మాలు వివరించటం జరిగినందున ఈ పద్యంలో మళ్ళీ రాజకులోచిత ధర్మాలు, జీవనోపాయం చెప్పబడలేదు.

క. పసులం బాలించునతఁడు । విసువక యేమఱక వాని విధము లెఱిఁగి ప్రో
చి సమర్థుం డగు; వెరవునఁ । బసిఁ గను సేవకుఁడు ధనముఁ బడయుఁ బొగడుతోన్. 76

ప్రతిపదార్థం: పసులన్ = పశువులను; పాలించు+అతఁడు = కాచేవాడు; విసువక = శ్రమ అనుకోక; ఏమఱక = అలక్ష్యం చేయక, ఉపేక్షించక; వానివిధములు+ఎఱిఁగి = వాటి కష్టసుఖాలు తెలిసికొని; ప్రోచి = కాపాడి, సంరక్షించి; సమర్థుండు+అగున్= నేర్పుకాడవుతాడు; వెరవునన్ = ఉపాయంతో, మెలకువతో; పసిన్ = పసరాలను; కను = చూచుకొనే; సేవకుఁడు = పనివాడు; పొగడుతోన్ = ప్రశంసతో, కీర్తితో; ధనమున్ = డబ్బును; పడయున్ = పొందుతాడు;

తాత్పర్యం: పశువులను పాలించేవాడు విసుగు చెందక, ప్రాలుమాలక వాటి కష్టసుఖాలు గమనిస్తూ కాపాడి నేర్పుకా డనిపించుకొంటాడు. మెలకువతో పశువులను చూచుకునేవాడు కీర్తితోపాటు ధనం గడిస్తాడు.

క. వంచనయును జాడ్యంబును । నించుకయును లేక ప్రభువు నిష్ట మెఱిఁగి తాఁ
బంచిన పని వెరవునఁ గా । వించిన కర్మకరుఁ డొందు విపుల ధనంబుల్.' 77

ప్రతిపదార్థం: వంచనయున్ = మోసమునూ; జాడ్యంబును = అలసత్వమూ, సోమరితనమూ; ఇంచుకయును లేక = కొంచెమైనను కలుగక; ప్రభువు+ఇష్టము = యజమానుడి కోరిక; ఎఱిఁగి = తెలిసి; తాన్ = తాను (సేవకుడు); పంచిన పనిన్ = ఆజ్ఞాపించిన కార్యమును; వెరవునన్ = నేర్పుతో; కావించిన = చేసినట్టి; కర్మకరుఁడు = పని మనిషి, సేవకుడు, భృత్యుడు; విపుల ధనంబుల్ = విస్తారమైన విత్తమును, సిరిని; ఒందున్ = పొందుతాడు.

తాత్పర్యం: మోసం, సోమరితనం లేక తన యజమానుడి పనిని అతడి యిష్టప్రకారం నెరవేర్చే సేవకుడు విస్తారమైన ధనం పొందుతాడు.'

వ. అని వెండియు. 78

తాత్పర్యం: అని మరల. (శంకరుడు పార్వతితో అట్లని మరల ఇట్లంటున్నాడు అని తరువాతి పద్యంతో అన్వయం).

క. 'పరధన పరదారల నప । హరింపమియు, దేవపితృ సమారాధనముం
గరుణయు నతిథి సపర్యయు । గిరితనయా! యెల్లవారికిం గృత్యంబుల్.' 79

ప్రతిపదార్థం: గిరితనయా! = పర్వతపుత్రీ!; హైమవతీ! పరధన = ఇతరుల విత్తమునూ; పరదారలన్ = ఇతరుల పత్నులనూ; అపహరింపమియున్ = దొంగిలించకుండటం, కాజేయకుండటం; దేవపితృసమారాధనమున్ = దేవతలయొక్క పితృదేవతల యొక్క పూజనమూ; కరుణయున్ = దయాగుణమున్నూ; అతిథిసపర్యయున్ = అతిథులకు సేవ చేయటమూ; ఎల్లవారికిన్ = అందరికీ; కృత్యంబుల్ = చేయదగిన పనులు.

తాత్పర్యం: 'పార్వతీ! పరులధనమునూ, పరుల పత్నినీ కోరకుండటం; దేవతలను, పితృదేవతలను ఆరాధించటం; కృపాగుణం కలిగిఉండటం; అతిథి సేవ చేయటం అందరూ ఆచరించవలసిన ధర్మాలు.'

శివుఁడు పార్వతికి వర్ణకర్మ పరిపాకంబుల తెఱం గెఱింగించుట (సం.13 అను 1-15-1525)

వ. అనిన విని యపర్ణాదేవి 'వర్ణంబుల కర్మంబులు పాకంబుఁ బొందు ప్రకారంబు చెప్పు' మని య
ప్పరమేశ్వరు నడిగిన నతం డిట్లనియె. 80

ప్రతిపదార్థం: అనినన్ విని = అని పరమశివుడు పల్కగా ఆలకించి; అపర్ణాదేవి = ఉమాదేవి; వర్ణంబుల కర్మంబులు = బ్రాహ్మణాది జాతులవారు చేయు పనులు; పాకంబున్+పొందు+ప్రకారము = పక్వమయ్యే తీరు; చెప్పుము+ అని; ఆ+పరమ+ ఈశ్వరున్+అడిగినన్; అతండు = ఆ శివుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని శివుడు చెప్పగా ఆలకించి 'కులముల యొక్క కర్మలు పరిపక్వమయ్యే విధమెట్టిదో తెల్పు'మని గౌరీదేవి కోరగా ఈశ్వరు డిట్లా అన్నాడు.

విశేషం: పరమేశ్వరుడిని పతిగా కోరి పార్వతి పర్ణములు = ఆకులు కూడ మెసవక ఘోర తపస్సు చేసింది గనుక ఆమెకు అపర్ణ అని పేరు వచ్చింది.

చ. 'తమ తమ కర్మముల్ తెరువు దప్పక చేసినవారు దేవలో
కమున సుఖంబు పొందుదురు; క్రమ్మఱి వచ్చియుఁ బూర్వజాతి జ
న్మమున మహర్ధిఁ బొందుదురు; మానిని! యిమ్మెయిఁ దప్పి యెట్టి కృ
త్యములఁ జరించి రజ్జనుల కట్టి కులంబునఁ బుట్టు వాటిలున్. 81

ప్రతిపదార్థం: మానిని = అభిమానవతీ! గౌరీ!; తెరువు+తప్పక = దారి తప్పక; తమ తమ కర్మముల్ = తమ తమ కుల వృత్తులు; చేసినవారు = సల్పినట్టి వారు; దేవలోకమునన్ = స్వర్గభువనంలో; సుఖంబు+పొందుదురు = సౌఖ్యాలు అనుభవిస్తారు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క్రమ్మఱి వచ్చియున్ = పుణ్యం క్షీణించగానే తిరిగి ధరణికి వచ్చి కూడా; పూర్వజాతిజన్మమునన్ = మునుపటి కులంలోని పుట్టుకతో; మహా+బుద్ధిన్ = మిక్కిలిపెంపును; పొందుదురు = చెందుతారు; ఈ+మెయిన్+తప్పి = ఈ విధానం విడిచి; ఎట్టి కృత్యములన్+చరించిరి = ఎట్టి పనులలో ప్రవర్తిస్తారో; ఆ+జనులకున్ = ఆ నరులకు; అట్టి కులంబునన్ = అట్టివర్ణంలోనే; పుట్టు = పుట్టుక; పాటిలున్ = కలుగుతుంది.

తాత్పర్యం: 'హైమవతీ! ఆయా కులాలకు విధింపబడిన కర్మలను శ్రద్ధతో చేసే వారు స్వర్గలోకంలో సుఖ మనుభవిస్తారు. పుణ్యం క్షీణించగనే వారు అక్కడ నుండి వచ్చి మళ్ళీ భూతలంలో మునుపటి కులాలలోనే జన్మించి మిక్కిలి అభివృద్ధి పొందుతారు. అట్లా కాకుండ తమ తమ కుల ధర్మాలు వదలి ఏయేకర్మలు చేస్తారో, ఆయా కర్మలను బట్టి వారు ఆయాకులాలలో పుట్టుతారు.

విశేషం: "స్వేస్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః,
స్వకర్మ నిరత స్సిద్ధిం యథా విందతి తచ్ఛృణు." - (భగ. 18-45)

"యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్,
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః." - (భగ. 18-46)

అర్జునా! తమ తమ వర్ణ ధర్మాలను వదలక ఆదరంతో ఆచరించే వాడు పరమపదాన్ని పొందుతాడు. అదెట్లాగో చెప్పుతాను వినుము. సకలభూతముల వ్యాపారాలు ఆ పరమాత్మవలననే జరుగుతున్నాయి. చరాచరాత్మకమైన జగమంతటా అతడు నిండి ఉన్నాడు. అట్టి పరమాత్మను మానవుడు తనకు విధించబడిన కర్మతో ఆరాధించి సిద్ధిని పొందుతున్నాడు - అని అర్జునుడికి భగవంతుడి ఉపదేశం.

క. ఎంతెంత మేలు చేసిన । నంతంతియ కులము నెక్కుడై సమకూరుం
గాంతా! విప్రుఁ డయిన న । త్యంతానంద మగులోక మతనికిఁ గలుగున్.' 82

ప్రతిపదార్థం: కాంతా! = రమణీ!; ఎంత+ఎంత = ఏపాటి, ఏ కొలది; మేలు చేసినన్ = ఉపకారం చేస్తాడో; అంత+అంతియ = అంతకు తగినట్టి; కులము = జాతి; ఎక్కుడు+ఐ+సమకూడున్ = గొప్పగా లభిస్తుంది; విప్రుఁడు+అయినన్ = బ్రాహ్మణుడై జన్మిస్తే; అతి+ఆనందము+అగు లోకము = మిక్కిలి సంతోష భరితమైన లోకం; అతనికిన్ = ఆ భూసురుడికి; కలుగున్ = లభిస్తుంది.

తాత్పర్యం: ఎవడు ఏ పాటి పుణ్యం చేస్తాడో వాడికి ఆ పాటి ఉత్తమ కులం లభిస్తుంది. అధిక పుణ్య ఫలంగా నరుడు బ్రాహ్మణ జాతిలో జన్మిస్తే అతడికి నిత్యానందమయమైన ఉత్తమ లోక ప్రాప్తి కలుగుతుంది.'

వ. అని చెప్పి మఱియును. 83

తాత్పర్యం: శంభుడు గిరిజతో అట్లా చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

ఉ. 'ఆపదఁ దూలపోక సిరి నంది మదింపక శౌర్యవృత్తిమైఁ
బాపుల గెల్చి యార్జవము బంధుజనాలికి నార్యకోటికిన్

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జూపుచు దీనులం గరుణఁ జూచి తగం గలమాత్రఁ బ్రోచుచున్

గోపము లేక మన్కి గలుగున్ దివిజాంశమునన్ జనించినన్.' 84

ప్రతిపదార్థం: దివిజ+అంశమునన్ = దేవతల అంశంలో; జనించినన్ = పుడితే; ఆపదన్ = కష్టంవచ్చినప్పుడు, విపత్తులో; తూలపోక = చలించక, నొవ్వక, బాధపడక; సిరిన్ = సంపదను; అంది = పొంది; మదింపక = గర్వించక; శౌర్య వృత్తిమైన్ = శూరత్వంతో, పరాక్రమంతో; పాపులన్ గెల్చి = కలుషాత్ములను జయించి; ఆర్జవము = చక్కని నడవడిక, ఋజువర్తన; బంధుజన+ఆళికిన్ = చుట్టాల సమూహానికి; ఆర్యకోటికిన్ = పెద్దల సముదాయానికి; చూపుచున్ = కనబరచుతూ, దీనులన్ = నొచ్చినవారిని, దిక్కులేని వారిని; కరుణన్+చూచి = దయతో ఆదరించి; తగన్ = ఒప్పిదముగ; కలమాత్రన్ = తనశక్తికి తగినట్లు; ప్రోచుచున్ = కాపాడుతూ; కోపము లేక మన్కి = ఆగ్రహంలేని బ్రతుకు; కలుగున్ = లభిస్తుంది.

తాత్పర్యం: దేవతల అంశలో జన్మించిన వాడు ఆపదలయందు చలించడు. సంపదలయందు గర్వించడు. పరాక్రమంతో పాపులను జయిస్తాడు. బంధుజనముల యెడ, పెద్దల సమూహం పట్ల ఋజు ప్రవర్తనతో మెలగుతాడు. దీనుల యందు కనికరం కలిగి తన శక్తి మేరకు వారిని సంరక్షిస్తాడు. కోపతాపాలు లేని మనుగడతో విరాజిల్లుతాడు.'

క. అనిన విని గౌరి 'కొందఱు । మనుజులు సంపద సుఖించి మనఁ గొందఱు లే

మి నలంగి దుఃఖ పడుదురు; । విన వలతుం గారణంబు; వినిపింపు శివా!' 85

ప్రతిపదార్థం: అనినన్+విని = పరమశివుడు అట్లా చెప్పగా ఆకర్ణించి; గౌరి = నగరాజకుమారి; శివా! = పరమేశ్వరా!; కొందఱు = కొంతమంది; మనుజులు = మానవులు; సంపదన్ = ఐశ్వర్యంతో; సుఖించి మనన్ = సౌఖ్యా లనుభవిస్తూ బ్రతుకగా; కొందఱు = కొంతమంది; లేమిన్ = లేమిడితో, పేదరికంతో, దారిద్ర్యంతో; నలంగి = బాధచెంది, నొచ్చి; దుఃఖము+పడుదురు = చింతిస్తుంటారు; కారణంబు = ఇందుకు హేతువు; వినన్ = వినుటకు; వలతున్ = వాంఛిస్తాను; వినిపింపు = చెప్పవలసినది.

తాత్పర్యం: అని మహాదేవుడు చెప్పగా విని భవాని 'హృదయేశ్వరా! పుడమిలో కొందరు సిరిసంపదలతో తులదూగుతూ సుఖా లనుభవిస్తుండగా మరి కొంతమంది పేదరికంతో అగచాట్లపాలై దుఃఖపడుతుంటారు. ఇందుకు కారణ మేమిటో వినగోరుతున్నాను. సెలవియ్యండి.'

చ. అనుటయు శంభుఁ డిట్లను 'దయన్ బలి భిక్షము పెట్టలేమిఁ గుం

దిన చెలిఁ జుట్టముం బిలిచి దీనత వాపి యపాపవృత్తిఁ జె

ల్లిన తొలుబాము గల్గునరు లెస్సగ మంచు విధాత; నిష్కృపా

త్ముని నతిలోభ దూషితుని దుర్గతి దుఃఖితుఁ జేయుఁ బార్వతీ!' 86

ప్రతిపదార్థం: అనుటయున్ = అని సర్వమంగళ పలుకగా; శంభుఁడు = శంకరుడు; ఇట్లు +అనున్ = ఈలాగున పలికాడు; పార్వతీ = గిరిజా!; దయన్ = కారుణ్యంతో; బలి = భూతములకు (కాకులు మొదలైనవాటికి); బలి = ఆహారం (పిడికెడు మెతుకులు); భిక్షము = యాచకులకు చేరెడు బియ్యం; పెట్టన్+లేమిన్ = పెట్టుటకు లేనందున; కుందిన = చింతించిన, దుఃఖించిన; చెలిన్ = మిత్రుడిని; చుట్టమున్ = బంధువును; పిలిచి = ఆహ్వానించి, రమ్మని; దీనత+పాపి = దరిద్రతను

తొలగించి, వారి పేదరికాన్ని నిర్మూలించి; అపాపవృత్తిన్ = కలుషరహితమైన ప్రవర్తనతో, పుణ్య వర్తనతో; చెల్లిన = సాగిన, గడచిన; తొలుబాము+కల్గు+నరున్ = ముందటి జన్మముగల, పూర్వజన్మం కలిగిన మనుజుడిని; విధాత = బ్రహ్మదేవుడు; లెస్సగన్ = చక్కగా, బాగుగా; మన్చున్ = అన్న వస్త్రాదులిచ్చి పోషిస్తాడు, జీవింపజేస్తాడు; నిస్+కృపా+ఆత్మునిన్ = దయలేని మనసు గలవాడినీ, అతిలోభ దూషితున్ = పరమ దురాశాపరుడిని, పిసినారి తనం గలవాడిని; దుర్గతి దుఃఖితున్+చేయున్ = పేదరికంతో విలపించేవాడినిగా చేస్తాడు.

తాత్పర్యం: ఉమాదేవి అట్లా అడిగితే శివు డిట్లా అన్నాడు. 'గౌరీ! భూతములకు బలి సమర్పణ చెయ్యటానికి, యాచకులకు బిచ్చం వెయ్యటానికి ఏమీలేక ఎంతో బాధపడుతున్న తన మిత్రులను, చుట్టాలను రమ్మని చెంతకు చేరదీసి వారి పేదరికాన్ని తొలగించి పుణ్య ప్రవర్తనతో పూర్వజన్మం గడపిన పురుషుడికి బ్రహ్మదేవుడు అధికంగా సిరిసంపద లిచ్చి కాపాడుతాడు. అట్లా కాకుండా తొలి జన్మలో దయారహితుడై, పరమలుబ్ధుడై (పిసినిగొట్టై) జీవితం గడపిన వాడిని ఈ జన్మలో కష్టాలపాలు చేసి దుఃఖపడేటట్లు చేస్తాడు బ్రహ్మ.

విశేషం: భవమునకు వికృతి పదం బాము. తొలుబాము = పూర్వభవము = ముందటి జన్మము - జన్మాంతర సుకృతదుష్కృత ఫలానుభవం తప్పదని నిరూపణ చేస్తాయి.

క. **విను మలుకయుఁ గూర్మియు లే । వనవద్యా! యెజ్జనంబులందును విధికిన్**
మును చేసిన కర్మము ఫల । మనుభవ గోచరము సేయు నంతియ తఱితోన్.' 87

ప్రతిపదార్థం: అనవద్యా! = అనింద్యచరిత్రురాలా!; వినుము = ఆలకించుము; విధికిన్ = బ్రహ్మకు, పరమేష్ఠికి; ఏ+జనంబుల +అందున్ = ఏ మనుష్యుల యందూ; అలుకయున్ = కోపమూ, కినుక; కూర్మియున్ = ప్రేమయూ; లేవు = కలుగవు; మును చేసిన కర్మము ఫలము = వారు మునుపటి జన్మలలో చేసిన కర్మల యొక్క ఫలం; తఱితోన్ = సమయమునందు; అనుభవ గోచరము+చేయున్ = అనుభవానికి వచ్చేటట్లుచేస్తుంది; అంతియ = ఇంతేసుమా! ఇంతకన్న వేరేమీ లేదు.

తాత్పర్యం: ప్రాణేశ్వరీ! చెప్పుతాను వినుము. బ్రహ్మదేవుడికి ఏ జీవుల యందు కోపం గానీ, ప్రేమగానీ లేవు. కానీ ఆయా జనులు పూర్వజన్మలలో చేసికొన్న కర్మలఫలం అనుభవించవలసిన వేళరాగానే వారి అనుభవానికి వస్తుంది. ఇంతేగాని ఇందుకు వేరే కారణం లేదు.'

విశేషం: "సమోఽహం సర్వభూతేషు నమే ద్వేష్యోఽస్తి న ప్రియః,
యో భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్." (భగ. 9-29)

నేను సర్వ ప్రాణులపట్ల సమానుడిని. నాకు ద్వేషించ తగిన వాడుగాని, ఇష్టుడుగాని లేడు అని గీతలో భగవానుడు చెప్పినట్లు జగత్సృష్టికర్తకు ఒకరిపట్ల కినుకగానీ, మరొకరిపట్ల ప్రేమగానీ లేవు. ఆయా జీవులు చేసికొన్న సుకృత దుష్కృతాలే వారి సుఖదుఃఖాలకు హేతువులు.

వ. **అని యెఱింగించి వెండియు. 88**

తాత్పర్యం: అని తెలిపి పరమేశ్వరుడు మళ్ళీ (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'ధనము గలిగియుండి ధవళాక్షి! కుడువక । కట్టకుండు పరమకష్టజనము
లొరువు లొత్తిచెప్పనుపకారులై తొలు । పుట్టునందు మనిన యట్టివారు. 89

ప్రతిపదార్థం: ధవళ+అక్షి! = తెలి కన్నులదానా!; ధనము+కలిగి+ఉండి = చేతిలో దండిగా డబ్బుండి కూడా; కుడువక = తిండి తినక; కట్టక+ఉండు = దుస్తులు ధరించకుండే; కష్టజనులు = పరమనీచులు; ఒరువులు = ఇతరులు; ఒత్తి చెప్పన్ = నొక్కి చెప్పగా, గట్టిగా నిర్బంధించి చెప్పగా; ఉపకారులు+ఐ = పరులకు మేలొనర్చువారై; తొలు పుట్టు+అందున్ = పూర్వజన్మలో, మునుపటి పుట్టువులో; మనిన+అట్టివారు = జీవించినటువంటివారు సుమా!

తాత్పర్యం: 'దేవీ! విశాలాక్షీ! పూర్వజన్మలో ఇరుగు పొరుగువారు నొక్కి నొక్కి చెప్పగా, వారి నిర్బంధానికి తలయొగ్గి పరులకు ఉపకారం చేస్తూ ఆ బ్రతుకు అట్లా వెళ్లబుచ్చినవారు ఇప్పుడు సిరి సంపద లుండికూడా కమ్మగా భుజించక, మంచి ఉడుపులు ధరించక నీచంగా జీవిస్తున్న ఆ జనులే సుమా!

ఆ. తమకు ధనము లేక తగు భోగముల కెవ్వ । రైన నడప మను సుఖాఢ్యజనులు
తొల్లి పేదవార లుల్ల మర్థుల కెప్డు । బెట్టఁగోరుచుండి నట్టివారు. 90

ప్రతిపదార్థం: తమకున్ = తమకు; ధనము లేక = ద్రవ్యం లేకున్ననూ; తగు భోగములకున్ = కావలసిన సుఖానుభవాలకు; ఎవ్వరు+ఐనన్ = ఎవ్వరెవ్వరో; నడపన్ = జరుపుతుండగా, ఇస్తూఉంటే; మను = జీవించునట్టి; సుఖ+ఆఢ్య+జనులు = సుఖాలనుభవిస్తున్న పుణ్యాత్ములు; తొల్లి = పూర్వం, మునుపు ; పేదవారలు = దరిద్రులు, బీదవాళ్ళు; ఉల్లము = మనస్సు; అర్థులకున్ = అడుగుకునేవాళ్ళకు, యాచకులకు; ఎప్డు = ఎల్లప్పుడూ; పెట్టన్+కోరుచున్+ఉండిన+అట్టివారు = ఇవ్వవలెనని వాంఛించే వారేసుమా!

తాత్పర్యం: ఇపుడు తమకు విత్తం లేకపోయినప్పటికీ ఇతరుల సహాయ సహకారాలతో సుఖాలు అనుభవిస్తున్న జనులు వెనుకటి జన్మలో తాము పేదవారైనప్పటికీ తమ మనసులలో ఎల్లప్పుడు పేదసాదలకు పెట్టి పోషించవలెనని వాంఛించే ఉదారులే సుమా!

విశేషం: పెట్టే శక్తి తనకు లేకపోయినా పెట్టవలెననే సంకల్ప ముంటే చాలు. అదే తన భావి సుఖానికి మూల మవుతుంది. తను పెట్టకపోయినా పెట్టే ఇల్లు చూపటం తనకు ఎంతో మేలుచేకూరుస్తుంది అని చెప్పటానికి ఇటువంటి సూక్తులే మూలం.

సీ. ఆయాసపడకుండ నర్థంబు చేరెడు । వారు పాత్రజనంబుఁ దార పిలిచి
తొలుమేనఁ బెట్టిన యలఘు దయాఢ్యులు; । ధనసిద్ధి బహులయత్నమునఁ గలుగు
మనుజులు పూర్వజన్మమున నర్థులు దమ్ము । నడుగ దాఁపక యిచ్చినట్టి వార;
లాయాసమునను విత్తాగమం బెడలెడు । జనులు ముందరి పుట్టువునఁ గృపా వి

తే. హీనులై యాచకుల నలయించి పిదప । నిడని లోభులు; ముదిసి ధనేశుఁడగు న
రుండు ప్రాయంబునాఁ డీక గం డడంగి । తొంటి భవమున నీగికిఁ దొడఁగి నతఁడు. 91

ప్రతిపదార్థం: ఆయాసము+పడక+ఉండన్ = శ్రమ చెందకుండ; అర్థంబు = విత్తం; చేరెడు వారు = చెందుతున్నవారు; తొలుమేనన్ = ముందటి జన్మలో; పాత్రజనంబున్ = యోగ్యులైనవారిని, తగినవారిని, అర్హులను; తారు+అ = తామే; పిలిచి

= ఆహ్వానించి; పెట్టిన+అలఘు+దయా+ఆఢ్యులు = దానం చేసిన గొప్ప దయాగుణమున్నవారు; బహుల యత్నమునన్ = పలువిధములైన ప్రయత్నాలతో; ధనసిద్ధి కలుగుమనుజులు = ద్రవ్యలాభం పొందునట్టి మనుష్యులు; పూర్వజన్మమునన్ = తొలుతటి పుట్టువులో; అర్థులు = యాచకులు; తమ్మున్ = తమర్ని; అడుగన్ = కోరగా; డాఁపక = తన దగ్గరనే పదిలపరచుకోక; ఇచ్చిన+అట్టివారలు = ఒసగిన పుణ్యపురుషులు సుమా!; ఆయాసమునను = శ్రమపడియూ; విత్త+ఆగమంబు = ధనము యొక్క లాభం, ప్రాప్తి; ఎడలిన జనులు = తొలగిన వారు; ముందరి పుట్టువునన్ = పూర్వజన్మలో; కృపావిహీనులు+ఐ = దయాశూన్యులై, కరుణమాలిన వారై; యాచకులన్ = అర్థులను; అలయించి = ఇంటికి త్రిప్పుకొని శ్రమ పెట్టి; పిదపన్ = తరువాత; ఇడని లోభులు = ఇయ్యని పిసినిగొట్టులు, లుబ్ధులు; ముదిసి = ముసలివాడై; ధన+ఈశుఁడు+అగు = ధనాధిపతిఅయిన, మహాధనికుడైన; నరుండు = మనుజుడు; తొంటి భవమునన్ = ముందటిజన్మలో; ప్రాయంబునాఁడు+ఈక = మంచి యౌవనదశలో ఉన్నప్పుడు దానంచెయ్యక; గండు+అడంగి = బలముడిగి, శక్తి చెడి, ముసలివాడై; ఈఁగికిన్ = దానము సల్పడానికి; తొడఁగిన+అతఁడు = పూనుకొన్నవాడు సుమీ!

తాత్పర్యం: ఈశ్వరీ! ఎక్కువ శ్రమపడకుండా డబ్బు ఎవరికి లభిస్తుందో వారు తొల్లిటి జన్మలో యోగ్యులైన వారిని తమంతట తామే రండని పిలిచి దానము చేసిన దయామయ హృదయులు సుమా! మిక్కిలి ప్రయత్నంతో ఇప్పుడు ధనం గడిస్తున్నవారు పూర్వ జన్మలో యాచకులు తమర్ని వేడినప్పుడు రేపురా, మాపురా, మళ్లీ రమ్మన కుండా, దాన మొనర్చిన పుణ్యాత్ములు సుమా! మిక్కిలి శ్రమపడికూడా విత్తం చేకూరక వేదన చెందుతున్నవారు మునుపటి పుట్టువున యాచకుల్ని కనికరం లేక పలుమారు తమ యింటికి తిప్పుకుని చివరికి ఏదీ యివ్వక పంపివేసిన లోభులు సుమా! ముసలితనంలో కుబేరులై ఉన్నవారు వెనుకటి జన్మలో తాము పడుచుదనంలో ఉన్నప్పుడు శక్తికొలది ఒకరికి ఉపయోగపడక వార్ధకంలో దానధర్మాలకు పూనుకొన్న వారే సుమీ!

తే. **కలిగియుండియుఁ దెవుళుల కతన భోగ । ములు భుజింపఁగలేని మర్త్యులు, గిరీంద్ర**
తనయ! తొలుమేన రోగముల్ దనికి చచ్చు । నపుడు దానంబుసేసిన యట్టివారు. **92**

ప్రతిపదార్థం: గిరి+ఇంద్రతనయ! = ఓ కొండలరాయని కూతురా!; కలిగి+ఉండియున్ = తనకు సంపద ఉండికూడా; తెవుళుల కతనన్ = రోగాల మూలంగా; భోగములు = సుఖాలు; భుజింపఁగన్+లేని = అనుభవించజాలని; మర్త్యులు = మనుష్యులు; తొలుమేనన్ = పూర్వజన్మాన; రోగముల్+తనికి = వ్యాధులు సంభవించి; చచ్చు+అపుడు = మరణించే వేళ; దానముల్ = దానాలు; చేసిన+అట్టివారు = ఇచ్చినవారు సుమా!

తాత్పర్యం: గిరిజాదేవీ! కలిమి కలిగి ఉండి కూడా వ్యాధిగ్రస్తులైన కారణాన బాధపడుతూ ఇపుడు భోగా లను భవించడానికి నోచుకొననివారు పూర్వజన్మంలో జబ్బులంటుకొని చనిపోయే సమయంలో దానం చేసిన వారే సుమా!

తే. **అధిక సౌందర్యములు గలయట్టి జనులు । తొల్లి మాంసభోజనములఁ దొఱఁగియున్న**
వారు రూపవిహీనులు దారు రూపు । గలిగి తొలుమేనఁ గొనటులఁ బలికినారు. **93**

ప్రతిపదార్థం: అధికసౌందర్యములు = ఎక్కువచక్కదనాలు, మిక్కిలి అందాలు; కల+అట్టి = కలిగినటువంటి; జనులు = మనుష్యులు; తొల్లి = పూర్వం; మాంసభోజనములన్ = మాంసాహారాన్ని; తొఱఁగి+ఉన్నవారు = మానివేసినవారు, విడిచినట్టివారు; రూపవిహీనులు = వికృతస్వరూపులు; తారు = తాము; తొలుమేనన్ = పూర్వజన్మలో; రూపు+కలిగి = అందంకలవారై; కొనటులన్ = కురూపులను; పలికినారు = ఎగతాళిచేసినవారు, పరిహసించినవారు సుమా!

తాత్పర్యం: ప్రేయసీ! చక్కందనం కలిగి ఉన్నవారు పూర్వజన్మలో మాంసం తినటం మానివేసినట్టివారే. నేడు వికృత స్వరూపులై ఉన్నవారు మునుపటి జన్మలో తాము సొగసుకాండ్రై ఉండి కురూపులను పరిహసించిన వాళ్లే సుమా!

క. విను సౌభాగ్యసమేతుఁడు । మును నిజదారైకపరుఁడు; ముందటి జన్మం
బున భార్యకుఁ బ్రీతి యొన । ర్పని మనుజుఁడు సుభగతావిరహితతఁ బొందున్. 94

ప్రతిపదార్థం: విను= గౌరీ! వినుము; సౌభాగ్యసమేతుఁడు= వైభవోపేతుడు; మును= పూర్వజన్మంలో; నిజదార+ఏకపరుఁడు= తన భార్యయందే మిక్కిలి ఆసక్తి కలవాడు; ముందటి జన్మంబునన్ = తొలుతటి పుట్టుకలో; భార్యకున్ = తన పత్నికి; ప్రీతి+ఒనర్పని = సంతోషం కల్గించని, తృప్తి చేకూర్చని; మనుజుఁడు = మనిషి; సుభగతావిరహితతన్ = సౌభాగ్యవిహీనత్వాన్ని; పొందున్ = పొందుతాడు అనగా అందచందాలు లేని ఆలిని పొందుతాడు.

తాత్పర్యం: ప్రియురాలా! పూర్వజన్మలో తన పత్నియందు పరమ ప్రీతిగల పురుషుడు, ఏకపత్నీవ్రత పరాయణుడు సౌందర్యవతిని ఇల్లాలుగా పొందుతాడు. ముందటి జన్మలో భార్యను ఉపేక్షించి యథేచ్ఛగా విహరించినవాడు సౌభాగ్యవిహీను డవుతాడు.

క. అమితజ్ఞానము విజ్ఞా । నముఁ గలిగియుఁ బేదయైన నరుఁడు చనిన జ
న్మమున వినికి గలిగియు దా । నము తెరువునఁ బోనివాఁడు నళినదళాక్షీ! 95

ప్రతిపదార్థం: నళినదళ+అక్షీ! = తామరరేకుల వంటి కన్నులు కలదానా!; అమితజ్ఞానమున్ = అధికమైన అధ్యాత్మజ్ఞానమును; విజ్ఞానమున్ = శాస్త్ర సంబంధమైన జ్ఞానమునూ, అనుభవపూర్వకమైన జ్ఞానమునూ; కలిగియున్ = లభించికూడా; పేద+ఐన+ నరుఁడు = దరిద్రుడైన మానవుడు; చనిన జన్మమునన్ = పోయిన పుట్టుకలో; వినికి+కలిగియున్ = ధర్మాలను గూర్చి వినికూడ; దానము తెరువునన్+పోనివాఁడు = దాన పథంలో వెళ్ళనివాడు సుమా!

తాత్పర్యం: తామరరేకులవంటి కన్నులుగల పార్వతీ! అధ్యాత్మ జ్ఞానమూ, శాస్త్రజ్ఞానమూ కలిగి ఉండి కూడా పేదరికంతో అలమటించేవాడు తొలి జన్మంలో ధర్మాలను తెలిసికూడా దానం చేయటానికి ఏమాత్రం పూననివాడే సుమా!

క. తగుబుద్ధిలేక సంపద । మిగులఁ గలుగు నరుఁడు తొంటిమేనఁ గరుణమై
విగతప్రజ్ఞుం డయ్యును । దగ దీనులఁ బ్రోచినతఁడు దళితాబ్జముఖీ ! 96

ప్రతిపదార్థం: దళిత+అబ్జముఖీ! = వికసించిన పద్మంవంటి ముఖంకలదానా!; తగు బుద్ధిలేక = తగిన తెలివిలేక; సంపద = ఐశ్వర్యం; మిగులన్ = మిక్కిలి; కలుగు నరుఁడు = కలిగినట్టివాడు; తొంటిమేనన్ = పూర్వజన్మలో; విగతప్రజ్ఞుండు+అయ్యునున్ = తెలివిలేనివాడు అయినప్పటికిన్నీ, వివేకవిహీను డైనప్పటికినీ; కరుణమైన్ = దయతో; తగన్ = చక్కగా; దీనులన్ = దరిద్రులను; ప్రోచిన+అతఁడు = రక్షించినవాడే సుమా!

తాత్పర్యం: వికసించిన కమలంవంటి మోముగలదానా! ఈ జన్మలో తగినంత తెలివితేటలు లేకపోయినప్పటికినీ మెండగు సంపద కలవాడు పూర్వజన్మలో వివేకహీనుడై ఉండి కూడా కనికరంతో దరిద్రులను రక్షించిన వాడే సుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. మేధావియై విన్కి మిగిలి విద్యలఁ బొల్చు । నరుఁడు దొల్బామున గురున కధిక
భక్తుఁడై తనదైన పాండిత్య మొరులకుఁ । గావించు వేడుక గలుగు సుజనుఁ;
డభ్యసింపంగ విద్యాయుక్తి లేకుండు । నాతఁడు తొల్లి విద్యాధికత్వ
మున గర్వియై శిష్టజనులకు సభ భంగ । మొనరించి కుందఁజేసిన యతండు;

తే. భార్యయును బిడ్డలును దాను బహుధనముల । భోగులై రోగములు లేక పొల్చువార
లమలినాచార పాత్రదానములు సత్య । కరుణలును దొంటి భవమునఁ గలిగినారు. 97

ప్రతిపదార్థం: మేధావి+ఐ = బుద్ధిమంతుడై, మంచితెలివి కలవాడై; విన్కిమిగిలి = శాస్త్రాదులను శ్రవణం చేసి, బహుశ్రుతుడై; పొల్చు = ఒప్పుతున్న, విలసిల్లునట్టి; నరుఁడు = మనుష్యుడు; తొల్+బామునన్ = కడచిన జన్మలో; గురునకున్ = ఆచార్యుడికి; అధిక భక్తుఁడు+ఐ = గొప్ప భక్తుడై; తనది+ఐనపాండిత్యము = విద్యలయందు తనకున్న నేర్పును; ఒరులకున్ = అన్యులకు; కావించు = కలిగించునట్టి; వేడుక+కలుగు+సుజనుఁడు = అభిలాష కలిగిన సత్పురుషుడు సుమా!; అభ్యసింపఁగన్ = చదువుకొనుటకు; విద్యాయుక్తి లేక+ఉండు+ఆతఁడు = విద్యాయోగం లేనటువంటివాడు; తొల్లి = మునుపు; విద్యా+అధికత్వమునన్ = విద్యలయొక్క అతిశయంచేత; మెండుగ విద్యలు రావటం వలన; గర్వి+ఐ = పొగరుబోతై; శిష్టజనులకున్ = మంచినడవడిగల మహనీయులకు, ఆర్యులకు, పూజ్యులకు; సభన్ = సభయందు; భంగము+ఒనరించి = అవమానం కలిగించి; కుందన్+చేసిన+అతండు = బాధించినవాడే, నొప్పించినవాడే సుమా!; భార్యయును = పత్నియు; బిడ్డలు = పిల్లలు; తనున్ = తానూ; బహుధనములన్ = పెక్కు సిరిసంపదలతో; భోగులు+ఐ = సుఖాలనుభవిస్తున్నవారై; రోగములు లేక = వ్యాధిగ్రస్తులు కాకుండ; పొల్చువారలు = శోభిల్లుతున్న వాళ్ళు; అమలిన+ఆచార = నిర్మలమైన ఆచారములు, నడవళ్ళు; పాత్రదానములు = అర్హులైనవారికివ్వటం; సత్యకరుణలును = నిజంపలకటం, దయాస్వభావం; తొంటిభవమునన్ = వెనుకటిజన్మలో; కలిగినారు = కలిగినట్టివారు.

తాత్పర్యం: బుద్ధిమంతుడై శాస్త్రశ్రవణం చేసి అనగా బహుశ్రుతుడై విద్యలచేత విలసిల్లే మానవుడు గడచిన జన్మలో ఆచార్యుడిని పరమభక్తితో ఆరాధించిన వాడే సుమా! అంతేగాక తాను నేర్చిన విద్యలను ఇతరులకు నేర్పి వారిని పండితులను చేయవలెననే అభిలాష కలిగిన మహాశయుడు సుమా! ఈ జన్మలో నేర్చుకుందా మనుకొన్నా విద్యలబ్బని వాడు మునుపటి జన్మలో విద్యాతిశయంతో దర్పించి పెద్దలను సభలలో అవమానపరచి వారి హృదయాలను నొప్పించిన వాడే సుమా! తాను, తన ఆలుబిడ్డలు అనేక భోగభాగ్యాలు అనుభవిస్తూ రోగాలు లేక హాయిగా మనుగడ సాగిస్తున్న వాళ్ళు ముందటి జన్మలో నిర్మలమైన ఆచారం గలవారూ, అర్హులకు దానధర్మాలు చేసిన వారూ, సత్యవచనులూ, దయాపరులై ఉండినవాళ్ళే సుమా!

ఆ. ఆలుబిడ్డ లొఱటులై లేమిఁ గుందుచుఁ । దెవులుచేతఁ బడుచు నవయు జనులు
మున్ను క్రోధలోభముల నాస్తికతఁ బర । పీడనంబు చేసి పేర్చినారు. 98

ప్రతిపదార్థం: ఆలుబిడ్డలు = భార్యయూ, పిల్లలూ; ఒఱటులు+ఐ = మూర్ఖులై; లేమిన్ = దారిద్ర్యంతో; కుందుచున్ = నొగులుతూ; తెవులుచేతన్+పడుచున్ = రోగాల బారిపడుతూ; నవయుజనులు = కృశిస్తున్న, బాధ పడుతున్న మనుష్యులు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మున్ను = పూర్వం; క్రోధలోభములన్ = కోపం చేతను, దురాశచేతనూ; నాస్తికతన్ = దేవుడు లేడని చెప్పటం చేతనూ; పరపీడనంబు+చేసి = ఇతరులను బాధించి; పేర్చినారు = చెలరేగిన వారే సుమా!

తాత్పర్యం: తమ ఆలుబిడ్డలు మూర్ఖులై ఒకవంక పేదరికంతో, మరొకవంక రోగాలతో అల్లాడుతుండగా కష్టాలనుభవిస్తున్న మనుష్యులు పూర్వజన్మంలో కోపం, దురాశ, దేవుడు లేడనటం మొదలైన చెడుగుణాలతో పరులను బాధిస్తూ విజృంభించినవారే సుమా!

సీ. **కాంత! జాత్యంధుండు గన్నులు చెడువాఁడు । తన యొప్పు మెఱయుచుఁ దగిలి యొరుని**
వనితఁ దొల్మేనఁ జూచినవాఁడు, కర్ణరో । గార్తుండు కటుక వాక్యములఁ దొల్లి
శిష్టు నొప్పించిన కష్టుండు, కడుపునఁ । దెవులైనతఁడు పూర్వ భవమునందు
గరదుండు, గోశ మశ్మరిని శర్కరను బా । ధితుఁ డగు నరుఁ డన్యసతిని గన్య

ఆ. **మహిషి గోవుఁ దురగి మదనాతురత మున్ను । గవిసినాఁడు, శోషి దివిరి యొరువు**
లనుభవింపఁ దెచ్చుకొనిన మాంసము దొంటి । పుట్టువున హరించినట్టి నీచు. 99

ప్రతిపదార్థం: కాంత! = ఓ వెలదీ!; జాత్యంధుండు = పుట్టుకతోనే గ్రుడ్డివాడూ, జనుషాంధుడూ; కన్నులు చెడువాఁడు = పుట్టుకతోనేగాక తరువాత చూపు గోల్పోయిన వాడూ; తన+ఒప్పు+మెఱయుచున్ = తన సౌందర్యం ప్రదర్శిస్తూ; తగిలి = వెంటపడి, పూనుకొని; ఒరుని వనితన్ = పరకాంతను; తొలుమేనన్ = ముందటి జన్మలో; చూచినవాఁడు = వీక్షించినవాడు సుమా!; కర్ణరోగ+ఆర్తుండు = చెవికి వచ్చిన రోగంతో బాధపడేవాడు; కటుక వాక్యములన్ = గాటయిన మాటలతో, పరుష పదాలతో, నిష్ఠురవచనాలతో; శిష్టున్ = సదాచారసంపన్నుడిని, యోగ్యుడిని; నొప్పించిన కష్టుండు = బాధించిన దుష్టుడు; కడుపునన్ = పొట్టలో; తెవులు+ఐన+అతఁడు = రోగంతో అల్లాడేవాడు; పూర్వభవము+అందున్ = తొలుతటి జన్మలో; గరదుండు = విషం పెట్టినవాడు సుమా!; కోశము+అశ్మరిని = మూత్రకోశసంబంధియైన నీరుకట్టు జబ్బుతో, మూత్రకృఛ్రవ్యాధితోనూ; శర్కరను = మధుమేహవ్యాధితోనూ; బాధితుఁడు+ఆగునరుఁడు = పీడించబడుతున్నమనిషి; అన్యసతిని = మరొక్కడి భార్యనూ; కన్యన్ = పెళ్ళికాని పడుచునూ; మహిషిన్ = గేదెనూ; గోవున్ = ఆవునూ; తురగిన్ = ఆడు గుర్రాన్నీ; మదన+ఆతురతన్ = కామోద్రేకంతో; మున్ను = తొలుతటి జన్మలో; కలిసినాఁడు = కూడిన వాడేసుమా!; శోషి = శుష్కించినవాడు, క్షయరోగి; తివిరి = ఇష్టపడి; ఒరువులు = ఇతరులు; అనుభవింపన్ = భుజించటానికి, తెచ్చుకొనిన మాంసమున్ = తెచ్చుకొన్నట్టి ఎరచిని; తొంటి పుట్టువునన్=పూర్వభవంలో; హరించిన+అట్టి= కాజేసినటువంటి; నీచు= అల్పుడు, క్షుద్రుడు, తుచ్ఛుడు సుమా!

తాత్పర్యం: వనితామణీ! వినుము. పుట్టుకతోనే గ్రుడ్డిఅయినవాడూ, మరి కొన్నాళ్ళకు చూపు కోల్పోయిన వాడూ తొలిజన్మలో తన సొగసును కనబరుస్తూ పరుని భార్యను పనిగట్టుక చూచినవాడే సుమా! చెవిపోటుతో బాధపడేవాడు ముందటి జన్మలో కర్కశవాక్యాలతో యోగ్యపురుషులను నొప్పించిన వాడే సుమా! పొట్టలో ఏదో ఒక జబ్బుతో పీడించబడేవాడు వెనుకటి పుట్టువులో ఇతరులకు విషం పెట్టినవాడే సుమా! నీరు కట్టు రోగంవల్ల, మూత్రద్వారంలో రాళ్ళు ఏర్పడినవాడూ, మధుమేహవ్యాధితో తీపులు తీసుకొంటున్నవాడు పూర్వజన్మలో మన్మథోద్రేకంతో పరకాంతను, పెళ్ళికాని పడుచును కూడినవాడే సుమా! అంతేగాదు; ఆవును, బర్రెను, ఆడు గుర్రాన్ని దాటినవాడే సుమా! నేడు క్షయరోగంతో బాధపడుతున్నవాడు తొలుతటి జన్మలో ఎవరో తిందామని ఆశపడి తెచ్చి పెట్టుకొన్న మాంసాన్ని కాజేసి గుట్టుగ ఆరగించిన నీచుడు సుమా!

ఆ. ఉలుముగొన్నవాఁడు తొలుమేన నాఘాత । బంధనముల నొరుల ప్రన్నఁదనము
చెఱచినాఁడు, పంగు వొఱవగఁ గాలుసే । విఱిచి సాధుజనులఁ బఱిచినాఁడు. 100

ప్రతిపదార్థం: ఉలుము+కొన్నవాఁడు = కుష్ఠరోగం కలవాడు; తొలుమేనన్ = పూర్వదేహంలో; ఒరుల = ఇతరుల యొక్క; ప్రన్నఁదనమున్ = అందమును; ఆఘాతబంధనములన్ = కొట్టుట చేతనూ, కట్టుట చేతనూ; చెఱచినాఁడు = పాడుచేసినవాడే సుమా!; పంగువు = నేడు కుంటివాడుగా ఉన్నవాడు; ఒఱవగన్ = వక్రంగా, వికృతంగా; కాలు+చే+విఱిచి = కాళ్ళు చేతులు విరిచి; సాధుజనులన్ = సత్పురుషులను; పఱిచినాఁడు = బాధపెట్టినవాడే సుమా!

తాత్పర్యం: నేడు కుష్ఠరోగిగా ఉన్నవాడు పూర్వజన్మంలో కొట్టి, కట్టి పరుల చక్కందనాన్ని చెరచినవాడే సుమా! ఇపుడు కుంటివాడుగా ఉన్నవాడు తొలుతటి పుట్టువులో సుజనులను కాళ్ళుచేతులు వక్రంగా విరిచి బాధించిన వాడే సుమా!

క. పిలకాదులఁ గంతులచే । నలమటఁ బడువారు బడియ నడిచియు ముష్టిం
జలమునఁ బొడిచియు సాధులఁ । దొలుబామున నొంచినట్టి దుష్టచరిత్రుల్. 101

ప్రతిపదార్థం: పిలక+ఆదులన్ = చర్మవ్యాధులు మొదలైన వాటితోనూ; కంతులచేన్ = కణుతులచేతనూ (గడ్డలతోనూ); అలమటన్+పడువారు = బాధపడేవాళ్ళు; తొలుబామునన్ = పూర్వభవంలో, క్రిందటి జన్మలో; సాధులన్ = సజ్జనులను; బడియన్ = దుడ్డుకర్రతో; అడిచియున్ = కొట్టియూ; చలమునన్ = ఈర్ష్యతో; ముష్టిన్ = పిడికిలితో; పొడిచియున్ = క్రుమ్మియూ; నొంచినట్టి = నొప్పించినట్టి, బాధించినట్టి; దుష్టచరిత్రుల్ = చెడునడత కలవారే సుమీ!

తాత్పర్యం: చెలీ! చర్మరోగాలతో, కణుతులతో బాధపడేవారు పూర్వజన్మలో సజ్జనులను బడితెతో బాదీ, మచ్చరంతో పిడికిలితో పొడిచీ నొప్పించిన వారే సుమీ!

విశేషం: "గ్రంథిభిః పిలకైశ్చైవ క్లిశ్యన్తే భృశదుఃఖితాః" అనే శ్లోకం పై పద్యానికి మూలం.

ఆ. పాదరోగు లశుచి పదముల దేవాల । యములు మెట్టుటయును నసదువారిఁ
దప్పులేక క్రొవ్వి తన్నుటయును దొలు । పుట్టునందుఁ గలిగినట్టివారు. 102

ప్రతిపదార్థం: పాదరోగులు = కాళ్లయందు వ్యాధులు గలవారు; అశుచిపదములన్ = అపరిశుద్ధములైన అడుగులతో; దేవ+ఆలయములు = దేవుడిగుళ్లు; మెట్టుటయును = ప్రవేశించడం; అసదువారిన్ = బలహీనులను, దీనులను; తప్పులేక = వారియందు దోషాలు లేకున్నప్పటికీ; క్రొవ్వి = పొగరుపట్టి; తన్నుటయును = కాళ్లతో తాడించడం అనే చెడుగుణాలు; తొలు పుట్టు+అందున్ = ముందటి జన్మలో; కలిగినట్టివారు = ఉన్నట్టివారు.

తాత్పర్యం: నేడు కాలిజబ్బులతో అల్లాడుతున్నవారు పూర్వజన్మలో అపవిత్రములైన పాదాలతో దేవుడి గుళ్ళకు వెళ్ళిన వారే సుమా! గౌరీ! ఏ తప్పులేకుండానే దిక్కుమాలిన దీనులను పొగరుబట్టి తమ కాళ్ళతో తన్నినవాళ్ళే సుమా వీరు!

చ. జ్వరమున గుల్మపీడ నతిసారములన్ బలుపుండులన్ మహో
దరమున వాతపిత్త కఫదారుణ రోగములన్ నిరంతరా

తురు లగువారు నిర్దయతఁ దొల్లి వినోదము గాఁగ జీవులం
దరమిడి చంపినారు గురుఁ దల్లడ పెట్టినవారు పార్వతీ! 103

ప్రతిపదార్థం: పార్వతీ! = హైమవతీ!; జ్వరమునన్ = జ్వరంచేత; గుల్మపీడన్ = కడుపులో దుర్మాంసపు బిళ్ళవలన కలిగే బాధతో; అతిసారములన్ = విరేచనాలతో, భేదులతో; బలుపుండులన్ = మిక్కిలి కురుపులతో, వ్రణాలతో; మహా+ఉదరమునన్ = మహోదరమనే వ్యాధితో (పొట్ట పెరిగే రోగం); వాత పిత్త కఫ = వాతము, పిత్తము, కఫము అనే; దారుణ రోగములన్ = భయంకరాలైన జబ్బుల చేత; నిరంతర = ఎల్లప్పుడు; ఆతురులు+అగువారు = బాధపడేవారు; తొల్లి = పూర్వజన్మలో; నిర్దయతన్ = కరుణలేక; వినోదము+కాఁగన్ = వేడుకగా, క్రీడగా; జీవులన్ = ప్రాణులను; తరము+ఇడి = వరుసపెట్టి; చంపినారు = సంహరించినట్టి వారే సుమీ!; గురున్ = ఆచార్యుడిని; తల్లడము+పెట్టినవారు = బాధించినవారేసుమా!

తాత్పర్యం: జ్వరం, కడుపులో బల్ల, భేదులు, కురుపులు, మహోదరం అనే పొట్ట పెరిగే వ్యాధి, వాతం, పిత్తం, శ్లేష్మం అనే త్రిదోషాలవలన కలిగే జబ్బులు-వీటి వల్ల ఎల్లప్పుడూ తల్లడిల్లుతున్నవారు పూర్వజన్మలో జంతువులను వరుసపెట్టి చంపినవారే సుమా! గురువును దుఃఖపెట్టిన వారే సుమా!

తే. గూనివాఁడును బిచ్చుకకుంటు గుజ్జుఁ। గొలుచు లమ్ముచోఁ గ్రచ్చులు గలిపి సరకు
దూఁచిపెట్టెడు చోటులఁ దూన్కి దరపి। పూర్వ భవమున లాభంబుఁ బొందినారు. 104

ప్రతిపదార్థం: గూనివాఁడును = ఎత్తైన వీపుకలవాడు; పిచ్చుక కుంటున్ = తొడలు లేనివాడు; గుజ్జున్ = పొట్టివాడును, కుబ్జుడు; కొలుచులు+అమ్ముచోన్ = ధాన్యం విక్రయించే సమయంలో; క్రచ్చులు+కలిపి = తాలు, తరకలు, రాళ్ళు కలిపియూ; సరకున్ = వస్తువును; తూఁచిపెట్టెడు చోటులన్ = తక్కెడలో ఉంచి తూనిక వేసేవేళ; తూన్కి = తూనిక; తరపి = తగ్గించి(తప్పు తూనిక తూచి); పూర్వభవమునన్ = ముందటి జన్మలో; లాభంబున్ = అన్యాయమైన లాభమును; పొందినారు = గడించినట్టివారే.

తాత్పర్యం: దేవీ! ఈ జన్మలో గూనివాడు, తొడలు లేనివాడు, మరుగుజ్జు క్రిందటి జన్మలో ధాన్యంలో తాలు తబక కలిపి విక్రయించిన వాళ్ళు. తప్పుడు తూనికలు తూచి వస్తువులు అమ్మి అక్రమ లాభాలు ఆర్జించిన వాళ్ళే.

సీ. వెఱ్ఱులు తొలుమేన వెడ్డున సాధుజ। నము మోసపుచ్చి ధనంబు గొన్న
జను లనపత్యులు విను తొల్లి పితృకార్య। దూరులు బాలఘాతులును జువ్వె;
పొలఁతి! నపుంసకుల్ పూర్వభవంబున। నెద్దుఁ బట్టిన వారు నేమి తప్పుఁ
బొరయకుండఁగఁ గోపమునఁ ద్రికచ్ఛేదంబు। గావించినారును, గామ సుఖము

తే. విఘ్నపఱిచిన తులువలు, విధవ తొంటి। జన్మమునయందు భర్తృవంచన మొనర్చి
ధనము గూర్చిన యదియు మదంబు పేర్మి। నోర్తుమగని హరించిన యుగ్మలియును. 105

ప్రతిపదార్థం: వెఱ్ఱులు = పిచ్చివాళ్ళు; తొలుమేనన్ = మునుపటి జన్మలో; వెడ్డునన్ = వంచనతో; సాధుజనమున్ = సత్పురుషులను; మోసము+పుచ్చి = దగాచేసి; ధనంబు+కొన్నజనులు = ద్రవ్యం గ్రహించిన మనుష్యులు; విను = పార్వతీ! ఆలకించుము; న+అపత్యులు(అనపత్యులు) = ఇప్పుడు బిడ్డలు లేకుండా ఉన్నవాళ్ళు; తొల్లి = మునుపటి జన్మలో; పితృకార్యదూరులు = తమ తల్లిదండ్రులకు శ్రాద్ధాది క్రియ నిర్వర్తించని వాళ్ళునూ; బాలఘాతులును+చువ్వె = బిడ్డలను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చంపిన వాళ్ళునూ సుమా!; పొలంతి! = చెలియా!; నపుంసకుల్ = మగతనం లేని వాళ్ళు; పూర్వభవంబునన్ = ముందటి జన్మలో; ఎద్దున్+పట్టినవారు = ఎద్దుయొక్క విత్తులు నలగగొట్టినవాళ్ళే; ఏమితప్పున్ = ఎట్టి దోషమూ, అపరాధమూ; పొరయక+ఉండన్+కన్ = వాటివల్ల కలుగక పోయినా; కోపమునన్ = క్రోధంతో, కినుకతో; త్రిక+ఛేదంబు+కావించినారు = ముడ్డిపూస విరుగ గొట్టినవారున్నూ; కామ సుఖమున్ = రతిసౌఖ్యం, సురతసుఖం; విఘ్నపఱచిన = ఆటంకపరచిన; తులువలు = తుచ్ఛులు, దుష్టులు; విధవ = మగడులేనిది, భర్తృవిహీన; తొంటి జన్మము+అందున్ = మునుపటి పుట్టుకలో; భర్తృవంచనము+ఒనర్చి = మగడినిమోసపుచ్చి; ధనము+కూర్చిన+ఆదియున్ = ద్రవ్యం ఆర్జించినట్టిదేసుమా!; మదము+పేర్మిన్ = గర్వాతిరేకంతో; ఓర్తుమగనిన్ = మరొక్కదాని పెనిమిటిని; హరించిన = లోబరచుకొన్న; ఉగ్మలియును = మగువయు అగును.

తాత్పర్యం: ప్రేయసీ! వినుము. ఇప్పుడు పిచ్చివాళ్ళుగ ఉన్నవాళ్ళు ముందటి జన్మలో వంచనతో సజ్జనుల డబ్బు కాజేసిన వారే సుమా! ఇప్పుడు బిడ్డలు లేనివాళ్ళు తమ తల్లిదండ్రులకు శ్రాద్ధక్రియలు నిర్వర్తించని వాళ్ళూ, పిల్లల్ని చంపినవాళ్ళూ అయి ఉన్నారు. నపుంసకులుగా ఉన్నవాళ్ళు తొలిజన్మలో ఎద్దును కట్టిపడవైచి దాని వృషణాలు నలిచిన వాళ్ళూ, ముడ్డిపూస విరుగ బొడిచిన వాళ్ళూ, రతిసౌఖ్యాన్ని అనుభవించకుండా చేసినవాళ్ళూ అయి ఉన్నారు. నేడు విధవరాలుగా ఉన్న చిన్నది మునుపు పెనిమిటిని మోసం చేసి ధనం ఆర్జించినట్టిదీ, పొగరుపట్టి మరియొక దాని భర్తను తన వశం చేసికొన్న గడుసుదీ సుమా!

తే. **ప్రయతులై పుట్టి యేవంపుఁబనులఁ గడుపుఁ । బ్రోచికొనువా రహంకారమునను గర్వ**
మాన మద దంభములఁ దొల్లి మాన్యజనులఁ । బరిభవించిన తుచ్ఛులు పద్మనయన! 106

ప్రతిపదార్థం: పద్మనయన! = కమలములవంటి కన్నులు గల చెలీ!; ప్రయతులు+ఐ+పుట్టి = పవిత్రులుగ జన్మించి; ఏవంపుఁబనులన్ (ఏవము+పనులన్) = రోత కలిగించే కృత్యములచేత, నీచకార్యాలతో, అసహ్యమైన పనులతో; కడుపున్+ప్రోచికొనువారు = పొట్టను పోషించుకొనేవారు; అహంకారమునను = నేనే అధికుడనన్న భావంతోను; గర్వమానమద దంభములన్ = పొగరుచేతను, చిత్త సమున్నతి చేతను, మదము చేతను, డంబము చేతను; తొల్లి = పూర్వజన్మలో; మాన్య జనులన్ = గౌరవించ దగిన వారిని, సజ్జనులను; పరిభవించిన = అవమానించిన; తుచ్ఛులు = అల్పులు, నీచులు సుమా!

తాత్పర్యం: కమలాక్షీ! పరిశుద్ధులై జన్మించినప్పటికినీ రోతపుట్టించే పనులు చేస్తూ, నేడు జీవిస్తున్నవాళ్ళు తొలిజన్మలో తాము గొప్పవాళ్ళమనే అహంకారంతో, పొగరుబోతుతనంతో, అభిమానంతో, మదంతో, డంబంతో విర్రవీగుతూ సత్పురుషులను అవమానపరచిన అల్పులు సుమా!

విశేషం: దంభం = ప్రసిద్ధి కోసం దానధర్మాలు సల్పటం; మానం = తన విద్యకూ, వంశానికీ తగని దురభిమానం.

సీ. **దాసత్వ మొంది యదల్పులఁ దిట్టుల । నాటులఁ బడుచుండునట్టి నీచు**
లప్పాటఁ దొలుమేన నతి గర్వులై ప్రల్ల । దమ్మునఁ బెక్కండ్రఁ దప్పులేక
తిట్టియు నడిచియుఁ దిరిగినవార లా । పొలువలపైఁ గృపగలిమి మేలు
ధనిక గృహద్వారమునఁ బ్రతిహారి ద । మ్మ్యాఁగంగ నుండి దైన్యమున దుఃఖ

తే. **పడు జనంబులు భోగైకపరతఁ దొల్లి । మాననీయుల కవసర మీని వారు**
రాజదండితుఁ దకృతాపరాధుఁ గ్రూర । దండ దూషితుఁ జేసినతండు సూవె! 107

ప్రతిపదార్థం: దాసత్వము+ఒంది = సేవకులై; అదల్పులన్ = తర్జనభర్జనలతో, బెదిరింపులతో; తిట్టులన్ = దూషణలతో; ఆటులన్ = బాధలను; పడుచున్+ఉండు+అట్టి = అనుభవిస్తున్న; నీచులు = దుష్టులు; ఆ+పాటన్ = ఆ విధంగా; తొలుమేనన్ = ముందటి జన్మలో; అతి గర్వులు+ఐ = మిక్కలి అహంకారులై; ప్రల్లదమ్మునన్ = వదరుబోతు తనంతో, దుర్భాషలతో; పెక్కంద్రన్ = పలువురను, అనేకులను; తప్పులేక = దోషం లేకపోయినా; తిట్టియున్ = దూషించి; అడిచియున్ = కొట్టి; తిరిగినవారలు = సంచరించినట్టి వారు; ఆ పొలువలపైన్ = ఆ దుష్టులమీద; కృప+కలిమిమేలు = దయకలిగి ఉండటం మంచిది; ధనిక గృహద్వారమునన్ = భాగ్యవంతుల యొక్క వాకిళ్ళ వద్ద; ప్రతిహారి = వాకిటి కావలివాడు, ద్వార పాలకుడు; తమ్మున్ = తమను; ఆగంగన్ = ఆపగా, నిలువరించగా; ఉండి = అక్కడే నిలబడి; దైన్యమునన్ = పేదతనంతో; దుఃఖపడు జనంబులు = చింతిస్తున్న మనుష్యులు; భోగ+ఏక+పరతన్ = సుఖములందలి పరమాసక్తితో; మాననీయులకున్ = గౌరవించదగినవారికి; అవసరము+ఈనివారు = అవకాశం కల్గించని వారే సుమా!; రాజదండితుఁడు = రాజుచే శిక్షించబడిన వాడు; అకృత+అపరాధున్ = తప్పు చెయ్యని వాడిని; క్రూరదండ దూషితున్= కఠినమైన శిక్షచే చెరచబడినవాడిగా; చేసిన+అతండు+చూవె = చేసినవాడే సుమా!

తాత్పర్యం: సేవకులై పరుల నాశ్రయించి వారి బెదిరింపులనూ, దూషణలనూ, పెట్టేబాధలనూ సహిస్తున్న అధములు ముందటి జన్మలో మిక్కిలి గర్వంతో, వదరుబోతులై వాగుతూ నిరపరాధులైన వారిని తమ ఇష్టానుసారం తిట్టుతూ కొట్టుతూ ప్రవర్తించిన వారే సుమా! దేవీ! అట్లాంటి వారి మీద దయచూపటం మంచిది. ధనవంతుల ఇండ్లకేగి అక్కడ ద్వారపాలకులచే అడ్డగించబడి దైన్యంతో దుఃఖించే జనులు ముందటి జన్మలో తమ దర్శనార్థమై పెద్దలు రాగా వారికి అవకాశమియ్యని దుర్మార్గులే సుమీ! ఈనాడు రాజదండనకు గురియైనవాడు పూర్వజన్మలో ఏ అపరాధం చెయ్యని వాడికి కఠినమైన శిక్షవిధించిన వాడే సుమా!

తే. **విను నష్టసకలధను లగు । జనములు నిక్షేప మిడిన సరకులు దొలుబా**
మున మగుడ నీక నెపమిడి । కొనినట్టి యసత్య లోభ కుత్సితు లతివా! **108**

ప్రతిపదార్థం: అతివా! = ఓ మగువా!; విను = శ్రద్ధగా ఆకర్ణించుము; నష్టసకల ధనులు+అగు+జనములు = పోగొట్టుకొన్న సమస్తమైన ధనములు గల నరులు; నిక్షేపము+ఇడిన = తమ దగ్గర దాచనిచ్చిన; సరకులు = వస్తువులు;మగుడన్ = మళ్ళీ; ఈక = ఇవ్వక; తొలు బామునన్ = ముందటి జన్మలో; నెపము+ఇడి = ఏదో ఒకసాకు పెట్టి; కొనిన+అట్టి = పుచ్చుకొన్న; అసత్య లోభకుత్సితులు = అసత్యవాదులు, లోభులు, కపటులు సుమా!

తాత్పర్యం: గౌరీ! సకలధనాలు కోల్పోయి అల్లాడుతున్నవారు పూర్వజన్మలో తమ దగ్గర దాచుటకై ఉంచిన వస్తువులను తిరిగి వాళ్ళకు ఇవ్వక ఏదో ఒకసాకు చూపి కాజేసిన అసత్యవాదులు, లోభులు, కపటులు సుమా!

క. **తమబంధులుఁ దారును నొ । క్కమరియ తెగటాఱువారు కరుణారహిత**
త్వమునఁ దొలుమేన వెడపగ । నమేయ నరవధము సేసినట్టి దురాత్ముల్.' **109**

ప్రతిపదార్థం: తమబంధులున్ = తమచుట్టాలూ; తారును = తామున్నూ; ఒక్కమరి+అ = ఒకేసారి, ఒకేతడవ; తెగటాఱువారు = నశించేవారు; కరుణారహితత్వమునన్ = దయాశూన్యులై; తొలుమేనన్ = మునుపటి జన్మలో; వెడపగన్ = నిష్కారణ విరోధంతో; అమేయ = మితిలేని; నరవధము = మనుజ సంహారం; చేసినట్టి = కావించిన; దుర్+ఆత్ముల్ = చెడుమనస్సు కలవారు సుమా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: తమ చుట్టములూ, తామూ ఒకేసారి మరణం పాలైనవారు పూర్వజన్మలో కృపలేనివారై నిర్హేతుకమైన ద్వేషంతో బహుజనాన్ని చంపిన పాపాత్ములు సుమా!'

వ. అని యెఱింగించి యీశ్వరుం డీశ్వరితో నిట్లనియె. 110

తాత్పర్యం: అని చెప్పి భవుడు మళ్ళీ భవానితో ఇట్లా అన్నాడు.

సీ. 'ఇంతి! నా చెప్పిన యిప్పాపకర్ములం। దఱకును నరకంబు దప్ప; దందుఁ
బడుపాటు లెల్లను బడివచ్చి నరులైన। యప్పుడు వాటిల్లునట్టి తెఱఁగు
లివి; యట్లు గాకయు నెక్కుడుగాని పా। పంబుల మానుషభవము గలుగు
నిట్లైన నమ్మేన నే కర్మమున ఫల। మైనను మానవు లనుభవింప;

ఆ. రోపి మునులు దేవయోనులు నత్తను। వునన తపము ఫలము లనుభవింతు'
రనిన దేవి 'యెఱుఁగ నయ్యె మీదయఁ బెక్కు। లర్థములు గృతార్థ నైతి' ననియె. 111

ప్రతిపదార్థం: ఇంతి! = ఓ చెలువా!; నాచెప్పిన = నేను నుడివిన; ఈ+పాపకర్ములు = ఈ పాపకృత్యాలు చేసినవారు; అందఱకును = ఎల్లరకూ; నరకంబు తప్పదు = నరకబాధలు అనుభవించక తప్పదు; అందున్ = ఆ నరకలోకంలో; పడుపాటులు+ఎల్లనున్ = పొందవలసిన కష్టాలన్నీ; పడివచ్చి = అనుభవించివచ్చి; నరులు+ఐన+అప్పుడు = తిరిగి మానవులై పుట్టినప్పుడు; పాటిల్లు+అట్టి+తెఱఁగులు+ఇవి = సంభవించబోయే గతులివి; అట్లు+కాకయున్ = అట్లాకాకుండాను; ఎక్కుడు+కానిపాపంబులన్ = అధికములుగాని పాపాలచేత; మానుషభవము కలుగున్ = మనుష్యజన్మ లభిస్తుంది. ఇట్లు+ఐనన్ = ఈ విధంగా లభించినప్పుడు; ఆ+మేనన్ = ఆ శరీరమునందు; ఏకర్మమున ఫలము+ఐనను = ఎట్టి కర్మ ఫలితమైనా; మానవులు = నరులు; అనుభవింపరు = పొందరు; ఓపి = సమర్థులై; మునులు = మునీశ్వరులు; దేవయోనులున్ = దేవజాతుల వారునూ; ఆ+తనువునన = ఆ దేహమునందే; తపము ఫలములు = తపస్సుయొక్క ఫలాలు; అనుభవింతురు = అనుభవిస్తారు; అనినన్ = అని శంభుడు పల్కగా; దేవి = శాంభవి; మీదయన్ = నాథా! మీ యొక్క కృపచే; పెక్కులు+అర్థములు = పలువిషయాలు; ఎఱుఁగన్+అయ్యెన్ = తెలిసికొనగలిగాను; కృతార్థన్+ఐతిన్ = ధన్యురాల నయ్యాను; అనియెన్ = అని చెప్పింది.

తాత్పర్యం: 'కాత్యాయనీ! నే చెప్పిన ఈ పాపులందరికీ నరకం తప్పదు. పూర్వం తా మొనర్చిన దురితాలవలన నరకలోకంలో నానాబాధ లనుభవించి మళ్ళీ వీరు పుడమిలో నరులై జన్మించినపుడు వారికి ఈ చెప్పబడిన గతులు కలుగుతాయి. అధికములైన పాపకృత్యాలు సల్పనివారికి మనుష్య జన్మ కలుగుతుంది. అయితే ఆ శరీరమందే మనుషులు తాము చేసిన కర్మఫలాలు అనుభవించరు. కాని, మునీశ్వరులు, యక్షగరుడగంధర్వ కిన్నర కింపురుషాది దేవయోనులు మాత్రం తాము సల్పిన తపః ఫలాలను ఆ దేహములందే అనుభవిస్తారు' అని పరమేశ్వరుడు పల్కగా 'దేవా! మీ కృప వలన పెక్కు సంగతులు తెలిసికొని ధన్యురాలనయ్యాను' అని పార్వతి పలికింది.

వ. అని వెండియు న ద్దేవునితో 'మనుజు లపరజన్మంబునంగాని కర్మఫలంబు లనుభవింప రంటిరి; తప్పు చేసిన నరుల నరపతు లిట్టి తప్పున కిట్టి దండంబను నిరూపణంబున దండించెద రని యక్కర్మంబు ఫలం బప్పుట్టువునన యనుభవించుట గాదె?' యనిన గౌరికి గంగాధరుం డిట్లనియె. 112

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని వెండియున్ = అని మరలా; ఆ+దేవునితోన్ = ఆ శంకరుడితో; మనుజులు = నరులు; అపర జన్మంబునన్+కాని = తరువాతి జన్మలో తప్ప; కర్మఫలంబులు; అనుభవింపరు; అంటిరి = మీరన్నారు గదా!; తప్పు చేసిన, నరులన్, నరపతులు = రాజులు; ఇట్టి తప్పునకున్ = ఇటువంటి దోషానికి, ఇట్టిదండంబు = ఇటువంటి శిక్ష; అను నిరూపణంబునన్ = అనే నిర్ణయంతో; దండించెదరు; అని = అని గౌరి పలికి; ఆ+కర్మ ఫలంబు; ఆ+పుట్టువునన = ఆ జన్మలోనే; అనుభవించుట+కాదు+ఎ? = అనుభవించినట్లవుతున్నది కదా! అనినన్ = అని పలుకగా; గౌరికిన్; గంగాధరుండు = గంగను తలపై ధరించిన శివుడు; ఇట్లు+అనియెన్ = ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని వచించి మహేశ్వరి మళ్ళీ మహాదేవుడితో ఇట్లా అన్నది. నాథా! ఇపుడు మనుషులు చేసే కర్మలయొక్క ఫలాలు మున్ముందు కలుగబోయే జన్మలందే వారు అనుభవిస్తారు అని మీరన్నారుకదా! మరి తప్పొనర్చిన జనులను ఈ తప్పునకు ఇట్టి శిక్ష అని శాస్త్ర విధి ననుసరించి నిర్ణయించి రాజు దండిస్తున్నాడు కదా! అపుడు మనుషులు తమ కర్మఫలాలు ఈ లోకంలోనే ఈ దేహమందే అనుభవించినట్లవుతున్నది. మరి తమరు ఉత్తర జన్మలందే వారికి కర్మ ఫలానుభవం అని చెప్పటానికి హేతువేమిటి?' అని ప్రశ్నించింది. అందుకు ఈశ్వరు డిట్లా అన్నాడు.

సీ. 'జనపతుల్ దమ రాజసంబున దండించి । నారుగా నొల్లక నరుల తప్పు
లకుఁ దగు దండంబు లన వారిఁ బఱతురు; । తక్కొరు లెవ్వరుఁ దప్పుసేయ
వెఱచుటకై యట్టి విధి మూఁడుటది పూర్వ । కర్మంబువలనన కాని, యపుడు
గలిగిన తప్పునఁ గా' దన్న నాదేవి । 'యవనీశ దండితుఁ డైన నరున

తే. కఘము వాయునొ? పాయదో?' యనిన నీశ్వ । రుండు 'నృపదండితుఁడు యమదండమునను
బడఁడు; లేని తప్పున నరుఁ బఱిచినతనిఁ । బఱుపకున్నాతనిని యమబాధ వొందు.' 113

ప్రతిపదార్థం: జనపతుల్ = ప్రభువులు; తమరాజసంబునన్ = తమ యొక్క అధికారంతో (దుర్గర్వంతో); దండించినారు+కాన్ = శిక్షించిన వారుగా; ఒల్లక = అంగీకరించక; నరులతప్పులకున్ = మనుషులు చేసిన అపరాధాలకు; తగు = అర్హములైన; దండంబులన = శిక్షలచేతనే; వారిన్ = ఆ దోషులను; పఱతురు = బాధిస్తారు; తక్కు+ఒరులు+ఎవ్వరున్ = మిగిలినవారెవ్వరునూ; తప్పు+చేయన్+వెఱచుటకై = తప్పిదము లొనర్ప భయపడటానికై; అట్టివిధి = అట్టి కీడు; మూఁడుట+అది = సంభవించటమనేది; పూర్వ కర్మంబు వలనన కాని = ముందటి జన్మలో చేసిన కర్మవలననే తప్ప; అపుడు+కలిగిన = అప్పుడు చేసిన; తప్పునన్+కాదు = అపరాధంవలనకాదు; అన్నన్ = అని పరమశివుడు పల్కగా; ఆ+దేవి = ఆ పరమేశ్వరి; అవనీ+ఈశ+దండితుఁడు+ఐన = ధరణీ వల్లభుడి చేత శిక్షించబడినట్టి; నరునకున్ = మనిషికి; అఘము = పాపం; పాయును+ఒ? = తొలగుతుందా?; పాయదు+ఓ? = తొలగదా?; అనినన్ = అని ప్రశ్నించగా; ఈశ్వరుండు; నృపదండితుఁడు = రాజుచే శిక్షించబడ్డవాడు; యమదండమునన్ = యముడి యొక్క శిక్షను; పడఁడు = అనుభవించడు; లేని తప్పునన్ = చెయ్యని దోషంచేత అనగా తప్పు చెయ్యకున్నా; నరున్ = మనిషిని; పఱిచిన+అతనిన్ = బాధించిన వాడిని; పఱుపక+ఉన్న+ఆతనినిన్ = తప్పు చేసినా దండించకున్నవాడిని; యమబాధ పొందున్ = యముడి వలన బాధ కలుగుతుంది.

తాత్పర్యం: రాజులు కేవలం తమకున్న అధికారదర్పంతో శిక్షిస్తున్నామని తలపోయక జనులు చేసే తప్పులకు తగిన దండన విధించి వారిని బాధిస్తారు. ఇతరులు అట్లాంటి తప్పులు చేయటానికి భయపడతారు అనే ఉద్దేశంతోనే వారట్లా చేస్తారు. రాజ దండనకు గురికావటం అన్నది పూర్వం తను చేసికొన్న కర్మ వలననే సంప్రాప్తిస్తుంది కాని ఇప్పుడు తను చేసిన తప్పువలన కాదు' అని శివదేవుడు వ్యాఖ్యానించగా గౌరీదేవి, 'దేవదేవా! రాజుచే దండించబడిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వాడికి పాపం తొలగుతుందా? తొలగదా?' అని అడిగింది. 'పాలకుడిచేత దండింపబడినవాడు మఱి యమదండన పొందడు. తప్పు చెయ్యని వాడిని దండించినా, తప్పు చేసిన వాడిని దండించక విడిచిపెట్టినా తప్పక అతడు యమదండనకు గురి ఔతా'డని పార్వతికి పరమేశ్వరుడు ప్రతివచించాడు.

వ. అని నిర్దేశించి వెండియు. 114

తాత్పర్యం: అని ఈశ్వరుడు నిర్ణయపూర్వకంగా చెప్పి మరల (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం).

క. 'విను తమ చేసిన కర్మం । బున ఫల మెవ్వరికిఁ ద్రోచి పుచ్చఁగ రా; దె
ట్లును గుడువక పో' దది యన । విని పార్వతి యిట్టు లనియె విభునకుఁ గృష్ణా ! 115

ప్రతిపదార్థం: విను = గౌరీ! వినుము; తమ చేసిన = తామొనర్చిన; కర్మంబునఫలము = పనుల వలని ఫలం; ఎవ్వరికిన్ = ఎట్టివారికిన్నీ; త్రోచిపుచ్చన్+ కన్+రాదు = తొలగద్రోయుటకు వీలుపడదు; అది = ఆ కర్మ ఫలం; ఎట్లును = ఏ విధంగానైన; కుడువక = అనుభవించక; పోదు = నశించదు; అనన్ = అని శంకరుడు చెప్పగా; విని = ఆలకించి; పార్వతి; విభునకున్ = తన భర్తకు; కృష్ణా! = శ్రీ కృష్ణా!; ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నది అని నారదుడు దేవి పల్కిన మాటలను వాసుదేవుడికి తెలిపాడు.

తాత్పర్యం: 'పార్వతీ! వినుము. తాము చేసిన కర్మఫలాలను తొలగ త్రోసికొనడానికి ఎంతటి వారికిన్నీ శక్యంగాదు. ఆ కర్మలఫలం అనుభవించితీరవలసిందే' అని శంకరు డనగా పార్వతి మళ్ళీ శ్రీకృష్ణా! ఇట్లా అన్నది.

తే. 'కర్మఫలములు గుడిచినఁ గాని పోవ । వంటి; వానిఁ బ్రాయశ్చిత్త మపహరించు
నందు; రశ్వమేధంబున నఖిల పాప । ములును జెడు ననఁగా విందు భూతనాథ!' 116

ప్రతిపదార్థం: భూతనాథ! = భూతగణాలకు ప్రభుడవైన ప్రాణేశ్వరా!; కర్మఫలములు = చేసిన కర్మల యొక్క ఫలాలు; కుడిచినన్+కాని = అనుభవిస్తే కాని; పోవవు+అంటి = తొలగవు అని చెప్పినావు; వానిన్ = ఆ కర్మఫలాలను; ప్రాయశ్చిత్తము = పాపపరిహారార్థమైన క్రియ; అపహరించున్+అందురు = పోగొట్టుతుందని చెప్పుతారు; అశ్వమేధంబునన్ = అశ్వమేధయాగం వల్ల; అఖిల పాపములును = సమస్త దురితాలూ; చెడున్ = నశిస్తాయి; అనఁగాన్+విందున్=అని చెప్పగా వింటున్నాను.

తాత్పర్యం: 'జీవితేశ్వరా! కర్మఫలాలు అనుభవించక తీరదని తమరు వచిస్తున్నారు. ప్రాయశ్చిత్తాలవలన దోషాలు తొలగిపోతాయని అంటారు. అశ్వమేధయాగం చేస్తే సర్వపాపాలు పటాపంచలవుతాయనే మాటలు వింటున్నాను.'

వ. అని పలికి 'యిది యెట్లొకో?' యనుటయు భవుండు. 117

ప్రతిపదార్థం: అని పలికి = అని వచించి; ఇది+ఎట్లు+ఒకో? = ఈ సంగతి ఏమిటో?; అనుటయున్ = అని గౌరి అడుగగా; భవుండు = శివుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: పార్వతీదేవి ఈ రీతిగా పలికి 'ఈ కర్మానుభవం విషయం ఎట్టిది?' అని అడుగగా శంభు'డిట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'అతివ! కామకృతములైన కర్మంబుల । ఫలము లనుభవింప వలయు; వినుమ
కామకృతము చెడుట గలుగుఁ బ్రాయశ్చిత్త । మాచరింప సంశయంబు వలదు. 118

ప్రతిపదార్థం: అతివ! = ఓ తరుణీ!; కామ కృతములు+ఐన = కోరికతో చేసినట్టివగు; కర్మంబులఫలములు = కర్మల యొక్క ఫలాలు; అనుభవింపన్ వలయున్ = అనుభవించే తీరాలి; వినుము = పార్వతీ! శ్రద్ధగా ఆలకించుము; ప్రాయశ్చిత్తము+ ఆచరింపన్ = దోషపరిహారార్థం చేయునట్టిక్రియ వల్ల; అకామకృతము = ఏ సంకల్పం లేక చేయబడినట్టి కర్మయొక్క ఫలం; చెడుట+కలుగున్ = నశించిపోవటం జరుగుతుంది; సంశయంబు వలదు = సందేహించ నక్కరలేదు.

తాత్పర్యం: 'దేవీ! కోరి కోరి చేసిన కర్మల యొక్క ఫలాలు తాను అనుభవించక తీరదు. ఎట్టి సంకల్పం లేక, అజ్ఞానం వల్లనో, పరాకువల్లనో చేసిన కర్మల యొక్క ఫలం మాత్రం ప్రాయశ్చిత్తం వలన తప్పక నశిస్తుంది. ఈ విషయంలో సంశయం వద్దు.

క. కావునఁ గుడువక పొలియదు । దేవాసురమునులకైన దేవీ! కర్మో
ద్భావితఫల మీయర్థము । నీవలవఱుపుము భవన్మనీషఁ దిరముగన్. 119

ప్రతిపదార్థం: కావునన్ = కాబట్టి, కనుక; దేవీ! = ప్రేయసీ!; కర్మ+ఉద్భావితఫలము = కర్మల వలన ఉద్భవించిన (జనించిన) ఫలం; దేవ+అసుర+మునులకున్+ఐనన్ = వేల్పులకైనా, రాక్షసులకైనా, మునీశ్వరులకైనా; కుడువక = అనుభవించక; పొలియదు = నశించదు, సమసిపోదు; ఈ+అర్థమున్ = ఈ సంగతిని; నీవు = నీవు; భవత్+మనీషన్ = నీ బుద్ధియందు; తిరముగన్ = స్థిరంగా, గట్టిగా; అలవఱుపుము = అభ్యసించుము,(ధరించుము).

తాత్పర్యం: రమణీ! కనుక దేవతలకైనా, రక్కసులకైనా, మునులకైనా మరెవ్వరికైనా తాము చేసిన కర్మల ఫలం తామే అనుభవించక నశించదు. ఈ విషయాన్ని నీ బుద్ధిలో దృఢంగా పదిలపరచుకొమ్ము'!

వ. అని చెప్పి య ప్పరమేశ్వరుండు వెండియు. 120

ప్రతిపదార్థం: అని చెప్పి = అని పలికి; ఆ+పరమ+ఈశ్వరుండు = ఆ మహేశ్వరుడు; వెండియున్ = మరల. (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అని నుడివి మహాదేవుడు మళ్ళీ అంబికతో ఇట్లా అన్నాడు.

క. సుకృతముల నరుఁడు నాకము । నకుఁ జను; నవి గొంచెమైన నరుఁడ యగును; వా
నికి దివి కేఁగి డిగిన యత । నికి మానుష వైభవములు నెఱయం గల్గున్.' 121

ప్రతిపదార్థం: నరుఁడు = మానవుడు; సుకృతములన్ = పుణ్యాలచేత; నాకమునకున్ = స్వర్గానికి; చనున్ = వెళతాడు; అవి = ఆ పుణ్యాలు; కొంచెము+ఐనన్ = స్వల్పమైతే; నరుఁడు+అ = నరుడే; అగున్ = అవుతాడు; వానికిన్ = ఆ మనుజుడికి; దివికిన్+ఏఁగి = స్వర్గలోకానికి వెళ్ళి; డిగిన+అతనికిన్ = అక్కడ నుండి భువికి వచ్చిన వాడికి; మానుష వైభవములు = మనుషులకు కలిగే శుభములు; నెఱయన్ = పూర్ణంగా; కల్గున్ = లభిస్తాయి.

తాత్పర్యం: మానవుడు పుణ్యాలొనర్చి స్వర్గలోకానికి వెళ్ళుతాడు. ఆ పుణ్యములు అల్పములైతే పుడమిలో మనుష్యుడై పుట్టుతాడు. ఇట్లా అల్పపుణ్యుడికీ, స్వర్గానికి వెళ్ళి మరలి వచ్చిన వాడికి మనుష్య భోగాలు పూర్ణంగానే లభిస్తాయి.'

వ. **అని నిర్దేశించి యుద్దేశ రూపంబునం గర్మంబుల తెఱం గెఱింగించి 'యింక నేమి యడుగవల తడుగు' మనిన నంబిక 'కర్మ కరణంబు జంతువశంబు గ్రహవశంబునా రెండు తెఱంగులం జెప్పదు; రం దెయ్యది దృఢం?' బని యడుగుటయు మృడుం డిట్లనియె.** **122**

ప్రతిపదార్థం: అని నిర్దేశించి = అని నిర్ణయించి; ఉద్దేశరూపంబునన్ = తలంచిన విధంగా; కర్మంబుల తెఱంగు = కర్మముల యొక్క స్వరూపం, విధానం; ఎఱింగించి = తెలిపి; ఇంకన్, ఏమి+అడుగన్+వలతు = ఏ విషయం అడుగదలచావో; అడుగుము; అనినన్ = అని శంభు డనగా; అంబిక = గౌరి; కర్మకరణంబు = కర్మలు చేయటం; జంతువశంబు = ప్రాణులకు అధీనం; గ్రహవశంబు = సూర్యాదిగ్రహాల యొక్క అధీనం; నాన్ = అని; రెండు తెఱంగులన్ = రెండు విధాలుగా; చెప్పుదురు; అందున్ = ఆ రెంటిలో; ఏ+అది(ఎయ్యది) = ఏది; దృఢంబు = బలీయం; అని+అడుగుటయున్ = అని ప్రశ్నించగా; మృడుండు = శంకరుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ ప్రకారం గిరీశుడు గిరిజకు తెల్పి 'ఉమా! నేను భావించిన చందంగా నీకు కర్మస్వరూపం వివరించాను. ఇంకా ఏమైనా అడుగదలంచితే అడుగు' మన్నాడు. పార్వతి, 'దేవా! కర్మాచరణం జీవుల వశమనీ, సూర్యాదిగ్రహాలకు అధీనమనీ రెండు విధాలుగా చెప్పుతుంటారు. ఇందులో ఏది బలీయమో సెలవియ్యండి' అని అడిగింది. అందుకు ఈశు డిట్లా అన్నాడు.

తే. **'నాతి! విను గ్రహచారంబు హేతువులుగ। నశుభములు శుభములు నరుఁ డాచరించు;**
గ్రహము చేయించునే? తాన కాక చేఁత। కొడయుఁ డటుగాన ఫలములు గుడువ వలయు.' **123**

ప్రతిపదార్థం: నాతి! = ఓ సుందరీ!; విను = వినుము; గ్రహచారంబు = గ్రహముల యొక్క సంచారం; హేతువులుగన్ = కారణంకాగా; నరుఁడు = మనిషి; అశుభములున్ = చెడుపనులనూ, పాపకార్యాలనూ; శుభములున్ = మంచిపనులనూ, పుణ్యకార్యాలనూ; ఆచరించున్ = చేస్తాడు; చేఁతకున్ = కర్మకు; ఒడయఁడు = అధికారి; తాను+అ+కాక = కేవలం తానే తప్ప; గ్రహము చేయించును+ఏ? = గ్రహం తన చేత ఆ పని చేయిస్తుందా? చేయించదనిభావం; అటు+కాన = అందుచేత; ఫలములు = కర్మలయొక్క ఫలాలు; కుడువన్+వలయున్ = తాను అనుభవించవలసిందే.

తాత్పర్యం: 'కాత్యాయనీ! గ్రహాల యొక్క సంచారం కారణంగా నరుడు శుభాశుభకర్మలు చేస్తాడు. ఆ కర్మ లన్నింటికీ తానే అధికారి. గ్రహాలు తన చేత ఆ పనులు చేయించటం లేదు కదా! కనుక ఆ కర్మఫలాలు తానే అనుభవించక తప్పదు.'

విశేషం: గ్రహాలు తొమ్మిది. 1)సూర్యుడు 2)చంద్రుడు 3)అంగారకుడు 4)బుధుడు 5)బృహస్పతి 6)శుక్రుడు 7)శని 8)రాహువు 9)కేతువు. అంగారకుడిని కుజుడంటారు. బృహస్పతికి గురుడని పేరు.

ద్రుతాంతమైన 'కావునన్' అనేదానిలో "వు" లోపించగా శేషించిన రూపం కానన్. అటుగానన్ అని ద్రుతాంతంగా దీనికి పూర్వకవి ప్రయోగాలు కోకొల్లలు. కాని, భారతంలో ఇది కళగానే కన్పిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ. 'ధృతరాష్ట్రుండును బుత్త్రులున్ వనము; గుంతీనందనుల్ సింహముల్;
మతి నూహింప నసింహమైన వనమున్ మర్దింతు; రెందున్ వనా
వృత వృత్తంబులుగాని సింహములకున్ వేగంబు చేటొందుఁ; గా
న తగం బొందుట కార్య మీయుభయమున్ సంతుష్టిమై నున్కికిన్.' (ఉద్యో. 1-358)

'కానన్' అనేది ద్రుతప్రకృతిక మైనప్పటికీ తిక్కనగారు దీనిని కళగానే స్వీకరించారు. లేకపోతే ద్రుతసంధికార్యాలు ప్రవర్తించి 'కానఁదగన్' అను రూపం సిద్ధించి ప్రాసమైత్రికి భంగం కలిగి ఉండేది.

వ. అనినఁ 'జా వనునది యేమి?' యని యుమ యడుగ నీశానుం డిట్లనియె. 124

ప్రతిపదార్థం: అనినన్ = అని శివుడు తెల్పగా; ఉమ = పార్వతి, చావు+అనునది = మరణమనేది; ఏమి = ఏమిటి?; అని, అడుగన్ = ప్రశ్నించగా; ఈశానుండు = ఈశ్వరుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని పార్వతి 'చావు అంటే ఏమిటి?' అని అడుగగా, శివుడు ఇట్లా అన్నాడు.

తే. 'నిత్యుఁ డాత్ముండు; దేహ మనిత్య; మతఁడు । ముదిమిఁ దెవులున వికృతమై యది వికలతఁ
బొందుటయు, దానిఁ దొఱఁగి తాఁ బోవునట్టి । దశకు మరణ మ న్పేరయ్యెఁ దనులతాంగి! 125

ప్రతిపదార్థం: తనులతా+అంగి! = సన్నని తీగవంటి శరీరంకలదానా!; ఆత్ముండు = జీవుడు; నిత్యుఁడు = నశించనివాడు, శాశ్వతుడు; దేహము = శరీరం; అనిత్యము = శాశ్వతం కానిది, నశించిపోయేది; ముదిమిన్ = ముసలితనం చేతనూ; తెవులునన్ = రోగాల చేతనూ; వికృతము+ఐ = పరిణామం పొందినదై, మార్పు చెందినదై; అది = ఆ మేను; వికలతన్+పొందుటయున్ = శక్తిని గోల్పోవగా; దానిన్ = తనువును; తొఱఁగి = విడిచి; తాన్ = జీవుడు; పోవునట్టి దశకున్ = వెళ్ళిపోయేస్థితికి; మరణము+అన్ = చావు అనే; పేరు+అయ్యెన్ = నామం ఏర్పడింది.

తాత్పర్యం: 'తీగవంటి సన్నని శరీరం గల చెలీ! జీవుడు శాశ్వతంగా ఉండేవాడు. దేహం అట్లాంటిది కాదు; నశించిపోయే స్వభావం కలది. దేహాత్మల కున్న తేడా ఇది. అయితే ముసలితనం చేత, రోగాల చేత మారిపోయి క్షీణించి శరీరం నశించే వేళ జీవుడు దానిని విడిచి వెళ్ళే స్థితికే మరణం అని పేరు.

విశేషం: భగవద్గీతోపనిషత్తులోని సాంఖ్యయోగం దేహాత్మ లక్షణాలను "న జాయతే మ్రియతే వా కదాచిత్"; "వేదాఽవినాశినం నిత్యం"; "వాసాంసి జీర్ణాని యథా విహాయ"; "దేహీ నిత్య మవధ్యోఽయం" ఇత్యాది శ్లోకాలలో విపులంగా చర్చించింది.

క. జీవుఁడు జీర్ణ శరీరముఁ । బోవిడిచి నవంబుఁ బొందఁ బుట్టను పేరం
దా వెలయుం దద్దశ జీ । వావలి వర్తించు నిటు గతాగతపరయై.' 126

ప్రతిపదార్థం: జీవుఁడు = ఆత్మ; జీర్ణ శరీరమున్ = శిథిలమైన శరీరాన్ని; పోన్ విడిచి = పరిత్యజించి; నవంబున్ = నూతనమైనదాన్ని, క్రొత్తదానిని; పొందన్ = గ్రహించటానికి; పుట్టు+అనుపేరన్ = పుట్టుతున్నాడు అనే పేరుతో; తాన్ = తాను; వెలయున్ = వెలుగొందుతున్నాడు; తత్+దశన్ = ఆ స్థితియందు; జీవ+ఆవలి = ప్రాణిసమూహం; ఇటు = ఈ ప్రకారం; గత+ఆగత+పర+ఐ = పోవుట, వచ్చుట అనువాటికి అధీనమై - రాకపోకలకు అనగా చావు పుట్టువులకు లోబడి; వర్తించున్ = మెలగుతుంది;

తాత్పర్యం: జీవుడు శిథిలమైన శరీరాన్ని వదలి క్రొత్త దేహాన్ని చేకొనే దానికే పుట్టుక అని పేరు. ప్రాణులు ఈ విధంగా కర్మమూలకములైన దేహాలను ధరిస్తూ విడుస్తూ అంటే జనన మరణాలకు అధీనులై ప్రవర్తిస్తుంటారు.'

విశేషం: "వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి,
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ." (భగ. 2-22)

మానవుడు శిథిలాలైన వస్త్రాలను వదలి నూతన వస్త్రాలను ఎట్లా ధరిస్తాడో, అట్లే జీవుడు కూడ శిథిలాలైన శరీరాలను విడిచి క్రొత్తవైన ఇతర శరీరాలను పొందుతున్నాడు.

ఇత్యాది గీతాశ్లోకాలు ఇక్కడ స్మర్తవ్యాలు.

వ. అనిన విని పార్వతి శర్వునితో 'బాలురు చచ్చుటకును వృద్ధులు పెద్ద కాలంబు బ్రదుకుటకును గారణం బేమి?' యనుడు నతండు. 127

ప్రతిపదార్థం: అనినన్; విని; పార్వతి; శర్వునితోన్ = శంకరుడితో; బాలురు = పిల్లలు; చచ్చుటకును; వృద్ధులు = ముసలివారు; పెద్దకాలంబు = పెక్కు సంవత్సరాలు; బ్రదుకుటకును; కారణంబు+ఏమి; అనుడున్ = అని ప్రశ్నించగా; అతండు = శివుడు. (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: శంభుడు అట్లా చెప్పగా విన్న గౌరీదేవి అతడితో 'మహేశ్వరా! పిల్లలు చావటానికి, పెద్దలు చిరకాలం జీవించటానికి హేతు వేమిటి?' అని ప్రశ్నించగా శివు డిట్లా బదులు చెప్పాడు.

తే. 'మేను జీర్ణముగాఁ జేయుఁ గాని మరణ । మొందఁ జేయదు విను కాల మెందు నరుని
పూర్వకర్మంబు లాయువుఁ బొదలఁ జేయ । సన్నముగఁ జేయ బ్రదుకును జావుఁ గలుగు.' 128

ప్రతిపదార్థం: విను = గౌరీ వినుము; కాలము = కాలం అనేది; మేనున్ = శరీరమును; జీర్ణముగాన్+చేయున్+కాని = చివికిపోయేటట్లు చేస్తుంది తప్ప; మరణము+ఒందన్+చేయదు = చనిపోయేటట్లు చేయలేదు; ఎందున్ = ఎక్కడైనా; నరునిపూర్వకర్మంబులు = మానవుడు పూర్వజన్మలో చేసికొన్న కర్మలు; ఆయువున్ = ఆయుష్యాన్ని, జీవితకాలాన్ని; పొదలన్+చేయన్ = వృద్ధి పొందేటట్లు చేయగా; సన్నముగన్+చేయన్ = క్షీణించేటట్లు చేయగా; బ్రదుకును = జీవించటం; చావున్ = మరణించటం; కలుగున్ = సంభవిస్తాయి.

తాత్పర్యం: 'దేవీ! విను. కాలం శరీరాన్ని శుష్కింపజేస్తుంది గాని చంపలేదు, నరుడు చేసిన పూర్వకర్మలే అతడి జీవిత కాలాన్ని పెంచటం చేత, క్షీణింప జేయడం చేత బ్రతకటం, చావటం అనేవి సంభవిస్తాయి.'

వ. అని చెప్పిన 'నాయు వేమిటం బెరుఁగు? నేద్దానం దఱుఁగు?' ననిన విని యుమకు నుమాపతి యిట్లనియె.129

ప్రతిపదార్థం: అని చెప్పినన్; ఆయువు = ఆయుస్సు; ఏమిటన్ = దేనిచేత; పెరుఁగున్? = వృద్ధి చెందుతుంది?; ఏ+దానన్ = దేనిచేత; తఱుఁగున్ = సన్నగిల్లుతుంది, క్షీణిస్తుంది?; అనినన్; విని; ఉమకున్; ఉమాపతి = శివుడు; ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని శివుడు చెప్పగా ఆకర్ణించి పార్వతీదేవి 'జీవితేశ్వరా! ఆయుస్సు దేనిచే వృద్ధి పొందుతుంది? దేని చేత క్షీణిస్తుంది? చెప్పు' మని అడిగింది. అందుకు ఉమావల్లభుడు ఇట్లా సమాధాన మిచ్చాడు.

శివుఁడు పార్వతికి ఆయుర్వృద్ధి క్షయంబులకుఁ గారణంబులు చెప్పుట. (సం.13 అను 01 15-2300).

తే. **'క్షమయు సత్యంబుఁ గృపయు శౌచమును గురుల । వలని భక్తియు నాయువు పొలుపు నిచ్చు;**
నలుక బొంకు క్రూరత శుచితాపగమము । గురువిరోధ మాయువుఁ గడుఁ గుందఁ జేయు. 130

ప్రతిపదార్థం: క్షమయున్ = సహనం, ఓర్పు; సత్యంబున్ = నిజం చెప్పటం; కృపయున్ = దయ; శౌచమును = పరిశుద్ధత; గురులవలని భక్తియున్ = ఆచార్యుల యెడ భక్తి భావం, పెద్దల యందు భక్తి; ఆయువు పొలుపున్ = ఆయుర్దాయము యొక్క పెంపును; ఇచ్చున్ = కలుగ జేస్తాయి; అలుక = కోపం, బొంకు = అబద్ధమాడటం; క్రూరత = కనికరం లేకుండటం, కర్కశత్వం; శుచితా+అపగమము = పరిశుద్ధత నుండి తొలగటం, శౌచవిహీనత్వం; గురు విరోధము = ఆచార్యుడి పట్ల వైరం, దేశికులపై ద్వేషం; ఆయువున్ = ఆయుష్యాన్ని; కడున్ = మిక్కిలి; కుందన్+చేయున్ = తగ్గించి వేస్తాయి, క్షీణింపజేస్తాయి.

తాత్పర్యం: 'సహనం, సత్యం, దయ, పరిశుద్ధత, గురువులయందు భక్తి ఆయుస్సును వృద్ధిపరుస్తాయి. క్రోధం, అబద్ధం, క్రూరత్వం, అపరిశుద్ధత, గురుద్వేషం అనేవి ఆయుస్సును మిక్కిలి క్షీణింపజేస్తాయి గౌరీ!

తే. **తపమునను బ్రహ్మచర్యవ్రతమున హిత మి । తాశనమున రసాయనాభ్యాసమునను**
బెరుఁగు నాయు; వాక్రియలపై నరుఁడు ప్రీతి । గలుగుటయుఁ బూర్వభవకృత కర్మ ఫలము. 131

ప్రతిపదార్థం: తపమునను = తపస్సు చేతనూ; బ్రహ్మచర్యవ్రతమునన్ = బ్రహ్మచర్య నియమపాలనం చేతనూ; హిత+మిత+అశనమునన్ = తగినట్టి, మితమైన ఆహారం చేతనూ; రసాయన+అభ్యాసమునను = జీవనౌషధాలను సేవించటం చేతనూ; అనగా ముసలితనం, మృత్యువును పోగొట్టే రసాయనాలను వాడటం చేతనూ; ఆయువు = ఆయుస్సు; పెరుఁగున్ = వృద్ధి చెందుతుంది; నరుఁడు = మానవుడు; ఆక్రియలపైన్ = తపస్సు మున్నుగా కలిగిన ఆ చర్యల మీద; ప్రీతి+కలుగుటయున్ = ఇష్టపడటం కూడ, మక్కువ చెందటం సైతం; పూర్వభవ = ముందటి జన్మలో; కృత = చేయబడిన; కర్మఫలము = కర్మలయొక్క ఫలమే సుమా!

తాత్పర్యం: విష్ణుసహోదరీ! తపస్సు చేతనూ, బ్రహ్మచర్యవ్రతానుష్ఠానం చేతనూ, ప్రియమైన, మితమైన ఆహారం స్వీకరించటం చేతనూ, జరామృత్యుహరణమైన జీవనౌషధాలను సేవించటం చేతనూ ఆయుర్దాయం పెరుగుతుంది. పై నుడివిన క్రియలమీద ఆసక్తి కలగటం కూడ ఆ నరుడు తొలుతటి జన్మలో చేసిన సుకృత కర్మల ఫలమే సుమా!

క. **తన లావున కధిక మయిన । పనిసేయు టయుక్తమును నపథ్యము నగు భో**
జనములు హరించు నాయువు; । వనిత! యవియుఁ బూర్వకర్మ వశతన కలుగున్. 132

ప్రతిపదార్థం: వనిత! = ఓ వెలదీ!; తనలావునకున్ = తన శక్తికి, తన బలమునకు; అధికము+అయిన = మించిన, ఎక్కువైన; పనిచేయుట = పనులు సల్పటం; అయుక్తమును = తగనిదియు; అపథ్యమున్+అగు = హితం కానిదియు అగు; భోజనములు

= ఆహారాలు, తిండ్లు; ఆయువున్ = ఆయుస్సును; హరించున్ = నశింపజేస్తాయి; అవియున్ = పై జెప్పినవి; పూర్వకర్మ వశతన్+అ = మునుపటి జన్మలో చేసిన కర్మల ననుసరించే; కలుగున్ = సంభవిస్తాయి.

తాత్పర్యం: గిరిజా! తన శక్తికి మించిన పనులు చెయ్యటం, అయోగ్యమైన, హితకరం కాని తిండ్లు తినటం వలన ఆయువు హరించుక పోతుంది. ఇట్లాంటివి పూర్వజన్మలో చేసిన కర్మల వల్లనే సంభవిస్తాయి.

వ. మఱియు నొక్క విశేషంబు సెప్పెద. 133

తాత్పర్యం: ఇంకొక్క విశేషం చెప్పుతాను గౌరీ! వినుము.

ఆ. సుకృతు లమరలోక సుచిరవాసులు నిట । దిగి చిరాయువులును నగుదు; రితరు
లతిచిరముగ నరకగతు లయి తుది నాయు । వల్ప మగు మనుష్యు లగుట గలుగు.' 134

ప్రతిపదార్థం: సుకృతులు = పుణ్యాత్ములు; అమరలోక సుచిరవాసులు = స్వర్గలోకంలో బహు దీర్ఘకాలం నివసించేవారు అవుతారు; ఇట దిగి = ఇలకు దిగివచ్చి; చిర+ఆయువులును+అగుదురు = దీర్ఘాయుష్మంతు లవుతారు; ఇతరులు = తక్కిన వారు, పాపాత్ములు; అతి చిరముగన్ = మిక్కిలి పెద్దకాలం; నరక గతులు+అయి = నరకలోకమునకు వెళ్ళినవారై; తుదిన్ = చివరకు, కడపట; ఆయువు = జీవితకాలం; అల్పము+అగు = తక్కువైన; మనుష్యులు+అగుట = మానవులై పుట్టటం; కలుగున్ = సంభవిస్తుంది, జరుగుతుంది.

తాత్పర్యం: పుణ్యపురుషులు దేవలోకంలో సుఖా లనుభవిస్తూ బహుకాలం గడపి పుణ్యం క్షీణించగానే తిరిగి భూలోకంలో మానవులుగా పుట్టుతారు. అప్పుడు వారు పుడమిలో దీర్ఘకాలం జీవిస్తారు. పాపులు నరకలోకంలో యాతనలు అనుభవించి పిమ్మట భూమిలో నరులై జన్మిస్తారు. అపుడు వారు అల్పమయిన ఆయుస్సు కలిగి ఉంటారు.'

విశేషం: దీర్ఘకాలం మనటానికి, అల్పకాలం జీవించటానికి ఆయాజీవులు చేసిన పుణ్యపాపాలే హేతువులని చెప్పటం జరిగింది.

క. నా విని భవాని 'పురుష । స్త్రీ విధములు రెండు గలవు త్రినయన! వానన్
జీవుఁడు వర్తించు తెఱఁగు । నీ వేర్పడఁ జెప్పవే!' యనియెఁ గంసారీ! 135

ప్రతిపదార్థం: కంస+అరీ(కంసునికి విరోధి)! = కంసుడుని సంహరించిన శ్రీకృష్ణా!; నాన్ = అని పరమేశ్వరుడు చెప్పగా; విని = ఆకర్ణించి; భవాని = శివపత్ని అయిన పార్వతి; త్రినయన! = మూడు కన్నులు గల శివా!; పురుష స్త్రీ విధములు = మగవాడని, ఆడుది అనే రీతులు; రెండు+కలవు = రెండున్నవి; వానన్ = ఆ రెంటిలో; జీవుఁడు = ఆత్మ; వర్తించు తెఱఁగు = మెలగే విధం; నీవు = తమరు; ఏర్పడన్ = విశదంగా, స్పష్టంగా; చెప్పవు+ఏ! = సెలవియ్యవా!; అనియెన్ = అని అడిగింది.

తాత్పర్యం: కృష్ణా! (కృష్ణుడితో నారదు డంటున్నాడు) శివుడు చెప్పిన మాటలువిని భవాని మరల భవుడితో

'ప్రాణేశ్వరా! లోకంలో పురుషులనీ, స్త్రీ లనీ జీవులు రెండు రకాలుగా ఉన్నారు కదా! వారిలో జీవుడు ఎట్లా ప్రవర్తిస్తుంటాడో ఆ విషయం నాకు విస్పష్టంగా వివరించు' మని వేడుకొనింది.

వ. అనిన విని మహాదేవుండు మహీధరతనయ కిట్లనియె. 136

ప్రతిపదార్థం: అనినన్; విని; మహాదేవుండు = ఈశ్వరుడు; మహీధరతనయకున్ = కొండ కొమార్తెకు, పార్వతికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పార్వతి అడుగగా శంభుడు ఆమెతో ఇట్లా అన్నాడు.

క. 'తాత్త్వికములైన పురుష। స్త్రీత్వంబులు లేవు పార్వతీ! జీవున; కా
తత్త్వమున కహంకృతిఁ గ। ర్మిత్వ మొలసి భావ్యవిధమ మెయికొను చుండున్.' 137

ప్రతిపదార్థం: పార్వతీ! = గౌరీ!; జీవునకున్ = ఆత్మకు; తాత్త్వికములు+ఐన = శరీరారంభక ద్రవ్యాలైన భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం అనే మహాభూతాలు, అహంకారతత్త్వం, మహత్తత్త్వం, మూలప్రకృతి అనే తత్త్వాల భేదం వలన కలిగిన, పురుషస్త్రీత్వంబులు లేవు = మగతనం ఆడుతనం అనేవి లేవు; ఆ తత్త్వమునకున్ = ఆ జీవభావానికి; అహంకృతిన్ = అహంకారం చేత; కర్మిత్వము+ఒలసి = కర్మసంబంధం లభించి; భావ్య విధము+అ = భావించినట్లుగానే స్త్రీ పురుషభేదం; మెయికొనుచున్+ఉండున్ = సంభవిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: 'గౌరీ! జీవుడికి మహదహంకారాదులైన తత్త్వాలలో భేదం వాటిల్లి మగవాడుగనో, ఆడుదిగనో జన్మించటం సంభవించదు. ఆత్మ స్త్రీ దేహం ధరించినా, పురుష శరీరం పొందినా ఆ ఇరవైనాలుగు తత్త్వాలు స్త్రీ పురుషులకు ఏకవిధంగానే ఉంటాయి. వాటిలో మార్పుండదు. అహంకారం వలన జీవుడికి కర్మ సంబంధం కలిగి ఆడుదిగనో, మగవాడుగనో రూపం ధరిస్తాడు.'

విశేషం: భూమి, జలం, వాయువు, తేజస్సు, ఆకాశం అనే పంచమహాభూతాలూ, అహంకారతత్త్వం, మహత్తత్త్వం, మూల ప్రకృతి అనే ఎనిమిది ద్రవ్యాలతో శరీరం రూపొందుతుంది. చర్మం, కన్ను, చెవి, నాలుక, ముక్కు అనే అయిదు జ్ఞానేంద్రియాలు, వాక్కు, చేయి, కాలు, మలవిసర్జనద్వారం, మూత్రవిసర్జన ద్వారం(పాయువు, ఉపస్థ) అనే అయిదు కర్మేంద్రియాలూ, మనస్సూ, జ్ఞానేంద్రియ పంచకం చేత గ్రహించబడే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు అనే అయిదు విషయాలూ మొత్తం ఈ ఇరవై నాలుగు శరీరాన్ని ఆశ్రయించుకొని ఉండే తత్త్వాలు. ఈ తత్త్వాలు పురుషుడికిగాని, స్త్రీకి గాని ఏకవిధంగానే ఉంటాయి. అయితే ఆయాజీవులు చేసికొన్న పుణ్యాపాప కర్మ ఫలాలైన సుఖదుఃఖాలు అనుభవించటానికి శరీరాలు ఏర్పడుతాయి. నేనే ఈ పని చేస్తున్నాను అనే అహంకర్తృత్వ బుద్ధి వలన ఆ పుణ్యాపాప కర్మ సంబంధమైన సుఖదుఃఖానుభవం కొరకు జీవుడు శరీరం ధరిస్తాడు. అది పురుష దేహమైనా కావచ్చు; స్త్రీ దేహమైనా కావచ్చు. అంతేకాని అసలు ఆత్మకు స్త్రీత్వ పురుషత్వాలులేవు.

వ. అని మఱియును. 138

తాత్పర్యం: అని చెప్పి మహాదేవుడు మళ్ళీ (ఉమతో ఇట్లా అన్నాడు అని తరువాతి పద్యంతో అన్వయం)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'కర్మములకుఁ గర్తగాఁ డాత్ముఁ; డతని స । త్త్వము రజస్సుఁ దమము వాత పిత్త
కఫము లెట్లు మర్త్యకాయ గతము లగు । నట్ల పొందుఁ గర్త లవియ చూవె. 139

ప్రతిపదార్థం: ఆత్ముఁడు = జీవుడు; కర్మములకున్ = కర్మలకు; కర్తకాఁడు = చేసేవాడు కాదు; వాతపిత్త కఫములు = వాతం, పిత్తం, శ్లేష్మం అనేవి; ఎట్లు = ఏ విధంగా; మర్త్యకాయగతములు+అగున్ = మనిషి శరీరాన్ని పొందుతాయో; అట్లు+అ = ఆ రీతిగానే; అతనిన్ = జీవుడిని; సత్త్వము = సత్త్వగుణం; రజస్సు = రజోగుణం; తమము = తమోగుణం; పొందున్ = ఆశ్రయిస్తాయి, కూడుతాయి; కర్తలు = ఆ పనులు చేసేవి; అవి+అ+చూవె = ఆ సత్త్వ రజ స్తమో గుణాలే సుమా!

తాత్పర్యం: 'గౌరీ! ఆత్ముడు కర్మలకు కర్త కాడు. వాతం, పిత్తం, కఫం అనే త్రిదోషాలు శరీరాలను ఆశ్రయించుకొని ఉన్న చందంగా సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం జీవుడిని ఆశ్రయించి ఉంటాయి. ఈ మూడు గుణాలే కర్మలకు కర్తలు గాని జీవుడు మాత్రం కానేకాడు.

విశేషం: "సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః,
నిబధ్నన్తి మహాబాహో! దేహే దేహిన మవ్యయమ్." (భగ. 14-5)

సత్త్వరజస్తమోగుణాలు ప్రకృతికి సహజమైన గుణాలు. అవి నాశరహితుడైన ఆత్మను దేవమనుష్యాది దేహాలలో బంధిస్తున్నాయి.

"ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః,
అహంకార విమూఢాత్మా కర్తాఽహ మితి మన్యతే." (భగ. 3-27)

ప్రకృతికి చెందిన సత్త్వ రజస్తమోగుణాలచేత చేయించబడుతున్న కర్మలను ఆత్మయొక్క యథార్థస్వరూపం తెలియనివాడు దేహాత్మాభిమానం వలన ఆ పను లన్నిటినీ తానే చేస్తున్నట్లు తలపోస్తాడుకాని వాస్తవానికి గుణాలే కర్మలకు కర్తలు అని గీత చెప్పుతున్నది.

తే. సత్య శౌచ దయాదులు సాత్త్వికములు, । రమణి! లోభ సంగాదులు రాజసంబు,
లనృత హింసాపరత్వ భయాలసత్వ । ధైర్యహాని నిద్రాదులు తామసములు. 140

ప్రతిపదార్థం: రమణి! = సుందరీ!; సత్య శౌచదయా+ఆదులు = సత్యం, పరిశుద్ధత, కృప మొదలైన గుణాలు; సాత్త్వికములు .= సత్త్వగుణానికి సంబంధించినట్టివి; లోభసంగ+ఆదులు = దురాశ లేదా పిసినారితనం, సంసార విషయాసక్తి మొదలైనవి; రాజసంబులు = రజోగుణ సంబంధమైనవి; అనృత = అబద్ధాలాడటం; హింసాపరత్వ = జీవులను బాధించటంలో ఆసక్తి; భయ = భీతి చెందటం; అలసత్వ = సోమరితనం; ధైర్యహాని = ధైర్యంకోల్పోవటం; నిద్రా+ఆదులు = నిద్రించటం మొదలైనవి; తామసములు = తమోగుణానికి సంబంధించినవి.

తాత్పర్యం: సుందరీ! సత్యం, శుచిత్వం, కరుణ మొదలైనవి సత్త్వగుణానికి సంబంధించినటువంటివి. అత్యాశ (పిసినారితనం--అవసరమైనపుడు తన సొమ్ము ఖర్చుపెట్టకుండటం), భార్యాపుత్రమిత్రాదుల యందు మమత మొదలైనవి రజోగుణ సంబంధమైనవి. అబద్ధాలు చెప్పడం, జీవహింసయందు ఆసక్తి, భయపడటం, సోమరితనం, అధైర్యం, నిద్ర మొదలైనవి తమోగుణానికి చెందినట్టివి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **ఇవి నానాముఖములఁ బురు । షు వికారముఁ బొందఁ జేయుచుం బరఁగును హై**
మవతీ! కావున సర్వం । బు వినుము గుణకృత్య మిట్టి బోధం బొప్పన్ **141**

ప్రతిపదార్థం: ఇవి = ఈ త్రిగుణాలు; నానా ముఖములన్ = అనేకరీతుల; పురుషున్ = జీవుడిని, ఆత్ముడిని; వికారమున్+పొందన్+చేయుచున్ = స్వభావంలో మార్పులు కలిగిస్తూ; పరఁగున్ = విలసిల్లుతున్నవి; కావునన్ = కాబట్టి; హైమవతీ! = హిమవంతుడి పుత్రివైన దేవీ!; ఇట్టి బోధంబు = ఇట్టి తెలివి; ఒప్పన్ = చెలువొందగా; వినుము = ఆలకించుము; సర్వంబు = సమస్తమూ; గుణకృత్యము = గుణాలు చేసే పనే.

తాత్పర్యం: గిరిజా! సత్త్వరజస్తమోగుణాలు మూడున్నూ పురుషుడిని నానావికారాల పాలు చేస్తున్నవి. కనుక సర్వకార్యాలూ ఈ గుణాల చేతనే చేయబడుతున్నవని తెలివితో తెలిసికొనుము.

తే. **తన్వి! సాత్త్విక రాజస తామసాత్ము । లైనవారలఁ బుణ్యలోకానుభవము**
మనుజభావంబు నిరయపీడనముఁ బొందు । మోక్షలక్ష్మి నిర్గుణునకు మునుఁగ ముసరు. **142**

ప్రతిపదార్థం: తన్వి! = ఓ చెలీ!; సాత్త్విక రాజస తామస+ఆత్ములు+ఐనవారలన్ = సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం కలిగినట్టి వారిని; పుణ్యలోక+అనుభవమున్ = పుణ్యలోక సుఖానుభవం; మనుజభావంబున్ = మనుష్యత్వం; నిరయపీడనమున్ = నరకలోక బాధయున్నూ; పొందున్ = వరుసగా చెందుతాయి; మోక్ష లక్ష్మి = ముక్తి సంపద; నిర్గుణునకున్ = త్రిగుణాతీతుడికి; మునుఁగన్ ముసరున్ = పరిపూర్ణంగా చేకూరుతుంది.

తాత్పర్యం: పార్వతీ! సత్త్వగుణప్రధానుడికి పుణ్యలోక సుఖాలు, రజోగుణప్రధానుడికి మనుష్యత్వమూ, తమోగుణప్రధానుడికి నరకలోక బాధ కలుగుతాయి. త్రిగుణాతీతుడైన వాడికి ముక్తి పరిపూర్ణంగా లభిస్తుంది.

విశేషం: ఈ యర్థాన్నే భగవద్గీత ఇట్లా వెల్లడించింది.

"ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థాః మధ్యే తిష్ఠంతి రాజసాః,
జఘన్యగుణ వృత్తిస్థాః అధో గచ్ఛంతి తామసాః."

"నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టాఽనుపశ్యతి,
గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి." (భగ. 14-18,19.)

వ. **అని వెండియు.** **143**

తాత్పర్యం: అని పరమశివుడు పలికి ఇంకనూ (ఇట్లా అన్నాడని తరువాతి సీసపద్యంతో అన్వయం).

సీ. **'ఎట్టివి కర్మంబు లట్టివ నరుల శు । భాశుభసంప్రాప్తు; లట్లు గాక**
పర విప్రియమున మేల్ వడయుటయును గల్గుఁ । బతిభృత్యతతిఁ బటు భర్త్సనముల
నొజ్జ శిష్యులఁ దర్జనోక్తుల వెజ్జ రో । గార్తుల నానా విధౌషధముల
నలమటఁ బొందింతు రవ్విధంబుల చేత । లన్నియు సుకృతంబులై ఫలించు'

ఆ. **నని మఱియును జెప్పు 'నఖిలేంద్రియో పేత । మగు జరాయుజంబు నండజంబు**
నువిద! చోఁకు నెఱుఁగు నుద్భిజ్జములు స్వేద । జముల కదియుఁ జూపు సంభవించు. **144**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కర్మంబులు = చేసే పనులు; ఎట్టివి = ఎట్లాంటివో; నరుల శుభ+అశుభ సంప్రాప్తులు = మనుష్యులు పొందేటటువంటి పుణ్యాపాపాలరాకడలు కూడ; అట్టివి+అ = అటువంటివే అవుతాయి; అట్లు+కాక = పై జెప్పినవిధంగా కాకుండా; పరవిప్రియమునన్ = ఇతరులకు అనిష్టములైన వాటిని చెయ్యటం వలన కూడ; మేల్ = మంచిని; పడ యుటయును+ కల్గున్ = పొందడం కూడ జరుగుతుంది; పతి = యజమానుడు, అధికారి; భృత్యతతిన్ = సేవక గణాన్ని; పటు భర్త్సనములన్ = గట్టిగా బెదరించటం చేత, నిందించటం వలన; ఒజ్జ = గురువు, ఉపాధ్యాయుడు; శిష్యులన్ = ఛాత్రులను; తర్జన+ఉక్తులన్ = బెదరింపుమాటల చేత; వెజ్జు = వైద్యుడు; రోగ+ఆర్తులన్ = వ్యాధుల చేత బాధపడేవారిని; నానావిధ+ఔషధములన్ = పలురకాలైన మందుల చేతనూ; అలమటన్+పొందింతురు = శ్రమ పెట్టుతారు; ఆ+విధంబుల+చేఁతలు+అన్నియున్ = ఆ రీతివైన పనులన్నీ; సుకృతంబులు+ఐ = పుణ్యకార్యాలై; ఫలించున్ = పండుతాయి, ప్రయోజనాలు సిద్ధింపజేస్తాయి; అని = అంటూ; మఱియును = ఇంకా; చెప్పున్ = చెప్ప సాగినాడు; ఉవిద! = ఓ ప్రియా!; జరాయుజంబున్ = మావియందు పుట్టునదియూ; అండజంబున్ = గ్రుడ్డు నుండి పుట్టునదియూ; అఖిల+ఇంద్రియ+ఉపేతము+అగున్ = అన్ని ఇంద్రియాలతోనూ కూడిన దవుతుంది; ఉద్భిజ్జములు= చెట్లూ, పొదలూ; చోఁకున్+ఎఱుఁగున్ = స్పర్శజ్ఞానం కలిగి ఉంటాయి; స్వేదజములకున్ = చెమటవలన జన్మించిన జీవులకు; అదియున్+చూపు = స్పర్శజ్ఞానంతో పాటు దర్శన శక్తి కూడ; సంభవించున్ = కలుగుతుంది.

తాత్పర్యం: 'మనుషులు చేసేపనులను బట్టి వారికి మేలుగీళ్లు లభిస్తాయి. చెడ్డపని చేస్తే చెడు ఫలితం, మంచి పనులు చేస్తే మంచి ఫలితం కలుగుతాయన్న మాట. ఇందుకు భిన్నంగా కూడా జరగటం కద్దు. ఇతరులకు ఇష్టంగాని పనులు చేసే కర్తకు మేలు కలగటం కూడా సంభవిస్తుంది. అధికారి సేవకులను బెదరిస్తూ మాట్లాడటం, వైద్యుడు రోగాలతో అల్లాడే వారిని, చేదు, వగరు, కారం మందులు మింగించి శ్రమ పెట్టటం, గురువు విద్యార్థులను దండించటం ఇట్లాంటివే. ఈ పనుల వల్ల కర్తకు పుణ్యమేకాని పాపం రాదు'-- అని చెప్పి మహేశ్వరుడు మహాదేవితో మళ్ళీ అంటున్నాడు. 'దేవీ! మావియందు పుట్టిన ప్రాణీ, గ్రుడ్డునుండి జన్మించిన జీవీ సకలేంద్రియాలతో ఒప్పారుతుంది. చెట్లు చేమలు స్పర్శజ్ఞానం మాత్రమే కలిగి ఉంటాయి. చెమట వలన జన్మించిన జీవులస్థితి గతులు గూడ వృక్షాదుల స్థితిగతుల వంటివే. కాని, వీటికి దర్శనశక్తి గూడ ఉంటుంది.

విశేషం: జీవరాసులు నాలుగు విధాలు: 1)జరాయుజములు 2)అండజములు 3) ఉద్భిజ్జములు 4) స్వేదజములు అని.

అందు 1) జరాయుజములు అనగా మావి నుండి, గర్భాశయం నుంచి పుట్టినట్టివి--మనుష్యులు, పశువులు మొదలైన ప్రాణులు.

2) అండజములు = గ్రుడ్డువలన పుట్టినవి: పక్షులు, చేపలు, బల్లులు, పాములు.

3) ఉద్భిజ్జములు = భూమిని భేదించుకొని పుట్టినవి: వృక్షములు, లతలు (తీగలు) గుల్మములు (పొదలు)

4) స్వేదజములు = చెమటవలన పుట్టే క్రిమి విశేషాలు-- ఈగలు, దోమలు, చీమలు, మిడుతలు, నల్లులు, క్రిములు, కీటకాలు.

క. నరుఁడు జరాయుజములలో । తరుణీ! విను ముత్తముఁడు; శ్రుతము లేకున్నన్
సరి నతఁడు పశువుఁ; గావున । వరిష్ఠ మగునట్టి వినికి వలయు నరునకున్. 145

ప్రతిపదార్థం: తరుణీ! = ఓ లలనా!; వినుము = ఆలింపుము; నరుఁడు = మనుజుడు; జరాయుజములలోన్ = మావి నుండి పుట్టిన జీవులలో; ఉత్తముఁడు = శ్రేష్ఠుడు; శ్రుతము+లేక+ఉన్నన్ = పెద్దల వలన ధర్మాధర్మముల వినికిడి లేకపోయినచో;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అతఁడు = ఆ మనుజుడు; పశువున్+సరి = పశువుతో, జంతువుతో సమానుడే; కావునన్ = కాబట్టి; నరునకున్ = మానవుడికి; వరిష్ఠము+అగు = శ్రేష్ఠమైన; వినికి వలయున్ = బోధ, ఉపదేశం అవసరం.

తాత్పర్యం: కాంతా! మావినుండి ఉద్భవించిన ప్రాణులలో మానవుడు శ్రేష్ఠుడు. అతడు ధర్మాధర్మాల స్వరూప మెట్టిదో పెద్దల వలన వినాలి. అట్టి వినికి లేనిచో అతడు పశువుతో సమానుడే. కావున జనుడికి శ్రేష్ఠమైన వినికిడి అవసరం.

క. ఇరుదెఱఁగు విను తమము శా । ర్వరమును దేహజము శార్వరము దేజస్సం
స్ఫురణమునఁ బాయు శ్రుతమునఁ । బరిహృతమగు దేహజంబు పర్వతపుత్రీ! 146

ప్రతిపదార్థం: పర్వతపుత్రీ! = ఓ హైమవతీ!; విను = వినుము; తమము = చీకటి; ఇరు+తెఱఁగు = రెండు విధాలు; శార్వరమును = శర్వరీ సంబంధము అనగా రాత్రిసంబంధమైనదీ; దేహజమున్ = శరీర సంబంధమైనదియూ (అని); శార్వరము = రేయి వలన కలిగిన చీకటి; తేజస్+సంస్ఫురణమునన్ = వెలుగు గోచరించటంచేత, కాంతి ప్రసరించటం వలన; పాయున్ = తొలగుతుంది; దేహజంబు = శరీరం నుండి పుట్టినట్టిది; శ్రుతమునన్ = వినికిడి వలన (వేదశాస్త్ర శ్రవణం వలన); పరిహృతము+ అగున్ = తొలగింపబడుతుంది.

తాత్పర్యం: గౌరీ! వినుము; చీకటి రెండు విధాలు. ఒకటి రాత్రి వలన కలిగినట్టిది. రెండవది శరీరం వలన ఏర్పడినట్టిది. రాత్రి చీకటి కాంతి ప్రసరణం వలన నశిస్తుంది. దేహమున పుట్టిన చీకటి పెద్దలు చేసే శాస్త్ర చర్చ ఆలకించి గ్రహించటం వలన తొలగిపోతుంది.

విశేషం: దేహమున పుట్టిన చీకటి అంటే అజ్ఞానం.

ఆ. బ్రహ్మ యా తమంబుఁ బాపుటకై తపో । వ్యాప్తిఁ బడసె శ్రుతులు నంగములును
గానఁ గార్యములు నకార్యంబులును వానఁ । దెలిసి కొనఁగ బుద్ధి కలఁక దీఱు. 147

ప్రతిపదార్థం: బ్రహ్మ = బ్రహ్మదేవుడు; ఆ తమంబున్ = ఆ చీకటిని; పాపుటకై = తొలగించటానికి; తపః వ్యాప్తిన్ = తపస్సు యొక్క సమృద్ధి చేత, చిరకాల ఘోర తపస్సు చేత; శ్రుతులున్ = వేదాలనూ; అంగములునున్ = వేదాంగాలైన ఆరుశాస్త్రాలనూ; పడసెన్ = పొందినాడు; కానన్ = కనుక; కార్యములున్ = చేయదగిన పనులూ; అకార్యంబులునున్ = చేయ దగని పనులూ; వానన్ = ఆ వేద శాస్త్రాల చేత; తెలిసికొనఁగన్ = ఎఱిగినట్లయితే; బుద్ధి కలఁక తీఱున్ = బుద్ధిజాడ్యం, మాంద్యం నశిస్తుంది.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు శరీరంలోని చీకటిని తొలగించటానికి బహుకాలం గొప్ప తపస్సు చేసి ఆ తపఃఫలంగా వేదాలనూ, శాస్త్రాలనూ పొందగలిగాడు. కాబట్టి చేయదగిన పను లేవో, చేయరాని పనులేవో ఆ వేదశాస్త్రాల వలన తెలియవలె. అందువలన బుద్ధి జాడ్యం తొలగిపోతుంది.

విశేషం: శ్రుతులు: ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. వేదాంగములు: శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం-- ఇవి ఆరు.

తే. క్రోధకామాదులైన దుర్గుణము లెల్ల । వాయుహతి మేఘపటలంబు వాయు పగిది
శ్రుతముచేఁ బాయు; నరులలో సురల కరణి । శ్రుతయుతులు దేజరిల్లుదు రతిశయిల్లి. 148

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: క్రోధకామ+ఆదులు+ఐన = కోపం, కామం మొదలైన; దుర్గుణములు+ఎల్లన్ = చెడుగుణాలన్నీ; వాయుహతిన్ = గాలిదెబ్బచే, తాకిడి చేత; మేఘ పటలంబు = మబ్బులగుంపు; పాయుపగిదిన్ = తొలగిపోయే విధంగా; శ్రుతము చేన్ = వేదశాస్త్రపురాణాల వినికి చేత; పాయున్ = తొలగిపోతాయి; నరులలోన్ = మనుషుల్లో; శ్రుతయుతులు = వేదశాస్త్రాదుల వినికిడితో కూడినవారు; సురల కరణిన్ = దేవతలమాదిరి; అతిశయిల్లి = మించి; తేజరిల్లుదురు = ప్రకాశిస్తారు, వెలుగొందుతారు.

తాత్పర్యం: కామక్రోధాది దుర్గుణా లన్నీ గాలి దెబ్బకు మబ్బులు చెదరిపోయేటట్లు వేదశాస్త్రాల వినికిడివలన నశిస్తాయి. మానవులలో బహుశ్రుతు లైన మహనీయులు వేల్పుల వలె హెచ్చుగా విరాజిల్లుతారు.

విశేషం: "కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః,
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్." (గీత. 3అధ్యా 37శ్లో.)

రజోగుణం వలన కామం జనిస్తుంది. ఈ కామానికి ఎంత అనుభవించినా తృప్తి ఉండదు. ఇదే అడ్డగించబడి కోపంగా మారి ఘోరపాపాలు చేయిస్తుంది. ఇది జ్ఞానికి ప్రబలశత్రువు-అని గీత కామక్రోధాలు ఎట్లాంటివో వివరించింది.

వాయుహతిన్ మేఘపటలంబు వాయు పగిది, క్రోధ కామాది దుర్గుణములు శ్రుతముచే పాయున్ - అనుచోట ఉపమాలంకారం.

తే. **శ్రుతము నరునిఁ బరిజ్ఞానయుతునిఁ జేయు । వాని సుకృత మల్పమును ననూన ఫలము**
నిచ్చు; నజ్ఞాని సత్కర్మ మెంతయైన । నఫల మగుఁగాన శ్రుతవంతుఁ డగుట వలయు.' 149

ప్రతిపదార్థం: శ్రుతము = శాస్త్రాదుల వినికి; నరునిన్ = మనుజుడిని; పరిజ్ఞానయుతునిన్+చేయున్ = పూర్ణజ్ఞానంతో కూడిన వాడినిగా చేస్తుంది; వాని సుకృతము = అతడు చేసిన పుణ్యం; అల్పమును = కొంచెమైననూ; అనూనఫలమున్+ఇచ్చున్ (న+ఊన = అనూన) = మిక్కుటమైన ఫలాన్ని ప్రసాదిస్తుంది. కొదువలేని ఫలాన్ని ఇస్తుంది; అజ్ఞాని సత్కర్మము = జ్ఞానం లేని వాడి యొక్క మంచిపని అనగా వాడు చేసిన పుణ్యకర్మ; ఎంత+ఐనన్ = ఎంత గొప్పదైనప్పటికిన్నీ; అఫలము+అగున్ = వ్యర్థమవుతుంది; కానన్ = కాబట్టి; శ్రుతవంతుఁడు+అగుట+వలయున్ = శాస్త్రాదుల వలన ధర్మస్వరూపం ఎరిగిన వాడు కావడం అవసరం.

తాత్పర్యం: శాస్త్రాదుల వినికిడి మానవుడిని పరిపూర్ణ జ్ఞానవంతుడిని చేస్తుంది. అట్టి వివేకవంతుడు చేసే పుణ్యం కొంచెమైనా గొప్ప ఫలం వానికి ప్రసాదిస్తుంది. "అజ్ఞాని చేసిన మంచిపని ఎంత గొప్పదైనా అది వ్యర్థమవుతుంది. కాబట్టి మానవుడు శ్రుతవంతుడుకావడం ఎంతో అవసరం"

వ. **అని నిర్దేశించి సర్వేశ్వరితో సర్వజ్ఞుం డిట్లనియె. 150**

ప్రతిపదార్థం: అని నిర్దేశించి = ఇట్లు నిర్ణయపూర్వకంగా తెల్పి; సర్వ+ఈశ్వరితోన్ = సమస్తమునకు నాయకురాలైన గౌరీదేవితో; సర్వజ్ఞుండు = సమస్తం తెలిసిన శంభుడు; ఇట్లు+అనియెన్ = ఇట్లా వచించాడు.

తాత్పర్యం: అని చెప్పి లోకేశ్వరి అయిన ఉమాదేవితో శివదేవుడు ఇట్లా చెప్పాడు.

సీ. 'మృతిఁ బొంది వేగ జన్మించినఁ బూర్వదై । హికము లన్నియు బుద్ధి నెలయువాఁడు
జాతిస్మరుం డనఁ జను; నయ్యెఱుక పెద్ద । వాఁడు గాఁగాఁ జెడు; వనిత! వినుము
పుట్టెఱుంగుట కల్మి బోధించుటకు నాస్తి । కులమును జన్మంబు గలుగు తెఱఁగుఁ;
జచ్చిపోయిన వారు వచ్చి యత్తను వొంది । మెలఁగు టొక్కొక చోటఁ గలిగియుండు;

తే. నట్టి తెఱఁగు వెంగలు లైన యమునిదూత । లొరులఁ జని కొనిపోయినఁ గరుణతోడ
న మ్మహాత్ముండు మగిడి పొమ్మన్న నరుగు । దెంచుటని నీ వెఱుంగు; సందియము లేదు.' 151

ప్రతిపదార్థం: వనిత! = ఓ వెలదీ!; వినుము = ఆలకించుము; మృతిన్+పొంది = మరణం చెంది; వేగ = శీఘ్రమే, వెను వెంటనే; జన్మించినన్ = పుట్టినచో; పూర్వదైహికములు+అన్నియున్ = మునుపటి జన్మ వృత్తాంతా లెల్ల; బుద్ధిన్ = మనస్సులో; ఎలయువాఁడు = నెలకొని ఉన్నవాడు; జాతిస్మరుండు = పూర్వజన్మ వృత్తాంతం ఎరిగినవాడు; అనన్+చనున్ = అని చెప్పుటకు తగి ఉంటాడు; ఆ+ఎఱుక = ఆ పూర్వజన్మస్మృతి; పెద్దవాఁడు+కాఁగాన్ = క్రమంగా వయసుముదిరిన వాడవుతుండగా; చెడున్ = నశిస్తుంది; పుట్టు+ఎఱుంగుట కల్మి = పూర్వజన్మము తెలియుటను కలిగి ఉండటం; జన్మంబు+ కలుగు+తెఱఁగున్ = జన్మవచ్చే విధానాన్ని; నాస్తి కులమును = ఈశ్వరుడు లేడనే జాతిని; బోధించుటకున్ = తెలియపఱచుటకు మేల్కొల్పుటకు ఉపకరిస్తుంది; చచ్చిపోయినవారు = మరణించినవారు; వచ్చి = యమలోకం నుంచి మరలి వచ్చి; ఆ+ తనువు+ఒంది = మృతదేహంలో ప్రవేశించి; మెలఁగుట = వ్యవహరించటం; ఒక్క+ఒకచోటన్ = ఒక్కొక్క తావులో; కలిగి+ ఉండున్ = జరుగుతుంటుంది; అట్టి తెఱఁగు = అట్లాంటి సంఘటన; వెంగలులు+ఐన = అవివేకులైన; యముని దూతలు = యమకింకరులు; ఒరులన్ = ఆయువు ముగియని వాళ్ళను; చని = వారి దగ్గరకు వచ్చి; కొని పోయినన్ = యమలోకానికి తీసికొని వెళ్ళగా; కరుణ తోడన్ = కనికరంతో; ఆ+మహా+ఆత్ముండు = ఆ దొడ్డ మనసు గల యమధర్మరాజు; మగిడి పొమ్ము+అన్నన్ = ఆ జీవుడిని తిరిగి వెళ్ళుమని చెప్పగా; అరుగుదెంచుట = చచ్చినవాడు తిరిగి కాయంలో ప్రవేశిం చటం అని; నీవు+ఎఱుఁగు = నీవు తెలియాలి; సందియము లేదు = ఈ విషయంలో అనుమానం వద్దు.

తాత్పర్యం: 'మరణించినతోనే మళ్ళీ జన్మిస్తే పూర్వజన్మ విషయాలన్నీ అతని బుద్ధిలో నెలకొని ఉంటాయి; జ్ఞప్తిలో ఉంటాయి. అట్లా పూర్వ జన్మవృత్తాంతం ఎరిగిన వాడిని జాతిస్మరు డంటారు. క్రమంగా వయసు పెరిగి పెద్దవాడవుతున్న కొద్దీ అతడు తొల్లింటి పుట్టుకకు సంబంధించిన ఎరుకను కోల్పోతాడు. కాత్యాయనీ! పూర్వజన్మకు సంబంధించిన ఎరుకను గలిగిఉండటం పునర్జన్మ ఉన్నదనే విషయాన్ని నిరీశ్వరవాదులకు తెలియజెప్పడానికి తోడ్పడుతుంది. చనిపోయిన వాడు తిరిగి ఒక్కొక్కప్పుడు బ్రతకడం కద్దు. అదెట్లంటే యమకింకరులు పొరపాటున ఒకడి ప్రాణాలకు బదులు మరొకడి ప్రాణాలు గైకొని వెళ్ళినపుడు ధర్మాత్ముడైన యముడు గమనించి ఆయుస్సు తీరని వాడిని కనికరించి బ్రతుకుమని తిరిగి పంపివేయటం సంభవిస్తుంటుంది. అప్పుడు మృతుడు మరల జీవితు డవుతాడు. ఇట్లాంటి విషయా లెన్నో ఉన్నవి. సందేహించ నక్కర లేదు.'

శివుఁడు పార్వతికి స్వప్నాదుల తెఱం గెఱింగించుట (సం.13-అను -15-2457)

వ. అని తెలిపిన గౌరి 'కల యనునది యేమి? యెఱింగింపవే' యనుటయును నతండు. 152

ప్రతిపదార్థం: అని తెలిపినన్ = అని శంభుడు చెప్పగా; గౌరి; కల+అనునది+ఏమి? = స్వప్న మనగా ఎటువంటిది?; ఎఱింగింపవు+ఏ = చెప్పుమా; అనుటయును = అని అడుగగా; అతండు = ఈశ్వరుడు (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని శంభుడు చెప్పగా గౌరీదేవి 'జీవితేశ్వరా! కల అంటే ఏమిటి? తెలుపు'మని వేడగా శివు డిట్లా అన్నాడు.

ఆ. 'స్వప్న మనఁగ సుప్తజనము మనశ్చేష్ట। యదియుఁ గాంచు నొగి ననాగతములఁ
గానఁ గలలు సూచకము లగు భావి శు। భాశుభోదయముల కనుచుఁ జెప్పె. 153

ప్రతిపదార్థం: స్వప్నము+అనఁగన్ = కల అంటే; సుప్తజనము మనః+చేష్ట = నిదురిస్తున్న జనుల యొక్క మనోవ్యాపారం; అదియున్ = ఆ మనసు; ఒగిన్ = క్రమంగా; అనాగతములన్ = రాబోయేవాటిని; కాంచున్ = దర్శిస్తుంది; కానన్ = కాబట్టి; కలలు; భావి = రానున్న; శుభ+అశుభ+ఉదయములకున్ = మేలు కీళ్ళ యొక్క పుట్టుకలకు; సూచకములు+అగున్ = ప్రకటన లవుతాయి, చూపుతాయి, వెల్లడిస్తాయి; అనుచున్; చెప్పెన్ = ఈశ్వరుడు తెలిపాడు.

తాత్పర్యం: 'స్వప్నమంటే నిదురిస్తున్న మనిషి యొక్క మనస్సు చేసే వ్యాపారం. ఆ మనస్సు రాబోయే విషయాలను ముందుగా కనుగొంటుంది. కనుక కలలు మునుముందు కలుగబోయే కష్టసుఖాలను వెల్లడిస్తాయి' అని పరమేశ్వరుడు పరమేశితో పలికాడు.

వ. చెప్పిన విని భవాని భవునితోడ. 154

ప్రతిపదార్థం: చెప్పినన్; విని; భవాని = గౌరీదేవి; భవునితోడన్ = ఈశ్వరుడితో (ఇట్లా అన్నది అని తరువాతి పద్యంతో అన్వయం).
తాత్పర్యం: ఈశ్వరుడు పలికిన పలుకులు ఆలకించి గౌరి ఆయనతో ఇట్లా అన్నది.

సీ. 'దైవంబొ? కర్మవర్తనము జనంబు ను। త్సాహంబొ?' యనిన ' నతండు దైవ
మోపి కర్మంబు సేయుట లేదు దైవసం। కలన ఫలం బిచ్చుఁ గాని వినుము
దేవి! పూర్వకృతంబు దైవనామకమునఁ। బరఁగు; నప్పటి చేఁత పౌరుషంబు
కృషివోలె నుండుఁ; బౌరుష గతి వర్ష స। ద్వాయువులట్ల దైవ ప్రకార

తే. మెఱుఁగు ఖనన మథనముల నెట్లు జలముఁ। జిచ్చుఁ బుట్టు నమ్మెయి నరుచేష్ట దైవ
యోగమున సిద్ధిఁ బొందు నుద్యోగ రహితుఁ। డెత్తెఱంగున దైవ సమృద్ధిఁ బడయు. 155

ప్రతిపదార్థం: కర్మవర్తనము = కర్మలయందు ప్రవర్తింపచేయటం; దైవంబు+ఒ? = దైవమా? (లేక); జనంబు+ఉత్సాహంబు+ఒ? = జనుల యొక్క యత్నమా?; అనినన్ = అని శర్వాణి ప్రశ్నించగా; అతండు = చంద్రమౌళి; దైవము = దైవం; ఓపి = పూనుకొని; కర్మంబు+చేయుట లేదు = కర్మను సల్పడం లేదు; దైవసంకలన = దైవము యొక్క తోడ్పాటు, ఘటన; ఫలంబు+ఇచ్చున్+కాని = ప్రయోజనాన్ని సిద్ధింపజేస్తుంది; దేవి! = సాధ్వీ!; వినుము = ఆలకించవలసింది; పూర్వకృతంబు = నరుడు మునుపు చేసిన సుకృతం; దైవనామకమునన్ = దైవమనే పేరుతో; పరఁగున్ = విలసిల్లుతుంది; అప్పటి చేఁత = జనుడు అప్పుడు చేసిన కర్మ; పౌరుషంబు = పురుష సంబంధము; పౌరుషగతి = పురుష వ్యాపారం; కృషి+పోలెన్+ఉండున్ = సేద్యం వలె ఉంటుంది; దైవప్రకారము = విధి విధానం; వర్షసద్+వాయువులు+అట్లు+అ = వాన, మంచిగాలి వలె ఉంటుంది; కృషి ఫలించటానికి వర్షం, మంచిగాలి అవసరం గదా! అని; ఎఱుఁగు = తెలిసికొనవలసినది; ఖనన మథనములన్ = నేలను త్రవ్వుట వలన, అరణి కట్టెను చిలుకుట వలన; ఎట్లు = ఏ విధంగా; జలమున్ = నీరూ; చిచ్చున్ = అగ్నియూ; పుట్టున్ = జన్మిస్తాయో; ఆ+మెయిన్ = ఆ రీతిగానే; నరుచేష్ట = మనిషి యొక్క క్రియాచరణ; దైవయోగమునన్ = దైవం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యొక్క తోడ్పాటుతో; సిద్ధిన్+పొందున్ = ఫలిస్తుంది, ఫలకారి అవుతుంది; ఉద్యోగరహితుఁడు = యత్నం చెయ్యనివాడు; ఏ+తెఱంగునన్ = ఏ విధంగా; దైవసమృద్ధిన్ = భాగ్యము యొక్క పెంపును; పడయున్? = పొందగలడు? పొందలేడని భావం.

తాత్పర్యం: 'మానవుడిని కర్మలయందు ప్రవర్తింపజేస్తున్నది దైవమా? లేక అతడి ఉత్సాహమా? చెప్పవలసిన దని గౌరి ప్రశ్నిస్తే శంకరు డిట్లా బదులు పలికాడు. 'దేవీ! దైవం తానుగా ఏ పనీ చెయ్యడు కాని నరుడు చేసే పనులకు తోడ్పడి ఫలాన్నిస్తాడు. ముందటి జన్మలో జనుడు చేసిన కర్మమే దైవమని చెప్పబడుతుంది. ఇపుడు చేసే కర్మ పౌరుషమని పిలువబడుతుంది. మనిషి చేసే యత్నం వ్యవసాయంవంటిది. దైవసహాయ మంటేనో జలం వంటిది; గాలి వంటిది. ఇవి రెండూ కృషి ఫలించడానికి తోడ్పడుతాయి. నేలను త్రవ్వినపుడే నీరు పడుతుంది. అరణికట్టెను మథించినపుడే అగ్నిపుట్టుతుంది. అట్లాగే మానవయత్నం - దైవం సాయపడినపుడు ఫలిస్తుంది. అసలు యత్నపరుడు కానివాడికి దైవంతోడ్పాటు ఎట్లా లభిస్తుంది? (లభించనే లభించదని భావం.)

క. కావున నుద్యోగంబును । దైవంబును గారణములు దామరసాక్షీ!
యే విధమునఁ గర్మముల ఫ । లావాప్తికి దీన సంశయము వలదు సుమీ!' 156

ప్రతిపదార్థం: కావునన్ = కాబట్టి; తామరస+అక్షీ! = పద్మములవంటి నేత్రములు గలదానా!; ఏ విధమునన్ = ఏ రీతిగా చూచినప్పటికినీ; కర్మముల = కర్మముల యొక్క; ఫల+అవాప్తికిన్ = ఫలముల యొక్క సంప్రాప్తికి; ఉద్యోగంబును = మనుష్యయత్నమూ; దైవంబును = దైవబలమునూ; కారణములు = హేతువులు; దీనన్ = ఈ విషయంలో; సంశయము వలదు సుమీ! = సందేహం అక్కర లేదు సుమా!

తాత్పర్యం: కమలముల వంటి కన్నులు గల సఖీ! ఎట్లు పరికించినా కర్మఫలాలు లభించటానికి మానవ యత్నమూ; దైవానుకూల్యం కారణాలు. ఇందులో అనుమానించవలసిన అక్కర లేదు సుమా!'

తే. అనిన నంబిక 'గర్భంబు నాత్ముఁ డెట్లు । చొచ్చు?' ననవుడు నభవుఁడు 'సురత బీజ
రక్త దైవముల్ సూవె కారణము లాత్మ । గర్భ సంవేశనమునకుఁ గమలనయన! 157

ప్రతిపదార్థం: అనినన్ = అని శంభుడు పలుకగా; అంబిక = పార్వతి; ఆత్ముఁడు = జీవుడు; గర్భంబున్ = ఉదరమును; ఎట్లు+చొచ్చున్? = ఎట్లా ప్రవేశిస్తాడు?; అనవుడున్ = అని అడుగగా; అభవుఁడు = శ్రీకంఠుడు; కమలనయన! = తామరల వంటి కన్నులు గలదానా!; ఆత్మ = జీవుడి యొక్క; గర్భసంవేశనమునకున్ = గర్భంలో ప్రవేశించటానికి; సురత = రతి క్రీడయూ; బీజ = పురుషుడి వీర్యమూ; రక్త = స్త్రీ యొక్క నెత్తురూ; దైవముల్ = దైవమూ అనే యీ నాలుగూ; కారణములు+చూవె! = హేతువులు సుమా!

తాత్పర్యం: శివుడు ఆ విధంగా చెప్పగా విన్నదై పార్వతి 'నాథా! జీవుడు గర్భంలో ప్రవేశించటానికి హేతువు లెట్టివి?' అని అడిగింది. అందుకు శంకరుడు 'పద్మాక్షీ! స్త్రీ పురుషుల యొక్క సంభోగం, పురుషుడి వీర్యమూ, స్త్రీ యొక్క శోణితమూ, దైవం యొక్క తోడ్పాటూ ఇందుకు కారణాలు' (అని చెప్పాడు).

క. మాయారహితుఁ డహంకా । రాయత్తతఁ జూవె పుట్టువను చెఱఁబడి నా
నాయాసంబులఁ బడు నా । జ్ఞాయుతుఁడై యాత్ముఁ డింత చర్చింపు మదిన్.' 158

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మాయారహితుఁడు = సహజంగా కూటయుక్తులు, కుయుక్తులు, కాపట్యం లేని; ఆత్ముఁడు = జీవుడు; ఆజ్ఞాయుతుఁడు+ఐ = దైవం యొక్క ఆజ్ఞతో కూడినవాడై; అహంకార+ఆయత్తతన్+చూవె! = అహంకారానికి అధీనుడగుట వల్లనే సుమా!; పుట్టువు+అను = జన్మమనే; చెఱన్+పడి = బంధనంలో చిక్కి; నానా+ఆయాసంబులన్+పడున్ = పలు విధములైన శ్రమల పాలవుతున్నాడు; ఇంత = ఈ విషయం; మదిన్ = నీ మనసులో; చర్చింపు = విచారించుము.

తాత్పర్యం: పార్వతీ! నిష్కల్మషుడైన జీవుడు అహంకారమునకు వశుడై దాని ఆజ్ఞచొప్పున జన్మమనే చెరలో చిక్కి బహుకష్టాలపాలవుతున్నాడు. ఇది నీ మనసులో చర్చించుము'.

సీ. **అని చెప్పి 'దైవరహస్యంబు వినిపింతు । విను' మని పలికి యిట్లనియె శివుఁడు**
'తొల్లి మనుష్యులు తొలుమేని కర్మంబు । లెఱుఁగఁగాఁ జాలుట నెల్లవారు
మేలుసేయఁగ ననిమిషలోకమున నధి । కంబగు సందడి గాఁగ మనుజు
లమరులై పేర్చిన' నజుఁడు వేల్పుల సంక । టము వాయుటకు నుపాయము దలంచి

తే. **మానవుల కయ్యెఱుకకల్మి మాన్చి కామ । రోషముల నొలయించిన దోషకృతుల**
వారు నరకాది సమ్మర్దకారు లగుడు, । నదియుఁ గాదని చింతించి యనువు గాంచి. **159**

ప్రతిపదార్థం: అని చెప్పి = అని వచించి; దైవరహస్యంబున్ = దేవతలకు కూడా గోప్యమైన విషయం, వినిపింతున్ = చెప్పుతాను; వినుము+అని పలికి = వినవలసిందని చెప్పి; శివుఁడు = శంకరుడు; ఇట్లు+అనియెన్ = అంబికతో ఇట్లా అన్నాడు; తొల్లి = పూర్వం; మనుష్యులు = నరులు; తొలుమేని కర్మంబులు = పూర్వజన్మంలో చేసిన పనులు; ఎఱుఁగఁగాన్+చాలుటన్ = తెలియగలిగినవారు కావటం చేత; ఎల్లవారు = మనుష్యులందరు; మేలు+చేయన్+కన్ = సత్కార్యములు సల్పటం వలన; అనిమిషలోకమునన్ = దేవలోకంలో, స్వర్గంలో; అధికంబు+అగు = మిక్కుటమైన; సందడి కాఁగన్ = సమ్మర్దం కలుగగా, చోటు చాలక ఇరుకు ఏర్పడగా; మనుజులు = నరులు; అమరులు+ఐ = మృతిలేనివారై, వేల్పులై; పేర్చినన్ = అతిశయించగా; అజుఁడు = బ్రహ్మదేవుడు; వేల్పుల సంకటము = దేవతల యొక్క కష్టం, చిక్కు; పాయుటకున్ = తొలగుటకు; ఉపాయము+తలంచి = వెరవు పరికించి, ఉపాయం ఆలోచించి; మానవులకున్ = మనుష్యులకు; ఆ+ఎఱుక+కల్మి = ఆ పూర్వజన్మ జ్ఞాన సంపద, ఆ స్మృతి సమృద్ధిని; మాన్చి = తొలగించి; కామరోషములన్ = కామక్రోధాలను; ఒలయించినన్ = కలుగజేయగా; వారు = నరులు; దోషకృతులన్ = దుష్టకార్యాలచేత; నరక+ఆది సమ్మర్దకారులు+అగుడున్ = నరకలోకాదులయందును రాయిడి (ఒత్తిడి) కలిగించినవారు కాగా; అదియున్ కాదు+అని = అట్లు వారిని పాపకృత్యాలకు ప్రేరేపించి నరకలోక నివాసులను చేయటం కూడా తగదని; చింతించి = ఆలోచించి; అనువు+కాంచి = అందుకు ఉపాయం కనుగొని-(తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: పరమేశ్వరుడు శాంకరిని అవలోకించి 'సతీ! దేవతలకు కూడా ఎరుకపడని ఒక రహస్యం ఉన్నది చెప్పుతాను విను' మంటూ ఉపక్రమించాడు. 'పూర్వం మానవులందరికీ పూర్వ జన్మస్మృతి ఉండేది. అందువలన వారు ఎల్లప్పుడూ పుణ్యకార్యాలు చేస్తూ తత్ ఫలితంగా స్వర్గలోకానికి చేరేవారు. మితి మీరి అందరూ అక్కడికి వెళ్ళటం వలన స్వర్గధామంలో చోటు చాలక సమ్మర్దం ఏర్పడింది. వేల్పులకు సంకటస్థితి కలిగింది. దానిని నివారించుటకు బ్రహ్మదేవుడు ఉపాయం ఆలోచించి జనులు పుణ్యకార్యాలు సల్పకుండా వారికి ఇదివరకున్న

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పూర్వజన్మజ్ఞానాన్ని తొలగించి, కామక్రోధాలను వారికి కల్పించాడు. ఆ చెడు గుణాల వలన వారు చెడుపనులు చేయటానికి పూనుకొని నరకలోక నివాసులు అవుతూండటం వలన అక్కడ కూడా మితిమీరిన త్రొక్కిడి ఏర్పడింది. ఇది కూడా బాగులేదని చతుర్ముఖుడు మరొక ఉపాయం ఆలోచించాడు. ఇది సమంజసమైనదని భావించాడు.

క. సరిగా నా రెండెడలకు । నరులు సనుట గోరి మనమునం గానమియుం
బరలోక విధము శాస్త్రము । వెరవునఁ గనుటయు నొనర్చె విధి వారలకున్.' 160

ప్రతిపదార్థం: ఆ రెండు+ఎడలకున్ = ఆ స్వర్గలోకానికి, నరక లోకానికి; సరిగాన్ = సమానంగా; నరులు = మనుష్యులు; చనుట+కోరి = వెళ్ళవలెనని వాంఛించి; మనమునన్ = మనసులో; పరలోక విధము = పరలోక విధానాన్ని; కానమియున్ = కనుగొనజాలకుండుటను; శాస్త్రము వెరవునన్ = శాస్త్రం యొక్క ఆధారంతో; కనుటయున్ = కనుగొనుటయును; వారలకున్ = ఆ నరులకు; విధి = బ్రహ్మ; ఒనర్చెన్ = చేశాడు.

తాత్పర్యం: అటు స్వర్గానికి, ఇటు నరకానికి మనుషులు మితిమీరి వెళ్ళి సమ్మర్దం కలిగించకుండా, ఆ రెండు చోట్లకు సమానంగా వెళ్ళేటట్లు చేయదలచి బ్రహ్మదేవుడు పరలోకస్థితి గతులు మనోదృష్టి చేత వారు ఎరుగకుండేటట్లుగాను, శాస్త్రం చేతనే తెలిసేటట్లు గాను చేశాడు.'

వ. అనినం బార్వతి 'పునర్జన్మంబు గలదు లేదను సంశయంబుతోన పొట్టు పొరలగుదురు నరులు; దాని తెఱంగు నిశ్చయింపవే యనుటయు నంధకారాతి యిట్లనియె. 161

ప్రతిపదార్థం: అనినన్; పార్వతి; పునః+జన్మంబు = మరణించినవాడు తిరిగి పుట్టటం; ఉత్తర జన్మ; కలదు = ఉన్నది; లేదు; అను = అనునట్టి; సంశయంబుతోన్+అ = సందేహంతోనే; నరులు; పొట్టు పొరలు+అగుదురు = నలిగి నలిగి పోతున్నారు, సతమతమైపోతున్నారు; దాని తెఱంగున్ = ఆ పునర్జన్మ విషయం; నిశ్చయింపవు+ఏ = నిర్ణయింపుమా; అనుటయున్ = అని వేడగా; అంధక+అరాతి = అంధకుడనే రాక్షసుడికి శత్రువు = అనగా అంధకాసురుడిని గూల్చిన త్రిశూలపాణి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని భవుడు పలుకగా భవాని ' దేవా! పునర్జన్మ కలదని కొందరూ, లేదని కొందరూ వాదులాడుకొంటూ సతమత మవుతున్నారు. ఆ ఉత్తర జన్మం విషయ మెట్టిదో నిర్ణయించ వేడుతున్నాను' అని పల్కగా అంధకాసురుడిని హరించిన హరు డిట్లా అన్నాడు.

క. 'కలదో లేదో యనియెడు । తలపోతయ కాని నిశ్చితము గాదు సురా
దులకుఁ; బునర్జన్మంబుల । కలిమియు లేమియును నరులు గానమి దప్పే? 162

ప్రతిపదార్థం: సుర+ఆదులకున్ = దేవతలు మొదలైనవారికి కూడా; కలదు+ఓ = పునర్జన్మ ఉన్నదో; లేదు+ఓ = లేదో; అనియెడు = అనునట్టి; తలపోత+అ+కాని = ఊహయేకాని; పునఃజన్మంబుల = పునర్జన్మల యొక్క (తిరిగి జన్మించటం అనువాటి యొక్క); కలిమియున్ = ఉండటం; లేమియునున్ = లేకుండటం అనే విషయం; నిశ్చితము+కాదు = నిర్ణయిం చబడలేదు; నరులు= మానవులు; కానమి= చూడజాలకుండటం, ఎరుగకుండటం; తప్పు+ఏ? = దోషమా? కాదని భావం.

తాత్పర్యం: 'అసలు పునర్జన్మ ఉన్నదో లేదో అనే సంశయం దేవతలకు కూడా ఉన్నది. వారి కీ విషయంలో ఒక నిశ్చయజ్ఞానం లేదు. మరి మానవులకు అది తెలియకుండటంలో ఆశ్చర్య మేమున్నది?

క. కల; దది యూరక కానఁగ । నలవియె? శ్రుతివాక్యసమితి యర్థంబులపై
నిలిచిన శ్రద్ధం గ్రమమున । దెలివొందినఁ గాక యెట్టి ధీమంతులకున్.' 163

ప్రతిపదార్థం: అది = పునర్జన్మ; కలదు = ఉన్నది; శ్రుతివాక్యసమితి = వేదవాక్యముల సముదాయము యొక్క; అర్థంబులపైన్ = భావముల మీద; నిలిచిన = సక్తమైన; శ్రద్ధన్ = ఆసక్తితో; క్రమమునన్ = క్రమాన; తెలివి+ఒందినన్+కాక = జ్ఞానం పొందితే తప్ప, వివేక వంతుడైతే తప్ప; ఎట్టి ధీమంతులకున్ = ఎంతటి ప్రజ్ఞావంతులకు కూడా; ఊరక = తేలికగా, అలవోకగా; కానఁగన్ = తెలియుటకు; అలవి+ఎ? = శక్యమా, సాధ్యమా?

తాత్పర్యం: ప్రేయసీ! పునర్జన్మమనేది ఉన్నది. అది ఎంతటి బుద్ధిమంతులకైనా వేద వాక్యాలయొక్క అర్థం గ్రహించకుండా తెలిసికొనటానికి సాధ్యపడదు.'

వ. అనిన విని గౌరి గంగాధరున కిట్లనియె. 164

ప్రతిపదార్థం: అనినన్; విని; గౌరి; గంగాధరునకున్ = గంగను శిరసున ధరించిన వాడికి - పరమేశ్వరుడికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శివుడి పలుకులు విని ఉమాదేవి మళ్ళీ ఆయనతో ఇట్లా అన్నది.

క. 'మృతులైనవారలు నిరా । కృతులై యుండుదురు; వారిఁ గీనాశ భట
ప్రతతి కొని చనుట, యా పితృ । పతి శాసించు టవి యెట్టి భంగులు దేవా!' 165

ప్రతిపదార్థం: దేవా! = స్వప్రకాశస్వరూపుడా!; మృతులు+ఐనవారలు = చనిపోయిన వాళ్ళు; నిర్+ఆకృతులు+ఐ = రూపరహితులై; ఉండుదురు = ఉంటారు; వారిన్ = ఆ మృతులను; కీనాశభటప్రతతి = యమకింకరుల గుంపు; కొనిచనుట = తీసికొని వెళ్ళటం; ఆ పితృపతి = ఆ యమధర్మరాజు; శాసించుట = వారిని దండించటం; అవి = అనునట్టివి; ఎట్టి భంగులు? = ఏ విధమైనవి?

తాత్పర్యం: 'ప్రభూ! చనిపోయిన వాళ్ళు ఆకారరహితులై ఉంటారు. యమకింకరులు రూపరహితులైన వారిని తమ వెంట ఎట్లా తీసికొనిపోతారు? యమధర్మరాజు వారిని ఎట్లా శిక్షిస్తాడు? ఈ సంగతులు నాకు విశదంగా చెప్పండి' అని గౌరి కోరింది.

వ. అని యడిగిన న ద్దేవుం డిట్లనియె. 166

తాత్పర్యం: అని ఉమాదేవి ప్రశ్నించగా ఆ భగవంతుడు ఇట్లా అన్నాడు.

సీ. 'తఱియైన మనుజులఁ దనువులు విడిపించి । మాయాశరీర సమన్వితులుగ
నొనరించి దూతలు గొనిపోదు; రందును । ధర్మవర్తుల సుగంధంబు మృదువు
నైన మార్గమున, మధ్యపువారి నిర్బాధ । సరణిఁ, బాపాత్ముల బరుసఁదనము
ముటికియుఁ గల పథంబున నడపింతు, రి । ప్పరుసునఁ జని పితృపతికిఁ జూప

ఆ. నతఁడు పుణ్యలోక గతియును మానవ । త్వంబు ఘోరనరక వాసమును వి
ధించి పుచ్చు వారిఁ దెలచి మన్నించి భ । ర్జించి వరుసతోడఁ జిగురుఁబోఁడి!' 167

ప్రతిపదార్థం: చిగురుఁబోఁడి! = చిగురుటాకు వలె మెత్తని మేనుగలదానా!; దూతలు = యమభటులు; తఱి+ఐన = ఆయుస్సు దీరిన, కాలం చెల్లిన; మనుజులన్ = మనుష్యులను; తనువులు విడిపించి = దేహాలు వీడేటట్లు చేసి; మాయాశరీర సమన్వితులుగన్ = కృత్రిమమైన దేహాలతో కూడిన వారిని; ఒనరించి = చేసి; కొనిపోదురు = తీసికొని వెళ్ళుతారు; అందునున్ = అట్లా తమ వెంట కొనిపోయే వారిలో; ధర్మవర్తులన్ = ధర్మంగా నడుచుకొనేవారిని (ఉత్తములను); సుగంధంబు = సువాసన; మృదువు+ఐన = మెత్తనైన; మార్గమునన్ = దారిలోనూ; మధ్యము+వారిన్ (మధ్యపువారిని) = అంతగా ధర్మపరులు కానట్టివారిని (మధ్యములను); నిర్బాధసరణిన్ = అంతగా కష్టములు లేని తెరువులోనూ; పాప+ఆత్ములన్ = పాపహృదయులను (అధములను); పరుస+తనమున్ = కఠినత్వమూ; ముఱికియున్ = మాలిన్యమూ; కల = కలిగిన; పథంబునన్ = బాటలో; నడపింతురు = నడచేటట్లు చేస్తారు. ఆ+పరుసునన్ = ఆ తీరున; చని = వెళ్ళి; పితృపతికిన్ = యముడికి, సమవర్తికి; చూపన్ = దర్శింప జేయగా; అతఁడు = ఆ యమధర్మరాజు; వారిన్ = తనకడకు వచ్చిన ఉత్తమ, మధ్యమ, అధములను; వరుసతోడన్ = క్రమంగా; తెలచి = పొగడి, కొనియాడి; మన్నించి = ఆదరించి; భర్జించి = బెదరించి, పుణ్యలోక గతియునున్ = స్వర్గలోక గమనమును; మానవత్వంబున్ = మనుష్యత్వమును అనగా నరలోకగతియును; ఘోరనరకవాసమును = భయానకమైన నరకలోకమున పడియుండుటయు; విధించి = ఏర్పరచి; పుచ్చున్ = పంపి వేస్తాడు.

తాత్పర్యం: 'కోమలీ! యమభటులు ఆయువు ముగిసిన జనుల దగ్గరకు వచ్చి వారి ప్రాణాలను శరీరాల నుండి వెడలిస్తారు. పిదప ఒక మాయా దేహంలో వారి అసువులను ప్రవేశపెడతారు. ఆ కృత్రిమ దేహాలతో వారిలో ధర్మాత్ములైన వారిని పరిమళవంతమైన మృదుమార్గంలోనూ, మధ్యములైన వారిని అంతగా కష్టాలు లేని దారిలోనూ, పాపులను దుర్గంధభూయిష్ఠమైన, కఠినమైన త్రోవలోనూ, నడిపించుకొంటూ వెళ్ళి యముడికి చూపిస్తారు. యమధర్మరాజు పుణ్యపురుషులను కొనియాడి పుణ్యలోకాలకు పంపుతాడు. రెండవ తెగవారిని ఆదరించి నివసించుటకు మనుజ భువనానికి పొమ్మంటాడు. పాపులను బెదరించి నరకలోకానికి గెంటి వేస్తాడు.'

వ. అని చెప్పిన నగేంద్రతనయ చంద్రశేఖరుని తోడ. 168

తాత్పర్యం: అని పరమేశ్వరుడు చెప్పగా పర్వతరాజపుత్రి ఐన గౌరీదేవి చంద్రుడిని శిరసున ధరించిన శంకరుడితో. (ఇట్లా పలికెనని తరువాతి పద్యంతో అన్వయం).

క. 'నరకం బెట్టిది? కల్మష । కరులన్ జముఁ డెట్టి భంగిఁ గాఱియఁ బెట్టున్?
వరదా! చెప్పు మనుడు న । ప్పురహరుఁ డిట్లనియె వృష్ణిపుంగవ! ప్రీతిన్. 169

ప్రతిపదార్థం: నరకంబు+ఎట్టిది? = నరక మనగా ఎటువంటిది?; కల్మష కరులన్ = పాపం చేసే వారిని; జముఁడు = యమధర్మరాజు; ఎట్టిభంగిన్ = ఏ రీతిని; కాఱియన్+పెట్టున్? = బాధపెడతాడు?; వరదా! = కోరికలిచ్చువాఁడా!; చెప్పుము = తెల్పుము; అనుడున్ = అని పార్వతి పలుకగా; ఆ+పురహరుఁడు = ఆ త్రిపురాలను ధ్వంసం చేసిన రుద్రుడు; ప్రీతిన్ = సంతోషంతో; ఇట్లు+అనియెన్ = ఇట్లా వచించాడు; వృష్ణిపుంగవ! = వృష్ణివంశజులలో శ్రేష్ఠుడా, శ్రీకృష్ణా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'నరక మంటే ఎట్లాంటిది? పాపులను యముడు ఏ విధంగా బాధిస్తాడు? నాథా! నాకు చెప్పండి' అని అంబిక అడుగగా ఆ త్రిపురాసుర సంహారి సంతోషంతో ఇట్లా అన్నాడు శ్రీకృష్ణా! (అని నారద మహర్షి ఉమాశంకరుల సంవాదాన్ని వాసుదేవుడికి వినిపించాడు).

సీ. **'రౌరవం బనఁగ ధరాస్థలిక్రింద మ । హారౌరవం బన నవుల దాని**
కావల విను కంటకావనంబన నుండుఁ । గ్రమవృత్తిఁ బేర్చు దుఃఖములు గలిగి
యగ్నికుండంబునా నటఁ బంచకష్టంబు । నాఁగల విట్లున్న నరకతలము
లై దండుఁ బాపక్రియా తారతమ్యంబు । లూహించి యంతకుం డునుపఁ బనుచుఁ

తే. **దగిన యెడలఁ బాపాత్ములఁ దద్భటాలి । దహన కర్తన బంధన తాడనములఁ**
బఱుప వారలఁ గుక్కలు గఱచుఁ' గ్రిములు । దొలుచు' గ్రద్దలు నొప్పించుఁ దుండనిహతి. **170**

ప్రతిపదార్థం: క్రమవృత్తిన్ = వరుస ప్రకారం; పేర్చు = అతిశయించే; దుఃఖములు+కలిగి = కష్టాలతో కూడినవై; రౌరవంబు+ అనఁగన్ = రౌరవము అనే పేరుతో; ధరాస్థలి క్రిందన్ = భూమికి అడుగు భాగంలోనూ; మహారౌరవంబు+ అనన్ = మహారౌరవం అనేనామంతో; అవులన్ = ఆ రౌరవానికి అవతల; దానికిన్+ఆవలన్ = ఆ మహారౌరవానికి తరువాత; కంటకావనంబు+అనన్ = ముళ్ళ అడవి అనే పేరుతోనూ; అగ్నికుండంబునాన్ = అగ్నికుండం అనే పేరుతో మరొకటి; అటన్ = అక్కడ; పంచకష్టంబునాన్+కలవి = పంచకష్టము అనే పేరు కలిగినవి; ఇట్లు+ఉన్న = ఈ రీతిగా ఉన్నట్టి; నరకతలములు = నరకప్రదేశాలు; ఐదు = అయిదు(ఉన్నవి); అందున్ = వాటిలో; అంతకుండు = యముడు; పాపక్రియా తారతమ్యంబులు+ఊహించి = ఆయాజీవు లొనర్చిన పాపకార్యాల యొక్క హెచ్చు తక్కువలు పరికించి; పాప+ఆత్ములన్ = కిల్బిష మొనర్చిన వాళ్ళను; తగిన+ఎడలన్ = ఉచితమైన తావులందు; ఉనుపన్ = ఉంచుటకు; పనుచున్ = ఆజ్ఞాపిస్తాడు; వారలన్ = ఆ పాపులను; తత్+భట+ఆలి = ఆ యముడి యొక్క భటుల సమూహం; దహన = కాల్చడం; కర్తన = చీల్చటం; బంధన = కట్టటం; తాడనములన్ = కొట్టటం అనేపనుల చేత; పఱుపన్ = బాధలపాలు చెయ్యగా; కుక్కలు = శునకాలు; కఱచున్ = ఆ దుర్మార్గులను కరుస్తాయి; క్రిములు = పురుగులు; తొలుచున్ = రంధ్రాలు ఏర్పడేటట్లు చేస్తాయి; గ్రద్దలు = గృధ్రాలు; తుండనిహతిన్ = ముక్కుల యొక్క పొడుపులతో; నొప్పించున్ = వారు అల్లాడేటట్లు చేస్తాయి.

తాత్పర్యం: 'గిరినందినీ! భూమికి అధోభాగంలో ఐదు నరక ప్రదేశా లున్నవి. అవి ఒకదానికంటె మరొకటి పరమబాధాకరాలు. అవేవంటే - రౌరవం, మహారౌరవం, కంటకారణ్యం, అగ్నికుండం, పంచకష్టం అనే పేరులు కలవి. అవి దుర్మార్గులు తాము చేసిన పాపఫలం అనుభవించే చోట్లు. యముడు ఆయాజీవుల పాపాల యొక్క తారతమ్యాలను అనుసరించి ఆయా నరకస్థానాలకు పంపుతాడు. అక్కడ యమభటులు వారిని కాలుస్తూ, నరుకుతూ, కాలుచేతులు కట్టిపడవేస్తూ, కొట్టుతూ నానావిధాల బాధిస్తారు. ఆ నరక వాసులను జాగిలాలు కరిచీ, పురుగులు తొలిచీ, గ్రద్దలు ముక్కులతో పొడిచీ నొప్పిస్తాయి.

వ. **మఱియును యమదూత వ్రాతంబు నానావిధ వేదనలం బెట్టి దండించుచుండు.** **171**

ప్రతిపదార్థం: మఱియును = ఇంకా; యమదూత వ్రాతంబు = యమకింకరుల యొక్క సమూహం; నానా విధ = పలు రకాలైన; వేదనలన్+పెట్టి = బాధలకు గురిచేసి; దండించుచున్+ఉండున్ = శిక్షిస్తూ ఉంటారు.

తాత్పర్యం: అక్కడ యమదూతలు పాపులను నానాయాతనలకు గురి చేస్తూ బహుభంగుల శిక్షిస్తారు.

ఉ. అమ్మెయిఁ బాపముల్ వొలియునంతకు దుఃఖము లంది కీటజ
న్మమ్ములఁ బక్షియోనులఁ గ్రమంబునఁ బొంది మృగత్వ మానుష
త్వమ్ముల నోలిఁ బొందుదురు వా రిను మెంతయుఁ గ్రాఁగి కల్మష
త్వమ్ము దొఱంగుమాడ్కి నవతామరస ప్రతిమాన లోచనా!' 172

ప్రతిపదార్థం: నవ = నూత్నమైన, అప్పటికప్పుడు వికసించిన; తామరస = పద్మదళములకు; ప్రతిమాన = సాటివచ్చు; లోచనా = కన్నులు గలదానా!; ఆ+మెయిన్ = ఆ రకంగా; పాపముల్ = కిల్బిషాలు; పొలియు+అంతకున్ = నశించే వరకూ; దుఃఖములు+అంది = కష్టాలు అనుభవించి; వారు = ఆ జీవులు; ఇనుము = ఇనుము అనే లోహం; ఎంతయున్ = మిక్కిలి; క్రాఁగి = కొలిమిలో తప్తమై; కల్మషత్వమ్మున్ = మాలిన్యమును, తుప్పును; తొఱంగుమాడ్కిన్ = వదలినచందంగా; క్రమంబునన్ = వరుసగా; కీట జన్మమ్ములన్ = పురుగుల యొక్క పుట్టుకలనూ; పక్షియోనులన్ = పక్షుల జన్మాలనూ; పొంది = చెంది; ఓలిన్ = ఆ పిదప వరుసగా; మృగత్వ మానుషత్వమ్ములన్ = జంతువులవుటనూ, మనుజులవుటనూ; పొందుదురు = చెందుతారు.

తాత్పర్యం: కమల పత్రములతో సమానమైన కన్నులు గల కాత్యాయనీ! ముందు నుడివినట్లు పాపులు తమ పాపాలు నశించే వరకూ నరకలోకాలలో నానావిధ యాతనలు అనుభవించి కొలిమిలో కాగిన ఇనుము తుప్పును వీడిన విధంగా శుద్ధులై తొలుత పురుగులుగానూ, పిదప పక్షులుగానూ, ఆవల మృగాలుగానూ, అనంతరం మనుష్యులు గానూ జన్మ లెత్తుతారు.'

విశేషం: శంకరాచార్యులవారు చెప్పినట్లు "జంతూనాం నరజన్మదుర్లభతరం". జీవి తనదుష్కర్మల ఫలంగా నానా విధక్షుద్రయోనులలో పుట్టి పుట్టి, చచ్చి చచ్చి చివరి కెప్పుడో పాపాలు నశించి పరిశుద్ధుడై ఫలితంగా మానవజన్మను పొందుతున్నాడు. మానవుడై జన్మించినవాడు దైవీగుణసంపత్తిని అలవరచుకొనాలి. ఆసురీసంపదను అలవరచుకొనగూడదని భగవద్గీతలోని షోడశాధ్యాయం హితోపదేశం చేస్తుంది.

వ. అనిన విని పార్వతి 'పాపంబు లనునవి యెట్టివి? యెఱింగింపవే' యనుటయు నీశానుం డిట్లనియె.173

ప్రతిపదార్థం: అనినన్ విని = అని శివుడు చెప్పగా విన్నదై; పార్వతి; పాపంబులు+అనునవి; ఎట్టివి?; ఎఱింగింపవు+ఏ = తెలియ జెప్పవా; అనుటయున్ = అని అడుగగా; ఈశానుండు = శివుడు, ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: ఈశాను డట్లా పలుకగా ఆలకించినదై ఉమాదేవి, 'దేవా! పాపాలంటే ఎట్లాంటివో తెలుపవా?' అని అడుగగా అత డిట్లా అన్నాడు.

శివుఁడు పార్వతికి మానస వాచిక కాయికములను త్రివిధ పాపములఁ దెల్పుట. (సం.13-అను-1.15-2792).

సీ. 'మానిని! త్రివిధముల్ మానస వాచిక। కాయికంబులఁ బాతకంబు; లందుఁ
బరధనాపేక్షణ పాపానుమోద ధ। ర్మద్వేష ముఖములు మానసంబు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లనృత దారుణ భాషణాదులు వాచిక । ములు; వధంబును బంధమును నభక్ష్య
భక్షణంబును నన్యభామారతము మద్య । పానంబు మొదలైన పాపకృతులు

తే. కాయికంబులు; విను మధికం బపేయ । పానమది దుష్కృతంబులలోన నెల్లఁ
బానమున నిందతో వచ్చుఁ బ్రాణగొడ్డ । ములును జేటులు నరకాబ్ధి మునుఁగుటలును. 174

ప్రతిపదార్థం: మానిని! = ఆత్మాభిమానం గల ఓ వెలదీ!; పాతకంబులు = పాపాలు; మానస వాచిక కాయికంబులన్ = మనసు చేత, నోటిచేత, శరీరం చేత చేయబడేవి; త్రివిధముల్ = మూడు విధాలు, ముత్తెఱగులు; అందున్ = ఆ మూడు విధాలలో; మానసంబులు = మనస్సంబంధమైనవి; పరధన+అపేక్షణ = ఇతరుల సొమ్ము వాంఛించటం; పాప+అనుమోద = పాపకృత్యాలను సమ్మతించటం, చూచి సంతోషించటం; ధర్మద్వేషముఖములు = పుణ్యాలను ద్వేషించటం మొదలైనవి; అనృత = అసత్యాలు పలకటం, దారుణ భాషణ+ఆదులు = పరమ కర్కశంగా మాట్లాడటం మొదలైనవి; వాచికములు = వాక్కునకు చెందిన పాపాలు; వధంబును = ప్రాణులను చంపటం; బంధమును = కట్టివేయటం; అభక్ష్యభక్షణంబును = తినగూడని వాటిని తినటం; అన్యభామారతమున్ = పరుని భార్యతో కూడటం; మద్యపానంబున్ = కల్లు త్రాగటం; మొదలు+ఐన = మున్నగు; పాపకృతులు = కిల్బిషకృత్యాలు; కాయికంబులు = శరీర సంబంధమైనట్టివి; వినుము = ప్రేయసీ! శ్రద్ధగా ఆలకించుము; అపేయ పానము+అది = త్రాగరానిదైన సారాయి త్రాగటం అనేది; దుష్కృతంబులలోనన్+ఎల్లన్ = పాపాలన్నింటియందునూ; అధికంబు = కడుపెద్దది; పానమునన్ = త్రాగుడు వలన; ప్రాణగొడ్డములును = ప్రాణహానికరములు, ప్రాణోపద్రవాలు; చేటులున్ = కీళ్ళు; నరక+అబ్ధిమునుఁగుటలును = నరకమనే సముద్రంలో మునిగి పోవటాలు; నిందతోన్ = అపకీర్తితో; వచ్చున్ = సంభవిస్తాయి.

తాత్పర్యం: 'దేవీ! మనసుతో చేయబడేవి, నోటితో సల్పబడేవి, శరీరంతో కావింపబడేవి అని పాపాలు ముప్విధాలు. ఇతరుల ద్రవ్యాన్ని వాంఛించటం, దుష్కృత్యాలు జరుగుతుంటే అంగీకరించటం లేదా చూచి సంతోషించటం, ధర్మకార్యాలను ద్వేషించటం మొదలైనవి మనస్సంబంధమైన పాపాలు. అబద్ధాలు చెప్పటం, కఠోరంగా మాట్లాడటం, వాక్సంబంధమైన దోషాలు, చంపటం, బంధించటం, తిన కూడని వాటిని తినటం, పరుని పత్నిని అనుభవించటం, కల్లు త్రాగటం మొదలైనవి శరీరసంబంధమైన పాతకాలు. పార్వతీ! వినుము. పాపా లన్నింటిలో దొడ్డపాపం కల్లు త్రాగటం. మద్యపానం వలన ప్రాణోపద్రవం కలుగుతుంది, చేటు వాటిల్లు తుంది, నరకసముద్రంలో కూలటం జరుగుతుంది.

విశేషం: బాలవ్యాకరణకర్త పరవస్తు చిన్నయసూరి లక్షణవిరుద్ధంబగు భాష గ్రామ్యంబు. అది గ్రంథరచనకు పనికిరాదని శాసించాడు. కాన కఱకంఠుడు, కపిల గడ్డము, కపిలజడల వంటి నన్నయ భారత ప్రయోగాలకు రక్షణ కల్పించడానికి ఆయన "పెద్దలు వ్యవహరించిన మాట గ్రామ్యమైనను గ్రహింపదగును'' అంటూ "ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు'' అని సూత్రం కల్పించాడు. అందుకు ఉదాహరణగా ఇచ్చిన పదాలలో తిక్కన గారి ఈ ప్రాణగొడ్డము ఒకటి. ఈనాడు అనేకమారులు, అల్పదండిత్యాదులు పేరున్న పెద్ద పెద్ద కవులే నిరంకుశంగా వాడుతున్నారు.

క. లోకము నిర్మర్యాద । త్వాకులమై చెడదె సజ్జనావలి మధుపా
నాకాంక్ష దొఱఁగకున్న గు । ణా కల్పా! యేమిసేయ దక్కీడు నరున్? 175

ప్రతిపదార్థం: గుణ+ఆకల్పా! = సద్గుణాలే నగలుగా గలదానా!; సత్+జన+ఆవలి = సత్పురుషుల యొక్క సంఘం; మధుపాన+ఆకాంక్ష = మద్యం త్రాగడంలోని ఆసక్తి; తొఱఁగక+ఉన్నన్ = వదలకుంటే, మానకుంటే; లోకము = ప్రపంచం; నిర్+మర్యాదత్వ+ఆకులమై = హద్దులేమిచే కలిగిన వ్యాకులపాటు చెందినదై; చెడదు+ఎ? = నశింపదా? ఆ+కీడు = ఆ మధుపానాసక్తి వలన కలిగే హాని; నరున్ = మనిషిని; ఏమి+చేయదు? = ఏమిచేయలేదు? అనగా అన్ని అనర్థాల పాలు కావిస్తుందని భావం.

తాత్పర్యం: గుణభూషితవైన పార్వతీ! సత్పురుషులు మద్యపానం మానకపోతే లోకం హద్దు లేనిదై సంక్షోభానికి గురై చెడిపోతుంది. మధుసేవ మనిషికి ఏ హాని కల్గించలేదు? అన్ని అనర్థాలనూ కల్గిస్తుందని తాత్పర్యం.

క. కావున నే విధమున సుర । సేవింపక యుడుగుటొప్పుఁ జెలువ! సకల వ
ర్ణావలికి దానఁ గీర్తి । శ్రీవైభవ పుణ్యగతులు సేర్చికొన నగున్. 176

ప్రతిపదార్థం: కావునన్ = కాబట్టి; చెలువ = ఓ లలనా; ఏ విధమునన్ = ఎట్లైనా; సురసేవింపక = మద్యం త్రాగక; ఉడుగుట = మానటం; ఒప్పున్ = తగును; దానన్ = అట్లా చేయడం వలన; సకల వర్ణ+ఆలికిన్ = అన్నికులాలవారికిన్నీ; కీర్తి శ్రీవైభవ పుణ్యగతులు = యశస్సు, సిరి, వైభవం, పుణ్యలోకాలు; చేర్చి కొనన్+అగున్ = పడయవచ్చును, పొందవచ్చును.

తాత్పర్యం: కాబట్టి కాంతామణీ! ఏ విధంగానైనా కల్లుమానటం అవశ్యకర్తవ్యం. అట్లా చెయ్యటం వలన పేరు ప్రఖ్యాతులూ, సిరిసంపదలూ, గొప్పతనం, సద్గతులూ సర్వజాతులవారూ సంపాదించుకొనవచ్చు.'

క. అన విని యంబిక 'సుకృతము । లనునవి యెట్టి?' వని యడుగు నద్దేవికి ని
ట్లనియెం జంద్రార్ధధరుం । డనుమోదోల్లాసి యగుచు నంబుజనాభా! 177

ప్రతిపదార్థం: అనన్; విని; అంబిక = దుర్గ; సుకృతములు+అనునవి = పుణ్యాలు అనేవి; ఎట్టివి? = ఎట్లాంటివి?; అని = అంటూ; అడుగు = ప్రశ్నించునట్టి; ఆ+దేవికిన్ = ఆ భగవతికి; చంద్ర+అర్ధ+ధరుఁడు = నెలవంకను తలదాల్చిన శివుడు; అనుమోద+ఉల్లాసి+అగుచున్ = సంతోషంతో ప్రకాశిస్తున్నవాడై; ఇట్లు+అనియెన్ = ఇట్లా చెప్పాడు; అంబుజనాభా! = పద్మమునాభియందుగలవాడా! శ్రీ కృష్ణా!

తాత్పర్యం: అని పరమేశ్వరుడు పలుకగా పార్వతీదేవి 'ప్రభూ! పుణ్యాలంటే ఎట్లాంటివి? అని ప్రశ్నించింది. అందుకు శశాంకశేఖరుడు సంతోషంతో విలసిల్లుతూ ఆమె కిట్లని చెప్పాడు శ్రీకృష్ణా! (అని నారదమహర్షి శౌరితో అన్నాడు).

తే. 'ఔపరమికాభిధానంబు నంబుజాక్షి! । నిరుపకరణాఖ్యమును సోపకరణనామ
కంబు నయి లోకమున సుకృతంబు పరఁగుఁ । ద్రివిధముల వానిఁ దగ వివరింతు వినుము. 178

ప్రతిపదార్థం: అంబుజ+అక్షి! = తామరరేకులవంటి నేత్రాలు గలగౌరీ!; ఔపరమిక+అభిధానంబున్ = ఔపరమికము అనే పేరుగలదియూ; నిరుపకరణ+ఆఖ్యమునున్ = నిరుపకరణము అనే పేరుగలదియూ; సోపకరణనామకంబున్ = సోపకరణము అనే పేరుగలదియూ; అయి = కలిగి; లోకమునన్ = జగములో; సుకృతంబు = పుణ్యం; త్రివిధములన్ = మూడురీతుల; పరఁగున్ = ఒప్పుతున్నది; వానిన్ = మూడు విధాల ఉన్న పుణ్యాలను; తగన్ = చక్కగా; వివరింతున్ = వెల్లడిస్తాను; వినుము = ఆలకించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'పద్మ దళముల వంటి నయనాలు గల గౌరీ! పుణ్యం ఔపరమికం అనీ, నిరుపకరణం అనీ, సోపకరణం అనీ మూడూ విధాలుగా ప్రపంచంలో వెలుగొందుతున్నది. విశదీకరిస్తాను. విను.

సీ. **ఔపరమిక మనునది పాపవర్జన; । మకట! కానఁగ నేర రజ్ఞజనులు;**
యత్నంబు వలదు; వ్యయం బేమియును లేదు । పరలోకభీతిఁ బాపములఁ దొఱఁగి
నంతన సుగతి సౌఖ్యం బొడఁగూడెడు; । నదియు నాత్మాధీన; మట్టిదాని
సుకరత్వ మెఱుఁగక చొత్తురు నరకంబు; । వెరవరుల్ శ్రుతమున వృద్ధయోగ

తే. **మునను ధృతికల్మి నింద్రియ వినియమమున । నది దమకుఁ గలిగింతురు; యమ మనంగఁ**
బరఁగు నది దాన నాకంబుఁ బడయవచ్చు। ననినఁ జెప్పంగ నేల ధర్మాభియుక్తి. **179**

ప్రతిపదార్థం: ఔపరమికము+అనునది = ఔపరమికము అనేది; పాపవర్జనము = పాపకృత్యాలను వదలటమే; అకట! = అయ్యో!; అజ్ఞజనులు = మూర్ఖులు, మూఢులు; కానఁగన్+నేరరు = తెలిసికొనలేరు; యత్నంబు వలదు = ఇందుకు పెద్దగా ప్రయత్నించనక్కర లేదు; వ్యయంబు+ఏమియును+లేదు = ధనం కొంచెమైనా వెచ్చించవలసినపని లేదు; పరలోకభీతిన్ = పరలోకంలో ఎట్లాంటి బాధలు అనుభవించ వలసి వస్తుందో అనే భయంతో; పాపములన్ = దురితాలను; తొఱఁగిన+అంతన్+అ = విడిచి పెట్టిన మాత్రాననే; సుగతిసౌఖ్యంబు = సద్గతి వలని సుఖం, స్వర్గ సౌఖ్యం; ఒడన్+కూడెడున్ = లభిస్తుంది; అదియున్ = ఆ పాపవివర్జనం; ఆత్మ+అధీనము = తనకు వశమయ్యే ఉంటుంది; అట్టిదాని సుకరత్వమున్ = ఆ పాపవర్జనం వలన కలిగే సౌలభ్యం, మేలు; ఎఱుఁగక = తెలియక; నరకంబున్+చొత్తురు = నరకలోకంలో ప్రవేశిస్తారు; వెరవరుల్ = ఉపాయశాలురు; శ్రుతమునన్ = వేద శాస్త్రపురాణాదుల వినికి చేతనూ; వృద్ధయోగమునను = పెద్దలసాంగత్యం చేతనూ; ధృతికల్మిన్ = ధైర్యం కలిగి ఉండటం వలననూ; ఇంద్రియవినియమమునన్ = ఇంద్రియాలను నిగ్రహించటం చేతనూ, అది = ఆ పరలోకసుఖం, తమకున్ = తమకు; కలిగింతురు = లభించేటట్లు చేస్తారు, చేకూరుస్తారు; అది యమము+అనంగన్+పరఁగున్ = అది యమమనే పేరుతో విలసిల్లుతుంది; దానన్ = ఆ యమముచేత; నాకంబున్ = స్వర్గాన్ని; పడయన్+వచ్చున్ = పొందవచ్చును. అనినన్ = అని చెప్పినపుడు; ధర్మ+అభియుక్తిన్ = పుణ్యార్జనమును గూర్చి; చెప్పంగన్+ఏల? = చెప్పటమెందుకు?

తాత్పర్యం: ఔపరమిక మనగా పాపాలను విడిచిపెట్టడం. అయ్యో! ఇంత సులభమైన దానిని మూఢ మానవులు గ్రహించనేరకున్నారు. పాపవర్జనానికి ప్రయత్నం అక్కరలేదు. డబ్బును వెచ్చించ వలసిన అవసరంలేదు. పరలోకం ఉన్నది గదా అనే భయంతో పాపకృత్యాలు చేయటం మానితే చాలు. సద్గతి వలన కలిగే సౌఖ్యం తనంతట తానే లభిస్తుంది. దుష్కృత్యాలు మానటం అనేది తన చేతిలోని పనేకదా! ఇందువలన కలిగేమేలు గమనించక జనులు చెడుపనులు చేస్తూ నిరయం పాలవుతున్నారు. ఉపాయశాలురగు బుద్ధిమంతులు వేదశాస్త్ర పురాణాదులను వింటూ, పెద్దలను సేవిస్తూ, ధైర్య మవలంబించి, ఇంద్రియాలను నిగ్రహించి సద్గతుల వలన కలిగే సౌఖ్యమును పొందుతారు. యమం వల్లనే స్వర్గసుఖం లభిస్తుంది అని చెప్పేటప్పుడు మానవుడు కేవలపుణ్యాకర్మలే ఆచరి స్తున్నప్పుడు లభించే భాగ్యం ఇట్టిదని వర్ణించడానికి శక్యం కాదు.

విశేషం: యమము: ఇంద్రియాలను స్వాధీనంలో ఉంచుకోవటం. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధు లనేవి యోగాంగాలు. ఇవి ఎనిమిది. వీటిలో మొదటిది యమము -- (ఇంద్రియ నిగ్రహం).

ఆ. నిరుపకరణ మనఁగఁ బరఁగు శౌచంబు స । త్యంబు శాంతి దాంతి యార్జవంబు
వ్రతనిరూఢి సముపవాసంబు బ్రహ్మ చ । ర్యంబు కల్మి నియమ మండ్రు దాని. 180

ప్రతిపదార్థం: శౌచంబు = శుచిత్వం, పరిశుద్ధత; సత్యంబున్ = నిజము; శాంతి = త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములనే జ్ఞానేంద్రియాల నిగ్రహం, అంతరింద్రియాల నణచటం; దాంతి = వాక్, పాణి, పాద, పాయూ పస్థలనే కర్మేంద్రియాల యొక్క నిగ్రహం; అనగా బహిరింద్రియాల గెలుపు; ఆర్జవము = నిష్కాపట్యం, స్వచ్ఛమైన నడవడిక; వ్రతనిరూఢి = వ్రతాలయందు ప్రీతి; సముపవాసంబు = ఒక్కప్రొద్దు లుండటం; బ్రహ్మచర్యంబు కల్మి = బ్రహ్మచర్యం అవలంబించటం; నిరుపకరణము+ అనఁగన్ = నిరుపకరణం అనే పేరుతో; పరఁగున్ = ఒప్పుతుంది; దానిన్ = ఆ నిరుపకరణాన్నే; నియమము+అండ్రు = నియమ మని అంటారు.

తాత్పర్యం: పరిశుద్ధత, సత్యం, అంతరింద్రియ నిగ్రహం (శాంతి), బహిరింద్రియనిగ్రహం (దాంతి), ఋజుప్రవర్తన, వ్రతాలను ప్రీతితో అనుష్ఠించటం, ఒక్కప్రొద్దు లుండటం, బ్రహ్మచర్యవ్రతపాలన అనేవి నిరుపకరణం అనే పేరుతో చెలువొందుతున్నాయి. ఈ నిరుపకరణమునే నియమ మంటారు.

సీ. ఆభ్యంతరంబు బాహ్యము ననఁ**గా శౌచ । మిరు దెఱఁగై యుండు హృదయసుకృత**
మాభ్యంతరము విను మాహారశుద్ధియు । నంగశోధనము బాహ్యంబు సత్య
మన్నది గన్నది విన్నది యున్న రూ । పున నుక్త మగుట యంభోజవదన!
శాంతి బుద్ధీంద్రియ సన్నివారణ దాంతి । కర్మేంద్రియముల యోగ్యప్రవృత్తి;

తే. యార్జవము గుటిలుఁడు గామి యగు వ్రతంబు । మంచిపని పూని నడపుట యంచితోప
వాస మశననిగ్రహ మనవద్యమైన । బ్రహ్మచర్యంబు గామునిబారిఁ బడమి. 181

ప్రతిపదార్థం: శౌచము = పరిశుద్ధత; ఆభ్యంతరంబున్ = లోపలిదీ; బాహ్యమున్ = వెలుపలిదీ; అనఁగాన్ = అనునట్లు; ఇరు+తెఱఁగు+ఐ = రెండు విధాలై; ఉండున్ = ఉంటుంది; హృదయసుకృతము = మనసు చేసిన పుణ్యం; ఆభ్యంతరము = లోపలిది; వినుము = గౌరీ! ఆలకించుము; ఆహారశుద్ధియున్ = భోజనం యొక్క పరిశుద్ధి; అంగశోధనమున్ = దేహమును శుద్ధపరచుట, (ఒడలు తోముకొనుట); బాహ్యంబు = వెలుపలిది; అంభోజవదన! = పద్మమువంటి ముఖముగలదానా!; అన్నది = నోటితో చెప్పినది; కన్నది = కంటితో చూచినదీ; విన్నది = చెవులతో ఆలకించినదీ; ఉన్నరూపునన్ = యథాతథంగా; ఉన్నది ఉన్నట్లుగా; ఉక్తము+అగుట = చెప్పబడుట; సత్యము = నిజం; బుద్ధి+ఇంద్రియ+సత్+నివారణ = మనస్సు మున్నగు ఇంద్రియాలను బాగా నిగ్రహించటం; శాంతి = శాంతి అనబడుతుంది; కర్మ+ఇంద్రియముల = వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ అనే అయిదు కర్మేంద్రియాల యొక్క; యోగ్యప్రవృత్తి = సక్రమమైన ప్రవర్తన; దాంతి = దాంతి అనబడుతుంది. కుటిలుఁడు+కామి = మోసగాడు కాకుండటం, కాపట్యం లేకుండటం; ఆర్జవము = ఆర్జవ మనబడుతుంది; మంచిపని = సత్కార్యం; పూని = యత్నించి; నడపుట = సాగించటం; వ్రతము+అగున్ = వ్రతమనిపించుకొంటుంది; అశన నిగ్రహము = ఆహారం మానివేయటం; అంచిత+ఉపవాసము = ఒప్పిదమైన ఉపవాస మవుతుంది; కామునిబారిన్+పడమి = మన్మథుడికి వశుడు కాకుండటం; బ్రహ్మచర్యము = బ్రహ్మచర్యమని చెప్పబడుతుంది.

తాత్పర్యం: శౌచమనేది ఆభ్యంతరమనీ, బాహ్యమనీ రెండురకాలు. అందు మనస్సు యొక్క పారిశుద్ధ్యం ఆభ్యంతర మవుతుంది. ఆహార శుద్ధి, దేహశుద్ధి బాహ్యమని చెప్పబడుతుంది. నోటితో చెప్పినదీ, కంటితో చూచినదీ, చెవులతో విన్నదీ ఉన్నదున్నట్లు చెప్పడమే నిజం. దేవీ! జ్ఞానేంద్రియపంచకాన్ని జయించటమే శాంతి. కర్మేంద్రియాలను సద్విషయాలలో ప్రవర్తింపజేయటమే దాంతి. నిష్కపటవర్తనమే ఆర్జవం. మంచిపనులు పూనికతో చేయటమే వ్రతం. భోజనం మానటమే ఉపవాసం. కామోద్రేకానికి గురికాకుండా ఉండటమే బ్రహ్మచర్యం.

విశేషం: 'నిరుపకరణ మనఁగ' అనే 180వ పద్యానికి ఈ పద్యం వివరణప్రాయం.

ఆ. **నాతి! తీర్థసేవనంబును నియమ వి। శేష మగుట దానిఁ జెప్పవలయు**
సకలనదులఁ దీర్థసంజ్ఞలు గల వబ్ధి। కరుగునట్టి విచ్చు నధికఫలము. **182**

ప్రతిపదార్థం: నాతి! = ఓ మగువా!; తీర్థసేవనంబును = పుణ్యతీర్థాలను సేవించటం; నియమ విశేషము+అగుటన్ = నియమాలలో ఒకటికావటం వలన; దానిన్ = దానిని గూర్చి; చెప్పన్ వలయున్ = తప్పక చెప్పాలి; సకలనదులన్ = అన్ని నదుల విషయంలో; తీర్థసంజ్ఞలు= తీర్థాలనే పేర్లు కలవు; అబ్ధికిన్+అరుగు+అట్టివి = సముద్రమునకు పోయే నదులు; అధిక ఫలమున్+ఇచ్చున్ = మిక్కుటమైన పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాయి.

తాత్పర్యం: చెలీ! పుణ్యతీర్థాలలో మునగడం కూడ నియమ విశేషం గనుక తీర్థాలను గురించి చెప్పవలసి ఉన్నది. అన్ని నదులూ పుణ్యతీర్థాలే. వాటిలో సాగరానికి పోయేనదులు అధిక ఫలాన్ని ఇస్తాయి.

తే. **వానియందును మునిపద మాననీయ। దేశములు నబ్ధిసంయోగ దేశములును**
దెలియు మన్యోన్యసంగమ దేశములును। బరమతీర్థంబు లగుఁ బద్మపత్రనయన! **183**

ప్రతిపదార్థం: పద్మపత్రనయన! = తామర రేకుల వంటి కన్నులు కలదానా! గౌరీ!; వానియందును = ఆ పుణ్య తీర్థాలలోనూ; మునిపదమాననీయ = మునీంద్రులు అడుగులు మోపటం చేత ఆదరించదగిన; దేశములున్ = చోటులూ; అబ్ధి సంయోగదేశములును = సముద్రంలో కలిసే చోట్లున్నూ; అన్యోన్య(అన్యః+అన్య) సంగమ దేశములును = ఒకదానితో ఒకటి చేరేచోట్లున్నూ; పరమ తీర్థంబులు+అగున్ = శ్రేష్ఠమైన తీర్థా లవుతాయి; తెలియుము = దేవీ! గ్రహించుము.

తాత్పర్యం: ఆ విధంగా సముద్రంలో కలియుటకు అరిగే నదులలో మునీశ్వరులు తమ పాదాలు మోపి పవిత్రీ కరించిన చోట్లూ, ఈ స్రవంతులు సాగరంలో కలిసే చోట్లూ, నదీనదాలు పరస్పరం కూడే చోట్లూ అనగా సంగమస్థానాలూ ఉత్తమతీర్థాలని దేవీ! గ్రహించుము.

క. **వనధి మహాతీర్థం బం। దును సంయమివరులచేతఁ దొల్లి ప్రియమునం**
గొనియాడఁ బడిన చోటులు। విను ముత్తమ తీర్థములు వివేకాభరణా! **184**

ప్రతిపదార్థం: వివేక+ఆభరణా! = విజ్ఞానమే అలంకారంగా గల గౌరీ!; వినుము = ఆలకించుము; వనధి = సముద్రం; మహాతీర్థంబు = గొప్ప పుణ్యతీర్థం; అందును = మీదుమిక్కిలి; సంయమివరులచేతన్ = మునీంద్రుల చేత; తొల్లి =

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పూర్వం; ప్రియమునన్ = ఇష్టంతో, ఆదరంతో; కొనియాడన్+పడిన = పొగడబడినట్టి; చోటులు = ప్రదేశాలు, తావులు; ఉత్తమతీర్థములు = శ్రేష్ఠములైన తీర్థాలు, పవిత్ర తీర్థాలు.

తాత్పర్యం: విజ్ఞానమే విభూషణంగా గల పార్వతీ! వినుము. సాగరం ఒక గొప్ప పుణ్యతీర్థం. మునుపు మునిశ్రేష్ఠులు ప్రియపడి శ్లాఘించిన సాగరసంగమ ప్రదేశాలన్నీ పరమ పవిత్రాలైన తీర్థాలు.

క. వెలి శుచియై మఱి తీర్థం । బులు సొచ్చుట మేలు నియమములు దీర్చి తగన్
వెలలిన యెడ దేవార్చన । ములు విప్రార్చన లవశ్యమును గృత్యంబుల్. 185

ప్రతిపదార్థం: వెలిన్ = వెలుపల, నదికి బయట; శుచి+ఐ = పరిశుద్ధుడై; మఱి = ఆవల; తీర్థంబులు+చొచ్చుట = నీళ్ళలో ప్రవేశించటం; మేలు = మంచిది; నియమములు+తీర్చి = స్నానాది విధులెల్ల ఆచరించి; తగన్ = యుక్తంగా; వెలలిన+ఎడన్ = నది నుండి తీరం చేరిన తరువాత; దేవ+అర్చనములు = దేవతాపూజలు; విప్ర+అర్చనలు = బ్రాహ్మణపూజలు; అవశ్యమును = తప్పక; కృత్యంబుల్ = చేయదగినట్టివి.

తాత్పర్యం: పుణ్యతీర్థాలలో మునగటానికి ముందు కాలకృత్యాలు తీర్చుకొని, స్నానమాడి పరిశుద్ధుడై ఆవల ఆ పవిత్రతీర్థాలలో ప్రవేశించాలి. ఆ విధంగా తీర్థాలలో ప్రవేశించి స్నానవిధులెల్ల చక్కగా ఆచరించి గట్టెక్కిన తరువాత దేవబ్రాహ్మణ పూజలు తప్పకుండా నిర్వర్తించాలి.

క. చేరువ తీర్థము కంటెను । దూరపుఁదీర్థంబు మేలు తోయజవదనా!
శారీరాయాసము ద । త్కారణమై వేదవాక్యగతి యిట్లుండున్. 186

ప్రతిపదార్థం: తోయజవదనా! = పద్మంవంటి మోము కలదానా!; చేరువ తీర్థము కంటెను = సమీపంలోని తీర్థం కన్నా; దూరము+ తీర్థంబు (దూరపు తీర్థంబు) దూరప్రదేశంలో ఉండే తీర్థం; మేలు = శ్రేష్ఠమైనది; (ఎందుకంటే) శారీర+ఆయాసము = దేహము యొక్క బడలికయే, శ్రమయే; తత్+కారణము+ఐ = అందుకు హేతువై; వేదవాక్యగతి = వేద వచనాల యొక్క పోకడ; ఇట్లు+ఉండున్ = ఈ రీతిగా ఉంటుంది.

తాత్పర్యం: ఓ పద్మముఖీ! దగ్గరలో ఉండే తీర్థాన్ని సేవించడం కంటె, దూరంలో ఉండే తీర్థాన్ని సేవించడమే మంచిది. ఎందుకంటే వేదవాక్యాల పోకడ ననుసరించి తీర్థయాత్రలో దేహం బడలిక చెందడం, శ్రమపొందడం మంచిది.

క. విను సోపకరణ మనునది । ధనధాన్యాదిక సమగ్రతను గృహమేధుల్
గొనియాడుతెఱఁగు దానం । బున వైదిక పైతృకాది పుణ్యక్రియలన్. 187

ప్రతిపదార్థం: విను = అపర్ణా! ఆలకించుము; సోపకరణము+అనునది = సోపకరణం అని చెప్పబడేది; ధన ధాన్య+ఆదిక = ధనం, ధాన్యం మొదలైనవాటి యొక్క; సమగ్రతను = పూర్ణత్వం చేత, మెండుగా కలిగి ఉండటం చేత; గృహమేధుల్ = గృహస్థులు, గేస్తులు, ఇంటి యజమానులు; దానంబునన్ = దానాల చేతను; వైదిక = వేదోక్తములైన, వేదవిహితాలైన; పైతృక+ఆది = పితృశ్రాద్ధం, తర్పణం మొదలైన; పుణ్యక్రియలన్ = పవిత్రకార్యాలను; కొనియాడు తెఱఁగు = ఆదరించే విధానమై ఉన్నది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అపర్ణా! ఆలకించుము. సోపకరణ మనేది మెండుగా ధనధాన్యాలు గల గృహస్థులు దానము చేతను, పితృశ్రాద్ధాదులైన వైదిక కార్యాలచేతను ఆదరించే విధానమై ఒప్పుతున్నది.

సీ. **న్యాయార్జితంబైన యర్థంబు వేదవి । త్త్వము శాంతి మొదలగు వరగుణములు**
గల విప్రునకుఁ బుణ్య కాలపావన దేశ । కలితంబుగా భక్తి గలిగి యీగి
మేలిదానము శక్తి మిగులుట శక్తికిఁ । దగుట దానికిఁ గడుఁ దగమి యుత్త
మము మధ్యమము నధమము నగు దాన వి । ధానంబు విను మిట్లు దైవికంబుఁ

తే. **బైతృకంబును లోనైన పనులఁ దాను । వేడ్కసేయు వస్తువుఁ గొను విప్రకోర్కి**
కనుగుణంబగు నదియును నర్థి నిచ్చు । టధికతరమైన ఫల మిచ్చు నంబుజాక్షి! 188

ప్రతిపదార్థం: అంబుజ+అక్షి! = నీరజములవంటి నేత్రాలు కలదానా!; న్యాయ+ఆర్జితంబు+ఐన = న్యాయం తప్పక సంపాదించినట్టి; అర్థంబున్ = విత్తాన్ని; వేదవిత్త్వమున్ = వేదమునెరుంగుట; శాంతి = ఇంద్రియనిగ్రహం; మొదలు+అగు = మున్నుగా కలిగిన; వరగుణములు = శ్రేష్ఠములైన గుణాలు; కల = కలిగిన; విప్రునకున్ = బ్రాహ్మణుడికి; పుణ్యకాల = పవిత్రమైన కాలంతో; పావనదేశ = పవిత్రమైన ప్రదేశంతో; కలితంబుగాన్ = కూడి ఉండేటట్లుగా; భక్తి+కలిగి = భక్తి భావం కలిగి; ఈగి = ఇచ్చుట; మేలిదానము = ఉత్తమ దానం; శక్తిన్ మిగులుట = తన శక్తికి మించటం; శక్తికిన్+ తగుట = తన శక్తికి తగినట్లుండటం; దానికిన్ = తనశక్తికి; కడున్ = మిక్కిలి; తగమి = తగినట్లు ఉండకుండటం అనేవి వరుసగా; ఉత్తమమున్ = శ్రేష్ఠమూ; మధ్యమమున్ = రెండవ రకం; అధమమున్ = హీనమూ; అగు = అయినట్టి; దానవిధానము = దానపద్ధతి అవుతుంది; వినుము = అంబికా! ఆలకించుము; ఇట్లు = ఈ రీతిగా; దైవికంబు = దైవసంబంధం; పైతృకంబు = పితృసంబంధమును; లోను+ఐన పనులన్ = మొదలగు కార్యములందు; కొను = స్వీకరించే; విప్రుకోర్కికిన్ = బ్రాహ్మడికాంక్షకు; అనుగుణంబు+అగు+అదియునున్ = తగినట్టి దానిని; అర్థిన్ = ప్రీతితో, భక్తితో; ఇచ్చుట = దానమివ్వటం; అధికతరము+ఐన = ఎంతో ఎక్కువైన; ఫలము+ఇచ్చున్ = ఫలాన్నిస్తుంది;

తాత్పర్యం: న్యాయంగా సంపాదించిన సొమ్మును వేదం చదివిన, శాంతి మొదలైన సద్గుణాలు కలిగిన బ్రాహ్మణుడికి పుణ్యకాలమందు, పుణ్యక్షేత్రమందు భక్తితో దానం చేయటం ఎంతో ఉత్తమం. తన శక్తికి మించిన దానం పరమోత్తమం. తన శక్తికి తగినట్లివ్వడం మధ్యమం. తన శక్తికి ఏ మాత్రం తగనట్లు ఇవ్వడం అధమం. దేవీ! దానవిధాన మంటే ఇది. ఈ విధంగానే దేవ సంబంధమైన యజ్ఞయాగాదులలోనూ, పితృకార్యములైన శ్రాద్ధాదులలోనూ తన కిష్టమైన వస్తువునూ, దానగ్రహీత అయిన బ్రాహ్మణుడి కోరికకు తగిన వస్తువునూ శ్రద్ధా భక్తులతో సమర్పిస్తే ఆ దానం మిక్కుటమైన ఫలాన్ని ఇస్తుంది.

తే. **చేయు టెంతయు మేలైనఁ జేసి పిదప । వగచినట్టి దానము దనుఁ బొగడికొన్న**
దానవిధి నిష్ఫలంబులు గాన రెండు । నుడుగుదాత మహాఫల మొందఁ గాంచు.' 189

ప్రతిపదార్థం: చేయుట = దానం సల్పటం; ఎంతయున్ = మిక్కిలి; మేలు+ఐనన్ = శ్రేయస్కరమైనదైనను; చేసి = సలిపి; పిదపన్ = దానానంతరం; వగచినట్టి దానము = చింతించునట్టి దానమూ; తనున్ = తనను; పొగడికొన్నదానవిధి = మెచ్చుకొనే దాన పద్ధతి; నిస్+ఫలంబులు+కానన్ = ఫలరహితములు కాబట్టి, ప్రయోజన శూన్యాలు కనుక; రెండున్ = ఆ రెండు విధాలైన దానాలను; ఉడుగుదాత = వదలునట్టి ఈవికాడు; మహాఫలమున్ = గొప్ప ప్రయోజనాన్ని; ఒందన్+కాంచున్ = పొందగలడు.

తాత్పర్యం: "దానం చేయడం ఎంతోమేలే అయినప్పటికీ చేసిన తర్వాత దుఃఖపడినదానమూ, తానిచ్చినదాన్ని తానే పొగడుకొనే దానమూ నిష్ఫలాలు. కాబట్టి ఈ రెండూ మానుకొన్న దాత మహాఫలాన్ని పొందగలడు''.

వ. అనుటయు దాక్షాయణి 'దాతవ్యంబు లెయ్యవి చెప్పు' మనిన భవుం డిట్లనియె. 190

ప్రతిపదార్థం: అనుటయున్ = అని శివుడు చెప్పగా; దాక్షాయణి = దక్షప్రజాపతి కూతురైన సతీదేవి; దాతవ్యంబులు = దానం చెయ్యదగిన వస్తువులు; ఏ+అవి (ఎయ్యవి) = ఏవి; చెప్పుము; అనినన్ = అని అడుగగా; భవుండు = శంకరుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని శంభుడు తెలుపగా పార్వతీదేవి 'దానమీయ తగిన వస్తువు లేవో చెప్పు' మని అడుగగా ఈశ్వరు డిట్లా అన్నాడు.

శివుఁడు పార్వతికి దాన ఫల విశేషంబుల నెఱింగించుట. (సం.13 అను 1.15-3205)

సీ. 'అన్నంబుఁ దోయంబు నఖిలజంతువులకుఁ । బ్రాణముల్ గాన య ప్పరమవస్తు
వులు మేలు దాతవ్యములలోన నెల్లను; । నతిథుల కవి యిచ్చు టమరలోక
చిరమహాసౌఖ్యంబుఁ జేయుఁ; గాంచన మగ్ని । యగుటఁ దద్దాన మత్యంతపావ
నము సర్వకామప్రదము; గోవు సద్విప్ర । నకు నీగి తద్రోమ నికరసంఖ్య

ఆ. వరుస నాకలోక వాసంబు గావించు; । నందుఁ గపిల నిచ్చునాతఁ డిరువ
దొక్క తరము వారి నూర్ధ్వలోకమునకు । ననుపఁ జాలు వికచవనజవదన! 191

ప్రతిపదార్థం: వికచవనజవదన! = వికసించిన పద్మంవంటి ముఖం కలదానా!; అన్నంబున్ = ఓగిరం, కూడు, ఆహారం; తోయంబున్ = నీళ్ళూ, జలమూ, ఉదకమూ; అఖిలజంతువులకున్ = సమస్త జీవులకూ, ప్రాణముల్+కానన్ = ప్రాణాధారాలు గనుక; ఆ+పరమ వస్తువులు = ఆ శ్రేష్ఠములైన పదార్థాలు, అన్నోదకాలు; దాతవ్యములలోనన్+ఎల్లన్ = దానమివ్వదగిన వస్తువులన్నింటిలోనూ; మేలు = ఉత్తమమైనవి, మంచివి; అతిథులకున్ = భోజనవేళకు వచ్చినవారికి; అవి = ఆహారపానీయాలు; ఇచ్చుట = ఇవ్వటం; అమరలోక = దేవలోకంలో; చిరమహాసౌఖ్యంబున్+చేయున్ = బహుకాలం గొప్ప సుఖాలను కలిగిస్తుంది; కాంచనము = బంగారం; అగ్ని+అగుటన్ = నిప్పుకావటం వలన; తత్+దానము = సువర్ణదానం; అత్యంత పావనము = మిక్కిలి పవిత్రమైనది, కల్మషహరం; సర్వకామప్రదము = అన్ని కోరికలను ఈడేరుస్తుంది; గోవున్ = ధేనువును; సత్+విప్రునకున్ = మంచి బ్రాహ్మణుడికి; ఈగి = దానమివ్వటం; తత్+రోమనికరసంఖ్య = ఆ ఆవు యొక్క శరీరమందలి వెంట్రుకల యొక్క లెక్క; వరుసన్ = క్రమంగా; నాకలోకవాసంబున్ = స్వర్గలోకనివాసాన్ని; కావించున్ = కలుగజేస్తుంది; అందున్ = ఆ ధేనువులలో

కూడ; కపిలన్ = గోరోచనా వర్ణం కల గోవును, పుల్లావును; ఇచ్చు+అతఁడు = దానం చేసేవాడు; ఇరువది+ఒక్కతరము వారిన్ = తన పూర్వులలో ఇరవై ఒక్కతరాల వాళ్ళను; ఊర్ధ్వలోకమునకున్ = పుణ్యలోకానికి, స్వర్గానికి; అనుపన్+చాలున్ = పంపగలడు.

తాత్పర్యం: ఓ పద్మముఖీ! గౌరీ! అన్నం, నీళ్ళూ సకల ప్రాణులకూ ప్రాణాధారాలు కనుక ఆ శ్రేష్ఠములైన పదార్థాలు దాన మివ్వదగిన వస్తువు లన్నింటిలో మిక్కిలి ఉత్తమపదార్థాలు. అతిథులకు చేసే అన్నదానం, జలదానం దాతకు స్వర్గలోకంలో బహుకాలం మహాభోగానుభవం సమకూరుస్తాయి. బంగారం నిప్పు. దానిని దానం చెయ్యడం పరమపవిత్రం. అది అన్ని కోరికలను ఈడేరుస్తుంది. గోవును సద్బ్రాహ్మణుడికి దానమిస్తే దాని శరీరంలో ఎన్ని వెంద్రుక లున్నవో అన్నియేండ్లు స్వర్గలోకనివాస సౌఖ్యం పొందవచ్చును. ఆ గోవులలోనూ కపిల గోవును దానమిచ్చేదాత తన పూర్వులు ఇరవై యొక్క తరాల వారిని స్వర్గానికి పంపగలడు.

క. విను భూమిదాన కర్తకు । ననిమిషలోకమున నిలువనగు సౌఖ్యంబుల్
దనరుచు నుండఁగ నెఱ పెం । పున భూమి గలంత కాలమును గిరితనయా! 192

ప్రతిపదార్థం: గిరితనయా! = ఓ శైలపుత్రీ!; విను = ఆలకించుము; భూమిదాన కర్తకున్ = భూదానం చేసిన వాడికి; భూమి+కల+అంత+కాలమున్ = భూమి ఉండేవరకూ; సౌఖ్యంబుల్ = సుఖాలు; తనరుచున్+ఉండన్+కన్ = వర్ధిల్లుతుండగా, శోభిల్లుతుండగా; నెఱపెంపునన్ = పూర్ణగౌరవంతో, నిండు గౌరవంతో; అనిమిషలోకమునన్ = దేవలోకంలో; నిలువన్+అగున్ = ఉండవచ్చును.

తాత్పర్యం: పార్వతీ! వినుము. భూదానం చేసిన పుణ్యపురుషుడు ఆ భూమి ఉండేంత వరకూ పరిపూర్ణ సుఖాలు అనుభవిస్తూ, మిక్కిలి గౌరవంతో దేవలోకంలో నివసిస్తాడు.

ఆ. భూమి నఖిల మగు విభూతి విశేషజా । తంబు గలుగుఁ గానఁ దత్ప్రదాన
మెల్ల వస్తువులును నిచ్చిన యట్లగు । దానఁ బోని పాపతమము లేదు. 193

ప్రతిపదార్థం: భూమిన్ = నేలయందు; అఖిలము+అగు = సమస్తమైన; విభూతి విశేషజాతంబు = సంపద్విశేషముల యొక్క సమూహం అనగా మణులు, మాణిక్యాలు, వెండి, బంగారం మొదలైన అనర్ఘవస్తువులు; కలుగున్ = లభిస్తుంది; కానన్ = కాబట్టి; తత్+ప్రదానము = ఆ ధరణీదానం అనేది; ఎల్ల వస్తువులునున్+ఇచ్చిన+అట్లు+అగున్ = అన్ని వస్తువులనూ ఇచ్చినట్లే అవుతుంది; దానన్ = ఆ భూదానం వలన; పోని = నశించని; పాపతమము లేదు = పాతక మనే చీకటి లేదు.

తాత్పర్యం: భూమిలో సర్వవిధాలైన సంపద్విశేషాలు నెలకొని ఉంటాయి. కనుక భూదానం చేసినట్లయితే సకల వస్తు దానం చేసినట్లే అవుతుంది. ధరణిదానం వలన నశించని దురితమనే చీకటి ఉండనే ఉండదు.

విశేషం: అలం: పాపతమము అనే చోట రూపకం.

క. అతివా! కన్నియ నిచ్చినఁ । బితృపతి ముదమందు, సురలుఁ బ్రీతు లగుదు; రం
చితగతి కర్తకు దొరకొను । నతి తేజశ్శ్రీయశస్కమగు నభ్యవమున్. 194

ప్రతిపదార్థం: అతివా! = ఓ సఖీ!; కన్నియన్+ఇచ్చినన్ = పిల్లనిచ్చి పెళ్ళి చేస్తే, కన్యాదానం చేస్తే; పితృపతి = యమధర్మరాజు;

ముదము+అందున్ = సంతోషం పొందుతాడు; సురలు = దేవతలు; ప్రీతులు+అగుదురు = హర్షం చెందుతారు; కర్తకున్ = కన్యాదాన మొనర్చిన వాడికి; అంచిత గతి = పూజించదగిన, ఒప్పిదమైన సద్గతి; దొరకొనున్ = సమకూడుతుంది, లభిస్తుంది; ఆ భవమున్ = ఆతడి జన్మం కూడ; అతితేజస్ = మిక్కుటమైన కాంతి; శ్రీ = సంపద; యశస్కము+అగున్ = కీర్తిగలది అవుతుంది.

తాత్పర్యం: గిరిజా! కన్యాదానం చేసిన యెడల యముడు సంతోషిస్తాడు. వేల్పులు హర్షిస్తారు. కన్యాదాతకు సద్గతులు కలుగుతాయి. ఆతని జన్మం కాంతియుతమై, సంపద్యుక్తమై, కీర్తిమంతమై విరాజిల్లుతుంది.

తే. విద్య యిచ్చుట సత్పాత్ర విషయమైన । నవ్యయానందపదముఁ జేయంగఁ జాలుఁ;
దగఁగ దక్షిణయిచ్చి పేదలకు విద్య । యీ నియోగించుటయుఁ దత్సమాన కృతియ. 195

ప్రతిపదార్థం: విద్య+ఇచ్చుట = విద్యాదానం చెయ్యటం, చదువు చెప్పటం; సత్పాత్ర విషయము+ఐనన్ = యోగ్యులకే చెందినది అయితే; అవ్యయ+ఆనందపదమున్ = శాశ్వతసుఖస్థానమును; చేయంగన్+చాలున్ = లభింపజేయగలదు; తగన్+కన్ = (తగఁగన్) తగినట్లుగా; దక్షిణ+ఇచ్చి = గురువులకు ధనమిచ్చి; పేదలకున్ = దరిద్రులకు; విద్య+ఈన్ = విద్యనిచ్చుటకు; నియోగించుటయున్ = నియమించటం కూడ; తత్+సమానకృతి+అ = తాను విద్య చెప్పటంతో సమానమైన కార్యమేఅవుతుంది.

తాత్పర్యం: యోగ్యులైన వారికి విద్యాదానం చేస్తే విద్యాదాతకు శాశ్వతమైన పరలోక సౌఖ్యం లభిస్తుంది. అట్లా తాను చదువు చెప్పేశక్తిలేని వాడైతే గురువులకు దక్షిణ లిచ్చి పేదలకు విద్య చెప్పిస్తే స్వయంగా విద్యచెప్పిన వాడికి లభించే శాశ్వతానంద పదవి ఇతనికి గూడ లభిస్తుంది.

సీ. తిలరాశి యిచ్చినఁ గలుగు నగ్నిష్టోమ । ఫలము; వాసోదాన ఫలము చిరత
రాయువు; గొడు గీగి యఖిలపీడలఁ బాపు; । దాసదాసీజనదాన మహిమ
కర్మ విమోక్షంబు గలిగించు; దీపదా । నము ఫల మాత్మాతివిమలభావ;
మంబు ప్రవాహంబు నధిగమింపఁగఁ జేత । నిఖిల వ్యసనముల నిస్తరింపఁ

ఆ. జేయుఁ; దెరువు లెస్ససేయుట సంతాన । మిచ్చు; నౌషధంబు నిచ్చు టెల్ల
తెవులుఁ బాపు; సాదు దెరువరి కునికి ప । ట్టొసఁగు టొసఁగు దనుసుఖోదయములు.' 196

ప్రతిపదార్థం: తిలరాశి = నువ్వుల ప్రోగు; ఇచ్చినన్ = దానం చేస్తే; అగ్నిష్టోమ ఫలము = అగ్నిష్టోమమనే యజ్ఞం చేయటం వలన లభించే ప్రయోజనం; కలుగున్ = చేకూరుతుంది; వాసస్+దానఫలము = వస్త్రదానం చేస్తే లభించే మేలు; చిరతర+ఆయువు = దీర్ఘాయుష్యం; గొడుగు+ఈగి = ఛత్రదానం; అఖిలపీడలన్ = సమస్త బాధలనూ; పాపున్ = తొలగిస్తుంది; దాసదాసీజన దానమహిమ = సేవకులనూ, సేవికలనూ దానం చెయ్యటం వలన కలిగే ప్రభావం; కర్మ విమోక్షంబు+కలిగించున్ = కర్మ బంధం నుండి విముక్తి కలిగిస్తుంది; దీపదానము ఫలము = దీపదానం వలన లభించే ఫలం; ఆత్మ+అతి విమల భావము = ఆత్మకు మిక్కిలి నైర్మల్యం కలగటం; అంబు ప్రవాహంబున్ = నీటి వెల్లువను, జలప్రవాహాన్ని; అధిగమింపన్+ కన్+ చేఁత = పొందేటట్లు చేయడం; నిఖిల వ్యసనములన్ = ఎల్లదుఃఖాలనూ; నిస్తరింపన్+చేయున్ = దాటేటట్లు చేస్తుంది, తరింపజేస్తుంది; తెరువున్ = బాటను; లెస్స+చేయుట = బాగుపరచటం; సంతానము+ఇచ్చున్ = బిడ్డలను ప్రసాదిస్తుంది; ఔషధంబున్+ఇచ్చుట = మందునొసగటం; ఎల్ల+తెవులున్+పాపున్ = అన్ని రోగాలను మాన్పుతుంది; సాదు తెరువరికిన్ = సాధువైన బాటసారికి; ఉనికి పట్టు+ఒసఁగుట = నివాసస్థానమివ్వటం;

ఆశ్రయం కల్పించటం; తనుసుఖ+ ఉదయములు= దేహానికి సౌఖ్యవృద్ధి; ఒసఁగున్ = కలుగ జేస్తుంది, సమకూరుస్తుంది.

తాత్పర్యం: నువ్వులను దానమిస్తే అగ్నిష్టోమ యాగఫలం కర్తకు లభిస్తుంది. వస్త్రదానం వలన దీర్ఘాయుర్దాయం చేకూరుతుంది. ఛత్రదానం సర్వబాధానివారకం. దాసదాసీజన దాన ప్రభావం వలన కర్మబంధం నుండి విముక్తి సమకూడుతుంది. దీపాన్ని దానమిస్తే ఆత్మకు నైర్మల్యం సిద్ధిస్తుంది. జలప్రవాహాన్ని అందుబాటులోకి తెస్తే సకల దుఃఖనివృత్తి కలుగుతుంది. దారి డొంకలను బాగు పరిస్తే బిడ్డలు పుడతారు. మందులివ్వటం వలన రోగబాధలు తొలగిపోతాయి. సాధువైన బాటసారికి ఆశ్రయ మొసగితే తన శరీరానికి సౌఖ్యాభివృద్ధి సమకూడుతుంది.'

వ. అనిన విని 'యజ్ఞంబు తెఱం గెఱింగింపవే' యని పార్వతి ప్రార్థించినం బరమేశ్వరుం డిట్లనియె. 197

ప్రతిపదార్థం: అనినన్ విని = అని శంకరుడు చెప్పగా ఆలించి; యజ్ఞంబు తెఱంగు = యాగము యొక్క స్వరూపం; ఎఱింగింపవు+ఏ = తెలుపవా; అని; పార్వతి; ప్రార్థించినన్ = వేడగా; పరమేశ్వరుండు; ఇట్లు+అనియెన్ = ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని శంకరుడు చెప్పగా ఆలకించి అంబిక 'యజ్ఞము యొక్క స్వరూప మెట్టిదో సెలవిం' డని వేడగా ఆయన ఇట్లా అన్నాడు.

సీ. 'విను మింతి! వైదికంబును లౌకికంబును । నన రెండు దెఱఁగులు యజ్ఞవిధులు;
వర్ణయోగ్యార్జన వర్ధనాంచిత ధన । ధాన్యముల్ గొని దేవతలకుఁ దృప్తి
యగునట్లుగా ఋత్వి గర్చన మొప్పఁగాఁ । గావించునది వైదికంబు; దేవ
తలకు మహోత్సవంబులు సేయుటయు గీత । వాద్యనృత్యము లనవద్యములుగ

ఆ. సంఘటించుటయును సద్గంధమాల్య ధూ । ప ప్రదీప భోజ్యభక్ష్యములు స
మాదరంబుతో నివేదించుటయు లౌకి । కంబు; రెండు నమరగణహితములు. 198

ప్రతిపదార్థం: ఇంతి! = కాంతా!; విను = వినుము; యజ్ఞ విధులు = యాగాచరణాలు, యజ్ఞవిధానాలు, యజ్ఞ ప్రకారాలు; వైదికంబును = వేదసంబంధమైనది; లౌకికంబును = లోకసంబంధమైనది; అనన్ = అనగా; రెండు తెఱఁగులు = రెండురీతులు; వర్ణయోగ్య = కులమునకు తగినట్లు; ఆర్జన = సంపాదనముచే; వర్ధన = పెంపుదల చేత; అంచిత = ఒప్పునట్టి; ధనధాన్యముల్ = విత్తం, ధాన్యం; కొని = గ్రహించి; దేవతలకున్ = ఇంద్రాదిదేవతలకు; తృప్తి+అగునట్లుగాన్ = సంతుష్టి కలిగేరీతిలో; ఋత్విక్+అర్చనము = వేదమంత్రాలను చెప్పునట్టి ఋత్విజులను పూజించటం; ఒప్పఁగాన్ = తగి ఉండగా; కావించు+అది = చేయునటువంటిది; వైదికంబు = వేదసంబంధమైన యజ్ఞం; దేవతలకున్ = సురలకు; మహా+ ఉత్సవంబులు = పెద్ద పెద్ద తిరునాళ్ళు; చేయుటయున్ = నిర్వహించటం; గీతవాద్యనృత్యములు = పాటలు, మేళాలు, నాట్యాలు; అనవద్యములుగన్ = అనింద్యములుగా, కొఱతలేకుండా; సంఘటించుటయున్ = సమకూర్చటమున్నూ; సద్+గంధ = మంచిగంధం; మాల్య = పూలదండలు; ధూప = సాంబ్రాణి మున్నగు పొగలు వేయటం; ప్రదీప = దీపాలు వెలిగించటం; భోజ్యములు = భుజింపదగినవి; అన్నం, పప్పు మొదలైనవి; భక్ష్యములు = వడలు, లడ్లు మొదలైన పిండివంటలు, తిను బండాలు; సమాదరంబుతోన్ = గౌరవబుద్ధితో; నివేదించుటయున్ = నైవేద్యమివ్వటం, ఆరగింపు చేయటం; లౌకికంబు = లోకసంబంధమైనది; రెండున్ = వైదికం, లౌకికం అనే ఈ రెండున్నూ; అమరగణహితములు = దేవతాసమూహానికిఇష్టమైనవి.

తాత్పర్యం: 'అపర్ణ! ఆలకించుము. యజ్ఞాలు వైదికములనీ, లౌకికములనీ రెండు విధాలు. బ్రాహ్మణాదిజాతుల వారు తమ కులధర్మాలను అనుసరించి సంపాదించి, వృద్ధిపరచిన ధనధాన్యాలను వెచ్చించి దేవతలకు సంతృప్తి కలిగేటట్లు వేదోక్తంగా ఋత్విక్కులకు సంభావన లిచ్చి నిర్వహించే యాగాలు వైదికాలు. వేల్పులకు బ్రహ్మోత్సవాలు అనగా తిరునాళ్ళు వైభవోపేతంగా జరిపించటం, ఆ దేవోత్సవాలలో పాటలు, మేళం వాయించటం, ఆటలు ఏర్పాటుచేయించటం, మంచి గంధం, పూలమాలలు, ధూపం, దీపం, భక్ష్యభోజ్యాలతో నైవేద్యం సమర్పించటం ఈ మొదలైన షోడశోపచారాలతో దేవుళ్ళను అర్చించటం లౌకికమని చెప్పబడుతున్నది. అటు వైదికం, ఇటు లౌకికం ఈ రెండు విధానాలూ దేవతలకు ఇష్టమైన ఆరాధనా పద్ధతులు.

తే. ధర్మములు దానములును సద్వ్రతచయంబు । సదృశములు గావు వినుము యజ్ఞమున కరయ
యజ్ఞకర్త లోకోత్తరుం డతని కిచ్చు । టతనిచేఁ గొను టధిక పుణ్యములు చెలువ! 199

ప్రతిపదార్థం: చెలువ! = ఓ తరుణీ!; వినుము = ఆలకించుము; ధర్మములు = ధర్మాలు, పుణ్యాలు; దానములును = వితరణములు; సద్+వ్రతచయంబు = మంచి వ్రతాలు, నోములు; అరయన్ = పరికించగా, పరిశీలించగా, ఆలోచించగా; యజ్ఞమునకున్ = యాగమునకు, క్రతువునకు, సవనమునకు; సదృశములు+కావు = సమానం కావు; యజ్ఞకర్త = యాగం చేసేవాడు, యజమానుడు; లోక+ఉత్తరుఁడు = జనులలో శ్రేష్ఠుడు; అతనికిన్ = యజ్ఞం చేసేవాడికి; ఇచ్చుట = ఇవ్వటం; అతనిచేన్+కొనుట = అతనివలన స్వీకరించటం; అధికపుణ్యములు = మిక్కిలి పుణ్యాలు.

తాత్పర్యం: శ్రుతులకూ, స్మృతులకూ విహితమైన కర్మలు ధర్మాలు. అట్టి ధర్మాలు, దానాలు, మంచి వ్రతాలు ఇవేవీ యజ్ఞానికి సాటి రాలేవు. యజ్ఞం చేసినవాడు నరులలో ఉత్తముడు. అట్టి యాగకర్తకు ఇవ్వటంకాని, అతడి వలన పుచ్చుకొనటం గాని పరమ పుణ్యాలు.

ఉ. మానస కృత్యముల్ సురసమాజ మెఱుంగఁగఁ జాలుఁ గావునన్
మానస మెక్కడేనిఁ జన మంచిగఁ జేసిరయేని యజ్ఞమున్
దానము నాదియైన సుకృతంబులు లగ్గ ఫలింప నీదు త
ద్ధ్యాన పరత్వ పూత సుకృతంబులకున్ ఫలమిచ్చు మెచ్చుచున్.' 200

ప్రతిపదార్థం: సురసమాజము = దేవతాసంఘం; మానసకృత్యముల్ = మనస్సు చేసే పనులు, మనోవ్యాపారాలు; ఎఱుంగన్‌కన్+చాలున్ = తెలిసికొనగలదు; కావునన్ = కాబట్టి; మానసము = చిత్తం; ఎక్కడన్+ఏనిన్+చనన్ = ఎక్కడికో వెళ్ళిపోతే, ఎక్కడెక్కడనో సంచరిస్తుంటే; మంచిగన్ = ప్రశస్తంగా, ఘనంగా; చేసిర+ఏనిన్ = చేసినప్పటికిన్నీ; యజ్ఞమున్ = యాగమూ; దానమున్ = వితరణమూ; ఆది+ఐన = మొదలైన; సుకృతంబులు = పుణ్యకార్యాలు; లగ్గ ఫలింపన్+ఈదు = సురసమాజం లెస్సగా ఫలించేటట్లు చేయదు; తద్+ధ్యాన+పరత్వ = తదేకధ్యానమందు సక్తమగుటచే; పూత = పవిత్రమైన; సుకృతంబులకున్ = సత్కార్యాలకు, పుణ్యకార్యాలకు; మెచ్చుచున్ = కొనియాడుతూ; ఫలము+ఇచ్చున్ = ఆ దివిజసమూహం ఫలం ప్రసాదిస్తుంది.

తాత్పర్యం: దేవతాసమూహం మానవుల యొక్క మనోవృత్తులను తెలిసికొనగలదు. మన సెక్కడో మసలుతుంటే యజ్ఞం, దానం మున్నగు పుణ్యకార్యాలు ఎంతో ఘనంగా నిర్వర్తించినప్పటికిన్నీ దేవ సమాజం వాటికి ఫలాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రసాదించదు. తదేక ధ్యానంతో పవిత్రమైన మనసును నిల్పి చేసే పుణ్యకార్యాలను మెచ్చుతూ దివిజబృందం ఫలాన్ని అనుగ్రహిస్తుంది.'

క. అని చెప్పిన హిమవద్గిరి । తనయ త్రిపురవైరితోడ 'దైవికవిధు లే
వినఁ గని సంతోషించితి; । వినిపింపుము పైతృకంబు విధము వృషాంకా!' 201

ప్రతిపదార్థం: అని చెప్పినన్ = అని శంకరుడు పలుకగా; హిమవత్ గిరితనయ = మంచు కొండకూతురైన పార్వతీదేవి; త్రిపురవైరితోడన్ = త్రిపురములను దహించిన పరమేశ్వరుడితో; దైవికవిధులు = దేవతలకు సంబంధించిన కర్మలు; ఏన్ = నేను; వినన్+కని = వినుటకు నోచి; సంతోషించితిన్ = ఆనందించాను; వృష+అంకా! = వృషభం ధ్వజంగా కల మహాదేవా!; పైతృకంబు విధము = పితృదేవతలకు చెందిన కర్మ విధానాన్ని; వినిపింపుము = తెలియజెప్పుము.

తాత్పర్యం: అని పరమేశ్వరుడు పలుకగా విని హిమాలయ నగాధిరాజు కూతురైన ఉమాదేవి త్రిపురా సురసంహారకుడైన ఈశ్వరుడితో 'నాథా! మీవలన దైవికములైన కార్యములను విననోచి ఆనందమందినాను. ఇక పితృదేవతలకు ప్రీతికరములైన కార్యములను గూర్చి తెలుప వేడుతున్నాను.'

సీ. అనిన నా సర్వజ్ఞుఁ డద్దేవి కిట్లను । 'గయ కురుక్షేత్రంబు గంగయాది
యగు పుణ్యదేశంబు లతిఫలదంబులు; । మాఘ భాద్రపదాఖ్య మాసములు బ
హుళపక్ష మపరాహ్ణ ముగ్మలి! యమవస । ద్వాదశి నవములు పరఁగు దుష్టిఁ
బితృ దేవతల కిచ్చుఁ; గుతప దౌహిత్ర తి । లలు నితాంత పవిత్రములు పితృక్రి

తే. యలకు; శౌచ మక్రోధ మవ్యగ్రభావ । మర్హములు శుక్లపక్ష పూర్వాహ్ణ యుగ్మ
దివస జన్మదినములు నిందితము లాజ్య । ముద్గ పాయసాపూపముల్ ముఖ్యకోటి. 202

ప్రతిపదార్థం: అనినన్ = గౌరి అడుగగా; ఆ సర్వజ్ఞుఁడు = సమస్త మెరింగిన శివుడు; ఆ+దేవికిన్ = ఆ గిరిసుతకు; ఇట్లు+అనున్ = ఇట్లా వచించాడు; ఉగ్మలి = చెలీ!; గయ, కురుక్షేత్రంబున్, గంగ; ఆది+అగు = మొదలైన; పుణ్యదేశంబులు = పవిత్రప్రదేశాలు; అతి ఫలదంబులు = మిక్కిలి ఫలాన్నిచ్చే చోట్లు; మాఘ, భాద్రపద+ఆఖ్య+మాసములు = మాఘము, భాద్రపదము అనే పేర్లుగల నెలలూ; బహుళపక్షము = కృష్ణపక్షం (అమావాస్యకు ముందటి పాడ్యమి విదియ మొదలైన పదునాల్గు తిథులు - వెరసి పదిహేను రోజుల కాలం); అపర+అహణము = మధ్యాహ్నమునకు పైబడినకాలం; అమవస= అమావాస్య; ద్వాదశి నవములు = ద్వాదశి, నవమి అనే తిథులు; పరఁగు తుష్టిన్ = ఒప్పిదమైన సంతృప్తిని, మిక్కిలి సంతృప్తిని; పితృదేవతలకున్; ఇచ్చున్ = ఇస్తాయి; కుతప = కుతపకాలం అనగా పగలు పదునెన్మిది గడియలకు పైబడిన కాలం; దౌహిత్ర = కూతురు యొక్క కొడుకు; తిలలు = నువ్వులు; నితాంత పవిత్రములు = మిక్కిలి పవిత్రమైనట్టివి; పితృక్రియలకున్ = శ్రాద్ధాది పితృక్రియలకు; శౌచము = పరిశుద్ధత; అక్రోధము = కోపం లేకుండటం అనగా క్రోధరాహిత్యం; అవ్యగ్రభావము = కలత చెందని హృదయం, ఆందోళన చెందకుండుట; అర్హములు = యుక్తములు, తగినట్టివి; శుక్లపక్ష = శుక్లపక్షం; పూర్వ+అహ్న = మధ్యాహ్నమునకు ముందటికాలం; యుగ్మదివస = సరిదినాలు; జన్మదినములు = పుట్టినరోజులు; నిందితములు = తగని రోజులు; ఆజ్య = నేయి; ముద్గ = పెసలు; పాయస = పరమాన్నం; అపూపముల్ = పిండివంటలు; ముఖ్యకోటి = ప్రధానమైన పదార్థాల సమూహం.

తాత్పర్యం: అని అంబిక అడుగగా సర్వవిదుడైన శంభుడు ఆమెతో ఇట్లన్నాడు. సఖీ! గయ, కురుక్షేత్రం, గంగ మున్నగు పవిత్ర ప్రదేశాలు పితృకర్మలకు మిక్కిలి ఫలప్రదాలు. మాఘభాద్రపద మాసాలూ, బహుళపక్షం, అపరాహ్ణ సమయం, అమావాస్య, ద్వాదశి, నవమి అనే తిథులు పితృదేవతలకు మిక్కిలి సంతృప్తినిస్తాయి. కుతపకాలం, దౌహిత్రుడు, నువ్వులు పితృకర్మలకు మిక్కిలి అర్హములు. శ్రాద్ధాదులు జరుపునప్పుడు శుచిత్వం, కోపరాహిత్యం, వ్యాకులపాటు చెందకుండటం ఆవశ్యకాలు. శుక్లపక్షం (పూర్ణిమతో చేరిన పాడ్యమి, విదియ మొదలైన పదునైదు తిథుల కాలం), పూర్వాహ్ణం (మధ్యాహ్నమునకు ముందటి కాలం), సరిదినాలు, పుట్టిన రోజులు పితృకర్మలకు యోగ్యములు కావు. నెయ్యి, పెసరపప్పు, పరమాన్నం, పిండివంటలు (మినుప వడలు, అప్పాలు, నువ్వుల ఉండలు) శ్రాద్ధాదులలో ముఖ్యపదార్థాలు.

విశేషం: పక్షం = పదిహేను రోజుల కాలం. నెలకు రెండు పక్షాలు. మొదటిది శుక్లపక్షం. రెండవది బహుళ పక్షం లేక కృష్ణ పక్షం. పాడ్యమి విదియ తదియ మొదలైన పదునాల్గు తిథుల తర్వాత వచ్చేది పూర్ణిమ లేక పున్నమ. ఇది శుక్ల పక్షం, లేక సిత పక్షం, పాడ్యమి విదియ ఇత్యాది తిథుల తర్వాత వచ్చే అమావాస్యతో కలిపి పదిహేనురోజులు బహుళపక్షం లేక కృష్ణ పక్షం.

హిందూ కాలమాన ప్రకారం రోజుకు 60 గడియలు. గడియకు 60 విగడియలు; గడియ అనగా 24 నిమిషముల కాలం. విగడియ 24 సెకండ్ల సమయం.

కుతపము: పగటిప్రొద్దు పదిహేను భాగాలలో ఎనిమిదవ భాగం కుతపకాలం. ఉదయం 11గం.36 నిమిషాల తర్వాత 48 నిమిషాలు అనగా 12గం.24 నిమిషాల సమయం కుతపకాలం. ఈ కాలం పితరులకు ప్రశస్త పుణ్యకాలం. ఈ కుతపకాలానికి ముందు పితృదేవతలకు పిండ ప్రదానాదులు చేయరాదు.

క. శ్రోత్రియు లరోగు లవికల। గాత్రులు పాత్రములు పైతృకములకు సచ్చా
రిత్రత్వము ముఖ్యంబు స। గోత్రు మృతకళత్రు నన్యకులుఁ గొన రతివా! 203

ప్రతిపదార్థం: అతివా! = రమణీ!; పైతృకములకున్ = శ్రాద్ధాదులకు, ఆబ్దికాలకు, తద్దినాలకు; శ్రోత్రియులు = వేదం చదివినవారూ; అరోగులు = రోగాలు లేని వాళ్ళూ; అవికలగాత్రులు = అంగవైకల్యం లేని వాళ్ళూ; పాత్రములు = అర్హులు, తగినవారు, యోగ్యులు; సత్+చారిత్రత్వము = మంచినడవడి; ముఖ్యంబు = ప్రధానం, ఆవశ్యకం; సగోత్రున్ = తన గోత్రం వాడినీ, మృతకళత్రున్ = భార్య చనిపోయిన వాడినీ; అన్యకులున్ = ఇతరకులస్థుడినీ; కొనరు = అంగీకరించరు, నిమంత్రించరు.

తాత్పర్యం: దేవీ! శ్రాద్ధాదులందు నిమంత్రించటానికి వేదం చదివినవారూ, రోగాలు లేనివారూ, అంగవైకల్యం కలుగని వారూ అర్హులు. వీరందరూ మంచి నడవడి గలవారై ఉండాలి. తన గోత్రం వాడూ, భార్య మరణించిన వాడూ, ఇతర కులస్థుడూ తద్దినాలలో నిమంత్రణకు పనికిరాడు.

ఆ. గంధపుష్పమాలికా ధూపదీప వ। స్త్రముల నర్చ లిచ్చి తగఁగ భోజ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నములు నిర్వహించి క్రమవృత్తిఁ బిండప్ర । దానవిధి యొనర్చు టేను మెత్తు.' **204**

ప్రతిపదార్థం: గంధ = చందనం; పుష్పమాలికా = పూలదండలు; ధూప = సాంబ్రాణి పొగ; దీప = దీపం; వస్త్రములన్ = క్రొత్త బట్టలు మున్నగు వాటిచేత; అర్చలు+ఇచ్చి = పూజలు చేసి; తగన్+కన్ = చక్కగా, ఒప్పిదంగా; భోజనములు నిర్వహించి = అన్నపానీయాలిచ్చి; క్రమవృత్తిన్ = స్వాములు సంతృప్తిగ భుజించిన మీదట; పిండప్రదాన విధి = పితరులకు పిండాలు పెట్టేపని; ఏను = నేను; మెత్తున్ = శ్లాఘిస్తాను.

తాత్పర్యం: ఆబ్దికంలో నిమంత్రితులైన వారిని గంధం, పూలమాలలు, ధూపం, దీపం, వస్త్రాలు మొదలైన వాటితో పూజించి శ్రద్ధాభక్తులతో వారికి భోజనాలు పెట్టి సంతుష్టులను చెయ్యాలి. ఆ పిదప శాస్త్ర విధి ననుసరించి పితరులకు పిండ ప్రదాన మొసగటం కాత్యాయనీ! నేను ఎంతో మెచ్చుకుంటాను.'

వ. అని యెఱింగించిన మేనకాత్మజ మృడునితో నిట్లనియె. **205**

ప్రతిపదార్థం: అని; ఎఱింగించినన్ = శివుడు చెప్పగా; మేనకా+ఆత్మజ = హిమవంతుడి పత్ని అయిన మేనకాదేవి యొక్క కూతురైన అంబిక; మృడునితోన్ = శివుడితో; ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నది.

తాత్పర్యం: శివు డట్లా చెప్పగా విని మేనకాదేవి పుత్రి అయిన ఉమ శంభుడితో ఇట్లా అన్నది.

క. 'మృతిఁ బొంది పునర్జన్మము । నతర్క్యగుణ జంతుకోటి యప్పుడ పొందుం
బితృపూజన మని యెవ్వరి । కితవుగఁ జేయుదురు దీని నెఱిఁగింపు శివా!' **206**

ప్రతిపదార్థం: శివా! = ఈశ్వరా! అతర్క్యగుణ = ఊహించనలవిగాని గుణాలు కలిగిన; జంతుకోటి = ప్రాణిసమూహం; మృతిన్+పొంది = మరణించి; పునః+జన్మము = మరొకపుట్టుక; అప్పుడు+అ = వెంటనే; పొందున్ = పొందుతుంది; (అట్లాంటప్పుడు); పితృపూజనము+అని = పితరులకు పూజ అంటూ; ఎవ్వరికిన్ = మరెవ్వరికి; ఇతవుగన్ = ప్రీతిగా; చేయుదురు? = చేస్తారు?; దీనిన్ = ఈ విషయమును; ఎఱిఁగింపు = నాకు తెల్పవలసినది.

తాత్పర్యం: 'పరమేశ్వరా! ఊహించటానికి అలవిగాని గుణాలుగల ప్రాణికోట్లు తమతమ కర్మఫలాలు అనుభవించటానికి చచ్చి మరల వెంటనే జన్మిస్తున్నాయి. అట్లాంటప్పుడు ఎవరి ప్రీతి కొరకు జనులు పితృపూజ సల్పుతున్నారో అనగా శ్రాద్ధాది కర్మలు నిర్వహిస్తున్నారో నాకు తెల్పండి.'

ఆ. అనుడు నచటనున్న మునిజను లెల్లను । నగతనూజ నాత్మఁ బొగడి యభవుఁ
డిచ్చు నుత్తరంబు నేర్పడ విను వేడ్క । గదురనుండి రపుడు కంసదమన! **207**

ప్రతిపదార్థం: అనుడున్ = అని గౌరి అడుగగా; అచటన్+ఉన్న = అక్కడ వేంచేసి ఉన్నట్టి; మునిజనులు+ఎల్లను = మునీశ్వరులందరూ; అగతనూజన్ = పర్వతపుత్రిని; (అగము, నగము = కొండ); పొగడి = కొనియాడి; అభవుఁడు = శంకరుడు; ఇచ్చు+ఉత్తరంబున్ = చెప్పునట్టి ప్రతివచనాన్ని; ఏర్పడన్ = విశదంగా; వినువేడ్క = ఆలకించవలెననే కోరిక; అపుడు = ఆ సమయాన; కదురన్ = కలుగగా; కంసదమన! = కంసు నణంచిన శ్రీకృష్ణా!; ఉండిరి = వేచి ఉన్నారు,

ఎదురుచూస్తున్నారు.'

తాత్పర్యం: అని గౌరీదేవి అడుగగా, అక్కడున్న మునీశ్వరులంతా గిరిపుత్రిని ప్రశంసించి 'శంకరుడు ఆమె మాటల కేమి బదులిస్తాడో వినవలెనన్న కుతూహలంతో ఉన్నారు శ్రీకృష్ణా! (అని నారదుడు వాసుదేవుడితో అన్నాడు).

సీ. అంబిక కిట్లను హరుఁడు 'సందేహింపఁ । దగునది యిది గుహ్యతమము వినుము
దివిజు లట్టుల పితృదేవతలును; దేవ । బృంద ముత్తరదిశఁ బితృచయంబు
దక్షిణ దిశ నుండుఁ; దత్పూజనంబులు । వరుసన హవ్యకవ్యంబు లండ్రు;
చచ్చినవారికి శ్రాద్ధంబు సేయఁగా । నా పితృ సంఘంబు హర్ష మొంది

తే. యాయువును శ్రీయుఁ గీర్తియు నాదియైన । యైహికంబులు సుగతియు నాదరమునఁ
గర్త కొసఁగు సురాసుర గరుడ యక్ష । తతులకును బూజనీయంబు పితృగణంబు.' 208

ప్రతిపదార్థం: హరుఁడు = శంభుడు; అంబికకున్ = ఆ మహాదేవికి; ఇట్లు+అనున్ = ఇట్లన్నాడు; ఇది = ఇపుడు నీవు నన్నడిగిన విషయం; సందేహింపన్+తగునది = సంశయింపదగినదే. ఇది = ఈ సంగతి; గుహ్యతమము = పరమ రహస్యమైనది. వినుము = చెప్పుతాను ఆలకించుము; పితృదేవతలును = పితృదేవతలు కూడ; దివిజుల+అట్టులు+అ = దేవతల వంటివారే; దేవబృందము = వేల్పులసమూహం; ఉత్తరదిశన్ = ఉత్తరపుదిక్కులో; పితృచయంబు = పితృదేవతలగుంపు; దక్షిణదిశన్+ఉండున్ = దక్షిణపుదిక్కులో ఉంటుంది; తత్+పూజనంబులు = దేవతలయొక్క, పితృదేవతల యొక్క అర్చనలు; వరుసన్+అ = వరుసగా; హవ్యకవ్యంబులు+అండ్రు = హవ్యము, కవ్యము అని అంటారు; చచ్చినవారికిన్ = మరణించిన వారికి; శ్రాద్ధంబు చేయన్+కాన్ = తద్దినం పెడితే; ఆ పితృసంఘంబు = ఆ పితృదేవతల యొక్క సమాజం; హర్షము+ఒంది = సంతోషం పొంది; ఆయువును = ఆయుష్యమూ; శ్రీయున్ = సంపదనూ; కీర్తియున్+ఆది+ఐన = యశస్సూ మొదలైన; ఐహికంబులు = ఇహలోక సుఖాలు; సుగతియున్ = సద్గతినీ, పరలోకమునూ; ఆదరమునన్ = అభిలాషతో, ప్రీతితో; కర్తకున్ = యజమానుడికి; ఒసఁగున్ = అనుగ్రహిస్తారు; పితృగణంబు = పితృదేవతల యొక్క సముదాయం; సుర+అసుర = దేవదానవుల యొక్క; గరుడ = గరుడుల యొక్క, యక్ష = యక్షులయొక్క; తతులకునున్ = సమూహాలకునూ; పూజనీయంబు = పూజించదగినది.

తాత్పర్యం: పరమేశ్వరుడు పార్వతితో ఇట్లా అన్నాడు. 'సతీ! నీ వడిగిన విషయం నిజంగా సందేహాస్పదమైనదే. ఇది అతిరహస్య విషయం. చెప్పుతాను వినుము. పితృదేవతలు కూడ దేవతలవంటి వారే. దేవతలు ఉత్తరపు దిక్కులో ఉంటారు. పితృదేవతలు దక్షిణ దిశలో ఉంటారు. దేవతా పూజనానికి హవ్యమని, పితృదేవతా పూజకు కవ్యమని పేళ్ళు. చనిపోయిన వారికి శ్రాద్ధం పెట్టినట్లయితే పితృదేవతా సమాజాలు సంతోషపడి ఆ యజమానుడికి చిరాయుష్యం, ఐశ్వర్యం, యశస్సు మొదలైన ఇహలోక సుఖాలు ప్రసాదిస్తారు. ఆదరంతో సద్గతులు కూడా కలిగిస్తారు. పితృదేవతా సమూహం దేవ దానవ గరుడ యక్ష సమూహానికి గూడ పూజింప దగినవారే సుమా!'

వ. అని నిర్దేశించి వెండియు. 209

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ (ఇట్లా అన్నాడు)

క. 'తమ తమ సారములకుఁ దగఁ । గమలాక్షీ! చేయుదాన కల్పనల విశే
షము లొక్క రూపయగుఁ ద । త్ప్రమాణ రూపణము చేసి పలికెదఁ దెలియన్. 210

ప్రతిపదార్థం: కమల+అక్షీ! = పద్మాలవంటి లోచనములు కలదానా!; తమ తమ సారములకున్ = తమ తమ శక్తులకు, యోగ్యతలకు; తగన్ = అర్హమైనట్లు, తగినట్లు; చేయు = సల్పునట్టి; దాన కల్పనల విశేషములు = దాన రచనయందలి విశేషాలు; ఒక్క రూపు+అ+అగున్ = ఫలప్రదాన విషయంలో సమానములై ఉన్నవి; తత్+ప్రమాణ రూపణముచేసి = ఆయాదానముల యొక్క పరిమితులను బట్టి యథార్థస్థితి ఎట్లాంటిదో నిర్వచించి; తెలియన్+పలికెదన్ = నీకు తెలిసేటట్లు చెప్పుతాను.

తాత్పర్యం: "తామరరేకులవంటి నేత్రములుగల పార్వతీ! తమతమ శక్తికి తగినట్లు చేసే దానవిశేషాలన్నీ సమానంగానే ఉంటాయి. ఆయాదానాల, వాటి ఫలితాల ప్రమాణాలను నిర్వచించి తెలిసేట్లు చెప్తాను."

క. విను మొక కుంచెడు ధాన్యము । తన కాయతి గల్గు నతఁడు దాని నొసఁగినన్
ధనకోటి గల్గువాఁ డ । ద్ధన మొసఁగిన నొక్కరూప తత్తత్ఫలముల్. 211

ప్రతిపదార్థం: వినుము = పార్వతీ! ఆలకించుము; తనకున్ = తనకు; ఒక కుంచెడు ధాన్యము = నాలుగుమానికలు లేదా నాలుగు ముంతల గింజలు; ఆయతి = ఆదాయం, రాబడి; కల్గు+అతఁడు = కలిగినట్టి వాడు; దానిన్ = ఆ నాలుగు ముంతల గింజలను; ఒసఁగినన్ = ఒకడికి దానం చేసినా; ధనకోటి = కోటి రొక్కం, కోటిరూపాయలు; కల్గువాఁడు = ఉన్నవాడు; ఆ+ధనము = ఆ ద్రవ్యమంతా; ఒసఁగినన్ = సమర్పణ చేసినా; తత్+తత్+ఫలముల్ = ఆ నాల్గుముంతలు గింజ లిచ్చిన వాడికీ, ఈ కోటిరూపాయల విత్తం ఇచ్చిన వాడికీ లభించే ఫలాలు; ఒక్క రూపు+అ = సరి సమానాలే సుమా!

తాత్పర్యం:. గౌరీ! వినుము. కుంచెడు ధాన్యం రాబడి గలవాడు ఆ కుంచెడు గింజలు దానమొనర్చినా, కోటికి పడగెత్తినవాడు ఆ కోటి రూపాయలు దానమిచ్చినా కలిగే ఫలం మాత్రం సమానమే. దాన పరిమాణమును బట్టి ఫలపరిమాణ ముండదు. శక్తి ననుసరించి చేసే దానాలు దాతకు సమాన ఫలితాలిస్తాయని తాత్పర్యం.

క. పరుషత్వము లే కంతః । కరణంబున శుద్ధి చాలఁ గలిగి ప్రియము పాం
పిరివోవఁ జేత దానము । పరమోత్కృష్టంబు పద్మపత్రనిభాక్షీ!' 212

ప్రతిపదార్థం: పద్మపత్రనిభ+అక్షీ! = తామరరేకులతో సమానములైన కన్నులు కలదానా!; పరుషత్వము లేక = కాఠిన్యం లేక; అంతఃకరణంబున శుద్ధి = మనస్సునందు పరిశుద్ధత, నైర్మల్యం; చాలన్ = మిక్కిలి; కలిగి = ఉండి; ప్రియము = ఇష్టం, సంతోషం; పాంపిరి+పోవన్ = అతిశయించగా; దానము చేఁత = దాన మొనర్చుట; పరమ+ఉత్కృష్టము = మిక్కిలి ఉత్తమం.

తాత్పర్యం: కమల పత్రాలవంటి కన్నులు కలదానా! కాఠిన్యం లేకుండా మిక్కిలి చిత్తశుద్ధితో సంతోష పూర్వకంగా చేసే దానం అత్యుత్తమం.'

క. అని చెప్పి 'కొన్ని ధర్మము । లనఘా! యెఱిఁగింతు నీకు నవధానముతో
విను' మని పలికి శివుం డి । ట్లను విశదము గాఁగఁ గూర్చి యంబుజనాభా! 213

ప్రతిపదార్థం: అని చెప్పి = అని వచించి; శివుండు = పరమేశ్వరుడు; అనఘా! = ఓ దోషరహితురాలా, పుణ్యాత్మురాలా, గౌరీ!; కొన్ని ధర్మములు = మరికొన్ని ధార్మిక విషయాలు; నీకున్ = నీకు; ఎఱిఁగింతున్ = తెలుపుతాను; అవధానముతోన్ = ఏకాగ్రతతో, శ్రద్ధతో; వినుము; అని పలికి; విశదము కాఁగన్ = తేటతెల్లమయ్యేటట్లు, స్పష్టమయ్యేటట్లు; కూర్చి = ఆ ధర్మముల నుద్దేశించి, గురించి; ఇట్లు+అనున్ = ఇట్లా అన్నాడు; కమలనాభా! = పద్మము నాభియందుగల శ్రీకృష్ణా!

తాత్పర్యం: అని వచించి పరమేశ్వరుడు శాంభవితో 'ఓ పుణ్యురాలా! నీకు మరికొన్ని ధర్మాలు తెలియజెప్పుతాను. ఏకాగ్రచిత్తంతో ఆలకించు'మంటూ విస్పష్టంగా చెప్పినాడు శ్రీకృష్ణా! (అని నారదుడు శ్రీకృష్ణుడిని సంబోధించి ఈశ్వరుడు గౌరికి చెప్పిన ధర్మాలు తెలిపాడు).

చ. 'తెవుళులు గొన్నవారి కవి దీఱుట కౌషధ మీగి, దుర్గతుల్
దవులు జనాలిఁ బ్రోపు, సుపథంబుగఁ దైర్థిక కోటిఁ దన్పు, బాం
ధవ రహితత్వ దీనశవ దాహము, దుఃఖితులైన వారిఁ దే
ర్ప వెరవు, నోర్పుఁ గల్మియును బ్రస్తుతి కెక్కిన మేటి ధర్మముల్.' 214

ప్రతిపదార్థం: తెవుళులు+కొన్నవారికిన్ = జబ్బుపడినవాళ్ళకు; అవి+తీఱుటకున్ = ఆ రోగాలు కుదరటానికి, మానడానికి; ఔషధము+ఈగి = మందునివ్వటం; దుర్గతుల్+తవులు = దుఃస్థితిలో ఉన్న, కష్టాల పాలైన, కడగండ్లలో చిక్కిన; జన+ఆలిన్ = జనుల యొక్క సమూహాన్ని; ప్రోపు = కాపాడటం, సంరక్షించటం; సుపథంబుగన్ = మంచిదారిగా; తైర్థిక కోటిన్ = తీర్థయాత్రా పరుల బృందాన్ని; తన్పు = తృప్తి నొందించటం; బాంధవరహితత్వ = చుట్టాలు లేనందున; దీన = దిక్కుమాలినట్టి, అనాథగానున్న; శవదాహమున్ = పీనుగును కాల్చటం; దుఃఖితులు+ఐనవారిన్ = దుఃఖము పొందుతున్నవాళ్ళను; తేర్పన్ = ఓదార్చుటకు; వెరవున్ = ఉపాయం; ఓర్పు+కల్మియున్ = సహనం కలిగి ఉండటం; ప్రస్తుతికిన్+ఎక్కిన = పొగడ్తగాంచిన; మేటిధర్మముల్ = గొప్పధర్మాలు, ఉత్తమధర్మాలు.

తాత్పర్యం: 'వ్యాధులతో బాధపడేవారికి ఆ రోగాలు మానటానికి మందులివ్వటం, దుఃస్థితిలో ఉన్నవాళ్ళను ఆదుకొనటం, తీర్థయాత్రాపరులను మంచిమార్గంలో సంతృప్తి పరచటం (అన్నపానములిచ్చి, ఆశ్రయం సమకూర్చి), చుట్టపక్కాలు లేనట్టి అనాథప్రేతకు దహనక్రియ జరపటం, దుఃఖాలపాలైన వారిని ఆ దుఃఖాల నుండి ఉద్ధరించే ఉపాయం ఆలోచించటం, ఓర్పు కలిగి ఉండటం గణన కెక్కిన ఉత్తమ ధర్మాలు.'

వ. అని పలికినఁ బార్వతీదేవి పరమప్రియంబు నొంది. 215

తాత్పర్యం: అని శివుడు చెప్పగా ఉమాదేవి మిక్కిలి సంతోషపడి.

శివుఁడు పార్వతికి ధర్మవిశేషంబుల తెఱం గెఱింగించుట. (సం.13. ఆను 1-16-3630).

సీ. 'ధర్మంబు నానావిధంబులఁ బరఁగు నం; ద్రవి యెఱిఁగింపవే' యనుడు హరుఁడు
'వితతంబులగు శ్రుతి స్మృతులచేఁ జెప్పఁగాఁ । బడిన తెఱంగులు పడఁతి! వినుము

జాతి ధర్మములు, దేశజ ధర్మములుఁ, గుల । ధర్మంబులును, గణ ధర్మములును,
గాయంబు వికృతులఁ గాలపర్యయముల । వచ్చు నాపద్ధర్మ వర్తనములు

ఆ. గాఁగ నిట్లు ధర్మగతు లైదు గల వని । చెప్పుటయును గౌరి శివునితోడఁ
'బుణ్యలోక కలిత భోగంబు లెట్లుండు?' । ననిన నిట్టు లనియె హరుఁడు గృష్ణ! 216

ప్రతిపదార్థం: ధర్మంబు = ఇహపర సుఖాలు కలిగించటానికి కారణమైన ధర్మం; నానా విధంబులన్ = అనేకరీతుల; పరఁగున్+అంద్రు = ఒప్పుతుందని చెప్పుతారు; అవి = ఆ ధర్మాలను; ఎఱిఁగింపవు+ఏ = తెలుపుమా; అనుడున్ = అని గిరిజ వేడగా; హరుఁడు = శంకరుడు; వితతంబులు+అగు = విస్తారములైన, విరివి అయిన; శ్రుతి స్మృతులచేన్ = వేదాల చేతనూ, ధర్మశాస్త్రాలచేతనూ; చెప్పన్+కాన్+పడిన = చెప్పబడినట్టి; తెఱంగులు = విధములు; పడఁతి! = ఓ ప్రాణేశ్వరీ, ఓ తరుణీ!; వినుము = ఆలించుము; జాతిధర్మములున్ = బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే జాతుల యొక్క ఆచారాలు; దేశజ ధర్మములున్ = ఆయాదేశములందు కలిగిన, పాటించునట్టి ధర్మాలు; కులధర్మంబులును = ఆయాఇండ్లవారికి తండ్రి తాత ముత్తాతల నుండి వాడుక పడిన ధర్మాలు; గణధర్మములును = జనసముదాయం అనుసరించే సామాన్యధర్మాలు; కాయంబు వికృతులన్ = శరీరము యొక్క మార్పులచేతను (బాల్య యౌవన కౌమార వార్ధక్య లక్షణాల చేత); కాలపర్యయములన్ = కాలము యొక్క మార్పులచేతను; వచ్చు = సంభవించు, కలుగునట్టి; ఆపత్+ధర్మవర్తనములు = విపత్కాలంలో అనుసరణీయాలైన ధర్మాలు; కాఁగన్ = అనగా; ఇట్లు = ఈ ప్రకారం; ధర్మగతులు = ధర్మము యొక్క తీరులు; ఐదు కలవు = ఐదున్నవి; అని, చెప్పుటయును = పరమశివుడు నుడువగా; గౌరి; శివునితోడన్ = శంకరుడితో; పుణ్యలోకకలితభోగంబులు = ఉత్తమ లోకాలందలి సుఖాలు; ఎట్లు+ఉండున్+అనినన్ = ఎట్లా ఉంటాయని అడుగగా; హరుఁడు = ఈశ్వరుడు; ఇట్టులు+అనియెన్+కృష్ణ! = శ్రీకృష్ణా! ఇట్లా అన్నాడు. (అని నారదుడు దేవకీనందనుడితో నుడివాడు).

తాత్పర్యం: 'ప్రాణేశ్వరా! ధర్మం పలువిధాలుగా ఉంటుందని అంటారు. ఆ ధర్మస్వరూపం ఎట్లాంటిదో నాకు వివరిస్తారా' అని పార్వతి వేడగా పరమేశ్వరుడు 'దేవీ! విరివిగా ఉన్న వేదాలలో, ధర్మశాస్త్రాలలో ధర్మస్వరూపం వ్యాఖ్యానించబడింది. విశదీకరిస్తాను. వినుము. బ్రాహ్మణక్షత్రియవైశ్య శూద్రులనే నాలుగు వర్ణాలవారు అనుసరించే ధర్మమూ, ఆయాదేశాలలో పాటించబడే ధర్మమూ, ఒకే జాతివారైనా వేర్వేరు ఇండ్లవారు తమ తండ్రి తాత ముత్తాతల నుంచి వాడుక చొప్పున అనుష్ఠించే ధర్మమూ (కులధర్మం), మంది అనుసరించే సామాన్య ధర్మమూ, శరీరస్థితిని బట్టి, కాలము యొక్క మార్పులను బట్టి అవలంబించే ఆపద్ధర్మమూ అని ధర్మం ఐదు విధాలు అని పినాకపాణి వచించాడు. ఆ మాటలు విని శర్వాణి శర్వుడితో 'ప్రభూ! పుణ్యజగాలలో సుఖానుభవాలు ఎట్లా ఉంటాయి?' అని అడిగింది. అందుకు అభవుడు ఇట్లా అంటున్నాడు కృష్ణా! (అని నారద మహర్షి మహేశ్వరుడు గౌరితో అన్నమాటలు వినిపించాడు).

సీ. 'ఎల్లపుష్పంబులు నెక్కాలమును దద్ద । విలసిల్లుఁ; గల్పక వృక్షజనిత
మనులేప; మాహార మమృత; మంబరములు । నిత్యామలినములు; నిరుపమాన
భంగి దీప్తంబు లాభరణముల్; వాన ర । మించుచు నన్యోన్యమిత్రభావ
మొప్పంగ మేనుల యొప్పును మనముల । మార్దవంబును గుణమాన్యతలును

తే. గలిగి పురుషులుఁ గాంతలుఁ గామహర్ష । లీల లెసఁగఁ గ్రోధాదులు లేక రుజయు
జరయు నెఱుఁగక నలిఁ జరింతురు దివంబు । నందు సంతత నిర్భరానంద మొంద.' 217

ప్రతిపదార్థం: ఎల్లపుష్పంబులున్ = సమస్తములైన పువ్వులు; ఏ+కాలమును = అన్ని కాలములందును, పన్నెండు మాసాలలోనూ, ఆరు ఋతువులలోనూ; తద్ద = మిక్కిలి; విలసిల్లున్ = ప్రకాశిస్తాయి; కల్పకవృక్షజనితము = కల్పతరువుల నుండి కలిగినట్టిది (నిర్యాసం, జిగురు, బంక); అనులేపము = (మైపూత) ఒడలికి పూసికొనే పరిమళ ద్రవ్యం; ఆహారము = తినేతిండి; అమృతము = సుధ; అంబరములు = కట్టుకునే బట్టలు; నిత్య+అమలినములు = ఎల్లప్పుడూ మురికి లేనటువంటివి; ఆభరణముల్ = ధరించే నగలు, సొమ్ములు, రవణములు; నిర్+ఉపమానభంగిన్ = పోలికలేని విధంగా, సాటిలేనట్లుగా; దీప్తంబులు = ప్రకాశించునట్టివి; వానన్ = మీద నుడివిన వాటితో; రమించుచున్ = ఆనందిస్తూ; అన్యోన్యమిత్రభావము = పరస్పరస్నేహం; ఒప్పంగన్ = విలసిల్లగా; మేనుల = శరీరాల యొక్క; ఒప్పును = చక్కదనమూ, సౌందర్యమూ; మనముల మార్దవంబును = హృదయాల యొక్క మెత్తదనమూ; గుణమాన్యతలును = సద్గుణాలయొక్క యోగ్యతలూ; కలిగి = లభించిన వారై; పురుషులున్ = మగవారూ; కాంతలున్ = ఆడువారు; కామహర్షలీలలు+ఎసఁగన్ = కోర్కెలు తీరినందున ఆనంద విలాసాలొప్పగా; క్రోధ+ఆదులు లేక = కోపం మొదలైన దుర్గుణాలు కలుగక; రుజయున్ = రోగమూ; జరయున్ = ముసలితనమూ; ఎఱుఁగక = తెలియక; నలిన్ = ప్రేమతో, అనురాగంతో; దివంబు+అందున్ = స్వర్గంలో; సంతత = ఎడతెగని; నిర్భర+ఆనందము+ఒందన్ = అపరిమితమైన హర్షం కలుగగా; చరింతురు = వర్తిస్తారు, సంచరిస్తారు.

తాత్పర్యం: 'స్వర్గలోకంలో అన్నిరకాల పువ్వులు అన్ని కాలాలలో ప్రకాశిస్తుంటాయి. అక్కడ మగవారూ, ఆడువారూ కల్పతరువుల నుండి లభించే పరిమళద్రవ్యం తమశరీరాలకు పూసికొంటారు. అమృతమే వారికి ఆహారం. ఎప్పుడూ మాయని ఉడుపులు తాలుస్తారు. సాటిలేక వెలుగొందే సొమ్ములు ధరిస్తారు. పరస్పర మైత్రితో, మేని అందచందాలతో, మనసుల మెత్తందనాలతో, సద్గుణాలయోగ్యతలతో వారు ఒప్పారుతుంటారు. యథేచ్ఛగా సుఖాలలో తేలుతుంటారు. వారికి క్రోధాది దుర్గుణాలు లేవు. రోగాలు లేవు; ముసలితనం లేదు. వారు నిత్యయౌవనమూర్తులు. ఎల్లప్పుడు పట్టరానంత ఆనంద పారవశ్యంతో వారు స్వర్గంలో హాయిగా విహరిస్తుంటారు.'

వ. అనిన విని హైమవతి 'సుగతి దుర్గతులకుఁ జనం గలవారిం జూచి వీ రిట్టివారని నిశ్చయింపవచ్చుట రామి
యెఱింగింపు' మనవుడు మృడుండు విను మని యిట్లనియె. 218

ప్రతిపదార్థం: అనినన్ విని = అని శంభుడు చెప్పగా ఆలకించి; హైమవతి = హిమవంతుడి పుత్రిక పార్వతి; సుగతి దుర్గతులకున్ = స్వర్గనరకాలకు; చనన్+కలవారిన్ = పోదగిన వాళ్ళను, చూచి = కనుగొని; వీరు+ఇట్టివారు+అని = వీళ్ళు ఇట్లాంటి వాళ్ళని; నిశ్చయింపన్ = నిర్ణయించుటకు; వచ్చుట; రామి = సాధ్యాసాధ్యములు, శక్యాశక్యములు; ఎఱింగింపుము = తెల్పుము; అనవుడున్ = అని అడుగగా; మృడుండు = ఈశ్వరుడు; వినుము; అని ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని శివుడు చెప్పగా పార్వతి 'స్వర్గనరకాలకు పొయ్యేవాళ్ళు వీళ్ళని జనాలను చూచి నిర్ణయించటం శక్యమగునా? కాదా? చెప్పు' మని అడిగింది. అందుకు ఆయన ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. 'జనులకుఁ గీడు రోయక యజస్రము ధర్మరతిం జరించి స
జ్జన గురు పూజనంబులును సత్యహితోక్తులు దీనపోషణం
బును నతిథిప్రియత్వమును భూరిదయార్ద్రతయుం గలట్టి వా
రనిమిషలోకగాములని యాత్మ నెఱుంగుము మేనకాత్మజా! 219

ప్రతిపదార్థం: మేనకా+ఆత్మజా! = మేనకాదేవి కుమారీ!; జనులకున్ = నరులకు; కీడు+రోయక = హాని తలపెట్టక, అపకృతిగావించక; అజస్రము = ఎల్లప్పుడు; ధర్మరతిన్ = ధర్మమందలి ఆసక్తితో, ప్రీతితో; చరించి = మెలగి; సత్+జన = సత్పురుషుల యొక్క; గురు = ఒజ్జల యొక్క; పూజనంబులును = పూజించుటలు; సత్యహిత+ఉక్తులు = యథార్థమైనవీ, మేలుగలిగించేవి అయినట్టి మాటలు; దీనపోషణంబును = దరిద్రులను వృద్ధికి తెచ్చుట; అతిథి ప్రియత్వమును = అతిథుల యందు ఆదరణము; భూరిదయా+ఆర్ద్రతయున్ = మిక్కుటమైన దయారసం చేత తడియుటయు; కల+అట్టివారు = కలిగినటువంటి జనులు; అనిమిషలోకగాములు+అని = స్వర్గలోకానికి వెళ్ళేవారని; ఆత్మన్ = మదిలో; ఎఱుంగుము = తెలియుము.

తాత్పర్యం: 'ఓ మేనకాదేవి తనయా! మనుష్యులకు అపకారం తలపెట్టని వారూ, ఎల్లవేళల ధర్మమందే ఆసక్తిగలవారూ, సత్పురుషులనూ గురువులనూ పూజించే వారూ, సత్యముగనూ, హితముగనూ మాట్లాడేవారూ, పేదలను పోషించేవారూ, అతిథులను ఆదరించేవారూ, అధిక కరుణా రసముచే చెమ్మగిల్లిన హృదయం కలవారూ అయిన నరులు స్వర్గలోకానికి వెళ్ళేవారని గ్రహించుము.

చ. పరుసని పల్కు బొంకులగు పల్కులు నన్యధనాభిలాషముం
బరవనితా విలోలతయు బాంధవ సజ్జన విప్రియంబు దు
శ్చరితులతోడిమైత్రియును సంతత ధర్మరతాభ్యసూయయుం
గరినిభయాన! ఘోరనరకంబున కేఁగెడి వారి చిహ్నముల్.' 220

ప్రతిపదార్థం: కరినిభయాన! = ఏనుగు నడకతో సమానమైన నడక గలదానా!; పరుసనిపల్కు = కఠినపు వాక్కు; బొంకులు+అగుపల్కులు = అబద్ధపు మాటలు; అన్యధన+అభిలాషమున్ = ఇతరుల విత్తమునందు కోరిక; పరవనితా విలోలతయున్ = పరాయిస్త్రీ యందు మిక్కిలి ఆశ; బాంధవ = చుట్టాలయందు; సత్+జన = సత్పురుషుల యందు; విప్రియంబు = ఇష్టం లేకుండటం; దుస్+చరితుల తోడి మైత్రియును = చెడు నడవడి గలవారితో చెలిమి; సంతత ధర్మరత = ఎల్లప్పుడు ధర్మమునందు ఆసక్తి గలవారియందు; అభ్యసూయయున్ = మిక్కిలి దోషారోపణబుద్ధి లేదా కోపం, (అనేవి); ఘోర = భయంకరమైన; నరకంబునకున్ = నరకలోకానికి; ఏగెడి వారిచిహ్నముల్ = వెళ్ళేవారి యొక్క గుర్తులు, లక్షణాలు.

తాత్పర్యం: గజగమనంవంటి గమనం గల శైలజా! కఠినంగా మాట్లాడటం, అబద్ధాలు చెప్పటం, పరులధనాన్ని అపేక్షించటం, పరస్త్రీలను వాంఛించటం, బంధువులయందు, సత్పురుషులయందు ద్వేషం వహించటం, చెడునడవడిగల వారితో స్నేహం చెయ్యటం, ధర్మమందు శ్రద్ధగలవారియెడల అసూయవహించటం అనేవి భయంకర నరకం పాలయ్యే వారి లక్షణాలు, గుర్తులు.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అని చెప్పిన విని హిమగిరి । తనయ వృషధ్వజుని తోడ 'ధర్మంబులు పె
క్కనుపమమూర్తీ! పరమం । బనఁ జాలెడు ధర్మ మెద్ది యన్నిటిలోనన్. 221

ప్రతిపదార్థం: అని చెప్పినన్ = అని శివుడు నుడువగా; విని; హిమగిరితనయ = హిమవత్పర్వత పుత్రిక; వృషధ్వజుని తోడన్ = శివుడితో; అనుపమమూర్తీ! = సాటిలేని స్వరూపము గలవాడా!; ధర్మంబులు = ధర్మాలు; పెక్కు = అనేకం; పరమంబు+అనన్ +చాలెడు = శ్రేష్ఠము అని చెప్పడానికి తగిన; ధర్మము = అభ్యుదయ శ్రేయస్సాధనమైన కృత్యం; అన్నిటిలోనన్ = అన్నింటిలో; ఎద్ది? = ఏది?

తాత్పర్యం: అని పరమశివుడు పలుకగా విని పరమేశ్వరి ఆ వృషభకేతనుడితో 'సాటిలేని స్వరూపంగల స్వామీ! ధర్మాలు ఎన్నో ఉన్నాయి. అన్నింటిలో ఉత్తమోత్తమమైన ధర్మం ఏది?

వ. చెప్పు మనిన న ప్పరమేశ్వరుం డిట్లనియె. 222

తాత్పర్యం: తెలుపుమని అడుగగా సర్వేశ్వరు డిట్లా అన్నాడు.

క. 'రమణీ! వర్గత్రయ ధ । ర్మము లిచ్చు సుఖములు దుఃఖమయము లచిరముల్
గమనాగమకరములు ని । త్యమహాసౌఖ్యంబు మోక్షధర్మం బిచ్చున్. 223

ప్రతిపదార్థం: రమణీ! = సుందరీ!; వర్గత్రయధర్మములు = ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాల వలన లభించే పుణ్యాలు; ఇచ్చు సుఖములు = ఇచ్చునట్టి సౌఖ్యాలు; దుఃఖమయములు = దుఃఖరూపాలు; అచిరముల్ = శాశ్వతములు కానివి; గమన+ఆగమ+కరములు = రాకపోకలను కలుగజేసేవి; మోక్షధర్మంబు = చతుర్విధ పురుషార్థాలలో నాల్గవదైన మోక్షధర్మం; నిత్యమహా సౌఖ్యంబున్ = శాశ్వతమైన గొప్ప సుఖాన్ని; ఇచ్చున్ = ప్రసాదిస్తుంది.

తాత్పర్యం: 'గౌరీ! ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలవలన లభించే సుఖాలు చివరకు దుఃఖమయాలు, అశాశ్వతాలు. వస్తూ పోతూ ఉంటాయే కాని నిలుకడగా ఉండేవి కావు. నాల్గవపురుషార్థమైన మోక్షధర్మం మాత్రం శాశ్వతమైన మహానందాన్ని ప్రసాదిస్తుంది.

విశేషం: వర్గత్రయం-త్రివర్గం. అనగా ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలు. మోక్షం నాల్గవ పురుషార్థం. సాధించదగినది అదే. శబ్దస్పర్శరూపరసగంధాలనే విషయాలతో త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములనే జ్ఞానేంద్రియ పంచకానికి కల సంబంధములే మాత్రా స్పర్శలు. ఇవి సుఖదుఃఖాది ద్వంద్వాలను కలుగజేస్తాయి. సుఖదుఃఖాదు లన్నీ వస్తూ పోతూ ఉండేవే తప్ప శాశ్వతంగా ఉండేవి కావు. అట్టి ద్వంద్వాలను సహించుమని శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించాడు.

> "మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః,
> ఆగమాపాయినోఽ నిత్యాః తాంస్తితిక్షస్వ భారత." (భగ. 2-14) అని.

సీ. కావున విను త్రివర్గంబుకంటెను మేలు । దలపోయ మోక్షంబు; దానిఁ బడయు
తెఱఁ గెఱింగించెదఁ దెఱవ! గృహస్థ ధ । ర్మంబున నిల్చి ఋణంబు లెల్లఁ

బాచి వనమునకుఁ బరమశాంతత నేఁగి । సద్గురుముఖమున సాంఖ్యయోగ
విదుఁ డగునది; పంచవింశతి జ్ఞానంబు । సాంఖ్యంబు, ధర్మనిశ్చలత యోగ;

తే. **మాసమాచారయుగళ మేకాధి కరణ । మస్ఖలితముగ మది నది యలవరించి**
ధ్యానపరుఁ డయి శీతోష్ణ హర్ష శోక । ముఖములగు వివిధ ద్వంద్వములఁ దొఱంగి. **224**

ప్రతిపదార్థం: కావునన్ = కాబట్టి; త్రివర్గంబుకంటెను = ధర్మార్థకామముల కంటె; తలపోయన్ = ఆలోచించగా; మోక్షంబు = నాల్గవ పురుషార్థమైన ముక్తి; మేలు = ఉత్తమం; దానిన్ = ఆ మోక్షాన్ని; పడయు తెఱఁగు = పొందేవిధం; ఎఱింగించెదన్ = తెలుపుతాను; తెఱవ! = ఓ కాంతా!; విను = ఆకర్ణించుము; గృహస్థధర్మంబునన్+నిల్చి = గృహస్థాశ్రమ ధర్మం అవలంబించి; ఋణంబులు+ఎల్లన్ = దేవ ఋణము, పితృ ఋణము, ఋషి ఋణము అనే మూడింటితో పాటు నాల్గవదైన మనుష్య ఋణమును; పాచి = తొలగించి; వనమునకున్ = అడవికి; పరమశాంతతన్ = మిక్కిలి నెమ్మదితో; ఏఁగి = వెళ్ళి; సద్+గురుముఖమునన్ = మంచి ఆచార్యుడి వలన; సాంఖ్యయోగ విదుఁడు = సాంఖ్యయోగం ఎరిగినవాడు; అగునది = కావాలి; పంచవింశతి జ్ఞానంబు = ఇరువదైదుతత్త్వాల యెఱుక; సాంఖ్యంబు = సాంఖ్యమని చెప్పబడుతున్నది; ధర్మనిశ్చలత = ధర్మమందు చలించకుండుట లేదా నిలుకడ; యోగము = యోగమని పిలువబడుతున్నది; ఆ సమాచారయుగళము = సాంఖ్యయోగము, కర్మయోగము అనేవి రెండు; ఏక+అధికరణము = ఒకే ఆధారముగా గలవి; అది = దానిని, మదిన్ = మనస్సులో; అలవరించి = అభ్యసించి, సమకూర్చి; ధ్యానపరుఁడు+అయి = ధ్యానమందు ఆసక్తి కలవాడై; శీత+ఉష్ణ, హర్షశోకముఖములు+అగు = శీతోష్ణములు, సుఖదుఃఖాలు మున్నగు; వివిధ ద్వంద్వములన్ = పలురకాలైన ద్వంద్వాలను, తొఱంగి = వీడి, విడిచి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: గౌరీ! ధర్మార్థకామములనే మూడు పురుషార్థముల కంటె ఆలోచించగా నాల్గవ పురుషార్థమైన మోక్షమే శ్రేష్ఠమైనది. దానిని పొందే విధం వివరిస్తాను వినుము. మానవుడు గార్హస్థ్యం స్వీకరించి దేవఋణాన్ని యజ్ఞయాగాదుల చేతనూ, ఋషిఋణాన్ని వేదపాఠం చేతనూ, పితృఋణాన్ని శ్రాద్ధతర్పణాదుల చేతనూ, మనుష్యఋణాన్ని ఆతిథ్యం చేతనూ తీర్చి, పరమశాంతుడై అరణ్యాలకు వెళ్ళవలె. యోగ్యుడగు గురువువలన సాంఖ్యయోగాన్ని గురించి తెలిసికొనవలె. సాంఖ్యయోగమంటే ఇరువదైదుతత్త్వముల ఎరుకయే. ధర్మమందు చలించక నిలవడమే యోగమని చెప్పబడుతుంది. సాంఖ్యమూ, యోగమూ ఇవి రెండున్నూ ఏకాశ్రయాలే. మనసులో ఈ రెంటినీ జారుపాటు లేకుండా నిలుపుకొని ధ్యానపరుడయి శీతోష్ణసుఖదుఃఖాది ద్వంద్వాల నుండి విముక్తుడు కావాలి. అనగా ద్వంద్వాలను జయించాలి.

విశేషం: సంఖ్య అంటే జ్ఞానం. జ్ఞానం వలన నిశ్చయించబడే ఆత్మతత్త్వానికే సాంఖ్యమని పేరు.
సంఖ్యకు సంబంధించినది కావడం వలన కూడా సాంఖ్య యోగం.

"భూతాని చ కవర్గేణ చవర్గేణేంద్రియాణి చ
టవర్గేణ తవర్గేణ జ్ఞానగంధాదయ స్తథా
మనః పకారేణైవోక్తం ఫకారేణ త్వహంకృతిః
బకారేణ భకారేణ మహాన్ ప్రకృతి రుచ్యతే
ఆత్మా తు స మకారోఽయం పంచవింశః ప్రకీర్తితః."

కఖగఘఙ - అను కవర్గం చేత - పృథివి, జలం, తేజస్సు, వాయువు, ఆకాశం అనే పంచభూతాలు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చఛజఝఞ - అను చవర్గం చేత - వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ అనే పంచకర్మేంద్రియాలు;
టఠడఢణ - అనే టవర్గం చేత - త్వక్, చక్షు, శ్రోత్ర, జిహ్వ, ఘ్రాణములనే పంచజ్ఞానేంద్రియాలు;
తథదధన - అనే తవర్గం చేత - శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు అనే పంచతన్మాత్రలు;

పకారము చేత మనస్సు, ఫకారము చేత అహంకారం, బకారము చేత మహత్తు, భకారము చేత ప్రకృతి, మకారము చేత ఇరువదైదవతత్త్వమైన జీవాత్మ గ్రహించబడుతుంది - ఇది పంచవింశతితత్త్వాత్మకమైన సృష్టి వ్యవస్థ.

"సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః
ఏక మప్యాస్థితస్సమ్యక్ ఉభయో ర్విందతే ఫలమ్." (భగ. 5-4)

కర్మయోగ జ్ఞానయోగాలు పరస్పరం భిన్నములని అల్పజ్ఞులు భావిస్తారు. కాని, వీటిల్లో ఏది అనుష్ఠించినా ఆత్మదర్శన ప్రాప్తి అవుతుంది.

"య త్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే,
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి." (భగ. 5-5)

ఆత్మదర్శనానికి సాధనభూతములైన జ్ఞాన కర్మయోగాలకు భేదం లేదని గుర్తించిన వారే పండితులు- అని భారతంలో మరోచోట దీనికి ఉపోద్బలకంగా చెప్పబడింది.

ఉ. శౌచము బ్రహ్మచర్యమును శాంతియు లఘ్వశనంబునై యిళం
జూచుచు నంతరాత్మ నెడసొచ్చిన విఘ్నవిశేషమున్ ధృతిం
ద్రోచుచు భక్తియుక్తికి గురుండు ప్రమోదమయుండు గాఁగఁ ద
ద్గోచరతం జరింపఁగ నకుంఠిత మోక్షసుఖంబు చొప్పడున్. 225

ప్రతిపదార్థం: శౌచమున్ = శుచిత్వమూ, పరిశుద్ధత; బ్రహ్మచర్యమును = బ్రహ్మచర్యమనేవ్రతమూ; శాంతియున్ = అంతరింద్రియనిగ్రహం, మనో నిగ్రహం; లఘు+అశనంబున్+ఐ = మితాహారస్వీకారం కలిగి; ఇళన్ = ఇళ అనేనాడి ద్వారా; అంతరాత్మన్ = జీవుడిని; చూచుచున్ = కనుగొంటూ; ఎడ+చొచ్చిన = నడుమ ప్రవేశించిన; విఘ్నవిశేషమున్ = అంతరాయ పరంపరను, ఆటంకాలను; ధృతిన్ = ధైర్యంతో; త్రోచుచున్ = నెట్టివేస్తూ, తొలగించుకొంటూ; భక్తియుక్తికిన్ = తాను భక్తి భావంతో కూడి ఉండటానికి; గురుండు = తన ఆచార్యుడు; ప్రమోదమయుండు+కాఁగన్ = సంతోషభరితుడు కాగా; తద్+గోచరతన్ = ఆ గురుడి దృష్టికి గోచరమయ్యేటట్లు; చరింపఁగన్ = మెలగితే; అకుంఠిత = మొక్కవోవని; మోక్షసుఖంబు = మోక్షానందం; చొప్పడున్ (చొప్పు+పడున్) = లభిస్తుంది, సమకూడుతుంది.

తాత్పర్యం: పరిశుద్ధత, బ్రహ్మచర్యవ్రతం, అంతరింద్రియ నిగ్రహం, మితమైన ఆహారస్వీకారం కలిగి ఇళానాడి ద్వారా ఆత్మను అవలోకిస్తూ నడుమ నడుమ సంభవించే విఘ్నపరంపరను ధైర్యంతో తొలగదోస్తూ, తన భక్తి భావనకు గురుడు సంతసించగా, అతడి పర్యవేక్షణలో మెలగటం వలన మొక్కవోని మోక్షానందం లభిస్తుంది.

తే. అది సదాభ్యాసకలన నత్యంతనిర్మ । లంబు నవ్యయమును నచలంబు ఘనము
నై జరావ్యాధి మరణ జన్మాది దుఃఖ । బహుళ సంసార చక్రంబుఁ బాపనేర్చు.' 226

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అది = ఆ మోక్షధర్మం; సదా+అభ్యాస కలనన్ = నిరంతరం అభ్యాసం చేయటం వలన; అతి+అంత+నిర్మలమున్ = మిక్కిలి స్వచ్ఛమైనదీ; అవ్యయమునున్ = తరుగనిదీ; అచలంబున్ = చలింపనిదీ; ఘనమున్ = దొడ్డదీ; ఐ = అయి; జరా = ముసలితనం, వార్థక్యం; వ్యాధి = రోగం, మరణ = చావు, మృతి; జన్మ = పుట్టుక, జననం; ఆది = మొదలైన; దుఃఖబహుళ = దుఃఖాలచేత నిబిడమైన, సాంద్రమైన, దట్టమైన; సంసార చక్రంబున్ = పరిభ్రమణశీలమైన సంసారమండలం నుండి; పాపన్+నేర్చున్ = తొలగించగలదు.

తాత్పర్యం: అంబికా! మోక్షధర్మం నిరంతరాభ్యాసంవలన మిక్కిలి నిర్మలమైనది. తరుగనిది, చలించనిది; దొడ్డది. అది ముసలితనం, రోగం, జననం, మరణం మొదలైన దుఃఖాలతో నిండిన సంసారచక్రంలో జీవి చిక్కకుండ చేయగలదు.

వ. అని యుపదేశించి వెండియు. 227

తాత్పర్యం: అని పరమశివుడు గౌరికి బోధించి మరలా ఇట్లా అన్నాడు.

క. 'విను సంసారమునకు విసు । వని మర్త్యుఁడు శోకమోహ వశగతుఁడై మో
క్షనిరూఢిఁ బడయ నేరఁడు । మనము విరక్తముగ విసివి మఱి ముక్తి గనున్. 228

ప్రతిపదార్థం: విను = గౌరీ! ఆలకించుము; సంసారమునకున్ = జనన మరణరూపమైన సంసారానికి; విసువని = విసుగుచెందని; ఛీయని రోయని; మర్త్యుఁడు = మనుజుడు; శోకమోహవశగతుఁడు+ఐ = శోకమునకూ, వ్యామోహమునకూ అధీనుడై; మోక్షనిరూఢిన్ = ముక్తి వలన ప్రసిద్ధిని, మోక్షసంపదను; పడయన్+నేరఁడు= పొందలేడు; మనము = తన మనస్సు; విరక్తముగన్ = ప్రాపంచిక విషయములందు అపేక్షలేనిదౌతూ; విసివి = వేసట చెంది, నిర్వేదము పొంది; మఱి = ఆవల; ముక్తిన్+కనున్ = మోక్షాన్ని పొందుతాడు.

తాత్పర్యం: 'దేవీ! సంసారమందు విరక్తి చెందని మనిషి శోకమోహాలకు అధీనుడై ముక్తిని పొందలేడు. తన మనసు ప్రాపంచిక విషయా లనుభవించి, అనుభవించి విసిగి వేసారి విరక్తి పొందినపుడే మోక్షాన్ని పొందగలడు.

వ. అట్టిదశ చింతా వివర్జనంబునను, భూతాస్థిరత్వ జ్ఞానంబునను, దృష్ణారాహిత్యంబునను గాని కలుగదు గావున వాని భంగులు ప్రకటించెద. 229

ప్రతిపదార్థం: అట్టిదశ = వైరాగ్యం; చింతా వివర్జనంబుననున్ = చింతను వదలుట చేతనూ, భూత+అస్థిరత్వ జ్ఞానంబుననున్ = ప్రాణికోట్లు శాశ్వతంగా ఉండవనే వివేకం వలననూ; తృష్ణారాహిత్యంబుననున్ = ఆశను వీడుట చేతనూ; కాని = తప్ప; కలుగదు = సంభవించదు; కావునన్ = కనుక; వాని భంగులు = వాటి తీరులు; ప్రకటించెదన్ = వెల్లడిస్తాను, చాటుతాను.

తాత్పర్యం: గిరిజా! సంసార వైరాగ్యం అనేది చింతను మానడం వలన, భూతములు శాశ్వతములు కావు అనే వివేకం వలన, ఆశను వీడటం వలనగాని కలుగదు. కనుక ఆ మూటి స్వరూప మెట్లాంటిదో వివరిస్తాను. సావధానచిత్తవై ఆకర్ణించుము.

సీ. ధనములు చెడిన బాంధవులు సచ్చినఁ దదీ । యములగు గుణముల యందు మనసు
వెట్టక యున్నది యెట్టన్న వగచినఁ । దాపంబు వొందుట దక్క నొండు

గలుగునే సుఖము దుఃఖంబును దోడివ । యవి మార్చి వచ్చుచు నరుగుచుండుఁ
గేవల సుఖము లే దా వాసవునకైనఁ । జేటు దృశ్యములకు సిద్ధ మగుట

తే. మున్న కనియున్న వగ చిత్తమున జనింప । దరయఁ గీడు పరిగ్రహ మది సమగ్ర
మైనతఁడు పొత్తినూలి ప్రువ్వట్ల తాన । తనకు బంధంబు గావించికొను లతాంగి! 230

ప్రతిపదార్థం: లతా+అంగి! = తీగవంటి మేను గలదానా!; ధనములు చెడినన్ = విత్తం నశించినా; బాంధవులు = చుట్టాలు; చచ్చినన్ = మరణించినా; తదీయములు+అగు = ఆ బాంధవులకు సంబంధించిన; గుణములయందున్ = సత్స్వభావములందు; మనసు = చిత్తమును; పెట్టక+ఉన్న+అది = నిలుపకుండా ఉండాలి (పోయిన చుట్టాలను స్మరిస్తూ ఉండకూడదు); ఎట్టు+అన్నన్ = ఎందుకంటే; వగచినన్ = వారికై దుఃఖిస్తే; తాపంబు+పొందుట+తక్కన్ = వేదన చెందటమే తప్ప, బాధ పడటమే తప్ప; ఒండు+కలుగును+ఏ = మరొక్క ప్రయోజనమున్నదా?; సుఖము = సౌఖ్యమూ; దుఃఖంబును = శోకమూ; తోడివి+అ = వెంటనుండేవే; అవి = ఆ హర్షశోకాలు, మోదఖేదాలు; మార్చి = ఒకదాని తర్వాత మరొక్కటిగా, వచ్చుచున్+అరుగుచున్+ఉండున్ = వస్తూ పోతూ ఉంటాయి; ఆ వాసవునకున్+ఐనన్ = ఆ దేవేంద్రుడికైనా; కేవల సుఖములేదు = అచ్చంగా సుఖమే కలగటం లేదు; దృశ్యములకున్ = కంటికి కనపడేవాటికెల్ల; చేటు = వినాశం; సిద్ధము+అగుట = నిర్ణయించబడి ఉండటం; మున్న = ముందే; కని+ఉన్నన్ = తెలిసి ఉంటే; చిత్తమునన్ = మనసులో; వగ = దుఃఖం; జనింపదు = పుట్టదు; అరయన్ = ఆలోచిస్తే; పరిగ్రహము = ఇతరులనుండి స్వీకరించటం; కీడు = హాని; అది సమగ్రము+ఐనన్= అది పూర్ణమైతే; అతఁడు = దానం గైకొన్నవాడు; పొత్తినూలిప్రువ్వు+అట్లు+అ = పట్టుకాయలోని పురుగుమాదిరి; తనకున్+తాను+అ = తనకు తానే; బంధంబు+కావించికొనున్ = కట్టిపడవేసికొంటాడు.

తాత్పర్యం: మహాదేవీ! ధనం పోయినా, చుట్టాలు చనిపోయినా, వారి గుణాలు తలచుకొని మనసున చింతించకుండటం మంచిది. ఎందుకనగా అట్లా దుఃఖించడం వలన తన శరీరానికి బాధతప్ప మరో ప్రయోజనం లేదు. సుఖదుఃఖాలు జంట బాయనివి. అవి ఒక దాని తర్వాత మరొకటిగా వస్తూ పోతూ ఉంటాయి. దేవేంద్రునంతటి వాడుకూడా సుఖం మాత్రమే పొందటం లేదు. దుఃఖం గూడ అనుభవిస్తున్నాడు. దృగ్గోచరములైన పదార్థము లన్నింటికీ వినాశం తప్పదు అన్న విషయం తెలిస్తే మనసులో దుఃఖం కలుగదు. పరులవలన వస్తువులు స్వీకరించటం హానికరం. పరిగ్రహమే వృత్తిగా పెట్టుకొన్నవాడు పట్టుకాయలోని పురుగు తన దారాలతో తన్ను బంధించుకొని చెడునట్లు చెడిపోతాడు.

విశేషం: అలం: పొత్తినూలి ప్రువ్వట్లు అనుచోట ఉపమాలంకారం.

ఆ. విను ధనార్జనంబు ధనరక్షణంబు ధ । నవ్యయంబు ధనవినాశనముఁ బ్ర
గాఢ దుఃఖదములు గావున దుఃఖభా । జనము ధనము గాల్చు మనఁగ వలయు. 231

ప్రతిపదార్థం: విను = ఆలకించుము; ధన+ఆర్జనంబు = ద్రవ్యం సంపాదించటం; ధనరక్షణంబు = ఆర్జించిన విత్తాన్ని కాపాడటం; ధనవ్యయంబున్ = డబ్బును వెచ్చించటం; ధనవినాశనమున్ = సొమ్ముపోవటం; ప్రగాఢ దుఃఖదములు = అత్యంత దుఃఖాన్ని కలిగిస్తాయి. కావునన్ = కాబట్టి; ధనము = సొత్తు; దుఃఖభాజనము = దుఃఖానికి పాత్రం; కాల్చుము+అనఁగన్+వలయున్ = అట్టి డబ్బును తగులబెట్టుమని చెప్పవలె.

తాత్పర్యం: దేవీ! శ్రద్ధగా వినుము. ధనం సంపాదించటం, కాపాడటం, వ్యయపరచటం, నాశనం కావటం అన్నవి తీవ్రదుఃఖాన్ని కలిగిస్తాయి. కనుక ఇన్ని దుఃఖాలకు మూలమైన డబ్బును తగులబెట్టుమని చెప్పటం యుక్తం.

క. రమణీ! తృష్ణాసమ దుః । ఖమును బరిత్యాగ సమ సుఖముఁ గలవే? కా
యము ముదిసిన ముదియదు ప్రా । ణము గొని పోఁజాలు తెవులనం జనుఁ దృష్ణన్. 232

ప్రతిపదార్థం: రమణీ! = ఓ అంగనామణీ!; తృష్ణా సమదుఃఖమును = ఆశతో సమానమైన దుఃఖం; పరిత్యాగ సమసుఖమున్ = ఆశను వీడటంతో సమానమైన సుఖం; కలవు+ఏ? = ఉన్నవా? లేవని భావం; కాయము = శరీరం, ముదిసినన్ = ముసలితనం పొందినా; ముదియదు = ఆశ మాత్రం ముసలితనం పొందదు; తృష్ణన్ = ఆశను; ప్రాణము = ఊపిరిని; కొనిపోవన్+చాలు = తీసికొని వెళ్ళేశక్తి కలిగిన; తెవులు = వ్యాధి; అనన్+చనున్ = అని చెప్పవచ్చు.

తాత్పర్యం: శైలజా! అశతో సమానమైన దుఃఖం, ఆశను వదలటంతో సమానమైన సుఖం లేనే లేవు. ఆశ అనేది మనుష్యుడి శరీరం ముదిమిని పొందినా తాను మాత్రం ముదిమిని పొందదు. ఆశను ప్రాణాలు తీయగల ఘోరరోగం అని చెప్పవచ్చును.

క. కామములు భోగములఁ దెగు । నే? మెలఁతుక! నేత నాఱునే చిచ్చు ధృతిం
గామములఁ దొఱఁగు సౌఖ్యము । నేమెయి సౌఖ్యములుఁ బోలునే యరయంగన్. 233

ప్రతిపదార్థం: మెలఁతుక! = ఓ వనితారత్నమా!; కామములు = కోరికలు, విషయతృష్ణలు; భోగములన్ = అనుభవించటం వలన; తెగును+ఏ? = నశించునా? నశించవని భావం; చిచ్చు = అగ్ని; నేతన్ = నేతితో, ఆజ్యంతో; ఆఱును+ఏ? = చల్లారునా? అరయంగన్ = పరికించగా, భావించగా, ఆలోచించగా; ధృతిన్ = ధైర్యంతో; కామములన్ = వాంఛలను; తొఱఁగు సౌఖ్యమున్ = వీడుటవలన లభించే సుఖాన్ని; ఏ+మెయిన్ = ఏ విధంగానూ; సౌఖ్యములు = సుఖాలు; పోలును+ఏ? = సరిపోలగలవా? సాటి కాజాలవని తాత్పర్యం.

తాత్పర్యం: ఉమా! కోరిక లెప్పుడూ అనుభవించటం చేత తీరనే తీరవు. ఆజ్యధారలవలన అగ్ని చల్లారదు. చల్లారకపోగా అంతకంతకూ హెచ్చుతుంది. ధైర్యంతో ఆశలు త్యజించటం వలన లభించే సౌఖ్యానికి ఏ విధంగాను సుఖాలు దీటుకాలేవు.

విశేషం: "న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి,
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే." (శ్రీమద్భాగవతమ్. 9-19-14.)

అనుభవిస్తూ ఉంటే కామం ఎన్నటికీ శమించదు. అగ్నిలో నెయ్యి వేసిన చందంగా అది వృద్ధి చెందుతూనే ఉంటుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. విచ్చలవిడి నింద్రియముల । నెచ్చటికైనను జనంగనిచ్చిన నరకం
బచ్చువఱుచుఁ; గుదియించినఁ । దెచ్చు సుగతి నరున కది సతీమౌళిమణీ! 234

ప్రతిపదార్థం: సతీమౌళిమణీ! = ఓ పతివ్రతా శిరోరత్నమా!; ఇంద్రియములన్ = కన్ను ముక్కు చెవి మొదలుగా గల ఇంద్రియాలను; విచ్చల విడిన్ = స్వేచ్ఛగా, నిరాటంకంగా; ఎచ్చటికిన్+ఐనమున్ = వాటి ఇష్టం వచ్చిన తావుకు; చనన్+కన్+ఇచ్చినన్ = పోనిస్తే; నరకంబున్ = పాపమును; అచ్చు+పఱుచున్ = కలిగిస్తాయి; కుదియించినన్ = అణచివేస్తే, వశపరచుకుంటే; అది = ఆ యింద్రియ నిగ్రహం; నరునకున్ = మానవుడికి; సుగతిన్ = ఉత్తమగతిని, పుణ్యస్థితిని; తెచ్చున్ = కలుగజేస్తుంది.

తాత్పర్యం: ఓ సాధ్వీశిరోమణీ! ఇంద్రియాలను వాటి ఇష్టప్రకారం ఎచటికైనా పోనిస్తే అవి నరకాన్ని సమకూరుస్తాయి. అట్లా వాటిని స్వేచ్ఛా సంచారానికి అనుమతించక అణచివేస్తే (నిరోధిస్తే) అవి జనుడికి సద్గతి లభింపజేస్తాయి.

తే. కామరసమున నతితృష్ణుఁడై మనుష్యుఁ । డర్థతృష్ణా పరీతాంతరంగుఁ డైన
గొఱియ నడవిలో నెత్తెడు కోలుపులియుఁ । బోలె మృత్యు వాతనిఁ గొనిపోవు దేవి!' 235

ప్రతిపదార్థం: దేవి = ప్రియురాలా!; మనుష్యుఁడు = మానవుడు; కామరసమునన్ = కామమనెడు రుచిగల పదార్థమందు; అతితృష్ణుఁడు+ఐ = మిక్కిలి ఆశకలవాడై; అర్థతృష్ణాపరీత = ధనమందలి అశతో ఆవరించబడిన, ఆక్రమించబడిన; అంతరంగుఁడు+ఐనన్ = మనసుగల వాడైతే; అడవిలోన్ = అరణ్యంలో; గొఱియన్ = గొర్రెను; ఎత్తెడు = హరించునట్టి; కోలుపులియున్+ పోలెన్ = పెద్దపులిమాదిరి, బెబ్బులి వలె; మృత్యువు = మిత్తి; అతనిన్ = కామదాహం, ధనదాహం గలనరుడిని; కొనిపోవున్ = తీసికొని వెళ్ళుతుంది.

తాత్పర్యం: విషయాభిలాషతో, ధనాశతో నిండిన మనసుగల మానవుడిని అడవిలో గొర్రెను అపహరించే బెబ్బులి మాదిరి మృత్యువు తన వెంట కొనిపోతుంది.'

విశేషం: అలం: ఉపమ.

వ. అని పలికి 'జరామృత్యువులఁ ద్రోవం జాలు మేలెయ్యది యంటేనిఁ జెప్పెద నాకర్ణింపు' మనుపలుకు పలికి యిట్లనియె. 236

ప్రతిపదార్థం: అని పలికి = అని చెప్పి; జరామృత్యువులన్ = ముసలితనమును, మరణమును; త్రోవన్+చాలు = తరుమ గొట్టగల; మేలు = వరము, మంచి పని; ఏ+అది(ఎయ్యది) = ఏది; అంటి+ఏనిన్ = అన్నచో; చెప్పెదన్ = వచిస్తాను; ఆకర్ణింపుము = వినుము; అనుపలుకు = ఆనుమాట పలికి, ఇట్లు+అనియెన్ = శివుడు ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పరమేశ్వరుడు పార్వతి కట్లు వచించి 'ముసలితనమునూ, మరణాన్ని తరుమగొట్టగల క్షేమంకరమైన మంచిపని ఏది అని అడిగినచో చెప్పుతాను విను' మని ఇట్లా అన్నాడు.

తే. 'ధనములును దానములుఁ దపోధనము వాజి । పేయ రాజసూయంబులు వేయు నోపి
చేయుటలు గావు మోక్షదర్శిత్వ మొకఁడ । మందు జరకు మృత్యువునకు నిందువదన! **237**

ప్రతిపదార్థం: ఇందువదన! = జాబిలివంటి మోము గలదానా!; ధనములును = విత్తములు; దానములున్ = వితరణములు, ఈవులు; తపోధనమున్ = తపస్సనెడు ధనం, తపశ్చర్య; వాజిపేయ రాజ సూయంబులున్ = అశ్వమేధ రాజసూయాది యాగాలు; వేయున్ = వెయ్యి; ఓపి+చేయుటలు = సమర్థతతో సల్పుటలు; జరకున్ = ముదిమికీ; మృత్యువునకున్ = మిత్తికీ; మందు = నివారకమైన ఔషధం; కావు = కాజాలవు; మోక్షదర్శిత్వము+ఒకఁడు+అ = మోక్షమును దర్శించటమన్నది ఒక్కటే; మందు = జరామరణాలను మాన్పే ఔషధం.

తాత్పర్యం: 'చంద్రముఖీ! ధనాలు, దానాలు, తపస్సులు, అశ్వమేధ రాజసూయయాగాలు ఇవేవీ జరామరణాలను కలుగకుండా చేయలేవు. ముక్తి ఒక్కటే ముసలితనాన్నీ మరణాన్నీ మాన్పుటకు తగినమందని గ్రహించుము.

తే. జాములును దివసములు మాసములు నేండ్లు । నైన కాల మాయువుగొని యరుగుచుండు;
నెల్లి చేయుపనులు నేఁడ యింతి! మా పా । నర్చుపని రేప చేయుట నామతంబు. **238**

ప్రతిపదార్థం: ఇంతి! = ఓ పడతీ!; జాములును = యామములు; దివసములున్ = దినములు; మాసములున్ = నెలలు; ఏండ్లున్ = సంవత్సరాలు; ఐనకాలము = ఈ రీతిగా ఉన్న కాలం; ఆయువున్ = ఆయుస్సును; కొని = గ్రహించి; అరుగుచున్+ఉండున్ = పోతూ ఉంటుంది; ఎల్లి చేయుపనులు = రేపు చేసే కార్యాలు; నేఁడు+అ = ఈనాడే; మాపు+ఒనర్పుపని = సాయంకాలం చేసేపని; రేపు+అ = ఉదయమే; చేయుట = సల్పటం; నామతంబు = నా ఆశయం, నాపద్ధతి, నా కిష్టం.

తాత్పర్యం: తరుణీ! జాములు, దినములు, నెలలు, సంవత్సరాలు ఈ రూపంతో ఉన్నకాలం జీవుల ఆయుస్సును హరించుకొని ముందుకు సాగిపోతూ ఉంటుంది. రేపు చేసేపని ఈ రోజు, సాయంకాలం చేయవలసిన పని ఉదయమే చేయటం నాకిష్టం.

విశేషం: జాము అనగా యామం. ఏడున్నర గడియలకాలం ఒక జాము. జామునకు 3 గంటలు. పగలు నాల్గుజాములు, రేయి నాల్గుజాములు చేరితే ఒక రోజు. ఇరవైనాలుగు గంటలు.

తే. మేలు గడువేగ చేయరు కాలపాశ । బద్ధులై యేమఱుటఁజేసి పడఁతి! మనుజు
లింత యెఱుఁగుట సంసార మెడలఁద్రోచు । నట్టి విసువుటఁ బుట్టించునది హితంబు. **239**

ప్రతిపదార్థం: పడఁతి! = ఓ చెలువా!; మనుజులు = నరులు; కాలపాశబద్ధులు+ఐ = కాలమనే త్రాటిచేత బంధించబడిన వారై; ఏమఱుటన్+చేసి = పరాకు వహించటం వలన, జాగరూకులు కానందున, కాలప్రభావ మెట్టిదో మఱచినందున; మేలు = మంచిపని; కడువేగ = మిక్కిలి తొందరగా; చేయరు = ఆచరించరు; ఇంత+ ఎఱుఁగుట = కాలం ఆయుస్సును హరిస్తుందన్న విషయం గ్రహించటం; సంసారము = సంసారాన్ని; ఎడలన్+త్రోచునట్టి = తొలగించేటటువంటి; విసువుటన్ = విరక్తిని; పుట్టించున్ = జనింపచేస్తుంది; అది హితంబు = ఆ వైరాగ్యమే మేలు సమకూరుస్తుంది.

తాత్పర్యం: మనుష్యులు కాలాధీనులై ఏమరుపాటు వహించి మంచి పనులు మిక్కిలి తొందరగా చెయ్యరు. కాలం ఆయుస్సును హరిస్తుందన్న విషయం తెలిసికొనటంచేత సంసారమందు వైరాగ్యం కలుగుతుంది. ఆ విరక్తియే ముక్తికి సాధనమై మేలు చేకూరుస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: "అమానిత్వమదంభిత్వం అహింసా క్షాంతి రార్జవమ్,
ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మ వినిగ్రహః " (భగ. 13-8)

"ఇంద్రియార్థేషు వైరాగ్యం అనహంకార ఏవ చ,
జన్మమృత్యుజరావ్యాధి దుఃఖదోషానుదర్శనమ్.'' (భగ. 13-9)

"అసక్తి రనభిష్వంగః పుత్రదారగృహాదిషు,
నిత్యం చ సమచిత్తత్వం ఇష్టానిష్టోపపత్తిషు.'' (భగ. 13-10)

ఇట్లా అమానిత్వాది గుణసంపత్తి మోక్షసాధనంగా గీత నుడివింది. ఆ యీ విషయాలే ఇక్కడ ప్రశంసించబడ్డాయి.

వ. ఇవ్విధంబున. 240

తాత్పర్యం: ఈ ప్రకారంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఈ తెరువు లాదరింపఁగఁ । జేతోగతికిని విమర్శసిద్ధి యొదవుఁ ద
జ్జాత విరక్తియు ముక్తికి । నా తెరువ సమీపవర్తి యచలేంద్రసుతా! 241

ప్రతిపదార్థం: అచల+ఇంద్రసుతా! = శైలరాజపుత్రీ!; ఈ తెరువులు = ఈ మార్గాలు; ఆదరింపన్+కన్ = అంగీరించటం వలన, పాటించటం వలన; చేతోగతికిన్ = మనఃప్రవృత్తికి; విమర్శసిద్ధి = పరిశీలన శక్తి; ఒదవున్ = లభిస్తుంది; తత్+జాత = యుక్తాయుక్తపరిశీలనాశక్తివలన కలిగిన; విరక్తియున్ = వైరాగ్యం; ముక్తికిన్ = మోక్షానికి; ఆతెరువు+అ = ఆ దారియే; సమీపవర్తి = చేరువలో ఉన్నట్టిది.

తాత్పర్యం: పై నుడివిన మార్గా లనుసరిస్తే మనసునకు విమర్శనా పరిజ్ఞాన మేర్పడుతుంది. దాని వలన వైరాగ్యం సిద్ధిస్తుంది. ఆ విరక్తి మార్గమే ముక్తికి చేరువైన దారి.

క. వైరాగ్యంబు ప్రశాంతికిఁ । గారణము; ప్రశాంతి ముక్తిఁ గను; మోక్షానం
దారాము జరామృత్యువు । లేరూపునఁ జేర నేర విద్ధచరిత్రా!.' 242

ప్రతిపదార్థం: ఇద్ధ చరిత్రా! = ప్రకాశమానమైన నడవడికలదానా!; వైరాగ్యంబు = విషయవాంఛారాహిత్యం; ప్రశాంతికిన్ = మనోజయానికి; కారణము = హేతువు; ప్రశాంతి; ముక్తిన్ = మోక్షమును; కనున్ = దర్శిస్తుంది; మోక్ష+ఆనంద+ఆరామున్ = మోక్షానందమందు క్రీడించే వాడిని; జరామృత్యువులు = వార్ధకం, మరణం; ఏరూపునన్ = ఏ విధంగానైనా; చేరన్ నేరవు = సమీపించలేవు.

తాత్పర్యం: ఓ పవిత్ర చరిత్రురాలా! ప్రాపంచిక వస్తు వ్యామోహం లేనివాడికి మనోజయం సిద్ధిస్తుంది. దాని వలన ముక్తి లభిస్తుంది. జరామరణాలు మోక్షానందంలో తేలియాడే వాడి చెంతకు చేరలేవు.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అని చెప్పి మఱియు శివుఁ డి । ట్లను హిమగిరిసుతకు 'సాంఖ్య మమలినహృదయా!
విను వివరించెద; సంసృతి । యను రోగంబునకు వైద్య మది యరయంగన్. 243

ప్రతిపదార్థం: అని చెప్పి = అని పలికి; మఱియున్ = ఇంకనూ; శివుఁడు; హిమగిరి సుతకున్ = మంచుకొండ కొమార్తె అయిన అంబికకు; ఇట్లు+అనున్ = ఇట్లా అన్నాడు; అమలిన హృదయా! = నిర్మలమైన మనస్సుగల దేవీ!; సాంఖ్యమున్ = సాంఖ్యయోగాన్ని; వివరించెదన్ = వ్యాఖ్యానిస్తాను; విను = ఆకర్ణించుము; సంసృతి+అను = సంసారమనే; రోగంబునకున్ = వ్యాధికి; అది = సాంఖ్యము; వైద్యము = మందు, చికిత్స.

తాత్పర్యం: అని పలికి పరమేశ్వరుడు పార్వతితో మళ్ళీ ఇట్లా అన్నాడు. 'స్వచ్ఛమైన హృదయం గల గౌరీ! సాంఖ్యమును గూర్చి చెప్పుతాను వినుము. అది సంసారమనే రోగానికి తగిన మందు.

శివుఁడు పార్వతికి సాంఖ్యప్రకారంబు దెలుపుట. (సం.13 అను 1-15-4096).

ఆ. జ్ఞానమున విముక్తి సాంఖ్యులు పడయుదు । రరసిచూడఁగా నిరర్థకంబు
ఘోరతరము నండ్రు శారీరమైన త । పంబుఁ బంచ వింశ భజన మూఁది. 244

ప్రతిపదార్థం: సాంఖ్యులు = జ్ఞానమార్గం అనుసరించేవారు; జ్ఞానమునన్ = అధ్యాత్మ జ్ఞానంచేత; విముక్తిన్ = మోక్షాన్ని; పడయుదురు = పొందుతారు; పంచవింశభజనంబు+ఊఁది = ఇరువదైదవదైన ఆత్మ యొక్క సేవను ఎగురగొట్టి, మాని; శారీరము+ఐన+తపంబు = దేహసంబంధమైన తపస్సు; అరసిచూడఁగాన్ = పరామర్శిస్తే, పరిశీలిస్తే; నిర్+అర్థకమున్ = ప్రయోజన శూన్యం; ఘోరతరమున్ = మిక్కిలి దారుణం; అండ్రు = అని చెప్పుతారు.

తాత్పర్యం: సాంఖ్యమతావలంబులు జ్ఞానంవలన మోక్షం పొందుతారు. పరామర్శిస్తే ఆత్మను సేవించటం మాని శారీరకమైన తపస్సు చేయటంవలన ప్రయోజనం ఉండదు. అది పరమప్రయాసకరం కూడ అని చెప్పుతారు.

సీ. ప్రకృతి కవ్యక్తనామకమును గల; దందు । మహదహంకార తన్మాత్రలును మ
నము నింద్రియములు భూతములు జన్యములుగా । నోలిన యిరువది నాలు గయ్యెఁ;
బంచవింశక తత్త్వభావితక్షేత్ర మా । తత్త్వ సంతానంబు సత్త్వమును ర
జస్సుఁ దమస్సు నాఁ జను నిజగుణములఁ । బ్రకృతిదాఁ గరణ రూపములు గాఁగఁ

ఆ. గొని సృజించు లోకకోటి నయ్యవ్యక్త । మణువు నిత్య మేక మక్రియం బ
హైతుకంబు చక్షురాదుల కగ్రాహ్య । మది ప్రధాన మనఁగ నతిశయిల్లు. 245

ప్రతిపదార్థం: ప్రకృతికిన్ = ప్రకృతికి; అవ్యక్తనామకమును+కలదు = అవ్యక్త మనే పేరున్నూ ఉన్నది; అందున్ = ఆ అవ్యక్తమందుండి; మహత్ = మహత్తు; అహంకార = అహంకారం; తన్మాత్రలును = శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము అనేవి; మనమున్ = మనస్సు; ఇంద్రియములు = జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు మొత్తం పది; భూతములున్ = పంచభూతాలు అనగా పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము; జన్యములు+కాన్ = జనించగా; ఓలిన్ = క్రమంగా; ఇరువదినాలుగు+అయ్యెన్ = చతుర్వింశతి సంఖ్యగలవి అయ్యాయి; పంచవింశకతత్త్వ = ఇరువదైదవతత్త్వమైన ఆత్మచేత; భావిత = ఆదరించబడిన; క్షేత్రంబు = ప్రకృతి; ఆతత్త్వసంతానంబున్ = ఆ

యిరువది నాల్గుతత్త్వాల సముదాయాన్ని; సత్త్వమును = సత్త్వగుణమూ; రజస్సున్ = రజోగుణమూ; తమస్సున్ = తమోగుణమూ; నాన్ = అనగా; చను = ఒప్పునట్టి; నిజగుణములన్ = తన గుణాలతో; ప్రకృతి తాన్ = ఆ ప్రకృతి; కరణరూపములు కాఁగన్+కొని = కార్యసాధనములు కాగా గైకొని; లోకకోటిన్ = జీవరాసులను, భూతజాలమును; సృజించున్ = జనింపజేస్తుంది; ఆ+అవ్యక్తము = ఆ ప్రకృతి అనేది; అణువు = సూక్ష్మమైనది; నిత్యము = శాశ్వతము; ఏకము = ఒక్కటే, అద్వితీయం; అక్రియంబు = కార్యరూపం కానట్టిది; అహైతుకంబు = కారణం కానట్టిది; (ఆ ప్రకృతి కార్యకారణములకు అతీతమైనది); చక్షుః+ఆదులకున్ = కన్ను మొదలైన ఇంద్రియాలకు; అగ్రాహ్యము = గ్రహింపరానిది, గోచరము కానట్టిది; అది = ఆ ప్రకృతి; ప్రధానము+అనఁగన్ = ప్రధానమనే పేరుతో; అతిశయిల్లున్ = ఒప్పారుతుంది. (ప్రకృతికే అవ్యక్తమనీ, ప్రధానమనీ పేర్లు).

తాత్పర్యం: ప్రకృతికి అవ్యక్తమనే పేరు కూడా ఉన్నది. అందుండి మహత్తూ, అహంకారం, శబ్దాదులైదూ, మనస్సూ, జ్ఞానేంద్రియాలు ఐదూ, కర్మేంద్రియాలు ఐదూ, పంచభూతాలు జన్మించగా మొత్తం ఇరువది నాల్గుతత్త్వాలైనాయి. ఇరువదైదవతత్త్వం ఆత్మ. ఇట్టి ఆత్మకు స్థానమై ప్రకృతి నిజగుణాలైన సత్త్వరజస్తమస్సులను సాధనాలుగా గ్రహించి లోకాలను సృష్టిస్తుంది. అవ్యక్త మనేది ఎట్టిదనగా అది పరమాణువు. శాశ్వతం. ఏకం, కార్యరూపం కాదు; కారణరహితమైనట్టిది. అది ఇంద్రియాలకు గోచరించదు. ప్రధానమనే పేరుతో అది విలసిల్లుతుంది.

తే. సౌఖ్యతుష్టిప్రకాశముల్ సాత్త్వికములు । మోద ఖేదాదిక ద్వంద్వములు లతాంగి!
రాజసము లప్రకాశ సంత్రాస మోహ । ములును దంద్రయుఁ దామసములుగ నెఱుఁగు. 246

ప్రతిపదార్థం: లతా+అంగి! = తీగవంటి శరీరముగల దేవీ!; సౌఖ్యతుష్టి ప్రకాశముల్ = సుఖం, సంతృప్తి, పదార్థవిజ్ఞానం అనే గుణాలు; సాత్త్వికములు = సత్త్వమునకు సంబంధించినట్టివి; మోదఖేద = సంతోషం, దుఃఖం; ఆదిక = మొదలైన; ద్వంద్వములు = జంటలు; రాజసములు = రజోగుణ సంబంధులు; అప్రకాశ = జ్ఞానరాహిత్యం; సంత్రాస = భయం; మోహములు = విపరీతజ్ఞానం; తంద్రయున్ = సోమరితనం; తామసములుగన్ = తమోగుణప్రధానాలుగా; ఎఱుఁగు = తెలియుము.

తాత్పర్యం: సౌఖ్యం,సంతృప్తి,వివేకం సత్త్వగుణానికి సంబంధించిన లక్షణాలు. సంతోషం,దుఃఖం మొదలైన ద్వంద్వాలు రజోగుణ ప్రధానాలు; జ్ఞానరాహిత్యం, భీతి, విపరీతజ్ఞానం, సోమరితనం అనేవి తమోగుణ ప్రధానాలని గ్రహించుము.

విశేషం: "సత్త్వం రజ స్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః,
నిబధ్నంతి మహాబాహో! దేహే దేహిన మవ్యయమ్." (భగ. 14-5)

సత్త్వరజస్తమోగుణాలు ప్రకృతికి సహజమైనగుణాలు. ప్రకృతి పరిణామమే శరీరం. కనుక ఆ మూడు గుణాలు దేహాన్ని ఎప్పుడూ వదలవు. అవి నాశరహితుడైన జీవుడిని దేవమనుష్యాది శరీరాలలో బంధిస్తున్నాయి.

"తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశక మనామయమ్,
సుఖ సంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ." (భగ. 14-6)

సత్త్వమనే గుణం నిర్మలమైనది; జ్ఞాన ప్రకాశకం. అది జీవుడికి జ్ఞానమందు, సుఖమునందు ఆసక్తిని రేకెత్తిస్తుంది. అందు చేత పురుషుడు వైదిక కర్మలలో ప్రవర్తించి ఆ కర్మఫలాలు అనుభవించడానికి జన్మలెత్తుతాడు. ఈ రీతిగా సత్త్వగుణం కూడా సంసారబంధ కారణమే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

"రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగసముద్భవమ్,
తన్నిబధ్నాతి కౌంతేయ! కర్మసంగేన దేహినమ్." (భగ. 14-7)

రజోగుణం స్త్రీపురుషుల ప్రేమకు కారణం. అది ఇంద్రియార్థములందూ, దారపుత్రమిత్రాదులందు ఆసక్తిని కలిగిస్తుంది. అందుచేత పురుషుడు కర్మ లాచరిస్తాడు. ఫలానుభవానికై జన్మిస్తుంటాడు. ఇట్లా రజోగుణం కూడా బంధకమే అవుతున్నది.

"తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్,
ప్రమాదాలస్య నిద్రాభిః తన్నిబధ్నాతి భారత." (భగ. 14-8)

తమోగుణం విపరీత జ్ఞానం వలన పుట్టి విపరీత జ్ఞానాన్ని కల్గిస్తుంది. ఇది జీవికి ఏమరుపాటునూ, సోమరితనాన్నీ, నిద్రనూ కలిగిస్తూ సంసార బంధహేతు వవుతున్నది.

"సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత,
జ్ఞాన మావృత్య తు తమః ప్రమాదే సంజయ త్యుత." (భగ. 14-9)

సత్త్వగుణం సుఖాసక్తిని, రజోగుణం కర్మాసక్తినీ, తమోగుణం విరుద్ధ కార్యప్రవృత్తిని కల్గిస్తున్నాయి.

"రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత,
రజస్సత్త్వం తమశ్చైవ తమస్సత్త్వం రజస్తథా." (భగ. 14-10)

ఈ త్రిగుణాలలో ఒక్కొక్కటి ఒక్కొక్క సమయాన మిగిలిన రెండు గుణాలను మించిపోయి తన పనిని తాను సాధిస్తుంది - అన్న భగవద్గీతార్థములే ఇక్కడ చెప్పబడ్డాయి.

క. ధృతి విజ్ఞాన శ్రద్ధలు । నతివ! యసమ్మోహమును దయయు హర్షము నం
చిత సత్త్వ వృద్ధిఁ బరి వ । ర్ధితంబులగు సత్త్వ మరుగఁ దెరలుం దారున్. 247

ప్రతిపదార్థం: అతివ! = ఓ చెలువా!; ధృతి = ధైర్యం; విజ్ఞాన శ్రద్ధలు = శాస్త్రజ్ఞానం, ధర్మకార్యాసక్తి; అసమ్మోహమును = భ్రాంతి లేకుండటం; దయయున్ = కరుణ; హర్షమున్ = సంతోషమూ; అంచిత సత్త్వవృద్ధిన్ = ఒప్పిదమైన సత్త్వగుణం ఉద్రేకించి నప్పుడు; పరివర్ధితంబులు+అగున్ = మిక్కిలి వృద్ధి పొందుతాయి; సత్త్వము = ఆ సత్త్వగుణం; అరుగన్ = అణగి పోగానే; తారున్ = ఆ గుణాలు కూడా; తెరలున్ = తొలగిపోతాయి.

తాత్పర్యం: ధైర్యమూ, అనుభవసహితమైన జ్ఞానమూ, శ్రద్ధ, భ్రాంతిరాహిత్యమూ, కరుణ, సంతోషం అనే గుణాలు సత్త్వగుణం ఉద్రేకించి నపుడు మిక్కిలి వృద్ధి చెందుతాయి. ఆ సత్త్వ గుణం అణగినప్పుడు అవి కూడ అణగిపోతాయి.

క. క్రోధ లోభ కామానృత ద్రోహచింత । తాపములకు రజోభివర్ధనము వృద్ధిఁ
జేయు వానికి నెల్ల సంక్షీణ భావ । మావహిల్లు రజఃక్షయ మావహిల్ల. 248

ప్రతిపదార్థం: క్రోధ = కోపం; లోభ = దురాశ, పిసినారితనం; కామ = కామం (రాగం); అనృత = అసత్యం; ద్రోహచింత = పరులకు కీడు తలపెట్టటం; తాపములకున్ = దుఃఖాలు అనే వాటికి; రజః+అభివర్ధనము = రజోగుణముయొక్క

పెరుగుదల; వృద్ధిచేయున్ = వృద్ధిని కల్గిస్తుంది; రజఃక్షయము = రజోగుణవినాశం; ఆవహిల్లన్ = కలుగగా; వానికిన్+ఎల్లన్ = మీద చెప్పబడిన క్రోధాది గుణాలన్నింటికీ; సంక్షీణభావము = తరుగుదల, హీనస్థితి; ఆవహిల్లున్ = కలుగుతుంది.

తాత్పర్యం: కోపం, లోభం, కామం, అసత్యం, పరులకు కీడు చేసే తలంపు, దుఃఖం మొదలైనవి కలగటానికి రజోగుణవృద్ధియే కారణం. ఆ రజోగుణం క్షీణిస్తే ఇవన్నీ క్షీణిస్తాయి.

తే. **సంశయంబు విషాదంబు జడత నిద్ర । విను తమస్సు వర్ధింపఁగాఁ బెనుపు నొందు**
నది విహీనతఁ బొందిన నవియు హీన । భావ మొందు వికస్వర పద్మనయన! **249**

ప్రతిపదార్థం: వికస్వర పద్మనయన! = వికసించిన కమలాలవంటి కన్నులు గల శైలజా!; విను = వినుము; సంశయంబు = సందేహం; విషాదంబు = దుఃఖం; జడత = మాంద్యం; నిద్ర = నిదుర; తమస్సు = తమోగుణం; వర్ధింపన్+కాన్ = వృద్ధి నొందించగా; పెనుపున్+ఒందున్ = అవి వృద్ధి చెందుతాయి; అది = తమోగుణం; విహీనతన్+పొందినన్ = క్షీణస్థితిని చెందితే; అవియున్ = ఆ సంశయాది గుణాలన్నీ; హీనభావము+ఒందున్ = క్షీణిస్తాయి.

తాత్పర్యం: ఓ పద్మపత్రాక్షీ! సందేహం, దుఃఖం, మాంద్యం, నిద్ర అనేవి తమోగుణంవలన వృద్ధిపొందుతాయి. ఆ తమోగుణం క్షీణిస్తే ఇవీ క్షీణిస్తాయి.

సీ. **ఒక్కఁ డొక్కనిచేత నెక్కుచుఁ దఱుగుచుఁ । ద్రిగుణంబులును బ్రవర్తించు; వీన**
జనితంబులగు ప్రీతి సంతాప మోహాదు । లొదవినఁ దత్తద్గుణోదయములఁ
గని యుపేక్షించుచు మనము నూనఁగ నీమి । కార్యంబు ధర్మార్థకామములకు
నమర మనుష్య తిర్యగ్జననములకు । మూలముల్ సత్త్వాదు లోలి నెఱుఁగు

తే. **బుద్ధి యనఁగ మహత్తత్త్వమునకు నామ; । మది వివేక విజ్ఞాన చిహ్నంబు; భూత**
జని యహంకారమునకు లక్షణ; మహంక । రణము దొఱఁగుట మోక్షకారణము దేవి! **250**

ప్రతిపదార్థం: దేవి! = దాక్షాయణీ!; ఒక్కఁడు = ఒక్కగుణం; ఒక్కని చేతన్ = మరొక్క గుణం చేత; ఎక్కుచున్ = వృద్ధి గాంచుచు; తఱుఁగుచున్ = క్షీణిస్తూ; త్రిగుణంబులును = సత్త్వరజస్తమోగుణాలు మూడున్నూ; ప్రవర్తించున్ = సాగుతుంటాయి; నడుస్తుంటాయి; వీనన్ = ఈ గుణాలవలన; ప్రీతి = సంతోషం, సంతాప = దుఃఖం; మోహ+ఆదులు = భ్రాంతి మొదలైనవి; జనితంబులు+అగున్ = సంభవిస్తాయి; ఒదవినన్ = అట్లా కలుగగా; తత్+తత్+గుణ+ఉదయములన్ = ఆయా గుణముల యొక్క పుట్టుకలను; కని = చూచి; ఉపేక్షించుచున్ = ఉదాసీనభావం వహిస్తూ, ఒప్పరికిస్తూ; మనమున్ = తన మనస్సును; ఊనగనీమి = ఆ గుణకార్యములందు లగ్నం కాకుండా చేయటం; కార్యంబు = కర్తవ్యం; ధర్మ+అర్థ+ కామంబులకున్ = ధర్మ మొనర్చుటకు, సొమ్ము గడించుటకు, కోరిక లనుభవించుటకు; అమర మనుష్య తిర్యక్+జననములకున్ = దేవతలుగా, మానవులుగా, పశుపక్ష్యాదులుగా జన్మించుటకునూ; సత్త్వ+ఆదులు = సత్త్వరజస్తమోగుణాలు; ఓలిన్ = వరుసగా; మూలముల్ = కారణాలు; ఎఱుఁగు = దేవీ! గ్రహించుము; బుద్ధి+అనఁగన్ = బుద్ధి అనేది; మహత్+తత్త్వమునకున్ = మహత్తునకు; నామము = పేరు; అది = అది; వివేక విజ్ఞాన చిహ్నంబు = వివేకమునకు, విజ్ఞానమునకు గుర్తు - అనగా విచారణ సల్పేశక్తికి, శాస్త్రజ్ఞానమునకు గుర్తు; భూతజని = భూతముల యొక్క ఉత్పత్తి; అహంకారమునకున్+లక్షణము = అహంకారమునకు ఆనవాలు, చిహ్నం; అహంకరణము = నేను అనే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అభిమానం; తొఱఁగుట = వదలటం; మోక్షకారణము = ముక్తికి హేతువు.

తాత్పర్యం: సత్త్వరజస్తమోగుణాలలో ఒక్కొక్కగుణం ఒక్కొక్కవేళ ఉద్రేకించి తక్కిన రెండు గుణాలను అణచివైచి ప్రవర్తిస్తుంటుంది. ఇట్లా ఆ మూడు గుణాల వృద్ధి క్షయాలు సాగుతూ ఉంటాయి. సత్త్వగుణం విజృంభించినపుడు ఆ గుణ కార్యమైన సంతోషం, రజోగుణాభివృద్ధివలన దుఃఖం, తమోగుణం చెలరేగినపుడు మోహం కలుగుతుంటాయి. ఇట్లా ఆయా గుణవర్ధనంవలన ఆయాగుణాలు సంభవిస్తున్నవనీ, ఇవన్నీ ఆ గుణకార్యాలే అనీ, వాటితో నాకు నిమిత్తం లేదనీ తెలిసి నరుడు ఆ గుణకార్యాలపట్ల ఉదాసీనుడై ఉండాలి. తన మనస్సు ఆయా సుఖ దుఃఖాల యందు నిమగ్నం కాకుండా ఉండేటట్లు జాగ్రత్త వహించటమే అతడి కర్తవ్యం. ఈ గుణత్రయమే ధర్మార్థకామ సంగ్రహణానికీ, దేవమనుష్య పశుపక్ష్యాది జాతులలో జన్మించడానికీ హేతువవుతున్నది. బుద్ధి అనగా మహత్తత్త్వానికి మరొక నామధేయం. అది వివేక విజ్ఞానాలకు గుర్తు. అహంకారం భూతోత్పత్తికి మూలం. అహంకార పరిత్యాగంవలననే ముక్తి లభిస్తుంది.

ఆ. అన్నియింద్రియముల నడరింప మగుడఁ జే । యంగ మనసు చాలు; నవియు నదియు
భూత తద్వికారములును దేహము తద । న్యుండు దానఁ బరఁగి యుండు దేహి. 251

ప్రతిపదార్థం: అన్నిఇంద్రియములన్ = దశేంద్రియాలను, ఇంద్రియాలన్నింటినీ; అడరింపన్ = విషయములందు ప్రవర్తింపచేయుటకూ; మగుడన్+చేయన్+కన్ = నివర్తింపజేయుటకూ, మరలించుటకూ; మనసు = చిత్తం; చాలున్ = సమర్థమై ఉంటుంది; అవియున్ = ఆ యింద్రియాలూ; అదియున్ = ఆ చిత్తమూ; భూత = పృథివ్యప్తేజో వాయ్వాకాశములనే (నేల, నీరు, నిప్పు, గాలి, నింగిఅనే) పంచభూతాలూ; తద్+వికారములును = ఆ పంచభూతగుణములైన శబ్దస్పర్శరూప రసగంధాలున్నూ; దేహము = శరీరమై ఉన్నది; తద్+అన్యుండు = ఆ దేహం కంటె భిన్నుడైన; దేహి = ఆత్ముడు, జీవుడు; దానన్ = ఆ శరీరమందు; పరఁగి ఉండున్ = ఒప్పారుతుంటాడు.

తాత్పర్యం: ఇంద్రియాలు విషయాలపై ప్రవర్తిల్లుటకునూ, విషయముల నుండి ఇంద్రియాలను మరల్చుటకునూ మనస్సు సమర్థమై ఉన్నది. ఆ ఇంద్రియాలు, మనస్సు, పృథి వ్యాదిభూత పంచకం, భూతగుణాలైన శబ్దస్పర్శాదులు శరీరం. ఇది జీవుడికంటె భిన్నమైనది. జీవుడు ఈ దేహమనే ఆలయంలో నెలకొని ఉన్నాడని గ్రహించుము.

క. విను దేహియు దేహము వే । అను నిశ్చయదృష్టి గల్గునాతఁడు చాలున్
మనసు మగిడింప నది ని । ర్మనస్కతఁ బొనర్చి మోక్షమార్గముఁ జూపున్. 252

ప్రతిపదార్థం: విను = వినుము; దేహియున్ = జీవుడు; దేహమున్ = శరీరం; వేఱు+అను = ఒక్కటికావు అనే; నిశ్చయదృష్టి = నిర్ణయమునందు చూపు; కల్గు+ఆతఁడు = కలిగినవాడు; మనసున్ = తన మనస్సును; మగిడింపన్+చాలున్ = ఇంద్రియార్థముల నుండి త్రిప్పుటకు సమర్థు డగును-అనగా విషయముల మీదికి పోకుండ చేయగలడు; అది = అట్లామనసును మరలించటం; నిర్మనస్కతన్+పొనర్చి = సంకల్ప వికల్పములు కలుగకుండా చేసి; మోక్షమార్గమున్+చూపున్ = ముక్తి మార్గాన్ని కనబరుస్తుంది.

తాత్పర్యం: దేవీ! దేహం, ఆత్మ ఒక్కటికావు-వేరు వేరైనవి అనే నిర్ణయాత్మకమైన దృష్టికలవాడు తన మనస్సును

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇంద్రియార్థాలనుండి మరలించటానికి శక్తి గలిగి ఉంటాడు. విషయాలనుండి నివృత్తమైన మనస్సు సంకల్పరహితమై ముక్తి మార్గాన్ని కనపరుస్తుంది.

వ. అప్పుడు ప్రకృతిం దొఱంగి పంచవింశకుండు వెలుంగు; నాతత్త్వంబు పరమ హంసుండనం బరఁగుఁ దద్విజ్ఞానంబు శాంతిసాధ్యంబును బరమశాంతి ప్రదంబునై యుండు. 253

ప్రతిపదార్థం: అపుడు = ఆ వేళ, ఆ మోక్షస్థితిలో; ప్రకృతిన్+తొఱంగి = దేహమే నేను అనే అభిమానం వదలి; పంచ వింశకుండు = ఇరువదైదవతత్త్వమైన ఆత్ముడు; వెలుంగున్ = ప్రకాశిస్తాడు; ఆ తత్త్వంబు = ఆ తత్త్వం; పరమహంసుండు+ అనన్+పరఁగున్ = పరమహంసుడనే నామధేయంతో ఒప్పారుతుంది; తద్+విజ్ఞానంబు = ఆ పరమహంస తత్త్వము యొక్క ఎఱుక; శాంతిసాధ్యంబును = మనోనిగ్రహం చేతనే సంపాదించతగినదియూ; పరమశాంతి ప్రదంబున్+ఐ = పరిపూర్ణమైన శాంతినిచ్చేది గానూ; ఉండున్ = ఉంటుంది.

తాత్పర్యం: ఆ ముక్తిదశయందు దేహమే నేననే అభిమానం వదలి ఆత్ముడు ప్రకాశిస్తాడు. ఆ తత్త్వమే పరమహంసుడని చెప్పబడే తత్త్వం. ఆత్మతత్త్వం ఇట్టిదనే యెఱుక మనోజయం వలననే సమకూడుతుంది. అది పరమశాంతిని ప్రసాదిస్తుంది.

మ. రసగంధాది గుణాలి లేమి నవికారత్వంబునన్ సర్వ సం
వసనవ్యాప్తి నణుత్వభంగిని మహత్త్వస్ఫూర్తిఁ జక్షుః ప్రభృ
త్యసమాలంబితఁ దేజరిల్లు పరమాత్మాఖ్యంబు షడ్వింశకం
బు సమత్వంబునఁ జూచు శాంతుఁ డతివా! పొందున్ విమోక్షస్థితిన్.
254

ప్రతిపదార్థం: అతివా! = ఓ భామా!; రసగంధ+ఆది = రసం, గంధం మొదలైన; గుణ+ఆలిలేమిన్ = గుణసముదాయం లేనందుననూ; అవికారత్వంబునన్ = పరిణామంలేనందు చేతనూ; సత్వసంవసన వ్యాప్తిన్ = అన్నింటియందునివసించటం, వ్యాపించి ఉండుట చేతనూ; అణుత్వభంగిన్ = సూక్ష్మపరిమాణంలో ఉన్నందుననూ; మహత్త్వ స్ఫూర్తిన్ = గొప్ప పరిమాణంలోఉన్నందుననూ; చక్షుః ప్రభృతి = కన్ను మొదలైన ఇంద్రియాలచేత; అసమాలంబితన్ = గ్రహించబడకుండుట చేతనూ; తేజరిల్లు = ఒప్పారుతున్న; షడ్వింశకంబున్ = ఇరువది ఆరవతత్త్వమైన; పరమాత్మ+ఆఖ్యంబున్ = పరమాత్మ అనే పేరుగల వాడిని; సమత్వంబునన్ = భేదరహితబుద్ధితో; చూచు = దర్శించునట్టి; శాంతుఁడు = మనస్సును జయించినవాడు; విమోక్షస్థితిన్ = మోక్షపదవిని; పొందున్ = చెందగలడు.

తాత్పర్యం: దేవి! రసగంధాది గుణాలు లేనిదై, పరిణామ శూన్యమై, అన్నిటియందు వసించుచు, అన్నిటియందు వ్యాపించి ఉన్నదై, అతిసూక్ష్మరూపమై, బృహత్పరిమాణమునూ గలదై, కన్ను మొదలగు ఇంద్రియాలకు అగోచరమై ఇరువది ఆరవ తత్త్వమొకటి విరాజిల్లుతున్నది. అదే పరమాత్మ. సమబుద్ధితో దానిని దర్శించే శాంతస్వరూపుడు మోక్షపదమును పొందగలడు.

వ. ఇది కపిలాది పరమర్షిసేవితంబైన సాంఖ్యధర్మంబు; యోగ ప్రకారంబు వివరించెద. 255

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఇది = ఈ చెప్పినది; కపిల+ఆది = కపిలుడు మొదలగు; పరమ+ఋషి = గొప్ప ఋషులచే; సేవితంబు+ఐన = అనుసరించబడిన, అనుష్ఠించబడిన; సాంఖ్యధర్మంబు = సాంఖ్యమనే పేరుగల జ్ఞాన విధం; యోగప్రకారంబున్ = యోగము యొక్క విధమును; వివరించెదన్ = వ్యాఖ్యానిస్తాను.

తాత్పర్యం: గౌరీ! ఇవుడు నేను నుడివింది కపిలుడు మున్నగు గొప్ప మునీంద్రులు అనుసరించిన జ్ఞానమార్గం. ఇక యోగమార్గం ఎట్లాంటిదో ఇప్పుడు వివరిస్తాను. వినవలసింది.

సీ. విను మింద్రియంబులు మనసును బుద్ధియు । నాత్మండు నొక్కటి యగుటఁ గాన్పు
యోగ పరిజ్ఞాన ముగ్మలి యగ్ని స । మా రాధనంబును నధిక వాగ్వి
వర్జనంబును సత్త్వవత్త్వంబు దానాధ్య । యనములు శౌచ సత్యములుఁ బాప
ములఁ బాపుఁ బాపనిర్ముక్తుఁడై మఱియోగ । మాచరింపఁగ యోగ్యుఁ డగు నరుండు

తే. మనసు పట్టుట ముఖ్యపుటనువు దాని । కామిషము గాలగాని కెట్లట్ల శుచియు
నజనమును నగుచోట మృద్వాసనమునఁ । గాయమున కార్జవము భంగి గలుగనుండి. 256

ప్రతిపదార్థం: ఉగ్మలి! = ఓ పడతీ!; వినుము = ఆలింపుము; ఇంద్రియంబులు = కన్నుమొదలైన ఇంద్రియాలూ; మనసును = మనస్సూ; బుద్ధియున్ = బుద్ధీ; ఆత్ముండున్ = ఆత్మయూ; ఒక్కటి అగుటన్ = ఏకమై ఉండుటను; కాన్పు = దర్శించటం; యోగపరిజ్ఞానము = యోగమునకు చెందిన పూర్ణజ్ఞానం; అగ్నిసమారాధనంబును = అగ్నిహోత్రుడి యొక్క ఉపాసన, పూజించటం; అధికవాక్+వివర్జనంబును = ఎక్కువగా మాట్లాడటం మానటం, మౌన వ్రతావలంబనం; సత్త్వవత్త్వంబు = సత్త్వగుణం కలిగి ఉండటం; దాన+అధ్యయనములున్ = పాత్రులకు దానమివ్వటం, వేదమును పఠించటం; శౌచసత్యములున్ = పరిశుద్ధుడై ఉండటం, అబద్ధమాడ కుండటం; పాపములన్ = పాతకాలను; పాపున్ = తొలగిస్తాయి; పాపనిర్ముక్తుఁడు+ఐ = దురితముల నుండి తొలగినవాడై, విడువబడ్డవాడై; మఱిన్ = ఇంకనూ; యోగము+ఆచరింపన్+కన్ = యోగ మనుష్ఠించటానికి; నరుండు = మనుజుడు; యోగ్యుఁడు+అగున్ = అర్హుడవుతాడు; దానికిన్ = యోగానుష్ఠానానికి; మనసున్ = మనస్సును; పట్టుట = విషయాల మీదికి వెళ్ళకుండా నిలువరించటం; ముఖ్యము+అనువు = (ముఖ్యపు+అనువు = ముఖ్యపు+టు+అనువు = ముఖ్యపు టనువు) ప్రధానమైన ఉపాయం; గాలగానికిన్ (గాలము+కాఁడు = గాలగాఁడు) = గాలం వేసి చేపలు పట్టే చెంబడివాడికి, బెస్తకు; ఆమిషము+ఎట్లు = మాంస మెట్లో; అట్లు+అ = ఆ విధంగానే; శుచియున్ = శౌచము, పరిశుద్ధత; అజనమును+అగుచోటన్ = మనుష్యులు లేని తావునందు, ఏకాంత ప్రదేశంలో; మృదు+ఆసనమునన్ = మెత్తనిపీఠం మీద; కాయమునకున్ = శరీరమునకు; ఆర్జవము+భంగి = ఋజువుగా ఉండే తీరు, వక్రత లేని విధం; కలుగన్ = ఏర్పడగా; ఉండి = కూర్చుండి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఉమాదేవీ! ఇంద్రియాలూ, మనస్సూ, బుద్ధీ, ఆత్మా ఒక్కటే అగునట్లు దర్శించటం పరిపూర్ణమైన యోగజ్ఞానం. అగ్నిహోత్రుడిని ఉపాసించటం అనగా హోమాదులు నిర్వర్తించటం, మిక్కిలిగ మాట్లాడకుండటం - అనగా మౌనవ్రతావలంబనం, సత్త్వగుణం కలిగి ఉండటం, పాత్రులకు దానం సల్పటం, వేదాలు చదవటం, శుచిగా ఉండటం, సత్యం పల్కటం, పాతకాలను తొలగిస్తాయి. అట్లా పాపాల నుండి నిర్ముక్తుడైన మనుజుడు యోగానుష్ఠానానికి అర్హుడవుతాడు. మనసును అటునిటు విషయాలమీదికి వెళ్ళనీక నిలువరించటమే ఇందుకు ముఖ్యమైన ఉపాయం. చేపలు పట్టే జాలరికి మాంసమెట్లు ముఖ్యమో అట్లాగే యోగ మనుష్ఠించేవాడికి పరిశుద్ధమూ, జనశూన్యమూ అయిన

ప్రదేశం ముఖ్యం. అట్టి ఏకాంత ప్రదేశంలో మృదువైన పీఠం మీద శరీరంలో వంపులేకుండా, నడుం వంగకుండా కూర్చొనాలి.

విశేషం: యోగానుష్ఠాన పద్ధతి గురించి భగవద్గీత ఆరవ ఆధ్యాయం ఆత్మసంయమ యోగం విపులంగా వివరించింది. అందులోని విషయాలే ఈ 256వ పద్యం మొదలు 263వ పద్యం వరకు -- ఎనిమిది గద్య పద్యాలలో సంగ్రహ ఫక్కిలో చెప్పబడ్డాయి.

"యోగీ యుంజీత సతతం ఆత్మానం రహసి స్థితః,
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీ రపరిగ్రహః." (భగ. 6-10)

"శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిర మాసన మాత్మనః,
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజిన కుశోత్తరమ్." (భగ. 6-11)

"తత్రై కాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః,
ఉపవిశ్యాసనే యుంజ్యాత్ యోగమాత్మ విశుద్ధయే." (భగ. 6-12)

"సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః,
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్." (భగ. 6-13)

"ప్రశాంతాత్మా విగతభీః బ్రహ్మచారివ్రతే స్థితః,
మన స్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః." (భగ. 6-14)

"యుంజన్నేవం సదాఽఽత్మానం యోగీ నియతమానసః,
శాంతిం నిర్వాణ పరమాం మత్సంస్థా మధిగచ్ఛతి." (భగ. 6-15)

యోగనిష్ఠుడు యోగాభ్యాసకాలంలో జితేంద్రియుడై దేనియందూ మమకారం లేకుండా మనుష్యులు లేని ప్రదేశంలో ఒంటరిగా కూర్చొని ఆత్మను ధ్యానించాలి.

ధ్యానానికి పూనుకునేటప్పుడు తనకు అనుకూలమైన పీట మీద మనశ్శుద్ధికై దర్భలను పరవాలి. ఆ పీట అటు ఇటూ బెసకనిదిగా ఉండాలి. అది అంతహెచ్చు, అంత లొచ్చు కానిదిగా ఉండాలి. తాను కూర్చొని ధ్యానం చేసే చోటు పవిత్రంగా ఉండాలి. అనగా ఆ ప్రదేశం క్రిమికీటకాదులు లేనిదిగా దుర్గంధభూయిష్ఠం కానిదిగా ఉండాలి. అట్టి చోట సుఖకరమైన స్థిరాసనం మీద కూర్చొని మనసును ఆత్మయందే నిల్పి ఇంద్రియాలను, వాటి వ్యాపారాలను అరికట్టి ఆత్మధ్యానం చెయ్యాలి. అదే సంసారవిముక్తికి దారి.

యోగానికి ఉపక్రమించేవాడు తన శరీరం(నడుము), మెడ, తలను సమంగా, వంకరలేకుండా, చలించకుండా నిలిపి దిక్కులను చూడకుండా దృష్టిని ముక్కుకొనపై నిలపాలి.

ఎటువంటి భయం లేక ప్రసన్న హృదయుడై బ్రహ్మచర్య వ్రతాన్ని అవలంబించాలి. ఇక్కడ బ్రహ్మచర్యవ్రతమనగా గృహస్థుడికి నిషిద్ధదేశకాలములందు స్త్రీ సంగమం లేకుండటం. పెళ్ళికానివాడికి ఎప్పుడూ స్త్రీ సంగమం లేకుండటం.

ఇట్లా బ్రహ్మచర్యవ్రతాన్ని పాటించి మనస్సును విషయాలమీదికి వెళ్ళకుండా నిగ్రహించి నన్నే పొందవలెననే వాంఛతో దానిని నామీదనే నిల్పి ధ్యానించాలి.

ఈ విధంగా నిశ్చలమైన చిత్తంతో నన్నే ధ్యానించేవాడు సుఖానికి పరమావధి అయిన ముక్తిని పొందుతాడు.

క. మనమున నైదింద్రియములు । నునిచి మనం బాత్మ నల్ల నొదిఁగింపఁగ నె
క్కొని ప్రాణంబు నపానం । బును వశ్యత నిలుచు యోగమున సిద్ధికినై. 257

ప్రతిపదార్థం: మనమునన్ = మనస్సులో; ఐదు+ఇంద్రియములు = పంచేంద్రియాలను; ఉనిచి = ఉంచి; మనంబున్ = ఆ మనస్సును; ఆత్మన్ = ఆత్మయందు; అల్లన్ = మెల్లగా; ఒదిఁగింపఁగన్ = లీనమయ్యేటట్లు చేయగా; నెక్కొని = సమకూడి; ప్రాణంబున్ = ప్రాణవాయువున్నూ; అపానంబునున్ = అపానమనేవాయువున్నూ అనగా ఉచ్ఛ్వాసనిశ్వాసములు రెండూ; యోగమున సిద్ధికిన్+ఐ = యోగం ఫలించుటకై; వశ్యతన్ = అధీనములై; నిలుచున్ = నిలబడుతాయి.

తాత్పర్యం: మనస్సున ఐదింద్రియాలనూ, మనస్సునూ ఆత్మయందు లీన మొనర్చగా ఉచ్ఛ్వాస నిశ్వాసములు రెండున్నూ యోగం సిద్ధించటానికి అధీనములై ఉంటాయి.

తే. అవహితుం డయి తద్దశ యనుభవింపఁ । గా నపానమిశ్ర ప్రాణ గతికి మూర్ధ
మతివ! యమ్మెయి నెలవగు; నతఁడ చూవె । జీవుఁ డనఁ బరమాత్ముండు నా వెలుంగు.' 258

ప్రతిపదార్థం: అతివ! = ఓ కాంతా! అవహితుండు+అయి = మనుజుడు సావధానుడై; తత్+దశ+అనుభవింపఁగన్ = ఆ స్థితిని అనుభవిస్తుండగా; అపానమిశ్ర ప్రాణగతికిన్ = అపానవాయువుతో గూడిన ప్రాణవాయువు యొక్క గమనానికి; మూర్ధము = శిరస్సు; ఆ+మెయిన్ = ఆ రీతిగా; నెలవు+అగున్ = స్థానమవుతుంది; అతఁడు+అ = ఆస్థానమయిన వాడే; జీవుఁడు+అనన్ = జీవుడనగా; పరమాత్ముండు నాన్ = పరమాత్ముడనగా; వెలుంగున్+చూవె! = విరాజిల్లుతాడు సుమా!

తాత్పర్యం: మనుజుడు ఏకాగ్రచిత్తుడై మీద చెప్పిన స్థితియందుండగా అపానవాయువుతో కూడిన ప్రాణవాయువు యొక్క గమనమునకు శిరస్సు నిలయమవుతుంది. నిలయమైన అతడే జీవుడని, పరమాత్మ అని చెప్పబడుతూ ప్రకాశిస్తున్నాడు.'

వ. అని వెండియు. 259

తాత్పర్యం: అని చెప్పి మరల శివుడు (భవానితో ఇట్లా అంటున్నాడని తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. ప్రాణు నపానునందును నపానునిఁ బ్రాణునియందు నిల్పి ని
ర్వాణముఁ గోరి చిత్తము తిరంబుగఁ బట్టఁగఁ బ్రాణసంయమా
క్షీణత దేహమధ్యశిఖిఁ జిమ్మఁగఁ దత్తయ మొంది మూర్ధపా
రీణతఁ గోర్కి సల్పు నపరిచ్యుతిఁ దద్గతుఁడైన యోగికిన్. 260

ప్రతిపదార్థం: ప్రాణున్ = ప్రాణవాయువును; అపాను+అందున్ = అపానవాయువునందును; అపానునిన్ = అపానమును; ప్రాణుని+అందున్ = ప్రాణమునందును; నిల్పి = స్థాపించి, ఉంచి; నిర్వాణమున్+కోరి = మోక్షము నపేక్షించి; చిత్తము = మనస్సు; తిరంబుగన్ = స్థిరముగా, దృఢముగా, నిశ్చలముగా; పట్టఁగన్ = స్వాధీనపరచుకొనగా; నిగ్రహించగా; తత్+గతుఁడు+ఐన+యోగికిన్ = అట్టి యోగవిధానమందు నెలకొన్న యోగికి; ప్రాణసంయమ+అక్షీణత = ప్రాణనిరోధము యొక్క

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆధిక్యము; దేహమధ్యశిఖిన్ = శరీరము యొక్క నడుమనున్న అగ్నిని- ఊష్మమును; చిమ్మన్+కన్ = వ్యాప్తం చేయగా, విసరగా, ఎగమీటగా; తత్+త్రయము = ప్రాణము, అపానము, దేహమధ్యాగ్ని అను మూడున్నూ; ఒంది = చేరుకొని; అపరిచ్యుతిన్ = జారుపాటులేనితనంతో; తొలగిపోకుండా; మూర్ధపారీణతన్ = శిరస్థానమును భేదించుకొని పోవుటయందు; కోర్కి సల్పున్ = అభిలాష వహిస్తాయి.

తాత్పర్యం: ప్రాణమును అపానములో, అపానమును ప్రాణములో స్థాపించి ముక్తిని వాంఛించి మనస్సును గట్టిగా నిరోధించగా ఆ యోగ మార్గము నందు నిరతుడైన యోగికి ప్రాణనిరోధ సంపన్నత్వం శరీరమందలి ఊష్మమును పైకి ఎగజిమ్మగా ఆ ప్రాణాపాన దేహాగ్నులు మూడును చేరి ఏ మాత్రము జారుపాటు లేకుండ మూర్ధ స్థానమును భేదించుకొని పోవుటలో అభిలాష వహిస్తాయి.

విశేషం: తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః,
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున. (భగ. 6-46)

"అర్జునా! యోగి కృచ్ఛ్ర చాంద్రాయణాది రూపమైన తపస్సులు చేసే వారికంటె, శాస్త్ర జన్యజ్ఞానం గల వారి కంటె, ఇష్టాపూర్తాది కర్మలు ఆచరించేవారి కంటె శ్రేష్ఠుడు. కనుక నీవు యోగివి కమ్ము" అని యోగం యొక్క గొప్పతనం చెప్పి దాని తీరుతెన్నులు ఆత్మసంయమయోగంలో శ్రీకృష్ణభగవానుడు అర్జునుడికి వివరిస్తాడు.

వ. అని చెప్పి వెండియు. 261

తాత్పర్యం: అని పరమేశ్వరుడు గౌరితో చెప్పి మరల (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం).

చ. అలసతయున్ విచిత్తతయు నత్యశనాదరణంబు రోగముం
గలయును లోభమున్ భయముఁ గామముఁ గ్రోధము లౌల్యమున్ విరో
ధులు విను యోగసేవకు; నదుష్టతఁ బేర్చిన యోగ మిచ్చు సి
ద్ధు లెనిమిదింట నప్రతిహతుం డయి యోగి చరించు నెల్లెడన్. 262

ప్రతిపదార్థం: అలసతయున్ = సోమరితనమూ, జడత, మాంద్యమూ; విచిత్తతయున్ = పరధ్యానంలో ఉండటం, పరాకు; అతి+అశన+ఆదరణంబున్ = మిక్కుటంగా తినడంలో అపేక్ష; రోగమున్ = వ్యాధియూ; కలయును = స్వప్నమూ, నిదుర; లోభమున్ = దురాశ, పిసినిగొట్టుతనం; భయమున్ = భీతియూ; కామమున్ = స్త్రీ వాంఛ, కోరిక; క్రోధమున్ = కోపం; లౌల్యమున్ = విషయాసక్తి, భోగేచ్ఛ, చాపల్యం; యోగసేవకున్ = యోగాభ్యాసానికి; విరోధులు = శత్రువులు; విను = వినుము; అదుష్టతన్ = దోషరహితత్వంతో; పేర్చిన యోగము = అతిశయించిన యోగం; ఇచ్చు = ప్రసాదించునట్టి; సిద్ధులు+ఎనిమిదింటన్ = అష్టసిద్ధులతో; అప్రతిహతుండు+అయి = అడ్డులేని వాడై, ఎదురులేని వాడై, ఆటంకంలేనివాడై; యోగి = యోగీశ్వరుడు; ఎల్ల+ఎడన్ = అన్నిచోట్ల, అంతటా; చరించున్ = తిరుగ గలడు.

తాత్పర్యం: సోమరితనం, పరధ్యానంలో ఉండటం, విపరీతంగా తిండితినటం, రోగం, నిదుర, పిసినిగొట్టు తనం, భీతి, స్త్రీవాంఛ (కోరిక), కోపం, విషయాసక్తి లేదా భోగేచ్ఛ అనేవి యోగానుష్ఠానానికి ప్రబలశత్రువులు. దోషరహితమై ఒప్పారునట్టి యోగం ప్రసాదించే అష్టసిద్ధులతో యోగి అడ్డమాపులేక అంతటా యథేచ్ఛగా విహరించగలడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అష్టసిద్ధులు: అణిమా మహిమాచైవ గరిమా లఘిమా తథా, ప్రాప్తిః ప్రాకామ్య మీశత్వం వశిత్వం చాష్టసిద్ధయః.

1) అణిమ = అణుస్వభావం. దీనివలన సూక్ష్మాకారం ధరించి సర్వత్ర వెళ్ళటానికి శక్తి సమకూడుతుంది.

2) మహిమ = గొప్పతనం; ఇందువలన బృహత్స్వరూపం ధరించుటకు వీలవుతుంది.

3) లఘిమ = తేలికగా ఉండటం: దీని వలన తన కిష్టం వచ్చినపుడు చులకనగా ఉండ గలశక్తి లభిస్తుంది.

4) గరిమ = భారమగుట: తన్నెంత బలవంతులైననూ పైకెత్తలేనంత బరువుగా తానుండ గల శక్తి ఈ ఐశ్వర్యం వలన సమకూడుతుంది.

5) ప్రాప్తి = పొందటం: దీని వలన వాంఛితార్థం వెంటనే పొందబడుతుంది.

6) ప్రాకామ్యం = తన కోరికకు అడ్డులేకుండటం.

7) ఈశత్వం = ప్రాభవం కలిగి ఉండటం.

8) వశిత్వం = లోబరుచుకొనటం.

ఆ. **నిద్రపెంపు నిద్ర నిగ్రహించుటయును । గొలఁది మీఱు కుడుపుఁ గుడువమియును**
యోగి కొప్పు; వతఁడు యుక్త వర్తనుఁడైన । నువిద! దుఃఖహారి యోగ మొందు. **263**

ప్రతిపదార్థం: ఉవిద! = ఓ చెలీ!; నిద్రపెంపు = నిద్ర యొక్క ఆధిక్యం, ఎక్కువగా నిద్రించటం; నిద్ర నిగ్రహించుటయును = నిద్రను మానటం; కొలఁది మీఱు కుడుపున్ = మితిమీరి భుజించటం; కుడువమియును = అసలే భుజించకుండటం; యోగికిన్ = యోగానుష్ఠాన పరుడికి; ఒప్పవు = తగవు; అతఁడు = యోగి; యుక్త వర్తనుఁడు+ఐనన్ = తగిన తీరున యోగం అనుష్ఠిస్తే; దుఃఖహారి = దుఃఖాన్ని తొలగించునట్టి; యోగము = యోగమును; ఒందున్ = పొందగలడు.

తాత్పర్యం: ఎక్కువగా నిద్రపోవటం, బొత్తిగా నిద్రపోకుండా ఉండటం, మితిమీరి భుజించటం, మొదలే భుజించకుండా ఉండటం యోగికి తగవు. గౌరీ! యోగి తగిన తీరున మెలగితే దుఃఖాన్ని హరించే యోగం సిద్ధిస్తుంది.

విశేషం: "నాత్యశ్నతస్తు యోగోఽస్తి నచైకాంత మనశ్నతః,
న చాతి స్వప్న శీలస్య జాగ్రతో నైవ చార్జున!" (భగ. 6-16)

అపరిమితంగా తినే వాడికి, అసలే తినని వాడికి, ఎక్కువగా నిద్రించే వాడికి, ఎప్పుడూ మేల్కొని ఉండేవాడికి ఈ యోగం సిద్ధించదు.

"యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు,
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా." (భగ. 6-17)

మితాహార విహారాలు, తన శక్తికి లోబడి మితంగా కార్యకలాపాలయందు ప్రవర్తించటం, మితంగా నిద్రపోవటం, మితమైన మెలకువ గలిగిన వాడికి కర్మబంధ విమోచనం కలిగించే యోగం సిద్ధిస్తుంది.

వ. **ఇట్టిది యోగధర్మం' బనిన నంబిక 'సాంఖ్యయోగ శ్రవణంబునఁ బరిజ్ఞాత పరమార్థ నైతి; భవదీయ సాయుజ్యంబుభక్తు లెట్టి పరిచర్యం బడయుదు? రెఱింగింపవే' యని యడిగిన మృడుండు మృడాని కిట్లనియె.** **264**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: యోగధర్మంబు; ఇట్టిది = ఇట్లాంటిది; అనినన్; అంబిక = పార్వతి; సాంఖ్యయోగ శ్రవణంబునన్ = సాంఖ్య యోగములు వినటం చేత; పరిజ్ఞాత = చక్కగ తెలియబడిన; పరమార్థన్+ఐతిన్ = పరమార్థం కలదాననైనాను; మోక్షధర్మం తెలిసికొనగలిగాను; భవదీయసాయుజ్యంబున్ = నీలో ఐక్యమొందటాన్ని; భక్తులు; ఎట్టి పరిచర్యన్ = ఏ విధమైన సేవచేత; పడయుదురు = పొందగలరో; ఎఱింగింపవు+ఏ = తెలుపవా; అని; అడిగినన్; మృడుండు = శంకరుడు; మృడానికిన్ = శాంకరికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దేవీ! యోగ స్వరూప మిట్టి' దని శంకరుడు శర్వాణికి చెప్పగా ఆమె- 'దేవా! సాంఖ్యమును, యోగమును తమవలన విని పరమార్థ మెట్టిదో గ్రహించాను. మరి భక్తులు ఎట్టిసేవ చేసి నీలో ఐక్యమంద గలరో తెల్పుమని వేడుతున్నాను' అని పలుకగా ఈశ్వరుడు ఈశ్వరితో ఇట్లా అన్నాడు.

విశేషం: సాయుజ్యం చతుర్విధ ముక్తులలో ఒకటి.

1) సాయుజ్యం అనగా ఐక్యం, లయం. తాను కొలిచే దేవతలో లయం కావటం.
2) సారూప్యం = ఆ రూపంవంటి రూపం పొందటం అనగా సమానరూపత్వమును వహించటం.
3) సాలోక్యం = తన ఇష్టదేవత ఉన్న లోకంలో తానూ ఉండటం.
4) సామీప్యం = సాన్నిధ్యం, లేక సమానత్వం చెందటం'.

శివుండు పార్వతికి నాత్మసాయుజ్య ప్రాప్తిసాధనంబులు దెలుపుట. (సం.13- అను 1-4336).

క. 'విను మవిచింత్యుఁడ సురలకు । మునులకు నేనియును యోగమును సాంఖ్యము నా
యొనరించినయవి యీశుఁడ । సనాతనుఁడ నవ్యయుండ సత్యాత్ముండన్. 265

ప్రతిపదార్థం: వినుము = పార్వతీ! వినుము; సురలకున్ = దేవతలకు; మునులకున్+ఏనియున్ = మునీంద్రులకైనమా; అవిచింత్యుఁడన్ = ఊహించనలవిగాని వాడిని; యోగమును = యోగవిద్యయూ; సాంఖ్యమును = సాంఖ్యశాస్త్రమునూ; నా+ఒనరించిన+అవి = నేను రచించినట్టివి; ఈశుఁడన్ = సమస్తమునకు నేను ప్రభుడను; సనాతనుఁడన్ = శాశ్వతమైన వాడిని, ప్రాచీనుడిని, ఎప్పటినుండో ఉన్నవాడిని; అవ్యయుండన్ = నాశరహితుడిని; సత్య+ఆత్ముండన్ = సత్యస్వరూపుడిని.

తాత్పర్యం: ప్రేయసీ! వినుము. వేల్పులకునూ, మునులకునూ నే నిట్టివాడనని ఊహింపనలవిగాని వాడిని. సాంఖ్యయోగ శాస్త్రములు రెంటికినీ నేనే కర్తను, నేనే సర్వమునకు అధిపతిని. పురాణపురుషుడను నేనే. నేనే నాశరహితుడిని, నేనే సత్యస్వరూపుడిని.

క. ఏను బ్రసన్నుఁడనైనం । గానిది లే దర్చకులకుఁ గావున మంత్ర
ధ్యానస్తుతి వందన ముఖ । నానాభజనముల వలయు నైష్ఠికత శివా! 266

ప్రతిపదార్థం: శివా! = దుర్గా!; ఏను = నేను; ప్రసన్నుఁడన్+ఐనన్ = అనుగ్రహిస్తే; అర్చకులకున్ = నన్ను కొలిచే వారికి, కానిదిలేదు = దుర్లభమైనది ఏదీ లేదు; కావునన్ = కనుక; మంత్ర = మంత్రం; ధ్యాన = చింతనమూ; స్తుతి = స్తోత్రమూ; వందనముఖ = నమస్కారం మొదలైన; నానాభజనములన్ = పలువిధాలైన సేవలందు; నైష్ఠికత = ఆసక్తి, నిలుకడ, దీక్ష; వలయున్ = ఉండవలె.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: దుర్గా! నేను దయదలిస్తే నన్ను కొలుచునట్టివారికి సకలప్రయోజనాలు సమకూడుతాయి. కనుక మంత్ర జపం, చింతనం, స్తోత్రం, నమస్కారం మొదలైన సకల విధాలైన నా సేవలందు భక్తుడు నిష్ఠాపరుడై ఉండటం ముఖ్యం.

ఆ. **నాలుగాశ్రమముల నలువురు విప్రుల । కతివ! పాశుపతమహావ్రతంబు**
తెలుఁగు లేను దొల్లి దెలిపితి; శిష్య ప్ర । శిష్య సరణి నది ప్రసిద్ధ మయ్యె. 267

ప్రతిపదార్థం: అతివ! = రమణీ! నాలుగు+ఆశ్రమములన్ = బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే నాలుగు ఆశ్రమాలలోని; నలువురు విప్రులకున్ = నలుగురు బ్రాహ్మణులకు; పాశుపత మహావ్రతంబు తెఱఁగులు = పాశుపతమనే గొప్పవ్రతము యొక్క విధానాలు; ఏను = నేను; తొల్లి = మునుపు; తెలిపితిన్ = బోధించాను, చెప్పినాను; అది = ఆ వ్రత విధానం; శిష్య ప్రశిష్యసరణిన్ = శిష్యులు, ఆ శిష్యులకు శిష్యులు అనేవారి ద్వారా; ప్రసిద్ధము+అయ్యెన్ = లోక విఖ్యాతి గాంచింది;

తాత్పర్యం: దేవీ! పూర్వం నేను బ్రహ్మచర్యం మొదలగు నాలుగు ఆశ్రమాల లోని నలుగురు బ్రాహ్మణులకు పాశుపత మహావ్రత విధానాన్ని బోధించాను. అది ఆ నలుగురు బ్రాహ్మణులవలన, వారి శిష్యులవలన, ప్రశిష్యులవలన జగత్ప్రఖ్యాతి చెందింది.

క. **మంగళ రక్షా శుచితా । లింగార్చన యోగ్యతలు ఫలించుటకై భూ**
తిం గావించితిఁ; దల్లి । ప్తాంగులును గపాలధరులునై శాంతిమెయిన్. 268

ప్రతిపదార్థం: మంగళ రక్షా = శుభముల యొక్క రక్షణ; శుచితా = పావనత్వం; లింగ+అర్చనయోగ్యతలు = లింగమును పూజించుటకు అర్హతలు; ఫలించుటకై = నెరవేరుటకై, సిద్ధించుటకై; భూతిన్ = విభూతిని; కావించితిని = రూపొందించాను; తత్+లిప్త+అంగులును = ఆ భస్మమును దేహము నందు ధరించిన వారునూ; కపాలధరులును = భిక్షాపాత్రను ధరించిన వారును, ఐ = అయి; శాంతిమెయిన్ = మనోనిగ్రహంతో, శాంతిస్వభావంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: దేవీ! మంగళ రక్షణ కొరకు, పవిత్రత సమకూడటం కొరకు, లింగము నర్చించే యోగ్యత సిద్ధించటం కొరకు నేను విభూతిని రూపొందించాను. ఆ విభూతిని శరీరమందు అలదుకొని, భిక్షాపాత్రను చేబూని మనో నిగ్రహంతో.

తే. **బ్రహ్మచర్య భిక్షాశన పరత గలిగి । జటిత యొండె ముండిత యొండె సంభరించి**
మనసు నాయంద తిరముగా నునిచి యొండు । వస్తువుల దెస నొల్లమి వర్తిలంగ. 269

ప్రతిపదార్థం: బ్రహ్మచర్య = బ్రహ్మచర్యవ్రతం; భిక్షా+అశనపరతకలిగి = భిక్షాన్నం భుజించటం అనువాటియందు ఆసక్తి కలిగి; జటిత+ఒండెన్ = జడలు దాల్చటం గాని; ముండిత+ఒండెన్ = తల బోడి చేయించుకొనటంగాని; సంభరించి = స్వీకరించి; మనసున్ = చిత్తాన్ని; నాయందు+అ = నా మీదనే; తిరముగాన్+ఉనిచి = నిశ్చలంగా నిలిపి, దృఢంగా, గట్టిగా నిలిపి; ఒండు వస్తువులదెసన్ = ఇతరములైన ప్రాపంచిక వస్తువుల విషయంలో; ఒల్లమి = అనాదరం; వర్తిలంగన్ = సాగగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: బ్రహ్మచర్యవ్రతం అవలంబించి, భిక్షాన్నం భుజిస్తూ, జుట్టు పెంచుకొని గాని, తలగొరిగించుకొనిగాని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉంటూ, నాయందు గట్టిగా మనసుంచి, ఇతర వస్తువుల పట్ల అనాదరం గలిగిన వారై.

క. చరియించు భక్తజనులకుఁ । బరమానందైకతానుభవ మొసఁగుదు; న
వ్వెరవున మత్సాయుజ్యము । దొరకును వారలకు వికచతోయజవదనా! 270

ప్రతిపదార్థం: చరియించు = ప్రవర్తించే; భక్త జనులకున్ = నా భక్తులైన వారికి; పరమ+ఆనంద+ఏకతా+అనుభవము = శ్రేష్ఠమైన ఆనందము యొక్క ముఖ్యానుభవం, మహానందము యొక్క పరమానుభూతిని; ఒసఁగుదున్ = అనుగ్రహిస్తాను; వికచతోయజవదనా! = వికసించిన పద్మం వంటి ముఖం కలదానా!; ఆ+వెరవునన్ = చిత్తం నాయందే దృఢముగ లగ్నమొనర్చి, నాకంటె అన్యములైన వస్తువులను అనాదరించటం అనే ఉపాయంచేత; వారలకున్ = నా భక్తులకు; మత్+సాయుజ్యము = నన్ను పొందటం, నాలో ఐక్యంకావటం అనేది; దొరకును = లభిస్తుంది.

తాత్పర్యం: పూచిన కమలం వంటి ముఖము గల కాత్యాయనీ దేవీ! మనసు నాయందే నిశ్చలంగా నిల్పి ప్రవర్తించే భక్తజనావళికి బ్రహ్మానందము యొక్క పరమానుభూతిని ప్రసాదిస్తాను. ఆ ఉపాయంతోనే భక్తులు నా సాయుజ్యమును పడయగలరు.

వ. ఇది సాయుజ్యావాప్తి ప్రకారం' బని చెప్పి వెండియు. 271

ప్రతిపదార్థం: ఇది = ఇపుడు నేను నుడివింది; సాయుజ్య+అవాప్తి ప్రకారంబు = సాయుజ్యమనే మోక్షం పొందునట్టి విధానం; అని చెప్పి; వెండియున్ = మళ్ళీ, (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఇది సాయుజ్యమనే ముక్తిని పొందే విధమని గౌరికి చెప్పి శంకరుడు మళ్ళీ ఇట్లా అన్నాడు.

క. శివలింగ స్థాపనముఁ త్రి । భువనములం బరమహితము పొంటెం గరుణన్
ధవళాక్షి! చేసితిం ద । త్ప్ర విమల లింగమున నన్ను భావించు టుఱున్. 272

ప్రతిపదార్థం: ధవళ+అక్షి! = ఓ తెలికన్నుల చెలీ!; పరమహితము పొంటెన్ = మిక్కిలిమేలు కలిగించేటందుకు; కరుణన్= కృపతో; త్రిభువనములన్ = ముల్లోకాలలో; శివలింగస్థాపనమున్+చేసితిన్ = శివలింగాలను ప్రతిష్ఠించాను; తత్ = ఆ యొక్క ప్రవిమల లింగమునన్ = నిర్మలమైన లింగంలో; నన్నున్ = నన్ను; భావించుట= తలంచటం, స్మరించటం; ఉఱున్= తగును.

తాత్పర్యం: శైలకుమారీ! ముజ్జగాలకు మేలు చేయదలచి దయతో నేనే శివలింగాలను స్థాపించాను. ఆ పవిత్రమైన లింగాలను నాస్వరూపంగా ఎంచి పూజించటం సముచితం.

చ. కలమెయిఁ బాల నేత నుదకంబులనేని వరాభిషేక మం
గళము నొనర్చి భక్తి రతి గంధము మాల్యము ధూప దీప సం
కలనములన్ నివేద్యమును గాఢ సమర్పణ మొందఁ జేసి లిం
గలసితమూర్తియందు ననుఁ గాంచి భజించిన ముక్తి చేకుఱున్.' 273

ప్రతిపదార్థం: కలమెయిన్ = ఉన్నంతలో, తన శక్తికి తగినట్లు; పాలన్ = క్షీరంతో; నేతన్ = నేయితో; ఉదకంబులన్+ఏనిన్

= నీళ్ళతో నైనా; వర+అభిషేకమంగళము = శ్రేష్ఠమైన మజ్జనమనెడు శుభమును; ఒనర్చి = చేసి; భక్తిరతిన్ = భక్తితత్పరతతో; గంధమున్ = చందనం; మాల్యమున్ = పూలదండలు; ధూపదీప సంకలనములన్ = సాంబ్రాణి పొగవేయటం, దీపమును వెలిగించి చూపటం అనే ఉపచారాల యొక్క కూడికతో; నివేద్యమును = నైవేద్యాన్ని; గాఢసమర్పణము+ఒందన్+చేసి = అధికపూజ్యభావంతో సమర్పణ కావించి; లింగలసిత మూర్తి+అందున్ = శివలింగము యొక్క ఒప్పిదమైన స్వరూపమందు; ననున్ = నన్ను; కాంచి = దర్శించి; భజించినన్ = కొలిస్తే; ముక్తి = మోక్షం; చేకుఱున్ = లభిస్తుంది.

తాత్పర్యం: పార్వతీ! తన శక్తికి తగినట్లు క్షీరంతోనూ, ఘృతంతోనూ, లేదా జలంతోనైనా లింగమునకు అభిషేకం సల్పి భక్తితో గంధపుష్ప ధూపదీప నైవేద్యములు సమర్పించి ఆ శివలింగమునందు పరమేశ్వరుడనైన నన్ను దర్శించి భజించే భక్తులకు ముక్తి లభిస్తుంది.'

క. అని పలికి 'నీవు దేవాం । గన లాదిగఁ గల త్రిలోక కాంతలకును మ్రొ
క్కనకుం బాత్రం బగు పద । వనజంబులు గల్గి యొప్పు వరసతి వతివా!. 274

ప్రతిపదార్థం: అని పలికి = అని ఈశ్వరుడు వచించి; అతివా! = ఓ భామినీ!; నీవు; దేవ+అంగనలు = దేవతాస్త్రీలు, వేల్పుబోటులు; ఆదిగన్+కల = మొదలుగా గల; త్రిలోక కాంతలకును = ముల్లోకాల లోని ముగుదలందరికినీ; మ్రొక్కనకున్ = వారు నమస్కరించుటకు; పాత్రంబు+అగు = అర్హమైన; పదవనజంబులు = పద్మముల వంటి పాదాలు; కల్గి = కలిగిన దానవై; ఒప్పు = ప్రకాశించే; వర సతివి = ఉత్తమ పతివ్రతవు కదా!

తాత్పర్యం: ఆ విధంగా గిరిజతో పలికి శంకరుడు ఆమెను చూచి 'ప్రాణేశ్వరీ! నీవు దేవతా స్త్రీలు మొదలుగా ముజ్జగాలలోని వెలదులందరి మ్రొక్కులు స్వీకరించ దగిన పాదపద్మాలు గల పతివ్రతాశిరోమణివి సుమా!'

క. చతురవు వివేక విభవో । న్నత చిత్తవు వ్రతవిధాన నైష్ఠికతా సం
యుత మతివి లౌకిక జ్ఞా । నితా మహిమ సహజమతి వనిందిత వరయన్. 275

ప్రతిపదార్థం: చతురవు = నేర్పుగల దానవు, చురుకైన దానవు; వివేక విభవ+ఉన్నత చిత్తవు = యథార్థ జ్ఞానం యొక్క ఆధిక్యంతో కూడిన పెద్ద మనసు కలదానవు; వ్రత విధాననైష్ఠికతా సంయుత మతివి = నోములు నోమటంలో ఆసక్తితో కూడిన మనసు కల దానవు; లౌకిక జ్ఞానితా మహిమ సహజమతివి = లోకసంబంధమైన జ్ఞానం యొక్క గొప్పతనం పుట్టుకతోనే వచ్చిన చిత్తం కలదానవు; అరయన్ = పరిశీలించగా; అనిందితవు = మాటపడని దానవు, దూరులేని దానవు.

తాత్పర్యం: గౌరీ! నీవు నేర్పు కలిగిన దానవు, యథార్థజ్ఞాన వైభవంతో కూడిన దొడ్డమనసు కలదానవు, వ్రత విధానములందు నిష్ఠతో కూడిన చిత్తం కలదానవు, సహజంగా వచ్చిన లోకజ్ఞానంతో కూడిన హృదయం కల దానవు. నీవు మాటపడని దానవు.

క. కావునఁ గాంతా ధర్మము । నీ వలనం దెలియువేడ్క నెమ్మనమున నా
కావిర్భవించెఁ; జెప్పం । గా వలయును దాని వికచకమలదళాక్షీ!.' 276

ప్రతిపదార్థం: కావునన్ = కాబట్టి; వికచకమల దళ+అక్షీ! = వికసించిన తామర రేకుల వంటి నేత్రములు కలదానా!; కాంతా ధర్మమున్ = స్త్రీ ధర్మాన్ని; నీవలనన్ = నీ మూలంగా; తెలియు వేడ్క = తెలిసికొనవలెననే ఇచ్ఛ, కుతూహలం; నెమ్మనమునన్ (నెఱ+మనమునన్) నా నిండు మనసులో; ఆవిర్భవించెన్ = జనించింది; దానిన్ = మహిళా ధర్మాన్ని; చెప్పన్+కాన్+వలయున్ = నీవు చెప్పాలి.

తాత్పర్యం: ప్రాణేశ్వరీ! వనితా ధర్మం ఎట్లాంటిదో నీ వలన తెలియవలెననే కుతూహలం నా హృదయంలో కలిగింది. కనుక స్త్రీ ధర్మం ఎట్టిదో నీవు చెప్పాలి.'

ఆ. అనిన సిగ్గుతోడి యలఁతి న వ్వొలసిన । చెన్ను మొగము వింత చెలువుఁ దాల్ప
వాంచి యెత్తి గౌరి వరునితో నిట్లను । 'నేను మీకుఁ దెల్ప నెంతదాన?. 277

ప్రతిపదార్థం: అనినన్ = అని శివుడు తన్నడుగగా; సిగ్గుతోడి = లజ్జతో కూడిన; అలఁతినవ్వు = చిరునగవు, చిన్నినవ్వు, పిన్న నవ్వు; ఒలసిన = వ్యాపించిన; చెన్ను మొగము = సుందరమైన వదనం; వింత చెలువున్+తాల్పన్ = కొత్త అందాన్ని పొందగా; వాంచి = సిగ్గు బరువున ముందు తలను వంచు కొన్నదై; ఎత్తి = భర్తకు బదులాడ వలసి ఉన్నందున వంచిన మొగం పైకెత్తి; గౌరి = గిరిసుత అయిన పరమేశ్వరి; వరునితోన్ = పెనిమిటి అయిన శంభుడితో; ఇట్లు+అనున్ = ఈ రీతిగా పలికింది; నేను = నేను; మీకున్ = సర్వజ్ఞులైన తమకు; తెల్పన్ = స్త్రీ ధర్మాన్ని మనవి చేయటానికి; ఎంత దానన్? = ఏ పాటిదాన్ని?

తాత్పర్యం: శివుడు స్త్రీధర్మం వివరించుమని అడిగినపుడు గౌరీదేవి సిగ్గుతో కూడిన చిన్నినవ్వు ఎగబ్రాకి తన అందమైన మోమునకు అపూర్వమైన సొబగును సమకూర్చగా వంచిన వదనాన్ని కొంచెం పైకెత్తి మగడితో ఇట్లా అన్నది. 'నాథా! తరుణీ ధర్మం ఎట్లాంటిదో తమకు నివేదించటానికి నే నేపాటిదాన్ని?

విశేషం: పాత్రల యొక్క స్వరూప రూప చిత్రణకౌశలం కవిబ్రహ్మ తిక్కన గారికి అలవడినట్లు సారస్వతరంగంలో మరేకవికి అలవడలేదన్న మాట పాతమాట. ఈ చిరుపద్యంలో పార్వతీ దేవిని పాఠకుల కట్టెదుట నిల్పినాడు బుధజన విరాజి తిక్కన సోమయాజి.

క. ఐనను మీరడిగిన మ । న్మానస బోధంబు కొలఁది మగువల తెఱఁగుల్
పూని వినిపింప కుండుట । దాన తగదు గాన చెప్పెదను సర్వజ్ఞా!' 278

ప్రతిపదార్థం: ఐనను = మీకు తెలుపునంతటిదాన్ని కాకున్నా; మీరు = తమరు; అడిగినన్ = తెలుపుమన్నప్పుడు; మగువల తెఱఁగుల్ = ఆడువారి తీరులు; మత్+మానస+బోధంబు కొలఁదిన్ = నాచిత్త మందలి తెలివి కొద్దీ; పూని = యత్నించి; వినిపింపక+ఉండుట = తెలియజేయకుండటం; తాన = అనునది; తగదు+కానన్ = యుక్తం కాదు కనుక; సర్వజ్ఞా! = సమస్త మెరింగిన స్వామీ!; చెప్పెదను = వచిస్తాను, మనవి చేస్తాను.

తాత్పర్యం: సర్వజ్ఞుడవైన స్వామీ! మీరు స్త్రీ ధర్మ మెట్టిదో తెలుపుమని అడిగినప్పుడు నాకు తెలిసినంతవరకు చెప్పకుండటం మంచిది కాదు కనుక మనవి చేస్తాను.'

క. అని పలికి మఱియు నిట్లను । 'నను నెప్పుడుఁ బాయకుండు నదు లెల్లను; న
వ్వనితలతోడ సమాలో । చన మొనరించి మఱి చెప్పఁ జను నిత్తెఱఁగున్.' 279

ప్రతిపదార్థం: అని పలికి = అని గౌరి వచించి; మఱియున్ = ఇంకా; ఇట్లు+అనున్ = ఈ లాగున చెప్పింది; ననున్ = నన్ను; ఎప్పుడున్ = అన్ని వేళల; నదులు+ఎల్లను = నదులన్నియూ; పాయక+ఉండున్ = విడిచి పెట్టక నాతోనే ఉంటాయి;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ+వనితల తోడన్ = ఆ మగువలతో, ఆ నదీమతల్లులతో; సమాలోచనము+ఒనరించి = యోచించి, సంప్రదించి; మఱి = పిదప, పిమ్మట, తరువాత; ఈ+తెఱఁగున్ = మీ రడిగిన తరుణీ ధర్మాలను; చెప్పన్+అగున్ = చెప్పదగును, చెప్పుతాను.

తాత్పర్యం: గౌరి మహేశ్వరుడితో అట్లా పలికి మళ్ళీ ఇట్లా అన్నది. 'దేవా! నదులెల్లను ఎల్లవేళల నన్ను విడువకుండా ఉంటాయి. ఆ నదీమతల్లులతో సంప్రదించిన తరువాత తా మడిగిన స్త్రీ ధర్మాలు ఎట్టివో మనవిచేస్తాను.'

వ. అని విన్నవించి గంగ యమున గోదావరి కౌశికి కావేరి కృష్ణవేణి పెన్న నర్మద బాహుద రేవ తమస మొదలైన నదులు మున్న తనతోడన వచ్చి యున్న నన్నాతుల గుఱించి 'యీశానుం డిట్లడిగెడు నెట్లు చెప్పద?' మనిన గంగాదేవి 'నీకంటె నే మెఱుంగుదుమే? నీ వెఱింగిన తెఱంగున నంగనాధర్మం బెఱింగించి పతిం బ్రీతునిం జేయు; మేము భవదీయ వాగమృతంబు వీనుల నినిచెద' మనుటయుఁ బార్వతి ప్రసన్నచిత్తయై వల్లభు వదనంబునం జూడ్కి నిలిపి. 280

ప్రతిపదార్థం: అని, విన్నవించి = మనవి చేసికొని; గంగ = భాగీరథి; యమున = కాళింది; గోదావరి = గౌతమి; కౌశికి, కావేరి, కృష్ణవేణి, పెన్న = పినాకిని; నర్మద, బాహుద, రేవ, తమస, మొదలు+ఐన = మున్నుగా కలిగిన; నదులు; మున్ను+అ = ముందుగానే; తన తోడను+అ; వచ్చి+ఉన్నన్ = వచ్చిఉండగా; ఆ+నాతులన్ గుఱించి = ఆ మగువల (నదుల) నుద్దేశించి, ఆ నదులతో; ఈశానుండు = ఈశ్వరుడు; ఇట్లు; అడిగెడున్ = అడుగుతున్నాడు; ఎట్లు; చెప్పుదము = సమాధానమిస్తాము; అనినన్; గంగాదేవి; నీ కంటెన్; ఏము = మేము; ఎఱుంగుదుము+ఏ; నీవు; ఎఱింగిన; తెఱంగునన్ = విధమున; అంగనా ధర్మంబు = స్త్రీ ధర్మం; ఎఱింగించి; పతిన్ = భర్తను; ప్రీతునిన్+చేయుము = సంతోషించిన వానిగా సల్పుము; ఏము = మేము, భవదీయ = నీ యొక్క; వాక్+అమృతంబు = వచనములనెడు సుధారసం; వీనులన్ = చెవులలో; నినిచెదము = నిండించెదము; అనుటయున్ = అని చెప్పగా; పార్వతి; ప్రసన్నచిత్త+ఐ = సంతుష్టాంతరంగఅయి, అనుగ్రహ యుక్తమగు మనస్సు గలదై; వల్లభు వదనంబునన్ = పెనిమిటి యొక్క ముఖమునందు; చూడ్కి నిలిపి = చూపులు ప్రసరింపజేసి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అంబికాదేవి అట్లా పలికి గంగ, యమున, గోదావరి, కావేరి, కృష్ణవేణి, పెన్న, బాహుద, రేవ, తమస మున్నగు వాహినులు మునుపే తనతో అక్కడికి వచ్చి ఉన్నందున వాటిని చూచి 'ఓ చెలులారా! శివదేవుడు స్త్రీ ధర్మ మెఱింగింపుమని కోరినాడు. మన మేమి చెప్పవలెనో చెప్పండి' అని అడిగింది. అందుకు గంగాదేవి ఆమెతో 'అమ్మా! నీకంటె స్త్రీ ధర్మాలు మా కేమి తెలుసు? నీకు తెలిసిన విధంగా నీవే అతివల ధర్మాలు అభవున కెరిగించి సంతోషపెట్టుము. మేము నీ వాక్యామృతాన్ని వీనుల విందుగా ఆస్వాదించి హర్షిస్తాము' అని పలికింది. అప్పుడు ఉమాదేవి ప్రసన్నురాలై పతిముఖారవిందం మీద చూపు నిలిపి (ఇట్లా చెప్పింది).

క. 'దేవా! నీదు ప్రసాద । శ్రీ వచ్చిన యెఱుక సుందరీవిధము భవ
ద్భావంబునకుఁ బ్రియంబుగ । సేవాధర్మంబుఁ దెలియఁ జెప్పెద' ననియెన్. 281

ప్రతిపదార్థం: దేవా! = ప్రభూ!; నీదు ప్రసాదశ్రీన్ = నీ అనుగ్రహసంపత్తిచే; వచ్చిన = లభించిన; ఎఱుకన్ = తెలివితో, జ్ఞానంతో; సుందరీ విధము = స్త్రీల యొక్క తీరు, స్వభావమును; భవత్+భావంబునకున్ = నీ యొక్క చిత్తమునకు; ప్రియంబుగన్ = ఇంపుగా, ఇష్టంగా; సేవాధర్మంబున్ = ఉపచారధర్మాన్ని; తెలియన్+చెప్పెదన్ = నీ వెరుంగునట్లు వచిస్తాను; అనియెన్ = అని చెప్పింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'ప్రభూ! మీ పరమానుగ్రహంవలన లభించిన తెలివితో స్త్రీల స్వభావాన్ని, వారిసేవాధర్మాన్ని మీ మనస్సునకు ఇంపుగ తెలియ జెప్పుతాను' అని పలికింది.

తే. అనిన విని సురమునులు ప్రియంబుఁ బొంది । రమర గంధర్వ సిద్ధ సాధ్యాంగనా జ
నంబు వినువేడ్క వచ్చి య న్నలినవదన । వెనుక దెసనుండె దేవకీతనయ! యపుడు. 282

ప్రతిపదార్థం: అనినన్ = గౌరి అట్లావచింపగా; సురమునులు = దేవతలు, ఋషులు; విని = ఆలించి; ప్రియంబున్+పొందిరి = సంతోషం చెందారు; దేవకీతనయ = శ్రీకృష్ణా!; అమర = వేల్పులు; గంధర్వ = గంధర్వులు; సిద్ధ = సిద్ధులు; సాధ్య = సాధ్యులు అనే వారి యొక్క; అంగనాజనంబు = స్త్రీ సమూహం; విను వేడ్కన్ = ఉమాదేవి మాటలు వినవలె నన్న కుతూహలంతో; వచ్చి = ఏతెంచి; ఆ+నలిన వదన వెనుక దెసన్ = ఆ పద్మముఖి యొక్క వెనుక వైపు; అపుడు = ఆ సమయాన; ఉండెన్ = ఉన్నది.

తాత్పర్యం: శైలజ మాటలు విని దేవతలు, మునులు హర్షించారు. సురలు, గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు అనే దేవజాతుల యొక్క వనిత లందరూ ఆమె పలుకులు వినే కుతూహలంతో వచ్చి ఆమె వెనుక వైపు కూర్చొని ఉన్నారు కృష్ణా!

వ. అని చెప్పి య ప్పురుషోత్తము వీనులు వికసిల్లుచుండ నారదుం డిట్లనియె. 283

ప్రతిపదార్థం: అని చెప్పి, ఆ+పురుష+ఉత్తము = ఆ శ్రీకృష్ణ భగవానుడి యొక్క; వీనులు = చెవులు, వికసిల్లుచున్+ఉండన్ = విప్పారగా; వినవలెనని కుతూహల పడుచుండగా; నారదుండు, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: గౌరీదేవి మాటలు వినవలెనని కుతూహలంతో శ్రీకృష్ణుని కర్ణములు విప్పారగా నారదమహర్షి ఇట్లా అన్నాడు.

పార్వతి శివునకుఁ బతివ్రతా ధర్మంబుల తెఱఁ గెఱింగించుట.

క. వనితలుఁ బురుషులుఁ బ్రియమున । దను వినుతింపంగ శైలతనయ సమాక
ర్ణనకౌతుకి యగు నీశా । నునితో మృదురీతి నిట్లనుం గమలేశా! 284

ప్రతిపదార్థం: కమలా+ఈశా = లక్ష్మీ వల్లభా! కృష్ణా!; వనితలున్ = ఆడువారు; పురుషులున్ = మగవారు; ప్రియమునన్ = ఇష్టంగా; తనున్ = తనను; వినుతింపంగన్ = కొనియాడగా, స్తోత్రం చేయగా; శైలతనయ = హిమవంతుడి కూతురైన ఉమాదేవి; సమాకర్ణన కౌతుకి = వినుటయందు కుతూహలం కలవాడైన; ఈశానునితోన్ = శంభుడితో; మృదురీతిన్ = కోమల ఫణితితో; ఇట్లు+అనున్ = ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: స్త్రీలు, పురుషులు ప్రీతితో తనను స్తుతిస్తూ ఉండగా పర్వత రాజపుత్రిక తన పలుకులు వినుటకు కుతూహలపడుతున్న పరమేశ్వరుడితో కోమల కంఠస్వరాన ఇట్లా అన్నది.

సీ. 'ఋతుమతి గాక శుద్ధతయుఁ గల్గినయింతి । కన్య తత్పరిణయ కరణమునకు
నొడయులు విను తల్లియును దండ్రియును దండ్రి । తోఁ బుట్టినతఁడు మాతులుఁడు సోద
రుండును యోగ్యవరునిఁ జూచి వారిలో । నెవ్వరైనను బ్రీతి నిచ్చువారు;
పతి యంతనుండియుఁ బ్రభువు దానికి; నట్లు । గావున నాతండ దైవ మనుచు

తే. నతని మత మూఁది దేవతా పితృ సమర్చ । నములు నతిథి పూజనము సన్మతి సమాచ
రించుచును బతిహితము వాటించి నడపు । సతి పతివ్రత యిహపరసౌఖ్యమహిత. 285

ప్రతిపదార్థం: ఋతుమతి+కాక = పుష్పవతి కాక, సమర్తాడక; శుద్ధతయున్ = పరిశుద్ధత్వం; కల్గిన+ఇంతి = కలిగినటువంటి పిన్నది; కన్య = బాల అని చెప్పబడుతుంది; తత్+పరిణయ కరణమునకున్ = ఆ చిన్నదానికి పెళ్ళి చెయ్యడానికి; తల్లియును = జనని; తండ్రియును = జనకుడున్నూ; తండ్రితోఁ బుట్టిన+అతఁడున్ = తండ్రి యొక్క తోడబుట్టువు అనగా పినతండ్రి, చిన్నాయన, బాబాయి; మాతులుఁడున్ = మేనమామ అనగా తల్లి తోడబుట్టువు; సోదరుండును = ఆ బాలిక యొక్క తోడబుట్టిన వాడు; ఒడయులు = అధికారులు, కర్తలు; యోగ్యవరునిన్ = తగిన మగడిని; చూచి = కనుగొని; వారిలోన్ = పైనుడివిన వారిలో; ఎవ్వరు+ఐననున్ = ఎవ్వరో ఒక్కరు; ప్రీతిన్ = సంతోషంతో; ఇచ్చువారు = వరుడికిచ్చి పెళ్ళి చెయ్యటానికి అర్హులు; దానికిన్ = ఆ కన్నియకు; అంతన్+ఉండియున్ = పెళ్ళి అయినప్పటి నుండి; పతి = భర్తయే; ప్రభువు = నాయకుడు, పాలకుడు; అట్లు+కావునన్ = అందుచేత; ఆతండు+అ = ఆ పెనిమిటియే; దైవము+అనుచున్ = దేవుడంటూ; అతనిమతము+ఊఁది = అతడి ఇష్టము ననుసరించి, అతడి అభిప్రాయం ప్రకారం; దేవతా పితృసమర్చనములు = దేవతల యొక్క పితృదేవతల యొక్క పూజలు; అతిథి పూజనము = అతిథులను ఆదరించుటయు; సన్మతిన్ = మంచి మనస్సుతో; సమాచరించుచును = నిర్వర్తిస్తూ; పతిహితమున్+పాటించి = మగని యొక్క మేలు కోరి; నడపు = సంసార యాత్ర సాగించే; సతి = వనితయే; పతివ్రత = సాధ్వి; ఇహపర సౌఖ్యమహిత = ఆమెయే ఇహపర సుఖాలు పొందటంలోదొడ్డది.

తాత్పర్యం: పుష్పవతి గాక పరిశుద్ధురాలుగా ఉండే పిన్నదాన్ని కన్య అంటారు. ఆ చిన్నదానికి పెళ్ళి చేసే విషయంలో కర్తలు తల్లి, తండ్రి, పినతండ్రి, మేనమామ, అన్నదమ్ములు. వీరిలో ఎవ్వరైనా ఆ బాలికను తగిన పురుషుడి కిచ్చి సంతోషంతో వివాహం జరిపించాలి. పరిణయం జరిగింది మొదలుకొని ఆమెకు పెనిమిటియే సర్వాధికారి. పతినే దైవంగా భావించి అతడి ఇష్టానుసారం ఆమె దేవతల, పితృదేవతల పూజలు, అతిథి పూజలు సద్బుద్ధితో సలుపుతూ మగనిమేలు కోరుతూ సంసారయాత్ర సాగించాలి. అట్లాంటి పడతియే పతివ్రత. అట్టి ఇల్లాలు ఇహపరలోక సుఖాలు చూరగొంటుంది.

వ. ఏతద్విషయం బయిన యొక్క నిదర్శనం బవధరింపుము. 286

ప్రతిపదార్థం: ఏతద్+విషయంబు+అయిన = ఈ స్త్రీ ధర్మమునకు సంబంధించిన; ఒక్కనిదర్శనంబు = ఒక దృష్టాంతం; అవధరింపుము = చిత్తగించవలసింది;

తాత్పర్యం: దేవా! ఈ స్త్రీ ధర్మ విషయకమైన దృష్టాంతం ఒకటున్నది. విన్నవిస్తాను. చిత్తగించ ప్రార్థన.

సీ. బ్రాహ్మణుఁ డొకనికి భార్య లిద్దఱు గల; । రందొక భామిని యతని హితము
నడపెడు నవధాన మెడలి యాతఁడు పంప । కయుఁ దాన సురపితృకార్యపరత
నడచుఁ; దక్కటియింతి నాథుఁ బాటించుచుఁ । దన్మతంబునఁ జేయు ధర్మవిధులు;
వారు ముువ్వురు విధివశమున నొక్కట । మృతిఁ బొంది; రా పతివ్రత వరుండు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. చనిన సుగతికిఁ జనెఁ; బెఱవనిత జముఁడు । 'నీకుఁ బోలదు మరలుము నీశరీర
మునక' యని యాఁగె; నది శోకమున సబాష్ప । యైనఁ గన్గొని యతఁడు దయార్ద్రుఁ డగుచు. 287

ప్రతిపదార్థం: బ్రాహ్మణుఁడు+ఒకనికిన్ = ఒక విప్రుడికి; భార్యలు+ఇద్దఱు = ఇరువురు పత్నులు; కలరు = ఉన్నారు; అందున్ = వారిలో; ఒక భామిని = ఒక చెలువ; అతని హితమున్ = అతడి కిష్టమైన దానిని; నడపెడున్ = సలుపుతుంది; ఆతఁడు = ఆమె భర్త; అవధానము+ఎడలి = ఏకాగ్రత చెడి, జ్ఞప్తి లేక, ఎఱుకమాలి; పంపకయున్ = ఆజ్ఞాపించకున్ననూ, తనను ఆ పనిచేయుమని నియమించకున్ననూ; తాను+అ = తానే, స్వయంగా; సురపితృకార్యపరతన్ = దేవ, పితృదేవతా పూజాదికములైన పనులయందు ఆసక్తితో; నడచున్ = ప్రవర్తిస్తూంటుంది, మెలగుతుంటుంది; తక్కటి+ఇంతి = రెండవపత్ని; నాథున్+పాటించుచున్ = భర్తమాట, భర్త అనుమతి ఆదరిస్తూ, లక్ష్యపెడుతూ; తత్+మతంబునన్ = అతడి ఇష్టానుసారం; ధర్మవిధులు = పుణ్యకార్యాలు; చేయున్ = సల్పుతుంది; వారు ముప్వురున్ = భర్త, భార్యలిద్దరూ; విధివశమునన్ = దైవాజ్ఞకులోనై; ఒక్కట = ఏకకాలమందు; మృతిన్+పొందిరి = మరణించారు; ఆ పతివ్రత = ఆసాధ్వి అనగా రెండవ యిల్లాలు; వరుండు = మగడు; చనినసుగతికిన్ = వెళ్ళిన పుణ్యలోకానికి, స్వర్గానికి; చనెన్ = వెళ్ళింది; పెఱవనితన్ = తక్కిన వెలదిని- అనగా మొదటి భార్యను; జముఁడు = యమధర్మరాజు; నీకున్ = నీకు; పోలదు = తగదు; నీ శరీరమునకు+అ = నీ దేహమునకే; మరలుము = తిరిగిపొమ్ము; అని = అని పలుకుతూ; ఆఁగెన్ = నిలిపినాడు; అది = ఆ మొదటి పెండ్లం; శోకమునన్ = ఏడుపుతో; సబాష్ప+ఐనన్ = కన్నీటి బొట్లతో కూడినది కాగా; కన్గొని = చూచి, అతఁడు = యముడు; దయా+ఆర్ద్రుఁడు+అగుచున్ = కృపారసముతో తడిసిన వాఁడై, దయతో చెమ్మగిల్లిన మనసుకలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: ఒకానొక బ్రాహ్మణుడికి ఇద్దరు భార్యలు. వారిలో ఒకతె (తొలిది) మగని కుశలం కోరి, తనను ఈ పనిచేయుమని అతడు నియోగించక పోయినా దేవతలకు, పితృదేవతలకు పూజాదికం నిర్వహించేది. మరి యొకతె (మలిది) పతి మాట జవదాటక అతడి ఆజ్ఞ పడసి పుణ్యకార్యాలు సలిపేది. వారు ముప్వురూ విధివశాత్తు ఏకకాలంలోనే చనిపోయారు. అందులో పెనిమిటి అనుమతితో ధర్మకార్యాలు సలుపుతున్న మలిఇల్లాలు అతడి వెంట పుణ్యలోకానికి వెళ్ళింది. భర్త అనుమతి లేకుండా దేవ పితృపూజలు నిర్వహిస్తున్న తొలి పెళ్ళాన్ని పెనిమిటితో స్వర్గానికి పోకుండా యముడు అడ్డగించి 'నీ శరీరానికి తిరిగి మరలు' మని ఆదేశించాడు. అందుకు ఆమె కన్నీరు మున్నీరుగా విలపించింది. యముడి హృదయం కరుణారసంతో కరిగి పోయింది.

క. 'పతిమతము గొనక ధర్మము । నతివ నడపు టొప్ప; దింకనైనను బతికిన్
హితము లగువానిఁ జేసిన । నతనిఁ గలయు' దనినఁ జనియె నదియును మరలన్. 288

ప్రతిపదార్థం: పతిమతము+కొనక = భర్త యొక్క అంగీకారం పొందక; ధర్మమున్ = పుణ్యమును; అతివ = పత్ని; నడపుట = చేయటం; ఒప్పదు = తగదు; ఇంకన్+ఐననున్ = ఇక మీదటనైనా; పతికిన్ = భర్తకు; హితములు+అగువానిన్ = ఇష్టములైనవాటిని; చేసినన్ = చేసినట్లయితే; అతనిన్ = యజమానుడిని; కలయుదు = కలిసికొంటావు; అనినన్ = అని యముడు చెప్పగా; అదియును = ఆ తొలిపత్ని; మరలన్ = మళ్ళీ, తిరిగి; చనియెన్ = వెళ్ళింది.

తాత్పర్యం: పెనిమిటి యొక్క అనుమతిలేక పుణ్యకార్యాలు చేయటం భార్యకు తగదు. ఇకనైనా నీ పతి కిష్టములైన కార్యాలను నీవు చేస్తున్నట్లయితే అతడిని కలిసికొనగలవు' అని యమధర్మరాజు చెప్పాడు. ఆయన మాటలు విని ఆమె దేహంతో మరలిపోయింది.

వ. కావునం బతికి ననువ్రత యగుట గృహిణికి ధర్మం' బని పలికి వెండియు. 289

ప్రతిపదార్థం: కావునన్ = కాబట్టి, పతికిన్ = భర్తకు, అనువ్రత+అగుట = అనుకూలంగా మెలగటం; గృహిణికిన్ = ఇల్లాలికి; ధర్మంబు = న్యాయం; అని పలికి; వెండియున్ = మరల (పార్వతి శివుడితో ఇట్లా అన్నది అని తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: కాబట్టి భర్తకు అనుకూలంగా మెలగటం ఇల్లాలికి ధర్మమని చెప్పి పార్వతి మళ్ళీ.

క. 'లలన యిలువాడి నాథుఁడు । వలచిన చవి వంటకములు వండి యిడి తనుం
గలయఁ దలంచిన మెయికొని । యెలమిం గైసేసి హృదయ మీ వలయు శివా! 290

ప్రతిపదార్థం: శివా! = మహేశ్వరా!; లలన = కాంత; ఇలువాడిన్ = ఇంటి వాడుక చొప్పున; నాథుఁడు = తనపతి; వలచిన = కోరినట్టి; చవివంటకములు = రుచిగల పదార్థాలు; వండి+ఇడి = వండి తినబెట్టి; తన్నున్ = తనను; కలయన్+తలంచినన్ = పొందగోరినచో; మెయికొని = అందుకు అంగీకరించి, ఇష్టపడి; ఎలమిన్ = సంతోషంతో; కైసేసి = అలంకరించుకొని; హృదయము = తన మనస్సు; ఈవలయున్ = సమర్పించవలెను.

తాత్పర్యం: ఇంటి వాడుక ననుసరించి భర్త తన కిష్టములైన వంటకములు వాంఛించినపుడు గృహిణి వండి పెట్టాలి. అతడు తన పొందు కోరినపుడు సంతోషంతో తన సమ్మతి తెలిపి శృంగారించుకొని తన హృదయం ఆతడికి సమర్పించాలి.

తే. పనుల యెడ మాఱుపలుకక యనవధానుఁ । డైన పతిఁ దలఁపించి ధర్మార్థ కలిత
కృతులు నడపుచు, సవతి గల్గినను బోరి । తంబు లే కొక్కటై యున్కి తగవు సతికి. 291

ప్రతిపదార్థం: పనులయెడన్ = కార్యాలపట్ల; మాఱుపలుకక = అడ్డు చెప్పక, ప్రతికూలంగా మాట్లాడక; అనవధానుఁడు +ఐన+పతిన్ = ఏమరిపాటు చెందిన భర్తను; తలఁపించి = కర్తవ్యాన్ని జ్ఞప్తి పరచి; ధర్మ+అర్థ+కలితకృతులు = ధర్మార్థములతో కూడినపనులు అనగా ధర్మమును అర్థమును ఆర్జించుటకు తోడ్పడే పనులు; నడపుచున్ = కొనసాగిస్తూ; సవతి+కల్గినను = సపత్ని ఉన్నను; పోరితంబు లేక = కలహం లేకుండా; ఒక్కటి+ఐ+ఉన్కి = ఆమెతో కలసి మెలసి ఉండటం; సతికిన్ = సాధ్వికి; తగవు = న్యాయం.

తాత్పర్యం: గృహిణి తన భర్త కావించే పనులకు అడ్డుపడరాదు. ఆతడు ఏమరిపాటున కర్తవ్యం మరచి ఉన్నప్పుడు ఆ విషయమును జ్ఞప్తికి తేవాలి. ధర్మార్థసాధకాలైన పనులు కొనసాగేటట్లు చేయాలి. తనకు సవతాలు ఉన్నప్పుడు కలహించక ఆమెతో కలసిమెలసి ఉండాలి. ఇది సతీ ధర్మం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. సవతాలికిఁ బతి వలచిన । నవుఁగాకని యతని యిచ్చ కనురూపముగాఁ
దివిరి నడచు సతి దైవము; । శివ! యది తగు నెల్ల జనముచే మ్రొక్కుగొనన్. 292

ప్రతిపదార్థం: శివ! = పరమేశ్వరా!; పతి = భర్త; సవతి+ఆలికిన్ = తన సపత్నికి; వలచినన్ = మోహపడితే; అవున్+కాక+అని = అది మంచిదే అని; అతని+ఇచ్చకున్ = మగని కోరికకు; అనురూపముగాన్ = తగినట్లుగా, అనుకూలంగా; తివిరి = పూను కొని; నడచు సతి = మెలగే వనిత; దైవము = దేవతయే సుమా! అది = ఆ ఇల్లాలు; ఎల్ల జనముచేన్ = సమస్త ప్రజల చేత; మ్రొక్కు+కొనన్+తగున్ = నమస్కారా లందుకొనడానికి యోగ్యురాలు.

తాత్పర్యం: నాథా! తన మగడు తనను విడిచి తన సవతాలి పొందు కాంక్షించినపుడు చింతించక అది మంచిదే అని అతడి అభిలాషకు అనుకూలంగా మెలగే సతీమణి నిజంగా దేవతయే. ఆమె ప్రజలందరి వందనా లందుకొనటానికి అర్హురాలు.

క. తన చేతికి నిచ్చిన వ । స్తునికాయము నిల్లురువున చొప్పున మగుడం
గొనివచ్చి భార్య పతి దె । మ్మని నప్పుడ యిచ్చుటొప్పు నకపటవృత్తిన్. 293

ప్రతిపదార్థం: తన చేతికిన్, ఇచ్చిన, వస్తునికాయమున్ = వస్తువుల సమూహాన్ని; ఇల్లురువున చొప్పునన్ = ఇల్లడ ధనం మాదిరిగా, కుదువ బెట్టిన వస్తువులరీతిగా, న్యాసధనం పోలికగా; మగుడన్ = తిరిగి; కొని వచ్చి = తీసుక వచ్చి; భార్య = పత్ని; పతి = తన పెనిమిటి; తెమ్ము+అనిన+అప్పుడు+అ = తీసుక రమ్మని చెప్పిన వెనువెంటనే; అకపట వృత్తిన్ = మోసగించక, వంచించక, నిష్కపటమైన బుద్ధితో; ఇచ్చుట = పెనిమిటి కొప్పగించుట; ఒప్పున్ = తగును.

తాత్పర్యం: మగడు తన చేతి కిచ్చిన వస్తువులను అతడు తెమ్మని అడిగిన వెను వెంటనే కుదువ బెట్టిన సొమ్ము మాదిరిగా భద్రంగా వంచనారహితమైన వర్తనతో అతడికి అప్పగించటం భార్యయొక్క ధర్మం.

క. పతి తనకు నేమి యిచ్చిన । నతిముదమునఁ బొందవలయు; నాత్మజుఁ డైనన్
మతిఁ గొంకక యేకాంత । స్థితి నేకాసనత నున్కి సెట్ట ప్రమదకున్. 294

ప్రతిపదార్థం: పతి = భర్త; తనకున్, ఏమి, ఇచ్చినన్; అతివ = స్త్రీ; ముదమునన్+పొందన్+వలయున్ = సంతోషపడవలసి ఉంటుంది; ఆత్మజుఁడు+ఐనన్ = కన్నకుమారుడైనా; మతిన్ = మనస్సులో; కొంకక = సంకోచించక, భయపడక; ఏకాంతస్థితిన్ = ఒంటరిగా ఉన్నప్పుడు, రహస్యంగా ఉన్న చోట; ప్రమదకున్ = స్త్రీకి; ఏక+ఆసన+స్థితి = ఒకే పీఠమందుండటం; చెట్ట = కీడు, హానికరం.

తాత్పర్యం: భర్త తన కేమి ఇచ్చినా భార్య సంతోషంతో స్వీకరించాలి. కడకు కన్నకుమారుడితోనైనా స్త్రీ ఒంటరిగా ఉన్నప్పుడు ఒకే పీఠం మీద జంకు గొంకులు లేకుండా కూర్చొనటం హానికరం.

క. ధని యధనుఁడు రూపసి యొ । ప్పనివాఁడు వివేకి మూఢభావుఁ డరోగుం
డనుగత రోగుఁ డనక యం । గన పతిఁ బాటింపవలయుఁ గామధ్వంసీ! 295

ప్రతిపదార్థం: కామధ్వంసీ! = మన్మథుడిని కాల్చిన వాడా!; ధని = ధనం కలవాడు; అధనుఁడు = ధనంలేని వాడు, దరిద్రుడు; రూపసి = అందగాడు; ఒప్పనివాఁడు = అందం లేనివాడు, కురూపి; వివేకి = తెలివికలవాడు; మూఢభావుఁడు = తెలివిమాలినవాడు; అరోగుండు = రోగం లేనివాఁడు, ఆరోగ్యవంతుడు; అనుగత రోగుఁడు = వెంబడించే రోగాలు కలవాడు, అనారోగ్యవంతుడు; అనక = అని భావించక; అంగన = ఆడుది; పతిన్ = భర్తను; పాటింపన్+వలయున్ = ఆదరించవలెను.

తాత్పర్యం: కాముని సంహరించిన కైలాసవాసా! ధనవంతుడు దరిద్రుడు; రూపవంతుడు రూపహీనుడు; తెలివిగలవాడు తెలివిమాలినవాడు; ఆరోగ్యవంతుడు అనారోగ్యం కలవాడు అని తలంపక ఆడుది తన పెనిమిటిని ఆదరించాలి.

క. బలిభిక్షము గడప కిడ । న్వలయును దేవపితృ పూజనంబుల కాలం
బులఁ బతి శుభమందుటఁ ద । త్ఫలంబుగాఁ గోరు టొప్పిదము సతికి శివా! 296

ప్రతిపదార్థం: శివా! = పరమేశ్వరా!; బలి = భూతముల (జంతువుల) కొరకు బలియు; భిక్షమున్ = యాచకులకు బిచ్చమూ; కడపక = లేదు పొమ్మనక; ఇడన్ వలయున్ = ఒసగవలెను; దేవ = దైవతములయొక్క; పితృ = పితృదైవతముల యొక్క; పూజనంబుల కాలంబులన్ = అర్చించే సమయములందు; పతి = తన విభుడు; శుభము+అందుటన్ = మంగళములు పొందటం; తత్+ఫలంబుగాన్ = ఆ దేవ పితృపూజల ఫలంగా; కోరుట = అభిలషించటం; సతికిన్ = పత్నికి; ఒప్పిదము = యుక్తము, యోగ్యము, తగినట్టిది.

తాత్పర్యం: భూతములకు (పశు పక్ష్యాదులకు) ప్రీతిగ బలి సమర్పణ కావించటం, యాచకులకు బిచ్చం పెట్టటం, దేవతలను, పితృదేవతలను పూజించే వేళలందు ఆ పూజాఫలమెల్ల తన భర్తకు శుభములు చేకూర్చటానికి ఉపయుక్తం కావాలని కోరుకొనటం ఇల్లాలి యొక్క ధర్మం.

క. గతి పతియ చువ్వె భార్యకు; । నతనిఁ గడచినట్టి సత్పరాయణము కృపా
యుత! కలదే? కావునఁ దా । నతనికి భక్తయగు టిచ్చు నఖిల శుభంబుల్.' 297

ప్రతిపదార్థం: కృపాయుత! = దయతో కూడిన వాడా!; భార్యకున్ = పత్నికి; గతి = దిక్కు; పతియ చువ్వె! = భర్తయే సుమా!; అతనిన్ = మగడిని; కడచిన+అట్టి = మించినట్టి; సత్+పరాయణము = ఉత్తమమైన ఆశ్రయం, పరమప్రాప్యమైన వస్తువు; కలదు+ఏ? = ఉన్నదా? లేదని భావం; కావునన్ = కాబట్టి; తాన్ = తాను; అతనికిన్ = పెనిమిటికి; భక్త+అగుట = భక్తురాలు కావటం, సేవలొనర్చటం; అఖిలశుభంబుల్ = సమస్త మంగళములను; ఇచ్చున్ = లభింపజేస్తుంది.

తాత్పర్యం: దయామయా! భార్యకు భర్తయే దిక్కు. అతడిని మించిన ఉత్తమమైన ఆశ్రయం ఆమెకు మరొక్కటి లేదు. కావున అతడికి సేవకురాలు కావటంవలన సతికి సర్వశుభాలు సమకూడుతాయి.'

వ. అని చెప్పి య ప్పరమేశ్వరునకుం బార్వతి భార్యల యధర్మంబులు వివరించునదియై యిట్లనియె. 298

తాత్పర్యం: పార్వతి ఆ విధంగా పలికి శివుడికి భార్యల యొక్క అధర్మాలెట్టివో తెలుపదలచి మళ్ళీ ఇట్లా అన్నది.

పార్వతి శివునకుఁ బతివ్రత కనర్హంబులగు ధర్మంబులఁ దెలుపుట. (సం.13. అను 1.15-4609).

సీ. 'పరమేశ! యాసురి పైశాచి రాక్షసి । యను పేళ్ళు గల వధర్మాంగనలకు;
వ్యభిచారతత్పరత్వంబు వారికి నెల్లఁ । గల; దసురాంశజ క్రౌర్యనిరత,
తనయిచ్చఁ బొలియించు ధనధాన్యములు, చల । హృదయ, భోగపరాత్మ, యీర్ష్య గలదు;
పైశాచి క్రోధన, భర్తృపుత్రులయందు । నిఃస్నేహ, గృహకార్యనిపుణ గాదు,

తే. కలహశీల; రాక్షసి సయికంబు లేదు, । బొంకువల్కు, నెప్పుడు నిద్రవోవు, వీత
లజ్జ; యిందఱు నాథుకులంబువారి । దురిత మొందించి పోదురు నరకమునకు. 299

ప్రతిపదార్థం: పరమేశ! = శంకరా!; అధర్మ+అంగనలకున్ = ధర్మవిరుద్ధములైన పనులు చేసే ఆడువారికి; ఆసురి, పైశాచి, రాక్షసి; అను పేళ్ళు గలవు = అనే పేర్లు ఉన్నాయి; వారికిన్+ఎల్లన్ = పైనుడివిన వారికందరికీ; వ్యభిచారతత్పరత్వంబు = పరపురుషుడితో సంగమించటంలో ఆసక్తి; కలదు = ఉన్నది; అసుర+అంశజ = అసురాంశలో జన్మించిన ఆసురి అనే పేరుగల మగువ; క్రౌర్యనిరత = క్రూరకృత్యాలలో అభిలాష కలిగి ఉంటుంది; ధనధాన్యములు = ధనమూ, ధాన్యమూ; తన+ఇచ్చన్ = తన యిష్ట ప్రకారం; పొలియించున్ = నాశనం చేస్తుంది; చలహృదయ = అతి చంచల స్వభావురాలు, నిలుకడ లేని మనస్సు కలది; భోగపర+ఆత్మ = సుఖాలకు వశమైన చిత్తం కలిగినట్టిది, భోగాలు మరిగినటువంటిది; ఈర్ష్యకలదు = అసూయకలిగినట్టిది; పైశాచి = ఇక పైశాచి అనే పేరుగల అంగన; క్రోధన = కోపస్వభావం కలది; భర్తృ పుత్రుల+అందున్ = తన మగడియందునూ, తన బిడ్డలయందునూ; నిఃస్నేహ = ప్రేమలేనిది; గృహకార్యనిపుణ+కాదు = ఇంటిపనులయందు నేర్పుకలది కాదు; రాక్షసి = రాక్షసి అనే నామధేయం గల పడతి; కలహశీల = తగవులమారి, జగడగొండి; సయికంబు లేదు = అది సూక్ష్మదృష్టిలేనట్టిది; బొంకు = అబద్ధం; పల్కున్ = మాట్లాడుతుంది; ఎప్పుడున్ = అన్ని వేళలందు; నిద్రపోవున్ = నిద్రిస్తుంది; వీతలజ్జ = అది సిగ్గుమాలినది; ఇందఱున్ = ఈ చెప్పిన వారంతా; నాథుకులంబు+వారిన్ = భర్త యొక్క వంశం వారిని; దురితము+ఒందించి = పాపాల పాలు చేసి; నరకమునకున్+పోదురు = నరక లోకానికి వెళ్ళుతారు.

తాత్పర్యం: 'పరమశివా! అధర్మ మార్గంలో చరించే ఆడవాళ్ళు ఆసురి, పైశాచి, రాక్షసి అనే పేర్లు కలిగి ఉన్నారు. వీరంతా పరపురుషుల పొందు వాంఛిస్తుంటారు. వీరు రంకుటాళ్లు. ఆసురి అనే ఆడుది అసురాంశలో జన్మించినట్టిది. అది క్రూరకృత్యాలలో అపేక్ష కలిగి ఉంటుంది. తన ఇష్ట ప్రకారం ధనధాన్యాలను నాశనం చేస్తుంది. దాని మనసు నిలుకడ కలిగి ఉండదు. భోగా లనుభవించటంలో అభిలాష కలిగి ఉంటుంది. అది అసూయాపరురాలు. పైశాచి అనే పేరు వహించి ఉన్న పొలతి కోపిష్ఠిది. పెనిమిటియందు, బిడ్డల యందు దానికి ప్రేముడి లేదు. ఇంటి పనులలో దానికి నేర్పులేదు. రాక్షసి అనే పేరు ధరించిన స్త్రీ కయ్యానికి కాలుద్రవ్వుతుంది; గయ్యాళి; దానికి సూక్ష్మదృష్టిలేదు. అబద్ధాలు చెప్పుతుంది. ఎప్పుడూ నిద్రపోతుంటుంది. అది సిగ్గు విడిచిన చేడె. వీరందరూ భర్త యొక్క వంశంవారినంతా పాపాలకు గురిచేసి తాము నరకం పాలవుతారు.

ఆ. ఎఱుక గలిగి పిదప నేనియుఁ బతిభక్తి । గలిగి ధర్మ మోపి సలిపి శాంతి
గలిగియున్న మున్ను గల పాపములు వాసి । పురుషుతోడ దివికిఁ బోవఁ గంద్రు. 300

ప్రతిపదార్థం: ఎఱుక+కలిగి = జ్ఞానం లభించి, తెలివి గలిగి; పిదపన్+ఏనియున్ = ఆ తరువాతనైనా; పతిభక్తి+కలిగి = భర్తయందు భక్తి జనించి; ఓపి = సమర్థతతో; ధర్మము = పుణ్యమును; సలిపి = ఆచరించి; శాంతి+కలిగి+ఉన్నన్ = శాంత

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గుణం కలిగి ఉంటే, అనగా మనసును పరిపరివిధాల పోనీకుండా ఉంటే; మున్ను+కల = పూర్వం సంపాదించినట్టి; పాపములు = దురితాలు; పాసి = తొలగి; పురుషుతోడన్ = మగడితో; దివికిన్ = స్వర్గానికి, పోవన్+కంద్రు = వెళ్ళగలుగుతారు.

తాత్పర్యం: ప్రాణేశ్వరా! అట్టి స్త్రీలు తెలివి గలిగిన తరువాత నయినా పతియందు భక్తి గలిగి పుణ్యకార్యాలు సమర్థతతో సలుపుతూ, మనసును పరిపరి విధాల పోనీక నిగ్రహించి ఉన్నచో మునుపు తాము చేసిన పాపాలన్నీ తొలగి తమ పురుషుడితో స్వర్గానికి వెళ్ళగలరు.

ఆ. అట్లుగాక పతుల యంతిమ సమయంబు । నందుఁ జింతఁ దక్కి యనుమరణము
చేసిరేని సుగతి సిద్ధించుఁ బతి సమే । తంబుగాఁగ నన్నితంబినులకు. 301

ప్రతిపదార్థం: అట్లు+కాక = పైనుడివిన విధంగా కాక; పతుల = భర్తల యొక్క; అంతిమ సమయంబు+అందున్ = మరణకాలంలో; చింతన్ = విచారమును, దుఃఖమును; తక్కి = విడిచి పెట్టి; అనుమరణము+చేసిరి+ఏనిన్ = సహగమనం చేసినట్లయితే- భర్త చితిమంటలలో ప్రవేశించి తామూ బూది అయితే; ఆ+నితంబినులకున్ = ఆ సతీమణులకు; పతి సమేతంబు+ కాఁగన్ = మగలతో కూడ; సుగతి+సిద్ధించున్ = సద్గతి కలుగుతుంది - స్వర్గలోకం లభిస్తుంది.

తాత్పర్యం: మనోహరా! పై చెప్పిన విధంగా పుణ్యకార్యాచరణ చెయ్యలేని స్త్రీలు పతి చనిపోయినపుడు శోకం వదలి సహగమనం చేస్తే - అతడితో చితిమంటలలో ప్రవేశించి శరీరం విడిచిపెడితే - అట్టి సతులకు వారి మగలతో పాటు స్వర్గం సంప్రాప్తిస్తుంది.

క. ద్విజభామినికి నధర్మము । ప్రజఁ గాంచిన పిదప నయ్యపత్యము శోకో
ద్విజితయుఁ బతిభక్తయునై । త్యజించి యనుమరణ నియత యగుట మహేశా!' 302

ప్రతిపదార్థం: మహేశా! = పరమేశ్వరా!; ద్విజభామినికిన్ = బ్రాహ్మణస్త్రీకి; ప్రజన్ = బిడ్డలను; కాంచినపిదపన్ = కనినమీదట; శోక+ఉద్విజితయున్ = దుఃఖంచేత కలత చెందినదియూ, శోక వ్యాకులచిత్తయూ; పతిభక్తయున్+ఐ = భర్తయందు భక్తిగలదై; ఆ+అపత్యమున్ = ఆ బిడ్డను; త్యజించి = వదలి; అనుమరణ నియత+అగుట = భర్తతో సహగమనం చేయటానికి నిర్ణయించుకొన్నది కావటం; అధర్మము = అన్యాయం.

తాత్పర్యం: బ్రాహ్మణ స్త్రీ తనకు సంతానం కలిగిన తరువాత, దుఃఖవ్యాకుల చిత్తంతో, భర్తయందు భక్తి గలదై బిడ్డను వదలి పతితో సహగమనం చేయటం అన్యాయం.'

క. అని చెప్పి గౌరి పతి కి । ట్లను 'నాదగు చాపలమున నఖిలేశ్వర! నిన్
వినిపించితి నేఁ గొన్నివ । చనముల; నీతప్పు నాకు సైఁపుము కరుణన్.' 303

ప్రతిపదార్థం: అని చెప్పి, గౌరి, పతికిన్; ఇట్లు+అనున్ = ఈ లాగున చెప్పింది; అఖిల+ఈశ్వర! = సమస్తమునకూ ప్రభువైన వాడా!; నాదగు చాపలమునన్ (నాది+అగు = నాదగు); నా యొక్క బుద్ధి చాంచల్యం చేత; నేన్ = నేను; కొన్ని వచనములన్ = కొన్ని మాటలను; నిన్+వినిపించితిన్ = నీకు చెప్పాను; ఈ తప్పున్ = ఈ దోషాన్ని; కరుణన్ = కృపతో, నాకున్+సైఁపుము = నా విషయమై సహించుము, మన్నించుము.

తాత్పర్యం: ఉమాదేవి ఆ ప్రకారం పతికి స్త్రీ స్వభావాన్ని గురించి తెలిపి మళ్ళీ ఇట్లా అన్నది. 'జగత్ప్రభూ! నా చాపల్యం కొద్ది నేను కొన్ని మాటలు తమకు విన్నవించాను. దయతో ఈ తప్పును మన్నించ వేడుతున్నాను.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **అని సిగ్గున చెన్నగు నా । నన మించుక వాంచి యెత్తు నగతనయ శివుం**
డును మునులును మునిపత్నులు । వినుతించిరి మధురవాక్య విభవం బెసఁగన్. **304**

ప్రతిపదార్థం: అని = అట్లు పలికి; సిగ్గునన్ = లజ్జచేత; చెన్ను+అగు = అందగించిన; ఆననమున్ = మొగమును; ఇంచుక వాంచి = కొంచెం క్రిందికి వంచి, (పిదప); ఎత్తు = మీదికెత్తిన; నగతనయన్ = పర్వత పుత్రిని; మధురవాక్య విభవంబు+ఎసఁగన్ = మనోహరమైన మాటల పెంపు సొంపారగా; శివుండు = శంభుడు; మునులును = ఋషులు; ముని పత్నులున్ = ఋషుల భార్యలు; వినుతించిరి = కొనియాడారు;

తాత్పర్యం: ఆ విధంగా పలికి సిగ్గుతో చెలువారిన మోమును కొంచెం వంచి పైకెత్తిన నగరాజపుత్రికను మృత్యుంజయుడు, మునులు, మునుల భార్యలు ప్రస్తుతించారు.

క. **సురగంధర్వఖచర కి । న్నర కింపురు షోరగాది నారీజనముల్**
పరమప్రీతిని బొగడిరి । పరమేశ్వరి నెలుఁగు లడరఁ బంకజనాభా!' **305**

ప్రతిపదార్థం: పంకజనాభా! = పద్మము బొడ్డున గల నారాయణా!; సుర = వేల్పులు; గంధర్వ = గంధర్వులు; ఖచర = ఖేచరులు; కిన్నర = కిన్నరులు; కింపురుష = కింపురుషులు; ఉరగ+ఆది = నాగులు మున్నగు జాతుల యొక్క; నారీజనముల్ = స్త్రీ సమూహాలు; పరమేశ్వరిన్ = గౌరీదేవిని; ఎలుఁగులు+అడరన్ = కంఠధ్వనులు చెలరేగగా; పరమ ప్రీతిన్ = మిక్కుటమైన ఆనందంతో; పొగడిరి = శ్లాఘించారు.

తాత్పర్యం: శ్రీకృష్ణా! దేవతలు, గంధర్వులు, ఖేచరులు, కిన్నరులు, కింపురుషులు, నాగులు మున్నగు దేవతా జాతుల వనితా జనాలు మిక్కిలి సంతోషంతో గొంతులెత్తి గిరిజాదేవిని కొనియాడారు.'

క. **అని చెప్పి నారదుం డి । ట్లను న గ్గోవిందుతోడ నప్పడు ప్రియ మా**
ననమునఁ బొదలఁగఁ బార్వతిఁ । గనుఁగొని సర్వేశ్వరుండు గారవ మొప్పన్. **306**

ప్రతిపదార్థం: అని చెప్పి = అని వచించి; నారదుండు = నారద మహర్షి; ఆ+గోవిందునితోడన్ = ఆ గోపాలకృష్ణుడితో; ఇట్లు+అనున్ = ఈ విధంగా చెప్పాడు; అప్పుడు = ఆ వేళ; ప్రియము = ప్రేమ; ఆననమునన్ = ముఖమునందు; పొదలఁగన్ = వర్ధిల్లగా; సర్వేశ్వరుండు = శివుడు; పార్వతిన్ = గిరిజను; కనుఁగొని = వీక్షించి; గారవము+ఒప్పన్ = గౌరవభావం హెచ్చుగా.

తాత్పర్యం: అని పలికి నారద మహర్షి వాసుదేవుడితో ఇట్లా అన్నాడు. 'శ్రీకృష్ణా! శివు డప్పుడు ముఖమున సంతోషం దీపించగా ఆదరంతో గౌరీదేవిని వీక్షించి.

క. **'నానీ సంవాదము శుచి । యై నైష్ఠికజనుల కెవ్వఁ డాదర మెసఁగం**
గా నలినాక్షీ! చెప్పను । వానికి నిత్యామరత్వ వైభవ మొదవున్. **307**

ప్రతిపదార్థం: నలిన+అక్షీ! = పద్మములవంటి నేత్రములు గల గౌరీ!; నానీ సంవాదము = మనఇరువురి యొక్క సంభాషణ; ఎవ్వఁడు = ఎవడు; శుచి+ఐ = పరిశుద్ధుడై; నైష్ఠిక జనులకున్ = నిష్ఠగల మనుజులకు; ఆదరము+ఎసఁగన్+కాన్ = గౌరవం అతిశయించగా; చెప్పును = చెప్పుతాడో; వానికిన్ = అట్టివాడికి; నిత్య+అమరత్వ+వైభవము = శాశ్వతమైన దివ్యత్వ సంపద; ఒదవున్ = లభిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'కమల పత్రాలవంటి కన్నులు గల దేవీ! మనఇద్దరి సంభాషణం ఎవడు పరిశుద్ధుడై గౌరవ బుద్ధితో శ్రద్ధాభక్తులు గల జనులకు చెప్పుతాడో అతడికి శాశ్వతమైన దేవతాత్వ వైభవం లభిస్తుంది.

క. మన సంవాదం బెవ్వరు । వినిరి నియతి నజ్జనులకు విభవముఁ దేజం
బును గీర్తియు నాయువు శ్రీ । యును నారోగ్యంబుఁ గల్గు నుత్పలనయనా!' 308

ప్రతిపదార్థం: ఉత్పలనయనా! = కలువ రేకులవంటి కన్నులుగల దానా! ఓ కలువకంటీ!; మనసంవాదంబు = మన ఇద్దరి సంభాషణ; ఎవ్వరు = ఎవరు; నియతిన్ = భాగ్యవశాన; వినిరి = విన్నారో; ఆ+జనులకున్ = ఆ నరులకు; విభవమున్ = ఉన్నత స్థితీ; తేజంబున్ = శక్తి, ప్రకాశం; కీర్తియున్ = యశస్సు; ఆయువున్ = ఆయుష్యమూ; శ్రీయును = సంపత్తి; ఆరోగ్యంబున్ = అనామయమూ; కల్గున్ = సమకూడుతాయి.

తాత్పర్యం: కలువ రేకులవంటి కన్నులదానా! మన సంవాదం ఎవరు పూర్వజన్మకృత పుణ్యవశాన ఆలకిస్తారో, అటువంటి మనుజులకు ఉన్నతస్థితి; తేజస్సు, యశస్సు, ఆయుస్సు, ఐశ్వర్యమూ, ఆరోగ్యమూ సమకూడుతాయి.'

క. 'అని నిర్దేశించి శివుఁడు । చనియె; శివయుఁ గొలువుతోన చనె; నిద్దెసకుం
జని రన వశమే? యద్భుత । మనిరూప్యం బప్రతర్క్య మది శ్రీ రమణా! 309

ప్రతిపదార్థం: శ్రీరమణా! = ఇందిరావల్లభా! శ్రీకృష్ణా!; అని నిర్దేశించి = అని ఉపదేశించి; శివుఁడు = శంభుడు; చనియెన్ = కొలువు చాలించి వెళ్ళాడు; శివయున్ = శాంభవి కూడ; కొలువు తోన = కొలువుతోడనే; చనెన్ = వెళ్లిపోయింది; ఈ+దెసకున్ = ఈ దిక్కునకు; చనిరి+అనన్ = వారు వెళ్ళారు అని చెప్పుటకు; వశమే? = శక్యమా? కాదని భావం; అది = ఆ పార్వతీ పరమేశ్వరులు ఎచ్చటి కేగినారన్నది; అద్భుతము = ఆశ్చర్యజనకం; అనిరూప్యంబు = నిర్ణయించుటకు వీలుకానిది; అప్రతర్క్యము = ఊహించటానికి సాధ్యపడనిది.

తాత్పర్యం: 'కృష్ణా! ఆ విధంగా ఉపదేశవాక్యాలు చెప్పి పరమేశ్వరుడు వెళ్ళాడు. కొలువు విరియగానే పరమేశ్వరి కూడ వెళ్ళిపోయింది. వారు ఏ దిక్కునకు వెళ్ళారో చెప్పటానికి ఎవరితరమూ కాదు. అది ఆశ్చర్యజనకం. నిర్ణయించుటకూ, ఊహించుటకూ సాధ్యపడని విషయం.'

క. అని పలికి నారదుఁడు 'నా । వినిన కనిన యద్భుతంబు వినిపించితి నీ'
కనియెం గృష్ణుని సభ్యుల । మనంబు లానంద పూర మగ్నము లయ్యెన్. 310

ప్రతిపదార్థం: అని పలికి = అని వచించి; నారదుఁడు = నారద మహర్షి; కృష్ణునిన్ = కృష్ణునుద్దేశించి; నా వినిన = నేను విన్నట్టి; కనిన = చూచినట్టి; అద్భుతంబున్ = వింతను; నీకున్ = నీకు; వినిపించితిన్ = తెల్పినాను; అనియెన్ = అని పలికాడు; సభ్యులమనంబులు = సభలో ఉన్న వారి యొక్క చిత్తములు; ఆనంద పూరమగ్నములు+అయ్యెన్ = సంతోషమనెడు వెల్లువలో మునిగి పోయాయి.

తాత్పర్యం: అట్లా వచించి నారదమహర్షి శ్రీ కృష్ణభగవాను నుద్దేశించి 'నేను విన్నట్టి, చూచినట్టి వింతను నీకు వినిపించాను స్వామీ!' అని పలికాడు. సభలో ఉన్న జనుల మనసులు ఆనంద మనెడు రసప్రవాహంలో మునుకలు వేశాయి.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని యిట్లు భీష్ముం డుమామహేశ్వర సంవాదం బనుపుణ్యకథ చెప్పిన ధర్మతనయుండు సోదర సహితంబుగాఁ బ్రమోదరసభరితుండై. 311

ప్రతిపదార్థం: అని+ఇట్లు = అని ఈ ప్రకారం; భీష్ముడు = గాంగేయుడు, ఉమామహేశ్వర సంవాదంబు = పార్వతీ పరమేశ్వరుల పరస్పర సంభాషణ; అను పుణ్యకథ = అనే పవిత్రమైన గాథ; చెప్పినన్ = తెలుపగా; ధర్మతనయుండు = యముని కుమారుడైన యుధిష్ఠిరుడు; సోదర సహితంబుగాన్ = తమ్ములతో కూడ; ప్రమోదరసభరితుండు+ఐ = ఆనందరసంతో నిండిన వాడై.

తాత్పర్యం: అని భీష్ముడు పార్వతీ పరమేశ్వరుల సంవాదమనే పవిత్రగాథను ధర్మనందనుడికి తెలుపగా విని అతడు తనతమ్ములతో పాటు సంతోష రసభరిత హృదయుడయ్యాడు.

భీష్ముఁడు ధర్మజునకుఁ బరప్రాప్తి హేతుభూతం బగు జప విశేషంబు దెలుపుట. (సం.13 అను 17-5).

సీ. అతనికిఁ బ్రణమిల్లి 'యనఘ! పరప్రాప్తి । యెద్దాన సమకూరు? నెఱుఁగఁ జెప్పు'
మనిన నతండు 'నారాయణధ్యాన పూ । జాస్తుతి తత్కథా శ్రవణనిరతి
యమ్మేలు గావించు; నధిప! విద్వజ్జన । సంరక్షణము కల్మషములఁ బాపు;
వేశ్య యొక్కత తొల్లి విద్వాంసు నొకరిని । మ్రుచ్చని తలవరుల్ మోఁదఁ జూచి

తే. 'యితఁడు మావాఁడు మీ రిది యేటి కాగ । డంబు చేసెద?' రని మోక్షణంబు చేసి
యాసుకృతమున బ్రాహ్మణియై జనించెఁ; । దగఁగ నర్చింపు మీవు విద్వజ్జనముల.' 312

ప్రతిపదార్థం: అతనికిన్ = కురుపితామహుడైన భీష్ముడికి; ప్రణమిల్లి = నమస్కరించి; అనఘ! = దోషరహితుడా! ఓ పుణ్యపురుషా!; పరప్రాప్తి = మోక్షం లభించటం; ఏ+దానన్ = ఏ విధంగా; సమకూడున్ = కలుగుతుందో; ఎఱుఁగన్+చెప్పుము = నాకు తెలిసేటట్లు చెప్పుము; అనినన్ = అని ధర్మజుడు ప్రశ్నించగా; అతండు = భీష్ముడు; అధిప! = ఓ ధర్మరాజా!; నారాయణధ్యాన పూజాస్తుతి = శ్రీ మన్నారాయణుడిని ధ్యానించటం, పూజించటం, స్తోత్రం చెయ్యటం; తత్+కథాశ్రవణనిరతి = ఆ మహానుభావుడి చరిత్రలు వినటంలో ఆసక్తి; ఆ+మేలు = ఆ శ్రేయస్సును; కావించున్ = కలిగిస్తుంది; విద్వత్+జన+సంరక్షణము = పండితులైన వాళ్ళను చక్కగ కాపాడటం అనేది; కల్మషములన్ = పాపాలను; పాపున్ = తొలగిస్తుంది; తొల్లి = మునుపు; వేశ్య ఒక్కత = ఒక బోగముది, పడుపుకత్తె; విద్వాంసున్+ఒకరిని = ఒక ప్రాజ్ఞుడిని; తల వరుల్ = తలారులు, కావలికాండ్రు (గ్రామాలలో, పట్టణాలలో రాత్రులందు దొంగలు పడకుండ గస్తు తిరిగేవాళ్ళు) మ్రుచ్చు+అని = చోరుడని, దొంగ అని; మోఁదన్ = కొట్టగా; చూచి = కనుగొని; ఇతఁడు మావాఁడు; మీరు; ఏటికిన్ = ఎందుకు, ఇది; ఆగడంబు చేసెదరు = చెడ్డపనిచేస్తున్నారు; అని = అని పల్కి; మోక్షణంబు చేసి = ఆ పండితునికి తలారుల నుంచి విముక్తి గలిగించి; ఆ సుకృతమునన్ = ఆ పుణ్యంచేత; బ్రాహ్మణి+ఐ = బ్రాహ్మణ స్త్రీగా; జనించెన్ = పుట్టింది; ఈవు = నీవు; తగఁగన్ = ఒప్పిదంగా; విద్వత్+జనములన్ = పండిత సమూహమును; అర్చింపుము = పూజించుము.

తాత్పర్యం: ధర్మజుడు భీష్ముడికి నమస్కరించి 'పుణ్యపురుషా! పరమపదం ఏ విధంగా లభిస్తుందో సెలవియ్యం' డని వేడుకొన్నాడు. అందుకు గాంగేయుడు 'కుంతీనందనా! పరమపదం శ్రీమన్నారాయణుడిని ధ్యానించటం, పూజించటం, స్తుతించటం, ఆయన పుణ్యకథలు ఆసక్తితో ఆకర్ణించటం వలన ప్రాప్తిస్తుంది. మోక్షానికి ప్రతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బంధకమైన దురితాలన్నీ పండితులను సంరక్షించటం వలన తొలగి పోతాయి. పూర్వం ఒక పడుపుకత్తె తలారులు ఒక విద్వాంసుడిని చోరుడని భావించి చావ మోదుతుంటే చూచింది. 'మీరు నిరపరాధిని బాధిస్తున్నారు. ఇతడు మావాడు' అని చెప్పి వారి బారినుంచి ఆ విద్వాంసుడికి విముక్తి కల్గించింది. ఆ పుణ్యఫలంగా ఆమె మరుజన్మలో భూసురకాంతగా పుట్టింది. కనుక నీవు పండితులను సమాదరించుము'.

వ. **అనిన విని యుధిష్ఠిరుండు 'దారిద్ర్య వ్యాధి శోకంబులకు శాంతి సంపాదింపంజాలు జపం బెయ్యది? చెప్పవే' యనుటయు ననిమిషనదీ నందనుండు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను, వినాయక, విశాఖ, వహ్ని, వాయు, చంద్రాదిత్యులను, శక్ర, వరుణ, యమ, కుబేరులను, సురభిని, సముద్రంబులను, గంగాది మహానదులను, మరు దశ్వివసురుద్రాది దేవతలను, బితృదేవతలను, వాలఖిల్యాది సిద్ధులను, వేదవ్యాస వాల్మీకి నారదాగస్త్య గౌతమ కశ్యపాత్రికణ్వాది మహామునులను, రంభాద్యప్సరః స్త్రీలను, ధర్మతపస్సత్యములను, నహో రాత్రంబులను, దారాగ్రహంబులను, నశ్విన్యాది తారకంబులను, మాసర్తు వత్సరంబులను, వైనతేయ కాద్రవేయులను, గాశీక్షేత్ర కురుక్షేత్రాది పుణ్య క్షేత్రంబులను, నైమిశారణ్య దండకారణ్యాది పుణ్యారణ్యంబులను, మేరు హిమవత్కైలాసాది ప్రభూత శైలంబులను, దిబ్బభోభూములను, బుణ్యభూరుహంబులను, భూసురులను, జక్రవర్తులను, రాజులను, బరమభక్తిం దలంచి, కీర్తించి, నమస్కరించి 'యీ సమూహం బంతయు నన్ను రక్షించి నాకు నాయురారోగ్యైశ్వర్యాభివృద్ధి పరమానందంబు లభినందనపూర్వకంబుగా నిచ్చుఁ గావుత మని యిచ్చఁ గోరి 'యో న్నమో భగవతే వాసుదేవాయ, నమః పురుషోత్తమాయ, నమస్సర్వలోక గురవే, నమస్సర్వలోక పిత్రే, నమ స్సర్వలోక పితామహాయ, నమస్సర్వలోక ప్రపితామహాయ, నమ స్సర్వలోక ప్రధానాయ, నమ స్సర్వలోకేశ్వరాయ, నమ స్సర్వలోక విశిష్టాయ, నమ స్సర్వలోక సుఖప్రదాయ, నమ స్సర్వలోకకర్త్రే, నమ స్సర్వలోకభర్త్రే, నమ స్సర్వలోకహర్త్రే, నమ స్సర్వలోక నిధయే, నమ స్సర్వలోక నిధానాయ, నమ స్సర్వలోకోద్భవకరాయ, నమో విష్ణవే, ప్రభవిష్ణవే' యని పఠించుట మహాజపంబు.** **313**

ప్రతిపదార్థం: అనినన్ విని = అని భీష్ముడు చెప్పగా ఆలకించి; యుధిష్ఠిరుండు = ధర్మజుడు; దారిద్ర్య వ్యాధి శోకంబులకున్ = పేదరికానికి, రోగాలకు, దుఃఖాలకు; శాంతిన్ = ఉపశమనమును; సంపాదింపన్+చాలు = సమకూర్చగలుగునట్టి; జపము = మంత్రజపం; ఏ+అది = (ఎయ్యది) ఏది; చెప్పవు+ఏ = చెప్పవా; అనుటయున్ = అని అడుగగా; అనిమిషనదీనందనుండు = దేవతలనది మందాకిని యొక్క కుమారుడు భీష్ముడు; బ్రహ్మవిష్ణు మహేశ్వరులను = త్రిమూర్తులను; వినాయక = గణపతి; విశాఖ = కుమారస్వామి; వహ్ని = అగ్నిదేవుడు; వాయు = వాయుదేవుడు; చంద్ర+ఆదిత్యులను = చంద్రుడు, సూర్యుడు అనువారిని; శక్ర = ఇంద్రుడు; వరుణ = వరుణుడు; యమ = యముడు; కుబేరులను = ధనాధిపతి కుబేరుడు అనువారలను; సురభిని = కామధేనువును; సముద్రంబులను = సప్తసాగరాలను; గంగా+ఆదిమహానదులను = గంగమొదలైన గొప్పనదులనూ; మరుత్ = సప్తమారుతాలను; అశ్వి = అశ్వినీ పుత్రులు దేవవైద్యులిద్దరినీ; వసు = అష్టవసువులు; రుద్ర = ఏకాదశ రుద్రులు, ఆది = మొదలైన; దేవతలను = వేల్పులను, సురలను; పితృదేవతలను = అర్యముడు మున్నగు పితృదేవతలను; వాలఖిల్య+ఆది+సిద్ధులను = వాలఖిల్యులు మొదలైన ఋషులను; వేదవ్యాస, వాల్మీకి, నారద, అగస్త్య, గౌతమ, కశ్యప, అత్రి; కణ్వ+ఆది = కణ్వుడు మొదలుగాగల; మహామునులను; రంభా+ఆది = రంభ మొదలైన; అప్సరః స్త్రీలను = అప్సరసలను; ధర్మ తపః సత్యములను = ధర్మమును, తపస్సును, సత్యమును; అహః+రాత్రంబులను =

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పగళ్ళను, రాత్రులను; తారా గ్రహంబులను = తారలను, నవగ్రహాలను; అశ్వినీ+ఆది తారకంబులను = అశ్విని, భరణి మొదలైన ఇరువదేడు నక్షత్రాలను; మాస+ఋతు(మాసర్తు); చైత్రము, వైశాఖం మున్నగు పన్నెండు నెలలు, వసంతం, గ్రీష్మం మొదలైన ఆరు ఋతువులను; వత్సరంబులను = ప్రభవ, విభవ మొదలైన అరవై సంవత్సరాలను; వైనతేయ = వినతాపుత్రుడైన గరుత్మంతుడు మొదలగు పక్షీంద్రులను; కాద్రవేయులను = కద్రువకొడుకులు వాసుకి, అనంతుడు మున్నగు సర్పరాజులను; కాశీక్షేత్ర; కురుక్షేత్ర; ఆది = మొదలైన, పుణ్యక్షేత్రంబులను = పవిత్ర ప్రదేశాలను; నైమిశ+అరణ్య; దండకా+అరణ్య; ఆది = మొదలైన, పుణ్య+ అరణ్యములను = పావనములైన తపోవనాలను; మేరు = మేరువు; హిమవత్ = హిమవంతం; కైలాస = కైలాసం; ఆది = మున్నగు, ప్రభూతశైలంబులను = ఎత్తైన కొండలను, గొప్ప పర్వతాలను; దిక్+నభస్+భూములను = దిక్కులు, ఆకాశం, భూమి అనువాటిని; పుణ్యభూరుహంబులను = పవిత్రములైన కల్పవృక్షం మొదలైన వృక్షరాజములను; భూసురులను = బ్రాహ్మణులను; చక్రవర్తులను = సార్వభౌములను; రాజులను = నరేశ్వరులనూ; పరమభక్తిన్ = మిక్కిలిభక్తితో; తలంచి = స్మరించి; కీర్తించి = కొనియాడి, పొగడి; నమస్కరించి = మ్రొక్కి; ఈ సమూహంబు+అంతయున్ = పైనుడివిన మొత్తము; నన్నున్ రక్షించి = నన్ను కాపాడి; నాకున్, ఆయుః+ఆరోగ్య+ఐశ్వర్య+అభివృద్ధి పరమ+ఆనందంబులు = ఆయుష్యం, ఆరోగ్యం, సంపదల యొక్క పెంపు, మిక్కుటమైన సంతోషం అనువాటిని; అభినందనపూర్వకంబుగాన్ = సంతోషపురస్సరంగా, ప్రశంసా పూర్వకంగా; ఇచ్చున్+కావుతన్+అని = (ఇచ్చుఁగావుతమని) = ప్రసాదించుగాక అని; ఇచ్చన్ = మనస్సులో; కోరి = కాంక్షించి; ఓమ్+భగవతే వాసుదేవాయ నమః = భగవంతుడైన వాసుదేవుడి కొరకు నమస్కారం; పురుషోత్తమాయ నమః = పురుషోత్తముడికి వందనం; సర్వలోక గురవే నమః = సమస్తలోకములకు గురుడైన వాడికి నమోవాకం; సర్వలోకపిత్రే నమః = ఎల్ల జగములకు తండ్రి అయిన వాడికి ప్రణామం; సర్వలోక పితామహాయ నమః = సకల జగత్తులకు తాత అయినవాడికి అంజలి; సర్వలోక ప్రపితామహాయ నమః = ఎల్లలోకాల తాతకు తండ్రియైనవాడికి (ముత్తాతకు) కేలు మోడ్పు; సర్వలోక ప్రధానాయ నమః = అఖిలలోకాలకు ప్రకృతి అయిన వాడికి ప్రణతి; సర్వలోక+ఈశ్వరాయ నమః = సమస్తలోకాలకు నాథుడయిన వాడికి నమస్సు; సర్వలోక విశిష్టాయ నమః = సమస్త భువనాలతో కూడిన వాడికి మ్రొక్కులు; సర్వలోక సుఖప్రదాయ నమః = అన్ని లోకాలకు సౌఖ్యమొసగువాడికి నమస్కృతి; సర్వలోక కర్త్రే నమః = సమస్త జగములకు కర్త ఎవడో వాడికి జోహారు; సర్వలోకభర్త్రే నమః = అన్ని లోకాలను కాపాడేవాడికి, భరించే వాడికి జోతలు; సర్వలోక హర్త్రే నమః = సమస్త భువనాలను హరించేవాడికి జేజేలు; సర్వలోక నిధయే నమః = సకలలోకాలకు ఆధారమైన వాడికి ప్రణిపాతం; సర్వలోక నిధానాయ నమః = జగములన్నిటికి గుప్తనిధిగా ఉన్న వాడికి అభివాదం; సర్వలోక హితాయ నమః = సమస్త లోకాలకు మిత్రుడైన వాడికి ధన్యవాదం; సర్వలోక హితకరాయ నమః = అన్ని లోకాలకు మేలు చేసేవాడికి కై మోడ్పు; సర్వలోక+ఉద్భవాయ నమః = సమస్త లోకాలకు ఉత్పత్తి స్థానమైన వాడికి చేమోడ్పు; సర్వలోక+ఉద్భవ కరాయ నమః = సమస్తలోకాలను పుట్టించేవాడికి నతి; విష్ణవే, ప్రభ విష్ణవే నమః = వ్యాపనశీలుడికి, సామర్థ్యము, మహిమ కలవాడికి దోసిలొగ్గుతున్నాను; అని = అంటూ; పఠించుట = చదవటం; మహా జపంబు = గొప్పజపం.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగా విని ధర్మరాజు 'తాతా! పేదరికం తొలగటానికి, రోగాలు మానటానికి, దుఃఖాలు తీరటానికి తగిన జప మేదో సెలవియ్యం'డని అర్థించాడు. అపుడు గంగాతనయుడు 'కుంతీ నందనా! బ్రహ్మవిష్ణుమహేశ్వరులనూ, గణపతినీ, కుమారస్వామినీ, అగ్ని వాయుదేవుళ్ళనూ, చంద్రసూర్యులనూ, ఇంద్రవరుణయమ కుబేరులనూ, కామధేనువునూ, సప్తసముద్రాలనూ, గంగ మొదలైన పవిత్ర తీర్థాలనూ, సప్తమరుత్తులనూ (వాయువులనూ), అశ్వినీ దేవతలనూ, అష్టవసువులనూ, ఏకాదశరుద్రులనూ, అర్యముడు మున్నగు

పితృ దేవతలనూ, వాలఖిల్యాది మహర్షులనూ, వ్యాసుడు, వాల్మీకి, నారదుడు, అగస్త్యుడు, గౌతముడు, కశ్యపుడు, అత్రి, కణ్వుడు మున్నగు మౌనీంద్రులనూ, రంభ మొదలైన అచ్చర బోటులనూ, ధర్మము, తపము, సత్యము అనువాటినీ, రాత్రులను, పవళ్లను, తారలను, నవ గ్రహాలను, అశ్విని మొదలైన ఇరువది యేడు నక్షత్రాలనూ, నెలలు, ఋతువులు, సంవత్సరాలుగా ఉన్న కాలమునూ, గరుత్మంతుడు మున్నుగాగల వినతాపుత్రులు పక్షీంద్రులనూ, ఆదిశేషుడు మొదలుగా గాల కద్రువ కొడుకులు సర్పరాజులనూ, కాశీ క్షేత్రం, కురుక్షేత్రం మున్నగు పవిత్ర స్థలాలనూ, నైమిశారణ్యం, దండకారణ్యం మొదలైన పవిత్ర వనభూములనూ, మేరు శైలం, హిమగిరి, కైలాస పర్వతం మొదలైన గొప్పకొండలను, దిక్కులను, ఆకాశాన్ని, ధరణిని, పావనములైన కల్పవృక్షం మున్నగు వనస్పతులనూ, బ్రాహ్మణులనూ, చక్రవర్తులను, రాజులను, మిక్కిలి భక్తితో స్మరించి, స్తుతించి, నమస్కరించి వీరంతా నన్ను కాపాడుదురుగాక! వీరంతా నాకు దీర్ఘాయుష్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం, మిక్కుటమైన సంతోషం మెచ్చుతూ ఇత్తురుగాక!' అని మదిలో ఆకాంక్షించాలి. ఆవల 'వాసుదేవా! పురుషోత్తమా! సమస్త జగద్గురూ! సమస్త లోకాలకు తండ్రి అయిన వాడా! సమస్త లోకాలకు తాత అయినవాడా! సమస్త లోకాలకు ముత్తాత అయినవాడా! సమస్త లోకాలకు ప్రధానమైన వాడా! సమస్త లోకాలకు ప్రభువైనవాడా! సమస్త లోకాలతో కూడినవాడా! సమస్త లోకాలకు సౌఖ్యం ప్రసాదించేవాడా! సమస్త లోకాలకు కర్త అయిన వాడా! సమస్త లోకాలకు భర్త అయిన వాడా! సమస్త లోకాలను హరించేవాడా! సమస్త లోకాలకు ఆధారభూతుడా! సకల లోకాలకు దాపుడుధనంగా ఉన్నవాడా! సకల లోకాలకు చెలికాడా! సకల లోకాలకు మేలు కూర్చేవాడా! సర్వ లోకాలకు ఉత్పత్తిస్థానమైన వాడా! సర్వ లోకాలను జన్మింపజేసేవాడా! అంతట వ్యాపించువాడా! ప్రభావం కలవాడా! నీకు వందనం, అభివందన' మంటూ ఈ మంత్రమును పఠించటం మహాజపం.

విశేషం: సర్వదారిద్ర్యాలనూ, సర్వదుఃఖాలనూ పోగొట్టి మోక్షం ప్రసాదించే మంత్రం చెప్పుమని ధర్మరాజు అడిగినప్పుడు భీష్ముడు విష్ణుమంత్రోపదేశం చేశాడు. భగవన్మంత్రా లనేకం. వాటిల్లో వ్యాపకమంత్రాలు శ్రేష్ఠాలు. భగవంతుడి స్వరూప గుణ చేష్టితాలను సంపూర్ణంగా తెలిపేవి వ్యాపకమంత్రాలు. "నారాయణాయ విద్మహే, వాసుదేవాయ ధీమహి, తన్నో విష్ణుః ప్రచోదయాత్" అని విష్ణు గాయత్రిలో తెల్పబడిన ఆ మూడు మంత్రాలు మాత్రమే శ్రేష్ఠమైనవి.

"యథా సర్వేషు వేదేషు నాస్తి నారాయణా త్పరః,
తథా సర్వేషు మంత్రేషు నాస్తి చాష్టాక్షరాత్పరః."

సకలవేదాలలో నారాయణుడిని మించిన వేల్పులేనట్లే అన్ని మంత్రాలలో అష్టాక్షరిని మించిన మంత్రం లేదు. అనగా 'ఓం నమో భగవతే వాసుదేవాయ, ఓం నమో విష్ణవే', అనే రెంటికన్నా "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరీ మహామంత్రం పరమోత్తమం.

మంత్రంలో మొదటిపదం ఓంకారం. అదే ప్రణవం. దీనిలో అ,ఉ,మ అనే మూడక్షరా లున్నాయి. ఈ మూడక్షరాలు మూడు కుండలలో ఉన్న దధిని మథించి వెన్నను తీసినట్లుగా ఋగ్యజుస్సామములనే మూడు వేదాలనుండి తీయబడ్డాయి. కనుక ఓంకారం వేదసారం. ఇందులోని అకారం "అవ రక్షణే" అను ధాతువు నుంచి ఏర్పడింది. అది సకల జగత్కారణుడూ, సర్వరక్షకుడూ అయిన లక్ష్మీ వల్లభుడికి వాచక మవుతున్నది. అందుచే అకారమునకు నారాయణుడు అని అర్థం. "అక్షరాణాం అకారోఽస్మి"-- అక్షరాలలో అకారాన్ని నేను అని గీతలో భగవానుడు నుడివాడు. అతడు తన్ను స్మరించే జీవులకు అనర్థాలను తొలగించి అపేక్షితాలను అనుగ్రహిస్తాడు. ప్రణవంలో మొదటి అక్షరం తరువాత రెండవ అక్షరం ఉకారం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉకారం ఏవకారార్థం అనగా అతనికే అంటే అకారవాచ్యుడైన నారాయణుడికే, మరెవ్వరికినీ కాదు, అని అర్థం. మూడవ పదం మకారం. మకారం జీవవాచకం. అనగా జీవుడు మకారశబ్దవాచ్యుడు. అతడు కేవలం నారాయణుడికే చెందినవాడు తప్ప తనకుగాని, మరెవ్వరికిగానీ చెందిన వాడు, సంబంధపడినవాడు కాడని భావం. సర్వదేశ సర్వకాల సర్వావస్థలయందు పరమాత్మకు కైంకర్యం, సేవ, దాస్యం, చేస్తూ ఉండదగినవాడు జీవుడు అనే అర్థం ప్రణవం వలన గోచరిస్తుంది. ఇక్కడ మరో విషయం గమనించాలి. రక్షకుడు అకారశబ్దవాచ్యుడైన నారాయణు డైనప్పటికినీ, రక్షించబడేటప్పుడు మాతృసంబంధం అనగా లక్ష్మీ సంబంధం జీవుడికి అనుసంధేయం. ఆమె విష్ణువక్షః స్థలాన్ని వీడినప్పుడే అకారమనే అక్షరాన్ని ఎడబాయటం సంభవిస్తుంది. కనుక అకారం నారాయణుడితో పాటు లక్ష్మికి గూడ వాచకమే అవుతుంది.

" అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా''

సూర్యుడిని ప్రభవలె, కాంతి వలె శ్రీరాముడిని వదలి ఉండలేను అని సీతాదేవి -

" అనన్యా హి మయా సీతా భాస్కరేణ ప్రభా యథా''

రవిని వదలి ప్రభవలె జానకిని వదలి నే నుండలేను అని శ్రీరాముడు పలికి ఉన్నారు (శ్రీమద్రామాయణం)

" రాఘవత్వేఽభవ త్సీతా రుక్మిణీ కృష్ణజన్మని,
అన్యేషు చావతారేషు విష్ణో రేషానపాయినీ.''

" దేవత్వే దేవ దేహేఽయం మానుషత్వే చ మానుషీ,
విష్ణో ర్దేహానురూపాం వై కరోత్యేషాఽఽత్మన స్తనుమ్.''

ఇత్యాది స్తుతులు లక్ష్మీనారాయణులకు ఎడబాటెప్పుడూ లేదని చాటుతున్నాయి. కనుక అకారమునకు విష్ణుసంబంధం చేత లక్ష్మి అనే అర్థం సిద్ధిస్తుంది అని ప్రత్యేకించి చెప్పపనిలేదు. ఉకారమునకు లక్ష్మి అనే అర్థం చెప్పడానికి అవధారణార్థమే యుక్తమని పెద్దల నిర్వచనం. అందువలన జీవుడు లక్ష్మీనారాయణు లిద్దరికీ దాస్యవృత్తి నెరపుతూ ఉండవలసిన వాడని తెల్లమవుతుంది.

"ఓం నమో భగవతే వాసుదేవాయ'' అనే ద్వాదశాక్షరీమంత్రంలో ఓం తరువాత ప్రయుక్తమైన శబ్దం నమః. దీనిలో న, మః అని రెండు పదాలున్నాయి. అవి నే నున్నది (ఆత్మ, జీవుడు) నాసేవ కొరకు గాదు; పరులసేవ కొరకు గాదు; భగవంతుడి సేవకొరకే - అనే అర్థాన్ని వెల్లడిస్తాయి. నేను నాకు గాని, ఇతరులకు గాని, సంబంధపడిన వాడిని కాను; ఆ పరమాత్మకే సంబంధించిన వాడిని - అని భావిస్తూ జీవుడు తాను సల్పే కైంకర్య రూపమైన కర్మయందు కర్తృత్వ భోక్తృత్వబుద్ధి మాని, పరమాత్ముడే తన పరికరమైన నాచేత తన కైంకర్యమును తానే చేయించుకొంటున్నాడు. తానే దాని ఫల మనుభవిస్తున్నాడు. ఇందులో నాప్రసక్తి ఏమీ లేదు అని భావిస్తూ పరమాత్ముడికి దాస్యం సల్పాలి అని నమశ్శబ్దము యొక్క అర్థతాత్పర్యాలు.

భగవంతుడు, వాసుదేవుడు అను రెండు పదాలు చతుర్థీ విభక్త్యంతాలుగా మారినపుడు భగవతే వాసుదేవాయ అనే విశేషణ విశిష్టమైన భగవన్మంత్రాన్ని ఋషులచే పరికీర్తితమైనదాన్ని కురుపితామహుడు, మహామహుడు భీష్ముడు ధర్మపుత్రుడికి ఉపదేశించాడు. భగవంతుడైన వాసుదేవుడికే తప్ప నాసేవ నా కొరకు గాదు; అన్యులకొరకూ కాదు అని ఆ మంత్రానికి భావం ఏర్పడుతుంది. భగవంతు డనగా జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తి తేజస్సులు అనే షాడ్గుణ్యసంపత్తి కలవాడు. వసుదేవుని కుమారుడైన శ్రీకృష్ణుడనిగాని, తనయందు సమస్తం వసించగా తాను అన్నిటి యందు నివసించేవాడు అనిగాని వాసుదేవుడనే మాటకు అర్థం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **పాపంబులును భయంబులు । నాపదలుం బాయు నిమ్మహాజపమున ధా**
త్రీపాలోత్తమ! శుభములు । ప్రాపించును ధర్మతత్పరత సిద్ధించున్.' 314

ప్రతిపదార్థం: ధాత్రీపాల+ఉత్తమ = రాజులలో శ్రేష్ఠుడా! ఈ+మహాజపమునన్ = ఈ గొప్ప మంత్రము యొక్క ఆవృత్తి చేత; పాపంబులును = పాతకాలు; భయంబులున్ = భయాలు; ఆపదలున్ = విపత్తులు, కడగండ్లు; పాయున్ = తొలగుతాయి; శుభములు = మంగళములు, ఇహపరసౌఖ్యాలు; ప్రాపించును = సమకూడుతాయి; ధర్మతత్పరత = ధర్మమందు ఆసక్తి; సిద్ధించున్ = లభిస్తుంది.

తాత్పర్యం: రాజులలో శ్రేష్ఠుడవైన ధర్మజా! ఈ విష్ణుమంత్ర జపంచేత పాతకాలు, భయాలు, కష్టాలు తీరుతాయి. శుభాలు, ఇహపర సౌఖ్యాలు లభిస్తాయి. ధర్మమందు ఆసక్తి కలుగుతుంది.'

వ. **అని యిట్లు గంగాపుత్త్రుం డజాతశత్త్రునకు సర్వసిద్ధికరం బయిన యిమ్మహాజపం బుపదేశించెనని చెప్పి**
తదనంతర సత్కథ లాకర్ణింపు మని పలికి జనమేజయునకు వైశంపాయనుం డిట్లనియె. 315

ప్రతిపదార్థం: అని; ఇట్లు; గంగా పుత్త్రుండు = గంగాదేవి కుమారుడు భీష్ముడు; అజాతశత్రునకున్ = విరోధులు లేని ధర్మజుడికి; సర్వసిద్ధికరంబు = అన్ని శుభాలు ఇచ్చునట్టి; ఈ+మహా జపంబున్ = ఈ గొప్ప మంత్ర జపాన్ని; ఉపదేశించెన్= బోధించాడు; అని చెప్పి; తత్+అనంతర+సత్కథలు = ఆ పిదప జరిగిన మంచి వృత్తాంతాలు; ఆకర్ణింపుము = ఆలకించుము, వినుము; అని పలికి; జనమేజయునకున్ = శ్రోత అయిన జనమేజయమహారాజునకు; వైశంపాయనుండు= కథకుడైన వ్యాసమహర్షి శిష్యుడు వైశంపాయనుడనే పేరుగల మహర్షి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ విధంగా భీష్ముడు ధర్మరాజుకు అన్ని శుభాలూ, భోగమోక్షాలూ ప్రసాదించే విష్ణుమంత్రం ఉపదేశించాడు-అని చెప్పి అవతలి కథ వినుమని జనమేజయ మహారాజుతో వైశంపాయన మహర్షి ఇట్లా అన్నాడు.

తే. **'మనుజనాథ! యశేషధర్మములు సర్వ । పావనములు శాంతనవుఁడు బహువిధములఁ**
జెప్ప నిమ్మెయి విని యుధిష్ఠిరుఁడు భక్తి । న మ్మహాత్ముని నిట్లని యడిగె మఱియు. 316

ప్రతిపదార్థం: మనుజనాథ = జనమేజయమహారాజా!; సర్వపావనములు = అన్ని విధముల పవిత్రము చేయునట్టి; అశేష ధర్మములు = ఎల్లధర్మాలు; శాంతనవుఁడు = శంతను మహారాజు పుత్రుడైన భీష్ముడు; బహువిధములన్ = పలురీతుల; చెప్పన్ = తెల్పగా; ఈ+మెయిన్ = ఈ విధంగా; విని; యుధిష్ఠిరుఁడు = ధర్మజుడు; భక్తిన్ = భక్తితో; ఆ+మహా+ఆత్మునిన్ = ఆ దొడ్డమనసుగల భీష్ముడిని; మఱియున్ = ఇంకనూ; ఇట్లు+అని+అడిగెన్ = ఈ విధంగా ప్రశ్నించాడు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! పాపా లన్నిటిని పోకార్చి పవిత్రమొనర్చు సకలధర్మాలు శంతను పుత్త్రుడైన భీష్ముడు పెక్కు రీతుల చెప్పగా విని మళ్ళీ ధర్మజుడు మహానుభావుడైన గాంగేయుడిని ఇట్లా ప్రశ్నించాడు.

చ. **'అతఁ డొకరుండ లోకముల కన్నిటికిన్ మహనీయమైన దై**
వతముఁ బరాయణంబు నను వైభవ మెవ్వని కొప్పు? నర్చన
స్తుతి రతి నెవ్వనిం గొలిచి శోభన మొందు జనంబు? మేలు నా
నతిశయ మొంది నీకు మతమై చను నెయ్యది ధర్మకోటిలోన్? 317

ప్రతిపదార్థం: అతఁడు+ఒకరుండు+అ = ఆతడొక్కడే; లోకములకున్+అన్నిటికిన్ = సమస్తలోకాలకు; మహనీయము+ఐన = పరమోత్తమమైన; దైవతము = దైవము; పర+అయనంబున్+అను = పొందదగిన వాడనునట్టి; వైభవము = గొప్పతనము; ఎవ్వనికిన్+ఒప్పున్ = ఎవ్వడికి తగి ఉన్నదో; అర్చన స్తుతిరతిన్ = భక్తితో పూజించటం, గుణములను కీర్తించటం అనే సేవలందు గల ప్రీతితో, ఆసక్తితో; జనంబు = ప్రజ; ఎవ్వనిన్ = ఏ పురుషోత్తముడిని; కొలిచి = భజించి; శోభనము+ఒందున్ = శుభమును పొందునో అనగా భోగమోక్షములు చెందునో; ధర్మకోటిలోన్ = పుణ్యాలన్నింటిలో; ఏ+అది = (ఎయ్యది) ఏది; మేలునాన్ = మంచిదిగా, శ్రేష్ఠమైనదిగా; అతిశయము+ఒంది = ఆధిక్యం చెంది; నీకున్ = నీకు; మతము+ఐ = ఇష్టమై; చనున్? = ఒప్పుతున్నది?

తాత్పర్యం: "పితామహా! లోకము (శాస్త్రాలు) లన్నింటిలో గొప్పదైవం ఎవరు? ఎవడు ఆశ్రయించదగిన మహిమతో విరాజిల్లుతున్నాడు? ఎవడిని భక్తితో పూజించి, ఎవడి గుణాలను కీర్తించి మానవులు శుభములు పొందుతున్నారు? ధర్మా లన్నింటిలో అతిశయించినదై, నీకు సమ్మతమైనదై, మేలు చేకూర్చే ధర్మమేది?

తే. జపములం దెల్ల నుత్తమ జపము నాఁగ । నంచితంబయి తన్ను జపించు జంతు
వునకు జన్మసంసార బంధనము లోపి । పాపు నెయ్యది? యెఱిఁగింపు పరమబోధ!' 318

ప్రతిపదార్థం: పరమబోధ! = ఉత్తమ జ్ఞానం కలవాడా!; జపములందున్+ఎల్లన్ = అన్ని జపాలలో; ఉత్తమ జపమునాఁగన్= శ్రేష్ఠమైన జపమని; అంచితంబు+అయి = ఒప్పిదమై, పూజితమై; తన్నున్ = తనను; జపించు = ఆవృత్తి సల్పునట్టి; జంతువునకున్ = జీవుడికి; జన్మసంసారబంధనములు = జనన మరణరూపమైన సంసారమనే కట్లు; ఓపి = సామర్థ్యం కలిగి; ఏ+అది(ఎయ్యది) = ఏది; పాపున్ = తొలగిస్తుందో; ఎఱిఁగింపు = నాకు తెల్పుము.

తాత్పర్యం: పరమజ్ఞాన సంపన్నుడైన మహాత్మా! జపా లన్నింటిలో శ్రేష్ఠమై, తనను జపించే వారికి జనన మరణ రూప సంసార బంధాలనుండి విముక్తి కలిగించే జపమేదో నాకు తెల్పుము.'

వ. అని యడిగిన నాభూపతికి భీష్ముం డిట్లనియె. 319

తాత్పర్యం: అని ప్రశ్నించిన ప్రభువైన ధర్మరాజుతో భీష్ము డిట్లా అన్నాడు.

భీష్ముఁడు ధర్మజునకు విష్ణుమంత్ర ధ్యానం బవశ్యానుష్ఠేయం బని చెప్పుట. (సం.13-135-4).

సీ. 'అఖిలజగత్ప్రభు వగు దేవదేవు న । నంతునిఁ బురుషోత్తమాభిధాను
నంచితనామ సహస్రకంబున సంస్తు । తించుచు సంతతోత్థిత మనస్కుఁ
డై యజమానుఁ డవ్యయుఁడైన యాతని । నర్చించుచును దృఢ ధ్యాన నిరతుఁ
డగుచు నమస్కృతి యాచరించుచు ననా । ద్యంతు న విష్ణు నధ్యక్షు నెల్ల

తే. లోకములకు బ్రహ్మణ్యుఁ ద్రిలోక కీర్తి । వర్ధనుని సర్వధర్మజ్ఞు వరదు లోక
నాథు భూతభవోద్భవు నమ్మి భక్తిఁ । గొలిచి సర్వదుఃఖంబులఁ దొలఁగఁ ద్రోచు. 320

ప్రతిపదార్థం: అఖిలజగత్ ప్రభువు+అగు = సమస్తలోకాలకు నాథుడైన; దేవదేవున్ = బ్రహ్మాది దేవత లందరికీ దేవుడైన; అనంతునిన్ = అంతం లేని వైభవం కలవాడిని, దేశకాల వస్తు పరిచ్ఛేదం లేని వాడిని; పురుష+ఉత్తమ+అభిధానున్ =

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పురుషోత్తముడనే పేరుగల వాడిని, పరమోదారుడిని; అంచిత = ఒప్పిదమైన; నామ సహస్రకంబునన్ = వేయినామాలతో; సంస్తుతించుచున్ = లెస్సగా కీర్తిస్తూ; సంతత+ఉత్థిత+మనస్కుఁడు+ఐ = ఎల్లప్పుడు పూనికతో కూడిన చిత్తం కలవాడై; యజమానుడు = పూజకుడు, పూజించేవాడు; అవ్యయుఁడు+ఐన = నాశనంగాని, మార్పుగాని లేనివాడైన; ఆతనిన్ = ఆ పరమాత్ముడిని; అర్చించుచును = పూజిస్తూ; దృఢధ్యాన నిరతుఁడు+అగుచున్ = నిశ్చలమైన ధ్యానంలో ఆసక్తి కలవాడై; నమస్కృతి = వందనం; ఆచరించుచున్ = చేస్తూ; అనాద్యంతున్(న+ఆది+అంతున్) = ఆద్యంత శూన్యుడిని, మొదలు తుదిలేని వాడిని; ఆ+విష్ణున్ = సర్వత్రవ్యాపించిన వాడిని; ఎల్లలోకములకున్ = సమస్త భువనములకు; అధ్యక్షున్ = ప్రభువైనవాడిని; సమస్తలోకాలను ప్రత్యక్షంగా తిలకించే వాడిని; బ్రహ్మణ్యున్ = బ్రహ్మకుగాని, బ్రాహ్మణుడికిగాని, తపస్సుకుగాని, వేదానికి గాని హితుడైన వాడిని; త్రిలోక కీర్తి వర్ధనునిన్ = ముల్లోకాలకు కీర్తిని వృద్ధిపొందించేవాడిని; సర్వధర్మజ్ఞున్ = సకలధర్మా లెరిగిన వాడిని; వరదున్ = భక్తులకు వరాలిచ్చేవాడిని; లోకనాథున్ = లోకస్వామిని; భూతభవ+ఉద్భవున్ = జీవులయొక్క సంసారానికి లేదా ఉనికికి కారణమైన వాడిని; నమ్మి = విశ్వసించి; భక్తిన్= భక్తితో; కొలిచి = సేవించి; సర్వదుఃఖంబులన్ = అన్ని చింతలను; తొలఁగన్+త్రోచున్ = దూరంగా గెంటి వేస్తాడు.

తాత్పర్యం: సమస్తలోకాలకు అధిపతియూ, బ్రహ్మాది దేవతలకు దేవుడూ, అంతంలేని వైభవం కలవాడూ, పురుషోత్తముడని ఖ్యాతి వహించినవాడూ అయిన పరమాత్మను వెయ్యి నామాలతో స్తుతిస్తూ ఎల్లప్పుడు పూనిక వహించిన చిత్తంతో గృహస్థుడు ఆద్యంత రహితుడైన ఆ పరమపురుషుడిని పూజిస్తూ, ధ్యానిస్తూ, నమస్కరిస్తూ అంతటా వ్యాపించినవాడున్నూ, భువనా లన్నింటికీ అధ్యక్షుడూ, బ్రహ్మణ్యుడూ, ముల్లోకాలకు కీర్తి పెంచేవాడూ, సకల ధర్మములు ఎరిగినవాడూ, భక్తులకు వరాలిచ్చేవాడూ, జగన్నాథుడూ, జీవుల యొక్క సత్తకు కారణమైనవాడూ అయిన మహాస్వామిని భక్తితో భజించి సకల దుఃఖాలను దూరంగా గెంటి వేయగలడు.

తే. **ప్రస్తుతులఁ బుండరీకాక్షుఁ బరమభక్తిఁ । దగిలి యర్చించుటయ నామతంబు; సర్వ**
ధర్మములకును సమధికతమము నైన । ధర్మ మింత యెఱుంగుము ధర్మతనయ! **321**

ప్రతిపదార్థం: ధర్మతనయ = ధర్మనందనా!; ప్రస్తుతులన్ = స్తోత్రాలతో; పుండరీక+అక్షున్ = తెల్లదామరలవంటి కన్నులుగల వాసుదేవుడిని; పరమభక్తిన్ = మిక్కిలి భక్తితో; తగిలి = ప్రియపడి, ఇష్టపడి; అర్చించుటయ = పూజించటమే; నామతంబు = నా కిష్టం; సర్వధర్మములకును = అన్నిధర్మాలలో; సమధిక తమము+ఐనధర్మము = మిక్కిలి అధికమైన ధర్మం అది; ఇంత+ఎఱుంగుము = ఇది నిజ మని గ్రహించుము.

తాత్పర్యం: ధర్మనందనా! పుండరీక నయనుడైన వాసుదేవుడిని పరమభక్తితో పూజించటమే ధర్మాలన్నిటిలో ఉత్తమమైన ధర్మం. హరిని పూజించటమే నామత మని గ్రహించుము.

సీ. **పరమతేజంబును బరమ పదంబును । బరమైన బ్రహ్మంబుఁ బరపరాయ**
ణముఁ బవిత్రంబులు నాఁ దగువానికి । నెల్లఁ బవిత్రంబు, నెల్ల మంగ
ళంబులకును మంగళంబును, నెల్ల దే । వతలకుఁ బరమదైవతము, భూత
సమితికి నవ్యయజనకుండు నగునట్టి । వాఁ డెవ్వఁ; డెవ్వాని వలనఁ దోఁచు

తే. **నాదియుగము నాగమమున; నంత్యవేళ । నడఁగు నెవ్వానియందుఁ జరాచరములు,**
విశ్వలోక ప్రధానుఁ డవ్విష్ణు వేయు । భవ్యనామంబులును బాపభయహరములు. **322**

ప్రతిపదార్థం: పరమతేజంబును = శ్రేష్ఠమైన తేజస్సును, సమానాధికరహితమైన గొప్పవెలుగు; పరమపదంబును = ఉన్నతమైన స్థానమును; పరము+ఐన బ్రహ్మంబున్ = గొప్పదగు దైవతమును; పరపరాయణమున్ = ముఖ్యమైన ప్రాప్యము, పొందదగిన శ్రేష్ఠమైన వస్తువు; పవిత్రంబులు = పరిశుద్ధికరములు; నాన్+తగు = అనదగిన; వానికిన్+ఎల్లన్ = పదార్థములన్నింటిలో; పవిత్రంబున్ = పరిశుద్ధికరమైనదియు; ఎల్లమంగళంబులకును = సమస్తములైన శుభములకును; మంగళంబును = శుభమును గల్గించునది; ఎల్లదేవతలకున్ = సకల దేవతలకునూ; పరమదైవతమున్ = శ్రేష్ఠమైనదైవమునూ; భూతసమితికిన్ = జీవుల యొక్క సమూహమునకు, ప్రాణికోటికి; అవ్యయజనకుండున్ = శాశ్వతుడైన తండ్రి; అగు+అట్టివాఁడు = ఐనట్టి మహాత్ముఁడు; ఎవ్వఁడు = ఎవడో; ఏ+ వాని వలనన్ = ఏ మహనీయుడివలన; చర+అచరములు = జంగమములు, స్థావరాలు, చేతనములు, అచేతనములు; ఆది యుగము+ఆగమమునన్ = సృష్టి వేళలో; తోఁచున్ = గోచరించునో, ఉత్పన్నమగునో; అంత్యవేళన్ = ప్రళయకాలంలో; ఎవ్వని+అందున్ = ఏ స్వామిలోపల; అడఁగున్ = లీనమగునో, లయించునో; విశ్వలోక ప్రధానుఁడు = సకల ప్రపంచమందు ముఖ్యమైన వాడెవ్వడో; ఆ+విష్ణు = ఆ విష్ణుదేవుడి యొక్క; వేయు = వెయ్యి; సహస్ర సంఖ్యాకమైన; భవ్యనామంబులును= శుభనామములు, మంగళకరములైన పేర్లు; పాపభయహరములు = దురితమును, భయమును తొలగించేవి.

తాత్పర్యం: పరంజ్యోతి స్వరూపుడు; పరమపదాధినాథుడు, పరబ్రహ్మము, మిక్కిలి ఆశ్రయించదగినవాడు, పవిత్రములను పవిత్రీకరించేవాడు, శుభములకెల్ల శుభసంధాయకుడు, సకలదైవతములకు దైవతమయినవాడు, ప్రాణికోటికి వినాశరహితుడైన జనకుడు ఎవడో, ఎవడు చరాచరముల నెల్ల సృష్టిస్తున్నాడో, ప్రళయకాలమందు ఈ భూతజాలమంతా ఎవడిలోపల అణగి ఉంటుందో- సకలజగత్తులలో ప్రధానపురుషుడైన ఆ విష్ణుదేవుడి మంగళకరములైన సహస్రనామాలు జీవుల పాపాలను, భయాలను పటాపంచలు కావిస్తాయి.

తే. **భూరిగుణయోగ విఖ్యాతములును ఋషి స । మాజ పరిగీతములును నై మహిమఁ దనరు**
నమ్మహాత్ముని నామంబు లధికతర వి । భూతికై చెప్పెదను విను భూపవర్య!' 323

ప్రతిపదార్థం: భూపవర్య! = రాజులలో శ్రేష్ఠుడా!; భూరిగుణయోగ విఖ్యాతములునున్ = గొప్ప సద్గుణముల యొక్క కలయికచే ప్రసిద్ధికాంచినవియూ; ఋషిసమాజ = మంత్రవేత్తలైన ముని సంఘం చేత; పరిగీతములునున్+ఐ = లెస్సగా కీర్తించబడినట్టివై; మహిమన్ = ప్రభావం చేత; తనరు = ఒప్పునట్టి; ఆ+మహా+ఆత్ముని నామంబులు = ఆ పురుషోత్తముడి యొక్క పేరులు; అధికతర విభూతికై = మిక్కుటమగు ఐశ్వర్య మొదవుటకై; చతుర్విధ పురుషార్థ సిద్ధికై, ఆత్మోజ్జీవనమునకై; చెప్పెదను = తెల్పుతాను; విను = ఆలకించుము.

తాత్పర్యం: రాజ వల్లభా! ఉదాత్తగుణముల యొక్క సంబంధముచేత ప్రసిద్ధికెక్కినవీ, మునిసంఘంచేత అత్యాదరంతో కొనియాడబడేవీ, ప్రభావంతో ప్రకాశించునట్టివీ అయిన ఆ మహనీయుడినామాలు మిక్కుటమైన విభూతి సమకూడటం కొరకు నీకు చెప్పుతాను వినుము.

వ. **అని పలికి 'విశ్వంబు విష్ణుండు వషట్కారుండు భూతభవ్యభవత్ప్రభు' వను నివి మొదలైన 'రథాంగపాణి యక్షోభ్యుండు సర్వప్రహరణాయుధుం' డనియెడునివి తుదిగాఁ గల సహస్ర నామంబు లుపన్యసించి. 324**

ప్రతిపదార్థం: అని పలికి = అని భీష్ముడు వచించి; విశ్వంబు = స్వరూపరూప గుణ విభవైశ్వర్యాదులచే పూర్ణుడు, ప్రపంచస్వరూపుడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విష్ణుండు = సమస్తమునందు వ్యాపించిఉండేవాడు, దేశకాలవస్తుపరిచ్ఛేదం లేక అంతట నిండి ఉండేవాడు; వషట్కారుండు = సమస్త లోకాలను తన వశం చేసికొన్నవాడు, యజ్ఞాలలో హోమానికి ఉద్దేశ్యమైనవాడు; భూతభవ్యభవత్ప్రభువు = భూతభవిష్యద్వర్తమాన కాలములనే త్రికాలములలోని సకల పదార్థాలకు ప్రభువైనవాడు; అను+ఇవి = అనునట్టి ఈ నామాలు; మొదలు+ఐన = మొదలుగా కలిగిన; రథాంగపాణి = చక్రము చేతియందు కలవాడు, సుదర్శన చక్రం హస్తమందుకలవాడు; అక్షోభ్యుఁడు = కలత నొందించుటకు సాధ్యపడనివాడు, ఎట్టికలతలు లేనివాడు; సర్వప్రహరణాయుధుండు = భక్త రక్షణకై పంచాయుధాలతో పాటు సకల విధములైన అస్త్రాలు ఆయుధాలుగా కలవాడు, ఆయుధాలనే ప్రశస్తి లేని గోళ్ళుకూడా ఆయుధాలుగా కలిగినవాడు; అనియెడు+ఇవి = అనునట్టి ఈ నామాలు; తుదిగాన్+కల = కడపట కలిగిన; సహస్రనామంబులు = వెయ్యిపేర్లు; ఉపన్యసించి = వక్కాణించి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: నారాయణుడి సహస్రనామాలు చెప్పుతాను శ్రద్ధగా ఆకర్ణించు మని పలికి భీష్ముడు విశ్వము, విష్ణుడు, వషట్కారుడు, భూతభవ్య భవత్ప్రభువు అనే నామాలతో ప్రారంభమై రథాంగపాణి, అక్షోభ్యుడు, సర్వప్రహరణాయుధుడు అనే నామాలతో అవసితమయ్యే శ్రీవిష్ణు సహస్రనామాలు ఉగ్గడించాడు.

ఆ. కీర్తనీయుఁడైన కేశవు దివ్యనా। మంబు లివి భవద్ధితంబుఁ గోరి
తరతరంబ కీర్తితంబు లయ్యె నశేష। భంగి వేయుఁ గురునృపాలవర్య! 325

ప్రతిపదార్థం: కురునృపాలవర్య! = కురువంశ ప్రభువులలో శ్రేష్ఠుడా!; కీర్తనీయుఁడు+ఐన = కొనియాడదగినట్టి; కేశవు = శ్రీమన్నారాయణుడి యొక్క; దివ్యనామంబులు+ఇవి = అప్రాకృతములైన నామాలు ఇవియే; భవత్+హితంబున్+కోరి = నీ మేలు నాకాంక్షించి; వేయున్ = వెయ్యింటిని; అశేషభంగిన్ = అన్యూనాతిరిక్తంగా, ఒక్కటి వదలకుండా, పూర్తిగా; తరతరంబు+అ = క్రమక్రమంగా; కీర్తితంబులు+అయ్యెన్ = కొనియాడబడ్డాయి.

తాత్పర్యం: కురువంశరాజులలో ఉత్తముడవైన ధర్మజా! స్తుతికి పాత్రుడైన కేశవుడి యొక్క అప్రాకృతాలైన వెయ్యినామాలివి. వీటిని నీ శ్రేయస్సును కోరి పరిపూర్ణంగా క్రమక్రమంగా నీకు వినిపించాను.

భీష్ముఁడు ధర్మజునకు విష్ణునామ ప్రభావంబుఁ దెలుపుట. (సం.13-135-121).

సీ. విష్ణునామంబులు వేయును నిత్యంబు। వినినఁ బఠించిన మనుజుఁ డిహము
నందుఁ బరమ్మున నశుభంబు నొందక। యత్యంత శుభముల ననుభవించు;
విప్రుండు వేదాంతవిదుఁ డగు, రాజు వి। జయ మొందు, వైశ్యుఁ డక్షయ ధనంబుఁ
బడయు, శూద్రుఁడు సుఖభాగిత వెలయు, ధ। ర్మార్థకామ ప్రజాభ్యర్థి జనులు

తే. గాంతు రయ్యె తెఱంగు; లేకాంత భక్తి। శౌచియై విని కీర్తించి సారయశము
నచల లక్ష్మియు వంశ వర్యతయు మేలి। పెంపుసొంపును గలిగి శోభిల్లు నరుఁడు. 326

ప్రతిపదార్థం: విష్ణునామంబులు వేయును = విష్ణుదేవుడి యొక్క సహస్రనామాలు; నిత్యంబున్ = ప్రతిదినము; వినినన్ = ఇతరులు చదువగా ఆలకించిననూ; పఠించినన్ = తాను చదివిననూ; మనుజుఁడు = నరుడు; ఇహమునందున్ = ఈ లోకంలో; పరమ్మునన్ = పై లోకంలో; అశుభంబున్+ఒందక = అమంగళము, కీడు పొందక; అత్యంత శుభములన్ = కడలేని సౌఖ్యాలను; అనుభవించున్ = అనుభవిస్తాడు; విప్రుండు = భూసురుడు; వేద+అంత+విదుఁడు+అగున్ =

ఉపనిషద్రహస్యాలు తెలిసినవా డవుతాడు; రాజు = క్షత్రియుడు; విజయము+ఒందున్ = జయమును పొందుతాడు; వైశ్యుఁడు = వణిజుడు, వైశ్యకులస్థుడు; అక్షయధనంబున్ = తరుగని సిరిని; పడయున్ = పొందుతాడు; శూద్రుఁడు = శూద్రవర్ణస్థుడు; సుఖభాగితన్ = సౌఖ్యభాజనుడై; సుఖములందు పాలుపంచుకొన్నవాడై; వెలయున్ = విలసిల్లుతాడు; ధర్మ+అర్థ+కామ = ధర్మం, అర్థం, కామం అనే త్రివర్గమునూ; ప్రజా+అభి+అర్థి = సంతానమును అభిలషించేటటువంటి; జనులు = ప్రజలు, ఏకాంత భక్తిన్ = అధికమైన భక్తితో; అయ్యైతెఱంగులు = ఆయా అభిలషితార్థములు; కాంతురు = పొందుతారు; శౌచి+ఐ = పరిశుద్ధుఁడై; విని = శ్రీవిష్ణుసహస్రనామములను ఆలకించి; కీర్తించి = తాను కొనియాడి, పఠించి; సారయశమున్ = స్థిరమైన కీర్తిని; అచల లక్ష్మియున్ = నిలుకడ కలిగిన సంపత్తిని; వంశ వర్యతయున్ = తనకులమందు ప్రాధాన్యమును; మేలి = ఉన్నతమైన; పెంపుసొంపును = గౌరవాతిశయాన్ని; కలిగి = లభించినవాడై; నరుఁడు = మనుజుడు; శోభిల్లున్ = వెలుగొందుతాడు.

తాత్పర్యం: శ్రీ విష్ణు సహస్రనామాలు అనుదినం వినేవాడు, పఠించేవాడు ఈ లోకంలో, పైలోకంలో అశుభాల పాలుగాక అపరిమిత శుభాలు అనుభవిస్తాడు. బ్రాహ్మణుడు నామసహస్రపఠనం చేత వేదాంతవేత్త అవుతాడు. క్షత్రియుడు శాత్రవ జయం పొందుతాడు. వైశ్యుడు ధనసమృద్ధి గలవాడవుతాడు. శూద్రుడు శ్రవణమాత్రంతోనే సుఖాలను పొందుతాడు. ధర్మమును వాంఛించేవాడు ధర్మాన్ని, అర్థమును అభిలషించేవాడు అర్థాన్ని, కామమును కోరేవాడు కామములను, సంతానం కాంక్షించేవాడు సంతతిని అత్యంత భక్తితో విష్ణుసహస్రనామాలను విని, పఠించి పొందగలడు. పరిశుద్ధుడై ఏ నరుడు సహస్రనామాలను శ్రవణం చేస్తాడో, పారాయణం చేస్తాడో ఆతడు స్థిరమైన కీర్తిని, తరుగని సిరిని, కులమందు ప్రాధాన్యమును పడయగలుగుతాడు. ఉన్నత గౌరవాతిశయంతో ఒప్పుతాడు.

సీ. **పురుషోత్తముని నామములు వేయుఁ గీర్తించు । నాతఁ డొక్కెడను భయంబుఁ బొందఁ,**
డమిత వీర్యమునఁ దేజమునఁ గాంతిని బల । రూపగుణంబుల రూఢికెక్కు ,
రోగబంధాపదార్తులకుఁ బఠనమాత్ర । నయ్యయి దురితము లడఁగు, వాసు
దేవాశ్రయుఁడు వాసుదేవ పరాయణుఁ । డును నగుమర్త్యుఁ డవ్వినుతనామ

ఆ. **కము లుపన్యసించి కల్మషంబుల నెల్ల । దొఱఁగి దుర్గతులకుఁ దొలఁగి జన్మ**
మరణములకు రోగ జరలకు నందని । పరమమైన బ్రహ్మపదము నొందు. **327**

ప్రతిపదార్థం: పురుషోత్తముని = శ్రీమన్నారాయణుడి యొక్క; నామములు వేయున్ = వెయ్యినామధేయాలను; కీర్తించు+అతఁడు = కొనియాడునట్టి వాఁడు, పొగడేవాడు, శ్లాఘించేవాడు; ఒక్క+ఎడను = ఏ తావునందు గూడ; భయంబున్ = వెరపును, భీతిని; పొందఁడు = చెందడు; అమిత వీర్యమునన్ = మిక్కిలి పరాక్రమంతోనూ; తేజమునన్ = ప్రతాపంతోనూ; కాంతిన్ = శోభతో, దీప్తితో; బలరూపగుణంబులన్ = శక్తి, సౌందర్యం, సద్గుణములు అనువాటితో; రూఢికిన్+ఎక్కున్ = ప్రసిద్ధిగాంచుతాడు; రోగ+బంధ+ఆపత్+ఆర్తులకున్ = వ్యాధులు, బంధనం, కష్టాలు అనువాటితో బాధపడేవారికి; పఠనమాత్రన్ = సహస్రనామ పారాయణం చేయగానే; అయ్యయి దురితములు = ఆయాపాపాలు; అడఁగున్ = నశిస్తాయి, నిర్మూలమవుతాయి; వాసుదేవ+ఆశ్రయుఁడున్ = వాసుదేవుడిని ఆశ్రయించుకొన్నవాడున్నూ; వాసుదేవ పరాయణుఁడునున్ = వాసుదేవుడిని పరమ గతిగా ఎంచుకొన్నవాడూ, విశ్వసించినవాడూ; అగుమర్త్యుఁడు = అయిన మానవుడు; ఆ+వినుత నామకములు = ఆ మెచ్చదగిన వెయ్యిపేర్లు; ఉపన్యసించి = ఉగ్గడించి, పేర్కొని; కల్మషంబులన్+ఎల్లన్ = అన్ని దురితాలను, పాతకాలను; తొఱఁ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గి = వీడి; దుర్గతులకున్+ తొలఁగి = దుఃస్థితులకు దూరమై, విపత్తులనుండి విడివడి, ఇడుములు బాసి; జన్మమరణములకున్ = చావు పుట్టుకలకు; రోగజరలకున్ = వ్యాధులకూ, ముసలితనానికీ; అందని = చిక్కని, దొరకని, లోనుగాని; పరమము+ఐన = ఉత్తమమైన; బ్రహ్మపదమున్+ఒందున్ = మోక్షాన్ని పొందుతాడు.

తాత్పర్యం: విష్ణుమూర్తి వెయ్యినామాలను నిత్యం పారాయణ మొనర్చేవాడు ఎక్కడా భయాన్ని పొందడు. మిక్కుటమైన శౌర్యం, ప్రతాపం, శోభ, శక్తి, సౌందర్యం, సద్గుణాలు అనే వాటితో ప్రసిద్ధి చెందుతాడు. శ్రీ విష్ణునామ పఠనంతో రోగాలు వదలుతాయి. చెరనుండి విముక్తి లభిస్తుంది. ఇడుమలు తీరుతాయి. నామ పారాయణంవలన ఈ పాతకాలన్నీ నశిస్తాయి. వాసుదేవుడిని ఆశ్రయించుకొన్నవాడు, వాసుదేవుడిని దిక్కుగా ఎంచుకొన్నవాడూ, శ్లాఘింపదగిన ఈ భగవన్నామాలను పఠించి దురితవిహీనుడై, దుఃస్థితులకు దూరమవుతాడు. జననమరణాలకూ, జరావ్యాధులకూ లోనుగాక పరమోత్తమమైన మోక్షపదవిని అందుకొంటాడు.

క. స్మృతి సౌఖ్య క్షాంతి శ్రీ । ధృతి కీర్తులు గలుగు దుర్మతియుఁ గ్రోధము లు
బ్ధతయును మాత్సర్యము లే । వతి పుణ్యత విష్ణుభక్తులైన జనులకున్. 328

ప్రతిపదార్థం: అతిపుణ్యతన్ = అధికమైన పుణ్యం సల్పడంచేత; విష్ణు భక్తులు+ఐన = నారాయణ ప్రేమికులైన; జనులకున్ = నరులకు; స్మృతి = జ్ఞప్తి, ఒరులు చేసిన మేలు మరువకుండటం; సౌఖ్య = సుఖం; క్షాంతి = సహనం, ఓర్పు; శ్రీ = కలిమి; ధృతి = ధైర్యం; కీర్తులు = యశస్సు అనునవి; కలుగున్ = లభిస్తాయి; దుర్మతియున్ = చెడుబుద్ధి; క్రోధము = కినుక, కోపం, ఆగ్రహం; లుబ్ధతయును = పేరాస; మాత్సర్యము = ఓర్వలేనితనం, అసూయ; లేవు = కలుగవు.

తాత్పర్యం: పుణ్యాత్ములైన విష్ణుభక్తులకు ఇతరు లొనర్చిన మేలు మరువకుండటం, సుఖం, సహనం, సంపత్తి, ధైర్యం, యశస్సు అనేవి లభిస్తాయి. చెడుబుద్ధి, కోపం, పేరాస, ఓర్వలేనితనం అనే దుర్గుణాలు ఉండవు.

సీ. చంద్రార్క నక్షత్ర సహిత మైన నభంబు, । సచరాచరోర్వియు, జలనిధులును,
సురదైత్య గంధర్వ గరుడ యక్షోరగ । వ్రజములు హరివశవర్తనములు;
బుద్ధియు నింద్రియములును మనంబు స । త్త్వంబును బలము దేజంబు ధృతియు
క్షేత్రంబుఁ దద్గత క్షేత్రజ వస్తువు । లరయఁగా వాసుదేవాత్మకంబు;

తే. లాగమోదితాచారమయంబు ధర్మ । మచ్యుతుండు తత్ప్రభువు; సాంఖ్యమును యోగ
తంత్రమును శిల్పవేదశాస్త్రములుఁ గర్మ । ములు జనార్దనువలన సముద్భవించె. 329

ప్రతిపదార్థం: చంద్ర+అర్క,నక్షత్ర సహితము+ఐన = సోముడితో, సూర్యుడితో, చుక్కలతో కూడినట్టి; నభంబున్ = ఆకాశం; సచర+అచర+ఉర్వియున్ = చేతనాలతో, అచేతనాలతో కూడిన ధరణీతలం; జలనిధులును = సముద్రాలు; సుర = దేవతలు; దైత్య = రాక్షసులు; గంధర్వ = గంధర్వులు; గరుడ = గరుడులు; యక్ష = యక్షులు; ఉరగ వ్రజములు = సర్పములు అనువాటి యొక్క సమూహాలు; హరివశవర్తనములు = విష్ణున కధీనములైన ప్రవర్తన గలవి; శ్రీహరికి లోబడి మెలగుతుంటాయి; బుద్ధియున్ = బుద్ధి; ఇంద్రియములున్ = జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు; మనంబున్ = మనస్సు; సత్త్వంబును = సత్త్వము; బలమున్ = శక్తి; తేజంబున్ = తేజస్సు; ధృతియున్ = ధైర్యం; క్షేత్రమున్ = శరీరం; తద్గత = దేహంలో ఉన్న; క్షేత్రజవస్తువులు = ఆత్మద్రవ్యములు; అరయన్+కాన్ = ఆలోచించగా; వాసుదేవ+ఆత్మకములు =

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నారాయణ స్వరూపాలు; ధర్మము = ధర్మమనే ప్రథమ పురుషార్థం; ఆగమ+ఉదిత = వేదాలలో, ధర్మశాస్త్రాలలో చెప్పబడిన; ఆచారమయంబు = అనుష్ఠానముతో కూడినది; తత్+ప్రభువు = ఆ ధర్మానికి అధీశ్వరుడు; అచ్యుతుడు = నారాయణుడు; సాంఖ్యమును = సాంఖ్యశాస్త్రమును; యోగతంత్రమును = యోగసిద్ధాంతము; శిల్ప వేద శాస్త్రములు = శిల్పము, వేదములు, ఇతిహాసపురాణాలు; కర్మములున్ = కర్మలు; జనార్దనువలనన్ = నారాయణుడివలన; సముద్భవించెన్ = కలిగాయి.

తాత్పర్యం: సూర్యచంద్ర నక్షత్రాలతో గూడిన ఆకాశం, స్థావరాలతో, జంగమాలతో చేరిన భూతలం, సముద్రాలు, దేవతలు, దానవులు, గంధర్వులు, గరుడులు, యక్షులు, సర్పములు మున్నుగా గల్గిన భూతజాలం, విష్ణుదేవుడికి అధీనాలై మెలగుతున్నాయి. బుద్ధి, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, సత్త్వం, శక్తి, తేజస్సు, ధైర్యం, శరీరం, శరీరగతుడైన ఆత్మ-ఈ పదార్థజాతమంతా ఆలోచిస్తే వాసుదేవమయాలే. వేదాలలో, ధర్మశాస్త్రాలలో చెప్పబడిన సదాచారమే, సంప్రదాయమే ధర్మం. ఈ ధర్మానికి ప్రభువు శ్రీమన్నారాయణుడు. సాంఖ్య యోగ సిద్ధాంతాలు, శిల్పం, వేదాలు, ఇతిహాసపురాణాలు, కర్మములు సమస్తమూ జనార్దనుడివలననే సంభవించాయి.

ఆ. విష్ణుఁ డొక్కరుండ విను మహాభూతంబు; । దక్కు భూత తతులు పెక్కు గలవు;
సరిఁ ద్రిలోకములను బరఁగి విశ్వంబు భూ । తాత్ముఁ డమ్మహాత్ముఁ డనుభవించు. 330

ప్రతిపదార్థం: విను = ధర్మజా! సావధానుడవై ఆలకించుము; విష్ణుఁడు+ఒక్కరుండు+అ = సర్వజీవాంతర్యామి యైన విష్ణుదేవుడొక్కడే; మహాభూతంబు = గొప్పభూతం; తక్కు = ఇతరములైన, తదన్యములైన; భూత తతులు = భూతముల యొక్క సమూహాలు, జీవజాలాలు; పెక్కు కలవు = అనేకం ఉన్నాయి; సరిన్ = సమానంగా, భేదరహితంగా; త్రిలోకములను = ముజ్జగాలలో; పరఁగి = వ్యాపించి; భూత+ఆత్ముఁడు = భూతస్వరూపుడైనట్టి, భూతములకెల్ల ఆత్మగాఉన్నట్టి; ఆ+మహా+ఆత్ముఁడు = ఆ మహనీయుడైన విష్ణుదేవుడు; విశ్వంబున్+అనుభవించున్ = ప్రపంచమును అనుభవిస్తున్నాడు.

తాత్పర్యం: ధర్మజా! శ్రద్ధాసక్తులతో ఆలకించుము. విష్ణువొక్కడే మహాభూతం. తక్కినవన్నీ చిన్న చిన్న భూతాలు-లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. భూతాత్ముడు, మహాత్ముడు అయిన మహావిష్ణువు ముల్లోకములందు వ్యాపించి లీలారసాన్ని అనుభవిస్తున్నాడు.

ఆ. వ్యాస సంప్రణీతమైన యీ విష్ణు స్త । వంబు సకలశోభనంబులును సు
ఖములుఁ గోరు పురుషుఁ డమలినబుద్ధిఁ బ । ఠింపవలయు భక్తి పెంపుతోడ. 331

ప్రతిపదార్థం: సకలశోభనంబులును = సమస్తములైన శుభాలను, మంగళములను, సౌభాగ్యాలను; సుఖములున్ = సౌఖ్యాలు; కోరు = వాంఛించే; పురుషుఁడు = నరుడు; అమలిన బుద్ధిన్ = నిర్మలమైన చిత్తంతో; భక్తిపెంపుతోడన్ = అధికమైన భక్తిభావంతో; వ్యాససంప్రణీతము+ఐన = వేదవ్యాసమహర్షిచేత రచించబడిన; ఈవిష్ణుస్తవంబున్ = ఈ శ్రీవిష్ణు సహస్రనామస్తోత్రాన్ని; పఠింపన్+వలయున్ = తప్పక చదవాలి.

తాత్పర్యం: సమస్త సన్మంగళాలను, సుఖాలను కోరుకునే మానవుడు నిర్మలమైన అంతఃకరణంతో, అధికమైన భక్తి భావంతో శ్రీవేదవ్యాస మహర్షి కృతమైన శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రాన్ని తప్పక చదవాలి.

క. అజు విశ్వాధీశ్వరు స । ర్వజగత్ప్రభవావ్యయ ప్రవర్తనకరు నం
బుజలోచను నెవ్వారలు । భజింతురు పరాభవమునఁ బడ రప్పుణ్యుల్. 332

ప్రతిపదార్థం: అజున్ = పుట్టుకలేని వాడూ, జన్మరహితుడూ; విశ్వ+అధి+ఈశ్వరున్ = ప్రపంచానికి అధిపతియూ; సర్వజగత్ = సమస్త లోకాల యొక్క; ప్రభవ = పుట్టుకను; అవ్యయ ప్రవర్తన = నాశముగాని, శాశ్వతమైన నిర్వహణమును; కరున్ = చేసేవాడునూ అయిన; అంబుజలోచనున్ = పద్మములవంటి నేత్రములుగల మహావిష్ణువును; ఏ+వారలు = ఏ జనులు; భజింతురు = కొలుతురో, సేవింతురో; ఆ+పుణ్యుల్ = ఆ పుణ్యాత్ములు; పరాభవమునన్+పడరు = అవమానం పాలుగారు.

తాత్పర్యం: పుట్టుకలేని వాడున్నూ, ప్రపంచేశ్వరుడున్నూ, సకలభువనాలను సృష్టించేవాడున్నూ, కమలదళముల వంటి కన్నులు గల శ్రీమహావిష్ణువును ఎవరు సేవిస్తారో, అట్టి పుణ్యపురుషులు పరాభవముల పాలుగారు.

క. **కావున విష్ణుని పేళ్ళగు । నీ వేయుఁ బఠింపు నీకు నెప్పుడు నాయు**
శ్రీవిభవారోగ్యంబులు । భూవర! సిద్ధించుఁ బరమబోధముఁ గలుగున్.' 333

ప్రతిపదార్థం: భూవర! = రాజా!; కావునన్ = కనుక; విష్ణుని పేళ్ళు+అగు = శ్రీహరినామధేయాలైన; ఈవేయున్ = ఈ వెయ్యింటిని; పఠింపు = చదువుము; నీకున్ = నీకు; ఎప్పుడున్ = ఎల్లప్పుడు, సంతతము; ఆయుః = ఆయుష్యము; శ్రీ = సంపద, కలిమి, సిరి; విభవ = వైభవం, గొప్పతనం; ఆరోగ్యములు = అనామయం, వ్యాధిరాహిత్యం; సిద్ధించున్ = లభిస్తాయి; పరమబోధమున్ = ఉత్తమజ్ఞానం; కలుగున్ = సమకూడుతుంది, చేకూరుతుంది.

తాత్పర్యం: ధర్మజా! విష్ణుదేవుడి వెయ్యినామాలను ఎల్లప్పుడూ పఠించుము. పఠిస్తే నీకు దీర్ఘాయుష్యము, ఐశ్వర్యమూ, వైభవమూ, ఆరోగ్యమూ, ఉత్తమ జ్ఞానమూ లభిస్తాయి.'

క. **అని యిట్లుపదేశించిన । విని మోదము నెమ్మనమున వెల్లిగొనఁగ బాం**
డుని యగ్రసుతుఁడు గాంగే । యున కభివందన మొనర్చి యుచితవినయుఁ డై. 334

ప్రతిపదార్థం: అని, ఇట్లు = అంటూ ఈ ప్రకారం; ఉపదేశించినన్ = భీష్ముడు బోధించగా; విని = ఆలకించి; మోదము = సంతోషం; నెఱ+మనమునన్ = తన నిండు మనస్సులో; వెల్లి+కొనఁగన్ = ప్రవహించగా; పాండుని+అగ్రసుతుఁడు = పాండు మహారాజు యొక్క పెద్దకుమారుడు అయిన ధర్మరాజు; గాంగేయునికిన్ = గంగాపుత్రుడైన దేవవ్రతుడికి, భీష్ముడికి; అభివందనము+ ఒనర్చి = ప్రణామం చేసి, దణ్ణం పెట్టి; ఉచిత వినయుఁడు+ఐ = తగిన అణకువ కలవాడై (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: ఈ రీతిగా భీష్ముడు ధర్మజునకు శ్రీవిష్ణుసహస్రనామాలు ఉపదేశించగా ఆలకించి ఆనందం తనమదిలో నిండి ప్రవహించగా పాండుమహారాజుయొక్క జ్యేష్ఠ పుత్రుడైన యుధిష్ఠిరుడు ఆయనకు సాష్టాంగదండప్రణామం చేసి, తగిన వినయంతో.

వ. **'పూజానమస్కారంబులకు నెవ్వరు భాజనంబు? లెవ్వరికిఁ జెట్ట సేసినం జేటు వాటిల్లు? నెవ్వారలు సంతోషించిన శుభంబులు చొప్పడుం? జెప్పవే యనిన నతం డతని కిట్లనియె. 335**

ప్రతిపదార్థం: పూజా నమస్కారంబులకున్ = అర్చించటానికీ, మ్రొక్కటానికీ; ఎవ్వరు; భాజనంబులు = అర్హులు, పాత్రులు, యోగ్యులు, తగినవారు; ఎవ్వరికిన్; చెట్ట+చేసినన్ = కీడు కావిస్తే; చేటు+పాటిల్లున్ = కీడు మూడుతుందో; ఏ+వారలు = ఎవ్వారు; సంతోషించినన్; శుభంబులు; చొప్పడున్ = కలుగునో; చెప్పవు+ఏ? = తెలుపవా?; అనినన్ = అని ధర్మరా జనగా; అతండు = భీష్ముడు; అతనికిన్ = ధర్మజునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పూజించటానికి, నమస్కరించటానికి ఎవరు తగినవారు? ఎవరికి కీడు చేస్తే మనకు కీడు మూడుతుందో, ఎవరిని సంతోషపరిస్తే మనకు శుభాలు సంప్రాప్తిస్తాయో చెప్పవలసింది' అని వేడుకొనగా గాంగేయుడు ధర్మనందనుడికి ఇట్లా బదులు చెప్పాడు.

బ్రాహ్మణ పూజానమస్కారంబులు పరమోత్కృష్టంబు లని చెప్పుట. (సం.13-136-1).

సీ. 'పూజానమస్కారములకుఁ బాత్రములు బ్రా । హ్మణులు; వారలకుఁ గీ డాచరించి
వాసవుండును జెడు; వారి సంతసమున । నఖిల శుభంబులు నావహిల్లు;
ధర్మసేతువు లోకధారకం బఖిలశా । స్త్ర ప్రవర్తకము విప్రవ్రజంబు;
తపమును వాక్కును ధనము విప్రుల కొక్క । కుడుపు మాత్రన పాపకోటిఁ బాతు;

తే. రమ్మహాత్ములు చొప్పరు లఖిలమార్గ । ములకు; విను దేవతలు దేవతలకు బాలుఁ
డజ్ఞుఁ డన లేదు పూజకు నర్హు లనిన । నధిప! వృద్ధులఁ బ్రాజ్ఞుల నడుగనేల?' 336

ప్రతిపదార్థం: అధిప = రాజా!; బ్రాహ్మణులు = భూసురులు; పూజానమస్కారములకున్ = పూజించటానికీ, నమస్కరించటానికీ; పాత్రములు = తగినవారు, అర్హులు; వారలకున్ = విప్రులకు; కీడు+ఆచరించి = హాని సల్పి; వాసవుండును = దేవేంద్రుడైననూ; చెడున్ = నశిస్తాడు, పాడైపోతాడు; వారి సంతసమునన్ = ఆ బ్రాహ్మణులు ఆనందపడితే; అఖిలశుభంబులున్ = సమస్తమంగళములు; ఆవహిల్లున్ = కలుగుతాయి; విప్రవ్రజంబు = బ్రాహ్మణ సమాజం; ధర్మసేతువు = ధర్మరక్షకం; లోకధారకంబు = లోకమును ధరించునట్టిది, లోకులకు ఆధారమైనట్టిది; అఖిలశాస్త్రప్రవర్తకము = భగవదాజ్ఞలైన వేదశాస్త్ర పురాణాదులను ప్రవర్తింపజేస్తుంది, జనులు అనుసరించేటట్లు చేస్తుంది; విప్రులకున్ = ద్విజులకు; తపమును = తపస్సు; వాక్కును = మాటయు; ధనము = విత్తము; ఒక్కకుడుపుమాత్రన = ఒక పూట వారికి భోజనం పెట్టితే (అన్నదాత యొక్క); పాపకోటిన్ = పాతకాల సమూహాన్ని; పాతురు = తొలగిస్తారు; అఖిలమార్గములకున్ = అన్నిదారులకు; ఆ+మహా+ఆత్ములు = ఆ దొడ్డమనసుగల విప్రులే; చొప్పరులు = దారిచూపేవారు; విను = ధర్మజా! శ్రద్ధగా ఆలకించుము; దేవతలకున్ = వేల్పులకు; దేవతలు = వారే వేల్పులు; బాలుఁడు = పిల్లవాడు; అజ్ఞుఁడు = మూఢుడు; అనన్ లేదు = విప్రుల విషయంలో ఆ ఎన్నిక తగదు; పూజకున్ = ఆరాధనకు; అర్హులు = వారు యోగ్యులు; అనినన్ = అని చెప్పేటపుడు; వృద్ధులన్ = వారిలో పెద్దలను గూర్చి; ప్రాజ్ఞులన్ = పండితులగూర్చి; అడుగన్+ఏల = పూజార్హులని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

తాత్పర్యం: బ్రాహ్మణులు పూజించటానికి, నమస్కరించటానికి యోగ్యులు. వారికి కీడుచేసినచో దేవేంద్రుడయినా చెడకమానడు. వారిని సంతోషపెడితే సకల శుభాలు సమకూడుతాయి. ధర్మ రక్షకులు, లోకోద్ధారకులు, శాస్త్రప్రవర్తకులు వారే సుమా! విప్రులకు వారి తపస్సే, వచనమే ధనం. వారి కొక్కపూట తిండి పెట్టినవారి పాతకరాసు లన్నింటినీ వారు పటాపంచలు కావించగలరు. అన్ని మార్గా లెరిగినవారు కనుక జనులకు మంచిదారి చూపగలవారు వారే. ధర్మపుత్రా! వినుము. దేవతలకు దేవతలు వారే. ద్విజుడు బాలుడైనా, మూఢుడైనా పూజార్హుడే. అటువంటప్పుడు వారిలో పెద్దలయినవారూ, పండితులయినవారూ పూజార్హులని వేరుగా చెప్పవలసిన అక్కర లేదుగదా!'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని యజాతశత్రుండు 'బ్రాహ్మణులఁ బూజించుటవలన విశిష్టంబయిన శుభం బెయ్యది దృష్టం బయ్యు వారలయందు వర్ణనీయం బగు వర్తనం బేమి గానంబడియె నీవిట్లు వారలం గొనియాడె? దెఱింగింపవే' యనుటయు నాపగాపుత్రుండు 'పవనార్జున సంవాదం బను నితిహాసంబు విను; మది భవత్ప్రశ్నంబునకు సదుత్తరంబై యుండు' నని పల్కి య జ్జనపతి కిట్లనియె. 337

ప్రతిపదార్థం: అనినన్; విని; అజాత శత్రుండు = ధర్మరాజు; బ్రాహ్మణులన్; పూజించుట వలనన్; విశిష్టంబు+అయిన = శ్రేష్ఠమైన, ప్రత్యేకమైన; శుభంబు; ఏ+అది (ఎయ్యది) = ఎట్టిది; దృష్టంబు+అయ్యున్ = నీచేచూడబడినదూ, నీకు గోచరించినా; వారలయందున్ = ఆ బ్రాహ్మణులందు; వర్ణనీయంబు+అగు = స్తుతించదగిన, మెచ్చదగిన; వర్తనంబు = నడవడి, ప్రవర్తన; ఏమి+కానంబడియెన్ = ఏమి కనిపించింది?; నీవు; ఇట్లు; వారలన్ = ఆ ద్విజులను; కొనియాడెదు? = మెచ్చుకొంటావు? ఎఱింగింపవు+ఏ = తెల్పుమా; అనుటయున్ = అని ధర్మరాజడుగగా; ఆపగాపుత్త్రుండు = నదీసుతుడు-భీష్ముడు; పవన+అర్జున సంవాదంబు = వాయుదేవునకు, కార్తవీర్యార్జునునకు జరిగిన సంభాషణం; అను = అనునట్టి; ఇతిహాసంబున్ = పూర్వ చరిత్రను; వినుము; అది = ఆ కథ; భవత్+ప్రశ్నంబునకున్ = నీ వడిగిన దానికి; సత్+ఉత్తరంబు+ఐ = మంచిసమాధానమై; ఉండున్ = ఉంటుంది; అని పల్కి; ఆ+జనపతికిన్ = రాజైన ధర్మజునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీష్ము డట్లా పల్కగా విని పాండునందనుడు 'పితామహా! బ్రాహ్మణులను పూజించటంవలన ప్రత్యేకమైన శుభం నీ కేమి గోచరించినప్పటికినీ, వారియందు ఇంతగా కొనియాడదగిన నడవడి(చరిత్ర) నీ కేమి కన్పించింది? వారిని నీవు ఇట్లా ఎందుకు మెచ్చుతున్నావో తెల్పు' మని అడిగాడు. అందుకు గంగానందనుడు 'ధర్మజా! పవనార్జున సంవాదమనే ఒక పూర్వగాథ ఉన్నది. అది నీ వడిగిన ప్రశ్నకు సరి అయిన సమాధానం అవుతుంది. వినిపిస్తాను, విను' మని భీష్ముడు ఇట్లా అన్నాడు.

పవన కార్తవీర్యార్జున సంవాదంబు భీష్ముండు ధర్మరాజునకుం జెప్పుట. (సం.13-137-2).

సీ. 'అధిప! సహస్రబాహార్జునుఁ డేడుదీ । వులు నేలి యద్భుతబలపరాక్ర
మములఁ దనర్చి 'మత్సము లెవ్వరును నెందు । లేరని యత్యవలేపయుక్తి
నాడిన నొకభూత మాకాశముననుండి । 'యెఱుఁగక పలికెద; వెల్లవారి
కధికులుగారె ధరామరు' లనవుడు । నతఁడు 'వారలు రాజు నాశ్రయించి

తే. నడపి కొందురు మనుగడ; పుడమిఁజేని । కంటె నె ట్లెక్కుడై? రట్లుఁ గాక యేను
మనుతుఁ గూర్చినఁ, జెఱుతు నల్గిన సమస్త । భూతముల' నన్న వెఱచి యా భూత మరిగె. 338

ప్రతిపదార్థం: అధిప! = రాజా! సహస్రబాహు+అర్జునుఁడు = వేయిచేతులు గల కార్తవీర్యార్జునుడు; ఏడు దీవులున్+ఏలి = సప్తద్వీపాలను పాలించి; అద్భుతబలపరాక్రమములన్ = ఆశ్చర్యం కల్గించే శక్తితో, శౌర్యంతో; తనర్చి = ఒప్పి; మత్+సములు = నాకు సమానులు; ఎవ్వరును; ఎందున్; లేరు; అని; అతి+అవలేపయుక్తిన్ = మిక్కుటమైనగర్వంతో కూడినవాడై; ఆడినన్ = పలుకగా; ఒక భూతము = ఒకప్రాణి; ఆకాశమునన్+ఉండి = గగనతలం నుండి; ఎఱుఁగక పలికెదవు = తెలియకుండా మాట్లాడుతున్నావు; ఎల్లవారికిన్ = అందరికి; ధరా+అమరులు = భూసురులు; అధికులుకారు+ఎ = గొప్పవారుగదా!; అనవుడున్ = అని ఆ భూతం పలుకగా; అతఁడు = కార్తవీర్యుడు; వారలు = బ్రాహ్మణులు; రాజున్; ఆశ్రయించి = కనిపెట్టుకొని; మనుగడ = తమజీవనము, బ్రతుకు తెరువు; నడపి కొందురు = సాగించుకొంటారు; పుడమి ఱేనికంటెన్

= భూపతికంటెను; ఎట్లు = ఏ విధంగా; ఎక్కుడు+ఐరి? = అధికులైనారు?; అట్లున్+కాక = అంతేగాక; ఏను = నేను; కూర్చినన్ = ఇష్టపడితే, ప్రియపడితే; సమస్తభూతములన్ = ఎల్లజీవులను; మనుతున్ = రక్షిస్తాను, కాపాడ గలను; అల్గినన్ = కోపం వహిస్తే; చెఱుతున్ = నాశనం చేస్తాను, శిక్షించగలను; అన్నన్ = అని చెప్పగా; వెఱచి = భయపడి; ఆ భూతము; అరిగెన్ = వెళ్ళిపోయింది.

తాత్పర్యం: 'ధర్మనందనా! వేయి చేతులు గల కార్తవీర్యార్జునుడు అనే రాజు సప్తద్వీపాలను పరిపాలించాడు. వింత గొలుపు బలపరాక్రమాలతో వెలుగొందుతూ అతడు ఎందునూ నాకు సమానులు ఎవ్వరూ లేరని మిక్కిలి గర్వంతో పలికాడు. ఆ మాటలు విని ఆకాశంనుండి ఒక భూతం 'నీవు తెలియక మాట్లాడుతున్నావు. అందరికంటె బ్రాహ్మణులు అధికులు కదా!' అని పలికింది. అందు కతడు 'బ్రాహ్మణులు రాజు నాశ్రయించి బ్రతుకుతారు. అట్టివారు రాజుకంటె ఎట్లా అధికులౌతారు? ఆ విషయ మట్లుంచు. నేను ఇష్టపడితే సకల జీవులను సంరక్షించగలను. ఆగ్రహిస్తే అందరినీ అంతం చేయగలను' అన్నాడు. ఆ మాటలకు భయపడి ఆ భూతం అదృశ్యమయింది.

విశేషం: ద్వీపం అనగా నాలుగు దిక్కుల నీళ్ళు గల భూభాగం. ద్వీపాలు ఏడు.
1)జంబూద్వీపం 2)ప్లక్షము 3)కుశము 4)క్రౌంచము 5)శాకము 6)శాల్మలము 7)పుష్కరము.

వ. అట్టియెడం బవనుండు గగనంబున నుండి త న్నెఱింగించికొని యన్నరపతి తోడ. 339

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్ = ఆ భూతం అదృశ్యమైన తర్వాత; పవనుండు = వాయుదేవుడు; గగనంబునన్+ఉండి = ఆకాశస్థలం నుండి; తన్నున్+ఎఱింగించికొని = నేను వాయువును అని పరిచయం చేసికొని; ఆ+నరపతితోడన్ = ఆ రాజుతో, కార్తవీర్యుడితో.

తాత్పర్యం: ఆ భూతం అంతర్ధానమైన పిదప అంబరతలం నుండి అనిలుడు కార్తవీర్యార్జునుడితో (ఇట్లా అన్నాడని తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'భూదేవశక్తిన కాదె రాజులు ప్రజా । రక్ష యొనర్చుట; బ్రాహ్మణులకు
నధికులు గలరె? యహల్యకై యింద్రుండు । గౌతముఁ డలిగిన గాసిఁ బడఁడె?
కుంభసంభవుచేత నంభోధి యడఁగదె? । యనలుండు భృగుశాపహతుఁడు గాఁడె?'
యన విని మఱుమాట యాడక యున్న య । ర్జుననకుఁ బవనుఁ డిట్లనియె మఱియు

తే. 'నాంగిరసవంశ సంభవుం డగు నుచథ్యుఁ । గోరి నిజపుత్రి సోముఁడు గారవమున
నిచ్చె; నా దంపతులు దమయిచ్చ వనము । నందు వసియించి ముని హృదయంబు లలర. 340

ప్రతిపదార్థం: రాజులు = క్షత్రియులు; ప్రజారక్ష+ఒనర్చుట = జనులను పాలించటం, కాపాడటం; భూదేవశక్తిన్+అ+కాదు+ఎ = భూసురుల యొక్క బలం చేతనే కదా! బ్రాహ్మణులకున్ = విప్రులకంటె; అధికులు+కలరు+ఎ? = మించినవా రున్నారా?; అహల్యకై = అహల్య కొరకు; ఇంద్రుఁడు = దేవేంద్రుడు; గౌతముఁడు+అలిగినన్ = గౌతమమహర్షి కినియగా; గాసిన్+పడఁడు+ఎ? = కష్ట మనుభవించలేదా?; కుంభసంభవుచేతన్ = కలశం నుండి జన్మించిన అగస్త్యమహర్షి చేత; అంభోధి = సముద్రం; అడఁగదు+ఎ? = అడుగంటలేదా?, నిర్జలము కాలేదా?; అనలుఁడు = అగ్నిదేవుడు; భృగుశాపహతుఁడు+కాఁ

డు+ఎ? = భృగుమౌని శాపం చేత దెబ్బతినలేదా?; అనన్ విని = అని పవనుడు పల్కగా ఆలకించి; మఱుమాట = ప్రతివచనం; ఆడక+ఉన్న = చెప్పకున్నట్టి; అర్జుననకున్; పవనుఁడు = వాయువు; మఱియున్ = ఇంకనూ; ఇట్లు+అనియెన్; ఆంగిరసవంశసంభవుండు+అగు = అంగిరసమహాముని వంశమునందు జన్మించినవాడైన; ఉచథ్యున్ = ఉచథ్యుడనే పేరుగల విప్రుడిని; కోరి = ఇష్టపడి; సోముఁడు = చంద్రుడు; నిజపుత్రిన్ = తన కొమార్తెను; గారవమునన్ = ఆదరంతో, మన్ననతో; ఇచ్చెన్ = ఇచ్చి పెళ్ళిచేశాడు; ఆ దంపతులు = ఆ భార్యాభర్తలు; తమ+ఇచ్చన్ = తమ ఇష్టప్రకారం; వనము+అందున్ = అరణ్యంలో; వసియించి = నివసించి; మునిహృదయంబులు+అలరన్ = మునీశ్వరుల యొక్క మనసులు ఆనందించే టట్లు. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: 'రాజులు ప్రజలను సంరక్షించటం బ్రాహ్మణుల శక్తి వలననేకదా! బ్రాహ్మణులకంటె గొప్పవారెవ్వరున్నారు? ఇంద్రు డహల్యను కోరి గౌతమ మహర్షి శాపానికి గురియై బాధ లనుభవించలేదా? కలశసంభవుడైన అగస్త్య మహర్షి సముద్ర జలాలు ఇంకిపోయేటట్లు చేయలేదా? అగ్నిదేవుడు భృగుమహర్షి శాపహతుడు కాలేదా?' అని పల్కగా విని బదులాడక మౌనముద్ర వహించిన కార్తవీర్యుడితో మళ్ళీ అనిలదేవు డిట్లా అన్నాడు. అర్జునా! అంగిరసుడనే మునివంశంలో జన్మించిన ఉచథ్యుడనే వాడికి చంద్రుడు తన పుత్రికనిచ్చి మన్ననతో వివాహమంగళం జరిపించాడు. ఆ భార్యాభర్తలు స్వేచ్ఛగా వనంలో నివసిస్తూ అక్కడి మునీంద్రుల మనస్సులు ఆనందించే టట్లు.

వ. వర్తించునెడ నొక్కనాఁ డమ్ముని యమునానదీస్నానంబునకుం జనుటయు మున్న యవ్వనితం గామించి వేచి తిరుగు వరుణుండు. 341

ప్రతిపదార్థం: వర్తించు+ఎడన్ = వారు వనంలో మెలగుతుండగా; ఒక్కనాఁడు; ఆ+ముని; యమునానదీ స్నానంబునకున్; చనుటయున్ = వెళ్ళగా; మున్ను+అ = అంతకుపూర్వమే; ఆ+వనితన్ = ఆ యువతిని; కామించి = మోహించి, అభిలషించి; వేచి = ఆమె కొరకు కనిపెట్టుకొని; తిరుగు వరుణుండు = సంచరిస్తున్న వరుణుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఉచథ్యుడు, అతని పత్ని వనంలో హాయిగ నివసిస్తున్నారు. ఒకనాడు ఉచథ్యుడు యమునలో స్నానమాడటానికి వెళ్ళాడు. అంతకు మునుపే అతని పత్నిని కామించి సమయం కొరకు నిరీక్షిస్తూ తిరుగుతున్న దిక్పతి వరుణుడు.

క. ఎత్తి కొనిపోయి తనపురి । నత్తామరసాక్షి నునిచె; నమ్ముని కడకున్
మెత్తన చని నారదముని । యత్తెఱఁ గెఱిఁగింప నాతఁ డాతనితోడన్. 342

ప్రతిపదార్థం: ఎత్తికొనిపోయి = అపహరించుక వెళ్ళి; తనపురిన్ = తన పట్టణంలో; ఆ తామరస+అక్షిన్ = కమలములవంటి కన్నులు గల ఆ కలికిని; ఉనిచెన్ = ఉంచాడు; ఆ మునికడకున్ = ఆ ఉచథ్యుని దగ్గరకు; నారదముని = నారదయతీంద్రుడు; మెత్తన చని = మెల్లగా వెళ్ళి; ఆ+తెఱఁగు = వరుణుడు అతని చెలినపహరించిన విధం; ఎఱిఁగింపన్ = చెప్పగా; ఆతఁడు = ఉచథ్యుడు; ఆతనితోడన్ = ఆ నారదుడితో. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: వరుణుడు ఉచథ్యుని యొక్క ఉవిదను అపహరించుకొని వెళ్ళి తనపురంలో ఉంచాడు. నారదమహర్షి ఉచథ్యుని చెంత కేగి ఈ విషయం మెల్లగా అతడి చెవిలో వేశాడు. అప్పు డతడు నారదుడితో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. 'తాన దిక్పతి; దన కిట్లు దగునె యొరుని । భార్యఁ గొని పోవ? నీ వేఁగి పలుకు మిట్ల'
యనినఁ జని నారదుండు సెప్పినను విడువఁ । డయ్యెఁ గామాంధుఁడై సతి నబ్ధివిభుఁడు. 343

ప్రతిపదార్థం: తాను+అ = ఆ వరుణుడు; దిక్+పతి = పశ్చిమదిశకు పాలకుడు; ఒరుని భార్యన్ = ఇతరుడి ఇల్లాలిని; ఇట్లు = ఈ ప్రకారం; కొనిపోవన్ = తీసికొని వెళ్ళటం; తనకున్+తగునె? = తనవంటి వానికి అర్హమా?, న్యాయమా?; నీవు+ఏగి = నీవు వెళ్ళి; ఇట్లు+అ = ఇపుడు నీతో నేనన్న విధంగా; పలుకుము = చెప్పుము; అనినన్ = అని ఉచథ్యుడు తెల్పగా; నారదుండు; చని; చెప్పినను; కామ+అంధుఁడు+ఐ = కామం చేత కన్నుకాననివాడై, గ్రుడ్డి వాడై; అబ్ధివిభుఁడు = సాగరాలకు అధిపతి అయిన వరుణుడు; సతిన్ = ఆ చెలువను; విడువఁడు+అయ్యెన్ = వదలలేదు.

తాత్పర్యం: 'ఆ వరుణుడు దిక్పాలకుడు. పరుని ఇల్లాలిని ఇట్లా అపహరించుక వెళ్ళటం న్యాయం కాదు అని నీవతని చెంతకు వెళ్ళి చెప్పుము' అని ఉచథ్యుడు కోరగా నారదు డరిగి ఉచథ్యుడి మాటలు వరుణుడికి చెప్పాడు. కాని కామం చేత కన్నుగానని వరుణుడు మునిపత్నిని విడువలేదు.

వ. విడువకున్న నమ్ముని యుచథ్యుకడకు మగిడి వచ్చి. 344

ప్రతిపదార్థం: విడువక+ఉన్నన్; ఆ+ముని = నారదమహర్షి; ఉచథ్యుకడకున్ = ఉచథ్యుని దగ్గరకు, మగిడివచ్చి = తిరిగి వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: నారదుడు చెప్పినప్పటికినీ వరుణుడు ఆ పడతిని విడువలేదు. అంతట ఆ ముని మరలి ఉచథ్యుని దగ్గరకు వచ్చి (ఇట్లా అన్నాడు).

సీ. 'ఇంతిఁ దా విడువనియంతియ కాదు, నన్ । బెడతల పట్టి త్రోపించె వరుణుఁ'
డని చెప్పటయు నల్గి యతఁడు సర్వజలంబు । ద్రావిన వరుణపురంబు ధూళి
మయమైన భయమంది మానినిఁ గొనివచ్చి । యొప్పించి ప్రణమిల్లి తప్పు వాపి
కొని మునికృపఁ గాంచి చనియె నాదిక్పతి; । ధరణీశ! రాజులో ధరణిసురులో

ఆ. యెక్కు?' డనిన వినియు నక్కిక్కు వడియున్న । యతనితోడ ననిలుఁ డమరు లసుర
సమితికోడి వచ్చి శరణుసొచ్చిన నగ । స్త్యుండు విజయలక్ష్మి నొసఁగుటయును. 345

ప్రతిపదార్థం: ఇంతిన్ = మీ కాంతను; తాన్ = తాను, వరుణుడు; విడువని+అంతియ+కాదు = విడిచిపెట్టకుండటం మాత్రమే కాదు; నన్ = నన్ను; పెడతల పట్టి = తలవెనుక పట్టుకొని; త్రోపించెన్ = నెట్టించాడు; అని చెప్పుటయున్ = అని నారదుడు తెల్పగానే; అల్గి = కోపించి; అతఁడు = ఉచథ్యుడు; సర్వజలంబులు+త్రావినన్ = సముద్రంలోని నీరంతా త్రావగా; వరుణపురంబు = సాగరంలో ఉన్న వరుణుడి పట్టణం; ధూళిమయంబు+ఐనన్ = దుమ్ముతో నిండగా, దుమ్ముతో ఆవరింపబడగా, దుమ్ముక్రమ్ముకోగా; భయము+అంది = భీతి చెంది, వెరచి; మానినిన్ = ఉచథ్యుని భార్యను; కొనివచ్చి = తీసికొనివచ్చి; ఒప్పించి = ఆ మునికి అప్పగించి; ప్రణమిల్లి = నమస్కరించి; తప్పు+పాపికొని = తన దోషం తొలగించుకొని; మునికృపన్+కాంచి = ఆ మునీంద్రుడి దయపడసి; ఆ దిక్పతి = దిక్పాలకుడైన వరుణుడు; చనియెన్ = వెళ్ళాడు; ధరణీ+ఈశ! = ఓ భూవల్లభా! కార్తవీర్యార్జునా!; రాజులు+ఒ = భూపతులా?; ధరణీసురులు+ఒ = భూసురులా?; ఎక్కుడు = అధికులు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అనినన్= అని వాయుదేవుడు ప్రశ్నించగా; వినియున్ = ఆలకించి కూడా; నక్కిళ్ళు పడి+ఉన్న = నిరుత్తరుడై ఉన్న; నోటి నుండి మాట రాకున్న; అతనితోడన్ = కార్తవీర్యుడితో; అనిలుఁడు = వాయువు; అమరులు = వేల్పులు, అనిమిషులు, సురులు; అసురసమితికిన్= రక్కసుల గుంపుకు; ఓడివచ్చి = అపజయంపాలై వచ్చి; శరణు+చొచ్చినన్ = ఆశ్రయించగా, కాపాడుమని వేడగా; అగస్త్యుఁడు = అగస్త్యమహర్షి; విజయలక్ష్మిన్ = జయశ్రీని; ఒసఁగుటయున్ = ఆ దేవతలకు లభింపజేయుటయు. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: 'వరుణుడు నీ పత్నిని విడిచిపెట్టకుండటమేకాదు, ఇక్కడి నుంచి వెళ్ళిపొమ్మని నన్ను మెడబట్టి ముందుకు నెట్టించాడు' అని నారదుడు పలికేసరికి ఉచథ్యుడు ఆగ్రహోదగ్రు డయ్యాడు. సాగరజలా లన్నిటినీ పీల్చివేశాడు. సముద్రగర్భంలో ఉన్న తన పట్టణం బయటపడి దుమ్ముతో ఆవరింపబడగా అతడు భయపడ్డాడు. మునిపత్నిని వెంటబెట్టుకొనివచ్చి సమర్పించి, నమస్కరించి తన తప్పు మన్నించుమని వేడుకొన్నాడు. ఆయన కనికరించగా వరుణుడు సెలవుగైకొని వెళ్ళిపోయాడు. రాజా! రాజులు గొప్పవారా? లేక బ్రాహ్మణులు గొప్పవారా? చెప్పు మని మరుద్దేవుడు మహీపతిని ప్రశ్నించాడు. ఆ మాటలన్నీ కార్తవీర్యుడు వింటూనే ఉన్నాడు. అతడికి నక్కిళ్ళు పడిపోయాయి. మౌనంగా ఉన్నాడు. అనిలుడు మళ్ళీ మాటలకు ఉపక్రమించాడు. అర్జునా! అమరులు అసురుల చేతిలో ఓడిపోయి అగస్త్యమహర్షిని శరణు జొచ్చారు. ఆ మహనీయుడు వేల్పులకు విజయలక్ష్మిని అనుగ్రహించాడు.

వ. గంగా తీరంబునం గ్రతువు లొనరించు గీర్వాణులం బూర్వగీర్వాణులు గాసి చేసిన, వసిష్ఠుని కడకు వారలు వలియం బాఱుదేరం గోపించిన యత్తాపసోత్తముని రోషానల జ్వాలలు సాకారంబులయి యాదైత్యలోకంబు నేర్చుటయుం జెప్పి, యక్కుంభసంభవుండును వసిష్ఠుండును శ్రేష్ఠులగుట రాజుల కొడఁ బాటు గాదోకదే యనిననుం బలుక కున్న యన్నరపతితోడం బవమానుండు మఱియు నిట్లనియె.346

ప్రతిపదార్థం: గంగాతీరంబునన్ = గంగానది ఒడ్డున; క్రతువులు = యాగాలు, యజ్ఞాలు; ఒనరించు = సల్పుతున్న; గీర్వాణులన్ = దేవతలను; పూర్వగీర్వాణులు = రాక్షసులు; గాసిచేసినన్ = బాధించగా; వారలు = వేల్పులు; వసిష్ఠుని కడకున్ = వసిష్ఠమహర్షి దగ్గరకు; వలియన్ = శ్రమతో; పాఱుదేరన్ = పరుగెత్తిరాగా; కోపించిన = రక్కసులపై కినిసిన, ఆగ్రహించిన; ఆ+తాపస+ఉత్తముని = మునులలో శ్రేష్ఠుడైన వసిష్ఠుడి యొక్క; రోష+అనలజ్వాలలు = కోపమనే నిప్పుమంటలు; స+ఆకారంబులు+అయి = రూపుదాల్చినవై; ఆ దైత్యలోకంబున్ = ఆ రాక్షస జనాలను; ఏర్చుటయున్ = దహించుట అనే విషయాన్ని; చెప్పి = నుడివి; ఆ+కుంభసంభవుండును = ఆ అగస్త్యమౌనీంద్రుడూ; వసిష్ఠుండును = వసిష్ఠ మహర్షియూ; శ్రేష్ఠులు+అగుట = ఉత్తములగుట; రాజులకున్ = భూపతులకు; ఒడఁబాటు కాదో కదే = సమ్మతం కాదు కాబోలు; అనినమున్ = అని పల్కిననూ; పలుకక+ఉన్న = బదులు చెప్పకున్న, ప్రత్యుత్తర మీయకున్న; ఆ+నరపతి తోడన్ = ఆ మనుజేంద్రుడితో, రాజుతో; పవమానుండు = వాయువు; మఱియున్ = ఇంకా; ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'గంగానది గట్టున యజ్ఞాలు చేస్తున్న దేవతలను రాక్షసులు పీడించగా వారు నొచ్చి వసిష్ఠ మహర్షి దగ్గరకు వలిపడి పరుగెత్తుకొనివచ్చారు. వేల్పుల దురవస్థకు కారణమైన రక్కసులపై ఆ ముని పుంగవునకు కోపం వచ్చింది. ఆయన క్రోధాగ్నిజ్వాలలు ఆ దానవసమూహాన్ని దహించి వేశాయి' అని వాయుదేవుడు వచించి 'కార్తవీర్యా! అగస్త్య వసిష్ఠ మౌనీశ్వరులు తమకంటె శ్రేష్ఠు లగుట రాజులకు సమ్మతం కాదు కాబోలు' అని చెప్పినప్పటికినీ మారుమాటాడకున్న ఆ మహీపతితో మళ్ళీ వాయుదేవు డిట్లా అన్నాడు.

పవనుఁడు కార్తవీర్యార్జునునకు నత్రి ప్రభృతుల మహిమ చెప్పుట. (సం.13-141-1).

సీ. 'ఒకతఱి దేవతలకు దైత్యులకు మహా । రణమయ్యెఁ; నప్పోర రాహునస్త్ర
సమితిచే నర్కుండుఁ జంద్రుండు సొలసిన । వెలుఁ గడంగుడుఁ దమ మొలసి వెగడు
పడిన య ద్దివిజుల వడి నంటఁ దాఁకి య । య్యసురలు నొప్పింప నత్రికడకుఁ
బాఱి 'మమ్ముం గావు పరమదయాత్మక!' । యనుడు నతండు చంద్రార్కతనువు

ఆ. లక్షతములు సేసి యసురసైన్యము రూపు । మాపె నిజకటాక్షమాత్రముననన;
యతని నృపులకంటె నధికుఁ డందమొ హీనుఁ । డందమో నిజంబ యధిప! చెపుమ.' 347

ప్రతిపదార్థం: ఒకతఱిన్ = ఒకప్పుడు; దేవతలకున్; దైత్యులకున్ = రాక్షసులకు; మహారణము+అయ్యెన్ = గొప్పయుద్ధం జరిగింది; ఆ+పోరన్ = ఆ సంగ్రామంలో; రాహు+అస్త్రసమితిచేన్ = రాహువు యొక్క బాణాలసమూహం చేత; అర్కుండున్ = సూర్యుడును; చంద్రుండున్ = సోముడునూ; సొలసినన్ = మూర్ఛిల్లగా; వెలుఁగు = కాంతి; అడంగుడున్ = అణగిపోగా, మాయగా; తమము = చీకటి; ఒలసి = వ్యాపించి; వెగడు పడిన = భయపడిన, తల్లడపడిన, చలించిపోయిన; ఆ+దివిజులన్ = ఆ దేవతలను; వడిన్ = వేగంగా; అంటన్+తాకి = వెంట నంటి ఎదుర్కొని, వెంబడించి; మార్కొని; ఆ+అసురలు = ఆ రక్కసులు; నొప్పింపన్ = బాధించగా; అత్రికడకున్ = అత్రిమహర్షి దగ్గరకు; పాఱి = పరుగెత్తిపోయి; పరమ+దయా+ఆత్మక = మిక్కిలి దయతో కూడిన వాడా!; మమ్మున్; కావు = కాపాడుము; అనుడున్ = అని వేల్పులనగా; అతండు = అత్రిముని; చంద్ర+ అర్కతనువులు = చంద్ర సూర్యుల దేహాలు; అక్షతములు చేసి = గాయాలు లేనివాటిగా చేసి, గాయాలు మాన్పి; నిజకటాక్షమాత్రమునన = తన చూపులను ప్రసరింపజేయటంచేత; అసుర సైన్యమున్ = రక్కసుల సేనను; రూపుమాపెన్ = నిర్మూలించాడు; అధిప! = ఓ రాజా!; అతనిన్ = అత్రిమహర్షిని; నృపులకంటెన్ = రాజులకంటె; అధికుఁడు+అందము+ఒ? = ఎక్కువవా డందామా? (లేక) హీనుఁడు+అందము+ఓ? = తక్కువవా డందామా?; నిజంబు+అ = సత్యం; చెపుము+అ = తెల్పుమా.

తాత్పర్యం: 'ఒకప్పుడు దేవదానవులకు ఘోరయుద్ధం జరిగింది. ఆ సంగ్రామంలో రాహువు యొక్క బాణాల వలన సూర్యచంద్రులు గాయపడి మూర్ఛపోయారు. వారు మూర్ఛిల్లగా వెలుతురు మాసిపోయి చీకట్లు క్రమ్ముకొన్నాయి. భీతిల్లిన వేల్పులను వెంటనంటి రక్కసులు నొప్పించారు. అంతట దేవతలు అత్రిమహర్షి దగ్గరకు పరుగెత్తిపోయి 'పరమదయామయా! మమ్ము రక్షించు' మని వేడుకొన్నారు. ఆ ముని పుంగవుడు సూర్యచంద్రుల శరీరాల గాయాలు మాన్పి తన దృక్ప్రసారంతో రాక్షససైన్యాన్ని నిర్మూలించాడు. రాజా! అటువంటి అత్రి మహామునిని రాజులందరికంటె ఎక్కువ వాడనవలెనో, తక్కువవా డనవలెనో నీవే నిజం చెప్పుము.'

సీ. అనిన నూరకయున్న యర్జునుతోడ స । దాగతి యిట్లను 'ధరణినాథ!
సురపతి యాశ్వినుల్ సోమపానంబున । కర్హులు గారన్న నాశ్రయంబు
పాటించి వారికై భార్గవచ్యవనుండు । దనమంత్రముల బల్మి ననిమిషులకు
నెగ్గుసేయంగ న య్యింద్రుండు పోటున । వ్రేటున నాతని గీటడంచు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. బుద్ధి నొకశైలమును వజ్రమును రయమున । గొని మహోగ్రతఁ గవియ, న మ్మునివరుండు
జలము చల్లిన శైలవజ్రములు దాను । ముడుగఁ బడి య బ్బలారాతి మూర్ఛవోయి. 348

ప్రతిపదార్థం: అనినన్ = అని ప్రభంజనుడు (గాలి) పలుకగా విని; ఊరక+ఉన్న = మాట్లాడకుండ ఉన్నట్టి; అర్జునతోడన్ = కార్తవీర్యునితో; సదాగతి = వాయువు; ఇట్లు+అనున్ = ఇట్లా అన్నాడు; ధరణినాథ = భూపాలా!; సురపతి = అమరవల్లభుడు; ఆశ్వినుల్ = అశ్వినీ దేవతలు, దేవవైద్యులు; సోమపానంబునకున్ = యజ్ఞాలలో సోమరసం ఆస్వాదించటానికి; అర్హులు+కారు = తగరు; అన్నన్ = అని నుడువగా; ఆశ్రయంబుపాటించి = తనను వారాశ్రయించుటను ఆదరించి; వారికై = ఆ దేవవైద్యులకొరకు; భార్గవచ్యవనుండు = భృగువంశమువాడైన చ్యవనమహర్షి; తనమంత్రముల బల్మిన్ = తన యొక్క మంత్రశక్తితో; అనిమిషులకున్ = దివిజులకు; ఎగ్గు+చేయంగన్ = కీడు సల్పగా; ఆ+ఇంద్రుండు = ఆ సురపతి; పోటునన్ = పొడుచుటచేత; వ్రేటునన్ = నరుకుట చేత; ఆతనిన్ = ఆ చ్యవనుడిని; గీటు+అడంచుబుద్ధిన్ = నిర్మూలించే తలంపుతో; ఒకశైలమును = ఒకగిరినీ; వజ్రమును = వజ్రాయుధాన్ని; రయమునన్+కొని = శీఘ్రంగా గ్రహించి; మహా+ఉగ్రతన్ = మిక్కిలి రౌద్రంగా; కవియన్ = సమీపించగా, మీదికి రాగా; ఆ+ముని వరుండు = ఆ ఋషిశ్రేష్ఠుడు; జలము చల్లినన్ = నీళ్ళు చిలుకగా; శైల వజ్రములున్ = కొండయూ, వజ్రాయుధమూ; తానున్ = తానున్నూ; ముడుగన్+పడి = చేష్టలుడిగి, శక్తి చెడి; ఆ+బల+అరాతి = బలుడనే రాక్షసుడికి శత్రువైన దేవేంద్రుడు; మూర్ఛపోయి = సొమ్మసిల్లి. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: తన మాటలకు బదులాడని కార్తవీర్యుడితో సమీరణుడు మళ్ళీ 'నరేంద్రా! దేవేంద్రుడు అశ్వినీ దేవతలు యజ్ఞాలలో సోమపానానికి అనర్హులు' అని అన్నాడు. తనను ఆశ్రయించిన ఆ దేవ వైద్యులకు సాయపడదలచి భృగువంశంలో జన్మించిన చ్యవనమహర్షి తన మంత్రబలంతో దేవతలకు కీడు చేయగా ఇంద్రుడికి కోపం వచ్చింది. చ్యవనుడిని పొడిచిగాని, నరికిగాని చంపదలచి మహేంద్రుడు ఒక పర్వతాన్ని, వజ్రాయుధాన్ని గ్రహించి భయంకరంగా మహర్షి మీదికి ఉరికాడు. ఆ మునీంద్రుడు మంత్రజలం చల్లగా ఆ శైలవజ్రాయుధాలతో పాటు ఇంద్రుడు శక్తి చెడి మూర్ఛిల్లాడు.

వ. ఒక్కింత సేపునకుం దెలిసె; నంతకు నమ్మునివరుండు మదుండను వాని శతయోజన దీర్ఘసహస్రదంతుని సృజించి పంపిన. 349

ప్రతిపదార్థం: ఒక్క+ఇంతసేపునకున్ = కొంచెం సేపటికి; తెలిసెన్ = ఒడలు తెలిసింది; అంతకున్ = అతడు మూర్ఛ నుంచి తేరుకొనే లోపలనే; శతయోజన దీర్ఘ సహస్రదంతునిన్ = నూరామడల పొడవైన వేయి దంతాలు గలవాడిని; మదుండు+ అనువానిన్ = మదుడనే పేరుగల వాడిని; సృజించి పంపినన్ = సృష్టించి ఇంద్రునిపైకి పంపగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: మూర్ఛిల్లిన దేవేంద్రుడు కొంచెంసేపటికి తేరుకొన్నాడు. ఆ లోపలనే చ్యవనమహర్షి నూరామడల పొడవైన వెయ్యి పళ్ళుగల మదుడనే వాడిని ఒకడిని సృష్టించి ఇంద్రుడిపైకి పంపాడు.

ఆ. వాఁడు సురగణంబు వాసవుఁ గబళింప । వారు 'శరణుశరణు వరమునీంద్ర!'
యనిన, వారిఁ గాచె న మ్ముని; వారిచ్చి । రపుడు సోమపాన మాశ్వినులకు. 350

ప్రతిపదార్థం: వాఁడు = మదుడనేవాడు; సురగణంబున్ = దివిజ సమూహాన్ని; వాసవున్ = ఇంద్రుడిని; కబళింపన్ =

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మ్రింగగా; వారు = ఆ సురలు, దేవేంద్రుడు; వరమునీంద్ర! = ఓ శ్రేష్ఠుడవైన మునీంద్రా!; శరణు శరణు = రక్షించు, రక్షించు; అనినన్ = అని పలుకగా; వారిన్ = వారలను; ఆ+ముని; కాచెన్ = కాపాడినాడు; వారు = ఆ దేవతలు; అపుడు = ఆ వేళ; ఆశ్వినులకున్ = అశ్వినిదేవతలకు; సోమపానము = సోమరసం యజ్ఞాలలో త్రాగే అర్హత; ఇచ్చిరి = కల్పించారు.

తాత్పర్యం: చ్యవన మహర్షిచేత సృజించబడ్డ మదుడు దేవతలను, దేవేంద్రుడిని మ్రింగగా వారు 'మహామునీ! మమ్మ్ము రక్షించు రక్షించు' మని చ్యవన మునిని ప్రార్థించారు. ఆయన కరుణించి వారిని మదుడిబారి నుండి రక్షించాడు. దేవతలు అపుడు యజ్ఞాలలో సోమరసపానార్హత అశ్వినీ దేవతలకు కలిగించారు.

క. నీ వా చ్యవనుండును ధా । త్రీవరు సరిగామి యెట్లుఁ దెలుప కుడుగుదే?'
నా వినియు నొక్కమాటయు । నా విభుఁ డాడండ దాని కలయక మఱియున్. 351

ప్రతిపదార్థం: ఆ చ్యవనుండును = ఆ చ్యవనమహర్షి కూడ; ధాత్రీవరు సరి+కామి = రాజుతో సమానుడు కాకుండటం; ఎట్లున్ = ఏ విధమో; నీవు = నీవు; తెలుపక = చెప్పక; ఉడుగుదు+ఏ? = మానెదవా? నాన్ = అని, గాలిదేవుడు పలుకగా; వినియున్ = విని కూడ; ఆ విభుఁడు = ఆ కార్తవీర్యప్రభువు; ఒక్కమాటయున్ = ఒక్క పలుకు కూడ; ఆడండు+అ = పలుకడు; దానికిన్ = అట్లా బదులు పలుకనందుకు; అలయక = విసుగు చెందక; మఱియున్ = ఇంకనూ. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: అంతటి చ్యవన మహర్షి కూడ రాజుతో సమానుడు కాకపోవటం ఎట్లో చెప్పకుండా మానుతావా?' అని గాలిదేవుడు కార్తవీర్యుడిని ప్రశ్నించాడు. వింటూ కూడ అతడు అందుకు బదులాడ లేదు. వాయుదేవుడు విసుగు చెందక మళ్ళీ మొదలుపెట్టాడు.

వ. వాయుదేవుం డన్నరదేవు వలని కరుణంజేసి యితని చేటోర్వని వాఁడై. 352

ప్రతిపదార్థం: వాయుదేవుండు, ఆ+నరదేవు వలని = ఆ రాజుపైన గల, కరుణన్+చేసి = దయవలన; ఇతని చేటు = ఇతనికి కలిగే కీడు; ఓర్వని వాడు+ఐ = సహించని వాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: వాయుదేవుడు కార్తవీర్యార్జునుడి మీద తనకున్న కృపవలన ఆతడికి కీడు మూడటం సహించలేని వాడై.

సీ. 'అకట! దత్తాత్రేయునకు భక్తి శుశ్రూష । చేసి కాదే యి వ్విశిష్టబల ప
రాక్రమంబుల నొంది రాజుల కెల్లను । నెక్కుడై తా కృత మేల మఱవ?
విను మీ వొకండవే యనిమిషాది సమస్త । భూతంబులును వృద్ధిఁ బొందు టవని
దివిజులకృపన యీ తెఱఁ గెల్లజనములు । నెఱిఁగిన పని శాంతిఁ గొఱలి విప్ర

తే. కులము దైవస్వరూపం బగుట మనంబు । నందు దృఢముగ నిల్పి తదాశ్రయమున
వెలయువాఁడ; వైనను మేలు వినుము నాదు । బుద్ధి' యనవుడు నతఁడు ప్రబోధ మొలసి 353

ప్రతిపదార్థం: అకట! = అయ్యో!; దత్తాత్రేయునకున్ = దత్తాత్రేయుడికి; భక్తిన్ = భక్తితో; శుశ్రూష = సేవ, సపర్య, పరిచర్య; చేసికాదు+ఏ = సల్పినందువల్లనే గదా; ఈ విశిష్టబలపరాక్రమంబులన్ = ఈ ఉత్తమమైన శక్తిని, శౌర్యమును; ఒంది = పొంది; రాజులకున్+ఎల్లను = భూపతులందరి కంటె; ఎక్కుడు+ఐతి = అధికుడవైనావు; ఆకృతము = గురుసేవాఫలమైన నీ ఉన్నత స్థితిని; మఱవన్+ఏల? = ఎందుకు విస్మరించటం?; వినుము = అర్జునా! వినుము;

ఈవు+ఒకండవు+ఏ? = నీవొక్కడివేనా? కాదు; అనిమిష+ఆది = దేవతలుమున్నుగా కల; సమస్త భూతంబులును = సకల ప్రాణులునూ; వృద్ధిన్+పొందుట = పెంపు వహించుట; అవని దివిజుల కృపన్+అ = భూసురుల యొక్క కారుణ్యం వలననే సుమా! ఈ తెఱఁగు = ఈ విషయం; ఎల్ల జనములున్ = సమస్త ప్రజలు; ఎఱిఁగినపని = తెలిసిన కార్యమే; శాంతిన్+కొఱలి = మనోనిగ్రహంతో ఒప్పారుతూ; విప్రకులము = బ్రాహ్మణవర్ణం; దైవస్వరూపంబు+అగుట = సాక్షాత్ భగవత్స్వరూపం కావటం; మనంబు+అందున్ = హృదయంలో; దృఢముగన్+నిల్పి = గట్టిగా నిలుపుకొని; తత్+ఆశ్రయమునన్ = ఆ భూసురుల యొక్క అండదండలతో; వెలయువాఁడవు+ఐననున్+మేలు = విరాజిల్లువాడ వగుట శ్రేయస్కరం; నాదుబుద్ధి వినుము = నా హితం ఆలకించుము; అనవుడున్ = అని అనిలుడు చెప్పగా; అతఁడు= కార్తవీర్యార్జునుడు; ప్రబోధము+ఒలసి = తెలివినొంది, జ్ఞానం కలిగి; (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: 'అయ్యో! దత్తాత్రేయులవారిని అఖండ భక్తితో శుశ్రూషించి కదా ఇంతటి మేటి బలపరాక్రమాలు పడసి రాజులందరిలో అధికుడవై అలరారుతున్నావు. నీ ఈ ఉన్నతస్థితికి గురు సేవయే మూలకారణం అనే మాట మరువరాదు. నీవొక్కడివే కాదు దేవతలు మొదలుగాగల సకల జీవరాసులూ వృద్ధిపొందటం బ్రాహ్మణుల కృపవలననే కదా! ఈ విషయం లోకు లందరికీ విదితమే. మనసును స్వాధీనంలో ఉంచుకొని ధరణీసురులు దైవస్వరూపులన్న దృఢభావనతో వారి నాశ్రయించుకొని వర్తించటం నీకు శ్రేయస్కరం. నా హితోపదేశం విను' మని వాయుదేవుడు చెప్పగా కార్తవీర్యుడు తెలివి తెచ్చుకొన్నాడు.

క. 'నీ పనుపు చేసి బ్రదికెద; । నేపు నహంకృతియు విడిచి యెల్లవలన మే
లాపాదించుచు విప్రుల । శ్రీపాదము లాశ్రయించి చెందెద శాంతిన్.' 354

ప్రతిపదార్థం: నీ పనుపు చేసి = నీ ఆజ్ఞను శిరసావహించి; బ్రదికెదన్ = జీవిస్తాను; ఏపున్ = ఆటోపం; అహంకృతియున్ = దురభిమానం, దుర్గర్వం; విడిచి = వదలి; ఎల్లవలనన్ = అందరికినీ అన్ని విధాల; మేలు+ఆపాదించుచున్ = క్షేమం కలిగిస్తూ; విప్రుల = బ్రాహ్మణుల యొక్క; శ్రీపాదములు+ఆశ్రయించి = మంగళకరములైన చరణములను నమ్ముకొని; శాంతిన్+ చెందెదన్ = శాంతిని వహిస్తాను.

తాత్పర్యం: 'నీ ఆజ్ఞను తలదాల్చి, నీవు చెప్పినట్లే మంచిబుద్ధి కలిగి మనుగడ సాగిస్తాను. ఆటోపం, స్వాభిమానం వదలి అందరికి మేలు కలిగిస్తూ బ్రాహ్మణుల శ్రీచరణాలే శరణా లని విశ్వసించి స్వస్థచిత్తంతో మెలగుతాను.'

ఆ. అనిన సంతసిల్లి యనిలుఁ డానృపు 'బుద్ధి । గలిగి బ్రదుకు' మనుచు గారవించి
వీడుకొల్పి చనియె; విప్రులపెం పిట్టి । దని యెఱుంగు కురుకులాగ్రగణ్య! 355

ప్రతిపదార్థం: అనినన్ = అని కార్తవీర్యుడు చెప్పగా; సంతసిల్లి = సంతోషపడి; అనిలుఁడు = వాయుదేవుడు; ఆనృపున్ = ఆ రాజును; బుద్ధి+కలిగి = తెలివి తెచ్చుకొని; బ్రదుకుము = జీవించుము; అనుచున్ = అని పలుకుతూ; గారవించి = ఆదరించి; వీడుకొల్పి = పోయిరమ్మని చెప్పి; చనియెన్ = వాయువు వెళ్ళిపోయాడు; కురుకుల+అగ్రగణ్య! = కౌరవవంశంలో తొలుత పేర్కొనదగినవాడా! ధర్మజా!; విప్రులపెంపు = బ్రాహ్మణుల ఆధిక్యం, గొప్పతనం; ఇట్టిది = ఇటువంటిది; అని+ఎఱుంగు = అని తెలిసికొమ్ము.

తాత్పర్యం: కార్తవీర్యార్జునుడి మాటలకు ఆనందించి అనిలదేవుడు ఆ రాజుతో 'నీవు సద్బుద్ధి గలిగి సుఖంగా జీవించు' మని ఆదరవచనములాడి వెళ్ళుటకు సెలవొసంగి తనదారిని తాను వెళ్ళాడు. 'కురుకులోత్తమా! ధర్మజా!

బ్రాహ్మణుల గొప్పతనం ఇట్టిదని గ్రహించు’ మని భీష్ముడన్నాడు.

భీష్మండు ధర్మజునకుఁ గృష్ణుని ప్రభావం బుపన్యసించుట. (సం.13-143-3).

వ. అనుటయు నవ్విభుండు ‘బ్రాహ్మణ మహానుభావం బింకను విన వలతుం జెప్పవే’ యనుటయు నప్పుడమిఱేనికి భీష్ముండు తనకు నింద్రియంబులును వాఙ్మనసంబులు నపుడు దుర్బలంబు లగుట యెఱింగించి ‘యినుండు దక్షిణాయనంబు తుది చేరుచు వచ్చె; దేహన్యాసంబు తడవులేమి దోఁచుచున్నది కృష్ణుండు నీకు విప్రజన విశేషంబు వివరించువాఁ’ డని పలికి యిట్లనియె. 356

ప్రతిపదార్థం: అనుటయున్ = అని భీష్ముడు పలుకగా; ఆ+విభుండు = ప్రభువైన ధర్మజుడు; బ్రాహ్మణ మహా+అనుభావంబు = విప్రుల యొక్క ప్రభావం, గొప్పతనం; ఇంకను; వినన్; వలతున్ = కోరుతున్నాను; చెప్పవు+ఏ = తెల్పుమా; అనుటయున్ = అని అడుగగా; ఆ+పుడమిఱేనికిన్ = ఆ భూవల్లభుడికి; భీష్ముండు; తనకున్; ఇంద్రియంబులును = నేత్రాదులైన ఇంద్రియాలు; వాక్+మనసంబులు = వాక్కు, మనస్సు; అపుడు; దుర్బలంబులు = బలహీనములు; అగుట = కావటం, ఎఱింగించి; ఇనుండు = రవి; దక్షిణ+అయనంబు = దక్షిణాయనం యొక్క; తుది = చివర; చేరుచున్+వచ్చెన్ = చేరబోవుతున్నాడు, సమీపిస్తున్నాడు; దేహన్యాసంబు = శరీరం నిల్పుటకు; తడవు లేమి = అలస్యం లేదని; తోఁచుచున్+ఉన్నది = స్ఫురిస్తున్నది; కృష్ణుండు; నీకున్; విప్రజన విశేషంబు = బ్రాహ్మణుల యొక్క ఘనత; వివరించువాఁడు = వక్కాణిస్తాడు, స్పష్టపరుస్తాడు; అని పలికి, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగా ధర్మజుడు ‘బ్రాహ్మణుల గొప్పతనం ఇంకా వినాలని కోరిక కలుగుతున్నది చెప్పవా’ అని అడిగాడు. భీష్ముడు తనకు ఇంద్రియాలు, వాక్కూ, మనసూ, బలహీనా లైనవని పలికి ‘రాజా! సూర్యుడు దక్షిణాయనం చివరకు చేరబోతున్నాడు. ఇక దేహం నిలవటానికి సమయం లేదని తోస్తున్నది. బ్రాహ్మణ మహిమ నీకు శ్రీకృష్ణ భగవానుడు విశదపరుస్తా’ డని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

తే. ‘ఏను గృష్ణు నెఱుంగుదు మానవేంద్ర! । యెత్తెఁ గ్రీడావరాహమై యిద్ధరిత్రి;
నిది యొకండును జెప్పఁగా నేల? కృష్ణు । లీలఁ గాదె భూమ్యాది భూతాలి గలిగె. 357

ప్రతిపదార్థం: మానవ+ఇంద్ర! = నరేశ్వరా!; ఏను = నేను; కృష్ణున్; ఎఱుంగుదున్; క్రీడావరాహము+ఐ = ఆటకొఱకు, వినోదం కొరకు సూకర రూపం ధరించిన వాడై; ఈ+ధరిత్రిన్ = ఈ పుడమిని; ఎత్తెన్ = సాగరగర్భం నుండి ఉద్ధరించాడు, తన కోరతో మీది కెత్తాడు; ఇది+ఒకండును = ఇదొక్కటే అని; చెప్పన్+కాన్+ఏల = చెప్పటమెందుకు?; భూమి+ఆది+భూత+ఆలి = ధరణి మొదలైన భూతముల యొక్క సమూహం; కృష్ణులీలన్ = శ్రీకృష్ణ పరమాత్మ యొక్క విలాసం చేతనే; కలిగెన్ = జన్మించింది.

తాత్పర్యం: ‘రాజా! శ్రీకృష్ణు డెవరో నాకు బాగా తెలుసు. ఆయన వినోదం కొరకై అలవోకగా సూకరరూపం ధరించి సాగరలీన అయిన ధరను తన దంష్ట్రాగ్రం చేత మీదికెత్తాడు. ఇది ఒక్కటే కాదు; ఇట్లాంటి అద్భుత చర్య లెన్నింటినో ఆ మహానుభావుడు చేశాడు. భూమి మొదలైన భూతజాలం ఈ పురాణపురుషుడి విలాసం వలననే జనించాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. కృష్ణుండు. 358

తాత్పర్యం: ఈ వాసుదేవుడు.

తే. **బొడ్డుతామరయందు దొక్క పురుషుఁ డుద్భ । వించునట్లుగఁ జేసి తద్విరచనా ని**
భమున నఖిలచరాచర ప్రభవ మయ్యె; । నరయ సామాన్యమే కృష్ణు పరమలీల? 359

ప్రతిపదార్థం: బొడ్డుతామర+అందున్ = తన నాభికమలం నుండి; ఒక్కపురుషుఁడు = బ్రహ్మదేవుడు; ఉద్భవించు+అట్లుగన్+ చేసి = జన్మించేటట్లుగా చేసి; తత్+విరచనానిభమునన్ = ఆ బ్రహ్మసృష్టి అనే నెపంతో; అఖిల = సమస్తమైన; చర+ అచర+ప్రభవము+అయ్యెన్ = చేతనాచేతనముల యొక్క ఉత్పత్తి (పుట్టుక) జరిగింది; అరయన్ = ఆలోచించగా; కృష్ణు పరమలీల = శ్రీకృష్ణ పరమాత్మ యొక్క అద్భుతమైన విలాసం; సామాన్యము+ఏ? = సాధారణమైనదా? కాదని భావం.

తాత్పర్యం: ధర్మజా! తన నాభికమలం నుండి వాసుదేవుడే చతుర్ముఖుడిని పుట్టించాడు. బ్రహ్మసృష్టి అనే మిషతో స్థావరజంగమముల యొక్క పుట్టుక ఏర్పడింది. పరిశీలిస్తే ఇంతకూ మూలమైన శ్రీకృష్ణ లీల సామాన్యమైనది కాదు గదా!

క. **విను మెత్తఱి ధర్మంబులు । దనుజులచే బాధఁ బొందుఁ దత్సమయమునన్**
జనియించి య ద్దురాత్ములఁ । దునుముం గృష్ణుండు ధర్మధుర్యులఁ గాచున్. 360

ప్రతిపదార్థం: వినుము = రాజా! ఆలకించుము; ఏ+తఱి = ఎప్పుడు; ధర్మంబులు = ధర్మాలు; దనుజులచేన్ = రాక్షసులచేత, దుర్మార్గులచేత; బాధన్+పొందున్ = గ్లానిని పొందుతాయో; తత్+సమయమునన్ = అట్టివేళలో; జనియించి = అవతరించి; కృష్ణుండు = శ్రీకృష్ణ పరమాత్మ; ఆ+దుర్+ఆత్ములన్ = ఆ చెడు మనస్సుగలవారిని; తునుమున్ = ఖండిస్తాడు, సంహరిస్తాడు; ధర్మధుర్యులన్ = ధర్మాత్ములను; కాచున్ = రక్షిస్తాడు.

తాత్పర్యం: రాజా! శ్రద్ధగా వినుము. ఎప్పు డెప్పుడు ధర్మానికి గ్లాని కలుగుతుందో అప్పుడు దుర్మార్గులను నిర్మూలించటానికి శ్రీకృష్ణుడు అవతరించి ధర్మాత్ములను కాపాడుతాడు.

విశేషం: "యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత,
అభ్యుత్థాన మధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహమ్." (భగ. 4-7)

ఎప్పుడు ధర్మానికి హాని, అధర్మానికి అభివృద్ధి కలుగుతాయో అప్పుడు నేను అవతరిస్తాను-

అనే గీతా శ్లోకానికి తిక్కన గారి అనువాదం ఎంత సుమనోమనోహరమో పాఠకులు అవలీలగా గుర్తించగలరు.

క. **శూలియునుం దాన దిశా । పాలురునుం దాన విశ్వపతియును గురుభూ**
పాలవర! తాన కృష్ణుఁడు । కాలము దిక్కులును దాన కలఁ డఖిలములన్. 361

ప్రతిపదార్థం: కురుభూపాలవర! = కురువంశ రాజులలో శ్రేష్ఠుడా!; శూలియును = శూలధరుడైన శివుడును; తాను+అ = తానే; దిశాపాలురునున్ = దిక్పాలకులునూ; తాను+అ = తానే; విశ్వపతియునున్ = జగన్నాయకుడునూ; తాను+అ = తానే; కాలమున్ = భూతభవిష్యద్వర్తమాన కాలములునూ; దిక్కులునున్ = దశ దిశలునూ; తాను+అ = తానే; అఖిలములన్ =

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సమస్తవస్తువులలో; కలఁడు = ఉన్నాడు.

తాత్పర్యం: కురువంశరాజోత్తమా! శ్రీకృష్ణభగవానుడే పరమేశ్వరుడు. అతడే దిక్పాలక స్వరూపుడు. అతడే సర్వజగన్నాథుడు. త్రికాలములునూ, దశదిశలునూ ఆతడే. సమస్తమందును అతడే ఉన్నాడు.

ఆ. అరయఁ గృష్ణుఁ డధ్వరాత్మకుఁ; డఖిలాగ । మోక్తమంత్రతంత్ర యుక్తి నతనిఁ
బ్రస్తుతించి మేలు వడయుదు రధ్వర । కర్తలైన జనులు కౌరవేంద్ర! 362

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర! = కురుసార్వభౌమా!; అరయన్ = పరికించగా; కృష్ణుఁడు = శ్రీకృష్ణుడు; అధ్వర+ఆత్మకుఁడు = యజ్ఞస్వరూపుడు; అఖిల+ఆగమ+ఉక్త = సమస్త వేదాలలో చెప్పబడిన; మంత్ర తంత్ర యుక్తిన్ = మంత్ర తంత్రాలతో; అతనిన్ = ఆ సర్వేశ్వరుడిని; ప్రస్తుతించి = కొనియాడి; అధ్వరకర్తలు+ఐన జనులు = యాగాలు సల్పునట్టివారు; మేలు+పడయుదురు = శుభాలు పొందుతారు.

తాత్పర్యం: కురురాజా! వాసుదేవుడు యజ్ఞస్వరూపుడు. ఆ మహనీయుడిని వేదాలలో చెప్పబడిన మంత్ర తంత్రాలతో స్తుతించి యాగనిర్వాహకులు శుభాలు పొందుతారు.

క. చయనంబుల ఋగ్వేదం । బయ మహిత సువర్ణనాముఁ డగు కృష్ణ గుణో
దయము వినుతించు యజ్ఞ । క్రియా నిరతులైన సురలు ప్రీతిం బొందన్. 363

ప్రతిపదార్థం: యజ్ఞ క్రియా నిరతులు+ఐన = యాగకర్మలందు ఆసక్తి గలిగిన; సురలు = అమరులు; ప్రీతిన్+పొందన్ = సంతోషం చెందగా; అయమహిత సువర్ణనాముఁడు+అగు = శుభము లిడుటలో గొప్పవగు మంచి అక్షరాలతో కూడిన పేరుగల (సువర్ణుఁడు); కృష్ణ+గుణ+ఉదయమున్ = శ్రీకృష్ణుడి సద్గుణాల యొక్క అతిశయమును; ఋగ్వేదము; చయనంబులన్ = యాగవిశేషము లందు; వినుతించున్ = స్తుతిస్తుంది.

తాత్పర్యం: యాగకర్మలందు ఆసక్తిగల దేవతలు హర్షించగా, శుభము లిడుటలో దొడ్డదగు బంగారు నామధేయం గల శ్రీకృష్ణుడి గుణాతిశయాన్ని ఋగ్వేదం యాగవిశేషములందు కొనియాడుతుంది.

క. విను ఋగ్వేదము కృష్ణుని । వినుతించుట యరుదె? యఖిలవేదంబులుఁ ద
జ్జనిత విలాసంబులు వే । దనిరూపిత వస్తువుననఁ దాన కుమారా! 364

ప్రతిపదార్థం: కుమారా! = వత్సా!; విను = వినుము; ఋగ్వేదము; కృష్ణునిన్; వినుతించుట = కొనియాడటం; అరుదు+ఎ? = ఆశ్చర్యమా? కాదని భావం; అఖిలవేదంబులున్ = అన్ని వేదాలు; తత్+జనిత+విలాసంబులు = ఆ మహాత్ముడి నుండి పుట్టిన లీలలు కలవి; వేదనిరూపిత వస్తువున్+అనన్ = ఆగమములచే నిశ్చయించబడిన పదార్థమనగా; తాను+అ = తానే, ఆ శ్రీకృష్ణుడే.

తాత్పర్యం: వత్సా! వినుము. ఋగ్వేదం శ్రీకృష్ణుడిని శ్లాఘించటం వింత గాదు; సకల వేదాలు అతడి లీలలను వర్ణించేవే. వేదములచే నిశ్చయించబడిన పరబ్రహ్మవస్తువు ఆ శ్రీకృష్ణుడే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. అగ్నులును యజమానుఁడు నాహుతులును । యాగఫలరూపమును గృష్ణుఁ డని యెఱుంగు;
మిన శశాంకతారకముల నెసఁగు తేజ । ములును గృష్ణమయంబుల భూపవర్య! 365

ప్రతిపదార్థం: అగ్నులును = ఆహవనీయం మున్నగు అగ్నులు; యజమానుఁడున్ = యాగం చేసేవాడు; ఆహుతులునున్ = హోమద్రవ్యాలు, హవిస్సులు; యాగఫలరూపమును = యజ్ఞఫల స్వరూపమునూ; కృష్ణుఁడు+అని; ఎఱుంగుము = గ్రహించుము; ఇన+శశ+అంక+తారకములన్ = సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు అనువాటియందు; ఎసఁగు = ఒప్పునట్టి; తేజములును = కాంతులు కూడ; కృష్ణమయంబులు+అ = కృష్ణస్వరూపాలే.

తాత్పర్యం: రాజోత్తమా! యాగాగ్నులు, యాగకర్త, హవిస్సులు, యాగ ఫలస్వరూపమైన వాడూ శ్రీకృష్ణుడే అని గ్రహించుము. సూర్యచంద్ర నక్షత్రములందు ఒప్పుతున్న కాంతులు కృష్ణమయములే సుమా!

క. పరమజ్యోతి యనఁగ ని । ర్జరామర పదం బనంగ సత్యం బన భూ
వర! యమృత మనఁగ దేవకి । వరసుతుఁడు వెలుంగు వేదవర్గము తుదలన్.' 366

ప్రతిపదార్థం: భూవర! = రాజా!; పరమజ్యోతి+అనఁగన్ = పరంజ్యోతి అనగా; నిర్జర+అమర+పదంబు+అనంగన్ = అజరము, అమరము అయినస్థానము, ముసలితనం, చావు అనునవి లేని చోటు అనగా; సత్యంబు+అనన్ = సత్యమనగా; అమృతము+ అనఁగన్ = ముక్తి పథం, మోక్షస్థానం అనగా; దేవకి వరసుతుఁడు = దేవకీ దేవి యొక్క ఉత్తమపుత్రుడు; వేద వర్గముతుదలన్ = వేదాల కొసలైన ఉపనిషత్తులయందు; వెలుంగున్ = ప్రకాశిస్తున్నాడు.

తాత్పర్యం: పరంజ్యోతి అని, అజరము, అమరము అయిన స్థానమని, సత్యమని, మోక్షమని కొనియాడబడే దేవకీ నందనుడైన శ్రీకృష్ణ భగవానుడు వేదశిఖలైన ఉపనిషత్తులలో దీపిస్తున్నాడు.'

క. అని యి ట్లుపదేశించిన । విని మోదము నొంది పాండువిభునగ్రసుతుం
డనిమిషతటినీ సుతునకు । వినతుండై నెమ్మనమున వేడ్క దలిర్పన్. 367

ప్రతిపదార్థం: అని; ఇట్లు; ఉపదేశించినన్ = శ్రీకృష్ణుడి ప్రభావం గూర్చి బోధించగా; విని; మోదమున్+ఒంది = సంతోషం చెంది; పాండు విభు+అగ్రసుతుండు = పాండుమహారాజుయొక్క పెద్దకొడుకైన ధర్మరాజు; అనిమిషతటినీ సుతునకున్ = దేవనది యొక్క కుమారుడైన భీష్ముడికి; వినతుండు+ఐ = నమస్కరించిన వాడై; నెమ్మనమునన్ (నెఱ+మనమునన్) = నిండుమదిలో; వేడ్క = సంబరం, కుతూహలం; తలిర్పన్ = చిగురించగా. (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: అని భీష్ముడు శ్రీకృష్ణుడి ప్రభావం గూర్చి బోధించగా ఆలకించి ధర్మజుడు సంతోషించి గంగానందనుడు భీష్ముడికి నమస్కరించి తన మనస్సులో కుతూహలం రేకెత్తగా.

కృష్ణుడు ధర్మరాజునకు బ్రాహ్మణ ప్రభావంబు చెప్పుట. (సం.13-144-1).

వ. కృష్ణునకుఁ బ్రణమిల్లి 'దేవా! భూదేవ మాహాత్మ్యంబు వినవలతు నానతీయవే' యని వినయసంభృతుం డగుచుఁ బ్రార్థించిన నప్పార్థివుని మీఁదఁ గరుణామృతమయంబగు నాలోకనం బొలయ నద్దేవుం డాదరభరితుండై యిట్లనియె. 368

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కృష్ణునకున్ = వాసుదేవుడికి; ప్రణమిల్లి = నమస్కరించి; దేవా! = ప్రభూ!; భూదేవ మాహాత్మ్యంబున్ = బ్రాహ్మణుల యొక్క ప్రభావం; వినన్+వలతున్ = వినుటకు ఇష్టపడుతున్నాను; ఆనతి+ఈయవు+ఏ? = సెలవియ్యవా?; అని; వినయ సంభృతుండు+అగుచున్ = వినయముతో నిండినవాడై, వినయపూర్ణుడై; ప్రార్థించినన్ = వేడగా; ఆ+పార్థివుని మీఁదన్ = రాజగు ధర్మజునిపై; కరుణా+అమృతమయంబు+అగు = దయ అనెడు సుధారసంతో నిండిన; ఆలోకనంబు = దృష్టి,చూపు; ఒలయన్ = వ్యాపించగా, ప్రసరించగా; ఆ+దేవుండు = ఆ భగవంతుడు; ఆదరభరితుండు+ఐ = ఆదరంతో నిండినవాడై; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధర్మజుడు శ్రీకృష్ణుడికి మ్రొక్కి 'స్వామీ! బ్రాహ్మణుల గొప్పతనం వినవలెనని కుతూహలపడుతున్నాను. సెలవియ్యవలసిం' దని వినయంతో వేడుకొన్నాడు. వాసుదేవుడు ఆ రాజచంద్రుడిపై కరుణామృతంతో నిండిన చూపులు ప్రసరింప జేసి ఆదరంతో ఇట్లా అన్నాడు.

క. **'ననుఁ బ్రద్యుమ్నుం డివ్విధ । మున నడిగిన వాని కేను ముద మందుచు నా**
తని హితము గోరి కుంతీ । తనయాగ్రజ! యున్నరూప తగ నిట్లంటిన్. 369

ప్రతిపదార్థం: కుంతీ తనయ+అగ్రజ! = కుంతీదేవి యొక్క జ్యేష్ఠకుమారుడా!; ననున్ = నన్ను; ప్రద్యుమ్నుండు = ప్రద్యుమ్నుడు; ఈ+విధమునన్ = ఇపుడు నీ వడిగిన చందంగానే; అడిగినన్ = అడుగగా; వానికిన్ = అతడికి; ఏను = నేను; ముదము+అందుచున్ = సంతోషం చెందుతూ; ఆతనిహితము+కోరి = అతడి యొక్క మేలును ఆశించి; ఉన్న రూపు+అ = ఉన్నది ఉన్నట్లుగా; తగన్ = ఒప్పిదంగా; ఇట్లు+అంటిన్ = ఇట్లా చెప్పాను.

తాత్పర్యం: కౌంతేయాగ్రజా! ఇపుడు నీవడిగినట్లే ఇంతకుపూర్వం నాకుమారుడు ప్రద్యుమ్నుడు నన్ను అడిగాడు. అందుకు సంతోషిస్తూ వాని మేలు కోరి ఉన్న దున్నట్లుగా ఇట్లా చెప్పాను.

సీ. **వర్గత్రయము నపవర్గంబు సాధింప । నమర పితృ ప్రీతు లాచరింప**
నైహికసుఖము లుపార్జింపవలసిన । వారికి విప్రుల చేరుగడలు;
దివిజులకైన నాయువు శ్రీయుఁ గీర్తియుఁ । దనరుట తత్ప్రసాదమునఁ జూవె!
యలిగి భస్మము సేయ వలచి పెం పొసఁగంగ । నవనీసురులు శక్తు; లట్టు లగుట

తే. **వారిఁ గోపింపఁ జేయక వారలకుఁ బ్రి । యంబు సేయుచు వారు ప్రహర్ష మొందఁ**
దనకుఁ గలభంగి నిచ్చు నతండు రెండు । భువనములయందుఁ బెంపును బొగడుఁ బడయు. 370

ప్రతిపదార్థం: వర్గత్రయమున్ = ధర్మార్థకామాలనే మూడు పురుషార్థాలనూ; అపవర్గంబున్ = మోక్షమనే నాల్గవ పురుషార్థాన్నీ; సాధింపన్ = సాధించటానికి, సంపాదించటానికి; అమర = దేవతలకు; పితృ = పితృదేవతలకు; ప్రీతులు+ఆచరింపన్ = సంతోషాలు కల్గించుటకు; ఐహిక సుఖములు = ఈ లోకమందలి సుఖాలు; ఉపార్జింప = పొందుటకు; వలసిన వారికిన్ = అక్కరగల మానవులకు; విప్రులు+అ = బ్రాహ్మణులే; చేరుగడలు = ఆధారభూతులు; దివిజులకున్+ఐనన్ = వేల్పులకైననూ; ఆయువున్ = ఆయుష్యమూ; శ్రీయున్ = కలిమి, సంపదయూ; తనరుట = అతిశయించటం, లభించటం; తత్+ప్రసాదమునన్+ చూవె! = బ్రాహ్మణుల అనుగ్రహం చేతనే సుమా!; అవనీసురులు = బ్రాహ్మణులు; అలిగి = కోపించి; భస్మము+చేయన్ = బూది కావించటానికి, నాశనం చెయ్యటానికి; వలచి = ఇష్టపడి; పెంపు+ఒసఁగంగన్ = వృద్ధికావించటానికి; శక్తులు = సమర్థులు, దక్షులు; అట్టులు+అగుటన్ = అందువలన; వారిన్ = బ్రాహ్మణులను; కోపింపన్+చేయక = అలుగునట్లు చెయ్యక; వారలకున్ = విప్రులకు; ప్రియంబు+చేయుచున్ = హితం సల్పుతూ, మేలు చేకూరుస్తూ; వారు = బ్రాహ్మణులు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రహర్షము+ఒందన్ = మిక్కిలి సంతోషం పొందేటట్లు; తనకున్ = తనకు; కలభంగిన్ = ఉన్నంతలో; ఇచ్చు+అతండు = దానమొనర్చేవాడు; రెండు భువనముల+అందున్ = ఉభయలోకాలలో, ఇహపరాలలో; పెంపును = అభివృద్ధిని; పొగడున్ = పొగడ్తనూ; పడయున్ = పొందుతాడు.

తాత్పర్యం: ధర్మార్థకామమోక్షాలు అనే చతుర్విధ పురుషార్థాలు సంపాదించటానికి, దేవతలను, పితృదేవతలను సంతృప్తులను చెయ్యటానికి, ఇహలోకసుఖాలు పొందటానికి బ్రాహ్మణులే ఆధారభూతులు. దేవతలకైనా ఆయుస్సు, యశస్సూ, సంపత్తీ వారి అనుగ్రహం వలననే కలుగుతాయి. వారు ఆగ్రహిస్తే ఎంతటివారినైనా బూడిద చెయ్యగలరు. అనుగ్రహిస్తే అభివృద్ధి కలిగించగలుగుతారు. కనుక వారికి కోపం తెప్పించక ప్రియం సల్పుతూ వారు హర్షించేటట్లు ఎవడు తన శక్తి కొలది దాన మిస్తాడో అతడు ఇహపరలోకాలలో అభివృద్ధిని, పేరు ప్రఖ్యాతులను పొందుతాడు.

దుర్వాసుఁడు కృష్ణుని మనశ్శుద్ధి పరీక్షించి యనుగ్రహించిన ప్రకారము. (సం.13-144-14).

వ. నా కనిన యాశ్చర్యంబు సెప్పెద నాకర్ణింపుము. స్వతంత్ర ప్రవర్తనుండగు దుర్వాసుండు మనమందిరంబునకు వచ్చి మందహాసంబు సేయుచుఁ, గోపించుచు, సుముఖుం డగుచు, విముఖత్వంబు నొందుచుఁ, గుడువనొల్ల ననుచుఁ, బెక్కండ్రకుం గావించిన కూడు గూర దా నొక్కరుండు భుజించుచు, సెజ్జ నిద్రించుచు' భూమి శయనించుచు, నెందేనిం బోవుచు, మరలి వచ్చుచుఁ బ్రవర్తించుచుండి యొక్కనాఁడు 'కృష్ణా! నాకుం బాయసంబు మీఁద వేడుక పుట్టెడుఁ బెట్టింపవే' యనఁ దత్క్షణంబ కావించినం గొంత కుడిచి, కొంత తన యొడలం బూయు మనినం బూసితి; నచ్చేరువ నున్న రుక్మిణిం జూచి కొంత య క్కాంతమేనం దాన పూసి రథ్యరూపంబుగా రథంబున న ప్పొలఁతిం బూన్చి రథారోహణంబు చేసి, వీథికి వెడలి, యమ్ముద్దియను ములుకోలం బొడుచుచు రథంబు నడిపింప, నాకుం గోపంబు నీర్ష్యయు నించుకయు జనింపకుండె; నేనుం జూచుచుం దోడన నడచితి; నప్పుడు యాదవు లాశ్చర్య కోపభయాయత్త చిత్తులై యనేక ప్రకారంబులం దమలోఁ బలుకుచుం జేయునది లేక కెలంకుల వచ్చుచుండ. 371

ప్రతిపదార్థం: నా+కనిన = నేను చూచిన; ఆశ్చర్యంబు+చెప్పెదన్ = వింత విషయాన్ని చెప్పుతాను; ఆకర్ణింపుము = వినుము; స్వతంత్రప్రవర్తనుండు+అగు = స్వేచ్ఛగా మెలగువాడైన; దుర్వాసుండు; మనమందిరమునకున్ = మనభవనానికి; వచ్చి; మందహాసంబు చేయుచున్ = చిరునవ్వునవ్వుతూ; కోపించుచున్ = కోపపడుతూ; సుముఖుండు+అగుచున్ = అనుకూలుడుగా ఉంటూ, ప్రసన్నుడుగా ఉంటూ; విముఖత్వంబున్+ఒందుచున్ = ప్రతికూలుడుగా మారుతూ; కుడువన్+ఒల్లన్+అనుచున్= భుజించనని చెపుతూ; పెక్కండ్రకున్ = అనేకులకు, పలువురికి; కావించిన = వండిన, సిద్ధపరచిన; కూడు; కూర; తాన్ = తను; ఒక్కరుండు+అ = ఒక్కడే; భుజించుచున్; సెజ్జన్ = శయ్యపై, పడుకపై, పరుపుపై; నిద్రించుచున్; భూమిన్ = కటికనేలమీద; శయనించుచున్ = పండుకొంటూ; ఎందున్+ఏనిన్ = ఎక్కడికైననూ; పోవుచున్, మరలివచ్చుచున్; ప్రవర్తించుచున్+ ఉండి = ఈ ప్రకారం మెలగుతూ ఉన్నవాడై; ఒక్కనాడు; కృష్ణా; నాకున్; పాయసంబుమీఁదన్ = పరమాన్నం మీద; వేడుక పుట్టెడున్ = ఆసక్తి గలిగింది, అభిలాష జనించింది; పెట్టింపవు+ఏ? = తినబెట్టవా?; అనన్; తత్+క్షణంబు+అ = ఆ వెంటనే; కావించినన్ = పాయసాన్ని వండించగా; కొంత; కుడిచి = తిని, ఆరగించి; కొంత; తన+ఒడలన్ = తన శరీరం మీద, తనమేనికి; పూయుము+అనినన్ = రాయుమని చెప్పగా; పూసితిన్ = రాచినాను; ఆ+చేరువన్ = ఆ సమీపమందు; ఉన్న; రుక్మిణిన్; చూచి; కొంత; ఆ+కాంతమేనన్ = ఆమెశరీర మందు; తాను+అ = తానే (దుర్వాసుడే); పూసి = రాచి; రథ్య రూపంబుగాన్ = వాహనంగా, గుర్రంగా; రథంబునన్, ఆ+పొలఁతిన్+పూన్చి = ఆ వనితను కట్టివేసి; రథ+ఆరోహణంబు+చేసి

= తాను రథమెక్కి; వీథికిన్ = వీథులలోనికి; వెడలి = బయలుదేరి; ఆ+ముద్దియను = ఆ మెలతను, ఆ రమణిని, రుక్మిణిని; ములుకోలన్ = ములుగఱ్ఱతో; పొడుచుచున్ = పొడుస్తూ; రథంబున్, నడపింపన్ = లాగేటట్లు చేయగా; నాకున్; కోపంబున్, ఈర్ష్యయున్ = ఆసూయ, ద్వేషమూ; ఇంచుకయున్ = కొంచెం కూడ; జనింపక+ఉండెన్ = కలుగలేదు; నేనున్; చూచుచున్; తోడన = ఆ రథము వెంబడి; నడచితిన్ = వెళ్ళాను; అప్పుడు; యాదవులు; ఆశ్చర్యకోప+భయ+ఆయత్తచిత్తులు+ఐ = అద్భుతం, క్రోధం, భీతి, అను గుణాలకు అధీనమైన మనస్సు కలవారై; అనేక ప్రకారంబులన్ = పలు విధాల; తమలోన్ = తమ మనస్సులలో; పలుకుచున్ = దుర్వాసుడిని గురించి మాట్లాడుతూ; చేయు+అది+లేక = చేసేదేమీ లేక; కెలంకులన్ = ఆ రథానికి ఇరుప్రక్కల; వచ్చుచున్+ఉండన్ = ఆ యాదవులు వస్తూండగా.

తాత్పర్యం: ధర్మజా! నేను చూచిన ఒక అద్భుత విషయాన్ని చెప్పుతాను, వినుము. తన ఇష్టప్రకారం ప్రవర్తించే దుర్వాస మహర్షి ఒకసారి మన యింటికి వచ్చాడు. ఆయన ఒక సమయంలో చిరునవ్వు నవ్వుతూ ఉండేవాడు; మరొకప్పుడు కినుక వహించేవాడు. ఒకప్పుడు అనుకూలుడుగా, ఇంకొకప్పుడు ప్రతికూలుడుగా ఉండేవాడు. ఒక తడవ నేను తిండి తినను అనేవాడు. మరొకప్పుడు పలువురకు వండిన ఆహారమంతా తా నొక్కడే ఆరగించేవాడు. ఒకప్పుడు పరుపులమీద శయనించేవాడు, మరొకప్పుడు కటికనేలమీద పరుండేవాడు. చెప్పకుండ ఎక్కడికో వెళ్ళేవాడు. తిరిగి తనకు తానే వచ్చేవాడు. ఇట్లా ప్రవర్తిస్తూ ఒకరోజు ఆ మహర్షి 'కృష్ణా! నాకు పరమాన్నం మీద మనసుపడింది; పెట్టించవా' అని అడిగాడు. వెంటనే నేను పాయసం వండించాను. ఆయన అందులో కొంచెం తిని, కొంత తన ఒడలికి నన్ను పూయమన్నాడు. నేను పూశాను. ఆ చెంతనే నిలిచి ఉన్న రుక్మిణిని చూచి మహర్షి ఆమె దేహానికి తానే పాయసం పూశాడు. ఆమెను రథానికి గుఱ్ఱం మాదిరి కట్టివేసి తాను రథంలో కూర్చొని లాగుమన్నాడు. వీథులలో విహారానికి బయలుదేరాడు. రుక్మిణి రథాన్ని ఈడుస్తూ ఉంటే ములుగఱ్ఱతో చోచో అని ఆమెను పొడుస్తూ తేరిని నడిపించాడు. ఆయన ఇంత చేస్తున్నా, నేను ఇదంతా చూస్తున్నా, నాకు మౌని మీద కోపంగాని, ద్వేషంకాని కలుగలేదు. సాక్షిమాత్రుడిగా వీక్షిస్తూ రథంతో నేను నడిచాను. ఈ దృశ్యాన్ని అవలోకిస్తున్న యాదవులకు ఆశ్చర్యమూ, కోపమూ, భయమూ జనించింది. వారు తమలో తాము మహర్షిని గురించి ఏమేమో అనుకొంటూ చేసేది లేక మౌనంగా రథానికి ఇరుప్రక్కల నడిచారు.

ఆ. రథముఁ దివిచి డస్సి రమణి మేదిని మీఁద । మ్రొగ్గ తిలఁగఁ బడిన డిగ్గ నుఱికి
దానిమీఁద ధూళి దాఁ జల్లి వెసఁ బాఱె । నమ్మునీశ్వరుండు యామ్యదిశకు. 372

ప్రతిపదార్థం: రథమున్ = అరదమును, తేరును; తివిచి = లాగి, ఈడ్చి; డస్సి = అలసిపోయి; రమణి = రుక్మిణి; మేదిని మీఁదన్ = నేలపై; మ్రొగ్గతిలఁగన్ = ముందునకు వ్రాలి; పడఁగన్ = ధరపై కూలగా; ఆ+ముని+ఈశ్వరుండు = ఆ దుర్వాసముని శ్రేష్ఠుడు; డిగ్గన్+ఉఱికి = రథమునుండి క్రిందికి దుమికి; దాని మీఁదన్ = రుక్మిణి మీద; తాన్ = తాను; ధూళిన్+చల్లి = దుమ్ముకొట్టి; యామ్యదిశకున్ = దక్షిణ దిక్కునకు; వెసన్ = శీఘ్రంగా; పాఱెన్ = పరుగెత్తి పోయాడు.

తాత్పర్యం: రుక్మిణీదేవి దుర్వాసు డెక్కిన రథాన్ని ఈడ్చి అలసిపోయి ముందుకు వ్రాలి నేలమీద కూలబడింది. అపుడు మునీంద్రుడు స్యందనంనుంచి క్రిందికి దుమికి ధరణిమీద చతికిలబడి ఉన్న రుక్మిణి మీద దుమ్ము చల్లి శీఘ్రంగా దక్షిణదిశకు పరుగెత్తి వెళ్ళాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పాఱిన నాతని వెనుకన । పాఱితి; సంప్రార్థనా ప్రభాషణములతోఁ
దేఱి మరలి యమ్ముని 'మిముఁ । గాఱియ వెట్టితిఁ గదే యకట!' యనుచు దయన్. 373

ప్రతిపదార్థం: పాఱినన్ = దుర్వాసు డట్లా పరుగెత్తి వెళ్ళగా; ఆతని వెనుకన = ఆ ముని యొక్క వెంబడినే; పాఱితిన్= నేనూ పరుగెత్తి వెళ్ళాను; సంప్రార్థనా ప్రభాషణములతోన్ = నా యొక్క ప్రార్థనా వాక్యాలతో, నావేడుకునే మాటలతో; తేఱి= ప్రసన్నుడై; మరలి = వెనుకకు మళ్ళి; ఆ+ముని = దుర్వాసుడు; అకట! = అయ్యో!; మిమున్ = మిమ్మల్ని; కాఱియ+పెట్టితిన్+కదే! = కష్టపెట్టానుసుమా!; అనుచున్ = అని పలుకుతూ; దయన్ = కరుణతో. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: దుర్వాసుడు ఆ విధంగా దక్షిణ దిశకు పరుగెత్తి పోగా నేను ప్రార్థనా వాక్యాలతో ఆయన వెంట పరుగెత్తి వెళ్ళాను. నేను తప్పు మన్నించుమని వేడుకొంటూ పల్కిన పల్కులకు ఆయన ప్రసన్నుడై వెనుదిరిగి 'అయ్యో! మిమ్మ బాధించాను గదా!' అని కృపతో.

వ. నన్నుం గనుంగొని 'నీవు కోపంబు జయించితివి. నీకు వరం బిచ్చెదఁ గైకొనుము. 374

ప్రతిపదార్థం: నన్నున్; కనుంగొని = చూచి; నీవు; కోపంబున్; జయించితివి = గెలిచావు; నీకున్; వరంబు; ఇచ్చెదన్; కైకొనుము = గ్రహింపుము, స్వీకరించుము.

తాత్పర్యం: దుర్వాసమహర్షి నన్ను చూచి 'కృష్ణా! నీవు కోపాన్ని జయించావు. నీకు వరమిస్తాను గ్రహించుము'.

ఆ. 'ఎల్లవారుఁ దమకు నెంత గూర్తురు నీకు । నంత గూర్చి నిన్ను ననుసరించు
వారు గాత; లోక వంద్యుండవై యెందు । మాఱులేక యతుల మహిమ మనుము.' 375

ప్రతిపదార్థం: ఎల్లవారున్ = అందరు; తమకున్ = తమకు తామంటే; ఎంత కూర్తురు = ఎంతగా ఇష్టపడతారో, తమ యందు ఎంత ప్రేమ కలిగి ఉంటారో; నీకున్ = నీకును; అంతకూర్చి = అంతగా ఇష్టపడి; నిన్నున్ = నిన్ను; అనుసరించువారు+కాతన్ = అనుసరించేవారు ఔతారు గాక!; లోకవంద్యుండవు+ఐ = లోకుల యొక్క నమస్కారాలు గైకొంటూ; ఎందున్ = ఎచ్చటను; మారులేక = అడ్డులేక, ప్రతిలేక; అతులమహిమన్ = సాటిలేని ప్రభావంతో; మనుము = జీవించుము, వర్ధిల్లుము.

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! సమస్త జనులు తమయందు తాము ఎంత ప్రేమ కలిగి ఉంటారో, అనగా తమకు తామంటే ఎంత ప్రియమో, అంత ప్రేమ నీ యందు కలిగి ఉండి నిన్ను అనుసరిస్తారు. నీవు జనుల యొక్క మ్రొక్కులు గైకొంటూ ఎందును ఎదురే లేక సాటిలేని మహిమతో వర్ధిల్లుదువుగాక!'

వ. అని నిర్దేశించి మఱియు నిట్లనియె. 376

ప్రతిపదార్థం: అని; నిర్దేశించి = నిర్ణయించి, నిర్ధారణ చేసి చెప్పి; మఱియున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దుర్వాస మహర్షి నిర్ణయపూర్వకంగా వచించి ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'నాయంగంబుల నెల్లం । బాయస మతిభక్తిఁ బూసి పాదతలమునం
బూయవు గావునఁ గలుగు న । పాయం బఱకాల నీకు నవిలంఘ్యుంబై. 377

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నా అంగంబులన్+ఎల్లన్ = నా అన్ని అవయవములందు; అతిభక్తిన్ = మిక్కిలి భక్తితో, గాఢ ప్రేమతో; పాయసము = పరమాన్నం; పూసి = రాసి, ప్రామి, అలది; పాదతలమునన్ = అరికాలిలో, పాదము యొక్క క్రింది భాగంలో; పూయవు = నీవు పూయలేదు; కావునన్ = కాబట్టి; నీకున్ = నీకు; అజకాలన్ = పాదతలంలో; అవిలంఘ్యంబు+ఐ = దాటరానిదై; తప్పించుకొన వీలుగానిదై; అపాయంబు = కీడు, చేటు, హాని; కలుగున్ = సంభవిస్తుంది.

తాత్పర్యం: 'నా శరీరమం దంతట పరమభక్తితో పరమాన్నం ప్రామినావు. కాని అరికాలిలో మాత్రం పూయలేదు. కాబట్టి నీకు పాదతలంలో తప్పించుకొన శక్యంగాని హాని కలుగుతుంది.

క. విను పరమపదప్రాప్తికి । ననుగుణమైయుండుఁ గాన యదియును నశుభం
బనరాదు; నీవు బ్రాహ్మణ । జనముల యెడ నడపు మిట్టి చందమ యెపుడున్.' 378

ప్రతిపదార్థం: విను = శ్రీ కృష్ణా! ఆలకించుము; అదియును = నీకు పాదతలంలో కలుగబోయే కీడు; పరమ పదప్రాప్తికిన్ = నీవు శ్రీవైకుంఠం చెందటానికి, అనుగుణము+ఐ = అనుకూలమై, తగినదై; ఉండున్ = ఉంటుంది; కాన = కనుక; అశుభంబు+అనన్+రాదు = అమంగళం అని భావించకూడదు; నీవు; బ్రాహ్మణ జనముల+ఎడన్ = విప్రుల విషయంలో; ఎపుడున్ = ఎల్లప్పుడూ; ఇట్టి చందము+అ = ఈ విధంగానే; నడపుము = ప్రవర్తించవలసినది.

తాత్పర్యం: కృష్ణా! నా పలుకులు వినుము. పాదతలంలో నీకు కలుగనున్న ఆపద నీ వైకుంఠప్రాప్తికి అనుకూలంగానే ఉంటుంది. కనుక ఆ చేటును అమంగళమని భావించకూడదు. నీవు బ్రాహ్మణుల విషయంలో ఈ రీతిగానే భయభక్తులతో ప్రవర్తించుము.'

వ. అని పలికి రథవహన పరిశ్రాంతయగు మీతల్లిం జూచి 'నీవు సౌందర్య సౌభాగ్యంబుల నప్రతిమానవై మాననీయత్వంబునం గృష్ణుని షోడశ సహస్రాంతఃపుర కాంతలకంటె నెక్కుడగు' మని దీవనయిచ్చి యమ్ముని యంతర్హితుం డయ్యె. 379

ప్రతిపదార్థం: అని; పలికి; రథవహన పరిశ్రాంత+అగు = రథం లాగటంవలన బడలిక పొందినట్టి; మీతల్లిన్ = నీ జననిఅగు రుక్మిణిని; చూచి = కనుగొని; నీవు; సౌందర్య సౌభాగ్యంబులన్ = చక్కదనంలో, వైభవంలో; అప్రతిమానవు+ఐ = సాటిలేని దానవై; మాననీయత్వంబునన్ = గౌరవార్హతలో; కృష్ణుని = శ్రీకృష్ణుడి యొక్క; షోడశ సహస్ర+అంతఃపురకాంతలకంటెన్ = పదహారువేలమంది రాణివాసపు రమణుల కంటె; ఎక్కుడు+అగుము = అధికురాలవు కమ్ము; అని; దీవన = ఆశీర్వాదం; ఇచ్చి; ఆ+ముని; అంతర్హితుండు+అయ్యెన్ = అంతర్ధానం చెందాడు.

తాత్పర్యం: అని దుర్వాసుడు పలికి రథాన్ని ఈడ్చి ఈడ్చి అలసిపోయిన మీ అమ్మను జూచి 'నీవు సౌందర్యమునందు, సౌభాగ్యమునందు సాటిలేని దానవై గౌరవార్హతలో శ్రీకృష్ణుడి పదహారువేలమంది రాణులలో అగ్రేసరవై విలసిల్లు' మని ఆశీర్వదించి ఆ మునీంద్రుడు అదృశ్యుడయ్యాడు.

ఆ. రుక్మిణియును నేను రుచిరసంపద నప్పు । డతిశయిల్లు నస్మ దంగకములఁ
జూచి కొనుచు మిగులఁ జోద్య మందుచుఁ బ్రియ । మెడఁద నెలకొనంగ నింటి కరిగి. 380

ప్రతిపదార్థం: రుక్మిణియునున్; నేనున్; రుచిరసంపదన్ = సౌందర్య సంపత్తిచే; అప్పుడు = ఆ వేళ; అతిశయిల్లు =

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏపారుతున్న; అస్మత్+అంగకములన్ = మా యొక్క దేహాలను; చూచి కొనుచున్ = దర్శించుకొంటూ; మిగులన్ = మిక్కిలి; చోద్యము +అందుచున్ = ఆశ్చర్యపడుతూ; ప్రియము = ప్రేమ; ఎడఁదన్ = హృదయములందు; నెలకొనంగన్ = కుదురుకొనగా, కలుగగా; ఇంటికిన్+అరిగి = గృహమునకు వెళ్ళి (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: రుక్మిణీ, నేనూ మహర్షి దీవన వలన సౌందర్య సమృద్ధితో విలసిల్లుతున్న మా శరీరాలను వీక్షించుకొంటూ, మిక్కిలి ఆశ్చర్యపడుతూ, సంతోషం హృదయములందు నిండగా ఇంటికి వెళ్ళాము.

ఆ. అందు వస్తుచయము ముందటికంటెను । బహులమును మనోజ్ఞ భంగికంబు
నగుటఁ జూచి యద్భుతాయత్తచిత్తుల । మైతి; మిట్టివార లవనిసురులు. 381

ప్రతిపదార్థం: అందున్ = ఇంటిలో; వస్తుచయము = వస్తువుల యొక్క సమూహం; ముందటి కంటెను = మునుపున్న వాటి కంటె; బహులమును = అధికంగానూ; మనోజ్ఞ భంగికంబున్ = మనస్సునకు ఇంపు గూర్చునట్టిదిగాను; అగుటన్+చూచి = ఉండటం కనుగొని; అద్భుత+ఆయత్త చిత్తులము+ఐతిమి = ఆశ్చర్యానికి అధీనమైన మనస్సులు కలవారమయ్యాము; అవనిసురులు = పుడమియందలి దేవతలు-బ్రాహ్మణులు; ఇట్టివారలు = ఇటువంటి మహిమకలిగిన వాళ్ళు.

తాత్పర్యం: ప్రద్యుమ్నా! ఇంటిలోని వస్తుసముదాయం మునుపటికంటె ఇనుమిక్కిలిగా ఉండి ఎంతో రమ్యమై కనువిందు చేసింది. వాటిని చూచి మేము ఆశ్చర్య నిమగ్న మానసులమయ్యాము.

క. కావున వారికి భక్తుఁడ । వై వెలయు కుమార!' యనిన నతఁ డట్టిఁడయై
తా వెలసె; నీవు నట్టిఁడ । వై వెలయఁగ వలయుఁ గౌరవాన్వయముఖ్యా!' 382

ప్రతిపదార్థం: కుమార = తనయా! ప్రద్యుమ్నా! ; కావునన్ = కనుక; వారికిన్ = భూసురులకు; భక్తుఁడవు+ఐ = భక్తుండవై; వెలయు = ప్రకాశించుము; అనినన్ = అని నేను చెప్పగా; అతఁడు = మా కుమారుడైన మన్మథుడు; అట్టిఁడు+అ+ఐ = (అట్టిఁడయై) = అట్టివాడే అయి, బ్రాహ్మణభక్తుడై; తాన్ = తాను; వెలసెన్ = వెలుగొందాడు; కౌరవ+అన్వయముఖ్యా! = కురువంశజులలో ప్రధానుడవైనవాడా! ధర్మజా! ; నీవున్ = నీవు కూడ; అట్టిడవు+ఐ = మా కుమారుడు ప్రద్యుమ్నుడి మాదిరి విప్రభక్తుడవై; వెలయఁగన్+వలయున్ = విరాజిల్లవలె సుమా!

తాత్పర్యం: కాబట్టి కుమారా! నీవు బ్రాహ్మణులకు భక్తుడవై ప్రకాశించాలి' అని నేను చెప్పాను. ప్రద్యుమ్నుడు నామాట చొప్పున బ్రాహ్మణులయందు భక్తి గలిగి విరాజిల్లాడు. ధర్మజా! నీవు గూడ మా కుమారుడి వలె విప్రభక్తుడవై వెలుగొందాలి.'

వ. అని చెప్పినం బ్రముదితమానసుం డగుచు నమ్మానవనాథుండు మాధవుతో 'దుర్వాసుండు శర్వాంశ సంభవుం డని విందు; శర్వుని మహిమ విన వలతుం జెప్పవే' యనిన నప్పురుషోత్తముండు భరితాదరుండై. 383

ప్రతిపదార్థం: అని; చెప్పినన్; ఆ+మానవ నాథుండు = ఆ నరేశ్వరుడు (ధర్మరాజు); ప్రముదిత మానసుండు+అగుచున్ = సంతోషించిన మనస్సు కలవాడవుతూ; మాధవుతోన్ = లక్ష్మీ వల్లభుడైన శ్రీకృష్ణుడితో; దుర్వాసుండు; శర్వ+అంశ సంభవుండు = ఈశ్వరాంశలో జన్మించినవాడు; అని; విందున్ = పెద్దలు చెప్పగా వింటున్నాను; శర్వుని మహిమన్ = పరమేశ్వరుడి ప్రభావం; వినన్+వలతున్ = వినవలెనని కోరుతున్నాను; చెప్పవు+ఏ? = ఎరిగించవా? వచింపవా?; అనినన్;

ఆ+పురుష+ఉత్తముండు = పురుషులలో శ్రేష్ఠుడైన శ్రీకృష్ణదేవుడు; భరిత+ఆదరుండు = పూర్ణమైన ఆదరం కలవాడై. (ఆదరము = గౌరవము).

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు చెప్పగా నరేశ్వరుడైన ధర్మజుడు మనస్సులో ఎంతో సంతసించి శ్రీకృష్ణుడితో 'దేవా! దుర్వాసుడు ఈశ్వరాంశలో జన్మించాడని పెద్దలు చెప్పగా వింటున్నాను. పరమశివుడి మహిమలను గూర్చి వినవలెనని కుతూహలపడుతున్నాను. సెలవీయవా' అని అడిగాడు. అందుకు శ్రీకృష్ణుడు ఎంతో ఆదరబుద్ధితో. (తరువాతి పద్యంతో అన్వయం).

కృష్ణుఁడు ధర్మజునకు శివుని మహిమ చెప్పుట. (సం.13-145-3).

ఆ. 'అడుగ వలయుదాని నడిగితి నీవు న । న్నధిప! నామనము ప్రియంబుఁ బొందె;
శివునిఁ దలఁచి మ్రొక్కి శివు దివ్యమహిమ సె । ప్పెద నితాంత విమల హృదయ కమల! 384

ప్రతిపదార్థం: అధిప = రాజా!; అడుగన్ వలయు దానిన్ = అడుగుటకు అర్హమైన విషయమునే; నీవు; నన్నున్; అడిగితి = అడిగావు; నా మనము = నా హృదయం; ప్రియంబున్+పొందెన్ = ప్రీతి వహించింది, సంతోషం చెందింది; నితాంత= మిక్కిలి; విమల= స్వచ్ఛమైన, హృదయ కమల= హృదయమనే పద్మం కలవాడా!; శివునిన్ = మహాదేవుడిని; తలఁచి = స్మరించి; మ్రొక్కి = నమస్కరించి; శివు దివ్యమహిమన్ = పరమేశ్వరుడి యొక్క అప్రాకృతమైన ప్రభావాన్ని; చెప్పెదన్ = తెలుపుతాను.

తాత్పర్యం: 'ధర్మజా! నీవు నన్ను అడుగదగిన విషయమే అడిగావు. ఇందుకు నా మన సెంతో ఆనందించింది. ఆ మహాదేవుడిని ధ్యానించి నమస్కరించి ఆయన దివ్యములైన మహిమలను తెలుపుతాను. నీవు మిక్కిలి పరిశుద్ధమైన అంతఃకరణం కలవాడివి సుమా!

వ. ఏకాగ్రచిత్తుండవై యాకర్ణింపు' మని ధర్మజున కిట్లనియె. 385

ప్రతిపదార్థం: ఏక+అగ్రచిత్తుండవు+ఐ = నిశ్చలమైన మనస్సుకలవాడవై; ఆకర్ణింపుము = వినుము; అని; ధర్మజునకున్; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: ధర్మజా! నిశ్చల బుద్ధితో నే చెప్పునది విను' మని శ్రీకృష్ణుడు ఆయనతో ఇట్లా అన్నాడు.

క. 'శతరుద్రీయము నే నరుఁ । డతిభక్తిని శివుని మనమునందు నిలిపి యం
చితముగఁ బఠించు సులభం । బతనికి సర్వంబు నిందు నందు నరేంద్రా!' 386

ప్రతిపదార్థం: నర+ఇంద్రా! = మనుజవల్లభా!; ఏ నరుఁడు = ఏ మనుజుడు; శతరుద్రీయమున్ = యజుర్వేదాంతర్గతమైన నమకం అనే మంత్రభాగాన్ని; అతిభక్తిని = మిక్కిలి భక్తితో; శివునిన్ = శంకరుడిని; మనము+అందున్ = హృదయంలో; నిలిపి = నిలుపుకొని, నెలకొల్పి; అంచితముగన్ = ఒప్పిదంగా, యోగ్యంగా; పఠించున్ = చదువునో; అతనికిన్ = ఆ శత రుద్రీయపఠితకు; ఇందున్ = ఈ లోకంలో; అందున్ = పరలోకంలో; సర్వంబున్ = సమస్తమూ; సులభంబు = తేలిక (తేలికగా లభిస్తుంది).

తాత్పర్యం: 'ధర్మజా! ఏ మానవుడు పరమభక్తితో పరమేశ్వరుడిని హృదయంలో నిలుపుకొని శతరుద్రీయాన్ని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

(నమకాన్ని) ఒప్పిదంగా పఠిస్తాడో ఆ మనుజుడికి ఇహలోకంలో, పరలోకంలో సమస్త సుఖాలు సులభంగా లభిస్తాయి.'

వ. అని వెండియు. 387

తాత్పర్యం: అని మళ్ళీ (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'అమరు మహాదేవుఁడను పేరు శివునకు; । నప్పరమునకు మీఁ దరయ లేదు
తత్కోపదృక్కీల ధర్మవిరుద్ధపు । జాతుల నెల్లను సమయఁ జేయు
దేవతల్ మునులు నతి ప్రయత్నంబునఁ । గావించు దక్షయాగమున శివుని
మఱచిన నయ్యజ్ఞ మఱవఱలై పోదె? । భగనేత్రనాశ మాదిగ ననేక

తే. భంగములు రావె? వారి కా ప్రభువు చేత; । శరణు వేఁడిన గావఁడే? కరుణ నట్టి
వారి; నీశు పెం పేమన వచ్చు! మఱియు । వినుము తద్దివ్యలీలలు మనుజనాథ! 388

ప్రతిపదార్థం: మనుజనాథ! = భూపతీ!; శివునకున్ = ఈశ్వరుడికి; మహాదేవుఁడు+అను = మహాదేవుడనే; పేరు = నామం; అమరున్ = ఒప్పుతుంది; తగి ఉన్నది; ఆ+పరమునకున్ = ఆ శ్రేష్ఠుడికంటె; మీఁదు = మించిన వస్తువు; అరయన్ = విచారించగా; లేదు = కలుగదు; తత్+కోపదృక్+కీల = ఆ రుద్రుడి యొక్క కోపపు చూపులనే నిప్పుమంట; ధర్మవిరుద్ధము+ జాతులన్+ఎల్లనున్ = ధర్మమునకు వ్యతిరేకమైన తెగలనన్నింటినీ, వేద విహితమైన ఆచారానికి వ్యతిరిక్తములైన అన్ని జాతులనూ; సమయన్+చేయున్ = నాశనం చేస్తుంది; దేవతల్; మునులు; అతిప్రయత్నంబునన్ = మిక్కిలిపూనికతో; కావించు = సలుపుతున్న; దక్షయాగమునన్ = దక్షప్రజాపతి యొక్క యజ్ఞంలో; శివునిన్ = శంకరుడిని; మఱచినన్ = విస్మరించగా, ఆహ్వానించనందున; ఆ+యజ్ఞము = ఆ క్రతువు, అధ్వరము; అఱవఱలు+ఐ+పోదు+ఎ? = భగ్నంకాలేదా? విధ్వంసమై పోయింది గదా!; వారికిన్ = దక్షయజ్ఞంలో పాల్గొన్న వారికి; ఆ ప్రభువుచేతన్ = ఆ జగత్పతి మూలాన; భగనేత్రనాశము = సూర్యుడి కన్ను పోవటం; ఆదిగన్ = మొదలుగా; అనేక భంగములు రావె? = పలువిధములైన అవమానాలు, భయాలు కలుగవా? కలిగినవని తాత్పర్యం; శరణు వేఁడినన్ = కాపాడుమని అర్థించగా; అట్టివారిన్ = అట్లా శరణు జొచ్చినవారిని; కరుణన్ = దయతో; కావఁడు+ఏ? = రక్షించలేదా? రక్షించాడని భావం; ఈశుపెంపు = పరమేశ్వరుని ప్రాభవం, ఆధిక్యం, గొప్పతనం; ఏమి+అనన్+వచ్చున్? = ఎంతని పొగడ గలం?; మఱియున్ = ఇంకను; తత్+దివ్యలీలలు = ఆ మహాదేవుడి యొక్క పరమాద్భుత చర్యలు; వినుము = ఆకర్ణించుము.

తాత్పర్యం: 'కుంతీనందనా! శివుడికి మహాదేవుడనే పేరు ఎంతో తగి ఉన్నది. ఆయనకు పై వాడెవ్వడూ లేడు. అత డనీశుడు. ఆ రుద్రుడి యొక్క కినుక గదిరిన చూపు మంటలతో వేద ధర్మానికి విరుద్ధ ప్రవర్తన గల జాతులన్నీ దగ్ధమయిపోతాయి. ఈశ్వర విరహితంగా దేవతలు, మునులు మిక్కిలి పూనికతో నిర్వర్తించే దక్షుడి యజ్ఞం ధ్వంసం కాలేదా? ఈశ్వరుడు ఆగ్రహించటంవలననే సూర్యుడికి కనులు పోవుట మున్నగు అనర్థాలు ఆ క్రతువులో పాల్గొన్నవారికి కలుగలేదా? ప్రభూ! మమ్ము రక్షించుమని శరణు వేడిన వారిని ఆయన కరుణతో కాపాడలేదా? అట్టి పరమేశ్వరుడి మహిమ వర్ణించటానికి శక్యం కాదు. ఆ మహా దేవుడి దివ్య లీలలు ఇంకా వినుము.

సీ. ప్రబలదైత్యులు పురత్రయనాయకులు జగ । త్త్రయము నప్రతిమ ప్రతాప లీల
బాధింప దివిజులు ఫాలలోచనుఁ గాంచి । 'కావుము కృప దేవదేవ! మమ్ముఁ
బశువుల మగు వారిఁ బశుపతి వైన నీ' । వనుచు మహాక్రోశ మాచరింప
నప్పురంబులు మూఁటి నస్త్ర మొక్కటన భ । స్మము గాఁగఁ జేసి యమ్మార్గణంబు

తే. నంకమున నిడ నది బాలుఁ డైన 'నీతఁ । డెవ్వఁ?' డని చూచి వెఱఁగంది యెల్లసురలు
వినుతిసేయ బ్రాహ్మణమూర్తి వెలుఁగు నతని । కిడియె దుర్వాసుఁ డనునామ మీశ్వరుండు. 389

ప్రతిపదార్థం: ప్రబలదైత్యులు = మిక్కిలి బలవంతులైన రక్కసులు; పురత్రయనాయకులు = ఇనుము, వెండి, బంగారం అనే లోహాలతో నిర్మించబడిన మూడు పట్టణాలకు అధిపతులు అయినట్టివారు; జగత్+త్రయమున్ = స్వర్గ మర్త్య పాతాళలోకాలను; అప్రతిమ = సాటిలేని; ప్రతాపలీలన్ = శౌర్యము యొక్క విలాసంతో; బాధింపన్ = పీడించగా; దివిజులు = దేవతలు; ఫాలలోచనున్ = నుదుట కన్ను గల శంకరుడిని; కాంచి = దర్శించి; దేవదేవ! = దేవతలకు అధీశ్వరుడవైన మహేశా!; పశువులము+అగు వారిన్+మమ్మున్ = పశువులుగా ఉన్నట్టి మమ్ములను; పశుపతివి+ఐన+నీవు = పశువులకు పాలకుడవుగా ఉన్న నీవు; కృపన్ = కారుణ్యంతో; కావుము = కాపాడుము; అనుచున్ = అని; మహా+ఆక్రోశము+ఆచరింపన్ = మిక్కిలి వాపోవగా; ఆ+పురంబులు మూఁటిన్ = ఆ త్రిపురాలను; అస్త్రము+ఒక్కటన = ఒక్కమంత్రపూతమైన సాయకంతో; భస్మము+ కాఁగన్+చేసి = బూడిద అగునట్లొనరించి; ఆ+మార్గణంబున్ = ఆ బాణమును; అంకమునన్+ఇడన్ = తన తొడమీద ఉంచుకొనగా; అది = ఆ శరము; బాలుఁడు+ఐనన్ = బాలుడు కాగా; ఈతఁడు+ఎవ్వఁడు+అని = ఈ పసివా డెవడని; చూచి = కనుగొని; వెఱఁగు+అంది = విస్మయపడి; ఎల్లసురలు = అమరులందరూ; వినుతి+చేయన్ = స్తుతించగా, పొగడగా; బ్రాహ్మణమూర్తిన్ = విప్రస్వరూపంతో; వెలుఁగు = ప్రకాశిస్తున్న; అతనికిన్ = ఆ బాలకుడికి; ఈశ్వరుండు = ఉమాపతి; దుర్వాసుఁడు+అనునామము = దుర్వాసుడనే పేరు; ఇడియెన్ = ఒసగినాడు.

తాత్పర్యం: మిక్కిలి బలవంతులైన త్రిపురాసురులు తమ సాటిలేని బలపరాక్రమాలతో ముల్లోకాలను బాధించసాగారు. అప్పుడు వేల్పులు ముక్కంటిని దర్శించి 'దేవాదిదేవా! మేము పశువులము. మమ్ము పాలించేవాడవు గనుక నీవు పశుపతివి. కనుక కరుణతో మమ్ము కాపాడు' మని బిగ్గరగా మొరపెట్టుకొన్నారు. అంతట మహేశుడు ఆ త్రిపురములను ఒక్క అస్త్రప్రయోగంతో భస్మం చేసి ఆ బాణాన్ని తన తొడపై నిడు కొన్నాడు. ఆ బాణం ఒక బాలుడు కాగా ఇత డెవ్వడని చూచి ఆశ్చర్యచకితులై వేల్పులు వినుతించారు. విప్రరూపంతో వెలుగొందే ఆ బాలుడికి అపుడు శివుడు దుర్వాసుడని నామకరణం చేశాడు.

తే. అతఁడు సూవె మాయింటికి నరుగుదెంచి । యంత సేసినాఁ' డనవుడు నచ్చెరువును
భక్తియును మదిఁ బిరిగొనఁ బాండు నగ్ర । సుతుఁడు నిభృతిమై దేవకిసుతునితోడ. 390

ప్రతిపదార్థం: అతఁడు+చూవె = ఆ దుర్వాసుడేసుమా; మా+ఇంటికిన్ = మా గృహానికి; అరుగుదెంచి = వచ్చి; అంత+ చేసినాఁడు = కొనియాడ తరముగాని మహాద్భుతములు సలిపాడు; అనవుడున్ = అని మాధవుడు పల్కగా; అచ్చెరువును = ఆశ్చర్యమూ; భక్తియును = భక్తియూ; మదిన్ = హృదయంలో; పిరిగొనన్ = అతిశయించగా; పాండు+అగ్రసుతుఁడు = పాండుమహారాజు పెద్దకొడుకు; నిభృతిమైన్ = అణకువతో, వినయంతో; దేవకిసుతుని తోడన్ = దేవకీదేవి నందనుడైన కేశవుడితో (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఆ దుర్వాసుడే మా గృహానికి వచ్చి అన్ని అద్భుత చేష్టితములు కావించాడు' అని వాసుదేవు డన్నాడు. ధర్మజుడు ఆశ్చర్య మొకవంక, భక్తి మరొకవంక తన మనసులో మల్లడి గొనగా వినయంతో దేవకీ తనయుడితో.

క. 'శివముఖ్యనామములు ప్ర । స్తవనకృతిన్ భోగమోక్షదము లగు నని విం
దు విమలబోధ! యెఱింగిం । పవె వాని నిరుక్తి' ననినఁ బరమప్రీతిన్. 391

ప్రతిపదార్థం: విమలబోధ! = నిర్మలమైన జ్ఞానం కలవాడా!; శివముఖ్యనామములు = శివుని యొక్క ప్రసిద్ధములైన పేళ్ళు; ప్రస్తవనకృతిన్ = స్తోత్ర మొనర్చుటచేత; భోగ మోక్షదములు+అగునని = సౌఖ్యమును, ముక్తిని ప్రసాదిస్తాయని; విందున్ = పెద్దలు చెప్పగా వింటున్నాను; వాని నిరుక్తిన్ = ఆ నామముల యొక్క అర్థాన్ని; ఎఱింగింపవు+ఎ? = తెలుపవా?; అనినన్ = అని యుధిష్ఠిరుడు వేడగా; పరమప్రీతిన్ = మిక్కిలి హర్షంతో (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: 'పరమేశ్వరుడి ప్రసిద్ధనామాలు స్తోత్రం చేస్తే ఇహపరసుఖాలు కలుగుతాయని విన్నాను. విమలవిజ్ఞాన స్వరూపుడవైన నీవు ఆ పరమశివుడి నామాలను అర్థసహితంగా నా కెరిగింపు' మని ధర్మజుడు వేడగా మిక్కిలి సంతోషించి.

వ. అతం డిట్లనియె. 392

తాత్పర్యం: నారాయణుడు ఈ విధంగా పలికాడు.

క. 'శివదేవు ముట్టఁ గొల్వఁగ । నవనీశ్వర! యతని పేళ్ళ యర్థ మెఱిఁగి సం
స్తవనకృతిఁ గూర్ప నాకై । న విధాతకు నైన నరిది నామదిఁ జూడన్. 393

ప్రతిపదార్థం: అవనీ+ఈశ్వర! = భూపాలా!; శివదేవున్ = భగవంతుడైన శివుడిని; ముట్టఁగొల్వఁగన్ = సంపూర్ణంగా సేవించటానికి; అతని పేళ్ళ+అర్థము = ఆ శివనామముల యొక్క అర్థం; ఎఱిఁగి = తెలిసి; సంస్తవన కృతిన్+కూర్పన్ = స్తోత్రకార్యం కావించటం; నామదిన్+చూడన్ = నామనసులో తలపోయగా; నాకున్+ఐనన్ = నాకు గాని; విధాతకున్+ఐనన్ = బ్రహ్మకుగాని; అరిది = అశక్యం.

తాత్పర్యం: 'ధర్మజా! పరమేశ్వరుడిని పరిపూర్ణంగా భజించటం, ఆయన నామాలకు అర్థ మెఱిగి స్తోత్రం సల్పటం పరికించగా నాకు గాని, బ్రహ్మకు గాని శక్యం కాదు.

వ. అయినను. 394

తాత్పర్యం: శక్యం కానప్పటికినీ.

క. నీవిట్లు నన్ను నడిగితి । గావున నా యెఱిఁగి నట్టి గతిఁ జెప్పెద న
ద్దేవాది దేవు వర నా । మావలి విను మచలమైన యవధానముతోన్. 395

ప్రతిపదార్థం: నీవు; ఇట్లు; నన్నున్; అడిగితి = చెప్పుమని అడిగావు; కావునన్; నా+ఎఱిఁగిన+అట్టి+గతిన్ = నేను తెలిసికొన్న విధంగా; ఆ దేవ+ఆదిదేవు = దేవతలకే మొదటి దేవుడైన శంభుడి యొక్క; వర = శ్రేష్ఠములైన; నామ+ఆవలిన్ = పేళ్ళ యొక్క సమూహమును; అచలము+ఐన = చలించనట్టి, స్థిరమైన; అవధానముతోన్ = ఏకాగ్రచిత్తంతో; వినుము = అలకించుము.

తాత్పర్యం: నరేశ్వరా! నీవు శంభుడి నామాలు, వాటి అర్థాలు తెల్పుమని నన్ను కోరితివి కనుక నా తెలిసినంతలో ఆ దేవదేవుడి యొక్క ఉత్తమనామావళి వినిపిస్తాను. స్థిరమైన చిత్తంతో శ్రద్ధగా ఆలకించుము.

ఆ. అగ్ని వాయు వాస వాదిత్య వసు మరు । దాదిదేవతా మయాత్ముఁ డైన
శివుని మహిమఁ బ్రీతిఁ జెప్పుట వినుట స । ర్వార్థసాధకంబు లగు నృపాల! 396

ప్రతిపదార్థం: అగ్ని = అగ్నిదేవుఁడు; వాయు = వాయుదేవుడు; వాసవ = దేవేంద్రుడు; ఆదిత్య = ద్వాదశాదిత్యులు; వసు = అష్టవసువులు; మరుత్ = సప్తమారుతములు; ఆది = మొదలుగాగల; దేవమయ+ఆత్ముఁడు+ఐన = దేవతాస్వరూపి అయిన; శివుని మహిమన్ = పరమేశ్వరుడి ప్రభావమును, విభూతులను; ప్రీతిన్ = సంతోషంతో; చెప్పుట = నుడువటం; వినుట = ఆకర్ణించటం; సర్వ+అర్థసాధకంబులు+అగున్ = సమస్తప్రయోజనాలను సమకూర్చునట్టివి కాగలవు.

తాత్పర్యం: ధర్మజా! అనలుడు, అనిలుడు, ఇంద్రుడు, ఆదిత్యులు, వసువులు, మరుత్తులు మున్నుగా గల సర్వదేవతా స్వరూపుడైన శివదేవుడి మాహాత్మ్యమును ప్రీతితో చెప్పుట గాని, వినుట గాని సకలాభీష్టములను సిద్ధింప జేస్తుంది.

కృష్ణుఁడు ధర్మజునకు శివనామ నిర్వచనంబు చెప్పుట. (సం.13-266-1 (కుంభ)).

క. వినుము నరేంద్ర! మహత్త్వం । బున నుండను నీశ్వరత్వమున నఖిల మహా
ముని జనములును మహేశ్వరుఁ । డని కొనియాడ హరుఁ డొప్పు నప్రతిముండై. 397

ప్రతిపదార్థం: నర+ఇంద్ర! = రాజా!; వినుము; మహత్త్వంబునన్ = గొప్పతనంతో; ఈశ్వరత్వమునన్ = ఐశ్వర్యంతో; ఉండను = ఉండటంచేత; అఖిల = సమస్తమైన; మహాముని జనములును = గొప్పమునీశ్వరులు; మహా+ఈశ్వరుఁడు+అని = మహేశ్వరు డంటూ; కొనియాడన్ = వినుతించగా, పొగడగా; అప్రతిముండు+ఐ = తన కెందును సాటిలేనివాడై; హరుఁడు = శివుడు; ఒప్పున్ = విలసిల్లుతున్నాడు.

తాత్పర్యం: రాజేంద్రా! వినుము. గొప్పతనంతో, ఐశ్వర్యంతో విరాజిల్లేవాడు కనుక సకల మునీంద్రులు ఆయనను మహేశ్వరుడని కొనియాడుతుండగా సాటిలేనివాడై సాంబశివుడు ప్రకాశిస్తున్నాడు.

సీ. ఉగ్రత్వమునఁ బ్రతాపోన్నతి రుద్రనా । మము దాల్చె; దేవసంఘమున కెల్ల
మహతినాఁ బొలుపారు మహనీయ దేవత । గావున విను మహాదేవుఁ డయ్యె;
నఖిలసత్కర్మ ఫలాకారశుభములు । సేయు వేడుక కల్మి శివుఁ డనంగఁ
జనియె; సుస్థిరతేజమున వెలుఁ గొందుట । నంచిత స్థాణు సమాఖ్యఁ బరఁగె;

తే. జంగమస్థావరాత్మక సకలభూత । రూపబహుత నొందుట బహురూపనామ
ధేయుఁడై యొప్పె; ధూమ్రపుఁజాయ జటల । వలన ధూర్జటి యనుపేర వఱలె హరుఁడు. 398

ప్రతిపదార్థం: విను = ధర్మజా! వినుము; హరుఁడు = శంభుడు; ఉగ్రత్వమునన్ = భయంకరత్వం చేతనూ; ప్రతాప+ఉన్నతిన్ = పరాక్రమౌన్నత్యం చేతనూ; రుద్రనామమున్+తాల్చెన్ = రుద్రుడను పేరు వహించాడు; దేవసంఘమునకున్+ఎల్లన్ =

దేవతాసమాజాని కంతటికీ; మహతినాన్ = మహతి అనేపేరుతో (దొడ్డవాడనగా); పొలుపు+ఆరు = ప్రకాశించే, ఒప్పారే; మహనీయ దేవతకావునన్ = గొప్ప వేల్పుగనుక; మహాదేవుఁడు+అయ్యెన్ = మహాదేవుడు అనే పేరు ధరించాడు; అఖిలసత్కర్మఫల+ఆకార = అన్ని మంచిపనులకు ఫలస్వరూపములైన; శుభములు = మంగళములు; చేయువేడుక కల్మిన్ = ఒనర్చునట్టి ఉబలాటం కలవాడు గనుక; శివుఁడు+అనఁగన్+చనియెన్ = శివుడనే పేరుతో ఒప్పుతున్నాడు; సుస్థిరతేజమునన్ = మిక్కిలి శాశ్వతమైన కాంతితో; వెలుఁగు+ఒందుటన్ = ప్రకాశిస్తూండటంచేత; అంచితస్థాణుసమాఖ్యన్ = ఒప్పిదమైన స్థాణుడనే నామధేయంతో; పరఁగెన్ = విలసిల్లినాడు; జంగమస్థావర+ఆత్మక = చరాచరాత్మకమైన, చేతనములు, అచేతనములు అనునట్టి; సకల భూత = సమస్త ప్రాణులయొక్క; రూపబహుతన్ = ఆకారబాహుళ్యమును, అనేక రూపాలను; ఒందుటన్ = పొందుటచే; బహురూపనామధేయుఁడు+ఐ = బహురూపుడు అనే పేరు గలిగిన వాడై; ఒప్పెన్ = విరాజితుడైనాడు; ధూమ్రపుఁజాయజటల వలనన్ (ధూమ్రము+చాయ = ధూమ్రపున్+చాయ = ధూమ్రపుఁజాయ) = నలుపుకలిసిన ఎరుపు వన్నె జడలు ధరించిన వాడగుట వలన; ధూర్జటి+అనుపేరన్ = ధూర్జటి అనే ఆహ్వాయంతో; వఱలెన్ = ఒప్పినాడు.

తాత్పర్యం: భీకరత్వం చేతను, పరాక్రమం చేతనూ హరునకు రుద్రుడనే పేరు వచ్చింది. దేవ సమాజమందు దొడ్డవేల్పు కనుక మహాదేవు డయినాడు. సమస్త సత్కర్మములకు ఫలరూపములైన శుభాలను ప్రసాదించే కుతూహలం కలవాడు కనుక శివుడనే పేరు ధరించాడు. సుస్థిర మైన కాంతితో దీపిస్తున్నాడు కనుక ఈయనకు స్థాణుడనే నామం ఏర్పడింది. కదిలేవి, కదలనివి అయిన సకలప్రాణుల యొక్క స్వరూపములు తాల్చుటచే బహురూపుడనే పేరుతో పెంపారుతున్నాడు. పొగవన్నె జటాజూటం ధరించిన వాడు గనుక ధూర్జటి అనే నామంతో విరాజిల్లుతున్నాడు.

ఆ. **వినుము విశ్వు లనఁగఁ జను దేవతలు దన। యంద పొడమి; రట్టు లగుట విశ్వ**
రూపనామకమున దీపితుం డయ్యె నా। త్రిపురమర్దనుండు నృపవరేణ్య! **399**

ప్రతిపదార్థం: నృపవరేణ్యా = రాజోత్తమా!; వినుము = ఆకర్ణించుము; ఆ త్రిపురమర్దనుండు = త్రిపురాసురులను సంహరించిన పరమేశ్వరుడు; విశ్వులు+అనఁగన్+చను = విశ్వులు అనే పేరుతో ఒప్పుతున్న; దేవతలు = వేల్పులు; తనయందున్+అ = తనయందే; పొడమిరి = జన్మించారు; అట్టులు+అగుటన్ = అందువలన; విశ్వరూప నామకమునన్ = విశ్వరూపుడు అనే నామధేయంతో; దీపితుండు+అయ్యెన్ = ప్రకాశించాడు.

తాత్పర్యం: త్రిపురాసురులను సంహరించిన ఆ గౌరీపతి యొక్క దేహం నుంచి విశ్వు లనే దేవతలు జన్మించారు కనుక ఆయన విశ్వరూపుడు అనే పేరుతో విలసిల్లుతున్నాడు.

సీ. **బహునేత్రములు మేనఁ బ్రజ్వరిల్లుట సర్వ। తశ్చక్షు రాహ్వయోదాత్త కీర్తిఁ**
బరఁగు; భూతము లెల్లఁ బశువులు దాఁ బతి। గావునఁ బశుపతి నా వెలుంగు;
వృషభస్థుఁడై యున్కి వృషవాహనుఁడు; మృత్యు। వనఁ జనుఁ బ్రాణ పాలాఖ్య సమత
నొంది; వహించు వేదోక్తాభిధానముల్। మఱియుఁ బెక్కులు; వాని మహిమ వేద

ఆ. **వేత్త లైనవారు వివరించి యన్యోన్య। బోధకత్వమునఁ బ్రభూత సౌఖ్యు**
లగుచు సంతతము శివారామతా నిరూ। ఢాత్ములై చరింతు రధిపముఖ్య! **400**

ప్రతిపదార్థం: అధిపముఖ్య! = రాజులలో ఉత్తముడా!; బహునేత్రములు = అనేక నయనాలు, పెక్కు కన్నులు; మేనన్ = శరీరమందు; ప్రజ్వరిల్లుటన్ = వెలుగొందటం చేత; సర్వతః+చక్షుః+ఆహ్వాయ+ఉదాత్తకీర్తిన్ = అంతటా కన్నులు గలవాడు అనే గొప్పయశస్సుతో; పరఁగున్ = ఒప్పుతున్నాడు; భూతములు+ఎల్లన్ = జీవులందరూ; పశువులు = జంతువులు, మృగాలు; తాన్ = అతడు; పతి+కావునన్ = ఆ జీవు లందరికి నాథుడు గనుక; పశుపతి నాన్ = పశుపతి అనే ఆహ్వాయంతో; వెలుంగున్ = ప్రకాశిస్తున్నాడు; వృషభస్థుఁడు+ఐ+ఉన్కిన్ = ఎద్దు మీద ఉండటం చేత; వృషవాహనుఁడు = నందివాహనుడు అని శంభునకు మరొక్క పేరు; మృత్యువు+అనన్+చనున్ = అతడు ప్రాణిదేహాలలో విషమస్థుడైనప్పుడు జీవులపాలిటికి మృత్యువు అని చెప్పదగి ఉన్నాడు; సమతన్+ఒంది = సమస్థితిని పొంది; ప్రాణపాల+ఆఖ్యన్+వహించున్ = ప్రాణపాలుడు (ప్రాణాలను కాపాడేవాడు) అనే నామం ధరిస్తున్నాడు. మఱియున్ = ఇంకనూ; వేద+ఉక్త+అభిధానముల్ = శ్రుతులందు చెప్పబడిన పేళ్ళు; పెక్కులు = అనేకములు ఆయనకు ఉన్నాయి; వాని మహిమన్ = ఆ నామముల యొక్క మాహాత్మ్యమును (ఆ చంద్రశేఖరుడి ప్రభావాన్ని); వేద వేత్తలు+ఐనవారు = వేదార్థము లెరింగినవారు; వివరించి = తేటపరచి; అన్యః+అన్య+బోధకత్వమునన్ = ఒకరి కొకరు ఉపదేశించుకొంటూ, తెలియ జెప్పుకొనుచూ; ప్రభూత సౌఖ్యులు+అగుచున్ = అధికమైన సుఖం కలవా రవుతూ, మిక్కిలి సుఖవంతు లవుతూ; సంతతము = ఎల్లప్పుడు; శివ+ఆరామతా+నిరూఢ+ఆత్ములు+ఐ = శివుడి యందు క్రీడించుటచే ఎన్నెకెక్కిన మనసు గలవా రవుతూ; చరింతురు = మెలగుతుంటారు, వర్తిస్తూ ఉంటారు.

తాత్పర్యం: ధర్మజా! అనేక నయనాలు తన దేహంలో కలిగి వెలుగొందటం చేత పరమేశ్వరుడికి 'సర్వతశ్చక్షువు' అనే నామధేయం ఏర్పడింది. జీవు లెల్లరూ పశువులు. తాను ఆ పశువులకు పాలకుడు. కనుక ఆయనకు పశుపతి అనే నామం కలిగింది. నందినెక్కి సంచరించటం చేత అతడు వృషభవాహనుడు అనే పేరు పొందాడు. జీవుల ప్రాణాలు హరించేవాడూ, వారి ప్రాణాలను కాపాడేవాడూ అతడే. ఆగమాలలో ఆ మహనీయుడికి అనేక నామాలున్నవి. వాటి మహిమ వేదవేత్తలైన మహానుభావులు వివరంగా పరస్పరం బోధించుకొంటూ, పరమానందభరితులవుతూ నిరంతరం శివుడియందే లగ్నమైన పావన మనస్సులతో సంచరిస్తూ ఉంటారు.

విశేషం: భగవద్భక్తు లెట్లా మనుగడ సాగిస్తారో శ్రీమద్భగవద్గీత వెల్లడిస్తుంది.

> "మచ్చిత్తా మద్గత ప్రాణా బోధయన్తః పరస్పరమ్,
> కథయన్తశ్చ మాం నిత్యం తుష్యన్తి చ రమన్తి చ." (భగ. 10-9)

నా భక్తులు నాయందే తమ మనసులను లగ్నం చేసి నన్ను వదలి బ్రతుకలేని వారై తాము అనుభవించిన నా కల్యాణగుణాలను, నా అవతార దివ్య చేష్టితాలను నిత్యం ఒకరి కొకరు బోధించుకొంటూ ఆనందిస్తుంటారు- అని.

క. ఈ నామనిర్వచనములు । మానవుఁడు పఠించినను సమాహితమతియై
వీనుల నించిన సౌఖ్యము । నానందము నిందు నందు నతనికిఁ గల్గున్.' 401

ప్రతిపదార్థం: ఈ నామనిర్వచనములు = ఈ శివనామముల యొక్క అర్థవివరణాలు; మానవుఁడు = నరుఁడు; పఠించినను = చదివినా; సమాహితమతి+ఐ = ఏకాగ్రచిత్తుడై, నిశ్చలమైన మనస్సు గలవాడై; వీనులన్ = చెవులలో; నించినన్ = నిండించినా, ప్రవేశింపజేసినా; సౌఖ్యమున్ = సుఖమునూ; ఆనందమున్ = సంతోషమునూ; ఇందున్ = ఈ లోకంలో; అందున్ = పరలోకంలో అనగా ఇక్కడా అక్కడా; అతనికిన్ = ఆ నరుడికి; కల్గున్ = లభిస్తుంది.

తాత్పర్యం: అర్థమననంతో పరమేశ్వరుడి నామాలు పఠించినా, ఏకాగ్రచిత్తంతో ఆకర్ణించినా ఆ మానవుడికి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇహపరలోకాలలో సుఖం, సంతోషం సమకూరుతాయి.

వ. అని చెప్పి మఱియును. 402

తాత్పర్యం: అని పలికి మరల (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'వ్యాసమహామునిలోక హి। తాసక్తిని శివుని విషయమై పఠ్యముగాఁ
జేసె నుపస్థాన మొకటి। యా సమధిక పుణ్యవాక్చయము విను మధిపా! 403

ప్రతిపదార్థం: అధిపా! = రాజా!; వ్యాస మహాముని = శ్రీ వేద వ్యాసమహర్షి; లోకహిత+ఆసక్తిని = జగములకు మేలు చేయవలెనన్న అభిలాషతో; శివుని విషయము+ఐ = ఈశ్వరుడికి సంబంధించి; పఠ్యముగాన్ = పఠించ దగినదిగా; ఉపస్థానము +ఒకటి+చేసెన్ = దరిజేర్చుస్తోత్ర మొకటి కావించాడు; ఆ సమధిక పుణ్యావాక్చయము = ఆ గొప్ప పవిత్ర వాక్కుల సముదాయం; వినుము = ఆలకించుము.

తాత్పర్యం: శ్రీ వేద వ్యాస మహర్షి లోకానికి మేలు గావించవలె నన్న ఆకాంక్షతో పరమ శివునకు సంబంధించి పఠించ దగిన ఒక గొప్ప స్తోత్రం రచించాడు. మిక్కిలి గొప్పవైన ఆ పవిత్ర వచనాలు వినిపిస్తాను. శ్రద్ధగా వినుము.

సీ. సర్వజగన్నిత్యసాక్షి లోకైక శు। భావహమూర్తి నిరామయుండు
ప్రథమ భూతములకుఁ బ్రథమతమంబు ను। దాత్తంబు నయిన భూతంబు శివుఁడు;
దన ముఖంబున నగ్ని జనియించెఁ, దను సభ। క్తిక సమారాధన కృతుల నియతిఁ
బాటించువారికి భవమోక్షణంబు గా। వించు, వేడుక మది నించువాఁడు

తే. వితత చతురాత్మకత్వ విశ్రుతి వహించి। కరుణఁ దత్తత్పదస్థిరా కలన కల్యు
లగు సపర్యారతులకు నయ్యై విధంబు। నీడ్య పదవుల నొసఁగు మహేశ్వరుండు. 404

ప్రతిపదార్థం: సర్వజగత్+నిత్య+సాక్షి = సకల లోకాలకు శాశ్వతుడైన సాక్షియు; లోక+ఏక+శుభ+ఆవహ మూర్తి = జగములకు ముఖ్యంగా శుభాలు కలిగించే స్వరూపం కలవాడూ; నిర్+ఆమయుండు (నిరామయుండు) = రోగ విహీనుడూ; ప్రథమభూతములకున్ = పృథివి, జలం, తేజస్సు, వాయువు, ఆకాశం అనే తొట్టతొలుతటి భూతములకు; ప్రథమ తమంబు = మొట్టమొదటిదీ; ఉదాత్తంబు+అయిన = దొడ్డదయిన; భూతంబు = ప్రాణి; శివుఁడు = పరమేశ్వరుడే; తన ముఖంబునన్ = తన యొక్క వదనమునందు; అగ్ని = అనలం; జనియించెన్ = పుట్టింది; తనున్ = గౌరీ వల్లభుడిని; సభక్తిక సమారాధన కృతులన్ = భక్తితో గూడిన పూజాకార్యములను; నియతిన్ = నియమంతో; పాటించువారికిన్ = కావించేవారికి; భవమోక్షణంబు = సంసారంనుండి విముక్తి, జన్మరాహిత్యము; కావించు వేడుకన్ = కలిగించే కుతూహలం; మదిన్ = మనస్సులో; నించువాఁడు = నిండించుకొనేవాడు అతడే; వితత = ఎక్కుడైన; చతుః+ఆత్మకత్వ+విశ్రుతిన్+వహించి = సదాశివాదికమైన నాలుగు స్వరూపాలతో ప్రఖ్యాతిగాంచి; మహేశ్వరుండు = భర్గుడు; కరుణన్ = దయతో; తత్+తత్+పద+ స్థిర+ఆకలన కల్యులు+అగు = ఆయాస్థానాలలో సుస్థిరముగనున్న శుభమూర్తులైన; సపర్యారతులకున్ = తన పూజలందు ఆసక్తి గలవారికి; అయ్యైవిధంబు = ఆయావిధాలైన; ఈడ్యపదవులన్ = పొగడదగిన అధికార స్థానాలను; ఒసఁగున్ = ఇస్తాడు.

తాత్పర్యం: సకల జగత్తులకు నిత్యసాక్షిగా ఉన్నవాడు, సర్వలోకాలకు శుభాలు కలిగించే స్వరూపం కలవాడూ, రోగ రహితుడు, ప్రథమభూతము లని చెప్పబడే భూమి మొదలైన పంచ మహాభూతాలకంటె ముందున్న దొడ్డ భూతం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీకంఠుడు. తనను నియమం వీడక భక్తితో ఆరాధించే వారికి సంసారవిముక్తి కలిగించవలెననే అభిలాష తన మనసులో నింపుకొని ఉంటాడు నీలగళుడు. సదాశివాది రూప చతుష్టయంతో విఖ్యాతుడైన ఆ మహేశ్వరుడు తనను పూజించటంలో ఆసక్తి గల సుస్థిరపదస్థులైన మంగళమూర్తులకు ఆయావిధాలైన కొనియాడదగిన ఉన్నత పదవులు అనుగ్రహిస్తాడు.

తే. ఈ యుపస్థాన మచలిత హృదయవృత్తి । నరుఁడు శివలింగ సన్నిధానమున వాఙ్ని
రూఢముగఁ జేసి యాయురారోగ్యసకల । కామ్యవైభవైశ్వర్యముల్ గలిగి నెగడు.' 405

ప్రతిపదార్థం: ఈ+ఉపస్థానము = ఈ దరిజేర్చుస్తోత్రమును; అచలిత హృదయవృత్తిన్ = చలించని మనఃప్రవృత్తితో; నరుఁడు = మనుజుడు; శివలింగ సన్నిధానమునన్ = శివలింగము యొక్క సమక్షంలో; వాక్+నిరూఢముగన్+చేసి = వాక్ప్రసిద్ధముగ పఠించి; ఆయుః+ఆరోగ్య = ఆయుస్సు, ఆరోగ్యం; కామ్య = కోరదగిన; వైభవ+ఐశ్వర్యముల్ = గొప్పతనమూ, సంపద; కలిగి = పొంది; నెగడున్ = వర్ధిల్లగలడు.

తాత్పర్యం: ఈ స్తోత్రమును చలించని మనస్సుతో ఏ మానవుడు శివలింగ సన్నిధిలో వాగ్విధేయ మొనర్చునో ఆతడు ఆయుష్యం, ఆరోగ్యం, ప్రాభవం, సంపద కలిగి వర్ధిల్లగలడు.'

భీష్ముఁడు ధర్మజునకు ధర్మసూక్ష్మ ప్రకారంబు చెప్పుట. (సం.13-147-10).

వ. అనిన విని యత్యంత సంతోషంబు నొంది కుంతీతనయాగ్రజుండు శాంతనవుతో 'ధర్మంబులు బహుప్రకారంబులు గలవు; పరమానుష్ఠేయంబగు ప్రకారం బెయ్యది? దాని నెఱింగింపవే' యనుటయు నజ్జనపతికి జాహ్నవీనందనుం డిట్లనియె. 406

ప్రతిపదార్థం: అనినన్; విని; అత్యంత సంతోషంబున్+ఒంది = మిక్కిలి హర్షమును పొంది; కుంతీతనయ+అగ్రజుండు = కుంతీదేవి కుమారులలో తొలుతపుట్టిన వాడైన ధర్మరాజు; శాంతనవుతోన్ = శంతనుమహారాజు కుమారుడైన భీష్ముడితో; ధర్మంబులు; బహుప్రకారంబులు = పలువిధాలు; కలవు; పరమ+అనుష్ఠేయంబు+అగు = ముఖ్యంగా ఆచరించదగిన; ప్రకారంబు = విధం; ఏ+అది(ఎయ్యది)? = ఏది?; దానిన్; ఎఱింగింపవు+ఏ? = తెలుపవా?; అనుటయున్ = అని అడుగగా; ఆ+జనపతికిన్ = ఆ నరనాథునకు-ధర్మజునకు; జాహ్నవీనందనుండు = జహ్నుమహర్షి కూతురైన గంగాదేవి యొక్క కొడుకు (భీష్ముడు); ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని కృష్ణుడు చెప్పగా మిక్కిలి సంతసించి ధర్మజుడు భీష్ముడితో 'ధర్మాలు పలువిధాలుగా ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా అనుష్ఠించదగిన ధర్మ మేదో తెల్పు' మని అడుగగా గంగానందనుడు ఆ నరపతితో ఇట్లా అన్నాడు.

ఆ. ధర్మములకు సంజ్ఞ తద్వేదులగు మహా । త్ములు తగంగఁ జెప్పుదురు నరేంద్ర!
వినుము కాలపాకమున నది యన్యథా । త్వంబు గలిగి యవిశదత్వ మొందు. 407

ప్రతిపదార్థం: నర+ఇంద్ర! = రాజా!; ధర్మములకున్ = ధర్మాలకు; సంజ్ఞ = గురుతు; తత్+వేదులు+అగు = ఆ ధర్మం తెలిసిన వారైన; మహా+ఆత్ములు = మహనీయులు; తగంగన్ = యుక్తంగా, ఒప్పిదంగా; చెప్పుదురు = వచిస్తారు; వినుము = ఆలకించుము; కాలపాకమునన్ = కాలం యొక్క మార్పుచేత, కాలం గడువగా గడువగా; అది = ఆ ధర్మం;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అన్యథాత్వంబు+కలిగి = వేరొక తీరును పొంది; అవిశదత్వము+ఒందున్ = అస్పష్టతను చెందుతుంది.

తాత్పర్యం: 'ధర్మజా! ధర్మం ఇట్లాంటి దని ఆ ధర్మస్వరూపం తెలిసిన మహనీయులు మాత్రమే యుక్తంగా చెప్పగలరు. కాల పరిణామం వలన ధర్మం అందుకు భిన్నంగా గోచరిస్తుంది. స్పష్టతను కోల్పోయి మరుగున పడుతుంది.

వ. ఎ ట్లంటేని. 408

తాత్పర్యం: అదెట్లంటివా.

క. అనఘ! యధర్మము ధర్మం । బను మతిఁ బుట్టించుఁ దృణ సమావృతమై ప్ర
న్నని తలము చందమునఁ దోఁ । చిన నూయింబోలె సూక్ష్మచిత్తత లేమిన్. 409

ప్రతిపదార్థం: అనఘ! = పాపరహితుడా!; సూక్ష్మచిత్తత లేమిన్ = పరిశీలనాత్మకమైన సూక్ష్మబుద్ధి లేనందువలన; తృణసమావృతము+ఐ = గడ్డితో కప్పబడినదై; ప్రన్నని తలము చందమునన్ = మిట్టపల్లాలు లేని చక్కని సమప్రదేశంగా; తోఁచిన = స్ఫురించిన; నూయిన్+పోలెన్ = బావివలె, కూపం మాదిరిగా; అధర్మము = అన్యాయం; ధర్మంబు+అనుమతిన్ = న్యాయం అనే తలంపును; పుట్టించున్ = కలిగిస్తుంది.

తాత్పర్యం: పుణ్యపురుషా! పరిశీలనాత్మకమైన సూక్ష్మబుద్ధి లేనందున గడ్డితో కప్పబడిన బావి మిట్టపల్లాలు లేని చక్కని సమప్రదేశంగా తోచేటట్లు ఒక్కొకప్పుడు అధర్మం ధర్మమనే తలంపును కలిగిస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

క. తప్పక కాన్పఁగ లేమిం । జెప్పెడు వారలును దద్విశేషము దప్పం
జెప్పఁగ ధర్మంబు తెరువు । దప్పు నది క్రియాపరులకు దైన్యము దెచ్చున్. 410

ప్రతిపదార్థం: తప్పక = మానక; కాన్పన్+కన్+లేమిన్ = ఇది ధర్మం, ఇది అధర్మం అని చూపలేక పోవటంవలన, గోచరించక పోవటం వలన; చెప్పెడు వారలును = ధర్మం బోధించేవారు కూడ; తత్+విశేషము = ఆ ధర్మం యొక్క ఘనత, ప్రత్యేకత, విలక్షణత్వం; తప్పన్ = తొలగేటట్లు; చెప్పన్+కన్ = తెలుపగా; ధర్మంబుతెరువు = ధర్మము యొక్క పద్ధతి; తప్పున్ = తప్పిపోతుంది; అది = ధర్మసూక్ష్మ మెరుంగని వారి బోధ; క్రియాపరులకున్ = కార్యాలు సల్పేవారికి; దైన్యమున్ = దుఃఖాన్ని; తెచ్చున్ = కలిగిస్తుంది.

తాత్పర్యం: ఇది ధర్మం ఇది అధర్మం అని సరిగా చూపలేక పోవటం వలన, ధర్మబోధ చేసేవారు ఆ ధర్మం యొక్క విలక్షణత్వం తొలగేటట్లు తెలపటం చేత ధర్మం దారితప్పుతుంది. ధర్మసూక్ష్మ మెరుంగని వారి బోధ విని కార్యాచరణకు పూనుకొనే వారికి కడకు దుఃఖమే సంభవిస్తుంది.

వ. కావున ధర్మంబు సూక్ష్మ ప్రకారంబు. 411

తాత్పర్యం: కనుక ధర్మం మిక్కిలి సూక్ష్మమైనది.

క. శ్రుతముఁ బరిత్యాగముఁ గల । మతిమంతుల నడుగు లోభమదమోహసమా
వృత బుద్ధులు గాని సమం । చిత చరితులవలనఁ దెలియు శీలనిరూఢా! 412

ప్రతిపదార్థం: శీలనిరూఢా! = సత్ప్రవర్తనచేత ప్రసిద్ధిగాంచిన ధర్మజా!; శ్రుతమున్ = పెద్దలవలన శాస్త్రముల వినికిడియూ; పరిత్యాగమున్ = వితరణమూ, ఈవీ; కల = కలిగినట్టి; మతిమంతులన్ = బుద్ధిమంతులను; అడుగు = ధర్మ మనగా ఎట్టిదో ప్రశ్నించుము; లోభ = దురాశ, పిసినిగొట్టుతనమూ; మద = గర్వమూ; మోహ = అజ్ఞానమూ, ధర్మ సమ్మూఢత్వమూ అనువానిచే; సమావృతబుద్ధులు = ఆవరించబడిన చిత్తం కలవారు; కాని = కానట్టి; సమంచితచరితుల వలనన్ = పూజించదగిన నడవడిగల మహనీయులవలన; తెలియు = గ్రహించుము.

తాత్పర్యం: మంచి స్వభావం గల ధర్మపుత్రా! పెద్దలవల్ల శాస్త్రముల వినికిడి, వితరణగుణము గల్గిన బుద్ధిమంతుల నడిగి ధర్మస్వరూప మెట్టిదో తెలిసికొమ్ము. దురాశ, దుర్గర్వం, మోహం అనే దుర్గుణాలతో ఆవరించబడిన మనసులుగల వారివలన కాకుండా పవిత్రచరిత్రుల వలననే ధర్మం ఎరుగవలసినది.

క. కామార్థంబులు మోహో । ద్దామత కృత్యంబు లని యెదం గని ధర్మ
స్తోమమునఁ దగులు జనముల । చే మేలుగ నెఱిఁగి కొనుము సిద్ధవివేకా! 413

ప్రతిపదార్థం: సిద్ధవివేకా! = ప్రసిద్ధమైన జ్ఞానం కలవాడా!; కామ+అర్థంబులు = పురుషార్థములలో కామం, అర్థం అనేవి; మోహ+ఉద్దామత+కృత్యంబులు+అని = అజ్ఞానం యొక్క స్వతంత్రకార్యాలని; ఎదన్ = హృదయంలో; కని = ఎరిగి; ధర్మస్తోమమునన్ = ధర్మముల యొక్క సమూహమందు; తగులు = సక్తులైన; జనములచేన్ = జనులచేత; మేలుగన్ = హితవుగా; ఎఱిఁగికొనుము = తెలిసికొమ్ము!

తాత్పర్యం: ప్రశస్తమైన జ్ఞానం గల ధర్మజా! కామము, అర్థమూ అనేవి మోహాతిరేకం వలన జరిగే కార్యాలని మదిలో నెరిగి, ధర్మమం దాసక్తిగల జనుల వలన హితవుగా ధర్మస్వరూపం గ్రహించుము.

తే. అనఘ! యంచిత స్వాధ్యాయమునను యజ్ఞ । మున సమాచారమున నిష్ఠ పొనుఁగుపడక
యుండు నెవ్వారలకు వార లోపి నడపు । నదియ కనుము ధర్మము సూక్ష్మపదము గాఁగ.' 414

ప్రతిపదార్థం: అనఘ! = పుణ్యుడా!; అంచిత = ఒప్పిదమైన; స్వాధ్యాయమునను = వేదాధ్యయనమునందునూ; యజ్ఞమునన్ = యజ్ఞము లొనర్చుట యందును; సమాచారమునన్ = అనుష్ఠానమునందును, ప్రవర్తన అందునూ; నిష్ఠ = శ్రద్ధ, నమ్మిక, నిలుకడ; ఏ+వారలకున్ = ఎవ్వరికి; పొనుఁగు+పడక+ఉండున్ = క్షీణించక, మరుగుపడక ఉంటుందో; వారలు = అట్టివారు; ఓపి = నేర్పుతో, సమర్థులై; నడపు+అదియ = సాగించునట్టిదే; ధర్మము సూక్ష్మపదముగాఁగన్ = ధర్మము యొక్క సూక్ష్మంగా; కనుము = తెలియుము.

తాత్పర్యం: దోషరహితుడా! వేదాధ్యయనంలోనూ, యజ్ఞాలను నిర్వహించటంలోనూ, ఆచారంలోనూ శ్రద్ధ ఎవరికి నశించకుండా ఉంటుందో అట్టివారి ఆచరణ ధర్మ సూక్ష్మ మెరిగి చేసేదిగా గ్రహించుము.'

క. అన విని యుధిష్ఠిరుఁడు 'నా । మన మిప్పుడు మీరు సెప్పుమాటల సందే
హ నిరూఢ మయ్యె ధర్మము । గనుఁ గొన వలయుటకు బహుముఖత్వము కల్మిన్. 415

ప్రతిపదార్థం: అనన్; విని; యుధిష్ఠిరుఁడు = ధర్మజుడు; ధర్మము = ధర్మమును; కనుఁగొనవలయుటకున్ = తెలిసికొనటానికి; బహుముఖత్వము కల్మిన్ = అనేక మార్గాలుండటం చేత; నామనము = నా హృదయం; ఇప్పుడు, మీరు; చెప్పుమాటలన్ = పలికే వాక్యాలచేత, నుడివే నుడుగులచేత; సందేహ+నిరూఢము+అయ్యెన్ = సంశయాన్ని మొలకెత్తిస్తున్నది.

తాత్పర్యం: అని భీష్ముడు చెప్పగా ధర్మరాజు 'పితామహా! మీరు చెప్పే మాటలచేత ధర్మాన్ని తెలిసికొనటానికి మార్గా లనేకం ఉండటం చేత నామనస్సులో ధర్మవిషయమై సందేహపరంపరలు ఉదయిస్తున్నాయి.

క. పారంబు లేని ధర్మా । చారంబున మునుఁగు మాదృశ క్షుద్రులకుం
దీరం బిట్టిది యని తెలి । వార భవాదృశుల తగుదు రర్మిలిఁ జెప్పన్. 416

ప్రతిపదార్థం: పారంబు లేని = ఒడ్డులేని, దరిలేని; ధర్మ+ఆచారంబునన్ = ధర్మానుష్ఠానంలో; మునుఁగు = నిమగ్నులమైన; మాదృశ క్షుద్రులకున్ = మావంటి అల్పులకు; తీరంబు = గట్టు; ఇట్టిది+అని = ఇది అని; తెలివి+ఆరన్ = జ్ఞానముదయించేటట్లు; అర్మిలిన్ = ప్రేమతో, ప్రీతితో; చెప్పన్ = తెలపటానికి; భవాదృశులు+అ = తమవంటివారే; తగుదురు = యోగ్యులు.

తాత్పర్యం: దరిలేని ధర్మానుష్ఠాన సముద్రంలో మునిగి దరి గానక అల్లాడుతున్న మావంటి అల్పులకు ఈ ధర్మసాగరానికి తీర మిది యని సంతోషంతో తెలియ జెప్పడానికి మీవంటి మహాత్ములే తగిఉన్నారు.

తే. ఆగమోక్త విధంబుఁ బ్రత్యక్షమును స । మాచరణముఁ బృథగ్విధ వ్యాకులములు
ధర్మసూక్ష్మత యి మ్మూటఁ దథ్య మిట్టి । దనఁగ రాని యట్లున్నది యనఘచరిత! 417

ప్రతిపదార్థం: అనఘచరిత! = పుణ్యవర్తనుడవైన పితామహా!; ఆగమ+ఉక్త విధంబున్ = వేదమునందు చెప్పబడిన విధమును; ప్రత్యక్షమును = కంటికి కనిపిస్తున్నది, ఎదుటనున్నది, లోకానుభవం; ఆచరణమున్ = పెద్దలనుంచి పరంపరగా వస్తున్నవాడుక; పృథక్+విధ+వ్యాకులములు = వేర్వేరు తీరులతో కలగుండు పడుతున్నవి; ధర్మసూక్ష్మత = ధర్మస్వరూపం; ఈ+మూటన్ = ఆగమోక్తవిధం, ప్రత్యక్షం, ఆచరణం అనే మూటిలో; ఇట్టిది = ఇటువంటిది; తథ్యము = వాస్తవం, సత్యం; అనఁగన్+ రాని+అట్లు+ఉన్నది = అని చెప్పటానికి శక్యం కాకుండా ఉన్నది.

తాత్పర్యం: తాతా! ఆగమోక్తవిధం, ప్రత్యక్షం, ఆచరణ - అని ధర్మం భిన్న భిన్న రీతులతో కలగుండు పడుతున్నది. ఈ మూటిలో ధర్మసూక్ష్మత ఇద మిత్థ మని చెప్పటానికి వీలుకాకుండా ఉన్నది. పుణ్యవర్తనుడవైన నీవు ధర్మసూక్ష్మ మంటే ఎటువంటిదో నాకు తెలుప వలసినది-

వ. అనిన నాపగేయుండు కౌంతేయాగ్రజుతో ని ట్లనియె. 418

ప్రతిపదార్థం: అనినన్; ఆపగేయుండు = నదీనందనుడు-భీష్ముడు; కౌంతేయ+అగ్రజుతోన్= కుంతి కుమారులలో జ్యేష్ఠుడైన ధర్మజుడితో; ఇట్లు+అనియెన్ = ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ధర్మజుడి పలుకులు విని మందాకినీనందనుడైన భీష్ముడు కుంతీజ్యేష్ఠనందనుడైన ధర్మజుడితో ఈ ప్రకారం చెప్పాడు.

క. 'ఇవి మూఁడు దెఱంగులు ధ । ర్మువు సూక్ష్మత నిశ్చయింప ముఖ్యపదంబుల్
దివిరికొని యివియ చూచుట । యవనీశ్వర! పూర్వమునులయందుఁ గలుగుటన్. 419

ప్రతిపదార్థం: అవనీ+ఈశ్వర! = భూనాథా!; ధర్మువు సూక్ష్మతన్ = ధర్మము యొక్క సూక్ష్మతను; నిశ్చయింపన్ = నిర్ణయించటానికి; తివిరికొని = పూనుకొని; ఇవియ = ఆగమోక్త విధానం, ప్రత్యక్షం, ఆచరణం అనే వాటినే; చూచుటన్ = దర్శించటం వలననూ; పూర్వమునుల అందున్ = మునుపటి మునీశ్వరుల అందునూ; కలుగుటన్ = ఈ పద్ధతుల అనుసరణం ఉండటం వలననూ; ఇవి మూఁడు తెఱంగులున్ = ఈ మూఁడు విధానాలే; ముఖ్యపదంబుల్ = ధర్మసూక్ష్మ నిర్ణయానికి ప్రధానమైన గుర్తులు.

తాత్పర్యం: 'ధర్మపుత్రా! ధర్మసూక్ష్మ నిర్ణయానికి ఆగమోక్తవిధం, ప్రత్యక్షం, సమాచరణం అనే ఈ మూడు విధానాలే తప్ప మరోదారి ఏదీ లేదు. పూర్వమునీంద్రులు సైతం ధర్మసూక్ష్మ నిర్ణయానికి ఆధారంగా వీటినే గై కొన్నారు.

క. అనుమానింపకు మంధుం । డును నిశ్శంకాత్ముఁడును జడుండును బోలన్
జననాథ! యేను బల్కెద । విని దృఢముగ నూఁదు మింక వేయును నేలా? 420

ప్రతిపదార్థం: జననాథ! = నరవరా!; ఏను పల్కెదన్ = నేను చెప్పుతాను; అంధుండును = గ్రుడ్డివాడును; నిస్+శంకా+ఆత్ముండును = పరమసంశయాత్ముడును; జడుండును = మందబుద్ధిగలవాడు, మూఢుడును; పోలన్ = వీరికి సరిపోలేటట్లు; అనుమానింపకుము = సందేహించవద్దు; విని = నా పలుకు లాలించి; దృఢముగన్ = గట్టిగా; ఊఁదుము = ప్రమాణంగా స్వీకరించుము, అవలంబించు; ఇంకన్ = ఇక; వేయును+ఏలా? = పలుమాట లెందుకు?

తాత్పర్యం: రాజా! గ్రుడ్డివాడు, సంశయాత్ముడు, మూఢుడు- వీరి వలె నీవు సందేహించవద్దు. ఈ ధర్మజిజ్ఞాస మాని నేను చెప్పేమాటలు విని, నా మాటలనే ప్రమాణాలుగా స్వీకరించి, వాటినే గట్టిగా అనుసరించుము. ఇక పలుమాటలతో నీకు పని లేదు సుమా!

క. విమలాత్మ! యహింసయు దా । నము సత్యముఁ గ్రోధవర్జనంబును విను ము
త్తమ ధర్మరాశి యిది ధ । ర్మమునకుఁ బరసీమ దీని మరుపుము మదికిన్. 421

ప్రతిపదార్థం: విమల+ఆత్మ! = ఓ నిర్మలచిత్తుడా!; వినుము = ఆలకించుము; అహింసయున్ = ప్రాణులను బాధించకుండటం; దానము = దానం చేయటం; సత్యమున్ = నిజం పలకటం; క్రోధవర్జనంబును = కోపం వదలటం; ఉత్తమ ధర్మరాశి = మేలైన ధర్మముల యొక్క ప్రోగు; ఇది = ఈ అహింసాదిక సద్గుణ సముదాయం; ధర్మమునకున్ = ధర్మానికి; పరసీమ = తుదిహద్దు; మదికిన్ = నీ మనస్సునకు; దీనిన్ = ఈ గుణరాశిని; మరుపుము = మరుగునట్లు చేయుము; అలవడేటట్లు చేయుము, వశపరచుము.

తాత్పర్యం: పరిశుద్ధమైన మనస్సుగల యుధిష్ఠిరా! అహింస, దానం, సత్యం, కోపరాహిత్యం అనేవి ఉత్తమ ధర్మాలు. ఈ గుణాలు ధర్మానికి పరమావధులు. కనుక నీ మనసు ఈ గుణాలను అనుసరించేటట్లు చేయవలసింది.

తే. బ్రాహ్మణారాధనమునఁ దత్పరుఁడ వగుము; । దక్కు మొండు విచారముల్ ధర్మపుత్త్ర!'
యనిన మానస మానంద మంద నాతఁ । డతని కతిభక్తి వందనం బాచరించి. 422

ప్రతిపదార్థం: ధర్మపుత్త్ర! = యముడి కుమారుడా! బ్రాహ్మణ+ఆరాధనమునన్ = విప్రులను పూజించటంలో; తత్పరుఁడవు+అగుము = ఆసక్తి కలవాడవు కమ్ము; ఒండు విచారముల్ = ఇతరచింతలు, ఆలోచనలు; తక్కుము = విడువుము, మానుము; అనినన్ = అని దేవవ్రతుడు (భీష్ముడు) చెప్పగా; అతఁడు = యుధిష్ఠిరుడు; మానసము = హృదయం; ఆనందము+అందన్ = సంతసం పొందగా; అతనికిన్ = భీష్ముడికి; అతి భక్తిన్ = మిక్కిలి భక్తితో; వందనంబు = నమస్కారం; ఆచరించి = చేసి. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: ధర్మపుత్త్రా! విప్రులను ఆరాధించటంలో ఆసక్తి వహించుము. అన్యచింతలు వదలిపెట్టుము'- అని భీష్ముడు పలికాడు. ధర్మజుడు మనసులో సంతోషించి ఆయనకు మిక్కిలి భక్తితో నమస్కరించాడు.

వ. 'ఎవ్వరు ధర్మంబునెడ నసూయ సేయుదు? రెవ్వరు దాని నుపాసింతు? రెఱింగింపుము. వారి వారి పొందుగతులును విన వలతుం జెప్పు' మనిన నప్పౌరవోత్తమునకు న ప్పురుషసత్తముం డిట్లనియె. 423

ప్రతిపదార్థం: ఎవ్వరు = ఏ మనుజులు; ధర్మంబు+ఎడన్ = ధర్మం పట్ల; అసూయ+చేయుదురు = దోషారోపణం చేస్తారో, ద్వేషిస్తారో; ఎవరు = ఏ నరులు; దానిన్ = ఆ ధర్మమును; ఉపాసింతురు = సేవిస్తారో, ఆచరిస్తారో; ఎఱింగింపుము = తెలుపుము; వారి వారి పొందు గతులును = ధర్మాన్ని నిరసించేవారు, దానిని సేవించేవారు పొందే స్థితి గతులను, పుణ్యాపాపాలను; వినన్ వలతున్ = వినవలెనని కోరుతున్నాను; చెప్పుము; అనినన్; ఆ+పౌరవ+ఉత్తమునకున్ = పురువంశంలో పుట్టిన వారిలో శ్రేష్ఠుడైన ఆ ధర్మపుత్త్రుడికి; ఆ+పురుష+సత్తముండు = ఆ మానవోత్తముడైన భీష్ముడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఎవరు ధర్మాలపట్ల అసూయ వహిస్తారో, ఎవ్వరు వాటిని నమ్మి సేవిస్తారో ఆ ఇరుతెగల వారిని గూర్చి, వారికి కలిగే స్థితిగతులను గురించి తెల్పు' మని వేడగా ధర్మజునకు మహామానవుడు భీష్ముడిట్లా అన్నాడు.

సీ. 'వినుము రజస్తమో వికృతులఁ దగిలిన । మానసంబులు గల మానవులకుఁ
గలుగు ధర్మద్వేషకలనంబు; వారలు । నరకవాసార్హులు ధరణినాథ!
సత్య పరాత్ములు సతతంబు ధర్మ ము । పాసింతు; రూర్ధ్వ లోకాధివాస
మునకు వా రుక్తులు; మునుమును పుట్టిన । సుతుఁడు ధర్మము పద్మజునకు దాని

తే. పాక సంపద సుమతు లుపార్జితగ ను । పాసనము సేయుదురు తియ్యపంటి పరువ
మాదరించి తదుపచార మాచరించు । వెరవుగల యట్టి జనముల విధము దోఁప.' 424

ప్రతిపదార్థం: ధరణినాథ! = భూవల్లభా!; వినుము; రజః+తమః+వికృతులన్(రజస్తమోవికృతులన్) = రజోగుణము యొక్క, తమో గుణము యొక్క వికారములను; తగిలిన = పొందిన; మానసంబులు+కల = మనస్సులు కలిగిన; మానవులకున్ = నరులకు; ధర్మద్వేషకలనంబు = ధర్మమునందు విరోధమనే దోషం; కలుగున్ = సంభవిస్తుంది; వారలు = ఆ ధర్మ విరోధులు; నరకవాస+అర్హులు = నరకలోకంలో నివసించటానికి తగిన వారు; సత్యపర+ఆత్ములు = సత్యమందు ఆసక్తి గల మనసులు కలవారు; సతతంబున్ = ఎల్లప్పుడు; ధర్మమున్ = ధర్మాన్ని; ఉపాసింతురు = సేవిస్తారు; వారు = అట్లాంటి సత్యపరులు; ఊర్ధ్వలోక+అధివాసమునకున్ = స్వర్గభువనంలో నివాసంచెయ్యటానికి; ఉక్తులు = యోగ్యులు; పద్మజునకున్

= కమలము నుండి జన్మించిన బ్రహ్మదేవుడికి; మునుమును పుట్టిన = తొట్టతొలుత జనియించిన; సుతుఁడు = కుమారుడు; ధర్మము = ధర్మం; తియ్యపంటిపరువము = మధురమైన పండు యొక్క పక్వదశను; ఆదరించి = పాటించి, గమనించి; తత్+ఉపచారము+ఆచరించు = దానిని వాడుకొనే పద్ధతులనుసరించే; వెరవు+కల+అట్టి = ఉపాయమెరిగినట్టి; జనులవిధము+ తోఁపన్ = జనులతీరు గోచరించేటట్లు; సుమతులు = సుబుద్ధులు; దాని పాకసంపద = ధర్మము యొక్క పక్వస్థితి; ఉప+ఆర్జిత+కన్ = సంపాదిత అయ్యేటట్లు; ఉపాసనము+చేయుదురు = ఆ ధర్మాన్ని సేవిస్తారు.

తాత్పర్యం: 'ధర్మజా! శ్రద్ధగా వినుము. రజస్తమోగుణవికారం పొందిన మనసులుగల మనుష్యులు ధర్మం మీద పగబూనుతారు. అట్టివారికి నరక లోక నివాసమే గతి. సత్య వ్రతపరాయణులు నిరంతరం ధర్మమునే సేవిస్తారు. వారు స్వర్గలోకనివాససౌఖ్యానికి అర్హులు. ధర్మం బ్రహ్మదేవుడి ప్రథమపుత్రుడు. మధురఫలాలను భుజించటానికి ఉబలాటపడేజనులు దాని పరిపక్వస్థితిని ఎట్లా శ్రద్ధాసక్తులతో, ఆదర బుద్ధితో గమనిస్తూ ఎట్లా ఉపచారాలు చేస్తుంటారో ఆ విధంగానే మంచిబుద్ధికలవారు ధర్మాన్నే ఆశ్రయించి సేవిస్తుంటారు.'

వ. అనినం గౌంతేయాగ్రజుండు శాంతనవుతోడ 'సాధులు నసాధులు నన నెట్టివారు? చెప్పు' మనుటయు నమ్మహాత్ముం డి ట్లనియె. 425

ప్రతిపదార్థం: అనినన్; కౌంతేయ+అగ్రజుండు = కుంతీపుత్రులలో పెద్దవాడు, ధర్మజుడు; శాంతనవుతోడన్ = శంతను పుత్రుడైన భీష్ముడితో; సాధులు = సత్పురుషులు; అసాధులు = దుర్జనులు; అనన్; ఎట్టివారు; చెప్పుము; అనుటయున్ = అని ప్రశ్నించగా; ఆ+మహా+ఆత్ముండు = ఆ దొడ్డబుద్ధిగలవాడు- భీష్ముడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీష్ముడి పల్కులు విని ధర్మజుడు ఆ మహనీయుడితో 'సాధువు లనగా ఎటువంటివారు? అసాధువు లనగా ఎటువంటివారు? చెప్పు' మని అడుగగా భీష్ము డిట్లా చెప్పాడు.

భీష్ముఁడు ధర్మజునకు సాధ్వసాధుజనుల నిరూపించి చెప్పుట. (సం.13-148-8).

సీ. 'తమయంత నెఱుఁగరు ధర్మంబు సదుపదే । శమునను గాన రసాధుజనులు;
ధర్మబోధం బివ్విధంబులు రెంటను । గలిగెడువారు సాధులు; తదీయ
చరితంబు విను; విడువరు మలమూత్రంబు । లర్హంబు గానిచో నధిప! యతిథి
భోజనశిష్టాన్న భోజులు, దెరు విచ్చి । తగినవారలకుఁ బ్రదక్షిణముగ

తే. నరుగుదురు, నడపుదురు సత్యార్జవములు, । శరణు సొచ్చినఁ గాతురు, సురతగుప్తి
పరులు, నిజదారతృప్తులు, గురువినీతు, । లమలహృదయులు, సంతోష మారఁ గలరు.' 426

ప్రతిపదార్థం: అసాధుజనులు = సత్పురుషులు కానివారు, దుర్జనులు; ధర్మంబున్ = ధర్మమును; తమ+అంతన్ = తమకు తామే; ఎఱుఁగరు = తెలియలేరు; సత్+ఉపదేశమునను = పెద్దల యొక్క ఉపదేశం వలన కూడ; కానరు = తెలిసికొనరు, గ్రహించరు; ధర్మబోధంబు = ధర్మోపదేశం; ఈ+విధంబులు రెంటను = తమకు తాముగా గాని, పెద్దలవలనగాని; కలిగెడు వారు = పొందువారు; సాధులు = సజ్జనులు, సత్పురుషులు; తదీయచరితంబున్ = ఆ సత్పురుషుల యొక్క నడవడిని, ప్రవర్తనను; అధిప! = రాజా!; విను = వినుము; అర్హంబు+కానిచోన్ = యోగ్యంగాని తావులో; మలమూత్రంబులు; విడువరు; అతిథి భోజనశిష్ట = అతిథులు భుజించగా మిగిలిన; అన్న భోజులు = అన్నమును భుజించేవారు-సాధుజనులు; తగినవారలకున్

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

= అర్హులైనవారికి; తెరువు+ఇచ్చి = దారి వదలి; ప్రదక్షిణముగన్ = కుడివైపునకు తిరిగి; అరుగుదురు = వెళ్ళుతారు; సత్య+ఆర్జవములు = సత్యం, ఋజుత్వం (నిష్కాపట్యం); నడపుదురు = కొనసాగిస్తారు; శరణు+చొచ్చినన్ = కాపాడుమని ఆశ్రయిస్తే; కాతురు = రక్షిస్తారు; సురతగుప్తి పరులు = వారు రతి క్రీడ రహస్యంగా సల్పుతారు; నిజదారతృప్తులు = తమ భార్యలయందే సంతృప్తి చెందుతారు; గురువినీతులు = వారు తమగురువులకు విధేయులు; అమల హృదయులు = నిర్మల మనస్కులు; సంతోషము+ఆరన్+కలరు = ఎల్లప్పుడు సంతోషంతో హాయిగా ఉంటారు.

తాత్పర్యం: 'సాధువులు కానివారు ధర్మం తమంతట తాముగాగాని, పెద్దలవలనగాని తెలిసికొనరు. సత్పురుషులు ధార్మికజ్ఞానాన్ని తమంతట తాము గాను, గురువుల వలననూ ఆర్జిస్తారు. ధర్మజా! సత్పురుషుల చరిత్ర ఎటువంటిదో తెలుపుతాను శ్రద్ధతో వినుము. వారు మలమూత్రములను యోగ్యములైన ప్రదేశాలలో విడువరు. అతిథులు భుజించిన పిదప శేషించిన ఆహారాన్ని భుజిస్తారు. అర్హులైనవారికి దారి వదలి ప్రదక్షిణ మొనర్చి వెళ్ళుతారు. సత్యంగా, నిష్కపటంగా ప్రవర్తిస్తారు. శరణు జొచ్చినవారిని సంరక్షిస్తారు. స్త్రీ సంగమం బయటికి పొక్కనీయరు. రహస్యంగా ఉంచుతారు. తమ భార్యలతోనే సంతృప్తి చెందుతారు. గురువుల పట్ల అణకువ కలిగి ఉంటారు. వారు నిర్మల హృదయులు; నిత్యసంతోషులు.'

విశేషం: ధర్మిష్ఠులు (సత్పురుషులు) రాజమార్గాలలో, ఆవులనడుమ, ధాన్యం మధ్య మలమూత్ర విసర్జనం చెయ్యరు. అగ్నిని, వృషభమును, దేవుడిని, గోశాలను, బ్రాహ్మడిని, ధార్మికుడిని, ముసలివాడిని చూచినపుడు వారికి ప్రదక్షిణం చేస్తారు. ఇంకా వృద్ధులకు, భారవాహులకు, ఆడువారికి, బాలురకు, ఆతురులకు, బ్రాహ్మణులకు, గోవులకు, రాజులకు దారి వదులుతారు.

వ. అని వెండియు. 427

తాత్పర్యం: అని మరల.

తే. 'సాధు లింద్రియ విభ్రాంతి సంహరింతు, । రఘముఁ దెలిసి ప్రాయశ్చిత్త మాచరింతు,
రప్రకాశంబుగా ధర్మ మాచరింతు, । రఖిలభూతదయాళుత్వమారఁ గలరు.' 428

ప్రతిపదార్థం: సాధులు = సజ్జనులు; ఇంద్రియ విభ్రాంతిన్ = ఇంద్రియముల యొక్క తొట్రుపాటును, ఇంద్రియవ్యామోహమును; సంహరింతురు = నిర్మూలిస్తారు; అఘమున్ = పాపమును; తెలిసి = ఎరిగి; ప్రాయశ్చిత్తము+ఆచరింతురు = పాపమును పరిహరించే కర్మను కావిస్తారు; అప్రకాశంబుగాన్ = గుట్టుగా, రహస్యంగా, చాటుకొనకుండా; ధర్మము+ఆచరింతురు = ధర్మం సలుపుతారు; అఖిలభూత దయాళుత్వము+ఆరన్+కలరు = సమస్త ప్రాణుల మీద సంపూర్ణంగా కృపచూపుతారు.

తాత్పర్యం: 'సత్పురుషులు ఇంద్రియభ్రాంతిని నిర్మూలిస్తారు. చేసిన పాప మెరిగి ప్రాయశ్చిత్తం చేసికొంటారు. తమ పేరు ప్రకటించుకొనకుండా రహస్యంగా ధర్మం చేస్తారు. సమస్తభూతముల మీద దయా సంపూర్ణులై వెలుగొందుతారు.'

వ. అనిన విని యజాతశత్రుండు శంతనుపుత్త్రుతో నప్రయత్నులకు నర్థంబు సిద్ధించుట గలుగు; ధర్మపరులును నీతివిదులును నైన బలవంతులు బహుమార్గంబులగు సదుపాయంబుల నర్థంబు లాకాంక్షింప సిద్ధింపకుండెడుఁ; గొందఱకు సిద్ధించియు నవి భోగంబుల కుపయోగ్యంబులు గాకుండు; శిక్షలు పెద్ద లేకయుం గొన్ని చిత్తంబులందు విద్య లలవడు; శిక్షితులయ్యును నిర్విద్యు లగుటయుం గలుగుఁ; దేవుళ్ళ

నోసియుం బోట్లం బడియును గొందఱు చావరు; పూరి పుడుక దాఁకి బలాధికులు చచ్చుట చూచెద మిట్లు
గాఁ గతం బేమి? యెఱింగింపవే యనుటయు న మ్మహీపతి కమ్మహాత్ముం డి ట్లనియె. 429

ప్రతిపదార్థం: అనినన్; విని; అజాత శత్రుండు = ధర్మజుడు; శంతను పుత్త్రుతోన్ = భీష్ముడితో; అప్రయత్నులకున్ = ఎట్టిప్రయత్నం లేని వారికి; అర్థంబు = ధనం; సిద్ధించుట+కలుగున్ = లభించటం సంభవిస్తుంది; ధర్మపరులును = ధర్మమునందు ఆసక్తి కలవారును; నీతివిదులును = నీతి నెరింగినవారును; ఐన బలవంతులు; బహుమార్గంబులు+అగు = పెక్కుదారులు గలిగిన; సత్+ఉపాయంబులన్ = మంచి ఉపాయాలచేత; అర్థంబులు = ధనములు; ఆకాంక్షింపన్ = కోరుతున్నా; సిద్ధింపక+ఉండెడున్ = లభించకుండా ఉంటాయి; కొందఱకున్ = కొంతమందికి; సిద్ధించియున్ = సమకూడికూడా, అవి = ఆ ధనములు; భోగంబులకున్; ఉపయోగ్యంబులు కాక+ఉండున్ = ఉపయోగపడకుండా పోతాయి; శిక్షలు = బోధలు; పెద్దలేకయున్ = ఎక్కువగా ఉండనప్పటికినీ; కొన్ని చిత్తములందున్ = కొందరి మనస్సులలో; విద్యలు = చదువులు; అలవడున్ = అబ్బుతాయి, సిద్ధిస్తాయి; శిక్షితులు+అయ్యును = బోధించబడిన వారైనప్పటికినీ; నిర్విద్యులు+అగుటయున్ = చదువురానివారు కావటం కూడ; కలుగున్ = జరుగుతుంది; తెవుళ్ళన్ = రోగాల వలన; నోసియున్ = నొచ్చియూ, బాధచెందికూడా; పోట్లన్ = దెబ్బలచేత, పొడుపులచేత; పడియును = నొచ్చికూడ; కొందరు; చావరు; పూరిపుడుక = గడ్డిపరక, గడ్డిపోచ; తాఁకి = గ్రుచ్చుకొని; బల+అధికులు = శక్తిసంపన్నులు; చచ్చుట = చావటం; చూచెదము = చూస్తున్నాము; ఇట్లుకాన్ = ఇట్లా జరగటానికి; కతంబు+ఏమి? = కారణమేమిటి?; ఎఱింగింపవు+ఏ = తెలుపవా?; అనుటయున్ = అని ధర్మరా జడుగగా; ఆ+మహీపతికిన్ = ఆ భూభర్తకు (ధర్మజునకు); ఆ+మహా+ఆత్ముండు = ఆ దొడ్డ మనసు గల భీష్ముడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీష్ముడి పలుకులు విని ధర్మజుడు, 'తాతా! ఎట్టి ప్రయత్నం లేకుండానే కొందరికి డబ్బు వస్తుంది. ధర్మాత్ములు, నీతిమంతులు అయిన శక్తి సంపన్నులు ఎన్నో మార్గాలలో, ఎన్నో ఉపాయాలతో ధనం సంపాదించటానికి సర్వయత్నాలు చేసినప్పటికినీ వారి కది లభించదు. మరి కొంతమందికి సిరి సమకూడినా సుఖ మనుభవించటానికి ఉపయోగపడదు. గురుబోధ అంతగా లేకపోయినప్పటికీ కొందరికి సులువుగా చదువులు అబ్బుతాయి. కొందరికి అధ్యాపకులు ఎంత బోధించినా ఏ మాత్రం విద్యలు పట్టుపడవు. రోగాలతో నొచ్చికూడ, కత్తిపోట్లకు, కర్రదెబ్బలకు గురి అయికూడ కొందరు చావరు. మరి కొంతమంది బలవంతులు గడ్డిపోచ గ్రుచ్చుకోగా కాలం చేస్తారు. ఇట్టివెన్నో వైపరీత్యాలను చూస్తున్నాము. ఇందుకు కారణ మేమిటో తెలుపవలసింది' అని అడిగిన అజాతశత్రువుకు ఆ భీష్ముడు ఇట్లా అన్నాడు.

శుభాశుభంబులు పూర్వ జన్మ కృత పుణ్యాపాపంబులచేఁ గల్గునని చెప్పుట. (సం.13-149-10).

క. 'మొలవం బెట్టని యట్టిది । మొలచునె? తొలుమేని దానముల నానార్థం
బులు సిద్ధించుఁ బ్రయత్నం । బులు లేకయు; నింత నిజము భూపవరేణ్యా! 430

ప్రతిపదార్థం: భూపవరేణ్యా! రాజులలో ఉత్తముడా!; మొలవన్ = మొలచుటకు, చెట్టు చేమలు మొలకెత్తటానికి; పెట్టని+అట్టిది = నేలలో నాటని బీజం; మొలచును+ఎ? = పుట్టుతుందా? పుట్టదని భావం; తొలుమేని దానములన్ = పూర్వజన్మలో చేసిన దానాలచేత; నానా+అర్థంబులు = అనేక ప్రయోజనాలు; ప్రయత్నంబులు లేకయున్ = ఎట్టియత్నాలు చెయ్యకుండానే; సిద్ధించున్ = నెరవేరుతాయి; ఇంత నిజము = ఇది వాస్తవం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: 'రాజేంద్రా! నేలలో బీజం నాటకుండా మొక్క మొలుస్తుందా? మొలవనే మొలవదు. అట్లే ముందటి జన్మలో చేసిన దానాల వలననే ఎట్టి ప్రయత్నాలు లేకుండానే అన్ని ప్రయోజనాలు నెరవేరుతాయి. ఈ మాట నిజం.

తే. **అలఘు తపములు దొలుమేనఁ గలిగెనేని । వెదకి కొనివచ్చు న న్నరు విపులభోగ**
ములు పురాకృత వృద్ధసేవల ఫలించు । బుద్ధికలిమియు విద్యలఁ బొలుచుటయును. **431**

ప్రతిపదార్థం: అలఘుతపములు = గొప్పతపస్సులు; తొలుమేనన్ = మునుపటి జన్మలో; కలిగెన్+ఏనిన్ = చేసి ఉన్నట్లయితే; ఆ+నరున్ = ఆ మానవుడిని; విపులభోగములు = విస్తారమైన సుఖాలు; వెదకి కొని వచ్చున్ = తాముగా వచ్చి ఆశ్రయిస్తాయి; పురాకృతవృద్ధసేవలన్ = మునుపు చేయబడిన పెద్దల శుశ్రూషవలన; బుద్ధికలిమియున్ = తెలివి కలగటం; విద్యలన్ = చదువులలో; పొలుచుటయున్ = ప్రకాశించటమూ; ఫలించున్ = సిద్ధిస్తాయి.

తాత్పర్యం: ముందటి జన్మలో ఘనతపస్సులు చేసి ఉన్నట్లయితే ఆ మనిషిని విస్తారమైన సుఖాలు వచ్చి వరిస్తాయి. పూర్వం చేసిన పెద్దల సేవ వలననే నరులకు తెలివితేటలు కలుగుతాయి. వారు చదువులలో రాణిస్తారు.

క. **తొలుమేన నహింసారుచి । గలిగిన దీర్ఘాయు వొందుఁ గారణభూతం**
బులు భూవర! యివి యీ గుణ । ములు లేమియ కీడులకును మూలం బరయన్. **432**

ప్రతిపదార్థం: భూవర! = రాజా!; తొలుమేనన్ = మునుపటిపుట్టువులో; అహింసారుచి = అహింసయందు ప్రీతి; కలిగినన్ = ఉన్నట్లయితే; అతడు; దీర్ఘ+ఆయువున్+ఒందున్ = దీర్ఘాయుష్యమును పొందుతాడు; ఇవి = ఈ అహింసాదులు; కారణభూతంబులు = ఇందుకు హేతువులు; ఈ గుణములు లేమియ = ఈ సద్గుణాలు లేకుండటమే; అరయన్ = ఆలోచించగా; కీడులకున్ = ఆపదలకు, అనర్థాలకు; మూలంబు = హేతువు.

తాత్పర్యం: వెనుకటి జన్మలో అహింసయందు ఆసక్తి కలిగి ఉంటే అతడు ఈ జన్మలో దీర్ఘాయుష్మంతు డవుతాడు. యుధిష్ఠిరా! ఈ సద్గుణాలే ఇందుకు హేతువులు. ఇవి లేకుండటమే అన్ని అనర్థాలకు మూలం.

వ. **కావున.** **433**

తాత్పర్యం: ధర్మజా! కనుక.

తే. **వినుము దానంబుఁ దపమును వృద్ధసేవ । నము నహింసయు నియత కృత్యములు సర్వ**
జనుల కి మ్మహాగుణములు మనమునందు । దృఢముగా నిల్పి నడపుము ధీరవర్య!' **434**

ప్రతిపదార్థం: ధీరవర్య! = ధైర్యం కలవారిలో శ్రేష్ఠుడా!; వినుము = ఆలకించుము; దానంబున్ = వితరణ గుణం; తపమును = తపశ్చర్య; వృద్ధసేవనము = పెద్దలకు శుశ్రూష చేయటం; అహింసయున్ = ప్రాణులను బాధించకుండటం; సర్వజనులకున్ = సమస్తప్రజలకు; నియతకృత్యములు = విధిగా ఆచరించదగిన కార్యములు; ఈ+మహాగుణములు = ఈ గొప్పగుణాలను; దృఢముగాన్ = గట్టిగా; మనమునందున్ = మనస్సులో; నిల్పి = నిలుపుకొని; నడపుము = పనులు సాగించుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధీరోత్తమా! వినుము. దానం, తపస్సు, పెద్దలను సేవించటం, ప్రాణులను హింసించకుండటం, అనేవి సమస్త జనులు విధిగా ఆచరించదగిన కార్యాలు. ఈ దొడ్డ గుణాలను గట్టిగా మనసులో నిలుపుకొని అనుష్ఠించవలసినది.'

వ. అని యుపదేశించి యాపగానందనుండు వెండియుఁ బాండవాగ్రజున కిట్లనియె. 435

తాత్పర్యం: అని బోధించి గంగానదీ పుత్రుడైన భీష్ముడు మళ్ళీ పాండు మహారాజు కుమారులలో జ్యేష్ఠుడైన ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

సీ. 'ఎప్పుడు ధర్మంబునెడ నాదరము గల । వానికిఁ గాలంబు దాన యిచ్చు
ధర్మతత్త్వ ప్రబోధముఁ బరిస్ఫుటముగాఁ । గావున సుస్థిరభావశుద్ధి
సహిత తప శ్రుత స్నాన దాన జపంబు । లను దేవతా పూజలను నమోఘ
కాలుఁడై వర్తింపఁగా ధర్మయోగంబు । సమకూరు; ధర్మంబు సాధనత్వ

తే. మొంది చేయించికొని చెప్పఁ బొందు నిర్మ । లాత్మకుండు సంసార పారాత్మకంబు
సత్య మజరామరము బోధ నిత్య మచ్యు । తము పరానంద మగు నప్పదంబు ననఘ!' 436

ప్రతిపదార్థం: అనఘ! = పుణ్యుడా!; ఎప్పుడున్ = నిరంతరం, అనవరతం; ధర్మంబు+ఎడన్ = ధర్మం పట్ల; ఆదరము+కలవానికిన్ = గౌరవమున్న మనిషికి, అభిలాషగలవాడికి; కాలంబు = కాలమే; ధర్మతత్త్వబోధము = ధర్మస్వరూపజ్ఞానం, ధర్మమిట్లాంటిదనే ఎరుక; పరిస్ఫుటముగాన్ = తేటతెల్లంగా, మిక్కిలి స్పష్టంగా, విశదంగా; తాను+అ = ఆ ధర్మమే; ఇచ్చున్ = కలుగజేస్తుంది, ప్రసాదిస్తుంది; కావునన్ = కనుక; సుస్థిర = నిశ్చలమైన; భావశుద్ధి సహిత = చిత్తశుద్ధితో కూడిన, హృదయనైర్మల్యంతో కూడిన; తపః = తపస్సుచేత; శ్రుత = ధర్మశాస్త్రాల వినికిడిచేత; స్నాన, దాన, జపంబులను = స్నానం, దానం, మంత్ర జపం అనువాటి చేత; దేవతా పూజలను = దైవములను ఆరాధించటంచేత; అమోఘకాలుండు+ఐ = వ్యర్థంగాని కాలం కలవాడై; సమయాన్ని వ్యర్థపరచక; వర్తింపఁగాన్ = ప్రవర్తిస్తే; ధర్మయోగంబు సమకూడున్ = అతడికి ధర్మంతో చేరిక కలుగుతుంది, ధర్మం సంప్రాప్తిస్తుంది; ధర్మంబు = ధర్మం; సాధనత్వము+ఒంది = ఉపకరణమై; చేయించుకొని = తన ప్రచారం చేయించుకొని; చెప్పన్ = స్వరూప జ్ఞానబోధ గావించగా; నిర్మల+ఆత్మకుండు = ఆ కల్మషరహితమైన మనస్సు కలవాడు, ఆపరిశుద్ధ హృదయుడు; సంసారపార+ ఆత్మకంబున్ = భవసాగరానికి ఆవలితీరమైనదీ; సత్యము = సత్యమైనది; అజర+అమరము = ముదిమి, వినాశం లేనిదీ; బోధనిత్యంబు = జ్ఞానంచేత శాశ్వతమైనదీ; అచ్యుతము = జారుపాటులేనిదీ, నాశంలేనిదీ; పర+ఆనందము = పరమానందరూపమైనదీ; అగు = అయినట్టి; ఆపదంబున్ = ఆ స్థానమును, ముక్తిని; పొందున్ = పొందగలడు.

తాత్పర్యం: 'ఎల్లప్పుడూ ధర్మమందు ఆసక్తిగల జనుడికి కాలమే ధర్మతత్త్వ స్వరూప జ్ఞానం స్పష్టంగా కలిగిస్తుంది. కనుక నిశ్చలమైన చిత్తశుద్ధితో తపస్సు, ధర్మశాస్త్రాలశ్రవణం, స్నానం, దానం, మంత్రజపం, దైవారాధనం కాలాన్ని వ్యర్థపుచ్చకుండా యథావిధిగా ఆచరిస్తుంటే అట్టివాడికి ధర్మం సంప్రాప్తిస్తుంది. ఆ ధర్మాన్నే తరణోపాయంగా గైకొని తాను ఆచరిస్తూ, ఇతరులచేత ఆచరింపజేస్తూ, బోధిస్తూ ఉంటే ఆ నిర్మల హృదయుడు సంసారమునకు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆవలి గట్టుగ ఉన్నట్టిది, సత్యమైనది, జరామరణాలకు దవ్వైనది, జ్ఞానపూర్ణమూ, వినాశరహితమూ పరమానందరూపమూ అయిన ముక్తిపదాన్ని పొందుతాడు.'

వ. అని నిర్దేశించి మఱియును. 437

తాత్పర్యం: అని నిర్ణయించి చెప్పి ఇంకను. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. 'కను వెలుంగు వేద వ్యాస మునివరుండు । నధిప! కృష్ణుండు నీకుఁ బరాయణంబు
చింత దిగఁ ద్రావి పాలింపు శాంతవృత్తిఁ । బ్రజల; సర్వంబునందును విజయి వగుము.' 438

ప్రతిపదార్థం: అధిప! = రాజా!; నీకున్ = నీకు; వేదవ్యాసమునివరుండు = మునిశ్రేష్ఠుడైన శ్రీవేదవ్యాసుడు; కనువెలుంగు = కంటికి వెలుతురు వంటివాడు, మార్గదర్శకుడు; కృష్ణుండు = శ్రీకృష్ణభగవానుడు; పరాయణంబు = అత్యంత ప్రియమైన ఆశ్రయస్థానం, నీకు దిక్కైన దేవుడు; చింత = విచారమును; దిగన్+త్రావి = వదలిపెట్టి; ప్రజలన్ = జనులను; శాంతవృత్తిన్ = మనోనిగ్రహంతో, మిక్కిలి చల్లగా; పాలింపు = ఏలుము; సర్వంబు+అందును = అన్ని విషయాలలో; విజయివి+అగుము = విజయం పొందుము.

తాత్పర్యం: 'ధర్మజా! నీకు వేదవ్యాసమహర్షి కంటికి వెలుగువంటివాడు. వాసుదేవుడు నీకు ఆరాధ్యదైవం. ఇక చింత వదలి ప్రజలను చల్లగా పరిపాలించుము, కార్యరంగములందు విజయం పొందుము.'

క. అని యిట్లుపదేశించిన । యనిమిషతటినీ తనూజు నతుల వచనమున్
విని మో మలరఁగఁ బులకలు । దనువున జాదుకొన నొప్పె ధర్మజుఁ డధిపా! 439

ప్రతిపదార్థం: అధిపా! = ఓ జనమేజయమహారాజా!; అని = అంటూ; ఇట్లు = ఈ ప్రకారం; ఉపదేశించిన = బోధించినట్టి; అనిమిషతటినీ తనూజు = దేవనదీపుత్రుడైన భీష్ముని యొక్క; అతులవచనముల్ = సాటిలేని మాటలు; విని = ఆలకించి; మోము = ముఖం; అలరఁగన్ = వికాసం చెందగా; పులకలు = గగుర్పాటు; తనువునన్ = శరీరమందు; జాదుకొనన్ = కలుగగా; ధర్మజుఁడు = ధర్మరాజు; ఒప్పెన్ = ప్రకాశించాడు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! ఈ విధంగా బోధించిన దివిజగంగా పుత్రుడైన భీష్ముడి సాటి లేని మాటలు ఆలకించగానే ధర్మపుత్రుడి ముఖం వికసించింది. గగుర్పాటు పొందిన శరీరంతో అతడు ప్రకాశించాడు.

సీ. అపుడు వీక్షించి సత్యవతీ సుతుండు శం । తనునందనునితోడ 'ధర్మజుండు
దెలివొందె భవదుప దేశామృతంబున; । ననుజులుఁ గృష్ణుండు నాప్తసకల
రాజన్యులును ధృతరాష్ట్రుండుఁ దానును । దగ ని న్నుపాసించి దయకుఁ బాత్ర
మయ్యె; వీడ్కొలుపు మియ్యవనీశుఁ; దఱితోడఁ । గ్రమ్మఱ నితఁడు నీ కడకు వచ్చు

ఆ. వాఁడుగాక!' యనిన వాత్సల్యమున నార్ద్ర । మైన చూడ్కి న మ్మహాత్ముఁ డతనిఁ
జూచి 'పురికిఁ జనుము; శుభపరంపరలకు । భాజనంబ వగుము రాజముఖ్య!' 440

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అపుడు = ఆ వేళ; సత్యవతీసుతుండు = సత్యవతి కుమారుడైన వ్యాసమహర్షి; వీక్షించి = చూచి; శంతనునందనునితోడన్ = శంతను మహారాజు పుత్త్రుడైన భీష్ముడితో; భవత్+ఉపదేశ+అమృతంబునన్ = నీ బోధఅనెడు సుధారసంచేత; ధర్మజుండు; తెలివి+ఒందెన్ = జ్ఞానం పొందినాడు; అనుజులున్ = తోబుట్టువులును; కృష్ణుండున్; ఆప్త సకలరాజన్యులును = హితులైన సమస్తరాజులును, ధృతరాష్ట్రుండున్; తానును = తాను కూడ (ధర్మజుడు); తగన్ = చక్కగా; నిన్నున్; ఉపాసించి = కొలిచి; దయకున్ = నీకృపకు; పాత్రము+అయ్యెన్ = అర్హుడైనాడు; ఈ+అవనీ+ఈశున్ = ఈ భూపతిని; వీడ్కొలుపుము = సెలవిచ్చి పంపుము; తఱితోడన్ = సమయం రాగానే; క్రమ్మఱన్ = మరల; ఇతఁడు = ఈ ధర్మపుత్రుడు; నీ కడకున్ = నీ చెంతకు; వచ్చువాఁడుగాక = రాగలడు; అనినన్ = అని వ్యాసమహర్షి పలుకగా; ఆ+మహా+ఆత్ముఁడు = ఆ భీష్ముడు; వాత్సల్యమునన్ = వాత్యల్యరసంచేత; ఆర్ద్రము+ఐన+చూడ్కిన్ = తడిసిన చూపుచేత; అతనిన్ = ధర్మరాజును; చూచి; రాజముఖ్య= రాజులలో శ్రేష్ఠుడా; పురికిన్ = హస్తినకు; చనుము = వెళ్ళుము; శుభపరంపరలకున్ = శుభములయొక్క వరుసకు, సమూహమునకు; భాజనంబవు+అగుము = పాత్రుడవు కమ్ము.

తాత్పర్యం: అపుడు వ్యాసమహర్షి భీష్ముడిని చూచి, 'ధర్మజుడు నీ ఉపదేశసుధారసం తనివార గ్రోలి జ్ఞానఘనుడైనాడు. సోదరులు, వాసుదేవుడు, మిత్రులైన సమస్తరాజులు, ధృతరాష్ట్రుడు, తానూ చక్కగా నిన్ను సేవించి నీ కృపకు పాత్రమైనాడు. ఇక ఈతనికి సెలవిచ్చి హస్తినకు పంపుము. సమయానికి తిరిగి నీ దగ్గరకు రాగలడు' అని చెప్పాడు. భీష్ముడు వాత్సల్య రసంచేత తడిసిన చూపులతో ధర్మజుడిని వీక్షించి ఓ రాజశ్రేష్ఠుడా! నీవు పురమునకు వెళ్లుము. శుభ పరంపరలు పొందుము'.

భీష్ముఁడు ధర్మజు నూఱడించి కరిపురంబునకుఁ బంపుట. (సం.13-152-5).

వ. అని యనుజ్ఞ చేసి వెండియు. 441

తాత్పర్యం: అని సెల వొసంగి మళ్ళీ (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'నీ బుద్ధి ధర్మైకనిష్ఠ గావుతను; స । మగ్ర దక్షిణ బహుయజ్ఞములు య
యాతి చందమున శ్రద్ధాన్వితంబుగఁ జేయు; । రాజ ధర్మంబునఁ బ్రకృతి రంజ
నము నాచరింపు; చుట్టములును జెలులును । బండిన వృక్షంబుఁ బక్షి కులము
లెట్లట్ల నిన్నాశ్రయించి సుఖించువా; । రర్కుని యుత్తరాయణము వచ్చు

తే. టరసికొనియుండి నాకడ కరుగుదెమ్ము । పొమ్ము; తల్లియుఁ దమ్ములు భూవరుండు
నీవు సుఖులరై యుండుఁడు నృపవరేణ్య!' । యనుడు నానంద మొంది ధర్మాత్మజుండు. 442

ప్రతిపదార్థం: నృపవరేణ్యా! = రాజులలో శ్రేష్ఠుడా!; నీ బుద్ధి = నీ మనస్సు; ధర్మ+ఏకనిష్ఠ+కావుతను = ధర్మమందు ముఖ్యంగా నిలుకడ కలది అగుగాక, కుదురుకొను గాక!; సమగ్ర దక్షిణ = అధిక దక్షిణలుగల; బహుయజ్ఞములు = అనేక యాగాలు; యయాతి చందమునన్ = యయాతి మహారాజువలె; శ్రద్ధా+అన్వితంబుగన్ = విశ్వాససహితంగా; చేయు = సల్పుము; రాజధర్మంబునన్ = రాజు అనుసరించవలసిన ధర్మంతో; ప్రకృతిరంజనము = ప్రజలను సంతోషపెట్టటం, అలరించటం; ఆచరింపుము = కావింపుము, చుట్టములును = బంధువులు; చెలులును = మిత్రులు; పండిన వృక్షంబున్ = ఫలించిన చెట్టును, పండ్ల చెట్టును; పక్షికులములు = పక్షులగుంపులు; ఎట్లు = ఏ విధంగా ఆశ్రయించుకొని ఉంటాయో; అట్లు+అ = ఆ రీతిగానే;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిన్నున్ = నిన్ను; ఆశ్రయించి = ఆధారం చేసికొని; సుఖించువారు = సుఖంగా ఉంటారుగాక!; అర్కుని = సూర్యుడి యొక్క; ఉత్తర+అయనము+వచ్చుట = మకరరాశిలో ప్రవేశం జరగటం; అరసికొని+ఉండి = కనిపెట్టుకొని ఉండి; నాకడకున్ = నాదగ్గరకు; అరుగుదెమ్ము = రావలసినది; పొమ్ము = ఇపుడు పట్టణానికి వెళ్ళుము; తల్లియున్ = మీ జనని; తమ్ములున్ = నీ సోదరులు; భూవరుండున్ = రాజగు ధృతరాష్ట్రుడును; నీవున్ = నీవు; సుఖులరు+ఐ+ఉండుఁడు = సుఖంగా ఉండండి; అనుడున్ = అని భీష్ముడు చెప్పగా; ధర్మ+ఆత్మజుండు = ధర్మరాజు; ఆనందము+ఒంది = హర్షించి. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: 'నరనాథోత్తమా! నీబుద్ధి ధర్మమందే నిశ్చలంగా నిలుచుగాక! యయాతిమహారాజు వలె భూరిదక్షిణ లిచ్చి అనేక యాగాలు శ్రద్ధావంతుడవై చేయవలసింది. రాజ ధర్మాన్ననుసరించి రాష్ట్రంలోని ప్రజలను సంతోషపెట్టుము. పండ్ల చెట్టును పక్షిసమూహం వలె నిన్నాశ్రయించుకొని ఉన్న నీ చుట్టాలు, నీ మిత్రులు సుఖింతురుగాక! సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన శుభకాలం కనిపెట్టుకొని ఉండి నా దగ్గరకు రావలసింది. ఇపుడు హస్తినాపురికి వెళ్ళుము. నీ తల్లీ, నీ తమ్ముళ్ళూ, నీ తండ్రి ధృతరాష్ట్రుడూ, నీవూ సుఖంగా ఉండండి' అని గాంగేయు డనగానే ధర్మజుడు ఆనందించి-

విశేషం: అలం: ఉపమ.

వ. 'అట్ల చేయువాఁడ' నని సవినయంబుగాఁ బలికి దేవవ్రతునకు దండప్రణామం బాచరించి యిట్లు వీడుకొని. 443

ప్రతిపదార్థం: అట్లు+అ = నీవు చెప్పిన విధంగానే; చేయువాఁడన్ = చేయగలను; అని; సవినయంబుగాన్ = అణకువతో కూడేటట్లు; పలికి; దేవవ్రతునకున్ = భీష్ముడికి; దండప్రణామంబు+ఆచరించి = కర్రవలె నేల వ్రాలి నమస్కరించి; ఇట్లు వీడుకొని = ఈ విధంగా భీష్ముడిని వదలి, పోయివచ్చెదనని విన్నవించి బయలుదేరి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: 'తమరు చెప్పినట్లుగానే నడుచుకొంటా' నని వినయంతో విన్నవించి భీష్ముడికి సాష్టాంగదండప్రణామం చేసి, 'వెళ్ళి వస్తా' నని చెప్పి సెలవు గైకొన్నాడు ధర్మరాజు.

క. మును లనుపఁగఁ గృష్ణాదులుఁ। జనుదేరఁగ నాత్మపురికిఁ జనియె ముదితులై
జను లెదురు కొనఁగఁ బుణ్యాం। గనలును విప్రులును వచ్చి కని దీవనతోన్. 444

ప్రతిపదార్థం: మునులు = మునీశ్వరులు; అనుపఁగన్ = పోయిరమ్మని పంపగా; కృష్ణ+ఆదులు = ముకుందుడు మున్నగువారు; చనుదేరఁగన్ = వెంటరాగా; ఆత్మపురికిన్ = తననగరానికి; చనియెన్ = ధర్మజుడు వెళ్ళాడు; ముదితులు+ఐ = సంతసించినవారై; జనులు = పురంలోని ప్రజలు; ఎదురుకొనఁగన్ = తనకు ఎదురుగా రాగా, ప్రత్యుత్థానం సల్పగా; పుణ్య+అంగనలును = ముత్తైదువలునూ; విప్రులును = భూసురులును; వచ్చి = చనుదెంచి, అరుదెంచి, తోతెంచి; కని = తనను వీక్షించి; దీవనతోన్ = ఆశీర్వాదంతో. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: ధర్మజుడు మునీశ్వరులు తనను పోయి రమ్మని పంపగా వాసుదేవుడు మున్నగువారు వెంటరాగా తన నగరానికి వెళ్ళాడు. సంతోషంతో పురప్రజలు ఎదురుగా వచ్చారు. ముత్తైదువలు, బ్రాహ్మణులు వచ్చి తనను దర్శించి దీవనలతో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. సేసలు చల్లఁగ మహిమో । ద్భాసితుఁడై యిట్లు వోయి ధర్మజుఁడు నిజా
వాసంబు సొచ్చి గాంధా । రీసంభావన మొనర్చి ప్రియము దలిర్పన్. 445

ప్రతిపదార్థం: సేసలు చల్లఁగన్ = మంగళాక్షతలు తన శిరంపై చల్లగా; ధర్మజుడు; మహిమ+ఉద్భాసితుఁడు+ఐ = గొప్పతనంతో, ప్రాభవంతో ప్రకాశిస్తున్నవాడై; ఇట్లుపోయి = ఈ ప్రకారంగా వెడలినవాడై; నిజ+ఆవాసంబు+చొచ్చి = తన ఇంటిలో, ప్రాసాదంలో, మందిరంలో, భవనంలో ప్రవేశించి; గాంధారీ సంభావనము+ఒనర్చి = గాంధారీదేవిని ఆదరించి, ఓదార్చి; ప్రియము+తలిర్పన్ = ప్రేమ చిగురింపగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: మంగళాక్షతలు తన శిరంపై చల్లుతుండగా ధర్మజుడు ప్రాభవంతో దీపిస్తూ బయలుదేరి పురికి విచ్చేసి తన భవనంలో ప్రవేశించాడు. ప్రవేశించగానే తొలుత గాంధారీదేవిని దర్శించి, ఆమె నూరడించాడు. ఆ తరువాత ప్రేమ చిగురింపగా.

ఆ. తల్లి కెఱఁగి ముదము ద్రౌపది కొనరించి । సకలపౌరజనుల జానపదుల
నెలమి యొలయ వీడుకొలిపి భూసురులకు । దానవిధుల సమ్మదం బొనర్చి. 446

ప్రతిపదార్థం: తల్లికిన్ = జనని అయిన కుంతీమహాదేవికి; ఎఱఁగి = నమస్కరించి; ద్రౌపదికిన్ = పాంచాలికి; ముదము = సంతోషం; ఒనరించి = కలిగించి; సకలపౌరజనులన్ = సమస్త పట్టణప్రజలను; జానపదులన్ = గ్రామవాసులను, పల్లెలలో నివసించే జనులనూ; ఎలమి = ప్రీతి; ఒలయన్ = జనింపగా, అతిశయించగా; వీడుకొలిపి = తనను దర్శింపవచ్చిన ఈ జనులందరిని పోయిరండని సాగనంపి; భూసురులకున్ = విప్రులకు; దానవిధులన్ = దానంచేయటం చేత; సమ్మదంబు+ఒనర్చి = సంతోషం సమకూర్చి. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: ధర్మజుడు తన తల్లి అయిన కుంతీ మహాదేవికి నమస్కరించాడు. ద్రౌపదీదేవికి సంతసం కలిగించాడు. తనను దర్శించవచ్చిన నగరవాసులను, పల్లీ వాసులను ఆనందంతో వెళ్ళిరండని సాగనంపి బ్రాహ్మణులను దాన, ధర్మాది విధులచే సంతోషపరిచాడు.

వ. విపతులైన సతులకు సమగ్రధనంబు లొసంగి, ధృతరాష్ట్రునిం బ్రభూత పూజా కరణంబునం బరితుష్టునిం జేసి. 447

ప్రతిపదార్థం: విపతులు+ఐన = భర్తలను కోల్పోయిన; సతులకున్ = స్త్రీలకు; సమగ్రధనంబులు+ఒసంగి = దండిగా విత్తమిచ్చి; ధృతరాష్ట్రునిన్; ప్రభూతపూజాకరణంబునన్ = అధికంగా పూజించటంచేత; సంతుష్టునిన్+చేసి = తృప్తిపరచి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ధర్మజుడు మగలను పోగొట్టుకున్న మగువలకు అధికంగా ధనము లిచ్చాడు. ధృతరాష్ట్రుడిని మిక్కుటమైన పూజలచేత సంతృప్తిపరిచాడు.

తే. తమ్ములును గృష్ణుఁడును బ్రమోదమునఁ దేల । నమ్మహీశ్వరుఁ డపుడు రాజ్యాభిషేక
మంగళము నొందినట్లు నెమ్మదిఁ దలంచి । గట్టియైన యూఱట పెంపుఁ గాంచి పొలిచె. 448

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తమ్ములును = తోబుట్టువులైన భీమాదులు; కృష్ణుఁడును = మాధవుడునూ; ప్రమోదమునన్+తేలన్ = ఆనందంలో తేలియాడగా; ఆ+మహీ+ఈశ్వరుండు = ఆ భూవల్లభుడు - ధర్మరాజు; అపుడు = ఆ వేళ; రాజ్య+ అభిషేక+ మంగళమున్ = రాజ్యాభిషేక మనే శుభప్రయోజనాన్ని; ఒందిన+అట్లు = పొందినరీతిగా; నెమ్మదిన్+తలంచి = తన నిండు మదిలో భావించి; గట్టి+ఐన+ఊఁటట+పెంపున్ = దృఢమైన విశ్రాంతి యొక్క ఆధిక్యమును; కాంచి = పొంది; పొలిచెన్ = స్వస్థచిత్తుడై శోభిల్లాడు.

తాత్పర్యం: తన తోబుట్టువులూ, గోవిందుడూ పరమానందభరితు లౌతూ ఉండగా ధర్మజుడు అపుడు రాజ్యాభిషేక శుభమును పొందిన వాడి వలె తన నిండు మదిలో భావించి మిక్కిలి విశ్రాంతి వహించి విరాజిల్లాడు.

వ. అట్లు శోభిల్లి వారల నుచిత ప్రకార సమాచరణంబులకుం జన నియోగించి యభ్యంతర మందిరంబున కరిగె; న ట్లజాతశత్రుండు సమ్యగంగీకృత సామ్రాజ్యుం డయి జన సంపూజ్యం బగు చరితంబున సంప్రవర్తిలు చుండఁ బంచాశ ద్వాసరానంతరంబ వాసరపతి యుత్తరాయణగతుం డగుటయు. 449

ప్రతిపదార్థం: అట్లు; శోభిల్లి = ప్రకాశించి; వారలన్ = తన తమ్ముళ్ళను; ఉచితప్రకార సమాచరణంబులకున్ = తగు విధములైన కార్యాచరణములకు; చనన్ = వెళ్లుటకు; నియోగించి = నియమించి; అభ్యంతరమందిరంబునకున్ = లోపలి సౌధంలోనికి; అరిగెన్ = వెళ్ళాడు; అట్లు = ఆ విధంగా; అజాతశత్రుండు = ధర్మజుడు; సమ్యక్+అంగీకృత సామ్రాజ్యుండు+అయి = చక్కగా సమ్మతింపబడిన (స్వీకరించబడిన) సామ్రాజ్యం కలవాడై; జనసంపూజ్యంబు+అగు = ప్రజలచే పూజింపదగిన, గౌరవించదగిన; చరితంబునన్ = ప్రవర్తనతో; సంప్రవర్తిలుచున్+ఉండన్ = మెలగుతుండగా; పంచాశత్+వాసర+అనంతరంబు+అ = యాభైరోజుల తర్వాత; వాసరపతి = దినాధిపతి అయిన సూర్యుడు; ఉత్తర+అయన+గతుండు+అగుటయున్ = ఉత్తరాయణంలో ప్రవేశించినవాడుకాగా;

తాత్పర్యం: ఆ విధంగా ధర్మరాజు ప్రకాశిస్తూ తన తమ్ముళ్ళను తత్తత్ కాలోచితములైన పనుల నిర్వహణానికి నియమించి తాను లోపలి సౌధం లోనికి వెళ్ళాడు. ఆయన చక్కగా రాజ్య పరిపాలన బాధ్యతలు స్వీకరించి జనాదరణీయమైన ప్రవర్తనతో మెలగుతుండగా యాభై దినముల పిదప సూర్యభగవానుడు ఉత్తరాయణంలో ప్రవేశించాడు.

ధర్మజుఁడు కృష్ణాదులఁ దోడ్కొని భీష్ముని యొద్దకుం బోవుట. (సం.13-153-6).

సీ. అ క్కౌరవేశ్వరుం డప్పుడు కదలి గాం। ధారిని ధృతరాష్ట్ర ధరణి విభుని
గొంతిని మున్నిడుకొని కృష్ణుఁ దమ్ముని। దన తమ్ములను విదురుని యుయుత్సు
సంజయులను గృపాచార్యధౌమ్యుల మంత్ర। కోవిదులగు యాజకులను దోడఁ
గొని వస్త్ర చందనాగురు పుష్ప ఫలఘృత। కుండముల్ వట్టించుకొని యనేక

తే. రత్నములుఁ గాంచనంబుఁ దో రాఁగ నగ్ని। యంచితంబుగఁ దా సంఘటించి యోగ్య
జన సమానీతముగఁ జేసి సకల పరిజ। నంబుఁ గొల్వ మహావిభవంబు మెఱయ. 450

ప్రతిపదార్థం: ఆ+కౌరవ+ఈశ్వరుండు = ఆ కురువంశ ప్రభువు - ధర్మజుడు; అప్పుడు = అపుడే; కదలి = బయలుదేరి; గాంధారినిన్; ధృతరాష్ట్ర ధరణివిభునిన్ = ధృతరాష్ట్ర మహీపతిని; గొంతినిన్ = కుంతీదేవిని; మున్ను+ఇడుకొని = ముందుంచుకొని; కృష్ణున్ = యదువల్లభుడిని; తమ్మునిన్ = ఆయన అనుజుడైన సాత్యకిని; తన తమ్ములను = తన తోబుట్టువులైన

భీమాదులను; విదురునిన్; యుయుత్సుసంజయులనున్ = ధృతరాష్ట్రుడి కుమారులలో బ్రతికిఉన్న యుయుత్సుడిని, సంజయుడిని; కృప+ఆచార్య ధౌమ్యులన్ = గురువైన కృపాచార్యుడిని, పురోహితుడైన ధౌమ్యుడిని; మంత్రకోవిదులు+అగు = మంత్రవిద్యలందు నిపుణులైన; యాజకులను = యజ్ఞములు చేయించగల ఋత్విక్కులను; తోడన్+కొని = తన వెంట బెట్టుకొని; వస్త్ర = నూతనములైన వస్త్రాలు; చందన = శ్రీగంధం, మంచిగంధపు కొయ్యలు; అగురు = అగురు అనే పరిమళద్రవ్యం, అగురు చెక్కలు; పుష్ప = పూలు; ఫల = పండ్లు; ఘృతకుండముల్ = నేతికడవలు; పట్టించుకొని = మోయించుకొని; అనేక రత్నములున్ = పెక్కు రత్నాలు, మాణిక్యాలు; కాంచనంబున్ = బంగారం; తోన్+రాఁగన్ = తన వెంబడి వస్తుండగా; అగ్ని = నిప్పు; అంచితంబుగన్ = ఒప్పిదంగా, పూజ్యంగా; తాన్ = తాను; సంఘటించి = సమకూర్చి; యోగ్యజన సమానీతముగన్+చేసి = అర్హులైన జనులచే చక్కగా కొనిరాబడుతున్నదిగా ఒనర్చి; సకలపరిజనంబున్ = సమస్త సేవక బృందం; కొల్వన్ = తనను సేవిస్తూ ఉండగా; మహావిభవంబు మెఱయన్ = గొప్ప వైభవం దీపించగా. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: కురువంశరాజులలో మేటి అయిన ధర్మజుడు గాంధారీధృతరాష్ట్రులను, కుంతీదేవిని ముందుంచుకొని శ్రీకృష్ణుడిని, ఆయన తమ్ముడు సాత్యకినీ, తన తమ్ములైన భీమాదులనూ, విదుర సంజయులనూ, ధృతరాష్ట్రుడి పుత్రులలో బ్రతికిఉన్న యుయుత్సుడిని, కృపాచార్యధౌమ్యులనూ, మంత్రవేత్తలైన ఋత్విక్కులనూ వెంటబెట్టుకొని బయలుదేరాడు. నూతన వస్త్రాలు, చందన కాష్ఠములు, అగరు చెక్కలు, పూలు, పండ్లు, నేతికుండలు మోసికొంటూ పరిజనులు వెంటనడిచారు. అనేక మణులు మాణిక్యాలు బంగారం ఆయన వెంట కదలి వచ్చాయి. పవిత్రాగ్నిని యోగ్యజనులు జాగరూకులై తీసికొని వస్తుండగా యుధిష్ఠిరుడు సేవక గణం తనను సేవిస్తుండగా మహా వైభవంతో విరాజిల్లుతూ.

వ. చని భీష్ముని వీరశయనస్థానంబున కనతి దూరంబునం దేరు డిగ్గినం గృష్ణాదులును రథావతరణంబులు చేసిరి; తానును వారును బారాశర్య నారద దేవల ప్రభృతి పరమసంయమి సముపాస్యమానుం డగు న మ్మాననీయుం జేర నరిగి ముని జనంబులకు వినతుం డయి తదభినందితుం డగుచు నా ధర్మనందనుం డయ్యమరనదీనందనునకు నభివందనం బాచరించి సమీచీనధ్యానతత్పరుండైన య ద్దేవవ్రతు నుద్దేశించి.

451

ప్రతిపదార్థం: చని = వెళ్ళి; భీష్ముని వీరశయన స్థానంబునకున్ = వీరుడైన గాంగేయుడి పడుక ఉన్నచోటికి; అనతి దూరంబునన్ = చేరువలోనే; తేరు+డిగ్గినన్ = స్యందనం నుండి దిగిన వెంటనే; కృష్ణ+ఆదులును = శౌరి మొదలైనవారు; రథ+అవతరణంబులు చేసిరి = తమ తమ తేరుల నుంచి దిగారు; తానును = ధర్మజుడును; వారును = కృష్ణాదులును; పారాశర్య = పరాశర మునీంద్ర పుత్రుడైన వ్యాసుడు; నారద, దేవల ప్రభృతి = నారదుడు, దేవలుడు మొదలగు; పరమ సంయమి = మహామునులచే; సముపాస్యమానుండు+అగు= లెస్సగా సేవించబడుతున్న; ఆ+మాననీయున్ = ఆ గౌరవించదగిన భీష్ముడిని; ఆ ధర్మనందనుండు = ఆ ధర్మరాజు; చేరన్+అరిగి = చెంతకు వెళ్ళి; మునిజనంబులకున్ = యోగులకు; వినతుండు+అయి = నమస్కరించి; తత్+అభినందితుఁడు+అగుచున్ = వారిచే కొనియాడబడుతూ, సంతోషపరచబడినవాడై; ఆ+అమరనదీ నందనునకున్ = ఆ దేవనదీకుమారుడైన భీష్ముడికి; అభివందనంబు+ఆచరించి = ప్రణామం సమర్పించి; సమీచీన ధ్యాన తత్పరుండు+ఐన = ఉచితమైన ధ్యానంలో నిమగ్నుడైన; ఆ+దేవవ్రతున్+ఉద్దేశించి = ఆ భీష్ముడిని గురించి; ఆయన వైపు చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధర్మరాజు మహావీరుడైన భీష్ముడు పరుండి ఉన్న ప్రదేశానికి సమీపంలో రథం దిగాడు. శ్రీకృష్ణుడు మొదలైన వారంతా తమతమ తేరులనుండి దిగారు. అజాతశత్రుడు వారితో కలసి వ్యాసుడు, నారదుడు, దేవలుడు మున్నగు మహర్షులచే సేవించబడుచున్న పూజార్హుడైన శాంతనవుడి చెంతకరిగి ముందు అక్కడి మునులకు నమస్కరించాడు. ఆ మౌనిపుంగవు లందరూ తనను కొనియాడగా పాండవాగ్రణి గంగాపుత్రుడికి ప్రణమిల్లి ధ్యాననిమగ్నుడైన ఆ మహామహు నుద్దేశించి.

తే. **'అనఘ! వచ్చితి ధర్మనందనుఁడఁ; బ్రణతి । యాచరించెద; నాపలు కవధరింప**
నవసరంబేని విను సమయంబు వార్చి । యగ్ని మొదలుగఁ దేఁ దగు నట్టివాని. **452**

ప్రతిపదార్థం: అనఘ! = పుణ్యుడా!; ధర్మనందనుఁడన్ = నేను ధర్మపుత్రుడిని; వచ్చితిన్ = వచ్చాను; ప్రణతి+ఆచరించెదన్ = నమస్కారం చేస్తున్నాను; నా పలుకు = నా మాట; అవధరింపన్ = చిత్తగించటానికి; అవసరంబు+ఏని = అవసరమైతే, సమయం కుదిరితే; విను= ఆలకించవలసినది; సమయంబు వార్చి = ఉత్తరాయణ వేళ కొరకు నిరీక్షించి; అగ్ని మొదలుగన్ = దహనసంస్కారానికి కావలసిన అనలం మొదలుకొని; తేన్+తగు+అట్టివానిన్ = తీసికొనిరాదగినట్టి వస్తువులనెల్ల (తీసుక వచ్చానని తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: 'పుణ్యపురుషా! నేను ధర్మజుడిని; వచ్చాను. నీకు నమస్కరిస్తున్నాను. అవసరమైతే నా మాటలు చిత్తగించ వలెనని వేడుతున్నాను. ఉత్తరాయణం రాగానే అగ్ని మొదలుగా తీసికొని రాదగిన వస్తువుల నెల్ల (తీసికొని వచ్చాను).

సీ. **తెచ్చితి, ఋత్విజుల్ వచ్చిరి, హరియు నీ । తనయుఁడు ధృతరాష్ట్రుఁడును, సమస్త**
బంధులుఁ గల మహీపతులు విప్రులుఁ బౌర । జనులు నేతెంచిరి సదయహృదయ!
వీరిఁ జూడుము కను విచ్చి' నావుడు నమ్మ । హాత్ముఁ డందఱఁ జూచి యా నృపాలు
కేలు దెమల్చుచు 'మేలు చేసితి దైవ । యోగంబు గాదె నీ వొదవు టరయ

ఆ. **మనుజనాథ! మాఘమాసంబు శుక్ల ప । క్షంబు నామనమున సంప్రమోద**
మావహిల్లఁ జేసె' నని యభినందించి । యతని కధిక హర్ష మావహించె. **453**

ప్రతిపదార్థం: తెచ్చితిన్ = తీసికొని వచ్చాను; ఋత్విజుల్ = పురోహితులు; వచ్చిరి = వచ్చారు; హరియున్ = నారాయణుడును; నీ తనయుఁడు = నీ కుమారుడైన; ధృతరాష్ట్రుఁడును = ధృతరాష్ట్ర మహారాజును; సమస్త బంధులున్ = చుట్టాలందరును, కలమహీపతులున్ = ఉన్న రాజులు; విప్రులున్ = భూసురులు; పౌరజనులున్ = పురవాసులును; ఏతెంచిరి = వచ్చి ఉన్నారు; సదయహృదయ! = దయతో కూడిన మనసుగల పితామహా!; కనువిచ్చి = కన్నులు దెరచి; వీరిన్ = ఈ వచ్చినవారిని; చూడుము = కనుగొనుము; నావుడున్ = అని ధర్మజుడు వచింపగా; ఆ+మహా+ఆత్ముఁడు = ఆ గొప్ప మనసు గల భీష్ముడు; అందఱన్+చూచి = ఎల్లరినీ విలోకించి; ఆ నృపాలుకేలు = రాజైన ధర్మజుడి హస్తం; తెమల్చుచున్ = తన చేతితో పట్టుకొని కదలిస్తూ; మేలు చేసితి = ఉపకార మొనర్చావు; నీవు = నీవు; ఒదవుట = నాకు లభించటం; అరయన్ = ఆలోచించగా; దైవ యోగంబు+అ+కాదు+ఎ? = దైవము యొక్క తోడ్పాటు కాదా?; మనుజనాథ! = ధర్మజా!; మాఘమాసంబు+శుక్లపక్షంబు = మాఘమాసంలోని సితపక్షం; నామనమునన్ = నా హృదయంలో; సంప్రమోదము = మిక్కిలి ఆనందం; ఆవహిల్లన్+చేసెన్ = కలిగించింది; అని; అభినందించి = కొనియాడి; అతనికిన్ = ధర్మరాజుకు; అధికహర్షము = మిక్కుటమైన సంతోషం; ఆవహించెన్ = కలిగించాడు.

తాత్పర్యం: తాతా! తీసికొనిరాదగిన వస్తువు లన్నిటినీ తీసికొని వచ్చాను. మంత్రవేత్తలైన పురోహితులు వచ్చారు. శ్రీకృష్ణుడు, నీ కుమారుడైన ధృతరాష్ట్ర మహారాజు, చుట్టాలు. ఉన్న రాజులూ, బ్రాహ్మణులూ, పౌరులూ వచ్చి ఉన్నారు. ఓ కరుణామయహృదయుడా! వీరినందరినీ కనువిచ్చి చూడు' మని ధర్మజుడు వేడుకొన్నాడు. మహాత్ముడైన గాంగేయుడు వారి నందరిని కలయజూచి, ధర్మతనయుడి కరము తన కరముతో పెనవేసి కదలిస్తూ 'నరేశ్వరా! ఎంతో ఉపకారం చేశావు. నీవు నాకు దైవానుగ్రహం వలననే లభించావు. ఈ మాఘమాస శుక్ల పక్షం నామది కెంతో హర్షం సమకూర్చింది' అని ధర్మజుని కొనియాడి అతడికి అధికానందం చేకూర్చాడు.

వ. తదనంతరంబ ధృతరాష్ట్రునితో నిట్లనియె. 454

ప్రతిపదార్థం: తత్+అనంతరంబు+అ = ఆ తరువాత; ధృతరాష్ట్రునితోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ పిదప ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

తే. 'వేదశాస్త్ర పరిజ్ఞాన వృద్ధసేవ । నములు గలిగి యశేషధర్మములు నెఱిఁగి
వ్యాసమునిపతి దేవరహస్య మర్థిఁ । జెప్ప విని నిష్కళంకత నొప్పి తనఘ! 455

ప్రతిపదార్థం: అనఘ! = పుణ్యుఁడా!; వేదశాస్త్రపరిజ్ఞాన = వేదములందలి, శాస్త్రములందలి విశేషజ్ఞానం; వృద్ధసేవనములు = పెద్దల యొక్క శుశ్రూష; కలిగి = లభించి; అశేషధర్మములున్ = సమస్త ధర్మాలు; ఎఱిఁగి = తెలిసి; వ్యాసమునిపతి = మునీంద్రుడైన వ్యాసులవారు; దేవరహస్యము = దేవతలకు మాత్రమే తెలిసిన రహస్యాన్ని; అర్థిన్ = ప్రీతితో; చెప్పన్ = తెలుపగా; విని = ఆకర్ణించి; నిస్+కళంకతన్ = దోషరాహిత్యంతో, ఎట్టి దోషం లేక; ఒప్పితి = ప్రకాశించావు.

తాత్పర్యం: 'పుణ్యపురుషా! నీవు వేదశాస్త్ర విజ్ఞానం, పెద్దలసేవ కలిగిన వాడివి. అన్ని ధర్మాలు ఎరిగిన వాడివి; వేదవ్యాసమహర్షి ప్రీతితో దేవతలకు మాత్రమే ఎరుగదగిన రహస్యం ఎరిగించగా విని దోషరహితుడవై వెలుగొందుతున్నావు.

క. కావున భవితవ్యములకు । నీ వడలఁగ వలదు; పాండునృపపుత్త్రులు స
ద్భావమునఁ జూడ నేర్చిన । భూవర! తగ నీవు గన్న పుత్త్రులుగారే.! 456

ప్రతిపదార్థం: కావునన్ = కనుక; భవితవ్యములకున్ = జరుగనున్నవాటికై; నీవు; అడలఁగన్+వలదు = భయపడవద్దు; పాండు నృపపుత్త్రులు = పాండురాజు కొడుకులు; సద్+భావమునన్ = మంచితలంపుతో; చూడన్+నేర్చినన్ = నీవు చూడగలిగితే; భూవర! = ఓ రాజా!; తగన్ = యోగ్యంగా; నీవు = నీవు; కన్నపుత్రులు+కారు+ఏ = కనినట్టిబిడ్డలు కారా? కన్న కుమారులే అని భావం.

తాత్పర్యం: ధృతరాష్ట్రమహారాజా! జరుగనున్న వాటిని గూర్చి నీవు భయపడనక్కరలేదు. మంచితలంపుతో నీవు చూడ గలిగితే నీ తమ్ముడైన పాండురాజు కుమారులు నిజంగా నీకడుపున పుట్టిన బిడ్డలవంటి వారే కదా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వీరిం బరిపాలింపుము; । వీరలశుశ్రూషఁ జిత్త వృత్తి ముదమునం
గూరఁగ ధర్మసుతునిపైఁ । గారుణ్యము గలిగి పనులు గఱపుము నెమ్మిన్. 457

ప్రతిపదార్థం: వీరిన్ = పాండునందనులను; పరిపాలింపుము = కాపాడుము; వీరలశు(శ్రూషన్ = వీరిసేవవలన; చిత్తవృత్తి = మనోవ్యాపారం; ముదమునన్ = సంతోషంతో; కూరఁగన్ = నిండగా; ధర్మసుతునిపైన్ = ధర్మపుత్రుడి మీద; కారుణ్యము = కృప; కలిగి = కల్గినవాడవై; నెమ్మిన్ = ప్రీతితో; పనులు+కఱపుము = కర్తవ్యములు బోధింపుము, రాచకార్యముల నెరిగింపుము-

తాత్పర్యం: రాజా! పాండవులను పరిపాలించుము. వీరి సేవలవలన నీ హృదయం ఆహ్లాదంతో నిండగా, ధర్మజుడిపై కృప చూపుము. ప్రీతితో ఇతడికి కర్తవ్యబోధ కావింపుము.

తే. ఏ నెఱుంగుదు నితఁడు నీయెడఁ బ్రియంబు । భక్తియును గల్గి యక్రూరభావుఁ డగుట
నీవు వత్సలత్వమున నీ నృపతిఁ బంచి । పనులు గొనుము కౌరవకుల భారధుర్య! 458

ప్రతిపదార్థం: కౌరవకుల భారధుర్య! = కౌరవవంశ భారమును మోసేవాడా!; ఇతఁడు = ధర్మరాజు; నీ+ఎడన్ = నీ విషయంలో; ప్రియంబు = ప్రేమ; భక్తియును+కల్గి = భక్తియును కలిగి; అ(క్రూరభావుఁడు+అగుటన్ = క్రూరస్వభావం, కఠినస్వభావం లేనివాడు కావటం; ఏను = నేను; ఎఱుంగుదున్ = తెలియుదును; నీవు = నీవు; వత్సలత్వమునన్ = వాత్సల్యంతో; ఈ నృపతిన్ = ఈ రాజును; పంచి = ఆజ్ఞాపించి; పనులు+కొనుము = సేవలు చేయించుకొమ్ము.

తాత్పర్యం: కురువంశ భారమును వహించే ధృతరాష్ట్రా! ధర్మజుడు నీయెడ ప్రేమ, భక్తి కలవాడని నాకు తెలుసు. ఇతడు కఠిన స్వభావం కలవాడు కాడు. నీవు వాత్సల్యంతో ఈ నృపతిని చూచుకొమ్ము. ఆజ్ఞాపించి ఇతడిచేత సేవలు చేయించుకొమ్ము!

క. విను నీతనయులు దుర్యో । ధనాదు లవినీతిపరు లధర్మజ్ఞులు క్రో
ధను లతిలుబ్ధులు వారల । మనమున నిడి వగవ వలదు మనుజాధీశా!' 459

ప్రతిపదార్థం: మనుజ+అధి+ఈశా! = నరేశ్వరా!; విను = నా పలుకు లాలకించుము; నీ తనయులు = నీ కుమారులైన; దుర్యోధన+ ఆదులు = దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైనవారు; అవినీతిపరులు = నీతి మాలినవారు; అధర్మజ్ఞులు = ధర్మమెరుంగనివారు; క్రోధనులు = కోప స్వభావులు; అతిలుబ్ధులు = మిక్కిలి దురాశాపరులు; వారలన్ = ఇట్టి వారిని; మనమునన్+ఇడి = మనసులో నిలుపుకొని; వగవన్+వలదు = దుఃఖించవద్దు.

తాత్పర్యం: రాజా! నీ కుమారులు దుర్యోధనుడు మున్నగువారు నీతిమాలిన వాళ్ళు. ధర్మవిహీనులు, కోప స్వభావులు, పరమ దురాశాపరులు; ఇట్లాంటివాళ్ళను మనస్సులో నిలుపుకొని దుఃఖించవద్దు.'

వ. అని పలికి కృష్ణు నాలోకించి. 460

తాత్పర్యం: అని వచించి శ్రీకృష్ణుడిని వీక్షించి. (తరువాతి పద్యంతో అన్వయం)

భీష్ముఁడు శరీరంబు విడుచుటకు శ్రీకృష్ణు ననుజ్ఞఁ గొనుట. (సం.13-153-36).

తే. **'దేవదేవ! జీవాత్మక! దేవవంద్య! । శంఖ చక్ర గదా పద్మ చారుహస్త!**
వాసుదేవ! త్రివిక్రమ! వరద! పరమ । పురుష! ప్రణతి యొనర్చెదఁ గరుణఁ జూడు.' **461**

ప్రతిపదార్థం: దేవదేవ! = దేవతలకు పతియైనవాడా!; దేవనాయకా! జీవ+ఆత్మక! = జీవస్వరూపుడా, జీవులలో అంతర్యామిగా ఉన్న వాడా!; దేవవంద్య = వేల్పులచేత నమస్కరించబడేవాడా, కొనియాడబడేవాడా!; శంఖచక్రగదాపద్మచారుహస్త = పాంచజన్యమనే శంఖం, సుదర్శన మనే చక్రం, కౌమోదకి అనే గద, పద్మం- అనేవాటిచే సుందరమైన చేతులు కలవాడా!; వాసుదేవ = వసుదేవుడి కుమారుడా!; త్రివిక్రమ = బలిని దానమడిగి ముజ్జగాలు ఆక్రమించినవాడా!; వరద! = భక్తులకు వరములిచ్చేవాడా!; పరమ పురుష! = పురుషులలో ఉత్తమపురుషుడా! పురుషోత్తమా!; ప్రణతి+ఒనర్చెదన్ = నిన్ను స్తోత్రం చేస్తాను; కరుణన్ = కృపతో; చూడు = కనుగొనుము.

తాత్పర్యం: 'దేవదేవా! జీవాత్మకా! వేల్పులచేత నమస్కరించబడేవాడా! శంఖం, చక్రం, గద, పద్మం అనునవి హస్తములందు ధరించినవాడా! వసుదేవనందనా! త్రివిక్రమావతార! పురుషోత్తమా! నిన్ను స్తోత్రం చేస్తున్నాను. నన్ను దయతో చూడుము.'

వ. **అనుచు నమస్కరించి.** **462**

తాత్పర్యం: అని పలుకుతూ నమస్కారం చేసి.

ఆ. **'బలము నీవ నాకు, భక్తుండ నీయెడ, । నాలుబిడ్డ లేని యట్టివాఁడఁ,**
గావు నన్ను నధిక కారుణ్యమున నిమ్ము । నుజ్ఞఁ గమలదళమనోజ్ఞనయన!' **463**

ప్రతిపదార్థం: కమలదళ మనోజ్ఞనయన! = తామర రేకులవలె అందమైన కన్నులుకలవాడా!; నాకున్ = నాకు; బలము = శక్తి; నీవు+అ = నీవే; నీ+ఎడన్ = నీ విషయంలో; భక్తుండన్ = భక్తుడిని; ఆలు = భార్య; బిడ్డ = చూలు; లేని+అట్టి వాఁడన్ = లేనటు వంటి వాడిని; అధిక కారుణ్యమునన్ = మిక్కిలిదయతో; నన్నున్ = నన్ను; కావు = రక్షించుము; అనుజ్ఞన్+ ఇమ్ము = నేను వెళ్ళటానికి ఉత్తరువు ఒసంగుము.

తాత్పర్యం: 'పద్మపత్రాల వంటి సుందరనేత్రాలు కలవాడా! నాకు నీవే బలం. నేను నీ భక్తుడిని. ఆలూ, చూలూ లేనివాడిని. నన్ను పరమకృపతో పరిరక్షించుము. శరీరయాత్ర ముగించటానికి సెలవియ్యవలసింది.'

వ. **అని వెండియు.** **464**

తాత్పర్యం: అని మరల. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **'మాధవ! పాండుకుమార వర్గమునకు । గతి నీవ; రక్షింపు కరుణ మెఱయ;**
దుర్బుద్ధియైన యా దుర్యోధనుని తోడఁ । గృష్ణుఁ డెక్కడ నుండు గెలుపు గలుగు

నక్కడి కంటి నేఁ బెక్కుమాఱులు; నట్లు । చెప్పఁగా నా పంపు సేయ కతఁడు

దమవారి నెల్లను సమయించి తానును । సమసె; ని న్నెఱుఁగుదు; నమిత మహిమ

తే. **నరుఁడు నారాయణుఁడు నను పరమమునులు । జగము రక్షించుటకుఁ గేలి జన్మ మొంది**

సంచరించెద రని పరాశరసుతుండు । నారదుండును జెప్పిరి నాకుఁ దొల్లి.' **465**

ప్రతిపదార్థం: మాధవ! = లక్ష్మీనాయకా!; పాండు కుమార వర్గమునకున్ = పాండురాజు యొక్క సుతసమూహానికి; గతి = దిక్కు; నీవు+అ = నీవేనయ్యా!; కరుణమెఱయన్ = కృప వెలయగా; రక్షింపు = వారిని కాపాడుము; దుర్బుద్ధి+ఐన = చెడుబుద్ధి గలవాడైన; ఆ+దుర్యోధనుని తోడన్ = ఆ సుయోధనుడితో; నేన్ = నేను; పెక్కుమాఱులు = పలుసారులు; కృష్ణుఁడు+ఎక్కడన్+ ఉండున్ = శ్రీకృష్ణుడు ఏ పక్షంలో ఉంటాడో; అక్కడికిన్ = ఆ పక్షానికి; గెలుపు+కలుగున్+అంటిన్ = విజయం లభిస్తుందని చెప్పాను; అట్లు చెప్పఁగాన్ = అట్లా చెప్పినప్పటికినీ; నా పంపు+చేయక = నా ఆజ్ఞ ననుసరించక; అతఁడు = ఆ సుయోధనుడు; తమవారిన్; ఎల్లనున్ = అందరినీ; సమయించి = చంపి; తానును+సమసెన్ = తాను కూడ మరణించాడు; నిన్నున్+ఎఱుఁగుదున్ = నీ వెవరో తెలిసికొన్నాను; అమిత మహిమన్ = మిక్కిలి ప్రభావంతో; నరుఁడు = నరుడు; నారాయణుఁడు = నారాయణుడు; అను = అనే పేరులు గల; పరమమునులు = గొప్ప మునీశ్వరులు; జగము రక్షించుటకున్ = లోకాన్ని కాపాడటానికే; కేలిజన్మము+ఒంది = వినోదించుటకు జన్మము లెత్తి, లీలామానుష విగ్రహులై; సంచరించెదరు+అని = విహరిస్తున్నారు, మెలగుతున్నారు అని; పరాశరసుతుండు = పరాశరమహర్షి తనయుడైన, శ్రీ వేదవ్యాసమహర్షి; నారదుండును = బ్రహ్మమానసపుత్త్రుడైన నారదమహర్షియు; నాకున్ = నాకు; తొల్లి = మునుపు, పూర్వం; చెప్పిరి = తెలిపి ఉన్నారు.

తాత్పర్యం: 'రమావల్లభా! పాండునందనులకు నీవే దిక్కు. వారిని కరుణతో కాపాడుము. దుష్టబుద్ధి అయిన దుర్యోధనుడితో 'కృష్ణుడు ఏ పక్షంలో ఉంటాడో ఆ పక్షమునకు విజయం తథ్య' మని పలుమారు నేను చెప్పాను. పాండవులతో కలసి మెలసి ఉండుమని నేను చెప్పిన మాటలు అతడు వినక యుద్ధ మొనర్చి తమవారినందరిని మరణం పాలుచేసి తుదకు తానుగూడ మరణించాడు. కేశవా! నిన్ను నే నెరుగుదును. మహా మహిమతో నరుడు, నారాయణుడు అనే పరమఋషులు లోక సంరక్షణార్థం లీలామానుష వేషధారులై శ్రీకృష్ణార్జునులుగా చరిస్తున్నారని పరాశరమహర్షి నందనుడైన వ్యాసులవారూ, బ్రహ్మమానసపుత్త్రుడైన నారదులవారూ నాకు మునుపే చెప్పి ఉన్నారు.'

వ. **అనిన విని వాసుదేవుండు దేవవ్రతు వదనం బత్యాదరంబున నాలోకించి.** **466**

ప్రతిపదార్థం: అనినన్; విని; వాసుదేవుండు; దేవవ్రతువదనంబు = భీష్ముడి ముఖం; అతి+ఆదరంబునన్ = మిక్కిలి మన్ననతో; ఆలోకించి = చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: భీష్ముడి పలుకులు విని శ్రీకృష్ణుడు మిక్కిలి ఆదరంతో ఆయన ముఖం చూచి (ఇట్లా అన్నాడు)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. 'కీ డొకప్డు లేదు, కృతపుణ్యుఁ డవు, తండ్రి । వలని భక్తి పెంపు గలవు; దానఁ
గాదె బంటుఁ బోలె గాంగేయ! మృత్యువు । నీవశమున నిలిచె నిర్భరముగ. 467

ప్రతిపదార్థం: గాంగేయ! = గంగానందనా!; ఒకప్డు = ఏనాడున్నూ; కీడు = నీ వలన దోషం; లేదు = లేదు; కృతపుణ్యుఁడవు = పుణ్యములు సల్పినట్టివాడివి; తండ్రి వలని = నీ జనకుడియందు; భక్తి పెంపు+కలవు = అమితభక్తి కలిగినట్టివాడవు. దానన్+కాదు+ఎ = ఆ కారణం చేతనే కదా!; బంటున్+పోలెన్ = సేవకుడి వలె; మృత్యువు = మిత్తి; నీ వశమునన్ = నీ అధీనంలో; నిర్భరముగన్+నిలిచెన్ = పూర్తిగా నిలిచింది.

తాత్పర్యం: 'గంగాపుత్రా! నీ వలన ఏనాడూ దోషం లేదు. నీవు పరమ పుణ్యాత్ముడివి. తండ్రియందు మిక్కిలి భక్తి గలవాడివి. కనుకనే బంటువలె అడుగులకు మడుగు లొత్తుతూ మృత్యువు నీ అధీనంలో నిలిచింది.

భీష్ముఁడు శరీరంబు విడిచి నాకలోకగతుం డగుట. (సం.13-153-46).

వ. నీకు నే ననుజ్ఞ యిచ్చితి వసువులం బొందు' మనినం బరమానందంబునం బొంది పాండునందనులను ధృతరాష్ట్రునిం దక్కటి వారలనుం గనుంగొని 'మీచేత ననుజ్ఞాతుండన కదా' యని పలికి, యందఱం గౌఁగిలించుకొని 'యానృశంస్యంబును సత్యంబును నిత్యంబులుగాఁ బాటించి బ్రదుకుం' డని చెప్పి, తాను దొల్లి రాజుల గెల్చి తెచ్చిన ధనంబులు విప్రజనంబుల కిచ్చి, ధర్మతనయుం జూచి 'యెల్ల బ్రాహ్మణులునుం బూజనీయులు; ఋత్విజులు నాచార్యులు వృద్ధులు విశేషించి పూజింప వలయువా' రని నిర్దేశించి యూరకుండి, ధారణానుక్రమంబున సమాహితాత్ముం డయి వాయువుల సన్నిరుద్ధంబు చేసిన నవి యూర్ధ్వగతిం గైకొనియె; నమ్మహాత్ముం డవయవంబులం బ్రాణంబులు వాపికొనుచు వచ్చునయ్యై చోట్లు శల్యరహితంబు లగుచుండె; నట్లగుటం గాంచి కృష్ణాదులగు నఖిలజనంబులు నాశ్చర్యభరితాంతఃకరణు లగుచుఁ గీర్తించి; రా సంయమచతురునిచే సర్వాయతన సన్నిరుద్ధంబై యాత్మ మూర్ధంబు భేదించి మహోల్కాకారంబున నాకసంబున కెగసి కొంతద వ్వరిగి యంత నంతర్హితం బయ్యె; నప్పుడు పుష్పవృష్టి గురిసె, దేవ దుందుభులు మొరసె, నంబరంబున సిద్ధులు సాధ్యులుం బొగడుచుం బ్రమోదంబు నొంది; రిట్లు దేవవ్రతుండు దివంబునకుం జనుటయు. 468

ప్రతిపదార్థం: నీకున్; నేను; అనుజ్ఞ = అనుమతి, సెలవు; ఇచ్చితిన్; వసువులన్ = వసువులనెడు దేవగణమును; పొందుము = చేరుము, కలియుము; అనినన్; పరమ+ఆనందంబునన్+పొంది = మిక్కిలి సంతోషం చెంది; పాండునందనులను = పాండురాజు కుమారులను; ధృతరాష్ట్రునిన్; తక్కటి వారలనున్ = మిగిలిన వారిని; కనుంగొని = చూచి; మీ చేతన్; అనుజ్ఞాతుండను+అ+కదా? = అనుమతించబడినవాడనే గదా?; అని; పలికి; అందఱన్ = ఎల్లరను; కౌఁగిలించుకొని; ఆనృశంస్యంబును = క్రూరత్వం లేకుండుటనూ, అహింసనూ; సత్యంబును = సత్యం పలుకుటనూ; నిత్యంబులుగాన్ = శాశ్వతములుగా; పాటించి = అనుసరించి; బ్రదుకుండు = జీవించండి; అని చెప్పి; తాను; తొల్లి = పూర్వం; రాజులన్; గెల్చి; తెచ్చిన ధనంబులు; విప్రజనంబులకున్ = బ్రాహ్మణసమూహానికి; ఇచ్చి; ధర్మతనయున్+చూచి; ఎల్లబ్రాహ్మణులునున్ =

విప్రులందరూ; పూజనీయులు = పూజించదగినవారు; ఋత్విజులు = యజ్ఞం చేయించే బ్రాహ్మణులు; ఆచార్యులు = గురువులు; వృద్ధులు = ముసలివారు; విశేషించి = ముఖ్యంగా; పూజింపన్ వలయువారు = పూజించదగినవారు; అని; నిర్దేశించి = నిర్ణయంగా చెప్పి; ఊరకుండి = మాట లుడిగి, మాటలు మాని, మిన్నకుండి; ధారణా+అనుక్రమంబునన్ = యోగధారణచేత; సమాహిత+ఆత్ముండు+అయి = నిశ్చలమైన మనస్సు కలవాడయి; వాయువులన్ = ప్రాణాపానాది వాయువులను; సన్నిరుద్ధంబు చేసినన్ = చక్కగా అడ్డగించగా; అవి = ఆ ప్రాణాపానాదివాయువులు; ఊర్ధ్వగతిన్+కైకొనియెన్ = ఊర్ధ్వగమనాన్ని పొందాయి; ఆ+మహా+ఆత్ముండు = ఆ దొడ్డ మనస్సు గల భీష్ముడు; అవయవంబులన్ = శరీరావయవములందు; ప్రాణంబులు = ప్రాణాలను; పాపి కొనుచున్ = తొలగించుకొంటూ; వచ్చు+అయ్యైచోట్లు = వచ్చునట్టి ఆయా ప్రదేశాలు; శల్యరహితంబులు+ అగుచున్ = శల్యములు లేని వవుతూ; ఉండెన్ = ఉండినవి; అట్లు+అగుటన్ = అట్లాకావటం; కాంచి = చూచి; కృష్ణ+ఆదులు+అగు = శ్రీకృష్ణుడు మొదలైన; అఖిలజనంబులు = ప్రజలందరూ; ఆశ్చర్యభరిత+అంతఃకరణులు+అగుచున్ = అద్భుతరసంతో నిండిన మనస్సులు కలవా రవుతూ; కీర్తించిరి = మెచ్చారు; ఆ+సంయమచతురునిచేన్ = ఇంద్రియనిగ్రహమందు నేర్పరి అయిన భీష్ముడిచే; సర్వ+ఆయతన సన్నిరుద్ధంబు+ఐ = అన్ని అవయవ ద్వారముల యందునూ అడ్డగించబడినదై; ఆత్మ = జీవుడు; మూర్ధంబు = శీర్షం, తల, కపాలం; భేదించి = చీల్చుకొని; మహా+ఉల్కా+ఆకారంబునన్ = గొప్ప అగ్ని కణము యొక్క రూపంతో, గొప్పదివిటీ రూపంతో; ఆకసంబునకున్ = నింగికి; ఎగసి; కొంతదవ్వు = కొంతదూరం; అరిగి = వెళ్ళి; అంతన్ = ఆ పిదప; అంతర్హితంబు+అయ్యెన్ = మాయమయింది; అప్పుడు = ఆ సమయాన; పుష్పవృష్టి = పూలవాన; కురిసెన్; దేవదుందుభులు = వేల్పుల నగారాలు; మొరసెన్ = మ్రోగినవి; అంబరంబునన్ = గగనంలో; సిద్ధులున్, సాధ్యులున్ = ఆ పేరుగల దేవజాతివారు; పొగడుచున్ = భీష్ముడిని శ్లాఘిస్తూ; ప్రమోదంబున్+ఒందిరి = సంతోషించారు; దేవవ్రతుఁడు = భీష్ముడు; దివంబునకున్ = స్వర్గానికి; చనుటయున్ = వెళ్ళగా.

తాత్పర్యం: 'గంగానందనా! వెళ్ళుటకు నిన్ను అనుమతిస్తున్నాను. నీ తోటివారైన వసువులను నీవు కలిసికొమ్ము' అని వాసుదేవుడు పలుకగా భీష్ముడు పరమానందభరితుడయ్యాడు. పాండవులను, ధృతరాష్ట్రుడిని, తక్కిన వారిని చూచి 'మీచేత అనుమతించబడ్డానుగదా!' అని పలికి వారందరినీ కౌగిలించుకొన్నాడు. 'అక్రూరులై, సత్య వచనులై మీరు జీవితం గడపండి' అని వచించి ఆ మహాపురుషుడు పూర్వం తాను రాజులను జయించి తెచ్చిన ధనరాసులను బ్రాహ్మణుల కిచ్చి ధర్మరాజును జూచి 'వత్సా! బ్రాహ్మణు లందరూ పూజ్యులు. వారిలోనూ ముఖ్యంగా ఋత్విక్కులు, గురువులు, వృద్ధులు ఆరాధించదగినవారు' అని గట్టిగా నుడివి మౌనం వహించాడు. యోగధారణచే చిత్తమును నిగ్రహించి ప్రాణాపానాదివాయువుల సంచారాన్ని అడ్డగించగా అవి ఊర్ధ్వముఖంగా పయనించి మూర్ధమును చేరాయి. అపు డా మహనీయుడు ఒక్కొక్క అవయవమునుండి ప్రాణములను తొలగించుకొంటూ రాగా రాగా ఆ స్థానములన్నీ శల్యరహితా లయినాయి. ఇట్లా జరగటం చూచి మధుసూదనుడు మున్నగు సకల జనుల హృదయాలు పరమాశ్చర్యభరితా లయ్యాయి. వారందరూ భీష్ముడిని మిక్కిలి కొనియాడారు. ఇంద్రియాలను అరికట్టటంలో మిగుల సమర్థుడైన భీష్ముడిచే అన్ని అవయవద్వారాల నుండి అడ్డగించబడిన అతడి ఆత్మ శిరస్సు భేదించుకొని గొప్ప అగ్నికణం వలె కనిపిస్తూ మింటికెగసి కొంతదూరం వెళ్ళి ఆ తరువాత అంతర్ధాన మయింది. అపుడు దేవతలు పూలవాన కురిపించారు, నగారాలు మ్రోగించారు. సిద్ధులు, సాధ్యులు అనే దేవజాతివారు భీష్ముడిని శ్లాఘిస్తూ హర్షించారు. ఆ విధంగా ఆ మహనీయుడు శరీరం విడిచి స్వర్గం చేరిపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరలోకగతుండైన భీష్మునకు నగ్నిసంస్కారంబు చేయుట. (సం.13-154-8.)

సీ. ధర్మపుత్త్రుండును దమ్ములు విదుర యు । యుత్సులు నగరు కాష్ఠోత్కరంబుఁ
జందన దారు సంచయమును గొని సమ । స్థలి సమంచిత చితి యలఘు భంగి
విరచించి; రయ్యుధిష్ఠిరుఁడును ధృతరాష్ట్రుఁ । డును న మ్మరున్నదీ తనయు పుణ్య
గాత్రంబు సుస్నాన కలితంబు విహితాను । లేపంబుఁ బుష్పదామోపశోభి

తే. తంబు నుత్తమ క్షౌమావృతంబు నుజ్జ్వ । లాభరణ భూషితంబుఁగా నధికభక్తిఁ
జేసి; రప్పుడు సామంబు సెలఁగ హోమ । మాచరించిరి యాజకు లగ్నీ యలర. 469

ప్రతిపదార్థం: ధర్మపుత్త్రుండును; తమ్ములున్; విదుర యుయుత్సులున్ = విదురుడును, యుయుత్సుడును; అగరుకాష్ఠ+ఉత్కరంబున్ = అగరు చెక్కల యొక్క మొత్తమును; చందనదారు సంచయమును = చందనపు కొయ్యల యొక్క మొత్తమును; కొని = తీసికొని; సమస్థలిన్ = మిట్ట పల్లాలు లేని చదునైన తావులో; సమంచితచితి = ఒప్పిదమైన సొద; అలఘుభంగిన్ = ఘనమైన రీతిలో; విరచించిరి = పేర్చిపెట్టారు; ఆ+యుధిష్ఠిరుఁడును = ఆ ధర్మజుడు; ధృతరాష్ట్రుడును; ఆ+మరుత్+నదీతనయు = ఆ దేవనదీ పుత్త్రుడైన భీష్ముడి యొక్క; పుణ్యగాత్రంబున్ = పావనశరీరాన్ని; సుస్నానకలితంబున్ = మంత్రయుక్తమైన చక్కని స్నానంతో కూడినదిగాను; విహిత+అనులేపంబున్ = తగిన మైపూతలు గలదిగానూ; పుష్పదామ = పూలదండలచే; ఉపశోభితంబున్ = శోభింపజేయబడినదిగానూ; ఉత్తమక్షౌమ+ఆవృతంబున్ = మేలైన పట్టు వస్త్రములచే ఆవరించబడినదిగానూ; ఉజ్జ్వల = ప్రకాశిస్తున్న; ఆభరణ+భూషితంబున్+కాన్ = సొమ్ములచే అలంకరించ బడినదిగానూ; అధికభక్తిన్ = మిక్కిలి భక్తితో; చేసిరి = ఒనర్చిరి; అప్పుడు = ఆ సమయమందు; సామంబు+చెలఁగన్ = సామవేద మంత్రపఠనం అతిశయించగా; యాజకులు = ఋత్విక్కులు; అగ్ని+అలరన్ = అగ్నిహోత్రుడు ఆనందించగా; హోమము+ఆచరించిరి = హోమం చేశారు.

తాత్పర్యం: ధర్మరాజు, అయన తమ్ములు, విదురుడు, యుయుత్సుడు అగరు చందన కాష్ఠాలతో చదునైన ప్రదేశంలో చితిని కడుగొప్పగా పేర్చారు. మిక్కిలి భక్తితో ధర్మజుడు ధృతరాష్ట్రుడు గంగానదీ నందనుడి పవిత్రగాత్రాన్ని స్నానం చేయించారు. ఒడలికి చందనం పూశారు. మేలైన పట్టువస్త్రం చుట్టి పూలదండలతో, మెరిసే ఆభరణాలతో అలంకరించారు. అపుడు సామవేద పఠనం జరిగింది. పురోహితులు అగ్నిదేవుడు హర్షించే టట్లు హోమం చేశారు.

క. కనకములు మణులు భూసుర । జనసం ఘంబున కజాతశత్రుఁడు శ్రద్ధా
వినయప్రీతి యుతంబుగ । ననేకములు వేడ్క నొసఁగె నవహిత మతియై. 470

ప్రతిపదార్థం: అజాతశత్రుఁడు = ధర్మరాజు; అవహితమతి+ఐ = సావధానచిత్తుడై; కనకములు = బంగారం; మణులు = రత్నాలు, మాణిక్యాలు; భూసురజనసంఘంబునకున్ = బ్రాహ్మణసమాజానికి; శ్రద్ధావినయప్రీతియుతంబుగన్ = విశ్వాసమూ, అణకువ, సంతోషం అనే గుణాలతో కూడిన వాడై; అనేకములు = పెక్కులు; వేడ్కన్+ఒసఁగెన్ = ప్రీతితో ఇచ్చాడు.

తాత్పర్యం: అజాతశత్రుడు; సావధానమనస్కుడై శ్రద్ధ, వినయం, సంతోషం అనేగుణాలు ముప్పిరిగొనగా పెక్కుమణులు, బంగారం బ్రాహ్మణ సమూహానికి వేడుకతో ఇచ్చాడు.

వ. తదనంతరంబ. 471

తాత్పర్యం: అటు పిమ్మట.

క. తలదిక్కు గవలుఁ బాదం । బుల దెస ధృతరాష్ట్ర పాండు భూపాగ్రతనూ
జులుఁ బట్టి యధిక విభవో । జ్జ్వల మగు పాడె పయి నిడిరి శవరత్నంబున్. 472

ప్రతిపదార్థం: తలదిక్కు = తలవైపు; కవలు = నకుల సహదేవులు; పాదంబులదెసన్ = కాళ్ళవైపు; ధృతరాష్ట్రపాండు భూప+అగ్రతనూజులున్ = ధృతరాష్ట్రుడు, పాండురాజు యొక్క పెద్దకొడుకు-ధర్మజుడు; పట్టి = పట్టుకొని; అధిక విభవ+ఉజ్జ్వలము+అగు = మిక్కిలి వైభవంతో ప్రకాశిస్తున్న; పాడెపయిన్ = శవవాహనం మీద; శవరత్నంబున్ = శ్రేష్ఠమైన భీష్ముడి శవాన్ని; ఇడిరి = ఉంచారు.

తాత్పర్యం: భీష్ముడి శవాన్ని తల తట్టు నకుల సహదేవులు, కాళ్ళతట్టు ధృతరాష్ట్ర ధర్మజులు పట్టుకొని మిక్కిలి వైభవంతో ఒప్పారుచున్న శవవాహనం మీద ఉంచారు.

వ. అమ్మెయి నన్నలువురును వహించిరి; భీమసేనార్జునులు ధవళచామరంబు లిడిరి; యుయుత్సుం డుత్తమచ్ఛత్రంబు వట్టె; వృద్ధలగు కౌరవ స్త్రీ లాలవట్టంబులు వట్టిరి; ధౌమ్యుండు క్రియా కలాపంబు నడపె; నట్లు సొదసేర్చి దేవవ్రతుని దేహంబు శ్రౌతాగ్ని కాహుతి చేసి బహుకుండంబు లెత్తి ఘృతంబు ప్రయోగించి ప్రజ్వలింపఁ జేసి; రివ్విధంబునం బితృమేధంబు విభవమహితంబును, విధివిహితంబు నుంగా ననుష్ఠించి య క్కౌరవు లపసవ్యంబుగాఁ దిరిగి కృష్ణద్వైపాయన నారద దేవల ప్రభృతు లనుగమింప భాగీరథికిం జని సర్వభరతభార్యా సమేతంబుగా న గ్గాంగేయునకుఁ దిలోదక ప్రదానంబు లాచరించి; రట్టి సమయంబున. 473

ప్రతిపదార్థం: ఆ+మెయిన్ = ఆ విధంగా; ఆ+నలువురును = నకులసహదేవులు; ధృతరాష్ట్రుడు, ధర్మరాజు; వహించిరి = పాడెను బుజాల కెత్తుకున్నారు; భీమసేన+అర్జునులు = భీముడు, అర్జునుడు; ధవళచామరంబులు+ఇడిరి = తెల్లని చామరాలతో విసిరారు; యుయుత్సుఁడు; ఉత్తమ+ఛత్రంబు+పట్టెన్ = గొప్పగొడుగును ధరించాడు; వృద్ధలు+అగు = ముదుసళ్ళయిన; కౌరవస్త్రీలు = కురువంశమునకు చెందిన ఆడువారు; ఆలవట్టంబులు+పట్టిరి = గుడ్డతో తయారు చేసిన గుండ్రని విసనకర్రలతో విసిరారు; ధౌమ్యుండు = ధౌమ్యులవారు; క్రియాకలాపంబునడపెన్ = మంత్రతంత్రయుక్తమైన కర్మకాండ జరిపాడు; అట్లు = ఆ విధంగా; దేవవ్రతుని దేహంబున్ = భీష్ముడి యొక్క శరీరాన్ని; సొద+చేర్చి = చితిపై పరుండబెట్టి; శ్రౌత+అగ్నికిన్ = వేదవిహితమైన అనలానికి; ఆహుతి చేసి = హోమద్రవ్యంగా సమర్పించి; మంత్రపూర్వకంగా వేల్చి; బహుకుండంబులు+ఎత్తి = పెక్కు కుంభము లెత్తి, పలుకడవలు ఎత్తి; ఘృతంబు = నెయ్యి; ప్రయోగించి = చితాగ్నిలో క్రుమ్మరించి; ప్రజ్వలింపన్+చేసిరి = గనగన మండేటట్లు కావించారు; ఈ+విధంబునన్ = ఈ రీతిగా; పితృమేధంబు = ప్రేతకార్యం; విభవమహితంబునున్ = వైభవంతో ఒప్పినదిగానూ; విధివిహితంబునున్+కాన్ = శాస్త్ర సమ్మతమైనదిగానూ;

అనుష్ఠించి = ఆచరించి; ఆ+కౌరవులు = ఆ కురువంశ్యులు; అపసవ్యంబుగాన్ = అప్రదక్షిణంగా; తిరిగి = మరలి; కృష్ణద్వైపాయన, నారద, దేవల, ప్రభృతులు = వ్యాసుడు, నారదుడు, దేవలుడు మొదలైనవారు; అనుగమింపన్ = తమ వెంటరాగా; భాగీరథికిన్ = గంగానదికి; చని = వెళ్ళి; సర్వభరత భార్యా సమేతంబుగాన్ = భరతవంశస్థులైన సమస్త కౌరవుల భార్యలతో కూడ; ఆ+గాంగేయునకున్ = గంగాపుత్త్రుడైన భీష్ముడికి; తిల+ఉదకప్రదానంబులు = నువ్వులు నీళ్ళు వదలటం; ఆచరించిరి = చేశారు; అట్టి సమయంబునన్ = ఆ వేళలో.

తాత్పర్యం: ఆ విధంగా తలవైపు నకులసహదేవులు, కాళ్ళవైపు ధర్మజ ధృతరాష్ట్రులు పాడెను తమ బుజాలపై నిడుకొని మోశారు. భీమార్జునులు వింజామరలతో విసిరారు. యుయుత్సుడు గొప్పగొడుగును పట్టాడు. కౌరవ స్త్రీలలో ముసలివాళ్ళు ఆలవట్టములు ధరించారు. ధౌమ్యుడు కర్మకాండ జరిపాడు. భీష్ముడి శరీరాన్ని చితిపై నుంచి వేదవిహితమైన అగ్నికి ఆహుతి చేశారు. లెక్కలేనన్ని నేతికుండలు చితాగ్ని గనగనమండగా క్రుమ్మరించారు. ఈ రీతిగా శవదహనకార్యం శాస్త్రసమ్మతంగా వైభవోపేతంగా ఆచరించి ఆ కౌరవు లందరూ అప్రదక్షిణంగా మరలి స్నానాలకై గంగకు వెళ్ళారు. వారి వెంట వ్యాసుడు, నారదుడు, దేవలుడు మున్నగు మునిపుంగవులు బయలుదేరారు. కౌరవు లందరూ పత్నీసహితంగా గంగలో మునిగి భీష్ములవారికి నువ్వులు నీళ్ళు వదిలారు. ఆ సమయంలో.

పుత్త్రశోకాతుర యైన గంగాదేవి కృష్ణాదులం గనుంగొని దుఃఖించుట. (సం.13-154-18.)

సీ. **ఉదకంబులందుండి యుత్థితయై శోక । విహ్వలత్వంబున వికల గమన**
యగుచు నెమ్మోముపై నశ్రులు గ్రమ్మఁగా । జనుదెంచి కౌరవసమితి యెదుర
నిలిచి భాగీరథి 'యలఘుండు తన కొడు । కిలఁ బరికింపఁగా నెట్టిభంగి
వాఁడయ్యెఁ? జరితంబుపోఁడిమి మీరెల్ల । నెఱుఁగుదు; రైనను నేను గొంత

తే. **సెప్ప వినుఁడు! దృఢ వ్రతశీలుఁ, డమల । బుద్ధి రాజవృత్తాఢ్యుఁడు, భూరికృపుఁడు,**
కార్యసంవేది, పితృభక్తి ధుర్యుఁ, డార్య । సమ్మతుండు, విద్యా పరిశ్రమ ఘనుండు. **474**

ప్రతిపదార్థం: భాగీరథి = గంగాదేవి; ఉదకంబులందున్+ఉండి = నీళ్ళలో నుండి; ఉత్థిత+ఐ = లేచినదై; శోకవిహ్వలత్వంబునన్ = దుఃఖం చేత అవయవాలు స్వాధీనం తప్పగా; వికలగమన+అగుచున్ = తడబడే నడక గలది అవుతూ; నెమ్మోముపైన్ (నెఱ+మోము) = అందమైన మొగం మీద; అశ్రులు క్రమ్మన్+కాన్ = కన్నీటి బిందువులు ఆవరించగా; చనుదెంచి = వచ్చి; కౌరవసమితి+ఎదురన్+నిలిచి = కౌరవుల సమూహం యొక్క ముందు నిలబడి; తన కొడుకు = తన పుత్త్రుడైన భీష్ముడు; అలఘుండు = గొప్పవాడు; ఇలన్ = ధరణియందు; పరికింపన్+కాన్ = పరిశీలించగా, తలపోయగా, ఆలోచించగా; ఎట్టిభంగి వాఁడు+అయ్యెన్ = ఎంతగొప్పతీరు తెన్నులు కలవాడయ్యాడు; చరితంబు పోఁడిమిన్ = అతడి ప్రవర్తన యొక్క గొప్పతనం; మీరు+ఎల్లన్ = మీరందరూ; ఎఱుంగుదురు = తెలిసిఉన్నారు; ఐనను = కాని; నేను; కొంత = కొంచెం; చెప్పన్ = తెలుపగా; వినుఁడు = ఆలకించండి; దృఢవ్రతశీలుఁడు = గట్టి పట్టుదల కలవాడు; అమలబుద్ధి = నిర్మలమైన బుద్ధికలవాడు; రాజవృత్త+ఆఢ్యుఁడు = క్షత్రియ ధర్మవర్తనమందు విఖ్యాతుడు; భూరికృపుఁడు = గొప్పదయకలవాడు; కార్యసంవేది = చేయదగిన పను లెరింగిన వాడు; పితృభక్తి ధుర్యుఁడు = పితృభక్తియందు అగ్రేసరుడు; (పితృభక్తి = జనకునియందు గాఢమైన ప్రేమ); ఆర్యసమ్మతుండు = పెద్దలకు ఇష్టుడు, ప్రియమైనవాడు; విద్యా పరిశ్రమ ఘనుఁడు = చదువులందలి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరిశ్రమచేత దొడ్డవాడు; కష్టపడి విద్యలు నేర్చిన దొడ్డ మనిషి.

తాత్పర్యం: గంగాదేవి జలముల నుండి పైకిలేచి దుఃఖంతో విలవిల్లాడుతూ, తడబడేనడకతో ముఖం నిండా కన్నీళ్ళు నిండగా వచ్చి కౌరవులముందు నిలిచింది. నా తనయుడైన భీష్ముడు గొప్పవాడు. 'ధరణిలో తనంతటివాడు మరొకడు లేడనిపించుకొన్నాడు. ఆతడి నడవడి ఎంత గొప్పదో మీకందరికీ తెలుసు. అయినా, నేను కొంచెం చెప్తుతాను. వినండి; నా కుమారుడు గట్టి పట్టుదల గలవాడు. నిర్మలమైన బుద్ధిగలవాడు. క్షత్రియధర్మశీలి. పరమదయాస్వభావుడు. చేయదగిన పను లెరిగినవాడు. పితృభక్తి యందు అగ్రేసరుడు. పెద్దలందరికీ ప్రియమైనవాడు. అధికంగా విద్యాపరిశ్రమ సల్పినవాడు.

తే. **కాశిరాజ కన్యకలకుఁగాఁ బెనంగి । వానిచే గాసియైరి భూవరులు పలువు**
రంబకై పూని వానిమహాబలంబు । జామదగ్న్యుండుఁ దెరలుపఁ జాల కరిగె.' 475

ప్రతిపదార్థం: కాశిరాజ కన్యకలకున్+కాన్ = కాశీరాజు కొమార్తెలకై; పెనంగి = పోరాడి; వానిచేన్ = నా కుమారుడు భీష్ముడిచేత; పలువురు భూవరులు = పెక్కుమంది రాజులు; గాసి+ఐరి = కష్టాలపాలయ్యారు; అంబకై = కాశీరాజు కూతురు అంబకొరకు; పూని = యత్నించి; వానిమహాబలంబు = అతడి యొక్క గొప్పశక్తిని; జామదగ్న్యుండు = జమదగ్ని కొడుకైన పరశురాముడు; తెరలుపన్+చాలక = కదిలించలేక; అరిగెన్ = ఓడి వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: నా కుమారుడు తన తమ్ములకొరకై కాశీరాజ పుత్రికలను అంబ, అంబిక, అంబాలికలను తీసికొని వచ్చేటప్పుడు రాజులు అతడితో పోరాడి వెతలపాలయ్యారు. అంబ యొక్క పక్షం వహించి ఎదుర్కొన్న పరశురాముడు నా కుమారుడి బలాన్ని కదిలించలేక భంగపడి తొలగిపొయ్యాడు.'

వ. **అని విలాపంబు చేసి వెండియు. 476**

తాత్పర్యం: అని రోదించి మరల (ఇట్లా అన్నది అని తరువాతి పద్యంతో అన్వయం).

తే. **'అంతవాఁడు శిఖండిచే నట్టు లగుట । గనియుఁ బెక్కులు పఱియలు గాక యునికి**
కతనఁ జేసి వజ్రమయంబు గాఁగ నోపు । నని తలంచెద నాడెంద మన్నలార!' 477

ప్రతిపదార్థం: అన్నలార! = భ్రాతలారా!; అంతవాఁడు = అంతటిశక్తి సంపన్నుడు; శిఖండిచేన్ = శిఖండి అనే ఒక సామాన్యుడి చేత; అట్టులు+అగుట = యుద్ధంలో కూలి శరతల్పగతుడుకావటం; కనియున్ = చూచి కూడ; నా డెందము = నా గుండె; పెక్కులు+పఱియలు కాక = బ్రద్దలు బ్రద్దలుగా పగిలిపోక; ఉనికి కతనన్+చేసి = ఎప్పటి వలె ఉన్నట్టి హేతువును బట్టి; వజ్రమయంబు+కాఁగన్+ఓపున్ = వజ్రంతో తయారు చేసిన దేమో అని; తలంచెదన్ = భావిస్తాను.

తాత్పర్యం: 'అన్నలారా! అంతటి శక్తి సంపన్నుడు సామాన్యుడైన శిఖండిచే కదనమున కూలి శరతల్ప గతుడవటం కంటితో చూచి కూడ నా గుండె బ్రద్దలు కాకుండా ఎప్పటివలె ఉన్నదంటే అందుకు కారణం అది వజ్రంతో నిర్మించబడినదేమో అని భావిస్తాను.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని వగచిన గంగాదేవికి దేవకీనందనుం డిట్లనియె. 478

ప్రతిపదార్థం: అని; వగచిన = శోకించిన; గంగాదేవికిన్; దేవకీనందనుండు = శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని దుఃఖిస్తున్న గంగాదేవితో శ్రీకృష్ణు డిట్లా అన్నాడు.

పుత్త్రమరణ దుఃఖితయగు గంగను కృష్ణద్వైపాయను లూఱడించుట. (సం.13-154-26).

తే. 'నీవు శోకంబు దక్కుము; నీ సుతుండు । పరమగతి నొందె; శాప సంప్రాప్తిఁ జేసి
వసువు మర్త్యుఁడై వర్తించె; నసదృశప్ర । భావుఁ డాతఁడు; వగపేల దేవి! నీకు? 479

ప్రతిపదార్థం: దేవి! = అమ్మా!; నీవు; శోకంబు+తక్కుము = దుఃఖం విడువుము; నీ సుతుండు = నీ కుమారుడు; పరమగతిన్+ఒందెన్ = ఉత్తమ లోకం చేరాడు; శాపసంప్రాప్తిన్+చేసి = శాపం పొందినందువలన; వసువు = అష్ట వసువులలో ఒకడు; మర్త్యుఁడు+ఐ = మానవుడై; వర్తించెన్ = ఈ లోకంలో చరించాడు, మెలగాడు; ఆతఁడు = భీష్ముడు; అసదృశ ప్రభావుఁడు = సాటిలేని మహిమ కలవాడు; నీకున్ = నీకు; వగపు+ఏల? = దుఃఖ మెందుకు?

తాత్పర్యం: 'తల్లీ! గంగాభవానీ! నీవు చింతించవద్దు. నీ కుమారుడు వసువులలో చేరిపోయాడు. శాపం పొందిన కారణాన వసువు భీష్ముడనే పేర నరుడై నీ కడుపున జన్మించాడు. ఈ లోకంలో ఇంతకాలం వర్తించాడు. ఇతడు సాటిలేని మహిమ గలవాడు. ఇతడిని గూర్చి శోకించవద్దు.

చ. అతని శిఖండి యేల? యమరాధిపుఁడున్ సమయింపఁ జాలునే
యతఁడు నిజేచ్ఛఁ జేసి నరు నంచిత దివ్య శరంబు లంగసం
గతములు చేసి పాన్పుగ సుఖస్థితి మృత్యువు మాన్చియుండి కీ
ర్త్యతిశయ మొంది తా వలచినప్పుడు వోయె విషాద మేటికిన్?' 480

ప్రతిపదార్థం: అతనిన్ = భీష్ముడిని; శిఖండి+ఏల? = శిఖండి మాత్రమే కాదు; అమర+అధిపుఁడున్ = దేవేంద్రుడయినా; సమయింపన్+చాలును+ఏ? = సంహరించగలడా? చంపలేడని భావం; అతఁడు = నీ పుత్త్రుడైన భీష్ముడు; నిజ+ఇచ్ఛన్+చేసి = తన కోరిక ప్రకారం; నరు+అంచిత+దివ్యశరంబులు = అర్జునుడి యొక్క ఒప్పిదమైన దివ్యబాణాలు; అంగసంగతములు+చేసి = తన శరీరమును పొందేటట్లు కావించి; పాన్పుగన్ = ఆ దివ్య శరములే శయ్యగా; సుఖస్థితిన్ = సుఖమునం దునికితో, హాయిగా; మృత్యువున్+మాన్చి = మరణం తొలగించుకొని; ఉండి = ప్రాణాలతో ఉన్నవాడై, జీవించి; కీర్తి+అతిశయము+ఒంది = పేరు పెంపులు వడసి, అధికమైన యశస్సు పొంది; తాన్ = తాను; వలచిన+అప్పుడు = కోరుకొన్నప్పుడే; పోయెన్ = దేహం విడిచాడు; విషాదము+ఏటికిన్? = చింత ఎందుకు?

తాత్పర్యం: 'అమ్మా! గంగాదేవీ! ఒక్క శిఖండి మాత్రమే అనట మెందుకు? ఆ దేవేంద్రు డయినా నీ కుమారుడిని సంహరించగలడా? భీష్ముడు తన ఇష్టప్రకారం అర్జునుడి దివ్యశరాలను తనువు నందు నాటించుకొని, ఆ ఫల్గునుడి దివ్యబాణాలే తనకు పాన్పుగా సుఖంగా పవళించినవాడై మృత్యువును దూరంగా ఉంచి, ధర్మజుడికి సమస్త ధర్మము

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

లుపదేశించి, పేరు పెంపులు గడించి తాను కోరుకొన్నప్పుడే శరీరాన్ని వదలివేశాడు. తల్లీ! అట్టి ధర్మాత్ముడి కొరకు నీవు శోకించవద్దు.'

వ. అని యూఱడిలం బలికెఁ; గృష్ణద్వైపాయన మునివరుండును బరమాదరణీయతత్పర వచనంబుల నజ్జాహ్నవీదేవికి నానందం బాపాదించెఁ; దదనంతరంబ యాత్మీయ సలిల సాంగత్యంబు నొందు నమ్మందాకినిచేతం గృష్ణాదులు నందఱు జనపతులును ననుజ్ఞాతులు నాశీర్వాద ప్రీతులునై మునులునుం దోడ నడవ నది వెడలి, రని యిట్లు భీష్ముని వృత్తాంతంబు వైశంపాయనుండు జనమేజయునకుఁ జెప్పిన నప్పుడమిఱేఁ 'డిత్తెఱంగున న త్తాతకు వలయు విధానం బాచరించి చరితార్థుండైన యప్పార్థివ ముఖ్యుండు మఱి యెట్టి చందంబునం బ్రవర్తించె? మునీంద్రా! యెఱింగింపవే' యని యడుగుటయు. 481

ప్రతిపదార్థం: అని = అంటూ శ్రీకృష్ణుడు; ఊఱడిలన్ = గంగాదేవి ఉపశాంతి పొందేటట్లు, స్వస్థచిత్త అయ్యేటట్లు; పలికెన్ = వచించాడు; కృష్ణద్వైపాయనమునివరుండును = కృష్ణద్వైపాయనుడు అనే పేరుగల మునిశ్రేష్ఠుడైన వేదవ్యాసుడును; పరమ+ఆదరణీయతత్పరవచనంబులన్ = మిక్కిలి గౌరవించదగిన భీష్ముడికి సంబంధించిన మాటలచే; ఆ+జాహ్నవీ దేవికిన్ = ఆ గంగాదేవికి; ఆనందంబు = హర్షం; ఆపాదించెన్ = సమకూర్చాడు, కలిగించాడు; తత్+అనంతరంబు+అ = అటు పిమ్మట; ఆత్మీయసలిల సాంగత్యంబున్+ఒందు = తన నీటితో కలయికను పొందునట్టి, తన నీళ్ళలో కలసిపోవుచున్న, లీనమౌతున్న; ఆ+మందాకినిచేతన్ = ఆ భాగీరథిచేత; కృష్ణ+ఆదులు = శ్రీకృష్ణుడు మున్నగువారు; అందఱు జనపతులును = రాజు లెల్లరును; అనుజ్ఞాతులు = వెళ్ళుటకు అనుమతించబడినవారును; ఆశీర్వాద ప్రీతులును+ఐ = ఆమె దీవనల చేత సంతోషించినవారును అయి; మునులునున్ = ఋషులూ; తోడన్ నడవన్ = తమ వెంబడిరాగా; నదిన్+వెడలిరి = నదినుండి బయలుదేరారు; అని; ఇట్లు = ఈ రీతిగా; భీష్ముని; వృత్తాంతంబు = విషయమును; వైశంపాయనుండు = వ్యాసమహర్షి శిష్యుడైన పౌరాణికుడు; జనమేజయునకున్ = పరీక్షిన్మహారాజుపుత్త్రుడు జనమేజయ మహారాజునకు; చెప్పినన్ = చెప్పగా; ఆ+పుడమిఱేఁడు = ఆ భూపాలుడు-జనమేజయుడు; ఈ+తెఱంగునన్ = ఈ విధంగా; ఆ+తాతకున్ = పితామహుడైన భీష్ముడికి; వలయు విధానంబు+ఆచరించి = చేయదగినపనులన్నీ చేసి; చరితార్థుండు+ఐన = కృతకృత్యుడైన, ధన్యుడైన; ఆ+పార్థివముఖ్యుండు = ఆ రాజోత్తముడు-యుధిష్ఠిరుడు; మఱి+ఎట్టిచందంబునన్ = ఇంకే తీరున; ప్రవర్తించెన్? = మెలగినాడు?; ముని+ఇంద్రా! = ఓ వైశంపాయన మహర్షీ; ఎఱింగింపవు+ఏ = తెల్పుమా; అని; అడుగుటయున్ =అడుగగా.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు వచించి గంగాదేవిని ఊరడించాడు. వ్యాసమహర్షి దుఃఖోపశమన వాక్యాలు పలికి ఆమెకు ఆనందం కలిగించాడు. తరువాత తన జలాలలో విలీనురాలవుతున్న భాగీరథి చేత శ్రీకృష్ణుడు, తక్కిన రాజులు పోయి వచ్చుటకు ఆమె అనుమతి పడసినవారూ, ఆమె దీవనలచే సంతోషపడినవారూ అయి మునులు తమ వెంట నడువగా నది నుంచి నిర్గమించారు' అని భీష్ముడి వృత్తాంతం జనమేజయుడికి వైశంపాయన మహర్షి చెప్పాడు. అప్పుడు జనమేజయుడు వైశంపాయనుడిని చూచి 'మునీశ్వరా! తన పితామహుడైన గాంగేయుడికి జరుపవలసిన ఉత్తర క్రియలు జరిపి కృతకృత్యుడైన ధర్మరాజు తరువాత ఎట్లా ప్రవర్తించాడో తెలుప వేడుతున్నాను' అని ఆయనను అర్థించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అశ్వాసాంతము

చ. సకరుణ దివ్యచిత్త! పరిశాంత మహత్త్వ విధానవిత్త! ని
ర్వికృత విలాస హృద్య! శ్రుతి విస్తర విస్ఫురణైక వేద్య! పా
వక బహుభవ్యనామ! పరివర్ధన సంక్షయ దూరధామ! వి
శ్వకలిత తోషణా! సుభగ సాత్యవతేయవచో విభూషణా! 482

ప్రతిపదార్థం: సకరుణ = కృపతో కూడిన; దివ్య చిత్త! = అప్రాకృతమైన మనస్సుకలవాడా!; పరిశాంత మహత్త్వ విధానవిత్త! = లోకాలకు ప్రళయాధిక్యం కలిగించే విధానం చేత ప్రసిద్ధుడా!; నిర్వికృత విలాసహృద్య! = వికారరహితములైన లీలలచే మనోహరమైన వాడా!; (షడ్విధపరిణామములు-అస్తి, జాయతే, వర్ధతే, పరిణమతి, అపక్షీయతే, నశ్యతి- ఉండుట, పుట్టుట, పెరుగుట, మారుట, క్షీణించుట, నశించుట అనే మార్పులు లేని విలాసములచే మనోహరమైనవాడా); శ్రుతివిస్తర విస్ఫురణ+ఏక+వేద్య!= వేద బాహుళ్యం యొక్క విజ్ఞానంచేతనే తెలియదగిన వాడా!; పావకబహుభవ్యనామ! = పవిత్రములు గావించునట్టి అనేకములైన మంగళనామములు కలవాడా!; పరివర్ధన సంక్షయ దూరధామ! = వృద్ధిక్షయాలకు దవ్వైన నిలయాలు కలవాడా!; విశ్వకలితతోషణా!= లోకంలో తెలియబడే సంతోషం కలవాడా!; సుభగసాత్యవతేయ వచో విభూషణా! = మధురములైన, (రమణీయములైన) వ్యాసమహర్షి యొక్క వాక్కులకు ఆభరణమైనవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! నీ హృదయం కృపా భరితం. నీవు జగత్తులకు ప్రళయం కల్పించే ప్రభావంతో ప్రసిద్ధుడివి. షడ్భావ వికారశూన్యుడ వగుటవలన నీ విలాసాలు మనస్సులకు ఇంపు కలిగిస్తాయి. వేద బాహుళ్యము యొక్కవిజ్ఞానంతోనే తెలియదగిన వాడవు నీవు. పావనములైన అనేక నామములు కలవాడివి నీవు. వృద్ధిక్షయాలకు దవ్వైన నిలయాలు కలవాడవు నీవు. అనగా నీ నిలయములైన శ్రీవైకుంఠకైలాసములు వృద్ధిక్షయాలకు దూరములు అని భావం. ప్రపంచమందున్న ఆనందమంతా నీదే. వేదవ్యాస మహర్షి రమణీయ వచనాలకు అలంకారమైన వాడవు నీవే స్వామీ!

క. సత్సేవ్యచరణ! శమవ । ద్వాత్సల్యాభరణ! ధర్మతత్త్వోద్ధరణా!
హృత్సంగతభక్తిక దురి । తోత్సారణధుర్య దృఙ్మయూఖ విసరణా! 483

ప్రతిపదార్థం: సత్+సేవ్య+చరణ! = సజ్జనులచే సేవించబడిన పాదములు కలవాడా!; శమవత్ = శాంతితో కూడిన; వాత్సల్య+ఆభరణ = వాత్సల్యమనే గుణమే భూషణంగా కలవాడా!; ధర్మతత్త్వ+ఉద్ధరణా! = ధర్మతత్త్వమును ఉద్ధరించేవాడా! (కాపాడేవాడా!); హృత్+సంగత+భక్తిక = హృదయమందు పాదుకొన్న భక్తి గలవారల యొక్క; దురిత = పాపాలను; ఉత్సారణ = తొలగద్రోయటం అనే; ధుర్య = భారం వహించే; దృక్+మయూఖ+విసరణా! = చూపులనెడి కిరణముల యొక్క ప్రసారం కలవాడా!

తాత్పర్యం: స్వామీ హరిహరనాథా! సత్పురుషులు నీ పాదపద్మాలను భజిస్తారు. నీవు శాంతియుతమైన వాత్సల్యగుణంచేత (దోషమును భోగ్యముగా స్వీకరించే గుణం) విలసిల్లుతుంటావు. నీ అవతార ప్రయోజనం ధర్మాన్ని ఉద్ధరించటమే. "పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్, ధర్మసంస్థాప నార్థాయ సంభవామి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

యుగే యుగే" అని గీతలో చెప్పినట్లు ధర్మాన్ని కాపాడటమే. భక్తి భరిత హృదయులైన వారి పాపాలను నీ చూపులనెడి కిరణముల యొక్క ప్రసారంతో రూపుమాపుతావు.

మాలిని : **స్మయ విరహిత పూజ్యా! మంత్రగీతాధిరాజ్యా!**
నయన హిమగు సూర్యా! నైష్ఠిక క్షేమధుర్యా!
దయిత భువనరక్షా! దాంతి సంపద్యతాక్షా!
నియమ నికటవర్తీ! నిష్కళానంద మూర్తీ! **484**

ప్రతిపదార్థం: స్మయవిరహితపూజ్యా! = అహంకార రహితులచే పూజింపదగినవాడా! (స్మయము = మదం, అహంకారం, అవలేపం, దర్పం); మంత్రగీత+అధిరాజ్యా! = వేదమంత్రాలచేత గానం చేయబడిన గొప్ప రాజ్యం కలవాడా! అనగా సకలవేదాలు హరిహరనాథుడి రాజ్యాధిపత్యమునే కీర్తిస్తాయని భావం; నయనహిమగు+సూర్యా = నేత్రములుగాఉన్న చంద్రుడు సూర్యుడు కలవాడా! అనగా సూర్యచంద్రులు కుడికన్ను ఎడమకన్నులుగా కలవాడా! (హిమగు = హిమగువు = చంద్రుడు); నైష్ఠిక క్షేమధుర్యా! = వేద ధర్మాన్ని ఆచరించటంలో శ్రద్ధగలవారి యొక్క క్షేమభారమును వహించేవాడా! "అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్" అని గీతలో చెప్పే ఉన్నాడు; దయితభువనరక్షా! = ప్రియమైన లోకరక్షణం కలవాడా! అనగా లోకాలను కాపాడుట యందు ప్రీతికలవాడా!; దాంతిసంపత్+యత+అక్షా! దాంతిసంపత్ = క్లేశములను, కష్టాలను సహించడం అనే సంపదచేత; యత+అక్షా! = నియమించబడిన, లోబరచుకొనబడిన ఇంద్రియాలు (కర్మేంద్రియాలు) గలవాడా!; నియమనికటవర్తీ! = నియమాలకు సమీపమందు మెలగువాడా! అనగా యోగవిద్యాభ్యాసమునకు చేరువలో ఉండే వాడా!, నియమవ్రతశీలురకు సమీపమందే ప్రవర్తించేవాడా!; నిష్కలానందమూర్తీ = పూర్ణానందస్వరూపుడా! (నిస్+కళ = అంశ లేనట్టి)

తాత్పర్యం: దేవా! హరిహరనాథా! అహంకార రహితులు నిన్ను పూజిస్తారు. నీ సామ్రాజ్యాధిపత్య ప్రభావాన్ని వేదాలు కొనియాడుతున్నాయి. చంద్ర సూర్యులు నీ యెడమ కుడి కన్నులు. వైదికాచారపరుల యొక్క యోగక్షేమాల భారం నీవే వహిస్తున్నావు. జగద్రక్షణమందు ఆసక్తి గలవాడవు నీవు. శాంతి దాంతులు కలవాడవు నీవు. నియమ వ్రత శీలుర యొక్క చెంతనే నీవు మెలగుతుంటావు. ప్రభూ! నీవు అఖండానంద స్వరూపుడవు.

విశేషం: మాలిని అనే పేరుగల ఈ వృత్తానికి నాలుగుపాదాలు. ప్రతిపాదంలో వరుసగా "న,న,మ,య,య" అనే గణాలు ఉంటాయి. ప్రతి చరణం యొక్క ఆద్యక్షరంతో ఆచరణంలోని తొమ్మిదో అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. ఈ వృత్తానికి ప్రాసనియమం ఉన్నది.

గద్యము : ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభారతంబున నానుశాసనిక పర్వంబునందు సర్వంబును బంచమాశ్వాసము.

శ్రీమదాంధ్ర మహాభారతమునందలి యానుశాసనిక పర్వము సమాప్తము.

ప్రతిపదార్థం: ఇది = ఇయ్యది; శ్రీమత్+ఉభయకవిమిత్త్ర = సంపద్యుక్తుడైన ఉభయకవిమిత్త్రుడును (సంస్కృతాంధ్రకవులకు చెలికాడనే బిరుదం వహించినవాడు); కొమ్మన+అమాత్య+పుత్త్ర = కొమ్మన అనే పేరుగల మంత్రి యొక్క కుమారుడు; బుధ+ఆరాధన+విరాజి = పండితులయొక్క పూజలచేత ప్రకాశించేవాడు, పండితులను పూజించటం చేత ప్రకాశించేవాడు

అయిన; తిక్కన సోమయాజి ప్రణీతంబు+అయిన = తిక్కన సోమయాజిచేత రచించబడిన, శ్రీమహాభారతంబునన్ = శుభకరమైన మహాభారతంలోని; ఆనుశాసనిక పర్వంబు+అందున్ = ఆనుశాసనికపర్వంలోని; సర్వంబును = సమస్తమూ; పంచమ+ఆశ్వాసము = ఐదవ ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది ఉభయకవిమిత్ర బిరుద భాసురుడూ, కొమ్మనమంత్రి కుమారుడూ పండితులయొక్క పూజలచేత ప్రకాశించేవాడూ అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన ఆనుశాసనిక పర్వంలోని సమస్తమూ పంచమాశ్వాసం.

ఆనుశాసనిక పర్వంలోని పంచమాశ్వాసం సమాప్తం.

ఆంధ్రమహాభారతంలోని ఆనుశాసనికపర్వం ముగిసింది.

- - -

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 15

అశ్వమేధ,ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వములు

కృతికర్త

తిక్కన సోమయాజి

వ్యాఖ్యాతలు

డా|| హెచ్.ఎస్. బ్రహ్మానంద

శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు

డా|| అంబటిపూడి నాగభూషణం

ప్రధాన సంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Aswamedha, Asramavasa, Mousala, Mahaprasthanika
and Swargarohana parvams of Tikkana Somayaji
Vol. XV.

Commentary by
Dr. H.S.Brahmananda - Aswamedha, 1,2 Cantos Mousala, Mahaprasthanika and Swargarohana
Dr. Nagalla Guruprasada Rao - Aswamedha 3,4 Cantos
Dr. Ambatipudi Nagabushanam - Asramavasa 1,2 Cantos

Chief Editor
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious publications Series No.614
First Edition : 2006

Second Edition: 2013
Copies : 5,000

© All Rights Reserved

Published by

Sri. M.G. Gopal, I.A.S.

Executive Officer,

T.T.Devasthanams,

Tirupati - 517 507

D.T.P. Type Setting

Editor-In-Chief Office

T.T.D. Tirupati.

Printed at:

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా అధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు ఆవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారిసేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్-ఇన్-చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్

మహాభారత యుద్ధానంతరం ద్వాపరాంతం వరకు జరిగిన సంఘటనలను సౌప్తిక, స్త్రీ పర్వాల తరువాతి పర్వాలు చిత్రీకరిస్తాయి. వీటిలో శాంతి, అనుశాసనిక పర్వాలు ధర్మవివేచన చేస్తూ ముందుకు వెళతాయి. తరువాతి ఐదు పర్వాలలో వివిధ ఘటనలు ఒకదాని వెంట ఒకటి జరిగి స్వర్గారోహణానికి త్వరితగతిన పయనిస్తున్నట్లు కనిపిస్తుంది. ధర్మరాజు భీష్మునితో ధర్మసూక్ష్మాలను తెలుసుకున్నప్పటికి, భీష్మాదుల మరణానికి బాధపడుతూ వైరాగ్యంతో అశ్వమేధాన్ని నిర్వహించాడు. అశ్వమేధయాగానంతరం ధృతరాష్ట్రుడు వానప్రస్థానికి వెళతారు. ఆ తరువాత ముసలం వల్ల యాదవులు అందరూ నాశనం చెందుతారు. యాదవ కౌరవుల లేమితో పాండవులు రాజ్యాన్ని పాలించలేక వైరాగ్యంతో మహాప్రస్థానానికి బయలుదేరి స్వర్గారోహణ చేస్తారు. ఈ స్వర్గారోహణంతో భారతకథ పరిసమాప్తమౌతుంది. ఈ ఐదుపర్వాల వ్యాఖ్యాన గ్రంథంతో తెలుగు భారత వ్యాఖ్యాన ప్రణాళిక పరిసమాప్తమౌతుంది. ఐదుపర్వాల వ్యాఖ్యానకర్తలు డా॥ హెచ్.ఎస్.బ్రహ్మానంద, డా॥ నాగళ్ల గురుప్రసాదరావు, డా॥ ఎ. నాగభూషణం గారలు. వీరు అత్యంత ఓర్మితో, అనుభవంతో వ్యాఖ్యానం చేశారు. వీరికి దేవస్థానం తరపున అభినందనలు తెలుపుతున్నాను.

ఈ ఐదు ఆశ్వాసాలకు పీఠిక, కథాసారము శైలిలో, ఏకరూపతనిచ్చి సంపాదకత్వం వహించిన వారు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు. వీరికి శుభాభినందనలు.

18 పర్వాల తెలుగు భారతాన్ని వ్రాసినవారు ముగ్గురయితే దాన్ని వ్యాఖ్యానించిన వారు ముప్పైమంది. అయినా దాన్ని చూపి సరిదిద్దిన ఎడిటోరియల్ సభ్యులు, ప్రధాన సంపాదకులు, సంపాదకమండలి, సంపాదకమండలి సలహా సభ్యులు, చుట్టూ అధికారులగణం, కార్యకర్తల దళం, అందరినీమించి ఈ కార్యక్రమాన్ని పూర్తిగా ఆశీర్వదించిన పాలకమండలి అధ్యక్షులు, సభ్యులు – అందరూ తమవంతు పాత్రను నిర్వహించి ఈ బృహత్ ప్రణాళికలో వేంకటేశ్వరస్వామి ఆశీర్వచనాన్ని పొందటానికి అర్హమైన పని చేసి కృతకృత్యులైనారు. అందరికి పేరుపేరునా అభినందనలను సూచిస్తూ, వారికై స్వామి అనుగ్రహాన్ని కోరుతాను.

ఆంధ్రమహాభారతాన్ని వ్యాఖ్యాన సహితంగా తీర్చిదిద్దిన ఈ పుస్తక సంపుటాలను పాఠకులు చదివి ఆనందించగలరని భావిస్తున్నాను.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతీ సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమస్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 - 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జూలై 11వ తేదీన హైదరాబాదు బాలాజీభవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్యపర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయము గైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అరసున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏకరూపత కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసియున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్వురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిక్రమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగా పర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీమధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జూలై 3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డిగారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్‌కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥ కె. సర్వోత్తమరావు	**శ్రీ డి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥ రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిన అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైనచోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జూలై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీ డి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్నభిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీ స్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలో ని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక

వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్లకొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పండ్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నప్పుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి, విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి''.

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాస్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదకమండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంపాదకమండలి సభ్యులు

డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు	శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
డా॥ ఎస్.బి. రఘునాథాచార్య	డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
డా॥ కె.జె. కృష్ణమూర్తి	డా॥ కె. సర్వోత్తమరావు

సలహామండలి సభ్యులు

పౌరసంబంధాధికారి, తి.తి.దే.	డా॥ బిరుదురాజు రామరాజు
అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్, తి.తి.దే.	డా॥ ఎం. కులశేఖరరావు
ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి, తి.తి.దే.	డా॥ తుమ్మపూడి కోటీశ్వరరావు
	డా॥ ఎం. బుద్ధన్న

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో అప్పటి కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలులలోని సభ్యులయొక్క సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారత సంపుటాలన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్తపాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ప్రథమ సంపుటం- ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం - సభాపర్వం వెలువడినాయి. డాక్టర్ ఐ.వి.సుబ్బారావుగారి తరువాత కార్యనిర్వహణాధికారి అయిన డా॥ పి.కృష్ణయ్య, ఐ.ఏ.ఎస్., గారు వచ్చిన తత్క్షణమే ఆంధ్ర మహాభారత ప్రచురణను గూర్చి ఆసక్తితో గమనించి అన్నివిధాల సహకరించి ఆది, సభాపర్వాల విడుదలకు ఏర్పాటు చేయడమే కాకుండ తరువాతి సంపుటాలు వెలుగుచూడడానికి ఒక కాల నిర్ణయంతో పని జరగాలని త్వరపరిచినారు. 2002 సంవత్సరానికి ఈ బృహత్ ప్రణాళిక వ్యాఖ్యా సహిత మహాభారతం తుదిమెరుగులు దిద్దుకోవాలని వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో పండిత మండలిని పురమాయించినారు. అప్పట్లో తీవ్రతరం అయిన ప్రయత్నంతో గోదావరి పుష్కరాల సమయానికి ఆరణ్యపర్వం (2 భాగాలు), విరాటపర్వం విడుదల అయ్యాయి. తర్వాత శ్రీ అజేయ కల్లంగారు కార్యనిర్వహణాధికారిగా విచ్చేసిన వెనువెంటనే ఈ మహాభారత వ్యాఖ్యాన సహిత ప్రచురణ ప్రణాళికను మరింత వేగిరపరచి కృష్ణాపుష్కరాల లోపల యుద్ధపంచకాన్ని విడుదల చేయాలనీ, 2004 సంవత్సరం చివరకు మిగిలిన పర్వాష్టకము వెలుగుచూడాలనీ నిర్ణయించడం జరిగింది. 2004 కృష్ణాపుష్కరాల సమయంలో ఉద్యోగ, భీష్మ, ద్రోణపర్వాలు వెలువడ్డాయి. తరువాత కర్ణపర్వం ఒక సంపుటంగాను, తరువాతి పర్వాలైన శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు మూడింటిని కలిపి ఒకే సంపుటంగాను, శాంతిపర్వాన్ని రెండు సంపుటాలుగాను ముద్రించాము. ఇవి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారి చేతులమీదుగా విడుదల అయ్యాయి. ఆ తరువాత అనుశాసనికపర్వం (ఐదు ఆశ్వాసాలు) ఒక సంపుటంగాను మిగిలిన ఐదుపర్వాలను (అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణపర్వాలు) ఒక సంపుటంగాను ప్రచురించాలని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిర్ధారణచేసి త్వరితగతిన ఉపక్రమించినప్పటికి అనుకోని ఆటంకాలు ఏర్పడి జాప్యం జరిగిన సంగతి నిజం. అపుడు మనలను ఆదుకున్నవారు ఎడిటోరియల్‌సెల్‌లో సభ్యులైన శ్రీ ముదివర్తి కొండమాచార్యులువారు. ఆయన కష్టపడి కునుకువేయక తుదిమెరుగుల వరకు పనిచేసి ఇస్తేకాని గట్టు ఎక్కలేకపోయాయి.

ఈ మధ్యకాలంలో అంటే మహాభారత వ్యాఖ్యాన ప్రచురణ యజ్ఞం చివరిదశలో ఉండగా సంచాలకులైన సప్తగిరి సంపాదకులు డా॥ యన్.ఎస్.రామమూర్తిగారు పదవీ విరమణ చేయడం జరిగింది. 1994 సం॥లో సప్తగిరి సంపాదకుడిగా పదవి స్వీకరించిన వెనువెంటనే మహాభారత వ్యాఖ్యాన ప్రచురణ భారాన్ని భుజానవేసుకొని సమర్థంగా అన్ని ఆటంకాలను అధిరోహించి ఆంధ్రదేశం గర్వించతగ్గ ఒక మహా గ్రంథాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ఆయన చేసిన కృషి అభినందనీయము.

ఈ మహాభారత వ్యాఖ్యాన ప్రచురణ యజ్ఞంలో పాలుపంచుకొంటూనే పరమపదించినవారు కొందరు మహనీయులు. 2006 సం॥ జనవరి 25న కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన, సంపాదకమండలి సమావేశం జరిగింది. ఆంధ్రదేశంలో ప్రాతఃస్మరణీయులైన డా॥ దివాకర్ల వేంకటావధాని, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు, నాగసిద్ధారెడ్డి, ఆచార్య తూమాటి దొణప్ప, ములుకుట్ల రామకృష్ణశాస్త్రి, డా॥ ఎస్.బి.రఘునాథాచార్య, డా॥ మరుపూరి కోదండరామిరెడ్డి, ఏలూరిపాటి అనంతరామయ్య, డా॥ మేడవరం వెంకటనారాయణశర్మ, డా॥ కె.రామగోపాల కృష్ణమూర్తి వారలకు శ్రద్ధాంజలి ఘటించింది.

వ్యాఖ్యానంతో కవిత్రయ భారతాన్ని సంపూర్ణంగా ప్రచురించడం అనేది ఒక హిమాలయ సదృశ కార్యక్రమం. ఈ పద్దెనిమిది పర్వాల వ్యాఖ్యానాన్ని 15 పుస్తకాలుగా చేసి ప్రకటించడంలో సహాయ సహకారాలు అందించినవారు అనేకులు. గ్రంథసంపాదనక్షేత్రంలో పలువ్యాఖ్యాతల వ్యాఖ్యానాన్ని సంపాదకులు ఒక్కరే ఒక్కతాటిపై ఏకధాటిగా విషయాన్ని నడిపించడం గ్రంథ సంపాదన క్షేత్రంలో అసామాన్యం. ప్రధాన సంపాదకుల వారికి వ్యాఖ్యాతలకు మధ్య 'ఎడిటోరియల్‌సెల్' అనే ప్రక్రియ భారతీయ భాషలలోనే అరుదు. ఇటువంటి కార్యక్రమానికి పూనుకొని ఏకనిష్ఠగా వర్క్‌షాపువలె చివరివరకు పనిచేసిన చాల సందర్భాలు అరుదు. అటువంటి విద్వాంసుల త్రిసభ్య సెల్ పరిశీలనతో మహాభారత వ్యాఖ్యానం పూర్తి అయింది. ఈ సెల్‌లోని సభ్యులు

1. **ఆచార్య సముద్రాల లక్ష్మణయ్య**
2. **డా॥ కె.సర్వోత్తమరావు**
3. **శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు-**

తమ అనుభవ విద్వత్ ప్రతిభలను ధారపోసినారు. వీరికి సంపాదకమండలి సమావేశం ధన్యవాదాలను తెలిపింది.

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. లోగడ తి.తి.దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వున్న శ్రీ అజేయ కల్లం, ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహానికి కృతజ్ఞతాభివందనాలు. ఈ మహాగ్రంథం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పూర్తిగా వెలుగు చూడటంలో ముఖ్యకారకులైన తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ ఎ.పి.వి.ఎన్. శర్మ ఐ.ఏ.ఎస్., గారి ప్రోత్సాహక పర్యవేక్షణకు కైమోడ్పులు. తి.తి.దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి సాహిత్య ప్రియులూ ఐన శ్రీ ఎన్.ముక్తేశ్వరరావు, ఐ.ఏ.ఎస్., గారు మరింత ప్రోత్సాహం ఇచ్చి ప్రాజెక్టు పనిని వేగవంతం చేశారు. దీనికోసం ప్రతిరోజు నిరంతరాయంగ పని జరిగేటట్లు చూడడమే కాకుండ వారానికొక 'నివేదిక'ను అడిగి తగు మార్గదర్శనాన్ని చేసినవారు ఆయన. వారికి గౌరవాదరాలతో కృతజ్ఞతలు తెలుపటానికి సంతోషిస్తున్నాము.

సంబంధిత విభాగాధిపతిగా, సలహామండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన శ్రీ కె.రాంపుల్లారెడ్డి, పౌరసంబంధాధికారి, తి.తి.దేవస్థానం, తిరుపతి- వారికి మరియు ఈ ప్రాజెక్టుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహాయ సహకారాలందించిన తదితర అధికారిగణానికి నమస్సులు. ఈ ప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధాన పాత్ర వహించిన- వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదకమండలి, సలహామండలి) విద్యావేత్తలకు, ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారికి- నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు.

ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమండలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంటు డా॥ కోరాడ రామకృష్ణ, తెలుగు ఉప-సంపాదకులు డాక్టర్ కె.రాధారమణ, డాక్టర్ అల్లాడి సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ ఉప-సంపాదకులు శ్రీ బి.ఎన్.శ్రీనివాసన్ గారలకు, తదితర సిబ్బందికి, ఈ పుస్తకాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పాఠకులకు తక్కువ వ్యవధిలో అందించడానికి తోడ్పడిన టి.టి.డి. ముద్రణాలయాధికారి శ్రీ జి.వెంకటేశ్వరరావు గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూఉన్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారత' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయ సాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

డా॥ ఎన్. ఎస్.రామమూర్తిగారు ఈ వ్యాఖ్యాన యజ్ఞాన్ని పూర్తిగావించినప్పటికీ పుస్తకాలను చదువరులచేతిలో పెట్టేపనిని భవదీయుడికి వదలినారు. అందరికి పేరుపేరున కృతజ్ఞతలను చెపుతూ, పుస్తకాలను శ్రీ వేంకటేశ్వరుని పాదాలకు పుష్పాలుగా అర్పిస్తున్నాను.

సి.శైలకుమార్
కన్వీనర్
సంపాదకుడు - సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి

అధ్యక్షులు

శ్రీ ఎ.పి.వి.ఎన్.శర్మ ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకుడు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం,

సంపాదక మండలి సభ్యులు

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆచార్య ఎం. బుద్ధన్న

శ్రీ కె. రామపుల్లారెడ్డి, (పౌరసంబంధాధికారి) (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ మేడసాని మోహన్, డైరెక్టర్ అన్నమాచార్య ప్రాజెక్టు, (ఎక్స్ అఫిషియో సభ్యులు)

డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య, కార్యదర్శి ధర్మప్రచార పరిషత్తు (ఎక్స్ అఫిషియో సభ్యులు)

కన్వీనర్

సి. శైలకుమార్

“సప్తగిరి” సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా. 1
3. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా 1,2
4. డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ ఆశ్వా. 1,2
5. డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా 1
6. డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7. శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా. 2
8. డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా. 4
9. డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా. 5
10. డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12. శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13. డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14. డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15. డాక్టర్ కె. రాజన్న శాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17. డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18. డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19. డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20. డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా. 1; స్వర్గా-1
21. డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22. డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23. డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25. డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26. డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	అను. ఆశ్వా. 1,2
27. డాక్టర్ శలాక రఘునాథశర్మ	అను. ఆశ్వా. 3,4
28. డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	అను. ఆశ్వా. 5
29. శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30. డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సంకేతాక్షర సూచి

ఆది.	–	ఆదిపర్వం
సభా.	–	సభాపర్వం
ఆర.	–	ఆరణ్యపర్వం
విరా.	–	విరాటపర్వం
ఉద్యో.	–	ఉద్యోగపర్వం
భీష్మ.	–	భీష్మపర్వం
ద్రోణ.	–	ద్రోణపర్వం
కర్ణ.	–	కర్ణపర్వం
శల్య.	–	శల్యపర్వం
సౌప్తి.	–	సౌప్తికపర్వం
స్త్రీ.	–	స్త్రీ పర్వం
శాంతి.	–	శాంతిపర్వం
అను.	–	అనుశాసనికపర్వం
అశ్వ.	–	అశ్వమేధపర్వం
ఆశ్ర.	–	ఆశ్రమవాసపర్వం
మౌస.	–	మౌసలపర్వం
మహా.	–	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	–	స్వర్గారోహణపర్వం
సం.	–	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	–	సంస్కృత మహాభారతము
అను.	–	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	–	ప్రధాన సంపాదకుడు

క.	–	కందపద్యం
వ.	–	వచనం
ఆ.	–	ఆటవెలది
తే.	–	తేటగీతి
సీ.	–	సీసం
ఉ.	–	ఉత్పలమాల
చ.	–	చంపకమాల
మ.	–	మత్తేభవిక్రీడితం
శా.	–	శార్దూలవిక్రీడితం
ఆశ్వా.	–	ఆశ్వాసం
క్రీ.శ.	–	క్రీస్తుశకం
య.	–	యగణం
మ.	–	మగణం
త.	–	తగణం
ర.	–	రగణం
జ.	–	జగణం
భ.	–	భగణం
న.	–	నగణం
స.	–	సగణం
ల.	–	లఘువు
గ.	–	గురువు
అలం.	–	అలంకారం
సం.	–	సంవత్సరం
మొ.	–	మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆశ్రమవాస పర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీసంబంధాయుర్గురు। తా సిద్ధిద చరణపద్మ! దాంత్యున్మీల

ద్ధీసద్మ శాంతిసేవ్యా। వ్యాసాది మునీంద్రభావ్య హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= ఐశ్వర్యానికి; సంబంధ= సంబంధించినటువంటివాటియొక్క, (ధన కనకాది సంపదలు); ఆయుస్(ః)= జీవితకాలంయొక్క; గురుతా= ఆధిక్యాన్ని; సిద్ధిద= కలుగజేసేటటువంటి; చరణ పద్మ!= తామరవంటి పాదాలు కలవాడా!; దాంతి= బహిరింద్రియ నిగ్రహంచేత; ఉన్మీలత్= వికసించేటటువంటి; ధీ= బుద్ధి; సద్మ!= నివాసంగా కలవాడా!; శాంతి= అంతరింద్రియ నిగ్రహంచేత; సేవ్యా!= సేవించదగినవాడా!; వ్యాస= వ్యాసుడు; ఆది= మొదలుగా కలిగిన; ముని+ఇంద్ర= మునిశ్రేష్ఠులచేత; భావ్య= భావించబడేవాడా!; హరిహరనాథా!= ఓ హరిహరనాథ స్వామీ!

తాత్పర్యం: ధనకనకాది సంపదలూ, ఆయువులూ అత్యధికంగా సిద్ధింపజేసేటటువంటి పద్మములవంటి పాదాలు కలవాడా! బాహ్యేంద్రియాలను నిగ్రహించగలిగినవారి బుద్ధిలో నివసించేవాడా! అంతరింద్రియాలను నిగ్రహించుకొనటం చేత సేవించదగినవాడా! వ్యాసుడు మొదలైన మహామునులచేత భావించబడేవాడా! హరిహరనాథస్వామీ!

విశేషం: శ్రీయొక్క సంబంధం కలిగిన ఆయుర్గురుత అంటే సంపదలతో కూడిన జీవిత కాలాధిక్యము. జీవితకాలం అధికంగానూ, అంతకాలమూ సంపదలు గలిగే విధంగానూ, శ్రీసంబంధం కలిగినవాడు శ్రీపతి హరి. హరి శ్రీసంబంధిగురుత్వం ఇచ్చేవాడు. మృత్యుంజయుడైన శివుడు లయకారి, కాబట్టి ఆయుర్గురుత, హరుడిస్తాడు. ఇంద్రియ లోలుడుగా బాహ్యదృష్టికి గోచరిస్తూ ఆంతరదృష్టికి ఇంద్రియజేతయై దాంతి గలవాడు హరి. తపోమగ్నుడై అంతర్ముఖత్వంతో శాంతుడైన వాడు హరుడు. ఇటువంటి ఉభయవిధమైన ఏకతత్త్వాన్నే వ్యాసాదిమునీంద్రులు భావించారు. అదే 'హరిహరనాథ' తత్త్వం. 'శాంతి బుద్ధీంద్రియ సన్నివారణ, దాంతి కర్మేంద్రియాల యోగ్య ప్రవృత్తి, అని భార. ఆను.5181.కర్మేంద్రియాలను యోగ్య విషయాలలో ప్రవర్తింపజేయటం 'దాంతి' ఇతర విషయాలలో నివర్తింపజేయటం (బహిరింద్రియ) నిగ్రహం దాంతి.

ధృతరాష్ట్రుని పాలికి నారదుండు మునులతో వచ్చి యత్తపోవనమహిమ చెప్పుట (సం.15-26-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు వైచిత్రవీర్యుండు పరమతపోధుర్యుం డయి యుండె; నంత నొక్కనాఁడు నారద పర్వత దేవల మౌంజాయను లమ్మహీనాయకుం జూచువేడ్కనయ్యా శ్రమంబునకుం జనుదెంచిన. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= జనమేజయ మహారాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అట్లు= ఆ విధంగా; వైచిత్రవీర్యుండు= (విచిత్రవీర్యుడి కొడుకు) ధృతరాష్ట్రుడు; పరమ+తపస్+ధుర్యుండు+అయి ఉండెన్= గొప్ప తపస్సును తీవ్రంగా ఆచరిస్తూ ఉన్నాడు (శతయూపుడి ఆశ్రమ సమీపంలో) తన ఆశ్రమంలో ఉన్నాడు); అంతన్= ఆ సమయంలో; ఆ+మహీనాయకున్= ఆ ధృతరాష్ట్ర మహారాజును; చూచు+వేడ్కన్=

చూడాలనే కోర్కెతో; ఆ+ఆశ్రమంబునకున్= ధృతరాష్ట్రుడు ఉంటున్న ఆశ్రమానికి; నారద పర్వత దేవల మౌంజాయనులు= నారదుడూ, పర్వతుడూ, దేవలుడూ, మౌంజాయనుడు అనే మునులు; చనుదెంచినన్= రాగా.

తాత్పర్యం: హరిహరనాథా! జనమేజయుడితో వైశంపాయన ముని ఈ విధంగా చెప్పాడు. ధృతరాష్ట్రుడు ఆ ప్రకారంగా తీవ్రమైన తపస్సును ఏకాగ్రతతో ఆచరిస్తూ ఉండగా, ఒకరోజు ఆ ధృతరాష్ట్రుడిని చూడటానికి నారదుడు, పర్వతుడు, దేవలుడు, మౌంజాయనుడు అనే మహర్షులు అతడి ఆశ్రమానికి వచ్చారు.

క. శతయూపుఁడు నయ్యెడకుం। గుతుకంబున వచ్చె; వారిఁ గుంతి వినయ సం
భృతయై యందఱను సమ। ర్చితులుగఁ జేసినఁ బ్రహృష్టచేతసు లగుచున్. 3

ప్రతిపదార్థం: శతయూపుఁడున్= శతయూపుడు కూడా; కుతుకంబునన్= కుతూహలంతో; ఆ+ఎడకున్= ధృతరాష్ట్రుడి వద్దకు; వచ్చెన్= వచ్చాడు; వారిన్= ఆ నారదాదులను; అందఱను= అందరినీ; వినయ సంభృత+ఐ= అణకువతో నిండినదై; కుంతి= కుంతీదేవి; సమ్+అర్చితులుగన్= బాగా పూజించబడినవారినిగా; చేసినన్= చేయగా (నారదాదులనందరినీ అణకువతో పూజించగా); ప్రహృష్ట+చేతసులు= (ఆ నారదాదులు) సంతోషించిన మనస్సు కలవారు; అగుచున్= అవుతూ.

తాత్పర్యం: శతయూపుడు కూడా కుతూహలంతో ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చాడు. అపుడు కుంతి వాళ్ళనందరినీ సవినయంగా పూజించగా, వాళ్ళు సంతోషించారు.

వ. ధృతరాష్ట్రుకడకుం బోయిన నతండు వినయ సంభ్రమంబులతో వినతుం డైన దీవన లిచ్చి యతని పెట్టించిన దర్భాసనంబుల నాసీనులై యుచిత సల్లాపంబులు సేయుసమయంబున నారదుం డన్నర నాథుతో శతయూప నామధేయుం డయిన ధరాధిపు పితామహుం డగు సహస్రచిత్యుం డను మహారాజు తన పెద్దకొడుకైన శతచిత్యునందు రాజ్యభారం బిడి యియ్యాశ్రమంబునకు వచ్చి తపశ్చరణంబున దుశ్చ్యవన సఖిత్వంబు వడసె; మఱియును బృషధ్రుండును, శైలాలయుండును, బురుకుత్సుండును నిందుఁ దపంబు చేసి యింద్రలోకంబు వడసి రా రాజర్షిసత్తముల నెల్లను నే నీలోకంబున మెలంగుచుండి యియ్యెడం గంటి నయ్యెడం జూచితి; నిది యితరదుష్ప్రాప్యంబయిన పుణ్యప్రదేశంబు; నీకుం గృష్ణద్వైపాయను ప్రసాదంబున నిచ్చట వసియింప సంభవించె' నని పలికి వెండియు. 4

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుకడకున్= ధృతరాష్ట్రుడి వద్దకు; పోయినన్= వెళ్ళగా; అతండు= ఆ ధృతరాష్ట్రుడు; వినయ సంభ్రమంబులతోన్= అణకువతోనూ, సంరంభముతోనూ; వినతుండు= నమస్కరించినవాడు; ఐనన్= కాగా; (నారదాదులు) దీవనలు+ఇచ్చి= ఆశీర్వదించి; అతని పెట్టించిన= ఆ ధృతరాష్ట్రుడు ఏర్పాటు చేయించిన; దర్భాసనంబులన్= దర్భలచేత తయారుచేయబడ్డ ఆసనాలపై; ఆసీనులు+ఐ= కూర్చున్నవారై; ఉచిత సల్లాపంబులు= తగిన సంభాషణలు; చేయు సమయంబునన్= చేసేటప్పుడు (కుశలాదికమైన మాటలు మాటాడుతుండగా); నారదుండు= నారదమహర్షి; ఆ+నరనాథుతోన్= ఆ ధృతరాష్ట్రుడితో (ఇట్లా అన్నాడు); శతయూప నామధేయుండు+ఐన= శతయూపుడు అనే పేరు కలిగిన; ధరా+అధిపు= రాజుకు; పితామహుండు= తాత; అగు= అయిన; సహస్ర చిత్యుండు= సహస్రచిత్యుడు; అను మహారాజు= అనే పేరుకలిగిన రాజు; తన పెద్దకొడుకు= తన కుమారులలో పెద్దవాడు; ఐన= అయినటువంటి; శతచిత్యునందున్= శతచిత్యుడు అనే వాడిమీద; రాజ్యభారంబు= రాజ్యపాలన బాధ్యతను; ఇడి= ఉంచి; ఈ+ఆశ్రమంబునకున్= ఇపుడు నీవు (ధృతరాష్ట్రుడు) ఉంటున్న ఆశ్రమానికి; వచ్చి= చేరి (ఇక్కడ ఉండి); తపస్+చరణంబునన్= తపస్సు చేయుటంవలన; దుశ్చ్యవన= ఇంద్రుడియొక్క; సఖిత్వంబు= మైత్రిని; పడసెన్= పొందాడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మఱియును= ఇంకా; పృషధ్రుండును= పృషధ్రుడు అనే పేరుగలవాడు; శైలాలయుండును= శైలాలయుడనే రాజు; పురుకుత్సుండును= పురుకుత్సుడనే అతడు; ఇందున్= ఈ ఆశ్రమంలోనే; తపంబు= తపస్సు; చేసి= ఆచరించి; ఇంద్రలోకంబు= ఇంద్రుడుండే లోకం (స్వర్గం); పడసిరి= పొందారు; ఆ రాజర్షి సత్తములన్= రాజ ఋషులలో ఉత్తములైన వారిని; ఎల్లను= అందరినీ; నేను= నేను (నారదుడు); ఈ లోకంబునన్= భూలోకంలో; మెలంగుచున్+ఉండి= సంచరిస్తూ ఉండి; ఈ+ఎడన్= ఇక్కడ; కంటిన్= చూచాను; ఆ+ఎడన్= ఇంద్రలోకంలోనూ; చూచితిన్= చూచాను; ఇది= నీవు ఉంటున్న ఈ ఆశ్రమం; ఇతర+దుస్+ప్రాప్యంబు= ఇతరుల (సామాన్యుల) చేత పొందరానిది; అయిన= అయినటువంటి; పుణ్యప్రదేశంబు= పవిత్ర స్థలం; ఇచ్చటన్= ఈ ఆశ్రమంలో; వసియింపన్= ఉండే అవకాశం; నీకున్= నీకుకూడా; కృష్ణద్వైపాయను= వ్యాసమహర్షియొక్క; ప్రసాదంబునన్= కరుణవలన; సంభవించెన్= కలిగింది; అని= అనే విధంగా; పలికి= చెప్పి; వెండియున్= తిరిగి (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: నారదాదులందరూ (కుంతిచేసిన అతిథి పూజలకు సంతోషించి) ధృతరాష్ట్రుడి వద్దకు చేరారు. అపుడు ఆ ధృతరాష్ట్రుడు వినయంతోనూ, గౌరవంతోనూ వారికి వంగి నమస్కరించాడు. వారు ధృతరాష్ట్రుడిని ఆశీర్వదించారు. ధృతరాష్ట్రుడు ఏర్పాటు చేయించిన దర్భాసనాలమీద కూర్చున్నారు. కుశలాదికం సంభాషిస్తున్నారందరూ. ఆ సమయంలో నారదుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'పూర్వం శతయూప మహారాజుకు తాత అయిన సహస్రచిత్యుడు అనే (కేకయదేవ) రాజు తన పెద్దకొడుకైన శతచిత్యుడికి రాజ్యభారం అప్పగించి ఈ ఆశ్రమానికి వచ్చి తపస్సుచేసి ఇంద్రుడి మైత్రిని పొందాడు. ఆ తరువాత పృషధ్రధుడూ, శైలాలయుడూ (భగదత్తుడి తాత), పురుకుత్సుడూ (మాంధాత కొడుకు) ఈ ఆశ్రమంలోనే తపస్సు చేసి ఇంద్రలోకం పొందారు. నేను భూలోకంలో సంచరించేటప్పుడు ఇక్కడ (ఈ ఆశ్రమంలో వారు తపస్సు చేసికొనటం, అంతకుపూర్వం రాజులుగా పాలనచేయటం) తరువాత ఇంద్రలోకంలోనూ ఆ ఉత్తమ రాజర్షులను ఎరుగుదును. ఈ ఆశ్రమానికి రావటం సామాన్యులకు సాధ్యం కాదు. నీకు కూడా ఈ ఆశ్రమంలో నివసించే అవకాశం వ్యాసుడిదయవలన కలిగింది' అని చెప్పి నారదుడు మళ్ళీ ఇట్లా అన్నాడు.

సీ. **'ధరణీశ! యిచ్చటి తపమున నీవు నా । నృపుల యట్టుల విశిష్టపుఁ బదంబుఁ**
గందు; నీ తోడన గాంధారియును వచ్చు; । మీకు శశ్రూష యమేయ భక్తిఁ
జేసి కుంతియుఁ బతిఁ జేరంగ నరుగు; న । ప్పాండుభూపతి సురపతి సమీప
మువనుండి యెప్పుడు నినుఁ దలంచు, నతండు । పోఁడిమి సేయఁగలాఁడు నీకు

ఆ. **ధర్మమూర్తి యైన ధర్మసూనుఁడు దన । యాత్మ గాన విదురుఁ డన్నరేంద్రు**
వినుతతనువుఁ దగఁ బ్రవేశించు సంజయుఁ । డతుల నాకలోకగతి వెలుంగు. **5**

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఇచ్చటి= అటువంటి మహత్తు కలిగిన ఈ ఆశ్రమంలో ఆచరించిన; తపమునన్= తపస్సువలన; నీవున్= నీవుకూడా; ఆ నృపుల+అట్టుల= సహస్రచిత్యుడు మొదలైన రాజులవలెనే; విశిష్టము+పదంబు= గొప్ప స్థానాన్ని (సద్గతి); కందు(వు)= పొందుతావు; గాంధారియును= గాంధారికూడా; నీతోడన్+అ= నీతోపాటే; వచ్చున్= ఆ ఉత్తమ గతికి (నిన్ను) అనుసరించి వస్తుంది; కుంతియున్= కుంతీదేవికూడా; అమేయభక్తిన్= మిక్కిలి భక్తితో; మీకున్= మీకు (గాంధారీ ధృతరాష్ట్రులకు); శుశ్రూష= సేవ; చేసి= ఆచరించి; పతిన్= భర్త అయిన పాండురాజును; చేరంగన్= పొందటానికి; అరుగున్= వెళ్ళుతుంది; ఆ+పాండుభూపతి= ఆ పాండురాజు; సురపతి= దేవేంద్రుడి యొక్క; సమీపమునన్+ఉండి= చెంత ఉండి; ఎప్పుడున్= నిరంతరమూ; నినున్= నిన్ను; తలంచున్= తలచుకొంటూ ఉంటాడు; అతండు= ఆ పాండురాజు; నీకున్=

నీకు (గాంధారికీ); పోఁడిమి= మేలు; చేయన్+కలాఁడు= కలిగేటట్లు చేస్తాడు; ధర్మమూర్తి= ధర్మమే ఆకారంగా కలవాడు; ఐన= అయినటువంటి; ధర్మసూనుఁడు= ధర్మరాజు; తన+ఆత్మ= తన(విదురుడి) యొక్క యథార్థ రూపం; కానన్= కాబట్టి; విదురుఁడు; ఆ+వర+ఇంద్రు= ఆ ధర్మరాజు యొక్క; వినుత+తనువున్= ప్రశస్తమైన శరీరంలో; తగన్= తగువిధంగా (యోగమార్గంలో); ప్రవేశించున్= ప్రవేశిస్తాడు; సంజయుఁడు; అతుల నాకలోక గతిన్= సాటిలేని స్వర్గలోకానికి వెళ్ళటంచేత; వెలుంగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అటువంటి ఈ ఆశ్రమంలో తపస్సు చేయటంవలన సహస్రచిత్యుడు మొదలైన పూర్వపు రాజులవలె నీవూ ఉత్తమమైన గతిని పొందుతావు. గాంధారికూడా నిన్ను అనుసరించి వస్తుంది. మీకు అత్యంత భక్తితో సేవలు చేయటంవలన కుంతికూడా చివరకు తన భర్త పాండురాజు వద్దకు వెళ్ళుతుంది. ఇంద్రుడి వద్ద ఉండి ఎప్పుడూ నిన్నే తలచుకొనే పాండురాజు నీకు మేలు చేయగలడు. ధర్మ స్వరూపమైన ధర్మరాజు తన ఆత్మ కాబట్టి విదురుడు ధర్మరాజు శరీరంలో తగువిధంగా ప్రవేశిస్తాడు. సంజయుడు స్వర్గలోకానికి వెళ్ళి ప్రకాశిస్తాడు.'

వ. అనిన విని యాంబికేయుండు గాంధారీకుంతీ సమేతంబుగా సంతోషంబు నొందె; నచ్చటియందఱును బ్రీతాత్ములై; రప్పుడు. 6

ప్రతిపదార్థం: అనినన్= అని నారదుడు చెప్పగా; విని= విన్నవాడై; ఆంబికేయుండు= (అంబిక కొడుకు) ధృతరాష్ట్రుడు; గాంధారీ కుంతీ సమేతంబుగాన్= గాంధారితోనూ, కుంతితోనూ కలిసి; సంతోషంబున్= ఆనందాన్ని; ఒందెన్= పొందాడు; అచ్చటి అందఱును= ఇంకా అక్కడ ఉన్న వారందరూ; ప్రీత+ఆత్ములు= సంతోషించిన మనసుగలవారు; ఐరి= అయ్యారు; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: నారదు డట్లా చెప్పగా విన్న ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతులతో సహా సంతోషించాడు. ఇంకా అక్కడ ఉన్నవారందరూ కూడా సంతోషించారు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. శతయూపుఁడు నారదుతో। 'నతుల జ్ఞానాభిరామ' యడిగెద నిన్నుం
గుతుకంబున నొక్కటి; నీ। వితతకృపం దెలియఁ జెప్పవే నా' కనుడున్. 7

ప్రతిపదార్థం: శతయూపుఁడు= శతయూపుడనే రాజర్షి; నారదుతోన్= నారదమహర్షితో (ఇట్లా అన్నాడు); అతులజ్ఞాన+అభిరామ!= సాటిలేని జ్ఞానంతో మనోహరమైనవాడా!; నిన్నున్= నిన్ను; కుతుకంబునన్= కుతూహలం కొద్దీ; ఒక్కటి= ఒకానొక విషయం; అడిగెదన్= అడుగుతాను; నాకున్= నాకు; నీ+వితత+కృపన్= అత్యధికమైన నీదయతో; నీవు; తెలియన్+చెప్పవే= తెలుపవలసింది; అనుడున్= అని శతయూపుడు అనగా.

తాత్పర్యం: శతయూపుడు నారదుడితో 'అన్నీ అందరికంటె ఎక్కువగా తెలిసినవాడా! కుతూహలంకొద్ది నిన్నొక విషయం అడుగదలచాను దయతో నాకు చెప్పవలసింది' అని పలుకగా. (తరువాతి వచనంతో అన్వయం)

వ. ఆ దేవముని 'నీ యడుగఁ దలంచినది యెయ్యది? యడుగు' మనిన నతం 'డిక్కురుపతి సుగతి గను' నని నిర్దేశించితి; తద్విశేషంబు వినవలతు; వివరింపు' మనుటయు. 8

ప్రతిపదార్థం: ఆ దేవముని= ఆ దేవతా ఋషి; నీ+అడుగన్+తలంచినది= నీవు నన్ను అడగాలి అనుకొన్నది; ఏ+అది?= ఏది?, ఏమిటి?; అడుగుము= అడుగుము; అనినన్= అని నారదు డనగా; అతండు= ఆ శతయూపుడు; ఈ+కురుపతి= ఈ ధృతరాష్ట్రుడు;

సుగతి= శ్రేష్ఠమైన స్థానాన్ని; కనున్= పొందుతాడు; అని= అనే విధంగా; నిర్దేశించితి(వి)= చెప్పావు; తద్+విశేషంబు= సుగతి పొందటానికి సంబంధించిన ఆ విషయం; వినన్+వలతు(న్)= వినగోరుతున్నాను; వివరింపుము= విస్తరించి చెప్పవలసింది; అనుటయున్= అని శతయూపుడు అనగా.

తాత్పర్యం: ఆ దేవర్షి నారదుడు 'నీవు నన్ను ఏమి అడగా లనుకొంటున్నావు? అడుగుము' అన్నాడు. అపుడు శతయూపుడు 'ఈ కురురాజుకు ఉత్తమగతి కలుగుతుందని చెప్పావు. అందుకు సంబంధించిన విశేషాలు వివరించు.' మని అడుగగా (తరువాతి పద్యంతో అన్వయం)

నారదుఁడు శతయూపునితో ధృతరాష్ట్రాదులు సుగతిఁ బొందెడు తెఱంగు చెప్పుట (సం.15-27-8)

సీ. **ఆ సంయమీశ్వరుం డాతని కిట్లను। 'నిచ్చమై నేను మహేంద్రు కడకు**
నరిగి సంభాషణ మాచరించుచు నుండ। నా సభ నిక్కౌరవాధినాథు
వలనివార్తలు పుట్టి యలఘు తపోవృత్తి। నిష్ఠాతిశయము వర్ణించి' రప్పు
డవ్వాసవుఁడు చెప్పె ననఘ! నాతో ముని। జాతుఁడు ధృతరాష్ట్ర జనవిభుండు

తే. **తపము మూఁడేఁడు లొనరించి తాను సతియు। దేహము ల్విడ్చి చని ధనాధీశు చెలిమి**
నతిశయిల్లు దివ్యాభరణాభిరాముఁ। డై విమానవిహార హృష్టాత్ముఁ డగుచు. 9

ప్రతిపదార్థం: సంయమి+ఈశ్వరుండు= (యతులలో శ్రేష్ఠుడైన) ఆ నారదుడు; అతనికిన్= శతయూపుడితో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనున్= అన్నాడు; అనఘ!= పాప మెరుగనివాడా!; నేను= నేను (నారదుడు); ఇచ్చమైన్= కోరికతో; మహేంద్రు కడకున్= దేవేంద్రుడి వద్దకు; అరిగి= వెళ్ళి; సంభాషణము+ఆచరించుచున్+ఉండన్= మాటలాడుతుండగా; ఆ సభన్= ఆ ఇంద్రసభలో; ఈ+కౌరవ+అధినాథు వలని వార్తలు= ఈ ధృతరాష్ట్రుడికి సంబంధించిన సమాచారం; పుట్టి= ప్రస్తావనకు వచ్చి; అలఘు తపస్+వృత్తి నిష్ఠా+అతిశయము= ధృతరాష్ట్రుడి గొప్ప అయిన తపస్సునందు వర్తిస్తున్న శ్రద్ధయొక్క ఆధిక్యం; వర్ణించిరి= ప్రశంసించారు; అప్పుడు= ఆ సందర్భంలో; ఆ+వాసవుఁడు= ఆ ఇంద్రుడు; నాతోన్= నాతో; చెప్పెన్= ఈ విధంగా అన్నాడు; మునిజాతుఁడు= మునివలన జన్మించిన; ధృతరాష్ట్ర జన విభుండు= ధృతరాష్ట్ర మహారాజు; మూఁడు+ఏఁడులు= మూడు సంవత్సరాల పాటు; తపము= తపస్సు; ఒనరించి= చేసి; తానున్= తానూ; సతియున్= అతడి భార్యా; దేహముల్= శరీరాలు; విడ్చి= త్యజించి; చని= వెళ్ళి; ధన+అధి+ఈశు= ధనాధిపతి అయిన కుబేరుడియొక్క; చెలిమిన్= స్నేహంతో; దివ్య+ఆభరణ+అభిరాముఁడు+ఐ= గొప్ప ఆభరణాలతో మనోహరుడై; విమాన+విహార+హృష్ట+ఆత్ముఁడు= విమానంలో విహరించటంవలన సంతోషించే మనస్సు కలవాడు; అగుచున్= అవుతూ; అతిశయిల్లున్= వెలుగుతాడు.

తాత్పర్యం: శతయూపుడితో నారదమహాముని ఇట్లా అన్నాడు. 'ఓ పుణ్యాత్మా! ఒకసారి నేను దేవేంద్రుడివద్దకు వెళ్ళి మాటాడుతుండగా ఆ సభలో ఈ ధృతరాష్ట్రుడి వృత్తాంతం ప్రస్తావనకు వచ్చి, ఇతడి తీవ్రతపోనిష్ఠను అందరూ ప్రశంసించారు. ఆ సందర్భంలో దేవేంద్రుడు నాతో ఇట్లా అన్నాడు. 'ముని శ్రేష్ఠుడైన ధృతరాష్ట్రుడు తపస్సు మూడు సంవత్సరాలు చేస్తాడు. ఆ తరువాత తానూ గాంధారీ తమ శరీరాలు విడిచిపెట్టి, కుబేరుడితో మైత్రి పొంది దివ్యమైన ఆభరణాలు ధరించి, పుష్పకవిమానంలో విహరిస్తూ సంతోషంగా వెలుగుతారు.

క. **అని పొండుని మది ప్రమదం। బునఁ దేలఁగఁ జెప్పె 'ననుడు మోదము ధృతరా**
ష్ట్రుని నెమ్మనమున నిండా। రె; నఖిల జనచిత్తములను బ్రియము దలిర్చెన్. 10

ప్రతిపదార్థం: పాండునిమది= పాండురాజు హృదయం; ప్రమదంబునన్= సంతోషంతో; తేలఁగన్= తేలిపోయేటట్లుగా; అని= ఆ ప్రకారంగా; చెప్పెన్= ఇంద్రుడు నారదుడితో చెప్పాడు; అనుడున్= అని నారదుడు చెప్పగానే; ధృతరాష్ట్రుని= ధృతరాష్ట్రుడియొక్క; నెమ్మనమునన్= నిండైన హృదయంలో; మోదము= సంతోషం; నిండారెన్= నిండింది; అఖిలజన చిత్తములను= అక్కడ ఉన్న వారందరి మనస్సులోనూ; ప్రియము= ఆమోదం; తలిర్చెన్= చివురించింది.

తాత్పర్యం: పాండురాజు హృదయం సంతోషంతో తేలేవిధంగా ఇంద్రుడు నాతో ఆ విధంగా చెప్పాడు' అని నారదు డనగానే ధృతరాష్ట్రుడి మనస్సు నిండా ఆనందం పొందింది. అక్కడున్న వారందరి మనస్సుల్లోనూ ప్రీతి పల్లవించింది.

విశేషం: ధృతరాష్ట్రుడికి కుబేరలోకం సిద్ధిస్తుందనీ సుఖిస్తాడనీ విని పాండురాజు సంతోషించాడు. అంటే పాండురాజుకు ధృతరాష్ట్రుడిపై గల గౌరవాదరాలు ధ్వనిస్తున్నాయి.

వ. ఇట్లు సద్గోష్ఠి నడపి యత్తాపసోత్తము లక్కురుపతిసత్తము నభినందించి యామంత్రణంబు సేసి నిజనివాసంబులకుం జని; రక్కాలంబున. 11

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సత్+గోష్ఠి= సాధుజనులతో సమావేశాన్ని; నడపి= జరిపి; ఆ+తాపస+ఉత్తములు= నారదుడు మొదలైన ఆ మునిశ్రేష్ఠులు; ఆ+కురుపతి సత్తమున్= కురువంశపు రాజులలో ఉత్తముడైన ఆ ధృతరాష్ట్రుడిని; అభినందించి= ప్రశంసించి; ఆమంత్రణంబు+చేసి= వీడుకోలు చెప్పి; నిజ నివాసంబులకున్= తమ తమ స్థానాలకు; చనిరి= వెళ్ళిపోయారు; ఆ+కాలంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా సాధుజనులంతా కలిసి మంచి మాటలతో సమావేశం జరిపి, నారదుడు మొదలైన మునివరులందరూ ఆ ధృతరాష్ట్రుడు ఉత్తమ గతులు పొందుతున్నందుకు తత్సాధకంగా తీవ్ర తపస్సు చేస్తున్నందుకూ ప్రశంసలు చేసి వీడ్కోలు చెప్పి తమతమ నివాసాలకు వెళ్ళిపోయారు. ఆ సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. పాండుపుత్త్రులు తల్లిఁ బలుమఱుఁ దలఁతురు। వగతురు, ధృతరాష్ట్రువలన సుబల
నందన దెసను మనంబిడి; చింతింతు। రట్ల పౌరులు వంత నారఁ గూరి
'వృద్ధుండు ధృతరాష్ట్రవిభుఁడు సుఖార్హుఁడు। విగతజనం బైన విపినభూమి
నెత్తెఱంగున వసియించు? గాంధారియుఁ। గుంతియు నత్యంత కోమలాంగు

తే. లడవి నుండంగ నెట్లోర్తు రకట! యిట్టి కొడుకులను రాజ్యసౌఖ్యంబు విడిచి యట్లు
సనునె యక్కుంతిభోజుని తనయ? జనని। దొఱఁగిపోవుట కెంత గుందుదురొ వీరు! 12

ప్రతిపదార్థం: పాండు పుత్త్రులు= పాండురాజు కొడుకులు; తల్లిన్= కుంతిని; పలుమఱున్= అనేక పర్యాయాలు; తలఁతురు= తలచుకొంటూ ఉంటారు; ధృతరాష్ట్రువలనన్= ధృతరాష్ట్రుడిపైనా; సుబలనందన+దెసను= (గాంధార రాజయిన) సుబలుడి కూతురి (గాంధారి) పైనా; మనంబు+ఇడి= తమ మనసులు ఉంచి; వగతురు= (పాండవులు) దుఃఖిస్తూ ఉంటారు; పౌరులును= ప్రజలు సైతం; అట్లు+అ= ఆ విధంగానే; వంతన్= దుఃఖంలో; ఆరన్+కూరి= నిండా మునిగిపోయి; చింతింతురు= విచారిస్తూ ఉంటారు; వృద్ధుండు= ముసలివాడైన; ధృతరాష్ట్ర విభుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; సుఖ+అర్హుఁడు= సుఖింపదగినవాడు;

విగతజనంబు= మనుష్యులు లేనిది; ఐన= అయినటువంటి; విపినభూమిన్= అడవులలో; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; వసియించున్?= ఉంటాడు?; గాంధారియున్= గాంధారీ; కుంతియున్= కుంతీ; అత్యంత కోమల+అంగులు= మిక్కిలి సుకుమారమైన మేనులు కలవారు; అడవిన్= అడవిలో; ఉండంగన్= ఉండటానికి; ఎట్లు= ఏ విధంగా; ఓర్తురు?= సహించగలరు?; అకట!= అయ్యో!; ఆ+కుంతిభోజతనయ= (కుంతిభోజుడి కూతురు) కుంతి; ఇట్టి= ఇటువంటి; కొడుకులను= పుత్రులను; రాజ్యసౌఖ్యంబున్= రాజ్యాధిపత్యంవలన కలిగే సుఖమూ; విడిచి= వదలిపెట్టి; అట్లు= ఆ విధంగా (అడవులకు); చనునె?= వెళ్లునా? జనని= తమ తల్లి కుంతి; తొఱఁగి= తమను విడిచి; పోవుటకున్= అడవులకు వెళ్ళినందుకు; వీరు= ఈ పాండవులు; ఎంత= ఎంతగా; కుందుదురు+ఒ?= విచారిస్తున్నారో కదా!

తాత్పర్యం: అక్కడ హస్తినాపురంలో పాండవులు తల్లిని చాలాసార్లు తలుచుకొంటూ ఉన్నారు. గాంధారీ ధృతరాష్ట్రులను తలుచుకొని దుఃఖిస్తున్నారు. జనులు కూడా మిక్కిలిగా దుఃఖించేవారు. వారు 'ముసలివాడైన ధృతరాష్ట్రుడు ఇప్పుడు సుఖపడవలసినటువంటివాడు. మనుషులే ఉండని అడవులలో ఏ విధంగా ఉండగలడు? గాంధారీ, కుంతీ చాలా సుకుమారలు. అడవులలో ఉండటం ఎట్లా ఓర్చుకొంటారు? ఇటువంటి ఉత్తములైన కొడుకులను, రాజ్యసుఖాలను విడిచిపెట్టి ఆ కుంతి అడవులకు ఎట్లా వెళ్ళిందో! తల్లి తమను విడిచిపోయినందుకు ఈ పాండవులు ఎంతగా విచారిస్తున్నారో!

క. **ఆయాసంబున విదురుని। కాయము, సంజయుని మేనుఁ గందక యున్నే?**
పోయిరి ధృతరాష్ట్ర మహీ। నాయకుపై భక్తిఁ గాననమున వసింపన్.' **13**

ప్రతిపదార్థం: విదురుని కాయము(న్)= విదురుడి శరీరమూ; సంజయుని మేను= సంజయుడి శరీరమూ; ఆయాసంబునన్= (అడవులలో) శ్రమవలన; కందక+ఉన్నే?= నొవ్వకుండా ఉంటాయా?; ధృతరాష్ట్ర మహీనాయకుపైన్= ధృతరాష్ట్ర మహారాజుమీద; భక్తిన్= సేవా భావంతో; కాననమునన్= అడవిలో; వసింపన్= ఉండటానికి; పోయిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడిని సేవించుకొనాలనే ఉద్దేశంతో అరణ్యాలలో ఉండటానికి వెళ్ళారు గానీ, ఆ విదురుడికీ, సంజయుడికీ అడవులలో శ్రమవలన ఒళ్ళు కందిపోకుండా ఉంటుందా?

క. **అని యొండొరువులతోడ। న్వనట యెసఁగఁ బలుకుదురు మనంబులఁ గుంతీ**
తనయులు మాతృవియుక్తత। కనయము నడలుదురు కౌరవాన్వయముఖ్యా! **14**

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; వనట= దుఃఖం; ఎసఁగన్= అతిశయిస్తుండగా; ఒండొరువులతోడన్= ఒకరితో ఒకరు (పరస్పరం); పలుకుదురు= అంటూ ఉంటారు; కౌరవ+అన్వయముఖ్య!= కౌరవవంశంలో పేరుగాంచినవాడా జనమేజయా!; కుంతీ తనయులు= పాండవులు; మాతృ వియుక్తతకున్= తల్లితో కలిగిన ఎడబాటుకు; మనంబులన్= మనస్సులలో; అనయము= అత్యధికంగా; అడలుదురు= అల్లాడిపోతూ ఉంటారు.

తాత్పర్యం: ఈ విధంగా పౌరులు తమలో తాము దుఃఖంతో మాటాడుతారు. ఓ జనమేజయ మహారాజా! పాండవులు తల్లితో ఎడబాటుకు చాలా అల్లాడిపోతున్నారు. (అన్నాడు వైశంపాయనుడు).

సీ. **ధర్మపుత్త్రాదులందఱు నొక్కచో నుండి। ధృతరాష్ట్రు నాతని దేవిఁ బేరు**
కొని వారి కొడుకు లెల్లను ద్రుంగి రని, వార। లతి వృద్ధు లెమ్మెయి నడవిఁ గలిసి

యున్నా రనియు, నింక నెన్నాళ్ళు లుండెడి। గొంతి వనంబునఁ గూరఁ దినుచు?.

ననియును, బంధుల నదయతఁ దునిమితి। మలుక ధైర్యంబున నడఁప మైతి

తే. మనియు, నభిమన్యు వీరుని నతని తమ్ముఁ। గుఱ్ఱలను గర్ణునాఁఅడిఁ గోలుపోయి

యొంటి వడితి మనియుఁ, గడు నుమ్మలంపు। మాట లాడుదు ర్పరిజనుల్ మఱుఁగుచుండ. 15

ప్రతిపదార్థం: ధర్మపుత్ర+ఆదులు= ధర్మరాజు మొదలైన వారు; అందఱున్= అందరూ; ఒక్కచోన్= ఒక చోట; ఉండి; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్రుడినీ; ఆతని, దేవిన్= అతడి భార్యఅయిన గాంధారినీ; పేరుకొని= పేర్కొని; వారి, కొడుకులు+ఎల్లను= వారి కుమారులైన దుర్యోధనాదులందరూ; త్రుంగిరి= మరణించారు; అని; వారలు= ఆ గాంధారీ ధృతరాష్ట్రులు; అతి వృద్ధులు= బాగా ముసలివాళ్ళు; ఏ+మెయిన్= ఏ విధంగా; అడవిన్= అడవిలో; కలిసి= కలిసిపోయి; ఉన్నారు= జీవిస్తూ ఉన్నారు; అనియున్= అనుచూ; గొంతి= (తమ తల్లి) కుంతి; కూరన్= కంద మూలాలు; తినుచున్= ఆహారంగా తీసికొంటూ; వనంబునన్= అడవిలో; ఇంకన్= ఇంకా; ఎన్నాళ్ళు= ఎంతకాలం; ఉండెడిన్= ఉంటుంది; అనియును= అంటూ; బంధులన్= చుట్టాలను; అదయతన్= జాలిలేకుండా; తునిమితిమి= చంపేశాం; అలుకన్= కోపాన్ని; ధైర్యంబునన్= నిర్వికారచిత్తంతో; అడఁపము+ఐతిమి= అణచివేయలేకపోయాము; అనియున్= అనీ; వీరునిన్= వీరుడైన; అభిమన్యున్= అభిమన్యుడిని; అతని తమ్ముఁ గుఱ్ఱలను= అభిమన్యుడికి తమ్ముళ్ళయిన ద్రౌపది కొడుకులు ఉపపాండవులను; ఆఱిడిన్= అపకీర్తి కరంగా; కర్ణున్= కర్ణుడిని; కోలుపోయి= పోగొట్టుకొని; ఒంటి+పడితిమి= ఏకాకులం అయినాం; అనియున్= అంటూ; కడున్= మిక్కిలి; ఉమ్మలము+మాటలు= దుఃఖపు మాటలు; పరిజనుల్= సేవకులు; మఱుఁగుచున్+ఉండన్= దుఃఖిస్తూ ఉండగా; ఆడుదుర్= అంటూ ఉంటారు.

తాత్పర్యం: ధర్మరాజు మొదలైన వారినందరినీ ఒకచోటికి చేర్చి అక్కడి పరిజనులంతా దుఃఖిస్తుండగా ధృతరాష్ట్రుడినీ, గాంధారినీ, తలచుకొని ఇట్లా శోకాలాపాలు చేసేవారు. గాంధారీ ధృతరాష్ట్రుల కొడుకులు అందరూ మరణించారు. ఈ పండు ముసలి ప్రాయంలో అడవి పాలయ్యారు. కుంతీదేవి కూరలు తిని కడుపు నింపుకొంటూ అడవులలో ఇంకా ఎన్నాళ్ళు ఉంటుందో-నిర్దాక్షిణ్యంగా బంధువులను చంపివేశాం. కౌరవులమీది కోపాన్ని ధైర్యంతో అణచుకోలేకపోయాము. అపకీర్తికరంగా పరాక్రమవంతుడైన అభిమన్యుడినీ, అతడి సోదరులనూ, కర్ణుడినీ పోగొట్టుకొని ఏకాకులమైనాం.

విశేషం: 'పరిజనులు మఱుఁగుచుండ' పాండవులు అనుకొంటున్న మాటలు వాటివెనక విచారం చూసేవారికి కూడా దుఃఖం కలిగించేంతటి విస్తారంగా ఉన్నదని భావం.

వ. ఇ ట్లనుదినంబును ఘన చింతాక్రాంతులై యలంత నొందుదురు. 16

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అనుదినంబును= ప్రతిరోజూ; ఘన= చింతా; ఆక్రాంతులు= అత్యధికమైన విచారానికి లోబడినవారు; ఐ= అయి; అలంతన్= అలసటను; ఒందుదురు= పొందుతున్నారు.

తాత్పర్యం: ఈ విధంగా ప్రతిరోజూ పాండవులు అత్యంతదుఃఖంవలన బడలిపోతూ ఉన్నారు.

చ. విదురుని సంజయుం దలఁచి వేదనఁ బొందుదు; రట్లు నెవ్వగల్

హృదయముఁ గుందఁజేయఁ జెలువేది మనోజ్ఞము లైన భోగముల్

వదలి వినోదముల్ సలుపు లాలసతం బెడఁబాసి రాజ్యసం

పద నరయం దలం పెడలి పాడఱి యుండుదు, రేమి సెప్పుదున్! 17

ప్రతిపదార్థం: విదురునిన్= విదురుడిని; సంజయునిన్= సంజయుడినీ; తలఁచి= తలచుకొని; వేదనన్= విచారాన్ని; పొందుదురు= పొందుతుంటారు; అట్లు= ఆ విధంగా; నెవ్వగల్= సంపూర్ణ (నెఱ)మైన విచారాలు; హృదయమున్= తమ తమ మనసులను; కుందన్+చేయన్= క్రుంగిపోయేటట్లు చేస్తుండగా; చెలువు+ఏది= తేజస్సు నశించి; మనోజ్ఞములు+ఐ= తమ మనసులకు ఇష్టమైనటువంటి; భోగముల్= అనుభవాలను; వదలి= విడిచిపెట్టి; వినోదముల్= ఆనందం కలుగజేసే పనులు; చలుపు= చేయాలి అనే; లాలసతన్= కోర్కెను; పెడన్+పాపి= పూర్తిగా వదలిపెట్టి; రాజ్య సంపదన్= సామ్రాజ్యపు సిరులను; అరయన్= చూసే; తలంపు= ఆలోచన; ఎడలి= తొలగి; పాడఱి= తమకు యోగ్యమైన స్థితి నశించి; ఉండుదురు= ఉంటారు; ఏమి= (జనమేజయా!) వారి స్థితిని గురించి= ఏమని; చెప్పుదున్!= చెప్పగలను!

తాత్పర్యం: విదురుడిని, సంజయుడిని తలచుకొని పాండుకుమారులు విచారించేవాళ్ళు. ఆ విధంగా సంపూర్ణంగా దుఃఖాలు మనసును క్రుంగదీస్తుంటే తేజోహీనులైనారు. తమకు ఇష్టమైన సుఖాలు విడిచిపెట్టారు. వేడుకలపై కోరికనే వదలివేశారు. రాజ్యం మీద ఆలోచన కూడా తొలగిపోయింది. తమకు అర్హమైన స్థితిని పోగొట్టుకొని ఉన్నారు. ఆ దుస్థితిని ఏమని చెప్పేది జనమేజయా!

విశేషం: వగలలో నెఱతనంవలన పాండవులలో 'రాజతేజం' పోయింది. హృదయం కూడా వ్యథ (మానసిక) ఆంతరంగికం కాగా చెలువేదటం - కాంతిహీనులు కావటం శారీరకం బాహిరమైనది. రాజభోగాలు తమ మనసుకు నచ్చినవికూడా విడిచిపెట్టారు. 'న రాజ్యే న చ నారీషు' అని మూలంలో కొంతవాచ్యంగా ఉన్న స్త్రీ సుఖం ఇక్కడ మనోజ్ఞాలైన భోగాలలో చేరి గూఢంగా వ్యక్తం చేయబడటం మనోజ్ఞం. నిద్రాది సుఖాలు (27.14) త్యజించారు. రాజ్య సంపదనరయం దలంపెడలి' యుద్ధంచేసి రాజ్యం సంపాదించుకొన్నారు కాని (తామెంతో ఆశపడిన తల్లి రాజ్యసుఖాలకు దూరం కావటంవలన) రాజ్యంపై పాండవులకు మక్కువ పోయింది. తన వారికి ఉపయోగించని రాజ్యం తమకూ అనవసరం అన్నట్లుగా అయింది. 'న వేదాధ్యయన 'సంప్రీతిః) అనే మూలం ఇట పరిహరించటం విశేషం. రాజ్యసుఖాదులలో తృప్తి లేదన్న మూలం కంటె ఆ భోగాలే త్యజించారన్న తెలుగులో ప్రత్యేకత ఉన్నది. రాజ్యంపై కూడా తలపు లేకుండా అన్ని సుఖాలూ వదలివేయటంవలన (దుఃఖంచేత కాంతివిహీనులు కావటంవలన పాండవులు రాజులుగా కనబడలేదు. రాజకార్యాలు చూడటం లేదు (29,2,3) 'పాడఱి (నష్టసంజ్ఞాః) యుండుదురు. మొత్తమ్మీద ఉన్నారు. అర్హస్థితి మాత్రం కాదు (29.4) ఏమి చెప్పుదున్ అనే మాట పాండవుల విచారం మాటలలో చెప్పటానికి వీలులేనంత అధికం అని కథకుడి (వైశంపాయనుడి) తాత్పర్యం. దానితో ముగింపు ఇంక నేను చెప్పలేను అనే అంశం నిరూపిస్తున్నట్లుగా ఉండటం విశేషం.

క. ద్రౌపదియు సుభద్రయు సం। తాపం బందుదురు; పాండుతనయులు దలరన్

భూపాల భవజ్జనకుని। చూ పందఱ మానసముల శోకము నదుమున్. 18

ప్రతిపదార్థం: పాండుతనయుల్= పాండురాజు కొడుకులు; తలరన్= దుఃఖిస్తుంటే; ద్రౌపదియున్= ద్రౌపదీ; సుభద్రయున్= సుభద్రా; సంతాపంబు= విచారం; అందుదురు= పొందుతుంటారు; భూపాల!= జనమేజయ రాజా!; భవత్! జనకుని= నీకు తండ్రి అయిన పరీక్షిత్తుడిని; చూపు= చూసికొనటం అనేది; అందఱ= పాండవులూ, ద్రౌపదీ, సుభద్రా మొదలైనవారందరి యొక్క; మానసముల= మనసులలో ఉన్నటువంటి; శోకము= విచారాన్ని; అదుమున్= అణచిపెట్టుతుంది.

తాత్పర్యం: పాండవుల విచారం ఇంకా అధికమయ్యేటట్లుగా ద్రౌపదీ, సుభద్రా బాధపడేవారు. ఓ జనమేజయ మహారాజా! నీ తండ్రి అయిన పరీక్షిత్తును చూచికొంటూ అందరూ మనసులో బాధ అణచుకొనేవారు.

విశేషం: (అభిమన్యు) అతని తమ్ముగుజ్జులను (15.ప) తలచుకొనటంవలనను ద్రౌపదీ, సుభద్రలు (హతపుత్రులు) కుంతీ ప్రభృతులను గురించి విచారిస్తుంటే - అది పాండవులను ఇంకా బాధించేది. పరీక్షిత్తు వంశాంకురం. పాండవ వంశం నిలబడవలసింది పరీక్షిత్తు ఒక్కడివలననే. పరీక్షిత్తును అందరూ ప్రేమగా చూసేవారు. ఇంతవిచారం ఉన్నా వాళ్ళందరూ ఇంకా రాజ్యాన్ని అంటిపెట్టుకొని ఉండటానికి కారణం పరీక్షిత్తే. అందువలననే క్రమంగా ఇపుడు జనమేజయుడు 'భూపాలుడైనాడు. శోకము నదుమున్' మనవడిపై ప్రేమ కూడా (ఇంతమందికి) శోకాన్ని అణచిపెట్టబడ్డ శోకం (కుంతీ ప్రభృతులు స్మరణకు వచ్చిన సమయాలలో) ఉబికి అధికమవుతుందని 'అదుము' శబ్దం వ్యక్తం చేస్తుంది.

ఆ. **పరమధీరు లైన పాండుతనూభవు । లిట్లు ధైర్యసార మెడలి వికల**
బుద్ధు లగుచు నుండి పోవం గడంగి ర । య్యంధనృపతిఁ జూడ నధిపముఖ్య! 19

ప్రతిపదార్థం: అధిపముఖ్య!= రాజులలో శ్రేష్ఠుడా జనమేజయ మహారాజా!; పరమ ధీరులు+ఐ= ఉత్కృష్టమైన ధైర్యం కలిగినవారై; పాండుతనూభవులు= పాండురాజు కొడుకులు; ఇట్లు= ఈ ప్రకారంగా; ధైర్యసారము= ధైర్యంయొక్క గొప్పతనాన్ని; ఎడలి= (తొలగి) కోలుపోయి; వికల బుద్ధులు= కలతచెందిన బుద్ధి కలిగినవారు; అగుచున్+ఉండి= అయి; ఆ+అంధనృపతిన్= ఆ ధృతరాష్ట్రుడిని; చూడన్= చూడటానికి; పోవన్= పోయేటందుకు; కడంగిరి= పూనుకొన్నారు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! అత్యధిక ధైర్యం కలిగిన పాండవులు ఈ విధంగా ఉత్తమ ధైర్యం కోల్పోయి సరిగా లేని మనసులతో ఉండి, గ్రుడ్డివాడైన ఆ ధృతరాష్ట్రుడిని చూచేందుకు వెళ్ళటానికి పూనుకొన్నాడు.

విశేషం: 'పరమధీరులకు కూడా ధైర్య సారం పోవటం అనేది వారికి ధృతరాష్ట్రాదులపై ఉన్న ఆత్మీయతను వ్యక్తంచేస్తుంది. ధృతరాష్ట్రుడు 'అంధనృపతి' చూపులేనివాడు కాబట్టి ఆయనను చూడన్ బయలుదేరారు. ఆ నృపతి అంధుడు కాబట్టి తమ తల్లికంటె ధృతరాష్ట్రుడిని చూడటంలో ప్రాధాన్యం. గాంధారీ ప్రభృతులకూ (అంధ) నృపతి ఉపలక్షకం.

వ. **అట్టియెడ సహదేవుండు పాండవాగ్రజునకుం బ్రణమిల్లి భరితవినయుం డై. 20**

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో; సహదేవుండు= సహదేవుడు; పాండవ+అగ్రజునకున్= ధర్మరాజుకు; ప్రణమిల్లి= నమస్కారం చేసి; భరిత వినయుండు+ఐ= నిండా అణకువ కలవాడై (ఇట్లా అన్నాడు.)

తాత్పర్యం: ఆ సమయంలో సహదేవుడు ధర్మరాజుకు ప్రణామంచేసి వినయంతో (తరువాతి పద్యంతో అన్వయం).

క. **'ఏను మును చెప్ప వెఱచితిఁ । గాని యధిప! గొంతిఁ జూడఁగా జను టర్హం**
బైన పని; యింత కేదెస । దా నొందునొ విపినవాస దౌస్థిత్యమునన్? 21

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఏను= నేను; మును= ముందుగా; చెప్పన్= చెప్పటానికి; వెఱచితిన్+కాని= సంకోచించాను కాని; గొంతిన్= కుంతిని; చూడఁగాన్= చూడటంకొరకు; చనుట= అడవులకు వెళ్ళటం; అర్హంబు+ఐన పని= తగిన కార్యం; ఇంతకున్=ఇప్పటికే; విపిన+వాస దౌస్థిత్యమునన్= అరణ్యాలలో నివసించటంవలన కలిగిన దురవస్థల మూలంగా; తాను= ఆ కుంతి; ఏదెసన్= ఎటువంటి స్థితి; ఒందునొ?= పొందిందో?

తాత్పర్యం: ధర్మరాజా! నేను ముందే చెప్పటానికి సంకోచించాను గానీ కుంతిని చూడటానికి మనం అడవులకు వెళ్ళటం ఉచితమైన కర్తవ్యం. అరణ్యావాసపు శ్రమవలన కుంతి ఇప్పటికే ఏ స్థితిలో ఉన్నదో. (దుష్స్థితి యొక్క భావార్థక రూపం దౌస్థ్యము)

తే. గొంతి ప్రాణంబుతో నుండఁ గురువరేణ్య!। యచ్చటికిఁ జని యొకమరి యమ్మహాను

భావ దర్శింప వలవదె? బావ నప్పు। ననుసరించుచు నెట్లున్న యదియొ సాధ్వి! 22

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశంలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; గొంతి= కుంతి; ప్రాణంబుతోన్+ఉండన్= బ్రతికి ఉన్నప్పుడే; ఒకమరి= ఒక పర్యాయం; అచ్చటికిన్= అడవికి; చని= వెళ్ళి; ఆ+మహానుభావన్= ఆ ఉత్తమురాలిని; దర్శింపన్= చూడటం; వలవదె?= తగదా?; సాధ్వి!= మంచి నడవడికల స్త్రీ (కుంతి); బావన్= బావగారి (ధృతరాష్ట్రుడినీ; అప్పన్= అక్కగారి (గాంధారి)నీ; అనుసరించుచున్= వెంట ఉండి; ఎట్లు= ఏ విధంగా; ఉన్న+అదియొ!= ఉన్నదో!

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడా! కుంతి ప్రాణాలతో ఉన్నప్పుడే ఒకసారి అడవికి వెళ్ళి ఆ మహాత్మురాలిని చూడటం ధర్మం. సాధువర్తనం కలిగిన కుంతి అక్క బావలను అనుసరిస్తూ నడుచుకొంటూ ఇప్పుడు ఎట్లా ఉన్నదో?

క. ధృతరాష్ట్రుఁడు గాంధారియు। నతిమృదులాంగకులు వల్కలాజినధరులై

వ్రతచర్యల వన్యాహా। రత నలఁగుచు నున్నవారు రాజవరేణ్యా! 23

ప్రతిపదార్థం: రాజవరేణ్యా!= రాజులలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; ధృతరాష్ట్రుఁడున్= ధృతరాష్ట్రుడూ; గాంధారియున్= గాంధారీ; అతి మృదుల+అంగకులు= మిక్కిలి సుకుమారం అయిన శరీరం కలవారు; వల్కల+అజినధరులు+ఐ= నారబట్టలు, మృగచర్మాలు ధరించినవారై; వ్రతచర్యలన్= వ్రతాలను ఆచరించటంచేత; వన్య+ఆహారతన్= అడవులలో లభించే కాయలు దుంపలు మొదలైనవి ఆహారంగా తీసికొనటంచేత; నలఁగుచున్= బాధపడుతూ; ఉన్నవారు= ఉన్నారు.

తాత్పర్యం: రాజా! ధృతరాష్ట్రుడూ, గాంధారీ చాలా సుకుమారులు. నారబట్టలు, మృగచర్మాలూ ధరించి, వివిధ వ్రతాలు ఆచరిస్తూ, కాయలు దుంపలు తీసికొంటూ చాలా నలిగిపోయి ఉన్నారు.

ఉ. వారలఁ జూడఁ బోఁ దగు నవశ్యము దుర్దశ పుట్టకుండ మున్
మీ'రని చెప్ప నప్పుడు సమీపమునం జెవి దార్చి నెవ్వగం
గూరుచు నున్న ద్రౌపది యగుం గరణీయము బంధు దుఃఖ సం
తారక! మీకు నీతఁ డుచితంబుగఁ జెప్పిన కార్య మెమ్మెయిన్. 24

ప్రతిపదార్థం: దుర్దశ= కష్టమైన స్థితి; పుట్టక+ఉండన్= కలగకుండా; మున్= ముందుగానే; వారలన్= ఆ గాంధారీ ధృతరాష్ట్రులను, కుంతిని; చూడన్= చూడటానికి; మీరు; అవశ్యము= తప్పకుండా; పోన్= అడవికి వెళ్ళటం; తగున్= మంచిది; అని= అనే విధంగా; చెప్పన్= సహదేవుడు ధర్మరాజుతో చెప్పగా; సమీపమునన్= అక్కడికి దగ్గర్లో; చెవి తార్చి= చెవి ఉంచి; నెవ్వగన్= సంపూర్ణమైన శోకంతో; కూరుచున్= మునుగుతూ; ఉన్న= ఉన్నటువంటి; ద్రౌపది; అప్పుడు= ఆ సమయంలో (ఇట్లా అన్నది); బంధు దుఃఖ సంతారక!= బంధువులను విచారంనుండి దాటించేవాడా! ధర్మరాజా!; ఉచితంబుగన్= తగు విధంగా; ఈతఁడు= ఈ సహదేవుడు; మీకున్= తమతో; చెప్పిన కార్యము= చెప్పినటువంటి పని; ఏ+మెయిన్= ఏ విధంగా నైనా; కరణీయము= చేయదగినది; అగున్= ఔతుంది.

తాత్పర్యం: ఆ గాంధారీ ధృతరాష్ట్రులకు ఇంకా కష్టదశ రాకుండా ముందుగానే వారిని చూడటానికి మీరు తప్పకుండా అడవికి వెళ్ళటం మంచిది' అని సహదేవుడు ధర్మరాజుతో చెప్పగా, దుఃఖంలో మునిగి అటువైపోక చెవి వేసి ఉంచిన ద్రౌపది అప్పుడు ధర్మరాజుతో ఇట్లా అన్నది; 'బంధువుల దుఃఖాన్ని నిర్మూలించేవాడా! సహదేవుడు మీకు చెప్పింది యుక్తం. ఏ విధంగానైనా తప్పకుండా ఇతడు చెప్పినట్లు చేయటం యుక్తం.

తే. **గొంతి కోడండ్రు రెల్లను గురువరేణ్య! । యెత్తినడుగుల నున్నవా రత్తపస్వి**
నీ వరిష్ఠ దర్శింపంగఁ బోవఁ గోరి । యనియె నట్టు లయ్యిరువురు నాడుటయును. **25**

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశ శ్రేష్ఠుడా ధర్మరాజా!; గొంతి కోడండ్రురు= కుంతీదేవి కోడళ్ళు (ద్రౌపది, సుభద్ర మొదలైనవారు); ఎల్లను= అందరూ; ఆ+తపస్వినీ వరిష్ఠన్= తాపసులలో శ్రేష్ఠురాలైన ఆ కుంతీదేవిని; దర్శింపంగన్= చూడటానికి; పోవన్= అరణ్యాలకు వెళ్ళటం; కోరి= అభిలషించి; ఎత్తిన+అడుగులన్= ప్రయాణానికి సిద్ధమై; ఉన్నవారు= ఉన్నారు; అనియెన్= అన్నది ద్రౌపది; ఆ+ఇరువురు= సహదేవుడు, ద్రౌపదీ; అట్టులు= ఆ విధంగా; ఆడుటయును= పలికిన వెంటనే.

తాత్పర్యం: కురుశ్రేష్ఠుడా! తాపసులలో ఉత్తమురాలైన ఆ కుంతిని చూడటానికి పోవాలనే కోరికతో ఆవిడ కోడళ్ళం అందరమూ, ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాం' అన్నది ద్రౌపది. సహదేవుడూ, ద్రౌపదీ ఇద్దరూ కూడా ఆ విధంగా చెప్పటంతో వెంటనే. (తరువాతి వచనంతో అన్వయం).

పాండవులు బంధుసహితంబుగా ధృతరాష్ట్రుఁ జూడఁబోవుట (సం. 15-29-18)

వ. **అమ్మానవనాథుండు కాననగమనంబు నిశ్చయించి పడవాళ్ళం బలిపించి 'ధృతరాష్ట్రు దర్శింపఁ బోద; మనతి బహుళంబును బ్రధాన చతురంగ సముదీర్ణ భంగికంబునుం గా బలంబుల సమకట్టుం; డందలంబులునుం బాటబండ్లునుం గాఁ బెక్కాయితంబులు సేయుం; డనేక శకటంబులుం, బటకుటీరప్రకరంబును, నానావిధ భక్ష్య భోజ్యంబులునుం గొనివచ్చునట్లుగా నిపుణ పరిచారకుల నియమింపుండు; పౌర జనంబు లారాజుం జూచువేడ్కనెవ్వరు వచ్చినను వారల యోగక్షేమంబు లరసి సురక్షితంబుగా నడపింపం దగువారి నియోగింపుం; డెల్లి పయనం బని చాటింపుం' డని పనిచిన వార లట్లు చేయ మఱునాఁడు యుయుత్సునిం గృపాచార్యుని ధౌమ్యుని రావించి 'మీరు పురరక్షణంబునకు నిలువుం' డని యత్యాదరంబునం జెప్పి,** **26**

ప్రతిపదార్థం: ఆ+మానవనాథుండు= ఆ ధర్మరాజు; కాననగమనంబు= అడవులకు ప్రయాణం; నిశ్చయించి= నిర్ణయం చేసి; పడవాళ్ళన్= వివిధ సేనాపతులను; పిలిపించి= కబురుచేసి రప్పించి; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్రుడిని; దర్శింపన్= చూడటంకొరకు; పోదము; అనతి బహుళంబును= మరీ ఎక్కువ గాకుండా; ప్రధాన చతురంగ సముదీర్ణ భంగికంబునున్= ప్రశస్తమైన రథ, గజ, తురగ, పదాతి రూపమైన నాలుగంగాల గొప్ప విన్యాసం; కాన్= అయ్యేవిధంగా; బలంబులన్= సైన్యాలను; సమకట్టుండు= సిద్ధం చేయండి; అందలంబులునున్= పల్లకీలు; బాటబండ్లును= ఎడ్లబండ్లు; కాన్= అయ్యే విధంగా; పెక్కు= వివిధాలైన వాహనాలు; అయితంబులు= సిద్ధం; చేయుండు= చేయండి; అనేక శకటంబులున్= అధికంగా (సరుకుల) బండ్లు; పటకుటీర ప్రకరంబులును= గుడారాల సమూహాలు; నానావిధ భక్ష్య భోజ్యంబులును= పలురకాలైన పిండివంటలు, ఇంకా తినే పదార్థాలును; కొనివచ్చునట్లునున్= తీసికొనివచ్చేవిధంగా; నిపుణ పరిచారకులన్= నేర్పుకలిగిన సేవకులను; నియమింపుండు= ఏర్పాటు చేయండి; ఆ రాజున్= ఆ ధృతరాష్ట్ర మహారాజును; చూడన్= చూడాలనే; వేడ్కన్= కోరికతో; పౌరులు= పురజనులు; ఎవ్వరు= ఎవ్వరైనా; వచ్చినను= వస్తే;

వారల= ఆ పౌరులయొక్క; యోగక్షేమంబులు= ఉన్నత స్థితినీ దాని రక్షణాన్నీ; అరసి= జాగ్రత్తగా చూస్తూ; సురక్షితంబుగాన్= ప్రమాదం లేకుండా; నడపింపన్= తీసికొని వెళ్ళటానికి; తగువారిన్= సమర్థులైనవారిని; నియోగింపుండు= ఏర్పాటు చేయండి; పయనంబు= ప్రయాణం; ఎల్లి= రేపే; అని= అనేవిధంగా; చాటింపుండు= (ప్రజలకు) తెలియజేయండి; అని= అని చెప్పి; పనిచినన్= ఆజ్ఞాపించగా; వారలు= ఆ సేనాపతులు; అట్లు= ధర్మరాజు చెప్పిన ప్రకారంగా; చేయన్= చేయగా; మఱునాఁడు= మరుసటిరోజు; యుయుత్సునిన్= ధృతరాష్ట్రుడి (వైశ్యకు) కొడుకు యుయుత్సుడిని; కృపాచార్యునిన్= కృపుడిని; ధౌమ్యునిన్= తమ పురోహితుడైన ధౌమ్యుడిని; రావించి= పిలిపించి; మీరు= మీరందరూ; పురరక్షణంబునకున్= రాజధానిని కాపాడటానికి; నిలువుండు= ఇక్కడే ఉండండి; అని; అతి+ఆదరంబునన్= మిక్కిలి ప్రేమతో; చెప్పి= వారితో చెప్పి.

తాత్పర్యం: ధర్మరాజు అడవికి వెళ్ళటానికి నిర్ణయించి సేనాపతులను పిలిపించి 'మనం ధృతరాష్ట్రుడిని చూడటానికి పోదాం. మీరు మరీ ఎక్కువ కాకుండా రథ గజ తురగ పదాతి దళాలను సిద్ధం చేయండి. పల్లకీలు, ఎడ్లబండ్లు అధికంగా ఏర్పాటు చేయండి. ఇంకా ఇతర వాహనాలు పెక్కు గుడారాలూ, రకరకాల పిండివంటలు, ఇతరమైన తిండ్లు తీసికొనిరావటానికి నేర్పుకలిగిన సేవకులను నియమించండి. ధృతరాష్ట్రుడిని చూడాలనే కోర్కెతో పురజనులు ఎవరు వచ్చినా వారికి ఏ విధమైన ఇబ్బంది లేకుండా సౌకర్యాలను జాగ్రత్తగా చూచి నడిపించగలిగినవారిని ఏర్పాటు చేయండి. 'రేపే ప్రయాణం అని చాటించండి' అని ధర్మరాజు ఆజ్ఞాపించగా ఆ సేనాపతులు ఆ ప్రకారమే అన్ని ఏర్పాట్లు చేశారు. ధర్మరాజు ఆ మరునాడు యుయుత్సుడిని, కృపాచార్యుడిని, తమపురోహితుడు ధౌమ్యుడిని పిలిపించి మిక్కిలి ప్రేమతో తాములేని సమయంలో నగరం రక్షించటంకొరకు ఇక్కడే ఉండండి అని వారికి చెప్పి (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **ఏనికగములతో నేతెమ్ము నీ వని। బాహుదర్పోజ్జ్వలుఁ బవనతనయుఁ**
దేరులగమి చెలువారు నీచే నని। దేవసమాను గాండీవధరుని,
గుఱ్ఱపు దళముల కొమరు వీ కలవడు। నని చారుతను మనోహారు నకులుఁ
గాల్బల మమరు నీ కలిసి వచ్చుట నని। సన్నుతచేష్టితుఁ బిన్నతమ్ముఁ

తే. **బనిచె; వార లమ్మెయిఁ దూర్య నినద మెసఁగ। నాతపత్రావళి ధ్వజవ్రాత కలిత**
రత్నరోచులు రోదోంతరంబు నిండ। నరుగుదెంచిరి వైభవ మతిశయిల్ల. 27

ప్రతిపదార్థం: బాహు దర్ప+ఉజ్జ్వలున్= భుజాల నిరంకుశ బలంతో ప్రకాశించే; పవన తనయున్= భీముడిని; నీవు; ఏనిక గములతోన్= ఏనుగుల బలంతో; ఏ+తెమ్ము= రావలసింది; అని= అని చెప్పి; పనిచెన్= నియోగించాడు; దేవసమానున్= దేవతలతో సమానుడైన; గాండీవధరునిన్= అర్జునుడిని; నీచేన్= నీవలన; తేరులగమి= రథ సమూహం; చెలువారు= శోభిస్తుంది; అని; చారుతను మనోహరున్= అందమైన శరీరంచేత మనసులను హరించేవాడు అయిన; నకులున్= నకులుడిని; నీకున్= నీకు; గుఱ్ఱపు దళముల= తురంగబలంయొక్క; కొమరు= పద్ధతి; అలవడున్= సాధ్యమౌతుంది; అని; సత్+మత చేష్టితున్= సాధుజనంచేత ప్రశంసించబడే; పిన్న తమ్మున్= చిన్న తమ్ముడు సహదేవుడిని; నీ కలసి వచ్చుటన్= నీతో కలిసి రావటంవలన; కాల్బలము= పదాతి దళం; అమరున్= ఒప్పుతుంది; అని; పనిచెన్= నియోగించాడు; వారలు= భీమ, అర్జున, నకుల, సహదేవులు; ఆ+మెయిన్= ధర్మరాజు నియమించిన ప్రకారంగా; తూర్య నినదము= ఢక్క మొదలైన వాద్యాల ధ్వనులు; ఎసఁగన్= అతిశయించగా; ఆతపత్ర= గొడుగుల; ఆవళి= వరుసతోను; ధ్వజ= పతాకల; వ్రాత= సమూహంతోను, కలిత= కూర్పబడి ఉన్న; రత్న= రత్నాల; రోచులు= కాంతులు; రోదస్+అంతరంబు= భూమి ఆకాశాల నడిమి ప్రదేశం అంతా; నిండన్= నిండగా; వైభవము= రాచరికం; అతిశయిల్లన్= ప్రకాశిస్తుండగా; అరుగుదెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: ధర్మరాజు బాహుబలంచేత ప్రశస్తి పొందిన భీముడిని గజబలంతో కలిసి రమ్మన్నాడు. దేవతలతో సమానమైన అర్జునుడి వలన రథబలం శోభిస్తుందన్నాడు. అందమైన నకులుడిని 'అశ్వబలం నడిపించటం నీకు అభ్యస్తమై ఉన్న' దన్నాడు. సాధుజన ప్రశంసలు పొందే చిన్నతమ్ముడు సహదేవుడిని నీతో కలిసి రావటంవలన కాల్బలం ప్రకాశిస్తుందన్నాడు. ఆ భీమార్జున నకుల సహదేవులు అన్నగారు ఆజ్ఞాపించిన పద్ధతిలో గజ రథ తురగ పదాతి బలాలతో, వాద్యాల ధ్వనులు రేగుతుండగా, గొడుగులలో, జెండాలలో కూర్చిన రత్నాల కాంతులు భూమ్యాకాశాల నడుమ నిండిపోగా వైభవంగా బయలుదేరారు.

వ. ద్రౌపదీ ప్రముఖ వధూజనంబులనుం దక్కునుం గల భరత భార్యల నందలంబులను గనకంపు బండ్లను నిడికొని రండని యంతఃపురాధికారుల నబ్బూరమణుండు నియమించిన, వార లట్ల చేసిరి; తానును మణిభా సమానంబును నీలవాలశోభిత షోడశ శ్వేతాశ్వ వ్యూఢంబును నైన రథం బెక్కి మౌక్తిక ప్రాలంబ మాలి కాద్యోతితంబు లగు నాతపత్రంబు లుల్లసిల్ల. 28

ప్రతిపదార్థం: ద్రౌపదీప్రముఖ వధూజనంబులనున్= ద్రౌపది మొదలైన పాండవ స్త్రీలను; తక్కునున్+కల= మిగిలిన; భరత భార్యలన్= భరతవంశపు వీరుల భార్యలను; అందలంబులనున్= పల్లకీలలోను; కనకంపు బండ్లను= బంగారపు బండ్లలోను; ఇడికొని= ఎక్కించుకొని; రండు+అని= తీసికొనిరండి; అని= అనిచెప్పి; ఆ+భూరమణుండు= ఆ ధర్మరాజు; అంతఃపుర+ అధికారులన్= అంతఃపుర రక్షణ బాధ్యతలను చూచే అధికారులను; నియమించినన్= పంపగా; వారలు= ఆ అంతఃపురాధికారులు; అట్లు+అ= ధర్మరాజు ఆజ్ఞాపించిన విధంగానే; చేసిరి= చేశారు; తానును= తాను స్వయంగా; మణిభాసమానంబును= మణులతో ప్రకాశించేది; నీల= నల్లనైన; వాల= తోకలచేత; శోభిత= వెలుగుతున్న; షోడశ= పదహారు; శ్వేత= తెల్లని; అశ్వ= గుర్రాలతో; వ్యూఢంబును= కూర్చబడినది; ఐన= అయినటువంటి; రథంబు= రథాన్ని; ఎక్కి= అధిరోహించి; మౌక్తిక= ముత్యాలతో చేసిన; ప్రాలంబ= వేలాడే; మాలికా= దండలతో; ద్యోతితంబులు= ప్రకాశించేవి; అగు= అయినటువంటి; ఆతపత్రంబులు= గొడుగులు; ఉల్లసిల్లన్= ఒప్పుతుండగా.

తాత్పర్యం: ద్రౌపది మొదలైన పాండవులకు సంబంధించిన స్త్రీలనూ, ఇంకా మిగిలిన భరతవంశపు వారి భార్యలనూ, పల్లకీలలోను, బంగారపు బళ్ళలోనూ ఎక్కించుకొని తీసికొనిరండని ధర్మరాజు అంతఃపుర అధికారులను ఆదేశించాడు. వారు అట్లాగే చేశారు. ధర్మరాజు తానుకూడా వివిధ మణులతో ప్రకాశించేది, నల్లని తోకలు కలిగిన తెల్లటి గుర్రాలు పదహారింటిచేత కూర్చబడినది అయిన రథం ఎక్కి వ్రేలాడుతూ ఉన్న ముత్యాల మాలలు కలిగిన గొడుగులు ఒప్పుతుండగా. (తరువాతిపద్యంతో అన్వయం)

తే. వేణువీణారవంబులు వివిధ గాన। నాదములుఁ బాఠకారావ మేదురంబు
లగుచు వంది బృందముల వాక్యాలి బెరసి। దిశలు దీటుకొనంగఁ బ్రదీప్తలీల. 29

ప్రతిపదార్థం: వేణు వీణా రవంబులున్= పిల్లన గ్రోవులయొక్కయు, వీణలయొక్కయు ధ్వనులు; వివిధ గాన నాదములు= పలువిధాలైన పాటల ధ్వనులునూ; పాఠక+ఆరావ మేదురంబులు= (వేద) అధ్యాపకుల ధ్వనులతో సాంద్రములు; అగుచున్= అవుతూ; వంది బృందముల= బట్టుల (స్తోత్రపాఠకుల) గుంపుల; వాక్య+ఆలిన్= స్తుతి వాక్యాల సముదాయంతో; బెరసి= కూడుకొని; ప్రదీప్తలీలన్= మిక్కిలి ప్రకాశించేవిధంగా; దిశలు= దిక్కులలో; దీటుకొనంగన్= వ్యాపించగా.

తాత్పర్యం: వేణువుల, వీణల ధ్వనులూ, రకరకాల పాటల ధ్వనులూ, వేద అధ్యాపకుల కంఠ ధ్వనులతో అధికమై, స్తోత్రపాఠకుల స్తుతివాక్యాలతో కలిసి అత్యధికంగా ప్రకాశించే విధంగా దిక్కులనిండా వ్యాపించగా, (తరువాతి వచనంతో అన్వయం).

వ. వెడలెఁ వివిధ వాహనారూఢు లయి పౌరు లప్పూరువంశవరు ననుగమించిరిత్తెఱంగున మెఱయు మహిమ నుజ్జ్వలుం డగుచుం జని భాగీరథి యుత్తరించి పాండవోత్తముండు కురుక్షేత్రంబు ప్రవేశించి చనుచుండ.30

ప్రతిపదార్థం: వెడలెన్= బయలుదేరాడు; పౌరులు= పురజనులు; వివిధ వాహన+ఆరూఢులు+అయి= పలురకాలయిన వాహనాలను ఎక్కినవారై; ఆ+పూరువంశవరున్= పూరుమహారాజు వంశంలో శ్రేష్ఠుడైన ధర్మరాజును; అనుగమించిరి= వెన్నంటి వచ్చారు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; మెఱయు= మెరుస్తున్న; మహిమన్= గొప్పతనంచేత; ఉజ్జ్వలుండు= ప్రకాశిస్తున్నవాడు; అగుచున్= అవుతూ; పాండవ+ఉత్తముండు= పాండవులలో ఉత్తముడైన ధర్మరాజు; చని= ముందుకు వెళ్ళి; భాగీరథి= గంగానదిని; ఉత్తరించి= దాటి; కురుక్షేత్రంబు= కురుక్షేత్రంలో; ప్రవేశించి= చొచ్చి; చనుచున్+ఉండన్= ముందుకు వెళ్ళుతూ ఉండగా.

తాత్పర్యం: ధర్మరాజు అడవికి ప్రయాణమయ్యాడు. పౌరులు రకరకాల వాహనా లెక్కి, ఆ ధర్మరాజు వెంట వచ్చారు. ఈ విధంగా ప్రాభవం వెలయగా ధర్మరాజు వెళ్ళి గంగానదిని దాటి కురుక్షేత్రంలో ప్రవేశించి (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. సంయమివరుఁ డైన శతయూప మునిపతి । యాశ్రమంబునఁ దదుపాంత భాగ
మునఁ గదలీశోభియును మృగాకీర్ణంబు । నగు ధృతరాష్ట్రుని యాశ్రమంబు
నెఱిఁగిన వా రదె యిదె యంచుఁ బేర్కొని । చూపి చెప్పిన ధర్మసుతుఁడు దేరు
డిగిన భీమాదులు డిగ్గిరి; వాహనం । బులు సర్వజనులు నప్పురుష వరుల

ఆ. ననుసరించి; రజ్జనాధిపుఁ డయ్యాంబి । కేయు నాశ్రమంబు డాయఁ జనుచు
నచటిజనుల నడిగె 'నయ్య వేఁడీ?' యని । గద్గదిక నెలుంగు గడలుకొనఁగ. 31

ప్రతిపదార్థం: సంయమివరుఁడు= యతులలో శ్రేష్ఠుడు; ఐన= అయినటువంటి; శతయూప మునిపతి= శతయూపుడనే పేరు కలిగిన ఆ మునినాథుడియొక్క; ఆశ్రమంబునన్= ఆశ్రమంలో; తద్+ఉప+అంత భాగమునన్= దానికి దగ్గరలో; కదలీ శోభియును= అరటి చెట్లతో అందంగా ఉన్నది; మృగ+ఆకీర్ణంబున్= వివిధ మృగాలతో నిండినది; అగు= అయినటువంటి; ధృతరాష్ట్రుని ఆశ్రమంబున్= ధృతరాష్ట్రుడియొక్క ఆశ్రమాన్ని; ఎఱిఁగినవారు= తెలిసిన జనులు; అదె= అదిగో; ఇదె= ఇదిగో; అంచున్= అంటూ; పేర్కొని= పేరు చెప్పి; చూపి= చూపించి; చెప్పినన్= చెప్పగా; ధర్మసుతుఁడు= ధర్మరాజు; తేరు= రథం; డిగినన్= దిగగా; భీమ+ఆదులున్= భీముడు మొదలైన తమ్ములు నలుగురూ కూడా; వాహనంబులు= తమ తమ వాహనాలను; డిగ్గిరి= దిగారు; సర్వజనులున్= ద్రౌపదీ ప్రముఖ కాంతలూ, పౌరులూ అందరు; ఆ+పురుషవరులన్= పురుషశ్రేష్ఠులగు ఆ పాండవులను; అనుసరించిరి= వారి వెంట నడిచారు; ఆ+జన+అధిపుఁడు= ఆ ధర్మరాజు; ఆ+ఆంబికేయున్+ఆశ్రమంబు= ఆ ధృతరాష్ట్రుడి ఆశ్రమాన్ని; డాయన్+చనుచున్= సమీపించి వెళ్ళుతూ; అచటి జనులన్= అక్కడ ఉన్న వారిని; ఎలుంగు= కంఠస్వరాన్ని; గద్గదికన్= డగ్గుత్తికతో; కడలుకొనఁగాన్= నిండగా (వ్యాపించగా); అయ్య= మా తండ్రి; వేఁడీ?= ఎక్కడ ఉన్నాడు?; అని= అనే విధంగా; అడిగెన్= ప్రశ్నించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అక్కడ యతిశ్రేష్ఠుడైన శతయూపుడి ఆశ్రమ సమీపంలో అరటి తోపులతో మనోజ్ఞమైనదీ, వివిధ మృగాలతో నిండినదీ అయి ఉన్న ధృతరాష్ట్రుడి ఆశ్రమం తెలిసినవారు 'అదిగో ఇదె' అని పేర్కొని ప్రశంసిస్తూ నిర్దేశించి చెప్పారు. ధర్మరాజు రథం దిగాడు. వెంటనే అతడి తమ్ముళ్ళు భీమాదులు వాహనాలు దిగారు. మిగిలిన స్త్రీలూ పౌరజనం అందరూ కూడా తమ తమ వాహనాలు దిగారు. అందరూ ధర్మరాజు వెంట నడుస్తున్నారు. ధర్మరాజు ధృతరాష్ట్రుడి ఆశ్రమం సమీపించి అక్కడ ఉన్న వారితో గొంతు బొంగురు పోవగా 'మా తండ్రి ఎక్కడ? అని అడిగాడు.

వ. అనిన వార లప్పుడమిఱేనితోడ. 32

ప్రతిపదార్థం: అనినన్= అని ధర్మరాజు అడుగగా; వారలు= అచ్చటి జనులు; ఆ+పుడమిఱేనితోడన్= ఆ రాజుతో.

తాత్పర్యం: తమ తండ్రి ఎక్కడ అని అడిగిన ధర్మరాజుతో ధృతరాష్ట్రుడి ఆశ్రమంలో ఉన్నవారు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'యమునా స్నానంబునకును। సుమతోయాహరణమునకు సువ్రతుఁ డా సం
యమి చనియె' ననుచుఁ దన్మా। ర్గము సెప్పిరి నెమ్మిఁ దెలియఁ గౌరవముఖ్యా! 33

ప్రతిపదార్థం: సువ్రతుఁడు= ఉత్తమమైన వ్రతాలను ఆచరించే వాడు అయిన; ఆ సంయమి= ఆ ధృతరాష్ట్ర యతి; యమునా స్నానంబునకును= యమునానదిలో స్నానం చేయటానికి; సుమ తోయ ఆహరణమునకున్= పూవులూ, నీళ్ళూ, తీసికొని రావటంకొరకు; చనియెన్= వెళ్ళాడు; అనుచున్= అని; కౌరవముఖ్యా!= కురువంశంలో ప్రధానుడా! జనమేజయ మహారాజా!; తద్+మార్గము= యమునానదికి పోయే త్రోవ; నెమ్మిన్= ప్రేమతో; తెలియన్= వివరంగా; చెప్పిరి= చెప్పారు.

తాత్పర్యం: 'మంచి వ్రతాలను ఆచరిస్తూండేటటువంటి ఆ ధృతరాష్ట్ర యతి యమునలో స్నానంచేయటానికి పూలు, నీళ్ళూ తెచ్చుకొనటానికి వెళ్ళాడు' అని చెప్పి ఓ జనమేజయ మహారాజా! ఆ ఆశ్రమం వద్ద ఉన్న జనులు యమునకు వెళ్ళే మార్గం ధర్మరాజుకు వివరించి చెప్పారు.

పాండవులు కురుక్షేత్రంబున నున్న ధృతరాష్ట్ర గాంధారీ కుంతుల దర్శించుట (సం.15-31-6)

సీ. చెప్పినఁ బాండవు లప్పథంబున భక్తి। నరుగుచు నెదురుగ నరుగుదెంచు
నంబికానందనుఁ డాదిగాఁ గలవారిఁ। గని రప్పు డన్నలఁ గడచి శీఘ్ర
గామియై చని తల్లి కాళ్ళపైఁ బడి యేడ్చె। సహదేవుఁ; డధిక బాష్పప్లుతాస్య
యగుచు నబ్భామిని వగచుచు నాతని। నెత్తి తాఁ గౌఁగిట నిఱియఁ జేర్చి

తే. పేరుకొని చెప్పె నతని గాంధారి కంతఁ। గూడి యతఁడును దారు నక్కురుకుమారు
లక్కురూద్వహు నన్నియతాత్ము దేవిఁ। గాంచి రనుజీవు లెఱిఁగింపఁ గౌరవేంద్ర! 34

ప్రతిపదార్థం: చెప్పినన్= చెప్పగా; పాండవులు= పాండురాజు కొడుకులు; ఆ+పథంబునన్= వారు చెప్పిన మార్గంలో; భక్తిన్= పూజ్యభావంతో; అరుగుచున్= యమునా నదివైపుగా వెళ్ళుతూ; ఎదురుగన్= తమకు ఎదురుగా; అరుగుదెంచు= వస్తూ ఉన్న; అంబికా నందనుఁడు= ధృతరాష్ట్రుడు; ఆదిగాన్= మొదలుగా; కలవారిన్= ఉన్న గాంధారీ, కుంతీ ప్రభృతులను; కనిరి= చూచారు;

అప్పుడు= ఆ సమయంలో; సహదేవుఁడు= సహదేవుడు; అన్నలన్= తనకు ముందు నడుస్తున్న నలుగురు అన్నలను; కడచి= దాటి; శీఘ్రగామి+ఐ= తొందరగా వెళ్ళేవాడై; చని= ముందుకు పోయి; తల్లి కాళ్ళపైన్= కుంతి పాదాలమీద; పడి= పడిపోయి; ఏడ్చెన్= శోకించాడు; ఆ+భామిని= ఆ కుంతిదేవి; అధిక= మిక్కుటమైన; బాష్ప= కన్నీటి; ప్లుత= ప్రవాహంగల; ఆస్య= ముఖం కలిగినది; అగుచున్= అవుతూ; వగచుచున్= దుఃఖిస్తూ; ఆతనిన్= తన పాదాలపై పడ్డ సహదేవుడిని, తాను= తను; ఎత్తి= లేవదీసి; కౌఁగిటన్= తన కౌగిలిలో; ఇఱియన్+చేర్చి= గట్టిగా పొదుపుకొని; గాంధారికిన్= గాంధారితో; అతనిన్= సహదేవుడిని; పేరుకొని= పేరు ప్రస్తావిస్తూ; చెప్పెన్= చెప్పింది; కౌరవ+ఇంద్ర!= కురువంశశ్రేష్ఠుడా! జనమేజయ మహారాజా!; అంతన్= అటు పిమ్మట; అతండును= ఆ సహదేవుడును; ఆ+కురుకుమారులు= ధర్మజుడు మిగిలిన పాండుకుమారులు; తారును= వారూ; కూడి= కలిసి; ఆ+కురు+ఉద్వహున్= కురువంశ ఉద్ధారకుడైన ఆ ధృతరాష్ట్రుడినీ; ఆ+నియత+ఆత్మదేవిన్= ఇంద్రియాలను అణచిన ఆ ధృతరాష్ట్రుడి భార్య గాంధారినీ; అనుజీవులు= పరిచారకులు; ఎఱిఁగింపన్= తెలియజెప్పగా; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రుడి ఆశ్రమంవద్ద ఉన్నవారు ధృతరాష్ట్రుడు స్నానాదులకై వెళ్ళిన యమునానది మార్గం చెప్పగా, పాండవులు అదే మార్గంలో వెళ్ళుతున్నారు. అట్లా వెళ్ళుతూ ఎదురుగా వస్తూ ఉన్న ధృతరాష్ట్రుడిని, గాంధారిని, కుంతిని వారు చూచారు. అప్పుడు సహదేవుడు తనకు ముందున్న అన్నలను దాటి తొందరగా వెళ్ళి తల్లి కుంతీదేవి కాళ్ళపైబడి ఏడిచాడు. కుంతికూడా దుఃఖంతో కన్నీళ్ళు నిండిన ముఖంతో, సహదేవుడిని లేవదీసి గట్టిగా పొదువుకొని గాంధారికి సహదేవుడు వచ్చాడని చెప్పింది. ఓ జనమేజయ మహారాజా! పిమ్మట ధర్మరాజాదులు కూడా వచ్చి సహదేవుడితో కలిసి, తమ రాకను అనుచరులు తెలియజేస్తుండగా, గాంధారీ ధృతరాష్ట్రులను దర్శించుకొన్నారు.

చ. **కని మఱి తల్లి పాదములఁ గ్రందుగఁ జేర్చిరి మస్తకంబు; ల**
వ్వనితయు నందఱం బొదివి వత్సలతన్ మన మార్ద్రభావ మొం
ద నురలు నశ్రుబిందువుల దందడిఁ జిక్కఁగఁ గౌఁగిలించి వా
రి నయనవారి చేఁ దుడిచి ప్రీతిగ దీవెన లిచ్చె భూవరా! 35

ప్రతిపదార్థం: కని= గాంధారీ ధృతరాష్ట్రులను చూచి; మఱి= అటు తరువాత; తల్లి పాదములన్= కుంతి కాళ్ళమీద; మస్తకంబులన్= తమ తమ తలలను; క్రందుగన్= ఒక్కసారిగా; చేర్చిరి= ఉంచారు; భూవరా!= ఓ జనమేజయ రాజా!; ఆ+వనితయున్= ఆ కుంతి కూడా; అందఱన్= కొడుకుల నందరినీ; పొదివి= దగ్గరకు తీసికొని; మనము= హృదయం; వత్సలతన్= పుత్రప్రేమతో; ఆర్ద్ర భావము= తడిసిపోవటాన్ని; ఒందన్= పొందగా; ఉరలు= దొర్లిపడుతున్న; అశ్రు బిందువులు= కన్నీటి చుక్కలు; దందడిన్= ఆధిక్యంతో; చిక్కఁగన్= గట్టిగా; కౌఁగిలించి= (కొడుకులను) కౌగిలించుకొని; వారి= కొడుకులయొక్క; నయనవారిన్= కన్నీటిని; చేన్= తన చేతితో; తుడిచి= తొలగించి; ప్రీతిగన్= ప్రేమతో; దీవెనలు= ఆశీస్సులను; ఇచ్చెన్= ఇచ్చింది.

తాత్పర్యం: ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు ఆ విధంగా గాంధారీ ధృతరాష్ట్రులను చూచి, ఒక్కసారిగా తల్లి కుంతి పాదాలపై తలలుంచి నమస్కరించారు. జనమేజయ మహారాజా! అపుడు కుంతీదేవి ఆ కొడుకులు అందరినీ పొదివిపట్టుకొని మనసు వాత్సల్యంతో నిండి, కన్నీటి బిందువులు జారిపడుతుండగా, పుత్రులను గట్టిగా కౌగిలించుకొని వాళ్ళ కన్నీళ్ళు చేతితో తుడిచి ప్రేమతో ఆశీర్వదించింది.

తే. **అట్టియెడఁ బాండవాగ్రజ నధిక వినయ। భరితుఁడై కాంచి భీమునిఁ బార్థుఁ గవలఁ**
గనియె సంజయుఁ డెంతయు గారవమున। నాదరించి రయ్యేవురు నతనిఁ బ్రీతి. 36

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సందర్భంలో; సంజయుఁడు= సంజయుడు; పాండవ+అగ్రజున్= ధర్మరాజును; అధిక వినయ భరితుఁడు+ఐ= మిక్కిలి అణకువతో నిండినవాడై; కాంచి= చూచి; భీమునిన్= భీముడిని; పార్థున్= అర్జునుడిని; కవలన్= నకుల సహదేవులను; ఎంతయున్= ఎంతో; గారవమునన్= ప్రేమతో; కనియెన్= చూచాడు; ఆ+ఏవురున్= ఆ అయిదుగురు పాండవులును; ప్రీతిన్= ఇష్టంతో; అతనిన్= ఆ సంజయుడిని; ఆదరించిరి= సమ్మానించారు.

తాత్పర్యం: ఆ సమయంలో సంజయుడు ధర్మరాజును మిక్కిలి వినయంతో భీమార్జున నకుల సహదేవులను అత్యంత వాత్సల్యంతో చూచాడు. పాండవులు సంజయుడిని ప్రేమతో సమ్మానించారు.

సీ. **ద్రోవదిఁ దొట్టి వధూజనంబులుఁ దక్కుఁ । గలయట్టి భరత భార్యలుఁ గ్రమమునఁ**
గాంచిరి కురువృద్ధు గాంధారి గొంతిని; । వారలు గొనివచ్చు వారి కలశ
ములు పాండురాజ పుత్త్రులు పుచ్చికొని భరి । యించిరి; పురజను లెల్ల నధిక
వినయత నమ్ముప్వురను గని; రవ్వేళ । నందఱు ముదమంది; రట్లు దగిన

ఆ. **వారు బలసి యునికి వారణపురమున । నున్నయట్ల కాఁగఁ దన్నుఁ దలఁచె**
మదిఁ గురూద్వహుండు తదనంతరంబ ని । జాశ్రమమున కెలమి నరుగుదెంచి. **37**

ప్రతిపదార్థం: ద్రోవదిన్+తొట్టి= ద్రౌపదిని మొదలు పెట్టి; వధూ జనంబులును= పాండవ స్త్రీలు; తక్కున్‌కల+అట్టి= మిగిలి ఉన్నటువంటి; భరత భార్యలు= భరతవంశపు స్త్రీలు; క్రమమునన్= వరసగా; కురువృద్ధున్= ధృతరాష్ట్రుడిని; గాంధారిన్= గాంధారిని; గొంతిని= కుంతిని; కాంచిరి= చూచారు; వారలు= వారు; కొనివచ్చు= తీసికొనివస్తున్న; వారి కలశములు= నీటి పాత్రలు; పుచ్చికొని= తాము అందుకొని; పాండురాజ పుత్త్రులు= పాండవులు; భరియించిరి= మోశారు; పురజనులు= పౌరులు; ఎల్లన్= అందరూ; అధిక వినయతన్= మిక్కిలి అణకువతో; ఆ+మువ్వురను= ఆ ముగ్గురిని; కనిరి= చూచారు; ఆ+వేళన్= అటువంటి సమయంలో; అందఱున్= అక్కడి వారందరూ; ముదము= సంతోషం; అందిరి= పొందారు; అట్లు= ఆ విధంగా; తగినవారు= అర్హులైనవారు; బలసి= కూడుకొని; ఉనికిన్= ఉండటంతో; కురు+ఉద్వహుండు= ధృతరాష్ట్రుడు; తన్నున్= తనను గురించి; మదిన్= మనసులో; వారణపురమునన్= హస్తినలోనే; ఉన్న+అట్లు= ఉన్నాననే విధంగా; కాఁగన్= అయినట్లుగా; తలఁచెన్= అనుకొన్నాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; ఎలమిన్= ఉత్సాహంతో; నిజ+ఆశ్రమంబునకున్= తన తపోవనానికి; అరుగుదెంచి= వచ్చి.

తాత్పర్యం: ద్రౌపది మొదలైన పాండవ స్త్రీలు, ఇంకా మిగిలిన భరతవంశపు రాజుల భార్యలు, క్రమంగా, ధృతరాష్ట్రుడి తరువాత గాంధారిని, ఆ తరువాత కుంతిని చూచారు. ఆ ముగ్గురు పట్టుకొని వస్తున్న నీటి పాత్రలను పాండుకుమారులు అందుకొని తీసికొనివచ్చారు. ధృతరాష్ట్రుడిని చూడటానికి వచ్చిన పౌరులు అందరూ ఆ ముగ్గురిని మిక్కిలి వినయంతో చూచారు. అటువంటి సమయంలో అందరూ సంతోషంగా ఉన్నారు. తనవారంతా తన చుట్టూ ఉండటంతో ధృతరాష్ట్రుడు మనసులో తాను హస్తినాపురంలోనే ఉన్నట్లుగా భావించాడు. తరువాత ఉత్సాహంగా తన ఆశ్రమానికి వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. **తారక శోభితాంబర విధంబునఁ బొల్పెసఁగంగ నాశ్రమో**
దారతలంబు బంధుజనతాకలనంబునఁ దాను జంద్రు నొ

ప్పార వహించి విస్ఫురితుఁ డై తనరెం గురుభర్త వచ్చి ర
చ్చేరువఁ గల్గు తాపసులు చెచ్చెరఁ బార్థులఁ జూచు వేడుకన్. 38

ప్రతిపదార్థం: బంధుజనతా కలనంబునన్= చుట్టాలతో నిండి ఉండటంచేత; ఆశ్రమ+ఉదార తలంబు= ధృతరాష్ట్రుడియొక్క గొప్ప ఆశ్రమ ప్రదేశం; తారక శోభిత+అంబర విధంబునన్= నక్షత్రాలతో ప్రకాశించే ఆకాశంవలె; పొల్పు= అందం; ఎసఁగంగన్= అతిశయించగా; కురుభర్త= ఆ ధృతరాష్ట్రుడు; తాను= స్వయంగా; చంద్రు+ఒప్పు+ఆరన్= చంద్రుడియొక్క సౌందర్యం అధికంగా; వహించి= ధరించి; విస్ఫురితుఁడు+ఐ= ప్రకాశించేవాడై; తనరెన్= ఒప్పుతున్నాడు; ఆ+చేరువన్= ఆ సమీపంలో; కల్గు= ఉన్న; తాపసులు= మునులు; పార్థులన్= పాండవులను; చూచువేడుకన్= చూడాలనే కుతూహలంతో; చెచ్చెరన్= వేగంగా; వచ్చిరి= అక్కడికి వచ్చారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి బంధువులు మొదలైన జనాలలో నిండి ఉండటంవలన ఆశ్రమ ప్రదేశం నక్షత్రాలతో ప్రకాశిస్తున్న ఆకాశంవలె ఉండి అందులో ధృతరాష్ట్రుడు స్వయంగా చంద్రుడివలె ప్రకాశిస్తున్నాడు. ఆ సమయంలో కుంతి కొడుకులను చూడాలనే కోరికతో ఆ సమీపంలో ఉండే తాపసులు ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి వచ్చారు.

విశేషం: అలం: ఉపమ.

వ. **వచ్చినం గని వారల నెల్లను సవినయ ప్రణామంబులం బ్రీతులం జేసి పాండవు లలరు మొగంబులతో ధృతరాష్ట్రుం బరివేష్టించి యుండిరి; వనితాజనంబులు నొక్కవలన నిలిచి; రుచితాసనంబులనున్న యమ్మునులు సంజయు నాలోకించి 'ధృతరాష్ట్ర బంధు జనంబుల నందఱం బేరువేర నేర్పడ మా కెఱింగింపవే' యని యడిగిన నతండు వారల కి ట్లనియె.** 39

ప్రతిపదార్థం: వచ్చినన్= రాగా; పాండవులు= పాండురాజు కొడుకులు; కని= చూచి; సవినయ ప్రణామంబులన్= అణకువతో కూడిన పాదాభివందనాలతో; వారలన్= ఆ తాపసులను; ఎల్లను= అందరినీ; ప్రీతులన్+చేసి= సంతోషించినవారుగా చేసి; అలరు మొగంబులతోన్= వికసించిన ముఖాలతో; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్రుడిని; పరివేష్టించి+ఉండిరి= చుట్టుకొని ఉన్నారు; వనితాజనంబులున్= ద్రౌపది మొదలైన స్త్రీలు అందరూ; ఒక్కవలనన్= ఒక ప్రక్కగా; నిలిచిరి= నిలుచుని ఉన్నారు; ఉచిత+ఆసనంబులన్= తమకు తగిన ఆసనాలమీద; ఉన్న= కూర్చున్న; ఆ+మునులు= పాండవులను చూడవచ్చిన మునులు; సంజయున్= సంజయుడిని; ఆలోకించి= చూచి; ధృతరాష్ట్ర బంధుజనంబులన్= ధృతరాష్ట్రుడి చుట్టాలను; అందఱన్= అందరినీ; పేరు పేరన్= ప్రత్యేకంగా ఒక్కొక్కరిని; ఏర్పడన్= స్పష్టంగా; మాకున్= మాకు; ఎఱింగింపవే= తెలుపవలసింది; అని; అడిగినన్= అడుగగా; అతండు= సంజయుడు; వారలకున్= ఆ తపసులతో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి వచ్చిన మునులపాదాలకు పాండవులు వినయంగా నమస్కారాలు చేసి వారిని సంతోషపెట్టారు. ఆనందంతో విచ్చుకొన్న ముఖాలతో ఆ పాండవులు ధృతరాష్ట్రుడి చుట్టూ కూర్చున్నారు. ద్రౌపది మొదలైన స్త్రీలు అంతా ఒక ప్రక్కగా నిలబడ్డారు. తమకు తగిన ఆసనాలమీద కూర్చున్న ఆ మునులు సంజయుడిని చూచి ధృతరాష్ట్రముని యొక్క చుట్టాలందరిని పేరు పేరునా మాకు తెలియజెప్పు'మని అడిగారు. అప్పుడు వారితో సంజయుడు ఇట్లా చెప్పాడు.

సీ. 'జాంబూనదచ్ఛాయ చందంబు వర్ణంబు। గలిగిన పలుచని గనప మేను,
నుచిత దీర్ఘత్వ సమున్నత ఘ్రాణంబు। నిడుదలైన విశాల నేత్రములును,
గంఠీరవంబు రేఖయు నొప్పఁ జూడ్కికి। నెంతయు వ్రేఁగైన యితఁడు ధర్మ
తనయుఁ; డెఱ్ఱఁదనంబుఁ దనరిన మూఁపులు। నాయత స్ఫీతంబు లైన బాహు

తే. వులును వెడందయురంబు నై పొలుచు నితఁడు। భీముఁ; డుజ్జ్వల సుందర శ్యామ తనువు
వారణేంద్రు కైవడియును, వారిజముల। యట్టి కనుదోయిఁ గల యితం డర్జునుండు. 40

ప్రతిపదార్థం: జాంబూనదచ్ఛాయ= మేలిమి బంగారు కాంతియొక్క; చందంబు= విధం; వర్ణంబు= రంగు; కలిగిన= కలిగి ఉన్నటువంటి; పలుచని= సన్ననైన; గనపమేనున్= ఉన్నతమైన శరీరము; ఉచిత= తగినంత; దీర్ఘత్వ= పొడుగుతో; సమ్+ఉన్నత= ఎత్తుగా ఉన్న; ఘ్రాణంబున్= ముక్కు; నిడుదలు+ఐన= దీర్ఘములు అయినటువంటి; విశాల నేత్రములును= పెద్ద కన్నులు; కంఠీరవంబు= సింహంయొక్క; రేఖయున్= తీరూ; ఒప్పన్= ప్రకాశిస్తుండగా; చూడ్కికిన్= చూపునకు; ఎంతయున్= ఎంతో; వ్రేఁగు+ఐ= సహించరానివాడైన; ఇతఁడు= ఈ వ్యక్తి; ధర్మతనయుఁడు= ధర్మరాజు; ఎఱ్ఱఁ దనంబును= (మేని) ఎరుపురంగు; తనరిన మూఁపులున్= ఎత్తయిన భుజ అగ్రభాగాలు; ఆయత స్ఫీతంబులు+ఐన= మిక్కిలి పొడుగై విస్తరించినవైన; బాహువులును= భుజాలు; వెడఁద+ఉరంబును= విశాలమైన వక్షస్థలము; ఐ= కలిగి; పొలుచు ఇతఁడు= ప్రకాశిస్తున్న ఈ వ్యక్తి; భీముఁడు= భీమసేనుడు; ఉజ్జ్వల= ప్రకాశిస్తున్న; సుందర= అందమైన; శ్యామ= నల్లని రంగు కలిగిన; తనువున్= శరీరమూ; వారిజముల+అట్టి= పద్మాలవంటి; కనుదోయిన్= కన్నుగవయూ; వారణ+ఇంద్రు+కైవడియును= ఉత్తమమైన ఏనుగువంటి తీరు; కల+ఇతండు= కలిగిన ఈ వ్యక్తి; అర్జునుండు= అర్జునుడు.

తాత్పర్యం: మేలిమి బంగారుకు ప్రతిబింబమైన పసిమిరంగు కలిగిన సన్నని శరీరం, తగినంత పొడుగు, ఎత్తూ కలిగిన ముక్కు, పొడుగ్గా ఉన్న పెద్ద పెద్ద కన్నులు, సింహం తీరు కలిగి చూపునకు అధికమైన ఇతడు ధర్మరాజు, ఎరుపురంగు శరీరం, ఎత్తైన భుజాలు పొడుగ్గా విస్తరించి ఉన్న భుజాలూ, విశాలమైన వక్షస్స్థలము కలిగి ఉన్న ఈ వ్యక్తి భీముడు, బాగా ప్రకాశిస్తున్న అందమైన నల్లటి శరీరం, తామరలవంటి కన్నులు, గజేంద్రుడి వంటి తీరూ కలిగిన ఇతడు అర్జునుడు.

తే. సుందరాకారమునఁ దమ కెందు సదృశు। లొరులు లేమి తెల్లం బగుచుండ గొంతి
యుభయ పార్శ్వంబు లందుఁ గూర్చున్న విష్ణు। శతమఖోపముల్ వినయభూషితులు కవలు. 41

ప్రతిపదార్థం: సుందర+ఆకారమునన్= అందమైన రూపం విషయంలో; తమకున్= తమతో (నకుల సహదేవులతో); సదృశులు= సమానమైనవారు; ఒరులు= ఇతరులు; ఎందున్= ఎక్కడ కూడా; లేమి= లేకపోవటం; తెల్లంబు= స్పష్టం; అగుచున్+ఉండన్= అవుతుండగా; గొంతి= కుంతియొక్క; ఉభయ పార్శ్వంబులందున్= రెండుప్రక్కలా; కూర్చున్న= ఆసీనులై ఉన్న; విష్ణు శతమఖ ఉపముల్= విష్ణువుతోను, ఇంద్రుడితోను, పోలిక కలిగినవారు; వినయ భూషితులు= అణకువే అలంకారంగా కలవారు అయినవారు; కవలు= నకుల సహదేవులు.

తాత్పర్యం: అందమైన రూపంలో తమకు సాటివచ్చేవారు ఎక్కడా లేరనే విషయం స్పష్టమవుతుండగా కుంతికి రెండు ప్రక్కలా కూర్చున్న విష్ణుని ఇంద్రుని పోలినవారు, అణకువే అలంకారంగా ఉన్నవారు అయిన ఈ ఇద్దరు నకుల సహదేవులు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. నీలోత్పల చ్ఛాయఁ బోలు మై చాయయు, । నవపద్మదళములఁ దెవడు మెఱుఁగుఁ
గనుదోయి, మధ్యాత్వమునకుఁ బ్రవేశించు । ప్రాయంబు, నత్యభిరామ మూర్తి
యలవడఁ గైకొన్న యతులిత సంపద । చందంబు దోఁపించు చారుగౌర
వంబును గలుగు నివ్వనిత పాంచాలి; యి । య్యింతి పార్శ్వమునఁ గట్టెఱ్ఱ మేను

తే. వనజ సన్నిభ ముఖమునై యినుని మహిమ । యుజ్జ్వలాకృతి దాల్చినట్లున్న యీ ల
తాంగి నారాయణుని చెలియలు సుభద్ర । నరుని వల్లభ సంయమినాథులార! 42

ప్రతిపదార్థం: సంయమినాథులార!= శ్రేష్ఠులైన మునులారా!; నీల+ఉత్పలచ్ఛాయ= నల్ల కలువలయొక్క రంగును; పోలు= పోలిన; మై చాయయున్= శరీరపు రంగు; నవ పద్మ దళములన్= క్రొత్తగా (వికసించిన) తామరపువ్వుయొక్క రేకులను; తెవడు= నిందించేటటువంటి; మెఱుఁగున్+కనుదోయి= కాంతిమంతములైన కనులజంటా; మధ్యాత్వమునకున్= మధ్య అనే నాయిక యొక్క, లక్షణంలో; ప్రవేశించు= ప్రవేశిస్తున్న; ప్రాయంబున్= వయసు; అతి+అభిరామమూర్తి= మిక్కిలి మనోజ్ఞమైన రూపం; అలవడన్= సిద్ధించేటట్లుగా; కైకొన్న= స్వీకరించిన; అతులిత సంపద= సాటిలేని సమృద్ధియొక్క; చందంబు= విధం; తోఁపించు= స్ఫురింపజేసేటటువంటి; చారు గౌరవంబును= గొప్పమన్ననా; కలుగు ఈ+వనిత= కలిగి ఉన్న ఈ స్త్రీ; పాంచాలి= ద్రౌపది; ఈ+ఇంతి= ఈ ద్రౌపదియొక్క; పార్శ్వమునన్= ప్రక్కన; కడు+ఎఱ్ఱ మేను= మిక్కిలి ఎర్రనైన శరీరం; వనజ సన్నిభ ముఖమును= పద్మంతో సమానమైన ముఖము; ఐ= కలిగి; ఇనుని మహిమ= సూర్యుడియొక్క గొప్పతనం; ఉజ్జ్వల+ఆకృతి= ప్రకాశించే రూపం; తాల్చిన+అట్లు= ధరించిన విధంగా; ఉన్న= ఉన్నటువంటి; ఈ లతాంగి= ఈ తీగబోడి; నారాయణుని చెలియలు= శ్రీకృష్ణుడి చెల్లెలు; నరుని వల్లభ= అర్జునుడి భార్య- సుభద్ర.

తాత్పర్యం: నల్లకలువలవంటి శరీరపు రంగు, అపుడే వికసించిన తామరపూవు రేకులను పరిహసించి ప్రకాశిస్తున్న కళ్ళూ, అపుడే మధ్యా దశలో ప్రవేశిస్తున్న వయసు కలిగి మనోహరమైన ఆకారాన్ని ధరించిన సాటిలేని సంపదల తీరు స్ఫురింపజేసే గొప్ప మన్నన కలిగిన ఈమె ద్రౌపది. ద్రౌపదికి ప్రక్కన బాగా ఎర్రనైన శరీరం పద్మంవంటి ముఖం కలిగి, సూర్యతేజస్సు రూపు ధరించినట్లుగా ఉన్న ఈమె శ్రీకృష్ణుడి చెల్లెలు, అర్జునుడి భార్య సుభద్ర.

ఆ. వీరి కెలనఁ గనక గౌర మధూకాభ । తనువు లొప్పుచున్న వనిత లురగ
పాండ్య సుతలు, నరుని భార్య; లులూపి చి । త్రాంగద యనఁ బరఁగ నాహ్వాయములు. 43

ప్రతిపదార్థం: వీరికెలనన్= ఈ ద్రౌపదీ సుభద్రల ప్రక్కన; కనక= బంగారంవలె; గౌర= పసుపు పచ్చని; మధూక+ఆభ= ఇప్పపూవుతో సమానంగా ఎర్రని; తనువులు= శరీరాలు; ఒప్పుచున్న= ప్రకాశిస్తున్న; వనితలు= ఆ స్త్రీలు; ఉరగ పాండ్య సుతలు= నాగ, కన్యపాండురాజు కూతురు అయినవారు; నరుని భార్యలు= అర్జునుడి సతులు; ఆహ్వాయములు= ఆ ఇద్దరి పేర్లు; ఉలూపి= (ఉరగవనిత) ఉలూపి; చిత్రాంగద= (పాండ్యసుత) చిత్రాంగద; అనన్= అనే విధంగా; పరఁగున్= ఒప్పుతున్నాయి.

తాత్పర్యం: ఈ ద్రౌపదీ సుభద్రల ప్రక్కన తమ మేనులు బంగారంవలె పసుపూ, మధూకంవలె ఎరుపు రంగుతో ప్రకాశిస్తూ ఉన్నవారు-ఒకరు నాగకన్య, ఇంకొకరు పాండ్యరాజు కూతురు. వీరు అర్జునుడి భార్యలు, ఉలూపి చిత్రాంగద అని వీరి పేర్లు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **ఇందీవరచ్ఛాయ కెనయైన చాయ నొ। ప్పిన మేను గలుగు నీ భీతహరిణ**
నయన భీముని భార్య; నవ్యచంపక దామ। గౌరాంగి యైన యిక్కమలవదన
సహదేవు గృహిణి; మేచకనవకువలయ। వర్ణంబునకు సరివచ్చు కాంతిఁ
జెలు వైన తనువునఁ బొలుచు నిన్నలినాయ। తాక్షి మాద్రీదేవి యగ్రతనయు

తే. **పత్ని; వీరల కెలనఁ బాపటలు లేక। ధౌతసిత వస్త్ర పరిధానలై తనువుల**
నిభృతి దోఁపఁగ నున్న యిన్నెలఁత లాంబి। కేయు కోడండ్రు కరుణావిధేయులార! 44

ప్రతిపదార్థం: కరుణా విధేయులార!= దయకు లోబడిన తాపసులారా!; ఇందీవరచ్ఛాయకున్= నల్ల కలువల కాంతికి; ఎన= సాటి; ఐన= అయినటువంటి; చాయన్= రంగుతో; ఒప్పిన మేను= ప్రకాశిస్తున్న శరీరం; కలుగు= కలిగి ఉన్న; ఈ భీతహరిణనయన= ఈ భయపడ్డ లేడి కన్నులవంటి కన్నులు గల స్త్రీ, భీముని పెండ్లాము; నవ్యచంపకదామ గౌర+అంగి= నూతనములైన సంపెంగ పూలదండవలె పసుపురంగు శరీరం కలిగినది; ఐన= అయినటువంటి; ఈ+కమలనయన= ఈ తామరవంటి కన్నులు గల స్త్రీ; సహదేవు గృహిణి= సహదేవుడి భార్య; మేచక నవ కువలయ వర్ణంబునకున్= నల్లనైన క్రొత్త కలువపూవు రంగుతో; సరివచ్చు కాంతిన్= సాటివచ్చే ప్రకాశంతో; చెలువు+ఐన= అందమైనటువంటి; తనువునన్= శరీరంతో; పొలుచు= ఒప్పుతున్న; ఈ+నలిన+ఆయత+అక్షి= తామరరేకులవలె విశాలమైన కన్నులుగల ఈ స్త్రీ; మాద్రీదేవి= మాద్రియొక్క; అగ్రతనయు పత్ని= పెద్ద కొడుకు నకులుడి భార్య; వీరల కెలనన్= ఈ కుంతి కోడళ్ళ ప్రక్కన; పాపటలు= ముత్తయిదువ లక్షణమైన సీమంతాలు; లేక= లేకుండా; ధౌత సిత వస్త్ర పరిధానలు= శుభ్రంచేయబడ్డ తెల్లటి వస్త్రాలు ధరించినవారు; ఐ= అయి; తనువుల నిభృతి= శరీరాల గోపనం; తోఁపఁగన్= తోచే విధంగా; ఉన్న= ఉన్నటువంటి; ఈ+నెలఁతలు= ఈ స్త్రీలు; ఆంబికేయు కోడండ్రు= ధృతరాష్ట్రుడి కోడళ్ళు.

తాత్పర్యం: కరుణకు లోబడిన తాపసులారా! నల్లకలువల కాంతికి సాటివచ్చే రంగుతో ఉన్న శరీరంగల ఈమె భీముడి భార్య (శ్రీకృష్ణుడితో ఎప్పుడు విరోధించే రాజచమూపతి సోదరి), క్రొత్త సంపంగిపూల దండవలె గౌరవర్ణంతో ఉన్న శరీరం కలిగిన ఈ పద్మాక్షి సహదేవుడి భార్య (జరాసంధుడి కూతురు). అప్పుడే విచ్చుకొన్న నల్లకలువలతో సమానమైన రంగుగల శరీరంతో ప్రకాశిస్తున్న ఈ పద్మదళనేత్ర (మాద్రి పెద్దకొడుకు) నకులుడి భార్య. వీరికి ప్రక్కగా పాపటలు లేకుండా ఉతికిన తెల్లని చీరలు ధరించి శరీరం దాచుకొంటూ ఉన్న ఈ స్త్రీలు ధృతరాష్ట్రుడి కోడళ్ళు (భరత భార్యలు).

తే. **వీరి చందంబ యై కడు గారవమునఁ। దను సుభద్ర వొదువ నున్న తరుణి ద్రోణ**
కర్ణముఖ యోధవీరులఁ గలఁచి తెగిన। యట్టి యభిమన్యు ప్రియ యుత్తరాభిధాన. 45

ప్రతిపదార్థం: వీరి చందంబు+అ= ధృతరాష్ట్రుడి కోడళ్ళ విధమే; ఐ= అయి; సుభద్ర= అత్త అయిన సుభద్ర; తనున్= తనను; కడున్= మిక్కిలి; గారవమునన్= ప్రేమతో; పొదువన్= దగ్గరకు తీసికొనగా; ఉన్న= ఉన్నటువంటి; తరుణి= స్త్రీ; ద్రోణ కర్ణ ముఖ యోధ వీరులన్= ద్రోణుడు, కర్ణుడు మొదలైన యుద్ధ నిపుణులైన పరాక్రమవంతులను; కలఁచి= కలతపెట్టి; తెగిన+అట్టి= మరణించినటువంటి; అభిమన్యు ప్రియ= అభిమన్యుడి భార్య; ఉత్తరా+అభిధాన= ఉత్తర అనే పేరు కలిగినది.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి కోడళ్ళవలె భర్త లేని లక్షణాలతో ఉండి, సుభద్ర ఎంతో ప్రేమతో దగ్గరకు తీసికొన్న స్త్రీ, ద్రోణుడు కర్ణుడు మొదలైన మహావీరులనే యుద్ధంలో కష్టపెట్టి మరణించిన అభిమన్యుడి భార్య; పేరు ఉత్తర.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని చూపి చెప్పె, నప్పు డాంబికేయుండు కౌంతేయాగ్రజున కిట్లనియె. 46

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; చూపి= చూపించి; చెప్పెన్= చెప్పాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; కౌంతేయ+అగ్రజునకున్= ధర్మరాజుతో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని సంజయుడు ధృతరాష్ట్రుడి బంధువులందరిని చూపించి ఆ తాపసులకు వివరించి చెప్పాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

సీ. 'కుశలివై యుండుదే కురువంశ సత్తమ! । పౌరజనులు జానపదులుఁ దెఱఁగు
తో నిన్ను ననుసరింతురె? తమ్ము లందఱు । సుఖ ముందురే? నీదు సఖులు సుఖులె
బంధులు సంతోషభరితులే? యిష్ట భృ । త్యులు తగవైన కోర్కులు ఫలింపఁ
గ్రాలుదురే? హర్షలీలలఁ బూర్వ రా । జన్యుల నడవడి సలుపఁబడునె?

ఆ. నయముతోడి యప్పనముల భండారంబుఁ । బెనుతె? యగ్రహార జనులమీఁద
గాలి యైన సుడియఁగా నీక యరయుదే? । యనఘ! పుణ్యకీర్తు లతిశయిల్ల. 47

ప్రతిపదార్థం: కురువంశ సత్తమ!= కురుమహారాజు వంశంలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; కుశలివి= క్షేమం కలిగినవాడివి; ఐ= అయి; ఉండుదు+ఏ?= ఉన్నావా?; పౌరజనులు= ప్రజలు; జానపదులు= పల్లెల్లో ఉండే ప్రజలందరూ; తెఱఁగుతోన్= పద్ధతి ప్రకారం; నిన్నున్= నిన్ను; అనుసరింతురు+ఎ?= అనుసరించుకొని ఉన్నారా?; తమ్ములు= ఏ అనుజులు; అందఱున్= అంతా; సుఖముందురు+ఏ?= సుఖంగా ఉన్నారా?; నీదు సఖులు= నీ మిత్రులు; సుఖులు+ఎ?= సుఖంగా ఉన్నారా?; బంధులు= చుట్టాలు; సంతోష+భరితులు+ఏ?= ఆనందంతో నిండి ఉన్నారా?; ఇష్ట భృత్యులు= నీకు ప్రియమైన సేవకులు; తగవు= సముచితాలు; ఐన= అయినటువంటి; కోర్కులు= కోరికలు; ఫలింపన్= సిద్ధించటంతో; హర్షలీలలన్= సంతోషంగా; క్రాలుదురు+ఏ?= ఒప్పుతూ ఉన్నారా?; పూర్వ రాజన్యుల= నీకు పూర్వులైన ఉత్తమరాజులు అనుసరించిన; నడవడి= ధర్మమార్గం; చలుపఁబడును+ఎ?= నీ చేతకూడా ఆచరింపబడుతున్నది కదా?; నయముతోడి= న్యాయమైన పద్ధతిలో; అప్పనములన్= పన్నులతో; భండారంబున్= కోశాన్ని; పెనుతు+ఎ?= పెంచుతున్నావా?; అనఘ!= పాపరహితుడా! ధర్మరాజా!; పుణ్యకీర్తులు= పుణ్యం కీర్తి; అతిశయిల్లన్= పెంపొందే విధంగా; అగ్రహార జనుల మీఁదన్= సమ్మానంతో ఇచ్చిన అగ్రహారాలలోని ప్రజలమీద; గాలి+ఐనన్= గాలికూడా; సుడియఁగాన్+ఈక= సోకకుండా; అరయుదు+ఏ?= కాపాడుతున్నావా?

తాత్పర్యం: కురువంశంలో శ్రేష్ఠుడా! నీవు క్షేమంగా ఉన్నావు కదా! పల్లె పట్టణ ప్రజలంతా పద్ధతి ప్రకారం నిన్ను అనుసరిస్తూనే ఉంటున్నారా? నీ తమ్ముళ్ళు అందరూ సుఖంగా ఉన్నారా? నీ మిత్రులు సుఖంగా ఉన్నారా? చుట్టాలు పూర్తిగా సంతోషంగా ఉన్నారా? నీ కిష్టమైన సేవకులు సముచితమైన కోర్కెలు తీరటంతో సంతోషంగా ఉన్నారా? నీకు పూర్వులైన రాజులు నడచిన ధర్మమార్గాన్నే నీవూ అనుసరిస్తున్నావు కదా! న్యాయంగా తీసికొనే పన్నులతో కోశాగారాన్ని పెంచుతున్నావా? పాపరహితుడా! ధర్మరాజా! పుణ్యమూ, కీర్తి పెరిగే విధంగా దేవబ్రాహ్మణుల కిచ్చిన అగ్రహారాలపై గాలికూడా వీచకుండా జాగ్రత్తగా కాపాడుతున్నావా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మిత్ర నరపతుల శాత్రవ । ధాత్రీశుల నెమ్మిఁ బరుసఁ దనమున వశతా
పాత్రములుగఁ జేయుదె? సుచ । రిత్ర! యుదాసీన నృప పరీక్ష నడచునే? 48

ప్రతిపదార్థం: సుచరిత్ర!= మంచి నడవడికలవాడా! ధర్మరాజా!; మిత్ర నరపతులన్= నీకు మిత్రులైన; రాజులనూ; శాత్రవ ధాత్రీ+ఈశులన్= శత్రువులైన రాజులనూ; నెమ్మిన్= ప్రేమతో; పరుసఁదనమునన్= కాఠిన్యంతో; వశతా పాత్రములుగన్= నీకు వశమయ్యే వారినిగా; చేయుదు+ఎ?= చేస్తున్నావా?; ఉదాసీన నృప పరీక్ష= తటస్థులైన రాజులను గూర్చిన పరీక్ష; నడచున్+ఏ?= కొనసాగుతుందా?

తాత్పర్యం: ఉత్తమమైన నడవడి కలిగిన ధర్మరాజా! మిత్రులైన రాజులను ప్రేమతో, శత్రువులైన రాజులను కాఠిన్యంతో, నీకు వశంలో ఉండేటట్లుగా చేసికొంటున్నావు కదా! మిత్రులూ, శత్రువులూ కాకుండా తటస్థంగా ఉండే రాజులను గూర్చి జాగ్రత్తగా పరీక్ష జరుపుతున్నావు కదా!

క. దేవతల కతిథులకుఁ బిత్రృ । దేవతలకుఁ బూజనములఁ దృప్తి యొనర్తే?
యీ వసుధఁ జతుర్వర్ణ జ । నావళులు నిజోచితక్రియలఁ దగ మనునే? 49

ప్రతిపదార్థం: పూజనములన్= తగిన అర్చనలతో; దేవతలకున్= దైవాలకు; అతిథులకున్= ఆకలి దప్పి మొదలగు వాటితో వచ్చినవారికి; పిత్రృదేవతలకున్= దేవతలైన తన వంశంలో పూర్వ వ్యక్తులకు; తృప్తి= సంతోషాన్ని; ఒనర్తు+ఏ?= కలిగిస్తున్నావా?; ఈ వసుధన్= ఈ భూమిమీద; చతుర్+వర్ణ ఆవళులు= బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులుగా నాలుగు వర్ణాలకు సంబంధించిన ప్రజాళి; నిజ+ఉచిత క్రియలన్= తమకు తమకు తగిన పనులతో; తగన్= ధర్మయుక్తంగా; మనున్+ఏ?= జీవిస్తున్నది కదా?

తాత్పర్యం: దేవతలను, అతిథులను, పిత్రృదేవతలను పూజలతో తృప్తి పరుస్తున్నావు కదా! ఈ భూమిపై నున్న నాలుగు వర్ణాల ప్రజలు తమ తమ వృత్తులలో ధర్మబద్ధంగా జీవిస్తున్నారా?

తే. బాలురకును దుర్బలులకు భామినులకు । వృద్ధులకును మనంబుల వెఱపు లేని
యట్టి మెలఁకువ గలిగెడునట్లు గాఁగ । నడచునే యాజ్ఞ పురమునఁ బుడమియందు.' 50

ప్రతిపదార్థం: బాలురకున్= పిల్లలకు; దుర్బలులకున్= బలహీనులకు; భామినులకున్= స్త్రీలకు; వృద్ధులకున్= ముసలివారికి; మనంబులన్= మనసులలో; వెఱపు= భయం; లేని+అట్టి= లేనటువంటి; మెలఁకువ= జాగరూకత; కలిగెడు+అట్లు+కాఁగన్= సంభవించే విధంగా; ఆజ్ఞ= నీ ఆదేశం; పురమునన్= రాజధానిలోను; పుడమియందున్= రాజ్యంలోనూ; నడచున్+ఏ?= సాగుతున్నదా?

తాత్పర్యం: పిల్లలు, బలహీనులు, స్త్రీలు, వృద్ధులు, మనసులో భయంలేకుండా జీవించే విధంగా నీ ఆజ్ఞలు నగరంలోను, రాజ్యంలోను చెల్లుతున్నాయి కదా?

క. అనిన విని యా నృపతి య । జ్జనపతితో నిట్టు లనియె 'జగదీశ్వర! నీ
వినుతోపదేశమున భవ । దనుయుక్తము లెల్ల నడచు నవికలభంగిన్.' 51

ప్రతిపదార్థం: అనినన్= ధృతరాష్ట్రుడు ఆ విధంగా పలుకగా; ఆ నృపతి= ఆ ధర్మరాజు; విని= ఆలకించి; ఆ+జనపతితోన్= ఆ ధృతరాష్ట్ర నరనాథుడితో; ఇట్టులు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు; జగత్+ఈశ్వర!= మహారాజా!; నీ వినుత ఉపదేశమునన్= నీవు చేసిన గొప్ప రాజధర్మ ఉపదేశంవలన; భవత్+అనుయుక్తములు= నీవు ప్రశ్నించినవి; ఎల్లన్= అన్నీ; అవికలభంగిన్= లోటు లేని విధంగా; నడచున్= జరుగుతున్నాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఆ విధంగా ప్రశ్నించగా విని ధర్మరాజు అతడితో ఇట్లా అన్నాడు; 'మహారాజా! ఇపుడు నీవు ప్రశ్నించిన విషయాలు అన్నీ నాకు నీవు చేసిన రాజనీతి ఉపదేశం మూలంగా ఏ లోటు లేకుండా సాగుతున్నాయి.'

వ. అని పలికి యిట్లనియె. 52

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; పలికి= చెప్పి; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి ప్రశ్నలకు ఆ విధంగా సమాధానం చెప్పిన ధర్మరాజు ధృతరాష్ట్రుడితో మళ్ళీ ఇట్లా అన్నాడు.

క. 'ఆయాసము సైరింపని । మీ యొడలు తపఃక్రియలకు మెయికొనియెనె? భూ
నాయక! శుశ్రూష దగం । జేయునొకో గొంతి డప్పిఁ జెందక మీకున్. 53

ప్రతిపదార్థం: భూనాయక!= ధృతరాష్ట్ర మహారాజా!; ఆయాసము= శ్రమను; సైరింపని= ఓర్వలేని; మీ+ఒడలు= తమ శరీరం; తపస్+క్రియలకున్= తపశ్చర్యలకు; మెయికొనియెన్+ఎ!= పూనుకొన్నది కదా!; గొంతి= కుంతీదేవి; డప్పిన్= అలసట; చెందక= లేకుండా; మీకున్= తమకు; తగన్= తగు విధంగా; శుశ్రూష= సేవ; చేయున్+ఒకో?= చేస్తున్నది కదా?

తాత్పర్యం: 'రాజా! కష్టాలను తట్టుకోలేని మీ శరీరం శరీర క్లేశ కారణమైన ఉపవాసాది వ్రతనియమాలకు పూనుకొన్నది కదా! కుంతి అలసట లేకుండా మీకు అర్హమైన విధంగా సేవలు చేస్తున్నది కదా!

క. మా పెద్దతల్లి యలజడి । కోపి తపోవృత్తి గడపుచున్నదియె? సుత
వ్యాపాదనకారుల మముఁ । బాపాత్ములఁ దలఁచి యెట్లు పలుకునొ మీతోన్? 54

ప్రతిపదార్థం: మా పెద్దతల్లి= మా జ్యేష్ఠమాత; అలజడికిన్= శ్రమకు; ఓపి= ఓర్చుకొని; తపోవృత్తిన్= నియమవంతమైన ప్రవర్తనం; కడపుచున్నది+ఎ?= గడుపుతున్నదా?; సుతవ్యాపాదన కారులన్= కొడుకులను మరణంపాలు చేసిన; పాప+ఆత్ములన్= దురాత్ములైన; మమ్మున్= మమ్ములను; తలఁచి= స్మరించి; మీతోన్= తమతో; ఎట్లు= ఏ విధంగా; పలుకున్+ఒ!= మాటాడుతుందో!

తాత్పర్యం: మా పెద్దమ్మ గాంధారి బాధల కోర్చుకొని తపస్సు ఆచరిస్తున్నదా? తన కొడుకులను చంపిన దుర్మార్గులుగా మమ్ములను తలచుకొని మీతో ఏమంటున్నదో.

ఆ. సంజయుండు తపము జాలికిఁ జాలి వ । ర్తిల్లుచున్నవాఁడె? ధీరచిత్తుఁ
డిచట లేఁడు విదురుఁ డెచటి కేఁగినవాఁడొ? । యతనిఁ జూడ వలయు నధిప! నాకు.' 55

ప్రతిపదార్థం: సంజయుడు= సంజయుడు; తపము జాలికిన్= తపస్సువలన కలిగే శ్రమకు; చాలి= ఓర్చుకొని; వర్తిల్లుచున్+ఉన్నవాఁడె?= తపస్సు చేస్తూ ఉన్నాడా?; అధిప!= రాజా!; ధీరచిత్తుఁడు= నిర్వికారమైన మనస్సు కలిగినవాడు; విదురుఁడు= విదురుడు; ఇచటన్+లేఁడు= ఇక్కడ మీతోపాటు కనిపించటం లేదు; ఎచటికిన్= ఎక్కడికి; ఏఁగినవాఁడు+ఒ?= వెళ్ళాడో?; నాకున్= నాకు; అతనిన్= ఆ విదురుడిని; చూడన్ వలయున్= చూడాలి.

తాత్పర్యం: సంజయుడు తపస్సువలన శ్రమకు ఓర్చుకొంటున్నాడా! రాజా! దృఢమైన చిత్తం కలిగిన విదురుడు ఇక్కడ లేడు; ఎక్కడికి వెళ్ళాడు? నేను అతడిని చూడాలి.'

వ. అనుటయు ధృతరాష్ట్రుఁడు ధర్మతనయుతోడ. 56

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధర్మరాజు పలుకగా; ధృతరాష్ట్రుఁడు; ధర్మతనయుతోడన్= ధర్మరాజుతో (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా అనగానే ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో, ఇట్లా అన్నాడు (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. 'ఏఁ దపంబున కోర్తు నెంతయు; శుశ్రూష । యలయక గొంతి మా కాచరించు;
వినుము! గాంధారియు ననఘచరిత్ర త । పోనిష్ఠ కోర్చు; నిమ్మాననీయ
మిముఁ దలంచిన యప్డు మెచ్చి దీవించు; సం । జయుఁడు ప్రాజ్ఞుఁడు; తపశ్చరణమునకు
విసువఁడు; మముఁ బాసి విదురుఁ డెచ్చట నేనిఁ । జరియించు మునిజనాశ్చర్యకారి

ఆ. యగుచు; జలము లనిల మాహారముగఁ గొను;। నవియు నదియుఁ గొనక యయిన నుండు;
శూన్య విపినమున విదైన్య స్వతంత్ర సం । చారియై వసించుఁ గౌరవేంద్ర! 57

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కురువంశ శ్రేష్ఠుడా! ధర్మరాజా!; ఏను= నేను; తపంబునకున్= తపస్సుకు; ఓర్తున్= సహిస్తాను; గొంతి= కుంతీదేవి; మాకున్= మాకు; శుశ్రూష= సేవ; అలయక= అలసటలేకుండా; ఆచరించున్= చేస్తుంది; వినుము= వినుము; ఎంతయున్= చాలాబాగా; ఆచరించున్= చేస్తున్నది; అనఘ చరిత్ర!= పాపం లేని నడవడి కలవాడా! ధర్మరాజా!, వినుము= (ఈ అంశం శ్రద్ధగా విను; ఈ+మాననీయ= గౌరవింపదగిన; గాంధారియున్= గాంధారికూడా!; తపోనిష్ఠన్= శ్రద్ధగా తపసు చేయడంతో; ఓర్చున్= సమర్థురాలై ఉన్నది; మిమున్= మిమ్మల్ని (పాండవులను); తలంచిన అప్డు= స్మరించిన సందర్భంలో; మెచ్చి= మిమ్మల్ని ప్రశంసచేసి; దీవించున్= మేలు కలిగేటట్లుగా ఆశీర్వదిస్తుంటుంది; సంజయుండు= సంజయుడు; ప్రాజ్ఞుఁడు= అన్నీతెలిసినవాడు; (కాబట్టి) తపస్ చరణమునకున్= తపస్సు ఆచరించటంలో; విసువండు= విసుగుపడడు; విదురుండు= విదురుడు; మమున్= మమ్మల్ని; (ధృతరాష్ట్రాదులను) విడిచి= వదలిపెట్టి; ఎచ్చటికిన్+ఏని(న్)= ఎక్కడెక్కడో; చరియించున్= తిరుగుతుంటాడు; ముని-జన-ఆశ్చర్య-కారి+అగుచున్= తాపసులకు సైతం ఆశ్చర్యం కలిగిస్తూ ఉన్నవాడై; జలములు= నీళ్ళూ; అనిలమున్= గాలీ; ఆహారముగన్= భోజనంగా; కొనున్= స్వీకరిస్తుంటాడు; అవియున్= ఆ నీళ్ళూ; అదియున్= ఆ గాలీ కూడా; కొనక= స్వీకరించకుండా కూడా; ఉండున్= ఉంటాడు; శూన్య-విపినమునన్= నిర్మానుష్యమైన, అడవిలో; వి-దైన్య= స్వతంత్ర; సంచారి= విచారం లేకుండా, స్వేచ్ఛగా తిరిగేవాడు; ఐ= అయి; వసించున్= ఉంటాడు;

తాత్పర్యం: ధర్మరాజా! నేను తపస్సు ఆచరించటానికి సమర్థుడనై ఉన్నాను. మాకు కుంతి అలుపు లేకుండా, ఎంతో చక్కగా సేవలు చేస్తున్నది పాపం (దోషం) లేని వర్తనం కలవాడా (జాగ్రత్తగా వినుము) (మీకు) పూజ్యురాలయిన

గాంధారి కూడా తపస్సు శ్రద్ధగా చేసికొనే సామర్థ్యం కలిగి ఉన్నది. మీరు గుర్తుకు వచ్చినప్పుడు ఈమె మిమ్మల్ని పొగడుతూ మీకు మేలు కలగాలని ఆశీర్వదిస్తుంటుంది. సంజయుడు బుద్ధిమంతుడు. తపస్సు ఆచరించటంలో ఏ మాత్రమూ వెనుదీయడు. ఇంక విదురుడు మమ్మల్ని విడిచిపెట్టి ఎక్కడెక్కడో తిరుగుతుంటాడు. మునులకు సైతం వింత అనిపించే విధంగా, నీళ్ళూ, గాలీ మాత్రమే ఆహారంగా తీసికొంటాడు. ఒక్కొక్కసారి అది కూడా తీసికొనకుండానే ఉంటాడు. మనుష్యులు తిరగని అడవిలో నిర్విచారంగా స్వేచ్ఛగా (తిరుగుతూ) ఉంటాడు.

క. ఒక్కొకమరి డబ్బాటీ। చక్కటిఁ గాన నగు ననియె జనవర తోఁచెన్
గ్రక్కున నప్పుడ విదురుం। డక్కొంతేయాగ్రజున కనతిదూరమునన్. 58

ప్రతిపదార్థం: ఒక్క+ఒకమరి= ఒక్కొక్క పర్యాయం; డబ్బాటు= ఆకస్మికంగా; ఈ చక్కటిన్= ఈ ప్రదేశంలో; కానన్-అగున్= (ఆ విదురుడు) కనబడతాడు; అనియెన్= అని (ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో) అన్నాడు; జనవర!= ఓ జనమేజయ మహారాజా!; అప్పుడు+అ= (ధృతరాష్ట్రుడు చెప్పిన) ఆ సమయంలోనే; ఆ+కౌంతేయ+అగ్రజునకున్= కుంతి కొడుకులలో పెద్దవాడైన ఆ ధర్మరాజుకు; అనతిదూరమునన్= (మరీ దూరంగా కాకుండా) కొంచెం దూరంలో; గ్రక్కునన్= ఆకస్మికంగా; విదురుండు= విదురుడు; తోఁచెన్= కనపడ్డాడు;

తాత్పర్యం: ఒక్కొక్కసారి (గుబాలున) అప్రయత్నంగా ఈ ప్రదేశంలో కూడా కనబడుతాడు విదురుడు' అని ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో అన్నాడు. అదే సమయంలో కొంచెం దూరంలో ఆ విదురుడు హఠాత్తుగా ధర్మరాజుకు కనపడ్డాడు.

వ. కాంతారధూళి మలినాంగుండును జటీభూతకేశపాశుండును దిగంబరుండును నగు విదురుం డట్లు దోఁచి యయ్యాశ్రమంబున నున్న జనంబులం గని మగుడి పోవంజూచె; ధర్మతనయుండు తన యనుచరుల నిలువుం డనుచుఁడా నొక్కరుండును సత్వరంబుగా నవ్వినుత ప్రభావుని వెనుకం జనియె; నతండు గుల్మాంత రితుం డగుచుం దోఁచుచుఁ బోవం బోవ నప్పాండ వాగ్రజుం డెలుంగెత్తి 'యో విదుర! నిలునిలు; మేను యుధిష్ఠిరుండ; నిన్నుఁ గాన వచ్చితి 'నని పలుకుచుం బాటిన నమ్మహాత్ముండు మరలి కనుంగొని వివిక్త ప్రదేశంబున నొక్క పాదపంబు చేరి నిలిచిన. 59

ప్రతిపదార్థం: కాంతార= అడవిలోని; ధూళి= దుమ్ముచేత; మలిన= మట్టిగొట్టుకొన్న; అంగుండును= (శరీర) అవయవాలు కలవాడూ; జటీ భూత= జడలుగా ఏర్పడిన (జడలు గట్టిన); కేశ= తలవెంట్రుకల యొక్క; పాశుండును= సమూహం కలవాడూ; దిగంబరుండును= ఒంటిమీద గుడ్డలు లేనివాడూ; అగు= అయినటువంటి; విదురుండు= విదురుడు; అట్లు= ఆ ప్రకారంగా ఆకస్మికంగా; తోఁచి= (ధృతరాష్ట్రాశ్రమంలోని జనులకు) కనబడి; ఆ+ఆశ్రమంబునన్= ఆ ధృతరాష్ట్రుడి తపోవనంలో; ఉన్న= (క్రొత్తగా చేరి) ఉన్నటువంటి; జనంబులన్= (చాలా మంది) మనుష్యుల్ని; కని= చూచి; మగిడి= వెనక్కు తిరిగి; పోవన్ చూచెన్= (పోదామనుకొన్నాడు) పోతున్నాడు; ధర్మతనయుండు= ధర్మరాజు; తన-అనుచరులన్= తనను వెన్నంటి ఉండే జనాన్ని; నిలువుండు= (నా వెంట రావద్దు) ఇక్కడ నిలిచి ఉండండి; అనుచున్= అని చెప్తూ; తాను-ఒక్కరుండును= తాను (ధర్మరాజు) ఒక్కడు మాత్రమే; సత్వరంబుగాన్= వేగంగా; ఆ+వినుతప్రభావుని= ప్రశంసించబడే గొప్పతనం కలిగిన ఆ విదురుడి యొక్క; వెనుకన్= వెనకే; చనియెన్= వెళ్ళాడు; అతండు= ఆ విదురుడు; గుల్మ-అంతరితుండు= తీగ పొదలలో కనబడకుండా ఉన్నవాడు;

అగుచున్= అవుతూ; తోఁచుచున్= నడుమనడుమ కనబడుతూ; పోవన్-పోవన్= ఇంకా ఇంకా ముందుకి వెళ్ళుతూ ఉంటే; ఆ+పాండవ అగ్రజుండు= ఆ ధర్మరాజు; ఎలుంగు+ఎత్తి= గొంతెత్తి (గట్టిగా); ఓవిదురా!= ఓవిదురా!; నిలు-నిలుము= నిలబడుము నిలబడుము; ఏను= నేను; యుధిష్ఠిరుండన్= ధర్మరాజును; నిన్నున్= నిన్ను; కానన్= చూడటానికి; వచ్చితిన్= వచ్చాను; అని పలుకుచున్= అని అంటూ; పాటినన్= విదురుడి వెంట పరుగెత్తుతుంటే; ఆ+మహాత్ముండు= గొప్పవాడైన ఆ విదురుడు; మరలి= వెనక్కు (ధర్మరాజు) వైపు తిరిగి; కనుంగొని= (ధర్మరాజును) చూచి; వివిక్త ప్రదేశంబునన్= జనా లెవ్వరూ లేని చోట; ఒక్క పాదపంబు= ఒకానొక చెట్టు వద్దకు; చేరి= చేరుకొని; నిలిచినన్= ఆగి ఉండగా.

తాత్పర్యం: అడవిలోని దుమ్ముతో, ఒళ్ళంతా మట్టి గొట్టుకొని పోయి, జడలు గట్టిన జుట్టుతో దిగంబరంగా ఉన్న విదురుడు ఆ విధంగా అకస్మాత్తుగా కనబడి ఆ ఆశ్రమంలో (కొత్త) జనాలను చూచి వెనుకకు తిరిగి వెళ్ళిపోసాగాడు. అప్పుడు ధర్మరాజు తన అనుచరులను వెంటరాకుండా అక్కడే నిలిచి ఉండండని చెప్పుతూ ఒక్కడే ఆ విదురుడి వెంట వెళ్ళాడు. ఆ విదురుడు పొదలలో దూరి నడుమ నడుమ కనబడుతూ, ముందు ముందుకు వేగంగా వెళ్ళుతున్నాడు. అప్పుడు ధర్మరాజు గొంతెత్తి పెద్దగా 'ఓ విదురా! ఓ విదురా! ఆగుము ఆగుము నేను ధర్మరాజును. నిన్ను చూద్దామని వచ్చాను' అని అరుస్తూ విదురుడి వెంట పరుగెత్తుతున్నాడు. అప్పుడు విదురుడు వెనుకకు తిరిగి ధర్మరాజును చూచి ఏకాంతంగా ఉండే చోట ఒకానొక చెట్టు దగ్గరకు వెళ్ళి ఆగి నిలుచున్నాడు.

విదురుఁడు యోగమార్గంబున ధర్మరాజునందుఁ గలియుట (సం.15-33-22)

సీ. **ధర్మతనూజుండు తత్సమీపంబున । కేఁగి యయ్యోగి కట్టెదుర నిలిచి**
యాతండు నయనంబు లర్ధమీలితములై । యుండంగ నూరక యున్నఁ గాంచి
'నిర్మలాత్మక ! యేను ధర్మసూనుఁడ; నన్నుఁ । గనువిచ్చి చూడవే!' యనుడు నతఁడు
ఱెప్పల నెగయించి యప్పాండవోత్తముఁ । దప్పక చూచి యుదాత్త యోగ

తే. **బలము గైకొని యింద్రియములను బ్రాణ । ములను నింద్రియములుఁ బ్రాణములను గలిపి**
నిజశరీరంబు విడిచి యా నృపతి తనువు । సొచ్చెఁ దేజోమయత్వవిస్ఫూర్తి మెఱయ. 60

ప్రతిపదార్థం: ధర్మతనూజుండు= ధర్మరాజు; తద్-సమీపంబునకున్= ఆ విదురుడి దగ్గరకు; ఏఁగి= వెళ్ళి; ఆ+యోగి= ధ్యానంలో నిమగ్నుడైన ఆ విదురుడి యొక్క; కడు+ఎదురన్= ఎట్ట ఎదురుగా; నిలిచి= నిలువబడి; అతండు= ఆ యోగి (విదురుడు); నయనంబులు= కళ్ళు; అర్ధ-మీలితంబులు= సగం మూయబడినవి; ఐ-ఉండంగన్= అయిఉండగా; ఊరక-ఉన్నన్= నిర్వికారంగా ఉండగా; కాంచి= (ధర్మరాజు) చూచి; నిర్మల+ఆత్మక= స్వచ్ఛమైన మనసు కలవాడా! (విదురా); ఏను= నేను; ధర్మసూనుండన్= ధర్మరాజును; నన్నున్= నన్ను; కనువిచ్చి= కళ్ళు తెరిచి; చూడవే= చూడవలసింది; అనుడున్= అని ధర్మరాజును; పల్కఁగా= (వేడుకొనగా); అతఁడు= విదురుడు; ఱెప్పలన్= కనురెప్పల్ని; ఎగయించి= ఎత్తి; ఆ+పాండవ+ఉత్తమున్= ఆ ధర్మరాజును; తప్పక= నిశితంగా (దీర్ఘంగా); చూచి= చూచి; ఉదాత్త-యోగ-బలము= గొప్పదయిన యోగశక్తిని; కైకొని= ఆశ్రయించి; ఇంద్రియములను= ధర్మరాజుయొక్క బాహ్యాంతరింద్రియాలలో; ప్రాణములను= ధర్మరాజు ప్రాణాలతో; ఇంద్రియములన్= తన (విదురుడి) ఇంద్రియాలూ; ప్రాణములున్= తన (విదురుడి) ప్రాణాలూ; కలిపి= సంయోగం చెందేటట్లు చేసి; నిజశరీరంబు= తన (విదురుడి) శరీరాన్ని; విడిచి= వదలి పెట్టి; తేజస్+మయత్వ-విస్ఫూర్తి= తేజస్సుతోనిండినట్లు తళుకులు; మెఱయన్= ప్రకాశించగా; ఆ నృపతి తనువున్= ఆ ధర్మరాజుయొక్క శరీరాన్ని; చొచ్చెన్= ప్రవేశించాడు;

తాత్పర్యం: ధర్మరాజు విదురుడి దగ్గరకు వెళ్ళి అతడికి ఎదురుగా నిలబడ్డాడు. యోగి అయిన ఆ విదురుడు అరమూసిన కన్నులతో మాటాడకుండా నిశ్చలంగా ఉండిపోయాడు. అది చూచి ధర్మరాజు-'స్వచ్ఛమైన హృదయం కలవాడా! నేను ధర్మరాజును. కనులు తెరిచి నన్ను చూడు' అని ప్రార్థించాడు. అపుడు విదురుడు మెల్లగా కనురెప్పలెత్తి ధర్మరాజును తదేకంగా చూస్తూ యోగశక్తితో తన ఇంద్రియాలను ధర్మరాజు ఇంద్రియాలలోనూ, తన ప్రాణాలను ధర్మరాజు ప్రాణాలలోనూ కలిపి, తన శరీరం విడిచిపెట్టి, కాంతిమయమైన రూపంతో ఆ ధర్మరాజు శరీరంలో ప్రవేశించాడు.

ఆ. వినుము ధర్మపుత్త్రు తనువునఁ గాంతియు। లావు నప్పు డగ్గలంబు లయ్యె,
నొలసె బుద్ధి యధిక బల; మట్టు లగు టతఁ। డెఱిఁగి చోద్యమంది యెలమి నొందె. 61

ప్రతిపదార్థం: వినుము= జనమేజయమహారాజా! వినుము; అప్పుడు= విదురుడు ధర్మరాజు శరీరంలో ప్రవేశించినపుడు; ధర్మపుత్త్రు= ధర్మరాజు యొక్క; తనువునన్= శరీరంలో; కాంతియున్= తేజస్సు; లావును= శక్తీ; అగ్గలంబులు= అధికములు; అయ్యెన్= అయ్యాయి; బుద్ధి= ప్రతిభ; అధిక బలము= అధికమైన పటుత్వాన్ని; ఒలసెన్= పొందింది; అట్టులు అగుట= తాను అధిక శక్తి మంతుడు కావటం; అతఁడు= ఆ ధర్మరాజు; ఎఱిఁగి= గ్రహించి; చోద్యము= ఆశ్చర్యం; అంది= పొంది; ఎలమిన్= సంతోషాన్ని; ఒందెన్= పొందాడు.

తాత్పర్యం: విదురుడు ధర్మరాజులో కలిసిన తర్వాత ధర్మరాజు శరీరానికి కాంతీ, శక్తీ అధికమయ్యాయి. బుద్ధి ఇంకా బలవంతమయింది. అట్లా కావటం గ్రహించి ధర్మరాజు ఆశ్చర్యంతో సంతోషించాడు.

క. తదనంతరంబ యప్పతి। విదురశవము ప్రాను సెంది వికృతరహితమై
నిదురమెయి నొఱగియున్న ప। గిది నుండం జూచి యగ్నికృత్యము నడపన్. 62

ప్రతిపదార్థం: తద్-అనంతరంబు+అ= ఆ తర్వాత; ఆ+పతి= ఆ ధర్మరాజు; విదురశవము= విదురుడి (ప్రాణంలేని) శరీరం; ప్రాను చెంది= చలనరహితమై; వికృత-రహితము-ఐ= మార్పు చెందినది కానిదై (మార్పులేకుండా; నిదురమెయిన్= నిద్రతో; ఒఱగి ఉన్నపగిదిన్= వాలిపోయిన విధంగా; ఉండన్= ఉండగా; చూచి= చూచి; అగ్నికృత్యము= అగ్నికార్యం (దహనం); నడపన్= ఆచరించటానికి ఊహచేశాడని (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఆ తరువాత విదురుడి శవం చలించకుండా, ఏ మార్పూ చెందకుండా (ప్రాణం ఉన్నప్పటి వలెనే) నిద్రతో వాలిపోయిన విధంగా ఉండటం చూచి ధర్మరాజు ఆ విదురుడి శరీరానికి అగ్నికార్యం (దహనం) చేయదలచాడు.

చ. తలఁచిన మింట నొక్కెలుఁగు 'ధర్మతనూజ! యతిత్వ గౌరవో
జ్జ్వలుని కళేబరంబునకు వహ్నివిధాన మొనర్చు టర్హమే?
వల'దని మ్రోసె; నమ్మనుజవల్లభుఁ డప్పని దక్కి పోయి బ్రా
తలకును దండ్రికిన్ సువిదితంబుగ నంతయునుం గ్రమంబునన్. 63

ప్రతిపదార్థం: తలఁచినన్= అనుకోగా; మింటన్= ఆకాశంలో; ఒక్క+ఎలుఁగు= ఒకానొక స్వరం (ఇట్లా వినబడ్డది); ధర్మతనూజ!= ధర్మరాజా!; యతిత్వ-గౌరవ+ఉజ్జ్వలుని= యతి లక్షణాల ఆధిక్యం చేత ప్రకాశించే విదురుడియొక్క; కళేబరంబునకున్=

శరీరానికి; వహ్ని-విధానము= అగ్నికార్యం; ఒనర్చుట= చేయుటం; అర్హము+ఏ?= తగునా?; వలదు= ఆవిధంగా (దహనం) చేయవద్దు; అని= అనే విధంగా; మ్రోసెన్= ధ్వనించింది; ఆ+మనుజవల్లభుండు= ఆ (ధర్మ)రాజు; ఆ+పని= విదురుడి శరీరాన్ని దహనం చేసే పని; తక్కి= మానుకొని; పోయి= తిరిగి (ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి) వెళ్ళి; భ్రాతలకున్= భీముడు మొదలైన సోదరులకూ; తండ్రికిన్= పెదతండ్రి అయిన ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి)వెళ్ళి; భ్రాతలకున్= భీముడు మొదలైన సోదరులకూ; తండ్రికిన్= పెదతండ్రి అయిన ధృతరాష్ట్రుడికీ; సువిదితంబుగన్= స్పష్టంగా; అంతయునున్= విదురుడి సమక్షంలో జరిగిన వృత్తాంతం అంతా; క్రమంబునన్= మొదటినుండి ఒక వరుసలో, (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: విదురుడి శరీరానికి అగ్ని సంస్కారం చేయాలని ధర్మరాజు అనుకొనగా, అప్పుడు ఆకాశంలోనుండి ఒకానొక స్వరం 'ధర్మరాజా! యతిధర్మపు గొప్పదనంతో ప్రకాశించే విదురుడి దేహాన్ని దహనం చేయటం తగునా? ఆ విధంగా చేయవద్దు' అని ధ్వనించింది. అప్పుడు ధర్మరాజు ఆపని మానుకొని తిరిగి (ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి) వెళ్ళి అక్కడ ఉన్న తమ్ముళ్ళతోనూ, తండ్రితోనూ జరిగిన సంఘటన అంతా క్రమంగా చెప్పాడు'.

వ. **ఎల్లవారును వినుచుండం జెప్పిన నందఱు నద్భుత రసంబున మునింగిరి; పదంపడి ధృతరాష్ట్రుం డామంత్ర ణంబు సేయ మునిజనులు నిజనివాసంబులకుం జనిరి; తదనంతరంబ యాంబికేయుండు ధర్మనందనుని తోడ.** **64**

ప్రతిపదార్థం: ఎల్లవారును= ద్రౌపదీ ప్రభృతులైన స్త్రీ జనమూ, పాండవులను చూడవచ్చిన తాపసులూ అందరూ; వినుచుండన్= వింటుండగా; చెప్పినన్= విదురుడి వృత్తాంతాన్ని ధర్మరాజు చెప్పగా; అందఱున్= అక్కడివారందరూ; అద్భుతరసంబునన్= అద్భుతం అనే రసంలో; మునింగిరి= మునిగిపోయారు; పదంపడి= తర్వాత; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; ఆమంత్రణంబు-చేయన్= వీడ్కోలు చెప్పగా; మునిజనులు= పాండవులను చూడవచ్చిన తాపసులు; నిజవాసంబులకున్= తమ తమ నివాసస్థలాలకు; చనిరి= వెళ్ళారు; తద్+అనంతరంబు+అ= ఆతర్వాత; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; ధర్మనందనుని తోడన్= ధర్మరాజుతో (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ద్రౌపది మొదలైన స్త్రీ జనమూ పాండవులను చూడవచ్చిన తాపసులు అందరూ వింటుండగా, తమ్ములతోనూ, ధృతరాష్ట్రుడితోనూ ధర్మరాజు విదురుడి వృత్తాంతం అంతా క్రమంగా చెప్పాడు. అది విని వారంతా ఆశ్చర్యంలో మునిగిపోయారు. తరువాత ధృతరాష్ట్రుడు వీడ్కోలు చెప్పగా (పాండవులను చూడటానికి వచ్చిన) తాపసులు తమ తమ నెలవులకు వెళ్ళిపోయారు. అటు పిమ్మట ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. **'భరతకులోత్తమ! ఫలమూలముల నుప । యోగింపు మొసఁగెద నొదవి తనకు**
నెయ్యది యాహారమయ్యె నాతిథ్యంబు । దానిన నడపుట ధర్మసరణి'
యనవుడు 'నట్ల కా' కని ఫలంబులు మూల । ములు నుపయోగించె మోదభరితుఁ
డగుచు నప్పాండుసుతాగ్రణి యబ్భంగి । నఖిలజనములు నాహారకలన

తే. **మాచరించి రయ్యందఱు నవని శయన । మొంది యారాత్రి నిద్రించి రుదితసూర్య ।**
కాలమగుటయు, సముచిత కర్మకరణ । మనుజులును దాను నడపె నమ్మనుజవిభుఁడు. **65**

ప్రతిపదార్థం: భరత కుల+ఉత్తమ!= భరతవంశంలో శ్రేష్ఠుడా, ధర్మరాజా!; ఫల-మూలములన్= పండ్లనూ, దుంపలనూ; ఒసఁగెదన్= ఇస్తాను; ఉపయోగింపుము= ఆహారంగా తీసికొమ్ము; ఏ+అది= ఏది; తనకున్= తనకు; ఒదవి= లభించిన; ఆహారము; అయ్యెన్= అవుతుందో; దానన్+అ= ఆ పదార్థంతోనే; ఆతిథ్యంబు= అతిథి భోజనాన్ని; నడపుట= ఉపయోగించటం; ధర్మసరణి= ధర్మబద్ధమైన మార్గం; అనవుడున్= అని ధృతరాష్ట్రుడు పల్కఁగా; ఆ+పాండు-సుత+అగ్రణి= పాండురాజు కొడుకులలో పెద్దవాడైన ఆ ధర్మరాజు; అట్లు+అ కాక= అట్లే అగుగాక అని; మోద-భరితుఁడు= సంతోషంతో నిండినవాడు; అగుచున్= అవుతూ; ఫలంబులు(న్)= పండ్లు; మూలములున్= దుంపలూ; ఉపయోగించెన్= ఆహారంగా తీసుకున్నాడు; అఖిల జనములున్= భీమాదులైన (మిగిలిన) జనమంతా; ఆ+భంగిన్= అదేవిధంగా (సంతోషభరితులై ఫలమూలాలు); ఆహారకలనము= ఆహారం తీసికొనే పని; ఆచరించిరి= చేశారు; ఆ+అందఱున్= ధర్మరాజు మొదలైన (ధృతరాష్ట్రాదులను చూడవచ్చిన) వారు అందరూ; ఆ రాత్రి= ఆరోజు రాత్రి; అవనిశయనము= నేలమీద పడకను; ఒంది= పొంది; నిద్రించిరి= నిద్రపోయారు; ఉదిత-సూర్యకాలము= సూర్యుడు ఉదయించే సమయం; అగుటయున్= అయినవెంటనే (ప్రాతఃకాలంలో); ఆ+మనుజవిభుఁడు= ఆ ధర్మరాజు; తాను(న్)= తానూ; అనుజులును= భీమాదులైన తమ్ముళ్ళూ; సముచిత-కర్మ-కరణము= ఆ కాలానికి తగిన సంధ్యావందనాది కర్మలను చేయటం; నడపెన్= పూర్తి చేశాడు.

తాత్పర్యం: భరతవంశశ్రేష్ఠుడా! పండ్లూ, దుంపలూ, ఇస్తాను. ఆహారంగా గ్రహించుము. తమకున్నదీ తాను తినేదీ ఏదో అదే అతిథులకూ పెట్టటమే ధర్మం అన్నాడు ధృతరాష్ట్రుడు. అప్పుడు ధర్మరాజు సరేలెమ్మని సంతోషంతో ఆ పండ్లూ మూలాలూ భుజించాడు. భీమాది బంధువులూ, పౌరులూ అందరూ కూడా అదే విధంగా సంతోషంతో ఫలమూలాలు తిన్నారు. ఆరోజు రాత్రి అందరూ నేలమీద పడుకొని నిద్రపోయారు. సూర్యు డుదయించటంతో ధర్మరాజు తనూ, తమ్ములూ ప్రాతఃకాలంలో ఆచరించవలసిన సంధ్యావందనాది క్రియలు ఆచరించారు.

వ. **అట్లు కాలోచితకృత్యంబులు నడపి సహోదరసహితుండును దారోపేతుండును నర్హపరివారానుగతుండును నై యాశ్రమపథంబు గలయ మెలంగి, పావనస్నాన పావకార్చన జపధ్యానాది తాపసధర్మచర్యా విధంబులు, నానామృగ నిర్భయ సంచార ప్రకారంబులు వివిధపక్షికుల నిశ్శంక కేళీవిభవంబులు నాలోకించి, కృత ప్రాతస్సవనకరణీయుం డై యున్న కురువృద్ధు కడకు వచ్చి వందనాభినందన వచనంబుల నతని యుల్లంబు పల్లవింపంజేసి యతఁడు వనుపఁ బవిత్రాసనోపవిష్టుం డై.** **66**

ప్రతిపదార్థం: అట్లు= ఆప్రకారంగా; కాల+ఉచిత-కృత్యంబులు= సూర్యోదయ (ప్రాతః) కాలంలో చేయవలసిన పనులను; నడపి= పూర్తిచేసి; సహోదరసహితుండును= భీముడు మొదలైన తమ్ములతో కూడిన వాడూ; దార+ఉపేతుండును= భార్య తోడుగా ఉన్నవాడూ; అర్హ-పరివార-అనుగతుండును= తగినంత సేవకజనం చేత అనుసరించబడే వాడూ; ఐ= అయి; (ధర్మరాజు) ఆశ్రమపథంబు= ఆ ధృతరాష్ట్రుడి ఆశ్రమ ప్రదేశం అంతా; కలయన్-మెలంగి= కలియ (సంపూర్ణంగా) తిరిగి; పావన= పవిత్రమైన; స్నాన= స్నానమూ; పావక= అగ్నియొక్క; అర్చన= పూజలు; జప= జపమూ; (మంత్రాదులను ఆవృత్తి చేయటం); ధ్యాన= ధ్యానమూ (తత్త్వాన్ని మనసులో భావన చేయటం); ఆది= మొదలైన; తాపస= మునులయొక్క; ధర్మ= కర్తవ్యాలను; చర్యా= ఆచరించే; విధంబులు(న్)= తీరులూ; నానా= రకరకాల; మృగ= జంతువుల వలని; నిర్భయ= భయంలేని, స్వేచ్ఛతో కూడిన; సంచార= తిరగటాల; ప్రకారంబులు(న్)= పద్ధతులూ; వివిధవిభవంబులు= అనేక విధాలయిన; పక్షి= పక్షుల; కుల= గుంపుల; నిశ్శంక= సంకోచంలేని; కేళీ= విహారాల; విభవంబులున్= గొప్పతనాలూ; ఆలోకించి= చూచి; కృత= చేయబడిన; ప్రాతర్= ఉదయకాలపు; సవన= (సోమ) యజ్ఞానికి సంబంధించిన; కరణీయుండు= క్రియలు కలిగిన వాడు; ఐ= అయి; ఉన్న= ఉన్నటువంటి;

కురువృద్ధు కడకున్= ధృతరాష్ట్రుడి వద్దకు; వచ్చి= చేరుకొని; వందన-అభినందన-వచనములన్= నమస్కారాలూ, సంతోషం కలిగించేవీ అయిన మాటలతో; అతని-ఉల్లంబు= ఆ ధృతరాష్ట్రుడి మనస్సు; పల్లవింపంగన్+చేసి= సంతోషించేటట్లుచేసి; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; పనుపన్= అనుమతించగా; పవిత్ర-ఆసన- ఉపవిష్టుండు= పావనమైన ఆసనం మీద కూర్చున్నవాడు; ఐ= అయి.

తాత్పర్యం: ఆ విధంగా ధర్మరాజు సూర్యోదయం అయిన సమయంలో అపుడు చేయవలసిన పనులు చేసి, తమ్ములతోనూ, భార్యతోనూ, కలిసి తగిన పరివారం వెంటరాగా ఆ ఆశ్రమ ప్రాంతం అంతా తిరిగి, అక్కడ పవిత్రమైన స్నానం, అగ్నిపూజనం, జపం, ధ్యానం, మొదలైన మునులు చేసే పనులు ఆచరింపబడుతూ ఉండటమూ, రకరకాల జంతువులు భయంలేకుండా స్వేచ్ఛగా తిరుగుతుండటమూ, వివిధ పక్షులు గుంపులై నిస్సంకోచంగా విహరిస్తూ ఉన్నప్పటి వైభవమూ చూచాడు. ఆ తరువాత ప్రాతఃకాలంలో చేయవలసిన (సోమ) యజ్ఞానికి సంబంధించిన కర్తవ్యాలను ఆచరించి కూర్చున్నటువంటి ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి అతడికి నమస్కారాలు, ప్రశంసలూ, పలికి, ఆ ధృతరాష్ట్రుడి ఆజ్ఞమీద ఒక పరిశుద్ధమైన ఆసనంమీద కూర్చున్నాడు ధర్మరాజు.

చ. **అనుజులుఁ దాను భక్తి మెయి నమ్మహనీయునిఁ గొల్చియుండ న**
య్యునికిఁ గనుంగొనంగఁ గరముత్సుకతన్ శతయూపుఁ డాదిగా
మునివరు లేఁగుదెంచినఁ బ్రమోదమునం గుశపీఠరాజిపై
నునుపఁగఁ బంచె గాఢవినయోక్తుల నా ధృతరాష్ట్రుఁ డందఱన్. **67**

ప్రతిపదార్థం: అనుజులున్= తమ్ముళ్ళూ, భీమాదులు; తాను(న్)= తానూ (ధర్మరాజు); ఆ+మహనీయునిన్= ఆ పూజ్యుని ధృతరాష్ట్రుడిని, భక్తి మెయిన్= సేవా భావంతో; కొల్చి= సేవించి; ఉండన్= (అక్కడే) ఉండగా; ఆ+ఉనికిన్= ఆస్థితిని; కనుంగొనంగన్= చూడటంకొరకు; శతయూపుఁడు= శతయూపుడనే వాడు; ఆదిగన్= మొదలుగా, మునివరులు= శ్రేష్ఠులైన (పరిసరాల్లోని) మునులు; కరము= మిక్కిలి; ఉత్సుకతన్= కుతూహలంతో; తాపసులు ఏఁగుదెంచినన్= (ధృతరాష్ట్రుడి వద్దకు) రాగా; ఆ ధృతరాష్ట్రుఁడు; అందఱన్= ఆ తపసులందరినీ; కుశపీఠరాజిపైన్= దర్భాసన సమూహంపై; ఉనుపఁగన్= కూర్చుండేవిధంగా (కూర్చోబెట్టండని); ప్రమోదమునన్= సంతోషంతో; గాఢ-వినయ-ఉక్తులన్= మిక్కిలి అణకువ కలిగిన మాటలతో; పంచెన్= నియోగించాడు.

తాత్పర్యం: ఆ ధర్మరాజు తమ్ముళ్ళతో కలిసి (తాను) ఆ ధృతరాష్ట్రుడిని భక్తితో సేవిస్తూ అక్కడ ఉన్నాడు. అటువంటి వాళ్ళను చూడటానికి శతయూపుడు మొదలైన మునులు మిక్కిలి ఉత్సాహంతో అక్కడికి వచ్చారు. వాళ్ళందరినీ దర్భాసనాలపై ఆసీనులు కండి అని ధృతరాష్ట్రుడు మిక్కిలి సంతోషంగా అణకువ మాటలతో చెప్పాడు.

వ. **అట్లున్న యమ్మునిజనంబులును బాండు పుత్త్రులునుం బరమధర్మమయ సంభాషణంబులు సేయుచుండ నినుండు నభోమధ్యగతుం డయ్యె; నప్పు డాంబికేయుండు సవినయంబుగా నత్తాపసోత్తములతో 'మీకు మధ్యందిన కృత్యంబు లాచరింపవలయు; విజయం చేయుం'డనిన వారలు నిజనివాసంబులకుం జనిరి; తదనంతరంబ కౌంతేయుల మాధ్యాహ్నిక కరణీయంబులు నిర్వర్తించుట కరుగుం డని పనిచె; నని చెప్పినవిని జనమేజయుం డప్పాండవేయు లవ్విధంబున వనంబున నెన్ని దినంబులు వసియించి?' రని యడిగిన వైశం పాయనుం డిట్లనియె.** **68**

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారంగా; ఉన్న= ఉన్నటువంటి; ఆ+మునిజనంబులును= శతయూపుడు మొదలైన తాపసులూ; పాండుపుత్త్రులునున్= పాండవులూ; పరమ-ధర్మమయ సంభాషణంబులు= ఉత్తమమైన ధర్మంతో నిండిన మాటలు; చేయుచుండన్= ఆడుతుండగా; ఇనుండు= సూర్యుడు; నభస్+మధ్యగతుండు= ఆకాశంలో నడిమి భాగానికి వచ్చినవాడు; అయ్యెన్= అయ్యాడు; అప్పుడు= ఆసమయంలో; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; సవినయంబుగాన్= అణకువతో; ఆ+తాపస+ఉత్తములతోన్= ఆ మునివరులతో; మీకున్= మీకు; మధ్యందిన కృత్యంబులు= మాధ్యాహ్నిక కార్యాలు; ఆచరింప వలయున్= నిర్వర్తించవలసిఉన్నది కాబట్టి విజయం చేయుండు, మీ నివాసాలకు వెళ్ళండి; అనినన్= అని పల్కగా; వారలు= ఆ మునిశ్రేష్ఠులు; నిజ నివాసంబులకున్= తమ నెలవులకు; చనిరి= వెళ్ళారు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; మాధ్యాహ్నిక-కరణీయంబులు= మధ్యాహ్నవేళ ఆచరింపవలసిన పనులు; నిర్వర్తించుటకున్= పూర్తిచేయటానికి; అరుగుండు= వెళ్ళండి; అని= అని చెప్పి; కౌంతేయులన్= పాండవులను; పనిచెన్= పంపించాడు (ధృతరాష్ట్రుడు); అని= ఆ ప్రకారంగా; చెప్పినన్= వైశంపాయనుడు చెప్పగా; విని= ఆలకించి; జనమేజయుండు= జనమేజయమహారాజు; ఆ+పాండవేయులు= ఆ పాండవులు, ఆ+విధంబునన్= ఆ తీరుగా; ఎన్ని దినంబులు= ఎన్నాళ్ళు; వనంబునన్= అరణ్యంలో; వసియించిరి?= ఉన్నారు?; అని= అని; అడిగినన్= ప్రశ్నించగా; అతనికిన్= ఆ జనమేజయుడితో ; వైశంపాయనుండు= వైశంపాయనముని; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆవిధంగా ధృతరాష్ట్రుడితో పాండవులూ, శతయూపుడూ మొదలైన మునులూ కలిసి ఉత్తమమైన ధర్మంతో నిండిన ఆలాపాలు చేస్తుండగా సూర్యుడు ఆకాశమధ్యానికి వచ్చాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు ఆ మునులను 'మీకు మధ్యాహ్నం చేయవలసిన పనులు నడపవలసి ఉన్నది కాబట్టి మీ స్థానాలకు వెళ్ళండి' అని వినయంగా చెప్పాడు. ఆ మునులు తమ తమ నెలవులకు వెళ్ళిపోయారు. తరువాత మాధ్యాహ్నికాలైన పనులు ఆచరించండని ధృతరాష్ట్రుడు పాండవులను కూడా పంపాడు-అని వైశంపాయనుడు చెప్పగా జనమేజయుడు విని 'పాండవులు ఆ విధంగా అరణ్యంలో ఎన్నాళ్ళున్నారు?' అని అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

సీ. **'ధరణీశ! పాండునందను లట్లు సాంతఃపు । రంబును సపరివారంబుఁగాఁగ**
నడవికి నేఁగి యయ్యంబికానందనుఁ । గాంచిన దినమునఁ గరము నియతి
ఫలమూలసమితి నాఁకలి వుచ్చి భూమిశ । యనమున నిద్రించి రాగరిష్ఠుఁ
డమ్మహితాత్ముల కర్థితో మఱునాఁ । డనుజ్ఞ యిచ్చిన, సుమనోజ్ఞములును

ఆ. **సన్నుతములు నైన యన్నపానాదుల । ననుభవించి మృదులహారి తల్ప**
ముల శయించి; రట్లు నెలనాళు లయ్యెడ । నతనిఁ గొల్చియుండి రథిపముఖ్య! 69

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= (జనమేజయ)రాజా!; పాండునందనులు= పాండవులు; స-అంతఃపురంబును= ద్రౌపదీ ప్రభృతులైన అంతఃపుర స్త్రీలతోనూ; సపరివారంబున్= భృత్యులతోనూ కూడినవారు; కాఁగన్= అయి; అట్లు= ఆ ప్రకారంగా; ధృతరాష్ట్రాదులను చూచే నిమిత్తం; అడవికిన్ ఏఁగి= అడవికి వెళ్ళి; ఆ+అంబికానందనున్= ఆ ధృతరాష్ట్రుడిని; కాంచిన దినమునన్= చూచిన రోజు; కరము= మిక్కిలి; నియతిన్= నియమంగా; ఫలమూల-సమితిన్= పండ్లూ, వేళ్ళ సముదాయంతో; ఆఁకలివుచ్చి= ఆకలి తీర్చుకొని; భూమిశయనమునన్= నేల పక్క (పరపు)గా; నిద్రించిరి= నిద్ర చేశారు; మఱునాఁడు= తరువాతిరోజు; ఆ గరిష్ఠుఁడు= దొడ్డవాడైన ఆ ధృతరాష్ట్రుడు; ఆ+మహిత+ఆత్ములకున్= దొడ్డ బుద్ధులైన ఆ పాండవులకు; అర్థితోన్= ప్రేమతో; అనుజ్ఞ= అనుమతి; ఇచ్చినన్= ఇవ్వగా; సుమనోజ్ఞములును= మనస్సు కింపు కలిగించేవి; సన్నుతములు= ప్రశస్తాలూ; ఐన= అయినటువంటి;

అన్న-పాన+ఆదులన్= భోజనమూ, పానీయమూ మొదలైన వాటిని; అనుభవించి= ఆస్వాదించి; మృదుల-హారి-తల్పములన్= కోమలములూ మనోహరములూ అయిన శయ్యలమీద; శయించిరి= నిద్రించారు; అధిపముఖ్య!= రాజులలో శ్రేష్ఠుడా! జనమేజయా!; అట్లు= ఆవిధంగా (పాండవులు); ఆ+ఎడన్= వనంలో; నెలనాళులు= నెలరోజులు; అతనిన్= ధృతరాష్ట్రుడిని; కొల్చి= సేవిస్తూ; ఉండిరి= ఉన్నారు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! అంతఃపుర కాంతలతోనూ, తగిన పరివారంతోనూ కలిసి (ధృతరాష్ట్రాదులను చూడటానికి) పాండవేయులు అడవికి వెళ్ళిన ఆ రోజు నియమంగా ధృతరాష్ట్రు డిచ్చిన ఫలమూలాదులతో ఆకలి తీర్చుకొని నేలమీద నిద్రించారు. ఆ మరునాడు ధృతరాష్ట్రుడు ప్రేమతో అనుమతించగా మనసుకు ఇష్టమైనవీ, ప్రశస్తమైనవీ అయిన భోజనాలూ, పానీయాలూ ఆస్వాదించి, కోమలంగానూ మనోహరంగానూ ఉన్న శయ్యలమీద నిద్రించారు. జనమేజయ మహారాజా! పాండవేయు లావిధంగా ధృతరాష్ట్రుడి ఆశ్రమవనంలో ఆ ధృతరాష్ట్రుడిని సేవించుకొంటూ నెలనాళ్ళున్నారు.

వ. పదంపడి యొక్కనాఁ డెప్పటియట్ల పాండుపుత్త్రులు గాంధారీ కుంతీసముపాసితుండయియున్న విచిత్రవీర్యపుత్త్రుంబరివేష్టించియుండ నవ్విశిష్ట గోష్ఠికై శతయూపప్రభృతి మునివరులు చనుదెంచిన నక్కురువృద్ధుఁడర్హంబు లగునాసనంబులు వెట్టించి సంభావించిన. 70

ప్రతిపదార్థం: పదంపడి= తరువాత; ఒక్కనాఁడు= ఒకానొకరోజు; ఎప్పటిఅట్లు+అ= ఎప్పటివలెనే; పాండుపుత్త్రులు= పాండవులు; గాంధారీ-కుంతీ-సముపాసితుండు+అయి= గాంధారి చేత, కుంతి చేత సేవించబడుతూ; ఉన్న= ఉన్నటువంటి; విచిత్ర వీర్యపుత్త్రున్= ధృతరాష్ట్రుడిని; పరివేష్టించి-ఉండన్= చుట్టుకొనిఉండగా; ఆ+విశిష్ట-గోష్ఠికై= అసాధారణమైన ఆ సమావేశానికి; శతయూప-ప్రభృతి-మునివరులు= శతయూపుడు మొదలైన మునిశ్రేష్ఠులు; చనుదెంచినన్= రాగా; ఆ+కురువృద్ధుండు= ఆ ధృతరాష్ట్రుడు; అర్హంబులు= (ఆ మునులకు) తగినవి; అగు-ఆసనంబులు= అయినటువంటి ఆసనాలను; పెట్టించి= ఏర్పాటు చేయించి; సంభావించినన్= గౌరవించగా.

తాత్పర్యం: తరువాత ఒకానొకరోజు పాండవులు ఎప్పటివలెనే, గాంధారిచేత, కుంతిచేత పూజించబడుతున్న ధృతరాష్ట్రుడి చుట్టూ కూర్చుని ఉన్నారు. అసామాన్యమైన ఆ సమావేశానికి శతయూపుడు మొదలైన మునులు వచ్చారు. ధృతరాష్ట్రుడు వారికి తగిన ఆసనాలు ఏర్పాటు చేయించి గౌరవించగా.(తరువాతి పద్యంతో అన్వయం)

వేదవ్యాసుఁడు పాండవసహితుండైన ధృతరాష్ట్రునాశ్రమంబునకు వచ్చుట (సం.15-34-21)

సీ. సముచితంబులు సధర్మములును నైన స । ల్లాపముల్ సెల్ల నుల్లంబు లలర
వార లున్నెడ సత్యవతికొడు కందుల । కేతేర నందఱు నెదురువోయి
వినతులై భక్తిఁ దోడ్కొనివచ్చి యతులకృ । ష్ణాజిన దర్భోత్తరాసనమున
నునిచి యమ్మునివరుననుమతిఁ దమతమ । యాసనంబుల నుండి; రమ్మహాత్ము

ఆ. నర్చితునిగఁ జేసె నాంబికేయుఁడు దద । నంతరంబ సమధికాదరమున
నతఁడు మధుర మృదు విధాక్షరంబుగ నమ్మ । హీశముఖ్యుతోడ నిట్టు లనియె. 71

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సముచితంబులు(ను)= మిక్కిలి యుక్తములైనవీ; సధర్మములను= వేద శాస్త్రాదులలో చెప్పబడిన అంశాలతో కూడినవీ; ఐన= అయినటువంటి; సల్లాపముల్= మంచి మాటలు; చెల్లన్= సాగుతుండగా; వారలు= పాండవాదులు; ఉల్లంబులు= మనసులు; అలరన్= సంతోషిస్తూ; ఉన్న+ఎడన్= ఉన్నటువంటి సమయంలో; అందులకున్= ఆచోటికి; సత్యవతి కొడుకు= వేదవ్యాసమూర్తి; ఏతేరన్= రాగా; అందఱున్= పాండవాదులు అందరూ; ఎదురు-పోయి= వ్యాసుడికి ఎదురువెళ్ళి; వినతులు+ఐ= వంగి నమస్కరించిన వారై; భక్తిన్= సేవా ధర్మంతో; తోడ్కొని వచ్చి= వ్యాసుడిని ఆశ్రమంలోనికి తీసికొనివచ్చి; అతుల= సాటిలేని; కృష్ణ-అజిన= కృష్ణమృగ చర్మం; దర్భ+ఉత్తర= దర్భలతో చేయబడిన; ఆసనంబునన్= ఆసనం మీద (దర్భాసనం మీద కృష్ణమృగ చర్మం కప్పబడింది); ఉనిచి= కూర్చుండజేసి; ఆ+మునివరు+అనుమతిన్= ఆ వ్యాసమహర్షి అనుజ్ఞతో; తమ తమ-ఆసనంబులన్= (వ్యాసుడికి స్వాగతం చెప్పడానికి ఎదురుగా వెళ్ళిన) అందరూ తమ తమ ఆసనాలమీద; ఉండిరి= కూర్చున్నారు; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; ఆ+మహాత్మున్= గొప్పవాడైన ఆ వేదవ్యాసుడిని; అర్చితునిగన్+చేసెన్= పూజించాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; అతఁడు= ఆ వ్యాసుడు; సమ్-అధిక-ఆదరమునన్= మిక్కిలి వాత్సల్యంతో; మధుర-మృదు-విధా-అక్షరంబుగన్= తీయనైన (ఇంపైన) మెత్తదనం కలిగిన మాటలతో; ఆ+మహీ+ఈశ-ముఖ్యు తోడన్= ఆ (ధృతరాష్ట్ర) మహారాజుతో; ఇట్టులు= ఈ ప్రకారంగా; అనియె(న్)= అన్నాడు.

తాత్పర్యం: (ధృతరాష్ట్రుడి చుట్టూ కూర్చున్న పాండవులూ, ఆ సమావేశానికి వచ్చిన శతయూపాది మునులు అందరూ) మిక్కిలి యుక్తమయినవీ, ధర్మంతో కూడినవీ, అయిన మంచిమాటలు సాగుతుంటే మనసులు సంతోషిస్తూ ఉన్న సమయంలో అక్కడికి వేదవ్యాసమహర్షి వచ్చాడు. అందరూ వ్యాసుడికి భక్తితో ఎదురువెళ్ళి పాదాభివందనం చేసి, వెంటఉండి ఆశ్రమానికి తీసికొనివచ్చారు. సాటిలేనటువంటి కృష్ణమృగచర్మం కప్పిన దర్భాసనం మీద ఆ వ్యాసమహర్షిని కూర్చుండబెట్టారు. వ్యాసుడి అనుమతితో, అందరూ తమ తమ ఆసనాల మీద కూర్చున్నారు. అపుడు ధృతరాష్ట్రుడు వ్యాసమహర్షిని పూజింపచేశాడు. తర్వాత ఆ వ్యాసుడు ధృతరాష్ట్రుడితో తియ్యని మెత్తని పలుకులతో ఇట్లా అన్నాడు.

సీ. **'వనవాసమున నీకు మన మలవడియెనే? । నియతిమైఁ దాపసక్రియల కోర్చి**
నడపెదవే పుత్త్రనాశజమైనశో । కము భవదంతరంగంబునందు
లేదు గదా? ధర్మవేదిని గాంధారి । యుమ్మలికంబు లే కున్న యదియె?
నీకుఁ బరిజ్ఞాననిష్ఠ గల్గెనె? గొంతి । శుశ్రూష మీ కొనర్చునె తగంగ?

తే. **రాజ్య మొల్లక వచ్చె నరణ్యవాస । మునకు నీయమ; మీరు రాఁ దనకు నింట**
నిలువఁ దగ దని యిమ్మేలు నీదు బుద్ధి । నొలసి యుండునె కౌరవకులపవిత్ర! **72**

ప్రతిపదార్థం: కౌరవ-కుల-పవిత్ర!= కురువంశంలో నిర్మలమైనవాడా!; నీకున్= నీకు; మనము= మనస్సు; వనవాసమునన్= అరణ్యాలలో నివసించటంలో; అలవడియెన్+ఏ?= అలవాటు పడిందా?; తాపస-క్రియలకున్= మునిధర్మాన్ని నిర్వర్తించటంలో; ఓర్చి= ఓర్పు కలిగి; నియతిమైన్= నియమబద్ధంగా; నడపెదవు+ఏ?= జరుపుతున్నావా?; భవత్-అంతరంగమునందున్= నీ మనసులో; పుత్త్ర-నాశజము= కొడుకులు మరణించటం వలన కలిగినది; ఐన= ఐనటువంటి; శోకము= దుఃఖం; లేదు కదా= ఇపుడు ఉండలేదు గదా; ధర్మవేదిని= ధర్మం తెలిపిన; గాంధారి= గాంధారి; ఉమ్మలికంబు= విచారం; లేక-ఉన్న-అది-ఎ?; లేకుండా ఉన్నదిగదా; నీకున్= నీకు; పరిజ్ఞాన నిష్ఠ= పరిపూర్ణమైన జ్ఞానం యొక్క స్థిరత్వం; కల్గెనె?= సంభవించిందా?; గొంతి= కుంతీదేవి; మీకున్= మీకు; తగంగన్= తగువిధంగా; శుశ్రూష= సేవ; ఒనర్చున్+ఎ?= చేస్తున్నదా?; మీరు= మీరు (గాంధారీ, ధృతరాష్ట్రులు) రాన్= (ఆశ్రమవాసానికి) అడవులకు రాగా; తనకున్= తనకు (కుంతి); ఇంటన్= ఇంట్లో (రాజధానిలో); నిలువన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉండిపోవటం; తగదు= యుక్తం కాదు; అని= అనిచెప్పి; ఈఅమ= ఈ కుంతి; రాజ్యము= కొడుకుల రాజ్యం; ఒల్లక= అంగీకరించకుండా; అరణ్యావాసమునకున్= మీతో అరణ్యాలలో ఉండడానికి; వచ్చెన్= వచ్చింది; మేలు= కుంతి శుశ్రూషార్థం మీతో అరణ్యాలకు రావడం అనే మంచిపని; నీదు బుద్ధిన్= నీమనసులో; ఒలసి ఉండునె?= మరపురాక నిలిచి ఉంటుందా?

తాత్పర్యం: 'కురువంశంలో పుణ్యాత్ముడా, ధృతరాష్ట్రా! నీ మనసు వనవాసానికి అలవాటు పడిందా? ముని ధర్మాలను ఓర్పుతో నియమంగా ఆచరిస్తున్నావా? కొడుకులు నశించిపోయారనే దుఃఖం నీ మనసులో లేదుగదా! ధర్మం తెలిసిన గాంధారి దుఃఖించడం లేదు కదా! నీకు సంపూర్ణమైన జ్ఞానం స్థిరంగా ఏర్పడిఉన్నదా గదా! కుంతి మీకు తగువిధంగా సేవలు చేస్తున్నదా? మీరు అరణ్యావాసానికి వస్తుంటే తాను ఇంట్లో ఉండటం యుక్తం కాదని (కొడుకుల) రాజ్యం కూడా విడిచిపెట్టుకొని మీ సేవకొరకు మీ వెంట అరణ్యాలకు వచ్చింది ఈమె. ఆ విధంగా కుంతి చేసిన మేలుపని నీ మనసులో మరపురాకుండా నిలిచిఉన్నదా?

చ. అనఘ! యజాతశత్రునెడ నాదరణాతిశయాన్వితంబె నీ
మనము? వృకోదరున్ నరుని మాద్రితనూజుల సత్క్రియాభినం
దనముల గారవింతె? వినుతస్థితిఁ దద్దయు నిర్మలత్వ మొం
దెనె భవదీయచిత్తమున ధీమహితా! దృఢశాంతిమూలమై.' 73

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా (ధృతరాష్ట్రా)!; నీ మనము= నీ మనస్సు; అజాతశత్రు-ఎడన్= ధర్మరాజు విషయంలో; ఆదరణ+అతిశయ-అన్వితంబు+ఎ?= మిక్కిలి ప్రేమతో కూడి ఉన్నదా?; వృక+ఉదరున్= భీముడిని; నరునిన్= అర్జునుడినీ; మాద్రి తనూజులన్= మాద్రికొడుకులు-నకుల సహదేవులనూ; సత్క్రియా+అభినందనములన్= ఆదరణంతోనూ, ప్రశంసలతోనూ; గారవింతు+ఎ?= లాలన చేస్తున్నావా?; ధీ మహితా!= బుద్ధిచేత గొప్పవాడా! (ధృతరాష్ట్రా)!; భవదీయ-చిత్తమునన్= నీమనస్సులో; వినుత-స్థితిన్= ప్రశంసింపదగిన ఉనికితో; ధృఢ-శాంతి-మూలము= స్థిరమైన (అంతర్) ఇంద్రియాలశాంతికి ఆధారం; ఐ= అయి; నిర్మలత్వము= స్వచ్ఛత; తద్దయున్= అధికంగా; ఒందెన్+ఎ?= కలిగిందా?

తాత్పర్యం: పాపంలేనివాడా! ధృతరాష్ట్రుడా! నీ మనసు ధర్మరాజుపై మిక్కిలి ప్రేమతో ఉన్నదా? భీమ, అర్జున, నకుల, సహదేవులను మంచితనంతోనూ, ప్రశంసలతోనూ ఆదరిస్తున్నావా? దొడ్డబుద్ధికలవాడా!, నీ మనసులో స్థిరమైన శాంతికి ఆధారంగా, ప్రశంసార్హంగా, నిర్మలభావం ప్రాప్తించిందా?'

వ. అని యంత నిలువక. 74

ప్రతిపదార్థం: అని= వ్యాసుడు ఆ విధంగా పలికి; అంతన్= అంతటితో; నిలువక= ఆగకుండా (ఇంకా ఈ విధంగా అన్నాడు).

తాత్పర్యం: అని అడిగిన వ్యాసుడు అంతటితో ఆగకుండా (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. 'వినుము! దీర్ఘవైర వృత్తియు' ద్రోహచిం। తనము లేక వాక్కు మనము నొక్క
చంద మగుట సకలజనములకును బంధు। సంపదాప్తి పరమసాధనంబు.' 75

ప్రతిపదార్థం: వినుము= ధృతరాష్ట్రా వినుము; దీర్ఘ-వైర-వృత్తియున్= చాలాకాలం శత్రుభావంతో ఉండటమూ; ద్రోహ చింతనము(ను)= (దీర్ఘకాలం) అపకారపు ఆలోచనమూ; లేక= లేకుండా; వాక్కు(ను)= మాటా; మనమున్= మనస్సూ; ఒక్క చందము= ఒకేవిధం; అగుట= కావటం; సకల జనములకున్= అందరికీ; బంధు= చుట్టాల (మిత్రుల); సంపద్= సంపదను (ఆధిక్యాన్ని); ఆప్తి= పొందటానికి; పరమ= ఉత్తమమైన; సాధనంబు= ఉపకరణం.

తాత్పర్యం: 'ధృతరాష్ట్రా! వినుము. ఎవరితోనైనా చాలకాలంగా విరోధంతో నడుచుకొనటమూ, అపకారం చేయాలనుకొనటమూ లేకుండా, మాటా, మనసూ ఒకే విధంగా ఉండటమే అందరికీ బంధు సంపద సిద్ధింపజేసే మార్గం'.

వ. అని చెప్పి వెండియు. 76

ప్రతిపదార్థం: అని= పైవిధంగా; చెప్పి= (ధృతరాష్ట్రుడితో) పలికి; వెండియు(న్)= తిరిగి (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: పై విధంగా చెప్పి తర్వాత మళ్ళీ వ్యాసుడు (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'విదురుండు దేహంబు విడిచిన తెఱఁగెల్ల। నెఱిఁగితె? మాండవ్యుఁ డిచ్చినట్టి
పటుశాపమున శూద్ర భావంబు నొందిన। ధర్మదేవత బోధనిర్మలాత్ముఁ
డైన యమ్మహనీయుఁ డట్లగుటంబుజా। సనుని యాజ్ఞాపనమున విచిత్ర
వీర్యనృపాధీన విశ్రుతక్షేత్రంబు। నం దేఁ బ్రవర్తింప నధిప! కలిగె

తే. ధర్మదేవత మాఱట తనువు సూవె। యీ యుధిష్ఠిరు నుజ్జ్వలకాయ; మింత
యెఱిఁగి కాదె యమ్మహిత యోగీశ్వరుఁడు స। మీడ్య యోగబలంబున నితనిఁ గలసె. 77

ప్రతిపదార్థం: అధిప!= (ధృతరాష్ట్ర) రాజా!; విదురుండు= విదురుడు; దేహంబు= శరీరం; విడిచిన తెఱఁగు= త్యజించిన విధం; ఎల్లన్= సమస్తం; ఎఱిఁగితి+ఎ= తెలిసికొన్నావా; బోధ నిర్మల-ఆత్ముఁడు= వివేకంతో దోషంలేని బుద్ధిగలవాడు; ఐన=అయినటువంటి; ఆ+మహనీఁయుడు= ఆ మహాత్ముడు (విదురుడు); మాండవ్యుఁడు= మాండవ్యుడనే మహర్షి; ఇచ్చిన+అట్టి= ఇచ్చినటువంటి; పటుశాపమునన్= ఘోరమైన శాపంవలన; శూద్రభావంబున్= శూద్రత్వాన్ని; ఒందిన= పొందినట్టి; ధర్మదేవత= యమధర్మరాజు; అంబుజ+ఆసనుని= బ్రహ్మ; (పద్మం ఆసనంగా కలవాడు); ఆజ్ఞాపనమునన్= ఆదేశం చేత; విచిత్రవీర్య= విచిత్రవీర్యుడనే; నృప= రాజుయొక్క (నీ తండ్రియొక్క); అధీన= అధీనమందున్న; విశ్రుత= ప్రసిద్ధమైన; క్షేత్రంబునందున్= భార్య అయిన అంబికయొక్క దాసియందు; ఏను= నేను (వ్యాసుడు); ప్రవర్తింపన్= వ్యవహరించగా (బోధ నిర్మల-ఆత్ముఁడు)= వివేకంచేత దోషంలేని బుద్ధికలవాడు; ఐన= అయినటువంటి; ఆ+ మహనీయుఁడు=మహాత్ముడైన ఆ విదురుడు; అట్లు= ఆ ప్రకారంగా (మాండవ్య శాపం వలన యముడే శూద్రుడుగా, విదురుడుగా); అగుట= కావటం; కలిగెన్= సంభవించింది; ఈ యుధిష్ఠిరుని= ఈ ధర్మరాజుయొక్క; ఉజ్జ్వల కాయము= కాంతిమంతమైన శరీరం; ధర్మదేవత= ధర్ముడి; మాఱట తనువు= రూపాంతరమే; చూవె!= సుమా!; ఇంత= ఇది అంతా; ఎఱిఁగి= తెలిసిఉండటం వలననే; కాదె= కదా; ఆ+మహిత యోగి+ఈశ్వరుఁడు= మహాత్ముడు, యోగులలో శ్రేష్ఠుడూ ఐన ఆ విదురుడు; సమ్+ఈడ్య-బలంబునన్= మిక్కిలి ప్రశంసించదగిన యోగశక్తిచేత; ఇతనిన్= ఈ ధర్మరాజు (శరీరంలో); కలసెన్= కలిసిపోయాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! విదురుడు శరీరం త్యజించిన తీరు తెలుసా? పూర్వం మాండవ్య మహర్షి ఇచ్చిన ఘోరమైన శాపం వలన శూద్రుడుగా పుట్టిన యమధర్మరాజే జ్ఞానం వలన నిర్మలబుద్ధీ, మహాత్ముడూ అయిన ఆ విదురుడు బ్రహ్మదేవుడి ఆజ్ఞప్రకారం నేను విచిత్ర వీర్యమహారాజు అధీనంలో ఉన్న అంబికా దాసి యందు వర్తించడం వలన యముడు విదురుడై శూద్రుడుగా పుట్టటం సంభవించింది. ఈ ధర్మరాజుయొక్క శరీరం ఆ యమధర్మరాజుయొక్క రూపాంతరమే. అది తెలిసినవాడు గాబట్టే గొప్ప యోగి అయిన విదురుడు తన యోగబలంతో ధర్మరాజులో కలిసిపోయాడు.

ఆ. అట్లు దేవతామయాత్మకుఁ డైన యి। వ్విభుఁడు నిన్నుఁ బ్రేష్యవృత్తి నిట్లు
గొలిచి యునికి బుద్ధిఁ దలపోసి సంతస। మంది యుండుదే కులాగ్రగణ్య!' 78

ప్రతిపదార్థం: కుల+అగ్రగణ్య!= కౌరవవంశంలో ప్రథమంగా పరిగణించదగిన వాడా!; శ్రేష్ఠుడా, ధృతరాష్ట్రా!; అట్లు= ఆవిధంగా మారుతనువు పొందిన ధర్మదేవతగా; దేవతామయ+ఆత్మకుఁడు= దేవతాలక్షణాలు నిండిన అంత స్వరూపం గలవాడు; ఐన= అయినటువంటి; ఈ+విభుఁడు= ఈ ధర్మరాజు; నిన్నున్= నిన్ను; ఇట్లు= ఈవిధంగా; ప్రేష్యవృత్తిన్= భృత్యుడి పద్ధతిలో; కొలిచి-ఉనికి= సేవిస్తూ ఉండటం; బుద్ధిన్= నీ మనసులో; తలపోసి= స్మరించి; సంతసము= సంతోషం; అంది= పొంది; ఉండుదు+ఏ?= ఉన్నారా?

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడా!, ఆవిధంగా రూపాంతరం పొందిన ధర్మదేవతకాబట్టి దేవతాస్వరూపుడైన ఈ ధర్మరాజు ఈ విధంగా భృత్యుడివలె నిన్ను సేవిస్తూ ఉండటం నీమనసులో స్మరించి ఆనందిస్తున్నావా?'.

వ. అనిన విని వైచిత్రవీర్యుం డప్పారాశర్యునకుఁ బరమవినయంబున నిట్లనియె, 79

ప్రతిపదార్థం: అనినన్= అని వ్యాసుడు చెప్పగా; విని= ఆలకించి; వైచిత్ర వీర్యుండు= ధృతరాష్ట్రుడు; ఆ+పారాశర్యునకున్= ఆ వ్యాసమహర్షితో; ఇట్లు= ఈ విధంగా; అనియె (న్)= అన్నాడు.

తాత్పర్యం: వ్యాసు డట్లా అనగా విని ధృతరాష్ట్రుడు, అణకువతో వ్యాసుడితో ఇట్లా అన్నాడు.

సీ. 'వనవాస మించుకయును నాకు దుఃఖంబు। సేయదు; దేహంబుఁ జిత్తమును ద
పఃక్రియలకుఁ బనుపడి యున్నయవి నన్ను। గాంధారిఁ బుత్రశోకం బొకింత
యేనియుఁ బొందంగ నీఁడు సభక్తిక। మైన వృత్తమున ధర్మాత్మజుండు
మునివర! యితనిపై ననుజుల మీఁద వ। త్సలము నా హృదయ మిద్ధరణివిభుఁడు

ఆ. దేవతాత్మఁ డగుట దెల్ల మై యునికి మ। ద్వచనవర్తనములవలన నితఁడ
యెఱిఁగి యుండుఁ గొంతి తెఱఁగు శుశ్రూషయు। నద్భుతంబు ముదము నావహించు. 80

ప్రతిపదార్థం: నాకున్= నాకు (ధృతరాష్ట్రుడికి); వనవాసము= అరణ్యంలో నివసించటం; ఇంచుకయును= కొంచెం కూడా; దుఃఖంబు= కష్టం; చేయదు= కలిగించలేదు; తపఃక్రియలకున్= మునులు ఆచరించవలసిన ధర్మాలు నిర్వహించటంలో; దేహంబున్= (నా) శరీరమూ; చిత్తమును= (నా) మనస్సు; పనుపడి-ఉన్నవి= తగి (అలవాటుపడి) ఉన్నాయి; వృత్తమున(న్)=

సభక్తికము ఐన భక్తితో కూడిన నడవడితో; ధర్మజుండు= ధర్మరాజు; నన్ను(న్)= నన్నూ; గాంధారిన్= గాంధారినీ; పుత్త్రశోకంబు= కొడుకుల (మరణం వలని) దుఃఖం; ఒక+ఇంత+ఏనియున్= కొంచెం కూడా; పొందంగన్-ఈఁడు= పొందనివ్వటం లేదు; మునివర!= మునిశ్రేష్ఠుడా!; నా హృదయము= నా మనస్సు; ఇతనిపైన్= ఈ ధర్మరాజుమీదా; అనుజులమీఁదన్= (ఈ ధర్మరాజు) తమ్ముళ్ళపైనా; వత్సలము= ప్రేమ కలిగిఉన్నది; ఈ+ధరణివిభుఁడు= ఈ (ధర్మ) రాజు; దేవతా-ఆత్ముఁడు= దైవ స్వరూపుడు; అగుట= కావటం; తెల్లము+ఐ= నాకు తెలిసినదై; ఉనికి= ఉండటం; మత్-వచన-వర్తనముల వలనన్= నా మాటలవలన, చేతలవలన; ఇతఁడు+అ= ఈ ధర్మరాజే; ఎఱిఁగి-ఉండున్= తెలిసికొని ఉంటాడు; గొంతి తెఱఁగు= కుంతీదేవి పద్ధతీ; శుశ్రూషయున్= ఆమె మాకు చేసే సేవ; అద్భుతంబు(న్)= (మాకు) ఆశ్చర్యాన్నీ; ముదమున్= సంతోషాన్నీ; ఆవహించున్= నింపుతున్నాయి.

తాత్పర్యం: 'మహర్షీ! అరణ్య నివాసం నాకు కొంచెం కూడా కష్టం కలిగించలేదు. తాపస ధర్మాలను ఆచరించటంలో నా శరీరమూ, మనస్సూ రెండూ సమర్థమై (అలవాటుపడి) ఉన్నాయి. భక్తితో కూడిన నడవడితో ధర్మరాజు నాకూ గాంధారికీ, పుత్ర వినాశం వలని దుఃఖం లేకుండా చేశాడు. ధర్మరాజుమీదా అతడి తమ్ముళ్ళమీదా నా మనస్సు ప్రేమతో నిండిఉన్నది. ఈ ధర్మరాజు దైవస్వరూపుడు అనే విషయం నాకు తెలుసు. అది నా మాటలవలన, చేతల వలన ధర్మరాజుకూ వ్యక్తమయ్యే ఉంటుంది. ఇంక కుంతి రాజ్యం విడిచి మా సేవకై అరణ్యాలకు వచ్చిన విధమూ, ఆమె మాకు చేస్తున్న సేవా, ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ కలిగిస్తున్నాయి.

వ. నాకుం బరిజ్ఞానంబును మానస నిర్మలత్వంబును భవత్ ప్రసాదంబునం గలిగెడుఁగాక' యనియె; నా సమ యంబున ద్రౌపదీసుభద్రలును దక్కునుంగల్గు నంగనాజనంబులును బారాశర్య సందర్శన ప్రవణత్వంబునం జనుదెంచి సభక్తి ప్రణామంబు లాచరించి యంతంత నిలిచి; రయ్యలఘుజ్ఞాన మాననీయుండు ధృతరాష్ట్ర తోఁడ. **81**

ప్రతిపదార్థం: నాకున్= నాకు; పరిజ్ఞానంబున్= తత్త్వమును గూర్చిన సంపూర్ణమైన వివేకమూ; మానస-నిర్మలత్వంబును= మనస్సు దోషరహితం కావటమూ; భవత్-ప్రసాదంబునన్= మీదయచేత; కలిగెడున్-కాక= సిద్ధించాలి; అనియెన్= అన్నాడు (ధృతరాష్ట్రుడు); ఆ సమయంబునన్= అప్పుడు; ద్రౌపదీసుభద్రలును= ద్రౌపదీ, సుభద్రా; తక్కునున్+కల్గు= మిగిలిఉన్న; అంగనాజనంబులును= స్త్రీలూ; పారాశర్య-సందర్శన ప్రవణత్వంబునన్= వ్యాసుడిని చూడాలనే ఆసక్తితో; చనుదెంచి= అక్కడికి వచ్చి; సభక్తి ప్రణామంబులు= (వ్యాసుడికి) అణకువతో, పాదాభివందనాలు; ఆచరించి= చేసి; అంత+అంత= ఇంచుకదూరంలో అక్కడక్కడా; నిలిచిరి= నిలబడి ఉన్నారు; ఆ+అలఘు+జ్ఞాన-మాననీయుండు= సమగ్రమైన జ్ఞానంచేత పూజించదగిన ఆ వ్యాసమహర్షి; ధృతరాష్ట్రుతోడ(న్)= ధృతరాష్ట్రుడితో (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: నాకు సంపూర్ణమైన జ్ఞానమూ, మనసు దోషరహితం కావటమూ, నీ దయవలన సంభవించుగాక! అన్నాడు ధృతరాష్ట్రుడు. ఆ సమయంలో ద్రౌపది, సుభద్ర ఇంకా మిగిలిన స్త్రీ జనమూ వ్యాసమహర్షిని చూడాలనే ఉత్కంఠతో, అక్కడికి వచ్చి వ్యాసుడికి వినయంగా పాదాభివందనం చేసి కొంచెం దూరంగా నిలుచున్నారు. అప్పుడు వ్యాసమహర్షి ధృతరాష్ట్రుడితో. (తరువాతి పద్యంతో అన్వయం)

ఉ. మీయెడ చింత వాయఁగ సమీహితబుద్ధి యొనర్పఁ గోరి యే
నీ యెడ కిప్డు వచ్చితి నభీష్టము వేఁడుము శంక దక్కి భూ

నాయక! యెల్లభంగిని మనః ప్రియముం దగ నిత్తు' నన్నఁ గౌం

తేయు లెలర్చిరి; రవ్వసుమతీపతి మోదము నొందె నెంతయున్. 82

ప్రతిపదార్థం: భూనాయక!= ధృతరాష్ట్ర మహారాజా!; మీయెడ చింత= మీకు మానసికమైన విచారం; పాయఁగన్= తొలగిపోయేటట్లు; సమీహిత-బుద్ధి= కోరుకొన్న జ్ఞానం; ఒనర్పన్+కోరి= సిద్ధింపజేయదలచి; ఈ+ఎడకున్= ఈచోటికి; ఇప్డు= ఈ సమయంలో; ఏను= నేను; వచ్చితిన్= వచ్చాను; శంక= సందేహం; తక్కి= విడిచిపెట్టి; అభీష్టము= నీకు(బాగా) కావలసింది; వేఁడుము= కోరుకొమ్ము; మనస్+ప్రియమున్= నీ మనసునకు ఇష్టమైనదానిని; ఎల్లభంగిన్= ఏ విధంగానైనా సరే; తగన్= సముచితంగా; ఇత్తున్= నెరవేరుస్తాను; అన్నన్= అని వ్యాసుడు పల్కగా; కౌంతేయులు= పాండవులు; ఎలర్చిరి= సంతోషించారు; ఆ+ వసుమతీ-పతి= ఆ ధృతరాష్ట్ర భూమి నాయకుడు; ఎంతయున్= ఎంతో; మోదమున్= ఆనందం; ఒందెన్= పొందాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! మీ మనసులోని చింతలన్నీ తొలగించి ఉత్తమమై, మీరు కోరుకొంటున్న జ్ఞానాన్ని మీకు కలగజేయటం కొరకే నేను ఇక్కడికి, ఈ సమయంలో వచ్చాను. సందేహపడకుండా నీ కిష్టమైనది అడుగుము. ఏవిధంగానైనా సరే మీ కోర్కె నెరవేరుస్తాను, అని వ్యాసుడు అనడంతో పాండవులు సంతోషించారు. ధృతరాష్ట్రుడుకూడా ఎంతో ఆనందించాడు.

వ. వ్యాసుండు వెండియు. 83

తాత్పర్యం: వ్యాసుడు తిరిగి, (ఇట్లా అంటున్నాడు. తరువాతి పద్యంతో అన్వయం)

చ. 'అనఘ! యమానుషం బయినయట్టిద యైనను నా తపంబుపెం

పునకు మునీంద్రు లద్భుతముఁ బొందఁగ మీ కవలీల నిత్తు నే'

ననుటయు నా కురుక్షితిపుఁ డాదటఁ గోరఁగ మీర లిందు వ

చ్చిన కరుణామయాదర విశేషముకంటెను మేలు గల్గునే? 84

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా!; అమానుషంబు= (నీ అభీష్టం) మనుష్యులకు సాధ్యంకానిది అయిన; అట్టిది+అ= అయినటువంటిదే; ఐనను= అయినటప్పటికీ; నాతపంబు-పెంపునకున్= నా తపస్సు యొక్క మహిమకు; ముని+ఇంద్రులు= (ఈ) మునిశ్రేష్ఠులు; అద్భుతమున్= ఆశ్చర్యం; పొందఁగన్= పొందుతుండగా; నేను= నేను; మీకున్= మీకు; అవలీలన్= సులువుగా; ఇత్తున్= (మీ కోరిక) తీరుస్తాను; అనుటయున్= అని వ్యాసుడు (మళ్ళీ) చెప్పగానే; ఆ-కురు-క్షితిపుఁడు= కురువంశపు రాజయిన ఆ ధృతరాష్ట్రుడు; మీరు= మీరు (వ్యాసుడు); అదటన్= (మాపై) ప్రేమతో; ఇందున్= ఇచ్చటికి (మావద్దకు); వచ్చిన= వచ్చినటువంటి; కరుణా-మయ-ఆదర-విశేషముకంటెను= దయతో నిండిన వాత్సల్యం కంటె; మేలు= ఎక్కువైనటువంటి శుభం; కోరఁగన్= మేం కోరుకొనటానికి ఇంకొకటి; కల్గునే?= ఉంటుందా?

తాత్పర్యం: నా తపస్సుకు మునిశ్రేష్ఠులంతా ఆశ్చర్యపడేటట్లుగా, 'నీ కోరిక మానవమాత్రులకు సాధ్యం కానటువంటిదైనా సరే, తేలికగా ఇస్తాను'. అని వ్యాసుడు అనటంతో ఆ ధృతరాష్ట్రుడు 'మీరు మా వద్దకు రావటంలో దయతో నిండిన వాత్సల్యంకంటె మేం కోరుకొనదగిన మేలు మరొకటి ఏమున్నది?' అన్నాడు.

క. మానుష మైన నమానుష। మైనను బ్రార్థనకు విషయమైనది భవదీ

యానూనకృపకు నెక్కుడు। గా నొక్కఁడుఁ గాన నేను గారుణ్యనిధీ! 85

ప్రతిపదార్థం: కారుణ్య-నిధీ!= దయకు గని వంటివాడా!, (వ్యాసమహర్షీ)!; ప్రార్థనకున్= వేడుకొనటానికి; విషయము= లక్ష్యం; ఐనది= అయినటువంటిది; భవదీయ-అనూన-కృపకున్= అత్యంతమైన మీ దయకంటె; ఎక్కుడుగాన్= ఎక్కువగా; మానుషము= మనుష్యులకు సాధ్యమైనది; ఐనన్= అయినా; అమానుషము= మనుష్యులకు సాధ్యంగానిది; ఐనను= అయినా; ఒక్కఁడున్= ఒకదానినికూడా; నేను= నేను; కాన(ను)= తలపను.

తాత్పర్యం: దయకు నిధివంటివాడా!, (వ్యాసమహర్షీ) గాఢమైన మీ దయకంటె అధికంగా కోరుకొనదగిన వస్తువు, ఇంకొకటి మానుషం గానీ, అమానుషం గానీ నాకు ఏమీ కనబడలేదు.

ఆ. సంయమీంద్ర! నాదుజన్మంబు సఫలతఁ। బొందె మీరు విమలబుద్ధి నింత
యాదరించినపుడ; లే దింకఁ బరలోక। భీతి ధన్యతముఁడ నైతి నేను. 86

ప్రతిపదార్థం: సంయమి+ఇంద్ర!= మునులలో శ్రేష్ఠుడా!; (వ్యాసమహర్షీ); మీరు= తమరు (వ్యాసుడు); విమలబుద్ధిన్= స్వచ్ఛమైన మనస్సుతో; ఇంత= ఇంత (అత్యధికం)గా దర్శనమిచ్చి, కోర్కె ఇస్తానని); ఆదరించినపుడు+అ= వాత్సల్యం చూపినపుడే; నాదుజన్మంబు= నా పుట్టుక; సఫలతన్= సార్థక్యాన్ని; పొందెన్= పొందింది; ఇంకన్= ఇకపైన; పరలోక-భీతి= ఉత్తమ లోకాలను గూర్చి అవి కలుగుతాయో లేదో అనే భయం; లేదు= పోయింది; నేను= నేను; ధన్యతముఁడన్= ఉత్తమ పుణ్యవంతుడిని; ఐతిన్= అయ్యాను.

తాత్పర్యం: (వ్యాస) మునివరా! మీరు స్వచ్ఛమైన మనసుతో నాపై వాత్సల్యం చూపిన సమయంలోనే నా జన్మ సార్థకమైంది. ఉత్తమలోకాలను గూర్చిన దిగులు పోయింది. నేను అందరికంటె పుణ్యం చేసికొన్నాను.

వ. అట్లయినను మీ రొక్కటి గోరు మనిన నామనంబున నెప్పుడుం గలయది యెఱింగింపవలసె; విన్నవించెద.87

ప్రతిపదార్థం: అట్లు-అయినను= అంతే అయినా; మీరు= తమరు; ఒక్కటి= ఏదైనా ఒక్కటి; కోరుము= అడుగుము; అనినన్= అన్నందువలన; నా మనంబునన్= నామనస్సులో; ఎప్పుడున్= నిరంతరంగా, (రాత్రింబగళ్ళు); కల+అది= ఉన్నటువంటిది; ఎఱింగింపన్-వలసెన్= మీకు తెలుపవలసి వచ్చింది; విన్నవించెద (న్)= అది తమకు మనవి చేసికొంటాను.

తాత్పర్యం: అయినప్పటికీ ఏదో ఒకటి కోరుకొమ్మని తమరు అన్నందుచేత, ఎంతో కాలంగా నా మనసులో ఉన్న ఒకవిషయం మీకు చెప్పవలసివచ్చింది. అది మనవి చేసికొంటాను.

సీ. దుష్టచిత్తుం డగు దుర్యోధనుండు ని। ష్పాపస్వభావులఁ బాండుసుతులఁ
బరిభవించి సమస్తనరనాథు లనిఁ గరి। తురగయుతంబుగాఁ ద్రుంగఁజేసి
ధరణి రాజ్యముఁ గోరి గురుభీష్మకర్ణాది। సత్పురుషుల నెల్లఁ జంపికొనియె;
నన్నీచునకుఁగా 'మహారాజు లాంధ్రను। బిడ్డల విడిచి యభేద్య ధైర్య,

తే. వృత్తి రణమృతిఁ బొంది; రవ్విభుల కేది। గతియొ? యిమ్మెయి మూఢులై కలనఁ బడిన
కురుకుమారకు లెట్లైరొ పరమబోధ। మహిత! యెఱుఁగని వగ పెద్ద మాన్పు మనియె. 88

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దుష్టచిత్తుఁడు= చెడ్డబుద్ధి కలవాడు; అగు= అయినటువంటి; దుర్యోధనుండు= దుర్యోధనుడు; నిస్+పాప-స్వభావులన్= దోషం లేని నడవడి కలిగిన (వారిని); పాండుసుతులన్= పాండవులను; పరిభవించి= అవమానపెట్టి; ధరణి రాజ్యము= ఈ భూమిపై ఆధిపత్యాన్ని; కోరి= అభిలషించి; కరి-తురగ-యుతంబుగాన్= ఏనుగుల బలం గుర్రాల బలంతో గూడ; సమస్త నర-నాథులు= రాజులు అందరూ; అనిన్= యుద్ధంలో; త్రుంగన్= నశించే విధంగా; చేసి= యుద్ధం చేసి; గురు-భీష్మ-కర్ణ-ఆది- సత్పురుషులన్= ద్రోణుడు, భీష్ముడు, కర్ణుడు మొదలైన గొప్ప వ్యక్తులను; ఎల్లన్= అందరినీ; చంపికొనియెన్= (చేతులార) నిర్మూలించుకొన్నాడు; ఆ+నీచునకున్+కాన్= అటువంటి అధముడి కొరకు; మహారాజులు= గొప్ప గొప్ప రాజులు; ఆండ్రను= తమ భార్యలనూ; బిడ్డల(న్)= పిల్లలనూ; విడిచి= వదలిపెట్టి; అభేద్య ధైర్య వృత్తి(న్)= చెదరని గుండె దిటవు కలిగిన నడవడితో; రణమృతిన్= యుద్ధంలో చావు; పొందిరి= పొందారు; ఆ+విభులకున్= అటువంటి వీర (యుద్ధ) మరణం పొందిన మహారాజులకు; ఏది గతియొ= (మరణానంతరం) ఎటువంటి గతి కలిగినదో ఈ+మెయి= ఈ విధంగా; మూఢులై= మూర్ఖులై; కలనన్+పడిన= యుద్ధంలో మరణించిన; కురుకుమారకులు= కౌరవులు; ఎట్లు+ఐరి+ఒ= అయినారో; ఎఱుఁగని= తెలియ లేదనే; వగ= బాధ; పెద్ద= నాకు చాల ఎక్కువగా ఉన్నది; పరమబోధ-మహిత!= ఉత్తమమైన జ్ఞానం చేత గొప్పవాడా!; మాన్పుము= (నా చింతను) పోగొట్టవలసింది; అనియెన్= అన్నాడు (ధృతరాష్ట్రుడు).

తాత్పర్యం: చెడుబుద్ధి కలిగిన దుర్యోధనుడు పుణ్యాత్ములైన పాండవులను అవమానపెట్టి, నేల (రాజ్యం) కొరకు, గజాశ్వబలంతో సహా నేలమీది రాజులందరూ యుద్ధంలో నశించిపోయేటట్లు చేశాడు. ద్రోణుడు, భీష్ముడు, కర్ణుడు మొదలైన గొప్పవారిని చేతులార చంపుకొన్నాడు. ఆ అధముడి (దుర్యోధనుడి) కొరకు మహారాజులంతా పెండ్లాలను పిల్లలను వదలుకొని చెదరని గుండె ధైర్యంతో యుద్ధంచేసి ఆ యుద్ధంలో మరణించిన ఆ మహాపురుషులకు తరువాత ఎటువంటి లోకాలు సిద్ధించాయి? మూర్ఖంగా యుద్ధానికి దిగి అందులో మరణించిన కౌరవవంశవీరులు మరణానంతరం ఏమైపోయారు? అనేది తెలియకపోవటం అనే దుఃఖం నాకు చాలా ఎక్కువగా ఉన్నది. ఉత్తమజ్ఞానం వలన గొప్పవాడా! (వ్యాసమహర్షీ) ఆ నా బాధను పోగొట్టవలసింది' అన్నాడు ధృతరాష్ట్రుడు.

వ. అనుటయు న ప్రేముడి పలుకులు విని గాంధారికిం గుంతికిం బాంచాలికి సుభద్రకు మఱియునుం గలయంగనలకుం జిత్తంబుల నెవ్వగలు గ్రొత్తలయ్యెఁ; నప్పు డాసుబలనందన పట్టావృతలోచనత్వంబునన చూచి దయాధామం బై యున్న యా మామ నుద్దేశించి మోడ్చిన చేతు లద్దెసకు నిగిడ్చి యిట్లనియె. 89

ప్రతిపదార్థం: అనుటయున్= ధృతరాష్ట్రుడు ఆ విధంగా అనటంతో; ఆ+ప్రేముడిపలుకులు= స్నేహంనిండిన (ధృతరాష్ట్రుడి) ఆ మాటలు; విని= ఆలకించి; గాంధారికిన్= గాంధారికీ; పాంచాలికిన్= ద్రౌపదికీ; సుభద్రకున్= సుభద్రకూ; మఱియునున్= ఇంకా; కల-అంగనలకున్= అక్కడ ఉన్న మిగిలిన కౌరవ స్త్రీలకూ; చిత్తంబులన్= మనసులలో; నెవ్వగలు= పరిపూర్ణమైన దుఃఖాలు; క్రొత్తలు-అయ్యెన్= అప్పుడే అపూర్వంగా ఏర్పడినట్లు అయ్యాయి; అప్పుడు= ఆ సమయంలో; సుబలనందన= గాంధారి; పట్ట-ఆవృత-లోచనత్వంబునన్+అ= పట్టంచేత ఆవరించబడిన (మూయబడ్డ) కన్నులు గలిగినది అయి; చూచి= వ్యాసుడిని చూచి; దయాధామంబు= దయకు నిలయం; అయి= ఐ; ఉన్న ఆ మామన్= ఉన్నటువంటి మామ అయిన వ్యాసుడిని; ఉద్దేశించి= లక్ష్యంగా చేసికొని; మోడ్చిన చేతులు= జోడించిన చేతులను; ఆ+దెసకున్= వ్యాసుడివైపు; నిగిడ్చి= ఉంచి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఆ విధంగా మాటాడగానే, స్నేహపూరితాలయిన ఆ మాటలు విని, గాంధారికీ, కుంతికీ, ద్రౌపదికీ, సుభద్రకూ, ఇంకా ఇతర (కౌరవ) స్త్రీలకూ, (స్వజన వియోగం వలన) మనసులో నిండి ఉన్న బాధలు అపుడే

క్రొత్తగా కల్గినట్లయింది. అపుడు గాంధారి పట్టంతో కప్పబడిఉన్న కళ్లతోటే వ్యాసుడిని చూచి, దయకు నిలయం అయిన తన మామ (ధృతరాష్ట్రుడి తండ్రి) అయిన వ్యాసుడిని గూర్చి, చేతులు జోడించి నమస్కరిస్తూ ఇట్లా అన్నది.

సీ. **'మునినాథ యీ రాజు తనయు లందఱును గ। య్యంబునఁ దెగినదియాదిగాఁ బ**
దాఱేండ్లు వగలపా లగుచుఁ దత్సన్నిధి। గల్గుటఁ గోరు;లోకంబు లెన్ని
యన్నియుఁ జూపంగనైనను జాలుదు। నిర్మలతపమున పేర్మి నీవు
పుత్త్రసాన్నిధ్య మీ భూపతి కొనరించు। టెంతటిపని? నీకు గొంతి ద్రుపద

తే. **రాజపుత్త్రి సుభద్ర కౌరవ కుమార। శతము భార్యలు నూర్వురు సొమదత్తి**
పత్ని, యత్తన్వియత్త యప్పడఁతి యత్త। గోరుదురు యుద్ధమృతబంధుకోటిఁ జూడ. **90**

ప్రతిపదార్థం: మునినాథ!= మునులలో శ్రేష్ఠుడా!; తనయులు= దుర్యోధనాదులైన కొడుకులు; అందఱును= మొత్తం; కయ్యంబునన్= యుద్ధంలో; తెగినది= నశించిపోవటం; ఆదిగాన్= మొదలుగా; ఈ రాజు= ఈ ధృతరాష్ట్రుడు; పది-ఆఱు+ఏండ్లు= పదహారు సంవత్సరాలు; వగలః పాలు= దుఃఖాలకు లోను; అగుచున్= అవుతూ; తద్-సన్నిధి= ఆ కొడుకులను కలిసికొనాలని; కోరున్= కోరుతూ ఉంటాడు; నీవు= నీవు (వ్యాసుడు); నిర్మల తపము పేర్మి(న్)= శుద్ధమైన తపస్సుయొక్క ఆధిక్యంతో; ఎన్ని లోకంబులు= ఈ సృష్టిలో మొత్తంగా ఎన్నిలోకాలు ఉన్నాయో; అన్నియున్= అవి అన్నీ కూడా; చూపంగన్-చూపించటానికి; చాలుదు(వు)= సమర్థుడివి; ఈ భూపతికిన్= ఈ ధృతరాష్ట్ర మహారాజుకు; పుత్త్రసాన్నిధ్యము= ఒక్కసారి కొడుకుల దగ్గర ఉండే అవకాశం; ఒనరించుట= కలిగించటం; నీకున్= నీకు; ఎంత పని?= ఎంతటి పని?; గొంతి= కుంతి; ద్రుపద రాజ-పుత్త్రి= ఆమె కోడలు (ద్రుపదమహారాజు కూతురు) ద్రౌపది; సుభద్ర= ఆమె కోడలు సుభద్ర; కౌరవ కుమారశతము= దుర్యోధనాదులయిన కౌరవవీరులు వందమందియొక్క; భార్యలు= పెండ్లాలు; నూర్వురు(న్)= వంద మందీ; సొమదత్తి పత్ని= సోమదత్తుడి కొడుకైన భూరిశ్రవుడి భార్యా; ఆ+తన్వి= ఆ భూరిశ్రవుడి భార్యకు; అత్త= (భూరిశ్రవుడి తల్లి) సోమదత్తుడి భార్యా; ఆ+పడఁతి= ఆ సోమదత్తుడి భార్యయొక్క; అత్త= అత్తగారూ; (సోమదత్తుడి భార్యయొక్క; అత్త; అత్తగారూ; సోమదత్తుడి తల్లి..అంటే బాహ్లీకుడి భార్యా) యుద్ధ మృత బంధు కోటిన్= యుద్ధంలో మరణించిన తమ తమ బంధువుల సమూహాన్ని; చూడన్= చూడాలని; కోరుదురు= కోరుతూ ఉంటారు.

తాత్పర్యం: (వ్యాస) మునిశ్రేష్ఠుడా! యుద్ధంలో కొడుకులందరూ మరణించింది మొదలుగా ఇప్పటికి పదహారేళ్ళ నుండి ఈ ధృతరాష్ట్ర మహారాజు (పుత్త్ర) శోకంతో ఉండి తన పుత్త్రుల సమీపం చేరుకొనాలని కోరుకొంటూ ఉన్నాడు. అత్యంతమైన నీ తపశ్శక్తితో ఈ సృష్టిలోనే మొత్తం ఎన్ని లోకాలు ఉన్నాయో ఆ వాటినన్నింటినీ చూపించగలిగిన నీకు ఈ ధృతరాష్ట్రుడికి పుత్త్రుల లోకాలు చూపించటం ఎంత పని? కుంతి, ద్రౌపది, సుభద్ర, (నూరుమంది) కౌరవుల భార్యలు నూరుమందీ, భూరిశ్రవుడి భార్యా, సోమదత్తుడి భార్యా, బాహ్లీకుడి భార్యా, యుద్ధంలో మరణించిన తమ తమ బంధువులను చూడాలని కోరుతున్నారు.

వ. **అంతయును భవదీయ దివ్యబోధంబు గనుచుండు.** **91**

ప్రతిపదార్థం: అంతయును= ఈ విషయం అంతా; భవదీయ-దివ్య-బోధంబు= నీ గొప్పదయిన నీ జ్ఞానం; కనుచున్+ఉండున్= చూస్తూనే (తెలిసే) ఉంటుంది.

తాత్పర్యం: ఇది అంతా గొప్పదైన నీ జ్ఞానానికి అందే ఉంటుంది.

క. పరమమునీంద్ర! సమరమృత। కురువీరుల మా మనముల గో దుడుగ భవ
త్కరుణ వెలయ లోకం బ। చ్చెరువందఁగఁ జూపవే విచిత్రపుమహిమన్'. 92

ప్రతిపదార్థం: పరమ-ముని+ఇంద్ర!= మునిశ్రేష్ఠులలో ఉత్కృష్టుడా!, (వ్యాసమహర్షీ); మా మనముల గోడు= ధృతరాష్ట్రాదులమైన మా (భరతవంశ్యుల) మనస్సులలో నిండిన బాధ; ఉడుగన్= తొలగేటట్లుగా; భవత్-కరుణ= నీ దయ; వెలయన్= ప్రకటితం కావటం చేత; లోకంబు= లోకంలోని జనమంతా; అచ్చెరువు= ఆశ్చర్యం; అందఁగన్= పొందేవిధంగా; విచిత్రపు మహిమన్= వింతగొలిపే గొప్పతనంతో; సమర-మృత-కురువీరులన్= యుద్ధంలో మరణించిన కౌరవవీరులను; చూపవే= మాకు కనబరచవా?

తాత్పర్యం: ముని శ్రేష్ఠులలో ఉత్తముడా!; వ్యాసమహర్షీ!, మా అందరి మనసులోని చింత తొలగిపోయేటట్లు, నీ దయ ప్రకటింపబడటంతో లోకమంతా ఆశ్చర్యపడేటట్లు, ఆశ్చర్యకరమైన నీ గొప్పతనంతో, యుద్ధంలో మరణించిన కురువంశపువారిని మాకు చూపించవలసింది'.

చ. అనునెడ గొంతి వాడువదనాబ్జముతోడ మదిం దలంచెఁ గ
ర్ణుని; నది యత్తపోధనవరుం డెదఁ గాంచి దయానురక్తి న
వ్వనిత గుఱించి యిట్లను 'భవన్మతి నొందిన కోర్కి సెప్పు మే
ననఘచరిత్ర! దాని ఫల మందఁగఁజేసి యలంతఁ బాపెదన్' 93

ప్రతిపదార్థం: అను+ఎడన్= గాంధారి ఆవిధంగా అంటున్న సమయంలో; గొంతి= కుంతీదేవి; వాడు-వదన-అబ్జము-తోడన్= వాడిపోయిన పద్మం అనే ముఖంతో; మదిన్= మనస్సులో; కర్ణునిన్= కర్ణుడిని; తలంచెన్= స్మరించింది; ఆ+తపస్+ధనవరుండు= తపస్సంపద గలిగిన ఆ వ్యాసుడు; అది= కుంతి మనసులోని విషయం; ఎదన్= తన మనసులో; కాంచి= గ్రహించి; దయా+అనురక్తిన్= దయతో కూడిన వాత్సల్యంతో; ఆ+వనిత-గుఱించి= ఆ కుంతిని ఉద్దేశించి; ఇట్లు= ఈ ప్రకారంగా; అనున్= అన్నాడు; అనఘ చరిత్ర!= దోషం లేని నడవడిగలదానా!; భవత్-మతిన్= నీ మనస్సును; ఒందిన= ప్రవేశించిన; కోర్కి= వాంఛితం; చెప్పుము= చెప్పుము; ఏను= నేను; దాని ఫలము= దానికి ప్రయోజనాన్ని; అందఁగన్+చేసి= (నీకు) కలుగ జేసి; అలంతన్= నీ విచారం; పాపెదన్= పోగొట్టుతాను.

తాత్పర్యం: గాంధారి ఆ విధంగా అనటంతో కుంతి వాడిపోయిన ముఖ కమలంతో మనసులో కర్ణుడిని స్మరించింది. తపస్సంపన్నుడైన వ్యాసు డది గ్రహించి వాత్సల్యంగా కుంతితో ఇట్లా అన్నాడు. 'పవిత్రమైన నడవడికలదానా! నీ మనసులో కలిగిన కోర్కె ఏమిటో చెప్పుము. దాని ప్రయోజనం అందించి, నీ విచారం పోగొట్టుతాను'.

వ. అనిన విని యయ్యింతి సంతసిల్లి యా సంయమివల్లభునకు దండప్రణామంబు చేసి చేతులు మోడ్చి లజ్జా సహితం బగు నంతరంగంబుతో వినయనమ్ర యగుచు నిట్లనియె. 94

ప్రతిపదార్థం: అనినన్= అని వేదవ్యాసుడు పలుకగా; విని= ఆలకించి; ఆ+ఇంతి= కుంతి; సంతసిల్లి= ఆనందించి; ఆసంయమి వల్లభునకున్= మునిశ్రేష్ఠుడైన ఆ వ్యాసుడికి; దండ-ప్రణామంబు= సాష్టాంగంగా నమస్కారం; చేసి= ఆచరించి; చేతులు మోడ్చి=

చేతులు జోడించి; లజ్జాసహితంబు= సిగ్గుతో కూడినది; అగు= అయిన; అంతరంగంబుతోన్= మనస్సుతో; వినయ-నమ్ర= అణకువతో వంగినది; అగుచున్= అవుతూ; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: వ్యాసుడు అట్లా అనటంతో కుంతి సంతోషించి ఆ మునిశ్రేష్ఠుడికి సాష్టాంగపడి, నమస్కరించి, చేతులు జోడించి, సిగ్గుపడుతున్న మనసుతో, అణకువతో వంగి వ్యాసుడితో ఇట్లా అన్నది.

కుంతి వేదవ్యాసునితోఁ గర్ణుఁడు దనకు జన్మించిన తెఱంగెఱింగించుట (సం.15.38.1)

సీ. **'దేవతలకు నీవ దేవత; విట్టి ని। న్మామగాఁ బడసితి మహితకరుణ**
ననుఁ జూచి నాదువిన్నప మాదరింపు మేఁ। గన్యాత్వదశ నుండఁగా మదీయ
జనకుని కడకుఁ గోపనుఁ డైన దుర్వాసుఁ। డన్మహాముని వచ్చె; నతని సవిన
యార్చన కలనాసమారాధితుండుగాఁ। జేసితిఁ బ్రీతుఁడై 'చెలువ! నీకు

ఆ. **నిత్తు వరము; వేఁడు మెయ్యది కోరిక?'। యనియె; నతఁడు 'మీ ప్రియంబుకంటె**
ననఘ! మిగులు కోర్కియును గలదే? నాకు। నంటిఁ; గాని యొకఁడు నడుగ నైతి. **95**

ప్రతిపదార్థం: దేవతలకున్= దేవతలకు గూడా; నీవు+అ= నీవే; దేవతవు= దేవుడివి; ఇట్టి= ఇటువంటి (దైవాలకు దైవమైనటువంటి); నిన్= నిన్ను; మామగాన్= మామ (భర్త తండ్రి)గా, (సమీప బంధువుగా); పడసితిన్= నేను పొందగలిగాను; ననున్= నన్ను; మహిత కరుణన్= అత్యంతమైన దయతో; చూచి= అనుగ్రహించి; నాదు విన్నపము= నా వేడుకోలును (నేను చెప్పే మాటలు); ఆదరింపుము= వాత్సల్యంతో వినవలసింది; ఏను= నేను; కన్యాత్వదశన్= కన్నెప్రాయంలో ఉండగా; మదీయ-జనకుని-కడకున్= నా తండ్రి వద్దకు; కోపనుఁడు= కోపస్వభావుడు; ఐన= అయినటువంటి; దుర్వాసుండు= దుర్వాసుడు; అన్-మహాముని= అనే పేరుగలిగిన గొప్ప ముని; వచ్చెన్= వచ్చాడు; అతనిన్= ఆ మహామునిని; స-వినయ-అర్చన-కలనా-సమ్- ఆరాధితుండు= అణకువతో కూడిన పూజలను సమకూర్చటంచేత చక్కగా సేవించబడినవాడు; కాన్= అయ్యేవిధంగా; చేసితిన్= (నేను) చేశాను; అతఁడు= అందుకు ఆ దుర్వాసుడు; ప్రీతుఁడు= సంతోషించినవాడు; ఐ= అయి; చెలువా!= అమ్మాయీ! (కుంతీ); నీకున్= నీకు; వరము= వరాన్ని; ఇత్తున్= ఇస్తాను; వేఁడుము= అడుగుము; కోరిక= నీ కోరిక; ఏ+అది!= ఏమిటి?; అనియెన్= అన్నాడు; అనఘ!= పుణ్యాత్మా!; మీ ప్రియంబుకంటెన్= మీరు సంతోషించటం కంటె; మిగులు= అధికమైన; కోర్కియును= కోర్కెగూడా; నాకున్= నాకు; కలదు+ఏ?= ఉంటుందా?; అంటిన్= అన్నాను; కాని= అంతేతప్ప; ఒకఁడున్= ఏదీకూడా; అడుగన్+ఐతి(న్)= కోరలేదు.

తాత్పర్యం: దైవాలందరకు నువ్వే దేవుడివి. అటువంటి నిన్ను మామగా పొందగలిగాను. నాపై దయఉంచి నా మనవిని ప్రేమతో వినవలసింది. నేను కన్యాప్రాయంలో ఉండగా కోపస్వభావుడైన దుర్వాసుడు మానాన్న (పెంచిన తండ్రి కుంతిభోజుడి) దగ్గరకు వచ్చాడు. నేను ఆ మహామునిని అణకువతో పూజించి సేవించాను. అతడు సంతోషించి, అమ్మాయీ 'నీకు వర మిస్తాను. కోరుకొమ్ము ఏం కావాలి?' అన్నాడు. అప్పుడు నేను 'పుణ్యాత్మా! మీరు సంతోషించటం కంటె ఎక్కువైన కోరిక నాకేముంటుంది?' అన్నాను తప్ప ఏ ఒక్కటీ వేడుకొనలేదు.

వ. **అమ్మాట తనమనంబునకు రానిచందంబు మొగంబునం దోఁప నత్తాపసవరుండు 'వరం బెల్లభంగి నొసంగక పోవ; నడుగు' మనుటయు, వెఱచియు నాదువేడ్కతెఱం గట్ల యగుటను 'బుత్త్రుంగోరితిఁ గోరిన నమ్ముని**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పతి యొక్క మంత్రం బనుగ్రహించి 'దీన నీ వావహించిన దేవతలు భవద్వశగతులై సుతజన్మంబు గలిగింతురు;
విశేషించి ధర్మువునకుఁ దల్లివి గాఁగలదాన' వని పలికి యంతర్ధానంబు చేసిన. 96

ప్రతిపదార్థం: ఆ+మాట= నేను అన్న ఆ మాట; తన మనంబునకున్= తన (దుర్వాసుడి) మనస్సునకు; రాని చందంబు= నచ్చని విధం; మొగంబునన్= అతడి (దుర్వాసుడి) ముఖంమీద; తోఁపన్= కనబడుతుండగా; ఆ+తాపసవరుండు= మునిశ్రేష్ఠుడైన ఆ దుర్వాసుడు; ఎల్లభంగిన్= ఏ విధంగానైనా; వరంబున్= మేలును; ఒసంగక= ఇవ్వకుండా; పోవన్= వెళ్ళను; అడుగుము= కోరుకొమ్ము; అనుటయున్= అని దుర్వాసోమహర్షి అనటం వలన; వెఱచియున్= భయపడీ; నాదువేడ్క తెఱంగు= నా కోరికతీరు; అట్లు+అ= అదే ప్రకారం; అగుటను= కావటంచేతా; పుత్త్రున్= కొడుకును; కోరితిన్= అడిగాను; కోరినన్= నేను ఆ విధంగా కోరటంతో; ఆ+మునిపతి= మునులలో శ్రేష్ఠుడైన ఆ దుర్వాసుడు; ఒక్క మంత్రంబు= ఒకానొక మంత్రాన్ని; అనుగ్రహించి= (నాకు) ఉపదేశించి; నీవు= నీవు; దీనన్= ఈ మంత్రంతో; ఆవహించిన-దేవతలు= రప్పించినటువంటి దేవతలు; భవత్-వశ-గతులు= నీకులోబడిన వారు (నీవు చెప్పిన విధంగా నడుచుకొనేవారు); ఐ= అయి; సుతజన్మంబు= నీకు కొడుకు పుట్టటాన్ని; కలిగింతురు= కలగజేస్తారు; విశేషించి= అందులో ప్రత్యేకంగా; ధర్మువునకున్= ధర్మదేవత (యమధర్మరాజు)కు; తల్లివి= (నీవు) జన్మనిచ్చేదానివి; కాన్+కలదానవు= అవుతావు అని; పలికి= చెప్పి; అంతర్ధానంబు చేసినన్= (ఆ దుర్వాసుడు) మాయమయిపోవటంతో, (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: (మీరు సంతోషించటంకంటె మించిన కోర్కె నాకు ఏముంటుంది? అని) నేను (కుంతి) అన్నమాట తన మనసుకు నచ్చకపోవటం ముఖంలో కనబడుతుండగా మునిశ్రేష్ఠుడైన ఆ దుర్వాసుడు 'ఏమైనాసరే నీకు వరం ఇవ్వకుండా ఇక్కడినుండి వెళ్ళను అడుగు' మన్నాడు. ఆ మాటలకు భయంతోనూ, 'నా కోరిక కూడా ఆ విధంగానే ఉండటం వలననూ నేను కొడుకు నిమ్మని అడిగాను. దానితో దుర్వాసోమహర్షి నాకు ఒక మంత్రాన్ని ఉపదేశించి. 'ఈ మంత్రంతో నీవు ఏ దేవతలను రప్పిస్తావో ఆ దేవతలు నీకు వశమై కొడుకులను గలుగజేస్తారు. ప్రత్యేకించి నీవు యమధర్మరాజుకు తల్లివి అవుతావు' అని చెప్పి మాయమైపోయాడు.

ఆ. అద్భుతమునఁ బొంది యమ్మంత్రరూప ము। ల్లమున నెప్పుడును దలంతు; నొక్క
నాఁడు మేడమీఁదఁ బోఁడిమి నే నుండి। కంటిఁ బొడుచుచున్న కమలమిత్త్రు. 97

ప్రతిపదార్థం: అద్భుతమునన్-పొంది= ఆశ్చర్యపడి; ఉల్లమునన్= మనసులో; ఎప్పుడును= నిరంతరమూ; ఆ+మంత్రరూపము= దుర్వాసుడు ఉపదేశించిన మంత్రాన్ని; తలంతున్= స్మరిస్తూఉండే దాన్ని; ఒక్కనాఁడు= ఒకరోజు; నేను= నేను; మేడమీఁదన్= మేడపైన; పోఁడిమిన్= సుఖంగా; ఉండి= ఉన్నదానినై; పొడుచుచున్న-కమలమిత్రున్= ఉదయించే సూర్యుడిని; కంటిన్= చూచాను.

తాత్పర్యం: (మంత్రం ఉపదేశించి దుర్వాసుడు అదృశ్యం అయిపోవటంతో) చాలా ఆశ్చర్యపడి నా మనసులో ఆ మంత్రాన్నే నిరంతరమూ స్మరిస్తూ ఉండేదాన్ని. ఒకరోజు నేను మేడమీద హాయిగా ఉండి ఉదయించే సూర్యుడిని చూచాను.

క. కని యిది కన్యకు దోషం। బని తలఁపక బాల్యసంభృతాజ్ఞానము వే
డ్కనొనర్ప నావహించితి। ముని మంత్ర బలమున సూర్యు మునినాథవరా! 98

ప్రతిపదార్థం: మునినాథవరా!= మునిశ్రేష్ఠులలో శ్రేష్ఠుడా!, వ్యాసమహర్షీ; కని= ఆ సూర్యుడిని చూచి; ఇది= తాను కోరుకొనబోతున్నది (పుత్రుడిని పొందటం); కన్యకున్= వివాహం కాని స్త్రీకి; దోషంబు= తప్పు; అని తలఁపక= అనుకొనకుండా; బాల్య-సంభృత-అజ్ఞానము= పిన్నతనం వలన పరిపూర్ణమైన తెలివి లేకపోవటం; వేడ్కన్= వినోదాన్ని; ఒనర్పన్= కలిగించగా, మునిమంత్రబలమునన్= ఆ దుర్వాసుడిచ్చిన మంత్రశక్తితో; సూర్యున్= ఆ సూర్యుడిని; ఆవహించితిన్= రప్పించాను.

తాత్పర్యం: ఋషి శ్రేష్ఠుడా! ఆ ఉదయించే సూర్యుడిని చూచి దుర్వాసుడిచ్చిన మంత్రశక్తితో పెళ్ళికాని పిల్లకు ఇది (పుత్రులు పొందటం) తప్పు అని ఎంచకుండా, చిన్నతనం వలన కలిగిన అజ్ఞానంతో, వినోదంగా సూర్యుడిని రప్పించాను.

తే. **ఆవహించిన నద్దేవుఁ డాకసమున। నాత్మమూర్తి వర్తింప మూర్త్యంతరంబు**
దాల్చి నాకడ కేతెంచెఁ దత్క్షణంబ। నాదుచిత్త మాశ్చర్యమగ్నంబు గాఁగ. **99**

ప్రతిపదార్థం: ఆవహించినన్= (ఆ విధంగా మంత్రములతో) రప్పించగా; ఆ+దేవుఁడు= ఆ సూర్యభగవానుడు; ఆత్మమూర్తి= తన చండస్వరూపం; ఆకసమునన్= ఆకాశంలో (యథాపూర్వంగా) వర్తింపన్= ప్రకాశిస్తూ ఉండగా; మూర్తి+అంతరంబు= వేరొక; ఆకారాన్ని; తాల్చి= ధరించి; నాదుచిత్తము= నామనస్సు; ఆశ్చర్యమగ్నంబు= ఆశ్చర్యంలో మునిగినది; కాఁగన్= కాగా; తద్+క్షణంబు+అ= వెంటనే; నాకడకున్= నావద్దకు; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఆ విధంగా దుర్వాసుడిచ్చిన మంత్రాన్ని స్మరించటంతో ఆ మంత్రబలం వలన సూర్యభగవానుడు ఆకాశంలో తన రూపం అలాగే ఉండగా ఆక్షణంలోనే ఇంకొక రూపం ధరించి నా మనసు ఆశ్చర్యంలో మునిగిపోతుండగా నావద్దకు వచ్చాడు.

వ. **ఇట్లు చనుదెంచి.** **100**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈఆప్రకారంగా; చనుదెంచి= వచ్చి.

తాత్పర్యం: సూర్యుడు ఈ విధంగా (తన సహజరూపం ఆకాశంలో ఉంచి మరొక రూపంతో కుంతివద్దకు) వచ్చి (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. **'అడుగు మిచ్చెద వరం' బనిన వడంకుచుఁ। గేలు మొగిడ్చి 'పొం డేల యిచట'**
ననిన 'వృథాహ్వాన మాచరించుట తప్పు। నిన్నును నెవ్వఁడు నీకు మంత్ర
మిచ్చె నాతని శపియింతుఁ జుమ్మీ!'యని। పలికె నయ్యర్కుఁ; డే నలికి గురుని
నిరపరాధుని శాపనిహతుఁగాఁ జేయుట। కోర్వక పుత్త్రకు నొసఁగు దేవ

తే. **కృప భవత్సము' ననిన నయ్యపరిమేయ। తేజుఁ డాత్మతేజమున నా దృష్టు్మ ఖేంద్రి**
యములు మనసును సమ్మోహితములు సేసి। యపుడు తనయుండు పుట్టెడు' ననియెఁ బిదప. **101**

ప్రతిపదార్థం: అడుగుము= ఏమి కావాలో కోరుకొమ్ము; వరంబు= నీకోరిక; ఇచ్చెదన్= ఇస్తాను; అనినన్= అని సూర్యుడు పలుకగా; వడంకుచున్= వణకిపోతూ; కేలు= చేతులు; మొగిడ్చి= జోడించి; పొండు= వెళ్ళిపొండి; ఇచటన్= ఇక్కడికి; ఏల=

(రావటం) ఎందుకు?; అనినన్= అని నేను (కుంతి) పల్కగా; వృథా-ఆహ్వానము= వ్యర్థం అయిన పిలుపు; ఆచరించుట= చేయటం; తప్పు= దోషం; నిన్నును= నిన్నూ (కుంతినీ)?; నీకున్= నీకు; మంత్రము= (దేవతలనాహ్వానింపజేసే) ఈ మంత్రాన్ని; ఎవ్వఁడు ఇచ్చెన్= ఎవడు ఇచ్చాడో; అతనిన్= వాడినీ; శపియింతున్+చుమ్మీ= శపిస్తాను సుమా; అని= అనే విధంగా; ఆ+అర్కుఁడు= ఆ సూర్యుడు; పలికెన్= అన్నాడు; ఏను= నేను; అలికి= భయపడి; గురునిన్= మంత్రం ఉపదేశించిన ఆ ఆచార్యుడు దుర్వాసుడిని; నిర్+అపరాధునిన్= ఏ తప్పూ చేయనివాడిని; శాప-నిహతున్= సూర్యుడిశాపంతో దెబ్బతిన్నవాడు; కాన్= అయ్యేటట్లు; చేయుటకున్= చేయటానికి; ఓర్వక= తట్టుకొనలేక; దేవ!= (సూర్య) భగవానుడా!; కృపన్= దయతో; భవత్-సమున్= నీకు సాటివచ్చేటటువంటి; పుత్త్రకున్= కొడుకును; ఒసఁగు(ము)= ఇమ్ము; అనినన్= అని నేను (కుంతి) పల్కగా; ఆ అపరిమేయతేజుఁడు= మేరలేని కాంతి కలిగిన ఆ సూర్యుడు; అపుడు= ఆ సమయంలో; ఆత్మతేజమునన్= తన కాంతితో; నా-దృక్-ముఖ-ఇంద్రియములు(ను)= (నా) కనులు మొదలైన ఇంద్రియాలను; మనసును= హృదయాన్ని; సమ్మోహితములు చేసి= ఆకర్షించబడ్డవాటినిగా చేసి; పిదపన్= తర్వాత; తనయుండున్= (నీకు) కొడుకు; పుట్టెడున్= పుట్టుతాడు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'కోరుకొమ్ము వరమిస్తా' నన్నాడు సూర్యుడు. నేను వణకిపోతూ చేతులు జోడించి వెళ్ళండి ఎందుకిక్కడ' అన్నాను. 'వ్యర్థంగా ఆహ్వానించటం తప్పు. నిన్నూ, నీకు ఈ మంత్రం ఉపదేశించినవాడినీ ఇద్దర్నీ శపిస్తాను' అన్నాడు సూర్యుడు. నేను భయపడి ఏ తప్పూ ఎరుగనివాడు మంత్రం ఉపదేశించిన ఆచార్యుడు దుర్వాసుడు శాపం పాలుకావడానికి అంగీకరించలేక, 'దేవా! దయతో నీ వంటి కొడుకు నిమ్మని సూర్యుడిని అడిగాను. అత్యంత తేజస్సు కలిగిన ఆ సూర్యుడు తన తేజస్సుతో కన్నులు మొదలైన నా యింద్రియాలనన్నింటినీ, మనసునూ ఆకర్షించి 'నీకు కొడుకు పుట్టుతాడు' అని చెప్పాడు.

వ. అని నిర్దేశించి. 102

ప్రతిపదార్థం: అని= ఆవిధంగా; నిర్దేశించి= నిర్ణయించి చెప్పి.

తాత్పర్యం: నీకు కొడుకు పుట్టుతాడని సూర్యుడు కుంతికి నిర్ణయం చేసి చెప్పి. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. 'నీకుఁ గన్యాత్వ వికలత గాక యుండ। వరము నిచ్చితి' ననుచు దివమున కరిగె;
జనకముఖబంధుచిత్తవంచనము నడపి। గూఢ మందిరాంతరమునఁ గొడుకుఁ గంటి. 103

ప్రతిపదార్థం: కన్యాత్వ వికలత= కన్యయొక్క ధర్మం చెడిపోయినది; కాక+ఉండన్= కాకుండే విధంగా; నీకున్= నీకు; వరమున్= వరాన్ని; ఇచ్చితిన్= ఇచ్చాను; అనుచున్= అంటూ సూర్యుడు; దివమునకున్= ఆకాశానికి; అరిగెన్= వెళ్ళాడు; జనక= తండ్రి; ముఖ= మొదలైన; బంధు= చుట్టాల; చిత్త= బుద్ధియొక్క; వంచనము(నే)= మోసం; నడిపి= చేసి; గూఢ-మందిర-అంతరమునన్= రహస్యపు గృహంలో; కొడుకున్= కొడుకును; కంటిన్= కన్నాను.

తాత్పర్యం: 'వివాహం కాకుండానే కొడుకును కనటం వలన నీ కన్యాత్వం చెడిపోకుండా నీకు వరమిస్తున్నాను' అని చెప్పి సూర్యుడు ఆకాశంలోకి వెళ్ళిపోయాడు. నేను (కుంతి) కూడా తండ్రి మొదలైన నా వాళ్ళందరి కన్నుగప్పి రహస్య మందిరంలో కొడుకును కన్నాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కని యేటిలో నిడితిఁ గలఁ। గని నట్లయి యుండెఁ దత్ప్రకారం; బిది మీ
కనినయది దివ్య బోధంబున నత్తెఱఁ గంతరంగమునఁ గొని కాలున్. 104

ప్రతిపదార్థం: కని= (ఆవిధంగా రహస్యంగా కొడుకును) ప్రసవించి, (ఆకొడుకును); ఏటిలోన్= గంగానదిలో; ఇడితిన్= పడేశాను; తద్+ప్రకారంబు= ఆ విధంగా కొడుకును కనటమూ, గంగలో విడవటమూ అనే మొత్తం వృత్తాంతమూ; కలన్= కలలో; కనిన-అటు= చూచిన విధంగా అయి; ఉండెన్= జరిగినట్లున్నది; ఇది= ఈ విషయం అంతా; దివ్య-బోధంబునన్= అలౌకికమైన జ్ఞానంవలన; మీ-కనిన-అది= తమకు (వ్యాసుడికి) తెలిసినదే; ఆ+తెఱఁగు= ఆ కర్ణుడి జన్మవృత్తాంతం; అంతరంగమునన్= నా మనసులో; కొని= నిలిచి; కాలున్= మండుతున్నది.

తాత్పర్యం: (రహస్యంగా కొడుకును) కని ఆ కొడుకును నదిలో వదలివేశాను. ఆ సంఘటన అంతా కలలో జరిగినట్లుగా ఉన్నది. జ్ఞానవిశేషం వలన ఇది అంతా మీకు (వ్యాసుడికి) తెలిసినదే. ఆ పుత్రుడి విధానం నా మనసులో నిలిచి దహిస్తున్నది. (మండుతుంది.)

తే. పాప మయ్యెఁ గా కుండె నప్పనిఁ దలంచి। యళుకుచుండుదు; మద్భయ మపనయింపుఁ
డతులకరుణ నిక్కురువృద్ధునభిమతమును। సఫలముగఁ జేయుఁ డివి నాకు సద్వరములు. 105

ప్రతిపదార్థం: పాపము-అయ్యెన్= పాపమే అవుతుందో; కాక+ఉండెన్= కాదో; ఆ+పనిన్= కన్న బిడ్డను నీటిలో వదలివేయటం అనే ఆ పనిని; తలంచి= తలచుకొని; అళుకుచున్+ఉండుదున్= భయపడుతూ ఉంటాను; అతుల కరుణన్= సాటిలేని దయతో; మత్+భయము= నా భయాన్ని; అపనయింపుఁడు= పోగొట్టండి; ఈ+కురువృద్ధు-అభిమతమును= ఈధృతరాష్ట్రుడి (పుత్రాదుల మరణానంతర గతులను తెలిసికొనాలనే) కోరికను; సఫలముగన్= సిద్ధించేటట్లు; చేయుఁడు= చేయండి; ఇవి= ఈరెండే; నాకున్= నాకు; సత్-వరములు= గొప్ప అభీష్టాలు.

తాత్పర్యం: పాపమో కాదో కాని కన్న కొడుకును నీటిలో విడిచిన ఆ పనిని తలచుకొని ఎప్పుడూ భయపడుతుంటాను. దయచేసి నా భయాన్ని పోగొట్టండి; మరణానంతరం పుత్త్రాదుల గతులు తెలిసికొనాలనే ఈ ధృతరాష్ట్రుడి కోర్కెను సిద్ధింపజేయండి. ఇవే నాకు అభీష్టాలు.

వ. అనిన విని యమ్మునీంద్రుం డమ్మానిని కిట్లనియె. 106

ప్రతిపదార్థం: అనినన్= అని కుంతి పల్కగా; విని= ఆలకించి; ఆ+ముని+ఇంద్రుండు= మునులలో శ్రేష్ఠుడైన ఆ వ్యాసుడు; ఆ+మానినికిన్; ఆమె (కుంతి)తో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: కుంతి ఆవిధంగా చెప్పగా విని వ్యాసమహర్షి ఆమెతో ఇట్లా అన్నాడు.

సీ. 'నీ చెప్పినది యెల్ల నిక్కంబు కోడల!। యెగ్గు నీ యందు లే; దేల వెఱవ?
సుర లద్భుతాపాదిచరితులు; కర్ణున। కట్లుగా నున్నది యగుటఁ జేసి
యేటిలో నాతని నిడి తీవు; కన్యాత్వ। హాని లే కున్కిఁ గులాగ్రగణ్య
వైతి; భవద్వృత్త మమలిన మగుటకు। ననుమాన మించుక యైన వలవ'

ఆ. దనుచు నాదరార్ద్రుఁడయి పల్కి గాంధారి। తోడ 'నీవు సుతులఁ దోడఁబుట్టు
వులను గాంతు, నీదు చెలియలు గొంతియుఁ। గర్ణుఁ జూడఁ గాంచు గణ్యచరిత! 107

ప్రతిపదార్థం: కోడల!= కోడలా, కుంతీ!; నీ చెప్పినది= నీవు చెప్పినటువంటిది; ఎల్లన్= మొత్తం; నిక్కంబు= నిజం; నీయందున్= నీలో; ఎగ్గు= దోషం; లేదు= లేదు; వెఱవన్= భయపడటం; ఏల?= ఎందుకు?; సురలు= దేవతలు; అద్భుత+ఆపాది-చరితులు= వింతలు పుట్టించే నడవడి కలవారు; కర్ణునకున్= కర్ణుడివిషయంలో; అట్లు= ఆవిధంగా; కాన్+ఉన్నది= జరగవలసి ఉన్నది; అగుటన్-చేసి= కాబట్టి; అతనిన్= కర్ణుడిని; ఏటిలోన్= గంగలో; ఇడితి(వి)= వదిలేశావు; కన్యాత్వ-హాని= నీలో కన్యాభావానికి హాని; లేక-ఉన్కిన్= లేకపోవటం చేత; ఈవు= నీవు; కుల-అగ్రగణ్యవు= ఈ వంశంలో శ్రేష్ఠురాలివి; ఐతి(వి)= అయినావు; భవత్-వృత్తము= నీ చరిత్ర; అమలినము= నిష్కళంకం; అగుటకున్= కావటంలో; ఇంచుక-ఐనన్= కొంచెం కూడా; అనుమానము= సందేహం; వలవదు= తగదు; అనుచున్= అంటూ; ఆదర+ఆర్ద్రుఁడు= వాత్సల్యంతో నిండి (తడిసి)నవాడు; అయి= ఐ; పల్కి= చెప్పి; గాంధారితోడన్= గాంధారితో; గణ్యచరిత!= ప్రశంసించదగిన నడవడి కలదానా!; నీవు= నీవు; సుతులన్= దుర్యోధనాదులైన కొడుకులనూ; తోడబుట్టువులను= శకుని మున్నగు సోదరులనూ; కాంతు(వు)= చూస్తావు; నీదు చెలియలు= నీకు చెల్లెలయిన; గొంతియున్= కుంతికూడా; కర్ణున్= (కొడుకైన) కర్ణుడిని; చూడన్-కాంచున్= చూడగలుగుతుంది.

తాత్పర్యం: 'కోడలా!, కుంతీ!. నీవు చెప్పినదంతా యథార్థం. నీలో ఏదోషమూ లేదు. భయ మెందుకు? దేవతలు వింతలు కల్పిస్తుంటారు. కర్ణుడికి ఆ విధంగా జరగవలసి ఉన్నది కాబట్టి అతడిని గంగలో విడిచావు. నీ కన్యాత్వానికి భంగం లేదు కాబట్టి ఈ వంశంలో నీవు శ్రేష్ఠురాలి వైనావు. నీ చరిత్ర నిష్కళంకం అనటంలో ఏ మాత్రమూ సందేహం లేదు'. అని వాత్సల్యాతిశయంతో పలికాడు వ్యాసమహర్షి. ఆ తరువాత గాంధారితో 'మంచి నడవడి కలదానా!, నీవు దుర్యోధనాదులైన కొడుకులనూ, శకుని ప్రభృతులైన సోదరులనూ చూస్తా విప్పుడు. నీ చెల్లెలు కుంతి కూడా కర్ణుడిని చూడగలుగుతుంది.

ఉ. ద్రౌపదియున్ సుభద్రయును దక్కటి కాంతలు భ్రాతృపుత్త్ర పా
త్త్రోపవిలోక నోత్సవము నొందుదు రిచ్చటి కిప్డు వచ్చు టే
నీ పని యాచరించుటకు; నిమ్మనుజేంద్రుఁడు నీవు గొంతి చిం
తాపరితాపనోదన విధంబుగఁ గోరితి రట్లు చేసెదన్. 108

ప్రతిపదార్థం: ద్రౌపదియున్= ద్రౌపదీ; సుభద్రయును= సుభద్రా; తక్కటి-కాంతలు(న్)= మిగిలిన భరతవంశపు స్త్రీలూ; భ్రాతృ= సోదరులనూ; పుత్త్ర= కొడుకులనూ; పౌత్త్ర= మనుమలనూ; ఉపవిలోకన= చూడటం అనే; ఉత్సవమున్= సంతోషాన్ని; ఒందుదురు= పొందుతారు; ఏను= నేను; ఇచ్చటికిన్= ఈ చోటికి; ఇప్డు= ఈ సమయంలో; వచ్చుట= రావడం; ఈపని= మీరు కోరిన ఈపని; ఆచరించుటకున్= చేయటానికే; ఈ+మనుజ+ఇంద్రుఁడు= ఈ (ధృతరాష్ట్ర) మహారాజు; నీవు= నీవు (గాంధారి); గొంతి= కుంతీ; చింతా-పరితాపనోదన-విధంబుగన్= (పుత్రాదులను) గురించిన ఆలోచనలూ, దుఃఖమూ తొలగిపోయేటట్లుగా; కోరితిరి= అడిగారు; అట్లు= మీరు కోరుకొన్నవిధంగా; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: ద్రౌపదీ, సుభద్రా, ఇతర భరతస్త్రీలూ, తమ తమ సోదరులనూ, కొడుకులనూ, మనుమలనూ చూచే ఆనందకర స్థితిని పొందుతారు. నేను ఇక్కడికి ఇప్పుడు వచ్చింది ఆపని చేయటానికే. ఈ ధృతరాష్ట్రుడూ, నీవూ (గాంధారి) కుంతీ, దుఃఖం తొలగించుమని కోరారు. ఆ విధంగా చేస్తాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. నీ కొడుకులకు మనుమలకు। శోకింపఁగ వలదు; వారు శూరత వెలయం
జే కొనిరి రణమరణమున। నాక భువనసుఖము సద్గుణస్తవనీయా! 109

ప్రతిపదార్థం: సత్+గుణ స్తవనీయా!= మంచి గుణాల చేత ప్రశంసించ దగిన దానా! (గాంధారీ); నీ కొడుకులకున్= దుర్యోధనాదు లయిన నీ పుత్త్రులను గూర్చి; మనుమలకున్= లక్ష్మణకుమారాదులైన మనవళ్ళను గురించీ; శోకింపఁగన్= దుఃఖించటం; వలదు= వద్దు; వారు= నీకొడుకులూ, మనుమలూ; శూరత= తమ పరాక్రమం; వెలయన్= వెల్లడి కాగా; రణ-మరణమునన్= యుద్ధంలో సంభవించిన మరణంతో; నాక-భువన-సుఖము= స్వర్గలోక సౌఖ్యాన్ని; చేకొనిరి= పొందారు.

తాత్పర్యం: మంచి గుణాల చేత స్తుతింపదగిన దానా! గాంధారీ! కొడుకులను గురించీ, మనుమలను గురించీ నీవు విచారించవద్దు. వాళ్ళు తమ పరాక్రమం వెల్లడి అయ్యేవిధంగా యుద్ధంలో మరణించటం వలన స్వర్గలోక సౌఖ్యాలను పొందారు.

ఆ. భామ! విను మవశ్య భవితవ్య మైన భా। రతరణంబు పొంటె నతుల మహిమ
మాననీయ దేవయోనులు జననంబు। నొంది రిందు మనుజయోనులందు. 110

ప్రతిపదార్థం: భామ!= వనితా! (గాంధారీ); వినుము= వినుము; అవశ్య-భవితవ్యము= తప్పక జరుగవలసినది; ఐన= అయినటువంటి; భారతరణంబుపొంటెన్= భారతయుద్ధం కొరకుగా; అతుల మహిమన్= సాటిలేని గొప్పతనం చేత; మాననీయ దేవయోనులు= గౌరవించదగిన దేవతలు మొ॥; ఇందున్= ఈ భూమిపై; మనుజయోనులందు(న్)= మానవజాతిలో; జననంబున్= పుట్టుకను; ఒందిరి= పొందారు.

తాత్పర్యం: గాంధారీ! తప్పకుండా జరిగి తీరవలసిన భారతయుద్ధం కొరకుగా, సాటిలేని మహత్తు గలిగిన దేవతలు మొదలైన అమానుషపు పుట్టుక గలవాళ్ళూ, ఈ భూమిమీద మానవజాతిలో పుట్టారు.

సీ. ధృతరాష్ట్రుఁ డనఁగ వర్తిల్లెడు మేటి గం। ధర్వుఁడీ ధృతరాష్ట్రధరణివిభుఁడు
తన్వి! పాండుఁడు మరుద్గణ మయజని; ధర్మ। దేవత సూవె యుధిష్ఠిరుండు;
పవనుండు భీముఁడై ప్రభవించె; నరుఁ డను। ముని యర్జునుం డయి జనన మొందె.
నారాయణుఁడు గృష్ణనాముఁడై జనియించెఁ;। గనుఁగొను కవల నాశ్వినులు గాఁగ;

తే. ద్వాపరంబుగ నెఱుఁగు గాంధార రాజు;। గలి సుయోధనుఁ డయ్యె; రాక్షసులు పుట్టి
రతని యనుజులై; కర్ణుని నరుణకిరణుఁ। గాఁగ; నభిమన్యుఁ జంద్రునిఁ గాఁగఁ గనుము. 111

ప్రతిపదార్థం: ఈ-ధృతరాష్ట్రవిభుఁడు= (నీ యెదుట ఉన్న) ఈ ధృతరాష్ట్రుడు అనే పేరుతో; వర్తిల్లెడు= ఉన్న; మేటి-గంధర్వుఁడు= గంధర్వనాయకుడు (రాజు); పాండుఁడు= పాండురాజు; మరుద్గణ-మయ-జని= మరుత్తుల అంశతో కూడిన పుట్టుక కలవాడు; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ధర్మదేవత= యమధర్మరాజు; చూవె= సుమా; భీముఁడు+ఐ= భీమసేనుడుగా; పవనుండు= వాయుదేవుడు; ప్రభవించెన్= పుట్టాడు; అర్జునుఁడు-అయి= అర్జునుడుగా; నరుఁడు అనుముని= నరుడు అనేపేరు గలిగిన ముని; జనియించెను= పుట్టాడు; కృష్ణనాముఁడు+ఐ= కృష్ణుడు అనే పేరు గలిగిన వాడుగా; నారాయణుఁడు= నారాయణుడనే ముని; జననము-ఒందెన్= పుట్టాడు; కవలన్= నకుల, సహదేవులను; ఆశ్వినులు= అశ్వినిదేవతలు; కాఁగన్= అయిఉన్నట్లు;

కను(గొను(ము)= గ్రహించుము; గాంధార రాజు= గాంధార రాజు (శకుని); ద్వాపరంబుగన్= ద్వాపరుడు అని; ఎఱుగు(ము)= తెలుసుకొమ్ము; కలి= కలిపురుషుడే; సుయోధను(డు= దుర్యోధనుడు; అయ్యెన్= అయిఉన్నాడు; అతని-అనుజులు-ఐ= ఆ దుర్యోధనుడి తమ్ములు, దుశ్శాసనాదులుగా; రాక్షసులు= రాక్షసులు; పుట్టిరి= జన్మించారు; కర్ణునిన్= కర్ణుడిని, అరుణ కిరణున్-కా(గన్= సూర్యుడిగానూ; అభిమన్యున్= అభిమన్యుడిని; చంద్రునిన్-కా(గన్= చంద్రుడిగానూ; కనుము= గ్రహించుము.

తాత్పర్యం: (గాంధారీ!) ఈ ధృతరాష్ట్ర మహారాజు ధృతరాష్ట్రుడనే గంధర్వరాజు, మరుత్తులనే దేవతల అంశతో పుట్టినవాడు పాండురాజు, ధర్మరాజు (యమ) ధర్మరాజే సుమా! వాయుదేవుడు భీముడుగా పుట్టాడు. నరుడు అనే పేరుగల ముని అర్జునుడుగాను, నారాయణుడు కృష్ణుడుగానూ పుట్టారు. నకుల సహదేవులుగా అశ్వినీ దేవతలు పుట్టారు. ద్వాపరం శకునిగానూ, కలిపురుషుడు దుర్యోధనుడు గానూ, రాక్షసులు దుశ్శాసనాదులైన దుర్యోధనుడి తమ్ములుగానూ పుట్టారు. కర్ణుడు సూర్యుడనీ, అభిమన్యుడు చంద్రుడనీ గ్రహించుము.

క. అనలు(డు ధృష్టద్యుమ్నుం। డన ద్రౌపదితోడ(బుట్టె; ననిలుని యంశం
బున జనియించె శిఖండియు;। ననిమిషగురు(డుద్భవించె నస్త్రగురుండై. 112

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; అనన్= అనే పేరుతో; ద్రౌపదితోడన్= ద్రౌపదితో; అనలు(డు= అగ్నిదేవుడు; పుట్టెన్= పుట్టాడు; శిఖండియున్=(ఇంక) శిఖండి; అనిలుని-అంశంబునన్= వాయుదేవుడి అంశతో; జనియించెన్= పుట్టాడు; అస్త్రగురుండు అయి= (కురుకుమారులకు అస్త్రవిద్యను నేర్పే ఆచార్యుడు) ద్రోణుడుగా; అనిమిష-గురు(డు= దేవతలకు గురువైన బృహస్పతి; జనియించెన్= పుట్టాడు.

తాత్పర్యం: అగ్నిదేవుడు ద్రౌపదికి తోబుట్టువుగా ధృష్టద్యుమ్నుడనే పేరుతో పుట్టాడు. వాయుదేవుడి అంశతో శిఖండి పుట్టాడు. బృహస్పతి ద్రోణాచార్యుడుగా జన్మించాడు.

తే. వినుము వసుశక్తి గాంగేయు(డన(గ జనన। మొందె; రుద్రాంశమున ద్రౌణి యుదయ మయ్యెఁ
దెలియ(జెప్పితి(గొందఱు కలరు మఱియు। నిర్జరాసురాంశముల జన్మించినారు.' 113

ప్రతిపదార్థం: వినుము= గాంధారీ! వినుము; గాంగేయు(డు= గంగ కొడుకు (భీష్ముడు); అన(గన్= అనే విధంగా; వసుశక్తిన్= అష్టవసువులలో (అష్టమ) చివరివాడు; జననము-ఒందెన్= పుట్టాడు; ద్రౌణి= ద్రోణపుత్రుడైన అశ్వత్థామ; రుద్ర-అంశమునన్= రుద్రుడి అంశతో; ఉదయము-అయ్యెన్= జన్మించాడు; తెలియన్-చెప్పితిన్= ఈ విషయాలు (ఇన్ని) నీకు తెలియజేశాను; నిర్జర+ అసుర-అంశములన్= దేవతల, రాక్షసుల అంశలతో; జన్మించినవారు= పుట్టినటువంటి వారు; మఱియున్= ఇంకా; కొందఱు= కొంతమంది; కలరు= ఉన్నారు.

తాత్పర్యం: గాంధారీ! వినుము (అష్టమ) వసువే గంగకు కొడుకుగా భీష్ముడి అంశతో జన్మించాడు. అశ్వత్థామ రుద్రాంశభవుడు. ఈ విధంగా కొందరి విషయం నీకు తెలియజేశాను. దేవరాక్షసఅంశలతో పుట్టినవారు ఇంకా కొంతమంది ఉన్నారు'.

క. అని పలికి 'మీ మనంబుల। వనట సమస్తంబు(బుచ్చి వైచెద నాతో(
జనుదెండు మీరు గంగకు(గనియెద రని(దెగిన బంధుగణముల నచటన్.' 114

ప్రతిపదార్థం: అని= అనేవిధంగా; పలికి= చెప్పి; మీ మనంబులన్= మీమీ హృదయాలలో ఉన్న; వనట= దుఃఖం; సమస్తంబున్= మొత్తమూ; పుచ్చివైచెదన్= తొలగిస్తాను; నాతోన్= నాతో (వ్యాసుడితో కలిసి; మీరు= మీరందరూ; గంగకున్= గంగానది వద్దకు; చనుదెండు= రండి; అనిన్= యుద్ధంలో; తెగిన= మరణించిన; బంధుగణములన్= మీ మీ చుట్టాలను; అచటన్= ఆ గంగవద్ద; కనియెదరు= చూస్తారు.

తాత్పర్యం: అనిచెప్పి వ్యాసుడు, 'మీ మనసులలో ఉన్న దుఃఖం మొత్తం పూర్తిగా పోగొట్టుతాను. నాతో గంగానది వద్దకు రండి. యుద్ధంలో మరణించిన మీమీ బంధువులను ఆ గంగానది వద్ద చూస్తారు.'

తే. అనుచు నుత్థితుఁ డగుటయు నార్పుటెలుఁగు। లాకసం బంద ధృతరాష్ట్రుఁ డాది గాఁగఁ
గలుగు నా సర్వజనులు నొక్కటఁ గడంగి। యరిగి రమ్మునినాథుతోఁ గురువరేణ్య! 115

ప్రతిపదార్థం: కురువరేణ్య!= ఓ జనమేజయ మహారాజా!; అనుచున్= ఆ విధంగా చెప్పుతూనే; ఉత్థితుండు+అగుటయున్= (వ్యాసమహర్షి ఆసనంనుండి) లేచినవాడు కాగా; ఆర్పు+ఎలుఁగులు= ఆనందం నిండిన అరుపులు (కంఠ ధ్వనులు); ఆకసంబు-అందన్= నింగిని తాకుతుండగా; ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్రుడు; ఆది-కాఁగన్= మొదలుగా; కలుగు= అక్కడ ఉన్న; సర్వజనులున్= జనం అంతా; ఒక్కటన్= ఒక్కసారిగా; కడంగి= పూని; ఆ మునినాథుతోన్= ఆ వ్యాసమహర్షితో కలిసి; అరిగిరి= (గంగానదికి) వెళ్ళారు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! వ్యాసమహర్షి అట్లా అంటూనే ప్రయాణానికి సిద్ధమై ఆసనం నుండి లేచి నిలబడగా, ఆనందంతో నిండిన అరుపులు ఆకాశం అంటుతుండగా, ధృతరాష్ట్రుడు మొదలైన అక్కడి జనమంతా ఒక్కసారిగా లేచి ఆ వ్యాసమహర్షితో కలిసి గంగానదికి వెళ్లారు.

క. అరుగఁగ మునిజనములు న। చ్చెరు వందుచు నమ్మునీంద్రు సేవించి మరు
త్సరిదుపకంఠ తలమునకు। నరిగిరి కౌతుకము మనములందు నెలకొనన్. 116

ప్రతిపదార్థం: అరుగఁగన్= ధృతరాష్ట్రాదులు ఆ విధంగా గంగకు బయలుదేరి వెళ్ళగా; మునిజనములున్= శతయూపుడు మొదలైన తాపసులు కూడా; అచ్చెరువు= ఆశ్చర్యం; అందుచున్= పొందుతూ; ఆ+ముని+ఇంద్రున్= మునులలో శ్రేష్ఠుడయిన ఆ వ్యాసుడిని; సేవించి= అర్చించి; మనములందున్= తమతమ మనసులలో; కౌతుకము= కుతూహలం; నెలకొనన్= చోటు చేసికొనగా; మరుత్= దేవతల; సరిత్= నది (గంగ) యొక్క; ఉపకంఠతలమునకున్= సమీపప్రాంతానికి; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: వ్యాసుడితో ధృతరాష్ట్రాది కురువంశ్యులు బయలుదేరి వెళ్ళుతుంటే, అక్కడే ఉన్న శతయూపుడు మొదలైన ఇతర మునులు గూడా వ్యాసవచనాలకు ఆశ్చర్యపడుతూ ఆయనను పూజించి మనసులలో (మృత వీరులను చూచే) కుతూహలం నిండగా, గంగాసమీపానికి వెళ్ళారు.

వ. అట్లు పౌరజానపదసహితు లై సకలజనంబులుం జని సాత్యవతేయుండు వనుప భాగీరథీతీరంబున విడిసి; ర వ్విచిత్రచరిత్రుండు దన చేయంబూనిన పని మఱునాఁడు రేపకడ సేయువాఁడుగాఁ బలికిన నయ్యందఱు నద్దినశేషంబు నా యామినియును శతసంవత్సరంబులుంబోలె నుండ సూర్యోదయసమయం బగుటయుఁ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

గాలోచితకృత్యంబు లాచరించి ధృతరాష్ట్రుండును బాండుతనయులుం దపోధనులు నప్పారాశర్యుపాలికి నరిగి యమ్మునివరుం బరివేష్టించిరి; గాంధారీప్రముఖభామినులు నేతెంచి యొక్కవలన నతనిం గొలిచి యుండిరి; సర్వజనులు నఱ్ఱు లెత్తికొని యంతంత నిలిచిరి; తదనంతరంబ. 117

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారంగా; పౌర-జానపద-సహితులు+ఐ= నాగరులూ, పల్లీయులూ అయిన జనంతో కూడినవారయి; సకల జనంబులున్= అక్కడి వారందరూ; చని= గంగాతీరానికి పోయి; సాత్యవతేయుండు= (సత్యవతి కొడుకు) వ్యాసుడు; పనుపన్= అనుమతించగా; భాగీరథీతీరంబునన్= గంగానది ఒడ్డున; విడిసిరి= బసచేశారు; ఆ+విచిత్ర చరిత్రుండు= వింత నడవడి కలిగిన ఆ వ్యాసమహర్షి; తనచేయన్+పూనిన-పని= తాను చేస్తానన్న (మృతవీరులను చూపటం అనే) పనిని; మఱునాఁడు= తరువాతి రోజు; రేపకడ= ఉదయంపూట; చేయువాఁడుగాన్= చేస్తానని; పలికినన్= చెప్పగా; ఆ+అందఱున్= అది చూడ వచ్చిన వారు అందరూ; ఆ+దినశేషంబు= ఆరోజు పగలులో మిగిలిన భాగమూ; ఆ+యామినియున్= ఆ రాత్రీ; శతసంవత్సరంబులున్+పోలెన్= నూరేండ్లంతగా; ఉండన్= దీర్ఘమై ఉండగా; సూర్య-ఉదయంబు= ప్రొద్దుపొడవటం; అగుటయున్= కావటంతో; కాల+ఉచిత కృత్యంబులు= ప్రాతఃకాలంలో ఆచరించవలసిన పనులూ; ఆచరించి= చేసి; ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడూ; పాండుతనయులున్= పాండవులూ; తపోధనులు= (శతయూపాది) మునులూ; ఆ+పారాశర్యుపాలికిన్= (పరాశరుడి కొడుకు అయిన) ఆ వ్యాసమహర్షి వద్దకు; అరిగి= పోయి; ఆ+మునివరున్= ఆ వ్యాసమహర్షిని; పరివేష్టించిరి= చుట్టుకొన్నారు; గాంధారీ-ప్రముఖ-భామినులున్= గాంధారి మొదలైన స్త్రీలు కూడా; ఏతెంచి= వ్యాసుడి వద్దకు వచ్చి; అతనిన్= ఆ వ్యాసుడిని; కొలిచి= సేవించి; ఒక్కవలనన్= ఒకవైపుగా; ఉండిరి; సర్వజనులున్= మిగిలిన ముని, పౌర, జానపద జనులందరూ; అఱ్ఱులు= మెడలు; ఎత్తుకొని= పైకి చాచికొని; (వ్యాసుడిని చూస్తూ); అంత+అంత= అక్కడక్కడ; నిలిచిరి= నిలువబడ్డారు; తదనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: ఆ విధంగా నగరవాసులూ, పల్లెవాసులతో సహా వ్యాస ధృతరాష్ట్రాదులందరూ కదలి గంగ వద్దకు వెళ్లారు. వ్యాసుడి ఆజ్ఞతో, గంగ ఒడ్డున ధృతరాష్ట్రాదులు బస చేశారు. అపుడు వింతపోకడలు గలిగిన ఆ వ్యాసుడు తాను చేయవలసిన మృతకురువీరులను చూపించేపని మరునాడు ఉదయం చేస్తా ననటంతో, మిగిలిన ఆ పగలూ, ఆరోజు రాత్రీ వందసంవత్సరాలవలె గడిపారు. అంతా సూర్యుడు ఉదయించిన వెంటనే ప్రాతఃకాలంలో చేయవలసిన పనులన్నీ పూర్తి చేసికొని ధృతరాష్ట్రుడూ, పాండవులూ, మునులూ వ్యాసుడి వద్దకు వెళ్ళి ఆయనచుట్టూ చేరారు. గాంధారి మొదలైన స్త్రీలు కూడా వచ్చి వ్యాసుడిని సేవించి ఒక ప్రక్కగా నిలుచున్నారు. ఇంక మిగిలిన జనమంతా వచ్చి వ్యాసుడివైపు మెడలు చాచి చూస్తూ అక్కడక్కడా నిలబడి ఉన్నారు. తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం)

వ్యాసుఁడు ధృతరాష్ట్రాదులకు భారతరణ మృతుల రావించి చూపుట (సం॥ 15-40-4)

సీ. సాత్యవతేయుండు జాహ్నవీసలిలావ। గాహన మొనరించి గారవమున
నింపారు నెలుఁగున 'నిందు రం' డనవుడు। నీ కేమి సెప్పుదు? నీటియందు
రవ మగ్గలముగ రారాజుఁ దమ్ములుఁ దత్కు। మారవర్గము నభిమన్యుఁ డాది
యగు పాండుపౌత్త్రులు నర్కజుండును బాహ్లి। కప్రముఖాఖిల కౌరవులును

తే. ద్రుపదమాత్స్యులు వారి బంధులును శకుని। యును దదీయానుజులును నాతని తనూజ
రాజియును భీష్మగురులఁ బురస్కరించి। కొనుచుఁ దమదివ్యదేహముల్ కొమరు మిగుల. 118

ప్రతిపదార్థం: సాత్యవతేయుండు= (సత్యవతి కొడుకు) వ్యాసుడు; జాహ్నవీ-సలిల-అవగాహనము= గంగనీటిలో మునుక; ఒనరించి= చేసి; గారవమునన్= వాత్సల్యంతో; ఇంపు+ఆరు+ఎలుఁగునన్= మాధుర్యం నిండిన (కంఠస్వరం) గొంతుతో; ఇందున్= ఇచ్చటికి; రండు= (మృత వీరులూ!) రండి; అనవుడున్= అనగానే; నీకున్= నీకు (జనమేజయుడితో); ఏమి చెప్పుదున్?= (నేను, వైశంపాయనుడు) ఏమి చెప్పేది?; నీటియందున్= ఆ గంగనీటిలో; రవము= శబ్దం; అగ్గలముగన్= అధికంగా; రారాజున్= దుర్యోధనుడూ; తమ్ములున్= దుశ్శాసనాదులయిన దుర్యోధనుడి తమ్ముళ్ళూ; తద్-కుమార వర్గమున్= లక్ష్మణాదులయిన ఆ ధార్తరాష్ట్రుల కుమార సమూహము; అభిమన్యుడు= అభిమన్యుడు; ఆది= మొదలు; అగు-పాండుపౌత్రులున్= అయినటువంటి పాండురాజు మనుమళ్ళూ; అర్కజుండును= (సూర్యుడివలన పుట్టిన) కర్ణుడూ; బాహ్లిక= బాహ్లికుడు; ప్రముఖ= మొదలుగా; అఖిల= సమస్తమైన; కౌరవులును= కురువంశ్యులూ; ద్రుపద-మాత్స్యులు= ద్రుపదుడూ (మత్స్యదేశం రాజైన) విరాటుడూ; వారి బంధులును= ధృష్టద్యుమ్నాదులైన ద్రుపద విరాటుల (పుత్రాది) బంధువులూ; శకునియును= శకునీ; తదీయ-అనుజులును= ఆ శకుని సోదరులూ; అతని తనూజ-రాజియును= వారి కుమారవర్గమూ; భీష్మ-గురులన్= భీష్ముడినీ, ద్రోణుడినీ; పురస్కరించుకొనుచున్= ముందుగా ఉంచుకొని; తమ-దివ్య దేహముల్= తమ తమయొక్క ప్రకాశించేటటువంటి అలౌకిక శరీరాలు; కొమరు= సౌకుమార్యం; మిగులన్= అతిశయించగా.

తాత్పర్యం: వ్యాసమహర్షి గంగాజలంలో మునుకవేసి ప్రేమతో తియ్యనైన గొంతుతో ఇక్కడికి (భారతయుద్ధంలో మరణించిన వారిని) రండి అన్నాడు. జనమేజయ మహారాజా! నీ కేమని చెప్పేది? అపుడు ఆ నీళ్ళలోనుండి పెద్దగా చప్పుడు ఆరంభమైంది. దానితోటే, దుర్యోధనుడూ, అతడి తమ్ముళ్ళూ, ఆ ధార్తరాష్ట్రుల కొడుకులూ మొదలైన ధృతరాష్ట్రుడి కుటంబం వారూ, అభిమన్యుడూ, ఉపపాండవులూ మొదలైన పాండురాజు కుటుంబం వారూ, కర్ణుడూ, ఇంకా బాహ్లికుడు (సోమదత్తుడు) మొదలైన కురువీరులందరూ, ద్రుపదుడూ, విరాటుడూ (ధృష్టద్యుమ్నుడూ, ఉత్తరుడూ మొదలైన) వాళ్ళ చుట్టాలూ, శకునీ, అతడి సోదరులూ, కొడుకులూ భీష్ముడూ, ద్రోణుడూ మొదలుగా గల వాళ్ళు తమ దివ్యశరీరాలు ప్రకాశిస్తుండగా కనబడ్డారు.

ఆ. దివ్య మాల్యములును దివ్యాంబరంబులు। దివ్య భూషణములు దివ్యలేప
నములుఁ జెన్నుఁ జేయఁ దమ మిత్త్ర సుభటసం। దోహములును దారుఁ దోఁచి రధిప! 119

ప్రతిపదార్థం: అధిప!= ఓ జనమేజయ మహారాజా!; దివ్య-మాల్యములును= స్వర్గ (ఊర్ధ్వ) లోకానికి సంబంధించినటువంటి పూమాలలూ; దివ్య+అంబరంబులు(న్)= దివ్యములైనటువంటి వస్త్రాలూ; దివ్య-భూషణములు= దివ్యములైన ఆభరణాలూ; దివ్య-లేపనములు(న్)= దివ్యములయిన మైపూతలూ; చెన్నున్+చేయన్= అందాన్ని కలిగిస్తుండగా; తమ-మిత్త్ర-సుభట-సందోహములును= తమకు మిత్రుల బంటుల సమూహాలూ; తారున్= తామూ (దుర్యోధనాదులూ); తోఁచిరి= కనబడ్డారు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ఆ దుర్యోధనాదులు మానవలోకానికి అతీతమయిన లోకాలకు సంబంధించిన పూలమాలలూ, అటువంటి దివ్యమయిన వస్త్రాలూ, దివ్యమైన అలంకారాలూ, దివ్యమైన మైపూతలూ అందగిస్తుండగా, తమతమ మిత్రుల, బంట్ల సముదాయాలూ తామూ కనబడ్డారు.

వ. అట్టియెడ. 120

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో..

తాత్పర్యం: (దుర్యోధనాదులైన భారతయుద్ధంలో మరణించిన వారు అందరూ గంగలో తోచిన) ఆ సమయాన.(తరువాతి పద్యంతో అన్వయం)

క. తగ నా కురువృద్ధునకు నొ। సఁగె నాఁటికి నెల్లదృష్టి సాత్యవతేయుం
డగణితతపఃప్రభావం। బు గని యధిక విస్మయంబుఁ బొందఁగ జనముల్. 121

ప్రతిపదార్థం: అగణిత-తపస్+ప్రభావంబు= గణించడానికి సాధ్యంగాని (వ్యాసుడి) తపఃశక్తి; కని= చూచి; జనముల్= అక్కడివారు అందరూ; విస్మయంబున్= ఆశ్చర్యాన్ని; పొందఁగన్= పొందుతుండగా; సాత్యవతేయుండు= వ్యాసుడు; ఆ కురు వృద్ధునకున్= ఆ ధృతరాష్ట్రుడికి; నాఁటికిన్= అప్పటికి; తగన్= తగినట్లుగా; ఎల్లదృష్టిన్= పూర్తిగా చూపును; ఒసఁగెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: తన తపః ప్రభావాన్ని చూచి జనమంతా ఆశ్చర్యపడేవిధంగా వ్యాసుడు ఆ ధృతరాష్ట్రుడికి అప్పటికి తగినట్లుగా సంపూర్ణదృష్టిని ఇచ్చాడు.

వ. అవ్విశేషంబు విని యద్భుత ప్రమద భరితయై నిజనయనంబుల బంధించిన పట్టం బపనయించి గాంధారి యును గనుంగొనుచుండ. 122

ప్రతిపదార్థం: గాంధారియును= గాంధారి కూడా; ఆ+విశేషంబు= ధృతరాష్ట్రుడికి దృష్టి రావటం అనే విశేషం; విని= ఆలించి; అద్భుత-ప్రమద-భరిత+ఐ= ఆశ్చర్యంతోనూ, సంతోషంతోనూ నిండినది అయి; నిజ-నయనంబులన్= తన కళ్ళకు; బంధించిన-పట్టంబు= కట్టిన వస్త్రాన్ని; అపనయించి= తొలగించి; కనుంగొనుచున్-ఉండన్= చూస్తూ ఉండగా.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడికి చూపురావటం అనే విశేషం విని ఆశ్చర్యానందాలతో గాంధారి కూడా తన కళ్ళకు కట్టిన వస్త్రాన్ని తొలగించి (దుర్యోధనాదులను) చూస్తుండగా, (తరువాతి పద్యంతో అన్వయం)

క. అవ్విధమునఁ దోఁచిన మఱి। నవ్వుచుఁ దెగడుచును బెరసి నరవర! పగ లే
కవ్వీరవరులు నెయ్యము। నివ్వటిలఁగ విలసనములు నెఱయ మెఱయఁగన్. 123

ప్రతిపదార్థం: నరవర!= ఓ జనమేజయ మహారాజా!; ఆ+విధమునన్= ఆ తీరుగా; తోఁచినన్= యుద్ధ మృతవీరులు కనబడగా; మఱి= అపుడు; ఆ+వీరవరులు= ఆ దుర్యోధనాదులు; నవ్వుచున్= నవ్వుతూ; తెగడుచున్= పరిహాసాలు ఆడుకొంటూ; బెరసి= సంఘీభావంతో కలిసి; పగ= విరోధం; లేక= లేకుండా; నెయ్యము= స్నేహం; నివ్వటిలఁగన్= అతిశయించగా; విలసనములు= కాంతులు; నెఱయన్= సంపూర్ణంగా; మెఱయఁగన్= మెరుస్తూ ఉండగా.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! ఆ విధంగా (గాంధారీధృతరాష్ట్రులతో కూడా అందరూ చూస్తూ ఉండగా) కనబడిన దుర్యోధనాదులైన వీరశ్రేష్ఠులు, నవ్వుతూ, పరిహాసాలాడుకొంటూ, కలిసి మెలిసి శత్రుత్వం లేకుండా, స్నేహం వర్ధిల్లుతుండగా, కాంతులు బాగా ప్రకాశిస్తూ ఉండగా (ఉన్నారు.)

తే. చతురగంధర్వు లప్సరోజనులు గాన। ములఁ బ్రమోద మొనర్పంగఁ బొగడ వంది
సమితి నిరహంకృతులు హృదయముల గౌర। వములు తెల్లంబు సేయంగ వచ్చి రొప్పి. 124

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: చతుర-గంధర్వులు= నేర్పరులయిన గంధర్వులు; అప్సరస్+జనులు= అప్సరసలు; గానములన్= వివిధములైన పాటలతో; ప్రమోదము= (తమకు) సంతోషం; ఒనర్పంగన్= కలిగిస్తుండగా; వంది-సమితి= భట్రాజుల బృందం; పొగడన్= (తమను) స్తుతిస్తుండగా; హృదయముల గౌరవములు= సంకుచితపు ఆలోచనలు లేని ఉదారబుద్ధిని; తెల్లంబు= స్పష్టం; చేయంగన్= చేస్తుండగా; నిర్+అహంకృతులు= అహంకారం లేనటువంటి వారుగా (దుర్యోధనాదులు); ఒప్పి= ప్రకాశిస్తూ; వచ్చిరి= ధృతరాష్ట్రాదులవద్దకు వచ్చారు.

తాత్పర్యం: నిపుణులైన గంధర్వులూ, అప్సరసలూ వివిధగానాలతో సంతోషపెట్టుతుండగా, స్తోత్రపాఠకుల సమూహం స్తుతిస్తుండగా, అహంకారం లేనటువంటి ఆ దుర్యోధనాదులు తమ ఉదారబుద్ధిని ప్రకటిస్తూ, ధృతరాష్ట్రాదుల సమీపానికి వచ్చారు.

వ. **ఇట్లు వచ్చి సకలబంధుజనంబులకుం బరమప్రమోదం బావహిల్లం గలిపి సముచితాచారంబులు నడపి; రా రెండు దెఱంగులవారలు నర్హ ప్రకారంబులఁ బితామహాచార్య శిష్య మాతృ మాతామహ పితృపితామహ భ్రాతృ జామాతృ పుత్రపుత్రీభగినీ పౌత్ర దౌహిత్ర శ్వశుర శ్వశ్రూస్నుషా మాతుల స్యాలక ప్రియ ప్రియా మిత్ర సమాగమసుఖంబు లనుభవించుచు.** **125**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా (అత్యంత వైభవంతో దుర్యోధనాదులు); వచ్చి= (ధృతరాష్ట్రాదుల వద్దకు) వచ్చి; సకలబంధు జనంబులకున్= అక్కడ ఉన్న బంధువులకు అందరికీ; పరమ-ప్రమోదంబు= ఉత్తమమైన సంతోషం; ఆవహిల్లన్= కలుగగా; కలిపి= కూడుకొని; సముచిత-ఆచారంబులు= తగువిధంగా (పెద్దలకు ప్రణామాలూ, పిన్నలకు ఆశీస్సులూ ఇత్యాదిగా) చేయవలసిన పనులు; నడపిరి= ఆచరించారు; ఆ రెండు దెఱంగులవారలు= ఆ రెండు విధాలయిన వారు (దివ్య దేహాలతో ఉన్న దుర్యోధనాదులూ, మానవులైన ధృతరాష్ట్రాదులూ); అర్హప్రకారంబులన్= తగువిధంగా; పితామహ= భీష్ముడితో; ఆచార్య= ద్రోణుడితో; శిష్య= శిష్యులతో; మాతృ= తల్లులతో; మాతామహ= తల్లులయొక్క తండ్రులతో; పితృ= తండ్రులతో; పితామహ= తండ్రులయొక్క తండ్రులతో; భ్రాతృ= సోదరులతో; జామాతృ= అల్లుళ్ళతో; పుత్ర= కొడుకులతో; పుత్రీ= కూతుళ్ళతో; భగినీ= అక్కా, చెల్లెళ్ళతో; పౌత్ర= (కొడుకు కొడుకు) మనవళ్ళతో; దౌహిత్ర= కూతురు కొడుకులతో; శ్వశుర= మామలతో; శ్వశ్రూ= అత్తలతో; స్నుషా= కోడళ్ళతో; మాతుల= మేనమామలతో; స్యాలక= బావమరదులతో; ప్రియ= (భర్త) ప్రియులతో; ప్రియా= ప్రియురాండ్ర (భార్యల)తో; మిత్ర= స్నేహితులతో; సమాగమ-సుఖంబు= కలియటంలోని ఆనందం; అనుభవించుచు(న్)= పొందుతూ.

తాత్పర్యం: ఈ విధంగా వైభవంతో వచ్చి దుర్యోధనాదులు అక్కడ ఉన్న తమ చుట్టాలందరికీ అత్యుత్తమమైన ఆనందం కలిగించి, చేయవలసిన సత్కారాది ఆచారాలు చేశారు. అపుడు ఆ రెండు విధములైన వారూ (దుర్యోధనాది దివ్యశరీరులూ, ధృతరాష్ట్రాది మానవ శరీరులూ) తగువిధంగా పరస్పరం-భీష్మ ద్రోణులూ (గురువులూ), శిష్యులూ, తల్లులూ, వారి (తల్లుల) తండ్రులూ, తండ్రులూ, వారి (తండ్రుల) తండ్రులూ, సోదరులూ, అల్లుళ్ళూ, కొడుకులూ, కూతుళ్ళూ, అక్క చెల్లెళ్ళూ, కొడుకు కొడుకులూ, కూతురు కొడుకులూ, మామలూ, అత్తలూ, కోడళ్ళూ, మేనమామలూ, బావమరదులూ, భర్తలూ, స్నేహితులూ కలిసికొనటంలోని ఆనందం అనుభవిస్తూ, (తరువాతి పద్యంతో అన్వయం)

తే. **అనఁగి పెనఁగి నాఁడెల్ల నిచ్ఛానురూప। వృత్తి వర్తిల్లుచుండి; రవ్విధము సకల**
జనుల నద్భుతరసమున మునుఁగఁ జేసె;। నే మనఁగ వచ్చు నా సంయమీంద్రు మహిమ. **126**

ప్రతిపదార్థం: నాఁడు= ఆరోజు; ఎల్లన్= మొత్తమూ; ఇచ్ఛా+అనురూప-వృత్తిన్= తమ తమ ఇష్టానికి సరి అయిన ప్రవర్తనతో; అనఁగి-పెనఁగి= (అందరూ) కలిసి, మెలిసి; వర్తిల్లుచుండిరి= ఉన్నారు; ఆ+విధము= ఆ తీరు; సకల-జనులన్= అక్కడి వారందరినీ; అద్భుత-రసమునన్= ఆశ్చర్యం అనే రసం (ప్రవాహం)లో; మునుఁగన్-చేసెన్= ముంచింది; ఆ-సంయమి+ఇంద్రు-మహిమ= మునిశ్రేష్ఠుడయిన ఆ వ్యాసుడి మాహాత్మ్యం, (జనమేజయా); ఏమి-అనఁగన్-వచ్చున్?= ఏతీరుగా చెప్పటానికి సాధ్యం అవుతుంది?

తాత్పర్యం: ఆరోజంతా వాళ్ళు అందరూ తమ ఇష్టం వచ్చినట్లుగా, కలిసి మెలిసి వ్యవహరించారు. ఆ విధంగా (దివ్యులు మానవులతో స్వస్వరూపంతో వచ్చి కలిసి ఉండటం) అందరినీ ఆశ్చర్య ప్రవాహంలో ముంచింది. (జనమేజయా!) మునిశ్రేష్ఠుడైన ఆ వ్యాసుడి మహిమ ఏమని చెప్పటానికి సాధ్యం అవుతుంది?

వ. మఱునాఁడు రేపకడ యప్పారాశర్యుండు ననుప నియ్యిరు దెఱంగులవారలుం బరస్పరామంత్రణంబు సేసి; రాశూరజనంబులు తమతమలోకంబులకుం జనువారై జాహ్నవీజలంబులం బ్రవేశింప, నన్నిలింపవందనీయుండు దానును జొచ్చి యచ్చటినుండి 'పతుల ననుగమింప వలసిన యంగనలు గంగాతోయంబులంగ్రుం కుటకు రం 'డనిన విని విధవలగు వీరభార్య లెల్లను ధృతరాష్ట్ర గాంధారీ కుంతీ ధర్మనందనుల యనుజ్ఞల గొని రయంబునం జని భాగీరథీ సలిలమగ్నలై మానుష దేహంబులు విడిచి దేవతనువులు దాల్చి దివ్యాలంకార సమలంకృతమూర్తులై మగలం గలసి; రవ్విశేషంబు చూచి సర్వజనులు నత్యంతాశ్చర్యసంతోషాధీన మానసులై రని చెప్పి వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 127

ప్రతిపదార్థం: మఱునాఁడు= తరువాతిరోజు; రేపకడ= ఉదయానే; ఆ+పారాశర్యుండు= (పరాశరమహర్షి కొడుకైన) ఆ వ్యాసుడు; పనుపన్= పంపగా; ఆ+ఇరుదెఱంగులవారలున్= దేవ-మానుషదేహులైన ఆ రెండు విధాలవారూ; పరస్పర+ఆమంత్రణంబు; ఒకరినొకరు వీడుకోలును; చేసిరి= చెప్పుకొన్నారు; ఆ శూరజనంబులు= (యుద్ధంలో మరణించిన) ఆ (దుర్యోధనాది) వీరులు; తమతమ లోకంబులకున్= (రణ మరణానంతరం) ఎవరికి కలిగిన లోకాలకు వారు; చనువారు+ఐ= వెళ్ళేవారు అయి-(వెళ్ళుతూ) జాహ్నవీ- జలంబులన్= గంగ నీటిలోకి; ప్రవేశింపన్= చొరబడగా; ఆ+నిలింపవందనీయుండు= దేవతలచే నమస్కరింపదగిన వ్యాసుడు; తానును= తానుకూడా; చొచ్చి= గంగాజలంలో ప్రవేశించి; అచ్చటన్= అక్కడే; ఉండి= నిలిచి (ఇట్లా అన్నాడు); పతులన్= తమ తమ భర్తలను; అనుగమింప(న్) వలసిన-అంగనలు= అనుసరించి వెళ్ళవలసిఉన్న స్త్రీలు; గంగా తోయంబులన్= గంగానదీ జలంలో; క్రుంకుటకు(న్)= మునగడానికి; రండు= రండి; అనినన్= అని (వ్యాసుడు) పల్కగా; విని= ఆలకించి; విధవలు= భర్తను కోల్పోయిన వారు; అగు-వీర- భార్యలు= అయినటువంటి వీరుల భార్యలు; ఎల్లను= అందరూ; ధృతరాష్ట్ర-గాంధారీ-కుంతీ-ధర్మనందనుల-అనుజ్ఞలు= ధృతరాష్ట్రుడియొక్కా, గాంధారియొక్కా, కుంతియొక్కా, ధర్మరాజు యొక్క అనుమతులు; కొని= స్వీకరించి; రయంబునన్= వేగంగా; చని= వెళ్ళి; భాగీరథీ-సలిల-మగ్నలు= గంగానదీ జలంతో మునిగినవారు; ఐ= అయి; మానుషదేహంబులు= మనుష్యులకు సంబంధించిన శరీరాలను; విడిచి= వదలి; దివ్య తనువులు= దివ్యమైన శరీరాలు; తాల్చి= ధరించి; దివ్య-అలంకార- సమలంకృత- మూర్తులు= దివ్యమయిన ఆభరణాదులతో అలంకరించబడిన రూపం కలవారు; ఐ= అయి; మగలన్= తమ తమ భర్తలను; కలిసిరి= కూడుకొన్నారు; ఆ+విశేషంబు= ఆ సంఘటనను; చూచి= చూచి; సర్వజనులున్= అక్కడివారు అందరూ; అత్యంత-ఆశ్చర్య-సంతోష-అధీన-మానసులు= మిక్కిలి ఎక్కువైన ఆశ్చర్యానికీ, ఆనందానికీ, లోబడిన మనసులు కలవారు; ఐరి= అయ్యారు; అని= అనే ప్రకారంగా; చెప్పి= పలికి; వైశంపాయనుఁడు= వైశంపాయనముని; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియె(న్)= అన్నాడు.

తాత్పర్యం: మర్నాడు ఉదయాన్నే వ్యాసుడి నియోగం మీద రెండు విధాలైన వారూ (దివ్య-దుర్యోధనాది, మానుష ధృతరాష్ట్రాది) దేహులూ, పరస్పరం వీడ్కోలు తీసికొన్నారు. దివ్యదేహులయిన ఆ వీరులు (రణ మరణానంతరం సంభవించిన) ఎవరిలోకాలకు వారు వెళ్ళటం కొరకు గంగ నీళ్ళలోకి దిగారు. దేవతలచేత సైతం అర్చింపదగిన ఆ వ్యాసుడు తాను గూడా గంగలో దిగి అక్కడే ఉండి-'భర్తలను అనుసరించి వెళ్ళవలసిన స్త్రీలు ఈ గంగలో మునగ డానికి రండి' అన్నాడు. విధవలైన (ఆవీరుల) స్త్రీలు అందరూ, ధృతరాష్ట్ర గాంధారి, కుంతి, ధర్మరాజుల అనుమతి తీసికొని తొందరగా వెళ్ళి గంగలో మునిగి, మనుష్య శరీరాలు విడిచిపెట్టి దివ్యదేహాలు ధరించి, దివ్యాలంకారాలతో తమ తమ భర్తలను కలుసుకొన్నారు. ఆ సంఘటనను చూచి అక్కడి వారందరి మనసులూ ఆశ్చర్యంతో, సంతోషంతో నిండిపోయాయి' అని చెప్పి వైశంపాయనముని జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

సీ. **'జననాథ! యీ ప్రియసంగమోత్సవ కథ। వినినఁ బఠించిన వేవిధములఁ**
బరమప్రియము లిందుఁ బరలోకమున సంభ। వించు మనమ్మున కించు భంగి
బాంధవయోగశోభనము వర్తిల్లు; న। నాయాసమున నామయాపగమము
గలుగు; భూదేవనికాయంబునకు దీనిఁ। దగ వినిపించిన ధార్మికులకు

తే. **నవ్యయానంద సంప్రాప్తి యావహిల్లుఁ;। దత్పరతఁ గొనియాడిన దైవతములు**
నీచదశఁ బొందకుండంగఁ గాచి తిరిగి। మే లొనర్తురు భరతభూపాలవర్య!' **128**

ప్రతిపదార్థం: జననాథ!= (జనమేజయ మహా) రాజా!; ఈ ప్రియసంగమ+ఉత్సవ-కథ= ఇష్టులైన వారు కలసికొన్న ఆనందదాయకమైన ఈ వృత్తాంతం; వినినన్= వినగా; పఠించినన్= చదివినా; వే విధములన్= అనేక ప్రకారాలుగా; ఇందున్= ఈ లోకంలోనూ; పరలోకమునన్= ఊర్ధ్వలోకాలలోనూ; పరమ-ప్రియములు= ఉత్తమములయిన అభీష్టాలు; సంభవించున్= నెరవేరుతాయి; మనమ్మునకున్= హృదయానికి; ఇంచు భంగిన్= ఇష్టం కలిగించే విధంగా; బాంధవ-యోగ-శోభనము= బంధువులను కలిసికొనే మేలు; వర్తిల్లున్= కలుగుతుంది; అనాయాసమునన్= సులువుగా; ఆమయ-అపగమము= రోగాలు తొలగిపోవటం; కలుగున్= సంభవిస్తుంది; దీనిన్= ఈ కథను; తగన్= సముచితంగా; ధార్మికులకున్= సత్యశౌచాది ధర్మ ఆచరణ శీలురకు; వినిపించినన్= చదివి వినిపిస్తే (అటువంటి); భూదేవనికాయమునకున్= బ్రాహ్మణుల సముదాయానికి; అవ్యయ+ఆనంద-సంప్రాప్తి= తరగని సంతోషం చేకూరటం; ఆవహిల్లున్= సంభవిస్తుంది; భరతభూపాల వర్య!= భరతవంశ రాజులలో శ్రేష్ఠుడా; జనమేజయా!; తత్పరతన్= ఈ కథపై తాత్పర్య (విశ్వాస) బుద్ధితో; కొనియాడినన్= ప్రశంసిస్తే; వారికి; దైవతములు= దేవతలు; నీచదశన్= తక్కువస్థితిని; పొందక+ఉండంగన్= పొందకుండా; కాచి= కాపాడి; తిరిగి= ఇంకా; మేలు= శుభం; ఒనర్తురు= కలుగజేస్తారు.

తాత్పర్యం: జనమేజయ రాజా! ఇష్టులైన వారు కలిసికొన్న ఈ వృత్తాంతాన్ని విన్నా, చదివినా, ఆ జనులకు ఈ లోకంలోనూ, పరలోకంలోనూ అనేక విధాలుగా అత్యుత్తమాలు అయిన కోరికలు నెరవేరుతాయి. మనసారా సంతోషం కలిగేటట్లు తమతమ బంధువులను కలిసికొనే ఆనందకరమైన స్థితిని వారు పొందుతారు. ఏమాత్రం కష్టం లేకుండా వారి రోగాలు తొలగిపోతాయి. ఈ కథను సముచితంగా ధర్మబుద్ధులకు చదివి వినిపించిన బ్రాహ్మణులకు తిరుగులేని ఆనందం కలుగుతుంది. పూర్తి నమ్మకంతో దీనిని ప్రశంసిస్తే వారికి, దేవతలు ఏ విధమైన కష్టమూ కలుగకుండా; ఇంకా అధికంగా శుభం కలుగజేస్తారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. **అనిన విని జనమేజయుండు వైశంపాయనుతో 'ధృతరాష్ట్రుం డట్లు కృష్ణద్వైపాయన ప్రసాదలబ్ధం బైన తత్కాల కలితదృష్టి విశేషంబున బంధులోకంబు నాలోకించి మఱియేమి వర్తనంబున నుండెఁ? బాండవు లెట్లు వర్తించి? రెఱింగింపవే' యనుటయు నతనికి నతం డిట్లనియె.** **129**

ప్రతిపదార్థం: అనినన్= అని వైశంపాయనుడు చెప్పగా; విని= ఆలకించి; జనమేజయుండు= జనమేజయుడు; వైశంపాయనుతోన్= వైశంపాయనమునితో (ఇట్లా అన్నాడు); ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; అట్లు= ఆ విధంగా; కృష్ణద్వైపాయన-ప్రసాద-లబ్ధము= వ్యాసమహర్షి యొక్క దయచేత పొందబడినది; ఐన= అయినటువంటి; తద్-కాల-కలిత-దృష్టి-విశేషంబునన్= ఆ సమయానికి మాత్రం కలిగిన ప్రత్యేకమైన చూపుతో; బంధులోకంబున్= భీష్మాది బంధు సమూహాన్ని; ఆలోకించి= చూచి; మఱి= ఆతరువాత; ఏమి= ఎటువంటి; వర్తనంబునన్= నడవడితో; ఉండెన్= ఉన్నాడు; పాండవులు= పాండురాజు కొడుకులు; ఎట్లు= ఏ విధంగా; వర్తించిరి?= ఉన్నారు?; ఎఱింగింపవే= తెలుపవలసింది; అనుటయున్= అనగా; అతనికిన్= ఆ జనమేజయుడితో; అతండు= వైశంపాయనుడు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వైశంపాయను డావిధంగా చెప్పగా విని జనమేజయుడు (వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు) 'ధృతరాష్ట్రుడు ఆ తీరుగా వ్యాసమహర్షి కరుణవలన పొందిన ఆనాటి చూపుతో, తన బంధువులను చూచి, ఆ తరువాత ఏ ప్రకారంగా నడచుకొన్నాడు? పాండవులు ఎట్లా ఉన్నారు? తెలియజేయవలసింది' అని ప్రార్థించగా అపుడు వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

ధృతరాష్ట్రుఁడు భాగీరథీ తీరంబుననుండి నిజాశ్రమంబు ప్రవేశించుట (సం.15-44-2)

సీ. **అ య్యద్భుతపువృత్త మమ్మెయిఁ జెల్లిన । ధృతరాష్ట్రమేదినీపతి తపస్వి**
గణము సవినయంబుగా నిజస్థానయా । నమునకు నామంత్రితముగఁ జేసి
యాశ్రమభూమికి నరిగెఁ దోడన పాండు । రాజనందనులును రా నుదాత్త
తేజు సత్యవతీ తనూజు మున్నిడికొని । యప్పు డమ్మునిపతి యతనితోడ

తే. **'నీవు వేదశా స్త్రార్థముల్ భావితాత్ము । లగు మునీంద్రులచేఁ జెవులార వింటి,**
కంటి తనయుల నీ కన్న కంటె నొప్పి । యుండుదురు వారు దివిసౌఖ్యయోగ మెసఁగ. **130**

ప్రతిపదార్థం: ఆ+అద్భుతపు వృత్తము= ఆశ్చర్యకరమైన ఆ (ప్రియ సమాగమ) సన్నివేశం; ఆ-మెయిన్= ఆ విధంగా; చెల్లినన్= పూర్తికాగా; ధృతరాష్ట్రమేదినీపతి= ధృతరాష్ట్ర మహారాజు; సవినయంబుగాన్= నమ్రతతో; తపస్విగణమున్= (శతయూపాది) మునుల సముదాయాన్ని; నిజ-స్థాన-యానమునకున్= తమ, తమచోట్లకు వెళ్ళటానికి; ఆమంత్రితముగన్= వీడ్కోలు చెప్పి; పాండురాజ-నందనులు= పాండవులు; తోడన= తనతో (వెంట); రాన్= వస్తూండగా; ఉదాత్త-తేజున్= మిక్కిలి ప్రకాశవంతుడైన; సత్యవతీ-తనూజున్= (సత్యవతి కొడుకు) వ్యాసుడిని; మున్ను-ఇడికొని= ముందు ఉంచుకొని; ఆశ్రమభూమికిన్= తన ఆశ్రమ ప్రదేశానికి; అరిగెన్= వెళ్ళాడు; అప్పుడు= ధృతరాష్ట్రుడు ఆశ్రమానికి వెళ్ళిన తరువాత; ఆ+మునిపతి= మునిశ్రేష్ఠుడైన ఆ వ్యాసుడు; అతని తోడన్= ఆ ధృతరాష్ట్రుడితో (ఇట్లా అన్నాడు); నీవు= నీవు; భావిత-ఆత్ములు= ఆత్మజ్ఞానులయిన; మునీంద్రులచేన్= మునిశ్రేష్ఠులవలన; వేద-శాస్త్ర-అర్థముల్= వేదాలయొక్క, ధర్మశాస్త్రాలయొక్క అంశాలను; చెవులు-ఆరన్= సమగ్రంగా; వింటి(వి)= విన్నావు; తనయుల(న్)= (మృతులయిన) కొడుకులను; కంటి(వి)= ఇపుడు చూచావు; వారు= ఆ కొడుకులు; దివి(న్)= స్వర్గంలో; సౌఖ్య-యోగము= ఆనందంతోడి సంబంధం; ఎసఁగన్= అతిశయించగా; నీ కన్న కంటెన్= ఇపుడు నీవు చూచిన దాని కంటె గూడా; ఒప్పి ఉండుదురు= సుఖంగా ఉంటారు.

తాత్పర్యం: ఆశ్చర్యకరమైన ఆ సంఘటన ఆ విధంగా పూర్తి కావటంతో; ధృతరాష్ట్రుడు వినయంతో వీడ్కోలు చెప్పగా (శతయూపాది) మునులు తమతమ నెలవులకు వెళ్ళిపోయారు. పాండవులు తనవెంట వస్తుండగా వ్యాసమహర్షిని ముందుంచుకొని ధృతరాష్ట్రుడు కూడా తన ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడ వ్యాసుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు 'ఆత్మజ్ఞానులైన మునిశ్రేష్ఠుల వలన వేద శాస్త్రవిషయాలు సంపూర్ణంగా విన్నావు. యుద్ధంలో మరణించిన నీ కొడుకులను చూచావు. నీ కొడుకులు స్వర్గసుఖాలతో నీవు చూచినదానికంటె అధికంగా ఆనందంగా ఉన్నారు.

ఉ. కావున నింక వారికయి కౌరవసత్తమ! యుమ్మలింప కా
త్మావిల భావముం దపము నగ్గలికం బెడఁబాపు నిన్ను సం
భావనఁ గొల్చి యొక్కనెల పాండవముఖ్యుఁడు నిల్చె నిష్ఠమై
నీ వనభూమి; నీ వసుమతీశ్వరుఁ బొమ్మనఁ గాదె వీటికిన్?' 131

ప్రతిపదార్థం: కౌరవ సత్తమ!= కురువంశపు వారిలో శ్రేష్ఠుడా! ధృతరాష్ట్రా!; కావునన్= (నీ కొడుకులు సుఖంగా ఉన్నారు. నీవు చూచావు) కాబట్టి; ఇంకన్= ఇకపైన; వారికయి= కొడుకులను గూర్చి; ఉమ్మలింపక= కుమిలిపోక; ఆత్మ+ఆవిల-భావమున్= మనసులోని కలతనూ; తపము+అగ్గలికన్= తపస్సు యొక్క తీవ్రతను; పెడఁబాపు(ము)= విడిచిపెట్టుము, పాండవ ముఖ్యుఁడు= ధర్మరాజు; సంభావనన్= సగౌరవంగా; నిష్ఠమైన్= శ్రద్ధతో; నిన్నున్= నిన్ను; కొల్చి= సేవించి (సేవిస్తూ); ఈ వనభూమిన్= ఈ అరణ్యం (ఆశ్రమం)లో; ఒక్కనెల= ఒక మాసం పాటు; నిల్చెన్= ఉండిపోయాడు; ఈ వసుమతీ-ఈశ్వరున్= ఈ (ధర్మ) రాజును; వీటికిన్= (హస్తి) నగరానికి; పొమ్ము+అనన్+కాదె!= పొమ్మని చెప్పవచ్చుగదా!

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడా! ధృతరాష్ట్రా! నీ కొడుకులను చూచావు. వాళ్ళు ఎంతో సుఖంగా ఉన్నారు కాబట్టి ఇకనైనా వాళ్ళను గూర్చి కుమిలిపోకుండా, మనసులో కలతనూ, తపసులో తీవ్రతనూ విడిచిపెట్టు! ధర్మరాజు పూజ్యభావంతో శ్రద్ధగా నిన్ను సేవిస్తూ అరణ్యంలో ఒక నెల రోజులు ఉన్నాడు. ఇంక ఈ (ధర్మ) రాజును రాజధానికి వెళ్ళుమని చెప్పవచ్చునుగదా!

వ. అని చెప్పిన నప్పౌరవోత్తముం 'డట్ల చేసెద' నని పలికి యమ్మునిసత్తమునకుం బ్రణమిల్లి 'భవదీయకృపా విశేషం బునం గృతార్థుండనైతి' నని యతని నామంత్రితుం జేసినం, బాండవులుం దగ నప్పరమముని వీడ్కొని; రయ్యం దఱను దీవించి యమ్మహాత్ముం డంతర్హితుం డయ్యెఁ; దదనంతరంబ. 132

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; చెప్పినన్= వ్యాసమహర్షి చెప్పగా; ఆ+పౌరవ+ఉత్తముండు= పురువంశ శ్రేష్ఠుడైన ఆ ధృతరాష్ట్రుడు; అట్లు+అ= ఆ (వ్యాసుడు చెప్పిన) విధంగానే; చేసెదన్= చేస్తాను; అని-పలికి= అని చెప్పి; ఆ+ముని సత్తమునకున్= మునులలో శ్రేష్ఠుడయిన ఆ వ్యాసమహర్షికి; ప్రణమిల్లి= ప్రణామం చేసి; భవదీయ-కృపా-విశేషంబునన్= మీయొక్క, దయ పెంపుతో; కృతార్థుండన్= కోరికలు తీరిన వాడిని; ఐతిన్= అయ్యాను; అని= అనిచెప్పి; అతనిన్= ఆ వ్యాసుడిని; ఆ మంత్రితున్-చేసినన్= వీడుకోలు చెప్పగా; పాండవులున్= పాండవులు గూడా; ఆ+పరమమునిన్= ఆ ఉత్తమ ఋషిని; తగన్= సముచితంగా; వీడ్కొనిరి= వీడుకోలు చెప్పారు; ఆ+మహాత్ముండు= ఆ వ్యాసమహర్షి; ఆ+అందఱను= ధృతరాష్ట్రుడు మొదలైన అక్కడి వారిని అందరినీ; దీవించి= ఆశీర్వదించి; అంతర్హితుండు-అయ్యెన్= అదృశ్యం అయ్యాడు; తద్-అనంతరంబు+అ= అ తరువాత.

తాత్పర్యం: వ్యాసుడు ఆ విధంగా చెప్పగా ధృతరాష్ట్రుడు అట్లాగే చేస్తానని చెప్పి ఆ మహర్షికి ప్రణామం చేసి మీ దయవలన కృతార్థుడినయ్యాను అని చెప్పి వ్యాసుడికి వీడ్కోలు పలికాడు. అప్పుడు పాండవులుకూడా తగువిధంగా ఆ మహర్షికి వీడ్కోలు చెప్పారు. వ్యాసుడు వాళ్ళందరినీ ఆశీర్వదించి అంతర్ధానమయ్యాడు. ఆ తరువాత.

సీ. **ఆంబికేయుండు ధర్మాత్మజుఁ జిత్తసం। ప్రీతి మోమునఁ దోఁపఁ బేరఁ బిలిచి**
'వసుమతీకార్య నిర్వహణంబు పెద్దకొ। ల్వున నుండి నీ వనుదినము నడప
కునికి కర్తవ్యమే? వినుకులు భీష్మాది। మహితులచేత సమగ్రభావ
మొందినయవి యింక నుపదేశ మేమియు। వలవదు; రంధ్ర మొవ్వని జనంబు

తే. **వేచు; ననుజానుగతుఁడవై వేగపొమ్ము। దారయుతముగఁ బురికి నుదారచరిత!**
నీ కతమ్మున మున్న నా శోక మెల్లఁ। బాసెఁ, దేజంబు సౌఖ్యానుభవముఁ గంటి. **133**

ప్రతిపదార్థం: ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; మోమునన్= ముఖంమీద; చిత్తసంప్రీతి= మనసులోని సంతుష్టి; తోఁపన్= కనబడుతుండగా; ధర్మాత్మజున్= ధర్మరాజును; పేరన్= పేరుతో (ప్రేమగా); పిలిచి= దగ్గరకు పిలిచి; ఉదారచరిత!= ఉత్తమమైన నడవడి కలవాడా!; వసుమతీ-కార్య-నిర్వహణము= రాజ్యానికి సంబంధించిన (పాలన) పనులు నడపటం; పెద్ద= ప్రధానమైన అంశం; నీవు= నీవు; అనుదినము= ప్రతిరోజు; కొల్వునన్= కొలువులో; ఉండి= ఉనికిగలిగి; నడపక-ఉనికి= నిర్వహించకుండా ఉండటం; కర్తవ్యము+ఏ?= (నీకు) చేయదగినదేనా?; భీష్మ+ఆది-మహితుల చేతన్= భీష్ముడు మొదలైన గొప్పవారి వలన; వినుకులు= నీవు విని తెలిసికొన్న రాజనీతి విషయాలు; సమగ్ర-భావము= సంపూర్ణత్వాన్ని; ఒందినయవి= పొందాయి; ఇంకన్= ఇంక కొత్తగా; ఉపదేశము= చెప్పవలసినది; ఏమియున్= ఏమీ; వలవదు= లేదు; ఒవ్వనిజనంబు= గిట్టనివారు; రంధ్రము= (నీ) పొరపాటును గూర్చి; వేచున్= ఎదురుచుస్తూ ఉంటారు (అందుచేత); అనుజ-అనుగతుఁడవు+ఐ= తమ్ములచేత అనుసరించబడే వాడివి అయి; దార-యుతముగన్= భార్యలతో; వేగ= త్వరగా; పురికిన్= (హస్తి) నగరానికి; పొమ్ము= వెళ్ళుము; నీకతమునన్= నీకారణంగా; నా శోకము= (పుత్ర) దుఃఖం; ఎల్లన్= సమస్తం; మున్ను+అ= ఇంతకు మునుపే; (దుర్యోధనాదులను ఇట్లా చూడకముందే); పాసెన్= తొలగిపోయింది; తేజంబు(న్)= ఉత్సాహం; సౌఖ్య-అనుభవమున్= ఆనంద అనుభూతినీ; కంటి(న్)= పొందాను.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు మనసులోని సంతోషం ముఖంపై వ్యక్తం అవుతుండగా ధర్మరాజును దగ్గరకు పిలిచి (ఇట్లా అన్నాడు). ఉత్తమమైన నడవడి కలవాడా! ధర్మరాజా! రాజ్యకార్యనిర్వహణం ప్రముఖమైన విషయం (కష్టంతో కూడినది). కొలువులో ఉండి నీవు స్వయంగా ప్రతిరోజూ రాజకార్యాలు నడపకుండా ఉండటం తగునా? భీష్ముడు మొదలైన మహాత్ముల వలన రాజనీతులు సమగ్రంగా తెలిసికొని ఉన్నావు. క్రొత్తగా చెప్పవలసిం దేమీ లేదు. గిట్టనిజనం నీ ప్రమాదం కొరకు వెదకుతూ ఉంటారు. అందుచేత నీవు వెంటనే తమ్ముళ్ళను వెంటబెట్టుకొని భార్యలతో హస్తినగరానికి వెళ్ళుము. నీ వల్ల నా (పుత్ర) శోకం పూర్తిగా ఇంతకు మునుపే పోయింది. ఉత్సాహమూ, సుఖానుభూతీ కలిగాయి.

చ. **'తపమునెడన్ మదీయమతి తత్పర గావున దాని కోర్తు నీ**
వపగతఖేదమానసుఁడ వై నను నిం దతినిష్ఠ నొందఁ బం
చి పురజనంబు సమ్మదముఁ జెందఁగ సైనికు లుల్లసిల్లఁగా
నృపవర! యేఁగి రాజ్య భరనిర్వహణం బొనరింపు', నావుడున్. **134**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: నృపవర!= (ధర్మ) రాజా!; మదీయ-మతి= నా మనస్సు; తపము-ఎడన్= తపస్సు విషయంలో; తత్పర= లగ్నమై ఉన్నది; కావునన్= అందుచేత; దానికిన్= తపస్సు; ఓర్తున్= సహించగలను (అందుచేత); నీవు= నువ్వు; అపగత-ఖేద-మానసుఁడవు= పోయిన విచారం కలిగిన మనస్సు గలవాడవు (మనసులో విచారం విడిచిపెట్టి); ఐ= అయి; ననున్= నన్ను; అతినిష్ఠన్= మిక్కిలి శ్రద్ధతో; ఇందున్= ఈ అరణ్యంలో; ఒందన్= (తపస్సు చేస్తూ) ఉండటానికి; ఎంచి= ఏర్పరచి; (నన్నిక్కడే వదలి) పురజనంబు= పౌరులు; సమ్మదమున్= సంతోషం; చెందఁగన్= పొందేటట్లు; సైనికులు= బంటులు; ఉల్లసిల్లఁగాన్= ఉత్సాహం పొందేటట్లుగా; ఏఁగి= (హస్తినగరానికి) వెళ్ళి; రాజ్య-భర-నిర్వహణంబు= సామ్రాజ్యపు-కార్యభారాన్ని వహించటం; ఒనరింపు(ము)= చేయుము; నావుడున్= అని ధృతరాష్ట్రుడు చెప్పగా, (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడా ధర్మరాజా! నామనస్సు తపస్సు మీద లగ్నమై ఉన్నది. కాబట్టి తపస్సును నేను సులువుగా ఆచరించగలను.అందుచేత నీవు నిర్విచారంగా నన్ను ఈ అరణ్యంలో విడిచి, తపస్సు చేసికొననిచ్చి పౌరులు (రాజ్య ప్రజలు) సంతోషించేటట్లుగా, సైన్యం ఉత్సాహం చెందే విధంగానూ, హస్తినగరానికి వెళ్ళి రాజకార్యాలను నిర్వహించుము. అని ధృతరాష్ట్రుడు చెప్పగా (ధర్మరాజు ఇట్లా అన్నాడు.)

సీ. **ధర్మతనూజుఁ డాతని తోడ నిట్లను। 'నధిప! భీమాదుల నరుగఁ బనుపు**
పుడమి రక్షింప; నీ యడుగులకడ నేను। నిలిచి మా తల్లుల నిన్నుఁ గొలిచి
యంచితతపమున కనుగుణం బైనట్టి। శుశ్రూషణము సేయుచును దపోని
యతితోడ నుండెద; నవపుడు గాంధారి। యి ట్లనఁ దగు 'నన్న 'యీవ కావె

తే. **కురుకులమునకు సంరక్షకుఁడవు; నీవు। తండ్రులకుఁ బిండ మొసఁగఁ గర్తవు; భవజ్జ**
నకునిపంపు చేయుము; భూజనము దలంక। కుండఁ బొ; మ్మది ప్రియము మా యుల్లములకు.' **135**

ప్రతిపదార్థం: ధర్మతనూజుఁడు= ధర్మరాజు; అతని తోడన్= ధృతరాష్ట్రుడితో; ఇట్లు= ఈవిధంగా; అనున్= అన్నాడు; అధిప!= (ధృతరాష్ట్ర) రాజా! పుడమి(న్)= రాజ్యాన్ని; రక్షింపన్= కాపాడటం కొరకు; అరుగన్= (రాజ్యానికి తిరిగి) వెళ్ళటానికి; భీమాదులన్= భీముడు మొదలైనవారిని; పనుపు(ము)= పంపించుము; నేను= నేను మాత్రం; నీ-అడుగుల-కడ(న్)= మీ పాదాల చెంతనే (ఇక్కడే, మీతో); నిలిచి= ఉండి; మా తల్లులన్= మా తల్లులు అయిన గాంధారినీ, కుంతినీ; నిన్నున్= నిన్నూ (ధృతరాష్ట్రుడిని); కొలిచి= సేవించి; అంచిత-తపమునకున్= మీ గొప్ప తపస్సుకు; అనుగుణంబు= తగినది; ఐన-అట్టి-శుశ్రూషణము= అయినటువంటి సేవ; చేయుచున్= చేస్తూ; తపస్-నియతి తోడన్= తపస్సుపై శ్రద్ధతో; ఉండెదన్= (ఇక్కడే) ఉంటాను; అనవుడు(న్)= అని ధర్మరాజు పలుకగా; గాంధారి= గాంధారి (ఇట్లా అన్నది); ఇట్లు= ఈవిధంగా; అనఁదగున్+అన్న!= అనటం ఉచితమేనా నాయనా?; కురుకులమునకున్= కురువంశానికి; సంరక్షకుఁడవు= కాపాడవలసినవాడివి; ఈవు+అ= నీవే; కావే!= కావా!; తండ్రులకున్= (పాండురాజు, మొ॥) వంశంలోని పెద్దలకు; పిండము= పిండాన్ని (శ్రాద్ధక్రియలలో); ఒసఁగన్= ఇవ్వటం; కర్తవు= చేయవలసిన వాడివి; నీవు= నీవే; భవత్-జనకుని-పంపు= నీ తండ్రి (ధృతరాష్ట్రుడు) చెప్పినది; చేయుము= ఆచరించుము; భూజనము= రాజ్యంలోని ప్రజలు; తలంకక-ఉండన్= కంగారు పడకుండా; పొమ్ము= (వెంటనే) రాజధానికి వెళ్ళుము; మా-ఉల్లములకున్= మా అందరి మనస్సులకూ; అది= నీవు రాజధానికి వెళ్ళటమే; ప్రియము= ఇష్టం.

తాత్పర్యం: ధర్మరాజు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'రాజా! రాజ్యాన్ని రక్షించడానికి (రాజధానికి) భీముడు మొదలైన వారిని పంపించుము. నేను ఇక్కడే మీ పాదాల వద్ద ఉండి, గాంధారినీ, కుంతినీ సేవించుకొంటూ, మీ తపస్సుకు తగినట్లుగా మీకు సేవ చేసికొంటూ తపోదీక్షలో ఉంటాను', ఆ మాటలకు గాంధారి ఇట్లా అన్నది. 'నాయనా! నీవు ఈ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విధంగా మాటాడవచ్చునా! కురువంశాన్ని రక్షించవలసిన వాడివి నీవే కదా! పాండుప్రభృతులైన తండ్రులకు శ్రాద్ధకర్మలు నిర్వహించటానికి నీవే కర్తవు. అందుచేత నీ తండ్రి (ధృతరాష్ట్రుడు) చెప్పినట్లు చేయుము. ప్రజలు కలత చెందకుండా వెంటనే రాజ్యానికి తిరిగి వెళ్ళు. అదే మా మనస్సులకు ఇష్టమైనది'.

వ. అని పలికిన, నప్పాండవాగ్రజుండు పాండురాజాగ్రమహిషితో నిట్లనియె. 136

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; పలికినన్= (గాంధారి) అనగా; ఆ+పాండవ+అగ్రజుండు= పాండురాజు కొడుకులలో పెద్దవాడైన ఆ ధర్మరాజు; పాండురాజ-అగ్ర-మహిషితోన్= పాండురాజు యొక్క పెద్ద భార్యతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: గాంధారి ఆ విధంగా అనటంతో ధర్మరాజు కుంతితో ఈ ప్రకారంగా అన్నాడు.

ఆ. 'ఇట్లు మీరు నన్ను నెంతయుఁ దఱిమిన । విపినభూమి మిమ్ము విడిచి పోవ
నియ్యకొనదు నాదుహృదయంబు; మునుపోలెఁ । గలుగ దిపుడు రాజ్యకాంక్ష నాకు. 137

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మీరు= మీరందరూ (గాంధారీ ధృతరాష్ట్రులూ, కుంతీ); తఱిమినన్= ఇక్కడినుంచి వెంటబడి వెళ్ళగొట్టినప్పటికీ; మిమ్మున్= మీ అందరినీ; విపినభూమిన్= అరణ్యదేశంలో; విడిచి= వదలిపెట్టి; పోవన్= రాజ్యానికి తిరిగి వెళ్లటానికి; నాదుహృదయంబు= నా మనస్సు; ముని+పోలెన్= ఇదివరకటివలె; ఇయ్యకొనదు= అంగీకరించటం లేదు; నాకున్= నాకు; ఇపుడు= ఇప్పుడు; రాజ్యకాంక్ష= రాజ్యంమీద కోరిక; కలుగదు= లేదు.

తాత్పర్యం: ఈ విధంగా మీరందరూ నన్ను ఎంతగా వెంటబడి తరిమినెట్టినా మిమ్మల్ని ఈ అడవిలో విడిచి వెళ్ళటానికి ఇదివరకటివలె నా మనసు అంగీకరించటంలేదు. మునుపు ఉన్నట్లు ఇపుడు నాకు రాజ్యంమీద కోరిక లేదు.

క. విను పాంచాలురు మాత్స్యులు । వనితా జనశేషులైరి; వారలు లేమిన్
జననీ! శూన్యంబై తోఁ । చినయది రాజ్యంబు నాదు చిత్తంబునకున్. 138

ప్రతిపదార్థం: జననీ!= అమ్మా!; విను= వినుము; పాంచాలురు(న్)= పాంచాల (ద్రుపద) వంశపు వారూ; మాత్స్యులు= విరాటనగరస్థులూ; వనితా-జన-శేషులు= ఆడవాళ్ళు మాత్రమే మిగిలిన వాళ్ళు; ఐరి= అయ్యారు; వారలు= ఆ పాంచాల, మాత్స్యులు; లేమిన్= లేనందువలన; రాజ్యంబు= ఆ రాజ్యం; నాదు చిత్తంబునకున్= నా మనసుకు; శూన్యంబు+ఐ= నిర్జనం (సారం లేనిది)గా; తోఁచినయది= కనిపించింది.

తాత్పర్యం: అమ్మా! వినుము, పాంచాల వంశంలోనూ, మాత్స్యవంశంలోనూ (పురుషులంతా యుద్ధంలో మరణించటంతో) ఆడవాళ్లు మాత్రమే మిగిలారు. వాళ్ళు ఎవరూ లేకపోవటం చేత ఆ రాజ్యం నా బుద్ధికి శూన్యంగా కనబడుతున్నది.

వ. అట్లుంగాక. 139

తాత్పర్యం: అంతే కాకుండా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. సమరము దీఱినకోలెను । శమనిరతా! నా మనంబు సారతపమునన్
రమియింపఁ గోరు యుష్మ । త్సమధిక తపమునకు నేను సందడి సేయన్.' 140

ప్రతిపదార్థం: శమనిరతా!= స్థిరమైన అంతరింద్రియ నిగ్రహంకలదానా!. తల్లీ!; సమరము= కురుక్షేత్ర యుద్ధం; తీఱినకోలెను= పూర్తి అయినప్పటినుండి కూడా; నామనంబు= నా మనసు; సార-తపమునన్= పరమార్థమైన తపస్సులో; రమియింపన్= ఆసక్తం కావటాన్ని; కోరున్= వాంఛిస్తున్నది; నేను= (అటువంటి) నేను; యుష్మద్-సమధిక-తపమునకున్= తీవ్రమయిన మీ అందరి తపస్సుకు; సందడి= విఘ్నం; చేయన్= (నేను) కలిగించను.

తాత్పర్యం: అంతరింద్రియ నిగ్రహగుణంలో స్థిరమయిన తల్లీ! భారతయుద్ధం ముగిసినప్పటి నుండి నా మనస్సు తపస్సునందే ఆసక్తమై ఉన్నది. నేను మీ తీవ్రమైన తపస్సుకు ఏ విధంగానూ ఆటంకం కలిగించను.

సీ. అన విని సహదేవుఁ డతనితో 'నేఁ దప । మాచరించెద; వీర లందఱకును
శుశ్రూష సేయు చియ్యాశ్రమంబున' నన్న । నక్కుమారునిఁ గుంతి యక్కుఁ జేర్చి
'వలవదు మీరు రా వలఁతులై మామీఁది । భక్తి నింపెసఁగ నీ పలుకు నెట్లు
పలుక మీ యునికి తపమునకు విఘ్నంబ । కాక యెఱిఁగి మీర లెల్లభంగి

ఆ. మాకు నియమవిధి సమాచరణములపై? । నింత యెఱిఁగి మీర లెల్లభంగి
నరుగు టొప్పుఁ గాని కురుకులోద్వహు మాట । గొనక యునికి చనదు తనయులార! 141

ప్రతిపదార్థం: అనన్= అని ధర్మరాజు పలుకగా; విని= ఆలకించి; సహదేవుఁడు= సహదేవుడు; అతనితోన్= ధర్మరాజుతో (ఇట్లా అన్నాడు); ఈ+ఆశ్రమంబునన్= ఈ (ధృతరాష్ట్రుడి) ఆశ్రమంలోనే ఉండి; వీరలు-అందఱకున్= కుంతి మొదలైన వీరికందరికి; శుశ్రూష= సేవ; చేయుచున్= చేస్తూ; తపము= తపస్సు; నే(ను)= నేను; ఆచరించెదన్= చేస్తాను; అన్నన్= అనగా; కుంతి= కుంతీదేవి; ఆ+కుమారునిన్= చిన్నకొడుకైన ఆ సహదేవుడిని; అక్కున్+చేర్చి= తన గుండెలకు హత్తుకొని. (ఇట్లా అన్నది); తనయులార!= కొడుకులారా!; మీరు= మీరు (ధర్మరాజాదులు); రా-వలఁతులు= రాజధర్మంలో సమర్థులు; ఐ= అయిఉండి; మామీఁది భక్తిన్= తల్లిదండ్రులపైన పూజ్య (సేవా) భావంతో; ఇంపు= ఇష్టం; ఎసఁగన్= అతిశయించే విధంగా; ఈ పలుకులు= ఈ రాజ్యం వద్దు. తపస్సు చేస్తాం అనే మాటలు; ఇట్లు= ఈ విధంగా (నేనంటే నేనని పోటీపడి); పలుకన్= అనటం; వలవదు= తగదు; మీ+ఉనికి= ఇక్కడ మీ స్థితి (మీరు ఇక్కడ ఉండటం); తపమునకున్= (మా) తపస్సుకు; విఘ్నంబు+అ= అవరోధమే; కాక= అట్లా కాక; మాకున్= మాకు; నియమ-విధి-సమాచరణములపైన్= తాపసుల నియమాలూ, విధులూ ఆచరించటం విషయంలో; ఏక+అగ్రత= నిశ్చలబుద్ధి; ఎట్లు= ఏ విధంగా; కలుగున్?= సంభవిస్తుంది?; మీరు= మీరు; ఇంత= ఇది అంతా; ఎఱిఁగి= గ్రహించి; ఎల్లభంగిన్= అన్ని విధాలుగానూ; అరుగుట= (రాజ్యానికి తిరిగి) వెళ్ళటం; ఒప్పున్= మంచిది (కర్తవ్యం); కాని= అంతే తప్ప; కురుకుల-ఉద్వహు-మాట= కురువంశాన్ని ఉద్ధరించేవాడయిన ఈ ధృతరాష్ట్రుడి మాటను; కొనక= అనుసరించక; ఉనికి= ఇక్కడే ఉండటం; చనదు= తగినది కాదు.

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా పల్కటం విని సహదేవుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు. (కుంతీ ప్రభృతులైన) వాళ్ళందరికీ సేవలు చేస్తూ ఈ ఆశ్రమంలో ఉండి తపస్సు నేను చేస్తాను. ఆ చిన్నవాడి (కొడుకు) మాటలకు కుంతి సహదేవుడిని, గుండెలకు హత్తుకొని ఇట్లా అన్నది. 'కొడుకులారా! మీరు రాజధర్మంలో సమర్థులయిఉండీ మా (తల్లిదండ్రుల) మీద సేవాదృష్టితో, ఈ మాటలు ఇట్లా అనటం తగదు. మీరు ఇక్కడ ఉండటం మా తపస్సుకు ఆటంకమే అవుతుంది తప్ప తాపసధర్మ ఆచరణంలో మాకు నిబ్బరమైన బుద్ధి ఎట్లా కలుగుతుంది? మీరు ఇది

మొత్తం గ్రహించి రాజ్యానికి తిరిగి వెళ్ళటమే అన్ని విధాలుగానూ ఉచితం. కురువంశ-ఉద్ధారకుడైన ఈ ధృతరాష్ట్రుడి మాట వినకుండా మీరు ఈ ఆశ్రమంలో ఉండిపోవటం ఉచితం కాదు'.

వ. **'మీకు సర్వకార్యంబుల యెడను శుభంబులయ్యెడును; బోయి రం' డనిన నజాతశత్రుండు మఱియొండు వలుకం బుయిలోడి ధృతరాష్ట్రునితోడం' దపోమహనీయులైన మిమ్ముం గొలిచి గత కల్మషుండ నైతి మీ యాజ్ఞాపనంబు దలనిడికొని పురంబునకుం బోయి వచ్చెద' ననుటయు నక్కురువృద్ధుం డతని దీవించుచు నాలింగనంబు చేసి, భీమసేను సాంత్వన వచనంబులం బ్రీతుం గావించి కౌఁగిలించుకొని, గాండీవిం గొనియాడి సంశ్లేషం బాచరించి, కవల సంభావించి పరిరంభణంబు నిర్వర్తించిన, నయ్యేవురు నతని పాదంబులకుఁ బ్రణమిల్లి యాశీర్వాదంబులు వడసి. 142**

ప్రతిపదార్థం: మీకున్= మీకు (పాండవులకు); సర్వకార్యంబుల-ఎడమ= అన్ని పనులలోనూ; శుభంబులు= మేళ్ళు; అయ్యెడును= అగుగాక; పోయిరండు= వెళ్ళిరండి; అనినన్= అని కుంతి పలుకగా; అజాతశత్రుండు= ధర్మరాజు; మఱి-ఒండు= మరొక మాట; పలుకన్= చెప్పటానికి; పుయిలోడి= జంకి; ధృతరాష్ట్రునితోడన్= ధృతరాష్ట్రుడితో; తపోమహనీయులు= తపశ్శక్తిచేత గొప్పవారయిన; మిమ్మున్= మిమ్మల్ని; కొలిచి= సేవించి; గతకల్మషుండన్= పాపాలు తొలగిపోయిన వాడిని; ఐతిన్= అయినాను; మీ-ఆజ్ఞాపనంబు= (రాజధానికి తిరిగివెళ్ళుచున్న) మీయొక్క ఆనతిని; తలన్-ఇడికొని= శిరసా వహించి (తలదాల్చి); పురంబునకున్= హస్తినగరానికి; పోయి వచ్చెదన్= వెళ్ళివస్తాను; అనుటయున్= అని ధర్మరాజు పలుకగా; ఆ+కురువృద్ధుండు= ఆ ధృతరాష్ట్రుడు; అతనిన్= ధర్మరాజును; దీవించుచున్= ఆశీర్వదిస్తూ; ఆలింగనంబు-చేసి= కౌగిలించుకొని; భీమసేనున్= భీముడిని; సాంత్వన-వచనంబులన్= సముదాయింపు మాటలతో; ప్రీతున్= సంతోషించిన వాడిని; కావించి= చేసి; కౌఁగిలించుకొని= దగ్గరకు తీసికొని; గాండీవిన్= అర్జునుడిని; కొనియాడి= పొగడి; సంశ్లేషంబు= కౌగిలింతను; ఆచరించి= చేసి; కవలన్= నకులసహదేవులను; సంభావించి= మన్నింపు మాటలతో ఆదరించి; పరిరంభణము= కౌగిలి; నిర్వర్తించినన్= నడపగా; ఆ+ఏవురు= ఆ పాండవులైదుగురు; అతని పాదంబులకున్= ధృతరాష్ట్రుడి కాళ్ళకు; ప్రణమిల్లి= నమస్కారం చేసి; ఆశీర్వాదంబులు= ధృతరాష్ట్రుడి ఆశీస్సులు; పడసి= పొంది.

తాత్పర్యం: మీకు అన్ని పనుల్లోనూ మేలు కలుగుతుంది. ఇక వెళ్ళిరండి అన్నది కుంతి. ధర్మరాజు కుంతితో ఇంకొక మాట అనటానికి సంకోచించాడు. ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. తపశ్శక్తిచేత మహిమగల మిమ్మల్ని సేవించి నేను నా పాపాలన్నీ పోగొట్టుకొన్నాను. మీ ఆజ్ఞ తలదాల్చి హస్తినగరానికి వెళ్లి వస్తాను' అన్నాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజును ఆశీర్వదిస్తూ, గుండెలకు హత్తుకొన్నాడు. భీముడిని సముదాయింపుమాటలతో సంతృప్తిపరిచి, కౌగిలించుకొన్నాడు. అర్జునుడిని పొగడి ఆలింగనం చేసికొన్నాడు. నకులసహదేవులను మన్నించి కౌగిలించుకొన్నాడు. అపు డా పాండవులు అయిదుగురూ ధృతరాష్ట్రుడి పాదాలకు ప్రణామం చేసి, ధృతరాష్ట్రుడి ఆశీస్సులు పొందారు.

సీ. **అతిభక్తి గాంధారి యడుగుల కెఱఁగిన । నద్దేవి వారల నక్కుఁ జేర్చి**
దీవించె; వారుఁ గుంతీ చరణంబులు । ఫాలముల్ వొందంగఁ బ్రణతు లైనఁ
దప్పక గ్రుచ్చి యందఱ నొక్క కౌఁగిటఁ । బొదివి యాశీర్వాదములు గ్రమమున
నర్మిలిపెంపున నలరుమనంబుతో । వేర్వేఱ యిచ్చె నా వీరజనని

తే. **ద్రుపద పుత్త్రికా ప్రభృతి వధూజనములు। తగు తెఱంగుల మామ నత్తలను వీడు**
కొనిరి వారును వారు నగ్గురు జనముల। నల్ల వలగొని చనిరి నృపాగ్రగణ్య! **143**

ప్రతిపదార్థం: నృప+అగ్ర-గణ్య!= రాజులలో ప్రథముడా! జనమేజయ మహారాజా!; అతిభక్తిన్= మిక్కిలి పూజ్యభావంతో; గాంధారి+అడుగులకున్= గాంధారి పాదాలకు; ఎఱఁగినన్= (పాండవులు) వంగి నమస్కారం చేయగా; ఆ+దేవి= ఆ గాంధారి; వారలన్= ఆ పాండవులను; అక్కున్+చేర్చి= గుండెకు హత్తుకొని; దీవించెన్= ఆశీర్వదించింది; వారున్= ఆ పాండవులు కూడా; ఫాలముల్= తమ నుదుటి ప్రదేశాలు (శిరస్సులు); కుంతీచరణంబులు= కుంతీదేవి పాదాలను; పొందఁగన్= తాకగా; ప్రణతులు= ప్రణామంచేసినవారు; ఐనన్= కాగా; ఆ-వీర-జనని= పాండవ వీరులను కన్న ఆ కుంతి; తప్పక= గట్టిగా; గ్రుచ్చి= పట్టుకొని; అందఱన్= పాండవులు అయిదుగురినీ; ఒక్క కౌఁగిటన్= ఒకే (సారి) కౌగిలిలో; పొదివి= దగ్గరకు తీసికొని; అర్మిలి పెంపునన్= అధికమైన వాత్సల్యంతో; అలరు-మనంబుతోన్= సంతృప్తి నిండిన మనస్సుతో; వేర్వేఱ= ఎవరికి వారికిగా; క్రమమునన్= (ధర్మరాజాదులకు) వరుసగా; ఆశీర్వాదములు= దీవెనలు; ఇచ్చెన్= ఇచ్చింది; ద్రుపద పుత్త్రికా= ద్రౌపది; ప్రభృతి= మొదలైన; వధూ-జనములు= స్త్రీలు; మామన్= మామ అయిన ధృతరాష్ట్రుడినీ; అత్తలను= అత్తలయిన గాంధారినీ, కుంతినీ; తగుతెఱంగులన్= తగిన పద్ధతులలో; వీడుకొనిరి= వీడ్కోలు తీసికొన్నారు; వారును= పాండవులూ; వారు= ద్రౌపది మొదలయిన స్త్రీలు; ఆ+గురుజనములన్= ధృతరాష్ట్రాదులైన పెద్దలను; అల్ల(న్)= మెల్లగా; వలగొని-చనిరి= (చుట్టుగా తిరిగారు) ప్రదక్షిణం చేసి వెళ్లారు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! తరువాత పాండవులు గాంధారి పాదాలకు నమస్కరించారు. ఆమె వాళ్ళను కౌగిలించుకొని దీవించింది. ఆ తర్వాత పాండవులు కుంతీదేవి పాదాలపై శిరసులుంచి నమస్కరించారు. వీరమాత అయిన కుంతి వారిని గట్టిగా పట్టుకొని అందరినీ ఒకేసారి కౌగిలిలోనికి తీసికొని వాత్సల్యం నిండిన మనసుతో, వరుసగా అందరికీ వేరు వేరుగా ఆశీస్సు లిచ్చింది. అటుపిమ్మట ద్రౌపది మొదలయిన స్త్రీ జనంగూడా తగు విధంగా ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతీదేవులనుంచి వీడుకోలు తీసికొన్నారు. ఆ పాండవులు, ద్రౌపదీ ప్రభృతులైన స్త్రీలు అందరూ ధృతరాష్ట్రాదులకు మెల్లగా ప్రదక్షిణం చేశారు.

క. **చని పరిజనములుఁబౌరులు। ననుమోదము తోడఁ గొలువ నరిగిరి నగరం**
బునకున్ గన్నుల పండువు। జనపదముజనం బొనర్ప జనసంస్తుత్యా! **144**

ప్రతిపదార్థం: జన సంస్తుత్యా!= ప్రజలచేత పొగడబడే వాడా! (జనమేజయా!); చని= ప్రదక్షిణం చేసి; (పాండవులు-ద్రౌపద్యాది స్త్రీలూ, ధృతరాష్ట్రాదులకు-వలగొని) అనుమోదముతోడన్= సంతోషంతో; పరిజనములున్= సేవకులూ; పౌరులున్= ప్రజలూ; కొలువన్= సేవిస్తుండగా; జనపదము-జనంబు= (దారిలో) పల్లె ప్రజలు; కన్నుల పండువు= (నేత్రపర్వం= కంటికి ఇంపు) సంతోషం; ఒనర్పన్= కల్గించగా; నగరంబునకున్= హస్తినగరానికి; అరిగిరి= వెళ్ళారు.)

తాత్పర్యం: ప్రజల ప్రశంసలు పొందిన వాడా! (జనమేజయ మహారాజా!) ఆ విధంగా పాండవులూ, ద్రౌపదీ ప్రభృతి స్త్రీలూ, ధృతరాష్ట్రాదులకు ప్రదక్షిణంచేసి-తమసేవకులూ, (తమతో వచ్చిన) ప్రజలూ సంతోషంగా తమను సేవిస్తుండగా, (ప్రయాణంలో దారిలో) పల్లె ప్రజలు కనువిందు చేయగా హస్తినగరానికి వెళ్ళారు.

వ. **అరిగి సముచిత వర్తనంబుల నుండిరి; కొంతకాలంబు చనిన నొక్కనాఁడు నారదమునీంద్రుం డనుజనహితుం**
డై యున్న ధర్మతనయుకడకుఁ జనుదెంచిన, నజ్జననాథుండు దమ్ములుం దానును నమ్మహాత్మునకు భక్తిం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బ్రణమిల్లి యాసనార్ఘ్య పాద్యాదిసత్కారంబు లొనర్చి తదీయ సమీపంబున నాసీనులై; రతని వదనంబు విలోకించి వినయం బెసంగ నమ్మహీపతి 'మహా భాగ! యెందుండి రాక! యేదేశంబులఁ జరించితిరి? నేను మీకు నేమిపని సేయుదుఁ జెప్పుం 'డనిన నప్పరమసంయమి యప్పుడమిఱేనితోడ. 145

ప్రతిపదార్థం: అరిగి= (పాండవులు హస్తినగరానికి) వెళ్ళి; సముచితవర్తనంబులన్= అర్హమైన నడవడులతో; ఉండిరి= ఉన్నారు; కొంతకాలంబు= ఈ విధంగా కొంతకాలం; చనినన్= కడచిపోగా; అనుజ-సహితుండు= తమ్ములతో కూడినవాడు; ఐ= ఉన్న; ధర్మతనయుకడకున్= ధర్మరాజు వద్దకు; ఒక్కనాఁడు= ఒకానొకరోజు; నారదమునీంద్రుండు= ముని శ్రేష్ఠుడైన నారదుడు; చనుదెంచినన్= రాగా; ఆ+మహాత్మునకున్= మహానుభావుడయిన ఆ నారదమునికి; ఆ+జననాథుండు= ఆ (ధర్మ) రాజు; తమ్ములున్= భీముడు మొదలైన తమ్ముళ్ళూ; తానును= తానూ; భక్తిన్= భక్తితో; ప్రణమిల్లి= పాదాభివందనం చేసి; ఆసన+అర్ఘ్య+పాద్య- ఆది-సత్కారంబులు= కూర్చుండటానికి ఆసనం చూపటం అర్చనకూ, పాదప్రక్షాళనకూ నీళ్ళు ఇవ్వటం, మొదలైన గౌరవాన్ని తెలిసే పనులు; ఒనర్చి= చేసి; తదీయ-సమీపంబునన్= ఆ నారదమునికి దగ్గరగా; ఆసీనులు+ఐరి= (పాండవులు) కూర్చున్నారు; ఆ+మహీపతి= ఆ (ధర్మ) రాజు; అతనివదనంబు= నారదుడి ముఖాన్ని; విలోకించి= చూచి; వినయంబు= నమ్రభావం; ఎసంగన్= అతిశయించగా; మహాభాగ!= మహాత్మా!; రాక= తమరు ఇక్కడికి రావటం; ఎందున్+ఉండి?= ఎక్కడినుంచి?; ఏదేశంబులన్= ఏయే చోట్ల; చరించితిరి?= తిరిగారు?; మీకున్= మీకొరకుగా; నేను= నేను (ధర్మరాజు); ఏమిపని= ఏపని; చేయుదున్= చేయుగలను; చెప్పుండు= తెలియజేయండి; అనినన్= అని ధర్మరాజు పలుకగా; ఆ+పరమ-సంయమి= ఆ మునిశ్రేష్ఠుడయిన ఆ నారదుడు; ఆ+పుడమిఱేనితోడన్= ఆ(ధర్మ)రాజుతో, (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఆ విధంగా హస్తినగరానికి వెళ్ళిన పాండవులు అర్హమైన ప్రవర్తనతో ఉంటున్నారు. ఇట్లా కొన్నాళ్ళు గడచిన తరువాత ఒకరోజు ధర్మరాజు తమ్ముళ్ళతో కలిసి కూర్చుని ఉన్నసమయంలో నారదుడు వచ్చాడు. అపుడు తమ్ముళ్ళూ, తానూ నారదుడికి ప్రణామం చేసి, ఆసనం చూపి, అర్ఘ్యం, పాద్యం మొదలైన మర్యాదలు చేసి ఆ నారదుడి వద్దనే కూర్చున్నాడు. అపుడా ధర్మరాజు నారదుడి ముఖం చూస్తూ-వినయం అధికం కాగా (ఇట్లా అన్నాడు) 'మహాత్మా! తమరు ఎక్కడినుండి వస్తున్నారు? ఎక్కడెక్కడ సంచరించారు? మీ కొరకు నేను చేయగలిగిన పని ఏమిటి? తెలియజేయండి' అన్నాడు. అప్పుడు నారదమహర్షి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

నారదుఁడు పాండవులకు ధృతరాష్ట్రాదుల నిర్యాణంబు చెప్పుట. (సం.15-45-1)

సీ. 'భూపవరేణ్య! తపోవనంబుననుండి। వచ్చితిఁ దీర్థసేవా పరత్వ
మున నేను బహుదేశములఁ జరించితి; నినుఁ। గని పెద్దకాలంబు గానఁ జూడఁ
దివిరి యిందులకు నేతెంచితి; ధృతరాష్ట్ర। చరితంబు జాహ్నవీపరిసరంబు
జనములచే వింటి' ననిన నజ్జనపతి। 'యా రాజవరుఁడు గాంధారి గొంతి

తే. సంజయుండు సమాధాన సహితులై శ। రీరముల వింత పుట్టకున్నారె?' యనియె;
ననుడు నద్దేవముని 'వారి యఖిల వర్త। నంబు వినుము సుస్థిర హృదయంబుతోడ.' 146

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భూపవరేణ్య!= (భూమిని పాలించే వారిలో) శ్రేష్ఠుడా! ధర్మరాజా!; నేను= నేను (నారదుడు); తపోవనంబున-నుండి= ముని ఆశ్రమమునుండి; వచ్చితిన్= వచ్చాను; తీర్థసేవా-పరత్వమునన్= పుణ్య తీర్థాలను సేవించటంలో లగ్నమయిన బుద్ధితో; బహు దేశములన్= అనేకములైన దేశాలలో; చరించితిన్= తిరిగాను; నినున్= నిన్ను (ధర్మరాజును); కని= చూచి; పెద్ద-కాలంబు=చాలా కాలమైనది; కానన్= కాబట్టి; చూడన్= నిన్ను చూడాలని; తివిరి= (కుతూహలంగలిగి సప్రయత్నంగా) ఇందులకున్= హస్తినగరానికి; ఏతెంచితిన్= వచ్చాను; ధృతరాష్ట్ర చరితంబు= ధృతరాష్ట్రుడియొక్క వృత్తాంతాన్ని; జాహ్నవీ-పరిసరంబు-జనములచేన్= గంగానదికి చుట్టుప్రక్కల ఉన్న జనాలవలన; వింటిన్= విన్నాను; అనినన్= అని నారదుడు పల్కగా; ఆ+జనపతి= ఆ (ధర్మ) రాజు; ఆ రాజవరుఁడు= రాజులలో శ్రేష్ఠుడైన ఆ ధృతరాష్ట్రుడూ; గాంధారి= గాంధారీ; గొంతి= కుంతీదేవీ; సంజయుండున్= సంజయుడూ; సమాధాన- సహితులు-ఐ= స్థిరమైన తపస్సమాధితో కూడిన వారు అయి; శరీరములన్= తమ దేహాలలో; వింత= వైపరీత్యం; పుట్టక= ఏర్పడకుండా; ఉన్నారె?= సుఖంగా ఉన్నారా?; అనియెన్= అన్నాడు; అనుడున్= ధర్మరాజు ఆ విధంగా ప్రశ్నింపగా; ఆ+దేవముని= ఆ నారదమహర్షి (ఇట్లా అన్నాడు); వారి-అఖిల-వర్తనంబు= ధృతరాష్ట్రాదుల వృత్తాంతం మొత్తమూ; సుస్థిర-హృదయంబుతోడన్= సావధానమతితో; వినుము= వినుము.

తాత్పర్యం: 'రాజులలో శ్రేష్ఠుడా! ధర్మరాజా! ఆశ్రమం నుండి వస్తున్నాను. పుణ్య తీర్థాలను సేవించాలనే కోరికతో చాలా దేశాలు తిరిగాను. నిన్ను చూచి చాల కాలమైనది కాబట్టి ఒకసారి చూచిపోదామని ఇక్కడికి వచ్చాను. గంగానది చుట్టుపక్కల జనంవలన ధృతరాష్ట్రాదుల వృత్తాంతం విన్నాను.' అనిన నారదుడి మాటలు విని ఆ ధర్మరాజు' ఆ ధృతరాష్ట్ర మహారాజు, గాంధారీ, కుంతీ, సంజయుడూ, నిశ్చలతపోదీక్షతో, శరీరాలకు ఏ విధమైన వైపరీత్యమూ కలగకుండా సుఖంగా ఉన్నారా?' అని అడిగాడు. అందుకు నారదుడు వారి సంగతులన్నీ (చెప్పుతాను) సావధానబుద్ధితో వినుము'. (అన్నాడు).

వ. అని పలికి యిట్లను 'మీరు పోయి కాంతారంబున నక్కురువృద్ధుం గొలిచియుండి, యతం డనుమతి సేయ నిట వచ్చితిరి; మఱి కొన్ని దినంబులకు. 147

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలికి= చెప్పి; ఇట్లు= (నారదుడు) ఈ విధంగా; అనున్= అన్నాడు; మీరు= పాండవులు; పోయి= (ధృతరాష్ట్రాదులను చూడటానికి) వెళ్ళి; కాంతారంబునన్= అడవిలో; ఆ+కురువృద్ధున్= ఆ ధృతరాష్ట్రుడిని; కొలిచి+ఉండి= సేవిస్తూ ఉండి; అతండు= ఆ ధృతరాష్ట్రుడు; అనుమతి చేయన్= పంపగా; ఇటన్= రాజ్యానికి; వచ్చితిరి= వచ్చారు; మఱి= తరువాత; కొన్నిదినంబులకున్= కొన్ని రోజులకు.

తాత్పర్యం: నారదుడు ఆ విధంగా పలికి మళ్ళీ ఇట్లా అన్నాడు. 'మీరు (పాండవులు) ధృతరాష్ట్రాదులను చూడడానికి వెళ్ళి అరణ్యంలో ఆ ధృతరాష్ట్రుడిని సేవించి-అతడు పంపించగా రాజ్యానికి తిరిగి వచ్చారు. ఆ తరువాత కొన్నినాళ్ళకు (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. ఆ రాజు నియతి గాంధారియు గొంతియు। సంజయుండును దోన చనఁగ నగ్ని
హోత్రంబు గొని యాజకోత్కరం బగ్రేస। రంబయి పో నిజాశ్రమము విడిచి
యరిగె గంగాద్వార పరిసరారణ్య భా। గమునకు; నందు దుష్కరతపంబు
వాయుభక్షతఁ బూని చేయఁ దొడంగె; గాం। ధారియు నీళ్ళ నాహారకలన

తే. **మోపి యొనరించె; గొంతి మాసోపవాస। నియమ మూఁది వర్తించె; సంజయుఁడు సప్త**
భోజనాంతరితం బగు భోజనంబు। వ్రతము గాఁగఁ జరించెఁ గౌరవ్యముఖ్య! 148

ప్రతిపదార్థం: కౌరవ్య-ముఖ్య!= కురువంశ్యులలో ఎన్నదగిన ధర్మరాజా!; నియతిన్= నియమంతో; గాంధారియున్= గాంధారీ; గొంతియున్= కుంతీ; సంజయుండును= సంజయుడూ; తోన్+అ= వెంటనే; చనఁగన్= రాగా; యాజక+ఉత్కరంబు= ఋత్విక్కుల సమూహం; అగ్నిహోత్రంబు= అగ్నిని; కొని= తీసికొని; అగ్రేసరంబు= (ధృతరాష్ట్రుడికి) ముందుగా; పోన్= పోతూఉండగా; ఆ రాజు= ఆ ధృతరాష్ట్రుడు; నిజ+ఆశ్రమము= (శతయూపాశ్రమ సమీపంలో ఏర్పరచుకొన్న) తన తపోవనాన్ని; విడిచి= వదలిపెట్టి; గంగా-ద్వార-పరిసర-అరణ్య-భాగమునకున్= గంగ పుట్టిన చోటికి (గురుద్వారం) సమీపంలో ఉన్న అడవి ప్రదేశానికి; అరిగెన్= వెళ్ళాడు; అందున్= ఆ అరణ్యంలో; వాయుభక్షతన్= కేవలం గాలి మాత్రమే ఆహారంగా తీసికొనటం అనే నియమం; పూని= అనుసరించి; దుస్-కర తపంబు= అసాధ్యమైన తపస్సు; చేయన్-తొడంగెన్= చేయటం ప్రారంభించాడు; గాంధారియున్= గాంధారి కూడా; నీళ్ళన్= నీటిని; ఆహార-కలనము= ఆహారంగా స్వీకరించే నియమాన్ని; ఓపి= అనుసరించి; ఒనరించెన్= తపస్సు చేసింది; గొంతి= కుంతి; మాస-ఉపవాస-నియమము= నెలరోజులు ఉపవాసం చేసేటటువంటి (నెలకొక్కసారి ఆహారం తీసికొనే) కట్టుబాటును; ఊఁది= ఆశ్రయించి; వర్తించెన్= తపస్సు చేస్తూ ఉన్నది; సంజయుఁడు(న్)= సంజయుడు కూడా; సప్తభోజన+అంతరితంబు= ఏడు భోజనాల వ్యవధానంతో (ఏడుపూటల కొకసారి); భోజనంబు= భోజనం తీసికొనటం; వ్రతము+కాఁగన్= నియమంగా; చరించెన్= ఆ అరణ్యంలో తపస్సు ఆచరించాడు.

తాత్పర్యం: కురుశ్రేష్ఠుడా! ధర్మరాజా! నియమవంతంగా, గాంధారీ, కుంతీ, సంజయుడూ తనను వెన్నంటి వస్తుండగా, ఋత్విక్కులు అగ్నులు తీసికొని తనకు ముందుగా నడుస్తుండగా, ఆ ధృతరాష్ట్రుడు తన ఆశ్రమాన్ని విడిచిపెట్టి గంగా ముఖం పరిసరాలలో ఉన్న అరణ్యాలకు వెళ్ళాడు. అక్కడ కేవలం గాలి ఆహారంగా ఇతరులకు అసాధ్యతపస్సు ప్రారంభించాడు. గాంధారి నీళ్ళు మాత్రం ఆహారంగా తీసికొంటూ తపస్సు ఆచరించింది. మాసోపవాసంతో నెలకొక సారి భోజనం తీసికొంటూ కుంతీ, ఏడుపూటల కొక పర్యాయం భోజనం తీసికొంటూ సంజయుడూ అక్కడ తపస్సు చేశారు.

తే. **యాజకులు దార యక్కురురాజు భక్తి। యుక్తి నొద్దనుండఁగ నగ్నిహోత్ర హోమ**
మాచరింతు రొక్కొకమరి యతఁడు పర్ణ। శాల వెడలి శూన్యాటవి సంచరించు. 149

ప్రతిపదార్థం: ఆ+కురురాజు= ఆ ధృతరాష్ట్రుడు; భక్తియుక్తిన్= పూజ్యభావంతో కూడి; ఒద్దన్= సమీపంలో; ఉండఁగన్= ఉండగా; యాజకులు= ఋత్విక్కులు; అగ్నిహోత్ర-హోమము= అగ్నులలో విధ్యుక్తంగా, హోమాన్ని; ఆచరింతురు= చేస్తుంటారు; ఒక్క+ఒక్క మరి= ఒక్కొక్కసారి; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; పర్ణశాల(న్)= ఆశ్రమాన్ని; వెడలి= విడిచిపెట్టి; శూన్య-అటవిన్= నిర్జనమైన అరణ్యాలలో; సంచరించున్= తిరుగుతుంటాడు.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రుడు భక్తి భావంతో, సమీపంలో ఉండగా ఋత్విక్కులు హోమంచేసేవారు. ఒక్కొక్కసారి ఆశ్రమం విడిచి నిర్జనమైన అరణ్యాలలో తిరుగుతుంటాడు ఆ ధృతరాష్ట్రుడు.

వ. **విషమ ప్రదేశంబుల నవ్విభునకు సంజయుండును। గాంధారికిఁ గుంతియుఁ గన్నై మెలంగుదు; రొక్కనాఁడు**
వారలందఱు గంగాద్వారంబునం గృతస్నానులై యాశ్రమంబునకు వచ్చుచుండ మహావాతోద్ధూతంబై. 150

ప్రతిపదార్థం: విషమ-ప్రదేశంబులన్= సమంగాలేని చోట్ల; ఆ+విభునకున్= ఆ ధృతరాష్ట్రుడికి; సంజయుండును= సంజయుడూ; గాంధారికిన్= గాంధారికి; కుంతియున్= కుంతీ; కన్ను+అయి= నేత్రంగా; మెలంగుదురు= మసలుకొంటారు; ఒక్కనాఁడు= ఒకానొకరోజు; వారలు+అందఱున్= ధృతరాష్ట్రుడు మొదలైన వారంతా; గంగాద్వారంబునన్= గంగాముఖంలో; కృతస్నానులు-ఐ= స్నానం చేసిన వారయి; ఆశ్రమంబునకున్= తమ తపోవనానికి; వచ్చుచున్+ఉండన్= వస్తూండగా; మహా-వాత-ఉద్ధూతంబు+ఐ= పెద్ద సుడిగాలిచేత-ఎగసిపడుతూ.

తాత్పర్యం: సమంగాని కష్టమైన స్థలాలలో ధృతరాష్ట్రుడికి సంజయుడూ, గాంధారి, కుంతీ కన్నులవలె మసలుకొనేవారు. ఒకరోజు వాళ్ళందరూ గంగాద్వారంలో స్నానం చేసి తిరిగి ఆశ్రమానికి వస్తూ ఉండగా పెద్ద సుడిగాలిలో ఎగసి పడుతూ-(దావానలం వ్యాపించిందని తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **పటుతరం బగు ఛటచ్ఛటరవ మెసఁగంగ । మ్రాఁకులుఁ బొదలును గాఁచికొనుచుఁ**
గమరును నార్తనాదంబును బెల్లుగ । నఖిలమృగంబుల నాఁచికొనుచు
లాఁగలఁ బుట్టల లోఁగిన శిఖల భు । జంగమ కులముల మ్రింగికొనుచు
వెగడొంది యఱచుచు నెగయు బల్పులుఁ గులఁ । బొగ నూర్ధ్వకీలలఁ బొదివి కొనుచు

తే. **దెసల నన్నిటఁ దన సముదీర్ణగతులు । దారుణ స్ఫురణమున విస్తార మొంద**
ఖేచరులకును భయముగ నేచి పరఁగె । నద్భుతోద్భవం బైన మహానలంబు. **151**

ప్రతిపదార్థం: పటుతరంబు= మిక్కిలి దృఢం; అగు= అయినటువంటి; ఛట చ్ఛటరవము= ఛట, ఛట, అనే విధమైన మోత; ఎసఁగన్= అతిశయిస్తుండగా, మ్రాఁకులున్= పెద్ద పెద్ద చెట్లనూ; పొదలున్= పొదరులనూ; కాఁచికొనుచున్= కాల్చుకొంటూ; కమరును= కాల్పులూ (చర్మం కాలిన వాసనా); ఆర్తనాదములును= బాధతో చేసిన అరపులూ; పెల్లుగన్= అధికం కాగా; అఖిల మృగంబులన్= సమస్తమైన జంతువులనూ; ఆఁగి కొనుచున్= ఆక్రమించుకొంటూ; లాఁగలన్= బొరియలలోనూ; పుట్టలన్= (పాము) పుట్టలలోనూ; లోఁగినన్= (లోపలకు) చొచ్చుకుపోయినా; శిఖలన్= మంటలతో; భుజంగమ-కులములన్= పాముల సముదాయాలను; మ్రింగికొనుచున్= మింగివేస్తూ (దగ్ధం చేస్తూ); వెగడు= భయం; ఒంది= పొంది; అఱచుచున్= అరుస్తూ; ఎగయు= ఆకాశంలోకి ఎగిరిపోతున్న; బల్-పులుఁగులన్= అధికమైన పక్షులనూ; పొగన్= పొగతోను; ఊర్ధ్వ కీలలన్= ఎత్తైన జ్వాలలతోనూ; పొదివికొనుచున్= తనలోపలికి లాక్కుంటూ; దెసలన్-అన్నిటన్= దిక్కులన్నింటినిండా; తన-సముదీర్ణ-గతులు= తన (దావాగ్ని) యొక్క-హెచ్చిన-పోకడలు; దారుణ-స్ఫురణమునన్= భయం కలిగిస్తు; విస్తారము+ఒందన్= విరివికాగా; అద్భుత+ఉద్భవంబు= ఆశ్చర్యంగా పుట్టినది; ఐన= అయినటువంటి; మహా+అనలంబు= గొప్ప అగ్ని; ఖేచరులకును= ఆకాశంలో సంచరించే దేవాదులకు సైతం; భయముగన్= భయం పుట్టిస్తూ; ఏచి= పెరిగి; పరఁగెన్= వ్యాపించింది.

తాత్పర్యం: ధృడమైన-ఛట,ఛటా అనే ధ్వనులు హెచ్చుతుండగా పెద్ద పెద్ద మాకులనూ, పొదలనూ కాలుస్తూ, కాలుస్తూ బాధతోడి అరుపులూ అధికం అవుతుండగా, సమస్తమైన జంతువులను ఆక్రమించుకొంటూ కన్నాలలోనూ, పుట్టలలోనూ ప్రవేశించినా (తన) మంటలతో పాములను మింగుతూ, భయంతో అరుస్తూ ఆకాశంలోకి ఎగిరిపోతున్న పక్షులను పొగతోనూ, జ్వాలలతోనూ, తనలోపలికి లాక్కుంటూ, అన్ని దిక్కులలోనూ అడ్డు లేకుండా ఉన్న తన పోకడలు భయం కలిగిస్తుండగా ఆశ్చర్యంగా ఏర్పడిన మహాగ్ని దేవగంధర్వాది ఆకాశ గాములకు సైతం భయం పుట్టిస్తూ పెరిగి వ్యాపించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లెరగలి చిచ్చు గవిసి చుట్టు ముట్టిన నమ్మనుజనాథుండును నన్నాతులు నిరాహారులై యునికిం జేసి యొక్క చోటఁ దటియ నుటికి తొలంగిపోవ లావులేరై; రట్టియెడ నా రాజర్షిసత్తముండు సంజయుతోడ. 152

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఎరగలి-చిచ్చు= దావాగ్ని; కవిసి= వ్యాపించి; చుట్టు-ముట్టినన్= చుట్టూనిండగా; ఆ+మనుజ నాథుండును= ఆ ధృతరాష్ట్ర మహారాజు; ఆ+నాతులు(న్)= ఆ స్త్రీలు గాంధారీ, కుంతీ; నిరాహారులు= ఆహారం తీసికొనని వారు; ఐ= అయి; ఉనికిన్-చేసి= ఉండటం వలన; ఒక్కచోటన్= వేరొక చోటికి; తటియన్= చేరుకొనటానికి; ఉటికి= పరుగెత్తి; తొలఁగిపోవన్= ఆ ప్రదేశంనుంచి వదలి వెళ్ళిపోవటానికి; లావు= శక్తి; లేరు+ఐరి= లేనివారు అయినారు; అట్టిఎడన్= ఆ పరిస్థితిలో; ఆ రాజర్షి సత్తముండు= రాజ ఋషులలో ఉత్తముడైన ఆ ధృతరాష్ట్రుడు; సంజయుతోడన్= సంజయుడితో (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఆవిధంగా అడవినిప్పు విస్తరించి తమను ముట్టడించగా ఆ ధృతరాష్ట్రుడూ, గాంధారీ, కుంతీ నిరాహారంగా ఉండటం వలన ఆచోటు వదలి వేరొకచోటికి వెళ్ళటానికి శక్తిలేని వారయినారు. అటువంటి స్థితిలో ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

సీ. 'ఒక్కింత దెఱపి నీ వెక్కడ నైనను। గనుఁగొని పొ మ్మగ్ని దనుకకుండ'
నని చెప్పి తలఁగిపోఁ దనకు గాంధారికిఁ। గుంతిభోజాత్మజకును నశక్య
మగుటయుఁ జెప్పిన నడలొంది యా సూత। సుతుఁడు 'మీరును నొకచోట వెడలి
పోవుట గలిగినఁ బోదు గా కే దవా। గ్నికి మిమ్ము నెర చేసి యకట పోదు

ఆ. నే మహాత్మయనుడు 'నిలువాసి యిట్లున్న। జనుల కివ్విధమున సమయు టెగ్గు
గాదు; నీకుఁ బోవఁగా వచ్చి యుండంగఁ। బోవ కునికి పాపమునకుఁ బట్టు.' 153

ప్రతిపదార్థం: నీవు= నీవు; ఎక్కడన్+ఐనను= ఏ చోట అయినా; ఒక్క+ఇంత= కొంచెం; తెఱపి= దావాగ్ని లేనిది; కనుఁగొని= చూచికొని; అగ్ని= దావాగ్ని; తనుకక-ఉండన్= సోకకుండా; పొమ్ము= వెళ్ళిపొమ్ము; అని చెప్పి= సంజయుడికి చెప్పి, తనకున్= తనకూ (ధృతరాష్ట్రుడికీ); గాంధారికిన్= గాంధారికీ; కుంతిభోజ-ఆత్మజకున్= (కుంతిభోజుడి కూతురు) కుంతికీ; తలఁగి= అగ్నిని తప్పుకొని; పోన్= వెళ్ళిపోవటానికి; అశక్యము= సాధ్యంకానిది; అగుటయున్= కావటమూ; చెప్పినన్= చెప్పగా; ఆ సూతసుతుఁడు= (సూతుడి కొడుకు) సంజయుడు; అడలు+ఒంది= భయపడి; మీరును= మీరందరూ; ఒకచోటన్= వేరొక (నిప్పులేని) చోటికి; వెడలి-పోవుట= ఈ (అగ్నినిండిన) చోటు విడిచి వెళ్ళటం; కలిగినన్= జరిగితే; ఏన్+పోదున్= నేనూ వెళ్లుతాను; కాక= అలా కాకుండా; అకట!= అయ్యో!; మహాత్మ!= దేవా!; మిమ్మున్= మిమ్మల్ని; దవ+అగ్నికిన్= అడవి అగ్గికి; ఎర-చేసి= ఆహుతిగా చేసి; పోదునే?= (నేను) పోగలనా?; అనుడున్= అని సంజయుడు చెప్పగా; ఇలు-పాసి= ఇల్లు విడిచిపెట్టి; ఇట్లు= ఈప్రకారంగా రక్షించుకోవడం అసాధ్యమై; (తాపసులై); ఉన్న జనులకున్= ఉన్నటువంటివారికి; ఈ-విధమునన్= ఈప్రకారంగా (అగ్నిపాలయి); సమయుట= మరణించటం; ఎగ్గు= కీడు (తప్పు); కాదు= కానేరదు; నీకున్= నీకు (సంజయుడికి); పోవఁగాన్= తప్పించుకొని పోవటానికి; వచ్చి-ఉండంగన్= సాధ్యమై ఉండగా; పోవక= (తప్పించుకొని) పోకుండా; ఉనికి= (ఇక్కడే) ఉండటం; పాపమునకున్= పాపానికి; పట్టు= స్థానం.

తాత్పర్యం: 'ఎక్కడైనా దావాగ్ని లేని కొంచెం చోటు చూచుకొని ఈ నిప్పు సోకకుండా నీవు వెళ్ళిపొమ్మ'- అనిచెప్పి ధృతరాష్ట్రుడు తనకూ, గాంధారికీ, కుంతికీ, అట్లా తప్పించుకొనిపోవటం సాధ్యంకాక పోవటాన్ని కూడా తెలియజేశాడు (సంజయుడికి), అపుడు సంజయుడు భయపడి 'మహానుభావా! మీరుకూడా ఈ చోటు విడిచి వేరొక చోటికి వెళ్ళితే

నేనూ వెళ్ళుతా గాని అయ్యో! మిమ్మల్ని ఈ దావాగ్నికి ఆహుతి చేసి నేనొక్కడిని వెళ్ళగలనా?' అన్నాడు. అపుడు ధృతరాష్ట్రుడు 'ఇల్లు వదలి ఈ విధంగా (తప్పించుకొనటానికి సాధ్యంగాని స్థితిలో) ఉన్నవారు ఈ ప్రకారంగా (అప్రయత్నంగా, బలవంతంగా) మరణించటం తప్పు (పాపం) కాదు, తప్పుకొని రక్షించుకొనే అవకాశం ఉన్న నీవు తప్పుకొనకుండా ఇక్కడే ఉండటం పాపహేతువు'.

వ. అని పలికి యతనిం బోవ నొడంబఱిచి యప్పౌరవ సత్తముండు సమాహితచిత్తుండై ప్రాఙ్ముఖాసీనుం డయ్యెఁ; గాంధారియుం గుంతియు నవ్విధంబునం గూర్చుండి; రప్పుడు సంజయుండు ధృతరాష్ట్రుతో 'యోగయుక్తుం డవు గ' మ్మనియెఁ; నతండు నట్లు సేసెఁ; దదనంతరంబ. 154

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలికి= చెప్పి; అతనిన్= సంజయుడిని; పోవన్= తమను (అగ్నిని) విడిచి వెళ్ళటానికి; ఒడంబఱిచి= అంగీకరింపజేసి; ఆ+పౌరవసత్తముండు= పురువంశంలో పుట్టిన శ్రేష్ఠుడు-ధృతరాష్ట్రుడు; సమాహితచిత్తుండు= నిశ్చలమైన మనస్సు కలిగినవాడు; ఐ= అయి; ప్రాక్+ముఖ+ఆసీనుండు= తూర్పుముఖంగా కూర్చున్నవాడు; అయ్యెన్= అయ్యాడు; గాంధారియున్= గాంధారీ; కుంతియున్= కుంతికూడా; ఆ+విధంబునన్= ఏకాగ్రమైన మనస్సుతో తూర్పు ముఖంగా; కూర్చుండిరి= కూర్చున్నారు; అప్పుడు= ఆసమయంలో; సంజయుండు= సంజయుడు; ధృతరాష్ట్రుతోన్= ధృతరాష్ట్రుడితో; యోగ-యుక్తుండవు= మనస్సుయొక్క వ్యాపారాలను నిరోధించి (జీవాత్మను పరమాత్మయందు కలవటం కలిగి)న వాడివి; కమ్ము= అగుము; అనియెన్= అన్నాడు; అతండున్= ఆ ధృతరాష్ట్రుడుకూడా; అట్లు= సంజయుడు చెప్పినవిధంగా; చేసెన్= చేశాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: అని చెప్పి సంజయుడిని, తమను వదలి వెళ్ళిపోవటానికి ఒప్పించి, ఆ ధృతరాష్ట్రుడు మనసును నిశ్చలంగా చేసికొని తూర్పుముఖంగా కూర్చున్నాడు. గాంధారీ, కుంతీ కూడా ఆవిధంగానే కూర్చున్నారు. అపుడు సంజయుడు ధృతరాష్ట్రుడితో- 'చిత్తవ్యాపారాలను నిరోధించు- (జీవాత్మను పరమాత్మతో కలిసిఉంచు)' మని చెప్పాడు. ధృతరాష్ట్రుడు అట్లాగే చేశాడు. ఆ తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ఒక్కతెఱపి సంజయుఁడు సని హిమశైల। మెక్కెఁనంత వారి నెల్ల నగ్ని
పొదివికొనియెఁ; నిట్లు వోయి రమ్మువ్వురుఁ। బుణ్యలోకమునకు భూపవర్య! 155

ప్రతిపదార్థం: భూవర్య!= రాజశ్రేష్ఠుడా! ధర్మరాజా!; సంజయుండు= సంజయుడు; ఒక్కతెఱపిన్= కొంచెం సందు చూచుకొని; చని= వెళ్ళిపోయి; హిమశైలము= హిమాలయం; ఎక్కెన్= చేరుకొన్నాడు; అంతన్= ఆ తరువాత; వారిన్ ఎల్లన్= వారిని అందరినీ (కుంతీ, గాంధారీ ధృతరాష్ట్రులను); అగ్ని= దావాగ్ని; పొదివికొనియెన్= తనలో ఇముడ్చుకొన్నది; ఆ+ముువ్వురు= ఆ ముగ్గురూ (ధృతరాష్ట్రుడు-గాంధారి-కుంతి); ఇట్లు= ఈ విధంగా; పుణ్యలోకమునకున్= పుణ్యవంతుల లోకానికి, సద్గతికి; పోయిరి= వెళ్ళిపోయారు.

తాత్పర్యం: ధర్మరాజా! సంజయుడు ఆ దావాగ్నిలో కొద్దిగా సందు చూచుకొని దాటిపోయి హిమాలయానికి వెళ్ళిపోయాడు. తరువాత ఆ దావాగ్ని వాళ్ళందరినీ తనలో కలుపుకొన్నది. ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి ఆ ముగ్గురూ ఈ విధంగా (తమ తనువులు చాలించి) ఉత్తమలోకాలకు చేరుకొన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. పదపడి నృప! యేను భాగీరథీతీర। మున వచ్చుచుండి యవ్వనము దివ్య
మునులచే మీ రటు సని క్రమ్మఱంగ వ। చ్చినది యాదిగ నయ్యశేష వృత్త
మును నేర్పడఁగ వింటి, మూఁడు కళేబర। ములుఁ గంటి; నక్కురుపుంగవుండు
భార్యయుఁ బాండుని పత్నియు సద్గతి। నొందిరి; నీ వింక నుమ్మలింప

ఆ. కుండు' మనిన శోక మొదవి యాతఁడు బాహు। లెత్తి యెలుఁగు సెలఁగ నేడ్వఁ దమ్ము
లడలు గదిరి యేడ్చి; రవ్వార్త నంతఃపు। రమున రోదనార్తరవము లెసఁగ! 156

ప్రతిపదార్థం: నృప!= (ధర్మ) రాజా!; పదపడి= ఆ తర్వాత; ఏను= నేను (నారదుడు); భాగీరథీ తీరమునన్= గంగఒడ్డు మీదుగా; వచ్చుచున్+ఉండి= వస్తూ; ఆ+వనము-దివ్య-మునులచేన్= ఆ గంగాపరిసరారణ్యవాసులైన మునివరులవలన; మీరు= మీరు (పాండవులు); అటన్= ఆ ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి; చని= వెళ్ళి; క్రమ్మఱంగన్= తిరిగి; వచ్చినది= హస్తినకు రావటం; ఆదిగన్= మొదలుగా; ఆ+అశేషవృత్తమును= జరిగిన వృత్తాంతం యావత్తూ; ఏర్పడఁగన్= వివరంగా; వింటిన్= విన్నాను; మూఁడు కళేబరములున్= ముగ్గురి (ధృతరాష్ట్రుడు, గాంధారి-కుంతి) శరీరాలనూ; కంటిన్= చూచాను; ఆ+కురుపుంగవుండు(న్)= ఆ ధృతరాష్ట్రుడూ; భార్యయున్= అతని భార్య గాంధారీ; పాండుని పత్నియున్= పాండురాజు భార్య-కుంతీ; సద్గతిన్= ఉత్తమలోకాలను; ఒందిరి= పొందారు; ఇంకన్= అందుచేత ఇంక; నీవు= నీవు; ఉమ్మలింపక+ఉండుము= దుఃఖించకుండా ప్రశాంతంగా ఉండు; అనినన్= నారదుడు చెప్పగా; శోకము= దుఃఖం; ఒదవి= పుట్టి; అతఁడు= ధర్మరాజు; బాహులు= చేతులు; ఎత్తి= పైకెత్తి; ఎలుంగు= గొంతు (కంఠస్వరం); చెలఁగన్= ధ్వనించగా; (పెద్దగా); ఏడ్వన్= ఏడుస్తుంటే; తమ్ములు= (ఆ ధర్మరాజు తమ్ములు) భీమ, అర్జున, నకుల, సహదేవులు; అడలు= దుఃఖం; కదిరి= అతిశయించి; ఏడ్చిరి= ఏడ్చారు; ఆ+వార్తన్= ధృతరాష్ట్రాదుల మరణవార్తవలన; అంతఃపురమునన్= ఆ రాణి వాసాలలో; రోదన+ఆర్త-రవములు= ఏడుపులతో, బాధనిండిన ధ్వనులు; ఎసఁగన్= అధికం కాగా.

తాత్పర్యం: ధర్మరాజా! తర్వాత నేను గంగాతీరం మీదుగా వస్తూ-మీరు ధృతరాష్ట్రాదులను చూడటానికి ఆయన ఆశ్రమానికి రావటం, తరువాత రాజ్యానికి తిరిగి రావటం మొదలుగా ఈ వృత్తాంతం మొత్తం ఆ గంగా తీరారణ్యవాసులయిన మునులవలన విన్నాను. ఆ ముగ్గురి (దగ్ధ) శరీరాలనూ చూచాను. ఆ ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, ఉత్తమలోకాలకు వెళ్ళిపోయారు. కాబట్టి నీవింక ఏమీ దుఃఖపడకు' మని నారదుడు చెప్పగా దుఃఖం కలిగి, ధర్మరాజు చేతులు పైకెత్తి, బిగ్గరగా ఏడ్వసాగాడు. భీమాదులూ దుఃఖంతో ఏడ్చారు. ఆ వార్తచేత అంతఃపురంలోను ఏడుపుల ధ్వనులు అతిశయించాయి.

వ. అవ్విశేషంబు. 157

తాత్పర్యం: ధృతరాష్ట్రాదుల ఆ మరణవార్త (క్రమంగా పౌరులకు తెలిసింది. తరువాతి పద్యంతో అన్వయం.)

క. విని పౌరజనసమూహము। లనయంబును వనట మునిఁగి హాహారవముల్
వినువీథి ముట్ట రోదన। మొనరిచె నవ్వేళఁ గరుణ ముత్కట మయ్యెన్. 158

ప్రతిపదార్థం: విని= (ధృతరాష్ట్రాదుల మరణవార్త) విని; పౌర-జన-సమూహములు= ఆ నగరపు ప్రజల గుంపులు; అనయంబును= నిరంతరమైన; వనటన్= శోకంలో; మునిఁగి= నిండి; హాహా-రవముల్= హా,హా అనే ధ్వనులు; వినువీథిన్= ఆకాశాన్ని; ముట్టన్=అంటగా; రోదనము= ఏడుపు; ఒనరిచెన్= చేశాయి; ఆ+వేళన్= ఆ సమయంలో; కరుణము= కారుణ్యం; ఉత్కటము= భరింపరానంతటిది; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: ధృతరాష్ట్రాదుల మరణవార్తను తెలిసికొని, పురప్రజలు గుంపులు గుంపులుగా చేరి, నిరంతరమైన శోకంతో చేసిన హా, (మహారాజా)హా-అనే ఏడుపు ధ్వనులు ఆకాశం అంటాయి. ఆ సమయంలో ఆ రాజ్య దైన్యం మేరలేనిదయింది.

క. నారదుఁ డుపశమ ఫణితులఁ। గౌరవసత్తమునిఁ దేర్పఁ గ్రమమున నాక్రం
దారవము లుడిగె బంధుజ। నారబ్ధము లైన యనునయాలాపములన్. 159

ప్రతిపదార్థం: నారదుఁడు= నారదమహర్షి; కౌరవసత్తమునిన్= కురువంశశ్రేష్ఠుడైన ధర్మరాజును; ఉపశమ-ఫణితులన్= ఊరడింపు మాటలతో; తేర్పన్= దుఃఖంనుండి తేరుకొనేటట్లు చేయగా; బంధు-జన+ఆరబ్ధములు= బంధువులు ప్రారంభించినవి; ఐన= అయిన; అనునయ+ఆలాపములన్= ఊరడింపు మాటలతో; ఆక్రంద-ఆరవములు= ఏడుపుల ధ్వనులు; క్రమమునన్= మెల్లగా; ఉడిగెన్= ఆగిపోయాయి.

తాత్పర్యం: నారదుడు సాంత్వన వచనాలతో ధర్మరాజు దుఃఖంనుండి తేరుకొనేటట్లు చేయగా బంధువుల అనునయపు మాటలతో, ఏడుపుల ధ్వనులు క్రమంగా ఆగిపోయాయి.

ధర్మరాజు ధృతరాష్ట్రప్రభృతులు మృతు లగుటకు శోకించుట(సం.15-16-1)

వ. అట్లు సమస్త జనంబులును విగతరోదను లై రప్పు డక్కౌరవనాథుండు నారదముని యాననం బాలోకించి యిట్లనియె. 160

ప్రతిపదార్థం: సమస్త జనంబులును= ధర్మరాజాదులు అందరూ; అట్లు= ఆ ప్రకారంగా (బంధువుల అనునయాలతో); విగతరోదనులు= ఏడుపు పోయిన వారలు; ఐరి= అయ్యారు (ఏడ్పుమానారు); అప్పుడు= ఆ సమయంలో; ఆ+కౌరవ-నాథుండు= కురువంశ్యులకు దిక్కయిన ఆ ధర్మరాజు; నారదముని-ఆననంబు= నారదమహర్షి ముఖాన్ని; ఆలోకించి= చూచి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు ప్రభృతులయిన జనులందరూ ఆ విధంగా ఏడుపులు మానారు. అపుడు ధర్మరాజు నారదుడిని చూస్తూ ఇట్లా అన్నాడు.

సీ. 'ఎఱుఁగఁగ వచ్చునే యెవ్వరి కెత్తతి। నేదెస యగునొ మునీంద్ర! యేము
గలుగంగ దెస లేని పులుమానిసికిఁ బోలె। నక్కురువృద్ధున కట్టిచావు
పాటిల్లె; సుముదీర్ణ బాహుదర్పోజ్జ్వలు। లైన పుత్త్రులు నూర్వు రట్లు గలిగి
బలము నాగాయుతప్రాణసమం బగు। నమ్మహారా జట్టి యడవిచిచ్చు

తే. **వలనఁ దెగటాఱె; నే మనఁ గలదు కమల। ముఖుల తాలవృంతానిలముల సుఖించు**
ప్రభువె కంక గృధ్రావలీపక్షవాయు। వడర నిలఁబడియున్నవాఁ డక్కటకట! **161**

ప్రతిపదార్థం: ముని+ఇంద్ర!= (నారద) మహర్షీ; ఎవ్వరికిన్= ఎటువంటివారికైనా; ఏ+తఱిన్= ఏసమయంలో; ఏదెస= ఏ విధంగా; అగునొ= అవుతుందో; ఎఱుఁగంగన్= తెలియటం; వచ్చునే?= సాధ్యమా? ఏము= (రాజులమైన కొడుకులు) పాండవులు; కలుగంగన్= ఉండగా; ఆ+కురువృద్ధునకున్= కురువంశంలో పెద్దవాడైన ఆ ధృతరాష్ట్రుడికి; దెస-లేని-పులు-మానిసికిన్-పోలెన్= దిక్కులేని హీన మనుష్యుడికి వలె; అట్టి-చావు= ఆవిధమైన (రక్షించేవాడు లేని) మరణం; పాటిల్లెన్= సంభవించింది; సముదీర్ణ-బాహు-దర్ప-ఉజ్జ్వలులు= విస్తారమైన భుజ బలగర్వం చేత ప్రకాశించేవారు; ఐన-పుత్రులు= అయినటువంటి కొడుకులు; నూర్వురు= వందమంది; అట్లు= ఆ విధంగా (కడుపు పంటగా) కలిగి= పుట్టి; నాగ+అయుత-ప్రాణ-సమంబు= పదివేల యేనుగుల బలంతో సమానమైన; బలము= శక్తి (స్వయంగానూ) కలిగిన; ఆ+మహారాజు= ఆ ధృతరాష్ట్ర చక్రవర్తి; అడవిచిచ్చువలనన్= దావాగ్నిచేత; తెగటాఱెన్+ఏ= కూలిపోయినాడట; ఏమి-అనన్+కలదు?= ఇంక చెప్పగలిగింది ఏమున్నది?; కమలముఖుల= తామరపూలవంటి ముఖాలు గలిగిన-కోమలులైన స్త్రీలయొక్క; తాల-వృంత= విసనకర్రలనుండి వెలువడే; అనిలములన్= మెల్లనైన గాలులచేత; సుఖించు ప్రభువు+ఎ= సుఖపడే ఆ మహారాజే; అక్కట+అక్కట= అయ్యయ్యో; కంక= రాబందులయొక్క; గ్రద్ధ= గ్రద్దలయొక్క; ఆవలీ= పంక్తుల యొక్క; పక్ష= రెక్కలనుండి వచ్చే; వాయువు= గాలి; అడరన్= అతిశయించగా; ఇలన్= నేలపైన; పడి-ఉన్నవాఁడు= పడిపోయి ఉన్నాడు.

తాత్పర్యం: 'నారదమునీంద్రా! ఎవ్వరికి, ఎప్పుడు, ఏమి జరుగుతుందో తెలియటం సాధ్యం కాదు. మేమింతమంది ఉండగా దిక్కులేని హీనమానవుడివలె, ఆ కురువంశవృద్ధుడికి ఆ విధమైన మరణం సంభవించింది. విస్తారమైన భుజబలాధిక్యం చేత గొప్పవారైన కొడుకులు, వందమందిని ఆ విధంగా పొంది, స్వయంగా పదివేల యేనుగుల బలం కలిగి ఉన్న మహారాజు, అడవిలో పుట్టిన అగ్గివలన కూలిపోయినాడంటే చెప్పే దేముంది? సుకుమారలైన కాంతలచేత తాలవృంతాలనుండి వెలువడే మెల్లనైన గాలితో సుఖించే మహారాజే-అయ్యో! రాబందుల, గ్రద్దల, రెక్కల నుండి వీస్తున్న గాలి అతిశయిస్తుండగా నేడు నేలమీద పడిపోయి ఉన్నాడు.

క. **కల మృదుమాగధ గానం। బుల మేల్కనురాజు గృధ్రములునుం గాకం**
బులు నఱవఁగ నిడుద నిదుర। నొలసి తెలుప దిక్కుమాలి యున్నాఁడు గదే! **162**

ప్రతిపదార్థం: కల= మధురమైన; మృదు= చెవికింపయిన; మాగధ= స్తోత్రపాఠకుల; గానంబులన్= స్తోత్ర గానాలతో; మేల్కనురాజు= నిదురనుండి మేలుకొనే ధృతరాష్ట్ర మహారాజు; గృధ్రములునున్= గ్రద్దలూ; కాకంబులున్= కాకులూ; అఱవఁగన్= అరుస్తూ ఉంటే; నిడుదనిదుర= దీర్ఘనిద్ర- (లేవలేని నిద్రలో); ఒలసి= పడి; తెలుపన్= తెలియజేయటానికి ఎవరూ లేక; దిక్కుమాలి= దిక్కులేకుండా; ఉన్నాఁడుగదే!= ఉన్నాడు గదా!

తాత్పర్యం: మాగధులు చేసే అవ్యక్తమధురమూ, సుకుమారమూ అయిన స్తోత్రగానంతో నిద్రలేచే మహారాజు ధృతరాష్ట్రుడు, ఈ రోజు గద్దలూ, కాకులూ చుట్టూ చేరి అరుస్తూ ఉంటే లేవలేని పెద్ద నిద్దురలో పడి మేల్కొలిపే వాడే లేక దిక్కులేకుండా పడిపోయి ఉన్నాడు గదా.

సీ. **వల్లభుం డొక్క సద్వ్రతముఁ బూనినఁ దానుఁ। దద్వ్రత మూని గాంధారి యతని**
పోయినగతిఁ బోయె; నాయమకై యంత। వగవఁ; బుత్త్రుల రాజ్యవైభవంబు

విడిచి మే యోమక యడవికి బోయిన । తల్లికి వగచెద; ధర్మసుతుఁడు

భీమసేనుండును, బీభత్సుఁడును దన । కడుపునఁ బుట్టిన కొడుకు; లట్టి

తే. యెగ్గతంబునఁ దానుఁ గారగ్గిఁ గాలె । నటె యనాథయై దీనికి నంతరంగ

మలఁదురక తల్లడిల్లక యారటమున । నుడుక కలమటఁ బడక యెట్లుండుఁ జెపుమ! 163

ప్రతిపదార్థం: వల్లభుండు= భర్త (ధృతరాష్ట్రుడు) ఒక్క= ఒకానొక; సత్-వ్రతము= ఉత్తమమైన దీక్షను; పూనినన్= ఆచరిస్తుంటే; తానున్= (పతివ్రత అయిన భార్యగా) తానుకూడా; తద్-వ్రతమున్= భర్తయొక్క దీక్షనే; పూని= అనుసరించి; పొంది; అతని-పోయినగతిన్= ఆ భర్త (ధృతరాష్ట్రుడు) పోయిన మార్గంలోనే; గాంధారి= గాంధారి; పోయెన్= వెళ్ళింది; ఆయమకై= అటువంటి ఆమె కోసం; అంత= పెద్దగా; వగవన్= బాధపడను; కానీ, పుత్రుల= పాండవుల; రాజ్య-వైభవము= సామ్రాజ్య-అధికారాన్ని-(సుఖాలనూ); విడిచి= వదలుకొని; మే= ఒడలు; ఓమక= కాపాడుకొనకుండా; అడవికిన్= అరణ్యానికి (గాంధారీ ధృతరాష్ట్రులతో); పోయిన= వెళ్లిన; తల్లికిన్= కుంతిని గురించి; వగచెదన్= దుఃఖిస్తున్నాను; ధర్మసుతుఁడు= ధర్మరాజు (తానూ); భీమసేనుండును= భీముడూ; బీభత్సుఁడును= అర్జునుడూ; తన కడుపునన్= తన (స్వ) గర్భం నుండి; పుట్టిన= జన్మించిన; కొడుకుల+అట్టి= పుత్రులు-అయిఉండగా; తాను= ఆ కుంతి; అనాథ= దిక్కులేనిది; ఐ= అయి; ఎగ్గతంబునన్= (కాపాడే) జనం లేని చోట; కారు+అగ్గిన్= దావాగ్నిలో; కాలెన్= కాలిపోయింది; దీనికిన్= ఇటువంటి కుంతీమరణానికి; అంతరంగము= మనస్సు; అలఁదురక= కలత పోకుండా; తల్లడిల్లక= (బాధతో) కంపం పొందకుండా; ఆరటమునన్= ఉద్వేగం (కుదురు లేకుండటం)తో; ఉడుకక= తపించి పోకుండా; అలమటన్= దురవస్థలో; పడన్= మునిగిపోకుండా; ఎట్లు= ఏప్రకారంగా; ఉండున్?= ఉంటుంది?; చెపుమ= (నారదమునీంద్రా!) నీవే చెప్పుము.

తాత్పర్యం: తన భర్త ఒకానొక మంచి వ్రతం ఆచరిస్తున్నాడు కాబట్టి (పతివ్రత అయిన భార్యగా) తాను కూడా అదేవ్రతాన్ని ఆచరిస్తూ భర్త పోయిన మార్గంలో గాంధారికూడా వెళ్ళిపోయింది. కాబట్టి ఆమెను గూర్చి నేను ఎక్కువగా బాధపడను. కానీ, కొడుకుల రాజ్యంతో ప్రాభవం వదలుకొని ఒడలు ఓముకొనకుండా అడవికి వెళ్ళిన తల్లి కుంతిని గూర్చి విచారిస్తున్నాను. ధర్మరాజు, భీముడు, అర్జునుడు, తన కడుపున పుట్టిన బిడ్డలై ఉండగా దిక్కులేనిదై, (రక్షించే) జనం లేని చోట, దావాగ్నిలో కాలిపోయింది. దానికి మనస్సు కలతపడకుండా, దుఃఖంతో కంపించకుండా కుదురులేని తనంతో తపించిపోకుండా, కష్టంలో మునిగిపోకుండా ఎలా ఉంటుంది నారదా! నీవే చెప్పుము.

క. విను ఖాండవ దహనంబునఁ । దనకుఁ బ్రమోదంబు శక్రతనయుఁ డొసఁగె; నా

తని తల్లిఁ గాల్పఁ దగునే । యనలునకుం; గడుఁగృతఘ్నుఁ డయ్యె మునీంద్రా! 164

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= నారదమహర్షీ!; విను= వినుము; ఖాండవదహనంబునన్= ఖాండవవనాన్ని దహించే పనిలో; శక్రతనయుండు= (ఇంద్రుడికొడుకు) అర్జునుడు; తనకున్= తనకు (అగ్నికి); ప్రమోదంబు= ఆనందం (అభీష్టం); ఒసఁగెన్= ఇచ్చాడు; అతనితల్లిన్= తనకు మేలుచేసినవాడి తల్లిని; కాల్పన్= దహించటం; అనలునకున్= అగ్నికి; తగున్+ఏ?= యుక్తమా?; కడున్= మిక్కిలి; కృతఘ్నుఁడు= (అగ్నిదేవుడు) చేసిన మేలు మరచేవాడు; అయ్యెన్= (ఇందువలన) అయినాడు.

తాత్పర్యం: మహర్షీ! ఇంకా వినండి. ఖాండవవనాన్ని దహించే పనిలో అర్జునుడు తనకు ఆనందాన్ని కలిగించాడే! అట్లా మేలు చేసిన వాడి తల్లిని దహించడం ఆ అగ్నికి తగినదేనా? అగ్ని చాలా కృతఘ్నుడయ్యాడు గదా!

సీ. మఱియొక్క నెవ్వగ మనమున జనియించె; । నాంబికేయుండు కారగ్గి నెరసె
దానికి నెయ్యది యేను జేయుదు నొక్కొ?' । యనవుడు నారదుం డానృపాలు
తోడ నబ్భరతవృద్ధుఁడు శాంతి యెక్కుడై । సవిశేషమైన పూజా విధాన
మున నుపాసించి తగిన యిష్టి సేసి య । గ్నులఁ దొలునాఁడ వీడ్కొనియె; ననియు

తే. నపుడు యాజకజనము లయ్యగ్ని చయము । నడవిలోన నుద్వాసించి యరిగె; ననియుఁ
బేర్చి యది యవ్వనం బెల్ల నేర్చె ననియు । వింటి నాత్మాగ్నిఁ గాలె నా విభుఁడు వత్స!' 165

ప్రతిపదార్థం: మనమునన్= నా మనసులో; మఱి= పైగా; ఒక్క= ఇంకొక; నెఱ+వగ= సంపూర్ణమయిన దుఃఖం; జనియించెన్= కలిగింది; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; కారు+అగ్గి= దావాగ్ని; నెరసెన్= చుట్టుముట్టుకొన్నది; దానికిన్= ఆస్థితికి; నేను= నేను (ధర్మరాజు); ఏ+అది= ఏ క్రియ; చేయుదున్+ఒక్కొ?= చేయవలసిఉన్నది?; అనవుడున్= అని ధర్మరాజు పల్కగా; ఆ-నృపాలుతోడన్= ఆ ధర్మరాజుతో; నారదుండు= నారదమహర్షి (ఇట్లా అన్నాడు); వత్స!= నాయనా! ధర్మరాజా!; ఆ+భరత వృద్ధుఁడు= భరతవంశంలో పెద్ద అయిన ఆ ధృతరాష్ట్రుడు; శాంతి= (ఇంద్రియాలను అణచి) సంపూర్ణమైన విరక్తి; ఎక్కుడు+ఐ= అధికమై; తొలినాఁడు+అ= మరణించటానికి ముందురోజే; అగ్నులన్= తన అగ్నిహోత్రాలను; సవిశేషము= ప్రత్యేకం; ఐన= అయినటువంటి; పూజా-విధానమునన్= అర్చనా పద్ధతిలో; ఉపాసించి= సేవించి; తగిన-ఇష్టి= అర్హమైన యజ్ఞం; చేసి= నిర్వహించి; వీడ్కొనియెన్= (అగ్నులను) విడిచిపెట్టాడు; అనియున్= అనీ; అపుడు= ఆ సమయంలో; ఆ+అగ్ని-చయమున్= ధృతరాష్ట్రుడు వీడుకొలిపిన అగ్నుల సముదాయాన్ని; యాజక-జనములు= (ధృతరాష్ట్రుడిని అనుసరించి వచ్చిన) ఋత్విక్కులు; అడవిలోనన్= ఆ అడవిలోనే; ఉద్వాసించి= విడిచి; అరిగెన్= వెళ్ళారు; అనియున్= అనీ; అది= అట్లా విడిచిపెట్టబడిన (ధృతరాష్ట్రుడి) అగ్నియే= అంటుకొని, పెరిగి; ఆ+వనంబు= ఆ అరణ్యం; ఎల్లన్= మొత్తం; ఏర్చెన్= తగులబెట్టింది; అనియెన్= అనీ; వింటిన్= విన్నాను (కాబట్టి); ఆ+విభుఁడు= ఆ ధృతరాష్ట్రుడు; ఆత్మ+అగ్నిన్= తన అగ్నిహోత్రంవలననే; కాలెన్= దగ్ధమయ్యాడు.

తాత్పర్యం: (మునీంద్రా) మనసులో మరో బాధ కలుగుతున్నది. ధృతరాష్ట్రుడు దావాగ్నిలో మరణించాడు గదా! ఆవిధంగా సంభవించిన మృతికి సంబంధించి నేను చేయవలసిన (ఉత్తర) క్రియలు ఏమిటి? ధర్మరాజు అట్లా అనగానే నారదుడు (ఇట్లా అన్నాడు) 'నాయనా! ఆ ధృతరాష్ట్రుడు సంపూర్ణమైన విరక్తి ఇంకా అధికమై ముందటిరోజే తన అగ్నులకు ప్రత్యేకపూజలు చేసి, అవసరమైన ఇష్టిని నిర్వహించి, ఆ అగ్నులనుండి సెలవు తీసికొన్నాడు. అపు డాతడితో ఉన్న ఋత్విక్కులు ఆ అగ్నులను అడవిలోనే ఉద్వాసన చేసి వెళ్ళిపోయారు. అట్లా వారు విడిచిపెట్టిన (ధృతరాష్ట్రుడి) అగ్నులే అంటుకొని పెరిగి ఆ అడవిని అంతా కాల్చేశాయి- అని కూడా విన్నాను. అందుచేత ధృతరాష్ట్రుడు కేవలం అడవిచిచ్చువలన కాకుండా స్వీయాగ్నులలోనే మృతిపొందాడు.

ఉ. కావున నెవ్వగం బొరయఁగాఁ బనిలేదు నరేంద్ర! గొంతియుం
బావకు నప్పకుం గరము భక్తి దగం బరిచర్య సేసి దే
వావలి ప్రస్తుతింపఁగ నిరామయలోకము నొందె; వారికిన్
నీ వుదకంబు లీవలయు నిష్ఠమెయిం దిలసంయుతంబుగాన్. 166

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= (ధర్మ) రాజా!; కావునన్= అందుచేత; (ధృతరాష్ట్రుడు ఆత్మాగ్నితో మృతి చెందాడు కాబట్టి); నెఱ+వగన్= అధికమయిన దుఃఖం; పొరయఁగాన్= పొందవలసిన; పని= అవసరం; లేదు= లేనే లేదు; గొంతియున్= కుంతికూడా; బావకున్= బావగారైన ధృతరాష్ట్రుడికీ; అప్పకున్= అక్క-గాంధారికీ; కరము= మిక్కిలి; భక్తి(న్)= సేవాభావంతో; తగన్= తగువిధంగా; పరిచర్య= శుశ్రూష; చేసి= ఆచరించి; దేవ+ఆవలి= దేవతల సముదాయం; ప్రస్తుతింపఁగన్= మెచ్చుకొనేటట్లుగా; నిరామయలోకమున్= మంచి (ఇంద్ర) లోకాన్ని; ఒందెన్= చేరుకొన్నది; నీవు= నీవు; వారికిన్= కుంతీ, గాంధారీ, ధృతరాష్ట్రులకు; నిష్ఠమెయిన్= శ్రద్ధతో; తిలసంయుతంబుగన్= నువ్వులతో గూడ; ఉదకంబులు= నీళ్ళు; ఈన్+వలయున్= ఇవ్వ(విడువ)వలసింది.

తాత్పర్యం: కాబట్టి ధర్మరాజు మిక్కిలి దుఃఖాన్ని పొందవలసిన అవసరం లేదు. కుంతి కూడా బావకు అక్కకూ మిక్కిలి భక్తితో తగిన విధంగా సేవచేసి దేవతలు ప్రస్తుతించే విధంగా మంచిలోకాన్ని పొందింది. వారికి నీవు నిష్ఠతో నువ్వులూ నీళ్ళూ విడువవలసియున్నది.

యుధిష్ఠిరుఁడు ధృతరాష్ట్రాదులకుఁ దిలోదక ప్రదానంబు చేయుట (సం.15-47-10)

క. **అనుజన్ములు నంతఃపుర । వనితాజనములును నీవు వసుధేశ్వర ! వే**
చని నడపుఁ డుదకవిధి నీ । జనకునకును జననులకును జాహ్నవిలోనన్.' **167**

ప్రతిపదార్థం: వసుధా+ఈశ్వర!= (ధర్మ) రాజా!; అనుజన్ములు= తమ్ముళ్ళూ; అంతఃపుర-వనితా-జనములును= అంతఃపుర స్త్రీలూ; నీవు(న్)= నీవూ; వే= త్వరగా; చని= వెళ్ళి; జాహ్నవిలోనన్= గంగలో; నీ జనకునకును= నీ తండ్రి అయిన ధృతరాష్ట్రుడికీ;జననులకును= తల్లులకు; (కుంతీ,గాంధారులకు); ఉదకవిధి= తిలోదకాలిచ్చే పని; నడపుఁడు= ఆచరించండి.

తాత్పర్యం: ధర్మరాజా! భీమసేనాదులైన తమ్ములూ, ద్రౌపదీ ప్రభృతులైన అంతఃపురకాంతలూ, నీవూ వెంటనే వెళ్ళి, గంగలో, ధృతరాష్ట్రుడికీ, కుంతీ, గాంధారులకూ; తిలోదకప్రదానం చేయండి.'

ఆ. **అనిన లెస్స గాక! యని ధర్మసుతుఁ డేక । వస్త్ర ధరణనియతి వఱల నెల్ల**
వారు నట్ల యేఁగుదేరఁగఁ బౌరులు । బలసి చనఁగఁ జనియెఁ బౌరవేంద్ర! **168**

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర!= జనమేజయరాజా; అనినన్= అని నారదుడు చెప్పగా; ధర్మసుతుఁడు= ధర్మరాజు; లెస్స కాక= మంచిది అట్లాగే; అని= అనిచెప్పి; ఏక-వస్త్ర-ధరణనియతి= ఒకే వస్త్రం ధరించటం అనే నియమం; వఱలన్= ఒప్పుతుండగా (నియమబద్ధంగా ఏకవస్త్రం ధరించి); ఎల్లవారున్= తమ్ములు మొదలైనవారు అందరూ; అట్లు+అ= ఆవిధంగా ఏకవస్త్రధారులై; ఏఁగుదేరఁగన్= వెంటరాగా; పౌరులు(న్)= పురప్రజలుకూడా; బలసి= అధికసంఖ్యలో; చనఁగన్= వెళ్ళగా; చనియెన్= (గంగకు) వెళ్ళాడు.

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడా! జనమేజయా! నారదు డావిధంగా చెప్పగా మంచిది అట్లాగే చేద్దామని ధర్మరాజు నియమానుగుణంగా, ఏకవస్త్రం ధరించగా, తమ్ములు మొదలైన వాళ్ళు గూడా అలాగే ఏకవస్త్రం ధరించి వెంటరాగా, పురప్రజలూ గుంపులుగా రాగా, గంగకు వెళ్ళాడు.

వ. **ఇట్లు చని గంగాస్నానం బాచరించి యమ్మహీపతి మొదలగు నర్వజనంబులు ధృతరాష్ట్రునకు గాంధారికిం గుంతికిం దిలోదకప్రదానంబులు నిర్వర్తించి, నివృత్తులై యశుచిత్వం బపనయించుటకుం బుర బహిరంగణం బునఁ బటకుటీర ప్రకరంబుల వసియించి; రట్టియెడ.** **169**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా (అనుజాదులతో-కలిసి); చని= (గంగకు) వెళ్ళి; గంగాస్నానంబు= గంగలో స్నానం; ఆచరించి= చేసి; ఆ+మహీపతి= ఆ ధర్మరాజు; మొదలు+అగు-అర్హజనంబులు= మొదలైన యోగ్యులయిన వారు; ధృతరాష్ట్రునకు(న్)= ధృతరాష్ట్రుడికీ; గాంధారికిన్= గాంధారికీ; కుంతికిన్= కుంతికీ; తిల+ఉదక-ప్రదానంబులు= నువ్వులూ, నీళ్ళూ ఇవ్వటం; నిర్వర్తించి= పూర్తిచేసి; నివృత్తులు+ఐ= (గంగనుండి రాజధానికి) తిరిగిపోతూ; అశుచిత్వంబు= ధృతరాష్ట్రాదుల మరణం వలన కలిగిన అశౌచాన్ని; అపనయించుటకున్= తొలగించుకొనటానికి; (ఆ రోజులు గడిపేయుటానికి); పుర-బహిస్-అంగణంబునన్= హస్తినాపురానికి వెలుపలి ప్రాంతంలో; పట-కుటీర-ప్రకరంబుల్= వస్త్రాలతో గూర్చిన ఆవాసాలలో (డేరాలలో); వసియించిరి= నివాసం ఏర్పాటు చేసికొన్నారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా (అనుజాది సహితుడై) ఏకవస్త్రధారణం మున్నగు లక్షణాలతో వెళ్ళి గంగలో స్నానం చేసి, ధర్మరాజు మొదలైన అవసరమైనవారు ధృతరాష్ట్రుడికీ, కుంతికీ తిలోదకాలిచ్చి వెనుకకువచ్చి మృతాశౌచం తొలగే వరకు హస్తిపురం వెలుపల గుడారాలలో నివాసం చేస్తున్నారు. ఆ సమయంలో...

సీ. **ఆంబికేయాదుల యస్థిపుంజముల గం। గాద్వార సలిల సంగమ విశిష్ట**
సంస్కారమునఁ గూర్పఁ జాలెడు సంశుద్ధ। జనముల రావించి సబహుమాన
ఫణితుల వారి కప్పని యేర్పడఁగఁ జెప్పి। పనిచె నక్కౌరవ జనవిభుండు;
శ్రాద్ధార్హదినమున వృద్ధానుమతి నతం। డక్కురువృద్ధున కతని సతికి

తే. **గొంతికిని రత్నకాంచన గోతురంగ। హస్తి కన్యా ధరిత్రీ గృహాది దాన**
విధుల సర్వజనంబులు విస్మితులుగ। నియతిమెయిఁ బారలౌకిక క్రియ లొనర్చె. **170**

ప్రతిపదార్థం: ఆ+కౌరవ-జన-విభుండు= కురువంశంవారికి నాథుడైన ఆ ధర్మరాజు; ఆంబికేయ-ఆదుల= ధృతరాష్ట్రుడూ మొదలైన (గాంధారీ, కుంతీ); అస్థిపుంజములన్= అస్థి సముదాయాలను; గంగాద్వార= గంగాద్వారంలోని; సలిల= (గంగా) జలంతో; సంగమ= కలపటం అనే; విశిష్ట= ప్రత్యేకమైన, సంస్కారమునన్= పవిత్రంగా; కూర్చన్= కలపటానికి; చాలెడు= సమర్థులయిన; సంశుద్ధ-జనములన్= పవిత్రులయిన (తెలిసినవారూ, ఆప్తులూ అయిన) మనుష్యులను; రావించి= పిలిపించి; వారికిన్= ఆ జనానికి; సబహుమాన-ఫణితులన్= మన్ననలతో గూడిన మాటలతో; ఆ+పని= ధృతరాష్ట్రాదుల అస్థులను గంగాజలంలో కలిపే పనిని; ఏర్పడఁగన్= వివరంగా; చెప్పి= తెలియజేసి; పనిచెన్= (ధృతరాష్ట్రాదులు దగ్ధమయిన చోటికి) పంపాడు; శ్రాద్ధ+అర్హ-దినమునన్= శ్రాద్ధం చేయవలసిన (అశౌచం తొలగినటువంటి-పంద్రెండవ) రోజున; అతండు= ఆ ధర్మరాజు; వృద్ధ-అనుమతిన్= పెద్దల ఆమోదంతో; ఆ+కురువృద్ధునకున్= ఆ ధృతరాష్ట్రుడికీ; అతని సతికిన్= ధృతరాష్ట్రుడి భార్య గాంధారికీ; గొంతికిని= కుంతీదేవికీ; రత్న= రత్నాలూ; కాంచన= బంగారమూ; గో= ఆవులూ; తురంగ= గుర్రాలూ; హస్తి= ఏనుగులూ; కన్యా= కన్నెపిల్లలూ; ధరిత్రీ= నేలా; గృహ= ఇళ్ళూ; ఆది= మొదలైన దాన-విధులన్= దానకర్మలచేత; సర్వజనంబులు= అందరూ; విస్మితులుగన్= ఆశ్చర్యపడేవిధంగా; పారలౌకిక క్రియలు= ధృతరాష్ట్రాదులకు ఊర్ధ్వలోకాన్ని సాధించే కర్మలను; నియతి మెయిన్= శ్రద్ధతో; ఒనర్చెన్= చేశాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రాదుల అస్థికలను గంగాద్వారంలోని జలంలో నిమజ్జనం చేసే పనిని నిర్వహించటానికి ధర్మరాజు సమర్థులైన ఉత్తమ వ్యక్తులను పిలిపించి వాళ్ళకు ఆపనిని మన్ననలతో వివరించి చెప్పి, (ధృతరాష్ట్రాదులు దగ్ధమైన చోటకు పంపాడు; మృత-అశౌచం తొలగినటువంటి పంద్రెండవ రోజు-శ్రాద్ధం చేయవలసిన నాడు.) పెద్దల ఆమోదంతో

ధృతరాష్ట్రుడినీ గాంధారినీ కుంతినీ, ఉద్దేశించి అందరూ ఆశ్చర్యపడేటట్లుగా రత్నాలూ, బంగారమూ, ఆవులూ, గుర్రాలూ, ఏనుగులూ, కన్నెలూ, భూమీ, ఇళ్ళూ, మొదలైన దానాలతో పరలోక సాధకాలైన ఉత్తర క్రియలను శ్రద్ధగా ఆచరించాడు ధర్మరాజు.

ఆ. మునిజనములు వచ్చి యనుమోద మందంగ। సకల బంధుజనులు సంతసిల్ల
నన్న పర్వతముల నాజ్యనదులఁ బిత్రృ। మేధ ముల్లసిల్లె మేదినీశ! 171

ప్రతిపదార్థం: మేదినీ+ఈశ!= (జనమేజయ) మహారాజా!; ముని జనములు= తాపసులు; వచ్చి= (ధృతరాష్ట్రాదుల శ్రాద్ధకర్మలను) చూడ వచ్చి; అనుమోదము= సంతోషం; అందంగన్= పొందగా; సకల-బంధు-జనులు= చుట్టాలు అందరూ; సంతసిల్లన్= ఆనందించగా; పితృమేధము= శ్రాద్ధకర్మ; అన్న-పర్వతములన్= కొండలంతలై ఉన్న అన్నం రాసులతోనూ; ఆజ్యనదులన్= నదులవలె ప్రవహిస్తున్న నేయితోనూ; ఉల్లసిల్లెన్= వర్ధిల్లింది;

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ధృతరాష్ట్ర ప్రభృతుల శ్రాద్ధం రోజు (శతయూపాది) మునులు వచ్చారు. ఆ మునులూ, చుట్టాలూ అందరూ సంతోషించే విధంగా కొండలంతటి అన్నరాసులతో, నదులవలె సాగుతున్న నేతి ప్రవాహాలతో ఆ పితృమేధం ప్రకాశించింది.

క. ద్వాదశ దినములు నారదుఁ। డాదరమున నొద్ద నుండి యంతయుఁ గని స
మ్మోదంబుతోడ నాశీ। ర్వాదం బొనరించెఁ బాండవ ప్రవరునకున్. 172

ప్రతిపదార్థం: నారదుండు= నారదమహర్షి; ద్వాదశదినములు(న్)= ఆ పంౘ్రెండు రోజులూ; ఆదరమునన్= వాత్సల్యంతో; ఒద్దన్= ధర్మరాజు తోనే; ఉండి= నిలిచి; అంతయున్= ధర్మరాజు చేసిన పారలౌకిక క్రియలు అన్నీ; కని= చూచి; సమ్మోదంబు తోడన్= సంతృప్తితో; పాండవప్రవరునకున్= పాండురాజు కొడుకులలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజుకు; ఆశీర్వాదంబు= ఆశీస్సు; ఒనరించెన్= కలుగజేశాడు.

తాత్పర్యం: ధర్మరాజు ధృతరాష్ట్రాదులకు పారలౌకిక క్రియలు నిర్వహించిన ఆ పంౘ్రెండు రోజులు కూడా నారద మహర్షి అక్కడే ఉండి; అంతా చూచి, ఆనందించి, ఆ ధర్మరాజును ఆశీర్వదించాడు.

వ. అమ్మునీంద్రునిఁ దక్కునుం గలుగుతపస్విసత్తముల సమర్చితులం గావించి యుధిష్ఠిరుం డామంత్రితులం జేసిన నాసంయమివరులు నిజనివాసంబులకుం జని; రాన్నృపకుంజరుండు బంధుమిత్రసహితుండై కుంజర పురంబు ప్రవేశించె; నిత్తెఱంగున నాంబికేయునకు భారతరణంబు పిదప దానాది పుణ్య క్రియాకలాపకరణంబులం బురంబునం బదియేనును, దపోనియమంబున వనంబున మూఁడునుంగాఁ బదునెనిమిది సంవత్సరంబులు చనియె; నివ్విధంబున వైచిత్రవీర్యుని సంసేవన సమస్తప్రకారంబుల సంఘటించి కృతార్థతానందంబునొంది ధర్మ నందనుండు జనంబు లభినందించుచందంబున సామ్రాజ్యంబుఁ బాలించె నని యిట్లు ధృతరాష్ట్రుని యాశ్ర మ వాసంబు విషయంబైన వర్తనంబు వైశంపాయనుండు చెప్పిన విని జనమేజయుండు 'మహాత్మా యిట్లు కృతకృత్యతం బొందిన పాండవాగ్రజుండు భూభారంబు నిర్వహించుచుండం బదంపడి పుట్టిన విశేషంబు లెఱింగింపవే! యనుటయు. 173

ప్రతిపదార్థం: యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఆ+మునీంద్రునిన్= ఆ నారదమహర్షినీ; తక్కునున్+కలుగు= మిగిలి ఉన్న; తపస్వి-సత్తములన్= మునివరులను; సమర్చితులన్= పూజించబడిన వారినిగా; కావించి= చేసి; ఆమంత్రితులన్-చేసినన్= వీడుకోలు ఇవ్వగా; ఆ సంయమివరులు= (నారదాదులైన) ఆ మునిశ్రేష్ఠులు; నిజనివాసంబులకున్= తమతమ నెలవులకు; చనిరి= వెళ్ళారు; ఆ నృప కుంజరుండు= రాజ శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజు; బంధు-మిత్ర-సహితుండు+ఐ= తనతో వచ్చిన చుట్టాలతో, స్నేహితులతో కలిసినవాడై; కుంజరపురంబు= హస్తినాపురం; ప్రవేశించెన్= ప్రవేశించాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఆంబికేయునకున్= ధృతరాష్ట్రుడికి; భారత రణంబు పిదపన్= కురుక్షేత్రయుద్ధం తరువాత; దాన+ఆది-పుణ్య-క్రియా- కలాప-కరణంబులన్= గ్రామాది దానాలు మొదలైన మంచి పనులను చేయటంతో; పురంబునన్= హస్తినాపురంలో; పది+ఏను= పదిహేను సంవత్సరాలూ; తపస్+నియమంబునన్= తపస్సుకు సంబంధించిన నియమాలతో; వనంబునన్= అడవిలో; మూఁడునున్= మూడునూ; కాన్= అయ్యేవిధంగా (మొత్తం); పదునెనిమిది సంవత్సరంబులు= పద్దెనిమిది సంవత్సరాలు; చనియెన్= గడచాయి; ధర్మనందనుండు= ధర్మరాజు; ఈ-విధంబునన్= ఈ తీరుగా; వైచిత్రవీర్యుని= (విచిత్రవీర్యుడి కొడుకు) ధృతరాష్ట్రుడి యొక్క; సంసేవన= శుశ్రూష; సమస్త ప్రకారంబులన్= అన్నివిధాలుగానూ; సంఘటించి= చేసి; కృతార్థతా+ఆనందంబున్= సాఫల్యంతోడి సంతోషాన్ని; ఒంది= పొంది; జనంబులు= ప్రజలు; అభినందించు-చందంబునన్= మెచ్చుకొనే విధంగా; సామ్రాజ్యంబున్= రాజ్యాన్ని; పాలించెన్= పరిపాలించాడు; అని; ఇట్లు= ఈ విధంగా; ధృతరాష్ట్రుని= ధృతరాష్ట్రుడియొక్క; ఆశ్రమవాసంబు= తపోవన నివాసానికి; విషయంబు+ఐన= సంబంధించిన; వర్తనంబు= వృత్తాంతం; వైశంపాయనుండు= వైశంపాయనముని; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; జనమేజయుండు= జనమేజయమహారాజు (వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు); మహాత్మా!= మహానుభావా!; ఇట్లు= మీరు చెప్పిన యీ ప్రకారంగా; కృతకృత్యతన్= కర్తవ్యం నిర్వహించి సాఫల్యాన్ని; పొందిన= పొందినటువంటి; పాండవ-అగ్రజుండు= ధర్మరాజు; భూభారంబు= రాజ్య నిర్వహణ బాధ్యతను; నిర్వహించుచుండన్= నడపుతూ ఉండగా; పదంపడి= ఆ తరువాత; పుట్టిన= కలిగిన; విశేషంబులు= ప్రత్యేక సంఘటనలు; ఎఱింగింపవే= తెలియ జెప్పవలసింది; అనుటయున్= అని అడుగగా- (జనమేజయుడితో వైశంపాయను డిట్లా చెప్పాడని తరువాతి మౌసలపర్వంతో అన్వయం)

తాత్పర్యం: ధర్మరాజు ఆ నారదమహర్షినీ; మిగిలిన (అక్కడికి చూడవచ్చిన) మునులనూ, పూజించి వీడుకోలు చెప్పగా వాళ్లందరూ తమ తమ ఆశ్రమాలకు వెళ్ళిపోయారు. తరువాత ఆ ధర్మరాజు కూడా తనతో వచ్చి ఉన్న చుట్టాలతోనూ, మిత్రులతోనూ కలిసి హస్తినాపురం ప్రవేశించాడు. ఈవిధంగా ధృతరాష్ట్రుడికి భారతయుద్ధం పూర్తయిన తర్వాత దానాలు మొదలైన పుణ్యకార్యాలు చేయడంతో హస్తినాపురంలో పదిహేనేండ్లూ, తపోనియమాలతో, అరణ్యంలో మూడేళ్ళూ, మొత్తం పద్దెనిమిది సంవత్సరాలు గడచాయి. ధృతరాష్ట్రుడిని అన్ని విధాలుగానూ సేవిస్తూ కృతార్థతతో ఆనందించిన ధర్మరాజు ప్రజలు ప్రశంసించే విధంగా రాజ్యాన్ని పరిపాలించాడు-అని వైశంపాయనుడు ఈ విధంగా ధృతరాష్ట్రుడి యొక్క ఆశ్రమవాసానికి సంబంధించిన వృత్తాంతం చెప్పగా విని జనమేజయుడు (వైశంపాయనుడితో) 'మహాత్మా! కృతకృత్యుడైన ధర్మరాజు రాజ్యాన్ని పరిపాలిస్తుండగా తరువాత జరిగిన విశేషాలు ఏమిటో తెలియజెప్ప వలసింది' అన్నాడు. (అప్పుడు వైశంపాయనుడిట్లా-మౌసలపర్వంలో చెప్పుతున్నాడు)

ఆశ్వాసాంతము

శా. **కారుణ్యాత్మక దృక్ప్రచార! గతసంకల్పాంతరంగస్థితి**
స్మేరాకార! పతంగమధ్యమ మరీచివ్యాప్తి మూర్ధత్సుధా

ధారారూపవిహార! నిర్మిత జగత్సంసార! నానాగమ

క్షీరోద్యన్నవనీతతాలసిత! నిశ్చిత్తత్త్వ సంభావితా! 174

ప్రతిపదార్థం: కారుణ్య-ఆత్మక-దృక్-ప్రచార= దయయే రూపంగా కలిగిన చూపులయొక్క కదలిక కలవాడా!; గత= తొలగిపోయినటువంటి; సంకల్ప= కోరికలు (రాగద్వేషాలకు సంబంధించిన తలపులు) కల్గిన; అంతరంగ= మనస్సులో; స్థితి= ఉండటంతో; స్మేర= వికాసం పొందిన; ఆకార!= స్వరూపం కలిగినవాడా!; పతంగ= సూర్యుడియొక్క; మధ్యమ= నడుమనున్నదైన; మరీచి= కిరణం; వ్యాప్తి= ప్రసారం చేత; మూర్ఛత్= వృద్ధిపొందుతున్న; సుధా= అమృతం యొక్క; ధారా= ప్రవాహం; రూప= ఆకారంగా; విహార!= విహరించేవాడా!; నిర్మిత= (నీచేత) కల్పించబడిన; జగత్= లోకాలయొక్క; సంసార!= జీవధర్మం గలవాడా!; నానా= అనేకములైన; ఆగమ= శాస్త్రాలు అనేటటువంటి; క్షీర= పాలనుండి; ఉద్యత్= పైకి తేలినటువంటి; నవనీతతా= వెన్నయొక్క ధర్మంతో; లసిత= ప్రకాశించేవాడా; నిస్-చిత్-తత్త్వ= సమగ్రమైన చైతన్యంతోను, బ్రహ్మభావంతోనూ; సంభావితా!= తెలిసికొనబడేవాడా!

తాత్పర్యం: కరుణయే ఆకారంగా ఉన్న చూపుల కదలికలు కలవాడా! ఏవిధమైన తలపులూ లేని వాళ్ళ మనసులలో వికాసరూపంతో ఉండేవాడా! సూర్యుడిలోని మధ్య కిరణం వ్యాపించడం చేత వర్ధిల్లుతున్నటువంటి అమృత ప్రవాహరూపమైన విహారం కలవాడా! విశ్వసంసారాన్ని కల్పించినవాడా! అనేక (విధ)ములైన శాస్త్రాలు అనే పాలనుండి ఉద్భవించిన వెన్నవంటి ధర్మంతో ప్రకాశించే వాడా! సంపూర్ణమైన చైతన్యమూ, బ్రహ్మముగా, (జ్ఞానులచేత) తెలియబడేవాడా!-హరిహరనాథా!.

క. నిర్మలసంవిదుపాస్యా! ధర్మకరణ! దుర్వికాస్య దైత్యశ్రేణీ

నిర్మథన కేళి! నిర్జర। శర్మకృతి విహారశీల! సంయమిలోలా! 175

ప్రతిపదార్థం: నిర్మల-సంవిత్-ఉపాస్యా!= మలినం లేని జ్ఞానం చేత ధ్యానించదగినవాడా!; ధర్మ-కరణ!= ధర్మక్రియకు సాధనమైనవాడా!; దుస్-వికాస్య= దుష్టమూ; కుటిలమూ అయిన నడవడి కలిగిన; దైత్య= రాక్షసుల; శ్రేణీ= సమూహాలను; నిర్మథన= నాశనం చేయటం; కేళి!= ఆటగా కలిగినవాడా!; నిర్జర= దేవతలకు; శర్మ= మేలునూ; కృతి= చేయటం అనే; విహార= వేడుక; శీల!= స్వభావంగా కలిగినవాడా!; సంయమి-లోలా!= ఇంద్రియాలను అణచుకొన్న-మునులయందు అధికాసక్తి కలవాడా!; హరిహరనాథా!.

తాత్పర్యం: నిర్మలమైన (సంకల్పాలను త్యజించిన) జ్ఞానం చేత ఉపాసింపదగినవాడా! ధర్మానికి మూలమైనవాడా! దుష్కర్మలు చేసేటటువంటి రాక్షస సమూహాలను నిర్మూలించటం క్రీడగా కలిగినవాడా! దేవతలకు మేలు చేయటమే వేడుక కావటం స్వభావంగా కలవాడా! యతులపై ఆసక్తి కలిగినవాడా!- హరిహరనాథుడా!.

మాలిని.

సమదవిమద దూరా సన్న రక్షా! ప్రసన్నా!

శమశుభమయమూర్తి! స్ఫారదుర్లక్ష సారా!

దమవిభవసముద్యద్ధామ! నిస్సీమభూమా!

సమహృదయలసత్సంసర్గ! సానందవర్గా! 176

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సమద= మదించిన వారికీ (అహంకారులకు); విమద= మదం లేని వారికీ (నిరహంకారులకు) దూర= దూరంగానూ; ఆసన్న!= దగ్గరగానూ ఉండేవాడా!; రక్షా-ప్రసన్నా!= రక్షించటం కొరకు దయ కలిగిన (చూపే)వాడా!; శమ= శాంతీ; శుభమయ= కళ్యాణమూ నిండిన; మూర్తి!= స్వరూపం కలవాడా!; స్ఫార= విస్తారమైనటువంటిదీ; దుర్‌లక్ష= సామాన్య ఇంద్రియాలకు తెలియనిదీ అయిన; సారా!= శక్తి గలవాడా!; దమ= ఇంద్రియాలు (మనస్సు) నిగ్రహం యొక్క; విభవ= ఆధిక్యం చేత; సముద్యత్= తోచేటటువంటి; ధామ!= ఉనికి కలవాడా!; నిస్సీమ-భూమా!= హద్దులేని సమృద్ధి కలిగిన వాడా!; సమ= సర్వమునందు, ఒకే సమయమున; హృదయ= మనసు గలిగిన వారియందు; లసత్= ప్రకాశించే; సంసర్గ!= సంబంధం (కూడుట) కలవాడా!; స-ఆనంద-వర్గా!= ఆనందంతో కూడిన (భక్తుల) సమూహం కలవాడా!-హరిహరనాథా!.

తాత్పర్యం: మదం గలిగిన వారికి దూరంగానూ, మదం (విడిచిన- లేని) వారికి దగ్గరగానూ ఉండేవాడా!. ఆశ్రితులను కాపాడటానికి ప్రసన్నుడివై ఉండేవాడా!. శాంతీ, శుభమూ నిండిన రూపం కలిగిన వాడా!; విస్తారమూ, సామాన్యులకు గోచరంగానిదీ అయిన శక్తి కలవాడా!; ఇంద్రియనిగ్రహం అధికంగా గలిగినవారిచేత మాత్రమే తెలియదగిన ఉనికి గలవాడా!. మేరలేని బాహుళ్యం (సమృద్ధి) కలిగినవాడా!. సర్వసమబుద్ధులతో ఒప్పుతున్న సంబంధం (సాన్నిహిత్యం) కలవాడా! ఆనందంతో కూడిన హృదయం కలిగిన భక్తసమూహం కలవాడా!-హరిహరనాథా!.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బైన శ్రీమహాభారతంబున నాశ్రమవాసపర్వంబునందు సర్వంబు ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది ఉభయకవి మిత్రుడూ, కొమ్మనామాత్యుడి పుత్త్రుడూ, పండితుల చేత ఆరాధించబడి రాణించేవాడూ అయిన తిక్కన సోమయాజి శుభప్రదంగా రచించిన శ్రీ మహాభారతంలోని ఆశ్రమవాసపర్వంలో చివరిది రెండవ ఆశ్వాసం.

ఆశ్రమవాసపర్వంలో రెండవ ఆశ్వాసం సమాప్తం,

శ్రీమదాంధ్రమహాభారతంలో ఆశ్రమవాసపర్వం సర్వం ముగిసింది.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

మౌసల పర్వము - ఏకాశ్వాసము

శ్రీ ధర్మకామ హృదయ స। మాధానాధాన కారకాంఘ్రిసరోజా!

బోధఘనవ్యాస పరస। మాధి సమాలీఢ తేజ! హరిహరనాథా! **1**

ప్రతిపదార్థం: శ్రీ= సిరిని; ధర్మ= ధర్మాన్ని; కామ= కామాన్ని (కోరేటటువంటి); హృదయ= మనస్సులకు; సమాధాన= నెమ్మదిని; ఆధానకారక= కల్గించే; అంఘ్రి సరోజా!= పాదపద్మాలు కలవాడా!; బోధఘన= విజ్ఞానంచే గొప్పవాడైన; వ్యాస= వ్యాసమహర్షియొక్క; పరసమాధి= నిర్వికల్ప సమాధిలో; సమాలీఢ= ఆస్వాదించబడిన; తేజ!= తేజస్సు కలవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! సిరిని, ధర్మాన్ని, కామాన్ని కోరే మనసులకు నీ పాదపద్మాలు నెమ్మది కలిగిస్తాయి. నీవు వ్యాసాది మహర్షుల పరసమాధిలో ఆస్వాదించబడిన తేజస్సు కలిగినవాడవు. నీకు నమస్కారం.

విశేషం: ధర్మార్థ కామాలను కోరి చేసే సమాధి సవికల్ప సమాధి. లోకంలో చాలామంది అట్లాంటివారే. కాని, ఋషుల సమాధి విశిష్టమైనది. దానిని నిర్వికల్ప సమాధి అంటారు. ఈ రెండూ హరిహరతత్త్వాలకు సూచకాలని గ్రహించాలి.

ధర్మరాజు రాజ్యంబున నుత్పాతంబులు దోఁచుట (సం.16-1-1)

క. **దేవా! జనమేజయ ధా। త్రీ వల్లభునకు నుదాత్త తేజోదీప్తుం**

డా వైశంపాయనుఁడు ప్రి। యావేశస్మేరచిత్తుఁడై యి ట్లనియెన్. **2**

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; జనమేజయ ధాత్రీవల్లభునకున్= జనమేజయ మహారాజునకు; ఉదాత్త= గొప్పదైన; తేజోదీప్తుండు= కాంతిచేత ప్రకాశించే వాడయిన; ఆ వైశంపాయనుఁడు= ఆ వైశంపాయన మహర్షి; ప్రియావేశ= ప్రేమతో కూడిన ధార్మికమైన ఆవేశంతోడి; స్మేరచిత్తుఁడు+ఐ= ప్రసన్నమైన మనసు కలవాడై; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: జనమేజయ మహారాజుతో వైశంపాయనుడు ప్రేమతో పుట్టిన ధార్మికావేశం కలిగినవాడై ఇట్లా చెప్పాడు.

విశేషం: వ్యాసుడు భవ్య కవితావేశం కలిగినవాడు (చూ.విరాట.1-3) అదే ఆవేశం వైశంపాయన మహర్షిలో కూడా ఉన్నది. 'లోకహితనిష్ఠ'లో పుట్టిన ధార్మికావేశ మిది. అదే ఋషులకు లోకం మీద ఉన్న ప్రేమ. జనన మరణాలకు చలించని ఋషి చిత్తం ఎప్పుడూ ప్రసన్నంగా ఉంటుంది.

సీ. **భారత సంగ్రామపారీణుఁడై జయ। రమ యుల్లసిల్ల సామ్రాజ్యమునకుఁ**

బాండవముఖ్యునిఁ బట్టంబు గట్టిన। యది యాది గాఁగ ముప్పదియునైదు

సంవత్సరంబులు సన ననంతర వత్స। రంబునఁ బ్రజకు భయం బొనర్చు

నుత్పాతములు పుట్టె నుర్వీశ! విను మహా। వాయువు శర్కరావర్షి యగుచు

ఆ. వీచు, నర్కునుదయవేళల బింబంబు। బలసి తోఁచు, ఘనకబంధసమితి
నీరదములు లేక నిర్ఘాతపాతముల్। గలుగు నుల్క లెల్లకడల డుల్లు.' 3

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ!= ఓ జనమేజయరాజా!; విను= ఈ కథను వినుము; భారతసంగ్రామ పారీణుఁడై= భారత యుద్ధం నిర్వహించటంలో సమర్థత కలిగి; జయరమ= విజయశ్రీ (గెలుపు); ఉల్లసిల్లన్= అతిశయించగా (పొంది); సామ్రాజ్యమునకున్= భారత సామ్రాజ్యానికి; పాండవముఖ్యునిన్= పాండు కుమారులలో శ్రేష్ఠుడిని-ధర్మరాజును; పట్టంబు= పట్టాభిషేకం; కట్టిన అది= జరిపినది; ఆదిగాఁగన్= మొదలుకొని; ముప్పదియునైదు సంవత్సరంబులు= ముప్పై ఐదు సంవత్సరాలు; చనన్= కడచిన తరువాత; అనంతర వత్సరంబునన్= ఆ పై సంవత్సరం (ముప్పై ఆరవ సంవత్సరంలో); ప్రజకున్; భయంబున్+ఒనర్చు= భయాన్ని కలిగించే; ఉత్పాతములు+పుట్టెన్= ఉపద్రవసూచకాలైన ప్రకృతి వికారాలు కలిగాయి; మహావాయువు= పెనుగాలి; శర్కరావర్షి+అగుచున్= ఇసుకను వర్షిస్తూ; వీచున్= వీచింది; అర్కు= సూర్యుడి యొక్క; ఉదయవేళలన్= ఉదయసమయాలలో; ఘనకబంధసమితి= పెద్దపెద్ద మొండెముల సముదాయాలు; బింబంబు బలసి= అర్కబింబాన్ని చుట్టుకొని; తోఁచున్= కనిపించటం మొదలుపెట్టాయి; నీరదములు లేక= మేఘాలు లేకుండానే; నిర్ఘాతపాతముల్= పిడుగుపాట్లు; కలుగున్= కలిగాయి; ఉల్కలు= ఉల్కలు; ఎల్లకడలన్= అన్ని దిక్కులలోనూ; డుల్లున్= రాలాయి.

తాత్పర్యం: రాజా! వినుము. ధర్మరాజుకు పట్టాభిషేకం జరిగిన ముప్పదైదు సంవత్సరాలు గడవగా ఆ ముప్పదిఆరవ సంవత్సరంలో భయంకరమైన ప్రకృతివైపరీత్యాలు కలిగాయి. ఉదయకాలంలో పెద్దగాలులతో ఇసుకవర్షం పడింది. ఉదయ సమయాలలో సూర్యబింబాన్ని పరివేష్టించి మొండాలు గోచరించాయి. మేఘాలు లేకుండానే పిడుగులు పడ్డాయి. అన్ని దిక్కులలోనూ ఉల్కలు రాలాయి.

విశేషం: 1.గాంధారి శపించింది యాదవనాశం 36వ సంవత్సరంలో జరగబోతుందని - కాబట్టి సంవత్సరాన్ని ఇంతగా నొక్కి చెప్పటం. 2. ప్రకృతి వైపరీత్యాలు మూడు రకాలు: 1. దివ్యమైనవి - సూర్యచంద్రాది గ్రహణాలు. 2. అంతరిక్ష సంబంధమైనవి-ఉల్కాపాతం మొదలైనవి. 3. భూ సంబంధమైనవి - భూకంపం మొదలైనవి.

క. పరివేషములినరజనీ। కరులకు నతిరూక్ష రుచులు గలిగి కలుగు నం
బరమెల్లఁ గప్పి వేసవిఁ। బరఁగుం బెనుమూడ మంచు పౌరవముఖ్యా! 4

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశశ్రేష్ఠా!; ఇనరజనీకరులకున్= సూర్యచంద్రులకు; పరివేషములు= గాలిగుడులు (కాంతి వలయాలు); అతిరూక్ష రుచులు కలిగి= అతిభయంకరమైన కాంతులు కలిగి; కలుగున్= ఏర్పడతాయి; అంబరము+ఎల్లన్= ఆకాశమంతటా; వేసవిన్= మండువేసవిలో (ఎండకాలంలో); కప్పి= బాగా పరచుకొని; పెనుమూడ మంచు= పెద్దపొగమంచు; పరఁగున్= వ్యాపించినది (విస్తరించింది).

తాత్పర్యం: సూర్యచంద్రులకు చుట్టూ అతిభయంకరమైన కాంతులలో గాలిగుడులు కట్టాయి. మండు వేసవిలో దట్టమైన పొగమంచు ఆకాశమంతటా విస్తరించింది.

సీ. ఇట్లనుదినమును నెన్నియేనియును మహో। త్పాతములు పుట్టుచుండఁ గొంత
కాలంబువోవఁగఁ గౌంతేయముఖ్యుండు। వినియె నొండొరులతోఁ బెనఁగి సర్వ

యాదవులును దెగి రంబుజనాభుండు । హలధరుండును దక్క నని నరేంద్ర!

విని భీమసేనుని వివ్వచ్చు నకులుని । సహదేవు రావించి సంభృతార్తి

తే. యగుచు నవ్వార్త యెఱిఁగించె నందఱకును; । వార లేవురు నెవ్వగల్ గూరు మాన

సములు గలఁగ నత్యంత విషణ్ణులైరి । సకలజనకోటులును శోకజలధి మునుఁగ. 5

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= ఓ రాజా!; ఇట్లు= ఈ విధంగా; అనుదినమును= ప్రతిరోజూ; ఎన్నియేనియునున్= ఎన్నో; మహా+ఉత్పాతములు= పెద్ద ఉపద్రవాలు; పుట్టుచున్+ఉండన్= కలుగుతుండగా; కొంతకాలంబు పోవంగన్= కొంతకాలం గడిచాక; కౌంతేయముఖ్యుండు= ధర్మరాజు; అంబుజనాభుండు= శ్రీకృష్ణుడు; హలధరుండును= బలరాముడు; తక్కన్= తప్ప (తక్కిన); సర్వయాదవులును= యాదవులందరూ; ఒండొరులతోన్= ఒకరితో ఒకరు; పెనంగి= పోట్లాడి; తెగిరి+అని= మరణించారని; విని= విన్నవాడై; భీమసేనునిన్= భీముడిని; వివ్వచ్చునిన్= అర్జునుడిని; నకులునిన్= నకులుడిని; సహదేవున్= సహదేవుడిని; రావించి= పిలిపించుకొని; సంభృత+ఆర్తి+అగుచున్= మిక్కిలి బాధకలవాడై; ఆ+వార్త= యాదవులమృతిని; అందఱకును= ఎల్లరికి; ఎఱిఁగించెన్= తెలియజేశాడు; వారలు+ఏవురు= ఆ పాండవులైదుగురూ; నెఱ+వగల్= సంపూర్ణమైన బాధలు; కూరు= నిండిన; మానసములు కలఁగన్= మనస్సులు వికలం కాగా; సకలజనకోటులునున్= హస్తినాపురవాసులంతా; శోకజలధిమునుఁగన్= శోకసముద్రంలో మునుగగా; అత్యంత= మిక్కిలి; విషణ్ణులు+ఐరి= విషాదాన్ని పొందారు.

తాత్పర్యం: ఇట్లా ప్రతిరోజూ ఏదో ఒక వైపరీత్యం జరుగుతూ ఉంటే కొంతకాలం గడిచాక ధర్మరాజు శ్రీకృష్ణ బలరాములు తప్ప తక్కిన యాదవులంతా ఒకరితో ఒకరు పోట్లాడి చనిపోయారన్న వార్త విన్నాడు. తన సోదరులను పిలిపించి ఈ వార్త తెలియజేశాడు. హస్తినాపురవాసులంతా ఈ వార్త విని శోకంలో మునిగారు. పాండవుల వ్యథ వర్ణనాతీతమైనది.

విశేషం: శోకజలధి-శోక మనెడి జలధి-రూపకాలంకారం.

తే. అనిన విని యమ్మహీపతి యాదవులకుఁ । బోరు దమలోనఁ గలిగిన కారణంబు

వారి వృత్తాంతములు వినవలతుఁ జెప్పు । మనుడు నమ్ముని యిట్లను నతనితోడ. 6

ప్రతిపదార్థం: అనినన్= ఈ విధంగా వైశంపాయనుడు చెప్పగా; విని; ఆ+మహీపతి= జనమేజయుడు; యాదవులకున్= యాదవ వంశీయులకు; తమలోనన్= తమలోతమకే; పోరు= యుద్ధం; కలిగిన కారణంబు= ఏ కారణంవలన కలిగిందో; వారి వృత్తాంతములు= ఆ కథలను; వినవలతున్= వినగోరుతాను; చెప్పుము; అనుడున్= అని చెప్పగా; ఆ ముని= వైశంపాయనుడు; అతనితోడన్= జనమేజయుడితో; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: 'యాదవులు తమలో తాము ఎందుకు పోరాడి మరణించారో తెలిసికొనగోరుతున్నాను' అని జనమేజయుడు అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు ఇట్లా చెప్పటం మొదలుపెట్టాడు.

విశేషం: యాదవులలో చాలా తెగలున్నాయి. వృష్ణి, భోజ, అంధక, కుకుర-ఇత్యాదులు, అందువలననే 'తమలో తాము ఎందుకు ఘర్షణపడ్డారు?' అని రాజు అడిగాడు.

క. 'ద్వారవతికిఁ గణ్వుండును । నారదమునివరుఁడు గాధినందనుఁడును బెం

పారంగఁ దొల్లి వచ్చిరి । నారాయణుఁ జూచువేడ్క నరవరముఖ్యా! 7

ప్రతిపదార్థం: నరవరముఖ్యా!= శ్రేష్ఠుడైన రాజా!; తొల్లి= చాలాకాలం క్రిందట; కణ్వుండును= కణ్వమహర్షి; నారదమునివరుండున్= నారదమహర్షి; గాధి నందనుండును= విశ్వామిత్రమహర్షి; నారాయణున్= శ్రీకృష్ణుడిని; చూచువేడ్కన్= దర్శించాలన్న కోరికతో; పెంపు+ఆరంగన్= (శిష్యప్రశిష్యులతో కలిసి) వైభవంగా; ద్వారవతికిన్= ద్వారకానగరానికి; వచ్చిరి= వచ్చారు.

తాత్పర్యం: చాలాకాలం క్రిందట కణ్వుడు, నారదుడు, విశ్వామిత్రుడు తమ శిష్యులతో కలిసి శ్రీకృష్ణుడిని చూడాలన్న కోరికతో ద్వారకకు వచ్చారు.

విశేషం: యాదవుల మరణానికి కారణమైన ఈ ఋషుల ఆగమనం కూడా శ్రీకృష్ణుడి సంకల్పమే - అని ఈ పద్యం తెలుపుతుంది. అందుకే ఋషులకు శ్రీకృష్ణుడిని చూడాలన్న కోరిక కలిగింది.

సీ. చనుదెంచి పురవీథిఁ జనునవసరమున। వృష్ణి కుమారులు విధివశమున
మనముల నవినీతి జనియింప సాంబున। కంగనాలంకార మమరఁజేసి
కొనివచ్చి యమ్మహామునివర్గమునకు మి। థ్యావినయమున వందన మొనర్చి
నిభృతులై కారుణ్యనియతాత్ములార! యీ। భామిని బభ్రునిభార్య ప్రజలఁ

తే. గనునె యిది? యని యడిగిన కౌరవేంద్ర!। యత్తపోధనవర్యు లయ్యాగడమున
కాత్మలందుఁ గ్రోధానల మగ్గలముగ। నెలయ నక్కుమారులతోడ నిట్టు లనిరి. 8

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర= ఓ జనమేజయమహారాజా! (వినుము); చనుదెంచి= ఆ ఋషులు అట్లావచ్చి; పురవీథిన్= ద్వారకానగర వీథులలో; చను+అవసరమునన్= వెళ్ళుతున్న సమయంలో; విధివశమునన్= విధిచేత ప్రేరేపించబడి; వృష్ణికుమారులు= వృష్ణి సంతతికి చెందిన యువకులు (కొందరు); మనములన్= మనస్సులలో; అవినీతి జనియింపన్= అవిధేయత కలుగగా; సాంబునకున్= సాంబుడనే పేరుగల కృష్ణుడి కుమారుడికి; అమరన్= తగినట్టుగా; అంగనా+అలంకారము+చేసి= ఆడదాని వేషంవేసి, కొనివచ్చి= తీసికొని వచ్చి; ఆ మహాముని వర్గమునకున్= ఆ గొప్పమునుల సముదాయమునకు; మిథ్యావినయమునన్= లేని వినయంతో; వందనము+ఒనర్చి= నమస్కారాలు చేసి; నిభృతులై= మాయావంతులై; కారుణ్య నియతాత్ములార!= కరుణామయమైన చిత్తాలు కలిగిన ఓ ఋషులారా!; ఈ భామిని= ఈ స్త్రీ; బభ్రుని భార్య= బభ్రుడనేవాడి పెండ్లాము; ఇది= ఈమె; ప్రజలన్+కనునే?= పిల్లలను కంటుందా?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; ఆ+తపోధనవర్యులు= ఆ ఋషులు; ఆ+ఆగడమునకున్= ఆ వంచనకు; ఆత్మలందున్= మనసులలో; క్రోధ+అగ్ని= కోపమనే అగ్ని; అగ్గలముగన్= అధికంగా; ఎలయన్= రగులుకొనగా; ఆ కుమారులతోడన్= ఆ యువకులతో; ఇట్టులు+అనిరి= ఇట్లా చెప్పారు.

తాత్పర్యం: ఇట్లా ద్వారకావీథులలో ఆ ఋషులు వెళ్ళుతున్న సమయంలో విధిచేత ప్రేరేపించబడి, వృష్ణివంశానికి చెందిన కొందరు యువకులు సాంబుడనే వాడికి ఆడదానివేషం, కపటమైన వినయాన్ని ఒలకబోస్తూ నమస్కారాలు చేసి, 'అయ్యా! మీరు అన్నీ తెలిసినవారు. కరుణామూర్తులు. ఈ స్త్రీ బభ్రుడి పెండ్లాము. ఈమెకు సంతానం కలుగుతుందా? లేదా? చెప్పండి!' అని అడిగారు. ఆ ఋషులకు ఇది కపటవేషమని తెలిసి చాలా కోపం వచ్చి ఇట్లా అన్నారు:

క. అంబుజనాభుని కొడు కీ। సాంబుఁడు గను యాదవక్షయాపాదన క
ల్యంబగు ముసలము; మావచ। నంబున కనృతంబు లేదు; నమ్ముఁడు మీరల్. 9

ప్రతిపదార్థం: అంబుజనాభుని కొడుకు= శ్రీకృష్ణునికుమారుడైన; ఈ సాంబుఁడు= సాంబుడు అనే ఇతడు; యాదవ= యాదవులకు; క్షయ+ఆపాదన+కల్యంబు+అగు= నాశనం కల్గించటానికి సమర్థమైన; ముసలమున్= రోకలిని; కనున్= కంటాడు; మా వచనంబునకున్= మా మాటకు; అనృతంబు లేదు= తప్పిపోవటమంటూ లేదు; మీరల్= మీరు; నమ్ముఁడు= నమ్మండి.

తాత్పర్యం: 'శ్రీకృష్ణుడి కుమారుడైన ఈ సాంబుడు యాదవకులనాశన సమర్థమైన ఒక రోకలిని కంటాడు పొండి. ఈ విషయాన్నైనా నమ్మండి (మాతోనా మీ ఆటలు? అని అర్థం). మా మాటలు పొల్లుకావు.

విశేషం: వృష్ణికులంలో వాసుదేవుడుగా కృష్ణుడు పుట్టాడని భగవద్గీత చెప్తుతుంది. శ్రీకృష్ణుడి కుమారుడే సాంబుడు.

సీ. **దామోదరుఁడు హలధరుఁడును దక్కంగ । యాదవులెల్లరు నమ్ముసలము**
నద్భుతశక్తి గీటడఁగుదు రబ్బల । దేవుండు దనదైన దేహ మధిక
నిష్ఠమై విడిచి వార్నిధిఁ బ్రవేశించు । భూశయ్య నుండంగ నాచక్రధరుని
జర యను రాక్షసి వెరవునఁ బట్టి క్ర । మించుఁ బొం' డని చెప్పి, మెచ్చు గాదు

ఆ. **మనము కృష్ణు నింకఁ గను టనియెడుబుద్ధి । నమ్మహామునీంద్రు లపుడు మరలి**
యాత్మవాసములకు నరిగిరి; తదనంత । రంబ కృష్ణుఁ డవ్విధంబు వినియె. **10**

ప్రతిపదార్థం: ఆ ముసలము= ఆ రోకలికున్న; అద్భుతశక్తిన్= విచిత్రమైన శక్తిచేత; దామోదరుఁడునున్= శ్రీకృష్ణుడును; హలధరుఁడును= బలరాముడును; తక్కంగన్= తప్ప (తక్కిన); యాదవులు+ఎల్లరున్= యాదవులందరూ; గీటు+అడఁగుదురు= నశిస్తారు; ఆ+బలదేవుండు= ఆ బలరాముడు; తనది+ఐన+దేహమున్= తన పార్థివశరీరాన్ని; అధికనిష్ఠమైన్= సమాధిలో నిష్ఠచేత; విడిచి= వదలిపెట్టి; వార్నిధిన్= సముద్రంలో; ప్రవేశించున్= ప్రవేశిస్తాడు; భూశయ్యన్+ఉండఁగన్= నేలమీద పడుకొని ఉండగా; ఆ+చక్రధరునిన్= ఆ శ్రీకృష్ణుడిని; జర+అనురాక్షసి= 'జర' అనే పేరున్న రాక్షసి; వెరవునన్= నేర్పుతో; పట్టి ఆక్రమించున్= పట్టి ఆక్రమిస్తుంది (చంపుతుంది); పొండు= (ఇక మీరు చేసింది చాలు) పొండి; అని చెప్పి= అని వారలను పంపివేసి; మనము= మనం; కృష్ణున్= శ్రీకృష్ణుడిని; ఇంకన్= ఇప్పుడింక; కనుట= చూడటం; మెచ్చు+కాదు= సమంజసం కాదు; అనియెడు బుద్ధిన్= అన్న ఆలోచనతో; ఆ+మహామునీంద్రులు= ఆ ఋషులు; ఆత్మవాసములకున్= తమ తమ నివాసాలకు; మరలి= తిరిగి; అరిగిరి= వెళ్ళారు; కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; తదనంతరంబు+అ= ఆ తరువాత (వెంటనే); ఆ+విధంబు= ఆ విషయం; వినియెన్= విన్నాడు.

తాత్పర్యం: బలరామకృష్ణులు తప్ప తక్కిన యాదవులంతా ఆ రోకలికున్న విచిత్ర శక్తి చేత నశిస్తారు. బలరాముడు యోగనిష్ఠతో తన శరీరం వదలి సముద్రంలోకి ప్రవేశిస్తాడు. కృష్ణుడు నేలపై పడుకొని ఉండగా 'జర' అనే రాక్షసి ఆయనను ఆక్రమించి చంపుతుంది. (ఇక చాలు) వెళ్ళండి?' అని చెప్పి వారిని పంపివేసి, 'ఇప్పుడు మనం కృష్ణుడిని చూడటం సమంజసం కా' దని ఆలోచించినవారై ఆ ఋషులు తమ తమ ఆశ్రమాలకు వెళ్ళిపోయారు. వెనువెంటనే కృష్ణుడి కీ వార్త తెలిసింది.

క. **విని కాలవేది యగు న । వ్వనజాక్షుఁడు నియతి యగు నవస్థకుఁ దలఁపం**
జన దన్యథాత్వకరణం । బని యూహించుచు నుపేక్ష యాత్మ నొలయఁగన్. **11**

ప్రతిపదార్థం: విని= ఇట్లా ఋషులు వెళ్ళిపోవటాన్ని గురించి విని; కాలవేదిఅగు= భూత భవిష్యద్వర్తమానాలను తెలిసినట్టి; ఆ+వనజాక్షుఁడు= కమలనేత్రుడైన ఆ కృష్ణుడు; నియతి+అగు+అవస్థకున్= కాలనిర్ణీతమైన పనికి; అన్యథాత్వకరణంబు= మరో విధంగా చేయటం; తలఁపన్+చనదు= ఆలోచించరాదు (అంటే అది అట్లాగే జరగాలని); అని ఊహించుచున్= అని తలుస్తూ; ఉపేక్ష= ఉదాసీన బుద్ధి; ఆత్మన్+ఒలయఁగన్= మనసులో ఏర్పడగా.

తాత్పర్యం: అట్లా ఋషులు మరలిపోవటాన్ని కృష్ణుడు విన్నాడు. భూతభవిష్యద్వర్తమానాలు తెలిసిన కృష్ణుడికి కాలవిధిని గతి మరల్చటం వీలులేని విషయమన్న భావం మనసులో కలుగగా ఉదాసీనుడయ్యాడు.

క. **తన చుట్లనున్న బంధులఁ। గనుఁగొని 'యిట్టిది విధాతృకరణీయం బి**
ప్పని మనవారల యొప్పని। తనమున మూఁడెనని వంతఁ దలపోయకుఁడీ.' **12**

ప్రతిపదార్థం: తనచుట్లన్= తన చుట్టూ; ఉన్న బంధులన్+కనుఁగొని= ఉన్న బంధువులను చూచి; విధాతృకరణీయంబు= బ్రహ్మనియామకం; ఇట్టిది= ఇట్లాంటిది (అంతేగాని); ఈ+పని= ఈ కార్యం (ఋషులను అవమానించి శాపం పొందటం); మనవారల= మనయాదవకుమారుల; ఒప్పనితనమునన్= మూర్ఖత్వంచేత; మూఁడెన్+అని= దాపురించిందని; వంతన్= దుఃఖంలో; తలపోయకుఁడీ= ఆలోచించకండి.

తాత్పర్యం: తన సమీపంలోని బంధువులను చూచి శ్రీకృష్ణు డిట్లా అన్నాడు; 'ఇది విధి నియామకం. అంతే తప్ప మన యాదవకుమారుల మూర్ఖత్వం చేత దాపురించిందని మీరు మాత్రం దుఃఖించకండి.'

మునిశాపంబున సాంబుని కడుపున ముసలంబు పుట్టుట (సం. 16-2-15)

సీ. **అని పల్కి యభ్యంతరావాసమున కేఁగె;। మఱునాఁడు సాంబకుమారు కడుపు**
లోనుండి జముదూతవోని భయంకర। నిష్ఠురముసలంబు నిర్గమించె;
దానికి నత్యద్భుతంబును భయమును। గదురంగ వసుదేవుకడకుఁ బాఱి
బంధు లయ్యాదవపతి కెఱిఁగించిన। నలఁదురి వెలువెల్లనగుచుఁ గొంత

తే. **ప్రొద్దు నివ్వెఱఁగంది యా భూవరుండు। కడురయంబున రోఁకలి పొడిగఁజేసి**
వనధిలోపలఁ జల్లంగ వారిఁ బనిచె;। వారలును నట్ల చేసిరి కౌరవేంద్ర! **13**

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= ఓ రాజా! (వినుము); అని పల్కి= అని చెప్పినవాడై శ్రీకృష్ణుడు; అభ్యంతరావాసమునకున్+ఏఁగెన్= తన మందిరానికి వెళ్ళిపోయాడు; మఱునాఁడు= ఆ తరువాతి రోజు; సాంబకుమారు కడుపులోనుండి= సాంబుడి పొట్టలోనుంచి; జముదూత+పోని= యమదూతవంటి; భయంకర= భయాన్ని కలిగించే; నిష్ఠుర= కఠినమైన; ముసలంబు= రోకలి; నిర్గమించెన్= బయలుపడింది; దానికిన్= ఆ రోకలి బయలుపడటాన్ని చూచి; అతి+అద్భుతంబునున్= చాలా ఆశ్చర్యాన్ని; భయమునున్= భయమూ; కదురంగన్= కలుగగా (ఆ బంధువులు); వసుదేవుకడకున్+పాఱి= వసుదేవమహారాజుదగ్గరికి వెళ్ళి; ఆ యాదవపతికిన్= ఆ వసుదేవుడికి; ఎఱిఁగించినన్= ఈ వృత్తాంతాన్ని తెలపగా; అలఁదురి= భయపడి; వెలువెల్లనగుచున్= వెలవెలపోతూ; కొంతప్రొద్దు= కొంచెం సేపు; ఆ భూవరుండు= ఆ వసుదేవుడు; నిండు+వెఱఁగు+అంది= చాలా ఆశ్చర్యపడి; కడురయంబునన్= అతివేగంగా; రోఁకలిన్= ఆ రోకలిని; పొడిగన్+చేసి= నూరి పొడిచేసి; వనధిలోపలన్+చల్లంగన్= సముద్రంలో కలిపివేయటానికి; వారిన్+పనిచెన్= వారిని పంపాడు; వారలును= ఆ బంధువుల కుమారులు; అట్లు+అ+చేసిరి= అట్లాగే చేశారు.

తాత్పర్యం: అనిచెప్పి శ్రీకృష్ణుడు తన మందిరానికి వెళ్ళిపోయినాడు. జనమేజయా! ఆ మరుసటిరోజే సాంబుడి కడుపులో నుండి యముని దూతవంటి భయంకరమైన కఠినంగా ఉన్న ఒక రోకలి వెలువడింది. దానికి ఆశ్చర్యమూ భయమూ కలుగగా బంధువులు వసుదేవుడి దగ్గరకు పరుగెత్తి ఆయనకు తెలుపగా ఆయన భయపడి వెలవెలబోయి నిశ్చేష్టుడై కొంతసేపుండి చాల ఆశ్చర్యపడుతూ ఆ రోకలిని వెంటనే పొడిగా చేసి సముద్రంలో కలిపివేయుండని వారిని (ఆ చెప్పిన బంధువులను) ఆజ్ఞాపించినాడు. వారు కూడ అట్లాగే చేసినారు.

విశేషం: భారతంలో చాలా ప్రధానాంశం. విధి ఎంత ఉత్కృష్టమైనదో చెప్పటమే. విధి అసాధ్యాలను సాధ్యం చేస్తుంది. దానిని ఎవరూ ఎదిరించలేరు. కనుకే మగవాడి పొట్టలోనుండి రోకలి బయటపడింది. ఇది ఒక వింత. దానిని పొడిగా చేసి నీటిలో కలిపితే సమస్య పరిష్కారమౌతుందని భావించటం మానవప్రయత్నం . అది ఎట్లాంటి రూపాంతరాన్ని పొంది విధి నియామకాన్ని నిర్వర్తించిందో తరువాతి కథలో చూస్తాం.

క. మునిశాపశక్తి మానుష। మునఁ ద్రోవఁగ రామి యుల్లములఁ దలఁపక య
జ్జనపతియు బాంధవులు న। ట్లొనర్చి యూఅడిలి యుండి రుర్వీనాథా! 14

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= రాజా!; మునిశాపశక్తిన్= మునుల శాపానికి ఉన్న శక్తిని; మానుషమునన్= మానవప్రయత్నంచేత; త్రోవఁగన్+రామి= తొలగించుకొనలేకపోవటాన్ని; ఉల్లములన్+తలఁపక= మనసులలో ఊహించకుండా; ఆ+జనపతియున్+బాంధవులున్= ఆ రాజు, అతడి బంధువులు; అట్లు+ఒనర్చి= ఆ విధంగా చేసి; ఊఱడిలి యుండిరి= ఊరటతో ఉన్నారు.

తాత్పర్యం: మనుష్యప్రయత్నంతో ఋషుల శాపశక్తిని తప్పించుకొనలేమన్న ఊహ కూడా వారికి రాలేదు. అట్లా రోకలిని పొడిచేసి సముద్రంలో కలపటంవలన తమ పని పూర్తయిందనుకొన్నారు. అట్లా చేసి కొంత ఓదార్పును పొందారు.

విశేషం: పురాణకథలన్నిటిలోనూ ఇట్లాంటి చర్యలు కనిపిస్తాయి. పరీక్షిత్తు ఒంటిస్తంభం మేడమీద ఉండి తక్షకుడి బారినుండి రక్షించుకొనాలని ప్రయత్నించటం ఇట్లాంటిదే. ఇక్కడ తక్షకుడు విధి చోదితుడు. అందుకే పండులో ప్రవేశించి పరీక్షిత్తునకు మరణం కలిగించాడు. ఇక్కడ కూడా అంతే. విధి ఎట్లా రూపాంతరం చెందగలుగుతుందో వసుదేవాదులు ఊహించలేకపోయారు.

క. పదపడి ధృతరాష్ట్ర మహిషి। యదయహృదయయై సమస్తయాదవులకు బె
ట్టిదమగు శాపం బిచ్చుట। విదితమయిన నజ్జనములు వెఱచుచునుండన్. 15

ప్రతిపదార్థం: పదపడి= పూనికతో (తనకు తానుగా); ధృతరాష్ట్ర మహిషి= ధృతరాష్ట్రుడి భార్య గాంధారి; అదయహృదయ+ఐ= కనికరం లేని హృదయం కలదై; సమస్తయాదవులకున్= యాదవులందరికీ; బెట్టిదమగు శాపంబు+ఇచ్చుట= క్రూరమైన శాపం ఇవ్వటం; విదితము+అయినన్= తెలియగా; ఆ+జనములు= ఆ జనులు; వెఱచుచునుండన్= భయపడుతుండగా.

తాత్పర్యం: తన సంతానం నశించటానికి శ్రీకృష్ణుడే కారణమని తలచి గాంధారి కనికరంలేని మనస్సుతో 'యాదవసంతానం కూడా నా సంతానంవలె నశిస్తుం'దని క్రూరంగా శపించింది. ఈ శాపవిషయం తెలిసిన వారు ఏమి కాబోతుందో అని భయపడుతుండగా. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: పతివ్రత శాపం తప్పకుండా ఫలిస్తుందని మనవారి విశ్వాసం. భర్తకు కనులు లేవని తానుకూడా కళ్ళకు గంతలు కట్టుకొని, జీవితాంతమూ గుడ్డితనాన్ని తెచ్చుకొన్న పతివ్రత గాంధారి, అందుకే ఆమెకు శాపం ఇవ్వగల శక్తి అబ్బింది. ఆ శాపాన్ని శ్రీకృష్ణుడు కూడా తొలగించలేకపోయాడు. యాదవులందరు అనటంలో శ్రీకృష్ణుడు కూడా వారిలో ఉన్నాడు. అందుకే ఇది క్రూరమైన శాపం.

క. కాలం బగుటయుఁ గురుభూ। పాలోత్తమ! యాదవేంద్రు పట్టణమున హృ
త్కాలుష్యసమాపాదన। శాలిమహోత్పాతముల్ ప్రజాతము లయ్యెన్. 16

ప్రతిపదార్థం: కురుభూపాలోత్తమ!= కురువంశస్థులలో శ్రేష్ఠుడా! (వినుము); కాలంబు+అగుటయున్= యాదవ నాశనకాలం సమీపించటంచేత; యాదవ+ఇంద్రు పట్టణమునన్= ద్వారకానగరంలో; హృద్+కాలుష్యసమాపాదన శాలి= హృదయాలలో కాలుష్యాన్ని పుట్టించగల శక్తి ఉన్న; మహా+ఉత్పాతముల్= పెద్దపెద్దవైన ఉపద్రవాలు (ప్రకృతివికారాలు); ప్రజాతములు+అయ్యెన్= పుట్టాయి.

తాత్పర్యం: యాదవుల వినాశనకాలం ఎప్పుడు సమీపించిందో అప్పుడే ద్వారకానగరంలో చెప్పరాని ఉపద్రవాలు సంభవించటం మొదలుపెట్టాయి.

విశేషం: రాబోయే శుభాశుభ ఫలాలను ప్రకృతి సూచించగలదని మనవారి విశ్వాసం. ఈ ఉత్పాతాలన్నీ ప్రకృతి వైపరీత్యాలే. వీటిని మూడు విధాలుగా ప్రాచీనులు చెప్పారు. సూర్యచంద్రాది గ్రహణాలను దివ్యాలని, ఉల్కలు తెగిపడటాన్ని అంతరిక్షాలని, భూమి కంపించటాన్ని భౌమాలని-అంటారు. ఇవి సంభవించినపుడు జీవితంలో భయంకరమైన అపాయాలు కలుగుతాయని సూచన.

తే. అరుణములు ఘూర్ణితంబులు నైన లోచ। నములు మెఱయ మహోగ్రదండము ధరించి
తిరుగు నొక్కొక్కచోటను దృశ్యుఁడగుచు। నంతకుం డిదె యదె తోఁచె ననఁగ నధిప! 17

ప్రతిపదార్థం: అధిప!= రాజా! (వినుము); అరుణములు= ఎఱ్ఱనివి; ఘూర్ణితంబులు+ఐన= గుండ్రంగా తిరిగేటటువంటి; లోచనములు మెఱయన్= కళ్ళు ప్రకాశిస్తుండగా; మహోగ్రదండము ధరించి= భయంకరమైన దండాయుధాన్ని ధరించి; అంతకుండు= యముడు; ఒక్కొక్కచోటను= అక్కడక్కడా; దృశ్యుఁడగుచున్= కనిపిస్తూ; ఇదె అదె తోఁచెన్+అనన్= ఇక్కడ కనిపించాడు, అక్కడ కనిపించాడు అని భ్రమించేటట్లు; తిరుగున్= తిరుగుతాడు.

తాత్పర్యం: ఎఱ్ఱని గుండ్రంగా తిరిగే కళ్ళు ప్రకాశిస్తుండగా మహా భయంకరమైన దండాన్ని ధరించి యముడు ఇదిగో ఇక్కడ అదిగో అక్కడ కనిపించినాడనేటట్లుగా ఒక్కొక్కచోట కనబడుతూ తిరుగుతూనే ఉన్నాడు.

విశేషం: అంతాన్ని సంఘటించే వాడు కాబట్టి యముడికి అంతకుడని పేరు. అతడి చేతనున్న దండము-కాలదండం, కాలపాశమనీ అంటారు.

ద్వారకాపురంబున మహోత్పాతము లనేకములు పుట్టుట (సం.16-3-2)

క. నీలపింగళ దేహమాభీల భంగి। కముగ నమ్మెయి వర్తించు జముఁడు సకల
వృష్ణి భోజాంధకోత్సాది విహరణమున। మునుల శాపంబు ప్రేరేఁప మనుజనాథ! 18

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; మునులశాపంబు ప్రేరేఁపన్= మునులశాపం ప్రేరేపించగా; వృష్ణిభోజ+అంధక+ఉత్సాది విహరణమునన్= యాదవులను నాశనం చెయ్యటం అనే క్రీడలో భాగంగా; జముఁడు= యముడు; నీలపింగళదేహము= నలుపు పసుపువన్నెలు గల శరీరం; ఆభీల భంగికముగన్= భయాన్ని సృష్టించే విధంగా; ఆ+మెయిన్= ఆ రీతిలో; వర్తించున్= తిరగటం మొదలుపెట్టాడు.

తాత్పర్యం: యాదవులను చంపటమనే ఆట మొదలుపెట్టాడా!-అన్నట్లుగా యముడు నలుపు, పసుపు వన్నెలు కలిసిన (గోరోచన వర్ణమని కూడా అంటారు) విచిత్ర దేహకాంతితో భయాన్ని కలిగించే రీతిలో అట్లా తిరగటం ప్రారంభించాడు.

సీ. **చిలుకలు గూబల యెలుఁగుల చందంబు। దోఁపంగ నఱచు రాత్రులను దినము**
లందును నక్కల యట్లు మేఁకలు గూయు। మొదవు పిండునకు గాడిదలు పుట్టు;
ముంగుల కుదయించు మూషికంబులు గుక్క। లెల్లను బిల్లుల నీను; బలుఁడు
హరియును దక్కంగ యాదవ నివహంబు। బ్రాహ్మణప్రతతికి బాధసేయు

తే. **గురుల కవమాన మొనరించుఁ దిరుగు లజ్జ। విడిచి యభిలాషముల వెంట విభుల పంపు**
సేయ కున్మార్గములఁ దమ చిత్తములకు। వచ్చినట్ల వర్తింతురు వనిత; లధిప! 19

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; రాత్రులనున్= రాత్రివేళలలో; చిలుకలు గూబల ఎలుగు చందంబుదోఁపంగన్= చిలుకలు గూబల అరుపులవలె; కూయున్= కూస్తుంటాయి; దినములందునున్= పగటివేళలలో; నక్కల+అట్లు మేఁకలు కూయన్= నక్కలవలె మేకలు అరుస్తుంటాయి; మొదవు పిండునకున్= ఆవుల సమూహానికి; గాడిదలు+పుట్టున్= గాడిదలు పుట్టుతున్నాయి; ముంగులకున్= ముంగిసలకు; మూషికంబులు+ఉదయించున్= ఎలుకలు పుట్టుతున్నాయి; కుక్కలెల్లను= కుక్కలన్నీ; పిల్లులన్+ఈనున్= పిల్లులను ఈనుతున్నాయి; బలుఁడు హరియున్ తక్కంగన్= బలరాముడు శ్రీకృష్ణుడు తప్ప; (తక్కిన) యాదవ నివహంబు= యాదవ సమూహం; బ్రాహ్మణప్రతతికిన్= బ్రాహ్మణుల సమూహానికి; బాధ+చేయున్= ఏదో ఒక బాధను కల్పిస్తోంది; గురులకున్= గురువులకు; అవమానము+ ఒనరించున్= అవమానం కలిగిస్తోంది; లజ్జవిడిచి తిరుగున్= సిగ్గు విడిచిపెట్టి తిరుగుతోంది; అభిలాషములవెంటన్= ఇచ్ఛవచ్చిన కోరికల వెంబడి; వనితలు= యాదవస్త్రీలు; విభులపంపు+చేయక= భర్తల ఆనను లెక్కచేయకుండా; ఉన్మార్గములన్= చెడునడతలతో; తమ చిత్తములకున్= తమ మనసులకు; వచ్చినట్లు+అ= ఇష్టమయిన రీతిలో; వర్తింతురు= తిరుగుతున్నారు.

తాత్పర్యం: రాత్రివేళలలో చిలుకలు గూబలవలె కూస్తున్నాయి. పగటివేళలలో మేకలు నక్కలవలె అరుస్తున్నాయి. ఆవులకు గాడిదలు పుట్టుతున్నాయి. ముంగిసలకు ఎలుకలు జన్మిస్తున్నాయి. కుక్కలు పిల్లులను ఈనుతున్నాయి. బలరాముడు కృష్ణుడు తప్ప తక్కిన యాదవులు పాపకార్యాలు చేయటం మొదలుపెట్టారు. బ్రాహ్మణులను బాధిస్తున్నారు, గురువులను అవమానిస్తున్నారు. సిగ్గువదలి కోరికల వెంబడి పరుగెత్తుతున్నారు. యాదవస్త్రీలు భర్తలను లెక్కచేయటం మాని, మదించి ఇష్టంవచ్చిన రీతిలో విచ్చలవిడిగా తిరుగుతున్నారు.

విశేషం: చిలుకలు గూబలవలె కూయటం, ఇత్యాదులు అసంభవాలు. ప్రకృతి గతి వికటించిందని అర్థం. గోబ్రాహ్మణులకు ఎక్కడ బాధ కలుగుతుందో అక్కడ అధర్మం పుట్టిందని వైదిక సంప్రదాయం చెప్తుతుంది. గురువులను అవమానించటంచేత యాదవులలో వివేకం పోయిందని అర్థం. స్త్రీలు శీలం కోల్పోయినందువలన వారిని కాపాడగల పాతివ్రత్యబలం కూడా నశించిందని అర్థం.

క. అనలములు హోమకాలం। బున నానాభూతవర్ణములతోడ శిఖల్
మనుజేశ్వర! వామావ। ర్తన మొందఁగ నుగ్రగంధ రౌద్రంబు లగున్. 20

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= రాజా!; హోమకాలంబునన్= హోమంచేసే సమయంలో; అనలములు= అగ్నులు; నానాభూత వర్ణములతోడన్= చిత్రవిచిత్రమైన రంగులు కలవిగా; శిఖల్= జ్వాలలు; వామ+ఆవర్తనము+ఒందఁగన్= అప్రదక్షిణంగా తిరుగుతూ పైకి లేవగా; ఉగ్ర= భయంకరంగా; గంధ= వాసన కలిగి; రౌద్రంబులు+అగున్= భీతిని పుట్టిస్తున్నాయి.

తాత్పర్యం: హోమకాలంలో అగ్ని నానా వర్ణాలతో భీకరంగా ప్రకాశిస్తున్నది. జ్వాలలు అప్రదక్షిణమార్గంలో పైకి లేస్తూ దుర్వాసనతో భీతిని కలుగజేస్తున్నాయి.

విశేషం: శుభకార్యాలకు ప్రదక్షిణమార్గం (ఎడమవైపునుంచి కుడివైపు తిరగటం), అశుభకార్యాలలో అప్రదక్షిణం (దీనినే అపసవ్యమంటారు-కుడివైపు నుండి ఎడమవైపు తిరగటం) వైదిక సంప్రదాయంలో ఉన్నది. అగ్నిజ్వాల అపసవ్యం కావటం అమంగళాన్ని సూచిస్తుంది.

క. విను కూడుగూరపాకము। గనుఁగొని ప్రొయివాపి డింపఁగా నప్పు డసం
జనితములై ప్రువ్వులు గల। గొన మిలమిల మెదలునందుఁ గురుకులముఖ్యా! 21

ప్రతిపదార్థం: కురుకులముఖ్యా!= కురుకులంలోని రాజులలో శ్రేష్ఠుడా!; విను= ఇంకా ఏం జరిగిందో చెప్తాను వినుము; కూడుగూర= అన్నము, కూరలు; పాకము కనుఁగొని= ఉడికింది తెలిసికొని; ప్రొయి+పాపి= పొయ్యినుండి దూరంగా; డింపఁగాన్= క్రిందికి దించగా; అప్పుడు+అ= అప్పుడే; సంజనితములు+ఐ= పుట్టినవై; ప్రువ్వులు= పురుగులు; కలగొనన్= అంతటా; అందున్= ఆ ఆహారంలో; మిలమిల= మిలమిల లాడుతూ; మెదలున్= మెదలుతూ కనిపిస్తుంటాయి.

తాత్పర్యం: అన్నం, కూరలు ఉడికాక పొయ్యినుంచి ఒకవైపు దింపుతుంటే మరోవైపు అప్పటికప్పుడే అందులో పురుగులు పుట్టుతున్నాయి. ఆ ఆహారంలో అంతటా వ్యాపించి భీతి కలిగించేటట్లు మిలమిలలాడుతూ మెదలుతున్నాయి.

సీ. అనుదినంబును నిట్టు లశుభసూచకములు। దోఁపంగ సర్వవిదుండు కృష్ణుఁ
డంతరంగమున సమాలోచనము చేసి। 'గాంధారి పుత్రశోకమునఁ జేసి
కోపంబు గదిరిన శాపంబు ముప్పది। యాఱవునేఁ డెల్ల యాదవులకు
నాశ మన్యోన్యహననమున నగుటకు। నిచ్చె నిష్ఠించి; యయ్యేఁడు వచ్చెఁ

తే. దప్ప దది ఫలించు; దానికి తీర్థ స। మీప భూమియైన మేలుగాదె!'
యని నరేంద్ర! యమ్మహాత్ముఁ డీ భంగి నూ। హించి తెఱఁగు నిశ్చయించెఁ దివిరి. 22

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= ఓ రాజా!; ఇట్టులు= ఈ విధంగా; అనుదినంబునున్= ప్రతిరోజూ; అశుభ సూచకములు= అశుభాన్ని సూచించే సంఘటనలు; తోఁపంగన్= జరుగుతూ ఉండగా; సర్వవిదుండు కృష్ణుఁడు= అన్నీ తెలిసిన శ్రీకృష్ణుడు; అంతరంగమునన్= మనసులో; సమాలోచనము చేసి= బాగా ఆలోచించి; గాంధారి= గాంధారీదేవి; పుత్రశోకమునన్+చేసి= పుత్రశోకంచేత; కోపంబు

కదిరినన్= కోపం పుట్టగా; ముప్పదియాఱవు నేఁడు= ముప్ఫై ఆరవసంవత్సరంలో; ఎల్ల యాదవులకున్= యాదవులందరికీ; అన్యోన్య హననమునన్= ఒకరినొకరు చంపుకొనటంద్వారా; నాశము+అగుటకున్= నాశనమవటానికి; నిష్ఠించి= తన పాతివ్రత్యబల నిష్ఠతో; శాపంబున్+ఇచ్చెన్= శాపమిచ్చింది; ఆ+ఏఁడు వచ్చెన్= ఆ సంవత్సరం వచ్చింది; అది తప్పదు= ఆ శాపం తప్పిపోదు; ఫలించున్= ఫలించి తీరుతుంది; దానికిన్= అట్లా చావటానికైనా; తీర్థ సమీపభూమి ఐనన్= పుణ్యతీర్థ సమీప భూమి అయితే; మేలు కాదె!= మేలు కదా!; అని ఆ+మహాత్ముఁడు= అని ఆ శ్రీకృష్ణుడు; ఈ భంగిన్+ఊహించి= ఈ విధంగా ఆలోచించి; తివిరి= పూనికతో; తెఱంగున్= ఒక కర్తవ్యాన్ని; నిశ్చయించెన్= నిశ్చయించాడు.

తాత్పర్యం: ఇట్లా ప్రతిరోజూ ద్వారకలో ఏదో ఒక అశుభసూచకమైన సంఘటన జరుగుతూనే ఉన్నది. దానిని గమనించిన కృష్ణుడు పూర్వ పుత్రశోకంతో గాంధారికి కోపం కలుగగా ఇచ్చిన శాపాన్ని స్మరించాడు. 'ఇక ముప్ఫై ఆరు సంవత్సరాలకు యాదవులంతా ఒకరినొకరు చంపుకొని నాశనమౌతా'రని ఆ పతివ్రత శపించింది. ఆ సంవత్సరం రానే వచ్చింది. ఇక యాదవనాశం తప్పదు. అట్లా జరగటానికైనా ఒక పుణ్యక్షేత్ర సమీపభూమి అయితే మంచిదని ఒక నిశ్చయానికి వచ్చాడు.

విశేషం: భారతంలో కాలవేదులు శ్రీకృష్ణుడు, వేదవ్యాసుడు. వారికి భవిష్యత్తులో జరగబోయేది తెలుసును. శ్రీకృష్ణుడు విశేషించి సర్వవేత్త. భగవదవతారం కాబట్టి అన్నీ తెలిసినవాడయ్యాడు. పాండవకౌరవ యుద్ధానికి కూడా వ్యాసుడు ధర్మక్షేత్రాన్నే రంగంగా నిర్ణయించాడు. దుష్కృతకర్ములకు కూడా పరమగతిని ప్రసాదించే దివ్యక్షేత్రమట కురుక్షేత్రం. అట్లాగే కృష్ణు డిక్కడ సముద్రతీరాన్ని నిశ్చయించాడు.

ఆ. అట్లు నిశ్చయించి, యాదవ నివహక్ష। యంబు దివ్యబుద్ధి నరసి యపర
దివసకలిత మగుటఁ దెల్లంబుగాఁ గని। కొని యతండు పెద్ద కొలువులోన. 23

ప్రతిపదార్థం: అట్లు నిశ్చయించి= ఆ విధంగా నిర్ణయించుకొని; యాదవనివహక్షయంబున్= యాదవసమూహనాశనాన్ని; దివ్యబుద్ధిన్+అరసి= దివ్యబుద్ధితో కనుగొని; అపరదివసకలితము+అగుటన్= మధ్యాహ్నకాలంతో కూడుకొనటాన్ని; తెల్లంబుగాన్ కనికొని= స్పష్టంగా గుర్తించి; అతండు= ఆ కృష్ణుడు; పెద్దకొలువులోనన్= పేరోలగంలో.

తాత్పర్యం: ఇట్లా నిర్ణయించుకొన్నవాడై శ్రీకృష్ణుడు తన దివ్యబుద్ధితో యాదవుల క్షయాన్ని గుర్తించాడు. మధ్యాహ్న సమయం కావటంతో రాజసభలో ఇట్లా ప్రకటించాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

ఉ. 'జాతర సేయఁగా వలయు సర్వజనంబులు నంబురాశికిన్
బ్రాతిగ భక్తితోడ' నని బంధుల కెల్లను జెప్పి, వీట వి
ఖ్యాతిగ నప్డు సాటుటకు నర్హునిఁ బంచిన ఘంటికాస్వనో
పేతము గాఁగ వాఁ డెలమిఁ బెద్దయెలుంగునఁ జాటె నెల్లెడన్. 24

ప్రతిపదార్థం: సర్వజనంబులన్= జనులందరూ; ప్రాతిగన్= ఘనంగా; భక్తితోడన్= భక్తితో; జాతర చేయఁగాన్ వలయున్= జాతరచేయాలని; బంధులకెల్లనున్+చెప్పి= బంధువులందరికీ చెప్పినవాడై; అప్డు= ఆ సమయంలోనే; వీటన్= నగరంలో; విఖ్యాతిగన్= అందరికీ తెలిసేలా; చాటుటకున్= చాటింపు వేయటానికి; అర్హునిన్= తగినవాడిని; పంచినన్= పంపగా; వాఁడు= ఆ చాటింపు

వేసే మనిషి; ఘంటికాస్వన+ఉపేతము కాఁగన్= గంటవాయించుకొంటూ; పెద్ద ఎలుంగునన్= పెద్ద గొంతుతో (గట్టిగా అరుస్తూ); ఎల్ల+ఎడన్= అన్నిచోట్లా; చాటెన్= చాటింపు వేశాడు.

తాత్పర్యం: 'మన ద్వారకావాసులందరూ గొప్పగా, భక్తియుక్తులై జాతర చేయాల్సి ఉన్నది' అని సమీపంలోని బంధువులకు చెప్పి, ఆ వార్తను నగరంలో చాటింపు వేయటానికి తగినవాడిని పురమాయించాడు. వాడు గంటవాయించుకొంటూ పెద్దగొంతుతో నగరంలో అన్ని వీథులలోనూ ఈ వార్తను చాటాడు.

విశేషం: యాదవులకు గిరిమఖము (కొండపూజ) చాలా ప్రధానమని హరివంశం చెప్పుతున్నది. అట్లాగే సముద్రపూజ కూడా ప్రధానమని ఈ సందర్భంవలన తెలుస్తున్నది.

సీ. **ఆ రేయిఁ గల నెల్లవారును గోరదౌ । డలును నల్లని మేను గల నెలంత**
యొక్కత యిలు సొచ్చి యువిదల నీడిచి । కొని పోవ శస్త్రాస్త్రకోటి కేతు
చయమును భూషణ సమితియు రాక్షసు । లపహరింపఁగఁ గని రపరదినము
నందగ్నిదత్తంబు నబ్జనాభంబును । నైన కృష్ణుని చక్ర మద్భుతముగ

ఆ. **నెగసి యఖిలజనులు నీక్షింప దివమున । కరిగె; నమ్మహాత్ము గరుడకేత**
నంబుఁ దోన చనియె నరవర! రోహిణీ । తనయు తాటిసిడము ననుసరించె. **25**

ప్రతిపదార్థం: నరవర!= రాజా!; ఆ రేయిన్= ఆ రాత్రిలో; కలన్= స్వప్నంలో; ఎల్లవారును= అందరూ; కోరదౌడలునున్= భయంకరమైన దౌడలూ; నల్లనిమేనున్= నల్లటిదేహమూ; కల నెలంత+ఒక్కత= ఉన్న స్త్రీ ఒకతె; ఇలు+చొచ్చి= ఇంటిలోనికి ప్రవేశించి; ఉవిదలన్= స్త్రీలను; ఈడిచికొని పోవన్= లాగుకొనిపోవగా; రాక్షసులు; శస్త్రాస్త్ర కోటి కేతుచయమునున్= శస్త్రాస్త్ర సమూహాన్ని, టెక్కెముల సముదాయాన్ని; భూషణసమితియున్= ఆభరణాల మొత్తాన్ని; అపహరింపఁగన్= దొంగిలించుకొని పోవటాన్ని; కనిరి= చూచారు; అపరదినమునన్= మరుసటిరోజున; అగ్నిదత్తంబున్= అగ్నిదేవుడు ప్రసాదించిందీ; అబ్జనాభంబునున్+ఐన= పద్మనాభమయినదీ అయిన; కృష్ణుని చక్రము= శ్రీకృష్ణుడి చక్రం; అద్భుతముగన్+ఎగసి= అద్భుతంగా ఆకసంలోనికి ఎగిరి; అఖిలజనులున్+ఈక్షింపన్= జనులందరూ చూస్తుండగా; దివమునకున్+అరిగెన్= స్వర్గానికి వెళ్లిపోయింది; ఆ+మహాత్ము= ఆ మహాత్ముడైన శ్రీకృష్ణుడి యొక్క; గరుడకేతనంబును= గరుడధ్వజం కూడా; తోన్+అ+చనియెన్= దాని వెంబడే వెళ్ళిపోయింది; రోహిణీ తనయు+తాటిసిడమున్= బలరాముడి తాళధ్వజం కూడా; అనుసరించెన్= శ్రీకృష్ణుడి గరుడకేతనాన్ని వెంబడించి వెళ్ళింది.

తాత్పర్యం: ఆ రాత్రి కలలో అందరూ చూస్తూ ఉండగా భయంకరమైన దౌడలు, నల్లటి దేహంగల ఒక స్త్రీ ఇళ్ళలోకి చొరబడి స్త్రీలను లాగికొని పోయింది. రాక్షసులు యాదవుల శస్త్రాస్త్రాలను, జెండాలను, ఆభరణములను దొంగిలించుకొని పోయారు. ఆ మరుసటిరోజున శ్రీకృష్ణుడి చక్రం ఉన్నట్లుండి ఆకాశంలోనికి ఎగిరిపోయింది. వెంబడి స్వామియొక్క గరుడధ్వజం కూడా వెళ్ళిపోయింది. వాటివెంటనే బలరాముడి తాటిజెండా కూడా స్వర్గాన్ని చేరుకొన్నది.

విశేషం: ఇళ్ళలోకి ప్రవేశించిన స్త్రీ అమంగళస్వరూపయైన జ్యేష్ఠాదేవి. స్త్రీలు మాంగల్యస్వరూపలు కాబట్టి వాళ్ళను చెరబట్టింది. అంటే యాదవరాజ్యలక్ష్మి అపహరించబడిందని అర్థం. చక్రాద్యాయుధాలకు భూలోకంలో ఇక పనిలేదు కాబట్టి అవికూడా స్వర్గాన్ని చేరుకొన్నాయి.

తే. వినుము సుగ్రీవమును శైబ్యమును వలాహ। కంబు మేఘపుష్పంబు నాఁ గలుగునట్టి

వాహనంబులతోఁ గూడ వాసుదేవు। తేరు తదవసరంబున దివికి నరిగె. 26

ప్రతిపదార్థం: వినుము= ఇంకా ఏం జరిగిందో చెప్తుతాను వినుము; సుగ్రీవమును= సుగ్రీవం; శైబ్యమును= శైబ్యం; వలాహకంబున్= వలాహకం; మేఘపుష్పంబు= మేఘపుష్పం; నాన్ కలుగునట్టి= అనే పేర్లున్న; వాహనంబులతోన్+కూడన్= వాహనాలతో కూడ; వాసుదేవు తేరు= కృష్ణుడి రథం; తద్+అవసరంబునన్= ఆ సమయంలో; దివికిన్+అరిగెన్= స్వర్గానికి వెళ్ళిపోయింది.

తాత్పర్యం: ఆ సమయంలో సుగ్రీవం, శైబ్యం, వలాహకం, మేఘపుష్పకం అనే నాలుగు గుర్రాలు కలిగిన శ్రీకృష్ణుడి రథం ఆకాశమార్గంలో స్వర్గానికి చేరిపోయింది.

క. 'వెడలుండు తీర్థయాత్రకుఁ। గడువేగం' బనిరి సురలు గగనంబున న

ప్పుడు సువ్యక్తముగా నె। క్కుడెలుంగులు సెలఁగ రాజకులమౌళిమణీ! 27

ప్రతిపదార్థం: రాజకులమౌళిమణీ!= చంద్రవంశ శ్రేష్ఠుడా!; గగనంబునన్= ఆకాశంలో; అప్పుడు= ఆ సమయంలో; సురలు= దేవతలు; సువ్యక్తముగాన్= బాగా వినిపించేటట్లు; ఎక్కుడు+ఎలుంగులు= పెద్దశబ్దాలు; చెలంగన్= వ్యాపించగా; తీర్థయాత్రకున్= సముద్రయాత్రకై; కడువేగంబు= తొందరగా; వెడలుండు+అనిరి= బయలుదేరండి అన్నారు.

తాత్పర్యం: అప్పుడు ఆకాశంలో నిలబడి దేవతలు స్పష్టంగా వినిపించేటట్లు పెద్దశబ్దాలతో 'సముద్రయాత్రకు బయలుదేరండి' అని యాదవులను ప్రబోధించారు.

క. అవి గనియు వినియు నులుకక। సవరణ లొప్పార నపు డసంభ్రములై యా

దవులు మనోజ్ఞములగు సీ। ధువులును మాంసములు వేడ్కతో నింటింటన్. 28

ప్రతిపదార్థం: అవి= ఆ అద్భుతదృశ్యాలను శబ్దాలను; కనియున్= చూచీ; వినియున్= వినీ (కూడా); ఉలుకక= బెదరక; అపుడు; యాదవులు= యాదవులందరూ; ఇంటింటన్= ప్రతి ఇంటిలోనూ; అసంభ్రములై= వేగిరపాటులేకుండా; మనోజ్ఞములు+అగు= ఇంపైన; సీధువులునున్= మద్యాలు; మాంసములున్= రకరకములైన మాంసాలు; సవరణలు+ఒప్పారన్= వాహనాద్యాభరణాలు అతిశయించగా,

తాత్పర్యం: అట్లా చక్రాద్యాయుధాలు మాయమవటాన్ని చూచినా, దివ్యశబ్దాలను విన్నా ఆ యాదవులలో ఏ కదలికా లేదు. ఏ తొందరపాటూ లేదు. ప్రతి ఇంటిలోనూ చాలా ఇంపైన మద్యాలు, మాంసాలు, వాహనాద్యాభరణాలు సమకూర్చుకొనే ప్రయత్నాలలో పడ్డారు.

యాదవు లందఱుఁ గృష్ణసహితులై సముద్రతీరమునకుఁ బోవుట (సం.16-4-6)

సీ. సమకట్టికొనుచు భోజ్యములు భక్ష్యంబులు। నానావిధముల నొనర్చికొనుచు

క్షీరశర్కరలును ఘృతబహుభంగిక। వ్యంజనంబులు వివిధాన్నపాన

ములును నక్షత గంధములును బుష్పంబులు। గావించుకొని బలుగావళులును

దలమోపులును బండ్లుఁ దమతోడ నొప్పారి। చనుదేరఁ గరులు నశ్వములు నరద

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **ములు నలంకార విరచనములు నుదాత్త। లలితరేఖంబు లగు మాల్యములును భూష**
ణములు నాలేపనములు వస్త్రములు వింత। చెన్ను సేయఁ జేష్టలు విలసిల్లుచుండ. 29

ప్రతిపదార్థం: సమకట్టికొనుచున్= సిద్ధం చేసికొంటూ; నానావిధములన్= చాలా రకాలుగా; భోజ్యములున్= ఆహారాలు; భక్ష్యములున్= పిండివంటులు; ఒనర్చి కొనుచున్= తయారు చేసికొంటూ; క్షీర= పాలు; శర్కరలును= చక్కెర; ఘృత= నెయ్యి; బహుభంగిక వ్యంజనంబులు= వివిధాలైన కూరలు; వివిధ+అన్నపానములునున్= రకరకాలైన అన్నాలు, పానీయాలు; అక్షత= అక్షతలు; గంధములునున్= చందనాదులను; పుష్పంబులున్= పూలు; కావించుకొని= తయారు చేసికొని; తమతోడన్= తమతో; పలుకావళులునున్= అనేకములైన కావళ్ళు; తలమోపులునున్= తలమీద మోసేవి; బండ్లున్; ఒప్పారి= వైభవోపేతంగా; చనుదేరన్= బయలుదేరగా; కరులున్= ఏనుగులూ; అశ్వములున్= గుర్రాలూ; అరదములున్= రథాలూ; అలంకార విరచనములున్= వివిధ రీతులలో చేసిన అలంకారాలు; ఉదాత్త= మనోజ్ఞంగా; లలిత= సుకుమారంగా; రేఖంబులు+అగు= వరుసలలో అలంకరించిన; మాల్యములునున్= పూలహారాలు; భూషణములున్= నగలు; ఆలేపనములున్= పూసుకొనటానికి పనికివచ్చే సుగంధద్రవ్యాలూ (చందన గంధాదిరూపంలో ఉన్నవి); వస్త్రములున్= బట్టలూ; వింతచెన్ను+చేయన్= వింతశోభను కూర్చగా; చేష్టలు= యాదవుల జానపదీయాలైన కార్యకలాపాలు; విలసిల్లుచున్+ఉండన్= విజృంభిస్తూ ఉండగా.

తాత్పర్యం: రకరకాలుగా అన్నాదులు వండారు; పిండివంటలు చేశారు. పాలు, చక్కెర, నెయ్యి, రకరకాలైన సాధకాలు, పానీయాలు సిద్ధం చేసికొన్నారు. అక్షతలు, గంధం, పూలు, ఇవన్నీ ఎత్తుకొన్నారు. వీటిని కావళ్ళుగా, తలమోపులుగా సిద్ధంచేసి వైభవోపేతంగా బయలుదేరారు. ఏనుగులు, గుర్రాలు, రథాలు-వీటికి చేసిన వివిధాలైన అలంకారాలు, అత్యంత మనోహరంగా దిగవేసిన పూలహారాలు, వాళ్ళు పెట్టుకొన్న నగలు, పూసుకొన్న సుగంధలేపనాలు, ధరించిన రంగురంగుల బట్టలు ఒకవింత శోభను కూర్చాయి. యాదవులకు సహజమైన కార్యకలాపాలు విజృంభించాయి.

క. **తన రథము లేమి నొండొక। ఘనరథమును దారుకుండు గైకొని యెలమిన్**
గొనిరా వెడవెడ గైసే। సిన కృష్ణుఁడు నిర్వికారచిత్తత వెడలెన్. 30

ప్రతిపదార్థం: తన రథము లేమిన్= తన రథం (స్వర్గానికి వెళ్ళిపోయింది కాబట్టి ఇప్పుడది) లేకపోవటంచేత; దారుకుండు= శ్రీకృష్ణుడి సారథి; ఒండొక= మరొక; ఘనరథమును= పెద్దతేరును; కైకొని= తీసికొని; ఎలమిన్= ఉత్సాహంతో; కొనిరాన్= కొనిరాగా; వెడవెడ= అతిస్వల్పంగా; కైసేసినన్= అలంకరించగా; కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; నిర్వికారచిత్తతన్= ఏ వికారమూలేని మనస్సుతో; వెడలెన్= బయలుదేరాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి రథం అదృశ్యమైపోయినందువలన దారుకుడు మరో పెద్ద తేరును పట్టుకు వచ్చాడు. దానికి ఆదరబాదరగా చాలా స్వల్పంగా అలంకారం చేశాడు. రథం సిద్ధమయింది. కృష్ణుడు కూడా ఏ వికారంలేని మనస్సుతో బయలుదేరాడు.

విశేషం: శ్రీకృష్ణుడు యోగేశ్వరుడు. అందువలననే ఆయనలో సంకల్పవికల్పాలతో కూడిన ఏ వికారాలూ లేవు. ఈ సమాధిస్థితిలో ఉండి నిర్వికారంగా కాగల వింతలు చూడటానికి బయలుదేరాడని అర్థం.

ఆ. **తొడవు చీర పూఁత తొంటియట్టులు గాఁగ। నేమి వాహనంబు నెక్క కించు**
కేని వికృతి లేని హృదయంబు మిత్ర సం। భాషణంబుఁ గలిగి బలుఁడు వెడలె. 31

ప్రతిపదార్థం: బలుఁడు= (ఇక) బలరాముడు; తొడవు= నగలు; చీర= బట్టలు; పూఁత= చందనాది లేపనాలు; తొంటి+అట్టులు+కాఁగన్= మునుపటివలెనే ఉండగా (అంటే కొత్తగా ఏ అలంకారమూ చేసికొనలేదని అర్థం); ఏమి వాహనంబున్+ఎక్కక= ఏ వాహనాన్ని అధిరోహించకుండానే; ఇంచుక+ఏని= కొంచెంకూడా; వికృతిలేని హృదయంబు= వికారంలేని మనసు; మిత్రసంభాషణంబున్+కలిగి= మిత్రులతో సంభాషణ కలిగి; వెడలెన్= బయలుదేరాడు.

తాత్పర్యం: ఇక బలరాముడు కూడా అట్లాగే బయలుదేరాడు. ఏ నగలూ కొత్తగా పెట్టుకొనలేదు. ధరించిన వస్త్రాలు మార్చలేదు. కొత్తగా ఏ సుగంధాలూ రాసుకొనలేదు. ఏ వాహనాన్ని ఎక్కలేదు. పాదచారిగానే బయలుదేరాడు. ఏ వికారమూ లేని మనసుతో, మిత్రులతో మాటాడి, బయలుదేరాడు.

విశేషం: ఆదిశేషుడి అవతారం కాబట్టి రాముడివెంట లక్ష్మణుడివలె, కృష్ణుడివెంబడి బలరాముడూ కనిపిస్తాడు. అందుకే కృష్ణుడివలె ఈయనలోనూ హృదయవికారం లేదు.

క. **ఆందోళికాది వాహన। సందోహంబున నితాంత చారుత్వము చె**
న్నొందఁగ సమలంకృతలగు। సుందరు లేతేర విభవశోభిత భంగిన్. **32**

ప్రతిపదార్థం: ఆందోళికా+ఆది= పల్లకీలు మొదలైన; వాహన= వాహనాల; సందోహంబునన్= సమూహంలో; నితాంత= అత్యంతమైన, అధికమైన; చారుత్వము= సౌందర్యం; చెన్ను+ఒందఁగన్= మిక్కిలిగా ప్రకాశించగా; సమలంకృతలు+అగు= బాగా అలంకరించుకొన్న; సుందరి+లు= స్త్రీలు; విభవశోభిత భంగిన్= వైభవం ప్రకాశించే రీతిలో; ఏతేరన్= బయలుదేరి రాగా.

తాత్పర్యం: ఆ యాదవస్త్రీలు పల్లకీలలో బయలుదేరారు. వారు బాగా అలంకరించుకొన్నారు. ఈ స్త్రీల గుంపు బయలుదేరటంతో ఒక కొత్తశోభ ప్రకాశించింది. యాదవుల యాత్ర అట్లా శోభాయమానమైనదని అర్థం. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. **వెలువడి లీల నేఁగి మును వేడ్క నొనర్చిన మేటి చప్పరం**
బుల నెలమిన్ మహార్ణవము పొంత వసించిన నుద్ధవుండు దా
నలఘుతపం బొనర్చుటకునై విపినంబున కేఁగువాఁడుగాఁ
బలికిన దాని కొండొకఁడు వల్కడ కృష్ణుఁడు కాలవేదితన్. **33**

ప్రతిపదార్థం: వెలువడి= అట్లా ద్వారకనుండి బయలుదేరి; లీలన్= వైభవంతో; ఏఁగి= ప్రయాణంచేసి; మహార్ణవము పొంతన్= సముద్ర సమీపంలో; మును= ముందుగానే; వేడ్కన్= ఉత్సాహంతో; ఒనర్చిన= ఏర్పాటుచేసిన; మేటి= గొప్పవైన; చప్పరంబులన్= పందిళ్ళలో; ఎలమిన్= సంతోషంతో; వసించినన్= ఉండగా; ఉద్ధవుండు= శ్రీకృష్ణుడి మంత్రీ, పురోహితుడూ ఐన ఉద్ధవుడు; తాను; అలఘుతపంబు= గొప్ప తపస్సు; ఒనర్చుటకున్+ఐ= చేయటం కోసమై; విపినంబునకున్= అడవికి; ఏఁగువాఁడుగాన్= వెళ్ళుతున్నట్టుగా; పలికినన్= చెప్పగా; కృష్ణుఁడు; కాలవేదితన్= ముందుజరగబోయేది తెలిసినవాడు కావటంవలన; ఒండొకఁడు పల్కఁడు+అ= ఏమీ మాటాడలేదు.

తాత్పర్యం: అట్లా ద్వారకనుండి బయలుదేరి యాదవులు మహావైభవంతో ప్రయాణం చేసి సముద్రతీరం చేరారు. అంతకుమునుపే అక్కడ వేసికొన్న పందిళ్ళ క్రింద అందరూ చేరారు. అపుడు శ్రీకృష్ణుడి మంత్రి, పురోహితుడు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మహాజ్ఞాని అయిన ఉద్ధవుడు తాను తపస్సు చేసికొనటానికి అడవికి వెళ్తానన్నాడు. ముందు జరుగబోయేది తెలిసినవాడు కాబట్టి కృష్ణుడు ఏమీ పలుకలేదు.

వ. అంత బలుండునుం బోవ నిశ్చయించి చెప్పిన. 34

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; బలుండునున్= బలరాముడుకూడా; పోవన్= వెళ్ళటానికి; నిశ్చయించి చెప్పినన్= నిర్ణయించి, తెలుపగా.

తాత్పర్యం: అప్పుడు బలరాముడు తానుకూడా బయలుదేరుతానని తన నిర్ణయం చెప్పగా. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. పలుకక మ్రొక్కి వీడుకొలుపంగ వనంబున కప్పురోహితుం
డలఘు వినిశ్చయంబు వగ పంతయు మాన్పఁగఁ బోయె నాతనిన్
హలధరుఁ డన్పఁ బోయి వినయంబున భక్తియుఁ దోఁప నయ్యనా
కులు నటఁబుచ్చి యొక్కెడ నకుంఠితనిర్ణయ శాంతచిత్తుఁడై. 35

ప్రతిపదార్థం: పలుకక= (శ్రీకృష్ణుడు) ఏమీ మారు మాటాడకుండా; మ్రొక్కి= నమస్కరించి; వీడుకొలుపంగన్= వీడ్కోలు చెప్పగా; ఆ+పురోహితుండు= ఆ ఉద్ధవుడు; అలఘువినిశ్చయంబు= తన దృఢమైన నిర్ణయమే; వగపు+అంతయున్= దుఃఖాన్నంతటినీ; మాన్పఁగన్= పోగొట్టగా; వనమునకున్= అడవికి; పోయెన్= బయలుదేరాడు; అతనిన్= ఆ ఉద్ధవుడిని; హలధరుఁడు= బలరాముడు, హలమును (నాగలిని) ఆయుధంగా ధరించినవాడు. అన్పన్+పోయి= దిగబెట్టిరావటానికి బయలుదేరి; వినయంబునన్= వినయంతో; భక్తియున్+తోఁపన్= భక్తి కూడా ప్రకటితంకాగా; ఆ+అనాకులున్= ఏ వ్యాకులతలేని ఆ ఉద్ధవుడిని; అటన్+పుచ్చి= అడవిలో వదలి; ఒక్క+ఎడన్= ఒకచోట; అకుంఠిత= మొక్కపోని; నిర్ణయ= నిర్ణయంగల; శాంతచిత్తుఁడు+ఐ= శాంతమైన మనస్సు కలిగినవాడై.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ఏమీ మాటాడకుండా వీడ్కోలు చెప్పాడు. ఉద్ధవుడికి ఏర్పడిన ఆ దృఢనిర్ణయంతో అతడిలోని దుఃఖమంతా పోయింది. తపస్సుకై బయలుదేరాడు. అతడిని దిగబెట్టి వస్తానని బలరాముడు బయలుదేరి వినయంతో, భక్తితో ఏ వ్యాకులతా లేని ఆ మహానుభావుడైన ఉద్ధవుడిని అడవిలో వదలి వచ్చి, మొక్కపోని శాంతమైన మనోభావంతో, (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'విను మొక్కఁడు నొక భూరుహ । మున మూలంబున నిరస్తమోహాంధత్వం
బున వెలుఁగు బుద్ధి విజ్ఞే । య నిరూఢతఁ జేసి యుండె నాసీనుండై. 36

ప్రతిపదార్థం: వినుము= రాజా వినుము!; ఒక్కఁడున్= ఒంటరిగా; ఒక భూరుహమున మూలంబునన్= ఒక చెట్టుయొక్కమొదట్లో; నిరస్త= పోయిన; మోహ+అంధత్వంబునన్= అజ్ఞానమనే చీకటితో (అజ్ఞానం నశించగా); వెలుఁగు= ప్రకాశిస్తున్న; బుద్ధి= బుద్ధిచేత; విజ్ఞేయ= తెలియదగిన తత్త్వమునందు; నిరూఢతన్+చేసి= నైపుణ్యం వలన; ఆసీనుండు+ఐ+ఉండెన్= కూర్చొని ఉన్నాడు.

తాత్పర్యం: అట్లాంటి శాంతచిత్తంతో బలరాముడు ఒంటరిగా ఒక చెట్టుకింద కూర్చున్నాడు. ఆయనలోని మోహమనే చీకటి నశించింది; జ్ఞానజ్యోతి ప్రకాశించింది. (అంటే 'నాది', 'నావారు' అన్న భావనలు నశించి 'అహంబ్రహ్మాస్మి'- అన్న మహావాక్యతత్త్వబోధ అయిందని అర్థం.)

చ. భూమిసురావళీమహిత భోజనతంత్రముఁ దీర్పఁ బూని హృ
ద్యామలరాజితంబులగు నట్లొనరించిన కూడుగూర లా
కోమలు లాఁగఁగా గడఁగి క్రోఁతుల కన్నియుఁ బంచివెట్టి రు
ద్దామవిహారలీల వసుధావర! యాదవు లేమి సెప్పుదున్? 37

ప్రతిపదార్థం: వసుధావర!= ఓ భూపతీ; యాదవులు; భూమిసురావళీ= బ్రాహ్మణుల; మహితభోజన తంత్రమున్= గొప్పదైన భోజన కార్యాన్ని; తీర్పన్+పూని= నిర్వహించాలన్న కోరికతో; హృద్య+అమల+రాజితంబులగు+అట్లు= మదికింపై, నిర్మలములై, ఒప్పిదము లయ్యేటట్లు; ఒనరించిన= సమకూర్చిన; కూడుగూరలు= అన్నాలు, కూరలు; ఆ కోమలులు= ఆ స్త్రీలు; ఆఁగఁగాన్= నిలుపగా; కడఁగి= ప్రయత్నించి; క్రోఁతులకున్= కోతులకు; అన్నియున్= అన్నింటినీ; ఉద్దామ విహారలీలన్= అణచరాని విహారవిలాసంతో విజృంభణగా; పంచిపెట్టిరి= పంచిపెట్టారు; ఏమి+చెప్పుదున్?= ఏమి చెప్పుదును?

తాత్పర్యం: బ్రాహ్మణ భోజనసంతర్పణకొరకని చాలా రుచికరంగా అతిపవిత్రంగా వండిన పదార్థాలను, ఆడవారు అడ్డుపడుతున్నా ఆగకుండా యాదవులు చెలరేగి కోతులకు పంచిపెట్టారు. ఇక చెప్పవలసినది ఏముంది?

విశేషం: ఇంతకాలమూ బ్రాహ్మణ సేవాతత్పరులుగా పుణ్యామార్జించిన యాదవులు తమ భార్యలు వారిస్తున్నా వినక బ్రాహ్మణులకు పెట్టవలసిన భోజనం కోతులకు పంచిపెట్టారు. అది తర్కానికి అందే విషయం కాదు. అందుకే భవిష్యత్తులో దొంగలబారిన పడ్డారు.

చ. పదపడి గీత వాద్యగతిబంధురనృత్యము లుల్లసిల్లఁగా
నుదధికి నంచితాక్షత మహోత్తరగంధవిశిష్టపుష్ప సం
పదలు బహుప్రకారములఁ బ్రస్తుతి కెక్కఁగఁ బూజసేసి పెం
పొదవ నివేద్య మిచ్చిరి సముజ్జ్వలహృద్య పదార్థకోటులన్. 38

ప్రతిపదార్థం: పదపడి= పిమ్మట; గీతవాద్యగతి= పాటలకు, వాద్యాలకు తగినగతి ననుసరించి; బంధుర= రమ్యమైన; నృత్యములు; ఉల్లసిల్లఁగాన్= ప్రకాశిస్తూ ఉండగా; అంచిత= సుందరమైన; అక్షత= అక్షతలతోనూ; మహోత్తర= శ్రేష్ఠమైన; గంధవిశిష్ట= సుగంధ పరిమళముతో కూడిన; పుష్పసంపదలు= పుష్పవైభవం; బహుప్రకారములన్= నానావిధాలుగా; ప్రస్తుతికెక్కఁగన్= పొగడ్తకెక్కునట్లుగా; ఉదధికిన్= సముద్రానికి; పూజచేసి; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశిస్తున్న; హృద్య= మనోజ్ఞాలైన; పదార్థకోటులన్= భక్ష్యభోజ్యాది పదార్థ సముదాయాన్ని; పెంపు+ఒదవన్= వైభవంతో; నివేద్యము+ఇచ్చిరి= నైవేద్యం చేశారు.

తాత్పర్యం: ఆ తరువాత రమ్యమైన గీతాలకు, వాద్యాలకు అనుగుణంగా మనోహరాలైన నృత్యాలు చేశారు. అందంగా అలంకరించిన అక్షతలతో, శ్రేష్ఠమైన పరిమళంతో కూడిన పుష్పాలు ఒక గొప్పవైభవాన్ని సంతరించగా సముద్రానికి పూజలు చేశారు. మనోజ్ఞాలైన భక్ష్య భోజ్యాది పదార్థాలను మిక్కిలి వేడుకగా నైవేద్యం పెట్టారు.

చ. విను తదనంతరంబ మదవిహ్వలభావము చేయఁ జాలి యిం
పొనరిన యాసవంబులు సముత్సుకతం గనకంపుఁ గోరలం

గొని హరి సన్నిధానమునఁ గ్రోలిరి యాదవు లంతరంగ మో

దనకరణంబులైన యుపదంశములం గొనుచున్ మహీశ్వరా! 39

ప్రతిపదార్థం: మహీ+ఈశ్వరా!= భూపతీ! రాజా!; విను= వినుము; తదనంతరంబు+అ= ఆ తరువాత; యాదవులు; సముత్సుకతన్= మిక్కిలి ఆసక్తితో; మద= కైపుచేత; విహ్వలభావము= అవయవాలను స్వాధీనం నుండి తప్పించే గుణం; చేయన్+చాలి= కలిగించగలిగి; ఇంపు+ఒనరిన= రుచికలిగిన; ఆసవంబులు= చెరకు, ద్రాక్షలనుంచి తీసిన మత్తుపానీయాలు (కల్లు); కనకము+కోరలన్= బంగారుచషకాలలో; కొని= తీసికొని; అంతరంగ= మనసుకు; మోదనకరణంబులు+ఐన= సంతోషాన్ని కలిగించే; ఉపదంశములన్= నంజుళ్ళను; కొనుచున్= తింటూ; క్రోలిరి= త్రాగారు.

తాత్పర్యం: ఆ తరువాత యాదవులు మిక్కిలి తమకంతో మత్తును కలిగించి, అవయవాలను స్వాధీనంనుండి తప్పించే గుణమున్న, బహురుచి కలిగిన మత్తుపానీయాలను బంగారుపాత్రలలో పోసుకొంటూ, శ్రీకృష్ణుని సన్నిధానంలోనే ప్రీతిని కలిగించే నంజుళ్ళను తింటూ బాగా త్రాగారు.

విశేషం: కల్లుకున్న ఈ 'విహ్వల' భావంచేతనే తరువాత యాదవులు ఒకరిని ఒకరు తిట్టుకొన్నారు. కొట్టుకొన్నారు. చంపుకొన్నారు. అందుకే సురాపానాన్ని తమోగుణాన్ని కలిగించే పనిగా పూర్వికులు నిషేధించారు.

తే. సాత్యకియుఁ గృతవర్మయుఁ జారుధేష్ణుఁ । డును గదుండును బ్రద్యుమ్నుఁడును మొదలుగఁ

గలుగు యాదవు లెల్లను గాంక్షఁ బాన । విధి యొనర్చిరి పెల్లున విధివశమున. 40

ప్రతిపదార్థం: విధివశమునన్= విధికి వశులై; సాత్యకియున్, కృతవర్మయున్, చారుధేష్ణుఁడునున్, గదుండునున్, ప్రద్యుమ్నుఁడునున్= సుప్రసిద్ధులైన సాత్యకి, కృతవర్మ, చారుధేష్ణుడు, గదుడు, ప్రద్యుమ్నుడు; మొదలుగన్+కలుగు= మొదలుగా గల; యాదవులు+ఎల్లనున్= యాదవులంతా; కాంక్షన్= మిక్కిలి కోరికతో; పానవిధి= తాగటం; ఒనర్చిరి= చేశారు.

తాత్పర్యం: విధికివశులై సాత్యకి, కృతవర్మ, చారుధేష్ణుడు, గదుడు, ప్రద్యుమ్నుడు మొదలైన యాదవులంతా చేరి మిక్కిలి కోరికతో తాగారు.

విశేషం: విధివశమునన్ - అనే మాట చాలా ముఖ్యమైనది. సాత్యకి శ్రీకృష్ణుడికి తమ్ముడి వరుసలోనివాడు. ప్రద్యుమ్నుడు సాక్షాత్తు కుమారుడే. ఇట్లాగే ఇతరులూ మహావీరులు. ఉచితానుచితపరిజ్ఞానం కలిగినవారే. కాని విధి ప్రేరేపిస్తే ఎవరూ ఆగరని అర్థం.

తే. వృష్ణి భోజాంధకులు కురువీర! యిట్లు । రేఁగి మద్యపానం బొనరించి మదముఁ

బొంది కేకిస లాడుచుఁ బొందుపడని । పలుకు లెసఁగంగఁ దిరిగి నవ్వులు సెలంగ. 41

ప్రతిపదార్థం: కురువీర!= కురుశ్రేష్ఠుడా!; ఇట్లు= ఈ విధంగా; వృష్ణి, భోజ+అంధకులు= వృష్ణి, భోజ, అంధక వంశాలకు చెందిన యాదవ వీరులు; రేఁగి= విజృంభించి; మద్యపానంబు= మత్తుపానీయాలను త్రాగటం; ఒనరించి= చేసి; మదమున్+పొంది= మత్తులోనికి జారిపోయి; కేకిసలాడుచున్= పరిహాసాలాడుతూ, చప్పట్లు చరుస్తూ; పొందుపడని పలుకులు+ఎసఁగంగన్= పొందులేని మాటలు పుట్టగా; తిరిగి= మరల; నవ్వులు+చెలంగన్= నవ్వులు విజృంభించగా.

తాత్పర్యం: ఇట్లా వృష్ణి, భోజ, అంధక వంశాలకు చెందిన వీరులంతా విజృంభించి, మద్యాన్ని బాగా పట్టించి మత్తులోకి జారిపోయారు. పరిహాసాలాడుతూ, వెకిలిగా నవ్వుతూ, (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: మాటల పొందులేకపోవటం త్రాగినదాని ఫలితం. తరువాతి కథలో ఒకరినొకరు నిందించుకొనటంలో ఇది కనిపిస్తుంది. మద్యపాన దుష్ఫలితాలు ఇట్లాంటిచోట్ల మనం బాగా గమనించవచ్చును.

సాత్యకి కృతవర్మలకు రోషజనకంబుగాఁ గలిగిన సంవాదము (సం.16-4-16)

సీ. **ఉన్మార్గ వర్తులై యుండిరి వినుమట్టి। యవసరంబున ఘూర్ణితారుణంబు**
లయిన నేత్రముల సాత్యకి కృతవర్మని। వదనంబు గనుఁగొని మద మెలర్ప
నొద్ద నిల్చున్న ప్రద్యుమ్ను చే సఱచుచు। నవమాన మేర్పడునట్టి భంగిఁ
బెలుచ నవ్వి ' యరాతిబృందంబు నిద్రావ। శత్వంబుఁ బొందుటఁ జావువోని

తే. **దుష్టదశ నొంది యుండఁగఁ దుచ్ఛుఁడేని। నడరి వధియింపఁగాఁ జొరఁ డనిన రాజ**
తనయుఁ డంత పాపంబు సేయునె యితండు। పొడిచెనటె యిస్సిరో యిట్టి పోటుఁ బోటె.' **42**

ప్రతిపదార్థం: వినుము= తరువాత జరిగినది చెప్తాను వినుము; ఉన్మార్గవర్తులు+ఐ ఉండిరి= ఇట్లా యాదవులంతా చెడుత్రోవ పట్టిన వారయ్యారు; అట్టి+అవసరంబునన్= ఆ సమయంలో; ఘూర్ణిత+అరుణంబులు+అయిన నేత్రములన్= గుండ్రంగా తిరుగుతున్న ఎర్రని కండ్లతో; సాత్యకి; కృతవర్మని; వదనంబున్ కనుంగొని= ముఖం చూసి; మదము+ఎలర్పన్= మదం అతిశయించగా; ప్రద్యుమ్ను= ప్రద్యుమ్నుడి; చే+చఱచుచున్= చేయి తట్టుతూ; అవమానము+ఏర్పడు+అట్టిభంగిన్= అవమానమయ్యేటట్లు; పెలుచన్+నవ్వి= బిగ్గరగా నవ్వి (ఇట్లా అన్నాడు); అరాతి బృందంబు= శత్రు సమూహం; నిద్ర+అవశత్వంబున్+పొందుటన్= నిద్రలో పూర్తిగా వివశులై మునిగిపోవటంవలన; చావు+పోని= చావువంటి; దుష్టదశన్+ఒంది+ఉండఁగన్= దుర్దశను కలిగి ఉండగా (అంటే నిద్రిస్తుంటే); తుచ్ఛుఁడు+ఏనిన్= ఎంతనీచుడైనా; అడరి= ప్రయత్నించి; వధియింపంగాన్+చొరఁడు= చంపటానికి పోడు; అనినన్= అనగా; రాజతనయుఁడు= రాజకుమారుడు (కృతవర్మ); ఇతండు; అంతపాపంబు+చేయునె?= అంతటి పాపం చేశాడా?; పొడిచెనటె?= పొడిచాడా? ఇస్సిరో= ఛీ ఛీ; ఇట్టి పోటుఁ పోటె?= ఇట్లా పొడవటం కూడా పొడవటమేనా?

తాత్పర్యం: ఇట్లా యాదవవులందరూ మత్తులో జోగుతుండగా, ఎర్రటి కళ్ళు గుండ్రంగా త్రిప్పుతూ సాత్యకి కృతవర్మను చూచి మదం అతిశయించగా ప్రద్యుమ్నుడి చేయి తట్టుతూ, అవమానం అయ్యేటట్లు బిగ్గరగా నవ్వి ఇట్లా అన్నాడు. 'శత్రువులు నిద్రలో ఉన్నప్పుడు నిజంగా వారు చచ్చినట్టే! అట్లాంటి స్థితిలో ఉన్నవారిని చంపటానికి ఏ నీచుడూ ముందు కురకడు. అట్లాంటప్పుడు రాజకుమారుడైన ఈ కృతవర్మ ఇంత పాపానికి ఎట్లా ఒడిగట్టాడు? ఇదీ ఒక శత్రు సంహారమా! ఛీ ఛీ! ఇట్లా చంపటం కూడా చంపటమేనా!'

తే. **అనినఁ బ్రద్యుమ్నుఁ 'డిది నీచు లయిన వారి। తెరువు వృష్ణివంశోత్తమ! దీని నిట్లు**
నీవు వాక్రువ్వ నేటికిఁ? బోవ విడువు;। జను లితనిఁ బ్రువ్వఁ దిట్టుట చాలదెట్లు? **43**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ప్రద్యుమ్నుఁడు; ఇది= ఈ విధంగా చంపటం; నీచులు+అయినవారి+తెరువు= నీచుల పద్ధతి; వృష్ణివంశోత్తమ!= వృష్ణివంశంలో పుట్టిన ఓ వీరుడా! (సాత్యకికి సంబోధన); దీనిన్+ఇట్లు= దీనిని ఇంతగా; నీవు+వాక్రువ్వన్+ఏటికిన్?=

నీవు చెప్పటం ఎందుకు?; పోవన్+విడువు(ము)= వదలిపెట్టుము; జనులు+ఇతనిన్= ప్రజలంతా ఇతడిని; ప్రువ్వన్+తిట్టుట= పుచ్చిపోయేలా తిట్టటం; చాలదెట్లు?= చాలదా ఏమి?

తాత్పర్యం: అట్లా అంటే ప్రద్యుమ్నుడు సాత్యకితో ఇట్లా అన్నాడు. 'పోనీలే బాబాయ్! ఇట్లా చంపటం నీచుల పద్ధతి. దీనిని నీవంటివాడు ఇంతగా చెప్పటం ఎందుకు?; వదిలిపెట్టుము. ప్రజలంతా ఇతడిని పుచ్చిపోయేటట్లు తిట్టుతూనే ఉన్నారు. అది చాలదా ఏమిటి?'

విశేషం: కృష్ణుడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు - ఒక ఇంటివారు. కృష్ణుడి తమ్ముడు కాబట్టి ప్రద్యుమ్నుడికి బాబాయి వరుస, మరో వంశంవాళ్ళను గురించి ఆయా ఇళ్ళలో ఉన్న గూఢభావనలు తాగినపుడు బైటపడ్డాయని అర్థం. తాగనప్పుడు ఒకరికొకరు చాలా గౌరవంగా ప్రవర్తిస్తారు. తాగినప్పుడు లోపల అణగారి ఉన్న ఉద్రేకాలు బయటికి వస్తాయి. ఇక్కడ అట్లాగే జరిగింది.

చ. **అన విని రోషచిహ్నవికృతాననుఁడై కృతవర్మ సాత్యకిం**
గనుఁగొని 'సిగ్గులేక యొరుకయ్యము నీకిటు లుగ్గడింపఁగాఁ
జనునె? కిరీటి చే నఱక శాంతత నొందిన సోమదత్తనం
దను తల ద్రుంపవే మఱచితా యిసిరో యిది పోరిపాడియే?' **44**

ప్రతిపదార్థం: అనన్+విని= ఇట్లా ప్రద్యుమ్నుడంటే విని; రోష చిహ్న వికృత+ఆననుఁడు+ఐ= రోషాన్ని వ్యక్తీకరించే వికారమైన ముఖంతో; కృతవర్మ; సాత్యకిన్+కనుఁగొని= సాత్యకిని చూచి (ఇట్లా అన్నాడు); సిగ్గులేక= సిగ్గువదలి; ఒరు కయ్యము= ఇతరుల యుద్ధాన్ని; నీకున్+ఇటులు+ఉగ్గడింపఁగాన్= నీవు ఇట్లా చెప్పటం; చనునె?= సరిపోతుందా? (నీవు మాత్రం); కిరీటి= అర్జునుడు; చే+నఱకన్= చేయి నరికివేయగా; శాంతతన్+ఒందిన= శాంతంగా ఉన్న; సోమదత్తనందను తలన్= సోమదత్తుని కుమారుడి తలను; త్రుంపవే?= నరకలేదా?; మఱచితా?= మరచిపోయావా?; ఇసిరో!= ఛీ, ఛీ!; ఇది= ఇట్లా చేయటం; పోరిపాడియే?= యుద్ధనీతియేనా?

తాత్పర్యం: అపుడు సాత్యకిని చూచి కృతవర్మ రోషాన్ని ప్రకటించే వికారమైన ముఖంతో నిప్పులు చెరుగుతూ ఇట్లా అన్నాడు; 'సిగ్గులేకుండా ఇతరులు చేసిన యుద్ధాన్ని ఎందుకు ప్రస్తావిస్తావు? నీవు ఇట్లా అనటం భావ్యం కాదు. అర్జునుడు చేతిని నరకగా, శాంతంగా ఉన్న సోమదత్తుడి కొడుకు తలను నీవు నరకలేదా? మరచిపోయావా? ఇది మాత్రం యుద్ధన్యాయమేనా?'

సీ. **అనియె దానికి హరి యా భోజపతిమీఁదఁ। గడు నెఱ్ఱనైన క్రీఁగంటిచూడ్కి**
నిగిడించి సక్రోధమగు మానసంబుతో। నఖిలభోజులఁ గలయంగఁ జూచె
నప్పుడు సాత్యకి హరితోడఁ 'గృతవర్ము। నునుజుండు శతధన్వుఁ డనుచితోద్య
మమున సత్రాజిత్తు మహితాత్ము మాననీ। యుని శమంతకమణికిని వధించెఁ

తే. **గాదె?' యని వారి దెసఁ గీడు గానిపింపఁ। బలికె; నవ్వాదు విని సత్యభామ కోప**
మడరి వనితాస్వభావోద్గతాశ్రుపూర। యగుచు హరి యగ్రతలమున కరుగుదెంచె. **45**

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; (అప్పుడు) దానికిన్ హరి= ఆ మాటలకు శ్రీకృష్ణుడు; ఆ భోజపతిమీఁదన్= ఆ కృతవర్మమీద; కడున్= మిక్కిలి; ఎఱ్ఱనైన= ఎఱ్ఱని; క్రీఁగంటిచూడ్కి= కడకంటిచూపు; నిగిడించి= సారించి; సక్రోధము+అగు= కోపంతోకూడిన; మానసంబుతోన్= మనస్సుతో; అఖిలభోజులన్= భోజులందరినీ; కలయంగన్+చూచెన్= ఒకసారిగా చూచాడు; అప్పుడు; సాత్యకి; హరితోడన్= కృష్ణుడితో (ఇట్లా అన్నాడు); కృతవర్మ+అనుజుండు= కృతవర్మ తమ్ముడు; శతధన్వుఁడు= శతధన్వుడనువాడు; అనుచిత+ఉద్యమమునన్= అనుచితమైన పూనికతో; మహితాత్మున్= మహితాత్ముడైన; మాననీయున్= గౌరవింపదగిన; సత్రాజిత్తున్= సత్రాజిత్తును (సత్యభామ తండ్రిని); శమకంతకమణికిని= శమంతకమణికొరకు; వధించెన్+కాదె!= చంపాడు కదా!; అని; వారిదెసన్= వారివైపు; కీడు= తప్పు; కానిపింపన్= కనిపించేలా; పలికెన్= అన్నాడు; ఆ+వాదు విని= ఆ వాక్కలహాన్ని విని; సత్యభామ; కోపము+అడరి= కోపంవచ్చి; వనితా స్వభావ+ఉద్గత+అశ్రుపూర+అగుచున్= స్త్రీ స్వభావం చేత పుట్టిన కంటినీరు కలిగినది అవుతూ (ఏడుస్తూ); హరి= కృష్ణుడి యొక్క; అగ్రతలమునకున్= ఎదుటికి; అరుగుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: అని కృతవర్మ అన్నాడు. ఆ మాటలకు కృష్ణుడికి కోపం వచ్చింది. కృతవర్మ మీద మిక్కిలి ఎఱ్ఱనైన కడగంటి చూపు సారించి, కోపంతో కూడిన మనసుతో భోజులందరినీ ఒకసారి అట్లా చూచాడు. అప్పుడు సాత్యకి కృష్ణుడితో ఇట్లా అన్నాడు. 'కృతవర్మ తమ్ముడు శతధన్వుడు మాత్రం చాలా అనుచితమైన పద్ధతిలో మహితాత్ముడూ, గౌరవింపదగినవాడూ అయిన సత్రాజిత్తును శమంతకమణికొరకు చంపలేదా?' అంటూ వారివైపు దోషారోపణ చేశాడు. ఈ వాక్కలహం విన్న సత్యభామకు కోపం వచ్చింది. స్త్రీస్వభావంచేత కంటిలో నీళ్ళు తిరిగాయి. ఏడుస్తూ కృష్ణుడి సమీపానికి వచ్చింది.

క. కనుఁగొని హరి కతిరోషము। జనియించెను; దానిఁ జూచి సాత్యకి యద్దే
వునకును దేవికినిం బ్రియ। మొనరించెద నని తలంచి యుద్వృత్తుండై. 46

ప్రతిపదార్థం: కనుఁగొని= ఇట్లా సత్య రావటాన్ని చూచి; హరికిన్+అతిరోషము= హరికి చాలా కోపం; జనియించెను= కలిగింది; దానిన్+చూచి= ఆ కోపాన్ని చూచి; సాత్యకి; ఆ+దేవునకునున్= కృష్ణుడికీ; దేవికినిన్= సత్యభామకూ; ప్రియము+ఒనరించెదన్+ అని+తలంచి= సంతోషం కలిగిస్తానని తలచి; ఉత్+వృత్తుండు+ఐ= పైకి గభాలున ఎగిరి.(తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: ఇట్లా సత్య ఏడుస్తూ రావటం చూచి కృష్ణుడికి కోపం వచ్చింది. ఆ కోపం చూచి సాత్యకి కృష్ణుడికీ సత్యభామకూ సంతోషం కలిగించదలచి పైకి గభాలున ఎగిరి. (తరువాతి పద్యంతో అన్వయం)

మ. కృతవర్మం బటు దృష్టిఁ జూచి కినుకం గెంపారు వక్త్రంబుతో
'నితఁ డాచార్య సుతుండు దోడ్పడఁగ రేయెల్లన్ వడిం గిట్టి క
ష్టతరోత్సాహత ద్రౌపదేయులను ధృష్టద్యుమ్నుఁ దత్సోదర
ప్రతతిం జంపిన నీచు వారల గతింబ్రాపించు టర్హంబగున్.' 47

ప్రతిపదార్థం: కృతవర్మన్= కృతవర్మను; పటుదృష్టిన్= తీక్ష్ణమైన చూపుతో; చూచి; కినుకన్= కోపంతో; కెంపారు వక్త్రంబుతోన్= ఎఱ్ఱనైనముఖంతో (ఇట్లా అన్నాడు); ఇతఁడు= ఈ కృతవర్మ; ఆచార్యసుతుండు= ద్రోణాచార్యుడి కొడుకు అశ్వత్థామ; తోడ్పడఁగన్= సహకరించగా; రేయి+ఎల్లన్= రాత్రంతా; వడిన్= అతివేగంగా; కిట్టి= సమీపించి; కష్టతర+ఉత్సాహతన్= అతి నీచమైన ఉత్సాహంతో; ద్రౌపదేయులనున్= ద్రౌపది కుమారులను (ఉపపాండవులను); ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; తత్సోదరప్రతతిన్=

అతడి సోదరసమూహాన్ని; చంపిన; నీచున్= నీచుడిని; వారలగతిన్= వాళ్ళు పోయిన దారిని; ప్రాపించుట= పొందేటట్లు చేయటం; అర్హంబు+అగున్= తగిన పని.

తాత్పర్యం: కృతవర్మను తీక్షణంగా చూచి కోపంతో ఎర్రబడ్డ ముఖంతో ఇట్లా అన్నాడు: 'ఈ కృతవర్మ అశ్వత్థామ సహకరిస్తే రాత్రంతా అతివేగంతో సమీపించి అతినీచమైన ఉత్సాహంతో ఉపపాండవులను, ధృష్టద్యుమ్నుడిని, అతడి సోదరులను చంపాడు. ఇట్లాంటి నీచుడిని వాళ్ళు చచ్చినమార్గానికే పంపటం తగిన పని.'

మద్యపానమత్తుఁడైన సాత్యకి కృతవర్మతల నఱకుట (సం.16-4-27)

మ. అనుచున్ సంయమి శాపజాత ముసలాత్యంతాద్భుత స్ఫీత శ
క్తినిరూఢంబుగ నూనినట్టి నిజ నిస్త్రింశంబు శీఘ్రంబునం
గొని తద్దీధితి రాజిచే నతని చూడ్కుల్ విహ్వలత్వంబు నొం
ద నుదగ్రోద్ధతిఁ ద్రుంచెఁ దద్గళము రక్తంబుల్ ప్రసారంబుగన్. 48

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; సంయమి= ఋషుల; శాపజాత= శాపంవలన పుట్టిన; ముసల= రోకలియొక్క; అత్యంత= మిక్కిలి; అద్భుత= అద్భుతమైన; స్ఫీత= వ్యాపించిన; శక్తి= శక్తి; నిరూఢంబుగన్= ప్రసిద్ధికెక్కగా; ఊనిన+అట్టి= ధరించిన; నిజ= తన; నిస్త్రింశంబున్= కత్తిని; శీఘ్రంబునన్= వెంటనే; కొని= ఒరలోనుండి లాగి; తద్+దీధితి+రాజిచేన్= ఆ ఖడ్గకాంతి సమూహంచేత; అతని= ఆ కృతవర్మ యొక్క; చూడ్కుల్= చూపులు; విహ్వలత్వంబున్+ఒందన్= వివశాలు కాగా; ఉదగ్ర+ఉద్ధతిన్= మిక్కిలికోపం అతిశయించగా; రక్తంబుల్ ప్రసారంబుగన్= రక్తాలు నలుదిక్కులా ప్రసరించగా; తద్+గళమున్= అతడి గొంతును; త్రుంచెన్= నరికాడు.

తాత్పర్యం: ఇట్లా అంటూ, ఋషుల శాపంచేత పుట్టిన రోకలి కున్న అద్భుతమైన శక్తి వ్యాపించిన తన కత్తిని ఒరలోనుండి లాగాడు. ఆ ఖడ్గకాంతి సమూహంచేత కృతవర్మ చూపులు స్వాధీనాన్ని కోల్పోయాయి. సాత్యకికి కోపం అతిశయించింది. ఆ కత్తితో రక్తం నలుదిక్కులా చిమ్మగా కృతవర్మగొంతును నరికివేశాడు.

విశేషం: సాత్యకి చంపినది కత్తితో, కాని ఆ కత్తిలో ఉన్న శక్తి ముసలానికి ఋషులశాపం ప్రసాదించింది. ఋషుల ఆగ్రహానుగ్రహాలు ఎట్లా ఉంటాయో ఇట్లాంటి సందర్భాలవలన తెలుస్తాయి.

తే. అట్లు కృతవర్మఁ దెగటార్చి యాతఁ డంత। నిలువ కుద్ధతుఁ డయి భోజకులముమీఁదఁ
గవిసె బాహావిలాసంబు ఖడ్గదీప్తి। చయము మెఱయంగ సంరంభసత్వరముగ. 49

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; కృతవర్మన్+తెగటార్చి= కృతవర్మను చంపి; అతఁడు= ఆ సాత్యకి; అంతన్ నిలువక= అంతటితో ఆగకుండా; ఉద్ధతుఁడు+అయి= గర్వించినవాడై; బాహావిలాసంబు= భుజదర్పాటోపం; ఖడ్గదీప్తిచయము= ఖడ్గకాంతి సమూహం; మెఱయంగన్= ప్రకాశించగా; సంరంభ= ఉద్రేకంతో కూడిన; సత్వరముగన్= వేగంతో; భోజకులముమీఁదన్= భోజులమీద; కవిసెన్= పడ్డాడు.

తాత్పర్యం: ఆ విధంగా కృతవర్మను చంపి సాత్కకి అంతటితో ఆగకుండా గర్వంతో బాహుబల సౌందర్యం, ఖడ్గకాంతి సమూహం ప్రకాశించగా ఉద్రేకంతో కూడిన వేగంతో భోజకులం మీద పడ్డాడు.

చ. కవిసినఁ జూచి యాఁగుటకుఁ గా నలినాక్షుఁడు వోవునంత నా
హవఖరులైన భోజులును నంధకవీరులు నొక్కఁడై దెసల్
సెవుడుపడంగ నార్చి యతిశీఘ్రత సాత్యకిఁ జుట్టుముట్టి; ర
ప్డు విమల బోధుఁ డాహరి కడుం గనలొందియుఁ గాలవేదితన్. 50

ప్రతిపదార్థం: కవిసినన్= ఆక్రమించగా; చూచి= గమనించి; ఆఁగుటకున్+కాన్= ఆపటానికై; నలిన+అక్షుఁడు= కమలనేత్రుడు (కృష్ణుడు); పోవునంతన్= వెళ్ళేంతలో; ఆహవఖరులు+ఐన= యుద్ధంలో మహాక్రూరులైన; భోజులునున్+అంధకవీరులున్= భోజులు, అంధకులు; ఒక్కఁడు+ఐ= ఒకటిగా కలిసి; దెసలు= దిక్కులు; చెవుడుపడంగన్= చెవుడయ్యేటట్లు; ఆర్చి= అరచి; అతిశీఘ్రతన్= అతివేగంగా; సాత్యకిన్= సాత్యకిని; చుట్టుముట్టిరి= ఆక్రమించారు; అప్డు= అప్పుడు; విమలబోధుఁడు= నిర్మలజ్ఞానం కలిగిన; ఆ హరి= ఆ కృష్ణుడు; కడున్= మిక్కిలిగా; కనలు+ఒందియున్= కోపపడి కూడా; కాలవేదితన్= కాలజ్ఞానం కలిగి.

తాత్పర్యం: ఇట్లా ఆక్రమించటానికి రావటం గమనించి ఆపటానికై కృష్ణుడు వెళ్లేటంతలో యుద్ధంలో వాడి వేడిమి ఉన్నవారూ, మహాక్రూరులూ అయిన భోజాంధకులు ఒక్కటిగా కలిసి, దిక్కులు చిల్లులు పడేటట్లు అరిచారు. అతివేగంతో సాత్యకిని చుట్టుముట్టారు. అప్పుడు నిర్మలజ్ఞానం కలిగిన శ్రీకృష్ణుడికి చాలా కోపం వచ్చింది. అయినా కాలజ్ఞానం కలిగినవాడు కాబట్టి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'విమలబోధుఁ' డనేమాట ఇక్కడ గమనించాలి. 'బోధ' అంటే జ్ఞానం. అది సాత్త్వికమయినప్పుడే 'విమల'మవుతుంది. 'కాలవేదిత' -సాత్యకి మృత్యువుకు సంబంధించిన జ్ఞానం. అది కలిగినవాడు కాబట్టి కృష్ణుడు తరువాతి కథలో ఊరుకొన్నాడు.

చ. తమ్మునిఁ గాచునట్టి సముదగ్రతఁ గైకొన నొల్లఁ డయ్యె వే
గమ్మున రుక్మిణీసుతుఁ డఖండపరాక్రమ మొప్పఁ గిట్టి శౌ
ర్యమ్ము భుజాబలమ్ము మెఱయం గని సాత్యకి సంతసిల్లి ద
ర్పమ్మునఁ బేర్చె మెచ్చొలసి ప్రస్తుతి సేసిరి చూచు ఖేచరుల్. 51

ప్రతిపదార్థం: తమ్మునిన్= తమ్ముడైన సాత్యకిని; కాచునట్టి= కాపాడే; సముదగ్రతన్= పూనికను; కైకొనన్= గ్రహించటానికి; ఒల్లఁడు+అయ్యెన్= ఇష్టపడలేదు; అపుడు; రుక్మిణీసుతుఁడు= ప్రద్యుమ్నుడు; వేగమ్మునన్= అతిశీఘ్రంగా; అఖండపరాక్రమము+ఒప్పన్= మొక్కపోని పరాక్రమంతో; కిట్టి= సమీపించి; శౌర్యమ్ము= పరాక్రమం; భుజాబలమ్ము= బాహుబలం; మెఱయన్+కని= ప్రకాశించటాన్ని చూచి; సాత్యకి; సంతసిల్లి= సంతోషపడి; దర్పమ్మునన్= గర్వంతో; పేర్చెన్= చెలరేగిపోయాడు; చూచు ఖేచరుల్= దీనిని చూస్తున్న ఆకాశసంచారులు (గంధర్వ విద్యాధరాదులు); మెచ్చు+ఒలసి= మెప్పు పుట్టి; ప్రస్తుతి+చేసిరి= ప్రస్తుతించారు.

తాత్పర్యం: కృష్ణుడు తమ్ముడైన సాత్యకిని కాపాడే ప్రయత్నం చెయ్యటానికి ఇష్టపడలేదు. అపుడు ప్రద్యుమ్నుడు అతి శీఘ్రంగా మొక్కపోని పరాక్రమంతో సమీపించి, తన విక్రమాన్ని, బాహుబలాన్ని ప్రకాశింప చేయటాన్ని చూచి సాత్యకి సంతోషపడి గర్వంతో మరింత చెలరేగిపోయాడు. దీనినంతా చూస్తున్న ఆకాశగమనులైన గంధర్వాదులు ప్రశంసాపూర్వకంగా ప్రస్తుతిచేశారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. కనుఁగొని వృష్ణివీరులు నికామసముజ్జ్వల రోషవహ్నినె
మ్మనమున నుత్థితంబుగ సమత్సర శౌర్యము విక్రమోద్ధతిం
బెనుపఁగ వార లిద్దఱకుఁ బ్రీతి యెలర్పఁగ సింహనాదముల్
ఘనపథమెల్ల నిండఁగ బలంబుఁ జలంబును నుల్లసిల్లఁగన్. 52

ప్రతిపదార్థం: వృష్ణివీరులు= వృష్ణివంశీయులైన ఇతర వీరులంతా; కనుఁగొని= దీనిని చూచి; నెమ్మనమునన్= మనస్సులలో; నికామ= అధికమైన; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశిస్తున్న; రోషవహ్ని= రోషమనే అగ్ని; ఉత్థితంబుగన్= పైకిలేవగా; సమత్సర శౌర్యము= మాత్సర్యంతో కూడిన శౌర్యం; విక్రమోద్ధతిన్= పరాక్రమాతిశయాన్ని; పెనుపఁగన్= పెంచగా; వారలు+ఇద్దఱకున్= సాత్యకి, ప్రద్యుమ్నులకు; ప్రీతి+ఎలర్పఁగన్= సంతోషాన్ని కల్గించటానికి; ఘనపథము+ఎల్లన్= ఆకాశం అంతటా; సింహనాదముల్= సింహ గర్జనలు; నిండఁగన్= నిండిపోగా; బలంబున్= బలమూ; చలమున్= పట్టుదలా; ఉల్లసిల్లఁగన్= వ్యక్తంకాగా.

తాత్పర్యం: అపుడు వృష్ణివంశీయులైన ఇతర వీరులంతా దీనిని చూచి, మనసులనిండా అధికమైన రోషాగ్ని పుట్టగా, మాత్సర్యంతో కూడిన పరాక్రమాతిశయంతో సాత్యకి, ప్రద్యుమ్నులకు సంతోషం కల్గించటానికై ఆకాశమార్గమంతటా సింహనాదాలు నిండిపోగా బలమూ, పట్టుదలా వ్యక్తం కాగా, (తరువాతి పద్యంతో అన్వయం)

క. భోజాంధక సంగమన వి। రాజితమగు నబ్బలంబు రౌద్రోద్రేక
భ్రాజితు లయి తాఁకి పెనఁగి। రేజాలియు లేక కృష్ణుఁ డీక్షింపంగన్. 53

ప్రతిపదార్థం: భోజ+అంధక+సంగమన= భోజుల, అంధకుల కూడికతో; విరాజితము+అగు+ఆ+బలంబు= పేరు పొందిన ఆ సైనికసమూహం; రౌద్ర+ఉద్రేక+భ్రాజితులు+అయి= రౌద్రంచేత పుట్టిన ఉద్రేకంతో ప్రకాశిస్తున్నవారై; ఏ జాలియున్+లేక= ఏ కనికరమూ లేకుండా; కృష్ణుడు+ఈక్షింపంగన్= శ్రీకృష్ణుడు చూస్తుండగానే; తాఁకి= ముట్టడించి; పెనఁగిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: భోజాంధకుల కూటమిగా పేరున్న ఆ సైనికబలం రౌద్రంచేత పుట్టిన ఉద్రేకంతో ప్రకాశిస్తున్నవారై శ్రీకృష్ణుడు చూస్తూ ఉండగానే ఏ జాలీ లేకుండా ఒకరినొకరు ముట్టడించి యుద్ధం చేశారు.

క. అయ్యిరు దెఱఁగున కప్పుడు। కయ్యమునకుఁ బరమసాధకంబుగఁ గలిగెన్
ముయ్యంచు తుంగ యచ్చట;। దయ్యము నేర్పు విను సెప్పెదం గురునాథా! 54

ప్రతిపదార్థం: కురునాథా!= కురుసార్వభౌమా!; ఆ+ఇరు+తెఱఁగునకున్= ఆ వృష్ణి, భోజాంధక వర్గాలు రెండింటికీ; అప్పుడు= ఆ సమయంలో; అచ్చటన్= అక్కడికక్కడే; ముయ్యంచు తుంగ= మూడు అంచులున్న తుంగ పరకలు; కయ్యమునకున్= యుద్ధానికి; పరమ= శ్రేష్ఠమైన; సాధకంబుగన్= ఆయుధాలుగా; కలిగెన్= దొరికాయి; దయ్యమునేర్పు= దైవనైపుణ్యం; చెప్పెదన్+విను= చెప్పుతాను వినుము.

తాత్పర్యం: ఆ ఇరువర్గాలవారికీ ఆ సమయంలో అక్కడికక్కడే మూడు అంచులున్న తుంగపరకలు యుద్ధానికి శ్రేష్ఠమైన ఆయుధాలవలె లభించాయి. దైవనైపుణ్యం ఎట్లాంటిదో చెప్పుతాను వినుము.

విశేషం: 'దయ్యము నేర్పు' అన్న మాట చాలా అర్థగర్భితమైనది. 'దైవ' శబ్ద వికృతి 'దయ్యం'. మానవుడికి ఎన్నటికీ అర్థంకాని నేర్పు ఒకటి దైవానికి ఉన్నది. అన్ని వరాలు కోరిన హిరణ్యకశిపుడిని నర+మృగవేషంలో రాత్రి+పగలు అయిన సమయంలో 'గోళ్ళ'ను ఆయుధంగా మలుచుకొని చంపటమే దైవనైపుణ్యం. ఇక్కడా ఇదే ప్రత్యేకత.

చ. మునివరశాపసంభవదమోఘగతిన్ ముసలంబు సాద్భుతం
బును నతిదారుణంబు నగు భూరిసముద్భట శక్తిఖేలనం
బున ముసలత్వ విస్ఫురణముం గలిగించెఁ బ్రవేశలీలఁ గై
కొని సమరప్రవర్తనము ఘోరతరంబుగ నెల్లతుంగలన్. 55

ప్రతిపదార్థం: మునివర= శ్రేష్ఠులైన మునుల యొక్క; శాప= శాపంచేత; సంభవత్= జనిస్తున్న; అమోఘగతిన్= గొప్ప గమనంతో; ముసలంబు= ముసలాయుధం; స+అద్భుతంబును= అద్భుతంతో కూడినదీ; అతిదారుణంబున్+అగు= అతి భయంకరమైన; భూరి= మిక్కిలి; సముద్భట= శ్రేష్ఠమైన; శక్తి= శక్తియొక్క; ఖేలనంబునన్= క్రీడలో; ఎల్ల తుంగలన్= తుంగలన్నింటిలోనూ; ప్రవేశలీలన్= ప్రవేశించటమనే లీలచేత; సమరప్రవర్తనమున్+కైకొని= యుద్ధ ప్రవృత్తిని కలిగిస్తూ; ఘోరతరంబుగన్= మిక్కిలి భయంకరంగా; ముసలత్వ విస్ఫురణమున్+కలిగించెన్= రోకలి అనే భావాన్ని (స్ఫురణము) కలిగించింది.

తాత్పర్యం: శ్రేష్ఠులైన మునుల శాపంచేత జనిస్తున్న మిక్కిలి గొప్ప గమనంతో, ముసలాయుధం అద్భుతమూ, భయంకరమూ అయిన శక్తియొక్క క్రీడతో తుంగలన్నిటిలోనూ సునాయాసంగా ప్రవేశించి, యుద్ధ ప్రవృత్తిని కలిగిస్తూ, భీతిని సృష్టిస్తూ ఆ తుంగలన్నీ రోకళ్ళనే స్ఫురణను కల్గించింది.

విశేషం: 'అమోఘగతిన్' అనే మాట దివ్యశక్తిని సూచిస్తుంది. పరకాయప్రవేశంవలె రోకలి తుంగలో ప్రవేశించింది. దానికి పట్టిన కాలం, రోకలి అందులో ప్రవేశించిన తీరును 'అమోఘగతి' అని తిక్కన అన్నారు. 'సమరప్రవర్తనము' అనే మాట కూడా విచారించదగినదే. ఆ తుంగ పరకలను చూడగానే శత్రుపక్షం వారిని వాటితో మోదాలన్న బుద్ధి పుట్టిస్తున్నాయని అర్థం. మరి రోకలిని పొడి చేసి సముద్రంలో కలిపివేశారు కదా! అన్న ప్రశ్నకు సమాధానం చెప్పుతున్నాడు.

క. పొడి గాఁగఁ జేసి యమ్మెయి। జడనిధిలో వృష్ణివరుఁడు చల్లించినను
జెడదయ్యె మునివరుల యె। క్కుడు శక్తిని ముసలశక్తి కురువంశవరా! 56

ప్రతిపదార్థం: కురువంశవరా!= కురువంశ శ్రేష్ఠా!; వృష్ణివరుఁడు= వృష్ణివంశంలో శ్రేష్ఠుడైన వసుదేవుడు; పొడిగాఁగన్+చేసి= ఆ రోకలిని ఆనాడే పొడిపొడిగా చేసి; ఆ+మెయిన్= ఆ విధంగా; జడనిధిలోన్= సముద్రంలో; చల్లించినను= చల్లించినా; మునివరుల= శ్రేష్ఠులైన మునుల; ఎక్కుడుశక్తిన్= అధికమైన తపశ్శక్తిచేత; ముసలశక్తి= ఆ రోకలికున్న ప్రభావం; చెడదు+అయ్యెన్= చెడిపోలేదు (తగ్గలేదు).

తాత్పర్యం: రాజా! వసుదేవుడట్లా ఆ రోకలిని ఆనాడే పొడిపొడిగా చేసి ఆ విధంగా సముద్రంలో చల్లించినా శ్రేష్ఠులైన మునులయొక్క అధికమైన తపశ్శక్తిచేత ఆ రోకలికున్న ప్రభావం ఏమీ తగ్గలేదు.

విశేషం: మరింత అధికమూ అయింది. ఒక్క రోకలితో అందరూ మోదుకొని చావలేదు కదా! అందుకే రోకలిని పొడి చేసి సముద్రంలో చల్లటంచేత ప్రతి తుంగా రోకలిగా మారి వారికి మృత్యుహేతువయింది. ఋషుల శాపం - దానికున్న శక్తీ - అన్నీ దైవలీలలో భాగమని చెప్పటమే దీని పరమార్థం. అంటే దైవం నేర్పుముందు మానుషప్రయత్నం ఎన్నడూ జయింపజాలదన్న తాత్పర్యాన్ని ఈ సంఘటన నిరూపిస్తున్నది.

సీ. యాదవవీరుల కా సమయంబున। మద్యపానోద్భూత మదము పేర్మి
మునివరామోఘవచన దివ్యశక్తినిఁ। జేసి కల్గద తుంగ వ్రేసినంత

టన ప్రతిభటునకుఁ దనుపీడ గలుగునే? । యను వివేకము దానిఁగొని విరోధి

నడచినయప్పుడు మిడుక లే కిలఁ బడఁ । గని యిది యెట్లొకో? యని తలంచు

తే. టయును గావున సమర మిట్టలపుభంగిఁ । జెల్లె గృత్రిమముసలచండోల్లసనము

లతిశయిల్లఁగ వారి కన్యోన్య వధ వి । హార దుర్వారసంచారఘోర మగుచు. 57

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ సమయంలో (యుద్ధం చేస్తున్నప్పుడు); యాదవవీరులకున్= వీరులైన యాదవులకు; మద్యపాన+ఉద్భూత+మదముపేర్మిన్= మద్యపానం చేత పుట్టిన మత్తువలన; మునివర+అమోఘ వచన దివ్యశక్తినిన్+చేసి= మునిశ్రేష్ఠుల గొప్ప శాప వచనానికి ఉన్న దివ్యశక్తి వలన; తుంగవ్రేసినంతటన= తుంగపరకతో కొట్టినంత మాత్రాన వెంటనే; ప్రతి భటునకున్= ప్రతివీరుడికి; తనుపీడ= శరీరబాధ; కలుగునే?= కలుగుతుందా?; అనే; వివేకము= తెలివీ; (అట్లాగే) దానిన్= ఆ తుంగను; కొని= తీసికొని; విరోధిని+అడిచిన+అప్పుడు= విరోధిని కొట్టినపుడు; మిడుకలేక= చలనమూ లేకుండా; ఇలన్+పడన్+కని= నేలమీద పడటాన్ని చూసి; ఇది+ఎట్లు+ఒకో+అని తలంచుటయునున్= ఇట్లా ఎలాగా! అన్న ఆలోచనా; కల్గదు+అ= కలుగనే లేదు; కావునన్= అందుచేత; కృత్రిమ= కపటమైన; ముసల= రోకళ్ళయొక్క (తుంగపరకల); చండ+ఉల్లసనములు= భయంకరమైన కాంతులు; అతిశయిల్లఁగన్= అధికం కాగా; వారికిన్= ఆ యదువీరులకు; అన్యోన్యవధ= ఒకరినొకరు చంపాలన్న; విహార= ఆటలో; దుర్వార= అడ్డులేని; సంచార ఘోరము+అగుచున్= సంచారంచేత దారుణమై; సమరము= యుద్ధము; ఇట్టలము+భంగిన్= అతిశయరీతిలో; చెల్లెన్= జరిగింది.

తాత్పర్యం: ఆ సమయంలో యాదవవీరులకు మద్యపానం చేత పుట్టిన మత్తువలన, మునుల గొప్పశాపవచనానికి ఉన్న దివ్యశక్తివలన, తుంగపరకతో కొట్టినంత మాత్రాన వెంటనే ప్రతివీరుడికి శరీరబాధ ఎట్లా కలుగుతుందనే తెలివి కానీ, ఆ తుంగను తీసికొని విరోధిని అణచినపుడు ఏ చలనంలేకుండా నేలమీద పడటాన్ని చూచి 'ఇది ఎట్లా సంభవం? అన్న ఆలోచన కానీ కలుగలేదు. అందువలన కపటమైన ఆ రోకళ్ళు - ఆ తుంగపరకల - భయంకరమైన కాంతులు అతిశయించగా, ఆ యదువీరులకు ఒకరినొకరు చంపాలన్న ఆటలో అడ్డు లేకుండా ఆ తుంగలు ఉపకరించగా యుద్ధం చాలా అతిశయమైన రీతిలో జరిగింది.

ఆ. తండ్రి పుత్రుఁ డన్న దమ్ముఁడు నాక య । య్యిరు దెఱంగు వారు నేపు రేఁగి

మడియ మోఁద గాలిఁ బడు వ్రూఁకుగముల తె । ఱంగు దోఁచె నేమనంగఁ గలదు? 58

ప్రతిపదార్థం: తండ్రి; పుత్రుఁడు; అన్న; తమ్ముఁడు; నాక= అనక; ఆ+ఇరు+తెఱంగువారు= ఆ రెండు వర్గాలవారు; ఏపు రేఁగి= చెలరేగి; మడియన్= చచ్చేట; మోఁదన్= మోదగా; గాలిన్= గాలి దెబ్బతో; పడు= కూలునట్టి; వ్రాఁకు గముల= వృక్షసమూహాల; తెఱంగు+తోఁచెన్= విధంగా కనిపించింది; ఏమి+అనంగన్+కలదు?= ఏమనవచ్చును?

తాత్పర్యం: తండ్రి, కొడుకు, అన్న, తమ్ముడు - అనే తేడా లేకుండా ఆ రెండువర్గాల వారు చెలరేగి చచ్చేటట్లు మోదుకొనగా గాలిదెబ్బకు పడిపోయేటటువంటి వృక్షసమూహాలవలె వారు కనిపించారు. కాలవైపరీత్యాన్ని ఏమనవచ్చును?

తే. మునిశాపము వారలమది । ననయము నస మెక్కఁజేయ సం దొకఁడైనన్

విను మరలుట దెరలుటలే । కని బెట్టుగఁ జేసి రధిప! యార్పులు సెలఁగన్. 59

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; విను= ఇంకా వినుము; మునిశాపము= మునులిచ్చిన శాపం; వారలమదిన్= వారి మనస్సులలో; అనయము= నిరంతరము; అసము+ఎక్కన్+చేయన్= దర్పం అధికం అయ్యేటట్లు చేయగా; అందున్+ఒకఁడు+ఐనన్= వారిలో ఒక్కడుకూడా; మరలుట= యుద్ధంనుండి వెనుకకురావటం గాని; తెరలుట= కలత చెందటం కాని; లేక= లేకుండా; ఆర్పులు= అరుపులు; చెలంగన్= అతిశయించగా; అనిన్= యుద్ధాన్ని; బెట్టుగన్+చేసిరి= విజృంభించి చేశారు.

తాత్పర్యం: రాజా! ఇంకా చెప్పుతాను వినుము. మునులిచ్చిన శాపం వారి మనస్సులలో నిరంతరం దర్పాన్ని అధికమయ్యేటట్లు చేసింది. దానితో వారిలో ఒక్కడు కూడా వెనుకకు మరలటం కాని, కలతచెందటం గాని లేకుండా ఉన్నవారు ఉన్నచోటే విజృంభించి యుద్ధం చేశారు.

తే. **అట్టియెడ విను భోజులు నంధకులును। జాలఁ గలుగుటఁ బ్రబలుండు సాత్యకియు స**
మగ్రశక్తి ప్రద్యుమ్నుఁడు నాదిగాఁగ। మడిసె వారిచే వృష్ణిసమాజమెల్ల. **60**

ప్రతిపదార్థం: విను= ఏమయిందో చెప్పుతాను వినుము; అట్టి+ఎడన్= ఆ సమయంలో; భోజులున్= భోజులూ; అంధకులునున్= అంధకులూ; చాలన్+కలుగుటన్= చాలామంది ఉండటంవలన; ప్రబలుండు= మిక్కిలి బలవంతుడైన; సాత్యకియున్= సాత్యకీ; సమగ్రశక్తి= పరమశక్తిమంతుడు; ప్రద్యుమ్నుఁడున్= ప్రద్యుమ్నుడూ; ఆది+కాఁగన్= మొదలుగాగల; వృష్ణిసమాజమెల్లన్= వృష్ణి వంశమంతా; మడిసెన్= నశించింది.

తాత్పర్యం: ఆ సమయంలో ఏమయిందో వినుము! భోజులు, అంధకులు సంఖ్యలో చాలా అధికంగా ఉండటం వలన మిక్కిలి బలవంతుడైన సాత్యకీ, పరమశక్తిమంతుడైన ప్రద్యుమ్నుడూ మొదలైన వారున్న వృష్ణివంశమంతా నశించింది.

సీ. **అనిరుద్ధుఁ బ్రద్యుమ్ను సాంబుని సాత్యకి। గదునిని మఱియును గలుగు వృష్ణి**
వరుల నంధకభోజవర్గ పరాక్రమ। క్రీడల సమసి యా క్షితితలమునఁ
బడియుండఁ గనుఁగొని పరమమునీంద్ర శా। పంబు మహాశక్తిఁ బద్మనాభుఁ
డును దీవ్రకోపాగ్ని తనదుచిత్తమున ను। ద్ధురమై జనింపంగ దురములోనఁ

తే. **బడక శేషించి మెఱసిన ప్రతిభటాళి। మీఁదఁ గవిసి తుంగలఁగొని మోఁది నిరవ**
శేషముగఁ జేసె; నిట్టు లశేష యాద। వులును మౌసలవిస్ఫూర్తిఁ బొలిసి రధిప! **61**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఆ క్షితితలమునన్= ఆ రణభూమిలో; అనిరుద్ధున్, ప్రద్యుమ్నున్, సాంబునిన్, సాత్యకిన్, గదునినిన్= అనిరుద్ధుడిని; ప్రద్యుమ్నుడిని, సాంబుడిని, సాత్యకిని, గదుడిని; మఱియును+కలుగు= ఇంకా తక్కిన; వృష్ణి వంశంలో పుట్టిన వీరులను; అంధక, భోజవర్గ పరాక్రమ క్రీడలన్= అంధక, భోజ వీరుల పరాక్రమ విలాసంచేత; సమసి= నశించి (చచ్చి); పడి+ఉండన్= పడిఉండగా; కనుఁగొని= చూచి; పద్మనాభుఁడునున్= కృష్ణుడుకూడా; పరమమునీంద్ర= గొప్ప మునీంద్రుల; శాపంబు= శాపానికున్న; మహాశక్తిన్= మహాశక్తిచేత; తీవ్రకోప+అగ్ని= తీవ్రమైన కోపమనే అగ్ని; తనదుచిత్తమునన్= తన మనస్సులో; ఉద్ధురము+ఐ= దట్టమై; జనింపంగన్= పుట్టగా; దురములోనన్= యుద్ధంలో; పడక= చావక; శేషించి= మిగిలి; మెఱసిన= అగుపించిన; ప్రతిభట+ఆళిమీఁదన్= శత్రువీరులమీద; కవిసి= ఉరికి; తుంగలన్+కొని= తుంగపరకలను తీసికొని; మోఁది= బాది; నిర్+ అవశేషముగన్+చేసెన్= ఒక్కరూ మిగలకుండా చేశాడు; ఇట్టులు= ఇట్లా; అశేషయాదవులునున్= యాదవులందరూ; మౌసల విస్ఫూర్తిన్= రోకటి విజృంభణ చేత; పొలిసిరి= చనిపోయారు.

తాత్పర్యం: ఆ రణభూమిలో అంధక, భోజవీరుల పరాక్రమ విలాసంచేత చచ్చిపడి ఉన్న అనిరుద్ధుడిని, ప్రద్యుమ్నుడిని, సాంబుడిని, సాత్యకిని, గదుడిని శ్రీకృష్ణుడు చూచాడు. మునీంద్రుల శాపంవలన కృష్ణుడికీ తీవ్రమైన కోపాగ్ని దట్టంగా పుట్టింది. అంతే! యుద్ధంలో చావక మిగిలి తనకు అగుపించిన శత్రువీరులమీద పడి, తుంగపరకలను తీసికొని చావగొట్టి ఒక్కరూ మిగలకుండా చేశాడు. ఇట్లా యాదవులందరూ రోకటి విజృంభణంచేత చనిపోయారు.

విశేషం: శ్రీకృష్ణుడిలో కూడా మానుషభావం అలముకొన్నది. అందుకే ఋషిశాపం ఆయనలోని 'యాదవు'నిపై పనిచేసింది. అందుకే తక్కిన యాదవవీరులను ఆయన చంపి ఋషుల శాపాన్ని ఫలింపజేశాడు. 'మౌసల విస్ఫూర్తి' అనే మాట చాలా గొప్పది. అక్కడ రోకలీ లేదు - దెబ్బాలేదు - ఉన్నదంతా ఋషి శాపవాక్కు - దాని కాంతే 'రోకలి' వలె కనిపించి మృత్యుకారకమయిందని తాత్పర్యం.

క. **నారాయణుఁ డప్పుడు గాం। ధారీ వాక్యంబు తెలఁగు దలఁచి మనమునం**
బారంబుఁ బొందెనే యిది। యా రూపున ననుచు సంగరావని నొకఁడున్. 62

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; నారాయణుఁడు= నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణుడు; మనంబునన్= మనస్సులో; గాంధారీ వాక్యంబు తెలఁగు= గాంధారి చెప్పిన శాపవిధానం; తలఁచి= స్మరించుకొని; ఇది= ఈ శాపం; ఆ రూపునన్= ఆ విధంగా; పారంబున్+పొందెనే!= తీరం చేరిందా!; అనుచున్= అనుకొంటూ; సంగర+అవనిన్= యుద్ధభూమిలో; ఒకఁడున్= ఒంటరిగా.

తాత్పర్యం: ఆ సమయంలో నారాయణస్వరూపుడైన శ్రీకృష్ణుడు మనసులో గాంధారి శాపమిచ్చిన విధాన్ని స్మరించుకొని ఆ శాపం ఇట్లా సార్థకమయిందా! అని అనుకొంటూ యుద్ధభూమిలో ఒంటరిగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **నిలుచున్నఁ జూచి రణసం। కులతఁ బడకయున్న దారుకుఁడు బభ్రుఁడు న**
జ్జలరుహనాభు సమీప। స్థలికిం జని యిట్టులని రతనితోడ నృపా! 63

ప్రతిపదార్థం: నృపా!= రాజా! (ఏమి జరిగిందో వినుము); నిలుచున్+ఉన్నన్= నిలబడి ఉండగా; చూచి; రణసంకులతన్= ఆ దొమ్మియుద్ధంలో; పడకయున్న= చావకుండా మిగిలిన; దారుకుఁడు; బభ్రుఁడు; ఆ+జలరుహ+నాభు= ఆ పద్మనాభుడి (కృష్ణుడి); సమీపస్థలికిన్= దగ్గరికి; చని= వెళ్ళి; అతనితోడన్= కృష్ణుడితో; ఇట్టులు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: నిలబడి ఉండగా ఆ దొమ్మియుద్ధంలో చావకుండా మిగిలిన దారుకుడు, బభ్రుడు ఆ కృష్ణుడి దగ్గరకు వెళ్ళి, అతడితో ఇట్లా అన్నారు.

తే. **అఖిలజనమును సంహృతమయ్యె నిచట। నేల? బలభద్ర దేవుఁ డున్నెడ ముకుంద!**
యరసికొని పోయి యాతని చరితమునకు। ననుగుణంబైన వర్తన మాచరింపు.' 64

ప్రతిపదార్థం: ముకుంద!= కృష్ణా!; అఖిలజనమును= యాదవసమూహమంతా; సంహృతము+అయ్యెన్= చచ్చింది; ఇచటన్+ఏల?= ఇక్కడెందుకు?; బలభద్రదేవుఁడు= బలరాముడు; ఉన్న+ఎడ= ఉన్నచోటును; అరసికొని పోయి= తెలిసికొని పోయి; అతని చరితమునకున్= అతడి నడవడికి; అనుగుణంబు+ఐన= తగిన; వర్తనము= పని; ఆచరింపు(ము)= చేయుము.

తాత్పర్యం: 'కృష్ణా! యాదవ సమూహమంతా చచ్చింది. మరి ఇక్క డెందుకు! బలరాముడు ఎక్కడున్నాడో తెలిసికొనిపోయి, అత డెట్లా ఉన్నాడో అందుకు అనుగుణంగా ఆచరించటం మంచిది.

ఉ. **అనుటయు నట్ల కాక! యని యంబుజనాభుఁడు బభ్రుదారుకు**
ల్మనములు దల్లడిల్లఁగ కెలంకుల రా బలభద్రదేవు పో
యిన దెస నాదరం బెసఁగ నేఁగి కురుక్షితిపాగ్రగణ్య! యా
ఘనతరమూర్తి నవ్వలనఁ గాంచె మహీజము పొంత నుండఁగన్. **65**

ప్రతిపదార్థం: కురుక్షితిప+అగ్రగణ్య!= ఓ కురురాజ శ్రేష్ఠా! వినుము; అనుటయున్= దారుకుడు, బభ్రుడు అట్లా పలుకగా; అట్లకాక!+అని= అట్లాగే చేద్దామని; అంబుజనాభుఁడు= పద్మనాభుడు (శ్రీకృష్ణుడు); బభ్రుదారుకుల్+మనములు= బభ్రుడి, దారుకుడి మనస్సులు; తల్లడిల్లఁగన్= తల్లడిల్లిపోగా; కెలంకులన్‌రాన్= తనకు ఇరువైపులా రాగా; బలభద్రదేవు పోయిన దెసన్= బలరాముడు వెళ్ళిన దిక్కులో; ఆదరంబు+ఎసఁగన్+ఏఁగి= గౌరవభావంతో వెళ్ళి; ఆ+వలనన్= ఆ వైపున; మహీజముపొంతన్= చెట్టుదగ్గర; ఉండఁగన్= ఉండగా; ఆ ఘనతరమూర్తిన్= ఆ బలిష్ఠమైన బలరాముడి రూపాన్ని; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: ఓ రాజా వినుము! అట్లా వారు పలుకగా అట్లాగే చేద్దామంటూ, బభ్రుదారుకులు, మనసులు తల్లడిల్లిపోగా, ఇరువైపులా నడుస్తుండగా శ్రీకృష్ణుడు బలరాముడు వెళ్లిన దారిలోనే చాలా గౌరవభావంతో వెళ్ళాడు. ఆ వైపున ఒక చెట్టుక్రింద ఆ బలిష్ఠవిగ్రహుడైన బలరాముడిని చూచాడు.

యాదవులెల్ల మడిసిన పిదపఁ గృష్ణుఁ డర్జునుఁ దోడ్తేర దారుకుం బంపుట

సీ. **కాంచి దారుకు దెసఁ గనుగొని 'నీవు వే। పాండురాజ తనూజుల పాలి కరిగి**
వారికి యాదవవర్గ సంక్షయవిధ। మెఱిఁగించి యర్జును నిందుఁ దెమ్ము'
నావుడు నతఁడు మహావేగవంతంబు। లగు రథ్యములఁ బట్టి యలఁతియరద
మునఁ బూన్చికొని రయంబున నేఁగె నప్పు డ। మ్మురవైరి బభ్రుని మోముఁ జూచి

ఆ. **'అతివపిండుఁ గుంజరాదులఁ బురిఁ జేర్చి। యరుగుదెమ్ము వేగ' మనిన నాతఁ**
డట్ల చేయు పనికి నయి చన నొకబోయ। త్రుంగఁ జేసె నతనిఁ దుంగ వ్రేసి. **66**

ప్రతిపదార్థం: కాంచి= అట్లా బలరాముడిని చూచి; దారుకుదెసన్= దారుకుడివైపు; కనుఁగొని= చూచి; నీవు; వే= వేగంగా; పాండు తనూజుల పాలికిన్= పాండురాజు కుమారుల దగ్గరకు; అరిగి= వెళ్ళి; యాదవవర్గ సంక్షయ విధము= యాదవ వర్గమంతా నశించిన విధం; ఎఱిఁగించి= తెలిపి; అర్జునున్= అర్జునుడిని; ఇందున్= ఇక్కడికి; తెమ్ము= తీసికొనిరమ్ము!; నావుడున్= అనగా; అతఁడు= ఆ దారుకుడు; మహావేగవంతంబులు+అగు= చాలా వేగంగా పరుగెత్తే; రథ్యములను= గుర్రాలను; పట్టి= పట్టుకొనివచ్చి; అలఁతి= చిన్న; అరదమునన్= రథానికి; పూన్చికొని= పూన్చుకొని; రయంబునన్= వేగంగా; ఏఁగెన్= వెళ్ళిపోయాడు; అప్పుడు; ఆ+మురవైరి= ఆ మురాసురుడి శత్రువు - శ్రీకృష్ణుడు; బభ్రునిమోమున్+చూచి= బభ్రుని ముఖం చూచి; అతివ పిండున్= స్త్రీల సమూహాన్ని; కుంజర+ఆదులన్= ఏనుగులు మొదలైనవాటిని; పురిన్+చేర్చి= ద్వారకలో చేర్చి; వేగము= శీఘ్రంగా; అరుగుదెమ్ము= మరలిరమ్ము; అనినన్= అనగా; అతఁడు= ఆ బభ్రుడు; అట్లు+అ+చేయుపనికిన్+అయి= అట్లాగే చేయటానికి; చనన్= పోగా; ఒక బోయ= ఒక బోయవాడు; తుంగ= తుంగపరకను; వ్రేసి= అతడిపై వేసి; అతనిన్= ఆ బభ్రుడిని; త్రుంగన్+చేసెన్= చచ్చేటట్లు చేశాడు.

తాత్పర్యం: అట్లా బలరాముడిని చూసి, దారుకుడి వైపు తిరిగి 'నీవు వేగంగా పాండుకుమారుల దగ్గరకు వెళ్ళి, యాదవవర్గమంతా నశించిన విధం తెలిపి, అర్జునుడిని ఇక్కడకు తీసికొనిరమ్ము' అన్నాడు. ఆ దారుకుడు బాగా వేగంగా పరుగెత్తే గుర్రాలను తీసికొనివచ్చి చిన్న రథానికి పూన్చుకొని వేగంగా వెళ్ళిపోయాడు. అప్పుడు కృష్ణుడు బభ్రుడివైపు చూచి 'నీవు స్త్రీలను, ఏనుగులు, గుర్రాలు మొదలైనవాటినీ ద్వారకలో చేర్చి తిరిగిరమ్ము' అన్నాడు. ఆ బభ్రుడు అట్లాగే చేయటానికి బయలుదేరాడు. అంతలో ఒక బోయవాడు ఒక తుంగపరకను వాడిపై వేసి, వాడిని చంపాడు.

విశేషం: బభ్రుడు యాదవుడు, ఆ ఒక్కడు కూడా మిగలలేదని చెప్పటం కోసం ఈ వర్ణన. ఇక ఆ బభ్రుడి పని కూడా శ్రీకృష్ణుడే చేయవలసి వచ్చింది. కాలం వికటించటమంటే అర్థం ఇదే.

ఆ. **హరికిఁ గానవచ్చునంత దవ్వుల నట్లు। పడియె బభ్రుఁ; డతని పాటుఁ జూచి**
సంయమీంద్రశాపశక్తికి నద్భుత। మంది యమ్ముకుందుఁ డన్నతోడ. **67**

ప్రతిపదార్థం: హరికిన్= కృష్ణుడికి; కానవచ్చునంత దవ్వులన్= కనిపించేటంత దూరంలోనే; బభ్రుఁడు; అట్లు= ఆ విధంగా; పడియెన్= నేలకూలాడు; అతని= ఆ బభ్రుడిని; పాటున్ చూచి= పడిపోవటాన్ని చూచి; ఆ+ముకుందుఁడు= శ్రీకృష్ణుడు; సంయమి+ఇంద్ర= ఋషిశ్రేష్ఠుల; శాపశక్తికిన్= శాపానికున్న శక్తికి; అద్భుతము+అంది= ఆశ్చర్యపడి; అన్నతోడన్= బలరాముడితో.

తాత్పర్యం: కృష్ణుడికి కనిపించేటంత దూరంలోనే అట్లా బభ్రుడు నేలకొరిగాడు. ఆ బభ్రుడి పతనాన్ని చూచి కృష్ణుడు ఋషిశ్రేష్ఠుల శాపాని కున్న శక్తికి ఆశ్చర్యపడి బలరాముడితో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **'సామజరథతురగములను। రామలఁ బురి సేర్చి యే మరలి వచ్చెద నీ**
భూమిజము కడన నిలువు ద। యామయ! నా రాక వార్చి' యనియె నరేంద్రా! **68**

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా (కృష్ణుడిట్లా అన్నాడు); సామజ= ఏనుగులనూ; రథ= రథాలను; తురగములనున్= గుర్రాలను; రామలన్= స్త్రీలను; పురి+చేర్చి= నగరానికి చేర్చి; ఏన్= నేను; మరలి వచ్చెదన్= తిరిగి వస్తాను; దయామయ!;= దయతోనిండినవాడా! (అన్నా); ఈ భూమిజము కడన్= ఈ చెట్టుదగ్గరే; నా రాక వార్చి= నా ఆగమనం నిరీక్షిస్తూ; నిలువు= ఉండుము.

తాత్పర్యం: కృష్ణుడు బలరాముడితో ఇట్లా అన్నాడు; 'అన్నయ్యా! ఏనుగులను, గుర్రాలను, రథాలను, స్త్రీలను ద్వారకలో వదలి నేను తిరిగి వస్తాను. అంతవరకు ఈ చెట్టుదగ్గరే ఉండుము'.

సీ. **అని గజాదుల నింతులను గొని పురి కేఁగి। వసుదేవుఁగాంచి యవ్వసుమతీశు**
తోఁ దగ నిట్లను దొల్లి కౌరవకుల। క్షయము సూచితి; నేఁడు సకలయాద
వులనాశమును గంటి నలఘుతేజోధన!। యఖిలబాంధవహీనమయిన యిచటి
మనువున వర్తింప మనసు గొల్పదు మున్న। యన్న కాననమున కరిగినాఁడు

తే. భవ్యతపమున నా బలభద్రుఁ గూడి। యేను దపమాచరించెద; నింక మీర

లరసికొనుఁడు సర్వంబును;। నరుఁడు వచ్చు। నిందు మీ పంపు సేఁతకై యెల్లినేఁడు.' 69

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; గజ+ఆదులన్= ఏనుగులు మొదలైనవాటిని; ఇంతులనున్= స్త్రీలను; కొని= వెంటతీసికొని; పురికిన్+ఏఁగి= ద్వారకకు వెళ్ళి; ఆ+వసుమతీ+ఈశుతోన్= రాజయినవసుదేవుడితో; తగన్= అర్హమైన రీతిలో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అలఘుతేజోధన!= గొప్ప తేజస్సే ధనంగా కలిగినవాడా (తేజోమూర్తీ); తొల్లి= మునుపు; కౌరవకులక్షయము= కౌరవవంశ నాశం; చూచితిన్= చూశాను; నేఁడు= ఈ వేళ; సకలయాదవులనాశమునున్= యాదవులందరూ నశించటం; కంటిన్= చూచాను; అఖిలబాంధవ హీనము+అయిన= బంధువులెవ్వరూ లేని; ఇచటిమనువునన్= ఇక్కడి బ్రతుకులో; వర్తింపన్= ఉండటానికి; మనసు+కొల్పదు= మనసు రావటంలేదు; అన్న= బలరాముడు; మున్న+అ= ముందుగానే; కాననమునకున్= అడవికి; అరిగినాఁడు= వెళ్ళాడు; భవ్యతపమునన్= శాంతమైన తపస్సుతో, ఆ బలభద్రున్+కూడి= బలరాముడితో కలిసి; ఏను= నేను (కూడా); తపము+ఆచరించెదన్= తపస్సు చేస్తాను; ఇంకన్= ఇకమీదట; సర్వంబును= అన్ని విషయాలనూ; మీరలు= మీరే; అరసికొనుఁడు= చూచికొనుడు; మీ పంపుసేఁతకై= మీ ఆజ్ఞను నిర్వర్తించి మీకు సహకరించటానికి; ఎల్లినేఁడు= రేపో ఈ రోజో; నరుఁడు= అర్జునుడు; ఇందున్= ఇక్కడికి; వచ్చున్= వస్తాడు.

తాత్పర్యం: అని చెప్పి, ఏనుగులు మొదలైనవాటినీ, స్త్రీలనూ వెంటతీసికొని ద్వారకకు వెళ్ళి, వసుదేవుడితో తగినరీతిలో ఇట్లా అన్నాడు: 'తండ్రీ! మునుపు కౌరవులందరూ నాశనం కావటం చూచాను. ఈ వేళ యాదవులందరి చావునూ చూచాను. ఓ తేజోమూర్తీ! బంధువు లెవ్వరూ లేని ఇక్కడ జీవితం గడపటానికి మనస్సు రావటంలేదు. బలరాముడు ముందుగానే అడవికి వెళ్ళాడు. అన్నతో కలిసి నేను కూడా శాంతమైన తపస్సు చేస్తాను. ఇక అన్ని విషయాలూ మీరే చూచికొనుడు. మీ ఆజ్ఞ నిర్వర్తించి, మీకు సహకరించటానికి అర్జునుడు రేపో ఈనాడో ఇక్కడకు వస్తాడు.'

క. అనుచు నతని పాదంబులు। తన ఫాలతలంబు సోఁకఁ దాత్పర్యమునన్

వినతి నడపె నంతకుమును। వినియె జనులచేత సమరవిధ మతఁ డధిపా! 70

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; అనుచున్= అంటూ; అతని పాదంబులు= వసుదేవుడి పాదాలు; తన ఫాలతలంబు సోఁకన్= తన నుదుటికి తాకేటట్లు; తాత్పర్యమునన్= గౌరవ ప్రపత్తులతో; వినతినడపెన్= నమస్కరించాడు; అతఁడు= ఆ వసుదేవుడు; అంతకుమును= అంతకుమునుపే; జనులచేతన్= ప్రజలచేత; సమరవిధము= యాదవుల యుద్ధ విషయం; వినియెన్= వినిఉన్నాడు.

తాత్పర్యం: అంటూ వసుదేవుడి పాదాలు తన నుదుటికి తగిలేటట్లు గౌరవప్రపత్తులతో కృష్ణుడు నమస్కరించాడు. ఆ వసుదేవుడు అంతకుమునుపే ప్రజలవలన యాదవులు తుంగపరకలతో చేసికొన్న యుద్ధాన్ని గురించి విని ఉన్నారు.

చ. విని బలుజీవి వోయి మది విహ్వలమై మెయి వ్రానుపాటు నొం

ద నునికి మీఁదఁ గేశవుఁడు దానును రాముఁడు నిల్లువాసి కా

ననమున నుండువారమని నైష్ఠికతం బలుకంగ నున్నచే

తనయు నడంగఁ జేష్టితము దక్కి శవాకృతి నుండె నత్తఱిన్. 71

ప్రతిపదార్థం: విని= ఆ మాటలు విని; బలుజీవి+పోయి= దృఢమైన చైతన్యాన్ని కోల్పోయి; మది= మనసు; విహ్వలము+ఐ= వివశమై (స్వాధీనం కోల్పోయి); మెయి= దేహము; వ్రానుపాటున్+ఒందన్= కొయ్యబారగా; ఉనికి= ఉండటంతో; మీఁదన్=

ఆపై; కేశవుఁడు= శ్రీకృష్ణుడు; తానును= తానూ; రాముఁడున్= బలరాముడూ; ఇల్లు+పాసి= ఇల్లు వదలి; కాననమునన్= అడవిలో; ఉండువారము+అని= ఉంటామని, నైష్ఠికతన్= నిష్ఠతో; పలుకంగన్= చెప్పగా; ఉన్న చేతనయున్= ఉన్న తెలివికూడా; అడంగన్= అణగిపోగా; చేష్టితము తక్కి= నిశ్చేష్టుడై; ఆ+తరిన్= ఆ సమయంలో; శవ+ఆకృతిన్= శవంవలె; ఉండెన్= ఉండిపోయాడు.

తాత్పర్యం: ఆ మాటలు విని, దృఢమైన చైతన్యం పోయి, మనస్సు అస్వాధీనమై, దేహం కొయ్యబారి ఉండగా ఆపైన శ్రీకృష్ణుడు తానూ బలరాముడూ అడవిలో ఉంటామని అనటంతో ఉన్న తెలివికూడా పోయి వసుదేవుడు నిశ్చేష్టుడై శవప్రాయంగా అయ్యాడు.

క. **తన మాటలు నజ్జన నా। థు నవస్థయు వినియుఁ గనియు దురపిల్లి సతీ**
జను లొక్కటఁ బె ల్లాక్రం। దన మొనరించిన మురారి దయ మది నొలయన్. **72**

ప్రతిపదార్థం: తన మాటలున్= తాను ఆడిన మాటలు (అడవిలో తపస్సు చేస్తామనటం); వినియున్= విని; ఆ+జననాథు+ అవస్థయున్= ఆ వసుదేవుడి స్థితి; కనియున్= చూచి; సతీజనులు= యాదవస్త్రీలు; దురపిల్లి= శోకించి; ఒక్కటన్= ఒక్కసారిగా; పెల్లు= మిక్కిలిగా; ఆక్రందనము+ఒనరించినన్= ఏడ్వగా; ముర+అరి= కృష్ణుడు; మదిన్= మనసులో; దయ= కరుణ; ఒలయన్= పుట్టగా.

తాత్పర్యం: తానాడిన మాటలు విని, వసుదేవుడి దురవస్థ చూచి, యాదవస్త్రీలు ఒక్కసారిగా హాహాకారాలు చేస్తూ పెద్దగా ఏడ్చారు. అప్పుడు కృష్ణుడు మనసులో కరుణ పుట్టగా. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. **అందఱ నూరార్చి 'యర్జునుం డిప్పుడ। వచ్చు నిచ్చటికి మీవంత లెల్లఁ**
దీర్చు నక్కురు కులదీపకుం' డని యుప। శమవాక్యములఁ దేర్చి జనకుపాల
నాసీనుఁ డయి తదీయాంఘ్రిపద్మంబులు। తన చారుపాణిపద్మముల మెత్త
మెత్తన యొత్తుచు మెలుపొందఁ గర్జంపుఁ। బలుకులఁ జిత్తవిభ్రమము మాన్చి

తే. **మఱియుఁ బార్థుని రాక పల్మఱును జెప్పి। యన్నయాధ్యుఁడు పనిసేయ నున్నవారిఁ**
'గరితురంగాదికముల మీ రరసికొనుఁడు;। వినుఁడు కర్తవ్యమిట్టిది వేయునేల?' **73**

ప్రతిపదార్థం: (శ్రీకృష్ణుడు) అందఱన్= అందరినీ; ఊరార్చి= ఓదార్చి; ఆ+కురుకులదీపకుండు= ఆ కురుకులంలో శ్రేష్ఠుడైన అర్జునుడు; ఇప్పుడు+అ= ఇప్పుడే; ఇచ్చటికిన్= ఇక్కడికి; వచ్చున్= వస్తున్నాడు; మీవంతలు+ఎల్లన్= మీ దుఃఖాలన్నిటినీ; తీర్చున్= పోగొట్టుతాడు; అని; ఉపశమవాక్యములన్= ఓదార్పు మాటలతో; తేర్చి= వారు తేరుకొనేటట్లు చేసి; జనకు పాలన్= తండ్రిదగ్గర; ఆసీనుఁడు+అయి= కూర్చుని; తదీయ= అతడి; అంఘ్రిపద్మంబులు= తామరలవంటి పాదాలను; తన; చారు= అందమయిన; పాణిపద్మములన్= తామరలవంటి చేతులలో; మెత్తమెత్తన= నెమ్మదిగా; ఒత్తుచున్= ఒత్తుతూ; మెలుపు+ఒందన్= సుకుమారంగా; కర్జము+పలుకులన్= చేయవలసిన పనిని గూర్చిన మాటలతో; చిత్రవిభ్రమమున్= మనసు చెదరటాన్ని; మాన్చి= మాన్పి; మఱియున్= మరల; పార్థుని రాక= అర్జునుడి రాకను గురించి; పల్మఱును చెప్పి= మాటిమాటికీ చెప్పి; ఆ+నయ+ఆఢ్యుఁడు= ఆ నీతికోవిదులలో శ్రేష్ఠుడు; పని+చేయన్+ఉన్నవారిన్= పనిచేయటానికి మిగిలిన సేవకులతో; మీరు; కరితురంగ+ఆదికములన్= గుర్రాలు, ఏనుగులు

మొదలైనవాటిని; అరసికొనుఁడు= చూచికొనండి; కర్తవ్యము= చేయదగిన పని; ఇట్టిది= ఇది; వేయున్+ఏల?= అధికంగా చెప్పటం ఎందుకు?

తాత్పర్యం: కృష్ణుడు అందరినీ ఓదార్చి 'అర్జునుడు ఇప్పుడే ఇక్కడికి వస్తున్నాడు. కురువంశశ్రేష్ఠుడైన ఆ అర్జునుడు మీ దుఃఖాలన్నిటినీ పోగొట్టుతాడు' అని ఓదార్పు మాటలలో వారిని తేర్చి, తండ్రి దగ్గర కూర్చొని నెమ్మదిగా కాళ్లు పట్టుతూ, అతిసుకుమారంగా చేయదగిన పనులనుగురించిన మాటలతో అతడి మనసులోని విభ్రమాన్ని పోగొట్టాడు. అర్జునుడి రాకను గురించి మాటిమాటికీ చెప్పాడు. ఆ నీతికోవిదుడికి తెలియని దేమున్నది? మిగిలిన సేవకులతో 'గుఱ్ఱాలను ఏనుగులను మీరే చూచుకోండి. ఇక అధికంగా చెప్పటం ఎందుకు?' అని కర్తవ్యబోధ చేశాడు.

తే. **అని తెగఁ బలికి యతని వీ। డ్కొని రామునికడకుఁ జని యకుంఠితభక్తిన్**
వినతుం డయి 'మన జనకుని। యనుమతి వచ్చితి మహాత్మ!' యనియె నరేంద్రా! **74**

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా!; అని= ఈ విధంగా; తెగన్+పలికి= నిష్కర్షగా పలికి; అతనిన్ వీడ్కొని= తండ్రికి వీడ్కోలు చెప్పి; రాముని కడకున్+చని= బలరాముడి దగ్గరకు వెళ్ళి; అకుంఠిత భక్తిన్= మొక్కపోని గాఢమైన భక్తితో; వినతుండు+అయి= నమస్కరించి; మహాత్మ!= గొప్ప మనసున్నవాడా!; మన జనకుని= మనతండ్రిగారి; అనుమతిన్+వచ్చితిన్= అనుమతితో వచ్చాను; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: రాజా! ఈ విధంగా నిష్కర్షగా పలికి, తండ్రికి వీడ్కోలు చెప్పి, బలరాముడి దగ్గరకు వెళ్ళి, మొక్కపోని గాఢమైన భక్తితో నమస్కరించి 'మహాత్మా! మన తండ్రిగారి అనుమతితో వచ్చాను' అన్నాడు.

బలరాముఁడు శరీరంబు విడిచి యనంతునియందుఁ గలయుట (సం.16-5-11)

సీ. **తదనంతరంబ యద్దామోదరుఁడు రాము। వదనసరోజంబువలన వెడలఁ**
గనియె మహాభుజంగము నరుణచ్ఛాయ। యై పొల్చు వక్త్రసహస్రకంబు
మణుల వెలింగెడు ఫణములుఁ దెలుపారి। పర్వతాభోగ నిభంబు నైన
మేని పెంపును గలదాని నట్లు బల। భద్రుండు నిజయోగబలముపేర్మిఁ

ఆ. **దనదుతనువు విడిచి చనియె వియద్వీథి। నంబునిధికి నమ్మహాత్ము నెదురు**
కొనియె వరుణుఁ డధిక వినయంబుతో నాగ। కులము లెల్ల వచ్చి కొలిచె భక్తి. **75**

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; ఆ+దామోదరుఁడు= ఆ పద్మనాభుడు (కృష్ణుడు); రామువదన సరోజంబువలనన్= బలరాముడి ముఖపద్మం నుండి; మహాభుజంగము= పెద్ద సర్పము; అరుణచ్ఛాయయై= ఎర్రటికాంతిగలదై; పొల్చు= ప్రకాశించెడి; వక్త్రసహస్రకంబు= వేయినోళ్ళు; మణుల వెలింగెడు ఫణములున్= మణులతో ప్రకాశించే పడగలు; తెలుపారి= తెల్లనై; పర్వత= కొండయొక్క; ఆభోగ= వైశాల్యంతో; నిభంబున్+ఐన= సదృశమైన; మేని పెంపును= పెద్ద ఆకారాన్ని; కలదానిన్= కలదానిని; వెడలన్= బయలు పడటాన్ని; కనియెన్= చూశాడు; అట్లు= ఆ విధంగా; ఆ బలభద్రుండు; నిజయోగబలము పేర్మిన్= తన యోగబలాధిక్యం వలన; తనదు తనువు విడిచి= తన దేహాన్ని వదలిపెట్టి; వియత్+వీథిన్= ఆకాశమార్గంలో; అంబునిధికిన్= సముద్రానికి; చనియెన్= వెళ్ళాడు; ఆ+మహాత్మున్= ఆ మహాత్ముడైన బలరాముడిని; వరుణుఁడు= జలాధిపతియైన

వరుణుడు; ఎదురుకొనియెన్= ఎదుర్కొని స్వాగతం చెప్పాడు; అధిక వినయంబుతోన్= అధికమైన వినయంతో; నాగకులము లెల్లన్= నాగకులాలన్నీ; భక్తిన్= భక్తితో; కొలిచెన్= పూజించాయి.

తాత్పర్యం: ఆ తరువాత కృష్ణుడు బలరాముడి ముఖంనుండి ఒక పెద్దసర్పం బయలుపడటాన్ని గమనించాడు. ఆ మహాసర్పం ఎర్రటి కాంతితో ప్రకాశించే వేయినోళ్ళు కలిగినది. మణులతో ప్రకాశించే పడగలు కలిగినది. పర్వతవైశాల్యానికి సదృశంగా ఉన్న పెద్ద ఆకారం కలిగినది. ఆ విధంగా బలరాముడు తన యోగబలంవలన తన దేహాన్ని వదలిపెట్టి, ఆకాశమార్గంలో సముద్రంలోనికి ప్రవేశించాడు. ఆదిశేషస్వరూపుడైన ఆ బలరాముడికి వరుణుడు స్వాగతం చెప్పాడు. నాగవర్గంవారంతా వచ్చి అధికవినయంతో పూజలు చేశారు.

విశేషం: ఆదిశేషుడు త్రేతాయుగంలో లక్ష్మణుడుగా, ద్వాపరయుగంలో బలరాముడిగా అవతరించాడు.

ఆ. **అహికులాగ్రగణ్యుఁడైన వాసుకియుఁ గ। ర్కోటకుండుఁ దక్షకుండు వారు**
ణుండుఁ గుంజరుండునుం గుముదుండును। దుర్ముఖుండునుం బృథుశ్రవుండు. **76**

ప్రతిపదార్థం: అహికుల= పాములవంశంలో; అగ్రగణ్యుఁడు+ఐన= మొదట లెక్కింపదగినవాడయిన; వాసుకియున్= వాసుకీ; (ఇంకా) కర్కోటకుండు; తక్షకుండు; వారుణుండు; కుంజరుండు; కుముదుండు; దుర్ముఖుండు; పృథుశ్రవుండు.

తాత్పర్యం: పాములకులంలో మొదటగా లెక్కింపదగిన వాడైన వాసుకి కర్కోటకుడూ, తక్షకుడూ, వారుణుడూ, కుంజరుడూ, కుముదుడూ, దుర్ముఖుడు, పృథుశ్రవుడూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **ప్రాదుఁడును వక్రదంతుండుఁ గ్రోధనామ। కుండు శంఖుండుఁ బుండరీకుండు మిశ్రి**
యును నజేయుండు ధృతరాష్ట్రుఁడును మొదలుగ। నరుగుదెంచిరి యద్దేవునర్థిఁ గొలువ. **77**

ప్రతిపదార్థం: ప్రాదుఁడునున్; వక్రదంతుండున్; క్రోధనామకుండున్= క్రోధుడనే పేరున్నవాడు; శంఖుండున్; పుండరీకుండున్; మిశ్రియునున్= మిశ్రి అనే వాడున్నూ; అజేయుండున్; ధృతరాష్ట్రుఁడునున్; మొదలుగన్= మొదలైనవారు; ఆ+దేవున్= ఆ దేవుడిని; అర్థిన్= కోరి; కొలువన్= సేవించటానికి; అరుగుదెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: ప్రాదుడు, వక్రదంతుడు, క్రోధుడనే పేరుగలవాడు, శంఖుడు, పుండరీకుడు, మిశ్రి, అజేయుడు, ధృతరాష్ట్రుడు మొదలైన నాగులు కూడా బలదేవుడిని భక్తితో పూజించటానికి వచ్చారు.

తే. **పరమకౌతుకంబు భవ్యభక్తియు నొల। యంగ వచ్చి కొలిచె నా ఫణీంద్రు**
గంగ యాది గాఁగఁ గల మహానదులు స। ముజ్జ్వలాభిరామమూర్తు లొంది. **78**

ప్రతిపదార్థం: పరమ= మిక్కిలి; కౌతుకంబు= ఆసక్తి; భవ్య= యోగ్యమైన; భక్తియున్= భక్తీ; ఒలయంగన్= ఒప్పగా; ఆ ఫణి+ఇంద్రున్= ఆ ఆదిశేషుడిని; గంగ+ఆది+కాఁగన్+కల= గంగ మొదలుగా ఉన్న; మహానదులు= పెద్దనదులన్నీ; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశిస్తున్న; అభిరామ= అందమైన; మూర్తులు+ఒంది= ఆకారాలు ధరించి; వచ్చి కొలిచెన్= వచ్చి పూజించాయి.

తాత్పర్యం: చాలా ఆసక్తితో, యోగ్యమైన భక్తితో ఆ ఆదిశేషుడిని, గంగ మొదలుగా ఉన్న పెద్ద నదులన్నీ మిక్కిలి ప్రకాశిస్తున్న అందమైన ఆకారాలు ధరించి వచ్చి పూజించాయి.

క. అంతయును దివ్యదృష్టి। క్రాంతి యగు మురాంతకుండు గనుఁగొన నమ్మూ
ర్త్యంతరము గలపికొనియె న। నంతుఁడు దన పరమమూర్తి యందు నరేంద్రా! 79

ప్రతిపదార్థం: అంతయునున్= అన్నిటినీ; దివ్యదృష్టి క్రాంతిఅగు= దివ్యదృష్టితో ఆక్రమించగల; ముర+అంతకుండు= మురారి (కృష్ణుడు); కనుఁగొనన్= చూస్తుండగా; అనంతుఁడు= పరబ్రహ్మస్వరూపుడైన శ్రీ మహావిష్ణువు; ఆ+మూర్తి+అంతరమున్= తనమూర్తి భేదమయిన ఆ ఆదిశేషుడిని; తన= తనదైన; పరమమూర్తియందున్= శ్రేష్ఠమైన మహారూపంలో; కలపికొనియెన్= కలుపుకొన్నాడు; నరేంద్రా!= రాజా! విన్నావా!

తాత్పర్యం: జనమేజయా? అన్నిటినీ ఆక్రమించగల (దర్శించగల) కృష్ణుడు చూస్తుండగనే అనంతుడు (ఆదిశేషుడు) తన మూర్తి భేదాన్ని (బలరామున్ని) తన శ్రేష్ఠమైన మహారూపంలో కలుపుకొన్నాడు.

సీ. అ ట్లగ్రజుఁడు చన్న నచ్చటువాసి యం। తంతఁ గ్రుమ్మరుచు మురారి సకల
లోకపాలనకు భూలోకంబునందుఁ దాఁ। బుట్టంగ వలసిన యట్టి మేటి
పనులెల్లఁ దీఱుట మనమునఁ దలపోసి,। తనువిముక్తికి నిమిత్తంబుఁ దలఁచి,
మునులవాక్యము తెఱంగును దొల్లి దుర్వాసు। నవయవసమితిఁ బాయసము పూయు

తే. నప్పు డఱకాలఁ బూయమి నత్తపస్వి। యచట నవిలంఘ్యమై యపాయంబు గలుగు
ననిన మాటయుఁ జర్చించి, మనసు నింద్రి। యములు నడఁగించి గాఢసమాధి నొంది. 80

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; అగ్రజుఁడు= అన్న; చన్నన్= వెళ్ళిపోగా; అచ్చటు= ఆ చోటు; పాసి= వదలి; అంతంతన్= అక్కడక్కడా; క్రుమ్మరుచున్= తిరుగుతూ; మురారి= కృష్ణుడు; సకలలోకపాలనకున్= సకలలోకాలను పాలించటానికి; భూలోకంబునందున్= భూలోకంలో; తాన్+పుట్టంగ వలసిన అట్టి= తాను జన్మించవలసినట్టి; మేటి పనులు= గొప్పపనులు; ఎల్లన్= అన్నీ; తీఱుటన్= పూర్తికావటం; మనమునన్+తలపోసి= మనసులో ఆలోచించి; తను విముక్తికిన్= దేహం వదలిపెట్టటానికి; నిమిత్తంబున్+తలఁచి= కారణాన్ని ఆలోచించి; మునుల వాక్యంబు తెఱఁగునున్= మునులిచ్చిన శాపవాక్యాలు; తొల్లి= మునుపు; దుర్వాసున్+అవయవసమితిన్= దుర్వాసో మహాముని అవయవ సమూహానికి (దేహానికి); పాయసము పూయు+అప్పుడు= పాయసం పూస్తున్నప్పుడు; అఱకాలన్+పూయమిన్= అరకాలులో పూయకపోవటం చేత; ఆ+తపస్వి= ఆ ఋషి; అచటన్= ఆ అరకాలిలోనే; అపాయంబు= కీడు; అవిలంఘ్యము+ఐ= దాటటానికి వీలులేకుండా (తప్పకుండా); కలుగున్= కలుగుతుంది; అనిన మాటయున్= అన్న మాటను; చర్చించి= విచారించుకొని; మనసున్+ఇంద్రియములున్= మనసును, ఇంద్రియాలను; అడఁగించి= అణచి; గాఢ సమాధిన్+ఒంది= గాఢ సమాధిని పొంది.

తాత్పర్యం: అట్లా బలరాముడు అవతారం చాలించి వెళ్ళిపోగా, శ్రీకృష్ణుడు ఆ చోటు వదలిపెట్టి అక్కడక్కడా తిరిగాడు. లోకస్థితిపాలనకోసం తాను భూలోకంలో ఏ విశిష్టకార్యాలు చేయటంకొరకు పుట్టాడో అవి పూర్తికావటం మనసులో ఆలోచించాడు. తాను దేహాన్ని వదలిపెట్టటానికి ఒక హేతువును ఆలోచించుకొన్నాడు. మునులు ఇచ్చిన శాపవాక్యం గుర్తుకు వచ్చింది. ఒకప్పుడు దుర్వాసుని కోరికపై అతడి దేహమంతటా పాయసాన్ని కృష్ణుడు పూశాడు. కాని, అరకాలిలో మాత్రం పాయసం పూయటం మరచిపోయాడు. ఫలితంగా ఆ ఋషి 'ఆ అరకాలిలోనే నీకు ప్రాణాపాయం జరుగుతుందని, అది తప్ప' దని చెప్పిన విషయమూ గుర్తుకు వచ్చింది. దీనితో ప్రాణత్యాగం ఎట్లా చేయవచ్చునో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్ఫురించింది. మనసును, జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలను అణచిపెట్టి, గాఢమైన సమాధిని పొంది (తరువాతి పద్యంతో అన్వయం).

క. జలనిధిశయనుండు మహీ। స్థలశయనునుం డయ్యెఁ; నట్టి సమయమునం దా
నలుకుచుఁ దత్కాంతార। స్థలి కల్లన నరుగుదెంచె జర కురుముఖ్యా! 81

ప్రతిపదార్థం: కురుముఖ్యా!= కురుశ్రేష్ఠా (వినుము)! అప్పుడు; జలనిధి శయనుండు= సాగరంలో నిద్రించే విష్ణుస్వరూపుడైన శ్రీకృష్ణుడు; మహీతలశయనుండు+అయ్యెన్= నేలమీద పడుకున్నవాడయ్యాడు; అట్టి సమయమునన్= ఆ సమయంలో; తద్+కాంతార+స్థలిన్= ఆ అడవిలో; తాన్= తాను; అలుకుచున్= నేలను కాలితో రాస్తూ; జర= ముసలితన మనెడి దేవత; అల్లనన్= నెమ్మదిగా; అరుగుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: క్షీరసాగరంలో శయనించే విష్ణువు - అంటే కృష్ణుడు - నేలమీద పడుకొన్నాడు. ఆ సమయంలో 'జర' నేలను కాలితో రాస్తూ నెమ్మదిగా ఆ అడవిలో ప్రవేశించింది.

విశేషం: జరామరణాలు ఒకదానిని వదలి మరి ఒకటి ఉండవు. అందుకే సహజమరణానికి ముందు ఎవరిలోనైనా ముసలితనపు లక్షణాలు వస్తాయి. జర - ముసలితనానికి అధిష్ఠానదేవత; 'కాలకన్య' అని కూడా అంటారు. ఆమె ప్రవేశించిన తరువాతే మరణం ఆసన్న మవుతుంది. కాల మాసన్న మయిందని సూచించేది 'జర'

ఆ. అరుగుదెంచి యచటఁ దిరిగెడు నొక వేఁట। కానిఁ గాంచి వాఁడు కమలనాభు
నొడలు చూచి టెంకి నున్న యేణం బను। నట్లు సేసి మాయ యావహించె. 82

ప్రతిపదార్థం: అరుగుదెంచి= 'అది' అట్లా వచ్చి; అచటన్= ఆ అడవిలో; తిరిగెడు= తిరుగుతున్న; ఒక వేఁటకానిన్+కాంచి= ఒక వేటగాడిని చూచి; వాఁడు= ఆ వేటగాడు; కమలనాభు(న్)+ఒడలు= పద్మనాభుడి (కృష్ణుడి) దేహం; చూచి= చూడగా; టెంకిన్= సమీపంలో ఉన్న; ఏణంబు+అనునట్లు+చేసి= జింక అని అనుకొనేటట్లు చేసి; మాయ= భ్రాంతి; ఆవహించెన్= కలుగచేసింది.

తాత్పర్యం: 'జర' అట్లా వచ్చి అడవిలో తిరుగుతున్న ఒక వేటగాడిని చూచి, అతడు కృష్ణుడి దేహాన్ని చూచి సమీపంలో ఉన్న జింక అని అనుకొనేటట్లు భ్రాంతిని ఆవహింపజేసింది.

మ. ధరణీనాథ! యతండు శాతశర ముద్యద్వృత్తి సంధించి యు
ద్ధురభంగిం దెగ నిండఁగాఁ దిగిచి యత్యుగ్రంబుగా నేసె; నా
హరి శ్రీపాదతలంబుఁ దూరఁగొని యయ్యస్త్రంబు మీఁగాల ని
ష్ఠుర వేగంబున నుచ్చిపోయె వెస వాఁడుం జేరఁ గైకొంటకున్. 83

ప్రతిపదార్థం: ధరణీనాథ!= రాజా!; అతండు= ఆ వేటగాడు; శాతశరము= వాడియైన బాణం; ఉద్యత్+వృత్తిన్= పూనికతో; సంధించి= ఎక్కుపెట్టి; ఉద్ధుర= దృఢమైన; భంగిన్= రీతిలో; తెగన్= నారిని; నిండఁగాన్= నిండుగా; తిగిచి= లాగి; అతి+ఉగ్రంబుగాన్= మిక్కిలి భయంకరంగా; ఏసెన్= ప్రయోగించాడు; ఆ+అస్త్రంబు= ఆ బాణం; ఆ హరి= ఆ కృష్ణుడి; శ్రీపాదతలంబున్= గొప్పదైన పాదం అడుగుభాగంలో; తూరఁగొని= దూరి; మీఁగాలన్= పాదోపరిభాగంలో; నిష్ఠురవేగంబునన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అతిశీఘ్రంగా; ఉచ్చిపోయెన్= బయటికి పొడుచుకు వచ్చింది; వెసన్= వెంటనే; వాఁడున్= ఆ వేటగాడు; కై కొంటకున్= (ఆ జింకను) తీసికొనివెళ్ళటానికి; చేరెన్= అక్కడికి వచ్చాడు.

తాత్పర్యం: ఆ వేటగాడు పూనికతో విల్లు ఎక్కుపెట్టి, దృఢమైన రీతిలో నారి సంధించి, నిండుగా లాగి, మిక్కిలి భయంకరంగా వదిలాడు. ఆ బాణం కృష్ణుడిపాదం అడుగుభాగంలో దూరి పాదోపరిభాగంలో అతి శీఘ్రంగా బయటికి పొడుచుకుని వచ్చింది. వెంటనే ఆ వేటగాడు (ఆ జింకను) తీసికొనివెళ్ళటానికి అక్కడికి వచ్చాడు.

విశేషం: కర్మఫలితాన్ని కృష్ణుడు కూడా తప్పించుకొనలేదు. బలరాముడు యోగమార్గంలో తనువును వదలిపెట్టాడు. కృష్ణుడు కూడా సమాధిలో ఉన్నాడు. కాని తనువును వదలటానికి ఋషిశాపం - దుర్వాసుడి వాక్యం ఒక మిషను చూపించింది. ఆ మిషే ఇట్లా వేటగాడు జింక అనుకొని బాణం వదలటం. పాదం అడుగున దూరి మీగాలుపైన పొడుచుకు రావటం - వేటగాడి ధనుర్విద్యా నైపుణ్యాన్ని సూచిస్తుంది.

క. చేరి తెలియఁ గనుఁగొని పెం। పారు పురుషుఁ డగు టెఱింగి యత్యంతార్తిం
గూరి వడఁకి తచ్చరణాం। భోరుహములఁ దన శిరంబు వొందం బడియెన్. 84

ప్రతిపదార్థం: చేరి= కృష్ణుడిని సమీపించి; తెలియన్+కనుఁగొని= బాగా పరికించి చూచి; పెంపు+ఆరు= బాగా గొప్పవాడైన; పురుషుఁడు+అగుట+ఎఱింగి= పురుషుడు కావటం గుర్తించి; అతి+అంత+ఆర్తిన్= చాలా ఆర్తిని; కూరి= పొంది; వడఁకి= గడగడలాడి; తద్+చరణ+అంభోరుహములన్= అతడి పాదపద్మాలవద్ద; తన శిరంబు+పొందన్= తన శిరస్సు తాకునట్లు; పడియెన్= క్రిందపడ్డాడు.

తాత్పర్యం: ఆ వేటగాడు కృష్ణుడిని సమీపించి, బాగా చూచి, ఎవరో మహాపురుషుడని గుర్తించి, చాలా ఆర్తినిపొంది, గడగడలాడి అతడి పాదపద్మాలవద్ద తన శిరస్సును పెట్టి క్రిందపడ్డాడు.

తే. పడి యేడ్చినఁ గృష్ణుఁడు తగు। నొడువుల నూరార్చి తన మనోరథ మిమ్మై
నొడఁగూడిన మానుషమగు। నొడలు విడిచి నిజపదంబు నొందుట కరిగెన్. 85

ప్రతిపదార్థం: పడి= క్రిందపడి; ఏడ్చినన్= ఏడవగా; కృష్ణుఁడు; తగు నొడువులన్= వాడికి ఉచితమైన పలుకులతో; ఊరార్చి= ఓదార్పు కలుగజేసి; తన మనోరథము= తన కోరిక; ఈ+మైన్= ఈ విధంగా; ఒడఁగూడినన్= సిద్ధించగా; మానుషము+అగు= మానవీయమైన; ఒడలు విడిచి= దేహాన్ని విడిచి; నిజపదంబున్+ఒందుటకున్= తన స్థానాన్ని పొందటానికి; అరిగెన్= వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: అట్లా వేటగాడు కిందపడి ఏడవగా కృష్ణుడు వాడికి ఉచితమైన పలుకులతో ఓదార్పు కలుగజేసి, తన కోరిక ఈ విధంగా తీరగా, మానవీయమైన దేహాన్ని విడిచి తన స్థానాన్ని పొందటానికి వెళ్ళిపోయాడు.

శ్రీకృష్ణుఁడు శరీరంబు విడిచి పరమపదంబునకుఁ బోవుట (సం.16-5-22)

సీ. ఊర్ధ్వలోకమునకు నూర్జిత తేజస్కుఁ। డగు కృష్ణుఁ డరిగిన నచటి దివ్య
మునివరులును సిద్ధులును రుద్రవసుమరు। దాదిత్య విశ్వముఖామరులును
సంక్రందనుండును సంభృతసంభ్రము। లగుచు భక్తియు వినయంబు నెఱయఁ
గా నెదుర్కొని చరణానతులై పర। మస్తుతి వాక్యముల్ విస్తరిల్ల

ఆ. బలసి; రందు దేవపతి యల్లఁ జేరి క। రములు మొగిచి 'ధర్మరక్షణమున
కై దయావిధేయమగు ఖేలనంబున। నవని నవతరించి తాది పురుష! 86

ప్రతిపదార్థం: (ఆ విధంగా); ఊర్ధ్వలోకమునకున్= స్వర్గలోకానికి; ఊర్జితతేజస్కుఁడు+అగు= పెంపొందిన తేజస్సు కలవాడైన; కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; అరిగినన్= వెళ్ళగా; అచటి= స్వర్గంలో ఉన్న; దివ్యమునివరులునున్= దివ్యులైన మునిశ్రేష్ఠులు; సిద్ధులునున్= సిద్ధులు; రుద్ర= రుద్రులు; వసు= వసువులును; మరుత్= మరుత్తులు; ఆదిత్య= ఆదిత్యులు; విశ్వముఖ+అమరులును= విశ్వముఖులు మొదలైన దేవతలు; సంక్రందనుండునున్= ఇంద్రుడు; సంభృత= పొందిన; సంభ్రములు+అగుచున్= వేగిరపాటు కలవారై; భక్తియున్= భక్తీ; వినయంబున్= వినయమూ; నెఱయఁగాన్= ప్రకటితాలు కాగా; ఎదుర్కొని= ఎదురువచ్చి; చరణ+ఆనతులు+ఐ= కాళ్ళకు మ్రొక్కినవారై; పరమ= శ్రేష్ఠమైన; స్తుతివాక్యముల్= ప్రశంసావాక్యాలు; విస్తరిల్లన్= వ్యాపించగా; బలసిరి= చుట్టుముట్టారు; అందున్= వారిలో; దేవపతి= దేవేంద్రుడు; అల్లన్= నెమ్మదిగా; చేరి= కృష్ణుడిని సమీపించి; కరములు మొగిచి= చేతులు జోడించి; (ఇట్లా అన్నాడు); ఆదిపురుష!= ఓ ఆదిపురుషుడా!; ధర్మరక్షణమునకై= ధర్మాన్ని రక్షించటానికై; దయావిధేయము+అగు= దయకు లొంగిన; ఖేలనమునన్= ఆటలో; అవనిన్= భూమిలో; అవతరించితి(తి)= అవతరించావు.

తాత్పర్యం: ఆ విధంగా స్వర్గలోకానికి పెంపొందిన తేజస్సు గలవాడైన కృష్ణుడు వెళ్ళగా స్వర్గంలో ఉన్న దివ్యులైన మునిశ్రేష్ఠులు, సిద్ధులు, రుద్రులు, వసువులు, మరుత్తులు, విశ్వముఖాది దేవతలు, దేవేంద్రుడు వేగిరపాటు చెంది ఎదురు వచ్చారు. కాళ్ళకు మొక్కారు. శ్రేష్ఠమైన స్తుతివాక్యాలు పలుకుతూ అందరూ కృష్ణుడి చుట్టూ చేరారు. వారిలో దేవేంద్రుడు నెమ్మదిగా శ్రీకృష్ణుడిని సమీపించి చేతులు జోడించి ఇట్లా అన్నాడు: 'ఆదిపురుషా! ధర్మాన్ని రక్షించటానికై దయాగుణంతో నీ వాడుతున్న ఆటలో భాగంగా భూమిలో పుట్టావు'.

విశేషం: 1. యక్ష, గంధర్వ, కిన్నర, కింపురుషాదులతోపాటు ఖేచరులుగా సిద్ధులను కూడా చెప్పుతారు. వీరు దేవతాగణం క్రింద వస్తారు. వీరితోపాటే అష్టవసువులు, సప్తమరుత్తులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు చెప్పబడ్డారు. శ్రీకృష్ణుడి విశ్వరూపసందర్శనంలో ఇంకా చాలామంది దేవయోనులు చెప్పబడ్డారు. వీరికి అధిపతి కాబట్టి దేవేంద్రు డని అంటారు.

2. విష్ణువు ధర్మాన్ని రక్షించటం కోసమే ప్రతియుగంలోనూ అవతరిస్తాడని పురాణాలు చెప్పుతున్నాయి. భగవద్గీతలో కూడా

"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్."

అని స్వామి స్వయంగా చెప్పాడు. ఆయనకు అవతరించటం ఒక లీల. ఆ లీలకు మూలం స్వామికి ఉన్న దయాగుణం. అపారకృపానిధి కాబట్టి భక్తుల మొరలు విని వారిని రక్షించటానికై అవతరిస్తాడు. ఇది భాగవతులు స్వామి అవతారాన్ని గుర్తించిన విధానం. అందుకే లీలావతారాలని కూడా అంటారు.

3, సర్వసమర్థుడైన స్వామికి దుష్టశిక్షణ, సాధుసంరక్షణ కష్టమైన పనులు కావు. ఒక ఆట ఆడినంత సులభం. అందుకే 'ఖేలనం' అనటం.

ఆ. అవతరించి కంసుఁ డాదిగాఁ గల దేవ। శత్రుకోటి నెల్ల సమయఁ జేసి
భరతకులము కసటు వాపి సంశుద్ధప్ర। తిష్ఠఁ గూర్చి యరుగుదెంచి తీశ! 87

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఈశ!= ఓ ప్రభూ!; (అట్లా) అవతరించి= అవతారమెత్తి; కంసుఁడు+ఆదిగాన్+కల= కంసుడు మొదలైన; దేవశత్రుకోటిన్+ఎల్లన్= దేవతలకు శత్రువైన వారినందరినీ; సమయన్+చేసి= నశించేటట్లు చేసి (చంపేటట్లు చేసి); భరతకులము= భరతవంశానికి పట్టిన; కసటు= అపరిశుభ్రతను; పాపి= పోగొట్టి; సంశుద్ధ= పరిశుభ్రమైన; ప్రతిష్ఠన్+కూర్చి= గౌరవం ఏర్పరచి; అరుగుదెంచితి(వి)= ఇట్లా వచ్చావు.

తాత్పర్యం: అట్లా అవతారమెత్తి, కంసుడు మొదలైన దేవతాశత్రుసమూహాన్ని అంతటినీ నశింపజేసి, భరతవంశానికి పట్టిన అపరిశుభ్రతను పోగొట్టి, పరిశుభ్రతను మరలా ఏర్పరచి ఇట్లా వచ్చావు.

విశేషం: ఇక్కడ 'అపరిశుభ్రత' అంటే అధర్మమనే అర్థం. ధర్మానికి కలిగే గ్లాని పేరే అపరిశుభ్రత. అది అజ్ఞానకారకమవుతుంది. ఫలితంగా సాధుసత్పురుషులకు పీడ కలుగుతుంది. దానిని నివారించటానికే స్వామి అవతరిస్తాడు.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్,
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే".

అని గీతలో స్వామి ఈ అవతారరహస్యాన్నే చెప్పాడు. ఇక్కడ 'భరత' కులము అనేమాట కేవలం పాండవకౌరవుల కథను మాత్రమే కాకుండా మొత్తం భారతదేశాన్ని స్పృశిస్తోంది. అందుకే కంసుడి ప్రసక్తి కూడా సార్థకం అవుతోంది.

క. అమృతం బజరం బవ్యయ । మమలం బవితర్క్య మచల మాగమగమ్యం
బు మహాత్మ! భవత్పద మ । య్యమేయ తత్త్వంబుఁ బొందు మనిరూప్యగతిన్. 88

ప్రతిపదార్థం: మహాత్మ!= ఓ మహాత్మా!; భవత్+పదము= నీ స్థానం; అమృతంబు= అమృతమైనది; అజరంబు= ముసలితనంలేనిది; అవ్యయము= తరగిపోనిది; అమలంబు= పరిశుద్ధమైనది; అవితర్క్యము= తర్కించటానికి వీలులేనది; అచలము= చలించనిది; ఆగమగమ్యంబు= వేదాల చేత తెలిసికొనదగినది; (అట్లాంటి) అమేయ తత్త్వంబున్= కొలవటానికి వీలులేని మహాతత్త్వాన్ని; అనిరూప్యగతిన్= నిరూపించటానికి వీలులేని విధంగా; పొందుము.

తాత్పర్యం: మహాత్మా! నీ స్థానం అమృతమైనది. దానికి ముసలితనం లేదు. అది ఎన్నటికీ తరగిపోదు. అది ఎప్పుడూ పరిశుద్ధమే. దాని స్వభావం తర్కంతో నిరూపించటానికి వీలులేదు. దానికెప్పుడూ చలనం లేదు.వేదాలు ఆ స్థానాన్ని గురించే చెప్తుతాయి. దానిని కొలవటానికి ఏ శాస్త్రప్రమాణాలూ లేవు. అట్లాంటి పరమపదాన్ని నిరూపించటానికి వీలులేని విధంగా నీవే పొందుము.

విశేషం: ఈ పద్యంలో ఆ పరమపదాన్ని అమృతము, అజరము ఇట్లా 'న' కారరూపాలలో సూచించారు. న+మృతము= ఇట్లా; నకారం తీసివేస్తే ఉన్నదంతా లోకం. మృతమయ్యేది. ముసలితనం పొందేది ఇట్లాగా. ఆ అతిలోకమైన తత్త్వాన్నే పరమపదమన్నారు. ఆ స్థానం ఎక్కడుంది? ఎట్లా ఉంటుంది? అన్న ప్రశ్నల ద్వారా సమాధానాన్ని పొందలేం. ఋషుల అనుభవమే దీనికి ప్రమాణం. దానిని స్వామి స్వయంగా పొందాలి. దానినుండి స్వామే స్వయంగా తాను ప్రభవించాలి. 'అందుకే ఆ తత్త్వాన్ని నీవే పొందుము' అన్నాడు ఇంద్రుడు. దీనికి నిరూపణం ఏమిటి? నిరూపణకు అసాధ్యమైన విషయ మనటం కోసమే 'అనిరూప్యగతి' అంటున్నారు. అందుకే శేషాంశను అనంతుడు కలుపుకొన్నాడు. ఆ అనంతాంశ అంశమాత్రంగా ఉన్న మహాతత్త్వం 'అమృత' స్థానమయిన పరమపదం. అందుకే స్వామి దానిని స్వయంగా పొందాలి. దానినే అక్షరపరబ్రహ్మమని గీత స్థాపించింది. అవతారరహస్యం ఎన్నటికీ ఏ శాస్త్రనిరూపణకూ లొంగే విషయం కాదని ఈ పద్యం ద్వారా మనం గుర్తించగలం. ఈ ఒక్క అంశలోనే జీవుడికన్నా దేవుడు ఎప్పుడూ ఒక మెట్టుపైనే ఉంటాడు. అదే భగవంతుడిలోని 'విశిష్ట' లక్షణం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **కృప నిట్ల యవతరింపుము। ప్రపన్నులగువారి యార్తిఁ బాపుటకై య**
జ్ఞపురుష! యుగయుగమున న। తృపరిమిత గుణాఢ్యరూప మభినుతి నొందన్.' **89**

ప్రతిపదార్థం: యజ్ఞపురుష!= యజ్ఞరూపుడవైన పురుషోత్తముడా!; అతి+అపరిమిత= మిక్కిలిగా అపరిమితమైన; గుణ= గుణాలచేత; ఆఢ్య= సంపన్నమైన; రూపము= నీ అవతారము; అభినుతిన్+ఒందన్= ప్రశంసను పొందగా; కృపన్= కృపతో; ప్రపన్నుల= శరణు గోరివచ్చిన వారి; ఆర్తిన్= దుఃఖమును; పాపుటకై= పోగొట్టటానికై; యుగయుగమునన్= ప్రతియుగంలోనూ; ఇట్లు+అ= ఇదే విధంగా; అవతరింపుము= అవతరింతువుగాక!

తాత్పర్యం: యజ్ఞరూపుడవైన పురుషోత్తమా! అపరిమితమైన గుణాలచేత సంపన్నమైన నీ అవతారం ప్రశంసాపాత్రం కాగా, దయతో శరణుగోరినవారి దుఃఖాన్ని పోగొట్టటానికై ప్రతియుగంలోనూ ఇట్లాగే అవతరింతువుగాక!'

విశేషం: 1.విష్ణువు తాల్చిన ప్రతి అవతారానికి సాక్షి ఇంద్రుడు. అందుకే అవతారరహస్యాన్ని ఇంత విస్తృత పరిధిలో వర్ణిస్తున్నాడు. 2. యజ్ఞ పురుష - అన్నమాట పురుషసూక్తాన్ని తాకే మాట. ఈ రెండు యజ్ఞాలకు అధిష్ఠానపురుషుడు ఆ 'సహస్రాక్షుడు సహస్రపాదుడు' అయిన మహాపురుషుడు. అందుకే పురుషోత్తముడని కూడా అన్నారు. 3. భారత కథాపరంగా పాపపుణ్యాజీవులిరువురూ 'హుతు' లయ్యారు. కాలాగ్నిలో పడి అందరూ శలభాలవలె (మిడుతలవలె) మాడిపోయారు. ఇంత మహాయజ్ఞానికి అధిష్ఠానదేవత శ్రీకృష్ణుడే. అందుకే భారతాన్ని 'వాసుదేవ చరిత్ర' మని కూడా అన్నారు. కనుక యజ్ఞపురుషుడు. ఇట్లా పాపపుణ్యాకర్మల కతీతమైన సాక్షీభూతుడు కాబట్టి రామకృష్ణాదులను 'అవతారా' లని అంటాము. 4.'ప్రపన్న' లనే మాట చాలా ప్రధానమైనది. 'ప్రపత్తి' యోగాన్ని పరమశ్రేష్ఠయోగంగా నిరూపించిన ఘనత విశిష్టాద్వైతులదే. కాని ఇంద్రాదులందరూ విష్ణువు శరణుపొంది తమ ఆర్తిని పోగొట్టుకొన్నవారే. ఈ కథలకాధారంగానే 'భాగవతుల' సంప్రదాయం ఏర్పడింది. అవతారలీల ఎప్పుడూ ఆర్తులను కాపాడటం కోసమేనని అర్థం. అందుకే భారతకథలో శ్రీకృష్ణుడు పాండవపక్షంలోనే ఉన్నాడు.

క. **అని నిభృతిఁ బలుక నా సువ। చనముల నత్యాదరం బెసఁగ వినిన ముకుం**
దునిపైఁ బెల్లు గురిసె న। య్యనిమిషపతి పుష్పవర్ష మతులితభక్తిన్. **90**

ప్రతిపదార్థం: అని; నిభృతిన్= వినయంతో; పలుకన్= పలుకగా; ఆ సువచనములన్= ఆ మంచిమాటలను; అతి+ఆదరంబు+ఎసఁగన్= మిక్కిలి ఆదరం పుట్టగా; వినిన= విన్న; ముకుందునిపైన్= కృష్ణుడిపై; ఆ+అనిమిషపతి= ఆ ఇంద్రుడు; అతులిత= సాటిలేని; భక్తిన్= భక్తితో; పెల్లు= మిక్కుటంగా; పుష్పవర్షము= పూలవాన; కురిసెన్= కురిపించాడు.

తాత్పర్యం: ఇట్లా వినయంతో అన్న ఆ మంచి మాటలను మిక్కిలి ఆదరంతో శ్రీకృష్ణుడు విన్నాడు. అప్పుడు ఆ కృష్ణుడిపై ఇంద్రుడు సాటిలేని భక్తితో మిక్కుటంగా పూలవాన కురిపించాడు.

ఉ. **అప్పుడు బ్రహ్మ వచ్చి హరియంఘ్రులకుం బ్రణమిల్లి భక్తిమైఁ**
దప్పక చూచుచున్ మది ముదంబునఁ దేల సలక్షణస్వరం
బొప్పి చెలంగ నాగమిక సూక్తులఁ బ్రస్తుతి సేసెఁ బ్రీతుఁడై
యప్పురుషోత్తముండు కరుణార్ద్ర నిరీక్షణమున్ నిగుడ్పఁగన్. **91**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; బ్రహ్మ= బ్రహ్మదేవుడు; వచ్చి= కృష్ణుడిని సమీపించి; హరి+అంఘ్రులకున్= హరి పాదాలకు; ప్రణమిల్లి= నమస్కరించి; భక్తిమైన్= భక్తితో; తప్పక+చూచుచున్= కన్నార్పకుండా చూస్తూ; మది= మనస్సు; ముదంబునన్= సంతోషంతో; తేలన్= తేలియాడగా; సలక్షణ= శాస్త్రవిహితమైన; స్వరంబు+ఒప్పి= ఉదాత్త, అనుదాత్త స్వరిత స్వరాలతో కూడి; చెలంగన్= అతిశయించగా; ఆ+పురుషోత్తముండు= ఆ పురుషోత్తముడైన కృష్ణుడు; ప్రీతుఁడు+ఐ= సంతసించినవాడై; కరుణ+ఆర్ద్ర= కరుణచే తడిసిన; నిరీక్షణమున్= చూపును; నిగుడ్పఁగన్= ప్రసరింపజేయగా; ఆగమిక సూక్తులన్= వేదమంత్రాలతో; ప్రస్తుతి+చేసెన్= ప్రస్తుతించాడు.

తాత్పర్యం: ఆ సమయంలో బ్రహ్మదేవుడు వచ్చి కృష్ణుడి పాదాలకు నమస్కరించి, భక్తితో కన్నార్పకుండా చూస్తూ మనస్సు సంతోషంతో తేలియాడగా ఆ పురుషోత్తముడు సంతసించి కరుణతో తడిసిన తన చూపును ప్రసరింపజేయగా శాస్త్రవిహితమైన స్వరాలతో కూడిన వేదమంత్రాలతో శ్రీమహావిష్ణువును ప్రస్తుతించాడు.

విశేషం: వేదజ్ఞానానికి బ్రహ్మదేవుడు సంకేతం. అందుకే బ్రహ్మచేతిలో వేద సముచ్చయం ఉన్నట్టుగా మనకు చిత్రాలు కనిపిస్తాయి. వేదాలలో స్తుతిపరమైన మంత్రాలకు 'సూక్తా' లని పేరు. శ్రీసూక్త, పురుషసూక్త ఇత్యాదులు. 'స్వర' భేదం తెలిసే వేదమంత్రాలు చదవాలి. ఈ శాస్త్రరహస్యాలన్నీ ఈ పద్యంలో ఉన్నాయి.

సీ. అప్పరమేశ్వరుం డయ్యందఱను జూచి। 'యనిరుద్ధ నామకంబైన యదియుఁ
బ్రద్యుమ్నతాప్రతిభాసమానమును సం। కర్షణభావ వికాసితంబు
వాసుదేవాత్మక వరరూపమున నేక। తా విభవత్సమాధానసిద్ధి
నొందించుకొంటి నానందబోధ నిరం జ। నామేయ మత్పదప్రాప్తి పరమ

ఆ. మంగళానుభూతి నంగీకరించెద। సుఖుల రగుఁడు మీరు సుకృతులార!'
యనిన వచనసమితి యతిమృదుమధురత। నింపు నొసఁగ నలరి రెల్లవారు. 92

ప్రతిపదార్థం: ఆ+పరమేశ్వరుండు= శ్రీమన్నారాయణుడు; ఆ+అందఱనున్+చూచి= ఆ దేవతలందరినీ చూచి; అనిరుద్ధ నామకంబు+ఐన+అదియున్= అనిరుద్ధమనే పేరు కలిగిందీ; ప్రద్యుమ్నతా ప్రతిభాసమును= ప్రద్యుమ్నత్వమనే కాంతినీ; సంకర్షణ భావ వికాసితంబున్= సంకర్షణ మనే భావంచేత ప్రకాశించేదీ; వాసుదేవ+ఆత్మక= వాసుదేవుడనే పేరిట; వరరూపమునన్= అతిశ్రేష్ఠరూపంతో; ఏకతా= అద్వితీయంగా; విభవత్= పుట్టుతున్న; సమాధాన= సమాధియొక్క; సిద్ధిన్= సిద్ధిచేత; ఆనంద= ఆనందరూపమైన; బోధ= జ్ఞానంతోడి; నిరంజన= ఏ దోషమూ లేని (పరిశుద్ధమైన); అమేయ= కొలవటానికి వీలులేని; మత్= నాదైన; పదప్రాప్తిన్= స్థానం పొందటాన్ని; ఒందించుకొంటిన్= కల్గించుకొన్నాను; పరమ మంగళానుభూతిన్= సర్వశుభంకరమైన ఈ అనుభూతిని; అంగీకరించెదన్= స్వీకరిస్తున్నాను; సుకృతులార!= పుణ్యాత్ములారా!; మీరు= మీరందరూ; సుఖులరు+ అగుఁడు= సుఖంగా ఉండండి; అనిన వచనసమితి= అన్న శ్రీకృష్ణుడి వాక్యసమూహం; అతి మృదుమధురతన్= మిక్కిలి మృదు మధురంగా; ఇంపున్+ఒసఁగన్= తృప్తిని కలిగించగా; ఎల్లవారున్= దేవతలంతా; అలరిరి= సంతోషించారు.

తాత్పర్యం: శ్రీమన్నారాయణుడు దేవతలందరినీ చూచి ఇట్లా అన్నాడు: 'పుణ్యాత్ములారా! నేను అనిరుద్ధ, ప్రద్యుమ్న, సంకర్షణ, వాసుదేవాత్మకమైన వ్యూహచతుష్టయంచేత అతిశ్రేష్ఠరూపంలో ఏకైకంగా పుట్టుతున్న సమాధిసిద్ధివలన ఆనందరూపమైన జ్ఞానంతో పరిశుద్ధమైనదీ, కొలవటానికి వీలులేనట్టిదీ అయిన నా స్థానప్రాప్తిని నేనే కల్గించుకొన్నాను. సర్వమంగళకరమైన ఈ అనుభూతిని స్వీకరిస్తున్నాను. మీరందరూ సుఖంగా ఉండండి.' ఇట్లా అన్న శ్రీనారాయణుడి మృదుమధుర వాక్యసమూహంచేత తృప్తులై దేవతలంతా సంతోషించారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: శ్రీకృష్ణుడు పొందిన మహానారాయణత్వ సిద్ధిని వర్ణించే పద్యం కాబట్టి ఈ పద్యం చాలా విశిష్టమైనది. నిర్వికారమైన పరబ్రహ్మనుండి సవికారమైన సృష్టి నాలుగు అంచెలుగా ఏర్పడిందని భారతం శాంతిపర్వంలోని 139వ అధ్యాయంలో చెప్పబడింది. ఆ అధ్యాయాన్ని 'నారాయణీయ' మంటారు. ఈ నాలుగు అంచెలనే నారాయణవ్యూహ తత్త్వమంటారు. ఈ నాలుగు దశలు ఇవి. 1. సనాతన వాసుదేవ తత్త్వం: నిష్క్రియ, నిర్గుణ, నిష్కళ, నిర్ద్వంద్వమైన పురుషతత్త్వ మిది. దీనినే పరతత్త్వ మంటారు. ఇదే పంచభూతాలను శరీరంగా చేసికొని జీవుడై అవతరించింది. ఈ జీవుడు లేకుండా ఆ పరబ్రహ్మతత్త్వానికి చేష్ట ఉండదు. అంటే కదలిక ఉండదు. అందుకే భారతకథలో వసుదేవుడి కుమారుడుగా కృష్ణుడు చెప్పబడినాడు. 2. సంకర్షణ తత్త్వం: ఈ జీవుడిపేరే శేషుడు. లేదా సంకర్షణుడు. పరవాసుదేవ తత్త్వంవైపు పాంచభౌతిక శరీరాన్ని ఆకర్షించే వాడని అర్థం. 'కర్షతీతి'- అంటే ఆకర్షిస్తాడని అర్థం. కృష్ణశబ్దానికి కూడా అర్థం ఇదే - ఆకర్షించేవాడని, భారతంలో శ్రీకృష్ణుడిచేత ఆకర్షింపబడని పాత్ర లేదు. 3. ప్రద్యుమ్నతత్త్వం: సంకర్షణతత్త్వంనుండి పుట్టేది ప్రద్యుమ్నతత్త్వం. ఇది సనత్కుమారతత్త్వం, విశ్వమనస్స్వరూపం. సర్వభూతాతిరిక్తమైన మనస్తత్త్వమిది. పంచభూతాలు ప్రళయకాలంలో ఈ 'మహామనస్సు'లో లీనమవుతాయి. శ్రీకృష్ణుడి కుమారుడు 'ప్రద్యుమ్నుడు' అని చెప్పబడిన పురాణకథలకు మూలం ఈ వ్యూహనిర్మాణమే. 4.అనిరుద్ధతత్త్వం: ఆ ప్రద్యుమ్నతత్త్వం నుంచి పుట్టేది అనిరుద్ధతత్త్వం. కర్తృకారణస్వరూపుడై స్థావరజంగమాత్మక విశ్వరూపుడు - సమష్టి అహంకార స్వరూపుడు అనిరుద్ధుడు. పురాణాల ప్రకారం ప్రద్యుమ్నుడి కొడుకే అనిరుద్ధుడు. ఈ నాలుగుతత్త్వాలను కలిగి పరమేశ్వరుడుగా నారాయణుడు ఈ పద్యంలో వివరించబడుతున్నాడు. ఆ నారాయణతత్త్వం కేవలం ఆనందరూపమైన జ్ఞానం కావటం వల్లనే తిక్కనగారు ప్రతి ఆశ్వాసాంతంలోనూ 'ఆనంద' ముద్రతో పద్యం వ్రాసి హరిహరాత్మకరూపమైన అద్వైతబ్రహ్మార్పణంగా కావ్యాన్ని ముగించారు. ఆ నారాయణతత్త్వం అద్వైత. ద్వైత, విశిష్టాద్వైతులందరికీ ఉపాసనీయమే. ఇదే తిక్కనగారి ధర్మాద్వైతం కూడా. దీనిని 'పరమ మంగళానుభూతి' అంటున్నారు తిక్కనగారు. శాంతరసానుభవాన్నే ఇక్కడ మంగళానుభూతి అంటున్నది. అందుకే అనిరుద్ధ. ప్రద్యుమ్న, సంకర్షణ రూపుడైన వాసుదేవుడు ఆ 'మూల' స్థితిని చేరుకొన్నారని ఈ పద్యం వివరిస్తున్నది. భారతమహార్థమంతా ఈ పద్యంలో గర్భితంగా ఉంది. 'ఒందించుకొంటి'. 'అంగీకరించెద' అనే మాటలు ఆ మూలమహాతత్త్వానికి ఉన్న సర్వతంత్ర స్వతంత్రను నిరూపిస్తున్నాయి. అందుకే 'స్వయంభూ' తత్త్వమని ఆ మహాతత్త్వాన్ని పిలుస్తారు.

క. ఆ దేవదేవుఁ డత్యం । తాదరసంభాషణంబు లమ్మెయి బ్రహ్మేం
ద్రాదులతోడ నొనర్చి య । నాది నిరవసాన నిజపదాస్థితుఁ డయ్యెన్. 93

ప్రతిపదార్థం: ఆ దేవదేవుఁడు= దేవతలకు దైవమైన ఆ నారాయణుడు; అత్యంత+ఆదర= మిక్కిలి ఆదరంతో కూడిన; సంభాషణంబులు= పలుకులు; ఆ+మెయిన్= ఆ రీతిగా; బ్రహ్మ+ఇంద్ర+ఆదులతోడన్= బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన దేవతలతో; ఒనర్చి= పలికి; అనాది= మొదలులేని; నిర్+అవసాన= తుదిలేని; నిజపద+ఆస్థితుఁడు= తన స్థానంలో కూర్చున్నవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: ఈ విధంగా నారాయణుడు బ్రహ్మాదిదేవతలతో ఆదరపూర్వకంగా సంభాషించి, అనాద్యంతమైన తన స్థానంలో కూర్చున్నవాడయ్యాడు.

విశేషం: 'ఆస్థిత' శబ్దం చాలా ముఖ్యమైనది. మూలవాసుదేవతత్త్వం కదలిక లేనిది. అంటే కూర్చున్నదని అర్థం. దానిలో కదలక కదిలితే సంకర్షణాది రూపమైన 'కదలిక' వస్తుంది. ఆ స్థితికి తుది లేదు. అట్లాగని మొదలు కూడా లేదు. దీనినే 'అమేయ' మని పూర్వ పద్యంలో అన్నది.

తే. ఇంద్రియాగోచరుం డైన యీశు నపుడు । బుద్ధిఁ జూచుచు నిర్భరాద్భుతకరంబు
లగు తదీయగుణమ్ముల నభినుతించు । చరిగి రాత్మవాసముల కజాదులెల్ల. 94

ప్రతిపదార్థం: అజ+ఆదులు+ఎల్లన్= బ్రహ్మాదులంతా; అపుడు= ఆ సమయంలో; ఇంద్రియ+అగోచరుఁడు= కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలకు కనిపించనివాడైన; ఈశున్= ఆ పరమేశ్వరుడిని (పూర్వం చెప్పిన ఆ ఆనందస్వరూపుడిని); బుద్ధిన్+చూచుచున్= మనస్సుకంటె అతీతమైన జ్ఞాననేత్రంతో (దానినే బుద్ధి అంటున్నది) చూస్తూ; నిర్భర+అద్భుతకరంబులు+అగు= మిక్కిలి అద్భుతాన్ని కలిగించే; తదీయ= ఆ మహాతత్త్వ; గుణమ్ములన్+అభినుతించుచున్= గుణాలను కీర్తిస్తూ; ఆత్మావాసములకున్= తమతమ నివాసాలకు; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: కర్మేంద్రియాలకు గోచరించని ఆ ఆనందస్వరూపుడిని జ్ఞాననేత్రాలతో తిలకిస్తూ, అద్భుతములైన ఆ మహాతత్త్వగుణాలను పొగడుతూ వారందరూ తమ తమ స్థానాలకు తిరిగి వెళ్ళారు.

విశేషం: ఇక్కడ ' ఈశ' శబ్దం హరిహరరూపమైన మహాతత్త్వాన్నే సూచిస్తున్నది.

దారుకుఁడు పాండవులకు సకలయాదవ క్షయంబు చెప్పుట (సం.16-6-1)

సీ. **అవనీశ! వినుమంత నద్దారుకుఁడు సని। పాండవేయులఁగని పరమమునులు**
యాదవకులముఁ బేరలుకమైఁ దొల్లి శ। పించుట మునుఁ దలఁపించి పిదప
జలధితీరముల నాసవపానమత్తులై। వృష్ణిభోజాంధకవీరు లెల్ల
మునివరనిర్దిష్ట ముసలాత్మకములైన। ముయ్యంచుతుంగల మోఁదులాటఁ

తే. **బేర్చి యొండొరువులఁ బరిమార్చుటయును। రామకృష్ణుల యునికియు నా మురారి**
తన్నుఁ బుత్తెంచుటయు సవిస్తారభంగిఁ। జెప్పె వారలు పెనువగఁ జేడ్పడంగ. 95

ప్రతిపదార్థం: అవనీశ!= రాజా!; వినుము; (అట్లా కృష్ణుడి ఆజ్ఞచేత బయలుదేరిన); ఆ+దారుకుఁడు= కృష్ణుడిసారథి దారుకుడు; చని= హస్తినాపురానికి వెళ్ళి; పాండవేయులన్+కని= పాండవులను చూచి; పరమమునులు= గొప్పవారైన మునులు; యాదవకులమున్= యాదవుల సమూహాన్ని; పేరు+అలుకమైన్= పెద్దకోపంతో; తొల్లి= మునుపు; శపించుట= శపించటాన్ని; మును= ముందుగా; తలఁపించి= జ్ఞాపకంచేసి; పిదపన్= ఆ తరువాత; జలధితీరములన్= సముద్రతీరాలలో; ఆసవ= మద్యం; పాన= తాగటంచేత; మత్తులై= మదించినవారై; వృష్ణిభోజాంధకవీరులు+ఎల్లన్= వృష్ణివంశీయులు, భోజాంధకులు అందరూ; మునివర= మునిశ్రేష్ఠులచేత; నిర్దిష్ట= సూచించబడిన; ముసల+ఆత్మకములైన= ముసలం రూపాంతరం పొందిన; మూఁడు+అంచుతుంగలన్= మూడంచుల తుంగపరకలతో; మోఁదులాటన్= మోదులాడుకోవటంలో; పేర్చి= విజృంభించి; ఒండు+ఒరువులన్= ఒకరి నొకరు; పరిమార్చుటయునున్= చంపటాన్ని; రామకృష్ణుల+ఉనికియున్= బలరామకృష్ణులు అడవిలో ఉన్న విషయమూ; ఆ మురారి= ఆ కృష్ణుడు; తన్నున్+పుత్తెంచుటయున్= తనను హస్తినకు పంపించటాన్నీ; వారలు= పాండవులు; పెను వగన్= పెద్ద దుఃఖంతో; చేడ్పడంగన్= దుఃఖపడగా; సవిస్తారభంగిన్= విస్తారంగా; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: అట్లా కృష్ణుడు పంపిన దారుకుడు హస్తినకు వెళ్ళి, పాండవులను చూచి, మహామునులు మునుపు యాదవులకు శాపమిచ్చిన విషయాన్ని తొలుత గుర్తు చేశాడు. పిదప సముద్రతీరంలో మద్యపానంచేత పుట్టినమత్తులో వృష్ణివంశీయులు, భోజాంధకులు మునివరులు సూచించిన ముసలం ఆత్మ ప్రవేశించిన తుంగపరకలతో ఒకరినొకరు మోదుకొని చావటాన్ని, బలరామకృష్ణులు అడవిలో ఉన్న విషయాన్ని, కృష్ణుడు తనను హస్తినకు పంపిన విషయాన్ని సవిస్తరంగా చెప్పాడు. దానిని విని పాండవేయులు దుఃఖంతో క్రుంగిపోయారు.

తే. **సర్వయాదవసంఘంబు చావు విన్న। ద్రౌపదీప్రముఖాఖిలాంతఃపురాంగ**
నలును శోకించి యాక్రందనములు సేసి। రతికరుణముగఁ బురజను లార్తిఁబొంద. **96**

ప్రతిపదార్థం: సర్వయాదవసంఘంబు= సర్వయాదవ సమూహంయొక్క; చావు= మరణాన్ని; విన్న= విన్నటువంటి; ద్రౌపదీ ప్రముఖ= ద్రౌపది, సుభద్ర మొదలైన; అఖిల అంతఃపుర+అంగనలును= అంతఃపురంలోని స్త్రీలందరూ; అతికరుణముగన్= మిక్కిలి శోచనీయంగా; పురజనులు= హస్తినలోని జనులు; ఆర్తిన్+పొందన్= దుఃఖాన్ని పొందగా; శోకించి= దుఃఖించి; ఆక్రందనములు= హాహాకారాలు; చేసిరి= చేశారు.

తాత్పర్యం: యాదవులందరూ ఇట్లా చనిపోవటం విని ద్రౌపది, సుభద్ర మొదలైన అంతఃపురస్త్రీలంతా శోచనీయంగా, హస్తినలోని జనులంతా దుఃఖాన్ని పొందేటట్లు హాహాకారాలు చేస్తూ ఏడ్చారు.

సీ. **దారుకుం డత్యంతధర్మవినీతిమై। నర్జునుతో 'నన్ను నచ్యుతుండు**
నినుఁ దోడి తెమ్మని పనిచిన వచ్చితి'। ననిచెప్పెఁ జెప్పిన నతనిఁ జూచి
'యాదవకుల విషయం బైన యొప్పని। పలుకు నా వీనులఁ జిలుకునట్టె!
యచటికి వేగంబ యరుగక యిచటఁ గా। ల్దన్ని యుండెడు నట్టి ధైర్య మెందుఁ

ఆ. **గలదు నాకు? నీవు పిలువ నే?' లని పల్కి। యన్నతోఁ దగంగ నాడి యాతఁ**
డక్కులాగ్రగణ్యు ననుమతితో ద్వార। వతికి నరిగె శీఘ్రగతి నరేంద్ర! **97**

ప్రతిపదార్థం: నరేంద్ర!= రాజా!; దారుకుండు= శ్రీకృష్ణుడి సారథియైన దారుకుడు; అత్యంత= మిక్కిలి; ధర్మవినీతిమైన్= ధర్మంతో కూడిన అణకువతో; అర్జునుతోన్= అర్జునుడితో; (ఇట్లా అన్నాడు); అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; నినున్= నిన్ను; తోడి తెమ్మని= తీసుకురమ్మని; నన్నున్= నన్ను; పనిచినన్= పంపగా; వచ్చితిన్= వచ్చాను; అని చెప్పెన్= అని చెప్పాడు; అతఁడు= ఆ అర్జునుడు; అతనిన్+చూచి= దారుకుడిని చూచి (ఇట్లా అన్నాడు)? యాదవకుల= యాదవుల వంశం; విషయంబైన= సంబంధమైన; ఒప్పని పలుకు= కీడు మాట; నా వీనులన్= నా చెవులలో; చిలుకున్+అట్టె!= ప్రవేశించటమా! (పడటమా); అచటికిన్= ద్వారకకు; వేగంబ= వేగంగా; అరుగక= వెళ్ళకుండా; ఇచటన్= ఇక్కడ; కాల్దన్ని= నిలకడగా; ఉండెడు అట్టి= ఉండేటువంటి; ధైర్యము+ఎందుఁగలదు నాకున్?= ధైర్యం నాకెక్కడుంది?; నీవు పిలువన్+ఏల= నీ వేల పిలవటం?; అని పల్కి= అని చెప్పి; అన్నతోన్= ధర్మరాజుతో; తగంగన్= తగినట్లుగా; ఆడి= పల్కి; ఆ+కుల+అగ్రగణ్యు+అనుమతితోన్= పాండవకుల శ్రేష్ఠుడైన ధర్మరాజు అనుమతితో; శీఘ్రగతిన్= అతివేగంగా; ద్వారవతికిన్+అరిగెన్= ద్వారకకు చేరాడు.

తాత్పర్యం: దారుకుడు మిక్కిలి ధర్మంతో కూడిన అణకువతో అర్జునుడితో ఇట్లా అన్నాడు: 'శ్రీకృష్ణుడు నిన్ను తీసికొనిరమ్మని పంపగా నేను వచ్చాను'. ఆ అర్జునుడు 'యాదవుల సంబంధమైన కీడుమాట నా చెవులలో పడటమా! ఇది విని కూడా ద్వారకకు వేగంగా వెళ్ళకుండా ఇక్కడ నిలకడగా ఉండే ధైర్యం నా కెక్కడున్నది? నీవు వేరే పిలవటం ఎందుకు?' అని అన్నాడు. ధర్మరాజుతో తగినట్లుగా సంభాషించి ఆ కులశ్రేష్ఠుడి అనుమతితో అతివేగంగా ద్వారకకు చేరాడు.

విశేషం: యాదవ పాండవుల నడిమి సంబంధగాఢత ఈ పద్యంలోని అర్జునుడి వాక్యాలద్వారా తెలుస్తుంది. బలరామకృష్ణులు ఇంకా బ్రతికే ఉన్నారనుకొని పాండవులు అనుకొంటున్నారు. అట్లా అనుకొనే అర్జునుడూ బయలుదేరుతున్నాడు. ఎంతో ఉత్కంఠ కలిగిన సన్నివేశ మిది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **అరిగి మగండు సచ్చిన కులాంగనయున్ శశి గ్రుంకినట్టి శ**
ర్వరియునుఁ బోల్పఁ బట్టగుచు వారిజనాభుఁడు లేని దీనతం
బొరసి కృపైకభాజనతఁ బొందిన యప్పురిఁ జూచి మానసం
బెరియఁగఁ జొచ్చె నేటి కెదురీఁదిన చాడ్పున నేమి సెప్పుదున్? 98

ప్రతిపదార్థం: అరిగి= చేరి; మగండు+చచ్చిన= భర్తచనిపోయిన; కులాంగనయున్= పుణ్యస్త్రీని; శశి= చంద్రుడు; క్రుంకినట్టి= అస్తమించినట్టి; శర్వరియునున్= రాత్రిని; పోల్పన్= పోల్చటానికి; పట్టు+అగుచున్= సందర్భం అవుతూ; వారిజనాభుఁడు= పద్మనాభుడు (కృష్ణుడు); లేని= లేనట్టి; దీనతన్= దైన్యం; పొరసి= పొంది; కృపా+ఏక= దైన్యానికి మాత్రమే; భాజనతన్= పాత్రతను; పొందిన= పొందినటువంటి; ఆ+పురిన్+చూచి= ఆ ద్వారకను చూచి; మానసంబు+ఎరియఁగన్= మనస్సు పరితపించగా; ఏటికిన్+ఎదురు+ఈఁదిన= ఏటికి ఎదురీదిన; చాడ్పునన్= విధంగా; చొచ్చెన్= నగరాన్ని ప్రవేశించాడు; ఏమి+చెప్పుదున్?= ఏమి చెప్పను?

తాత్పర్యం: అర్జునుడు ద్వారక చేరి; భర్త చనిపోయిన పుణ్యస్త్రీకి; చంద్రుడు అస్తమించిన రాత్రికి పోల్చదగినట్లున్న ద్వారకను చూచాడు. ఆ నగరంలో కృష్ణుడు లేడు. నగర మంతటా దైన్యంమాత్రమే ఉన్నది. అర్జునుడి మనస్సు పరితాపం పొందింది. ఒక్క అడుగు వెయ్యటానికి కూడా శక్తి లేకపోయింది. (ఏటి ప్రవాహానికి ఎదు రీదినట్లు కాళ్ళీడ్చుకొంటూ ద్వారకలోనికి అడుగుపెట్టా డని అర్థం).

విశేషం: అలం: మాలోపమ. శ్రీకృష్ణుడి అవతారం ముగియగానే అర్జునుడి బ్రదుకు ఏటి కెదురీదినట్లయిందని కూడా అర్థం నిక్షిప్తంగా ఉన్నది. ఈ ఏరు కాలప్రవాహం. కాలపురుషుడి సహాయం ఉండటంవలన ఏ ఈత సులభమయిందో అది ఇక గగనమై పోయిందని అర్థం.

క. **దారుకుఁడుఁ దోడఁ జనుదేరఁ। బౌర జనము లంతఁ దన్నుఁ బరమాశ్వాసం**
బారెడు మనములతోడను। గారవమునఁ జూడఁగా నగరికిం జనియెన్. 99

ప్రతిపదార్థం: దారుకుఁడు= శ్రీకృష్ణుడి సారథియైన దారుకుడు; తోడన్= వెంట; చనుదేరన్= రాగా; పౌరజనములు= ద్వారకాజనులు; అంతన్= ఆ సమయంలో; తన్నున్= తనను; పరమ= మిక్కిలి; ఆశ్వాసంబు= ఓదార్పు; ఆరెడు= నిండిన; మనముల తోడను= మనస్సులతో; గారవమునన్= గౌరవంతో; చూడఁగాన్= చూడగా; నగరికిన్= నగరుకు; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: దారుకుడు వెంటరాగా, ద్వారకావాసులు తనను మిక్కిలి ఓదార్పు నిండిన మనస్సులలో గౌరవించగా అర్జునుడు రాజసౌధానికి వెళ్ళాడు.

చ. **చనుటయుఁ గ్రొత్త పేరడలు సైఁపఁగ లేక మురాంతక ప్రియాం**
గనలు పదాఱువేలును మొగంబులఁ గప్పఁగ బాష్పవారి రో
దనరవముల్ చెలంగఁగఁ బదంబులు దొట్రుపడంగ దైన్యముల్
తనువులు దాల్చినట్టు దెరలం జనుదెంచిరి పార్థుపాలికిన్. 100

ప్రతిపదార్థం: చనుటయున్= పోగా; క్రొత్త= అప్పుడే పుట్టిన; పేరు+అడలు= పెద్దదుఃఖం; సైపఁగన్+లేక= తాళలేక; ముర+అంతక= శ్రీకృష్ణుడి; ప్రియ+అంగనలు= ప్రియ భార్యలు; పదాఱువేలును= పదహారువేలమందీ; మొగంబులన్= ముఖాలను; బాష్పవారి= కంటినీరు; కప్పఁగన్= ఆక్రమించగా; రోదన రవముల్= ఏడ్పు శబ్దాలు; చెలంగఁగన్= అతిశయించగా; పదంబులు= కాళ్ళు; తొట్రుపడంగన్= తడబడగా; దైన్యముల్= దీనతలు; తనువులు+తాల్చిన+అట్టు= ఆకారాన్ని పొందినట్టు; తెరలన్= సంక్షోభిస్తూ; పార్థుపాలికిన్= అర్జునుడి వద్దకు; చనుదెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: అర్జునుడు అట్లా వెళ్ళగా, అప్పుడే పుట్టిన పెద్ద దుఃఖం తాళలేక శ్రీకృష్ణుడి ప్రియభార్యలు పదహారువేలమందీ, ముఖాలను కంటినీరు ఆక్రమించగా, ఏడుపు శబ్దాలు అతిశయించగా, కాళ్ళు తడబడగా, దీనతలు ఆకారాన్ని పొందినట్లుగా, సంక్షోభిస్తూ అర్జునుడి దగ్గరకు వచ్చారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

చ. **వారలఁ గాంచి శోక మనివారణఁ జిత్తము పెల్లగింప న**
క్కౌరవసత్తముం డెలుఁగు గద్గదికం దగులంగ నేడ్చుచున్
దేరొక భంగి డిగ్గి యిలఁ ద్రెళ్ళిన యద్దురవస్థఁ జూచినన్
వైరులకైన డెందములు వ్రయ్యలుగా వగ దాఁకు భూవరా! **101**

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; వారలన్+కాంచి= వారిని చూచి; శోకము= దుఃఖం; అనివారణన్= ఆపుకొనలేకపోగా; చిత్తము= మనస్సు; పెల్లగింపన్= సంక్షోభించగా; ఆ+కౌరవసత్తముఁడు= ఆ కురువంశశ్రేష్ఠుడు; ఎలుఁగు= కంఠస్వరం; గద్గదికన్= డగ్గుత్తికను; తగులంగన్= పొందగా; ఏడ్చుచున్= ఏడుస్తూ; తేరు+ఒక భంగిన్+డిగ్గి= తేరు ఏదో ఒక విధంగా దిగి; ఇలన్= నేలమీద; త్రెళ్ళినన్= పడగా; ఆ+దురవస్థన్= ఆ దుఃస్థితిని; చూచినన్= చూస్తే; వైరులకున్+ఐనన్= శత్రువులకైనా; డెందములు= హృదయాలు; వ్రయ్యలుగాన్= ముక్కలయ్యేలా; వగ= దుఃఖం; తాఁకున్= కలుగుతుంది.

తాత్పర్యం: రాజా! వారిని చూచి దుఃఖం ఆపుకొనలేకపోగా, మనస్సు సంక్షోభించగా, ఆ అర్జునుడు స్వరం డగ్గుత్తికను పొందగా ఏడుస్తూ, తేరు ఏదో ఒక రీతిగా దిగి నేలమీద పడిపోయాడు. ఆ దుఃస్థితిని చూస్తే శత్రువులకైనా గుండెలు ముక్కలయి దుఃఖం కలుగుతుంది.

విశేషం: 'ఒక భంగిన్ డిగ్గి' అంటే అతి కష్టంమీద రథంనుండి దిగాడని అర్థం. ముందున్న వైభవం లేని గమన మిది. నారాయణుడి తోడ్పాటు లేని నరుడి పాటు ఎట్లా ఉంటుందో ఈ మాట నిరూపిస్తుంది. (వైరులకైనన్-శత్రువులకైనా అనడం వల్ల ఇక మిత్రులమాట చెప్పనక్కఱలేదని-కావ్యార్థాపత్తి)

తే. **రోదన ధ్వను లెసఁగంగ రుక్మిణియును । సత్యభామయు నప్పు డా సవ్యసాచి**
కడకు నేతెంచి పుడమిపైఁ బడిరి వనట । వెల్లి మునిఁగి యుల్లంబులు వెగడునొంద. **102**

ప్రతిపదార్థం: రోదనధ్వనులు= ఏడ్పుధ్వనులు; ఎసఁగంగన్= అతిశయించగా; రుక్మిణియునున్= రుక్మిణీ; సత్యభామయున్= సత్యభామా; (ఇరువురూ); అప్పుడు= ఆ సమయంలో; ఆ సవ్యసాచికడకున్= అర్జునుడి దగ్గరకు; ఏతెంచి= వచ్చి; వనటవెల్లిన్=

దుఃఖసముద్రంలో; మునిఁగి= మునిగిపోయి; ఉల్లంబులు= మనస్సులు; వెగడు= తల్లడము; ఒందన్= పొందగా; పుడమిపైన్+పడిరి= నేలమీద పడ్డారు.

తాత్పర్యం: రుక్మిణీసత్యభామ లిరువురూ పెద్దగా ఏడుస్తూ అర్జునుడి దగ్గరికి వచ్చారు. దుఃఖసముద్రంలో మునిగిపోయారు. మనస్సులు తల్లడపాటు పొందగా నేలపై పడ్డారు.

విశేషం: (వనటవెల్లి-వనట అనే వెల్లి-రూపకం.)

క. **తక్కనుగల మహిషీజను । లక్కుంతీతనయుచుట్టు నవని నొఱగి లో**
నెక్కొనిన వగలఁ బొగిలిరి । 'దిక్కెవ్వరు మాకు?' ననుచు దీనత దోఁపన్. **103**

ప్రతిపదార్థం: తక్కనున్+కల= మిగిలిఉన్న; మహిషీజనులు= కృష్ణుడి రాణులు; ఆ+కుంతీతనయు చుట్టున్= అర్జునుడి చుట్టూ; అవనిన్= నేలపై; ఒఱగి= పడి; లోన్= మనస్సులలో; నెక్కొనిన= అతిశయించిన; వగలన్= దుఃఖంతో; మాకున్= మాకు; దిక్కు+ఎవ్వరు+అనుచున్= దిక్కు ఎవరంటూ; దీనత= దైన్యం; తోఁపన్= కనిపించగా; పొగిలిరి= దుఃఖించారు (ఏడ్చారు).

తాత్పర్యం: మిగిలిఉన్న శ్రీకృష్ణుడి రాణులు అర్జునుడి చుట్టూ నేలపై పడి మనసులలో అతిశయించిన దుఃఖంతో 'మాకిక దిక్కెవ్వ?' రంటూ దైన్యంతో ఏడ్చారు.

క. **వినుము ధనంజయుఁ డప్పుడు । తనుఁ దాఁ దేర్చికొని యెల్లతరుణుల నూరా**
ర్చె నతనిఁ దోడ్కొని హరి జన । కునికడకుం జనియె దారుకుం డట్టి యెడన్. **104**

ప్రతిపదార్థం: వినుము= రాజా! వినుము; ధనంజయుఁడు= అర్జునుడు; అప్పుడు= ఆ సమయంలో; తనున్= తనను; తాన్= తానే; తేర్చికొని= సమాధానపరచుకొని; ఎల్ల తరుణులన్= స్త్రీలనందరనూ; ఊరార్చెన్= ఓదార్చాడు; అట్టి+ఎడన్= అప్పుడు; దారుకుండు= దారుకుడు; అతనిన్= అర్జునుడిని; తోడ్కొని= వెంట తీసికొని; హరిజనకుని కడకున్= వసుదేవుడి వద్దకు; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: వారి ఏడ్పులు చూచి, అర్జునుడు తనకు తానే సమాధానపరచుకొని ఆ స్త్రీలనందరనూ ఓదార్చాడు. ఆ తరువాత దారుకుడు అర్జునుడిని వెంట తీసికొని వసుదేవుడివద్దకు వెళ్ళాడు.

సీ. **'యాదవుల్ సమసిన నయ్యెడు నడలు చం । దమ కాక యివ్వనితాజనంబు**
నందు దైన్యముతోడి యత్యంత శోకస । మాకులత్వముఁ దోఁచె నస్మదీయ
మగు చిత్తమున వీరియాతురత్వము గన్న । యంతన కొందల మతిశయిల్లెఁ
గాని విశేషంబు గల్గదు కృష్ణుని దశ యెట్టిదో? యనుతల్లడంబు

ఆ. **నెవ్వరొక్కొ దీని నెఱిఁగించువారను నెవ్వగయును గదిరెఁ గవ్వడికిని**
నధిప! దారుకునకు నట్టయ్యు నా నృపు । కడ నెఱుంగు వారు గాఁగఁ దారు. **105**

ప్రతిపదార్థం: అధిప!= రాజా! వినుము; యాదవుల్= యాదవులు; సమసినన్= చస్తే; అయ్యెడు+అడలు+చందము+అకాక= కల్గే దుఃఖంవలె కాకుండా; ఈ+వనితాజనంబునందునన్= ఈ స్త్రీలలో; దైన్యముతోడి= దైన్యంతో కూడిన; అతి+అంత= మిక్కిలి;

శోక సమాకులత్వము= దుఃఖంతో కూడిన వ్యథ; తోఁచెన్= కనిపించింది; అస్మదీయము+అగు= నాదయిన; చిత్తమునన్= మనస్సులో; వీరి+ఆతురత్వముకన్న+అంతన్+అ= వీరి బాధ చూస్తే; కొందలము= బాధ; అతిశయిల్లెన్= అధికమవుతోంది; కాని= అయినా; విశేషంబు+కల్గదు= విశేషంగా ఏమీ కనిపించటంలేదు; కృష్ణుని దశ= శ్రీకృష్ణుడి స్థితి; ఎట్టిదో?= ఎట్లాంటిదో?; అను తల్లడంబున్= అనే భయమూ; ఎవ్వరు+ఒక్కొ?= ఎవరు?; దీనిన్= దీనిని; ఎఱిఁగించువారు= తెలిపేవారు; అను= అనేటటువంటి; నెఱి+వగయును= పెద్ద దుఃఖంకూడా; కవ్వడికిని= అర్జునుడికీ; కదిరెన్= వచ్చింది; దారుకునకున్= దారుకుడికి కూడా; అట్లు+అయ్యున్= అట్లా కాగా; ఆ నృపుకడన్= వసుదేవుడివద్ద; ఎఱుంగువారు= తెలిసికొనేవారు; కాఁగన్= కావటంకోసం; తారు= వారిద్దరూ.

తాత్పర్యం: 'యాదవులు చనిపోతే కలిగే దుఃఖంవలె కాకుండా ఈ స్త్రీలలో దైన్యంతో కూడిన వ్యథ కనిపిస్తున్నది. నా మనస్సులో వీరి ఆతురత చూస్తుంటే బాధ అధికమౌతున్నది. అయినా ఏ విశేషమూ కనిపించటంలేదు. శ్రీకృష్ణుడి స్థితి ఎట్లా ఉన్నదో? - అనే భయం పుట్టుతున్నది. దీనిని గురించి ఎవరు చెప్పుతారు?' అన్న పెద్ద దుఃఖం వచ్చింది. అర్జునుడికి. దారుకుడికీ అట్లాగే అయింది. అందుచేత వసుదేవుడి దగ్గరకు వెళ్ళి ఈ విషయం తెలిసికొనటం కొరకు వారిద్దరూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

అర్జునుఁడు సకల స్వజనక్షయ దుఃఖితుండగు వసుదేవునిం గాంచుట (సం.16-7-1)

క. తలఁకుచుఁ జని యతనిం గన। బలువగలం బొగిలి సెజ్జపై మేనిడి య
శ్రులు గ్రమ్మనున్న యవ్విభుఁ। డలమట క్రొత్త యయి మనసు నలమికొనంగన్. 106

ప్రతిపదార్థం: తలఁకుచున్= బాధపడుతూ; చని= వెళ్ళి; అతనిన్= వసుదేవుడిని; కనన్= చూడగా; బలు వగలన్= అధికమైన బాధతో; పొగిలి= శోకించి; సెజ్జ పైన్= పరుపుమీద; మేను+ఇడి= దేహాన్ని పడవేసి; అశ్రులు= కళ్ళనీరు; క్రమ్మన్= క్రమ్ముకోగా; ఉన్న= దుఃఖిస్తున్న; ఆ+విభుఁడు= వసుదేవుడు; అలమట= దుఃఖం; క్రొత్త+అయి= క్రొత్తగా పుట్టి; మనసున్= మనస్సును అలమికొనంగన్= ఆక్రమించుకొనగా.

తాత్పర్యం: బాధపడుతూ వెళ్ళి వసుదేవుడిని చూచారు. ఆయన మిక్కిలి బాధతో దేహాన్ని పరుపుమీద పడవేసి, కన్నునీరు క్రమ్ముకోగా ఏడుస్తున్నాడు. వీళ్ళను చూడగానే ఆయనకు కొత్తగా దుఃఖం పుట్టుకొచ్చింది. మనస్సునంతా ఆక్రమించింది.

విశేషం: మేను+ఇడి= దేహాన్ని పడవేయటం - అంటే చైతన్యంతో పడుకొనటం కాదని అర్థం - నిశ్చైతన్యంగా పడి ఉన్నాడని భావం.

ఆ. లేచి యడలి సవ్యసాచిఁ గౌఁగిటఁ జేర్చి। గద్గదిక నెలుంగు గడలుకొనఁగ
నడరి పెలుచ నేడ్చె నాఱడివోయిన। ప్రజలఁ బేరు గ్రుచ్చి పనవి పనవి. 107

ప్రతిపదార్థం: లేచి= పైకిలేచి; అడలి= దుఃఖించి; సవ్యసాచిన్= అర్జునుడిని; కౌఁగిటన్+చేర్చి= కౌగిలించుకొని; గద్గదికన్= డగ్గుత్తికతోడి; ఎలుంగు= కంఠస్వరం; కడలుకొనఁగన్= అతిశయించగా; అడరి= క్షోభించి; ఆఱడి+పోయిన= చనిపోయిన; ప్రజలన్= యాదవవీరులను; పేరు+క్రుచ్చి= పేరుపేరునా తడవి; పనవి, పనవి= ప్రలపించి, ప్రలపించి; పెలుచన్= పెద్దగా; ఏడ్చెన్= ఏడ్చాడు.

తాత్పర్యం: వసుదేవుడు తల్పంనుండి పైకి లేచి దుఃఖిస్తూ, అర్జునుడిని కౌగిలించుకొని కంఠంలోని డగ్గుత్తిక అతిశయించగా క్షోభించి చనిపోయిన యాదవవీరులను పేరుపేరునా తడవి, వారిని తలచుకొని ప్రలపించి పెద్దగాఏడ్చాడు.

క. మనుజాధిపుఁ డమ్మెయి రో। దన మటు సేయంగ నరుఁ డతని నూరార్చెన్
విను మవ్వసుదేవుం డి। ట్లను నాలుక తొట్రుపడఁగ నాతని తోడన్. 108

ప్రతిపదార్థం: వినుము= అప్పుడు ఏం జరిగిందో వినుము!; మనుజ+అధిపుఁడు= వసుదేవుడు; ఆ+మెయిన్= ఆ విధంగా; రోదనము+అటు+చేయంగన్= ఏడుస్తూ అట్లా వుంటే; నరుఁడు= అర్జునుడు; అతనిన్= వసుదేవుడిని; ఊరార్చెన్= ఓదార్చాడు; ఆ+వసుదేవుండు= ఆ వసుదేవుడు; నాలుక తొట్రు+పడంగన్= నాలుక తడబడగా; అతనితోడన్= అర్జునుడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అప్పుడు వసుదేవుడట్లా ఏడుస్తూ ఉంటే అర్జునుడు ఆయనను ఓదార్చాడు. వసుదేవు డప్పుడు నాలుక తడబడుతుండగా అర్జునుడితో ఇట్లా అన్నాడు:

చ. 'మనుజుల మాత్ర గాక సురమాన్యపరాక్రమ ముల్లసిల్లఁగా
దనుజులఁ దాఁకి గీటడఁచు దర్పమునం బెనుపొంది మాఱులే
క నెగడి రట్టిబిడ్డల కకారణరోషమునం బరస్పరా
హననము గల్గి చావలసె నందఱ కక్కట! దైవ మల్గినన్. 109

ప్రతిపదార్థం: మనుజుల మాత్రకాక= మనుష్యుల చేత మాత్రమే కాకుండా; సురమాన్య= దేవతలచేత గౌరవించబడిన; పరాక్రమము= విక్రమము; ఉల్లసిల్లఁగాన్= అతిశయించగా; దనుజులన్= రాక్షసులను; తాఁకి= ఎదిరించి; కీటడఁచు= చంపేటటువంటి; దర్పమునన్= పరాక్రమంతో; పెనుపు+ఒంది= పేరు పొంది; మాఱులేక= ప్రతిలేక; నెగడిరి= ప్రసిద్ధిపొందారు; అట్టిబిడ్డలకున్= అట్లాంటి యాదవకుమారులకు; అక్కట!= అయ్యో!; దైవము= దేవుడు; అల్గినన్= కోపగించుకొనగా; అందఱకున్= యాదవులందరికీ; అకారణ రోషమునన్= నిష్కారణంగా పుట్టిన రోషంతో; పరస్పర+ఆహననము+కల్గి= ఒకరినొకరు చంపుకొని; చాన్+వలసెన్= చావాల్సి వచ్చింది.

తాత్పర్యం: 'మనుష్యులను మాత్రమే కాకుండా దేవతలచేత కూడా ప్రస్తుతించబడ్డ విక్రమం కలిగి, రాక్షసులను ఎదిరించి చంపేటటువంటి పరాక్రమంచేత పేరుపొంది, ఎదురులేక సుప్రసిద్ధులైన యాదవకుమారులంతా దైవం కోపించటంచేత నిష్కారణంగా ఒకరిమీద ఒకరు కోపగించుకొని చంపుకొని చచ్చారు. అయ్యో! ఎంత దురవస్థ!

క. విను నీ శిష్యులు సాత్యకి। యును ప్రద్యుమ్నుండు నిమ్మహోగ్రపుసమరం
బునఁ దొలుపీనుఁగు లైరని। వినియుఁ బ్రదికినాఁడ నేన వీరుఁడ జగతిన్. 110

ప్రతిపదార్థం: విను= ఆ యుద్ధం ఎంత బాగా జరిగిందో వినుము!; నీ శిష్యులు= నీవు విద్య నేర్పిన శిష్యులు?; సాత్యకియునున్= సాత్యకీ; ప్రద్యుమ్నుండున్= ప్రద్యుమ్నుడూ; ఈ+మహా+ఉగ్రము+సమరంబునన్= ఈ భయంకర యుద్ధంలో; తొలు= మొదటి; పీనుఁగులు+ఐరి+అని= శవాలు అయ్యారని; వినియున్= వినికూడా; బ్రదికినాఁడన్= బ్రతికి ఉన్నాను; జగతిన్= ఈ జగత్తులో; ఏను+అ+వీరుఁడన్= వీరుడిని నేనొక్కడినే నయ్యా! (చస్తే బాగుండునని భావం)

తాత్పర్యం: ఆ యుద్ధం ఎంత బాగా జరిగిందో వినుము. నీవు విలువిద్యారహస్యాలు బోధించిన నీ శిష్యులు సాత్యకి, ప్రద్యుమ్నులే ఈ భయంకర యుద్ధంలో తొలిపీనుగులు అయ్యారు. ఈ విషయం విని కూడా ఇంకా నేను బ్రతికే ఉన్నాను. నేనేనయ్యా ఈ ప్రపంచంలో గొప్పవీరుడిని? (గొప్పవీరుడను కానని భావం.)

క. తొలితొలి సాత్యకి కృతవ। ర్మలు రేఁపఁగ బుట్టె సంగరము దానను వా
రల దూఱనేల? మునిము। ఖ్యుల శాపం బట్టి చేఁతకుం దగియుండన్? 111

ప్రతిపదార్థం: తొలి తొలి= ముందుముందుగా; సాత్యకి, కృతవర్మలు; రేఁపఁగన్= రెచ్చగొట్టగా; సంగరము= యుద్ధం; పుట్టెన్= మొదలైంది; మునిముఖ్యుల శాపంబు= మునిశ్రేష్ఠులు ఇచ్చిన శాపం (ముసలం విషయం); ఇట్టి చేఁతకున్= ఇట్లాంటి కార్యానికి; తగి+ఉండన్= తగి ఉండగా; దానను= ఆ యుద్ధం చేశారని; వారలన్= వారిద్దరినీ; దూఱన్+ఏల?= నిందించటం ఎందుకు?

తాత్పర్యం: ముందుముందుగా సాత్యకి కృతవర్మలు రెచ్చగొట్టారు. యుద్ధం ప్రారంభమైంది. అది కాదులే! ముందు మునిశ్రేష్ఠులు ఇచ్చిన శాపం ఈ యుద్ధానికి అనుకూలంగానే ఉందికదా! యుద్ధం చేశారని వాళ్ళిద్దరినీ ఎందుకు నిందించాలి?

చ. వలసిన నెట్టి కార్యమును వావిరి నెట్టుగ నైనఁ జేయఁగా
వలఁతి మృతుం బరీక్షితుని వత్సలతన్ బ్రదికించె శౌరి; మొ
క్కలమున యాదవుల్ పెనఁగఁగాఁ గని మాన్పఁ డుపేక్షసేసె నీ
పొలియు టవశ్యభావ్యమని బుద్ధిఁ దలంచుట గాన నయ్యెడున్. 112

ప్రతిపదార్థం: శౌరి= శ్రీకృష్ణుడు; వలసినన్= కావాలనుకుంటే; ఎట్టి కార్యమును= ఎట్లాంటి పనినైనా; వావిరిన్= ఉత్కృష్టంగా; ఎట్టుగన్+ఐనన్= ఎట్లాగైనా; చేయఁగాన్= చేయటానికి; వలఁతి= సమర్థుడు; మృతున్= చచ్చిన; పరీక్షితుని= పరీక్షిత్తును; వత్సలతన్= ప్రేమతో; బ్రదికించెన్= బ్రదికించాడు; (అట్లాంటివాడు); మొక్కలమునన్= మూర్ఖత్వంతో; యాదవుల్= యదుకుమారులు; పెనఁగఁగాన్= యుద్ధం చేస్తుండగా; కని= చూచి; మాన్పఁడు= యుద్ధాన్ని మాన్పించలేదు; ఉపేక్ష+చేసెన్= ఉపేక్ష చేశాడు; ఈ+పొలియుట= ఇట్లా యాదవులందరూ చావటం; అవశ్య భావ్యము+అని= తప్పనిసరిగా జరగవలసినదేనని; బుద్ధిన్= బుద్ధిలో; తలంచుట= తలచటమే; కానన్+అయ్యెడున్= కనిపిస్తోంది.

తాత్పర్యం: కృష్ణుడు కావాలనుకొంటే ఎంతటి అసాధ్యమైన పనినైనా అత్యుత్కృష్టంగా సాధ్యం చేసి చూపగలడు. అంతెందుకు! చనిపోయిన పరీక్షిత్తును ఎంతో ప్రేమతో బ్రతికించలేదా! అట్లాంటివాడు యదుకుమారులు మూర్ఖత్వంతో యుద్ధం చేస్తుంటే చూస్తూ ఉపేక్ష చేశాడు. యుద్ధాన్ని మాన్పించలేదు. ఇట్లా యాదవులంతా చావటం తప్పనిసరిగా జరగాల్సిన విషయంగా తలచాడేమో?

క. ఇది విధివశత్వమున నై। నది యని శోకంబు దొఱఁగు నట్టి వివేకం
బొదవదు ఫల్గున! యాఱడి। యదువంశం బెల్ల సమసె ననువగపెర్మిన్.' 113

ప్రతిపదార్థం: ఫల్గున!= అర్జునా!; ఆఱడి= వ్యర్థంగా; యదువంశంబు+ఎల్లన్= యదువంశమంతా; సమసెన్= నశించింది; అను= అన్న; వగ= దుఃఖంయొక్క; పెర్మిన్= అతిశయంతో; ఇది= ఇట్లాకావటం; విధి వశత్వమునన్= విధివశంగా; ఐనది=

జరిగింది; అని= అని తెలిసికొనటం ద్వారా; శోకంబున్= దుఃఖాన్ని; తొలఁగునట్టి= పోగొట్టుకొనేటువంటి; వివేకంబు= జ్ఞానం; ఒదవదు= పుట్టటం లేదు.

తాత్పర్యం: నిష్కారణంగా ఇంతమంది యదువీరులందరూ చచ్చిపోయారే అన్న దుఃఖాతిశయంలో ఇదంతా విధి వశంగా జరిగిందని తెలిసికొనటం ద్వారా దుఃఖాన్ని పోగొట్టుకొనేటటువంటి జ్ఞానమే పుట్టటంలేదు.'

విశేషం: జగన్నాటక సూత్రధారి నిజజీవితంలోని ఈ చరమాంకం చాలా అద్భుతంగా ఉన్నది. శ్రీకృష్ణుడు చనిపోవటం తల్లిదండ్రులకు తెలియదు. మహారాణులకు తెలియదు. అర్జునదారుకులకు తెలియదు. అందుకే అర్జునుడు ఇట్లా అనుకొంటున్నాడు.

వసుదేవుఁ డర్జునునకు యాదవనాశంబు తెలఁ గెఱింగించుట (సం.16-7-13)

క. అనునెడఁ గ్రీడి 'యితఁడు కృ। ష్ణునుపేక్షయ చెప్పెఁ గాని శోక మడరియుం
బనవఁడు కృష్ణునిఁ గావున। ననుమానము వలవ దమ్మహాత్ము నునికికిన్.' 114

ప్రతిపదార్థం: అను+ఎడన్= అని వసుదేవుడు చెప్తున్నప్పుడు; క్రీడి= అర్జునుడు; ఇతఁడు= వసుదేవుడు; కృష్ణ+ఉపేక్ష+అ= కృష్ణుడు చేసిన ఉపేక్ష మాత్రమే; చెప్పెన్+కాని= చెప్పాడు తప్ప; శోకము+అడరియున్= దుఃఖం అధికమై; కృష్ణునిన్= శ్రీకృష్ణుడిని గురించి; పనవఁడు కావునన్= దుఃఖించటం లేదు కాబట్టి; ఆ+మహాత్ము+ఉనికికిన్= ఆ మహానుభావుడి ఉనికికి (బ్రతుకు విషయంలో); అనుమానము= ఏ అనుమానమూ; వలవదు= అక్కరలేదు.

తాత్పర్యం: అని వసుదేవుడు చెప్తుతుంటే అర్జునుడు ఇట్లా ఆలోచించాడు: 'ఈయన కృష్ణుడు చేసిన ఉపేక్షను గురించి మాత్రమే చెప్తున్నాడు. దుఃఖాతిశయంతో కృష్ణుడిగురించి తలచుకొనటంలేదు. కాబట్టి కృష్ణుడి ఉనికిని గురించి ఏ అనుమానమూ అక్కరలేదు' (ఆయన బ్రతికే ఉంటాడని ఊహిస్తున్నాడు).

సీ. అని మదిఁ జర్చించె నప్పు డవ్వసుదేవుఁ। డతనితో ననియె 'సమస్తయాద
వులును మహామునీంద్రుల ఘోరశాపంబు। ఘనశక్తి నుద్భవించిన మహోగ్ర
ముసలంబు విలసనమున ముసలాయమా। నము లైన తుంగల సమదవృత్తి
నన్యోన్యవినిహతి యాచరించి గతాసు। లగుటయు నొక్కఁడు నతివపిండుఁ

ఆ. గరులఁ దురగములను నరదంబులను గొని। యరుగుదెంచెఁ గృష్ణుఁ డనిన నా ధ
నంజయుండు తన మనంబు దల్లడపడ। 'నమ్ముకుందుఁ డెచటి కరిగె నధిప!' 115

ప్రతిపదార్థం: అని= ఇట్లా; మదిన్= మనసులో; చర్చించెన్= ఆలోచించాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+వసుదేవుఁడు= ఆ వసుదేవుడు; అతనితోన్= అర్జునుడితో; అనియెన్= ఇట్లా అన్నాడు; సమస్త యాదవులునున్= యాదవులందరూ; మహాముని+ఇంద్రుల= మహామునీశ్వరుల; ఘోరశాపంబు= ఘోరమైన శాపానికున్న; ఘనశక్తిన్= గొప్పశక్తిచేత; ఉద్భవించిన= పుట్టిన; మహోగ్రవిలసనమునన్= మిక్కిలి భయంకరమైన ప్రకాశంచేత; ముసలాయమానములు+ఐన= రోకళ్ళవలె అవుతున్న; తుంగలన్= తుంగపరకలతో; సమదవృత్తిన్= మదించిన ప్రవృత్తితో; అన్యోన్యవినిహతిన్= ఒకరినొకరు చంపుకొనటాన్ని; ఆచరించి= చేసి; గత+అసులగుటయున్= ప్రాణాలు పోగొట్టుకొనగా; కృష్ణుఁడు ఒక్కఁడు= తానొక్కడే; అతివపిండున్= స్త్రీసమూహాన్నీ; కరులన్= ఏనుగులను; తురగములనున్= గుర్రాలను; అరదములనున్= రథాలను; కొని= వెంటతీసికొని; అరుగుదెంచెన్=

ఇక్కడికి వచ్చాడు; అనినన్= అని వసుదేవుడు చెప్పగా; ఆ ధనంజయుండు= ఆ అర్జునుడు; తన మనంబు= తన మనసు; తల్లడపడన్= కలతపడగా; (ఇట్లా అడిగాడు); అధిప!= ఓ వసుదేవమహారాజా! ఆ+ముకుందుఁడు= ఆ శ్రీకృష్ణుడు; ఎచటికిన్= ఎక్కడికి; అరిగెన్?= వెళ్ళాడు?

తాత్పర్యం: ఇట్లా అర్జునుడు ఆలోచించాడు. అపుడు వసుదేవుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు: 'యాదవులంతా మునుల శాపశక్తితో పుట్టిన భయంకరమైన ప్రకాశంచేత రోకళ్ళవలె అయిన తుంగపరకలతో మదించిన ప్రవృత్తితో ఒకరినొకరు చంపుకొన్నారు. ఇట్లా అందరూ చావగా కృష్ణుడు ఒక్కడే స్త్రీలను, ఏనుగులను, గుర్రాలను, రథాలను వెంటతీసికొని ఇక్కడికి వచ్చాడు' అని చెప్పగా, అర్జునుడి మనసు చాలా కలతపడింది. అప్పుడు వసుదేవుడిని ఇట్లా అడిగాడు 'రాజా! కృష్ణు డిప్పు డెక్కడా కనిపించడే! ఎక్కడికి వెళ్ళాడు?'

క. **అని యడిగిన వసుదేవుఁ డ। తని కిట్లను 'నట్లు వచ్చి దామోదరుఁడే**
వనటం బొందుచు నుండఁగ। నను నూరార్చుటకుఁ గాఁగ నరవర! నాతోన్. **116**

ప్రతిపదార్థం: అని= ఇట్లా అర్జునుడు; అడిగినన్= అడుగగా; వసుదేవుఁడు; అతనికిన్= అతడితో; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; నరవర!= ఓ పురుషశ్రేష్ఠా! అర్జునా!; అట్లు= ఆ విధంగా; దామోదరుఁడు= శ్రీకృష్ణుడు; వచ్చి= ఇక్కడికి వచ్చి; ఏన్= నేను; వనటన్= దుఃఖం; పొందుచున్+ఉండఁగన్= అనుభవిస్తుంటే; ననున్= నన్ను; ఊరార్చుటకున్+కాఁగన్= ఓదార్చటానికై; నాతోన్= నాతో (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ఇట్లా అర్జునుడు అడుగగా వసుదేవు డిట్లా చెప్పాడు: 'ఆ విధంగా కృష్ణు డిక్కడికి వచ్చి నేను దుఃఖపడుతున్నందువలన ఓదార్చటానికై ఇట్లా అన్నాడు.' (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **'విధివశంబునఁ జేసి వృష్ణిభోజాంధక। నాశంబు పాటిల్లె నరున కేను**
జెప్పి పుచ్చినవాఁడ; నిప్పుడ యక్కౌర। వాగ్రణి యిప్పురి కరుగుదెంచు;
నీయెడ భక్తుండు నినుఁ గొల్చియుండెడుఁ। బనిచినపని యొనర్పంగ వలఁతి
యమ్మహాభుజుఁడు కార్యజ్ఞుండు శౌర్యస। మగ్రుండు విక్రమమహితుఁ డతఁడు'

ఆ. **నాఁగ నే ననంగ నరనాథ! భేద మిం। చుకయు లేదు విడువు శోక మతనిఁ**
జేతఁ బట్టి నీవు మాతంగతురగాది। కముల బంధుజనులఁ గాచికొనుము. **117**

ప్రతిపదార్థం: నరనాథ!= వసుదేవమహారాజా!; విధివశంబునన్+చేసి= విధివశంగా; వృష్ణి, భోజ, అంధక= వృష్ణిభోజాంధకుల; నాశంబు= నాశనం; పాటిల్లెన్= సంభవించింది; ఏను= నేను; నరునకున్= అర్జునుడికి; చెప్పిపుచ్చినవాఁడన్= చెప్పి పంపించాను; ఆ+కౌరవ+అగ్రణి= ఆ అర్జునుడు; ఇప్పుడు+అ= ఇప్పుడే (ఇంక కొద్ది కాలంలోనే); ఈ+పురికిన్= ఇక్కడికి; అరుగుదెంచున్= వస్తాడు; నీయెడన్= నీమీద; భక్తుండు= భక్తి గౌరవాలు ఉన్నవాడు; నినున్+కొల్చి+ఉండెడున్= నిన్ను సేవించుకొని ఉంటాడు; పనిచిన పని= నియమించిన పని; ఒనర్పంగన్= చేయటానికి; వలఁతి= సమర్థుడు; ఆ+మహాభుజుఁడు= ఆ మహాబాహుబలవంతుడు; కార్యజ్ఞుండు= చేయతగినది తెలిసినవాడు; శౌర్యసమగ్రుండు= సమగ్రమైన శౌర్యం కలవాడు; విక్రమమహితుఁడు= పరాక్రమవంతుడు; అతఁడు నాఁగన్= అతడని; నేను+అనఁగన్= నేనని; భేదము= తేడా; ఇంచుకయున్= కొంచెం కూడా; లేదు; శోకము విడువు= దుఃఖించవద్దు; అతనిన్= ఆ అర్జునుడిని; చేతన్+పట్టి= ఆధారంగా గ్రహించి (ఊతగా తీసికొని); నీవు;

మాతంగ తురగాదికములన్= ఏనుగులు, గుర్రాలు మొదలైనవాటిని; బంధుజనులన్= బంధువులను; కాచికొనుము= రక్షించుకొనుము.

తాత్పర్యం: రాజా! విధివశంగా వృష్ణి భోజాంధకులు నశించటం జరిగింది. నేను అర్జునుడికి చెప్పి పంపించాను. ఆ అర్జును డీపాటికి వస్తూనే ఉంటాడు. అతడికి నీమీద మంచి భక్తి ఉన్నది. శ్రద్ధతో నిన్ను సేవించుకొని ఉంటాడు. ఏ పని చేయుమని నియమించినా చేయటానికి సమర్థుడు, మంచి బాహుబలం ఉన్నవాడు. సమగ్రమైన శౌర్యం ఉన్న వాడు. పరాక్రమించే స్వభావం ఉన్నవాడు. నిజానికి అతడని, నేనని తేడా కొంచెం కూడా లేదు. అతడిని ఊతగా తీసికొని నీవు ఇక్కడ ఉన్న ఏనుగులను, గుర్రాలను, బంధువులను రక్షించుకొనుము.

విశేషం: తండ్రిని కుమారుడు 'తండ్రీ!' అని సంబోధించకుండా రాజా! అని సంబోధిస్తున్నాడు. శ్రీకృష్ణుడు యోగీశ్వరుడు. కాబట్టే భవబంధాలను చాలా లీలగా తొలగించుకొనగలిగాడు. ఈ పర్వంలోని కథలో ఎక్కడా శ్రీకృష్ణుడి మమకారం కనిపించదు. కూటస్థుడుగా ఉంటూ తక్కిన కథనంతా చూస్తున్నాడు. తన మృత్యువును కూడా అట్లాగే ఆహ్వానించబోతున్నాడు. అందుకే తండ్రితో 'రాజా! యాదవులు నశించారు. అర్జునుడికి చెప్పిపంపాను. అతడే మీకు రక్ష' అని చెప్పుతున్నాడు. అర్జునుడి పరాక్రమానికి మూడు విశేషణాలు చెప్పాడు. బాహుబలం, నిండు శౌర్యం, విక్రమించే స్వభావం. ఒక వ్యక్తిలోనే ఈ మూడూ సాధారణంగా ఉండవు. ఈ మూడూ ఉన్నవాడు కాబట్టే ఈ పనిని అర్జునుడికి కృష్ణుడు అప్పజెప్పాడు. మరో విశేషాన్ని సూచిస్తున్నాడు. అర్జునుడు నరుడు. కృష్ణుడు నారాయణుడు, నరనారాయణ మహర్షులకథ పూర్వపర్వాలలో ప్రస్తావించబడింది. వారి అవతారంగా ప్రభవించిన కృష్ణార్జునుల నడుమ తేడా ఏమీ లేదు. అందుకే కృష్ణుడు నిర్వహించవలసిన పనిని 'నరు'డికి అప్పగించి 'నారాయణుడు' తప్పుకొంటున్నా డన్నమాట. భారతకథలో అత్యంత విషాదం పొందినవాడు అర్జునుడే. యుద్ధంలో ఎవడు అమితాసక్తిని, అసామాన్య శక్తిని కలిగినవాడో ఆ అర్జునుడికే సకలబంధునాశం చూపే ప్రాప్తిని విధి కలిగించింది. కర్మయోగ సారాంశాన్ని అర్జునుడి చేతులద్వారా అర్థం చేసికొనవచ్చును. అదే యాదవుల కర్మకాండ అర్జునుడి చేతులమీదుగా జరగటంలోని ఆంతర్యం. ఈ పర్వకథలో అర్జునుడిలో కర్మనుండి జ్ఞానంవైపు ప్రస్థానం కనిపిస్తుంది.

క. అతఁడు వనితలను బాలుర । నతిప్రయత్నమున నరసి యాపదఁ బాపున్
ధృతిసారమహిత! యంబుధి । కతిపయదినములను ముంపఁగల దిప్పురమున్. 118

ప్రతిపదార్థం: ధృతిసారమహిత!= ధైర్యసంపదచేత గౌరవించబడినవాడా! (వసుదేవ మహారాజా!); అతఁడు= ఆ అర్జునుడు; వనితలనున్= స్త్రీలను; బాలురన్= పిల్లలను; అతి ప్రయత్నమునన్= మిక్కిలి శ్రద్ధతో; అరసి= చూచికొని; ఆపదన్+పాపున్= ఆపదను తొలగిస్తాడు; కతిపయదినములను= కొన్నిరోజులలోనే; అంబుధి= సముద్రం; ఈ+పురమున్= ఈ ద్వారకను; ముంపన్+కలదు= ముంచబోతున్నది.

తాత్పర్యం: ధైర్యసంపదచేత గౌరవించబడిన వసుదేవమహారాజా! వినుము. ఆ అర్జునుడు ఇక్కడున్న స్త్రీలను, పిల్లలను శ్రద్ధతో చూచికొని కాపాడుతాడు. అంతేకాదు. కొన్నిరోజులలోనే సముద్రం ఈ ద్వారకానగరాన్ని ముంచివేయబోతున్నది.

విశేషం: ముసలివాడు, ధైర్యాన్ని కోల్పోయినవాడు కాబట్టి వసుదేవుడికి ధైర్యం కలుగటానికి అన్నమాట కాదు 'ధృతిసారమహిత!' అన్న సంబోధన. కంసుడి బాధలను అనుభవించి, చెరసాలలో భార్యతో ఏళ్ళు గడిపి, కృష్ణుడి అవతారంకొరకు వేచి ఉండటంలోనే వసుదేవుడిలోని 'ధృతిసారం' ఉన్నది. చాలా సార్థకమైన సంబోధన ఇది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. యాదవుల్ తమలోన నాహవం బొనరింప । కటమున్న బలదేవుఁ డడవి కరిగి
యత్యంత నియతిమై నధిక తపోవర్త । నంబునఁ దగిలియున్నాఁడు నాకు
నదియ యొప్పెడు తెరువై యుండుఁ గర్తవ్య । మిట్టిది; వేయును నేల? యింక
నొండు విచారంబు లుడిగి దయాలోల! । యనుమతి సేయు మప్పనికి నన్ను

తే. నా ధనంజయు చెప్పిన యట్ల సకల । కార్యజాతంబు నడపి నెగడు; మతండ
సమరమృత యాదవుల కెల్ల సముచిత ప్ర । కారమునఁ జేయు నగ్నిసంస్కార మనియె. 119

ప్రతిపదార్థం: యాదవుల్= యాదవులు; తమలోనన్= తమలో తాము; ఆహవంబు= యుద్ధం; ఒనరింపక+అట+మున్న= చేయటానికి ముందే; బలదేవుఁడు= బలరాముడు; అడవికిన్+అరిగి= అడవికి వెళ్ళిపోయి; అత్యంత= మిక్కిలి; నియతిమైన్= నిష్ఠతో; అధిక= అధికమైన (గాఢమైన); తపోవర్తనంబునన్= తపోవృత్తిలో; తగిలి+ఉన్నాఁడు= నిబద్ధుడై ఉన్నాడు; నాకున్= నాకు కూడా; అది+అ= అట్లా తపస్సు చేసికొనటమే; ఒప్పెడు= తగిన; తెరువు+ఐ= మార్గంగా; ఉండున్= ఉన్నది; కర్తవ్యము= చేయదగినది; ఇట్టిది= ఇట్లా ఉన్నది; వేయును ఏల?= అధికంగా చెప్పటానికి ఏమున్నది?; ఇంకన్= ఇక; ఒండు విచారంబులు+ఉడిగి= తక్కిన ఆలోచనలు మాని; దయాలోల!= ఓ దయామూర్తీ!; ఆ+పనికిన్= అట్లా తపస్సుచేసికొనటానికి; నన్నున్= నన్ను; అనుమతి+చేయుము= అనుమతించుము; ఆ ధనంజయుచెప్పిన+అట్ల= ఆ అర్జునుడు చెప్పినట్టుగా; సకలకార్యజాతంబు= అన్ని పనులనూ; నడపి= నిర్వహించి; నెగడుము= ప్రజలమన్నన పొందుము; అతండు+అ= ఆ అర్జునుడే; సమర= యుద్ధంలో; మృత= చనిపోయిన; యాదవులకున్+ఎల్లన్= యాదవులందరికీ; సముచిత ప్రకారమునన్= తగిన పద్ధతిలో; అగ్ని సంస్కారమున్= అగ్ని సంస్కారాన్ని; చేయును= చేస్తాడు; అనియెన్= అని చెప్పాడు.

తాత్పర్యం: 'యాదవులు తమలో తాము యుద్ధం చేయటానికి ముందే బలరాముడు అడవికి వెళ్ళిపోయి మిక్కిలి నిష్ఠలో గాఢమైన తపస్సులో నిబద్ధుడై ఉన్నాడు. నాకు కూడా అదే తగిన మార్గంగా కనిపిస్తున్నది. చేయదగినది ఇట్లా ఉన్నప్పుడు ఇక చెప్పటానికి ఏమున్నది? ఓ దయామూర్తీ! నీవు తక్కిన ఆలోచనలు మాని, కృపతో నేను తపస్సు చేసికొనటానికి అనుజ్ఞ ఇమ్ము. ఆ అర్జునుడు చెప్పినట్లుగా అన్ని పనులనూ నిర్వహించి, ప్రజలమన్నన పొందుము. ఆ అర్జునుడే యుద్ధంలో చనిపోయిన యాదవులందరికీ తగిన పద్ధతితో అగ్నిసంస్కారం చేస్తాడు' అని శ్రీకృష్ణుడు నాతో చెప్పాడు.

విశేషం: శ్రీకృష్ణుడు యోగేశ్వరుడే అయినా, అవతార పురుషుడే అయినా పుత్రధర్మం ఏమిటో నిరూపిస్తున్నాడు. తల్లిదండ్రుల అనుమతి తీసికొన్నాకే కుమారుడు ఏ పనైనా మొదలుపెట్టాలి. తపస్సు చేసికొనటానికో, సన్న్యసించటానికో వారి అనుమతి కావాలి. అంతే కాకుండా కుమారుడిగా తాను చేయవలసిన మూడు పనులనుండి విరమణ పొందటానికి తండ్రి అనుజ్ఞ అవసరం. ఒకటి రాజ్యబాధ్యత. మరొకటి కుమారుడుగా తల్లిదండ్రులను చూచికొనటం - వీటన్నింటికంటె ముఖ్యమైనది. యాదవులకు ఉత్తరక్రియలు నిర్వహించటం. అందుకే అనుమతిని అర్థిస్తున్నాడు. అర్జునుడిని తన ప్రతినిధిగా ఉంచి, అతడిద్వారా చేయవలసిన పనులన్నీ చేయించుకొమ్మంటున్నాడు. అట్లా చేసి ప్రజల మన్నన పొందాలని కూడా చెప్పుతున్నాడు. పాలకుడు ఏది చేసినా ప్రజల మన్నన పొందేటట్లు ఉండాలి. ఈ ఘట్టమంతటా శ్రీకృష్ణుడి నిర్మమకారమే ప్రధానమైన అంశం. అందువలననే తాను చేయవలసిన తండ్రిగారి పరలోకవిధులు కూడా అర్జునుడే చేయబోతాడని కూడా తండ్రికి చెప్పి ఆయనను మానసికంగా సిద్ధంచేసి ఉంచాడు. ఇట్లాంటి సందర్భాలను భరించగలగటమే 'ధృతి' అంటే, ఇక్కడ చెప్పుతున్న కృష్ణుడు, విని భరించిన వసుదేవుడు, ఆ విధులు

నిబ్బరంగా నిర్వహించిన అర్జునుడు - ముగ్గురూ ధృతిమంతులే. భారతమహేతిహాసంలోని పాత్రల గాంభీర్యం ఇట్లాంటి సందర్భాలను బట్టి అర్థం చేసికొని, జీవితంలో వచ్చే అనూహ్యమైన సంఘటనలను ఎదుర్కొనటం మనం అభ్యసించవచ్చును.

క. ఆతడు కాలాంతరమున। బ్రాఁతిగ భవదీయ భవ్యపరలోక విధుల్
చేతోగతి భక్తిపరి। స్ఫీతములుగఁ జేయు ననియుఁ జెప్పెఁ గుమారా! 120

ప్రతిపదార్థం: కుమారా!= నాయనా!; అతఁడు= ఆ అర్జునుడే; కాల+అంతరమునన్= కొంతకాలం తరువాత; బ్రాఁతిగన్= ప్రీతితో (శ్రద్ధాసక్తులతో); భవదీయ= మీ; భవ్య= యోగ్యమైన; పరలోకవిధుల్= శ్రాద్ధకర్మలు; చేతస్+గతిన్= మనస్సు ప్రమాణంగా (మనఃపూర్వకంగా); భక్తి పరిస్ఫీతములుగన్= చక్కగా నిండిన భక్తితో; చేయున్= చేస్తాడు; అనియున్= అనికూడా; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: నాయనా! ఇంతమాత్రమే కాదు. ఆ అర్జునుడే కొంతకాలం తరువాత శ్రద్ధాసక్తులతో మీకు యోగ్యమైన రీతిలో భక్తిశ్రద్ధలతో మనఃపూర్వకంగా శ్రాద్ధవిధులు కూడా నిర్వహిస్తాడని కూడా చెప్పాడు.

విశేషం: ఈ మాటను జాగ్రత్తగా వింటే హృదయవిదారకంగా ఉంటుంది. ఇక్కడ కుమారా! అన్న శబ్దం చాలా అర్థవంతమైనది. అర్జునుడు అల్లుడు. అయినా వసుదేవుడి కుటుంబానికి మగదిక్కుగా మిగిలాడు. అదే! ఈ సంబోధనలోని ఆంతర్యం.

క. చెప్పిన నేను నొడంబడి। యప్పురుషోత్తముని నెమ్మి ననిచితి; నిట నీ
చెప్పిన యట్టులు సేయుట। యొప్పైనను గలదు నీకు నొక్కఁడు సెప్పన్. 121

ప్రతిపదార్థం: చెప్పినన్= అట్లా చెప్పగా; నేనున్= నేను కూడా; ఒడంబడి= అంగీకరించి; ఆ+పురుషోత్తమునిన్= ఆ కృష్ణుడిని; నెమ్మిన్= ప్రేమతో; అనిచితిన్= పంపాను; ఇటన్= ఇక్కడ; నీ చెప్పిన అట్టులు= నీవు చెప్పిన విధంగా; చేయుట= చేయటం; ఒప్పు+ఐనను= తగిందే అయినా; నీకున్= నీకు; చెప్పన్= చెప్పటానికీ; ఒక్కఁడు= ఒక విషయం; కలదు= ఉన్నది.

తాత్పర్యం: అట్లా కృష్ణుడు చెప్పగా నేనుకూడా అంగీకరించి, ప్రేమతో సాగనంపాను. ఇప్పుడు నీవు వచ్చావు. నీవు చెప్పినట్టు చేయటం తగినపనే అయినా నేను నీకు చెప్పవలసిన విషయం ఒకటి ఉన్నది.

ఉ. పీనుఁగు పెంటగాఁ బడిన బిడ్డల నెల్లఁ దలంచు టెప్పుడున్
మానఁగ రామి తెల్ల; మిది మానసముం గలఁగింప నన్నమున్
బానము నెమ్మెయిన్ రుచికిఁ బట్టగునట్లును గాక యిద్దెసం
దాను సహించి యేమిగతిఁ దావుకొనునన్ మెయిఁబ్రాణ మర్జునా! 122

ప్రతిపదార్థం: అర్జునా!= నాయనా అర్జునా! (ఏం చెప్పమంటావు?); పీనుఁగుపెంటగాన్= పీనుగుల కుప్పగా; పడిన= చచ్చిన; బిడ్డలన్+ఎల్లన్= పిల్లలనందరనూ; తలంచుట= తలచుకొనటం; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; మానఁగరామి= మానకపోవటం; తెల్లము= నిస్సంశయంగా; ఇది= ఈ బాధే; మానసమున్+కలఁగింపన్= మనసును కలచివేస్తుండగా; అన్నమున్= అన్నమూ; పానమున్= నీళ్ళు; ఏ+మెయిన్= ఏ విధంగానూ; రుచికిన్= రుచికి; పట్టు+అగునట్లును గాక= రుచికి ఆశ్రయాలు కాకపోగా; ఈ+దెసన్= ఈ రీతిగా; తానుసహించి= తాను భరించి; ప్రాణము= ప్రాణం; మెయిన్= దేహంలో; ఏమి గతిన్= ఏ విధంగా; తావుకొనున్?= నిలదొక్కుకొనగలదు?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: నాయనా అర్జునా! ఏం చెప్పమంటావు? సంతానమంతా ఒక్కసారిగా చనిపోయి, పీనుగుల కుప్పగా అయిపోతే వారిని ఎడతెగకుండా తలచుకొని తలచుకొని ఆ శోకం మానలేక ఆ బాధే మనసును కలచివేస్తుండగా అన్నమూ, నీళ్ళూ కూడా సహించటం లేదు. ఈ బాధను ఇట్లా భరిస్తూ ఈ దేహంలో ప్రాణం మాత్రం తాను ఎట్లా నిలదొక్కుకొనగలదు? చెప్పుము.

క. ఈ వనితలఁ బ్రజలను దం । తావళముఖవస్తువులను దగు చందమునన్
నీ వరసికొనుము బాహు । శ్రీ విశ్రుత! కృష్ణుపనుపు సెల్లింపవనా!" 123

ప్రతిపదార్థం: బాహుశ్రీవిశ్రుత!= బాహుబలసంపద చేత ప్రసిద్ధి పొందిన అర్జునా!; ఈ వనితలన్= ఈ యాదవ వనితలను; ప్రజలను= పిల్లలను; దంతావళముఖ= ఏనుగులు మొదలైన; వస్తువులను= వస్తుసంపదను; తగుచందమునన్= తగినరీతిగా; నీవు+అరసికొనుము= నీవు జాగ్రత్తగా చూచుకొమ్ము; కృష్ణుపనుపు= కృష్ణుడి ఆజ్ఞను; చెల్లింపవు+అనా!= చెల్లింపవయ్యా!

తాత్పర్యం: అర్జునా! నీ బాహుబలం సుప్రసిద్ధం. నీవు చేయలేని పనిలేదు. ఈ యాదవస్త్రీలను, బిడ్డలను, ఏనుగులు, గుర్రాలు మొదలైన వస్తుసంపదను తగిన పద్ధతిలో జాగ్రత్తగా చూచికొమ్ము. ఆ విధంగా కృష్ణుడు నీపై మోపిన పనిని నిర్వహించి ఆయన ఆజ్ఞను పాలించు నాయనా!'

సీ. అన విని ఫల్గునుం డా వృష్ణిపతి హృద । యము దేహనిరపేక్షమగు టెఱింగి
డెందంబు నెవ్వగఁ బొంద నిమ్మేదినీ । రమణుతోఁ 'గృష్ణ విరహితమైన
యుద్దేశమున వసియింపంగ నాకుఁ జి । త్తము గొల్పునే? ధర్మతనయ భీము
లును నేను మాద్రినందనులును బాంచాలి । యును నేకచిత్తుల మనఘ! వినుము

తే. ధర్మతనయుఁ డిక్కార్యంబు దలఁచి మున్న । నిశ్చయించి బాలకులను నెలఁత పిండుఁ
దగుధనమును నింద్రప్రస్థ నగరమునకుఁ । జేర్పవలయుట మాకెల్లఁ జెప్పినాఁడు. 124

ప్రతిపదార్థం: అనన్= అని వసుదేవుడనగా; విని= విన్నవాడై; ఫల్గునుండు= అర్జునుడు; ఆ వృష్ణిపతి= ఆ వసుదేవుడి; హృదయము= అంతరంగం; దేహనిరపేక్షము+అగుట= దేహమమతతో సంబంధంలేనిది కావటం; ఎఱింగి= గుర్తించి; డెందంబు= అతడి హృదయం; నెఱ+వగన్= నిండుబాధను; పొందన్= పొందగా; ఈ+మేదినీరమణుతోన్= ఈ రాజుతో (వసుదేవుడితో); కృష్ణ విరహితమైన= కృష్ణుడు లేని; ఈ+దేశమునన్= ఈ దేశంలో; వసియింపఁగన్= నివసించటానికి; నాకున్= నాకు; చిత్తము+కొల్పునే?= మనసు వస్తుందా! (అని ఆలోచించినవాడై); అనఘ!= ఓ పాపరహిత రాజా!; వినుము; ధర్మతనయ= ధర్మరాజు; భీములును= భీముడు; నేనున్= అర్జునుడనైన నేను; మాద్రినందనులునున్= నకుల సహదేవులూ; పాంచాలియునున్= ద్రౌపదీ; ఏకచిత్తులము= ఒకే అభిప్రాయం ఉన్నవాళ్ళం; ధర్మతనయుఁడు= ధర్మరాజు; ఈ+కార్యంబున్= ఈ పనిని గురించి; తలఁచి= ఆలోచించి; మున్ను+అ= ముందుగానే; నిశ్చయించి= ఒక నిర్ణయం చేసికొని; బాలకులనున్= పిల్లలను; నెలఁతపిండున్= ఆడవారినీ; తగు ధనమునున్= కావలసినంత ధనాన్నీ; ఇంద్రప్రస్థనగరమునకున్= ఇంద్రప్రస్థ పట్టణానికి; చేర్పవలయుటన్= చేర్చటాన్ని గురించి; మాకున్+ఎల్లన్= మా అందరికీ; చెప్పినాఁడు= చెప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని వసుదేవు డనగా అర్జునుడు విని, ఆ వసుదేవుడి అంతరంగంలో దేహంమీది మమత పోవటాన్ని గుర్తించి, హృదయంలో నిండు బాధ కలుగగా, 'ఈ వసుదేవుడితో కృష్ణుడు లేని ఈ ద్వారకలో ఉండటానికి నాకు మనసు వస్తుందా!' అని ఆలోచించినవాడై, ఆ రాజుతో 'ఓ పుణ్యాత్మా! వినుము. ధర్మజ, భీమ, నకుల, సహదేవులూ, ద్రౌపదీ నేనూ - మేమందరం ఒకే అభిప్రాయం ఉన్నవాళ్ళం. ధర్మరాజు ఈ పనిని గురించి ఆలోచించి ముందుగానే ఒక నిర్ణయం చేసికొని, పిల్లలనూ, ఆడవారినీ, కావలసినంత ధనాన్నీ ఇంద్రప్రస్థపట్టణానికి చేర్చటాన్ని గురించి మా అందరికీ చెప్పాడు.

ఉ. **కావున నప్పురంబున సుఖస్థితి నుండెడు నట్లు గాఁగఁ బృ**
థ్వీవర! సంప్రయత్నమున వీరల నందఱ నంద పెట్టెదన్
నీవు పురస్సరుండవయి నెమ్మిఁ జనం గొనిపోయెదన్ భవ
ద్భావము నుమ్మలంబుఁ బెడఁబాపుము; తప్పునె దైవకృత్యముల్?' **125**

ప్రతిపదార్థం: పృథ్వీవర!= ఓ రాజా!; కావునన్= కాబట్టి; ఆ పురంబునన్= ఇంద్రప్రస్థంలో; సుఖస్థితిన్= సుఖంగా; ఉండెడు+అట్లు+కాఁగన్= ఉండేలా; సంప్రయత్నమునన్= చాలా జాగ్రత్తగా; వీరలన్+అందఱన్= వీరినందరనూ; అందున్+అ= ఆ ఇంద్రప్రస్థ నగరంలోనే; పెట్టెదన్= ఉంచుతాను; నీవు; పురస్సరుండవు+అయి= ముందున్నవాడవై; నెమ్మిన్= ప్రేమతో; చనన్= బయలుదేరగా; కొనిపోయెదన్= తీసికొనిపోతాను; భవత్= నీ; భావమున్= ఆలోచనను; ఉమ్మలంబున్= దుఃఖాన్ని; పెడన్+పాపుము= వదలిపెట్టుము; దైవకృత్యముల్= దేవుడి పనులు; తప్పునె?= తప్పుతాయా?

తాత్పర్యం: రాజా! అందువలన ఇంద్రప్రస్థపురంలో వారంతా సుఖంగా ఉండేటట్లు నేను చాలా జాగ్రత్తగా అందరినీ అక్కడికి చేరుస్తాను. నీవు అందరికంటె ముందు బయలుదేరగా నీ వెంట వారందరనూ తీసికొనిపోతాను. నీ ఆలోచనను, దుఃఖాన్ని వదలిపెట్టుము. దేవుడి పనులు తప్పటం అంటూ ఉంటుందా!'

విశేషం: భావ మంటే తలపు - వసుదేవుడి ఆలోచనలోని మమకారం చేత ఈ దుఃఖం కలుగుతోందని అర్జునుడు గుర్తించే ఇదంతా దైవచేష్ట అని రాజుకు ధైర్యం కలిగిస్తున్నాడు. మరి భగవద్గీతను కృష్ణుడి నోటినుండి స్వయంగా విన్నవాడు కదా!

క. **అని పలికి దారుకునిఁ గనుఁ। గొని యాతని చిత్తవృత్తి గుందుట బుద్ధిం**
గని యిట్లనుఁ 'గృష్ణుని పో। యిన వంక నెఱింగి పోద మేనును నీవున్. **126**

ప్రతిపదార్థం: అని= అని ఈ విధంగా; పలికి= వసుదేవుడితో చెప్పి; దారుకునిన్= దారుకుడిని; కనుఁగొని= చూచి; ఆతని చిత్తవృత్తి= అతని మనోవ్యాపారం; కుందుట= క్రుంగిపోవటాన్ని; బుద్ధిన్= ఊహాతో; కని= గుర్తించి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; కృష్ణుని పోయిన వంకన్= కృష్ణుడు వెళ్ళినదారిని; ఎఱింగి= గుర్తిస్తూ; ఏనునున్= నేనూ; నీవున్= నీవూ; పోదము= పోదాము.

తాత్పర్యం: వసుదేవుడితో ఇట్లా చెప్పి, దారుకుడివైపు అర్జునుడు చూచాడు. ఆ దారుకుడి మనసు కూడా బాధతో క్రుంగిపోయి ఉండటాన్ని గమనించి ఇట్లా అన్నాడు; 'నీవూ నేనూ కృష్ణుడు వెళ్ళినదారిని గమనిస్తూ పోదాము'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. ఇచ్చటి కార్యముల్ నడపుఁ డిట్లని నెమ్మి నమాత్యకోటికిం
బొచ్చెము లేక చెప్పి మఱి వోవుట యుక్తము నిల్చి వారలం
దెచ్చుట కీవ పొ' మ్మనిన దిగ్గన నాతఁడు వోయి యందఱం
దెచ్చె సుధర్మ యన్సభకు దేవపతిప్రియసూనుఁ డుండఁగన్. 127

ప్రతిపదార్థం: ఇచ్చటి కార్యముల్= ఇక్కడి పనులు; ఇట్లు= ఈ విధంగా; నడపుఁడు+అని= నడపండి అని; నెమ్మిన్= నెమ్మదిగా; పొచ్చెము లేక= ఏ దాపరికమూ లేకుండా; అమాత్యకోటికిన్= మంత్రివర్గానికి; చెప్పి= బాగా చెప్పి; మఱి+పోవుట= మరీ వెళ్ళటం; యుక్తము= అర్థవ్వమైన పని; వారలన్= వారందరినీ; నిల్చితెచ్చుటకున్= ఒకచోట చేర్చి తీసికొనిరావటానికి; ఈవు+అ= నీవే; పొమ్ము+అనినన్= వెళ్ళు అని చెప్పగా; దిగ్గనన్= వెనువెంటనే; అతఁడు= ఆ దారుకుడు; పోయి= వెళ్ళి; అందఱన్= ఆ మంత్రులందరినీ; సుధర్మ+అన్+సభకున్= సుధర్మ అని పేరున్న ఆ రాజసభకు; దేవపతి= ఇంద్రుడి; ప్రియసూనుఁడు= ప్రియ కుమారుడైన అర్జునుడు; ఉండఁగన్= ఆ సభలో ఉండగా; తెచ్చెన్= పిలుచుకొని వచ్చాడు.

తాత్పర్యం: ఇక్కడి పనులు ఇట్లా చేయండి - అని కొంత ఆగి వీళ్ళకు నెమ్మదిగా ఏ దాపరికమూ లేకుండా చెప్పిపోవటం తగినపని, అందుచేత నీవు వాళ్ళనందరినీ ఒకచోట చేర్చి తీసికొని రమ్మ' అని దారుకుడితో అర్జునుడన్నాడు. ఉన్నవాడున్నట్లుగా దారుకుడు వెళ్ళి ఆ మంత్రులందరినీ 'సుధర్మ' అనే పేరున్న ఆ రాజసభలో అర్జునుడుండగా అక్కడికి తీసికొనివచ్చాడు.

విశేషం: ఇంద్రుడి ధర్మాసనానికి 'ధర్మం' అని పేరు. వసుదేవుడి సభకు కూడా అదే పేరు ఉన్నదన్నమాట. ఇంద్రకుమారు డన్న మాట 'సుధర్మ' ఇంద్రుడి సింహాసనమన్న మాటను గుర్తు చేస్తుంది. భాగవతంలో " సుధర్మామధ్యపీఠంబునందున్నాడా బలభద్రుగూడి సుఖియై యుత్సాహియై ద్వారకన్ అనే ప్రయోగముంది.

సీ. అమ్మండపమ్మున కరిగిన యమ్మంత్రి। వర్యు లక్కౌరవ వంశవర్యు
వినయ మారఁగఁ బరివేష్టించి రమ్మహి। తాత్ముండుఁ గరమును నార్ద్రుఁ డగుచు
గారవంబున వారి గలయఁ గనుంగొని। యంతరంగంబు శోకాగ్ని నెరియ
వారలతో నిప్డు పౌరజనంబుల। నెల్లను బిలిపింపుఁ డేను మీకు.

తే. వారికిని నెఱిఁగింపంగ వలయునట్టి। పనులు గలవని చెప్పిన విని రయమున
వారు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రు। లాదిగాఁ బ్రజ రావించి రధిపముఖ్య! 128

ప్రతిపదార్థం: అధిపముఖ్య!= ఓ రాజశ్రేష్ఠుడా!; ఆ+మండపమ్మునకున్+అరిగిన= ఆ మండపానికి వెళ్ళిన; ఆ+మంత్రివర్యులు= ఆ మంత్రిశ్రేష్ఠులు; ఆ+కౌరవ వంశవర్యున్= ఆ కౌరవవంశశ్రేష్ఠుడైన అర్జునుడిని; వినయము+ఆరఁగన్= వినయం నిండగా; పరివేష్టించిరి= సమీపించి చుట్టూకూర్చున్నారు; ఆ+మహితాత్ముండు= ఆ అర్జునుడు; కరమునున్= మిక్కిలి; ఆర్ద్రుఁడు+అగుచున్= కరిగిపోయినవాడై; గారవంబునన్= గౌరవంతో; వారిన్+కలయన్+కనుంగొని= వారినందరినీ చూచి; అంతరంగంబు= తన హృదయం; శోక+అగ్నిన్= శోకాగ్నిలో; ఎరియన్= మండుతుండగా; వారలతోన్= వారితో; ఇప్డు= ఇప్పుడే; పౌరజనంబులన్+ఎల్లను= ద్వారకావాసులందరినీ; పిలిపింపుఁడు= పిలిపించండి; ఏను= నేను; మీకున్+వారికిన్= మీకూ వారికీ; ఎఱిఁగింపంగన్+వలయు+అట్టి= తెలుపవలసిన (చెప్పవలసిన); పనులు+కలవని= పనులున్నాయని; చెప్పినన్= చెప్పగా; విని= విన్నవారై; రయమునన్= వేగంగా;

వారు= ఆ మంత్రులు; బ్రాహ్మణ క్షత్రియవైశ్య శూద్రులు+ఆదిగాన్= బ్రాహ్మణక్షత్రియాది అష్టాదశవర్గీయులుగా ఉన్న; ప్రజన్= జనులనందరినీ; రావించిరి= రప్పించారు.

తాత్పర్యం: ఓ రాజా! వినుము. అట్లా ఆ మంటపానికి వెళ్ళిన ఆ మంత్రులు అర్జునుడిని వినయంతో సమీపించి చుట్టూకూర్చున్నారు. అతిదీనంగా కనిపిస్తున్న వారిని చూడగానే అర్జునుడు కరిగిపోయాడు. వారిని చాలా గౌరవంతో సంభావించి, అందరినీ చూచి, తన హృదయం శోకాగ్నిలో మండిపోతుండగా 'ఇప్పుడే ద్వారకావాసులందరినీ పిలిపించండి. వారికి, మీకు చెప్పవలసిన పనులున్నా'యని అన్నాడు. ఆ మాటలు విని వారు బ్రాహ్మణక్షత్రియాది వర్గాల వారిని అందరినీ రప్పించారు.

విశేషం: చతుర్వర్గాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులన్న పరిగణనం ప్రాధాన్యదృష్టితోనే కాని, 18 వర్గాలవారు గ్రామ బాధ్యతలను పంచుకొనేవారు. ఈ సందర్భంలో వారందరూ వచ్చారని అర్థం. భిన్నవృత్తులవారందరికీ గ్రామసభలో ప్రాతినిధ్యం ఉండేది.

తే.. **అరుగుదెంచి యా ప్రజ లుచితాసనమున। నున్న యయ్యింద్రనందనుఁ గన్న నతఁడు**
గరము నెమ్మి నయ్యందఱఁ గలయఁ జూచి। యిట్లనియె మోమునను దైన్య మెసకమెసఁగ. **129**

ప్రతిపదార్థం: ఆ ప్రజలు= ఆ జనులందరూ; అరుగుదెంచి= వచ్చి; ఉచిత+ఆసనమునన్= తనకు తగిన ఆసనంలో (సింహాసనంమీద); ఉన్న= కూర్చున్నటువంటి; ఆ+ఇంద్రనందనున్= ఆ అర్జునుడిని; కన్నన్= చూడగా; అతఁడు= అర్జునుడు; కరము= మిక్కిలి; నెమ్మిన్= ప్రేమతో; ఆ+అందఱన్= వారందరినీ; కలయన్+చూచి= పరికించి చూచి; మోమునను= ముఖంలో; దైన్యము= దీనభావం; ఎసకము+ఎసఁగన్= నిండుకొనగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అన్ని వర్గాల ప్రజలూ వచ్చి సింహాసనంమీద కూర్చుని ఉన్న అర్జునుడిని చూచారు. అర్జునుడికి వారిని చూడగానే ఎక్కడలేని అభిమానమూ కలిగింది. కాని, ముఖంలో దైన్యం తాండవిస్తోంది. అందరినీ పరికించి చూచాడు. వారితో ఇట్లా అన్నాడు.

క. **'వననిధి నేఁటికి నేడవు। దినమున నిప్పురము ముంచు దివిజులు గగనం**
బుననుండి చెప్పఁగా నే। వినినది యిది వెడలవలయు వేగమ మనకున్. **130**

ప్రతిపదార్థం: నేఁటికిన్= ఈ రోజుకు; ఏడు+అవు= ఏడవ; దినమునన్= రోజున; వననిధి= సముద్రం; ఈ+పురమున్= ఈ ద్వారకను; ముంచున్= ముంచుతుంది; (ఈ విషయం); గగనంబుననుండి= ఆకాశంలోనుండి; దివిజులు= దేవతలు; చెప్పఁగాన్= చెప్పగా; నే+వినినది= నేను విన్నది; మనకున్= మనం; వేగము+అ= వెనువెంటనే; ఇది= ఈ ద్వారకను; వెడలవలయున్= వదలివేయాలి.

తాత్పర్యం: 'ఈ రోజుకు ఏడవరోజున సముద్రం ఈ ద్వారకను ముంచుతుందని దేవతలు ఆకసంలోనుండి చెప్పగా విన్నాను. అందుచేత మనం వెనువెంటనే ఈ నగరాన్ని వదలి బయటకు వెళ్ళిపోవాలి.

విశేషం: సముద్రం ద్వారకను కొన్నిరోజులలో ముంచివేస్తుందన్న విషయం వసుదేవుడికి కృష్ణుడు చెప్పగా విన్నవాడు అర్జునుడు. కాని అట్లా చెప్పకుండా తాను దేవతలద్వారా విన్నానని చెప్పటంలో రాజనీతి ఉన్నది. అర్జునుడి కార్యదక్షతను ప్రస్ఫుటం చేసే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సందర్భ మిది. ఈ విషయం తెలిసీ కృష్ణుడు ఎట్లా వెళ్ళిపోయాడన్న భావం ప్రజలకు కలుగకుండా అర్జునుడు ఈ వార్తను తనదిగా చేసి చెప్పటంలో ఈ రహస్యమున్నది.

క. వినుఁ డింద్రప్రస్థపురం। బునకు నధీశుఁడుగ వజ్రుఁ బోఁడిమితో నే
నునిచెద మీరెల్ల నతఁడు। మనుపంగాఁ దొంటి యట్ల మనుఁ డచ్చోటన్. 131

ప్రతిపదార్థం: వినుఁడు (పై కారణంచేత ఇట్లా చేయాలనుకొంటున్నాను) మీరందరూ సావధానంగా వినండి; ఇంద్రప్రస్థపురంబునకున్= ఇంద్రప్రస్థానికి; అధీశుఁడుగన్= పాలకుడిగా; వజ్రున్= వజ్రుడిని; పోఁడిమితోన్= ఆదరంతో; నేను+ ఉనిచెదన్= నేను నియమిస్తాను; అతఁడు= ఆ వజ్రుడు; మనుపంగాన్= రక్షింపగా; మీరెల్లన్= మీరంతా; తొంటి+అట్ల= మునుపటివలెనే; ఆ+చోటన్= ఆ ఇంద్రప్రస్థనగరంలో; మనుఁడు= హాయిగా ఉండండి.

తాత్పర్యం: జాగ్రత్తగా వినండి. ఇంద్రప్రస్థనగరానికి వజ్రుడిని రాజుగా అభిషేకిస్తాను. అతడి రక్షణలో మీరందరూ ముందటివలెనే సుఖంగా బ్రతకండి.

క. సరకులు భారవహులకును। భరియింపఁగఁ గొలఁది యయిన భంగిని మోపుల్
వెరవు పడఁగఁ గట్టుఁడు చె। చ్చెర శకటము లాయితంబు సేయుఁడు మీరల్. 132

ప్రతిపదార్థం: మీరల్= మీరందరూ; సరకులు= సామాన్లు; భారవహులకున్= మోసేవారికి; భరియింపఁగన్= మోయటానికి; కొలఁది+అయిన+భంగిని= వీలయ్యేరీతిలో; మోపుల్= మూటలు; వెరవుపడఁగన్= అనుకూల మయ్యేటట్లు; కట్టుఁడు= కట్టండి; చెచ్చెరన్= త్వరితంగా; శకటములు= బండ్లు; ఆయితంబు+చేయుఁడు= సిద్ధం చెయ్యండి.

తాత్పర్యం: మీమీ ఇండ్లలోని సామానులను మోసేవారికి అనువైన రీతిలో వేరువేరుగా మూటలుగా కట్టండి. స్త్రీలు, బాలకులు, వృద్ధులు ప్రయాణం చెయ్యటానికి బండ్లనుకూడా సిద్ధం చెయ్యండి.

ఆ. వాహనములు వానివాని ముట్టులు నొక్క। వంకగా నొనర్చి వలసినపుడ
కట్టి వెడలిపోవునట్టి తెఱంగున। కనువు గాఁగఁ జేసికొనుఁడు వేగ. 133

ప్రతిపదార్థం: వాహనములు= బండ్లను; వానివాని ముట్టులు= వాటికి కావాల్సిన ఇతర పనిముట్లను; ఒక్కవంకగాన్= ఒకవైపుగా; ఒనర్చి= సిద్ధంచేసికొని; వలసిన+అపుడు+అ= అవసరమైనప్పుడే; కట్టి= కట్టుకొని; వెడలిపోవునట్టి= వెళ్ళిపోయే; తెఱంగునకున్= విధానికి; అనువు+కాఁగన్= వీలు అయ్యేటట్లు; వేగన్= తొందరగా; చేసికొనుఁడు= తయారు చేసికొనండి.

తాత్పర్యం: బండ్లను, వాటివాటి పనిముట్లను సేకరించి ఒకవైపుగా ఉంచుకొనండి. ఎప్పుడు అవసరమైతే అప్పుడే కట్టుకొని వెళ్ళిపోయే పద్ధతికి వీలు అయ్యేటట్లు తొందరగా అన్నిటినీ సమకూర్చుకొనండి.

విశేషం: ప్రాకృతికమైన ఉపద్రవం సంభవిస్తుందని తెలిసినపుడు ప్రభుత్వం ప్రజాసామాన్యుల జీవితాన్ని కాపాడటానికి ఎట్లాంటి చర్యలు తీసికొనాలో, వారు తమతమ వస్తువులతో ఎట్లా ప్రమాదస్థలంనుండి బయటపడేటట్లు సూచించాలో ఈ పద్యం చక్కగా సూచిస్తున్నది. అది ఉప్పెన అయినా, భూకంపమయినా జనులు ఇట్లాగే జాగ్రత్త పడాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. ఈ దేశముప్రజ ధర్మజు। నాదరసంభావనముల నాజ్ఞానిరతిన్
యాదవవీరుల కలనాఁ। డేది తెఱం గట్టి మనికి యెసకం బారున్.' 134

ప్రతిపదార్థం: ఈ దేశముప్రజ= ఈ ద్వారకా వాసులంతా; ధర్మజు= ధర్మరాజుయొక్క; ఆదర= ఆదరంవలన; సంభావనములన్= సమ్మానములచేత; ఆజ్ఞానిరతిన్= పాలనలోని ఆసక్తిచేత; యాదవవీరులకున్= యాదవులకు; అలనాఁడు= అప్పుడు; ఏది తెఱంగు= ఎట్లా ఉండేదో; అట్టి మనికి= అట్లాంటి జీవనం; ఎసకంబు+ఆరున్= అతిశయంగా పొందుతుంది.

తాత్పర్యం: ధర్మరాజు ఈ ద్వారకావాసులపై చూపే ఆదరంచేత, చేసే సమ్మానంచేత, అతడి పాలనలోని ఆసక్తిచేత, ఒకనాడు ఏ విధంగా యాదవవీరులు వైభవోపేతంగా బ్రతికారో అట్లాంటి జీవనాన్ని మరలా పొందుతారు.

విశేషం: ద్వారకావాసులు వృష్ణిభోజాంధకవర్గాలకు చెందిన గ్రామీణసంస్కృతి కలవారు. మీదుమిక్కిలి తెగ జీవితానికి అలవాటుపడ్డవారు. అందుకే వారు సులభంగా ఏ ఇతరులనూ నమ్మరు. రాజప్రతినిధిగా కృష్ణుడి బంధువుగా అర్జునుడు ఈ 'భరోసా' కలిగించి, వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నాడు. అందుకే కృష్ణుడు అర్జునుడి భుజాలపై ఈ క్లిష్టమైన భారాన్ని మోపాడు.

క. అని చెప్పి పురజనులఁ బోఁ। బనిచి సచివకోటితో నిభములాదిగ వా
హనముల సవరణ బెరయం। గొనిరాఁదగిన పరిచారకుల మునుముట్టన్. 135

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వారికి చెప్పి; పురజనులన్+పోన్+పనిచి= పురవాసులను పంపించివేసి; సచివకోటితోన్= మంత్రులతో (ఇట్లా అన్నాడు); ఇభములు+ఆదిగన్= ఏనుగులు మొదలైనవాటిని; వాహనములన్= రథాదులను; సవరణ= సిద్ధం; బెరయన్+ కొనిరాన్+తగిన= చేసి తీసికొనిరాగలిగిన; పరిచారకులన్= సేవకులను; మునుముట్టన్= తొలుత.

తాత్పర్యం: ఇట్లా వారితో చెప్పి పురప్రజలను పంపించివేసి, మంత్రులను ఇట్లా పురమాయించాడు: 'ఏనుగులు, గుర్రాలు మొదలైనవాటిని, పరికరాలతో కూడిన రథాలను సిద్ధం చేసి తీసికొనిరాగలిగిన సేవకులను తొలుత (తరువాతి పద్యంతో అన్వయం).

క. నియమింపుఁడు నగరి సరుకు। లయినవి యిట్టిట్టి భంగి నక్షీణములై
యెయిదంగలవారలఁ గని। పయనము తెఱఁగు సమకట్టుపని మఱవకుఁడీ. 136

ప్రతిపదార్థం: నియమింపుఁడు= నియమించండి; నగరి సరుకులు= నగరికి సంబంధించిన సంభారాలను; అయినవి= ఆయా దినుసులకు చెందినవి; ఇట్టి+ఇట్టి+భంగిన్= ఇవి ఇవి ఇంతింత తీసికొనివెళ్ళాలి (అని తెలిసి); అక్షీణములు+ఐ= తరగకుండా; ఎయిదన్+కలవారలన్+కని= ఇంద్రప్రస్థానికి చేరేదాకా సాగించగలవారిని చూచి; పయనము తెఱఁగు= ప్రయాణం చేసే విధానాన్ని; సమకట్టుపని= నియమించే పనిని; మఱవకుఁడీ= మరవకండి.

తాత్పర్యం: నియమించండి. నగరికి సంబంధించిన సంభారాలను వేటివేటిని ఎంతెంత తీసికొనివెళ్ళాలో, ప్రయాణానికంతా సరిపడేటట్లు తగ్గకుండా, ఇంద్రప్రస్థానికి చేరేవరకూ సాగించగలవారిని గుర్తించి, ప్రయాణం చేసే విధానాన్ని నియమించే పనిని మరువవద్దు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇట్లా బండ్లమీద సంభారాలను సాగించేవారిని ఆ రోజులలో 'సార్థవాహులు' అనేవారు. వారే ఆనాడు సుదూర ప్రాంతాలకు చాలా సామగ్రీ, సంభారాలు చేర్చేవారు. వారిలో ఉత్తమసార్థవాహులను నియమించటం, ప్రయాణం చేసేవిధానం - అంటే ఎక్కడెక్కడ ఆగాలో, విశ్రాంతి తీసికొనాలో, మొత్తం కార్యక్రమ నిర్దేశమన్నమాట.

క. సుందరులకు బాలురకును। నందలములు వేసడములు నాయితములుగాఁ
గందక కుందక చనువిధ। మొందఁగ సమకట్టుఁ డెడలకుండుఁడు తాల్మిన్. 137

ప్రతిపదార్థం: సుందరి+లు= సుందరులు+కున్= స్త్రీలకు; బాలురకునున్= బాలబాలికలను; అందలములు= పల్లకీలు; వేసడములు= కంచరగాడిదలు; ఆయితములుగాన్= సిద్ధంగా ఉంచి (వారు); కందక= అలసిపోకుండా; కుందక= బాధపడకుండా; చనువిధము+ఒందఁగన్= ప్రయాణించే పద్ధతి ఉండేటట్లు; సమకట్టుఁడు= ఏర్పాటు చేయండి; తాల్మిన్= ఓర్పును; ఎడలక+ఉండుఁడు= పోగొట్టుకోకుండా ఉండండి.

తాత్పర్యం: స్త్రీలకు, బాలబాలికలకు (పిల్లలకు) పల్లకీలు, కంచరగాడిదలను సిద్ధంగా ఉంచి, వారు అలసిపోకుండా బాధపడకుండా ప్రయాణం చేయటానికి ఏర్పాటు చేయండి. మీరెవ్వరూ ఓర్పును పోగొట్టుకొని హైరానా పడకండి.

తే. గతము లయిన కార్యంబులు గ్రమ్మఱింప। రాదుగాని మనకు ధర్మరాజు గలఁడు
శేషజనరక్ష కొడయనిఁ జేయవచ్చు। వాసుదేవుని మనుమని వజ్రదేవు.' 138

ప్రతిపదార్థం: గతములు+అయిన= జరిగిపోయిన; కార్యంబులు= పనులను; క్రమ్మఱింపన్+రాదు= మరల్చటానికి కాదు; కాని= అయినా; మనకున్= మనలను ఆదుకొనటానికి; ధర్మరాజు= ధర్మరాజు (చక్రవర్తి); కలఁడు= ఉన్నాడు; వాసుదేవుని మనుమనిన్= వాసుదేవుడి (కృష్ణుడి) మనుమడైన; వజ్రదేవున్= వజ్రుని; శేషజనరక్షకున్= మిగిలిన జనులను కాపాడటానికి; ఒడయనిన్= రాజుగా; చేయవచ్చున్= నియమించవచ్చును.

తాత్పర్యం: జరిగిపోయిన పనులను మరల్చటానికి సాధ్యంకాదు. (అంటే పోయిన యాదవప్రముఖులు తిరిగిరారు అని అర్థం). అయినా చక్రవర్తి అయిన ధర్మరాజే మనందరను ఆదుకొనగలడు. కృష్ణుడి మనుమడు వజ్రుడిని మిగిలిన యాదవసమూహానికి ప్రభువుగా నియమిస్తాడు. అందుచేత కంగారుపడవలసిన అవసరం లేదు.

క. అని వారి నిండ్లకును బోఁ। బనిచి మదిని వగలు మిగులఁ బార్థుం డా రే
యనవద్యచరిత! కృష్ణుస। దనమున వసియించె సముచితపువృత్తమునన్. 139

ప్రతిపదార్థం: అనవద్యచరిత!= అనింద్యచరిత్రుడా!; అని= ఈ విధంగా; వారిన్= ఆ మంత్రులను; ఇండ్లకునున్+పోన్+పనిచి= ఇళ్ళకు వెళ్ళుడని పంపి; మదిని= మనసులో; వగలు= శోకం; మిగులన్= మిక్కుటంకాగా; పార్థుండు= అర్జునుడు; ఆ రే= ఆ రాత్రి; కృష్ణుసదనమునన్= కృష్ణుడి ఇంటిలో; సముచితపువృత్తమునన్= తగినవిధంగా; నివసించెన్= విశ్రమించాడు.

తాత్పర్యం: రాజా! ఆ మంత్రులను ఈ విధంగా పంపించి, మనసులో శోకం అధికం కాగా అర్జునుడు ఆ రాత్రంతా కృష్ణుడి మందిరంలో దైవపూజాదికాలతో పరమపవిత్రంగా గడిపాడు.

చ. తెలతెల వేగునప్డు వసుదేవుడు నిర్మలయోగనిష్ఠ మే
నిల నిడి వర్ణనీయగతి కేఁగినఁ దత్సదనాంతరంబునం
జెలఁగె ననేక రోదనవిశేషము లవ్వసుదేవవల్లభల్
నలువురు నెమ్మిఁ గూడి మరణంబునకై కయిసేసి రత్తఱిన్. 140

ప్రతిపదార్థం: తెలతెల వేగునప్డు= తెల్లవారుతుండగా; వసుదేవుఁడు= వసుదేవ మహారాజు; నిర్మలయోగనిష్ఠన్= పవిత్రమైన యోగనిష్ఠతో; మేను+ఇలన్+ఇడి= దేహాన్ని నేలపై వదలివేసి; వర్ణనీయగతికిన్+ఏఁగినన్= పుణ్యలోకాలకు చేరగా; తద్+సదన+అంతరంబునన్= ఆ వసుదేవుడి మందిరంలో; అనేక= చాలాపెద్దగా; రోదన విశేషముల్= బిగ్గర ఏడ్పులు; చెలఁగెన్= వ్యాపించాయి; ఆ+వసుదేవ వల్లభల్ నలువురున్= ఆ వసుదేవుడి నలుగురు భార్యలూ; ఆ+తఱిన్= ఆ సమయంలో; నెమ్మిన్+కూడి= భర్తమీది అనురాగంతో ఒక్కసారిగా; మరణంబునకై= సహగమనానికై; కయిసేసిరి= సన్నాహాలు ప్రయత్నించారు.

తాత్పర్యం: అప్పుడే ఉదయం కాబోతుండగా వసుదేవమహారాజు పవిత్రమైన యోగనిష్ఠలో భూమిపై దేహాన్ని వదలివేసి పుణ్యలోకాలకు తరలిపోయాడు. ఆ మందిరంలో ఒక్కసారిగా ఏడుపులు మిన్నుముట్టాయి. ఆ రాజు భార్యలు నలుగురూ భర్తమీది అనురాగంతో సహగమనం చేయటానికి సిద్ధపడ్డారు.

వసుదేవుఁడు శరీరంబు విడిచి పరమగతికిఁ బోవుట (సం.16-8-15)

సీ. ఆ సమయంబున నర్జునుఁ డచటికి । నేతెంచి వైభవ మెసకమెసఁగఁ
బ్రాలంబమాలికాపంక్తులఁ గదళికా । స్తంభంబులను శాతకుంభకలశ
శిఖరంబులను బెంపుఁ జెలువును విలసిల్ల । యానంబు గల్పించి యాదవేంద్రు
శవము సుస్నాతంబుఁ జందనచర్చాస । మేతంబుఁ జీనాంబరాతి శోభి

తే. తంబు నాభరణస్ఫురితంబు మాల్య । యోజితంబునుగాఁ జేసి యాజక ప్ర
యుక్తమంత్రతంత్రస్ఫుటయోగ మింపొ । నర్ప నేతెంచె సామగానంబు చెలఁగ. 141

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అప్పుడు; అర్జునుఁడు= కృష్ణుడి మందిరంనుండి అర్జునుడు; అచటికిన్= వసుదేవుడి మందిరానికి; ఏతెంచి= వచ్చి; వైభవము+ఎసకమెసఁగన్= వైభవం అతిశయించగా; ప్రాలంబ= వేలాడుతున్న; మాలికాపంక్తులన్= పూలదండల వరుసలతో; కదళికాస్థంభంబులను= అరటికంబాలతో; శాతకుంభ= బంగారు; కలశ శిఖరంబులనున్= కలశ శిఖరాలతో; పెంపున్= వైభవమూ; చెలువును= శోభా; విలసిల్లన్= అతిశయించగా; యానంబు కల్పించి= శవయాత్రకు తగిన వాహనాన్ని (రథం వంటిదానిని) ఏర్పరచి; యాదవేంద్రు శవమున్= వసుదేవుడి కళేబరాన్ని; సుస్నాతంబున్= బాగా స్నానం చేయించబడినదీ; చందన చర్చాసమేతంబున్= చందనాది సుగంధలేపంతో కూడినదీ; చీన+అంబర+అతి+శోభితంబును= పట్టువస్త్రాలతో బాగుగా అలంకరించబడినదీ; ఆభరణ స్ఫురితంబున్= శవాలంకారానికి తగిన ఆభరణాలతో ప్రకాశిస్తున్నదీ; మాల్య యోజితంబును+కాన్+చేసి= పూలదండలతో ఒప్పినదిగానూ చేసి; యాజకప్రయుక్త= యాజ్ఞికులైన బ్రాహ్మణులచేత చేయబడుతున్న; మంత్ర= మంత్రాలచేత; తంత్ర= తంత్రాలచేత; స్ఫుట= వ్యక్తమవుతున్న; యోగము+ఇంపు+ఒనర్పన్= గంభీరమైన సమాధిస్థితి అందరిలోనూ ఆత్మస్థైర్యంతో కూడిన శోభను కలిగించగా; సామగానంబు చెలఁగన్= సామవేద పారాయణము నలుదిక్కులలో మారుమ్రోగగా; ఏతెంచెన్= బయలుదేరాడు.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడు వసుదేవుడి మందిరానికి వచ్చి పూలదండల వరుసలతో, అరటికంబాలతో, బంగారుకలశ శిఖరాలతో ఒప్పిన శవరథాన్ని వైభవోపేతంగా తయారుచేయించి, వసుదేవుడి కళేబరానికి స్నానం చేయించి, సుగంధద్రవ్యాలను పూయించి, పట్టువస్త్రాలను, ఆభరణాలను అలంకరింపజేయించి, పూలదండలు వేయించి, ఆ రథంలో శవాన్ని ఉంచి, బ్రాహ్మణులు చెప్పుతున్న మంత్రాలతోను, చేయిస్తున్న కార్యకలాపాలతోను, గంభీరమైన సమాధిస్థితి అందరిలోనూ ఒక ఆత్మస్థైర్యంతో కూడిన శోభను కల్పించగా, సామవేద పారాయణంతో నలుదిక్కులు మారుమ్రోగుతుండగా శవయాత్రకు సారథ్యం వహించి ముందుకు సాగాడు.

క. వినుదేవకియును రోహిణి। యును భద్రయు మదిరయును సముచితవిధానం
బున నొనరించిన యానము। లనూన పరికర్మరుచిరలయి యెక్కి తగన్. 142

ప్రతిపదార్థం: విను= రాజా వినుము!; దేవకియును, రోహిణియును, భద్రయును, మదిరయును= (వీరే వసుదేవుడి నలుగురు భార్యలు) వీరు నలుగురూ; అనూన= మెండైన; పరికర్మ రుచిరలు+అయి= కుంకుమాది సుమంగళద్రవ్యాలచేత అలంకృతలు కావటంచేత పుట్టిన కాంతులు కలవారై; సముచిత విధానంబునన్= ఆ సందర్భానికి తగినట్టుగా; ఒనరించిన= ఏర్పాటుచేసిన; యానములు= పల్లకీలను; తగన్+ఎక్కి= సముచితంగా ఎక్కినవారై.

తాత్పర్యం: వసుదేవుడి భార్య లయిన దేవకి, రోహిణి, భద్ర, మదిర తత్కాలోచితమైన సుమంగళద్రవ్యాలచేత అలంకృతలై క్రొత్త కాంతులు కలవారయ్యారు. ఆ సందర్భానికి ఉచితంగా తీర్చిన పల్లకీలలో ఎక్కినవారై. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. చెలులుం జుట్టలు దాపట। వలపట నేతేరఁ దెలిసి వదనసరోజం
బులనొప్పం దగియెడు మా। టల వారల వగలు మాన్పుటలు నుతికెక్కెన్. 143

ప్రతిపదార్థం: చెలులున్= మిత్రులు; చుట్టలు= బంధువులు; దాపటన్= ఎడమవైపు; వలపటన్= కుడివైపు; ఏతేరన్= రాగా; తెలిసి= మూర్ఛనుండి తేరినవారై; (ఆ బంధుమిత్రులు); వదనసరోజంబులన్= ముఖపద్మాలతో; ఒప్పన్= సముచితంగా; తగియెడు= తత్కాలోచితములైన; మాటలన్= ఓదార్పు పలుకులతో; వారల వగలు= వసుదేవుడి భార్యల దుఃఖాన్ని; మాన్పుటలు= మాన్పటం; నుతికిన్+ఎక్కెన్= అందరి పొగడ్తనూ పొందింది.

తాత్పర్యం: బంధుమిత్రులు ఆ పల్లకీలకు ఇరువైపులా నడుస్తూ రాగా వసుదేవుడి రాణులు మూర్ఛనుండి తేరుకొన్న వా రయ్యారు. ఆ కాలానికి ఉచితమైన ఓదార్పుమాటలతో వారు ఆ మహారాణుల దుఃఖాన్ని ఉపశమింపజేస్తూ రావటాన్ని చూచినవారు, ఎంతో కుదుటపడ్డారు. మేలుమే లన్నారు.

విశేషం: బంధుమిత్రులు అన్ని సమయాలలో కన్నా మరణజనితదుఃఖాన్ని బాపటంలో చాలా సహాయపడతారు. అందుకే హైందవ సమాజంలో ఈ బంధుమిత్రసంభావన - వ్యవస్థ ఇన్ని వేల సంవత్సరాలుగా మిగిలింది.

క. ఆ నృపుని వల్లభలు శవ। యానంబు పిఱుంద నిట్ల యరిగిరి విధి స
న్మానితగతి ముందట వి। ప్రానీకము చనియె నుజ్జ్వలాగ్నులు గొనుచున్. 144

ప్రతిపదార్థం: ఆ నృపుని వల్లభలు= ఆ రాజు భార్యలు; శవయానంబు పిఱుందన్= శవరథంవెంట; ఇట్లు+అ= ఇట్లా; అరిగిరి= వెళ్ళారు; ముందటన్= వీరందరి కన్నా ముందుగా; విధి సన్మానితగతిన్= శాస్త్రవిధి ననుసరించిన రీతిలో; విప్ర+అనీకము= బ్రాహ్మణుల సమూహం; ఉత్+జ్వల+అగ్నులు+కొనుచున్= మండుచున్న నిప్పులను తీసికొని; చనియెన్= ముందుకు సాగింది.

తాత్పర్యం: ఈ విధంగా ఆ మహారాణులు శవరథం వెంబడి వెళ్ళారు. వీరందరికన్నా ముందుగా శాస్త్రవిధి ననుసరించిన పద్ధతిలో బ్రాహ్మణులు శవదహనానికి అవసరమైన నిప్పులను తీసికొని ముందుకు సాగారు.

విశేషం: ఈ రోజులలో కూడా ఉత్తరకర్మలను చేసే వ్యక్తి (అధికారి) ఇట్లా ఉట్టిలో అగ్నిని తీసుకుపోవటం ఉన్నది. ఆనాటి రాజుల ఇళ్ళలో ఇట్లా బ్రాహ్మణులు తీసికొనివెళ్ళేవారు కాబోలు! శవయాత్రలో స్త్రీలు పాల్గొనటం ఆ రోజులలో నిషిద్ధం కాదని భావించాలి.

తే. **ద్వారకావాసు లెల్లను దల్లడంబు। లుల్లములఁ గప్ప మోముల నురుల బాష్ప**
ధార లతికరుణమున హాహారవంబు। లెసఁగ నేఁగిరి వెనుకను నిరుదెసలను. **145**

ప్రతిపదార్థం: (ఆ శవయాత్రలో); వెనుకను= అందరికంటె చివర; ఇరుదెసలను= రెండువైపులా; ద్వారకావాసులు+ఎల్లనున్= ద్వారకలో మిగిలిన జనులంతా; ఉల్లములన్= తమ హృదయాలను; తల్లడంబులు= పలువిధాలైన వ్యథలు; కప్పన్= ఆక్రమించగా; మోములన్= ముఖాలపై; బాష్పధారలు= కంటినీటిధారలు; ఉరులన్= దొర్లగా; అతికరుణమునన్= అతిశోచనీయంగా; హాహారవంబులు= హాహాకారాలు; ఎసఁగన్= చెలగగా; ఏఁగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ఆ శవయాత్రలోఅందరికంటె చివర ఇరువైపులా ద్వారకలో మిగిలిన జనులంతా వారివారి హృదయాలలో పలువిధాలైన వ్యథలు నిండిపోయి ముఖాలపై బాష్పధారలు దొర్లగా అతిశోచనీయంగా హాహాకారాలు చేస్తూ వెళ్ళారు.

సీ. **ఇమ్మెయిఁ గొని చని యమ్మహీశుఁడు వేడ్క। మెలఁగెడు తోఁటలోపల సమగ్ర**
చందనాగురు కాష్ఠచయముల మున్న కా। వించిన సొదకు సద్విధియుతముగ
నప్పాడె సేర్పించి యర్జునుఁ డయ్యాద। వేంద్రుని పితృమేధ మెల్ల జనులు
నభినుతి సేయంగ నచ్చితియం దా శ। వంబు నారోపింపఁ బనిచి యగ్ని

తే. **దీప్త మగునట్లు సేయింప దేవకీ ప్ర। ముఖులు నలువురు నప్పు డా శిఖిఁ బ్రవేశ**
లీల నంగీకరించి రాబాలవృద్ధ। మైన సకల జనంబులు నార్తి నొంద. **146**

ప్రతిపదార్థం: ఈ+మెయిన్= ఈ విధంగా; కొని చని= తీసికొనివెళ్ళి; ఆ+మహీ+ఈశుఁడు= ఆ రాజు-వసుదేవుడు; వేడ్కన్+మెలఁగెడు= విహారం కోసం తిరుగుతూ ఉండిన; తోఁటలోపలన్= ఉద్యానవనంలో; సమగ్ర= సమృద్ధిగా; చందన+అగురు+కాష్ఠ చయములన్= మంచిగంధపు చెక్కలు, అవురుగడ్డి మొదలైన వాటితోను, ఇతరములైన క్రలతోనూ; మున్ను+అ= ముందుగానే; కావించిన= సిద్ధం చేసిన; సొదకున్= చితిపైన; ఆ+పాడెన్= ఆ కట్టెను; సత్+విధియుతముగన్= విధ్యుక్త పద్ధతిలో; చేర్పించి; అర్జునుఁడు= ఆ అర్జునుడు; ఆ+యాదవేంద్రుని= ఆ వసుదేవుడి; పితృమేధమున్= పితృయజ్ఞాన్ని (దహన సంస్కారాన్ని); ఎల్లజనులున్= జనులంతా; అభినుతి+చేయంగన్= ప్రశంసించగా; ఆ+చితియందున్= ఆ చితిలో; ఆ శవంబున్= ఆ వసుదేవుడి కళేబరాన్ని; దీప్తము+అగునట్లు= మండేటట్లు; చేయింపన్= చేయించగా; దేవకీప్రముఖులు పలువురు= దేవకీ మొదలైన వసుదేవుడి

ఇల్లాండ్రు నలుగురు; అప్పుడు= ఆ సమయంలో; ఆ బాలవృద్ధము+ఐన= పిల్లలనుంచి పెద్దలవరకు; సకలజనంబులు= జనులంతా; ఆర్తిన్+ఒందన్= ఆర్తిని పొందగా; ఆ శిఖిన్= ఆ మంటలో; ప్రవేశలీలన్= ప్రవేశించే కార్యాన్ని; అంగీకరించిరి= సమ్మతించారు.

తాత్పర్యం: ఈ విధంగా తీసికొనివెళ్ళి, ఆ వసుదేవుడి ఉద్యానవనంలో బాగా మంచిగంధపు చెక్కలతోనూ, అవురుగడ్డితోనూ, ఇతరములైన కర్రలతోనూ ముందుగా సిద్ధంచేసిన చితిపైన విధ్యుక్తమైన పద్ధతిలో ఆ పాడెను చేర్పించి అర్జునుడు ఆ వసుదేవుడి పితృకార్యాన్ని, దహనకాండను జరిపించాడు. ఆ కళేబరాన్ని ఆ చితిపై ఉంచటానికి ఏర్పరచి, అగ్నిని మండేటట్లు చేయించగా దేవకి మొదలైన వసుదేవుడి ఇల్లాండ్రు ఆ సమయంలో ఆ చితాగ్నిలో ప్రవేశించే పనిని అంగీకరించారు. ఈ దృశ్యాన్ని చూస్తున్న జనులంతా పిల్లలనుండి పెద్దలవరకు అంతా బాధాతప్త హృదయు లయ్యారు

విశేషం: ఆపద్ధర్మంగా అర్జునుడు ఉత్తరక్రియలు చేస్తున్నాడు. అందుకే బ్రాహ్మణులద్వారా అన్ని కార్యాలు చేయించటం. ఇక్కడ శ్రీకృష్ణుడు చేయవలసిన ఉత్తరక్రియలు అర్జునుడు జరిపించటమే కథలో ఉన్న విశేషం.

క. ఘృతములు పైఁ జల్లఁగ న। చ్చితిఁ బేర్చిన సప్తజిహ్వ శిఖల రవము నూ
ర్జిత సామగాన నాదో। ద్గతియును హాహారవంబుఁ గలసి చెలంగెన్. 147

ప్రతిపదార్థం: ఘృతములు= నేతిని; పైన్+చల్లఁగన్= చితిపైన సమృద్ధిగా చల్లగా; ఆ+చితిన్= ఆ చితిలో; పేర్చిన= అతిశయించిన; సప్తజిహ్వ= అగ్నిదేవుడి; శిఖలరవమున్= మంటల సవ్వడి; ఊర్జిత= గంభీరమైన; సామగాన= సామవేదగానం యొక్క; నాద+ఉద్గతియును= శబ్దోచ్చారణ; హాహారవంబున్= హాహాకారాలు; కలసి= అన్నీ కలిసిపోయి; చెలంగెన్= ధ్వనించాయి.

తాత్పర్యం: ఆ చితిపైన నేతిని సమృద్ధిగా చల్లగా అందులోనుండి అతిశయిస్తూ పుట్టుకొనివస్తున్న మంటల సవ్వడి. గంభీరమైన సామవేద మంత్రోచ్చారణ, జనులు చేస్తున్న హాహాకారాలు అన్నీ కలిసిపోయి నలుదిక్కులా వ్యాపించాయి.

క. తదనంతరంబ వజ్రుఁడు। మొదలగు పురుషులు సతీసమూహముఁ దగుమై
నుదకప్రదానవిధి య। య్యదుముఖ్యున కాచరించి రన్వయముఖ్యా! 148

ప్రతిపదార్థం: అన్వయముఖ్యా!= కురువంశశ్రేష్ఠుడా!; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; వజ్రుఁడు మొదలగు పురుషులు= వజ్రుడు మొదలైన మగవారు (ఆ వంశీయులు); సతీసమూహమున్= తక్కిన ఆడవారూ; ఆ+యదు ముఖ్యునకున్= ఆ యదువంశశ్రేష్ఠుడైన వసుదేవుడికి; తగుమైన్= తగిన విధంగా; ఉదకప్రదాన విధిన్= జలతర్పణవిధిని; ఆచరించిరి= ఆచరించారు.

తాత్పర్యం: ఓ కురువంశ శ్రేష్ఠా! వినుము. ఆ తరువాత వజ్రుడు మొదలైన మగవారు, తక్కిన ఆడువారు ఆ వసుదేవుడికి జలతర్పణం చేశారు.

విశేషం: జల, తిల తర్పణాలని రెండు విధాలున్నాయి. ఆనాడు స్త్రీలు కూడా జలతర్పణం చేసేవారని ఈ వర్ణనను బట్టి గుర్తించాలి. ఈ ఆచారం ఇప్పుడు కూడా 'దశాహం' నాడు (10వ రోజు) ఉన్నది. తగుమెయిన్ - అంటే ఆ జలతర్పణం ఇవ్వటంలోనూ సంకల్పతంత్రాలలో తేడా లున్నాయని గుర్తించవచ్చును.

తే. అప్పు డందఱు బంధుల నాదరమునఁ। దనదు సముచితాలాపసంతానకలన
ననునయించి పురంబున కరిగెఁ దాను। వారు వగ మదిఁ గదుర విప్పచ్చుఁ డధిప! 149

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; అప్పుడు= ఆ సమయంలో; వివ్వచ్చుఁడు= అర్జునుడు, బీభత్సుడు (ప్రకృతి) - వివ్వచ్చుడు (వికృతి) (యుద్ధంలో బీభత్సం సృష్టించేవాడని అర్థం); అందఱ బంధులన్= బంధువులందరినీ; ఆదరమునన్= ఆదరంతో; తనదు= తన; సముచిత+ఆలాప సంతాన కలనన్= తగినటువంటి మాటల సముదాయంచేత పుట్టిన జ్ఞానంచేత; అనునయించి= ఓదార్చి; వారు= ఆ బంధువులు; మదిన్= హృదయాలలో; వగ= దుఃఖం; కదురన్= కలుగగా; తాను; పురంబునకున్= ద్వారకకు; అరిగెన్= తిరిగి వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ సమయంలో అర్జునుడు సముచితమైన తన మాటలతో పుట్టిన జ్ఞానంతో వారిని ఓదార్చి, ఆ బంధువులు దుఃఖంతో బాధపడుతుండగా ద్వారకకు తిరిగి వెళ్ళాడు.

తే. **ఇత్తెఱంగున సత్క్రియాయత్తుఁడైన । యర్జునుఁడు పితృమేధము నభినుతముగఁ**
జలిపి వృష్ణిభోజాంధకసమరధరణి । తలమునకు బుధజనసహితంబు గాఁగ. **150**

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; సత్+క్రియా+ఆయత్తుఁడైన అర్జునుఁడు= వైదికక్రియలో జాగరూకుడైన అర్జునుడు; పితృమేధమున్= పితృదేవతలకు చేసే వైదికకర్మను; అభినుతముగన్= మిక్కిలి ప్రశస్తంగా; చలిపి= చేసి; వృష్ణిభోజ+అంధక సమరధరణితలమునకున్= వృష్ణిభోజాంధకులు యుద్ధం చేసిన చోటుకు; బుధ జనసహితంబు+కాఁగన్= పండితులైన విప్రులతో కలిసి.

తాత్పర్యం: ఈ విధంగా వైదికక్రియలో జాగరూకుడైన అర్జునుడు పితృకార్యాన్ని మిక్కిలి ప్రశస్తంగా చేసి, వృష్ణిభోజాంధకులు యుద్ధం చేసినచోటుకు పండితులైన విప్రులతో కలిసి. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **అపరదినంబున నరిగె నప్పుడ వృద్ధ । బాలకాంతాజనప్రకరములకు**
నని నిర్గతప్రాణులై పడియున్న భో । జు లను నంధకుల వృష్ణులను గలయఁ
జూపంగ నుత్కటశోకంబు గదిరిన । నఱిముఱి మేదిని నొఱగువారు
విప్రలాపంబు నానాప్రకారంబులఁ । జేయువారును నిరుచేయి నెత్తి

తే. **యలఁత నాక్రందనములు హాహారవముల । తో నొనర్చువారును నైన నా నరుండు**
దద్ద యడలి దారుకు భాషితములఁ దేఱి । యఖిలజనులకు నుపశమ మావహించె. **151**

ప్రతిపదార్థం: అపరదినంబునన్= ఆ పుణ్యకార్యాలు తీరిన చివరిరోజున; అరిగెన్= వెళ్ళాడు; అప్పుడు= ఆ సమయంలో; వృద్ధ= వృద్ధులకు; బాల= బాలురకు; కాంతాజనప్రకరములకున్= స్త్రీల సముదాయానికి; అనిన్= యుద్ధంలో; నిర్గతప్రాణులై= ప్రాణాలుపోయి; పడి+ఉన్న= నేలమీద పడి ఉన్న; భోజులను, అంధకులన్, వృష్ణులనున్; కలయన్+చూపంగన్= అందరినీ చూపగా; ఉత్కట= మిక్కిలి; శోకము= దుఃఖం; కదిరినన్= కలుగగా; అఱిముఱిన్= వెంటనే; మేదినిన్= నేలమీద; ఒఱగువారు= ఒరిగిపోయేవారు; వి+ప్రలాపంబు= మిక్కిలి గట్టిగా ఏడవటం; నానాప్రకారంబులన్= నానావిధాలుగా; చేయువారునున్= చేసేవారు; ఇరుచేయున్= రెండుచేతులూ; ఎత్తి= పైకెత్తి; అలఁతన్= దుఃఖంతో; హాహారవములతోన్= హాహాకారాలతో; ఆక్రందనములు= ఏడ్వటం; తద్ద= మిక్కిలి; అడలి= దుఃఖించి; దారుకు= దారుకుడి; భాషితములన్= మాటలతో; తేఱి= తేరుకొని; అఖిలజనులకున్= వారికందరికీ; ఉపశమము= ఓదార్పును; ఆవహించెన్= కలిగించాడు.

తాత్పర్యం: ఆ పుణ్యకార్యాలు తీరిన చివరిరోజున వెళ్ళాడు. ఆ సమయంలో వృద్ధులకు, బాలలకు, స్త్రీల సముదాయానికి యుద్ధంలో ప్రాణాలు పోయి నేలపై పడి ఉన్న భోజాంధక వృష్ణి వీరులను ఒక్కొక్కరినీ చూపించగా, వారిలో కొందరు అమిత దుఃఖంతో అక్కడికక్కడే నేలమీద ఒరిగిపోయారు. కొందరు వారివారితో తమ బాంధవ్యాలు తలచుకొంటూ రకరకాలుగా ఏడవటం మొదలుపెట్టారు. ఇంకొందరు రెండు చేతులూ పైకెత్తి దుఃఖంతో హాహాకారాలు చేస్తూ ఏడుస్తున్నారు. ఇట్లాంటి వీరిని చూచి అర్జునుడు కూడా చాలా దుఃఖాన్ని పొందాడు. చివరకు దారుకుడు చెప్పిన మాటలతో తెప్పరిల్లి వారి కందరికీ ఓదార్పు కలిగించాడు.

క. తదనంతరంబ రణమృత। యదుసంఘములకు సమంచితానలసంస్కా
రదశాపూతత్వము నా। విదితయశుఁ డొనర్చె విప్రవితతి ఘటకుఁడై. 152

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; ఆ విదితయశుఁడు= ఆ ప్రఖ్యాతుడైన అర్జునుడు; విప్రవితతి= బ్రాహ్మణసమూహం; ఘటకుఁడై= కలిగినవాడై; రణమృత= యుద్ధంలో చనిపోయిన; యదుసంఘములకున్= యదువీరుల గుంపులకు; సమంచిత= బాగా; అనల= అగ్ని; సంస్కార= సంస్కారంచేత పుట్టిన; దశా= స్థితిచేత; పూతత్వమున్= పవిత్రతను; ఒనర్చెన్= కలిగించాడు.

తాత్పర్యం: ఆ తరువాత అర్జునుడు తాను వెంట తెచ్చుకొన్న బ్రాహ్మణులతో యుద్ధంలో చనిపోయిన యదువీరుల గుంపులకు చక్కగా అగ్నిసంస్కారంచేత పుట్టిన స్థితిచేత పవిత్రతను కలిగించాడు.

విశేషం: షోడశసంస్కారాలలో భాగమైన అపరకర్మ ఒక దశ. జీవుడి ఉత్క్రమణానికి సంబంధించిన ఒక పవిత్రీకరణం, దానితో ఆ దేహబంధాన్ని ఆ జీవుడు కోల్పోతాడు. అదే పవిత్రత. దానిని కలిగించటమే అపరకర్మ ప్రయోజనం.

ఆ. నిఖిలబంధుజనుల కఖిలమృతులకును। దగఁ దిలోదకప్రదాన మాచ
రించునట్లు గాఁగఁ బంచి యలుప్తక్రి। యత్వ మొనర నడపె నక్కిరీటి. 153

ప్రతిపదార్థం: ఆ+కిరీటి= ఆ అర్జునుడు; నిఖిల బంధుజనులకున్= బంధుజనులందరికీ; అఖిల మృతులకును= మృతులందరికీ; తగన్= వారివారికి తగినట్లు; తిలోదక ప్రదానమున్= తిలలు (నువ్వులు), నీరు కలిపి ప్రేతలకు తర్పణం వదలటాన్ని; ఆచరించినట్లు+కాఁగన్= చేయటానికై; పంచి= (బ్రాహ్మణులను) పంపించి; అలుప్త క్రియత్వము= క్రియాలోపం రాకుండా; ఒనరన్= తగినట్లుగా; నడపెన్= కార్యం నడిపించాడు.

తాత్పర్యం: బంధువులందరికీ, చనిపోయినవారందరికీ సామూహికంగా వారివారికి తగినట్లు తిలోదకప్రదానం చేయటానికై బ్రాహ్మణులను పంపించి, క్రియాలోపం రాని విధంగా అర్జునుడు కార్యం నడిపించాడు.

విశేషం: పురోహితుడు ఎవరితరపుననైనా ప్రేతకర్మ చేయటానికి 'అధికారి'గా వ్యవహరించగలడు - అట్లాంటి మంత్రాలున్నాయి. గాయత్రీజపం ద్వారా ఆ ఋణాన్ని విమోచనమూ చేసికొనగలడు. బంధువులకు, సఖులకు, గురువులకు, తర్పణం వదిలే విధానాలూ వేరువేరుగా ఉన్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **ఇవ్విధముగ విశ్రుతముగఁ। గవ్వడి నియతుఁ డయి బంధుకార్యము లెల్లన్**

నెవ్వగలు దన మనంబున। నివ్వటిలఁగ నాచరించె నృపసంసేవ్యా! **154**

ప్రతిపదార్థం: నృపసంసేవ్యా!= సామంతరాజులచే సేవించబడే కురువంశ చక్రవర్తీ వినుము!; ఈ+విధముగన్= ఈ విధంగా; విశ్రుతముగన్= పదిమందీ మెచ్చుకొనే విధంగా; కవ్వడి= అర్జునుడు (రెండుచేతులా వేగంగా బాణాలు వేయగలవాడని అర్థం); (సవ్యసాచి) నియతుఁడు+అయి= నియమవంతుడై; నెఱ+వగలు= నిండుబాధ; తనమనంబునన్= తన మనస్సులో; నివ్వటిలఁ గన్= అధికం కాగా; బంధుకార్యములు+ఎల్లన్= బంధువుల మిత్రుల ఉత్తరక్రియలను; ఆచరించెన్= చేశాడు.

తాత్పర్యం: ఈ విధంగా అర్జునుడు నియమవంతుడై నిండుబాధ తన మనసులో అధికం కాగా బంధుమిత్రుల కార్యాలను పదిమందీ మెచ్చుకొనేటట్లు చేశాడు.

విశేషం: కవ్వడిశబ్దం యథార్థంగా రెండు చేతులతోనూ బాణాలు వేసేవాడుకాగా ఇతర సందర్భాలలో ఇద్దరు చేయగలవానిని ఒకడుగా విశ్వసించగలవాడని అర్థాన్నిస్తుంది. అందుకే ఇంత భారాన్ని స్వామి అర్జునుడిపై మోపాడు.

అర్జునుఁడు రామకృష్ణుల వెదకుచు వనంబునకుఁ బోవుట (సం.16-8-31)

సీ. **పదపడి యాదవ భామినీబాలక। వృద్ధజనంబు నా శుద్ధబుద్ధి**

కలయంగఁ గనుఁగొని పలుకుల మార్దవ। మారఁ బురంబున కరుగఁ జెప్పి

రామకృష్ణులు తపోరతులై ప్రవర్తించు। వనభూమి యారసికొని తదీయ

సందర్శనమునకుఁ జనియెద నని వారి। నామంత్రితులఁ జేసి యేమి యనుచు

ఆ. **టకును శోక మార్చుటకును దారుకుఁ డాది। యయిన తగిన వారి నర్థవచన**

రచన మెఱయఁ బనిచి యుచితాప్తకతిపయ। జనులు దోడ రాఁగఁ జనియె నధిప! **155**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; పదపడి= పిమ్మట; ఆ శుద్ధబుద్ధి= ఆ పవిత్రచిత్తుడైన అర్జునుడు; యాదవభామినీ= యాదవస్త్రీలను; బాలక= బాలకులను; వృద్ధజనంబున్= వృద్ధులను; కలయంగన్= అందరినీ; కనుఁగొని= చూచి; పలుకులన్= మాటలలో; మార్దవము= మృదుత్వం; ఆరన్= నిండగా; పురంబునకున్= ద్వారకకు; అరుగన్= పొమ్మని; చెప్పి; రామకృష్ణులు= బలరాముడు, శ్రీకృష్ణుడు; తపస్+రతులు+ఐ= తపస్సులో మగ్నులై; ప్రవర్తించు= ఉంటున్న; వనభూమిన్= చోటును; ఆరసికొని= తెలిసికొని; తదీయ= వారి; సందర్శనమునకున్= దర్శనానికి; చనియెదన్+అని= పోతానని; వారిన్= వారిని; ఆమంత్రితులన్+చేసి= వీడ్కోలు చెప్పి విడిచినవాడై; ఏమి= ఏమి కావాలో దానిని; అనుచుటకునున్= సిద్ధంచేసి పంపటానికి; శోకము= దుఃఖం; ఆర్చుటకునున్= పోగొట్టటానికి; దారుకుఁడు+ఆది+అయిన= దారుకుడు మొదలైన; తగినవారిన్= యోగ్యులను; అర్థవచన రచన మెఱయన్= తగిన మాటల పొంతన అతిశయించగా; పనిచి= పంపించి; ఉచిత= తనకు తగిన; ఆప్తకతిపయజనులు= ఆప్తులైన మరి కొంతమంది; తోడరాఁగన్= తోడురాగా; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఈ కార్యాలు నిర్వర్తించిన తరువాత చూడలేక - అతిప్రయత్నంతో ఆ యాదవస్త్రీలను, బాలురను వృద్ధులను అందరినీ చూచి, మృదుత్వం నిండిన మాటలతో వారిని ద్వారకకు పొమ్మని చెప్పి, 'నేను అడవిలో బలరామకృష్ణులు తపస్సు చేసికొంటున్న చోటును కనుగొని వారిని దర్శించటానికి పోతా'నని అంటూ వారికి వీడ్కోలు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెప్పి, వారికి ఏమి కావాలో అది సిద్ధంచేయటానికి, వారి బాధను పోగొట్టటానికి దారుకుడు మొదలైన యోగ్యులైన వారిని వారికి తగిన మాటలు చెప్పి పంపి, ఆప్తులైన మరికొంతమంది తనవెంట రాగా అడవిలోకి వెళ్ళాడు.

క. చనిచని మనమున నిట్లను। ననుఁ బిలువఁగఁ బనిచి జనకునకుఁ గావలిగా
నునిచినవాఁ డయి నెమ్మదిఁ। జనిన హరికిఁ జావు సెప్పఁ జనియెద నకటా! 156

ప్రతిపదార్థం: చనిచని= వెళ్ళుతూ వెళ్ళుతూ; మనమునన్= మనస్సులో, ఇట్లు+అనున్= ఇట్లా అనుకొన్నాడు; ననున్= నన్ను; పిలువఁగన్+పనిచి= పిలువనంపి; జనకునకున్= తండ్రికి; కావలిగాన్= కావలిగా; ఉనిచినవాఁడు+అయి= పెట్టినవాడై; నెఱ+మదిన్= నిండుమనసుతో (ధైర్యంగా); చనిన హరికిన్= వెళ్ళినవారికి (శ్రీకృష్ణుడికి); అకటా!= అయ్యో!; చావు+చెప్పన్= తండ్రి చావును గురించి చెప్పటానికి; చనియెదన్= పోతున్నానే!

తాత్పర్యం: పోతూ పోతూ మనసులో ఇట్లా అనుకొన్నాడు; 'కృష్ణుడు నన్ను పిలువనంపి, తండ్రికి రక్షకుడిగా నియమించి ఆయన ధైర్యంతో తపస్సు చేసికొనటానికి వెళ్ళాడు. నేనేమో ఆయన తండ్రి చావును ఆయనకు చెప్పటానికి పోతున్నానే! అయ్యో! ఏమి ఈ దురవస్థ!

సీ. ఆ రాజు సచ్చుట నారాయణున కేల। సెప్పఁ? దపోనిష్ఠఁ జెందియున్న
యమ్మహాత్ముని హృదయమునకు మెరమెర। పుట్టింప నేటికిఁ? బోయి కాంచి
పంచినపని యాచరించెదఁ గాక స। వినయభక్తికముగ' ననుచు మఱియు
వివిధ చింతారూపవిధులు చిత్తమ్మునఁ। బాఱ గాంధారిశాపంబు తెఱఁగుఁ

తే. దలఁచి 'యయ్యవ్వ యతఁ డెగ్గతంపుఁ జోట। నరయ ది క్కెవ్వరును లేనియట్టి తెగుట
నొందఁగలవాఁడుగాఁ బల్క నొద్దనుండి। వింటి నకట! నిప్పును జెద లంటు నొక్కొ?' 157

ప్రతిపదార్థం: ఆ రాజు చచ్చుట= ఆ వసుదేవుడు మరణించటం; నారాయణునకున్= నారాయణుడికి; చెప్పన్+ఏల?= చెప్పటం ఎందుకు?; తపోనిష్ఠన్= తపోనిష్ఠను; చెంది+ఉన్న= పొంది ఉన్నటువంటి; ఆ+మహాత్ముని= ఆ మహాత్ముడైన కృష్ణుడి; హృదయమునకున్= హృదయానికి; మెరమెర= వ్యథను; పుట్టింపన్+ఏటికిన్?= పుట్టించటమెందుకు?; పోయి= వారి దగ్గరికి వెళ్ళి; కాంచి= చూచి; పంచిన పని= చెప్పిన పనిని; సవినయభక్తికముగన్= వినయ భక్తులతో; ఆచరించెదన్+కాక= చేస్తాను; అనుచున్= అనుకొంటూ; మఱియున్= ఇంకా; వివిధ= నానారకాలైన; చింతారూపవిధులు= ఆలోచనారూపాలైన పనులు; చిత్తమునన్= మనస్సులో; పాఱన్= స్ఫురించగా; గాంధారి= ధృతరాష్ట్రుడి పత్ని గాంధారి; శాపమ్ము తెఱఁగు= ఇచ్చిన శాపంవిధం; తలఁచి= స్మరించుకొని; ఆ+అవ్వ= ఆ పతివ్రత; అతఁడు= కృష్ణుడు; ఎగ్గతంపున్+చోటన్= ఎవరూలేనిచోట (ఒంటరిగా); అరయన్= చూచికొనటానికి; దిక్కు+ఎవ్వరును= దిక్కుగా ఎవ్వరూ; లేని+అట్టి= లేని విధంగా; తెగుటన్= చావటాన్ని; ఒందన్+కలవాఁడు+కాన్= పొందగలవాడుగా; పల్కన్= పలుకగా; ఒద్దన్+ఉండి= సమీపంలో ఉండి; వింటిన్= విన్నాను; అకట!= అయ్యో!; నిప్పును= నిప్పును; చెదలు= చెద పురుగులు; అంటున్+ఒక్కొ?= తాకుతాయా?

తాత్పర్యం: ఆ వసుదేవుడి మృతిని కృష్ణుడికి చెప్పటం ఎందుకు? తపోనిష్ఠలో మునిగి ఉన్న ఆ మహాత్ముడి హృదయానికి వ్యథ పుట్టించట మెందుకు? పోయి బలరామకృష్ణులను చూచి, చెప్పిన పనిని వినయ భక్తులతో చేస్తాను - అనుకొంటూ

నానావిధాలైన చింతలు, పనులు, మనసులో ఒకదానివెంట ఒకటి స్ఫురిస్తూ రాగా ఆనాడు గాంధారీమహాదేవి ఇచ్చిన శాపం తలచుకొన్నాడు. 'ఆమె శ్రీకృష్ణుడు ఎవ్వరులేనిచోట దిక్కెవ్వరూలేని విధంగా చనిపోతాడని శపించింది. ఆ మాట నేను దగ్గరే ఉండి విన్నాను. అయ్యో! నిప్పుకు చెదలంటుతాయా?'

విశేషం: అర్థాంతర న్యాసం. అర్జునుడు లౌకికాలౌకికవివేకం ఉన్నవాడే. అందుకే కృష్ణుడి మృతి లీలగా స్ఫురిస్తున్నది. శాపమిచ్చిన స్త్రీ మహాపతివ్రత గాంధారి. కాబట్టి శాపం తప్పదు. కాని శాపం పొందినవాడు శ్రీకృష్ణుడు. అతడు అమృతస్వరూపుడు. అందుకే నిప్పువంటివాడు. చెద - నశించటానికి గుర్తు. కృష్ణుడు ఎట్లా మరణిస్తాడని? । అది ఆనాటినుంచి ఈనాటివరకూ 'నరు' లందరూ వేసికొంటున్న చిత్రమైన ప్రశ్న. లీలామానుష విగ్రహుడు - పరీక్షిత్తును బ్రతికించిన కృష్ణుడు తనను తాను చావుబారినుండి ఎందుకు కాపాడుకోలేకపోతున్నాడన్నది పెద్ద ప్రశ్న. శరీరం ధరించిన ప్రతి ఒకడూ నశించవలసినదే. కృష్ణుడు కూడా శరీరాన్ని వదలిపెట్టాడు. అది దేహధారికి సహజమైన ధర్మం. కాని అర్జునుడి దృష్టిలో శ్రీకృష్ణుడు దేహమాత్రుడు కాడు కాబట్టి ఈ ప్రశ్న.

క. **అనుచుఁ బెనుఁగలఁక నొందిన । మనంబుతో వలయుదిక్కు మతి నరయక వే**
చనుచుండె నొండు దెస; కే । మనఁగలదు? విధాతచేఁత కడ్డము గలదే! **158**

ప్రతిపదార్థం: అనుచున్= అనుకొంటూ; పెను+కలఁకన్= పెద్దవ్యథను; ఒందిన= పొందినట్టి; మనంబుతోన్= మనసుతో; వలయుదిక్కున్= పోవలసిన దిక్కును; మతిన్+అరయక= బుద్ధితో ఆలోచించి తెలిసికొనలేక; ఒండు దెసకున్= మరొక దిక్కుకు; వే+చనుచుండెన్= ఉన్మాదివలె గబాగబా పోతున్నాడు; ఏమి+అనఁగలదు?= ఏం చెప్పగలం?; విధాత చేఁతకున్= బ్రహ్మ సంకల్పించినపనికి; అడ్డము+కలదే?= అడ్డం ఉంటుందా?

తాత్పర్యం: ఇట్లా అనుకొంటూ పెద్ద వ్యథను పొంది, కకావికలైన మనసుతో ఏ దిక్కుకు వెళ్ళాలో కూడా ఆలోచించి తెలిసికొనే స్తిమితం లేక మరొక దిక్కుకు పిచ్చివాడివలె గబగబా పోతున్నాడు. ఏమి చెప్పగలం? బ్రహ్మ సంకల్పించిన పనికి అడ్డం ఉంటుందా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. అట్లాంటి ధీరచిత్తుడు కూడా భీరువై స్మృతికోల్పోయాడని అర్థం. (విశేషం సామాన్యంచే సమర్థింపబడింది.)

క. **విను మనుచరు లాతని మో । మునఁ దోఁచు విషాదభావముం గని వెగడొం**
దిన కతన నట్లుగా ది । ట్లని చనియెడువంక సాలరై రెఱిఁగింపన్. **159**

ప్రతిపదార్థం: వినుము= రాజా! వినుము; అనుచరులు=అర్జునుడి వెంట వస్తున్నవారు; అతని= అర్జునుడి; మోమునన్+తోఁచు= ముఖంలో కనిపిస్తున్న; విషాద భావమున్+కని= దుఃఖభావాన్ని చూసి; వెగడు+ఒందిన కతనన్= భయపడిన కారణంగా; అట్లు+కాదు+ఇట్లు+అని= అట్లా కాదు - ఇట్లా అని; చనియెడు వంకన్= వెళ్ళేదారిని; ఎఱిఁగింపన్= తెలుపటానికి; చాలరు+ఐరి= సమర్థులు కాకపోయారు.

తాత్పర్యం: ఆ అర్జునుడి వెంట వస్తున్నవారు అతడి ముఖంలో కనిపిస్తున్న దుఃఖభావాన్ని చూచి భయపడ్డ కారణంగా 'వెళ్ళే దారి అట్లాకాదు - ఇట్లా' అని కూడా చెప్పటానికి ధైర్యం చేయలేకపోయారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. అట్లు దిక్కు దప్పి యడవిలోపలఁ గొన్ని। దినము లిట్టునట్టుఁ దిరుగ నొక్క
బోయ చూచి 'యెందుఁ బోయెద?' రనవుడు। 'హరి తపంబుసేయు నచటి' కనిరి. 160

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; దిక్కు+తప్పి= దిక్కు తప్పిపోయి; అడవిలోపలన్= అడవిలో; కొన్ని దినములు= కొద్ది రోజులు; ఇట్టున్+అట్టున్= ఇట్లా అట్లా; తిరుగన్= తిరుగగా; ఒక్క బోయ= ఒక బోయవాడు; చూచి= వీరిని చూచి; ఎందున్+పోయెదరు?+అనవుడున్= ఎక్కడికి వెళ్ళుతున్నారు? అనగా; హరి= శ్రీకృష్ణుడు; తపంబు+చేయు+అచటికిన్= తపస్సు చేస్తున్న ఆ చోటికి; అనిరి= అన్నారు.

తాత్పర్యం: ఆ విధంగా దిక్కు తప్పిపోయి అడవిలో కొన్నిరోజులు ఇట్లా అట్లా తిరుగుతుండగా, ఒక బోయవాడు వీరిని చూచి ఎక్కడికి వెడుతున్నా?' రని అడిగాడు. 'శ్రీకృష్ణుడు తపస్సు చేస్తున్న చోటికి' అని వీరు చెప్పారు.

క. అన విని 'యొకనాఁ డొక్కెడఁ। గనుఁగొంటిం గృష్ణుఁ జూపఁగా వచ్చెద నా
వన భూమి నాతఁ డింతకుఁ। జనునో నిలుచునొ యెఱుంగఁ జనుదెం' డనుచున్. 161

ప్రతిపదార్థం: అనన్+విని= అని చెప్పగా విని; ఒకనాఁడు= ఒకరోజు; ఒక్క+ఎడన్= ఒకచోట; కృష్ణున్+కనుఁగొంటిన్= కృష్ణుడిని చూచాను; చూపఁగాన్= చూపటానికి; వచ్చెదన్= వస్తాను; ఆ+వనభూమిన్= అడవిలో అదే చోట; అతఁడు= ఆ కృష్ణుడు; ఇంతకున్= ఇంతవరకు; నిలుచునొ?= ఉంటాడో?; చనునో?= వెళ్ళిపోయి వుంటాడో?; ఎఱుంగన్= నాకు తెలియదు; చనుదెండు= అయినారండి పోదాం; అనుచున్= అంటూ.

తాత్పర్యం: అని చెప్పగా విని 'ఒకరోజు ఒకచోట ఎక్కడో కృష్ణుడిని చూచాను. చూపటానికి వస్తాను. అయినా అడవిలో అదే చోట ఆయన ఇంతవరకు ఉంటాడో వెళ్ళిపోయి ఉంటాడో? మాత్రం నేను చెప్పలేను. అయినా పోదాం రండి' అంటూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. అక్కిరాతుండు సన వాని ననుగమించి। వెన్ను రుచిరదేహము పడియున్నచోటు
సేరి తెలియంగఁ జూచి మూర్ఛిల్లి పుడమిఁ। బడియెఁ గవ్వడి యనుచరు లడలు నొంద. 162

ప్రతిపదార్థం: ఆ+కిరాతుండు= ఆ బోయవాడు; చనన్= ముందువెళ్ళగా; వానిన్= వాని; అనుగమించి= వెంటవెళ్ళి; వెన్ను= శ్రీకృష్ణుడి; రుచిర దేహము= మనోహరమైన దేహం; పడి+ఉన్నచోటు+చేరి= నేలమీదపడి ఉన్నచోటు చేరి; తెలియంగన్+చూచి= బాగా పరికించి చూసి; కవ్వడి= అర్జునుడు; అనుచరులు= వెంటవచ్చినవారు; అడలున్+ఒందన్= వ్యథ పొందగా; మూర్ఛిల్లి= మూర్ఛపోయి; పుడమిన్+పడియెన్= నేలమీద పడ్డాడు.

తాత్పర్యం: ఆ బోయ ముందు నడుస్తుండగా అతడి వెంటవెళ్ళి కృష్ణుడి కాంతు లీనెడి మనోహరమైన కళేబరం నేలమీద వాలి ఉన్న చోటును చేరి బాగా పరికించి చూచి, అర్జునుడు మూర్ఛపోయి నేలమీద పడిపోయాడు. అతడి వెంట వచ్చినవారు వ్యథతో క్రుంగిపోయారు.

విశేషం: ఇంతవరకు నిగ్రహాన్ని ప్రదర్శించిన 'కవ్వడి' కూడా ఇక్కడ బాలుడివలె స్పృహకోల్పోయాడు. వారిద్దరి మైత్రీబంధం. గురుశిష్యసంబంధం అంత గాఢమైనది.

అర్జునుఁడు రామకృష్ణుల కళేబరంబులు చూచి విలపించుట

క. **మఱి కొంతసేపునకుఁ దె। ప్పిఱి లేచి ముకుందు మేను పెద్దయునుం బ్రొ**
ద్దు ఱియం గౌఁగిటఁ జేర్చెం। బఱివోయిన తాల్మి నూష్మబాష్పము లురులన్. 163

ప్రతిపదార్థం: (అర్జునుడు); మఱి కొంతసేపునకున్= కొంతసేపటికి; తెప్పిఱి= తెప్పరిల్లి; లేచి= లేచికూర్చొని; ముకుందు మేనున్= కృష్ణుడి దేహాన్ని; పెద్దయునున్+ప్రొద్దు= చాలాసేపు; కౌఁగిటన్= కౌగిలిలో; పఱి+పోయిన= నశించిన; తాల్మిన్= ఓపికతో; ఊష్మ= వేడి; బాష్పములు= కంటినీరు; ఉరులన్= ప్రవహిస్తుండగా; ఇఱియన్+చేర్చెన్= ఇరికించుకొని అట్లాగే ఉంచుకొన్నాడు.

తాత్పర్యం: కొంతసేపటికి అర్జునుడు తెప్పిరిల్లి లేచి కూర్చున్నాడు. కృష్ణుడి దేహాన్ని తన కౌగిలిలో ఇరికించుకొని వాటేసుకొని అట్లాగే చాలాసేపు ఉండిపోయాడు. ఇంతవరకున్న ఓర్పు, నిగ్రహం ఇప్పు డతడిలో లేవు. నిట్టూర్పులు విడుస్తున్నాడు. కళ్ళలో వేడినీరు ధారలుగా దొర్లుతున్నది.

క. **అనుచరులలోని భూసురు। లనునయవచనములఁ దేర్ప నతఁ డంకిలి దే**
ఱినమతితో నశ్రులు మఱి। యును గ్రమ్మం గరతలమున నొత్తుచుఁ జూచున్. 164

ప్రతిపదార్థం: అనుచరులలోని= వెంటవచ్చిన వారిలో ఉన్న; భూసురులు= బ్రాహ్మణులు; అనునయ= ఓదార్పు; వచనములన్= మాటలతో; తేర్పన్= ఓదార్చగా; అతఁడు= ఆ అర్జునుడు; అంకిలి= కలఁత; తేఱిన= తగ్గిన; మతితోన్= మనస్సుతో; అశ్రులు= కళ్ళలో నీరు; మఱియును+క్రమ్మన్= మరల క్రమ్ముకొనగా; కరతలమునన్= అరచేతితో; ఒత్తుచున్= తుడుచుకుంటూ; చూచున్= చూస్తాడు.

తాత్పర్యం: వెంటవచ్చిన వారిలో ఉన్న బ్రాహ్మణులు ఓదార్పు మాటలతో ఓదార్చగా అర్జునుడు కలతనుండి కొద్దిగా తేరుకొని, కళ్ళలో మరల నీరు క్రమ్ముకొనగా అరచేతితో తుడుచుకుంటూ అటూ ఇటూ చూచాడు.

ఉ. **'ఏమిట నిట్టులయ్యె నొకొ? యిమ్మహితాత్మకుఁ' డంచు నున్మిష**
ద్ధామములైన యంగములఁ దాఁ గలయం బరికించి యోగిహృ
ద్యామల పాదపద్మగత మైన విశేషము చూచి రుద్రతే
జోమయుఁ డైన సంయమి వచోగతి గాంచి సువిస్మితాత్ముఁడై. 165

ప్రతిపదార్థం: ఏమిటన్= ఏ కారణంచేత; ఈ+మహితాత్మకుఁడు= ఈ మహానుభావుడు; ఇట్టులు+అయ్యెన్+ఒకొ?= ఇట్లా అయ్యాడో?; అంచున్= అనుకొంటూ; ఉన్మిషత్= వికసించుచున్న; ధామములన్= స్థానములు గల; అంగములన్= అవయవాలను; తాన్= తాను (అర్జునుడు); కలయన్+పరికించి= బాగా పరిశీలించి; యోగి= యోగులకు; హృద్య= ప్రీతిని గూర్చునట్టి; అమల= పవిత్రమైన; పాదపద్మగత= కమలంవంటి పాదంలోని; విశేషము= వ్యత్యాసాన్ని (విశేషాన్ని - గాయంచేత ఏర్పడ్డ మార్పును); చూచి= గమనించి; రుద్రతేజోమయుఁడు+ఐన= రుద్రతేజస్సు నిండిన; సంయమి= ఋషి; వచస్+గతి= మాట తెఱగును; కాంచి= చూచి; సువిస్మిత+ఆత్ముఁడు+ఐ= మనసులో ఆశ్చర్యం పొంది.

తాత్పర్యం: 'ఈ మహానుభావుడు ఏ కారణంచేత ఇట్లా అయ్యాడో పాపం!' అనుకొంటూ బాగా విప్పారిన, ప్రకాశవంతములైన అవయవాలను అర్జునుడు బాగా పరిశీలించాడు. యోగులకు ప్రీతిని కలిగించే కృష్ణుడి పవిత్రపాదంలో

ఉన్న మార్పును - గాయాన్ని గమనించి రుద్రతేజస్సు నిండిన మహర్షి మాట ఫలితాన్ని - కృష్ణుడి మరణం ద్వారా సత్యం కావటాన్ని - చూచినవాడై, మనసులో ఆశ్చర్యం పొందాడు.

విశేషం: రుద్రుడు కాలస్వరూపుడు. ఋషి శాపంలో కాలప్రచోదనమున్నది. అందుకనే అది శ్రీకృష్ణుడిని కూడా వదలటంలేదని అర్థం. ఈ కారణంచేతే అర్జునుడికి ఆశ్చర్యం కలిగింది.

క. అవికృతమును రుచిరమునై। యవయవములు నిదుర వోయినప్పటి క్రియ నుం
డ వఱలు కృష్ణుని దేహం। బవిరత చక్షురభిముఖత నాలోకించెన్. 166

ప్రతిపదార్థం: అవికృతమును= ఏ వికారమూ పొందనివి; రుచిరమును+ఐ= కాంతిమంతములైనవి (అయిన); అవయవములు= దేహభాగాలు; నిదుర+పోయినప్పటి+క్రియన్= నిదురపోతున్నప్పటివలె; ఉండన్= ఉండగా; వఱలు= ప్రకాశిస్తున్న; కృష్ణుని దేహంబు= శ్రీకృష్ణుడి కళేబరాన్ని; అవిరత= ఎడతెరపి లేకుండా; చక్షుః+అభిముఖతన్= కంటి కెదురుగా; ఆలోకించెన్= చూస్తూ ఉండిపోయాడు.

తాత్పర్యం: ఆ కృష్ణుడి శరీరావయవాలు ఏ వికారాన్నీ పొందలేదు. కాంతి మునుపటివలెనే ఉన్నది. నిదురపోతున్నప్పటి వలె ప్రకాశవంతంగా వెలిగిపోతున్నది ఆ దేహం. ఆ దేహాన్ని కన్నార్పకుండా అట్లాగే చూస్తూ ఉండిపోయాడు.

ఉ. అమ్మెయి నూరకుండ ననుయాయి జనమ్ములు పెక్కు లాడి చి
త్తమ్ము కలంక దేర్చి యుచితక్రియకున్ మొగకొల్పి 'బంధుసం
ఘమ్ముల నిందుఁ దెత్తమొ? వికారవిదూర! యుపేంద్రు భవ్యదే
హమ్ముట గొంచుఁ బోదమొ? సమర్థవిధం బొకఁ డేర్పరింపుమా!' 167

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ విధంగా; ఊరకుండన్= అర్జునుడు ఉలుకు పలుకు లేకుండా ఉండగా; అనుయాయి= వెంటవచ్చు; జనమ్ములు= జనులు; పెక్కులు+ఆడి= చాలా విధాలుగా ఓదార్పు మాటలు చెప్పి; చిత్తమ్ము కలంకన్+తేర్చి= మనసు కలతను పోగొట్టి; ఉచిత క్రియకున్= చేయదగిన పనికి; మొగకొల్పి= ప్రోత్సహించి; బంధుసంఘమ్ములన్= బంధువుల సమూహములను; ఇందున్= ఇక్కడికి; తెత్తమొ?= తెద్దామా?; వికార= వికారానికి; విదూర= దూరంగా ఉన్నవాడా!; ఉపేంద్ర= కృష్ణుడి; భవ్యదేహమ్ము= పవిత్రదేహాన్ని; అటన్= ద్వారకకు; కొంచున్+పోదమొ?= తీసికొని వెళ్దామా?; సమర్థ= తగిన; విధంబు= పద్ధతిని; ఒకఁడు= ఒకదానిని; ఏర్పరింపుమా!= ఏర్పరచుము.

తాత్పర్యం: ఆ విధంగా ఉలుకూ పలుకూ లేకుండా కృష్ణుడి దేహాన్ని అర్జునుడికి అతడి వెంట వచ్చిన జనులు చాలా విధాలుగా ఓదార్పు మాటలు చెప్పి, అతడి మనసులోని కలతను పోగొట్టి, చేయదగిన పనికి ప్రోత్సహించారు. 'ద్వారకలోని బంధువులను ఇక్కడికి తీసికొనిరావటమో!, ఏ వికారమూ పొందనివాడా! పవిత్రమైన శ్రీకృష్ణుడి దేహాన్ని ద్వారకకు తీసికొని పోవటమో! ఈ రెంటింటిలో తగినపని ఏదో నిర్ణయించి చెప్పుము' అన్నారు.

చ. అని యడుగంగ 'దైవగతి నంబుధి పట్టణమాక్రమించు టె
ద్దినమున నొక్కొ?' యన్నవగ మదిం జొనిపెం గురునాథ! యప్పు డ

వ్వినుతగుణాభిరాముఁ డడవిం దమత్రిమ్మటఁ జన్నప్రొద్దు ల
య్యనుచరకోటితోడఁ దెలియం దలపోయఁగ లెక్క దోఁచినన్. 168

ప్రతిపదార్థం: అని= వారు ఈ విధంగా; అడుగంగన్= అడుగగా; కురునాథ!= ఓ రాజా! వినుము; అంబుధి= సముద్రం; పట్టణము+ఆక్రమించుట= ద్వారకను ఆక్రమించటం; ఏ+దినమునన్+ఒక్కో= ఏ రోజో!; అన్+వగ= అనే ఆలోచన; మదిన్= మదిలో; చొనిపెన్= ప్రవేశింపజేశాడు (ఆలోచించాడు); అప్పుడు= ఆలోచించినవాడై; ఆ+వినుత+గుణ+అభిరాముఁడు= ఆ ప్రశస్త గుణాలచేత అభిరాముడైన అర్జునుడు; అడవిన్= అడవిలో; తమ= తమయొక్క; త్రిమ్మటన్= త్రిప్పటలో; చన్న+ప్రొద్దులు= కడచిపోయినరోజులను; ఆ+అనుచర+కోటితోడన్= తనవెంట వచ్చిన వారితో; తెలియన్+తలపోయఁగన్= బాగా ఆలోచించగా; లెక్క+తోఁచినన్= లెక్క తేలగా.

తాత్పర్యం: వారు ఈ విధంగా అడుగగా అర్జునుడు 'సముద్రం ద్వారకను ఆక్రమించేది ఏ రోజో!' అన్న ఆలోచన చేశాడు. ఆలోచించి, అడవిలో తాము తిరిగిన తిరుగుళ్ళతో ఎన్నిరోజులు గడిచిపోయాయో తోడుగా ఉన్నవారితో కలిసి బాగా ఆలోచించాడు. చివరికి లెక్క తేలింది. (తరువాతి పద్యంతో అన్వయం).

క. మఱునాఁడ యగుట లెస్సగ । నెఱిఁగె; నినుం డపుడు వేఁడి యెడలిన దీప్తుల్
దుఱఁగలిగొనఁ బశ్చిమగిరి । చఱికి ననతి దూరమున విశదుఁడై తోఁచెన్. 169

ప్రతిపదార్థం: మఱునాఁడు+అ= మరుసటిరోజే; అగుటన్= కావటాన్ని; లెస్సగన్= బాగా; ఎఱిఁగెన్= గుర్తించాడు; అపుడు= ఆ సమయంలో; ఇనుండు= సూర్యుడు; వేఁడి= వేడిమి; ఎడలిన= తగ్గిన; దీప్తుల్= కాంతులు; తుఱఁగలిగొనన్= ప్రకాశిస్తుండగా; పశ్చిమగిరి= పడమటికొండ; చఱికిన్= చఱియకు; అనతి దూరమునన్= దగ్గరలోనే; విశదుఁడు+ఐ= స్పష్టంగా; తోఁచెన్= కనిపించాడు.

తాత్పర్యం: మరుసటి ఉదయమే సముద్రం ద్వారకను కబళిస్తుందని లెక్కతేలింది. అప్పుడే సూర్యుడు వేడిమి తగ్గిన కాంతులతో పడమటి కొండచరియకు సమీపంలోనే ప్రకాశిస్తూ కనిపించాడు.

సీ. దాని కజ్జనములుఁ దాను నుత్తల మంది । చర్చించి కార్యంబు చాయఁగాంచి
'మనము కృష్ణునిఁ గని చనుదెంచినారమై । పురమున నివ్వార్త పుట్టకుండ
నడచి యచ్చటి మాట లవి కొన్ని ఘటియించి । చెప్పి యూరేయి చెచ్చెరఁ బ్రయాణ
మునకుఁ గృత్యములగు పనులెల్ల సమకట్టి । వేగంగ గ్రక్కున వెడలవలయుఁ
ఆ. గాని వెడలకున్న భానూదయంబున । వనధి పురము ముంచికొనిన గణన
సేయరాని యట్టి సేగియుఁ బ్రయ్యుఁ బా । పంబు వగయు నెల్లభంగిఁ గలుగు. 170

ప్రతిపదార్థం: దానికిన్= అట్లా సూర్యాస్తమయం చూడటంవలన; ఆ+జనములున్= ఆ జనులు; తానున్= తానూ; ఉత్తలము+అంది= భయపడి; చర్చించి= బాగా ఆలోచించి; కార్యంబు= ఏమి చేయాలో - ఆ పని; చాయన్+కాంచి= పద్ధతిని నిర్ణయించుకొని (అర్జునుడు ఇట్లా చెప్పాడు); మనము= అడవిలోకి వచ్చినమనము; కృష్ణునిన్+కని= కృష్ణుడిని చూచి; చనుదెంచినారము+ఐ= తిరిగి వచ్చినవారివలె; పురమునన్= నగరంలో; ఈ+వార్త= కృష్ణుడి మరణవార్త; పుట్టకుండన్= పుట్టకుండా; అడఁచి= దాచిపెట్టి; అచ్చటి మాటలు= అక్కడ ఆడవలసిన మాటలు; అవి కొన్ని ఘటియించి= ఆ సమయానికి కావలసినవాటిని

కూర్చుకొని; చెప్పి= వారికి చెప్పి; ఈ రేయి= ఈ రాత్రి; చెచ్చెరన్= త్వరితంగా; ప్రయాణమునకున్= ద్వారకను వదలి బయలుదేరటానికి; కృత్యములు+అగు= చేయదగిన; పనులు+ఎల్లన్= పనులన్నిటినీ; సమకట్టి= పూర్తిచేసికొని; వేగంగన్= ఉదయం కాక మునుపే; గ్రక్కునన్= శీఘ్రంగా; వెడలవలయున్= బయటపడాలి; కాని= అట్లా కాకుండా; వెడలక+ఉన్నన్= బయటికి వెళ్ళకపోతే; భాను+ఉదయంబునన్= సూర్యోదయం కాగానే; వనధి= సముద్రం; పురమున్= నగరాన్ని; ముంచివేస్తే; గణన+చేయరాని= లెక్కించటానికి వీలులేని; సేగియున్= కీడు; ప్రయ్యున్= నిందపడును; పాపంబున్= పాపమూ; వగయున్= వ్యథా; ఎల్ల భంగిన్= అన్నివిధాలా; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: అట్లా సూర్యాస్తమయం చూడగానే ఆ జనులూ తానూ భయపడ్డారు. బాగా ఆలోచించి ఏమి చేయాలో నిర్ణయించుకొని అర్జునుడు ఇట్లా చెప్పాడు: 'మనం కృష్ణుడిని చూచి తిరిగి వచ్చిన వారివలెనే - కృష్ణుడి మరణవార్త నగరంలో పొక్కకుండా దాచిపెట్టి, అవసరాన్ని బట్టి ఆ సమయానికి కావలసినట్లుగా వారివారికి చెప్పి ఈ రాత్రికే త్వరితంగా ద్వారకను వదలివేసి బయలుదేరటానికి చేయదగిన పనులన్నిటినీ పూర్తిచేసికొని ఉదయం కాక మునుపే అతి శీఘ్రంగా ద్వారకనుండి బయటపడాలి. అట్లా కాకుండా బయటికి వెళ్ళకపోతే సూర్యోదయం కాగానే సముద్రం నగరాన్ని ఆక్రమించుకుంటే లెక్కకు మిక్కుటంగా ప్రాణనష్టం జరిగి - ఆపద, నింద, పాపం, వ్యథ మనందరికీ కలుగుతాయి.

విశేషం: కృష్ణుడి మరణవార్త చెప్పితే ప్రయాణసన్నాహాలు చేసే బుద్ధికూడా ఎవరికీ ఉండదు. అట్లా చేయకపోతే ప్రాణాలు పోయి, ఆస్తులు నశించి ద్వారకావాసులకు ఆపద వస్తుంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనలేని రాజప్రతినిధి అర్జునుడికి నింద వస్తుంది. ఇంతమందిని చంపిన పాపం వస్తుంది. దీనితో కలిగేది వ్యథమాత్రమే - అందుకే అర్జునుడు ఈ నిర్ణయం తీసికొన్నాడు.

అర్జునుఁడు రామకృష్ణులకు నగ్నిసంస్కారంబు సేయుట

ఉ. **కావున వేగ మగ్నియును గాష్ఠములున్ సమకూర్చి సద్విధి**
శ్రీవిలసిల్లఁ గృష్ణుని శరీరము సంస్కృతిఁ గూర్చి క్రమ్మఱం
బోవుట బుద్ధి' యంచు మఱి భూసురకోటియుఁ దాను గాఢసం
భావనతోడఁజేసె దృఢభక్తికుఁడై పితృమేధభద్రమున్. **171**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; వేగము= శీఘ్రంగా; అగ్నియునున్= అగ్నీ; కాష్ఠములున్= కర్రలూ; సమకూర్చి= సిద్ధం చేసికొని; సత్+విధి+శ్రీ= శాస్త్రకర్మ యొక్క ఉత్తమత్వం; విలసిల్లన్= సిద్ధించగా; కృష్ణుని శరీరమున్= శ్రీకృష్ణుడి దేహాన్ని; సంస్కృతిన్= అగ్ని సంస్కారంలో - చితిలో; కూర్చి= చేర్చి; క్రమ్మఱన్= తరువాత; పోవుట బుద్ధి= పోవటం తెలివైనపని; అంచున్= అని; మఱి= తరువాత; భూసురకోటియున్= బ్రాహ్మణసమూహమూ; తానున్= తానూ; గాఢ= గాఢమైన; సంభావనతోడన్= తలపుతో కూడిన శ్రద్ధతో; దృఢభక్తికుఁడై= దృఢమైనభక్తి కలవాడై; పితృమేధభద్రమున్= పితృయజ్ఞ మంగళాన్ని; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: కాబట్టి శీఘ్రంగా అగ్నిని, కర్రలను సిద్ధం చేసికొని శాస్త్రకర్మలో ఉత్తమత్వం సిద్ధించేటట్లు శ్రీకృష్ణుడి దేహాన్ని చితాగ్నిలో చేర్చి తరువాత బయలుదేరిపోవటం తెలివైనపని' అని ఆలోచించి బ్రాహ్మణులతో కూడి అర్జునుడు గాఢంగా శ్రీకృష్ణుడిని తలచుకొంటూ భక్తిశ్రద్ధలతో శ్రేష్ఠమైన పితృయజ్ఞాన్ని నిర్వర్తించాడు.

విశేషం: పితృయజ్ఞంలో ప్రధానమైనవి భక్తిశ్రద్ధలు. మృతుడిపట్ల గాఢమైన సంభావన. ఇట్లా చేస్తే ఆ శాస్త్రకర్మలో ఉత్తమత్వం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సిద్ధిస్తుంది. అందుకే శ్రేష్ఠమైన పితృమేధ మది. అది లేకుండా కేవలం పదార్థవైభవంతో చేసేదానికి ఆ ఉత్తమత్వసిద్ధి ఉండదని అర్థం. అర్జునుడు చేసిన పితృమేధం అంత విశిష్టంగా ఉన్నదని అర్థం.

చ. **హలధరునిం దలంచి మునులాడిన మాట తెలంగు దప్పదం**
చలయక తత్ప్రదేశమున నారసి కాంచి తదీయదేహమున్
వలయు తెఱంగునం బరమవహ్నికి నాహుతి సేసె నయ్యనా
కులహృదయుండు భూమిసురకోటియుఁ దానును సత్వరంబుగన్. **172**

ప్రతిపదార్థం: హలధరునిన్= బలరాముడిని; తలంచి= తలచుకొని; మునులు+ఆడినమాట+తెఱంగు= మునులు ఇచ్చిన శాపవిధానం; తప్పదు+అంచున్= తప్పదని; అలయక= బడలక; తద్+ప్రదేశమునన్= ఆ ప్రాంతాలలోనే; ఆరసి= వెదకి; తదీయ దేహమున్= అతడి కళేబరాన్ని; కాంచి= చూచి; ఆ+అనాకుల హృదయుండు= కలతలేని హృదయమున్న ఆ అర్జునుడు; భూమిసురకోటియున్+ తానును= బ్రాహ్మణులు, తానూ (కలిసి); సత్వరంబుగన్= అతి శీఘ్రంగానే; (ఆ దేహాన్ని); వలయు తెఱంగునన్= చేయవలసిన పద్ధతిలో; పరమవహ్నికిన్= శ్రేష్ఠమైన చితాగ్నికి; ఆహుతి+చేసెన్= ఆహుతి చేశాడు.

తాత్పర్యం: బలరాముడి గురించి తలచుకొని మునుల శాపోక్తి తప్పదని ఆలస్యం చేయకుండా ఆ ప్రాంతాలలోనే వెదుకగా ఆ బలరాముడి దేహమూ కనిపించింది. ఏ కలతాలేని స్థిరమైన హృదయంతో బ్రాహ్మణుల సహాయంతో అర్జునుడు ఆ కళేబరాన్ని కూడా చితాగ్నిలో ఆహుతి చేశాడు.

విశేషం: బలరాముడు పెద్దవాడుకదా! తరువాత ఉత్తరక్రియ చేయటం ఎట్లాగని అనిపించవచ్చును. అర్జునుడి మనసులో కృష్ణుడే ఉన్నాడు. బలరాముడి మృతి తొలుత ఊహకు కూడా వచ్చి ఉండకపోవచ్చును. అందుకే ఇట్లా జరిగింది. నారాయణాంశ కృష్ణుడు. శేషాంశ బలరాముడు - కాబట్టి కూడా ఈ వరుస సమర్థనీయమే.

సీ. **అబ్బంగిఁ గృతకృత్యుఁ డైన యప్పార్థుండు। యాదవపురమున కరుగుచున్న**
యెడ ననుచరులతో నిట్టి కార్యంబును। నడపక తక్కిన నాథు చన్న
గతికిఁ బోవుటకునై కడఁగెడు రుక్మిణీ। ప్రభృతుల మనకు నిల్పంగ వశమె?
రే యెల్ల నిప్పని సేయు విధముల క। వ్యయ మగు నంతకు వచ్చు నబ్ధి

ఆ. **మేలు సేయఁ బోయి యీ లోకమంతయుఁ। దిట్టునట్టి కీడు దెచ్చికొనఁగ**
వచ్చునే? స్వదేశవర్తులమై చూచి। కొంద మెల్లపనులు రండు వేగ. **173**

ప్రతిపదార్థం: ఆ+భంగిన్= ఆ విధంగా; కృతకృత్యుఁడైన= విహితమైన పనిని చేసినవాడైన; ఆ+పార్థుండు= ఆ అర్జునుడు; యాదవపురమునకున్= ద్వారకకు; అరుగుచున్న+ఎడన్= వెడుతున్న సమయంలో; (అర్జునుడు ఇట్లా అన్నాడు); ఇట్టి కార్యంబును= ఇట్లాంటి పనిని; నడపక తక్కినన్= చేయకుండా వదిలి ఉంటే; నాథు చన్న గతికిన్= భర్తపోయిన గతికి (మరణించటానికి); పోవుటకున్+ఐ= వెళ్ళటానికి; కడఁగెడు= సిద్ధపడే; రుక్మిణీ ప్రభృతులన్= రుక్మిణి మొదలగు కృష్ణుడి రాణులను; మనకు; నిల్పంగన్+వశమె?= నిలపటానికి వీలవుతుందా?; రేయి+ఎల్లన్= రాత్రంతా; ఈ+పని+చేయు విధములకున్+అ= ఇట్లా వారిని ఓదార్చి సర్దే పనిచేస్తూ ఉండిపోవటానికే; వ్యయమగున్+అంతకున్= వ్యర్థమయిపోతే, అంతలోపలే; అబ్ధి= సముద్రం; వచ్చున్=

ముంచుకొని వస్తుంది; (అట్లా అయితే); మేలు+చేయన్+పోయి= మేలు చేయటానికి పోయి; ఈ లోకము+అంతయున్= ఈ లోకంలోని అందరూ; తిట్టునట్టి కీడున్= తిట్టేటటువంటి ఆపదను; తెచ్చికొనఁగన్?+వచ్చునే= తెచ్చుకోవచ్చునా?; స్వదేశవర్తులమై= మనదేశంలోనే ఉంటూ; ఎల్లపనులు= అన్ని పనులూ; చూచికొందము= చూచికొందాము; వేగన్= వేగంగా; రండు= కదలి రండి.

తాత్పర్యం: ఆ విధంగా విహితమైన పితృకార్యాన్ని నెరవేర్చి ధన్యుడైన ఆ అర్జునుడు ద్వారకకు వెళ్ళుతున్న సమయంలో అనుయాయులతో ఇట్లా అన్నాడు: 'ఇంత ముఖ్యమైన పనిని చేయకుండా వదలి ఉంటే భర్తతోపాటు మరణించటానికి సిద్ధపడే రుక్మిణి మొదలైనవారిని నిలుపటానికి వీలవుతుందా? ఇట్లా వారిని ఓదార్చి సర్దే పనిచేస్తూ ఉండిపోవటానికే రాత్రి వ్యర్థమయిపోతే అంతలోపలే సముద్రం ముంచుకొని వస్తుంది. అట్లా అయితే మేలు చేయటానికి పోయి లోకంలోని అందరూ తిట్టిపోసేటటువంటి ఆపదను కొనితెచ్చుకొన్నట్లవుతుంది. అది మంచిదా? మన నగరానికి చేరుకొని, అక్కడే ఉంటూ అన్ని పనులూ చూచికొందాము. తొందరగా కదలిరండి.'

తే. **అనుచు నరిగి తాఁ దలఁచిన యట్ల యెల్ల। తెఱఁగు పనులు నా రాత్రిలోఁ దీర్చి ప్రొద్దు**
పొడుపునకు మున్న వెడలించెఁ బురము సకల। జనములను జీవధనముల సరకు నతఁడు. **174**

ప్రతిపదార్థం: అనుచున్+అంటూ; అరిగి= ద్వారకానగరం చేరి; తాన్= తాను; తలఁచిన+అట్లు+అ= తాను ఆలోచించిన విధంగానే; ఎల్ల+తెఱఁగుపనులు= అన్ని విధాలైన పనులనూ; ఆ రాత్రిలోన్= ఆ రాత్రిలోనే; తీర్చి= పూర్తిచేసి; ప్రొద్దుపొడుపునకున్+మున్ను+అ= సూర్యోదయం కాక మునుపే; సకలజనములనున్= ప్రజలందరినీ; జీవధనములన్= జీవరాసులను, ధనమును; సరకున్= సామానులను; అతఁడు= అర్జునుడు; పురము= ద్వారక; వెడలించెన్= దాటించాడు.

తాత్పర్యం: ఇట్లా అంటూ ద్వారకను చేరి, తాను తలచుకొన్న విధంగానే అన్ని విధాలైన పనులను ఆ రాత్రికి రాత్రే పూర్తిచేసి, సూర్యోదయం కాకమునుపే ప్రజలను, జీవరాసులను, ధనాన్ని, సామానులను అర్జునుడు ద్వారకానగరం దాటించాడు.

సీ. **అప్పుడు కృష్ణుని యంతఃపురాంగనా। జనము షోడశ సహస్రమ్ము నతని**
మహిషీజనుల రాముమహిళల నుచితవా। హనముల నిడికొని యర్హపురుష
లేతేరఁ దేరుల నేనుంగులను గుఱ్ఱ। ములను దత్పరిచారకులు ప్రయత్న
మున సవరణ తోడఁ గొని రా నగరి సర। కులుఁ దదీయాధికారులు బహు ప్ర

ఆ. **కారశకటములను గావళ్ళ నెత్తించి। యరసికొని కడంక నరుగుదేర**
విగతనాథ లైన మగువల గారాము। సెడక యుండునట్లు నడపికొనుచు. **175**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కృష్ణుని= శ్రీకృష్ణుడి; అంతఃపుర+అంగనాజనమున్= అంతఃపుర స్త్రీలు; షోడశసహస్రమ్మున్= పదారువేలమందిని; అతని= శ్రీకృష్ణుడి; మహిషీజనులన్= పట్టపురాణులను; రాము+మహిళలన్= బలరాముడి భార్యలను; ఉచిత వాహనములన్+ఇడికొని= తగిన వాహనములలో కూర్చొనబెట్టుకొని; అర్హపురుషులు= తగిన సేవకులు; ఏతేరన్= తోడురాగా; తేరులన్= రథాలను; ఏనుంగులనున్= ఏనుగులను; గుఱ్ఱములనున్= గుఱ్రాలను; తద్+పరిచారకులు= వాటివాటి సేవకులు; ప్రయత్నమునన్= పూనికతో; సవరణతోడన్+కొనిరాన్= వాటివాటి పరికరాలతో సిద్ధం చేసి తీసికొని రాగా; నగరిసరకులు= నగరికి సంబంధించిన సామగ్రిని; తదీయ+అధికారులు= ఆ నగరి పాలకులు; బహుప్రకార= నానావిధాలైన; శకటములనున్=

బండ్లలోను; కావళ్ళన్= కావళ్ళలోను; ఎత్తించి= ఎత్తించుకొని; అరసికొని= బాగా పరిశీలించుకొని; కడంకన్= పూనికతో; అరుగుదేరన్= బయలుదేరగా; విగతనాథలైన= భర్తలుపోయిన; మగువలన్= ఆ స్త్రీలను; గారాము+చెడక+ఉండునట్లు= మర్యాద తగ్గకుండునట్లుగా; నడపికొనుచున్= నడపుకొంటూ.

తాత్పర్యం: ఆ సమయంలో శ్రీకృష్ణుడి అంతఃపురకాంతలు పదహారువేలమందిని, అష్టమహిషులను, బలరాముడి నలుగురు భార్యామణులను తగిన వాహనములలో కూర్చొనబెట్టుకొని; తగిన సేవకులు తోడు రాగా, రథాలను, గుర్రాలను, ఏనుగులను, వాటి వాటి సేవకులు (చోదకులు, రౌతులు,మావటీలు) పూనికతో వాటివాటి పరికరాలతో అలంకరించి తీసికొనిరాగా, నగరికి సంబంధించిన సామగ్రిని ఆ నగరి ఉద్యోగులు నానావిధాలైన బండ్లలోను. కావళ్ళలోను ఎత్తించుకొని బాగా పరిశీలించి పూనికతో బయలుదేరగా భర్తలు పోయిన ఆ స్త్రీల మర్యాద ఏమాత్రం తగ్గకుండా ఉండేటట్లు చూచికొంటూ అర్జునుడు ప్రయాణం నడిపించాడు.

క. **విను వజ్రముఖ్య యాదవ। జనము నుచితవృత్తి నడపి సర్వంబున క**
య్యనఘుండు దాన దిక్కయి। చనియె నరదమునను మది విషాదము గదురన్. **176**

ప్రతిపదార్థం: విను= రాజా వినుము!; వజ్రముఖ్య= వజ్రుడు మొదలైన; యాదవజనమున్= యాదవులసమూహాన్ని; ఉచితవృత్తిన్= తగిన రీతిలో; నడపి= ప్రయాణం చేయించి; సర్వంబునకున్= అందరికీ, అన్నింటికీ; ఆ+అనఘుండు= ఆ పుణ్యాత్ముడు; తాను+అ= తానే; దిక్కు+అయి= సంరక్షకుడై; మదిన్= మనసులో; విషాదము= దుఃఖం; కదురన్= కలుగగా; అరదమునను= రథంలో; చనియెన్= ప్రయాణం చేశాడు.

తాత్పర్యం: స్త్రీలను మాత్రమే కాకుండా పురుషులైన వజ్రుడు మొదలైన యాదవులను కూడా సముచితమైన రీతిలో గౌరవప్రదంగా ప్రయాణం చేయించి అందరికీ తానే దిక్కుగా ఆ పుణ్యాత్ముడైన అర్జునుడు మనసులో కొండంత దుఃఖం కలుగుతున్నా రథంలో ప్రయాణం చేశాడు.

క. **ఇమ్మెయి నరుండు సకల జ। నమ్ము వెడల నినుఁడు పూర్వనగ మెక్కెను వే**
గమ్మున ముంచుకొనియె నగ। రమ్ము పయోరాశి భరతరాజవరేణ్యా! **177**

ప్రతిపదార్థం: భరతరాజవరేణ్యా!= భరతవంశరాజులలో శ్రేష్ఠుడా; ఈ+మెయిన్= ఈ విధంగా; నరుండు= అర్జునుడు; సకలజనమ్ము= జనులందరూ; వెడలన్= బయలుదేరగా; ఇనుఁడు= సూర్యుడు; పూర్వ నగము+ఎక్కెను= తూర్పుకొండను ఎక్కాడు; వేగమ్మునన్= అతి త్వరగా; పయోరాశి= సముద్రం; నగరమ్ము= నగరాన్ని; ముంచుకొనియెన్= ముంచివేసింది.

తాత్పర్యం: ఈ విధంగా అర్జునుడు ద్వారకావాసులు ఎప్పుడు నగరంనుండి బయటపడ్డారో, అప్పుడే సూర్యుడు తూర్పుకొండ నెక్కాడు - సూర్యోదయమైంది. అంతే! ఒక్కుమ్మడిగా సముద్రం నగరాన్ని ముంచివేసింది.

విశేషం: అర్జునుడు వసుదేవుడి వద్దకు వచ్చినప్పటినుండి ఇప్పటివరకు-అతడి కార్యదక్షత నిరూపించబడింది. నరుడి శక్తి ఎంతవరకు పనిచేయగలదో ఈ ఘట్టం నిరూపిస్తున్నది.

ద్వారకానగరంబు సముద్రమున మునింగిపోవుట (సం.16-8-40)

క. వననిధి పురంబు ముంపఁగ। మనుజేశ్వర! యెల్లజనులు మరలఁబడి కనుం
గొని రద్భుత రసపూరం। బునఁ బెన్నిట్టఁ దమ చిత్తములు మునుఁగంగన్. 178

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వర!= ఓ నరవరా! రాజా! (ఏమి చెప్పను!); వననిధి= సముద్రం; పురంబున్= నగరాన్ని; ముంపఁగన్= ముంచివేయగా; ఎల్లజనులున్= జనులందరూ; మరలఁబడి= వెనుదిరిగి; అద్భుతరసపూరంబునన్= అద్భుతరస ప్రవాహం యొక్క; పెన్నిట్టన్ (పెను+నిట్టన్)= పెద్దప్రవాహంలో; తమ చిత్తములు= తమ మనస్సులు; మునుఁగంగన్= మునిగిపోగా; కనుఁగొనిరి= చూచారు.

తాత్పర్యం: ఆ సముద్రం నగరాన్ని ఒక్కసారిగా ముంచివేస్తుంటే ప్రయాణం చేస్తున్న వీరందరూ ఒక్కసారి వెనుదిరి చూచారు. వారి హృదయాలు అద్భుతరసప్రవాహంలో మునిగిపోయాయి.

విశేషం: నగరం నీటిలో మునిగిపోతే వారి మనసు అద్భుతరసమనే ప్రవాహంలో మునిగిపోయినదని - రెండూ మునిగిపోయాయి.

తే. అపుడు రెండవ జలనిధి యనఁగఁ జాలి। యద్భుతోద్భూత వాక్యచయంబు పేర్మి
మ్రోయు నా జనసంఘంబు మురవిరోధి। మఱఁది నడిపించె దర్శితమార్గుఁడగుచు 179

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో, అద్భుత= సముద్రం అట్లా నగరాన్ని ముంచివేయటం చూచినందువలన పుట్టిన అద్భుతరసంచేత; ఉద్భూత= జనించిన వాక్యచయంబు; పేర్మిన్= మాటల సందడిచేత; రెండవజలనిధి+అనఁగన్+చాలి= రెండవ సముద్రమా అనిపించేటట్లు; మ్రోయు+ఆ+జనసంఘంబు= అరుస్తున్న ఆ జనసందోహాన్ని; మురవిరోధి మఱఁది= మురాసురుడి విరోధి అయిన శ్రీకృష్ణుడి మరది - అర్జునుడు; దర్శిత= చూపించిన; మార్గుఁడు+అగుచున్= దారి కలవాడు అవుతూ - దారి చూపించుతూ; నడిపించెన్= ముందుకు నడిపించాడు.

తాత్పర్యం: సముద్రం అట్లా నగరాన్ని ముంచివేయటం చూచినందువలన పుట్టిన అద్భుతరసంచేత ప్రయాణం చేస్తున్నవారిలో మాటలసందడి పెరిగింది. అందరూ ఒక్కసారి ఇట్లా గగ్గోలు పెట్టేటప్పటికి ఆ జనసందోహమే మరో సముద్రంవలె అనిపించింది. అట్లాంటి పెద్దగుంపును శ్రీకృష్ణుడి మరది దారి చూపిస్తూ నడిపించాడు.

విశేషం: రెండవ జలనిధి యనఁగఁ గాలి... మ్రోయు నా జనసంఘంబు - అలంకారం: ఉత్ప్రేక్ష.

క. నడిపించి పంచవటమున। విడియించెను; వీడు చోరవీరులు గని 'యె
క్కుడు ధనములు గల వీ వ్ము। క్కడి ప్రజలో లేరు దీనిఁ గావఁగ యోధుల్. 180

ప్రతిపదార్థం: నడిపించి= అట్లా నడిపించి (అర్జునుడు వారిని); పంచవటమునన్= పంచవటమనే చోట; విడియించెను= ప్రయాణం ఆపించాడు; వీడున్= ఆ విడిదిని; చోరవీరులు+కని= బలవంతులైన దొంగలు చూచి; ఎక్కుడు ధనములు= దండిగా ధనరాశులు; కలవు= ఉన్నాయి; (కాని); ఈ+ముక్కడి+ప్రజలోన్= ఈ అల్పజనులలో; దీనిన్+కావఁగన్= ఈ ధనాన్ని రక్షించటానికి; యోధుల్= యోధులు; లేరు.

తాత్పర్యం: అట్లా నడిపించి అర్జునుడు వారిని పంచవటమనే చోట విడిది చేయించాడు. ఆ విడిదిని గజదొంగలు

చూచి దండిగా ధనరాశులేమో వీరివద్ద కనిపిస్తున్నా దీనికి కాపాడుకొనటానికి తగిన యోధు లెవరూ ఈ క్షుద్రజనులలో కనిపించటంలేదు.

విశేషం: కాలం కలిసిరానపుడు మహాయోధులైన యాదవజాతివారు గిరివాసులైన 'క్షుద్రు'లవలెనే ఎవరి కళ్ళకైనా కనిపిస్తారు.

క. కవ్వడి యొక్కఁడ కంటిరె? జివ్వనఁ జేరుద మితండు సేడ్పడఁ గా నిం
దెవ్వరుఁ గడంగ లే రివి । ద్రెవ్విపడిన ధనము లెఱిఁగితిమి లోఁతెల్లన్.' 181

ప్రతిపదార్థం: కవ్వడి= అర్జునుడు; ఒక్కఁడు+అ= ఒకడే; కంటిరె?= చూచారా; చివ్వనన్= శీఘ్రంగా; చేరుదము= అతడిని ఎదుర్కొందాం; ఇతండు= అర్జునుడు; చేడు+పడఁగాన్= ఓడిపోతే; ఇందున్= ఈ యాదవులలో; ఎవ్వరున్= ఎవ్వరూ; కడంగన్+ లేరు= యుద్ధంచేయబూనలేరు; ఇవి+త్రెవ్విపడిన ధనములు= ఈ ధనరాసుల ముల్లెలు సంపూర్ణంగా మనకు తెగిపడిన సొమ్ములే (మనవే); లోఁతు+ఎల్లన్= వీరి లోతుపాతులన్నీ; ఎఱిఁగితిమి= తెలిసికొన్నాం.

తాత్పర్యం: అర్జునుడిని ఒకడిని చూస్తే చాలును. అతడిని యుద్ధంలో ఎదుర్కొని ఓడించామంటే ఈ యాదవులలో మరెవ్వరూ మనతో యుద్ధానికి రారు. ఈ సొమ్ము మనదే. వీరి లోతుపాతులు కనుగొన్నాం.'

క. అని వా రొండురువులతో । మనముల నుత్సాహ మెసఁగ మానితధనముల్
గొను నగ్గలికం బలుకుచు । ననేక బలకోటులగుట నలుకేది వడిన్. 182

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; వారు= ఆ దొంగలు; ఒండు+ఒరువులతోన్= ఒకరితో ఒకరు; మానితధనముల్= మన్నింపదగిన అమూల్యమైన ఆ ధనరాసులను; మనములన్= మనసులలో; ఉత్సాహము+ఎసఁగన్= ఉత్సాహం అధికం కాగా; కొను= హరించే; అగ్గలికన్ = విజృంభణతో; పలుకుచున్= మాటాడుతూ; అనేక= చాలామంది; బలకోటులు+అగుటన్= బలవంతుల గుంపు కావటంచేత; అలుకు+ఏది= జంకు విడిచి; వడిన్= వేగంగా.

తాత్పర్యం: అని ఆ దొంగలు ఒకరితో ఒకరు, ఆ అమూల్యమైన ధనరాశులను అధికమైన ఉత్సాహంతో కబళించే వారై విజృంభణతో మాటాడుతూ, చాలామంది బలవంతులుండటంచేత జంకు విడిచి వేగంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'బాలురు వృద్ధులుఁ జుండీ । యాలమునకుఁ గడఁగ నొక్కఁ డయినను లేఁడీ
స్త్రీలం బొదువుద మనుచును । నేల యవిసి మూఁగినట్లు నిర్భరభంగిన్. 183

ప్రతిపదార్థం: బాలురు= పిల్లలు; వృద్ధులున్= ముసలివారు; చుండీ!= సుమండీ!; ఆలమునకున్= యుద్ధానికి; కడఁగన్= పూనుకొనటానికి; ఒక్కఁడు+అయినను= ఒక్క డయినా; లేఁడు= లేడు; ఈ స్త్రీలన్= ఈ ఆడువారిని; పొదువుదము= పట్టుకొందాము; అనుచును= అని మాటాడుకొంటూ; నేలయవిసి= నేల పగిలి; మూఁగినట్లు= ఆక్రమించినట్లు; నిర్భరభంగిన్= అందరూ ఒక్కసారిగా.

తాత్పర్యం: 'వీరంతా పిల్లలు, ముసలివాళ్ళు మాత్రమే సుమా! అందుచేత యుద్ధం చేయటానికి వీరిలో ఒక్కడైనా పూనుకోడు. ఈ స్త్రీలను పట్టుకొందాము రండి' అని మాటాడుకొంటూ నేల పగిలి పరుచుకొన్నట్లు ఒక్కుమ్మడిగా వారంతా ఆ స్త్రీలపై పడ్డారు. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. **ఏ పెసఁగ రేఁగి యట్లు। ప్పాపాత్మక మగు కిరాతబలము సమగ్రా**
టోపమునఁ గవిసి వివిధ ధ। నాపహరణ మాచరింప నారంభించెన్. **184**

ప్రతిపదార్థం: ఏపు= ఉత్సాహం; ఎసఁగన్= అధికం కాగా; రేఁగి= చెలరేగి (విజృంభించి); అట్లు= ఆ విధంగా; ఆ+పాప+ ఆత్మకము+అగు= ఆ పాపిష్ఠులైన; కిరాతబలము= కిరాతుల సమూహం; సమగ్ర= మిక్కిలి; ఆటోపమునన్= విజృంభణతో; కవిసి= వారినాక్రమించి; వివిధ= నానారకాలైన; ధన+అపహరణము= ధనాలను అపహరించటం; ఆచరింపన్= చేయటానికి; ఆరంభించెన్= మొదలుపెట్టింది.

తాత్పర్యం: ఉత్సాహం అధికం కాగా ఆ పాపిష్ఠులైన కిరాతుల సమూహాలు చెలరేగి, మిక్కిలి విజృంభణతో వారిని ఆక్రమించి, నానావిధాలైన నగలను నగ్రలనూ అపహరించటం మొదలుపెట్టారు.

బోయ లర్జును నోర్చి యాదవాంగనల సొమ్ముల నపహరించుట (సం.16-8-50)

సీ. **కనుఁగొని జంభారితనయుఁ డోరోరి యీ। ప్రజ కేన చుండు సంరక్షకుండఁ**
దొలఁగి పొం డడియాస నొద్దకు వచ్చినఁ। దలలేఱి యుర్వికి బలియొనర్తు
నని యదల్చినను వా రఱవాయిగొనక య। ప్పలుకులన్నియును రజ్జులుగఁ గొనుచుఁ
జూమల నచట నచ్చట నొల్చికొనఁగ నా। లోకించి యవ్వీరలోకవరుఁడు

తే. **గాండివం బెక్కువెట్టి ప్రచండబాణ। నికర మక్కిరాతుల మీఁద నిగుడఁ జేయ**
నలఘుచర్మసంవృతగాత్రు లగుచుఁ దుచ్ఛ। బాణపాషాణలగుడముల్ పరఁగఁ జేసి. **185**

ప్రతిపదార్థం: జంభారితనయుఁడు= ఇంద్రుడికొడుకైన అర్జునుడు; కనుఁగొని= దీనిని చూచి; ఓరి+ఓరి= ఒరేయ్ (ఎవడురా అక్కడ?); ఈ ప్రజకున్= ఈ ప్రజలకు; ఏన= నేనే; చుండు!= సుమండీ!; సంరక్షకుండన్= సంరక్షకుడను; చుండు!= సుమండీ; తొలఁగిపొండు= దూరంగా పొండి; అడియాసన్= వ్యర్థమైన ఆశతో; ఒద్దకున్+వచ్చినన్= వీరిని సమీపిస్తే; తలలు+ఏఱి= తలలు నరికి; ఉర్వికిన్= నేలకు; బలి+ఒనర్తున్= బలి ఇస్తాను; అని= అని ఈ విధంగా; అదల్చిననున్= అదిల్చినా కూడా; వారు= ఆ కిరాతులు; అఱవాయి+కొనక= సరకుచేయక (లెక్కించకుండా); ఆ+పలుకులు+అన్నియును= అర్జునుడి మాటలన్నిటినీ; రజ్జులుగన్= వ్యర్థ భాషణాలుగా; కొనుచున్= గ్రహిస్తూ; చాలన్= ఆ స్త్రీలను; అచటన్+అచ్చటన్= అక్కడక్కడ; ఒల్చికొనఁగన్= దోచుకొంటూ ఉంటే (నగలు ఊడ్చుకొంటుంటే); ఆలోకించి= చూసి; ఆ+వీరలోక+వరుఁడు= వీరులలో శ్రేష్ఠుడైన ఆ అర్జునుడు; గాండివంబు+ఎక్కు+పెట్టి= గాండీవాన్ని ఎక్కుపెట్టి; ప్రచండబాణ నికరము= ప్రచండమైన బాణసమూహాన్ని; ఆ+కిరాతులమీఁదన్= ఆ కిరాతులమీద; నిగుడన్+చేయన్= ప్రయోగించగా; అలఘు= దళసరియైన; చర్మ= చర్మంచేత; సంవృత= దాచబడిన; గాత్రులు+అగుచున్= అవయవాలు కలిగినవారై (ఆ కిరాతులు); తుచ్ఛ= అల్పాలైన; బాణ= బాణాలను; పాషాణ= రాళ్ళను; లగుడముల్= దుడ్డుకర్రలను; పరఁగన్+చేసి= ప్రయోగించి.

తాత్పర్యం: అర్జునుడు దీనిని చూచాడు. 'ఎవడురా వాడు! ఈ ప్రజలకు నేనే సంరక్షకుడను. జాగ్రత్త! దూరంగా పొండి. అడియాసతో వీరిని సమీపిస్తే మీ తలలు నరికి భూమికి బలిస్తాను. 'అని అదలించాడు. అయినా ఆ కిరాతులు

ఈ మాటలను వ్యర్థమైన పలుకులుగా లెక్కచేయక, ఆ స్త్రీలనుండి నగలు ఒలుచుకొనటం మొదలుపెట్టారు. దానిని చూచి ఆ వీరోత్తముడైన అర్జునుడు గాండీవధనుస్సును ఎక్కుపెట్టి భయంకరమైన బాణసమూహాన్ని ఆ కిరాతులమీద ప్రయోగించాడు. కాని, వారికి గాయం కూడా కాలేదు. వారి దళసరి చర్మాలచేత వారి అవయవాలన్నీ భద్రంగా కాపాడబడ్డాయి. వారు అతిబలహీనా లైనటువంటి బాణాలను వేశారు. రాళ్ళు విసిరారు. కర్రలు ప్రయోగించారు.

విశేషం: ఇక్కడినుండి జరిగిన యుద్ధంలో మహాభారత యుద్ధాన్ని పోల్చి చూచికొనాలి. ఆ యుద్ధంలో అర్జునుడివెంట శ్రీకృష్ణుడు ఉన్నాడు. అందుకే బాణాలు పనిచేశాయి. అక్షౌహిణుల సైన్యాన్ని మట్టి కరిపించాడు. మరి ఇప్పుడో? కేవలం 'నరుడు' మాత్రమే యుద్ధం చేస్తున్నాడు. అందుకే బాణాలు పనిచేయలేదు.

క. ఆ బోయలు నిర్భయమతు । లై బీభత్సుపయిఁ గవియ నతఁడు మహాస్త్ర
ప్రాబల్యంబును మెఱయుటఁ । దా బుద్ధిఁ దలంచి మంత్రతతిఁ దోఁపమికిన్. 186

ప్రతిపదార్థం: ఆ బోయలు= ఆ కిరాతులు; నిర్భయమతులు+ఐ= నిర్భయ మనస్సులు కలవారై; బీభత్సుపయిన్= యుద్ధంలో భయాన్ని సృష్టించే అర్జునుడిమీద; కవియన్= దాడిచేయగా; అతఁడు= అర్జునుడు; మహా+అస్త్ర+ప్రాబల్యంబును= గొప్ప అస్త్రాలశక్తి; మెఱయుటన్= ప్రకాశించగా; తాన్= తాను; బుద్ధిన్+తలంచి= బుద్ధితో తలచుకొని; మంత్రతతి= మంత్రాల సమూహం; తోఁపమికిన్= తోచకుండా పోవటంవలన.

తాత్పర్యం: ఆ కిరాతులు నిర్భయంగా అట్లాంటి అర్జునుడిమీదనే దాడిచేశారు. అర్జునుడికి తనవద్ద ఉన్న మహాస్త్రశక్తి స్ఫురించింది. ఆ మంత్రాలను మననం చేయటం మొదలుపెట్టాడు. కాని ఒక్క మంత్రమూ స్ఫురించలేదు. అందువలన (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: శస్త్రం కేవలం బలప్రయోగాన్ని ఆశిస్తుంది. అస్త్రం మంత్రసహితం. ఆ కిరాతులకు ఏ అస్త్రాలూరావు. అందుకే వచ్చిన విధంగా అమ్ములు సంధించి వేస్తున్నారు. అయినా వారిదే పై చేయిగా ఉన్నది. అర్జునుడి బాణాలకు వెనకున్న మంత్రశక్తి పోయిందని అర్థం.

క. ఇది దైవ విరోధం బని । మదిఁ దానూహించి ప్రకృతిమార్గణములు బె
ట్టిదముగ నేయఁగ నవియుం । దుదముట్టఁగ రిత్తలయ్యెఁ దొనలు నరేంద్రా! 187

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా!; ఇది= ఇట్లా కావటం; దైవ విరోధంబు+అని= దైవం శత్రుత్వం వహించటంచేత అని; మదిన్= మనసులో; తాన్+ఊహించి= తాను ఆలోచించి; ప్రకృతి మార్గణములు= సహజమైన బాణాలను (మంత్రాలతో సంబంధంలేనివి); బెట్టిదముగన్= తీవ్రంగా; ఏయఁగన్= ప్రయోగించగా; అవియున్= అవికూడా; తుదిముట్టఁగన్= అయిపోగా; దొనలు= అమ్ములపొదులు; రిత్తలు+అయ్యెన్= ఖాళీ అయిపోయాయి. (ఏమి చెప్పమంటావు దైవలీల!)

తాత్పర్యం: ఇట్లా కావటం దైవం ప్రతికూలంగా ఉండటంవలన - అని మనసులో అర్జునుడు ఊహించాడు. మంత్రంతో సంబంధంలేని సాధారణమైన అమ్ములను అతితీవ్రమైన శక్తితో ప్రయోగించాడు. కొంతసేపటికి అవి కూడా అయిపోయాయి. అమ్ములపొదులు ఖాళీ అయిపోయాయి.

విశేషం: భారతయుద్ధంలో అర్జునుడు 'విజయుడు' కావటానికి అతడి అమ్ములపొదులు ఎప్పుడూ నిండుగానే ఉండటమే కారణం. వాటిలో బాణాలు ఎప్పుడూ తరిగిపోవు. సవ్యసాచి-కాబట్టి రెండు చేతులతోనూ ప్రయోగించగల డన్నమాట. దైవం-తన సహాయాన్ని మానగానే అర్జునుడి పరాక్రమం ఇట్లా అయింది!

సీ. **అప్పుడు కాలపర్యయమున కాశ్చర్య। ముని విషాదముఁ దన మనములోనఁ**
బరిగొన బహువిస్ఫురణకోదండ దం। డమున నా బోయల సమదవృత్తి
నెట్టకేలకు నొకయెడ మాన్చి రుక్మిణి। యాదిగాఁ గల కృష్ణు నగ్రమహిషు
లెనమండ్ర బలదేవు వనితల మఱియును। గతిపయ యాదవాంగనలఁ గాచెఁ;

తే. **దక్కఁ గల యింతిగముల నా దస్యులడరి। పట్టికొని యేచి వీ డెల్ల బన్నపడఁగ**
దొద్దగొని రథకుంజరతురగతతులు। దమకు వలవకునికి దిగఁ ద్రావి చనిరి. **188**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; (అర్జునుడు); కాలపర్యయమునకున్= కాలవ్యతిక్రమానికి (కాలం అడ్డం తిరగటానికి); ఆశ్చర్యమునున్= ఆశ్చర్యం; విషాదమున్= దుఃఖమూ; తన మనములోనన్= తన మనసులో; పిరిగొనన్= అతిశయించగా; బాహు= చేతిలో; విస్ఫురణ= ప్రకాశిస్తున్న; కోదండదండమునన్= బాణం కర్రతో; ఆ బోయల= ఆ కిరాతుల; సమదవృత్తిన్= మదించిన వ్యాపారాన్ని; ఎట్టకేలకున్= ఎట్లాగో చివరికి; ఒకయెడన్= కొంతసేపు; మాన్చి= మాన్పించి; రుక్మిణి+ఆదిగాన్+కల= రుక్మిణి మొదలైన; కృష్ణు+అగ్రమహిషులన్+ఎనమండ్రన్= శ్రీకృష్ణుడి ఎనిమిది మంది పట్టపురాణులను; బలదేవు వనితలన్= బలదేవుడి భార్యలను; మఱియును= ఇంకా; కతిపయ= కొంతమంది; యాదవ+అంగనలన్= యాదవస్త్రీలను; కాచెన్= కాపాడాడు; తక్కన్+కల= తక్కిన; ఇంతిగములన్= స్త్రీలను; ఆ దస్యులు= ఆ బోయలు; అడరి= విజృంభించి; పట్టికొని= పట్టుకొని; ఏచి= బాధించి; వీడు+ఎల్లన్= వారి విడిదంతా; బన్నపడఁగన్= నాశనంకాగా; దొద్దగొని= కొల్లగొట్టి; రథ= రథాలు; కుంజర= ఏనుగులు; తురగతతులు= గుర్రాల గుంపులు; తమకున్= తమకు; వలవక+ఉనికిన్= సాధ్యం కాకపోగా; దిగన్+ద్రావి= వదలిపెట్టి; చనిరి= వెళ్ళిపోయారు.

తాత్పర్యం: ఆ సమయంలో అర్జునుడు కాలం ఇట్లా తిరగబడటానికి మనసులో ఆశ్చర్యం, దుఃఖం అతిశయించగా, చేతిలో ప్రకాశిస్తున్న గాండీవంతో ఆ కిరాతుల విజృంభణాన్ని ఏదోవిధంగా కొంతసేపు అరికట్టి, రుక్మిణి మొదలైన అష్టమహిషులను, బలదేవుడి భార్యలను, ఇంకా కొంతమంది యాదవస్త్రీలను కాపాడాడు. ఆ కిరాతులు తక్కిన స్త్రీలను విజృంభించి పట్టుకొన్నారు. బాధించారు. వారి విడిదిని సర్వనాశనం చేశారు. వారి ధనాన్నంతా కొల్లగొట్టారు. రథాలు, ఏనుగులు, గుర్రాలు - వారికి సాధ్యం కాకపోవటం చేత వదలివేసి వెళ్ళిపోయారు.

క. **ఇమ్మాడ్కిం బఱిపోయిన। యమ్మొత్తము నడపికొనుచు నతిదైన్యము చి**
త్త మ్మలఁపంగఁ గురుక్షే। త్రమ్మునకుం జనియె నరుఁడు ధరణీనాథా! **189**

ప్రతిపదార్థం: ధరణీనాథా!= రాజా!; ఈ+మాడ్కిన్= ఈ విధంగా; పఱి+పోయిన= నశించిన; ఆ+మొత్తమున్= ఆ జనసమూహాన్ని; నడపికొనుచున్= నడపుకొంటూ; నరుఁడు= అర్జునుడు; అతిదైన్యము= మిక్కిలి దైన్యం; చిత్తమ్ము+అలఁపంగన్= చిత్తాన్ని క్షోభింపజేయగా; కురుక్షేత్రమ్మునకున్+చనియెన్= కురుక్షేత్రానికి వెళ్ళాడు.

తాత్పర్యం: ఈ విధంగా కిరాతులచేతిలో క్షీణించి నశించిన ఆ జనసమూహాన్ని నడిపించుకొంటూ అర్జునుడు మిక్కిలి దైన్యం చిత్తాన్ని క్షోభింపజేయగా కురుక్షేత్రానికి వెళ్ళాడు.

విశేషం: కురుక్షేత్రంలో యుద్ధం అయిపోయిన తరువాత కూడా కొందరు ఆప్తజనులు, ఋషులు, పురోహితులున్నారని ఈ సందర్భాన్ని బట్టి గుర్తించాలి.

క. చని యచట నచటఁ దన్నుం । గను నాప్తజనంబుతోడఁ గాలవశత్వం
బునఁ బొందిన దుర్దశఁ దగ । వొనర నతఁడు సెప్పఁ జొచ్చె మురివిన మదితోన్. 190

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; అచటన్+అచటన్= అక్కడక్కడ; తన్నున్+కను= తనను చూడవచ్చిన; ఆప్తజనంబుతోడన్= ఆప్తులతో; కాలవశత్వంబునన్= కాలశక్తికి వశమై; పొందిన= తాను పొందిన (తనవారు పొందిన); దుర్దశన్= చెడుస్థితిని; మురివిన మదితోన్= ముక్కలైన మనస్సుతో; తగవు+ఒనరన్= సముచితరీతిలో; అతఁడు= ఆ అర్జునుడు; చెప్పన్+చొచ్చెన్= చెప్పటం మొదలు పెట్టాడు.

తాత్పర్యం: కురుక్షేత్రం చేరి, అక్కడ తనను చూడటానికి వచ్చిన ఆప్తులతో కాలశక్తికి వశమై తాము పొందన దుర్దశను ముక్కలైన మనస్సుతో సముచితమైన రీతిలో అర్జునుడు చెప్పటం మొదలుపెట్టాడు.

సీ. కోపించి గాంధారి శాప మిచ్చిన యది । యాదవసంక్షయ మగుట యెట్లుఁ
దప్పదు; మనము తద్బాలవృద్ధస్త్రీజ । నంబుల నెల్ల నర్హంబు లైన
ఠావుల సత్ప్రతిష్ఠావిశోకంబులఁ । గాఁ జేయవలయు; నక్కాలమునకు
నొదవి యత్తెఱఁగున కుత్సహించుట కృత్య । మర్జున!' నీ కని యాడుచుండుఁ

ఆ. బలుమఱును దలంచి పాండవాగ్రజుఁ డది । కారణముగ నతని కరుణ పెంపు
నొప్పు నెఱుఁగుఁ గాక యిప్పార్థుఁ డయ్యదు । నికర శేషజనుల నెమ్మి నిలిపె. 191

ప్రతిపదార్థం: కోపించి= కోపగించుకొని; గాంధారి= గాంధారీమహాదేవి; శాపము+ఇచ్చిన+అది= శాపమిచ్చి ఉన్నది; యాదవ సంక్షయము+అగుట+ఎట్లున్+తప్పదు= యాదవులు నశించటం ఎట్లాగూ తప్పదు; మనము= పాండవులమైన మనం; తద్= ఆ యాదవుల; బాల= బాలలను; వృద్ధ+స్త్రీజనంబులన్+ఎల్లన్= వృద్ధులను, స్త్రీలను అందరినీ; అర్హంబులు+ఐన= తగిన; ఠావులన్= చోట్లలో; సత్= బాగుగా; ప్రతిష్ఠా= ఉంచటంచేత; విశోకంబులన్+కాన్= దుఃఖరహితులుగా; చేయవలయున్= చేయాలి; అర్జున!= ఓ అర్జునా!; ఆ+కాలమునకున్= ఆ సమయానికి; ఒదవి= ఉపయోగపడి; ఆ+తెఱఁగునకున్= ఆ కార్యానికి; ఉత్సహించుట= సిద్ధపడటం; నీకున్; కృత్యము+అని= చేయదగినపని అని; పలుమఱును= చాలాసార్లు; తలంచి= తలచుకొంటూ; పాండవ+అగ్రజుఁ డు= ధర్మరాజు; ఆడుచుండున్= అనేవాడు; అది కారణముగన్= అందుచేత; అతనికరుణ= అతడి అధికమైన కరుణను; పెంపున్+ఒప్పున్= వైభవాన్ని, గుణసంపదను; ఎఱుఁగున్+కానన్= తెలిసినవాడు కాబట్టి; ఈ+పార్థుఁడు= ఈ అర్జునుడు; ఆ+యదునికర= ఆ యదుసమూహంలో; శేషజనులన్= మిగిలిన ప్రజలను; నెమ్మిన్= ప్రేమతో; నిలిపెన్= ఆయా చోట్ల నిలిపాడు.

తాత్పర్యం: 'యాదవులమీది కోపంతో గాంధారి శాపమిచ్చి ఉన్నది కాబట్టి యాదవనాశనం ఎట్లాగూ తప్పదు. మనం ఆ యదుబాలురను, వృద్ధ, స్త్రీ జనాన్ని తగిన చోట్లలో నిలిపి వారి శోకాన్ని మరిపించటం చేయతగినపని. అర్జునా! ఆ సమయానికి వారికి సహాయపడి ఆ పనికి సిద్ధపడటం నీకు తగిన పని'. అంటూ చాలామార్లు తలచుకొంటూ ధర్మరాజు

అనేవాడు. అందుచేత అతడి అధికమైన కరుణను, వైభవాన్ని, గుణసంపదను తెలిసినవాడు కాబట్టి ఈ విధంగా అర్జునుడు ఆ యదుసముదాయంలో మిగిలిన జనులను ప్రేమతో ఆయా చోట్లలో నిలిపాడు.

సీ. నిలిపిన తెఱఁగెల్ల నృపవర! చెప్పెద। విను కృతవర్మనందనునిఁ జూచి
'నీ తల్లియును నీవు నీతోడఁబుట్టిన। వారును మృత్తికావతపురమున
నిలుఁ' డని బహుసంపదలఁ బొల్చు నప్పట్ట। ణంబుఁ దదీయదేశంబు నిచ్చి
యభిషిక్తుఁ జేసిన నాతండు నిజపరి। జనములు దాను హర్షం బెలర్ప

తే. నందుఁ బోయె; సరస్వతి యనఁగఁ బరఁగు। ఘననగరమున సాత్యకి తనయు నట్ల
నెయ్యమును గారవంబును నెఱయ నిలిపి। యనుప ముదమున నందుల కతఁడు చనియె. 192

ప్రతిపదార్థం: నృపవర!= ఓ రాజశ్రేష్ఠా!; నిలిపిన= నిలిపినటువంటి; తెఱఁగు+ఎల్లన్= విధమంతా; చెప్పెదన్= చెప్తుతాను; విను= బాగా వినుము; (అర్జునుడు); కృతవర్మనందనునిన్+చూచి= కృతవర్మ కొడుకును చూచి; నీ తల్లియును= నీ తల్లీ; నీవు= నీవూ; నీతోడన్+పుట్టినవారునున్= నీ సోదరులూ; మృత్తికావతపురమునన్= మృత్తికావతపురంలో; నిలుఁడు+అని= నిలవండి (ఉండండి) అని; బహుసంపదలన్+పొల్చు+ఆ+పట్టణంబున్= బాగా సంపదలతో కూడిన ఆ పట్టణాన్ని; తదీయదేశంబున్= ఆ దేశాన్ని; ఇచ్చి= ఏలుకొనటానికి ఇచ్చి; అభిషిక్తున్+చేసినన్= అభిషేకం చేయగా; ఆతండు= అతడు; నిజపరిజనములున్= తన సేవకజనం; తానున్; హర్షంబు+ఎలర్పన్= సంతోషమతిశయించగా; అందున్+పోయెన్= ఆ నగరానికి వెళ్ళాడు; సాత్యకితనయున్= సాత్యకి కుమారుడిని; అట్లు= అట్లాగే; సరస్వతి+అనఁగన్+పరఁగు= సరస్వతి అని పిలువబడే; ఘననగరమునన్= పెద్దపట్టణంలో; నెయ్యమునున్= స్నేహమూ; గారవంబునున్= గౌరవమూ; నెఱయన్= నిండగా; నిలిపి+అనుపన్= ఉండుమని పంపగా; ముదమునన్= సంతోషంతో; అందులకున్= ఆ నగరానికి; అతఁడూ= అతడు; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అర్జునుడు వారిని ఎట్లా నిలిపాడో చెప్తుతాను వినుము. కృతవర్మ కొడుకును చూచి అర్జునుడు 'నీవు, నీ తల్లి, నీ సోదరులు, మృత్తికావతపురంలో ఉండండి' అని చెప్పి, చాలా సంపదలు కలిగిన ఆ నగరాన్ని, ఆ దేశాన్ని అతడికి ఏలుకొనటానికి ఇచ్చి అభిషేకం చేశాడు. అతడు తన సేవకులతో కూడి సంతోష మతిశయించగా, ఆ నగరానికి వెళ్ళాడు. అట్లాగే సాత్యకి కుమారుడిని సరస్వతి అనే నగరానికి స్నేహగౌరవాలు నిండిన హృదయంతో అభిషేకంచేసి పంపించాడు. అతడూ సంతోషంతో ఆ నగరానికి వెళ్ళాడు.

సీ. తక్కటివారి నింద్రప్రస్థనగరంబు। నకుఁ గొని చని వజ్రు నాథుఁ గాఁగ
నందుఁ బట్టము గట్టి హస్తితురంగ ర। థంబుల విభజించి తగిన భంగి
నమ్మువ్వురకును సమర్పితంబులు సేసి। యయ్యయి బంధుల నందు నందు
నందును నిలుచు నట్లొందఁగ నియమించి। యక్రూరుభార్యల నాత్మజులను

తే. వజ్రునకు నప్పగించె; నవ్వాసుదేవు। పౌత్రుఁ డతి వినయంబునఁ బట్టువఱుప
వారు నిలువక పోయిరి వలచు నెడకు;। దాని విని యూరకుండె భీమానుజుండు. 193

ప్రతిపదార్థం: తక్కటివారిన్= తక్కినవారిని; ఇంద్రప్రస్థనగరంబునకున్+కొని చని= ఇంద్రప్రస్థనగరానికి తీసికొనివెళ్ళి; వజ్రున్= వజ్రుడిని; నాథున్+కాఁగన్= ప్రభువుగా; అందున్= ఆ నగరంలో; పట్టము+కట్టి= పట్టాభిషేకం చేసి; హస్తి= ఏనుగులను; తురంగ= గుర్రాలను; రథంబులన్= రథాలను; విభజించి= ఆ మూడు రాజ్యాలకు పంచిపెట్టి; ఆ+ముప్వురకునున్= ఆ ముగ్గురికీ; సమర్పితంబులు+చేసి= సమర్పించి; ఆ+అయి= ఆయా; బంధులన్= బంధువులను; అందున్= మృత్తికావతంలో; అందున్= సరస్వతిలో; అందునున్= ఇంద్రప్రస్థంలో; నిలుచునట్లు+ఒందఁగన్+నియమించి= నివసించేటట్లు తగిన నియామకం చేసి; అక్రూరు భార్యలన్= అక్రూరుడి భార్యలను; ఆత్మజులను= కుమారులను; వజ్రునకున్+అప్పగించెన్= వజ్రుడికి అప్పగించాడు; ఆ+వాసుదేవపౌత్రుఁడు= ఆ వజ్రుడు; అతి వినయంబునన్= అతి వినయంతో; పట్టు+పఱుపన్= అనునయించి ఉండుమని కోరుకొన్నా; వారు; నిలువకపోయిరి= అక్కడ నిలువకుండా వెళ్ళిపోయారు; భీమ+అనుజుండు= అర్జునుడు; దానిన్ విని= ఆ విషయం తెలిసి; ఊరకుండెన్= ఊరుకొన్నాడు.

తాత్పర్యం: తక్కినవారిని ఇంద్రప్రస్థానికి తీసికొనివెళ్ళి. వజ్రుడిని ప్రభువుగా ఆ నగరంలో పట్టంకట్టి ఏనుగులను, గుర్రాలను, రథాలను ఆ మూడు రాజ్యాలకు పంచి పెట్టి, ఆ ముగ్గురికీ సమర్పించాడు. ఆయా బంధువులను మృత్తికావతంలో, సరస్వతిలో, ఇంద్రప్రస్థంలో ఉండేటట్లు నియామకం చేశాడు. అక్రూరుడి భార్యలను, పిల్లలను వజ్రుడికి అప్పగించి వారి క్షేమం చూడు మన్నాడు. వజ్రుడు కూడా ఎంతో వినయంతో వారిని అనునయించి ఉండండని కోరినా వారు అక్కడ నిలువకుండా వెళ్ళిపోయారు. ఆ విషయం విన్న అర్జునుడు ఊరుకొన్నాడు.

అర్జునుఁడు రామకృష్ణుల నిర్యాణంబును యాదవస్త్రీల కెఱిఁగించుట

క. **యాదవకుటుంబముల న। త్యాదరమున నట్లు నిలిపి హలధరుఁడును దా**
మోదరుఁడుఁ దెగుట వారల। గాదిలి పొలఁతులకుఁ జెప్పఁగాఁ దలఁచె మదిన్. **194**

ప్రతిపదార్థం: యాదవకుటుంబములన్= యాదవుల కుటుంబాలలోని మూడువంశాలవాళ్ళనూ ఒక్కొక్క నగరంలో; అతి+ఆదరమునన్= మిక్కిలి గౌరవంతో; అట్లు= ఆ విధంగా; నిలిపి= ఉండేటట్లు చేసి (అర్జునుడు); హలధరుఁడును= బలరాముడూ; దామోదరుఁడున్= కృష్ణుడూ; తెగుట= చనిపోవటాన్ని; వారల= వారి; గాదిలి= ప్రియమైన; పొలఁతులకున్= స్త్రీలకు (భార్యలకు); చెప్పఁగాన్= చెప్పాలని; మదిన్= మనసులో; తలఁచెన్= ఆలోచించాడు.

తాత్పర్యం: అట్లా యాదవకుటుంబాలను ఆయా నగరాలలో అతి ప్రేమాభిమానాలతో నిలిపి, అర్జునుడు ఒకనాడు బలరామకృష్ణులు మృతినొందిన విషయం వారి ప్రియపత్నులకు చెప్పాలని ఆలోచించాడు.

చ. **తలఁచి యతండు మందగతిఁ దానును నర్హజనోత్కరంబు వా**
రలకడ కేఁగి శోకవిధురంబగు చిత్తముతోడఁ దారు గా
నల కటు వోయి పంకరుహనాభుని రాముని రోసి పల్దినం
బులు భ్రమ సంచరించుటయు బోయ తముం గని యార్ద్రచిత్తుఁడై. **195**

ప్రతిపదార్థం: తలఁచి= ఆలోచించి; అతండు= అర్జునుడు; మందగతిన్= నెమ్మదిగా; తాను; అర్హజన+ఉత్కరంబు= తగినజన సమూహంతో కలిసి; వారలకడకున్+ఏఁగి= వారివద్దకు వెళ్ళి; శోక= దుఃఖంచేత; విధురంబు+అగు= బాధించబడిన; చిత్తముతోడన్=

మనసులో; తారు= తాము; కానలకున్= అడవులలోకి; అటు+పోయి= ఆ విధంగా వెళ్ళి; పంకరుహనాభునిన్= శ్రీకృష్ణుడిని; రామునిన్= బలరాముడిని; రోసి= వెదకుతూ; పల్+దినంబులు= చాలా రోజులు; భ్రమన్= భ్రమలో; సంచరించుటయున్= తిరుగుతూ ఉండిపోవటమూ; బోయ= ఒక బోయవాడు; తమున్+కని= తమనుచూసి; ఆర్ద్రచిత్తుఁడు+ఐ= ఆర్ద్రమైన చిత్తము కలవాడై, కరగిన మనస్సు గలవాడై.

తాత్పర్యం: అట్లా ఆలోచించి, అర్జునుడు నెమ్మదిగా తాను తగిన జనసముదాయంతో కలిసి వారివద్దకు వెళ్ళి, దుఃఖంచేత బాధించబడిన మనసుతో తాము అడవులలోకి ఆ విధంగా వెళ్ళి శ్రీకృష్ణబలరాములను వెదకుతూ చాలా రోజులు భ్రమతో సంచరిస్తూ ఉండిపోవటమూ, చివరికి ఒక బోయవాడు తమను చూచి కనికరించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కందువ చోటికిఁ గొని పో। వం దా రరుగుటయుఁ జెప్పి వనట గదిరినన్
డెందము గలంగఁ గన్నీ। రందంద మొగంబు మీఁద నగ్గల మురులన్. 196

ప్రతిపదార్థం: కందువ= రహస్యమైన; చోటికిన్= ఒక తావునకు; కొనిపోవన్= తీసికొనివెళ్ళగా; తారు+అరుగుటయున్= తాము వెళ్ళటమూ చెప్పి; వనట= దుఃఖం; కదిరినన్= కలుగగా; డెందము= హృదయం; కలంగన్= కలతపొందగా; కన్నీరు= కంటినీరు; అందు+అంద= అక్కడక్కడా; మొగంబుమీఁదన్= ముఖంమీద; అగ్గలము= అధికంగా; ఉరులన్= ప్రవహించగా.

తాత్పర్యం: రహస్యమైన ఒకతావునకు తీసికొని వెళ్ళగా తాము వెళ్ళటమూ చెప్పాడు. అతడికి దుఃఖం అతిశయించింది. హృదయం కలతబారింది. కంటినీరు మొగం మీద అక్కడక్కడా ప్రవహించటం మొదలయింది. అప్పుడు(తరువాతి పద్యంతో అన్వయం)

సీ. తలవాంచి యేమియుఁ బలుకక యప్పార్థుఁ। డున్న నయ్యువిదలు వెన్నుఁ డూర్ధ్వ
గతి కేఁగు టెఱిఁగి శోకము మూర్తులొందిన। తెఱఁగునఁ బొగిలియు ధీరభావ
మాత్మల నెలకొన్న నన్న! నీవింతేల। యడలెదు? కాలపర్యయము నుడుప
వశమె యెవ్వరికిని? వార్తలకొఱఁత జె। ప్పుము మాకు ననుడు నప్పుణ్యచరితుఁ

ఆ. 'డడవిలోన మేము తడసిన దినముల। న్నియు గణించి యంబునిధి పురంబు
రేపకడయ ముంచు నేపాట నిమ్మెయి। వచ్చు నెడరు దలఁగువార మొక్కొ! 197

ప్రతిపదార్థం: తల+వాంచి= తలవంచి; ఏమియున్+పలుకక= ఏమీ మాటాడకుండా; ఆ+పార్థుఁడు+ఉన్నన్= అర్జును డుండగా; ఆ+ఉవిదలు= ఆ స్త్రీలు; వెన్నుఁడు= విష్ణుడు (శ్రీకృష్ణుడు); ఊర్ధ్వగతికిన్= ఊర్ధ్వలోకాలకు; ఏఁగుట+ఎఱిఁగి= వెళ్ళిపోవటం గుర్తించి; శోకము= శోకం; మూర్తులు+ఒందిన= మూర్తీభవించిన; తెఱఁగునన్= విధంగా; పొగిలియున్= దుఃఖించి కూడా; ధీరభావము= ధైర్యం; ఆత్మలన్= ఆత్మలలో; నెలకొన్నన్= నెలకొనగా; అన్న= నాయనా!; నీవు+ఇంత+ఏల+అడలెదు?= నీవింతగా ఎందుకు దుఃఖిస్తావు?; కాలపర్యయమున్= కాలవైపరీత్యాన్ని; ఉడుపన్= మాన్పటానికి; ఎవ్వరికిని= ఎవ్వరికైనా; వశమె?= సాధ్యమవుతుందా?; వార్తల కొఱఁత= తక్కిన విషయాలు; మాకున్+చెప్పుము; అనుడున్= అనగా; ఆ+పుణ్యచరితుఁడు= ఆ పుణ్యచరిత్ర కలిగిన అర్జునుడు; అడవిలోనన్= అడవిలో; మేము= మేము; తడసిన= తిరుగుతూ ఆలస్యం చేసిన; దినములు= దినాలు; అన్నియున్+గణించి= అన్నీ లెక్కించి; అంబునిధి= సముద్రం; పురంబు= నగరాన్ని; రేపకడయ= రేపే; ముంచున్=

ముంచివేస్తుంది; ఏ పాటన్= ఏ రీతిగా; ఈ+మెయిన్= ఈ విధంగా; వచ్చు+ఎడరు= వస్తున్న ఆపదను; తలఁగువారము+ఒక్కో!= తొలగించుకొనగలమో!

తాత్పర్యం: అర్జునుడు తలవంచి ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాడు. ఆ స్త్రీలకు శ్రీకృష్ణుడు పరమపదించాడని అర్థమయిపోయింది. శోకం మూర్తీభవించిన విధంగా దుఃఖించారు. అయినా ధైర్యం మనసులలో ఏర్పడగా, అర్జునుడితో ఇట్లా అన్నారు.' 'నాయనా! నీ వింతగా ఎందుకు దుఃఖిస్తావు? కాలం ఎదురు తిరిగినప్పుడు ఎవరు ఆపగలరు? తక్కిన విషయాలు చెప్పుము' అని వారనగా అర్జునుడు 'మేము అట్లా అడవిలో బలరామకృష్ణులను వెదకుతూ కడచిపోయిన రోజులను అన్నీ లెక్కించి, సముద్రం నగరాన్ని రేపే ముంచివేస్తుంది. ఇట్లా వస్తున్న ఆపదను ఏ ఉపాయంతో తొలగించుకొనగలమో! (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: శ్రీకృష్ణుడి భార్యలు, బలరాముడి సతులు ఎంత సంయమనం కలిగినవారో ఈ సందర్భం నిరూపిస్తున్నది. అప్పటికి వారు బాగా వయసు చెల్లినవారు కూడా. అందుకే వారు అర్జునుడిని ఓదార్చారు.

చ. **అను తలఁపాత్మ నొందుటయు నప్పటి కద్దెస మీకు నెల్లఁ జె**
ప్పిన నుచితంపు భంగులకుఁ బెద్దయుఁ బ్రొద్దు చనంగ నప్పురం
బునఁ గల విప్రముఖ్యజనముల్ పయనంబున కర్హమైన వ
ర్తన మొనరింపలేమి జలరాశి మునుంగుదు రట్లు గావునన్. **198**

ప్రతిపదార్థం: అను= అన్నటువంటి; తలఁపు= ఆలోచన; ఆత్మన్+ఒందుటయున్= మనసులో రాగా; అప్పటికిన్= అప్పుడే; ఆ+దెసన్= ఆ దుస్థితిని; మీకున్+ఎల్లన్+చెప్పినన్= మీకంతా చెప్పితే; ఉచితంపు+భంగులకున్= ఉచితమైన కార్యాలకు; పెద్దయున్+ప్రొద్దు= చాలా సమయం; చనంగన్= జరిగిపోతే; ఆ+పురంబునన్+కల= ద్వారకలో ఉన్న; విప్రముఖ్య జనముల్= బ్రాహ్మణులు మొదలైన జనులు; పయనంబునకున్= ప్రయాణానికి; అర్హమైన= తగిన; వర్తనము= పనులను; ఒనరింపన్+లేమిన్= చేయలేకపోవటంవలన; జలరాశిన్= సముద్రంలో; మునుంగుదురు= మునిగిపోతారు; అట్లు+కావునన్= అందుచేత.

తాత్పర్యం: అన్నటువంటి ఆలోచన మనసులో రాగా అప్పుడే ఆ దుస్థితిని మీకంతా చెప్పితే మీరు మీరు చేయవలసిన కార్యక్రమాలకు చాలా సమయం గడిచిపోతే ద్వారకానగరంలోని బ్రాహ్మణాదులు ఆ పనులలో ఉండిపోయి, ప్రయాణానికి తగిన సన్నాహాలు చేసికొనలేకపోవటంవలన సముద్రంలో మునిగిపోతారు. అందువలన (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఉచితంపు భంగులు= ఓదార్చటం, సహగమనానికి సిద్ధపడితే దానికి తగిన ఏర్పాట్లు చేయటం - ఇత్యాదులు.

చ. **హరికిని రామదేవునకు నర్హవిధానము లాచరించి యె**
వ్వరికిని జెప్ప కెల్ల పరివారముఁ బౌరులు సామజాదులున్
సరకులు నాయితంబు లగు సంఘటనం బొనరించి నాఁటికిం
గర మవధానయుక్తి సమకట్టితి నెవ్వగతోఁ బ్రయాణమున్. **199**

ప్రతిపదార్థం: హరికినిన్= శ్రీకృష్ణుడికి; రామదేవునకున్= బలరాముడికి; అర్హవిధానములు= అర్హమైన విధులు; ఆచరించి= చేసి; ఎవ్వరికినిన్+చెప్పక= ఎవరికీ చెప్పకుండా; ఎల్లపరివారమున్= పరివారాన్నంతటినీ; పౌరులున్= ప్రజలును; సామజ+ఆదులున్= ఏనుగులు మొదలైనవాటిని; సరకులున్= సామానులూ; ఆయితంబులు+అగు= సిద్ధమయ్యే; సంఘటనంబు= సన్నాహం; ఒనరించి= చేసి; నాఁటికిన్= ఆ రోజుకే; కరము= మిక్కిలి; అవధానయుక్తిన్= ఏకాగ్రతతో; నెవ్వగతోన్= నిండుబాధతో; ప్రయాణమున్= ప్రయాణాన్ని; సమకట్టితిన్= ఏర్పాటుచేశారు.

తాత్పర్యం: శ్రీకృష్ణబలరాములకు తగిన ఉత్తరక్రియలను చేసి, ఎవ్వరికీ చెప్పకుండా పరివారాన్ని, ప్రజలను, ఏనుగులు మొదలైనవాటిని, ఇతర సంభారాలను, ప్రయాణానికి సిద్ధమయ్యేరీతిలో సన్నాహం చేసి, ఆ రోజే మిక్కిలి ఏకాగ్రతతో నిండుబాధతో ప్రయాణాన్ని ఏర్పాటు చేశాను.

తే. వినుఁడు యాదవభామినీవృద్ధబాల । జనుల నందఱ నుచితవర్తనముతోడఁ
బ్రొద్దువొడువక ముందర పురజనప్ర । యుతముగాఁ బురి వెలువరించితిఁ గడంగి. 200

ప్రతిపదార్థం: వినుఁడు= ఇంకా వినండి; యాదవభామినీ= యాదవస్త్రీలను; వృద్ధ= వృద్ధులను; బాల జనులన్+అందఱన్= బాలురందరినీ; ఉచితవర్తనముతోడన్= తగినరీతిలో; ప్రొద్దు+పొడువక ముందరన్= ఉదయం కాకముందే; పురజన ప్రయుతముగాన్= పురజనులతో సహా; పురిన్= నగరమునుండి; కడంగి= ప్రయత్నించి; వెలువరించితిన్= బయటకు వచ్చేటట్లు చేశాను.

తాత్పర్యం: ఇంతేకాదు; యాదవస్త్రీ, బాల, వృద్ధులను తగిన రీతిలో ఉదయం కాకముందే పురజనులతో సహా అందరినీ ద్వారకనుండి బయటపడేటట్లు చేశాను.

విశేషం: దేశంకోసం, ప్రజల సంక్షేమం కోసం కులాచారాలను కూడా త్యాగం చేయాలన్న సందేశం ఈ సందర్భంలో గర్భితంగా ఉన్నది. అందుకే అర్జునుడు తరువాత ఇట్లా చెప్పుతున్నాడు.

ఆ. దానఁ జేసి మీరు నేనును బ్రయ్యుఁ బా । పంబు లేక వెడలఁ బడితి; మిదియ
తల్లులార! కరము తప్పయి తోఁచుట । నుల్ల మలఁత పేర్మి నురియుచుండు. 201

ప్రతిపదార్థం: తల్లులార!= ఓ మాతృస్వరూపులారా!; దానన్+చేసి= అందువలన; మీరు, నేనున్= మీరూ, నేనూ; ప్రయ్యున్= నిందా; పాపంబు= పాపం; లేక= లేకుండా; వెడలన్+పడితిమి= బయటపడ్డాం; ఇది+అ= ఇదే; కరము= మిక్కిలి; తప్పు+అయి= తప్పుగా; తోఁచుటన్= తోచటంవలన; ఉల్లము= హృదయం; అలఁతన్= బాధతో; పేర్మిన్= మిక్కిలిగా; ఉరియుచున్+ఉండున్= అలమటిస్తున్నది.

తాత్పర్యం: ఓ తల్లులారా! ఇట్లా చేయటంవలన నేను, మీరు అపనిందనుండి, పాపం నుండి బయటపడ్డాము. ఇదే చాలా పెద్ద తప్పుగా తోచి, నా హృదయం బాధతో మిక్కిలిగా అలమటిస్తున్నది.

క. వినుఁ డీ తప్పున దోషము । దనుకక యుండంగ నన్ను దయతోఁ జూడుం'
డనుచు నిలఁ జాఁగి మ్రొక్కినఁ । గని యందఱు నెత్తి యతని గారవ మెసఁగన్. 202

ప్రతిపదార్థం: వినుఁడు= వినండి; ఈ తప్పునన్= ఈ తప్పులో; దోషము= పాపం; తనుకక= అంటక; ఉండంగన్= ఉండేటట్లు; నన్నున్= నన్ను; దయతోన్= దయతో; చూడుండు= చూడండి; అనుచున్= అంటూ; ఇలన్+చాఁగి= నేలపై దండాకారంగా వ్రాలి; మ్రొక్కినన్= మ్రొక్కగా; కని= చూచి; అందఱున్= ఆ స్త్రీలందరూ; అతనిన్= అర్జునుడిని; ఎత్తి= పైకిఎత్తి; గారవము= గౌరవం; ఎసఁగన్= అతిశయించగా.

తాత్పర్యం: బాగా ఆలోచించండి. నేను చేసిన ఈ తప్పులో పాపం అంటకుండా నన్ను దయతో చూడండి' అంటూ నేలమీద వాలి వారికి సాష్టాంగనమస్కారం చేశాడు. అది చూసి ఆ స్త్రీలకు అతడిపై గౌరవం ఇనుమడించింది. ప్రేమతో అతడిని పైకి లేవనెత్తారు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఎంత పెద్ద తప్పుకైనా 'దండం' పెద్ద ప్రాయశ్చిత్తంగా మన భారతీయ సంప్రదాయం చెప్పుతుంది. పశ్చాత్తాపంతో పెద్దల యెడ గౌరవంగా చేసే 'ప్రణిపాతం' తప్ప ఇది కేవలం సభ్యతకోసం చేసేదికాదు.

క. **ఊరార్చి 'యింక నుచితా । చారంబులు నడపుటయ యిచటఁ గృత్యము; దు**
ర్వారం బగు విధిచేఁతకు । నేరికి నడ్డపడవశమె? యేల యలఁదురన్?' **203**

ప్రతిపదార్థం: ఊరార్చి= ఓదార్చి; ఇంకన్= ఇక; ఉచిత+ఆచారంబులు= తగిన కార్యాలు; నడపుట+అ= చేయటమే; ఇచటన్= ఇప్పుడు; కృత్యము= చేయదగినది; దుర్+వారంబు+అగు= వారించటానికి వీలులేని; విధిచేఁతకున్= విధి చేష్టకు; ఏరికిన్= ఎవరికైనా; అడ్డపడన్+వశమె?= అడ్డుపడటానికి వీలవుతుందా?; అలఁదురన్= క్షోభపడటం; ఏల?= ఎందుకు?;

తాత్పర్యం: వారు అర్జునుడిని ఓదార్చి, 'ఇక చేయదగిన కార్యాలను చేయటమే తగిన పని. వారించటానికి వీలులేని విధిచేష్టకు అడ్డుపడటానికి ఎవరికైనా వీలవుతుందా! క్షోభపడటం ఎందుకు?'

విశేషం: భారతీయుల జీవితంలో వైయక్తికమైన దుఃఖంకన్నా సంప్రదాయం ఎంత ప్రధానమో నిరూపించేది కర్మకాండ. ఈ యాదవస్త్రీలు కర్మయోగినులు. అందుకే విషాదాన్ని అతిక్రమించారు.

రుక్మిణీదేవి మొదలగు కృష్ణభార్య లగ్నిప్రవేశము చేయుట (సం.16-8-71)

సీ. **అని పల్కి రప్పిండునందు రుక్మిణియు జాం । బవతియులోనగు పద్మముఖులు**
గొందఱు గోరిరి కురునాథ! యనుమర । ణమునకు బంధుజనంబులెల్ల
శోకార్తులై రోదనాకులత్వము నొంది । రనుమృతికలనకు నమరియున్న
యా బలదేవ మురాంతక మహిషుల । కతి విభవం బైన యానకల్ప
తే. **నంబు నాకల్పరచనంబు నడపి నరుఁడు । చందనాగురుమయచితాసంవిధాన**
మాచరించి యర్థప్రకారాగ్ని విధి యొ । నర్చె మహనీయవిప్రజనంబుఁ బనిచి. **204**

ప్రతిపదార్థం: కురునాథ!= రాజా!; అని= ఈ విధంగా; పల్కిరి= చెప్పారు; ఆ+పిండునందున్= ఆ స్త్రీల గుంపులో; రుక్మిణియున్= రుక్మిణీ; జాంబవతియున్= జాంబవతీ; లోనగు= మొదలైన; పద్మముఖులు= కమలముఖులు (స్త్రీలు); కొందఱు= కొంతమంది;

అనుమరణమునకున్= సహగమనానికి; కోరిరి= కోరుకొన్నారు; బంధుజనంబులు+ఎల్లన్= బంధువులంతా; శోక= శోకంచేత; ఆర్తులు+ఐ= వ్యథితులై; రోదన= ఏడ్పుచేత; ఆకులత్వమున్= క్షోభ; ఒందిరి= పొందారు; అనుమృతి= సహగమనం; కలనకున్= చేయటానికి; అమరి+ఉన్న= సిద్ధంగా ఉన్న; ఆ బలదేవ= ఆ బలరామ; ముర+అంతక= కృష్ణుల; మహిషులకున్= రాణులకు; అతివిభవంబు+ఐన= వైభవోపేతంగా; యానకల్పనంబున్= పల్లకీని ఏర్పాటు చేయటం; ఆకల్పరచనంబున్= వేషభూషణాలను అలంకరించటం; నడపి= చేసి; నరుఁడు= అర్జునుడు; చందన+అగురుమయ= మంచిగంధపు చెక్కలతోనూ, అవురుగడ్డితోనూ తయారుచేసిన; చితా= చితాగ్నిని; సంవిధానము= ఏర్పరచటం; ఆచరించి= చేసి; అర్హప్రకార= తగినవిధంగా; అగ్నివిధిన్= అగ్నికార్యాన్ని; మహనీయ= పూజ్యులైన; విప్రజనంబున్= బ్రాహ్మణజనులను; పనిచి= పంపి; ఒనర్చెన్= చేశాడు.

తాత్పర్యం: ఈ విధంగా యాదవాంగనలు చెప్పారు. వారిలో రుక్మిణి, జాంబవతి మొదలైన స్త్రీలు సహగమనం చేస్తామన్నారు. బంధువు లంతా శోకంతో వ్యథను పొందారు. ఏడ్చిఏడ్చి క్షోభపడ్డారు. సహగమనం చేయటానికి సిద్ధంగా ఉన్న ఆ పట్టపురాణులకు అతివైభవంతో పల్లకీలు ఏర్పాటుచేసి, వస్త్రభూషణాలంకారాలు చేయించి, అర్జునుడు మంచి గంధపు చెక్కలతోనూ, అవురుగడ్డితోనూ చితాగ్నిని ఏర్పరిచి, మహనీయులైన పురోహితులను పంపి, అగ్నికార్యం నిర్వహించాడు.

క. **విను సత్యభామలోనగు। వనితాజను లధిక నియతి వనములకుఁ దపం**
బొనరింపఁ బూని కొందఱు। చని రవ్విధమున నలుప్తసత్కర్ముండై. **205**

ప్రతిపదార్థం: విను= రాజా! వినుము!; సత్యభామలోనగు= సత్యభామ మొదలైన; వనితాజనులు= స్త్రీలు; కొందఱు= కొంతమంది; అధికనియతిన్= తీవ్రమైన నియమంతో; వనములకున్= అడవులకు; తపంబు+ఒనరింపన్+పూని= తపస్సు చేయటానికి పూనుకొని; చనిరి= వెళ్ళారు; ఆ+విధమునన్= ఆ విధంగా (నరుడు); అలుప్త= లోపంరాని; సత్+కర్ముండు+ఐ= విధి ప్రయుక్త కర్మ కలిగినవాడై.

తాత్పర్యం: సత్యభామ మొదలైన స్త్రీలు కొంతమంది తీవ్రనియమంతో అడవులలో తపస్సు చేయటానికి నిశ్చయించుకొని వెళ్ళిపోయారు. ఇట్లా అర్జునుడు ఏ లోపమూ రాకుండా విధిప్రయుక్తకర్మను ఆచరించాడు. తరువాత- (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **అఖిలబంధు జనంబుల నాప్తజనుల। నర్హవాక్యప్రయుక్తి నూరార్చి యుచిత**
మార నామంత్రితులఁ జేసి యశ్రు లురులఁ। బోయె నా క్రీడి సాత్యవతేయుగుఱిచి. **206**

ప్రతిపదార్థం: అఖిలబంధుజనంబులన్= బంధువులందరినీ; ఆప్తజనులన్= స్నేహితులను; అర్హవాక్యప్రయుక్తిన్= వారివారికి తగిన మాటలతో; ఊరార్చి= ఓదార్చి; ఉచితము+ఆరన్= తగిన విధంగా; ఆమంత్రితులన్+చేసి= వీడ్కొని; అశ్రులు+ఉరులన్= కన్నీరు కారగా; ఆ క్రీడి= ఆ కిరీటి (అర్జునుడు); సాత్యవతేయున్+గుఱిచి= సాత్యవతేయుడైన వ్యాసుడి వద్దకు; పోయెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: బంధుమిత్రులను తగిన విధంగా వీడ్కొని, కంటతడి పెట్టుకొని, అర్జునుడు వ్యాసుడి వద్దకు వెళ్ళాడు.

అర్జునుఁడు వేదవ్యాసునొద్దకుఁ బోయి యాదవక్షయంబు చెప్పుట (సం.16-9-1)

సీ. **పోయి మరున్నదిపొంత యాశ్రమమున। నర్హాసనమున నేకాంతనిరతి**
నాసీనుఁడై యున్న యమ్మహాత్మునిఁగని। యత్యంతభక్తిసాష్టాంగవినతి
యాచరించినఁ జూచి యమ్మహనీయ వి। ద్యానిధి సేరంగ నతనిఁ బిలిచి
తన సమీపంబున నునిచి తద్వదనమ్ముఁ। గనుఁగొని ని న్నెఱుగంగ రాదు

తే. **వెడమొగం బైన దిదియేను విజయ! యెట్ట। కేల కెఱిఁగితి నిదియేమి? కినుకవొడమి**
వధమునకు నయోగ్యుండగువానిఁ జంపి। తే? పరాజితుఁడైతె? నీ తెఱఁగు సెపుమ.' **207**

ప్రతిపదార్థం: పోయి= వెళ్ళి; మరుత్+నది= ఆకాశగంగ; పొంత= సమీపంలో; ఆశ్రమమునన్= ఆశ్రమంలో; అర్హ+ఆసనమునన్= తగిన ఆసనంలో; ఏకాంతనిరతిన్= ఏకాంతంలో ఆసక్తితో; ఆసీనుఁడు+ఐ ఉన్న= ఆసీనుడుగా ఉన్న; ఆ+మహాత్మునిన్+కని= ఆ మహాత్ముడిని చూచి; అత్యంతభక్తిన్= మిక్కిలి భక్తితో; సాష్టాంగవినతి= సాష్టాంగ నమస్కారం; ఆచరించినన్= చేయగా; చూచి; ఆ+మహనీయ విద్యానిధి= ఆ గొప్ప విద్యానిధి (బ్రహ్మవిద్యావేత్త); అతనిన్= అర్జునుడిని; చేరంగన్= రమ్మని; పిలిచి; తన సమీపంబునన్= తన దగ్గర; ఉనిచి= ఉంచికొని; తద్+వదనమ్మున్= అతడి ముఖాన్ని; కనుఁగొని= చూచి; విజయ!= అర్జునా!; నిన్నున్+ఎఱుగంగన్+రాదు= నీవు ఎందుకిట్లా ఉన్నావో తెలియటంలేదు; వెడమొగంబు+అయినది= ముఖం వికారంగా మారిపోయింది; ఇది= ఈ విషయం; ఏను= నేను; ఎట్టకేలకున్= చివరికి; ఎఱిఁగితిన్= గుర్తించాను; ఇది ఏమి!= ఎందుకిట్లా!; కినుక+పొడమి= కోపం పుట్టి; వధమునకున్= చంపటానికి; అయోగ్యుండు+అగువానిన్= అర్హుడు కానివాడిని; చంపితే?= చంపావా?; పరాజితుఁడు+ఐతె?= ఓడించబడ్డావా?; నీ తెఱఁగు= నీ పరిస్థితి; చెపుమ= చెప్పుము.

తాత్పర్యం: అట్లావెళ్ళి అర్జునుడు ఆకాశగంగ ప్రాంతంలో ఒక కుటీరంలో ఉచితాసనంలో ఏకాంతాభిలాషతో కూర్చున్న ఆ మహాత్ముడిని చూచి, మిక్కిలి భక్తితో సాష్టాంగనమస్కారం చేశాడు. ఆ బ్రహ్మవిద్యానిధి అర్జునుడి సమీపానికి రమ్మని కూర్చుండబెట్టుకొని, అతడి ముఖాన్ని చూచి, 'అర్జునా! నీవు వెందుకిట్లా ఉన్నావో తెలియదు. ముఖం వికారంగా మారిపోయింది. ఇది నేను ఇంతసేపటికి గుర్తించాను. ఇది ఏమిటి? కోపం వచ్చి చంపటానికి అర్హుడు కానివాడిని చంపావా? లేక యుద్ధంలో ఓడిపోయావా? నీ పరిస్థితి ఏమిటో చెప్పుము.'

చ. **అనవుడు నాతఁ డిట్టు లను నమ్మహితాత్మునితోడఁ బద్మ లో**
చనుఁడు నవాంబుదప్రతిమ చారుతనూలసితుండు దేవకీ
తనయుఁడు రామదేవుఁడును దానును మేను దొఱంగిపోయె నే
మనఁగలఁ? దెల్ల యాదవులు నాఱడి బోయిరి సంయమీశ్వరా! **208**

ప్రతిపదార్థం: అనవుడున్= అని అడుగగా; అతఁడు= అర్జునుడు; ఆ+మహిత+ఆత్ముని తోడన్= ఆ మహాత్ముడైన వ్యాసమహర్షితో; (ఇట్లా అన్నాడు); సంయమి+ఈశ్వరా!= ఋషిశ్రేష్ఠుడా!; పద్మలోచనుఁడు= కమలనేత్రుడు; నవ+అంబుద+ప్రతిమ= కొత్తమేఘానికి దీటైన; చారు= అందమైన; తనూలసితుండు= దేహప్రకాశం కలవాడు; దేవకీ తనయుఁడున్= దేవకీపుత్రుడును; రామదేవుఁడునున్= బలరాముడూ; తానునున్= తానుకూడా; మేనున్= దేహాన్ని; తొఱంగిపోయెన్= విడిచిపోయాడు; ఏమనన్+కలదు?= చెప్పటానికి ఏముంది?; ఎల్ల యాదవులు= యాదవులందరూ; ఆఱడిన్+పోయిరి= నశించిపోయారు.

తాత్పర్యం: అని అడుగగా అర్జునుడు ఆ మహాత్ముడితో ఇట్లా అన్నాడు; 'ఋషీశ్వరా! పద్మపత్రనేత్రుడు, నీలమేఘానికి దీటైన శరీరకాంతి కలిగినవాడు, దేవకీతనయుడు అయిన శ్రీకృష్ణుడు, బలరాముడు తనువులు వదలిపెట్టారు. ఏమి చెప్పను? యాదవులంతా నశించిపోయారు.

క. మహితాయుధ సంప్రహతులు । సహించు దృఢదేహధృతుల సడిసన్న మహో
త్సహనులు యాదవవీరులు । నిహతు లయిరి తుంగలను మనీషిప్రవరా! 209

ప్రతిపదార్థం: మనీషిప్రవరా!= (పండిత బుద్ధిమంతులలో) శ్రేష్ఠుడా!; మహిత= గొప్ప; ఆయుధ= ఆయుధాల; సంప్రహతులు= దెబ్బలు; సహించు= సహించేటటువంటి; దృఢ= గట్టి; దేహధృతులన్= దేహ దార్ఢ్యాలతో; సడిసన్న= ప్రసిద్ధినొందిన; మహా+ఉత్+సహనులు= చాలా ఉత్సాహం గలవారు; (అయిన) యాదవవీరులు= యాదవులు; తుంగలను= తుంగపరకలతో; నిహతులు+అయిరి= చచ్చారు.

తాత్పర్యం: గొప్ప గొప్ప ఆయుధాల దెబ్బలు సహించేటటువంటి గట్టి దేహ దార్ఢ్యాలతో ప్రసిద్ధి నొందిన మహా సహనశక్తి ఉన్న యాదవవీరులు తుంగపరకలతో చనిపోయారు. పండితశ్రేష్ఠుడా! దీనిని ఏమనాలి?

విశేషం: వ్యాసుడిని 'మనీషి ప్రవరా!' అన్న సంబోధనతో పిలవటంలో చాలా ఆంతర్యం ఉన్నది. అర్జునుడు వచ్చినది యాదవనాశనం ఎందుకు జరిగింది? కృష్ణుడు చనిపోవటమేమిటి? తాను బోయల చేత చిక్కటమేమిటి? ఇట్లాంటి ప్రశ్నలతో, దానిని చెప్పగలవాడు 'మనీషి'. వారిలో శ్రేష్ఠుడు 'వ్యాసుడు'.

తే. అట్లు రామకృష్ణులు సర్వయాదవులును । దెగినఁ జిత్తంబు పొగులంగ మగువపిండు
బాలవృద్ధులఁ గొనిరాఁగఁ బథమునందు । నన్ను బోయలు దాఁకిన నగుచు నేను. 210

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; రామకృష్ణులున్= బలరామకృష్ణులు; సర్వయాదవులునున్= యాదవులందరూ; తెగినన్= చనిపోగా; చిత్తంబు= మనస్సు; పొగులంగన్= వ్యథపడగా; మగువపిండున్= యాదవస్త్రీలను; బాలవృద్ధులన్= పిల్లలను, ముసలివారిని; కొనిరాఁగన్= వెంట తీసికొని రాగా; పథమునందున్= దారిలో; నన్నున్= నన్ను; బోయలు= కిరాతులు; తాఁకినన్= ఎదుర్కొనగా; నేను= నేను; నగుచున్= నవ్వుతూ (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఆ విధంగా బలరామకృష్ణులు, సర్వయాదవులు చనిపోగా మనసు వ్యథచెంది యాదవస్త్రీబాలవృద్ధులను వెంట తీసికొని వస్తుండగా దారిలో నన్ను బోయలు ఎదిరించారు. అప్పుడు నేను నవ్వుతూ.

చ. ఘనతరబాహుశక్తియును గాండివశక్తియు నస్త్రశక్తియు
న్మనమున నచ్చి యప్డు మునినాథ। కడంగితి నెట్టకేల క
ద్ధనువు గుణంబుఁ గూర్చితి; నుదగ్రత బాహుల లేకయుండె న
స్త్రనికరమంత్రతంత్రములు సంస్మృతిఁ బొందవ యేమి సెప్పుదున్? 211

ప్రతిపదార్థం: మునినాథ!= మునులలో శ్రేష్ఠుడా!; ఘనతర= మిక్కిలి గొప్పదైన; బాహుశక్తియునున్= బాహుబలమూ; గాండివశక్తియున్= గాండివధనుస్సు శక్తీ; అస్త్రశక్తియున్= అస్త్రశక్తీ; మనమునన్= మనసులో; నచ్చి= జ్ఞాపకం ఏర్పడి; అప్డు=

అప్పుడు; (నేను); కడంగితిన్= యుద్ధం చేయబూనుకొన్నాను; ఎట్టకేలకున్= ఎట్లాగో; ఆ+ధనువుగుణంబున్+కూర్చితిన్= ధనువునకు అల్లెత్రాడును సంధించాను; బాహులన్= బాహువులలో; ఉదగ్రత= ఉద్ధతి; లేక+ఉండెన్= లేకుండా ఉండింది; అస్త్రనికర= అస్త్రసముదాయానికి సంబంధించిన; మంత్ర తంత్రములు= మంత్రతంత్రాలు; సంస్కృతిన్= గుర్తులోకి; పొందవ= రావయ్యెను; ఏమి+చెప్పుదున్?= ఏమి చెప్పను?

తాత్పర్యం: మునిశ్రేష్ఠా! మిక్కిలి గొప్పదైన నా బాహుబలమూ, గాండీవశక్తీ మనసులో స్ఫురించాయి: వాటి భరోసాతో యుద్ధం చేయబూనాను. ఎట్లాగో ఆ బాణానికి అల్లెత్రాటిని సంధించాను. కాని బాహువులలో ఉద్ధతి లేకుండా పోయింది. అస్త్రసముదాయానికి సంబంధించిన మంత్రతంత్రాలు ఏవీ గుర్తుకు రావటంలేదు ఏమి చెప్పను?

క. బోయల సంహృతికిఁ బ్రకృతి। సాయకసంపాతనములు సాలవె? యని యే
నేయఁ దొడఁగ దొనలు చెనఁటు। లై యుండె; నొకండుఁ జేయునది లే దయ్యెన్. 212

ప్రతిపదార్థం: బోయల= ఆ బోయల యొక్క; సంహృతికిన్= సంహారానికి; ప్రకృతి= సహజమైన; సాయక= బాణాలు; సంపాతనములు= వేయటం; చాలవె?= చాలవా?; అని; ఏను; ఏయన్+తొడఁగన్= వేయటం మొదలుపెట్టగా; దొనలు= అమ్ముల పొదులు; చెనఁటులు+ఐ+ఉండెన్= వ్యర్థం అయ్యాయి; ఒకండున్= ఒకడినికూడా; చేయునది= చేయటానికి; లేదు+అయ్యెన్= ఏమీ లేకపోయింది.

తాత్పర్యం: ఆ బోయలను చంపటానికి సహజమైన బాణాలు (మంత్రంతో సంబంధం లేనివి) ప్రయోగిస్తే చాలదా? అనుకొని నేను వేయటం మొదలు పెట్టాను. చిత్రంగా అమ్ముల పొదులు వ్యర్థం అయిపోయాయి. నేను ఒకడినికూడా ఏమీ చేయలేకపోయాను.

క. నెవ్వగయు నచ్చెరువు మది। నివ్వటిలఁగ నప్పు డేను నివ్వెఱపడితిన్
జివ్వన ముసరి కిరాతులు। క్రొవ్వేసకం బెసఁగఁ జూఱగొని రజ్జనులన్. 213

ప్రతిపదార్థం: నెఱ+వగయున్= నిండుబాధా; అచ్చెరువున్= ఆశ్చర్యమూ; మదిన్= మనసులో; నివ్వటిలఁగన్= అతిశయించగా; అప్పుడు= ఆ సమయంలో; ఏను= నేను; నిండు+వెఱ= నిశ్చేష్టతను; పడితిన్= పొందాను; చివ్వనన్= శీఘ్రంగా; కిరాతులు= బోయలు; ముసరి= చుట్టుకొని; క్రొవ్వు+ఎసకంబు+ఎసఁగన్= గర్వం అతిశయించగా విజృంభణతో; ఆ+జనులన్= ఆ యాదవులను; చూఱగొనిరి= దోచుకొన్నారు.

తాత్పర్యం: నా మనసులో చాలా బాధా, ఆశ్చర్యమూ కలిగాయి. ఆ సమయంలో నేను నిశ్చేష్టుడ నయ్యాను. ఆ బోయలు వెంటనే ఆ యాదవసమూహాన్ని చుట్టుకొని, గర్వితులై వారిని అతివిజృంభణతో దోచుకొన్నారు.

ఆ. చాపదండ నిహతి నోపిన భంగిఁ గి। రాతకోటి నాఁగి రామకృష్ణ
వల్లభాదు లైన వనితలఁ గొందఱ। వృద్ధబాలకులను వెరవుతోడ. 214

ప్రతిపదార్థం: చాపదండ నిహతిన్= ఆ బాణందెబ్బతో; ఓపిన భంగిన్= నాకు చేతనైనంత; కిరాతకోటిన్= ఆ బోయలను; ఆఁగి= ఆపి; రామకృష్ణ వల్లభాదులు+ఐన= బలరామకృష్ణుల భార్యలు మొదలైన; వనితలన్= స్త్రీలను; కొందఱన్= కొందరినీ; వృద్ధ బాలకులను= ముసలివారినీ, పిల్లలను; వెరవుతోడన్= ఉపాయంతో.

తాత్పర్యం: అంత నేను నా గాండీవంతో వారిని నాకు చేతనైనంత వరకు మోది వారిని ఆపి, బలరామకృష్ణుల భార్యలు మొదలైన కొంతమంది స్త్రీలను, వృద్ధబాలకులను ఉపాయంతో (తరువాతి పద్యంతో అన్వయం).

క. కాచికొని వచ్చి తగ నా। నేచిన య ట్లచట నచట నిలిపితి మునినా
థా! చేటును భంగంబును। నై చిత్తము శోకమునకు నగ్గం బయ్యెన్. 215

ప్రతిపదార్థం: కాచికొని= రక్షించుకొని; వచ్చి= తిరిగివచ్చి; తగన్= తగినట్లుగా; నా నేచినఅట్లు= నేను నేర్చినట్లు; అచటన్+అచటన్= అక్కడక్కడా; నిలిపితిన్= నిలిపాను; మునినాథా!= ఓ మహర్షీ! (ఇందువలన); చేటును= ఆపద; భంగంబును= ఓటమి; ఐ= పొంది; చిత్తము= మనసు; శోకమునకున్= దుఃఖానికి; అగ్గంబు+అయ్యెన్= వశమయింది.

తాత్పర్యం: రక్షించుకొని వచ్చి, తగినట్లుగా వారిని ఆయాచోట్లలో నా నేర్చిన విధంగా నిలిపాను. ఓ మునిశ్రేష్ఠా! ఈ కారణంచేత ఆపద, ఓటములపాలై నా మనసు శోకానికి వశమైపోయింది.

తే. పడని పాటు వాటిల్లిన వెడమొగంబు। వడక యెట్లుండవచ్చు? దపఃప్రకీర్త
నీయ! యిం కిట యే నేమి సేయువాఁడ?। నెసఁగు దయతోడ నానతి యిమ్ము నాకు.' 216

ప్రతిపదార్థం: తపస్+ప్రకీర్తనీయ!= తపస్సుచే మిక్కిలి స్తుతించదగినవాడా!; పడనిపాటు= రారాని అపాయం; పాటిల్లినన్= వస్తే; వెడమొగంబు= వికారమైన ముఖం; వడక= రాకుండా; ఎట్లుండవచ్చున్?= ఎట్లా ఉండగలను?; ఇంకన్+ఇట= ఇక ఇక్కడ; ఏను+ఏమి+చేయువాఁడన్?= నేను ఏమి చేయాలి?; ఎసఁగు= అతిశయించే; దయతోడన్= దయతో; నాకున్= నాకు; ఆనతి+ఇమ్ము= ఆజ్ఞాపించుము.

తాత్పర్యం: ఋషీశ్వరా! నీవు తపస్సుచేత మిక్కిలి స్తుతించబడిన బ్రహ్మజ్ఞానివి. ఎప్పుడూ రాని అపాయం మీదపడితే ముఖం వికారం కాకుండా ఎట్లా ఉంటుంది? ఇక ఇక్కడ నేను ఏమి చేయాలో మీరు దయతో నాకు సెలవివ్వండి.'

వేదవ్యాసుఁ డర్జునునకు హితోపదేశము చేయుట (సం.16-9-25)

సీ. అన విని యమ్మహాముని క్రీడి కిట్లను। 'సంయమిదత్తోగ్రశాపనిహతి
నఖిలయాదవులును నట్లైరి; దానికి। నడలఁగఁ బనిలేదు; హరి యెఱుంగు
మున్న యా సంక్షయ మన్న! చెప్పెద విను ప్రాప్తకాలంబగు పనికి నడ్డ
పడనేల యని యాత్మ భావించి యతఁ డుపేక్షాపరుఁడై యుండెఁగాక; మూఁడు

తే. భువనములు నన్యథాత్వంబుఁ బొందఁజేయఁ। జాలువాఁడు కణ్వాదుల శాప ముడుప
శక్తి లేకుండెనే? యవశ్యంబు భావి। యైనయదిగాన యదునాశ మయ్యెఁ జువ్వె. 217

ప్రతిపదార్థం: అనన్= అని అడుగగా; విని= వినినవాడై; ఆ+మహాముని= వేదవ్యాసుడు; క్రీడికిన్+ఇట్లు+అనున్= అర్జునుడితో ఇట్లా చెప్పాడు; సంయమి= ఋషులచేత; దత్త= ఇవ్వబడిన; ఉగ్ర= భయంకర; శాపనిహతిన్= శాపందెబ్బకు; అఖిలయాదవులునున్= యాదవులంతా; అట్లు+ఐరి= అట్లా అయ్యారు; దానికిన్= దానికి; అడలఁగన్= బాధపడవలసిన; పనిలేదు= అవసరం లేదు;

అన్న!= ఓ నాయనా!; హరి= శ్రీకృష్ణుడు; ఆ సంక్షయము= యాదవనాశము; మున్ను+అ= ముందుగానే; ఎఱుంగున్= ఎరుగును; చెప్పెదన్= చెప్పుతాను; విను= వినుము; ప్రాప్తకాలంబు+అగు= కాలం దాపురించిన; పనికిన్= కార్యానికి; అడ్డపడన్= అడ్డుగా వ్యవహరించటం; ఏల+అని= ఎందుకని; ఆత్మన్+భావించి= మనసులో భావించి; అతఁడు= శ్రీకృష్ణుడు; ఉపేక్షాపరుఁడు+ఐ= ఉపేక్ష కలిగి; ఉండెన్+కాక= ఉన్నాడు కాని; మూఁడుభువనములు= ముల్లోకాలు; అన్యథాత్వంబున్= తారుమారు; పొందన్+చేయన్+చాలువాఁడు= అయ్యేటట్లు చేయకలిగినవాడు; కణ్వ+ఆదుల= కణ్వాదిమహర్షుల; శాపము+ఉడుపన్= శాపాన్ని ఆపగా; శక్తి లేకుండెనే?= శక్తిలేనివాడా?; అవశ్యంబు= తప్పనిసరిగా; భావి+ఐన+అది= జరగవలసినది; కానన్= కాబట్టి; యదునాశము+అయ్యెన్+చువ్వె!= యదునాశనం అయింది సుమా!

తాత్పర్యం: అని అడుగగా విన్నవాడై వేదవ్యాసుడు అర్జునుడితో ఇట్లా చెప్పాడు: 'ఋషు లిచ్చిన భయంకరమైన శాపపు దెబ్బకు యాదవు లట్లా నశించారు. దానికి దుఃఖించవలసిన పనిలేదు నాయనా! శ్రీకృష్ణుడికి యాదవనాశనం ముందుగానే తెలుసును. చెప్పుతాను వినుము. కాలం దాపురించిన కార్యానికి అడ్డుగా వ్యవహరించటం ఎందుకని మనసులో భావించి శ్రీకృష్ణుడు ఉపేక్షతో ఉన్నాడు కాని, ముల్లోకాలను తారుమారు చేయగలిగిన శ్రీకృష్ణుడు కణ్వాది మహర్షుల శాపాన్ని ఆపటానికి శక్తి లేనివాడా?; తప్పనిసరిగా జరగవలసిన కార్యం కాబట్టి యదునాశన మయింది సుమా!

విశేషం: సర్వమూ కాలాధీనమై ప్రవర్తిస్తుందన్న పూర్వపర్వాలలోని సిద్ధాంతాన్నే ఈ పద్యమూ నిరూపిస్తున్నది. వ్యాసుడు మహాభారతంలో ఈ విషయాన్నే కేంద్రభూతంగా నిరూపించాడు.

ఉ. **నీ వని సేయ నీవలని నెయ్యమునం గృప నన్యసైన్యముం**
దా వధియించు శూలధరతాస్ఫురణం బెసఁగంగ ముంద ర
ద్దేవుఁడు; దానిఁ గాంచు భవదీయసమంచిత దృష్టియున్ నినుం
గావఁడ యా మురాంతకుఁడు కాలవిపర్యయ మావహిల్లుటన్. **218**

ప్రతిపదార్థం: నీవు; అని+చేయన్= యుద్ధం చేయగా; నీవలని= నీపట్ల ఉన్న; నెయ్యమునన్= స్నేహంతో; కృపన్= దయతో; అన్య సైన్యమున్= శత్రుసైన్యాన్ని; తాన్= తాను; ఆ దేవుఁడు= ఆ కృష్ణుడు; శూలధరతాస్ఫురణంబు+ఎసఁగంగన్= రుద్రత్వస్ఫురణ అతిశయించగా; వధియించున్= చంపేవాడు; దానిన్= దానిని; భవదీయ= నీ; సమంచిత దృష్టియున్= సుందరమైన దృష్టి; కాంచున్= కనుగొనేది; ఆ మురాంతకుఁడు= అట్లాంటి శ్రీకృష్ణుడు; కాలవిపర్యయము= కాలం అడ్డ తిరగటం; ఆవహిల్లుటన్= దాపురించటం వలన; నినున్= నిన్ను; కావఁడు+అ= కాపాడలేదు.

తాత్పర్యం: అర్జునా! నీవు యుద్ధం చేయగా నీపట్ల ఉన్న స్నేహంతో కృపతో శత్రుసైన్యాన్ని తాను (ఆ శ్రీకృష్ణుడు) రుద్రత్వస్ఫురణ ఆవహిల్లగా చంపేవాడు. నీ సుందరదృష్టి దానిని కనుగొనేది. అట్లాంటి శ్రీకృష్ణుడు కాలం అడ్డ తిరగటం దాపురించటంవలన నిన్ను కాపాడలేదు.

విశేషం: గీతోపదేశం చేసినపుడు శ్రీకృష్ణుడు తానే చంపేవాడని అర్జునుడు నిమిత్తమాత్రుడని చెప్పిన పరమేశ్వరకర్తృత్వ సిద్ధాంతాన్ని వ్యాసుడు ఇక్కడ వ్యాఖ్యానిస్తున్నాడు. అంటే మహాభారత యుద్ధాన్ని చేసింది; శత్రువులను 'కాల' రూపుడుగా చంపింది శ్రీకృష్ణుడే అని అర్థం. ఆ 'కాలం' ప్రచోదించిన రీతిగా తన అవతారాన్ని చాలించారు. 'రుద్రాంశ' నశించింది. అందుకే ఓడిపోయాడని అర్థం. (మురాంతకుడు= మురాసురుడిని చంపినవాడు కృష్ణుడు అని అర్థం).

చ. ధరణిభరంబు వాప నవతారము నొందిన విష్ణుఁ డత్తెఱం
గరుదుగ నిర్వహించి యజరామరనిష్కల నిర్వికార భా
స్వరనిజసత్పదంబు నుపశాంతిపరుండయి పొందె దానికిం
గురుకులవర్య! శోకమునఁ గుందుదురే మిముఁ బోటి బోధనుల్? 219

ప్రతిపదార్థం: కురుకులవర్య!= కురుకులశ్రేష్ఠుడా!; ధరణిభరంబు= భూభారం; పాపన్= తొలగించటానికి; అవతారమున్= అవతారాన్ని; ఒందిన= ఎత్తిన; విష్ణుఁడు= నారాయణుడు; ఆ+తెఱంగు= ఆ పని; అరుదుగన్= అపూర్వంగా; నిర్వహించి= చేసి; అజర+అమర= ముసలితనమూ, మృత్యువూ లేని; నిష్కల= కళారహితమైన; నిర్వికార= వికారాలు లేని; భాస్వర= ప్రకాశించే; నిజ= తన; సత్+పదంబున్= సత్‌స్థానాన్ని; ఉపశాంతి= ఉపశమింపజేయ; పరుండు+అయి= ఆసక్తిగలవాడై; పొందెన్= చేరాడు; దానికిన్= దానికి; మిముఁబోటి= మీవంటి; బోధనుల్= జ్ఞానులు; శోకమునన్= దుఃఖంతో; కుందుదురే?= బాధపడతారా?

తాత్పర్యం: భూభారాన్ని తొలగించటానికి అవతారమెత్తిన నారాయణుడు ఆ పని అపూర్వంగా నిర్వహించి ముసలితనం, మృత్యువూ లేనిదీ, కళాతీతమైనదీ, వికృతిలేనిదీ, అయి ప్రకాశిస్తూ ఉండే తన 'సత్' స్థానాన్ని ఉపశమం పొందినవాడై చేరాడు. దానికి మీవంటి జ్ఞానులు శోకంతో బాధపడటమా!

విశేషం: పరమాత్మ 'సత్' అని వేదాంతపరిభాషలో పిలువబడింది. 'యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ' అని గీతాశాస్త్రం. దానిని అందుకొన్నవారు మరలిరారు - అది 'సత్ ' పదం. ఆ స్థానానికి 'గడువు' లేదు (అజరం); నాశం లేదు (అమరం); కళలు లేవు (నిష్కల); (శుక్ల, కృష్ణ పక్ష చంద్రుడి కాంతులవలె వృద్ధి క్షయాలు లేవు. అందుచేత సంపూర్ణం); నిర్వికార మది - అంటే వికారం పొందటం - నశించటం - మారటం లేదు. అది ఎప్పుడూ 'ప్రకాశమే' అక్కడ చీకటి లేదు - అంటే 'అసత్' స్థానం చీకటి వెలుగులమయం, 'సత్' స్థానంలో చీకటి లేదు (తమసః పరస్తాత్- చీకటికి ఆవలిది). ఉపశాంతి - ఉపశమం - దానినే 'విరమణ' అన్నారు. సృష్టి అక్కడ మొదలై మరలా అక్కడికే చేరి విశ్రమిస్తున్నది. అందుకే స్వామిని 'శాంతాకారుడు' అని పిలిచారు.

మ. అవనీభారము వాపి తా హరికిఁ దోడై భీమ సాహాయ్యగౌ
రవదుర్దాంత పరాక్రమంబునఁ గృతార్థత్వంబునం జేసి య
స్త్రవితానంబును నిన్నుఁ బాసి చనియెన్ దైవప్రకారజ్ఞ! నీ
దువరిష్ఠాచరణంబునన్ సురలు సంతోషించి రప్పోరులన్. 220

ప్రతిపదార్థం: అవనీభరము+పాపి= భూభారాన్ని పోగొట్టి; తాన్+హరికిన్+తోడు+ఐ= తాను హరికి తోడుగా నిలిచి; భీమ= భీముడి; సాహాయ్య= సహాయ; గౌరవ= గౌరవంచేత; దుర్దాంత= ఉద్ధతమైన; పరాక్రమంబునన్= పరాక్రమంతో; కృత+అర్థత్వంబునన్+చేసి= అనుకొన్నపనిని సాధించటంచేత; అస్త్రవితానంబునున్= అస్త్రసమూహం కూడా; నిన్నున్+పాసి+చనియెన్= నిన్ను వదలి వెళ్ళిపోయింది; దైవప్రకారజ్ఞ!= దైవం ఎట్లా ప్రవర్తిస్తుందో తెలిసినవాడా!; నీదు= నీ; వరిష్ఠాచరణంబునన్= శ్రేష్ఠమైన అనుష్ఠానంచేత; ఆ+పోరులన్= ఆ యుద్ధాలలో; సురలు= దేవతలు; సంతోషించిరి= సంతోషపడ్డారు.

తాత్పర్యం: భూభారాన్ని పోగొట్టి, హరికి సహకరించి భీమసహాయ గౌరవంతో ఉద్ధతపరాక్రమంతో అనుకొన్న పనిని సాధించటంచేత అస్త్రసంపద నిన్ను వదలివెళ్ళిపోయింది. దైవం ఎట్లా ప్రవర్తిస్తుందో నీకు తెలుసుగదా నాయనా! నీ శ్రేష్ఠమైన అనుష్ఠానంచేత దేవతలు కూడా ఆ యుద్ధాలలో చాలా సంతోషించారు. నీవు ధన్యుడవు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: దైవప్రకారజ్ఞుడు - గీతాశ్రోతగా, నారాయణ సహాయం పొందిన అర్జునుడికి దైవం 'అఘటనఘటనా పటీయసి' - అని తెలియనిది కాదు. దానిని వ్యాసమహర్షి గుర్తు చేస్తున్నాడు. వరిష్ఠాచరణము - ఆచరణం అంటే నడవడి - ఇక్కడ శస్త్రవిద్యను అనుష్ఠించి, సాధించి, ఆ విద్యను సొంతం నిలుపుకొని యుద్ధంచేసినవాడని అర్థం - విద్య అనుష్ఠానరూపమని అర్థం.

క. బలమును బుద్ధియుఁ జేవయు। నలఘుమతీ! యుల్లసిల్లు నగు కాలమునం
బొలియుం గాలవిపర్యయ। కలనంబున బుధుల కుబ్బుఁ గలఁకయుఁ గలవే? 221

ప్రతిపదార్థం: అలఘుమతీ!= గొప్ప బుద్ధిగల ఓ అర్జునా వినుము!; అగు కాలమునన్= అయిన కాలంలో (కాలం అనుకూలంగా ఉన్నప్పుడు); బలమునున్= బలమూ; బుద్ధియున్= బుద్ధీ; చేవయున్= శక్తీ; ఉల్లసిల్లున్= అతిశయిస్తాయి (వ్యక్తమవుతాయి); కాల= కాలంయొక్క; విపర్యయ కలనంబునన్= అడ్డు తిరిగిన స్థితిచేత; పొలియున్= నశిస్తాయి; (అందుచేత); బుధులకున్= జ్ఞానులకు; ఉబ్బున్= గర్వమూ; కలఁకయున్= దుఃఖమూ; కలవే?= ఉంటాయా?

తాత్పర్యం: అయిన కాలంలో బలమూ, బుద్ధీ, శక్తీ ప్రకాశిస్తాయి. కాలం అడ్డు తిరిగితే నశిస్తాయి. అందువలన జ్ఞానులకు గర్వము కాని, శోకం కాని ఉండవు. నీవు జ్ఞానివి. నీకు తెలియని విషయమా ఇది!

తే. కాలమూలంబు సర్వంబుఁ గాన దీని। కొండు తలఁపులు దక్కి మీ రుత్తమంపు
గతికిఁ జనుఁడు నిశ్చింత వికారతనులు। విడిచి యార్యజనంబులు వినుతి సేయ.' 222

ప్రతిపదార్థం: సర్వంబున్ కాలమూలంబు= సమస్తమూ అన్ని కాలాలకూ ఆధారమైనది; కానన్= కాబట్టి; దీనికిన్+ఒండు తలఁపులు= దీనికి తక్కిన ఆలోచనలు; తక్కి= మాని; మీరు= పాండవులైన మీరు; ఆర్యజనంబులు= పెద్దలు; వినుతి+చేయన్= ప్రశంసించగా; నిశ్చింతన్= నిశ్చింతగా; వికారతనులు= వికార రూపాలైన ఈ దేహాలు; విడిచి= వదలిపెట్టి; ఉత్తమంపు+గతికిన్= ఉత్తమగతికి; చనుఁడు= వెళ్ళండి.

తాత్పర్యం: సృష్టిలో అంతా కాలాధీనంగా ఉంటుంది. అందుచేత ఈ విషయంలో తక్కిన ఆలోచనలు మాని, పాండవులైన మీరు పెద్దలు ప్రశంసించగా నిశ్చింతగా వికారరూపాలైన ఈ దేహాలు విడిచిపెట్టి ఉత్తమగతికి వెళ్ళండి.

విశేషం: వికార రూపాలు; వికారమంటే పరిణామం. అసత్ పదార్థాలకు లక్షణం పరిణమించటం - అంటే మార్పు పొందటం. వికార తనువులు - అంటే పరిణామశీలములైన దేహాలను అని అర్థం. ఉత్తమగతి - అంటే పుణ్యలోకాలు. మహాభారతేతిహాసం వ్యాసుడి ఈ ఉపదేశంతో సంపూర్ణేతిహాస మవుతోంది. 'కాలాయ తస్మై నమః' అని కాలశక్తికి అందుకే నమస్కరించారు.

సీ. అన విని శోకమోహంబులు వాసిన। డెందంబు నిర్భరానంద మొంద
నధికభక్తియు వినయంబును దలకొన। నర్జునుఁ డమ్మహితాత్ము వీడు
కొని వారణపురికిఁ జనుదెంచి ధర్మజుఁ। గని తన పోయివచ్చిన తెఱంగు
వినిపించె సర్వంబు నని యిట్లు సంయమి। నుతుఁడు వైశంపాయనుండు రామ

తే. కృష్ణు లాదిగఁ గల్గిన వృష్ణిచయము। భోజసంతతి యంధకరాజి నూత్న
వృత్తములు జనమేజయ విభున కింపు। సెవులఁ దళుకొత్త నేర్పడఁ జెప్పుటయును. 223

ప్రతిపదార్థం: అనన్= అని చెప్పగా; విని= అర్జునుడు విని; శోకమోహంబులు= శోకమూ; మోహమూ; పాపిన= పోయిన; డెందంబు= హృదయం; నిర్భర+ఆనందము= అతిశయమైన ఆనందం; ఒందన్= పొందగా; అధికభక్తియున్= అధికమైన భక్తీ; వినయంబునున్= వినయమూ; తలకొనన్= జనించగా; అర్జునుఁడు; ఆ+మహిత+ఆత్మున్= ఆ మహాత్ముడైన వ్యాసుడిని; వీడుకొని= వీడ్కోలు చెప్పి సెలవుతీసికొని; వారణపురికిన్= హస్తినాపురానికి; చనుదెంచి= వచ్చి; ధర్మజున్+కని= ధర్మరాజును చూచి; తన= తనయొక్క; పోయివచ్చిన తెఱంగు= పోయివచ్చిన వైనం; సర్వంబున్= అంతటినీ; వినిపించెన్= వినిపించాడు; అని; ఇట్లు= ఈ విధంగా; సంయమి నుతుఁడు= ఋషులచేత కీర్తించబడిన; వైశంపాయనుఁడు= వైశంపాయనమహర్షి; రామకృష్ణులు+ఆదిగన్= బలరామకృష్ణులు మొదలుగా; కల్గిన= ఉన్న; వృష్ణిసంతతి= వృష్ణివంశీయులు; భోజసంతతి= భోజవంశీయులు; అంధకరాజి= అంధక వంశీయుల సమూహం; నూత్న వృత్తములు= క్రొత్త కథలు; జనమేజయ విభునకున్= జనమేజయ మహారాజుకు; ఇంపు+చెవులన్+తళుకొత్తన్= శ్రవణమాధుర్యం స్ఫురించగా; ఏర్పడన్= స్పష్టమయ్యేటట్లు; చెప్పుటయునున్= చెప్పటమూ.

తాత్పర్యం: అని వ్యాసుడు చెప్పగా అర్జునుడు విని, శోకమూ, మోహమూ పోయిన హృదయంతో అతిశయమైన ఆనందం పొంది, అధికమైన భక్తి, వినయం కలుగగా, ఆ మహాత్ముడిని వీడుకొని హస్తినాపురికి వచ్చి, ధర్మరాజును చూచి తాను పోయివచ్చిన వైనమంతా చెప్పాడు - అని ఇట్లా వైశంపాయనమహర్షి జనమేజయమహారాజుకు వృష్ణిభోజాంధక వంశీయుల క్రొత్త కథలను శ్రవణమాధుర్యం స్ఫురించేటట్లు స్పష్టమైన రీతిలో చెప్పటం ఈ పర్వంలోని కథాసారాంశం.

ఆశ్వాసాంతము

శా. కాలస్వైరవిహారభంజన! కళాకౌతూహల స్తవ్య! దు
శ్శీలాంతఃకరణావిభావ్య! కరుణాశ్రీమందిరాపాంగ! మం
త్రాళీవాచ్య! సుధామయాంగ! పవనవ్యాపారరోధక్రియా
శాలిస్వాంత సముల్లసద్విహరణా! సంసార నిస్తారణా! 224

ప్రతిపదార్థం: కాలస్వైర విహారభంజన!= కాలంయొక్క స్వేచ్ఛా విహారాన్ని భంజించేవాడా!; కళా= కళయొక్క; కౌతూహల= కుతూహల స్వభావంచేత; స్తవ్య= కీర్తించదగినవాడా!; దుశ్శీల= దుష్టమైన శీలం కల; అంతఃకరణ= మనస్సులచేత; అవిభావ్య= భావించటానికి శక్యం కానివాడా!; కరుణా= అనుకంప అనేటటువంటి; శ్రీ= లక్ష్మికి; మందిర= ఆవాసంగా ఉండే; అపాంగ!= కటాక్ష వీక్షణ ప్రసారం కలవాడా!; మంత్రాళి= మంత్ర సముదాయంచేత; వాచ్య!= చెప్పదగినవాడా; సుధామయాంగ!= అమృతరూపమైన శరీరం కలవాడా!; పవన= వాయు; వ్యాపార= వ్యాపారాన్ని (ఉచ్ఛ్వాస నిశ్వాసాలను); రోధ= నిరోధించే; క్రియాశాలి= ప్రక్రియ తెలిపిన మహాయోగుల; స్వాంత సముల్లసత్+విహరణా!= హృదయాలలో విలసిల్లే విహారం కలవాడా!; సంసార నిస్తారణా!= సంసారసాగరం నుండి (భక్తులను) దాటింప జేసేవాడా!

తాత్పర్యం: కాలం సర్వభువనాలనూ తనవశం చేసికొనగల శక్తి కలిగినది కావటంచేత అది విజృంభిస్తూ ఉంటుంది. అట్లాంటి కాలాన్ని వశం కావించుకొని దాని గర్వాన్ని అణచినవాడివి నీవు. కళ కుతూహలంతో మాత్రమే నిన్ను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్తుతిస్తుంది. దుష్టస్వభావులకు నీ రూపం ఆలోచించటానికి కూడా అందదు. నీ వీక్షణం దయకు నిలయం. సర్వవేదాలూ నిన్నే తెలుపుతున్నాయి. నీవు అమృతస్వరూపుడవు. ప్రాణాయామాదులచేత వాయునిరోధం కావించే మహాయోగుల చిత్తాలలో నీవు సదా విహరిస్తుంటావు. సంసారసాగరంనుండి భక్తులను తరింపజేస్తావు.

విశేషం: 'కాలః సర్వస్యకారణం' అన్న స్మృతివాక్యం ఈ పద్యంలో స్తుతించబడింది. ఏ కళా భగవంతుడిని స్తుతించకుండా ఉండజాలదు. అన్నీ భగవత్తత్త్వనిరూపణ కుతూహలంలోనే నానావిధాలుగా కీర్తిస్తున్నాయి. మంత్రమన్నా వేదమన్నా ఒకటే. పవనవ్యాపార నిరోధమే ప్రాణాయామం. యోగుల హృదయాలలో పరమాత్మ రమిస్తాడు కాబట్టి యోగి-భగవంతుడు ఒకటేనన్న తాత్పర్యాన్ని గీత ప్రతిపాదించింది. పరమాత్మ అమృతస్వరూపుడు. 'తదేవ శుక్ర మమృతం తద్ బ్రహ్మ' అని ఉపనిషద్వాక్యం. 'తేషా మహం సముద్ధర్తా మృత్యుసంసార సాగరాత్' - అన్న గీతాప్రమాణమే 'సంసారనిస్తారణా!' అనే సంబోధనలో కనిపిస్తుంది. సంసారం సాగర రూపమైనది. మృత్యువు దాని స్వరూపం. ఆ సాగరాన్ని దాటించగలవాడు - అమృతరూపుడు మాత్రమే. అందుకనే పరమాత్మను అమృతస్వరూపుడిగా కీర్తించారు.

క. **హృదయకమలమధురూపా! । విదారిత దురంతతాప! వేదస్తోమా**
స్పద పారాశర్యమన । స్సదనా! దివిజ శుభకృద్వచనపరవదనా! 225

ప్రతిపదార్థం: హృదయ= హృదయమనే; కమల= కమలంలో; మధురూపా!= మధువురూపంలో ఒప్పినవాడా!; విదారిత= నశింపచేయబడిన; దురంత= అంతంలేని; తాప= సంసారతాపం కలవాడా!; వేదస్తోమ= శ్రుతిసముదాయానికి; ఆస్పద= నిలయమైన; పారాశర్య= వేదవ్యాసుడి; మనస్= మనస్సే; సదనా!= ఇల్లుగా కలిగినవాడా!; దివిజ= దేవతలకు; శుభ= శుభాన్ని; కృత్= కలుగజేసే; వచనపర= వచనాలలో ఆసక్తమైన; వదనా!= ముఖం కలిగినవాడా!

తాత్పర్యం: యోగులు తమతమ హృదయకమలాలలోని దహరాకాశంలో ప్రకాశించే నిన్ను గాంచి మహానందం పొందుతారు. కాబట్టి నీవు మధుస్వరూపుడవు. అంతులేని సంసారతాపాలను కూడా నీవు నశింపజేస్తావు. సర్వవేదాలకూ నిలయమైన వేదవ్యాసుడి చిత్తమే నీ నిలయం. దేవతలకు సైతం శుభాన్ని కలుగజేసే శ్రుతిస్మృతులు నీ ముఖం నుండే వెలువడ్డాయి.

విశేషం: కమలంలోని మధువువలె సారభూతమైన వాడు కాబట్టి యోగానందమే ఆ మధువు. కనుకనే అమృతరూపు డన్నది. సంసారతాపత్రయం - అంతంలేనిది. కేవలం భగవంతుడి దయచేతనే అది 'సాంతం' కావాలి. వ్యాసుడు వేదాలను విభజించాడు. వేదార్థ సందేహనివారణకొరకు బ్రహ్మసూత్రాలు రచించాడు. సర్వోపనిషత్ సారరూపంగా భగవద్గీతను గ్రథనం చేశాడు. జనులకొరకు వేదార్థాన్ని వివరిస్తూ భారతాద్యష్టాదశ పురాణాలు రచించాడు. అందుకనే ఆయన హృదయం వేదస్తోమాస్పద మనటం. అందుకే 'వ్యాసాయ విష్ణురూపాయ' అని కూడా అన్నారు. వేదాలు విరాట్ స్వరూపుడి విశ్వాసాలలో బయటపడ్డాయన్న దానికి అర్థమే-పరవదనా! అనే మాటకు అర్థం.

మాలిని.

అమరగణవిరోధి వ్యాపదాపాది కోపా!
శమితవినతచిత్తాసంగిగాఢప్రతాపా!
యమనియమ వికాసిధ్యాన గేహప్రదీపా!
దమశమకలితానంద ప్రకాశస్వరూపా! 226

ప్రతిపదార్థం: అమరగణ= సురసముదాయానికి; విరోధి= విరోధులైన రాక్షసులకు; వ్యాపద్= ఆపదలను; ఆపాది= కలుగజేసే; కోపా!= కోపం కలవాడా!; శమిత= శమింపచేయబడిన; వినత= వినయశీలురైన; చిత్త= భక్తుల చిత్తాలలో; ఆసంగి= నిండిన; గాఢ= గాఢమైన; ప్రతాపా!= ప్రకృష్టములైన తాపాలు కలిగినవాడా!; యమ= యమ; నియమ= నియమ (ఆదులచేత); వికాసి= వికసించిన; ధ్యాన= ధ్యానమనే; గేహ= గృహానికి; ప్రదీపా= దీపంగా ప్రకాశించేవాడా!; దమ; శమ= శమాలచేత; కలిత= కూడిన; ఆనంద ప్రకాశ= ఆనంద ప్రకాశాలను; స్వరూపా!= స్వరూపంగా కలిగినవాడా!

తాత్పర్యం: ధర్మపరులు దేవతలు. అందుచేత దేవగణాలను విరోధిస్తారనే కోపంతో నీవు రాక్షసులకు ఆపదలు కలుగజేస్తావు. నీవు వినయసంపదగల భక్తుల తాపత్రయాన్ని పోగొట్టుతావు. యమనియమాదులతో వికసించిన ఉపాసకుల ధ్యానంలో ప్రకాశిస్తావు. శమదమాదులచేత కలిగిన ఆనందప్రకాశాలే నీ స్వరూపం.

విశేషం: "యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్."

అన్న గీతోక్తికి వ్యాఖ్యానమే ప్రథమపాదం. సాధువులను రక్షించటం, దుష్కృతులను శిక్షించటం స్వామివారి కర్తవ్యం. అందుకనే అసురులపై స్వామి కోపం. శారీరక, మానసిక, వాచిక (మనోవాక్కాయ)-సంబంధి తాపాలున్నాయి; అట్లాగే ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక-తాపాలున్నాయి; వీటిని - ఈ త్రితాపాలను స్వామి పరిహరిస్తాడు. అందుకే ప్ర- అనే ఉపసర్గ ద్వారా ఈ తాపతీవ్రతను కవి సూచిస్తున్నాడు. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులు - యోగంలో ప్రధానమైన అష్టాంగాలు. శమం, దమం, విషయనివృత్తి, దుఃఖసహనం, శాస్త్రాచార్యోపదేశాలలో శ్రద్ధ, లక్ష్యవిషయకంగా చిత్తైకాగ్రత - వీటిని శమాదిషట్కమంటారు. వీటిచేత పరమేశ్వరస్వరూపమైన ఆనంద, ప్రకాశాలు గోచరిస్తాయి. ఆనందం దాని అనుభవం. ప్రకాశం-దానిరూపం. తిక్కనగారి ఆశ్వాసాంతాలలో చివర తప్పనిసరిగా ఈ ఆనందశబ్ద ప్రసక్తి ఉంటుంది. బ్రహ్మానంద సాధనకోసం వాగ్రూపమైన తపస్సు చేసిన మహాకవి తిక్కనగారు. అందుకే స్వామిని ఆనందనిలయుడుగా, ఆనందస్వరూపుడుగా, ఆనంద తత్పరుడుగా నానావిధాల కీర్తించి, తిక్కన తాపత్రయవిముక్తు డయ్యాడు. కను 'వెలుగు' ను పొందాడు. అందుకే 'ప్రకాశ' స్మరణం- ఇక్కడ చేయబడింది.

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బయిన శ్రీమహాభారతంబునందు మౌసలపర్వంబు సర్వంబు నేకాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈరచన; శ్రీమత్= ప్రసిద్ధి కెక్కిన; ఉభయ కవి= సంస్కృతాంధ్ర భాషాకవుల; మిత్త్ర= మిత్రుడును; కొమ్మన= కొమ్మన అనే; అమాత్య= మంత్రియొక్క; పుత్త్ర= కుమారుడును; బుధ= విద్వాంసులయొక్క; ఆరాధన= పూజచేత; విరాజి= ప్రకాశించేవాడును అయిన; తిక్కన సోమయాజి= సోమయాజి అయిన తిక్కనచేత; ప్రణీతంబు+ఐన= రచించబడినదైన; శ్రీమహాభారతంబునన్= శ్రీమహాభారతంలో; మౌసలపర్వంబు+అందున్= మౌసలపర్వంలో; సర్వంబును= సమస్తమును; ఏకాశ్వాసము.

తాత్పర్యం: కీర్తికలవాడూ, సంస్కృతాంధ్రభాషా కవిమిత్రుడూ, కొమ్మనమంత్రి కుమారుడూ, బుధపూజనంచేత ప్రకాశించేవాడూ అయిన తిక్కనసోమయాజి రచించిన శ్రీ మహాభారతంలో మౌసలపర్వం సర్వం ఏకాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతంలోని ఏకాశ్వాసమైన మౌసలపర్వం ముగిసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

మహాప్రస్థానిక పర్వము - ఏకాశ్వాసము

శ్రీ పదసీమా వాప్తి స। మాపాదన కేళి కౌతుకాధీన దయా

వ్యాపార! సకలవేదో। హాపోహాతీతసార! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీపద= మోక్షస్థానం యొక్క; సీమ= పరమావధిని; అవాప్తి= పొందటాన్ని; సమాపాదన= కలుగజేసేటటువంటి; కేళి= విలాసానికి సంబంధించిన; కౌతుక= ఉత్సాహానికి; అధీన!= వశుడైనవాడా!; దయావ్యాపార!= ఆపన్నుల విషయంలో దయతో వ్యవహరించేవాడా!; సకలవేద= అన్నివేదాలలోని; ఊహ+అపోహ+అతీతసార!= ఊహలకు, అపోహలకు కూడా అందని స్వరూపం కలవాడా!; హరిహరనాథా!= ఓ హరిహరనాథస్వామీ!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీ ఉత్తమ భక్తులకు ఆనందపరమావధి అయిన మోక్షసామ్రాజ్యాన్ని కలుగజేయటంలో నీవు మిక్కిలి ఉత్సాహపరుడివి. ఆపద నందినవారి యందు నీకెంతో కనికరం. నీ స్వరూపం వేదాలలో చెప్పబడిన ఊహలకు అపోహలకు అందనిది.

విశేషం: భగవంతుడు నిత్యోత్సాహం కలవాడు. ఆ ఉత్సాహం భక్తులకు అత్యుత్తమ స్థానమైన మోక్షాన్ని అందించటానికి సంబంధించింది. ఆ ఉత్తమస్థానాన్ని శ్రీపదమన్నారు. శ్రీసూక్తంలో చెప్పినట్టు మోక్షలక్ష్మికి కూడా 'శ్రీ' అనే పేరున్నది. అక్కడన్నీ శుభాలే. లోకంలో ఉన్న సుఖదుఃఖాది ద్వంద్వభావా లుండవు. అదొక అద్వైతానందం. దానినే బ్రహ్మానంద మన్నారు. (దానిని అందుకొనటానికే తాను ప్రయత్నించి రచన ప్రారంభించినట్లు విరాటపర్వాదిలో తిక్కన సోమయాజి చెప్పాడు), ఈ చివరి రెండు పర్వాలలో ఆ ఆనంద ప్రారంభ వికాసస్థితులు ప్రస్తావించబడ్డాయి. కవి, నాయక, పాత్రలతో పాటు సహృదయుడికీ ఏ అనుభవప్రాప్తి ఈ గ్రంథపఠనం ద్వారా సిద్ధిస్తుందో కవి ఈ మాట ద్వారా సూచిస్తున్నాడు. ఉత్తమభక్తి శ్రద్ధలతో భారతాన్ని అధ్యయనం చేసినవాడికి శ్రీపదసిద్ధి తప్పక జరుగుతుందని అర్థం. ఇదంతా స్వామికి ఒకలీల. అంటే ఒక ఆట అని అర్థం. అందుకే అవతారాన్ని 'లీల' అని కూడా అంటారు. ఇదంతా శ్రీకృష్ణలీల. పాండవు లిప్పుడు మహాపదలో ఉన్నారు. వారిని సముద్ధరించటానికే వ్యాసస్వరూపుడయిన శ్రీకృష్ణుడు మౌసలపర్వంచివర 'ఈ మానుష తనువులను త్యజించి పరమపదాన్ని చేరుకొనం'డని సూచించి వారిపై దయ చూపాడు. ఆ పరమపదాన్ని పాండవులు చేరుకొన్న స్థితిని ఈ ఏకాశ్వాస పర్వం వర్ణిస్తుంది. మరొక విశేషం-జైమిన్యాదులు మీమాంసాశాస్త్రంలో చెప్పినట్లు ఊహలు, అపోహలు వేదోక్తాలయిన కర్మోపాసనల విషయంలోనే పనికివస్తాయి. తపస్సిద్ధివస్తువయిన భగవంతుడి విషయంలో పనికిరావు. ప్రత్యక్షంగా కనిపిస్తున్న విషయాన్ని బుద్ధితో ఊహిస్తాం. ఇది ఊహ, ప్రకృతకర్తవ్యానికి అనుకూలం కానటువంటి విషయాన్ని తొలగించి ఆ కర్మను చేయటమే అపోహ. ఇట్లాంటి ఊహలు, అపోహలు కర్మలలో, ఉపాసనలలో అవసరమే. ఊహ మానసికం. అపోహ బౌద్ధికం. ప్రత్యక్ష విషయంలో ఊహ, పరోక్ష విషయంలో అపోహ కొంతవరకు పనికివస్తుంది. భగవంతుడి ఉనికి మానసికం. అపోహ బౌద్ధికం. ప్రత్యక్ష విషయంలో, ఊహ, పరోక్ష విషయంలో అపోహ కొంతవరకు పనికివస్తుంది. భగవంతుడి ఉనికిని స్థాపించటానికి ఈ రెండూ సమర్థం కావు. ఎందుకంటే అది కేవలం 'మనీష' యొక్క 'ధీ' గుణంచేత దర్శించదగ్గ విషయం కాదు కాబట్టి. శుశ్రూష, శ్రవణం, గ్రహణం, ధారణం, ఊహ, అపోహ, విజ్ఞానం, తత్త్వజ్ఞానం - అన్న ఈ ఎనిమిది గుణాలనూ 'ధీ' గుణాలంటారు. వీటన్నింటి ద్వారా నలుగురు గుడ్డివాళ్ళ కథలోవలె భగవత్ స్వరూపాన్ని ఒక్కో కోణం నుండి మాత్రమే వర్ణించగలుగుతాం. అసలు స్వరూపం ఈ 'ధీ' గుణాలన్నిటికీ అతీతమైనది. అది కేవలం యోగులకు మాత్రం దర్శనీయమైనది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అందుకే 'కనువెలుంగు'ను భగవంతుడు ప్రసాదించిన తరువాతే అర్జునుడైనా విశ్వరూపాన్ని చూడగలిగాడు. అందుచేత ఊహాపోహలకు అతీతమని అర్థం.

వ. దేవా! వైశంపాయనునకు జనమేజయుం డిట్లనియె 'నట్లు కృష్ణుని పరమానందపదప్రాప్తియు, బలభద్రుని యనంతత్వసిద్ధియు, సకలయాదవ మౌసలాహవప్రకారంబును నెఱింగి పదంపడి పాండవు లెత్తెఱంగున వర్తించిరి మునీంద్రా! యెఱింగింపుము.' 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహర స్వరూపుడవైన స్వామీ!; జనమేజయుండు= జనమేజయ మహారాజు; వైశంపాయనునకున్= వైశంపాయనమహర్షితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అడిగాడు; అట్లు= ఆ విధంగా; కృష్ణుని= శ్రీకృష్ణుడి; పరమ+ఆనంద పదప్రాప్తియున్= బ్రహ్మానంద పదప్రాప్తి; బలభద్రుని= బలరాముడి; అనంతత్వసిద్ధియున్= అనంతత్వసిద్ధిని; సకలయాదవ= అందరు యాదవుల; మౌసల+ఆహవ= ముసలయుద్ధం; ప్రకారంబును= జరిగినతీరును; ఎఱింగి= తెలిసికొని; పదంపడి= తరువాత; పాండవులు= పంచపాండవులు; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; వర్తించిరి= ప్రవర్తించారు (ఏం చేశారు?); మునీంద్రా!= మునీశ్వరా!; ఎఱింగింపుము= నాకు తెలుపుము.'

తాత్పర్యం: హరిహరనాథస్వామీ! జనమేజయుడు వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు; 'మునీంద్రా! ఆ విధంగా శ్రీకృష్ణుడు, బలరాముడు పరమపదించటమూ, సకలయాదవులు ముసల యుద్ధంలో మడిసిన విధమూ విన్న తరువాత పాండవులు ఏం చేశారో నాకు తెలుపండి!'

విశేషం: శ్రీకృష్ణుడు యోగేశ్వరుడు. పూర్వం చెప్పిన భగవంతుడి ఉనికిని చేరుకొనటానికి అర్హత ఉన్నవాడు. అందుకే పరమానంద స్వరూపస్థితిని అందుకొన్నాడు. బలరాముడు 'అనంత' నామధేయుడైన శేషుడి అవతారం. అందుకే కాల స్వరూపమైన అనంతత్వస్థితిని పొందాడు. ఆద్యంతా లున్నది మానవజీవితంలోని పరిమితకాలానికే. అంతం కానిది అనంతం. శేషుడన్నా అర్థం ఇదే. ఎంత కొలిచినా ఇంకా ఉండేవాడని అర్థం.

క. అని యడిగిన వైశంపా। యనుఁ డక్కురువంశవరు సమాదరణంబున్
వినయంబుఁ గౌతుకము పెం। పును సంభావించి యవ్విభున కిట్లనియెన్. 3

ప్రతిపదార్థం: అని= ఇట్లా; అడిగినన్= అడుగగా; వైశంపాయనుఁడు= వైశంపాయన మహర్షి; ఆ+కురువంశవరు= ఆ కురువంశ శ్రేష్ఠుడైన జనమేజయుడి; సమాదరణంబున్= మిక్కిలి ఆదరభావాన్ని; వినయంబున్= వినయాన్ని; కౌతుకం పెంపును= ఉత్సాహంయొక్క అతిశయాన్ని; సంభావించి= ప్రస్తుతించి; ఆ+విభునకున్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు;

తాత్పర్యం: ఇట్లా అడుగగా వైశంపాయనుడు జనమేజయుడి ఆదరభావాన్ని, వినయాన్ని, అతిశయించిన ఉత్సాహాన్ని మెచ్చుకొని ఆ రాజుతో ఇట్లా అన్నాడు:

సీ. 'అర్జునుం డమ్మెయి నచ్యుత రామాది। యాదవజనుల వృత్తాంతములును
దనదు తెఱంగు సత్యవతీతనూభవు। హితభాషణంబులు నేర్పడంగఁ
జెప్పిన విని యుధిష్ఠిరుఁడు ప్రస్థానంబు। నకు మది యొలయ నన్నరునితోడ
నఖిలభూతంబుల ననఘ! పాకంబుఁ బొం। దించుఁ గాలుండు మదీయబుద్ధి

తే. **కర్మ సంత్యాగకలనంబు కార్య మిప్పు। డను వినిశ్చయ మొందె; నీ మనము నరయ**
నిదియ మేలుగఁ గనుచున్కి విదిత మయ్యె। నాకు' ననవుడు నయ్యింద్రనందనుండు. 4

ప్రతిపదార్థం: అర్జునుండు= అర్జునుడు; ఆ+మెయిన్= ఆ విధంగా; అచ్యుత= కృష్ణుడు; రామ+ఆది= బలరాముడు మొదలైన; యాదవజనుల= యాదవుల; వృత్తాంతములును= వృత్తాంతాలను; తనదు తెఱంగున్= తన స్థితిని; సత్యవతీ తనూభవు= సత్యవతి కుమారుడైన వ్యాసుడి; హితభాషణంబులున్= హితవచనాలు; ఏర్పడంగన్+చెప్పినన్= వివరంగా చెప్పగా; విని; యుధిష్ఠిరుఁడు= ధర్మరాజు; ప్రస్థానమునకున్= ప్రయాణానికి; మది= మనసు; ఒలయన్= పోగా; ఆ+నరునితోడన్= ఆ అర్జునుడితో; అనఘ!= పాపరహితుడవైన అర్జునా!; కాలుండు= కాలపురుషుడు; అఖిలభూతంబులన్= అన్ని భూతాలనూ; పాకంబున్+పొందించున్= కాల్చిపరిపక్వం చేస్తాడు; మదీయబుద్ధి= నా బుద్ధి; కర్మ= కర్మయొక్క; సంత్యాగ= బాగా త్యాగం చేయటం; కలనంబు= అనే పనిని ఆమోదించటమే; ఇప్పుడు= ఇప్పుడు; కార్యము= చేయదగినపని; అను= అనే; వినిశ్చయము= విశిష్టమైన నిర్ణయం; ఒందెన్= పొందింది; నీ మనమున్+అరయన్= నీ మనసును గ్రహించగా; ఇది+అ= ఇదే; మేలుగన్+కనుచున్+ఉన్కి= మేలని భావిస్తున్నట్లు; నాకున్= నాకు; విదితము+అయ్యెన్= స్పష్టమయింది; అనవుడున్= అనగా; ఆ+ఇంద్రనందనుండు= ఆ అర్జునుడు.

తాత్పర్యం: అర్జును డా విధంగా బలరామకృష్ణుల, తక్కిన యాదవుల వృత్తాంతాలను, తన స్థితిని, వ్యాసుడి హితవచనాలను వివరించి చెప్పగా విని ధర్మరాజు తన మనసు ప్రయాణానికి సిద్ధపడగా అర్జునుడితో ఇట్లా అన్నాడు: 'అర్జునా! కాలపురుషుడు అన్ని భూతాలను కాల్చి పరిపక్వం చేస్తాడు. ఇప్పుడు నా బుద్ధికి కర్మను సంపూర్ణంగా త్యజించటం మాత్రమే తగినపనిగా ఒక నిశ్చితార్థం ఏర్పడుతున్నది. చూడగా నీ మనసుకూడా ఇదే మేలని భావిస్తున్నట్లు నాకు స్పష్టమవుతున్నది'- అనగా అర్జునుడు యుధిష్ఠిరుడితో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'పాకం' - అంటే వంట: కాలుడు - యముడని వాచ్యార్థం: మరణస్వరూపుడు కాబట్టి. 'కాలోఽస్మి' అన్న గీతాకారుడి వచనాన్ని బట్టి భగవంతుడు కాలస్వరూపుడు. జఠరాగ్ని రూపంలో చతుర్విధాన్నాలను కాల్చి పక్వం చేసినట్టుగానే జీవుడి పాపరాశిని కూడా కర్మానుభవరూపంలో జననాంతరాల మీద హరించి (ఇదే కాల్చటం). పుణ్యాత్ముడిగా (ఇదే పక్వం చేయటం) మార్చేవాడు కూడా ఆ కాలస్వరూపుడే. పాండవులలో ఆ పరిపక్వత సిద్ధిస్తున్నది - కాబట్టే కర్మను 'సంత్యాగం' చేయటానికి సిద్ధపడుతున్నాడు. త్యాగమంటే వదలటం. సమ్యక్ త్యాగమంటే - సంపూర్ణంగా వదలటం । అంటే సంకల్పస్థితిలోనే వదలివెయ్యటమని భావం. గీతలో మోక్షసన్న్యాస యోగంలో 'కర్మ ఫలత్యాగం' గా చెప్పిన ప్రక్రియకన్నా 'నిరీహుడుగా' (కోరికలు లేనివాడుగా), జ్ఞానాగ్ని దగ్ధకర్ముడుగా చేసే నిష్కామకర్మ ఉత్తమంగా, చెప్పబడింది. అంతేకాదు సంకల్పంలోనే 'కర్మ'ను త్యజించటం. దానికన్నా అత్యుత్తమం. ఇదే సంపూర్ణమైన రాజవిద్య. గుహ్యయోగమని దీన్నే అన్నారు. తరువాతి కథలో ధర్మరాజు ఈ సంకల్పత్యాగాన్ని ఎట్లా సాధించాడో చూస్తాం. పాండవులు పరమాత్ముడి జ్ఞానేంద్రియ కర్మేంద్రియ వర్గం వంటివారు కాబట్టి వారందరిలోనూ ఒకే ఊహపుట్టింది. అందుకనే అర్జునుడి మనసులో కూడా అదే ఊహ ఉందని ధర్మజుడు చెప్పగలిగాడు. 'మమ ప్రాణా హి పాండవాః' - అన్న శ్రీకృష్ణుడి వాక్యానికి అర్థం ఇదే.

వ. **అ న్నరేంద్రున కి ట్లనియె.** 5

ప్రతిపదార్థం: ఆ+నర+ఇంద్రునకున్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అర్జునుడు ఈ మాటలు విని ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

క. **'కాలము నే మన వచ్చును?। గాలముఁ గాలంబ పోలుఁగా కొంటికి నీ**
లీలలు గలవే? లెస్సగ। నాలోకించి: తిది హితము నభిమతము నగున్.' 6

ప్రతిపదార్థం: కాలమున్= కాలాన్ని; ఏమి+అనవచ్చును?= ఏమనాలి?; కాలమున్= కాలాన్ని; కాలంబు+అ= కాలమే; పోలున్= పోలుతుంది; కాక= అట్లాకాక; ఒంటికిన్= మరోదానికి; ఈ లీలలు+కలవే?= ఈ లీల లున్నాయా?; లెస్సగన్= బాగా; ఆలోకించితి(వి)= చూచావు; ఇది= ఇట్లా చెయ్యటం; హితమున్= మంచిదీ; అభిమతమున్+అగున్= నచ్చింది కూడా ఔతుంది.

తాత్పర్యం: 'కాలాన్ని ఏమనగలం? ఎట్లా వర్ణించగలం? కాలాన్ని పోలింది కాలం మాత్రమే కాక మరో దానికి లీల లున్నాయా? నేను బాగా ఆలోచించాను. ఇట్లా చెయ్యటం మనకు మంచిది. నచ్చిన పని కూడా.'

విశేషం: ఏమనవచ్చును? అన్న మాటలోని నుడికారం చాలా అర్థాన్ని కలిగింది. ఈ సందర్భంలో ఎట్లా వర్ణించగలమని అర్థం -'రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ' - అన్నట్టు కాలాన్ని పోలింది కాలం మాత్రమే. బమ్మిని తిమ్మి చెయ్యగల శక్తి, కొంటెను సాధువుగా మార్చేశక్తి - అఘటన ఘటనాపటీయసి - పరమేశ్వర రూపమైన కాలశక్తి. దానిముందు ఎంతటివారైనా తలవంచాల్సిందేనని అర్థం.

చ. **అని తన మాట కియ్యకొను నన్నరుపల్కుల కిచ్చ మెచ్చి య**
జ్జనపతి భీమునిం గవలఁ జయ్యనఁ బిల్వఁగఁ బంచి యత్తెఱం
గు నెఱి నెఱుంగఁ జెప్ప ననుకూలత వారలయందుఁ దద్ద గ
ల్గినఁ దెలి వగ్గలింప నెఱిఁగించె యుయుత్సున కవ్విశేషమున్. **7**

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; తనమాటకున్= తన మాటకు; ఇయ్యకొను= అంగీకరించిన; ఆ+నరుపల్కులకున్= ఆ అర్జునుడి మాటలకు; ఇచ్చన్+మెచ్చి= మనఃపూర్వకంగా మెచ్చుకొని; ఆ+జనపతి= ఆ రాజు (ధర్మరాజు); భీమునిన్= భీముడిని; కవలన్= నకుల సహదేవులను; చయ్యనన్= వెంటనే; పిల్వఁగన్+పంచి= రమ్మని చెప్పి పంపి; (వారు రాగా); ఆ+తెఱంగున్= ఆ విధాన్ని; నెఱిన్= చక్కగా; ఎఱుంగన్+చెప్పన్= తెలిసేటట్లు చెప్పగా; వారలయందున్= వారిలో; అనుకూలత= అనుకూల్యం; తద్ద= మిక్కిలి; కల్గినన్= కలుగగా; తెలివు= ప్రసన్నత; అగ్గలింపన్= అతిశయించగా; యుయుత్సునకున్= యుయుత్సుడికి; ఆ+విశేషమున్= ఆ విషయాన్ని; ఎఱిఁగించెన్= తెలిపాడు.

తాత్పర్యం: ఆ విధంగా తన మాటను అంగీకరించిన అర్జునుడి మాటలను మనఃపూర్వకంగా ధర్మరాజు మెచ్చుకొని భీమనకుల సహదేవులను పిలిపించి జరిగిన విషయాన్ని వారికి సంపూర్ణంగా తెలియజేశాడు. వారుకూడా ఈ విషయం పట్ల అనుకూలంగా ఉండటాన్ని చూచి ఆయనలో ప్రసన్నత అతిశయించింది. యుయుత్సుడికి ఈ విషయం వివరించాడు.

విశేషం: ధృతరాష్ట్రుడికి వైశ్యస్త్రీ వలన పుట్టినవాడు యుయుత్సుడు. కురుక్షేత్ర సంగ్రామ ప్రారంభంలో పాండవపక్షం చేరి ప్రాణాలు నిలుపుకొన్నవాడు.

క. **ఎఱిఁగించి రాజ్యతంత్రము। తెఱఁగుపఱిచి నడపు వెరవు తేటపడంగాఁ**
గఱపి, గృహాంతశ్చరితము। నెఱి నుపదేశించె నధిప! నెయ్యం బలరన్. **8**

ప్రతిపదార్థం: అధిప!= రాజా వినుము!; ఎఱిఁగించి= అట్లా వివరించి; రాజ్యతంత్రము= రాజ్యాన్ని పాలించే పద్ధతి; తెఱఁగుపఱిచి= చక్క చేసికొని; నడపు= నడిపే; వెరవు= విధానం; తేటపడంగాన్= స్పష్టమయ్యేటట్లు; కఱపి= నేర్పి; గృహ+అంతస్+

చరితము= అంతఃపురములో వర్తించాల్సిన విధాన్ని; నెఱిన్= చక్కగా; నెయ్యంబు+అలరన్= స్నేహభావం అతిశయించగా; ఉపదేశించెన్= బోధించాడు.

తాత్పర్యం: ఆ యుయుత్సుడికి రాజ్యాన్ని పాలించే పద్ధతిని సిద్ధం చేసికొని ఎట్లా పాలన చేయాలో స్పష్టంగా నేర్పించాడు. అంతఃపురంలో ఎట్లా వర్తించాలో కూడా స్నేహభావంతో బోధించాడు.

క. **ఆ యనుజుని నట్లు మహా । నాయకుఁ గావించి భటజనముఁ గూర్చి మహీ**
నాయకుఁ డార్యులు కీర్తన । సేయఁ బరీక్షితునిఁ రాజుఁ జేసె ధరణికిన్. 9

ప్రతిపదార్థం: ఆ+అనుజునిన్= ఆ సోదరుడిని; అట్లు= ఆ విధంగా; మహానాయకున్+కావించి= కురుసామ్రాజ్యానికి పెద్దగా నియమించి; భటజనమున్+కూర్చి= సైన్యాన్ని ఏర్పాటు చేసి; మహీనాయకుఁడు= ధర్మరాజు; ఆర్యులు= పెద్దలు; కీర్తన+చేయన్= ప్రస్తుతించగా; పరీక్షితునిన్= పరీక్షిత్తును; ధరణికిన్= భారతభూమికి; రాజున్+చేసెన్= రాజుగా చేశాడు.

తాత్పర్యం: అట్లా సోదరుడైన యుయుత్సుడిని కురుసామ్రాజ్యానికి పెద్దదిక్కుగా నియమించి, సైన్యాన్ని ఏర్పాటుచేసి, ధర్మరాజు పెద్దలు ప్రస్తుతించగా పరీక్షిత్తును భరతభూమికి రాజుగా చేశాడు.

వ. **ఇట్లభిమన్యు పుత్త్రునభిషిక్తుం జేసి యతనికిం బూజ్య సామ్రాజ్య పరిపాలన ప్రకారంబు లుపదేశించి కురుకుల పవిత్ర సముచిత చరిత్రభద్ర యగు సుభద్ర కిట్లనియె. 10**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అభిమన్యు పుత్త్రున్= అభిమన్యుడి పుత్రుడైన పరీక్షిత్తును; అభిషిక్తున్+చేసి= అభిషేకించి; అతనికిన్= అతడికి; పూజ్య= గౌరవాస్పదమైన; సామ్రాజ్య= రాజ్యానికి సంబంధించిన; పరిపాలన ప్రకారంబులు= పాలనారీతులు; ఉపదేశించి= బోధించి; కురుకుల= కురుకులంలో; పవిత్ర= పరమపవిత్రురాలును; సముచిత= ఉదాత్తమైన; చరిత్ర భద్ర+అగు= చరిత్ర చేత మంగళమూర్తి అయిన; సుభద్రకున్= సుభద్రతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా అభిమన్యుడి కుమారుడైన పరీక్షిత్తును రాజుగా అభిషేకించి, అతడికి గౌరవనీయమైన సామ్రాజ్య పాలనా రీతులను బోధించి కురుకులంలో తన పవిత్ర చరిత్రచేత ఉదాత్తురాలైన మంగళమూర్తి అయిన సుభద్రతో ధర్మరాజు ఇట్లా అన్నాడు:

మ. **భవదీయాత్మజు నాత్మజుండు కురుభూభారోద్వహుం డయ్యె యా**
దవవంశోత్తరుఁడైన వజ్రునకు నింద్రప్రస్థ రాజ్యంబు గౌ
రవ దీప్తంబుగ నిచ్చినాఁడ సుచరిత్రా! రక్షణీయంబు లై
నవి యీ యిండులు రెండు నీవు దృఢధైర్యం బొప్ప రక్షింపుమా! 11

ప్రతిపదార్థం: సుచరిత్రా!= మంచి నడవడిక గల సుభద్రా!; భవదీయ= నీ; ఆత్మజు+ఆత్మజుండు= కొడుకు కొడుకు (పౌత్రుడు); కురుభూభార= కురురాజ్య భారాన్ని; ఉద్వహుండు+అయ్యెన్= మోసేవాడయ్యాడు; యాదవవంశోత్తరుఁడు+ఐన= యాదవవంశంలో శ్రేష్ఠుడైన; వజ్రునకున్= వజ్రుడికి; ఇంద్రప్రస్థ రాజ్యంబు= ఇంద్రప్రస్థ రాజ్యాన్ని; గౌరవదీప్తంబుగన్= గౌరవం ప్రకాశించగా;

ఇచ్చినాఁడన్= ఇచ్చాను; ఈ+ఇండులు+రెండు= ఈ రెండు ఇళ్ళు (కురు, యాదవ వంశాలు); రక్షణీయంబులు+ఐనవి= మంచి చరిత్ర చేత రక్షించదగినవిగా ఉన్నాయి; దృఢధైర్యంబు+ఒప్పన్= గట్టి ధైర్యం ఒప్పగా; నీవు; (ఈ రెండు వంశాలనూ); రక్షింపుమా= రక్షించుము.

తాత్పర్యం: 'అమ్మా! నీ పౌత్రుడు ఈ రోజు కురురాజ్యభారాన్ని మోసేవాడయ్యాడు. యాదవవంశ శ్రేష్ఠుడైన వజ్రుడికి ఇంద్రప్రస్థం పట్టం కట్టాను. ఇట్లా కురు యాదవవంశాలు రెంటినీ పరిరక్షించుకొనాలి. దానికై వారికి రక్షణ అవసరం. నీవు దృఢమైన ధైర్యం కలిగి వీరిని ఎప్పుడూ రక్షించుకొనాలి.

విశేషం: అరణ్యంలో పాండవులు ఇడుమలు పడినప్పుడు కూడా సుభద్ర చాలా ధైర్యంతో అభిమన్యుడిని ధనుర్విద్యా నిపుణుడిగా తయారుచేసింది. అటు మనుమడిది కౌరవరాజ్యం. తన పుట్టింటి వంశం వాడైన వజ్రుడిది ఇంద్రప్రస్థం. అటూ ఇటూ ఇప్పుడు పెద్ద దిక్కు సుభద్రే. అందుకే ఆమెపై బాధ్యత పెట్టుతున్నాడు ధర్మరాజు. పాండవులు తమ తనువులు వదలిపెట్టటానికి సిద్ధపడుతున్నపుడు కూడా రాజ్యపాలనా బాధ్యతలను విస్మరించకపోవటం ఇక్కడ మనం స్మరించాలి. 'రాజధర్మం' అంటే అదే.

క. విను! శేషించిన యాదవ । జనులకు నా వజ్రనృపతి సంరక్షకుఁ డా
తనిఁ బోషించుట ధర్మం । బనఘా! యది లేమి ధర్మహాని యగుఁ జుమీ!' 12

ప్రతిపదార్థం: విను= సుభద్రా వినుము!; శేషించిన= మిగిలిన; యాదవజనులకున్= యాదవులకు; ఆ వజ్రనృపతి= ఆ వజ్రుడు; సంరక్షకుఁడు= పాలకుడు; అతనిన్= ఆ వజ్రుడిని; పోషించుట= పోషించటం; ధర్మంబు= మనధర్మం; అనఘా!= పుణ్యాత్మురాలా!; అది లేమి= అట్లా మనం చేయకపోతే; ధర్మహాని+అగున్+చుమీ!= ధర్మహాని జరుగుతుంది సుమా!

తాత్పర్యం: పుణ్యాత్మురాలా! వినుము!యుద్ధంలో మిగిలిన యాదవులకు వజ్రుడు రక్ష. మనం అతడిని ఆదుకొనాలి. అది మన ధర్మం. అట్లా చేయలేకపోతే ధర్మహాని అవుతుంది.'

విశేషం: న్యాయంగా సుభద్ర పుట్టింటివారు కాబట్టి ఈ విషయం ఆమెకు చెప్పాల్సిన అవసరమే లేదు. కాని, ధర్మరాజులోని ధర్మనిష్ఠ అంత ఉదాత్తమైనది కాబట్టే వజ్రుడి విషయం మరోసారి గుర్తు చేస్తున్నాడు.

క. అని తారు గృహంబు దొఱఁగి । చనునెడ నవ్వనిత పిఱుఁదఁ జనుదేకుండన్
జననాథ! యతఁడు నియమిం । చినవాఁడై యూఱడిల్లెఁ జిత్తములోనన్. 13

ప్రతిపదార్థం: అని= ఇట్లా చెప్పి; జననాథ!= ఓ రాజా!; తారు= తాము; గృహంబు= అంతఃపురం; తొఱఁగి= వదలి; చను+ఎడన్= వెళ్ళేటపుడు; ఆ+వనిత= ఆ సుభద్ర; పిఱుఁదన్= వెనక; చనుదేకుండన్= వెంబడించి రాకుండా; అతఁడు= ధర్మరాజు; నియమించినవాఁడు+ఐ= నియమించి; చిత్తములోనన్= మనసులో; ఊఱడిల్లెన్= ఊరట పొందాడు.

తాత్పర్యం: ధర్మరాజు సుభద్రకు ఇట్లా ధర్మబోధ చేసి తామందరూ అంతఃపురంనుండి బయలుదేరేటప్పుడు సుభద్రకూడా తమను వెంబడించి రాకుండ తగిన నియమాన్ని ఏర్పరచి మనసులో కొంత 'ఊరట' పొందాడు.

విశేషం: ధర్మరాజాదులు మహాప్రయాణం చేయబోతున్నారు. అదే తనుత్యాగమనే ప్రయాణం. సుభద్రకూడా అట్లా చేస్తే యదు కౌరవులకు రక్షణ ఉండదు. సత్యవతి, కుంతి, సుభద్ర - ఇట్లా తమ తమ వారిని రక్షించుకొనవలసి వచ్చింది. అదే భారత కథలోని వైచిత్రి. సంసార ప్రతిష్ఠను కాపాడటంలో స్త్రీ ఎంత ప్రధానమో ఈ ఘట్టాన్ని బట్టి అర్థం చేసికొనవచ్చును. చనుదేకుండన్ - ముత్తు పరంబగునపుడు తే, తేరులు తెచ్చునకగు

చ. పదపడి భారతాజి మృతబాంధవకోటికి మౌసలాజి ను
న్మదు లయి పడ్డ యాదవజనంబులకుం బరలోకసౌఖ్య సం
పద కయి చేసె నక్కురునృపాలవరిష్ఠుఁ డనేకదానముల్
రదని తురంగ గోకనక రత్నమయంబులుగా ముదంబునన్. 14

ప్రతిపదార్థం: పదపడి= ఆ వెనుక; ఆ+కురునృపాలవరిష్ఠుఁడు= ఆ కురురాజులలో శ్రేష్ఠుడైన ధర్మరాజు; భారత+ఆజిన్= భారతయుద్ధంలో; మృత= చనిపోయిన; బాంధవకోటికిన్= బంధు సమూహానికి; మౌసల+ఆజిన్= ముసలయుద్ధంలో; ఉన్మదులు+ అయి= మిక్కిలి మదించినవారై; పడ్డ= చనిపోయిన; యాదవజనంబులకున్= యాదవులకు; పరలోక సౌఖ్యసంపదకున్+అయి= పుణ్యలోకాలలో సౌఖ్యసంపద కలుగటానికి; రదని= ఏనుగు; తురంగ= గుర్రం; గో= ఆవు; కనక= బంగారు; రత్న మయంబులుగాన్= రత్నాలతో కూడిన; అనేక దానముల్= షోడశమహాదానాలను; ముదంబునన్= సంతోషంతో; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ఆ తరువాత ధర్మరాజు భారతరణంలో మృతి నందిన బంధువులకు, రోకటి పోరులో నశించిన యదుసమూహానికి పుణ్యలోక ప్రాప్తి కలిగేందుకు ఏనుగులను, గుర్రాలను, ఆవులను, బంగారు, రత్నాలను ఇంకా అనేకదానాలను హృదయపూర్వకంగా చేశాడు.

విశేషం: భూ,గో,తిల,హిరణ్య,రత్న, విద్యా, కన్యా, దాసీ, శయ్యా, గృహ, అగ్రహార, రథ, గజ,అశ్వ,ఛాగ, మహిషీ దానాలను షోడశదానాలంటారు. గో, భూ, తిల, హిరణ్య, ఆజ్య, వస్త్ర, ధాన్య, గుడ, రౌప్య, లవణ దానాలను దశదానాలు అంటారు. ఈ దానాల ప్రసక్తి హైందవ జీవితంలో చాలా ప్రధానమైనది. 'అనేక' దానముల్ అనటంలో ఆనాటి సంప్రదాయం ప్రకారం గజాదులుండటం వలన ఈ వివరణ అవసరమైనది.

క. భూదానంబులునుం గ। న్యాదానంబులును జేసె నన్నరపతి వా
సోదానంబులు నత్యం। తాదరమున నాచరించి యరదము లిచ్చెన్. 15

ప్రతిపదార్థం: ఆ+నరపతి= ఆ రాజు; భూదానంబులునున్= భూదానాలు; కన్యాదానంబులును= కన్యాదానాలూ; చేసెన్= చేశాడు; వాసస్+దానంబులు= వస్త్రదానాలు; అత్యంత+ఆదరమునన్= మిక్కిలి ఆదరంతో; ఆచరించి= చేసి; అరదములు+ఇచ్చెన్= రథాలు ఇచ్చాడు.

తాత్పర్యం: ఆ రాజు భూదానాలు, కన్యాదానాలు చేశాడు. అత్యంత ఆదరంతో వస్త్రదానాలు కూడా చేసి రథాలను కూడా బ్రాహ్మణుల కిచ్చాడు.

తే. ఇట్లు ధౌమ్యాది విప్రులకెల్లఁ దృప్తి। యెసఁగ బహువస్తుకోటుల నొసఁగి కృపుని
ధనమునను బహుమానంబునను బ్రమోద। భరితుఁగాఁ జేసెఁ గురుపతి కురువరేణ్య! 16

ప్రతిపదార్థం: కురువరేణ్య!= ఓ జనమేజయరాజా!; కురుపతి= ధర్మరాజు; ఇట్లు= ఈ విధంగా; ధౌమ్య+ఆది విప్రులకున్+ఎల్లన్= ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణులందరికీ; తృప్తి+ఎసఁగన్= తృప్తి కలిగేటట్లు; బహువస్తుకోటులన్= రకరకాల వస్తు సమూహాలను;

ఒసఁగి= ఇచ్చి; కృపుని= కృపాచార్యుడిని; ధనంబునన్= సంపదతో; బహుమానంబునను= గౌరవంతోను; ప్రమోద భరితున్+ కాన్+చేసెన్= సంతోషభరితుడిగా చేశాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఈ విధంగా ధౌమ్యాది పురోహిత బ్రాహ్మణులకు తృప్తి కలిగే విధంగా నానావిధాలైన వస్తు సముదాయాన్ని దానం చేశాడు. కృపాచార్యుడిని మిక్కిలి గౌరవంతో సత్కరించి సంతోషభరితుడిని చేశాడు.

వ. శేషించిన కాంచనరత్నాదు లా క్షితిపతి పరీక్షితునకుఁ బరమాదరంబున సమర్పించి యతనిం గృపాచార్యునకు శిష్యుంగా నప్పగించి పౌరజానపద ప్రవరజనంబుల రావించి. 17

ప్రతిపదార్థం: శేషించిన= మిగిలిన; కాంచన= బంగారు; రత్న+ఆదులు= రత్నాలు, ముత్యాలు, వజ్రాలు మొదలైనవాటిని; ఆ క్షితిపతి= ఆ ధర్మరాజు; పరీక్షితునకున్= పరీక్షిత్తుకు; పరమ+ఆదరమునన్= మిక్కిలి ప్రీతితో; సమర్పించి= ఇచ్చి; అతనిన్= పరీక్షిత్తును; కృపాచార్యునకున్= కృపాచార్యుడికి; శిష్యున్+కాన్= శిష్యుడిగా; అప్పగించి; పౌర= పురజనులలో; జానపద= గ్రామప్రజలలో; ప్రవర= ముఖ్యులైన; జనంబులన్= జనాలను; రావించి= రప్పించి.

తాత్పర్యం: మిగిలిన బంగారు, రత్నాలు మొదలైన వాటిని ధర్మరాజు పరీక్షిన్మహారాజులకు మిక్కిలి ఆదరంతో ఇచ్చాడు. అతడిని కృపాచార్యుడికి శిష్యుడిగా అప్పగించి పట్టణ, గ్రామాలలోని ముఖ్య జనులను పిలిపించుకొని. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. ఆ పార్థపౌత్రునిఁ జూపి 'మా యేవుర । మాఱుగా మీ రిక్కుమారవరునిఁ
గైకొని తగ నెల్లకార్య జాతంబును । నడపుచు ననురక్తి నాఁడునాఁటి
కెక్కుడగుచు నుండ నీతని యుల్లంబు । రంజిల్ల సమ్యగారాధనంబు
నందు సంప్రవణుల రగుఁడయ్య!' యని పల్కి । తమ నిశ్చయంబు నుదాత్తభంగిఁ

తే. జెప్పుటయు వారు మొగములు చిన్నఁబోవ । 'మము నుపేక్షించి యిటుసేఁత సముచితంబె?
నీదు చిత్తంబు కారుణ్య నిలయ; మేము । దరతరంబ యాశ్రితులము ధర్మశీల!' 18

ప్రతిపదార్థం: ఆ పార్థపౌత్రునిన్+చూపి= ఆ పార్థుడి మనుమడైన పరీక్షిత్తును చూపి; (ధర్మరాజు); మా+ఏవుర మాఱుగాన్= మా ఐదుగురికి బదులుగా; మీరు= మీరంతా; ఈ+కుమార వరునిన్= ఈ కుమార శ్రేష్ఠుడిని; కైకొని= ప్రభువుగా స్వీకరించి; తగన్= తగినట్లుగా; ఎల్లకార్య జాతంబును= అన్ని పనులనూ; నడపుచున్= నడుపుకొంటూ; అనురక్తి= అభిమానం; నాఁడునాఁటికిన్= నానాటికి; ఎక్కుడు+అగుచున్+ఉండన్= ఎక్కువ అవుతుండగా; ఈతని+ఉల్లంబు= ఇతడి హృదయం; రంజిల్లన్= సంతసించగా; సమ్యక్+ఆరాధనంబునందున్= బాగా ఆరాధించటంలో; సం+ప్రవణులరు= మిక్కిలి ఆసక్తి కలవారు; అగుఁడు+అయ్య!= అవండి; అని పల్కి= అని చెప్పి; తమ నిశ్చయంబున్= తమ నిర్ణయాన్ని; ఉదాత్తభంగిన్= ఉదాత్తమైన రీతిలో; చెప్పుటయున్= చెప్పగా; వారు= ఆ ప్రజలు; మొగములు= ముఖాలు; చిన్నఁబోవన్= చిన్నబోవగా (ఇట్లా అన్నారు); ధర్మశీల!= ధర్మమే స్వభావంగా కలవాడా!; మమున్+ఉపేక్షించి= మమ్ము ఉపేక్షించి; ఇటుసేఁత= ఇట్లా చేయటం; సముచితంబు+ఎ?= సముచితంగా ఉన్నదా?; నీదుచిత్తము= నీ మనసు; కారుణ్య నిలయము= కరుణకు నిలయం; తరతరంబు+అ= తరతరాలుగా; మేము; ఆశ్రితులము= మిమ్ములను ఆశ్రయించి ఉన్నాం.

తాత్పర్యం: ధర్మరాజు పరీక్షిత్తుడిని వారికి చూపి 'మా ఐదుగురికి బదులుగా మీరంతా ఈ కుమారుడిని ప్రభువుగా స్వీకరించి తగిన పద్ధతిలో అన్ని పనులనూ నడపుకొంటూ, అభిమానం రోజురోజుకీ అధికం అవుతుండగా ఇతడి హృదయం సంతోషించేటట్లు బాగా సహకరించటంలో మిక్కిలి ఆసక్తి కలవారు అవండి' అని పలికి తమ నిశ్చయాన్ని ఉదాత్తమైన రీతిలో చెప్పగా, ఆ ప్రజలు ముఖాలు చిన్నబోవగా ధర్మరాజుతో ఇట్లా అన్నారు: 'ధర్మమే స్వభావంగా ఉన్న రాజా! మమ్ములను ఇట్లా నిర్లక్ష్యం చేసి వెళ్ళిపోవటానికి నిశ్చయించుకొనటం సముచితంగా ఉన్నదా? నీ మనసు దయకు నిలయం. మేము తరతరాలుగా మిమ్ములను నమ్ముకొని బ్రతుకుతున్నాం'.

వ. అని గద్గదకంఠు లగుచు నాడిన మాటలకు నమ్మనుజేంద్రుండు దగు తెఱంగున మఱుమాటలాడి తమ గమనంబులకుఁ దజ్జనంబుల నియ్యకొల్పె; నప్పు డందులోనం గొందఱ నివేశనంబు లధికాభిలాషంబున నొత్తి కొనుట కారణంబుగా వివాదంబు పుట్టిన సహదేవుండు 'కలియుగంబు ప్రవేశించుటంజేసి కాదే యిట్టివి పుట్టెడు' నని తలంచి నవ్వి నరనాథునకుం జెప్పిన, నప్పౌరవోత్తముండు నవ్వుచు 'మన మనువులు సాలు' నని పలికి సర్వాభరణంబులు నూడ్చి వల్కలాజినంబులు ధరియించినం, దమ్ములు ద్రౌపదియు నట్ల చేసి; రందఱుం దత్కాలోచితంబులగు నిష్ఠా విధానంబు లాచరించి, యగ్నుల నంబుగతంబులు సేసి, మొగం బులం దెలి వగ్గలింప గృహంబు వెలువడి; రప్పుడు ద్రౌపది షష్ఠత్వనిష్ఠం బోవ సప్తమం బై యొక్క సారమేయంబు వారల వెనుకఁ జనియె; నప్పుడు. 19

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; గద్గదకంఠులు+అగుచున్= (డగ్గుత్తికపడిన) కంఠాలు కలిగినవారై; ఆడినమాటలకున్= పలికిన పలుకులకు; ఆ+మనుజ+ఇంద్రుండు= ఆ రాజు; తగు+తెఱంగునన్= తగినవిధంగా; మఱుమాటలు+ఆడి= సమాధానం చెప్పి; తమగమనంబులకున్= తమ ప్రయాణానికి; తద్+జనంబులన్= వారిని; ఇయ్యకొల్పెన్= సమ్మతింపచేశాడు; అప్పుడు= ఆ సమయంలో; అందులోనన్= వారిలో; కొందఱు= కొంతమంది; కొందఱ= కొందరి; నివేశనంబులన్= కూర్చున్నచోటులను; అధిక+అభిలాషంబునన్= మిక్కిలి ఆసక్తితో; ఒత్తికొనుట; కారణంబుగాన్= కారణంగా; వివాదంబు= వివాదం; పుట్టినన్= పుట్టగా; సహదేవుండు= సహదేవుడు; కలియుగంబు= కలియుగం; ప్రవేశించుటన్+చేసి+కాదే!= ప్రవేశించటం వలననేకాదా!; ఇట్టివి= ఇట్లాంటివి; పుట్టెడున్+అని= పుట్టు తున్నాయని; తలంచి= ఆలోచించి; నవ్వి; నరనాథునకున్= ధర్మరాజుకు; చెప్పినన్= చెప్పగా; ఆ+పౌరవ+ఉత్తముండు= ఆ పురువంశజులలో శ్రేష్ఠుడైన ధర్మరాజు; నవ్వుచున్= నవ్వుతూ; మన మనువులు= మన జీవితాలు; చాలును+అని= ఇక చాలని; పలికి= అంటూ; సర్వ+ఆభరణంబులున్= నగలన్నిటినీ; ఊడ్చి= తీసివేసి; వల్కల+అజినంబులు= నారబట్టలను, లేడిచర్మాన్ని; ధరియించినన్= కట్టుకొనగా; తమ్ములున్= తమ్ములైన భీమాదులు; ద్రౌపదియును= ద్రౌపదీ(కూడా); అట్ల చేసిరి= అట్లాగే చేశారు; అందఱున్= అందరూ; తద్+కాల+ఉచితంబులు+అగు= ఆ కాలానికి తగిన; నిష్ఠావిధానంబులు= నిష్ఠతో కూడిన ధార్మిక విధులను; ఆచరించి= చేసి; అగ్నులన్= అగ్నులను; అంబుగతంబులు+చేసి= నీళ్ళలో కలిపి; మొగంబులన్= ముఖాలలో; తెలివు= జ్ఞానంతోడి ప్రకాశం; అగ్గలింపన్= అతిశయించగా; గృహంబున్+వెలువడిరి= ఇంటి నుండి బయటికి వచ్చారు; అప్పుడు= ఈ సమయంలో; ద్రౌపది; షష్ఠత్వనిష్ఠన్= ఆరవ వ్యక్తిగా శ్రద్ధతో; పోవన్= వెంటవెళ్ళగా; ఒక్క సారమేయంబు= ఒక కుక్క; సప్తమంబు+ఐ= ఏడవదిగా; వారల వెనుకన్= వారి వెనుక; చనియెన్= బయలుదేరింది; అప్పుడు= అపుడు.

తాత్పర్యం: ఈ విధంగా వణుకుతున్న గొంతులతో వారన్న మాటలకు ధర్మరాజు తగిన విధంగా సమాధానం చెప్పి తమ ప్రయాణానికి వారిని సమ్మతింపజేశాడు. ఆ సమయంలో వారిలో కొందరికి మాత్రం ఆసీనులు కావడానికి

సంసిద్ధమయిన చోట్లలో ఇతరులు కూడా ఆసీనులు కావడానికి ఆసక్తి సంసిద్ధతలు ప్రదర్శించడం వలన వారిలో వారికి తగవు వచ్చింది. అపుడు సహదేవుడు 'కలియుగం ప్రవేశించటం వలననే కదా ఇట్లాంటి తగవు పుట్టిం' దని ఆలోచించి, నవ్వి ధర్మరాజుతో ఈ విషయం చెప్పాడు. అది విన్న ధర్మరాజు నవ్వుతూ ' ఇక మన జీవితాలు చాలు' అని అంటూ నగలన్నింటినీ తీసివేసి నారబట్టలనూ, జింకచర్మాన్నీ ధరించాడు. తమ్ములైన భీమాదులు, ద్రౌపది కూడా అట్లాగే చేశారు. అందరూ ఆ సమయానికి తగిన ధార్మికవిధులను చేసి అగ్నులను నీళ్ళలో కలిపివేశారు. అంతః పురంనుండి బయటికి వచ్చారు. వారివెంట ఆరవవ్యక్తిగా నిష్ఠతో ద్రౌపది బయలుదేరింది. ఒక కుక్క ఏడవదిగా వారివెంట పడింది.

విశేషం: కలియుగధర్మం అంటే ఏమిటో ఈ సందర్భాన్ని బట్టి అర్థం చేసికొనవచ్చును. కృతయుగంలో అందరూ సత్యధర్మనిష్ఠులే. త్రేతలో ఒకపాదం. ద్వాపరంలో మరోపాదం పోగా కేవలం ఒకపాదంమీద ధర్మదేవత నిలబడిందన్న సంప్రదాయ భావనకు మూలమిదే. ద్వాపరంలో ఒకరిచోటును మరి ఒకరు ఒత్తుకొని వచ్చినా పెద్దగా పట్టించుకొన్నవారు కారు. కలియుగం శ్రీకృష్ణుడి నిర్యాణంతో ప్రవేశించింది. అందుకే జనులలో 'ఓర్పు' నశించిందని అర్థం. ద్వాపరంలో ఏ ఒకరిద్దరిలోనో ఉన్న అసూయ సమాజ 'రుగ్మత' గా మారింది. కాబట్టే కలిప్రారంభంలోనే అంతచిన్న విషయానికి 'తగవు' వచ్చింది. ద్వాపరంలోని వ్యక్తులు కాబట్టి ధర్మజుడు, సహదేవుడు దీనిని చూసి నవ్వుకొన్నారు. సహదేవుడు భవిష్యద్ జ్ఞాన మున్నవాడు కాబట్టి కలియుగ ధర్మమని వ్యాఖ్యానించాడు. ఇక మనం అవతారాలు చాలించవచ్చునని ధర్మరాజు అనటానికి అర్థ మిదే. భారతంలో ధర్మజుడు 'నాయకుడు' కాబట్టే అవతార పరిసమాప్తి సూచన కూడా ఆయననోటే వెలువడింది. ద్రౌపది వారి నాశ్రయించి భారతరణ సంకల్పం కలిగించిన 'శక్తి' స్వరూపిణి. వెంటవచ్చిన కుక్క సాక్షాత్తు 'ధర్మమే'. వారికన్నా ముందువచ్చి వారివెంట వెళ్ళుతున్నది. ఇక్కడినుండే పాండవుల మహాప్రస్థానం మొదలవుతున్నది.

సీ. **పౌరజనంబు లాబాలవృద్ధంబుగా। వచ్చి రక్కురువంశవరులఁ జూడఁ;**
దత్సమయంబు జూదమునాఁడు వెడలి వా। రరిగెడు నయ్యవసరముఁ బోలె;
భటసమేతముగ నప్పాండుతనూజుల। తోన యుయుత్సుండు దాను నరిగె;
భవదీయ జనకుఁ డభ్యంతరసతు లెల్ల। ననుగమించిరి వారి మనుజనాథ!

తే. **యిట్లు కరిపురి వెలువడి యేఁగె ధర్మ। తనయుఁ డందఱు నెంతయు దవ్వు గాఁగ**
ª Ú□† Ç◊H-y ~üH◊ #°–E z x□°=ôl =°#–_È` Ç" Œz † ¶Ç~ŒÅ ‹ #°K◊Ç#°O_‹? 20

ప్రతిపదార్థం: పౌరజనంబులు= పురజనులు; ఆ బాల వృద్ధంబుగాన్= పిల్లలు మొదలుకొని, పెద్దలవరకూ అందరూ; ఆ+ కురువంశవరులన్+చూడన్= ఆ కురువంశ శ్రేష్ఠులను చూడగా; వచ్చిరి= వచ్చారు; తద్+సమయంబు= ఆ సమయం; జూదమునాఁడు= జూదంలో ఓడిపోయినరోజున; వెడలి= హస్తినవదలి; వారు+అరిగెడు= వాళ్ళు వెళ్ళిన; ఆ+అవసరమున్+పోలెన్= ఆ సందర్భంవలె ఉన్నది; యుయుత్సుండు= యుయుత్సుడు; భటసమేతముగన్= భటులతో కూడి; ఆ+పాండుతనూజులతోన్+అ= ఆ పాండుకుమారులతో పాటే; తానున్+అరిగెన్= తానుకూడా వెళ్ళాడు; మనుజనాథ!= ఓ జనమేజయ మహారాజా!; భవదీయ జనకుఁడు= నీ తండ్రి పరీక్షిన్మహారాజు; అభ్యంతర సతులు+ఎల్లన్= అంతఃపురంలోని స్త్రీలందరూ; వారిన్= వారిని; అనుగమించిరి= వెంబడించారు; ఇట్లు= ఈ విధంగా; కరిపురి వెలువడి= హస్తినాపురాన్ని వదలి; ధర్మతనయుఁడు= ధర్మరాజు; ఏగెన్= బయలుదేరాడు; అందఱున్= అందరూ; ఎంతయున్+దవ్వు+కాఁగన్= ఎంతో దూరం వరకు; సొలయక= వెనుదీయకుండా; ఏఁగిరి= వెంటనడిచారు; ఒకళ్ళను+చూచి= ఎవరినో చూచి (ధర్మరాజు) (ఇంక) నిలువుము= నిలువుము; అనఁడు; తలవాఁచి= తలను వంచి; ఆ రాజు= ధర్మరాజు; చనుచున్+ఉండెన్= వెళ్ళుతూ ఉన్నాడు.

తాత్పర్యం: హస్తినాపురంలోని జనులు పిల్లలు మొదలు పెద్దల వరకు అందరూ పాండవులను చూడటానికి వచ్చారు. ఆ సమయం - ఆనాడు జూదంలో ఓడిపోయి హస్తినాపురంనుండి వెళ్ళిపోయిన సందర్భాన్ని గుర్తుకు తెస్తున్నది. యుయుత్సుడు సైన్యంతోకూడి పాండవుల వెంట బయలుదేరాడు. రాజా! నీ తండ్రి పరీక్షిత్తు అతడి అంతఃపురకాంతలు వారిని వెంబడించారు. ఇట్లా ధర్మరాజు హస్తినను వదలి బయలుదేరాడు. వెంట వస్తున్నవారు చాలా దూరం వరకు వెనుదీయకుండా అట్లా వస్తూనే ఉన్నారు. ధర్మరాజు వారిలో ఎవరినో చూచి 'ఇక మీరు ఆగండి' అనక తాను మాత్రం ముందుకు సాగిపోతున్నాడు.

విశేషం: జూదంలో ఓడిపోయిన రోజున అరణ్యఅజ్ఞాతవాసాలకు ప్రస్థానం. ఈనాడు ముక్తిమార్గానికి చేస్తున్న ఈ ప్రయాణం 'మహాప్రస్థానం'. వెంటవచ్చిన వారికి పాండవులమీద ఎంత అపేక్ష ఉన్నదో ఈ ఘట్టం నిరూపిస్తున్నది.

చ. తనువులు దూల నందఱుఁ బ్రదక్షిణముల్ వినుత ప్రణామముల్
వినయసమేతులై నడపి వీడ్కొని రా నృపతిం గ్రమక్రమం
బున; నిటు లుమ్మలంబు మనముల్ పొగిలింపఁగ వచ్చి చొచ్చి ర
జ్జనములునుం బరీక్షితుఁడు సామజపట్టణ మస్ఫురద్గతిన్. 21

ప్రతిపదార్థం: అందఱున్= అందరూ; తనువులు+తూలన్= శరీరాలు అలసటతో తూలిపోతుండగా; వినయసమేతులు+ఐ= వినయంతో కూడినవారై; ప్రదక్షిణముల్= ప్రదక్షిణలు; వినుత ప్రణామముల్= ప్రశంసతోడి నమస్కారాలు; నడపి= చేసి; క్రమక్రమంబునన్= ఒక్కొక్కరే; ఆ నృపతిన్= ఆ ధర్మజుడిని; వీడ్కొనిరి= వీడ్కొన్నారు; ఇటు= ఇట్లా; ఉమ్మలంబు= దుఃఖం; మనముల్= మనస్సులను; పొగిలింపఁగన్= పరితపింపచేయగా; ఆ+జనములున్= ఆ పౌరులూ; పరీక్షితుఁడు= పరీక్షిన్మహారాజూ; సామజపట్టణము= హస్తినకు; అస్ఫురత్+గతిన్= కాంతిహీనమైన నడకతో; వచ్చి చొచ్చిరి= వచ్చి చేరారు.

తాత్పర్యం: అందరూ తూలిపోతున్న శరీరాలతో వినయంతో కూడినవారై ప్రదక్షిణలు చేశారు. ప్రస్తుతిస్తూ నమస్కరించారు. ఒక్కొక్కరే ధర్మరాజును వీడ్కొన్నారు. ఇట్లా దుఃఖం, వారి మనసులను పరితపింప చేస్తుండగా ఆ పౌరులు, పరీక్షిన్మహారాజు కాంతిలేని నడకలతో ఎట్లాగో హస్తినాపురం చేరుకొన్నారు.

వ. ఆ సమయంబున. 22

తాత్పర్యం: ఆ సమయంలో- (తరువాతి పద్యంతో అన్వయం)

తే. జనకు కడకు నులూచి (పి) భుజంగలోక। మునకుఁ బోయెఁ; జిత్రాంగద తన తనూజు;
డైన బభ్రువాహనుపాలి కరిగెఁ దక్కుఁ। గలుగు సతు లెల్ల నీ తండ్రికడన నిలువ. 23

ప్రతిపదార్థం: ఉలూచి= అర్జునుడి భార్య ఉలూచి; జనకు కడకున్= తండ్రివద్దకు; భుజంగలోకమునకున్+పోయెన్= నాగలోకానికి వెళ్ళింది; చిత్రాంగద= అర్జునుడి మరొకభార్య అయిన చిత్రాంగద; తన తనూజుఁడు+ఐన= తన కుమారుడైన; బభ్రువాహను పాలికిన్+అరిగెన్= బభ్రువాహనుడి దగ్గరికి వెళ్ళింది; తక్కున్+కలుగు+సతులు+ఎల్లన్= తక్కిన స్త్రీలందరూ; నీ తండ్రి కడన్+అ= నీ తండ్రి అయిన పరీక్షిత్తు వద్దనే; నిలువన్= నిలువగా.

తాత్పర్యం: అర్జునుడి భార్య ఉలూచి తన తండ్రి నివాసమైన నాగలోకానికి వెళ్ళింది. మరొకభార్య చిత్రాంగద తన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కుమారుడు బభ్రువాహనుడి వద్దకు చేరింది. తక్కిన స్త్రీలు నీ తండ్రి పరీక్షిత్తు వద్దనే నిలిచిపోగా. (తరువాతి వచనంతో అన్వయం)

వ. అప్పుడు. 24

తాత్పర్యం: ఆ సమయంలో- (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. కృపుఁడు ధౌమ్యుండు నా నృపతినిఁ దగువారి । నర్థ్వభాషణముల ననునయించి
యెలమి చిత్తంబులఁ దలకొల్పి పౌరులఁ । దగఁ జేర్చి పనుల నుత్సాహ మెసఁగ
వర్తింపఁ జేసిన వారణపురి పూర్వ । భంగి సంపత్పరిభరిత మయ్యెఁ;
నట ధర్మజుండు ముందటఁ జనఁ గ్రమమున । ననుగమించిరి పవనాత్మజుండు

తే. నర్జునుండు నకులుఁడుఁ దదవరజుండు । ద్రౌపదియు నిట్లు సనుచుండఁ దగిలి వారి
వెనుక విడువక శునకంబుఁ జనియెఁ; నవ్వి । ధమున వారు మహాపథగమనమునకు. 25

ప్రతిపదార్థం: కృపుఁడు= కృపాచార్యుడు; ధౌమ్యుండున్= ధౌమ్యుడు; ఆ నృపతిన్= ఆ రాజును; తగువారిన్= తగిన మరికొందరిని; అర్థ్వభాషణములన్= సముచితమైన ఓదార్పు మాటలతో; అనునయించి= ఓదార్చి; ఎలమి= ధైర్యం; చిత్తంబులన్= మనస్సులలో; తలకొల్పి= ప్రేరేపించి; పౌరులన్= పురజనులను; తగన్= తగినట్లు; తేర్చి= తేరుకొనేటట్లు చేసి; పనులన్= పనులలో; ఉత్సాహము+ఎసఁగన్= ఉత్సాహం అతిశయించగా; వర్తింపన్+చేసినన్= ప్రవర్తించేటట్లు చేయగా; వారణపురి= హస్తినాపురి; పూర్వభంగిన్= మునుపటివలె; సంపద్+పరిభరితము+అయ్యెన్= సంపదతో కూడినది అయింది; అటన్= అక్కడ; ధర్మజుండు= ధర్మరాజు; ముందటన్+చనన్= ముందరికి వెళ్ళుతుండగా; క్రమమునన్= వరుసగా; పవన+ఆత్మజుండు= భీముడు; అర్జునుండు= అర్జునుడు; నకులుఁడు= నకులుడు; తద్+అవరజుండు= అతడికి వెనుక పుట్టినవాడు (తమ్ముడు) (సహదేవుడు); ద్రౌపదియున్= ద్రౌపదీ; అనుగమించిరి= వెంటనడుస్తున్నారు; ఇట్లు= ఈ విధంగా; చనుచున్+ఉండన్= వెళ్ళుతుండగా; వారి వెనుకన్= వారి వెంబడి; తగిలి= అనుసరించి; విడువక= వదలక; శునకంబున్+చనియెన్= ఆ కుక్క కూడా వెళ్ళింది; ఆ+విధమునన్= ఆ విధంగా; మహా పథగమనమునకున్= అతిపెద్దదారిలో ప్రయాణానికి; (మహాప్రస్థానానికి) వారు.

తాత్పర్యం: కృపుడు, ధౌమ్యుడు ఆ రాజును, ముఖ్యులైన ఇతరులను తగిన ఓదార్పు మాటలతో ఓదార్చి ధైర్యం పురికొల్పారు. ఆ పురజనులను తేరుకొనేటట్లు చేసి ఉత్సాహంతో పనులు చేసికొనేటట్లు చేశారు. అందుచేత హస్తినాపురి మునుపటివలె అన్ని సంపదలతో కూడినది అయింది. ఇదిట్లా ఉండగా అక్కడ ధర్మరాజు ముందుకు సాగుతుండగా భీమార్జున నకుల సహదేవులు, ద్రౌపది ఆయన వెంట నడుస్తున్నారు. వారిని వెంబడించి వస్తున్న కుక్క వదలకుండా అట్లాగే వారిని అనుసరించి వెళ్ళుతున్నది. ఇట్లా అతి దీర్ఘమైన దారిలో ప్రయాణానికి వారు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'పురోహితు' డనే శబ్దానికి అర్థం ఈ పద్యంలో తెలుస్తున్నది. ముందు కాలానికి హితాన్ని కోరి ఎవరు ప్రజలను ధర్మపథంలో నడిపిస్తారో వారు పురోహితులు. వారికి హైందవ సమాజంలో అత్యుత్తమ గౌరవం ఇవ్వటానికి కారణం ఇదే. వారు రాజుకు ధైర్యం చెప్పారు. ప్రజలను ఉత్సాహవంతులను చేశారు. మళ్ళీ పంటలు పండాయి. లౌకిక వృత్తులన్నీ యథాతథంగా సాగాయి. అంటే కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయని అర్థం. అంతవరకు పాండవులు ఆ మహాప్రస్థానం చేస్తూనే ఉన్నారు.

వ. పూని యుపవాసవ్రతపరులై భాగీరథి పొంతకుం జని యంత నుండియుఁ బ్రాఙ్ముఖ వర్తనంబు గైకొని యోగబలంబున నరిగి గిరిసరిదరణ్యంబు లనేకంబులు గడచి పూర్వసముద్ర తీరంబు సేరి; రట్టియెడ. 26

ప్రతిపదార్థం: పూని= పూనుకొని; ఉపవాసవ్రతపరులు+ఐ= ఉపవాసదీక్షలో; భాగీరథి= గంగ; పొంతకున్+చని= సమీపానికి వెళ్ళి; అంతనుండియున్= అక్కడినుండి; ప్రాక్+ముఖవర్తనంబున్+కైకొని= తూర్పుదిశగా తిరిగి; యోగబలంబునన్= యోగశక్తితో; అరిగి= వెళ్ళి; గిరి= కొండలు; సరిత్= నదులు; అరణ్యంబులు= అడవులు; అనేకంబులు+కడచి= అనేకాలు దాటి; పూర్వసముద్రతీరంబు+చేరిరి= తూర్పు సముద్రతీరం చేరారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: పూనుకొని ఉపవాసదీక్షతో గంగను సమీపించి, అక్కడినుండి తూర్పుదిశగా తిరిగి యోగశక్తితో ప్రయాణించి కొండలు, నదులు, అడవులు అనేకాలు దాటి తూర్పు సముద్రతీరం చేరారు. ఆ సమయంలో-(తరువాతి పద్యంతో అన్వయం)

క. దిక్కులు మేఘపథంబును। బిక్కటిలఁగ నవయవములు భీషణములుగా
నొక్కయెడ నగ్నిదేవుం। డక్కౌరవవంశవరుల యగ్రతలమునన్. 27

ప్రతిపదార్థం: మేఘపథంబునన్= ఆకాశంలో; దిక్కులు= అష్టదిక్కులు; పిక్కటిలఁగన్= నిండుకొనగా (వ్యాపించగా); అవయవములు= దేహభాగాలు; భీషణములు+కాన్= భయంకరంగా (కనిపించగా); ఒక్కఎడన్= దారిలో ఒకచోట; అగ్నిదేవుండు; ఆ+కౌరవవంశవరుల= ఆ పాండవుల యొక్క; అగ్రతలమునన్= ముందువైపు.

తాత్పర్యం: వీరి ఎదుట అన్ని దిక్కులలో వ్యాపించిన సుదీర్ఘదేహుడై అతిభయంకరంగా కనిపిస్తున్న అవయవాలతో అగ్నిదేవుడు (తరువాతి పద్యంతో అన్వయం).

అగ్నిదేవుఁ డర్జును చేతి గాండీవంబు సముద్రంబున వైపించుట (సం.17-1-33)

సీ. నిలిచి బీభత్సుండు నిర్భర స్నేహంబు। కతమున విడువక గాండివంబు
గొనివచ్చుచున్న నాతనితోడ నవ్వాయు। సఖుఁ 'డో ధనంజయ! శౌరిచక్ర
మెన్నఁడే దివమున కేఁగె; నీ వేల గాం। డీవంబు విడువవు? దేవకార్య
మునకుఁగా వరుణదేవునిచేత నేను దె। చ్చినయది యీ ధనుశ్శ్రేష్ఠ మమ్మ

తే. హానుభావుని కొప్పింపు' మనిన 'లెస్స। యట్లు సేయుదుఁగా' కని యక్కిరీటి
యగ్రజానుజులకుఁ జెప్పి యాదరమున। నాతఁ డచ్చాప మంబుధియందుఁ బెట్టె. 28

ప్రతిపదార్థం: నిలిచి= (ఆ విధంగా అగ్నిదేవుడు వారి ముందు) నిలిచి; బీభత్సుండు= అర్జునుడు; నిర్భర= అతిశయించిన (పూర్ణమైన); స్నేహంబుకతమునన్= మైత్రివలన; విడువక= వదలకుండా; గాండివంబున్= గాండీవాన్ని; కొని వచ్చుచున్+ఉన్నన్= తీసికొని వస్తుండగా; అతనితోడన్= అతడితో; ఆ+వాయుసఖుఁడు= వాయుదేవుడి మిత్రుడైన అగ్నిదేవుడు; (ఇట్లా అన్నాడు); ఓ ధనంజయ!= ఓ అర్జునా!; శౌరిచక్రము= శ్రీకృష్ణుడి చక్రం; ఎన్నఁడేన్= ఏనాడో; దివమునకున్+ఏఁగెన్= స్వర్గానికి చేరిపోయింది; నీవు= నీవు మాత్రం; గాండీవంబు= గాండీవాన్ని; ఏల విడువవు?= ఎందుకు వదలిపెట్టవు?; దేవకార్యమునకున్+కాన్= దేవతలు సంకల్పించిన పనిని నెరవేర్చటానికి గాను; నేను; ఈ ధనుస్+శ్రేష్ఠము= ఈ శ్రేష్ఠమైన వింటిని; ఆ+వరుణదేవుని చేతన్=

వరుణదేవుడి నుండి; తెచ్చిన+అది= తెచ్చాను; (దీనిని మరలా); ఆ+మహానుభావునికిన్= ఆ మహానుభావుడయిన వరుణుడికి; ఒప్పింపుము= అప్పగించుము; అనినన్= అని చెప్పగా; లెస్స= చిత్తం; అట్లు+చేయుదుకాన్‌కాక+అని= అట్లాగే చేస్తానని; ఆ+కిరీటి= ఆ అర్జునుడు; అగ్రజ+అనుజులకున్= అన్నలకు, తమ్ముళ్ళకు చెప్పి; ఆదరమునన్= ఆదరంతో; అతఁడు= అర్జునుడు; ఆ+చాపము= ఆ ధనుస్సును; అంబుధియందున్= ఆ సముద్రంలో; పెట్టెన్= ఉంచాడు.

తాత్పర్యం: అట్లా అగ్నిదేవుడు వారిముందు నిలిచి అమితమైన స్నేహంతో ఆ గాండీవాన్ని అట్లాగే తీసికొనివస్తున్న అర్జునుడితో ఇట్లా అన్నాడు: 'ఓ అర్జునా! శ్రీకృష్ణుడి చేతిలోని సుదర్శనచక్రం ఏనాడో స్వర్గం చేరిపోయింది. మరి నీవు మాత్రం గాండీవాన్ని ఇంకా ఎందుకు వదలకుండా ఉన్నావు? దేవతలు సంకల్పించిన కార్యాన్ని సాధించటానికి నేను స్వయంగా వరుణదేవుడి వద్దనుండి తెచ్చింది ఆ ధనుస్సు. దానిని మరలా ఆ మహానుభావుడికే అప్పగించుము' -అని చెప్పగా, 'అట్లాగే' అని అర్జునుడు అన్నలకు, తమ్ముళ్ళకు ~~ఈ~~ విషయం చెప్పి, ఆ ధనువుకు గౌరవంతో నమస్కరించి ఆ వింటిని సముద్రంలో ఉంచాడు.

విశేషం: రాజసూయం ముందు ఏ అగ్నిదేవుడు గాండీవాన్ని ప్రసాదించాడో ఆ మహానుభావుడే స్వయంగా వచ్చి ఆ ధనువును సముద్రంలో సమర్పించుమంటున్నాడు. 'నరుడు' కాబట్టి అర్జునుడికి ఆ 'ధనువు' పై మమత పోలేదన్న మాట. 'సర్వస్వత్యాగం' చేస్తేనే తప్ప విముక్తి లభించదు. అర్జునుడికి ఆభరణాలకన్నా ముఖ్యమైనది, అతడికి 'అహం'కార కారణమైనది ఆ ధనుస్సే - అది దేవకార్యం కోసం ప్రసాదించబడింది - కౌరవయుద్ధంలో దాని ప్రయోజనం తీరిపోయింది. అందుకనే బోయలముందు అది కర్రవలె మాత్రం ఉపయోగపడింది.

వ. తదనంతరంబ కృశానుం డంతర్ధానంబు సేసి; నయ్యోగపరాయణులు పదంపడి. 29

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; కృశానుండు= అగ్నిదేవుడు; అంతర్ధానంబు+చేసెన్= మాయమైపోయాడు; ఆ+యోగపరాయణులు= యోగనిష్ఠితులైన పాండవులు; పదంపడి= పిమ్మట.

తాత్పర్యం: అట్లా చేయగానే అగ్నిదేవుడు మాయమైపోయాడు. ఆ తరువాత యోగనిష్ఠితులైన పాండవులు. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. దక్షిణాభిముఖతఁ దలకొని యిలకుఁ బ్ర। దక్షిణంబు గాఁగఁ దమ మనములు
తద్ద ముదము నొంద నద్దెస వార్ధి యు। పాంతమునకు నేఁగి రధిపముఖ్య! 30

ప్రతిపదార్థం: అధిపముఖ్య!= రాజా! (వినుము); దక్షిణ+అభిముఖతన్= దక్షిణంవైపుగా; తలకొని= పూనుకొని; ఇలకున్+ప్రదక్షిణంబు+కాఁగన్= భూమికి ప్రదక్షిణంగా; తమమనములు= తమ మనస్సులు; తద్ద= మిక్కిలి; ముదమున్+ఒందన్= సంతోషం చెందగా; ఆ+దెసన్= ఆ వైపుగా; వార్ధి= సముద్ర; ఉపాంతమునకున్= సమీపానికి; ఏఁగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: అట్లా దక్షిణంవైపుగా ప్రయాణించాలని పూనుకొని భూమికి ప్రదక్షిణమార్గంలో వెళ్ళుతూ తమ మనస్సులు మిక్కిలి సంతోషం చెందగా సముద్రానికి సమీపంగా వెళ్ళారు.

వ. అచ్చటినుండి. 31

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అక్కడినుండి - (తరువాతి పద్యంతో అన్వయం).

క. పడమర మొగమై పశ్చిమ। జడనిధి తీరంబు సేరఁజని యుత్తర మె
క్కుడు నియతి నడచి వారిధిఁ। బొడ వడఁగిన యాదవేంద్రుపురి చేరువగన్. 32

ప్రతిపదార్థం: పడమర మొగము+ఐ= పడమర వైపుగా; పశ్చిమజడనిధి తీరంబున్= పశ్చిమసముద్రతీరాన్ని; చేరన్+చని= చేరగా బయలుదేరి; ఉత్తరము+ఎక్కుడు నియతిన్+నడచి= ఉత్తరదిశగా అధికనిష్ఠతో నడచి; వారిధిన్= సముద్రంలో; పొడవు+అడఁగిన= నిలువునా మునిగిపోయిన; యాదవేంద్రు+పురి= శ్రీకృష్ణుడి నగరమైన ద్వారకకు; చేరువగన్= సమీపంగా.

తాత్పర్యం: అటునుండి పడమరవైపుగా బయలుదేరి పశ్చిమ సముద్రతీరాన్ని చేరి, అటుపైన అధికనిష్ఠతో ఉత్తరంవైపుగా ప్రయాణించి సముద్రంలో నిలువునా మునిగిపోయిన శ్రీకృష్ణుడి నగరమైన ద్వారకకు సమీపంగా (చేరి) (తరువాతి పద్యంతో అన్వయం).

చ. అటఁ జని యశ్రమంబున హిమాచలమున్ సమతిక్రమించి వా
రటవులు భూములున్ నదులు నద్రులునుం గడుఁబెక్కు లంచితో
త్కట దృఢయోగసేవన నితాంత నిరాకుల వర్తనంబు నొం
దుట గతఖేదులై కడచి తూలక మేరు సమీపభూమికిన్. 33

ప్రతిపదార్థం: అటన్+చని= అక్కడినుండి బయల్దేరి; అశ్రమంబునన్= శ్రమలేకుండానే; హిమాచలమున్= హిమవత్పర్వతాన్ని; సమతిక్రమించి= దాటి; వారు= పాండవులు; అటవులు= అడవులూ; భూములన్= భూములూ; నదులున్= నదులూ; అద్రులునున్= కొండలూ; కడున్+పెక్కులు= చాలావాటిని; అంచిత= మిక్కిలి; ఉత్కట= గొప్పదైన; దృఢ= దృఢమైన; యోగసేవన= యోగనిష్ఠచేత; నితాంత= అధికమైన; నిరాకుల= వ్యథలేని; వర్తనంబున్+ఒందుటన్= దేహమనోవృత్తులు కలిగి ఉండటంవలన; గతఖేదులు+ఐ= దుఃఖంలేనివారై; కడచి= ఆ దూరాన్ని దాటి; తూలక= చలించక; మేరు సమీపభూమికిన్= మేరుపర్వత సమీపానికి.

తాత్పర్యం: అక్కడినుండి బయలుదేరి శ్రమలేకుండానే హిమవత్పర్వతాన్ని దాటి, వారు అనేక అరణ్యాలూ, భూములూ, నదులూ, కొండలూ మిక్కిలి గొప్పదైన దృఢయోగనిష్ఠ చేత ఏ మాత్రం వ్యథలేకుండా అంత దూరాన్నీ ప్రయాణం చేసి ఏ కలతా లేనివారై అలసిసొలసి పోక మేరుపర్వత భూభాగానికి వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: నాలుగుదిక్కులూ చుట్టారని ఈ పద్యాల తాత్పర్యం. భారతదేశం నాలుగు చెరగులు చూచిన తరువాత హిమవత్ పర్వతం దాటి మేరుపర్వతం సమీపించారు. ఇక ఇదంతా దేవతల ఆవాసం. 'యోగసేవన' మంటే యోగాన్ని అభ్యసించటం. ఇక్కడ యోగం వలననే ఇంత దూరాన్నీ వారు ఏ ఖేదం లేకుండా దాటగలిగారన్న సూచన ఉన్నది. దేహమనోవృత్తులలో సాధించిన సమత్వం వలననే ఈ యోగం వారికి సిద్ధించింది. అందుకే వారు తూలిపోలేదు.

ద్రౌపది మొదలగువారు గతప్రాణులై పడుట (సం.17-2-3)

సీ. చనునప్పు డయ్యేడ్వురును నతిస్థిరయోగ। సాధనపరు లయి సత్వరముగఁ
బోవంగఁ బాంచాల భూపపుత్రిక యోగ। మెడలిన మేదినిఁ బడియె నధిప!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పడిన సమీరణుకొడుకు కనుంగొని యన్నతోఁ జెప్పి 'యయ్యతివవలనఁ

గాన మెన్నఁడు ధర్మహాని; యి ట్లగుటకు। నరయంగఁ గత మేమి?' యని విషణ్ణుఁ

తే. డగుచు నడిగిన నాతఁ 'డిమ్మగువ యింద్ర। తనయుదెసఁ బక్షపాతిని; దానఁ జేసి

సుకృతములు ఫలియింపమిఁ జూవె దీని। కిట్టి దురవస్థ వాటిల్లె నీడ్యచరిత!' 34

ప్రతిపదార్థం: చను+అప్పుడు= వెళ్ళుతున్నప్పుడు; ఆ+ఏడ్వురును= ఆ ఏడుగురూ; అతిస్థిరయోగ= అతిస్థిరమైన యోగాన్ని; సాధనపరులయి= సాధించటంలో తాత్పర్యం గలవారై; సత్వరముగన్= శీఘ్రంగా; పోవంగన్= వెళ్ళుతుండగా; పాంచాల భూపపుత్రిక= పాంచాలమహారాజుకూతురు (ద్రౌపది); యోగము+ఎడలినన్= యోగం సడలిపోగా; మేదినిన్+పడియెన్= నేలమీద పడిపోయింది; అధిప!= ఓ జనమేజయా!; పడినన్= అట్లా పడిపోగా; సమీరణు కొడుకు= వాయుపుత్రుడు-భీముడు; కనుంగొని= చూచి; అన్నతోన్= ధర్మరాజుతో; చెప్పి= ఈ విషయం చెప్పి (ఇట్లా అడిగాడు); ఆ+అతివ వలనన్= ఆ స్త్రీవలన; ధర్మహాని= ధర్మానికి చెరుపు; ఎన్నఁడున్+కానము= ఎప్పుడూ మనం చూడలేదు; ఇట్లు+అగుటకున్= ఇట్లా కావటానికి; కతము+ఏమి?= కారణం ఏమిటి?; అని; విషణ్ణుఁడు+అగుచున్= దుఃఖితుడవుతూ; అడిగినన్= అడుగగా; అతడు= ధర్మరాజు (ఇట్లా అన్నాడు); ఈడ్యచరిత= స్తుతించదగిన చరిత్రగల ఓ భీమసేనా!; ఈ+మగువ= ఈ స్త్రీ; ఇంద్రతనయు+దెసన్= అర్జునుడి విషయంలో; పక్షపాతిని= పక్షపాతం కలిగింది: దానన్+చేసి= అందుచేత; సుకృతములు= పుణ్యాలు; ఫలియింపమిన్+చూవె!= ఫలించకపోవటం చేతనే సుమా!; దీనికిన్+ఇట్టి= దీనికి ఇట్లాంటి; దురవస్థ+పాటిల్లెన్= దురవస్థ కలిగింది.

తాత్పర్యం: వెళ్ళుతుండగా ఆ ఏడుగురూ అతిస్థిరమైన యోగాన్ని సాధించటంలో తాత్పర్యం కలిగి అతిశీఘ్రగతితో ప్రయాణిస్తున్న సమయంలో పాంచాలరాజపుత్రిక అయిన ద్రౌపది యోగం సడలిపోగా నేలమీద పడిపోయింది. అట్లా పడిపోగా భీముడు చూచి, ఆ విషయం ధర్మరాజుతో చెప్పి ఇట్లా అడిగాడు: 'ఈ స్త్రీవలన ఎన్నడూ ధర్మహాని జరగటం మనం చూడలేదే! ఇట్లా ఈమె పడిపోవటం ఏకారణం చేత?' అని దుఃఖిస్తూ అడుగగా ధర్మరాజు ఇట్లా చెప్పాడు. 'స్తుతించదగిన చరిత్ర కల భీమసేనా! ఈ స్త్రీకి అర్జునుడి విషయంలో పక్షపాతం ఉన్నది. దీనివలననే ఆమె చేసిన పుణ్యాలు ఫలించకపోవటం సంభవించి ఆమెకు (ఇట్లాంటి) దురవస్థ వచ్చిపడింది'.

విశేషం: ఆ 'ఏడుగురూ' యోగసాధన తత్పరులై వెళ్లుతున్నారనటంలో 'కుక్క' కూడా ఉన్నది. ఆ కుక్క ఎంతటి గొప్ప సాధన చేసిందో చివరికి తెలుస్తుంది. అందుకే పండితుడైన వాడు 'సమదర్శి' కావాలి. 'శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః' అని గీతాకారుడు వక్కాణించటంలో ఉన్న రహస్య మిదే. అట్లాంటి సమదర్శి ధర్మరాజు. అందుకే చనిపోయింది తన ధర్మపత్ని అన్న మమతకూడా లేకుండా 'ఈస్త్రీ' అంటూ న్యాయనిర్ణయం చేస్తున్నాడు. మత్స్యయంత్రాన్ని భగ్నంచేసి ద్రౌపదిని చేపట్టిన నాటినుండి అర్జునుడి పరాక్రమ సౌందర్య విలాసాల విషయంలో ద్రౌపది మాత్రమే కాదు ఉలూపి, చిత్రాంగద, సుభద్ర, అందరూ ఒకింత పక్షపాతం కలవారే. ఇతరుల విషయం ఒక ఎత్తు. శక్తి అవతారమైన ద్రౌపది విషయం ఒక ఎత్తు. ఆమె ఆ పక్షపాతాన్ని జయించటంలో విఫల అయింది. అందుకే దేహమనోవృత్తుల సమతౌల్యం సడలిపోయింది. యోగం ఎంత కఠినమైన సాధనో ఇట్లాంటి చోట్ల అర్థం చేసికొనవచ్చును. పుణ్యాలు చేసినా అవి ఫలించక ఈ దురవస్థ వచ్చిందంటే - సుకృత దుష్కృతాలకు అతీతమైంది మానవుడి శ్రద్ధాత్రయ స్వరూపమైన ప్రకృతి గుణమని అర్థం. దానిని అనుసరించి 'ప్రారబ్ధాన్ని' పొందక తప్పదని తాత్పర్యం.

క. అని పలికి సమాధానము। దన బుద్ధిం దిరము చేసి ధైర్యస్థైర్యం

బున వికృతి లేని గతి నా। వనితశవము విడిచి కౌరవవిభుం డేఁగెన్. 35

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని పలికి= అని సమాధానమిచ్చి; తన బుద్ధిన్= తన చిత్తంలో; సమాధానము= నిశ్చలధ్యానంతో కూడిన సమాధిస్థితిని; తిరముచేసి= స్థిరంగా ఉంచుకొని; ధైర్యస్థైర్యంబునన్= ధైర్యంలోనూ, స్థిరత్వంలోనూ; వికృతిలేనిగతిన్= ఏ వికారమూ లేని విధంగా; ఆ వనితశవమున్ విడిచి= ఆ స్త్రీ శవాన్ని వదలి; కౌరవవిభుండు+ఏగెన్= ధర్మరాజు ముందుకు సాగిపోయాడు.

తాత్పర్యం: అని భీముడికి సమాధానమిచ్చి, నిశ్చలధ్యానంతో కూడిన సమాధిస్థితిని తన చిత్తంలో స్థిరంగా ఉంచుకొని ధైర్యం సడలకుండా, ఏ చలనమూ లేకుండా, ఏ వికారమూ లేని విధంగా ఆ స్త్రీ శవాన్ని వదలిపెట్టి ధర్మరాజు ముందుకు సాగిపోయాడు.

విశేషం: ఈ మహాప్రస్థానం 'భూ' దశను దాటిపోయింది కాబట్టి ఉత్తరక్రియల ప్రసక్తి లేదు.

సీ. **భూవర! యమ్మెయిఁ బోవంగ సహదేవుఁ। డపగతప్రాణుఁడై యవనిఁ బడిన**
గని వాయుజుఁడు ధర్మతనయున కెఱిఁగించి। యితఁ డనహంకారుఁ డెపుడు నీకు
నతిభక్తి శుశ్రూష యాచరించుచునుండు। మాలోన నెల్ల సన్మార్గ వర్తి;
యితనికి నేలొకో యిద్దెస వాటిల్లె?'। ననిన నమ్మనుజేంద్రుఁ డతనితోడ

తే. **'వీఁడు దనకంటెఁ బ్రాజ్ఞుండు లేఁడు జగతి। నెందు నని సంతతమ్ముఁ దా నెడ్డఁ దలఁచు;**
దాన నిట్లయ్యె' నం చుపేక్షానిరూఢ। బుద్ధి నరుగుచునుండె నప్పురుషవరుఁడు. **36**

ప్రతిపదార్థం: భూవర!= ఓ జనమేజయా!; ఆ+మెయిన్+పోవంగన్= ఆ విధంగా వెళ్ళుతుండగా; సహదేవుఁడు; అపగత= పోయిన; ప్రాణుఁడు+ఐ= ప్రాణాలు కలవాడై; అవనిన్+పడినన్= నేలమీద పడగా; కని= చూచి; వాయుజుఁడు= భీముడు; ధర్మతనయునకున్+ఎఱిఁగించి= ధర్మరాజుకు తెలిపి; (ఇట్లా అడిగాడు); ఇతఁడు= ఈ సహదేవుడు; అనహంకారుఁడు= అహంకారం లేనివాడు; ఎపుడున్= ఎల్లపుడూ; నీకు; అతిభక్తిన్= మిక్కిలి భక్తితో; శుశ్రూష+ఆచరించుచున్+ఉండున్= సేవ చేస్తుంటాడు; మాలోనన్+ఎల్లన్= మా అందరిలోనూ; సన్మార్గవర్తి= మంచిదారిలో నడిచేవాడు; ఇతనికిన్= ఇట్లాంటి సహదేవుడికి; ఈ+దెస= ఈ దురవస్థ; ఏల+ఒకో!= ఎందుకోమరి!; వాటిల్లెన్?= కలిగింది?; అనినన్= అని అడుగగా; ఆ+మనుజ+ఇంద్రుఁడు= ఆ రాజు (ధర్మరాజు); అతనితోడన్= భీముడితో; వీఁడు= ఇతడు; తన కంటెన్= తనకన్నా; ప్రాజ్ఞుండు= తెలిసినవాడు; జగతిన్= ప్రపంచంలో; ఎందున్= ఎక్కడా; లేఁడు+అని= లేడని; తాన్= తాను; సంతతమ్మున్= ఎల్లప్పుడూ; ఎడ్డన్= హృదయంలో; తలఁచున్= భావిస్తుంటాడు; దానన్= అందుచేత; ఇట్లు+అయ్యెన్= ఇట్లా అయింది; అంచున్= అంటూ; ఆ+పురుషవరుఁడు= ఆ పురుషశ్రేష్ఠుడు; ఉపేక్షా నిరూఢబుద్ధిన్= ఉపేక్షతో కూడిన చిత్తంతో; అరుగుచున్+ఉండెన్= సాగిపోతూనే ఉన్నాడు.

తాత్పర్యం: అట్లా వెళ్ళుతుండగా సహదేవుడు చనిపోయి నేలపైపడ్డాడు. భీముడు అతడిని చూచి అన్నకు చెప్పి ఈ సహదేవుడు ఏ అహంకారమూ లేనివాడు. ఎల్లప్పుడూ నిన్ను భక్తి శ్రద్ధలతో సేవిస్తూంటాడు. మా అందరిలోనూ మంచిదారిలో నడిచేవాడు వీడొక్కడే. ఇట్లాంటి వీడికి ఈ దురవస్థ ఎందుకు కలిగిందో మరి!' అని అడిగాడు. అపుడు ధర్మరాజు అన్నాడు: 'ఇతడు తనకంటె తెలిసినవాడు ఈ ప్రపంచంలో ఎక్కడా లేడని ఎప్పుడూ హృదయంలో భావిస్తుంటాడు. అందుకే ఇట్లా అయింది' అంటూ ఉపేక్షతో నిండిన మనస్సుతో ముందుకు సాగిపోయాడు.

విశేషం: విద్యాహంకారం కూడా యోగనాశ హేతువు అవుతుందని సహదేవుడి పతనం నిరూపిస్తున్నది.

క. అనిలజుఁడు నరుఁడు నకులుఁడు । శునకంబునుఁ దోన నరుగ సుస్థిరమతి యై
మనుజేంద్రవర్య! య ట్ల । జ్జనపతి సన నకులుతనువు జగతిం బడియెన్. 37

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్రవర్య!= ఓ రాజా! (వినుము); అనిలజుఁడు= వాయుకుమారుడైన భీముడు; నరుఁడు= అర్జునుడు; నకులుఁడు; శునకంబునున్= కుక్కా; తోనన్+అరుగన్= వెంట రాగా; సుస్థిరమతి+ఐ= సుస్థిరచిత్తం కలవాడై; అట్లు= ఆ విధంగా; ఆ+జనపతి= ఆ ధర్మరాజు; చనన్= వెళ్ళుతుండగా; నకులు+తనువు= నకులుడి శరీరం; జగతిన్+పడియెన్= నేలమీద పడింది.

తాత్పర్యం: భీమార్జున నకులులు, కుక్క తన వెంట వస్తుండగా సుస్థిరచిత్తం కలిగిన ధర్మరాజు ఆ విధంగా వెళ్లుతుండగా నకులుడి శరీరం నేలమీద వాలిపోయింది.

క. విను ద్రుపదనందనయుఁ దన । యనుజన్ముఁడు నంత నంత నవనిఁ బడుటఁ దాఁ
గని ధృతిదూలినయట్లు వ । డిన నకులునిఁ జూచి యడలు డెందముతోడన్. 38

ప్రతిపదార్థం: విను= రాజా! వినుము; ద్రుపదనందనయున్= ద్రౌపదీ; తన+అనుజన్ముఁడు= తన తమ్ముడైన సహదేవుడు; అంతన్+అంతన్= అక్కడక్కడా; అవనిన్+పడుటన్= నేలమీద పడిపోవటం; తాన్+కని= తాను చూచి; ధృతి= ధైర్యం; తూలిన+అట్లు= చలించినట్లు; పడిన= పడిపోయిన; నకులునిన్+చూచి= నకులుడిని చూచి; అడలు= శోకిస్తున్న; డెందముతోడన్= హృదయంతో.

తాత్పర్యం: ద్రౌపదీ, తన తమ్ముడైన సహదేవుడూ ఆ విధంగా అక్కడికక్కడ రాలిపోగా చూచి ధైర్యం చలించి తానూ వాలిపోయాడా అన్నట్లు నకులుడు పడిపోవటం చూచి శోకిస్తున్న హృదయంతో. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. అనిలసూనుఁడు ధర్మతనయున కెఱిఁగించి । యవ్విభుతో 'సుందరాకృతియును
శౌర్యంబు ధైర్యంబు సౌజన్యమునకుఁగురు । సంఘమునన కాదు జగతి నెందు
నితనికిఁ బోలె నహీనత మెఱయునే । యెవ్వరి కైనను నిట్టి పుణ్యుఁ
గుత్సితదశ యె ట్లొకో పొందె నక్కట!' । యనవుడు నక్కౌరవాగ్రగణ్యుఁ

తే. డతని కిట్లను 'నీతండు నాత్మసదృశుఁ । డఖిల జగముల లేఁడు రూపాతిశయము
తనక కల దని యెపుడుఁ జిత్తమునఁ దలఁచు; । నయ్యహంకృతి నిట్టి కీడయ్యెఁ జువ్వె!' 39

ప్రతిపదార్థం: అనిలసూనుఁడు= భీముడు; ధర్మతనయునకున్+ఎఱిఁగించి= ధర్మరాజుకు తెలిపి; ఆ+విభుతోన్= ఆ రాజుతో; సుందర+ఆకృతియును= సుందరమైన ఆకారం; శౌర్యంబు= శౌర్యమూ; ధైర్యంబు= ధైర్యమూ; సౌజన్యమును= మంచితనమూ; కురుసంఘమునన కాదు= కురు సంఘంలోనే కాదు; జగతిన్+ఎందున్= ప్రపంచంలో ఎక్కడా; ఇతనికిన్+పోలెన్= ఇతడికివలె; అహీనత= నిండుదనం; ఎవ్వరికైనను= ఎవరికైనా; మెఱయునే?= ప్రకాశిస్తుందా?; ఇట్టి పుణ్యున్= ఇట్లాంటి పుణ్యాత్ముడిని; కుత్సితదశ= నీచదశ; ఎట్లు= ఎట్లా; పొందెన్+ఒకో?= పొందిందో!; అక్కట!= అయ్యో!; అనవుడున్= అనగా; ఆ+కౌరవ+అగ్రగణ్యుఁడు= ధర్మరాజు; అతనికిన్= భీముడితో; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; ఈతండు= ఈ నకులుడు; ఆత్మసదృశుఁడు= తనకు దీటైనవాడు; అఖిలజగములన్+లేఁడు= సృష్టిలో లేడు; రూప+అతిశయము= సౌందర్యాధిక్యం; తనకున్+అ= తనకే; కలదు+అని=

ఉన్నదని; ఎపుడున్= ఎల్లప్పుడూ; చిత్తమునన్+తలఁచున్= మనసులో అనుకొంటూ ఉంటాడు; ఆ+అహంకృతిన్= ఆ అహంకారం వలన; ఇట్టి+కీడు+అయ్యెన్+చువ్వె!= ఇట్లాంటి కీడు సంభవించింది సుమా!

తాత్పర్యం: అట్లా నకులుడు పడిపోవగా వాయుకుమారుడైన భీముడు ధర్మరాజుకు తెలిపి ఆయనతో ఇట్లా అన్నాడు; 'అతిసుందరాకారం, శౌర్యమూ, ధైర్యమూ, మంచితనమూ ఇన్ని మంచిగుణాలు ఒకచోట ఉన్నవాడు ఈ కురుసంఘంలోనే కాదు ప్రపంచంలో మరెక్కడైనా ఉన్నాడా! ఎవరిలోనైనా ఇంత నిండుతనం కనిపిస్తుందా? ఇట్లాంటి పుణ్యాత్ముడిని ఇంత నీచదశ ఎట్లా పొందిందో మరి! అయ్యో! ఏమిటీ దురవస్థ?' అని అడుగగా ధర్మరాజు ఇట్లా అన్నాడు: 'ఇతడు తనకు దీటైనవాడు ఈ సృష్టిలోనే లేడని, లోకంలోని సౌందర్యమంతా తనకే ఉన్నదని మనసులో ఎప్పుడూ అనుకొంటూ ఉంటాడు. ఆ అహంకారానికి ఫలితమే ఈ కీడు సుమా!

విశేషం: నకులుడిది రూపగర్వం. అయినా నకుల సహదేవులు మనసులలో ఆ గర్వాన్ని పడ్డవారే. అంతమాత్రానికే వారియోగం భ్రష్టం అయిందంటే యోగసాధన కత్తివాదర మీది నడకవంటిది ఎట్లా అవుతుందో అర్థం చేసికొనవచ్చును.

క. అని ధృతిసారం బూఁది య। తని తనువు నుపేక్షఁ గూర్చి ధర్మతనూజుం
డనఘ! చనుచుండెఁ దక్కటి। యనుజులుఁ గుర్కురముఁ దోన యరుగుచు నుండన్. 40

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడవైన ఓ జనమేజయా!; అని= అని భీముడితో చెప్పి; ధర్మతనూజుండు= ధర్మరాజు; ధృతి సారంబు= ధైర్యంయొక్క పరమార్థ రూపమైన చేవను; ఊఁది= అవలంబించి; అతని తనువున్= అతడి దేహాన్ని; ఉపేక్షన్+కూర్చి= ఒప్పరికించి; తక్కటి= తక్కిన; అనుజులు= తమ్ములు; కుర్కురమున్= కుక్కా; తోన్+అ= వెంబడి; అరుగుచున్+ఉండన్= వెంటరాగా; చనుచున్+ఉండెన్= ముందుకుపోసాగాడు.

తాత్పర్యం: అని భీముడితో చెప్పి ధర్మరాజు ధైర్యగుణంయొక్క పరమార్థ రూపమైన చేవను అవలంబించి అతడిదేహం మీద తాను మమతకు గురికాకుండా నిశ్చలంగా పోసాగాడు. తక్కిన తమ్ములు, కుక్క అతడిని వెంబడించారు.

విశేషం: ఇక్కడ ఉపేక్ష అన్నది యోగసాధనలో చెప్పిన భావనాభేదాలలో ఒక్కటి. మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్షాభావాలు నాలుగూ చిత్తప్రసాదనం సాధించటంలో యోగి అవలంబిస్తాడు. ఉపేక్ష-అంటే తన మనసు తగులుకొనకుండా చేసికొనటం. అంతే తప్ప లౌకికమైన అర్థంలో నిర్లక్ష్యం చేయటం కాదు. పాండవులందరి విషయంలోనూ ధర్మరాజు ఇదే పాటిస్తున్నాడు. అందుకే ఇతడు ధర్మతనూజుడు - ధర్మం తనువు దాల్చిన యముడి కుమారుడు. పురుషశ్రేష్ఠుడు - ఇక్కడ పురుషుడంటే 'జీవు' డని తాత్త్వికార్థం. జీవుడు బంధవిముక్తుడు కావటంలో తొలుత సాధించవలసింది 'ఉపేక్ష' - దానికంటె ముదిత (సంతోషం), కరుణ (దయ), మైత్రి (సర్వసమభావం) - ఒకదానికన్నా మరొకటి ఉదాత్తమైన యోగగుణసంపద అని సంప్రదాయం చెప్పుతున్నది.

సీ. ద్రౌపదిపాటును దన యనుజన్ముల। పడుటయుఁ గనుఁగొని పార్థుఁ డాత్మ
యలమట మునిఁగిన నిల విగతాసుఁడై। పడినఁ గుందుచుఁ జూచి బకవిరోధి
యన్నకుఁ జూపి 'యీ యమలచరిత్రుని। యం దెన్నఁడును నసత్యంబుఁ గాన;
మిటు వడుటకుఁ గత మేమి?' నావుడు నీతఁ। డక్కౌరవుల నెల్ల నొక్కనాఁడ

తే. **యాహవంబునఁ దెగటార్తు ననియె; నట్లు । సేయఁ డయ్యెఁ; బల్కొక్కటి సేఁత యొకటి**
యగుట చాల దోషము; విను మదియుఁగాక । యెల్లకోదండ ధరుల గర్హించుచుండు. **41**

ప్రతిపదార్థం: ద్రౌపదిపాటును= ద్రౌపది నేలవాలటం; తన+అనుజన్ముల పడుటయున్= తన తమ్ముల పాటును; కనుఁగొని= చూచి; పార్థుఁడు= అర్జునుడు; ఆత్మ= చిత్తం; అలమటన్= బాధలో; మునిఁగినన్= మునిగిపోగా; విగత+అసుఁడు+ఐ= ప్రాణాలు పోగొట్టుకొని; ఇలన్= నేలపై; పడినన్= పడిపోగా; బకవిరోధి= భీముడు; కుందుచున్+చూచి= దుఃఖిస్తూ చూచి; అన్నకున్+చూపి= ధర్మరాజుకు చూపి (ఇట్లా అన్నాడు); ఈ+అమలచరిత్రునియందున్= ఈ పుణ్యచరిత్రుడిలో; ఎన్నఁడున్= ఎప్పుడూ; అసత్యంబున్+కానము= అసత్యాన్ని చూడం; ఇటు+పడుటకున్= ఇట్లా పడటానికి; కతము+ఏమి= కారణం ఏమిటి?; నావుడున్= అని అడుగగా; (ధర్మరాజు ఇట్లా అన్నాడు); ఈతఁడు= ఇతడు; ఆ+కౌరవులన్+ఎల్లన్= కౌరవులందరినీ; ఒక్కనాఁడు+అ= ఒకే రోజే; ఆహవంబునన్= యుద్ధంలో; తెగటార్తున్+అనియెన్= చంపేస్తానన్నాడు; అట్లు+చేయఁడు+అయ్యెన్= కాని అట్లా చేయలేదు; పల్కు+ఒక్కటి= మాట ఒకటి; చేఁత+ఒకటి= చేత మరొకటి; అగుట= కావడం; చాలదోషం= చాలా తప్పు; అదియున్+కాక= అదీ కాకుండా; వినుము= మరోవిషయం ఉన్నది వినుము; ఎల్లకోదండధరులన్= ధనుర్ధారులందరినీ; గర్హించుచుండున్= నిందిస్తుంటాడు.

తాత్పర్యం: అట్లా ద్రౌపది, తన తమ్ములు నేలకూలిపోవటాన్ని చూచి పార్థుడు తన చిత్తం బాధలో మునిగిపోగా ప్రాణాలు పోయి నేలపడ్డాడు. భీముడు ఇది చూచి దుఃఖిస్తూ అన్నకు చూపించి ఇట్లా అన్నాడు: “ ఈ పుణ్యచరిత్రుడిలో ఏ రోజూ ఒక అసత్యం కూడా చూడమే. ఇట్లా పడటానికి కారణం ఏమిటి?’ అని అడుగగా ధర్మరాజన్నాడు-‘ఇతడు కౌరవులందరినీ ఒకేరోజు యుద్ధంలో చంపేస్తానన్నాడు. అట్లా చేయలేదు మరి. చేత ఒకటి - మాట ఒకటి కావటం చాలా తప్పు. అంతే కాదు. ఇతడు ధనుర్ధారు లందరినీ నిందిస్తుంటాడు.

విశేషం: అంతటి మహాభారతయుద్ధాన్ని నిర్వహించిన అర్జునుడిలో ఉన్న ఒకదోషం ‘అసత్యం’. మనిషి చేయగలిగినదే మాటాడాలి. మాటాడిందే చేయాలి. ఈ దోషం లేని ‘నరు ‘డెవడు? నకుల సహదేవులలో ఆత్మ ‘స్తుతి’ దోషం కాగా అర్జునుడిలో ‘పరనింద’ మచ్చగా మిగిలిపోయింది. అందుకే అట్లాంటి అర్జునుడు కూడా పతనం కాకతప్పలేదు. ఈ పరనిందా దోషంలేని ‘నరుడు’ ఉంటాడా? అందుకే అర్జునుడిలో మానవుడిలోని ఈ దోషద్వయాన్ని ధర్మరాజు చూపిస్తున్నాడు. కర్ణుడిని అర్జునుడు జీవితాంతమూ ద్వేషిస్తూనే వచ్చాడు. అందుచేత అర్జునుడిది ‘మాత్సర్య’ దోషం.

ఉ. **దానను దాన నిట్లగుట తప్పునె?’ యంచుఁ దదీయ మైన య**
మ్మానితదేహమున్ విడిచి మానవనాథుఁడు దాల్మిఁ జేసి బ
ద్ధానిరతాత్ముఁ డై యరిగె; నత్తఱి వాయుజుఁ డార్తి నెంతయున్
దీనతఁ బొంది ధైర్యలత ద్రెవ్విన నేలకు వ్రాలె భూవరా! **42**

ప్రతిపదార్థం: భూవరా!= రాజా! వినుము; (ధర్మరాజు ఇట్లా చెప్పుతున్నాడు); దానను (దానన్)= ఆయాకారణాలచేత; ఇట్లు+అగుట= ఇట్లా కావటం; తప్పునె?= తప్పుతుందా?; అంచున్= అంటూ; తదీయమైన= అర్జునుడి; ఆ+మానితదేహమున్= మన్నించబడిన ఆ దేహాన్ని; విడిచి= వదలివేసి; మానవనాథుఁడు= ధర్మరాజు; తాల్మిన్+చేసి= ఓర్పువలన; బద్ధానిరతాత్ముఁడు+ఐ= కూర్చబడిన స్థిరచిత్తం కలవాడై; అరిగెన్= ముందుకుపోయాడు; ఆ+తఱిన్= ఆ సమయంలో; వాయుజుఁడు= భీముడు; ఆర్తిన్= దుఃఖంతో; ఎంతయున్= మిక్కిలి; దీనతన్+పొంది= దీనుడై; ధైర్యలత= ధైర్యమనేతీగ; త్రెవ్వినన్= తెగిపోగా; నేలకున్+వ్రాలెన్= నేలపై వాలిపోయాడు.

తాత్పర్యం: 'అందుచేత తానే ఈ విధంగా కావటం తప్పుతుందా' అంటూ ధర్మరాజు ఆ అర్జునుడి అతి 'గొప్ప' దేహాన్ని కూడా ఉదాసీన బుద్ధితో వదలివేసి ఓర్పుచేత కూర్చబడిన స్థిరమైన చిత్తంతో ముందుకు పోయాడు. ఆ సమయంలో వాయుకుమారుడైన భీముడు మిక్కిలి ఆర్తిని పొంది దీనుడై ధైర్యమన్నతీగ తెగిపోగా నేలమీద వాలిపోయాడు.

విశేషం: అర్జునుడిది 'మానిత' దేహమట. లోకం ఆ దేహానికి అంత 'గౌరవం' చూపిందని అర్థం. స్థిరచిత్తం దేనిచేత ఏర్పడుతుందంటే 'ఓర్పు' చేత అని అర్థం చేసికొనాలి. నిష్ఠచేత ధ్యానం సిద్ధిస్తుంది. ఓర్పు చేత ధ్యానం స్థిరపడుతుంది. ఈ ఓర్పునే 'సహన' మంటారు. సమత్వం దీని లక్షణం. "సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే" అని గీతాకారుడు ఈ సమత్వ నిర్వచనం చెప్పాడు. అర్జునుడిలో ఈ సమత సిద్ధించలేదు. డాంబికంచేత అసత్యదోషం. పరనిందచేత అసహనం అతడిలో చోటు చేసికొన్నాయి. అందుచేత పతనమయ్యాడు. ఇది చూచి భీముడిలోని 'ధైర్యం' కూడా నశించిపోయింది.

క. **అప్పుడు దగ నిట్లను నతఁ। డప్పౌరవవరున 'కో ధరాధిప! కనుఁగొ**
మ్మిప్పా టేమిట వచ్చెం। జెప్పు; మెఱుఁగు దేనిఁ గరుణ చిగురొత్తంగన్.' **43**

ప్రతిపదార్థం: అప్పుడు= అట్లా వాలిపోతూ; తగన్= ఉచితమైన రీతిలో; అతఁడు= భీముడు; ఆ+పౌరవవరునకున్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; ఓ ధరా+అధిప!= ఓ రాజా!; ఈ+పాటు= ఇట్లా నేను పడటం; ఏమిటన్= ఏ కారణాన; వచ్చెన్!= జరిగింది?; కనుఁగొమ్ము= కనుగొనుము; ఎఱుఁగుదేని= తెలిస్తే; కరుణచిగురు+ఒత్తంగన్= దయ చిగురించగా; చెప్పుము= తెలుపుము.

తాత్పర్యం: అట్లా వాలిపోతూ భీముడు సభక్తికంగా నమస్కరించి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు? 'ఓ రాజా! నేను ఇట్లా పడటం ఎందుచేత జరిగిందో కనుక్కొని తెలిస్తే దయచేసి చెప్పుము!'

విశేషం: ఇన్ని మరణాలకు హేతువు చెప్పిన అన్న సామాన్యుడు కాడని భీముడు గ్రహించటంవలననే 'కనుఁగొమ్ము!' అని అభ్యర్థిస్తున్నాడు. కనుగొనటం - అంటే ఇక్కడ దర్శించట మని అర్థం. 'ఎఱుఁగుదేని' - అంటే నీకు 'తెలిస్తే' అన్న మాటకు - తన జీవితంలో తాను ఏ తప్పూ చేయలేదన్న 'ధీమా' భీముడికి సంపూర్ణంగా ఉండటమే కారణం. అదే భీముడిలోని 'రాజసగుణం'.

చ. **అన విని యాతఁ డిట్లనియె నాతనితో 'భవదీయ మైన భో**
జన మతిమాత్ర ముద్ధతిఁ బ్రచండుఁడ వై భుజశక్తి నెవ్వరిం
గొనక కడంగి రజ్జుపలుకుల్ గడుఁ బెక్కులు పల్కుదెప్డు నీ
వనుపమశౌర్య! యిప్పడుట కత్తెఱఁగుల్ గత; మెల్లఁ జెప్పితిన్.' **44**

ప్రతిపదార్థం: అనన్ విని= అని భీము డనగా విని; అతఁడు= ధర్మరాజు; అతనితోన్= భీముడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు; అనుపమశౌర్య!= ఉపమించటానికి వీలులేని పరాక్రమం కల ఓ భీమసేనా!; భవదీయము+ఐన= నీదైనటువంటి; భోజనము= తిండి; అతిమాత్రము= అత్యధికమైనది; ఉద్ధతిన్= ఉద్ధతిలో (గర్వంలో); ప్రచండుఁడవు+ఐ= భయంకరుడవై; భుజశక్తిన్= బాహుబలంలో; ఎవ్వరిన్+కొనక= ఎవ్వరినీ లెక్కచేయక; కడంగి= పూనుకొని; రజ్జుపలుకుల్= వ్యర్థపుమాటలు; కడుపెక్కులు+పల్కుదు+ఎప్డున్= ఎల్లప్పుడూ చాలా చాలా మాటాడుతుంటావు; ఈ+పడుటకున్= ఇట్లా పడటానికి; ఆ+తెఱఁగుల్= ఆ విధాలే; కతము= కారణం; ఎల్లన్+చెప్పితిన్= అంతా చెప్పాను.

తాత్పర్యం: అని భీముడు అడుగగా విని, ధర్మరాజు అతడితో ఇట్లా అన్నాడు: 'భీమా! నీ పరాక్రమం నిరుపమానం. కాని, నీ తిండి అత్యధికం కావటం వలన , మిక్కిలి భయంకరుడవై బాహుబలంతో ఎవ్వరినీ లెక్కచేయకుండా పూనుకొని వ్యర్థపుమాటలు ఎప్పుడూ చాలాచాలా మాటాడుతుంటావు. నీ ఈ రీతులే నీ పిప్పుడు పడటానికి కారణం. అంతా చెప్పాను. ఇక చెప్పటాని కేముంది?'

విశేషం: భీముడిలో తక్కిన వారిలో ఉన్న ఏ దంభాది దుర్గుణాలూ లేవు - కాని అతడి ఆహారం తామసికమైనది. అత్యశనుడికి యోగం అబ్బదని గీతాకారుడు నియమం అందుకే చేశాడు. అధికంగా తినేవాడికి పుట్టే దుర్గుణం ఉద్ధతి. ఈ గర్వంతో భయంకరంగా ప్రవర్తిస్తాడు. బాహుబలం కారణంగా ఎవరినీ లెక్కచేయడు. ఫలితంగా వ్యర్థప్రలాపాలు ఆడుతాడు. భారతయుద్ధాన్ని ఒకసారి స్మరిస్తే ఈ విషయం తెలుస్తుంది. ఆహార జన్యమైన దుర్గుణం కాబట్టే స్వభావసిద్ధమైన గుణాలచేత పతనం పొందిన వారికంటె చాలా దూరం పోగలిగాడు. పై విధంగా పతనం పొందిన ఐదుగురూ ఐదు కారణాలవలన నేల బడ్డారు. ద్రౌపది= పత్నీధర్మమైన సమచిత్తవృత్తిని భంగం చేసిన కారణంగా; సహదేవుడు= జ్ఞానగర్వం చేత; నకులుడు= రూపగర్వంచేత; అర్జునుడు= మాత్సర్యంచేత; భీముడు= తామసాహారంచేత; వీటిలో ఏ దుర్గుణమూ అంటని 'ధర్మ' నందనుడు మాత్రం ఈ ప్రస్థానంలో చివరిమజిలీ చేరుకొన్నాడని అర్థం.

క. అని పలికి నిరీక్షింపక। చనుచుండె, నితండు ధైర్యసారోదారుం
డును నిశ్చయమహితుఁడు నయి। వెనుక శునక మధికభక్తి విడువక చనఁగన్. 45

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; నిరీక్షింపక= ఆగకుండా; ఇతండు= ధర్మరాజు; ధైర్యసార+ఉదారుండును= ధైర్యగుణంలోని సత్త్వంచేత ఏర్పడిన ఉదాత్తమైన మనసు గల వాడును; నిశ్చయమహితుఁడున్+అయి= నిశ్చయమైన మనోవృత్తి చేత ఏర్పడిన మహనీయతతో; వెనుకన్= వెంబడి; శునకము= కుక్క; అధికభక్తి మెయిన్= అధికమైన భక్తితో; విడువక= తనను వదలకుండా; చనఁగన్= రాగా; చనుచుండెన్= ముందుకు సాగిపోయాడు.

తాత్పర్యం: అని చెప్పుతూ ఆగకుండా ధర్మరాజు ధైర్యగుణంలోని సత్త్వంచేత ఏర్పడిన ఉదాత్తమైన మనస్సుతో, నిశ్చయబుద్ధి చేత ఏర్పడిన మహనీయతతో శునకం తనవెంబడి భక్తిపూర్వకంగా వదలకుండా వస్తుండగా తాను మాత్రం ముందుకు సాగిపోయాడు.

తే. ఆ సమంచిత సారమేయంబు పాండు। ధరణి నాయకు నగ్రిమతనయు పిఱుఁద
నధికభక్తి యుక్తంబుగ నరుగుచునికి। పలుమఱును నీకుఁ జెప్పితిఁ దలఁచి యుండు.' 46

ప్రతిపదార్థం: (జనమేజయా! వినుము); ఆ= ఇంతవరకు చెప్పిన; సమంచిత= మిక్కిలి పూజ్యమైన; సారమేయంబు= కుక్క; పాండు ధరణినాయకు+అగ్రిమ తనయుపిఱుఁదన్= పాండురాజు పెద్దకొడుకు వెనుక; అధికభక్తియుక్తంబుగన్= చాలా భక్తితోకూడి; అరుగుచున్+ఉనికి= వెళ్తూండటం; పలుమఱును= చాలామార్లు; నీకున్+చెప్పితిన్= నీకు చెప్పాను; తలఁచి+ఉండు!= గుర్తుంచుకొమ్ము!

తాత్పర్యం: రాజా! వినుము! ఆ మిక్కిలి పూజ్యమైన కుక్క పాండురాజు పెద్దకొడుకు వెనుక చాలాశక్తితో కూడి వెళ్తూండటం నీకు చాలామార్లు చెప్పాను. గుర్తుంచుకొనుము.'

వ. అని పలికి వైశంపాయనుండు జనమేజయున కిట్లను నట్లు నిష్ఠాగరిష్ఠుం డయి యుధిష్ఠిరుం డరుగుచుండ.47

తాత్పర్యం: అని పలికి వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు: ' ఆ విధంగా నైష్ఠికులలో శ్రేష్ఠుడైన యుధిష్ఠిరుడు వెళ్ళుతుండగా.

విశేషం: ధర్మరాజుకు యుధిష్ఠిరుడని నామాంతరం. యుద్ధంలో స్థిరంగా నిలిచేవాడని అర్థం. అదే స్థిరత్వం యోగంలోనూ ఉన్నదని అర్థం. అందుకే నిష్ఠ కలిగినవారిలో గరిష్ఠుడు - శ్రేష్ఠుడు అయ్యా డాయన.

ఇంద్రుఁడు రథంబుఁగొని ధర్మరాజు నెదురుకొనుట (సం.17-3-1)

సీ. దివ్యదేహోద్ధత దీప్తి సంతానంబు। దిశలు పదింటను దీటుకొనఁగ,
రథ సమాగమన సంరావంబు మేరుగ। హ్వరములఁ బ్రతిరవోత్కరము నీవ,
నచ్చటి సిద్ధ సాధ్య మునీంద్ర గణముల। నానావిధస్తోత్ర నాద మెసఁగఁ,
దత్ప్రదేశంబు బోధ స్ఫీత కల్పవృ। క్షంబులు పుష్పవర్షములు గురియ

తే. నింద్రుఁ డేతెంచి యాదర మెసక మెసఁగ। నక్కురుక్షితిపాలున కగ్రభాగ
వర్తి యగుటయు నతఁ డభివందనంబు। సేసె సవినయభక్తివిశేష మొప్ప. 48

ప్రతిపదార్థం: దివ్యదేహ= దివ్యమైన దేహమునుండి; ఉద్ధత= వెలువడుతున్న; దీప్తి సంతానంబు= కాంతిసమూహం; దిశలు పదింటను= పదిదిశలలోనూ; దీటుకొనఁగన్= వ్యాపించగా; రథ= రథం యొక్క; సమాగమన= రాకవలని (పుట్టిన); సంరావంబు= పెద్ద ధ్వని; మేరు= మేరుపర్వత; గహ్వరములన్= గుహలలో; ప్రతిరవ+ఉత్కరమున్+ఈనన్= ప్రతిధ్వనుల సముదాయాన్ని పుట్టించగా; అచ్చటి= ఆ పర్వతంలోని; సిద్ధ= సిద్ధులు; సాధ్య= సాధ్యులు; మునీంద్రగణములు= మునిశ్రేష్ఠుల సమూహాలు; నానావిధ స్తోత్ర నాదము+ఎసఁగన్= అనేక విధాలైన స్తోత్రాల ధ్వని వ్యాపించగా; తద్+ప్రదేశంబు= ఆ ప్రదేశమంతటా; బోధ= జ్ఞానంచే; స్ఫీత= అధికములైన; కల్పవృక్షంబులు= కల్పవృక్షాలు; పుష్పవర్షములు+కురియున్= పూలవానలు కురిపించగా; ఇంద్రుఁడు+ఏతెంచి= ఇంద్రుడు వచ్చి; ఆదరము= ఆదరభావం; ఎసకము+ఎసఁగన్= అతిశయించగా; ఆ+కురుక్షితిపాలునకున్= ఆ ధర్మరాజుకు; అగ్రభాగవర్తి+ అగుటయున్= ముందుభాగంలో నిలబడగా; అతఁడు= ఆ ధర్మరాజు; సవినయ= వినయంతో కూడిన; భక్తి విశేషము+ఒప్పన్= అధికమైన భక్తి ప్రకటితం కాగా; వందనంబు+చేసెన్= నమస్కరించాడు.

తాత్పర్యం: ఆ దివ్యదేహంనుండి వెలువడుతున్న కాంతి సమూహం పది దిశలలోనూ వ్యాపిస్తుండగా, రథం వస్తుండగా పుట్టిన పెద్ద ధ్వని మేరుపర్వత గుహలలో ప్రతిధ్వనుల సముదాయాన్ని పుట్టించగా, ఆ పర్వతంలోని సిద్ధసాధ్యముని గణాలు చేస్తున్న నానావిధాలైన స్తోత్రధ్వనులు వ్యాపించగా, ఆ ప్రదేశ మంతటా జ్ఞానప్రదాయకాలైన కల్పవృక్షాలు పూలవానను కురిపించగా, ఇంద్రుడు వచ్చి ఆదరభావం అతిశయించగా ధర్మరాజు ముందుభాగాన నిలబడ్డాడు. ఆ ధర్మరాజు కూడా వినయంతో కూడిన అధికమైన భక్తి ప్రకటితం కాగా నమస్కరించాడు.

విశేషం: కల్పవృక్షం - కోరిన కోర్కెలు ఇస్తుందన్నది సాధారణార్థం. మందార, పారిజాత, సంతాన, కల్పవృక్ష, హరిచందనాలకు కల్ప వృక్షాలని - దేవవృక్షాలని సాధారణనామం. ఇవి పూలను వెదజల్లటం దేవతల అనుగ్రహం ధర్మరాజుపై కలిగిందనటానికి సంకేతం. అవి 'బోధస్ఫీతము' లట! బోధ - అంటే జ్ఞానం. స్ఫీత - అంటే వ్యాపనధర్మం. కల్పవృక్షచ్ఛాయలో దివ్యజ్ఞానం కలుగు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తుందని అర్థం. ఈ కారణంగానే నారదుడు ప్రసాదించిన పారిజాత పుష్పాన్ని శ్రీకృష్ణుడు రుక్మిణికి ఇచ్చాడు. దేవలోకంలో రంభాదులుంటారని వారి సుఖం కోసమే యజ్ఞయాగాదులు చేస్తారనే అంశాన్ని కూడా ఈ తాత్త్విక నేపథ్యంలో చూడాలి. ఈ పర్వంలోని కథను జాగ్రత్తగా అనుశీలిస్తే 'స్వర్గతత్త్వం' తెలుస్తుంది.

క. అట్లు ప్రణతుం డయిన నభినందించి యప్పురందరుం డతని దివ్య స్యందనం బెక్కుమని పలికిన, నతండు
శోక సంతప్తుం డగుచు నతని కి ట్లనియె. 49

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; ప్రణతుండు+అయినన్= నమస్కరించగా; అభినందించి= మెచ్చుకొని; ఆ+పురందరుండు= ఆ ఇంద్రుడు; అతనిన్= ధర్మరాజును; దివ్యస్యందనంబు+ఎక్కుమని= ఆ దివ్యరథం ఎక్కుమని; పలికినన్= అడుగగా; అతండు= ధర్మరాజు; శోకసంతప్తుండు+అగుచున్= దుఃఖంతో బాధపడుతూ; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఇంద్రుడితో ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అట్లా నమస్కరించగా మెచ్చుకొని ఇంద్రుడు అతడిని దివ్యరథంలో ఎక్కుమని అడిగాడు. దానికి ధర్మరాజు దుఃఖంతో కుమిలిపోతూ ఇంద్రుడితో ఇట్లా అన్నాడు:

శా. 'తోడంబుట్టువు లందఱుం బడిన యా దుఃఖంబు చేతంబు సం
పీడం బెట్టెడు; సౌకుమార్యవతి దప్పిం గూలెఁ బాంచాలి; వా
ర్తోడై వచ్చిరి; వారు లేక యిట మీతో రాను; వా రెల్ల నా
తోడం గూడఁగ వచ్చునట్లుగఁ గృపాధుర్యాత్మ! కావింపవే!' 50

ప్రతిపదార్థం: తోడంబుట్టువులు= తమ్ములు; అందఱున్= అందరూ; పడిన= చనిపోయిన; ఆ దుఃఖంబు= ఆ దుఃఖం; చేతంబున్= మనసును; సంపీడన్+పెట్టెడున్= మిక్కిలి బాధిస్తున్నది; సౌకుమార్యవతి= సుకుమారి పాంచాలి (ద్రౌపది); దప్పిన్+కూలెన్= దప్పితో క్రిందపడి చనిపోయింది; వార్+తోడు+ఐ వచ్చిరి= వారు నాకుతోడుగా బయలుదేరి వచ్చారు; కృపాధుర్యాత్మ!= కృపాతిశయం తోడి మనసుగల ఓ మహేంద్రా!; ఇటన్= ఇప్పుడు; మీతోన్ రాను= మీతో బాటు స్వర్గానికి రాను; వారు+ఎల్లన్= వారందరూ; నాతోడన్= నాతోపాటు; కూడఁగన్+వచ్చునట్లుగన్= కలిసివచ్చేటట్లు; కావింపవే= చేయుము.

తాత్పర్యం: 'దయాధురంధరమైన' మనసున్న మహేంద్రా! నా తమ్ములు అందరూ చనిపోయారు. ఆ దుఃఖం నా మనసును మిక్కిలి బాధిస్తున్నది. సుకుమారవతి అయిన ద్రౌపది దప్పికతో నేలబడి చనిపోయింది. వారంతా నా ఈ ప్రయాణంలో తోడుగా వచ్చినవారు. వారు లేకుండా నే నిప్పుడు మీతో స్వర్గానికి రాను. వారంతా నాతోపాటు కలిసి వచ్చేటట్లు చేయుము.'

విశేషం: ఉపేక్షాపరుడుగా ఇంతవరకు వచ్చిన ధర్మరాజులో వారిపట్ల కృతజ్ఞతతో కూడిన ధార్మికబుద్ధి ఇక్కడ ప్రకటించబడుతున్నది. అంతేకాని కేవలం తమ్ములు, భార్య అన్న మమతానుబంధం కాదు.

చ. అన విని యింద్రుఁ డి ట్లనియె నక్కురుభర్తకు 'శోక మేల? నీ
యనుజులు ద్రౌపదీసహితులై తనువుల్ దిగఁ ద్రావి చన్నవా
రనఘ! యమర్త్య లోకమున; కక్కడఁ గాంచెదుగాక వారలం
దనువు దొఱంగఁగా వలదు ధర్మమయాత్మక నీవు రావనా!' 51

ప్రతిపదార్థం: అనన్+విని= అని ధర్మరాజు అనగా విని; ఇంద్రుఁడు; అ+కురుభర్తకున్+ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; అనఘ!= ఓ పుణ్యాత్మా!; శోకము+ఏల?= ఎందుకు బాధపడతావు?; నీ+అనుజులు= నీ తమ్ముళ్లు; ద్రౌపదీ సహితులు+ఐ= ద్రౌపదితో కూడినవారై; తనువుల్+దిగన్+ద్రావి= దేహాలు విడిచిపెట్టి; అమర్త్య లోకమునకున్= స్వర్గానికి; చన్నవారు= వెళ్ళారు; వారలన్= వారినందరినీ; అక్కడన్+కాంచెదు+కాక!= అక్కడ చూద్దువుగాని!; ధర్మమయ+ఆత్మక!= ధర్మంతో నిండిన మనసున్న ఓ ధర్మనందనా!; తనువు+తొఱఁగన్+కాన్+వలదు= దేహం విడిచిపెట్టడానికి వీలు కాదు; నీవు రావనా!= నీవు రావయ్యా వెళ్ళుదాం.

తాత్పర్యం: అని ధర్మరాజు కోరగా ఇంద్రుడు అతడితో ఇట్లా అన్నాడు: 'ఓ పుణ్యాత్మా! ఎందుకు చింతిస్తావు? నీ తమ్ముళ్లు, ద్రౌపదితో కలిసి తమ దేహాలు విడిచిపెట్టి స్వర్గలోకానికి వెళ్ళారు. వారి నందరినీ నీవు అక్కడ చూద్దువుగాని! నీవు ధర్మంతో నిండిన మనసున్నవాడివి! (సాక్షాత్తూ ధర్మనందనుడివి!) దేహం వదలివేసిన తరువాత మళ్ళీ అందులోకి ప్రవేశించటం కుదరని పని. అందుచేత నీవు నాతో రమ్మ వెళ్ళుదాం!''

విశేషం: అంటే సశరీరులై స్వర్గానికి చేరే యోగసిద్ధి వారికి లేదని తాత్పర్యం.

ధర్మరాజ సురరాజులకుఁ గుర్కురవిషయముగా జరిగిన వివాదము (సం.17-3-7)

సీ. **అనుటయు ధర్మజుం డమరేంద్రుతో 'నన్ను। నత్యంత దృఢభక్తి నాశ్రయించి**
పుర మేను వెడలునప్పుడు మొదల్గాఁ దోన। చనుదెంచె నీ భవ్యసారమేయ
మిది యట రావలదే నా మనంబు ని। ష్ఠురవృత్తి కోర్వ దస్తోకపుణ్య
నిరతాత్మ!' నావుడు దరహాస మొప్పఁ న। బ్బలవైరి' యి ట్లంట పాడియే? య

తే. **మర్త్యభావము కుక్క కేమాడ్కిఁగలుగు। ననఘ! నీ చింత తెఱఁ గశక్యంబు దీని**
విడిచి చను టేల నిష్ఠురవృత్తి యయ్యె;। నిచటఁ దడయంగ నేటికి? నెక్కు రథము.' 52

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ధర్మజుండు= ధర్మరాజు; అమర+ఇంద్రుతోన్= ఇంద్రుడితో; అస్తోక పుణ్యనిరత+ఆత్మ!= అత్యధిక పుణ్య విషయంలో ఆసక్తి గల చిత్తమున్న మహేంద్రా!; ఏను= నేను; పురము+వెడలునప్పుడు= హస్తినాపురం నుండి బయలుదేరేటప్పుడు; ఈ భవ్య సారమేయము= ఈ గొప్ప శునకం; అత్యంత= మిక్కిలి; దృఢ= దృఢమైన; భక్తిన్= భక్తితో; ఆశ్రయించి= సమీపించి; మొదల్గాన్= అందరికంటె ముందుగా; తోన్+అ= వెంబడే; చనుదెంచెన్= వచ్చింది; ఇది= ఇదికూడా; అట= స్వర్గానికి; రావలదే!= రావద్దా!; నా మనంబు= నా మనస్సు; నిష్ఠురవృత్తికిన్+ఓర్వదు= కఠినమైన పనిని సహించజాలదు; నావుడున్= అని అనగా; ఆ+బలవైరి= ఆ ఇంద్రుడు; దరహాసము+ఒప్పన్= చిరునవ్వు వెలయగా (ఇట్లా అన్నాడు); అనఘ!= పుణ్యాత్మా!; ఇట్లు+అంట= ఇట్లా అనటం; పాడియే?= న్యాయమా?; కుక్కకున్= కుక్కకు; అమర్త్యభావము= దివ్యత్వం; ఏమాడ్కిన్+ కలుగున్?= ఎట్లా కలుగుతుంది?; నీచింత తెఱఁగు= నీవు ఆలోచిస్తున్న విధానం; అశక్యంబు= అసాధ్యంగా ఉన్నది; దీనిన్= ఈ కుక్కను; విడిచి చనుట= వదలిపోవటం; నిష్ఠురవృత్తి= కఠినమైన పని; ఏల+అయ్యెన్?= ఎందుకవుతుంది?; ఇచటన్= ఇక్కడ; తడయంగన్+ఏటికిన్?= ఆలస్యం చెయ్యట మెందుకని?; రథమున్= రథాన్ని; ఎక్కుము.

తాత్పర్యం: అనగా ధర్మరాజు ఇంద్రుడితో ఇట్లా అన్నాడు: ' అత్యధికపుణ్యవిషయంలో ఆసక్తిగల చిత్తమున్న మహేంద్రా! నేను హస్తిననుండి బయలుదేరినపుడు ఈ మహనీయమైన శునకం మిక్కిలి దృఢమైన భక్తితో అందరికంటె ముందుగా

నన్ను వెంబడించి వచ్చింది. ఇది కూడా స్వర్గానికి రావద్దా! నా మనస్సు కఠినమైన పనిని సహించజాలదు' అని ధర్మజుడు పలుకగా ఇంద్రుడు చిరునవ్వు నవ్వి ఇట్లా అన్నాడు: 'పుణ్యాత్మా! నీవు ఇట్లా అనటం న్యాయంగా ఉన్నదా? కుక్కకు దివ్యత్వం ఎట్లా కలుగుతుంది? నీవు ఆలోచిస్తున్న విధానం అసాధ్యంగా ఉన్నది. ఈ కుక్కను వదలిపోవటం కఠినమైన పని ఎందు కవుతుంది? ఇక్క డింక ఆలస్యం చేయటం ఎందుకు? రథ మెక్కుము (వెళ్ళుదాం).

విశేషం: ఇంద్రుడు వేసిన ప్రశ్న చాలా ముఖ్యమైనది. కుక్కకు దివ్యత్వం ఎట్లా కలుగుతుందని? సమత్వదర్శనమే యోగం. విశ్వవిభూతి కలిగిన పరమాత్మ ప్రకాశించే ప్రతి వస్తువులోనూ ఉన్నాడు. ఆ కుక్క (సారమేయమంటే మగకుక్క. ఆడకుక్కను సారమేయి అంటారు) 'భవ్య' మైనది. చాలా పుణ్యం చేసికొన్నది. దాని భక్తి చాలా 'గట్టిది' నిశ్చంచలమైనది. అంతే కాదు. భీమార్జునుల కంటె ముందుగానే ధర్మరాజు వెంటపడ్డది. ఆ కుక్కలోనూ విశ్వాత్ముడిని దర్శించాడు ధర్మరాజు. అందుకే స్వర్గానికి అదికూడా రావాలని పట్టుబట్టాడు. ఇంద్రుడికి ఈ సమాధానం తెలియనిది కాదు. ధర్మరాజు కిది పరీక్ష.

వ. అనిన నమ్మనుజేంద్రుం డింద్రునితోడ 'నకార్యంబును దుష్కరంబును నగుకార్యం బేనియు నార్యుండును బ్రభుండును నైన నీయట్టి సత్పురుషుండు సంశ్రితులకై సంఘటింపవలదె? భక్త పరిత్యాగంబు సేసి పడయుసిరి నాకు నెంత యింపయ్యెడు?' ననుటయు నయ్యనిమిషనాథుండు. 53

ప్రతిపదార్థం: అనినన్= అని ఇంద్రుడనగా; ఆ+మనుజ+ఇంద్రుండు= ఆ రాజు (ధర్మజుడు); ఇంద్రునితోడన్= ఇంద్రుడితో, (ఇట్లా అన్నాడు); ఆర్యుండును= పూజ్యుడూ; ప్రభుండును= పాలకుడూ; ఐన నీ+అట్టి= అయిన నీవంటి; సత్+పురుషుండు= ఉత్తమపురుషుడు; అకార్యంబును= చేయరానిదీ; దుష్కరంబును= దుస్సాధ్యమైనదీ; అగుకార్యంబు+ఏనియున్= అయిన పని అయినాకూడా; సంశ్రితులకై= ఆశ్రయించినవారికొరకు; సంఘటింపన్‌వలదె?= చేయవద్దా?; భక్తపరిత్యాగంబు= భక్తులను వదలివేసి; పడయుసిరి= పొందేభాగ్యం; నాకున్+ఎంత+ఇంపు+అయ్యెడున్?= నాకు ఎంతమాత్రం తృప్తి అవుతుంది?; అనుటయున్= అనగా; ఆ+అనిమిషనాథుండు= దేవతలరాజైన మహేంద్రుడు.

తాత్పర్యం: అని ఇంద్రు డనగా ధర్మరాజు ఇంద్రుడితో ఇట్లా అన్నాడు: 'పూజ్యుడు, పాలకుడు అయిన నీ వంటి సత్పురుషుడు చేయరానిదీ, దుస్సాధ్యమైనదీ అయినపనినే అయినా ఆశ్రయించిన వారికొరకు చేయవద్దా! భక్తులను వదలివేసి పొందేటటువంటి భాగ్యం నాకుమాత్రం ఎంత తృప్తిని కలిగిస్తుంది?' అనగా అపుడు ఇంద్రుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'భజ సేవాయాం' అని వ్యుత్పత్తి. భజించుట - అంటే సేవించుట. ఇక్కడ కుక్క- భక్తుడు ఎట్లా అవుతున్నాడంటే - సేవించటం వలననే. వదలకుండా వెంటబడిరావటమే ఆ సేవ. అందుకే సేవకులను వదలివేసి తాను ఏ భాగ్యాన్ని పొందటానికి ఇష్టపడనని ధర్మరాజు చెప్పుతున్నాడు.

చ. 'అలుక హరించు ధర్మముల; నట్లగుటం గురువంశవర్య! నీ
వలుగక విన్ము కుక్కలకు నావసథంబు త్రివిష్టపంబునం
గలుగునె? నీకు నిష్ఠురత గల్గదు దీనిం బరిత్యజించినం
జలము కొనంగ నేల? శుభ సంగమనం బెడసేత కృత్యమే?' 54

ప్రతిపదార్థం: అలుక= కోపం; ధర్మములన్= ధర్మాలను; హరించున్= నశింపజేస్తుంది; అట్లు+అగుటన్= అందుచేత; కురువంశవర్య!= ఓ కురువంశశ్రేష్ఠుడా!; నీవు+అలుగక= నీవు కోపగించుకొనక; విన్ము= వినుము; కుక్కలకున్= కుక్కలకు; త్రివిష్టపంబునన్= స్వర్గంలో; ఆవసథంబు= మజిలీ (బస); కలుగునె!= లభిస్తుందా!; దీనిన్= ఈ కుక్కను; పరత్యజించినన్= వదలివేస్తే; నీకున్= నీకు; నిష్ఠురత+కల్గదు= పాపమేమీ రాదు; చలము= పట్టుదల, కోపం; కొనంగన్+ఏల?= పొందటం ఎందుకు?; శుభసంగమనంబు= స్వర్గసుఖానుభవమనే శుభంతోడి సంయోగమును; ఎడసేఁత= దూరం చేసికొనటం; కృత్యమే?= చేయదగిన కార్యమా? (కాదని భావం)

తాత్పర్యం: కోపం ధర్మాలను నశింపజేస్తుంది. అందుచేత ఓ కురువంశశ్రేష్ఠుడా! నీవు కోపగించుకొనకుండా వినుము. కుక్కలకు స్వర్గంలో చోటు లేదు. ఈ కుక్కను వదలివేస్తే నీకు పాప మేమీ రాదు. కోప పడతా వేల? శుభసందర్భం కలిగినపుడు దానిని దూరంచేసికొనటం తగిన పనికాదుకదా!

విశేషం: ఆవసథమంటే 'బస' (మజిలీ) అని అర్థం. చోటన్నది వాచ్యార్థ మయినా స్వర్గం ఒక మజిలీ మాత్రమే కాబట్టి అక్కడి చోటుకూడా 'బస' మాత్రమే. శాశ్వతమైన నివాసం కాదు. గీతను స్మరించుకుంటే ఈ అర్థం తెలుస్తుంది.

> "తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం
> క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి."

యజ్ఞయాగాదుల పుణ్యం వలన స్వర్గంచేరి అక్కడ సుఖాలు అనుభవించి ఆ పుణ్యం కాస్తా క్షీణించగా వాళ్ళు మరలా మానవలోకంలో ప్రవేశిస్తారు. అందుకే అక్కడివాసం ఒక "మజిలీ" మాత్రమే నన్నమాట.

సీ. **అనవుడు ధర్మనందనుఁ డమ్మహాత్ముతో । విను భక్తియుక్తుని విడుపు బ్రహ్మ**
హత్యఁ బోలెడి పాప మని చెప్పుదురు పెద్ద; । లట్లు గావున దీని నఖిలధర్మ
సారజ్ఞ! విడుచుట చనదు; దివ్యసుఖంబు । నకుఁ గాఁగఁ బాపంబునకుఁ జొరంగఁ
జాల' నావుడును వాసవుఁడు వ్రతస్థుండు । కుక్కనంటిన వాని కోరి చేయు

తే. **సుకృతమునకు నాశం బగు సువ్రతాత్మ! యింత యొప్పని నిర్బంధ మేల చెపుమ!**
విడువు మీ శునకము; దీని విడువఁబడుట । నాకలోక సౌఖ్యంబు నొనర్చు నీకు. 55

ప్రతిపదార్థం: అనవుడున్= అని ఇంద్రు డనగా; ధర్మనందనుఁడు= ధర్మరాజు; ఆ+మహాత్మ్ముతోన్= ఆ మహాత్ముడితో; అఖిలధర్మ సారజ్ఞ!= అన్ని ధర్మాలసారాన్నీ తెలిసిన ఓ మహేంద్రా!; విను= నామాట వినుము; భక్తియుక్తుని విడుపు= భక్తితో కూడిన వాడిని వదలిపెట్టటం; బ్రహ్మహత్యన్+పోలెడి= బ్రహ్మహత్యను పోలిన; పాపము+అని పెద్దలు చెప్పుదురు= పాపమని పెద్దలు అంటారు; అట్లు+కావునన్= అందుచేత; దీనిన్= ఈ కుక్కను; విడుచుట= వదలిపెట్టటం; చనదు= తగదు; దివ్యసుఖంబునకున్+కాఁగన్ = స్వర్గసుఖంకొరకని; పాపంబునకున్+చొరంగన్+చాలన్= పాపంలోకి ప్రవేశించలేను; నావుడును= అనగా; వాసవుఁడు= ఇంద్రుడు; సువ్రత+ఆత్మ!= మిక్కిలి ఉత్కృష్టమైన ప్రతిజ్ఞతోకూడిన మనసున్న ఓ ధర్మరాజా!; వ్రతస్థుండు= యజ్ఞదీక్షలో ఉన్నవాడు; కుక్కన్+అంటినన్= కుక్కను తాకితే; వానికోరి చేయు= వాడు ఆశిస్తున్న; సుకృతమునకున్= పుణ్యమునకు; నాశంబు+అగున్= నాశం కలుగుతుంది; (అట్లాంటప్పుడు); ఇంత= ఇంతటి; ఒప్పని= కూడని; నిర్బంధము+ఏల?= నిర్బంధం ఎందుకు?; చెపుమ= నీవే చెప్పుము; ఈ శునకమున్+విడువుము= ఈ కుక్కను వదలిపెట్టుము; దీని విడువన్+పడుట= దీనిని వదలటం; నీకున్= నీకు; నాకలోక= స్వర్గలోక; సౌఖ్యంబున్+ఒనర్చున్= సుఖాన్ని ప్రసాదిస్తుంది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని ఇంద్రు డనగా ధర్మరాజు ఆ మహాత్ముడితో ఇట్లా అన్నాడు: ' అన్ని ధర్మాల సారాన్నీ తెలిసిన మహేంద్రా! నా మాట వినుము. భక్తితో కూడిన సేవకుడిని వదలిపెట్టటం బ్రాహ్మణుడిని చంపటంతో సమానమని పెద్దలు చెప్పుతారు. అందుచేత ఈ కుక్కను వదలిపెట్టటం కుదరనిపని. స్వర్గసుఖంకొరకని నేను ఈ పాపానికి ఒడికట్టలేను' అనగా ఇంద్రుడు అన్నాడు: 'మిక్కిలి ఉత్కృష్టమైన ప్రతిజ్ఞతో కూడిన మనసున్న ఓ ధర్మరాజా! యజ్ఞదీక్షలో ఉన్నవాడు కుక్కను తాకితేనే వారు ఆశించిన పుణ్యం నశిస్తుందన్నది నీకు తెలియదా! అట్లాంటప్పుడు ఇంతగా నీ వెందుకు నిర్బంధం చేస్తున్నావు? నీవే చెప్పుమరి! ఈ కుక్కను వదలివేయి. దీనిని వదలటం వలన నీకు స్వర్గలోకసౌఖ్యం లభిస్తుంది.

విశేషం: పంచమహాపాతకాలు - బ్రహ్మహత్య, సురాపానం, స్వర్ణస్తేయం, గురుతల్పగమనం ఈ నాలుగు పాపాలు చేసేవారితో స్నేహం చెయ్యటం - అన్నవి ఐదు మహాపాపాలు. బ్రాహ్మణుడిని చంపటం, మద్యపానం, బంగారం దొంగిలించటం, గురువుగారి భార్యతో శయనించటం, ఇట్లాంటి పనులు చేసేవారితో స్నేహం చెయ్యటంకూడా ఒక మహాపాపమే అని మన హైందవధర్మం విధిస్తున్నది. సేవకుడిని పరిత్యజించటం కూడా అంత పాపమే అని ద్వాపర యుగధర్మం. యజ్ఞదీక్ష కలిగినవాడు కుక్కను తాకితే యజ్ఞపుణ్యం కూడా హరించుకుపోతుందన్నది లౌకిక ధర్మం. కుక్క ముట్టిన 'పిండం' పితరులకు చేరదని కూడా ఒక విశ్వాసమున్నది. అట్లాంటి పాపయోనిలో జన్మించినా ధర్మజుడి వెంటవచ్చిన 'భవ్యసారమేయము' సేవానిరతిచేత బ్రహ్మనిష్ఠను సాధించిందని ధర్మజుడి వాద తాత్పర్యం. ఆ భావాన్ని ధర్మజుడి ద్వారా పలికించుటకొరకే ఇంద్రుడింతగా కవ్వించి ప్రశ్నిస్తున్నాడు.

చ. **జనులు నుతింపఁగా సుకృత సంపదఁ జేసి యమర్త్య భావముం**
గనియును జెంద కి ట్లునికి కార్యమె? ద్రౌపది భీమసేను న
ర్జునుఁ గవలం ద్యజించుటకు సువ్రత! చాలితి చాలవయ్యె దీ
శునకము విడ్వ; నిత్తెఱఁగు సూరినుతుం డగు నీకు నర్హమే?' 56

ప్రతిపదార్థం: సువ్రత!= పుణ్యాత్ముడా!; జనులు నుతింపఁగాన్= ప్రజలు ప్రశంసించగా; సుకృత సంపదన్+చేసి= పుణ్యసమృద్ధివలన; అమర్త్యభావమున్= దివ్యత్వాన్ని; కనియును= పొందికూడా; చెందక+ఇట్లు+ఉనికి= స్వీకరించకుండా ఇట్లా ఉండటం; కార్యమె?= చేయదగిన పనేనా?; ద్రౌపదిన్ భీమసేనున్ అర్జునున్ కవలన్= ద్రౌపదిని భీమార్జున నకుల సహదేవులను; త్యజించుటకున్= వదలిపెట్టటానికికూడా; చాలితి(వి)= సిద్ధపడ్డావు; ఈ శునకమున్= ఈ కుక్కను; విడ్వన్+చాలవయ్యెదు= విడిచి పెట్టటానికి వెనుకాడుతున్నావు; సూరినుతుండు+అగు= పండితులచేత ప్రశంసించబడిన; నీకున్; ఈ+తెఱంగు= ఈ పద్ధతి; అర్హమే?= తగినదేనా?

తాత్పర్యం: పుణ్యాత్ముడా! ప్రజలందరూ ప్రస్తుతించగా పుణ్యభాగ్యం వలన దివ్యత్వాన్ని దర్శించికూడా ధరించకపోవటం సముచితంగా ఉన్నదా? ద్రౌపదిని, భీమసేనార్జున నకుల సహదేవులను కూడా వదలివెయ్యటానికి సిద్ధపడ్డావే. ఈ కుక్కను విడిచిపెట్టటానికి వెనుకాడుతున్నావు. పండితులచేత ప్రశంసలు పొందిన నీకు ఉచితానుచితాలు నేర్పాలా? ఈ పని తగినదేనా?'

సీ. అన విని ధర్మజుం 'డఖిలలోకములకుఁ। బతివి, ధర్మమునకుఁ బ్రభువ విట్టి
నీకంటె నెఱుఁగుదునే సదసత్ప్రకా। రము లట్లుఁగాక వాదము మహాత్ము
లయిన వారలతోడ నగునె చేయంగ? నై। నను విన్నవింపఁదగిన తెఱంగు
విన్నవించుట దోష విధము గా దనియెడు। బుద్ధిఁ జేసెద నేను బూని విన్న

తే. పంబు భీమముఖ్యులును ద్రౌపదియుఁ జచ్చి;। రేను వారల విడువక యేడ్చుచున్న
వత్తురే? తోడ వచ్చి చావని శునకము। విడువకుండుట తప్పుగా నుడువఁ దగునె? 57

ప్రతిపదార్థం: అనన్+విని= అని ఇంద్రు డనగా విని; ధర్మజుండు= ధర్మరాజు; అఖిలలోకములకున్= అన్ని లోకాలకు; పతివి= నీవు భర్తవు; ధర్మమునకున్+ప్రభువవు= ధర్మానికి రక్షకుడివి; ఇట్టి= ఇట్లాంటి; నీకంటెన్= నీకంటె; సత్+అసత్ ప్రకారములు= మంచి చెడుపద్ధతులు; ఎఱుఁగుదునే?= తెలిసినవాడినా?; అట్లున్+కాక= అదీ కాకుండా; మహాత్ములు+అయిన వారలతోడన్= మహాత్ములతో; వాదము= వాదం; చేయంగన్+అగునె= చేయటం ఒప్పుతుందా?; ఐనను= ఐనాకూడా; విన్నవింపన్+తగిన తెఱంగు= విన్నవించదగిన విషయం ఉంటే; విన్నవించుట= విన్నవించటం; దోషవిధము= తప్పుడుమార్గం; కాదు+అనియెడు బుద్ధిన్= కాదనేటటువంటి ఆలోచనతో; నేను; పూని= ప్రయత్నపూర్వకంగా; విన్నపంబున్+చేసెదన్= మీకు విన్నవించుకొంటున్నాను; భీమముఖ్యులును= భీముడు మొదలైనవారు; ద్రౌపదియున్= ద్రౌపదీ; చచ్చిరి= చనిపోయారు; వారలన్+విడువక= వారిని గూర్చి వదలకుండా; ఏను= నేను; ఏడ్చుచున్నన్= ఏడుస్తుంటే; వత్తురే!= మరలివస్తారా!; తోడన్+వచ్చి= నావెంబడి వచ్చి; చావని= చనిపోని; శునకమున్= కుక్కను; విడువకుండుట= విడిచిపెట్టకుండా ఉండటం; తప్పుగాన్= తప్పని; నుడువన్+తగునె?= చెప్పటం సమంజసంగా ఉన్నదా? (నీవే ఆలోచించుము!)

తాత్పర్యం: అని ఇంద్రుడు అనగా విని ధర్మరాజు ఇట్లా అన్నాడు: 'అన్నిలోకాలకూ నీవు భర్తవు. ధర్మసంరక్షకుడివి. ఇట్లాంటి నీకంటె మంచి చెడు పద్ధతులు తెలిసినవాడినా నేను? అదీ కాకుండా మహాత్ములతో వాదం చేయటం సాధ్యమవుతుందా? ఐనా కూడా విన్నవించ దగిన విషయం ఉంటే విన్నవించటం తప్పుడుమార్గం కాదనేటటువంటి ఆలోచనతో విన్నవించుకొంటున్నాను. భీమాదులూ ద్రౌపదీ చనిపోయారు. నేను వారిని గురించి వదలకుండా ఎంత ఏడ్చినా వారేమో మరలిరారు. అట్లా కాకుండా నా వెనుకనే వచ్చి చనిపోకుండా నిలిచిన ఈ కుక్కను వదలకుండటం తప్పు అనటం సమంజసమా? నీవే ఆలోచించుము!'.

చ. అనఘచరిత్ర! విన్ము శరణాగతుఁ జేకొన కున్కి శుద్ధమి
త్రునియెడఁ జేయు ద్రోహము. వధూటి వధించుట, విప్రునర్థముం
గొనుట యనంగఁ గల్గునివి గూడ సమం బగు నాకుఁ జూడ భ
క్తు ననపరాధునిన్ విడుచుదోషముతో నిది యోర్వవచ్చునే? 58

ప్రతిపదార్థం: అనఘచరిత్ర= పుణ్యచరిత్రుడవైన ఇంద్రా!; విన్ము= వినుము; నాకున్+చూడన్= నాకు చూడగా; శరణాగతున్= శరణు కోరి వచ్చినవాడిని; చేకొనక+ఉన్కి= స్వీకరించకపోవటం; శుద్ధమిత్రునిఎడన్= పవిత్రుడైన మిత్రుడి విషయంలో; చేయు ద్రోహము= చేసేటటువంటి ద్రోహమూ; వధూటిన్= అప్పుడే వివాహమైన వధువును; వధించుట= చంపటం; విప్రు+అర్థమున్+

కొనుట= బ్రాహ్మణుడి ధనాన్ని దొంగిలించటం; అనంగన్+కల్గు+ఇవికూడన్= అనబడే ఇవన్నీ; భక్తున్= సేవకుని; అనపరాధునిన్= ఏ అపరాధమూ చేయనివాడిని; విడుచుదోషముతోన్= త్యజించే దోషంతో; సమానము= సమానమైనది; ఇది= దీనిని; ఓర్వన్వచ్చునే?= సహించశక్యమా?

తాత్పర్యం: పుణ్యచరిత్రుడా! వినుము! నా దృష్టిలో శరణుకోరినవాడిని స్వీకరించకపోవటం, మంచిమిత్రుడికి ద్రోహం చెయ్యటం, కులవధువును చంపటం, బ్రాహ్మణుడి ధనాన్ని అపహరించటం - అనే ద్రోహాలతో సమానమే ఏ అపరాధమూ చేయని సేవకుడిని నిర్దాక్షిణ్యంగా వదలివెయ్యటం కూడా. ఈ పాపాన్ని ఎట్లా సహించగలుగుతాం?

విశేషం: ధర్మరాజులోని ఉదాత్తమయిన రాజనీతిని ఈ సందర్భంలో కూడా గమనించవచ్చును. భృత్యరక్షణ రాజకర్తవ్యం కనుక శునకాన్ని వదల నంటాడు.

ఉ. **కావున నాకలోకపు సుఖం బటు లుండఁగ నిమ్ము దేవ! నీ**
భావము నిల్పు నాదెసఁ గృపాభరితంబుగ; సారమేయ సం
భావన సేఁత దోసముగఁ బట్టమి నాకు వరంబు; నీవు పొ;
మ్మీ వనభూమి నుండెద సమిద్ధతపంబుల నిన్న కొల్చుచున్.' **59**

ప్రతిపదార్థం: దేవ!= స్వామీ!; కావునన్= అందుచేత; నాకలోకపు సుఖంబు= స్వర్గసుఖం; అటులు+ఉండఁగన్+ఇమ్ము= అట్లుండనీ!; నీ భావము= నీ విభూతిని; నా దెసన్= నాలో; కృపాభరితంబుగన్= దయతో; నిల్పు= నిలుపుము; (అందుచేత); సారమేయ= కుక్కను; సంభావనసేఁత= సంభావించడం; దోసముగన్+పట్టమి= దోషం కాకపోవటం; నాకున్ వరంబు= నాకు ఒక పెద్దవరం (కాగలదు); నీవు+పొమ్ము= నీవు మరలిపొమ్ము; ఈ వనభూమిన్= ఈ అటవీ భూములలో; సమిద్ధతపంబులన్= అతి తీవ్రమైన తపశ్చర్యలతో; నిన్ను+అ కొల్చుచున్= నిన్నే సేవిస్తూ; ఉండెదన్= ఉండిపోతాను.

తాత్పర్యం: స్వామీ! అందుచేత స్వర్గసుఖ విషయం అట్లా ఉండనీ! నీ విభూతిని నాలో దయతో స్థిరంగా ఉండేటట్లు చేయుము. ఆ పుణ్యంచేత కుక్కను ఆదరించిన కార్యం దోషం కాకపోవటమే నాకొక పెద్ద వరం కాగలదు. ఇక నీవు మరలిపొమ్ము. అతితీవ్రమైన తపశ్చర్యలతో నిన్నే సేవిస్తూ ఈ అడవులలోనే ఉండిపోతాను. నాకు అంతమాత్రం చాలును.'

వ. **అని పుయిలోడక పలికెఁ; బౌరవోత్తమా! యాకర్ణింపుము.** **60**

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా (ధర్మరాజు); పుయిలోడక= ఏ జంకూ లేకుండా; పలికెన్= చెప్పాడు; పౌరవోత్తమా!= పురువంశ శ్రేష్ఠుడయిన ఓ జనమేజయ మహారాజా!; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ఈ విధంగా ఏ మాత్రం భయం, జంకూ లేకుండా ధర్మరాజు ఇంద్రుడితో చెప్పాడు. ఇంకా వినుము.

సారమేయరూపంబున వచ్చిన ధర్ముండు ధర్మరాజునకుఁ బ్రత్యక్షం బగుట (సం.17-3-16)

సీ. **అట్లతిదృఢ నిశ్చయంబుగఁ బలికిన। తనపుత్త్రుఁ గనుఁగొని ధర్ముఁ డధిక**
సంప్రమోదముఁ బొంది సారమేయాకృతిఁ। బాసి తా నాత్మరూపంబుఁ దాల్చి

పరమ సంభ్రమ కృత ప్రణతియు నానంద। భరితుండు నగు నా నృపాలుతోడ

'నీపుణ్యవృత్తంబు నిర్మలమేధయు। నఖిల భూతంబులయందుఁ గలుగు

తే. దయయు నాదుచిత్తముఁ బ్రమదమునఁ దేల్చె। వత్స! భూలోకమున నిట్టివారుఁ గలరె?

తొల్లియును ద్వైతవనమున దోషదూర। మయిన నీ మనమున తెఱం గరసినాఁడ. 61

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; దృఢనిశ్చయంబుగన్= దృఢమైన నిశ్చయంతో; పలికిన= చెప్పిన; తనపుత్త్రున్+కనుఁగొని= తన కుమారుడిని చూచి; ధర్ముఁడు= యమధర్మరాజు; అధిక= మిక్కిలి; సంప్రమోదమున్+పొంది= సంతోషాన్ని పొంది; సారమేయ+ ఆకృతిన్+పాపి= కుక్క ఆకారాన్ని వదలిపెట్టి; తాను; ఆత్మ= నిజ; రూపంబున్= రూపాన్ని; తాల్చి= ధరించి; పరమ= మిక్కిలి; సంభ్రమ= తొట్రుపాటుతో కూడి; కృతప్రణతియున్= నమస్కరించినవాడు; ఆనందభరితుండును= ఆనందంతో కూడినవాడూ; అగు= అయిన; ఆ నృపాలుతోడన్= ఆ ధర్మరాజుతో; వత్స!= కుమారా!; నీ పుణ్యవృత్తంబున్= నీ పుణ్యచరిత్రను; నిర్మలమేధయున్= నిర్మలమైన బుద్ధిని; అఖిల భూతంబులయందున్+కలుగు+దయయున్= అన్ని భూతాలపట్ల ఉన్న దయాగుణం; నాదుచిత్తమున్= నా మనసును; ప్రమదమునన్+తేల్చెన్= సంతోషంలో తేల్చివేశాయి; భూలోకమునన్= భూమిలో; ఇట్టివారున్= నీవంటివారు కూడా; కలరె?= ఉన్నారా?; తొల్లియును= మునుపుకూడా; ద్వైతవనమునన్= మీరు వనవాసం చేస్తున్నప్పుడు ద్వైతవనంలో; దోషదూరము+ అయిన= దోషాలకు దూరంగా ఉన్న; నీ మనమున+తెఱఁగు= నీ మనోరీతిని; అరసినాఁడన్= గుర్తించాను.

తాత్పర్యం: ఆ విధంగా దృఢనిశ్చయంతో పలికిన తన కుమారుడిని చూచి యమధర్మరాజు చాలా సంతోషం పొంది కుక్కరూపాన్ని వదలి తన రూపాన్ని పొంది ఎదుట నిలిచాడు. తొట్రుపాటుతో నమస్కరించి, ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ఆ ధర్మరాజుతో యము డిట్లా అన్నాడు: 'నాయనా! నీ పుణ్యచరిత్రా, నిర్మలమైన బుద్ధీ, సర్వభూతాలపట్ల నీకున్న దయాగుణమూ నా మనసును సంతోషసాగరంలో తేల్చాయి. భూమిలో నీవంటివాడు ఎవడున్నాడు? మునుపుకూడా ద్వైతవనంలో దోషాలు లేని నీ పవిత్రమైన మనోరీతిని నేను గుర్తించి ఉన్నాను.

విశేషం: ద్వైతవనంలోని యక్ష ప్రశ్నలఘట్టాన్ని ఇక్కడ స్మరించుకొంటే అక్కడకూడా యమధర్మరాజే కుమారుడిని పరీక్షించాడు. ఇది రెండవ పరీక్ష. అక్కడ ధర్మజుడి నిర్మలమేధకు పరీక్ష. ఇక్కడ సర్వభూతదయకు పరీక్ష. అందుకనే నీచయోని రూపమయిన 'కుక్క'గా యముడు ధర్మజుడి వెంటనంటి పరీక్షించాడని అర్థం. ఆ విషయాన్ని యముడు గుర్తుకు తెస్తున్నాడు.

క. విను నీరు రోసి నీదగు। ననుజులు మృతులయిన వచ్చి యందఱిలో నొ

క్కనిఁ గోరుము బ్రదికించెద। నని పలికితి నేను నిర్మలాత్మక! నీతోన్. 62

ప్రతిపదార్థం: నిర్మల+ఆత్మక!= నిర్మలమైన మనసున్న ధర్మరాజా!; విను= వినుము; నీదగు= నీయొక్క; అనుజులు= తమ్ములు; నీరు రోసి= నీటికొరకు వెదకుతూ; మృతులు+అయినన్= చనిపోగా; వచ్చి= నీవు వచ్చి; అందఱిలోన్= అందరిలో (ఆ నలుగురిలో); ఒక్కనిన్+కోరుము= ఒక్కడిని కోరుకొనుము; బ్రతికించెదన్= బ్రదికిస్తాను; అని; నేను; నీతోన్; పలికితిన్= అన్నాను.

తాత్పర్యం: నిర్మలమైన మనసున్న ఓ ధర్మరాజా! ఆ కథ చెప్పుతాను వినుము. నీ తమ్ములైన భీమార్జున నకుల సహదేవులు మంచినీటికొరకు వెదకుతూ మరణించారు. వారిని వెదకుతూ నీవు వచ్చావు. అప్పుడు నేను 'వారిలో ఒకరిని కోరుకొనుము బ్రదికిస్తా' నన్నాను.

ఉ. **దానికి నీవు చిత్తమునఁ దల్లుల నిద్దఱనుం దలంచి మా**
లోన నొకండఁ గల్గితి నలుప్తత వారలయందుఁ గల్మి లో
కానుమతంబుగాదె నకులార్థిత ధర్మువు నాకు నన్మతిన్
వీనుల కింపుగా నకులు వేఁడితి; తద్విధ మెందుఁ గల్గునే? **63**

ప్రతిపదార్థం: దానికిన్= అట్లా నేను చెప్పగా అందుకు; నీవు; చిత్తమునన్= మనసులో; తల్లులన్= తల్లులను; ఇద్దఱనున్+తలంచి= ఇద్దరినీ తలచుకొని; మాలోనన్= మా తల్లి కుంతి సంతానంలో; ఒకండన్= ఒకడిని; కల్గితిన్= మిగిలాను; అలుప్తతన్= అట్లాగే లోపంలేకుండా; వారల+అందున్= వారిలో (మాద్రి సంతానంలో); కల్మి= ఒకరుండటం; లోక+అనుమతంబు+కాదె?= లోక సమ్మతం కాదా?; నకుల+అర్థిత= నకులుడిని కోరుకొనటం; నాకున్= నాకు; ధర్మువు= ధర్మం; అన్+మతిన్= అనేటటువంటి బుద్ధితో; వీనులకున్+ఇంపుగాన్= చెవులకింపు కలిగేటట్లు; నకులున్+వేఁడితి(వి)= నకులుడిని వేడావు; తద్+విధము= అట్లా కోరటం; ఎందున్+కల్గునే?= మరెక్కడైన ఉందా?

తాత్పర్యం: అట్లా నేను చెప్పగా దానికి నీవు మనసులో తల్లులను ఇరువురినీ తలచుకొని మా తల్లి కుంతి సంతానంలో నేను ఒకడిని మిగిలాను. అట్లాగే లోపంలేకుండా మాద్రి సంతానంలో ఒకరుండటం లోకసమ్మతం కాదా? అని నకులుడిని కోరుకొనటమే నాకు ధర్మమని తలచినా చెవులకు ఆనందం కలిగేటట్లు నకులుడిని కోరుకొన్నావు. అట్లా కోరుకొనటం మరెక్కడైనా ఉన్నదా?

క. **భీముని నర్జును విడిచియు। నీ మది నకులు బ్రదికింప నిగుడుట పుత్త్రా!**
నా మనమునఁ బాయదు ని। న్నేమనవచ్చు నఖిలంబు నింద్రుండెఱుఁగున్. **64**

ప్రతిపదార్థం: భీమునిన్= భీముడిని; అర్జునున్= అర్జునుడిని; విడిచియున్= విడిచిపెట్టి; నీ మదిన్= నీ మనసులో; నకులున్= నకులుడిని; బ్రదికింపన్= బ్రతికించగా; నిగుడుట= పూనుకొనటం; పుత్త్రా!= నాయనా!; నా మనమునన్= నా మనసులో; పాయదు= తొలగిపోదు; నిన్నున్+ఏమనవచ్చున్?= నిన్ను ఎట్లా ప్రశంసించగలం?; అఖిలంబు= అంతా; ఇంద్రుండు= ఇంద్రుడు; ఎఱుఁగున్= తెలియును.

తాత్పర్యం: నాయనా! భీమార్జునులను వదలి నీ మనసులో నకులుడిని బ్రదికించాలని పూనుకొనటాన్ని నా మనసెప్పుడూ మరవనే మరవదు. నిన్ను ఎట్లా ప్రస్తుతించగలం! ఇంద్రుడి కంతా తెలుసు.

క. **విను భక్తియుక్త మిది యని। శునకముఁ జేపట్టి నీవు సురపతి కొనివ**
చ్చిన యరద మెక్క నొల్లవ। యనఘా! సరి నీకు దివమునందును గలరే? **65**

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్మా!; విను= వినుము; భక్తియుక్తము= భక్తితో కూడింది; ఇది+అని= ఇది అని; శునకమున్+చేపట్టి= కుక్కను అంటిపెట్టుకొని; నీవు; సురపతి= ఇంద్రుడు; కొనివచ్చిన= తీసికొనివచ్చిన; అరదము= రథాన్ని; ఎక్కన్+ఒల్లవు+అ= ఎక్కటానికి అంగీకరించలేదు; నీకున్= నీతో; సరి= సమానుడు; దివమునందునున్= స్వర్గంలో కూడా; కలరే?= ఉన్నారా?

తాత్పర్యం: పుణ్యాత్మా! ఇది భక్తి కలిగిందని కుక్కను అంటిపెట్టుకొని ఇంద్రుడు తీసికొని వచ్చిన రథాన్ని కూడా ఎక్కటానికి అంగీకరించలేదు. నీవంటివాడు స్వర్గంలోనైనా ఉంటాడా?

ఉ. ఇంతటి పెంపు గల్గుట మహేంద్రుఁడు నీ దెసఁ గాంచె; నీవు ని
శ్చింతత మేనితోఁ జనుము సిద్ధపథంబునఁ బుణ్యలోకముల్
వింతలు గాక యుండఁ బృథివీవర! నీకు నుదార సౌఖ్య మ
త్యంతము నవ్యయంబు నగు నందలి మాన్యులు సంస్తుతింపఁగన్.' 66

ప్రతిపదార్థం: ఇంతటి= ఇట్లాంటి; పెంపు+కల్గుట= ఔన్నత్యం ఉండటం; మహేంద్రుఁడు= ఇంద్రుడు; నీ దెసన్+కాంచెన్= నీలో చూచాడు; పృథివీవర!= రాజా!; నీవు; నిశ్చింతతన్= ఏ చింతా లేకుండా; మేనితోన్= శరీరంతో; వింతలు+కాక ఉండన్= ఏమీ వింతగా తోచకుండానే; సిద్ధపథంబునన్= యోగమార్గంలో; పుణ్యలోకముల్= పుణ్యలోకాలకు; చనుము= వెళ్ళుము; అందలి= ఆ పుణ్యలోకాలలోని; మాన్యులు= పూజ్యులు; సంస్తుతింపఁగన్= ప్రశంసించగా; నీకున్= నీకు; ఉదారసౌఖ్యము= ఘనమైన సౌఖ్యం; అత్యంతము= పూర్ణంగాను; అవ్యయము= తరగనిదిగాను; అగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఇట్లాంటి ఔన్నత్యం నీలో ఇంద్రుడు గమనించాడు. రాజా! ఇక నీవు నిశ్చింతగా ఈ దేహంతోనే ఏమీ వింతగా తోచకుండానే యోగమార్గంలో పుణ్యలోకాలకు వెళ్ళుము. ఆ లోకాలలోని పెద్దలు నిన్ను ప్రస్తుతించే విధంగా నీకు అక్కడ ఘనమైన సౌఖ్యాలు సంపూర్ణంగా ఎన్నటికీ తరగకుండా లభిస్తాయి.

సీ. అనియె నప్పుడు పరమాహ్లాదమునఁ జను। దెంచి గంధర్వులు దేవమునులు
మరుదశ్వివసువులు మహితాదరంబున। ధర్ముండు నింద్రుండుఁ దారు నమ్మ
హాత్ముని నెత్తి రథారూఢుఁగాఁ జేసి। తమవిమానములు పార్శ్వముల నడపి
కొని చన నిఖిలదిక్కులఁ దనతేజంబు। వెలుఁగంగ సిద్ధులు వినుతి సేయ

తే. దైవతావాసమునకు నా ధర్మజుండు। చనియె; నయ్యవసరమున సర్వలోక
సమ్మతుఁడు బోధఘనుఁడు ప్రసన్నఫణితి। సారతోదారుఁడును నగునారదుండు. 67

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అప్పుడు= ఆ సమయంలో; గంధర్వులు; దేవమునులు= దేవర్షులు; మరుత్+అశ్వి+వసువులు= మరుత్తులు, అశ్వినులు, వసువులు; పరమ+ఆహ్లాదమునన్= మిక్కిలి ఆనందంతో; చనుదెంచి= వచ్చి; ధర్ముండున్= యముడూ; ఇంద్రుండున్= ఇంద్రుడూ; తారు= తామూ (అందరూ కలిసి); ఆ మహాత్మునిన్+ఎత్తి= ఆ మహాత్ముడైన ధర్మరాజును గౌరవపురస్సరంగా పైకెత్తి; రథ+ఆరూఢున్+కాన్+చేసి= రథంలో కూర్చోబెట్టి; తమవిమానములు= తమతమ విమానాలను; పార్శ్వములన్= ఇరువైపులా; నడపికొని= నడుపుకొంటూ; చనన్= వెళ్ళగా; నిఖిలదిక్కులన్= పదిదిక్కులలోనూ; తన తేజంబు= తనకాంతి; వెలుఁగంగన్= ప్రకాశించగా; సిద్ధులు; వినుతి+చేయన్= ప్రస్తుతించగా; ఆ ధర్మజుండు= ఆ ధర్మరాజు; దైవత+ఆవాసమునకున్= స్వర్గానికి; చనియెన్= బయలుదేరాడు; ఆ+అవసరమునన్= ఆ సమయంలో; సర్వలోక సమ్మతుఁడు= సకలలోక పూజ్యుడు; బోధఘనుఁడు= గొప్పజ్ఞాని; సారతా+ఉదారుఁడున్= బ్రహ్మతత్త్వరహస్య వేత్తృత్వంచేత మహనీయుడు; అగు= అయిన; నారదుండు= నారదమహర్షి; ప్రసన్న ఫణితిన్= ప్రసన్నమైన వాక్కుతో (ఇట్లా అన్నాడు.)

తాత్పర్యం: అని వర మిచ్చాడు. అప్పుడు గంధర్వులు, దేవఋషులు, మరుత్తులు, అశ్వినులు, వసువులు, మిక్కిలి ఆనందంతో వచ్చి యముడు, ఇంద్రుడు, తామూ అందరూ చేరి పరమాదరంతో ధర్మరాజును గౌరవ పురస్సరంగా దివ్యరథంలో ఆసీనుడిని చేశారు. రథం కదులుతుండగా అటూ ఇటూ వారు తమతమ విమానాలను నడుపుకొంటూ

అనుసరించారు. ఇట్లా పది దిక్కులలోనూ తన కాంతి ప్రకాశించగా సిద్ధులు ప్రస్తుతించగా ఆ ధర్మరాజు స్వర్గానికి బయలుదేరాడు. ఆ సమయంలో సకలలోక పూజ్యుడు, గొప్పజ్ఞాని, బ్రహ్మతత్త్వరహస్య వేత్తృత చేత మహనీయుడు అయిన నారదమహర్షి ప్రసన్నమైన వాక్కుతో. (తరువాతి వచనంతో అన్వయం)

వ ఎల్లవారును విన సంపూర్ణస్వరంబున నిట్లనియె: 68

ప్రతిపదార్థం: ఎల్లవారును= అందరూ; వినన్= వినేటట్లు; సంపూర్ణస్వరంబునన్= పెద్ద ఎలుగుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు;

తాత్పర్యం: అందరూ వినేటట్లు పెద్ద ఎలుగుతో నారదమహర్షి ఇట్లా అన్నాడు:

ఉ. 'దానములం దపంబులను దద్దయుఁ బే ర్గలయట్టివారలన్
మానవనాథులన్ వినమె! మాసెఁ దదీయ యశంబు లెల్ల నీ
మానిత కీర్తిదీప్తులు సమస్తజగంబులయందుఁ బర్వుట
న్మేనులతోడ వా రిటులు నేర్చిరె రా నమరత్వసిద్ధికిన్.' 69

ప్రతిపదార్థం: దానములన్= దానాలతో; తపంబులను= తపస్సులతో; తద్దయున్= మిక్కిలి; పేర్+గల+అట్టి= పేరున్నట్టి; వారలన్= వారిని; మానవనాథులన్= రాజులను (గురించి); వినమె!= వినలేదా!; నీ మానితకీర్తిదీప్తులు= నీ ప్రశస్తమైన కీర్తికాంతులు; సమస్త= అన్ని; జగంబులయందున్= లోకాలలోనూ; పర్వుటన్= వ్యాపించటంచేత; తదీయ= వారి; యశంబులు+ఎల్లన్= వారి కీర్తులన్నీ; మాసెన్= మరుగునపడ్డాయి (మాసిపోయాయి); వారు= ఆ రాజులు; మేనులతోడన్= శరీరాలతో; అమరత్వసిద్ధికిన్= అమరత్వసిద్ధికొరకు; రాన్= రావటానికి; ఇటులు నేర్చిరె!= ఇట్లా నేర్చారా! (రాగలిగారా?)

తాత్పర్యం: 'దానాలతో, తపస్సులతో మిక్కిలి పేరున్నట్టి ఎంతో మంది రాజులను గురించి విన్నాం. కాని నీ ప్రశస్తమైన కీర్తికాంతులు అన్ని లోకాలలోనూ వ్యాపించటం చేత వారి కీర్తులన్నీ మాసిపోయాయి. ఆ రాజులు ఇట్లా సశరీరులై అమరత్వసిద్ధికై రాగలిగారా?

చ. అన విని ధర్మరాజసుతుఁ డాతని కిట్లను 'నాదుతమ్ములం
గనుఁగొను నంతకున్ సుఖముగాఁ గొన నయ్యెద; నిత్తెఱంగు నా
కు నకట చూపరే పవనుకొడ్కును నింద్రసుతుండు మాద్రినం
దనులును నున్న చోటు సుఖదం బయినన్ సుఖహీనమేనియున్. 70

ప్రతిపదార్థం: అనన్+విని= అనగా విని; ధర్మరాజసుతుఁడు= ధర్మరాజు (యమధర్మరాజు కొడుకు); అతనికిన్= నారదుడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; నాదుతమ్ములన్= నా తమ్ముళ్ళను; కనుఁగొను నంతకున్= చూచేంతవరకు; ఈ+తెఱంగున్= దీనిని; సుఖముగాన్+కొనన్+అయ్యెదన్= సుఖంగా తీసికొనలేను; అకట!= అయ్యో!; పవనుకొడ్కును= భీముడు; ఇంద్రసుతుండు= అర్జునుడు; మాద్రినందనులును= నకుల సహదేవులూ; ఉన్నచోటు= ఉన్నచోటు (అది); సుఖదంబు+అయినన్= సుఖాన్నిచ్చేదే అయినా; సుఖహీనము+ఏనియున్= సుఖహీనమైనదే అయినా; నాకున్+చూపరే!= నాకు చూపించరూ!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు నారదుడితో ఇట్లా అన్నాడు: 'నా తమ్ముళ్ళను చూచేటంతవరకు దీనిని సుఖంగా తీసికొనలేను. అయ్యో! భీమార్జున నకుల సహదేవులను, వా రెక్కడ ఉన్నారో, అది సుఖాన్నిచ్చేదయినా, దుఃఖం కలుగజేసేదయినా, ఆ చోటును నాకు చూపెట్టరూ!

వ. వారలను మదీయపక్షప్రాప్తు లయిన భూపతులను జూచు వేడ్క యెల్లలోకంబుల మీఁదను గలుగు వేడుక కంటెనుమిగిలియున్నయది యనుటయు నమరేంద్రుండు తన మనంబున నితనితోడ సముచిత భాషణంబులు చేసెద; నిర్విధంబు కటుక వచనత్వంబు గా దని యూహించి యి ట్లనియె. 71

ప్రతిపదార్థం: వారలను= వారినీ; మదీయ= నా; పక్షప్రాప్తులు+అయిన= పక్షంలో నిలిచినవారు అయిన; భూపతులను= రాజులను; చూచువేడ్క= చూడాలన్న కోరిక; ఎల్లలోకంబుల మీఁదనున్= అన్ని లోకాలమీదా; కలుగువేడుక కంటెను= కలిగే కోరికకంటె; మిగిలి ఉన్నఅది= మించి ఉన్నది; అనుటయున్= అనగా; అమర+ఇంద్రుండు= దేవేంద్రుడు; తనమనంబునన్= తన మనసులో; ఇతనితోడన్= ఈ ధర్మరాజుతో; సముచిత భాషణంబులు= తగిన రీతిగా మాటాడటం; చేసెదన్= చేస్తాను; ఈ+విధంబు= ఈ విధంగా; కటుక= కఠిన; వచనత్వంబు= మాటలు; కాదని= కాదని; ఊహించి= ఆలోచించి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు;

తాత్పర్యం: నా తమ్ముళ్ళను, నా పక్షంలో నిలిచినవారూ అయిన రాజులను చూడాలన్న కోరిక అన్ని లోకాలమీద ఉన్న కోరికకన్నా అధికంగా ఉన్నది' - అనగా ఇంద్రుడు తన మనసులో ఈ ధర్మరాజుతో తగినరీతిగా మాటాడుతాను. కఠినంగా మాటాడటం బాగాలే దని ఆలోచించి ఇట్లా అన్నాడు:

విశేషం: స్వర్గానికి వెళ్ళగా మానవ సంబంధమైన 'మమత' ధర్మరాజులో మిగిలిఉన్నదా! అనిపిస్తుంది. కాని, తరువాత ధర్మరాజు సమాధానంలో ఈ సందేహనివృత్తి జరుగుతుంది.

చ. 'తనువు దొఱంగ కిట్లు సుకృతంబుల పెంపున వచ్చి తిప్పదం
బునకు మహాత్మ! యిచ్చటను బోవదు నీమదిఁ బాసి మర్త్యతం
బనుపడియున్న నెయ్యము సభాసదులన్ శుభదృష్టిఁ జూడుమా
మునులను సిద్ధులం; దగునె ముందటి చందము నొంది యుండఁగన్? 72

ప్రతిపదార్థం: మహాత్మ!= ఓ మహాత్మా!; తనువున్= దేహాన్ని; తొఱంగన్= త్యజించకుండా; ఇట్లు= ఈ విధంగా; సుకృతంబుల పెంపునన్= పుణ్య విశేషం వలన; ఈ+పదంబునకున్= ఈ స్వర్గస్థానానికి; వచ్చితి(వి)= వచ్చావు; ఇచ్చటను= ఇక్కడకూడా; మర్త్యతన్= మానవత్వంతో (మనిషిగా ఉన్నప్పుడు); పనుపడి+ఉన్న= నీకుండిన; నెయ్యము= స్నేహభావం; నీ మదిన్+పాపి= నీ మనసును వదలి; పోవదు= పోలేదు; ఆ మునులను= ఆ దేవర్షులను; సిద్ధులన్= సిద్ధులను; సభాసదులన్= స్వర్గసభలో ఉన్న మాన్యులను; శుభదృష్టిన్+చూడుమా!= శుభదృష్టితో చూడుము; ముందటి= మునుపటి; చందమున్= రీతినే; ఒంది+ఉండఁగన్= పొంది శోకిస్తూ ఉండటం; తగునె!= సముచితంగా ఉన్నదా!

తాత్పర్యం: 'ఓ మహాత్మా! దేహాన్ని త్యజించకుండా నీవు చేసిన పుణ్యవిశేషంవలన ఇట్లా ఇంత ఉన్నతమైన పదవికి రాగలిగావు. ఇక్కడకూడా మనిషిగా ఉన్నప్పుడు నీ కుండిన స్నేహభావం ఇంకా నీ మనసును వదలిపెట్టకుండా ఉన్నది. ఆ దేవర్షులను, సిద్ధులను, సభాసదులను శుభదృష్టితో చూడుము. ఇంకా మునుపటివలెనే శోకంలో మునిగిఉండటం సముచితంగా ఉన్నదా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఈ ప్రస్థానంలో చివరి వరకు ధర్మరాజు పరీక్షించబడుతూనే ఉన్నాడు. 'నాపక్షప్రాప్తులు' అన్న ధర్మరాజు మాట చాలా చిత్రమైనది. ఏడు అక్షౌహిణుల సైన్యంలోని యోధానుయోధులు భటులు సైనికులు - వీరంతా తనకు 'ప్రాప్త' మయ్యారు. దుర్యోధనుడివలె కోరి సంపాదించుకొన్నవారు కాదు. వారిని కృతజ్ఞతాపూర్వకంగా చూడాలని ధర్మరాజు కోరుతున్నాడు. దానిపై ఇంద్రుడి వ్యాఖ్య ఇది. నీ కింకా ఆ మనుషజన్మలోని స్నేహాది మమతానుబంధాలు ఇంకా నశించలేదా! అని.

చ. **ఒరులకు నందరానిపద మూర్జిత పుణ్యనిరూఢిఁ బొందఁగా**
దొరకొని యున్కి నీ వికృత దూరమనస్కతఁ గాదె! నీ సహో
దరులు భవన్మహోన్నత పదస్థితి కర్హులె తొంటి నెయ్యమున్
బొరయునె దేవతాత్మకులబుద్ధి నెఱుంగుము నీ విశేషమున్.' **73**

ప్రతిపదార్థం: ఒరులకున్+అందన్‌రాని= ఇతరులు అందుకొనటానికి వీలుకాని; పదము= స్థానాన్ని; ఊర్జిత= ఘనమైన; పుణ్యనిరూఢిన్= పుణ్యప్రసిద్ధిచేత; పొందఁగాన్= పొందటానికి; దొరకొని ఉన్కి= ప్రయత్నంతో ఉండటం; నీ వికృతదూర మనస్కతన్+కాదె= వికారాలకు దూరమైన నీ మనస్సు చేతనే కదా!; నీ సహోదరులు= నీ తమ్ములు; భవత్+మహోన్నత= నీయొక్క ఉన్నతమైన; పదస్థితికిన్= స్థానంలో ఉండటానికి; అర్హులె?= తగినవారా?; తొంటినెయ్యమున్= మునుపటి స్నేహభావాన్ని; పొరయునె?= కలిగి ఉంటుందా?; దేవతా+ఆత్మకుల బుద్ధిన్= దైవస్వరూపుల యొక్క బుద్ధితో; నీ విశేషమున్= నీయొక్క ప్రత్యేకతను; ఎఱుంగుము= తెలిసికొనుము.

తాత్పర్యం: ఇతరులు అందుకొనటానికి వీలులేని స్థానాన్ని ఘనమైన పుణ్యప్రసిద్ధి చేత పొందటానికి ప్రయత్నించటం నీకున్న వికార దూరమైన మనస్సుచేతనే కదా! నీ తమ్ములు నీ అంతటి ఉన్నత పదవిని అందుకొనటానికి తగినవారా! మర్త్యలోకం వీడివచ్చిన నీకు మునుపటి స్నేహబంధాలస్మరణం తగదు. దివ్యస్వరూపంలో ఉన్న నీవు నీ విశేషాన్ని గ్రహించుము.

క. **అని యిట్లాడిన సర్వభు। వనపతియు బుధుండు నైన వాసవుతోఁ దా**
ననియెం దగ వెండియు ధ। ర్మనందనుఁడు భరతవంశ మహిమాధాయీ! **74**

ప్రతిపదార్థం: భరతవంశ= భరతవంశానికి; మహిమ+ఆధాయీ!= కీర్తిని కూర్చేవాడా! (జనమేజయా! వినుము); అని= ఈ విధంగా; ఇట్లు+ఆడిన= పలికిన; సర్వభువనపతియున్= సర్వభువనపాలకుడూ; బుధుండున్+ఐన= పండితుడూ అయిన; వాసవుతోన్= ఇంద్రుడితో; ధర్మనందనుఁడు= ధర్మరాజు; తగన్= తగినట్లుగా; వెండియున్= మరలా; తాను; అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: జనమేజయా! వినుము: ఇట్లా అన్నటువంటి సమస్తలోకపాలకుడూ, మహావిద్వాంసుడూ అయిన ఇంద్రుడితో ధర్మనందనుడు మరలా ఇట్లా అన్నాడు:

ఉ. **'మీ రిటు లేమి సెప్పిన నమేయభుజాబలభగ్నదైత్య! యే**
గారవ మొప్పఁ దమ్ములను గాంతను బుత్త్రుల మిత్ర కోటిఁ గ

న్నారఁగఁ జూడ కుండుటకు నక్కట యోర్తునె? యెల్లభోగముల్

వారలఁ జూచి క్రమ్మఱఁగ వచ్చి సుఖస్థితిమై భుజించెదన్. 75

ప్రతిపదార్థం: అమేయభుజాబల!= లెక్కించటానికి వీలులేని భుజబలంచేత; భగ్నదైత్య!= ఓడించబడిన రాక్షసులుగల ఓ మహేంద్రా!; మీరు+ఇటులు+ఏమి+చెప్పినన్= మీరు ఇట్లా ఏమి చెప్పినాసరే!; గారవము+ఒప్పన్= ఆదరంతో; తమ్ములను= నా భీమార్జునులను నకులసహదేవులను; కాంతను= ద్రౌపదిని; పుత్త్రులన్= కుమారులను; మిత్రకోటిన్= నా పక్షాన యుద్ధంచేసిన స్నేహితులను; కన్ను+ఆరఁగన్= కనులారా; చూడక+ఉండుటకున్= చూడకుండా ఉండటానికి; అక్కట!= అయ్యో!; ఓర్తునె!= సహించగలనా!; వారలన్+చూచి= వారందరినీ చూచి; క్రమ్మఱఁగన్+వచ్చి= మరలివచ్చి; ఎల్లభోగముల్= అన్ని సుఖాలనూ; సుఖస్థితిమైన్= సుఖమైన ఉనికితో; భుజించెదన్= అనుభవిస్తాను.

తాత్పర్యం: లెక్కించటానికి వీలుకాని భుజబలంచేత రాక్షసులను నశింపచేసిన ఓ మహేంద్రా! మీ రేమి చెప్పినా సరే! అయ్యో! కనులారా నా సోదరులను, కాంతను, పుత్రులను, మిత్రులను ఆదరంతో ఒక్కసారి చూడకుండా నేను ఉండగలనా? వారందరినీ చూచి మరలి వచ్చాక ఈ సర్వభోగాలనూ స్తిమితమైన మనస్సుతో అనుభవిస్తాను'.

వ. నాకత్తెఱంగు పరమానందకరం' బనియె నని యిట్లు మునీంద్రమాననీయం బయిన పాండవేయ మహాప్రస్థానప్రకారంబు జనమేజయునకు వైశంపాయనుండు సెప్పుటయు. 76

ప్రతిపదార్థం: నాకున్= నాకు; ఆ+తెఱంగు= ఆ విధము; పరమ+ఆనందకరంబు+అనియెన్= మిక్కిలి సంతోషాన్ని కూరుస్తుంది అన్నాడు; అని; ఇట్లు= ఈ విధంగా; మునీంద్ర= మునిశ్రేష్ఠులకు; మాననీయంబు+అయిన= గౌరవించదగిన; పాండవేయ= పాండవుల; మహాప్రస్థానప్రకారంబు= మహా ప్రయాణవిధానం; జనమేజయునకున్= జనమేజయ మహారాజుకు; వైశంపాయనుండు= వైశంపాయనమహర్షి; చెప్పుటయున్= చెప్పటం (ఇందలి కథ).

తాత్పర్యం: నాకు అదే మిక్కిలి ఆనందాన్ని కలిగిస్తుందని ధర్మరాజు అన్నాడు' అని ఈ విధంగా మునీంద్రులు కూడా సమాదరించేటటువంటి పాండవుల మహాప్రయాణకథను జనమేజయుడికి వైశంపాయన మహర్షి చెప్పగా.

విశేషం: ఏ గుణాలను అభ్యసిస్తే సశరీరంగా స్వర్గాది పుణ్యలోక ప్రాప్తి కలుగుతుందో ధర్మరాజు పొందిన 'విజయాన్ని' బట్టి అర్థం చేసికొనవచ్చును. కాబట్టి మునీంద్రులకు కూడా ఈ కథ మిక్కిలి సమాదరణీయమని అర్థం.

ఆశ్వాసాంతము

శా. పారాశర్య వచఃపయోనిధి సుధాభంగీ! దయాసంగీ! దు

ర్వారాశేష విపద్విదారణ విహారా! చిన్మయాకార! వి

స్తారోదార! గుణత్రయస్ఫుటవిశేషా! నిర్గుణాశ్లేష! మా

గౌరీత్వోజ్జ్వల తత్త్వభాస్వర! నిజాకారాత్మకత్రీశ్వరా! 77

ప్రతిపదార్థం: పారాశర్య= వ్యాసుడి; వచస్= వచనా లనెడి; పయస్+నిధి= క్షీరసాగరానికి; సుధాభంగీ!= అమృతం వంటివాడా!; దయాసంగీ!= కరుణారసంతో కూడినవాడా!; దుర్వార= వారించటానికి అలవికానటువంటి; అశేష= అనేకాలైన; విపద్= ఆపదలను; విదారణ= నశింపచేయటమే; విహారా!= క్రీడగా కలిగినవాడా!; చిత్+మయ+ఆకార!= చైతన్య స్వరూపుడా!; విస్తార= సర్వవ్యాపకత్వ;

ఉదార!= మహత్త్వం కలిగినవాడా!; గుణత్రయ స్ఫుటవిశేషా!= సత్త్వరజస్తమోగుణాల రూపమైన ప్రకృతిసంబంధంచేత తెలియదగిన విశిష్టత కలవాడా!; నిర్గుణ+శ్లేష= వాస్తవానికి ఆ గుణత్రయంతో సంబంధంలేక, తత్కారణంగా విశ్వంతో ఏమాత్రం సక్తత లేనివాడా!; మా= లక్ష్మీభావంతో; గౌరీత్వ= గౌరీభావంతో; ఉత్+జ్వల= వెలిగేటటువంటి హరిహరాత్మకమైన; తత్త్వ= తత్త్వంచేత; భాస్వర= ప్రకాశించేవాడా!; నిజ+ఆకార+ఆత్మక+త్రీశ్వరా!= తన వ్యాపారానికి అనుగుణమైన గృహంగా భాసిల్లే బ్రహ్మ,విష్ణు, శివాత్మకరూపమైన మూర్తిత్రయం కలవాడా!;

తాత్పర్యం: వ్యాసుడి వచనాలనేటటువంటి క్షీరసాగరానికి అమృతంవలె సారభూతమైనవాడా! దయారసమూర్తీ! వారించటానికి అలవికాని ఎప్పటికీ తీరని ఆపదలను నశింపజేయటమే క్రీడగా కలవాడా! చైతన్యస్వరూపా! సర్వవ్యాపకత్వ మహత్త్వం కలిగినవాడా! సత్త్వరజస్తమోగుణాల రూపమైన ప్రకృతి సంబంధంచేత తెలియదగిన విశిష్టత కలవాడా! వాస్తవానికి గుణత్రయంతో సంబంధం లేని కారణంగా ప్రపంచంతో ఏ మాత్రం సంబంధం లేనివాడా! లక్ష్మీత్వ, గౌరీత్వ భావంతో ప్రకాశించే హరిహరాత్మకమైన తత్త్వంచేత ప్రకాశించేవాడా! తన వ్యాపారానికి అనుగుణమైన గృహంవలె భాసిల్లే బ్రహ్మవిష్ణు శివాత్మకమైన త్రిమూర్తిస్వరూపా! నీకు నమస్కారం.

విశేషం: మహాభారత తాత్పర్యమంతా ఆశ్వాసాంత పద్యాలలో కనిపిస్తుంది. అందులోనూ ఇవి పర్వాంత పద్యాలు కూడా. అందుచేత రమణీయమైన విశేషణాలతో హరిహరనాథుడి మహాతత్త్వానికి తిక్కనగారు భాష్యం చెప్తున్నారు. క్షీరసాగరంలో అమృతం పుట్టింది. అట్లాగే వ్యాసవచనాలకు తాత్పర్యరూపమైన హరిహరాత్మక సారం ఉన్నది. లౌకికాలౌకిక వ్యాపారాలమధ్య సమన్వయరూపమైన హరిహరాత్మక సారం ఉన్నది. లౌకికాలౌకిక వ్యాపారాల మధ్య సమన్వయ రూపమైన విచిత్ర తత్త్వమది. అందుకే గుణత్రయంతో ఆశ్లేష (కూడికా ఉన్నది); అశ్లేష (నిరాసక్తత) కూడా ఉన్నది. విష్ణువుగా భోగమూర్తి, శివుడుగా యోగమూర్తి, లక్ష్మీత్వరూపంలో భోగం. గౌరీరూపంలో యోగం. ఈ విచిత్రయోగాన్నే ధర్మాద్వైతమని తిక్కన వ్యాసుడిహృదయంలోని ఒక సూత్రాన్ని వ్యాఖ్యానిస్తున్నాడు. ఆంధ్రమహాభారతం ఏకైకంగా సాధించిన మహావిజయం ఈ సూత్ర వ్యాఖ్యానమే. అన్ని మతాలకూ సమన్వయం ఉన్నదిక్కడ. భోగ, యోగ రూపమైన లక్ష్మీత్వగౌరీత్వ (శ్రీయనశౌరివాచకము...) భావంలోని తత్త్వజ్ఞానమే సరస్వతి. అందుకే ఆమెతోపాటు బ్రహ్మకూడా హరిహరతత్త్వంలో గర్భితంగా ఉన్నాడు.

క. ప్రణవైకభావ్య! సురర! క్షణ కేళీస్తవ్య! జన్య సకలద్రవ్యా!
గణనాతీతా! పోష్య। ప్రణతవ్రాతా! నిరీహభక్తి ప్రీతా! 78

ప్రతిపదార్థం: ప్రణవ+ఏకభావ్య!= ఒక ప్రణవం చేతనే భావించదగినవాడా!; సుర= దేవతలను; రక్షణ= రక్షించటమనేటటువంటి; కేళీస్తవ్య!= క్రీడ కలిగినవాడు కావటంచేత స్తుతించదగినవాడా!; జన్య= పుట్టదగిన; సకల= అన్ని; ద్రవ్యా!= వస్తువులను కలిగినవాడా!; గణన= లెక్కించటానికి; అతీతా!= సాధ్యంకానివాడా!; పోష్య= పోషించదగిన; ప్రణత= భక్తుల; వ్రాతా!= సమూహం కలవాడా!; నిర్+ఈహ= కోరికలు లేని; భక్తి= భక్తిచేత; ప్రీతా!= సంతోషించేవాడా!

తాత్పర్యం: ఒక ప్రణవంచేత మాత్రమే తెలియదగినవాడా! దేవతలను రక్షించటమనే క్రీడచేత స్తుతించబడేవాడా! లెక్కించటానికి వీలులేనివాడా! పుట్టించదగిన సకల వస్తువులు కలవాడా! పోషించదగిన భక్తుల సమూహం కలవాడా! కోరికలు లేని భక్తిచేత ప్రీతుడవయ్యేవాడా! నీకు నమస్కారం.

విశేషం: ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ - అని గీత; తస్య వాచకః ప్రణవః - అని పాతంజల యోగసూత్రం. తస్య= తత్ పదార్థానికి వాచకం - సూచకం. అదే హరిహర తత్త్వం. అది కేవలం 'ఓం'కార రూపం. ఓంకార సాధన ద్వారానే తెలియదగింది. ప్రధానమైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పరమేశ్వర మంత్రం. అది ఒకటేనని శ్రుతి ప్రమాణం కావటంవలన 'ప్రణవైక భావుడు' అవుతున్నాడు.

సురలు - ధర్మపరులు. అందుకే ధర్మరక్షణ కళాశీలుడు కాబట్టి స్వామి అవతరిస్తుంటాడు. అదొక క్రీడ ఆయనకు. ఆ లీలామూర్తిని అందుకే భక్తులు కొలుస్తారు.

బ్రహ్మాదిస్తంబ పర్యంతమున్న సృష్టి మొత్తం పరమేశ్వరుడి నుండి ప్రభవించి అందులోనే లీనమవుతున్నది. అందుచేత సకల వస్తువులకు జన్యస్థాన మాయనే.

సర్వవ్యాపకత్వ - సర్వకర్తృత్వ - సర్వజ్ఞత్వ భావాలు కలవాడు కాబట్టి ఆయన తత్త్వం 'పరిచ్ఛిన్నం' కాదు. పరిచ్ఛిన్నం (ముక్క) అయితే కదా కొలవటానికి, అందుకే అగణితమైన తత్త్వమది.

భక్తులు నాలుగు రకాలని గీతాశాస్త్రం వివరించింది.

'ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ' - అని ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులు - అని నాలుగు రకాల భక్తులున్నారు. వీరిలో ఆర్తి తొలగాలని కోరేవారికంటె, అర్థంకావాలని వెళ్ళేవాడికంటె, అదేమిటో తెలిసికొనాలని యత్నించేవాడికంటె (వీడే జిజ్ఞాసువు)- ఏ కోరికా లేనివాడు 'జ్ఞాని' మాత్రమే. అందుకే పరమాత్మ 'జ్ఞానయోగి' తనకు చాలా ప్రీతిపాత్రుడని చెప్పాడు (స చ మే ప్రియః)

అందుచేత హరిహరనాథుడి తత్త్వం కేవలం యోగి ఆరాధనచేత జననాంతర పరిశ్రమచేత సాధించదగ్గ మహావిషయం తప్ప కేవలం విగ్రహవిశేషం కాదని అర్థం.

మాలిని.

అమృత వికిరణ క్రీడాభిరామా! త్రిధామా!
దమిత సకల దైత్యోద్వాహా! విజ్ఞాన దేహా!
సుమహ దుపనిషత్ప్రస్తుత్యభిశ్రావ్య! సేవ్యా
శమన రమణశీలా! సంభృతానందలీలా! **79**

ప్రతిపదార్థం: అమృత= అమృతాన్ని; వికిరణ= వెదజల్లటం అనే; క్రీడా+అభిరామా!= విహారంచేత మనోహరుడవైనవాడా!; త్రిధామా!= మూడు స్థానాలు కలవాడా!; దమిత= అణచివేయబడిన; సకల= సమస్త; దైత్య= రాక్షసుల; ఉత్+వాహా!= ఉత్సాహం కలవాడా!; విజ్ఞానదేహా!= జ్ఞానమే దేహంగా కలవాడా!; సుమహత్= ఉత్తమ; ఉపనిషద్= వేదోపనిషత్; ప్రస్తుతి+అభిశ్రావ్య= స్తవంచేత వినదగినవాడా! (అంటే కనదగినవాడా!); సేవ్యా!= సేవించదగినవాడా!; శమన= శాంతిలోనే; రమణ= క్రీడించే; శీలా!= స్వభావం కలవాడా!; సంభృత= సంపూర్ణ; ఆనంద= ఆనందంతో కూడిన; లీలా!= విలాసం ఉన్నవాడా!

తాత్పర్యం: అమృతాన్ని వెదజల్లటమనే విహారంచేత మనోహరుడవైనవాడా! అణచివేసిన సకల దైత్యుల ఉత్సాహం కలవాడా!; ఉత్తమ వేదోపనిషన్మంత్రాల సంస్తుతిచేత విని కనదగినవాడా! శాంతిలోనే క్రీడించే స్వభావం కలవాడా! సంపూర్ణమైన ఆనందంతో కూడిన విలాసమున్నవాడా! నీకు నమస్కారం.

విశేషం: నక్షత్రాలలో నేను చంద్రుడిని-అని గీతాకారుడు స్వామి విభూతియోగంలో చెప్పాడు. చంద్రుడు అమృతకిరణుడు. మోహినీరూపంలో భగవానుడు చేసిన పనికూడా ఇదే. దేవతలకు అమృతాన్ని పంచి రాక్షసులకు లేకుండా చేయటమే 'క్రీడ'. ఆ అభిరామ ధర్మాన్నే 'మోహిని' అన్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

త్రిధామా! - అన్నమాట చాలా విశిష్టమైంది. స్వామి విభూతిని వైష్ణవ సంప్రదాయం 'త్రిపాద్విభూతి, అంటుంది. స్వామి నాలుగు పాదాలలో ఒకటిమాత్రమే ఈ జగత్తులో ఉంది. తక్కిన మూడు పాదాలు ఊర్ధ్వ జగత్తులో ఉన్నాయి అని పురుషసూక్తం. వామన, త్రివిక్రమ, పరమేశ్వర రూపాలని. భూ - అంతరిక్ష - స్వర్లోకాలలో; అగ్ని, వాయు, సూర్యరూపాలలో ఉన్న తత్త్వమిది. జాగ్రత్- స్వప్న - సుషుప్తులలో వైశ్వానర, తైజస, ప్రాజ్ఞ రూపాలలో వ్యాపించి ఉన్న తత్త్వమిది. ఆహవనీయ - గార్హపత్య - దక్షిణాగ్ని రూపాలతో జగత్కర్మను ఆవరించి ఉంటుంది. అందుకే త్రిధాముడని హరిహరాత్మక స్వరూపాన్ని స్తుతిస్తున్నాడు.

సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ-అని తైత్తిరీయం చెబుతుంది. 'విజ్ఞానమానందం బ్రహ్మ' అని బృహదారణ్యకం - అందువలన శ్రుతి ప్రమాణంచేత పరమేశ్వరుడు విజ్ఞానరూపుడు.

వేద ఉపనిషన్మంత్రాలు భగవత్ స్తుతిపరాలే. అందుకే వీటిని ఋక్కులన్నారు. వీటిని 'సూక్తము' అని కూడా అందుకే అన్నారు.

స్వామి శాంతాకారుడు. సర్వరసానుభవాలూ ఎక్కడ ప్రశమనం పొందుతాయో అది 'శాంతం' అది కేవలం బ్రహ్మానంద స్వరూపం. అందుకే పరమేశ్వరుడి లీలను 'విలాస' మంటారు. అది అంతా ఆనందమయమే. అక్కడ శోకానికి చోటులేదు. భారతంలో శ్రీకృష్ణుడి చర్యలు అన్నీ ఆనందవిలాసాలే. ఆనందదాయకాలే. కడకు పరమాత్ముడి దేహ విసర్జనంకూడా ఒక 'విలాసం'గా కనిపిస్తుంది.

ఆ లీలలో భాగమే ధర్మనందనాదుల మహాప్రస్థానం. అందుకే ఈ ప్రస్థానంలోని ఘట్టాలు చిత్రంగా కనిపిస్తాయి. అతి చిత్రమైంది. 'కుక్క' వెంటబడటం. అది ధర్ముడి రూపాన్ని పొందటం. ఇంద్రుడు, యమధర్మరాజు, సకల దేవతా సమూహమూ కలిసి ధర్మజుని దివ్యరథంలో స్వర్లోకానికి సాదరంగా తీసికొనిపోవటం ఇవన్నీ పరమేశ్వరుడి క్రీడావిలాసమే.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్త్రకొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బయిన శ్రీ మహాభారతంబునందు మహాప్రస్థానిక పర్వంబు సర్వంబు నేకాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈ రచన; శ్రీమత్= ప్రసిద్ధికెక్కిన; ఉభయ కవి= సంస్కృతాంధ్ర భాషాకవుల; మిత్త్ర= మిత్రుడును; కొమ్మన= కొమ్మన అనే; అమాత్య= మంత్రియొక్క; పుత్త్ర= కుమారుడును; బుధ= విద్వాంసులయొక్క; ఆరాధన= పూజచేత; విరాజి= ప్రకాశించేవాడును అయిన; తిక్కన సోమయాజి= సోమయాజి అయిన తిక్కనచేత; ప్రణీతంబు+ఐన= రచించబడినదైన; శ్రీమహాభారతంబునందున్= శ్రీ మహాభారతంలో; మహాప్రస్థానిక పర్వంబు= మహాప్రస్థానిక పర్వంలో; సర్వంబును= సమస్తమును; ఏకాశ్వాసము.

తాత్పర్యం: కీర్తికలవాడూ; సంస్కృతాంధ్రభాషా కవిమిత్రుడూ, కొమ్మనమంత్రి కుమారుడూ, బుధపూజనంచేత ప్రకాశించేవాడూ అయిన తిక్కనసోమయాజి రచించిన శ్రీమహాభారతంలో మహాప్రస్థానికపర్వం సర్వం ఏకాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతములోని 'ఏకాశ్వాసమైన మహాప్రస్థానికపర్వం సర్వం ముగిసింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

స్వర్గారోహణ పర్వము - ఏకాశ్వాసము

శ్రీవర్ధనాయురభివృ। ద్ధ్యావహచరణ శతపత్ర! యమనియమాది

ప్రావీణ్య పూర్ణ మిత్ర! మ। హా విద్యోన్మేషగాత్ర! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీవర్ధన= ఐశ్వర్యాభివృద్ధిని; ఆయుస్+అభివృద్ధి+ఆవహ+చరణ+శతపత్ర!= జీవితకాలాభివృద్ధిని కలిగించేటటువంటి పాదపద్మాలు కలవాడా!; యమనియమ+ఆది= యమ నియమాది అష్టాంగయోగంలో; ప్రావీణ్యపూర్ణ= గరిష్ఠులైన మహా యోగీంద్రులకు; మిత్ర!= చెలికాడా!; మహావిద్యా= శ్రుతిరూపమైన శ్రీవిద్యలో; ఉన్మేష= వికసించే; గాత్ర= రూపం కలవాడా!; హరిహరనాథా!= హరిహరనాథస్వామీ!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! నీ చరణ కమలసేవ తత్సేవకులకు సంపూర్ణమైన ఐశ్వర్యాన్ని, ఆయుస్సును ప్రసాదిస్తుంది. నీవు యమ నియమాద్యష్టాంగ యోగ నిష్ఠులకు సంపూర్ణ మిత్రుడివి. 'మహావిద్య' సర్వదేవతా రూపమైన నీ స్వరూపాన్ని తెలుపుతుంది. అట్లాంటి నీకు నమస్కారం.

విశేషం: వేదాంతులు ఉపనిషత్తుల నాధారంగా 'బ్రహ్మవిద్య' నుపాసించారు. తాంత్రికులు వేద ప్రామాణ్యం ఆధారంగానే 'మహావిద్య' నుపాసించారు. హరిహరనాథ విద్య 'శ్రీవిద్య' కు మరో రూపమని తిక్కనగారి 'మహావిద్య' అనే మాట నిరూపిస్తున్నది. 'కామ కళావిలాసం'లో ఈ శ్రీవిద్యా స్వరూపం వివరించబడింది. 'మహావిద్య' అనే ఒక శాస్త్ర గ్రంథం ఉన్నది. ఇది మంత్ర గ్రంథం. వనదుర్గా ప్రధానంగా అనేక దేవతా మంత్రోపాసనలు ఇందులో ప్రస్తావించబడ్డాయి. తిక్కనకు శ్రీవిద్యా సంప్రదాయంతో ఉన్న దగ్గరి సంబంధం ఈ చివరి పాదంవలన మనం ఊహించవచ్చును.

వ. దేవా! జనమేజయుండు వైశంపాయనుతోడ 'మత్పూర్వపితామహు లగు పాండవులును ధార్తరాష్ట్రులును స్వర్గం బారోహించి యెట్టెట్టి నెలవుల నిలిచి? రెట్లు వర్తించిరి? చెప్పవే!' తదాకర్ణన కౌతుకంబు మదీయ చిత్తంబున నుత్తరంగం బగుచున్నయది; నీవు సర్వవిదుండ వేను భవదీయ సదయవాక్య సంభావనకు నర్హుండ' నని ప్రార్థించినం బ్రచుర దివ్యజ్ఞాన మాననీయుండును బరమకృపా విధేయుండును నైన సాత్యవతేయుని సాదర కరుణా విశేషంబున సంపోషితం బయిన బోధంబున సాధుజన స్తవ్యం డైన యా భవ్యమునివరుం డక్కురు వంశవరున కిట్లనియె నట్లు బంధు దర్శనంబు గోరి పలికిన పాండవాగ్రజు తలంపున కనుకూలుండై యాఖండలుండు. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథ స్వామీ!; జనమేజయుండు= జనమేజయ మహారాజు; వైశంపాయనుతోడన్= వైశంపాయన మహర్షితో (ఇట్లా అన్నాడు); మత్+పూర్వ+పితామహులు+అగు= నా పూర్వ పితామహులైన; పాండవులును= పాండవులూ;ధార్త రాష్ట్రులును= దుర్యోధనాదులు; స్వర్గంబు+ఆరోహించి= స్వర్గం చేరి; ఎట్టి+ఎట్టి= ఎట్లాంటెట్లాంటి; నెలవులన్= చోట్లలో; నిలిచిరి?=

నిలిచారు?; ఎట్లు= ఎట్లా; వర్తించిరి?= ప్రవర్తించారు? (ఏం చేశారు?); చెప్పవే= చెప్పుము; తద్+ఆకర్ణన= దానిని వినాలన్న; కౌతుకంబు= కుతూహలం; మదీయ= నా; చిత్తంబునన్= మనసులో; ఉత్+తరంగంబు+అగుచున్న+అది= ఎగిరి పడుతున్న అలవలె అధికమవుతున్నది; నీవు; సర్వవిదుండవు= అన్నీ ఎరిగినవాడివి; నేను= నేనేమో; భవదీయ= నీ; సదయ= దయతో కూడిన; వాక్య= మాటలతోడి; సంభావనకున్= ఆదరానికి; అర్హుండను+అని= అర్హుడిని అని; ప్రార్థించినన్= వేడుకొనగా; ప్రచుర= విస్తారమైన; దివ్యజ్ఞాన= దివ్యజ్ఞానంచేత; మాననీయుండును= పూజించదగినవాడూ; పరమ= మిక్కిలి; కృపావిధేయుండునున్= దయకు లోబడినవాడూ; ఐన= అయినటువంటి; సాత్యవతేయుని= సత్యవతి కుమారుడైన వ్యాసుడి; సాదర= ఆదరంతోకూడిన; కరుణా విశేషంబునన్= కరుణా విశేషంతో; సంపోషితంబు+అయిన= వృద్ధిచేయబడిన; బోధంబునన్= జ్ఞానంతో; సాధుజన= సాధువులచేత; స్తవ్యుండు+ఐన= స్తుతించదగినవాడైన; ఆ భవ్య మునివరుండు= ఆ పుణ్యాత్ముడైన వైశంపాయన మహర్షి; ఆ+కురువంశవరునకున్= ఆ కురువంశ శ్రేష్ఠుడైన జనమేజయ మహారాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు; అట్లు= ఆ విధంగా; బంధు దర్శనంబున్+కోరి= బంధువులను చూడాలని; పలికిన= అడిగిన; పాండవ+అగ్రజ= ధర్మరాజు; తలంపునకున్= కోరికకు; అనుకూలుండు+ఐ= ఇష్టపడినవాడై; అఖండలుండు= ఇంద్రుడు.

తాత్పర్యం: హరిహరనాథస్వామీ! వినుము. జనమేజయుడు వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు: 'నా ముత్తాతలైన పాండవులు, దుర్యోధనాదులు స్వర్గాన్ని చేరి ఎట్లాంటి స్థానాలు పొందారు? ఏం చేశారు? చెప్పండి. దానిని వినాలనే కోరిక నా మనసులో పరవళ్ళు త్రొక్కుతున్నది. మీకు అన్నీ తెలుసు. నేను మీ దయతో కూడిన మాటలతోడి ఆదరానికి తగినవాడిని' అని ప్రార్థించాడు. అపుడు విస్తారమైన దివ్యజ్ఞానంచేత పూజించదగినవాడూ, మిక్కిలి దయకు లోనైనవాడూ అయిన వ్యాసమహర్షి కరుణా విశేషంతో వృద్ధి పొందించబడిన బ్రహ్మజ్ఞాన సంపన్నుడు, సాధుజన స్తుతిపాత్రుడూ అయిన వైశంపాయన మహర్షి ఆ కురువంశశ్రేష్ఠుడితో ఇట్లా అన్నాడు. 'ఆ విధంగా బంధుజనాలను చూడాలని అడిగిన ధర్మరాజు కోరికకు ఇష్టపడినవాడై ఇంద్రుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: వ్యాసమహర్షిచేత వైశంపాయనుడి 'బోధ' (జ్ఞానం) పోషితం (వృద్ధి) అయిందనటంలో చాలా అర్థముంది. భారతీయ సంప్రదాయంలో గురుస్థానం అంత గరిష్ఠమైనది. విద్య గురువువలన వస్తుంది. బ్రహ్మజ్ఞానం గురుకరుణచేత మాత్రమే సంప్రాప్తమవుతుంది.

సీ. **తగువాని రావించి 'ధర్మనందనునకుఁ। దమవారిఁ జూడఁ జిత్తమునఁ గోర్కి**
దనికినయది; నీ వితని నటఁ గొనిపోయి। యఖిల బంధులఁ జూపు' మనుడు నతఁడు
గారవం బెసఁగంగ నా రాజసత్తముఁ। దోడ్కొని పోవఁ గుతూహలమునఁ
దోడన నారదాదులు కొంద అరిగి ర। ట్లేఁగెడుచోటఁ గట్టెదురఁ దోఁచె

తే. **నున్నతాసనాసీనుఁ డభ్యుదిత సరసి। జాప్త సంకాశుఁ డమృతాశనాంగనాది**
వృతుఁడు వీరలక్ష్మీ విరాజితుఁడు సతత। యుక్త సుఖసాధనుండు దుర్యోధనుండు. **3**

ప్రతిపదార్థం: ఇంద్రుడు; తగువానిన్= తగినదూతను; రావించి= రప్పించి; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; తమవారిన్= తనవారిని; చూడన్= చూడాలని; చిత్తమునన్= మనసులో; కోర్కి= కోరిక; తనికిన+అది= అతిశయించింది; నీవు+ఇతనిన్= నీవు ఇతడిని; అటన్= అక్కడికి; కొనిపోయి= తీసికొనివెళ్ళి; అఖిలబంధులన్= బంధువులందరినీ; చూపుము+అనుడున్=

చూపించుము అని చెప్పగానే; అతఁడు= ఆ సేవకుడు; గారవంబు+ఎసఁగంగన్= గౌరవం అతిశయించగా; ఆ రాజ సత్తమున్= ఆ రాజశ్రేష్ఠుడిని; తోడ్కొని పోవన్= వెంటతీసికొని వెళ్ళగా; కుతూహలమునన్= ఆసక్తితో; తోడన= వెనుకనే; నారద+ఆదులు= నారదాది మహర్షులు; కొందఱు+అరిగిరి= కొంతమంది బయలుదేరారు; అట్లు+ఏఁగెడు చోటన్= అట్లా బయలుదేరుతున్నప్పుడు; కడు+ఎదురన్= ఎట్టఎదుట; ఉన్నత+ఆసన+ఆసీనుఁడు= పెద్ద సింహాసనమీద కూర్చున్నవాడు; అభి+ఉదిత= ఉదయించిన; సరసిజ+ఆప్త= కమల మిత్రుడైన సూర్యుడితో; సంకాశుఁడు= సమానమైనవాడు; అమృత+అశన+అంగనా+ఆది= అమృతం త్రాగే దేవతాంగనలు- అప్సరసలు మొదలైనవారితో; వృతుఁడు= కూడుకొన్నవాడు; వీరలక్ష్మీ విరాజితుఁడు= శౌర్యలక్ష్మితో ప్రకాశిస్తున్నవాడు; సతత= నిరంతరమూ; యుక్త= పొందిన; సుఖసాధనుండు= సుఖసాధనాలు కలిగిన; దుర్యోధనుండు= దుర్యోధనుడు; తోఁచెన్= కనిపించాడు.

తాత్పర్యం: ఇంద్రుడు తగిన దూతను రప్పించి 'ధర్మరాజుకు తనవారిని చూడాలని మనసులో కోరిక అతిశయించింది. నీవు ఇతడిని అక్కడికి తీసికొనివెళ్ళి బంధువులందరినీ చూపించుము' అని చెప్పగా ఆ దూత గౌరవం అతిశయించగా ఆ రాజశ్రేష్ఠుడిని వెంటతీసికొని వెళ్ళగా ఆసక్తితో నారదాది మహర్షులు కొందరు వెంట వచ్చారు. అట్లా బయలుదేరుతున్నప్పుడు ఎదురుగా పెద్ద సింహాసనమీద కూర్చున్నవాడూ, ఉదయించిన సూర్యబింబంవంటి కాంతితో ప్రకాశిస్తున్నవాడూ, అప్సరఃప్రభృతి దేవకాంతా పరివృతుడూ, శౌర్యలక్ష్మీ విరాజితుడూ, ఎడతెగని సుఖసాధన సామగ్రితో అతిశయిస్తున్న దుర్యోధనుడు కనిపించాడు.

విశేషం: ఇక్కడి నుండి ధర్మరాజుకు మరోసారి 'శోధన' మొదలవుతుంది. మానుషభావం ఇంకా ధర్మజుడిలో బ్రదికి ఉన్నందువలన ఈ 'ప్రక్షాళన' అవసరమైనది.

వ. ఇట్లొప్పియున్న యతనిం గని ధర్మనందనుండు దేవమునివరుల మొగంబు లాలోకించి. 4

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; ఒప్పి+ఉన్న= ప్రకాశిస్తున్న; అతనిన్= దుర్యోధనుడిని; కని= చూచి; ధర్మనందనుండు= ధర్మరాజు; దేవమునివరుల మొగంబులు= దేవర్షుల ముఖాలు; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఇట్లా ప్రకాశిస్తున్న దుర్యోధనుడిని చూచి ధర్మరాజు దేవముని శ్రేష్ఠుల ముఖాలు చూచి. (తరువాతి పద్యంతో అన్వయం)

ధర్మజుఁడు దుర్యోధనుం జూచి యసూయాపరుం డైన, నారదుఁ డతనిం దేర్చుట (సం.18-1-4)

సీ. 'ఇతఁ డతిలోభోపహతమానసుఁడు, దీర్ఘ। దర్శిగాఁ, డితని కతమునఁ జేసి
నిఖిల దేశంబుల యఖిల నృపాలురుఁ। ద్రుంగిరి దంతి తురంగ సహిత
ముగ, ననవద్యాంగి విగతకల్మష ధర్మ। చారిణి సాధ్విఁ బాంచాలి నార్య
జనములు గనుఁగొన సభలోన నవమాన। పెట్టిన తులువ; యే నిట్టివాని

ఆ. తోడఁ గలసి మెలఁగుదునె? మహితాత్మకు। లార! యెచట నున్నవారు భీమ
ఫల్గునులును గవలుఁ బాంచాలియును నన్ను। నచటి కనుపవలయు' ననుచు మరలె. 5

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మహిత+ఆత్మకులార!= ఓ పుణ్యాత్ములారా!; ఇతఁడు= ఈ దుర్యోధనుడు; అతి+లోభ+ఉపహత+మానసుఁడు= మిక్కిలి లోభగుణంచేత దూషితమైన మనసున్నవాడు; దీర్ఘదర్శి+కాఁడు= దూరాలోచన ఉన్నవాడు కాదు; ఇతని కతమునన్+చేసి= ఇతడి కారణంగా; నిఖిల దేశంబుల= అన్ని దేశాల; అఖిలనృపాలురున్= రాజులందరూ; దంతి= ఏనుగులు; తురంగ= గుర్రాలు మొదలైన సైన్యంతో; సహితముగన్= కూడి; త్రుంగిరి= చనిపోయారు; అనవద్య+అంగిన్= పవిత్రమైన దేహం కలిగిన; విగత కల్మషన్= పాపాలు పోయినదానిని; ధర్మచారిణిన్= పతివ్రతను; సాధ్విన్= ఉత్తమ స్త్రీని (శీలవతిని); పాంచాలిన్= ద్రౌపదిని; ఆర్యజనములు= ఆర్యులు; కనుఁగొనన్= చూడగా; సభలోనన్= సభలో; అవమానపెట్టిన= అవమానపరచిన; తులువ= తుంటరి; ఏను+ఇట్టివానితోడన్+ కలసి= నేను ఇట్లాంటివాడితో కలిసి; మెలఁగుదునె?= ఉంటానా?; భీమ= భీముడూ; ఫల్గునులును= అర్జునుడూ; కవలున్= నకుల సహదేవులూ; పాంచాలియును= ద్రౌపదీ; ఎచటన్+ఉన్నవారు= ఎక్కడున్నారో; నన్నున్= నన్నుకూడా; అచటికిన్+అనుపన్‌వలయున్+ అనుచున్= అక్కడికి పంపించండి అంటూ; మరలెన్= వెనుదిరిగాడు.

తాత్పర్యం: ఇట్లా అన్నాడు 'ఓ పుణ్యాత్ములారా! మిక్కిలి లోభగుణంచేత దూషితమైన మనసున్నవాడు దూరాలోచనలేనివాడు ఈ దుర్యోధనుడు. ఇతడి కారణంగానే అన్ని దేశాల రాజులందరూ ఏనుగులతో, గుర్రాలతో కూడిన సైన్యంతో కూడి నశించారు. పవిత్రదేహం కలిగి రాజసూయంచేత పాపాలన్నీ పోగొట్టుకొని పరమ పతివ్రతగా, ఉత్తమ గృహిణిగా ఉన్న శీలవతి ద్రౌపదిని పెద్దలందరూ చూస్తుండగా నిండు సభలో అవమానపరచిన తుంటరి ఇతడు. నేను ఇట్లాంటి వాడితో కలిసి స్వర్గంలో ఉండటమా? నా భీమార్జున నకుల సహదేవులూ ద్రౌపదీ ఎక్కడున్నారో అక్కడికి నన్ను తీసికొని వెళ్ళండి' అంటూ వెనుదిరిగాడు.

విశేషం: అగ్ని సంభూత కాబట్టి ద్రౌపది 'పవిత్ర' దేహ. రాజసూయయాగంలో అవభృథస్నానం చేయటంవలన అన్ని పాపాలు నశించాయి. ఐదుగురు భర్తలతో పతివ్రతాధర్మాన్ని నిర్వహించిన కారణంగా 'ధర్మచారిణి' సంస్కారపరంగా సాధ్వి; స్వర్గంలో కూడా ధర్మరాజును 'మానుష' భావం వదలలేదు. అందుకే పూర్వకథనంతా స్మరిస్తున్నాడు.

వ. మరలినఁ జూచి నారదుండు నవ్వుచు నతని కి ట్లనియె. 6

ప్రతిపదార్థం: మరలినన్= తిరిగి వెళ్ళుతుంటే; చూచి; నారదుండు= నారదుడు; నవ్వుచున్= నవ్వుతూ; అతనికిన్= అతడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: తిరిగి వెళ్ళుతుంటే చూచి నారదుడు నవ్వుతూ అతడితో ఇట్లా అన్నాడు.

సీ. 'ఓ ధర్మనందన! యీ ధరణీవిభుం। డాహవ సంపరిత్యక్త తనుఁడు
దేవతాసంభావ్యుఁడై వెలింగెడుఁ; బుణ్య। కర్ము లెల్లను గడు గారవింతు
రితని; నితండు మహీశుల నుజ్జ్వల। క్షత్రధర్మంబునఁ గాదె త్రుంచె;
నది పాప మే లగు? ననఘ! పాంచాలి యీ। తనిచేతఁ బడుటయుఁ దక్కుఁ గలుగు

తే. నెగ్గులును నింక నిచ్చట నేల తలఁప? నిచొటు పుణ్యలోకము మది నీసు రోష
మను మనోవికృతులు దగునయ్య! వాని। విడిచి సమత నొందుము లోకవినుతచరిత!' 7

ప్రతిపదార్థం: ఓ ధర్మనందన!= ఓ ధర్మరాజా!; ఈ ధరణీ విభుండు= ఈ రాజు (దుర్యోధనుడు); ఆహవ= యుద్ధంలో; సం+పరిత్యక్త= పూర్తిగా వదలివేసిన; తనుఁడు= శరీరం కలవాడు (కనుక); దేవతా సంభావ్యుఁడు+ఐ= దేవతలచేత గౌరవించబడుతూ; వెలింగెడున్= ప్రకాశిస్తున్నాడు; పుణ్యకర్ములు+ఎల్లనున్= ధర్మకర్ములందరూ; ఇతనిన్= ఇతడిని; కడున్= మిక్కిలి; గారవింతురు= గౌరవిస్తారు; ఇతండు= ఇతడు; మహీశులన్= రాజులను; ఉత్+జ్వల= మిక్కిలి ప్రకాశించే; క్షత్ర= రాజ; ధర్మంబునన్+కాదె= ధర్మంతోనే కదా!; త్రుంచెన్= చంపాడు; అది= అట్లా చంపటం; పాపము+ఏల+అగున్?= పాపం ఎందుకు అవుతుంది?; అనఘ= పుణ్యాత్మా!; పాంచాలి= ద్రౌపది; ఈతనిచేతన్= ఇతడిచేతిలో; పడుటయున్= అవమానపడటం; తక్కున్+కలుగు= మొదలైన; ఎగ్గులునున్= దోషాలను; ఇంకన్= ఇక; ఇచ్చటన్= ఇక్కడ; తలఁపన్= తలచటం; ఏల?= ఎందుకు?; ఇచొటు= ఈ చోటు; పుణ్యలోకము= పుణ్యాదులచేత పొందదగిన లోకం (ఇక్కడ); మదిన్= మనసులో; ఈసున్= ఈర్ష్య; రోషము= కోపం; అను= అనేటటువంటి; మనో వికృతులు= మనోవికారాలు; తగునయ్య!= యుక్తమా!; వానిన్= ఆ వికారాలను; విడిచి= వదలి; లోక వినుత!= లోకంచేత స్తుతించబడిన ఓ ధర్మరాజా!; సమతన్= సమత్వాన్ని; ఒందుము= పొందుము.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఈ రాజు యుద్ధంలో వదలివేసిన శరీరం కలవాడు. కనుక దేవతలచేత గౌరవించబడుతూ ప్రకాశిస్తున్నాడు. ధర్మ కర్ములందరూ ఇతడిని చాలా గౌరవిస్తారు. ఇతడు రాజులను తన క్షాత్రధర్మంతోనే కదా యుద్ధంలో చంపాడు. అట్లా చంపటం పాపం ఎట్లా అవుతుంది? పుణ్యాత్మా! ఇతడిచేత ద్రౌపది అవమానపడటం మొదలైన పాపాలను ఇంకా తలచుకొనటం ఎందుకు? ఇది పుణ్యలోకం. ఇక్కడ నీ మనసులో ఈర్ష్య, కోపం మొదలైన మనోవికారాలు ఉండవచ్చా? ఆ వికారాలను వదలి నీవు సమత్వాన్ని పొందుము.

విశేషం: ద్వా విమౌ పురుషౌ లోకే సూర్యమండలభేదినౌ,

పరివ్రాడ్యోగయుక్తశ్చ రణే చాభిముఖే హతః.

అని ప్రమాణం. సూర్యమండలాన్ని భేదించుకొని ఊర్ధ్వలోకాలకు ప్రవేశించే అర్హత ఇద్దరికున్నది. ఒకరు యోగమార్గంలో దేహాన్ని వదిలే సన్యాసి. మరొకరు యుద్ధంలో శత్రువులకు వీపు చూపకుండా పోరాడి మరణించినవాడు. దుర్యోధనుడు 'సం' పరిత్యక్త తనుడు - అంటే అర్థం ఇదే. చివరికి తాను ఒకడే మిగిలినా ఓడిపోయి దాసోహమనలేదు. ఒంటరిగాపోరి దేహాన్ని గదాఘాతానికి గురై వదిలివేసినవాడు. అందుచేత అతడు స్వర్గభోగార్హు డయ్యాడు.

'సమత్వం యోగ ఉచ్యతే' అని గీతాకారుడి నిర్వచనం. నారద మహర్షి ఇక్కడ సిద్ధి - అసిద్ధి, గౌరవం - అవమానం; సుఖం - దుఃఖం ఇత్యాది ద్వంద్వభావాలను అతిక్రమించటమే యోగమని ప్రబోధిస్తున్నాడు.

'వినుత చరిత్రుఁడు' - ధర్మరాజు, అందుకే స్వర్గలోకానికి నిజదేహంతో రాగలిగాడు. కాని ఆ మానుష తనువునకు అంటుకొన్న భావాలే ఈర్ష్యాదులు. వాటిని తొలగించుకొమ్మని నారదుడి హితవు.

వ. అని వెండియు. 8

తాత్పర్యం: అని ఇంకా మరి (ఇట్లా అన్నాడు.) (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'జూదమునఁ గయ్యమున నీ। కే దురితంబులు నితాంత హృదయ క్లేశా

పాదకములు వాటిల్లె న। నాదృతములు సేయు వాని నన్నిటి ననఘా!' 9

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్మా!; జూదమునన్= జూదంలో; కయ్యమునన్= యుద్ధంలో; నీకున్+ఏదురితంబులు= నీకు ఏ పాపకృత్యాలు; నితాంత= అత్యంత; హృదయ క్లేశ+ఆపాదకములు= హృదయానికి దుఃఖాన్ని కలిగించేవి; పాటిల్లెన్= సంభవించాయో; వానిన్= వాటిని; అన్నిటిన్= అన్నిటినీ; అనాదృతములు+చేయుము= లెక్కచేయకుము (నిరాదరణ చేయుము).

తాత్పర్యం: పుణ్యాత్ముడవైన ధర్మరాజా! జూదంలో, యుద్ధంలో నీకు ఏ పాపకృత్యాలు హృదయానికి అత్యంత క్లేశాన్ని కలిగించాయో వాటిని ఇప్పుడు మరలా పరిగణించవద్దు; అన్నింటిని మరచిపొమ్ము.'

చ. **అన విని యమ్మునీంద్రునకు నవ్విభుఁ డిట్లనుఁ 'బాపశాలి స**
జ్జన సతతాపకారి కులసంక్షయ కారణరోషభాగి యి
మ్మనుజవరాధముం డితఁ డమర్త్యుల కెల్లను మాననీయుఁ డై
మనునటె పుణ్యలోకమున? మాటలు వేయును నేల సంయమీ! **10**

ప్రతిపదార్థం: అనన్+విని= అని నారదుడు చెప్పగా విని; ఆ+ముని+ఇంద్రునకున్= ఆ మునిశ్రేష్ఠుడితో; ఆ+విభుఁడు= ఆ ధర్మరాజు; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; సంయమీ!= ఋషీ!; పాపశాలి= పాపాత్ముడు (పరమపాపి); సత్+జన= మంచివారికి; సతత= నిరంతరం; అపకారి= అపకారంచేసినవాడు; కులసంక్షయ= వంశం నశించటానికి; కారణ= కారణమైన; రోషభాగి= కోపశీలి (ముక్కోపి); ఈ+మనుజవర+అధముండు= ఈ రాజాధముడు; ఇతఁడు= ఇట్లాంటి దుర్యోధనుడు; అమర్త్యులకున్+ఎల్లను= దేవతలందరికీ; మాననీయుఁడు+ఐ= గౌరవాస్పదుడై; పుణ్యలోకమునన్= ఈ స్వర్గంలో; మనునటె?= ఉండటమా?; మాటలు వేయునున్+ఏల?= ఎక్కువగా చెప్పట మెందుకు?

తాత్పర్యం: అని నారదుడు చెప్పగా విని అతడితో ధర్మరాజు ఇట్లా అన్నాడు. 'ఓ మునీ! పరమపాపి, మంచివారికి నిరంతరం అపకారం చేసినవాడు, వంశం నాశనం కావటానికి కారణమైన కోపశీలి ఈ రాజాధముడు. ఇట్లాంటి దుర్యోధనుడు దేవతలకు పూజనీయుడై స్వర్గంలో ఉండటమా! ఎక్కువగా చెప్పట మెందుకు?

తే. **అతని నట్లుండనిమ్ము; నా యనుజతనుజ। మిత్ర జనములఁ బాంచాలపుత్త్రి నా క**
వశ్యమును నభివీక్షింప వలయుఁ జూపఁ। బనుపు వారల యున్నెడ భవ్యచరిత!' **11**

ప్రతిపదార్థం: భవ్యచరిత!= పుణ్యచరిత్రగల నారదమహర్షీ!; అతనిన్+అట్లు+ఉండన్+ఇమ్ము= అతనిని అట్లా ఉండనిమ్ము; నా+అనుజ= నా తమ్ములను; తనుజ= కుమారులను; మిత్రజనములన్= మిత్రులను; పాంచాల పుత్త్రిన్= ద్రౌపదిని; నాకున్= నేను; అవశ్యమును= తప్పకుండా; అభివీక్షింపవలయున్= కనులారా చూడాలి; చూపన్= నాకు చూపటానికి; వారల+ఉన్నఎడ= వారున్నచోటికి; పనుపు= నన్ను పంపించుము.

తాత్పర్యం: పుణ్యచరిత్రగల నారదమహర్షీ! అతడు అట్లా సుఖిస్తూ ఉండనీ నా కేమి? నా తమ్ములను, కుమారులను, మిత్రులను, ద్రౌపదిని నేను తప్పకుండా కనులారా చూడాలి. అందుచేత నన్ను వా రున్నచోటికి పంపించుము.'

వ. **అని మఱియుం గలుగు మునీంద్రులఁ గలయం గనుంగొని.** **12**

ప్రతిపదార్థం: అని= అని చెప్పి!; మఱియున్+కలుగు= ఇంకా అక్కడున్న; ముని+ఇంద్రులన్= మునిశ్రేష్ఠులను; కలయన్= అందరినీ బాగా; కనుంగొని= చూచి.

తాత్పర్యం: అని చెప్పి ఇంకా అక్కడున్న మునిశ్రేష్ఠులందరినీ బాగా చూచి. (తరువాతి పద్యంతో అన్వయం)

ధర్మజుఁడు దేవమునులను గర్ణాది స్వజనులఁ జూప వేఁడుకొనుట (సం.18-3-6)

సీ. **'సంగ్రామ మృతులైన సకలబంధులకుఁ ది। లోదకం బే నిచ్చుచుండ వచ్చి**
కుంతి కర్ణుఁడు తన కొడు కని చెప్పి నా। కతని జన్మము తెఱం గంతవట్టు
విదితంబుగాఁ జేసె నది మొదలుగ నమ్మ। హావీరుఁ దలఁచిన యప్పు డెల్ల
నుల్లంబు సంతాప మొందుఁ దదీయపా। దంబు లద్దేవి పాదంబులట్ల

ఆ **యని సభక్తికముగ నర్చితంబులు సేయఁ। గానకునికి నేను గరము వగతు;**
నతఁడు నేము నైన నమరేంద్రుఁడును మమ్ముఁ। జెనయునే త్రిలోకసేవ్యులార! 13

ప్రతిపదార్థం: త్రిలోక సేవ్యులార!= త్రిలోకాలలోనూ సేవించదగినవారైన ఋషులారా!; సంగ్రామ మృతులు+ఐన= యుద్ధంలో చనిపోయిన; సకలబంధులకున్= బంధువులందరికీ; ఏను= నేను; తిల+ఉదకంబు+ఇచ్చుచుండన్= తిలోదకమిస్తుండగా; వచ్చి= అక్కడికి వచ్చి; కుంతి= మా తల్లి కుంతీదేవి; కర్ణుఁడు; తన కొడుకు+అని+చెప్పి= తన కుమారుడని చెప్పి; నాకున్= నాకు; అతని= ఆ కర్ణుడి; జన్మము తెఱంగు= పుట్టుకతీరు; అంత+పట్టు= అంతా; విదితంబుగాన్+చేసెన్= తెలిపింది; అది మొదలుగన్= అప్పటినుండి; ఆ+మహావీరున్= ఆ మహావీరుడిని; తలఁచిన+అప్పుడు+ఎల్లన్= తలచుకొన్నపుడంతా; ఉల్లంబు= హృదయం; సంతాపము+ ఒందున్= సంతాపాన్ని పొందుతున్నది; తదీయపాదంబులు= అతడి పాదాలను; ఆ+దేవి పాదంబులట్లు+అని= మా అమ్మ పాదాలవలె; సభక్తికముగన్= భక్తితో; అర్చితంబులు+చేయన్= పూజించటానికి; కానక+ఉనికి= వీలుకాక; నేను; కరము= మిక్కిలి; వగతున్= బాధపడుతుంటాను; అతఁడున్+ఏమున్+ఐనన్= అతడు మేము కలిస్తే; అమర+ఇంద్రుండును= ఇంద్రుడుకూడా; మమ్మున్= మమ్ములను; చెనయునే?= ఎదిరించగలడా?

తాత్పర్యం: 'త్రిలోకాలలోనూ సేవించతగిన ఋషివర్యులారా! ఒక విషయం వినండి. యుద్ధంలో చనిపోయిన బంధువులందరికీ నేను తిలతర్పణం చేస్తున్న సమయంలో మా అమ్మ కుంతీదేవి అక్కడికి వచ్చి కర్ణుడు తన కొడుకని తెలిపి, నాకు అతడి జన్మ రహస్యమంతా చెప్పింది. అప్పటినుండి ఆ మహావీరుడిని తలచుకొన్నప్పుడెల్లా నా హృదయం సంతాపాన్ని పొందుతున్నది. అతడి పాదాలను మా అమ్మపాదాలవలె భక్తితో పూజించటానికి వీలుకాక నేను చాలా బాధపడుతుంటాను. అతడూ మేమూ కలిస్తే మహేంద్రుడైనా మమ్ములను ఎదిరించగలడా?

విశేషం: ధర్మరాజు మొదట కోరుకొన్నది తమ్ముళ్ళను చూడాలని, తరువాత భార్యను, తరువాత మిత్రులను, ఆ తరువాత పుత్రులను, ఇప్పుడు కర్ణుడిని చూడాలంటున్నాడు. పైగా అతడు తమతో ఉండిఉంటే కౌరవు లేమిటి? ఇంద్రుడు కూడా ఎదిరించజాలి ఉండేవాడు కాడని చెప్పుతున్నాడు. శత్రుజయం మీద ఎంత తీవ్రకాంక్ష ధర్మరాజులో ఉండేదో దీనినిబట్టి అర్థం చేసికొనవచ్చును. అందుకే ధర్మరాజును 'శాత్రవజైత్రతేజంతో' పుట్టాడని నన్నయగారు వర్ణించారు.

చ. **అతని నెఱుంగకుండి వినుఁ డర్జునుఁ బంచితి నమ్మహాత్మునిన్**
మృతుఁడుగఁ జేయఁగా; నది శమింపదు శోకము నావహించుచున్;

మతికి నలంత సేయు గుణమాన్యుని నాతనిఁ జూచు కౌతుకం
బతిశయ మొందుచున్న యది; యాయన యెచ్చట నుండుఁ? జెప్పరే! 14

ప్రతిపదార్థం: వినుఁడు= వినండి; అతనిన్+ఎఱుంగక+ఉండి= అతడు మా అన్న అని తెలియక; ఆ+మహాత్మునిన్= ఆ మహనీయుడిని; మృతుఁడుగన్+చేయఁగాన్= చంపటానికి; అర్జునున్+పంపితిన్= అర్జునుడిని పంపాను; అది= ఆ పాపం; శోకమున్+ఆవహించుచున్= దుఃఖాన్ని కలుగజేస్తూ; శమింపదు= ఉపశమనం పొందటం లేదు; మతికిన్= మనసుకు; అలఁతన్= వ్యథను; చేయున్= కలగజేస్తున్నది; ఆతనిన్+చూచు= అతడిని చూడాలన్న; కౌతుకంబు= కుతూహలం; అతిశయము+ ఒందుచున్న+అది= అతిశయమవుతున్నది; ఆయన= ఆ మహనీయుడు; ఎచ్చటన్+ఉండున్= ఎక్కడుంటాడో; చెప్పరే!= చెప్పండి!

తాత్పర్యం: ఋషులారా! ఇంకా ఒక విషయం వినండి. అతడు మా అన్న అని తెలియక ఆ మహనీయుడిని చంపటానికి అర్జునుడిని పంపాను. ఆ పాపం నిరంతర దుఃఖాన్ని కలగజేస్తూ ఉపశమించకుండా ఉన్నది. మనసుకు వ్యథను కలగజేస్తున్నది. అతడిని చూడాలన్న కోరిక రానురాను అతిశయిస్తున్నది. ఆ మహానుభావుడు ఎక్కడుంటాడో చెప్పండి!

వ. ద్రుపద విరాట యుధామన్యులు, శంఖ ప్రభృతి తదీయజ్ఞాతులును రణాగ్నికిం బ్రాణహవిస్సులు వేల్చినవారు; వారల నాకుం జూడవలదే ప్రాణసముండగు జగత్ప్రాణ నందనుని సంక్రందన తేజోవిరాజితుండగు శ్వేతాశ్వుని. నశ్వుల ననుకరించు నకుల సహదేవులను, సహజ సద్గుణ శాలిని యగు పాంచాలినిం జూడక నిలువం జాలుదునె? వారి కెవ్వరికిని నాకలోక నివాసంబు లేక తక్కెనేని సోదర రహిత స్వర్గంబునందు స్వర్గత్వబుద్ధి పుట్టదయ్యెడు; వార లెచ్చోటనుండి రచ్చోట యేను పుణ్యలోకంబుగాఁ దలంచెద; నయ్యెడ కనిచి పుచ్చుం డనిమిషవర్యులారా!' యని పలికిన నప్పాండవాగ్రజుతో నద్దేవమును లిట్లనిరి. 15

ప్రతిపదార్థం: ద్రుపద విరాట యుధామన్యులు= ద్రుపదుడు, విరటుడు, యుధామన్యుడు; శంఖప్రభృతి= శంఖుడు మొదలైన; తదీయ=వారి; జ్ఞాతులును= దాయాదులు; రణ+అగ్నికిన్= యుద్ధమనే అగ్నిలో; ప్రాణహవిస్సులు= ప్రాణాలనే హవిస్సులను; వేల్చినవారు= హోమం చేసినవారు; వారలన్= వారిని; నాకున్+చూడన్‌వలదే?= నేను చూడవద్దా!; ప్రాణసముండు+అగు= నా ప్రాణంతో సమానమైన; జగత్+ప్రాణ+నందనునిన్= జగత్తుకు ప్రాణమిచ్చే వాయు కుమారుడైన భీముడిని; సంక్రందన= ఇంద్ర; తేజో విరాజితుండు+అగు= తేజస్సుతో ప్రకాశించే (ఇంద్ర తనయుడైన); శ్వేతాశ్వునిన్= తెల్లని గుర్రాలుగల అర్జునుడిని; అశ్వులన్= అశ్వినీ దేవతలను; అనుకరించు= పోలిన (అశ్వినీ దేవతల కుమారులైన); నకుల సహదేవులను; సహజ సద్గుణశాలిని+అగు= పుట్టుకతోనే సద్గుణ శీలి అయిన; పాంచాలినిన్= ద్రౌపదిని; చూడక= చూడకుండా; నిలువన్+చాలుదునె?= నిలువగలనా?; వారికిన్+ఎవ్వరికిని= వారికెవ్వరికీ; నాకలోక= స్వర్గలోక; నివాసంబు= నివాసం; లేక తక్కెనేని= లేకుండా పోయినట్లయితే; సోదర రహిత స్వర్గంబునందున్= తమ్ములు లేని స్వర్గలోకంలో; స్వర్గత్వ బుద్ధి= ఇది స్వర్గమనే బుద్ధి; పుట్టదు+అయ్యెడున్= పుట్టదు; వారలు= వారు; ఎచ్చోటన్+ఉండిరి= ఎక్కడుంటారో; అచ్చోట= ఆ చోటునే; ఏను= నేను; పుణ్యలోకంబు= స్వర్గం; కాన్= వలె; తలంచెదన్= భావిస్తాను; అయ్యెడకున్= ఆ చోటికి; అనిమిషవర్యులారా!= దేవతా శ్రేష్ఠులారా!; అనిచి పుచ్చుండు= పంపించండి; అని పలికినన్= అని అడుగగా; ఆ+దేవమునులు= ఆ దేవఋషులు; ఆ+పాండవ+ అగ్రజుతోన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనిరి= ఇట్లా చెప్పారు.

తాత్పర్యం: 'ద్రుపదుడు, విరాటుడు, ద్రుపదుడి కుమారుడైన యుధామన్యుడు, శంఖుడు మొదలైన వారి దాయాదులు యుద్ధమనే అగ్నిలో తమ ప్రాణాలనే హవిస్సులను ధారపోశారు. వారిని నేను చూడవద్దా! నా ప్రాణంతో సమానుడైన

వాయునందనుడిని, ఇంద్రతేజంతో ప్రకాశించే అర్జునుడిని, అశ్వినీదేవతలను పోలిన నకుల సహదేవులను, సహజ సద్గుణశీలి పాంచాలిని చూడకుండా నిలువగలనా? వారి కెవ్వరికీ స్వర్గలోక నివాసం లేకపోయినట్లయితే తమ్ములు లేని స్వర్గంలో ఇది స్వర్గమనే బుద్ధి పుట్టనే పుట్టదు. వారు ఎక్కడుంటారో ఆ చోటే నాకు స్వర్గం. దేవతాశ్రేష్ఠులారా! నన్ను అక్కడికి పంపించండి' అని ప్రార్థించగా దేవమునులు ధర్మరాజుతో ఇట్లా చెప్పారు. (రణాగ్నికిం బ్రాణహవిస్సులు వేల్చినవారు-రూపకం)

ఆ. 'అట్ల చేయువార మమలాత్మ! నీదు చి। త్తమున నేది దోఁచె దాని నాచ
రింప వలయు నని నిలింపేశ్వరుండు పా। టించి మాకు నప్పగించినాఁడు. 16

ప్రతిపదార్థం: అమల+ఆత్మ!= నిర్మలమైన ఆత్మగల ఓ ధర్మరాజా!; అట్ల= అట్లాగే; చేయువారము= చేస్తాము; నీదు= నీ; చిత్తమునన్= మనసులో; ఏది+తోఁచెన్= ఏది తోస్తుందో; దానిన్+ఆచరింపవలయున్+అని= దానిని చేయాలని; నిలింప+ఈశ్వరుండు= దేవతల ప్రభువు (ఇంద్రుడు); పాటించి= పూని; మాకున్= మాకు; అప్పగించినాఁడు= ఆ పని చేసిపెట్టుమని అప్పగించాడు.

తాత్పర్యం: 'ధర్మరాజా! అట్లాగే చేస్తాము. నీ మనసులో ఏ కోరిక పుట్టుతుందో దాని ప్రకారం చేయాలని పూని ఇంద్రుడు ఆ పని చేసి పెట్టండని నిన్ను మాకు అప్పగించాడు.'

విశేషం: అది స్వర్గలోకం. అక్కడ అన్నీ చిత్రంగానే ఉంటాయి. అన్ని లోకాలనూ అక్కడే ప్రత్యక్షంచేయగల దేవమాయ అక్కడ ఉన్నది. అందుకే ధర్మరాజు సంకల్పంలో నిగూఢంగా ఉన్న ఆలోచనలు అక్కడ రూపాన్ని పొందుతున్నాయి. ఋషులమాటలకు అర్థం ఇదే.

సీ. అని దేవదూతునిఁ గనుఁగొని 'యిమ్మహి। తాత్ముని భీమసేనార్జునాదు
లున్నచోటికి నన్ను 'మన్న నప్పురుషుఁ డా। దర మెసఁగంగ నా ధర్మతనయు
నిందు ర మ్మనుచుఁ దా ముందటఁ జన నమ్మ। హానుభావుఁడు వాని ననుగమించె;
నట్లు సనంగఁ గేశాస్థిసాంద్రంబు దు। ర్గం ధంబుఁ బరుషతరంబు దంశ
ఆ. మశక నిబిడమును దమఃకలితముఁ గ్రిమి। కీట రక్తమాంస కూట కుణప
ఘోరవిధము శాత దారుణ చంచు వా। యసరవాన్వితంబు నయ్యెఁ బథము. 17

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; దేవదూతునిన్= దేవదూతను; కనుఁగొని= చూచి; ఈ+మహిత+ఆత్మునిన్= ఈ మహనీయుడిని; భీమసేన+అర్జున+ఆదులు= భీముడు, అర్జునుడు మొదలైనవారు; ఉన్నచోటికిన్= ఉన్నచోటికి; అన్నుము+అన్నన్= తోడుగా తీసి కొని వెళ్ళుము అని అనగా; ఆ+పురుషుఁడు= ఆ దూత; ఆదరము+ఎసఁగంగన్= ఆదరం అతిశయించగా; ఆ ధర్మతనయున్= ఆ ధర్మరాజును; ఇందున్+రమ్ము+అనుచున్= ఇట్లా రండి అంటూ; తాన్+ముందటన్+చనన్= తాను ముందట వెళ్ళగా; ఆ+ మహానుభావుఁడు= ఆ ధర్మరాజు; వానిన్= ఆ దూతను; అనుగమించెన్= అనుసరించి వెళ్ళాడు; అట్లు+చనఁగన్= అట్లావెళ్ళగా; పథము= ఆ దారి; కేశ+అస్థిసాంద్రంబు= వెంట్రుకలు; ఎముకలచేత దట్టమైనది; పరుషతరంబు= అతికఠినంగా ఉన్నదీ; దంశ= దోమలతో; మశక= ఈగలతో; నిబిడమును= నిండినదీ; తమస్+కలితము= చీకటితో నిండినదీ; క్రిమి= క్రిములతోను; కీట= పురుగులతోనూ; రక్త= రక్తంతోను; మాంస= మాంసంతోను (నిండిన); కూట= గుట్టలు కలిగింది; కుణప= శవాలతో; ఘోర

విధము= భయంకరంగా; శాత= వాడిగా ఉన్న; దారుణ= భీషణమైన; చంచు= ముకుపుటాలు కలిగిన; వాయస= కాకుల; రవ+అన్వితంబున్= అరపులతో కూడినదీ; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: అని చెప్పి దేవదూతను చూచి 'ఈ మహనీయుడిని భీమార్జునాదులు ఉన్నచోటికి తోడుగా తీసికొనివెళ్ళుము' అని చెప్పగా ఆ దూత ఆదరం అతిశయించగా ఆ ధర్మరాజును 'ఇట్లా రండి!' అంటూ తాను ముందట దారి తీస్తూ వెళ్ళగా ధర్మరాజు ఆ దూతను అనుసరించి వెళ్ళాడు. అట్లా వెళ్ళుతుండగా ఆ దారి వెంద్రుకలచేత, ఎముకలచేత దట్టంగా ఉన్నది. అతిహేయంగా దోమలతో, ఈగలతో నిండింది. చీకటిగా ఉన్నది. క్రిములతో, పురుగులతో రక్తమాంసాల గుట్టలతో, శవాల దుర్గంధంతో, భయంకరంగా వాడిగా ఉన్న భీషణమైన ముకుపుటాలు కలిగిన కాకుల అరపులతో కూడిందిగా అయింది.

వ. అప్పథంబునఁ బాండవాగ్రజుండు చనిచని యారంగ్రాఁగిన నూనియ వోలెం దెరలుచున్న జలంబులు గలిగి యాయస కంటక దుస్స్పర్శంబగుచుఁ దటంబున నిశితాసి పత్త్రవనంబు శోభిల్ల వైతరణియను పేరఁ బరఁగిన యేఱును దత్ప్రదేశంబున ననేక ప్రకార యాతన లనుభవించు పాప కర్ములనుం జూచి దేవదూతునితో 'మనకుఁ బోవలయు చోటింక నెంత దవ్వుగల? దియ్యెడయును దేవతాధీనంబై యుండునే?' యని యడిగిన నప్పురుషుం డతనితోడ. 18

ప్రతిపదార్థం: ఆ+పథంబునన్= ఆ దారిలో; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; చని చని= పోయి పోయి; ఆరన్+క్రాఁగిన= సలసల కాగిన; నూనియ పోలెన్= నూనెవలె; తెరలుచున్న= తెర్లుతున్న; జలంబులు కలిగి= నీళ్ళుకలిగి; ఆయస= ఇనుముతో చేసినట్లున్న; కంటక= ముండ్లతో; దుస్‌స్పర్శంబు+అగుచున్= తాకటానికి వీలుకాకుండా ఉన్న; తటంబునన్= ఒడ్డులో; నిశిత+అసి= వాడిగా ఉన్న కత్తులవలె ఉన్న; పత్త్ర= ఆకులతో నిండిన; వనంబు= అడవి; శోభిల్లన్= ఒప్పగా; వైతరణి+అను పేరన్= వైతరణి అనే పేరుతో; పరఁగిన= ప్రసిద్ధమైన; ఏఱును= నది; తద్+ప్రదేశంబునన్= ఆ చోట; అనేక ప్రకార= నానా విధాలైన; యాతనలు= బాధలు; అనుభవించు= అనుభవిస్తున్న; పాపకర్ములనున్+చూచి= పాపకర్మలు చేసినవారిని చూచి; దేవదూతునితోన్= దేవదూతతో (ధర్మరాజు ఇట్లా అన్నాడు); మనకున్= మనం; పోవలయుచోటు= వెళ్ళవలసిన చోటు; ఇంకన్+ఎంత దవ్వుకలదు?= ఇక ఎంత దూర మున్నది?; ఈ+ఎడయును= ఈ చోటుకూడా; దేవతా+అధీనంబు+ఐ= దేవతల అధీనంలోనే; ఉండునే!= ఉంటుందా!; అని అడిగినన్= అని అడుగగా; ఆ+పురుషుండు= ఆ దూత; అతనితోడన్= ఆ ధర్మరాజుతో (ఇట్లా చెప్పాడు).

తాత్పర్యం: ధర్మరాజు ఆ దారిలో వెళ్ళి వెళ్ళి బాగా మరగ గాచిన నూనెవలె తెర్లుతున్న నీళ్ళు కలిగి ఇనుపముక్కలవంటి ముండ్లతో తాకటానికి దారుణంగా ఉన్న ఒడ్డుతో వాడి కత్తులవలె ఉన్న ఆకులతో కూడిన అడవి ఒప్పగా, వైతరణి అనే పేరున్న నదిని సమీపించారు. అక్కడ నానావిధాలైన శిక్షలను అనుభవిస్తున్న పాపకర్ములను చూచి దేవదూతతో 'మనం వెళ్ళవలసిన చోటు ఇక ఎంత దూరం ఉన్నది? ఈ చోటుకూడా దేవతల అధీనంలోనే ఉన్నదా?' అని అడిగాడు. అందుకు దేవదూత ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

విశేషం: నరకం అధోలోకమని అక్కడే యమయాతనలు పడే పాపిష్ఠులు ఉంటారని ధర్మరాజు కూడా భావిస్తున్నాడు. అందుకే ఈ చోటు స్వర్గవాసులైన దేవతల అధీనంలో ఎట్లా ఉంటుందని ప్రశ్న పుట్టింది ధర్మరాజుకు. అక్కడ తన వారు ఎందుకుంటారని ధర్మరాజు ధీమా. అందుకే దూతను అట్లా అడగటం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. 'ఈ నెలవును బృందారకాధీన; మిదియ। మనకు రావలసిన చో' టనిన నతం డ

సహ్య దుర్గంధ ఘోర దర్శనత నచోటు। చిత్త మతిదుఃఖితంబుగఁ జేయుటయును. 19

ప్రతిపదార్థం: ఈ నెలవును= ఈ చోటుకూడా; బృందారక+అధీనము= దేవతల అధీనంలోనే ఉన్నది; ఇదియ= ఇదే; మనకున్= మనం; రావలసినచోటు; అనినన్= అనగా; అతండు= ధర్మరాజు; అసహ్య= సహించటానికి వీలులేని; దుర్గంధ= దుర్గంధంతో కూడిన; ఘోర దర్శనతన్= ఆ ఘోర దృశ్యాన్ని చూడటంవలన; అచోటు= ఆ చోటు; చిత్తము= చిత్తాన్ని; అతిదుఃఖితంబుగన్= చాలా బాధపడినదిగా; చేయుటయును= చేయగా.

తాత్పర్యం: 'ఈ చోటుకూడా దేవతల అధీనంలోనే ఉన్నది. మనం రావలసిన చోటు ఇదే' అని ఆ దేవదూత చెప్పాడు. భరించటానికి వీలులేకుండా దుర్గంధం నిండిపోయిన ఆ ఘోరదృశ్యాన్ని చూడటంవలన ధర్మరాజు మనసు వ్యథతో బాధపడింది. అప్పుడు.

వ. మరలి పోవం జూచిన నయ్యెడఁ గొన్ని యెలుంగులు. 20

ప్రతిపదార్థం: మరలిపోవన్= తిరిగిపోవటానికి; చూచినన్= ప్రయత్నించగా; అయ్యెడన్= ఆ ప్రదేశంలో; కొన్ని+ఎలుంగులు= కొన్ని కంఠస్వరాలు (వినిపించాయి).

తాత్పర్యం: ధర్మరాజు ఆ ఘోరాన్ని చూడలేక మరలిపోదామనుకొన్నాడు. అంతలో అచ్చట కొన్ని కంఠస్వరాలు (వినిపించాయి).

తే. 'భవ్యజనన! నీ గాత్రము దివ్యసౌర। భంబు బెరసిన గాడ్పు మాపైఁ గరంబు

హృద్య మై వీచుటయు దుఃఖ మెల్లఁ బాసె। భూరి సౌఖ్యంబు నొందుచున్నార మేము. 21

ప్రతిపదార్థం: భవ్యజనన!= పవిత్రజన్మ కలవాడా!; నీ గాత్రము= నీ దేహంయొక్క; దివ్యసౌరభంబు= దివ్యమైన పరిమళం; బెరసిన= కలిసిన; గాడ్పు= గాలి; మాపైన్= మా మీద; కరంబు= మిక్కిలి; హృద్యము+ఐ= సంతోషకరమై; వీచుటయున్= వీచగా; దుఃఖము+ఎల్లన్+ పాసెన్= మా దుఃఖమంతా పోయింది; భూరి= మిక్కిలి; సౌఖ్యంబున్= సుఖాన్ని; మేము; ఒందుచున్నారము= పొందుతున్నాం.

తాత్పర్యం: 'ఓ పుణ్య చరిత్రుడా! నీ దేహానికున్న దివ్య పరిమళంతో కూడిన గాలి మా మీద సంతోషకరమై వీచగా మా దుఃఖాలన్నీ పటాపంచలయ్యాయి. మేము చాలా సుఖాన్ని పొందుతున్నాం.

విశేషం: ధర్మజుడు పుణ్యాత్ముడు - ఆ పుణ్యమే సుగంధం. పాపమే దుర్గంధం.

క. నినుఁ జూడఁ గనుటఁ బటుయా। తనలం దొరఁగితిమి పరమధర్మాత్మక! నీ

వనయము దయ నిచ్చట నిలి। చిన బ్రదుకుదు; మింకఁ గొంత సేపు నిలువవే!' 22

ప్రతిపదార్థం: పరమ ధర్మాత్మక!= ఉత్తమ ధర్మస్వరూపుడా!; నినున్= నిన్ను; చూడన్+కనుటన్= చూడగలగటంవలన; పటుయాతనలన్= భయంకరమైన బాధలను; తొరఁగితిమి= పోగొట్టుకొన్నాం; నీవు+అనయమున్= నీవు ఎల్లప్పుడూ; దయన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

దయతో; ఇచ్చటన్= ఇక్కడ; నిలిచినన్= నిలిస్తే; బ్రదుకుదుము= బ్రతుకుతాం; ఇంకన్= ఇంకా; కొంతసేపు; నిలువవే!= నిలువకూడదూ! (దయతో నిలువుము!)

తాత్పర్యం: ఉత్తమ ధర్మస్వరూపుడా! నిన్ను చూడగలగటంవలన భయంకరమైన బాధలను మేము దూరంచేసికొన్నాం. నీవు ఎప్పుడూ ఇక్కడే ఉంటే మేము బ్రతుకుతాం. ఇంకా కొంచెంసేపు నీవు ఇక్కడే దయచేసి ఉండుము.'

ధర్మరాజు నరకమున నున్న యన్నదమ్ముల నెఱిఁగి పరితపించుట (సం.18-2-36)

వ. **అని దుఃఖ భార కృపణంబు లగుచు వీతెంచినఁ గౌంతేయాగ్రజుం 'డోహో! యెంతబెట్టిదంబులైన యిడుమలం బడియెదరో వీర' లని కారుణ్యం బొలయ నిలిచి, వెండియు నత్తెఱంగు మాటలు విని 'మీ రెవ్వ?' రని యడిగినఁ 'గర్ణుండ భీమసేనుండ నర్జునుండ నకులుండ సహదేవుండ ద్రౌపదిని ధృష్టద్యుమ్నుండ ద్రౌపదేయుల' మను పలుకు లెసంగుటయు.** **23**

ప్రతిపదార్థం: అని; దుఃఖ= దుఃఖంయొక్క; భార= భారంచేత; కృపణంబులు+అగుచున్= అతిదీనంగా; వీతెంచినన్= వినరాగా; కౌంతేయ+అగ్రజుండు= ధర్మరాజు; ఓహో!= అయ్యో!; ఎంత బెట్టిదంబులు+ఐన= ఎంత క్రూరమైన; ఇడుమలన్= కష్టాలను; వీరలు= వీరు; పడియెదరో= పడుతున్నారో; అని; కారుణ్యంబు+ఒలయన్+నిలిచి= కారుణ్యం పుట్టగా; అక్కడే నిలబడి; వెండియున్=మరలా; ఆ+తెఱంగు మాటలు విని= అదే విధమైన పలుకులు విని; మీరు+ఎవ్వరు+అని= మీ రెవ రని; అడిగినన్= అడుగగా; కర్ణుండన్= నేను కర్ణుడిని; భీమసేనుండన్= నేను భీమసేనుడిని; అర్జునుండన్= నేను అర్జునుడిని; నకులుండన్= నేను నకులుడిని; సహదేవుండన్= నేను సహదేవుడిని; ద్రౌపదిన్= నేను ద్రౌపదిని; ధృష్టద్యుమ్నుండన్= నేను ధృష్టద్యుమ్నుడిని; ద్రౌపదేయులము= మేము ద్రౌపది పుత్రులం; అను= అన్న; పలుకులు= మాటలు; ఎసంగుటయున్= పుట్టగా.

తాత్పర్యం: అని దుఃఖభారంచేత అతిదీనంగా వినరాగా ధర్మరాజు 'అయ్యో! వీరు ఎంత క్రూరమైన కష్టాలు పడుతున్నారో!' అని కరుణ పుట్టగా అక్కడే నిలబడ్డాడు. మళ్ళీ అవే మాటలే వినబడ్డాయి. ధర్మరాజు మీరెవరని అడిగాడు. 'నేను కర్ణుడిని, నేను భీముడిని, నేను అర్జునుడిని, నేను నకులుడిని, నేను సహదేవుడిని, నేను ద్రౌపదిని, నేను ధృష్టద్యుమ్నుడిని, మేము ద్రౌపదీ కుమారులం' అన్న మాటలు వినిపించాయి.

విశేషం: దుర్యోధనుడు స్వర్గసౌఖ్యాలు అనుభవిస్తూ కనిపించగా పాండవులు నరకరూపంలో కనిపించటంలోని తాత్పర్యమే ఈ పర్వంలోని ప్రధానాంశం.

సీ. **ధర్మనందనుఁడు చిత్తమ్మున నుద్వేగ। మావహిల్లఁగ 'దైవ మకట! యిట్లు**
సేసెనే? కీ దేమి చేసిరొకో వీర। లిన్నరకమునకు నేఁగుదేర
వలసినయట్టిది? వాసవాద్యమరులు। నీచులు వో వీరి నే విచార
మించుకయును లేక యిట్టి కష్టపుటిడు। మలఁ బెట్టెడిదె? ధర్మమా! తెఱంగు

తే. **మాలితే నీవు సజ్జనమాన్యు లలఘు। సత్యపరులు దయాఢ్యులు నిత్యదాన**
రతులు బహుదక్షిణాంచిత క్రతువితాన। పావితాత్ము లనర్హంపుఁబాటు వడిరి. **24**

ప్రతిపదార్థం: ధర్మనందనుఁడు= ధర్మరాజు; చిత్తమ్మునన్= మనసులో; ఉద్వేగము= వ్యాకులత; ఆవహిల్లఁగన్= పుట్టగా; దైవము= దేవుడు; ఇట్లు+చేసెనే!= ఇట్లా చేశాడా!; వీరలు= ఈ పాండు తనయులు, ద్రౌపది మొదలైన వీరు; ఈ నరకమునకున్+ఏఁగుదేరన్= ఈ నరకానికి రావటానికి; వలసిన అట్టిది= రావలసినటువంటి; కీడు= అపకారం; ఏమి చేసిరొకో= ఏం చేశారో; వాసవ+ఆది+అమరులు= ఇంద్రాది దేవతలు; నీచులు+పో!= నీచులు సుమా!; వీరిని+ఏ విచారము+ఇంచుకయును లేక= వీరిని ఏ ఆలోచనా కొంచెంకూడా లేకుండా; ఇట్టి= ఇట్లాంటి; కష్టము+ఇడుమలన్= కఠినమైన కష్టాలలో; పెట్టెడిదె?= పెట్టటమా?; ధర్మమా!= ఓ ధర్మమా!; నీవు; తెఱంగు= పద్ధతి (న్యాయం); మాలితే!= వదలివేశావా!; సజ్జన= మంచివారిచేత; మాన్యులు= గౌరవించదగినవారు; అలఘు= గొప్ప; సత్యపరులు= సత్యనిష్ఠ కలవారు; దయా+ఆఢ్యులు= దయాగుణ సంపన్నులు; నిత్యదానరతులు= నిత్యమూ దానం చేయటంలో అభిలాష ఉన్నవారు; బహు= మిక్కిలిగా; దక్షిణా= దక్షిణలతో; అంచిత= ఒప్పిన; క్రతువితాన= యజ్ఞ సముదాయాలచేత; పావిత+ఆత్ములు= పవిత్రం చేయబడిన ఆత్మలు కలవారు; అనర్హము+పాటు+పడిరి= తగని కష్టాలు పడ్డారు.

తాత్పర్యం: ధర్మరాజు చిత్తంలో వ్యాకులత్వం పుట్టగా 'దేవుడు ఇట్లా చేశాడా! అయ్యో! అయినా వీరు ఈ నరకానికి రావటానికి తగిన పాపాలు ఏం చేశారు? ఇంద్రాది దేవతలు చాలా నీచులు సుమా! లేకపోతే వీరిని ఏ ఆలోచనా కొంచెంకూడా లేకుండా ఇట్లాంటి క్రూరమైన కష్టాలకు గురిచేస్తున్నారు. ఓ ధర్మమా! నీవు న్యాయం వదలివేశావా? మంచివారిచేత గౌరవించబడిన గొప్ప సత్య నిష్ఠకలవారు, దయాగుణ సంపన్నులు, నిత్యదానశీలురు, మిక్కిలిగా భూరిదక్షిణలతో ఒప్పిన యాగ సముదాయాలచేత పవిత్రీకరించబడిన ఆత్మలు కలవారు - అయినా, వీరు తగని కష్టాల పాలయ్యారు పాపం!

చ. **ఒకటను మేలు సేయని సుయోధనుఁ డమ్మెయి దేవపూజ్యుఁ డై**
సకలసుఖానుభూతియు నజస్రము పెంపు వహింప నొప్పి దృ
ష్టికిఁ గడు వ్రేఁకనై తనదు చెల్వలుఁ జుట్టలుఁ దాను సంతసం
బు కలిమి నేచి మి న్నడిచి పుణ్యపదావృతుఁడై వెలింగెడున్. **25**

ప్రతిపదార్థం: ఒకటనున్= ఒక విషయంలోకూడా; మేలు+చేయని= ఎవరికీ మేలు చేయని; సుయోధనుఁడు= దుర్యోధనుడు; ఆ+ మెయిన్= అట్లా; దేవపూజ్యుఁడు+ఐ= దేవతలకు పూజనీయుడై; సకల= అన్ని; సుఖ= సుఖాల; అనుభూతియున్= అనుభవాన్ని(పొంది); అజస్రము= ఎడతెగని; పెంపువహింపన్+ఒప్పి= గొప్పతనంతో కూడి ప్రకాశిస్తూ; దృష్టికిన్+కడు+వ్రేఁకనై= చూడటానికి చాలా దుర్భరంగా; తనదు= తన; చెల్వలున్= స్త్రీలూ; చుట్టలున్= బంధువులూ; తానున్= తానూ; సంతసంబు కలిమిన్= సంతోషంతో; ఏచి= విజృంభించి; మిన్ను+అడిచి= ఆకాశాన్ని లొంగదీసి (అంత పొడవు పెరిగి - సంతోషంతో అతిశయించి); పుణ్యపద+ ఆవృతుఁడు+ఐ= దేవతలచేత చుట్టుకొనబడినవాడై; వెలింగెడున్= ప్రకాశిస్తున్నాడు.

తాత్పర్యం: ఒక్క విషయంలో కూడా ఎవరికీ మేలు చేయని దుర్యోధనుడు అట్లా దేవతలకు పూజనీయుడై అన్ని సుఖాల అనుభవాన్ని పొంది ఎడతెగని గొప్పతనంతో కూడి ప్రకాశిస్తూ చూడటానికి చాలా దుర్భరంగా తన కాంతలు, బంధువులు, తానూ, సంతోషంతో విజృంభించి ఆకాశాన్ని మించిపోయి దేవతలచేత చుట్టుకొనబడి ప్రకాశిస్తున్నాడు.

విశేషం: దాయాది మాత్సర్యం ఎట్లా ఉంటుందో ఈ పద్యంలోని ప్రతి పదమూ నిరూపిస్తుంది. 'దుర్భరంగా' అంటే అతడి గొప్పతనాన్ని చూచి భరించటం ధర్మరాజు చేతకావటం లేదని అర్థం.

ఆ. ఈఁగకాలియంత యేనియుఁ బాపంబు। వీరివలనఁ గనుట వినుట గలుగ
దొక్కనాఁడు; నట్టి యుత్తములకు విధి। పాడి మాలి యిట్టి పాటు దెచ్చె.' 26

ప్రతిపదార్థం: వీరివలనన్= నా వారైన వీరివలన; ఈఁగ కాలిఅంత= ఈగ కాలంతటి స్వల్పమైన; పాపంబు= పాపం; ఏనియున్= కూడా; కనుట= చూడటం; వినుట= వినటం; ఒక్కనాఁడున్= ఒక్కరోజా; కలుగదు= లేదు; అట్టి+ఉత్తములకున్= అట్లాంటి ఉత్తములకు; విధి= దైవం; పాడి మాలి= న్యాయం వీడి; ఇట్టి= ఇట్లాంటి; పాటు= కష్టాన్ని; తెచ్చెన్= తెచ్చి పెట్టింది.

తాత్పర్యం: నా వారైన వీరివలన ఈగ కాలంతటి స్వల్పమైన పాపంకూడా జరిగినట్లు ఒకనాడూ చూడలేదు. వినలేదు. అట్లాంటి ఉత్తములైన వీరికి దైవం అన్యాయంగా ఇట్లాంటి కష్టాన్ని తెచ్చిపెట్టింది.'

సీ. అని యగ్గలపుఁజింత మునిఁగి కలంక మ। నోవికారము నాకు నావహిల్లఁ
గత మేమి యొకొ! యిది ఘనమాయయో కల। గనుటయో యరయ నిక్కంబొ చిత్త
విభ్రాంతిఁ జేసి వివేకింప నేర రా। దయ్యెడు' నని పరమాకులేంద్రి
యుఁడు శోకదుఃఖమయుండు నై కొండొక। ప్రొ ద్దూరకుండి సద్బుద్ధిఁ దలఁచి

తే. యలుక యింద్రుపైఁ బొడమిన నమ్మహాత్ముఁ। డప్పురుషుఁ జూచి మగుడ నీ వరుగు మార్య
వర్య! యెవ్వరి దూతవు వారికడకు। ననుచుఁ బలికి వెండియు నిట్టు లనియె నధిప! 27

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అని; అగ్గలము+చింతన్= మిక్కిలి చింతలో; మునిఁగి= మునిగిపోయి; కలంకన్= క్షోభతో; మనోవికారము= మనసు కకావికలు కావటం; నాకున్= నాకు; ఆవహిల్లన్= కలగటానికి; కతము+ఏమియొ= కారణం ఏమిటో; ఇది ఘనమాయయో!= ఇది దేవతలు పన్నిన గొప్ప మాయా!; కల కనుటయో= కలగనటమా!; అరయన్= లేక బాగా ఆలోచిస్తే; నిక్కంబొ!= నిజమేనా!; విభ్రాంతిన్+చేసి= మిక్కిలి భ్రాంతి పొందటంచేత; వివేకింపన్ నేరరాదు+అయ్యెడున్+అని= విచారించటం చేతకావటం లేదు అని; పరమ+ఆకుల+ఇంద్రియుఁడు= మిక్కిలి వ్యథ చెందిన ఇంద్రియాలు కలవాడై; శోకదుఃఖమయుండున్+ఐ= శోకంతో, దుఃఖంతో నిండినవాడై; కొండొక ప్రొద్దు= కొంచెంసేపు; ఊరకుండి= మిన్నకుండి; సద్బుద్ధిన్+తలఁచి= తేరుకొన్న మనస్సుతో ఆలోచించి; ఇంద్రుపైన్= ఇంద్రుడిపై; అలుక+పొడమినన్= కోపం పుట్టగా; ఆ+మహాత్ముఁడు= ధర్మరాజు; ఆ+పురుషున్+చూచి= ఆ దూతను చూచి; ఆర్యవర్య!= పూజ్యుడా!; నీవు; ఎవ్వరిదూతవు= ఎవరి దూతవో; వారికడకున్= వారి వద్దకు; మగుడన్= మరల; అరుగుము= వెళ్ళుము; అనుచున్= అని; పలికి= చెప్పి; వెండియున్= మరలా; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: జనమేజయా! వినుము. ఇట్లా మిక్కిలి చింతలో మునిగిపోయి ' నాకు ఇట్లా క్షోభతో మనసు కకావికలు కావటానికి కారణం ఏమిటో? ఇది దేవతలు పన్నిన మాయా! కలగనుటయా! లేక నిజమేనా! ఏమిటో భ్రాంతి పొందటంచేత విచారించటం చేతకావటం లే' దని మిక్కిలి వ్యథ చెందిన ఇంద్రియాలు కలవాడై శోక దుఃఖాలతో

నిండినవాడై కొంచెం సేపు ఊరకుండి తేరుకొన్న మనసుతో ఆలోచించి ఇంద్రుడిపై కోపం రాగా ఆ దూతను చూచి 'పూజ్యుడా! నీవు ఎవరి దూతవో వారి వద్దకు మరలిపొమ్ము' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: ధర్మరాజు మానుష శరీరంలో ఉండటంచేత ఇది మాయా? నిజమా? అని భ్రాంతిలో పడ్డాడు. పాండవులు నరకంలో కనిపించటమే - అది నిజం కాకపోవచ్చున్న ఊహను ధర్మరాజులో కలిగించింది. సద్బుద్ధిన్= అంటే మంచిబుద్ధితో అని అర్థం. ఇక్కడ భ్రాంతి తొలగటంకొరకు ఆయన'మౌనం' పాటించి మనసు కుదుటపరచుకొన్నాడని అర్థం.

ఇంద్రుఁడు నరకంబుకడ నున్న ధర్మజు నొద్దకు వచ్చి యతని సంభావించుట (సం.18-2-52)

క. **'నా యనుజులు దుఃఖార్దితు। లై యున్నాః రట్టు లగుట నచటికి రా; నిం**
కీ యెడన నేను నిలిచెదఁ। బాయక యని చెప్పు మా కృపానిరతునకున్.' **28**

ప్రతిపదార్థం: నా+అనుజులు= నా తమ్ములు; దుఃఖ= దుఃఖంచేత; అర్దితులు+ఐ= పీడితులై; ఉన్నారు; అట్టులు+అగుటన్= అట్లా కావటంవలన; అచటికిన్= అక్కడికి; రాను; నేను; ఈ+ఎడన్+అ= ఇక్కడే; పాయక= వదలకుండా; నిలిచెదన్= ఉంటాను; అని; ఆ+ కృపానిరతునకున్= నిరంతర కృపాగుణం ఉన్న ఆ ఇంద్రుడికి; చెప్పుము= చెప్పుము.

తాత్పర్యం: 'నా తమ్ములు దుఃఖపీడితులై ఉన్నారు. అట్లా కావటంవలన నేను ఇక అక్కడికి రాను. ఇక్కడే శాశ్వతంగా ఉండిపోతాను' అని ఆ దయానిధి ఇంద్రుడికి చెప్పుము.'

చ. **అనుటయు దేవదూతుఁడు రయంబున నిర్జరనాథు పాలికిన్**
జని తెలియంగఁ జెప్పఁ గురుసత్తమ! ధర్మజు నిశ్చయంబు న
య్యనఘచరిత్ర భాస్వరుని యాడిన మాటలు నాతఁ డంతయున్
విని చనుదెంచె నయ్యెడకు వేగమె సంయమి దేవయుక్తుఁడై. **29**

ప్రతిపదార్థం: కురుసత్తమ!= ఓ జనమేజయ మహారాజా!; అనుటయున్= అని ధర్మరా జనగా; దేవదూతుఁడు= ఆ దేవదూత; రయంబునన్= శీఘ్రంగా; నిర్జరనాథు పాలికిన్= దేవేంద్రుడివద్దకు; చని= వెళ్ళి; తెలియంగన్+చెప్పన్= ఈ విషయం వివరించగా; ధర్మజు నిశ్చయంబు= ధర్మరాజు నిర్ణయమూ; ఆ+అనఘ చరిత్ర భాస్వరుని= ఆ పుణ్య చరిత్రచేత ప్రకాశించెడి ధర్మరాజు యొక్క; ఆడినమాటలు= అన్న మాటలు; అతఁడు= ఇంద్రుడు; అంతయున్= సమస్తమూ; విని= విన్నవాడై; ఆ+ఎడకున్= ఆ చోటికి (యడాగమ-త్రికసంధులు); వేగమె= అతి శీఘ్రంగా; సంయమి= ఋషులతోనూ; దేవయుక్తుఁడు+ఐ= దేవతలతోనూ కలిసి; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: అని ధర్మరాజు చెప్పగా ఆ దేవదూత అతివేగంగా వెళ్ళి ఇంద్రుడికి ఇదంతా వివరించాడు. ధర్మరాజు నిర్ణయాన్ని ఆ పవిత్ర చరిత్రుడి మాటలను విని ఇంద్రుడు వెనువెంటనే ఋషులతోనూ, దేవతలతోనూ కలిసి ఆచోటికి వచ్చాడు.

ఆ. **ధర్ముఁడును మహాముదంబున నిజపుత్త్రుఁ। డగు నజాతశత్రు ననునయించి**
రక్షణం బొనర్పఁ బ్రకటవాత్సల్యత। నరుగుదెంచెఁ గురుకులాగ్రగణ్య! **30**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కురుకుల+అగ్రగణ్య!= కురువంశంలో మొదట గణింపదగినవాడా! జనమేజయా!; ధర్ముఁడును= యమధర్మరాజు కూడా; మహాముదంబునన్= చాలా సంతోషంతో; నిజపుత్త్రుఁడు+అగు= తనకొడుకైన; అజాతశత్రున్= ధర్మరాజును; అనునయించి= ఓదార్చి; రక్షణంబు+ఒనర్పన్= రక్షించటానికి; ప్రకటవాత్సల్యతన్= వాత్సల్యాన్ని ప్రకటిస్తూ; అరుగుదెంచెన్= అక్కడికి వచ్చాడు.

తాత్పర్యం: రాజా! వినుము. యమధర్మరాజుకూడా పుత్రవాత్సల్యాన్ని ప్రకటిస్తూ తన కొడుకైన ధర్మరాజును ఓదార్చి రక్షించటానికి అక్కడికి చాలా సంతోషంతో వచ్చాడు.

వ. **అప్పుడు.** **31**

తాత్పర్యం: ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. **వివిధ పాపాత్ములు వికృతశరీరు లై। యాతనా బాధితు లగుట మానె**
దుర్గంధమును గృధ్రవర్గాది పలలాశి। పక్షి పంక్తులుఁ గుణప వ్రజంబుఁ
దోఁపన యెఱచి నెత్తురు కేశ పటలంబు। లస్థిపుంజము లదృశ్యంబు లయ్యెఁ;
గ్రూరాసిపత్ర ఘోరారణ్యయుక్త వై। తరణి లేకుండె; సత్పరిమళంబు

తే. **నింపుఁ జేయు సోఁకును సొగియించు తనుపు। నార వీతెంచి సమ్మోద మావహించె;**
నమృతమయ మిది యనఁదగి యనిల మధిక। విశదభావంబుఁ బ్రాపించె దిశలు పదియు. **32**

ప్రతిపదార్థం: వివిధ= నానా విధాలైన; పాప+ఆత్ములు= పాపాలు చేసినవారు; వికృత శరీరులు+ఐ= వికారం పొందిన శరీరాలు కలవారై; యాతనా= శిక్షలచేత; బాధితులు+అగుట= బాధపడటం, మానెన్= ఆగిపోయింది; దుర్గంధమును= చెడ్డవాసన; గృధ్రవర్గ+ఆది= గ్రద్ద మొదలైన; పలల+ఆశి= మాంసాన్ని తినేటటువంటి; పక్షిపంక్తులు= పక్షుల సమూహాలు; కుణప వ్రజంబు= శవాల గుట్టలు; తోఁపన= కనిపించటంలేదు; ఎఱచి= మాంసం; నెత్తురు= రక్తం; కేశ పటలంబులు= వెంట్రుకల గుట్టలు; అస్థిపుంజములు= ఎముకల ప్రోగులు; అదృశ్యంబులు+అయ్యెన్= మాయమైపోయాయి; క్రూర+అసి= క్రూరమైన కత్తులవంటి; పత్ర= ఆకులున్న; ఘోర+ అరణ్య యుక్త= భయంకరమైన అడవితో కూడిన; వైతరణి= వైతరణీనది; లేక+ఉండెన్= లేకుండా పోయింది; సత్పరిమళంబున్= మంచివాసనను; ఇంపున్= తృప్తినీ; చేయు= కలిగించే; సోఁకును= స్పర్శను; సొగియించు= పారవశ్యం కలుగజేసే; తనుపున్= చల్లదనమూ; ఆరన్+వీతెంచి= బాగా వ్యాపించి; సమ్మోదము= సంతోషం; ఆవహించెన్= కలిగించింది; అమృతమయము+ఇది అనన్+తగి= ఇది అమృతంతో నిండిందా అన్నట్లుగా; అనిలము= వాయువు; అధిక= మిక్కిలి; విశదభావంబున్= మనోహరత్వాన్ని; దిశలుపదియున్= పది దిశలూ; ప్రాపించెన్= పొందాయి.

తాత్పర్యం: నానా విధాలైన పాపకర్ములు చేసినవారు వికారంపొందిన శరీరాలతో శిక్షలకు గురై బాధపడటం ఆగిపోయింది. చెడ్డవాసనతోడి గ్రద్దలు మొదలైన మాంసాన్ని తినే పక్షుల సమూహాలు, శవాలగుట్టలు కనిపించటంలేదు. మాంసం, నెత్తురు, వెంట్రుకల గుట్టలు, ఎముకల పోగులు మాయమైపోయాయి. క్రూరమైన కత్తులవంటి ఆకులున్న భయంకరమైన అడవితోకూడిన వైతరణీనది లేకుండా పోయింది. మంచివాసనను తృప్తినీ కలిగించే గాలి, సుఖాన్ని కలుగజేసే చల్లదనమూ బాగా వ్యాపించి సంతోషం కలిగింది. ఇది అమృతంతో నిండిందా అన్నట్లు వాయువు మనోహరత్వాన్ని పదిదిశలలో వ్యాపింపచేసింది.

వ. ఆ సమయంబున వాసవుతోడఁ జనుదెంచినట్టి. 33

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= ఆ సమయంలో; వాసవుతోడన్= ఇంద్రుడితో; చనుదెంచినట్టి= వచ్చినట్టి.

తాత్పర్యం: ఆ సమయంలో ఇంద్రుడితోపాటు వచ్చిన. (తరువాతి పద్యంతో అన్వయం)

మహాస్రగ్ధర;

వసురుద్రాదిత్య గంధర్వ గరుడ భుజగ వ్రాతముల్ వైభవం బు
ల్లసనం బొందంగ సిద్ధు ల్మనముల ముదము ల్పల్లవింపంగ సాధ్యుల్
హసితస్వాంతంబులం బె ల్లలమికొనఁగ నత్యాదరోత్కర్షముల్ పాం
డుసుతో పాంతమ్ము నం బిండు గొని నిలిచి చూడ్కుల్ తదంగంబు గప్పన్. 34

ప్రతిపదార్థం: వసు= వసువుల; రుద్ర= రుద్రుల; ఆదిత్య= ఆదిత్యుల; గంధర్వ= గంధర్వుల; గరుడ= గరుడుల; భుజగవ్రాతముల్= సర్పాల సమూహాలు; వైభవంబు= వైభవం; ఉల్లసనంబు= ప్రకాశాన్ని; ఒందంగన్= పొందగా; సిద్ధుల్= సిద్ధులు; మనములన్= మనసులలో; ముదముల్= సంతోషాలు; పల్లవింపంగన్= చిగురొత్తగా; సాధ్యుల్; హసిత= సంతోషించిన; స్వాంతంబులన్= హృదయాలతో; అతి+ఆదర+ ఉత్కర్షముల్= మిక్కిలి అతిశయించిన ఆదరం; పెల్లు+అలమికొనఁగన్= మిక్కిలి వ్యాపించగా; పాండుసుత+ ఉపాంతమ్మునన్= ధర్మరాజు సమీపంలో; పిండుగొని= చుట్టూ గుంపుగా చేరి; నిలిచి= నిలబడి; చూడ్కుల్= చూపులు; తద్+అంగంబు+కప్పన్= అతడి శరీరాన్ని ఆచ్ఛాదించగా.

తాత్పర్యం: వసు, రుద్ర, ఆదిత్య, గంధర్వ, గరుడ, సర్ప సమూహాలు వైభవం ప్రకాశించగా, సిద్ధులు మనసులలో సంతోషం పొందగా సాధ్యులు సంతోషించిన హృదయాలతో మిక్కిలి అతిశయించిన ఆదరం అంతటా వ్యాపించగా ధర్మరాజు సమీపంలో చుట్టూ గుంపుగా చేరి నిలబడి చూపులు అతడి శరీరాన్ని క్రమ్ముకొనగా. (తరువాతి వచనంతో అన్వయం)

వ. ఒండొరులతో నక్కురుమూర్తి గుణవిశేషంబు లుగ్గడించి యగ్గించుచుండ సంయమి సుర సమేతంబుగా నయ్యాఖండలుండు నయ్యఖండ యశో మండితుం జేరంజని సాంత్వన స్వరంబున నిట్లనియె. 35

ప్రతిపదార్థం: ఒండొరులతోన్= ఒకరితో ఒకరు; ఆ+కురుమూర్తి= ఆ ధర్మరాజు; గుణవిశేషంబులు+ఉగ్గడించి= సద్గుణాలను చెప్పి; అగ్గించుచున్+ఉండన్= ప్రశంసిస్తుండగా; సంయమి= ఋషులతో; సురసమేతంబుగాన్= దేవతలతో కూడ; ఆ+ అఖండలుండు= ఆ ఇంద్రుడు; ఆ+అఖండ+యశస్+మండితున్= అఖండమైన కీర్తిచేత ప్రకాశించే ఆ ధర్మరాజును; చేరన్+చని= సమీపించి; సాంత్వన= ఓదార్పు కలిగించే; స్వరంబునన్= గొంతుకతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఒకరితో ఒకరు ఆ ధర్మరాజు సద్గుణాలను చెప్పుకొని ప్రశంసిస్తుండగా ఋషులతో, దేవతలతో కలిసి ఇంద్రుడు ఆ కీర్తిచే ప్రకాశించే ధర్మరాజును సమీపించి ఓదార్పు కలిగించే గొంతుకతో ఇట్లా అన్నాడు.

క. 'నీ విచ్చో నునికికి ని। ద్దేవతలందఱును వగచి ధిషణాగుణ సం
భావిత! నిన్నుం దోడ్కొని। పో వచ్చినవారు కినుకఁ బో విడువ వనా. 36

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పతిపదార్థం: ధిషణాగుణ సంభావిత!= బుద్ధిగుణంచేత సమ్మానించబడిన ఓ ధర్మరాజా!; నీవు; ఇచ్చోన్+ఉనికికిన్= ఇక్కడ ఉండటానికి; ఈ+దేవతలు+అందఱును= ఈ దేవతలందరూ; వగచి= బాధపడి; నిన్నున్+తోడ్కొని పోన్+వచ్చినవారు= నిన్ను తీసికొని పోవటానికి వచ్చారు; కినుకన్+పోన్+విడువవనా!= కోపం వదలిపెట్టవయ్యా!

తాత్పర్యం: 'బుద్ధిగుణంచేత సమ్మానించబడిన ధర్మరాజా! నీవు ఇక్కడ ఉండటంచేత ఈ దేవతలందరూ బాధపడి నిన్ను తీసికొనిపోవటానికి వచ్చారు. కోపం వదలిపెట్టుము నాయనా!

క. సిద్ధియు నవ్యయలోక స। మృద్ధ సుఖావాప్తియును శమిత వికృతియు స
ద్బుద్ధియు నుదాత్తభంగిని। సిద్ధించెను నీదుగుణ విశేషము కతనన్. 37

ప్రతిపదార్థం: సిద్ధియున్= యోగప్రాప్తి; అవ్యయలోక సమృద్ధ సుఖ+అవాప్తియున్= నాశరహితమైన బ్రహ్మలోక సమృద్ధమైన సుఖప్రాప్తి; శమితవికృతియున్= శమించిన వికారాలు; సద్బుద్ధియున్= సద్బుద్ధి; నీదు= నీ; గుణ విశేషము కతనన్= గుణ విశేషంచేత; ఉదాత్తభంగిన్= ఉదాత్త రీతిలో; సిద్ధించెను= సిద్ధించాయి.

తాత్పర్యం: నీకు యోగం ప్రాప్తించింది. నాశరహితమైన బ్రహ్మలోక సమృద్ధమైన సుఖప్రాప్తికూడా సిద్ధించింది. నీ వికారాలు శమించాయి. నీకు సద్బుద్ధి కలిగింది. నీ గుణవిశేషంచేత ఇవన్నీ ఉదాత్తరీతిలో నీకు సిద్ధించాయి.

విశేషం: యోగం= ఇంద్రుడు చెప్పుతున్నది యోగసిద్ధిని గురించి, దానివలన అష్టసిద్ధులు కలుగుతాయి. అణిమ, గరిమ, లఘిమ, మహిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వము, వశిత్వము - అన్నవి ఈ సిద్ధులు. ఇవి ఆధారంగానే ధర్మజుడు సశరీరుడై స్వర్గానికి వచ్చాడు. కాని ఇతరులవలె అక్కడ ఉండిపోవటానికి రాలేదు. అది ఇంద్రుడికి తెలుసు.

ధర్మరాజు ముముక్షువుగా వచ్చాడు. సర్వబంధమోక్షం కావాలని ధర్మజుడి ఆకాంక్ష. దానికి తగిన సాధనసంపత్తి ధర్మజుడి జన్మంలోనే ఉన్నది. స్వభావంతో ఆయన సద్గుణి, సద్బుద్ధి సిద్ధించింది. కనుక ఇహపర విభేద దృష్టి ఆయనలో ఆజన్మాంతమూ పనిచేస్తోంది. ఇదే గుణవిశేషం. దీనిచేత ఆయనకు అవ్యయలోక ప్రాప్తి కలిగింది. ఈ మాట చాలా ముఖ్యమైనది. ధర్మజుడు మాత్రమే శమమును సాధించాడు. వికారదూరుడు కావటమే 'శమ' మంటే, ఆ స్థితిని శాంతమంటారు. దీనినే శాస్త్రంలోవలె మోక్షమంటారు. ఆ మోక్షం 'అవ్యయమైనది. అక్కడ తరుగుదల లేదు. స్వర్గంలోవలె సుఖానుభవం తరువాత మళ్ళీ మానుషతనువు ఎత్తవలసిన అవసరంలేదు. దానినే 'బ్రహ్మ' లోకమన్నారు. ఈ బ్రహ్మ అక్షర పర 'బ్రహ్మ' తప్ప సత్యలోకావాసి కాడు. గీతాకారుడు ఈ అక్షర= అవ్యయతత్త్వమే తానని చెప్పాడు.

"యం ప్రాప్య వ నివర్తంతే తద్ధామ పరమం మమ" అని స్వామి సెలవిచ్చాడు. దేనిని చేరినవారు మరలి రారో - ఆ స్థానం 'పరమమైనది. ఆ స్థానం నాది అని అర్థం. అది ధర్మజుడికి సిద్ధించిందట. అదికూడా 'ఉదాత్తంగా' ధర్మరాజుకు ఈ సిద్ధి గుణ విశేషంచేత సహజంగా కలిగింది. హఠాత్తుగానూ కలగలేదు. హఠయోగాదులవలన కలిగిందీ కాదు. అందుచేత ఇంద్రుడు ఇట్లా అన్నాడు.

క. విను మొక్కటి సెప్పెద రా। జనువానికి నెల్లఁ దప్ప దవనీశ్వర! యె
ట్లును నారక స్థలంబుం। గనుఁగొన వలయు టిది వేదకథితము సుమ్మీ! 38

ప్రతిపదార్థం: ఒక్కటి= ఒక విషయం; చెప్పెదన్= చెప్పుతాను; అవనీ+ఈశ్వర! విను= ధర్మరాజా! వినుము; రాజు+అనువానికిన్+ఎల్లన్= రాజన్న ప్రతి ఒక్కడికీ; ఎట్లును= ఎట్లాగైనా; నారకస్థలంబున్= నరకాన్ని; కనుఁగొనవలయుట= చూడవలసిరావటం; తప్పదు= తప్పేది కాదు; ఇది= ఈ విషయం; వేద కథితము= వేదంచేత చెప్పబడ్డది; సుమ్మీ!= సుమా!

తాత్పర్యం: ధర్మరాజా! ఒక విషయం చెప్పుతాను వినుము. రాజన్న ప్రతి ఒక్కడికీ ఎట్లాగైనా నరక ద్వార దర్శనం చేయవలసిరావటం తప్పేది కాదు. ఇది వేదం చెప్పిన మాట సుమా!

విశేషం: 'రాజ్యాంతే నరకం ధ్రువమ్' అని శాస్త్ర ప్రమాణం. అది వేదమూలమైన సిద్ధాంతమని వేదవ్యాసుడు చెప్పుతున్నాడు. రాజ్యపాలనలో సంకల్పితంగానో అసంకల్పితంగానో పాప 'పంకిలం' (బురద) రాజుకు అంటుకొనక తప్పదు. కొన్నిటికి కర్త, కొన్నిటికి ప్రేరకుడు. కొన్నిటికి సాక్షి. అన్నిటికీ బాధ్యుడు. ఇట్లా రాజు 'పాప' భాగి అవుతున్నాడు. అందుకే 'నరకం'లో పడటమో, కనీసం నరక ద్వార దర్శనమో తప్పదట. ధర్మజుడి 'పాపం' చాలా తక్కువ కాబట్టి నరక దర్శన భ్రమనైనా పొందక తప్పలేదు.

సీ. **పుణ్యంబులును బాపములు రెండు జోకలై। యుండుఁ బుణ్యంబుల నొదవు నాక**
సుఖము పాపంబులఁ జొప్పడు నరకదుః। ఖము విను మున్ను నాకంబు సుఖము
ననుభవించిన యట్టి యతఁడు పదంపడి। యధిక నారక పీడ ననుభవించు;
మున్ను నారక దుఃఖమునఁ బడ్డవాఁ డనం। తరమ నాకమునఁ దాఁ బొరయు సౌఖ్య;

తే. **మల్పపుణ్యుండు తొలి తొలి యమరతా సు। ఖంబు గయికొని మఱియు దుఃఖముల నొందు;**
భూరిపుణ్యుండు మునుమును ఘోర నిరయ। యాతనల నొంది వెండి సౌఖ్యంబు లొందు. 39

ప్రతిపదార్థం: విను= వినుము; పుణ్యంబులును= పుణ్యాలు; పాపములు= పాపాలు; రెండున్= రెండూ; జోకలు+ఐ= జంటగా; ఉండున్= ఉంటాయి; పుణ్యములన్= పుణ్యాలచేత; నాక సుఖము= స్వర్గ సుఖం; ఒదవున్= కలుగుతుంది; పాపంబులన్= పాపాలచేత; నరక దుఃఖము; చొప్పడున్= కలుగుతుంది; మున్ను= ముందుగా; నాకంబు సుఖము= స్వర్గ సుఖం; అనుభవించిన+అట్టి+అతఁడు= అనుభవించినవాడు; పదంపడి= తరువాత; అధిక= మిక్కిలి అధికంగా; నారకపీడన్= నరక బాధ; అనుభవించున్= అనుభవిస్తాడు; నారకదుఃఖమునన్= తొలుత నరకదుఃఖంలో పడ్డవాడు; అనంతరము+అ= తరువాతే; నాకమునన్= స్వర్గంలో; తాన్= తాను; సౌఖ్యమున్= సౌఖ్యాన్ని; పొరయున్= పొందుతాడు; అల్పపుణ్యుండు= అల్పంగా పుణ్యంచేసికొన్నవాడు; తొలి తొలి= ముందుగా; అమరతాసుఖంబున్= స్వర్గసుఖాన్ని; కయికొని= స్వీకరించి; మఱియున్= పిదప; దుఃఖములన్+ఒందున్= దుఃఖాలను పొందుతాడు; భూరి పుణ్యుండు= అధిక పుణ్యం చేసికొన్నవాడు; మునుమును= ముందుగా; ఘోర= ఘోరమైన; నిరయ= నరక; యాతనలన్+ఒంది= యాతనలను అనుభవించి; వెండి= పిదప; సౌఖ్యంబులు+ఒందున్= సుఖాలు పొందుతాడు.

తాత్పర్యం: ధర్మరాజా! జాగ్రత్తగా వినుము. పుణ్యపాపాలు రెండూ జంటగా ఉంటాయి (ఒకదానితో ఒకటి కలిసే ఉంటాయి). పుణ్యంచేత స్వర్గం, పాపంచేత నరకం కలుగుతాయి. తొలుత స్వర్గంలో సుఖం అనుభవించినవాడు పిదప నరకంలో చాలా బాధలు పడతాడు. తొలుత నరకయాతన అనుభవించినవాడు ఆ తరువాతే స్వర్గసుఖాలు చవిచూస్తాడు. అల్పంగా పుణ్యం చేసికొన్నవాడు తొలుత స్వర్గసుఖాన్ని స్వీకరించి తరువాత చాలాకాలం నరకయాతన అనుభవిస్తాడు. అధికపుణ్యం చేసికొన్నవాడు మొదట నరకయాతన అనుభవించి తరువాత చాలాకాలం స్వర్గసుఖాలు పొందుతాడు.

విశేషం: భగవద్గీత గుణత్రయ, శ్రద్ధాత్రయాలుగా చెప్పిన విషయ సర్వస్వ సారాంశమూ ఈ ఒక్క పద్యంలో ఉన్నది. దైవత్వం సాత్త్వికసంపద. రాక్షసత్వం తామసికసంపద. మానవత్వం ఈ రెండింటి ధర్మాలలో ఉన్న రాజసికసంపద. సత్త్వ ప్రధానమైన సుఖం తొలుత అమృతతుల్యంగా ఉండి కడపట విషమై ప్రాణం తీస్తుంది. ధర్మరాజుకు పుట్టిన సందేహాలను నివృత్తి చేయటమే

మహేంద్రుడి తాత్పర్యం. దుర్యోధనుడు మహాల్పపుణ్యుడు. అందుచేత స్వర్గసుఖం తొలుత అనుభవిస్తున్నాడు. తరువాత రౌరవాది నరకాలు సిద్ధంగా ఎట్లాగూ ఉన్నాయి. పాండవులు మహాపుణ్యాత్ములు. అందుచేత నరకబాధను తొలుత పడుతున్నారు. చివరకు దీర్ఘమైన స్వర్గసుఖం ఉన్నదివారికి.

మరి ధర్మరాజు! ఇతడికి స్వర్గాన్ని అతిశయించిన అక్షరత్వసిద్ధి కావాలి. అది పుణ్యపాపాలను సమదృష్టితో స్వీకరించిన 'శమిత' చిత్తునికే సాధ్యం. అందుకే ఇంద్రియాధిదేవత అయిన ఇంద్రుడు ఈ ప్రబోధం చేస్తున్నాడు.

'జోక' అంటే 'జంట' అని వాచ్యార్థమే కాని - పరస్పర ఆశ్రితంగా ఉంటాయని పరమార్థం. ఒకే వ్యక్తిలో పుణ్యపాపాలు రెండూ ఉంటాయని అర్థం.

ధర్మరాజులోనూ రాచరికంవలన ఏర్పడిన పాపాంశలేశం చేతనే నరకద్వార దర్శనం కలిగిందని అర్థం చేసికొనాలి. అది ముందు చెప్పబడింది.

ఒక్క మనిషికి మాత్రమే అటు సాత్త్వికానికి ఎగరగలిగిన అవకాశం ఉన్నది. తామసంలో కూరుకుపోయే దౌర్భాగ్యం ఉన్నది.

క. **ఇట నేను నిన్నుఁ బుత్తెం। చుట యుత్తరకాల దివ్య సుఖ సంగమ సం**
ఘటనకుఁ గాదే నీ కట। కటఁ బడుటకు దీనిఁ దెలుపఁగా రావలసెన్. **40**

ప్రతిపదార్థం: ఇటన్= ఇక్కడికి; ఏను= నేను; నిన్నున్= నిన్ను; పుత్తెంచుట= పంపించటం; ఉత్తరకాల= భవిష్యత్తులో; దివ్య= స్వర్గ; సుఖ= సుఖంతో; సంగమ= కలయిక; సంఘటనకున్= జరగటానికి; కాదే!= కాదా! (అవునని అర్థం); నీ= నీవు; కటకటన్+పడుటకున్= బాధపడుతూ ఉండటంవలన; దీనిన్= దీనినంతా; తెలుపఁగాన్= తెలుపగా; రావలసెన్= రావలసి వచ్చింది.

తాత్పర్యం: నేను నిన్నిక్కడికి పంపించటం భవిష్యత్తులో సర్వసుఖప్రాప్తికొరకే కదా! నీవు బాధపడుతూ ఉండటంవలన నీ కిదంతా చెప్పవలసి వచ్చింది.

సీ. **కర్ణుఁ డుత్తమసిద్ధిఁ గాంచి వెలింగెడు। నమ్మహాభుజునకు నై కరంబు**
దుఃఖింతు నీ వెప్డుఁ; దుది ముట్టి యున్నాఁడి। తండు నిజోజ్జ్వలస్థాన మొంది
సర్వాస్త్రవిదుని నా జలజాప్త నందనుఁ। గనుఁగొని చిత్తంబు కలఁక విడువు;
మనిలనందనుఁడు నర్జునుఁడును నకులుండు। సహదేవుఁడును భవత్సైన్యరూప

తే. **వర్తి సర్వమహీపతివర్గములును। ద్రౌపదియు ద్రౌపదేయులు రాజవర్య!**
దీప్త నిజధామ సంప్రాప్తిఁ దేజ మలరి। యుండఁగాఁ జూచి సమ్మోదయుతుఁడ వగుము. **41**

ప్రతిపదార్థం: రాజవర్య!= ధర్మరాజా!; కర్ణుఁడు; ఉత్తమ సిద్ధిన్= ఉత్తమ స్థితి ప్రాప్తిని; కాంచి= పొంది; వెలింగెడున్= ప్రకాశిస్తున్నాడు; ఆ+మహాభుజునకున్+ఐ= ఆ పరాక్రమవంతుడికొరకై; నీవు; ఎప్డున్= ఎప్పుడూ; కరంబున్= మిక్కిలిగా; దుఃఖింతు= దుఃఖిస్తుంటావు; ఇతండు= ఈ కర్ణుడు; నిజ+ఉజ్జ్వలస్థానము+ఒంది= తనదైన ప్రకాశవంతమైన స్థానం పొంది; తుదిముట్టి+ఉన్నాఁడు= పరాకాష్ఠనంది ఉన్నాడు; సర్వాస్త్ర విదున్= అన్ని అస్త్రాలు తెలిసినవాడైన; ఆ జలజాప్తనందనున్= ఆ సూర్యకుమారుడిని, కర్ణుడిని; కనుఁగొని= చూచి; చిత్తంబుకలఁక= మనోవ్యథ; విడువుము= విడిచిపెట్టుము; అనిలనందనుఁడు= వాయుపుత్రుడు

(భీముడు); అర్జునుఁడును= అర్జునుడూ; నకులుండు= నకులుడు; సహదేవుఁడును; భవత్= నీ; సైన్యరూపవర్తి= సైన్యరూపంలో ప్రవర్తించిన; సర్వమహీపతివర్గములును= రాజసమూహాలన్నీ; ద్రౌపదియున్= ద్రౌపదీ; ద్రౌపదేయులున్= ద్రౌపది కుమారులూ; దీప్త= ప్రకాశించే; నిజధామ= తమతమ నెలవులను; సంప్రాప్తిన్= పొందటంవలన; తేజము+అలరి= తేజస్సు అతిశయించి; ఉండఁగాన్= ఉండగా; చూచి; సమ్మోదయుతుఁడవు+అగుము= సంతోషం పొందుము.

తాత్పర్యం: ధర్మరాజా! కర్ణుడు ఉత్తమ స్థానప్రాప్తిని పొంది ప్రకాశిస్తున్నాడు. ఆ పరాక్రమవంతుడికొరకు నీవు ఎప్పుడూ దుఃఖిస్తుంటావు. ఈ కర్ణుడు తనదైన ప్రకాశవంతమైన స్థానాన్ని పొంది పరాకాష్ఠనంది ఉన్నాడు. సకలశస్త్రాస్త్రవిదుడైన ఈ సూర్యనందనుడిని చూచి మనోవ్యథను విడిచిపెట్టుము. భీమార్జున నకుల సహదేవులు, నీ సైన్యంలో ఉండి పోరాడిన రాజసమూహాలూ, ద్రౌపదీ, ద్రౌపది పుత్రులూ అందరూ ప్రకాశిస్తున్న తమ తమ స్థానాలను పొంది తేజస్సు అతిశయించి ఉండగా చూచి సంతోషించుము.

విశేషం: 'దేవ' అనే శబ్దానికి మూలమైన ధాతువు అర్థం - దివ, ప్రకాశమని, ప్రకాశించేవారు దేవతలు. దేవతాలోకానికి చెందినవారందరూ తేజోరూపాలతో ప్రకాశిస్తుంటారు. అవి భౌతికతనువులు కావు అని ఇంద్రుడు సూచిస్తున్నాడు.

ఆ. **దైవ విహిత మగుటఁ దప్పింప రాకున్న। యట్టి యల్ప దుఃఖ; మనుభవించి**
తింక నిట సుఖంబు లేపార నాతోడ। విహరణం బొనర్పు విమలచరిత! 42

ప్రతిపదార్థం: దైవ= దైవంచేత; విహితంబు+అగుటన్= శాసించబడింది కావటంవలన; తప్పింపన్+రాక+ఉన్న+అట్టి= తప్పించటానికి వీలులేని; అల్పదుఃఖము= కొద్ది దుఃఖాన్ని; అనుభవించితి(వి)= అనుభవించావు; ఇట= ఇకమీద; సుఖంబులు+ఏపారన్= సుఖాలు అతిశయించగా; విమలచరిత!= ఓ నిర్మల చరిత్రగల ధర్మరాజా!; నాతోడన్= నాతో కలిసి; విహరణంబు= విహారం; ఒనర్పు= చేయుము.

తాత్పర్యం: విమలచరిత్రుడవైన ఓ ధర్మనందనా! దైవం శాసించినందున తప్పించటానికి వీలులేని అల్పదుఃఖాన్ని ఇంతవరకు అనుభవించావు. ఇక నాతో కలిసి సుఖాలు అతిశయించగా స్వర్గవిహారం చేయుము.

క. **మానిత సువ్రతములకు। న్దానకరణమునకు ననుగుణం బయిన శుభం**
బే నీకుం గావింపం। గా నుజ్జ్వల వృత్తిఁ బరఁగు కౌరవముఖ్యా! 43

ప్రతిపదార్థం: కౌరవముఖ్యా!= ధర్మరాజా!; మానిత= మన్నించబడిన; సువ్రతములకున్= ఉత్తమవ్రతాలు చేసినందుకు; దాన= దానాలను; కరణమునకున్= చేసినందుకు; అనుగుణంబు+అయిన= అనుగుణమైన; శుభంబు= శుభాన్ని; ఏన్= నేను; నీకున్+కావింపన్+కాన్= నీకు చేయగా; ఉజ్జ్వలవృత్తిన్= ప్రకాశంతో (తేజస్సుతో); పరఁగు(ము)= ఒప్పుము.

తాత్పర్యం: ధర్మరాజా! మన్నించబడ్డ ఉత్తమవ్రతాలు చేసినందుకు, దానాలు చేసినందుకు అనుగుణమైన శుభాలను నేను కలిగించగా నీవు ప్రకాశవంతుడవై వెలుగుము.

తే. **రాజసూయాశ్వమేధాధ్వరముల సంచి। తంబు లయిన యుదాత్త లోకంబు లనుభ**
వింపు మాధిక్య మహనీయ విభవ మెసఁగ। నక్షయోదార సౌఖ్యంబు లావహిల్ల. 44

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: రాజసూయ= రాజసూయం; అశ్వమేధ+అధ్వరముల= అశ్వమేధ యాగాలను చేసినందువలన; సంచితంబులు+అయిన= కూడబెట్టబడిన; ఉదాత్తలోకంబులు= పుణ్యలోకాలను; ఆధిక్య= ఆధిక్యంతో కూడిన; మహనీయ= గొప్ప; విభవము+ఎసఁగన్= వైభవం ఒప్పగా; అక్షయ= తరుగులేని; ఉదార= ఘనమైన; సౌఖ్యంబులు= సుఖాలు; ఆవహిల్లన్= కలుగగా; అనుభవింపుము= అనుభవించుము.

తాత్పర్యం: ధర్మనందనా! రాజసూయం, అశ్వమేధం మొదలైన యాగాల ఫలితంగా లభించిన పుణ్యలోకాలను ఆధిక్యంతో గొప్ప వైభవంతో తరుగులేని ఘనమైన సుఖాలతో అనుభవించుము.

సీ. **మహితవర్తనులైన మాంధాతృ నల హరి । శ్చంద్ర దిలీప దుష్యంత భరతు**
లొందిన కీర్తనీయోన్నతి నొందుము । నినుఁ గొనియాడంగ ముని నిలింప
గంధర్వ గరుడోరగ ప్రధానులు సిద్ధ । సాధ్య సత్తములును సకుతుకముగ
వచ్చినవా' రని వారినెల్లనుఁ జూప । నతఁడు వినయ సంభృతాంగుఁ డగుచు

తే. **నాదరముగఁ బ్రత్యుద్గతి యాచరింప । వార లెంతయుఁ బ్రీతిమై గారవంపుఁ**
బలుకు లెసఁగంగ నధిక సంభావనంబు । సేసి రాననములు విలసిల్లుచుండ. **45**

ప్రతిపదార్థం: మహితవర్తనులు+ఐన= ఉదాత్త జీవనులైన; మాంధాతృ= మాంధాత; నల= నలుడు; హరిశ్చంద్ర= హరిశ్చంద్రుడు; దిలీప= దిలీపుడు; దుష్యంత= దుష్యంతుడు; భరతులు= భరతుడు (వీరంతా); ఒందిన= పొందిన; కీర్తనీయ= ప్రస్తుతించదగిన; ఉన్నతిన్= ఔన్నత్యాన్ని; ఒందుము= పొందుము; నినున్ కొనియాడంగన్= నిన్ను ప్రశంసించటానికి; గంధర్వ= గంధర్వులు; గరుడ= గరుడులలో; ఉరగ ప్రధానులు= పాములలో ముఖ్యులైనవారు; సిద్ధ= సిద్ధులు; సాధ్యసత్తములున్= సాధ్యులలో ముఖ్యులు; సకుతుకముగన్= కుతూహలంతో; వచ్చినవారు+అని= వచ్చారని; వారిన్+ఎల్లనున్+చూపన్= వారినందరినీ చూపగా; అతఁడు= ధర్మరాజు; వినయ= వినయంతో; సంభృత+అంగుఁడు+అగుచున్= నిండిన దేహం కలవాడై; ఆదరముగన్= ఆదరంతో; ప్రతి+ఉద్గతి= లేచి నిలవటం; ఆచరింపన్= చేయగా; వారలు= వారంతా; ఎంతయున్= ఎంతో; ప్రీతిమైన్= ప్రీతితో; ఆననములు= ముఖాలు; విలసిల్లుచున్+ఉండన్= వికసిస్తుండగా; గారవంపు+పలుకులు= గౌరవవాక్యాలు; ఎసఁగంగన్= అతిశయించగా; అధిక= మిక్కిలిగా; సంభావనంబు+చేసిరి= గౌరవించారు.

తాత్పర్యం: ఉదాత్తజీవనులైన మాంధాత, నలుడు, హరిశ్చంద్రుడు, దిలీపుడు, దుష్యంతుడు, భరతుడు - వీరంతా ఏ ఉన్నత స్థితిని పొందారో ఆ కీర్తనీయమైన స్థానాన్ని పొందుము. నిన్ను ప్రశంసించటానికి గంధర్వులు, గరుడులు, ఉరగులు, సిద్ధులు, సాధ్యులు - వీరందరూ కుతూహలంతో వచ్చారు' అంటూ వారినందరినీ చూపాడు. వారిని చూచి ధర్మరాజు వినయాంగుడై లేచి నిలబడి నమస్కరించాడు. వారందరూ ఎంతో ప్రీతిగా ముఖాలు వికసించగా గౌరవవాక్యాలతో ధర్మనందనుడిని మిక్కిలిగా సత్కరించారు.

విశేషం: భారతచరిత్రలో సుప్రసిద్ధులు షట్చక్రవర్తులు. 'హరిశ్చంద్రో నలోరాజా పురుకుత్సః పురూరవః, సగరః కార్తవీర్యశ్చ షడేతే చక్రవర్తినః' అని చెప్పారు. కాని తిక్కనగారు చెప్పుతున్న మాంధాత్రాది చక్రవర్తులలోని లక్షణాలు ధర్మరాజులో ఏదో ఒకరకంగా అన్వయిస్తాయి కాబట్టి ఈ వరుసలో చెప్పాడు.

మాంధాత : యవనాశ్వుడు భృగుమహర్షి ఉంచిన మంత్ర జాలాగ్నితోడుగా అతడి గర్భంనుండి బయటపడ్డ కుమారుడు మాంధాత. ఇంద్రుడు ఆ శిశువునోట తనవేలుంచి కుడిపి పెంచాడు.

నలుడు : ద్యూతంలో సోదరుడివలన సర్వం కోల్పోయి 'ఏకవస్త్రులు'గా నలదమయంతులు అరణ్యావాసం చేశారు. ఒకే చీర కట్టుకొన్నారు. చివరికి అతడి ధర్మబుద్ధే అతడిని కాపాడింది. ధర్మనందనుడి కథకూడా ఇదే.

హరిశ్చంద్రుడు: సత్యవాక్పరిపాలకుడు. కడకు భార్యను బలిఇవ్వటానికి కూడా సిద్ధపడ్డాడు. ధర్మరాజుకూడా సత్యవాక్కుకనుకే -అశ్వత్థామా 'హతః కుంజరః అనే మాటను లోగొంతుకతో మాటాడాడు. అన్న మాటకు కట్టుబడే అరణ్య అజ్ఞాతవాసాలు చేశాడు.

దిలీపుడు : కామధేనువు శాపంవలన సంతానం కలుగక పోగా వసిష్ఠుడి ఆనతిమేరకు కామధేనువు సంతానమైన నందినిని భార్యతో కలిసి సేవించాడు. చివరకు ఆ నందినిని తినటానికి వచ్చిన పులికి తానే ఆహారం కావటానికి సిద్ధపడ్డాడు. దిలీపుడివలె ధర్మజుడు కూడా త్యాగమూర్తే.

దుష్యంతుడు : భార్యావియోగం సంభవించినా రాజధర్మాన్ని అనుష్ఠించటంలో అప్రమత్తత ప్రదర్శించిన ధీరోదాత్తుడు.

భరతుడు : శకుంతలా దుష్యంతుల పుత్రుడైన ఇతడే భరతరాజవంశాలకు కర్త అయ్యాడు. పాండవ కౌరవులదికూడా భరతవంశమే. అందుకే ఈ గ్రంథం భారతమయింది.అందుచేత ధర్మరాజు దుష్యంత భరతుల వంశంలో పుట్టి - ఆ వంశ ప్రతిష్ఠను తన ఉదాత్తజీవనంచేత వెలిగించాడని అర్థం.

వ. అమ్మహేంద్రుఁ డమ్మహానుభావునితో మఱియు నిట్లనియె. 46

ప్రతిపదార్థం: ఆ+మహేంద్రుఁడు= ఆ ఇంద్రుడు; ఆ+మహానుభావునితోన్= ధర్మరాజుతో; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ఇంద్రుడు ధర్మరాజుతో ఇంకా ఇట్లా చెప్పాడు.

క. 'ఆకాశగంగ యిదె పు। ణ్యాకృతి; యిన్నదిఁ బరిప్లుతాంగుఁడ వై సు
శ్లోకా! నాచెప్పిన నృప। లోకంబును మిగులు మమరలోకసుఖములన్.' 47

పతిపదార్థం: సుశ్లోకా!= యశోవంతుడా!; ఆకాశగంగ; ఇదె= ఇదిగో ఇదే; పుణ్య+ఆకృతి= పుణ్యమే ఈ నదిరూపంలో ఆకృతిదాల్చింది; ఈ+నదిన్= ఈ నదిలో; పరిప్లుత+అంగుఁడవు+ఐ= స్నానంచేసినవాడవై; అమరసుఖములన్= స్వర్గసుఖాల అనుభవంలో; నా చెప్పిన= నేను ఇంతకు మునుపు చెప్పిన; నృపలోకంబును= రాజుల సమూహాన్ని; మిగులుము= అతిశయించుము.

తాత్పర్యం: 'యశోవంతుడవైన ఓ ధర్మరాజా! ఇదిగో ఇదే ఆకాశగంగ. పుణ్యమే ఈ నది ఆకారాన్ని పొందింది. ఈ నదిలో స్నానంచేసి స్వర్గసుఖాల అనుభవంలో ఇంతవరకు చెప్పిన రాజ సమూహాన్ని అతిశయించి ప్రకాశించుము.'

యముఁడు ధర్మరాజు నుచిత వచనంబుల సంభాషించుట (సం.18-3-28)

సీ. అనియె నప్పుడు ధర్ముఁ డభిరామమూర్తి ము। ఖ ప్రసాదంబునఁ గరము వెలుఁగ
నా రాజవర్యునిఁ జేరంగ నరిగి ని। స్సీమగౌరవ! పరీక్షింప! గంటి
నిన్ను ముమ్మా; ఱరణీ ప్రసంగంబున। ద్వైతవనంబునఁ దగిలి కుక్క
తో వచ్చినప్పుడు దైవతగిరిపొంత। ననుజవర్గము విషయంబు గాఁగ.

తే. నిప్పు డిచటను; జలన మొకప్పుడైన। నీదుమది నించుకేనియు లేదు; దమము
శమము సత్యంబు మద్గత సారభక్తి। నీకు నగ్గలములు మహనీయచరిత! 48

ప్రతిపదార్థం: అప్పుడు= అట్లా ఇంద్రు డంటున్న సమయంలో; ధర్ముఁడు= యమధర్మరాజు; అభిరామమూర్తి= మనోహరమైన ఆకారంకలవాడు; ముఖప్రసాదంబునన్+కరము వెలుఁగన్= ముఖం యొక్క ప్రసన్నతచేత మిక్కిలి ప్రకాశిస్తూ; ఆ రాజవర్యునిన్= ధర్మరాజును; చేరంగన్+అరిగి= సమీపించి; అనియెన్= ఇట్లా అన్నాడు; నిస్సీమగౌరవ!= ఎల్లలు లేని గౌరవం పొందిన ఓ రాజా!; నిన్నున్= నిన్ను; ద్వైతవనంబునన్= అరణ్యవాస సమయంలో ద్వైతవనంలో; అరణీ ప్రసంగంబునన్= అరణి విషయంగానూ; దైవతగిరిపొంతన్= మేరుపర్వత సమీపంలో; తగిలి= ఇష్టపడి; కుక్కతోన్+వచ్చినప్పుడు= కుక్కతో వచ్చిన సమయంలో; ఇప్పుడు+ ఇచటను= ఇప్పుడిక్కడ; అనుజవర్గము విషయంబు+కాఁగన్= సోదర సమూహ విషయంగానూ; ముమ్మాఱు= మూడుసార్లు; పరీక్షింపన్+కంటిని= పరీక్షించి చూచాను; మహనీయచరిత!= పుణ్యచరిత్రుడా!; నీదుమదిన్= నీ మనసులో; ఒకప్పుడైనన్= ఒకసారైనా; చలనము= కదలిక; ఇంచుకేనియున్= కొంచెంకూడా; లేదు= కనిపించదు; నీకున్= నీకు; దమము= బాహ్యేంద్రియనిగ్రహం; శమము= అంతరింద్రియనిగ్రహం; సత్యంబు= సత్యగుణం; మత్+గత+సారభక్తి= నాపై ఉన్న గాఢభక్తి; అగ్గలములు= మిక్కిలి ప్రశంసనీయాలు.

తాత్పర్యం: ఇట్లా ఇంద్రు డంటున్న సమయంలో మనోహరాకారుడూ, ముఖం యొక్క ప్రసన్నతచేత ప్రకాశిస్తున్నవాడూ అయిన యమధర్మరాజు ధర్మరాజును సమీపించి ఇట్లా అన్నాడు; 'అనంత గౌరవం పొందిన ఓ రాజా! నిన్ను మొదటిసారి ద్వైతవనంలో అరణి విషయకంగానూ, రెండోసారి మేరుపర్వత సమీపంలో కుక్కతో నీవు వచ్చినప్పుడూ, మూడోసారి ఇప్పుడు ఇక్కడ నీ సోదరుల స్వర్గప్రాప్తి విషయంలోనూ - మూడుసార్లు నిన్ను నేను పరీక్షించాను. ఓ పుణ్యచరిత్రుడా! నీ మనసులో ఒక్కసారికూడా ఏ కొంచెమైన కదలిక కూడా లేదు. నీకు దమ, శమ, సత్యగుణాలూ, నాపైన ప్రగాఢమైన భక్తీ ఉన్నాయి.

విశేషం: ధర్మరాజు అవతార రహస్యం ఇందులో ఉంది. ధర్మం పురుషార్థాలను బంధిస్తుంది. ధరిస్తుంది. అందుకే అది 'అక్షం' (ఇరుసు)వలె కదలకుండా ఉంటుంది. అదే ధర్మనందనుడిలోని నిశ్చలత్వం.

సారభక్తి= గాఢమైన అన్నది వాచ్యార్థంగా చెప్పినా, అంతస్తత్త్వరూపమైన కూడిక అని అర్థం. భక్తి - శబ్దానికి కలిసి ఉండటమనే అర్థం ఉంది. 'సార' మన్నా, 'అంతస్తత్త్వ' మన్నా ఒక్కటే. యముడి అంశే ధర్మరాజు కాబట్టి ఈ మాట చాలా అర్థవంతమైనది. సాక్షాత్తు యముడే సెలవిస్తున్నాడు కాబట్టి.

దమం - అంతరింద్రియ నిగ్రహం. జ్ఞానేంద్రియ వ్యాపారాలను నియమిస్తూ దేహస్థితిని తన అదుపులోనికి తీసికొని నిశ్చలత్వాన్ని సాధించటం. ధర్మరాజు దీనిని సాధించటంచేత ఆ మహాప్రస్థానంలో పడిపోలేదు.

సత్యం- 'ఋతం సత్యం చ, పరం ధీమహి' - పరతత్త్వ స్పృహతోడి ధర్మాన్ని నిర్వహింపజేసే మహాశక్తి 'సత్యం', భారతంలోని పరతత్త్వస్పృహ పేరే శ్రీకృష్ణుడు. ధర్మాన్ని నిర్వహింపజేసిన మహాశక్తి ధర్మరాజు. కనుక ఆయన 'సత్య' రూపుడు. అందుకే ఆయన ఒకడే మిగిలాడు. ఏది 'సత్' పదార్థమో అది ఎప్పటికీ అనంతంగా మిగులుతుంది.

ఇక్కడ 'యముడు' కాలస్వరూపుడు 'కాలో యం' అని శ్రుతి చెప్పిన మహాతత్త్వం ఇది. ఏది సత్యరూపంలో ధర్మాన్ని నిర్వహింపజేసి జగత్తును క్రమబద్ధం చేస్తుందో అదే 'సమవర్తి' అయిన కాలస్వరూపం. ఆ సమ 'వృత్తి'ని ధర్మరాజులో ప్రబోధించటమే ఇంతవరకు ఇంద్రుడు చేసింది. అది ఏర్పడగానే 'యముడు' ప్రత్యక్షమయ్యాడు. ఇదే ఈ సంఘటనలోని సాంకేతికార్థం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అందుచేత స్వర్గారోహణ మంటే ఈ శమదమ సత్య స్వరూపంలో నరరూపాన్ని అందిన 'ధర్మరాజు' ఐక్యంకావటమని అర్థం. గీతాకారుడు దీనినే అక్షర పరబ్రహ్మయోగమన్నాడు. మోక్షమని దీనికి వ్యావహారిక నామం.

వ. పరిశోధితుండ వయితి; కలంక దొఱంగి సుఖివి గ'మ్మని పలికి 'రాజునకు నవశ్యంబును నరకంబు సూచుట గలదు గావున నత్తెఱంగున కయి యేనును వాసవుండును నిన్నుం గడుఁగీడగు నచ్చోటు సొనిపితిమి. సూర్యతనయ పవననందనాదుల నరక దుఃఖానుభావంబులు మా చేసిన యెడ మాయంబులగుట నీకుఁ దెలిసె; వారు పుణ్యలోకవాసులయి యునికియు వాసవు వాక్యంబులఁ దేటపడియె' నని చెప్పి. 49

ప్రతిపదార్థం: పరిశోధితుండవు+అయితి(వి)= నీవు బాగా పరిశోధించబడ్డావు; కలంక= వ్యథను; తొఱంగి= వదలిపెట్టి; సుఖివికమ్ము= సుఖంగా ఉండుము; అని పలికి= అని చెప్పి (ఇంకా ఇట్లా అన్నాడు); రాజునకున్= రాజైనవాడికి; అవశ్యంబును= తప్పకుండా; నరకంబు = నరకాన్ని; చూచుట= చూడటం; కలదు= ఉన్నది; కావునన్= అందుచేత; ఆ+తెఱంగునకున్+అయి= దానికొరకని; ఏనును= నేనూ; వాసవుండును= ఇంద్రుడూ; నిన్నున్= నిన్ను; కడున్+కీడు+అగు= చాలా రోత అయినటువంటి; ఆ+చోటు= ఆ చోటికి; చొనిపితిమి= పంపించాము; సూర్యతనయ= కర్ణుడు; పవననందన+ఆదులు= భీమాదులు పడిన; నరకదుఃఖ+ అనుభావంబులు= నరక దుఃఖానుభవాలు; మా చేసిన= మేము పన్నిన; ఎడన్+చోట మాయంబులు+అగు= మాయంకావటం; నీకున్+తెలిసెన్= నీకు తెలిసింది; వారు= కర్ణాదులు; పుణ్యలోక వాసులు+అయి+ఉనికి= పుణ్యలోకవాసులుగా ఉండటం; వాసవు వాక్యంబులన్= ఇంద్రుడి మాటలచేత; తేటపడియెన్= స్పష్టమయింది (కదా); అని చెప్పి (ఇట్లా సెలవిచ్చాడు).

తాత్పర్యం: 'నీవు బాగా పరిశోధించబడ్డావు. వ్యథను వదలిపెట్టి సుఖంగా ఉండుము' అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు. రాజైనవాడికి నరకాన్ని చూడటం తప్పనిసరి కాబట్టి నేనూ ఇంద్రుడూ నిన్ను కడు రోతను కలిగించే ఆ చోటికి పంపాము. కర్ణ భీమసేనాదులు పడ్డ నరక బాధలన్నీ మేము పన్నిన స్వల్ప మాయాదృశ్యాలని నీకు తెలిసింది కదా! కర్ణాదులు పుణ్యలోక వాసులై ఉన్నారన్నది ఇంద్రుడిమాటలవలన స్పష్టమయిందిగా!' అని చెప్పి ఇట్లా సెలవిచ్చాడు.

విశేషం: శోధన= వెదకటమని అర్థం, పరి= మిక్కిలిగా; భగవంతుడు భక్తుడికి పెట్టే పరీక్షలకు 'శోధన' అంటారు. ఋణం నుండి విముక్తుడు కావటాన్నికూడా శోధన మంటారు. పాపక్షాళనం కావటం కూడా శోధనమే. ధర్మరాజు విషయంలో ఇన్ని అర్థాలూ సమన్వయిస్తాయి.

ధర్మరాజు జీవితమంతా సోదరులతో ధర్మపత్నితో నిరంతర పరీక్షలను ఎదుర్కొన్నాడు. సంపాదించిన రాజ్యసంపద నెత్తురుకూడని తెలిసి విరాగభావం పొందగా 'తృష్ణ' క్షయమయింది. 'తృష్ణ' అంటే దప్పిక. రాజ్యకాంక్ష దాయాదులను జయించాలన్న తీవ్రమైన కోరిక - ఈ రెండూ నశించాయి. పూర్వపర్వ కథలలో ఇవన్నీ ప్రస్తావించబడ్డాయి.

పాపక్షాళనం ఇక్కడ జరిగింది. అదే నరకానుభవ దర్శనం. ఈ మూడింటిచేత 'పరి' - సమగ్రంగా 'శోధితుడు' అయ్యాడు.

ఇది భారతీయ సంస్కృతిలో 'పరిశోధన', అంటే ధర్మరాజు జీవితం ఒక మహాశోధన. అన్వేషణ, దీనికి గమ్యస్థానమే 'స్వర్గారోహణం'

క. 'నీ వియ్యాకాశనదీ। పావన సలిలముల మునుఁగు భవ్యాత్మ ! భవ
ద్భావంబు విడుచు మానుష। భావ వికారముల శోకబంధము లడఁగున్. 50

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: భవ్య+ఆత్మ!= పుణ్యాత్మా!; నీవు; ఈ+ఆకాశ+నదీ= ఈ ఆకాశ గంగానదియొక్క; పావన= పవిత్ర; సలిలములన్ = జలాలలో; మునుఁగు= మునుగుము; భవత్+భావంబు= నీ మనసును; మానుష= మనుష్య సంబంధాలైన; భావ వికారముల= భావ వికారాల; విడుచున్= వదలిపెట్టును; శోకబంధములు= శోకమూ, బంధమూ; అడఁగున్= నశిస్తాయి.

తాత్పర్యం: పుణ్యాత్మా! నీవు ఈ ఆకాశగంగయొక్క పవిత్ర జలాలలో మునుగుము! నీ మనస్సు నుండి మనుష్య సంబంధమైన భావవికారాలు తొలగిపోతాయి. శోకబంధాలూ నశిస్తాయి.

విశేషం: ధర్మరాజులోని ఆత్మ భవ్యమైనదే. అది దివ్యత్వం కలిగిందే. కాని అతడి మానుష శరీరం కారణంగా 'సంసార' భావం పోలేదు. భవత్ - సంసార, జన్మ. స్వ సంబంధమైన ఆలోచన. నేను నేనన్న భావన పేరే మోహం. నేను దేహంకాదు, ఆత్మనని గుర్తించటమే జ్ఞానం.

ఈ మోహం కారణంగా - భావ వికారాలు ఏర్పడతాయి. నిశ్చలత్వం ఉండదు. ఈ కుదురులేనితనం నుండి 'శోకం' పుడుతుంది. ఈ విషాదాన్ని పెంచేది 'సంసారబంధం'. స్వర్గానికి చేరిన తరువాత కూడా ధర్మరాజులో 'నేను' అన్న భావన తన సోదరులు దుఃఖ మనుభవిస్తున్నారన్న 'వ్యథ' పోలేదు.

అందుకే ఆకాశగంగలో స్నానం చేయుము అని యముడు ఆదేశిస్తున్నాడు. 'వియద్గంగ' - అని ఆకాశగంగనే అంటారు. విష్ణువు పాదంలోపుట్టిన గంగ ఆకసంనుండి శివుడి శిరస్సుపై పడుతుందని పురాణాలు చెప్పుతాయి. ఆత్మకున్న విశ్వవ్యాపన స్వభావమే 'ఆకాశగంగ' అన్నారు.

చ. **పరమ సుఖంబుఁ జెంది యతిభాస్వరులై విహరించు నీదు సో**
దరు లగు కర్ణ ముఖ్యుల ముదం బెసలారఁగఁ జూచె దీ మహో
త్తర బహు సౌఖ్యనిర్మల పదంబున దివ్య విహార లీలలం
బరఁగెద వేల? యిం కిచట బాంధవరక్షక! రమ్ము చెచ్చెరన్.' **51**

ప్రతిపదార్థం: బాంధవరక్షక!= బంధువులను రక్షించే స్వభావమున్న ధర్మరాజా!; పరమసుఖంబున్+చెంది= స్వర్గసుఖాన్ని అనుభవిస్తూ; అతిభాస్వరులు+ఐ= మిక్కిలి ప్రకాశించువారై; విహరించు= విహరిస్తున్న; నీదు సోదరులు+అగు= నీ సోదరులయిన; కర్ణముఖ్యులన్= కర్ణాదులను; ముదంబు= సంతోషం; ఎసలారఁగన్= అతిశయించగా; చూచెదు= చూద్దువుగానీ; నిర్మలపదంబునన్= నిర్మలమైన స్థానంలో; దివ్య= దివ్యమైన; విహారలీలలన్= విహార లీలలలో; పరఁగెదవు= ఒప్పుతావు (ప్రకాశిస్తావు); ఇంకన్= ఇంకా; ఇచట= ఇక్కడ ఉండటం; ఏల?= ఎందుకు?; చెచ్చెరన్= శీఘ్రంగా; రమ్ము= రా! (వెళ్ళుదాం పద).

తాత్పర్యం: బంధురక్షకా! స్వర్గసుఖాన్ని అనుభవిస్తూ మిక్కిలి ప్రకాశిస్తున్న నీ సోదరులైన కర్ణాదులను సంతోషం అతిశయించగా చూద్దువుగాని ఈ మహత్తర బహు సౌఖ్యాలతో ఒప్పిన నిర్మలస్థానంతో దివ్య విహారంలో నీవుకూడా ప్రకాశిస్తావు. ఇంకా ఇక్కడ ఉండటం ఎందుకు? వెంటనే వెళ్ళుదాం పద!'

విశేషం: శ్రీరాముడిని గురించి 'రక్షితా స్వస్య ధర్మస్య - స్వజనస్య చ రక్షితా' అని చెప్పారు. శ్రీరాముడు స్వధర్మాన్ని రక్షించాడు. స్వజనులను రక్షించాడు. సరిగా ఈ అర్థంలోనే ధర్మరాజుకూడా బంధురక్షకుడయ్యాడు. ధర్మరాజే లేకపోతే పాండవపక్షమే లేదు. స్వర్గానికి వెళ్ళికూడా బంధువుల గురించి పరితపించిన ధర్మరాజులో స్వజనరక్షణబుద్ధి అపరిమితంగా ఉన్నది.

ధర్మజుఁ డాకాశగంగావగాహంబుఁ జేసి దేవభావంబు నొందుట (సం.18-3-40)

సీ. అని పల్కి ధర్ముఁ డత్తనయునిఁ దోడ్కొని । యయ్యందఱును దోడ నరుగుదేర
నాకాశ గంగ యుపాంతమునకుఁ బోవ । నప్పుణ్యనది నమ్మహానుభావుఁ
డార్య సంస్తవన వాక్యంబులు చెలఁగ భ । వ్యస్నానమంగళ మాచరించి
మానుష తనువు నమ్మాత్రన విడిచి ది । వ్యం బగు మహితదేహంబు దాల్చి

తే. వైరమత్సర స్నేహ సంవాసలౌల్య । గర్వశోకాదులైన హృద్గత వికార
ములఁ దొఱంగి నిర్ధూమత్వమున వెలుంగు । పావకుఁడుఁబోలె శోభిల్లెఁ బౌరవేంద్ర! 52

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర!= రాజా!; అని పల్కి= అని చెప్పినవాడై; ధర్ముఁడు= యమధర్మరాజు; ఆ+తనయునిన్= ఆ కుమారుడిని (ధర్మజుడిని); తోడ్కొని= వెంటబెట్టుకొని; ఆ+అందఱునున్= వారందరూ; తోడన్+అరుగుదేరన్= వెంట రాగా; ఆకాశగంగా+ ఉపాంతమునకున్= ఆకాశగంగ సమీపానికి; పోవన్= వెళ్ళగా; ఆ+పుణ్యనదిన్= ఆ పుణ్యనదిలో; ఆ+మహానుభావుఁడు= ధర్మరాజు; ఆర్య= పెద్దల; సంస్తవన వాక్యంబులు= ప్రశంసావాక్యాలు; చెలఁగన్= అతిశయించగా; భవ్య= శుభప్రదమైన; స్నానమంగళము= మంగళస్నానాన్ని; ఆచరించి= చేసి; మానుషతనువున్= మనుష్యదేహాన్ని; ఆ+మాత్రన్+అ= ఆ క్షణంలోనే; విడిచి= వదలిపెట్టి; దివ్యంబు+అగు= దివ్యమైన; మహిత= పూజ్య; దేహంబున్= శరీరాన్ని; తాల్చి= ధరించి; వైర= వైరం; మత్సరం= మాత్సర్యం; స్నేహ= స్నేహం; సంవాస= సహవాసం; లౌల్య= చంచలత్వం; గర్వ= గర్వం; శోక+ఆదులు+ఐన= శోకం మొదలైన; హృద్+గత= హృదయంలోని; వికారములన్+తొఱఁగి= వికారాలను పోగొట్టుకొని; నిర్ధూమత్వమునన్= పొగలేకుండా (ఉజ్జ్వలంగా); వెలుంగు= ప్రకాశించే; పావకుఁడున్+పోలెన్= అగ్నిదేవుడివలె; శోభిల్లెన్= ఒప్పాడు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ఇట్లా చెప్పి యమధర్మరాజు తన కుమారుడిని తోడ్కొని వారందరూ తోడు రాగా ఆకాశగంగ సమీపానికి వెళ్ళాడు. ఆ పుణ్యనదిలో ఆ మహానుభావుడు పెద్దల సంస్తుతులు అతిశయించగా శుభప్రదమైన మంగళస్నానం చేశాడు. ఆ క్షణంలోనే మానుషదేహాన్ని వదలిపెట్టి దివ్యమైన పూజ్యదేహాన్ని పొందాడు. అంతటితో అతడి హృదయంలో ఉన్న వైరం, మాత్సర్యం, స్నేహం, సహవాసం, చంచలత్వం, గర్వం, దుఃఖం మొదలైన మనుష్య సహజాలైన మనోవికారాలన్నీ మాయమయ్యాయి. అపుడు ధర్మరాజు పొగలేని అగ్నిదేవుడివలె మహోజ్జ్వలంగా ప్రకాశించాడు.

విశేషం: 'దివ్య' మంటే తేజోరూపమైన అని అర్థం. ఇంతకుమునుపే వివరించినట్లు వైరాది భావాలన్నీ ధర్మరాజు దేహాన్ని ఆశ్రయించి ఉండినందువలన ఆ దేహాన్ని వదలగానే అవి కూడా నశించాయి. తేజోరూపంలో ధర్మరాజు దివ్యత్వాన్ని పొందాడు. అలం : ఉపమ.

వ. ఇవ్విధంబున నొప్పి మీ తాత ధర్మనందనుండు బృందారక నాయక నారదాద్యుదార పురుషుల నభినందించుచు ధర్ముండును దారును దో నరుగుదేర దివ్యశక్తి నటఁ జని మనోహరం బయిన యొక్కయెడ.53

పతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; ఒప్పి= ప్రకాశించి; మీ తాత= మీ తాతగారైన (పరీక్షిత్తు పెద్దతండ్రి కాబట్టి తాత); ధర్మనందనుండు= ధర్మరాజు; బృందారక నాయక= ఇంద్ర; నారద+ఆది+ఉదార+పురుషులన్= నారదుడు మొదలైన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మహనీయులను; అభినందించుచున్= ప్రస్తుతిస్తూ; ధర్మండును= యమధర్మరాజు; తారును= వారూ; తోన్+అరుగుదేరన్= తోడురాగా; దివ్యశక్తిన్= దివ్యశక్తితో; అటన్+చని= ముందుకు వెళ్ళి; మనోహరంబు+అయిన= మనోహరమైన; ఒక్క+ఎడన్= ఒక చోట.

తాత్పర్యం: ఈ విధంగా ప్రకాశించే మీ తాతగారైన ధర్మరాజు ఇంద్రుడిని, నారదాది మహర్షులను ప్రస్తుతిస్తూ యమధర్మరాజు, వారు తోడురాగా దివ్యశక్తితో ముందుకు వెళ్ళి అక్కడ మనోహరమైన ఒక చోట. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **విస్ఫుర ద్బహురత్న వితతి కనత్కన । కాత్మకం బయిన మహాసనమున**
దేదీప్యమాన మై దివ్యావయవదీధి । తి ప్రతానం బెల్ల దిశల వెలుఁగఁ
జక్రగదాద్యస్త్రసంతతి నుజ్జ్వలా । త్యంత సుందర పురుషాకృతులును
జారుమౌళి స్థలీ సమవేత నిజరూప । ములుఁ గల్గి భక్తిమై బలసి కొలువఁ

తే. **దనదు చూడ్కికి నెంతయుఁ దగు లొనర్చి । మున్ను చూచిన యట్లగుమూర్తి యొప్ప**
నరుఁడు కేవల సవినయ పరత వెలుఁగఁ । బొలుచు నారాయణునిఁ గాంచె భూపవర్య! **54**

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజోత్తమా! జనమేజయ మహారాజా!; విస్ఫురత్= ప్రకాశిస్తున్న; బహురత్న వితతి= బహురత్న సముదాయంతో; కనత్= వెలుగుతున్న; కనక+ఆత్మకంబు+అయిన= బంగారుమయమైన; మహాసనమునన్= సింహాసనంలో; దేదీప్యమానమై= మిక్కిలిగా ప్రకాశిస్తూ; దివ్య+అవయవ దీధితి ప్రతానంబు= దివ్యమైన అవయవాలకాంతి విస్తృతి; ఎల్లదిశలన్= అన్ని దిశలలోనూ; వెలుఁగన్= విస్తరించగా; చక్ర గదా+ఆది అస్త్రసంతతి= చక్రం, గద మొదలైన అస్త్ర సమూహం; ఉత్+జ్వల= మిక్కిలి ప్రకాశిస్తున్న; అతి+అంత= మిక్కిలి; సుందర పురుష+ఆకృతులును= సుందరమైన పురుష రూపాలూ; చారు= అందమైన; మౌళిస్థలీ= కిరీటాలతో; సమవేత= కూడిన; నిజరూపములున్= స్వస్వరూపాలూ; కల్గి= కలిగి; భక్తిమైన్= భక్తితో; బలసి= అతిశయించి; కొలువన్= కొలువగా; తనదు చూడ్కికిన్= తన చూపునకు; ఎంతయున్= ఎంతో; తగులు= ఆసక్తి; ఒనర్చి= కూర్చి; మున్ను= మునుపు; చూచిన+అట్లు+అగు+ మూర్తి= చూచినట్లే ఉన్న ఆకారం; ఒప్పన్= శోభించగా; నరుఁడు= అర్జునుడు; కేవల= స్వచ్ఛంగా; సవినయపరతన్= వినయపరత్వంతో; వెలుఁగన్= ప్రకాశించగా; పొలుచు= ఒప్పుతున్న; నారాయణునిన్= శ్రీమన్నారాయణమూర్తిని; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: ప్రకాశిస్తున్న బహురత్న సముదాయంతో వెలుగుతున్న బంగారు సింహాసనంలో ప్రకాశిస్తున్న దివ్యమైన అవయవాల కాంతి దిశలన్నిటా విస్తరించగా, శంఖ, చక్ర, గదాయుధాలు మిక్కిలి సుందర పురుషాకృతులతో, అందమైన కిరీటాలు కలిగి తమ రూపాలతో అతిభక్తితో కొలుస్తుండగా, తన నేత్రాలకు మిక్కిలి సొంపును కూర్చి, మునుపు చూచినట్లే ఉన్న ఆకారంతో సమీపంలో నరుడు (అర్జునుడు) స్వచ్ఛమైన వినయంతో నమస్కరిస్తుండగా ఒప్పుతున్న శ్రీమన్నారాయణమూర్తిని ధర్మరాజు చూచాడు.

విశేషం: నారాయణుడున్నచోట నరుడుంటాడు. నరనారాయణుల ప్రసక్తి పూర్వపర్వాలలో వచ్చింది. చక్రగదాద్యాయుధాలు పురుషరూపాలలో ఉంటాయని మంత్రస్మరణచేత ఆయుధరూపాలను పొందుతాయని అర్థం. కనుకే వీటిని తిక్కనగారు 'అస్త్రా'లని పిలుస్తున్నారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చ. **కని మది నమ్మహాత్ముఁ డధిక ప్రమదంబు వహించె; నొండెడం**
గనుఁగొనియెం బ్రియం బెసఁగఁ గౌరవవంశవరేణ్య! దీప్తి ధా
ముని రవిపంక్తిలోనఁ బదుమూఁడవ మూర్తి వెలుంగుచుండఁ గ
ర్ణుని మఱి భీమసేనుని మరుద్గణ మధ్యగతత్వ శోభితున్. **55**

ప్రతిపదార్థం: కని= చూచి; ఆ+మహాత్ముఁడు= మహాత్ముడైన ఆ ధర్మరాజు; మదిన్= హృదయంలో; అధిక ప్రమదంబున్= మిక్కిలి సంతోషం; వహించెన్= పొందాడు; కౌరవవంశవరేణ్య!= ఓ జనమేజయ మహారాజా!; ఒండెడన్= మరోవైపు; ప్రియంబు+ఎసఁగన్= ప్రేమ అతిశయించగా; దీప్తిధాముని= కాంతికి నెలవుగా; రవిపంక్తిలోన్= సూర్య సమూహంలో; పదుమూఁడవమూర్తి= పదమూడవవాడుగా; వెలుంగుచున్+ఉండన్= ప్రకాశిస్తున్న; కర్ణునిన్= కర్ణుడిని; మరుత్+గణ= మరుద్గణాల; మధ్యగతత్వ శోభితున్= నడుమ ప్రకాశిస్తున్న; భీమునిన్= భీముడిని; కనుంగొనియెన్= చూచాడు.

తాత్పర్యం: అట్లా చూచి ధర్మరాజు తన హృదయంలో మిక్కిలిగా సంతోషించాడు. మరోవైపు ప్రేమ అతిశయించగా, కాంతికి నెలవుగా సూర్యసమూహంలో పదమూడవవాడుగా శోభిస్తున్న కర్ణుడిని, మరుద్గణాలనడుమ ప్రకాశిస్తున్న భీముడిని కూడా చూచాడు.

విశేషం: ద్వాదశ - ఆదిత్య మండలాలున్నాయి. ఈ పండ్రెండింటికి తోడుగా పదమూడవస్థానంలో కర్ణుడు ప్రకాశిస్తున్నాడట! సప్త మరుద్దేవతలున్నారు. వారినడుమ భీముడు శోభిస్తున్నాడు.

తే. **అంగముల భంగి తొల్లింటి యట్ల యై య । నూన తేజోవిరాజితు లైన వారిఁ**
గనియె నశ్వసమీపవర్తనులఁ దత్స । మానమూర్తుల వీక్షించె మాద్రిసుతుల. **56**

ప్రతిపదార్థం: అంగములభంగి= ఆకారాలరీతి; తొల్లింటియట్ల+ఐ= మునుపటివలె ఉండి; అనూన= అధికమైన; తేజో విరాజితులు+ ఐనవారిన్= తేజంతో ప్రకాశిస్తున్న; అశ్విసమీపవర్తనులన్= అశ్వినీదేవతల సమీపంలో ఉన్నవారూ; తద్+సమాన మూర్తులన్= వారితో సమానమైన రూపాలు కలవారు అయిన; మాద్రిసుతులన్= మాద్రికుమారులైన నకుల సహదేవులను; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: ఆకారాల రీతి మునుపటివలె ఉండగా తేజంతో ప్రకాశిస్తూ అశ్వినీదేవతల సమీపంలో వారితో సమానమైన రూపాలతో ఒప్పుతున్న నకుల సహదేవులను కూడా చూచాడు.

చ. **ఉదిత రవిచ్ఛవిం దరుణి నుత్పలగంధి నుదాత్తమూర్తి ద్రౌ**
పది నచొటెల్లనుం దన ప్రభన్ వెలుఁగొందఁగఁ జేయుదాని న
వ్విదితయశుండు చూచి మది విస్మయమందఁగ నింద్రుతోడ 'ని
మ్మదవతి యెవ్వ? రార్యజనమాన్యచరిత్ర! యెఱుంగఁ జెప్పవే.' **57**

ప్రతిపదార్థం: ఉదిత= ఉదయించిన; రవిచ్ఛవిన్= సూర్యకాంతితో (ప్రకాశించే); తరుణిన్= స్త్రీని; ఉదాత్తమూర్తిన్= గంభీరమైన ఆకృతి కలిగినదానిని; అచొటు+ఎల్లనున్= ఆ ప్రదేశమంతటా; తన ప్రభన్= తన దివ్యకాంతిని; వెలుఁగు+ఒందఁగన్+చేయుదానిన్= ప్రకాశింపచేస్తున్న దానిని; ద్రౌపదిన్= ద్రౌపదిని; ఆ+విదితయశుండు= (ప్రఖ్యాత కీర్తి అయిన) ధర్మరాజు; చూచి; మది= హృదయం;

విస్మయము+అందఁగన్= ఆశ్చర్యాన్ని పొందగా; ఇంద్రుతోడన్= ఇంద్రుడితో; ఆర్యజనమాన్యచరిత్ర!= ఆర్య జనులచేత పూజించబడే ఓ ఇంద్రా!; ఈ+మదవతి= ఈ స్త్రీ; ఎవ్వరు= ఎవరు; ఎఱుంగన్+చెప్పవే= తెలియ జెప్పుము.

తాత్పర్యం: ఉదయించిన సూర్యకాంతితో ప్రకాశిస్తూ, గంభీరమైన ఆకృతి కలిగి, ఆ చోటును తన దివ్య ప్రకాశంతో వెలుగజేస్తూ ఉన్న ద్రౌపదీ మహాసతిని చూచి ఆశ్చర్యమగ్నుడై, ఎవరో పోల్చుకొనలేక మహేంద్రుడిని ఇట్లా అడిగాడు. 'స్వామీ! ఈ స్త్రీ ఎవరు? నాకు దయచేసి చెప్పండి.'

విశేషం: తిక్కన అందరిని పోల్చుకొనగలిగిన ధర్మరాజు ద్రౌపదిని ఎందుకు గుర్తించలే? దన్న సంశయానికి తరువాతి పద్యంలో సమాధానమున్నది. ద్రౌపది అవతారరహస్యం ఈ పద్యంలో ఉన్నది.

ఇంద్రుఁడు ధర్మజునకు దేవత్వంబు నొందిన స్వజనంబులఁ జూపి చెప్పుట (సం.18-4-9)

సీ. **అనవుడు నతనితో నాతఁ 'డీ భామ మ । హాలక్ష్మి ద్రౌపది' యనఁగ ద్రుపదు**
నికిఁ గూఁతురై యయోనిప్రభవం బగు । మానుషరూపంబు మహితలీల
ముగఁ దాల్చి భవదనుభూతి సెల్లించె గౌ । రీశ్వరు నాజ్ఞ వహించి వచ్చె'
నని చెప్పి, యల్ల రమ్యాకృతు లేవురు । గంధర్వవరులు నిక్కమలనయన

తే. **యందు మీకు జన్మించిన యక్కుమారు; । లల్లవాఁడె మీ తండ్రికి నగ్రజుండు**
ప్రకట గంధర్వపతి ధృతరాష్ట్రనాముఁ । డిందు నతఁ' డంచుఁ జూపె నరేంద్రముఖ్య! **58**

ప్రతిపదార్థం: నర+ఇంద్రముఖ్య!= ఓ జనమేజయమహారాజా!; అనవుడున్= అని ధర్మరాజు అడుగగా; అతఁడు= ఇంద్రుడు; అతనితోన్= ధర్మరాజుతో (ఇట్లా అన్నాడు); ఈ భామ= ఈ స్త్రీ; మహాలక్ష్మి= శ్రీమహాలక్ష్మి; ద్రౌపది+అనఁగన్= ద్రౌపది అనే పేరుతో; ద్రుపదునికిన్+కూఁతురు+ఐ= ద్రుపదుడి కూతురుగా; అయోనిప్రభవంబు+అగు= అయోనిజగా; మానుషరూపంబున్= మనుష్యరూపాన్ని; మహితలీలముగన్+తాల్చి= ఉదాత్త లీలతో ధరించి; భవత్+అనుభూతిన్+చెల్లించెన్= నీకు సంతోషం కలిగించింది; గౌరీ+ఈశ్వరు+ఆజ్ఞ= ఈశ్వరుడి ఆజ్ఞను; వహించి వచ్చెన్= పాలించి అవతరించింది; అని చెప్పి; అల్ల= అదిగో అక్కడున్నవారు; రమ్య+ఆకృతులు= అందమైన రూపాలు కలవారు; ఏవురు= ఐదుగురు; గంధర్వవరులున్= గంధర్వ శ్రేష్ఠులు; ఈ+కమలనయన+అందున్= కమలములవంటి కన్నులు గల ఈ ద్రౌపదియందు; మీకన్= మీకు; జన్మించిన= పుట్టిన; ఆ+కుమారులు= ఉపపాండవులు; ఇందున్= వీరిలో; అతఁడు= అతడే అల్లవాఁడె= అదిగో ఆయనే; మీ తండ్రికిన్+ అగ్రజుండు= మీ నాయనకు అన్న; ప్రకట గంధర్వపతి= ప్రసిద్ధుడైన గంధర్వనాయకుడు; ధృతరాష్ట్రనాముఁడు= ధృతరాష్ట్రుడని పేరు కలవాడు; అంచున్= అంటూ; చూపెన్= కనబరిచాడు.

తాత్పర్యం: అని ధర్మరాజు అడుగగా ఇంద్రు డిట్లా అన్నాడు. 'నాయనా! ఈమె శ్రీమహాలక్ష్మి. ద్రౌపది అనే పేరుతో ద్రుపదుడి ఇంట అయోనిజగా మానవరూపాన్ని లీలగా పొందిన సాధ్వి. మీకు సర్వసుఖానుభవాన్ని కలిగించింది. మహేశ్వరుడి ఆజ్ఞతో ఈమె అవతరించింది. అదిగో అక్కడున్న ఐదుగురు గంధర్వశ్రేష్ఠులు ఈమెవల్ల మీకు కలిగిన ఉపపాండవులు. మరి అక్కడ కనిపిస్తున్నవాడే ప్రఖ్యాతుడైన గంధర్వనాయకుడు ధృతరాష్ట్రుడు. మీ పెదతండ్రి' అంటూ వారిని చూపాడు.

విశేషం: ఆదిపర్వంలో ఉన్న పంచేంద్రోపాఖ్యానాన్ని ఒకసారి స్మరించుకొని ఈశ్వరుడి అనుజ్ఞతో 'ఇంద్రసేన' ద్రౌపదిగా అవతరించినదన్న విషయాన్ని ఇక్కడ అనుసంధించుకొనాలి. 'శ్రీమహాలక్ష్మి' అన్న భావన ఏమిటి? ఆమె పాండవుల శౌర్యలక్ష్మి, విజయలక్ష్మి కూడా. ఇది కథద్వారా మనకు తెలిసే అంశం. ఇచ్ఛాజ్ఞాన క్రియా రూపమైన 'శక్తి' కూడా భారతయుద్ధానికి ద్రౌపదే. అట్లా ఆమెలో 'శ్రీ' తత్త్వమున్నది. ఒకవిధంగా 'శ్రీయన, గౌరినాఁబరఁగు' - అని విరాటపర్వాదిలో తిక్కనగారు స్తుతించిన దేవీతత్త్వం ద్రౌపది. అందుకే వైదికధ్యాయిత'కు మహా ఇష్టమైన పరతత్త్వ లక్షణం ఆమెలో ఉన్నది. అదే 'ధర్మ' పరిరక్షణ రూపమైన పాండవపత్నీత్వం.

మానవులు యోనిజులు - తల్లిగర్భంనుంచి బయపడతారు కాబట్టి. కాని, అవతారమూర్తులు అయోనిజులు. పాండవులందరూ మాతృగర్భసంజాతులే. శ్రీకృష్ణుడు కూడా దేవకీ గర్భంలోనే పుట్టాడు. ఒక ద్రౌపదిమాత్రమే 'అయోనిజ'గా అవతరించింది. అందుకే లీలావతారమనటం.

అనుభూతిని చెల్లించటం - పత్నిగా వారి వారికి కావలసిన అనుభూతులను అందించిందని వాచ్యార్థం. మీ వాంఛలను మహాపతివ్రతగా సఫలంచేసిందని తాత్త్వికార్థం. ఇట్లా ద్రౌపది అవతారరహస్యం ఈ పద్యంలో వివరించబడింది.

వ. ఇట్లు ద్రౌపదీ ద్రౌపదేయాంబికేయుల తెఱం గెఱింగించి, వెండియు నాఖండలుండు పాండవాగ్రజునకుఁ గర్ణుం జూపి 'భవదగ్రజుండు సూర్యునపరశరీరంబు కౌంతేయుండయి రాధేయుం డనం బరఁగినవాఁడు సుమ్ము! చూడు' మని పలికి, సిద్ధ సాధ్య విశ్వదేవగణంబులతో నున్నవారు తత్తదంశ ప్రభూతు లయి వాసుదేవానుచరణ పరాయణులగుచు వర్తించిన సాత్యకి కృతవర్మాది యాదవుల నాలోకింపుము.' 59

ప్రతిపదార్థం: ఇట్లు= ఇట్లా; ద్రౌపదీ= ద్రౌపది; ద్రౌపదేయ= ద్రౌపది కుమారుల; అంబికేయుల= ధృతరాష్ట్రుడి; తెఱంగు+ఎఱింగించి= పుట్టుకను తెలిపి; వెండియున్= మరలా; అఖండలుండు= ఇంద్రుడు; పాండవ+అగ్రజునకున్= ధర్మరాజుకు; కర్ణున్+చూపి= కర్ణుడిని చూపి; భవత్+అగ్రజుండు= మీ అన్న; సూర్య+అపరశరీరంబు= సూర్యుడి మరోరూపం; కౌంతేయుండు+అయి= కుంతీ కుమారుడుగా పుట్టి; రాధేయుఁడు+అనన్= రాధా కుమారుడుగా; పరఁగినవాఁడు= ప్రసిద్ధినొందినవాడు; సుమ్ము!= సుమా!; చూడుము+ అని పల్కి= చూడుమనిచెప్పి; (ఇట్లా అన్నాడు); సిద్ధ= సిద్ధుల; సాధ్య= సాధ్యుల; విశ్వదేవగుణంబులతోన్+ఉన్నవారు= విశ్వేదేవ సమూహాలతో కనిపిస్తున్నవారు; తత్తద్+అంశ+ప్రభూతులు+అయి= ఆయా అంశలతోపుట్టి; వాసుదేవ+అనుచరణ+ పరాయణులు+ అగుచున్= శ్రీకృష్ణుడి సాహచర్య నిరతులై; వర్తించిన= ప్రవర్తించిన; సాత్యకి; కృతవర్మ+ఆది= కృతవర్మ మొదలైన; యాదవులన్= యదువీరులను; ఆలోకింపుము= చూడుము.

తాత్పర్యం: ఇట్లా ద్రౌపది ఉపపాండవులు, ధృతరాష్ట్రుల తీరును వివరించి, ఇంద్రుడు ధర్మరాజుతో 'అదిగో మీ అన్న కర్ణుడు. సూర్యుడి మరోరూపమే కుంతీ కుమారుడుగా పుట్టి రాధాతనయుడుగా పేరు పొందాడు సుమా! అక్కడ చూడుము' అంటూ సిద్ధ సాధ్య విశ్వదేవ సమూహాలతో కనిపిస్తున్నవారు, ఆయా అంశలతో పుట్టి శ్రీకృష్ణుడి సహచరులుగా ప్రవర్తించిన సాత్యకి కృతవర్మాది యదువీరులు! వారి నందరినీ చూడుము.' (అని వారిని చూపించాడు).

క. అని చెప్పి చూపి 'యభిమ। న్యునిఁ జూచితె చంద్రు భంగి నుజ్జ్వల కాంతిం
దనరెడుఁ దదంశజాతుం। డనూన ధృతిశాలి వీఁడె' యంచుం జూపెన్. 60

ప్రతిపదార్థం: అని చెప్పి; చూపి= వారిని చూపించి (ఇట్లా అన్నాడు); అభిమన్యునిన్= అభిమన్యుడిని; చూచితె= చూచావా; చంద్రుభంగిన్= చంద్రుడివలె; ఉజ్జ్వల కాంతిన్= మిక్కిలి ప్రకాశిస్తున్న కాంతితో; తనరెడున్= ఒప్పుతున్నాడు; తద్+అంశజాతుండు=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ చంద్రాంశతో పుట్టినవాడు; అనూన= మిక్కిలి; ధృతిశాలి= బలశాలి; వీఁడె= ఇదిగో చూడుము; అంచున్= అంటూ; చూపెన్= చూపాడు.

తాత్పర్యం: అని చెప్పి వారిని చూపించి ఇట్లా అన్నాడు. 'అభిమన్యుడిని చూచావా! చంద్రుడివలె మిక్కిలి ప్రకాశిస్తున్న కాంతితో ఒప్పుతున్నాడు. ఆ చంద్రాంశతోనే పుట్టిన ఇతడు మిక్కిలి బలశాలి. ఇదిగో చూడుము' అంటూ చూపాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. చూపి తదనంతరం బమ్మహాత్మునితోడ. 61

తాత్పర్యం: తరువాత ఆ మహాత్ముడితో. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. 'పాండురాజు వీఁడె బహురత్న ఖచిత వి। మాన మెక్కి గొంతి మాద్రి తన యు
పాంత భాగమున సుఖాసీనలుగ నాదు। వలను వచ్చుచున్నవాఁడు గంటె. 62

ప్రతిపదార్థం: పాండురాజు= మీ తండ్రి పాండుమహారాజు; వీఁడె= ఇతడే; బహురత్న ఖచిత= మిక్కుటంగా రత్నాలు పొదిగిన; విమానము+ఎక్కి= విమానాన్ని అధిరోహించి; గొంతి, మాద్రి= కుంతీ, మాద్రీ; తన= తనయొక్క; ఉపాంత భాగమునన్= సమీపంలో; సుఖ+ఆసీనలుగన్= సుఖంగా కూర్చుని ఉండగా; నాదువలను= నా వైపు; వచ్చుచున్నవాఁడు= వస్తున్నాడు; కంటె!= చూస్తున్నావా!

తాత్పర్యం: మీ తండ్రి పాండురాజు ఇతడే. మిక్కుటంగా రత్నాలు పొదిగిన దివ్య విమానాలు ఎక్కి కుంతీ, మాద్రీ దేవులు తన సమీపంలో సుఖంగా ఆసీనలు కాగా నా వైపే వస్తున్నాడు చూస్తున్నావా!

క. అదె భీష్ముఁడు వసువుల కడఁ। గదిసి యెలమి నున్నవాఁడు కంటే! ద్రోణుం
డిదె దివిజగురుని పాలఁ బ్ర। మద మెసఁగ వసించినాఁడు మాన్యచరిత్రా!' 63

ప్రతిపదార్థం: అదె= అదిగో అక్కడ; భీష్ముఁడు= భీష్ముడు; వసువులకడన్= అష్టవసువుల వద్ద; కదిసి= చేరి; ఎలమిన్= ఆనందంగా; ఉన్నవాఁడు= ఉన్నాడు; దివిజ గురుని పాలన్= బృహస్పతి సమీపంలో; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; ప్రమదము+ఎసఁగన్= సంతోషం అతిశయించగా; వసించినాఁడు= నిలిచాడు; మాన్యచరిత్రా!= ఓ ధర్మరాజా!; కంటే?= చూచావా?

తాత్పర్యం: అదిగో అక్కడ భీష్ముడు వసువులవద్ద చేరి ఆనందంగా ఉన్నాడు. బృహస్పతి సమీపంలో ద్రోణుడు సంతోషంగా నిలిచాడు. చూచావా?

వ. అని పలుకుచుఁ జూపి, గంధర్వ యక్ష గుహ్యక గణంబులలో ద్రుపద విరాటులను, దదీయానుజ తనుజ వర్గంబులనుం, దక్కునుం గలుగు కేకయ పాండ్యప్రభృతి నానా దేశాధీశులను వేఱువేఱం జెప్పుచుఁ జూపుచు 'భవదీయం బగు సమరంబునం బరిత్యక్త శరీరు లయి యుత్తమలోకంబులు వడసి యున్నవారల నవలోకింపు' మని చెప్పె నవిన విని జనమేజయుండు వైశంపాయనుతో 'మునీంద్రా! యిప్పుడు నీ చెప్పిన సుయోధన

శకుని సైంధవులును గర్ణుండును గర్ణకుమారులును వెండియుంగల తత్పక్ష భూపతులును ఘటోత్కచాదు లయిన పాండవులవారును నీ చెప్పిన సకల జనంబులు నాకలోకంబున నెప్పుడు నుండుదురో? యట్లుంగాక కొంతకాలంబు నిలిచి క్రమ్మఱ మనుష్యాది జన్మంబుల నొందుటకై యరుగుదెంతురో? యిత్తెఱంగు వినవలతుం జెప్పవే యని యడిగిన నమ్మునిపతి యమ్మనుజపతితో నిట్లనియె. **64**

ప్రతిపదార్థం: అని పలుకుచున్= అని అడుగుతూ; చూపి= వారిని చూపించి; గంధర్వ యక్ష గుహ్యక గణంబులలోన్= గంధర్వులు, యక్షులు, గుహ్యకులు వీరి గణాలలో; ద్రుపద= ద్రుపదుడిని; విరాటులను= విరాటుడిని; తదీయ+అనుజ= వారి తమ్ముల; తనుజ= కుమారుల; వర్గంబులనున్= సమూహాలను; తక్కునున్+కలుగు= మిగిలిన; కేకయ= కేకయులు; పాండ్య= పాండ్యులు; ప్రభృతి= మొదలైన; నానాదేశాధీశులనున్= అనేక దేశాధిపతులను; వేఱువేఱన్= వేరు వేరుగా; చెప్పుచున్= వివరిస్తూ; చూపుచున్= చూపిస్తూ; భవదీయంబు+అగు= నీ; సమరంబునన్= యుద్ధంలో; పరిత్యక్త= వదలిన; శరీరులు+అయి= శరీరాలు కలవారై; ఉత్తమలోకంబులు+ పడసి+ఉన్నవారలన్= పుణ్యలోకాలను పొంది ఉన్నవారిని; అవలోకింపుము+అని= చూడుము అని; చెప్పెన్+అనినన్= చెప్పాడు అని చెప్పగా; విని= విన్నవాడై; జనమేజయుండు= జనమేజయుడు; వైశంపాయనుతోన్= వైశంపాయన మహర్షితో; మునీంద్రా!= మునీశ్వరా!; ఇప్పుడు= ఇంతవరకు; నీ చెప్పిన= నీవు చెప్పిన; సుయోధన= దుర్యోధనుడు; శకుని= శకుని; సైంధవులును= సైంధవుడూ; కర్ణుండును= కర్ణుడూ; కర్ణకుమారులును= కర్ణుడి కొడుకులు; వెండియున్+కల= ఇంకా మిగిలిన; తత్పక్షభూపతులును= కౌరవపక్షంలోని రాజులు; ఘటోత్కచాదులు+ఐన= ఘటోత్కచుడు మొదలైన; పాండవులవారును= పాండవపక్షంలోనివారు; నీ చెప్పిన= నీవు ఇంతవరకూ చెప్పిన; సకల జనంబులున్= జనులందరూ; నాకలోకంబునన్= స్వర్గలోకంలో; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; ఉండుదురో= ఉంటారో; అట్లున్+కాక= అట్లా కాకుండా; కొంతకాలంబు నిలిచి= కొంతకాలం ఉండి; క్రమ్మఱన్= మరలా; మనుష్య+ఆది జన్మంబులన్= మనుష్యాది జన్మాలు; ఒందుటకై = పొందటానికై; అరుగుదెంతురో= తిరిగి వస్తారో; ఈ+తెఱంగు= ఈ విషయం; వినన్ వలతున్= వినాలని ఉన్నది; చెప్పవే+అని+అడిగినన్= చెప్పుము అని అడుగగా; ఆ+మునిపతి= ఆ మునిశ్రేష్ఠుడు; ఆ+మనుజపతితోన్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని అడుగుతూ వారిని చూపి గంధర్వ యక్ష గుహ్యక సమూహాలలో ఉన్న ద్రుపదుడిని, విరాటుడిని, వారి తమ్ములను, వారి కొడుకులను, మిగిలిన కేకయ పాండ్యాది నానా రాజులను వేరువేరుగా వివరిస్తూ చూపిస్తూ ఇంద్రుడు 'ధర్మరాజా! నీవు చేసిన యుద్ధంలో శరీరాలు వదలి పుణ్యలోకాలను పొంది ఉన్నవారిని చూడుము' అని చెప్పాడని వైశంపాయనుడు జనమేజయుడితో చెప్పాడు. అప్పుడు జనమేజయుడు 'ఓ మునీశ్వరా! ఇంతవరకు నీవు చెప్పిన దుర్యోధన శకుని సైంధవులు, కర్ణుడు, అతడి కుమారులు ఇంకా మిగిలిన కౌరవపక్షంలోని రాజులు, ఘటోత్కచుడు మొదలైన పాండపక్షంలోనివారు. నీవు ఇంతవరకు చెప్పిన జనులందరూ స్వర్గలోకంలో శాశ్వతంగా అట్లాగే ఉంటారా? లేక కొంతకాలం ఉండి మళ్ళీ మనుష్యాది జన్మలు ఎత్తటానికి తిరిగి వస్తారా! ఈ విషయం వినాలని నాకు కుతూహలంగా ఉన్నది. దయతో చెప్పుము' అని అడుగగా ఆ మునిశ్రేష్ఠుడు ఆ రాజుతో ఇట్లా అన్నాడు.

సీ. **'కురువర! యిది దేవగుహ్యంబు మునివరుఁ। డైన వేదవ్యాసుఁ డతుల కరుణఁ**
జెప్పినయది నీకుఁ జెప్పెద సమవధా। నంబుతో వినుము 'సనత్కుమారుఁ
గలసెఁ బ్రద్యుమ్నుఁ డన్యులకు దురాసదం। బయిన కుబేర లోకానుభవము
ధృతరాష్ట్రుఁ డొందెను సతియుఁ దానును నింద్రు। భవనంబునన నిల్చెఁ, బాండునృపతి

తే. **యాంద్రు రిరువురుఁ దో నిల్వ నమృతకరునిఁ। గూడె నభిమన్యుఁ, డనిమిషగురుని నొందెఁ**
దత్ప్రతీకాశుఁ డయిన కోదండగురుఁడు, । ద్వాపరాత్మకుం డయ్యె గాంధారవిభుఁడు. **65**

ప్రతిపదార్థం: కురువర!= ఓ జనమేజయా!; ఇది దేవగుహ్యంబు= ఇది దేవరహస్యం; మునివరుఁడు+ఐన= మునిశ్రేష్ఠుడైన; వేదవ్యాసుఁడు= వేదవ్యాసమహర్షి; అతులకరుణన్= సాటిలేని దయతో; చెప్పిన+అది= చెప్పిన విషయ మిది; నీకున్+చెప్పెదన్= నీకు చెప్పుతాను; సమవధానంబుతోన్= ఏకాగ్రతతో; వినుము; ప్రద్యుమ్నుఁడు= ప్రద్యుమ్నుడు; సనత్కుమారున్+కలసెన్= సనత్కుమారుడితో కలిసిపోయాడు; ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్రుడు; సతియున్+తానును= భార్యా తానూ; అన్యులకున్= ఇతరులకు; దురాసదంబు+అయిన= పొందటానికి వీలులేని; కుబేరలోక+అనుభవమున్= కుబేరలోక సౌఖ్యాన్ని; ఒందెన్= పొందాడు; పాండునృపతి= పాండురాజు; ఆంద్రురు+ఇరువురున్, తోన్+నిల్వన్= భార్యలిరువురూ కూడా ఉండగా; ఇంద్రుభవనంబునన్+అ= ఇంద్రభవనంలోనే; నిల్చెన్= నిలిచాడు; అభిమన్యుఁడు= అభిమన్యుడు; అమృతకరునిన్+కూడెన్= చంద్రుడితో కలిసిపోయాడు; ఆనిమిషగురునిన్= బృహస్పతిని; తద్+ప్రతీకాశుఁడయిన= అతడితో సమానుడైన; కోదండగురుఁడు= ధనుర్విద్యాగురుడు ద్రోణాచార్యుడు; ఒందెన్= పొందాడు; గాంధార విభుఁడు= శకుని; ద్వాపర+ఆత్మకుఁడు+అయ్యెన్= ద్వాపరయుగాధిదైవతంతో కలిసిపోయాడు.

తాత్పర్యం: 'జనమేజయా! ఇది దేవరహస్యం. మునిశ్రేష్ఠుడైన వేదవ్యాసమహర్షి మిక్కిలి కరుణతో చెప్పిన విషయం నీకు చెప్పుతాను. ఏకాగ్రతతో వినుము. ప్రద్యుమ్నుడు సనత్కుమారుడిలో కలిశాడు. ధృతరాష్ట్రుడు భార్య గాంధారితో కలిసి ఇతరులకు ప్రవేశించటానికి వీలులేని కుబేరలోకంలో చేరాడు. పాండురాజు కుంతీ మాద్రీ దేవులతో స్వర్గంలోనే నిలిచిపోయాడు. అభిమన్యుడు చంద్రుడిలో కలిసిపోయాడు. ద్రోణాచార్యుడు బృహస్పతిలో కలిశాడు. శకుని ద్వాపరయుగాధిదైవతంతో కలిసిపోయాడు.

విశేషం: కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు నాలుగు. భాగవతప్రమాణం ప్రకారం ధర్మం నాలుగు, మూడు, రెండు, ఒక పాదాలు కలిగి ఉండటం ఈ యుగాల లక్షణం. కృత-యుగంలో ధర్మం సిద్ధంగా ఉన్నది. త్రేత - లో సంపాదించబడింది. ద్వాపరంలో సందేహించబడింది (ద్వాపర శబ్దానికి సంశయమనే అర్థం) కలి - లో నశించి 'పాపం' స్థిరపడింది. అందుకే 'జగడం' కలియుగధర్మం. భారతంలో శకుని పాత్ర ద్వాపరంలోని 'సంశయాత్మ', దానిని నమ్ముకొన్నవాడు కాబట్టే దుర్యోధనుడు సర్వనాశనమయ్యాడు. (సంశయాత్మా వినశ్యతి - అని భగవద్గీత), యుద్ధకారకుడయ్యాడు.

క. **రారాజు నాక నరకో ' దార సుఖాత్యంత దుఃఖ ధామంబులఁ బెం**
పారియు హీనత నొందియుఁ। గౌరవ కులనాథ! పిదపఁ గలియం దొం(దు)దెన్. **66**

ప్రతిపదార్థం: కౌరవకులనాథ!= కౌరవవంశరాజా! జనమేజయా!; రారాజు= దుర్యోధనుడు; నాక= స్వర్గ; నరక; ఉదార= మహితమైన; సుఖ; అత్యంత= మిక్కిలి; దుఃఖ; ధామంబులన్= స్థానాలలో; పెంపారియున్= అతిశయించీ; హీనతన్+ఒందియున్= హీనస్థితి పొంది; పిదపన్= ఆ తరువాత; కలియందున్= కలిపురుషుడిలో; ఒందున్= చేరుతాడు (ఒందెన్= చేరాడు).

తాత్పర్యం: జనమేజయా! వినుము. దుర్యోధనుడు స్వర్గంలో ఉదారమైన సుఖస్థానంలో, అతిశయించే నరకంలో మిక్కిలి హీనస్థితిలో కృశించి చివరకు కలిపురుషుడిలో లీనమయ్యాడు. (అవుతాడు).

విశేషం: వేదప్రామాణ్యాన్ని శంకించటమన్నా, భగవంతుడి ఉనికిని ప్రశ్నించటమన్నా రెండూ ఒక్కటే. అదే దుర్యోధనుడిలోని ఆత్మ ద్రవ్యం. దాని పేరే శకుని. అందుకే పాపపుణ్యాల ఫలితాలు రెండూ తీవ్రంగానే అనుభవించి చివరికి భవిష్యద్యుగంలోకి చొచ్చుకొనిపోయే లక్షణం ఒక దుర్యోధనుడిలో మాత్రమే ఉన్నది. అందుకే దుర్యోధనుడు జన్మించినపుడే జ్యోతిష్కులు చెప్పుతారు. ఈ శిశువు యుగ ధర్మధ్వంసకుడు అవుతా డని. అట్లాగే కలియుగ ప్రారంభకుడూ అయ్యాడు. ఈ కథ (స్వర్గారోహణోదంతం) జరుగుతున్నది ద్వాపర, కలియుగాల సంధి దశలో, అందుకే ఒందెన్/ఒందున్ అన్న రెండు క్రియలూ అర్థవంతాలే.

వ. అట్లపోలె నాక నరకంబు లనుభవించి. 67

ప్రతిపదార్థం: అట్లపోలెన్= అదేవిధంగా; నాక= స్వర్గాన్ని; నరకంబులు= నరకాన్ని; అనుభవించి= అనుభవించినవారై.

తాత్పర్యం: అదేవిధంగా స్వర్గ నరకాలను అనుభవించినవారై. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అతని తమ్ములెల్ల యాతుధానావలిఁ। గలిసి; రాత్మజనకుఁ గలసె సూర్యుఁ
గర్ణుఁ; డధిప! వసువు గావున వినుము గం। గాత్మజుండు వసువు లందు నిలిచె. 68

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; వినుము; అతని తమ్ములు+ఎల్లన్= దుశ్శాసనాదులు అందరూ; యాతుధాన+ఆవలిన్= రాక్షస గణాలను; కలిసిరి= కలిశారు; కర్ణుఁడు; ఆత్మజనకున్= సూర్యుడిని; కలసెన్= కలిశాడు; వసువు+కావునన్= వసువుల అంశలో పుట్టినవాడు కాబట్టి; గంగా+ఆత్మజుండు= గంగాదేవి కుమారుడు భీష్ముడు; వసువులందున్= అష్టవసువులలో; నిలిచెన్= నిలిచిపోయాడు.

తాత్పర్యం: దుర్యోధనుడి తమ్ములైన దుశ్శాసనాదులు రాక్షసగణాలలో కలిసిపోయారు. కర్ణుడు తన తండ్రి అయిన సూర్యుడిని కలిసికొన్నాడు. 'వసువు' కాబట్టి గంగాపుత్రుడైన భీష్ముడు అష్టవసువులలో నిలిచిపోయాడు.

విశేషం: రాక్షసాంశతో ప్రతియుగంలోనూ ఒక్కొక్కడు అవతరిస్తుంటాడు. అట్లాగే దైవతాంశతోకూడా ద్వాపరంలోని రాక్షస ప్రకృతులు కావటంవలననే అన్ని అన్యాయాలకు ఒడిగట్టి పాండవులను చిత్రహింసలు పెట్టారు. భారతం మూడుకాలాలలోనూ, మూడు లోకాలలోనూ జరుగుతున్న ఇతిహాస మనటానికి కారణం ఈ దైవ, రాక్షస పాత్రల సంఘర్షణే.

వ. ద్రుపదుండు, విరాటుండు, ధృష్టకేతుండును, భూరిశ్రవుండును, శల్యుండును, శంఖుండును, నుత్తరుండును, విశ్వనామదేవతలఁ గలసిరి. ధృష్టద్యుమ్నుండు హుతవహునిఁ గూడికొనియె' నని చెప్పి యప్పరమ సంయమి యప్పుడమిఱేనితో వెండియు నిట్లనియె. 69

ప్రతిపదార్థం: ద్రుపదుండు= ద్రుపద మహారాజు; విరాటుండు= విరాట మహారాజు; ధృష్టకేతుండును= ధృష్టద్యుమ్నుడి కుమారుడైన ధృష్టకేతువు; భూరిశ్రవుండును= సోమదత్తుడి కొడుకయిన భూరిశ్రవుడు; శల్యుండును= శల్యుడూ; శంఖుండును= శంఖుడూ; ఉత్తరుండును= ఉత్తరకుమారుడు; విశ్వనామ దేవతలన్= విశ్వేదేవతలను; కలసిరి= కలిశారు; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు (ద్రౌపది అన్న); హుతవహునిన్= అగ్నిదేవుడిని; కూడికొనియెన్= కలిసికొన్నారు; అని చెప్పి; ఆ+పరమసంయమి= ఆ ఉత్తమ మహర్షి; ఆ+పుడమిఱేనితోన్= ఆ రాజుతో; వెండియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ద్రుపదుడు, విరాటుడు, ధృష్టకేతువు, భూరిశ్రవుడు, శల్యుడు, శంఖుడు, ఉత్తరుడు, విశ్వేదేవతలను చేరారు. ధృష్టద్యుమ్నుడు అగ్నిదేవుడిలో కలిశాడు' అని చెప్పి వైశంపాయనుడు జనమేజయుడితో ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: 'విశ్వ' నామదేవతలనే విశ్వేదేవతలంటారు. దేవతలలో ఒక గణానికి ఈ పేరున్నది. క్రతువు, దక్షుడు, వసువు, సత్యుడు, కాముడు, ధురి, రోచనుడు, పురూరవసుడు, మార్ద్రవసుడు - అనే పదిమందికి విశ్వేదేవతలని పేరు.

ధృష్టద్యుమ్నుడూ, ద్రౌపదీ అగ్నికుండంలో పుట్టారు. అగ్ని సంజాతుడు కాబట్టి అగ్నిలోనే ధృష్టద్యుమ్నుడు లీనమయ్యాడు.

తే. **వినుము ధర్మనందను పుణ్యతనువునందుఁ। దగఁ బ్రవేశించి యున్న విద్యామయాత్ముఁ**
డైన విదురుండు నమ్మహితాత్మ బోధ। శాలియును ధర్ముఁ గూడిరి సచ్చరిత్ర! 70

ప్రతిపదార్థం: సత్+చరిత్ర!= మంచి చరిత్రగల ఓ జనమేజయ రాజా!; వినుము; ధర్మనందను= ధర్మరాజుయొక్క; పుణ్యతనువునందున్= పుణ్యశరీరంలో; తగన్= తగినట్టుగా; ప్రవేశించి+ఉన్న= చేరిఉన్న; విద్యామయాత్ముఁడు+ఐన= జ్ఞానరూపమైన విద్యామయుడైన; విదురుండు= విదురుడు; ఆ+మహిత+ఆత్మబోధశాలియున్= ఆ ఆత్మజ్ఞాన సంపన్నుడైన ధర్మరాజు; ధర్మున్= యమధర్మరాజును; కూడిరి= చేరుకొన్నారు.

తాత్పర్యం: ధర్మరాజుయొక్క పుణ్యశరీరంలో అప్పటికే ప్రవేశించి ఉన్న జ్ఞానవిద్యారూపుడైన విదురుడు ఆత్మజ్ఞాన సంపన్నుడైన ధర్మరాజు యమధర్మరాజులో కలిసిపోయారు.

విశేషం: యముడే మాండవ్య మహాముని శాపంవలన విదురుడుగా పుట్టాడన్న కథను ఇక్కడ స్మరిస్తే ధర్మరాజుతోపాటు విదురుడుకూడా యమాంశజుడే అని తెలుస్తుంది. అందుకే కాలస్వరూపుడై కౌరవపక్షాన్ని నిరంతరం ప్రబోధిస్తూ వారి అనుచితకార్యాలను ఖండిస్తూ ద్వాపరయుగ వ్యాఖ్యాతగా విదురుడు నిలిచాడు. చివరికి అరణ్యంలో తపస్సు చేసికొంటూ ఉండి తనను చూడటానికి వచ్చిన ధర్మరాజు శరీరంలో యోగబలంతో ప్రవేశించాడు. ఆ శరీరానికి (విదురుడి కళేబరానికి) అగ్నికార్యం చేయకూడదని ఆకాశవాణి చెప్తుతుంది. అట్లాంటి పరమ పవిత్రమూర్తి కాబట్టి విదురాంశ ధర్మనందనుడితో కలిసి 'కాలాంశ'లో లీనమైపోయింది.

సీ. **కమలగర్భుని నియోగంబున నిజయోగ। బలము గైకొని బలభద్రదేవుఁ**
డంబుధి కరిగి యనంతుఁ బరమమూర్తిఁ। గలసె; నత్తెఱఁగు ము న్నలఘుకీర్తి
ధన! నీకుఁ జెప్పితిఁ దక్కటి వృష్ణిభో। జాంధకు లెల్ల గుహ్యక గణంబుఁ
గూడిరి; కృష్ణు సంక్రీడకుఁ బాత్రంబు। లైన షోడశ సహస్రాంగనలును

తే. **విధినియుక్త కాలంబున విను సరస్వ। తీ జలంబుల మునిఁగి యుత్కృష్ట మగు ని**
జాప్సరోభావ మొంది నారాయణుని యు। పాంతచారిణు లైరి ప్రహర్ష మెసఁగ. 71

ప్రతిపదార్థం: అలఘుకీర్తిధన!= ఘనమైన కీర్తియే ధనంగా కలిగిఉన్న ఓ జనమేజయా!; విను= వినుము; కమలగర్భుని= బ్రహ్మదేవుడి; నియోగంబునన్= పనుపుమేరకు; నిజయోగబలమున్+కైకొని= తన యోగబలంకొని; బలభద్రదేవుఁడు= బలరాముడు; అంబుధికిన్+ అరిగి= సముద్రం చేరి; పరమమూర్తిన్= ముఖ్యుడైన; అనంతున్= కాలస్వరూపుడైన అనంతుడిని; కలసెన్= కలిశాడు; ఆ+తెఱంగు= ఆ విషయం (ఆ వైనం); నీకున్= నీకు; మున్న= మునుపే; చెప్పితిన్= చెప్పాను; తక్కటి= తక్కిన; వృష్ణి

భోజాంధకులు+ఎల్లన్= వృష్ణి, భోజ, అంధకవంశీయులందరూ; గుహ్యక గణంబున్= గుహ్యకుల సమూహాన్ని; కూడిరి= చేరారు; కృష్ణ= శ్రీకృష్ణుడి; సంక్రీడకున్= విలాసానికి; పాత్రంబులు+ఐన= పాత్రలైన; షోడశ సహస్ర+అంగనలును= పదహారువేలమంది గోపికలు; విధి నియుక్త కాలంబునన్= శాస్త్ర నిర్దిష్ట ముహూర్తంలో; సరస్వతీ జలంబులన్= సరస్వతీ నదీ జలాలలో; మునిఁగి; ఉత్కృష్టము+అగు= గొప్పదైన; నిజ= తమ తమ; అప్సరస్+భావము+ఒంది= అప్సరసల భావాన్ని పొంది; ప్రహర్షము+ఎసఁగన్= సంతోషమతిశయించగా; నారాయణుని= శ్రీమన్నారాయణుడియొక్క; ఉపాంత చారిణులు+ఐరి= సమీపంలో తిరుగుతున్నారు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడి ఆనతిమేరకు బలరాముడు తన యోగబలంతో అనంతుడిలో కలిసిపోయాడు. ఆ విషయం నీకు మునుపే చెప్పాను. తక్కిన వృష్ణి భోజాంధక వీరులంతా గుహ్యకగణంలో కలిసిపోయారు. శ్రీకృష్ణుడి రాసక్రీడకు పాత్రలైన పదహారువేల గోపాంగనలు శాస్త్ర నిర్దిష్టకాలంలో సరస్వతీ నదీజాలాలలో మునిగి తమతమ అప్సరోభావాలను పొంది సంతోష మతిశయించగా నారాయణుడి సమీపంలో తిరుగుతున్నారు.

చ. అనుమరణంబునం దగ మురాంతకు రుక్మిణి సెందె; లక్ష్మి య
వ్వనరుహనేత్ర; తక్కఁగల వామవిలోచన లేడ్వురుం దదీ
యనుత తను ప్రవేశన సమాచరణం బొనరించి రవ్వరాం
గనలును లక్ష్మి యంశముల కావునఁ; గౌరవ వంశవర్ధనా! 72

ప్రతిపదార్థం: కౌరవ వంశవర్ధనా!= కురువంశాన్ని వృద్ధిపొందించే ఓజనమేజయా!; ముర+అంతకు+అనుమరణంబునన్= మురాసురుని సంహరించిన శ్రీకృష్ణునితోడి సహగమనం చేత; తగన్= ఒప్పిదముగా; ఆ+వనరుహనేత్ర= పద్మంవంటి కన్నులుగల; రుక్మిణి= రుక్మిణీదేవి; లక్ష్మిన్= లక్ష్మీదేవిని; చెందెన్= పొందినది; తక్కఁగల= మిగిలినవారైన; వామ+విలోచనలు= అందమైన కన్నులుగలవారు; ఆ+వర+ అంగనలును= ఆ శ్రేష్ఠమైన అవయవములు గల్గినవారు. ఏడ్వురున్= ఏడుమంది (సత్యభామాదులు) లక్ష్మి+అంశములు+అ= లక్ష్మీదేవి యంశభూతలే; కావునన్= అగుటచేత; తదీయ= ఆ లక్ష్మీదేవియొక్క; నుత= పొగడబడిన; తను ప్రవేశన= శరీరమునందు ప్రవేశించుట యనే (చొచ్చుట అనెడి); సమాచరణంబు= గొప్పకార్యాన్ని; ఒనరించిరి= చేశారు.

తాత్పర్యం: శ్రీకృష్ణునితో పాటు అనుమరణంచేత రుక్మిణీదేవి లక్ష్మీదేవిలో లీనమయింది. తక్కిన సత్యభామాది కృష్ణపత్నులు ఏడుగురు కూడా ఆ లక్ష్మీదేవి అంశలతో అవతరించిన వారగుట చేత మూలభూతమైన ఆ లక్ష్మీదేవియొక్క దివ్యదేహంలోనికే ప్రవేశించారు.

విశేషం: ఇక్కడ చెప్పుతున్న లక్ష్మి విష్ణువుతో 'అనపాయిని'గా (ఎడబాటులేకుండా) ఉన్న ఆదిలక్ష్మి, రాఘవుడికి సీతగా, శ్రీకృష్ణుడికి రుక్మిణిగా జన్మించిన అంశ ఈమెదే. ఈమె అష్టలక్ష్మీ స్వరూపం కలిగింది. ఆది, ధాన్య, ధైర్య, గజ, సంతాన, విజయ, విద్యా, ధన రూపాలు ఈ అష్టలక్ష్మి రూపాలని ఉన్నది. వీరే అష్టమహిషులు.

వ. అని చెప్పి యమ్మహాయుద్ధంబున మృతులైన యట్టివారును, నేను మున్ను ప్రసంగించిన యట్టివారును, బ్రసంగింపనివారును నిట్టిట్టి గతిం బ్రాపించి రని నాచేతం జెప్పంబడిన వారెల్లను నిజార్హప్రకారంబుల సురాసుర యక్షగుహ్యక గంధర్వబృందంబులం జెందిరి; కురునందనా! నీ యడిగిన తెఱం గెఱింగించితి నని వెండియు. 73

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని చెప్పి= అని వేదవ్యాసులవారు చెప్పి; ఆ+మహాయుద్ధంబునన్= ఆ మహాయుద్ధంలో; మృతులు+ఐన+అట్టివారును= చనిపోయినవారూ; నేను మున్ను= నేను ముందు; ప్రసంగించిన+అట్టివారును= చెప్పినవారూ; ప్రసంగింపని+వారును= చెప్పనివారూ; ఇట్టి+ఇట్టి= ఇట్లాంటిట్లాంటి; గతిన్+ప్రాపించిరి+అని= స్థితి పొందారని; నా చేతన్= నాచేత; చెప్పబడిన వారు+ఎల్లను= పేర్కొనబడ్డవారందరూ; నిజ+అర్హ ప్రకారంబులన్= వారి వారికి తగినట్లుగా; సుర= దేవతల; అసుర= రాక్షసుల; యక్ష= యక్షుల; గుహ్యక= గుహ్యకుల; గంధర్వ= గంధర్వుల; బృందంబులన్= సమూహాలను; చెందిరి; కురునందనా!= ఓ జనమేజయ మహారాజా!; నీ+అడిగిన= నీవు అడిగిన; తెఱంగు= వైనాన్ని; ఎఱింగించితిన్= తెలిపాను; అని వెండియున్= అని ఇంకా.

తాత్పర్యం: అని వేదవ్యాసులవారు చెప్పి, ఆ మహాయుద్ధంలో చనిపోయినవారు, నేను ముందు చెప్పినవారు, చెప్పనివారు, నేను ఇట్లాంటిట్లాంటి స్థితిని పొందారని చెప్పినవారంతా వారి వారికి తగినట్లుగా సుర, అసుర, యక్ష, గుహ్యక, గంధర్వ గణాలలో చేరిపోయారు. ఓ జనమేజయ మహారాజా! నీవు కోరిన విధంగా విషయమంతా తెలిపాను' అని ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: యక్ష, గుహ్యక, గంధర్వులు దేవయోనులే అయినా భిన్న విద్యలలో ముడిపడినవారు. యక్షులు, గుహ్యకులు కుబేరుడు మూలపురుషుడుగా కలవారు. శ్రీకృష్ణుడు గోలోకంలో ఉన్నప్పుడు అతడి గుహ్య ప్రదేశంనుండి వీరు పుట్టారని బ్రహ్మవైవర్త పురాణం చెప్తున్నది. వీరిలో కుబేరుడు మొదటివాడు. యక్షులందరూ అతడిచేత పాలించబడినవారే. గంధర్వులు బ్రహ్మచేతినుండి పుట్టినవారు. సంగీతం వీరి విద్య.

తే. **'వినుము పాండవ కౌరవ విషయ మైన। యట్టి యితిహాస మే నుపాఖ్యానజాత**
సహిత మగునట్లుగా సమస్తంబు మహిత। విస్తరంబుగఁ జెప్పితి విశదభంగి. **74**

ప్రతిపదార్థం: వినుము; పాండవ= పాండవులకు; కౌరవ= కౌరవులకు; విషయము+ఐన= సంబంధించినదైన; అట్టి+ఇతిహాసము= కథను; ఏను= నేను; ఉపాఖ్యాన+జాత+సహితము+అగునట్లుగాన్= ఉపకథల సమూహంతో కూడినదిగా; సమస్తము+ఐన= మొత్తం కథనంతా; మహిత విస్తరంబుగన్= మిక్కిలి వివరణాత్మకంగా; విశదభంగిన్= బాగా స్పష్టమైన రీతిలో; చెప్పితిన్= చెప్పాను.

తాత్పర్యం: 'రాజా! వినుము. పాండవ కౌరవులకు సంబంధించిన ఇట్లాంటి ఇతిహాసాన్ని ఉపకథలతో చేర్చి మొత్తం కథనంతా మిక్కిలి వివరణాత్మకంగా బాగా స్పష్టమైన రీతిలో నేను చెప్పాను.

వ. **కృష్ణద్వైపాయన మునీంద్రుండు సత్ప్రసాద భరితుండై యాజ్ఞాపింప నట్లు తదీయానుజ్ఞ వడసి తద్దయా లబ్ధ ప్రజ్ఞావిశేషుండనై యశేషంబును వివరింప నమ్మహాత్ముని కారుణ్యంబున నిమ్మహనీయేతిహాసంబు సమాధాన మానసుండ వై యాకర్ణించి నీవును బహుళ పుణ్యాత్ముండవుఁ గృతార్థుండవుఁ బరమార్థవిదుండవు నైతి' వని యిట్లు సాంద్రానంద సంపాదనశీలుం డై.** **75**

ప్రతిపదార్థం: కృష్ణద్వైపాయనముని+ఇంద్రుండు= వేదవ్యాసమహర్షి; సత్+ప్రసాద= సదనుగ్రహ; భరితుండు+ఐ= భరితుడై; ఆజ్ఞాపింపన్= ఆజ్ఞాపించగా; అట్లు= అట్లా; తదీయ+అనుజ్ఞ+పడసి= అతడి అనుమతి పొంది; తద్+దయా లబ్ధ= అతడి

దయతో పుట్టిన; ప్రజ్ఞా విశేషుండను+ఐ= బుద్ధి విశేషం గలవాడివై; అశేషంబును= సమస్త విషయాలను; వివరింపన్= వివరించగా; ఆ+మహాత్ముని= ఆ మహాత్ముడియొక్క; కారుణ్యంబునన్= కరుణతో; ఈ+మహనీయ+ఇతిహాసంబున్+ ఈ గొప్ప పూర్వకథను; సమాధాన+ మానసుండను+ ఐ= సమాధి కలిగిన మనస్సుతో (ఏకాగ్రచిత్తంతో); ఆకర్ణించి= విని; నీవును= నీవు కూడా; బహుళ= మిక్కిలి; పుణ్య+ఆత్ముండవు= పుణ్యం పొందినవాడివి; కృతార్థుండవు= ధన్యుడివి; పరమార్థ విదుండవు= బ్రహ్మజ్ఞానవేత్తవు; ఐతిని+అని= అయ్యానని; ఇట్లు= ఈ విధంగా; సాంద్ర+ఆనంద+సంపాదన శీలుండు+ఐ= అధికమైన ఆనందాన్ని (బ్రహ్మానందాన్ని పొందాలన్న తపన కలవాడై.)

తాత్పర్యం: 'వేదవ్యాసమహర్షి సదనుగ్రహభరితుడై ఆజ్ఞాపించగా అట్లా అతడి అనుమతి పొంది అతడి దయతో పుట్టిన బుద్ధి విశేషంచేత సమస్త విషయాలనూ వివరించగా, అతడి కరుణతో ఈ మహేతిహాస కథను బాగుగా విని నీవుకూడా పుణ్యాత్ముడివి, ధన్యుడివి, బ్రహ్మజ్ఞాన వేత్తవు అయ్యావు' అని బ్రహ్మానంద సంపాదన తత్పరుడై.

క. శ్రీనిత్యత్వ ప్రమదా । దాన కుతూహల నిరూఢతాస్త వ్యాపాం
గా! నిర్భర వేదవ్యా । సానేక వచోనుషంగ! హరిహరనాథా! 76

ప్రతిపదార్థం: శ్రీ= ఐశ్వర్యం యొక్క; నిత్యత్వ= స్థిరంగా ఉండటంవలన; కలిగే; ప్రమద= సంతోషాన్ని; ఆదాన= కలగజేయటంలోని; కుతూహల= ఆసక్తిచేత కలిగిన; నిరూఢతా= ప్రసిద్ధిచేత; స్తవ్య= స్తుతింపబడిన; అపాంగా= కడగంటి చూపులు కలవాడా!; నిర్భర= వేదశాస్త్రాలలో నిండిన; వేదవ్యాస= వ్యాసమహర్షియొక్క; వచస్= బ్రహ్మసూత్ర పురాణాది బహు వాక్యాలకు; అనుషంగ= అన్వయమైనవాడా!; హరిహరనాథా!= ఓ హరిహరనాథ దేవా!

తాత్పర్యం: ఓ హరిహరనాథస్వామీ! ఐశ్వర్యం స్థిరంగా ఉండటంవలన కలిగే ఆనందాన్ని కలుగజేయటంలోని ఆసక్తిచేత కలిగిన ప్రసిద్ధిచేత స్తుతించబడిన కడగంటి చూపులు కలవాడా! వేదశాస్త్రాలతో నిండిన వ్యాసమహర్షియొక్క బ్రహ్మసూత్రపురాణాది బహువాక్యాలకు అన్వయమైనవాడా! నీకు నమస్కారం.

విశేషం: భగవంతుడి దయ రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి ఐశ్వర్యాన్ని ప్రసాదించటంలో, రెండవది దానిని నిత్యంగా ఉంచటంలో. ఈ రెండూ చాలా భిన్న విషయాలు. పరమేశ్వర సమర్పణ భావంతో ఎవరు జీవితాన్ని యజ్ఞంగా భావించి జీవిస్తారో వారి ఐశ్వర్యాన్ని భగవానుడు నిరంతరమూ కాపాడుతాడని అర్థం. ఎవరు ధనంచేత మదాది దుష్టగుణాలకు బానిసలవుతారో వారి సంపద హరించుకొనిపోతుంది. భారతంలోని అంతస్సారరూపమైన ప్రబోధం ఇదే.

అనుషంగ మనే మాట శాస్త్ర పరిభాషలోనిది. పూర్వవాక్యంలోని పదాన్ని ఉత్తరవాక్యానికి అన్వయంచేసి సంబంధాన్ని నిరూపించటాన్ని 'అనుషంగ' మంటారు. వేదవాక్యాలలో చెప్పబడిన పరమేశ్వరతత్త్వం వ్యాసమహర్షిచే బ్రహ్మసూత్ర, పురాణాదులలో భిన్న రీతులలో అన్వయించబడటంచేత వ్యాసవచనాలతో 'అనుషంగుడు' హరిహరనాథుడు. ఏ వాక్యాన్ని చదివినా స్వామిత్వం ఎంతో ఒక కొంత స్ఫురిస్తుందని అర్థం. అన్ని వాక్యాలూ కలిపి కడకు పరమేశ్వరుడి 'నిత్యవిభూతి'నే నిరూపిస్తాయని అర్థం. స్వర్గారోహణంలో ఉన్నదే పరమేశ్వరుడి నిత్యవిభూతి. ఇక్కడి ఐశ్వర్యానికి తుది లేదు. ఇక్కడ దుఃఖం లేదు, మదమాత్సర్యాది దుర్గుణాల సంపుటి లేదు.

అందుకే జీవులందరూ ఈ మహత్త్వంలో లీనమవుతున్నారు. 'భగవాన్ వాసుదేవశ్చ కీర్త్యతేఽత్ర సనాతనః' అని వ్యాసమహర్షి భారత ప్రారంభంలోనే సూచించాడు. ఇది శ్రీకృష్ణ కీర్తన - అని అర్థం. అందుకే భారతంలోని కథ. సంఘటనలు, వర్ణనలు, పాత్రలు, వారి సంభాషణలు, అంతర్బాహ్యమనోవృత్తులు. వారి కార్యకలాపాలు అన్నీ కలిసి శ్రీకృష్ణపారమ్యాన్నే నిరూపిస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇది కావ్యాంతంలో మహాకవి చేసిన హరిహరనాథ స్తుతి కాబట్టి ఇంత విశేషార్థమున్నది. గీతాకారుడు ఈ మహార్థాన్ని ఇట్లా బోధించాడు.

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః."

(నీవు అన్ని ధర్మాలను చివరికి నాలో విడిచిపెట్టి నన్ను శరణు వేడుము. నిన్ను సర్వపాపాలనుండి నేను విముక్తుడిని చేస్తాను) ఈ పాప విముక్తి పేరే స్వర్గమంటే. అది నిత్య విభూతి. అక్కడ కేవలం ప్రకాశమున్నది. ఆ ప్రకాశం పేరే 'దేవత' - దైవత్వమంటే అదే. పాండవులు జీవితమంతా ఆ పరతత్త్వ సహాయంతో బ్రదికారు. సర్వ బాధ్యతలూ ఆ శ్రీకృష్ణుడిలోనే ఉంచారు. అందుచేతనే అందరూ దేవతాగణాలలో చేరారు. ఇంతటికీ మూలమైన 'ధర్మ' నిర్వహణచేసిన వారు, జ్ఞాన, సర్వపాప విముక్తుడూ అయిన ధర్మరాజు కేవలం దివ్యత్వం పొందలేదు. నిత్య సత్య పరమరూపమైన ధర్మంలోకి ఆకర్షించబడ్డాడు. ఈ ధర్మాన్ని అవలంబించి అవతరించిన నారాయణమూర్తికూడా శ్రీకృష్ణ దేహాన్ని చాలించి స్వర్గంలో ధర్మరాజు ఆగమనానికి రంగం సిద్ధం చేస్తున్నాడు. ఈ స్వర్గప్రాప్తినే 'శ్రేయస్సు' అన్నారు. అది సిద్ధించాలనే నన్నయగారు భారతాదిలో నాందీ పద్యంలో త్రిమూర్తివర్ణనను ఆశీర్వాదరూపంలో చేశారు. ఆ శ్రేయస్సు సిద్ధించటమే స్వర్గప్రాప్తి.

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయునకుఁ జెప్పినట్లు సర్పయాగ సమయ ప్రవృత్తం బైన మహాభారతం బంతయు దత్సభాగతుండైన రోమహర్షణ నామధేయుండును సాత్యవతేయ శిష్యుండును, బండిత ప్రవరుండును నగు సూతుని పుత్రుండైన యుగ్రశ్రవుండనియెడు కథకుండు సమ్యగవధానంబున నాకర్ణించిన వాఁడగుటను సమాశ్రితవత్సలుం డైన యా కృష్ణద్వైపాయను ననుగ్రహంబునఁ దత్కథా సాకల్య వివరణ విశార దుం డై యుండు; నతండు నైమిశారణ్య పుణ్యక్షేత్రంబునందు శౌనకుండను కులపతి మొదలుగాఁ గల కొందఱు మహామునులు సత్త్రయాగం బాచరించుచుండ నయ్యెడకుం జని వారలం గాంచినఁ బుణ్యకథాశ్రవణ కౌతు కాధీన మానసులైన యమ్మాననీయులు పుణ్యాత్మకుం డైన యక్కథకునకు సముచితార్చనంబులఁ బ్రియంబొనర్చి కథాకథనంబుఁ బ్రసంగించినం బ్రీతుండై యాతం 'డేమి తెలుంగు కథ వినంగోరెద?' రనుటయు నప్పరమార్థ పరాయణు లతనితోడ 'నెయ్యది హృద్యంబును నపూర్వంబును సమగ్ర జ్ఞాన ప్రదంబును నఘ నిబర్హణంబును నైనయది యక్కథ మాకు విన నిష్టం' బని పలుకుటయు. 77

ప్రతిపదార్థం: దేవా= హరిహరనాథ!; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్+చెప్పినట్లు= జనమేజయుడికి చెప్పిన విధంగా; సర్పయాగ సమయ ప్రవృత్తంబు+ఐన= సర్పయాగ సమయంలో చెప్పబడిన; మహాభారతంబు+అంతయున్= మహా భారతాన్ని అంతటినీ; తద్+సభాగతుండు+ఐన= ఆ సభలో ఉండిన; రోమహర్షణ నామధేయుండును= రోమహర్షణుడనే పేరుగలవాడు; సాత్యవతేయ శిష్యుండును= వ్యాసుడి శిష్యుడు; పండిత ప్రవరుండునున్= పండిత శ్రేష్ఠుడూ; అగు= అయిన; సూతుని పుత్రుండు+ఐన= సూతుడి కుమారుడైన; ఉగ్రశ్రవుండు= ఉగ్రశ్రవుడు; అనియెడు కథకుండు= అని పేరున్న కథకుడు; సమ్యక్+అవధానంబునన్= మిక్కిలి ఏకాగ్రతతో; ఆకర్ణించినవాఁడు+అగుటను= విన్నవాడు కావటంవలన; సమాశ్రిత వత్సలుండు+ఐన= ఆశ్రయించినవారిని ప్రేమగా చూచే; ఆ కృష్ణ ద్వైపాయనున్= ఆ వ్యాసుడి; అనుగ్రహంబునన్= అనుగ్రహంచేత; తద్+కథా= ఆ కథను; సాకల్య= సమగ్రంగా; వివరణ= వివరించటంలో; విశారదుండు+ఐ+ఉండున్= నేర్పరిగా ఉంటాడు; అతండు= ఆ ఉగ్రశ్రవుడు; నైమిశారణ్య పుణ్యక్షేత్రంబు నందున్= నైమిశారణ్య పుణ్యక్షేత్రంలో; శౌనకుండు+అను= శౌనకుడు

అనే; కులపతి= విద్యాగురువు; మొదలుగాన్+కల కొందఱు మహామునులు= మొదలైన కొందరు మహర్షులు; సత్రయాగంబు+ ఆచరించుచున్+ఉండన్= సత్రయాగం చేస్తుండగా; ఆ+ఎడకున్+చని= అక్కడికి వెళ్ళి; వారలన్+కాంచినన్= వారిని చూడగా; పుణ్యకథా శ్రవణ= పుణ్యకథలను వినటంలో; కౌతుక+అధీన మానసులు+ఐన= ఆసక్తికల మనస్సులుగల; ఆ+మాననీయులు= ఆ పూజ్యులు; పుణ్య+ఆత్మకుండు+అయిన= పుణ్యాత్ముడైన; ఆ+కథకునకున్= ఆ ఉగ్రశ్రవుడికి; సముచిత+అర్చనంబులన్= తగిన పూజలతో; ప్రియంబు+ఒనర్చి= తృప్తిని కలిగించి; కథాకథనంబు ప్రసంగించినన్= కథను చెప్పుమని ప్రస్తావించగా; ప్రీతుండు+ఐ= సంతోషపడి; అతండు= అతడు; ఏమి తెఱంగుకథ= ఎట్లాంటి కథ; వినన్+కోరెదరు+ అనుటయున్= వినగోరుతారు అని అడుగగా; ఆ+పరమార్థ పరాయణులు= ఆ బ్రహ్మతత్త్వ నిష్ఠ ఉన్నట్టివారు; అతనితోడన్= అతడితో; ఏ+అది= ఏది; హృద్యంబును= హృదయంగమమూ (హృదయాన్ని తాకేది); అపూర్వంబును= మునుపు లేనిది, అద్భుతమైనదీ; సమగ్ర జ్ఞాన ప్రదంబును= సంపూర్ణ జ్ఞానాన్ని ఇచ్చేదీ; అఘనిబర్హణంబును= పాపాన్ని నశింపజేసేదీ; ఐన+అది= అయినటువంటి; ఆ+కథ= ఆ కథను; మాకున్= మాకు; వినన్+ఇష్టంబు+అని పలుకుటయున్= వినాలని ఉన్నదని చెప్పగా.

తాత్పర్యం: హరిహరనాథ స్వామీ! వైశంపాయన మహర్షి జనమేజయుడికి సర్పయాగ సమయంలో ఈ భారతకథను చెప్పుతుండగా ఆ సభలో ఉండిన వ్యాసుడి శిష్యుడు, పండిత శ్రేష్ఠుడు అయిన సూతుడి కొడుకు ఉగ్రశ్రవుడనేవాడు మిక్కిలి ఏకాగ్రతతో విన్నాడు. ఉగ్రశ్రవుడు గొప్ప కథకుడు. వ్యాసుడి అనుగ్రహంవలన ఆ కథను సమగ్రంగా వివరించే శక్తి అతడికి అబ్బింది. అతడు నైమిశారణ్యంలో శౌనకుడనే విద్యాగురువు. మరికొందరు మహామునులు సత్రయాగం చేస్తుండగా అక్కడికి వెళ్ళి వారిని చూచాడు. పుణ్యకథలు వినాలన్న కోరిక ఉన్నవారు ఆ పుణ్యాత్ముడికి సముచితమైన సత్కారాలతో సంతోషం కలిగించారు. కథ వినాలని కోరారు. ఉగ్రశ్రవుడు సంతోషించి, మీకు ఎట్లాంటి కథకావాలి? అని అడిగాడు. ఆ పరమార్థపరాయణులైన మహామునులు ఏ కథ హృదయంగమంగా, అపూర్వంగా, సమగ్ర జ్ఞానదాయకంగా, పాపనాశకంగా ఉంటుందో అట్లాంటి కథ వినాలని కోరగా.

విశేషం: కులపతి - అనే మాటకు చాలా అర్థమున్నది. పదివేల మంది శిష్యులను అన్నదానాదులచేత పోషిస్తూ వేదాధ్యయనం చేయించే బ్రహ్మర్షిని కులపతి అంటారు. వారే విద్యాగురువులు. అట్లాంటి పరమ పవిత్ర వాతావరణంలో వినిపించబడింది ఈ కథ. అసలు ఈ కథను తొలుత వినిపించినవాడు వైశంపాయనుడు. సమయం - సత్రయాగం. ఒక పాపాన్ని చేయబోతున్న జనమేజయుడికి పాప నాశకమైన ఈ కథ చెప్పబడింది.

ఈ కథ మిక్కిలి ఆసక్తికరమైనది. 'వింటే భారతం వినాలి. తింటే గారెలు తినాలి' అని తెలుగువారు సామెతరూపంలో కూడా భారతాన్ని నిత్యం స్మరిస్తారు. కథలోని మలుపులు, ఆ మలుపులలోని వెలుగులు - పాఠకుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఇదే హృదయంగమ ధర్మం.

ఎఱుక సమగ్రత - ఒక బ్రహ్మతత్త్వ జిజ్ఞాస తప్ప మరి ఏదీ సమగ్రమైన విద్య కాదు. భారతంలో చివర బ్రహ్మతత్త్వమే నిత్యమని జగత్తు తాత్కాలికమని నిరూపించబడింది.

భూతాలన్నీ అవ్యక్తంలో పుట్టుతాయి. వ్యక్తమధ్యంలో పెరుగుతాయి. అవ్యక్తంలో లీనమవుతాయి - అన్న గీతా సూక్తికి భారతం వివరణాత్మకమైన అద్భుత కథనం. అందుకే స్వర్గారోహణంతో ఈ పుణ్యకథ అంతమై పాఠకులలో పాపపుణ్య విచక్షణను కలిగిస్తుంది. ఇదే బ్రహ్మజిజ్ఞాసకు మూలమైన జ్ఞానం.

అందుకే వ్యాసమహర్షిని మహాభారత తాత్పర్యాన్ని చెప్పుమని శిష్యు డడిగినపుడు ఇట్లా చెప్పాడు.

'పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్' పరోపకారంచేత పుణ్యం వస్తుంది. పరపీడనచేత పాపం వస్తుంది. ఈ మౌలికమైన జీవితనీతిని నేర్పటమే మహాభారతం సాధించిన అద్భుతమైన సామాజిక ప్రయోజనం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అపూర్వత్వం - ఈ కథలోని ప్రత్యేకత. ఎన్నో మతాలవారు తమతమ భావాలకు అనుగుణంగా ఈ కథకు రూపకల్పన చేశారు. కాని, నూరుపర్వాలలో ఈ విధంగా సర్పయాగంతో మొదలై స్వర్గారోహణంతో అంతమయిన కథను తొలిసారిగా వ్యాసమహర్షే గ్రథనం చేశాడు. అదే అపూర్వం.

సత్రయాగం - అంటే దీర్ఘకాలం చేయబడే యాగమని అర్థం. పదమూడు రోజులు మొదలు నూరు రోజుల వరకు సాధారణంగా జరుపుతారు. కొన్ని వందల సంవత్సరాల పాటు జరిపినవీ ఉన్నాయి. అట్లాంటి పరమ పుణ్యప్రదమైన సన్నివేశంలో చేయబడిన వాఙ్మయరూపమైన యజ్ఞమే మహాభారత కథనం.

క. అతఁ డింతటిది మహా భా। రతంబ యను నిశ్చయము తిరంబుగ మతిసం
గత మగుడు నమ్మహాత్ముల। కతివిశదము గాఁగ నిమ్మహాకథ చెప్పెన్. 78

ప్రతిపదార్థం: అతఁడు= ఆ ఉగ్రశ్రవుడు; ఇంతటిది= ఇటువంటిది; మహాభారతంబు+అ= మహాభారతమే; అను నిశ్చయము= అనే నిశ్చయం; తిరంబుగన్= స్థిరంగా; మతిన్+సంగతము+అగుడున్= హృదయంలో నెలకొనగా; ఆ+మహాత్ములకున్= ఆ మహనీయులకు; అతివిశదము కాఁగన్= మిక్కిలిగా తెలిసేటట్లు; ఈ+మహాకథ= ఈ గొప్ప కథ; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఆ ఉగ్రశ్రవుడు అటువంటి కథ ఒక మహాభారతం మాత్రమే అనే నిశ్చయం స్థిరంగా మనసుకు తట్టగా ఆ మహనీయులకు మిక్కిలి వివరంగా ఈ గొప్ప కథను చెప్పాడు.

వ. చెప్పి యిట్లనియె; 'నట్లు జనమేజయుండు సర్పయాగ కర్మానుష్ఠానముల యెడ వైశంపాయనువలన నివ్వినుతేతిహాసంబు విని విస్మితుండును బ్రమోద భరితుండును నయ్యెఁ; నక్కొలఁదిఁ దదీయ యాజకులు యజన సమాపన విధి యనుష్ఠించి; రయ్యుధిష్ఠిరానుజ పుత్త్ర పౌత్త్రుఁ డత్తెఱంగున భుజంగంబుల యాపదఁ దీర్చిన యస్తీకు నభ్యర్చనంబున నత్యంత సంతుష్టునిం జేసి, యతని నివాసంబునకు ననిచి పుచ్చి, ఋత్విజులాదిగా నఖిల బ్రాహ్మణులకు బహు ధనంబు లొసంగి వినయం బెసంగ నామంత్రితులం జేసిన వారలు నిజ నివాసంబులకుం జనిరి; వైశంపాయనుఁ బెంపారు సవిశేష పూజనంబులఁ బరితోషితుం గావించి దేవోప చారంబులఁ గృష్ణద్వైపాయన మునీంద్రులంబూజించి, యజ్ఞపతి సకల జనంబులు ప్రస్తుతింప విభవంబు శోభిల్లం బురంబుఁ బ్రవేశించె.' 79

ప్రతిపదార్థం: చెప్పి= భారతకథను చెప్పి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; అట్లు= ఆ విధంగా; జనమేజయుండు= జనమేజయ మహారాజు; సర్పయాగ కర్మ+అనుష్ఠానములయెడన్= సర్పయాగ కర్మలను అనుష్ఠిస్తున్న సమయంలో; వైశంపాయను వలనన్= వైశంపాయన మహర్షివలన; ఈ+వినుత+ఇతిహాసంబున్= ఈ ప్రసిద్ధమైన కథను; విని= విన్నవాడై; విస్మితుండును= ఆశ్చర్యం పొందినవాడూ; ప్రమోదభరితుండును= సంతోషంతో కూడినవాడూ; అయ్యెన్= అయ్యాడు; ఆ+కొలఁదిన్= ఆ పరిమాణంలో; తదీయ= జనమేజయుడు నియమించిన; యాజకులు= యాగంచేయించే బ్రాహ్మణులు; యజన సమాపన విధిన్= యాగ పూర్తికర్మను; అనుష్ఠించిరి= చేశారు; ఆ+యుధిష్ఠిర+అనుజ+పుత్త్ర+పౌత్త్రుఁడు= ఆ ధర్మరాజు తమ్ముడి కొడుకు మనుమడు (జనమేజయుడు ధర్మరాజు, అర్జునుడు, అభిమన్యుడు, పరీక్షిత్తు, జనమేజయుడు); ఆ+తెఱంగునన్= ఆ విధంగా; భుజగంబుల= సర్పాల; ఆపదన్+తీర్చిన= ఆపదను తీర్చిన; అస్తీకున్+అభ్యర్చనంబునన్= అస్తీకుడి పూజతో; అత్యంత= మిక్కిలి; సంతుష్టునిన్+చేసి= సంతోషింపజేసి; అతని నివాసంబునకున్= అతడి నివాసానికి; అనిచి పుచ్చి= పంపించి; ఋత్విజులు+ఆదిగాన్= ఋత్విక్కులు మొదలైన; అఖిలబ్రాహ్మణులకున్= బ్రాహ్మణులందరికీ; బహుధనంబులు+ఒసంగి= మిక్కిలిగా ధనమిచ్చి;

వినయంబు+ఎసఁగన్= వినయం అతిశయించగా; ఆమంత్రితులన్+చేసినన్= వీడ్కోల్పగా; వారలు= వారు; నిజనివాసంబులకున్= తమ తమ ఇళ్ళకు; చనిరి= వెళ్ళారు; వైశంపాయనున్= వైశంపాయన మహర్షిని; పెంపారు= సమృద్ధిగా; సవిశేష= ప్రత్యేకమైన; పూజనంబులన్= అర్చనాదులచేత; పరితోషితున్+కావించి= సంతుష్టుడిని చేసి; దేవ+ఉపచారంబులన్= దైవానికిచేసే దైవోపచార విధితో; కృష్ణద్వైపాయన ముని+ఇంద్రున్+పూజించి= వ్యాసుడిని పూజించి; ఆ+జనపతి= జనమేజయుడు; సకలజనంబులు= అందరూ; ప్రస్తుతింపన్= ప్రశంసించగా; విభవంబు= వైభవం; శోభిల్లన్= ప్రకాశించగా; పురంబు= హస్తినాపురి; ప్రవేశించెన్= చేరుకొన్నాడు.

తాత్పర్యం: ఉగ్రశ్రవుడు భారతకథను చెప్పి ఇట్లా అన్నాడు: 'ఆ విధంగా జనమేజయ మహారాజు సర్పయాగ కర్మలను అనుష్ఠిస్తున్న సమయంలో వైశంపాయన మహర్షివలన ఈ ప్రసిద్ధమైన కథను విన్నవాడై ఆశ్చర్యంపొందాడు. సంతోషపడ్డాడు. ఆ విధంగానే యాగం చేయటానికి నియమించబడిన బ్రాహ్మణులు యాగ పూర్తికర్మలను చేశారు. అట్లా జనమేజయుడు సర్పాల ఆపదను తీర్చిన అస్తీకుడిని తగిన పూజలతో సత్కరించి సంతోషింపజేసి అతడి నివాసానికి పంపించాడు. ఋత్విక్కులు మొదలైన బ్రాహ్మణులకు మిక్కిలిగా కానుక లిచ్చి వినయంతో వారిని సాగనంపాడు. వారంతా తమ తమ ఇళ్ళకు వెళ్ళారు. ఆ తరువాత వైశంపాయన మహర్షిని ప్రత్యేకమైన పూజలతో సత్కరించి సంతోషాంతరంగుడిని చేసి, వేదవ్యాసమహర్షికి దేవోపచార విధితో పూజలు గావించి జనమేజయ మహారాజు ప్రజలందరూ ప్రస్తుతించగా వైభవం అతిశయించగా హస్తినాపురాన్ని ప్రవేశించాడు.'

విశేషం: భారతకర్త వ్యాసమహర్షిని దైవోపచారంతో పూజించారంటే దైవంతో సమానంగా పరిగణించి పూజించారని అర్థం. శక్త్యుపచార, భక్త్యుపచార, షోడశోపచార పూజలని పూజలు మూడు విధాలు. దైవోపచారమంటే ఈ మూడు విధాలా అర్చించటమని అర్థం.

సీ. **అని చెప్పి యా శౌనకాది మునీశ్వర। గణముతో మఱియు నక్కథకుఁ డింపు**
మిగులంగ నిట్లను 'మేటి మునీశ్వర। సంఘంబులో నెల్ల సత్యదర్శి
సర్వవిధిజ్ఞాత సర్వవిజ్ఞాన భ। వ్యాత్ముండు సర్వేంద్రియ ప్రబోధ
శాలి సర్వజ్ఞుండు శౌచశాంతి క్షమా। దాంతి తపోనిత్యతావిభాసి

తే. **యాప్తసర్వవిధైశ్వర్యుఁ డఖిల సాంఖ్య। యోగ భేద విదుండు ధర్మోపదేశ**
చతుర వాగ్విలాసుండు నిస్తత్త్వ వస్తు। వేది సాత్యవతేయుండు వేదమయుఁడు. **80**

ప్రతిపదార్థం: అని చెప్పి= అని చెప్పినవాడై; ఆ శౌనక+ఆది= ఆ శౌనకుడు మొదలైన; ముని+ఈశ్వర గణముతోన్= మునీశ్వరుల సమూహంతో; మఱియున్= ఇంకా; ఆ+కథకుఁడు= ఉగ్రశ్రవుడు; ఇంపు మిగులంగన్= మాధుర్యం అతిశయించగా; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; ముని+ఈశ్వర సంఘంబులోన్+ఎల్లన్+మేటి= మునీశ్వరుల సమూహంలో గొప్పవాడు; సత్యదర్శి= సత్యాన్ని దర్శించినవాడు; సర్వవిధిజ్ఞాత= అన్ని విధులూ తెలిసినవాడు; సర్వవిజ్ఞాన భవ్యాత్ముండు= ప్రపంచంలోని విజ్ఞానమంతా నిండిన పుణ్యాత్ముడు; సర్వేంద్రియ ప్రబోధశాలి= బ్రహ్మజ్ఞానంద్వారా అన్ని ఇంద్రియాలను మేల్కొల్పగలిగినవాడు; సర్వజ్ఞుండు= అన్నీ తెలిసినవాడు; శౌచ= పవిత్రత; శాంతి; క్షమా= ఓర్పు; దాంతి; తపస్= తపస్సులు; నిత్యతా= నిత్యత్వంచేత; విభాసి= ప్రకాశించేవాడూ; ఆప్త= పొందిన; సర్వవిధ= అన్ని విధాల; ఐశ్వర్యుండు= ఐశ్వర్యం కలవాడు; అఖిల= అన్నివిధాల; సాంఖ్యయోగ భేదవిదుండు=

సాంఖ్యయోగ భేదాలూ తెలిసినవాడు; ధర్మోపదేశ= ధర్మోపదేశంలో; చతుర= నేర్పరితనంగల; వాచ్+విలాసుండు= వాక్కుయొక్క క్రీడ కలవాడు; నిస్తత్త్వ= వాస్తవం కాని; వస్తువేది= వస్తువును తెలిసినవాడు; సాత్యవతేయుండు= సత్యవతీ కుమారుడైన వేదవ్యాసుడు; వేదమయుఁడు= వేద స్వరూపుడు.

తాత్పర్యం: అని చెప్పి ఉగ్రశ్రవసుడు ఆ శౌనకాది మునులతో ఇట్లా అన్నాడు; 'సత్యవతీ కుమారుడైన వేద వ్యాసమహర్షి వేదస్వరూపుడు. ముని సంఘంలో గొప్పవాడు. సత్యాన్ని దర్శించినవాడు. అన్ని విధులూ తెలిసినవాడు. ప్రపంచంలోని విజ్ఞానమంతా నిండిన పుణ్యాత్ముడు. బ్రహ్మజ్ఞానంద్వారా అన్ని ఇంద్రియాలనూ మేల్కొల్ప గలిగినవాడు. అన్నీ తెలిసినవాడు. పవిత్రత, శాంతి, క్షమ, దాంతి, తపస్సుల నిత్యత్వంచేత ప్రకాశించేవాడు. అన్ని విధాల ఐశ్వర్యాన్నీ పొందినవాడు. ధర్మోపదేశంలో నేర్పరి. సదసత్ వివేకజ్ఞుడు.

విశేషం: "అచతుర్వదనో బ్రహ్మ ద్విబాహు రపరో హరిః
అఫాలలోచన శ్శంభుః భగవాన్ బాదరాయణః."

అని వ్యాసుడిని సంప్రదాయంలో కీర్తిస్తారు. ఈ కీర్తి భారతం చదివినవాడికి ఎవడికైనా సార్థకమనే అనిపిస్తుంది. నాలుగు ముఖాలు లేని బ్రహ్మ. రెండు భుజాలున్న విష్ణువు. ఫాలనేత్రం లేని శివుడు. భగవత్ స్వరూపుడు వ్యాసుడని పై శ్లోకానికి అర్థం. కృష్ణుడనే పేరు వాసుదేవుడికి, ద్రౌపదికి, వ్యాసుడికి ముగ్గురికే చెల్లింది. అందుకే వైష్ణవ సంప్రదాయంలో వ్యాసుడిని విష్ణు స్వరూపుడంటారు. ఈ అర్థాన్నే పై శ్లోకం వివరిస్తున్నది.

ఇంద్రియాలను మేల్కొల్పటమంటే ఏమిటో వివరించవలసిన అవసరం ఉన్నది. అజ్ఞానంచేత ఇంద్రియాలు స్తబ్ధంగా అంధకారంలో మునిగి ఉంటాయి. ఆ మత్తునుండి ఇంద్రియాలను మేల్కొల్పితే తప్ప మనసుకూ, ఇంద్రియాలకూ అన్వయం కుదరదు. ఈ అన్వయం చేతనే యోగం సిద్ధిస్తుంది. అప్పుడు జ్ఞానేంద్రియ పంచకాలు కర్మేంద్రియ పంచకాలు, వాటి గుణాలు. శ్రద్ధలూ ఇవన్నీ సాధకుడి గుప్పిట్లో ఉంటాయి. 'యతి' అనే శబ్దానికి అర్థం ఇదే. నియతేంద్రియు డని అర్థం. దానిద్వారా పవిత్రత సిద్ధిస్తుంది. అది అగ్నికి ఉన్న శుచిత్వంవంటిది. బుద్ధీంద్రియాల నిగ్రహం శాంతి. కర్మేంద్రియాల నిగ్రహం దాంతి. సర్వభూత సహనం క్షమ. వీటిని నిరంతరం జ్ఞానాగ్నిలో వేల్చటమే 'తపస్సు'. అట్లాంటి జ్ఞానాగ్ని దగ్ధకర్ముడు వేదవ్యాసుడు. అందుకే సదసద్ వివేకం కలవాడయ్యాడు. సత్ - ఉన్నది (బ్రహ్మతత్త్వం) అసత్-లేనిది (వస్తుజగత్తు). జ్ఞానబోధచేయాలి అంటే అసద్ వస్తువు ఏమిటో - అంటే అజ్ఞానమంటే ఏమిటో బోధపరచాలి. అందుకే విస్తత్త్వ - వాస్తవం కాని వస్తువు ఏమిటో వ్యాసుడికి తెలుసని చెప్పటం.

సాంఖ్యం - కపిలమహర్షి ప్రతిపాదించిన యోగమిది. ప్రధానమైన మూల ప్రకృతి వికారం లేనిది - 1. మహదహంకారశబ్ద స్పర్శ రూప రసగంధరూప పంచతన్మాత్రలు-7. ప్రకృతి, వికృతులు - పంచమహాభూతాలు, పంచజ్ఞానేంద్రియాలు. పంచకర్మేంద్రియాలు, మనసు అనేది కేవలం వికృతులు-16, ప్రకృతికాని వికృతి కాని కాలపురుషుడు-1. ఇవి మొత్తం-25, సంఖ్యాపూర్వకంగా అవికారుడైన పురుషుడు (ఆత్మ) చెప్పబడినందువలన ఇది 'సాంఖ్య' యోగం. ఈ తత్త్వాలు 24 అని, 25 అని, 36 అని మత భేదాలున్నాయి.

అణిమాదులైన అష్టవిభూతులనే ఐశ్వర్యమంటారు. ఇది కలిగినవాడినే 'ఈశ్వరు' డంటారు. అందుకే వ్యాస భగవానుడు పూజనీయుడయ్యాడు.

వ. పాండవుల కీర్తిం బ్రకటించుటకును, మఱియుం గొందఱు జనపతుల చరిత్రంబుల జనుల కెఱింగించుటకును, దేవదేవుం డగు వాసుదేవుని సంక్రీడా విశేషంబులు వివరించుటకును, సర్వదేవజాతుల జన్మంబులును దదీయ సాయుజ్యంబులును దేటపఱుచుటకును, సకల ధర్మంబులునుం దెలుపుటకునుగాఁ బంచమవేదం బయి పరఁగు నిమ్మహాభారత సంహిత యొనర్చె; నిమ్మహేతిహాసంబు సంవత్సర త్రయకృతంబు; దీని విశేషంబు వినుండు. 81

ప్రతిపదార్థం: పాండవుల కీర్తిన్= పాండవుల కీర్తిని; ప్రకటించుటకును= ప్రకటించటానికీ; మఱియున్= ఇంకా; కొందఱు= కొంతమంది; జనపతుల చరిత్రంబులన్= రాజుల కథలను; జనులకున్+ఎఱింగించుటకును= జనులకు తెలపటానికి; దేవదేవుండు+అగు= దేవతలకు దేవుడైన; వాసుదేవుని= శ్రీకృష్ణుడి; సంక్రీడా= లీలా; విశేషంబులన్= విశేషాలను; వివరించుటకును= వివరించటానికి; సర్వదేవజాతుల= అన్ని దేవగణాల; జన్మంబులును= పుట్టుకలను; తదీయ= వారి; సాయుజ్యంబును= ఐక్యాన్ని లేదా కలయికను; తేటపఱుచుటకును= విశదంచేయటానికి; సకల ధర్మంబులునున్= అన్ని ధర్మాలను; తెలుపుటకును+కాన్= తెలుపటానికిగాను; పంచమవేదంబు+అయి= ఐదవవేదంగా; పరఁగు= ప్రసిద్ధమైన; ఈ+మహాభారత సంహిత+ఒనర్చెన్= ఈ మహాభారత సంహితను రచించాడు: ఈ+మహేతి హాసంబు= ఈ మహేతిహాసం; సంవత్సరత్రయ కృతంబు= మూడు ఏళ్ళపాటు రచించబడింది; దీని విశేషంబు వినుండు= దీని వైశిష్ట్యం చెప్తుతాను వినండి.

తాత్పర్యం: పాండవుల కీర్తిని ప్రకటించటానికీ, ఇంకా కొంతమంది రాజులకథలను జనులకు తెలపటానికీ. దేవదేవుడైన వాసుదేవుడి లీలా విశేషాలను వివరించటానికీ, సర్వదేవతా గణాల పుట్టుక, సాయుజ్యం విశదంచేయటానికీ, సకల ధర్మాలను తెలపటానికి గాను, పంచమవేద మని పేరుపొందిన ఈ మహాభారత సంహితను వేదవ్యాసుడు మూడు సంవత్సరాలలో నిర్మించాడు. దీని వైశిష్ట్యం చెప్తుతాను వినండి.

విశేషం: సాయుజ్య (ఐక్యం) సామీప్య (సమీపవాసం), సారూప్య (తత్తుల్యరూపం), సాలోక్య (తల్లోకవాసం) అని ముక్తి నాలుగు విధాలు.

తే. అమల ధర్మార్థ కామ మోక్షముల గుఱిచి। యొలయు తెరు వెద్దియును నిందుఁ గలుగునదియ
యొం డెడలఁ గల్గు దీన లేకుండు చొప్పు। దక్కొకంటను లేదు వేదజ్ఞులార!' 82

ప్రతిపదార్థం: వేదజ్ఞులార!= వేద విదులారా!; అమల= పవిత్రమైన; ధర్మ+అర్థ+కామ+మోక్షములన్+గుఱిచి= ధర్మార్థ కామమోక్షాలను గురించి; ఒలయు= ప్రవర్తించే; తెరువు= ధర్మం; ఎద్దియునున్= ఏదైతే; ఇందున్= ఈ భారతంలో; కలుగున్= ఉన్నదో; అది+అ= అదే; ఒండు+ఎడలన్= మరొకచోట కూడా; కల్గున్= ఉంటుంది; దీనన్= ఇందులో; లేకుండు= కనిపించని; చొప్పు= ధర్మం; తక్కు+ఒకంటను= మరి ఏ చోటా; లేదు= కనిపించదు.

తాత్పర్యం: ఓ వేదవిదులారా! పవిత్రమైన ధర్మార్థ కామమోక్షాలకు సంబంధించి ప్రవర్తించే ధర్మం ఏదైతే ఈ భారతంలో చెప్పబడిందో అది మరొకచోట కూడా ఉంటుంది. ఇందులో లేని ధర్మం మరెక్కడా కూడా కనిపించదు.

విశేషం: మహాభారతంలో పురుషార్థాలను గురించి సర్వవిషయ సమగ్ర చర్చ జరిగిందని ఈ పద్యానికి అర్థం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మే చార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ,
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్.

అని మూలశ్లోకం. మూలంలో జనమేజయుడికి చెప్పినట్టుండగా తిక్కనగారు వేదవిదులైన మహర్షులతో ఉగ్రశ్రవుడన్నట్టు మార్చినారు. 'వేదవిదులకు' ఇతరత్ర ఈ పురుషార్థాల విషయంగా ఏమి చెప్పారో కరతలామలకంగా ఉంటుంది. కాబట్టి వారికి చెప్పటంలో ఔచిత్యమున్నది. అంటే చతుర్వేదోపనిషత్సారమూ ఈ పంచమ వేదరూపంలో వ్యాసమహర్షిచే అందించబడిందని తాత్పర్యం. ఇదే మునివృషభుడైన వ్యాసమహర్షి నిరూపించిన 'అర్థం'. ఈ అర్థాన్ని వినాలనే రాజరాజనరేంద్రుడు నన్నయభట్టుగారిని కోరింది.

సీ. **'పుణ్యాత్ములార! యీ పుణ్యేతిహాసంబు । జనమేజయుండు సేయు సర్పమఖము**
కాలంబునం దట్లు కారుణికోత్తముఁ । డైన వేదవ్యాసుఁ డాదరమున
నాజ్ఞాపనము సేయ నతని శిష్యుఁడు లోక । నుతుఁడు వైశంపాయనుండు సెప్ప
నన్నరేంద్రుఁడు విన నా సభ నిలిచి స । వినయభక్తికముగ వినినవాఁడఁ

తే. **గథనశక్తియు నమ్ముని కరుణవలనఁ । గలిగె నా కిత్తెఱంగున గారవించి**
మీరు వినుచుండఁ జెప్పెడి మేటి పదము । గంటి; మంటి మీ దయ పెంపుకతనఁ జేసి.' **83**

ప్రతిపదార్థం: పుణ్య+ఆత్ములార!= పుణ్యాత్ములారా!; ఈ+పుణ్య+ఇతిహాసంబు= పుణ్యప్రదమైన ఈ కథను; జనమేజయుండు= జనమేజయ మహారాజు; చేయు= చేస్తున్న; సర్పమఖము కాలంబునందున్= సర్పయాగ కాలంలో; అట్లు= ఆ విధంగా; కారుణిక+ఉత్తముఁడు+ఐన= దయగలవారిలో శ్రేష్ఠుడైన; వేదవ్యాసుఁడు= వ్యాసమహర్షి; ఆదరమునన్= ఆదరంతో; ఆజ్ఞాపనము+చేయన్= అనుజ్ఞ ఇవ్వగా; అతని శిష్యుఁడు= అతడి శిష్యుడైన వాడూ; లోకనుతుఁడు= లోకంచేత ప్రస్తుతించబడినవాడూ అయిన; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; ఆ+నర+ఇంద్రుఁడు వినన్= జనమేజయుడు వింటుండగా; చెప్పెన్= చెప్పాడు; ఆ సభన్= ఆ సభలో; నిలిచి= ఉండి; సవినయ భక్తికముగన్= వినయంతోనూ, భక్తితోనూ; వినినవాఁడన్= విన్నాను - వినినవాడిని (నేను); నాకున్= నాకు; కథనశక్తియున్= కథను చెప్పేశక్తికూడా; ఆ+ముని= వ్యాసమహర్షి; కరుణవలనన్= కరుణవలననే; కలిగెన్= కలిగింది (నేను); ఈ+తెఱంగునన్= ఈ విధంగా; గారవించి= నన్ను గౌరవించి; మీరు= మీరందరూ; వినుచుండన్= వింటుండగా; చెప్పెడి= భారతాన్ని చెప్పగలిగే; మేటి పదమున్= ఉన్నత స్థానాన్ని; కంటిన్= పొందాను; మీ దయ= మీ కరుణ; పెంపుకతనన్+చేసి= అతిశయించిన దానివలన; మంటిన్= ఆయుష్మంతుడిని అయ్యాను. (ఆశీస్సులు పొందానని తాత్పర్యం).

తాత్పర్యం: పుణ్యాత్ములారా! పుణ్యప్రదమైన ఈ కథను జనమేజయ మహారాజు సర్పయాగం చేస్తున్న సమయంలో దయామయుడైన వ్యాసమహర్షి అనుజ్ఞచేత అతడి శిష్యుడూ లోకంలో ప్రసిద్ధిచెందినవాడూ అయిన వైశంపాయన మహర్షి ఆ రాజు వింటుండగా చెప్పాడు. నేను ఆ సభలో ఉండి వినయ భక్తులలో ఆ కథను సమగ్రంగా విన్నాను. నా కీ కథను చెప్పే సామర్థ్యం కూడా వ్యాసులవారి అనుగ్రహం వలననే కలిగింది. ఇట్లా నన్ను గౌరవించి మీరంతా వింటుండగా నేను భారతాన్ని చెప్పగలిగే ఉన్నత స్థానాన్ని పొందాను. మీ ఆశీస్సులచేత ఆయుష్మంతుడిని అయ్యాను.

విశేషం: సూతుడు కావటంచేత మహర్షుల ఆశీర్వాదంచేత తాను తరించానని చెప్తున్నాడు. అదే మన భారతీయ సంప్రదాయంలో పాండిత్యానికీ, ఆశ్రమానికీ ఉన్న చిత్రమైన గౌరవం.

వ. **అని పలికి వెండియు.** **84**

తాత్పర్యం: అని చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

ఫలశ్రుతి

క. 'అలఘుమతులార! పర్వం। బుల నీ యితిహాస రత్నమును వినిన నఘం
బులు వాయు; నాకలోకము। గలుగును; సిద్ధించు ముక్తి కాంక్షిత యైనన్. 85

ప్రతిపదార్థం: అలఘుమతులార!= ఘనబుద్ధి కలిగిన మహర్షులారా!; ఈ+ఇతిహాస రత్నమును= ఈ శ్రేష్ఠమైన ఇతిహాసాన్ని; పర్వంబులన్= పర్వదినాలలో; వినినన్= వింటే; అఘంబులు= పాపాలు; పాయున్= నశిస్తాయి; నాకలోకము= స్వర్గం; కలుగును= కలుగుతుంది; ముక్తి= ముక్తి (మోక్షం); కాంక్షిత+ఐనన్= కోరితే; సిద్ధించున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: ఉదాత్తమతులైన మహర్షులారా! ఈ మహేతిహాసాన్ని పర్వదినాలలో వింటే సర్వపాపాలూ నశిస్తాయి. స్వర్గం లభిస్తుంది. సంకల్పించి గాఢమైన భక్తితో వింటే ముక్తి కూడా లభిస్తుంది.

విశేషం: పండుగలు, పబ్బాలు అని రెండు రకాల ఉత్సవాలు. ఉగాది మొదలైన పండుగలు, పర్వాలు (పబ్బాలు) ఐదు ముఖ్యమైనవి. అమావాస్య, పూర్ణిమ, అష్టమి, దశమి, సూర్యసంక్రాంతి - వీటిని పంచపర్వదినా లంటారు. ఇంకా చంద్రగ్రహణాన్ని, చాతుర్మాస్యంలోని వైశ్వదేవాదియాగ సందర్భాలను (వైశ్వదేవం, వరుణం, ప్రఘాస, శాఖమేధ, సునాసీరయా లన్నవి) కూడా పర్వాలనే పిలుస్తారు. అందుచేత భారతం భారతీయులకు మోక్షప్రదమైన పారాయణగ్రంథ మని అర్థం.

క. ఆద్యంతంబును నీ యన। వద్యకథ వినంగఁ గనినవారికిఁ బాయున్
సద్యంబ బ్రహ్మహత్యా। వద్యము మొదలైన పాపవర్గం బెల్లన్. 86

ప్రతిపదార్థం: ఆది+అంతంబునున్= మొదటినుండి తుదివరకూ; ఈ+అనవద్య కథన్= ఈ పుణ్యకథను; వినంగన్+కనినవారికిన్= వినగలిగినవారికి; సద్యంబు+అ= తత్క్షణమే; బ్రహ్మహత్యా+అవద్యము= బ్రహ్మహత్యపాపం; మొదలైన= మొదలైనటువంటి; పాపవర్గంబు+ఎల్లన్= పాపసమూహాలన్నీ; పాయున్= నశిస్తాయి.

తాత్పర్యం: ప్రారంభం మొదలు ఈ పుణ్యకథను ఎవరు వింటారో వారికి ఆ క్షణమే బ్రహ్మహత్యాపాపం మొదలైన మహాపాపసమూహాలు కూడా నశిస్తాయి.

క. సురపితృకార్యంబుల భూ। సురులకు దీని వినిపించు సుకృతాత్ముఁడు ద
త్కరణ ఫలంబుల నధిక। స్ఫురితంబుగఁ బడయు మహితబోధనులారా! 87

ప్రతిపదార్థం: మహిత= గొప్ప; బోధనులారా!= జ్ఞానులారా! (బ్రహ్మజ్ఞానులారా!); సుర= దైవ; పితృ= పితరుల; కార్యంబులన్= కార్యాలలో; భూసురులకున్= బ్రాహ్మణులకు; దీనిన్= ఈ భారతాన్ని; వినిపించు= వినిపించే; సుకృత+ఆత్ముఁడు= పుణ్యాత్ముడు; తద్+కరణ ఫలంబులన్= ఆయా కార్యాలను చేసిన ఫలితాలను; అధిక స్ఫురితంబుగన్= మహా ప్రకాశవంతంగా; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: దైవ, పితృకార్యాలు జరిపేటప్పుడు ఏ పుణ్యాత్ముడు బ్రాహ్మణులకు ఈ మహాభారతాన్ని వినిపిస్తాడో అతడు ఆయా పుణ్యకార్యాల ఫలితాన్ని మిక్కిలి ప్రకాశవంతంగా పొందుతాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇక్కడ 'స్ఫురితం' అంటే ఐశ్వర్యభరితంగా అని అర్థం.

క. మానసముల నింద్రియముల । నేనియుఁ జేయంగఁబడిన యేనః పుంజం
బీ నిర్మలేతిహాసము । వీనుల నొక్కింత సిలుక విరియు సకలమున్. 88

ప్రతిపదార్థం: మానసములన్= మనస్సులలో; ఇంద్రియములన్= ఇంద్రియాలలో; ఏనియున్= నేటితోనైనా; చేయంగన్+పడిన= చేయబడ్డ; ఏనస్+పుంజంబు= పాప సమూహం; ఈ+నిర్మల+ఇతిహాసము= ఈ పవిత్రమైన భారతకథ; వీనులన్= చెవులలో; ఒక్కింత+చిలుకన్= కొంచెంగా చిలికినా కూడా (పడినాకూడా); సకలమున్= పాపాలన్నీ; విరియున్= తొలగిపోతాయి.

తాత్పర్యం: మనస్సుతోకాని, ఇంద్రియాలతోకాని చేయబడ్డ పాపసమూహం ఈ పవిత్రమైన భారతేతిహాసం చెవులలో ఏకొంత చిలికినా కూడా ఆ సర్వపాపాలూ వెంటనే విరిగిపోతాయి.

ఉ. భ్రాజిత వృత్తిమైఁ బరఁగు భారత సంహిత సంయమీంద్రులా
రా! జయనామకంబునను రాజితభంగి జగత్త్రయంబునం
బూజిత కీర్తియై నెగడు భూరిజయోన్నతిఁ గంద్రు దీనిచే
రాజు; లిలాసురుల్ మఱి యరాతుల గెల్తురు విన్న యంతటన్. 89

ప్రతిపదార్థం: సంయమి+ఇంద్రులారా!= ఋషీశ్వరులారా!; భ్రాజిత వృత్తిమైన్= ప్రకాశధర్మంతో; పరఁగు= ఒప్పేటటువంటి; భారత సంహిత= మహాభారతేతిహాసం; జయనామకంబునను= జయమనే పేరుతో; రాజితభంగిన్= వెలుగుతూ; జగత్+త్రయంబునన్= మూడు లోకాలలోనూ; పూజిత కీర్తి+ఐ= మన్నించబడిన ప్రఖ్యాతికలదై; నెగడున్= వ్యాపించింది; విన్నఅంతటన్= వినగానే; రాజులు= చక్రవర్తులు; దీనిచేన్= ఈ భారత కథా శ్రవణంచేత; భూరి= మిక్కిలి; జయ+ఉన్నతిన్= విజయంతోడి ఉన్నతస్థితిని; కంద్రు= పొందుతారు; మఱి= ఇంకా; ఇలాసురుల్= బ్రాహ్మణులు సైతం; అరాతులన్= శత్రువులను; గెల్తురు= గెలుస్తారు.

తాత్పర్యం: ఋషీశ్వరులారా! ప్రకాశధర్మం కలిగిన ఈ భారతేతిహాసం 'జయ'మనే పేరుతో వెలుగుతూ మూడు లోకాలలోనూ మన్నించబడుతూ ప్రఖ్యాతమై వ్యాపించింది. రాజులు ఈ కథ విని విజయలక్ష్మిని పొంది వెలుగుతారు. బ్రాహ్మణులు కూడా శత్రువులను జయిస్తారు.

విశేషం: బ్రాహ్మణులు విపక్షవాద జయం సాధిస్తారని తాత్పర్యం.

ఉ. భారతమర్థితో వినిన భక్తిఁ బఠించిన శ్రీయు నాయువున్
భూరియశంబునుం బ్రమదమున్ దృఢ విద్యయుఁ గల్గు; వారి కే
కోరికలైన వేగ మొనఁగూడు; సుపుత్త్రునిఁ గాంచు సద్వరున్
గారవ మొప్పఁగాఁ బడయు గర్భిణియున్ వరుసన్ గుమారియున్. 90

ప్రతిపదార్థం: భారతము= భారతాన్ని; అర్థితోన్= కోరికతో; వినినన్= వింటే; భక్తిన్= భక్తితో; పఠించినన్= చదివితే; శ్రీయున్= సంపద; ఆయువున్= ఆయుస్సు; భూరి= మిక్కిలి; యశంబునున్= కీర్తి; ప్రమదమున్= సంతోషమూ; దృఢ= గట్టి; విద్యయున్=

చదువూ; కల్గున్= కలుగుతాయి; వారికిన్= వారికి; ఏ కోరికలు+ఐనన్= ఏ కోరికలైనా; వేగము+ఒనన్+కూడున్= శీఘ్రంగా ఫలిస్తాయి; గర్భిణియున్= గర్భిణీ; కుమారియున్= కన్యా; వరుసన్= వరుసగా; సుపుత్రునిన్= మంచి కొడుకును; సద్వరున్= మంచి మగడిని; పడయున్= పొందుతారు.

తాత్పర్యం: భారతాన్ని కోరికతో వినినా, భక్తితో చదివినా సంపద, ఆయుస్సు, మిక్కిలి యశస్సు, సంతోషం, గట్టి చదువు కలుగుతాయి. వారికి ఏ కోరిక అయినా అతి శీఘ్రంగా ఫలిస్తుంది. గర్భిణికి మంచి కుమారుడు పుట్టుతాడు. కన్యకు మంచి వరుడు దొరుకుతాడు.

విశేషం: గట్టి చదువు= గట్టి పునాది ఉన్న చదువని అర్థం. బ్రహ్మజ్ఞానమే ఆ గట్టి పునాది. నిత్యానిత్య వస్తు వివేకం ఉన్న చదువునే 'దృఢవిద్య' అని తిక్కనగారు అందంగా పిలిచారు.

భారత శ్రవణంచేత ఇంద్రియాలు ఉద్వేగాన్ని, చంచలత్వాన్ని పోగొట్టుకొని ప్రశాంతగతికి, కార్యనిర్వహణకు సంసిద్ధమవుతాయి. కాబట్టి ఆయుస్సు పెరుగుతుంది. ఇట్లాగే తక్కిన ఫలితాలు కూడా. (క్రమాలంకారం)

ఉ. శిక్షిత చిత్తులార! శుభసిద్ధులు వొందు ననేక జన్మ పా
పక్షపణంబునన్ వెలుఁగు భారత సంహిత కెల్లఁ బుండరీ
కాక్షుని వాసుదేవుఁ బ్రకటార్థముగాఁ గని విన్న మానవుం
డక్షయ పుణ్యలోకములయందు రమించు నిరామయస్థితిన్. 91

ప్రతిపదార్థం: శిక్షిత= అదుపులో ఉంచబడిన; చిత్తులార!= మనసులుగల ఋషివర్యులారా!; భారతసంహితకున్+ఎల్లన్= భారత సంహితకు అంతటికీ; ప్రకట+అర్థముగాన్= సారాంశంగా; పుండరీకాక్షునిన్= కమలాక్షుడైన; వాసుదేవున్+కని= శ్రీకృష్ణుడినిచూచి; విన్న= విన్నటువంటి; మానవుండు= మానవుడు; అనేక జన్మ పాప= అనేక జన్మాలలో చేసిన పాపాల; క్షపణంబునన్= క్షయం చేత; వెలుఁగున్= ప్రకాశిస్తాడు; శుభసిద్ధులు+పొందున్= శుభమైన ఫలితాలు పొందుతాడు; అక్షయ= తరుగుదలలేని; పుణ్యలోకముల+అందున్= పుణ్యలోకాలలో; నిరామయస్థితిన్= దోషరహితమైన సుఖస్థితిలో; రమించున్= క్రీడిస్తాడు.

తాత్పర్యం: అదుపులో ఉంచిన మనస్సులుగల మహర్షులారా! భారత సంహితకు సారాంశభూతుడుగా కమల పత్రనయనుడైన శ్రీకృష్ణ పరమాత్మను దర్శించి ఎవడు ఈ ఇతిహాసాన్ని వింటాడో వాడు జన్మజన్మలలో చేసిన పాపాలు నశించి ప్రకాశిస్తాడు. అన్ని శుభ ఫలితాలను పొందుతాడు. ఎప్పటికీ నశించని పుణ్యలోకాలలో ఏ దోషమూలేని సుఖస్థితిలో రమిస్తుంటాడు.

విశేషం: భగవంతుడైన వ్యాసుడు భారతార్థాన్ని శ్రీకృష్ణ పారమ్య బోధకంగానే ఉద్దేశించాడని ముందే వివరించటం జరిగింది.

ఉ. వ్యాసమునీంద్ర సారకరుణాతిశయంబున భారతార్థ ము
ద్భాసితమైనయట్టి నుతభాగ్యునకున్ సకలాగమార్థ సం
వాసన మావహిల్లు జనపంక్తులు గీర్తనసేయ శశ్వదు
ల్లాస సుఖానుభూతి నచలస్థితి నొప్పు నతం డుదాత్తుఁడై. 92

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వ్యాసమునీంద్ర= వ్యాసమహర్షియొక్క; సార= సాంద్రమైన; కరుణా+అతిశయంబునన్= కరుణాధిక్యంచేత; భారత+ అర్థము= మహాభారత తాత్పర్యం; ఉత్+భాసితము+ఐన+అట్టి= స్ఫురించినట్టి; నుతభాగ్యునకున్= స్తుతించబడిన భాగ్యవంతుడికి; సకల+ఆగమ+అర్థ+సంవాసనము+ఆవహిల్లున్= అన్ని వేదాల అర్థాల కలిమీ కలుగుతుంది; జనపంక్తులు= జన సమూహాలు; కీర్తన+ చేయన్= కీర్తించగా; అతండు= అతడు; ఉదాత్తుఁడు+ఐ= అధికుడై; శశ్వత్= శాశ్వతమైన; ఉల్లాస+సుఖ+అనుభూతిన్= ఉల్లాసరూపమైన సుఖానుభూతితో; అచలస్థితిన్= చలించనిస్థితిలో; ఒప్పున్= వెలుగుతాడు.

తాత్పర్యం: వ్యాసమహర్షియొక్క సాంద్రమైన కరుణాధిక్యంచేత మహాభారత తాత్పర్యం ఎవరికి స్ఫురిస్తుందో ఆ భాగ్యవంతుడికి సకల వేదోపనిషత్సారమూ కరతలామలకం అవుతుంది. జనులు అతడిని కీర్తించగా అతడు శాశ్వతమైన సుఖరూపానుభూతితో చలనంలేని బ్రాహ్మీస్థితిలో వెలుగుతాడు.

విశేషం: మహాభారతంలో బయటికి కనిపించే కథవెనుక అతిగంభీరమైన తాత్త్విక ధార ఉందని ప్రాజ్ఞులు సెలవిచ్చారు. 'మహా' అనే శబ్దానికి అర్థ విచారణ చేస్తూ 'పెద్ద' అనే వాచ్యార్థం వెనుక సాంఖ్యం నుండి వేదాంతం వరకూ ఉన్న సర్వ ఆర్ష విజ్ఞానమూ 'మహా' శబ్దంలో దాగి ఉందని పండితులు అంటారు. 'మహత్తు' అని పిలువబడింది సాంఖ్యవిద్యలో చెప్పబడిన ప్రకృతితత్త్వం. 'భారత'మని చెప్పబడింది ప్రాణస్వరూపమైన ప్రణవతత్త్వం, దీనినే బ్రహ్మమని అన్నారు. శతపథబ్రాహ్మణంలో ఈ రహస్యం చెప్పబడింది. కాబట్టి భారతంలో పరాపర గోవృషభ, మాతృపితృ, ద్యావాపృథ్వీ, వాక్ప్రాణ, ద్రవ్యాత్మ, మృతామృత, అగ్నీషోమ, స్త్రీ పురుష, బంధు బిందు - తత్త్వాలు చెప్పబడ్డాయి. సంభవపర్వంనుండి యుద్ధ పర్వాలవరకూ ప్రకృతి (ప్రవృత్తి) యజ్ఞం. స్త్రీ శాంత్యాను శాసనికాదులు నివృత్తిరూప బ్రహ్మయజ్ఞం. ఈ రెండూ కలిసి పూర్ణతత్త్వమైన అద్వైతసార నిరూపణ చేస్తున్నాయి. ఈ లౌకికాలౌకిక తత్త్వ సమన్వయ జ్ఞానాన్నే 'యోగ' మని భారతం స్పష్టం చేస్తున్నది. స్వర్గారోహణపర్వ సారాంశం కూడా ఇదే.

వ. అని యిట్లు సమస్త పురాణ పారీణుండైన సూతుండు. 93

తాత్పర్యం: అని ఈ విధంగా సమస్త పురాణ కథనంలోనూ నేర్పరి అయిన ఉగ్రశ్రవుడు.

చ. పరమపదాప్తి హేతు వగు భారత సంహిత శౌనకాది భూ
సురవరు లింపునం గరఁగు చొప్పునఁ జెప్పిన వారు మోదసం
భరితతఁ బొంది యక్కథకు బ్రాఁతిగ నర్చితుఁ జేసి రర్మిలిన్;
హరిహరనాథ! సర్వభువనార్చిత! నన్ దయఁ జూడు మెప్పుడున్. 94

ప్రతిపదార్థం: పరమపద= మోక్ష; ఆప్తి= ప్రాప్తికి; హేతువు+అగు= కారణమైన; భారత సంహిత= భారత సంహితను; శౌనక+ఆది= శౌనకుడు మొదలైన; భూసురవరులు= బ్రాహ్మణోత్తములు; ఇంపునన్= తృప్తితో; కరఁగుచొప్పునన్= కరిగిపోయే విధంగా; చెప్పినన్= చెప్పగా; వారు= ఆ మహర్షులు; మోదసంభరితతన్+పొంది= మోద సంభరితులై (సంతోషం నిండినవారై); అర్మిలిన్= ప్రీతితో; బ్రాఁతిగన్= ఘనంగా; ఆ+కథకున్= ఆ ఉగ్రశ్రవసుడిని; అర్చితున్+చేసిరి= పూజించారు; (తిక్కనగారు ఇట్లా ప్రార్థిస్తున్నారు); హరిహరనాథ!= స్వామి హరిహరనాథా!; సర్వభువనార్చిత!= అన్ని భువనాలలోనూ పూజించబడేవాడా!; నన్= నన్ను; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; దయన్+చూడుము= దయతో చూడుము.

తాత్పర్యం: మోక్షప్రాప్తి కారణమైన భారత సంహితను శౌనకాది మునులకు వారు తృప్తితో కరిగిపోయేటట్లు చెప్పగా, వారు సంతోషంతో నిండినవారై ఆ కథకుడైన ఉగ్రశ్రవసుడిని ప్రీతితో ఘనంగా పూజించారు. స్వామీ హరిహరనాథా! సర్వలోకార్చితా! నన్ను సర్వదా నీ కృపాకటాక్షాలతో చూడుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇక్కడ 'ఇంపు' అంటే రసానందానుభవంవలన కలిగే 'తృప్తి' అని అర్థం. 'కరఁగట' మంటే కంటతడిపెట్టుకొని 'స్నిగ్ధ' లై సత్త్వగుణసంపన్నులు కావటమని అర్థం.

అశ్వాసాంతము

ఉ. పావన! దుర్దశాపహా! శుభప్రదమూర్తి! సుధానుభూతి సం
జీవిత భక్తలోక! తులసీదళదామ కపాలమాలికా
భావిభవాభిరామ! పరిపక్వతపఃఫలరూప! సాంఖ్య వి
ద్యావహా! యోగశక్తి విశదాద్భుత ఖేలన! లోకపాలనా! 95

ప్రతిపదార్థం: పావన!= పవిత్రుడా!; దుర్దశా+అపహా!= కష్టాలను తొలగించేవాడా!; శుభప్రదమూర్తి!= శుభాలను కలిగించే స్వరూపం కలవాడా; సుధా+అనుభూతి= అమృతాన్ని అనుభవించటంచేత; సంజీవిత= బ్రతికించబడ్డ; భక్తలోక!= భక్త సముదాయం కలవాడా!; తులసీదళదామ= తులసీపత్రాల దండయొక్క; కపాలమాలికా= పుర్రెల సరంయొక్క; భా= కాంతియొక్క; విభవ+అభిరామ!= అతిశయంచేత మనోహరంగా ప్రకాశించేవాడా; పరిపక్వ= పరిపక్వంపొందిన; తపస్+ఫలరూప!= తపస్సుయొక్క ఫలరూపమైనవాడా!; సాంఖ్య విద్యావహా!= సాంఖ్యవిద్యను ప్రసాదించినవాడా!; యోగశక్తి= యోగశక్తిచేత; విశద= ప్రకటించబడిన; అద్భుతఖేలన!= అద్భుతకార్యాలను లీలగా చేసినవాడా!; లోకపాలనా!= లోకాన్ని పరిపాలించేవాడా!

తాత్పర్యం: పరమేశ్వరా! నీవు పరమపవిత్రమూర్తివి. భక్తుల ఆపదలను తొలగిస్తూ వారికి సకల శుభాలూ చేకూరుస్తావు. అపాయసమయంలో అమృతాన్ని చిలికి వారిని బ్రతికిస్తావు. ఎముకల పేరుతో, తులసీదామంతో సితా సిత కాంతులతో నీవు మిక్కిలి మనోహరంగా కనిపిస్తావు. తాపసుల తపస్సుకు ఫలరూపమైన వాడివి నీవే. కపిలుడిరూపంలో సాంఖ్య విద్యను ప్రసాదించావు. యోగ విద్యాతిశయంచేత ఎన్నో అద్భుతకార్యాలను క్రీడగా చేసి చూపావు. లోకంలో ధర్మస్థితిని పరిరక్షిస్తూ సాధువులను కాపాడుతూ లోకపాలకుడివిగా విరాజిల్లుతున్నావు.

విశేషం: **"అపవిత్రః పవిత్రో వా సర్వావస్థాంగతోఽపి వా,**
యః స్మరేత్ పుండరీకాక్షం స బాహ్యాభ్యంతర శ్శుచిః."

అని స్మృతి. ఎవరు పుండరీకాక్షుడిని స్మరిస్తారో వారు శుచిపరులైనా అశుచులైనా ఏ అవస్థలో ఉన్నా బాహ్యాభ్యంతరాలలో 'పవిత్రు' లే అవుతా రని అర్థం. అందుచేత పరమాత్మ 'పవిత్రుడు'.

దేవతలకు అమృత ప్రదానంచేసి వారిని రక్షించాడు. అదే స్వామివారి 'మోహినీ' అవతారం. అమృతమంటే మృతిలేనిదని అర్థం.

ఎముకలహారం - తెల్లనిది. తులసీదామం - నల్లనిది. లౌకికాలౌకిక తత్త్వాలకు సంకేతాలు ఇవి. తులసీదామం హరిది. ఎముకల మాల హరుడిది.

'సాంఖ్య' శబ్దానికి ఆత్మజ్ఞానమని అర్థం. గీతాకారుడు వివక్షించాడు. కపిలుడి 'సాంఖ్య' విజ్ఞానమే శంకరుల అద్వైతానికి, తరువాతి విశిష్టాద్వైత, ద్వైతాలకు మూలం.

శ్రీకృష్ణుడు విరాట్ స్వరూపాన్ని ప్రదర్శించింది కేవలం యోగశక్తిచేతనే. అందుకే అతడు 'యోగేశ్వరుడు'. బ్రహ్మ సృష్టికర్త. రుద్రుడు లయస్వరూపుడు. విష్ణువు పాలకుడు. అందుకే రాజును విష్ణువు అంశకలిగినవాడుగా చెప్పారు. (నావిష్ణుః పృథివీపతిః).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. **దేవ! చతుర్విధ భూ। తావాసా! సుకృత హృదయ హారివిలాసా!**
కేవల భావానందమ। యా! వేదవ్యాస వర్ణనారూఢ దయా! 96

ప్రతిపదార్థం: దేవ!= స్వామీ!; చతుర్విధ= నాలుగు విధాలైన; భూత+ఆవాసా= భూతజాలంలోనూ నివసించేవాడా!; సుకృత= పుణ్యాత్ములైన సజ్జనుల; హృదయ= హృదయాలను; హారి= ఆకర్షించే; విలాసా!= క్రీడ కలవాడా!; కేవల= కేవలం; భావ+ఆనందమయా!= ఆత్మానంద రూపుడా!; వేదవ్యాస= వ్యాసమహర్షిచేత చేయబడిన; వర్ణన= వర్ణనలచే; ఆరూఢ= తెలియదగిన; దయా!= కరుణ (అనుగ్రహం) కలవాడా!

తాత్పర్యం: దేవా! నాలుగు భూతాలలోనూ నీవు వసిస్తున్నావు. పుణ్యాత్ములైన సజ్జనుల హృదయాలను ఆకర్షించే క్రీడ కలిగినవాడివి నీవు. నీవు కేవలం ఆత్మానంద స్వరూపుడివి. వేదవ్యాస మహర్షి చేసిన వర్ణనలు నీ అనుగ్రహ పారమ్యాన్నే బోధిస్తాయి.

విశేషం: దేవ, మనుష్య, తిర్యక్, స్థావరములని నాలుగు విధాలుగా భూతాలు చెప్పబడ్డాయి. అన్ని భూతాలకూ జనుస్థానం కాబట్టి స్వామి అన్నిటిలోనూ వసిస్తున్నాడు. (ఈశావాస్యమిదం సర్వం - అని ఈశావాస్యోపనిషత్తు).

సుకృతులకు స్వామి మనోహరుడు - దుష్కృతులకు భీషణుడు. అందుకే నరసింహాది రూపాలతో దుష్ట సంహారం చేశాడు. లక్ష్మీనరసింహుడై ప్రహ్లాదుడిని కాపాడాడు.

'భావ' మంటే 'ఆత్మ' అని అర్థం. బ్రహ్మ ఆనందస్వరూపుడు. బ్రహ్మపదార్థం కేవలం భావనామయం. అట్లాగే ఆనంద భావానందమయితే అది ఆత్మానందం మాత్రమే.

భారత భాగవతాదులలోని ప్రహ్లాద, గజేంద్ర, కుచేల, ద్రౌపద్యాదుల కథలు స్వామి కరుణనే నిరూపిస్తాయి.

మాలిని.

అకృతక మధురోక్తి వ్యాప్త సందీప్త సారా!
సకల భువన రక్షాశాలి శుంభద్విహారా!
శుక జనకమనీషా శుద్ధ బుద్ధానుభావా!
సకృపకృత విలాసా! సంభృతానందభావా! 97

ప్రతిపదార్థం: అకృతక= కల్పితం కానటువంటి; మధుర+ఉక్తి= మధురోక్తులలో; వ్యాప్త= వ్యాపించి; సందీప్త= ప్రకాశించే; సారా!= సారరూపుడా!; సకల= అన్ని; భువన= భువనాలనూ; రక్షాశాలి= రక్షిస్తూ; శుంభద్విహారా!= వెలిగే క్రీడ కలిగినవాడా!; శుక= శుకమునీంద్రుడి; జనక= జనకుడైన వ్యాసుడి; మనీషా= బుద్ధిచేత; శుద్ధబుద్ధ+అనుభావా!= అకలుషజ్ఞాన స్వరూపుడని నిశ్చయించబడ్డవాడా!; సకృప= దయతో; కృత= చేయబడిన; విలాసా!= లీలలు కలవాడా?; సంభృత= సంపూర్ణంగా నిండిన; ఆనంద భావా!= ఆనంద స్వరూపుడా! (నీకు మరల మరల నమస్కారం).

తాత్పర్యం: నిత్యమధురాలైన వేదవాక్యాలలో నీ ప్రకాశం సర్వత్రా వెలుగుతున్నది. సకల భువన రక్షణ రూపమే నీ విహారం. వేదవ్యాసుడు నిన్ను శుద్ధజ్ఞాన స్వరూపుడిగా వర్ణించాడు. భక్తుల సముద్ధరణకొరకు నీవు దయతో అనేక లీలలు ప్రదర్శిస్తావు. నీవు సంపూర్ణానంద స్వరూపుడివి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: వేదాలు పురుషప్రయత్నం లేకుండా పుట్టాయి. అందుకే అవి 'అకృతకాలు'. పరమేశ్వర నిశ్శ్వాసరూపమే వేదమని సంప్రదాయం. అందుకే అది అపౌరుషేయం.

బ్రహ్మసూత్ర ప్రకారం పరమాత్ముడు శుద్ధ బుద్ధ ముక్త రూపుడు - అని నిరూపించినవాడు సాధారణమైన ప్రజ్ఞ ఉన్నవాడు కాడు. ఆ ప్రజ్ఞ పురుష 'మనీష'. అది శుకజనకుడిది. శుకుడు జన్మతో బ్రహ్మర్షిగా పుట్టాడు. అతడి తండ్రి వేదవ్యాసుడు. అందుకే 'వ్యాసపీఠం' భారతీయ ఆత్మ సంపదగా మన్నన పొందింది.

స్వామి కృపావిలాసమే ఇన్ని అవతారాలూ. కనుకే స్వామి దయావీరగుణ సంపన్నుడు. కృపామూర్తి. ఆయన కేవలం బ్రహ్మానంద స్వరూపుడు. మాలినీ వృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న,న,మ,య,య - గణాలు ఉంటాయి. 9వ అక్షరం యతిమైత్రీస్థానం. ప్రాసనియమం ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీమహాభారతంబునందు స్వర్గారోహణపర్వంబు సర్వంబు నేకాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈ రచన; శ్రీమత్= ప్రసిద్ధి కెక్కిన; ఉభయ కవి= సంస్కృతాంధ్ర భాషాకవుల; మిత్త్ర= మిత్రుడును; కొమ్మన= కొమ్మన అనే; అమాత్య= మంత్రియొక్క; పుత్త్ర= కుమారుడును; బుధ= విద్వాంసులయొక్క; ఆరాధన= పూజచేత; విరాజి= ప్రకాశించేవాడును అయిన; తిక్కన సోమయాజి= సోమయాజి అయిన తిక్కనచేత; ప్రణీతంబు+ఐన= రచించబడినదైన; శ్రీమహాభారతంబునన్= శ్రీ మహాభారతంలో; స్వర్గారోహణ పర్వంబు= స్వర్గారోహణ పర్వం; సర్వంబును= సమస్తమును; ఏకాశ్వాసము.

తాత్పర్యం: కీర్తికలవాడూ, సంస్కృతాంధ్రభాషా కవిమిత్రుడూ, కొమ్మనమంత్రి కుమారుడూ, బుధపూజనంచేత ప్రకాశించేవాడూ అయిన తిక్కనసోమయాజి రచించిన శ్రీ మహాభారతంలో స్వర్గారోహణపర్వం సర్వం ఏకాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతంలోని ఏకాశ్వాసమైన స్వర్గారోహణపర్వం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతం సంపూర్ణం

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

శ్లో॥ యదక్షర పదభ్రష్టం । మాత్రాహీనం చ యద్భవేత్,
తత్సర్వం క్షమ్యతాం దేవ! నారాయణ! నమోఽస్తు తే.

(స్వామీ! నారాయణమూర్తీ! అక్షరంలోకాని, పదంలోకాని, మాత్ర (గణం)లోకాని ఏదైనా లోపం ఉంటే దానిని నీవే క్షమించుము. నీకు నమస్కారం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

గద్యపద్య ప్రథమపాద సూచి

అశ్వమేధ పర్వము

పద్యము	పుట
అ	
అంతఁ బోవక హేమ	47
అంతకుఁ బిన్నలున్ వెదక	129
అంత చేయంగ వలయునే	398
అంతటి లోభము గెలువక	140
అంత నక్కడఁ గృష్ణుండు	263
అంత నిలువక ముని	229
అంతయు నిమ్మహానుభావ	328
అంతరంబగు నిక్కయ్యు	54
అంతరాత్మ యనంగ	162
అంబరమాది యనిల	163
అంబరాది భూతముల	151
అంబరీషుం డను రాజు	140
అకట యెట్లగు నొక్కొ	230
అక్కుమారుఁ డేచి యర్జున	303
అక్షరంబు తెఱం గెఱింగించెద	107
అఖిలజనములు నచ్చెరు	378
అఖిలలోకభర్త వమరేంద్ర	44
అగుఁగాక నీవు సెప్పెడు	213
అగ్గాండీవికృప	335
అగ్ని చల్ల నైన నబ్జమిత్రు	17
అచ్చిత్రము చూచి	342
అజమరామర పదకర	405
అజ్జనపతి లజ్జితుండై	18
అట మున్న గాండివంబు	299
అటు మోచి తెచ్చి యందొక	226
అట్టి దవ్విపినంబు	131

పద్యము	పుట
అట్టి పరమధర్మం	393
అట్టియెడ	297
అట్టియెడ	364
అట్టియెడ	378
అట్టియెడం గర్మకాండ	395
అట్టియెడ ధర్మనందనుం	359
అట్టియెడ నొక్కనాడు	380
అట్టివాఁడనయి యుండియు	216
అట్టివా రిట్టి వా రగుట	89
అట్టులగుటఁ జేసి యవనీ	344
అట్టు లప్పురంబు నతి	333
అట్లుగా దిట్ల నియమ	120
అట్లుంగాక	365
అట్లుంగాక	382
అట్లుండి తన యనాదరణంబు	313
అట్లుండి యవనీసురా	259
అట్లు గవియుటయు	336
అట్లు గావున ధర్మరాజాను	67
అట్లు తన పతియును	319
అట్టు తెంపు చేసి యాసీనులైన	325
అట్లున్న రూపు	355
అట్లు పుండరీకాక్షుండు	279
అట్లు భక్తి దన్ను నాశ్రయించి	71
అట్లు మరలి మరలి	209
అట్లు విప్రుల కిచ్చి	372
అట్లు వివిధ విద్యానిధి	261

పద్యము	పుట
అట్లు వెనుకొనక నిలిచి	301
అట్లు వోయి పోయి మార్గంబు	210
అట్లు శౌరి పార్థు సంచిత	104
అట్లు సమకట్టి యతండు	13
అట్లు సేయువాఁడ నని	31
అ ట్లేకలవ్యనందనుం	339
అట్లేసిన	336
అట్లొప్పి యప్పుడమిఱేఁడు	374
అడుగులు గడ్గి ప్రీతి	381
అతఁడును దీవ్రబాణముల	303
అతఁడును వారిఁబోఁబనిచి	243
అతడు మడువు వెడలి	249
అతనిఁ దోపఁ జేయునట్టి	147
అతనికి గురుభక్తికతన	225
అతని నొదుంగనేయుట	297
అతని బలంబులఁ గ్రూర	339
అతని మనుమఁడు మరుత్తుం	12
అతని సుతుండు సూవె	15
అతిథి యొక్క ధరామరుం	381
అతిలోభంబునం జేసి	212
అతుల కనకమయము	372
అతులమైన నీ దయా	217
అతులిత దక్షిణాన్విత	4
అత్తఱి రోదనధ్వనులు	266
అత్యంతప్రబలంబులు	77
అదల్చిన నతండు సార	221

పద్యము	పుట
అది పూత్కారము చేసిన	304
అది బలహీనతగాఁ	335
అది యంతయును విని	17
అది యతివిస్తారము	247
అదియును గాక ఫలంబులు	82
అది యెట్లంటేని	222
అది యెట్లంటేని నాకర్ణింపు	329
అది యెట్లనిన	94
అది సదుపాయ మెందును	184
అది సింధుదేశవర్తి	307
అది హితంబు తత్ప్రాప్తికి	150
అద్దేవిఁగని యతం డట్ల	234
అధర్మంబుగా కుండునట్లు	228
అధిప తనయ నిన్ను	306
అధ్యాత్మాదులు భూతాది	163
అధ్వరహయ విషయం	323
అనఘ జలంబు నీ వలసి	224
అనఘ నకులరూపంబున	401
అనఘ మత్పితామహుని	397
అనఘ! మరుత్తుండు	08
అనఘ మరుత్తుండు	16
అనఘ ముంజగర్భమగు	92
అనఘ! యేడు మ్రొక్కులా	33
అనఘ విను మే గురుఁడ	195
అనపాయుండగు నెవ్వం	57
అనపేక్షిత ఫలతాశోభన	290
అనలశిఖలు వోని	302
అన విని జనమేజయుఁ	253
అనవిని నీవు ధర్మాగతి	399
అన విని ప్రమదంబున	17
అన విని యమ్మునీశ్వరున	06
అన విని యింద్రుఁ డిట్లనియె	36
అన విని సమ్మోద మారిన	285
అనవుడుఁ గృష్ణుఁ డిట్టులను	222
అనవుడుఁ బ్రీతినొంది	283
అనవుడు నక్కిరీటి	201
అనవుడు నట్లు చేసెద	332
అనవుడు నతండు	111
అనవుడు నమ్మాటకు	136
అనవుడు నాచార్యుం	31
అనవుడు నాతఁ డార్య	135
అనవుడు నేమియుం	334
అనవుడు బ్రహ్మబలము	38
అనవుడు బ్రాహ్మణప్రవరుఁ	143
అనవుడు సంవర్తుఁడు	34
అనవుడు సక్తుప్రస్థుఁడ	391
అనవుడు హింస పాపమని	134
అనసూయయు నక్రోధం	177
అనికిఁ దొడంగు నప్పుడు	69
అని గురుఁడు ప్రబోధించిన	194
అని చూపి పల్కు నవసర	388
అని చెప్పి	13
అని చెప్పి	54
అని చెప్పి	76
అని చెప్పి	83
అని చెప్పి	185
అని చెప్పి గర్భావాప్తి	82
అని చెప్పి బ్రాహ్మణుం	139
అని చెప్పి మనస్సుకు	117
అని చెప్పి మఱియు నిట్లని	138
అని చెప్పి మఱియును	131
అని చెప్పి మఱియును	86
అని చెప్పి యచ్చతురాననుం	168
అని చెప్పి యప్పరమ	235
అని చెప్పి యప్పరమేష్ఠి	156
అని చెప్పి యాగామి	345
అని చెప్పి యింద్రియ	125
అని చెప్పి వెండియు	190
అని చెప్పెఁగాని యభిమన్యు	250
అని చెప్పె నని చెప్పి	94
అని చెప్పె ననిన విని	353
అని తన సక్తు విచ్చిన	384
అని ధర్మజుండు పలికిన	208
అని ధర్మదేవత జనకునకు	144
అనినం గొడుకు మాటల	386
అనినంబ్రీతుం డయ్యెను	224
అనినఁ గృపయును శోకం	270
అనినఁ బ్రియమంది దేవీ	331
అనిన నగుచు నొక కేలన	70
అనిన నగ్నిదేవుఁ డమర	34
అనిన నతం డిట్లనియె	147
అనిన నతఁడట్ల కాకని	306
అనిన నయ్యనిమిషపతి	222
అనిన నవహితుండవై	95
అనిన నవ్వారిజనాభుండు	352
అనిన బ్రాహ్మణి పతితో	113
అనిన మరుత్తుఁ డయ్యమర	40
అనిన మరుత్తుఁ డిట్లనియె	42
అనిన వారి మాట లాదరింపక	394
అనిన విని జనమేజయుండిది	396
అనిన విని జనమేజయమునీంద్రు	225
అనిన విని దామోదరుండు	202
అనిన విని ధర్మ నందనుండా	05
అనిన విని మరుత్తుఁ	42
అనిన విని యంబుజ	283
అనిన విని యమ్మహా	41
అనిన విని యమ్మునీ	06
అనిన విని యమ్మునులు	182
అనిన విని యర్జునుం	148
అనిన విని యవ్వనిత	383
అనిన విని యింద్రియం	118
అనిన విని యుదంకుండు	213
అనిన విని యూరకున్నం	03
అనిన విని వార లత్యంత	244
అనిన సభక్తికముగ	314
అని నిజమందిరంబునకు	315

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అని నిర్దేశించి నీరజాసనుం	166
అని నిర్దేశించి యద్దేవుం	151
అని నిర్దేశించి యోగి	91
అని నిర్దేశించి వెండియు	193
అని నిర్దేశించుటయు	147
అని నిష్ఠించి పలుక	139
అని పలవించి యా సరసి	274
అని పలికి కర్మాధికారులం	286
అని పలికి గురుండా	194
అని పలికి దవ్వులన	43
అని పలికినఁ గృష్ణుం	371
అని పలికిన నయ్యధ్వర్యు	371
అని పలికి పతి చరణం	321
అని పలికి పార్థుం జేరం	320
అని పలికి మఱియు	112
అని పలికి మఱియు	188
అని పలికి మఱియు	238
అని పలికి మునీంద్రా!	07
అని పలికి యమ్మహాత్ము	29
అని పలికి యిట్లనియె	09
అని పలికి విశేషించి	62
అని పలికి వెండియు	88
అని పలికి వెండియు	398
అని పలుకుచు దివ్యం	390
అని పలుకుటయుఁ	36
అని పలుకుటయును	134
అని పల్కె సౌదాసుఁ డమ్ముని	232
అని ప్రతిజ్ఞ సేసి	275
అని ప్రార్థించిన యప్పార్థి	19
అని మఱియును	370
అనిమిషులన్ మునీశ్వరులు	308
అని యంత నిలువక	321
అని యంత నిలువని	273
అని యక్కొమ్మ యమ్మహితాత్మున	234

పద్యము	పుట
అని యగ్గించి యతని	66
అని యడిగిన	377
అని యడిగిన వైశంపాయనుం	64
అని యడిగిన వైశంపాయనుఁ	253
అని యదల్చి	304
అని యిట్లప్పురుషోత్తముం	277
అని యిట్లు కమలగర్భుండు	194
అని యిట్లు కమలగర్భుఁడు	193
అని యిట్లు కృష్ణుండు	61
అని యిట్లు కృష్ణుండు	196
అని యిట్లు కృష్ణుండు	100
అని యిట్లు నిభృతుండై	45
అని యిట్లు పనిచిన నాతండు	230
అని యిట్లు సభక్తికంబుగా	205
అని యిట్లఋంగనివాఁడయి	211
అని యివ్విధంబున మనంబును	121
అని యివ్విధమునఁ గాముఁడు	59
అని యుగ్గడించి	324
అని యుపదేశించి వివరించి	159
అనియెం గావున నీ పై	306
అనియె నయ్యుదంకుడట్లు	245
అనియె నా భృగువంశవరేణ్యు	237
అని యెఱింగించి మఱియును	178
అనిలనందును నాననం	346
అని వసుదేవసూనుఁడు	195
అని విన్నపంబు సేసిన	229
అని విలాపంబు చేసి	322
అని వివరించి విరించి	174
అని వెండియు	16
అని వెండియు	170
అని వెండియు	204
అని వెండియు	217
అని వెండియు	270
అని వెండియు	324
అని వెండియు	369

పద్యము	పుట
అని వెండియు	403
అని వెండియు నప్పశువు	133
అని వెండియు నవ్విప్రుం	141
అని సమర్పణంబు చేసిన	381
అని సల్లాపము సేయుచుండ	399
అని హితంబు తత్ప్రాప్తికి	150
అనుచుం దచ్చరణంబులు	74
అనుచుం బ్రణతుండై	332
అనుచు నక్కుమారుం	343
అనుజుం డతనికి ననుపెను	34
అనుజులుఁ దాను బరాశర	260
అనుజులు నఖిలనృపాలురుఁ	374
అనుటయు	232
అనుటయుఁ గృప చిగురొత్తు	227
అనుటయు నజ్జనపతి	142
అనుటయు నంబుజనాభుఁడు	220
అనుటయు నతనికి	136
అనుటయు నధ్వర్యుం డతని	134
అనుటయు నన్నకులంబు	379
అనుటయు నయ్యవనీ	116
అనుటయు నాచార్యుండు	30
అనుటయు నా సత్యవతీ	08
అనుటయు భీతి నగ్ని	35
అనుటయును మదాహ్వానం	43
అనుటయు వైశంపాయను	401
అనుచు దయాళుఁడైన హరి	217
అనుడు నతఁడు హర్షించుచు	74
అను పలుకు పలికి	312
అనుభవించుచునుండి	73
అనుమతి యింక వేఱ	284
అన్న నాకు మాన్యుఁ డాతండు	24
అప్పనికి సముచితసైన్య	255
అప్పు డయ్యతిథి	388
అప్పుడు	279

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
అప్పుడు	356
అప్పుడు	371
అప్పుడును మత్సరంబున	336
అప్పుడు శోకాక్రాంతుండయి	311
అప్పుడు సక్తుప్రస్థుండు	390
అప్రయోజనంబులై యుండు	118
అమరాధిపతిఁ దొల్లి	393
అమలమతిఁ గరముఁ	11
అమ్మనుజేశ్వరుండు విభవాతి	13
అమ్మహాత్ముతో నిట్లనియె	69
అమ్మహీవల్లభుఁ డర్జునుఁ	288
అమ్మెయిగాక వాతాదులు	52
అమ్మెయి బంధుమిత్రుల	53
అమ్మెయిఁ బ్రభూతధన	378
అమ్మేటిమగ ఁడు తన	317
అయ్యనాదితత్త్వ	96
అయ్యనుష్ఠానం బెట్టిదనిన	94
అయ్యెడుంగాక యిపుడు	25
అరయ నివి యెట్లుఁ జెడియెడు	143
అరసికొనియుండి యప్పాండవాగ్రజుం	264
అరిగి పట్టణవీథి నల్లన	314
అరిగి యేఁదండ్రికి నత్తెఱంగంతయు	330
అరుణాంబుదంబులు	307
అరుల నెల్ల జయించియు	140
అర్ఘ్యంబుగొని రయంబున	343
అర్థాకర్మలోప మపచయ	76
అర్థప్రకార సమావర్తనుం	174
అలఘుభ క్తి సదస్యుల	369
అలజళ్ళు దీనివలనం	354
అల్లన చన నాతఁ డాదరంబున	123
అల్లన నవ్వుచు నయ్యింతి	328
అవని యెల్లను వృత్రుఁ	49
అవశ్యంబును నా కట్లు	219
అవహితులై ప్రవర్గ్యము	363
అవి తొలుబాముసం గలుగు	154
అవినయవృత్తి నశ్వమున	296
అవి నిశితాస్త్రపంక్తిఁ	343
అవ్యక్తతత్త్వజాతము	180
అవ్యక్తనామకం బగు	170
అవ్యక్తప్రభవంబును	179
అవ్యక్తమునను మహత్తత్త్వ	159
అవ్యక్తాదిక సకలము	189
అవ్విකారంబు లెక్కడై	77
అవ్విపినంబున	130
అవ్విభుఁడు వోయివత్తుగాక	68
అశుభములును శుభమ్ములు	82
అశ్వమేధ ముఖమునందట్ల	61
అశ్వమేధమునకు నార్యుల	370
అసమాలంబ మశబ్దము,	90
ఆ	
ఆకర్ణింపుము	11
ఆగమము పశువిధిం	134
ఆగమోక్తంబు దర్శనీయంబు	367
ఆజాలి యేల నిర్మల	398
ఆత ఁడెవ్వఁడో యని నన్ను	401
ఆతతమైన నాదగు నపాన	241
ఆతనికడకు ము న్నరిగితి	24
ఆత్మకులము పరిక్షీణమై	279
ఆత్మతత్త్వ మేకంబు	167
ఆదరార్ద్రుఁ డగుచు నలరి	149
ఆదిసృష్టిఁ బ్రధాన మను	86
ఆ దేవుఁడతనితో నటు	219
ఆ నగంబు పార్శ్వంబుల	27
ఆ నరపతి రయమున	11
ఆ పరంజ్యోతి పేళ్ళుల	168
ఆ బీభత్సుండు	300
ఆ భార్గవోత్తము నట్లు	245
ఆ యతు లాధ్వరంబున	364
ఆ యమయు గౌతముండు	244
ఆ యుగ్రోద్ధతి చూచి పెల్కుటి	300
ఆ రాజు సేరి సాష్టాంగప్రణామం	22
ఆ రాత్రి యేనును పాండు	250
ఆ వాక్యము లెల్ల వినుచు	359
ఆ సక్తువు గంధంబును	391
ఆ సహదేవుపుత్త్రు గాత్రంబు	335
ఆ సౌదాసనరేంద్రుం డాసుర	230
ఇ	
ఇంక నెక్కడ గడచెద మున్న	128
ఇంక వచ్చిన దారుణేక్షణ	36
ఇంచుకయేనియున్ వనట	322
ఇంతట్టిట్టిద యి ట్లైన	119
ఇంద్రధనువు చందంబున	299
ఇంద్రుని దెస భయంబించుకేని	41
ఇచ్చినఁబ్రీతిఁ బుచ్చికొని	387
ఇట్టివని వాఙ్మనసప్రకారం	114
ఇట్టులగుట యెఱిఁగి	185
ఇట్లగు టె ట్టనియెదరేని	181
ఇట్లనియె	382
ఇట్లు తెలియ నెఱిఁగి	165
ఇట్లు దశార్ణపతి	339
ఇట్లు తెలివొంది విజృంభించి	308
ఇట్లుపదేశించి మఱియు	186
ఇట్లు బలంబును ధనంబు	11
ఇట్లు మరుత్తుండు మరుత్పతికిం	46
ఇట్లు మహాధనవంతుండై	29
ఇట్లు వసిష్ఠ ప్రయుక్త	50
ఇట్లు సన్నిహితుండయిన	258
ఇతండు ద్వాదశవార్షికంబైన	397
ఇత్తెఱంగున	376
ఇత్తెఱంగున మీకు భద్రం	122
ఇది బుద్ధీంద్రియప్రపంచం	164
ఇది యింద్రుండు నీ తోడం	33
ఇదియును నతిథికి	386
ఇది సూక్ష్మ కర్మానుష్ఠాన	51
ఇప్పుడు నారదుం డెదున్న	20

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఇప్పుడు నీ మహామహిమ	217
ఇమ్ముద్దియకు	228
ఇమ్మెయి సకలజనులు	373
ఇలకు వెలగా హిరణ్యం	369
ఇవి తామసంబులని	153
ఇవ్వాయువు లేనును	109
ఇవ్విధంబునం గనుంగొను	162
ఇవ్విధంబున జను నా	294
ఇవ్విధంబున ధర్మజ	64
ఇవ్విధంబున నరిగి	258
ఇవ్విధంబున హింసారహిత	400
ఇవ్విషయంబునం గామ	56
ఇవ్విషయంబున నెందుఁ	396
ఈ	
ఈ తెఱఁగున నుద్యుక్తుండై	96
ఈ మాటకుఁ జారుముఖీ	105
ఈ మాట సంవర్తుని సన్నిధిన	39
ఈ మూఁడాశ్రమములలో	176
ఈ యోగీశ్వరుండు మదీయా	35
ఈ విధమున వెడలి	80
ఉ	
ఉంఛవృత్తియైన యుర్వీ	395
ఉదంకుం డతని కిట్లనియె	231
ఉత్తరపుణ్యగర్భమున	266
ఉత్తర బిడ్డ నెత్తికొని	278
ఉద్ధతులై త్రిగర్తోర్వరాపతి	295
ఉమ్మలికంబునం బొగులు	01
ఊ	
ఊరకుండి మూర్ఛనూని	141
ఊర్ధ్వగతికేఁగు మానవులుం	81
ఊహించి తన్ను (గప్పెడు	88
ఎ	
ఎక్కటి యిట్టివి దోషము	79
ఎక్కి హంసకేతు వేడ్కెల	315
ఎట్లంటేని ఘ్రాణాదులకు	143
ఎదురుకొని వీడుఁబట్లకు	347
ఎనయఁగ శుక్లము శోణిత	83
ఎప్పు డెవ్వరివలన	122
ఎలప్రాయ మిచ్చితిని	227
ఎల్ల జనులు నివ్వీరుం	342
ఎల్లవారును బ్రమోదంబు	271
ఏ	
ఏతద్విషయంబగునది	70
ఏతెంచిన గోవిందసమేత	282
ఏను నీకుం గామదోహిని	112
ఏను నీ యధ్వరంబునకు	25
ఏను మరుత్తుం డనువాఁడ	23
ఏను సుధ యడుగుటయు	222
ఏ మమ్మెదమనినఁబృథివి	371
ఏమఱుటలతెఱంగు	75
ఏమిట నైన నొప్పమి	238
ఏరు నేలకొలఁది నెడనెడ	263
ఏ వింటి విజయుఁ డనేక	353
ఏవిధంబునఁ గోలుపోనీవు	270
ఒ	
ఒడలి యస్థిరత్వ మూహించి	93
ఒక్కనా డప్పుండరీకాక్షుం	66
ఒక్క బిలంబుననుండి	378
ఒక్కయెడ నధ్వర్యునకు	132
ఒక్కింత నిలిచి నిభృత	218
ఒక్కింతసేపునకు దెలివొంది	274
ఒలయు లాభాలాభములు	89
క	
కడచి ద్రౌపది చని యడలు	272
కని యా నృపుఁడలఁతి	257
కనుఁగొను కౌతుకంబునఁ	365
కనువిచ్చి గొంతిఁ జూడుము	274
కమఠంబు తన యంగకమున	166
కమలనాభుండు పెద్దయు	206
కరణంబు కర్మంబు కర్త	126
కరణ కర్మకర్తృ కారకాత్మకుం	127
కరదమనంబున నాతఁడు	12
కర ముచితంబుగాఁ బలికి	211
కరిపురంబునం బుట్టిన	252
కరి యిటు లేపునం గవియఁగా	305
కర్మముల్ మేలంద్రు కర్మతత్పరులు	192
కర్మానుష్ఠానంబును	49
కలయంగ నిట్లని చెలఁగె	356
కలయంగ నెల్ల యెడలం	97
కలయంగ రాజులఁ గనుఁ	350
కవిసినవారితో మఱియుఁ	296
కాదేనిఁ ద్రిజగముల	398
కానిపించుకొని సంభావించి	281
కావున	68
కావున	205
కావున	180
కావునఁ గామక్రోధ	150
కావున నేఁ గడంగ విను	342
కావున ముక్తికిఁ గారణం	84
కినియుట మాను మేలె మునికిం	213
కుక్కలు చుట్టి రా నొక్క	220
కుత్తుకకు నడ్డుపడు	78
కులిశము వచ్చుచున్నది	41
కూలిన నేలకు వచ్చిన	305
కూలియు నీడం బోవక	302
కృతకర్మఫలము దెగ	80
కృష్ణుం డుచితవచనంబుల	02
కెలఁకులకును మింటికిని	130
కేలు మొగిచి వినయశాలి	95
కొడుకుచేతఁ జచ్చిపడియున్న	321
కొన్నిటికిఁ బంచవర్ణముల	129
కోటికోటులు మాడలు	372

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
కోరికలకుఁ జొరకయ	193
కౌరవకులమును మిథ్యా	212
కౌరవ సైన్య మేకాదశా	247
క్రతుపరులు సన్న తగ	215
క్రతువుఁజూడ నేతెంచిన	375
క్రతుసమాప్తిసమయమున	400
క్రమమునఁ బ్రాణంబున	158
క్రమయుక్తము యుక్తముగా	363
క్షత్రధర్మంబునఁ గైకొంటి	02
క్షుధ హరించుఁ బ్రజాపరి	389
గ	
గండున రాధాతనయుఁడు	248
గంధంబు ఘ్రాణంబ కాని	116
గతి నీవె నాకు మత్సంతతికి	267
గాదిలి తనయుఁడు నగు	322
గాలి నవ్విటప మాలోల	239
గుణత్రయంబునుం ద్రోచుట	157
గుణసమతానుభూతి	100
గురుఁడైదు దివసములు	248
గురుకార్యంబునకై భూవర	232
గురునకుఁ బ్రియహితకరుఁ డయి	174
గురుసుతుడు పాండుతనయ	250
గురుసుతుఁడు భీమునకు	268
గొంతి యెంతయుం బ్రియంబున	208
గ్రామంబు దొఱఁగి యరణ్య	175
ఘ	
ఘోటకోత్తమ రోమకూపంబు	243
ఘోరప్రకారం బగు శాపంబు	213
ఘోషిణి నాఁగ నఘోషిణి	115
చ	
చంపకు మీ రాజుల	306
చంపెడునట్టి నాకడకు	237
చచ్చినబంధులఁ గొని	61
చతురాశ్రమములును	150
చన దిటు లంట గం పెఱుంగ	118

పద్యము	పుట
చని యతనితోడ	16
చనుఁ బ్రాణుఁ నధోగతి	124
చిత్రాంగదయు నాగపుత్రియు	361
చిత్రాంగదయు నులూపి(చి)యు	375
చుఱుచుఱఁ దన చెవుల్	252
చెప్పం గలయది యెల్లను	100
చెప్పితి సర్వంబును నీ	193
చెప్పిన నప్పరమముని	23
చెప్పిన విని యమ్మనుజ	233
చేది దేశంబు సొచ్చిన	338
చొచ్చి యనేక ప్రకార	241
ఛాగమిది యరయంగ	133
జ	
జగతి ఋత్విగర్థముగ	369
జనకునిఁ దెగటార్చిన	324
జననార్ణవేళ వెలువడి	83
జనవినుతచరిత బ్రాహ్మణుఁ	146
జని రుగ్జరామరణములు	88
జన్మంబునందు రాజన్యులు	392
జపమును దానము యజ్ఞము	158
జమదగ్ని పితృకార్య	402
జలము నినుఁ దలఁపఁగా	221
జ్ఞానపరినిష్ఠితాత్మకు	193
జ్ఞానపూర్వకమైన సన్న్యస	169
జ్ఞానము సవిశేషస్థితి	173
జ్ఞానాసి నది నటికి యభి	179
జ్యోతిస్సులందు వర్యుఁడు	171
డ	
డప్పి భావించుకొని యమ్మహా	21
త	
తక్కటిసోదరుల సుతుల	207
తగు ప్రియమున సకుటుంబం	389
తగువారిగాంచి యత్యద్భుతం	281
తటిని దగ నుత్తరించు	185
తత్త్వమనశ్వర మశరీర	55

పద్యము	పుట
తత్సాధనంబు తద్గత	152
తదీయతనయుఁ ప	384
తద్గుణంబులు సూరె	160
తనపాలి సక్తువుఁ దండ్రికి	384
తనమీఁద మగధుఁ డేయఁగ	335
తన మేలు ప్రకాశింపక	178
తనయందు తన్ను లెస్సగ	93
తన యంశమైన కనకము	373
తన యెఱిఁగిన తెరువున	94
తన సత్త్వమును బలంబును	75
తనులత యొండు చేసిన	228
తనువువలన నిష్కర్షం	92
తను వేర్పరించి కేవలమును	97
తను వొందుగఁ జేసెద	228
తప్పు పైఁచి నన్ను దయఁజూచి	404
తమతమ దేశంబుల	376
తమ భాగంబులు దక్కిన	42
తమము రజస్సుఁదొఱఁగి	191
తమము రజస్సుసత్త్వము	214
తరుణజరఠభావ	290
తలంచినం భుజంగమంబులకుఁ	325
తాత లోకగుఁరుడు దామోదరుఁడు	273
తీర్చినతెఱంగు నెఱింగించెద	330
తురగంబును సంభారోత్కరమను	286
తురగపరీక్షావిధులగు	286
తురగమేధమఖిల	283
తెగియెడు సమయంబున	303
తెత్తముగాక నరేంద్ర	254
తెలివు వొందియున్నది	30
తెలుపఁ దగునేనిఁ గరుణం	354
తొలుత ధృతరాష్ట్రగాంధారుల	281
త్రవ్వినఁ బ్రభ లెల్లదెసల	261
త్రియుగకనులవీథీదీప్త	406

పద్యము	పుట
ద	
దంతములు జిహ్వ గుత్తుక	94
దానఁ గడు డస్సె నాతని	18
దాన నన్నియతుండు దన	226
దానికి నీడఁ బోవక యుదగ్ర	318
దాని నెట్లు యుద్ధంబు గాదనియె	53
దాని నెఱింగి సుభద్ర	251
దినమున మూఁడవయామం	232
దివసము రాత్రియునుం బోరి	172
దివ్యవాణి గీర్తించెఁ గౌరవ్య	371
దివ్యాస్త్రవిదుఁడు ధిషణా	287
దీన సకల జంతువులును	161
దీని రక్షింపనర్హుండు	287
దురభిమానము పేర్మి	343
దుర్యోధనుండు దన తమ్ముల	249
దేవకీపుత్త్ర సంజీవితుఁ	267
దేవమతుఁ డను విప్రుండు	123
దేవర యిప్పని దివ్యచిత్తంబున	207
దేవా నీ విక్కులంబు గలిగించిన	268
దేవా! వైశంపాయనుండు	01
దేవా! వైశంపాయనుండు	200
దేవా వైశంపాయనుండు	292
ద్వారకకుఁ బోయి వచ్చెదఁ	67
ద్వారకకు నిమ్మహాత్ముఁడు	206
ద్వారకానగరంబుచేరువ	340
ద్వారకానగరమునకుఁ	263
ధరణీసుర కులమునెడం	276
ధరణీసురులను బనిచెను	347
ధర్మంబు గలఁగఁగాంచి	216
ధర్మజుండమ్మెయి ధరణిఁ	64
ధర్మజుం డెమ్మెయి ధరియించు	269
ధర్మతనయుం డశ్వమేధ	305
ధర్మదేవత యతనితో	390
ధర్మపుత్త్రుం గొలిచి	360
ధర్మసాధనంబు దనువు	75
ధర్మసుతుండును దమ్ములు	279
ధర్మార్థకామగోచర	158
ధార్తరాష్ట్రుల కీడు దలఁపక	311
ధృతి నెవ్వఁడు నన్నుం	57
న	
నందను చావు నిక్కమయినం	272
నడతము పోద మనుడు	68
నడుమన వానిం బార్థుఁడు	302
ననుఁ దపమునఁ బ్రహరించెద	58
ననుఁ గానఁక నీ వచ్చిన	23
నను మోక్షమూది చెఱిచెద	58
నరనాయక నీయేలెడు	142
నరుఁ డెంత కాలమేనిం	84
నరునియెడ నా మనంబున	216
నలుగాలివానిఁ బక్షుల	367
నవ్యత్వ పురాణత్వదశా	101
నవ్వుచు నానాశరముల	310
నా చిత్తము వసుదేవుని	201
నాథ! నీ వెప్పుడు నన్ను	320
నాదు విన్నపముగ నర	352
నా దెసఁ బ్రసన్నుఁడవు	403
నానావిధబహుళాంచిత	256
నాపాలిసక్తు విచ్చెద	382
నా మనమును బుద్ధియును	147
నాయెడ నిప్పుడు	403
నాయెఱింగినభంగిఁజెప్పెద	106
నారదదేవలకౌశిక	204
నారాచప్రముఖాస్త్రజాల	308
నారాయణుండు నరునిం	351
నాలుక యాడుట కేలుం	79
నాలుగాశ్రమంబులకు	150
నా వచ్చినపని సెప్పెద	33
నావలని కరుణపెంపున	205
నిక్కపుఁగిన్క వచ్చిన ననిన్	299
నిక్కపుధర్మువునన	276
నిజంబుగా నేను దొఱంగితి	118
నినుఁ జూడువేడ్క నేడ్వురు	388
నిను వేఁడుట మోఘముగాఁ	223
నిమిషమైనఁ బరమనియతి	179
నివ్వెఱపడిన యా నృప	336
నిష్ఠించి యిబ్బంగి నీ కేము	05
నీకతంబునఁ బతి నాకుమారుని	319
నీ కృపగాంచితి నాకు నింకొండు	25
నీకుం బొడసూపి యైరావత	242
నీ చరితంబు చిత్రమహనీయ	244
నీ జన్మమునకు ధిషణుఁడు	33
నీ తమ్ముఁడు తురగముఁగొని	346
నీ తేజంబు సహింపఁగ	227
నీ దానంబున విస్మితు	388
నీ పంపునఁ బోవుటను	351
నీమఱఁది యాకొడుకుపై	269
నీ మహిమ వొగడఁగొలఁదియె	203
నీ యొడలు డస్సి వెలవెల	31
నీ వడఁగిననుం బ్రాణముఁ	120
నీవలనన్ మహాత్మ! విను	67
నీ వింత దెలిపి పలికెద	315
నీ విట వన్ని నాపయి	344
నీ విషయ మెంతవ ట్టది	141
నీవును దల్లులు బంధు	331
నీవును నివ్వాక్యంబులు	194
నీవు ప్రత్యాఖ్యానంబుచేసిన	223
నీవు వోయి మరుత్తుని నెమ్మి	39
నీవు సెప్పిన మహనీయ	145
నీ వేమి తప్పు సేసితి	403
నృపు లోహటింప జంత్రపు	358
నెఱయఁ బ్రధానపదార్థము	172
నెలకొని ప్రాణాపానం	108
న్యాయముగల్గి యధ్వరమునందు	397
ప	
పంచభూతంబులఁ బరఁగింప	187
పండితులు వీని చేతం	161
పగఱయెడ నైన నే బొంకు	275
పట్టి యతఁడు దనదు పైచీర	02
పతియు చుట్టంబుఁ బక్కంబు	383

పద్యము	పుట
పదంపడి	78
పదంపడి యర్ధదివసంబు	361
పదనమదమరాళీ భక్త	198
పదపడి ధర్మాచరణము	85
పద్మనాభుండు వచ్చిన	273
పనివడి పూఁచి పట్టమి	59
పనుచు నప్పుడతని	38
పరమంబనంగ వేదాంత	191
పరమతపంబు గాఢ	135
పరమదయావిధేయ	196
పరమనియతి యనఁగ	180
పరశురామ! నీవు బ్రాహ్మణుండవు	137
పరిజనయోగక్షేమములు	208
పలికిన నత్తపస్వి దృఢ	240
పలికి సాదరముగ బభ్రు	331
పవనుం డనుకూలతమెయి	210
పసిఁడి యిట్టికలం జతు	366
పాండవాగ్రజుఁడట్ల పవన	345
పాండవాగ్రజునకుఁ బ్రణతి	355
పాతాళంబున నున్నను	240
పాతాళభువనం బిచ్చటికి	240
పాదపాయూపస్థపాణి	164
పాపాత్ములు నరకము	81
పాములుఁ దేళ్ళునుం బసులు	153
పాలకడగన పెక్కుపనులలో	95
పావకుండు సర్వదేవాత్మకుండూ	124
పిడుగులు వడిఁ బెక్కొక్కట	300
పిలిచిన రాజులున్ మునులుఁ	347
పుండరీకాక్ష యీ పుడమి	218
పుణ్యంబులగు కర్మముల	72
పురుషునందు సమానంబు	123
పెక్కు భంగుల దీవించె	265

పద్యము	పుట
పెనుసెలయేఱులు వాఱగ	304
పొగడి యేఁ దీవ్రశరములు	317
పొదలుఁ దఱుఁగుటకై	173
పొదివినఁగనుఁగవ	341
ప్రమదమెసఁగ విదురుఁ	265
ప్రయతుండై హయమేధ	362
ప్రణవ ముఖవేదములుఁ	214
ప్రాణప్రభృతులగు పవన	121
ప్రాణాపానంబుల యెడ	114
ప్రాణుఁబొదువుట వాణి	114
ప్రీతిఁ బేర్వేరఁ బిలిచి	46
ప్రీతుఁడనైతి నీదెస	73
బ	
బంధులోకమునకుఁ బరమ	252
బభ్రువాహనుండు వైభవ	360
బభ్రువాహనునకుఁ బరమ	375
బలమును శౌర్యమున్ మదము	154
బాలార్కద్యుతిపుంజపింజర	258
బాలుఁడు మృతజాతుం డని	266
బాలుని మేనికిఁ బ్రాణముల్	277
బ్రాహ్మపదవేదనమునకు	70
బ్రహ్మవిద్యారహస్యంబు	97
బ్రాహ్మణజనములరాజులు	236
భక్తియు వినయము శ్రద్ధా	387
భక్తివినయసంభరితుం	239
భక్తిస్మేర మునీంద్రచిత్త	405
భగదత్త తనయుండు	301
భటతురగసామజరథో	11
భరతులపాలికేఁగి తగఁ	210
భర్తృభార్యాకృతభవ్య	105
భవదీయ శ్వసనము	203
భవవర్ధన విలయంబుల	215

పద్యము	పుట
భీతి నాభూతంబంతర్ధానంబు	403
భీమసేనుండును నకులుండును	288
భువనభవన దీపస్ఫూర్తి	102
భువనము లొక్కపెట్ట	270
భూతతారతమ్యజ్ఞానం	187
భూతతృప్తిఁజేసి భూరి	261
భూత తారతమ్య	163
భూతములు నింద్రియంబులు	133
భూదైవత దత్తాశీర్వాదంబులు	257
భూపాల యతఁడు కాశీపురి	20
భూమిముఖచతుష్కమున	187
భూరితపంబునఁ జూరె	189
భూరిహర్షంబునఁ బొంది	45
భృగువులు క్రోధనులనఁగా	402
భోజన శయనాసమయములు	348
మ	
మంత్రివిద్వేషంబు మాన్య	09
మణిపూరపురాధీశుఁడు	352
మత్సరమెక్కఁగా సుబల	341
మదిఁగొనియాడి యా రిపు	316
మన మయ్యెడకుం బోయి	27
మనము కరినగరమునకు	68
మనసు నుదానవాయువును	112
మనసును వాక్కును మాలో	112
మనసు మనసునంద	167
మనసు సుస్థితింబొందుట	115
మనుజనాథ యెప్పుడును	225
మమతాహంకారవిముక్త	190
మమతాహంకృతిరహిత	190
మరణజరారోగముల	26
మఱియు నిట్లను నెత్తెఱంగున	26

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
మఱియును	358
మఱియును	372
మఱియునుం గల యలంతి	289
మఱియును సన్నిధింగల	262
మఱియు వలయు కృత్యంబు	208
మహితకీర్తిలోలమత్ర్వాణ	320
మహితసత్యంబుఁ బరమ	277
మాంసశోణితాస్థిమయ	161
మాఘమాసపౌర్ణమాసియై	345
మాతంగత్వము దాల్చి	223
మాననీయ నియతిమహిత	131
మానమదాదిదోషపరి	289
మానస శరీరములగు	73
మానసు మదగ్ర	215
మానితగుణ నీ వాఁకలి	383
మానుషము దైవమును	357
మాయాప్రయోగంబ వేటొండు	326
మిథిల నెప్పుడు వసియించెద	142
మీఁద బొంకగు మాటయే	275
మీ కరుణఁ గాక తగు	244
మీ కారుణ్యంబున నాశోకం	62
మీ చరణసరసిజంబులు	353
ముక్తుండు జరామరణ	92
ముని యశ్వముఁజూచి కరం	287
ముని యిట్ల నెమ్మిగాంచిన	231
మునివర బ్రతికితి	19
మును మే మాలంబించిన	119
మునులకు నెల్ల గందములు	348
మున్న చనుదెంచి ప్రీతిమై	375
మున్ను ధృతరాష్ట్రుకడకు	264
ముష్టి సడలి చోద్యముగను	298
మృగనయన! బ్రహ్మసంభవ	130
మృగములుఁ బక్షులులోనుగ	382
మొనసి వాని నతఁడు	317

పద్యము	పుట
య	
యజనము సెల్లుకాలము	47
యజ్ఞంబులలోనఁదపో	138
యజ్ఞవాటంబు దక్కటి	348
యజ్ఞవాటమును జనాధిపులకు	346
యవ లోషధులలో నన్నంబు	171
యాగవిముక్త మై చను	313
యాగశాలయు శిల్పిజనులం	346
ర	
రక్షాకరమంత్రకలన	260
రమ్యమైన చప్పరంబుల	259
రాజగృహపురముకడ	333
రాజసగుణములకుం గల	155
రాజులఁ జంపకుమని	341
రెండవమరుత్తుఁడై	373
ల	
లేచి కూర్చుండి కలయంగఁ	327
వ	
వంకయైన తలంపెల్ల	48
వగ నిర్మూలము సేయమి	49
వచ్చి కన్నీళ్ళులు వదనంబుపై	310
వచ్చిన గారవించి యనపద్యపు	400
వచ్చు చైత్రమాసంబునం	337
వడి నది వీవున వెడలిన	318
వనమునకు నేఁగె సంయమి	10
వనమునకేఁగి యందు	370
వనమున వన్యాహారం	55
వనితలలోపలఁ జనియెడు	333
వరయూపసుయోజితమగు	367
వలవదు పొండనంగ	296
వలవదు లాఁతివాఁడవె	229
వాతాదులందు గుణములు	52

పద్యము	పుట
వానిం దా నవలీలమై	316
వాని సంవర్తుంగా నెఱింగి	21
వాయువంగంబులందు దుర్వ్యాప్తి	79
వారలందఱకు ధర్మనందను	246
వారలు చెప్పెడి శాంతోదార	85
వాసవుఁడును నవ్విభు నెడ	15
విజయుండు చచ్చునే వేఁదురులార	325
విదగ్ధవి ప్రసమూహం	404
వినను గానను జేయ వెరవైన	106
వినయమారంగ గోవిందున	202
వినయమారంగ నాతని	327
వినయముతోఁ గేల్ మొగుచుచు	21
వినయ మెసఁగ నార్యజన	313
వినవలయు వాని నెల్లను	03
విని ధిషణుం డమర్త్యులకు	18
వినిపించితి నిను బోధం	99
విని యా విప్రునితో నిట్లను	111
విను ఋత్విగాఢ్యుఁ డగు	369
వినుఁ డక్కనుటకు మూలం	189
వినుఁ డవ్యక్తాంతంబగు	192
వినుఁ డహంకారసంజనితంబు	162
వినుఁ డాగుణంబు లన్నిటిఁ	156
వినుఁ డా తత్త్వంబున	160
వినుఁ డీ సత్త్వస్థుఁ బురుషుఁ	181
వినుఁడు ధర్మక్షేత్రమున	379
వినుఁడు ప్రభవవిలయ జ్ఞాన	151
వినుఁ డెక్కువతక్కువలేక	158
వినుత చతుర్వర్ణకసంజనక	198
వినుత బహురత్నవిస్ఫుర	278
విను తెలియంగ నుదానం	109
విను పెక్కులేల కోరిక	60
విను ప్రణవాదికరూప	111
విను మంతశ్శ్రుతులలో	56
వినుమట్లు చెలంగఁగ	358
విను మమ్మొయి నిర్దేశంబున	113
విను మయకృతసభఁ గ్రొత్తగఁ	65
విను మఱునాఁడు శల్యుఁడతి	248
విను మహోరాత్రంబులును	125

పద్యము	పుట
విను మాబీజము పిండము	83
విను మింద్రతురగసమ	356
వినుము తెలియంగ శ్లేష్మం	77
వినుము ప్రభూత దానములు	389
వినుము మదీయబుద్ధి	39
వినుము మూర్ఖొనఁ జనిగొన	131
విను యోగయుక్తునకు శస్త్ర	93
విను లక్షభూసురుడు గుడి	349
విను సుఖదుఃఖము లచిరము	87
విను సృష్ట శోణితంబున	124
విమలము నచలమునగు	195
వివిధ భోజ్యపదార్థవిభవం	364
వివిధ వాహనారూఢులై	209
వివ్వచ్చు డాగమవిధివంతముగ	294
విశేషించి గాంధారీధృతరాష్ట్రులం	344
విశేషించి మదీయపుత్త్రుండు	352
విశ్వరూపా యీ రూపంబు	219
విషయంబులు నశ్వరములు	161
వీడ్కొని చనియెంబదంపడి	220
వీడ్కొలిపిన	312
వృక్షంబులకుం గలుగును	130
వృక్షమూలనదీతీరవిజన	177
వృత్తివిశేషమునఁ జనిన	191
వెండియు నిట్లని బోధించు	104
వెడలెడు నమ్మహీవిభుని	257
వెలిపగఱ గెలుపు గెలుపే	56
వేడుక నాలుంగొడుకును	390
వేదోక్తవిధిసహితభవ్యా	285
వేదోదితప్రకారంబాదర	394
వేర్వేఱ యుండవు వినుఁడు	156
వైశంపాయనుం డిట్లనియె	224
వ్యక్త మనిర్వాచ్యం బవ్యక్తము	151
వ్యామిశ్రమతి యగునతనికి	98
వ్యాస నారదాదులును నిన్ను	04

పద్యము	పుట
వ్యాసమహాముని వత్సలత్వంబున	254
వ్యాసులు పంచినట్ల నియమా	284
వ్రతపరినిష్ఠమై వర్తించు	85
శ	
శకట ఖరోష్ట్రఘోటక	262
శమము దమమును నిత్య	12
శరధిపరివేష్టిత క్షితి	55
శరధిపరీత భూమిఁ గల	350
శరనిధితరఁగల భంగిం	188
శరములు ద్రుంపనాతఁడు	298
శారీరమును మానసంబును	51
శాస్త్ర యొక్కండ తచ్ఛాననంబున	128
శ్రద్ధ గలిగి లోకసంగ్రహ	99
శ్రీకంఠు రుద్రుని శివుఁ బూష	27
శ్రీనగసుతాత్వమహిత	200
శ్రీనామకపార్వత్యభిధాన	01
శ్రీవిద్యాశాంతికృతిప్రావీణ్య	292
శ్రీసుఖనిష్పాదనకేలీ	104
శ్రుతి యనఁ దప మనఁగఁ	149
శ్రోత్ర మధ్యాత్మంబు సూరె	163
ష	
షోడశశ్వేతాశ్వవ్యూఢ	256
స	
సంతోషమును బ్రకాశత్వంబు	155
సంయమివరులార సత్త్వ	152
సంవర్తు నాలోకించి	40
సంవర్తునిచేత ననుజ్ఞాతుం	47
సంవర్తుఁ బిలిచి యాసన	32
సకలజనంబులుం గయిసేసి	280
సకలధర్మములలో సర్వ	183
సకలబాంధవభూపతి	373
సకలవిధానదక్షుఁడవు	45
సగరాదులఁజెప్ప వినమె	357
సత్త్వభావనకంటెఁ బ్రశస్తమైన	181
సత్త్వమునన భూతంబుల	149

పద్యము	పుట
సత్త్వము ప్రదీపమాపర	184
సదసత్ప్రకారనిత్యం బది	159
సన్న్యాసమనఁ దపశ్చరణంబు	178
సమయంబు చేసికొని	223
సమరంబు ధర్మవిజయ	66
సమరమునప్పుడు నీకే	196
సముచితగోష్ఠి నడపి	282
సముచితభంగుల నందఱఁ	209
సయ్యాతిక్రతువున నయ్యశ్వినుల	37
సరసన సాత్యకి	209
సర్వగాత్రంబులందును	354
సర్వపశు శ్రపణంబు	368
సర్వభూతదయానుషం	176
సర్వసంకల్పవర్జనశాలి	91
సర్వసంభారంబులును	285
సాత్త్వికులకు దివము రజో	157
సారథిఁగూల్చి యశ్వములఁ జంపి	335
సారనియతిఁ బాటించి	138
సితలేపన సితభూషణ	256
సుభద్ర తన్నుం గనినం	265
సురనాథుఁడు దద్దయు	32
సురలు గంధర్వులు నురగులు	235
సూర్యవర్ముని తమ్ముండు	297
సోముఁ డనఁ దారకములన	81
స్త్రీ సంతోషించు తెఱం	382
స్థలపథమునఁ బోతమ్ము	185
స్థావరజంగమయు	204
స్పర్శంబు రసము రూపంబును	107
స్రోతస్సన జీవగమన	157
స్రోతోమార్గంబులఁ జూవే	78
స్రోతోమార్గములు గఫము	78
హ	
హతశేషంబైన యా సింధు	309
హిమగిరిసానుదేశమున	13

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆశ్రమవాస పర్వము

పద్యము	పుట
అ	
అంతయును భవదీయ దివ్య	546
అం దక్కురువిభుండు దానును	499
అంధుని కొడుకులయందొక	419
అజ్జనపతి చనుచుండె	479
అట్టియెడఁ బాండవాగ్రజు	520
అట్టియెడ	558
అట్టియెడ సహదేవుండు	513
అట్లయినను మీరొక్కటి	544
అట్లుంగాక	567
అట్లు కాలోచితకృత్యం	534
అట్లు తెలివొంది	433
అట్లు దేవతామయాత్మకు	541
అట్లున్న యమ్మునిజనంబు	535
అట్లు పురప్రవేశంబుచేసి	496
అట్లు పౌరజానపదసహితు	556
అట్లు సంతసిల్లి యధిప	475
అట్లు సమస్తజనంబులు	578
అట్లేడ్చి యుడిగి తమ	460
అడలెడఁ బడఁగా మమ్ము	461
అడుగు మిచ్చెద వరం బని	550
అతఁ డొరసుండు నీ కీ క్షితి	428
అతిభక్తి గాంధారి	569
అతులభోగంబును నంచిత	416
అతులితరత్నకాంచన	476
అది పాపము దానికి	484
అది మీ మనంబులం బెట్టక	456
అద్భుతమునఁ బొంది	549
అనఁగి పెనఁగి నాఁడెల్ల	560
అనఘ యజాతశత్రునెడ	539
అనఘ యమానుషంబయిన	543
అనఘా యిక్కురుముఖ్యన	437
అనలుఁడు ధృష్టద్యుమ్నుం	555
అన విని ధర్మజుం డంబికా	452
అన విని మెచ్చి ధర్మసుతు	471
అన విని యాకురుప్రవరు	436
అన విని సహదేవుఁడతని	568
అనవుడు నమ్ముని యమ్మహీ	410
అని చూపి చెప్పె నప్పు డా	526
అని చెప్పఁగఁ జెవి దాటిచి	468
అని చెప్పిన నప్పౌర	564
అని చెప్పి మఱియు	471
అని చెప్పి వెండియు	540
అని చెప్పె నిట్లవ్విప్ర	465
అని ధర్మతనయు వదనంబు	490
అనినం బౌరజనంబు	459
అనినఁ బ్రియమంది విదురు	473
అనిన ధర్మతనయు	439
అనిన నమ్మహాత్ముఁ డను	436
అనిన నా ధర్మపుత్రుండును	483
అనిన లెస్సఁ గాకయని	582
అనిన వార లప్పుడమి	519
అనిన విని జనమేజయుం	563
అనిన విని ధర్మతనయు	437
అనిన విని ధర్మసుతుండు	491
అనిన విని యమ్మునీంద్రు	552
అనిన విని యయ్యింతి	547
అనిన విని యాంబికేయుం	507
అనిన విని యానృపతి	527
అనిన విని వైచిత్రవీర్యుం	541
అని నిర్దేశించి	551
అని పలికిన నప్పాండవా	567
అని పలికి నానిశ్చయంబు	486
అని పలికి నిజస్కంధంబు	484
అని పలికి పాండవాగ్రజుం	424
అని పలికి పాండవాగ్రజుం	458
అని పలికి మీ మనంబుల	555
అని పలికి యతనిం బోవ	576
అని పలికి యప్పుడమి	472
అని పలికి యమ్మగువ దిక్కు	454
అని పలికి యిట్లను	572
అని పలికి యిట్లనియె	528
అని పలికి విదుర కృప	431
అని పలికి వెండియు	469
అని పాండుని మది	508
అని భీము నదిమి విదురు	470
అని యంత నిలువక	539
అని యప్పు డజ్జనంబుల	457
అనియె నట్టియెడ	488
అని యొండొరువులతోడ	510
అనిలజు మేనిచంద మగు	432
అనుచు నతని చరణంబులు	430
అనుచు నుత్థితుఁడగుటయు	556
అనుజన్ములు నంతఃపు	582
అనుజులుఁ దానుభక్తి	535
అనుటయుఁ బ్రియమంది	437
అనుటయు గొంతి యక్కురు	482
అనుటయు ధృతరాష్ట్రుఁడు	529
అనుటయు నప్ప్రేముడి	545
అనునెడ గొంతి వాడు వదనా	547
అపరిమిత విభూతీ యప్ర	502
అప్పుడు గాంధారి యల్లన	432
అమ్మాట తన మనంబునకు	548
అమ్మానవనాథుండు	515
అమ్మునీంద్రునిఁ దక్కనుం	584
అయ్యద్భుతపువృత్త మమ్మెయి	563
అయ్యమలాత్మతోడఁ	487
అరిగి సముచితవర్తనం	570
అరుగఁగ మునిజనములు	556

పద్యము	పుట
అర్చలిచ్చి హోమంబు	497
అవ్విధమునఁ గర్ణుఁ	485
అవ్విధమునఁ దోఁచిన	559
అవ్విశేషంబు	577
అవ్విశేషంబు విని	559
ఆ	
ఆంబికేయాదుల యస్థి	583
ఆంబికేయుండు ధర్మాత్మ	565
ఆంబికేయుండు చెప్పినట్టుల	434
ఆతల్లికిఁ దండ్రికి సంప్రీతి	412
ఆత్మ రంధ్రము లించుకైనను	445
ఆ దేవముని నీ యడుగ	507
ఆప్తవృద్ధులఁ బెట్టు మంగనా	442
ఆయాసంబున విదురుని	510
ఆయాసము సైరింపని	528
ఆరయ నెన్నండైనను	458
ఆ రాజు నియతి గాంధారి	572
ఆవహించిన నద్దేవు	550
ఆ శయ్యకు ననతిదూరం	498
ఆశాపాశ విమోచనోపకరణ	500
ఆ సంయమీశ్వరుం డాతని	508
ఇ	
ఇంకఁ దడయనేల యింతి	453
ఇందీవరచ్ఛాయ కెనయైన	525
ఇట్లనుదినంబును ఘన	511
ఇట్లు కురువృద్ధుండు	440
ఇట్లు చని గంగాస్నానం	582
ఇట్లు చనుదెంచి	550
ఇట్లు మీరు నన్ను నెంతయు	567
ఇట్లు వచ్చిసకలబంధు	560
ఇట్లు సద్గోష్ఠినడపి	509
ఇట్లెరగలిచిచ్చుగవిసి	575
ఇతఁ డేమి యన్న నేమగు	472
ఇతని కియ్యమకును విను	483
ఇత్తెఱం గంతరంగంబున	423

పద్యము	పుట
ఇది యేమిసేయంగ నెత్తికొంటి	486
ఉ	
ఉత్సాహశక్తియు నుర్వీశ	449
ఎ	
ఎఱుఁగంగవచ్చునే యెవ్వరి	578
ఎల్లవారును వినుచుండం	533
ఏఁ దపంబున కోర్తునెంతయు	529
ఏ కార్యమైనను నెవ్వఁడేని	425
ఏనికగములతో నేతెమ్ము	516
ఏను గాంధారియును	426
ఏను మును చెప్ప	513
ఏమి క్రొత్తగఁ బుట్టిన	444
ఏమేనింబలుకం జూచినం	467
ఒ	
ఒక్క తెఱపి సంజయుఁడు	576
ఒక్కింత దెఱపి నీవెక్కడ	575
ఒక్కొకమరి డబ్బాటీ	530
క	
కనకము మేలిరత్నములు	474
కనకాది వస్తువుల్	475
కని గారవంబునం	499
కని మఱి తల్లిపాదముల	520
కని యిది కన్యకుదోషం	549
కని యేటిలో నిడితిఁ	552
కరిదశసహస్రబల	432
కర్ణునకుఁ జేయవలసిన	469
కలమృదు మాగధ గానం	579
కాంతార ధూళి మలినాంగుం	530
కారుణ్యాత్మకదృక్ప్రచార	585
కావున నింక వారికయి	564
కావున నెవ్వగం బొరయ	581
కావున నేమియుఁ జేయం	424
కుడువ నిచ్చుతఱియుఁ	448
కురురాజునకును దేవికి	493
కుశలివై యుండుదే	526

పద్యము	పుట
కేవలతపః క్రియా	438
కొలువిమ్ము మాపుకడ	444
కోరిన విదురాదులు	499
కౌరవకోటియు మీరును	455
కౌరవనాథ కుంతియును	411
గ	
గుళ్ళుఁ జెఱువులుఁ గట్టించు	413
గూఢబుద్ధివై నమ్మించి	427
గొంతి కోడండ్రురెల్లను	515
గొంతిదేవికిఁ గోడండ్రకు	465
గొంతి ప్రాణంబుతోనుండ	514
గొంతి మొదలైన	478
గౌరవంబున సుకుమార	490
గ్రామములు దేవతలకును	473
చ	
చతుర గంధర్వులప్సరో	559
చని పరిజనములుఁ బౌరులు	570
చిత్రాంగదయు నులూపియు	412
చెప్పినఁ బాండవు లప్పృథంబున	519
చేయుము విచ్చలవిడి	474
జ	
జననాథ యీ ప్రియసంగ	562
జనవర ధర్మజుఁ గొలువం	413
జాంబూనదచ్ఛాయ చందంబు	522
త	
తదనంతరంబు యప్పతి	532
తదనంతరమ ధర్మతనయుఁ	439
తగ నా కురువృద్ధునకు	559
తపమునెడన్ మదీయ	565
తమ్ములనడుచు నీతండు	458
తలఁచిన మింట నొక్కొలుఁగు	532
తల్లియుఁ దండ్రియున్	427
తాను నభ్యంతరగృహంబున	453

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
తారకశోభితాంబర	521
తెగనాడకున్నఁ బోవరని	489

ద

పద్యము	పుట
దివ్యమాల్యములను దివ్యాం	558
దీని ధర్మనందనుండును	420
దుర్ద్యూతమునఁ దారు	489
దుష్టచిత్తుండగు దుర్యో	544
దేవతల కతిథులకుఁ బిత్రు	527
దేవతలకు నీవ దేవత	548
దేవా జనమేజయుండు	409
దేవా వైశంపాయనుండు	504
ద్వాదశదినముల నారదు	584
ద్యూతంబున దుర్యోధను	415
దైవమానుషబలములు	446
ద్రోవదిఁ దొట్టి వధూజనం	521
ద్రోవదియు సుభద్రయు	512
ద్రౌపదియున్ సుభద్ర	553
ద్రౌపదియు సుభద్రయు	448
ద్రౌపదీప్రముఖవధూ	485

ధ

పద్యము	పుట
ధరణీరాజ్యము నాకును	426
ధరణీశ పాండునందను	536
ధరణీశ యిచ్చటి తపము	506
ధర్మతనూజుండు తత్సమీ	531
ధర్మతనూజుఁడాతని	566
ధర్మపుత్త్రాదు లందఱు	510
ధర్మపుత్త్రుడు దీర్ఘదర్శి	463
ధర్మమార్గంబున ధరణి	451
ధాత్రి శంతనుఁడు విచిత్ర	461
ధృతరాష్ట్రుండుఁ బుర	481
ధృతరాష్ట్రుం డేకతంబ	419
ధృతరాష్ట్రుఁ డనఁగ వర్తిల్లె	554
ధృతరాష్ట్రుఁడు గాంధారి	514
ధృతరాష్ట్ర కడకుంబోయిన	505

న

పద్యము	పుట
నడపునఁ గోల్పుచ్చుఁగ	447
నరపర రాజనీతులు	451
నరుఁడనునయించె వెస	479
నరు వలను సూచె నతఁడుం	473
నాకతంబునఁ జేసి యా	421
నాకుం బరిజ్ఞానంబును	542
నా మది నొండులేదు	492
నా యింటి ధనముగైకొని	471
నారదుఁడుపశమ ఫణి	578
నిత్యవిధినద్వివేకము	452
నిర్మలసంవిదుపాస్యా	586
నిలిచి రందుఁ బాండవు	495
నిపురంగఁ దెలిసి యతనిం	433
నీకుఁ గన్యాత్వవికలత	551
నీకు శుశ్రూష యొనరించి	430
నీ కొడుకులకు మనుమల	554
నీ చెప్పినది యెల్ల నిక్కంబు	552
నీలోత్పలచ్ఛాయఁ బోలు	524
నీ వరయంగ సుఖావ్యాప్తి	424
నీవలనను భక్తి స్నేహ	445
నీ వినయము భక్తియు	435
నీవును దమ్ములు భక్తిభరా	485
నీవు నిచ్చలును విద్యావృద్ధ	441
నీవు రాజవుగాక నీకేను	429
నీవు శుశ్రూష చిరకాల	430
నీవేమియు ననకుము సహ	484
నేలను హర్మ్యంబులపై	481
న్యాయంబుతోడ వివిధో	445

ప

పద్యము	పుట
పటుతరంబగు ఘటచ్ఛట	574
పదంపడి యొక్కనాఁ డెప్పటి	537
పదపడి నృప యేను	577
పదపడి భీమమాట	474
పనిచినం బ్రియంబు పెంపున	477
పనులయెడ మేలుగాంచిన	445
పరమధీరులైన పాండు	513
పరమమునీంద్ర సమర	547
పరిజనములు కన్నీళ్ళులు	489
పరుల గెలిచి నిర్భయముగ	450
పలికెద నే సత్యము	429
పాంచాలి నవమానపఱచిన	470
పాండవాగ్రజుఁ డక్కురు	479
పాండుపుత్త్రులు తల్లి	509
పాపమయ్యెఁ గాకుండె	552
పురరక్షణము దృఢంబుగ	442
పొగులుచును నల్లనల్లన	496
ప్రజ ముదమొందంగ	456
ప్రెగడల మనసులు విరసము	447

బ

పద్యము	పుట
బలము లెసగ దైవబలము	447
బాలురకును దుర్బలులకు	527
భరతకులోత్తమ ఫలమూల	533
భరతవంశోత్తమ పౌర	460
భామ విను మవశ్యభవిత	554
భీమసేన నకులసహదేవు	479
భీమార్జుననకులమనః	485
భీష్మద్రోణ కృపద్రౌణి	462
భూపవరేణ్య తపోవనంబున	571
భూమిదానవిధులు భూవర	477

మ

పద్యము	పుట
మనమునఁ దోఁచిన దానము	487
మఱచితె యాతఁడు మనలం	469
మఱియొక్క నెవ్వగ మనము	581
మఱునాఁడు రేపకడ	561
మహి లెస్సఁగ రక్షించిన	456
మా తండ్రి నిష్టవిధములఁ	472
మా తండ్రి పరాశరసుతు	453

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
మానుషమైన నమానుష	543
మా పెద్దతల్లి యలజడి	528
మా యయ్య కాననమునకు	482
మిత్రనరపతుల శాత్రవ	527
మీకు సర్వకార్యంబుల	569
మీ తండ్రి సురనదీసూతి	466
మీయెడ చింతవాయఁగ	542
మీరు మరలుండనియె	493
మునిజనములు వచ్చి	584
మునినాథ యీరాజు	546
మునిహృదయనిలయ	501
మును చేసిన యవి చాలవె	468
మృదువులకు జాల మృదువు	464
య	
యమునాస్నానంబునకు	519
యాజకులు దార యక్కురు	573
ర	
రాజ్యఫలము కామింప	492
రాజ్యాధిపత్య సంపూజ్య	417
రాజుగురుఁ డెల్లవారికి	425
రాజు వృద్ధుఁడు ధృత	467
వ	
వంశవృద్ధులు పుత్రవర్గ	414
వచ్చినం గని వారల	522
వచ్చి రెండకన్ను వానకన్ను	480
వనమున మాద్రీపుత్రులు	488
వనవాస మించుకయును	541
వనవాసమున నీకు మన	538
వనవాసాయాసంబుల	472
వల్లభుం డొక్క సద్వ్రత	579
వారలఁ జూడఁ బోఁదగు	514
వారి విషయంబైన మేలు	469
విదురుండు దేహంబు	540
విదురుని సంజయుం	511
వినికి గలిగి రక్షించుచు	450
విని ధృతరాష్ట్రుండు వారి	455
విని పౌరజనసమూహము	577
విను ఖాండవదహనంబున	580
విను పాంచాలురు మాత్స్యులు	567
విను మంత్రభేదనమున	443
విను మతని తెఱఁగెఱిఁగి	417
వినుము దీర్ఘవైరవృత్తి	539
వినుము ధర్మపుత్త్ర	532
వినుము వసుశక్తిగాంగేయు	555
విను మెల్లవారు నతని	415
విషమప్రదేశంబుల	573
వీరలయెడఁ గొడుకా	483
వీరలెప్పుడు మము నీవు	465
వీరి కెలనఁ గనక గౌర	524
వీరి చందంబయ్యె కడు	525
వీరుల సప్తాంగంబులు	446
వృద్ధకృపణపుత్త్రవిరహిత	457
వెడలె వివిధవాహనా	518
వేణువీణారవంబులు	517
వ్యవహారములు శుచులైన	443
వ్యాసుండు వెండియు	543
శ	
శతయూపుఁడు నయ్యేడకుం	505
శతయూపుఁడు నారదుతో	507
శూరులు శాంతస్వాంతులు	464
శ్రాద్ధ దివసంబులందుఁ	416
శ్రీ సంబంధాయుర్గురు	504
శ్రీ సాదనపదపద్మోపాసన	409
స	
సంజయుండు తపము	528
సంపదల నాపదల	450
సంయమివరుఁడైన శతయూప	518
సంయమీంద్ర నాదు	544
సమదవిమదదూరా	586
సమరము దీఱినకోలెను	567
సముచితంబులు సధర్మ	537
సాత్యవతేయుండు జాహ్నవీ	557
సాధుచరిత్రయు శాంతయు	459
సుందరాకారమునఁ దమ	523
సుతులు సమరమున	423
సూనులు లేమిం గలిగెడు	414
స్వర్గమైనను బాలింప	463
స్నానాదికవిహితానుష్ఠాను	497
హ	
హృదయముల నొండొరు	418
హృదయములు దలర	494

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మౌసల పర్వము

పద్యము	పుట
అ	
అంత బలుండునుం బోవ	603
అంతయును దివ్యదృష్టి	622
అందఱ నూరార్చి యర్జునుం	619
అంబుజనాభుని కొడు కీ	591
అక్కిరాతుండు సన వాని	659
అఖిలజనమును సంప్రాప్త	615
అఖిలబంధుజనంబుల	679
అ ట్లగ్రజుఁడు చన్న నచ్చటు	622
అట్టియెడ విను భోజులు	614
అట్లు కృతవర్మఁ దెగటార్చి	609
అట్లు దిక్కుదప్పి యడవి	659
అట్లు నిశ్చయించి యాదవ	598
అట్లు రామకృష్ణులు సర్వ	681
అతఁడు వనితలను బాలుర	640
అనలములు హోమకాలంబు	597
అన విని ఫల్గునుం డా వృష్ణి	643
అన విని యమ్మహాముని	683
అన విని యొకనాఁడొక్కడ	659
అన విని రోషచిహ్న	607
అన విని శోకమోహంబులు	686
అనవుడు నాతఁ డిట్టులను	680
అని గజాదుల నింతులను	617
అని చెప్పి పురజనుల	648
అని తెగఁబలికి యతని	620
అనినఁ బ్రద్యుమ్నుఁడిది	606
అనిన విని యమ్మహీపతి	590
అని నిభృతిఁ బలుక నా	627
అని పలికి దారుకుని	644
అని పల్కి యభ్యంతరా	593
అని పల్కి రప్పిండునందు	678
అని మదిఁ జర్చించె	638
అని యడిగిన వసుదేవు	639
అని యడుగంగ దైవగతి	661
అనియె దానికి హరి	607
అనిరుద్ధుఁ బ్రద్యుమ్ను సాంబుని	614
అని వారి నిండ్లకును	649
అని వా రొండొరువులతో	668
అనుచరులలోని భూసురు	660
అనుచుఁ బెనుఁగలఁక	658
అనుచు నతని పాదంబులు	618
అనుచు నరిగి తాఁ దలఁచి	665
అనుచున్ సంయమిశాప	609
అనుటయు నట్ల కాకయని	616
అను తలఁ పాత్మ నొందుట	676
అనుదినంబును నిట్టుల	597
అనునెడఁ గ్రీడి యితఁడు	638
అపరదినంబున నరిగె	654
అపుడు రెండవ జలనిధి	667
అప్పరమేశ్వరుం డయ్యందఱ	628
అప్పు డందఱ బంధుల	653
అప్పుడు కాలపర్యయమున	671
అప్పుడు కృష్ణుని యంతః	665
అప్పుడు బ్రహ్మ వచ్చి హరి	627
అబ్బంగిఁ గృతకృత్యు	664
అమరగణవిరోధి	688
అమృతం బజరం బవ్యయ	626
అమ్మండపమ్మున కరిగిన	645
అమ్మెయి నూరకుండ	661
అయ్యిరు దెఱఁగున	611
అరిగి మగండు సచ్చిన	632
అరుగుదెంచి యచటఁ	623
అరుగుదెంచి యా ప్రజ	646
అరుణములు ఘూర్ణితంబులు	595
అవతరించి కంసుఁ డాదిగా	625
అవనీభారము వాపి	685
అవనీశ విను మంత నద్దారు	630
అవికృతమును రుచిరము	661
అవి గనియు వినియు	600
అహికులాగ్రగణ్యుఁడైన	621
ఆ	
ఆందోళికాది వాహన	602
ఆతఁడు కాలాంతరమున	642
ఆ దేవదేవుఁ డత్యంతాదర	629
ఆ నృపునివల్లభలు శవ	651
ఆ బోయలు నిర్భయమతు	670
ఆ రాజు సచ్చుట నారాయణు	657
ఆ రేయిఁగల నెల్లవారును	599
ఆ సమయంబున నర్జున	650
ఇ	
ఇంద్రియాగోచరుండైన	629
ఇచ్చటి కార్యముల్ నడుపు	645
ఇట్లనుదినమును నెన్ని	589
ఇత్తెఱంగున సత్క్రియా	654
ఇది దైవవిరోధంబని	670
ఇది విధివశత్వమున	637
ఇమ్మాడ్కిం బఱివోయిన	671
ఇమ్మెయిఁ గొనిచని	652
ఇమ్మెయి నరుండు సకల	666
ఇవ్విధమున విశ్రుత	656
ఈ	
ఈ దేశము ప్రజ ధర్మజ	648
ఈ వనితలఁ బ్రజలను	643
ఉ	
ఉన్మార్గవర్తు లై యుండిరి	606
ఊ	
ఊరార్చి యింక నుచితా	678
ఊర్ధ్వలోకమునకు నూర్జిత	624

పద్యము	పుట
ఏ	
ఏ పెనఁగ రేఁగి యట్ల	669
ఏమిట నిట్టులయ్యెనొకొ	660
క	
కందువచోటికిఁ గొని	675
కనుఁగొని జంభారితనయు	669
కనుఁగొని వృష్ణివీరులు	611
కనుఁగొని హరి కతి	608
కవిసినఁ జూచియాఁగుట	610
కవ్వడి యొక్కఁడ కంటిరే	668
కాంచి దారుకుదెస	616
కాచికొని వచ్చి తగ	683
కాలంబగుటయుఁ గురు	595
కాలమూలంబు సర్వంబు	686
కాలస్వైరవిహారభంజన	687
కావున నప్పురంబున	644
కావున వేగ మగ్నియును	663
కృతవర్మం బటుదృష్టిఁ	608
కృపనిట్ల యవతరింపుము	627
కోపించి గాంధారి శాపమిచ్చి	672
గ	
గతము లయిన కార్యంబులు	649
ఘ	
ఘనతరబాహుశక్తియును	681
ఘృతములు పైఁజల్లఁగ	653
చ	
చనిచని మనమున నిట్లను	657
చని యచటనచటఁదన్నుం	672
చనుటయుఁ గ్రొత్తపేరడలు	632
చనుదెంచి పురువీథిఁజను	591
చాపదండనిహతి నోపిన	682
చిలుకలు గూబల యెలుఁగు	596
చెప్పిన నేను నొడంబడి	642
చెలులుం జుట్టులు దాపట	651
చేరి తెలియఁ గనుగొని	624
జ	
జలనిధిశయనుండు మహీ	623
జాతర సేయఁగావలయు	598
త	
తండ్రి పుత్రుఁ డన్నదమ్ముఁడు	613
తక్కటివారి నింద్రప్రస్థ	673
తక్కును గల మహిషీజను	634
తదనంతరంబ యద్దామో	620
తదనంతరంబ రణమృత	655
తదనంతరంబ వజ్రుఁడు	653
తన చుట్లనున్న బంధుల	593
తన మాటలు నజ్జనవాథు	619
తన రథము లేమినొండొక	601
తమ్ముఁనిఁ గాచునట్టి నముద	610
తలఁకుచుఁ జని యతనిం	635
తలఁచి యతండు మందగతి	674
తలవాంచి యేమియుఁ బలుక	675
తెలతెలవేగునప్పు వసు	650
తొడవు చీర పూఁత తొంటి	601
తొలితొలి సాత్యకి కృతవర్మ	637
ద	
దానఁజేసి మీరు నేనును	677
దాని కజ్జనములుఁదాను	662
దామోదరుఁడు హలధరుఁడు	592
దారుకుండత్యంత	631
దారుకుఁడు దోడఁ జనుదే	632
దేవా! జనమేజయధాత్రీ	588
ద్వారకావాసులెల్లను	652
ద్వారవతికిఁ గణ్యుండు	590
ధ	
ధరణిభరంబు వాప	685
ధరణీనాథ యతండు శాత	623
న	
నడిపించి పంచవటమున	667
నారాయణుఁడప్పుడు	615
నిఖిలబంధుజనుల	655
నియమింపుడు నగరివరకు	648
నిలిపిన తెఱఁగెల్ల నృపవర	673
నిలుచున్నఁ జూచి రణ	615
నీలపింగళ దేహ మాభీల	595
నీ వనిసేయ నీవలని	684
నెవ్వగయు నచ్చెరువు	682
ప	
పడనిపాటు వాటిల్లిన	683
పడి యేడ్చినఁ గృష్ణుండు	624
పదవడి గీతవాద్యగతి	604
పదపడి ధృతరాష్ట్రమహిషి	594
పదపడి యాదవభామినీ	656
పరమకౌతుకంబు భవ్య	621
పరివేషము లినరజనీ	589
పలుకక మ్రొక్కి వీడుకొలుపంగ	603
పీనుఁగు పెంటగాఁబడిన	642
పొడిగాఁగఁ జేసి యమ్మెయి	612
పోయి మరున్నది పొంత	680
బ	
బలమును బుద్ధియుఁజేవ	686
బాలురు వృద్ధులుఁ జండీ	668
బోయల సంప్రాప్తికిఁ బ్రకృతి	682
భ	
భారతసంగ్రామ పారీణుఁడై	588
భూమిసురావళీ మహిత	604
భోజాంధక సంగమ	611
మ	
మనుజాధిపుఁ డమ్మెయి	636
మనుజుల మాత్రగాక	636
మఱికొంత సేపునకు	660
మఱునాఁడ యగుట లెస్స	662
మహితాయుధసంప్రహ	681

పద్యము	పుట
మునివరశాపసంభవ	612
మునిశాపము వారల మది	613
మునిశాపశక్తి మానుష	594
య	
యాదవ కుటుంబముల	674
యాదవవీరుల కా సమయం	612
యాదవుల్ తమలోన	641
యాదవుల్ సమసిన	634
ర	
రోదనధ్వను లెసఁగంగ	633
ల	
లేచి యడలి సవ్యసాచి	635
వ	
వననిధి నేఁటికి నేడవు	646
వననిధిపురంబు ముంప	667
వలసిన నెట్టి కార్యమును	637
వారలఁ గాంచి శోకమని	633
వాహనములు వానివాని	647
విధి వశంబునఁజేసి వృష్ణి	639
విని కాలవేదియగు నవ్వన	592
విని బలుజీవివోయి మది	618
వినుఁడు యాదవభామినీ	677
విను కూడుగూర పాకము	597
వినుఁ డింద్రప్రస్థపురం	647
వినుఁ డీ తప్పున దోషము	677
విను తదనంతరంబ	604
విను దేవకియును రోహిణి	651
విను నీ శిష్యులు సాత్యకి	636
విను మనుచరు లాతని	658
వినుము ధనంజయు	634
వినుము సుగ్రీవమును	600
విను మొక్కడు నొక భూరుహ	603
విను వజ్రముఖ్య యాదవ	666
విను సత్యభామ లోనగు	679
వృష్ణిభోజాంధకులు	605
వెడలుండు తీర్థయాత్రకు	600
వెలువడి లీలనేఁగి	602
శ	
శ్రీ ధర్మ కామహృదయ	588
స	
సమకట్టికొనుచు భోజ్య	600
సరకులు భారవహులకు	647
సర్వయాదవసంఘంబు	631
సాత్యకియుఁ గృతవర్మయు	605
సామజరథతురగముల	617
సుందరులకు బాలురకును	649
హ	
హరికిఁ గానవచ్చునంత	617
హరికిని రామదేవునకు	676
హలధరునిం దలంచి	664
హ్రాదుఁడును వక్రదంతుం	621
హృదయకమలమధు	688

మహాప్రస్థానిక పర్వము

పద్యము	పుట
అ	
అచ్చటినుండి	703
అటఁజని యశ్రమంబున	704
అ ట్లతిదృఢనిశ్చయంబుగఁ	719
అట్లు ప్రణతుండయిన	713
అనఘచరిత్ర విన్ము	718
అన విని ధర్మజుండఖిల	718
అన విని ధర్మరాజసుతుఁ	723
అన విని యాతఁ డిట్లనియె	710
అన విని యింద్రుఁ	713
అనవుఁడు ధర్మనందను	716
అని గద్గదకంఠ లగుచు	698
అని తన మాట కియ్యకొను	693
అని తారు గృహంబు దొఱంగి	695
అని ధృతిసారంబూఁది	708
అనిన నమ్మనుజేంద్రుండు	715
అని పలికి నిరీక్షింపక	711
అని పలికి వైశంపాయనుండు	712
అని పలికి సమాధానము	705
అని పుయిలోడక పలికె	719
అని యడిగిన వైశంపాయను	691
అని యిట్లాడిన సర్వ	725
అనియె నప్పుడు పరమా	722
అనిలజుఁడు నరుఁడు	707
అనిలసూనుఁడు ధర్మ	707
అనుటయు ధర్మజుం	714
అన్నరేంద్రున కిట్లనియె	692
అప్పుడు	701
అప్పుడు దగ నిట్లను	710
అమృతవికిరణ క్రీడాభి	728
అర్జునుం డమ్మెయి	691
అలుక హరించు ధర్మముల	715
ఆ	
ఆ పార్థపౌత్రునిఁ జూపి	697
ఆ యనుజుని నట్లు	694
ఆ సముచితసారమేయం	711
ఆ సమయంబున	700
ఇ	
ఇంతటి పెంపు గల్గుట	722

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము	పుట
ఇట్లభిమన్యుపుత్రు నభి	694
ఇట్లు ధౌమ్యాదివిప్రుల కెల్ల	696
ఎ	
ఎఱిఁగించి రాజ్యతంత్రము	693
ఎల్లవారును విన	723
ఒ	
ఒరులకు నొందరాని	725
క	
కావున నాకలోకపు సుఖం	719
కాలము నే మనవచ్చును	692
కృపుఁడు ధౌమ్యుండు నా నృపతినిఁ	701
చ	
చనునప్పు డయ్యేడ్వురును	704
జ	
జనకుకడకు నులూచి	700
జనులు నుతింపఁగా సుకృత	717
త	
తదనంతరంబ	703
తనువు దొఱంగ కిట్లు	724
తనువులు దూల నందఱుఁ	700
తోడంబుట్టువు లందఱుం	713
ద	
దక్షిణాభిముఖతఁ దలకొని	703
దానను దాన నిట్లగుట	709
దానములం దపంబులను	723
దానికి నీవు చిత్తమునఁ	721
దిక్కులు మేఘపథంబును	702
దివ్యదేహోద్ధత దీప్తి	712
దేవా! వైశంపాయనునకు	691
ద్రౌపదిపాటును దన	708
న	
నా క త్రెఱంగు పరమానందకరం	726
నిలిచి బీభత్సుండు నిర్భర	702
ప	
పడమర మొగమై పశ్చిమ	704
పదపడి భారతాజిమృత	696
పారాశర్యవచఃపయోనిధి	726
పూని యుపవాసవ్రతపరులై	702
పౌరజనంబు లాబాలవృద్ధ	699
ప్రణవైకభావ్యసురరక్షణ	727
భ	
భవదీయాత్మజు నాత్మజుండు	694
భీముని నర్జును విడిచియు	721
భూదానంబులునుం	696
భూవర! యమ్మొయిఁబోవంగ	706
మ	
మీ రిటు లేమి సెప్పిన నమేయ	725
వ	
వారలను మదీయ	724
విను ద్రుపదనందనయు	707
విను నీరు రోసి నీదగు	720
విను భక్తియుక్తమిదియని	721
విను శేషించిన యాదవ	695
శ	
శేషించిన కాంచనరత్నాదు	697
శ్రీపదసీమావాప్తి	690

స్వర్గారోహణ పర్వము

పద్యము	పుట
అంగములభంగి తొల్లింటి	758
ఆ కృతక మధురోక్తివ్యాప్త	781
అట్ల చేయువార మమలాత్మ	738
అట్ల పోలె నాకనరకంబుల	764
అతఁ డింతటిది మహాభారతం	771
అతని తమ్ములెల్ల యాతుధానవలిఁ	764
అతని నట్లుండ నిమ్ము	735
అతని నెఱుంగకుండి విను	736
అదె భీష్ముఁడు వసువులకడ	761
అన విని యమ్మునీంద్రునకు	735
అనవుడు నతనితో నాతఁడీ	759
అని చెప్పి చూపి	760
అని చెప్పి యమ్మహాయుద్ధంబున	766
అని చెప్పి యాశౌనకాది	772
అని దుఃఖభారకృపణంబులగుచు	741
అని దేవదూతునిఁ గనుగొని	738
అని పలికి వెండియు	775
అని పల్కి ధర్ముఁడత్తనయుని	756
అని పలుకుచుఁ జూపి గంధర్వ	761
అని మఱియుం గలుగు	735
అని యగ్గలపుఁజింత మునిఁగి	743
అని యిట్లు సమస్తపురాణ	779
అనియె నప్పుడు ధర్ముఁ	752
అని వెండియు	734
అనుటయు దేవదూతుఁడు	744
అనుమరణంబునం దగ	766
అప్పథంబునఁ బాండవాగ్రజుం	739
అప్పుడు	745
అమలధర్మార్థకామ	774
అమ్మహేంద్రుఁ డమ్మహానుభావునితో	752
అలఘుమతులార పర్వంబుల	776

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పద్యము పుట

ఆ
ఆకాశగంగ యిదె పుణ్యా 752
ఆద్యంతంబును నీయన 86
ఆ సమయంబున వాసవు 746

ఇ
ఇట నేను నిన్నుఁ బుత్తెంచుట 749
ఇట్లు ద్రౌపదీద్రౌపదేయాంబికేయుల 760
ఇట్లొప్పియున్న యతనిం గని 732
ఇతఁ డతిలోభోపహత 732
ఇవ్విధంబున నొప్పి మీ తాత 756

ఈ
ఈఁగకాలి యంతయేనియు 743
ఈ నెలవును బృందారకాధీన 740

ఉ
ఉదిత రవిచ్ఛవిందరుణి 758

ఒ
ఒండొరులతో నక్కురుమూర్తి 746
ఒకటను మేలు సేయని 742

ఓ
ఓ ధర్మనందన యీ ధరణీ 733

క
కని మది నమ్మహాత్ముఁడధిక 758
కమలగర్భుని నియోగంబున 765
కర్ణుఁ డుత్తమసిద్ధిఁగాంచి 749
కురువర యిది దేవగుహ్యం 762
కృష్ణద్వైపాయన మునీంద్రుండు 767

చ
చూపి తదనంతరంబ 761
చెప్పి యిట్లనియె నట్లు 771

పద్యము పుట

జ
జూదమునఁ గయ్యమున 734

త
తగువాని రావించి ధర్మ 731

ద
దేవ! చతుర్విధభూతా 781
సురపితృకార్యంబుల 776
దేవా జనమేజయుండు 730
దేవా వైశంపాయనుండు 769
దైవవిహిత మగుటఁ దప్పింప 750
ద్రుపదవిరాటయుధామన్యులు 737
ద్రుపదుండు విరాటుండు 764
ధర్మనందనుఁడు చిత్తమ్మున 741
ధర్ముఁడును మహాముదంబున 744

న
నా యనుజులు దుఃఖార్దితులై 744
నినుఁజూడఁగనుటఁ బటు 740
నీ విచ్చో నునికికి నిద్దేవత 746
నీ వియ్యాకాశనదీ 754

ప
పరమపదాప్తిహేతువగు 779
పరమసుఖంబు జెంది 755
పరిశోధితుండ వయితి 754
పాండవుల కీర్తిం బ్రకటించు 774
పాండురాజు వీఁడె బహు 761
పావనదుర్దశావహాశుభ 780
పుణ్యంబులును బాపములు 748
పుణ్యాత్ములార యీ పుణ్యైతి 775

పద్యము పుట

భ
భవ్యజనన నీ గాత్రము 740
భారత మర్థితో వినిన 777
భ్రాజితవృత్తిమైఁ బరఁగు 777

మ
మరలినఁ జూచి నారదుండు 733
మరలిపోవం జూచిన నయ్యెడఁ 740
మహితవర్తనులైన 751
మానసముల నింద్రియముల 777
మానితసువ్రతములకు 750

ర
రాజసూయాశ్వమేధాధ్వరముల 750
రారాజు నాక నరకోదార 763

వ
వసురుద్రాదిత్య గంధర్వ 746
వినుము ధర్మంనందను పుణ్య 765
వినుము పాండవకౌరవ 767
విను మొక్కటి సెప్పెద 747
వివిధపాపాత్ములు వికృత 745
విస్ఫురద్బహురత్న వితతి 757
వ్యాసమునీంద్రసారకరుణా 778

శ
శిక్షితచిత్తులార! శుభ 778
శ్రీనిత్యత్వప్రమదాదాన 768
శ్రీవర్ధనాయురభివృద్ధ్యా 730

స
సంగ్రామమృతులైన సకల 736
సిద్ధియు నవ్యయ లోకసమృద్ధ 747

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

[**పీఠిక విషయసూచిక:- 1.** అశ్వమేధపర్వము:- (1) రాజసూయం: అశ్వమేధం:- పు.01* (2) అశ్వమేధం: అవనీదానం:-పు.3*(3) అంతర్యాగం: అంతర్యోగం- పు.4* (4) రెండు రాజ్యాలకు రాజధానులు. పు.5*(5) దయా దానధర్మవీరాలు - పు.8 (6.) అశ్వమేధంలో అద్భుతం- పు. 10* **2.ఆశ్రమవాసపర్వం:-** (1) గాంధారీ ధృతరాష్ట్రుల హస్తినాపురవాసం-పు.12*(2) గాంధారీ ధృతరాష్ట్రుల ఆశ్రమ వాసం- పు. 14* **3.మౌసల పర్వము:-** (1) మూడు మహానగరాలు- పు.17* (2) ద్వారకను ముంచిన ముప్పేట ముప్పు- పు.17*(3) అవతారపురుషుడి అపూర్వ ప్రస్థానం- పు.19* (4) మౌసలపర్వం మహాప్రస్థానిక పర్వానికి తొలిపలుకు- పు.20* **4.మహాప్రస్థానిక పర్వము:-** (1) ప్రస్థాన ప్రయత్నం- పు.22* (2) మహాప్రస్థానం - పు.23* (3) అమరేంద్రుడి ఆహ్వానం- పు.24* (4) ధర్మసంవాదం -పు.24* **5. స్వర్గారోహణపర్వము:-** (1) మూడు రంగాలు- పు. 27*(2) ఆరోహణమే కాని అవరోహణంలేదు-పు.28* (3) పద్యత్రయం పర్వహృదయం- పు.28***6. మహాభారతం: శాంతరసం: ధర్మవీరం:-** పు.30* (1) తత్త్వజ్ఞాన స్వరూప స్వభావాలు- పు.30* (2) శాంతరసాస్వాద విధానం-పు.31*(3) ఆనందవర్ధనుడి శాంతరస ప్రస్తారం; అభినవగుప్తుడి పరిష్కారం- పు. 33* (4) ఆంధ్రమహాభారత శాంతరస విమర్శ- పు.34*(5) ఆంధ్ర మహాభారతంలో అంగిరసం ధర్మవీరమే- పు.36* (6) కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం- పు.38* కథాసారం -పు. 39]

అశ్వమేధపర్వం

సీ. 'సమరంబు ధర్మవిజయ పరికీర్త్యంబు । గాఁ జేసి భూమి నిష్కంటకముగఁ
బాలించుచున్నాఁడు ప్రజ ప్రీతి నొందంగ, । విద్వజ్జనంబులు వివిధసుఖము
లనుభవించుచుఁ దన్ను వినుతింప, నెగడెడు । శాంతియు సమతయు సకలజనముఁ
గొనియాడు సిద్ధులు మునులు సేవింతురు, । ధర్మనందనుఁ డి ట్లుదాత్తుఁ డగునె!

తే. యతని కున్నతి గావించి రనిలజుండుఁ । గవలు, నెంతయు నీ చేతి గాండివంబు
లీల గల్గి మహాధర్మశాలి సత్య । నిత్యుఁ డమ్మహీపతి గృతకృత్యుఁ డయ్యె,'-శ్రీకృష్ణుడు(**అశ్వ.1.145**)

1.రాజసూయం: అశ్వమేధం:

ధర్మనందనుడి సార్వభౌమాధికార చరిత్ర వాహినికి రాజసూయం ఒక ఒడ్డు అయితే, అశ్వమేధం మరొక ఒడ్డు. రాజసంతో రాజలోకాన్ని జయించి వారినుండి విలువైన బహుమానాలు పొంది. వారిచేత స్వీయ సార్వభౌమత్వాన్ని ప్రతిష్ఠాపించుకొనటం ధ్యేయంగా సాగింది రాజసూయం. దానివలన శిశుపాలాదుల వైరంకూడా పెరిగింది. తరువాత మహాయుద్ధానికి దారి తీసింది. విస్తృత ప్రాణహానికి, వీరసంహారానికి కారణమయింది. ఒక విధంగా కురుక్షేత్ర యుద్ధానికి బీజావాపనం రాజసూయంలోనే జరిగింది. సర్వ సర్వంసహా చక్రవర్తిత్వాన్ని అందించింది రాజసూయమే. దానిని సంగ్రహించిందీ రాజసూయమే. పూర్వాధికారాన్ని మరల తెచ్చికొనటానికి భారతయుద్ధ విజయం ఒక్కటే ధర్మరాజుకు చాలలేదు. కురుక్షేత్రంలో కౌరవులను, వారి సహాయకులను చంపి హస్తినాపురానికి రాజయ్యాడే కాని సార్వభౌమ గౌరవం పొందలేదు. దానికి మరల అశ్వమేధయాగం అవసరమయింది. రాజసూయంలో ధర్మనందనుడితోపాటు భీష్మాది కురువీరులూ, దుర్యోధనాది కౌరవవీరులూ, బంధుమిత్రులూ, అందరూ విజయోత్సాహంతో పాల్గొన్నారు. అందరూ ఆయా బాధ్యతలు పంచుకొని నిర్వహించారు. కాని, అశ్వమేధయాగంనాటికి ధర్మరాజు ఆ బంధువర్గాన్నంతటినీ యుద్ధంలో సంహరించాడు. ఆ పాపభయం అతడి అంతరంగాన్ని దహించివేస్తున్నది. బంధుమిత్ర పుత్ర ప్రజాహంతకుడు ప్రభువు కావటం ధర్మమా? అని కొందరు ప్రశ్నించే తరుణం ఏర్పడింది. రాజసూయంలో లేని పాపచింత అశ్వమేధంనాటికి ఏర్పడింది. ఆ పాపఫలం పోవటానికి అశ్వమేధయాగ మొక్కటే తరణోపాయమని వ్యాసమహర్షీ, వాసుదేవుడూ ధర్మరాజును ఒప్పించారు. ఆ యజ్ఞాంతంలో చేసే అవభృథ స్నానం సర్వపాపనివారిణి అని నిశ్చయించారు. ధర్మజుడు దానికి అంగీకరించాడు.

అయితే, రాజసూయానికీ, అశ్వమేధానికీ తారతమ్యం కొట్టవచ్చినట్లు కనబడుతుంది. రాజసూయంలో పాండవులకు ప్రేరక సహాయక రక్షక శక్తిగా శ్రీకృష్ణుడు త్రిముఖంగా నిలిచి యోగక్షేమం వహించాడు. భీష్ముడి నిర్దేశంతో శ్రీకృష్ణుడిని యజ్ఞపురుషుడిగా సమ్మానించి ధర్మరాజు ధన్యుడయ్యాడు. రాజసూయంలో వ్యాసమహర్షి వెనుక ఉండి నడిపించగా శ్రీకృష్ణుడు ముందుండి ముందుకు సాగించి ఫలాన్ని ధర్మరాజుకు అందించాడు. అశ్వమేధం నాటికి ఆ పరిస్థితి వ్యత్యస్తమయింది. శ్రీకృష్ణుడు భారతయుద్ధానంతరం ఎక్కువగా నిర్లిప్త పాత్రను నిర్వహించాడు. తాను పూర్వం చేసిన వాగ్దానాలను నిలుపుకొనటానికి, భవిష్యత్తుకు పనికివచ్చే ధర్మవేదాంత బోధలు చేయటానికీ, శాపానుభవాలను అనుభవించవలసి వచ్చినప్పుడు జరుగుతున్న చరిత్రను మార్చే మహిమ తనకున్నా కర్మఫలానుభవాన్ని జీవులు అనుభవించే సంసారచక్ర భ్రమణానికి అడ్డుపడక, చివరకు తననూ తనవారినీ ఆ చక్రంలో భోక్తలుగా మార్చే ప్రవృత్తిని ప్రకటించాడు. అందువలన శ్రీకృష్ణుడి పాత్ర అశ్వమేధంలో నిమిత్తమాత్రంగా ఉన్నా నిండుగా, అండగా దండిగా ఉన్నట్లు భాసిస్తుంది. రాజసూయయాగంలో శ్రీకృష్ణుడివలె అశ్వమేధంలో సూత్రధారి పాత్ర నిర్వహించింది పారాశర్యమహర్షి. అవసరాన్ని తానే గుర్తించి, ధర్మరాజుకు ప్రత్యక్షమై, అడుగడుగున తానే మార్గదర్శిగా, మహర్షిగా నిలిచి, అడ్డంకులను తొలగించి, అవసరాలను తీర్చి, అండదండలుగా నిలిచి, గురువుగా ఋత్విజుడుగా, మహర్షిగా, పురోహితుడుగా తగిన పాత్రను నిర్వహించి ధర్మరాజును చేయిపట్టుకొని అశ్వమేధం నిర్వహించేటట్లు చేశాడు. రాజసూయంలో శ్రీకృష్ణుడిని పూజించిన ధర్మరాజు అశ్వమేధంలో వ్యాసమహర్షిని పూజించి తన సర్వసామ్రాజ్యాన్నీ ఆయనకు దక్షిణగా సమర్పించుకొన్నాడు. ఆ తరువాత వ్యాస, శ్రీ కృష్ణుల ఆదేశానుసారం అసంఖ్యాకంగా బంగారు నాణాలను వ్యాసమహర్షికి సమర్పించి భూవలయాన్ని కొనుక్కొన్నాడు.

అశ్వమేధయాగం సంకల్పించటానికి ముందు ధర్మరాజుకు ఆ యజ్ఞం నిర్వహించి, స్వర్ణదానాలు చేయటానికి తగినంత ధనం లేదు. అతడు తన అశక్తతను ప్రకటించాడు. అప్పుడు అతడికి అపారస్వర్ణ ధననిధు లున్న చోటును చెప్పిందీ, అది ధర్మసంపదగా అతడిని ఒప్పించిందీ. ఆ నిధుల వద్దకు దారి చూపించిందీ. దానికి తగిన విధి విధానాలను తెలిపిందీ, దాని అధిపతి అయిన శివుడిని ఆరాధించే పద్ధతిని దగ్గర ఉండి శాస్త్రోక్తంగా నిర్వహింపచేసిందీ స్వయంగా వేదవ్యాసమునీంద్రుడే. పూర్వం మరుత్తుడనే ప్రభువు అశ్వమేధాది యజ్ఞాలు చేసి అపారస్వర్ణ రాసులను బ్రాహ్మణులకు దానం చేశాడు. వారు మోయగలిగినంత బంగారాన్ని తీసికొని వెళ్ళుతూ మిగిలిన అపారస్వర్ణరాసులను హిమాలయంలో ఒకచోట గుప్తంగా ఉంచి. రాబోయే కాలంలో దానిని కనుగొన్నవారికి ఆ సంపద స్వంతం ఔతుందని వరమిచ్చారు. దానివలన ధర్మరాజుకు ఆ సంపద ధర్మసంపదగా లభించింది. దానితో మూడురెట్ల స్వర్ణ దానాలను యజ్ఞంలో చేసి మూడు యజ్ఞాలు చేసి ఫలాన్ని పొందుమని వ్యాసుడు ధర్మజుడికి హితవు చెప్పాడు. దీనివలన రెండు లాభాలు కలిగాయి. అశ్వమేధయాగంలో అశ్వాన్ని అడ్డగించిన రాజులను హింసించకుండా సౌమ్యంగా శాంతంగా వారిని వారించి, అవసరమైతే సైన్యాన్ని చంపి రాజులను చంపకుండా వదలి, హింసలేని విజయాన్ని, రాజులనుండి ధనాన్ని కప్పంగా స్వీకరించని స్నేహపూర్వక శాంతి విజయాన్ని సాధించాలని అర్జునుడికి ధర్మరాజు ప్రభోధించాడు. అశ్వరక్షణలో అర్జునుడు తన గాండీవ పరాక్రమాన్ని పరిపూర్ణంగా ప్రదర్శించలేకపోయాడు. గాండీవం కొన్నిసార్లు నేలపై పడింది. బభ్రువాహనుడిచేతిలో విజయుడు ఒకసారి ప్రాణాలు కోల్పోయాడు. ఉలూపి సంజీవనీమణిచేత అతడిని పునరుజ్జీవితుడిని చేసింది. అర్జునుడు శిఖండిని అడ్డం పెట్టుకొని భీష్ముడిని అధర్మంగా చంపినందుకు వసువులు కోపించి అర్జునుడు మరణించేటట్లు శపించగా, ఆ శాపపరిహారార్థం ఆ మార్గాన్ని ఆశ్రయించి, భీష్మవధవలన అర్జునుడికి కలిగే నరకబాధను తొలగించటమైనదని ఉలూపి వివరించింది. అశ్వమేధంలో అశ్వరక్షణంలో అర్జునుడికి శ్రీకృష్ణుడి రక్ష ఉన్నా ప్రత్యక్షంగా ఆయనకు సాయపడిన జాడలు లేవు. అతడు నిర్లిప్తుడుగా ఉండిపోయాడు. పై పెచ్చు అతడికి వేదాంత బోధ చేసి మరచిపోయిన భగవద్గీతాపరమార్థాన్ని జ్ఞాపకం చేశాడు.

అశ్వమేధయాగానికి ధర్మరాజు పలికిన ఆహ్వానాన్ని పురస్కరించుకొని యాగారంభానికి రెండు నెలలముందే శ్రీకృష్ణుడు బంధుమిత్రులతో కలిసి హస్తినాపురానికి వచ్చాడు. దాని కొక దివ్యకారణం లేకపోలేదు. పాండవులు స్వర్ణరాసులతో హస్తినాపురానికి తిరిగిరావటానికి ఒక నెలరోజుల పూర్వమే ఉత్తరకు మృతశిశువు జన్మించాడు. కుంతి, ద్రౌపది, సుభద్ర మొదలైనవారు మృతశిశువును

బ్రతికించుమని శ్రీకృష్ణుడిని ప్రార్థించారు. అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మశిరోనామకాస్త్ర శిఖలలో మాతృగర్భంలోనే మాడి చనిపోయిన బాలుడిని రక్షిస్తానని ఇదివరలో అతడు చేసిన ప్రతిజ్ఞను అందరూ జ్ఞాపకం చేశారు. మాట నిలుపుకొనటం అతడి సత్యవ్రత ధర్మమైపోయింది. మృతశిశువును తన ముందుంచి శోకించిన ఉత్తర మాతృహృదయాన్ని గమనించి ఆర్ద్రుడైన శ్రీకృష్ణుడు మృతబాలుడిని రక్షించి, పరీక్షితుడని పేరుపెట్టి, విలువైన కానుకలు చదివించి పాండవ పక్షంవారికి మహానందం కలిగించాడు. పాండవ వంశాంకురాన్ని రక్షించటంలో పరమదయాళువుగా వ్యవహరించిన శ్రీకృష్ణుడు యాదవులు తుంగలతో మోదుకొని చనిపోయే సందర్భంలో నిర్లిప్తంగా ఉన్న వైఖరికూడా దివ్యత్వాన్నే ప్రదర్శించింది. కాలం వక్రించేటప్పుడు శ్రీకృష్ణుడు నిర్లిప్తంగా ఉండటం భారతయుద్ధానంతరం ఆయన వర్తనంలో కానవచ్చే అంతరార్థం.

స్థూలంగా ఈ తారతమ్యాలను గమనిస్తే రాజసూయం రాజసంగా సాగినా శ్రీకృష్ణ రక్షితమై శ్రీకరమయింది. అశ్వమేధం సాత్వికంగా సాగి వ్యాస దర్శకత్వంలో శాంతంగా, పాపప్రక్షాళకంగా పావనమయింది. రాజసూయంలో ధర్మరాజును మించిన సమ్రాట్టు మరొకడు లేడు. అశ్వమేధంలో ధర్మరాజు తప్ప మరొక సమ్రాట్టు లేడు. వాసుదేవుడు రాజసూయంనాటికి అవతార కార్యక్రమానికి వ్యూహాన్ని సిద్ధంచేశాడు. అశ్వమేధం నాటికి అవతారకార్యక్రమానికి చరమగీతం పాడుకొన్నాడు. ఇంత భేదం కొట్టవచ్చినట్లు కనబడే అశ్వమేధం పాండవుల చరిత్రకు పూర్ణఫలం!

2.అశ్వమేధం: అవనీదానం:

భీష్ముడికి ఉత్తరక్రియలు చేసి తిలోదకాలిచ్చి ధర్మరాజు గంగను దాటి శోకసంతప్తుడై సొమ్మసిల్లాడు. భీమాదులు అతడికి శైత్యోపచారాలు చేసి సొక్కు తీర్చారు. ధృతరాష్ట్రుడు అతడిని అనునయించాడు. నారదాది మహర్షులు ప్రబోధించిన వాక్యాలను శ్రీకృష్ణుడు జ్ఞాపకం చేశాడు. అందరి మాటలు వినినా అతడికి అంతశ్శాంతి కలుగలేదు. వ్యాసమహర్షి నుద్దేశించి ఇట్లా అడిగాడు. 'మహర్షీ! ఇకమీద నేను తపోవనానికి పోవటానికి అనుజ్ఞ ఇవ్వండి. లేదా పితామహ కర్ణులను చంపించిన క్రూరకర్ముడను. నాకు శాంతి ఎట్లా కలుగుతుంది? ఆ మహాపాపం పోయే కర్మానుష్ఠానం బోధించండి' అని ప్రార్థించాడు. వ్యాసుడు ధర్మరాజు చిత్తవృత్తికి విసిగి చివరకు ఇట్లా అన్నాడు.

సీ. 'నిష్ఠించి యిబ్భంగి నీ కేము చెప్పిన । వాక్యంబు లెల్లను వఱదఁ గలసి
పోయెనే? నీదగు బుద్ధి యింతొప్పదో? । కాక మర్త్యుఁడు గాఁడు కర్త యీశ్వ
రుని నియోగమున మేలును గీడు నొనరించుఁ । గాన నీ మదిఁ బాపకర్మశంక
గలిగె నేనియును యాగముల దానంబుల । నది వాపికొనరాదె? యశ్వమేధ

తే. మధిక దక్షిణాన్వితముగ ననఘ! చేయు; । మంతతో భవదీయ చిత్తానుతాప
మంతయును బాయు; రఘురామునట్లు పూరు । భరతులును బోలె దానతత్పరుఁడ వగుము.'**(అశ్వ.1.12)**

చ. 'అన విని యమ్మునీశ్వరున కా నృపుఁ డిట్లను 'నశ్వమేధయా
గనిరతి భూమిపాలు గతకల్మషుఁ జేయఁగఁ జాలు నాఁగ ము
న్నును వెడ వింటి; సజ్జన మనోజ్ఞ వచో మహనీయ! నీవు చె
ప్పిన పలుకూఁది యా క్రతువు ప్రీతి నొనర్చెద నెల్ల భంగులన్.' **(అశ్వ.1.13)**

యజ్ఞాలలో భూరిదక్షిణ లిచ్చే యజ్ఞం అశ్వమేధం. స్వర్ణదానంవలన సర్వపాపాలు నశిస్తాయని ధర్మరాజు విన్నాడు. భూరిదక్షిణ లిచ్చే మార్గం లేదని ధర్మజుడు చింతించాడు. వ్యాసుడు మరుత్తుడికథ చెప్పి, అతడు చేసిన స్వర్ణదానాల నిధిని గురించి చెప్పి, దక్షిణలకు కావలసిన ధనాన్ని అనాయాసంగా అందించాడు. ధర్మజు డంగీకరించాడు. చివరకు మొత్తం రాజ్యాన్నే వేదవ్యాసుడికి దక్షిణగా ఇచ్చి ధర్మరాజు తపోవనానికి వెళ్ళుతానని వ్యాసుడిని ప్రార్థించాడు. అశ్వమేధయాగ ప్రయోగమే

వనగమనానికి ఉపాయంగా మార్చుకొన్న ధర్మరాజు చాతుర్యం ప్రశంసనీయం. దానినుండి తప్పించి మరల ధర్మరాజును రాజ్యస్వీకారానికి అంగీకరింపజేయటం వ్యాసమహర్షికి ఒక ప్రత్యేక ప్రయత్నమే కావలసి వచ్చింది. 'ఇలకు వెలగా బంగారాన్ని ఇ'మ్మని వ్యాసుడు అడిగాడు. దానికి ధర్మరాజు ఇట్లా సమాధానం చెప్పాడు.

ఆ. 'అశ్వమేధమునకు నార్యులు దక్షిణ। ధరణి యండ్రు గాన నరునిచేత
విజితమైన ధరణి ప్రజనిత ప్రీతిమై। ఋత్విగర్చనముగ నిచ్చినాఁడ.'

చ. 'వనమున కేఁగి యందు సుఖవాసత నుండఁగలాఁడఁ గాక యే
ననఘవిచార! బ్రహ్మధన మక్కట! కొందునె?' యన్నఁ బ్రీతిమై
ననుజులు యాజ్ఞసేనియును 'నట్టిద యా పని; యొండు చెప్పకుం'
డనుటయు, హర్ష బాష్పపులకాంకురముల్ ధరియించి రందఱున్.' **(అశ్వ.4.190.192)**

అశ్వమేధం ధర్మజుడి ధర్మనియతితో అప్రతిమానంగా నిలిచింది. అమరుల ప్రశంసల నందుకొన్నది. చివరకు వేద వ్యాసుడు కూడా ధర్మజుడిని ప్రశంసించాడు. అంతటితో ఆగక భూమిని వెలపెట్టి కొనుమని బ్రాహ్మణుల కోర్కెగా కోరాడు. శ్రీకృష్ణుడు ఆ ప్రతిపాదనను సమర్థించాడు. ధర్మరాజు తన తమ్ములతో సంప్రతించి ఒప్పుకొన్నాడు. కోటి కోటుల మాడలు కుప్పపోసి 'ధరణికి వెల' అని చెప్పి వ్యాసుడి నుండి భూమిని కొన్నాడు. వ్యాసు డా మాడలను ఋత్విజులకు పంచిపెట్టాడు. ధర్మరాజు కృతార్థ డయ్యాడు.

తే. 'సకల బాంధవ భూపతి సంయుతముగ। నా నరేశ్వరుఁ డవభృథ స్నానపూత
గాత్రుఁడై చిత్తగత సర్వకల్మషములఁ। బాసి నిర్జిత స్వర్గత్వభాసి యయ్యె.' **(అశ్వ.4.204)**

శాంతిపర్వంలో ఆరంభమైన ధర్మజుడి అశాంతి అశ్వమేధపర్వంలో అవభృథస్నానంతో అంతమయింది. శాంతచిత్తుడైన ధర్మజుడు స్వర్గారోహణానికి అధికారి అయ్యాడని పై పద్యం ధ్వనింపజేస్తున్నది.

3.అంతర్యాగం: అంతర్యోగం:

అశ్వమేధపర్వంలో ధర్మరాజార్జున పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నది. భవిష్యత్కథలో ఆ పాత్రలు నిర్వహించబోయే కార్యాలకు భావికథార్థ సూచకాలుగా ఈ పర్వంలో గోచరిస్తాయి. వారికి యాగపరమైన శిక్షణ వేదవ్యాస మునీంద్రు డిస్తే యోగపరమైన సాధనను శ్రీకృష్ణుడు అందించాడు. యాగం కర్మయోగానికీ, యోగం జ్ఞానయోగానికీ, సంబంధించినవి. అందువలన ఈ పర్వంలో ఒక కర్మయోగి, మరొక జ్ఞానయోగి గురుస్థానాలలో నిలుస్తారు. వారే వ్యాసమహర్షి, శ్రీకృష్ణుడు. వారిరువురి ప్రబోధాలతో జీవితాలను మలచుకొన్నవారు ధర్మరాజు. అర్జునుడు. ఒకరు బహిర్యాగ ప్రక్రియను బోధిస్తే, మరొకరు అంతర్యాగ ప్రబోధాన్ని చేశారు. వ్యాసమహర్షి అశ్వమేధయాగ ప్రక్రియకు అనుగుణంగా మరుత్తుడి చరిత్రను వివరించాడు. కాని, ఆ కథ విని ధర్మరాజు 'బంధువిషయ శోకంబునం గ్రమ్మఱం దెలివినొందియు నొందక ధూమంబు పొదివిన యనలంబునుం బోలె' (అశ్వ.1.108) ఉండిపోయాడు. అతడి మానసిక స్థితిని గమనించి శ్రీకృష్ణుడు అధ్యాత్మిక విషయ ప్రబోధాన్ని ప్రారంభించాడు. అది అంతర్యాగ విధానం. 'ధర్మరాజా! దుఃఖం మృత్యువును, ధైర్యం బ్రహ్మత్వాన్నీ చేరుస్తాయి. నీవు కర్మానుష్ఠానాన్ని నిర్మలంగా నడపలేకపోతున్నావు. దానికి కారణం దుఃఖాన్ని నిర్మూలించగల బుద్ధిశక్తి నీకు అలవడకపోవటమే. అంతశ్శత్రువులను గుర్తించకపోవటం వలననే నీ కీ అవస్థ ఏర్పడింది. ఎన్ని బోధనలు చేసినా నీకు మనశ్శాంతి లభించటంలేదు. మానవులకు రెండు రకాలుగా వ్యాధులు వస్తాయి. మొదటిది శారీరకవ్యాధి. ఇది వాతపిత్తాదుల ప్రకోపంవలన కలుగుతుంది. దానివలన శరీర వికారాలు గోచరిస్తాయి. రెండవది మానసిక వ్యాధి. అది సత్త్వరజస్తమోగుణాల విషమస్థితులవలన కలుగుతుంది. ఇవి అన్యోన్య ప్రభావంతో ఏర్పడుతుంటాయి. అట్లాగే సూక్ష్మ కర్మానుష్ఠానం కూడా నీవు తెలిసికొనాలి. నీవు కౌరవులవలన పొందిన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బాధలు అవమానాలు, అరణ్యాజ్ఞాతవాసాలలో పొందిన కష్టనిష్ఠురాలు, భీష్మాదులతో చేసిన యుద్ధాలు, వాటివలన ఏర్పడిన లాభనష్టాలు - ఇవన్నీ సత్యాలు కావు; మిథ్యలు, నిజంగా మీరు చేసిన యుద్ధం ఏదంటే వినుము.

ఉ. ‘అమ్మెయి బంధుమిత్త్రుల సహాయతకల్మి ప్రయోజనంబు లే;
దమ్మహనీయ యుద్ధమున కాత్మయ తోడు, మనంబు శత్రుఁ; డీ
వెమ్మెయినైన శాంతి ఘటియింపుము; లోపగఁ దీర్పు; మెందు శాం
తమ్ము చుమీ మనోజయము; దాన వెలుంగుము శాంతబుద్ధివై.’

తే. ‘అంతరం బగు నిక్కయ్య మధిప! గెలువ । కిట్ల యేగతిఁ బోయెదో యెఱుఁగ; దీని
నీవ కనుఁగొని సద్బుద్ధి నిశ్చయ ప్ర । వీణుఁడవు గమ్ము; మాటలు వేయు నేల?’ (అశ్వ.1.119,120)

కురుక్షేత్ర యుద్ధం ఆత్మకూ మనస్సుకూ జరిగే అంతర్యుద్ధమని తెలిసి, బాహిరమైన యుద్ధం మిథ్యగా భావించటం అధ్యాత్మికం. అదే అంతర్యాగం. దానిని ధర్మరాజు అలవరచుకొనకపోతే మనశ్శాంతి ఏర్పడదని, అతడు శాంతుడు కాలేడని శ్రీకృష్ణుడు తెలియచెప్పాడు. ‘మమ’ (అహంకారం) అనే రెండక్షరాలు మృత్యువుకూ, ‘న మమ’ (అహంకారత్యాగం) అనే మూడక్షరాలు బ్రహ్మపదానికీ సంకేతా లని తెలియాలి. తత్త్వం - నాశనం లేనిది, శరీరం లేనిది. పుట్టిన ప్రాణులు గతిస్తాయి. ఈ తత్త్వం తెలిస్తే తాత్త్వికంగా హింస లేదు. విశాలమైన భూమిని పాలిస్తూ దానిమీద మమకారం లేకుండా ఉంటే పాపం పట్టి పీడించదు. అంతశ్శత్రువులలో కాముడు బలిష్ఠుడు. అతడిని జయించగలిగితే - అంటే కామాన్ని జయిస్తే - శాంతి లభిస్తుంది. ‘కామగీత’ లు ప్రసిద్ధం. మోక్షాన్ని కోరేవాడికి కూడా కామం ఉంటుంది. కాబట్టి కోరికలు మనస్సులో చొరబడనీకుండ, అ లోలుపత్వంతో, ఫలాభిసంధి లేకుండా అశ్వమేధయాగం చేయుము. చచ్చిన బంధువులు ఎట్లాగూ తిరిగిరారు. వారిని గురించి విచారం మాని క్రతువులు చేయుము’ - అని శ్రీకృష్ణుడు బోధించాడు. ఈ బోధలు వినిన ధర్మజుడు ఆ తత్త్వాన్ని మననం చేసికొన్నాడు. మునులందరికీ నమస్కరించాడు.

క. ‘మీ కారుణ్యంబున నా । శోకం బంతయును బాసె, సుమనస్కృత సు
శ్లోకాత్ములార! కలిగెన్ । నాకున్; విచ్చేయుఁ డింక; నను మఱవకుఁడీ! (అశ్వ.1.138)

అని శోకంలేని శాంతచిత్తాన్ని ధర్మరాజు ప్రకటించాడు. పారాశర్యుడు చేయించిన బహిర్యాగం పాప నివారణకు తోడ్పడితే, శ్రీకృష్ణుడు బోధించిన అంతర్యాగం ధర్మజుడి శోకాన్ని మాన్పి మనశ్శాంతిని కలిగించింది.

4.రెండు రాజ్యాలకు రాజధానులు:

అశ్వమేధపర్వంలో హస్తినాపురం, ఇంద్రప్రస్థం - అనే రెండు నగరాలకు ప్రస్తావన ఏర్పడింది. ఇది సభాపర్వ కథను స్మరింపజేసినా, దానికి దీనికి తారతమ్యం గమ్యమానం. ధర్మరాజు ప్రజారంజకంగా పరిపాలన సాగిస్తున్న కాలంలో కృష్ణార్జును లిద్దరూ ఇంద్రప్రస్థపురంలో కొంతకాలం నివసించి స్వేచ్ఛా విహారాలు నిర్వహించారు. ఆనాటి మయసభనుకూడా దర్శించారు. వారి విహారాలు విలాసయాత్రలుగా కాక విజ్ఞానయాత్రలుగా మారాయి. అర్జునుడు శ్రీకృష్ణుడిని ఇట్లా అడిగాడు.

‘అనికిఁ దొడంగు నప్పుడు మదాత్మ గలంగినఁ గొన్ని తత్త్వ బో
ధన మహనీయ వాక్యము లుదాత్తకృపం దగ నీవు సెప్పి; తే
మనమున వాని యర్థములు మాధవ! నిల్పఁగ జాలనైతి; న
వ్వినుత వచస్సుధారసము వీనులవిం దొకమాఱు నింపవే!’ (అశ్వ.1.155)

నరుడికి భగవద్గీత మరపున పడింది. అతడు దాని సారాన్ని అమృతరసంగా మరలా క్రోలాలని కోరుకొన్నాడు. ఆనాడు విషాదయోగ నివారణార్థం, యుద్ధక్రియా ప్రారంభార్థం ప్రబోధం. ఈనాడు వివేక ప్రకాశార్థం. ఆత్మజ్ఞాన ప్రబోధనార్థం పునః ప్రబోధం. శ్రోతయొక్క మానసిక స్థితిలో భేదం ఉన్నది. ఆనాడు అర్జునుడు బుద్ధియందు తత్త్వహీనుడు, శ్రద్ధారహితుడు. అందువలన అతడికి బోధపడలేదు. ధారణ నిల్వలేదు. అందుకే శ్రీకృష్ణుడు ఇట్లా ఎత్తిపొడిచాడు.

తే. 'బ్రహ్మపదవేదనమునకుఁ 'బరమ హేతు । భూతములు నాఁటి వాక్యముల్ బుద్ధిఁ దన్మ
హార్థములు నిల్ప వైతి; శక్యంబె యింక । నవ్వచనములు సెప్పంగ నలఘుశౌర్య!' **(అశ్వ.1.157)**

బ్రహ్మపదాన్ని తెలిపే పరమహేతువులైన భగవద్గీతా వాక్యాలను యథాతథంగా పునరుక్తం చేయటం సాధ్యపడదని శ్రీకృష్ణుడు తెలిపి, పద్ధతిని మార్చి ఆ పరమార్థాన్ని ప్రతిపాదించాడు. అప్పుడు పాటించింది ప్రత్యక్షబోధ, అది ప్రధానం ప్రవచన రూపంగా సాగింది. ఇప్పుడు ఇతిహాసరూపంగా మారింది. ధారణకు, మనవానికీ ఈ పద్ధతి మేలని శ్రీకృష్ణుడు భావించాడు. శ్రీకృష్ణుడు తనవద్దకు వచ్చిన ఒక విప్రోత్తముడిని తత్త్వజ్ఞానం బోధించుమని కోరాడట! అతడు కాశ్యపు డనే విప్రుడికి సన్న్యస్తుడైన ఒక సిద్ధుడు శిష్యవాత్సల్యంతో బోధించిన పరతత్త్వ ప్రతిపాదక వాక్యాలను వినిపించాడట! అందులోని ముఖ్యాంశా లివి.

1.బ్రహ్మవిద్యారహస్యం: శరీరమే ధర్మసాధనం. ధర్మం పరిజ్ఞానాన్ని కలిగిస్తుంది. కాబట్టి మానవుడు శరీరాన్ని అన్నివిధాలా కాపాడుకొనాలి. క్రమశిక్షణ పాటించాలి. వాతపిత్త శ్లేష్మాల విజృంభణాన్ని నియమించాలి. బ్రహ్మ - ప్రధానమనే తత్త్వాన్ని మొదట సృష్టించాడు. దానిని క్షరమంటారు. దానికి పరమైన తత్త్వాన్ని అక్షరం, అమృతం అని పిలుస్తారు. ఈ రెంటినుండి భూతాలన్నీ పుట్టాయి. జీవుడు మోహావరణాన్ని త్రోసిపుచ్చి మోక్షాన్ని పొందుతాడు. పాలకడవను పశువుల నడుమ పెట్టినవాడు దానిని ఎట్లా ఏమరకుండా ఉంటాడో, అట్లాగే మనస్సును ఏమరకుండా ఆత్మను అన్వేషించాలి. ఇంద్రియాలకు అనాదితత్త్వం అందదు. ఎల్లఎడలా శిరస్సులునూ, కన్నులునూ, పాదములునూ, హస్తములునూ కల ఆ ఉజ్జ్వలతత్త్వాన్ని యోగవంతుడు మాత్రమే చూడగలడు. "సర్వతః పాణిపాదం తత్ సర్వతోక్షి శిరోముఖమ్" । గీత.

2.బ్రాహ్మణగీత: (బ్రహ్మవిద్యా ప్రబోధం) జ్ఞాని అయిన ఒక బ్రాహ్మణుడిని అతడి భార్య అధ్యాత్మవిద్యను బోధించుమని అడుగగా ఆ బ్రాహ్మణుడు ఆమెకు బ్రహ్మవిద్యా ప్రబోధకాలైన అనేకాంశాలు బోధించాడు. వాటి సారాంశం ఇది. కర్మలు సమస్త సిద్ధులను కలిగిస్తాయి. బ్రహ్మాదులు అక్షరోపాస్తిని దీనివలన చేస్తారు. అక్షరం అమలిన బుద్ధికి మాత్రమే తప్ప శబ్దాదులకు అందదు. పంచవాయువులు, మనస్సు, బుద్ధి - ఈ ఏడూ వైశ్వానరుడికి జిహ్వలు, వైశ్వానరుడు అంటే ఆత్మ ('అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః'-గీత) ఘ్రాత, భోక్త మొదలైన ఏడుగురు ఋత్విజులు ఘ్రేయం, భక్ష్యం మొదలైన సప్తసమిధలను వైశ్వానరుడియందు హోమం చేస్తారు. ఇది సప్తహోతృ విధానం. దీనినే అంతర్యాగ మంటారు. అంటే జ్ఞానేంద్రియాలను అంతర్ముఖంగా మలచుకొనటమే.

అంతేకాక జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలను పదింటినీ వైశ్వానరుడిలో హోమం చేయటం దశహోతృవిధానం అంటారు. ఇదీ అంతర్యాగంలో భాగమే. జీవాత్ముడు అనే కర్త విషయమూర్తులనే హవిస్సులను అనుభవించకుడా, ఉదాసీనత్వం అనే స్రుక్కునం దుంచి ఆత్మ అనే అగ్నిలో వేలిస్తే, అది ప్రజ్వలితమై అవిద్య అనే ధూమాన్ని హరిస్తుంది. అదియే మోక్షప్రకారం. అంటే విషయానుభూతిని విడచుటయే మోక్షహేతువు. యోగి స్వభావం తామరాకుపై నీటిబిందువు వలె ఉంటుంది.

3.అధ్వర్యు యతి సంవాదం:- అధ్వర్యుడు యజ్ఞపశువును ప్రోక్షించి విశసనానికై సిద్ధం చేస్తుండగా ఒక యతి అది హింస కాదా? అని ప్రశ్నించాడు. యజ్ఞంలో పశువిశసనం పాపం కాదనీ, దానివలన పశువు పుణ్యలోకం చెందుతుం దనీ, యజమానునికి శ్రుతివిహితమైన పుణ్యం వస్తుందనీ అధ్వర్యుడు చెప్పాడు. కాని, హింసపాపమని యజ్ఞమే చెప్పుతుందనీ యజ్ఞాలలో కెల్ల తపోయజ్ఞమే ఉత్తమమని యతి నిశ్చయించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

4.అంబరీషగీతలు:- అంబరీషుడు బాహ్యశత్రువులను జయించి తృష్ణ మొదలైన అంతశ్శత్రువులను జయించలేక విచారపడ్డాడు. ఒకప్పుడు జనకమహారాజు సభకు యముడు విప్రరూపంలో వచ్చి ఒక ఆకృత్యం చేశాడు. జనకుడు అతడిని తన రాజ్యపు సరిహద్దులు దాటి వెళ్ళుమని ఆజ్ఞాపించాడు. ఆ బ్రాహ్మణుడు 'రాజా!' నీ రాజ్యపు ఎల్ల లేమిటో చెప్పితే వాటిని విడిచి పోతాను' అన్నాడు. వేదాంతి అయిన జనకమహారాజు ఆ ప్రశ్నలోని అధ్యాత్మికార్థాన్ని భావించి మూర్ఛపోయాడు. ఇది నాది అనే మమత్వబుద్ధి లేని జనకుడు తన తప్పు తెలిసికొన్నాడు. యముడు అతడిని ప్రశంసించాడు.

ఈ సంవాదాలన్నీ చెప్పి బ్రాహ్మణుడు తన భార్యతో నిర్గుణతత్త్వాన్ని తెలిసికొనటానికి అహంకార విసర్జన మొక్కటే మార్గమని బోధించాడని శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించాడు. అప్పుడు అర్జునుడు 'పరమవేద్యమైన బ్రహ్మమును గూర్చి తెలుపు'మని శ్రీకృష్ణుడిని అడిగాడు. ఆయన గురుశిష్యసంవాదాన్ని చెప్పాడు.

5.గురుశిష్య సంవాదం:- ఒకప్పుడు మునులు 'ఏది హితము? దానిని పొందే మంచిమార్గమేది?' అని ప్రశ్నించగా బ్రహ్మదేవు డిట్లా చెప్పాడు 'సత్త్వమువలననే భూతములు పుట్టుతాయి. అందులోనే వసిస్తాయి. అందులోనే లయిస్తాయి. శ్రుతి, తపస్సు అనేవి సత్త్వానికి మారుపేర్లు. మునులు యోగనిష్ఠతో కామక్రోధాలను జయించి సత్త్వాన్ని సేవిస్తారు. సత్త్వమే హితం. దానిని చేరటానికి ధర్మమే ఉత్తమ మార్గం.

తాబేలు తన అవయువాలను లోపలికి ముడుచుకొన్నట్లు విద్వాంసుడు తన ఇంద్రియాలను తనలోనికి మరల్చికొంటాడు. భూతపంచకం అనే సముద్రానికి కాముడు, క్రోధుడు అనేవారు ప్రభువులు. వారిని జయించి విద్వాంసుడు ఆ సముద్రాన్ని దాటగలుగుతాడు. ధర్మానికి అహింస, మనుష్యులకు కర్మము. వాక్కుకు సత్యం. బుద్ధికి వ్యవసాయం. జ్ఞానానికి సన్న్యాసం లక్షణాలు.

సముద్రంలో తరంగాలవలె అవ్యక్తంలో చరాచరభూతాలన్నీ పుట్టుతాయి. లయిస్తాయి. అవ్యక్తం అవ్యయుడైన పురుషుడిని ఆశ్రయిస్తుంది. దీనిని తెలిసికొని మహాయోగులు మోహబంధంనుండి విముక్తి పొందుతారు. దీనికి తగిన సాధనం తపస్సు. మమత్వంతో అహంకృతితో కూడిన తపస్సువలస సాధకుడు ప్రజాపతి సమీప పదాన్ని పొందుతాడు. మమతాహంకార విముక్తమైన తపస్సుచేత యోగి అవ్యయస్థానాన్ని పొందుతాడు. సత్త్వసహాయంతో రజస్తమోగుణాలను జయించి ఈశ్వరసాక్షాత్కారాన్ని పొంది సత్త్వాన్ని కూడా విడిచిపెట్టాలి.

క. 'జ్ఞాన పరినిష్ఠితాత్మకు । లైన విముక్తి పద నిర్ణయజ్ఞులచే స
మ్మానిత యగు గతి యిది క । ర్మానుగతి విరక్త జన సమంచితము సుఁడీ!'

క. 'కోరికలకుఁ జొరక యసం । గారూఢత గలిగి యెల్లయందును సమతం
గూరిన చిత్తంబులు గల । సారాత్మకు లీ పథమునఁ జనుటకు శక్తుల్.' **(అశ్వ.2.213,215)**

అని బ్రహ్మదేవుడు మునులకు చెప్పినట్లు గురువు శిష్యుడికి చెప్పాడని శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించాడు. చివరకు అర్జునుడు ఆ గురుశిష్యు లెవ రని శ్రీకృష్ణుడిని ప్రశ్నించాడు. శ్రీకృష్ణుడు అసలు రహస్యం బయటపెట్టాడు.

క. 'అనఘ! విను మే గురుఁడ; నా । మనంబు శిష్యుండు, విమలమానస! నీపైఁ
బనుపడు ప్రీతిం జెప్పితి । ననితర సులభాతిగుహ్య మగు నిప్పదమున్.'

క. 'విమలము నచలము నగు చి । త్తము నా దెస నేకభక్తితత్పరముగఁ జే
యము; నిత్యము నీ యధ్యా । త్మము ననుసంధింపు; పాసెదవు దురితములన్.'

క. 'సమరమునప్పుడు నీ కీ । యమృత పదప్రాప్తి హేతు వగు సమ్యగ్బో
ధము వివరించితి; నచలత । రమింపు మిం దెపుడు శమధురాధుర్యుఁడవై.' **(అశ్వ.2.222-224)**

ఇందులో గురువు ఆత్మ, శిష్యుడు హృదయం, సాధకుడు ఈ రహస్యాన్ని మననం చేసికొంటే - ఈ ప్రబోధం బహిరంగంగా శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పినా సాధకులకు ఇది అంతర్యోగంగానూ, అంతర్యాగంగానూ ఉపాసించతగిందని స్పష్టమౌతున్నది.

అధ్యాత్మికంగా దీనిని అనుసంధించు మని శ్రీకృష్ణుడు నిర్దేశించటంలో గల తాత్పర్యం కూడా ఇదే. భగవద్గీత ఎంత అధ్యాత్మికమైనా అర్జునుడికి యుద్ధోత్సాహాన్ని కలిగించి బహిః ప్రేరణగా నిలిచింది. అశ్వమేధ పర్వంలో బోధించిన ఈ భాగం గీతా తాత్పర్యమే. అందువలన దీనిని కొందరు 'అనుగీతాపర్వ'మని పిలుస్తారు. ఈ అనుగీత అర్జునుడిలో అధ్యాత్మికంగా అంతఃపరిణామాన్ని కలిగించటానికి ఉద్దేశించబడింది. ధర్మానికి అహింస లక్షణం. అర్జునుడు సవనాశ్వరక్షణలో యుద్ధభూమిలో అహింసనే చాటాడు. ఆచరణలో పాటించాడు. అంతేకాదు మౌసలపర్వంలో వసుదేవ, శ్రీకృష్ణ, బలరామాదులకేకాక, యాదవవీరుల కందరికీ స్వయంగా అపరక్రియలు జరిపించి, ద్వారక సముద్రంలో మునిగినప్పుడు ద్వారకావాసుల నందరినీ ఆ విపత్తునుండి రక్షించి, వారికి ఉచిత విధులు నిర్వహించి, సౌకర్యాలు కల్పించి శ్రీకృష్ణ సేవాతత్పరుడై భాసించిన అర్జునుడు ఈ అనుగీతను విని అంతః పరిణామానికి గురి అయినవాడే.

తే. 'కాలమూలంబు సర్వంబుఁ గాన దీని। కొండుతలఁపులు దక్కి మీ రుత్తమంపు
గతికిఁ జనుఁడు నిశ్చింత వికారతనులు। విడిచి యార్యజనంబులు వినుతి సేయ.' (మౌస.1,222)

అని వేదవ్యాసుడు మితబోధ చేసినపుడు శోకమోహాలు లేని హృదయంతో మహాప్రస్థానానికి మనసులో సిద్ధమైన స్థిరచిత్తుడు శ్రీకృష్ణుడి శిష్యుడైన అర్జునుడే. మహాప్రస్థానిక పర్వంలో ప్రస్థానానికి సంకల్పించింది ధర్మరాజు, దానికి దోహదం చేసింది కూడా అర్జునుడే.

క. 'కాలము నే మనవచ్చును?। కాలము కాలంబ పోలుఁ గా; కొంటికి నీ
లీలలు గలవే? లెస్సగ। నాలోకించి తిది హితము నభిమతము నగున్.' (మౌస.1,6.)

అన్నమాటే అన్నకు కొండంత అండగా నిలిచింది. భీమాదులకు వెలుగుబాటగా తోచింది. మహాప్రస్థాన యాత్రకు మార్గదర్శక మయింది. ఇంతటి అధ్యాత్మికసమున్నత మానసికసంస్కారం శ్రీకృష్ణ ప్రబోధంవలననే కలిగింది.

మరొక విశేషం: హస్తినాపురంలో ధర్మరాజు పాలిస్తూ ఉండగా కృష్ణార్జునులు ఇంద్రప్రస్థపురంలో విహరించటంలో భావికథార్థ ధ్వనికూడా ఉన్నది. పాండవుల తరువాత హస్తినాపురంలో పరీక్షిత్తు ప్రభువు. ఇంద్రప్రస్థపురంలో శ్రీకృష్ణుడి మనుమడు వజ్రుడు ప్రభువు. వారిద్దరి నడుమ కృష్ణార్జునులకు వలెనే స్నేహపూర్వక బంధుత్వాన్ని ధర్మజుడు నెలకొల్పాడు. వస్తుధ్వనిగా ఈ కావ్యార్థం పరమరమణీయం.

5.దయా, దాన, ధర్మవీరాలు:

అశ్వమేధపర్వంలో ధర్మరాజుయొక్క దయావీరానికి అర్జునుడి యుద్ధవీరం అండగా నిలిచి పోషించింది. సవనాశ్వాన్ని అనుసరిస్తూ అర్జునుడు ధర్మరాజు తనతో పలికిన పలుకులనే ఎదురుపడిన ప్రతిరాజుకూ తెలియజేస్తూ దయాభావాన్ని ప్రదర్శించాడు.

చ.. 'కవిసినవానితో మఱియుఁ గవ్వడి యిట్టు లనున్ దయా ధురా
ప్రవణుఁ డజాతశత్రుఁడు తురంగమరక్షకు నంపునప్డు భూ
పవితతి యెల్లనుం దెగియె భారతయుద్ధమునందు బాలురం
దివిరి వధింపఁ గాదు కృపఁ దిన్నఁదనం బెసఁగం జరింపుమా!'

చ. 'అవినయవృత్తి నశ్వమున కడ్డము వచ్చిర యేని నీవు బాం
ధవము దలిర్పఁ బల్కి యనిఁ దప్పఁగఁ బ్రోవుము గిన్క మాను.' (మౌస.4,6.7)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అన్న ధర్మరాజు మాటలు అతడి దయామయ భావస్పందనలు. అహింసాప్రధానమైన ధర్మయజ్ఞం నాయకుడి హృదయశాలలో ప్రారంభమై ఉండటంవలన ఆ పుణ్యవాసనలు విరివిగా వ్యాపించాయి. వాటిని గంధవహుడివలె ఇంద్రతనూజుడు దిగంతాలకు ప్రసరింపజేశాడు.

సవనాశ్వాన్ని అడ్డగించి, పరాక్రమవంతులై త్రిగర్త సేనాధినాథులు తనను ఎదిరించినప్పటికీ, ధర్మరాజ ప్రబోధంతో దయను పూనిన అర్జునుడు సమయోచితంగా యుద్ధవీరాన్ని ప్రకటించలేక గాండీవాన్ని జారవిడుచుకొన్నాడు. అప్పుడు వీరులు కొందరు-

తే. 'ఇంద్రధనువు చందంబున నెసక మెసఁగు । గాండివముపాటు గంటిరే! చండవిక్ర
మాభిరాముండు గాండీవి యన్న పలుకు । లకు మహోగ్రత సూపనొల్లండు గాక!' **(మౌస.4.14)**

అని అర్జునుడి పరాక్రమాన్ని పరిహాసం చేశారు. పంతానికి శత్రువీరులు యుద్ధానికి దిగి ఔద్ధత్యం ప్రకటించగా మానధనుడైన వీరుడికి క్రోధం రావటం సహజంకాని, అర్జునుడికి క్రోధం రాలేదు. ధర్మజ ప్రేరితమైన దయాభావంతో అతడిలోని క్రోధం స్తంభించిందని భావం. ఆ తరువాత నిజంగా అర్జునుడికి కోపం వచ్చింది. దానికి కారణం గాండీవ పతనాలవలన అవమానం. అవినయపరులైన శత్రువుల ఉద్ధతి. ఇక్కడ ఉన్న విభావానుభావ వర్ణన ఎంత రసోదంచితమో చూడండి.

క. 'ఆట మున్న గాండివం బు । త్కటరయమున నెత్తి కోపదహనం' లత్యు
ద్భటమూర్తిఁ దాల్చె నన మి । క్కుటమై కడకంటి పెంపు గొమరారంగన్.'

వ. 'ఆ బీభత్సుండు.'

క. 'పిడుగులు వడిఁ బెక్కొక్కటఁ । బడియెడు ననఁ దొరఁగఁ జేసెఁ బటు విశిఖము ల
ప్పుడు మేదిని దోఁపద చె । ప్పెడు కొలఁదియె రథికవరుల పీనుఁగు పెంటల్. **(అశ్వ..4.16-18)**

గాండీవాన్ని వెంటనే ఎత్తటం, కోపదహనుడు కావటం, కడకంటి కెంపు రేగటం కోపభావతీవ్రతకు అనుభావాలు. 'బీభత్సుడు' అనే శబ్దం అర్థశక్తితో అర్జునుడు వైరిబలాన్ని చేయటానికి ఉత్సాహం ప్రకటిస్తున్నాడనే భావం కలిగిస్తుంది. క్రుద్ధుడైన విజయుడి గాండీవ వినిర్ముక్త బాణసంపుటి పిడుగులవానగా స్ఫురించాయనటంలో అలంకార ధ్వని ఉన్నది. ఆ పిడుగుల జడివానకు రథిక వరులు పీనుగుపెంటలై పోయారు. ఇందులో మహారథికులను మట్టుపెట్టి సామాన్య వీరులను వదలిపెట్టాడన్న ధ్వని కూడా ఉన్నది. ఇదంతా అర్జునుడికి సహజంగా కలిగిన కోపం కాదు. పాలపొంగువంటిది. 'అన్నమాట'ను నిరాదరించారని శత్రువులమీద ఉప్పొంగిన ఉప్పెనవంటి కోపమే, యుద్ధంలో పోయినవారు పోగా మిగిలినవారు, వారి బంధువులు శరణు వేడగా అతడి కోపం అప్రయత్నంగా చల్లారింది.

శా. 'ఆ యుగ్రోద్ధతి సూచి పెల్కుఱి త్రిగర్తానీకముల్ నల్గడం
బాయంబాఱెఁ దదాప్తు ' లేము దగ నీ పంపోపి సద్భక్తిమైఁ
జేయంగాఁ బనిగొమ్ము పేర్మిగ మముం జేకొమ్ము సమ్యగ్దయా
శ్రీయుక్తా!' యనినన్ ధనంజయుఁడు గాచెన్ వారి నెల్లం గృపన్

వ. 'అట్లు వెనుకొనక నిలిచి యెలుంగెత్తి వారలతో 'మీ రిట్లు ప్రాణంబులు గాచికొనుండు నా పంచిన పని
సేయంబూని బుద్ధికలిగి సుఖులరై యుండుఁ' డని యయ్యశ్వంబు ననుసరించె.' **(అశ్వ..4.19-20)**

పై మాటలలో శరణుకోరినవారిని కాపాడవలెనన్న ధర్మంతోపాటు, శత్రువీరులకు తగిన బుద్ధి చెప్పి, తరువాత వారిని దయతో కాపాడాలనే భావం కూడా కనిపిస్తుంది. లేకపోతే వీరులను గొంతెత్తి పిలువవలసిన అవసరం లేదు. 'కృపన్' వారిని 'కాచెన్'అనటానికి అదే కారణం. ఆ అర్థం -

క. 'చంపకుమీ రాజుల నను । కంపాతిశయంబు మెఱయఁగా నడపుము నీ
పెం పను కుసుమమునకు । నా పంపొనరించుటయ సౌరభముగ నెఱుఁగుమీ!' (అశ్వ..4.34)

అన్న ధర్మరాజు ప్రబోధంలో ధ్వనించింది. ఇటువంటి మనఃప్రవృత్తియే అశ్వమేధపర్వమంతా వెన్నెలవలె విరిసి దయావీరాన్ని ప్రకాశింపజేసింది.

శ్రీకృష్ణ ప్రబోధానంతరం ధర్మరాజు సత్త్వగుణ పరిపూర్ణుడు కావటంచేత ఆయనలో యుద్ధవీరంకంటె దయాదాన ధర్మవీరాలు ముప్పేటగా అశ్వమేధపర్వం నుండి ముప్పిరిగొన్నాయి. అశ్వమేధంలో రాజులపట్ల చూపిన దయావీరం, యజ్ఞంలో దానాలలో చివరకు సర్వరాజ్యాన్ని వ్యాసుడికి సమర్పించటంలో దానవీరం, ఆ తరువాతి పర్వాలలో ఇంద్రప్రస్థాన్ని యాదవరాజ్యంగా సమర్పించటంలోనూ దానవీరం, చివరకు కుక్క కొరకు స్వర్గభోగాన్ని కూడా త్యాగం చేయటానికి సిద్ధంకావటంలో ధర్మవీరం ధర్మరాజులో రసోల్లాస స్థాయిని పొందాయి. ఆ విధంగా భారతంలోని చివరి అయిదు పర్వాలూ ధర్మజుడి ధర్మవీరానికి పంచప్రాణాలుగా పరిఢవిల్లా యనటంలో విప్రతిపత్తి లేదు.

6. అశ్వమేధంలో అద్భుతం:

అశ్వమేధపర్వంలో సహజమైన అద్భుత ఘట్టాలు ఉన్నాయి. శ్రీకృష్ణుడి ద్వారకాయానంలో ఉదంకాశ్రమోదంతం ఒక అద్భుతం. అందులో శ్రీకృష్ణుడి విశ్వరూప ప్రదర్శనం ఒక అపూర్వ ఘట్టం. ఉదంకుడికి జలప్రదానం మరొక అబ్బురపాటు కలిగించే ఉదంతం. పరీక్షిత్తుకు శ్రీకృష్ణుడు చేసిన ప్రాణదానం మరొక దివ్యాద్భుతం. అశ్వమేధయాగ నిర్వహణం దేవతలనే మెప్పించిన అద్భుతకార్యం. ఇన్ని అద్భుతాలు వినిన జనమేజయుడు

ఆ. 'అనఘ! మత్పితామహుని యశ్వమేధయా । గంబు సమయమునఁ గరంబు విస్మ
యంబుఁ జేయఁజాలునట్టిది యేమేనిఁ । గలిగెనేని వినఁగ జెపుమ!' (అశ్వ..4.213)

అని వైశంపాయనుడిని అడగటం ఒక అద్భుతం. అతడు వినిపించిన సక్తుప్రస్థ చరిత్రం సహజంగా అద్భుతం. అది ఆ పర్వాంతంలో నిబంధించటం కథాశిల్పపరంగా పాఠకులకు మరొక అద్భుతం. ఈ చివరి అంశం కొంత వివరించతగింది.

అధ్వర్యు యతి సంవాదంలో వేదవిహితంగా పశువిశసనం చేసిన యజ్ఞం హింసాయజ్ఞం కాదని అధ్వర్యుడు భావించగా, అహింసాయజ్ఞమైన తపోయజ్ఞం హింసాయజ్ఞంకంటె గొప్పదని యతి వాదిస్తాడు. కర్మఠులకూ, జ్ఞానులకూ మధ్య ఈ వాదం ఎపుడూ సాగుతూనే ఉన్నది. అయితే క్షత్రియులకు పశువిశసనరూప యజ్ఞమే ఉపాదేయమన్నట్లు వేదవ్యాసాదులు నిశ్చయించారు. బ్రాహ్మణులకు, జనకాది జ్ఞానులకు అహింసాయాగమే న్యాయమని మునులు భావించి ఉన్నారు. ఈ రెండు మార్గాలూ సమాజంలో సమ్మానించబడుతూ ఉండగా, వాటిలో ఎక్కువ తక్కువలు నిర్ణయించే ఒక పరిస్థితి ఏర్పడటం అశ్వమేధపర్వంలోనే ఒక విచిత్ర ప్రశ్న. ఆకలికై ఏర్పరచుకొన్న పేలపిండిని మొత్తాన్ని అతిథి సత్కారంలో వినియోగించి సక్తుప్రస్థుడు సకుటుంబంగా ప్రాణాలు కోల్పోవటానికి కూడా సిద్ధం కావటం ఆ కథలోని గొప్పతనం. ఆ బ్రాహ్మణుడు అతిథి కిచ్చిన అర్ఘ్యపాద్యాదుల తడిలో పొరలి, పేలపిండి వాసన చూచిన ముంగిస శరీరంలో సగభాగం బంగారంగా మారటం మరొక విశేషం. ఆ ముంగిస ధర్మరాజు చేసిన అశ్వమేధ యాగాన్ని దర్శించి ప్రయత్నించినా మిగిలిన మేను బంగారు కాకపోవటంతో సక్తుప్రస్థుడి దర్మం కంటె ధర్మరాజు యజ్ఞం గొప్పది కాదని బ్రాహ్మణుల ఎదుట చెప్పి మాయ మైపోవడం, ఆశ్చర్యం. ఆ తీర్పు వెనుక యముడు సక్తుప్రస్థుడి ధర్మప్రవృత్తిని ప్రశంసించిన వాక్యం బలమైన ప్రమాణం.

చ. 'వినుము! ప్రభూతదానములు విశ్రుతయజ్ఞములున్ సధర్మతా
వినుతికి నెక్కఁజాలవు వివేకనిధీ! పరిశుద్ధ శోభితా
ర్జనమునఁ దెచ్చికొన్నది వరంబగుఁ బాత్రము నర్హకాలముం
గని లఘువస్తువేని నొసఁగం గను టుజ్జ్వలధర్మ మారయన్.' (అశ్వ.4.246)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఈ ప్రశంసతో యముడు సక్తుప్రస్థుడిని సకుటుంబంగా బొందితో బ్రహ్మలోకానికి పంపాడు. మరి ధర్మరాజు అశ్వమేధంలో చేసిన బహుళ దానాలవలన పొందింది బొందితో స్వర్గమే, ఆ విధంగా చూచినా సక్తుప్రస్థుడి నింద నిజమే ఔతున్నది.

అయితే ఒక విశేషం, ఆ నింద చేసిన నకులం పితృదేవతలచేత శప్తుడైన జమదగ్ని మహర్షి. అతడి పితృదేవతలు అతడికి శాపమోక్షాన్ని కలిగిస్తూ -

వ. 'విదగ్ధ విప్ర సమూహం బొడంబడునట్టి యుచిత వాక్యంబుల నీ వెన్నఁ డేని మహాధర్మంబు కీడని యాడితి నాఁడు నీకు శాపమోక్షం బగు' నని నిర్దేశించి; రన్నకులంబును సక్తుప్రస్థుని కతంబునం దగిన మాటల నా తెఱంగున సదస్యులతో ధర్మనందను నశ్వమేధంబు నధిక్షేపించి విగత శాపత్వానందంబు నొంది యంతర్హితం బయ్యెను.'

ముంగిస చేసింది అధిక్షేపం. మహాధర్మాన్ని కీడని పలకటం అధిక్షేపం. దానివలన జమదగ్నికి పితృదేవతల శాపం తొలగింది. అతడికి ఆనందం కలిగింది. అనగా చివరకు తేలింది ఏమిటి? ధర్మరాజు అశ్వమేధంవలన జమదగ్నికి శాపవిమోచనం జరిగి ఒక అద్భుతం బయటపడింది. ఈ ఉదంతం ధర్మజుడి అశ్వమేధానికి ఎటువంటి కొంచెపాటును కలిగించలేదని తెలియటం ఇందులో చెప్పిన అద్భుతం. అదే కథాకథన శిల్పం.

అశ్వమేధ పర్వ ప్రాశస్త్యాన్ని గురించి భూపతి లక్ష్మీనారాయణరావుగారు చేసిన ఈ ప్రశంస పేర్కొనతగింది. "జ్ఞానోపదేశమునం జేసి స్వధర్మోన్ముఖుడైన ధర్మరాజు రాజ్యభారము వహించి, వ్యాసబోధితుఁడై లోకహితార్థమశ్వమేధమును వేదోక్త విధమున నిర్వహించి దేశమునందలి రాజులనెల్లర నేకైక ధర్మశాసనబద్ధులం గావించినాడు. ఇంతియేకాక నిరాసక్తుడై వేదోక్తములగు కర్మల నాచరించుటవలనను, స్వధర్మమును శ్రద్ధతో నిర్వహించుటవలనను గృహస్థుడు భవబంధ విమోచనము బడయగల డను విషయము ధర్మరాజు నశ్వమేధ వృత్తాంతమూలమున వ్యక్తీకరింపబడినది." (భారతము; తిక్కన-పుట 158-159).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆశ్రమవాసపర్వం

1. గాంధారీధృతరాష్ట్రుల హస్తినాపురవాసం:

అశ్వమేధయాగంలో పాండవులు హస్తినాపుర ప్రభుత్వంలో స్థిరపడ్డాడు. పదిహేనేళ్ళు ప్రశాంతంగా గడచిపోయాయి. ఆ ప్రశాంతతకు కారణం ధర్మజుడి ధర్మవర్తనం. ఇదివరలో చరిత్ర సృష్టించింది రాజ్యప్రజలు కాదు రాజమందిర ప్రముఖులే. మహాభారత యుద్ధం ప్రవర్తిల్లటానికి దుర్యోధన ధృతరాష్ట్ర వర్తనమే మూలకారణం కాని, భీష్మాది రాజబంధువులు, ద్రోణాచార్యాదులు, మంత్రులు, ప్రజలు అసలే కారు. ఒకవిధంగా అందరూ శాంతినే కోరారు. దుర్యోధనాది దుష్టచతుష్టయం, ధృతరాష్ట్రుడి ద్వంద్వనీతిని ఆదరువుగా చేసికొని అశాంతిని సృష్టించింది, ధృతరాష్ట్ర సంతతిని రణభూమికి అంకితం చేసింది. ఆ దోషాన్ని ధృతరాష్ట్రుడు క్రమంగా గుర్తించాడు. వ్యాసాది మహామునులు, వాసుదేవాదులు ఆయా సందర్భాలలో చెప్పిన నీతులను, హితవాక్యాలను మౌనంగా మననం చేసికొన్నాడు. గాంధారిని శాంతింపజేశాడు. వారిరువురూ కలిసి యథాపూర్వం రాజభవనంలో నివసిస్తూ ఉన్నారు. వారి పుత్రశోకం దావానలం వంటిది. వారు సజీవంగా దానిలో ప్రతిరోజూ దహించుకొని పోతూనే ఉన్నారు. వారి తాపాన్ని తీర్చటం ధర్మరాజు ప్రథమ కర్తవ్యంగా మారింది.

ధృతరాష్ట్రుడు హస్తినాపురంలో ఒక ఆశ్చర్యార్థకం! ధర్మరాజు ప్రభువు కాకపోయినట్లయితే అత డొక ప్రశ్నార్థకమై ఉండేవాడు. దుర్యోధనుడి కాలంలోనే అతడు సమాధానంలేని ప్రశ్నగా మారిపోయాడు. ధర్మరాజు ఆ రాజును సమాధానపరిచాడు. అది అతడి ధర్మనీతి చాతుర్యం. ధృతరాష్ట్రుడు పాండురాజు కాలంలోనూ పెద్దరికాన్ని అనుభవించాడు. రాజ్యం పాండురాజుదైనా ప్రభువుగా ధృతరాష్ట్రుడిని మన్నించి పాండురాజు కాలం గడిపాడు. పాండురాజు తరువాత ధృతరాష్ట్రుడే మహారాజుగా మిగిలాడు. అతడి ప్రభుత్వాన్ని ఎవ్వరూకాదనలేదు. అతడు ఆ మర్యాదను పాటిస్తూ పాండవులకు భాగం కల్పించాడు. కౌరవులు మాయాద్యూతంలో దానిని వశంచేసికొని, పునర్ద్యూతంలో పాండవులను ఓడించగా అరణ్యాజ్ఞాతవాసాలకు నిర్లిప్తతను ప్రకటించాడు. శ్రీకృష్ణుడు రాయబారిగా వచ్చి శాంతి సందేశాన్ని వినిపించిన మహాసభలో కూడా ఆ గ్రుడ్డిరాజు నిర్లిప్తంగా నిలిచిపోయాడు. తాను సర్దిచెప్పలేని కుటుంబసమస్యను శ్రీకృష్ణుడు సరిదిద్దలేదని వాపోయాడు. గాంధారి భర్తతో గొంతు కలిపింది. అశ్వమేధయాగం తరువాత అదంతా ఒక పీడకలగా మిగిలింది. గాంధారీ ధృతరాష్ట్రుల అంత్యక్రియలు చేయటానికి దుర్యోధనాదులైన నూరుగురు కొడుకులూ లేరు. వారిమీద సానుభూతి చేసే జ్ఞాతులెవ్వరూ కానరారు. ఏ విధంగా చూచినా గాంధారీ ధృతరాష్ట్రులు అన్ని విధాలా ఏకాకులయ్యారు. అది ఆ మహారాజు జీవితచరిత్రలో శోచనీయమైన అధ్యాయం.

ఆ తరుణంలో ఆ వృద్ధ దంపతులకు అన్నీ తానై అందరూ ఉన్న అనుభూతినీ, అనురాగాన్నీ పంచింది ధర్మరాజు. ప్రతి ఉదయం తానే స్వయంగా వెళ్ళి వారిని దర్శించి పలకరించేవాడు. వారు అడుగకుండానే అన్నీ సమకూర్చేవాడు. తమ్ములందరూ, అంతఃపుర స్త్రీలందరూ నిత్యం వారికి సేవలందించేటట్లు శ్రద్ధ వహించేవాడు. సామంతులూ, అతిథులూ ముందుగా గాంధారీ ధృతరాష్ట్రులను దర్శించి తన వద్దకు వస్తే సంతోషించేవాడు. ధర్మరాజు ప్రదర్శించే భక్తి శ్రద్ధలకు గాంధారీ ధృతరాష్ట్రాదులు కొడుకులు లేని లోపం మనసుకు తోచకుండా సుఖంగా హస్తినాపురిలో నివసించారు. ఊరక కలిసి ఉండటమేకాదు వారి వియోగంవలన రాజకుటుంబమంతా దిగులుపడేటట్లు చేసికొన్నారు. పుత్ర వియోగానంతరం ధర్మరాజుతో కలిసి పదిహేనేళ్ళు నివసించగలిగారంటే అది గాంధారీ ధృతరాష్ట్రుల గొప్పతనం అనటంకంటె ధర్మజుడి కుటుంబనీతిమాహాత్మ్యమని చెప్పటమే సమంజసం. ఆ తాత్పర్యం ఆశ్రమవాస పర్వంలోని ధర్మజుడి ప్రవర్తనలో ముమ్మూర్తులా ప్రతిఫలిస్తుంది.

పాండవులందరిలో గాంధారీ ధృతరాష్ట్రులను ఏకాంతంగా ఉపాలంభించేది భీము డొక్కడే. దానికి కారణం దుర్యోధన ధృతరాష్ట్రులే. చిన్నప్పటినుండి దుర్యోధనుడు భీముడిని చంపాలని యత్నించాడు. భీముడు కౌరవులను వధించటానికి పగపూనాడు. ఆ పగసాధింపులో భీముడు నెగ్గాడు. దానిని సహించలేని ధృతరాష్ట్రుడు కౌగిలింతలో భీముడిని నలిపి చంపాలని యత్నించి, శ్రీకృష్ణుడి పన్నాగంతో

బైటపడి అవమానాల పాలయ్యాడు. అందువలన భీముడు రహస్యంగా ఆ గుడ్డిరాజు గుండెలో ములుకులుగా గుచ్చుకొనే మాటలు గాంధారి వింటూ ఉండగా మాటాడి మనసులోని కచ్చెను తీర్చుకొనేవాడు.

సీ. 'అంధుని కొడుకులయం దొకరునిఁ దప్పి । పో నీక త్రుంచితి; భూరి శక్తి
దర్పితంబైన మద్బాహు పంజరము సొ । చ్చిన రిపురాజన్య సింహములకు
వెడలంగ వచ్చునే? వెంగలులై వారు । కయ్యంబు సేసిరి గాక! నన్ను
నెఱిఁగినఁ దొడరుదు రెట్టులు?; దుర్యోధ । నాదుల ననిఁ దెగటార్చినట్టి

తే. నాదు దోర్దండములఁ జందనం బలంది । కుసుమదామముల్ సుట్టి మ్రొక్కుదు మహోప
కారు; లరయంగ దైవముల్ గావె?' యనుఁ ద । దీయ మర్మంబు లెల్ల భేదిల్ల నధిప!' **(ఆశ్వ.1.19)**

ధర్మరాజు కీ సంగతి తెలియదు. గాంధారీధృతరాష్ట్రులు ఆ మాటలకు లోలోన బాధపడేవారే కాని, ఎవ్వరికీ బయటికి చెప్పుకొనలేకపోయేవారు. అయినా, అన్నేళ్ళు గాంధారి ఓర్పు వహించిందంటే, ధృతరాష్ట్రుడు ఎంత నేర్పుగా ఆమెను శాంతంగా ఉంచాడో మనం ఊహించగలగాలి. పదిహేనేళ్ళు గడిచినా పరిస్థితులు మారలేదు. ధృతరాష్ట్రుడు ఆలోచనలో పడ్డాడు. పూర్వం పెద్దలూ, గాంధారీ చెప్పిన నీతులు వినకపోవటంవలననే భీముడు రహస్యోపాలంభనాలకు పాలుకావలసి వస్తున్నదని గ్రహించాడు. కర్తవ్యాన్ని ఆలోచించాడు. గాంధారీ ధృతరాష్ట్రులకు దహనసంస్కారాదులు చేయదగిన కొడుకులు లేని హస్తినాపురిలో నివసించటం గౌరవం కాదు. గృహస్థాశ్రమంలో తనివితీరిన తరువాత సన్న్యాసం కాని, వానప్రస్థంగాని ఆశ్రమధర్మంగా స్వీకరించటం గృహస్థుడి ధర్మం. ధర్మబద్ధంగా జీవించి తనువు చాలించటం వంశమర్యాద. అందువలన బంధువులను పిలిపించి, ధర్మజుడితో తన వనవాస గమనవాంఛను బయటపెట్టాడు. రాజాజ్ఞను తీసికొనటం ధర్మం కాబట్టి ధర్మజుడి అనుమతి కోరాడు. గాంధారితో కలిసి నారచీరలు ధరించి తపోవనంలో మునులతో కలిసి తపస్సు చేస్తూ, కందమూలాలను తింటూ తనువు చాలించాలనే కోర్కెను వెలువరించాడు. ధర్మజు డా మాటలు విని తల్లడిల్లిపోయాడు. ధృతరాష్ట్రుడు లేని హస్తినాపురంలో తాను ఉండలే నన్నాడు. తనకు రాజ్యం వద్దని 'వైరాగ్యం' ప్రకటించాడు. ఇట్లా వేడుకొన్నాడు-

ఉ. 'తల్లియుఁ దండ్రియున్ గురుఁడు దైవము నా కరయంగ నీవ; భూ
వల్లభ! నీవు కానననివాసము గోరి చనంగ నెట్టు లే
నుల్లము వట్టి హస్తిపురి నుండఁగ నేర్తు? యుయుత్సుఁ బెంపు శో
భిల్లఁగ రాజుఁ జేయు; నినుఁ బ్రీతి యెలర్పఁగఁ గొల్చి వచ్చెదన్.' **(ఆశ్వ.1.32)**

అని వాపోయాడు. రాజ్యంకంటె ధృతరాష్ట్రుడి సేవయే తనకు ప్రీతిని కలిగిస్తుందని విన్నవించుకొన్నాడు. నిజానికి ధృతరాష్ట్రుడే రాజనీ, దుర్యోధనాదుల దుష్కృత్యాలను మనసులో తలచటం లేదనీ, తనకు గాంధారీ కుంతీ ఒకటే అనీ, తనమాట నమ్ముమనీ కాళ్ళవేళ్ళపడి వేడుకొన్నాడు. ధృతరాష్ట్రుడి మనసులోని అనుమానాలను పసికట్టి వాటిని కాదని పేర్కొన్నాడు. ధృతరాష్ట్రుడు విషణ్ణుడయ్యాడు. ధర్మజుడి చిత్తశుద్ధికి కరిగిపోయి మూర్ఛపోయాడు. ధర్మరాజే స్వయంగా ఆ రాజును శైత్యోపచారాలతో తేర్చాడు. ధృతరాష్ట్రుడు ధర్మరాజు సేవలను మెచ్చుకొన్నాడు. కాని, తపోవనానికి అనుమతిస్తేకాని అన్నం తిననని భీష్మించుకొని కూర్చున్నాడు.

ఆ పరిస్థితి గమనించి వ్యాసుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. ధృతరాష్ట్రుడు వనవాసగమనం ఆశ్రమవాస వ్రత సమ్మతమని పలికాడు. "రాజులకు రణమరణమొండె, దృఢ సమాధిఁ దనువు విడుచు టొండె గాక, వృద్ధులై రోగతల్పమునఁ జావు మేలె?' (1.48) అని ధర్మరాజుకు ధర్మసూత్రం చూపించాడు. ధర్మకర్మ నిష్ఠుడైన ధర్మరాజు వ్యాసోక్తికి మారు పలుకక అంగీకరించాడు. ఆశ్రమవాసపర్వంలో ధృతరాష్ట్రుడు వ్యాసుడి వాక్యం ప్రకారం హస్తినాపురిలో కాబోయే రోగ శయ్యపై మరణాన్ని త్యజించాడు. తపోవనంలో దావాగ్నిమధ్య దృఢసమాధిగతుడై తనువు త్యజించాడు. అట్టి ధర్మకర్మకు వనగమనం ఉపకరించింది. ధృతరాష్ట్రుడు ఆశ్రమధర్మాన్ని ఆచరించిన ఆదర్శప్రభువుల కోవలో నిలిచే అర్హతను ఆశ్రమవాసపర్వం కల్పించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఒక మహారాజు తపోవనంలో ఆశ్రమవాస వ్రతం స్వీకరించేటప్పుడు నిర్వహించవలసిన వేదవిహిత కర్మల నన్నింటినీ శాస్త్రోక్తంగా పాటించిన ధర్మశీలం ధృతరాష్ట్రుడి చివరి అధ్యాయంలో గోచరిస్తుంది. మొదట ప్రభువుయొక్క అనుమతి, ఆ తరువాత ప్రజల అనుమతి తీసికొన్నాడు. మృతులైన జ్ఞాతులకూ, కొడుకులకూ యథావిధిగా విశేష శ్రాద్ధకర్మలు నిర్వహించారు. (ఆపై ఇక శ్రాద్ధకర్మలు చేయటం మానివేశాడని భావం). వనప్రస్థానానికి ముందు ధర్మరాజుకు రాజనీతి విశేషాలు బోధించాడు. భీష్ముడు, వ్యాసుడు, శ్రీకృష్ణుడు వంటి దిగ్దంతులు బోధించినా ఆశ్రమధర్మంగా ధృతరాష్ట్రుడు తన కర్తవ్యాన్ని నిర్వహించాడు. ధర్మరాజు సవినయంగా ఆ బోధనను స్వీకరించాడు.

క. 'నిత్యనిధి సద్వివేకము । సత్యవ్రతశీల! ధర్మసారజ్ఞ భవ
నృత్యాకలితమ యైనను । నిత్యంబును వృద్ధసేవ నిష్ఠఁ జలుపుమీ!' (ఆశ్ర.1.79)

అని నిరంతర సత్సంగాన్ని ప్రబోధించాడు ధృతరాష్ట్రుడు. ధర్మరాజు భీష్ముడు లేని లోపాన్ని, శ్రీకృష్ణుడు దగ్గరలేని అవకాశాన్ని ధృతరాష్ట్రుడు తీర్చాడని కృతజ్ఞతలు తెలిపాడు.

ధృతరాష్ట్రుడికి వారసులైన పాండవుల ఘనతను ప్రజలు వేనోళ్ళ పొగిడారు.

తే. 'స్వర్గమైనను బాలింపఁ జాలువారు । వీరలకు భూమిపాలన విధి యనంగ
నెంతపని? వీరిచేతికి నిచ్చి తిపుడు । మమ్ము నెల్ల విధంబుల మనిచి తధిప!' (ఆశ్ర.1.102)

అనే ప్రశంస పాండవపాలనపై ప్రజ లిచ్చిన బంగారపు తీర్పు! ధృతరాష్ట్రుడి వనవాసగమనానికి అందిన అక్షరాశీస్సులు!'

2. గాంధారీధృతరాష్ట్రుల ఆశ్రమవాసం:

గాంధారీ ధృతరాష్ట్రులు వనగమనం చేసేదృశ్యం కరుణరసభరితం. వల్కలాలు కట్టి ఆ వృద్ధరాజదంపతులు గృహాన్ని పూజించి, తమ వస్తువులనన్నింటిని పరిత్యజించి, యాజకులు అగ్నులు పట్టుకొని ముందు నడుస్తూ ఉండగా అంతఃపురం వదలి వెలుపలికి వచ్చారు. ధర్మజుడు అర్ద్రుడై ఆర్తితో 'హా! మహారాజముఖ్యా! ఎక్కడికి నీ పయనం?' అని బిగ్గరగా ఏడ్చి చదికిలపడ్డాడు. భీమాదులు అతడిని అనునయించారు. ధర్మరాజు ఎంతటి ధీరోదాత్తుడో అంతటి బంధుప్రేమ కలవాడు. సాత్త్విక స్వభావుడు. పెదతండ్రి వెంట తానూ వనానికి పోతానని ముందుకు వచ్చాడు. విదురుడు సంజయుడు ధృతరాష్ట్రుడి వెంట నడిచారు. కృపాచార్యుడు కూడా వనగమనానికి సిద్ధం కాగా ధృతరాష్ట్రుడు అతడిని వారించి, ధర్మరాజును అనునయించి ఇద్దరినీ ఆపాడు.

అప్పుడు కుంతీదేవి గాంధారీ ధృతరాష్ట్రులవెంట వనవాసానికి పోవసిద్ధమయింది. ధర్మజాదులు ఆమెను పెక్కు రకాలుగా బ్రతిమిలాడారు. ఆమె వారికి నచ్చచెప్పటానికి యత్నించింది. సహదేవుడు, ద్రౌపది భీమాదులమీది మమకారాన్ని ఒలకబోసింది. కర్ణుడిని మరువవద్దని మరల మరల చెప్పింది. ధర్మరాజు ఆమెను వారించగా నిష్ఠురమాడింది.

తే. 'రాజ్యఫలము కామింపఁ బుత్త్రా! సమగ్ర । తపమునకు ఫలమైన యుత్తమగతి ప్ర
సిద్ధి గోరుదు; నది గల్గఁజేఁత కిట్టి । తోడు మఱి నాకుఁ గలుగునే దురితదూర!' (ఆశ్ర.1.171)

అని గాంధారీ ధృతరాష్ట్రుల సేవకై అడవులకు బయలుదేరింది. ముందు కుంతి, ఆమె భుజంమీద చేయివేసి గాంధారి, ఆమె భుజంమీది చేతితో ధృతరాష్ట్రుడు. వారివెంట విదురుడు వన గమనం చేశారు. ఇది ఉత్తమమైన ప్రస్థానం, అందరూ వనంలో తీవ్ర తపస్సు చేయాలని బయలుదేరారు. పూర్వ స్నేహవైరభావాలు లేని ఒక సమభావం వారిలో యోగంగా నిలిచింది.

ధృతరాష్ట్రుడు శతయూపాశ్రమ ప్రాంతంలో నివసించి తపశ్చర్య లారంభించాడు. నారదుడు అక్కడికి వచ్చి ఆ క్షేత్ర మాహాత్మ్యాన్ని వర్ణించి చెప్పి పూర్వరాజు లా క్షేత్రంలో తపస్సుచేసి ఇంద్రలోకానికి చేరిన వృత్తాంతాన్ని తెలిపాడు. ధృతరాష్ట్రుడు మూడేళ్ళు తపస్సు చేసి తనువును త్యజిస్తాడని కుబేరుడి సన్నిధానంలో వైభవంతో ఉంటాడనీ ఇంద్రుడు చెప్పినట్లు నారదుడు శతయూపుడికి తెలిపాడు. ధృతరాష్ట్రుడు దానిని విని సంతోషించాడు. అంటే ధృతరాష్ట్రుడి మూడేళ్ళ ఆశ్రమవాస చరిత్ర తపస్సాధనలో ముఖ్యమైనదని భావం. దానిని మూడు దశలుగా భావించవచ్చును.

1. పూర్వరంగం:- హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు అంతఃపుర భోగాలనూ, గృహస్థుడు చేసే వేదవిధులనూ వదలి సంసారబంధాలను త్రెంచుకొని, తపోవన నియమాలకు అనుకూలమైన చిత్తవృత్తితో నియమనిష్ఠలతో మునివృత్తిని స్వీకరించి తపస్వులతో కలిసి నివసించే వానప్రస్థాశ్రమ జీవన పద్ధతికి సిద్ధమయ్యాడు. ఇది వనగమనయోగ్యతను సాధించిపెట్టిన పూర్వరంగం.

2. ప్రథమదశ: మోహపరిత్యాగ పరీక్ష:- శతయూపాశ్రమంలో కుటీర నివాసం చేస్తున్న ధృతరాష్ట్రుడు శరీరాన్ని బాగా కృశింపజేసే నియమవ్రతాలు చేపట్టి జ్ఞాన కర్మేంద్రియాలవలన కలిగే వికారాలకు దూరమయ్యే తపస్సు ప్రారంభించాడు. చిక్కి శల్యమయ్యాడు. గాంధారి, కుంతి, విదురుడూ కూడా ఆ మార్గంలో పురోగమించారు. అప్పుడు వారికొక పరీక్ష ఎదురయింది. హస్తినాపురంలో నివసించే రాజకుటుంబ సభ్యులకు కుంతిని, గాంధారీ ధృతరాష్ట్రులను విదురుడినీ దర్శించాలనే బంధుప్రీతి రూప వ్యామోహం మోసులెత్తింది. దానిని మొదట ప్రస్తావించి అందరినీ ప్రేరేపించినవాడు సహదేవుడు. అతడికి కుంతిని చూడాలన్న కోరిక కలిగింది. ఆ సంగతి ధర్మరాజుతో చెప్పాడు. దానితో అందరికీ బంధుప్రీతి పెల్లుబికింది. ధర్మరాజు సబంధుపరివారంగా ధృతరాష్ట్రుడిని చూడాలని బయలుదేరాడు. ఇది బంధుసందర్శనంగా ప్రారంభమైనా, కుంతీ, గాంధారీ ధృతరాష్ట్రులతో కలిసి ధర్మజాదులు ఒక నెలరోజులు వనంలోనే ఉండిపోయారు. తపస్సుకు ఉపక్రమించిన ధృతరాష్ట్రాదులకు అది సంతోషదాయకమైనా, వారి మోహనప్రవృత్తికి అది పరీక్షగా నిలిచింది. ధర్మరాజు తాను వారితో శాశ్వతంగా ఉండి పోవాలని కూడా భావించాడు. ఆ తరుణంలో వ్యాసుడు రంగంలో ప్రవేశించి ధృతరాష్ట్రుడి యోగక్షేమాలు విచారించి, అతడికి తపస్సుమీద ఆసక్తి ఉన్నదని గ్రహించి మరొక పరీక్ష పెట్టాడు. ధృతరాష్ట్రుడికి వరమివ్వటానికి సిద్ధంకాగా, అతడు మరణించిన బంధువుల రూపాలను చూడాలనే కోర్కెను వెలిపుచ్చాడు. కుంతి, గాంధారి మొదలైన స్త్రీలందరూ ఆ కోర్కెను బలపరిచారు. వ్యాసుడు కరుణించి మృతబంధువులు దివ్య శరీరాలతో గంగనుండి వెలువడి వారికి దర్శనమిచ్చే అద్భుత దృశ్యాన్ని కల్పించి చూపాడు. వారు స్నేహవైరాది మనోవికారాలు లేని తేజోమూర్తులుగా దర్శనమిచ్చి, సమత్వభావనకు పోషకంగా అమృతానురుచిని కలిగించారు. గాంధారి కళ్ళగంతలు విప్పి కళ్ళారా చూచింది. ధృతరాష్ట్రుడు వ్యాసదత్త దివ్యదృష్టితో చూచాడు. మిగిలినవారు ఆశ్చర్యంతో వారిని చూచారు. వారి దర్శనంతో ధృతరాష్ట్రాదులలో మోహదృష్టి నశించింది. సమదృష్టి పెరిగి యోగంపై మనస్సు రమించింది. ధృతరాష్ట్రుడి వద్దనే ఉంటానన్న ధర్మజుడి వ్యామోహాన్ని వ్యాసుడు వారించి అతడిని హస్తినాపురానికి తిరిగి పంపాడు. నిరంతర బంధుజన దర్శనం తపస్సుకు ప్రతిబంధకమని తెలిపి ధృతరాష్ట్రుడు ఆ ఆశ్రమప్రాంతాన్ని వదలి దూరవన ప్రదేశాలకు తరలివెళ్ళాడు. మొదటి పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. మోహబంధాలనుండి దూరమై ప్రథమదశ ఉత్తమగతికి ప్రగతి సోపానంగా మారింది.

2. రెండవదశ - దేహాభిమానాన్ని త్యజించే ఉగ్ర తపస్సు:- ధృతరాష్ట్రుడు గంగాద్వార పరిసరారణ్యాలలో ఉగ్రతపస్సు మొదలు పెట్టాడు. అతడు వాయుభక్షణంతోనూ, గాంధారి జలభక్షణంతోనూ తపస్సు సాగించారు. కుంతి మాసోపవాస నియమ వ్రతం సాగించింది. ధృతరాష్ట్రుడు క్రమంగా అగ్నికార్యాదులను వదలి కర్మసన్న్యాసం చేశాడు. యాజకులు అగ్నులను ఆ అడవిలో వదలి వెడలిపోయారు. ధృతరాష్ట్రాదుల శరీరాలు నీరసించాయి. వారికి దేహాభిమానం క్రమంగా వీడిపోయింది. ఇది రెండవ దశ.

3. మూడవదశ: యోగసమాధిలో తనువులు త్యజించటం:- ఒకనాడు ధృతరాష్ట్రాదులు గంగా నదిలో స్నానంచేసి అడవిలో ప్రవేశించారు. భీకరమైన వాయువుతో దావాగ్ని చెలరేగి వారిని చుట్టుముట్టింది. ఆ అగ్ని ధృతరాష్ట్రుడు వదలిన యజ్ఞాగ్నివలన ఏర్పడిందే. కుంతీ, గాంధారీ ధృతరాష్ట్రులు నీరసించి ఉండటంతో అగ్నినుండి తప్పించుకొనలేక పోయారు. వారివెంట నున్న సంజయుడు, రాజు కోరికపై యోగమార్గంలో హిమవత్పర్వతంమీదకు వెళ్ళాడు. ప్రస్థానంలో తనువు త్యజించాడు. సంజయుడి సూచనపై ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి తూర్పుదిక్కు మొగమై యోగసమాధిలో కూర్చుండి తమంతటతాము హుతాశనుడి కీలలకు ఆహుతి అయ్యారు. ధృతరాష్ట్రుడు తన గార్హపత్యాగ్నిలో తానే దగ్ధమయ్యాడు. కొడుకులు అగ్నికార్యం చేయవలసిన అవసరం అతడికి ఏర్పడలేదు. దావాగ్ని దగ్ధుడైన ధృతరాష్ట్రుడు యోగమార్గంలో తనువును త్యజించిన పుణ్యపురుషుడై ఉత్తమలోకాలకు వెళ్ళాడు. గాంధారి అతడిని అనుసరించింది. కుంతి యోగాగ్నిలో తనువును త్యజించి పాండురాజును చేరుకొన్నది. నారదుడివలన ఈ వృత్తాంతం విని ధర్మరాజాదులు వారికి తిలోదకాలిచ్చారు.

ధృతరాష్ట్రుడు యోగమార్గంలో తనువును త్యజించి స్వర్గాన్ని పొందాడు. కుంతీ గాంధారు లా బాటలో నడిచారు. సంజయుడు యోగమార్గంలో మహాప్రస్థానం చేశాడు. విదురుడు యతిగా మారి దిగంబరుడై తిరుగుతూ యోగమార్గంలో తనువును త్యజించి తన జీవచైతన్యాన్ని ధర్మరాజులో లీనంచేసి ధన్యుడయ్యాడు. ఈ విధంగా ధృతరాష్ట్రుడి ఆశ్రమవాసం వనగమనం చేసిన అయిదుగురికీ యోగమార్గంలో అయిదు విధాలుగా స్వర్గగమనానికి స్వర్ణమార్గంగా ఉపయోగపడింది.

మౌసలపర్వం

1. మూడు మహానగరాలు:-

మహాభారత యుద్ధానంతరం చరిత్ర కెక్కిన మహానగరాలు మూడు. అవి: హస్తినాపురం, ఇంద్రప్రస్థం, ద్వారక-చంద్రవంశ చక్రవర్తులు ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన రాజ్యానికి ఏకైక రాజధాని హస్తినాపురం. ప్రస్తుతం అది పాండవాధీనంలో ఉన్నది. దానికి ధర్మరాజు చక్రవర్తి. ఆయన అశ్వమేధయాగం చేసి భారత సమ్రాట్టుగా ప్రసిద్ధికెక్కాడు. ధృతరాష్ట్ర పాలనలో పాండవ భాగంగా ఇవ్వబడిన రాజ్యానికి రాజధాని ఇంద్రప్రస్థపురం. ఇది శ్రీకృష్ణుడి దివ్య మహిమతో అద్భుత నగరంగా పాండవుల కాలంలో అభివృద్ధి చెందింది. మయసభ అందులో అద్భుత శిల్పం. ధర్మరాజు రాజసూయం చేశా డక్కడ! పాండవ పూర్వ ప్రభకు ప్రతినిధిగా నిలిచిం దిప్పుడు. హస్తినాపురికి అనుబంధ మహానగరంగా గౌరవించబడుతున్నది. దాని అదృష్ట మేమిటంటే నరనారాయణాంశ సంభూతులైన అర్జున శ్రీకృష్ణులు భారతయుద్ధానంతరం ఆ నగరంలో కొన్నాళ్ళు నివసించారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి అనుగీతను బోధించి దానిని జ్ఞానక్షేత్రంగా దీపింపచేశాడు. హస్తినాపురికి అండగా ఆకాలంలో నిలిచింది ద్వారక. దానికి ప్రభువు వసుదేవుడు. అది యాదవ రాజ్యరాజధాని. బలరామ శ్రీకృష్ణుల భవ్య నివాసక్షేత్రం. కౌరవుల తరువాత యాదవులు మహావీరులు, యుద్ధకుశలులు. వారిలో వృష్ణి , భోజక, అంధకాది వంశాలకు చెందినవారు ఉన్నారు. వారందరూ ఏకాభిప్రాయంతో ఎల్లప్పుడూ ఉండకపోయినా వసుదేవుడన్నా, వాసుదేవుడన్నా భయభక్తులతో మసలుకొంటారు. మూడు నగరాలకు ప్రభువు లెవరైనా వాటిమీద శ్రీకృష్ణుడి ప్రభావం మాత్రం ఎప్పుడూ ఉండేది. పాండవులకు బంధువే కాక ప్రత్యక్షదైవం వాసుదేవుడు. అనన్యభక్తితో అతడిని సేవించి, ఆయన కల్పించిన రక్షను, యోగక్షేమాలను సర్వదా పొందిన సార్థక భక్తులు పాండవులు. అందువలన భారతయుద్ధంలోనూ, తరువాతకూడా పాండవజీవిత నౌకకు శ్రీకృష్ణుడు కర్ణధారిగా ఉండి కథను చివరిదాకా విజయపథంలో నడిపించాడు. మొత్తానికి హస్తినాపుర చరిత్రకే కాక, పురత్రయ భవితవ్యానికి కూడా శ్రీకృష్ణుడూ మార్గదర్శి, సూత్రధారుడు, చక్రధారి. అతడు నిర్మించిన ద్వారకానగర చరమాంక చరిత్రను చిత్రించేది మౌసలపర్వం. అది మహాభారత కథలో ఒక కీలకపాత్ర నిర్వహించటం విశేషం.

2. ద్వారకను ముంచిన ముప్పేట ముప్పు:

అవతారపురుషుడైన శ్రీకృష్ణుడు తన అవతార సమాప్తికి ముందే తన భౌతిక వైభవాన్ని ఉపసంహరించుకొనే వ్యూహంలో భాగంగా యాదవ వీర సంహారానికీ, ద్వారకానగరోపసంహారానికీ తగిన హేతువులను కల్పించి తాను నిమిత్తమాత్రుడుగా మిగిలే లీలను ప్రకటించాడు. ఆ విధంగా ద్వారకకు మూడు విపత్తులు ఏర్పడ్డాయి.

1. కణ్వుడూ, నారదుడూ, విశ్వామిత్రుడూ అనే ముగ్గురు మహర్షులూ సాంబుడు ఆడిన కపట స్త్రీ నాటకం కారణంగా ఇచ్చిన శాపం:- 'సాంబుడికి యాదవకులాన్ని నశింపచేసే ఒక ముసలం పుట్టుతుందనీ, దాని శక్తివలన బలరామకృష్ణులు తప్ప మిగిలిన యాదవులందరూ నశిస్తారనీ, బలరాముడు యోగశక్తితో తన శరీరం వదలి సముద్రంలో ప్రవేశిస్తాడనీ, శ్రీకృష్ణుడు ఏకాంతంగా నేలపై పరుండి ఉండగా 'జర' అనే రాక్షసి అతడిని ఆక్రమించి చంపుతుందనీ మునులు శపించారు. దానివలన పుట్టిన ముసలం కారణంగా యాదవవీరులు పరస్పర కలహంలో నశిస్తారు. బలరామకృష్ణులు అవతారాలు చాలిస్తారు.

2. గాంధారిశాపం:- భారతయుద్ధంలో ఉత్తమ జ్ఞాతులు తమలో తాము పోరాడి చనిపోయేటట్లు శ్రీకృష్ణుడు చేశాడు కాబట్టి శ్రీకృష్ణుడి జ్ఞాతులైన యాదవులుకూడా తమలో తాము పోరాడి చనిపోతారనీ, శ్రీకృష్ణుడు నాటినుండి ముప్పదారేళ్ళకు అదే నాడు ఆదుకొనే దిక్కెవ్వరూ లేక శోచనీయస్థితిలో చనిపోతాడనీ గాంధారి శపించింది.

3. ద్వారక సముద్రంలో మునగటం:- శ్రీకృష్ణ నిర్యాణానంతరం ఒక వారం రోజులకు సూర్యోదయ సమయంలో సముద్రం ద్వారకను ముంచి తనలో కలుపుకొంటుందని శ్రీకృష్ణుడు వసుదేవుడికి తెలిపాడు.

ఈ ప్రళయానికి ప్రథమకారణం మునుల శాపంవలన కలిగే ముసలం కాబట్టి, దాని మహిమను ప్రదర్శించే ఈ పర్వం మౌసలపర్వం అని పిలువబడింది. యాదవవీరుల మరణానికి దివ్యమైన కారణం ఉన్నదని చిరునవ్వు నవ్వుతూ గాంధారితో శ్రీకృష్ణుడిట్లా అన్నాడు-

తే. 'మున్న కాదె యాదవులకు మునివరేణ్య । కలిత దారుణశాపంబు గలదు; నీకు
నేల చర్వితచర్వణ మిట్లు సేయ? । దీన నేమి ప్రవృత్తి? దానిఁ జెపుమ!'

క. 'యదువంశజాతులకుఁ ద । ప్పదు నాకము; వారి సురలుఁ బరిమార్పఁగ లే;
రది కారణంబు గాఁగఁ దె । గుదు రొండొరుచేత రణము ఘోరత్వమునన్.'

తే. 'అనిన పలుకులు విని పాండుతనయు లెదలు । వెఱపు పెంపున గంపింప విహ్వలించి
యాత్మజీవితములదెస నాస లపుడు । వదల విడిచిరి కౌరవవంశవర్య! **(స్త్రీ.2.163-165)**

దేవతలకు కూడా అసాధ్యులైన యాదవులు పరస్పర సంహారంతో తనువులు చాలించటమే దైవం నిర్ణయించిన మార్గం. దానికి అనువుగా మునిశాపాన్నీ, గాంధారి శాపాన్నీ కల్పించి కార్యకారణ సంబంధాన్ని కల్పించాడు. ఇది శ్రీకృష్ణుడి దివ్యవ్యూహం! దీనివలన భూతలంమీద మరొక మహాయుద్ధం వారించబడింది. యాదవమరణం క్రమంగా పాండవ మహాప్రస్థానానికి దారి తీస్తుందని పై చివరి పద్యం వ్యంగ్యంగా సూచిస్తున్నది. అది తిక్కన కథాకథనశిల్పం!

చంద్రవంశ చరిత్రలో వ్యాసవాసుదేవులు విష్ణుసన్నిభులు. భీష్ముడి తరువాత హస్తినాపుర సింహాసనానికి వారసులను కల్పించటంలో దోహదకారిగా నిలిచిన మహర్షి వ్యాసుడు. పాండవుల తరువాత వారి వంశాంకురాన్ని ప్రాణంపోసి రక్షించిన మహాత్ముడు శ్రీకృష్ణుడు. వీ రిద్దరూ పాండవులను అశ్వమేధయాగాంతం వరకు మార్గదర్శకులై, రక్షకులై వెంట నడిచారు. యాగానంతరం శ్రీకృష్ణుడు ద్వారకలోనే ఉండిపోయాడు. వ్యాసమహర్షి ఆశ్రమంలో తపోనిష్ఠుడై నిలిచాడు. వా రెక్కడున్నా హస్తినాపుర సామ్రాజ్య శ్రేయోభిలాషులు, సంరక్షణాచార్యులు.'

పాండవులలో పార్థుడు శ్రీకృష్ణుడికి ప్రాణస్థానీయుడు. అతడికి సుభద్ర నిచ్చి వివాహం చేయటంలో శ్రీకృష్ణుడు రహస్యమైన కీలకమైన పాత్ర పోషించాడు. ఆమెకు పాంచాలి వైపునుండి ఎటువంటి ఇబ్బందులు కలగకుండ కంటికి రెప్పవలె కాపాడాడు. అర్జునుడికి సుభద్రవలన కలిగిన పుత్త్రుడు అనన్యసామాన్య ధానుష్కుడై, అపరపార్థుడని పొగడందిన అభిమన్యుడు. అతడిని తాను అభిమానించి పెంచి పెద్దచేసి మహావీరుడిని చేయటమే కాక, విరాటరాజపుత్రిక అయిన ఉత్తరతో వివాహం జరిపించటంలో సహకరించాడు. ఆ దంపతులకు పుట్టిన పుత్రుడే పరీక్షిత్తు. అతడిని అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మముఖాస్త్రశిఖిశిఖలనుండి రక్షిస్తానని శపథంచేసి మృతశిశువుగా పుట్టిన ఆ బాలుడిని ప్రాణవంతుడిగా తేజోవంతుడిగా మార్చి అనుగ్రహించి పాండవవంశాన్ని నిలిపాడు.

విచిత్ర మేమంటే ధృతరాష్ట్రుడికి గాని, పాండవులకుగాని, వారి సంతతి నిలువ లేదు. వారు భారతయుద్ధంలో మరణించారు. కౌరవభార్యలకు సంతతి మిగలలేదు. ద్రౌపది కొడుకులు ఉపపాండవులు అశ్వత్థామచేత హతులయ్యారు. అపాండవం కావలసిన తరుణంలో అశ్వత్థామ శపథాన్ని కాదని శ్రీకృష్ణుడు సుభద్ర మనుమడే కురురాజ్యాధిపతి కావాలని శ్రీకృష్ణుడి దివ్య ప్రణాళిక అయి ఉంటుంది. ఆయన వ్యూహం అంతటితో ఆగినట్లు లేదు. ద్వారకలో బలరామ వాసుదేవు లున్నారు. వారి పుత్రులూ మౌసలయుద్ధంలో చనిపోయారు. ధృతరాష్ట్రుడికివలె, పాండవులకువలె, శ్రీకృష్ణుడికి కూడా వారి తరువాతి తరం బ్రతికే అదృష్టం లేదన్నమాట! అది-శ్రీకృష్ణుడి సమత్వబుద్ధి. మరొక విశేష మేమంటే ' ద్వారక' ముఖ్యపట్టణంగా యాదవరాజ్యం నిలిస్తే అది హస్తినాపురితో ఎప్పటికైనా పోటీపడవచ్చును. అందువలన దానిని అదృశ్యం చేయటం (సముద్రంలో ముంచటం) శ్రీకృష్ణుడి దివ్యవ్యూహం. అంతటితో ఆగక గతప్రాణులైన యాదవులకూ, తనకూ, బలరాముడికీ అంత్యసంస్కారాలు అర్జునుడు చేసేటట్లు ఏర్పాటు చేయటం శ్రీకృష్ణుడి దైవ సంకల్పం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నారాయణుడు చేయవలసిన విధులు నరుడు చేయగలడు. 'అమ్మహాభుజుఁడు కార్యజ్ఞుండు, శౌర్యసమగ్రుండు, విక్రమమహితుఁ; డతఁడు, నా ౘగ నేననంగ నరనాథ! భేద మించుకయు లేదు' (మౌస.1.117) అని స్పష్టంగా శ్రీకృష్ణుడు వసుదేవుడితో చెప్పాడు.

మరొక అద్భుత మేమంటే శ్రీకృష్ణుడి తరువాత, ద్వారక నీటిలో మునిగిన తరువాత వసుదేవాదులను, మిగిలిన ప్రజలను ఇంద్రప్రస్థానానికి చేర్చేటట్లు అక్కడ శ్రీకృష్ణుడి మనుమడైన వజ్రుడిని రాజుగా నిలిపేటట్లు ధర్మరాజు ముందే యోచించి అర్జునుడికి అంతరంగికంగా ఆదేశా లిచ్చి ఉండటం గమనిస్తే శ్రీకృష్ణుడి ప్రభావం హస్తినాపురంమీద ఎంత ఉన్నదో తెలుస్తుంది. ద్వారక నీట మునిగి ఇంద్రప్రస్థంలో విలీనమయింది. యాదవ రాజ్యం హస్తినాపురానికి మిత్రరాజ్యంగా మారింది. ఆ రెండూ సుభద్రాదేవి రక్షణలో శాంతి సౌఖ్యాలతో విలసిల్లబోతున్నాయి. మనుమళ్ళను మహారాజులను చేసే ఒక దివ్య ప్రణాళిక వెనుక ఉన్న రహస్యం చివరకు గాని తెలియదు. భీష్మాది మహావీరులూ, బలరామ శ్రీకృష్ణులూ, పాండవులూ, వారి సంతతీ అందరూ అంశావతారులైన కారణజన్ములు. అందుకే వారి కార్యాలు ముగియగానే స్వర్గవాసులయ్యారు. మిగిలిన అదృష్టవంతులు చరిత్రను ముందుకు నడిపారు. దీనికంతా వెనుక ఉన్నది వాసుదేవ మాహాత్మ్యం.

3. అవతారపురుషుడి అపూర్వప్రస్థానం:

మహాభారతంలో చివరి నాలుగు పర్వాలూ ప్రస్థాన పర్వాలుగా ప్రసిద్ధికెక్కాయి. భారత పాత్రలన్నింటిలో శ్రీకృష్ణుడి పాత్ర పరిపూర్ణ దివ్య పాత్ర. అతడు పరమేశ్వరుడుగా, సాక్షాత్తు నారాయణుడి అవతారంగా భీష్మాది మహావీరులూ, వ్యాసాది మహర్షులూ గుర్తించి కీర్తించారు. మానవాకృతి తాల్చిన మాధవుడు జీవించిన విధానం లీలామానుషంగా భాసించి, నిర్యాణంకూడా దివ్యాదివ్యంగా తేజరిల్లటం విశేషం.

భారతంలో మరణించిన వారందరి చరిత్రలలో శ్రీకృష్ణ నిర్యాణం విలక్షణమైనది. యుద్ధంలో వీరమరణం పొందినవారందరికి ఆ మరణమే వారికి స్వర్గప్రాప్తిని కలిగిస్తుంది. వారు మరణించిన తరువాత మాటాడరు. రణభూమిలో మరణించని వీరులు యోగమార్గంలో తనువులను త్యజిస్తారు. కాని, పూర్వాంశను పొందిన తరువాత జీవితాంశాలను గురించి సామాన్యంగా మాటాడరు. మరణించిన తరువాత జీవులు దివ్యదేహాలు పొందవచ్చును. అంతవరకు స్వర్గ నరక భోగాలను అనుభవిస్తూ ఉండవచ్చును. ఏమైనా వారికి దేహస్పృహ ఉండటం కాని, దానికి సంబంధించిన ఈర్ష్యాసూయలు, అనురాగాది బంధాలు ఉండటం కాని కానరాదు. మరణించిన వీరుల చరిత్రలన్నీ ఈ లక్షణాలకు సాక్ష్యాలే. అయితే, వారందరికంటె విలక్షణంగా ధర్మరాజు బొందితో స్వర్గానికి పోవటం. స్వర్గనరక దర్శనం చేసికొనటం, ఆ సమయంలోకూడా శరీరావరణ సంబంధాలైన రాగాసూయాదులకు గురికావటం గమనిస్తాం. ఆకాశగంగావగాహనం తరువాత అతడు దివ్యదేహాన్ని పొంది తదనుభూతికి లోనుకావటం స్వర్గారోహణపర్వంలో గోచరిస్తుంది. అట్టి సుకృతులు పూర్వచక్రవర్తులలో కొందరున్నారు. హరిశ్చంద్రుడటువంటివాడు. వారి వరుసలో ధర్మరాజు నిలిచి తన ప్రత్యేకతను నిలుపుకొన్నాడు. ఇందరు ఇన్ని ప్రత్యేకతలతో ప్రకాశించినా శ్రీకృష్ణుడితో సరిపోలజాలరు. బలరాముడు ఆదిశేషుడి అవతారంగా ప్రసిద్ధిచెందాడు. శ్రీకృష్ణుడితో పుట్టిన విష్ణువు ఆయుధాలు ఆయనకంటె ముందే మానవాకృతులు వదలి విష్ణు లోకం చేరుకొన్నాయి. బలరాముడుకూడా శ్రీకృష్ణుడివద్ద అనుమతి పొంది అడవిలో ఒకమ్రాను మొదట యోగసమాధిలో ఉండిపోయాడు. శ్రీకృష్ణుడు అతడిని దర్శిస్తూ ఉన్నప్పుడే అతడి శరీరంలోనుండి వేయిపడగల ఆదిశేషుడు యోగమార్గాన పైకి లేచి ఆకాశగమనంతో సముద్రంలో లీనమైపోయాడు. దేవతలూ, శేషులూ అతడికి ఆహ్వానం పలికారు. ఇది ఒక అద్భుత నిర్యాణం. శరీరపతనానంతరం నిజరూపధారణం చేసి బల రాముడు మరేమీ మాటాడలేదు. జరా ప్రేరితుడై, వ్యాధుడు శ్రీకృష్ణుడి పాదాన్ని జింకగా భ్రమించి బాణంతో గట్టిగా కొట్టి నప్పుడు, లౌకికవ్యక్తిగా భూశయనం చేసి ఉన్న శ్రీకృష్ణుడు, దుర్వాసోమహర్షి శాపం కారణంగా అరికాలిలో తగిలే దెబ్బతో మృత్యువు కలుగుతుందని తెలిపి, నిర్వికారంగా యోగసమాధిలో ఉండి, వేటగాడిని అనునయించి, తన తనువును తానే త్యజించి నిజస్థానంలో అవ్యయుడుగా నిలిచి ఆనందబ్రహ్మగా తనస్థితిని తానే వ్యాఖ్యానించి బ్రహ్మాదులకు చెప్పి వారిని ఆనందపరిచాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తనువును త్యజించినప్పుడు జీవన్ముక్తుడైన మహాయోగివలె కనబడి, తాను పొందిన నిజస్థితిని, తదనుభూతిని చెప్పగలిగినవాడే అవతారపురుషుడని శ్రీకృష్ణుడి నిర్యాణం నిరూపించి చెప్పుతుంది. స్వస్వరూపంతో నిలిచిన ఆ పరమాత్ముడు అన్నమాట లివి-

సీ. 'అప్పరమేశ్వరుం డయ్యందఱను జూచి । 'యనిరుద్ధ నామకం బైనయదియుఁ;
ప్రద్యుమ్నతా ప్రతిభాసమానమును, సం । కర్షణభావవికాసితంబు,
వాసుదేవాత్మక వరరూపమున నేక । తా విభవత్వమాధాన సిద్ధి
నొందించుకొంటి; నానందబోధ నిరంజ । నామేయ మత్పద ప్రాప్తి పరమ

ఆ మంగళానుభూతి నంగీకరించెద । సుఖుల రగుఁడు మీరు సుకృతులార!'
యనిన వచన సమితి యతిమృదు మధురత । నింపు నొసఁగ నలరి రెల్లవారు.' **(మౌస.2.92)**

దీనిని వ్యాఖ్యాత ఈ పద్యం వద్ద ఈ విధంగా వివరించాడు. ''శ్రీకృష్ణుడు పొందిన మహానారాయణత్వ సిద్ధిని వర్ణించే పద్యం కాబట్టి ఈ పద్యం చాలా విశిష్టమైనది. నిర్వికారమైన పరబ్రహ్మంనుండి సవికారమైన సృష్టి నాలుగు అంచెలుగా ఏర్పడిందని సంస్కృత భారతం శాంతిపర్వంలోని 139వ అధ్యాయంలో చెప్పబడింది. ఆ అధ్యాయాన్ని 'నారాయణీయం' అంటారు. ఈ నాలుగు అంచెలనే నారాయణవ్యూహతత్త్వ మంటారు. ఈ నాలుగు దశలు ఇవి: 1. సనాతన వాసుదేవతత్త్వం- నిష్క్రియ, నిర్గుణ, నిష్కళ, నిర్ద్వంద్వమైన పురుషతత్త్వమిది. దీనినే పరతత్త్వ మంటారు. ఇదే పంచభూతాలను శరీరంగా చేసికొని జీవుడై అవతరించింది. ఈ జీవుడు లేకుండా ఆ పరబ్రహ్మతత్త్వానికి చేష్ట ఉండదు. అంటే కదలిక ఉండదు. అందుకే భారతకథలో వసుదేవుడి కుమారుడుగా కృష్ణుడు చెప్పబడినాడు. 2. సంకర్షణతత్త్వం -ఈ జీవుడి పేరే శేషుడు, లేదా సంకర్షణుడు. పరవాసుదేవ తత్త్వంవైపు పాంచభౌతిక శరీరాన్ని ఆకర్షించే వాడని అర్థం. 'కర్షతి' అంటే ఆకర్షిస్తాడని అర్థం. కృష్ణశబ్దానికి కూడా అర్థం ఇదే ఆకర్షించేవాడని. భారతంలో శ్రీకృష్ణుడిచేత ఆకర్షించబడని పాత్ర లేదు. 3. ప్రద్యుమ్న తత్త్వం: సంకర్షణతత్త్వం నుండి పుట్టేది ప్రద్యుమ్న తత్త్వం. ఇది సనత్కుమారతత్త్వం. విశ్వమనస్స్వరూపం. సర్వభూతాతిరిక్తమైన మనస్తత్త్వమిది. పంచభూతాలు ప్రళయకాలంలో ఈ 'మహామనస్సు' లో లీనమౌతాయి. శ్రీకృష్ణుడి కుమారుడు ప్రద్యుమ్నుడు - అని చెప్పబడిన పురాణకథలకు మూలం ఈ వ్యూహనిర్మాణమే 4. అనిరుద్ధతత్త్వం -అ ప్రద్యుమ్న తత్త్వంనుండి పుట్టేది అనిరుద్ధతత్త్వం. కర్తృకారణ స్వరూపుడై స్థావరజంగమాత్మక విశ్వరూపుడు - సమష్టి అహంకార స్వరూపుడు అనిరుద్ధుడు. పురాణాల ప్రకారం ప్రద్యుమ్నుడి కొడుకే అనిరుద్ధుడు. ఈ నాలుగు తత్త్వాలను కలిగిన పరమేశ్వరుడుగా నారాయణుడు ఈ పద్యంలో వివరించబడుతున్నాడు. ఆ నారాయణతత్త్వం కేవలం ఆనంద రూపమైన జ్ఞానం. అందుకే అనిరుద్ధ, ప్రద్యుమ్న, సంకర్షణ రూపుడైన వాసుదేవుడు ఆ రూపాలన్నీ క్రమంగా ఉపసంహరించుకొని ఆ మూలస్థితికి చేరుకొన్నానని తానే స్వయంగా చెప్పుకొనటం ఈ ప్రకటన విశేషం. ఇట్లా చెప్పుకొన్న పాత్ర శ్రీకృష్ణ డొక్కడే. అందుకే భారతంలో పరమాత్ముడు శ్రీకృష్ణుడనీ, అతడి అవతారం లీలామానుషరూపమనీ, అందువలననే అతడు మానవుడివలె చనిపోగలడనీ, పరమేశ్వరుడివలె తన తత్త్వాన్ని లోకానికి చెప్పగలడనీ, తెలుపబడింది. మౌసలపర్వం వాసుదేవతత్త్వ మనబడే నారాయణవ్యూహ చతుష్టయ తత్త్వమనీ, అదే భారతంలో తెలియదగిన భగవత్తత్త్వమనీ బోధపరుస్తుంది.

4. మౌసలపర్వం మహాప్రస్థానికపర్వానికి తొలిపలుకు;

శ్రీకృష్ణ నిర్యాణం అర్జునుడికి అనంతశోకాన్ని కలిగించింది. తేజోమయమైన శ్రీకృష్ణుడి మృతదేహాన్ని చూచి విజయుడు దుఃఖంతో మొదట మూర్ఛిల్లాడు. ఆ తరువాత అతడి మృత శరీరాన్ని కౌగిలించుకొని చాలాసేపు ఉండిపోయాడు. ఆపై తన చుట్టున్నవారి బలవంతాన తేరుకొన్నాడు. విధి విధానం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాడు. కన్నకొడుకులు కూడా నోచుకొనని ఆ అపూర్వమైన అదృష్టాన్ని అర్జునుడు పొందాడు. అయితే, ఆ తరువాత ద్వారకావాసులను తరలిస్తున్నప్పుడు మార్గమధ్యంలో బోయలు స్త్రీలపై దాడిచేసి బంగారం దోచుకొన్నప్పుడు, అర్జునుడు బాణాలు వేసినా అవి వారిపట్ల ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోయాయి. అర్జునుడికి

అస్త్రాల మంత్రతంత్రాలు ఆ సమయంలో స్ఫురించకుండా పోయాయి. అర్జునుడి ప్రతాపం ఓటుపడ్డట్లయింది. ఆ నిర్వీర్యస్థితికి అతడు తట్టుకొనలేకపోయాడు. శ్రీకృష్ణ నిర్యాణం తన ప్రతాప నిష్క్రమణంగా భావించి శోకించాడు. అతడికి శోకమోహాలు ముంచుకొనివచ్చి వేదవ్యాసమునీంద్రుడివద్దకు చేర్చాయి. అతడు యాదవ వీరుల మరణాన్నీ, బలరామకృష్ణుల నిర్యాణాన్నీ, ద్వారకావాసుల దైన్యాన్నీ, చివరకు తన నిస్సహాయస్థితినీ పేర్కొని వాపోయాడు. దానికి కారణం చెప్పుమన్నాడు. ఆ తరువాతి కర్తవ్యం తెలుపుమన్నాడు. వ్యాసమహర్షి శోకమోహావిష్టుడైన అర్జునుడికి అవతారపురుషుడి లీలా మానుష చర్యల వెనుక నున్న తాత్త్విక భూమికను వివరించి, అది విషాదానికి ఆలంబనం కాకూడదని బోధించాడు. ఆ తాత్పర్యం ఇది-

1. మునిశాపంవలన యాదవనాశనం జరిగింది. అందువలన దానికి దుఃఖించ పనిలేదు. యాదవులు కర్మఫలాన్ని అనుభవించారు. వారికి ప్రాప్తకాలం వచ్చింది. కాబట్టి శ్రీకృష్ణుడు వారి నాశనానికి అడ్డుపడకుండా ఉపేక్షవహించాడు. మూడు లోకాలను అన్యథాకరించగలిగిన సర్వశక్తిమంతుడు శ్రీకృష్ణుడు. యదునాశం అవశ్యభోక్తవ్యం కాబట్టి ఆ మహాత్ముడు అడ్డుకొనలేదు. ఈ తత్త్వం తెలిస్తే యాదవమరణశోకం నీకు ఉపశమిస్తుంది.

2. నీవు యుద్ధం చేసేటప్పుడు నీపట్ల ఉండే స్నేహంవలన శ్రీకృష్ణుడు రథసారథి అయి వర్తించినా, రుద్రరూపుడై శూలాన్ని ధరించి ముందుగా శత్రువులను సంహరిస్తూ నీ విజయానికి దోహదంచేస్తూ ఉండేవాడు. నీ యోగదృష్టికి ఆ దృశ్యం గోచరిస్తూ ఉండేది. అప్పుడు కాలం నీకు అనుకూలంగా ఉండేది. కాబట్టి శ్రీహరి నిన్ను రక్షించాడు. ఇపుడు కాలవైపరీత్యంవలన నీ వెంట నీ జంటగానిలిచి సాయంగా లేడు. కాలానుకూల్య కాలవైపరీత్యాలు దైవసంకల్పం మీద ఆధారపడి ఉంటాయి. అది తెలిస్తే ఇప్పటి నీ స్థితి స్పష్టమౌతుంది. దీనికి విచారించటం అవివేకం.

3. ధరణిభారాన్ని తగ్గించటానికి విష్ణువు అవతరించి, దుష్టశిక్షణాన్నీ, శిష్టరక్షణాన్నీ అబ్బురపాటు కలిగేటట్లుగా నిలిపి తన అవతార కార్యక్రమం ముగియగానే తనువు చాలించి అజరామరం, నిష్కళంకం, నిర్వికారం, నిరంజనం అయిన తన సత్పదాన్ని పొంది ఉపశాంతిపరు డయ్యాడు. ఇది మంగళకరమైన శుభస్థితి. మీ వంటి జ్ఞానులు దీనికి శోకించరాదు.

4. నీవు భీమాదులసహాయంతో అవనీభారాన్ని తగ్గించటంలో శ్రీహరికి తోడ్పడి కృతార్థుడ వయ్యావు. దైవాజ్ఞను అనుసరించి అస్త్రసముదాయం నిన్ను వదలి వెళ్ళింది. నీవు పూర్వం చేసిన యుద్ధాలలో ప్రదర్శించిన పరాక్రమ విశేషాలకు దేవతలు కూడా హర్షించారు. హరి సహకరించినప్పుడు నరుడు రాణిస్తాడు. ఈ రహస్యం తెలిసి విచారించటం వివేకం కాదు.

5. బలం, బుద్ధి, చేవ-కాలం అనుకూలంగా ఉన్నప్పుడు ప్రకాశిస్తాయి. కాలం వికటించినప్పుడు నశిస్తాయి. పండితులు కాలం కలిసివచ్చినప్పుడు మూలమైన మీ తనువులను విడిపెట్టండి. అట్లా మీరు చేస్తే ఆర్యులు కీర్తిస్తారు.

మౌసలపర్వ కథార్థాలను వ్యాసమహర్షి వ్యాఖ్యానించి అర్జునుడి శోకమోహాలను తొలగించి వివేకాన్ని ప్రసాదించాడు. దీనివలన పాండవులకు ఒక భవ్యసందేశం అందింది. వారికి కాలం అనుకూలంగా లేదు. లేదని శ్రీకృష్ణ నిర్యాణం ధ్వనింపజేసింది. పాండవులకు సారథిగా, సచివుడుగా, వియ్యంగా, సఖుడుగా, బాంధవుడుగా, విభుడుగా, గురువుగా, దైవంగా వెన్నంటి నిలిచి రక్షించిన దివ్యశక్తిమంతుడు శ్రీకృష్ణుడే కాలస్వరూపుడు. అతడు నిష్క్రమించి పాండవులకు తనువుల వికార స్వభావాన్ని తొలగించుకొనే సందేశ మిచ్చినట్లు సాక్షాత్ కృష్ణద్వైపాయనుడే సూచించాడు. బోధించాడు. ఆ బోధనయే పాండవ జీవితచరమాంకానికి తొలిపలుకు, మౌసలపర్వం బలరామకృష్ణుల జీవితాలకు భరతవాక్యం. పాండవ మహాప్రస్థానానికి నాందీవాక్యం! అదే మౌసలపర్వ సార్థక్యం.

మహాప్రస్థానికపర్వం

1. ప్రస్థానప్రయత్నం:

పాండవుల చరిత్రలోని చరమఘట్టాన్ని రెండు పర్వాలుగా విభజించటం విశేషం. వస్తు విభాగం దృష్ట్యా అది ఔచిత్యం కూడా. మొదటిది మహాప్రస్థానిక పర్వం. రెండవది స్వర్గారోహణపర్వం. ఇందులో మహాప్రస్థానం చేసింది ఏడుగురు. వారిలో స్వర్గారోహణం చేసింది చివరకు ధర్మరాజు ఒక్కడే. వస్తు స్వభావరీత్యా ఈ రెండూ ప్రత్యేక స్వభావాలు కలిగి ఉండటంచేత పరిమాణంలో చిన్నదైనా విడివిడి పర్వాలుగా విభజించబడ్డాయి. మహాప్రస్థానం పాండవు లందరిదీ, స్వర్గారోహణం ధర్మరాజు ఒక్కడిదీ.

తే. 'కాలమూలంబు సర్వంబు గాన దీని। కొండుతలఁపులు దక్కి మీ రుత్తమంపు
గతికిఁ జనుఁడు నిశ్చింత వికారతనులు। విడిచి యార్యజనంబులు వినుతి సేయ. (మౌస.1.222)

అన్నది వ్యాసోపదేశం. దీనిని అన్నివిధాలా అర్థంచేసికొని, అక్షరాలా అమలు చేయటానికి నిశ్చయించాడు. ధర్మరాజు కాలవిపర్యయాన్ని గమనిస్తే కలికాల ప్రవేశాన్ని స్మరిస్తే పాండవులకు కాలం చెల్లిందన్నది సూక్ష్మబుద్ధికి తోచే వాస్తవం. దానిని గుర్తించి ధర్మరాజు దానికి ప్రత్యామ్నాయంగా మరొక సంకల్పం చేయకుండా నిశ్చింతతో కూడిన మనస్సును సమాహితంచేసి యోగనిష్ఠం చేశాడు. అనన్యచింతతో ఉత్తమగతిని పొందాలని దీక్ష వహించాడు. ఉత్తమగతి అంటే తమ కర్మలకు తగిన పరలోక గతి. అది స్వర్గం కావచ్చును. మోక్షం కావచ్చును. ధర్మజుడి చిత్తం కర్మయోగ పరిపక్వత చెంది ఉన్నది కాబట్టి మోక్షాన్నికాని, స్వర్గాన్ని కాని లక్షించక వికారాలకు నెలవైన దేహాన్ని యోగంతో పరిత్యజించ దలచాడు. అతడు కర్మయోగి కాబట్టి శరీరాన్ని జీవన్ముక్తుడివలె వదలటానికి ఉన్ముఖుడు కాలేదు. దానికి కారణం అతడు జనకుడి వంటి రాజర్షి కాడు. అతడు సమగ్ర కర్మయోగి, అతడి ఉత్తమ సంస్కారానికి మహాప్రస్థానం ఉత్తమగతికి ఉత్తమ సాధనంగా తోచింది. దానికి అనుగుణంగా అతడు తమ తనువులకు కాలపరిపాకం సిద్ధించిందనీ, కాలం సమీపించిందనీ దృఢ నిశ్చయంతో యోగబుద్ధిని అనుసంధించాలని నిర్ణయించాడు. దానికి ఉపబలకంగా కర్మపరిత్యాగాన్ని చేయటానికి సంకల్పించాడు. దానికి తమ్ముల నందరినీ ఒప్పించాడు. కాలపురుషుడి లీలలను అందరికీ తెలియచెప్పాడు. తానెత్తుకొన్న బరువులను ఒక్కొక్కటి దింపుకొన్నాడు. యుయుత్సుడిని రాజ్యరక్షకుడిగా నియోగించాడు. అతడికి రాజ్యనిర్వహణ రహస్యాలు తెలిపాడు. పరీక్షిత్తును హస్తినాపుర ప్రభువుగా అభిషేకించాడు. రాజ్యపాలన విధులను అతడికి బోధించాడు. వజ్రుడిని ఇంద్రప్రస్థ రాజ్యానికి ప్రభువుగా చేశాడు. సుభద్రను ఆ ఉభయ రాజ్యాలకు సంరక్షకురాలిగా నియమించాడు. కృపాచార్యుడిని గురువుగా, ధౌమ్యుడిని పురోహితుడిగా నిర్దేశించాడు. పౌరులకు హితవు చెప్పి పరీక్షిత్తును వారికి ప్రభువుగా ప్రతిష్ఠించాడు. పాండవుల తరువాత సుస్థిర పరిపాలన హస్తినాపురిలో కలిగింది. అతడి ప్రభుత్వపు బాధ్యత తీరింది.

ఆ తరువాత పాండవులు మృతులైన కురు యాదవ వీరులకు విశేష శ్రాద్ధకర్మలు నిర్వహించి, విశేష దానధర్మాలు చేసి పితృదేవతల ఋణం తీర్చుకొన్నారు. నిరంతరంగా తాము సాగిస్తున్న అగ్నికార్యాలకు సాక్షులుగా నిలిచిన అగ్నులను నీట కలిపి నిత్య కర్మలకు ఉద్వాసన పలికారు. ఆపైన నారచీరలు కట్టి, మందిరభోగాలను వదలి, మహాప్రస్థానానికి ఉపక్రమించారు. పాండవులవెంట ద్రౌపదిమాత్రం బయలుదేరింది. సుభద్ర రాజ్యరక్షకురాలుగా నిలిచింది. ఉలూచీ, చిత్రాంగదలు వారి వారి పుట్టిళ్ళకు పోయారు. మహాప్రస్థానంలో పాల్గొన్నది మొత్తం ఏడుగురు. వరుసగా వారు - ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, ద్రౌపది, వారి వెంట విడువకుండా నడుస్తున్న ఒక శునకం. హస్తినాపురం దాటి వారు యోగప్రస్థానాన్ని చేపట్టారు. స్థిరయోగ సాధనలు సడలకుండా వారు గిరివన నదీనదాలను అవలీలగా దాటి భూప్రదక్షిణంగా తిరిగి హిమవత్పర్వతం దాటి. మేరుపర్వత ప్రాంతాలలో ప్రస్థానం సాగించారు. వారితోపాటు శునకంకూడా యోగప్రస్థానం సాగించి వారందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే, ధర్మజుడు ఆ శునకాన్ని ఎక్కడా ఏమీ ప్రశ్నించలేదు. భీమాదులూ దానిని పట్టించుకొనలేదు.

2. మహాప్రస్థానం:

ప్రస్థానం - అంటే ప్రయాణం. మహాప్రస్థానం అంటే శరీరం పతనమయ్యేంత వరకూ యోగసిద్ధితో సాగించే నిరంతరగమనం. ఇది సమాధిగతులై శరీరంనుండి జీవుడిని బ్రహ్మరంధ్రంద్వారా ఎడలించి ముక్తి ప్రస్థానం చేసే మహాయోగు లనుసరించే యోగమార్గం కాదు. శరీరాన్ని ఉపవాసదీక్షలతో కృశింపచేసి యోగసిద్ధితో భూతలాన్ని తాకకుండా పైకెగసి ఆకాశమార్గంలో చేసే యోగయానం. దేహమనోవృత్తుల సమతులన సాధనద్వారా కర్మయోగులు సాధించే అద్భుతయానం. మహాప్రస్థానం. యోగసాధన కలిగించే ఫలాన్ని ఇస్తుంది. అష్టాంగయోగ ఫలసిద్ధివలననే ఆ ప్రస్థానం సాధ్యమౌతుంది. మహాప్రస్థానంలో భూమిపై పడిన శరీరానికి యోగిశరీరానికివలె దహన సంస్కారాదులు అవసరంలేదు. ఆ దేహంపట్ల శోకమోహాలు పొందకుండా, వెనుదిరగకుండా, నిక్షేపాలు, వికారాలు లేకుండా సమాహిత యోగచిత్తంతో, సంగవిరహితంగా ప్రస్థానం సాగించటం మహాప్రస్థాన లక్ష్యం. మహాప్రస్థానంతో తనువు త్యజించిన వారికి దివ్యలోకాలు లభిస్తాయి. వారు యుద్ధంలో చనిపోయినవారికంటె, యోగంతో తనువులు త్యజించినవారికంటె తక్కువ కారు. పాండవు లందరూ అటువంటి పుణ్యాత్ములు పొందే దివ్యపదాలు పొందాలనే మహాప్రస్థానాన్ని చేపట్టారు.

పాండవుల వెంట ప్రస్థానంలో పాల్గొంటున్న శునకం వారి యోగ ప్రస్థానానికి సాక్షిగా సాగుతున్న యమధర్మరాజు. అతడు తన పుత్రుడైన ధర్మరాజును దివ్యపరీక్ష చేసి దివ్యలోకాలకు పంపాలని అంతటి యాత్రకు నడుం కట్టాడు. పాండవులలో ధర్మజుడు నివృత్తికి, భీముడు ప్రవృత్తికి ప్రతినిధులుగా ప్రతిస్పందించేటట్లు సంఘటనలు సాగాయి. మొట్టమొదట ద్రౌపది యోగబలం సడలింది. ఆమె నేలపై కూలి ప్రాణాలు పరిత్యజించింది. ఆమె స్థితిని చూచి భీము డొక్కడే స్పందించాడు. ఆమె ధర్మం తప్పని ఇల్లాలని దుఃఖించాడు. ఆమె పతనానికి కారణమేమిటని ధర్మరాజును ప్రశ్నించాడు. ధర్మరాజు దుఃఖించలేదు. చలించలేదు. యోగం సడలకుండానే సత్యం చెప్పాడు. ఆమె పాండవు లైదుగురిపట్లా సమమైన అనురాగం కలిగి యోగసిద్ధిని పొందవలసింది. కాని, అర్జునుడివలన పక్షపాతం ప్రదర్శించింది. అందువలన ఆమె పుణ్యం ఫలించలేదు. కాబట్టి ఆ దురవస్థ ఏర్పడిం దని చెప్పాడు. యోగఫలసిద్ధికి పుణ్యకర్మల ఫలసిద్ధి కూడా హేతువనే కర్మఫలయోగాన్ని ధర్మరాజు ప్రతిపాదించాడు. ఆమె కర్మదోషమే దేహపతనానికి కారణమయిందని చెప్పాడు. అయినా, మహాప్రస్థానంలో ఆమె తనువును త్యజించింది కాబట్టి దివ్యలోకభోగాలకు తిరుగు ఉండదని తాత్పర్యం. దానివలన ధర్మరాజు కలత చెందక యోగనిష్ఠతో ముందుకు సాగాడు. భీమాదులు అనుసరించారు.

క్రమంగా సహదేవాదులు యోగం సడలి తనువులను త్యజించారు. భీముడు విషణ్ణుడై హేతువులను తెలిసికొంటూనే ఉన్నాడు. సహదేవుడు నిరహంకారంతో ఎల్లప్పుడూ ధర్మరాజుకు సేవలుచేస్తూ కర్మవీరుడుగా కనబడేవాడు. కాని, అతడు అంతరంగంలో తనకంటె ప్రాజ్ఞుడు లేడని గూఢాహంకారాన్ని ప్రదర్శించేవా డని ధర్మజుడు చెప్పాడు. లోకానికి అనహంకారిగా కనబడేవాడు లోలోన దురహంకారి, బైట ఒక వేషం లోన ఒకవేషం. అందువలన ఆ పాటు తప్పలేదు. నకులుడు కూడా పెద్దలపట్ల ఎప్పుడూ సౌజన్యమూర్తిగా లోకంలో ప్రసిద్ధి కెక్కాడు. కాని, లోలోన తనవంటి అందగాడు లోకంలో ఎక్కడా లేడని గర్విస్తూ ఉండేవాడు. ఈ గూఢాహంకారం అతడి పుణ్యపరిపాకానికి తోడ్పడ లేదని ధర్మజుడు తెలిపాడు. ద్రౌపదీ, నకుల సహదేవులు పడిపోయినందుకు అర్జునుడు లోలోన కుమిలిపోతూ నేలపై పడిపోయాడు. పవిత్ర చరిత్రుడు, సత్యసంధుడు అయిన అర్జునుడి చావుకు కారణ మేమిటని భీముడు అడిగాడు. అతడు కౌరవులనందరిని యుద్ధంలో ఒక్కనాడు సంహరిస్తా నన్నాడు. లోకంలోని కోదండ వీరుల నెల్లప్పుడు నిందించాడు. అన్న మాటను నిలబెట్టుకొనక, పరదూషణ చేసే దోషంవలన అర్జునుడి పుణ్యం ఫలించక అతడి శరీరం పతనమైనదని చెప్పి ధర్మజుడు మోహానికి లోనుగాక ముందుకు సాగాడు. చివరకు భీముడు పడిపోతూ, తన పతనానికి కారణమేమిటని అన్నను అడిగాడు. భీముడు ప్రచండభుజశక్తి కలవాడైనా భోజనప్రీతిని ఎక్కువగా ప్రదర్శిస్తూ ఎదుటివారిని లెక్కచేయక గొప్పలు మాటాడే ప్రగల్భస్వభావంతో కూడిన అహంకారం ప్రదర్శిస్తూ ఉండటంవలన తనువు పడిపోయిందని ధర్మరాజు చెప్పాడు. భీమాదులు ప్రవృత్తి వీరులుగా సోదర ప్రేమను, సతిపట్ల అనురాగాన్ని ప్రదర్శించారు. వారికి సహజంగా ఉన్న మమకార, అహంకారాలే వారి యోగసిద్ధికి ఆటంకాలై మహాప్రస్థానంలో పెద్దవారికంటె ముందుగా శరీరపతనం కావటానికి హేతువులయ్యాయి. భీమాదులలో దోషాలుగా ధర్మజుడు చెప్పినవి మోహాహంకారాలు ప్రగల్భాలు. వాటివలన వారికి శోకాదులు కలిగాయి. యోగం సడలింది. శరీరాలు పడిపోయాయి. మరి ధర్మరాజులో అవి లేవా?

3. అమరేంద్రుడి ఆహ్వానం:

ఆ పరీక్షలు నిర్వహించటానికే అమరేంద్రుడు స్వర్గంనుండి స్వర్ణరథంతో దిగి వచ్చాడు. కల్పవృక్షాల కొమ్మలనుండి పూలవానలు కురిపించాడు. మునీంద్రులచేత స్తోత్రపాఠాలు చదివించాడు. దివ్యరథాన్ని ఎక్కుమని ధర్మరాజును కోరాడు. సశరీరస్వర్గం ధర్మరాజు ముందు సన్నద్ధమై ఉన్నది. ధర్మజుడిలో ఏ మాత్రం మోహమున్నా ఎగిరి గంతువేసి రథమెక్కేవాడే కాని, అతడు శోకసంతప్తుడయ్యాడు.

శా. ‘తోడంబుట్టువు లందఱుం బడిన యా దుఃఖంబు చిత్తంబు సం
పీడం బెట్టెడు; సౌకుమార్యవతి దప్పిం గూలెఁ బాంచాలి; వా
ర్లోడై! వచ్చిరి; వారు లేక యిట మీతో రాను; వారెల్ల నా
తోడంగూడఁగ వచ్చునట్లుగఁ గృపాధుర్యాత్మ! కావింపవే!’ **(మహాప్ర.1.50)**

అని వేడుకొన్నాడు. ద్రౌపదీ, తమ్ములూ పడిపోయిన సన్నివేశాలను ఉద్విగ్నహృదయుడై భీముడు నివేదించినప్పుడు అత్యంత ధైర్య నిగ్రహవృత్తితో చెదరని యోగ సమాధితో ప్రస్థానం సాగించిన ధర్మరాజు ఇంద్రుడి ఎదుట పత్నీ సోదరుల వియోగ దుఃఖం మనస్సును వివరీతంగా పీడిస్తున్నదని వాపోయి, వారు లేని స్వర్గలోక భోగాలు తనకు అనుభోగ్యాలు కావని చెప్పుతూ, వారినికూడా అనుమతిస్తే అమరలోకానికి రావటానికి సుముఖత వ్యక్తం చేశాడు.

ధర్మజుడి సమాధానం శ్రోతలో కొన్ని అనుమానాలు రేకెత్తించే అవకాశం ఉన్నది.

1. ధర్మరాజుకు పత్నియందూ, తమ్ములయందూ ఉన్నది సమత్వబుద్ధియా? మోహబుద్ధియా? అతడి మాటలలో కానవచ్చేది బంధుప్రీతియా? ధర్మ ప్రీతియా?

2. తనువులను త్యజించిన తమ్ములను, భార్యను గురించి శోకిస్తున్న ధర్మరాజు సశరీరులుగా వారికికూడా దివ్యభోగానుభవాలకు అవకాశమిమ్మని కోరుతున్నాడా? లేక వారందరూ తనువులను వీడగా తాను తనువుతో స్వర్గభోగాల నెట్లా భోగించేది? అని సంశయిస్తున్నాడా? స్వర్గానుభూతిలో అందరికీ సమత్వాన్ని కోరుతున్నాడా?

3. చివరకు మిగిలే ప్రశ్న - స్వర్గం సశరీరంగా అనుభవించేదా? అయితే తా నొక్కడికే ఆ అవకాశం ఎందుకు కలగాలి? తమ్ములకూ భార్యకూ కలిగించవచ్చును కదా? తోడైవచ్చినవారిని మార్గమధ్యంలో వదలి ఒంటరిగా స్వర్గానికి పోవటం ధర్మమా? ఈ అసమానతలను ఇంద్రుడే తన దయాప్రవృత్తితో తీర్చగలడు. అందుకే ధర్మజుడు అతడిని ప్రార్థించటం.

ఇటువంటి ధర్మసందేహాలన్నీ తీరేటట్లు సముచిత సమాధాన మిచ్చాడు స్వర్గాధిపతి. 1. ధర్మరాజా! నీకు శోక మెందుకు? భార్యా సహితులై నీ తమ్ములు తనువులు వదలి స్వర్గలోకానికి వెళ్లారు. నీవు వారిని అక్కడ చూడగలుగుతావు 2. నీవు ధర్మమయాత్ముడవు కాబట్టి శరీరాన్ని వదలవద్దు. వెంటనే ఈ తనువుతో స్వర్గానికి బయలుదేరుము’ అన్నాడు. తనువులు వదలిన తమ్ములను, ద్రౌపదిని తనువుతో వెళ్ళితేనే స్వర్గంలో చూడవచ్చుననీ అప్పుడు శోకం శమిస్తుందనీ - సమాధానం చెప్పి ధర్మజుడిలోని శోకమోహాలను వారించి స్వర్గగమనానికి పునరాహ్వానం పలికాడు పురందరుడు.

4. ధర్మసంవాదం:

ఆ తరువాత ధర్మరాజు ఒక ధర్మసందేహాన్ని లేవనెత్తాడు. మొదటినుండి మహాప్రస్థానంలో అత్యంత దృఢభక్తితో అనుసరిస్తున్న ఆ భవ్యశునకాన్ని నిర్దయతో వదలిరావటం న్యాయం కాదనీ, అదికూడా తనతో రావటం ధర్మమనీ ఇంద్రుడిని కోరాడు. ఇంద్రుడు కుక్కకు దివ్యభావం కలగటం అసంభవమనీ, దానిని వదలి రావటం క్రూరత్వం కాదనీ, ఆలస్యం చేయక రథాన్ని ఎక్కుమనీ దేవేంద్రుడు ధర్మరాజును త్వరపెట్టాడు.

ధర్మరాజు ధర్మహానివలన పాపం కలుగుతుందనీ, అది పుణ్యహాని కలిగిస్తుందనీ, దానివలన సద్గతులు దూరమౌతాయనీ, కాబట్టి పాపకార్యానికి తాను తలపడననీ వాదించాడు. సత్పురుషులు ఆశ్రితులను రక్షించాలనీ, భక్తపరిత్యాగంవలన కలిగే సంపద

పరిత్యాజ్యమనీ ధర్మసూక్ష్మాన్ని ప్రతిపాదించాడు. శునకానికి స్వర్గంలో స్థానం లేదనీ, దానిని వదలటంవలన పాపం రాదనీ దేవేంద్రుడు పలికి అతడి పాపభీతిని తొలగించాలని యత్నించాడు. ధర్మరాజు దానికి అడ్డు తగిలి, భక్తితో సేవించేవాడిని వదలితే బ్రహ్మహత్యాదోషం వంటి పాపం కలుగుతుందని పలికి కుక్కను వదలనని ప్రతిజ్ఞ చేశాడు. దానికి శుచికి సంబంధించిన అభ్యంతరాన్ని సురేంద్రుడు ప్రస్తావించాడు. నిష్పాపరులు కుక్కను తాకితే వారి పుణ్యమంతా నశిస్తుందని అన్నారు. 'ఇంత పనికిరాని పని నీవు ఎందుకు చేయాలి? దీనిని నీవు వదిలితే చాలు నీకు స్వర్గసౌఖ్యం లభిస్తుంది' అని మోహపెట్టాడు. ఇంకా ఇట్లా అన్నాడు.

చ. 'జనులు నుతింపఁగా సుకృతసంపదఁ జేసి యమర్త్య భావముం
గనియును జెంద కిట్లునికి కార్యమె? ద్రౌపది, భీమసేను, న
ర్జునుఁ గవలం దృజించుటకు సువ్రత! చాలితి; చాల వయ్యె దీ
శునకము విడ్వ; నిత్తెఱఁగు సూరినుతుండగు నీకు నర్హమే?' (మౌస.1.56)

ఈ సూటి ప్రశ్నకు ధర్మజుడు రోషంతో, అహంకారంతో సమాధానం చెప్పవచ్చును. కాని, అతడు నిగ్రహించుకొని, నిబ్బరంగా, నిరహంకారంగా మాటాడాడు. 'ధర్మప్రభువులకు ధర్మం నేను చెప్పగలనా? పెద్దలతో వాదం చేయవచ్చునా? అయినా, వినయంతో విన్నవించుకొంటా'నని దోషంలేని పద్ధతిలో దోసిలి ఒగ్గి పలికాడు'. భీమాదులూ ద్రౌపదీ చనిపోయారు కాబట్టి ఏడ్చినా తిరిగి రారని మోహం చంపుకొన్నాను. కాని, చావని ఈ కుక్కను విడువనంటే మీరు తప్పుగా భావించటం న్యాయమా?' అని ప్రశ్నించాడు.

చ. 'అనఘచరిత్ర! విన్ము; శరణాగతుఁ జేకొన కున్కి శుద్ధమి
త్రునియెడఁ జేయు ద్రోహము, వధూటి వధించుట, విప్రునర్థముం
గొనుట యనంగఁగల్గు నివిగూడ సమంబగు; నాకుఁ జూడ భ
క్తు ననపరాధునిన్ విడుచు దోషముతో నిది యోర్వ వచ్చునే?

ఉ. కావున నాకలోకపు సుఖం బటు లుండఁగనిమ్ము దేవ! నీ
భావము నిల్పు నా దెసఁ గృపాభరితంబుగ సారమేయ సం
భావనసేఁత దోసముగఁ బట్టమి నాకు వరంబు, నీవు పొ;
మ్మీ వనభూమి నుండెద సమిద్ధతపంబుల నిన్ను గొల్చుచున్.' (మహా.1.58.59)

ఈ వాక్యాలు ధర్మరాజుయొక్క పరిపూర్ణ ధర్మస్వరూపాన్ని ప్రత్యక్షీకరింప చేశాయి. వినయంతో విజ్ఞతను ప్రకటించిన ధర్మరాజు ప్రగల్భోక్తులు పలుకని వాడయ్యాడు. "యోగినః సమదర్శినః" అన్న గీతావాక్యానికి అనువుగా కుక్కయందూ, కుక్కమాంసం తినేవాడియందూ సమంగా వ్యవహరించే సమత్వాన్ని ప్రకటించి యోగనిష్ఠను పోషించుకొన్నాడు. కుక్కను శరణాగతుడిగానూ, భక్తుడిగానూ పోల్చి చెప్పి రాజధర్మాన్నీ దైవధర్మాన్నీ స్పృశించి ఇటు మానవులకూ అటు దేవతలకూ గల ధర్మసామ్యాన్ని ధ్వనింపజేశాడు. అపరాధం చేయని భక్తుడిని వదలటం శరణాగతుడిని వంచించటంవలన కలిగే పాపం మిత్రద్రోహం, వనితావధ, బ్రాహ్మణ ద్రవ్యచౌర్యంవంటి దోషాలవలన కలిగే పాపంకంటె దుర్భరమని పాపచింతను వ్యక్తంచేసి స్వర్గ ప్రాప్తికి ఆ పాపం అడ్డుకట్టవంటి దని ధర్మనిష్ఠను ప్రదర్శించాడు. కుక్క కొరకు స్వర్గభోగాలను ప్రక్కకు పెట్టటం ధర్మరాజుయొక్క మోహరాహిత్యాన్నీ, సారమేయాన్ని సమర్థించటమే పాపమని దేవేంద్రుడు భావిస్తే దానిని క్షమించే వరమిమ్మని కోరే వినయాన్నీ విజ్ఞతనూ ప్రకటించే వివేకాన్నీ ప్రదర్శించాడు. ఒకవేళ ఆ విధంగా కోరటంవలన దేవేంద్రుడికి కోపంవస్తే అతడి అనుగ్రహం కలిగేంతవరకు వనంలో ఉండి తపస్సు చేస్తానని తిరుగులేని నియమశీలాన్ని ప్రదర్శించి దేవేంద్రుడిని ధర్మశీలంతో బంధించాడు. ధర్మవినయ దయాదిగుణ ప్రకాశమైన వాక్యరచనా విధానం విషయ నిరూపణ సమర్థం కావటమే కాకుండా విషయాతీతుడైన దైవాన్నికూడా అర్ద్ర పరిచింది. సారమేయరూపుడైన ధర్ముడు నిలువున పులకించి నిజరూపం ధరించి ధర్మజుడి ధర్మస్థితిని వేనోళ్ళ కీర్తించాడు. పూర్వం ద్వైతవనంలో నీటిమడుగులో

నీరుత్రాగి విగతజీవులైన తమ్ములలో ఒక్కరిని కోరుకొమ్ము బ్రతికిస్తానన్నప్పుడు, ధర్మరాజు తన పినతల్లి పెద్దకొడుకైన నకులుడిని కోరుకొని ప్రదర్శించిన ధర్మనీతిని ప్రశంసించాడు. ఆశ్రితరక్షణధర్మంతో శునకంకొరకు ఇంద్రుడి రథాన్నే ఎక్కనన్న ధర్మజుడి త్యాగశీలాన్ని కీర్తించాడు. ధర్మరాజువంటి ధర్మవీరులు స్వర్గంలో కూడా ఉండరని మెచ్చుకొన్నాడు.

ఉ. "ఇంతటి పెంపు గల్గుట మహేంద్రుఁడు నీ దెస గాంచె; నీవు ని
శ్చింతత మేనితోఁ జనుము సిద్ధపథంబునఁ బుణ్యలోకముల్ ।;
వింతలు గాకయుండఁ బృథివీవర! నీకు నుదారసౌఖ్య మ
త్యంతము నవ్యయంబు నగు నందలి మాన్యులు సంస్తుతింపఁగన్. **(మహా.1.66)**

అని ప్రోత్సహించాడు. ఇంద్రాది దేవతలందరూ కలసి ధర్మరాజు నెత్తికొని దివ్యరథంలో ఉంచి, దాని ప్రక్కన తమ రథాలు నడపుకొంటూ, సిద్ధగణాలు స్తుతిస్తూ ఉండగా స్వర్గలోకానికి పరమాహ్లాదంగా తీసికొనివెళ్ళారు.

ఆ దివ్యసన్నివేశాన్ని చూచి నారదమహర్షి ఎల్లవారును వినేటట్లు సంపూర్ణస్వరంతో ఇట్లా ధర్మజుడి ప్రశంసను ప్రకటించాడు.

ఉ. "దానములం దపంబులను దద్దయుఁ బేర్కలయట్టి వారలన్
మానవనాథులన్ వినమె? మాసె దదీయ యశంబులెల్ల నీ
మానిత కీర్తిదీప్తులు సమస్త జగంబులయందుఁ బర్వుట
న్మేనులతోడ వా రిటుల నేర్చిరె రా నమరత్వసిద్ధికిన్.' **(మహా.1.69)**

పూర్వ ప్రభువులు చాలామంది స్వర్గాన్ని పొందారే కాని, బొందితో స్వర్గాన్ని అధిరోహించినవారు లేరనీ, ధర్మరాజుకే ఆ పుణ్యం దక్కిందనీ దేవర్షి ప్రకటించాడు. మహాప్రస్థానికపర్వంలో అద్భుతం ధర్మజుడు మేనితో స్వర్గారోహణం చేయటం.

అది కలిగించిన మరొక అద్భుత మేమిటంటే తనకంటె ముందు తనువులు చాలించి స్వర్గంలో నివసిస్తున్న తమ్ములను, భార్యను, తన పక్షంవారైన శూరులనూ చూడాలనే కోర్కె కలగటం, వనవాసం చేస్తున్న ధృతరాష్ట్రుడు వ్యాసమహర్షిని కోరినవరం కూడా ఇటువంటిదే. అప్పుడు గంగనుండి దివ్యదేహాలతో వెలువడిన వీరవర్గాన్ని దర్శించాడు ధర్మరాజుకూడా. ఆ తరువాత ధృతరాష్ట్రుడు. గాంధారి, కుంతి, తమ్ములు, ద్రౌపది మొదలైనవారు దివంగతులయ్యారు. వారినందరినీ స్వర్గంలో చూడవచ్చునని ఇంద్రుడు సూచించాడు. అమరనాథుడు అడగకుండా ఇచ్చిన అపూర్వమైన వర మది. దానిని ప్రసాదింపజేయండని దివ్య మహర్షులను ముందుగా కోరాడు. ధర్మరాజు కాని, నారదాదులు ఆ కోర్కెను వారించారు. అపారపుణ్య ఫలంగా దివ్యదేహాలుండే స్వర్గంలో ప్రవేశించి మానవ దేహ వికారమనస్కతతో బంధుమిత్రులపై దేహబంధమమకారాలను పెంచుకొని దర్శించాలని కోరటం దేవతలు మెచ్చే కార్యంకాదని నచ్చచెప్పటానికి యత్నించాడు. కాని, ధర్మజుడు వారి అభ్యంతరాన్ని పట్టించుకొనలేదు. సరాసరి దేవేంద్రుడినే తెగవేసి అడిగాడు.

ఉ. 'మీ రిటు లేమి సెప్పిన నమేయభుజాబలభగ్న దైత్య! యే
గారవ మొప్పఁ దమ్ములను గాంతను బుత్త్రుల మిత్రకోటిఁ గ
న్నారఁగఁ జూడకుండుటకు నక్కట యోర్తునె? యెల్లభోగముల్
వారలఁ జూచి క్రమ్మఱఁగ వచ్చి సుఖస్థితిమై భుజించెదన్." **(మహా.1.75)**

అమరలోకానికి భౌతికకాయంతో వచ్చిన భూపతి కోరే కోరిక అమరపతికే అద్భుతంగా తోచవచ్చును. మరి తనువుతో ధర్మరాజును దివ్యలోకానికి దేవతలు ఎందుకు తెచ్చినట్లు? అది మేరుపర్వతమంత ప్రశ్న. దీనికి అద్భుతమైన సమాధానం చెప్పటమే మహాభారతేతిహాసకథా నిర్వహణంలోని నిజమైన అద్భుతం. అందుకే స్వర్గారోహణపర్వం స్వతంత్ర పర్వంగా సముద్భవించింది.

స్వర్గారోహణపర్వం

1. మూడు రంగాలు:

ధర్మరాజుకు ఏర్పడిన ధర్మపరీక్షలు రెండు విధాలు: అవి మానవ పరీక్షలు, దైవపరీక్షలు, మానవకృతపరీక్షలలో కృష్ణ భీమార్జునుల శక్తి యుక్తులను ఉపయోగించుకొని విజయాలను సాధించాడు. దైవకృతమైన ధర్మపరీక్షలలో స్వీయమైన యోగశక్తిని, ధర్మప్రవృత్తిని ఉపయోగించి సర్వ స్వతంత్రుడై వ్యవహరించి మానవులను, మహర్షులను, దేవతలను మెప్పించి తన ఉత్తమ ధర్మవీర నాయకత్వాన్ని నిలుపుకొన్నాడు. దైవపరీక్షలలో మకుటాయమానమైనది స్వర్గారోహణపర్వంలో నిర్వహించబడే చరమపరీక్ష. ఇది విలక్షణమైనది. దీనిలో ప్రదర్శించబడే ధర్మస్థితికి 'దేవత్వమే' ఫలం!

ఇతిహాసంలో నాయకుడు పొందే కర్మఫలానుభవాన్ని కూడా చిత్రించటం ఒక మహాసంప్రదాయం. మహాభారతంలో ఆ భాగం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడింది. ఆ నిర్వహణ శిల్పం స్వర్గారోహణ పర్వంలో నాటకీయంగా, అద్భుతంగా చిత్రించబడింది. ఇందులో ప్రధానంగా మూడు రంగాలు ఉన్నాయి. మూడు అద్భుతాలు ఉన్నాయి. ముప్పేటగా సాగే ఈ కథా సంవిధానం దేవలోకంలో చిత్రించబడిన ధర్మజ ధర్మవీర దివ్యవిలాసం.

దీనిని ఈ విధంగా విశ్లేషించవచ్చును.

1. ధర్మరాజు పాంచభౌతిక శరీరంతో స్వర్గలోకంలో ప్రవేశించినా, ఆ శరీరంతో ఎటువంటి భోగాలు అనుభవించగలడు? శరీర వికారాలకు స్వర్గనరక భోగాలు అందుతాయా? అయితే ఆ రెండు లోకాల భోగాలనూ ధర్మరాజు శరీరానికి అందించి అనుభవింపజేసే మార్గం ఏమిటి? ఆ వ్యూహాన్ని చిత్రించి నిర్వహించిన దర్శకులు స్వర్గనరకాధిపతులు మహేంద్రుడు, యముడు, ప్రక్కనుండి సమీక్షిస్తూ సమయోచిత సూచనలను, ప్రశంసలను అందించిన మార్గదర్శులు మహర్షులు. వీరందరు కలిసి ఆడిన స్వర్గనరక మాయాదర్శన రంగం ప్రథమరంగం.

2. స్వర్గనరకాలలో సంచరించేటప్పుడు శరీరానికి సంబంధించిన రాగద్వేషాలకు మనస్సులోనైనా, ధర్మవర్తనంలో ధర్మరాజు స్థిరంగా నిలువగలుగుతాడా లేదా అన్న పరీక్ష చేయటం రెండవరంగం. దుర్యోధనుడు స్వర్గభోగాలు అనుభవిస్తున్న దృశ్యం ధర్మరాజుకు అసూయ కలిగించింది. దానివలన స్వర్గభోగాల మీద అసహనభావం ఏర్పడింది. కర్ణభీమాదులు నరకలోకయాతనలు అనుభవిస్తున్నారని తెలిసిన ధర్మజుడు- దుస్సహమైన నరకంలో వారితో కలిసి ఉండటమే తనకు ఆనందమని ప్రకటించటం అతడి. ధర్మ ప్రవృత్తికి ప్రతీకగా నిలిచింది. స్వజనం కొరకు స్వర్గాన్ని కాదన్న ధర్మజుడి ప్రవృత్తి యమధర్మరాజును ఆనందంలో ముంచెత్తింది. అది దేవేంద్రుడూ తానూ కలిసి పెట్టిన దివ్యపరీక్షగా ప్రకటించి ధర్మజుడి ఉత్తమ ధార్మిక ప్రవృత్తిని ఉదాత్తంగా కీర్తించాడు. ఉత్తమ ధర్మవీరుడి శరీరధారణం స్వర్గనరకభోగ పరీక్షలో నిగ్గు తేలటం ఈ ద్వితీయరంగ ప్రయోజనం.

3. స్వర్గంలో శరీరంతో అనుభవించే అనుభవం లేదనే రహస్యం తెలిసిన తరువాత కూడా ధర్మరాజు తనువుతో తనవారిని స్వర్గంలో చూడాలని అనుకొనటం ఎంతటి భ్రాంతిమూలమో తెలపటం జరిగింది. స్వర్గవాసులు దివ్య దేహాలతో ఉంటారు. వారిని దివ్యదేహాలే చూడగలరు. అందువలన ధర్మరాజు ఆకాశగంగలో మునిగి పాంచభౌతికకాయాన్ని వదలి, దివ్యదేహాన్ని ధరించి కర్ణాదులను దర్శించవచ్చునని యమదేవేంద్రులు చెప్పి, ఒప్పించి దివ్యగంగలో మునిగేటట్లు చేశారు. ధర్మరాజు తనువును గంగలో త్యజించి దివ్యదేహంతో వెలువడి తనవారిని దివ్యదేహాలుగా దర్శించాడు. విశేష మేమంటే - ఆ దివ్యదేహాలకు, భౌతికకాయ స్పృహలు లేవు. ధర్మరాజుకూ తమ స్పృహ లేకపోవటంచేత అహంకార మమకార బంధాలు అతడికి స్ఫురించలేదు. పొగలేని అగ్నివలె ధర్మరాజు వెలుగొందుతూ దేహానుబంధాలు లేని దివ్యత్వాన్ని అనుభవించాడు. ఈ అనుభవం కలగటానికి దేవేంద్రుడు, యముడు, నారదాది మునీంద్రులు సహకరించారు. ధర్మరాజు చివరకు తేజోరూపంతో ధర్ముడిలో లీనమైపోయాడు. ఇది అద్భుతాంతమైన చివరిరంగం. దీనితో స్వర్గారోహణపర్వమే కాదు మహాభారతేతిహాసం కూడా పరిపూర్ణమౌతుంది.

2. ఆరోహణమే కాని అవరోహణం లేదు:

'స్వర్గారోహణం' అనే సమాసం సార్థకమైనది. స్వర్గమోక్షాల రెండింటిలో ఆరోహణం ఉన్నా, 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి' అనే గీతా వాక్యం ప్రకారం స్వర్గం నుండి మాత్రమే పుణ్యభోగానంతరం జీవులు మర్త్యలోకానికి 'అవరోహణం' చేసే అవకాశం ఉన్నది. దానిని స్ఫురింపజేసేది మొదటి అర్థం. అంటే పాండవాదులు తాము చేసిన పుణ్యకర్మల ఫలితంగా స్వర్గాన్ని పొందుతారు. పుణ్యఫలాలను అక్కడ అనుభవించి మరల భూలోకంలో జన్మలెత్తుతారు. ఈ సంసారచక్రాన్ని స్ఫురింపజేసే అర్థం ఆ శీర్షికలో ధ్వనింపజేయబడుతుంది. స్వర్గారోహణపర్వం ఇంతకంటె విశిష్టమైన అర్థాన్ని కూడా అందిస్తుంది. అప్పుడే దాని అర్థం సార్థకమౌతుంది.

మహాభారత కథనంతా విని జనమేజయుడు వైశంపాయనుడిని ఒక ప్రశ్న అడుగుతాడు. కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్న వీరులందరూ స్వర్గానుభవాలను పొంది తిరిగి మర్త్యలోకంలో పుట్టారా? అని, దానికి వైశంపాయనుడు ఒక దేవరహస్యం చెప్పాడు. అది వేదవ్యాసుడే చెప్పాడని వెల్లడించాడు. భారతయుద్ధం శ్రీకృష్ణావతార లీలా విశేషంలో భాగంగా జరిగిందే కాబట్టి ఆ తరంలో పుట్టిన వారందరూ కారణ జన్ములనీ, వారందరూ దేవాంశలలోనో, రాక్షసాంశలలోనో, గంధర్వాది దేవయోనుల అంశలలోనో పుట్టినవారనీ, వారందరూ శరీరాలను వదలి కర్మఫలానుభోగాలను స్వర్గనరకాలలో అనుభవించి, చివరకు వారి వారి మూల ప్రకృతులలో భాగాలుగా కలిసిపోయారే కాని పునర్జన్మలు ఎత్తలేదని తెలిపారు. అందువలన మహాభారత పాత్రలన్నీ పునర్జన్మలెత్తని వారే అయితే వారందరూ పొందింది మోక్షం మాత్రం కాదు. దానాలూ, ధర్మాలూ, యజ్ఞాలూ, తీర్థయాత్రలూ, వ్రతాలూ, తపస్సులూ, యుద్ధాలూ మొదలైన పుణ్యకర్మలవలన ఆయా యజమానులు వివిధ పుణ్యలోకాలు పొందుతారు. వాటి నన్నింటినీ స్వర్గలోకంలోని భాగాలుగానే పరిగణించటం పరిపాటి. అందువలననే.

తే. 'రాజసూయశ్వమేధాధ్వరముల సంచి । తంబు లయిన యుదాత్తలోకంబు లనుభ
వింపు మాధిక్య మహనీయ విభవ మెసఁగ । నక్షయోదార సౌఖ్యంబు లావహిల్ల.' **(మహా.1.44)**

అని మహేంద్రుడు ధర్మరాజుకు ఆయా లోకానుభవాలను స్వర్గానుబంధంగా నియోగించాడు. ధర్మరాజు చివరకు యమధర్మరాజులో లీనం కావటం కూడా స్వర్గారోహణంలోనికే వస్తుంది. అంటే మహాభారత పాత్రలకు స్వర్గపరంగా ఆరోహణమే కాని, అవరోహణం లేదని ఈ పర్వం ప్రకటించే పరమతాత్పర్యం.

3. పద్యత్రయం: పర్వహృదయం:

ఆదర్శ ధర్మవీరుడైన ధర్మరాజు ఉత్తమ కర్మవీరుడు. కర్మయోగానికి సంబంధించిన సర్వధర్మభోగాల అనుభవం అతడి జీవితంలో చూచాడు. చాలావరకు అనుభవించాడు. లోకాంతర వర్తనంలోకూడా తదనుభూతిని దేవేంద్ర యమధర్మరాజుల అనుగ్రహంవలన తెలుసుకొన్నాడు. మహేంద్రుడి ఉపదేశం కర్మఫలోపనిషత్తు వంటిది.

క. 'విను మొక్కటి సెప్పెద రా । జనువానికి నెల్లఁ దప్ప దవనీశ్వర! యె
ట్లును నారకస్థలంబుం । గనుఁగొన వలయు; టిది వేదకథితము సుమ్మీ!'

సీ 'పుణ్యంబులును బాపములు రెండు జోకలై । యుండుఁ; బుణ్యంబుల నొదవు నాక
సుఖము పాపంబులఁ జొప్పడు నరక దుః । ఖము; విను మున్ను నాకంబు సుఖము
ననుభవించిన యట్టి యతఁడు పదంపడి । యధిక నారకపీడ ననుభవించు;
మున్న నారకదుఃఖమునఁ బడ్డవాఁ డనం । తరమ నాకమునఁ దాఁ బొరయు సౌఖ్య;

తే. మల్పపుణ్యుండు తొలి తొలి యమరతా సు । ఖంబు గయికొని మఱియు దుఃఖముల నొందు;
భూరిపుణ్యుండు మునుమును ఘోరనిరయ । యాతనల నొంది వెండి సౌఖ్యంబు లొందు.'

క. ఇట నేను నిన్నుఁ బుత్తెం । చుట యుత్తరకాల దివ్యసుఖ సంగమ సం
ఘటనకుఁ గాదే? నీ కట । కటఁబడుటకు దీనిఁ దెలుపఁగా రావలసెన్.' **(మహా.1.38-40)**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

స్వర్గారోహణపర్వ సారం ఈ పద్యత్రయం.

కవిత్రయం రచించిన ఆంధ్రమహాభారతం తెలుగులో వెలసిన పంచమవేదం.

తే. అమల ధర్మార్థ కామమోక్షముల గుఱిచి । యొలయు తెరు వెద్దియును నిందుఁగలుగు; నదియ
యొండెడలఁ గల్గు; దీన లేకుండు చొప్పు । దక్కొకంటను లేదు వేదజ్ఞులార!' **(మహా.1.82)**

మహాభారతం: శాంతరసం: ధర్మవీరం:

శాంతానికి రసస్థితి నంగీకరించే లాక్షణికులలో ప్రధానంగా వినవచ్చే వాదాలు రెండు. ఒకటి శాంతరసం నవమరసమని వివేచించేది ('నిర్వేదస్థాయి భావాత్మకః శాంతోఽపి నవమో రసః'-కావ్యప్రకాశమ్) మరొకటి శాంతం ప్రకృతిరసమని ప్రతిపాదించేది.

'భావా వికారా రత్యాద్యా శ్శాంతస్తు ప్రకృతిర్మతః।
వికారః ప్రకృతేర్జాతః పునస్తత్రైవ లీయతే॥
స్వం స్వం నిమిత్త మాసాద్య శాంతాద్భావః ప్రవర్తతే।
పునర్నిమిత్తాపాయే తు శాంత ఏవ ప్రలీయతే॥' **(నాట్యశాస్త్రమ్ 1.107-108 అభినవభారతీసహితమ్)**

రసస్థితిని అంగీకరించటంలో ఈ రెండూ సంవదించినా వాదంలో వీటిమధ్య కొంత అంతరం కనబడుతుంది. శృంగారాది రసాలవంటిదే శాంతమని చెప్పే పద్ధతి మొదటిది. శృంగారాదులను వికృతిరసాలుగా వివేచించి వాటి ఉదయానికీ, ఉపశాంతికీ వెనుక మూలకందమైన నిర్వికారచిత్త వృత్తిని ప్రకృతిరసంగా భావించేది రెండవది. సహజమైన ఈ భేదాన్ని ఈ రససమన్వయ మార్గాలలో పాటించాలి.

ఈ పర్యాలోచనలో రసం సహృదయనిష్ఠలం అన్న సత్యం నిర్వివాదాంశం. 'యేషాం కావ్యానుశీలనవశాత్ విశదీభూతే మనోముకురే వర్ణనీయ తన్మయీ భవన యోగ్యతా తే హృదయ సంవాద భాజః సహృదయాః' అనే ధ్వన్యాలోక సహృదయ లక్షణం ప్రమాణం. కావ్యంలో నాయకాదుల నాశ్రయించి ప్రతీయమాన మయ్యే స్థాయిభావాలను తన్మయీ భవన యోగ్యతతో హృదయసంవాద భాక్కులై అనుభవించేవారు సహృదయులు. వారి అనుభవం నాటకాదులతో అయిన సమరూప చిత్తవృత్తి రూపమైన భావసంవాదం. అందువలననే శారదాతనయాదులు "యస్తుష్టౌ తుష్టి మాప్నోతి? శోక ముపైతి చ । క్రోధే క్రోధో భయే భీరు । స్స శ్రేష్ఠః ప్రేక్షక స్స్మృతః॥" (భావప్రకాశమ్) అని పేర్కొనటం, నాయకాశ్రితమైనది రతి అయితే సహృధయానుభవనిష్ఠ మయ్యేది శృంగారరసం. నాయకాశ్రితమైన స్థాయినే వ్యవహార సౌలభ్యం కొరకు రస మంటారు కాని రసం సామాజికనిష్ఠమైనదే.

శాంతం ప్రకృతి రసమన్న వాదాన్ని స్థాపించినవాడు అభినవగుప్తుడు. నవమరసంగా ఆ రసాన్ని స్థాపించటంలో కానవచ్చే కొన్ని అనుపపత్తులను తొలగించటానికీ, శాంతరసస్థాయి భావ కోలాహలాన్ని శాంతింపజేయటానికీ ఒక మహామంత్రంగా ఆయన ఆ క్రొత్తబాటను నిర్మించాడు. అది ఒక రససమీకరణవాదంగా రూపొందింది.

అభినవగుప్తుడు శాంతరసానికి తత్త్వజ్ఞానం స్థాయి భావమని ప్రతిపాదించి స్థాపించిన తీరు. పరమరమణీయం, పరమ ప్రమాణం ఆయన 'శాంతరస ప్రకరణ' ప్రవచనాన్ని మనం రెండంశాలుగా విభజించుకొని పరిశీలించవచ్చును. 1. స్థాయిభావ స్వరూప స్వభావ విచారం. 2. శాంతరసాస్వాదన విధాన విచారం.

1. తత్త్వజ్ఞాన (స్థాయిభావ) స్వరూపస్వభావాలు:

1. తత్త్వజ్ఞానమే మోక్షసాధనం కాబట్టి తత్త్వజ్ఞానమే స్థాయి. తత్త్వజ్ఞానమంటే ఆత్మజ్ఞానమే. జ్ఞానానందాది విశుద్ధ ధర్మ యుక్తమైనదీ. పరికల్పిత విషయోపభోగరహితమైనదీ అయిన ఆత్మయే శాంతానికి స్థాయి. దీనిని స్థాయి అని ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు.[1]

---

1. 'కస్తర్హ్యత్రస్థాయీ? ఉచ్యతే - ఇహతత్త్వజ్ఞానమేవ తావన్మోక్ష సాధన మితి తస్యైవ మోక్షే స్థాయితా యుక్తా తత్త్వజ్ఞానం చవా మాత్మజ్ఞాన మేవ.. తేవ ఆత్మైవ జ్ఞానానందాది విశుద్ధ ధర్మయోగీ పరికల్పిత విషయోపభోగ రహితోఽత్ర స్థాయీ. న చాన్య స్థాయి తయా స్థాయిత్వం వచనీయం' (అభినవ భారతి - పరిష్కృత శాంతరస ప్రకరణమ్ - Number of Rs - Prof v.Raghavan - పుట 97

2. తత్త్వజ్ఞానం సకల భావాంతర భిత్తిస్థానీయం. సర్వస్థాయి భావాలకంటె అది స్థాయితమం. రత్యాది చిత్తవృత్తులన్నీ ^¥H÷‹ 6KG¶□°. JO^Î=□# Jk x‹ ¬¹/¾Ø ‹ ªbÉ□Ö ƒ i=Q[2]

3. రత్యాదులకూ తత్త్వజ్ఞానానికీ భేదం ఉన్నది. రత్యాదులు భిత్తవృత్త్యంతర సంయుక్తాలై కలుషితాలౌతాయి. వాటికి లౌకిక ప్రతీతి ఉన్నది. తత్త్వజ్ఞానం చిత్తవృత్త్యంతరానుసంధానం కలిగినా అవికల్ప రూపంగా ఉంటుంది. దానికి లౌకిక ప్రతీతి ఉండదు. లోకంలో ఇది కొంత భావించినా, రత్యాదిస్థాయి భావాలవలె దీనిని పరిగణించటానికి వీలు లేదు. సాధ్యరసాలైన శృంగారాదులలో సిద్ధరసమైన శాంతానికి ఉపయోగం లేదు. తత్త్వజ్ఞానం ఎప్పుడూ సంచారిభావంవలె లక్షణీయం కాదు.[3]

2. శాంతరసాస్వాదనవిధానం:

1. తత్త్వజ్ఞాన బీజ సంస్కార భావితులే ఇందులో సహృదయసంవాదాన్ని పొందగలుగుతారు.[4]

2. తత్త్వజ్ఞానం, శమం - సర్వం ఆత్మరూపమే రత్యాదులు ఆత్మలోని కాలుష్యోపరాగ విశేషాలు. తత్త్వజ్ఞాన సిద్ధుడైన సహృదయుడు రత్యాదులను అనుగమించినా, సమాధినుండి వ్యుత్థిత చిత్తుడైనా అవ్యవధానంగా సమాధిబలంచేత దానిని అధిగమించి, ప్రశాంతచిత్తు డౌతాడు.[5]

---

2. 'తత్త్వజ్ఞానం తు సకల భావాంతర భిత్తిస్థానీయం: సర్వస్థాయిభ్య; స్థాయితమం; సర్వా రత్యాదికా; చిత్తవృత్తి; వ్యభిచారి భావయిన్ నిసర్గత ఏవ సిద్ధస్థాయిభావ మితి త న్నవచనీయమ్'' - పరిష్కృత శాంతరస ప్రకరణమ్ N.O.R - పు98

3. 'సహ రత్యాదయ ఇవేతరా సంపృక్తేన వపుషా తథావిధ మాత్మరూపం లౌకిక ప్రతీతి గోచరం స్వగతమపి అవికల్పరూపం వ్యుత్థానాపసరే నుసంధేయమానం చిత్తవృత్త్యంతర కలుష మేవావభూతి భాసతాం వా లోకే తథా; తథాపి న సంభవ న్మాత్ర స్థాయినాం గణనమ్, రసేషూక్తేషు అనుపయోగాత్, అపి తు వ్యభిచారిత్వేన లక్షణీయత్వం విజ్ఞాయతే, నే తరతా''. ప. శాం. ప్ర N.O.R - పుట 98.

4 "హృదయసంవాదోఽపి తథావిధ తత్త్వజ్ఞాన బీజ సంస్కార భావితానాం భవత్యేవ''. (ప. శాం. ప్ర N.O.R - పుట 103).

5. "తదిద మాత్మస్వరూప మేవ తత్త్వజ్ఞానం శమః, తథా చ తత్కాలుష్యోపరాగ విశేషా ఏవాత్మవో రత్యాదయః, తదనుగమేఽపి శుద్ధ మస్య రూపం అవ్యవధాన సమాధిబలా దధిగమ్య వ్యుత్థానేఽపి ప్రశాంతతా భవతి.'' (ప. శాం. ప్ర N.O.R - పుట 99).

3. శాంతం సర్వరస ప్రకృతి. ఇతర రసాలు సంస్కారాంతరాలతో ఉంటాయి. శాంతం సర్వసంస్కార మూలప్రకృతి. విషయ విపరివృత్తివలన సర్వరసాలూ పర్యంతాన శాంతంగానే అస్వాదనీయా లౌతున్నాయి.[6]

4. తత్త్వాస్వాదన స్వరూపం ఇట్లా ఉంటుంది. రత్యుత్సాహాదులన్నీ ఉపరాగాన్ని కలిగిస్తాయి. దానివలన ఆత్మస్వరూపం ఉపరంజితమై వాటియందు అనుభూతమౌతుంది. విరళంగా కూర్చబడిన రత్నాలలో సితతరంగా నిర్భాసించే సూత్రంవలె ఉపరంజకాలైన రత్యాదులలో ఆత్మస్వరూపం గోచరిస్తుంది. రత్యాదు లేవీ ఉపరంజకాలుగా లేకపోయినా ఆత్మవలె ఆత్మజ్ఞానం భాసిస్తుంది. అట్లా భాసమానమైన తత్త్వజ్ఞానం విషయ పరాఙ్ముఖత్వంవలన సకల దుఃఖ విరహితమై పరమానంద లాభంతో సంవేదకరూపమై ప్రకాశిస్తుంది. కావ్య ప్రయోగబంధాల వలన సాధారణరూపంలో నిర్భాసించి, అంతర్ముఖావస్థా భేదంతో లోకోత్తర ఆనందాన్ని ఇచ్చి సంవిన్మయమైన హృదయసంవాదాన్ని కలిగిస్తుంది.[7]

పై అంశాలను క్రోడీకరించుకొని శాంతరస సమాలోచనం చేస్తే ఈ క్రింది విధంగా వివేచించాలి.

1. నిసర్గసిద్ధమూ, స్థాయి తమమూ, ఆత్మజ్ఞానరూపమూ, సర్వరస ప్రకృతి భూతమూ అయిన స్థాయివలన కలిగే రససిద్ధి వికృతి రససిద్ధికంటె విశిష్టమై ఉండాలి.

2. రత్యాదులు వికృతులైతే ప్రకృతి అయిన ఆత్మజ్ఞానం నిర్వికారంగా నిలిచేది అయి ఉండాలి. అయితే అది ప్రాగభావం కాకుండా ప్రధ్వంసాభావమని తృష్ణాక్షయ సుఖస్థాయి విచారంలో అభినవగుప్తుడు నిర్దేశించాడు.[8]

3. రత్యాదులు సహృదయులకు రసానందాన్ని కలిగిస్తే, స్థాయితమమైన తత్త్వజ్ఞానం జ్ఞానానందాది విశుద్ధ ధర్మమైన ఆత్మస్వరూపంలో ఆభిన్నం కాబట్టి, దానివలన కలిగేది జ్ఞానానందమని నిర్దేశించవచ్చును.

4. శాంతరసాస్వాది అయిన సహృదయుడు సహజంగా తత్త్వజ్ఞాన బీజ సంస్కార భావితుడుగా ఉండాలి. కాబట్టి వీతరాగుడైన జిజ్ఞాసువే ఈ రససిద్ధికి తగిన అధికారి. జిజ్ఞాస మోక్షదాయకం కాబట్టి మోక్షపురుషార్థనయమైనదే శాంతం.[9]

5. రసం సామాజికనిష్ఠం కాబట్టి సహృదయుడి తత్త్వజ్ఞానమే శాంతానికి స్థాయి.

6. మోక్షపురుషార్థ సాధనైక వృత్తి గల సహృదయుడికి కావ్యరసాస్వాదన ప్రవృత్తియే ఒక వికృతి. ఆ వికృతి నాశ్రయించి అతడు ముందుకు సాగినా అతడి ఆత్మ తత్త్వజ్ఞానం రత్నహారంలోని దారంవలె ఉపరంజితమైనా, కాకపోయినా స్వస్వరూప ప్రకాశంతో నివృత్తి రూపంగా శోభిస్తూ ఉంటుంది.

---

6. "తత్ర సర్వరసానాం శాంత ప్రాయ ఏవాస్వాదః, విషయేభ్యో విపరివృత్త్యా, తన్ముఖ్యతాలాభః కేవలం వాసనాంతరోపహిత ఇతి- అత్ర సర్వప్రకృతి త్వాభిధానాయ పూర్వ మభిధానమ్". (ప.శాం.ప్ర.N.O.R - పుట 104).

7, "రత్యాస్వాదోఽస్య కీ దృశః? - ఉచ్యతే - ఉపరాగదాయిభిః ఉత్సాహరత్యాది రుపరక్తం యదాత్మ స్వరూపం తదేవ విరళోంభిత రత్నాంతరాళ నిర్భాసమాన సతతర సూత్రవత్ యదాహిత తత్స్వరూపం సకలేషు రత్యాదిషు ఉపరంజకేషు తథాభావే నాపి సకృద్విభాతోఽయ మాత్మేతి న్యాయేన భాసమానం పరాఙ్ముఖతాత్మక సకల దుఃఖజాలహీనం పరమానందలాభ సంవిదేకత్వేన కావ్య ప్రయోగబంధాభ్యాం సాధారణతయా నిర్భాసమానం అంతర్ముఖావస్థా భేదేన లోకోత్తరానందానయనం తథావిధహృదయం విధత్త ఇతి." (ప.శాం.ప్ర.N.O.R - పుట 106).

8. "అన్యే తు స్వం స్వం నిమిత్త మాసాద్య..ప్రతీయతే ఇతి భరతవాక్యం దృష్టవన్తః సర్వ రససామాన్య స్వభావం. శాన్త్ర మాచక్షాణా అనుపజాత విశేషాన్తరం చిత్తవృత్తిరూపం శాన్తస్య స్థాయిభావం మన్యన్తే. ఏతచ్చ నా తీవాస్మత్పక్షాద్దూరమ్. ప్రాగభావ ప్రధ్వంసాభావ కృతస్తు విశేషంః, యుక్తశ్చ ప్రధ్వంస ఏవ తృష్ణానామ్" -(లోచనవ్యాఖ్యా, ధ్వన్యాలోకః- నిర్ణయసాగర ప్రతి (1935)- పుట. 220)

9. "తతః త్రివర్గఫలక రసానంతరం మోక్షఫలక శ్శాంతః" - అభినవభారతీ, నాట్యశాస్త్రమ్. 24 అధ్యా.

7. రత్యాదులు శకుంతలా దుష్యంతాదులైన విభావాదులను ఆశ్రయించి ప్రతీయమానమౌతుంటే వాటిని సహృదయుడు తన్మయీభవన యోగ్యతతో హృదయసంవాదాన్ని బోధించి అస్వాదిస్తాడు వికృతిరస వివేకంలో. కాని, ప్రకృతిరస వివేకంలో తత్త్వజ్ఞానం నాయకాశ్రితం కావచ్చును. కాకపోవచ్చును. అసలు కావ్యంలోని రత్యాది రసభావాలు కావు. ప్రకృతి రసాస్వాదన పరుడైన సహృదయుడికి ప్రధానం. మోక్షదాయకమైన తత్త్వజ్ఞానమే ముఖ్యం. ఇందువలన కావ్యంలోని తత్త్వజ్ఞానోపదేశమే అతడికి స్థాయి. ప్రకృతిరసమెప్పుడూ కావ్యగత శాస్త్రరూపమైన తత్త్వజ్ఞానాన్ని ఆశ్రయించే స్థాయిత్వాన్ని భజిస్తుంది.

8. ప్రకృతి రస ప్రతీతి సహృదయుడి ఆత్మ స్థితమై ఉండటంచేత తత్త్వజ్ఞానం ప్రధానంగా ఆత్మరతి రూపంగానే భాసిస్తుంది. నిజానికి అతడు తనతోనే తాను తాదాత్మ్యం పొందుతాడు. తన ఆత్మజ్ఞానంతోనే సంవదిస్తాడు. కావ్యార్థాలు అతడికి నిమిత్తసూత్రాలు. కారణమాత్రాలు. పర్యంతంలో నిలిచే స్వస్వరూప సంవిదాత్మకమైన సమాధిస్థితియే అతడి రసస్థితి.

9. ఈ దృష్టితో వివేచిస్తే రత్యాదిస్థాయి భావాలవలన సహృదయుడు పొందేది రసానందం; స్థాయితమమైన తత్త్వజ్ఞానంవలన వీతరాగులు సవికల్పమైనా నిర్వికల్పతను సాధించే చిత్తవృత్తియందు అంతర్ముఖావస్థలో పొందేది జ్ఞానానందం: బహిర్విషయ విముక్తుడై నిర్వికల్ప సమాధిలో బ్రహ్మానుసంధానంవలన యోగి పొందేది బ్రహ్మానందం. మొదటిది అలౌకిక రసానందం; రెండవది లోకోత్తర పరమానందం; మూడవది నిర్వికల్ప బ్రహ్మానందం.

10. శాంతం నవమరస మని అంగీకరిస్తే దానివలన కలిగేది రసానందమే: ప్రకృతి రసమని వివేచిస్తే మోక్షసాధనమైన జ్ఞానానందమౌతుంది. రసానందం బ్రహ్మానంద సబ్రహ్మచారి మాత్రమే. జ్ఞానానందం మోక్షోపస్కారకం కూడా. ఒక బ్రహ్మానందమే సాక్షాన్మోక్షస్థితి. ఈ విధమైన వివేచనం లక్షణవిరుద్ధం కాదు. దీనికి దృష్టాంతం మహాభారతంలో శాంతరస సాధనం.

3. ఆనందవర్ధనుడి శాంతరస ప్రస్తారం: అభినవగుప్తుడి పరిష్కారం:

శాంతరస అభావ వాదాన్ని ఖండిస్తూ ఆనందవర్ధనుడు తృష్ణాక్షయ సుఖస్థాయిభావాన్ని అంగీకరించాడు. కాని, దానిని ప్రకృతి రసమని కాని, స్థాయితమ మని కాని నిర్దేశించలేదు. అయితే అందరికీ తృష్ణాక్షయ సుఖచిత్తవృత్తి అలవడటం సాధ్యం కాదనీ, ఏ కొద్దిమంది మహామహులలోనో అది సిద్ధమైనా దానిని శాంతరస మని అంగీకరించటంలో అభ్యంతరం ఉండకూడదని కూడా పేర్కొన్నాడు. "దీనిని బట్టి ఆనందవర్ధనుడు శాంతరసాన్ని నవమరసంగా మాత్రమే అంగీకరించా డని స్పష్టమౌతుంది. ఆనందవర్ధనుడి ఈ వాక్యాలపై వ్యాఖ్యానిస్తూ లోచనకారుడు (అభినవగుప్తుడు) శాంతానికి విభావాలుగా జనకాది రాజర్షులు సముచితంగా ఉంటారని సూచించాడు. 'శృంగారా దపి ఫలభూమావవర్ణనీయ త్వైవ పూర్వ భూమౌతు ప్రశాంత వాహితా'' "సంస్కృతాన్త శ్ఛిద్రేషు ప్రత్యయాన్తరాణి సంస్కారేభ్యః'' - ఇతి సూత్రద్వయ నీత్మా చిత్రాకారా యమ నియమాది చేష్టా వా రాజ్య వహోద్వహనాది లక్షణా వా శాన్తస్యాపి జనకాదే ర్దుష్టైవేత్యనుభవ సద్భావా ద్యమనియమాది మధ్యా సంభావ్యమాన భూయో వ్యభిచారి సద్భావాచ్చ ప్రతీయత ఏవ'' (ధ్వన్యాలోకః, లోచనవ్యాఖ్యా తృతీయోద్యోతం. పు.220) - ఇత్యాది వాక్యాలవలన నాయకాశ్రితమైన స్థాయి శాంతరస కావ్యంలో ఎట్లా పోషించబడటానికి వీలుందో తెలిసికొనటానికి అవకాశం కలుగుతుంది. అది నవమరసవాదానికి అనుకూలమైన శాంతరసచర్చకు ఉపయోగపడుతుంది.

10. 'ధ్వన్యాలోకః - తృతీయోద్యోతః । పుట. 219-220 (లోచనవ్యాఖ్యా సహితం - నిర్ణయ సాగర్ ప్రెస్ ప్రతి- 1935)

ఆనందవర్ధనుడు ప్రబంధాలలో ఏదో ఒక రసం అంగిగా పోషించబడాలని నిర్దేశిస్తూ రామాయణ భారతాలలోని అంగిరసాలను నిర్ణయించాడు. ఆ రెండూ రెండు త్రోవల నడిచాయి. వాల్మీకి "శోకః శ్లోకత్వ మాగతః'' అని కరుణరసాన్ని సూచించి, సీతాత్యంత వియోగ పర్యంతంగా తన ప్రబంధాన్ని నిర్మించి తద్రసాన్ని పోషించాడని రామాయణ రససాధన విధానాన్ని పేర్కొన్నాడు. (ధ్వన్యాలోకః - చతుర్థోద్యోతః-పు.298). ఈ పద్ధతినిబట్టి చూస్తే రామాశ్రితమైన శోకస్థాయియే సహృదయ హృదయ సంవాదంలో కరుణరసమయి సిద్ధిస్తుందని స్పష్టమౌతున్నది. మరి మహాభారత రసచర్చలో నాయకాశ్రితమైన స్థాయి ఏదీ చెప్పబడలేదు. ఆ కావ్యాన్ని శాస్త్రరూప కావ్యచ్ఛాయాన్వయిగా నిర్దేశించి, శాస్త్రనయాన్ని అనుసరించి పరమపురుషార్థమైన మోక్షం, కావ్య నయాన్ని అనుసరించి తృష్ణాక్షయ

సుఖ పరిపోషణాత్మకమైన శాంతం ప్రధాన వివక్షితాలైనట్లు స్పష్టం చేశాడు. భారతంలో శాంతరసాస్వాదన విధానాన్ని నిరూపిస్తూ వృష్ణిపాండవ విరసావసాన కథార్థాలవలన సహృదయుడికి విషయవైమనస్యం కలిగి వైరాగ్యం జనిస్తుందనీ, అది మోక్షమూలం కాబట్టి గీతాదులలో నిబంధించబడిన పరమపురుషార్థ సాధకమైన పరిజ్ఞానాన్ని ఆశ్రయించి విరక్తుడైన సహృదయుడు సనాతనమైన శ్రీకృష్ణ పరబ్రహ్మతత్త్వాన్ని ఉపాసిస్తాడనీ, అవిద్యా ప్రపంచరూపమైన పాండవాదుల చరిత్రలన్నీ నిస్సారాలని గ్రహించి, వాటియందు అభినివేశం పూనకుండా పరమార్థతత్త్వాన్నే అస్వాదిస్తాడనీ, తదాస్వాదన జన్యమైన రసమే శాంతరసమనీ ఆనందవర్ధనుడు పేర్కొన్నాడు. భారతంలో చివర హరివంశవర్ణనంవలన సాంసారిక వృత్తిరూపమైన మహాభారత కథార్థాలలో సంసారాతీత తత్త్వమైన వాసుదేవ పరబ్రహ్మమే వివక్షితమని ప్రబంధ ధ్వనిగా వివేచించాడు. (ధ్వన్యాలోకః, చతుర్థోద్యోతః- పుట. 298-300)

ఆనందవర్ధనుడి భారత శాంతరస సాధన సహృదయ వివేచనపై ప్రధానంగా ఆధారపడి ఉన్నది. భారత తత్త్వోపదేశమే అతడి చిత్తవృత్తికి వైరాగ్యదాయకమై క్రమంగా శాంతరససిద్ధిని కలిగిస్తుందని నిరూపించబడింది. ఈ వైరాగ్యం స్థాయిగా ధర్మరాజాదులనుగాని, శ్రీకృష్ణాదులను గాని ఆశ్రయించి ప్రతీయమాన మయ్యేది కాదు. ప్రబంధార్థ తత్త్వజ్ఞాన చర్వణంవలన సహృదయుడు సాధించేది. ఈ విధమైన విమర్శలో భారత శాంతరసాస్వాదన రామాయణ రసాస్వాదనం వంటిది కాదని ఆనందవర్ధనుడు వాచ్యం చేయకుండా వ్యంగ్యంగా సూచించాడు.

ఇక్కడ వివేచనాపరులకు ఒక సత్యం మాత్రం స్పష్టమౌతుంది. శాంతాన్ని శృంగారాదులవలె నవమరసమని భావించిన ఆనందవర్ధనుడు తద్రసాస్వాదన విధానంలో ప్రకృతిరస వివేచనమార్గాన్ని అనుసరించాడనటంలో అనుమానం లేదు. నిజానికి ఆయన ప్రవచనాన్ని అనుసరించి చూస్తే కావ్యనయమైన తృష్ణాక్షయ సుఖాత్మక స్థాయి భావాన్ని కావ్యనాయకాదుల నాశ్రయించి వివేచించవలసి ఉన్నది. కాని, ఆ పని ఆయన చేయలేదు. దానిని నాయకాశ్రితంగా అన్వయించటం భారతంలో సాధ్యం కాదని ఆయన వ్యంగ్యమార్గాన్ని అనుసరించి అంగీకరించాడని భావించవచ్చును. అయినా, ఆధునికులు ఆ మార్గాన్ని ప్రస్తరించి చూపిస్తున్నారు. కాని, అదంతా ఆనందవర్ధనుడి మతాన్ని అనుసరించి అవిద్యామూలకమై భాసిస్తున్నది. శాంతరస కావ్యాలలో జనకాది జీవన్ముక్తుల చరిత్రలు వర్ణించినప్పుడే అది నాయకాశ్రితమై ప్రతీయమానమౌతుందన్న అభినవగుప్తుడి వివేచనం గమనించదగింది. ధర్మజుడు ధీరశాంతుడని కానీ, తత్త్వజ్ఞాని అనికానీ, జీవన్ముక్తుడు అని కానీ నిరూపించటానికి భారతంలో కూడా అవకాశం లేదు. అందువలన భారతంలో తత్త్వచింతయే స్థాయి కాగా, పాండవాదుల వృత్తాంతాలు ఉపరాగమాత్రదాయకాలై సహృదయుడి విషయపరివృత్తివలన వికృతులై పోతున్నాయి. సంచారులై సమసిపోతున్నాయి. ఇట్టి స్థితిలో ఆనందవర్ధన ప్రతిపాదితమైన తృష్ణాక్షయ సుఖస్థాయి కంటె అభినగుప్తుడి తత్త్వజ్ఞాన స్థాయియే భారత శాంతరస సమన్వయంలో సమాశ్రిత మౌతున్నది. లోతుగా ఆలోచించిచూస్తే అభినవగుప్తుడి ప్రకృతిరసవాదం ఆనందవర్ధనుడి శాంతరస ప్రస్థానానికి నిర్దుష్టమైన పరిష్కారం.

4. ఆంధ్రమహాభారత శాంతరసవిమర్శ:

శాంతరస చర్చలో నవమరస, ప్రకృతిరస స్థితులను విశ్లేషించుకొని విమర్శించకపోతే స్పష్టమైన దర్శనం కలగటం సాధ్యం కాదు. ఆంధ్రమహాభారతంలో అంగిరసంగా శాంతాన్ని సాధించే విమర్శలలో ఇట్టి విశ్లేషణ లోపించటంవలన సాంకర్యం కనబడుతున్నది. దానిని తొలగించటానికి పరిశీలకులు ప్రయత్నం చేయవలసి ఉన్నది. అందుకు కొన్ని సూచనలు.

1. ఇతిహాస పురాణాలు శాంతరస ప్రధానాలన్న సాహిత్య సంప్రదాయాన్ని అనుసరించి భారతరసాన్ని నిరూపించదలచు కొంటే అభినవగుప్తుడి ప్రకృతిరస మార్గాన్ని అనుసరించటం సముచితం.

2,భారతంలో నాయకుడు ధర్మరాజనీ, అతడిని ఆశ్రయించి ప్రతీయమానమయ్యే స్థాయి శమమనీ సాధించే మార్గం ప్రకృతి రస వివేచనంలో పొసగని ప్రస్థానం. అయితే, శాంతం నవమరస మనే వాదాన్ని ఆశ్రయిస్తే ఆ మార్గం ఉపాదేయమే.

3. ఆంధ్రభారతం సంస్కృత భారతంకంటె విలక్షణమైన స్వభావాన్ని సంతరించుకొన్నది. మూలభారతం శాస్త్రరూప కావ్యచ్ఛాయాన్వయి. ఆంధ్రభారతం కావ్యరూప శాస్త్రచ్ఛాయాన్వయి. ఈ మార్పు కవిత్రయంవారి కావ్యకళా దృష్టివలన ఏర్పడింది.

తిక్కన 'ధర్మాద్వైతస్థితి'ని పేర్కొన్నాడు. దానికి ధర్మముయొక్కయు అద్వైతముయొక్కయు స్థితి అని శ్రీ ఓరుగంటి నీలకంఠశాస్త్రిగారు వ్యాఖ్యానించారు. (తిక్కన యజ్వ హరిహరనాథ తత్త్వము. పు.13), అట్లయినప్పుడు కావ్యనయమున సాధించబడేది నాయకాశ్రితమైన ధర్మస్థితి. అంటే ధర్మవీరం. శాస్త్రనయమున అద్వైతస్థితి అంటే తత్త్వజ్ఞానం. సూక్ష్మవివేచనను ఆశ్రయిస్తే సమన్వయ సౌలభ్యం కలుగుతుంది. తత్త్వజ్ఞానమే స్థాయి అని అంగీకరిస్తే ప్రకృతి రసవాదాన్ని అనుసరించి సహృదయుడు పొందేది శాంతరస మౌతుంది. కాని, కవిత్రయ ప్రణాళికలో కావ్యరసానికి తత్త్వజ్ఞానం అంగం. అందువలననే భగవద్గీతాదులు తెలుగులో తావన్మాత్రంగానే నిలిచాయి. కావ్య రసాన్ని కొనియాడటంలో (విరా.1,15) నవమరసంగా శాంతాన్ని అంగీకరించే దృక్పథం ఉన్నది. అప్పుడే కావ్యనాయక జీవితానికి ప్రాధాన్యం వస్తుంది. హరివంశాన్ని భారత భాగంగా రచించకపోవటంలోని అంతర్యంకూడా అదే. ధర్మరాజు ధర్మవీరుడు కాని జనకశుకాదులవలె జీవన్ముక్తుడు కాడు. ఆయన జీవితంలో కొంద రన్నట్లు నిర్వేదం స్థాయి కాదు. అతడు విరక్తుడూ కాడు. అందువలన శాంతరసాశ్రయుడుగా ఆయన జీవితంలో స్థాయి ప్రతీయమానం కావటానికి వీలులేదు. యమధర్మరాజు అంశగా భూలోకానికి వచ్చి మరల ఆయనలో లీనం కావటం మోక్షం కాదు. అసలు ఆ చివరి అవస్థకాదు స్థాయిని నిర్ణయించేది. నాయక జీవిత ప్రవృత్తి నిరూపిస్తుంది. యముడిలో లీనం కావటానికి ఆయన జీవితమంతా కృషి చేయలేదు. అట్లని జీవన్ముక్త స్థితిలో నిలిచి జీవితాన్నంతా ఉపరాగంగా భావించలేదు. అంతేకాదు. స్వర్గంకొరకుకూడా ఆయన తాపత్రయపడలేదు. అతడి ధర్మస్థితికి ఫలం స్వర్గం. అంతే అతడు ధర్మాచరణ ప్రమాణాన్ని లోకానికి నిరూపించి చూపటానికి పుట్టిన కారణజన్ముడు. అతడి స్థితి మోక్షస్థితి కాదు; ధర్మస్థితి, భారతంలోని బహుశాస్త్ర విషయాలలో మోక్షవిషయక మొకటి. అది జ్ఞానదీప్తిని కలిగించేది. జ్ఞానదీప్తి ధర్మస్థితికి ఉద్దీప్తిని కలిగించేది. ఇట్లా అంటే శాంతం ధర్మవీరానికి అంగంగా ఉండటం ఉచితం కాదని ఒక శంక రావచ్చును. ఆనందవర్ధనాదులు శాంతాన్ని మరొక రసంలో అంతర్భవింపజేయవద్దన్నారు. కాని, మరొక రసానికి అంగంగా నిలుపటానికి వ్యతిరేకరించలేదు. కవిత్రయంవారి మతం కూడా అదే.

4. భారతంలోని తత్త్వ జ్ఞాన విషయాలకే ప్రాధాన్యమిచ్చి, పాండవ వృష్ణివంశ విరసావసానాన్ని సహృదయుడు భావించి వాటి అవిద్యామూలకత్వాన్ని వివేచించి వాసుదేవతత్త్వాన్ని అవిష్కరిస్తే - శాంతరసస్థితి నిరూపిత మౌతుంది. అది నన్నయ అన్నట్లు అధ్యాత్మవిదులు వేదాంతమని భారతాన్ని చూచేచూపు. రసమార్గానికి కావలసింది కవివృషభులు భారతం మహాకావ్యమని ప్రసరింపజేసే దృక్పథం. ఆంధ్రమహాభారతం ముందుగా మహాకావ్యం; ఆ తరువాత శాస్త్రం. శాస్త్రభాగంలో ధర్మవేదాంత నీతి శాస్త్రాలకు మరల అంతర్విభాగమున్నది. అంగాలెన్ని ఉన్నా అంగి కావ్యత్వం. అంగిరసం ధర్మాద్వైతాలలో మొదట నిర్దేశించబడిన ధర్మవీరమే. ఆ ద్వంద్వంలో ఉత్తరోత్తరాలు బలీయాలని ఆశించవచ్చును. దోషం లేదు. బలమైన అంగం అంగికి కార్యసాధకం. శాంతరసవాదం శాస్త్రరూపమైన సంస్కృతభారతానికి వర్తించినట్లు కావ్యరూపమైన ఆంధ్రభారతానికి వర్తించదు.

5. "సంస్కృత భారతమును శాస్త్రేతిహాసమనియు, ఆంధ్రమహాభారతమును కావ్యేతిహాసమనియు అనుకొనవచ్చును." (తిక్కన కావ్య శిల్పము - డా॥ కేతవరపు వేంకట రామకోటి శాస్త్రి - పు. 129) అని ఆంధ్రభారతాన్ని కావ్యేతిహాసంగా వివేచించే పద్ధతికూడా ఉన్నది. అందులోకూడా అంగిరసం నాయక ప్రవృత్తి నాశ్రయించే ఉన్నదని భావించబడుతుంది. అది కావ్య విమర్శకూ, నవమరసవాదానికీ అనుగుణంగా ఉన్నది. అయితే, అందులో 'ఇతిహాస రసస్థితి'ని ప్రత్యేకంగా ప్రతిపాదించుకొనవలసి వచ్చింది. "భారత మితిహాసమైనందున రససాంద్రత తక్కువగా నుండును.. ఆంధ్రభారతము కావ్యేతిహాస మగుటవలన ప్రధాన కథా సంబంధియైన యౌచిత్యము, పాత్రోన్మీలనము మొదలైనవి లెస్సగా పాటించబడినవి. మొత్తంమీద శాంత మాస్వాద్యమగునట్లుగా ప్రధానకథ నిర్వహించబడినది" (తిక్కన కావ్యశిల్పము - పు. 148) అని చెప్పుకొని కావ్యత్వానికి ఇతిహాసత్వాన్ని అనుసంధానం చేసికొనవలసి వచ్చింది. ఈ మార్గంలో శాంతం నవమరసంగా భావించి, శృంగారాదులవలె నిరూపించే పద్ధతి ప్రచురంగా కనబడుతున్నది. కాని, స్పష్టమైన ప్రస్థానం కాకపోవటంచేత సమన్వయించుకొనవలసిన విషయాలు మరికొన్ని అట్లాగే మిగిలిపోయి ఉన్నాయి.

6. భారతంలోని శాంతాన్ని ప్రకృతిరసంగా వివేచిస్తే నాయకాశ్రితమైన స్థాయిభావ చర్చ అసంగతమౌతుంది. నవమరసంగా శాంతాన్ని అంగీకరించి నాయకచర్చ చేస్తే సహృదయుడు హృదయసంవాదంవలన పొందే తత్త్వజ్ఞానం లేదా జ్ఞానానందాది విశుద్ధ

ధర్మయుక్తమైనదీ. పరికల్పిత విషయోపభోగ రహితమైనదీ అయిన ఆత్మయే - ఆత్మజ్ఞానమే - పాఠకుడియందు ప్రతీయమాన మౌతున్నట్లు వివేచించవలసి ఉంటుంది. ఆంధ్రమహాభారతానికి సంబంధించినంతవరకు ప్రకృతిరసవాదం సమన్వయించదు. నవమరసవాదాన్ని ఆశ్రయించి నాయకాశ్రితమైన స్థాయిభావాన్ని నిరూపించటం సమగ్రరూపం తాల్చలేదు. ఈ పరిస్థితులలో భారతంలో ధర్మవీరం అంగిరసం అని సాగించే విమర్శప్రస్థానం కావ్యరూపమైన భారతానికి సగౌరవమైన రసస్థితిని అందించ గలుగుతున్నది.

5. ఆంధ్రమహాభారతంలో అంగిరసం ధర్మవీరమే:

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు తెలుగు భారతంలో శాంతరసం అంగిగా స్ఫురించటం లేదని సూచించారు. కాని, వ్యాసభారతం శాంతరస ప్రధానమని అంగీకరించాడు. "(సంస్కృత) భారతమున్నది. భారత మహాకావ్యం యొక్క మహాకావ్యార్థము శాంతరసమునందుఁబర్యవసించుచున్నది. అది శాంతరస పర్యవసాయి యగుట వ్యాసోపజ్ఞకమైన విషయము. నన్నయచేసిన చేఁత వేఱు. తిక్కనచేసిన చేఁత వేఱు. ఆయన దృష్టి వేఱు, ఈయన దృష్టివేఱు. మహాకావ్యముయొక్క సమష్టిమీద సంస్కృతభారతమునందు నిర్ణీతమైన శాంతరసము తెనుగు కావ్యమునందుకూడా సహజముగా బర్యవసింపఁజేసికొన వచ్చునుగాని యెచ్చట నీ శాంతరసమునకు నడ్డుతగులునో చెప్పలేము. ఆంధ్రమహాభారతము భిన్నకర్తృక మగుటచేత నా యిబ్బంది కలుగదు. ఇది చాలా అగాధమైన విషయము" (జయంతి - నాచన సోముఁడొకండు (వ్యాసము)) అన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వారి దృష్టికూడా భారతం ధర్మవీరరస ప్రధానం అన్న వాదానికి ప్రోద్బలకంగానే ఉన్నది. శాంతరస ప్రధానంగా వ్యాసోపజ్ఞకంగా నిర్మించబడిన సంస్కృత భారతం కంటె భిన్నమార్గంలో నడపబడిన ఆంధ్రమహాభారతంలోని రసం శాంతరసం కానప్పుడు న్యాయంగా ధర్మవీర రసాన్నే అంగిరసంగా పేర్కొనాలి.

సాధారణంగా కావ్యరసానికి కథానాయకాశ్రిత రసానికీ - నాయకుడి చరిత్రే కావ్యం కనుక - భేదముండదు. కాని, కావ్యరసం అన్నప్పుడు నాయకాశ్రితమైన అంగాంగిరసాలతోపాటు, మిగిలిన పాత్రలను ఆశ్రయించిన రసాలు వ్యక్తం అయినప్పటికీ అవి నాయకాశ్రితమైన అంగిరసాన్నే మ్రింగివేయకూడదు. ఆ దృష్టితో చూచినప్పటికీ ఆంధ్రమహాభారతంలో భీమార్జునాదులు అనునాయకులుగా కలిగిన ప్రధాన నాయకుడైన ధర్మరాజును ఆశ్రయించింది ధర్మవీర మనటానికి ఎటువంటి విప్రతిపత్తి గోచరించటం లేదు.

కొందరు భారతంలో శ్రీకృష్ణుడు నాయకుడనీ, దానికి ఉపబలకంగా సంస్కృతభారతంలోని 'నారాయణం నమస్కృత్య' అన్న ఉపక్రమణాన్నీ, హరివంశంతో జరిగిన ఉపసంహారాన్నీ, మధ్య మధ్య నిబంధించబడిన శ్రీకృష్ణమాహాత్మ్య సందర్భాలను, భగవద్గీత, సనత్సుజాతీయం. మోక్షధర్మోపన్యాసాలూ మొదలైన గ్రంథాంశాలను కలిపి చదివి, వీటినే గ్రంథతాత్పర్య నిర్ణాయకమైన లింగాలుగా భావించి, వీటి పర్యాలోచనలో అది శాంతరస ప్రధానమని భావిస్తున్నారు. ఇటువంటి సందర్భంలో విశ్వనాథ సత్యనారాయణ గారన్నట్లు సంస్కృతభారతానికి సరిపెట్టుకొన్నా సరిపోవచ్చునేమో కాని, ఈ విషయంలో కూడా భిన్నమార్గంలో నడచిన ఆంధ్రమహాభారతానికి అట్లా పొసగదు. దీనికి ఉపస్కారకంగా మరొకటి రెండు ఉపపత్తులను ఇక్కడ పొందుపరుస్తాను.

1. ఆంధ్రమహాభారతంలో నన్నయ భట్టారకుడు 'నారాయణం నమస్కృత్య' అన్న అర్థసందర్భం కలిగేటట్లు కాక 'శ్రీవాణీ గిరిజా..పురుషోత్తమాంబుజభవ శ్రీకంధరాః' అని మూర్తిత్రయ స్మరణంతో గ్రంథోపక్రమం చేశాడు. తిక్కన సోమయాజి భారతాన్ని సమగ్రంగా ముగింపదలచినవాడై 'హృదయాహ్లాది...ఉద్యోగాదులంగూడఁగా బదునేనింటిఁ దెనుంగు బాన జనసంప్రార్థ్యంబు' గావింపదలచి, 'హరివంశ' రహితంగా తన గ్రంథోపసంహారాన్ని చేయదలచినట్లు స్పష్టమౌతుంది. తిక్కనసోమయాజి వాసుదేవ తత్త్వ ప్రతిపాదకమైన హరివంశాన్ని కూడా గ్రహించినట్లయితే ఆ గ్రంథ తాత్పర్యం వేరుగా నిర్ణయించవలసి ఉండేదేమో? మధ్యలో భగవద్గీతాది మోక్షప్రతిపాదక గ్రంథాంశాలను కావ్యరస పోషణదృష్టిలో చాలావరకు తగ్గించి రచించటంలో కూడా శాంతరస తాత్పర్యాన్ని ఆంధ్రమహాభారతంలోని వీరరసానికి అంగభూతంగా చేయటానికే అయి ఉండవచ్చునని తాత్పర్య మేర్పడుతున్నది.

2. భగవానుడైన శ్రీకృష్ణుడు భారతంలో నాయకుడైతే "వాసుదేవస్య మాహాత్మ్యం- పాండవానాం చ సత్యతాం - దుర్వృత్తం ధార్తరాష్ట్రానామ్" అన్న వ్యాస వచనానికి అన్వయం కుదుర్చుకొనవలసి వస్తుంది. భారతంలో పాండవుల సద్వృత్తం

(భారతం కాబట్టి) ధార్తరాష్ట్రుల దుర్వృత్తం ప్రధానవస్తువైతే, దానికి అనుగుణంగా వాసుదేవుడికి మాహాత్మ్యం పోషించబడుతుందనే తాత్పర్యం ఏర్పడుతున్నది. మూడింట రెండువంతులుగా ఉన్న పాండవ కౌరవుల సద్వృత్త దుర్వృత్తాలు అన్వయ వ్యతిరేక క్రమంతో ధర్మాశ్రయాలనీ, వాటికి పోషకంగా శ్రీకృష్ణమాహాత్మ్యం ప్రపంచితమైనదనీ స్పష్టమౌతుంది. ఈ దృష్టితో పరిశీలిస్తే శ్రీకృష్ణుడి చరిత్ర వివిధ మహిమలకు అస్పదమైనట్టిదైనా, పాండవ ధర్మరక్షణ పరత్వంతో కూడి ఉన్నట్లు చిత్రించబడటంవలన ఆయన భారతకథలో ఉపనాయకుడుగానే ప్రకాశిస్తున్నాడు. అటువంటప్పుడు భగవన్మాహాత్మ్యం స్వాశ్రయ రక్షణ తత్పరమౌటం వలన దాని గౌరవం ఇనుమడిస్తుంది. "నాయకం ప్రాగుపన్యస్య వంశ వీర్య శ్రుతాదిభిః । న తస్యైవ వధం బ్రూయాత్" (భామహాలంకారం) అన్న అలంకారికాదేశాన్నిబట్టి కథా మధ్యంలో నాయకవధకాని, మరణంకాని నిబంధించరాదు. దీనికి విరుద్ధంగా శ్రీకృష్ణ నిర్యాణం కథామధ్యంలోనే కూర్చబడటంవలన, అది సాంప్రదాయికం కాకపోవటంవలన శ్రీకృష్ణుడికి కథానాయకత్వం కల్పించటం పొసగదు. నాయక నిర్యాణమైన తరువాత చేర్చిన హరివంశం ఐతిహాసిక దృష్టితో దాని మహిమను ప్రతిపాదిస్తున్నట్లుగా నిలబడటానికి అవకాశం ఉంటుంది కాని కావ్యదృష్టితో అటువంటిది పొసగదని సహృదయులు గుర్తించకపోరు. ఈ విధంగా శ్రీకృష్ణుడు కథానాయకుడు కానప్పుడు పరిశేషన్యాయంతో ధర్మరాజు కాక తప్పదు. "సమగ్ర గుణః కథావ్యాపీ నాయకః" అనే లక్షణం ధర్మరాజుకు నూటికి నూరుపాళ్ళు వర్తిస్తుందని భారత పరిశీలకులకు గోచరిస్తుంది. 'భారతం' 'జయం' - అనే కావ్య నామాలు కూడా ధర్మరాజుయొక్క చరిత్రౌన్నత్యాన్ని "నాయకో ధర్మవిజయీ లోకోత్తర గుణోత్తరః" (విష్ణు ధర్మోత్తర ఖండం) అనే లక్షణాన్ని బట్టి అతడి ధర్మ విజయాన్ని ప్రతిపాదించేవిగా ఉండి, అతడి నాయకత్వానికి ఏకవాక్యతను సంపాదిస్తున్నాయి.

భారత విమర్శకులలో కొందరు - నాయకుడైన ధర్మరాజు పొందింది మోక్షమే అనీ, దానిని ఫలింపజేసే శాంతరసమే రచనను ఆశ్రయించుకొన్న ప్రధాన రసమని అంటారు కాని, అది కూడా సత్యం కాదు. కావ్యశాస్త్రంలో శాంతరసమంటే "న యత్ర దుఃఖం నసుఖం న చింతా న ద్వేషరాగౌ న చ కాచి దిచ్ఛా - రసస్తు శాన్తః" (నాట్యశాస్త్రమ్) అని స్పష్టంగా చెప్పబడింది. ఇది మరణానంతర నిశ్శబ్దస్థితి కాదు. జీవితంలో సాధించే శమస్థితి. అటువంటిది ధర్మరాజులో ఎక్కడా కనబడదు. 'నకాచిదిచ్ఛా, న చింతా'- అన్నది రాజ్య సంపాదనాసక్తుడైన అతడికీ, 'న యత్ర దుఃఖం' అన్నది అరణ్యవాస, బంధుమరణ దుఃఖితుడు, సోదరమరణ దుఃఖితుడై చివరకు మెలగిన అతడికి, 'న సుఖం, న ద్వేషరాగౌ' అన్నది స్వర్గంలో కూడా దుర్యోధనాదులనుగురించి, కర్ణభీమాదులను గురించి ద్వేషరాగాలను ప్రకటించిన అతడికి ఎట్లా వర్తిస్తుంది? కాబట్టి శాంతరసం కాబోదు.

కావ్యాంతంలో ధర్మరాజు పొందిన స్థితులు కూడా గమనించదగినవి. సశరీర స్వర్గారోహణం. మాయామూలక నరకదర్శనం, దేవలోక నివాసం, యమధర్మరాజాంశ రూపంలో పూర్వరూపప్రాప్తి - అన్న వాటిల్లో దేనిని కూడా మోక్షమని పేర్కొనటానికి వీలులేదు. 'అత్యంతిక దుఃఖనివృత్తి రూపమైన స్వరూప స్థితికి' మోక్షమని సంకేతం;' బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' (శ్రుతి) అన్నట్లు ముక్తుడికి గమనాగమనాలు నిషేధించబడటంవలన స్వర్గారోహణం జరిపిన నాయకుడు ముక్తుడని, మోక్షసాధనపరుడని చెప్పటానికి వీలులేదు. ముక్తి ద్వివిధం - జీవన్ముక్తి, విదేహముక్తి అని-స్వర్గంలో కూడా శరీర ధర్మాలైన రాగద్వేషాలు విడువని నాయకుడు జీవన్ముక్తుడని కాని, ఆకాశగంగావగాహనం తరువాత దివ్యశరీరాన్ని ధరించిన ధర్మరాజు విదేహముక్తుడని కాని చెప్పటం సమంజసం కాదు. ఈ విధంగా ముక్తిద్వయానికి దూరమైన శాంతరసాన్ని ధర్మరాజులో ప్రతిష్ఠించి మహాభారతరసాన్ని నిర్ణయించటం పాడికాదు.

నివృత్తి ధర్మరూపమైన మోక్షానికి సోపానరూపమైన ప్రవృత్తి ధర్మాన్ని తక్కువగా భావించుకొని రసవిచారం చేయకూడదు. రసలోకంలోనూ, కావ్యరసిక లోకంలోనూ ప్రవృత్తిరసాలకు నివృత్తి రసాలకంటె ప్రభుత్వం హెచ్చు. శాంతం సన్మునుల మనోదృష్టులకు, తత్త్వవేత్తల శాస్త్రదృష్టులకు అందినంతగా సామాజికులకు సర్వసామాన్యంగా అనుభూతికి అందదు. 'ఆంధ్రావళి మోదముంబొరయు' లక్ష్యంతో ప్రధానంగా రచించబడిన ఆంధ్రమహాభారతంలో పురుషార్థ సాధనోత్సాహాన్ని ధర్మబద్ధంగా సాధించే చిత్తవృత్తికి మూలకందమైన ధర్మవీరం అంగిరస మనటం సర్వాంగీకారం ఔతుంది. వీరం సర్వమానసిక ప్రవృత్తులకు బీజభూతం: ప్రదీపకం. ప్రవృత్తిరసాలలో వీరం రసమూర్ధన్యం. శాంతం దానికి శక్తి నిస్తుంది. కవిత్రయం ఈ సత్యాన్ని ఆంధ్ర మహాభారత రసపోషణం ద్వారా నిరూపించింది. అందువలన ఎన్ని దృక్కోణాలనుండి చూచినా ధర్మరాజు ధార్మిక చరిత్రతోపాటు, కావ్యమంతా పరివ్యాప్తమై ఉన్న ధర్మవీర రసమే అంగిరసమని స్థిరపడుతున్నది. అదే ఆంధ్రమహాభారతం సాధించిన రసామృతత్వ సిద్ధి!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

6. కవిత్రయ మహాభారతం: వ్యాఖ్యానం:

తెలుగులో ఆదికావ్యమైన ఆంధ్రమహాభారతం అవతరించి వెయ్యేళ్ళు కావస్తున్నా ఇంతవరకు దానికి సమగ్రవ్యాఖ్య వెలువడలేదు. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో కవిత్రయ మహాభారతానికి తెలుగులో శిష్టవ్యావహారిక భాషలో సరళవ్యాఖ్య వెలువడటం ఆంధ్రావళి ఆనందించే అపూర్వ సాహిత్యోత్సవం. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు భారతీయ వైదిక ధర్మప్రచార మహోద్యమాన్ని చేపట్టి మహనీయంగా సాగిస్తున్నారు. అందులో ఈ పంచమవేదవ్యాఖ్యాన ప్రణాళిక ఒక మహత్తర సారస్వత యజ్ఞం. ఏడుకొండలరాయడు మాత్రమే చేపట్టి ధర్మరక్షణ కళా ప్రావీణ్యంతో ఈ వ్యాఖ్యానించిన పదునెనిమిది పర్వాల ఈ దివ్య ప్రబంధమండలిని పరిష్కరించి, సర్వాంగ సుందరంగా ప్రచురించి, సామాన్య జనులకు అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారు చేసికొన్న వెలుగుల పుణ్యం. ఈ పవిత్ర మహత్తర ప్రయత్నానికి శ్రీ తిరుమలేశుడి పక్షాన బాధ్యత వహించి, అభ్యుదయ పరంపరను విజయవంతంగా సమకూరుస్తున్న మాన్యులు, మహనీయులు టి.టి.డి. బోర్డు ఛైర్మన్, సభ్యులు, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, వారి సహకారులూ, సంపాదక సలహామండలుల సభ్యులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, ఎడిటోరియల్ సెల్ సభ్యులూ, పలురకాలుగా ఈ కార్యక్రమంలో తోడ్పడుతున్న అధికారులూ, అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటి. ఆది రెండు భాగాలుగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటిగా రూపుదిద్దుకొన్నది. విస్తృతమైన అరణ్యపర్వం మూడవ సంపుటిగా రెండు భాగాలలో ప్రచురించబడింది. మొదటి భాగం నన్నయ రచించిన అరణ్యపర్వభాగం. రెండవ భాగం ఎఱ్ఱాప్రెగడ పూరించిన అరణ్యపర్వశేషం. ఈ విధంగా అరణ్యపర్వం విభజించబడి ప్రచురించటం తెలుగులో ఇదే ప్రథమం. నాల్గవ, అయిదవ, ఆరవ, ఏడవ, ఎనిమిదవ సంపుటులుగా విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ పర్వాలు వెలువడ్డాయి. తొమ్మిదవ సంపుటిగా శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు వెలశాయి. పదవ సంపుటిగా శాంతిపర్వం రెండు భాగాలుగా వెలువడింది. పదకొండవ భాగంగా అనుశాసనిక పర్వం ఆకృతి తాల్చింది. అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వాలన్నీ కలిసి ఈ పన్నెండవ సంపుటిగా సంతరించుకొన్నవి. ఈ వరుసలో ఇది చివరి సంపుటి. దీనితో కవిత్రయ మహాభారతం ముగిసింది.

ఈ సంపుటిలోని పర్వపంచకంలో ముగ్గురు విద్వన్మణులు వ్యాఖ్యానాలు వ్రాశారు. ప్రసిద్ధ సాహిత్యాచార్యులు. ప్రస్తుత టి.టి.డి. ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానందంగారు అశ్వమేధపర్వంలోని, మొదటి రెండాశ్వాసాలకూ, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వాలకూ సమర్థంగా వ్యాఖ్యను సంతరించారు. మహావిద్వాంసులు శ్రీ నాగళ్ళ గురు ప్రసాదరావుగారు అశ్వమేధపర్వ తృతీయ, చతుర్థాశ్వాసాలకు సారవంతమైన వ్యాఖ్యను రచించారు. విద్వన్మణులైన డాక్టర్ అంబడిపూడి నాగభూషణంగారు ఆశ్రమవాసపర్వవ్యాఖ్యను ఆమోదయోగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ పర్వాలన్నింటికీ సంపాదకుడుగా నేను పీఠికనూ, కథాసారాన్నీ రచించాను. ఇవి ఆంధ్రుల ఆమోదాన్ని పొందుతాయని ఆశిస్తాను.

ఈ సంపుటి ఈ విధంగా రూపొందటానికి తోడ్పడిన మిత్రులు విద్వన్మణులు డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారికి, శ్రీకె. సత్యరాం ప్రసాద్‌గారికి, డాక్టర్ ఎన్. సుధాకర్ నాయుడుగారికి, శ్రీజి. రాధాకృష్ణగారికీ, శ్రీమతులు సుశీలా లక్ష్మీ విద్యానాథులకూ, డాక్టర్ వి.యస్. లక్ష్మికి నా కృతజ్ఞతలు.

పరమ కల్యాణ భద్రమూర్తి అయిన శ్రీపద్మావతీ సహిత శ్రీవేంకటేశ్వరస్వామి వేదవేద్యులు, వేదాంతగమ్యులు. పరతత్త్వ రూపులు, అయినా భక్త సులభులు, సాహిత్య సంగీత కళాప్రియులు, రసానందమూర్తులు. ఆ స్వామికి ఈ పంచమవేదం అక్షరమైన తోమాలసేవ, వ్యాఖ్యానం సుగంధ పరిమళ సేవ, విశేషాంశాలు ఉజ్జ్వలాలంకారసేవ, పీఠిక ఆ విరాణ్మూర్తికి మంగళ నీరాజనసేవ. ఈ సర్వం స్వామివారికి సారస్వతమైన అక్షరార్చన.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సత్య శివ సుందర రూపులైన స్వామివారి దివ్య సన్నిధిలో ఈ వ్యాఖ్యాన సంపుటిని వాఙ్మయారాధనలో భాగంగా పుణ్యపూజకు సుమమంజరిగా సమర్పించుకొంటున్నాము. అన్యథా శరణం నాస్తి. త్వమేవ శరణం మమ! విశ్వశ్రేయస్సును, విజయపరంపరను ప్రసాదించుమని స్వామివారిని వేడుకొంటున్నాము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

హైదరాబాదు

10-9-2005

జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రధాన సంపాదకుడు,

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అశ్వమేధపర్వ కథాసారం

ధర్మరాజుకు కలుగని మనశ్శాంతి:

భీష్ముడివలన సమస్త ధర్మాలు విన్నాకూడా ధర్మరాజు మనశ్శాంతిని పొందలేకపోయాడు. 'భీష్మకర్ణులను చంపిన పాపాత్ముడిని నాకు శాంతి ఎట్లా కలుగుతుం' దని వాపోయాడు. అప్పుడు వేదవ్యాసుడు యాగాలు, దానాలు చేసి బంధుసంహారపాపాన్ని పోగొట్టుకొమ్మని బోధించాడు. అశ్వమేధయాగం చేయటానికి ధర్మరాజు అంగీకరించాడు. కాని, ఆ యాగం చేయటానికి భూరిదక్షిణలివ్వటానికీ, చాలా ధనం కావాలి. రాజులందరూ యుద్ధంలో చనిపోవటంవలన ఆడవారు శిశువులు మాత్రమే ఆయారాజ్యాలలో మిగిలి ఉండటంవలన భూములన్నీ పాడై ఉండటంవలన ధనసేకరణ దుస్సాధ్యమని ధర్మరాజు భావించాడు. దీనికి వ్యాసుడు ఒక ఉపాయం చెప్పాడు. మరుత్తుడనే ఒక చక్రవర్తి మునుపు ఒకసారి స్వర్ణరూపంలో అధిక దక్షిణలిచ్చి మహాయాగాలు చేయగా, ఆ స్వర్ణభారాన్ని బ్రాహ్మణులు కొనిపోలేక హిమవత్పర్వత ప్రాంతాలలో భూములలో దాచారనీ ఆ సంపదను కనుగొన్నవారికి అది వశమౌతుందనీ వరాన్ని ప్రసాదించారు. దానిని తీసికొనివచ్చి అశ్వమేధాన్ని జరపటం ధర్మవిరుద్ధం కాదని వ్యాసమహర్షి సూచించాడు. ఈ సందర్భంలో మరుత్తుడికథను వ్యాసమహర్షి వివరించాడు. ఇంద్రాది దేవతలుకూడా ఈర్ష్యాసూయలకు అతీతులు కారని ఈ కథ నిరూపిస్తుంది.

ఈ సందర్భంలో ధర్మరాజు పరితాపాన్ని పోగొట్టటంకొరకు శ్రీకృష్ణుడు ఆధ్యాత్మిక విషయాలను ప్రసంగిస్తూ ధర్మరాజు 'బాహ్యజయం' మాత్రమే పొందాడనీ 'అంతఃశత్రువులజయం' ఇంకా అతడు సాధించాల్సి ఉందనీ చెప్పాడు. ఈ ఆంతరయుద్ధంలో ఆత్మకు, మనస్సుకు సంగ్రామం జరుగుతుందనీ అదే నిజమైన యుద్ధమనీ శ్రీకృష్ణుడు వివరించాడు. భీష్మాదులతో జరిగిన యుద్ధం 'మిథ్యాయుద్ధ'మని చెప్పుతూ 'మమ' అనే రెండక్షరాలు మృత్యువనీ, 'న మమ' అనే మూడక్షరాలు 'బ్రహ్మ' మని నిష్కర్ష చేశాడు. ఈ సందర్భంలోనే భగవంతుడు 'కామగీత' ను బోధించాడు. కాముడు ఒకప్పుడు నన్నెవ్వరూ గెలువజాలరని శపథం చేసి ఇట్లా పలికాడట- 'నన్ను ఎవడు తపస్సు చేసి జయించాలని అనుకొంటాడో వాడికి ఆ తపస్సులోని 'అభిమాన' రూపంలోనే ఉండి వాడికి పరాజయం కలిగిస్తాను. అట్లాగే మహాయాగాలు చేస్తున్న వాడికి కూడా 'దంభ' రూపంలో వాడి మనసులో ఉండి వాడి ప్రయత్నాన్ని వమ్ముచేస్తా' నన్నాడు కాముడు. కాబట్టి కామజయమే ఆంతరజయమని శ్రీకృష్ణుడు ప్రబోధించాడు. (ఇక్కడే 'కాముడిని జయించి కార్యసిద్ధిని సఫలం చేసికొనటం ఎట్లాగో వ్యాసమహర్షి నాధారంగా తిక్కనగారు పరమరమణీయంగా వివరించారు). వ్యాసనారదాది మునీంద్రులు ధర్మరాజును వీడ్కొని వెళ్ళిపోయారు. ధర్మరాజు హస్తినాపురంలో ధర్మబద్ధంగా జనరంజకంగా పరిపాలన సాగిస్తున్నారు. శ్రీకృష్ణార్జునులు కలిసి ఇంద్రప్రస్థపురంలో విహరిస్తున్నారు. అప్పుడు అర్జునుడు పూర్వం శ్రీకృష్ణుడు తనకు బోధించిన 'భగవద్గీత' విషయం ప్రస్తావించి, అది మరపునకు వచ్చిందనీ, దానిని మరల బోధించుమనీ వేడుకొన్నాడు. అర్జునుడి మరుపును చీదరించుకొని మరలా శ్రీకృష్ణుడు అర్జునుడికి తత్త్వజ్ఞానాన్ని స్థిరీకరించే ప్రయత్నం చేశాడు.

అర్జునుడికి బోధించిన అనుగీత:

శ్రీకృష్ణార్జునుల సంవాదంలో భాగంగా అధ్యాత్మవిద్యా రహస్యాన్ని బోధించుమని అడిగిన భార్యకు భర్త చేసిన ఉపదేశమే 'బ్రాహ్మణగీత'గా వెలువడింది. కర్మలు సకల సిద్ధిప్రదాలని భర్త భార్యకు బోధించాడు. బ్రహ్మాదులుకూడా అక్షరోపాసనను కర్మమూలకంగానే చేస్తారు. అక్షరమనేది శబ్దాదులచేత తెలియబడేది కాదు. అది అమలిన బుద్ధికిమాత్రమే గోచరమవుతుంది. ప్రాణాది పంచవాయువులు ఆ అక్షరతత్త్వాన్నే చేరుతాయి. పంచవాయువులు, మనస్సు, బుద్ధి అనే ఈ ఏడూ వైశ్వానరుడికి జిహ్వలు. వైశ్వానరుడంటే ఆత్మే. ఘ్రేయము, భక్ష్యము మొదలైన సప్త సమిధలను ఘ్రాత, భోక్త అనబడేటటువంటి ఏడుగురు ఋత్విజులు వైశ్వానరుడిలో హోమం చేస్తారు. దీనినే సప్తహోతృ విధానమంటారు. ఇట్లా జ్ఞానేంద్రియాలను అంతర్ముఖంగా మలవటమే అంతర్యాగం. ఇట్లాగే శబ్దస్పర్శ రూపరసగంధాలనే పంచభూతలక్షణాలు, వక్తవ్య, కర్తవ్య, గంతవ్య, విసర్గానందాలనే కర్మేంద్రియవ్యాపారాలు ఐదు - మొత్తం ఈ పదీ హవిస్సులు. వీటిని హోమంచేసేవారు జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలు. వీటిని అంతర్భూతుడైన వైశ్వానరుడిలో హోమం చేయటమే దశహోతృవిధానం. ఇది అంతర్యాగంలో ఒక భాగం.

ఈ చర్చలలో మనస్సు - వాక్కులలో ఏది ప్రధానమన్న విషయం, మనస్సు, ఇంద్రియాలలో ఏది ముఖ్యమన్న విషయం చాలా రమ్యంగా అగుపిస్తాయి. మోక్షప్రకారాన్ని గురించి చెప్తుతూ కరణ, కర్మ కర్తలనేవి 'కారకత్రయం' అనీ, ఘ్రాణాదులు మనస్సు బుద్ధి - ఇవి కరణాలనీ, గంధాదులు కర్మహేతువులనీ, జీవాత్మకు కర్త అనీ,అతడు విషయరూపాలైన హవిస్సులను అనుభవించక ఉదాసీనత్వం అనే స్రుక్కులోఉంచి ఆత్మ అనేటటువంటి అగ్నిలో హోమం చేస్తే మోక్ష విధానమనీ తెలియాలి. దీనికి భిన్నంగా విషయసుఖాలను అనుభవిస్తే అదే బంధహేతు వవుతుందని బ్రాహ్మణగీత బోధిస్తుంది. చివరకు యోగి స్వభావం తామరాకుమీద నీటిబొట్టువలె నిర్లిప్తంగా ఉండటమన్న భగవద్గీతాసారాన్ని బ్రాహ్మణగీత పునరుద్ఘాటిస్తుంది.

అధ్వర్యుయతి సంవాదమనే ప్రసంగం 'హింస' అంటే ఏమిటో చర్చించటం కొరకు ప్రసక్తమయింది. ఒక అధ్వర్యుడు యజ్ఞ పశువును ప్రోక్షించి నరకటానికై సిద్ధపడుతుండగా ఒక యతి 'ఇది హింసకాదా?' అని ఆక్షేపించాడు. ఇది హింస కాదని ఆ యజ్ఞ పశువు ఊర్ధ్వలోకాలు పొందుతుందనీ, శ్రుతి ప్రామాణ్యాన్ని అధ్వర్యుడు ఉదాహరించాడు. 'యజ్ఞపశువుకు ఊర్ధ్వలోకం సిద్ధించటంవలన నీ కేమిఫల' మని యతి అడిగాడు. శ్రుతి విహితమైన పుణ్యమే నాకు ఫల 'మని ఆ అధ్వర్యుడ'న్నాడు. హింస పాపమని వేదమే చెప్తుతున్నది కదా!' అని యతి అడుగగా 'యజ్ఞంలోని పశువిశసనం పాపంకా'దని అతడు సమాధానం చెప్పాడు. కాని యజ్ఞంలో తపోయజ్ఞమే ఉత్తమమన్న నిష్కర్షతో ఈ సంవాదం ముగుస్తుంది.

అంబరీషగీతలు తరువాత ప్రసక్తమయ్యాయి. అంబరీషుడనే రాజు బాహ్య శత్రువులనందరినీ జయించినా తృష్ణ మొదలైన అంతఃశత్రువులను జయించలేకపోయా నని విచారం వ్యక్తం చేశాడు. లోభాన్ని ఎవరు జయించలేరో వారు జన్మ జరామృత్యువులకు వశమవుతారని ఆ మహారాజు ప్రబోధించాడు.

జనక యమ సంవాదం కూడా చాలా ప్రశస్తమైన కథ. ఒకసారి జనకమహారాజు వద్దకు బ్రాహ్మణుడి వేషంలో యమధర్మరాజు వచ్చాడు. ఏదో ఒక చేయరానిపనిని ఆ బ్రాహ్మణుడు తన ముందర చేయగా జనకుడు కోపగించుకొని 'నారాజ్యపు సరిహద్దులను వదలి పో'మ్మని అతడిని ఆజ్ఞాపించాడు. అప్పుడు 'రాజా! నీ రాజ్యపు మేరలను నిర్దేశించండి. ఆ మేరలను దాటి వెళ్ళిపోతాను' అన్నాడు ఆ బ్రాహ్మణుడు. జనకుడు ఆ మాటలు విని మూర్ఛపోయాడు. తెలివిరాగా తన తప్పును తాను సవరించుకొన్నాడు. పరమవేదాంతి అయిన అతడికి తన రాజ్యం తన నగరమన్న భావనే లేదు. కనుక జనకుడికి భూమ్యాది పంచభూతాలను జయించే మనోధర్మం సిద్ధించిందని ధర్మదేవత సంతోషించి వెళ్ళిపోయాడు.

ఈ కథలన్నింటినీ బ్రాహ్మణుడు బ్రాహ్మణితో చెప్పాడు. చివరికి బ్రాహ్మణుడు ఇట్లా అన్నాడు. 'ఓ వనితా వినుము! జిజ్ఞాసువు అరణి, గురుడు ఉత్తరారణి. తపస్సుచేత వేదంచేత ఈ రెండింటి నిర్మథనంలో జ్ఞానమనే నిప్పు పుట్టుతుంది. క్షేత్రజ్ఞుడని ఆ జ్ఞాన స్వరూపాన్నే అంటాము. అది ఇంద్రియాలకు అందదు. అది నిర్గుణమైనది. దానిని అహంకార విసర్జనం ద్వారా మాత్రమే గుర్తించగలుగుతాం.

ఈ సంవాదాన్ని విన్న అర్జునుడు ఆ పరమవేద్యమైన బ్రహ్మతత్త్వాన్ని గురించి చెప్పుమని అడుగగా శ్రీకృష్ణుడు గురుశిష్య సంవాదాన్ని వినిపించాడు. ఒకప్పుడు మహామునులు అంగిరసుడిని పురస్కరించుకొని బ్రహ్మదగ్గరకు వెళ్ళారు. 'ఏది హితం? దానిని పొందటానికి మంచిమార్గం ఏది?' అని అడిగారు. బ్రహ్మ ఈ విధంగా చెప్పాడు. 'సత్త్వంవలన భూతాలన్నీ పుట్టుతాయి. సత్త్వంలోనే ప్రవర్తించి, అందులోనే లీనమవుతాయి. శ్రుతి, తపస్సు అనేవి సత్త్వానికి మారుపేర్లు. యోగనిష్ఠులైన మునులు కామక్రోధాలను విడిచి సత్త్వాన్నే సేవిస్తాయి. అదే హితం. దానిని చేరుకొనటానికి మంచి మార్గమున్నది. అదే ధర్మం. చతురాశ్రమాలను, వర్ణ చతుష్టయాన్ని ఆశ్రయించిన పవిత్ర జీవనులు ధర్మాన్ని అనుష్ఠించిన వారవుతారు. దీనికి ముందుగా తెలిసికొనదగిన విషయం- చతుర్వింశతి తత్త్వాలను గురించి, పంచమహాభూతాలు, శబ్దాది గుణాలు, జ్ఞాన కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారం, ప్రకృతి - అనే ఈ 24 తత్త్వాల పుట్టుకను, లయాన్ని తెలిసినవాడు సంసారమోహాన్ని పొందక పరతత్త్వాన్ని పొందుతాడు' అని చెప్తుతూ బ్రహ్మ సత్త్వరజస్తమో గుణాలను గురించి వివరించాడు. గుణత్రయంలో ఎక్కువ తక్కువలు లేకుండా సమస్థితిని కలిగి ఉండటమే అవ్యక్తస్థితి. ఈ అవ్యక్తస్థితినుండి మహత్తత్త్వం పుడుతుంది. దీనికే మతి, బుద్ధి అనే నామాంతరాలు ఉన్నాయి. మహత్తుకే అహంకార సంజ్ఞ ఉన్నది. అహంకారంనుండి పంచభూతాలు, వాటినుండి శబ్దాదులు, జ్ఞానేంద్రియాలు - ఇట్లా సృష్టిపరిణామం సాగింది. వీటిలో శ్రోత్రాదులైదూ, మనస్సు, బుద్ధి, ప్రాణం, అభిమానం లేదా అహంకారం - అనే ఈ తొమ్మిదీ కలిసి

'నవద్వారపురం' అనే సంకేతాన్ని పొంది ఉన్నాయి. అంటే ఈ శరీరమే నవద్వారపుర మన్నమాట. ప్రాణాది పంచకం, వాక్కు, మనస్సు, బుద్ధి- అనే ఈ ఎనిమిదింటి సంపుటికే 'అంతరాత్మ' అని పేరు. లోకం ఈ అంతరాత్మ అనే ఉపాదాన కారణంనుండి పుట్టుతున్నది. అహంకారం నుండి జ్ఞాన కర్మేంద్రియాలు, మనస్సు అనే పదకొండు తత్త్వాలు పుట్టుతాయి. వీటి బారిని పడకుండా ఎవరు ఆత్మను ఉపాసిస్తాడో వాడు పరతత్త్వవేత్త అవుతాడు.

పిదప బ్రహ్మదేవుడు అధ్యాత్మ, అధిభూత, అధిదైవత తత్త్వాలను గురించి చెప్పాడు. ఇంద్రియాలను, ఇంద్రియార్థాలను, భూతసార్థాన్ని వేరువేరుగా తెలిసికొని మనసులో స్థిరంగా నిలుపుకొనటంచేత 'భవం' (పుట్టుక-పాపం) అనే భావన నశిస్తుంది. విద్వాంసుడు తన ఇంద్రియాలను తనలోనికి మరల్చుకొనటం అభ్యసిస్తాడు - తాబేలు బయటపడిన తన అవయవాలను లోపలికి ముడుచుకొన్న రీతిగా - అట్లా కలిగేదే ఇంద్రియజయం. భూతపంచకమనే సముద్రానికి కాముడు, క్రోధుడు ప్రభువులు. వీరిని జయిస్తేకాని విద్వాంసుడు ఆ సముద్రాన్ని దాటలేడు. ధర్మానికి అహింస లక్షణం. మనుష్యులకు కర్మ, వాక్కుకు సత్యం, బుద్ధికి వ్యవసాయం, జ్ఞానానికి సన్న్యాసం ప్రధానవ్యాపారాలు. జ్ఞానపూర్వకమైన సన్న్యాసంవలన ద్వంద్వభావనా రాహిత్యంవలన యోగులు జరామృత్యు నిస్తరణం సాధిస్తారు.

ఈ విధంగా బోధించి బ్రహ్మదేవుడు 'అవ్యక్తతత్త్వం' అతిగహనమైనదని చెప్పుతూ ఇట్లా అన్నాడు.

'అవ్యక్తం సలింగం, పురుషుడు అలింగుడు. అతడు క్షేత్రాన్ని తెలిసినవాడు కావటంచేత క్షేత్రజ్ఞుడు. క్షేత్రమంటే ప్రకృతి. అది త్రిగుణాత్మకం. ప్రకృతిలో లీనమైన మహత్తత్త్వమే అంతరాత్మ. అతడికి ప్రకృతి క్రియాకలాపమంతా తెలుసు. కాని, ప్రకృతి అంతరాత్మను ఎరుగదు. అట్లే భూతాలలో అగ్ని శ్రేష్ఠుడు. విద్యలలో సావిత్రి, ఛందస్సులలో గాయత్రి, ఆశ్రమాలలో గృహస్థాశ్రమం. ప్రజాపతులలో నేను శ్రేష్ఠులం. నా కంటె విష్ణుడు ఎక్కువ. ఈశ్వరుడు దేవతాళిలో అందరిలోనూ శ్రేష్ఠుడు. నేను - విష్ణువు-ఈశ్వరుడు అనే మూర్తిత్రయం ఒక పదార్థమే. ఎవరు మమ్ములను ముగ్గురినీ ఒకే తత్త్వంగా తెలిసికొంటాడో వాడే 'ఎరుక' సమగ్రంగా కలిగినవాడు.'

అని బోధించి చివరకు బ్రహ్మ సత్త్వం ఎట్లా అవశ్యం అనుష్ఠించదగిందో చెప్పాడు.

సత్త్వం పురుషుడే అని కొందరంటారు. కాని, పురుషుడు గుణాతీతుడు. సృష్టిక్రమాన్ని గమనించినా ఈ విషయం తెలుస్తుంది. భూమ్యాది భూతచతుష్కం ఆకాశంలో లీనం అవుతుంది. ఆకాశం అవ్యక్తంనుండే సముద్రాలలోనుండి తరంగాలు పుట్టినట్లుగా చరాచరభూతాలు పుట్టుతూ లీనమవుతూ ఉంటాయి. అవ్యక్తం అవ్యయుడైన పురుషుడిని ఆశ్రయిస్తుంది. అందుచేత పురుషుడు గుణాతీతుడు. కేవల సత్త్వుడు మాత్రమే కాడు. దీనిని గుర్తించటమే మోహబంధవిముక్తి. దీనికి అర్హమైన సాధనం తపస్సు, అహంకృతితో కూడిన తపస్సువలన ప్రజాపతి సమీపత్వాన్ని మాత్రమే పొందగలుగుతాం. కాని, మమకార విదూరమైన తపస్సుచేత అవ్యయస్థానమే ప్రాప్తిస్తుంది. సత్త్వసహాయంతో రజస్తమోగుణాలను జయించి ఈశ్వర సాక్షాత్కారం పొంది ఆ సత్త్వాన్నికూడా వదలిపెట్టాలి.'

అంటూ బ్రహ్మ చేసిన బోధను గుర్తుచేసి శ్రీకృష్ణపరమాత్మ మునుపు తాను కురుక్షేత్రంలో బోధించిన గీతాసారాన్ని పునరుద్ఘాటించాడు.'

శ్రీకృష్ణుడి ద్వారకాయానం:

శ్రీకృష్ణుడు తాను ద్వారకానగరానికి వెళ్ళి వసుదేవాదులను చూడాలనే కోర్కె వెలిపుచ్చాడు. అర్జును డా విషయాన్ని ధర్మరాజుకు తెలిపి అతడి అనుమతితో ద్వారకకు వెళ్ళవచ్చునని కృష్ణుడితో కలిసి ఇంద్రప్రస్థంనుండి హస్తినాపురానికి వచ్చాడు. అర్జునుడు శ్రీకృష్ణుడిని సగుణ బ్రహ్మస్వరూపుడిగా గ్రహించి అతడిని స్తుతించాడు. అర్జునుడి అభ్యర్థన మేరకు ధర్మరాజు శ్రీకృష్ణుడికి గౌరవ పురస్సరంగా - అశ్వమేధయాగానికి బంధుమిత్ర పరివార సమేతంగా రమ్మని ప్రార్థిస్తూ - ద్వారకకు పోవటానికి అనుమతించాడు. అర్జునుడిని వదలలేక శ్రీకృష్ణుడు రథంమీద ప్రయాణం సాగించాడు.

మార్గమధ్యంలో శ్రీకృష్ణుడు ఉదంకమహాముని ఆశ్రమాన్ని దర్శించాడు. ఉదంకుడు మహాభారతయుద్ధ కాలంలో శ్రీకృష్ణుడు నిర్వహించిన పాత్ర పక్షపాతంగా ఉన్నదనే భావంతో వ్యంగ్యంగా నిందాస్ఫోరకంగా పలకరించాడు. శ్రీకృష్ణుడు నిర్వికారంగా సమాధానం చెప్పుతూ శాంతికొరకు తాను చేసిన కృషిని వివరించి, కౌరవుల కారణంగానే యుద్ధం చెల్లిందని

వివరించాడు. ఉదంకుడి వ్యంగ్యోక్తులకు శపించబోయాడు. ఉదంకుడు శ్రీకృష్ణుడిని ప్రార్థించాడు. అతడు ప్రసన్నుడై తన పరబ్రహ్మతత్త్వాన్ని తెలిపాడు. ఉదంకుడి వేడికోలుపై తన విశ్వరూపాన్ని ప్రసాదించి అతడిని ఆశ్చర్యాంబుధిలో ముంచాడు. ఉదంకుడి ప్రార్థనపై నిజసౌమ్యరూపాన్ని తాల్చి వరం కోరుకొమ్మన్నాడు. ఆ ఋషి నివాసప్రాంతం నిర్జలప్రాంతం కావటంవలన ఎల్లప్పుడూ నీరు చేరువలో ఉండేటట్లు అనుగ్రహించుమని కోరాడు. ఎప్పుడు తన రూపాన్ని స్మరిస్తే అప్పుడు జలం లభిస్తుందని అభయమిచ్చి ద్వారకకు వెళ్ళాడు.

ఒకనాడు ఉదంకుడు దాహార్తుడై శ్రీకృష్ణుడిని స్మరించాడు. ఒక చండాలుడు తన మలిన శరీరంనుండి జలం స్రవిస్తూ ఉండగా ఎదుట గోచరించి, ఆ నీటిని త్రాగి దప్పిక తీర్చుకొనుమని అడిగాడు. ఉదంకుడు ఏవగింపుతో అతడిని నిరాకరించాడు. అతడు అదృశ్యు డయ్యాడు. శ్రీకృష్ణుడు ప్రత్యక్షమై ఆ చండాలరూపుడు ఇంద్రుడనీ అతడి శరీరంమీద స్రవించే జలం అమృతమనీ చెప్పి గొప్ప అదృష్టాన్ని దూరం చేసికొన్నా వని ఆ మునీంద్రుడికి తెలిపి, ఆపై అతడు తలచుకొన్నప్పుడెల్లా మేఘాలు పట్టి వానపడుతుందనీ చెప్పాడు. ఆ మేఘాలకు ఉదంక మేఘాలనే పేరు ఏర్పడింది. ఈ ఉదంతం విన్న తరువాత జనమేజయుడు వైశంపాయనుడిని ఉదంకుడి చరిత్రను చెప్పుమని అడిగాడు. ఉదంకుడు గౌతముడి భార్య అహల్యకు సౌదాసుడి భార్య మదయంతి యొక్క కుండలాలు తెచ్చి ఇచ్చిన కథను వివరంగా తెలిపాడు.

శ్రీకృష్ణుడు ద్వారకకు చేరాడు. యాదవులు రైవతక పర్వతోత్సవంలో ఆసక్తులై ఉన్నారు. శ్రీకృష్ణుడి రాకకు ఉప్పొంగిపోయారు. శ్రీకృష్ణుడు వసుదేవాదులకు సముచిత సాదరసేవలందించాడు. వసుదేవుడు శ్రీకృష్ణుడిని భారత యుద్ధ విశేషాలను వివరించమని కోరాడు. భారతయుద్ధకర్మ చాలా పెద్దదనీ, దానిని చెప్పటానికి చాలా రోజులు పట్టుతుందనీ పేర్కొని శ్రీకృష్ణుడు సూక్ష్మంగా యుద్ధోదంతాన్ని చెప్పాడు. కౌరవసైన్య సంఖ్యావివరాలూ, భీష్మ, ద్రోణ, కర్ణ, శల్యాది వీరులు యుద్ధంచేసిన దినాలూ, శకుని పడిపోయిన తరువాత దుర్యోధనుడు ఒంటరిగా పారిపోయి హ్రదంలో దాగికొన్న సంగతీ, పాండవు లతడిని అధిక్షేపించి హ్రదంబయటికి రప్పించి భీముడిచేతిలో తొడలు విరిగిపడిపోయిన ఉదంతాన్నీ చెప్పాడు. ఆ రాత్రి అశ్వత్థామ విజృంభించి పాండవ స్కంధావారంలో ఉన్న వీరులనూ, బలాలనూ క్రూరంగా సంహరించిన పద్ధతినీ, పాండవపక్షంలో, కౌరవపక్షంలో ప్రాణాలతో మిగిలి ఉన్న వారినీ చివరకు పేర్కొన్నాడు. కాని, అభిమన్యుడి మరణ విశేషాన్ని చెప్పలేదు. సుభద్ర విషాదంతో ఆ సంగతి జ్ఞాపకం చేసి అభిమన్యు వధవృత్తాంతాన్ని చెప్పించింది. వసుదేవాదులు శోకంతో ఆక్రోశించారు. శ్రీకృష్ణుడు వారిని ఓదార్చాడు. అభిమన్యుడి పరాక్రమాన్ని కీర్తించాడు. ఆ తరువాత చుట్టాలతో కలిసి సంతోషంతో కాలం గడిపాడు.

అశ్వమేధయాగ యత్నం:

హస్తినాపురంలో చుట్టాలందరూ మాటలవెంబడి అభిమన్యుడి పరాక్రమాన్ని పొగడేటప్పటికి ఉత్తర శోకించేది. అది చూచి పాండవులు దుఃఖమగ్నులయ్యేవారు. దానిని గమనించి వ్యాసమహర్షి ఒకనాడు వారివద్దకు వచ్చి అశ్వమేధయాగం చేయవలసిన అవసరాన్నీ, దాని విషయవిధులనూ వివరించి, వారిని యజ్ఞకార్యానికి ప్రోత్సహించి అదృశ్యుడయ్యాడు. ధర్మరాజు తమ్ములతో సంప్రదించి, హిమాలయంలో గుప్తమైయున్న స్వర్ణనిధులను స్మరించి, వాటిని సాధించే ప్రయత్నంలో చేయవలసిన పూజాదికాలను నిర్వహించి, ధృతరాష్ట్రుడివద్ద అనుమతి తీసికొని, హస్తినాపుర రక్షకు యుయుత్సుడినీ, విదురుడినీ నియోగించి ధర్మజాదులు హిమాలయాలకు పయనం కట్టారు. శిఖరాలను ఎక్కి ఒక సమతల ప్రదేశంలో విడిది చేశారు.

అప్పుడు వ్యాసమహర్షి పాండవుల ముందు ప్రత్యక్షమయ్యాడు. ధర్మరాజాదులు ఆ మహర్షిని పూజించి కర్తవ్యాలను బోధించుమని అడిగారు. ఆ రాత్రి పాండవులు నియమ నిష్ఠలతో దర్భశయనాలమీద శయనించారు. పంచాగ్నులవలె వెలుగొందారు. మరునా డుదయం శివుడిని ఒకచోట అవాహనంచేసి ధూపదీప నైవేద్యాలతో విధివిధానంగా పూజించారు. ప్రమథులను అర్చించారు. మంత్ర జలాలతో నిధులున్నచోట ప్రోక్షించారు. పూలతో, మాంసంతో, పేలాలతో శాస్త్రోక్తంగా పూజించారు. బలవంతులైన సేవకులచేత త్రవ్వించారు. అప్పుడు నలుదిక్కులా వెలుగులు విరజిమ్ముతూ స్వర్ణ నిధులు బయటపడ్డాయి. పాండవులు వాటిని పూజించారు. వ్యాసుడు ప్రత్యక్షమయ్యాడు. పాండవు లా మహర్షిని పూజించారు. అతడు వారిని దీవించి అదృశ్యుడయ్యాడు. అప్పుడు ధర్మరాజు ఆ నిధులను వెలికి తీయించి వేలకొలది బండ్లకూ, గాడిదలకూ, ఒంటెలకూ, గుర్రాలకూ, ఏనుగులకూ బరువులు ఎత్తించి, వివిధ హేమ పాత్రలనూ, యజ్ఞోపకరణాలకూ

వీరులకు ఎత్తించి, శ్రమలేని ప్రయాణాలతో హస్తినాపురం వైపు పయనం సాగించాడు. దానిని చూచి మానవులూ, దేవతలూ, ఆశ్చర్యపడ్డారు. శత్రువులు భయపడ్డారు.

పరీక్షిత్తు జననం:

ధర్మజుడి అశ్వమేధాహ్వానాన్ని పురస్కరించుకొని శ్రీకృష్ణుడు సకల బంధుసమేతంగా హస్తినాపురానికి వచ్చాడు. అందరూ కలిసి సంతోష సల్లాపాలతో ఉంటున్న తరుణంలో ఉత్తరకు మగబిడ్డ పుట్టాడు. కాని, మహాబాణాగ్నితో దగ్ధమై చనిపోయినవాడుగా ఉన్నాడు. అంతఃపురకాంతలు శోకంలో మునిగిపోయారు. కుంతీ సుభద్రలు మృతబాలుడి గురించి శ్రీకృష్ణుడితో మొరపెట్టి చెప్పుకొన్నారు. పాండవ వంశాంకురాన్ని బ్రతికించుమని బహువిధాలుగా ఆక్రందిస్తూ అర్థించారు. అశ్వత్థామ బ్రహ్మముఖాస్త్రాన్ని ప్రయోగించినప్పుడు ఆ శిశువును రక్షిస్తానని చేసిన ప్రతిజ్ఞను వాసుదేవుడికి జ్ఞాపకం చేశారు. ఆ బిడ్డ చనిపోతే ఆ శోకంతో తామంతా ఒకవైపు, పాండవులంతా మరొకవైపూ ప్రాణాలు వదలటం తథ్యమని మొరపెట్టుకొన్నారు. వారి ఆక్రందనలు విని శ్రీకృష్ణుడు అర్ద్రుడయ్యాడు. వారందరితో కలిసి మాధవుడు ప్రసూతిమందిరానికి వెళ్ళాడు.

ద్రౌపది ముందుగా వెళ్ళి ఉత్తరకు శ్రీకృష్ణాగమనాన్ని తెలియపరచింది. ఉత్తర లేని వాసుదేవుడికి మ్రొక్కి, ఆ బిడ్డ చేత కూడ మ్రొక్కించాలని ముచ్చటపడ్డా, అశ్వత్థామ అస్త్రశక్తికి గురి అయి మృతుడు కావటంవలన ఆ మాట ఓటువోయిందని వాపోయింది. ఆ శిశువును అంకతలంమీద ఉంచుకొని శ్రీకృష్ణాదులను కన్నెత్తి చూడుమని పలవించింది. మృతశిశువు తెలివొందక పోవటంతో మూర్ఛపోయింది. కొంతసేపటికి ఉత్తర తేరికొని లేచి నేలపై పరుండియే శ్రీకృష్ణుడికి 'శరణు శరణు' అని మ్రొక్కింది. శ్రీకృష్ణుడు ఆమెను, 'ఓడకు, ఓడకు' మని అభయహస్తం ఇచ్చాడు. మృతశిశువును శయనంమీద పరుండబెట్టుమన్నాడు. 'నా మాట అబద్ధం కాకుండా ఇదిగో బాలుడిని బ్రతికిస్తున్నాను. సంతోషంతో అందరూ చూడండి' అని హెచ్చరించాడు. బ్రహ్మముఖాస్త్ర ప్రయోగానికి విరుగుడు పెట్టాడు. పంచవిధ శపథాలతో బాలకుడికి పంచ ప్రాణాలు పోశాడు. బాలుడు కదిలాడు; కళ్ళుతెరిచాడు. అంతఃపుర స్త్రీలందరూ ఆనందంలో మునిగి తేలారు. ఉత్తర బాలుడిని తెచ్చి శ్రీకృష్ణుడి పాదాలకు ప్రణమిల్లజేసింది. అతడు బాలుడిని దీవించి వంశమంతా అంతరించిన సమయంలో పుట్టాడు కాబట్టి 'పరీక్షిత్తు' అని పేరుపెట్టాడు. అందరూ సంతసించారు. శ్రీకృష్ణుడూ, యాదవ ప్రముఖులు అందరూ కానుకలు చదివించారు. ప్రజలు పరమానందాన్ని పొందారు.

యజ్ఞాశ్వవరణం:

శ్రీకృష్ణుడి కరుణవలన పాండవసంతతి నిలిచింది. పరీక్షిత్తుకు ఒక నెల వయస్సు వచ్చింది. పాండవులు స్వర్ణ నిక్షేపాలతో హస్తినకు చేరారు. వాసుదేవాదులు వారికి ఘనస్వాగతం చెప్పారు. పాండవులు నగరప్రవేశం చేసి పెద్దలకూ, బంధువులకూ, సముచిత మర్యాదలు చేశారు. శ్రీకృష్ణాదులతో కలిసి ఒక మందిరంలో కొలువుచేశారు. పరీక్షిత్తుకు ప్రాణంపోసిన శ్రీకృష్ణ మహిమను విని ఆశ్చర్యసంతోషమగ్నులయ్యారు. గోవిందుడి నిరంతర దయాప్రవృత్తిని వేనోళ్ళ పొగడారు.

కొన్నాళ్ళకు వ్యాసమహర్షి పాండవుల మందిరానికి వచ్చాడు. ఆ మహర్షిని పూజించి ధర్మరాజు వాయజుడి దయవలన పొందిన ఆ మహాసంపదను అశ్వమేధయాగంకొరకు వినియోగించేందుకు అనుమతిని కోరాడు. మహర్షి సంతోషించి 'చంద్రవంశతిలకా! అశ్వమేధం సమస్తపాపాలనూ నశింపజేస్తుంది. దానిని నీవు సమగ్రదక్షిణాన్వితంగా నిర్వహించి పరిశుద్ధుడవై ప్రకాశిస్తూ ప్రసిద్ధికెక్కు' మని ప్రబోధించాడు. ధర్మరాజు సంతోషించి యాగాన్ని నిర్వహించటానికి శ్రీకృష్ణుడి అనుమతినికూడా కోరాడు. 'తల్లివైనా, తండ్రివైనా, గురువువైనా నీవే. నీ ఆజ్ఞ శిరోధార్య' మని ప్రార్థించాడు. 'వ్యాసమహర్షి చెప్పినట్లుగా చేయుము. యజ్ఞము చేసి మనస్తాపాన్ని పోగొట్టుకొనుము. అశ్వమేధయాగపుణ్యం సర్వధర్మాలకంటె శ్రేష్ఠమైనదని నేనే చెప్పాను కదా! యజ్ఞం చేయుమని నేనే ప్రేరేపించాను కదా! ఇక నా అనుజ్ఞ ప్రత్యేకంగా దేనికి? యజ్ఞనిర్వహణలో నేనేమి చేయాలో చెప్పుము. నీ తమ్ములతో కలిసి నేనూ సాయం చేస్తాను. యజ్ఞానికి సత్వరం పూనుకొమ్ము' అని శ్రీకృష్ణుడు ప్రోత్సహించాడు.

ధర్మరాజు వ్యాసమహర్షిని యజ్ఞానికి ముహూర్తాన్ని నిశ్చయించుమని, విధివిధానాలు బోధించుమని ప్రార్థించాడు. ఆ మహర్షి యజ్ఞ నిర్వహణంలో తనకు యాజ్ఞవల్క్యుడూ, పైలుడూ సహకరిస్తారనీ, చైత్రపూర్ణిమ శుభముహూర్తమనీ, యజ్ఞాశ్వాన్ని ఎన్నిక చేయించాలనీ సలహా ఇచ్చాడు. వేదోక్త దీక్షతో విడిచిన యజ్ఞాశ్వం భూమండలమంతా తిరిగి ధర్మజుడి కీర్తిని నలుదిక్కులా వ్యాపింపచేస్తుందనీ, యజ్ఞ పరికరాలనన్నింటినీ క్రొత్తగా సిద్ధం చేయించుమనీ తెలిపాడు. ధర్మరాజు అశ్వశాస్త్రజ్ఞులచేత ఉత్తమాశ్వాన్ని ఎన్నిక చేయించాడు. నిపుణులతో బంగారంతో స్రుక్స్రువాదులను చేయించాడు. వ్యాసుడు సంతోషించి శాస్త్రోక్తంగా అశ్వాన్ని వదలటానికి అనుమతించాడు. అశ్వరక్షణకు దివ్యాస్త్రవిదుడైన అర్జునుడిని నియోగించుమన్నాడు. దేశరక్షణకు భీమనకులులనూ, కుటుంబరక్షణకు సహదేవుడినీ నియోగించాడు. ఇంకా మిగిలిన పనులకు ధర్మరాజు తగినవారిని నియమించారు. కుంతీ గాంధారీ ధృతరాష్ట్రుల అనుజ్ఞతో అశ్వమేధయాగానికి సిద్ధమయ్యాడు.

సవనాశ్వరక్షణం:

దైవజ్ఞులు నిర్ణయించిన శుభముహూర్తాన ధర్మరాజు యజ్ఞదీక్ష స్వీకరించాడు. వ్యాసాది మహర్షుల ఋత్విజుల నడుమ ధర్మరాజు బ్రహ్మర్షుల మధ్య బ్రహ్మవలె ప్రకాశించాడు. వేదవ్యాసుడు శాస్త్రోక్తంగా వదలిన ఉత్తమాశ్వం బయలుదేరింది. గాండీవధారి అయిన అర్జునుడు అశ్వాన్ని అనుసరించాడు. అతడిని యజ్ఞకర్మ నిపుణులైన యాజ్ఞవల్క్య శిష్యులు అనుగమించారు.

యాగాశ్వం ధరణిని ప్రదక్షిణంగా తిరిగి ఉత్తరదిశవైపు సాగింది. అశ్వం త్రిగర్తదేశంలో ప్రవేశించింది. త్రిగర్త దేశాధిపతి కొడుకూలూ, మనుమలూ కలిసి సూర్యవర్మ నాయకత్వంలో అశ్వాన్ని అడ్డగించి అర్జునుడిని ఎదిరించారు. అర్జునుడు వారిని దయతో పలుకరించి, భారత యుద్ధంలో చాలామంది రాజులు చనిపోవటం కారణంగా ధర్మరాజు దయామయుడై గుర్రాన్ని పట్టుకొన్నవారిని మంచిమాటలతో ఒప్పించి రక్తపాతం జరుగకుండా చూడుమని చెప్పాడనీ హెచ్చరించి యుద్ధంనుండి విరమించుకొనుమని కోరాడు. కాని, సూర్యవర్మ దాడి సాగించాడు. అర్జునుడు అతడి బాణాలను వమ్ము చేశాడు. సూర్యవర్మకు తోడుగా అతడి తమ్ములు కేతువర్మ, ధృతవర్మలు కూడా పూనుకొని అర్జునుడి హస్తాన్ని నొప్పించి గాండీవం నేలమీద పడేటట్లు చేశారు. అర్జునుడు ఆగ్రహించి వారిపై పిడుగులవర్షంవంటి బాణాలను గుప్పించాడు. ఆ విజృంభణానికి త్రిగర్త వీరులు చెల్లాచెదరై అర్జునుడిని శరణు వేడారు. వారిని కరుణించి, ధర్మజుడి అశ్వమేధానికి వారిని ఆహ్వానించి అర్జునుడు అశ్వం వెంట ముందుకు సాగాడు.

యాగాశ్వం ప్రాగ్జ్యోతిషపురం దగ్గరకు వచ్చింది. భగదత్తుడి కుమారుడు భుజబలగర్వంతో యాగాశ్వాన్ని పట్టాడు. అర్జునుడు వాడిబాణాలతో అతడిని నొప్పించి నగరంలోనికి పారిపోయేటట్లు చేశాడు. అతడు ఏనుగునెక్కి మరల యుద్ధానికి వచ్చి అర్జునుడితో ఘోరంగా పోరాడాడు. నాలుగవనాడు మరణించాడు. అతడి కుమారుడు వజ్రదత్తుడు చెలరేగి తన మదపుటేనుగును అర్జునుడిపై పురికొల్పాడు. అర్జునుడు కోపగించి వజ్రాయుధంవంటి బాణంతో ఏనుగును కూల్చాడు. నేలపైబడ్డ వజ్రదత్తుడిని జాలితో చంపకుండా వదలి ధర్మరాజు శాంతి సందేశాన్ని వినిపించి, అశ్వమేధానికి ఆహ్వానించాడు. వజ్రదత్తుడు అంగీకరించి నమస్కరించాడు. అర్జునుడు యజ్ఞాశ్వంతో ముందుకు సాగాడు.

అశ్వం సింధుదేశంలో ప్రవేశించింది. భారతయుద్ధంలో చనిపోయిన సైంధవవీరుల పుత్రులూ, పౌత్రులూ పూర్వవైరాన్ని స్మరించి వేలసంఖ్యలో రథికులు అర్జునుడిమీద దండెత్తారు. గుమిగూడి అతడిపై దారుణంగా దాడిచేశారు. పార్థుడు బడలి తూలిపడ్డాడు. గాండీవం నేలపై పడింది. దేవతలూ, మహర్షులూ భయంతో బలప్రసాదక మంత్రాలు చదివారు. అర్జునుడు తేరుకొని లేచి గాండీవాన్ని ధరించి విజృంభించి శత్రువీరులను భయంకర బాణాలతో పీనుగు గుట్టలుగా మార్చాడు. కొందరు వీరులు తిరగబడ్డారు. కాని, వారికి అర్జునుడు ధర్మజుడి శాంతి సందేశాన్ని వినిపించి ప్రాణాలను దక్కించుకొనండని హితవు చెప్పాడు. అయినా వారు అగలేదు. విజయుడు వారిని చంపాడు. అప్పుడు జరిగినదంతా తెలిసికొని దుస్సల దుఃఖిస్తూ తన మనుమడిని ఎత్తుకొనివచ్చి అర్జునుడిని శరణువేడింది. అర్జునుడి రాక విని తనకొడుకు చనిపోయాడనీ, బాలుడిని రక్షించుమనీ మొరపెట్టుకొన్నది. దుర్యోధన సైంధవుల దుర్ణయాలకు విచారం వ్యక్తపరచింది. అర్జునుడు కరుణించి దుస్సలకూ, ఆమె మనుమడికీ శరణిచ్చి నగరానికి పంపాడు. యజ్ఞమృగాన్ని వెంటాడే శివుడివలె అర్జునుడు అశ్వాన్ని వెన్నంటి వెళ్ళాడు.

యజ్ఞాశ్వం మణిపూరనగరం దగ్గరకు చేరింది. ఆ నగరాధిపతి బభ్రువాహనుడు. తన తండ్రి అయిన అర్జునుడి ఆగమనాన్ని తెలిసికొని పెద్దలతో కలిసి వచ్చి అతడికి అభివాదనం చేయబోయాడు. అర్జునుడు దానిని మెచ్చక రాజధర్మానుగుణంగా యుద్ధం చేయుమని హెచ్చరించాడు. బభ్రువాహనుడు విచారంతో తిరిగి నగరానికి వచ్చాడు. పాతాళలోకంలోని నాగరాజకన్య ఉలూపి(చి) దివ్యదృష్టితో ఆ సంగతి తెలిసికొని అక్కడికి వచ్చి అర్జునుడితో యుద్ధం చేయుమనీ, అది అతడికి ప్రీతి కలిగిస్తుందనీ ప్రబోధించి యుద్ధోత్సాహాన్ని కలిగించి, తండ్రితో పోరు తగదని భావించిన అతడి మనసు మార్చి, అపూర్వ ప్రకాశాన్నీ, ప్రతాపాన్నీ ప్రసాదించి, అతడిని యుద్ధానికి పంపి, తాను అంతఃపురంలో నిలిచింది. బభ్రువాహనుడు హంసధ్వజం గల రథమెక్కి వెడలి యజ్ఞాశ్వాన్ని పట్టి పార్థుడిమీద బాణవర్షాన్ని కురిపించాడు. అతడు కుమారుడి హంసధ్వజాన్ని కూల్చి అతడి శరీరాన్ని బాణాలతో పీడించాడు. బభ్రువాహనుడు వాడిబాణంతో అర్జునుడి భుజసంధిని కొట్టాడు. ఆ దెబ్బకు రక్తంకారగా అర్జునుడు సొమ్మసిల్లి విల్లు ఆలంబనంగా నిలబడ్డాడు. తనంతవా డయ్యాడని కొడుకు ప్రతాపాన్ని మెచ్చుకొన్నాడు. విజయుడు అసూయతో బభ్రువాహనుడి శరీరమంతా బాణాలతో నింపాడు. అతడు వజ్రాయుధంవంటి బాణాన్ని తండ్రి హృదయంలో నాటాడు. అర్జునుడు నేలపై కూలాడు. అర్జునుడు వేసిన బాణానికి బభ్రువాహనుడు కూడా మూర్ఛపడి నేలపై కూలాడు. ఇట్లా భర్తా కుమారుడూ నేలగూలిన సంగతి తెలిసి చిత్రాంగద యుద్ధభూమికి వచ్చింది. ఉలూపికూడా వచ్చింది. పతిపై కొడుకును పురికొల్పి ఇద్దరూ చనిపోయేటట్లు చేసిన ఉలూపిని నిష్ఠురాలాడింది. పతిశరీరంమీదపడి పరిపరివిధాల దుఃఖించింది. అర్జునుడిని బ్రతికించుమని ఉలూపిని కోరింది. బ్రతికించకపోతే ప్రాయోపవేశం చేస్తానని భర్తశవం కాళ్ళవద్ద మోకరిల్లింది. అంతలో బభ్రువాహనుడు తేరుకొని తండ్రిని చంపినందుకూ, తల్లిని దుఃఖంపాలు చేసినందుకూ విచారించి పితృహంతకుడికి ప్రాయశ్చిత్తం లేదని వాపోయాడు. తండ్రిపై యుద్ధానికి పురికొల్పిన ఉలూపిని చూచి నిష్ఠురా లాడాడు. వీర వధ పాపం; దానికంటె ధార్మికవధ మహత్తర పాపం. ఇక జనకవధ మితిలేని పాపం, వీరుడూ, రాజూ, ధార్మికుడూ, తండ్రీ అయిన మహాత్ముడిని చంపిన పాపానికి నిష్కృతి లేదని అంటూ ప్రాయోపవేశానికి పూనుకొన్నాడు బభ్రువాహనుడు.

అప్పుడు ఉలూపి సంజీవనమణిని స్మరించింది. ఆ మణి ఆమె చేతిలో నిలిచింది. ఆమె చిత్రాంగదనూ బభ్రువాహనుడినీ చూచి 'అమాయకులారా! అర్జునుడు ఇంద్రుడిచేతకూడా చావడు. అతడికి ఒక గొప్పమేలు చేయదలచి ఈ పని చేశాను. బభ్రువాహనుడి శక్తని పరీక్షించాను. ఇది మాయా ప్రయోగం కాని నిజం కాదు' అని ప్రకటించింది. సంజీవనమణిని బభ్రువాహనుడిచేత అర్జునుడి హృదయాన్ని తాకించింది. అతడు లేచి కూర్చుండి కొడుకును పలకరించి యోగక్షేమాలు విచారించాడు. బభ్రువాహనుడు అర్జునుడి పాదాలకు సాష్టాంగ నమస్కారం చేశాడు. చుట్టూ ఉన్నవారందరూ విషాదంతో, ఆనందంతో కలిసి ఉండటానికి కారణం అడిగాడు అర్జునుడు. ఉలూపి ఇట్లా అన్నది. 'నీ కుమారుడివలన నీకు అశుభం కలిగింది. నీవు యుద్ధంలో శిఖండి మిషగా భీష్ముడిని పడగొట్టినందుకు వసువులు కోపగించి నిన్ను శపించారు. గంగాదేవి కూడా దానికి అంగీకరించింది. నేను ఆ సంగతి సమీప తీర్థంలో స్నానం చేస్తూ విని మా తండ్రికి ఆ సంగతి నివేదించాను. అతడు వసువులను ప్రార్థించి నివారణోపాయం పొందాడు. బభ్రువాహనుడిచేత రణరంగంలో నిహతుడైతే ఆ పాపం పరిహారమౌతుందని వారు అనుగ్రహించారు. నీకీ ప్రాయశ్చిత్తం జరుగకపోతే మరణానంతరం నరకప్రాప్తి కలుగుతుందని భావించి, తగిన సమయ మిదే అని నిశ్చయించి. బభ్రువాహనుడిని యుద్ధానికి ప్రేరేపించి, అతడికి అనంతశక్తిని ప్రసాదించి ఈ ప్రాయశ్చిత్తాన్ని కలిగించాను' అని చెప్పింది. అర్జునుడితోపాటు అందరూ ఆనందించారు. తనకూ, తనవంశానికీ ఎల్లప్పుడూ పెంపుకోరే ఉలూపిని విజయుడు ప్రశంసించాడు. ధర్మజుడు తలపెట్టిన అశ్వమేధయాగానికి బభ్రువాహనుడినీ, అతడి తల్లులనూ, బంధుమిత్రులనూ ఆహ్వానించాడు. ఉలూపినీ, చిత్రాంగదనూ అభినందించి వారిపూజ లందుకొని అశ్వాన్ని వెంబడించాడు.

యజ్ఞాశ్వం అనేక దేశాలలో ఇచ్చవచ్చినట్లు తిరిగి రాజగృహం చేరుకొన్నది. దానికి అధిపతి జరాసంధ పౌత్రుడైన మేఘసంధి. అతడు బాలుడు కావటంచేత అర్జునుడి పరాక్రమం తెలియక గర్వంతో ఎదిరించి యుద్ధం చేశాడు. అర్జును డతడికి ధర్మరాజు శాంతి సందేశాన్ని వివరించినా వినక పోరుకు దిగాడు. అర్జునుడు కరుణతో అతడి శరీరం తాకకుండా బాణవర్షాన్ని కురిపించి అతడి రథాన్ని, గుర్రాలను, విల్లునూ, గదనూ ముక్కలు చేశాడు. చివరకు మేఘసంధి తన బలహీనతను గుర్తించి అర్జునుడి శరణువేడాడు. అతడు క్షమించి అశ్వమేధానికి ఆహ్వానించాడు. అశ్వం క్రమంగా వంగ పుండ్ర మ్లేచ్ఛాది దేశాలలో తిరిగినప్పుడు పార్థుడు ఆయా రాజులనందరిని జయించాడు.

ఆ తరువాత క్రమంగా చేది దేశాధిపతి అయిన శిశుపాలుడి కుమారుడి శరభుడినీ, టేంకణాధిపతి కిరాతరాజునూ, కోసల, కాశ, దశార్ణ, నిషాద పౌండ్ర, ఆంధ్ర, ద్రావిడ, కేరళ, కర్ణాట భూపతులనూ, సౌరాష్ట్ర, గోకర్ణాధిపతులనూ ఓడించాడు. యాదవులు అతడిని పూజించారు. పాంచాల, గాంధారదేశాలలో శకుని కుమారుడు బాల్యచాపల్యంతో అర్జునుడితో తలపడి ఓడిపోయి శరణు వేడాడు. వారందరికీ ధర్మరాజు శాంతి సందేశాన్ని వినిపించి, చైత్ర శుద్ధ పూర్ణిమనాటి అశ్వమేధ యాగానికి ఆహ్వానాన్ని అందించాడు. యజ్ఞాశ్వం హస్తినాపురంవైపు పయనం సాగించింది. చారులవలన ధర్మరాజు ఆ విషయం తెలిసికొని సంతోషించాడు.

ధర్మరాజు మాఘపూర్ణిమనాడు సభ తీర్చాడు. భీమాదులైన సోదరులను అశ్వమేధయాగశాలా నిర్మాణం, అతిథి గృహ నిర్మాణం, అతిథిసన్మానం, అన్నదానం మొదలైన సౌకర్యాలు కల్పించటానికి తగిన ఏర్పాట్లు చేయండని నియమించాడు. వారు కల్పించిన సౌకర్యాలకు శ్రీకృష్ణాదులు హర్షించారు. అర్జునుడు యజ్ఞాశ్వాన్ని ముందుంచుకొని హస్తినాపురిలో ప్రవేశించాడు. ప్రజలు ఆనందోత్సాహాలతో వేడుకలు చేసికొన్నారు. అతిథులందరూ రావటం మొదలు పెట్టారు. బభ్రువాహనుడూ, అతడి తల్లులూ హస్తినాపురానికి చేరారు. అశ్వమేధానికి సర్వం సిద్ధమయింది.

అశ్వమేధయాగ నిర్వహణం:

ఋత్విజులు అశ్వమేధానికి సుమూహూర్తం నిశ్చయించారు. వ్యాసమహర్షి ధర్మరాజును యజ్ఞదీక్షకు పూనుకొమ్మన్నాడు. ఈ యజ్ఞం చాలా గొప్పది. నీవు మహాధనవంతుడవు. దక్షిణలు ఈయవలసిన దానికంటె మూడురెట్లు ఎక్కువగా ఇచ్చి మూడు యజ్ఞాలు చేసినంత ఫలాన్ని పొందుము. యజ్ఞాంతంలో చేసే అవభృథస్నానం మిక్కిలి పవిత్రమైనది. అది సమస్త పాపాలనూ తొలగిస్తుంది. కురుక్షేత్ర యుద్ధంలో దాయాదులను సంహరించటంవలన పాపం కలిగిందనే వ్యథ నీ మనస్సులో ఉన్నది కదా! అది అవభృథస్నానంవలన తొలగి నీ మనస్సు నిర్మలమౌతుంది. సమస్త శుభాలు కలుగుతాయి' అని పలికాడు. ఆ మాటలు విని ధర్మరాజు యజ్ఞదీక్ష వహించి అశ్వమేధ క్రియా కలాపాన్ని భక్తి శ్రద్ధలతో విధియుక్తంగా నిర్వహించాడు.

వేదవ్యాసాది మహర్షులు ఋత్విజులుగా యజ్ఞం యథావిధిగా సాగింది. యజ్ఞాశ్వంతో పాటు వివిధ జంతువులను మంత్రోచ్చారణతో విశసనంచేసి యజ్ఞాగ్నిలో హుతంచేశారు. ఋత్విజులూ, దేవతలూ, మహర్షులూ ధర్మరాజును, అతడి తమ్ములనూ దీవించారు. ధర్మరాజు సదస్యులకు వేయికోట్ల టంకాలు దక్షిణలుగా ఇచ్చాడు. బ్రహ్మజ్ఞాని అయిన వేదవ్యాసమహర్షికి ధర్మరాజు తన భూమండల సామ్రాజ్యన్నంతా దక్షిణగా సమర్పించాడు. వ్యాస శ్రీకృష్ణుల హితవు నాశ్రయించి వ్యాసదత్తమైన భూమండలాన్ని ధర్మరాజు కోటికోట్ల టంకాలు వెలగా చెల్లించి తిరిగి పొందాడు. వ్యాసు డా ధనరాశిని ఋత్విజులకు పంపిపెట్టాడు. యజ్ఞశాల భాగాల నన్నింటినీ ధర్మరాజు బ్రాహ్మణ బృందాలకు సమర్పించాడు. మిగిలినవర్ణాలవారికి కూడా స్వర్ణదానం చేసి ధర్మరాజు ప్రజలందరినీ సంతోషపెట్టాడు. యజ్ఞాంతంలో ధర్మరాజు సకుటుంబంగా, బంధుమిత్ర సమేతంగా అవభృథస్నానంచేసి పవిత్రుడై సర్వదోషాలూ పోయిన నిర్మల మనస్సుతో పుణ్యకాంతులతో ప్రకాశించాడు. చివరకు వ్యాసుడి పాదాలకు నమస్కరించాడు. ఆ మహర్షి ఆశీర్వదించి శిష్యసమూహంతో అదృశ్యుడయ్యాడు. ధర్మరాజు తన తమ్ములూ రాజులూ చుట్టూచేరి నిలువగా నక్షత్రాలలో చంద్రుడివలె రాణించాడు.

శ్రీకృష్ణాది బంధువుల కందరికీ ధర్మరాజు సముచిత పూజాగౌరవాలు చేసి తృప్తిపరిచాడు. అందరినీ వారివారి గృహాలకంపి కృతార్థుడయ్యాడు.

సక్తుప్రస్థ చరిత్రం:

ధర్మరాజు అశ్వమేధయాగం చేసినప్పుడు ఏదైనా ఆశ్చర్యకరమైన సంఘటన జరిగి ఉంటే - దానిని చెప్పుమని జనమేజయుడడుగా వైశంపాయన మహర్షి ఈ విధంగా సక్తుప్రస్థ చరిత్రం చెప్పాడు.

అశ్వమేధయాగంలో అత్యధిక స్వర్ణదక్షిణలతో సంతోషించిన బ్రాహ్మణ సమూహం చెంతకు ముంగిస ఒకటి ప్రక్కనున్న కన్నంనుండి బయటకు వచ్చి 'ఈ అశ్వమేధయాగం వీసమంతకూడా సక్తుప్రస్థుడి మహాధర్మంతో సరిపోలదు' అని ఆక్షేపించింది. దేవతలూ, మహామునులూ మెచ్చుకొన్న ధర్మరాజు అశ్వమేధాన్ని ఏకారణంవలన తక్కువని పేర్కొన్నావో తెలుపుమని ఆ బ్రాహ్మణులు ముంగిస నడిగారు. ముంగిస సక్తుప్రస్థుడి కథ ఇట్లా చెప్పింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

కురుక్షేత్రంలో రోషకామరహితుడైన ఒక ఉత్తమ బ్రాహ్మణుడు ఉంఛవృత్తితో నివసిస్తూ ఉన్నాడు. అతడికి భార్యా, కొడుకూ, కోడలూ తోడుగా ఉండేవారు. ఒకసారి వానలు కురువక ధాన్యం దొరకటం కష్టమై పోయింది. ఒకనాడు అతికష్టంమీద అందరూ కలిసి పగలెల్లా కష్టపడి తృణధాన్యం పోగుచేసికొని, దానిని నాలుగు మానికల పేలపిండిగా కొట్టుకొని, తలా ఒక మానిక పేలపిండిని సమంగా పంచుకొని వినియోగించుకొనటానికి సిద్ధమయ్యాడు. అంతలో బాటసారి అయిన బ్రాహ్మణుడు అతిథిగా వచ్చాడు. ఆకలిగొన్న అతడికి అతిథ్యంగా బ్రాహ్మణుడు తనవంతు పేలపిండిని అందించాడు. అతడు దానిని స్వీకరించి తృప్తుడు కాలేదు. అతడి భావం తెలిసికొని బ్రాహ్మణుడు బాధపడుతుండగా అతడి భార్య తన భాగం పిండిని అతిథికి ఇవ్వటానికి సిద్ధమయింది. కాని, బ్రాహ్మణుడు వారించాడు. 'భర్త భార్యకు చుట్టం, పక్కం, స్నేహితుడు, తల్లి, తండ్రి, గురువు, దైవం, కాబట్టి అతడి పనిచేయటం ఆమె ధర్మం. భర్త భుజించకుండా ఉంటే భార్య తింటుందా? అతిథి సత్కారం సహధర్మచారిణి ధర్మం' అని తన భాగం పేలపిండిని భర్తద్వారా అతిథికి సమర్పించింది. అతడు దానిని తిని ఇంకా అసంతృప్తిని ప్రదర్శించాడు. బ్రాహ్మణుడు పరితపించాడు. అతడి కుమారుడు తన భాగమైన పేలపిండిని అతిథికి సమర్పించటానికి ముందుకు వచ్చాడు. తండ్రి వారించాడు. పిల్లల తిండిని పెద్దలు గ్రహించటం న్యాయం కాదన్నాడు. 'తండ్రియే కుమారుడు' అని చెప్పిన వేదవాక్యాన్ని ప్రమాణంగా చేసి కొడుకు తన భాగాన్ని అతిథికి సమర్పించాడు. అతిథి ఆ పిండిని తిని తృప్తిపడలేదు. అప్పుడు కోడలు తన భాగాన్ని అతిథికి అందించింది. పెద్దలను అనుసరించటమే తన ధర్మమని తెలిపింది. ఆ భాగాన్ని తిని అతిథి తృప్తిని, సంతోషాన్ని ప్రదర్శించి తాను యముడనని ప్రకటించుకొని, వారు ప్రదర్శించిన భక్తి శ్రద్ధలనూ, ఓర్పుతో కూడిన దయాదానగుణాలనూ ప్రశంసించి, దేవతలు వారిని అశీర్వదిస్తున్నారని తెలిపాడు. దేవేంద్రుడు పూలవాన కురిపించాడు; స్వర్గానికి వారిని ఆహ్వానించాడు. యముడు అప్పుడు ఇట్లా ప్రకటించాడు. 'పుణ్యాత్మా! ఆకలి బుద్ధిని, తేజస్సునూ మట్టుపెట్టుతుంది. ఆశ దయను నాశనం చేస్తుంది. ఈ లోకతత్త్వం తెలిసికూడా భార్య అనీ, బిడ్డలనీ, చూడకుండా ఆకలినీ ఆశనూ జయించావు. నీవు చేసిన అతిథి పూజాపుణ్యంవలన బ్రహ్మ అనుగ్రహంతో నిన్ను సకుటుంబంగా తన సభకు రప్పించుకొనాలని నిర్ణయించాడు. దానాలూ యజ్ఞాలూ కూడా సన్మార్గంలో సంపాదించిన ద్రవ్యాన్ని స్వల్పమైనా యోగ్యుడైన వాడికి దానంచేయటంవంటి ఉత్తమ ధర్మాలు కావు' - అని యముడు తన నిజరూపాన్ని చూపాడు; బ్రహ్మ పంపిన దివ్య విమానంతో ఆ బ్రాహ్మణ కుటుంబ సభ్యుల నందరినీ ఎక్కించి బ్రహ్మలోకానికి పంపాడు.

ఆ పేలపిండి వాసన వ్యాపించి అతిథి కాళ్ళు కడిగిన నీటి తడి అంటుకొని సక్తుప్రస్థుడు చేసిన ధర్మం మహిమవలన ఆ ముంగిస శరీరం ఒకవైపు బంగారంగా మారింది. ఆనాటినుండి ఆ ముంగిస దానకార్యాలు జరిగే యజ్ఞప్రదేశాలకూ, మున్యాశ్రమాలకూ వెళ్ళుతూ, తన శరీరంలోని రెండవ భాగంకూడా బంగారం అవుతుందేమోనని యత్నిస్తూ ఉండేది. ఆ ప్రయత్నంలో భాగంగానే ధర్మజుడి అశ్వమేధయాగాన్ని కూడా దర్శించింది. కాని, అక్కడ కూడా ఆ ముంగిస కోరిక తీరలేదు. అందువలన సక్తుప్రస్థుడి యజ్ఞానికి ఆ యజ్ఞం సాటిరాదని పలికింది. ఆ తరువాత ఆ ముంగిస అదృశ్యమై పోయింది. ఇది అక్కడ జరిగిన అద్భుత విశేషం.

మునులు, బ్రాహ్మణులు, రాజులు, దేవతలు మెచ్చుకొనిన ధర్మరాజు అశ్వమేధంకంటె సక్తుప్రస్థుడి యజ్ఞం గొప్పదనటంలో గల తాత్పర్య మేమిటంటే - పశుహింసారూపమైన యజ్ఞంకంటె అహింసారూపమైన యజ్ఞం గొప్పది అని తెలపటానికే, ఈ తత్త్వాన్ని తెలిపే ఒక ఇతిహాసం ఉన్నది.

పూర్వం దేవేంద్రుడు యజ్ఞం చేయతలపెట్టాడు. శాస్త్రోక్తంగా హోమం చేయటానికి జంతువులను తెప్పించాడు. మునులు హింస ధర్మం కాదని వాదించారు. ఇంద్రుడు వారి మాటలు లెక్కించక పశువిశసనంతో యజ్ఞం చేశాడు. దేవతలు ఇంద్రుడి కొమ్ముకాచారు. మునులకూ ఇంద్రుడికీ వివాదం ఏర్పడింది. ఉపరిచర వసువు ఇంద్రుడిని సమర్థించాడు. అందువలన అతడికి అధోగతి కలిగింది. కాబట్టి హింస లేని యజ్ఞం ఉత్తమ మని తాత్పర్యం ఏర్పడింది. సక్తుప్రస్థుడి ధర్మం అందువలననే ఉత్తమమైనదని ముంగిస చెప్పింది - అని వైశంపాయనుడు చెప్పాడు.

అహింసాయజ్ఞం ఉత్తమం:

ధర్మమార్గంలో ప్రాప్తించిన పదార్థాన్ని దానంచేయటం ఉత్తమమని చెప్పే మరొక కథను జనమేజయుడు ఇట్లా చెప్పాడు.

అగస్త్యుడు నియమనిష్ఠలతో పన్నెండేళ్ళు ఒక మహాయజ్ఞాన్ని నిర్వహించటం మొదలు పెట్టాడు. మహర్షులెందరో ఆయజ్ఞం లో ఋత్విజులుగా ఉన్నాడు. అప్పుడు ఇంద్రుడు వర్షాలు కురిపించకపోవటంవలన కరువు ఏర్పడింది. ధర్మమార్గంలో ధాన్యం దొరకకపోతే పన్నెండేళ్ళ యజ్ఞం ఎట్లా సాగుతుందో అని మహర్షులు భయపడ్డారు. దానిని అగస్త్యుడు గ్రహించి అవసరం వస్తే తానే ఇంద్రపదవి గ్రహించి వర్షాలు కురిపిస్తాననీ, మూడు లోకాలలో ఎక్కడ ఉన్నా యజ్ఞద్రవ్యాలు తెప్పిస్తానని శపథం చేశాడు. మంచి విత్తనాలతో యజ్ఞం చేస్తే లోకం అనావృష్టినుండి రక్షించబడుతుందని అగస్త్యుడు జంతుహింసలేని యజ్ఞం చేయసంకల్పించాడు. ఇంద్రుడు దానికి సంతోషించి మేఘాలను పంపి వానలు కురిపించాడు. బృహస్పతితో కలిసివచ్చి యజ్ఞహవిస్సులు గ్రహించి అగస్త్యుడిని కృతార్థుడిగా చేశాడు. ఈ విధంగా హింస లేని యజ్ఞం దేవతల ప్రశంస లందుకొన్నది. ధర్మమార్గాన ప్రాప్తించిన ద్రవ్యాలతో చేసే తపోరూపమైన యజ్ఞం విద్వాంసుల మనస్సులను మెప్పించగలుగుతుంది.

శాపగ్రస్తుడైన జమదగ్నియే ముంగిస:

'ఆ ముంగిస ఎవరు?' అని జనమేజయుడు అడుగగా వైశంపాయనుడు ఇట్లా చెప్పాడు. 'జమదగ్ని నిష్ఠతో శ్రాద్ధం చేయ సంకల్పించాడు. క్రొత్తకుండలో హోమధేనువుపాలు పిండి అనువైనచోట దానిని జాగరూకతతో ఉంచాడు. అతడి మనస్సును పరీక్షించాలని క్రోధభూతం నిశ్చయించింది. అది ఆకారం తాల్చి పొరపాటున జరిగిందని అనుకొనేటట్లు పాలకుండను దొర్లించింది. జమదగ్ని దానిని చూచికూడా కోపించలేదు. ఆ భూతం అతడి శాంతప్రవృత్తికి మెచ్చుకొని తన నిజరూపాన్ని తెలిపి, తన తప్పిదానికి మన్నించుమని వేడుకొన్నది. అతడు ఆ భూతాన్ని మన్నించి పితృదేవతలకు తెలిస్తే శపిస్తారని చెప్పి వెళ్ళిపొమ్మన్నాడు. ఆ కోపభూతం భయంతో అదృశ్యమై పోయింది.

పితృదేవతలు జమదగ్నిపై కోపగించి శ్రాద్ధంపట్ల అశ్రద్ధ వహించినందుకు ముంగిసగా పుట్టుమని శపించారు. 'తపస్వులకు కోపం పనికిరాదని క్రోధభూతాన్ని కోపించలే దని చెప్పి తనను దయతో చూచి శాపవిముక్తిని ప్రసాదించుమని వేడుకొన్నాడు. వారు ప్రసన్నులై 'ఏనాడు నీవు పండితులైన బ్రాహ్మణులు ఒప్పుకొనేటట్లుగా మహాధర్మమును అధమ ధర్మంగా నిరూపిస్తావో ఆనాడే నీకు శాపవిముక్తి ఔతుంది' అని నిర్ణయించారు. అందువలన ముంగిస రూపంలోని జమదగ్ని ధర్మరాజు అశ్వమేధాన్ని అధిక్షేపించి శాపవిముక్తి పొంది ఆనందిస్తూ అదృశ్యుడయ్యాడు.

ఆశ్రమవాసపర్వ కథాసారం

వంశపారంపర్యంగా వచ్చిన సామ్రాజ్యాన్ని ధర్మరాజు జగత్పూజ్యంగా పాలిస్తూ గాంధారీ ధృతరాష్ట్రులను భక్తిగౌరవాలతో నిత్యమూ సేవిస్తూ ఉన్నాడు. అతడివలెనే అతడి తమ్ములూ, కుంతి, ద్రౌపది, సుభద్ర, చిత్రాంగద, ఉలూపి మొదలైన రాణులూ ఆ రాజదంపతులను ప్రతిరోజూ కలిసి మర్యాదలు జరుపుతుండేవారు. ధర్మరాజును దర్శించవచ్చే రాజులందరూ ముందుగా ధృతరాష్ట్రుడిని కొలిచి వచ్చేవారు. కొడుకులు లేని కొదువ ఆ వృద్ధ రాజదంపతులకు కలుగకుండా పాండవులు వారిని కంటికి రెప్పగా కాపాడుతుండేవారు. భీముడు మాత్రం వారిని చూచినప్పుడు దుర్యోధనుడు తనకు చేసిన కీడులనూ, తాము పడిన పాట్లనూ మనస్సులో స్మరించి కోపగించుకొనేవాడు. గాంధారీ ధృతరాష్ట్రులు ఏకాంతంగా తటస్థించినప్పుడు తన భుజపరాక్రమాన్ని ప్రశంసించుకొంటూ వారిని ఉపాలంభించేవాడు. వారు దానికి కటకటపడేవారు. ఆ సంగతి ధర్మజార్జునులకు తెలిసేది కాదు. కర్ణాకర్ణిగా నకుల సహదేవులు విన్నా సంతోషించి ఊరకుండేవారు. దుర్యోధనాదులకంటె మిక్కుటమైన అనురాగాన్ని ప్రదర్శిస్తున్న ధర్మరాజుపట్ల గాంధారీ ధృతరాష్ట్రులు ప్రీతితో మెలగుతూ ఉండేవారు. ఇట్లా పదిహేనేళ్ళు గడచిపోయాయి.

ధృతరాష్ట్రుడి తపోవనగమన సంకల్పం:

ఒకనాడు ధృతరాష్ట్రుడు బంధుజనాన్నీ ధర్మరాజునూ పిలిచి సమావేశపరిచాడు. తనవలన కలిగిన కౌరవవినాశనాన్ని పేర్కొని, భీష్మాదులు చెప్పిన హితవును తాను వినని దోషానికి పశ్చాత్తాపాన్ని ప్రకటించి, ధర్మజుడు తన పట్ల చూపుతున్న ప్రేమాభిమానాలకు సంతోషించి, రాజులకు సమరమరణం కానీ, వనంలో తపోమరణం కానీ ధర్మమని పేర్కొని, వార్ధక్యం కారణంగా గాంధారీ తానూ వనాలకు వెళ్ళి, తపస్వులైన మునులతో కలిసి వల్కలధారులై, కందమూలాలను తింటూ, ధర్మరాజు శ్రేయస్సు కోరుతూ జీవితశేషకాలం గడపాలనే కోరికను వ్యక్తం చేశాడు.

ఆ మాటలు విని ధర్మరాజు ఖిన్నుడై 'నీవే నాకు తల్లివి, తండ్రివి, గురువు, దైవానివి, నీవు అడవులకు వెళ్ళితే నేను 'హస్తినాపురిలో ఉండలేను. బ్రతిమిలాడాడు. పదివేల ఏనుగుల బలంగల ధృతరాష్ట్రుడు దప్పికతో గాంధారి శరీరంపై సొమ్మసిల్లి ఒరిగి పోయాడు. ధర్మరాజు ఆ వృద్ధరాజును చల్లని నీటితో తుడిచి చేర్చి కూర్చుండబెట్టాడు. ధృతరాష్ట్రుడు తనను తపస్సుకై వనగమనం చేయటానికి అనుమతించనిదే ఆహారం తిననని పట్టుపట్టాడు. అప్పుడూ వేదవ్యాసుడు అక్కడ అవతరించి గాంధారీ ధృతరాష్ట్రుల వనగమనం ధర్మబద్ధమని చెప్పి ధర్మరాజుచేత అంగీకరింపజేశాడు.

ఒకనాడు ధృతరాష్ట్రుడు ధర్మరాజును ఏకాంతంగా పిలిచి సప్తాంగమైన రాజ్యపాలనంలో ఉన్న కష్టాన్ని తెలిపి సముచిత రాజనీతి విశేషాలను అతడికి బోధించాడు. శత్రురాజులను జయించే పద్ధతులు వివరించి చెప్పాడు. చివరకు ఇట్లా అన్నాడు. 'ధర్మజా! రాజనీతులు నీకు భీష్ముడూ, శ్రీకృష్ణుడూ మొదలైన పెద్దలందరూ ఎన్నో చెప్పారు. అయినా, నాకు నీ పట్ల ఉండే అనురాగం చొప్పున నాకు తెలిసినంతవరకు నీకు తెలియజెప్పాను. సత్యవిధి, సద్వివేకం, సత్యవ్రతశీలం నీకు సహజలక్షణాలు. అయినా, నీవు వృద్ధసేవను నిష్ఠతో ఆచరించుము' అని ప్రబోధించాడు. ధర్మరాజు ఆ విధంగా ఆచరిస్తానని మాట ఇచ్చాడు. ధృతరాష్ట్రుడు సంతోషించాడు.

ధృతరాష్ట్రుడు తపోవన గమనానికి పురజనుల ఆజ్ఞను కోరాడు. ధర్మరాజు పురప్రముఖులను ముఖద్వారంవద్ద నిలిపాడు. ధృతరాష్ట్రుడు హస్తినాపుర పూర్వ ప్రభువుల మహత్త్వాన్ని కీర్తించి దుర్యోధనుడి దుష్టవర్తనాన్ని గర్హించి, ధర్మరాజు ధర్మపాలనాన్ని ప్రజానురక్తిని ప్రశంసించి ప్రజలను పాండవులపట్ల వినయవిధేయతలతో మెలగండని ప్రబోధించాడు. గాంధారితో కలిసి తాను తపోవనానికి వెళ్ళటానికి వారి అనుమతి కోరాడు. ప్రజలు ధృతరాష్ట్రుడి తపోవన గమనానికి దుఃఖితులై శంబువనే విప్రుడిని తమ ప్రతినిధిగా తమ కృతజ్ఞతలను తెలియపరిచారు. పాండవుల బలపరాక్రమాలను, ప్రజానురక్తిని ప్రశంసించాడు. 'పాండవులు స్వర్గాన్నైనా పాలించగలరు. వీరికి ఈ భూమిని పాలించటం ఒక లెక్కా? మమ్ములను వీరి చేతిలో పెట్టి అన్నివిధాలా రక్షించావు. ధర్మరాజు దీర్ఘదర్శి, మహోదాత్త సచివుడు, బంధురక్షణపరుడు, శత్రువులనుకూడా దయతో చూడగలవాడు, భావశుద్ధి, ప్రతిభ, సువ్రతం అనేవి అతడికి వెన్నతో పెట్టిన విద్యలు; ఇతడి తమ్ములు శూరులు, శాంత స్వభావులు, గురుభక్తి పరులు, ధర్మజుడిపై రాజ్యభార ముంచి నీవు నిశ్చింతగా ఉండుము' అని ప్రజాహృదయం తెలిపి, అతడికి ప్రజాపరిషత్తు పక్షాన అనుమతి ఇచ్చారు.

ధృతరాష్ట్రుడు మృతులైన బంధువులకందరికి సవిశేష శ్రాద్ధకార్యాలు జరపటానికి ధర్మరాజును సన్నాహం చేయుమన్నాడు. పాండవులలో భీముడు ఆ ప్రతిపాదనను వ్యతిరేకించాడు. అర్జునుడు భీముడిని కాదని తన ధనంతో శ్రాద్ధ కర్మలు నిర్వహించేటట్లు అనుమతించాడు. ధృతరాష్ట్రుడు బంధువర్గానికంతా ధనకనక రత్న సముదాయాలతో ఘనంగా విశేష శ్రాద్ధ విధులు నిర్వహించాడు.

గాంధారీధృతరాష్ట్రుల వనగమనం:

కార్తికమాసంలో పూర్ణిమ వెళ్ళిన మరునాడు పాడ్యమిరోజున కుంతీదేవి భుజంమీద గాంధారి చేయి ఇడి నడువగా, గాంధారి భుజాన్ని ఆధారంగా చేసికొని ధృతరాష్ట్రుడు బయలుదేరి, ఋత్విజులు అగ్నులు చేపట్టి ముందు నడువగా, విదురుడు సంజయుడు వెంట నడుపగా వనగమనయాత్ర సాగింది. ఆ దృశ్యం చూచి ధర్మజుడు 'మహారాజా! ఎక్కడికి పోతావు?' అని రోదిస్తూ కుప్పగూలిపోయాడు. అర్జునుడు అతడిని ఓదార్చాడు. భీమాదులు, అంతఃపుర స్త్రీలు, పురజనులు శోకమగ్నులయ్యారు. పాండవులు వనవాసానికి పోయిన ఆనాటి దృశ్యం మరల తలపించింది. కృపాచార్యుడు, యుయుత్సుడు ధృతరాష్ట్రుడి వెంట వనగమనానికి సిద్ధమయ్యారు. కాని, వృద్ధనృపతి వారిని వారించి ధర్మరాజుకు ఒప్పగించాడు. ధర్మరాజు తానూ వనగమనం చేసి ధృతరాష్ట్రాదులకు సేవచేయటానికి అనుమతి ఇమ్మని కుంతీదేవిని కోరాడు. కుంతీదేవి అతడిని వారించి తానే వారిసేవకై వనవాసానికి వెళ్ళటానికి నిశ్చయించుకొన్నట్లు ప్రకటించింది. ధర్మరాజాదులు తల్లిని వారించి దుఃఖించారు. ఆమె గాంధారినుండి కొంత దూరంగా తొలగి ధర్మరాజుతో తన దృఢసంకల్పాన్ని తెలిపి, కర్ణుడిని మరచి పోవద్దనీ, సహదేవుడిని అనురాగంతో చూడుమనీ, భీమార్జున నకులులను క్షేమంగా రక్షించుకొనుమనీ, ద్రౌపదిని దృఢమైన ప్రేమతో మన్నించుమనీ, చెప్పి ధర్మరాజును ఒప్పిచంటానికి యత్నించింది. అతడు వినకపోవటంతో కొంత కఠినంగా, వ్యంగ్యంగా మాట్లాడి అతడిని ఒప్పించింది. అతడు కుంతీదేవిని గాంధారీ ధృతరాష్ట్రులతో పంపటానికి అంగీకరించాడు. ఆమె తమవారినందరినీ ఓదార్చి అడవులకు పయనమయింది. గాంధారీ

ధృతరాష్ట్రులు, కుంతితో విదుర సంజయులతో కలిసి పురం వెడలి గంగానదీతీరానికి చేరాడు. ధర్మరాజాదులు వెనుదిరిగి హస్తినాపురంలో ప్రవేశించారు.

శతయూపాశ్రమ నివాసం:

మరునాడు ఉదయం ధృతరాష్ట్రుడు గంగను దాటి కురుక్షేత్రంలో శతయూపుడనే రాజర్షి వసించే ఆశ్రమానికి చేరాడు. అతడిప్రార్థనను అంగీకరించి అక్కడే కుటీరాలు నిర్మించుకొని, తపోనిష్ఠతో కృశించి క్రమంగా శల్యాకారాలతో జీవితం సాగిస్తున్నాడు. అప్పుడు ఒకనాడు నారదాది మునీంద్రులు ఆ ఆశ్రమానికి వచ్చారు. శతయూపుడు కూడా వచ్చాడు. కుంతీదేవి ఇచ్చిన అతిథిసత్కారాలు స్వీకరించి, ఆ ఆశ్రమంతో పూర్వం శతయూపుడి తాత సహస్రచిత్యుడు, అతడి పెద్దకొడుకు శతచిత్యుడికి రాజ్యాన్ని అప్పగించి తపస్సుచేసి ఇంద్రుడితో చెలిమిని సంపాదించాడు. ఇంకా బృషధ్రుడు, శైవాలయుడూ, పురుకుత్సుడూ ఈ వనంలో తపస్సుచేసి ఇంద్రలోకానికి వెళ్ళారని ఆ వన మాహాత్మ్యాన్ని పేర్కొన్నారు. వ్యాసమహర్షి ప్రసాదంచేత ధృతరాష్ట్రుడు ఆ ఆశ్రమ ప్రాంతంలో నివసించటం దైవ నిర్ణయమని నారదుడు ప్రకటించాడు. తా నిదివరలో ఇంద్రుడివలన ధృతరాష్ట్రుడు మూడేళ్ళు ఆ ఆశ్రమంలో తపస్సు చేసి దేహాన్ని వదలి కుబేరుడి వద్దకు చేరుతాడనీ, గాంధారి అతడిని అనుసరిస్తుందనీ, కుంతీదేవి స్వర్గంలో ఉన్న పాండురాజును పొందుతుందనీ వినినట్లు తెలిపాడు.

కొన్నాళ్ళకు హస్తినాపురంలో పాండవులూ, అంతఃపుర స్త్రీలూ గాంధారీ ధృతరాష్ట్రులను గురించి, కుంతీదేవిని గురించి దిగులుపడ నారంభించారు. సహదేవుడు ఒకనాడు ధర్మరాజుతో వారందరిని చూచిరావాలన్న కోరికను వ్యక్తం చేశాడు. ధర్మరాజు సుముఖుడై బంధుసహితంగా ధృతరాష్ట్రాదులను చూడటానికి రాజలాంఛనాలతో శతయూపాశ్రమానికి బయలుదేరాడు. తపోవనంలో ఉన్న కుంతీ, గాంధారీ ధృతరాష్ట్రులను దర్శించి, యోగక్షేమాలు పంచకొని, వారితోనూ మునులతోనూ కలిసి నెలరోజులు ఆశ్రమవనంలో నివసించారు. ఒకనాడు విదురుడు దిగంబరుడై ధర్మరాజుకు కనబడి, యోగమార్గాన తన జీవతేజాన్ని ధర్మరాజులో లీనంచేశాడు. దానితో ధర్మరాజు మరింత తేజోమయు డయ్యాడు.

ఒకనాడు వేదవ్యాసమునీంద్రుడు ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి వచ్చి, అతడి యోగక్షేమాలు తెలిసికొని, తపస్సు అతడికి కష్టం కలిగించటం లేదని గ్రహించి, అతడికి ఒక వరాన్ని ఇవ్వటానికి సుముఖత ప్రకటించాడు. ధృతరాష్ట్రుడు దివంగతులైన తన కొడుకులను, బంధువులను చూడాలనీ, వారెట్లా ఉన్నారో తెలిసికొనాలనీ కోరిక ఉన్నదని అడిగాడు. అట్లాగే గాంధారీ, కుంతీ, తదితర పాండవవర్గ భర్తృవిరహిత వనితలూ తమ తమ వారిని చూడాలని కోరుకొన్నారు. కుంతి తాను కన్యగా ఉన్నప్పుడు జన్మించిన కర్ణుడిని చూడాలని విశేషంగా కోరింది. వ్యాసమహర్షి వారినీ, మునిగణాన్నీ గంగానదీ తీరానికి తీసికొని వెళ్ళి, మరునాటి ఉదయాన పూర్వం భారత రణంలో మృతులైన వీరులందరినీ వారిదివ్యదేహాలతో గంగనుండి వెలువడేటట్లు చేశాడు. వారందరూ పూర్వపు వైరాలను మాని స్నేహపూరిత ప్రవృత్తులతో మసలటం చూచి అందరూ ఆశ్చర్యపడ్డారు. వారందరూ మరునాటి ఉదయం గంగలో అంతర్హితులైపోయేటట్లు చేశాడు. మహాద్భుతమైన ఆ సన్నివేశం అందరినీ ఆనందంలో ముంచెత్తింది. ధర్మరాజు రాజ్యంమీద ఆసక్తి లేక ధృతరాష్ట్రుడి సన్నిధానంలోనే ఉండిపోవాలని సంకల్పించాడు. కాని, వ్యాస బోధితుడై హస్తినాపురానికి చేరి ప్రజాపరిపాలనలో ఆసక్తుడయ్యాడు.

గాంధారీ ధృతరాష్ట్రుల మరణం:

కొన్నాళ్ళ తరువాత నారదమహర్షి ధర్మరాజును దర్శించటానికి వచ్చి, గాంధారీ ధృతరాష్ట్రులూ, కుంతీదేవీ తపోవనంలో కార్చిచ్చులో దహించబడ్డారనే వర్తమానం చెప్పి హస్తినాపురాన్ని శోకసాగరంలో ముంచాడు. నారదుడు తాను విన్న వివరాలు చెప్పాడు. గాంధారీ ధృతరాష్ట్రులు, కుంతి, సంజయుడు తపస్సును తీవ్రతరం చేశారు. ఆశ్రమాలను విడిచి గంగాద్వార పరిసరారణ్యాలలో ఉగ్రతపస్సు మొదలు పెట్టారు. ధృతరాష్ట్రుడు గాలినే ఆహారంగా, గాంధారి నీటినే ఆహారంగా గ్రహించి తపస్సు సాగించారు. కుంతి మాసోపవాసాలు చేసింది. సంజయుడు ఏడు భోజనాలకాలంలో ఒక భోజనం చేస్తూ తీవ్రతపం చేశాడు. చివరకు ధృతరాష్ట్రుడు అగ్నికార్యం కూడా మానివేశాడు. ఋత్విజులు అగ్నిని అడవిలో వదలి వెళ్ళిపోయారు. ఒకనాడు ధృతరాష్ట్రాదులు గంగలో స్నానంచేసి అడవిలోకి వస్తూ ఉండగా కార్చిచ్చు పెచ్చుపెరిగి

చుట్టుముట్టింది. సంజయుడు సందుచూచుకొని పర్వతంమీదకు ఎక్కిపోయాడు. ధృతరాష్ట్రుడూ, గాంధారీ, కుంతీదేవీ తూర్పుకు తిరిగి యోగసమాధిలో కూర్చుండిపోయారు. దావాగ్నిలో దగ్ధమైపోయారు.

ఈ వృత్తాంతం విని ధర్మజుడు శోకించాడు. నారదుడిచేత అనునయించబడి శాంతుడై ధృతరాష్ట్రాదులకు గంగలో తిలోదకాలు యథావిధిగా ఇచ్చాడు. పాండవులందరూ పితృయజ్ఞాన్ని చేసి, పవిత్రులయ్యారు. ధృతరాష్ట్రుడివీ, గాంధారివీ, కుంతివీ ఆస్థికలు తెప్పించి గంగలో కలిపించారు. వారికి ఉత్తమ గతులు కల్పించారు. ఆ తరువాత హస్తినాపురికి చేరి ధర్మబద్ధంగా పరిపాలన సాగించారు. ఇది ధృతరాష్ట్రుడి ఆశ్రమవాస చరిత్ర.

మౌసలపర్వ కథాసారం

ధర్మరాజుకు పట్టాభిషేకం జరిగి 35 సంవత్సరాలు దాటి 36వ సంవత్సరం మొదలైంది. భయంకరమైన ప్రకృతి వైపరీత్యాలు కనబడటం ప్రారంభించాయి. ఇసుక తుపానులు, సూర్యచంద్రబింబాలచుట్టూ కాంతులతో గాలిసుడులు, మండువేసవిలో పొగమంచులు - ఇట్లా ఎన్నో విధాలైన వైపరీత్యాలు గోచరించాయి. కొంతకాలం తరువాత బలరామ శ్రీకృష్ణులు తప్ప తక్కిన యాదవులందరూ తమలో తాము పోరాడుకొని చనిపోయా రన్నవార్త ధర్మరాజు విన్నాడు. సోదరులకూ, ప్రజలకూ ఈ వార్త తెలియజెప్పాడు. అందరూ శోకసాగరంలో మునిగిపోయారు.

యాదవకులంలో ముసలం:

కొంతకాలంక్రితం కణ్వుడూ, నారదుడూ, విశ్వామిత్రుడూ శ్రీకృష్ణ దర్శనార్థం ద్వారకకు వచ్చారు. విధిప్రేరితులై వృష్ణివంశానికి చెందిన కొందరు యువకులు శ్రీకృష్ణుడి కుమారుడైన సాంబుడికి స్త్రీ వేషం వేసి, ఆమెకు సంతానం కలుగుతుందా లేదా? అని ఆ మునులను ప్రశ్నించి కపటనాటకమాడారు. ఆ సంగతి గ్రహించిన ఋషులు 'సాంబుడికి యాదవకులాన్ని నశింపజేసే ఒక ముసలం (బలమైన రోకలి) పుట్టుతుందనీ, దాని శక్తివలన బలరామ కృష్ణులు తప్ప మిగిలిన యాదవులందరూ నశిస్తారనీ, బలరాముడు యోగశక్తితో తన శరీరం వదలి సముద్రంలో ప్రవేశిస్తాడనీ, శ్రీకృష్ణుడు నేలపై పరుండి ఉండగా 'జర' అనే రాక్షసి అతడిని ఆక్రమించి చంపుతుందనీ పలికి ద్వారకలోనికి ప్రవేశించక తిరిగి వెళ్ళిపోయారు. శ్రీకృష్ణుడు ఈ విషయం తెలిసికొని 'ఇది విధి ప్రేరణవలన జరిగిందే' అని బంధువులకు తెలిపాడు.

ఆ మరుసటి రోజే సాంబుడి కడుపులోనుండి ఒక ముసలం భయంకరంగా వెలువడింది. ఆ సంగతి వసుదేవుడికి తెలుపగా, అతడు నివ్వెరపడి దానిని పొడిచేసి సముద్రంలో కలపటానికి ఆజ్ఞాపించాడు. యాదవులు అట్లే చేశారు. గాంధారిశాపం కూడా యాదవకుల నాశనానికి తోడ్పడింది. ద్వారకలో ఉపద్రవాలు సంభవించటం మొదలయ్యాయి. అక్కడక్కడా యాదవులకు యమదర్శనం కూడా జరిగేది. యాదవులలో స్త్రీ పురుషులు నైతిక సూత్రాలకు విరుద్ధంగా ప్రవర్తించ నారంభించారు. విడ్డూరాలెన్నో గోచరించాయి. శ్రీకృష్ణుడు దివ్యబుద్ధితో యాదవ క్షయాన్ని గుర్తించి వారందరినీ సముద్రతీరంలో జాతర చేసికొనాలని ప్రకటింపజేశాడు. రాత్రిళ్ళలో రాక్షసులు యాదవ సంపదలను హరించారు. శ్రీకృష్ణుడి శంఖచక్రాలూ, గరుడధ్వజం, రథం, గుర్రాలు, అన్నీ ఆకాశంలోనికి ఎగిరిపోయాయి. ఇన్ని జరిగినా యాదవులలో వివేకం కలగలేదు. మద్యమాంసాలూ, పిండివంటలూ సిద్ధంచేసికొని సముద్రతీరం చేరారు. శ్రీకృష్ణుడు సామాన్య రథ మెక్కి వెళ్ళాడు. బలరాముడు కాలినడకతో బయలుదేరాడు. స్త్రీలు పల్లకీలలో పయనమయ్యారు. ఉద్ధవుడు తపస్సుకై వెళ్ళాడు. అతడివెంట బలరాముడు బయలుదేరి అడవిలో ఒంటరిగా ఒకచెట్టు మొదట్లో సమాధిలో కూర్చున్నాడు.

ఆ తరువాత యాదవులు భక్ష్య భోజ్యాదులను సముద్రుడికి నైవేద్యం పెట్టారు. పురుషులు మత్తుపానీయాలను ఒడలు తెలియనంతవరకు త్రాగారు. విశేషించి సాత్యకి, కృతవర్మ, చారుదేష్ణుడు, గదుడు, ప్రద్యుమ్నుడువంటి మేటి వీరులూ, వృష్ణిభోజ, అంధక వంశాలకు చెందిన వీరులు మద్యాన్ని మిక్కుటంగా త్రాగి మత్తులోనికి జారిపోయారు, ఇంద్రియాలమీద అదుపును పోగొట్టుకొన్నారు. సాత్యకి కృతవర్మను ఉద్దేశించి 'నిద్రించి ఉన్న పాండవవీరులను రాత్రివేళ సంహరించటం నీచకార్య' మని నిందించాడు. ప్రద్యుమ్నుడు అతడితో శ్రుతికలిపాడు. కృతవర్మ మండిపడి 'సాత్యకి సోమదత్తుడి కొడుకు తలనరకటం అన్యాయ'మని అధిక్షేపించాడు. ఇట్లా క్రమంగా వాగ్యుద్ధం మొదలైనది. సాత్యకి కత్తితో కృతవర్మ గొంతు నరికాడు. అంతటితో అగక ఆవేశంతో బోజకులంమీద పడ్డారు. భోజాంధకులు సాత్యకిని చుట్టుముట్టారు. వారిని ప్రద్యుమ్నుడు ఎదుర్కొన్నాడు. వృష్ణివంశీయులు పొంగిపోయారు. భోజాంధకులు వారిపై దాడి

చేశారు. అక్కడ మూడంచుల తుంగలనే ఆయుధాలుగా చేసికొని పోరు ఘోరంగా పోరుసాగించి పరస్పరం చంపుకొన్నారు. మునుల శాపశక్తివలన తుంగలకు రోకళ్ళ బలం వచ్చింది. సాత్యకీ, ప్రద్యుమ్నుడూ మొదలైనవారున్న వృష్ణివంశమంతా నశించింది. బంధువుల శవాలను చూచి శ్రీకృష్ణుడు కోపంతో యుద్ధంలో దూకి చావక మిగిలి ఉన్న యాదవులనందరినీ తుంగలతో తుదముట్టించాడు. ఆ విధంగా యాదవులందరూ నశించారు. శ్రీకృష్ణుడికి గాంధారీశాపం గుర్తుకు వచ్చింది.

శవాల కుప్పల నడుమ నిలిచి ఉన్న శ్రీకృష్ణుడి వద్దకు దొమ్మియుద్ధంలో చావక మిగిలి ఉన్న దారుకుడు, బభ్రుడు వచ్చారు. వారిరువురితో కలిసి కృష్ణుడు బలరాముడి వద్దకు వెళ్ళాడు. దారుకుడిని హస్తినాపురికి పోయి అర్జునుడికి యాదవుల మరణాన్ని తెలిపి ద్వారకకు తీసికొనిరమ్మని పంపాడు. అత డొక చిన్నపాటి రథంమీద హస్తినాపురానికి బయలుదేరాడు. బభ్రుడిని పిలిచి స్త్రీలనూ, పిల్లలనూ, ఏనుగులనూ, గుర్రాలనూ ద్వారకకు చేర్చుమన్నాడు. కాని, అతడు ఒక బోయవాడిచేతిలో హతుడు కావటంచేత శ్రీకృష్ణుడే వారందరిని తీసికొని ద్వారకకు చేరాడు. వసుదేవుడికి జరిగినదంతా చెప్పి, త్వరలో అర్జునుడు వచ్చి తగిన సేవలు చేస్తాడని తెలిపి, అతడిని ఓదార్చి, బలరాముడివద్దకు తిరిగి వచ్చాడు. బలరాముడి ముఖంనుండి వేయిపడగల మహాసర్పం వెలువడి యోగబలంతో ఆకాశమార్గాన పయనించి సముద్రంలో ప్రవేశించింది. ఆదిశేషరూపుడైన బలరాముడికి వరుణుడూ, నాగులూ స్వాగతం పలికారు. మహావిష్ణువులో ఆ ఆదిశేషుడు లీనమయ్యాడు

శ్రీకృష్ణ నిర్యాణం:

బలరాముడు అవతారం చాలించిన తరువాత శ్రీకృష్ణుడు తనకు దుర్వాసుడు పెట్టిన శాపంప్రకారం అరికాలులో ప్రమాదముందని ఊహించి, క్షీరసాగరంలో శయనించినట్లుగా నేలమీద పరున్నాడు. ఆ సమయంలో జర ఒక బోయవాడిని ప్రేరేపించి శ్రీకృష్ణుడి అరికాలిని జింకగా భ్రమింపజేసి బాణంతో కొట్టించింది. కొట్టింది శ్రీకృష్ణుడినని తెలిసి బోయవాడు దుఃఖించాడు. శ్రీకృష్ణుడు అతడిని ఓదార్చి తన అవతార కార్యక్రమం పూర్తి అయినదని సంకల్పించి, దేహాన్ని వదలి తన స్థానానికి బయలుదేరాడు. బ్రహ్మాదులు శ్రీకృష్ణుడికి దివంలో స్వాగతం పలికారు. పూలవానలు కురిపించారు. కృష్ణావతారలీలలను కీర్తించారు. అమృతం, అజరం, అవ్యయం, అమలం, అచలం అయిన పరమాత్మ నిజస్థితిలో శ్రీకృష్ణుడు నిలిచాడు. 'పుణ్యాత్ములారా! నేను అనిరుద్ధ, ప్రద్యుమ్న, సంకర్షణ, వాసుదేవాత్మకమైన వ్యూహచతుష్టయంచేత అతి శ్రేష్ఠరూపంతో ఏకైకంగా పుట్టుతున్న సమాధిస్థితి వలన ఆనందరూపమైన జ్ఞానంతోడి పరిశుద్ధమైనదీ, కొలవటానికి వీలులేనిదీ అయిన నా స్థానప్రాప్తిని నేనే కలిగించుకొన్నాను. సర్వమంగళకరమైన ఈ అనుభూతిని స్వీకరిస్తున్నాను. మీరందరూ సుఖంగా ఉండండి' అని దేవతలను ఆశీర్వదించాడు.

ద్వారక సముద్రంలో మునగటం:

దారుకుడివలన ధర్మజుడు యాదవుల మరణవృత్తాంతం విన్నాడు. పాండవులు, ద్రౌపది, సుభద్ర మొదలైనవారందరూ శోకించారు. శ్రీకృష్ణ సందేశం విని అర్జునుడు ధర్మజుడి సలహాతో ద్వారకకు బయలుదేరి వెళ్ళాడు. భర్త చనిపోయిన పుణ్యస్త్రీవలె, చంద్రుడు అస్తమించిన రాత్రివలె ద్వారక గోచరించింది. శ్రీకృష్ణుడు లేని ద్వారకలో అర్జునుడు ప్రవేశించలేకపోయాడు. శ్రీకృష్ణుడి భార్యలు పదహారువేలమంది స్త్రీలు రోదిస్తూ అర్జునుడి దగ్గరకు వచ్చారు. వారి శోకాన్ని చూచి అతడు మూర్ఛపోయాడు. తనంతట తాను నిబ్బరించుకొని ఆ వనితలను ఓదార్చి, వసుదేవుడివద్దకు వెళ్ళాడు. శ్రీకృష్ణుడి యోగక్షేమాలు తెలిసికొనాలనే తాపత్రయం అతడిలో క్షణక్షణం పెరుగుతున్నది. శయ్యమీద శోకమూర్తిగా పరుండి ఉన్న వసుదేవుడు లేచి అర్జునుడిని కౌగిలించుకొన్నాడు. దేవతలచేతకూడా ప్రశంస లందుకొన్న యదువీరులు నిష్కారణంగా పరస్పరం పోరాడుకొని చనిపోయిన ఉందంతాన్ని చెప్పి దుఃఖించాడు. 'ఆ మారణహోమాన్ని తప్పించగల దక్షుడైనా శ్రీకృష్ణుడు ఉపేక్షవహించాడు' - అని వేదన పడ్డాడు. వసుదేవుడు శ్రీకృష్ణుడి ఉపేక్షను గురించే చెప్పటంతో అత డింకా బ్రతికే ఉండి ఉండవచ్చునని అర్జునుడు ఊహించాడు. స్త్రీలను, ఏనుగులను, గుర్రాలను శ్రీకృష్ణుడు ద్వారకకు తీసికొనివచ్చాడనీ, అర్జునుడు వచ్చి వసుదేవుడిని సేవిస్తాడనీ, అతడికీ శ్రీకృష్ణుడికీ భేదం లేదనీ, అతడిసాయంతో స్త్రీలను, పిల్లలను కాపాడుకొనాలనీ, కొన్ని రోజులలోనే సముద్రం ద్వారకానగరాన్ని ముంచివేస్తుందనీ, అడవిలో తపస్సు చేసికొంటున్న బలరాముడిని కలిసి, తానూ తపస్సు చేసికొనటానికి వెళ్ళాడని, మరణించిన యాదవులకు సముచిత రీతిలో అర్జునుడు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అగ్ని సంస్కారం చేస్తాడనీ, మాకు కూడా అర్జునుడే శ్రాద్ధవిధులు నిర్వహిస్తాడనీ శ్రీకృష్ణుడు చెప్పి వెళ్ళాడని పేర్కొన్నాడు. శ్రీకృష్ణుడు అర్జునుడిపై పెట్టిన బరువు బాధ్యతలను నిర్వహించుమని కోరాడు.

వసుదేవా! ధర్మరాజు ఈ స్థితిని ముందే భావించి ద్వారకలో మిగిలిఉన్న వారినందరినీ ఇంద్రప్రస్థపురానికి చేర్చుమని చెప్పాడు. నీవు ముందుగా బయలుదేరితే నీతో మిగిలినవారినందరినీ భద్రంగా చేరుస్తాను' అని అర్జునుడు పలికి, మంత్రులనందరినీ 'సుధర్మ'సభలో సమావేశపరచుమని దారుకుడిని ఆజ్ఞాపించాడు. సభలో మంత్రులూ, అన్ని వర్గాల ప్రతినిధులూ సమావేశమయ్యారు. ఆనాటినుండి ఏడవరోజున ద్వారక సముద్రంలో మునిగిపోతుందనీ, కాబట్టి ద్వారకావాసులు ఇంద్రప్రస్థనగరానికి తరలివెళ్ళాలనీ, వాటికి తగిన ఏర్పాట్లు త్వరగా చేయాలనీ, ధర్మరాజు వారందరినీ ఆదుకొంటాడనీ, శ్రీకృష్ణుడి మనుమడైన వజ్రుడిని యాదవప్రభువుగా నియమిస్తాడనీ చెప్పి అర్జునుడు వారిని పంపాడు. ఆ రాత్రి శ్రీకృష్ణమందిరంలో దైవపూజలలో గడిపాడు.

తెల్లవారుజామున వసుదేవుడు దివంగతుడయ్యాడన్న వర్తమానం తెలిపింది. అర్జునుడు ఆయనకు రాజలాంఛనాలతో శవయాత్రను జరిపించాడు. వసుదేవుడి భార్యలు దేవకి, రోహిణి, భద్ర, మదిర ఆయనతోపాటు సహగమనం చేశారు. పితృకార్యాన్ని అర్జునుడు యథావిధిగా జరిపించాడు.

ఆ తరువాత అర్జునుడు కొందరు విప్రులతో కూడి యాదవులు మరణించిన యుద్ధభూమికి బయలుదేరాడు. మృతవీరులకు తగిన అగ్ని సంస్కారాలను చేయించాడు. తిలోదకాలు ఇప్పించి అందరి మన్ననలు పొందాడు.

తపస్సు చేసికొంటున్నారు అని తలపోస్తున్న బలరామకృష్ణులను దర్శించటానికి అర్జునుడు కొంతమందిని తనవెంట పెట్టుకొని అడవిలోకి బయలుదేరాడు. 'ఎవ్వరూ లేనిచోట, దిక్కెవ్వరూ లేనివిధంగా చనిపోతా'వని గాంధారి శ్రీకృష్ణుడికి ఇదివరలో ఇచ్చిన శాపం పార్థుడికి జ్ఞాపకం వచ్చింది. మనసు కలతచెంది దిక్కుతోచకుండా అడవిలో తిరిగాడు. మార్గంలో ఒక బోయవాడు కనబడి శ్రీకృష్ణుడున్న తావుకు తీసికొనివెళ్ళాడు. కాంతు లీనెడి శ్రీకృష్ణుడి కళేబరాన్ని నేలమీద పడి ఉండగా చూచి అర్జునుడు శోకావేశంతో మూర్ఛపోయాడు. కొంతసేపటికి తేరుకొని లేచి శ్రీకృష్ణుడి దేహాన్ని కౌగిలించుకొని చాలాసేపు ఉండిపోయాడు. వెంటవచ్చిన బ్రాహ్మణులు అతడిని ఓదార్చి భవిష్యత్కార్యక్రమంమీద దృష్టిమళ్ళించారు. తెల్లవారి సూర్యోదయంతో ద్వారక సముద్రంలో మునుగుతుంది. కాబట్టి సూర్యాస్తమయ సమయం సమీపించటంతో శ్రీకృష్ణుడికి అగ్ని సంస్కారం చేయటానికి నిశ్చయించారు. సమీపంలో ఉన్న బలరాముడి శరీరానికి కూడా అగ్ని సంస్కారం చేశారు. వారి మరణవార్తలు ద్వారకావాసులకు తెలియచెప్పకూడదని నిశ్చయించారు. ఆ రాత్రికే అర్జునాదులు ద్వారకకు తిరిగివచ్చి తెల్లవారేసరికి ద్వారకావాసుల నందరినీ నగరం దాటేటట్లు చేశాడు. సూర్యోదయవేళకు ద్వారకను సముద్రం ముంచివేసింది. అందరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు.

ఆ మహాజనాన్ని అర్జునుడు తీసికొని వెళ్ళుతున్నాడు. వారిని పంచవటిలో విడిదిచేయించాడు. అక్కడ బలవంతులైన దొంగలు స్త్రీలను బాధించి సంపదలు హరించారు. అర్జునుడు వారిని వారించటానికి యత్నించాడు. కాని, అతడికి అస్త్రాల మంత్రాలు స్ఫురించలేదు. ప్రయోగించిన బాణాలు ఆ దొంగలపై పనిచేయలేదు. అంతఃపుర స్త్రీలను మాత్రం రక్షించుకొని అర్జునుడు యాత్ర సాగించి కురుక్షేత్రం చేరాడు. అక్కడి మిత్రుల సాయంతో యాదవులకు విడుదులు ఏర్పాటు చేశాడు. కృతవర్మ కొడుకునూ అతడి బంధువులనూ మృత్తికావాసపురంలో ఉంచాడు. ఆ నగరానికి అతడిని రాజును చేశాడు. సాత్యకి కొడుకుకు సరస్వతి నగరాన్నిచ్చి పట్టంకట్టాడు. మిగిలినవారి నందరినీ ఇంద్రప్రస్థానికి తరలించి, దానికి వజ్రుడిని రాజుగా చేశాడు. బలాలను ముగ్గురికి తగినట్లుగా పంచాడు. అక్రూరుడి భార్యలు, పిల్లలు అడవులకు పోయారు. ఒకనాడు విజయుడు సవినయంగా బలరామకృష్ణుల నిర్యాణవార్తను వారి రాణులకు తెలిపాడు. విషయాలన్నీ వివరించి విలంబనంగా వార్త చెప్పటానికి గల కారణాలను కూడా తేటపరిచాడు. రాణులు అర్జునుడి

చర్యలను గౌరవించారు. రుక్మిణ్యాదులు అగ్నిలో ప్రవేశించారు. సత్యభామాదులు అడవులకు వెళ్ళారు. అందరినీ వీడ్కొల్పి అర్జునుడు వ్యాసుడిని దర్శించటానికి వెళ్ళాడు.

వ్యాసోపదేశం:

ఖిన్నుడై ఉన్న అర్జునుడిని వ్యాసమహర్షి ఆశ్వాసించి కారణం అడిగాడు. బలరామకృష్ణుల నిర్యాణాన్నీ, యాదవవీరుల మరణాన్నీ, బోయలను తాను ఎదిరించలేకపోవటం - మొదలైన వివరాలన్నీ తెలిపి తనకు అస్త్రమంత్రాలు స్ఫురించకపోవటానికీ, బోయలను కూడా జయించలేని బలహీనత ఏర్పడటానికీ కారణమేమిటని అడిగాడు. కర్తవ్యాన్ని బోధించుమని ప్రార్థించాడు.

వ్యాసమహర్షి అర్జునుడితో ఇట్లా చెప్పాడు. 'ముని లిచ్చిన భయంకర శాపప్రభావంచేత యాదవు లిట్లా నశించారు. దానికి దుఃఖించవలసిన అవసరం లేదు. శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడు కావటంచేత కాలం దాపురించిన కార్యానికి అడ్డుగా వ్యవహరించటం ఎందుకని ఉపేక్షతో ఊరుకొన్నాడు. శ్రీకృష్ణుడు కణ్వాది మహర్షుల శాపాన్ని అపేశక్తి కలవాడైనా, తప్పనిసరిగా జరుగదగిన కార్యం కాబట్టి యాదవనాశనాన్ని ఆపలేదు. భారతయుద్ధంలో నీ పట్ల ఉండే స్నేహంవలన దయతో శ్రీకృష్ణుడు రుద్రత్వస్ఫురణ పొంది తానే నీకంటెముందుగా శత్రుసైన్యాన్ని చంపేవాడు. నీ సమంచిత దృష్టి దానిని దర్శించగలిగింది. ఇప్పుడు కాలవిపర్యయంవలన అతడు నిన్ను కాపాడలేదు. నారాయణుడు శ్రీకృష్ణావతారం ఎత్తి అవతార కార్యక్రమం పూర్తిచేసి స్వస్థానాన్ని పొందాడు. అయిన కాలంలో బలమూ, బుద్ధీ, శక్తీ ప్రకాశిస్తాయి. కాలం అడ్డం తిరిగితే నశిస్తాయి. నీ అస్త్రసంపద కూడా ఇటువంటిదే. అందువలన జ్ఞానులు దానికి గర్వించరు, దీనికి శోకించరు. సృష్టిలో సర్వం కాలాధీనంగా ఉంటుంది. అందుచేత తక్కిన ఆలోచనలు మాని, పాండవులైన మీరు పెద్దలు ప్రశంసించగా వికారరూపాలైన ~~ఈ~~ దేహాలను వదలి ఉత్తమగతికి వెళ్ళండి' అని ప్రబోధించాడు.

అర్జునుడు నిర్వికారచిత్తంతో ఆ సందేశం విని, ఆ మహర్షిని వీడ్కొని హస్తినాపురంచేరి ధర్మరాజుకు జరిగిన వృత్తాంతమంతా నివేదించాడు.

మహాప్రస్థానికపర్వ కథాసారం

వ్యాసమహర్షి సందేశం వినిన ధర్మరాజు మహాప్రస్థానం చేయాలన్న సంకల్పంతో అర్జునుడితో ఇట్లా అన్నాడు.'కాలుడు సర్వభూతాల పరిపాకాన్ని కలిగిస్తాడు. కర్మపరిత్యాగమే ప్రస్తుత కర్తవ్యమని నా బుద్ధికి స్ఫురిస్తున్నది.నీ మనస్సుకూడా దానికి అనుకూలంగా ఉన్నట్లు తోస్తున్నది' అన్నాడు. అర్జునుడు అగ్రజుడి అభిప్రాయానికి అనుకూలంగా పలికాడు. 'కాలాన్ని ఏమనవచ్చును? కాలానికి సాటి కాలమే ఔతుంది. కాలపు లీలలకంటె గొప్ప లీలలు ఉన్నాయా? నీవు బాగా దర్శించావు. నీ ఆలోచన మనకు హితం, అభిమతం కూడా!' అన్నాడు. అతడి మాటలకు ధర్మరాజు సంతోషించి భీమనకుల సహదేవులను పిలిపించి వారి కాసంగతి తెలుపగా, వారు కూడా అంగీకరించారు. వెంటనే యుయుత్సుడిని పిలిపించి అతడి కా విశేషాలను తెలిపి, రాజ్యతంత్రాన్ని వివరించి సర్వసైన్యాధ్యక్షుడిగా నియోగించి, పరీక్షితుడిని రాజ్యాధిపతిగా అభిషేకించి, సామ్రాజ్య పరిపాలన ప్రకారాన్ని ఉపదేశించాడు.

కురుకుల పవిత్రచరిత్ర అయిన సుభద్రకు ధర్మరాజు ఇట్లా ఉపదేశించాడు. 'నీ మనుమడు పరీక్షితుడు కౌరవరాజ్యభారం వహించాడు. యాదవవంశవరుడు వజ్రుడికి ఇంద్రప్రస్థరాజ్యాన్ని ఇచ్చాను. వీరిరువురినీ నీవు రక్షించాలి. నీవు మాతో రావద్దు. వనవాసవ్రతాదులను స్వీకరించవద్దు' అని నియమించాడు. భారతరణంలో మృతులైన బంధువులకూ, యాదవ వీరులకూ పరలోక ప్రాప్తికొరకు అనేక దానాలు చేశాడు. ధౌమ్యాది విప్రులకు బహువస్తుకోటిని దానంచేసి వారిని సంతోషపరిచాడు. మిగిలిన బంగారాన్ని పరిక్షితుడి కిచ్చి కృపాచార్యుడిని అతడికి గురువుగా నియమించి, పౌర జానపద ప్రముఖుల ఎదుట పరీక్షితుడిని ప్రభువుగా ప్రకటించి, వారు తమపట్ల ప్రదర్శించిన అభిమానానికి అభినందించి, తమ మహాప్రస్థానానికి ప్రజాపరిషత్తు అనుమతిని పొందాడు.

ధర్మరాజు సర్వాభరణాలను త్యజించి, నారచీరలు ధరించి, తమ్ములూ ద్రౌపదీ అట్లాగే చేసి తనవెంట రాగా, అగ్నులను నీట పడవైచి, వారివెంట ఏడవదిగా ఒక కుక్క ఉండగా, ప్రజలు వెంటరాగా హస్తినాపురం వెడలి కొంతదూరం వెళ్ళారు. ధర్మరాజు ఏ ఒకరిని ఉద్దేశించి కూడా ఇక ఆగండి అని అనలేదు. తలవంచుకొని పోసాగాడు. క్రమంగా

ప్రజలందరూ ఆగి, ప్రదక్షిణ ప్రణామాలు చేసి తిరిగి వెళ్ళారు. పరీక్షితుడు నగరంలోనికి ప్రవేశించాడు. ఉలూపి నాగలోకం వెళ్ళింది. చిత్రాంగద బభ్రువాహనుడి వద్దకు వెళ్ళింది. మిగిలినవారు హస్తినాపురంలో ఉండిపోయారు. కృపధౌమ్యుల నేర్పరితనంతో రాజ్యం సంపద్భరితమై ఒప్పారింది.

ప్రస్థానంలో భీమాదుల ప్రాణత్యాగం:

ధర్మజుడు ముందు నడవగా క్రమంగా భీమార్జున నకుల సహదేవులూ, ద్రౌపదీ, శునకం వెంటసాగారు. ఈ ఏడుగురూ యోగబలంతో పర్వతారణ్య నదీప్రాంతాలను అవలీలగా దాటుతూ ప్రస్థానం సాగిస్తున్నారు. తూర్పు సముద్రతీరంలో అగ్ని ప్రత్యక్షమై అర్జునుడి గాండీవాన్ని సముద్రంలో నిక్షిప్తం చేయించాడు. ఆ తరువాత భూప్రదక్షిణంగా దక్షిణ పశ్చిమ సముద్రాలవెంట సాగి ఉత్తర దిశగా పయనించి హిమలయ పర్వతాలను దాటి మేరుపర్వత భూములలో ప్రస్థానం సాగించారు.

ఆ సమయాన పాంచాలికి యోగం సడలింది. ఆమె నేలపై పడి ప్రాణాలు వదలింది. భీముడు విషణ్ణుడై దానికి కారణ మేమిటని అన్నను ప్రశ్నించాడు. ఆమెకు పతులైదుగురైనా అర్జునుడిమీద అనురాగం అధికంగా చూపేది కాబట్టి దాని ఫలితంగా ఆ పతనం జరిగిందని ధర్మరాజు చెప్పి యోగసిద్ధి శిథిలంకాకుండా ముందుకు సాగాడు. కొంతసేపటికి సహదేవుడు పడిపోయాడు. భీముడు దానికి కారణమడిగాడు. తనకంటె పండితుడు లేదని విర్రవీగటంవలన అత డా ఫలితం పొందాడని ధర్మజుడు పలికి నిర్వికారంగా ముందుకు నడిచాడు. ఆపైన నకులుడు నేలపై పడ్డాడు. కారణమడిగిన భీమసేనుడికి అతడి సౌందర్యగర్వమే దానికి కారణమని అగ్రజుడు చెప్పాడు. ఆ తరువాత అర్జునుడు నేలపై వాలిపోయాడు. భీముడు ఆవేదనతో కారణమడిగాడు. కౌరవులనందరినీ, ఒకేరోజున సంహరిస్తానని పలికాడు. సాటి విలుకాండ్రను లెక్కచేయక గర్వించాడు. మాట లొకటి చేతలు మరొకటి కావటంవలన ఫలంగా ఆ పతనం పొందాడని ధర్మరాజు సమాధానం చెప్పాడు. ఆ తరువాత భీముడు కూడా యోగం సడలి ఒరిగిపోతూ దానికి కారణమేమిటని అన్నను అడిగాడు. బలపరాక్రమాలున్నా భోజనప్రీతి ఎక్కువ కావటం, ఎవ్వరినీ లక్ష్యంచేయకుండా మాట్లాడటం అతడి పతనానికి కారణమని ధర్మరాజు చెప్పాడు. ఒక ధర్మరాజూ, అతడివెంట నడుస్తున్న శునకమూ మిగిలారు. వారు వెనుదిరగకుండా ప్రస్థానాన్ని సాగించారు.

సురేంద్ర ధర్మజ సంవాదం:

అప్పుడు దేవేంద్రుడు దివ్యకాంతులతో వెలుగొందుతున్న రథాన్ని తెచ్చి ధర్మజుడి ముందు నిలిపి కల్పవృక్ష పుష్పాలతో వాన కురిపించి అతడిని రథ మెక్కుమని ఆహ్వానించాడు. అప్పుడు ధర్మరాజుకూ, ఇంద్రుడికీ నడుమ ఈ క్రింది సంవాదం జరిగింది.

ధర్మరాజు : దేవేంద్రా! నా తమ్ములూ, నా భార్యా నాతోపాటు తోడుగా ప్రస్థానంచేస్తూ దప్పితో చనిపోయారు. వారిని వదలి నేనొక్కడినే స్వర్గానికి ఎట్లా వచ్చేది? దయతో నాతోపాటు వారుకూడా వచ్చేటట్లు చేయుము.

ఇంద్రుడు : ధర్మరాజా! నీ తమ్ములూ, ద్రౌపదీ తనువులు వదలి స్వర్గానికి వెళ్ళారు. నీవు వారిని అక్కడ చూడవచ్చును. నీవు సాక్షాత్తూ ధర్మనందనుడివి, ఒకసారి దేహం వదలిన తరువాత మరల ఆత్మలు అందులో ప్రవేశించటం కుదరదు. కాబట్టి నీవే నాతో రమ్ము వెళ్ళుదాం.

ధర్మరాజు : హస్తినాపురం నుండి గాఢ భక్తితో అందరికంటె ముందుగా ఈ శునకం నన్ను అనుసరించి వస్తున్నది. దీనిని వదలి నేను కఠినుడను కాలేను. ఈ శునకాన్ని కూడా స్వర్గానికి రానిమ్ము.

ఇంద్రుడు : నీ విట్లా అనవద్దు. కుక్కకు దివ్యత్వం ఎట్లా కలుగుతుంది? కుక్కను వదలటం కఠినత్వం కాదు ఆలస్యం చేయక రథమెక్కుము

ధర్మరాజు : ఇంద్రా! నీవంటి సత్పురుషులకు అసాధ్య మేమున్నది? భక్తులను వదలి పొందే భాగ్యం నాకు మాత్రం తృప్తి కలిగిస్తుందా?

ఇంద్రుడు : ఉత్తములకు కోపం పనికిరాదు. కుక్కలకు స్వర్గంలో చోటు లేదు. ఈ కుక్కను వదలితే నీ కేమీ పాపం రాదు. కోపతాపాలు వదలి శుభసమయంలో ఆలస్యం చేయవద్దు.

ధర్మరాజు : భక్తిగల సేవకుడిని వదలితే బ్రహ్మహత్యతో సమానమైన పాపం కలుగుతుందని పెద్దలంటారు. స్వర్గ సుఖం కొరకై ఈ కుక్కను విడిచి పాపం పొందలేను.

ఇంద్రుడు : యజ్ఞదీక్షితులు కుక్కను తాకితే పుణ్యం నశిస్తుంది - అని నీకు తెలియదా? నీవు పట్టుబట్టక ఈ కుక్కను వదలి స్వర్గసౌఖ్యం పొందుము. పుణ్యభాగ్యంవలన దివ్యత్వం పొందావు. ద్రౌపదినీ, తమ్ములనూ వదలటానికి వెనుకాడని నీవు ఈ కుక్కను వదలలేకపోతున్నావు. ఇది నీకు తగిన పనేనా?

ధర్మరాజు : ధర్మాన్ని విన్నవించుకొనటం తప్పుకాదు. భీమాదులూ, ద్రౌపదీ చనిపోయారు. ఎంత దుఃఖించినా వారు తిరిగిరారు. బ్రతికి ఉన్న కుక్కను వదలటం న్యాయమా? శరణన్నవారిని స్వీకరించకపోవటం, మిత్రుడికి ద్రోహం చేయటం కులవధువును చంపటం, బ్రాహ్మణధనాన్ని అపహరించటం - అనే వాటికంటె ఏ అపరాధమూ చేయని సేవకుడిని నిర్దాక్షిణ్యంగా వదలేపాపం గొప్పది. ఆ పాపం క్షమించరానిది. దేవేంద్రా! కుక్కను సంభావించిన కార్యం దోషం కాకుండా ఉండేటట్లు వరం ప్రసాదించుము. నీవు నాపై దయను ప్రసరించుము. నేను నీకై తపస్సు చేస్తూ అడవుల లోనే ఉండిపోతాను. నాకు ఈ మాత్రం చాలు. ఇట్లా నిర్భయంగా, నిర్ద్వంద్వంగా పలికిన ధర్మరాజును చూచి శునకరూపంలో ఉన్న యమధర్మరాజు సంతోషించి,నిజరూపాన్ని ప్రదర్శించి ధర్మరాజును అభినందించాడు. యక్షప్రశ్నల సందర్భంలో తమ్ములలో పినతల్లి కొడుకైన నకులుడిని బ్రదికించుమని కోరుకొనటంలో ప్రదర్శించిన ధర్మనీతిని ప్రశంసించాడు. ధర్మ రాజువంటి ధర్మాత్ములు స్వర్గంలోనైనా ఉండరని కీర్తించాడు. ఇంద్రుడితో వెడలి స్వర్గసుఖాల ననుభవించుమని ధర్మరాజుకు వరమిచ్చాడు. అతడిని దివ్యరథంమీద కూర్చుండబెట్టి దివ్యలోకాలకు పంపాడు. ఇంద్రాది దేవతలు ధర్మజుడిని అభినందించారు. అప్పుడు దివ్యమహర్షి అయిన నారదుడు ధర్మరాజును ఎలుగెత్తి ఇట్లా కీర్తించాడు. 'దానాలలో తపస్సులలో కీర్తి కెక్కిన రాజులనెందరి గురించో విన్నాము. కాని, నీ ప్రశస్తమైన కీర్తికాంతులు అన్ని లోకాలలోనూ వ్యాపించటంచేత వారి కీర్తులన్నీ మాసిపోయాయి. ఆ రాజులు ఇట్లా సశరీరులై అమరత్వసిద్ధికై రాగలిగారా?'

ధర్మరాజు : నా సోదరులూ, ద్రౌపదీ ఎక్కడ ఉన్నారో, యుద్ధంలో నా పక్షంలో పోరిన యోధులెట్లా ఉన్నారో? చూడాలని ఉన్నది. సుఖమైనా, దుఃఖమైనా వారిని చూపించండి.

ఇంద్రుడు : ధర్మరాజా! నీ పుణ్యవిశేషంవలన బొందితో స్వర్గానికి వచ్చావు. ఇంకా నీకు దేహసంబంధాలు వదల లేదు. స్వర్గవాసులను దర్శించుము. ఇదివరలోపలె దేహభావంతో శోకాన్ని పొందకుము.

ధర్మరాజు : దేవేంద్రా! మీరేమైనా చెప్పండి. నా సోదరులను, కాంతను, పుత్రులను, మిత్రులను అందరినీ ఆదరంతో ఒక్కసారి చూడనీయండి. వారిని చూడకుండా నేనుండలేను. వారందరినీ చూచి వచ్చి సర్వ భోగాలూ స్తిమితంగా అనుభవిస్తాను. అదే నాకు ఆనందాన్ని కలిగిస్తుంది.'

స్వర్గారోహణపర్వ కథాసారం

బంధుమిత్రులను చూడాలని కోరిన ధర్మరాజు విన్నపాన్ని మన్నించి ఇంద్రుడు తగిన దూతనిచ్చి పంపాడు. నారదుడు ధర్మరాజును అనుసరించాడు. మొట్టమొదటగా మహాసింహాసనంమీద కూర్చుండి దివ్యాంగనల సేవలందుకొంటున్న దుర్యోధనుడిని చూపించాడు దేవదూత, ధర్మరాజు అసూయపడ్డాడు. తన ప్రక్కన ఉన్న దేవర్షులతో దుర్యోధనుడి దుర్ణయాలను పేర్కొని అతడివద్ద ఉండలేక భీమార్జునాదులు, ద్రౌపదీ ఉన్నచోటికి తీసికొనివెళ్ళండని కోరుకొన్నాడు. దుర్యోధనుడు యుద్ధంలో ప్రాణాలు కోల్పోయాడనీ, తన పక్షంవారిని యుద్ధమృతులుగా చేశాడనీ, అది క్షాత్రధర్మం కాని పాపం కాదనీ, శరీర రహితుడైన దుర్యోధనుడిపై ఈర్ష్యాదులు పొందే తన దేహస్పృహను వీడుమనీ 'దేవర్షులు ధర్మరాజుకు హితవు చెప్పారు.

ధర్మరాజు తన సోదరులనూ, ద్రౌపదినీ, బంధువులనూ చూడాలనే ఆకాంక్షను మరల వ్యక్తం చేయటమే కాక, తిలోదకాల నిచ్చే సమయంలో కుంతివలన కర్ణుడు తనకు జ్యేష్ఠుడని తెలియటంవలన, అతడిని వధించటానికి తానే అర్జునుడిని ప్రేరేపించటంవలన, కర్ణుడిని దర్శించి కృతార్థుడు కావాలని ప్రత్యేకంగా అర్థించాడు. అట్లాగే విరాట ద్రుపదాది బంధుమిత్రులను దర్శించాలని పట్టుపట్టాడు. అతడి కోరికను దేవదూత ఇంద్రుడికి తెలియపరిచాడు. అతడి అనుమతితో

ధర్మరాజును ముందుకు నడిపించాడు. వారు దుర్భర దుర్గంధ భూయిష్ఠమైన మలిన ప్రదేశంలో ప్రవేశించారు. దుస్సహ నరకబాధ లనునుభవించే జీవులు గోచరించారు. ధర్మరాజు కలతపడ్డాడు. కాని, ఆ బాధితులందరూ ధర్మరాజు శరీర సుగంధాన్ని అనుభవిస్తూ శాంతిసుఖాలను పొందుతుండటంవలన అతడిని మరికొంతసేపు అక్కడ ఉండుమని వేడుకొన్నారు. ధర్మరాజు 'వారెవరు?' అని అడిగాడు. వారే కర్ణుడు, భీముడు, అర్జున నకుల సహదేవులు, ద్రౌపది, ధృష్టద్యుమ్నుడు, ఉపపాండవులని గొంతులు వినిపించాయి. ధర్మరాజు వ్యాకులచిత్తుడయ్యాడు. పుణ్యశీలురైన భీమాదులు నరకబాధలు పడటం అధర్మమని అవేశపడ్డాడు. ఒక్కమేలిపనికూడా చేయని దుర్యోధనుడు స్వర్గభోగాలను పొందుతున్నందుకు అసహనం ప్రకటించాడు. ఇంద్రుడిపై అగ్రహించాడు. దేవదూతను తిరిగి పొమ్మని ఏవగించుకొన్నాడు. ఆ సంగతి తెలిసికొని ఇంద్రుడు దేవతలతో కలిసి అక్కడికి వచ్చాడు. యమధర్మరాజు కూడా తనకుమారుడైన ధర్మరాజు వద్దకు వచ్చాడు. అక్కడి దుర్గంధ భూయిష్ఠమైన మలిన వాతావరణమంతా మారి సుగంధయుతమైన పవిత్ర ప్రదేశంగా స్ఫురించింది.

ఇంద్రు డిట్లా అన్నాడు 'ధర్మరాజా!. మరణాంతే నరకం ధ్రువమ్' అనేది రాజులపట్ల మరచిపోలేని సత్యం. పుణ్యపాపాలు రెండూ జంటగా ఉంటాయి. పుణ్యంచేత స్వర్గమూ, పాపంచేత నరకమూ కలుగుతాయి. స్వల్పపుణ్యం చేసినవారు తొలుత స్వర్గసుఖాన్ని అనుభవించి తరువాత దీర్ఘనరకాన్ని పొందుతారనీ, అధిక పుణ్యంచేసినవారు మొదట నరకయాతనలు పొంది తరువాత స్వర్గసుఖాలు పొందుతారనీ, దుర్యోధనాదులు మొదటి తెగకు చెందుతారనీ, కర్ణభీమాదులు రెండవ తెగవారనీ వివరించాడు. ధర్మరాజు స్వల్పనరక బాధను పొందటం శాశ్వత స్వర్గసుఖంకొరకే అనీ పేర్కొన్నాడు. ధర్మరాజు దానధర్మాలు యజ్ఞాలు చేయటంవలన మాంధాత్రాది చక్రవర్తులు పొందిన ఉన్నత స్థితిని పొందాడని కీర్తించాడు. ఆకాశగంగలో స్నానంచేసి పూర్వరాజులు పొందలేని ఉత్తమ స్థితిని పొందుమని సూచించాడు.

యమధర్మరాజు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు: 'నిన్నిప్పటికి మూడుసార్లు పరీక్షించాను. మొదట ద్వైతవనంలో అరణి విషయకంగానూ, రెండవసారి మేరుపర్వత ప్రాంతంలో కుక్కతో కలిసి నీవు వచ్చినప్పుడూ, ఇక్కడ నీ సోదరుల స్వర్గప్రాప్తి విషయంలోనూ నీవు స్థిరచిత్తుడవై శమ, దమ, సత్య గుణాలనూ, నాపై ప్రగాఢమైన భక్తినీ ప్రదర్శించావు. నీవు బాగా పరీక్షించబడ్డావు. ఈ స్వల్ప నరక దర్శనంకూడా మాయా కల్పితమే. కర్ణభీమాదులు పుణ్యలోకవాసులయ్యారు. నీవు ఆకాశగంగలో మునిగి మానవ సంబంధాలైన శోకాదులనుండి విముక్తుడవు కమ్ము. పుణ్యలోకాలను పొంది ఉన్న నీ బంధులోకాన్ని చూడగలుగుతావు' అని అన్నాడు. ధర్మరాజును ఆకాశగంగ సమీపానికి తీసికొనివెళ్ళి అందులో మంగళస్నానం చేయించాడు. ధర్మరాజు వెంటనే తన మానవదేహం వదలి దివ్యదేహాన్ని పొందాడు. అతడి మనోవికారాలన్నీ నశించి పొగలేని అగ్నివలె ప్రకాశించాడు. యమాదులతో కలిసి ముందుకు సాగి స్వర్గసింహాసనారూఢుడై, చతుర్భుజమూర్తి అయిన శ్రీమన్నారాయణుడిని నరుడు సేవిస్తూ ఉండటం చూచాడు. మరొకవైపు సూర్యమండల శోభతో వెలుగొందే కర్ణుడిని, మరుద్గణాలతో కూడి ఉన్న భీముడినీ, అశ్వినీదేవతలతో కూడి ఉన్న నకుల సహదేవులనూ చూచి ఆనందించాడు. మరొకవైపు ఉదయించిన సూర్యకాంతితో ప్రకాశిస్తున్న దివ్యశక్తి మూర్తిని చూచి 'ఆమె ఎవరు?' అని దేవేంద్రుడిని ప్రశ్నించాడు. ఆమె మహాలక్ష్మి అనీ, పరమేశ్వరుడి ఆజ్ఞతో ద్రుపదుడికి అయోనిజగా పుట్టి, పాండవులకు సుఖాలను కలిగించిందనీ ఇంద్రుడు పేర్కొన్నాడు. అట్లే గంధర్వరూపులైన ఉపపాండవులనూ, గంధర్వనాయకుడైన ధృతరాష్ట్రుడినీ చూపించాడు. ఆయా దేవతాంశాలతో యక్ష, గుహ్యక గంధర్వాంశలతో, రాక్షసాంశలతో పుట్టి వారిలో లీనమై వివిధవీరులను చూపించాడు. వారు మరల భూమిమీద పుట్టరని పేర్కొన్నాడు. దుర్యోధనుడు స్వర్గసుఖాలను స్వల్పకాలం అనుభవించి ఆ తరువాత నరకంలోపడి దీనస్థితినొంది చివరకు కలిపురుషుడిలో కలిసిపోయాడు. దుశ్శాసనాదులు రాక్షసగణాలలో లీనమయ్యారు. చివరకు విదురుడు, ధర్మరాజు యమధర్మరాజులో లీనమయ్యారు. వేదవ్యాస ప్రోక్తమైన ఈ భారత మహేతిహాసాన్ని వైశంపాయనుడు జనమేజయుడికి సర్పయాగసందర్భంలో వినిపించి, ఆ రాజును ధన్యుడిని చేశాడు. జనమేజయుడు ఈ కథ విని బ్రహ్మానందాన్ని పొందాడు. ఈ కథను సూతుడు శౌనకాది మహామునులకు సత్రయాగ సందర్భంలో వినిపించాడు.

చ. 'పరమపదాప్తిహేతు వగు భారతసంహిత శౌనకాది భూ
సురవరు లింపునం గరఁగు చొప్పునఁ జెప్పిన వారు మోదసం
భరితతఁ బొంది, యక్కథకుఁ బ్రాఁతిగ నర్పితుఁజేసి రర్మిలిన్;
హరిహరనాథ! సర్వభువనార్చిత! నన్ దయఁజూడు మెప్పుడున్.' (స్వర్గా.94)

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

జి.వి.సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు

శ్రీమదాంధ్ర మహాభారతము

విషయసూచిక

అశ్వమేధపర్వము

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
శోకమగ్నుండగు ధర్మజునిఁ గృష్ణాదులు ప్రబోధించుట	సం.14-1-1	1
వేదవ్యాసమునీంద్రుండు ధర్మజునకు మరుత్తుని చరితంబు సెప్పుట	సం.14-4-23	12
మరుత్తుఁడు సంవర్తునిఁ దన యజ్ఞమున కుపద్రష్టగా వరియించుట	సం.14-6-27	20
సంవర్తుండు మరుత్తుని యజ్ఞమున కుపద్రష్ట యగుట	సం.14-7-23	25
అగ్నిదేవుం డింద్రసందేశము మరుత్తున కెఱింగింప వచ్చుట	సం.14-9-11	32
మరుత్తుని యజ్ఞంబున హవిర్భాగంబులు గొన నింద్రాదులు వచ్చుట	సం.14-10-19	43
శ్రీకృష్ణుడు ధర్మరాజునకు మనస్తాపోపశమంబు సేయుట	సం.14-11-7	49
వ్యాస నారదాదిమునులు ధర్మజు వీడ్కొని స్వస్థానములకుఁ బోవుట	సం.14-14-8	62
ధర్మజుఁడు ధరణిం బాలించునపుడు కృష్ణార్జునులు వర్తించువిధము	సం.14-15-1	64
శ్రీకృష్ణుఁ డర్జునునకుఁ దత్త్వజ్ఞానస్థిరీకరణము చేయుట	సం.14-16-12	70
శ్లేష్మాదిరోగ వికారంబుల నిరూపించుట	సం.14-17-14	76
తత్త్వజ్ఞాన విశేషప్రదర్శనము	సం.14-18-25	86

ద్వితీయాశ్వాసము

బ్రాహ్మణగీతలు	సం.14-20-1	104
అంతర్యాగప్రకారంబు నిరూపించి చెప్పుట	సం.14-20-18	109
ఇంద్రియమనః పరస్పరసంవాదప్రకారము	సం.14-22-13	117
జీవాత్మ స్వరూప నిరూపణప్రకారము	సం.14-25-3	126
జనకునకు విప్రరూపధరుండైన యమునితో నైన సంవాదము	సం.14-32-1	141
గురుశిష్య సంవాదంబు కృష్ణుం డర్జునున కెఱింగించుట	సం.14-35-2	148
మనోబుద్ధ్యహంకారాది తత్త్వప్రకారము	సం.14-40-1	159
అవ్యక్తనామతత్త్వ నిరూపణప్రకారము	సం.14-43-34	170
సత్త్వం బవశ్యానుష్ఠేయంబుగా నిరూపించుట	సం.14-49-27	183

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విషయము	సంస్కృతమూలము	పుట
తాను ద్వారక కరుగవలయు నని యర్జునునిఁ గృష్ణుఁ డడుగుట	సం.14-50-49	200
శ్రీకృష్ణారును లింద్రప్రస్థముననుండి హస్తినాపురంబునకు వచ్చుట	సం.14-51-15	204
శ్రీకృష్ణుఁ డుదంకాశ్రమంబునకుఁ బోవుట	సం.14-52-7	210
శ్రీకృష్ణుఁ డుదంకునకుఁ దన విశ్వరూపంబుఁ జూపుట	సం.14-54-4	217
జనమేజయునకు వైశంపాయనుఁ డుదంకుని చరితంబు చెప్పుట	సం.14-55-1	225
ఉదంకుఁడు మదయంతివలనఁ గుండలంబులు పుచ్చికొనుట	సం.14-57-3	235
ఉదంకుఁడు కుండలంబు లిచ్చి యహల్యను సంతోషపఱుచుట	సం.14-37-53	243
వ్యాసుఁడు పాండవుల నశ్వమేధయాగోన్ముఖులఁ జేయుట	సం.14-61-8	252
వ్యాసుఁడు హిమవత్పర్వతంబున నున్న పాండవుల కడకు వచ్చుట	సం.14-64-1	258
శ్రీకృష్ణుండు సకలబంధుసహితుండై కరినగరంబునకు వచ్చుట	సం.14-65-1	264
పరిక్షిత్ప్రాణదానంబునకై కుంతీసుభద్రలు కృష్ణుఁ బ్రార్థించుట	సం.14-65-25	267
కృష్ణుఁడు మృతజాతుండైన పరీక్షితు లబ్ధజీవితుం జేయుట	సం.14-68-18	275
వ్యాసుఁడు కృష్ణసహితులై యున్న పాండవులయొద్దకు వచ్చుట	సం.14-70-8	281
ధర్మజుండర్జును యజ్ఞాశ్వ రక్షణంబునకు నియోగించుట	సం.14-71-22	288

చతుర్థాశ్వాసము

ధర్మజుం డశ్వమేధదీక్షం బూని హయంబుం బుడమిఁ దిరుగ విడుచుట	సం.14-72-1	292
అర్జునుతోఁ ద్రిగర్తదేశాధిపతులు యుద్ధము చేయుట	సం.14-73-1	295
అర్జునుఁడు సింధుదేశాధీశులతోడ యుద్ధంబు చేయుట	సం.14-76-1	307
బభ్రువాహనుం డర్జునునితో యుద్ధంబు చేయుట	సం.14-78-14	315
అర్జునుఁడు బభ్రువాహనుని శరంబుచేతఁ బుడమిం ద్రెళ్ళుట	సం.14-78-35	318
ఉలూపిచి సంజీవనమణిచేత నర్జును బ్రతికించుట	సం.14-81-1	325
ఉలూపిచి యర్జునునితో వసువుల కోపప్రసాదంబుల నెఱింగించుట	సం.14-82-5	328
అర్జునుఁడు జరాసంధపౌత్రునితో యుద్ధంబుచేసి యోడించుట	సం.14-83-1	334
అర్జునుఁడు గాంధారదేశాధీశునితో యుద్ధంబు చేసి జయించుట	సం.14-85-9	342
కృష్ణుఁడు ధర్మజునితో నర్జును సందేశంబు చెప్పుట	సం.14-88-13	352
అర్జునుఁడు యజ్ఞాశ్వంబుతోడ హస్తిపురంబునకు వచ్చుట	సం.14-89-16	356
ధర్మరా జశ్వమేధయాగంబు సుప్రయోగంబుగాఁ జేయుట	సం.14-90-17	362
ధర్మరాజు వ్యాసునకు యజ్ఞదక్షిణగాఁ దన రాజ్యంబంతయు నిచ్చుట	సం.14-91-1	368
ధర్మజుఁడు యజ్ఞంబునకు వచ్చిన రాజులనెల్ల సత్కరించి పంపుట	సం.14-91-30	374
సక్తుప్రస్థ చరిత్రంబు నకులంబు బ్రాహ్మణులకుం జెప్పుట	సం.14-92-5	378
యముఁడు సక్తుప్రస్థునికడ కతిథియై వచ్చుట	సం.14-93-11	381

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విషయము	సంస్కృతమూలము	పుట
యముఁడు సక్తుప్రస్థుని బ్రహ్మలోకంబునకుఁ బో నియోగించుట	సం.14-93-60	388
సక్తుప్రస్థుఁడు సకుటుంబముగా బ్రహ్మలోకంబునకుఁ బోవుట	సం.14-93-83	391
అగస్త్యమహాముని ద్వాదశవార్షిక యజ్ఞప్రభావము	సం.14-95-4	396
జమదగ్నిమహాముని పితృదేవతల శాపంబున నకులంబై పుట్టిన కథ	సం.14-96-1	400

ఆశ్రమవాసపర్వము

ప్రథమాశ్వాసము

యుధిష్ఠిరాదులును గాంధారీ ధృతరాష్ట్రులును నొండొరులయెడల నడచికొనిన ప్రవర్తనము	సం.15-1-1	409
ధృతరాష్ట్రుఁడు ధర్మజునితోఁ దన మనోరథంబుఁ దెలుపుట	సం.15-5-1	421
వ్యాసుఁడు ధృతరాష్ట్రు వనవాసంబున కనుజ్ఞ యిచ్చుట	సం.15-8-1	434
ధృతరాష్ట్రుఁడు ధర్మజునకు రాజనీతి విశేషంబులు చెప్పుట	సం.15-9-7	441
ధృతరాష్ట్రుఁడు ధర్మరాజునకు శత్రురాజుల జయించు తెఱంగు చెప్పుట	సం.15-12-6	448
ధృతరాష్ట్రుండు వనవాసంబునకుం బురజనులచే ననుజ్ఞ గొనుట	సం.15-13-8	454
ధృతరాష్ట్రునితో శంబు వను విప్రుఁడు పౌరజనసమ్మతి చెప్పుట	సం.15-15-10	460
భీముఁ డర్జునునితో ధృతరాష్ట్రు నుద్యోగంబునకుఁ బ్రతికూలించి చెప్పుట	సం.15-17-15	468
ధృతరాష్ట్రుఁడు గాంధారీసహితుండై వనంబునకుఁ బోవుట	సం.15-20-1	477
ధర్మరాజు కుంతిని వనంబునకుఁ బోవలదని ప్రార్థించుట	సం.15-22-19	486
ధృతరాష్ట్రుఁడు శతయూపరాజర్షి యాశ్రమంబున వసియించుట	సం.15-25-9	498

ద్వితీయాశ్వాసము

ధృతరాష్ట్రునిపాలికి నారదుండు మునులతో వచ్చి యత్తపోవన మహిమ చెప్పుట	సం.15-26-1	504
నారదుఁడు శతయూపునితో ధృతరాష్ట్రాదులు సుగతిఁ బొందెడు తెఱంగు చెప్పుట	సం.15-27-8	508
పాండవులు బంధుసహితంబుగా ధృతరాష్ట్రుఁ జూడఁబోవుట	సం.15-29-18	515
పాండవులు కురుక్షేత్రంబున నున్న ధృతరాష్ట్ర గాంధారీకుంతుల దర్శించుట	సం.15-31-6	519
విదురుఁడు యోగమార్గంబున ధర్మరాజునందుఁ గలియుట	సం.15-33-22	531

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విషయము	సంస్కృతమూలము	పుట
వేదవ్యాసుఁడు పాండవసహితుండైన ధృతరాష్ట్రు నాశ్రమంబునకు వచ్చుట	సం.15-34-21	537
కుంతి వేదవ్యాసునితోఁ గర్ణుఁడు తనకు జన్మించిన తెఱంగెఱింగించుట	సం.15-38-1	548
వ్యాసుఁడు ధృతరాష్ట్రాదులకు భారతరణమృతుల రావించి చూపుట	సం.15-40-4	557
ధృతరాష్ట్రుఁడు భాగీరథీ తీరంబుననుండి నిజాశ్రమంబు ప్రవేశించుట	సం.15-44-2	563
నారదుఁడు పాండవులకు ధృతరాష్ట్రాదుల నిర్యాణంబు చెప్పుట	సం.15-45-1	571
ధర్మరాజు ధృతరాష్ట్రప్రభృతులు మృతు లగుటకు శోకించుట	సం.15-16-1	578
యుధిష్ఠిరుఁడు ధృతరాష్ట్రాదులకుఁ దిలోదకప్రదానంబు చేయుట	సం.15-47-10	582

మౌసలపర్వము

ధర్మరాజు రాజ్యంబున నుత్పాతంబులు దోఁచుట	సం.16-1-1	588
మునిశాపంబున సాంబుని కడుపున ముసలంబు పుట్టుట	సం.16-2-15	593
ద్వారకాపురంబున మహోత్పాతము లనేకములు పుట్టుట	సం.16-3-2	595
యాదవు లందఱుఁ గృష్ణసహితులై సముద్రతీరమునకుఁ బోవుట	సం.16-4-6	600
సాత్యకి కృతవర్మలకు రోషజనకంబుగాఁ గలిగిన సంవాదము	సం.16-4-16	606
మద్యపానమత్తుండైన సాత్యకి కృతవర్మ తల నఱకుట	సం.16-4-27	609
యాదవులెల్ల మడిసినపిదపఁ గృష్ణుఁ డర్జునుఁ దోడ్తేర దారుకుం బంపుట		616
బలరాముఁడు శరీరంబు విడిచి యనంతునియందుఁ గలియుట	సం.16-5-11	620
శ్రీకృష్ణుడు శరీరంబు విడిచి పరమపదంబునకుఁ బోవుట	సం.16-5-22	624
దారుకుఁడు పాండవులకు సకలయాదవక్షయంబు చెప్పుట	సం.16-6-1	630
అర్జునుఁడు సకలస్వజనక్షయ దుఃఖితుండగు వసుదేవునిం గాంచుట	సం.16-7-1	635
వసుదేవుఁ డర్జునునకు యాదవనాశంబు తెఱఁ గెఱింగించుట	సం.16-7-13	638
వసుదేవుఁడు శరీరంబు విడిచి పరమగతికిఁ బోవుట	సం.16-8-15	650
అర్జునుఁడు రామకృష్ణుల వెదకుచు వనంబునకుఁ బోవుట	సం.16-8-31	656
అర్జునుఁడు రామకృష్ణుల కళేబరంబులు చూచి విలపించుట		660
అర్జునుఁడు రామకృష్ణులకు నగ్నిసంస్కారంబు సేయుట		663
ద్వారకానగరంబు సముద్రమున మునింగిపోవుట	సం.16-8-40	667
బోయ లర్జును నోర్చి యాదవాంగనల సొమ్ముల నపహరించుట	సం.16-8-50	669
అర్జునుఁడు రామకృష్ణుల నిర్యాణంబును యాదవస్త్రీల కెఱిఁగించుట		674
రుక్మిణిదేవి మొదలగు కృష్ణభార్య లగ్నిప్రవేశము చేయుట	సం.16-8-71	678
అర్జునుఁడు వేదవ్యాసునొద్దకుఁ బోయి యాదవక్షయంబు చెప్పుట	సం.16-9-1	680
వేదవ్యాసుఁ డర్జునునకు హితోపదేశము చేయుట	సం.16-9-25	683

మహాప్రస్థానిక పర్వము

అగ్నిదేవుఁ డర్జునుచేతి గాండీవంబు సముద్రంబున వైపించుట	సం.17-1-33	702
ద్రౌపది మొదలగువారు గతప్రాణలై పడుట	సం.17-2-3	704
ఇంద్రుఁడు రథంబుఁగొని ధర్మరాజు నెదురుకొనుట	సం.17-3-1	712
ధర్మరాజు సురరాజులకుఁ గుర్కురవిషయముగా జరిగిన వివాదము	సం.17-3-7	714
సారమేయరూపంబున వచ్చిన ధర్ముండు ధర్మరాజునకుఁ బ్రత్యక్షం బగుట	సం.17-3-16	719

స్వర్గారోహణ పర్వము

ధర్మజుఁడు దుర్యోధనుం జూచి యసూయాపరుండైన, నారదుఁ డతనిం దేర్చుట	సం.18-1-4	723
ధర్మజుఁడు దేవమునులను గర్ణాదిస్వజనులఁ జూప వేఁడుకొనుట	సం.18-3-6	727
ధర్మరాజు నరకమున నున్న యన్నదమ్ముల నెఱింగి పరితపించుట	సం.18-2-36	732
ఇంద్రుఁడు నరకంబుకడనున్న ధర్మజునొద్దకు వచ్చి యతని సంభావించుట	సం.18-2-52	735
యముఁడు ధర్మరాజు నుచితవచనంబుల సంభాషించుట	సం.18-3-28	743
ధర్మజుఁ డాకాశగంగావగాహంబుఁ జేసి దేవభావంబు నొందుట	సం.18-3-40	746
ఇంద్రుఁడు ధర్మజునకు దేవత్వంబు నొందిన స్వజనంబులఁ జూపి చెప్పుట	సం.18-4-9	750
ఫలశ్రుతి		776

శ్రీమదాంధ్ర మహాభారతము

అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణపర్వములు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శ్రీమదాంధ్ర మహాభారతము

అశ్వమేధపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీనామక పార్వత్యభి। ధానక మాధుర్య ధుర్యతత్త్వాశ్లేషో

పానీతనిరంతర సాం। ద్రానంద ప్లావితాత్మ! హరిహరనాథా ! 1

ప్రతిపదార్థం : హరిహరనాథా!= హరిహరనాథ స్వామీ! శ్రీనామక= శ్రీ (లక్ష్మి) అనే పేరు కలిగినదీ; పార్వతీ+అభిధానక= పార్వతి అనే పేరు కలిగినదీ; మాధుర్యధుర్య= తీయదనం కలిగి ఉన్న; తత్త్వ= శక్తితత్త్వంయొక్క; ఆశ్లేష= కలయికచేత; ఉపానీత= పొందించబడిన; నిరంతర= ఇతరభావాలతో వ్యవధానం లేని, అఖండాకారంతో ఉన్న; సాంద్ర+ఆనంద= దట్టమైన ఆనందంలో; ప్లావిత= తేలించబడిన; ఆత్మ!= హృదయం కలవాడా!

తాత్పర్యం : లక్ష్మి, పార్వతి అనే పేర్లుగల మధుర శక్తులతో అంతరాయం లేకుండా కూడి ఉండటంచేత ఎల్లప్పుడు మహానందంలో తేలియాడుతూ ఉండే అంతరంగంతో అలరారే మహానుభావా! ఓ హరిహరనాథా! (అవధరించుము).

(శోకమగ్నుండగు ధర్మజునిఁ గృష్ణాదులు ప్రబోధించుట (సం. 14-1-1))

వ. **దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె న ట్లమరనదీనందనున కుదకకర్మం బాచరించి**

ధర్మనందనుండు ధృతరాష్ట్రపురస్సరంబుగ భాగీరథి యుత్తరించి తత్తీరదేశంబున. 2

ప్రతిపదార్థం : దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు; జనమేజయునకున్; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు; అట్లు= ఆ విధంగా; అమరనదీనందనునకున్= గంగానదీ కుమారుడికి (భీష్ముడికి); ఉదక కర్మంబు= జలతర్పణం; ఆచరించి= చేసి; ధర్మనందనుండు= ధర్మరాజు; ధృతరాష్ట్ర పురస్సరంబుగన్= ధృతరాష్ట్రుడిని ముందుంచుకొని; భాగీరథి= గంగను; ఉత్తరించి= దాటి; తద్+తీరదేశంబునన్= ఆ నదీతీరంలో;

తాత్పర్యం : స్వామీ! జనమేజయుడికి వైశంపాయనుడు ఇట్లా చెప్పాడు. ఈ విధంగా భీష్ముడికి జలతర్పణాదులు చేసి ధర్మరాజు ధృతరాష్ట్రుడిని ముందుంచుకొని గంగను దాటి ప్రయాణంచేసి, ఆ నదీతీరంలో.(తరువాతి పద్యంతోఅన్వయం)

వ. **ఉమ్మలికంబునం బొగులు నుల్లముతోఁ బొరి లోచనంబులం**

గ్రమ్మఁగ నశ్రువారి ధృతిగౌరవ మేద మహోగ్ర బాణపా

తమ్మున మ్రొగ్గు నేనుఁగు విధమ్మున నేలకు వ్రాలఁ బెట్టె వే

గమ్మ వృకోదరుండు మురఘస్మరుపంపున నమ్మహీశ్వరున్. 3

ప్రతిపదార్థం : (ఆ ధర్మరాజు); ఉమ్మలికంబునన్= శోకంతో; పొగులు= దుఃఖించేటటువంటి; ఉల్లముతోన్= హృదయంతో; పొరిన్= మిక్కిలిగా; లోచనంబులన్= కళ్ళతో; అశ్రువారి= కంటినీరు; క్రమ్మఁగన్= నిండగా; ధృతి గౌరవము= గొప్పధైర్యం; ఏదన్= పోగా; మహా+ఉగ్రబాణ= మిక్కిలి భయంకరమైన బాణాలయొక్క; పాతమ్మునన్= పడుటచేత; మ్రొగ్గు= నేల రాలేటటువంటి; ఏనుఁగు విధమ్మునన్=

ఏనుగువలె; నేలకున్ వ్రాలన్= నేలమీదికి ఒరగగా; వేగమ్ము+అ= అతివేగంగా; వృకోదరుండు= భీముడు; మురఘస్మరు= శ్రీకృష్ణుడి; పంపునన్= ఆజ్ఞతో; ఆ+మహీ+ఈశ్వరున్= ఆ ధర్మరాజును; పట్టెన్= పట్టుకొన్నాడు;,

తాత్పర్యం : ఆ ధర్మరాజు మిక్కిలి శోకంతో దుఃఖపడుతూ కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతుండగా ధైర్యం రవ్వంతకూడా లేక, క్రూరమైన బాణాల తాకిడికి నేలకూలే ఏనుగువలె నేలమీదికి ఒరుగుతుండగా, అది చూచి శ్రీకృష్ణుడు చెప్పగా భీముడు ఆయనను క్రిందపడకుండా పట్టుకొన్నాడు.

విశేషం : అలం: ఉపమ.

ఆ. పట్టి యతఁడు దనదు పై చీర యాస్తర। ణంబు సేసి భూస్థలంబునందుఁ
బెట్టె మానసములు పెద్దయు నలఁదురి। యర్జునాది సోదరాలి వొదివె. 4

ప్రతిపదార్థం : పట్టి= పట్టుకొని; అతఁడు= భీముడు; తనదు= తన; పై చీర= పైనున్న అంగవస్త్రాన్ని; ఆస్తరణంబు+చేసి= క్రింద పరచి; భూస్థలంబునందున్= నేలపై; పెట్టెన్= ధర్మరాజును నెమ్మదిగా కూర్చోపెట్టాడు; మానసములు= మనస్సులు; పెద్దయున్= మిక్కిలిగా; అలఁదురి= బాధపడి; అర్జున+ఆది సోదర+అలి= అర్జునుడు మొదలైన సోదరవర్గం (ధర్మరాజును); పొదివెన్= పొదివి పట్టుకొన్నది.

తాత్పర్యం : అట్లా పట్టుకొని భీముడు తన భుజంపైన నున్న అంగవస్త్రాన్ని నేలమీద పరచి, ధర్మరాజును నెమ్మదిగా దానిపైన కూర్చోపెట్టాడు. అర్జుననకులసహదేవులు మిక్కిలిగా బాధపడుతూ తమ అన్నగారిని పొదివి పట్టుకొన్నారు.

వ. కృష్ణుం డుచితవచనంబుల నా భూపాలుం బ్రబోధించె; నప్పుడు ధృతరా ష్ట్రుండు గదిసి కూర్చుండియక్కురుపతితోడ. 5

పతిపదార్థం : కృష్ణుండు= శ్రీకృష్ణుండు; ఉచిత వచనంబులన్= తగిన ఓదార్పు మాటలతో; ఆ భూపాలున్= ఆ ధర్మరాజును; ప్రబోధించెన్= మేలుకొలిపాడు; అప్పుడు= ఆ సమయంలో; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు; కదసి+కూర్చుండి= దగ్గరగా కూర్చొని; ఆ+కురుపతితోడన్= ఆ ధర్మరాజుతో (ఇట్లా అన్నాడు.)

తాత్పర్యం : శ్రీకృష్ణుడు తగిన ఓదార్పుమాటలతో ఆ ధర్మరాజును మేలుకొలిపాడు. ఆ సమయంలో ధృతరాష్ట్ర మహారాజు ఆ ధర్మరాజుకు దగ్గరగా కూర్చొని ఇట్లా అన్నాడు.

సీ. 'క్షత్రధర్మంబునఁ గైకొంటి మేదిని। యుమ్మలికింపక లెమ్ము వత్స!
యనుజవర్గము నీవు ననుభవింపుము శోక। కాలంబు గా దిది యేల వగవ?'
నని పల్కి 'విదుర' హితాలాపములు దన। విన కుండుటయు సుయోధనుని కీడు
నద్దుష్టబుద్ధిఁ దా ననుసరింపఁగ ధర్మ। మెడలిన కతమున నింత పుట్టె'

ఆ. ననియుఁ దెలియనాడి తనకు గాంధారికి। వగలు మిగులఁ బొగులవలయుటయును
నుగ్గడించి 'మమ్ము నొంటి వగ్గులఁ గనుం। గొనుము నంత దీర్పు' మనయె నధిప! 6

ప్రతిపదార్థం : అధిప!= జనమేజయరాజా! (ధృతరాష్ట్రుడు ఇట్లా అంటున్నాడు); వత్స!= కుమారా!; క్షత్త్రధర్మంబునన్= క్షత్త్రియ ధర్మంతో; మేదిని+కైకొంటి(వి)= భూమిని గ్రహించావు; ఉమ్మలింపక లెమ్ము= శోకించకుండా లెమ్ము!; అనుజవర్గమున్= నీ తమ్ములూ; నీవున్= నీవు; అనుభవింపుము= ఈ రాజ్యసౌఖ్యాన్ని అనుభవించండి; ఇది= ఇది; శోకకాలంబు+కాదు= దుఃఖించవలసిన సమయం కాదు; వగవన్+ఏల?= దుఃఖించటం ఎందుకు?; అని పల్కి= అని చెప్పి; విదుర= విదురుడి; హిత+ఆలాపములు= మంచి ప్రబోధాలు; తన వినకుండుటయున్= తాను వినకపోవటం; సుయోధనుని కీడున్= సుయోధనుడి దుర్మార్గం; ఆ+దుష్టబుద్ధిన్= ఆ చెడుబుద్ధిగల సుయోధనుడిని; తాన్+అనుసరింపఁగన్= తానుకూడా అనుసరిస్తూ రాగా; ధర్మము+ఎడలిన+కతనమునన్= ధర్మం నశించిన కారణంగా; ఇంత+పుట్టెన్+అనియున్= ఇంత జరిగిందనీ; తెలియన్+ఆడి= వివరించి; తనకున్= తనకూ; గాంధారికిన్= గాంధారికీ; వగలు మిగులన్= చింతలు అతిశయించగా; పొగులన్+వలయుటయును= శోకించవలసి రావటం; ఉగ్గడించి= చెప్పి; మమ్మున్= మమ్మల్ని; ఒంటి వగ్గులన్= ఒంటరి ముసలివాళ్ళను బక్కవాళ్ళను; కనుంగొనుము= చూడుము; వంత+తీర్పుము= మా దుఃఖాన్ని ఉపశమింపజేయుము; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం : జనమేజయుడికి వైశంపాయనుడు ఇట్లా చెప్తున్నాడు. 'రాజా! అట్లా ధర్మరాజు సేదదీరిన తరువాత ధృతరాష్ట్రుడు అతడి దగ్గర కూర్చుని ఇట్లా అన్నాడు. 'నాయనా! క్షత్త్రియధర్మంతో యుద్ధంచేసి భూమిని సంపాదించావు. ఇపుడు శోకించటం ఎందుకు? పైకి లెమ్ము. నీ తమ్ములూ నీవూ ఈ రాజ్యాన్ని అనుభవించండి. ఇది దుఃఖించవలసిన సమయంకాదు. ఎందుకు చింతిస్తావు?' అని చెప్పి, తాను విదురుడి నీతిమాటలను వినకపోవటం, సుయోధనుడి దుర్మార్గం, చెడుబుద్ధిగల సుయోధనుడిని తాను కూడా అనుసరిస్తూ రావటంవలన ధర్మం నశించి ఇంత కీడు పుట్టటం - అంతా వివరించి, చివరికి తానూ గాంధారీ ఇట్లా శోచించవలసిన పరిస్థితి రావటాన్ని చెప్పి 'కుమారా! ఒంటిరివాళ్ళం. ఏ దిక్కూలేని బక్కవాళ్ళం. మమ్ములను నీవే చూచుకొనాలి. మా దుఃఖాన్ని నీవే పోగొట్టాలి' అన్నాడు.

వ. **అనిన విని యూరకున్నం గని శౌరి యక్కౌరవపతితో 'బంధువులు శోకంబు నొందిన మృతకోటికిం బరితాపంబు వాటిల్లు; నట్లుంగాక భవదీయజ్ఞాతులు సమరంబున ననివర్తులై యూర్ధ్వలోక వర్తులైరి; వారికి శోకింపం బని యేమి? శోకించిన వారలు మగిడివత్తురే?' యని పలికి వెండియు.** 7

ప్రతిపదార్థం : అనినన్= అని చెప్పగా; విని; ఊరకున్నన్= ఊరకుండగా; కని= చూచి; శౌరి= కృష్ణుడు; అ+కౌరవపతితోన్= ఆ ధర్మరాజుతో; బంధువులు= బంధువులైనవారు; శోకంబున్+ఒందినన్= ఏడిస్తే; మృతకోటికిన్= చనిపోయినవారి సమూహానికి; పరితాపంబు=మిక్కిలి ఆరాటం; పాటిల్లున్= కలుగుతుంది; అట్లున్+కాక= అంతే కాకుండా; భవదీయ= నీ; జ్ఞాతులు= దాయాదులు; సమరంబునన్= యుద్ధంలో; అనివర్తులు+ఐ= వెనుదిరిగి రాకుండా; ఊర్ధ్వలోకవర్తులు+ఐరి= స్వర్గం చేరినవాళ్ళు అయ్యారు; వారికిన్= వారిని గురించి; శోకింపన్= ఏడవటానికి; పని+ఏమి?= అవసరమేమున్నది?; శోకించినన్= ఏడిస్తే; వారలు= వాళ్ళు; మగిడి వత్తురే?= మరలి వస్తారా?; అని పలికి; వెండియున్= మళ్ళీ (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం : ధృతరాష్ట్రుడి మాటలు విని ధర్మరాజు మౌనంగా ఉండిపోగా కృష్ణుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు. 'బంధువులు ఏడుస్తూ ఉంటే చనిపోయినవారి ఆత్మలు పరితపిస్తాయి. అంతే కాకుండా నీ దాయాదులు వీరోచితంగా వెనుదిరుగక పోరాడి, స్వర్గలోకాన్ని పొందారు. వారిని గురించి శోకించవలసిన అవసరం ఏముంది? ఏడిస్తే పోయినవారు తిరిగి వస్తారా?' అని చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు.

క. **'వినవలయు వాని నెల్లను। జననాయక! వింటి నీవు శాంతనవునిచే**
వనట యుడుగు; మిఁక దుర్మతి। యునుబోలెను వగచుచుండు టుచితమె నీకున్? 8

ప్రతిపదార్థం : జననాయక!= రాజా!; వినవలయు వానిన్+ఎల్లను= వినవలసిన ఆ సుభాషితాలను; ఈవు= నీవు; శాంతనవునిచేన్= భీష్ముడివలన; వింటివి= విన్నావు; ఇఁకన్= ఇంక; వనట+ఉడుగుము= శోకాన్ని విడిచిపెట్టుము; దుర్మతియును+పోలెను= దుష్టచిత్తమున్నవాడికివలె; వగచుచుండుట= దుఃఖిస్తూ ఉండటం; నీకున్= నీకు; ఉచితమె?= తగిన పనా?

తాత్పర్యం : 'రాజా! పెద్దలు చెప్పే మాటలను వినాలి (అంటే ధృతరాష్ట్రుడి మాటలను వినాలని అర్థం), నీవు మునుపు భీష్ముడి వలన నుండి ఎన్నో ధర్మాలను విన్నావు. ఇంకా చింతిస్తూ కూర్చోవటం బాగాలేదు. నీ చింతను వదలిపెట్టుము. దుష్టచిత్తులు మాత్రమే అట్లా జరిగిపోయిన దానిని గురించి చీకాకు పడుతూ కూర్చుంటారు. అందుచేత నీకు ఇది తగిన పనికాదు.

వ. వ్యాసనారదాదులును నిన్ను బోధించిరి. వారి వాక్యంబు లూహింపుము. 9

ప్రతిపదార్థం : వ్యాస నారదాదులును= వ్యాసుడు, నారదుడు మొదలైనవారు; నిన్నున్= నీకు; బోధించిరి= ఎన్నో నీతులు చెప్పారు; వారి వాక్యంబులు= వారి సుభాషితాలను; ఊహింపుము= భావనచేయుము.

తాత్పర్యం : వ్యాసుడు, నారదుడు మొదలైనవారు నీకు ఎన్నో రీతులుగా నీతిబోధ చేశారు కదా! వారి సుభాషితాలను ఒకసారి భావన చేయుము.

చ. అతులిత దక్షిణాన్విత మహాధ్వరకర్తవు గమ్ము, దేవతా
పితృనివహంబులం గరము ప్రీతియు భక్తియు నుల్లసిల్ల న
ర్చితములు సేయు, ముర్విఁ బ్రజఁ జేకొని రక్ష ఘటింపు, బంధు సు
స్థితు లొనరింపు, మెప్డు నతిథివ్రతపూజ లొనర్పు భూవరా!' 10

పతిపదార్థం : భూవరా!= రాజా!; అతులిత= సాటిలేని; దక్షిణా+అన్విత= దక్షిణలతో కూడిన; మహా+అధ్వర కర్తవు+కమ్ము= గొప్ప యాగాన్ని చేసినవాడవు కమ్ము (గొప్ప యాగం చేయుము అని అర్థం); దేవతా పితృ నివహంబులన్= దేవతల, పితృదేవతల సమూహాన్ని; కరము= మిక్కిలిగా; ప్రీతియున్= ప్రేమా; భక్తియున్= భక్తీ; ఉల్లసిల్లన్= ప్రకాశించగా; అర్చితములు+చేయుము= అర్చించుము; ఉర్విన్= భూమిలో ఉన్న; ప్రజన్= జనులను; చేకొని= స్వీకరించి; రక్ష+ఘటింపు(ము)= రక్షణను ఏర్పాటు చేయుము; బంధు+సుస్థితులు+ఒనరింపుము= బాంధవుల నుంచి స్థితులు ఏర్పాటు చేయుము; ఎప్డున్= ఎల్లప్పుడూ; అతిథి వ్రత పూజలు= అతిథి వర్గానికి పూజలను; ఒనర్పు(ము)= చేయుము.

తాత్పర్యం : రాజా! సాటిలేని దక్షిణలతో కూడిన మహాయాగాలు చేయుము. దేవతలను పితృ దేవతలను మిక్కిలి భక్తి శ్రద్ధలతో అర్చించుము. నీ రాజ్యంలోని ప్రజలను సదా రక్షించుము. బాంధవులకువలె వారికి సుస్థితి కలిగించుము. ఎప్పుడూ అతిథులను, అభ్యాగతులను భగవత్స్వరూపులుగా పూజించుము.'

విశేషం : 'దక్షిణ' లేని ఏ యాగం పూర్తికాదని సంప్రదాయం, 'రిక్తహస్తేన నోపేయాత్ రాజానం దైవతం గురుమ్' అని పెద్దలంటారు. 'రాజు దగ్గరకు, దైవతం దగ్గరకు, గురువు దగ్గరకు దక్షిణ లేకుండా వట్టి చేతులతో వెళ్ళరా' దని పై వాక్యానికి అర్థం. ఆరుమార్గాలద్వారా గృహస్థులు పరమేశ్వరుడి అనుగ్రహం పొందవచ్చునని సంప్రదాయం చెప్తున్నది. 1. బ్రహ్మయజ్ఞం: 2. వేదాధ్యయనం: 3. పితృయజ్ఞం: 4. దైవయజ్ఞం: 5. భూతయజ్ఞం: 6. అతిథియజ్ఞం. శ్రీకృష్ణుడు చెప్పిన అశ్వమేధయాగంలో బ్రహ్మవేద, దైవయాగాలు కలిసి ఉన్నాయి. ఇక మిగిలినవి పితృ, భూత, అతిథి యజ్ఞాలు. అందుకే ఈ పద్యంలో వాటిని గురించి చెప్పారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అనిన విని ధర్మనందనుండు సాత్యవతేయు మొగంబు గనుంగొని 'దేవా! భవదీయ దయాప్రేమంబులు నాపై' నెప్పుడు నత్యంత గాఢంబులై యుండు; నన్నుఁ బెక్కుభంగుల రక్షించితి; రిట మీఁద వనంబున కరుగ ననుజ్ఞ యిచ్చుట నాకుం బ్రియం; బరుగనియట్లయినం బితామహకర్ణులం జంపించిన క్రూరకర్మునకు శాంతి యెట్లుగలుగు? నమ్మహాకల్మషం బేమిటం బాయు? నయ్యనుష్ఠానంబు విధియింపుం'డని పలుకుటయు నా ధర్మధుర్యునకుఁ బారాశర్యుం డిట్లనియె. 11

ప్రతిపదార్థం : అనినన్= ధర్మరాజుతో శ్రీకృష్ణుడు అట్లా చెప్పగా; విని; ధర్మనందనుండు= ధర్మరాజు; సాత్యవతేయు= వ్యాసమహర్షియొక్క; మొగంబు+కనుంగొని= ముఖం చూచి; దేవా!= స్వామీ; భవదీయ= మీయొక్క; దయాప్రేమంబులు= దయా, ప్రేమా; నాపైన్= నా మీద; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; అత్యంత= మిక్కిలి; గాఢంబులు+ఐ+ఉండున్= అధికంగా ఉంటూ వచ్చాయి; నన్నున్= నన్ను (నా తమ్ములను) (మీరు); పెక్కుభంగులన్= చాలా రీతులలో; రక్షించితిరి= కాపాడారు; ఇటమీఁదన్= ఇకపైన; వనంబునకున్+అరుగన్= అడవికి వెళ్ళటానికి; అనుజ్ఞ+ఇచ్చుట= అనుమతి ఇవ్వటం; నాకున్+ప్రియంబు= నాకు ప్రీతికరమైనది; అరుగని+అట్లు+అయినన్= వెళ్ళకపోతే; పితామహ= భీష్మ; కర్ణులన్= కర్ణులను; చంపించిన; క్రూరకర్మునకున్= పాపకర్ముడికి; శాంతి; ఎట్లు+కలుగున్?= ఎట్లా కలుగుతుంది?; ఆ+మహాకల్మషంబు= ఆ గొప్ప పాపం; ఏమిటన్+పాయున్?= దేనితో తొలగిపోతుంది?; ఆ+అనుష్ఠానంబు= ఆ వ్రతాన్ని (దీక్షను); విధియింపుండు= విధించండి; అని; పలుకుటయున్= చెప్పగా; ఆ ధర్మధుర్యునకున్= ఆ ధర్మనిర్వహణ సమర్థుడైన ధర్మరాజుతో; పారాశర్యుండు= పరాశరుడి కుమారుడైన వ్యాసుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం : శ్రీకృష్ణుడు అట్లా చెప్పగా విని ధర్మరాజు వ్యాసుడిని చూచి, 'స్వామీ! మీ దయాప్రేమలు మామీద ఎప్పుడూ మిక్కిలి గొప్పగా ఉంటూ వచ్చాయి. మమ్మలను మీరు ఎన్నో విధాలుగా రక్షించారు. ఇకమీద నాకు అడవికి వెళ్ళటానికి అనుమతి ఇస్తే నాకు చాలా సంతోషంగా ఉంటుంది. అట్లా వెళ్ళకుండాపోతే తాతగారైన భీష్ముడిని, అన్నగారైన కర్ణుడిని చంపిన ఈ మహాపాపానికి నిష్కృతి ఎట్లా కలుగుతుంది? ఏమి చేస్తే ఆ మహాపాపం పోతుందో ఆ వ్రతవిధిని నాకు అనుగ్రహించండి' అని అడుగగా వ్యాసమహర్షి ఇట్లా అన్నాడు.

విశేషం : 'ధురం' అంటే భారం. ధర్మభారాన్ని మోసేవాడు కాబట్టి ధర్మధురంధరుడు - ధుర్య - ధురీణ శబ్దాలకు కూడా అర్థం ఇదే. యముడు ధర్మదేవత. యముడి అవతారమైన ధర్మరాజు కూడా ధర్మనిర్వహణ సమర్థుడే. అందుకే భీమార్జునాదులందరూ అతడికి ధర్మనిర్వహణవిధిలో సహకరించినవారు మాత్రమే అని అర్థం.

సీ. 'నిష్ఠించి యిబ్భంగి నీ కేము చెప్పిన । వాక్యంబు లెల్లను వరదఁ గలిసి
పోయెనే? నీ దగు బుద్ధి యిం తొప్పదో । కాక మర్త్యుండు గాఁడు కర్త యీశ్వ
రు నియోగమున మేలును గీడు నొనరించుఁ । గాన నీ మదిఁ బాపకర్మ శంక
గలిగె నేనియును యాగముల దానంబుల । నది వాపికొనరాదె? యశ్వమేధ

తే. మధికదక్షిణాన్వితముగ ననఘ । చేయు; । మంతతో భవదీయచిత్తానుతాప
మంతయును బాయు; రఘురాము నట్లు పూరు । భరతులును బోలె దానతత్పరుఁడ వగుము.' 12

ప్రతిపదార్థం : నిష్ఠించి= శ్రద్ధను పూని; ఈ భంగిన్= ఇంతకు ముందు చెప్పిన రీతిలో; నీకున్+ఏము+చెప్పిన= నీకు మేము చెప్పిన; వాక్యంబులు+ఎల్లనున్= సుభాషితాలన్నీ; వఱదన్+కలిసిపోయెనే?= వరదలో కలసి పోయాయా? (వ్యర్థమయ్యాయా?); నీదు+అగు బుద్ధి= నీ బుద్ధి; ఇంత+ఒప్పదో+కాక= దీన్ని అంగీకరించదేమో కాని, మర్త్యుఁడు= మనిషి; కర్త కాఁడు= పనులకు కర్త కాడు; ఈశ్వరుని నియోగమునన్= పరమేశ్వరుడి నియోగంచేత; (తాను) మేలును= మేలూ; కీడున్+ఒనరించున్= కీడు చేస్తాడు; కానన్= కాబట్టి, నీ మదిన్= నీ మనస్సులో; పాపకర్మ శంక= పాపకర్మ విషయకమైన సందేహం; కలిగెన్+ఏనియునున్= ఉంటే; యాగములన్= యాగాలతో; దానంబులన్= దానాలతో; అది= ఆ దుష్కృతం; పాపికొనన్‌రాదె?= పోగొట్టుకొనవచ్చు కదా!; అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; అశ్వమేధము= అశ్వమేధయాగాన్ని; అధిక= మిక్కిలిగా; దక్షిణా+అన్వితముగన్= దక్షిణలతో కూడినదిగా; చేయుము= నిర్వహించుము; అంతతోన్= దానితో; భవదీయ= నీ; చిత్త+అనుతాపము+అంతయును= చిత్తంలోని పరితాపమంతా; పాయున్= పోతుంది; రఘురాము+అట్లు= శ్రీరాముడివలె; పూరు భరతులునున్ పోలెన్= పూరు భరతచక్రవర్తులవలె; దానతత్పరుఁడవు+అగుము= దానాలు చేసేవాడివి కమ్ము.

తాత్పర్యం : 'ఎంతో శ్రద్ధవహించి ఇంతవరకు శ్రీకృష్ణుడు, నేను నీకు చెప్పిన నీతి వాక్యాలన్నీ వరదలో కలిశాయా! లేక నీ బుద్ధి వాటిని అంగీకరించలేదా! ఏమైనా వినుము. మనిషి చేసే పనులకు కర్త అతడు కాడు. పరమేశ్వరుడు ఎట్లా చేయుమంటే మనిషి అట్లా మంచిచెడులను చేస్తుంటాడు. అందుచేత నీ మనస్సులో పాపకర్మవిషయకమైన అనుమానమేదైనా ఉంటే యాగాలద్వారా, దానాలద్వారా దానిని తొలగించుకొనుము. ఎక్కువగా దక్షిణలు ఇచ్చి, అశ్వమేధయాగాన్ని భక్తిశ్రద్ధలతో చేయుము. దానితోనే నీ మనసులోని పరితాపమంతా పోతుంది. శ్రీరామ పూరు భరత చక్రవర్తులవలె బాగా దానాలు చేయుము. నీకు మంచి' కలుగుతుంది.

చ. **అన విని యమ్మునీశ్వరున కా నృపుఁ డిట్లను 'నశ్వమేధయా**
గనిరతి భూమిపాలు గతకల్మషుఁ జేయఁగ జాలు నాఁగ ము
న్నును వెడ వింటి సజ్జన! మనోజ్ఞ వచోమహనీయ! నీవు చె
ప్పిన పలు కూఁది యా క్రతువు ప్రీతి నొనర్చెద నెల్లభంగులన్. **13**

ప్రతిపదార్థం : అనన్ విని= అని వ్యాసు డనగా విని; ఆ మునీశ్వరునకున్= ఆ వ్యాసుడితో; ఆ నృపుఁడు= ఆ ధర్మరాజు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అశ్వమేధయాగ నిరతి= అశ్వమేధయాగంలో అభిలాష; భూమిపాలున్= రాజును; గతకల్మషున్= పోయిన కల్మషం కలవాడినిగా; చేయఁగన్+చాలున్+నాఁగన్= చేయగా సమర్థమైనదని; మున్నును= పూర్వం కూడా; వెడ+వింటిన్= కొద్దిగా విన్నాను; సజ్జన!= మహోత్తమ పురుషుడా!; మనోజ్ఞ వచో మహనీయ!= మనోహరమైన వాక్యం కలిగిన గొప్పవాడా!; నీవు చెప్పిన= నీవు బోధించిన; పలుకు+ఊఁది= మాటను ఆధారంగా గ్రహించి; ఆ క్రతువు= ఆ యాగాన్ని; ఎల్ల భంగులన్= అన్ని విధాలుగాను; ప్రీతిన్+ఒనర్చెదన్= భక్తిశ్రద్ధలతో దైవప్రీతికరంగా చేస్తాను.

తాత్పర్యం : అని వ్యాసుడనగానే ధర్మరాజు 'స్వామీ!' అశ్వమేధయాగంలో అభిలాష ఉన్న రాజుకు ఏ పాపాలూ అంట వని పెద్దలు ఎంతోమంది చెప్పగా ముందు కొద్దిగా విన్నాను. నీవు ఉత్తమపురుషుడవు. నీ వాక్యం మనోహరమైనది. నీ ప్రజ్ఞ మహనీయమైనది. కనుక నీ మాటలనే ప్రమాణంగా గ్రహిస్తాను. అశ్వమేధాన్ని భక్తిశ్రద్ధలతో దైవప్రీతికరంగా తప్పకుండా చేస్తాను.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి 'మునీంద్రా! యొక్క విన్నపం బవధానంబుతో నవధరింపు; మశ్వమేధం బధికదక్షిణాన్వితంబుగావలయు ననుట దెల్లంబుగా మీరు నానతిచ్చితిరి; నా కర్థంబు లేదు; కయ్యంబున మృతులయిన నరపతుల సతులు శిశువులును శోకాక్రాంతులునుం గావున వారలవలన ధనాహరణం బత్యంతాకరణీయంబును దుర్లభంబును నైనది; తొల్లి దుర్యోధనుండు మాతోడి యీసునం జేసి పెక్కండ్రు రాజులను వ్రుక్కడి మూకలనుం గూడఁ బెట్టి ధనంబు వ్యయపెట్టి భూమియు బండారంబునుం బాడు చేసె; నివ్విధంబున నిర్ధనత్వంబు వాటిల్లె; ధనార్జనంబునకు నొండొక వెరవు దొరకొన దిట్టిది కర్తవ్యం బని యెఱుంగకున్నవాఁడ; మంత్రులరై నాకుఁ గార్యం బెఱింగింపవలయు' నని ప్రార్థించిన నమ్మహాత్ముం డమ్మహీపతిం బరమాదరంబున నాలోకించి కొండొక విచారించి. 14

ప్రతిపదార్థం : అని పలికి= అని చెప్పి; మునీంద్రా!= మునులలో శ్రేష్ఠుడా!; ఒక్క విన్నపంబు= నా విన్నపం ఒకటి ఉన్నది; అవధానంబుతోన్= ఏకాగ్రచిత్తంతో; అవధరింపుము= వినుము; అశ్వమేధంబు= అశ్వమేధయాగం; అధిక దక్షిణా+అన్వితంబు= మిక్కిలి ఎక్కువ దక్షిణలతో కూడింది; కావలయున్+అనుట= కావాలి అన్నది; తెల్లంబుగాన్= స్పష్టంగా; మీరున్+ఆనతిచ్చితిరి= మీరు కూడా చెప్పారు; నాకున్+అర్థంబు+లేదు= నావద్ద ధనం లేదు; కయ్యంబునన్= యుద్ధంలో; మృతులు+అయిన= చనిపోయిన; నరపతుల= రాజుల; సతులు= భార్యలు; శిశివులునున్= వారి కుమారులు; శోక+ఆక్రాంతులునున్= శోకంలో చిక్కుకొన్నవారు; కావునన్= కావటంచేత; వారలవలనన్= వారి నుండి; ధన+ఆహరణంబు= ధనం తీసికొనటం; అత్యంత+అకరణీయంబునున్= మిక్కిలి చేయరానిది; దుర్లభంబున్+ఐనది= అసాధ్యమైనది; తొల్లి= మునుపు; దుర్యోధనుండు= సుయోధనుడు; మాతోడి ఈసునన్+ చేసి= మాపై ఈర్ష్యచేత; పెక్కండ్రు రాజులను= చాలామంది రాజులను; వ్రుక్కడి మూఁకలనున్= అల్లరి గుంపులను; కూడన్+పెట్టి= చేర్చుకొని; ధనంబు వ్యయపెట్టి= ధనం వృథాగా ఖర్చుపెట్టి; భూమియున్= భూమినీ; భండారంబునున్= ధనాగారాన్నీ; పాడుచేసెన్= నాశనం చేశాడు; ఈ విధంబునన్= ఈ రీతిగా; నిర్ధనత్వంబు= ధనంలేమి; పాటిల్లెన్= వచ్చి పడింది; ధన+ఆర్జనంబునకున్= ధనం సంపాదించడానికి; ఒండొక+వెరవు= మరొక ఉపాయం; దొరకొనన్= లభించటానికి; ఇట్టిది= ఇట్లాంటిది; కర్తవ్యంబు+అని= చేయదగినదని; ఎఱుంగక+ఉన్నవాఁడన్= తెలియకుండా ఉన్నాను; మంత్రులరై= మీరు మంత్రిగా; నాకున్= నాకు; కార్యంబు= చేయదగిన పని; ఎఱింగింపన్‌వలయున్+అని= తెలపాలి అని; ప్రార్థించినన్= ప్రార్థించగా; ఆ+మహాత్ముండు= మహాత్ముడైన ఆ వ్యాసుడు; ఆ+మహీపతిన్= ఆ రాజును; పరమ+ఆదరంబునన్= మిక్కిలి ఆదరంతో; ఆలోకించి= చూచి; కొండొక= కొంతసేపు; విచారించి= ఆలోచించి.

తాత్పర్యం : అని చెప్పి 'మునీంద్రా! నా విన్నపం ఒకటి ఉన్నది. దయచేసి వినండి. అశ్వమేధయాగంలో అధికంగా దక్షిణలు ఈయవలసి ఉంటుం దన్న విషయం మీరు స్పష్టంగా చెప్పారు. ఇప్పుడు నావద్ద ధనం లేదు. యుద్ధంలో చనిపోయిన రాజుల భార్యలు, శిశువులు మిగిలారు. వారు దుఃఖసముద్రంలో మునిగి ఉన్న ఈ సమయంలో నేను వారినుండి ధనం లాగటం మిక్కిలి హేయమైన పని. దుస్సాధ్యం కూడా. మునుపు దుర్యోధనుడు నాపై అసూయతో ఎంతో మంది వ్యసనపరులైన రాజులను అతిగా గుంపులను చేరదీసి, ధనాన్ని వ్యర్థంగా ఖర్చుపెట్టటంవలన ఈ రీతిగా భూమి, ధనాగారం నాశనమయ్యాయి. అందుచేతనే కోశం ఈనాడు ఈ విధంగా లేమికి గురి అయింది. ధనం సంపాదించటానికి మరొకమార్గం ఏమిటో నాకు గోచరించటంలేదు. కాబట్టి మీరు నాపైన కృపతో మంత్రిత్వం వహించి ఏమి చేయాలో చెప్పండి' అని ప్రార్థించగా ఆ వ్యాసమహర్షి పరమాదరంతో ఆ మహారాజును చూచి, కొంచెంసేపు ఆలోచించి, ఇట్లా అన్నాడు.

విశేషం : ద్వాపరయుగంలో రాజనీతి ఎట్లాంటిదో మనం ఇక్కడ చూడవచ్చును. రాజు పన్నులద్వారా ఎప్పుడు పడితే అప్పుడు ప్రజలను శోకింపచేయరాదని అర్థం. యుద్ధం జరిగిన తరువాత ఎంత ధనం వ్యయమై ఉంటుందో అర్థం చేసికొనవచ్చును. తోడుగా దుర్యోధనుడి దుర్వ్యయం. అందుకే మిగిలిన రాణివాసంపైనా, శిశువులపైనా ధనాహరణ ప్రయోగం చేయటం హేయమయిన పని

అని ధర్మరాజు భావించాడు. మనుస్మృతిలోనూ ఇతర రాజనీతి గ్రంథాలలోనూ రాజు ప్రజలను పన్నుల పేరిట ఎట్లా హింసించరాదో స్పష్టంగా చెప్పబడి ఉన్నది. అందుచేత భారతీయులు 'సంపాదన'ను మాత్రమే గాకుండా 'సంపాదనకు అనుసరించే మార్గాలను' కూడా వివేచించారని అర్థం చేసికొనాలి.

సీ. **'అనఘ! మరుత్తుండు యజ్ఞంబు సేసి మ । హాధనరాసుల నవనిసురుల**
కిచ్చె; వా రవి కడు నెక్కుడై యుండుటఁ । ద్రవ్వితండంబులు దమ గృహముల
నిడికొని పెఱధన మెల్లను నిధియుఁగా । నిమ్మైన నెలవున నిడుచు నుండి
యందఱు నేకవాక్యత దీని నెవ్వరు । గనినను నిది వారి ధనమ యనిరి

ఆ. **మానవేంద్ర! యమ్మహానిధానము దెచ్చి । వలసినట్లు నీవు వ్యయము సేయు**
మనిన ధర్మతనయుఁ 'డతఁ డె ట్లుపార్జించె । నంత కాంచనము? మహాత్మ! చెపుమ.' 15

ప్రతిపదార్థం : అనఘ!= ఓ పుణ్యాత్ముడవైన ధర్మరాజా!; మరుత్తుండు= మరుత్తుడు; యజ్ఞంబు+చేసి= యజ్ఞం చేసి; మహాధనరాసులన్= గొప్ప ధనరాసులను; అవనిసురులకున్+ఇచ్చెన్= బ్రాహ్మణుల కిచ్చాడు; వారు= ఆ బ్రాహ్మణులు; అవి కడున్+ఎక్కుడై+ఉండుటన్= అవి చాలా ఎక్కువ కాగా; త్రవ్వితండంబులు= సమృద్ధిగా; తమ గృహములన్= తమ ఇళ్ళలో; ఇడికొని= ఉంచుకొని; పెఱధనము+ఎల్లనున్= తక్కిన ధనాన్ని అంతా; నిధియున్+కాన్= నిధిగా; ఇమ్మైన= అనుకూలమైన; నెలవునన్= చోటిలో; ఇడుచున్+ఉండి= దాస్తూ; అందఱున్= అందరూ; ఏకవాక్యతన్= ఒకే మాటగా; దీనిన్+ఎవ్వరు కనినను= దీనిని ఎవరు చూస్తే; ఇది వారి ధనము+అనిరి= (ఇది) వారి ధనమే అన్నారు; మానవ+ఇంద్ర!; రాజా!; ఆ+మహానిధానమున్+తెచ్చి= ఆ మహానిధిని తీసికొని వచ్చి; వలసిన+అట్లు= ఎట్లా అవసరమో అట్లా; నీవు వ్యయము చేయుము= నీవు ఖర్చు పెట్టుము; అనినన్= అని చెప్పగా; ధర్మతనయుఁడు= ధర్మరాజు; అతఁడు= ఆ మరుత్తుడు; అంత కాంచనమున్= అంత బంగారమును; ఎట్లు+ఉపార్జించెన్?= (ఆయన) ఎట్లా సంపాదించాడు?; మహాత్మ!= ఓ మహర్షీ; చెపుమ= దయచేసి చెప్పుము (అని అడిగాడు).

తాత్పర్యం : ధర్మరాజా! మరుత్తు డనే ఒక రాజు యజ్ఞంచేసి గొప్ప ధనరాసులను బ్రాహ్మణుల కిచ్చాడు. ఆ బ్రాహ్మణులు ఆ ధనం చాలా ఎక్కువ కావటంవలన సమృద్ధిగా తమకు కావలసినంత ఇళ్ళలో ఉంచుకొని, తక్కిన ధనాన్ని ఒక నిధిగా ఒక అనుకూలమైన చోట దాచిపెట్టుతూ అందరూ ఒకే మాటగా 'ఈ నిధిని ఎవరు కనుగొంటారో ఇది వారిదే' అని అన్నారు. 'కాబట్టి నాయనా! ఆ ధనాన్ని తీసికొనివచ్చి కావలసినంత ఖర్చుపెట్టుకొనుము' అని మహర్షి చెప్పగా ధర్మరాజు 'మహాత్మా! ఆ మరుత్తుడు అంత కాంచనం ఎట్లా సంపాదించాడు?' అని అడిగాడు.

విశేషం : ఇక్కడ రెండు ధర్మ మీమాంస లున్నాయి. మొదటిది ఆ బ్రాహ్మణులు ఆ డబ్బును ఎవరు కనుక్కొంటే వాళ్ళదే ఆ ధనమని 'వాచా' దత్తంచేసి ఉండటం, బ్రాహ్మణులు ధనాన్ని అట్లా దాచటంలో విప్రులు ధనసంచయన విషయంలో 'లుబ్ధులు' కారా దన్న సూచన కూడా ఉన్నది. రెండవది - ధర్మరాజు అడిగిన ప్రశ్న, ఆ ధనాన్ని మరుత్తుడు ఎట్లా సంపాదించా డనటం అంటే యజ్ఞానికి వాడే ధనం పవిత్రధనం కావాలి తప్ప దుర్మార్గంగా సంపాదించిన దయితే అది వాడదగినది కాదన్న సూచన ఇందులో ఉన్నది.

క. **అనుటయు నా సత్యవతీ । తనయుండు 'మరుత్తు పుణ్యతరచరితంబున్**
వినఁ గోరుట మే లెంతయు; । వినిపించెద వీను లలర వినుము నరేంద్రా! 16

ప్రతిపదార్థం : అనుటయున్= అని ధర్మరాజు అంటే; ఆ సత్యవతీ తనయుండు= ఆ వ్యాసుడు; నర+ఇంద్రా!= రాజా!; మరుత్తు= మరుత్తుడి; పుణ్యతర చరితంబున్= గొప్ప పుణ్య చరిత్రను; వినన్+కోరుట= నీవు వినాలని అనుకొనటం; ఎంతయున్+మేలు= ఎంతో మంచిది; వినిపించెదన్= నేను వినిపిస్తాను; వీనులు+అలరన్= చెవులకు విందుగా; వినుము.

తాత్పర్యం : ధర్మరాజు అట్లా అనగా వ్యాసమహర్షి 'ఓ రాజా! మరుత్తుడి కథ గొప్ప పుణ్యప్రదమయిన కథ, ఈ కథను నీవు వినాలని కోరుకొనటం చాలా మంచి విషయం. ఈ కథను నీవు వీనుల విందుగా విని తరించుము. చెప్పుతాను.'

వ. అని పలికి యిట్లనియెఁ 'గృతయుగంబున దండనీతి ప్రవర్తకుం డగు మనువునకుఁ బ్రజాని యను తనయుం డుదయించె; నతనికి క్షుతుం డుద్భవించె; నాతనికి నిక్ష్వాకుండు ప్రభవించె; నా భూపతికి నూర్వురు సుతు లుద యించి; రం దగ్రజుండగు వింశునకు వివింశుం డుదయించె; నప్పుడమిఱేనికిం బదియేవురు గొడుకులు పుట్టిరి; వారిలోనం బెద్దవాఁ డగు ఖనీనేత్రుం డధికబలశౌర్యుండును నకార్యపరుండును నై సోదరులం గలిసికొని నడవక పదునలువురం జెఱిచి సామ్రాజ్యంబుఁ గైకొని యుండి.' 17

ప్రతిపదార్థం : అని పలికి= అని చెప్పి; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు; కృతయుగంబునన్= కృతయుగంలో; దండనీతి ప్రవర్తకుండు+ అగు= దండనీతిని భూలోకంలో ప్రవర్తింపజేసిన; మనువునకున్= మను చక్రవర్తికి; ప్రజాని+అను= ప్రజాని అనే పేరుగల; తనయుండు= కొడుకు; ఉదయించెన్= పుట్టాడు; అతనికిన్; క్షుతుండు; ఉద్భవించెన్= కలిగాడు; అతనికిన్; ఇక్ష్వాకుండు; ప్రభవించెన్= జన్మించాడు; ఆ భూపతికిన్= ఆ రాజుకు; నూర్వురు సుతులు= నూరుగురు కుమారులు; ఉదయించిరి= పుట్టారు; అందున్= వారిలో; అగ్రజుండు+అగు= పెద్దవాడైన; వింశునకున్= వింశుడు అనే వాడికి; వివింశుండు+ఉదయించెన్= వివింశుడు పుట్టాడు; ఆ+పుడమిఱేనికిన్= ఆ రాజుకు; పది+ఏవురు= పదిహేనుమంది; కొడుకులు పుట్టిరి= కుమారులు పుట్టారు; వారిలోనన్= వారిలో; పెద్దవాఁడు+అగు= పెద్దవాడైన; ఖనీనేత్రుండు= ఖనీనేత్రుడు; అధిక బల శౌర్యుండును= మిక్కిలి బలపరాక్రమా లున్నవాడు; అకార్యపరుండును= చేయరాని పనులు చేసేవాడు; ఐ= అయి; సోదరులన్= తమ్ములను; కలిసికొని నడవక= చేర్చుకొని నడవకుండా; పదు నలువురన్= పద్నాలుగుమందిని; చెఱచి= నాశనంచేసి; సామ్రాజ్యంబున్= రాజ్యాన్ని; కైకొని+ఉండి= కైవసం చేసికొని.

తాత్పర్యం : అని చెప్పి ఇట్లా మరుత్తుడి కథను వివరించటం మొదలు పెట్టాడు. 'కృతయుగంలో దండనీతిని ప్రవర్తింపజేసిన మనుచక్రవర్తికి ప్రజాని అనే కొడుకు పుట్టాడు. అతడికి క్షుతుడు, క్షుతుడికి ఇక్ష్వాకుడు కలిగారు. ఇక్ష్వాకుడికి నూరుగురు కుమారులు. వారిలో పెద్దవాడు వింశుడు. అతడి కొడుకు వివింశుడు. అతడికి పదిహేనుమంది కొడుకులు పుట్టారు. వారిలో పెద్దవాడు ఖనీనేత్రుడు. అతడు మిక్కిలి బలపరాక్రమాలున్నవాడు, దుర్మార్గుడు. తన తమ్ముళ్ళతో కలిసి ధర్మమార్గంలో జీవించినవాడు కాడు. అతడు చివరికి తన సోదరులు పద్నాలుగుమందిని నాశనంచేసి, రాజ్యాన్ని కైవసం చేసికొన్నాడు.

సీ. మంత్రివిద్వేషంబు మాన్యపరాభవం। బును బ్రజాపీడనంబులును గలిగి
మొక్కలీఁ డగుటయు మ్రుచ్చిలి మంత్రు లా। తనిఁ బాపి యతని నందనుని రాజ్య
మునకుఁ బట్టము గట్టికొని; రక్కుమారుండు। దమ యయ్య చేటు చిత్తమునకుఁ దలఁచి
సచివప్రభృతు లగు సర్వజనంబుల। యాత్మల ననురాగ మావహిల్ల

తే. సత్యమును బాడియును నొప్పి నిత్యధర్మ। పరత వర్తిల్లె నమ్మహీశ్వరుఁడు సతత
దానతత్పరుఁడై కల ధనములెల్లఁ। విప్రులకు నిచ్చి దారిద్ర్యవికలుఁ డయ్యె. 18

ప్రతిపదార్థం : మంత్రి= మంత్రులను; విద్వేషంబున్= ద్వేషించటం; మాన్య= ఉత్తములను (మంచివారిని); పరాభవంబునున్= అవమానించటం; ప్రజాపీడనంబులునున్= జనులను హింసించటం; కలిగి= అనే ఈదుర్లక్షణాలు కలిగి; మొక్కలీఁడు+అగుటయున్= ముష్కరుడు (పొగరుబోతు) కాగా; మ్రుచ్చిలి= రహస్యంగా పథకం పన్ని; మంత్రులు= సచివులు= అతనిన్+పాపి= అతడిని తొలగించి; అతని నందనునిన్= అతడి కుమారుడిని; రాజ్యమునకున్= రాజ్యానికి; పట్టమున్+కట్టికొనిరి= పట్టం కట్టుకొన్నారు; ఆ+కుమారుండు= ఆ రాజుకొడుకు; తమ+అయ్య= తన తండ్రి; చేటు= నాశనాన్ని; చిత్తమునన్+తలఁచి= మనసులో ఆలోచించి; సచివ ప్రభృతులు+అగు= మంత్రులు మొదలైన; సర్వజనంబుల= జనులందరి; ఆత్మలన్= హృదయాలలో; అనురాగము= ప్రేమ; ఆవహిల్లన్= పుట్టగా; సత్యమునున్= సత్యం; పాడియునున్= న్యాయం; ఒప్పి= (వాటిచేత) ప్రకాశించి; నిత్యధర్మపరతన్= అనునిత్యమూ ధర్మంలో నిష్ఠ కలిగి; వర్తిల్లెన్= ప్రవర్తించాడు; ఆ+మహీ+ఈశ్వరుఁడు= ఆ రాజు; సతత దాన తత్పరుఁడు+ఐ= నిత్యదానశీలుడై; కల ధనములు+ఎల్లన్= కలిగిన ఆస్తినంతటినీ; విప్రులకున్+ఇచ్చి= బ్రాహ్మణుల కిచ్చి; దారిద్ర్య వికలుఁడు+అయ్యెన్= దారిద్ర్యంచేత బాధితుడు అయ్యాడు.

తాత్పర్యం : మంత్రులను ద్వేషించటం, సజ్జనులను అవమానించటం, ప్రజలను హింసించటం నిత్యకృత్యాలు కావటంతో ముష్కరుడైన ఆ రాజును రహస్య పన్నాగం ద్వారా మంత్రులు తొలగించి, అతడి కుమారుడిని రాజ్యానికి పట్టం కట్టుకొన్నారు. ఆ రాజకుమారుడు తన తండ్రి దుర్మార్గంవలన పతనావస్థను పొందటం గుర్తించినవాడై మంత్రులు, పురోహితులు మొదలుగాగల జనులందరి హృదయాలోనూ ప్రేమాభిమానాలు కలిగేటట్లు సత్యం, న్యాయం అనుసరిస్తూ నిత్యధర్మపరుడుగా ప్రవర్తించాడు. నిత్యదానశీలుడై తన ఆస్తినంతా విప్రులకు దానమిచ్చివేసి, దారిద్ర్యంతో బాధపడ్డాడు.

క. దానఁ గడు డస్సె నాతని। సేన; యరాతు లది యెఱిఁగి చెచ్చెర బలసం
తానముతోడం బైకొని। యా నరపతిఁ జెఱిచి; రాతఁ డాప్తులుఁ దానున్. 19

ప్రతిపదార్థం: దానన్= దానివలన; అతని సేన= అతడి సైన్యం; కడున్+డస్సెన్= మిక్కిలి అలసి పోయింది; అరాతులు= శత్రువులు; అది+ ఎఱిఁగి= దానిని తెలిసికొని; చెచ్చెరన్= వెంటనే; బలసంతానముతోడన్= పెద్ద సైన్యబల సమూహంతో; పైకొని= ఆక్రమించి; ఆ నరపతిన్= ఆ రాజును; చెఱిచిరి= ఓడించి తరిమారు; ఆతఁడు= ఆ రాజు; ఆప్తులున్+తానున్= తన ఆప్తులతో కలిసి.

తాత్పర్యం: దానివలన అతడి సైన్యం క్షీణించిపోయింది (బలహీనమైనది), ఇది గుర్తించిన శత్రువులు పెద్ద సైన్యబలంతో రాజ్యాన్ని ఆక్రమించి, ఆ రాజును ఓడించి తరిమివేశారు. ఆ రాజు తన ఆప్తులతో కలిపి.

విశేషం: డస్సి= అలసి (ఇక్కడ) బలహీనం కావటం; చెఱుచు= నశింపజేయు (కాని ఇక్కడ 'ఓడించి తఱుము')

క. వనమునకు నేఁగె; సంయమి। జనములు నచ్చెరువు నొందు చందంబున న
జ్జనవిభుఁడు నియతి నట తప। మొనరించి మహాప్రభావ మొంది కడంకన్. 20

ప్రతిపదార్థం: వనమునకున్= అడవికి; ఏఁగెన్= వెళ్ళాడు; సంయమి జనములున్= మునులు కూడా;అచ్చెరువున్+ఒందు+చందంబునన్= ఆశ్చర్యం పొందే విధంగా; ఆ+జనవిభుఁడు= ఆ రాజు; నియతిన్= నియమ నిష్ఠలతో; అటన్= ఆ అడవిలో; తపము+ఒనరించి=తపస్సు చేసి; మహాప్రభావము+ఒంది= మహాశక్తిని పొంది; కడంకన్= పూనికతో.

తాత్పర్యం: ఆ రాజు తన ఆప్తులతో అడవికి వెళ్ళాడు. మునులు కూడా ఆశ్చర్యం పొందే విధంగా ఆరాజు నియమ నిష్ఠలతో ఆ అడవిలో తపస్సు చేసి, గొప్ప ప్రభావశాలి అయ్యాడు.

క. అమలమతిఁ గరముఁ గోలఁగ । నమరిచి మానితతపోమయాధికశక్తిన్
దమన క్రియ యొనరించిన । నమితగుణా! చెప్పఁ జిట్టలయ్యెను దానన్. 21

ప్రతిపదార్థం: అమితగుణా!= అసంఖ్యాకములైన సుగుణాలు కలిగిన ఓ జనమేజయా!; అమలమతిన్= నిర్మలమైన మనస్సుతో; కరమున్= చేతిని; కోలఁగన్= దండంవలె (కర్రవలె); అమరిచి= అమర్చుకొని; మానిత= గొప్పదైన; తపోమయ+అధిక శక్తిన్= తపస్సుతో నిండిన ఎక్కుడు శక్తితో; దమనక్రియ+ఒనరించినన్= శరీరాన్ని దమింపజేయగా; దానన్= అందువలన; చెప్పన్= చెప్పటానికి; చిట్టలు+అయ్యెన్= ఆశ్చర్యం పుట్టింది.

తాత్పర్యం : నిర్మలమైన మనస్సుతో చేతిని దండంవలె చేసికొని గొప్ప తపశ్శక్తితో శరీరాన్ని దమింపచేశాడు. ఓ జనమేజయ మహారాజా! దానితో ఒక పరమాద్భుతం జరిగింది.

వ. ఆకర్ణింపుము. 22

ప్రతిపదార్థం : ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం : అదేమిటో చెప్తుతాను వినుము.

క. భటతురగసామజరథో । ద్భట సేనాసముదయములు బహుళరుచిసము
త్కటకాంచన రాసులు న । చ్చటఁ బొడమెం జూడ నక్కజం బగు భంగిన్. 23

ప్రతిపదార్థం : భట= సేవకులు; తురగ= గుర్రాలు; సామజ= ఏనుగులు; రథ= రథాలు; ఉద్భట సేనా సముదయములు= శూరులైన సైనికుల గుంపులు; బహుళ= మిక్కిలి; రుచి సముత్కట= కాంతిచేత అతిశయించే; కాంచన రాసులున్= బంగారు రాసులు; అచ్చటన్= అక్కడ; చూడన్= చూడటానికి; అక్కజంబు+అగు భంగిన్= ఆశ్చర్యమయ్యేటట్లు; పొడమెన్= పుట్టాయి.

తాత్పర్యం : సేవకులు, గుర్రాలు, ఏనుగులు, రథాలు, శూరులైన సైనికుల సమూహాలు, మిక్కిలి కాంతిచేత ప్రకాశించే బంగారు రాసులు చూడటానికి ఆశ్చర్యం కలిగిస్తూ అక్కడ పుట్టాయి.

వ. ఇట్లు బలంబును ధనంబును గల్గుటయును. 24

ప్రతిపదార్థం : ఇట్లు= ఈ విధంగా; బలంబునున్= సైన్యబలమూ; ధనంబునున్= ధనమూ; కల్గుటయునున్= కలుగటంతో.

తాత్పర్యం : ఇట్లా సైన్యబలం, ధనం రెండూ కలుగగా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. ఆ నరపతి రయమున రిపు । భూనాథులమీఁద నడచి పోరుల వారిన్
సేనాయుతముగఁ జంపియుఁ । గానలకుం దోలియును బ్రకాశత నొందెన్. 25

ప్రతిపదార్థం : ఆ+నరపతి= ఆ రాజు; రయమునన్= వెంటనే; రిపు భూనాథుల మీఁదన్= శత్రురాజులపైన; నడచి= దండెత్తి; పోరులన్= యుద్ధంలో; వారిన్= వారిని; సేనాయుతముగన్= వారి సైన్యాలతో సహా; చంపియున్= చంపి; కానలకున్+తోలియునున్= అడవులలోకి పారద్రోలి; ప్రకాశతన్+ఒందెన్= ప్రకాశాన్ని పొందాడు.

తాత్పర్యం : ఆ రాజు శీఘ్రంగా శత్రురాజులపైన దండెత్తి యుద్ధంలో వారిని సైన్యయుతంగా చంపి, తక్కిన వారిని అడవులలోకి పారద్రోలి, విజయం పొంది వైభవంతో అతిశయించాడు.

క. **కరదమనంబున నాతఁడు। కరంధముఁ డనంగఁ బరఁగి గౌరవమున వి**
స్ఫురణము విభవము శౌర్యముఁ। గరుణయు ధైర్యంబు వెలయఁగా నిల యేలెన్. **26**

ప్రతిపదార్థం : కర= చేతియొక్క; దమనంబునన్= దమించటంచేత; అతఁడు= ఆ రాజు; కరంధముఁడు+అనంగన్= కరంధము డనే పేరుతో; పరఁగి= ప్రసిద్ధుడై; గౌరవమునన్= గొప్పగా; విస్ఫురణము= కాంతి; విభవము= సంపద; శౌర్యము= గొప్ప పరాక్రమం; కరుణయున్= కరుణ; ధైర్యంబున్= ధైర్యం; వెలయఁగాన్= అతిశయించగా; ఇల+ఏలెన్= భూమి(ని) పాలించాడు.

తాత్పర్యం : చేతిని దమనంచేసినందువలన అతడికి కరంధముడని పేరు వచ్చింది. గొప్ప కాంతి, సంపద, పరాక్రమం, దయ, ధృతి కలిగి ఆ రాజు రాజ్యం ఏలాడు.

విశేషం: 'ధమన' మని కొన్ని పాఠాలు ఉన్నాయి. కాని 'దమన' శబ్దమే సరైనది. దమనం అంటే బాహ్యేంద్రియ నిగ్రహం. 'శమం' అంటే అంతరింద్రియ నిగ్రహం (మనోనిగ్రహం ఇత్యాదులు), కరంధముడు చేసినది చేతిని క్రగా నియమించి తపస్సుచేయటం. కాబట్టి అది ధమనక్రియ. అతడిపేరు 'కరంధముడు' కావటమే సహజం. కొన్ని పాఠాలు 'కరందమనుడు' అనే రూపాన్ని ఇచ్చాయి. లోకంలో మహాప్రాణంతోడి 'కరంధముడు' అనే పేరు ప్రసిద్ధమై ఉండాలి.

తే. **శమము దమమును సత్యశౌచములుఁ గలిగి। యజనశీలత నశ్వమేధాధ్వరంబు**
లంగిరసుఁ డుపదర్శకుండై నయింపఁ। బెక్కొనర్చె లోకములు సంప్రీతిఁ బొగడ. **27**

ప్రతిపదార్థం : శమమున్= అంతరింద్రియ నిగ్రహం; దమమునున్= బాహ్యేంద్రియ నిగ్రహం; సత్య= సత్యవాక్పాలనం; శౌచములున్= శుచిత్వం (పవిత్రత); కలిగి= కలిగినవాడై; యజనశీలతన్= యాగంలో నిరంతరమైన ఆసక్తి కలిగి; అంగిరసుఁడు= అంగిరో మహర్షి; ఉపదర్శకుండు+ఐ= ఉపద్రష్టగా; నయింపన్= నడిపిస్తుండగా; అశ్వమేధ+అధ్వరంబులు= అశ్వమేధయాగాలు; లోకములు= అన్ని లోకాలలోనివారు; సంప్రీతిన్= తృప్తితో; పొగడన్= ప్రస్తుతించగా; పెక్కు+ఒనర్చెన్= చాలా చేశాడు.

తాత్పర్యం: శమ దమ సత్య శౌచాలు కలిగి, ఆ రాజు నిరంతరయజ్ఞదీక్షితుడై అంగిరసమహర్షి ఉపద్రష్టగా సారథ్యం వహించి నడిపిస్తుండగా అశ్వమేధయాగాలు చాలామార్లు చేసి, అన్ని లోకాలవారిచేత ప్రశంసలు పొందాడు.

(వేదవ్యాస మునీంద్రుండు ధర్మజునకు మరుత్తుని చరితంబు సెప్పుట (సం. 14-4-23))

క. **అతని మనుమఁడు మరుత్తుం। డతులయశుఁడు విష్ణుసదృశుఁ డనఁ దగు నాగా**
యుతబలుఁడు ధర్మతత్త్వ। స్థితివిదుఁడు సమిద్ధబహుళతేజుం డధిపా! **28**

పతిపదార్థం: అధిపా!= రాజా!; అతని మనుమఁడు= ఆ కరంధముడి మనుమడు; మరుత్తుండు= మరుత్తుడనే పేరుగలవాడు; అతులయశుఁడు= సాటిలేని కీర్తిమంతుడు; విష్ణుసదృశుఁడు+అనన్+తగున్= విష్ణు సమానుడు అనదగినవాడు; నాగ+అయుత

బలు'డు= పదివేల ఏనుగుల బలం కలవాడు; ధర్మతత్త్వస్థితి విదుఁడు= ధర్మతత్త్వస్థితిని తెలిసినవాడు; సమిద్ధ= మిక్కిలి ప్రకాశించే బహుళతేజుండు= అధికమైన తేజస్సు కలవాడు.

తాత్పర్యం: ఓ రాజా! ఆ కరంధముడి మనుమడు మరుత్తుడు. అతడు నిర్మలమైన కీర్తికలవాడు. విష్ణుసదృశుడు. పదివేల ఏనుగుల బల మున్నవాడు. ధర్మతత్త్వస్థితి తెలిసినవాడు. మహాతేజోవంతుడు.

విశేషం: ధర్మరాజు 'మరుత్తుడికి ఆ బంగారు ఎట్లా వచ్చింది?' అనటానికి సమాధానంగా చెప్పిన కథ కాబట్టి ఈ కథలో మరుత్తుడి దివ్యగుణాల ప్రసక్తి ఉన్నది. అతడి తండ్రి తపోధనుడు. అతడి సంపద తపోజన్యం. కుమారుడు తండ్రికి తగిన కొడుకు అని చెప్పటం ఇక్కడి ఉద్దేశం. 'నా విష్ణుః పృథివీపతిః' అంటే విష్ణ్వంశలేనివాడు చక్రవర్తి కాడని అర్థం. ధర్మానికి ఒక తత్త్వమున్నది. అది సత్యం. దాని స్థితి 'ఋతం' మీద ఆధారపడి ఉన్నది. ధర్మ సత్య ఋత తత్త్వవేత్త అని అర్థం. తరువాతి కథలో దీని నిరూపణ ఉన్నది.

ఉ. అమ్మనుజేశ్వరుండు విభవాతిశయంబు వెలుంగ నశ్వమే
ధమ్మొనరించుచుండి వివిధస్ఫురితాలయముల్ ప్రదీప్తభాం
డమ్ములు సత్పదార్థము లిడం దగు తక్కును గల్గు సిద్ధపా
త్రమ్ము లసంఖ్యముల్ పసిఁడిఁ బ్రస్తుతి కెక్క ఘటించె భూవరా! 29

ప్రతిపదార్థం : భూవరా!= రాజా!; ఆ+మనుజ+ఈశ్వరుండు= ఆ మరుత్తుడనే రాజు; విభవ+అతిశయంబు= వైభవం యొక్క; పెంపు; వెలుంగన్= ప్రకాశించగా; అశ్వమేధమ్ము+ఒనరించుచున్+ఉండి= అశ్వమేధయాగం చేస్తూ ఉండి; వివిధ= భిన్నములుగా; స్ఫురిత+ఆలయముల్= ప్రకాశించే ఆకారాలు కలిగిన ఇండ్లు, ప్రదీప్త భాండమ్ములు= మిక్కిలి కాంతులు వెదజల్లే కుండలు; సత్+పదార్థములు+ఇడన్+తగు= విలువైన మంచి పదార్థాలను పెట్టగలిగిన; తక్కును+కల్గు= నిడివి కలిగిన; సిద్ధ పాత్రమ్ములన్= ఉపయోగించటానికి సిద్ధంగా ఉన్న పాత్రలను; అసంఖ్యముల్+లెక్కకు మిక్కుటంగా; ప్రస్తుతికిన్+ఎక్కన్= జనులందరూ ప్రశంసించేటట్లుగా; పసిఁడిన్= బంగారంతో; ఘటించెన్= చేయించాడు.

తాత్పర్యం : రాజా! ఆ మరుత్తుడనే రాజు వైభవంయొక్క పెంపు మిక్కిలి ప్రకాశించేటట్లుగా అశ్వమేధయాగం చేస్తూ యజ్ఞంలోని మంచి పదార్థాలను దాచటానికి వీలుగా నిడివి కలిగిన పెద్ద పెద్ద బంగారు కుండలను లెక్కకు మిక్కుటంగా చేయించాడు. ఆ కుండలు నానావిధాలైన ఆకారాలతో అత్యధికకాంతితో మెరిసిపోతున్నాయి.

వ. అట్లు సమకట్టి యతండు. 30

ప్రతిపదార్థం : అట్లు= అట్లా; సమకట్టి= సిద్ధంచేసి; అతండు= ఆ మరుత్తుడు.

తాత్పర్యం : అట్లా సిద్ధం చేసికొని ఆ మరుత్తుండు. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. హిమగిరిసానుదేశమున నెక్కుడు వైభవ ముల్లసిల్ల య
జ్ఞము తగఁ జేసి భూమిసురసంఘము లెల్లను దృప్తిఁ బొంద హే
మ మొసఁగెఁ గుప్పఁ గూరలు సమగ్రకుతూహలుఁడై కనత్సువ
ర్ణమయగృహక్రియోపకరణప్రకరంబులు నిచ్చె భక్తితోన్.' 31

ప్రతిపదార్థం : హిమగిరి సానుదేశమున్= హిమవత్పర్వత సానువులలో; ఎక్కుడు వైభవము+ఉల్లసిల్లన్= వైభవం మిక్కిలిగా ప్రకాశించగా; యజ్ఞము= యజ్ఞాన్ని; తగన్+చేసి= శాస్త్రయుక్తంగా చేసి; భూమిసుర సంఘములు+ఎల్లనున్= బ్రాహ్మణ సమూహాలన్నీ; తృప్తిన్+పొందన్= తృప్తిపొందేటట్లు; భక్తితోన్= సభక్తికంగా; కుప్పఁగూరలు= కుప్పలు తెప్పలుగా; హేమము+ఒసఁగెన్= బంగారు (దక్షిణగా) ఇచ్చాడు; సమగ్ర కుతూహలుఁడు+ఐ= యజ్ఞం సమగ్రంగా పూర్తి కావాలన్న ఆసక్తితో; కనత్= ప్రకాశించే; సువర్ణమయ= బంగారంతో చేసిన; గృహక్రియా+ఉపకరణ= ఇంటిలోవాడేటటువంటి చెంబు, పళ్ళెంవంటి ఉపకరణాల; ప్రకరంబులున్= సముదాయాలను; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం : హిమగిరి సానువులలో మిక్కిలి వైభవంతో శాస్త్రయుక్తంగా యజ్ఞం జరిపి, బ్రాహ్మణసమూహాలకు తృప్తికలిగేటట్లు సభక్తికంగా కుప్పతెప్పలుగా బంగారం దక్షిణగా ఇచ్చాడు. యజ్ఞం సమగ్రంగా పూర్తి కావాలన్న ఆసక్తితో బంగారుతో చేయబడి, ప్రకాశిస్తున్న ఇంటిలో వాడే చెంబు, పళ్ళెం వంటి ఉపకరణాల సముదాయాలను బ్రాహ్మణులకు దానంగా ఇచ్చాడు.'

విశేషం: బంగారును దక్షిణగా ఇచ్చాడు. బంగారు పాత్రలను దానంగా ఇచ్చాడు. వీటినే దానధర్మాలని అంటారు. యజ్ఞసాఫల్యం దానం యొక్క 'సమగ్రత' మీద ఆధారపడుతుందని అర్థం.

వ. అని చెప్పి 'యిది మరుత్తుని యాభిజాత్యంబును దదీయవిత్తవిశేషంబును నెఱింగించుట; యవ్విత్తం బతనికి దొరకొనిన తెఱంగును నెఱింగించెదఁ; దదంచిత క్రతుక్రియాప్రకారంబునుం జెప్పెద విను; మట్లు కరంధముఁ డనం బరఁగి మనువంశదీపకుండై పేర్చిన యా భూపతి నిజ తపఃప్రభావంబున మహానుభావుం డగునంగిరసుండు దన కుపద్రష్టయయి యనే కాశ్వమేధంబులు సేయించుటం జేసి యావహిల్లిన మాహాత్మ్యంబునను మహీపతు లెల్లఁ గొలువం బూజ్యసామ్రాజ్యం బనుభవించి తన వలచిన యప్పుడ తనువుతోడన యూర్ధ్వలోకంబునకుం జనియె; నమ్మనుజపతితనయుం డవిక్షిన్నామధేయుండు ధరాభార ధౌరేయుండై యతనిన పోలి ప్రజలం బాలించె. 32

ప్రతిపదార్థం : అని చెప్పి= అని చెప్పినవాడై; ఇది= ఈ వృత్తాంతం; మరుత్తుని= మరుత్తుడియొక్క; అభిజాత్యంబునున్= పుట్టుకలోని గొప్పతనాన్ని (వంశగౌరవాన్ని); తదీయ= అతడి; విత్త విశేషంబును= సంపదలయొక్క అధిక్యాన్ని; ఎఱింగించుట= ఎరిగించటంకొరకు చెప్పాను; ఆ+విత్తంబు= ఆ ధనం; అతనికిన్= అతడికి; దొరకొనిన= సంక్రమించిన; తెఱంగునున్= విధానాన్ని కూడ; ఎఱింగించెదన్= తెలుపుతాను; తదంచిత క్రతు క్రియా ప్రకారంబునున్= ఆ గొప్ప క్రతువు జరిగిన తీరును; చెప్పెదన్= చెప్పుతాను; వినుము; అట్లు= ఆ విధంగా; కరంధముడు= అనన్+పరఁగి= అనే పేరు పొంది; మనువంశదీపకుండు+ఐ= మనువంశానికి దీపంవంటివాడై; పేర్చిన= ప్రకాశించిన (ఒప్పిన); ఆ భూపతి= ఆ రాజు; నిజ= తన; తపస్+ప్రభావంబునన్= తపస్సుయొక్క శక్తిచేత; మహానుభావుండు+ అగు= మహాత్ముడైన; అంగిరసుండు= అంగిరసుడు; తనకున్= తనకొరకు; ఉపద్రష్ట+అయి= ఉపద్రష్టగా; అనేక= చాలా; అశ్వమేధంబులు= అశ్వమేధయాగాలు; చేయించుటన్+చేసి= చేయించటంచేత; ఆవహిల్లిన= పుట్టిన; మాహాత్మ్యంబునున్= శక్తివలన; మహీపతులు+ఎల్లన్= రాజు లందరూ; కొలువన్= సేవిస్తూండగా; పూజ్య= గౌరవప్రదమైన; సామ్రాజ్యంబు= రాజ్యాన్ని; అనుభవించి= ఏలి; తన వలచిన అప్పుడు+అ= తాను కోరుకొన్నప్పుడే; తనువుతోడన్= శరీరంతో; ఊర్ధ్వలోకంబునకున్= స్వర్గానికి; చనియెన్= వెళ్ళిపోయాడు; ఆ+మనుజపతి తనయుండు= ఆ రాజు కొడుకు; అవిక్షిత్+నామధేయుండు= అవిక్షిత్తు అని పేరుగలవాడు (అచిక్షిత్తు - అని కూడా నామాంతరం); ధరాభార= భూభార; ధౌరేయుండు+ఐ= మోయటంలో సమర్థుడై; అతనిన్+అ+పోలి= అతనినే (తండ్రినే) పోలి; ప్రజలన్+పాలించెన్= ప్రజలను పరిపాలించాడు.

తాత్పర్యం : అని చెప్పిన వ్యాసుడు 'ఈ వృత్తాంతం మరుత్తుడి వంశగౌరవాన్ని, అతడి సంపదలోని వైశిష్ట్యాన్ని చెప్పటంకోరారు చెప్పాను. అతడికి ఆ ధనం ఎట్లా వచ్చిందో చెప్పుతాను వినుము. ఆ క్రతువును ఆయన ఎట్లా చేశాడో కూడా వివరిస్తాను. ఆ విధంగా కరంధముడనే పేరు పొంది మనువంశదీపకుడై ఒప్పిన ఆ రాజు తన తపశ్శక్తిచేత మహాత్ముడైన అంగిరసుడు తనకు ఉపద్రష్టగా చాలా అశ్వమేధాలు చేయించటంచేత పుట్టిన ప్రభావంతో రాజులందరూ సేవిస్తుండగా గౌరవప్రదమైన రాజ్యాన్ని ఏలి, తాను కోరినప్పుడు తన బొందితోసహా స్వర్గానికి వెళ్ళిపోయాడు. ఆ రాజుకొడుకు అవిక్షిత్తు, అతడు భూభారాన్ని వహించటంలో సమర్థుడై, తండ్రిని పోలి ప్రజలను పరిపాలించాడు' అని చెప్పాడు.

చ. అతని సుతుండు సూవె మనుజాధిపసత్తమ! యమ్మహాత్ముఁ డా
పతి తన తండ్రి పిమ్మటఁ గృపారతుఁ డార్యుఁడు దండనీతి వి
శ్రుతమతి దానశీలుఁ డన రూఢికి నెక్కి తదీయరాజ్య సు
స్థితి వెలుఁగొందె వాసవునిఁ జీరికిఁ జేకొనఁ డీసు పెంపునన్. 33

ప్రతిపదార్థం: మనుజ+అధిప సత్తమ!= రాజశ్రేష్ఠా! - ఓ ధర్మరాజా!; అతని సుతుండు+చూవె!= అతడి కుమారుడే సుమా!; ఆ+మహాత్ముఁడు= ఆ మరుత్తుడు; ఆ పతి= ఆ రాజు; తన తండ్రి పిమ్మటన్= తన తండ్రి తరువాత; కృపారతుఁడు= కృపామయుడు; అర్యుఁడు= పూజ్యుడు; దండనీతి విశ్రుతమతి= దండనీతిని బాగా ఎరిగినవాడు; దానశీలుఁడు= గొప్ప దానగుణం కలవాడు; అనన్= అనగా; రూఢికిన్+ఎక్కి= ప్రసిద్ధిపొంది; తదీయరాజ్య= అతడి రాజ్యపు; సుస్థితిన్= ఉన్నతస్థితితో; వెలుఁగు+ఒందెన్= ప్రకాశం పొందినది; (అతడు) వాసవునిన్= ఇంద్రుడిని కూడా; ఈసు పెంపునన్= పెరిగిన అసూయతో; చీరికిన్+చేకొనఁడు= లక్ష్యపెట్టడు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! వినుము. ఆ మరుత్తుడు ఆ అవిక్షిత్తుడి కుమారుడే సుమా! ఆ మరుత్తుడు తండ్రి పోయాక రాజ్యపాలన చేపట్టి, దయగలవాడని, పూజ్యుడని, దండనీతివిశారదుడని, దానగుణం కలవాడని పేరుపొందాడు. అతడి రాజ్యం సుస్థితిని పొంది, వెలుగొందింది. ఆ రాజు తన పెంపుతో ఇంద్రుడిని కూడా లెక్కపెట్టలేదు. అతడికి తన దీక్షపైన అంత విశ్వాసం ఉన్నది. ఇది చూచి, ఇంద్రుడు పట్టరానంత అసూయను పెంచుకొన్నాడు.

క. వాసవుఁడును నవ్విభునెడ। నీసు గలిగి తన్ను మిగులనీనని తచ్చిం
తాసక్తుండై మంత్రి ని। వాసమునకుఁ జనియెఁ బూరువంశప్రవరా! 34

ప్రతిపదార్థం: పూరువంశప్రవరా!= పూరుడివంశంలోని శ్రేష్ఠుడా! (ధర్మరాజా!); వాసవుఁడునున్= ఇంద్రుడుకూడా; ఆ+విభు+ఎడన్= ఆ మరుత్తుడిపై; ఈసు+కలిగి= ఈర్ష్య కలిగి; తన్నున్= తనను; మిగులనీనని= మించనీయనని; తద్+చింతా+ఆసక్తుండు+ఐ= అదే చింతలో ఆసక్తి కలవాడై; మంత్రి నివాసమునకున్+చనియెన్= మంత్రి నివాసానికి వెళ్ళాడు.

తాత్పర్యం: ఆ ఇంద్రుడుకూడా ఆ మరుత్తుడిపై ఈర్ష్య కలిగి, ఈ రాజు తన పుణ్యకార్యాలతో తనను మించిపోగూడదు అనే చింతలో మునిగిపోయినవాడై తన మంత్రి అయిన బృహస్పతి నివాసానికి వెళ్ళాడు.

విశేషం: వంద యగాలు చేస్తే ఇంద్రపదవిని పొందుతారని శాస్త్రోక్తి. ఇంద్రుడి భయం అదే. కాబట్టి ఇంద్రుడికి ఒక మానవుడి మీద అసూయ కలిగిందన్నమాట! అంటే దేవతలు కూడా ఈర్ష్యలకు అతీతులు కారని అర్థం.

వ. చని యతనితోడ. **35**

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; అతనితోడన్= అతడితో (ఆ బృహస్పతితో).

తాత్పర్యం: వెళ్ళి ఆ బృహస్పతితో ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'అనఘ! మరుత్తుండు నిను వరింపఁ దలంచుఁ। దన యజ్ఞమున కుపద్రష్ట గాఁగ

నమరాధిపతి యగు నట్టి నాకును జేసి। యుపదర్శనం బింక నొక్క మర్త్యు

నకుఁ జేత నీ పెంపునకు హాని గాదె! నన్। విడిచి యాతని యజ్ఞవిధులు నడపుఁ;

డాతనిఁ దొఱఁగి మదాప్తత మెఱయు పె। క్కాడంగ నేటికి?' ననుడు నతని

తే. పలుకులకు నవ్వి యా బృహస్పతి 'మహాత్మ!। యెఱుఁగనే నిన్ను? నన్ను నీ వింత సెప్ప

నేల! సర్వలోకముల కధీశుఁ డైన। నీ గురుం డొరు నాసించునే మహేంద్ర!' **36**

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; మరుత్తుండు= మరుత్తుడు; నినున్= నిన్ను; తన యజ్ఞమునకున్= తాను చేయదలచిన యజ్ఞానికి; ఉపద్రష్ట+కాఁగన్= ఉపద్రష్టగా ఉండటానికి; వరింపన్+తలంచున్= వరించాలని అనుకొంటున్నాడు; అమర+అధిపతి+అగు+అట్టి= స్వర్గాధిపతిని అయినటువంటి; నాకును= నాకు; ఉపదర్శనంబు చేసి= ఉపద్రష్టగా పని చేసి; ఒక్కమర్త్యునకున్= ఒక మనిషికి; చేఁత= చేయటం; నీ పెంపునకున్= నీ గొప్పతనానికి; హానికాదె!= హానికాదా!; నన్+విడిచి= నన్నువదలిపెట్టి; అతనిన్= ఆ మరుత్తుడియొక్క; యజ్ఞకార్యం నడిపించడి (లేదా); అతనిన్+తొఱఁగి= అతడిని వదలిపెట్టి; మత్+ఆప్తతన్= నాకు ఆప్తుడుగా; మెఱయు(ము)= విరాజిల్లుము; పెక్కు+అడంగన్+ఏటికిన్?= ఎక్కువగా చెప్పటం ఎందుకు?; అనుడున్= అనగా; అతని పలుకులకున్= ఆ ఇంద్రుడి మాటలకు; నవ్వి; ఆ బృహస్పతి; మహాత్మ!= ఓ మహాత్మా!; మహేంద్ర!= ఓ మహేంద్రా! నిన్నున్= నీవెవడివో; ఎఱుఁగనే?= నాకు తెలియదా?; నన్నున్= నాకు; నీవు+ఇంత+చెప్పనేల?= నీవు ఇంతగా చెప్పటం ఎందుకు?; సర్వలోకములకున్+అధీశుఁడు+ఐన= అతడు అన్ని లోకాలకూ అధిపతి అయిన; వినుము; (నీ గురుండు= నీ గురువైన బృహస్పతి;) ఒరున్+ఆసించునే?= మరి ఒకడిని ఆశిస్తాడా?

తాత్పర్యం: 'పుణ్యాత్మా! మరుత్తుడు తాను చేయదలచిన యజ్ఞానికి ఉపద్రష్టగా ఉండటానికి నిన్ను వరించాలని అనుకొంటున్నాడు. స్వర్గాధిపతి నైన నాకు ఉపద్రష్టగా ఉండిన మీరు ఒక మానవుడికి సహకరించటం మీ గొప్పతనానికి హానికరం కాదా! నిన్ను విడిచిపెట్టి అతడి యజ్ఞకార్యాన్ని నడిపించండి. లేదా అతడిని వదలిపెట్టి నాకు ఆప్తుడుగా విరాజిల్లండి. ఇంక ఎక్కువగా చెప్పవలసిన అవసరం లేదు. 'అని అనగా ఆ బృహస్పతి నవ్వి' ఓ మహాత్మా! ఇంద్రా! నీ వెవడవో నాకు తెలియదా? నాకు నీవు ఇంతగా చెప్పాలా? అందువలన అన్ని లోకాలకు అధిపతి అయినప్పటికీ నీవంటివాడికి గురువైన నేను మరొకడిని ఆశించటమా?'

విశేషం: ఉపదర్శనంఅంటే యజ్ఞానికి ముందు ఫలానావారు ఫలానా పని చేయాలని కోరుకొనటం, దీన్నే 'ఋత్విగ్వరణం' అంటారు. అట్లా కోరబడ్డవాడు 'వరుడు' అంటే శ్రేష్ఠుడని అర్థం.

వ. అని వెండియు. **37**

తాత్పర్యం : అని ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. 'అగ్ని చల్లనైన, నబ్జమిత్త్రుఁడు మైల। పడ్డ, నుర్వి వొరలఁబడిన, మేరు

నగము సంచలించినను బొంకు వొరయునే?। నాదు పలుకు నెమ్మనమున నమ్ము!' 38

ప్రతిపదార్థం: అగ్ని చల్లనైనన్= అగ్ని చల్లబడినా; అబ్జమిత్త్రుఁడు= సూర్యుడు; మైలపడ్డన్= మకిలిపట్టినా; ఉర్వి= భూమి; పొరలఁబడినన్= క్రిందుమీదైనా; మేరునగము= మేరుపర్వతం; సంచలించినను= కదిలిపోయినా, నాదు పలుకు= నా మాట; బొంకు+పొరయునే?= అబద్ధం అవుతుందా?; నెఱ+మనమునన్= నిండు హృదయంతో; నమ్ము(ము)= విశ్వసించుము.

తాత్పర్యం: 'అగ్ని చల్లబడినా, సూర్యుడు మకిలిపట్టినా, భూమి క్రిందుమీదైనా, మేరుపర్వతం కదలాడినా, నా మాట అసత్యం కాదు. బాగా విశ్వసించుము.'

క. అన విని ప్రమదంబునఁ దే। లిన చిత్తముతోడ సమదలీలం జనియెం

దన మందిరంబునకు సుర। లనురాగముఁ బొంద నింద్రుఁ డమలచరిత్రా! 39

ప్రతిపదార్థం: అమలచరిత్రా!= పవిత్ర చరిత్రుడవైన ధర్మరాజా!; అనన్= ఈ విధంగా బృహస్పతి చెప్పగా; విని= విన్నవాడై; ఇంద్రుఁడు; ప్రమదంబునన్= సంతోషంతో; తేలిన చిత్తముతోడన్= తేలియాడిన మనస్సుతో; సమదలీలన్= దర్పంగా; సురలు= దేవతలు; అనురాగము పొందన్= సంతోషం పొందగా; తన మందిరంబునకున్= తన భవనానికి; చనియెన్= వెళ్ళాడు.

విశేషం: నిర్మలచరిత్రుడవైన ధర్మరాజా! ఈ విధంగా బృహస్పతి చెప్పగా విన్నవాడై, ఇంద్రుడు సంతోషంతో తేలియాడిన మనస్సుతో దర్పంగా, దేవతలు సంతోషించగా తన మందిరం చేరుకొన్నాడు.

సీ. అది యంతయును విని యమ్మరుత్తుఁడు త్రిద। శాచార్యు కడ కేఁగి యతనితోడ

'నీకు నెఱింగించి నీ పంపునన యేను। సంభారముల నెల్ల సంఘటించి

యజ్ఞాచరణమున కమరియున్నాఁడ నీ। వుపదర్శనంబు సేయుటకు రమ్ము'

నావుడు 'నింద్రుండు ననుఁ దన యాగము। నకు మున్న వరియించినాఁడు; నాకు

తే. నెట్లు రావచ్చు?' ననియె నా యింద్రమంత్రి। యట్లు పలికిన 'మా తాత కనఘ! నీదు

తండ్రి సంప్రీతితో నుపద్రష్ట యయ్యెఁ। నట్ల కృపసేయు' మని పల్కె నవ్విభుండు. 40

ప్రతిపదార్థం: అది+అంతయునున్+విని= అదంతా విని; ఆ+మరుత్తుఁడు= ఆ మరుత్తుడు; త్రిదశ+ఆచార్యు కడకున్+ఏఁగి= దేవతల గురువైన బృహస్పతి వద్దకు వెళ్ళి; అతనితోడన్= అతడితో; నీకున్+ఎఱింగించి= నీకు తెలిపి; నీ పంపునన్+అ= నీవు చెప్పిన పద్ధతిలోనే; ఏను= నేను; సంభారములన్+ఎల్లన్= యజ్ఞసామగ్రినంతా; సంఘటించి= చేర్చుకొని; యజ్ఞ+ఆచరణమునకున్= యజ్ఞం చేయటానికి; అమరి+ఉన్నాఁడన్= సిద్ధంగా ఉన్నాను; నీవు+ఉపదర్శనము+చేయుటకున్= నీవు ఉపద్రష్టగా ఉండటానికి; రమ్ము= దయచేసి రావలెను; నావుడున్= అని అడుగగా; ఇంద్రుండు; ననున్= నన్ను, తన యాగమునకున్= తాను చేయనున్న యాగానికి; మున్ను+అ= ముందే; వరియించినాఁడు= వరించాడు; నాకున్= నేను; ఎట్లు రావచ్చున్?= ఎట్లా రావటం?; అనియెన్= అన్నాడు; ఆ+ఇంద్రమంత్రి= బృహస్పతి; అట్లు పలికినన్= అట్లా అనగా; ఆ+విభుండు= ఆ రాజు; అనఘ!= పుణ్యాత్మా!; నీదు తండ్రి= నీ తండ్రి అంగిరసుడు; మా తాతకున్= మా తాతగారైన కరంధముడికి; సంప్రీతితోన్= ప్రేమతో; ఉపద్రష్ట అయ్యెన్= ఉపద్రష్ట అయ్యాడు కదా!; అట్లు+అ; కృపచేయుము+అని పల్కెన్= అట్లాగే నీవు నన్ను కనికరించుము - అని అన్నాడు.

తాత్పర్యం: అదంతా విని ఆ మరుత్తుడు దేవతల గురువు బృహస్పతి వద్దకు వెళ్ళి, అతడితో 'ఆచార్యా! నీకు తెలిపి, నీ అనుమతి చొప్పుననే నేను యజ్ఞసామగ్రిని సిద్ధంచేసికొని యజ్ఞం చేయటానికి తయారుగా ఉన్నాను. నీవు దయతో ఉపద్రష్టగా వ్యవహరించుము. అని అడుగగా అప్పుడు బృహస్పతి 'రాజా! ఇంద్రుడు ఇంతకుముందే తాను చేయనున్న యాగానికి ఉపద్రష్టగా నన్ను వరించాడు. ఇప్పుడు రావటం ఎట్లా?' అన్నాడు. దానికి ఆ రాజు 'మహాత్మా! మీ తండ్రి అంగిరోమహర్షి మా తాతగారైన కరంధముడికి ఉపద్రష్టగా వ్యవహరించారు కదా! అట్లాగే నామీదా మీరు దయచూపండి' అని కోరాడు.

చ. **విని ధిషణుం డమర్త్యులకు విన్నను వొప్పఁ గ్రతుప్రయోగముల్**
మనము దలిర్పఁగా నడపి మర్త్యుని యాగము నొజ్జఁ గాఁగఁ జా
ల నిది నిజంబ యింక ననులాప మొనర్పక పొమ్ము వేఱ యొ
క్కని నుపదర్శనంబునకుఁ గైకొను మారసి నీవు' నావుడున్. **41**

ప్రతిపదార్థం: విని= ఆ రాజుమాటలు విని; ధిషణుండు= బృహస్పతి; అమర్త్యులకున్= మరణంలేనివారైన దేవతలకు; విన్ననువు+ఒప్పన్= నేర్పు మెరసేటట్లు; క్రతుప్రయోగముల్= యాగ ప్రక్రియలను; మనము= మనస్సు; తలిర్పఁగాన్= వికసించగా; నడపి= నడిపించి; మర్త్యునియాగమున్= మానవుడు చేస్తున్న యాగానికి; ఒజ్జన్+కాఁగన్= గురువుగా ఉండటానికి; చాలన్= తగను; ఇది నిజంబు+అ= ఇది నిజం (అంతే); ఇంకన్= ఇక; అనులాపము= వేడికోలు; ఒనర్పక= చేయకుండా; పొమ్ము= వెళ్ళుము; వేఱ+ఒక్కనిన్= మరొకడిని; నీవు ఆరసి= నీవువెదకి; ఉపదర్శనంబునకున్= ఉపద్రష్టత్వం వహించటానికి; కైకొనుము= స్వీకరించుము; నావుడున్= అని అనగా (అప్పుడు).

తాత్పర్యం: ఆ రాజు మాటలు విని బృహస్పతి 'రాజా!' దేవతలకు నేర్పుతో వారి మనస్సులు సంతోషించేటట్లు యాగప్రక్రియలను నిర్వర్తించిన ప్రసిద్ధి నాది. అట్లాంటి నేను మానవుడు చేసే యాగానికి గురువుగా వ్యవహరించటం సముచితం కాదు. అందుచేత ఈ వేడికోలు ఇక మాని, మరొకరిని వెదకి ఉపద్రష్టగా గైకొనుము. ఇక వెళ్ళుము' అనగా - తరువాతి వచనంతో అన్వయం.

వ. **అజ్జనపతి లజ్జితుండై మగిడి వచ్చి యెదుర నారదుం గని వినయం బెసంగ వినతుండై నిలిచిన నమ్ముని యతనిం గనుంగొని 'యెటవోయి వచ్చె? దేల విన్ననై యున్నవా'డవు? నీ తెఱం గెఱింగింపు; మెవ్విధంబుననైన నీ విషాదంబు మాన్చెద' ననుటయు నమ్మనుజవరుండు 'మదీయాధ్వరంబునకు నాంగిరసు నుపాధ్యాయుంగా వరియింపం బోయితి; నద్దేవగురుండు నన్ను దూషించి పరిత్యజించె; నింక నేటి బ్రదు? 'కని పలికిన నప్పరమ సంయమి యప్పుడమితేనితో 'బృహస్పతి నిన్నొల్లకున్ననేమి? యంగిరసుని పిన్నకొడుకు సంవర్తుండాధిషణు చేత ధిక్కరింపంబడి సకలంబును విడిచి వెడలి వైరాగ్యంబు పెంపున దిగంబరుఁ డయి తిరుగుచున్నవాఁడతని పాలికి నరుగు; మమ్మహాత్ముండు భవన్మఖంబునకు నుపదర్శనం బాచరించు' ననవుడు సంతసిల్లి యా భూవరుం డిట్లనియె.** **42**

ప్రతిపదార్థం: ఆ+జనపతి= ఆ రాజు; లజ్జితుండు+ఐ= సిగ్గుపడినవాడై; మగిడివచ్చి= తిరిగివచ్చి; ఎదురన్= ఎదురుపడ్డ; నారదున్= నారదమహర్షిని; కని= చూచి; వినయంబు+ఎసంగన్= వినయం ఒప్పగా; వినతుండు+ఐ= నమస్కరించినవాడై; నిలిచినన్= నిలబడగా; ఆ+ముని= నారదుడు; అతనిన్+ కనుంగొని= ఆ మరుత్తుడిని చూచి; ఎట+పోయి+వచ్చెదు?= ఎక్కడకు వెళ్ళి వస్తున్నావు?; ఏల=

ఎందుకు; విన్నన+ఐ= చిన్నబోయి; ఉన్నవా'డవు?= ఉన్నావు?; నీ తెఱంగు= నీ విధం; ఎఱింగింపుము= తెలుపుము; ఏ+విధంబునన్ ఐనన్= ఎట్లాగైనా నీ విషాదంబున్= నీ దుఃఖాన్ని; మాన్పెదన్+అనుటయున్= మాన్పుతాను అనగా; ఆ మనుజవరుండు= ఆ రాజు; మదీయ+అధ్వరంబునకున్= నేను చేయబూనిన యాగానికి; అంగిరసున్= అంగిరసుడి కుమారుడైన బృహస్పతిని; ఉపాధ్యాయున్+కాన్= ఉపద్రష్టగా; వరియింపన్+పోయితిని= వరించాలని వెళ్ళాను; ఆ+దేవగురుండు= ఆ బృహస్పతి; నన్నున్+దూషించి= నన్ను తిట్టి; పరిత్యజించెన్= విడిచి పెట్టాడు; ఇంకన్+ఏటి+బ్రదుకు?+అని= ఇక నా బ్రదుకు ఎందుకు? అని; పలికినన్= అనగా; ఆ పరమ సంయమి= ఆ ఋషిశ్రేష్ఠుడు; ఆ+పుడమిఱేనితోన్= ఆ రాజుతో; బృహస్పతి; నిన్నున్+ఒల్లకున్నన్+ఏమి?= నిన్ను ఇష్టపడకపోతే నేమిటి?; అంగిరసుని పిన్నకొడుకు= అంగిరసుడి చిన్న కుమారుడు; సంవర్తుండు= సంవర్తు డనేవాడు; ఆ ధిషణుచేతన్= ఆ బృహస్పతిచేత; ధిక్కరింపన్+పడి= తిరస్కరించబడి; సకలంబును= అన్నిటిని; విడిచి= వదలిపెట్టి; వైరాగ్యంబు పెంపునన్= మిక్కిలి విరాగభావంతో; దిగంబరుఁడు+అయి= బట్టకూడా లేకుండా; తిరుగుచున్నాడు. అతని పాలికిన్+అరుగుము= అతడివద్దకు వెళ్ళుము; ఆ+మహాత్ముండు= ఆ సంవర్తుడు; భవత్+మఖంబునకున్= నీ యాగానికి; ఉపదర్శనంబు+ఆచరించున్+అనవుడున్= ఉపద్రష్టగా వ్యవహరిస్తాడు అని చెప్పగా; సంతసిల్లి= సంతోషపడి; ఆ భూవరుండు= ఆ రాజు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ రాజు సిగ్గుపడ్డవాడై తిరిగివచ్చి, ఎదురుపడ్డ నారదమహర్షిని చూచి, వినయంతో నమస్కరించి నిలబడ్డాడు. నారదుడు మరుత్తుడిని చూచి 'ఎక్కడికి వెళ్ళి వస్తున్నావు? ఎందుకు చిన్నపోయి కనిపిస్తున్నావు? ఏమిటి నీ వ్యవహారం? ఎందుకిట్లా దుఃఖిస్తున్నావు? నీ విషాదాన్ని ఎట్లాగైనా పోగొట్టుతాను' అన్నాడు. అపుడు ఆ రాజు 'స్వామీ! అంగిరసుడి కుమారుడైన బృహస్పతిని ఉపద్రష్టగా వరించాలని వెళ్ళాను. ఆ దేవగురుడు నన్ను తిట్టి వదలిపెట్టాడు. ఇక నా బ్రదుకు వ్యర్థం' అని బావురుమన్నాడు. ఆ ఋషిశ్రేష్ఠుడు 'రాజా! ఆ బృహస్పతి నిన్ను ఇష్టపడకపోతే ఏమిటి నష్టం? అంగీరసుడి చిన్న కొడుకు సంవర్తుడనే వాడు కూడా బృహస్పతిచేత తిరస్కరించబడి. సర్వం వదలి, వైరాగ్యం అవలంబించి, దిగంబరుడుగా తిరుగుతున్నాడు. నీవు అతడి వద్దకు వెళ్ళుము. ఆ మహాత్ముడు నీ యాగానికి ఉపద్రష్టగా ఉంటాడు' అని చెప్పగా మిక్కిలి సంతోషపడి ఆ రాజు ఇట్లా అన్నాడు.

క. **'మునివర! బ్రదికితి సంవ। ర్తుని నెచ్చటఁ గాంతు? నెప్పరుసునం దగ నా**
డిన నతఁడు ద్రోపు సేయక। ననుఁ గైకొను? నెఱుఁగఁ జెప్పు నాకుం గరుణన్.' **43**

ప్రతిపదార్థం: మునివర!= ఓ మునిశ్రేష్ఠా!; బ్రదికితిన్= బ్రదికాను; సంవర్తునిన్= సంవర్తుడిని; ఎచ్చటన్+కాంతున్?= ఎక్కడ చూడగలను?; ఏ+పరుసునన్= ఏ విధంగా; తగన్= తగినట్లుగా; ఆడినన్= మాట్లాడితే; అతఁడు= ఆ సంవర్తుడు; త్రోపు+చేయక= త్రోసి పుచ్చకుండా; ననున్+కైకొనున్= నన్ను స్వీకరిస్తాడో; నాకున్= నాకు; కరుణన్= దయతో; ఎఱుఁగన్+చెప్పు(ము)= తెలియజెప్పుము

తాత్పర్యం: 'ఓ మునిశ్రేష్ఠా! బ్రదికాను, కాని ఆ సంవర్తుడిని ఎక్కడ చూడగలను? అతడితో ఎట్లా మర్యాదగా మాటాతే అతడు నా విన్నపాన్ని తోసిపుచ్చకుండా నన్ను స్వీకరిస్తాడో దయతో వివరంగా చెప్పి పుణ్యం కట్టుకొనండి.'

వ. **అని ప్రార్థించిన యప్పార్థివోత్తమునకు నత్తపోధనసత్తముం డిట్లనియె.** **44**

ప్రతిపదార్థం: అని= ఈవిధంగా; ప్రార్థించిన= ప్రార్థించినట్టి; ఆ+పార్థివ+ఉత్తమునకున్= ఆరాజశ్రేష్ఠుడితో; ఆ+తపోధన+సత్తముండు= ఆ ఋషిశ్రేష్ఠుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా ప్రార్థించగా ఆ రాజుతో ఆ మహర్షి ఇట్లా అన్నాడు.

సీ. 'భూపాల! యతఁడు కాశీపురిఁ బాయక । వర్తించు నున్మత్తవర్తనమున;
నతని నెఱింగెడు నట్టి యుపాయంబు । వినుము పురద్వారమున శవంబు
నిడికొని నీ వుండు మేతెంచి చూచి ని । వర్తించు వాని సంవర్తుఁ గాఁగ
నెఱుఁగుము; మరలి యట్లేఁగంగ వెనుకన । పొమ్ము నిశ్చలభక్తిపూర్వకముగ

ఆ. నెచట నైన నీకు నేకాంత మొదవిన । శరణు సొరుము వినయభరితవృత్తి
నాదు గుఱుతు సెప్పినారెవ్వ రనినను । జెంద నారదుండు సెప్పె ననుము. 45

ప్రతిపదార్థం: భూపాల!= రాజా!; అతఁడు= ఆ సంవర్తుడు; కాశీపురిన్= కాశీపురిని; పాయక= వదలకుండా; ఉన్మత్త వర్తనమునన్= పిచ్చివాడివలె; వర్తించున్= ప్రవర్తిస్తుంటాడు; అతనిన్+ఎఱింగెడు+అట్టి= అతడిని గుర్తించేటటువంటి; ఉపాయంబు= యుక్తి; వినుము= చెప్తుతాను వినుము; పురద్వారమునన్= ఊరు ముందటి ద్వారం వద్ద; శవంబున్+ఇడికొని= ఒక శవాన్ని దగ్గర ఉంచుకొని; నీవు+ఉండుము= నీవు ఉండుము; ఏతెంచి= వచ్చి; చూచి; నివర్తించువానిన్= వెంటనే మరలిపోయేవాడిని; సంవర్తున్+కాఁగన్= సంవర్తుడని; ఎఱుంగుము= తెలిసికొనుము; మరలి+అట్లు+ఏఁగంగన్= మరలి అట్లా వెళ్ళిపోతుండగా; వెనుకన్+అ= వెనుకనే; నిశ్చల= నిశ్చలమైన; భక్తిపూర్వకమునన్= భక్తితో; పొమ్ము= వెళ్ళుము; ఎచటన్+ఐనన్= ఎక్కడైనా; నీకున్; ఏకాంతము+ఒదవినన్= ఒంటరిగా ఆయన దొరికితే; వినయభరితవృత్తిన్= వినయంతో కూడిన ప్రవృత్తితో; శరణు+చొరుము= ఆశ్రయం పొందుము; నాదు గుఱుతు= నా గుర్తు; ఎవ్వరు+చెప్పినారు+అనినను= ఎవరు చెప్పారని అడిగితే; చెందన్= నిన్ను పొందటానికి; నారదుండు= నారదమహర్షి; చెప్పెన్+అనుము= చెప్పాడు అని చెప్పుము.

తాత్పర్యం: రాజా! ఆ సంవర్తుడు కాశీపురాన్ని ఏనాడూ వదలిపెట్టడు; పిచ్చివాడివలె ప్రవర్తిస్తుంటాడు. అతడిని ఎట్లా గుర్తించాలో ఒక ఉపాయం చెప్తుతాను వినుము. ఊరు ముందటి ద్వారంవద్ద ఒక శవాన్ని దగ్గర పెట్టుకొని నీవు ఉండుము. వచ్చి చూచి వెంటనే ఎవరు మరలి పోతారో వారే సంవర్తుడని గుర్తించుము. అట్లా మరలి పోతున్నప్పుడు ఆయన వెంటనే నీవూ నిశ్చలమైన భక్తితో వెళ్ళుము. ఎక్కడైనా ఆయన ఒంటరిగా దొరికినప్పుడు వినయంతో ఆయన శరణు పొందుము. 'నా గుర్తు ఎవరు చెప్పారు?' అని ఆయన అడిగితే నారదమహర్షి చెప్పారని చెప్పుము.

(మరుత్తుఁడు సంవర్తునిఁ దన యజ్ఞమున కుపద్రష్టఁగా వరియించుట (సం. 14-6-27))

సీ. ఇప్పుడు నారదుం డెందున్న వాఁడని । యడిగినయట్లైన నతఁడు నాకు
ని న్నెఱింగించి యగ్నిప్రవేశము సేసె । ననుము శంకింపక' యనుడు నమ్మ
హీపతి వారాణసీపురంబున కేఁగి । దిక్కుమాలిన పీనుఁ గొక్కచోటఁ
బడియున్నఁ గని దానిఁ బట్టించుకొని పుర । ద్వారప్రదేశంబు సేర నరిగి

తే. యచట నక్కుణపము నిడి యంతనంత । వేచికొని యుండఁగా నొక్క వెఱ్ఱివాఁడు
వచ్చి శవముఁ గనుంగొని వాటువడ్డ । పసరమును బోలెఁ గ్రమ్మఱి పాఱుటయును. 46

ప్రతిపదార్థం: ఇప్పుడు= ఇపుడు; నారదుండు= నారదమహర్షి; ఎందున్+ఉన్నవాఁడు+అని= ఎక్కుడ+ఉన్నాడని; అడిగిన+అట్లు+ఐనన్= అడిగినట్లయితే; అతఁడు= నారదుడు; నాకున్= నాకు; నిన్నున్+ఎఱింగించి= నిన్ను గురించి తెలిపి; అగ్ని ప్రదేశంబు+చేసెన్= అగ్నిలో ప్రవేశించాడని; శంకింపక= సందేహించకుండా; అనుము= చెప్పుము; అనుడున్= అని చెప్పగా; ఆ+మహీపతి= ఆ రాజు;

వారాణసీ పురంబునకున్+ఏఁగి= వారాణసీ పురానికి వెళ్ళి; దిక్కుమాలిన పీనుఁగు= దిక్కులేని శవం; ఒక్కచోటన్+పడి+ఉన్నన్= ఒకచోట పడి ఉంటే; కని= చూచి; దానిన్+పట్టించికొని= దానిని మోయించుకొని; పురద్వార ప్రదేశంబు= పురద్వారాన్ని; చేరన్+అరిగి= వెళ్ళి చేరుకొని; అచటన్= అక్కడ; ఆ+కుణపమున్+ఇడి= ఆ శవాన్ని ఉంచుకొని; అంతన్+అంతన్= దాచి సమీపంలో అక్కడా ఇక్కడా; వేచికొని ఉండఁగాన్= కాచుకొని ఉండగా; ఒక్క వెఱ్ఱివాఁడు= ఒక పిచ్చివాడు; వచ్చి; శవమున్+కనుంగొని= శవాన్ని చూచి; వాటు+పడ్డ= దెబ్బతిన్న; పసరమును+పోలెన్= పశువువలె; క్రమ్మఱి= వెనుకకు తిరిగి; పాఱుటయునున్= పరుగెత్తగా.

తాత్పర్యం: ఇప్పుడు నారదుడు ఎక్కడున్నాడు? అని ఒక సమయంలో అడిగితే ఆయన నాకు మిమ్ములను గురించిచెప్పి అగ్నిలో ప్రవేశించాడని ఏ సంకోచంలేకుండా చెప్పుము. 'అని నారదుడు చెప్పగా ఆ రాజు కాశీపురానికి వెళ్ళి దిక్కులేని శవం ఒకచోట పడి ఉండగా చూచి, దానిని మోయించుకొని నగరద్వారంవద్దకు చేరుకొని ఆ శవాన్ని అక్కడ ఉంచుకొని, దాని సమీపంలో అక్కడా ఇక్కడా ఉంటూ కాచుకొని ఉన్నాడు. అప్పుడు ఒక పిచ్చివాడు వచ్చి శవాన్ని చూచి, దెబ్బతిన్న పశువువలె వెనక్కి తిరిగి పారిపోయాడు.

వ. వాని సంవర్తుంగా నెఱింగి యజ్జనపతి యాతని పజ్జన చనంజన నతండు మరలిచూచి పై ధూళి సల్లియు నుమిసియు వేఁదుఱుచందంబు భావింప నా భూవల్లభుండు. 47

ప్రతిపదార్థం: వానిన్= అతడిని; సంవర్తున్+కాన్= సంవర్తుడిగా; ఎఱింగి= గుర్తించి; ఆ+జనపతి= ఆ రాజు; అతని= ఆ సంవర్తుడి; పజ్జన్+అ= వెనుకనే; చనన్+చనన్= పోగా పోగా; అతండు= అతడు; మరలిచూచి= తిరిగి చూచి; పైన్= ఆ రాజుపై ధూళి+చల్లియున్= దుమ్ము చల్లి; ఉమిసియున్= ఉమ్మి వేసి; వేఁదుఱు+చందంబున్= పిచ్చివాడి రీతిని; భావింపన్= కలిగించగా; ఆ భూవల్లభుండు= ఆ రాజు.

తాత్పర్యం: అతడిని సంవర్తుడినిగా గుర్తించి ఆ రాజు అతడి వెనుకనే పోగా పోగా అతడు తిరిగి చూచి రాజుపై దుమ్ముచల్లి, ఉమిసి, పిచ్చివాడివలె ప్రవర్తించగా ఆ రాజు, (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినయముతోఁ గేల్ మొగుచుచు । ననుగమనం బుడుగ కరుగ నాతండును ని
ర్జనమగు ప్రదేశమునకుం । జని యొక వటవిటపి నీడఁ జదికిలఁ బడియెన్. 48

ప్రతిపదార్థం: వినయముతోన్= వినయంగా; కేల్= చేతులు; మొగుచుచున్= ముడిచి నమస్కరిస్తూ; అనుగమనంబు= వెంట వెళ్ళటాన్ని; ఉడుగక= వదలకుండా; అరుగన్= వెళ్ళగా; అతండును= సంవర్తుడూ; నిర్జనము+అగు= ఎవరూ లేని ఏకాంతమైన ప్రదేశమునకున్+చని= ఒక చోటికి వెళ్ళి; ఒక వట విటపి నీడన్= ఒక మఱ్ఱిచెట్టు నీడలో; చదికిలన్+పడియెన్= చతికిలపడ్డాడు.

తాత్పర్యం: వినయంగా చేతులు జోడించుకొని నమస్కరిస్తూ ఆయన ఎట్లా వెళ్ళితే అట్లా వెళ్ళుతూ పోగా పోగా ఆ సంవర్తుడు ఒక ఏకాంతమైన చోటికి వెళ్ళి, ఒక మఱ్ఱిచెట్టు నీడన చతికిలపడ్డాడు.

వ. డప్పి భావించుకొని యమ్మహాత్ముం డట్లు గూర్చుండుటయు. 49

తాత్పర్యం: దప్పి ఉన్నవాడివలె (భావిస్తూ) ఆ మహాత్ముడు అట్లా కూర్చుండగా. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. ఆ రాజు సేరి సాష్టాంగప్రణామంబు। సేసి నిల్చిన 'ననుఁ జెప్పి నిన్ను
ననఘ! పుత్తెంచిన యతని పే రెఱిఁగింపు। నిజమైన సిద్ధించు నీ మనోర
థంబు; బొంకగు నేనిఁ దల యేడు వ్రయ్యలై। పడు' దని యమ్ముని పలుకుటయును
నారదుఁ డెఱిఁగించె నాకు మి'మ్మని నిజ। మాడిన సంవర్తుఁ 'డాతఁ డెచట

తే. నేమి తెఱంగున నున్నవాఁ డెఱుంగవలయుఁ। జెప్పు' మనుడు 'మీ తెఱఁగెల్లఁ జెప్పి నన్ను
నిందుఁ బుత్తెంచు నపుడ యయ్యీడ్యధర్మ। పరుఁడు సొదఁ జొచ్చె' నని చెప్పి నరవరుండు. 50

ప్రతిపదార్థం: ఆ+రాజు= ఆ మరుత్తుడు; అపుడు; చేరి= సంవర్తుడిని సమీపించి; సాష్టాంగ ప్రణామంబు+చేసి= ఎనిమిది అవయవాలు పుడమి సోకేటట్లు నమస్కారంచేసి; నిల్చినన్= నిలువగా; అనఘ!= ఓ పుణ్యాత్మా!; ననున్+చెప్పి= నన్ను గురించి చెప్పి; నిన్నున్+పుత్తెంచిన+అతని పేరు= నిన్ను పంపిన అతడి పేరు; ఎఱిఁగింపు(ము)= చెప్పుము; నిజమైనన్= నీవు చెప్పేది నిజమైతే; నీ మనోరథంబు= నీ కోరిక; సిద్ధించున్= నెరవేరుతుంది; బొంకు+అగున్+ఏని= అబద్ధమైతే; తల+ఏడు+వ్రయ్యలై+పడుదు(వు)+అని= తల ఏడు ముక్కలై చనిపోతావు అని; ఆ+ముని= ఆ ముని; పలుకుటయును= పలుకగా; నాకున్= నాకు; మిమ్మున్= మిమ్ములను గురించి; నారదుండు= నారదమహర్షి; ఎఱిఁగించెన్+అని= తెలిపాడని; సంవర్తుఁడు; నిజము+ఆడినన్= నిజం చెప్పగా; అతఁడు= ఆ నారదుడు; ఎచటన్+ఏమి+తెఱఁగునన్+ఉన్నవాఁడు?= ఎక్కడ ఏం చేస్తున్నాడు?; ఎఱుఁగన్ వలయున్= తెలిసికొనాలి; చెప్పుము+అనుచున్= చెప్పుమనగా; మీ తెఱఁగు+ఎల్లన్+చెప్పి= మీ వైనాన్ని గురించి అంతా చెప్పి; నన్నున్+ఇందున్+పుత్తెంచు+అపుడ= నన్ను ఇక్కడికి పంపించేటప్పుడే; ఆ+ఈడ్య+ధర్మపరుఁడు= పొగడదగిన ధర్మ నిష్ఠుడైన ఆ నారదుడు; సొదన్+చొచ్చెన్= చితిలో ప్రవేశించాడు; అని; నరవరుండు= ఆ రాజు; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: ఆ సంవర్తుడు అట్లా కూర్చోగానే మరుత్తుడు అతడిని సమీపించి నమస్కరించి నిలిచాడు. 'మహాత్మా! నన్ను గురించి చెప్పి నిన్ను పంపించిన వారెవరో చెప్పుము. నీవు చెప్పేది నిజమైతే నీ కోరిక నెరవేరుతుంది. అబద్ధమైతే తల ఏడు ముక్కలై చస్తావు' అని సంవర్తు డన్నాడు. దానికి ఆ రాజు 'అయ్యా! మిమ్ములను గురించి నారద మహర్షి నాకు తెలిపాడు' అని నిజం చెప్పాడు. 'అయితే అతడు ఇప్పుడు ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు? తెలిసికొనాలి చెప్పుము' అని సంవర్తుడు అడిగాడు. 'స్వామీ! మీ వైనమంతా నాకు చెప్పి నన్ను ఇక్కడికి పంపిస్తున్న సమయంలోనే ఆ మహర్షి చితి పేర్చి అందులోకి ప్రవేశించాడు' అని మరుత్తుడు (నారదుడు ఎట్లా చెప్పాడో అట్లాగే) చెప్పాడు.

విశేషం: ఈ సందర్భాన్ని కేవలం సాంకేతికంగా అర్థం చేసికొంటేనేగాని 'ఇతిహాసం' ఎన్ని లోతులకు పోయి అధ్యాత్మికరహస్యాలను వ్యాఖ్యానించిందో పట్టుకొనలేము.

నారదుడు మహర్షి. సంవర్తుడు అవధూత. సంవర్త శబ్దానికి అర్థం 'తిరిగి వచ్చినవాడు' అని. దేనినుండి? - అన్ని ఇంద్రియ సుఖాలనుండీ, భోగం నుండీ, పదవీవ్యామోహం నుండీ, చివరికి మృత్యువునుండీ అని అర్థాలు చెప్పాలి. అందుకే శవాన్ని చూడగానే 'పారిపోతాడు గుర్తుంచుకో' అని నారదుడు సూచన చేశాడు. అంటే 'మృత్యువెరుగ' డని అర్థం. అట్లాగే అతడికి 'ఇంద్రియలోలత్వం' లేదన్న సారాంశమే నారదుడి 'అగ్నిప్రవేశం'లో ఉన్నది.

'అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్' అన్నారు వేదంలో, అగ్ని వాక్కురూపాన్ని పొందిందని, శుచిమంతుడు అగ్నిరూపంలో ఉంటాడని అర్థం. కాబట్టి నారద - సంవర్తుల నడుమ రహస్యంగా జరిగిన 'సాంకేతిక భావ ప్రకటన' ఈ సంఘటనలో ఉన్నది. నిజంగా నారదుడు అగ్ని ప్రవేశం చేశాడని కాదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. చెప్పిన నప్పరమముని యప్పుడమితేని యాననం బాలోకించి, 51

ప్రతిపదార్థం : చెప్పినన్; ఆ+పరమముని= ఆ గొప్ప ఋషి; ఆ+పుడమితేని= ఆ రాజుయొక్క; ఆననంబు= ముఖాన్ని; ఆలోకించి=చూచి.

తాత్పర్యం: మరుత్తుడు అట్లా చెప్పగా ఆ ఋషిశ్రేష్ఠుడు ఆ రాజును చూచి ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతోఅన్వయం)

క. 'ననుఁ గానఁగ నీ వచ్చిన। పని యెయ్యది?' యనిన నృపతి 'నా యజ్ఞం
బునకుఁ గృప మీర లుపద। ర్శనముం జేయంగ వలయు సంయమినాథా! 52

ప్రతిపదార్థం: ననున్+కానఁగన్= నన్ను చూడటానికి; నీ+వచ్చిన= నీవు వచ్చిన; పని+ఏ+అది?= పని ఏమిటి?; అనినన్= అనగా; నృపతి= రాజు; సంయమినాథా!= ఋషిశ్రేష్ఠుడా!; నా యజ్ఞంబునకున్= నేను చేయబోతున్న యజ్ఞానికి; మీరలు= మీరు; ఉపదర్శనమున్+చేయఁగన్+వలయున్= ఉపద్రష్టగా వ్యవహరించాలి.

తాత్పర్యం: 'నన్ను చూడటానికి నీవు వచ్చిన పని ఏమిటి?' అని సంవర్తుడు అడిగాడు. దానికి ఆ రాజు 'ఓ ఋషిశ్రేష్ఠుడా! నేను చేయబోయే యజ్ఞానికి మీరు ఉపదర్శనం చేయాలి' అంటూ ఇంకా ఇట్లా అన్నాడు.

వ. U#° =°~î` త్తుఁ డనువాఁడ భవదీయజనకుం డుపాధ్యాయుండు గాఁ గ్రతుకర్తయైన కరంధముని పౌత్రుండ' ననుటయు సంవర్తుండు సంప్రీతి నాతనితో 'నీవు నీ కార్యంబు నాకుం జెప్పితి; నా తెఱంగు వినుము; మా యన్న యగు బృహస్పతి దన తపోబలంబున నన్ను నవమానించిన మదీయ గృహధనాది వస్తువు లెల్లను విడిచి యిట్లు దిరిగెద; నను బోఁటి పేద నీ కుపద్రష్ట యైన నయ్యెడు పెంపునుం గలదె? యమ్మహాత్ము నీవు వరియింపు మట్లుగాక యేన కావలయు నను తలంపు గలదేని. 53

ప్రతిపదార్థం: ఏను= నేను; మరుత్తుండు+అనువాఁడన్= మరుత్తుడు అనే వాడను; భవదీయజనకుండు= మీ తండ్రి అంగిరసుడు; ఉపాధ్యాయుండుగాన్= ఉపద్రష్టగా; క్రతుకర్త+ఐన= క్రతువులు చేసిన; కరంధముని= కరంధముడియొక్క; పౌత్రుండను= మనుమడిని; అనుటయున్= అనగా; సంవర్తుండు; సంప్రీతిన్= ప్రేమతో; అతనితోన్; నీవు నీ కార్యంబు= నీవు నీ పనిని; నాకున్+చెప్పితి(వి)= నాకు చెప్పావు; నా తెఱంగు+వినుము= నా విషయం వినుము; మా+అన్న+అగు= మా అన్న అయిన; బృహస్పతి; తన తపోబలంబునన్= తన తపశ్శక్తి ప్రభావంతో; నన్నున్= నన్ను; అవమానించినన్= అవమానపరిస్తే; మదీయ= నా; గృహధనాది వస్తువులు+ఎల్లనున్= గృహం, ధనం, వస్తువులు మొదలైన వాటి నన్నిటినీ; విడిచి= వదలి; ఇట్లు+తిరిగెదన్= ఇట్లా తిరుగుతున్నాను; నను+బోఁటి= నా వంటి; పేద= నిరుపేద; నీకు+ఉపద్రష్ట ఐనన్= నీకు ఉపదర్శనం చేయిస్తే; అయ్యెడు పెంపునున్+కలదె?= ఒరిగే వైభవం ఏమిటి?; ఆ+మహాత్మున్= పెద్దవాడైన ఆ బృహస్పతిని; నీవు; వరియింపుము= వరించుము; అట్లుగాక= అట్లా కాకుండా; ఏను+అ= నేనే; కావలయున్+అను తలంపు+కలదు+ఏని= కావాలి అని ఆలోచన ఉంటే.

తాత్పర్యం: 'నా పేరు మరుత్తుడు. మీ తండ్రి అంగిరసుడు ఉపద్రష్టగా వ్యవహరించగా చాలా క్రతువులు చేసిన కరంధముడి మనుమడిని,' అని చెప్పగా సంవర్తుడు అభిమానంతో మరుత్తుడిని చూచి ఇట్లా అన్నాడు 'రాజా! నీ పనిని నీవు చెప్పావు. ఇక నా విషయం వినుము. మా అన్న బృహస్పతి తన తపోబలంతో నన్ను అవమానపరిచాడు. అందుచేత నా ఇంటిని, ధనాన్ని, వస్తుసముదాయాన్ని అంతటినీ వదలివేసి ఇట్లా తిరుగుతున్నాను. నా వంటి నిరుపేద నీకు ఉపద్రష్టగా ఉంటే నీకు ఒరిగే వైభవం ఏమిటి? పెద్దవాడైన ఆయననే కోరుకొనుము. అట్లా కాకుండా నేనే కావాలి అని నీకు మనసులో ఉంటే (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. అన్న నాకు మాన్యుఁ డాతండు వనుపంగ। నాచరింతు నీదు యాగమునకు
నొజ్జతనము వేగ మర్వీశ! యగ్గురుఁ। గని యనుజ్ఞ వడయు' మనిన విభుఁడు. 54

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ= రాజా!; అన్న= బృహస్పతి; నాకున్+మాన్యుఁడు= నేను గౌరవింపదగినవాడు; అతండు= అతడు; పనుపంగన్+అనుమతిస్తే; నీదు యాగమునకున్= నీ యజ్ఞానికి; ఒజ్జతనమున్= ఉపాధ్యాయత్వాన్ని; ఆచరింతున్= నిర్వహిస్తాను; వేగము+అ= వెంటనే; అ+గురున్+కని= ఆ దేవగురువును చూచి; అనుజ్ఞ+పడయుము= అనుమతి పొందుము; అనినన్= అని చెప్పగా; విభుఁడు= ఆ రాజు.

తాత్పర్యం: రాజా! మా అన్నగారు గౌరవార్హుడు. అతడు అనుమతిస్తేనే నేను నీ యాగానికి ఉపద్రష్టగా ఉండగలను. కనుక వెంటనే మా అన్నను చూచి ప్రార్థించి అనుమతి సంపాదించుము' అని సంవర్తుడు అన్నాడు. అప్పుడు ఆ రాజు (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. 'ఆతని కడకు ము న్నరిగితిఁ గృప పుట్టఁ। బలికితి; నతఁడు నా పలుకు సరకు
గొనక యమర్త్యయాజనము ననుష్ఠించు। నేను మర్త్యుని యొజ్జ నేల యగుదు?
ననియె నాతోడి యీసున వాసవుఁడు గురు। నుడిపిన కతమునఁ గడఁగి గురుఁడు
నను ధిక్కరించె నింకనఘ! యందేమని। పోదు? మీ మాహాత్మ్యమునను వాస

ఆ. వుని నతిక్రమింతు వని నమ్మి యున్నాఁడ;। గైకొనంగవలయుఁ గరుణ వెలయ'
ననిన మునియు 'నట్ల యయ్యెడుఁగా కని। పలికె మఱియు నా నృపాలుతోడ. 55

ప్రతిపదార్థం: అతని కడకున్= అతడి వద్దకు; మున్ను+అరిగితిన్= ముందు వెళ్ళాను; కృప పుట్టన్+పలికితిన్= దయ కలిగేటట్లు మాటాడాను; అతఁడు= ఆ బృహస్పతి; నా పలుకున్= నా మాటను; సరకుగొనక= లెక్కచేయక; అమర్త్య= దేవతలయొక్క; యాజనమున్= యజ్ఞ కార్య నిర్వహణం; అనుష్ఠించు= ఆచరించే; నేను; మర్త్యుని= మానవుడి; ఒజ్జన్= ఉపాధ్యాయుడిగా; ఏల+అగుదున్?= ఎట్లా అవుతాను?; అనియెన్= అన్నాడు; నా తోడి+ఈసునన్= నాపైన అసూయతో; వాసవుఁడు= ఇంద్రుడు; గురున్= బృహస్పతిని; ఉడిపిన కతమునన్= ఆపివేసినందువలన; కడఁగి= పూని; గురుఁడు= ఆ బృహస్పతి; ననున్+ధిక్కరించెన్= నన్ను ఎదిరించి మాటాడాడు; ఇంకన్= ఇక; అందున్+ఏమని+పోదున్?= ఆ స్వర్గానికి ఏమని వెళ్ళను?; మీ మాహాత్మ్యమునను= మీ తపఃప్రభావంతో; వాసవునిన్+అతిక్రమింతువు+అని= ఇంద్రుడిని మీరి వ్యవహరించగలవని; నమ్మి+ఉన్నాఁడన్= నమ్మి ఉన్నాను; అనఘ!= ఓ పుణ్యాత్మా!; కరుణ వెలయన్= కరుణతో; కైకొనంగన్+వలయున్= ఉపాధ్యాయత్వాన్ని తప్పక తీసికొనాలి; అనినన్= అనగా; మునియున్= సంవర్తుడు కూడా; అట్లు+అయ్యెడున్+కాక+అని= అట్లాగే కానిమ్ము అని; ఆ నృపాలుతోడన్= ఆ రాజుతో; పలికెన్= అన్నాడు; మఱియున్.

తాత్పర్యం: 'స్వామీ! నేను ముందే బృహస్పతివద్దకు వెళ్ళి, అతడికి దయపుట్టేటట్లుగా ఎంతో వినయంగా మాటాడాను. అయినా అతడు నా మాటలు లెక్క చేయలేదు. దేవతల యజ్ఞాలను జరిపించే తాను మానవుల కుపాధ్యాయుడిగా ఎట్లా ఉండటం? అన్నాడు. నాపైన అసూయతో బృహస్పతిని ఇంద్రుడు ఆపివేయటంవలన బృహస్పతి నన్ను అట్లా ఎదిరించి మాటాడాడు. ఇక మరల అక్కడికి ఏమని వెళ్ళను? మీ తపఃప్రభావంతో ఇంద్రుడిని అతిక్రమించగలరని నమ్మకంతో నేను ఉన్నాను. ఓ పుణ్యాత్మా! కరుణతో ఉపాధ్యాయత్వాన్ని తప్పక మీరు స్వీకరించాలి' అని ఆ రాజు కోరగా సంవర్తుడు ఆ రాజుతో 'అట్లాగే కానిమ్ము' అంటూ ఇంకా ఇట్లా అన్నాడు.

తే. 'అయ్యెడుం గాక యిపుడు నీ' కనుచు 'నీవు। సంచలించిన యప్పుడు శాప మిత్తు
నీకుఁ గీడును బాటిల్లు నింత దలఁచి। సుస్థిరుండవు గావలె సుజనవర్య! 56

ప్రతిపదార్థం: ఇపుడు= ఇప్పటికి; నీకున్+అయ్యెడున్+కాక= నీవు కోరినట్లే అవుతుంది గాక; అనుచున్= అంటూ; సుజనవర్య!= మంచివారిలో శ్రేష్ఠుడవైన ఓ రాజా!; సంచలించిన+అప్పుడు= నీవు యజ్ఞదీక్షనుండి కదలితే అప్పుడు; శాపము+ఇత్తున్= శాపం ఇస్తాను; నీకున్+కీడునున్+పాటిల్లున్ నీకు దానివలన కీడు కూడా కలుగుతుంది; ఇంత+తలఁచి= దీనినంతా ఆలోచించి; సుస్థిరుండవు+ కావలెన్= నీవు స్థిరచిత్తుడుగా యజ్ఞదీక్ష నిర్వహించాలి.

తాత్పర్యం: 'రాజా! ఇప్పటికి నీవు కోరినట్లే అవుతుంది పొమ్ము. కాని, నీవు ఎప్పుడు యజ్ఞదీక్షనుండి కదలుతావో అపుడు శాపం పెట్టుతాను. దానివలన నీకు కీడు కలుగుతుంది. ఇదంతా ఆలోచించి నీవు స్థిరచిత్తంతో యజ్ఞదీక్ష నిర్వహించాలి జాగ్రత్త!

వ. ఏను నీ యధ్వరంబున కుపదర్శనంబు సేయుచుండ నద్దివస్పతియు బృహస్పతియుఁ బ్రద్వేషించి రోషంబు వాటింతురు; దానికి నులికి నీవు సంచలించిన మదీయ శాపంబునం గీడు వచ్చు; నింత దలంచి సుస్థిర నిశ్చయుండవు గావలయు విచారించుకొ' మ్మనిన నమ్మహనీయుతో నమ్మహీనాథుండు. 57

ప్రతిపదార్థం: ఏను= నేను; నీ+అధ్వరంబునకున్= నీ యాగానికి; ఉపదర్శనంబు చేయుచుండన్= ఉపద్రష్టగా వ్యవరిస్తున్నప్పుడు; ఆ+దివస్పతియున్= ఆ స్వర్గాధిపతి ఇంద్రుడూ; బృహస్పతియున్= ఆ దేవ గురువు బృహస్పతీ; ప్రద్వేషించి; నన్ను మిక్కిలిగా ద్వేషించి; రోషంబు+పాటింతురు= కోపం పూనుతారు; దానికిన్= దానికి; ఉలికి= భయపడి; నీవు; సంచలించినన్= భయపడి దీక్షను విరమిస్తే; మదీయ శాపంబునన్= నా శాపంవలన; కీడు వచ్చున్= కీడు కలుగుతుంది; ఇంత+తలంచి= ఇదంతా ఆలోచించి; సుస్థిర నిశ్చయుండవు+కావలయున్= గట్టి నిర్ణయం కలిగినవాడవు కావాలి. విచారించుకొమ్ము+అనినన్= బాగా ఆలోచించుకొనుము - అనగా; ఆ+మహనీయుతోన్= ఆ మహానుభావుడితో; ఆ+మహీనాథుండు= ఆ భూపతి (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: నేను నీ యాగం నడిపిస్తుంటే ఇంద్రుడు, బృహస్పతి నా మీద కోపగించుకొని, నీ యజ్ఞానికి ఎన్నో ఆటంకాలు కలిగించవచ్చును. దానికి భయపడి యజ్ఞం విరమించుకొంటే నేను నిన్ను శపిస్తాను. దానివలన కీడు జరుగవచ్చును. ఇదంతా ముందుగా ఆలోచించి సుస్థిరమైన నిశ్చయం కలిగి దీక్ష తీసికొనుము. బాగా ఆలోచించుకొనుము' అని ఆ మహర్షి చెప్పగా రాజు (తరువాతి పద్యంతో అన్వయం.)

(సంవర్తుండు మరుత్తుని యజ్ఞమున కుపద్రష్ట యగుట (సం.14-7-23))

సీ. 'నీ కృపగాంచితి నాకు నింకొండు వి। చారంబు లేటికి? సంయమీంద్ర!
యా దివస్పతియు బృహస్పతియును నేల?। పశుపతి విద్వేషపరతఁ గలఁచె
నేనియుఁ గలఁగుదునే?' యని పలికి 'మీ। సంగతి వాసిన సరసిజాప్త
చంద్రతారకకులాచలములు గల యంత। కాలంబుఁ బుణ్యలోకములు లేక

తే. పోవు' నని శపథము శుద్ధభావవృత్తిఁ। బలుకుటయు, మెచ్చి యమ్మునిపతి 'మహీంద్రు
కంటె నిను ధనవంతునిగా నొనర్చి। క్రతువు నడపుదు' నని చెప్పె ప్రమద మెసఁగ. 58

ప్రతిపదార్థం: సంయమి+ఇంద్ర!= ఋషిశ్రేష్ఠుడా!; నీ కృప+కాంచితిన్= నీ దయను పొందాను; నాకున్+ఇంకన్+ఒండు= నాకు ఇంకవేరే విచారంబులు+ఏటికిన్= ఆలోచనలు ఎందుకు?; ఆ దివస్పతియున్= ఆ ఇంద్రుడూ; ఆ+బృహస్పతియున్= ఆ బృహస్పతీ; ఏల?= మాత్రమే ఏమిటి?; పశుపతి= ఆ ఈశ్వరుడే; విద్వేషపరతన్= శత్రుత్వంతో; కలఁచెన్+ఏనియున్= నన్ను బాధించినా; కలఁగుదునే?= బాధపడి భయపడతానా?; అని పలికి; మీ సంగతి+పాసినన్= మీతో స్నేహాన్ని పోగొట్టుకుంటే; సరసిజ+ఆప్త= సూర్యుడు; చంద్ర= చంద్రుడు; తారక= నక్షత్రాలు; కుల+అచలములు+కల+అంత+కాలంబున్= సప్తకులపర్వతాలు ఉన్నంత కాలమూ; పుణ్యలోకములు= పుణ్యలోకాల ప్రాప్తి; లేకపోవును+అని= లేకపోతాయి అని; శుద్ధభావవృత్తిన్= పరిశుద్ధమైన మనోనిశ్చయంతో; పలుకుటయున్= చెప్పగా; ఆ+మునిపతి= ఆ ఋషిశ్రేష్ఠుడు; మెచ్చి= మెచ్చుకొని, నినున్+మహేంద్రుకంటెన్= నిన్ను ఇంద్రుడికంటె; ధనవంతునిగాన్+ఒనర్చి= ధనవంతుడిగా చేసి; క్రతువు నడపుదున్+అని= క్రతువు నడిపిస్తానని; ప్రమదము+ఎసఁగన్+చెప్పి= సంతోషం పుట్టేటట్లు చెప్పి.

తాత్పర్యం: 'ఋషిశ్రేష్ఠుడా! నీ దయను పొందాక నాకు మరో ఆలోచన ఎందుకు? ఆ ఇంద్రబృహస్పతులే కాదు, సాక్షాత్తు ఆ పరమేశ్వరుడే కోపగించుకొని అడ్డుపెట్టినా భయపడతానా? మీతో స్నేహం పోగొట్టుకొనటం జరిగితే సూర్య, చంద్ర, తారక కులపర్వతా లున్నంత కాలమూ నాకు పుణ్యగతులు కలుగుతాయా?' అని పరిశుద్ధమైన మనోనిశ్చయంతో మరుత్తుడు పలికాడు. ఆ మాటలు విని, మునిశ్రేష్ఠుడైన సంవర్తుడు మెచ్చుకొన్నవాడై '(రాజా! నిన్ను ఇంద్రుడికంటె ధనవంతుడిగా చేసి యజ్ఞం నడిపిస్తా నని సంతోషం కలిగేటట్లు చెప్పి సప్తకులపర్వతములు:- 1.మహేంద్రము, 2.మలయము. 3.సహ్యము, 4.శక్తిమంతము, 5. గంధమాదనము; 6.వింధ్యము,7.పారియాత్రము. చెప్పి. (తరువాతి వచనంతో అన్వయం)

వ. మఱియు నిట్లను 'నెత్తెఱంగున నేను ధనవంతుండ నగుదు నంటేని వినుము. హిమవంతంబు నుత్తర భాగంబున ముంజవంతంబను పర్వతంబుగల దందు శివుండు శివాసహాయుండై సురసిద్ధ గరుడగంధర్వాది సమస్త భూత జాలంబు సేవింప విహరించుచుండు. 59

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఇట్లు+అనున్= ఇట్లా అంటాడు; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; నేను; ధనవంతుండన్+అగుదున్+అంటేని= నేను ఎట్లా ధనవంతుడిని అవుతాను అని అంటావా!; వినుము; హిమవంతంబు+ఉత్తరభాగంబునన్= హిమలయాలకు ఉత్తర భాగంలో; ముంజవంతంబు+అను= ముంజపంత మనే; పర్వతంబు కలదు= పర్వతం ఉన్నది; అందున్= ఆ చోట; శివుండు= శివుడు; శివా సహాయుండు+ఐ= పార్వతీదేవితో కూడి; సుర= దేవతలచేత; సిద్ధ= సిద్ధులచేత; గరుడ= గరుడులచేత; గంధర్వ+ఆది= సమస్త భూత జాలంబు= గంధర్వులు మొదలైన సమస్త భూత సమూహాలూ; సేవింపన్= సేవిస్తుండగా; విహరించుచున్+ఉండున్= విహరిస్తూ ఉంటాడు.

తాత్పర్యం: ఇంకా ఇట్లా అన్నాడు. 'ఏ విధంగా నేను ధనవంతుడిని కాగలను?' అని నీవు అంటావా! అయితే వినుము. హిమాలయాలకు ఉత్తరభాగంలో ముంజవంత మనే పర్వతం ఉన్నది. అక్కడ శివుడు పార్వతితో కూడి దేవతలు, సిద్ధులు, గరుడులు, గంధర్వులు మొదలైన సమస్తభూతాలచేత సేవించబడుతూ విహరిస్తుంటాడు.

క. మరణజరారోగము ల। గ్గిరి యే డిరవులను లే వఖిల గుల్మలతా
తరువులఁ గుసుమఫలంబులు। గర మొప్పచునుండు నెల్లకాలము లందున్. 60

ప్రతిపదార్థం: ఆ+గిరి+ఏడు+ఇరవులను= ఆ కొండలోని ఏడు దిక్కులలోనూ; మరణ= మరణం; జరా రోగములు= ముసలితనం, రోగాలు; లేవు= ఎక్కడా కనిపించవు; అఖిల= అన్ని విధాలైన; గుల్మ= పొదలు; లతాతరువులన్= తీగలలోను, చెట్లలోను;

ఎల్లకాలములందున్= అన్ని కాలాలలోను; కుసుమ ఫలంబులు= పూలు; పండ్లు; కరము= మిక్కిలిగా; ఒప్పుచున్+ఉండున్= ప్రకాశిస్తూ ఉంటాయి.

తాత్పర్యం: ఆ కొండలో ఎక్కడా జరారోగమరణాలు లేవు. అన్ని ఋతువులలోనూ పొదలలో, తీగలలో, చెట్లలో పూలు, పండ్లు సమృద్ధిగా కనిపిస్తాయి.

విశేషం : ముంజపర్వతం ఉత్తరదిశలో ఉన్నది. కనుక తక్కిన ఏడు దిక్కులనూ ప్రస్తావించారని అర్థం. అంటే 'ఎక్కడా లేదని' అర్థం చూ. పద్యం 76

తే. ఆ నగంబు పార్శ్వంబుల నరుణకిరణ। రుచివితావితానంబు ననుకరించుచు వెలుంగు
శుద్ధకాంచనమయ శిలాస్థూలవాలు। కాప్రభాజాల మాశ్చర్యకారి యగుచు. 61

ప్రతిపదార్థం: ఆ నగంబు= ఆ కొండయొక్క; పార్శ్వంబులన్= ప్రక్కలలో; అరుణకిరణ= సూర్యుడి (ఎర్రటి కిరణాలు కలిగిన); రుచివితానంబున్= కాంతి సమూహాన్ని; అనుకరించుచున్= పోలి; ఆశ్చర్యకారి+అగుచున్= ఆశ్చర్యం కలిగిస్తూ; శుద్ధకాంచనమయ= మేలిమి బంగారుతో నిండిన; శిలా= రాళ్ళతోనూ; స్థూలవాలుకా ప్రభాజాలము= పెద్ద ఇసుక రేణువుల కాంతి సముదాయం; వెలుంగున్= ప్రకాశిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: ఆ కొండ ప్రక్కల సూర్యకిరణాలను పోలిన బంగారు రాళ్ళు, బంగారు ఇసుక ఆశ్చర్యకరంగా ప్రకాశిస్తూ ఉంటాయి. (అది అంత గొప్ప దివ్యభూమి అని తాత్పర్యం).

వ. మన మయ్యెడకుం బోయి. 62

ప్రతిపదార్థం: మనము; ఆ+ఎడకున్= ఆ ప్రక్కకు; పోయి.

తాత్పర్యం: మనం ఆ ప్రాంతానికి వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. శ్రీకంఠు రుద్రుని శివుఁ బూషదంతఘ్ను। హరునిఁ గపర్ది శంకరుని నంత
కాంతకు వరదుని నాదిదేవునిఁ ద్రిలో। చను సహస్రాక్షుని శాంతమూర్తిఁ
జీరవాసుని ధన్వి సిద్ధు దండధరు మృ। గవ్యాధు నుష్ణీషిఁ గనకబాహుఁ
బశుపతి వృషు భూతపతి మాతృభక్తుని। నజు నగ్నివక్త్రుని నభవు భవుని

ఆ. భక్తిఁ బ్రస్తుతించి ప్రణతులఁ దేల్చి త। త్కరుణ వడసి పసిఁడి ద్రవ్వి తండ
ములు నృపాల! పెక్కుమోపులు దెత్తము। రమ్ము భారవహులఁ దెమ్ము చాల.' 63

ప్రతిపదార్థం: శ్రీకంఠున్= విషకంఠుడిని; రుద్రున్= రుదం రోదనం ద్రావయతీతి- రుద్రః. రోదనమును బాఱఁద్రోలువాఁడు; రోదించే (శబ్దించే) వాడిని; శివున్= శుభం కూర్చేవాడిని; పూషదంతఘ్నున్= సూర్యుడి దంతా లూడగొట్టిన వాడిని; హరునిన్= సకలాన్ని హరించేవాడిని; కపర్దిన్= పెద్ద జటాజూటం కలవాడిని; శంకరునిన్= శుభకారకుడిని ('శం' అంటే శుభం); అంతక+అంతకున్= యముడికి యముడివంటివాడిని (మృత్యుంజయుడని అర్థం); వరదునిన్= కోరిన వరాలు ఇచ్చేవాడిని; ఆదిదేవునిన్= దేవతలలో

మొదటివాడిని; త్రిలోచనున్= మూడు కన్నులు కలవాడిని; సహస్రాక్షునిన్= వేయి కన్నులు కలవాడిని; శాంతమూర్తిన్= పరమశాంత స్వరూపుడిని; చీరవాసునిన్= ఏనుగు చర్మాన్ని ధరించినవాడిని; ధన్విన్= పినాకమనే ధనుస్సును ధరించినవాడిని; సిద్ధున్= సిద్ధసమాధి నిష్ఠుడిని; దండధరున్= దండాన్ని ధరించినవాడిని; మృగవ్యాధున్= వేటలాడేవానిని; ఉష్ణీషిన్= తలపాగా ధరించినవాడిని; కనకబాహున్= బంగారు బాహువులు కలవాడిని; పశుపతిన్= పశువులకు- ప్రాణులకు పతిని; వృషున్= వర్షించేవాడిని; భూతపతిన్= సర్వభూతపతిని; మాతృభక్తునిన్= మాతకు భక్తుడైన వానిని; అజున్= పుట్టుకలేనివానిని; అగ్నివక్త్రునిన్= అగ్ని ముఖంలో కలవాడిని; అభవున్= పుట్టుకలేనివానిని; భవునిన్= స్వయంగా జన్మించినవాడిని (అట్లాంటి మహాశివుడిని); (మనం చూచి); నృపాల!= ఓ రాజా!; భక్తిన్= భక్తితో; ప్రస్తుతించి= స్తోత్రాలు చేసి; ప్రణతులన్+తేల్చి= నమస్కారాలతో తృప్తి కలిగించి; తద్+కరుణ+పడసి= ఆయన కరుణ పొంది; పసిఁడి= బంగారును; త్రవ్వి తండములు= సమృద్ధిగా; పెక్కు మోవులు+తెత్తము= చాలా పెద్ద పెద్ద మూటలుగా కట్టి మోయించుకొని తీసికొని వద్దాము. రమ్మి= రమ్ము; బయలుదేరుము; చాల= చాలమంది; భారవహులన్= బరువులు మోసే పనివారిని; తెమ్మి= వెంట పిలుచుకొని రమ్ము.

తాత్పర్యం: 'రాజా! అట్లాంటి చోట మన మిద్దరం వెళ్ళి - విషకంఠుడు, రుద్రుడు, శివుడు, పూషదంతఘ్నుడు, హరుడు, కపర్ది, శంకరుడు, అంతకాంతకుడు, వరదుడు, ఆదిదేవుడు, త్రిలోచనుడు, సహస్రాక్షుడు, శాంతమూర్తి, చీరవాసుడు, ధన్వి, సిద్ధుడు, దండధరుడు, మృగవ్యాధుడు, ఉష్ణీషుడు, కనకబాహుడు, పశుపతి, వృషుడు, భూతపతి, మాతృభక్తుడు, అజుడు, అగ్నివక్త్రుడు, అభవుడు, భవుడు అయిన ఆ మహేశ్వరుడిని వివిధరీతులలో ప్రస్తుతించి, నమస్కారాలతో తృప్తి కలిగించి, ఆయన దయను సంపాదించి, అక్కడున్న బంగారును కోకొల్లలుగా పెద్దపెద్ద మూటలు కట్టించి మోయించుకొని వద్దాము, బయలుదేరుము. బరువులు మోసేవారిని దండిగా పిలుచుకొని రమ్ము!' అన్నాడు.

విశేషం: ఈ పద్యంలో ఒక గొప్ప శిల్పాన్ని తిక్కనగారు నిక్షిప్తం చేశారు. శివుడిని ఏయే పేర్లతో స్తుతించాలో ఆయా పేర్లను ఇక్కడ చెప్పి, తరువాతి పద్యంలో శివుని కరుణను పొందారు - అని చెప్పటంవలన ఈ పేర్లతో శివుడిని స్తుతించారన్న అర్థం వస్తోంది. ఈ రహస్యం మనం అర్థం చేసికొంటేనే తిక్కనగారు నాటకీయంగా ఇంత మహారచనను ఎట్లా చేశారో గుర్తించగలుగుతాం.

ఇక ఈ పద్యంలోని శివస్తుతులలో ఎన్నో పురాణాల కథలు దాగి ఉన్నాయి. 'కాలకూట భరణజా శ్రీః శోభా కంఠే యస్య సః శ్రీకంఠః' అని అమరకోశకారుడు అర్థం చెప్పాడు. కాలకూట విషాన్ని త్రాగటంవలన వచ్చిన నల్లదనం శోభ, దానివలన శోభించిన కంఠం కలిగినవాడు శ్రీకంఠుడు (శితికంఠుడని కూడా).

శివుఁడు - అంటే శుభాలు కూర్చేవాడని, బ్రహ్మానందస్వరూపుడు కాబట్టి నిర్వికారుడుగా సదా శమరూపంలో స్థిరంగా ఉండే వాడని 'శివు' డన్నారు. అదే 'శుభం' కాబట్టి అట్లా ఆయన 'శుభమూర్తి' అయ్యా డన్నమాట.

ప్రళయకాలంలో సర్వాన్నీ హరిస్తాడు కాబట్టి హరుడు. భక్తుల ఆపదలను హరిస్తాడు కాబట్టి హరుడు. 'హరి' శబ్దానికి యముడు, వాయువు, ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు, సింహం, కిరణం, గుర్రం, చిలుక, పాము, కోతి, కప్ప అనే అర్థాలతో పాటు 'విష్ణువు' అనే అర్థం కూడా ఉన్నది. స్థితికారుడు 'హరి'. లయకారుడు 'హరుడు'. ఈయనకూడా భక్తుల పాపాలు హరించేవాడే. సంస్కృతంలో శబ్దాలు చాలా చిత్రమైన 'శబ్దశక్తి' కలిగినవి. హరిహరాద్వైతానికి మంచి నిదర్శనం హరిహర రూపం.

కపర్ది - శివుడి జటాజూటానికి కపర్దమని పేరు. సుఖం నిండించేదని 'కపర్ద' శబ్దానికి అర్థం చెప్పుతారు. కపర్దము కలిగినవాడు 'కపర్ది' అని. గంగను తన జటాజూటంలో బంధించి లోకానికి అపకారం జరుగకుండా చేశాడు. అట్లా 'కపర్ది' లోకాన్ని రక్షించాడు.

శంకరుఁడు - 'శం' అంటే సుఖం. సుఖరూపి అని, సుఖాన్ని ఇచ్చేవాడని రెండర్థాలు ఉన్నాయి.

అంతకాంతకుడు - అంతకుడు 'యముడు'. అతడిని అంతంచేసినవాడు 'శివుడు'. ఎవరిని ఆశ్రయిస్తే మృత్యుభయం లేదో అతడు అంతకాంతకుడు. మార్కండేయుడి కథ ఇందుకు నిదర్శనం.

కోరిన వరాలు ఇస్తాడు కాబట్టి వరదుఁడు. మహాదేవుడని, ఆదిదేవుడని శివుడికే పేర్లు. తరువాతి దేవతలందరూ శివుడిని పూజించినట్లు పురాణాలు చెప్పుతాయి. సూర్యచంద్రాగ్నులు ఎవరికి 'కళ్ళు'గా ఉంటారో అతడు 'త్రిలోచనుడు' (కాలస్వరూపుడని అర్థం).

సహస్రాక్షుఁడు - పురుష స్వరూపుడు (చూ. పురుష సూక్తం) సహస్రాక్షతత్త్వం శివ, విష్ణు రూపాలలో వ్యక్తమయింది. అదే హరిహర రూపం. శాంతమూర్తి (శివుడనే పదం కింద చెప్పబడింది).

చీరవాసుఁడు - గజాసురుడిని చంపి, అతడి చర్మాన్ని చీరగా ధరించినవాడు;

ధన్వి - పినాకమనే ధనుస్సును ధరించి తారకాసుర సంహారం (కుమార రూపంలో) త్రిపురాసుర సంహారం (స్వరూపంలో) చేసినవాడు. యోగేశ్వరుడు కాబట్టి సిద్ధుడు. కాలదండాన్ని ధరించిన వాడు (యమస్వరూపుడు) కాబట్టి దండధరుడు. వేటాడటంలో ఆసక్తి ఉన్నవాడు (చూ. కిరాతార్జునీయ కథ) కాబట్టి మృగవ్యాధుడు. తలపాగా ధరించినవాడుగా ఉత్తరభారతంలో శివుడిని అర్చిస్తారు. (జటాజూటమే తలపాగా కావచ్చును). ప్రాణులందరూ పశువులు. కనుక పశుపతి. వరాలు వర్షిస్తాడు. కాబట్టి వృషుడు (వృషభరూపుడు - ధర్మస్వరూపుడు కాబట్టి); మాతృభక్తుడు - శివుడు అంబను అర్చించేటట్లుగా శక్తితంత్రం చెబుతుంది. (ఇక్కడ కూడా శివుడి శివాద్వైతం) అగ్ని వక్త్రుడు - అగ్నిముఖుడు (చూ. కుమార సంభవం కథ). అజుడు (బ్రహ్మ - పుట్టుకలేని వాడని) (అభవుడన్నా ఇంతే) భవుడు స్వయంగా పుట్టినవాడు.

క. అని పలికి యమ్మహాత్ముఁడు। గొని పోవఁగఁ బోయి శివు నకుంఠితకరుణన్
గనక మసంఖ్యము మోపులు। గొని వచ్చె నతండు మంచుకొండ యివులకున్. 64

ప్రతిపదార్థం : అని పలికి= అని చెప్పి; ఆ+మహాత్ముఁడు= ఆ సంవర్తుడు; కొనిపోవఁగన్= తీసికొని వెళ్ళగా; పోయి= (మరుత్తుడు) ముంజపర్వతానికి వెళ్ళి; శివు+అకుంఠిత కరుణన్= (అర్చించి అతడియొక్క) మొక్కవోని కరుణతో; కనకము= బంగారం; అసంఖ్యము= కొల్లలుగా; మోపులు+కొని= మూటలు కట్టించుకొని మోయించుకొని; అతండు= ఆ రాజు; మంచుకొండ+ఇవులకున్= మంచుకొండను దాటి బయటికి; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: అట్లా చెప్పి, ఆ సంవర్తుడు తనను వెంటతీసికొని వెళ్ళగా ఆ మరుత్తుడు ఆ పర్వతానికి వెళ్ళి, శివుడిని స్తుతించి (ఎట్లా స్తుతించాలో పయి పద్యంలోని శివపర్యాయనామాలలోనే ఉన్నది) అతడి దయను మిక్కిలిగా పొంది, బంగారురాసులను కోకొల్లలుగా మూటలు కట్టించి, బంగారు శిలలను మోపులు కట్టించుకొని, పనివారిచేత మోయించుకొని, మోయించుకొని, హిమాలయాలు దాటి నగరం చేరుకొన్నాడు.

వ. ఇట్లు మహాధనవంతుండై మరుత్తుండు సువర్ణమయంబులుగా యజ్ఞవాటంబును భాండప్రముఖసకల క్రియాసాధనంబులును శయ్యాసనాదులుం గావించుకొని తత్ప్రదేశంబున నతిమానుషంబగు విభవం బెసంగ యజనంబున కుపక్రమించుటయు, బృహస్పతి యంతయు నెఱింగి యంగంబు గృశంబై వెలరువాఱునట్టి వగం బొందిన సంక్రందనుండు సూచి యవ్వాచస్పతి కిట్లనియె. 65

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మహాధనవంతుఁడు+ఐ= మిక్కిలి ధనం కలవాడై; మరుత్తుండు; సువర్ణమయంబులుగాన్= బంగారుతో; నిర్మింపబడినవిగా; యజ్ఞవాటంబును= యజ్ఞవాటికను; భాండ ప్రముఖ సకల క్రియా సాధనంబులును= కుండలు మొదలైన యాగప్రక్రియకు కావలసిన పనిముట్లను; శయ్యాసనాదులున్= శయ్యలు; ఆసనాలు మొదలైనవాటినీ, కావించుకొని= చేయించుకొని; తద్+ప్రదేశంబునన్= ఆ యజ్ఞవాటికలో; అతి మానుషంబు+అగు= దివ్యమైన; విభవంబు+ఎసంగన్= వైభవం

అతిశయించగా; యజనంబునకున్= యజ్ఞానికి; ఉపక్రమించుటయున్= ప్రారంభించగా; బృహస్పతి; అంతయున్+ఎఱింగి= అంతా తెలిసికొని; అంగంబు+కృశంబు+ఐ= శరీరం చిక్కిపోయి; వెలరు+పాఱునట్టి= తెల్లబారిన (వెల వెలపోగా); వగన్+పొందినన్= శ్రమను పొందగా; సంక్రందనుండు= ఇంద్రుడు; చూచి= చూచినవాడై; ఆ+వాచస్పతికిన్= ఆ బృహస్పతికి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా మహాధనవంతుడై ఆ రాజు బంగారుతో యజ్ఞవాటికను, కుండలు మొదలైన యాగ సాధనాలను, శయ్యలను, ఆసనాలను తయారు చేయించుకొని, అక్కడ దివ్యమైన వైభవంతో యాగం ప్రారంభించగా బృహస్పతి అంతా తెలిసికొన్నాడు. అతడి శరీరం అవమానంతో చిక్కిపోయింది. వెలవెల పోయింది. దీనిని చూచి, ఇంద్రుడు ఆయనతో ఇట్లా అన్నాడు.

ఆ. 'తెలివు వొంది యున్నదియె నీదు చిత్తంబు? । సురల బ్రదుకుతెరువు లరసి నడపు
చున్నవాఁడవే! సముత్సాహమున వారు । నీకుఁ బ్రియ మొనర్చి నేర్చి మండ్రె?' 66

ప్రతిపదార్థం: నీదు చిత్తంబు= నీ మనస్సు; తెలివు= తెలివి; పొంది+ఉన్నదియె?= పొంది ఉన్నదా? (అంటే తెలివిగానే ఉన్నదా?); సురల బ్రదుకు తెరువులు= దేవతల జీవనమార్గాలు; అరసి= తెలిసికొని; సముత్సాహమునన్= ఉత్సాహంతో; నడపుచున్+ఉన్నవాఁడవే!= నడిపిస్తున్నావు కదా!; వారు= ఆ దేవతలు; నీకున్= నీకు; ప్రియము+ఒనర్చి= ప్రీతి కలిగించి; నేర్చి= నేర్పుతో; మండ్రె?= మందురే? (ఉంటున్నారా?)

తాత్పర్యం: 'ఆచార్యా! నీ మనసు జాగరూకంగానే ఉన్నది కదా! దేవతల పద్ధతి తెలిసిన మీరు వారికి శ్రేయోదాయకమైన రీతిలో కార్యతంత్రం నడిపిస్తున్నారు కదా! వారు కూడా మిమ్ములను సేవిస్తూ నిపుణంగా కార్యసాఫల్యం అందుకొనగలుగుతున్నారు కదా!

విశేషం: కుశలప్రశ్న వేసినట్లు ఉన్నా ఇంద్రుడు బృహస్పతిని ఎట్లా ప్రశ్నించాలో అట్లా అడుగుతున్నాడు. దేవతలు నిరంతర కార్యవ్యగ్రులు. వారి గురువు నిత్యోత్సాహి కావాలి. రాక్షసులపై, మానవులపై ఎత్తుకు పై ఎత్తులు వేయటమే బృహస్పతి పని. ఆ పని చేయగలిగినవాడు ఇట్లా చిన్నబోయి పాలిపోయి కనిపించటం వెనుక ఏమి జరిగిందో ఆ 'సహస్రాక్షు' డికి తెలియనిది కాదు. దేవతలు 'నిపుణ' కర్ములు. అందుకే రాక్షసులపై, మానవులపై ఎప్పుడూ పై చేయిగానే ఉంటారు. దీనిని సూచిస్తూ ఇంద్రుడు పై మాటలు అన్నాడు.

వ. అనుటయు నాచార్యుండు 'సర్వంబు సంపన్నంబ', యనిన ననిమిషపతి యతనితోడ. 67

ప్రతిపదార్థం: అనుటయున్= అని ఇంద్రుడు అనగా; ఆచార్యుండు= బృహస్పతి; సర్వంబు= అంతా; సంపన్నంబు+ఆ= సమగ్రంగానే ఉంది; అనినన్= అనగా; అనిమిషపతి= దేవతాపతి (ఇంద్రుడు); అతనితోడన్= బృహస్పతితో (ఇట్లా అన్నాడు.)

తాత్పర్యం: అని ఇంద్రు డనగా బృహస్పతి అన్నీ సమగ్రంగా ఉన్నాయని చెప్పాడు. అపుడు ఇంద్రు డాయనతో తరువాతి పద్యంతో అన్వయం.

విశేషం: సర్వం సంపూర్ణం, సంపన్నం - అనే మాటలను యజ్ఞసంపూర్తిని సూచించటానికి వాడుతారు. బృహస్పతి ఉపద్రష్ట కాబట్టి అతడి నోట యాగపరిభాష 'అంతా బాగానే ఉన్నది' అనే అర్థంలో ప్రవృత్తం కావటంలో ఆశ్చర్యం లేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'నీ యొడలు దస్సి వెలువెల । నై యున్నది; నీకు నిట్టి యధికపు వగపుం
జేయఁగ వెఱవని నీచులఁ । జేయుదు దండితులఁ గాఁగఁ జెప్పుము వారిన్.' 68

ప్రతిపదార్థం: నీ+ఒడలు= నీ శరీరం; దస్సి= అలిసిపోయి; వెలువలనై+ఉన్నది= వెలవెలపోయి ఉన్నది; నీకున్+ఇట్టి= నీకు ఇట్లాంటి; అధికపు వగపున్= అధికమైన దుఃఖాన్ని; చేయఁగన్= కలుగచేయటానికి; వెఱవని= భయపడని; నీచులన్= నీచులను; దండితులన్+కాఁగన్= దండితులనుగా; చేయుదున్= చేస్తాను; వారిన్= వారు ఎవరో; చెప్పుము.

తాత్పర్యం: 'ఆచార్యా! మీ శరీరం అలసటతో చిక్కిపోయింది. వెలవెలబోతున్నది. మీకు ఇట్లాంటి దుఃఖాన్ని కలిగించటానికి జంకని నీచు లెవరో చెప్పండి. వారిని కఠినంగా దండిస్తాను' అన్నాడు.

వ. అనవుడు నాచార్యుం 'డట్టిదిలేదు; మరుత్తుండు మహనీయం బగు మఖం బొనరింప నుద్యోగించిన వాఁ డతనికి మద్విరోధి యగు సంవర్తుండు యాజకుండయి యది నడపువాఁడయ్యెననివింటి; మద్విషాదంబునకు మూలం బిది; యట్లు గాకుండం జేయవలయు; నజ్జననాయకు నియమించి సంవర్తుని యాజకత్వంబు నవశ్యంబును మాన్చునది' యని పలికినం బాకశాసనుండు పార్శ్వంబున నున్న యగ్నిదేవు నాలోకించి 'నీవు మరుత్తు పాలికిం బొ; మ్మతండు క్రతుకరణంబున కుత్సహించినవాఁడు; తదీయం బగు నుపదర్శనంబు బృహస్పతి యాచరించువాఁడుగా సంఘటించి ర' మ్మని నియోగించిన. 69

ప్రతిపదార్థం: అనవుడున్= అని పలుకగా; ఆచార్యుండు= బృహస్పతి; అట్టి+అది లేదు= అట్లాంటిది ఏమీ లేదు; మరుత్తుండు; మహనీయంబు+అగు= గొప్పదైన; మఖంబు+ఒనరింపన్= యాగం చేయటానికి; ఉద్యోగించినవాఁడు= ప్రారంభించాడు; అతనికిన్= అతడికి; మత్+విరోధి+అగు= నా శత్రువైన; సంవర్తుండు; యాజకుండు+అయి= యాజకుడై; అది= దానిని; నడపువాఁడు+అయ్యెను+అని= నడిపించేవాడు అయ్యాడని; వింటిన్= విన్నాను; మత్+విషాదంబునకున్= నా దుఃఖానికి; మూలంబు+ఇది= మూలం ఇది; అట్లు+కాకుండన్= అట్లాకాకుండా; చేయన్ వలయున్= చేయాలి; ఆ+జననాయకున్+నియమించి= ఆ రాజును నియంత్రించి; సంవర్తుని; యాజకత్వంబు= ఉపదర్శనాన్ని; అవశ్యంబునున్= తప్పకుండా; మాన్చునది= మానిపించాలి; అని పలికినన్= అని అడుగగా; పాకశాసనుండు= ఇంద్రుడు; పార్శ్వంబునన్+ఉన్న= దగ్గరే ఉన్నటువంటి; అగ్నిదేవున్+ఆలోకించి= అగ్నిదేవుడిని చూచి; నీవు; మరుత్తు పాలికిన్ పొమ్ము= మరుత్తుడివద్దకు వెళ్ళుము; అతండు; క్రతుకరణంబునకున్= యాగం చేయటానికి; ఉత్సహించినవాఁడు= మొదలుపెట్టాడు; తదీయంబు+అగు= ఆ యాగసంబంధమైన; ఉపదర్శనంబు= యాజకత్వాన్ని; బృహస్పతి; ఆచరించువాఁడుగాన్= చేసేటట్లు; సంఘటించి రమ్ము= ఏర్పాటు చేసి రమ్ము; అని ; నియోగించినన్= నియమించగా.

తాత్పర్యం: అని చెప్పగా బృహస్పతి 'అట్లాంటిది ఏమీ లేదు. మరుత్తుడు గొప్పయాగం చేయటానికి ఆరంభించాడు. అతడికి నా విరోధి సంవర్తుడు యాజకత్వం వహిస్తున్నాడని విన్నాను. నా దుఃఖానికి మూలం ఇదే. అట్లా కాకుండా చేయాలి. నీవు ఆ రాజును నియంత్రించి, సంవర్తుడు ఉపద్రష్ట కాకుండా మానిపించాలి' అని కోరగా ఇంద్రుడు తన ప్రక్కనున్న అగ్నిదేవుడితో 'నీవు మరుత్తుడివద్దకు వెళ్ళి ఆ యాజకత్వాన్ని బృహస్పతి వహించేటట్లు ఏం చేయాలో అట్లా చేసి రమ్మ' అని నియమించగా - తరువాతి పద్యంతో అన్వయం.

ఆ. 'అట్లు సేయువాఁడ' నని యగ్ని నిజతను । స్ఫురణ మతిశయిల్ల నరుగుటయును.
నుల్ల మచ్చెరువున నూన మరుత్తుండు । ప్రణతి యాచరించి భక్తితోడ. 70

ప్రతిపదార్థం: అట్లు+చేయువాఁడను+అని= అట్లాగే చేస్తాను అని; అగ్ని; నిజతను స్ఫురణము= తన దేహకాంతి; అతిశయిల్లన్= అతిశయించగా; అరుగుటయునున్= వెళ్ళగా; ఉల్లము= హృదయం; అచ్చెరువునన్= ఆశ్చర్యంతో; ఊనన్= వహించగా; మరుత్తుండు; భక్తితోడన్= భక్తివో; ప్రణతి= నమస్కారం; అచరించి= చేసి.

తాత్పర్యం: అట్లాగే చేస్తానని అగ్నిదేవుడు తన శరీరకాంతి మరింత అతిశయించగా క్షణమాత్రంలో ఆ మరుత్తుడి ముందు పోయి వెలిగాడు. అతడిని చూచి, మరుత్తుడు ఆశ్చర్యమగ్ను డయ్యాడు. భక్తితో అగ్నిదేవుడికి నమస్కరించి మరుత్తుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

(అగ్నిదేవుం డింద్రసందేశము మరుత్తున కెఱింగింప వచ్చుట (సం.14-9-11))

సీ. **సంవర్తుఁ బిలిచి యాసన పాద్యముఖ్యోప। చరణముల్ నడిపించి పరిసరమున**
నున్న నయ్యనలుఁ డయ్యుర్వీశ్వరునితోడ। 'బలవైరి పనుప నీ పాలి కనఘ!
యరుగుదెంచితి దూతనై' యన్న నవ్విభుం। డవ్వాసవుండు సౌఖ్యమున వెలుఁగు
చున్నాఁడె? యమరసముత్కరం బతనికిఁ। బ్రియ మాచరించి వర్తించుచున్నె?

ఆ. **యాదరంబు గలదె నాదెస? నా సహ। స్రాక్షు నెమ్మనంబునందు హవ్య**
వాహ!' యనుడు నతఁడు వసుమతీపతికి ని। ట్లనియెఁ గౌరవాన్వయాగ్రగణ్య! 71

ప్రతిపదార్థం: కౌరవ+అన్వయ+అగ్రగణ్య!= కౌరవవంశంలో గొప్పవాడవైన ఓ జనమేజయ మహారాజా! (వినుము); సంవర్తున్+పిలిచి= యాజకుడైన సంవర్తుడిని పిలిచి అతడి సహాయంతో; ఆసన= ఆసనం; పాద్యముఖ్య+ఉపచరణముల్+నడిపించి= పాద్యం మొదలైన ఉపచారాలు చేసి (అగ్నిదేవుడికి); పరిసరమునన్+ఉన్నన్= సమీపంలో నిలబడగా; ఆ+అనలుఁడు= ఆ అగ్ని; ఆ+ఉర్వీ+ఈశ్వరుతోడన్= ఆ రాజుతో; అనఘ!= ఓ పుణ్యాత్మా!; బలవైరి= ఇంద్రుడు; పనుపన్= పంపగా; నీ పాలికిన్= నీ వద్దకు; దూతను+ఐ= దూతగా; అరుగుదెంచితిన్= వచ్చాను; అన్నన్= అనగా; ఆ+విభుండు= ఆ రాజు; హవ్యవాహ!= ఓ అగ్నిదేవా!; ఆ+వాసవుండు= ఆ ఇంద్రుడు; సౌఖ్యమునన్= సుఖంగా; వెలుఁగుచున్న+వాఁడె?= ప్రకాశిస్తున్నాడా?; అమర సముత్కరము= దేవతాసమూహం; అతనికిన్= అతడికి; ప్రియము+ఆచరించి= సంతోషం కలిగించి; వర్తించుచున్నె?= ప్రవర్తిస్తున్నదా?; నా దెసన్= నా యెడ; ఆ సహస్రాక్షు= ఆ ఇంద్రుడి యొక్క; నెమ్మనంబునందున్= నిండు మనసులో; ఆదరంబు+కలదె?= ఆదరం ఉందా?; అనుడున్= అని అడుగగా; అతఁడు= ఆ అగ్ని; వసుమతీపతికిన్= ఆ రాజుతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సంవర్తుడిని పిలిపించి అతడి సహాయంతో అగ్ని దేవుడికి ఆసనపాద్యాద్యుపచారాలను సలిపి నమస్కరించి, మరుత్తుడు అతడి సమీపంలో నిలబడ్డాడు. అప్పుడు అగ్నిదేవుడు 'ఓ పుణ్యాత్మా! ఇంద్రుడు పంపగా నీ వద్దకు దూతగా వచ్చాను' అన్నాడు. అపుడు ఆ రాజు 'ఓ అగ్నిదేవా! ఇంద్రుడు సుఖంగా ఉన్నాడా? దేవతలు అతడికి ప్రీతి గూర్చుతూ ప్రవర్తిస్తున్నారు కదా! ఆ సహస్రాక్షుడి నిండు మనసులో నా విషయంగా ఆదరం ఉన్నది కదా!' అని అడుగగా ఆ అగ్నిదేవుడు ఇట్లా అన్నాడు.

క. **'సురనాథుఁడు దద్దయు సుఖి। సుర లాతనికిం బ్రియంబు సొలయక యొనరిం**
తురు నా దెస నాదర మ। ప్పురుషవరున కగ్గలంబు భూపవరేణ్యా! 72

ప్రతిపదార్థం: భూపరేణ్యా!= రాజశ్రేష్ఠుడా!; సురనాథుఁడు= దేవరాజు (ఇంద్రుడు); తద్దయున్= మిక్కిలి; సుఖి= సుఖంతో ఉన్నాడు; అతనికిన్= అతడికి; సురలు= దేవతలు; సొలయక= వెనుకాడకుండా (నిరంతరం); ప్రియంబు= ప్రీతిని; ఒనరింతురు= కూర్చుతున్నారు; ఆ పురుష వరునకున్= ఆ పురుషశ్రేష్ఠుడైన ఇంద్రుడికి; నీ దెసన్= నీ యెడ; ఆదరము= ప్రీతి; అగ్గలము= అత్యధికం.

తాత్పర్యం: 'ఓ రాజా! ఇంద్రుడు చాలా సుఖంగా ఉన్నాడు. దేవతలుకూడా అతడికి నిరంతరం ప్రీతిని సంఘటిస్తూ సేవచేస్తున్నారు. ఆ పురుషసత్తముడికి నీ యెడ పరమాదరం ఉన్నది.

వ. నా వచ్చిన పని సెప్పెద నాకర్ణింపుము. 73

తాత్పర్యం: నేను వచ్చిన పని చెప్పుతాను వినుము.

క. నీ జన్నమునకు ధిషణుఁడు । యాజకుఁడై మర్త్యు నిన్ను నమరత్వదశా
భ్రాజిష్ణుఁ జేయు నమ్మెయి । రాజితముగ నాచరింపు క్రతుకార్యంబున్. 74

ప్రతిపదార్థం: నీ జన్నమునకున్= నీ యజ్ఞానికి; ధిషణుఁడు= బృహస్పతి; యాజకుఁడు+ఐ= ఉపద్రష్టగా ఉండి; మర్త్యున్= మానవుడవైన; నిన్నున్= నిన్ను; అమరత్వ దశా భ్రాజిష్ణున్+చేయున్= దైవత్వస్థితితో ప్రకాశించేవాడిగా చేస్తాడు; ఆ+మెయిన్= ఆ విధంగా; రాజితముగన్= మహావైభవంగా; క్రతుకార్యంబున్= క్రతు కార్యాన్ని; ఆచరింపు(ము)= చేయుము.

తాత్పర్యం: నీ యాగానికి బృహస్పతి యాజకుడుగా ఉండి, మానవుడవైన నిన్ను దైవత్వస్థితితో విరాజిల్లే వాడిగా చేస్తాడు. ఆ విధంగా మహావైభవోపేతంగా నీవు బృహస్పతి సహాయంతో ఈ యాగాన్ని నిర్వహించుము.

విశేషం: అంటే సంవర్తుడు చాలడని అభిప్రాయం. లోభం కలిగించి మరుత్తుడి మనస్సు మార్చాలని అగ్ని ఉద్దేశం.

వ. ఇది యింద్రుండు నీతోడం జెప్పుమన్న కార్యం' బనుటయు నమ్మనుజనాథుం డమ్మహాత్ముతోడ. 75

ప్రతిపదార్థం: ఇది= ఇంతవరకు నేను చెప్పినది; ఇంద్రుండు= మహేంద్రుడు; నీ తోడన్= నీతో; చెప్పుము+అన్న+కార్యంబు= చెప్పుమన్న పని; అనుటయున్= అనగా; ఆ+మనుజనాథుండు= ఆ రాజు; ఆ+మహాత్ముతోడన్= ఆ అగ్నిదేవుడితో.

తాత్పర్యం: 'ఇంతవరకు నేను చెప్పినది ఇంద్రుడు నీతో చెప్పుమన్న పని' అని అనగా ఆ రాజు అగ్నిదేవుడితో - తరువాతి పద్యంతో అన్వయం.

ఆ. 'అనఘ! యేడు మ్రొక్కు లా బృహస్పతికి మ్రొ । క్కెద; నతండు నన్ను నదయవృత్తి
నపహసించి తాను యాజకత్వమునకు । నెట్లుఁ జొరకయున్న నేను బోయి. 76

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పుణ్యాత్మా!; ఆ బృహస్పతికిన్; ఏడు మ్రొక్కులు= అనంతకోటి నమస్కారాలు; మ్రొక్కెదన్= మొక్కుతాను; అతండు= ఆయన; నన్నున్= నన్ను; అదయవృత్తిన్= దయలేని మనసుతో; తాను= తానుగా; అపహసించి= గేలిచేసి; యాజకత్వమునకున్= ఉపద్రష్టగా ఉండటానికి; ఎట్లున్+చొరక+ఉన్నన్= ఎట్లాగూ అంగీకరించకపోతే; నేను+పోయి= నేను వెళ్ళి.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్మా! ఆ బృహస్పతికి అనంతకోటి నమస్కారాలు చేస్తాను. (అంటే నన్ను నా మానాన విడిచిపెట్టని'మ్మని అర్థం) ఆయన నిర్దయతో నన్ను పరిహాసం చేసి ఉపాధ్యాయుడుగా ఉండటానికి ఏ మాత్రం అంగీకరించకపోతే నేను వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: 'సప్త'కు 'అనంత' అనే అర్థంకూడా ఉన్నది. ముందట 60వ పద్యంలోని ఏడు దిక్కులలోనూ అన్నప్పుడు కూడా 'ఎక్కడా' అనే అర్థం చెప్పవచ్చును. అక్కడ కూడా సంపూర్ణార్థమే ఉన్నది. సూర్యుడిని సప్తాశ్వుడని, అగ్నిని సప్తజిహ్వుడని, అట్లాగే సప్తమాతృకలు, సప్తసముద్రాలు, సప్తకులపర్వతాలు ఇత్యాదులలో కూడా 'సప్త' సంపూర్ణత్వ సంకేతమే.

ఇక్కడ మరుత్తుడి నమస్కారాలకు అర్థం 'వారి గొప్పతనం విషయంలో నాకు అభ్యంతరం లే'దనటం కూడా సూచించబడుతున్నది.

క. అనుజుం డతనికి నను పెను। పొనరిన సంవర్తు భక్తి నొడఁబఱిచి తగం
గొనివచ్చితి మత్క్రతు యా। జన మీ యోగీశ్వరుండ చాలుం జేయన్.' 77

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ బృహస్పతికి; అనుజుండు+అను= తమ్ముడనే; పెనువు=పెంపు; ఒనరిన= కలిగిన; సంవర్తున్= సంవర్తుడిని; భక్తిన్+ఒడన్+పఱిచి= భక్తితో ప్రార్థించి అంగీకరింపజేసి; తగన్= మర్యాదతో; కొనివచ్చితిన్= పిలుచుకొని వచ్చాను; మత్+క్రతు+యాజనము= నా క్రతువుయొక్క నిర్వహణాన్ని; ఈ+యోగి+ఈశ్వరుండు+అ= ఈ మునీశ్వరుడే; చేయన్+చాలున్= చేయగలడు.

తాత్పర్యం: ఆ బృహస్పతికి తమ్ముడనే ప్రసిద్ధి ఉన్న ఈ సంవర్తమహామునిని భక్తితో ప్రార్థించి అంగీకరింపజేసి, ఎంతో మర్యాదగా ఆహ్వానించి పిలుచుకొనివచ్చాను. నా యాగనిర్వహణను ఈ యోగీశ్వరుడే చేయించగల సమర్థుడు.'

ఆ. అనిన నగ్నిదేవుఁ 'డమరగురుం డుప। ద్రష్టయైన వజ్రధరుఁడు నీకు
నలఘుపుణ్యలోకములు సులభ్యములుగ। లీలఁ జేయు నట్లు మేలు గాదె!' 78

ప్రతిపదార్థం: అనినన్+అని మరుత్తుడనగా; అగ్నిదేవుఁడు (ఇట్లా అన్నాడు); అమరగురుండు= బృహస్పతి; ఉపద్రష్ట+ఐనన్= ఉపాధ్యాయుడుగా యాగం నిర్వహిస్తే; వజ్రధరుఁడు= ఇంద్రుడు; నీకున్= నీకు; అలఘు= గొప్పవైన; పుణ్యలోకములు= పుణ్యలోకాలను; లీలన్= అతి విలాసంగా, అలవోకగా, ఆశ్చర్యకరంగా; సులభ్యములుగన్= బాగా లభించేవిగా; చేయును= చేస్తాడు; అట్లు= అట్లా కావటం; మేలు+కాదె?= మంచిది కదా?

తాత్పర్యం: అని మరుత్తుడు చెప్పగా అగ్ని దేవు డిట్లా అన్నాడు. 'బృహస్పతి నీకు ఉపద్రష్టగా ఉంటే ఇంద్రుడు నీకు మహాపుణ్యలోకాలు అత్యాశ్చర్యకరంగా అతిసులభంగా దొరికేటట్లు చేస్తాడు. అది కూడా మంచిదే కదా!' అన్నాడు.

విశేషం: సంవర్తుడు జరిపిస్తే రావలసిన స్వర్గాది పుణ్యలోకాల ప్రాప్తి ఇంద్రుడి చేతిలో ఉండటంవలన ఆ పుణ్యలోకాలకు రానివ్వకపోవచ్చు నని భయపెట్టటం ఇందులోని రహస్యం.

క. అనవుడు సంవర్తుఁడు గడుఁ। గనలి యనలుతోడ 'నిట్టిగతి నీ విం కా
డిన మద్దారుణ దృష్టిని। నినుఁ గాల్తున్ మగుడు మిప్పనికిఁ దిరుగకుమీ. 79

ప్రతిపదార్థం: అనవుడున్= అని అగ్నిదేవుడు చెప్పగా; సంవర్తుఁడు= సంవర్త మహాముని; కడున్+కనలి= మిక్కిలి కోపించి; అనలుతోడన్= అగ్నిదేవుడితో; ఇట్టిగతిన్= ఇట్లాగే; నీవు+ఇంకన్+ఆడినన్= ఇంకా నీవు మాటాడితే; మత్+దారుణ+దృష్టిని= నా భయంకరమైన చూపుతో; నినున్+కాల్తున్= నిన్ను కాల్చివేస్తాను; మగుడుము= తిరిగిపొమ్ము; ఈ+పనికిన్+తిరుగకుమీ= మళ్ళీ ఈ పనికి ప్రయత్నించవద్దు (అన్నాడు).

తాత్పర్యం: అని అగ్నిదేవుడు చెప్పగా సంవర్తుడు మిక్కిలి కోపించి అగ్నిదేవుడితో 'నీవు ఇట్లాగే ఇంకా మాటాడితే నా భయంకరమైన చూపుతోనే నిన్ను కాల్చివేస్తాను. తిరిగిపొమ్ము. మరల ఈ పనికి ప్రయత్నం చేయకుము. వెళ్ళిపొమ్ము.' అన్నాడు.

విశేషం: అగ్నిదేవుడు 'మంట'కు అధిదైవతం. అతడినే కాల్చివేయగలది తపస్సునుండి పుట్టే అగ్నిమాత్రమే. అది దృష్టిద్వారా బహిర్గతమవుతుంది. అది మంట కాదు. 'తేజస్సు'. దాని ముందు అగ్ని కూడా నిలువదని తాత్పర్యం.

చ. అనుటయు భీతి నగ్ని యమరాధిపు పాలికిఁ బోయి 'యే మరు
త్తునిఁ గని నెమ్మి నీ దగు క్రతుక్రియకున్ గురు యాజకుండుగాఁ
గొనుమని చెప్పితిన్; విని యకుంఠితనిశ్చయుఁడైన యవ్విభుం
డనిమిషమంత్రికిన్ వెఱతు నాతని తమ్మునిఁ గోరి తెచ్చితిన్. 80

ప్రతిపదార్థం: అనుటయున్= అని సంవర్తుడు అనగా; భీతిన్= భయంతో; అగ్ని= అగ్నిదేవుడు; అమర+అధిపుపాలికిన్+పోయి= ఇంద్రుడి వద్దకు వెళ్ళి; ఏన్= నేను; మరుత్తునిన్+కని= మరుత్తుడిని చూచి; నెమ్మిన్= స్నేహభావంతో; నీది+అగు= నీవు చేస్తున్న; క్రతుక్రియకున్= యజ్ఞకర్మకు; గురున్= బృహస్పతిని; యాజకుండుగాన్= ఉపద్రష్టగా; కొనుము+అని= గ్రహించుము అని; చెప్పితిన్= చెప్పాను; విని= ఆ మాటలు విన్నవాడై; అకుంఠిత= మొక్కపోని; నిశ్చయుఁడు+ఐన= నిశ్చయం కలిగిన; ఆ+విభుండు= ఆ మరుత్తుడు; అనిమిషమంత్రికిన్= ఆ బృహస్పతి అంటే; వెఱతున్= నేను భయపడతాను; (అందుకే) అతని తమ్మునిన్= అతడి తమ్ముడు సంవర్తుడిని; కోరి= కోరుకొని; తెచ్చితిన్= తెచ్చాను.

తాత్పర్యం: అని సంవర్తుడనగా భీతితో అగ్నిదేవుడు పారిపోయి ఇంద్రుడివద్దకు వెళ్ళి, 'అయ్యా! నేను వెళ్ళి మరుత్తుడిని చూచి స్నేహభావంతో యాగానికి ఉపాధ్యాయుడుగా బృహస్పతిని గ్రహించు' మని చెప్పాను. ఆ మాటలు విన్న ఆ కృతనిశ్చయభావుడైన మరుత్తుడు 'స్వామీ! నాకు ఆ బృహస్పతి అంటే భయం. అందుచేతనే వాని తమ్ముడైన సంవర్తుడిని యాజ్ఞికుడుగా కోరుకొని ఆహ్వానించి పిలుచుకొని వచ్చాను.'

వ. ఈ యోగీశ్వరుండు మదీయాధ్వరంబునకు యాజకుండను పలుకుపలికి సంవర్తుం జూపె; నేనంత నిలువక పురుహూతునకుం బ్రియం బొనరించిన నీకుం బుణ్యలోకంబులు సిద్ధించునట్లు చేసిన మేలని తఱిమి చెప్పినను నప్పుడమిఱేఁ డొడంబడండ.' 81

ప్రతిపదార్థం: ఈ యోగి+ఈశ్వరుండు= ఈ యోగిశ్రేష్ఠుడైన సంవర్తుడు; మదీయ+అధ్వరంబునకున్= నా యాగానికి; యాజకుండు+అను పలుకు పలికి= ఉపద్రష్ట అనే మాట చెప్పి; సంవర్తున్+చూపెన్= సంవర్తుడిని చూపించాడు; నేను+అంతన్+నిలువక= నేను అంతటితో ఊరుకొనకుండా; పురుహూతునకున్= ఇంద్రుడికి; ప్రియంబు+ఒనరించినన్= సంతోషం కలిగిస్తే (ఆయనకు నచ్చినట్లు చేస్తే); నీకున్= నీకు; పుణ్యలోకంబులు= పుణ్యలోకాలు; సిద్ధించునట్లు చేసినన్= సిద్ధించేటట్లు చేస్తే; మేలు+అని= మంచిది కాదా! అని, తఱిమి చెప్పిననున్= వెంటపడి మరిమరీ చెప్పినా; ఆ+పుడమిఱేఁడు+ఒడంబడండు+అ= ఆ రాజు ఒప్పుకొనడాయె.'

తాత్పర్యం: ఈ యోగిశ్రేష్ఠుడైన సంవర్తుడే నా యాగానికి యాజకుడు అని చెప్తుతూ సంవర్తుడిని చూపాడు. నేను అంతటితో ఊరుకొనకుండా ఇంద్రుడికి వచ్చినట్లు నీవు చేస్తే నాకు ఆయన పుణ్యలోకాలు సిద్ధించేటట్లు చేయటం మంచిదే కదా! అని కూడా మరీమరీ చెప్పాను. అయినా ఆ రాజు ఒప్పుకొనడాయె.'

చ. అన విని యింద్రుఁ డిట్లనియె నగ్నికి 'నిమ్మడివోయి చెప్పు మ
జ్జనపతితోడ నా పలుకు సమ్మతిఁ జేయక తక్కెనేని నేఁ
బనిచెద వజ్రమున్ జమునిపాలికి నన్నరనాథు వేగమే;
యనుచుట కంత యెల్లిదమె యాతనికిన్ మన యాజ్ఞ యారయన్?' 82

ప్రతిపదార్థం: అనన్+విని= విని అగ్ని అనగా విన్నవాడై; ఇంద్రుఁడు= మహేంద్రుడు; అగ్నికిన్= అగ్నితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; ఇమ్మడి= ఇంకోసారి (రెండోసారి); పోయి= వెళ్ళి; ఆ+జనపతితోడన్= ఆ రాజుతో; చెప్పుము= ఇట్లా చెప్పుము; నా పలుకు= నా మాటను; సమ్మతిన్+చేయక= లెక్కించకుండా; తక్కెను+ఏనిన్= విడిచిపెట్టాడంటే; నేన్= నేను; వజ్రమున్= వజ్రాయుధాన్ని; ఆ నరనాథున్= ఆ రాజును; జమునిపాలికిన్= యముడి వద్దకు; అనుచుటకున్= పంపటానికి; పనిచెదన్= ప్రయోగిస్తాను; అరయన్= చూడగా; మన+ఆజ్ఞ= మా ఆజ్ఞ; ఆతనికిన్= అతడికి; ఇంత+ఎల్లిదమె?= ఇంత నిర్లక్ష్యమా?

తాత్పర్యం: అని అగ్ని అనగా ఇంద్రుడు అగ్నితో ఇట్లా అన్నాడు. 'అగ్నిదేవా! మరొకసారి వెళ్ళి ఆ రాజుతో చెప్పుము. నా మాటను లెక్కించకుండా అతిక్రమిస్తే వజ్రాయుధం ప్రయోగిస్తాను. మా ఆజ్ఞను పాలించటానికి అతడికి ఇంత నిర్లక్ష్యమా?'

వ. అని పలుకుటయుఁ బావకుండు పాకశాసను నాలోకించి. 83

ప్రతిపదార్థం: అని పలుకుటయున్= అని చెప్పగా; పావకుండు= అగ్ని; పాకశాసనునిన్= ఇంద్రుడిని, ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అని పలుకగా అగ్నిదేవుడు ఇంద్రుడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'ఇంక వచ్చిన దారుణేక్షణదగ్ధుఁ గా। వింతుఁ జుమ్మీ! యని విపులకోప
మూర్తియై పలికె సంవర్తుండు గావున। వెఱతు నే నట వోవ; వేఱొకండు
పోవుఁ గా' కనవుడు దేవేంద్రుఁ 'డన్యుల। నీవు దహింతు గా కే విధమున
నొరులు నిన్ను దహింతురో! పేదమాట యి। ట్లాడుదే?' యనుటయు నగ్ని పలుకు

ఆ. మూఁడులోకములును వాఁడి మగంటిమి। నేలుచున్నవాని నెట్లు వృత్రుఁ
డాక్రమించె నిన్ను? నదియును గాక ప। ర్జన్య! మఱియు వినుము బ్రహ్మబలము. 84

ప్రతిపదార్థం: ఇంక వచ్చినన్= ఇంక మరోసారి వచ్చావంటే; దారుణ+ఈక్షణ+దగ్ధున్+కావింతున్= భయంకరమైన చూపులతో కాల్చివేస్తాను; చుమ్మీ!= సుమా!; అని; విపులకోపమూర్తి+ఐ= మిక్కిలి కోపం కలిగినవాడై; సంవర్తుండు; పలికెన్= పలికాడు; కావునన్= కాబట్టి; అట+పోవన్= అక్కడికి పోవటానికి; నేన్+వెఱతున్= నేను భయపడతాను; వేఱు+ఒకండు= మరొకడెవడైనా; పోవున్+కాక= వెళ్ళుతాడులే; అనవుడున్= అని అనగా; దేవేంద్రుఁడు= ఇంద్రుడు; అన్యులన్= వేరే వాళ్ళను; నీవు దహింతు(వు)+కాక= నీవు కాలుస్తావు కాని; ఏ విధమునన్+ఒరులు= ఏ విధంగా ఇతరులు; నిన్నున్+దహింతురో= నిన్ను కాలుస్తారో; ఇట్లు= ఈ విధంగా; పేదమాట= (నిస్సహాయకమైన పలుకులు; ఓదార్పు) ఆడుదు (వు)+ఏ= పలుకుతావా?; అనుటయున్= అనగా; అగ్ని= అగ్నిదేవుడు; పలుకున్= ఇట్లా అన్నాడు; మూఁడులోకములును= మూడు లోకాలూ; వాఁడి+మగంటిమిన్= నిశిత పరాక్రమంతో; ఏలుచున్+ఉన్నవానిన్= పరిపాలిస్తున్నవాడిని; నిన్నున్= నిన్ను; వృత్రుఁడు= వృత్రాసురుడు; ఎట్లు+ఎట్లా; ఆక్రమించెన్?= ఆక్రమించాడు?; అదియునున్+కాక= అంతే కాకుండా; పర్జన్య!= ఇంద్రా!; మఱియున్= ఇంకా; బ్రహ్మబలమున్= యోగశక్తివలన పుట్టే బలాన్ని గురించి (చెప్పుతాను); వినుము.

తాత్పర్యం: 'మరొకసారి వచ్చానంటే నాకంటి చూపులతో నిన్ను కాల్చివేస్తాను' అని మిక్కిలికోపంతో సంవర్తుడు అన్నాడు. అందుచేత నాకు అక్కడికి పోవటానికి భయం. మరొకరిని ఎవరినైనా పంపించుము' అని అగ్నిదేవుడు అనగా ఇంద్రుడు ఇట్లా అన్నాడు. 'అదేమిటి. అంత నిస్సహాయంగా మాటాడుతున్నావు? నీవు ఇతరులను కాలుస్తావు తప్ప నిన్ను ఎవరైనా ఎట్లా కాలుస్తారయ్యా!' దానికి అగ్నిదేవుడు 'ముల్లోకాలను మహాపరాక్రమంతో పాలించే నిన్ను ఆనాడు వృత్రాసురుడు ఎట్లా ఆక్రమించాడో గుర్తు చేసికొనుము. అంతే కాదు ఓ ఇంద్రా! యోగశక్తి చాలా గొప్పది. ఎందుకో చెప్పుతాను వినుము.

విశేషం: 'బ్రహ్మ' శబ్దానికి 'సృష్టికర్త' అన్నది వాచ్యార్థం మాత్రమే. జ్ఞానమని, వేదమని, యోగమని సందర్భాన్నిబట్టి చాలా అర్థాలు ఉన్నాయి. తరువాతి కథలో ఈ అర్థవిశేషాన్ని చూడవచ్చును.

సీ. **సయ్యాతి క్రతువున నయ్యాశ్వినుల సోమ। పానంబు నీ కొడఁబాటు గాక**
పాయంగఁ బెట్టిన భార్గవచ్యవనుండు। వారికిఁగా సురవర్గసహిత
ముగ నిన్ను బాధితుండుగఁ జేసె నిజమంత్ర। బలమున; దాని కీ వలిగి వజ్ర
మేడ్తెఱఁ గొని యమ్మునీశ్వరు సాధింపఁ। గడఁగిన నగుచు బెట్టడఁచెఁ గాదె!

తే. **యతఁడు పుడిసెఁడు నీరన యప్పు డతనిఁ। దెలచి సోమ మాశ్వినులకుఁ గలుగఁ జేసి**
తరయ నెందును బ్రహ్మ బలాతిశయముఁ। గడచినట్టి బలంబులుఁ గలవె? యనఘ! **85**

ప్రతిపదార్థం: సయ్యాతి= సయ్యాతి నిర్వహించిన; క్రతువునన్= యాగంలో; ఆ+ఆశ్వినుల= ఆ అశ్వినీ దేవతల; సోమపానంబు= సోమరసపానం; నీకున్+ఒడఁబాటు+కాక= నీకు అంగీకారం కాక, పాయంగన్+పెట్టినన్= వారిని దూరంగా ఉంచితే; వారికిన్+కాన్= వారి కొరకని; భార్గవచ్యవనుండు= భార్గవచ్యవన మహర్షి; సురవర్గ సహితముగన్= దేవతాసమూహంతో సహా; నిన్నున్+బాధితుండుగన్= నీవు బాధపడే విధంగా; నిజమంత్ర బలమునన్= తన మంత్ర శక్తితో; చేసెన్= చేశాడు; దానికిన్+ఈవు+అలిగి= దానికి నీవు కోపగించుకొని; వజ్రము= వజ్రాయుధాన్ని; ఏడ్తెఱన్+కొని= పరాక్రమంతో గ్రహించి; ఆ+ముని+ఈశ్వరున్+సాధింపన్+కడఁగినన్= ఆ మునీశ్వరుడిని సాధించాలని ప్రయత్నించగా; నగుచున్= నవ్వుతూ; బెట్టు+అడఁచెన్+కాదె!= నీ గర్వాన్ని మిక్కిలి అణచాడు కాదా!; అతఁడు= ఆ ఋషి; పుడిసెఁడు= పుడిసిలిలో పట్టేటటువంటి; నీరు+అనన్= నీరు అనగా (నీరు కావాలనగా); అప్పుడు= ఆ సమయాన; అతనిన్= ఆ ఋషిని; తెలచి= ప్రస్తుతించి ప్రసన్నుడిని చేసికొని; అశ్వినులకున్= అశ్వినీదేవతలకు; సోమము= సోమరసాన్ని; కలుగన్+చేసితి(వి)= ఇచ్చావు; అరయన్= బాగా ఆలోచించగా; అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; బ్రహ్మబల+అతిశయమున్= బ్రహ్మ బలానికున్న గొప్పతనాన్ని; కడచినట్టి= మించినట్టి; బలంబులున్+కలవె?= ఇతర శక్తులు ఏవైనా ఉన్నాయా? (లేవని అర్థం).

తాత్పర్యం: ఒకప్పుడు సయ్యాతి క్రతువును జరుపుతుండగా ఆ అశ్వినీదేవతలు సోమపానంకొరకు రావటం నీకు ఇష్టం కాక, వారిని పంక్తిబాహ్యులుగా బయట ఉంచావు. అపుడు వారికొరకు భార్గవ చ్యవన మహర్షి దేవతలందరితో సహా నిన్ను తన మంత్రశక్తితో ముప్పుతిప్పలు పెట్టలేదా! అప్పుడు నీవు కోపగించుకొని పరాక్రమంతో వజ్రాయుధాన్ని గ్రహించి ఆ ఋషిమీద ప్రయోగించలేదా! అప్పుడు ఆయన నవ్వుతూ నీ గర్వాన్ని అణచలేదా! పురిసెడు నీళ్ళు ఆయన అడిగితే ఇవ్వగలిగావా? అప్పుడు నీవు సోమరసాన్ని అశ్వినీదేవతలకు కూడా పంచావు కదా! ఇదంతా చూస్తే - ఓ ఇంద్రా! మంత్రశక్తి కున్న గొప్పతనాన్ని మించిన ఇతరబలాలు ఏమున్నాయి?

విశేషం: చ్యవనమహర్షి శక్తి మంత్రశక్తి - తపస్సు, యాగం ద్వారా లభించిన జ్ఞానం దాని స్వరూపం. అదే బ్రహ్మస్వరూపమంటే.

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః । బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్,

బ్రహ్మైవ తేన గన్తవ్యం । బ్రహ్మకర్మసమాధినా - (గీత)

అనే గీతాకారుడి వాక్యాన్ని ఈ సందర్భంలో అనుసంధించుకొంటే ఇట్లా అర్థం చెప్పవచ్చును. బ్రహ్మకర్మ సమాధి రూపంగా జరిపేది యజ్ఞం. అది ఎవరికి అర్పించబడుతుందో, ఏది హవిస్సో, ఏది అగ్నో, ఏ వ్యక్తి హోమం చేస్తాడో, దానివలన లభించే పరమపదం ఏది ఉన్నదో అంతా 'బ్రహ్మమే'- కనుకనే 'బ్రహ్మ' మంటే కర్త, కారయిత, క్రియ, అన్నీ అవుతున్నాయి.

ఇంద్రుడు ఈ బ్రహ్మజ్ఞానం ఉన్నవాడు కాడు. యజ్ఞకర్మ ఫలంగా వచ్చిన తాత్కాలికమైన ఒక పుణ్యపదవికి మాత్రమే అర్హుడు. అందుకే ఈ కథ అంతా ప్రస్తావించబడినది. బృహస్పతి అంటే 'ధిషణ'కు కూడా బ్రహ్మజ్ఞానస్వరూపం అతీతమని చెప్పటమే ఈ కథ ప్రయోజనం.

ఇంద్రుడిదగ్గర 'వజ్రాయుధం' మాత్రమే ఉన్నది. అది వెన్నుపూసకు సంకేతం. యోగశక్తి ప్రసరించే 'కాలువ' అది, కాని యోగశక్తికి పర్యవసానస్థానం మాత్రం 'సహస్రారకమలమే'. అది లోకవాంఛలకు, ఆకర్షణలకు, ద్వంద్వభావనలకు, సంకల్ప రజస్తమోగుణాలకు అతీతమైన సత్త్వస్థితిని పొందినవాడికి మాత్రమే సాధనచేత పొందదగిన స్థానం. ఆ స్థితిలోనివాడు 'చ్యవనుడే' అందుకే 'వజ్రం' అతడిని ఏమీ చేయలేకపోయింది. సోమపానం చేయ నివ్వనని భీష్మించుకొన్న ఇంద్రుడు ఆ ఋషి ప్రసన్నుడు కావటంకొరకు 'నీరు' ఇవ్వలేకపోయాడు. తాను 'పర్జన్యుడు' - వర్షాధి దేవత అయినా 'వృత్రుడి' చేత ఆక్రమించబడినపుడు ఇంద్రుడికి 'వర్ష' శక్తి లేదు - ఆ శక్తిలేని తాను 'సోమ' పానార్హత ఉన్న అశ్వినీదేవతలకు పానయోగ్యత లేదని చెప్పటం అహంకారం తప్ప మరొకటి కాదు. అందుకే గర్వ మణగి చివరికి ఈ ఋషిపాదాలపై పడి క్షమించుమన్నాడు. ఆ దేవతలకు సోమ మిచ్చాడు. ఇది ఒక గొప్ప ప్రతీకాత్మక కథ.

తరువాతి కథలో ఇంద్ర, బృహస్పతులకు జ్ఞానం ఎట్లా రాబోతుందో సూచించే కథ ఇంతవరకు చెప్పబడింది. వర్షాధిదేవత ఇంద్రుడికే బలం లేకుండా చేసిన మంత్రశక్తి అగ్నిని దహించదా! అన్నది అగ్నిదేవుడి అంతర్యం.

సంవర్తుడికి యాజకార్హత లేదనటం కూడా ఆశ్వినులకు సోమపానార్హత లేదని చెప్పటంవంటిదే కదా! (ఇక తక్కిన కథ చదవండి).

క. అనవుడు 'బ్రహ్మబలము గడు । ఘనమగు టెఱుఁగుదు; మరుత్తుఁ గాఱియఁ బెట్టం

జనదే నా?' కని శక్రుఁడు । పనిచెను గంధర్వలోకపతి ధృతరాష్ట్రున్. 86

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; శక్రుఁడు= ఇంద్రుడు; బ్రహ్మబలము= బ్రహ్మబలం; కడు ఘనము+అగుట= మిక్కిలి గొప్పది కావటం; ఎఱుఁగుదున్= నాకు తెలుసును; (కాని) మరుత్తున్= మరుత్తుడిని; కాఱియన్+పెట్టన్= బాధపెట్టటానికి; నాకున్+చనదే?= నాకు దుస్సాధమా!; అని; గంధర్వలోకపతి= గంధర్వరాజు; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్రుడిని; పనిచెను= పంపాడు.

తాత్పర్యం: అని అగ్ని చెప్పగా ఇంద్రుడు 'బ్రహ్మబలం మిక్కిలి గొప్పదని నేను ఎరగుదును. కాని ఆ మరుత్తుడిని బాధించటానికి నేను తగనా?' (ఎందుకు తగను?) అని గంధర్వరాజైనటువంటి ధృతరాష్ట్రుడిని పంపాడు.

వ. పనుచునప్పు డతని కిట్లనియె. 87

ప్రతిపదార్థం: పనుచు+అప్పుడు= పంపుతున్నప్పుడు; అతనికిన్; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: పంపేటప్పుడు ఆ ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

తే. **'నీవు వోయి మరుత్తుని నెమ్మిఁ గాంచి। గురుని నీకు యాజకుఁడుగఁ గొనఁగవలయు;**
నట్లు చేయక యున్న వృత్రారి క్రోధ। దీప్తుఁడై కులిశంబుఁ బుత్తెంచు ననుము. 88

ప్రతిపదార్థం: నీవు పోయి= నీవు వెళ్ళి; మరుత్తునిన్= మరుత్తుడిని; నెమ్మిన్= నెమ్మదిగా; కాంచి= చూచి; గురునిన్= బృహస్పతిని; నీకు యాజకుఁడుగన్= ఉపద్రష్టగా; కొనఁగన్+వలయున్= తీసికొనాలి; అట్లు చేయక+ఉన్నన్= అట్లా చేయకుంటే; వృత్ర+అరి= వృత్రాసురుడికి శత్రువైన ఇంద్రుడు; క్రోధ దీప్తుఁడు+ఐ= కోపంతో మండిపోయి; కులిశంబున్= వజ్రాయుధాన్ని; పుత్తెంచున్= ప్రయోగిస్తాడు; అనుము= అని చెప్పుము.

తాత్పర్యం: 'నీవు వెళ్ళి ఆ మరుత్తుడిని చూచి నెమ్మదిగా ఇట్లా అనుము. 'నీవు బృహస్పతిని ఉపద్రష్టగా తీసికొనటం అభిలషణీయం. అట్లా చేయకపోతే ఇంద్రుడికి కోపం వస్తుంది. మండిపోయి వజ్రాయుధాన్ని ప్రయోగిస్తాడు జాగ్రత్త!' అని చెప్పుము.

వ. **ఈ మాట సంవర్తుని సన్నిధిన యాడు 'మని పలికిన నా ధృతరాష్ట్రుం డియ్యకొని సంవర్త సహితుండై యున్న మరుత్తునిం గని తాను గంధర్వుండనియును ననిమిషపతి పంపున వచ్చితి ననియుం జెప్పి, యప్పుడమితేనితో మఱియు నిట్లనియె. 89**

ప్రతిపదార్థం: ఈ+ మాట= ఆ మాట; సంవర్తుని సన్నిధిన్+అ= సంవర్తుడు సన్నిధానంలో ఉన్నప్పుడే; ఆడుము= పలుకుము; అని; పలికినన్= ఇంద్రుడు చెప్పగా; ఆ ధృతరాష్ట్రుడు; ఇయ్యకొని= అంగీకరించి; సంవర్త సహితుండు+ఐ+ఉన్న= సంవర్తుడితో కూడి ఉన్న; మరుత్తున్+కని= మరుత్తుడిని చూచి; తాను; గంధర్వుండు+అనియును= గంధర్వుడనీ; అనిమిషపతి పంపునన్= ఇంద్రుడి ఆజ్ఞతో; వచ్చితిన్+అనియున్= వచ్చాననీ; చెప్పి; ఆ+పుడమిఱేనితోన్= ఆ రాజుతో; మఱియున్= ఇంకా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ మాటలు సంవర్తుడు సమీపంలో ఉన్నప్పుడే పలుకుము' అని ఇంద్రుడు చెప్పగా అదే ప్రకారం చేస్తానని ఆ ధృతరాష్ట్రుడు అంగీకరించి, సంవర్తుడితో కూడి ఉన్న మరుత్తుడిని చూచి, తాను గంధర్వుడననీ, ఇంద్రుడి ఆజ్ఞమేరకు వచ్చాననీ చెప్పి ఇంకా ఇట్లా అన్నాడు.

చ. **'వినుము మదీయ బుద్ధి పృథివీవర! యాజకుఁ గాఁగ నీ మఖం**
బునకు బృహస్పతిం గొనుము; పూర్వదిశాపతి కవ్విధంబు ప్రీ
తి నొసఁగు నట్లు సేయ కవధీరణచేసిత యేని వజ్రముం
బనుచు నతండు నీపయి; సభాసదులున్ వినఁ జాటి చెప్పితిన్.' 90

ప్రతిపదార్థం: పృథివీవర!= ఓ రాజా! (భూపతీ!); మదీయబుద్ధిన్= నేను చెప్పే ఉపదేశాన్ని; వినుము; నీ మఖంబునకున్= నీ యాగానికి; యాజకున్+కాఁగన్= యాజకుడుగా; బృహస్పతిన్+కొనుము= బృహస్పతిని గ్రహించుము; ఆ+విధంబు= అట్లా చేయటం; పూర్వదిశాపతికిన్= ఇంద్రుడికి (తూర్పుదిశకు అధిపతి); ప్రీతిన్+ఒసఁగున్= ప్రియం కలిగిస్తుంది; అట్లు+చేయక= అట్లా చేయకుండా; అవధీరణ= నిర్లక్ష్యం; చేసితివి+ఏని= చేశావో; అతండు= ఆ ఇంద్రుడు; నీపయిన్= నీమీద; వజ్రమున్= వజ్రాయుధాన్ని; పనుచున్= ప్రయోగిస్తాడు; సభాసదులున్= నీ సభలోని వారందరూ; వినన్= వినేటట్లుగా; చాటి చెప్పితిన్= స్పష్టంగా చెప్పాను.

తాత్పర్యం: 'ఓ రాజా! నా మాటను వినుము. నీ యాగానికి ఉపద్రష్టగా బృహస్పతిని గ్రహించుము. అట్లా చేయటం ఇంద్రుడికి ప్రీతిని కలిగిస్తుంది. అట్లా చేయకుండా నిర్లక్ష్యం చేశావో ఇంద్రుడు నీ మీదకు వజ్రాయుధాన్ని పంపుతాడు. ఈ సభలోని వారందరూ వినేటట్లు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాను.'

విశేషం: ధృతరాష్ట్రుడు 'ఈ సభలోనివారు' అంటున్నా ఉద్దేశించినది మాత్రం సంవర్తుడిని మాత్రమే. అతడు వినేటట్లు చెప్పుమని కదా ఇంద్రుడి ఆజ్ఞ!

వ. **అనిన మరుత్తుఁ 'డయ్యమరగురుండ నా। యాగంబు నడపుట కాత్మ రోసి**
రాకున్న సంవర్తుఁ బ్రార్థించి తెచ్చితి;। నింక నట్టులు సేయ కెట్లు వచ్చు
ననఘ! మిత్రద్రోహ మధిక పాపముగాదె?। యిది నీ వెఱుంగు దయ్యింద్రుఁ డెఱుఁగు
సిద్ధసాధ్యాది ప్రసిద్ధులు నెఱుఁగుదు। రిమ్మాట గురునకు నియ్యకోల'

తే. **యనుడు గంధర్వుఁ 'డదె విన నయ్యె వజ్రఘోరనాదంబు నీ కోర్వఁ గలది యగునొ**
కాదొ నీవ యెఱుంగుదు మేదినీశ!। యనుటయును నృపుఁ డాలించి విని భయమున. 91

ప్రతిపదార్థం: అనినన్= అని ధృతరాష్ట్రుడు చెప్పగా; మరుత్తుడు; ఆ+అమర గురుండు= ఆ బృహస్పతి (దేవతల గురువు); నా యాగంబున్= నా యాగాన్ని; నడపుటకున్= నడిపించటానికి; ఆత్మన్+రోసి= మనసులో ఇష్టపడక; రాక+ఉన్నన్= రాకపోతే; సంవర్తున్= ఈ సంవర్త మహర్షిని; ప్రార్థించి తెచ్చితిన్= ప్రార్థించి తెచ్చాను; ఇంకన్= ఇక; అట్టులు+చేయక= అట్లా చేయకుండా; ఎట్లువచ్చున్?= ఎట్లా అవుతుంది?; అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; మిత్రద్రోహము= మిత్రుడికి ద్రోహంచేయటం; అధికపాపము+కాదె?= మిక్కిలి పాపం కాదా?; ఇది= ఈ విషయం; నీవు+ఎఱుంగుదు(వు)= నీకు తెలియును; ఆ+ఇంద్రుఁడు+ఎఱుఁగున్= ఆ ఇంద్రుడికీ తెలియును; సిద్ధ సాధ్యాది= సిద్ధులు, సాధ్యులు మొదలైన; ప్రసిద్ధులు= ప్రసిద్ధ దేవతా గణాలవారూ; ఎఱుఁగుదురు; ఈ+మాట= ఇట్లా స్నేహభావాన్ని కాపాడటం అనే మాట; గురునకున్= ఆ బృహస్పతికీ; ఇయ్యకోలు+అ= సమ్మతమే; అనుడున్= అనగా; గంధర్వుఁడు= ఆ గంధర్వుడు; మేదినీ+ఈశ= ఓ భూపతీ!; అదె= అదిగో; వజ్రఘోరనాదంబు= వజ్రాయుధపు భీకర శబ్దం; వినన్+అయ్యెన్= వినవస్తోంది; నీకున్+ ఓర్వన్+ కలది+అగునొ+కాదొ= నీకు దానిని తట్టుకొనగలశక్తి ఉన్నదో లేదో; నీవు+అ= నీవే; ఎఱుంగుదు(వు)= ఎరుగుదువు (తట్టుకొనలేవని సూచన); అనుటయును= అని అనగా; నృపుఁడు= ఆ రాజు; ఆలించి= ఆ శబ్దం విని; భయమునన్= భయంతో.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు చెప్పగా మరుత్తుడన్నాడు; 'ఆ దేవగురువైన బృహస్పతి నా యాగాన్ని నడిపించటానికి మనసులో ఇష్టపడక రాకపోతే ఈ సంవర్తమహర్షిని ప్రార్థించి తెచ్చాను. ఇక 'అట్లా కాకుండా ఏమి చేయను? ఓ పుణ్యాత్ముడా! స్నేహితుడిని మోసగించటం మిక్కిలి పాపం కదా! ఇది నీకు, ఆ ఇంద్రుడికి, సిద్ధసాధ్యాది పురుషులందరికీ తెలిసిన విషయమే. ఇట్లా చేయటం బృహస్పతికీ సమ్మతమే - ఎందుకంటే ధర్మబద్ధం కాబట్టి' అంటూండగానే ఆ గంధర్వుడు 'ఓ రాజా! అదిగో! వజ్రాయుధం ఈ దిశగా వస్తున్న భీకరశబ్దం వినిపిస్తోంది. తట్టుకొనగల శక్తి ఉన్నదో లేదో నీకు తెలియును కదా!' అనగా ఆ శబ్దం విని మరుత్తుడు, భయంతో- (తరువాతి వచనంతో అన్వయం)

వ. **సంవర్తు నాలోకించి.** 92

తాత్పర్యం : సంవర్తుడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'కులిశము వచ్చుచు నున్నది। యలు కొందెడు నా మనంబు ననఘచరిత! స
భ్యులు సంత్రాసము నొందిరి। తలకొని రక్షింపవలయు దయ మమ్మెల్లన్.' 93

ప్రతిపదార్థం: అనఘచరిత!= పుణ్యచరిత్రుడా!; కులిశము= వజ్రం; వచ్చుచున్+ఉన్నది= వస్తోంది; నా మనంబు+అలుకు+ఒందెడున్= నా మనసు భయపడుతున్నది; సభ్యులున్= ఈ యాగసభలోని వారందరూ; సంత్రాసమున్= భీతిని; ఒందిరి= పొందారు; తలకొని= పూనుకొని; దయన్= కరుణతో; మమ్మున్+ఎల్లన్= మమ్ములను అందరినీ; రక్షింపవలయున్= కాపాడాలి.

తాత్పర్యం: 'ఓ పుణ్యచరిత్రుడా! వజ్రాయుధం వచ్చేస్తున్నది. నా మనసు భయపడుతున్నది. సభ్యులు కూడా భీతిపొందారు. మీరు దయ ఉంచి, పూనికతో ఈ ఆయుధాన్ని ఎదిరించి మమ్ములను కాపాడాలి.'

వ. అనిన విని యమ్మహాయోగీశ్వరుండు. 94

ప్రతిపదార్థం: అనినన్ విని; ఆ+మహాయోగి+ఈశ్వరుండు= ఆ గొప్ప మునిశ్రేష్ఠుడు.

తాత్పర్యం: అని మరుత్తుడు అడుగగా ఆ మహాయోగిపుంగవుడైన సంవర్తుడు. (తరువాతి వచనంతో అన్వయం)

సీ. 'ఇంద్రునిదెస భయం బించుకేనియు వల;। దతఁడు నన్నెఱుఁగఁడే యధిప! వినుము
సంస్తంభవిద్యా ప్రశస్తవైభవమున। వజ్రంబు నడఁతు నవ్వాసవాది
దైవతంబుల యాయుధంబులు నాచేతఁ। బ్రతిహతం బొందు; దుష్ప వనచండ
వృష్టిప్రముఖమహా వికృతుల బాధింతు'। ననుడు 'మ్రోయుచు నిదె యరుగుదెంచె

ఆ. భిదుర మెవ్విధమున భీతి దొఱంగుదు?'। ననియె నృపతి; యాతఁ డల్ల నగుచు
దాని సరుకుగొనకు 'తగు వర; మడుగు నా। తపము పేర్మి నిత్తు ధరణినాథ!' 95

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఇంద్రుని దెసన్= ఇంద్రుడి వలన; భయంబు= భయం; ఇంచుక+ఏనియున్= ఇంచుకైనా; వలదు= వద్దు; అతఁడు= ఆ ఇంద్రుడు; నన్నున్+ఎఱుఁగడే?= నన్ను ఎరుగడా?; వినుము; సంస్తంభ విద్యా ప్రశస్త వైభవమునన్= సంస్తంభ విద్యయొక్క మిక్కిలి గొప్ప శక్తితో; వజ్రంబున్= వజ్రాయుధాన్ని; అడఁతున్= అణచి వేస్తాను; ఆ+వాసవ+ఆది= ఆ ఇంద్రాదులైన; దైవతంబుల= దేవతల; ఆయుధంబులు= ఆయుధాలు; నాచేతన్= నా చేత; ప్రతిహతంబు+ఒందున్= దెబ్బతింటాయి; దుష్పవన= భయంకరమైన సుడిగాలి; చండవృష్టి= ప్రచండమైన వర్షం; ప్రముఖ= మొదలైన; మహావికృతులన్= గొప్ప ప్రకృతి బీభత్సాలతో; బాధింతున్= వారిని హింసిస్తాను; అనుడున్= అన్న వెంటనే; నృపతి= ఆ రాజు; భిదురము= వజ్రాయుధం; మ్రోయుచున్= భీకరంగా మోతపెడుతూ; ఇదె= ఇదిగో - ఈవైపే; అరుగుదెంచెన్= వచ్చింది; ఏ+విధంబునన్= ఎట్లా; భీతిన్+తొఱంగుదున్?= భయం పోగొట్టుకోను?; అనియెన్= అన్నాడు; అతఁడు= ఆ సంవర్తుడు; అల్ల నగుచున్= చిరునవ్వు నవ్వి; ధరణినాథ!= ఓ రాజా!; దానిన్= ఆ ఆయుధాన్ని; సరకు+కొనకు(ము)= లెక్క చేయకుము; తగు వరము= నీకు యోగ్యమైన వరాన్ని; అడుగుము; నా తపము పేర్మిన్= నా తపోబలంతో; ఇత్తున్= ఇస్తాను(అన్నాడు).

తాత్పర్యం: 'ఓ రాజా! ఇంద్రుడి విషయంగా భయం కొంచెం కూడా వద్దు. అతడికి నా గురించి తెలియదా! వినుము. సంస్తంభవిద్యకున్న గొప్పశక్తితో ఆ వజ్రాన్ని అణచివేస్తాను. ఆ ఇంద్రాది దేవతల ఆయుధాలు నా ముందర పనిచేయవు.

సుడిగాలులతో భయంకరమైన వర్షాలతో దేవతాసమూహాన్ని ముప్పుతిప్పలు పెట్టుతాను' అంటుండగానే ఆ రాజు'అయ్యా! ఇదిగో వజ్రాయుధం పెనుమోతతో ఇటు వైపే వస్తున్నది. నాకు భయం కలుగకుండా ఎట్లా ఉంటుంది?' అన్నాడు. అప్పుడు ఆ సంవర్తుడు చిరునవ్వు నవ్వి 'ఓ రాజా! ఆ ఆయుధాన్ని ఒక సరకుగొనకుము. నీకు ఏమి వరం కావాలో అడుగుము. నా తపశ్శక్తితో ఇస్తాను' అన్నాడు.

విశేషం: 'స్తంభనం' అంటే స్తంభింపచేయటం, అంటే కదలకుండా చేయటం. అగ్ని, వాయు, జల స్తంభనాది అనేక విద్యలు చెప్పబడ్డాయి. 'వజ్రం' ప్రయోగించటాన్ని మరుత్తుడు చూచాడు. సంవర్తుడు మంత్రం ప్రయోగించాడు. ఇక వజ్రం స్తంభించిపోయింది. అందుకే దాని వర్ణన లేదు. 'వరం ఏం కావాలో కోరుకొమ్మ' అని అంటున్నాడు. మంత్రశక్తి ఎంత అమోఘమైనదో వర్ణించే పద్ధతి ఇదే.

చ. **అనిన మరుత్తుఁ డిట్లనియె నాతనితో 'భయమెల్లఁ బాసె నే**
నిను వరమర్థి వేఁడెద మనీష విరోధము దక్కి యధ్వరం
బున కిట వచ్చి దైవతవిభుండు నిజోచిత హవ్యభాగముం
గొనియెడు నట్లు గాఁగ మునికుంజర! చిత్తమునం దలంపవే. **96**

ప్రతిపదార్థం: అనినన్= అట్లా సంవర్తుడు అనగా; మరుత్తుఁడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; అతనితోన్= ఆ ఇంద్రుడివలన; భయము+ఎల్లన్= భయమంతా; పాసెన్= పోయింది; మునికుంజర!= ఓ మునిశ్రేష్ఠుడా!; ఏన్= నేను; నినున్= నిన్ను; వరము+అర్థిన్+వేఁడెదన్= ఆసక్తితో వరం అడుగుతున్నాను; దైవతవిభుండు= దేవరాజు (ఇంద్రుడు); మనీషన్= వివేకంతో; విరోధము+తక్కి= విరోధం విడిచి; అధ్వరంబునకున్+ఇట+వచ్చి= మన ఈ యాగానికి వచ్చి; నిజ+ఉచిత= తనకు తగిన; హవ్యభాగమున్= హవ్యభాగాన్ని; కొనియెడున్+అట్లు+కాఁగన్= తీసికొనేటట్లు; చిత్తమునన్= నీ మనసులో; తలంపవే= సంకల్పించుము.

తాత్పర్యం: అపుడు మరుత్తుడు ఇట్లా అన్నాడు. 'మునిశ్రేష్ఠుడా! ఆ ఇంద్రుడి భయం ఇక నాకు లేదు. భక్తి తాత్పర్యాలతో ఒక వరం అడుగుతాను. ఇంద్రుడు తన ధిషణతో ఆలోచించి, ఇకనైనా మనపైన విరోధం చాలించి ఈ యజ్ఞానికి ఇక్కడికి వచ్చి, తనకు రావలసిన హవ్యభాగాన్ని తీసికొనిపోయేవిధంగా మీరు మనస్సులో సంకల్పం చేసికొనండి.

విశేషం: సంవర్తమహర్షి సంకల్పబలం ఎంత ప్రబలమైనదో మరుత్తుడి అనుభవానికి వచ్చింది. అందుకే ఒకసారి సంకల్పించుకొంటే ఇంద్రుడు అనివార్యంగా వస్తాడని తెలుసు. అందుకే ఈ కోరిక. యజ్ఞం చేస్తున్నది దేవతలు సంప్రీతులు కావటానికే. వారితో విరోధం పాటించటం తనకూ అభిమతం కాదు. అందుకే మరుత్తుడు ఇంద్రుడు విరోధం మానివేస్తే చాలని అభిలషిస్తున్నాడు. అంటే ధర్మరాజుకు యజ్ఞం ఎట్లాంటి నిష్కామబుద్ధితో చేయాలో వ్యాసమహర్షి మరుత్తుడి ఈ కథ ద్వారా సూచిస్తున్నాడని అర్థం చేసికొనవచ్చును. ఆ మరుత్తుడి ధనమూ పవిత్రమే, సంకల్పమూ పవిత్రమే, అందుకే అది బ్రహ్మార్పణబుద్ధితో చేయబడినందున సఫలమైనదని తాత్పర్యం.

క. **తమ భాగంబులు దక్కిన । యమరులునుం బ్రీతిఁ గొనఁగ యాగంబు ప్రయో**
గము సుప్రణీతమయి లో । కమనోజ్ఞము గాఁగవలయుఁ గారుణ్యనిధీ!' **97**

ప్రతిపదార్థం: కారుణ్యనిధీ!= కరుణకు నిధి అయిన ఓ సంవర్తమునీ! తమ భాగంబులు= తమ తమ హవిర్భాగాలను; తక్కిన అమరులునున్= తక్కిన దేవతలు కూడా; ప్రీతిన్+కొనఁగన్= ప్రీతితో తీసికొనగా; యాగంబు ప్రయోగము= యజ్ఞకార్యనిర్వహణ; సుప్రణీతమయి= చక్కగా చేయబడినదై; లోక మనోజ్ఞము+కాఁగన్+వలయున్= అతిలోకమనోహరం కావాలి.

తాత్పర్యం: కరుణాసాగరుడవైన ఓ మునీశ్వరా! తమతమ హవిర్భాగాలను తక్కిన దేవతలు కూడా ప్రీతితో తీసికొనాలి. అప్పుడు మన యజ్ఞప్రయోగం చక్కగా చేయబడిన దౌతుంది. ప్రపంచంలోనే అత్యంతమనోహరంగా నిర్వహించబడిన యాగమై శాశ్వతకీర్తిని పొందుతుంది. ఇది నా కోరిక.'

క. అనుటయును 'మదాహ్వానం । బున నింద్రుఁడు సోమపానమున కేతెంచుం
జనుదెంతు రతనితోఁ ద । క్కిన యమరులుఁ దొడఁగు యజ్ఞకృతికి నరేంద్రా!' 98

ప్రతిపదార్థం: అనుటయునున్= అని సంవర్తుడితో మరుత్తుడనగా; అపుడు సంవర్తుడు; నర+ఇంద్ర= ఓ రాజా!; మత్+ ఆహ్వానంబునన్= నా ఆహ్వానంతో; ఇంద్రుఁడు= మహేంద్రుడు; సోమపానమునకున్= సోమపానానికి; ఏతెంచున్= తప్పక వస్తాడు; అతనితోన్+తక్కిన+అమరులున్= అతడి వెంట తక్కిన దేవతలు కూడా; చనుదెంతురు= వస్తారు; యజ్ఞకృతికిన్+తొడఁగు(ము)= యజ్ఞకార్యాన్ని మొదలుపెట్టుము.

తాత్పర్యం: అని మరుత్తుడు అంటే సంవర్తుడు ఇట్లా అన్నాడు. 'ఓ రాజా! నా ఆహ్వానంతో ఇంద్రుడు తప్పక సోమరసాన్ని త్రాగటానికి వస్తాడు. అతడివెంట తక్కిన దేవతలూ వస్తారు. ఇక యజ్ఞాన్ని మొదలుపెట్టుము.'

విశేషం: సోమరసం= 'సోమలత' అని ఒక తీగ ఉన్నది. ఆ తీగను యజ్ఞంలో మంత్రోక్తంగా పిండి రసం తీస్తారు. ఆ రసాన్ని ఋత్విక్కులు, హవిర్భాగం తీసికొనటానికి వచ్చిన దేవతలు కలిసి తాగుతారు. దీనిని సోమపానం అంటారు. అందుకే యాగం చేసినవాడిని సోమయాజి అని, సోమపీథి అని (సోమరసం త్రాగినవాడని) పిలుస్తారు. అది సభాగౌరవానికి సంబంధించిన విషయం.

(మరుత్తుని యజ్ఞంబున హవిర్భాగంబులు గొన నింద్రాదులు వచ్చుట (సం. 14-10-19))

వ. అని పలికి దవ్వులన యవ్వజ్రంబు వారించి గంధర్వునకు వీడుకోలు సేయించి యయ్యోగీంద్రుండు దేవేంద్రుని దేవతలనుం బిలిచె; నమ్మహాత్ముని మహనీయమంత్రశక్తి నాహూతులైన యప్పురుహూతప్రభృతి బృందారకులు ప్రియంబున నరుగుదేర నమ్మునిపతి యనుజ్ఞ నజ్జనపతి వారల నెదుర్కొను తెఱంగు నడపి తానునుగూడ నడచి వారికి నర్ఘ్యపాద్యాదిపూజనంబులు విధివిహిత ప్రకారంబునం జెల్లించె; నమ్మరుత్తుండును మరుత్పతికిం బ్రణమిల్లి 'దేవా! నీవు విజయంచేసి నా జన్నంబు సఫలంబు సేసితి; కృతార్థుండనైతిం గృపాధామ! నా మీఁది యలుక మాని నన్నుం జల్లనిచూడ్కిం జూడు 'మని ప్రార్థించి సంవర్తుం జూపి 'యిత్తాపసపతి బృహస్పతి స్వరూపంబ కావునం గ్రతుయాజకుండుగాఁ బ్రతిగ్రహించితి నని విన్నవించుటయు ననిమిషనాథుండు 'నీ వలనం బ్రీతిం బొందితి; నీతం డయ్యమరగురు నను జుం డతని యట్లగుటకు సందియంబేమి?' యనుచు వికచవదనుండై కనుంగొనిన నమ్మునివరుం డా దివిజవరున కిట్లనియె. 99

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; దవ్వులన్+అ= దూరంగానే; ఆ+వజ్రంబున్= ఆ వజ్రాయుధాన్ని; వారించి= ఆపివేసి; గంధర్వునకున్= ఆ గంధర్వుడైన ధృతరాష్ట్రుడికి; వీడుకోలు+చేయించి= వీడ్కోలు జరిపించి; ఆ+యోగి+ఇంద్రుండు= ఆ ఋషిశ్రేష్ఠుడు; దేవేంద్రునిన్= దేవేంద్రుడిని; దేవతలనున్= దేవతలను; పిలిచెన్= పిలిచాడు; ఆ+మహాత్ముని= ఆ మహనీయుడి; మహనీయ= గొప్ప; మంత్రశక్తిన్= మంత్రబలంతో; ఆహూతులు+ఐన= పిలువబడిన; ఆ+పురుహూత+ప్రభృతి= ఆ ఇంద్రుడు మొదలైన; బృందారకులు= దేవతలు; ప్రియంబునన్= ప్రేమతో; అరుగుదేరన్= రాగా; ఆ+మునిపతి= ఆ ఋషిశ్రేష్ఠుడి; అనుజ్ఞన్= ఆజ్ఞతో;

ఆ+జనపతి= ఆ రాజశ్రేష్ఠుడు; వారలన్= వారిని; ఎదుర్కొను+తెఱంగు+నడపి= ఆహ్వానించే పద్ధతిని నడపి; తానును కూడన్= తాను కూడా; నడచి= నడచివెళ్ళి; వారికిన్= వారికందరికీ; అర్ఘ్యపాద్య+అది= అర్ఘ్యం, పాద్యం మొదలైన; పూజనంబులు= అతిథి మర్యాదలు; విధి విహిత ప్రకారంబునన్= శాస్త్రం విధించిన ప్రకారంగా; చెల్లించెన్= చేశాడు; ఆ+మరుత్తుండునున్= ఆ మరుత్తుడు కూడా; మరుత్+పతికిన్= మరుత్తుల అధిపతి అయిన ఇంద్రుడికి; ప్రణమిల్లి= నమస్కరించి; దేవా!= ఓ స్వామీ!; నీవు; విజయం+చేసి= ఇక్కడికి దయతో వచ్చి; నా జన్నంబు= నా యాగాన్ని; సఫలంబు+చేసితి(వి)= చేశావు; కృత+అర్థుండను+ఐతిన్= నా కోరిక సఫలం అయినది; కృపాధామ!= దయానిలయా; నామీఁది+అలుక+మాని= నా మీద కోపం విడిచి; నన్నున్= నన్ను; చల్లని చూడ్కిన్+ చూడుము+అని= చల్లని చూపులతో చూడుము అని; ప్రార్థించి= ప్రార్థించినవాడై; సంవర్తున్+చూపి= సంవర్త మునీశ్వరుడిని ఇంద్రుడికి చూపించి; ఈ+తాపసపతి= ఈ ఋషీంద్రుడు; బృహస్పతి స్వరూపంబు+అ+కావున= బృహస్పతి స్వరూపమే కాబట్టి; క్రతుయాజకుండు+కాన్+ప్రతిగ్రహించితిన్+అని= ఉపద్రష్టగా తీసికొన్నానని; విన్నవించుటయున్= విన్నవించగా; అనిమిషనాథుండు= దేవతాపతి అయిన ఇంద్రుడు; నీవలనన్+ప్రీతిన్+పొందితిన్= నీ విషయంలో సంతోషం పొందాను; ఈతండు= ఈ సంవర్తుడు; ఆ+అమరగురు+అనుజుండు= ఆ బృహస్పతి తమ్ముడు; అతని+అట్లు+అగుటకున్= అతడివంటివాడే కావటానికి; సందియంబు+ ఏమి?= సందేహం ఏమిటి?; అనుచున్= అంటూ; వికచవదనుండు+ఐ= వికసించిన ముఖం కలవాడై; కనుంగొనినన్= చూడగా; ఆ+మునివరుండు= ఆ సంవర్తుడు; ఆ దివిజవరునకున్= ఆ దేవతాశ్రేష్ఠుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి, సంవర్తుడు ఆ వజ్రాయుధాన్ని అల్లంత దూరంలోనే ఆపివేసి (మరలిపోయేటట్లు చేశాడని అర్థం), గంధర్వరాజుకు వీడ్కోలు జరిపించి, మనసులో ఇంద్రుడిని, సకలదేవతలను పిలిచాడు. ఆ మహనీయుడి మహామంత్రప్రభావంతో పిలువబడిన ఇంద్రాది దేవతలు మరుక్షణంలో అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఆ మహర్షి అనుజ్ఞతో ఆ రాజు వారిని ఆహ్వానించి పూజించాడు. సంవర్తుడు కూడా వారిని అర్ఘ్యపాద్యాదులైన అతిథి మర్యాదలతో సత్కరించాడు. మరుత్తుడు ఇంద్రుడికి నమస్కరించి 'ఓ దేవా! నీవు విచ్చేసి నా యజ్ఞం సఫలం అయ్యేటట్లు చేశావు. నేను ధన్యుడను. దయానిధీ! నామీద కోపం మాని, నన్ను చల్లని చూపులతో చూడుము' అని ప్రార్థించినవాడై సంవర్తమునిని ఇంద్రుడికి చూపాడు. 'ఈ ఋషీంద్రుడు బృహస్పతివారి అపరస్వరూపమే. అందుకే వీరిని ఉపద్రష్టగా ప్రార్థించి పిలుచుకొనివచ్చాను' అని కూడా విన్నవించాడు. అప్పుడు ఇంద్రుడు 'రాజా! ఇప్పుడు నేను చాలా సంతోషం పొందాను. ఈ సంవర్తుడు బృహస్పతి తమ్ముడే కాబట్టి వారివంటివారే అనటంలో సందేహం ఏమిటి?' అంటూ విప్పారిన ముఖంతో వారిని వీక్షించగా ఆ సంవర్తుడు ఇంద్రుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: సంవర్తుడు బృహస్పతి అపర స్వరూపమే అని ఇప్పుడు అంగీకరిస్తున్న ఇంద్రుడికి ఈ జ్ఞానం అప్పుడే ఉంటే ఇంత కథకు అవకాశమే లేదు. యోగశక్తి 'సంకల్పసృష్టి' చేయటానికి సమర్థం అవటానికి నిదర్శనమే ఇంద్రాదుల రాక. బ్రహ్మబలం గొప్ప దనటమే ఇంద్రుడు సంవర్తుడిని మరుత్తుడిని ప్రశంసించటం.

ఆ. 'అఖిలలోకభర్త వమరేంద్ర! నీ విట్టు। లాదరమున వచ్చు టరయ నా త
పంబు ఫలముగాదె! పావనమూర్తి యీ। రాజు క్రతువుఁ బుణ్యరాశి యయ్యె. 100

ప్రతిపదార్థం: అమరేంద్ర! దేవతలలో (మరణం లేనివారిలో) శ్రేష్ఠుడవైన ఓ ఇంద్రా!; అఖిల లోక భర్తవు= నిఖిల లోకాలకూ పాలకుడవు; నీవు+ఇట్టులు+ఆదరమునన్= నీవు ఇట్లా ఆదరంతో; వచ్చుట= రావటం; అరయన్= ఆలోచిస్తే; నా తపంబు+ఫలము+కాదె= నాతపఃఫలంకాదా!; పావనమూర్తి+ఈరాజు+క్రతువు= పవిత్రుడైన ఈ రాజుయాగం; పుణ్యరాశి+అయ్యెన్= పున్నెపు ప్రోవు అయినది.

తాత్పర్యం: 'మహేంద్రా! మీరు నిఖిలలోకాలకు పాలకులు. అటువంటి మీరు ఆదరంతో ఇక్కడికి రావటం చూస్తే నా తపస్సు ఫలించిం దన్న సంతోషం కలుగుతున్నది. పవిత్రుడైన ఈ రాజు యాగం మీ రాకతో సఫలం అయింది. పుణ్యప్రదం అయింది.

చ. సకలవిధానదక్షుఁడవు సర్వము నారసి చేయఁ బంపు నీ
సకృపవిలోకనంబులను సార్థములై క్రతుమంత్రతంత్రముల్
వికలత లేక చెల్లు జనవిశ్రుతుఁ డీ నృపుఁడున్ భవద్దయన్
సుకృతులలోనఁ బెంపు గని చూడఁ గనుం దగఁ బుణ్యలోకముల్.' 101

ప్రతిపదార్థం: సకల విధాన దక్షుఁడవు= సకల ధర్మాలూ తెలిసి రక్షించే వాడవు; సర్వమున్= అన్నిటినీ; అరసి= చూచి; చేయన్+పంపు= చేయటానికి సమర్థంగా ఆజ్ఞాపించే; నీ; కృపతో కూడిన; విలోకనంబులను= చూపులతో; క్రతుమంత్రతంత్రముల్= యజ్ఞసంబంధమైన మంత్రాలు తంత్రాలు; స+అర్థములు+ఐ= అర్థవంతాలై; వికలత లేక= ఏ లోపమూ లేకుండా చెల్లున్= ప్రయోగం పొందుతాయి; జనవిశ్రుతుఁడు= లోకంలో ప్రసిద్ధుడైన; ఈనృపుఁడున్= ఈరాజుకూడా; భవత్+దయన్= మీ దయతో; సుకృతులలోనన్= పుణ్యాత్ములలో; పెంపు+కని= అతిశయించి; తగన్= తగినట్టుగా; పుణ్యలోకముల్= పుణ్యలోకాలు; చూడన్+కనున్= చూడగలుగుతాడు.

తాత్పర్యం: అంతేకాదు; నీవు సకలధర్మాలు తెలిసి సంరక్షించేవాడవు. కృపతో కూడిన నీ చూపులు అన్ని దిక్కులా ప్రసరిస్తూ తంత్రనిర్వహణసమర్థాలై వేదమంత్రాలను సార్థకాలుగా, ఏ లోపాలూ లేనివిగా చేస్తాయి. లోకంలో ప్రసిద్ధుడైన ఈ రాజు కూడా మీ దయతో పుణ్యాత్ములలో ఒకడై అతిశయించాడు. పుణ్యలోకాలను పొందే భాగ్యాన్ని కలిగినవా డయ్యాడు.'

విశేషం: 'సమేంద్రో మేధయాశ్నృణోతు' అని తైత్తిరీయం చెప్తున్నది. ఇంద్రుడు మేధను స్ఫురింపజేస్తాడు. దీనివలననే ఉచ్చారణ జరిగేది. మంత్రాలతో ముడిపడింది తంత్రం. యజ్ఞనిర్వహణకు మూలం ఈ మంత్ర స్ఫురణ, ఇది సహస్రముఖమైన జాగరూకతగా ఉంటుంది. అందుకే ఇంద్రుడికి 'సహస్రాక్షు'డని వైదికమైన ప్రసిద్ధి ఉన్నది. తరువాతి పురాణాలలో ఈ వైదికార్థం పోయి అహల్యాజారుడు కావటంవలన 'సహస్రభగు' డయ్యాడని కథలు చెప్పబడ్డాయి. ఈ మౌలికమైన వైదికార్థం ఈ పద్యంలో అత్యద్భుతంగా సూచించబడింది.

వ. అని యిట్లు నిభృతుండై యభివర్ణపూర్వకంబుగా సంభాషణం బాచరించిన. 102

ప్రతిపదార్థం: అని+ఇట్లు= అని ఈ విధంగా; నిభృతుండు+ఐ= వినయంతో; అభివర్ణన పూర్వకంబుగాన్= ప్రశంసాపూర్వకంగా; సంభాషణంబు+ఆచరించినన్= మాటాడగా.

తాత్పర్యం: ఈ విధంగా సంవర్తుడు వినయంతో ప్రశంసాపూర్వకంగా మాటాడాడు. (ఆ తరువాతి పద్యంతో అన్వయం)

సీ. భూరి హర్షంబునఁ బొంది పురందరుం। డమృతాశనులఁ గలయంగఁ జూచి
'యజ్ఞవాటం బుదాత్తాభిరామంబుగఁ। జేయింపుఁ, డప్సరః స్త్రీ జనంబు
నాట గంధర్వుల పాట జెల్లింపుఁడు। నావుడు వా రట్ల నడపి, మఱియు
సకలకర్మములకు సాహాయ్య మాచరిం। పంగ వేఱొక యగ్ని భంగి వెలఁగి

తే. లలితసముచితపీఠ మలంకరించి। వేడ్క సంవర్తముని హావిర్విధి యొనర్ప
యాగముజ్జ్వలమును సుప్రయోగకంబు। నగుచు నొప్పారె భరతకులాగ్రగణ్య! 103

ప్రతిపదార్థం: భరత కుల+అగ్రగణ్య!= భరతవంశ శ్రేష్ఠుడా! (వినుము); పురందరుండు= ఇంద్రుడు; భూరి హర్షంబునన్+పొంది= మిక్కుటమైన సంతోషం పొంది; అమృత+అశనులన్+కలయంగన్+చూచి= దేవతలను బాగా పరికించి చూచి; యజ్ఞవాటంబు= యజ్ఞవాటికను; ఉదాత్త+అభిరామంబుగన్= గొప్పగాను, అందంగానూ; చేయింపుఁడు= తీర్చండి; అప్సరస్+స్త్రీ జనంబు+ఆట= అప్సరసల నృత్యం; గంధర్వులపాట= గంధర్వుల గానం; చెల్లింపుఁడు= జరిపించండి; నావుడున్= అనగా; వారు; అట్లు+అ= అట్లాగే; నడిపి= నడిపించి; మఱియున్= ఇంకా; సకలకర్మములకున్= యజ్ఞసంబంధమైన అన్ని పనులకు; సాహాయ్యము+ఆచరింపంగన్= సహాయం చేయగా; సంవర్తముని= సంవర్తమహర్షి; వేఱు+ఒక= రెండవ; అగ్నిభంగిన్= అగ్నివలె; అగ్నివలె; వెలిఁగి= ప్రకాశించి; లలిత= మనోహరమైన; సముచిత= తగిన; పీఠము= ఆసనం; అలంకరించి= గ్రహించి; హవిస్+విధి= యాగవిధి; వేడ్కన్= వేడుకతో; ఒనర్పన్= జరిపించగా; యాగము= ఆ యాగం; ఉజ్జ్వలమునున్= మిక్కిలి ప్రకాశించినదీ; సుప్రయోగకంబున్+అగుచున్= చక్కగా నిర్వహింపబడినదీ అయి; ఒప్పారెన్= అతిశయించింది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆ విధంగా సంవర్తుడు ప్రశంసించగా ఇంద్రుడు ప్రసన్నుడై, దేవతలనందరినీ చూచి 'యజ్ఞవాటికను మహనీయంగానూ మనోహరంగానూ తీర్చిదిద్దండి. అప్సరఃస్త్రీలనాట్యం, గంధర్వుల గానం ఏర్పాటు చేయండి' అని ఆజ్ఞాపించాడు. వారు అట్లాగే చేసి, యజ్ఞకార్యనిర్వహణలో కూడా సహకారం అందించగా యజ్ఞం ప్రారంభమైనది. సంవర్తమహాముని మరొక అగ్నివలె ప్రకాశిస్తూ సముచితమైన ఆసనంమీద కూర్చుని యాగవిధిని నడిపిస్తుండగా యాగం మహావైభవంగా శాస్త్రవిధి ప్రకారం చక్కగా నిర్వహించబడినదై మిక్కిలి అతిశయించింది.

తే. ప్రీతిఁ బేర్వేరఁ బిలిచి చేసేఁత సోమ। మమ్మహాయోగి యంది యీ నెమ్మిఁ బాన
మాచరించి సహస్రనేత్రాదులైన। యమరు లానందమునఁ దేలి రథిపముఖ్య! 104

ప్రతిపదార్థం: అధిపముఖ్య!= మహారాజా!; ఆ+మహాయోగి= ఆ సంవర్తముని; ప్రీతిన్= ప్రేమతో; పేరు+పేరన్= పేరు పేరునా; పిలిచి= పిలిచి (దేవతలను పేరుపెట్టి పిలిచాడని అర్థం); చేసేఁతన్= ఒక్కొక్కరికీ తానుగా; సోమము= సోమరసాన్ని; అంది+ఈన్= అందివ్వగా; నెమ్మిన్= ప్రీతితో; సహస్రనేత్ర+ఆదులు+ఐన= ఇంద్రాదులైన; అమరులు= దేవతలందరూ; పానము+ఆచరించి= త్రాగి; ఆనందమునన్= ఆనందంతో; తేలిరి= ఓలలాడారు.

తాత్పర్యం: ధర్మరాజా! ఆ సంవర్తముని ఆదరంతో స్వయంగా సోమరసాన్ని పేరు పేరునా పిలిచి దేవత లందరికీ అందిచ్చాడు. ఇంద్రాది దేవతలంతా ఎంతో ప్రేమతో రసాన్ని పానంచేసి, ఆనందసాగరంలో ఓలలాడారు.

వ. ఇట్లు మరుత్తుండు మరుత్పతికిం బరమతృప్తి గావించి యామంత్రణంబు సేయ నయ్యందఱు నభినందించి నిజ నివాసంబులకుం జని; రజ్జననాథుండు. 105

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; మరుత్తుండు; మరుత్పతికిన్= ఇంద్రుడికి; పరమతృప్తి కావించి= మిక్కిలి సంతోషాన్ని కలిగించి; ఆమంత్రణంబు+చేయన్= వీడ్కోగా; ఆ+అందఱున్= ఆ దేవతలందరూ; అభినందించి= ఆ మరుత్తుడిని ప్రశంసించి; నిజ నివాసంబులకున్= తమ తమ నివాసాలకు; చనిరి= వెళ్ళిపోయారు; ఆ+జననాథుండు= ఆ మహారాజు.

తాత్పర్యం: ఈ విధంగా మరుత్తుడు ఇంద్రుడిని సంతోషపెట్టాడు. చివరికి సంవర్తుడు, మరుత్తుడు దేవతలందరినీ వీడ్కొన్నారు. ఆ అమరులు వీరిని ప్రశంసించి, తమతమ నివాసాలకు వెళ్ళిపోయారు. అప్పుడు ఆ మరుత్తుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. **యజనము సెల్లుకాలము సమాప్తతఁ బొందిననాఁడు తద్ద య**
క్కజమగు భంగిఁ బ్రస్ఫురితకాంచన రాసు లనేకముల్ బహు
ద్విజులకు భక్తియుక్తియును వేడుకయున్ వినయంబు నొప్ప సం
భజనపరాత్ముఁడై యొసఁగెఁ బౌరవవంశపయోధిచంద్రమా! **106**

ప్రతిపదార్థం: పౌరవవంశ+పయోధి+చంద్రమా!= పురువంశమనే సముద్రానికి చంద్రునివంటి ఓ జనమేజయ మహారాజా!; (ఆ రాజు) యజనము+చెల్లు కాలము= యాగం జరుగుతున్న సమయం; సమాప్తతన్+పొందిననాఁడు= సమాప్తి అయిన రోజున; తద్ద= మిక్కిలి; అక్కజము+అగు భంగిన్= ఆశ్చర్యం కలిగే విధంగా; ప్రస్ఫురిత= ప్రకాశిస్తున్న; కాంచనరాసులు= బంగారు రాసులను; అనేకముల్= చాలా వాటిని; బహు= అనేకులైన; ద్విజులకున్= బ్రాహ్మణులకు; భక్తి యుక్తియునున్= భక్తితోకూడుటయూ; వేడుకయున్= వేడుకా; వినయంబున్= వినయమూ; ఒప్పన్= ప్రకాశించగా; సంభజన పరాత్ముఁడు+ఐ= సేవాపరమైన చిత్తం కలవాడై; ఒసఁగెన్= దక్షిణగాఇచ్చాడు.

తాత్పర్యం: మహారాజా! ఆ విధంగా దేవతలు వెళ్ళిపోయిన తరువాత కూడా యాగం జరిగింది. యాగం పూర్తి అయిపోయిన రోజున అందరికీ మిక్కిలి ఆశ్చర్యం కలిగేటట్లు ఎన్నో బంగారు రాసులను ఎందరో బ్రాహ్మణులకు భక్తితో, వేడుకతో, వినయంతో మిక్కిలి ప్రశంసతో దక్షిణగా ఇచ్చాడు.

తే. **అంతఁ బోవక హేమమమత్వమహిత। యజ్ఞవాట భాండాది పదార్థములును**
బ్రాహ్మణావళి కిచ్చె నప్పాట నతఁడు। హిమగిరిప్రాంతమునఁ గ్రతు వెలమిఁ జేసి. **107**

ప్రతిపదార్థం: హిమగిరి ప్రాంతమునన్= హిమాలయప్రాంతంలో; క్రతువు= యాగం; ఎలమిన్= ప్రీతితో; చేసి= చేసినవాడై; అతఁడు= ఆ మరుత్తుడు; అంతన్+పోవక= అంతటితో ఆగకుండా; హేమమయత్వ= బంగారుతో చేయబడిన; మహిత= గొప్పవైన; యజ్ఞవాట= యజ్ఞవాటిక; భాండ+ఆది= కుండలు, స్రుక్కులు మొదలైన; పదార్థములును= పదార్థాలను; బ్రాహ్మణావళికిన్= బ్రాహ్మణ సమూహానికి; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: హిమాలయాలలో యాగం పూర్తిచేసినవాడై ఆ మరుత్తుడు అంతటితో ఆగకుండా బంగారుతో చేసిన గొప్పదైన యజ్ఞవాటికను (అందులోని సర్వభాగాలను), కుండలు, స్రుక్కులు మొదలైన పరికరాలను కూడా వదలకుండా అన్ని పదార్థాలను బ్రాహ్మణసమూహాన్ని పిలిచి దానంగా ఇచ్చివేశాడు.

వ. **సంవర్తునిచేత ననుజ్ఞాతుండై నిజపురంబునకు నరుగుదెంచి వార్ధివేష్టిత వసుంధరావలయంబునం బుణ్యపరత వెలయం బాలించె; బ్రాహ్మణులుఁ దమ యోపినంతయుం బసిండి ద్రవ్వితండంబులు దెచ్చుకొని తక్కినదాని నచ్చట నొక్కెడ నిధిగా నిక్షేపించి దీనిం గాలాంతరంబున నెవ్వరేనిం గని లిదియక్కనిన వారిధనంబ యని రమ్మహాకాంచన**

సంచయంబు గొనివచ్చి విచ్చలవిడి నశ్వమేధయాగంబున సకలదేవతలం దృప్తులంజేయు' మనియె; నట్లు వేదవ్యాసమునీశ్వరుండు సెప్పిన వచనంబులు వినియును బంధువిషయ శోకంబునం గ్రమ్మఱం దెలివి నొందియు నొందక ధూమంబు వొదివిన యనలంబునుంబోలె నున్న పాండవాగ్రజుం గనుంగొని కమలనాభుండు. 108

ప్రతిపదార్థం: సంవర్తునిచేతన్= సంవర్తుడిచేత; అనుజ్ఞాతుండు+ఐ= అనుమతింపబడినవాడై; నిజపురంబునకున్= తన నగరానికి; అరుగుదెంచి= తిరిగివచ్చి; వార్ధివేష్టిత= సముద్రంచేత చుట్టుకొనబడిన; వసుంధరా వలయంబునన్= భూమిలో; పుణ్యపరత వెలయన్= పుణ్యంపట్ల తాత్పర్యం కలిగేటట్లు; పాలించెన్= పరిపాలన చేశాడు; బ్రాహ్మణులున్= బ్రాహ్మణులు కూడా; తమ+ఓపినంతయున్= తాము మోయగలిగినంత; పసిండిన్= బంగారును; త్రవ్వి తండంబులు= కుప్పలుగా; తెచ్చుకొని= తమ ఇళ్ళకు తెచ్చుకొని; తక్కినదానిన్+అచ్చటన్+ఒక్క+ఎడన్= తక్కిన బంగారును అక్కడ ఒకచోట; నిధిగాన్= నిధిగా; నిక్షేపించి= దాచిపెట్టి; దీనిన్= దీనిని; కాలాంతరంబునన్= తరువాతి కాలంలో; ఎవ్వరేనిన్+కనిరి= ఎవరు చూస్తారో; ఇది= ఈ నిధి; ఆ+కనినవారి= ఆ చూచినవారి; ధనంబు+ఆనిరి= ధనమే అన్నారు; ఆ+మహాకాంచన సంచయంబున్= ఆ గొప్ప బంగారు రాశిని; కొనివచ్చి= తీసికొనివచ్చి; విచ్చలవిడిన్= విచ్చలవిడిగా; అశ్వమేధ యాగంబునన్= అశ్వమేధయాగంతో; సకలదేవతలన్= దేవతలందరినీ; తృప్తులన్+చేయుము+ అనియెన్= సంతోషింపజేయుము అన్నాడు; అట్లు= ఆ విధంగా; వేదవ్యాసమునీశ్వరుండు= వేదవ్యాస మహాముని; చెప్పిన వచనంబులు= చెప్పిన మాటలు; వినియును= వినికూడా; బంధువిషయ శోకంబునన్= బంధుమృతిజన్యమైన విషాదంలో; క్రమ్మఱన్= మరల; తెలివిన్+ఒందియున్+ఒందక= తెలివి పొందీ పొందక; ధూమంబు+పొదివిన= పొగ క్రమ్మిన; అనలంబునున్+పోలెన్= నిప్పువలె; ఉన్న పాండవ+అగ్రజున్= ఉన్నటువంటి ధర్మరాజును; కనుంగొని= చూచి; కమలనాభుండు= కృష్ణుడు (ఇట్లా అన్నాడు.)

తాత్పర్యం: సంవర్తుడి చేత అనుమతింపబడినవాడై తన నగరానికి మరుత్తుడు చేరుకొని, లోకంలో పుణ్యకార్యాలపట్ల తాత్పర్యం కలిగే విధంగా ధర్మంగా పరిపాలన చేశాడు. ఆ బ్రాహ్మణులు కూడా తాము మోయగలిగినంత బంగారును ఇళ్ళకు తెచ్చుకొని, తక్కినదానిని అక్కడే ఒకచోట నిధిగా దాచిపెట్టి 'దీనిని తరువాతి కాలంలో ఎవరు కనుగొంటారో వారిదే ఈ నిధి' అని అందరూ ఒకమాటగా అన్నారు. ఆ మహాకాంచనరాశిని తీసికొనివచ్చి, యథేష్టంగా వాడి, అశ్వమేధయాగంచేసి దేవతలను సంతోషింపజేయుము - అని వ్యాసమహర్షి చెప్పిన మాటలను వినికూడా బంధువుల మృతివలన పుట్టిన శోకంలో మరలా మునిగిపోయి తెలివి పొందీపొందని స్థితిలో ఉన్న ధర్మరాజు పొగక్రమ్మిన నిప్పువలె కనిపించాడు. అట్లాంటి ధర్మరాజుతో కృష్ణుడు ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. **'వంకయైన తలం పెల్ల వసుమతీశ! । యరయ మృత్యుపదం బగు నార్జవాన్వి**
తంబు బ్రహ్మపదం బింత తథ్య మేల । యీఱతాఱ తలంపుల బీఱవాఱ? 109

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ= భూనాథా! రాజా; వంక+ఐన= వంకరగా ఉన్న; తలంపు+ఎల్లన్= అన్ని ఆలోచనలూ; అరయన్= ఆలోచించగా; మృత్యుపదంబు+అగున్= మృత్యువుకు దారితీస్తాయి; ఆర్జవా+అన్వితంబు= ఋజుత్వంతో కూడినది; బ్రహ్మపదంబు= జ్ఞానానికి దారి; ఇంత+తథ్యము= ఇంత మాత్రం నిజం; ఈఱతాఱ= తారుమారైన; తలంపులన్= ఆలోచనలతో; బీఱు+పాఱన్= బాధపడటం; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: 'ఓ రాజా! వంకర ఆలోచనలు మృత్యువుకు దారితీస్తాయి. బ్రహ్మపదానికి దారి ఎప్పుడు ఋజువుగా (నేరుగా) ఉంటుంది. ఇది నిజం, అట్లాంటప్పుడు తారుమారైన ఆలోచనలతో ఏడుస్తూ కూర్చోవటం ఎందుకు?

విశేషం: ఇక్కడ ప్రస్తావించిన మృత్యువు, బ్రహ్మం అనే భావనలు భారతసారాన్ని తెలుపుతాయి. వంకర కానిది ఋజువు. ధర్మపథం ఎప్పుడూ వంకరటింకరగా ఉండదు. అందుకే అది సత్యం మీద ఆధారపడి ఉంటుంది. అధర్మం వంకరటింకరగా ఉన్న దారి మీద నడుస్తుంది. దుర్యోధనాదుల దుశ్చేష్టలు - వారు పడ్డ పరాభవాలు వంకర మార్గానికి సూచికలు. ధర్మరాజాదులు ధర్మాన్ని ఆశ్రయించి విజయం పొందినా వారిలోనూ అహంకారమమకారాలతో కూడిన ఆలోచనలు మిగిలే ఉన్నాయి. వాటినే కృష్ణుడు గుర్తు చేస్తున్నాడు. 'ఈ ఊగిసలాటనుండి బయటపడితేనే నీవు జ్ఞానం వైపు ప్రయాణం చేస్తా'వని కృష్ణుడు ప్రబోధిస్తున్నాడు. ఇక్కడ మృత్యువు దుఃఖానికి, బ్రహ్మం ఆనందానికి సంకేతాలు, మొదటిది బంధరూపం. రెండవది విముక్తిరూపం.

క. కర్మానుష్ఠానంబును। నిర్మలముగ నడపఁ బడదు నీచే విను మో
ధర్మతనూభవ! వగయును। నిర్మూలము సేయ విది మనీష గలిమియే? 110

ప్రతిపదార్థం: ఓ ధర్మతనూభవ!= ఓ ధర్మరాజా!; నీచేన్= నీచేత; కర్మ+అనుష్ఠానంబును= కర్మచేయటం; నిర్మలముగన్= నిర్మలంగా; నడపఁబడదు= చేయబడదు; వగయును= దుఃఖాన్నికూడా; నిర్మూలము+చేయవు= మాపుకొనవు; ఇది= ఇట్లాచేయటం; మనీష= తెలివి; కలిమియే?= ఉన్నదనటానికి నిదర్శనమా?

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీవు నిర్మలంగా ఏ పనీ చేయవు. కనీసం దుఃఖాన్నీ మాపుకోలేకపోయావు. నీ వివేకమంతా ఏమయింది? ఇది ఏమిటి?

క. వగ నిర్మూలము సేయమి యెట్లంటేని నీ వంతశ్శత్రువుల నెఱుంగవు గాదె! కావున నేతద్విషయం బైన యొక్క
యితి హాసంబు గల దాకర్ణింపుము. 111

ప్రతిపదార్థం: వగ= దుఃఖాన్ని; నిర్మూలము+చేయమి= పోగొట్టుకొనకపోవటం; ఎట్లు+అంటే; నీవు; అంతస్+శత్రువులన్= లోపలి శత్రువులను; ఎఱుంగవు+కాదె!= ఎరుగవు కదా!; కావునన్= కాబట్టి; ఏతద్+విషయంబు+ఐన= దీనికి సంబంధించిన; ఒక్క; ఇతిహాసంబు+కలదు= ఒక కథ ఉన్నది; ఆకర్ణింపుము= వినుము

తాత్పర్యం: నీవు దుఃఖం నిర్మూలనం చేసుకోలేక పోతున్నావు. కారణం. నీకు లోపలి శత్రువులున్నారని తెలియదు కదా! దీనికి సంబంధించిన ఒక కథ ఉన్నది. చెప్పుతాను.

విశేషం: దుఃఖం పోకపోవటానికి; లోపలి శత్రువులకు సంబంధం ఏమిటి? సంబంధం ఉన్నది. కామక్రోధలోభాది గుణాలు ఈర్ష్యాసూయలను, కర్తృత్వభావనను కలిగించి ఉత్సాహం పెంచినట్టే నిరుత్సాహాన్ని కలిగించి, దుఃఖహేతువులూ అవుతాయి. కనుక కృష్ణుడు అంతఃశత్రువులను గురించి ప్రస్తావిస్తున్నాడు.

(శ్రీకృష్ణుఁడు ధర్మరాజునకు మనస్తాపోపశమంబు సేయుట (సం.14-11-7))

సీ. అవని యెల్లను వృత్రుఁ డాక్రమించి తదీయ। గుణమగు గంధంబు గొనిన వజ్రి
వానిపై వజ్రంబు వైనఁ గ్రమంబున। నంబుతేజః పవనాంబరముల
యందుఁ బ్రవేశించి యందుల రసరూప। సంస్పర్శశబ్దముల్ చండవిక్ర
ముండైన యతఁడు సముద్ధతిఁ గొనఁగొనఁ। దొడ్తోడ నమ్మహేంద్రుండు గులిశ

ఆ. నిహతి వెలువరింప నిర్భరవేగుఁడై। యతనిలోను సొచ్చె నసుర దాన
మూర్ఛ వోయె దివిజముఖ్యుండు బోధితుఁ। జేసె మంత్రవిధి వసిష్ఠుఁ డతని. 112

ప్రతిపదార్థం: అవని+ఎల్లనున్= భూమినంతా; వృత్రుఁడు= వృత్రాసురుడు; ఆక్రమించి= ఆక్రమించుకొని; తదీయ= భూమికి సంబంధించిన; గంధంబున్+కొనినన్= గంధగుణాన్ని గ్రహించగా; వజ్రి= ఇంద్రుడు; వానిపైన్= ఆ వృత్రునిపై; వజ్రంబున్+వైవన్= వజ్రాయుధాన్ని ప్రయోగించగా; క్రమంబుననన్= క్రమంగా; అంబు= నీళ్ళు; తేజస్= అగ్ని; పవన= వాయువు; అంబరములు+అందున్= ఆకాశం - వీటిలో; ప్రవేశించి= దూరి; అందులు= అందున్న (అంటే తక్కిన నాలుగు భూతాలలోని); రస= నీటిలోని రసగుణాన్ని; రూప= అగ్నిలోని రూపగుణాన్ని; సంస్పర్శ= వాయువులోని స్పర్శగుణాన్ని; శబ్దముల్= ఆకాశంలోని శబ్దగుణాన్ని; చండ విక్రముండు+ఐన= మిక్కిలి పరాక్రమవంతుడైన; అతఁడు= ఆ వృత్రుడు; సముద్ధతిన్= విజృంభణతో; కొనన్+కొనన్= గ్రహించివేయగా; తోడ్తోడన్= వెనువెంటనే; ఆ+మహేంద్రుండు= ఆ ఇంద్రుడు; కులిశ+నిహతిన్= వజ్రప్రహారంచేత; వెలువరింపన్= అతడిని బయటికి లాగగా; నిర్భర వేగుఁడై= అమితమైన వేగం కలవాడై; అసుర= ఆ రాక్షసుడు; అతనిలోను+చొచ్చెన్= ఆ ఇంద్రుడిలోనే దూరాడు; దానన్= దానిచేత; దివిజముఖ్యుండు= దేవతాముఖ్యుడైన ఇంద్రుడు; మూర్ఛ+పోయెన్= మూర్ఛపోయాడు; వసిష్ఠుఁడు= వసిష్ఠమహర్షి; అతనిన్= ఆ ఇంద్రుడిని; మంత్రవిధిన్= మంత్రప్రయోగంతో; బోధితున్+చేసెన్= మూర్ఛదేర్చాడు.

తాత్పర్యం: ఒకప్పుడు వృత్రాసురుడు భూమి నంతా ఆక్రమించుకొని, భూమిలోని గంధగుణాన్ని లాగివేశాడు. అపుడు ఇంద్రుడు వాడిమీద వజ్రం ప్రయోగించాడు. వాడు క్రమంగా భూమిని వదలి తక్కిన నాలుగు భూతాలను ఆశ్రయించాడు. వరుసగా నీటిలోని రసాన్ని, అగ్నిలోని రూపాన్ని, వాయువులోని స్పర్శను, ఆకాశంలోని శబ్దాన్ని సంపూర్ణంగా గ్రహించివేశాడు. వెనువెంటనే ఇంద్రుడు మరలా వ్రజాన్ని ప్రయోగించాడు. అపుడు ఆ భూతాలలో దాగికొన్న వృత్రుడు బయటికి వచ్చాడు. వచ్చి ఇంద్రుడిలోనే దూరాడు. దానితో ఇంద్రుడే మూర్ఛపోయాడు. చివరికి వసిష్ఠమహర్షి మంత్రప్రయోగంతో ఇంద్రుడు తెలివి పొందాడు.

వ. ఇట్లు వసిష్ఠప్రయుక్త మంత్రశక్తిం బ్రబుద్ధుండైన వృద్ధశ్రవుండు శరీరాంతర్గతుం డైన వృత్రు సదృశంబైన వజ్రంబున వధియించె; నవ్వాసవుం డీ ధర్మరహస్యంబు తెఱంగు మునుల కెఱింగించె; మునులు నాకుం జెప్పిరి; మానవేశ్వర! దీని నీవు దెలిసికొను' మని పలికి యప్పాండవాగ్రజునితో నప్పుండరీకాక్షుండు వెండియు నిట్లనియె. 113

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వసిష్ఠ= వసిష్ఠుడిచేత; ప్రయుక్త= ప్రయోగింపబడిన; మంత్ర= మంత్రముయొక్క; శక్తిన్= బలంచేత; ప్రబుద్ధుండు+ఐన= మేల్కొన్న; వృద్ధశ్రవుండు= ఇంద్రుడు; శరీర= అంతర్గతుండు+ఐన= లోపల ఉన్న; వృత్రున్= వృత్రాసురుడిని; అదృశ్యంబు+ఐన= కనిపించని; వజ్రంబునన్= వజ్రంతో; వధియించెన్= చంపాడు; ఆ+వాసవుండు= ఆ ఇంద్రుడు; ఈ ధర్మరహస్యంబు తెఱంగు= ఈ ధర్మ సూక్ష్మ విధానాన్ని; మునులకున్= ఋషులకు; ఎఱింగించెన్= చెప్పాడు; మునులు= ఆ ఋషులు; నాకున్+చెప్పిరి= నాకు చెప్పారు; మానవ+ఈశ్వర!= ఓ ధర్మరాజా!; దానిన్= ఆ అంతశ్శత్రుస్వభావాన్ని; నీవు; తెలిసికొనుము+అని= తెలిసికొనుమని; పలికి; ఆ+పాండవ+అగ్రజునితోన్= ఆ ధర్మరాజుతో; ఆ+పుండరీకాక్షుండు= ఆ కృష్ణుడు; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా వసిష్ఠుడు ప్రయోగించిన మంత్రబలంతో మేల్కొన్న మహేంద్రుడు తన లోపల ఉన్న వృత్రాసురుడిపై కనిపించని వజ్రం ప్రయోగించి చంపాడు. ఆ విషయాన్ని ఇంద్రుడు ఋషులకు చెప్పగా వారు నాకు చెప్పారు. ధర్మరాజా! ఈ ధర్మ సూక్ష్మాన్ని గ్రహిస్తే అంతశ్శత్రుస్వభావం నీకు అవగత మవుతుంది' అంటూ మరలా కృష్ణుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **'శారీరమును మానసంబును నా రెండు। దెఱఁగులై వ్యాధి వర్తించు; నందు**
విను వాతమును బిత్తమును సమ। త్వంబుఁ బొందిన యప్డు స్వస్థుఁ డగు న
రుం; డవి మూఁట నొక్కండైన వికృతి నొం। దిన శరీరవ్యాధి యనఁగ బరఁగు;
సత్త్వరజస్తమస్సమత సుస్థితి; విష। మత మనోవ్యాధి; యీ ద్వితయమునకు

ఆ. **నొంటి దోఁచు టెపుడు నొదవ; దన్యోన్య సం। జనకజన్యభావసత్తఁ జేసి**
వికృతికాల మొకట నొకటి దోఁచునది వా। తాదులందు గుణములందు నధిప! **114**

ప్రతిపదార్థం: అధిప!= రాజా! వినుము; శారీరమును= శరీర సంబంధమైనది; మానసంబును= మనస్సుకు సంబంధించినది; నాన్= అని; వ్యాధి= రోగం; రెండు తెఱఁగులు+ఐ= రెండు విధాలుగా; వర్తించుచుండున్= ఉంటుంది; వాతమునున్= వాతం; పిత్తమునున్= పిత్తం (నడుమ 'శ్లేష్మం'); సమత్వంబున్+పొందినన్= సమస్థితిలో ఉంటే; అప్డు= ఆ సమయంలో; నరుండు= మనిషి; స్వస్థుఁడు+అగున్= ఆరోగ్యంగా ఉంటాడు; అవి మూఁటన్= ఆ మూటిలో; ఒక్కండు+ఐనన్= ఒక్కటి అయినా సరే; వికృతిన్+ఒందినన్= వికారం పొందితే; శరీరవ్యాధి+అనఁగన్+పరఁగున్= శరీరవ్యాధి అని పిలవబడుతుంది; (అట్లాగే); సత్త్వ= సాత్త్విక; రజన్= రాజసిక; తమస్= తామసిక (గుణాల); సమత= సమత్వం; సుస్థితి= మానసిక స్వస్థతకు నిదర్శనం; విషమత= వాటిలో ఏదో ఒకటి గాడితప్పటం; మనోవ్యాధి= మానసిక వ్యాధి అవుతుంది; ఈ ద్వితయమునకున్= ఈ రెండు రోగాలకూ; ఒంటిన్+తోఁచుట= ఏదో ఒకటి మాత్రమే కనిపించటం; ఎపుడున్+ఒదవదు= ఎపుడూ ఉండదు (ఎందుకంటే); అన్యోన్య= ఒకదానికొకటి; సంజనక+జన్య భావ సత్తన్+చేసి= ఒకదానినుంచి మరొకటి పుట్టే లక్షణం కలిగినది కావటంవలన; వాత+ఆదులందున్= వాతాది దేహస్థితులలో కాని; గుణములందున్= సత్త్వాదిగుణాలలో కాని; ఒకటన్+ఒకటి+తోఁచునది= ఒకటి మరోదానిలో కనిపిస్తే అది, వికృతికాలము= వికృతి కాలమనే అర్థం.

తాత్పర్యం: 'ధర్మరాజా! వినుము. వ్యాధి శరీరమనస్సంబంధులని రెండు రకాలు. వాతపిత్తశ్లేష్మాలు సమస్థితిలో ఉంటే అది ఆరోగ్యసూచకం. ఆ మూటిలో ఏ ఒక్కటి వికారం పొందినా శరీరవ్యాధి అనిపించుకొంటుంది. అట్లాగే సత్త్వరజస్తమోగుణాలు మూడు సమత్వంలో ఉండటం మానసికస్వస్థతకు నిదర్శనం. ఈ మూటిలో ఏ ఒక్కటి గాడితప్పినా అది మానసికవ్యాధి అవుతుంది. ఈ రెండూ వాటంతటవే అవి ప్రత్యేకంగా ఎప్పుడూ రోగరూపంలో కనిపించవు. ఎందుకంటే అవి ఒకదాని నుండి మరొకటి పుట్టే లక్షణం కలిగినవి కాబట్టి. అందుచేత వాతాదులలోకాని, సత్త్వాదులలోకాని, ఒకటి మరొకదానిలో కలిస్తే అప్పుడది వికృతికాలమే.(అంటే రోగమే అని తాత్పర్యం).

విశేషం: ఆధునిక వైద్యవిజ్ఞానం ప్రకారం కూడా మనస్సంబంధం లేని రోగం ఏదీ లేదని గుర్తించబడింది. గుణప్రసక్తి లేని వాతాదులు రోగరూపాన్ని పొంద వని అర్థం. ముందున్న 'నీవు నిర్మలంగా ఏ పనీ చేయవు. దుఃఖాన్ని మాన్పుకొనలేక పోయావు' అనే వాక్యాల అర్థాన్ని శ్రీకృష్ణుడు 'రోగ నిదానం'తో ప్రారంభించి విశ్లేషిస్తున్నా డని అర్థం.

వ. **ఇది సూక్ష్మ కర్మానుష్ఠానప్రకారంబు, దీని నీ వలవరింపవు గావునం గర్మానుష్ఠానంబును నిర్మలంబుగా నడపం**
బడ దంటి' నని పలికి మఱియును. **115**

ప్రతిపదార్థం: ఇది; సూక్ష్మ= సూక్ష్మమైన; కర్మ+అనుష్ఠాన= పనినిచేసే; ప్రకారంబు= విధం; దీనిన్= దీనిని; నీవు; అలవరింపవు= అభ్యసించలేదు; కావునన్= అందుచేత; కర్మ+అనుష్ఠానంబునున్= కర్మను చేయటం; నిర్మలంబుగాన్= నిర్మలంగా; నడపంబడదు+అంటిని= నీచేత చేయబడదు అన్నాను; అని పలికి= అని చెప్పి; మఱియును= ఇంకా ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కర్మను అనుష్ఠించే పద్ధతిలోని ధర్మసూక్ష్మం ఇది. దీనిని నీవు ఎప్పుడూ అభ్యాసం చేయలేదు. అందుకే నిర్మలంగా ఏ పనినీ నువ్వు చేయలేకపోయావు' అని చెప్పి, ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: భారతకథనంతా గమనిస్తే ఇంతవరకు ధర్మరాజుతో సత్త్వగుణాతిశయం ఉన్నా రజోగుణం లేదని చెప్పలేము. తామసంతోనే జూదంకూడా ఆడాడు. కృష్ణుడు ఈ కర్మసూక్ష్మాన్ని ఇక్కడ విశ్లేషిస్తున్నాడు. ఇంకా ఈ రహస్యాన్ని వివరించటమే తరువాతి పద్యంలో కనిపిస్తుంది.

క. వాతాదులందు గుణములు । నీ తెరువునఁ దక్కు వగుట యెక్కు డగుట నీ
చేతఃప్రసక్తిఁ దోఁచి నృ । పా! తెలియఁగవలయు సమత పరశాంతికినై. 116

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; వాతాదులందున్= వాతాదిదేహస్థితులలో; గుణములు= సత్త్వాది మనోగుణాలు; ఈ తెరువునన్= ఈ విధంగా; తక్కువ+అగుట= తక్కువ కావటం; ఎక్కుడు+అగుట= ఎక్కువ కావటం; నీ చేతస్+ప్రసక్తిన్+తోఁచి= నీ ప్రజ్ఞలోనికి చొరబడి అనుభవంలోనికి రాగా; పరశాంతికిన్+ఐ= శాశ్వతమైన శాంతిధామాన్ని అందుకొనటానికి; సమత= సమత్వాన్ని గురించి; తెలియఁగవలయున్= అర్థం చేసికొనాలి.

తాత్పర్యం: 'ఓ రాజా! వాతాదిస్థితులు సత్త్వాది గుణాలతో కలిసి ఈ విధంగా తక్కువ కావటం, ఎక్కువ కావటం అనే ప్రక్రియవలననే ఇన్ని కార్యకలాపాలు జరుపుతున్నాయనే తెలివిడి నీ ప్రజ్ఞాభూమికలో ప్రవేశించిన మరుక్షణం శాశ్వతసుఖంకొరకు ఏ 'సమత్వ' స్థితిని సాధించాలో దానిని గురించిన అవగాహన నీలో కలుగుతుంది.

సీ. అమ్మెయి 'గాక వాతాదులు సత్త్వము । ఖ్యములును దివిచిన గలఁగు దేని
నది నీ స్వభావ మేమనఁగల? దింకను । జెప్పెద నవధాన మొప్ప వినుము
సభ కేకవస్త్ర రజస్వలఁ బాంచాలిఁ । గొని రాక మఱవు కాననములోన
నిడుమలు గడుచుట నెడ్డఁ బెట్టకు జటా । సుర సైంధవాదుల దురితకృతులు

తే. తలఁపకుము మాత్స్యపురమున దైన్యపడుట । బుద్ధి సేయకు భీష్మాది యుద్ధతంత్ర
మారయంగ యుద్ధంబు గా దందుఁ బుట్టు । కీడు మే లేమియును జిత్తగింపకుండు. 117

ప్రతిపదార్థం: ఆ+మెయిన్+కాక= ఆ విధంగా కాకుండా; వాతాదులున్= వాతాది స్థితులు; సత్త్వముఖ్యములునున్= సత్త్వాది గుణాలు; తివిచినన్= లాగితే; కలఁగుదు(వు)+ఏని= బాధపడుతూ ఉంటే; అది= అట్లా కావటం; నీ స్వభావము= నీకు సహజమైన శరీర మనోధర్మమన్నమాట; ఏమనఁగలదు+ఇంకనున్?= ఇంకేమని చెప్పాలి?; చెప్పెదన్= దీనిని ఎట్లా దాటాలో చెప్తుతాను; అవధానము+ ఒప్పన్+వినుము= సావధానమనస్కుడవై వినుము; సభకున్= నిండుసభలోనికి; ఏకవస్త్రన్= ఒకే చీర కట్టినదానిని; రజస్వలన్= రజస్వలగా ఉన్నదానిని; పాంచాలిన్= ద్రౌపదిని; కొని రాక= లాగుకొని రావటాన్ని; మఱవు(ము)= మరచిపొమ్ము; కాననములోనన్= అడవిలో; ఇడుమలు+కుడుచుటన్= కష్టాలు అనుభవించటాన్ని; ఎడ్డన్= ఎదలో (మనసులో); పెట్టకు(ము)= ఉంచుకొనకుము; జటాసుర, సైంధవ+ఆదుల= జటాసురుడు, సైంధవుడు, మొదలైనవారి; దురిత కృతులు= చెడ్డపనులు; తలఁపకుము= మాటిమాటికీ తలచుకొనవద్దు; మాత్స్యపురమునన్= మాత్స్యదేశంలో; దైన్యపడుట= ఆర్తిని పొందటం; బుద్ధి+చేయకు= తలచుకొనకుము; భీష్మ+ఆది= భీష్ముడు మొదలైనవారి; యుద్ధతంత్రము= యుద్ధ ప్రక్రియ; ఆరయంగన్= బాగా ఆలోచిస్తే; యుద్ధంబు+కాదు= అది యుద్ధమే కాదు; అందున్= దానిలో; పుట్టు= పుట్టిన; కీడు= చెడు; మేలు= మంచి; ఏమియునున్= దేనిని; చిత్తగింపక+ఉండు (ము)= మనసులో పెట్టుకొనకుము.

తాత్పర్యం: ఆ విధంగా కాకుండా వాతాది స్థితులు, సత్త్వాది గుణాలు లాగుతూ బాధపడేటట్లుగా ఉంటే అది నీకు సహజమైన శరీరమనోధర్మం. ఇక దీనిని గురించి ఏమనాలి? అయినా దీనిని ఎట్లా దాటాలో చెప్తుతాను; సావధాన మనస్సుతో వినుము. నిండు సభలోనికి ఏకవస్త్రను, రజస్వలను (ద్రౌపదిని) లాగుకొని వచ్చారే - అనే దానిని మరచిపొమ్ము, అడవిలో ఇన్ని కష్టాలు అనుభవించామే - అన్నది ఎదలో పెట్టుకొనకుము, జటాసురుడు, సైంధవుడు మొదలైనవారి దుర్మార్గాలు మాటిమాటికీ తలచుకొనవద్దు. మాత్స్యదేశంలో ఆర్తిని పొందామే అని మథనపడకుము. అసలు భీష్మాదులు చేసిన యుద్ధం యుద్ధమే కాదు. అట్లాంటప్పుడు అందులో పుట్టిన కీడు. మేలు - దేనినీ నీ మనసులో ఉంచుకొనవద్దు.

వ. దాని నెట్లు యుద్ధంబు గాదనియె దంటేని నది మిథ్యాయుద్ధంబు సత్యయుద్ధం బాకర్ణింపుము. 118

ప్రతిపదార్థం: దానిని= భీష్మాదులతో చేసిన యుద్ధం; ఎట్లు= ఏ విధంగా; యుద్ధంబు= యుద్ధం; కాదు+అనియెద+వు+అంటేని= కాదంటావు అంటే; అది; మిథ్యాయుద్ధంబు= మిథ్యాయుద్ధం; సత్యయుద్ధంబు= సత్యయుద్ధాన్ని గురించి చెప్తుతాను; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: భీష్మాదులతో చేసిన యుద్ధం ఏ విధంగా యుద్ధం కాదు అంటావా? అది మిథ్యాయుద్ధం, సత్యయుద్ధాన్ని గురించి చెప్తుతాను వినుము.

విశేషం: మిథ్య అంటే అబద్ధం. బయటికి కనిపిస్తూ ఉన్న దేనికి నిజమైన అస్తిత్వం లేదో అది మిథ్య. ఇంతవరకు గుణాదుల విషయంగా మానవప్రకృతిని విశ్లేషించి ఇప్పుడు యుద్ధాన్ని మనోరీత్యా వివరించటంద్వారా దాని సత్యస్వరూపం ఏమిటో శ్రీకృష్ణుడు ప్రతిపాదిస్తున్నాడు.

ఉ. అమ్మెయి బంధుమిత్రుల సహాయత కల్మి ప్రయోజనంబు లే;
దమ్మహనీయయుద్ధమున కాత్మయ తోడు, మనంబు శత్రుఁ; డీ
వెమ్మెయి నైన శాంతి ఘటియింపుము లోపగఁ దీర్పు మెందు శాం
తమ్మ చుమీ మనోజయము దాన వెలుంగుము శాంతబుద్ధివై. 119

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ విధంగా; బంధుమిత్రుల= బంధువులయొక్క; స్నేహితులయొక్క; సహాయత కల్మి= సహాయం ఉండటం; ప్రయోజనంబు లేదు= నిష్ప్రయోజనం; ఆ+మహనీయ యుద్ధమునకున్= ఆ గొప్ప యుద్ధానికి; ఆత్మ+అ+తోడు= ఆత్మే తోడు; మనంబు శత్రుఁడు= మనస్సే శత్రువు; ఈవు+ఏమెయిన్+ఐనన్= నీవు ఏ విధంగానైనా; శాంతి ఘటియింపుము= శాంతిని పొందించుకొనుము; లో పగన్= అంతశ్శత్రుత్వాన్ని; తీర్పుము= తీర్చుకొనుము; ఎందున్= ఎక్కడైనా; శాంతమ్ము+అ= శాంతమే సుమా!; మనోజయము= మనస్సును జయించటం అంటే; దానన్= అందుచేత; శాంతబుద్ధివి+ఐ= శాంత బుద్ధిగలవాడవై; వెలుంగుము= ప్రకాశించుము.

తాత్పర్యం: ఆ విధంగా అంతమంది బంధుమిత్రుల సహాయం కలిగి ఉండటంవలన ఒరిగిందేమీ లేదు. ఆ మహాయుద్ధానికి ఆత్మే నిజమైన తోడు. మనస్సు శత్రువు. కనుక నీవు లోపలి శత్రువులను జయించి, మనసుకు శాంతిని ఒనగూర్చుకొనుము. శాంతమే కదా మనోజయమంటే! అందుచేత శాంతబుద్ధితో ప్రవర్తించటం అభ్యసించుము.

విశేషం: కౌరవులు, పాండవులు శత్రువర్గాలని భావించటం ఒక్క లౌకికవిషయమే తప్ప వారికి వీరు, వీరికి వారు శత్రువులు కారు. ఎవరెవరి శత్రువులు వారిలోపలే ఉన్నారు. దుర్యోధనుడి లోభ, దురభిమానాదులే అతడి శత్రువులు, అట్లాగే పాండవులకూ రాజ్యాభిలాష, తమ పరాక్రమంపై తమ నమ్మకం, కౌరవులపై పగ - తక్కువ స్థాయిలో లేవు. కనుక వారికీ అంతశ్శత్రువులున్నారు. కాకపోతే ద్వేషాన్ని తామే తీర్చుకొన్నట్లు యుద్ధంచేసి అశాంతులై మరణించారు. పాండవులు జయించినా 'శోకంపైన యుద్ధం చేస్తూనే ఉన్నారు. అందుకే మనోజయాన్ని గురించి శ్రీకృష్ణుడు ప్రబోధిస్తున్నాడు. శోకం తమోగుణజన్యం. అందుకే ఎడతెగని దుఃఖం. ఇది కౌరవులపై పగతీరినా పోలే దంటే దానికి కారణం వారి స్వభావంలోని అశాంత మనోవృత్తే. అందుకే, వివేకంతో శాంతబుద్ధిని అభ్యసించుమని భగవానుడు ప్రబోధించాడు. ఈ శాంతస్థితి నాశించే వ్యాసమహర్షి యాగంవైపు మనస్సు ప్రసరింపచేయుమని ప్రబోధించాడు. ఆ మనస్సును నియంత్రించకుండా పోతే అది మనిషిపైన విజయం సాధిస్తుంది. దాని ఫలితమే ఈ శోకాదులు. దానిని పారద్రోలు మని భగవంతుడి సూచన.

తే. **అంతరం బగు నిక్కయ్య మధిప! గెలువ। కిట్ల యేగతిఁ బోయెదో యెఱుఁగ దీని**
నీవ కనికొని సద్బుద్ధి నిశ్చయ ప్ర। వీణుఁడవు గమ్ము మాటలు వేయు నేల? **120**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అంతరంబు+అగు= లోపలి; ఈ+కయ్యము= ఈ యుద్ధాన్ని; గెలువక= గెలువకుండా; ఇట్లు+అ= ఈ విధంగా; ఏగతిన్+పోయెదో= ఏ మార్గం వైపు వెళ్ళుతున్నావో; ఎఱుఁగన్= నాకయితే తెలియటం లేదు; దీనిన్= దీనిని; నీవు+అ= నీవే; కనికొని= కనుగొని; సద్బుద్ధిన్= వివేకంతో; నిశ్చయ ప్రవీణుఁడవు కమ్ము= నిశ్చయబుద్ధి కలిగిన నేర్పరివి కావాలి; మాటలు+ వేయున్+ఏల?= అధికంగా ఎందుకు చెప్పటం?

తాత్పర్యం: రాజా! లోపలి ఈ కయ్యాన్ని గెలువకుండా ఇట్లా ఏడుస్తూ నీవు ఏ గతి పడతావో నాకు తెలియకుండా ఉన్నది. దీనిని నీవే కనుగొనుము. వివేకంతో నిశ్చయబుద్ధి కలిగి, నేర్పరిగా నీ దారిని మళ్ళించుకొనుము. ఈ విషయంలో ఇక నేను ఏమి చెప్పను?

వ. **అని చెప్పి కౌంతేయాగ్రజునితోఁ గృష్ణుండు వెండియు నిట్లను 'రెండక్షరంబులుమృత్యువు. మూడక్షరంబులు బ్రహ్మంబని యెయ్యవి యంటేని వినుము 'మమ' యను నవియును 'న మమ' యను నవియును నై యుండు భూతలంబుల చేతం గానంబడక యా బ్రహ్మమృత్యువులు పోరుచుండు.** **121**

ప్రతిపదార్థం: అని చెప్పి= అని చెప్పినవాడై; కౌంతేయ+అగ్రజునితోన్= ధర్మరాజుతో; కృష్ణుండు; వెండియున్+ఇట్లు+అనున్= మళ్ళీ ఇట్లా అన్నారు; రెండు+అక్షరంబులు= రెండక్షరాలు; మృత్యువు= మరణం (అజ్ఞానం); మూఁడు+అక్షరంబులు= మూడక్షరాలు; బ్రహ్మంబు= బ్రహ్మము (జ్ఞానం); అని; ఏ+అవి= ఏవి; అంటి(వి)+ఏ= అంటే; వినుము; మమ= అనునవియును (అనే రెండక్షరాలు); న మమ= (నాది కాదు); అనునవియును (అనే మూడక్షరాలు); ఐ+ఉండున్= అయి ఉంటాయి; ఆ+బ్రహ్మ+మృత్యువులు= ఆ బ్రహ్మము, మృత్యువు అనబడ్డవి; భూతంబులచేతన్= ఏ భూతాలచేతిలో; కానంబడక= చూడబడక; పోరుచున్+ఉండున్= పోట్లాడుతుంటాయి.

తాత్పర్యం: అని చెప్పి మరలా కృష్ణుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు 'రెండక్షరాలు మృత్యువు, మూడక్షరాలు బ్రహ్మము. 'మమ' అనే రెండక్షరాలు 'న మమ' అనే మూడక్షరాలు వరుసగా మృత్యువు, బ్రహ్మము. అవి ఏ భూతరాశికీ కనిపించకుండా నిరంతరం పోట్లాడుతూ ఉంటాయి.

విశేషం: 'మమ' (నాది) అనే భావమే 'బంధ' కారకం. అది మనిషిని అజ్ఞానంలో పడవేస్తుంది. 'న మమ' (నాది కాదు) అనే భావమే 'విముక్తి' హేతువు. అది 'సత్య' 'జ్ఞాన' రూపాలతో ఉండి 'అనంతం'గా ఉంటుంది. మమకారంలో 'సత్య' దృష్టి ఉండదు. జ్ఞానప్రసక్తి కూడా లేదు. అది చాలా పరిమితమైన ఉనికి కలిగింది. అందుకే 'న మమ' అనే మూడక్షరాలు బ్రహ్మ మని కృష్ణుడు మరలా భగవద్గీత సారాంశాన్ని ధర్మరాజుకు బోధిస్తున్నాడు.

'మమ' అన్నది శరీరవాదం. 'న మమ' అన్నది ఆత్మవాదం. శరీరం అశాశ్వతం, ఆత్మ శాశ్వతం, చింతించటం శరీర సంబంధి కనుక బంధహేతువు. దానిని మానుమని శ్రీకృష్ణుడు ఎట్లా బోధిస్తున్నాడో తరువాతి పద్యంలో చూడవచ్చును.

క. తత్త్వ మనశ్వర మశరీ। రత్వంబునఁ బరఁగు భూతరాశి నియతనా
శిత్వంబు హింసకత్వము। దాత్త్వికమై లేదు దేహదళమునను నృపా! 122

ప్రతిపదార్థం: నృపా!= ఓ రాజా!; తత్త్వము= ఆత్మతత్త్వం; అనశ్వరము= నశించనిది, శాశ్వతమైనది; అశరీరత్వంబునన్+పరఁగున్= శరీరసంబంధం లేనిదిగా ఉంటుంది. భూతరాశి= భూతరాశికి ఉన్నటువంటి; నియత నాశిత్వంబు= నియతంగా నశించే స్వభావం; హింసించుకొనటం (అనే ఈ లక్షణాలు); దేహదళమునను= దేహమనే ఖండభాగంలో (ఉన్నాయి); (అది); తాత్త్వికము+ఐ,లేదు= ఆత్మసంబంధమైన ధర్మం కాదు.

తాత్పర్యం: ఓ రాజా! ఆత్మతత్త్వం శాశ్వతమైనది. శరీరసంబంధం లేనిది; కాని భూతరాశి శరీరధారి కావటంవలన అది నియతంగా నశించే స్వభావం కలిగినది. పరస్పరం హింసించుకొనటం దాని లక్షణమే. అందుకే దేహం ఒక 'ఖండ' భాగం తప్ప ఆత్మవలె అఖండం కాదు. శాశ్వతం కాదు. అందుచేత దేహానికి తాత్త్వికలక్షణం లేదు.

క. శరధిపరివేష్టిత క్షితిఁ। బరిపాలించినను దానిపై దృఢమమతం
బొరయక వర్తించిన న। ప్పురుషుని దురితంబు లెట్లు పొందఁగ నేర్చున్? 123

ప్రతిపదార్థం: శరధి= సముద్రంచేత; పరివేష్టిత= చుట్టుకొనబడిన; క్షితిన్= భూమిని; పరిపాలించిననున్= ఏలినా; దానిపైన్= ఆ భూమిపై; దృఢ మమతన్= గట్టి మమతను; పొరయక= పొందక; వర్తించినన్= ప్రవర్తిస్తే; ఆ+పురుషునిన్= ఆ మానవుడిని; దురితంబులు= పాపాలు; ఎట్లు+పొందగన్+నేర్చున్= ఎట్లా ఆక్రమిస్తాయి?

తాత్పర్యం: సముద్రమే సీమగా కలిగిన ఈ భూవలయాన్నంతా పాలించినా సరే - ఆ భూమిపైన ఎవరికి గాఢమైన మమకారం ఉండదో అట్లాంటి మానవుడికి పాపాలు ఎట్లా అంటుతాయి?

క. వనమున వన్యాహారం। బున వర్తించినఁ బదార్థములపై మమతన్
మనమున విడ కుండిన న। మ్మనుజుఁడు మృత్యుముఖవర్తి మనుజాధీశా! 124

ప్రతిపదార్థం: మనుజ+అధి+ఈశా!= రాజా!; వనమునన్= అడవిలో; వన్యాహారంబునన్= అడవిలో దొరికే కందమూలాదులను ఆహారంగా కలిగి; వర్తించినన్= ఉంటున్నా; పదార్థములపైన్= ధన కనక వస్తు వాహనాది పదార్థాలపైన; మమతన్= మమతను; మనమునన్= మనస్సులో; విడక+ఉండినన్= వదలకుండా ఉంటే; ఆ మనుజుఁడు= ఆ మనిషి; మృత్యుముఖవర్తి= మృత్యుముఖంలో ఉండేవాడని అర్థం.

తాత్పర్యం: రాజా! అడవిలో ఉంటూ కందమూలాలు తింటూ ఉన్నా, ధన, కనక, వస్తు, వాహనాదులపై మమత పోలేదంటే ఆ మనిషి నిజంగా మృత్యుముఖంలో ఉన్నా డని అర్థం చేసికొనాలి.

విశేషం: పాండవులు అరణ్యవాసం చేశారు. కందమూలాలు తిన్నారు. కాని వారికి పదార్థజగత్తుమీద మమత ఇంకా పోలేదు. కనుక చేసిన అరణ్యవాసంనుండి లభించిన జ్ఞానం ఏమిటన్నది శ్రీకృష్ణుడి ప్రశ్న. అందుకే 'మమత' బంధుహేతువని చెప్పటం కొరకే 'మృత్యు' వనే గహ్వరంలోని (గుహ) ముఖద్వారంగా 'మమత'ను చెప్తూ ఈ మమతే 'మృత్యు' కారక మవుతుందని, ఇది లోపలి శత్రువని. దానిని జయించటమే అసలు 'విజయ'మని తరువాతి పద్యంలో వివరిస్తున్నాడు.

క. వెలి పగఱ గెలుపు గెలుపే? । యలఘుమతిన్ గెలువవలయు నభ్యంతర శ
త్రులఁ దద్విజయము మోక్షము । నలవఱుపం జాలు నొంట నమ్మేలగునే? 125

ప్రతిపదార్థం: వెలి= బయట ఉన్న; పగఱ= శత్రువుల; గెలుపు - గెలుపు+ఏ= జయం ఒక జయమేనా?; అలఘుమతిన్= గొప్ప వివేకంతో; అభ్యంతర= లోన ఉన్న; శత్రులన్= శత్రువులను; గెలువ వలయున్= గెలవాలి; తద్+విజయము= ఆ లోని శత్రువులను గెలవటమే; మోక్షము= విముక్తిని (బ్రహ్మసాక్షాత్కారం); అలవఱుపన్+చాలును= పొందేదారిని చూపించగలదు (విముక్తిమార్గ సాధనను నేర్పిస్తుంది); ఒంటన్= మరొకదానిలో; ఆ+మేలు+అగునే?= ఆ లాభం ఉంటుందా?

తాత్పర్యం: బయట ఉన్న శత్రువును జయించటమూ ఒక జయమేనా? లోపలి శత్రువులను గెలవాలి, ఆ విజయమే మోక్షమార్గసాధనను నేర్పిస్తుంది. మరి దేనితోనూ అది లభించదు.

విశేషం: కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు అనే ఆరు శత్రువులు 'అరిషడ్వర్గం' అని ఈ ఆరు గుణాలను పిలుస్తారు. ఈ శత్రువులలో అన్ని బంధాలనూ కలిగించే తొలి శత్రువు 'కామం' (కోరిక, ఇచ్ఛ, స్పందం, సంకల్పం)। దానిని గురించి తరువాత చెప్తున్నాడు.

క. విను మంతశ్శత్రులలో । ఘనుఁడగుఁ గాముఁడు నిరస్తకామం బగు వ
ర్తనము విరల మధ్యయన య । జనదానంబులును గామసహితములు గదా! 126

ప్రతిపదార్థం: వినుము= జాగ్రత్తగా వినుము; అంతస్+శత్రులలోన్= లోపలి శత్రువులలో; కాముఁడు= కోరిక, మన్మథుడు; ఘనుఁడు+అగున్= చాలా గొప్పవాడు; నిరస్త= వదలబడిన; కామంబు+అగు= కామం కలిగిన; వర్తనము= పని; విరలము= అరుదు (ఎందుకంటే);అధ్యయనము= వేదాదుల అధ్యయనంకాని; యజన= యజ్ఞంకానీ; దానంబులునున్= దానాదులు కానీ; కామ సహితములు కదా!= ఏదో ఒక సంకల్పంతో కూడినవే కదా!

తాత్పర్యం: జాగ్రత్తగా వినుము. లోపలి శత్రువులలో 'కాముడు' చాలా గొప్పవాడు. కామంలేని పని ప్రపంచంలో ఏదీ లేదు. వేదాదులు చదివినా, యాగాలు చేసినా, దానాదు లిచ్చినా దానికి మూలంగా ఏదో ఒక 'సంకల్పం' (కోరిక) ఉండనే ఉన్నది కదా!

వ. ఇవ్విషయంబునం గామగీత లను వాక్యంబులు గలవు. వాని నాకర్ణింపుము. కాముండు లోకంబు నుద్దేశించి యిట్లనియె. 127

ప్రతిపదార్థం: ఈ+విషయంబునన్= ఈ కామానికి సంబంధించిన; కామగీతలు= కాముడు చెప్పిన వాక్యాలు; అను= అనే; వాక్యంబులు= వాక్యాలు; కలవు= ఉన్నాయి; వానిన్= వాటిని; ఆకర్ణింపుము= చెప్పుతాను వినుము; కాముండు= ఆ మన్మథుడు; లోకంబున్= లోకాన్ని; ఉద్దేశించి= ఉద్దేశించినవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విషయానికి సంబంధించిన 'కామగీతలు' అనబడే వాక్యా లున్నాయి. వాటిని వినుము. కాముడు లోకాన్ని ఉద్దేశించి ఇట్లా అన్నాడు.

విశేషం: ఈ పర్వంలోనే కామగీతలు, బ్రాహ్మణగీతలు రెండు ఉన్నాయి. భగవద్గీతలో ఏ సారాంశం ఉన్నదో ఈ గీతలలోనూ అదే సారాంశం ఉన్నది. 'గీత' అంటే ఇక్కడ 'బోధ కలిగిన వాక్య' మని అర్థం.

క. **'అనపాయుం డగు నెవ్వం। డును నను బాధింపఁ జాలఁడు ప్రయత్నము సా**
ధన మగునె వేదవేద్యుం। డనయి పరఁగుచున్న నా యెడను విహతికినై. **128**

ప్రతిపదార్థం: న+అపాయుండు+అగు= దూరంగా జరగకుండా ఉండే; ఎవ్వండును= ఎవడూ కూడా; ననున్= నన్ను; బాధింపన్+చాలఁడు= బాధించలేడు; వేదవేద్యుండను+అయి= వేదాలచేత తెలిసికొనబడేటటువంటివాడిని అయి; పరఁగుచున్+ఉన్న= ఉంటున్న; నా ఎడమ= నా విషయంలో; విహతికిన్+ఐ= భంగపాటుకొరకు; ప్రయత్నము= యత్నించటం; సాధనము+అగునె?= కార్యసాఫల్యాన్ని ఒనగూర్చేది అవుతుందా?

తాత్పర్యం: నాకు దూరంగా జరగకుండా ఉండేవాడు ఎవడూ నన్ను ఓడించలేడు. వేదాలచేత గుర్తించబడే ఉనికి కలిగిన నన్ను భగ్నపరచే సాధనం ఏమీ లేదు. కనుక నేను అజేయుడను.

విశేషం: 'అపాయం' అంటే 'ఎడబాటు'. ఈనాటివలె 'అనర్థం' అని కాదు. ఎడబాటు లేనిది 'అనపాయత్వం' కాముడు తాను జీవులకు పుట్టుకతో వచ్చి మరణం దాకా వారిని వదలకుండా, వారు తనను వదలకుండా ఉంటాడు కాబట్టి 'అనపాయుడైన' ఏ మనిషీ నన్ను ఏమీ చేయలేడని అంటున్నాడు. కాబట్టి ఎంత ప్రయత్నించినా ఏదో ఒక రీతిగా 'కామం' పైచేయి విసురుతూ ఉంటుంది. మనిషి 'నిగ్రహం' కోల్పోతూ ఉంటాడు.

ఇక 'వేదవేద్యుడను' అని కామదేవుడు చెప్పుతున్న విషయం.

'కామస్తదగ్రే సమవర్తత'

ప్రపంచ సృష్టికి ముందు 'కామమే' పుట్టింది. ఇది వైదికమైన సిద్ధాంతం.

'సోఽకామయత బహు స్యాం ప్రజాయేతి' (తైత్తిరీయం) అతడు (ఆ ప్రజాపతి) కోరుకొన్నాడు - ప్రపంచాన్ని సృష్టిస్తానని. అందుకే అతడి 'కోరిక' నుండి ఈ సర్వసృష్టి జరిగింది అని శ్రుతివాక్యం.

ఇది 'కామతత్త్వానికి' వైదికమైన పునాది. ఇక్కడ చెప్పబడ్డ కాముడు పురాణాలలో చెప్పబడిన 'మన్మథుడు' కాడు. ఆ మన్మథుడు శృంగారసంబంధమైన 'కామ' వాంఛకు సంకేతం. వేదాలలో చెప్పబడిన కాముడు ప్రపంచంలోని పదార్థవ్యక్తీకృతికి మూలమైన ఆత్మ 'స్పందానికి' సంబంధించినవాడు. వేదంలోని కాముడు చెప్పుతున్న మాటలివి. అట్లాంటి నన్ను ఎవడూ జయించలేడు. అందుకే శివుడు కూడా చలించక తప్పలేదని పురాణాలు కథలుగా చెప్పాయి.

క. **ధృతి నెవ్వఁడు నన్నుం బ్రవి। హతుఁ జేయఁగఁ జూచు భావ మగుదు నతని; కే**
నతఁ డది యెఱుఁగఁడు గాన వి। హతి బొంకై పోవఁగా జయము లేకుండున్. **129**

ప్రతిపదార్థం: ధృతిన్= ధైర్యంతో; ఎవ్వఁడు= ఎవడైతే; నన్నున్= నన్ను; ప్రవిహతున్= దెబ్బకొట్టబడిన వాడిగా; చేయఁగన్+చూచున్= చేయజూస్తాడో; అతనికిన్+ఏన్= అతడికి నేను; భావము+అగుదున్= భావాన్ని అవుతాను; అతఁడు+అది+ఎఱుఁగఁడు= కాని అట్లా నేను భావ మవుతున్నానని అతడు ఎరుగడు; కానన్= కాబట్టి; విహతి= నన్ను దెబ్బకొట్టటం అనే పని; బొంకై పోవగాన్= అబద్ధం అయిపోగా; జయము లేక+ఉండున్= విజయం అన్నది లేకుండా పోతుంది.

తాత్పర్యం: ధైర్యంతో ఎవడు నన్ను దెబ్బకొట్టాలని చూస్తాడో వాడికి భావరూపంగా నేను అతడిలోనే ఉంటాను. కాని, నేను అట్లా అతడిలోనే ఉన్నానని అతడికి తెలియదు. అందుచేత నన్ను ఓడించటమనే ప్రశ్న లేనేలేదు. అందుచేత నన్ను జయించటం అనేదీ లేనేలేదు.

విశేషం: 'భూ' ధాతుసంబంధమైనది భావం. పుట్టేది అని అర్థం. ఏది సవ్యంగా పుట్టుతుందో అది భావం. కామం జయిస్తున్నా నన్నది ఒక భావం. ఆ భావరూపంలోనూ కామతత్త్వం ఉన్నది. అంటే కామాన్ని జయించాలని, ఇంద్రియాది నిగ్రహాలు, ఆహారవిహార నియమాలు పాటించేవారిలో ఆ ఇంద్రియజయస్వరూపమైన 'భావం' ఇచ్ఛారూపంలో ఉంటూ అది మరలా కాముడికి స్థానం అవుతుందని తాత్పర్యం. ఆ దీక్షలో ఉన్నవాడి కీ భావమే ఒక కామమని తెలియదు. కాబట్టి కామంమీద దెబ్బకొట్టటం అన్నది నీటి మీద వ్రాతే అని వాసుదేవుడు నొక్కి చెప్పుతున్నాడు.

క. ననుఁ దపమునఁ బ్రహరించెద। నని యెవ్వఁడు దొడఁగు నతని కా తపము ఫలం
బున దెసఁ గోరికనై యే। జనియింతుం; జెఱుపఁగా వశమె యెవ్వనికిన్? 130

ప్రతిపదార్థం: ననున్= నన్ను; తపమునన్= తపస్సుతో; ప్రహరించెదన్+అని= దెబ్బకొట్టుతానని; ఎవ్వఁడు+తొడఁగున్= ఎవడు పూనుకొంటాడో; అతనికిన్+ఆ తపముఫలంబున దెసన్= అతడికి ఆ తపస్సుయొక్క ఫలం గురించిన; కోరికన్+ఐ= కోరికగా; ఏన్= నేను; జనియింతున్= పుట్టుతాను; (నన్ను); ఎవ్వనికిన్= ఎవడికైనా; చెఱుపఁగాన్= చెడపటానికి; వశమె?= సాధ్యమా?

తాత్పర్యం: తపస్సుచేసి నామీద దెబ్బకొట్టుతానని ఎవడు పూనుకొంటాడో అతడికి ఆ తపస్సుయొక్క ఫలాన్ని గురించిన కోరికగా నేను పుట్టుతాను. నన్ను ఎవరు చెడగొట్టగలరు?

విశేషం : తపస్సు చేసేవారిలో ఏదో పొందాలన్న తపన ఉంటుంది. అది ఫలరూపమైన కోరిక. 'నేను స్వర్గసుఖం పొందాలి' అన్నదీ ఒక కోరికే కదా! 'నాకు కుమారుడు జన్మించాలి!' అనేది కూడా కోరికే కదా! మరి అపుడు కోరిక లేని తపస్సు ఎక్కడ ఉన్నది?

రెండవ అంశం - మన్మథుణ్ణి చెడగొట్టటం అంటే ఏమిటన్నది. కోరికను 'అణచటం' అనే భావనకు అర్థం - కోరికపై దెబ్బకొట్టటమనే. కాముడి దెబ్బే పెద్ద దెబ్బ. ఆ కాముడిని దెబ్బతీసేవాడు మరొక్కడు లేదు. అందుకే కామదేవుడు 'నేను మరలా మరలా కోరిక రూపంతో పుట్టుతూనే ఉంటాను' అంటున్నాడు.

క. నను మోక్షమూఁది చెఱిచెద। నని యెవ్వఁడు దలఁచు వానియందే మోక్షా
ర్థనమై యునికి నవధ్యుఁడ। సనాతనుఁడ ద్రోవ నొకఁడుఁ జాలఁడు నన్నున్.' 131

ప్రతిపదార్థం: మోక్షము+ఊఁది= మోక్షాన్నిధ్యేయంగా గ్రహించి; ననున్+చెఱిచెదన్+అని= నన్ను నాశనం చేస్తానని; ఎవ్వఁడు+ తలఁచున్= ఎవడు ఆలోచిస్తాడో; వాని+అందే= వానిలోనే; మోక్ష+అర్థనము+ఐ+ఉనికిన్= మోక్షంలోని కోరికగా ఉండటంవలన;

అవధ్యుఁడన్= నేను చంపటానికి వీలులేనివాడిని; సనాతనుఁడన్= శాశ్వతుడను; నన్నున్= నన్ను; ద్రోవన్= ద్రోసివేయటానికి; ఒకఁడున్+చాలఁడు= ఎవడూ సమర్థుడు కాడు.

తాత్పర్యం: మోక్షాన్ని ధ్యేయంగా గ్రహించి నన్ను నాశనం చేయాలని ఎవడు ఆలోచిస్తాడో వాడిలోనే మోక్షంలోని కోరిక రూపంలో నేను ఉండటంవలన నేను ఎవరిచేతా చంపబడేవాడిని కాను. నేను శాశ్వతుడను. నన్ను ఎవడూ త్రోసివేయజాలడు.'

విశేషం : సనాతనం అంటే శాశ్వతమైనదని అర్థం. చిరంతనమంటే ప్రాచీనమైనది. కాముడు 'సనాతనుడు' అంటే తొలి, నడుమ, చివరి దశలలో ఎవడు వదలకుండా ఉంటాడో వాడని అర్థం. అప్పుడే పుట్టిన బిడ్డ పాలవైపో, పంచదార నీళ్ళవైపో చూపే ఆసక్తి ఆహారం మీద కోరిక. నడిమి జీవితమంతా కోరికలపుట్ట. చివరిజీవితంలో జ్ఞానంమీదో మోక్షంమీదో ఆసక్తి. మరలా ఇదీ కోరికే. కనుకే కాముడు 'సనాతనుడు' అందుకే సృష్ట్యాదిలో ఉన్నవాడు కాముడే - అని 'కామస్తదగ్రే సమవర్తత' అనే వేదవాక్యం నిరూపిస్తున్నది.

క. **'అని యివ్విధమునఁ గాముఁడు। దనుఁ జెఱుపఁగరామిఁ జెప్పు తలఁపొందినఁ జె**
ప్పిన భంగి నెదను దోఁచెను। విను మవధానమునఁ బాండవేయప్రవరా! 132

ప్రతిపదార్థం: పాండవేయప్రవరా!= ఓ ధర్మరాజా!; అని; అంటూ; ఈ+విధమునన్= ఇట్లా; కాముఁడు; తనున్+చెఱుపఁగన్+రామిన్= తనను నాశనంచేయటానికి వీలులేకపోవటం గురించి; చెప్పు= చెప్పేటటువంటి; తలఁపు+ఒందినన్= ఆలోచన పుట్టగా; చెప్పిన భంగిన్= చెప్పినట్లు; ఎదను+తోఁచెన్= మనసుకు తట్టింది; అవధానమునన్= ఏకాగ్రచిత్తంతో; వినుము.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఈ విధంగా కాముడు తనను ఎవరూ నాశనం చేయ లేరన్న విషయాన్ని గురించి చెప్పే ఆలోచన ఒకటి పుట్టగా అట్లా చెప్పినట్టు నా మనసుకు తోస్తున్నది. ఏకాగ్రచిత్తంతో వినుము చెప్పుతాను.

విశేషం : కాముడు చేసిన ఈ ప్రకటనను 'కామగీత' అనటానికి అర్థం ఏమిటో ఇక్కడ తిక్కనగారు చెప్పుతున్నారు. అర్జునుడు యుద్ధరంగంలో విషాదంలో మునిగిపోతే భగవంతుడు ఇచ్చిన ఓదార్పు భగవద్గీత కాగా ఈ 'కామగీత'కు శ్రోతలు, సాక్షులు మానవులందరూ, మానవులే కాదు దేవతలు; రాక్షసులు,సకల సృష్టి దీనికి సాక్ష్యమే. ఎవరో అడిగితే కాముడు ఈ 'గీత' చెప్పలేదు. తనకు తానుగా తన 'అవినాశ' లక్షణాన్ని 'సనాతన' ధర్మాలను తెలియచెప్పటంకొరకు ఈ మాటలు చెప్పాడు - అని శ్రీకృష్ణ భగవానుడికి అనిపించిందట.

అందుకే తరువాతి రెండు పద్యాలలో 'కామగీత'కు ఫలశ్రుతివలె 'కామవిజయం' ఎట్లా సంభవమో వివరిస్తున్నాడు. అశ్వమేధపర్వ రహస్యమంతా ఈ పద్యాలలో ఉన్నది.

చ. **పనివడి పూఁచి పట్టమి సుబంధురధైర్యము నిర్వహింతు నే**
ననుమతి సొన్పకుండుట సమగ్రతపంబున తత్ఫలేచ్ఛ లే
కునికి విమోక్షతృష్ణభర మొందమి కాము నడంచుఁ గాన ని
య్యనువులు లేమి సువ్వె యనపాయతగా నతఁ డాడె భూవరా! 133

ప్రతిపదార్థం: భూవరా!= ఓ రాజా!; పనివడి= పనిగట్టుకొని; పూఁచి= పూనుకొని; పట్టమి= ఒకపనిని పట్టుకోకపోవటం; సుబంధుర= మిక్కిలి; ధైర్యము= ధృతి (తా); నిర్వహింతున్+ఏన్+అను మతి= నేను ఈ పనిని కొనసాగిస్తానన్న స్థిరబుద్ధి(ని); చొప్పకుండుట= ఆ కార్యనిర్వహణలో ప్రవేశింపజేయకపోవటం; సమగ్రతపంబునన్= గాఢమైన తపశ్చర్యలో; తద్+ఫల+ఇచ్ఛ= ఆ తపస్సుయొక్క

ఫలంలో కోరిక; లేక+ఉనికి= లేకుండా ఉండటం; విమోక్ష+తృష్ణ+భరము= విముక్తి కావాలన్న మిక్కిలి దప్పిక; ఒందమి= పొందకపోవటం; కామున్+అడంచున్= కాముడిని అణచివేస్తాయి; కానన్= కాబట్టి; ఈ+అనువులులేమి+చువ్వె= ఈ అనువులు- ఉపాయాలు లేకపోవటమే సుమా!; అనపాయతగాన్= వదలిపెట్టజాలని ధర్మంగా; అతఁడు= ఆ కాముడు; ఆడెన్= చెప్పాడు.

తాత్పర్యం: రాజా! వినుము. ఒక కార్యాన్ని పనిగట్టుకొని ప్రారంభించకపోవటం. దృఢమైన ధైర్యంతో ఈ పనిని తప్పక నిర్వహిస్తాననే స్థిరబుద్ధిని ఆ పనిలో పెట్టకపోవటం. గొప్ప తపస్సు చేస్తున్నప్పుడు కూడా ఆ తపఃఫలంలో కోరిక లేకుండా ఉండటం. చివరికి మోక్షం కావాలన్న కోరిక కూడా లేకుండటం కాముడిని జయిస్తాయి. కాని సాధారణంగా ఈ పనులు మనిషి చేయలేడు. ఈ ఉపాయాలు మనిషికి లభించవు. అందుకే 'నన్ను ఎవరూ వదలిపెట్టజాల' రని కాముడు ప్రకటించాడు.

విశేషం : అశ్వమేధపర్వంలోని అతిముఖ్యమైన పద్య మిది. కాముడు మానవుడిని ఎందుకు వెన్నాడుతాడో, అతడిని ఎట్లా జయించవచ్చునో చెప్పే ఉపాయం ఈ పద్యంలో ఉన్నది.

మొదటిది - పనిని చేయటం అంటే పూనుకొనిచేయాలి. త్రికరణశుద్ధిగా పనిని ప్రారంభించటం జరిగితే అది విఫలమయ్యే ప్రశ్న ఉండదు. అంతేకాదు, ఉద్యమించి పనిచేయాలి. ఉత్సాహంతో చేయాలి. దీనినే 'శ్రద్ధ' అంటారు. శ్రద్ధాళువు పనిని నిరాటంకంగా చేయగలుగుతాడు. ఈ శ్రద్ధ ఉన్నా 'పూనిక' మొండి పట్టుదల కాకుండా ఉండాలి.

రెండవది - పనిని తప్పక పూర్తిచేస్తానన్న 'స్థిరబుద్ధి' ఉండాలి. మధ్యలో వదిలివేయటం, చేతకాదేమో అనటం, చేస్తానని చేయకపోవటం. ఇతరులకు ఒప్పజెప్పటం, ఇట్లాంటి పనులు 'సోమరి' లక్షణాలు. పని పూర్తి అయ్యేదాకా ఆ స్థిరబుద్ధి నశించకూడదు. దీనినే 'ఓర్పు' అంటారు. ఓర్పు ఉన్నా 'నా పనే గెలవా' లన్న మూర్ఖత్వం ఉండరాదు.

మూడవది - మనం చేస్తున్న పనిని తాత్పర్యంతో చేయటం. ఆ నిర్దిష్టలక్ష్యం కార్యసాధనకోసమే తప్పా, కోరికను నింపుకొనటంకొరకు కాకూడదు. దాని నే విషయంలో కూడా ఫలాపేక్ష లేకుండా ఉండటం అని ఇక్కడ చెప్పుతున్నారు.

నాలుగవది - మోక్షవిషయంలో కూడా కోరిక ఉండకూడదనటం అంటే మోక్షం పొందాలన్నది ఒక 'దాహ' మట. దాహం అయిన మనిషి నీటికొరకు వెదకి తీరుతాడు. మోక్షం దానంతట అది రావాలి తప్పా నీవు ప్రయత్నం చేసి కృతిమంగా అందుకొనగలిగింది కాదన్న 'జ్ఞానం' ఉన్నపుడు మనిషి ఆ మోక్షాన్నీ కోరడు.

అప్పుడు మనిషి ఎట్లా పని చేస్తాడో తరువాతి పద్యంలో తిక్కనగారు వివరిస్తున్నాడు. 'అనువు' అంటే దారి/ఉపాయం అని అర్థాలున్నాయి. కామజయం అతికష్టం కాదని అర్థం.

క. విను పెక్కులేల? కోరిక। మనమునఁ జొరనీకయున్న మడియుం గాముం
డనపద్య! యశ్వమేధం। బొనరింపుము గోరకుండు మొక్కటియు మదిన్. 134

ప్రతిపదార్థం: అనపద్య!= పుణ్యాత్మా!; విను= ఆ కామజయం ఎట్లా సాధ్యమో చెప్పుతాను వినుము; పెక్కులు+ఏల?= ఇక అధికంగా చెప్పవలసిన అవసరం లేదు; కోరికన్= కోరికను; మనమునన్= మనస్సులో; చొరనీక ఉన్నన్= చొరబడకుండా చేస్తే; కాముండు= మన్మథుడు; మడియున్= చస్తాడు; అశ్వమేధంబు+ఒనరింపుము= అట్లా ఈ అశ్వమేధాన్ని చేయుము; మదిన్= మనస్సులో; ఒక్కటియున్= ఏ కోరికా; కోరక+ఉండుము= కోరకుండా ఉండుము.

తాత్పర్యం: ఓ పుణ్యాత్మా! ఆ కామవిజయం ఎట్లా సాధ్యమో చెప్పుతాను వినుము; పెక్కులు+ఏల?= ఇక అధికంగా చెప్పవలసిన అవసరం లేదు; ముందే వివరించానుగదా కోరికను మనస్సులో చొరబడకుండా చేస్తే మన్మథుడు వెంటనే చస్తాడు. ఇప్పుడు అశ్వమేధయాగం చేయుము. దానిని ఏమీ కోరకుండా చేయుము.

విశేషం : ఓ పుణ్యాత్మా! ఆ కామవిజయం ఎట్లా సాధ్యమో చెప్పుతాను వినుము. ఇక ఎక్కువగా చెప్పవలసిన పనిలేదు. (ముందే వివరించాను కదా!) కోరికను మనసులో చొరబడకుండా చేస్తే మన్మథుడు వెంటనే చస్తాడు. ఇప్పుడు అశ్వమేధయాగం చేయుము. దానిని ఏమీ కోరకుండా చేయుము.

ఆ. అశ్వమేధమఖమునం డట్ల యనఘ! య। లోలుపత్వగుణవిశాలబుద్ధి
శాలివై ఫలాభిసంధి లే కక్కాము। ధర్ము(గాం బొనర్పు ధర్మతనయ! 135

ప్రతిపదార్థం: ధర్మతనయ!= ఓ యమధర్మరాజ కుమారా! ధర్మరాజా!; అశ్వమేధ మఖమునందున్= అశ్వమేధయాగంలో; అట్లు+అ= అట్లాగే; అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; అలోలుపత్వగుణ= మిక్కిలి ఇష్టంలేని గుణంతో; విశాలబుద్ధిశాలివై= విశ్వజనీనమైన బుద్ధితోకూడిన వాడవై; ఆత్మజ్ఞానంతోడి; ఫల+అభిసంధి లేక= ఫలాన్ని గూర్చిన కోరిక లేక; ఆ+కామున్= ఆ కాముడినే; ధర్మున్+కాన్= ధర్మసాక్షిగా; పొనర్పు(ము)= యాగం చేయుము.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీవు పుణ్యాత్ముడవు. ఈఅశ్వమేధాన్ని ఏ తీవ్రమైన కోరికా లేని మనస్సుతో విశ్వజనీనమైన ధర్మబుద్ధితో ఆ కాముడినే కర్మసాక్షిగా చేసి యాగం చేయుము.

విశేషం : వ్యాసమహర్షిని గురించి 'విశాలబుద్ధి' అనే విశేషణం వాడుతారు.

'నమోఽస్తుతే వ్యాస విశాలబుద్ధే'

అని వ్యాసమహర్షిని కీర్తిస్తారు. వ్యాసమహర్షి బుద్ధి వైశాల్యం ధర్మాద్వైతానికి సంబంధించిన మహోదాత్త గుణం. యాగనిర్వహణ ఫలంకోరి చేయనపుడు ధర్మ నిర్వహణకు సంబంధించిన నిష్కామకర్మ అవుతుంది. అప్పుడు కాముడు కర్మబంధాన్ని కలిగించడు. కర్మకు సాక్షిగా మాత్రమే ఉంటాడు. అందుకే 'ధర్ముని'గా చేయుము అనటం. ధర్ముడంటే యమధర్మరాజువలె 'సమవర్తి' అని అర్థం. అపుడు కాముడు విముక్తి హేతువుగా వర్తిస్తాడు. అది 'ధర్ము'డనటానికి అర్థం.

క. చచ్చిన బంధుల(గొని రా। వచ్చునె? తల(పకుము నీవు వారిం; గ్రతువుల్
విచ్చలవిడిం జేయుము నిను। మెచ్చు జగంబు సమకూరు మీ(ద సుగతియున్.' 136

ప్రతిపదార్థం: చచ్చిన బంధులన్= చనిపోయిన బంధువులను; కొని రావచ్చునె?= మరల తీసికొని రావటానికి అవుతుందా?; నీవు వారిన్= నీవు వారిని గురించి; తల(పకుము= ఆలోచించకుము; విచ్చలవిడిన్= సమృద్ధిగా (యథేష్టంగా); క్రతువుల్= యాగాలు; చేయుము; నినున్= నిన్ను; జగంబు మెచ్చున్= ప్రపంచం మెచ్చుకొంటుంది; మీ(దన్= తరువాత; సుగతియున్= పుణ్యలోకాల ప్రాప్తికూడా; సమకూరున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: చనిపోయిన బంధువులను మరలా తీసికొనిరావటానికి సాధ్యమా? నీవు వారినిగురించి తలచి తలచి ఏడుస్తూ కూర్చొనవద్దు. నీ ఇష్టం వచ్చినంత బాగా దానధర్మాలుచేసి యాగాలు చేయుము. దీనివలన నీకు ప్రపంచంలో ఖ్యాతి వస్తుంది. పైగా పుణ్యలోకప్రాప్తికూడా సిద్ధిస్తుంది.'

వ. అని యిట్లు కృష్ణుండు సెప్పెం; బారాశర్యుండు బోధించె; దేవస్థానుండు నారదుండును హితవచనంబు లుపదేశించిరి. భీమాదులు నలువురును ద్రౌపదియును దగిన మాటలు సెప్పిరి. శా స్త్రచక్షుర్మహితులైన మహీసురులు యోగ్యవచనంబు లుపన్యసించి; రివ్విధంబున నందఱ వాక్యంబులు నాకర్ణించి, శోకంబు విడిచి,

యా భూకాంతుండు ధరణీపాలనాధ్వరకర్మంబుల కియ్యకొని యశుచిత్వనివృత్తికై గంగాతీరంబునఁ గొన్ని దినంబులు నిలుచువాఁ డయి మునివర్గంబునకుఁ బ్రదక్షిణంబును బ్రణామంబునుం జేసి. 137

ప్రతిపదార్థం: అని+ఇట్లు= ఈ విధంగా; కృష్ణుండు+చెప్పెన్= కృష్ణుడు చెప్పాడు; పారాశర్యుండు= వ్యాసుడు; బోధించెన్= కర్తవ్యబోధ చేశాడు; దేవస్థానుండు= దేవలోకంలో ఉండే; నారదుండును= నారదుడు; హితవచనంబులు= మంచి మాటలు; ఉపదేశించిరి= బోధించారు; భీమ+ఆదులు నలువురును= భీముడు మొదలైన నలుగురు (తమ్ములు); ద్రౌపదియును= ద్రౌపది కూడా; తగినమాటలు= ఒప్పిదమైన పలుకులు; చెప్పిరి= చెప్పారు; శాస్త్ర+చక్షుస్+మహితులు+ఐన= శాస్త్రాలనే చక్షువులుగా కలిగిన-మహనీయులైన; మహీసురులు= బ్రాహ్మణులు; యోగ్యవచనంబులు= తగిన మాటలు; ఉపన్యసించిరి= బోధించారు; ఈ+విధంబునన్= ఈరీతిగా; అందఱ+వాక్యంబులున్= అందరి మాటలను; ఆకర్ణించి= విని; శోకంబున్+విడిచి= శోకం వదలిపెట్టి; ఆ+భూకాంతుండు= ఆ రాజు; ధరణీపాలన+అధ్వర కర్మంబులకున్= భూమిని పాలించటానికి; యాగాలు చేయటానికి; ఇయ్యకొని= అంగీకరించి; అశుచిత్వ= అపవిత్రతను; నివృత్తికై= పోగొట్టుకొనటానికి; గంగాతీరంబునన్= గంగాతీరంలో; కొన్ని దినంబులు= కొన్ని రోజులు; నిలుచు వాఁడు+అయి= ఉండటానికి నిర్ణయించుకొన్నవాడై; మునివర్గంబునకున్= ముని సమూహానికి; ప్రదక్షిణంబునున్= ప్రదక్షిణమూ; ప్రణామంబునున్= వందనమూ; చేసి= చేసినవాడై.

తాత్పర్యం: ఈవిధంగా శ్రీకృష్ణుడు చెప్పాడు. వ్యాసమహర్షి కర్తవ్యబోధ చేశాడు. నారదమహర్షి హితోక్తులు పలికాడు. భీమాదులూ, ద్రౌపదీ తగిన మాటలు చెప్పారు. శాస్త్రపండితులైన బ్రాహ్మణులు కూడా ఏ విధంగా ప్రవర్తించాలో బోధించారు. ఈ రీతిగా అందరాడిన మాటలూ విని, శోకాన్ని వదలిపెట్టి, ఆ ధర్మరాజు రాజ్యపాలన చేయటానికి, యాగంచేయటానికి అంగీకరించాడు. ముందుగా యుద్ధపాపంవలన తమ కంటిన అపవిత్రతను పోగొట్టుకొనటంకొరకు గంగాతీరంలో కొన్ని రోజు లుండటానికి నిశ్చయించుకొని, మునిసమూహానికి ప్రదక్షిణంగా తిరిగి, శిరసు వంచి నమస్కరించాడు. ఇట్లా అన్నాడు.

క. 'మీ కారుణ్యంబున నా । శోకం బంతయును బాసె సుమనస్కత సు
శ్లోకాత్ములార! కలిగెన్ । నాకున్ విచ్చేయుఁ డింక నను మఱవకుఁడీ.' 138

ప్రతిపదార్థం: సుశ్లోక+ఆత్ములార!= పుణ్యాత్ములని ప్రసిద్ధిగాంచిన ఓ మునివర్యులారా!; మీ కారుణ్యంబునన్= మీ దయతో; నా శోకంబు+అంతయునున్= నా దుఃఖమంతా; పాసెన్= నశించింది; నాకున్= నాకు; సుమనస్కత= ప్రశాంత చిత్తవృత్తి; కలిగెన్= కలిగింది; ఇంకన్+విచ్చేయుఁడు= ఇక దయతో మీమీ స్వస్థానాలకు దయచేయండి; ననున్= నన్ను; మఱవకుఁడీ= మరవకండి.

తాత్పర్యం: పుణ్యాత్ములారా! మీ ఉపదేశాలవలన నా మనస్సు ప్రశాంతమైనది. శోకం నశించినది. దయచేసి మీమీ స్వస్థానాలకు దయచేయండి. మీరు మాత్రం నన్ను ఎన్నటికీ మరవకండి.'

(వ్యాసనారదాది మునులు ధర్మజు వీడ్కొని స్వస్థానములకుఁ బోవుట (సం. 14-14-8))

క. అని పలికి, విశేషించి వేదవ్యాసమునివరుపాదంబుల కెఱఁగి 'భవత్ప్రసాదంబునం గందువ గనిన కనకమ్ము మిమ్ముంబురస్కరించుకొనిపోయి చేకొనంగలవాఁడ; నప్పటికి సన్నిధిసేయవలయు; నప్పెన్నిధికినాశ్రయంబైన హిమగిరి మహీధరంబులలోన నెల్లను బరమాశ్చర్యనిధి యని చెప్పుదురు గావున భవదీయ రక్షగొనియె చుండీ యందు నా పోవుట' యని సవినయంబుగాఁ బ్రార్థించి 'నాపైఁ బెక్కులు కల్యాణకరణకల్పంబు లగు మాట లాడితిరి; మహాభాగ్యవంతులకుఁ గాక యిట్టివారి కారుణ్యంబు దొరకొనునె? మీ కరుణయ నన్ను భాగ్యవంతుం డని తెలిపెడు'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నని బహుప్రకారంబులం బ్రస్తుతిసేసె; న ట్లామంత్రితులై యమ్మహాత్ము లందఱు గృష్ణార్జునామంత్రణంబు గైకొని యంతర్ధానంబు సేసిరి. పదంపడి భీష్మునకుం బరలోకక్రియలు ధృతరాష్ట్ర సహితుండై యాచరించి కర్ణప్రభృతి కురుప్రకరంబునకు నూర్ధ్వలోక సాంద్రసౌఖ్యసిద్ధ్యర్థంబుగా నానావిధ దాన విధులు నిర్వర్తించి కృతకృత్యుండై కతిపయ దినంబుల కచ్చోటు గదలి పాండవాగ్రజుండు పాండునృపాగ్రజు నగ్రేసరుం గావించుకొని కరినగరంబున కరిగి యతనిం బూజించి తదనుజ్ఞాశోభితుండగుచుఁ గృష్ణుండును భీమాద్యనుజులు మోదంబు నొంద జనులు నభినందింపఁ బెంపారి వసుంధరాపరిపాలనధురంధరుం డయ్యెనని చెప్పిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె. 139

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; విశేషించి= ప్రత్యేకంగా; వేదవ్యాస మునివరు పాదంబులకున్= వ్యాసమహర్షి పాదాలకు; ఎఱంగి= నమస్కరించి; భవత్+ప్రసాదంబునన్= మీ అనుగ్రహంతో; కందువ కనిన కనకమ్మున్= తెలిసిన రహస్య నిధి అయిన ఆ బంగారాన్ని; మిమ్మున్= మిమ్ములను; పురస్కరించుకొని పోయి= ముందుగా ఉంచుకొని వెళ్ళి; చేకొనన్+కలవాఁడను= తీసికొనగలను (తీసికొంటాను); అప్పటికిన్= అప్పటికి (ఆ సమయానికి); సన్నిధి+చేయవలయున్= మీరు తప్పక దయచేయాలి; ఆ+పెన్నిధికిన్= ఆ మహానిధికి; ఆశ్రయంబు+ఐన= ఆశ్రయమైనటువంటి; హిమగిరి= హిమాలయం; మహీధరంబులలోన్+ఎల్లనున్= పర్వతాలన్నింటిలోనూ; పరమ+ఆశ్చర్య నిధి+అని= గొప్ప గొప్ప ఆశ్చర్యాలకు నిధి అని; చెప్పుదురు= చెప్పుతారు; కావునన్= అందుచేత; అందున్= ఆ చోటికి; నా+పోవుట= నేను వెళ్లటం; భవదీయ= మీ; రక్ష+కొనియె+చుండీ= మీ రక్షణను తీసికొనే సుమండీ!; అని; సవినయంబుగాన్= వినయంతో; ప్రార్థించి= ప్రార్థించినవాడై; నాపైన్= నన్ను గురించి; పెక్కులు= అనేకాలైన; కల్యాణ కరణ కల్పంబులు+అగు= మాటలు= శుభాలను చేకూర్చటానికి అనువైన మాటలు; ఆడితిరి= చెప్పారు; మహాభాగ్యవంతులకున్+కాక= చాలా గొప్ప అదృష్టవంతులకు తప్ప; ఇట్టి వారి= మీవంటి మహనీయుల; కారుణ్యంబు+దొరకొనునె?= దయ సంప్రాప్తిస్తుందా?; మీ కరుణ+అ= మీ దయే; నన్ను; భాగ్యవంతుండు+అని= అదృష్టవంతుడినని; తెలిపెడున్= తెలుపుతున్నది; అని; బహుప్రకారంబులన్= చాలా విధాలుగా; ప్రస్తుతి+చేసెన్= ప్రస్తుతించాడు; అట్లు= ఆ విధంగా; ఆమంత్రితులు+ఐ= వీడ్కొనబడ్డవారై; ఆ+మహాత్ములు+అందఱున్= ఆ మహనీయులందరూ; కృష్ణార్జున+ఆమంత్రణంబున్= శ్రీకృష్ణుడి; అర్జునుడి వీడ్కోళ్ళను; కైకొని; గ్రహించి; అంతర్ధానంబు+చేసిరి= మాయమయ్యాడు; పదంపడి= ఆ తరువాత; భీష్మునకున్= భీష్ముడికి; ధృతరాష్ట్ర సహితుండు+ఐ= ధృతరాష్ట్రుడితో కూడి; పరలోక క్రియలు= ఉత్తర క్రియలు; ఆచరించి= చేసి; కర్ణప్రభృతి= కర్ణుడు మొదలైన; కురు ప్రకరంబునకున్= కురు సమూహానికి; ఉర్ధ్వలోక= పై లోకాలలో; సాంద్ర సౌఖ్య సిద్ధి+అర్థంబుగాన్= మహాసౌఖ్యాలు కలిగే విధంగా; నానావిధ= వివిధాలైన; దానవిధులు= దానధర్మాదులు; నిర్వర్తించి= చేసి; కృతకృత్యుండు+ఐ= తాను చేయదగిన పనులను పూర్తిచేసినవాడై; కతిపయ దినంబులకున్= కొన్ని రోజుల తరువాత; ఆ+చోటు+కదలి= ఆ స్థానంనుండి బయలుదేరి; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; పాండునృప+అగ్రజున్= పాండురాజు అన్నను (ధృతరాష్ట్రుడిని); అగ్రేసరున్+కావించుకొని= ముందుగా ఉంచుకొని; కరి నగరంబునకున్+అరిగి= హస్తినాపురానికి వెళ్ళి; అతనిన్= ఆ ధృతరాష్ట్ర మహారాజును; పూజించి= మిక్కిలిగా గౌరవించి; తద్+ అనుజ్ఞా శోభితుండు+అగుచున్= అతడి అనుమతిచేత ప్రకాశిస్తున్నవాడై; కృష్ణుండునున్ భీమ+ఆది+అనుజులున్= శ్రీకృష్ణుడు, భీమాదులైన తన సోదరులు; మోదంబున్+ఒందన్= సంతోషం పొందగా; జనులు+అభినందింపన్= ప్రజలు మిక్కిలి సంతోషం పొందగా; పెంపారి= వైభవం అతిశయించగా; వసుంధరా పరిపాలన= భూమిని పాలించటంలో; ధురంధరుండు+అయ్యెన్+అని= ప్రవీణు డయ్యాడని; చెప్పినన్= చెప్పగా; విని; జనమేజయుండు; వైశంపాయనునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి, ప్రత్యేకంగా వ్యాసమహర్షి పాదాలకు నమస్కరించి 'మహర్షీ! మీ అనుగ్రహంతో తెలిసిన ఆ రహస్యనిధిని మిమ్ములను ముందుగా ఉంచుకొని వెళ్ళి తప్పకుండా గ్రహిస్తాను. ఆ సమయానికి మీరు తప్పకుండా రావాలి. ఆ మహానిధికి ఆకరమైన హిమాలయాలు గొప్పగొప్ప వింతలకు చోటని పెద్దలు చెప్పుతారు. కనుక అట్లాంటి

చోటికి నేను వెళ్ళటం అంటే మీ రక్షణను తీసికొనే సుమండీ!' అని వినయంతో ప్రార్థించినవాడై 'స్వామీ! మీరు మాకు శుభాలను చేకూర్చి, ఎన్నో మంగళకరవాక్యాలను పలికారు. గొప్ప అదృష్టవంతులకు తప్ప మీవంటి మహనీయుల దయ సంప్రాప్తిస్తుందా! మీ అనుగ్రహమే మేము చాలా అదృష్టవంతుల మని చెప్పుతున్నది' అని చాలా విధాలుగా ప్రస్తుతించాడు. ఆ విధంగా ధర్మరాజు వీడ్కోలు పలుకగా, ఆ మహాత్ము లందరూ శ్రీకృష్ణుడు, అర్జునుడు పలికిన వీడ్కోలు మాటలను విని సంతోషంగా అంతర్ధానం చేశారు. ఆ తరువాత ధర్మరాజు ధృతరాష్ట్రుడితో కలిసి భీష్ముడికి ఉత్తరక్రియలు నిర్వర్తించి, కర్ణుడు మొదలైన కురుసమూహానికి స్వర్గంలో మహత్తరసౌఖ్యసిద్ధి కలిగేటట్లు అనేక దానకర్మలు చేసినవాడై ధన్యు డయ్యాడు. కొన్ని రోజులకు ఆ చోటి నుండి బయలుదేరి ధృతరాష్ట్ర మహారాజు వెంట పాండవులు హస్తినాపురానికి చేరుకొన్నారు. ధర్మరాజు పెద్ద మహారాజును సముచితంగా గౌరవించి, ఆయన అనుమతితో విరాజిల్లుతూ శ్రీకృష్ణుడు, భీమాది సోదరులూ సంతోషంతో సహకరిస్తుండగా, ప్రజలు మెచ్చుకొనే విధంగా వైభవంతో ఒప్పారి రాజ్యపాలనాభారాన్ని మోయటంలో ప్రవీణుడని పేరు పొందాడు - అని చెప్పగా విని, జనమేజయుడు వైశంపాయనమహర్షిని చూచి ఇట్లా అడిగాడు.

(ధర్మజుఁడు ధరణిం బాలించునపుడు కృష్ణార్జునుల వర్తించు విధము (సం.14-15-1))

తే. **'ఇవ్విధంబున ధర్మజుం డెలమి ధరణి। పాలనము సేయఁగాఁ గృష్ణపార్థు లెట్టి**
తెఱఁగువారలై యెచట వర్తించి రెఱుఁగఁ। జెప్పవే నాకు సజ్జనసేవనీయ!' **140**

ప్రతిపదార్థం: సజ్జన సేవనీయ!= సత్పురుషులచేత సేవించదగిన ఓ వైశంపాయన మహర్షీ!; ఈ+విధంబునన్= ఈ రీతిగా; ధర్మజుండు= ధర్మరాజు; ఎలమిన్= ప్రీతితో; ధరణిపాలనము= రాజ్యపాలన; చేయఁగాన్= చేస్తుండగా; కృష్ణపార్థులు= శ్రీకృష్ణుడు, అర్జునుడు; ఎట్టి తెఱఁగువారలు+ఐ= ఏ విధంగా; ఎచట= ఎక్కడ; వర్తించిరి= ఉన్నారు? నాకున్= నాకు; ఎఱుఁగన్+చెప్పవే= దయచేసి వివరించుము.

తాత్పర్యం: మహర్షీ! ఈ విధంగా ధర్మరాజు రాజ్యపాలన చేస్తుండగా శ్రీకృష్ణుడు, అర్జునుడు ఎట్లా కాలం గడిపారు? ఏమి చేశారు? ఎక్కడున్నారు? దయచేసి వివరంగా నాకు చెప్పుము.

విశేషం : కృష్ణార్జునులు కలిస్తే ఇద్దరూ ఎప్పుడూ ఊరకే ఉండరు. వారు ఏదో ఒక పనిలో ఉంటారు. అది కూడా చాలా మహత్తర కార్యమే అయి ఉంటుంది. అదీ జనమేజయుడు భారతమంతా విని తెలిసికొన్న విషయం.

వ. **అని యడిగిన వైశంపాయనుం డిట్లనియె.** **141**

తాత్పర్యం: అని అడుగగా వైశంపాయనుడు ఇట్లా చెప్పాడు.

సీ. **'ధర్మజుం డమ్మెయి ధరణిఁ బాలింపంగ। ననఘ। యింద్రప్రస్థమున వసించి**
కృష్ణుండుఁ గ్రీడియుఁ గ్రీడాపరత సరి। త్కాననపర్వతసానుదేశ
ములఁ జరించుచు విప్రపూజలఁ బుణ్య క। థాశ్రవణముల సత్కావ్యగోష్ఠిఁ
బ్రొద్దు పుచ్చుచుఁ దమ పూర్వవృత్తము లైన। సమరతంత్రప్రముఖములఁ జెప్పి

తే. **కొనుచు నుండుదు రాత్మీయతనయు నరుఁడు। దలఁచి వగచిన శోకంబు దలఁగు నట్టి**
వాక్యసంతతి నా వృష్ణివరుఁడు దేర్చు। సముచితోక్తుల; ధర్మజు శాంతి వొగడు. **142**

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; ధర్మజుండు; ఆ+మెయిన్= ఆ విధంగా; ధరణిన్+పాలింపంగన్= రాజ్యాన్ని పరిపాలిస్తుండగా, ఇంద్రప్రస్థమునన్= ఇంద్రప్రస్థపురంలోనే; వసించి= ఉంటూ; కృష్ణుండున్= శ్రీకృష్ణుడు; క్రీడియున్= అర్జునుడూ; క్రీడాపరతన్= విలాసంగా; సరిత్= నదులు; కానన= అడవులు; పర్వత= కొండలు; సానుదేశములన్= సానువులలో; చరించుచున్= విహరిస్తూ; విప్రపూజలన్= బ్రాహ్మణులను అర్చిస్తూ; పుణ్యకథాశ్రవణములన్= పుణ్య కథలు వింటూ; సత్కావ్యగోష్ఠిన్= పవిత్రకావ్యాలను గురించి సాధుసత్పురుషులలో చర్చిస్తూ; ప్రొద్దు+పుచ్చుచున్= కాలం గడుపుతూ; తమ= తాము నిర్వహించిన; పూర్వవృత్తములైన= ముందు జరిగిన; సమరతంత్ర ప్రముఖములన్= యుద్ధ తంత్రాలను, వ్యూహాలను, చూచిన సాహసాలను; చెప్పికొనుచున్+ఉండుదురు= చెప్పుకొంటూ ఉంటారు; నరుఁడు= అర్జునుడు; ఆత్మీయతనయున్= తన కొడుకు అభిమన్యుడిని గురించి; తలఁచి= చింతించి; వగచినన్= దుఃఖపడినపుడు; శోకంబున్+తలఁగు+అట్టి= శోకాన్ని పోగొట్టుకొనేటటువంటి; వాక్యసంతతిన్= మంచి మాటలతో; ఆ వృష్ణివరుఁడు= ఆ వృష్ణివంశశ్రేష్ఠుడైన కృష్ణుడు; సముచిత+ఉక్తులన్= తగిన విధంగా; తేర్చున్= ఆ అర్జునుడిని; ఓదారుస్తాడు; ధర్మరాజు+శాంతిన్= ధర్మరాజుయొక్క ప్రశాంత స్వభావాన్ని; పొగడున్= పొగుడుతాడు.

తాత్పర్యం: ఓ పుణ్యాత్ముడా! వినుము. ఆ విధంగా ధర్మరాజు సుఖంగా రాజ్యపాలన చేస్తుండగా శ్రీకృష్ణుడు, అర్జునుడు ఇంద్రప్రస్థపురంలో ఉంటూ విలాసంగా నదులు, అడవులు, కొండలు, సానువులు వీటిలో విహారంగా తిరుగుతూ, బ్రాహ్మణులను పూజిస్తూ, పవిత్ర కథలను పెద్దవారివలన వింటూ, సత్కావ్యాలను గురించి సాధుసత్పురుషులతో గోష్ఠి జరుపుతూ కాలం గడుపుతుండేవారు. మాటాడుకొంటున్నపుడు తాము మునుపు యుద్ధంలో పన్నిన తంత్రాలను, యుద్ధవ్యూహాలను, చూపిన సాహసాలను ముచ్చటించుకొనేవారు. అప్పుడప్పుడు అర్జునుడు తన కొడుకు అభిమన్యుడి దుర్మరణం గుర్తుకురాగానే చింతలో మునిగి దుఃఖించేవాడు. అపుడు శ్రీకృష్ణుడు ఓదార్పు మాటలు చెప్పి, ఆ దుఃఖాన్ని పోగొట్టేవాడు. ఆ విధంగా ఉంటున్నప్పుడు ధర్మరాజు ప్రసక్తి వచ్చినప్పు డెల్లా శ్రీకృష్ణుడు ఆయన ప్రశాంతస్వభావాన్ని ఎంతగానో ప్రశంసించేవాడు.

విశేషం : నరనారాయణుల అవతారాలుగా చెప్పబడే అర్జునుడు. శ్రీకృష్ణుడు పాటించిన 'స్నేహం' బాంధవ్యానికి అతీతమైనది. అది ప్రేమమయమైన భక్తి దైవ - సంబంధం. అందుకే యుద్ధం జరిగేటంతవరకు 'కర్మ' యోగాన్ని బోధించి కార్యశీలుడిగా మార్చాడు కృష్ణుడు. యుద్ధం తరువాత కూడా అతడిలో మనశ్శాంతి కలిగి జ్ఞానోదయం కావటానికై అతడి వెంటనే ఉన్నాడు.

క. విను మయకృత సభఁ గ్రొత్తగఁ। గని యచ్చో నొక్కయెడ సకౌతుక నానా
జనపరివృతులై యుండుదు। రనూన విభవమునఁ బ్రమద మారఁగ వారల్. 143

ప్రతిపదార్థం: విను= ఇంకా వినుము; మయకృత సభన్= ఆనాడు మయబ్రహ్మ వారికొరకు నిర్మించి ఇచ్చిన మయసభను; క్రొత్తగన్+కని= క్రొత్తగా మరల ఒక సారి చూడటానికి వెళ్ళి; ఆ+చోటన్= అక్కడ; ఒక్క+ఎడన్= ఒకచోట; సకౌతుక= కుతూహలంతో కూడిన; నానాజన పరివృతులు+ఐ= అనేక జనులచేత చుట్టుకొనబడి; అనూన విభవమునన్= విశేషమైన వైభవంతో; ప్రమదము+ఆరఁగన్= సంతోషం అతిశయించగా; వారల్= ఆ కృష్ణార్జునులు; ఉండుదురు= ఉంటారు.

తాత్పర్యం: ఆనాడు మయబ్రహ్మ నిర్మించిన మయసభను మరలా చూడటానికి ఒకసారి శ్రీకృష్ణుడు అర్జునుడు వెళ్ళారు; అక్కడ ఒక చోట జనులంతా కుతూహలంతో ఈ ఇరువురి చుట్టూ మూగారు. అట్లా పాతకథలు త్రవ్వుకొంటూ క్రొత్త అనుభవం పొందుతూ సంతోషంగా వాళ్ళు కాలం గడిపారు.

విశేషం : పద్యంలో స్పష్టంగా చెప్పకపోయినా ఆ ఒక్కచోటు దుర్యోధనుడు భ్రాంతితో కాలుజారి నీటి మడుగులో పడ్డ స్థలమే అయి ఉండాలి. అది విహారస్థలంగా మారిపోయి ప్రజలు రోజూ సందర్శించేవారన్నమాట.

వ. ఒక్కనాఁ డప్పుండరీకాక్షుండు గాండీవితో నిట్లనియె. 144

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు= ఆ+పుండరీక+అక్షుండు= తెల్ల తామరరేకులవంటి కన్నులుగల ఆ శ్రీకృష్ణుడు; గాండీవితోన్= అర్జునుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఒక రోజు ఆ పుండరీకాక్షుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు.

సీ. 'సమరంబు ధర్మవిజయ పరికీర్త్యంబు। గాఁ జేసి భూమి నిష్కంటకముగఁ
బాలించుచున్నాఁడు ప్రజ ప్రీతినొందంగ। విద్వజ్జనంబులు వివిధసుఖము
లనుభవించుచుఁ దన్ను వినుతింప నెగడెడు। శాంతియు సమతయు సకలజనము
గొనియాడు సిద్ధులు మునులు సేవింతురు;। ధర్మనందనుఁ డి ట్లుదాత్తుఁ డగునె!

తే. యతని కున్నతి గావించి రనిలజుండు। గవలు నెంతయు నీ చేతి గాండివంబు
లీల గల్గి మహాధర్మశాలి సత్య। నిత్యుఁ డమ్మహీపతి గృతకృత్యుఁ డయ్యె.' 145

ప్రతిపదార్థం: సమరంబున్= యుద్ధాన్ని; ధర్మవిజయ పరికీర్త్యంబుగాన్+చేసి= ధర్మవిజయంగా పదిమందీ కీర్తించే విధంగా చేసి; భూమిన్= రాజ్యాన్ని; నిష్కంటకముగన్= ఏ ఆపదా లేకుండా; (భూమిని ఏ ముళ్ళూ లేకుండా చదును చేసినట్టు); పాలించుచున్నాఁడు= పరిపాలిస్తున్నాడు; ప్రజ= ప్రజలు; ప్రీతిన్+ఒందంగన్= సంతోషం పొందగా; విద్వత్+జనంబులు= పండితులైనవారు; వివిధ సుఖములు+అనుభవించుచున్= వివిధాలైన సుఖాలు అనుభవిస్తూ; తన్నున్= తన్ను; వినుతింపన్= ప్రస్తుతించగా; నెగడెడున్= ప్రకాశిస్తున్నాడు; శాంతియున్= ధర్మజుడు ప్రతిష్ఠించిన ప్రశాంతిని; సమతయున్= సమత్వాన్ని; సకల జనమున్= జనులందరూ; కొనియాడున్= ప్రస్తుతిస్తారు; సిద్ధులున్= సిద్ధులూ; మునులున్= మహర్షులు; సేవింతురు= ధర్మరాజును సందర్శించి ఆయనను సేవిస్తారు; ధర్మనందనుఁడు= ధర్మరాజు; ఇట్లు+ఉదాత్తుడు+ అగునె!= ఇట్లా ధర్మరాజు ఎంత ఉన్నతిని పొందాడయ్యా!; అనిలజుండున్= భీముడు; 'కవలున్= నకులసహదేవులు;' ఎంతయున్= ఎంతగానో; అతనికిన్= ధర్మరాజుకు; ఉన్నతి+కావించిరి= ఎంతో ఔన్నత్యాన్ని తెచ్చారు; నీచేతి గాండివంబున్= నీ చేతిలోని గాండీవాన్ని; లీలన్+కల్గి= అతి లీలగా తనదానివలెనే పొంది (అంటే నీ పరాక్రమమంతా అతడిది కాగా); మహాధర్మశాలి= సారధర్మప్రవీణుడైన ఆ ధర్మరాజు; సత్యనిత్యుఁడు= సత్యంలో నిత్యమూ చరించేవాడైన; ఆ+మహీపతి= ఆ ధర్మరాజు; కృతకృత్యుఁడు+అయ్యెన్= ధన్యు డయ్యాడు.

తాత్పర్యం: తాను చేసిన యుద్ధం ధర్మవిజయమని జనులు మిక్కిలిగా కీర్తించే విధంగా చేసి, ధర్మరాజు రాజ్యాన్ని ఏ ఆపదా లేకుండా పరిపాలిస్తూ ఉన్నాడు. ప్రజలు మిక్కిలిగా సంతోషించారు. విద్వజ్జనులు సర్వసుఖాలూ అనుభవిస్తూ తనను ప్రస్తుతిస్తున్నారు. అతడు స్థాపించిన ప్రశాంతి, సర్వసమానత్వ ధర్మాలు ప్రజల సమ్మతిని పొందాయి. సిద్ధులు, మునులు కూడా వచ్చి ఆయన సన్నిధిని చేరుతున్నారు. ధర్మరాజు ఎంత ఉన్నతిని పొందాడయ్యా! అవును - ఆయన కేమి కొదవ! భీముడు, నకులసహదేవులు తమ బలపరాక్రమాలతో ఆయన ఎత్తును ఎంతో పెంచారు. నీ గాండీవం ఆయన చేతిలో ఉన్నట్లే కదా! మీదు మిక్కిలి మహాధర్మశాస్త్రప్రవీణుడు, సత్యపాలనాధ్యక్షుడు. అందుకే ధర్మనందనుడు ధన్యు డయ్యాడు.'

వ. అని యగ్గించి యతని యాననం బాలోకించి. 146

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని; అగ్గించి= పొగడి; అతని ఆననంబు= అతడి ముఖం; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అని అర్జునుడిని పొగడి అతడి ముఖం చూచి (తరవాతి పద్యంతో అన్వయం.)

ఉ. 'నీవలనన్ మహాత్మ! విను నిర్భరచిత్తుఁడ నైతిఁ జూడఁగాఁ
బోవు తలంపు పుట్టెడుఁ బ్రభూతగుణున్ బలదేవు వత్సలన్
దేవకి నార్ద్రచిత్తు వసుదేవుని మద్గతరాగసాంద్ర స
ద్భావుల సర్వయాదవులఁ బార్థ! ననుం దగ నన్పిపుచ్చువే. 147

ప్రతిపదార్థం: పార్థ!= అర్జునా!; మహాత్మ!= మహనీయ గుణ సంపన్నుడా!; విను(ము)= నాకు ఒక కోరిక పుట్టినది వినుము; నీవలనన్= నీ వలన; నిర్భర చిత్తుఁడన్+ఐతిన్= నా మనసు మిక్కిలిగా సంతోషించింది (ఇపుడు); ప్రభూతగుణున్= మిక్కిలి ప్రశస్తగుణ సంపన్నుడైన; బలదేవున్= బలరాముడిని; వత్సలన్= నామీద వాత్సల్యంతో ఎదురుచూచే; దేవకిన్= దేవకిని; ఆర్ద్రచిత్తున్= ఆర్ద్రమైన (దయాహృదయుడైన) చిత్తం కలిగిన; వసుదేవునిన్= వసుదేవ మహారాజును; మత్+గత+రాగసాంద్ర సద్భావులన్= నా విషయంలో మిక్కిలి అనురాగమూ గాఢమైన సద్భావమూ కలిగిన; సర్వయాదవులన్= యాదవులందరినీ; చూడఁగాన్+పోవు+తలంపు+పుట్టెడున్= చూడటానికి వెళ్ళాలన్న కోరిక కలుగుతున్నది; నన్నున్= నన్ను; తగన్+అన్పి+పుచ్చవే= తగినవిధంగా దయతో పంపించుము.

తాత్పర్యం: 'అర్జునా! మహనీయ గుణసంపన్నా! నీవలన నేను మహానందాన్ని పొందాను. ఈ తృప్తి చాలును. ప్రశస్తగుణసంపన్నుడైన బలరాముడిని, వాత్సల్యంతో నాకొరకు ఎదురుచూచే మా అమ్మ దేవకిని, ఆర్ద్రచిత్తుడైన, నా అగమనం నిరీక్షించే మా తండ్రి వసుదేవ మహారాజును, నా విషయంలో గాఢమైన అనురాగ సద్భావాలు కలిగిన యాదవులందరను చూడాలన్న కోరిక పుట్టుతున్నది. ఇక నీవు నన్ను తగినవిధంగా దయతో పంపించుము.

విశేషం : అంతటి మహాయోగేశ్వరుడు కూడా లౌకికబాంధవ్యాలలోని మర్యాదలను ఎంత చక్కగా పాటించాడో ఈ పద్యంలో చూడవచ్చును. బావ అనుమతి లేకుండా వెళ్ళకూడదు. అది బంధుమర్యాద. అందుకే 'తగన్' పంపించు అని కోరటం.

క. ద్వారకకుఁ బోయి వచ్చెదఁ। గౌరవపతి కిత్తెఱంగు కార్యజ్ఞానో
దారుఁడ వగు నీ వౌచి। త్యారూఢము గాఁగఁ జెప్పు మగు సమయమునన్. 148

ప్రతిపదార్థం: ద్వారకకున్= ద్వారకా నగరానికి; పోయి వచ్చెదన్= వెళ్ళి వస్తాను; కార్యజ్ఞాన+ఉదారుఁడవు+అగు= కార్యానికి సంబంధించిన జ్ఞానంలో శ్రేష్ఠుడవైన; నీవు; కౌరవపతికిన్= ధర్మరాజుకు; అగు సమయమునన్= తగిన సమయంలో; ఈ తెఱంగు= ఈ విషయాన్ని; ఔచిత్య+ఆరూఢము కాఁగన్= తగిన రీతిలో; చెప్పుము= ప్రస్తావించుము.

తాత్పర్యం: అర్జునా! నేను ద్వారకానగరానికి వెళ్ళివస్తాను. ఏ పనిని ఎట్లా చేయాలో నీకు బాగా తెలుసును. సరైన సమయంలో తగిన రీతిలో ధర్మరాజుకు ఈ విషయం చెప్పుము.

వ. అట్లు గావున ధర్మరాజానుమతంబునం జనువాఁడఁ గావలయు వినుము. 149

ప్రతిపదార్థం: అట్లు+కావునన్= అందువలన; ధర్మరాజు+అనుమతంబునన్= ధర్మరాజు అనుమతితోనే; చనువాఁడన్+కావలయున్= వెళ్ళేవాడిని కావాలి; వినుము= ఎందుకో చెప్పుతాను వినుము.

తాత్పర్యం: ఎందుకు నిన్ను ప్రస్తావించు మన్నావంటే ధర్మరాజు అనుమతి గ్రహించే నేను వెళ్ళాలి. అది నా బాధ్యత. కారణం చెప్పుతాను వినుము.

తే. అవ్విభుఁడు వోయి వత్తుగా కనక పోను। మేనుఁ బ్రాణంబుఁ దనయులు మిత్రగణము
బంధులును నర్థచయము నప్పార్థివేంద్రు। సొమ్ము తదనువర్తనము వ్రతమ్ము నాకు. 150

ప్రతిపదార్థం: ఆ+విభుఁడు= ఆ రాజు (ధర్మరాజు); పోయివత్తు(వు)+కాక= వెళ్లిరా; అనక= అనకుండా; పోను= నేను వెళ్ళను; (నా) మేనున్= దేహం; ప్రాణంబున్= ప్రాణం; తనయులున్= సంతానమూ; మిత్రగణమున్= స్నేహితులూ; బంధులునున్= స్నేహితులూ; అర్థచయమున్= సంపదా; ఆ+పార్థివేంద్రు సొమ్ము= ఆ రాజు సొత్తే; (కనుక) నాకున్= నాకు; తద్+అనువర్తనము= ఆయన మాటను అనుసరించి వర్తించటం; వ్రతమ్ము= ఒక దీక్ష.

తాత్పర్యం: ఆ రాజు వెళ్ళిరా అనకుండా నేను వెళ్ళను. నా ఈ దేహం, ప్రాణం, సంతతి, స్నేహితులు, బంధువులు, సంపద - అన్నీ ఆ రాజు సొత్తే. అందుచేత ఆయన మాటను పాలించి వర్తించటం నాకు దీక్ష.

వ. కావున. 151

తాత్పర్యం: కాబట్టి - (తరవాతి పద్యంతో అన్వయం.)

క. మనము కరినగరమునకుం। జని పుణ్యాత్ముని నజాతశత్రుని నెలమిం
గని తగు నవసరమున ని। ప్పని విజ్ఞాపించి యతని పనిచిన భంగిన్. 152

ప్రతిపదార్థం: మనము= మన మిద్దరమూ; కరిగనరమునకున్= హస్తినాపురానికి; చని= వెళ్ళి; పుణ్యాత్మునిన్= పుణ్యాత్ముడైన; అజాతశత్రునిన్= ధర్మరాజును; ఎలమిన్= ప్రీతితో; కని= చూచి; తగు+అవసరమునన్= తగిన సమయంలో; ఈ+పని= ఈ విషయాన్ని; విజ్ఞాపించి= చెప్పి; అతని పనిచిన భంగిన్= అతడు చెప్పిన రీతిలో.

తాత్పర్యం: మన మిద్దరమూ హస్తినాపురానికి వెళ్ళి పుణ్యాత్ముడైన ఆ ధర్మరాజును చూచి తగిన సమయంలో ఈ విషయాన్ని విన్నవించి అతడి అనుమతి ప్రకారం చేద్దాము.

క. నడతము పోద 'మనుడుఁ గ। వ్వడి గొండొక వడి విచారవన్మానసుఁడై
'కడుమే లటు సేయుద' మని। యొడఁబాటుం బలుకు పలికి యొయ్యన పిదపన్. 153

ప్రతిపదార్థం: నడతము= నడుచుకొందాము; పోదము+అనుడున్= వెళ్ళుదాము పద - అనగా; కవ్వడి= అర్జునుడు; కొండొక వడిన్= కొంతసేపు; విచారవత్+మానసుఁడు+ఐ= విచారంగల మనసు కలవాడై; కడు మేలు= ఇది చాలా మంచిపని; అటు+చేయుదము= అట్లాగే చేద్దాము; అని; ఒడఁబాటున్= అంగీకారాన్ని సూచించే; మాట; పలికి= చెప్పి; ఒయ్య+న్+అ= వెంటనే; పిదపన్= తరువాత

తాత్పర్యం: వెళ్ళుదాము పద' అని కృష్ణు డనగా అర్జునుడు కొంతసేపు బాధపడి, తేరుకొని 'ఇది చాలా మంచిపని అట్లాగే చేద్దాము' అని అంగీకరించి, వెంటనే (తరువాతి వచనంతో అన్వయము.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అమ్మహాత్మునితో నిట్లనియె. 154

ప్రతిపదార్థం: ఆ+మహాత్మునితోన్= మహనీయుడైన ఆ కృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఆ మహనీయుడైన కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

చ. 'అనికిఁ దొడంగు నప్పుడు మదాత్మ గలంగినఁ గొన్ని తత్త్వబో
ధన మహనీయవాక్యము లుదాత్తకృపం దగ నీవు సెప్పి; తే
మనమున వాని యర్థములు మాధవ! నిల్పఁగఁ జాల నైతి; న
వ్వినుతవచస్సుధారసము వీనుల నింకొకమాఱు నింపనే.' 155

ప్రతిపదార్థం: అనికిన్= యుద్ధానికి; తొడంగు+అప్పుడు= ప్రారంభించినపుడు; మత్+ఆత్మ= నా మనస్సు; కలంగినన్= బాధపడగా; కొన్ని తత్త్వబోధన= కొన్ని తత్త్వ బోధకాలైన; మహనీయ= గొప్ప; వాక్యములు= మాటలు; ఉదాత్త కృపన్= గొప్ప దయతో; తగన్= తగినట్లుగా; నీవు చెప్పితి(ని)= చెప్పావు; ఏన్= నేను; మనమునన్= మనస్సులో; వాని+అర్థములు= ఆ మాటల భావాలను; నిల్పఁగన్+చాలన్+ఐతిన్= నిల్పజాలకుండా పోయాను; మాధవ!= కృష్ణా!; ఆ+వినుత+వచస్= ఆ గొప్పమాటలు అనే; సుధారసమున్= అమృతాన్ని; వీనులన్= చెవులలో; ఇంకొక మాఱు= మరొక్కసారి; నింపనే!= నింపవా!

తాత్పర్యం: 'యుద్ధానికి పూనుకొన్నప్పుడు నా మనస్సు కలతచెంది, నేను క్రుంగిపోయినప్పుడు నీవు కొన్ని తత్త్వబోధకాలైన మహావాక్యాలను నాపై మహాకరుణతో తగిన విధంగా బోధించావు. నేను మనస్సులో ఆ మాటల సారాంశాన్ని పదిలపరచుకొనలేకపోయాను. కృష్ణా! మళ్ళీ ఆ మాట లనే అమృతాన్ని చెవులలో మరొకసారి దయచేసి నింపవా!

విశేషం: యుద్ధప్రారంభంలో శ్రీకృష్ణుడు అర్జునుడిని ఉద్దేశించి చెప్పినదే 'భగవద్గీత.' యుద్ధానికి సన్నద్ధుడై బాణాలు అనుసంధించవలసిన సమయంలో వేదాంతభావన అసలు స్వరూపం తెలియక శోకంలో మునిగిపోయి, 'నాకు రాజ్యం వద్దు; రాజ్యసుఖం వద్దు; నేను యుద్ధం చేయను.' అని విషాదంలో అర్జునుడు కూరుకొనిపోయినప్పుడు శ్రీకృష్ణుడు భక్తిజ్ఞానకర్మలను, మనుష్యతత్త్వాన్ని, పరమేశ్వర విభూతిని, గుణశ్రద్ధాత్రయాలను బోధించి నిష్కామకర్మ చేయటంద్వారా శోకాన్ని దాటవచ్చునని ప్రబోధించి, యుద్ధం చేయుమని ప్రోత్సహించి, ఏ ఫలాపేక్ష కూడా లేకుండా కర్మ చేసినప్పుడు అది యోగమవుతుందని ఆనాడు చెప్పినా 'నరుడు' (అర్జునుడు మానవుడని అర్థం) అప్పటి కప్పుడు కాస్త 'తెలివిడి' పొందినా మరల అతడికి మరుపు ఆవహించి, అదంతా ఎక్కడో జరిగిన విషయంవలె లీలగా మాత్రమే గుర్తున్నది.

దానిని మరలా ఇక్కడా గుర్తు చేసికొంటున్నాడు.

గీతావాక్యాలు 'మహనీయ' వాక్యాలు. సకలోపనిషత్తుల సారాంశమూ గీతలో ఉందని వ్యాఖ్యాతలు నిరూపించారు. అందుకే దానిని 'బ్రహ్మవిద్య' అని గీతను 'ఉపనిషత్తు' అని పిలుస్తారు.

గీతావాక్యసారం 'సుధ' వంటిది. (సుధ అంటే అమృతం). వచస్+సుధారసము= వచస్సు అనే సుధారసము - అలంకారం రూపకం.

కామధేనువై వెలయుఁగ సకలా । మ్నాయసారమే గోవత్సముగా
ప్రేమపాత్రుడగు పార్థుని జేసియు । పిండి 'సుధ'ను గోపుడుంచె 'సుధి'కై.

అని భగవద్గీతా హరికథామంజరీకారుడు చెప్తున్నాడు. 'సుధి' అంటే 'మంచి ధిషణ' కలవాడు; సహృదయ సంపద, విజ్ఞానం నిష్పక్షపాతబుద్ధి, తత్త్వస్పృహ ఉన్నవాడు 'సుధి'. అట్లాంటి జ్ఞానానికి అమృతం వంటిది 'గీత'. అందుకే 'ఇంకొకమాటు నింపవే' అని ప్రేమతో 'గోముగా' అడుగుతున్నాడు. ధర్మరాజుపైనా, పాండవులందరిమీదా అనురాగ మున్నా కృష్ణుడికి ప్రీతిపాత్రుడు 'అర్జునుడే'. 'మమప్రాణా హి పాండవాః' అని అన్నాడు కృష్ణుడు. తన సంపదంతా ధర్మరాజుదే అన్నాడు. ఆయన అనుమతి లేనిదే ద్వారకకు పోను అన్నాడు. కాని చిత్రం ఏమిటంటే 'ప్రేమగలిగిన మిత్రుడు' అర్జునుడే.

క. అనిన నగుచు నొక కేల న । తనిఁ గౌఁగిఁట జేర్చి 'బుద్ధితత్త్వవిహీనుం
డును శ్రద్ధారహితుఁడు నై' । తని దూఱి ముకుందుఁ డిట్టు లను నాతనితోన్. 156

ప్రతిపదార్థం: అనినన్= అని అర్జును డనగా; నగుచున్= నవ్వుతూ; ఒక కేలన్= ఒక చేతితో; అతనిన్= అతడిని; కౌఁగిటన్+చేర్చి= కౌగిలిలో చేర్చుకొని; బుద్ధితత్త్వ విహీనుండును= బుద్ధితత్త్వం లేనివాడవూ, శ్రద్ధారహితుఁడున్+ఇతి(ఎ)+అని= శ్రద్ధలేనివాడవూ అయ్యావు అని; దూఱి= నిందించి; ముకుందుఁడు= కృష్ణుడు; అతనితోన్= అర్జునుడితో; ఇట్టులు+అనున్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని అర్జునుడు అనగా నవ్వుతూ కృష్ణుడు ఒక చేతితో అతడిని కౌగిలిలో చేర్చుకొని 'నీకు బుద్ధి, శ్రద్ధ రెండూ లేకుండా పోయాయి' అని మందలించి, అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం: శ్రద్ధలేకుండా వినటంవలన మరిచిపోయాడు. బుద్ధితో వినకపోవటంవలన సారాంశంకూడా మిగలకుండా పోయినది. అందుకే మందలించటం. కాని, ఆ మందలింపులోనూ ప్రేమ ఉన్నది. అందుకే కౌగిలించుకొని మరీ మందలించాడు.

తే. 'బ్రహ్మపదవేదనమునకుఁ బరమహేతు । భూతములు నాఁటి వాక్యముల్ బుద్ధిఁ దన్మ
హార్థములు నిల్పవైతి శక్యంబె యింక । నవ్వచనములు సెప్పంగ? నలఘుశౌర్య! 157

ప్రతిపదార్థం: అలఘుశౌర్య!= మహాపరాక్రమవంతుడా!; బ్రహ్మపద వేదనమునకున్= బ్రహ్మపదమంటే ఏమిటో తెలిసికొనటానికి; పరమ హేతు భూతములు= గొప్ప కారణభూతాలు; నాఁటి వాక్యముల్= ఆనాడు నేను చెప్పిన వాక్యాలు; బుద్ధిన్= నీ బుద్ధిలో; తద్+మహార్థములు= ఆ మహార్థాలను; నిల్ప(వు)+ఐతి(వి)= నిలుపకుండా పోయావు; ఇంకన్= మళ్ళీ; ఆ+వచనములు= ఆ మాటలను; చెప్పంగన్= చెప్పటానికి; శక్యంబె?= సాధ్యమా?

తాత్పర్యం: 'మహాపరాక్రమశాలీ! ఆనాడు చెప్పిన మహావాక్యాలు బ్రహ్మపదసాధకాలు. ఆ వాక్యాల అర్థాన్ని నీవు మనసులో నిలుపుకొనలేకుండా పోయావు. మరలా ఆ వాక్యాలను చెప్పాలంటే వీలవుతుందా!

విశేషం: బ్రహ్మపదం అంటే 'విముక్తి'- 'నడుమ' అనటమే బ్రహ్మమని ముందే వివరించబడింది. ఇక్కడ 'నిష్కామకర్మ' ను దానికి మార్గంగా చెప్పాడు (కామగీత చివరకూడా దీని ప్రసక్తి ఉన్నది) భగవద్గీత సారాంశమూ ఇదే. అందుకే బ్రహ్మపదనిర్వచనం తెలియాలంటే 'గీత'ను చదవాలని అర్థం. మహావాక్యాలు అట్లా తమకు తాముగా బయటపడతాయి తప్ప మాటిమాటికీ చెప్పాలంటే వీలుకానివి. కాబట్టే 'మంచి వాక్యాలను మళ్ళీ మళ్ళీ చెప్పలేము' అని పాశ్చాత్యులు కూడా భావిస్తారు.

(శ్రీకృష్ణుఁ డర్జుననకుఁ దత్త్వజ్ఞానస్థిరీకరణము చేయుట (సం. 14-16-12))

వ. ఏతద్విషయం బగునది యొక్కయితిహాసంబు గల దాకర్ణింపుము. నాకడకు నొక్క విప్రోత్తముండు వచ్చిన నేనును 'దత్త్వజ్ఞానంబు తెఱం గుపదేశింపవే' యనుటయు నతండు కాశ్యపనామధేయుం డగు నొక్క ధరామరుం డొక్కెడ

విజితేంద్రియుండును జ్ఞానవిజ్ఞానశాలియుఁ ద్య క్తసంసారపరిగ్రహుండును బ్రబుద్ధసేవితుండును నగు నొక్క సిద్ధునిం గాంచి సంభృతవినయుండై శిష్యత్వంబున భక్తి నాశ్రయించిన నమ్మహాద్విజునకు నమ్మహనీయుండు సెప్పిన వాక్యంబులు సెప్పెన; నవధానంబుతో విను' మని పల్కి మదీయవదనంబునం జూడ్కి నిలిపి యిట్లనియె. **158**

ప్రతిపదార్థం: ఏతద్+విషయంబు+అగునది= ఈ విషయానికి సంబంధించినదైన; ఒక్క ఇతిహాసంబు+కలదు= ఒక కథ ఉన్నది; ఆకర్ణింపుము= వినుము; నాకడకున్= నా దగ్గరకు; ఒక్క విప్ర+ఉత్తముండు= ఒక బ్రాహ్మణ శ్రేష్ఠుడు; వచ్చినన్= రాగా; నేనున్= నేను కూడా; తత్త్వజ్ఞానంబు+తెఱంగు= తత్త్వజ్ఞానరీతిని; ఉపదేశింపవే+అనుటయున్= దయచేసి ఉపదేశించుము అని కోరగా; అతండు= ఆ బ్రాహ్మణుడు; కాశ్యపనామధేయుండు+అగు= కాశ్యపుడని పేరుగల; ఒక్క ధరా+అమరుండు= ఒక బ్రాహ్మణుడు; ఒక్క+ఎడన్= ఒక చోట; విజిత+ఇంద్రియుండును= ఇంద్రియములను జయించినవాడూ; జ్ఞాన విజ్ఞాన శీలియున్= జ్ఞానం, విజ్ఞానం రెండూ కలవాడూ; త్యక్త= వదలిన; సంసార పరిగ్రహుండును= ఇల్లు, ఇల్లాలు కలవాడు; ప్రబుద్ధ సేవితుండును= జ్ఞానులచేత సేవించబడేవాడూ; అగు= అయిన; ఒక్క సిద్ధునిన్+కాంచి= ఒక సిద్ధుడిని చూచి; సంభృత వినయుండు+ఐ= నిండు వినయంతో; శిష్యత్వంబునన్= శిష్యభావంతో; భక్తిన్+ఆశ్రయించినన్= భక్తితో ఆశ్రయించగా; ఆ+మహాద్విజునకున్= ఆ గొప్ప బ్రాహ్మణుడికి; ఆ+మహనీయుండు= ఆ మహాత్ముడైన సిద్ధుడు; చెప్పిన వాక్యంబులు= చెప్పిన మాటలు; చెప్పెదన్= చెప్పుతాను; అవధానంబుతోన్= ఏకాగ్రచిత్తంతో; వినుము+అని= విను మని; పల్కి= చెప్పి; మదీయ వదనంబునన్= నా ముఖంలో; చూడ్కి+నిలిపి= చూపు నిలిపి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ విషయానికి (బ్రహ్మపదప్రాప్తికి సంబంధించిన) ఒక కథ ఉన్నది వినుము. నా వద్దకు ఒకసారి ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. 'అయ్యా! నాకు తత్త్వజ్ఞానం బోధించండి అని నే నడిగాను. అతడు కాశ్యపు డనే పేరుగల బ్రాహ్మణుడు ఒకచోట ఒక సిద్ధుడిని చూచారని, ఆ సిద్ధుడు ఇంద్రియాలను జయించినవాడని, జ్ఞానం విజ్ఞానం రెండూ తెలిసినవాడని, సంసారాన్ని భార్యను వదలినవాడని, మహాజ్ఞానులుకూడా ఆయనను సేవిస్తారని చెప్పి' తనకు ఆ సిద్ధుడు బోధించిన విషయాలు నాకు చెప్పిన వాక్యాలు నీకు చెప్పుతాను - ఏకాగ్రచిత్తంతో వినుము. అని పలికి నా ముఖంలో చూపు నిలిపి ఇట్లా అన్నాడు.

విశేషం: కృష్ణుడు వేదాంతం చెప్పుమని ఒక బ్రాహ్మణుడిని అడిగాడు. ఆ బ్రాహ్మణుడు కాశ్యపుడికి సిద్ధుడు బోధించిన వాక్యాలు చెప్పాడు. ఆ వాక్యాలను ఆ బ్రాహ్మణుడు కృష్ణుడికి చెప్పాడు. కృష్ణుడు ఆ మాటలను అర్జునుడికి తెలియజేస్తున్నాడు.

జ్ఞానం - లోకరీతికి సంబంధించినది. దీనినే లోకజ్ఞానం అంటాం. వివిధధర్మాలు, న్యాయపద్ధతులు, ఆర్థిక, సామాజిక పరిజ్ఞానం అంతా దీని కిందకు వస్తుంది. విశేషమైన జ్ఞానం విజ్ఞానం. ఇది అలౌకిక జ్ఞానం. ఇది మనిషి మనోజగత్తుకు సంబంధించిన వివేచన. వీటిని మించినది ప్రజ్ఞానం. దీనినే బ్రహ్మపదమంటారు. 'ప్రజ్ఞానం బ్రహ్మ' అనే వేదోక్తికి అర్థం ఇదే. ఇక్కడున్నది సత్య శివ సుందరమైన ఆత్మజ్ఞానం. సిద్ధుడు యోగి కాడు. అవధూత కాడు. కేవలం సాధకుడు. అందుకే ఇంద్రియాలను వశంలో ఉంచుకొని, ఇంటిని ఇల్లాలిని వదలి జ్ఞానుల సంపర్కంలో నివసిస్తుంటాడు. ఇతడే 'బోధకుడు'గా తగినవాడు. అందుకే అతడు చెప్పిన కథను కృష్ణుడు వినిపిస్తున్నాడు.

ఆ. అట్లు భక్తిఁ దన్ను నాశ్రయించిన శుచి। త్వాధికుండు నిర్మలాత్మకుండు
నతులవినయపరుఁడు నగు విప్రవరుని వీ। క్షించి యిట్టులనియె సిద్ధవరుఁడు **159**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; తన్నున్= తనను; భక్తిన్= భక్తితో; ఆశ్రయించిన= ఉపదేశం కోరి ఆశ్రయించిన; శుచిత్వ+అధికుండు= మిక్కిలి పవిత్రుడు; నిర్మల+ఆత్మకుండు= నిర్మలమైన మనస్సు కలవాడు; అతుల= సాటిలేని; వినయపరుఁడున్+అగు= వినయ శీలియైన, విప్రవరునిన్= బ్రాహ్మణశ్రేష్ఠుడిని; వీక్షించి= చూచి; సిద్ధవరుఁడు= సిద్ధులలో శ్రేష్ఠుడు; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అట్లా భక్తిపూర్వకంగా తనను ఆశ్రయించి, ఉపదేశం కోరిన మిక్కిలి పవిత్రుడు, నిర్మలమైన మనస్సుకలవాడు, వినయశీలి అయిన ఆ బ్రాహ్మణుడిని చూచి, సిద్ధుడు ఇట్లా అన్నాడు.

సీ. **'పుణ్యంబు లగు కర్మముల నెప్పుడును జేసి । యింపారుచుండు నైహికసుఖంబుఁ**
ద్రిదినంబుఁ బడసితి ధీయుత! యత్యంత । యత్నలబ్ధం బైన యట్టి పదము
పదపడి యొక మాత్ర భ్రంశంబు నొంది కా । మక్రోధ ముఖచిత్తముల విశేష
ములఁ బొరిఁబొరి జన్మమును మరణంబును । గలుగంగ నేను దల్లులను దండ్రు

తే. **లను సహోదరులను బుత్త్రులను ననేక । జాతి కలితులఁ గాంచితి జున్నుఁ బాలు**
వివిధభంగుల వానిఁ ద్రావితి సుహృద్వి । యోగధననాశ దుర్దశ లొందెఁ బెక్కు' **160**

ప్రతిపదార్థం: ధీయుత!= బుద్ధిమంతుడా!; పుణ్యంబులు+అగు= పుణ్యప్రదాలైన; కర్మములన్= పనులను; ఎప్పుడునున్+చేసి= ఎల్లప్పుడు చేసి; ఇంపారుచున్+ఉండు= ఇష్టమైన; ఐహిక సుఖంబున్= ఇహలోక సంబంధమైన సుఖాలను; త్రిదివంబున్= స్వర్గాన్ని; పడసితిన్= పొందాను; అత్యంత= మిక్కిలి; యత్నలబ్ధంబు+ఐన+అట్టి+పదము= ప్రయత్నంతో లభించిన అట్లాంటి స్వర్గ పదవిని; పదపడి= పొందిన అనంతరం; ఒక మాత్రన్= ఒక త్రుటికాలంలో; భ్రంశంబున్+ఒంది= జారి; కామక్రోధముఖ= కామం, క్రోధం మొదలైన; చిత్తమల విశేషములన్= మనస్సుకు సంబంధించిన అపరిశుభ్రతలచేత; పొరిన్+పొరిన్= మాటి మాటికి; జన్మమునున్= పుట్టటం; మరణంబునున్= చావటం; కలుగంగన్= కలుగగా; ఏను= నేను; తల్లులనున్; తండ్రులనున్; సహోదరులను= సోదరులను; పుత్త్రులనున్= కుమారులను; అనేక జాతి కలితులన్= చాలా జాతులతో కూడి ఉన్నవారిని; కాంచితిన్= చూచాను; జున్ను పాలు= జున్ను పాలను; వివిధ భంగులవానిన్= రకరకాలను; త్రావితిన్= త్రాగాను; సుహృద్= స్నేహితుల; వియోగ= పోగొట్టుకొనటం; ధననాశ= ధనం పోవటం; దుర్దశలు= చెడ్డ పరిస్థితులు; పెక్కులు= చాలా; ఒందెన్= వచ్చాయి.

తాత్పర్యం: బుద్ధిమంతుడా! పుణ్యం కలిగించే కార్యాలను ఎప్పుడూ చేయటంవలన కోరుకొన్న ఐహికసుఖాలను పొందాను. స్వర్గాన్నీ అందుకొన్నాను. మిక్కిలి ప్రయత్నంతో లభించిన అట్లాంటి స్వర్గపదవిని పొందిన అనంతరం ఒక త్రుటికాలంలో భ్రష్టుడివై అక్కడి నుండి జారిపోయి కామం, క్రోధం మొదలైన ఎన్నో అపరిశుభ్రతలకు లోనై మాటిమాటికి పుట్టి చచ్చి ఇట్లా జననమరణచక్రంలో తిరుగుతూ ఉండిపోయాను. ఎంత మంది తల్లులను, తండ్రులను, అన్నదమ్ములను, కొడుకులను చూచానో లెక్కలేదు. ఎన్ని జాతులలో పుట్టానో దానికి లెక్కలేదు. ఎన్నిరకాల చనుబాలను త్రాగానో ఎంతమంది స్నేహితులను పోగొట్టుకొన్నానో ఎంత ధనాన్ని నాశనం చేసికొన్నానో లెక్క చెప్పలేను. ఎన్నో దుర్దశలను అనుభవించాను.

విశేషం: ప్రసవమైన తరువాత 5,6 రోజులపాటు తల్లి శిశువుకు ఇచ్చే పాలను 'జున్నుపాలు' అంటారు. అది ఆరోగ్యప్రదం కాదని కొందరన్నా ఆధునికవైద్యం ఆ పాలు చాలా శక్తిమంతమైనవనీ, రోగనిరోధకత అత్యధికంగా ఆ పాలలోనే ఉంటుందని నిరూపించింది. ఈ పద్యంలో ఉన్న జున్నుపాలు చనుబాలే.

క. **మానస శారీరము లగు। నానావేదనల వివిధ నరకగతుల దుః**

ఖానేకత్వ మొనర్చు వి। మానవవధబంధనప్రమర్దనకృతులన్. 161

ప్రతిపదార్థం: మానస= మనస్సుకు సంబంధించిన; శారీరములు+అగు= శరీరానికి సంబంధించిన; నానా= అనేక; వేదనలన్= బాధలతో; వివిధ= చాలా విధాలైన; నరకగతులన్= నరకబాధల తీరుగా; దుఃఖ+అనేకత్వము+ఒనర్చు= అనేక దుఃఖాలను కలిగించే; విమానన= అవమానం; వధ= చంపటం; బంధన= కట్టివేయటం; ప్రమర్దన= చిత్రహింసచేయటం వంటి కృతులన్= కఠిన కార్యాలను.

తాత్పర్యం: నేను పడ్డ శ్రమ అంతా ఇంతా కాదు. మనసుతో బాధపడ్డాను. శరీరంతోనూ బాధపడ్డాను. నరకంలో పడే బాధలన్నీ ఇక్కడే పడ్డాను. అన్నిరకాల దుఃఖాలూ అనుభవించాను. అవమానం పొందాను. ఎన్నో మార్లు చంపగా చచ్చాను. నన్ను కట్టివేశారు. కొట్టి, చిత్రహింసలు పెట్టారు. ఇటువంటి కఠినశిక్షలన్నీ అనుభవించాను. (తరువాతి వచనంతో అన్వయం).

వ. **అనుభవించుచు నుండి విసివి లోకతంత్రంబు పరిత్యజించితిఁ; బదంపడి యాత్మప్రసాదంబున నిట్టి సిద్ధి వడసితి; నింక లోకంబుల నాలోకింప నాకుం బ్రజాసర్గంబు గల యంత గాలంబును శుభంబ నిరంతరంబై కలుగుచుండు; నే నంతకంతకు నెక్కుడు లెస్సయగు దశలన పొందుదు; బ్రహ్మానందంబు సులభంబ' యని పలికి మఱియును.**

162

ప్రతిపదార్థం: అనుభవించుచున్+ఉండి= అనుభవిస్తూ ఉండి; విసివి= విసుగు పుట్టి; లోక తంత్రంబున్= లోకవ్యాపారాన్ని; పరిత్యజించితిన్= పూర్తిగా వదలిపెట్టాను; పదంపడి= ఆ వెనుక; ఆత్మప్రసాదంబునన్= ఆత్మజ్ఞానంచేత; ఇట్టి సిద్ధి+పడసితిన్= ఇట్లాంటి సిద్ధసమాధిస్థితిని పొందాను.; ఇంకన్= ఇక మీదట; లోకంబులన్+ఆలోకింపన్= జగత్తును చూడగా (సాక్షీభూతుడుగా చూడగా); నాకున్= నాకు; ప్రజా+సర్గంబు= మనుష్యులను వదలిపెట్టే స్వభావం; కల+అంత+కాలంబును= ఉన్నంతకాలమూ; శుభంబు+అ= మేలే; నిరంతరంబై= నిరంతరంగా; కలుగుచుండున్= కలుగుతూ ఉంటుంది; ఏను= నేను; అంతకున్+అంతకున్= అంతకంతకూ; లెస్స+అగు= మేలైన (ఉన్నతమైన); దశలన్+అ= దశలనే; పొందుదున్= పొందుతాను; బ్రహ్మానందంబు= బ్రహ్మానందస్థితి; సులభంబు+అ= అందుకొనటం సులభమే; అని పలికి= అని చెప్పి; మఱియునున్= ఇంకా

తాత్పర్యం: అట్లా భిన్నబాధలను అనుభవిస్తూ ఉండి విరక్తిపుట్టి, లోకవ్యాపారాన్ని సంపూర్ణంగా వదలిపెట్టిన వెనుక జ్ఞానోదయమై ఆత్మప్రసాదంచేత ఈ సిద్ధసమాధిచేత ఈ సిద్ధసమాధిస్థితి ఏర్పడినది. ఇక లోకాలను సాక్షీభూతుడుగా చూడటంవలన నాకు మనుష్యులతో సంబంధం లేనంత కాలమూ ఎప్పుడూ మంచిదే జరుగుతున్నది. నేను అంతకంతకూ ఉన్నతమైన దశలనే పొందుతాను. చివరికి బ్రహ్మానందస్థితి కూడా కష్ట మేమీ కాదు' అని చెప్పి ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ఈ కథలోని రహస్యమంతా 'ప్రజాసర్గము' అనేమాటలో ఉన్నది. బంధంవలన క్లేశమూ, విముక్తివలన మోక్షమూ కలుగుతాయి. లోకతంత్రం వదలిపెట్టటమే బంధరాహిత్యం. అపుడు జనులతో (ప్రజ అంటే సంతానం అని, తోడి మనుష్యులని రెండు అర్థాలు ఉన్నాయి. బంధం ఈ ఇరువురిలోనూ ఉంటుంది.) సంసర్గం అంటే బంధం ఉండదు. సర్గం అంటే విసర్జనం. వదలిపెట్టటం. ప్రజాసర్గమంటే మనుష్యులను వదలిపెట్టటం. అందుకే యోగిలక్షణాలను గురించి చెప్తుతూ భగవద్గీతలో 'ఏకాంత' వాసం చేయటం ప్రధానంగా చెప్పారు.

ఉ. **'ప్రీతుఁడ నైతి నీ దెసఁ బరిస్ఫుటభంగిని జెప్పు మెద్ది నా**

చేత నుపాస్తిమైఁ బడయఁ జేరితి నీ కది గల్గు నట్లుగాఁ

జూతు నవశ్యమున్ వినయసుందర! నన్ను నెఱింగి వచ్చి తీ
వీ తెలి వస్మదీయ మతికెక్కిన నిన్నుఁ బరిగ్రహించితిన్.' 163

ప్రతిపదార్థం: వినయసుందర!= వినయంచేత అబ్బిన అధ్యాత్మిక సౌందర్యంకలవాడా!; నీ దెసన్= నీ పట్ల; ప్రీతుఁడన్+ఐతిన్= ప్రసన్నతను పొందాను; ఎద్ది= ఏది; ఉపాస్తిమైన్= ఉపాసనతో; నా చేతన్+పడయన్+చేరితి(వి)= నావలన పొందటానికి ఇక్కడికి వచ్చావో; పరిస్ఫుట భంగిన్= స్పష్టంగా; చెప్పుము; నీకున్; అది= ఆ స్థితి; కల్గు+అట్లుగాన్= కలిగే విధంగా; అవశ్యమున్= తప్పకుండా; చూతున్= చూస్తాను (వరమిస్తాను); ఈవు= నీవు; ఈ తెలివిన్= ఈ ఆత్మజ్ఞానంతో; నన్నున్+ఎఱింగి+వచ్చితి(వి)= నన్ను తెలిసికొని వచ్చావు; అస్మదీయ= మా; మతికిన్+ఎక్కిన= మనసుకు వచ్చిన; నిన్నున్= నిన్ను; పరిగ్రహించితిన్= శిష్యుడిగా స్వీకరించాను.

తాత్పర్యం: 'ఓ బ్రాహ్మణోత్తమా! నీలో వినయంచేత అబ్బిన దివ్యసౌందర్యం ఉన్నది. ఆత్మశోధన ఉన్నది. అందుకే నన్ను గురువుగా గుర్తించి వచ్చావు. నీ విషయంలో నేను ప్రసన్నత పొందాను. నీవు మాకు నచ్చావు. నిన్ను శిష్యుడిగా స్వీకరించాను. నన్ను ఉపాసించి ఏమి సాధించదలచుకొన్నావో స్పష్టంగా చెప్పుము. అది నీకు అబ్బేటట్లు తప్పకుండా చేస్తాను.'

క. అనుడు నతఁడు హర్షించుచు। 'ననుఁ బరతత్త్వ ప్రబోధనమునఁ గృతార్థా
త్మునిఁ జేసి జన్మమృతి దుః। ఖ నిరాస మొనర్పు పరమకారుణ్యనిధీ!' 164

ప్రతిపదార్థం: అనుడున్= అనగా; అతఁడు= ఆ బ్రాహ్మణోత్తముడు; హర్షించుచున్= సంతోషపడుతూ; పరమ కారుణ్యనిధీ!= ఉత్తమ కరుణకు నిధివంటివాడా! (కరుణాసాగరా!); ననున్= నన్ను; పరతత్త్వ ప్రబోధనమునన్= పరతత్త్వాన్ని గురించి ప్రబోధించటం ద్వారా; కృతార్థ+ఆత్మునిన్+చేసి= ధన్యుడిని చేసి; జన్మ= పుట్టుకవలన; మృతి= మరణంవలన; దుఃఖ= పుట్టే దుఃఖం; నిరాసము= (యొక్క) త్యాగం; ఒనర్పుము= కలుగజేయుము.

తాత్పర్యం: ఆ విధంగా సిద్ధుడు పలుకగా బ్రాహ్మణుడు చాలా సంతోషించి 'ఓ మహాత్మా! నీవు గొప్ప కరుణా సముద్రుడవు. నాకు పరతత్త్వాన్ని గురించి బోధించి నన్ను ధన్యుడిగా చేయుము. జననమరణాలవలన పుట్టే దుఃఖంనుండి నన్ను దూరం చేయుము. నాకు ఇంక ఏ వరమూ వద్దు' అన్నాడు.

వ. అనుచుం దచ్చరణంబులు కరంబుల నవలంబించి, ప్రణతి యాచరించి, కేలు మొగిచి యున్న నయ్యుర్వీ సురోత్తముతో నా సిద్ధసత్తముండు 'నీకుం బరిపాటిం జెప్పెద; సావధానమానసుండవై యాకర్ణింపు మని యిట్లనియె.' 165

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; తద్+చరణంబులు= అతడి పాదాలు; కరంబులన్= చేతులలో; అవలంబించి= పట్టుకొని; ప్రణతి= నమస్కారం; ఆచరించి= చేసి; కేలు మొగిచి+ఉన్న= చేతులు జోడించి ఉన్న; ఆ+ఉర్వీసుర+ఉత్తమునితోన్= ఆ బ్రాహ్మణోత్తముడితో; ఆ సిద్ధసత్తముండు= ఆ సిద్ధోత్తముడు; నీకున్+పరిపాటిన్+చెప్పెదన్= నీకు ఈ విషయాన్ని క్రమంగా చెప్పుతాను; స+అవధాన మానసుండవు+ఐ= ఏకాగ్రచిత్తం కలవాడై; ఆకర్ణింపుము+అని= వినుమని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అంటూ అతడి పాదాలను చేతలతో పట్టుకొని నమస్కారం చేసి చేతులు జోడించి ఉన్న ఆ బ్రాహ్మణుడితో ఆ సిద్ధుడు 'నీకు ఈ విషయం ఒక క్రమంలో చెప్పుతాను. ఏకాగ్రచిత్తంతో వినుము' అంటూ ఇట్లా చెప్పాడు.

ఆ. 'ధర్మసాధనంబు దనువు; ధర్మము పరి। జ్ఞానదాయి యట్లు గాన తనువు

నోమవలయు మర్త్యుఁ డేమిటి నేమఱ। కాత్మహితము గోరి యనఘచరిత! 166

ప్రతిపదార్థం: అనఘచరిత!= ఓ పుణ్యచరిత్రుడా!; తనువు= ఈ శరీరం; ధర్మసాధనంబు= ధర్మాన్ని సాధించటానికి గొప్ప ఉపకరణం; ధర్మము= మరి ఆ ధర్మం; పరిజ్ఞానదాయి= విశిష్టమైన మోక్షజ్ఞానాన్ని ఇస్తుంది; అట్లు+కాన= అందుచేత; మర్త్యుఁడు= మనుష్యుడు; ఏమిటన్= ఏ విధంగానైనా సరే; ఏమఱక= ఏమరకుండా; ఆత్మహితము+కోరి= తన శ్రేయస్సును కోరి; తనువున్= శరీరాన్ని; ఓమన్+వలయున్= రక్షించుకొనాలి.

తాత్పర్యం: ఓ పుణ్యాత్మా! ధర్మసాధనకు ఈ శరీరం ఒక గొప్ప సాధనం. మరి ధర్మం విశిష్టమైన మోక్షజ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ఈ కారణంచేత మనుష్యుడు ఏ విధంగానైనా సరే ఏమరకుండా తన శ్రేయస్సును కోరి, శరీరాన్ని రక్షించుకొనాలి.

విశేషం: దేహాన్ని నిర్లక్ష్యం చేస్తే తరువాత ఏ సాధనా చేయజాలము. అందుకే 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్' అని కాళిదాస మహాకవి కూడా శివుడిచేత అనిపించాడు. మనం చేసే సాధనల జయాపజయాలకు ఆధారం కూడా దేహమే. దానిని ఆరోగ్యంగా దృఢంగా ఉత్సాహవంతంగా సంరక్షించుకొంటే, వాక్కు, మనస్సు రెండూ నియంత్రణలో ఉంటాయి. ఈ మూడింటినీ కలిసి 'త్రికరణాలు' అంటారు. ఈ మూటి శుద్ధి లేనిదే యోగం సిద్ధించదు. ఏ విధంగా దేహాన్ని నిర్లక్ష్యం చేస్తామో దాని ఫలితాలు ఎట్లా ఉంటాయో తరువాత వివరిస్తున్నాడు.

వ. ఏమఱుటల తెఱంగు వివరించెద. 167

ప్రతిపదార్థం: ఏమఱుటల= ఏమరుపాటుల; తెఱంగు= పద్ధతులను; వివరించెదన్= వివరిస్తాను.

తాత్పర్యం: ఏమరుపాటు పొందే పద్ధతులను వివరిస్తాను వినుము.

సీ. తన సత్త్వమును బలంబును దన కయ్యెడు। కాలంబు నారయఁగాఁ దలంపఁ

డాహారముల గొను నవియును నగునవి। గానివి యను వివేకంబు బుద్ధిఁ

జొనుపఁడు బహుళభోజన మొక మరి సేయు। నొక మరి దుర్నిష్ఠ నుపవసించు

గతకాలమును నపక్వంబును గురుదుష్ట। విషమవిరుద్ధము విపులరసము

తే. నైన యన్నము దా నరయక భుజించుఁ। గుడుపుపైఁ గుడ్చు దిననిద్ర గూరు సురత

పరత నొందుఁ బె ల్లాయాసపడు విమూఢుఁ। డతని బాధించు దోషత్రయంబుఁ గెరలి.' 168

ప్రతిపదార్థం: విమూఢుఁడు= మందబుద్ధి; తన సత్త్వమునున్= తన స్వభావ సిద్ధగుణాన్ని; బలంబునున్= శక్తిని; తనకున్+ అయ్యెడు+కాలంబున్= తన కాలనియమాన్ని; అరయఁగాన్+తలంపఁడు= పూర్తిగా గ్రహించడు; ఆహారములు+కొనున్= తిండ్లు తింటాడు; అవియును= అవికూడా; అగునవి= సరిపడేవి; కానివి= సరిపడనివి; అను వివేకంబు= అనే విచక్షణను; బుద్ధిన్+చొనుపఁ డు= బుద్ధిలోనికి ప్రవేశింపనీడు; ఒక మరి= ఒక సారి; బహుళభోజనము+చేయున్= మిక్కిలిగా తింటాడు; ఒక మరి= మరొకసారి; దుర్నిష్ఠన్= భయంకరమైన నిష్ఠతో; ఉపవసించున్= ఉపవాసం ఉంటాడు; గతకాలమునున్= వండి చాలా కాలమైనదీ; అపక్వమునున్= సరిగా ఉడకనిది; గురు= తొందరగా పాకం కానిదీ; దుష్ట= పదార్థదోషం కలిగినదీ; విషమ= విరుద్ధపదార్థాల కలయిక కలిగినదీ;

విరుద్ధము= సమయానికి వ్యతిరేకమైనదీ; విపులరసమున్+ఐన+అన్నమున్= మిక్కిలి జావగా ఉన్న అన్నాన్ని (ఆహార పదార్థాలను); తాన్= తాను; అరయక= మంచి చెడులు పట్టించుకొనక; భుజించున్= తింటాడు; కుడువుపైన్= తిండిపైన (అనగా తిన్న వెంటనే); కుడ్చున్= మళ్ళీ తింటాడు; తినన్= తిన్నవెంటనే; నిద్రన్+కూరున్= నిద్రలో మునిగిపోతాడు; సురత పరతన్+ఒందున్= మైథునంలో పరవశుడైపోతాడు; పెల్లు+ఆయాసపడున్= మిక్కిలి ఆయాసపడతాడు; (అట్లాంటి) అతనిన్= ఆ వ్యక్తిని; దోషత్రయంబు= వాత, పిత్త, శ్లేష్మాలనబడే త్రిదోషాలు; కెరలి= విజృంభించి; బాధించున్= బాధిస్తాయి.

తాత్పర్యం: మూర్ఖుడైనవాడు తన స్వభావసిద్ధ గుణాన్ని, శక్తిని, తన కాలనియమాన్ని గుర్తించకుండానే ఆహారం తింటూ ఉంటాడు. ఆ ఆహారము తనకు సరిపడుతుందా? సరిపడదా? అనే విచక్షణను కూడా మనస్సులోనికి రానీయకుండా తింటుంటాడు. ఒక్కొక్కసారి విపరీతంగా తింటాడు. మరొక్కసారి భయంకరంగా నిష్ఠనుపూని ఉపవాసం చేస్తాడు. వండి ఎంతోకాలం గడిచిపోయినవి, సరిగా ఉడకనివి, తొందరగా పాకం కానివి, పదార్థదోషం కలిగినవి, విరుద్ధపదార్థాల కలయిక కలిగినవీ, సమయానికి వ్యతిరేకమైనవీ, మిక్కిలి జావగా ఉన్నవీ అయిన ఆహారపదార్థాలను మంచిచెడులు పట్టించుకొనకుండా తింటాడు. తిన్నవెంటనే మరల తింటాడు. తినిన వెంటనే నిద్రలోనికి జారిపోతాడు. మైథునంలో పరవశుడై మిక్కిలి ఆయాసపడతాడు. అట్లాంటి వ్యక్తిని వాతపిత్తశ్లేష్మాలు విజృంభించి బాధిస్తాయి.'

విశేషం : అన్ని రోగవికారాలకు మూలం ఆహారమే అన్నది ఆయుర్వేద సిద్ధాంతం. తన సహజగుణం 'పిత్త' మని గుర్తించాక దానికి విరుద్ధమైన ఆహారం గ్రహిస్తే ఏమవుతుంది? అట్లాగే తన శక్తికి మించి తినవచ్చునా? కాలనియమం అక్కరలేదా? ఈ మూడూ ఎవడు పట్టించుకొనడో వాడికి ఆహారమే శత్రువు అవుతుంది.

అట్లాగే విపరీతంగా తినటమూ, అతికఠినంగా ఉపవసించటమూ రెండూ అనారోగ్యకారణాలే. వేడిగా ఉన్నప్పుడే తినాలి. వంటలో వాడే పదార్థాల నడుమ ఒక ఆనుకూల్యం ఉంటుంది. దానిని అట్లాగే పాటించటం ఆయా ప్రాంతాలలో మంచిదని ఆయుర్వేదం చెప్తున్నది. తిన్నవెంటనే నిద్రించరాదు. కొంతసేపు తిరగాలి (భుక్త్వా శతపదం గచ్ఛేత్ - తిని నూరు అడుగులు నడవాలి). నిద్ర మొదలుపెట్టిన వెంటనే 'సంగమం' నిషిద్ధం. ఇట్లాంటి దుష్ప్రవర్తన ఆహారవిషయంలోను, విహారంలోను ఉన్నప్పుడు వాత, పిత్త, శ్లేష్మాలు ప్రకోపిస్తాయి. వాటి మూలానే అన్ని సమస్యలూ ఉత్పన్నమవుతాయి.

వ. అని చెప్పి. 169

ప్రతిపదార్థం: అని చెప్పినవాడై- తరవాతి పద్యంతో అన్వయం.

శ్లేష్మాది రోగవికారంబుల నిరూపించుట (సం.14-17-14)

ఆ. 'అర్హకర్మలోప మపచయ మొనరించు। ననఘ! దేహమున కనర్హవేగ

ధారణములు రోగతతి జనింపఁగఁ జేయుఁ। గామరోషములను గాయ మెడలు. 170

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; అర్హ= తగిన; కర్మ= పనిని; లోపము= చేయకుండటం; దేహమునకున్= శరీరానికి; అపచయమున్= లోపాన్ని; ఒనరించున్= కలిగిస్తున్నది; అనర్హ= తగని; వేగధారణములు= ఉద్రిక్తతలను పొందటం; రోగతతిన్= రోగ సముదాయాన్ని; జనింపఁగన్+చేయున్= పుట్టిస్తాయి; కామ= కామంతోనూ; రోషములను= రోషంతోనూ; కాయము= శరీరం; ఎడలున్= నశిస్తుంది.

తాత్పర్యం: 'ఓ పుణ్యాత్మా! తగిన పనిని చేయకుండా ఉండటం దేహస్థితిని మార్చివేస్తుంది. తగని ఉద్రేకాలు పుట్టుతాయి. వాటితో అన్నిరోగాలూ పుట్టుకొనివస్తాయి. కామక్రోధాదులు విజృంభించి దేహాన్ని నశింపజేస్తాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం : మనిషి దేహాన్ని కాపాడేది ఎప్పుడు ఏది ఎట్లా చేయాలో అట్లా చేయటం. అని సారాంశం. అపచయమంటే 'కోత' సుకర్మ దేహాన్ని పోషిస్తుంది. దుష్టకర్మ దేహాన్ని కోస్తుంది.

క. అత్యంతప్రబలంబులు । పైత్యవికారములు రేఁగి ప్రాణములకు శీ
ఘ్రాత్యయముం జేయు మహౌ । ద్ధత్యంబున నెలవు వెడల దఱిమి సుచరితా! 171

ప్రతిపదార్థం: సుచరితా!= పుణ్యచరితా!; అత్యంత= మిక్కిలి; ప్రబలంబులు= బలిష్ఠాలైన (శక్తి మంతాలైన); పైత్య వికారములు= పైత్యాది గుణాల వికారాలు; రేఁగి= విజృంభించి; మహా+ఔద్ధత్యంబునన్= గొప్ప విజృంభణతో (పట్టరాని రీతిలో); నెలవు= స్థానం; వెడలన్+తఱిమి= వదలిపోయేటట్లుగా తరిమికొట్టి; ప్రాణములకున్= ప్రాణాలకు; శీఘ్ర+అత్యయమున్= తొందరగా వదలిపోవటాన్ని; చేయున్= కలగ చేస్తాయి.

తాత్పర్యం: పుణ్యచరిత్రుడా! మునుపు చెప్పిన ఆహారవిహారాదుల నియమరాహిత్యంచేత పైత్యవికారాదులు పుట్టుతాయి. అవి రేగితే వాటిని నియంత్రించటం దుస్సాధం. వాటి ఉద్ధతికి తట్టుకొనజాలని ప్రాణాలు తమతమ నెలవులు వదలి పారిపోతాయి. (అంటే మనిషి మరణానికికూడా దారితీస్తాయని అర్థం).

తే. అవ్వికారంబు లెక్కుడై యడరి యెచ్చ । టెచటు భిన్నంబు సేయు నయ్యెడలు మర్మ
నామకంబులు మర్మభిన్నత్వ మెట్లు । సేయకుండుఁ బరిచ్యుతి జీవమునకు? 172

ప్రతిపదార్థం: ఆ+వికారంబులు= ఆ వికారాలు; ఎక్కుడు+ఐ= అధికమై; అడరి= విజృంభించి; ఎచ్చటు+ఎచటు= ఎక్కడెక్కడ; భిన్నంబు+చేయున్= నాశనం చేస్తాయో; ఆ+ఎడలు= ఆ చోటులు; మర్మనామకంబులు= మర్మస్థానాలని పిలువబడుతాయి; మర్మభిన్నత్వము= మర్మావయవాలు నశించటం; జీవనమునకున్= జీవానికి; పరిచ్యుతిన్= నాశనాన్ని; ఎట్లు+చేయక+ఉండున్?= ఎట్లా కలిగించకుండా ఉంటుంది?

తాత్పర్యం: ఆ వికారాలు విజృంభించి మర్మస్థానాలను దెబ్బతీస్తాయి. మర్మస్థానాలు దెబ్బతినటమంటే ప్రాణాలు పోవటమనే అర్థం.

విశేషం : ఆధునిక పాశ్చాత్యవైద్యం రోగాలను గుర్తించే పద్ధతికంటె ఆయుర్వేదపద్ధతి భిన్నం. ఆయుస్సును పెంచే ఆరోగ్యపద్ధతులు ఆహారవిహారనియమాలు. ఈ రెంటినీ పాటించనివాడిలో వాత, పిత్త, శ్లేష్మ వికారాలు విజృంభిస్తాయి. వికారమంటే 'అసాధారణ స్థితి' అని అర్థం. శ్లేష్మవాతాలు పిత్తంలో కలిసి, పిత్త శ్లేష్మాలలో వాతం కలిసి, వాతంలో పిత్త శ్లేష్మాలు కలిసి - ఇట్లా పొందే అసాధారణ స్థితివలననే గుండె, మెదడు, మూత్రపిండాలు, శ్వాసకోశాలు (ఇవే మర్మావయవాలు) ఎట్లా దెబ్బతింటాయో ఈ పద్యంలో వివరించబడింది. ప్రాణహాని వీటివల్లనే వస్తుందని అర్థం.

క. వినుము తెలియంగ శ్లేష్మం । బను దోషం బారఁ బరగి యవయవములు జా
డ్యనిరూఢంబులుగాఁ జే । యును లోపలి బయలు నెల్ల నొయ్యన కప్పున్. 173

ప్రతిపదార్థం: శ్లేష్మంబు+అను దోషంబు= శ్లేష్మమనే దోషం; ఆరన్+పరఁగి= బాగా వ్యాపించి; అవయవములు= దేహంలోని భిన్న అవయవాలను; జాడ్య= రోగ; నిరూఢంబులుగాన్= కలిగిన స్థానాలుగా; చేయును= చేస్తుంది; లోపలి+బయలున్+ఎల్లన్= అంతర్బాహ్య శరీరాన్ని అంతటినీ; ఒయ్యనన్= క్రమక్రమంగా; కప్పున్= ఆక్రమిస్తుంది; తెలియంగన్= బాగా; వినుము.

తాత్పర్యం: ఇక శ్లేష్మం ఎట్లాంటిదో చెప్పుతాను వినుము. శ్లేష్మదోషం ఏఏ అవయవంమీద వ్యాపిస్తుందో అది రోగ స్థానం అవుతుంది. అంతే కాదు; క్రమక్రమంగా లోపలి, బయటి ఇంద్రియాలన్నింటినీ శ్లేష్మం ఆక్రమించే లక్షణం కలిగినది.

వ. పదంపడి. **174**

తాత్పర్యం: ఆ తరువాత (తరువాతి పద్యంతో అన్వయం)

క. కుత్తుకకు నడ్డుపడు, నూ। ర్పొత్తిలి పోనీక యాఁగు, నూర్ధ్వశ్వాసం
బెత్తఁగఁ జేయును; జీవుం। డత్తనువున నుండనేర కంతట వెడలున్. **175**

ప్రతిపదార్థం: కుత్తుకకున్= గొంతుకు; అడ్డుపడున్= అడ్డుపడుతుంది; ఊర్పు= ఊపిరి; ఒత్తిలిపోనీక= ప్రక్కకు తప్పించుకొని పోనీయకుండా; అఁగున్= ఆపుతుంది; ఊర్ధ్వశ్వాసంబు= ఎగ ఊపిరి; ఎత్తఁగన్+చేయును= పీల్చేటట్లు చేస్తుంది (ప్రాణోత్క్రమణ సమయంలోనే అట్లా పీల్చుతారు); జీవుండు; అంతటన్= అపుడు; ఆ తనువునన్= ఆ శరీరంలో; ఉండన్+నేరక= ఉండలేక; వెడలున్= బయటికి వెళ్ళిపోతాడు.

తాత్పర్యం: ఆ శ్లేష్మగుణం (కళ్ళె మొదలైన రూపాలలో) గొంతుకలో అడ్డుపడుతుంది. దానివలన ఊపిరి సజావుగా పీల్చుకొనటానికి వీలుండదు. అపుడు ఎగశ్వాసతో ప్రాణం చాలా ఇబ్బందిపడుతుంది. జీవుడు ఇక ఆ శరీరంలో ఉండలేక బయటికి వెళ్ళిపోతాడు. ఈ విధంగా శ్లేష్మం ప్రాణాంతకమవుతుంది.

క. స్రోతోమార్గంబులఁ జూ। వే తమ కర్థంబు లైన విషయంబులఁ బ్ర
స్ఫీతమతిం జాతుర్యో। పేతములై యింద్రియంబు లేనును బట్టున్. **176**

ప్రతిపదార్థం: ఇంద్రియంబులు+ఏనునున్= ఐదు ఇంద్రియాలు; ప్రస్ఫీతమతిన్= ప్రకాశించే బుద్ధితో; చాతుర్య+ఉపేతములు+ఐ= నేర్పుతో కూడినవై; తమకున్+అర్థంబులు+ఐన= తమకు తమకు తగిన; విషయంబులన్= విషయ సుఖాలను; స్రోతస్+మార్గంబులన్= నవరంధ్రాల ద్వారా; పట్టున్= అనుభవిస్తాయి; చూవే!= సుమా!

తాత్పర్యం: కాళ్ళు; చేతులు మొదలైన అవయవాలు బుద్ధిచేత ప్రబోధించబడి మిక్కిలి నేర్పుతో నోరు, ముక్కు, చెవులు మొదలైన నవరంధ్రాల ద్వారా తమకు ఏ విషయసుఖాలు కావాలో వాటిని అనుభవిస్తుంటాయి సుమా!

విశేషం : వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థలు కర్మేంద్రియాలు. త్వక్, చక్షు, శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణాలు మొదలైనవి జ్ఞానేంద్రియాలు. నోరు, ముక్కురంధ్రాలు, చెవులు, కళ్ళు, పాయు, ఉపస్థలు నవద్వారాలు, మనిషి పొందే సుఖాలను విషయసుఖాలంటారు. కళ్ళద్వారా చూస్తాము. నోటిద్వారా తింటాము. ఇట్లాగే ఇతర అవయవాల విషయమూ గ్రహించవచ్చును. నేర్పుతో అనుభవించటం అంటే ఆ సుఖాన్ని అనుభవిస్తున్నామన్న స్పృహకూడా కలుగకుండా అనుభవించటం అని అర్థం.

క. స్రోతోమార్గములు గఫము। చేత నిరుద్ధంబు లైనఁ జెడు నింద్రియజా
తాతతశక్తులు దానను। వీతములగుఁ జేష్టితములు విను మనుజులకున్. **177**

ప్రతిపదార్థం: విను= జాగ్రత్తగా వినుము; మనుజులకున్= మనుష్యులకు; స్రోతస్+మార్గములు= నవరంధ్రాది మార్గాలు (స్రోతమంటే జారటం, కారటం, ప్రవహించటం అని అర్థం); కఫముచేతన్= కళ్ళెచేత; విరుద్ధంబులు+ఐనన్= అడ్డుపెట్టబడగా ఇంద్రియజాత=

ఇంద్రియసమూహానికి చెందిన; ఆతత= గొప్ప; శక్తులున్; చెడున్= నశిస్తాయి; దాననున్= దానితో; చేష్టితములు= ఇంద్రియ కార్యకలాపాలు; వీతములు+అగున్= ఆగిపోతాయి.

తాత్పర్యం: ఎప్పుడైతే కఫ్ఫ నవరంధ్రాలకు అడ్డుపడుతుందో అప్పుడు ఇంద్రియశక్తులు నశిస్తాయి. దానితో అన్ని అవయవాల కార్యకలాపాలూ స్తంభించిపోతాయి.

తే. వాయు వంగంబులందు దుర్వ్యాప్తిఁ గదిరి। నొవ్వుఁ దెవులును బుట్టించుఁ, గ్రొవ్వు సెఱుచు,
సందు లెడలించుఁ గ్రమమున నెందుఁ బరఁగి। తనువు మ్రానుగఁ జేసి జీవుని వెలార్చు. 178

ప్రతిపదార్థం: వాయువు= నాశమనే దోషం; అంగంబులందున్= అవయవాలలో; దుర్వ్యాప్తిన్= మిక్కిలి అనియంత్రితంగా వ్యాప్తిపొంది; కదిరి= విజృంభించి; నొవ్వున్= బాధను; తెవులునున్= రోగాన్ని; పుట్టించున్= పుట్టిస్తుంది; క్రొవ్వు= మదాన్ని; చెఱుచున్= నశింపజేస్తుంది; సంధులు= సంధిస్థానాలను; ఎడలించున్= బలహీనపరుస్తుంది; క్రమమునన్= మెల్లగా; ఎందున్= అన్నిచోట్లా; పరఁగి= వ్యాపించి; తనువున్= శరీరాన్ని; మ్రానుగన్+చేసి= కొయ్యబారేటట్లు చేసి; జీవునిన్= ప్రాణాన్ని; వెలార్చున్= బయటికి పడవేస్తుంది.

తాత్పర్యం: వాతదోషం అన్ని అవయవాలలోనూ అనియంత్రితంగా వ్యాపించి విజృంభిస్తుంది. బాధను, రోగాన్ని కలిగిస్తుంది. క్రొవ్వును కరగించి, సంధిస్థానాలను బలహీనపరుస్తుంది. క్రమంగా అన్ని చోట్లా వ్యాపించి, దేహాన్ని కొయ్యబారేటట్లు చేస్తుంది. చివరికి ప్రాణం పోయేటట్లు కూడా చేస్తుంది.

విశేషం : 'పక్షవాతం' మొదలైన రోగాలు సరిగ్గా ఇట్లాగే వ్యాపిస్తాయి. సంధులు అంటే కీళ్ళు అని అర్థం. అందుకే 'అజీర్ణేన వినా వాతం (న భవతి) 'అజీర్తి' లేకుండా 'వాతం' రాదు అని ఆయుర్వేదం చెప్పుతున్నది. అనియతాహారం అనియతమైన వాతానికి మూల మవుతుందని భావం.

క. నాలుక యాడుట కేలుం। గాలు ముడుఁపఁ జాఁప నగుట కాయంబున యం
దీ లీలలు వాయుగతుల్। మేలే నివి గలుగుఁ దక్కు మే లమలాత్మా! 179

ప్రతిపదార్థం: అమల+ఆత్మా!= పుణ్యాత్మా!; నాలుక+ఆడుట= నాలుక ఆడటం; కేలున్+కాలున్+ముడుఁపన్+చాఁపన్+అగుట= చేతులు, కాళ్ళు ముడవటానికి, చాపటానికి కావటం; కాయంబున+అందున్= దేహంలో; ఈ లీలలు= ఈ పనులు; వాయుగతుల్= వాతగుణానికి చెందిన వ్యాపకధర్మాలు; మేలు+ఏని= సక్రమంగా ఉంటే; ఇవి కలుగున్= ఈ పనులూ ఉంటాయి; తక్కు+మేలున్= తక్కువ, ఎక్కువలు కూడా; కలుగున్= కలుగుతుంటాయి.

తాత్పర్యం: పుణ్యాత్మా! నాలుకను కదలించటం, చేతులు కాళ్ళు ముడవటం, చాపటం మొదలైన పనులు దేహంతో వాతగుణప్రసారధర్మాలు సరిగా ఉంటేనే చేయగలుగుతాము. లేకపోతే ఎక్కువ తక్కువలు అవుతాయి. (అంటే ఆ పనులు సక్రమంగా చేయలేమని అర్థం).

విశేషం : ఇప్పటికీ పక్షవాతవ్యాధిని గుర్తించటానికి నాలుకను ఆడించుమంటారు. చేతులు, కాళ్ళు చాపుమంటారు, ముడువుమంటారు. వాతప్రకోపంవలన ఈ పనులు చేయలేకపోతారు. వాతం నియతంగా ఉంటే ఈ పనులు చేయగలుగుతాము. అందువలన వాతంలోని మేలు కీళ్ళే ఈ సమస్యలకు మూలమని అర్థం.

క. ఎక్కటి యిట్టివి దోషము। లొక్కొకమటి రెండు మూఁడు నొదవి బెరయుఁ దా
నక్కీడు సన్నిపాతం। బక్కజముగఁ దనువుఁ బాపునది జీవాత్మున్. 180

ప్రతిపదార్థం: ఎక్కటి= ఒక్కొక్కటి; ఇట్టివి దోషములు= ఇట్లాంటి దోషాలు; ఒక్కొక మఱి= ఒక్కొక్కసారి; రెండు+మూఁడున్+ఒదవి= రెండు మూడు కలిసి; బెరయున్= (ఒకచోట) చేరుతాయి; తాను+ఆ+కీడు= అట్లాంటి అపాయం; సన్నిపాతంబు= సన్నిపాతం; అది= ఆ రోగం; జీవాత్మున్= ప్రాణాన్ని; తనువున్+పోవున్= శరీరాన్ని వదలిపోయేటట్లు చేస్తుంది.

తాత్పర్యం: ఒక్కొక్కటిగా ప్రవర్తించే ఈ దోషాలు ఒక్కొక్కసారి రెండు మూడు కలిసి ఒకచోట చేరితే పుట్టే మహావ్యాధి సన్నిపాతం. అది చివరికి ప్రాణాన్నే తీస్తుంది.

విశేషం : సన్నిపాతం - బాలెంతరాళ్ళలో 'సంధి' రూపంలో జ్వర, మూర్ఛ, మానసిక దౌర్బల్యాది రూపాలలో ఉంటుంది. పిల్లలలో వివిధాలుగా రూపం దాలుస్తుంది. ఆయుర్వేదం దీన్ని త్రిదోషజన్యంగా గుర్తిస్తుంది. ముందు దోషాన్ని పోగొట్టాలి తప్ప రోగాన్ని మరోచోటికి తరిమేది కాకూడదని ఈనాడు వైద్యరంగంలో విజ్ఞులందరూ అంగీకరిస్తున్నారు. త్రిదోషమీమాంస ఈ దృష్టితో చాలా ప్రధానమైనది. వాతపిత్తశ్లేష్మాలు మూడూ మరణాంతకాలు అవుతాయన్నది ఈ వివరణ సారాంశం.

క. ఈ విధమున వెడలి చనిన। జీవుఁడు నిజకర్మజాలసిద్ధగతులకుం
బోవుం; దద్భవసుఖ దుః। ఖావేశముఁ బొందుచుండు నయ్యై యెడలన్. 181

ప్రతిపదార్థం: ఈ విధమునన్= ఈ రీతిగా; వెడలి చనిన= బయటపడిన; జీవుఁడు= ప్రాణధారి; నిజకర్మజాల= తానుచేసిన కర్మసమూహాలవలన; సిద్ధ= సిద్ధంగా ఉన్న; గతులకున్= పుణ్య పాపగతులకు; పోవున్= వెళ్ళుతాడు; తద్+భవ= ఆయా పుణ్యపాప గతులవలన పుట్టిన; సుఖ+దుఃఖ+ఆవేశమున్= సుఖదుఃఖభావాలను; ఆ+ఆ+ఎడలన్= ఆయా సందర్భాలలో; పొందుచుండున్+ ఉండున్= పొందుతూ ఉంటుంది.

తాత్పర్యం: ఈ రీతిగా బయటపడ్డ జీవుడు తాను చేసిన పుణ్యాపాపాదికర్మలవలన సిద్ధంగా ఉన్న గతులను చెందుతాడు. ఆయా గతులవలన పుట్టిన సుఖదుఃఖాలను ఆయా సందర్భాలలో పొందుతూ ఉంటాడు.

విశేషం: జీవం అంటే ప్రాణం. జీవధారి ఎవడోవాడు జీవుడు. దేహం వేరు. జీవుడు వేరు. జీవుడు దేహంలో ఉండటంవలన వాడు 'మనిషి' అవుతున్నాడు. జీవుడు వెళ్ళిపోగానే 'శరీరం' (శవం) అవుతున్నాడు. కనుక జీవుడి రాకపోకలను గురించి చెప్తున్నాడు.

క. కృతకర్మఫలము దెగఁ గుడి। చి తనకుఁ దగినట్టి పుట్టు సెందు మగుడ ని
ట్టి తెఱంగున జీవాత్ముఁడు। గతాగతము లనుభవించుఁ గల్మషరహితా! 182

ప్రతిపదార్థం: కల్మషరహితా!= పాపరహితుడా!; జీవాత్ముఁడా= జీవుడు; కృతకర్మఫలము=చేసిన కర్మల ఫలితము; తెగన్+కుడిచి= సంపూర్ణంగా అనుభవించి; తగిన+అట్టి= తగిన; పుట్టు= జన్మను; చెందున్= పొందుతాడు; మగుడన్= మళ్ళీ; ఇట్టి తెఱంగునన్= ఇదే విధంగా; గత+ఆగతములన్= పోయినదానిని, వచ్చినదానిని; అనుభవించున్= అనుభవిస్తాడు.

తాత్పర్యం: ఓ పాపరహితుడా! వినుము. జీవుడు తాను చేసిన పాపపుణ్యకర్మల ఫలాన్ని సంపూర్ణంగా అనుభవించి తగిన జన్మను పొందుతాడు. మళ్ళీ ఇట్లాగే జననమరణాలను అనుభవిస్తూ ఉంటాడు.

విశేషం: జీవాత్ముడు అంటే జీవుడే. ఒక నిర్దిష్టవస్తుగతమైన ఆత్మను జీవాత్మ డంటారు. సర్వసృష్టిలోనూ వ్యాపించిన ఆత్మను పరమాత్ముడంటారు.

గతం - పోయినది (మరణం); ఆగతం - వచ్చినది. జన్మం. ఒక శరీరం పోయి మరో శరీరం వస్తున్నది - కనుక జనన

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మరణాలని అర్థం. 'పునరపి జననం, పునరపి మరణం - పునరపి జననీ జఠరే శయనం' అని శ్రీ శంకరాచార్యులవారు బోధించినది. ఈ జన్మమరణతత్త్వాన్నే.

క. పాపాత్ములు నరకముఁ బు। ణ్యోపేతులు దివము విధి నియుక్తి నవశతం
బ్రాపింతురు గావున ని। ర్లేపంబగు మోక్ష మొందలే రట్టి జనుల్. 183

ప్రతిపదార్థం: విధి నియుక్తిన్= విధి నియామకంచేత; అవశతన్= తప్పకుండా; పాపాత్ములు= పాపంచేసినవారు; నరకమున్= నరకాన్ని; పుణ్య+ఉపేతులు= పుణ్యంతో కూడుకొన్నవారు; దివమున్= స్వర్గాన్ని; ప్రాపింతురు= పొందుతారు; కావునన్= అందుచేత; నిర్లేపంబు+అగు= ఏ బంధమూ లేని; మోక్షము= మోక్షస్థానాన్ని; అట్టి జనుల్= అట్లాంటివారు; ఒందలేరు= పొందజాలరు.

తాత్పర్యం: విధి నియామకంచేత పాపంచేసినవారు నరకాన్ని, పుణ్యం చేసినవారు స్వర్గాన్ని అవశ్యం పొందుతారు. అందుచేత ఏ బంధస్పర్శా లేని మోక్షాన్ని వీరెవరూ పొందలేరు.

విశేషం: స్వర్గనరకాలు రెండూ అంతర్దశలే తప్ప చివరి స్థితులు కావు. 'తే తం భుంక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి'(ఆ స్వర్గంలో పుణ్యఫలాన్ని అనుభవించి ఆ పుణ్యఫలం కాస్తా అయిపోగా తిరిగి మానవలోకంలో పుట్టుతారు) అని గీత చెప్పుతున్నది.కనుక పుణ్యాపాపకార్యాల బంధంలేని జ్ఞానులు మాత్రమే మోక్షస్థానాన్ని పొందగలరని ఈ వివరణకు అర్థం. విధి-అంటే బ్రహ్మ,ధర్మం,శాస్త్రం అని అర్థాలున్నాయి. ఈ సందర్భాన్నిబట్టి 'అనీ అర్థం చెప్పవచ్చును. 'శాస్త్రవిధి' అనికూడా చెప్పవచ్చును.

తే. ఊర్ధ్వగతి కేఁగు మానవు లుండునట్టి। నెలవు లార్యులు శాస్త్రసునిశ్చయమునఁ
గని యెఱింగింతు రవి నీవు వినుము నీకుఁ। దెలియునట్లుగఁ జెప్పెద ధీసమగ్ర! 184

ప్రతిపదార్థం: ధీసమగ్ర!= సమగ్ర బుద్ధిగలవాడా!; ఊర్ధ్వగతికిన్= ఊర్ధ్వలోకాలకు; ఏఁగు= వెళ్ళేటటువంటి; మానవులు= మనుష్యులు; ఉండు+అట్టి= ఉండేటటువంటి; నెలవులు= స్థానాలు (లోకాలు); ఆర్యులు= పెద్దలు; శాస్త్ర సునిశ్చయమునన్= శాస్త్రాలచేత బాగా నిర్ణయం చేయబడిన రీతులలో; కని= చూచి; ఎఱింగింతురు= చెప్పుతారు; నీకున్+తెలియునట్లుగన్= నీకు బాగా తెలిసే విధంగా; చెప్పెదన్= చెప్పుతాను; అని= ఆ విషయాలను; నీవు వినుము= నీవు శ్రద్ధతో వినుము.

తాత్పర్యం: బుద్ధిమంతుడా! వినుము. ఊర్ధ్వలోకాలకు వెళ్ళే జనులు ఏ ఏ స్థానాలలో ఉంటారో పెద్దలు శాస్త్రాలచేత నిర్ణయించబడిన రీతిలో దర్శించి, మునుపే చెప్పి ఉన్నారు. ఆ లోకాలను గురించి నీకు బాగా తెలిసే విధంగా చెప్పుతాను. శ్రద్ధగా ఆలకించుము.

విశేషం : స్వర్గలోకంతోపాటు వేరే ఊర్ధ్వలోకా లున్నాయని అర్థం.

తే. సోముఁ డనఁ దారకము లన సూర్యుఁ డనఁగ। గలుగు తేజస్విమూర్తుల నెలవు లందు
ధర్మపరు లుండుదురు తారతమ్యములకు। మనసు లెఱియునట్టివి గడుమంచి వగునె? 185

ప్రతిపదార్థం: సోముఁడు+అనన్= చంద్రుడని; తారకములు+అనన్= నక్షత్రాలని; సూర్యుఁడు+అనఁగన్= సూర్యుడని; కలుగు= ఉన్నటువంటి; తేజస్విమూర్తులు= కళామూర్తులు; నెలవులందున్= స్థానాలలో; ధర్మపరులు= ధర్మంలో నిష్ఠకలిగి బ్రతికినవారు; ఉండుదురు= ఉంటారు; తారతమ్యములకున్= మంచిచెడు మొదలైన తేడాలకు; మనసులు= మనస్సులు; ఎరియు+అట్టివి= మండేటటువంటి చోట్లు; కడు= మిక్కిలి; మంచివి+అగునే?= మంచిలోకాలు అవుతాయా?

తాత్పర్యం: ధర్మపరులుగా బ్రతికినవారు చంద్ర, నక్షత్ర, సూర్యమండలాలలో నివసిస్తారు. కాని, అక్కడ కూడా మంచి, చెడు అనే తారతమ్యాలకు మనస్సులు మండటం అనేది ఉన్నది. అందుచేత ఆ లోకాలుకూడా చాలా మంచివేమి కావు.

విశేషం : ఈ పర్వంలోని కథనుబట్టి బృహస్పతికి అసూయాదిగుణాలు పోలేదు. స్వర్గారోహణపర్వంలోని కథనుబట్టి మానుషదేహంలో అక్కడికి పోయినా ధర్మరాజులో 'అసూయ' నశించలేదు. అందుచేతనే ఈ విషయాన్ని చెప్పటం.

క. అదియును గాక ఫలంబులు। దుదిముట్టఁగఁ గుడిచి వెడల ద్రోవఁబడుదు ర
ట్టిది సౌఖ్య మగునె? శాశ్వత। పదంబు మోక్షంబ కాక భవ్యవిచారా!' 186

ప్రతిపదార్థం: భవ్యవిచారా!= ఉదాత్తమైన ధర్మవిషయచింతన కలవాడా!; అదియునున్+కాక= ఇంతే కాకుండా; ఫలంబులు= ఫలాలను; తుదిముట్టన్+కుడిచి= చివరిదాకా అనుభవించి; వెడలన్+త్రోవన్+పడుదురు= బయటికి వెళ్ళగొట్టబడుతారు; అట్టి+అది= అటువంటి స్వర్గాది లోకాల నివాసం; సౌఖ్యము+అగునె?= నిజంగా సుఖప్రద మవుతుందా?; శాశ్వతపదంబు= శాశ్వతస్థానం; మోక్షంబు+కాక= మోక్షం తప్ప.

తాత్పర్యం: ఉదాత్తమైన ధర్మచింతనగల ఓ బ్రాహ్మణుడా! ఇంతే కాదు. చేసిన పుణ్యఫలం ఎంతవరకు ఉంటుందో ఆ చివరిదాకా అనుభవించాక, జీవుడు ఆ లోకంనుండి బయటికి వెళ్ళగొట్టబడతాడు. అట్లాంటిస్థానం చిరసౌఖ్యదాయి ఎట్లా అవుతుంది? అట్లాంటి శాశ్వతస్థానం మోక్షం తప్ప మరొకటి కాదు.'

విశేషం : బంధవిముక్తి ఏ స్థితిలో ఉంటుందో అది విముక్తి. మోక్షమంటే విముక్తి మాత్రమే. అందుకే స్వర్గారోహణ పర్వకథలో చివరికి ఆకాశగంగ తీరంలో మోక్షాన్ని గురించి ధర్మరాజు తపస్సు చేశా డని, వ్యాసమహర్షి నిరూపించి 'జయ' ఇతిహాసాన్ని ముగించాడు. ఆ మోక్షవిజయమే మహాభారత తాత్పర్యం.

వ. అని చెప్పి 'గర్భావాప్తి ప్రకారం బెఱింగించెద వినుము' మని పలికి సిద్ధుం డా భూసురున కిట్లనియె. 187

ప్రతిపదార్థం: అని చెప్పి= అని చెప్పినవాడై; గర్భ+అవాప్తి= గర్భం ఏర్పడటం యొక్క; ప్రకారంబు= విధానాన్ని; ఎఱింగించెదన్= చెప్పుతాను; వినుము+అని+పలికి= వినుమని చెప్పి; సిద్ధుండు= ఆ సిద్ధుండు; ఆ భూసురునకున్= ఆ బ్రాహ్మణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి, 'గర్భం ఎట్లా ఏర్పడుతుందో చెప్పుతాను విను' మని సిద్ధుడు ఆ బ్రాహ్మణుడితో ఇట్లా చెప్పాడు.

తే. 'అశుభములును శుభమ్ములు నైన కర్మ। ముల ఫలంబులు గుడువక పోవఁ గాదు
మన్యువశగత మైన యాత్మకు నుదాత్త। చరిత! యది కారణము సువ్వె! జన్మమునకు. 188

ప్రతిపదార్థం: ఉదాత్తచరిత!= ఉత్తమ చరిత్ర కలిగినవాడా!; మన్యు= నేను అనే అహంభావం నుండి పుట్టిన క్రోధ, దుఃఖాది భావజాలానికి; వశగతము+ఐన= లోబడిన; ఆత్మకున్= జీవుడికి (జీవాత్మకు); అశుభములును= అశుభాలు; శుభమ్ములున్= శుభాలు; ఐన= అయినటువంటి; కర్మముల ఫలంబులు= కర్మల ఫలాలను; కుడువక= అనుభవించకుండా; పోవన్+కాదు= తీరదు; జన్మమునకున్= పుట్టుకకు; అది కారణము సువ్వె!= అదే కారణం సుమా!

తాత్పర్యం: 'ఉత్తమచరితుడా! నేను అనే అహంభావంనుండి పుట్టే క్రోధదుఃఖాది భావజాలానికి (మన్యువు అంటే ఇదే) దాసుడైన జీవుడు శుభాశుభఫల మిశ్రితములైన కర్మలఫలాలను అనుభవించక తప్పదు. పుట్టుకకు కారణం ఇదే సుమా!

క. ఎనయఁగ శుక్లము శోణిత। మును బెరసి వెలంది గర్భమున నెలకొను న
ప్పని బ్రహ్మశక్తి బీజ। త్వ నిరూఢిం బొనరు నవి వొదలుఁ బిండంబై. 189

ప్రతిపదార్థం: ఎనయఁగన్= ఒకదానికొకటి తగినట్టుగా; శుక్లము= పురుషుడి వీర్యం; శోణితమునున్= స్త్రీ రక్తం; బెరసి= కలిసి; వెలంది గర్భమునన్= స్త్రీ గర్భంలో; నెలకొనున్= నిలుస్తాయి; ఆ పని= ఆ విధంగా ఆ రెండూ సంయోగం పొందటం; బ్రహ్మశక్తిన్= బ్రహ్మకున్న సృజనాత్మక శక్తిచేత; బీజత్వ నిరూఢిన్= బీజం ఏర్పడటం అనే కార్యంగా; పొనరున్= ఒప్పుతుంది; అవి= ఆ శుక్లశోణితాలు; పిండంబు+ఐ= పిండంగా; పొదలున్= పెరుగుతాయి.

తాత్పర్యం: శుక్లశోణితాలు తగినట్లుగా కలిపి స్త్రీ గర్భంలో బీజంగా ఒకచోట నిలుస్తాయి. అట్లా కావటం బ్రహ్మకున్న సృష్టిసామర్థ్యశక్తిచేత జరిగే పని. అట్లా ఆ శుక్లశోణితాలు కలిసి, పిండంగా వృద్ధిపొందుతాయి.

విశేషం : ఆధునిక విజ్ఞానశాస్త్రం ప్రకారం కూడా వీర్యరజస్సులు కలిసినప్పుడు అందులోకి ప్రాణం ఎట్లా ప్రవేశిస్తున్నదనే విషయం (అదే బీజం) పరమాశ్చర్యంగానే మిగిలిపోయింది. ఈ ఆశ్చర్యకార్యాన్ని పురాణాలు 'బ్రహ్మ' అనే ప్రతీకద్వారా వివరించాయి.

క. విను మా బీజము పిండము। తనువునఁ జైతన్యరూపతం బరఁగి శిరం
బును గేలుఁ గాలు నుదరం। బు నురము వెన్ను నను నంగముల నేర్పఱుచున్. 190

ప్రతిపదార్థం: వినుము; ఆ బీజము= ఆ విధంగా ఏర్పడ్డ బీజం; పిండము తనువునన్= పిండంలోపల; చైతన్యరూపతన్= చైతన్యస్వరూపంగా; పరఁగి= వ్యాపించి ఉండి; శిరంబును= తలా; కేలున్= చేతులూ; కాలున్= కాళ్ళు; ఉదరంబున్= పొట్టా; ఉరమున్= రొమ్మూ; వెన్నున్= వీపూ; అను+అంగములన్= అనే అవయవాలను; ఏర్పఱుచున్= ఏర్పరుస్తుంది.

తాత్పర్యం: ఆ బీజం పిండంలోపల చైతన్యస్వరూపంగా ఉంటూ తల, చేతులు, కాళ్ళు, పొట్ట, రొమ్ము, వీపు అనే అవయవాలను ఏర్పరుస్తుంది.

విశేషం : శుక్లశోణితాల కలయికతో ఏర్పడ్డ బీజశక్తి పిండంలో ప్రాణశక్తిగా దాగి ఉంటున్నది - అనే విషయం గొప్ప వైజ్ఞానికసత్యం. అందుకే విగ్రహాది పూజలు చేసేటప్పుడు ఆ ప్రాణశక్తిని మనం ఆవాహన చేస్తాం. కాబట్టి దేహం వేరు. ప్రాణం వేరు. అందుచేత పిండం వేరు. పిండంలోని జీవశక్తి వేరు. దానినే బ్రహ్మశక్తిగా ముందు చెప్పారు.

వ. అని చెప్పి. 191

తాత్పర్యం: అని చెప్పినవాడై (తరువాతి పద్యంతో అన్వయం.)

క. జననార్ణవేళ వెలువడి। తన తొల్లిటి కర్మములకుఁ దగిన వివిధవ
ర్తనములఁ బొందు; నవి దెగినఁ। జని మఱియుం బుట్టుఁ గర్మసంతతికిఁ దగన్. 192

ప్రతిపదార్థం: జనన+అర్హవేళన్= పుట్టటానికి తగిన సమయంలో; వెలువడి= గర్భంనుండి బయటపడి; తన= తనయొక్క; తొల్లిటి కర్మములకున్= పూర్వజన్మ కర్మలకు; తగిన= తగిన రీతిలో; వివిధ= వివిధాలైన; వర్తనములన్= ప్రవర్తనలను; పొందున్= పొందుతాడు; అవి+తెగినన్= ఆ కర్మలు తెగగా; చని= చనిపోయి; మఱియున్= మళ్ళీ; కర్మ సంతతికిన్+తగన్= కర్మసమూహానికి తగిన విధంగా; పుట్టున్= పుడతాడు.

తాత్పర్యం: పుట్టటానికి తగిన సమయం రాగానే గర్భంనుండి బయటపడి జీవుడు తన పూర్వజన్మకర్మలకు తగిన రీతిలో వివిధ పద్ధతులలో జీవనం సాగిస్తాడు. ఆ కర్మలు తెగిన తరువాత చనిపోయి, మరలా తన కర్మలకు అనుగుణమైన విధంగా జన్మను ఎత్తుతాడు.

విశేషం : కర్మఫలశేషమే జన్మకు కారణమని, కర్మానుభవ సంపూర్తి మరణకారణమని అర్థం. ఇదే జననమరణ చక్రభ్రమణానికి కారణం.

క. **నరుఁ డెంత కాల మేనిం। బరమం బగు ముక్తిపదముఁ బడయక యుండుం**
బురుషవర! యంతకాలముఁ। బొరిఁ బొరి నిబ్భంగిఁ జావుఁ బుట్టువు నొందున్. **193**

ప్రతిపదార్థం: పురుషవర!= పురుషశ్రేష్ఠుడా!; నరుఁడు= మానవుడు; ఎంతకాలము+ఏనిన్= ఎంతకాలమైతే; పరమంబు+అగు= గొప్పదైన; ముక్తిపదమున్+పడయక+ఉండున్= ముక్తిస్థానాన్ని చెందకుండా ఉంటాడో; అంత కాలమున్= అంతదాకా; పొరిన్+పొరిన్= మరలా మరలా; ఈ+భంగిన్= ఈ రీతిగా; చావున్+పుట్టువున్= చావు పుట్టుకలను; పొందున్= పొందుతూనే ఉంటాడు.

తాత్పర్యం: పురుషశ్రేష్ఠుడా! మానవుడు ఎంత కాలంవరకు ఉత్కృష్టమైన మోక్షస్థానాన్ని పొందకుండా ఉంటాడో అంతవరకు మరలా మరలా ఈ విధంగా చావుపుట్టుకలను పొందుతూనే ఉంటాడు.

వ. **కావున ముక్తికిఁ గారణంబగు దాని। నేర్పడఁ జెప్పెద నెఱిఁగికొనుము;**
దానంబు శమమును దమమును బ్రహ్మ। చర్యంబును వ్రతపరిరక్షణంబు
దయయును బరధనదారవర్జనమును। నియమయమేంద్రియనిగ్రహములు
జననీజనకగురు జనపూజలును దేవ। తాతిథిపితృదేవతార్చనములు

తే. **సత్యమును శౌచమును శుభసంవిధాన। నిరతియును ధైర్యమును గ్రౌర్యనిరసనమ్ముఁ**
గలిమి పుణ్యవృత్తం బిది గలుగు నరుఁడు। మొనయు దీని నూఁతఁగ గొని మోక్షమునకు. **194**

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ముక్తికిన్+కారణంబు+అగు దానిన్= ముక్తికి కారణమైన దానిని; ఏర్పడన్+చెప్పెదన్=స్పష్టంగా చెప్తుతాను; ఎఱింగికొనుము= తెలిసికొనుము; దానంబున్= దానం; శమమునున్= శమం; దమమునున్= దమం; బ్రహ్మచర్యంబునున్= బ్రహ్మచర్యం; వ్రతపరిరక్షణంబున్= దీక్షను కాపాడుకొనుటయూ; దయయునున్= దయయూ; పర= ఇతరుల; ధన; దారవర్జనమున్= ధనమునూ; స్త్రీలనూ; ఆశించకుండా ఉండటం; నియమ= నియతితో; యమ+ఇంద్రియ+నిగ్రహంబులు= నియమించి ఇంద్రియాలను జయించటం; జననీ జనక= తల్లిదండ్రులు; గురుజన= గురువుల; పూజలును= పూజించటం; దేవతా= దేవతల; అతిథి= అతిథుల; పితృదేవతార్చనములు= పితృదేవతలను అర్చించటం; సత్యమునున్= సత్యపరిపాలన; శౌచమునున్= పరిశుద్ధిగా ఉండటం; శుభ+సంవిధాన+నిరతియునున్= శుభకార్యాల విషయంలో నిష్ఠ కలిగి ఉండటం; ధైర్యమునున్= ఎప్పుడూ ధైర్యం కలిగి ఉండటం;

క్రౌర్య నిరసనమ్మున్+కలిమి= క్రూరత్వాన్ని నిరసించటం అనే ఈ గుణాలు కలిగి ఉండటం; పుణ్యవృత్తంబు= పుణ్యచరిత్ర; ఇది+కలుగు నరుఁడు= ఇది ఉన్న మానవుడు; దీనిన్= ఈ చరిత్రనే; ఊఁతగన్+కొని= ఊతగా గ్రహించి; మోక్షమునకున్= మోక్షానికి; మొనయున్= ప్రయత్నిస్తాడు.

తాత్పర్యం: కాబట్టి ముక్తిహేతువైన దానిని చెప్పుతాను బాగా తెలిసికొనుము. దానం, శమం, దమం, బ్రహ్మచర్యం, దీక్షను పరిరక్షించుకొనటం, దయ, పరధనాన్ని, పరస్త్రీని కోరకుండటం; నియతితో ఇంద్రియాలను నిగ్రహించటం, తల్లిదండ్రులను, గురువులను పూజించటం, దేవతలను, అతిథులను, పితృదేవతలను ఆర్చించటం, సత్యవాక్పాలన, సదా శుచిగా ఉండటం, శుభకార్యాల విషయంలో నిష్ఠ కలిగి ఉండటం, ఎల్లప్పుడూ ధృతి కోల్పోకుండా ఉండటం. క్రూరత్వాన్ని ఎప్పుడూ నిరసించటం - అనే ఈ గుణాలు పుణ్యచరిత్రకు నిదర్శనాలు. ఈ విధమైన ప్రవృత్తి ఉన్న మానవుడు ఈ జీవితాన్నే సాధనంగా చేసికొని, మోక్షస్థానానికి ప్రయత్నిస్తాడు.

క. **పదపడి ధర్మాచరణము। వొదలుం దత్సూక్ష్మ విధము బుధజనుల కడం**
గదలక నిలిచి యెఱిఁగికొన। విదితంబగు వారి శీలవృత్తములఁ గడున్. **195**

విశేషం : పదపడి= మరి ఇంకా; ధర్మాచరణము= ధర్మాన్ని ఆచరించటం; పొదలున్= (ఒకటి) ఉన్నది; తద్+సూక్ష్మ విధమున్= ఆ ధర్మసూక్ష్మవిధాన్ని; బుధజనులకడన్= పండితులైన వారి దగ్గర; కదలక= ఏకాగ్రతతో; నిలిచి= భక్తిప్రవత్తులలో ఉండి; ఎఱిఁగికొనన్= తెలిసికొనగా; వారి శీలవృత్తములన్= వారి శీలప్రవర్తనలవలన, కడున్= మిక్కిలిగా; విదితంబు+అగున్= తెలుస్తుంది.

తాత్పర్యం: ఇంతమాత్రమే కాదు, ఇంకా ఒకటి ఉన్నది. అది ధర్మాన్ని ఆచరించటం, అది చాలా సూక్ష్మమైన విషయం. దానిని పండితులవద్ద శిష్యభావంతో చేరి, వారిని సేవించి, ఏకాగ్రతతో వారివలన తెలిసికొనాలి. అప్పుడు వారి ప్రవర్తనవలన, వారి జీవితంవలన మనకు ఆ ధర్మనిర్వహణలోని తత్త్వం బోధపడుతుంది.

క. **వారలు చెప్పెడి శాంతో। దారవచనసమితి వినఁగఁ దద్గత బహుగం**
భీరార్థము లంతఃకర। ణారూఢము లైనఁ బొరయ వాపద లెందున్. **196**

ప్రతిపదార్థం: వారలు= ఆ పండితులు; చెప్పెడి= చెప్పే; శాంత+ఉదార= శాంతమైన; ఉదారమైన; వచన సమితిన్= మాటల సముదాయాన్ని; వినఁగన్= వింటూపోగా; తద్+గత= ఆ మాటలలోని; బహు= మిక్కిలి; గంభీర= గంభీరాలైన; అర్థములు= అర్థాలు; అంతఃకరణ+ఆరూఢములు+ఐనన్= మనస్సులో నాటుకొనగా; ఆపదలు= అపాయాలు; ఎందున్= ఎన్నడూ; పొరయవు= సమీపించవు.

తాత్పర్యం: ఆ పండితులు చెప్పే శాంతోదార వచనాలను వింటూ పోగా ఆ మాటలలోని మిక్కిలి గంభీరాలైన అర్థాలు మనస్సులలో గాఢంగా నాటుకొనగా, ఆపదలు ఎన్నటికీ సమీపించవు. అట్లాంటి వారు ధర్మనిర్వహణ చేయగలరు.

సీ. **వ్రతపరినిష్ఠమై వర్తించుచుండి యిం। ద్రియవిజయమును శాంతియును గలిగి**
బ్రహ్మైకభజనతత్పరుఁ డగుచుండెడు। నతనికి బ్రహ్మంబు హుతవహుండు
సంస్తరంబును యోగ్యసమిధలు జలమును। మంత్రంబు గురుఁడు బ్రహ్మంబ యిట్టి
సచ్చరణంబు సూక్ష్మ బ్రహ్మచర్యంబు। దీనియం దుత్తమ స్థిరత గలుగు

తే. వాఁడు హర్షశోకోద్దామ వాయుహతుఁడు। గాఁడు మేదుర మోహాంధకారమున వె
డంగుపడఁడు సంసారనిస్సంగసిద్ధిఁ। బొందుఁ గాలక్రమమున నప్పురుషవరుఁడు. 197

ప్రతిపదార్థం: వ్రతపరినిష్ఠమైన్= పై విధంగా నియమబద్ధమైన జీవితాన్ని వ్రతంవలె మిక్కిలి నిష్ఠతో; వర్తించుచున్+ఉండి= కడపుతూ; ఇంద్రియ విజయమునున్= ఇంద్రియ జయాన్ని; శాంతియునున్= శాంతిని; కలిగి; బ్రహ్మ+ఏక భజన తత్పరుఁడు+అగుచున్+ ఉండెడు+అతనికిన్= కేవలం బ్రహ్మనే ఉపాసించటంలో నిష్ఠకలిగి వర్తించే మానవుడికి; బ్రహ్మంబు= ఆ బ్రహ్మమే; హుతవహుండు= అగ్ని; సంస్తరంబునున్= యాగమూ; యోగ్య సమిధలు= తగిన సమిధలు; జలమునున్= నీళ్ళూ; మంత్రంబున్= మంత్రమూ; గురుఁడున్= ఉపద్రష్ట; బ్రహ్మంబు= బ్రహ్మమే; ఇట్టి= ఈ విధమైన; సత్ +చరణంబు= సత్కర్మాచరణం; సూక్ష్మ= అతి సూక్ష్మమైన; బ్రహ్మచర్యంబు= బ్రహ్మపథంలో చరించటం; దీని+అందున్= దీనిలో; ఉత్తమ స్థిరత+కలుగువాఁడు= ఉత్తమ స్థిరత్వం కలిగినవాడు; హర్ష= సంతోషం; శోక+ఉద్దామ= దుఃఖం అనేటటువంటి భయంకరమైన; వాయుహతుఁడు+కాఁడు= గాలిచేత దెబ్బతినడు; మేదుర= దట్టమైన; మోహ+అంధకారమునన్= మోహమనే చీకటిలో; వెడంగు+పడఁడు= భయపడడు; కాలక్రమమునన్= కాలక్రమంలో; ఆ+పురుషవరుండు= ఆ పురుష శ్రేష్ఠుడు; సంసార= సంసార విషయంగా; నిస్సంగ సిద్దిన్+పొందున్= సంగరాహిత్య ప్రాప్తిని పొందుతాడు.

తాత్పర్యం: పై విధంగా నియమబద్ధమైన ధార్మికజీవితాన్ని వ్రతంవలె మిక్కిలి నిష్ఠతో గడపుతూ ఇంద్రియ జయాన్ని, శాంతిని కలిగి కేవలం బ్రహ్మను ఉపాసించటంలోనే నిష్ఠ కలిగి వర్తించే మానవుడికి ఆ బ్రహ్మమే అగ్ని, యాగమూ, సమిధలు, నీరూ, మంత్రమూ, ఉపద్రష్ట అంతా బ్రహ్మమే. ఈ విధంగా సత్కర్మను ఆచరించటమే బ్రహ్మపథంలో చరించటమంటే. ఈ ఆచరణలో ఉత్తమ స్థిరత్వాన్ని కలిగినవాడు సంతోషం, దుఃఖం అనే పెనుగాలులచేత దెబ్బతినడు. దట్టమైన మోహమనే చీకటిలో భయపడడు. కాలక్రమంలో ఆ మహాపురుషుడు సంసార బంధవిముక్తిని కాంచగలుగుతాడు.

విశేషం : "బ్రహ్మార్పణం బ్రహ్మహవిః । బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్,
బ్రహ్మైవ తేన గంతవ్యం । బ్రహ్మకర్మ సమాధినా."

అని భగవద్గీత చెప్పుతున్నది. బ్రహ్మే హవిస్సు, అగ్ని, హోత, యజ్ఞానికి ధ్యేయం. యజ్ఞఫలప్రదాత. యజ్ఞ మతనికే అర్పితం. అది ఒక బ్రహ్మకర్మ సమాధి. దానితోనే ఆ యాగం సాధ్యం. ఈ బ్రహ్మకర్మాచరణం స్థిరంగా చేయటంవలన 'అహం' నశించి. కర్తృత్వభావన లోపించి, దాని ఫలితంగా 'నిస్సంగం' (బంధవిముక్తి) సిద్ధిస్తుంది అని అర్థం.

వ. అని చెప్పె మఱియును. 198

తాత్పర్యం: అని చెప్పి ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం.)

తత్త్వజ్ఞానవిశేష ప్రదర్శనము (సం. 14-18-25)

సీ. ఆదిసృష్టిఁ బ్రధాన మను తత్త్వ మంబుజా। సనుఁడు గల్పించి చేతన మొనర్చె
క్షరమండ్రు దానిఁ దత్పర మగు తత్త్వంబు। నక్షర మనియును నమృత మనియు
నార్యులు సెప్పుదు రమ్మిథునంబున। యందు సంపన్నంబు లఖిలభూత
జాలంబులకును సంజనకంబులైన బీ। జము లిది శ్రుతివాక్యసంభృతార్థ

తే. మతఁడు గలిగించె గమనము నాగమనము। జీవరాశికిఁ గావున నా విధమున
నది భ్రమించుచునుండుఁ బుణ్యాతిశయము। కతన జీవాత్ముఁ డొకఁడు దన్ గాంచినపుడు. 199

ప్రతిపదార్థం: ఆదిన్= తొలుత; సృష్టిన్= సృష్టి క్రమంలో; అంబుజ+ఆసనుఁడు= బ్రహ్మ (పద్మం ఆసనంగాకలవాడు;) ప్రధానము+అను= తత్త్వమున్= ప్రధాన మనే పేరుగల తత్త్వాన్ని; కల్పించి= సృష్టించి; చేతనము+ఒనర్చెన్= దానికి ప్రాణం పోశాడు; దానిన్= దానిని; క్షరము+అండ్రు= క్షరం అని పిలుస్తారు; తద్+పరము+అగుతత్త్వంబు= దానికి అతీతమైన తత్త్వాన్ని; అక్షరము+అనియున్= అక్షరమనీ; అమృతము+అనియున్= అమృతమనీ; ఆర్యులు= పెద్దలు; చెప్పుదురు= చెప్పుతారు; ఆ+మిథునంబున్+అందున్= ఆ జంటలో; అఖిల భూతజాలంబులకున్= అన్ని భూత సమూహాలకు; సంజనకంబులైన= పుట్టుకకు కారణాలైన; బీజములు= బీజాలు; సంపన్నంబులు= పుట్టాయి; ఇది= ఈవిధంగా పుట్టటం; శ్రుతివాక్య= వేదవాక్యాలలో; సంభృత+అర్థము= నిండిన అర్థమే; అతఁడు= ఆ బ్రహ్మ; జీవరాశికిన్= జీవులకు; గమనము= వెళ్ళిపోవటం; ఆగమనము= రావటం; కలిగించెన్= కలిగించాడు; కావునన్= కాబట్టి; ఆ విధమునన్= ఆ రీతిగా; అది= ఆ బీజం; భ్రమించుచున్+ఉండున్= భ్రమిస్తూ ఉంటుంది; పుణ్య+అతిశయము కతనన్= పుణ్యాతిశయంవలన; జీవాత్ముఁడు+ఒకఁడు= జీవాత్మ ఒకటి; తన్+కాంచినపుడు= తనను ఆవహించినపుడు.

తాత్పర్యం: తొలుత సృష్టిక్రమంలో బ్రహ్మదేవుడు 'ప్రధాన'మనే తత్త్వాన్ని కల్పించి, దానికి ప్రాణం పోశాడు. దానిని 'క్షర'మంటారు. దానికి అతీతమైన తత్త్వం 'అక్షరం.' దీనినే అమృతమని కూడా అంటారు. క్షర - అక్షరాల జంటవలననే ఈ సకల భూతసమూహాల పుట్టుకను కలిగించగల బీజాలు పుట్టాయి. ఈ విషయాన్ని వేదాలు ప్రతిపాదించాయి కూడా; ఇట్లా ఆ బ్రహ్మ జీవులకు గమనం. ఆగమనం (చావు పుట్టుక) రెండూ నిర్దేశించి ఉన్నందువలన ఆ బీజం నిరంతరం జననమరణచక్రంలో భ్రమిస్తూ ఉంటుంది. పుణ్యం పండిన జీవాత్ముడు తనను పొందినపుడు ఆ బీజం ఏం చేస్తుందంటే. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం : గీతాకారుడు 'అక్షరపరబ్రహ్మ' యోగంగా ఈ అక్షరతత్త్వాన్ని వ్యాఖ్యానించాడు.

"అక్షరం బ్రహ్మపరమం స్వభావోఽధ్యాత్మ ముచ్యతే,
భూత భావోద్భవకరో విసర్గః కర్మ సంజ్ఞితః,"

బ్రహ్మం అక్షర స్వరూపం. అతడి స్వభావం అధ్యాత్మం. సకలసృష్టికి విసర్గమని పేరు.

"అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్,
అధియజ్ఞో హమేవాత్ర దేహే దేహభృతాం వర."

(నశించిపోయే దేహాదులన్నిటికీ - అధిభూతాలైనవాటికి - 'క్షర'మని పేరు. పురుషుడు దీనికి అధిదైవతం. ఈ దేహంలో ఉండే నేనే అధియజ్ఞాన్ని)

"అవ్యక్తోఽక్షర ఇత్యుక్త స్త మాహుః పరమాం గతిమ్,
యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ."

అవ్యక్తమని చెప్పబడే ఆ అక్షరతత్త్వమే పరమపదం. దానిని చెందినవాడు మరలిరాడు. అందువలన అక్షర, క్షర పురుషులతోనే ఈ జగమంతా నిండి ఉన్నది - అని తాత్పర్యం.

"ద్వా విమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ,
క్షర స్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే." (పురుషోత్తమప్రాప్తియోగం)

క. **విను సుఖదుఃఖము లచిరము। లనియుం దను వశుచి యనియు నఖిలపదార్థం**
బును నశ్వర మనియుం గ। ర్మనిరూఢత జాడ్య మనియు మది నూహించున్. **200**

ప్రతిపదార్థం: విను= జాగ్రత్తగా వినుము; సుఖదుఃఖములు= సుఖం; దుఃఖం; అచిరములు+అనియున్= అశాశ్వతాలని; తనువు= శరీరం; అశుచి+అనియున్= అపరిశుభ్రమయిందనీ; అఖిలపదార్థంబున్= సర్వపదార్థ సమూహమూ; నశ్వరము+అనియున్= అశాశ్వతమైనదనీ; కర్మవిరూఢత= కర్మలోనే నిరంతరం నిల్చిపోయి జ్ఞానం విషయంగా ఆలోచన చేయకుండుటం (అంటే సదా లౌకికమైన జీవితకర్మలలోనే మునిగి ఉండటం); జాడ్యము+అనియున్= ఒక జడత్వమని (రోగమని); మదిన్= అంతశ్శక్తితో; ఊహించున్= ఊహిస్తాడు.

తాత్పర్యం: అట్లా సంసారచక్రంలో తిరుగుతున్న జీవుడు పుణ్యపరిపాకంవలన సుఖదుఃఖాలు అశాశ్వతాలని, దేహం అపవిత్రమని, సకలపదార్థచయమూ అశాశ్వతమని, కర్మలో నిరంతరం కూరుకుపోయి ఉండటం ఒక జాడ్యమని అంతశ్శక్తితో ఊహించి తెలిసికొంటాడు.

విశేషం: భగవంతుడి అంశమాత్రమైన సంస్కారబీజంలోనే సదాలోచన కలుగుతుందని అర్థం చేసికొనాలి. అందుకే పుణ్యం పండినపుడే జీవుడు ఇట్లా ఆలోచిస్తాడని చెప్పటం.

క. ఊహించి తన్నుఁ గప్పెడు । మోహావేశంబు ద్రోచి మోక్షపదప్రా
ప్తీహను సంసారాబ్ధివ । గాహనముం జేయకుండు గతకల్మషుఁడై **201**

ప్రతిపదార్థం: ఊహించి= ఇట్లా గుర్తించి; తన్నున్= తనను; కప్పెడు= ఆక్రమిస్తున్న; మోహ+అవేశంబున్+త్రోచి= మోహావేశాన్ని త్రోసిరాజని; మోక్షపద= మోక్షస్థానం; ప్రాప్తి= పొందాలన్న; ఈహనున్= కోరికతో; గతకల్మషుఁడై= పాపాలు పోయినవాడై; సంసార+అబ్ధి= సంసార సాగరంలో; అవగాహనమున్= మునగటాన్ని; చేయక+ఉండున్= చేయకుండా ఉంటాడు.

తాత్పర్యం: ఇట్లా గుర్తించి తన్ను ఆవేశిస్తున్న మోహాన్ని ఆవలకుత్రోసి, మోక్షం పొందాలన్న ఆకాంక్షతో పాపప్రక్షాళన గావించుకొని సంసారసాగరంలో దిగకుండా జాగ్రత్తపడతాడు. అలంకారం-సంసారాబ్ధి-సంసారమనెడి అబ్ధి-రూపకం

వ. అని పలికి వెండియు. **202**

తాత్పర్యం: అని పలికి ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. జనిరుగ్జరామరణములు । గని ప్రకృతివిధంబు లెస్సగా నెఱుఁగుటఁ ద
జ్జనితక్లేశమునకు విసి । విన మర్త్యులు పరమపదము వెదకుదు రనఘా! **203**

ప్రతిపదార్థం: అనఘా!= ఓ పుణ్యాత్మా! వినుము; జని= పుట్టుక; రుజ్= రోగము; జరా= ముసలితనము; మరణము(లు)= చావూ; కని= చూచి; ప్రకృతి విధంబున్= ప్రకృతి విధానాన్ని; లెస్సగాన్= బాగా; ఎఱుఁగుటన్= తెలిసికొనటంవలన; తద్+జనిత= వాటినుండి పుట్టిన; క్లేశమునకున్= దుఃఖానికి; విసివిన= విసిగిన; మర్త్యులు= మానవులు; పరమపదమున్= మోక్షస్థానాన్ని; వెదకుదురు= అన్వేషిస్తారు.

తాత్పర్యం: పుట్టుక, రోగం, ముసలితనం, చావు - వీటిని చూచి చూచి, ఇది ప్రకృతి సహజ పరిణామమని తెలిసికొనటం వలన వీటివలన పుట్టే దుఃఖానికి మానవులు విసిగిపోయి, చివరికి మోక్షస్థానాన్ని అన్వేషించటం మొదలు పెట్టుతారు.

విశేషం : విసుగుపుట్టటం అంటే రోత పుట్టటమని అర్థం. ఏ విషయాన్ని చూడగా చూడగా అందులో ఏ చింతా లేదో దానిమీద కలిగే భావం 'రోత', అందుకే 'రోజూ చచ్చేవాడికి ఏడ్చేవారెవరు?' అనే సామెత పుట్టింది. ఇది అసహ్యము కాదు; జ్ఞానంవలన పుట్టే విరక్తిభావం మాత్రమే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **అట్టివా రిట్టి వా రగుట మేల్ గనికొని। యజనంబుఁ బూతంబు నైన చోట**
నాసీనుఁడై హృదయంబున నొక చింత। యును లేక యూఱడి యుండి యడరి
తోఁచు తోఁపుల నెల్లఁ దోడ్తో నడంచి ని। రాలంబనుం డైన యతఁడొకండు
సర్వమిత్రుండును సర్వసహుండును। నిర్జితేంద్రియుఁడును నిర్భయుఁడును

తే. **గామకోపహీనుఁడు శమఘనుఁడు నైన। యతఁ డొకండు మానాభిమానాపగమము**
సర్వభూతాత్మకత్వదర్శనముఁ గలుగు। నతఁ డొకండు వీరలు గందు రనఘ! ముక్తి **204**

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; అట్టివారు= అటువంటివారు; ఇట్టివారు= ఇట్లాంటివారు; అగుట= కావటాన్ని; మేల్+కనికొని= బాగా గుర్తించి; యజనంబున్= యజ్ఞం జరిగి; పూతంబున్+ఐన చోటన్= పవిత్రమైన స్థలంలో; ఆసీనుఁడై= కూర్చున్నవాడై; హృదయంబునన్= హృదయంలో; ఒక చింతయును లేక; ఊఱడి+ఉండి= ఓదార్పు కలిగిఉండి; అడరి= విజృంభించి; తోఁచు= వచ్చేటటువంటి; తోఁపులన్+ఎల్లన్= ఆలోచన లన్నిటినీ; తోడ్తోన్= వెంటనే; అడంచి= అణచివేసి; నిరాలంబనుండు+ఐ= ఏ ఆధారాన్ని గ్రహించకుండా ఉండేటటువంటి; అతఁడు+ఒకండు= అతడు ఒకడు; సర్వమిత్రుండును= అందరిలోనూ; అన్నిటిలోను మిత్రత్వాన్ని పాటించేవాడూ; సర్వసహుండును= అన్నిటిని సహించేవాడూ; నిర్భయుఁడును= భయరహితుడు; కామకోప హీనుఁడు= కామం, కోపం లేనివాడు; శమఘనుఁడు= శమగుణంచేత గొప్పవాడైనవాడు; ఐన= అయినటువంటి; అతఁడు+ఒకండు= అతడు ఒకడు; మానాభిమాన+అపగమము= మానం, అభిమానం ఈ రెండూ లేకపోవటం; సర్వభూత+ఆత్మకత్వదర్శనమున్+కలుగు+అతండు+ఒకండు = సర్వభూతాలలోని ఆత్మను దర్శించే లక్షణం కలిగినవాడు ఒకడు; వీరలు= ఈ ముగ్గురూ; ముక్తిన్= ముక్తిని; కందురు= పొందుతారు.

తాత్పర్యం: ఎవరు ఎట్లాంటివారో గుర్తించి పవిత్రమైన స్థలంలో కూర్చొని, ఏ చింతా లేకుండా ఓర్పుతో ఉంటూ ఎప్పటికప్పుడు దాడిచేసే ఆలోచనలను వెంటవెంటనే అణచి, ఏ ఆధారాన్నీ ఆశించకుండా ఉండేటువంటి ఆ సంయమి; ' అందరిలోనూ సమంగా మిత్రత్వాన్ని పాటిస్తూ అన్నిటినీ సహిస్తూ నిర్భయంగా కామక్రోధాదులను జయించి 'శమము'ను సాధించే ఆ 'సమదర్శి'; మానం, అవమానం ఇట్లాంటి ద్వంద్వభావాలను దాటి అన్నిటిలోనూ ఆత్మను దర్శించగలిన ఆ 'ఆత్మజ్ఞాని' - ఈ ముగ్గురూ ముక్తిస్థానాన్ని అందుకొంటారు.

విశేషం : ఇంద్రియజయం, సమదర్శనం, ఆత్మజ్ఞానం ఈ మూడు 'యోగి' లక్షణాలు. యోగులే ముక్తిని పొందగలరు. మార్గాలు భిన్నంగా ఉంటాయి. భగవద్గీతలో బోధించిన అంశాలనే మళ్ళీ శ్రీకృష్ణపరమాత్మ ప్రతినిధిగా సిద్ధుడు ఇక్కడ చెప్తున్నాడు.

సీ. **ఒలయు లాభాలాభములుఁ బ్రియద్వేషంబు। లును సుఖదుఃఖములును సమంబు**
లై యుండు నెవ్వని కాసపాటును నవ। జ్ఞతయు నెందును లేక సర్వధర్మ
తంత్రలోలుండును ధర్మశీలుండుఁగాఁ। డెవ్వఁడు గూర్చు వారొవ్వకుండు
వారని తనకు నెవ్వరు గల్గక త్రివ। ర్గేచ్ఛ యెవ్వనిచేత నీడ విడువఁ

తే. **బడు నకర్మభావంబుఁ దాపత్రయాప। గమము వైరాగ్యసుస్థిరత్వమును గల్గు**
నరయ నెవ్వని యందేని యతఁడు నతఁడు। నతఁడు నతఁడును గందు రవ్యయపదంబు. **205**

ప్రతిపదార్థం: ఒలయు= కలిగేటటువంటి; లాభ+అలాభములున్= లాభ నష్టాలూ; ప్రియ+ద్వేషంబులునున్= ఇష్టమైనవీ, అనిష్టమైనవీ; సుఖదుఃఖములునున్= సుఖమూ; దుఃఖమూ; ఎవ్వనికిన్= ఎవ్వడికి; సమంబులు+ఐ= సమానంగా; ఉండున్= ఉంటాయో (అతడు); ఆసపాటును= మిక్కిలి ఆశకు లోనుకావటం; అవజ్ఞతయున్= మిక్కిలి నిరాదరణం; ఎందునున్ లేక= ఎప్పుడూ కలిగి ఉండక; సర్వధర్మతంత్ర లోలుండును= అన్ని ధర్మతంత్రాలపట్ల ఇచ్ఛ గలిగినవాడూ; ధర్మశీలుండును= ధర్మమే శీలంగా కలిగినవాడూ; ఎవ్వఁడు+కాఁడు= ఎవడు కాకుండా ఉంటాడో (అతడును); కూర్చువారు= ఇష్టులు; ఒవ్వక+ఉండువారు+అని= శత్రువులు అని; తనకున్= తనకు; ఎవ్వరు+కల్గక= ఎవరూ ఉండక; త్రివర్గ+ఇచ్ఛ= ధర్మ, అర్థ, కామాలు ఈ మూడింటిలోనూ ఆకాంక్ష; ఎవ్వనిచేతన్+ఈడన్+విడువన్+పడున్= ఎవడిచేత సంపూర్ణంగా వదలబడుతుందో (అతడు); ఆకర్మభావంబున్= కర్మ చేయటంలేదన్న భావన; తాపత్రయ+అపగమము= దార, ధన, పుత్రేషణలు తాపత్రయం- ఇవి లేకుండటం; వైరాగ్య= విరాగ భావంయొక్క; సుస్థిరత్వమునున్= సుస్థిరత్వం; అరయన్= బాగాచూడగా; ఎవ్వని+అందున్+ఏనిన్= ఎవడిలోనైతే; కల్గున్= ఉంటుందో (అతడును); అవ్యయపదంబున్= మోక్షస్థానాన్ని; కందురు= పొందుతారు.

తాత్పర్యం: కలిగే లాభాలాభాలు, ప్రియద్వేషాలు, సుఖదుఃఖాలు ఎవరికి సమంగా ఉంటాయో అతడు; ఆశానిరాశలు రెండూ లేక అటు ధర్మతంత్రలోలత్వం, ఇటు ధర్మశీలత్వం రెండూ లేక ఎవడు ఉంటాడో అతడు; ప్రియులు ద్వేషులు ఇరువురూ లేక, ధర్మార్థకామాలు ఎవడిచేత సంపూర్ణంగా వదలబడుతాయో అతడు; ఎవడిలో తాను కర్తను కాదన్న భావన, తాపత్రయరాహిత్యం, సుస్థిరవైరాగ్యం ఉంటాయో అతడు-ఈ నలుగురూ శాశ్వతమైన మోక్షస్థానాన్ని చెందుతారు.

విశేషం: ఈ పద్యంలో ద్వంద్వమోహరాహిత్యం, సమదర్శనం, నిష్కామకర్మ, అకర్తృత్వభావన, వైరాగ్యభావనలో సుస్థిరత్వం ప్రధానంగా చెప్పబడ్డాయి. భగవద్గీతలో ఈ అంశాలన్నీ బోధింపబడ్డవే.

ధర్మతంత్రలోలుపత, ధర్మశీలత, రెండూ విరాగభావాన్ని పెంచేవి కావటం చాలా అద్భుతమైన అంశం. యుద్ధానంతర పర్వాలలో పాండవులను సంస్కరించటంలో వ్యాసమహర్షి ఉద్దేశం ఇదే. 'నేను ధర్మాత్ముడ'ను అనే భావన. నాది 'ధార్మిక కార్యమనే నిర్ణయం. రెండూ భ్రమలకు నిదర్శనలే. అందుకే భీష్మాదులు వైరాగ్యభావన అంటే ఏమిటో చెప్పవలసివచ్చింది. సిద్ధుడు కూడా దానినే బోధిస్తున్నాడు.

క. అసమాలంబ మశబ్దము। రసగంధస్పర్శరూపరహిత మగుణ ము
ల్లసితగుణమగు వెలుఁగు న। భ్యసననియతి పరుఁ డొకండు వడయుం బుత్రా! 206

ప్రతిపదార్థం: పుత్రా!= కుమారా!; అసమాలంబము= ఏ ఆధారమూ లేకుండా నిలిచి ఉన్నది; అశబ్దము= శబ్దంచేత బోధించబడనిది; రస గంధ స్పర్శ రూపరహితము= రసం, గంధం, స్పర్శం, రూపం - ఇవేవి లేనిది; అగుణము= ఏ గుణమూ లేనిది; ఉల్లసిత= మిక్కిలిగా ప్రకాశించే; గుణము+అగు= లక్షణం కలిగిన; వెలుఁగున్= ఆ కాంతిని; అభ్యసన నియతి వరుడు+ఒకండు= యోగాభ్యాసనియమ పరుడు ఒక్కడు మాత్రమే; పడయున్= పొందుతాడు.

తాత్పర్యం: కుమారా! ఏ ఆధారమూ లేకుండా నిలుచున్నది. శబ్దంచేత బోధించబడనిది. రసగంధస్పర్శరూప రహితమైనది. నిర్గుణమైనది, ప్రకాశించటమే లక్షణంగా కలిగిన ఆ కాంతి స్థానాన్ని నిరంతరయోగాభ్యాసనిష్ఠుడైన 'ఒక్కడు' మాత్రమే పొందగలుగుతాడు.

విశేషం : 'కశ్చిన్ మాం వేత్తి తత్త్వతః' అని గీతాకారుడు స్పష్టంగా చెప్పి ఉన్నాడు. ఎందరో యోగులు ప్రయత్నిస్తే వారిలో ఎవడో ఒకడు మాత్రమే ఆ పరమాత్మ తత్త్వాన్ని పూర్తిగా గుర్తిస్తాడని అర్థం. తక్కిన వారందరూ ఆ మహాప్రస్థానంలో ఏదో ఒక స్థాయిలో ఆగిపోతారు. లేదా వెనుదిరుగుతారు.

ఆ తత్త్వం 'కాంతి' రూపం, ప్రపంచంలోని మతాలన్నీ భగవంతుడిని 'కాంతి' స్వరూపంగా చెప్పాయి. గీతలో విశ్వరూపం కూడా ఒక కాంతిగోళంగా వర్ణించబడినది. అది అన్నిదిక్కులలోనూ వ్యాపించినది. దాని ఉనికి ఏ ఇతర వస్తువు మీదా ఆధారపడినది కాదు. అందుకే 'నిరాలంబం' అని దానిని పిలిచారు (అ+సమ+ఆలంబం= అన్నా అర్థం ఇదే).

'న తత్ర వాక్ గచ్ఛతి' అని ఆ స్థానాన్ని గురించి గీత చెప్పింది. ఆ స్థానం శబ్దంచేత బోధింపబడేది కాదు. అంటే ఆకాశమనే భూతం కాని, రస (జల) గంధ (భూమి) స్పర్శ (వాయు) రూప (అగ్ని) అనే ఇతర భూతాలు కాని,వాతగుణాలుకాని ఆ పరమాత్ముడి 'కాంతి'ని నిర్వచించలేవు. సత్త్వరజస్తమోగుణాలు అక్కడ లేవు. ఒకే లక్షణమున్నది అది 'ప్రకాశం'. నిత్యమూ వెలగటమే దాని ధర్మం. కనుక అది అక్షర మని (నశించని దని) పరబ్రహ్మ మని సిద్ధుడు చెప్పుతున్నాడు.

తే. **సర్వసంకల్పవర్జనశాలి యగుచుఁ బరమశాంతి చిత్తంబునఁ బట్టుకొల్పు**
నతఁ డనింధనానలము న ట్లల్లఁ బొందు। వికృతివర్జితయైన నిర్వృతిఁ గృతాత్మ!' **207**

ప్రతిపదార్థం: కృతాత్మ!= ధన్యాత్ముడా!; సర్వ= అన్ని; సంకల్ప= సంకల్పాలను; వర్జనశాలి+అగుచున్= వదలిపెట్టటంలో సమర్థుడై; పరమశాంతి= గొప్పశాంత స్థితిని; చిత్తంబునన్= మనసులో; పట్టుకొల్పు+న్+అతఁడు= స్థిరంగా ఉంచుకొనేటటువంటివాడు; అనింధన+అనలమున్+అట్లు= ఏ కట్టెలు లేకుండా అగ్నివలె; అల్లన్= నెమ్మదిగా; వికృతి వర్జిత+ఐన= ఏ వికారాలు లేనటువంటి; నిర్వృతిన్= మోక్షాన్ని; పొందున్= పొందుతాడు.

తాత్పర్యం: ధన్యుడా! సర్వసంకల్పాలను వర్జించి, పరమశాంతస్థితిని స్థిరంగా మనసులో పాదుకొల్పి, ఎవడు సాధన చేస్తాడో అతడు కర్ర, తైలం మొదలైన సాధనాలు లేకుండానే మండే అగ్నివలె ఏ వికారాలు పొందని ఆ మోక్షస్థానాన్ని అందుకొనగలడు.'

విశేషం : సాధారణంగా అగ్ని మండటానికి కర్ర కావాలి. కర్రలేనిదే మంటలేదు. కాని పరమాత్మ అనే అగ్ని నిరంతరం మండే లక్షణం కలిగినది. ఆ అగ్నికి ఆరిపోవటమనే 'వికారం' లేదు (వికారమంటే పరిణామం). అందుచేతనే అది కర్రను ఆధారంగా కలిగినది కాదనటం. ఈ లక్షణాన్నే 'నిరాలంబ' ధర్మంగా ముందు చెప్పింది.

నిర్వృతి, నిర్వాణం, బ్రహ్మపదం, మోక్షం - ఇవన్నీ పర్యాయ వాచకాలే. ఎక్కడ చేరి తిరిగి రామో అది 'నిర్వృతి' పదం.

వ. **అనినిర్దేశించి 'యోగిజనానుభావ్యంబైన నెలవెఱింగించెద' నని పలికి 'యోగులు దాన నాత్మదర్శనానందంబు నొందుదు రవధానంబున నాకర్ణింపు' మని యిట్లనియె.** **208**

ప్రతిపదార్థం: అని= అని ఈ విధంగా; నిర్దేశించి= బోధించి; యోగిజన= యోగులచేత; అనుభావ్యంబైన= అనుభవించదగిన; నెలవు= స్థానం; ఎఱింగించెదను+అని పలికి= చెప్పుతానని చెప్పి; యోగులు= యోగసాధకులు; దానన్= ఆ పదప్రాప్తిచేత; ఆత్మదర్శన= తమను తాము తెలిసికొనటంచేత కలిగే; ఆనందంబున్= ఆనందాన్ని; ఒందుదురు= పొందుతారు; అవధానంబునన్= ఏకాగ్రతతో; ఆకర్ణింపుము+అని= వినుమని; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా బోధించి, 'యోగులు పొందే స్థానం ఏదో చెప్పుతాను వినుము. యోగసాధకులు ఆ పదాన్ని పొంది ఆత్మానుభవానందాన్ని పొందుతారు. ఆ విషయం వివరిస్తాను. ఏకాగ్ర చిత్తంతో విను' మంటూ సిద్ధుడు ఇట్లా అన్నాడు.

విశేషం : యోగి పొందే ఆ ఆత్మదర్శనమే పరమాత్మదర్శనం. పరమాత్మనే ఉపనిషత్తులు బ్రహ్మ మన్నాయి. తైత్తిరీయోపనిషత్తు బ్రహ్మానందమని వివరించింది యోగులు పొందే ఆ ఆత్మానందతత్త్వాన్నే.

ఆ. అనఘ! ముంజగర్భ మగు నిషీకనిదర్శ । నంబు గాఁగఁ గనుఁగొనంగ వలయుఁ

దనువు ముంజ యాత్మ దదిషీక నిష్కర్ష । విధము సుమ్ము! యోగవిదుని వెరవు. 209

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పుణ్యాత్మా!; ముంజగర్భము+అగు= ముంజగడ్డిలోని; నిషీక= ముల్లును; నిదర్శనంబు+కాఁగన్= ఎట్లా చూస్తామో అట్లా; కనుఁగొనంగన్+వలయున్= అత్యంత సూక్ష్మమైన చూపుతో చూడాలి; తనువు= ఈ శరీరం; ముంజ= ముంజగడ్డి; ఆత్మ; యోగవిదుని= యోగసాధనలో పండిన వాడి; వెరవు= విధం; తద్= ఆ గడ్డిలోని; ఇషీక+నిష్కర్ష విధము సుమ్ము= ఒక్కొక్క పరకను వేరుపరచటంవంటిది సుమా!

తాత్పర్యం: పుణ్యాత్మా! ముంజగడ్డిలోని అతిసూక్ష్మమైన ముల్లును ఎట్లా చూస్తామో ఆత్మను అట్లాగే చూడాలి. యోగవిదులైనవారు దేహాన్ని ముంజగా, ఆత్మను అందులోని అతిసూక్ష్మమైన పరకలుగా వేరుచేస్తారు. ఇదే యోగంలో తలపండినవారి పద్ధతి

విశేషం : 'నీవార శూకవత్తన్వీ పీతాభాస్వత్యణూపమః' అనే మంత్రపుష్పభాగాన్ని మనం మామూలుగా చదువుతాం, నీవారమంటే వడ్లగింజ. శూక అంటే మొన. వడ్లగింజ మొనను చూడటం ఎంత సూక్ష్మమో ఆత్మ స్వరూపుడిని కనుగొనటమూ అంతే కష్టమని అర్థం. ముంజలోని పొరల విషయమూ ఇంతే. ముంజగడ్డితో మొలత్రాడు పేని. ఉపనయనసమయంలో బ్రహ్మచారికి కట్టుతారు. అతిసూక్ష్మమైన ముంజపరకలను వేరు చేయటంద్వారా ఒక 'సూక్ష్మగ్రాహిత'. బుద్ధికుశలత' ఏర్పడుతాయి. మనిషిలోకూడా అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలని పంచకోశాలను 'శారీరకులు' గుర్తిస్తారు. స్థూల, సూక్ష్మ, కారణ శరీరత్రయాన్ని వరుసగా విశ్వ, తైజస, ప్రజ్ఞానమని వ్యష్టిదశలోనూ, విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరులని సమష్టి దశలోనూ పిలుస్తారు. ముంజలోని పోలిక ఇట్లాంటిదే.

క. తనువువలన నిష్కర్షం । బొనర్చి జీవాత్ముఁ గాంచు యోగివరుం డ

య్యను వొదవి యట్లు దన్నుం । గనినప్పుడు జననమరణగతులం దొఱఁగున్. 210

ప్రతిపదార్థం: తనువువలనన్= శరీరంనుండి; నిష్కర్షంబు+ఒనర్చి= వేరుచేసి; జీవాత్మున్+కాంచు= జీవుడిని వేరుగా చూచే; యోగివరుండు= యోగిశ్రేష్ఠుడు; ఆ+అనువు+ఒదవి= అదే పద్ధతిని పాటించి; అట్లు= అట్లాగే; తన్నున్= తనలోని పరమాత్మను; కనినప్పుడు= చూచినప్పుడు; జననమరణ= చావు పుట్టుకలనే; గతులన్= స్థితులను; తొఱఁగున్= విడిచిపెడతాడు (తప్పించుకొంటాడు).

తాత్పర్యం: శరీరంనుండి జీవుడిని వేరుచేయటం నేర్చుకొన్న యోగి, సాధన పండగా అదే పద్ధతిలో తనలోని పరమాత్మనుకూడా చూడటం నేర్చుకొని, జననమరణ చక్రభ్రమణంనుండి బయటపడతాడు.

క. ముక్తుండు జరామరణ వి । యుక్తుండై హర్షశోకయోగ మెడలి స

ద్భక్తులకును నప్పద మీ । శక్తుండగుఁ జువ్వె బ్రహ్మచర్యము పేర్మిన్. 211

ప్రతిపదార్థం: ముక్తుండు= ఈ విధంగా జరామరణ భ్రమణం నుండీ ముక్తిని పొందిన యోగివర్యుడు; జరామరణ= ముసలితనం, చావు అనే బాధలనుండి; వియుక్తుండు+ఐ= బయటపడ్డవాడై; హర్షశోక యోగము+ఎడలి= సంతోషం, దుఃఖం అనే అనుభవాల కలయికను కోల్పోయి; బ్రహ్మచర్యము పేర్మిన్= బ్రహ్మచర్యశక్తితో; సత్+భక్తులకునున్= ఉత్తమ భక్తులకు; ఆ+పదము+ఈన్= ఆ పరమ పదాన్ని ప్రసాదించటానికి; శక్తుండు+అగున్+చువ్వె!= సమర్థుడు అవుతాడు సుమా!

తాత్పర్యం: ఈ విధంగా ముక్తుడైన యోగిశ్రేష్ఠుడు ముసలితనం, చావు మొదలైన బాధలనుండి బయటపడ్డవాడై సంతోషశోకాది భావాలు లేనివాడై, నిత్యబ్రహ్మచర్యపాలనచేత అబ్బిన అనుగ్రహశక్తితో ఉత్తమభక్తులకు ఆ పరమపదాన్ని ప్రసాదించటానికి సమర్థుడు అవుతాడు సుమా!

ఆ. ఒడలి యస్థిరత్వ మూహించి యాత్మయం। దధికనిష్ఠ గలుగు నతఁడు సకల
భూతకోటివలనఁ బొందఁడు భయము రా। గాది దుఃఖములకు నగపడండు 212

ప్రతిపదార్థం: ఒడలి= దేహంయొక్క; అస్థిరత్వము= అశాశ్వతత్త్వాన్ని; ఊహించి= గుర్తించి; ఆత్మయందున్= ఆత్మ విషయంలో; అధికనిష్ఠ+కలుగు+అతఁడు= మిక్కిలి శ్రద్ధకలిగిన యోగి; సకల భూతకోటివలనన్= సృష్టిలోని ఏ భూత సముదాయం నుండికాని; భయము; పొందఁడు; రాగ+ఆది= అనురాగదులవలన కలిగే; దుఃఖములకున్= శోకాది భావాలకు; అగపడండు= వశ పడడు.

తాత్పర్యం: ఈ శరీరం అశాశ్వతమని గుర్తించి, ఆత్మ విషయంలో గాఢమైన శ్రద్ధ కలిగి ఎవడు యోగసాధన చేస్తాడో అతడికి ఏ భూతంవలన భయం ఉండదు. ఏ అనురాగాదులవలన కలిగే దుఃఖమూ అతడు పొందడు.

విశేషం : ఆత్మ విషయంలో 'నిష్ఠ' కలిగి ఉండటమన్న విషయం యోగసాధనలో చాలా ప్రధానమైనది. దేహాభిమానం ఎవరికి పోతుందో వారే ఆత్మనిష్ఠులు కాగలుగుతారు. వారి సర్వకర్మలూ ఆత్మాభిముఖంగానే ప్రసరిస్తాయి. భయరాగద్వేషాదులు శరీర సంబంధులు కాబట్టి యోగి వాటినుండి విముక్తుడవుతాడని అర్థం.

క. విను యోగయుక్తునకు శ। స్త్రనిహతి జలబాధ యగ్నిదాహము మొదలై
చను నవ్వికారములు లే। వనఘ! యతఁడు గోరఁ డైంద్ర మగు పదమైనన్. 213

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్ముడా!; విను= బాగా వినుము; యోగయుక్తునకున్= యోగంతో కూడినవాడికి; శస్త్రనిహతి= ఆయుధాలచే దెబ్బతినటం; జలబాధ= నీటివలన బాధింపబడటం; అగ్నిదాహము= అగ్నివలన కాలటం; మొదలైచను+ఆ+వికారములు= మొదలైన అట్లాంటి పరిణామాలు; లేవు= ఉండవు; అతండు= అట్లాంటి యోగి; ఐంద్రము+అగు= ఇద్ర సంబంధమైన; పదము+ఐనన్= పదం అయినా; కోరడు= ఇష్టపడడు.

తాత్పర్యం: పుణ్యాత్మా! యోగి అయినవాడికి శస్త్రాలచేత కాని, నీటివలన కాని బాధ ఉండదు. అగ్ని అతడిని కాల్చటానికి సమర్థం కాదు. ఇట్లాంటి వికారాలులేని అతడు ఇంద్రపదవిని కూడా ఆశించడు.

విశేషం : ఆయుధాలకు దెబ్బతినటం, జలం తడపటం, అగ్ని దహించటం వంటి వాటిని శాస్త్రపరిభాషలో 'వికారాలు' అంటారు. ప్రకృతిసహజమైన కార్యాలను 'వికారాలు' అంటారన్నమాట. అది లేనివాడు కాబట్టి యోగిని 'నిర్వికారి' అంటారు. ఇంద్రపదవి అశాశ్వతమైనది కాబట్టి యోగి దానిని ఆశించడు.

క. తనయంద తన్ను లెస్సగఁ। గనుటం గడచిన సుఖంబు గలుగదు లోకం
బున నెందు దాని కయ్యెడు। వినుతానుష్ఠానమునకు విసువమి వలయున్. 214

ప్రతిపదార్థం: తనయందున్+ఆ= తనలోనే తన్నున్= తనను; లెస్సగన్= సమగ్రంగా; కనుటన్= చూడటంలో; కడచినన్= కాలం గడిస్తే; లోకంబునన్= లోకంలో; ఎందున్= ఎక్కడా; సుఖంబు+కలుగదు= సుఖం ఉండదు; దానికిన్+అయ్యెడు= దానికొరకు;

అయ్యేటటువంటి; వినుత= గొప్ప; అనుష్ఠానమునకున్= దీక్షకు; విసువమి= విసుగుపడకుండా ఉండటం; వలయున్= అవసరం.

తాత్పర్యం: తనలో తననే బాగా చూడడాన్ని మించిన సుఖం లోకంలో ఎక్కడా లేదు. దాని కొరకు (తనలో తన్ను) చూచుకోవడం కొరకు) కావలసిన పొగడదగిన నిష్ఠకు విసుగు చెందకుండా ఉండడం కూడా కావలెను.

వ. అయ్యనుష్ఠానం బెట్టిదనిన. 215

తాత్పర్యం: ఆ అనుష్ఠానం ఎట్లాంటిదంటే.- (తరువాతి పద్యంలో అన్వయం.)

క. తన యెఱిఁగిన తెరువున నె। మ్మన మంతర్వృత్తిఁ జేసి మఱి బాహ్యగతిన్
జన నీ కుండఁగ నది యెం। దనువునఁ బడు నిలుపవలయు నచ్చట దానిన్. 216

ప్రతిపదార్థం: తన+ఎఱిఁగిన= తనకు తెలిసిన; తెరువునన్= పద్ధతిలో; నెమ్మనమున్= తన నిండు మనస్సును; అంతర్వృత్తిన్+చేసి= లోపలికి మునుగజేసి; మఱి= ఇంక; బాహ్యగతిన్= బయటికి; చననీకుండఁగన్= వెళ్ళకుండా; అది= ఆ మనస్సు; ఎందున్+అనువునన్+పడున్= ఎక్కడ దారిలో పడుతుందో; అచ్చటన్= అక్కడ; దానిన్= దానిని; నిలుపవలయున్= నిలపాలి.

తాత్పర్యం: తనకు తెలిసిన మార్గంలో మనసును అంతర్ముఖం చేసి, ఇంక బయటికి పోనీయకుండా అది ఎక్కడ దారిలో పడుతుందో అక్కడే స్థిరంగా నిలపటం అభ్యసించాలి.

వ. అది యెట్లనిన. 217

తాత్పర్యం: అది ఎట్లాగంటే - (తరువాతి పద్యంతో అన్వయం)

తే. దంతములు జిహ్వ గుత్తుక తాలుతలము। కంఠనాళంబు హృదయంబు గణ్యచరిత!
మఱియు లోపల నెచటికి మనసు మెలఁగెఁ। దాఁ గదల్పక యచటన యాఁగ వలయు.' 218

ప్రతిపదార్థం: గణ్యచరిత!= ప్రసిద్ధచరిత్ర కలవాడా!; దంతములు= పళ్ళు; జిహ్వ= నాలుక; కుత్తుక= మెడ; తాలుతలము= దౌడ; కంఠనాళంబు= గొంతుక; హృదయంబు= ఎద; మఱియున్= ఇంకా; లోపలన్= లోపల; ఎచటికిన్= ఎక్కడికి; మనసు; మెలఁగెన్= వెళ్ళి ఆగుతుందో; అచటన్= అక్కడే (దానిని); తాన్= తాను; కదల్పక= కదల్చకుండా; ఆఁగవలయున్= నిలపాలి.

తాత్పర్యం: ప్రసిద్ధచరితుడా! దంతాలు, నాలుక, మెడ, దౌడ, గొంతుక, ఎద - ఇంకా లోపలికి ఎక్కడికి మనసు వెళ్ళి నిలుస్తుందో దానిని అక్కడే కదల్చకుండా ఆపాలి.'

వ. అని చెప్పెనని చెప్పి నాతో శిష్యుం డని మఱపునం బలికి తలంచికొని కొండొక విచారించి నవ్వుచు నవ్విప్రుండు నా మొగంబు సూచి 'యచ్యుతా! యా సిద్ధుం డనువాఁడ నేన కదా నీ యెఱుంగని యదియునుం గలదె? మఱియు నక్కాశ్యపనామధేయుం డడిగిన తెఱంగు దానికి నుత్తరంబు నా యిచ్చిన విధంబును విను' మని యిట్లనియె. 219

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; చెప్పెను+అని= సిద్ధుడు చెప్పాడని; చెప్పి; నాతోన్= నాతో; శిష్యుండు+అని= నీవు నా శిష్యుడివైతివని; మఱపునన్+పలికి= మరుపుతో అన్నవాడై; తలంచికొని= గుర్తుకు తెచ్చుకొని; కొండొక విచారించి= కొంతసేపు ఆలోచించి; నవ్వుచున్=

నవ్వుతూ; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; నామొగంబు+చూచి= నా ముఖం చూచి; అచ్యుతా!= కృష్ణా!; ఆ సిద్ధుండనువాఁడన్+నేను+ఆ కదా!= ఆ సిద్ధుడనబడేవాడను నేనే కదా!; నీ+ఎఱుంగని+అదియున్+కలదె?= నీకు తెలియనిది కూడా ఉన్నదా?; మఱియున్= ఇంకా; ఆ+కాశ్యప నామధేయుండు= ఆ కాశ్యపుడు అనే పేరుగల బ్రాహ్మణుడు; అడిగిన+తెఱంగు= అడిగిన విధం; దానికిన్+ఉత్తరంబు+నా యిచ్చిన+విధంబునున్= దానికి ఇచ్చిన సమాధానం తీరు; వినుము+అని= వినుమని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా సిద్ధుడు చెప్పాడని నాతో అని మరుపుతో నా 'శిష్యుడి'వి అని గుర్తుకు తెచ్చుకొని కొంతసేపు ఆలోచించి నవ్వుతూ ఆ బ్రాహ్మణుడు నా ముఖం చూచి 'కృష్ణా! ఆ సిద్ధుడను నేనే కదా! నీకు తెలియనిది ఏమున్నది? ఆ కాశ్యపుడు అడిగిన ప్రశ్న, నా సమాధానం చెప్పుతాను వినుము' అంటూ ఇట్లా అన్నాడు.

విశేషం : శ్రీకృష్ణుడికి తానే తత్త్వబోధ చేసినట్లు చెప్పటం బాగుండదని ఆ బ్రాహ్మణుడు 'సిద్ధుడి' కల్పన చేశాడు. కాని కృష్ణుడి సమీపంలో అసత్యం చెప్పటం కష్టం. అందుచేత 'సిద్ధుడి' 'శిష్య' డున్నాడేమో తెలియదు. బహుశా కృష్ణుడు గుర్తించి ఉంటాడు. అందుకే తన తప్పు తెలిసికొని, బ్రాహ్మణుడు ఆ సిద్ధుడిని నేనే అన్నాడు. ఇదంతా శ్రీకృష్ణుడి లీలలో భాగమే. అంతమాత్రమే కాదు. ఇదంతా చెప్పుతున్నవాడు కృష్ణుడే. అందుచేత ఈ పాత్రలన్నీ ఆయన కల్పించినవే. తానుకూడా జ్ఞానులను ఆశ్రయించి తెలిసికొంటా నన్న వినయసూత్రాన్ని అర్జునుడికి నేర్పటంకొరకు పరమాత్ముడు ఈ కల్పన మొత్తం చేసి ఉండాలి. చెప్పుతున్నవాడు బ్రాహ్మణుడే అయినా అవన్నీ శ్రీకృష్ణుడి వాక్యసంపదే. అందుకే దీనిని మొత్తం 'అనుగీత' అని కూడా పిలుస్తారు.

ఆ. 'కేలు మొగిచి వినయశాలి యమ్మేధావి। విశదకరుణఁ జెప్పవే మహాత్మ!

„ ¬╤°" ¶HÆ} „ ḣ} ` Ǫƒ ǻ † Ç I^¥ Ȩ¶HÆ ºH ^ ÑN=°x † ³. 220

ప్రతిపదార్థం: వినయశాలి= వినయవంతుడు; ఆ+మేధావి= ఆ ధీగుణ సంపన్నుడైన బ్రాహ్మణుడు; కేలు మొగిచి= చేతులు జోడించి; మహాత్మ!= ఓ మహాత్మా!; పరమ= ఉత్కృష్టమైన; మోక్షకరణ= మోక్షసాధనలో; పరిణతంబు+ఐన= పండిన; ఉదాత్త= గొప్పదైన; సూక్ష్మ= అతి సూక్ష్మమైన; సుకర= సులభమైన; ధర్మము= మార్గం; విశదకరుణన్= మిక్కిలి దయతో; చెప్పవే= బోధించవా!; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వినయవంతుడైన ఆ మేధావి చేతులు జోడించి 'మహాత్మా! ఉత్కృష్టమైన మోక్షసాధనలో సమర్థమైన. ఉత్కృష్టమైన సూక్ష్మసులభమార్గం ఏదో నాకు దయతో బోధించుము' అని అడిగాడు.

వ. అనిన 'నవహితుండవై యాకర్ణింపు'మని పలికి యిట్లంటి. 221

ప్రతిపదార్థం: అనినన్= అనగా; అవహితుండవు+ఐ= సావధానుడవై; ఆకర్ణింపుము+అని= వినుమని; పలికి= చెప్పి; ఇట్లు+అంటిన్.

తాత్పర్యం: అని అడుగగా ఏకాగ్రతతో వినుము అని చెప్పి ఇట్లా అన్నాడు.

ఆ. 'పాలకడవ పెక్కు పసులలో డించిన। యాతఁ డెట్లు దాని నరసికొనుచు

నుండు నట్లు లోన నునిచిన మనసు నే। మఱక యాత్మ వెదకు తెఱఁగు మేలు. 222

ప్రతిపదార్థం: పాలకడవ= పాలకుండ; పెక్కు పసులలోన్= అనేక పశువుల నడుమ; డించిన= ఉంచినపుడు; అతఁడు= ఆ గొల్లవాడు; ఎట్లు= ఏ విధంగా; దానిన్= ఆ కుండను (పశువులు త్రొక్కివేయకుండా); అరసికొనుచున్+ఉండున్= జాగ్రత్తగా చూచికొంటూ

ఉంటాడో (అట్లాగే); లోనన్= లోపల; ఉనిచిన= స్థిరంగా ఉంచిన; మనసున్= మనస్సును; ఏమరక= ఏమరకుండా; ఆత్మన్= ఆత్మను; గొల్లవాడివలె; వెదకు తెఱఁగు= జాగ్రత్తగా చూచికొనే పద్ధతి; మేలు= శ్రేష్ఠం.

తాత్పర్యం: పశువులమందలో ఒకచోట గొల్లడు పాలకుండను దించి తాను చుట్టూ తిరుగుతున్నా ధ్యాసను కుండమీద ఎట్లాఉంచుతాడో అట్లాగే విషయసుఖాలలో, దుఃఖాలలో జీవుడు భ్రమిస్తున్నా ఆత్మద్వారా లోన ఉంచిన మనసును జాగరూకంగా కాపాడుకొనటం ఉత్తమమార్గం.

విశేషం : అలం; ఉపమ. ఈ ఉపమానాన్నిబట్టి కృష్ణుడు గోవులు కాచాడు అనటానికి వెనుక ఉన్న తాత్త్వికభావం అర్థం చేసికొనవచ్చును. పశువులమంద అనియంత్రితమైన మనిషి ప్రవృత్తికి నిదర్శనం కాగా దానిని కాపాడుతూ వచ్చిన గోపాలకుడు ఆ ప్రవృత్తికి ఒక దారి చూపి 'పాలకుండ' (జ్ఞానాన్ని) భద్రపరచి ఇచ్చిన 'ఆత్మ' తత్త్వానికి సంకేత మవుతున్నాడు. పాలకుండను ఏ పశువైనా ఎప్పుడైనా త్రొక్కివేయవచ్చును. అట్లాగే విషయవాంఛాదులు మనసును పక్కదారి పట్టించవచ్చును. అందుకే ఈ పోలిక చాలా అర్థవంతమైనదీ. సహజమైనదీ కూడా.

క. **ఈ తెఱఁగున నుద్యుక్తుం। డై తెలి వొందిన మనంబు నతులవివేక**
ఖ్యాతి మరిగించి శశ్వ। ద్ద్యోతితమగు బ్రహ్మముం జతురయోగి గనున్. **223**

ప్రతిపదార్థం: ఈతెఱఁగునన్= ఈవిధంగా; చతుర యోగి నేర్పరియైన యోగీశ్వరుడు; ఉద్యుక్తుండు+ఐ= పూనుకొని; తెలివి+ఒందిన= జాగరూకమైన; మనంబున్= మనస్సును; అతుల= సాటిలేని; వివేక ఖ్యాతిన్= బుద్ధివైభవంతో; మరిగించి= అభ్యసింపచేసి; శశ్వత్= శాశ్వతంగా; ద్యోతితము+అగు= ప్రకాశించేటటువంటి; బ్రహ్మతత్త్వాన్ని; కనున్= చూస్తాడు (పొందుతాడు).

తాత్పర్యం: ఈ విధంగా నేర్పరితనమున్న యోగీశ్వరుడు పూనికతో జాగరూకమైన మనస్సును సాటిలేని బుద్ధివైభవసాహచర్యంతో శిక్షింపజేసి శాశ్వతంగా, ప్రకాశరూపంగా సాక్షాత్కరించే బ్రహ్మపదాన్ని సులభంగా పొందుతాడు.

విశేషం : బ్రహ్మపదప్రాప్తిలో రెండు ముఖ్యమైన దశలు ఇక్కడ చెప్పబడ్డాయి. తొలిదశ ముందటి పద్యంలోనే ప్రస్తావించాడు. విషయవాంఛలపాలు కాకుండా మనసును స్థిరీకరించటం. అట్లా స్థిరమైన చిత్తంలో 'జాగరూకత (మేల్కొన్న లక్షణం) ఏర్పడుతుంది; దానికి వివేకాన్ని తోడుచేయాలి. అంటే శాస్త్రాద్యవేక్షణవలన, సాధుసత్పురుషుల బోధలవలన సత్కర్మాచరణవలన కలిగే బుద్ధి వైభవం ఆ మనసుకు తోడైతే కలిగే సాత్త్వికజ్ఞానానికి బ్రహ్మపదప్రాప్తి సులభమని తాత్పర్యం.

తే. **అయ్యనాదితత్త్వ చక్షురాదికంబు। లైన యింద్రియములకు గ్రాహ్యంబు గాదు**
సకలమలనిరాసాజ్య ప్రసన్నతర మ। నఃప్రదీపంబు తద్దర్శనం బొనర్చు. **224**

ప్రతిపదార్థం: ఆ+అనాదితత్త్వము= మొదలు ఎరుగజాలని ఆ మహాతత్త్వం; చక్షుస్+ఆదికంబులైన= కన్నులు, చెవులు మొదలైన; ఇంద్రియములకున్= ఇంద్రియాలకు; గ్రాహ్యంబు కాదు= గ్రహించదగినది కాదు; సకల= అన్ని; మల= మలినాలనూ; నిరాస= నిరసించటమనే; ఆజ్య= నేయిచేత; ప్రసన్నతర= మిక్కిలి ప్రసన్నంగా చేయబడిన; మనస్+ప్రదీపంబు= మనస్సనే గొప్ప దీపం; తద్+దర్శనంబున్+ఒనర్చున్= ఆ దర్శనాన్ని; చేయించగలుతుంది.

తాత్పర్యం: ఆ ఆనాదితత్త్వం కన్నులు, చెవులు మొదలైన అవయవాలచేత చూడదగినది. వినదగినది కాదు. అన్ని మలినాలను

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క్షాళనం చేయట మనే నేతివలన మిక్కిలి మనోహరంగా వెలిగేటటువంటి ప్రశాంతమైన మనస్సు అనే గొప్పదీపం మాత్రమే ఆ బ్రహ్మపదాన్ని చూపగలుగుతుంది.అలంకారం - నిరాస+ఆస్య; మనఃప్రదీపంబు - రూపకం

క. కలయంగ నెల్ల యెడలం। దలలును లోచనములును బదంబులు హస్తం
బులునై యా తత్త్వం బు। జ్జ్వలభంగి వెలుంగ యోగవంతుఁడు గాంచున్. 225

ప్రతిపదార్థం: ఎల్ల+ఎడలన్= అన్నివైపులా; తలలును= తలలూ; లోచనములును= కళ్ళూ; పదంబులు= కాళ్ళూ; హస్తంబులున్+ఐ= చేతులు కలిగి; కలయంగన్= వ్యాపించి; ఆ+తత్త్వంబు= ఆ మహాతత్త్వం; ఉత్+జ్వల= మిక్కిలి మండుతున్న; భంగిన్= రీతిలో; వెలుంగన్= ప్రకాశిస్తుండగా; యోగవంతుఁడు= యోగం కలిగినవాడు; కాంచున్= చూస్తాడు.

తాత్పర్యం: అన్ని దిశలలోనూ తలలు, కళ్ళు, కాళ్ళు, చేతులు, కలిగి అంతటా వ్యాపించిన ఆ మహాతత్త్వం మిక్కిలిగా మండిపోతున్న కాంతిపుంజంవలె ప్రకాశిస్తుండగా దానిని మహాయోగి దర్శిస్తాడు.

విశేషం : పురుషసూక్తంలోనూ, భగవద్గీతలోను పురుషోత్తముడిని ఎట్లా వర్ణించారో ఇక్కడ కూడా అట్లాగే చెప్పటం గమనించవచ్చును. 'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్' అని పురుషసూక్తం ఆ పురుషుడిని వర్ణించినది. వేయితలలు, వేయి కన్నులు, వేయి కాళ్ళు అనంతత్వ సంకేతం. 'అనేక బాహూదరవక్త్రనేత్రు' డని భగవద్గీత వర్ణించింది. అతడికి పెక్కు చేతులు, కడుపులు, నోళ్ళు, కళ్ళు ఉన్నాయట. 'నాంతం, న మధ్యం, న పునస్తవాదిం' (నీకు అంతము, మధ్యము, అది లేదు. అందుకే 'దిశలు తోచటం' లేదు అని అర్జునుడు ఆ విరాట్పురుషుడిని చూచి ఆక్రందిస్తాడు' సర్వతోనంతరూపమ్ అని వర్ణించినట్లుగా ఆయన అనంతరూపుడు. దానినే 'ఎల్లయెడలన్' అని తిక్కనగారు చాలా సొగసైన తెలుగులో వర్ణించాడు.)

క. తను వేర్పరించి కేవల। మును శాంతము నైన తత్త్వమును సంతతమున్
గనుచున్నఁ దన్ను నెఱుఁగం। గనుఁజీఁకటిఁ బాపు వెలుఁగు గలుగుం బుత్రా! 226

ప్రతిపదార్థం: పుత్రా!= ఓ కుమారా! (శిష్యవాత్సల్యంతో పిలిచే పిలుపు); తనువు= శరీరం; ఏర్పరించి= వేరు చేసి; కేవలమును= ఏకైకమూ; శాంతమును+ఐన= శాంత స్వరూపమైన; తత్త్వమును= తత్త్వాన్ని; సంతతమున్= ఎల్లప్పుడూ; కనుచున్+ఉన్నన్= చూస్తుంటే; తన్నున్= తనను; ఎఱుఁగన్+కనున్= తాను చూచికొనటానికి (తెలిసికొనటానికి) సాధ్యమవుతుంది; చీఁకటికిన్+పాపున్= చీకటిని పోగొట్టుతుంది; వెలుఁగు+కలుగున్= ఆ పరమకాంతి నిధానం సంప్రాప్తిస్తుంది.

తాత్పర్యం: నాయనా! శరీరాన్ని వేరుచేసి; ఏకైకమూ శాంతస్వరూపమూ అయిన ఆ పరమతత్త్వాన్ని నిరంతరం దర్శించే యోగి క్రమంగా ఆత్మదర్శనం చేయగలుగుతాడు. లోని తమస్సు అణగుతుంది. పరమకాంతి నిధానం సంప్రాప్తిస్తుంది.

విశేషం : శ్రీమన్నారాయణుడు 'శాంతాకారు'డట. శాంతమే అతడి స్వరూపం. తక్కిన ఎనిమిది రసాలలో లౌకికస్పర్శ ఉంది. కాని 'శాంత' రసంలో దివ్యత్వం ఉంది. మహాభారతంలో ప్రధానం ఈ శాంతరస నిరూపణమే. అది కేవలము' ఏకైకం, అద్వితీయం. అక్కడ ద్వంద్వభావరాహిత్యం ఉండటంవలన ఏకం. అనంతం అనే స్ఫూర్తి ఉంది. అందుకే మోక్షాన్ని 'కైవల్యం' అని అంటారు. 'శాంత' మంటే మోక్షపదానుభవం అని తాత్పర్యం.

వ. బ్రహ్మవిద్యారహస్యంబు సర్వంబు నీకుం జెప్పితి; నీ వింక సుఖివి గమ్ము; నేనుం బోయెద' నని యామంత్రణంబు సేసిన నపాస్తసంశయుం డయి యా శిష్యుం డరిగె; నిట నిన్ను దర్శింప వచ్చితి' నని పలికి యమ్మహాద్విజుం డంతర్హితుండయ్యెఁ; బరమహితంబైన యా వాక్యసంతానంబు సమవధానంబున వినంబడియెనే పాండవ

మధ్యమా! నాఁడు రథస్థుండ వయిన నిన్ను నేతదీయంబైన యర్థజాతంబు వినిపించితి' నని నప్పురుషవరుతోడం బురుపోత్తముండు వెండియు నిట్లనియె. **227**

ప్రతిపదార్థం: బ్రహ్మవిద్యారహస్యంబు= బ్రహ్మవిద్యలోని రహస్యాన్ని; సర్వంబు= అంతటినీ; నీకున్+చెప్పితిన్= నీకు చెప్పాను; నీవు+ఇంకన్= నీవు ఇంక; సుఖివి+కమ్ము= సుఖంగా ఉండుము; పొమ్ము= వెళ్ళిరమ్ము; నేనున్+పోయెదను+అని= నేనూ వెడుతున్నానని; ఆమంత్రణంబు+చేసినన్= వీడ్కోలు చెప్పగా; ఆ శిష్యుండు= ఆ కాశ్యపుడు; అపాస్త= పోయిన; సంశయుండు+అయి= సందేహాలు కలవాడై; అరిగెన్= వెళ్ళిపోయాడు; ఇట= ఇక్కడ; నిన్నున్= నిన్ను; దర్శింపన్= దర్శించుకొనటానికి; వచ్చితిన్= వచ్చాను; అని; పలికి; ఆ+మహాద్విజుండు= ఆ గొప్ప బ్రాహ్మణుడు; అంతర్హితుండు+అయ్యెన్= మాయమైపోయాడు; పరమ= మిక్కిలి; హితంబు+ఐన= మేలును కలిగించే; ఈ వాక్యసంతానంబు= ఈ వాక్యసమూహం; సమవధానంబునన్= మిక్కిలి అవధానంతో; వినంబడియెనే!= విన్నావా?; పాండవ మధ్యమా!= ఓ అర్జునా!; నాఁడు= ఆ రోజు; రథస్థుండవు+అయిన= రథం మీద నిలిచిన; నిన్నున్= నిన్ను గురించి; ఏతదీయంబైన= ఈ బ్రహ్మపదప్రాప్తికి సంబంధించిన; అర్థజాతంబు= అర్థసముదాయం, వినిపించితిన్= వినిపించాను; అని= అని చెప్పి; ఆ+పురుషవరుతోడన్= ఆ పురుషశ్రేష్ఠుడితో; పురుషోత్తముడు= శ్రీకృష్ణుడు; వెండియున్= మళ్ళీ; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: బ్రహ్మవిద్యలోని రహస్యాన్ని అంతటినీ నీకు చెప్పాను. నీవు ఇక సుఖంగా ఉండుము. పోయిరమ్ము. నేనూ వెళ్ళుతున్నాను' అని వీడ్కోలు చెప్పగా ఆ శిష్యుడు తన సందేహాలన్నీ తీరగా వెళ్ళిపోయాడు. ఆ తరువాత నిన్ను దర్శించుకొనటానికి నేను ఇక్కడికి వచ్చాను' అని పలికి, ఆ బ్రాహ్మణుడు మాయమైపోయాడు. ఓ అర్జునా! పరమహితాన్ని కలిగించే ఈ వాక్యసముదాయాన్ని ఏకాగ్రచిత్తంతో విన్నావా! ఆనాడు యుద్ధభూమిలో రథంమీద నిలిచి, విషాదంతో ఉన్న నీకు ఆ బ్రహ్మపదసంప్రాప్తిని గురించిన ఈ విషయాలన్నిటినీ వినిపిచాను. గుర్తున్నదా!' అని కృష్ణుడు చెప్పి, మరలా అర్జునుడితో ఇట్లా అన్నాడు.

సీ. **వ్యామిశ్రమతి యగు నతనికి నకృతాత్ము। డైనవానికి నవధానరహిత**
చేతస్కునకు నిది సెప్పఁగాదే! దొల్లి। దెలియంగఁ జెప్పితి దేవతలకు
గాండివి నీవు దక్కఁగ నిది మర్త్యు లా। కర్ణింపఁ దగువారు గలరె యొరులు?
పరమరహస్య మీ పరిపాటి దీన న। య్యమృతవస్తువు గని యఖిలదుఃఖ

ఆ. **ములుఁ దొఱంగి నిత్యముక్తత వెలుఁ గొందు। నరుఁడు వైశ్యులైన నాతులైన**
శూద్రులైనఁ గంధ్రు సువ్వె యిమ్మెయి ముక్తి। బ్రాఁతె బ్రాహ్మణులకు రాజులకును? **228**

ప్రతిపదార్థం: వ్యామిశ్రమతి+అగునతనికిన్= అస్థిరమైన మనస్సు కలవానికి (అనేకాలైన ఆలోచనలవలన ఏర్పడ్డ అస్థిరత్వం కలవాడని అర్థం); అకృత+ఆత్ముఁడు+ఐన వానికిన్= ఆత్మవిద్యాపరిశ్రమ లేనివాడికి; అవధానరహిత= అవధానంలేని; చేతస్కునకున్= చిత్తమున్నవాడికి; ఇది= ఈ బ్రహ్మవిద్య; చెప్పన్+కాదే!= చెప్పరాదు సుమా!; తొల్లి= మునుపు; దేవతలకున్= దేవతలకు; తెలియంగన్+చెప్పితిన్= వివరంగా చెప్పాను; గాండివి= గాండీవాన్ని ధరించిన మహాధనుర్వేత్త అయిన; నీవు తక్కగన్= నీవు తప్ప; ఇది= ఈ విద్యను; ఆకర్ణింపన్+తగువారు= వినదగినవారు; ఒరులు= ఇతరులు; మర్త్యులు+కలరె?; మానవులున్నారా?; ఈ పరిపాటి= ఈ బ్రహ్మవిద్యాక్రమం; పరమ రహస్యము= మిక్కిలి గుప్తమైనది; దీనన్= దీనిచేత; నరుఁడు= మనిషి; ఆ+అమృతవస్తువున్+కని= ఆ అమృతవస్తువును దర్శించి; అఖిల= అన్ని; దుఃఖములున్+తొఱంగి= దుఃఖాలు పోగొట్టుకొని; నిత్యముక్తతన్= నిత్యముక్తస్థితిలో; వెలుఁగు+ఒందున్= ప్రకాశిస్తాడు; వైశ్యులు+ఐనన్= వైశ్యులు అయినా; నాతులు+ఐనన్= స్త్రీలైనా; శూద్రులు+ఐనన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

శూద్రులైనా; ఈ+మెయిన్= ఈ క్రమంలో; ముక్తిన్= ముక్తిని; కంద్రు= పొందుతారు; చువ్వె!= సుమా!; (ఇక); బ్రాహ్మణులకున్; రాజులకును= క్షత్రియులకూ; బ్రాఁతె?= దుర్లభమా?

తాత్పర్యం: అస్థిరచిత్తుడికి, ఆత్మవిద్యాపరిశ్రమలేనివాడికి, ఏకగ్రత లేనివాడికి ఈ బ్రహ్మవిద్యను బోధించరాదు సుమా! నేను మునుపు దేవతలకు ఈ విద్యను బోధించాను. మానవులలో ధనుర్విద్యానిపుణుడవు కాబట్టి నీవు తప్ప మనుషులెవ్వరూ ఈ విద్యను నానుండి వినదగ్గవా రెవరూ లేరు. ఈ బ్రహ్మవిద్యాక్రమం చాలా రహస్యమైనది. దీనివలన మానవుడు ఆ అమృతవస్తువును దర్శించి అన్ని దుఃఖాలూ పోగొట్టుకొని నిత్యముక్తుడుగా ప్రకాశిస్తాడు. వైశ్యశూద్రులైనా, స్త్రీలైనా ఈ విద్యానుష్ఠానంతో ముక్తిని పొందగలరంటే ఇక బ్రాహ్మణులకు, రాజులకు ఈ స్థితి దుర్లభమవుతుందా?

విశేషం : ధనుర్విద్యారహస్యం 'గురి'ని ఛేదించటం. దీనివలన లక్ష్యశుద్ధి కలుగుతుంది. అందుకే బ్రహ్మవిద్యకూడా ఒక ధనుర్విద్యవంటిదే అని ఉపనిషత్తులు చెప్తుతాయి. అందుకే 'నరుడు' ఒక్కడే గీతకు శ్రోత అయ్యాడు. అతడికే విషాదమూ కలిగింది. అతడికే పాపభీతి పుట్టింది. అతనే చివరికి మహాయుద్ధం చేశాడు. విజయుడయ్యాడు కూడా! ఈనాడు 'అనుగీత'కు శ్రోత కూడా ఆయనే. అందుకే ధర్మరాజుకు బోధించని గీతారహస్యాన్ని శ్రీకృష్ణుడు అర్జునుడికే బోధించాడు.

వేదవిద్యకు స్త్రీవైశ్య శూద్రులు ఒకప్పుడు బాహ్యులు. అయినా వారికి కూడా బ్రహ్మపదసంప్రాప్తి మాత్రం నిషిద్ధం కాదు. అందుకే ఇది 'యోగ' విద్యగా చెప్పబడినది. యాగం కర్మవిద్య. దానికి దూరులైనవారు కూడా బ్రహ్మత్వసిద్ధికి అర్హులే. స్థిరచిత్తం. ఆత్మవిద్యాపరిశ్రమ, మనోనిగ్రహాది సాధన, ఇంద్రియజయం, అవధానచిత్తం, వ్రతపరిరక్షణబుద్ధి కలిగిన ఎవరైనా బ్రహ్మపద సంప్రాప్తికి అర్హులేనని అర్థం. బ్రాహ్మణులు, రాజులు నిత్యజీవిత కార్యకలాపాలద్వారానే మొదటి మెట్టులోకి ప్రవేశించగలరు. కాబట్టి వారికి ఈ విద్య సుసాధ్యమని చెప్పటం మహర్షి వాక్యానికి అర్థం.

అర్యుడైనా అనార్యమైన దుఃఖాది భావాలలోకి వెళ్ళిపోతూ ఉంటాడు కాబట్టి భగవద్గీతలోనూ, ఇక్కడా ద్వంద్వ స్థితులను దాటటంద్వారా కలిగే చిత్తస్థైర్యాన్ని ప్రధానగుణంగా చెప్పటం కనిపిస్తుంది.

క. వినిపించితి నిను బోధం। బునకు నుపాయంబ ఫలసముదయము మోక్షం

బును సౌఖ్యనిర్ణయము ని। క్కనుట గడవ సుఖము లొండు గలవే యరయన్? 229

ప్రతిపదార్థం: నినున్= నిన్ను గురించి (నీకు); బోధంబునకున్= బ్రహ్మబోధకు; ఉపాయంబు= పద్ధతి; ఫలసముదయము= దాని ఫలితాలు; మోక్షంబును= విముక్తి; సౌఖ్యనిర్ణయమున్= ఆ సుఖస్వరూపం; వినిపించితిన్= వినిపించాను; ఈ+కనుటన్+కడవన్= ఈ బ్రహ్మపద దర్శనం విడిచి (అతిశయించి); అరయన్= బాగా చూడగా; ఒండు సుఖములు= మరి ఇతర సుఖాలు; కలవే?= ఉన్నాయా?

తాత్పర్యం: అర్జునా! నీకు ఇంతవరకు బ్రహ్మబోధకు సంబంధించిన క్రమం, దానిఫలం, విముక్తి ఆ సుఖస్వరూపం ఇవన్నీ చెప్పాను. ఈ బ్రహ్మపదసందర్శనంకంటె మరొక సుఖం ఏదైనా ఉందా!

విశేషం : ఇక్కడ సుఖమంటే ఆనందమని అర్థం. బ్రహ్మపదసుఖమే బ్రహ్మానందమని అర్థం. 'బ్రహ్మానందం పరమసుఖదం' అని స్తుతి. ఆ ఆనందం పరమసుఖాన్ని ఇస్తుందట. అందుకే మానుషానంద, రాజానందాదులు ఆ బ్రహ్మానందం ముందు ఏ మాత్రం కొరగానివి అవి తైత్తిరీయం సిద్ధాంతం చేసింది. (చూ॥ ఆనందవల్లి).

ఈ సుఖం వ్యసనకారకం కాదు. బంధం కలిగించదు. దాని లక్షణం విముక్తి. దాని గుణం ప్రకాశం.

ఆ. శ్రద్ధ గలిగి లోకసంగ్రహ సంగంబు। నీడ విడిచి యెవ్వఁ డీ యుపాయ

ముల భజించు వాఁడు మోక్షలక్ష్మి కిఁ బతి। యగు నొకింత సందియంబు వలదు. 230

ప్రతిపదార్థం: శ్రద్ధ కలిగి= శ్రద్ధతో కూడినవాడై; లోక సంగ్రహ= లోకాన్ని అవలంబించటంచేత కలిగిన; సంగంబున్= కలయికను; ఈడన్+విడిచి= సంపూర్ణంగా పరిత్యజించి; ఎవ్వఁడు= ఏ యోగి; ఈ ఉపాయములన్= ఈ మార్గాలతో; భజించున్+వాఁడు= మోక్ష సంపదను ఉపాసిస్తాడో అతడు; మోక్షలక్ష్మికిన్= మోక్షరూపయైన శ్రీదేవికి; పతి+అగున్= భర్త అవుతాడు; ఒక+ఇంత= కొంచెం కూడా; సందియంబు= సందేహం; వలదు= అక్కరలేదు.

తాత్పర్యం: ఎవడు శ్రద్ధాళువై ఈ లోకబంధంచేత పట్టిన మమతానుబంధాలను సంపూర్ణంగా దిగవిడిచి, ఇంతవరకు బోధించిన మార్గాలలో మోక్షపదవిని గురించి ఉపాసిస్తాడో అతడు మోక్షలక్ష్మిని వరిస్తాడు. ఈ విషయంలో కొంచెం కూడా సందేహం అక్కరలేదు. మోక్షలక్ష్మికిఁ బతియగు- అలంకారం రూపకం.

క. చెప్పం గలయది యెల్లను। జెప్పితి; నీ కింత గడవఁ జెప్ప నొకఁడు లేఁ
డిప్పాట నెలల నాఱిటఁ। జొప్పడు యోగంబు నియతి శుద్ధాత్మునకున్.' 231

ప్రతిపదార్థం: చెప్పన్+కల+అది= చెప్పగలిగినది; ఎల్లనున్= అంతా; చెప్పితిన్= చెప్పాను; నీకున్+ఇంతన్+కడవన్= నీకు ఇంతకుమించి; చెప్పన్= చెప్పటానికి; ఒకఁడున్+లేఁడు= ఏదీ లేదు; శుద్ధాత్మునకున్= పరిశుద్ధమైన ఆత్మగలవాడికి; ఈ+పాటన్= ఈ పద్ధతిలో; నియతిన్= నియమంతో పాలిస్తే; యోగంబు= యోగం; నెలలన్+ఆఱిటన్= ఆరు నెలలలో; చొప్పడున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: చెప్పగలిగినదంతా చెప్పాను. ఇంతకుమించి దీనిని గురించి చెప్పగలవారెవ్వరూ లేరు. నియమపాలన గల శుద్ధాత్ముడికి ఈ పద్ధతిలో ఆరునెలలలోనే సంపూర్ణయోగం సిద్ధిస్తుంది.'

వ. అని యిట్లు కృష్ణుండు జిష్ణునకు నధ్యాత్మవిషయంబులగు వాక్యంబులు సెప్పె నని చెప్పిన విని యన్నర నారాయణులు మఱియు నెవ్విధంబున వర్తించి రని యడుగుటయు. 232

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా, కృష్ణుండు= శ్రీకృష్ణుడు; జిష్ణునకున్= నరుడికి; అధ్యాత్మ విషయంబులగు వాక్యంబులు= వేదాంత సంబంధంగల వాక్యాలను; చెప్పెనని= చెప్పాడని; చెప్పినన్ విని= చెప్పగా విని; ఆ+నరనారాయణులు= ఆ కృష్ణార్జునులు; మఱియున్= ఇంకా; ఏ+విధంబునన్= ఏ తీరుగా; వర్తించిరి?= కాలం గడిపారు?; అని; అడుగుటయున్= జనమేజయుడు అడుగగా.

తాత్పర్యం: ఇట్లా శ్రీకృష్ణుడు అర్జునుడికి బ్రహ్మవిద్యాసంబంధాలైన మహావాక్యాలు వినిపించాడని చెప్పగా విని జనమేజయుడు 'ఆ తరువాత కృష్ణార్జునులు ఏమేమి చేశారు తెలుపుము' అని అడుగగా- తరువాతి ఆశ్వాసంలోనికి అన్వయం.

అశ్వాసాంతము

చ. గుణసమతానుభూతిహృతికోవిదసారవివేకభావ్య! చా
రణ సురసిద్ధసాధ్యఖచర ప్రముఖాఖిల భూతసేవ్య! వీ
క్షణకలనా కృతార్థమునిసార్థ బహుస్తుతివాక్యరత్నభూ
షణ! మహనీయ ఖేలన! నిసర్గకృపాకృత లోకపాలనా! 233

ప్రతిపదార్థం: గుణసమతా+అనుభూతి= సత్త్వరజస్తమోగుణాల ప్రకృతిస్థితియొక్క; హృతి= హరించటంలో; కోవిద= పండితులైనవారి; సార= సారభూతమైన; వివేక= వివేకంచేత; భావ్య!= భావింపదగినవాడా!; చారణ= గంధర్వులు; సుర= దేవతలు; సిద్ధ= సిద్ధులు; సాధ్య= సాధ్యులు; ఖచర= ఆకాశసంచారులు; ప్రముఖ= మొదలైన; అఖిల= అన్ని; భూత భూతాలచేత; సేవ్య= సేవింపబడేవాడా!; వీక్షణకలనా= కటాక్షప్రసారమాత్రంచేత; కృతార్థ= ధన్యులైన; మునిసార్థ= ముని సముదాయంయొక్క; బహుస్తుతివాక్య= అనేక

స్తుతివాక్యాలనేటటువంటి; రత్నభూషణ= మణుల అలంకారం కలిగినవాడా!; మహనీయఖేలన!= పూజనీయమైన విహారం కలిగినవాడా!; నిసర్గ= సహజమైన; కృపాకృత= దయతో నిర్వహించబడిన; లోకపాలనా= విశ్వసంరక్షణకార్యం కలవాడా!

తాత్పర్యం: సత్త్వరజస్తమోగుణాల సహజానుభవాన్ని పరిహరించటంలో సమర్థులైన ధీరుల సారవివేకంచేత భావింపదగినవాడవు నీవు. గంధర్వులు, దేవతలు, ఆకాశసంచారులు మొదలైన అన్ని ప్రాణులు నిన్ను సేవిస్తుంటాయి. నీ కటాక్షమాత్రంచేత ధన్యులైన మునిసముదాయం చేసే స్తోత్రాలనే అనేకరత్నాలతో పొదిగిన అలంకారం కలిగినవాడవు నీవు. నీ విహారం చాలా పూజనీయమైనది. ఈ విశ్వసంరక్షణకార్యాన్ని నీకున్న సహజమైన కృపతో నిర్వహిస్తున్న దేవదేవుడవైన ఓ హరిహరనాథా! నీకు నమస్కారం.

విశేషం : ప్రకృతి గుణాలు సత్త్వరజస్తమస్సులు. వీటి సముదాయ స్థితినే 'మాయ' అని అంటారు. వీటి 'సమత' అంటే సహజస్థితి అనే అర్థం. దీని లక్షణమే 'అహంకృతి', ఇంద్రియాదుల మోహధర్మం. దీనితో జీవుడు అనుభవిస్తున్నదే ఈ అజ్ఞానమయమైన లోకసుఖదుః ఖాది భావసముదాయం. దీనిని పోగొట్టుకొనటమే 'యోగ' సాధనఫలితం. వారు 'వివేకం' తో దీనిని సాధిస్తారు.

'భూతా'లని ప్రాణులకు సాధారణ నామం. హరిహరనాథస్వామి త్రిలోకసేవ్యుడని అర్థం. చారణులు, గంధర్వులు దేవనాయకులు. సురలని ఇంద్రాదులకు పేరు. సాధ్యులు అని పంద్రెండుగురు. వీరు దేవగణంలోని వారే. మన, మంత ప్రాణ, భర, ఆపాన, నిర్యవత్, నిర్మయ, నరక, దంశ, నారాయణ, వృష, ప్రభు లనివారి పేర్లు, ఇంకా ఆకాశంలో తిరిగే దేవయోనులు కొందరున్నారు. వారిని ఖచరులంటారు. సిద్ధులు- చంద్రలోకం దిగువ నివసించే విశ్వవసు ప్రభృతులు. వీరందరూ నిరంతరం దేవసేనాధురంధరులు.

ముని సార్థమంటే - మహర్షి సముదాయాలు; సప్తమహర్షులు మొదలైనవారు చేసిన స్తుతులే స్వామికి ఆభరణాలని అర్థం. అంటే వారి స్తుతులచేత స్వామి మహనీయత్వం ఇనుమడించినదని భావం.

స్వామికి లోకపాలన ఒక 'క్రీడ', దుష్టశిక్షణ శిష్టరక్షణ ఆ ఆటలోని ప్రధాన అంశాలు. సత్యధర్మసంరక్షణలే దాని ప్రయోజనం. ఈ నిర్వహణకు హేతువు స్వామివారికున్న అపారకృప. వైష్ణవ భక్తులు స్వామి 'కృపా' ధర్మం ఆధారంగా 'ప్రపత్తి' యోగాన్ని ప్రతిపాదించారు. స్వామి లోకాన్ని సంరక్షించటంలో ఆయనకు ఏ స్వార్థమూలేదు. అంతా పరార్థమే. అంతా ఆయన సహజ దానదయాధర్మకర్మమే. అందుకే ఈ పర్వంలో స్వామి అర్జునుడిపై 'కృప' వహించి మరలా గీతార్థాన్ని బోధించాడు. యజ్ఞదీక్షను అనుగ్రహించి, పాండవులను సముద్ధరించాడు. వారికి ఆముష్మికచింత కలిగించి, జ్ఞానులుగా మార్చాడు. స్తుతివాక్యరత్న-అనుచో రూపకాలంకారం

క. నవ్యత్వ పురాణత్వ ద। శావ్యపనయదుర్నిరూప సౌందర్యా! వే
దవ్యాసవాక్ప్రకాశిత!। దివ్యధురాధుర్య! యోగిధీసత్కార్యా! 234

ప్రతిపదార్థం: నవ్యత్వ= కొత్తదనం; పురాణత్వ= ప్రాచీనత్వం అనే ఈ రెండు; దశావ్యపనయ= దశలు తొలగిపోవటంచేత; దుర్నిరూప= నిరూపించటానికి సాధ్యంకాని; సౌందర్యా!= అందం కలిగినవాడా!; వేదవ్యాస= వేదవ్యాస మహర్షియొక్క; వాక్= వాక్కులచేత; ప్రకాశిత!= ప్రకాశింపచేయబడినవాడా!; దివ్య= ఉత్తమమైన; ధురాధుర్య!= భారాన్ని వహించేవాడా!; యోగి= కపిలాది మహామునుల; ధీ= ప్రజ్ఞా విశేషంచేత; సత్కార్యా!= సత్కరింపబడేవాడా!

తాత్పర్యం: స్వామీ! క్రొత్తపాతదనాలు రెండూ లేనివాడిని కావటంచేత నీ సౌందర్యం ఇదమిత్థమని నిర్ణయించటం కష్టం. వ్యాసమహర్షి రచనలచేత నీ ప్రకాశం ఉద్దీప్తమైనది. సకలభువనరక్షణ కార్యాన్ని నిర్వహించే నీవు ప్రసిద్ధులైన కపిలాది మహర్షుల ప్రజ్ఞావిశేషంచేత సత్కరింపబడేవాడవు. నీకు నమస్కారం.

విశేషం : పరమేశ్వరుడు కాలస్వరూపుడు. కనుక వ్యావహారికమైన భూతభవిష్యద్వర్తమాన విభాగం ఆయనకు వర్తించదు. కాబట్టి ఆ కాంతిరూపానికి క్రొత్తపాతలు లేవు. ఆ కారణంవలననే ఆయన రూపం దుర్నిరీక్ష్యం (చూడసాధ్యం కానిది). కనుక నిరూపణకు

అసాధ్యమైనది. మరి పురాణాలు 'శతకోటి మన్మథాకారు' డనటంలో ఉద్దేశం. ఆ సౌందర్యం వ్యామోహజనకం కాదని. ఆ అర్థంలోనే మన్మథుడి 'తండ్రి' అనటం కూడా.

వ్యాసమహర్షి వేదవిభాగజ్ఞుడు. కనుక వేదవాక్కులు, బ్రహ్మసూత్రాలు, అష్టాదశపురాణాలు ఇత్యాదులచేత ఏ బ్రహ్మతత్త్వ నిరూపణం జరిగిందో ఆదంతా వ్యాసవాక్యసముదాయమే. కనుక వ్యాసవాక్కు స్వామిని ప్రకాశింపజేసినదనటం.

స్వామి భరిస్తున్నది మానుషమైన భారంకాదు. అది దివ్యభారం. భువననిర్వహణ రూపమైన ధర్మసంరక్షణ దివ్యకార్యం. కాబట్టి దివ్యభారమని అనటం.

యోగులు తమ ధీవిలాసంచేత ఎవరిని గుర్తించి సేవించారో ఆ బ్రహ్మపదం యోగులచేత సత్కరించబడింది. అందుకే గీతను బోధించిన శ్రీకృష్ణుడిని యోగేశ్వరుడని అన్నారు.

మాలిని.

భువనభవన దీపస్ఫూర్తి తేజోవిలాసా!
సవితృశశిమయత్వ స్ఫారచక్షుర్వికాసా!
వివిధనిగమవిద్యావేద్యసూక్ష్మ ప్రభాసా!
పవనవిజయలీలాప్రౌఢ చేతోవిలాసా! **235**

ప్రతిపదార్థం: భువన= సప్త సప్త భవనాలనేటటువంటి; భవన= ఇంటికి; దీపస్ఫూర్తి; దీపమనిపించే; తేజోవిలాసా!= కాంతిప్రకాశం కలిగినవాడా!; సవితృ= సూర్య; శశిమయత్వ= చంద్రమయమైన; స్ఫార= విస్తారమైన; చక్షుర్వికాసా!= దృష్టివికాసం కలవాడా!; వివిధ= బహువిధాలైన; నిగమవిద్యావేద్య= వేదవిద్యచేత తెలియదగిన; సూక్ష్మప్రభాసా!= అతి సూక్ష్మమైన తేజోరూపం కలిగినవాడా!; పవన విజయ= గాలిని నిరోధించటంచేత (యోగవిద్యాభ్యాసంచేత); లీలాప్రౌఢ= మహత్త్వాన్ని సాధించిన ప్రౌఢులైన యోగుల; చేతస్+విలాసా!= హృదయాలలో విహరించేవాడా!

తాత్పర్యం: చతుర్దశభువనాలనే భవనాన్ని నీ దీప్తిచేత ప్రకాశింపచేస్తున్నావు నీవు. సూర్యచంద్రులను నేత్రాలుగా కలిగి, ఈ సర్వసృష్టిని వీక్షిస్తావు నీవు. నీ తేజోవిలాసం వేదవిద్యారూపమైన జ్ఞానచక్షువుచేత మాత్రమే దర్శింపదగినది. ప్రాణాయామాది యోగసాధనలచేత ప్రౌఢులైన యోగుల హృదయాలలో నీవు సదా విహరిస్తుంటావు. అట్లాంటి నీకు నమస్కారం.

విశేషం : భూలోక భువర్లోకాది సప్త ఊర్ధ్వ లోకాలు, అతల, సుతల, వితలాది సప్త అధోలోకాలు - ఈ రెండు ఏళ్ళు కలిసి చతుర్దశ భువనాలు (2X7=14) అవుతాయి. ఈ లోకాలకు ఉన్న ఒకే మహాకాంతిపుంజం హరిహరనాథస్వామిదే.

విరాట్ పురుషుడి వర్ణనలో చెప్పినట్టు సూర్యచంద్రులు స్వామి నయనాలు. అంటే రాత్రింబవళ్ళులో నిరంతరం స్వామి వారి వీక్షణ లోకంమీద ఉన్నదని తాత్పర్యం. భువనభవనదీప-అలంకారం రూపకం.

చతుర్వేదాలని సాధారణనామం ఉన్నా వేదాలు అనంతాలని తైత్తిరీయం చెప్తున్నది. (అనంతావై వేదాః)

"ఏక శతమధ్వర్యుశాఖాః । నవధాఽథర్వణో వేదః,
సహస్రధా సామవర్త్మా । ఏకవింశతిధా బాహ్వృచం."

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అని పతంజలి మహర్షి మహాభాష్యంలో చెప్పటాన్ని గమనిస్తే ఎన్నో శాఖలు వేదవాఙ్మయంలో ఉన్నట్లు తెలుస్తుంది.

'పవన విజయం' అంటే 'గాలిని నిరోధించటం' అని అర్థం. ప్రాణాయామంతోనే యోగ సాధన మొదలవుతుంది. కనుక యోగులు పవనవిజయులు. కనుక ద్వంద్వభావాతీతులై యోగసాధనలో ప్రౌఢు' లవుతారు.

'రామ' శబ్దాన్ని నిర్వచిస్తూ 'యోగినాం హృదయేషు రమతీతి రామః' అని చెప్తుతారు. యోగుల హృదయాలలో రమించే ధర్మమున్నందువలన రాముడని వసిష్ఠుడు పేరు పెట్టాడట! ఇదే ఇక్కడా అనువర్తించుకొనాలి.

మాలినీ వృత్తంలో ప్రతిపాదంలోనూ వరుసగా న,న,మ,య,య గణాలు ఉంటాయి. 9వ అక్షరం యతిమైత్రిస్థానం. ప్రాసనియమం ఉన్నది.

గద్యము:

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధన విరాజ తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీమహాభారతంబున నశ్వమేధపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము

ప్రతిపదార్థం: ఇది= ఈరచన; శ్రీమత్= మంగళకరుడైన; ఉభయకవిమిత్ర= కావ్యశాస్త్ర కవులిరువురికీ మిత్రుడైనవాడు, బుధ+ఆరాధన విరాజి= పండితులను (జ్ఞానులను) సేవించటం వలన కీర్తితో ప్రకాశించేవాడు; తిక్కన సోమయాజి= సోమయాజి అయిన తిక్కన చేత; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీ మహాభారతంబునన్; అశ్వమేధ పర్వంబునందున్; ప్రథమ+ఆశ్వాసము= మొదటి ఆశ్వాసము.

తాత్పర్యం: ఇది ఉభయకవిమిత్రుడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, జ్ఞానులచేత ఆరాధించబడి రాణించేవాడూ అయిన తిక్కన సోమయాజి శుభప్రదంగా రచించిన శ్రీ మహాభారతంలోని అశ్వమేధపర్వంలో మొదటి ఆశ్వాసం.

అశ్వమేధపర్వంలోని ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

అశ్వమేధపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీసుఖనిష్పాదన కే। లీసక్త పదారవిందలీలా! సతతా

భ్యాసవికాసిసమాధి స। మాసాదిత శాంతిలోల! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: హరిహరనాథా!= హరిహరనాథ స్వామీ! శ్రీసుఖ= మోక్షసుఖాన్ని; నిష్పాదనకేలీ= కలుగజేయటం అనే క్రీడలో; సక్త= ఆసక్తమైన; పదారవిందలీలా!= చరణపద్మాల విలాసం కలిగినవాడా!; సతత+అభ్యాస= నిరంతరం అభ్యసించటం వలన; వికాసి= పరిపూర్ణమైన= సమాధి= సమాధిచేత; సమాసాదిత= పొందబడిన; శాంతిలోల!= స్వస్వరూప శాంతియందు ఆసక్తి కలిగినవాడా!

తాత్పర్యం: స్వామీ - హరిహరనాథా! నీ శ్రీచరణకమలసేవకులు పరమపదసుఖాన్ని అవలీలగా పొందగలరు. సంతత యోగాభ్యాసం వలన కలిగే సమాధిలో సిద్ధించే శాంతి అంటే నీకు ఆసక్తి మెండు.

విశేషం: 'శ్రీ' శబ్దానికి వేదాంత పరిభాషలో నిశ్శ్రేయసమని అర్థం. మోక్షం ఒక లక్ష్మీస్వరూపం. దానినే 'శ్రీ' పదంచేత పిలుస్తారు. 'సాహి శ్రీ రమృతా సతాం' అని తైత్తిరీయం అమృతభావరూపమైన మోక్షం శ్రీపదవాచ్యమని చెప్పుతున్నది.

హరిహరనాథుడు 'శాంతి'లోలుడు. సమాధిలో యోగి నిర్వికల్పం పొందుతాడు. నిర్వికారమే శాంతరూపం. శ్రీకృష్ణుడు ఏ గీతాసారాన్ని మరలా పూర్వపర్వంలో బోధించాడో ఆ తత్త్వాన్ని మరలా ఈ పర్వంలో కూడా బ్రాహ్మణగీతల ద్వారా చెప్పుతున్నాడు.

బ్రాహ్మణగీతలు (సం. 14-20-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కి ట్లనియె. 2

ప్రతిపదార్థం: హరిహరనాథస్వామీ! వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

ఆ. అట్లు శౌరి పార్థు నంచిత బ్రహ్మ వి। ద్యాప్రబోధకంబు లైన యట్టి

వినుతవాక్యవాక్యములు సవిస్తరంబుగ విని। పించి యతనివలన ప్రీతిఁ జేసి. 3

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; శౌరి= కృష్ణుడు; పార్థున్= అర్జునుడిని (గురించి); అంచిత= గొప్పదైన; బ్రహ్మవిద్యా ప్రబోధకంబులు+ఐన+అట్టి= వేదాంత విద్యను బోధించేటటువంటి; వినుత= ప్రసిద్ధ; వాక్యములు= వాక్యాలు; సవిస్తరంబుగన్= విశదంగా; వినిపించి= చెప్పి; అతనివలనన్= అతడియందు; ప్రీతిన్+చేసి= ప్రేమకారణంగా.

తాత్పర్యం: అట్లా పూర్వపర్వంలో చెప్పిన విధంగా శ్రీకృష్ణుడు అర్జునుడికి గొప్ప వేదాంతవిద్యను బోధించేటటువంటి ప్రసిద్ధకావ్యాలను విశదంగా బోధించినవాడై, అతడిపట్ల ఉన్న ప్రేమకారణంగా. (తరువాతి వచనంతో అన్వయం)

వ. వెండియు నిట్లని బోధించు 4

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: వెండియున్= మరల; ఇట్లు+అని= ఈ విధంగా; బోధించున్= బోధించాడు.

తాత్పర్యం: ఇంకా ఇట్లా చెప్పాడు.

సీ. **భర్తృభార్యాకృత భవ్యసంవాదంబు। నభయ నామకమునై యతిశయిల్లు**
నట్టిది యొక యితిహాసంబు విను పార్థ! జననుతసమధికజ్ఞానవర్ణి
తాత్మకుఁ డైన మహాద్విజుఁ డొకఁడు వి। విక్త ప్రదేశసేవిత్వనిరతి
నున్నెడ నల్ల నాసన్నయై వినయంబు। భక్తియు నెసఁగఁ దత్పత్ని ప్రణతి

తే. **యాచరించి 'మహాత్మ! యధ్యాత్మబోధ। భరితఁగాఁ జేయవే నన్నుఁ గరుణ పల్ల**
వింప' నని దయవుట్టంగ వేఁడుటయును। మందహాసవిభాసియై మగువఁ జూచి. **5**

ప్రతిపదార్థం: పార్థ!= అర్జునా!; భర్తృ భార్యా కృత= భర్తృభార్యలచేత చేయబడిన; భవ్య= గొప్ప; సంవాదంబున్= సంభాషణ; అభయ నామకమున్+ఐ= అభయమని పేరు కలిగినది; అతిశయిల్లున్= ప్రసిద్ధి చెందిన; అట్టిది= అట్లాంటిది; ఒక+ఇతిహాసంబు= ఒక కథ (ఉన్నది); విను; జననుత= ప్రజలచేత ప్రస్తుతించబడిన; సమధిక= మిక్కిలి అధికమైన; జ్ఞాన వర్ణిత+ఆత్మకుఁడు+ఐన= జ్ఞానంచేత పేరెన్నిక గన్న ఆత్మ కలిగిన (ఆత్మజ్ఞానం కలిగిన అని అర్థం); మహాద్విజుఁడు= ఉత్తమ బ్రాహ్మణుడు; ఒకఁడు= ఒకాయన; వివిక్త= ఏకాంతమైన; ప్రదేశ= స్థలాలలో; సేవిత్వనిరతిన్= భగవంతుడిని ఉపాసనచేయాలన్న కోరికతో; ఉన్న+ఎడన్= ఉన్న సందర్భంలో; అల్లన్= నెమ్మదిగా; ఆసన్న+ఐ= సమీపించినదై; వినయంబున్= వినయమూ; భక్తియున్= భక్తీ; ఎసఁగన్= అతిశయించగా; తద్+పత్ని= ఆయన భార్య; ప్రణతి+ఆచరించి= నమస్కారంచేసి; మహాత్మ!= ఓ మహనీయుడా!; నన్నున్= నన్ను; కరుణ+పల్లవింపన్= దయ చిగురొత్తగా; అధ్యాత్మబోధ+భరితన్+కాన్= అధ్యాత్మజ్ఞానంతో నిండినదానినిగా; చేయవే+ దయతో చేయుము; అని; దయ+పుట్టంగన్= దయ జనించేటట్లుగా; వేఁడుటయును= ప్రార్థించగా; మందహాస= చిరునవ్వుతో; విభాసి+ఐ= ప్రకాశిస్తున్నవాడై; మగునవన్+చూచి= ఆ స్త్రీని చూచి.

తాత్పర్యం: 'అర్జునా! వినుము. భార్యాభర్తలు చేసిన ఒక గొప్ప సంభాషణ 'అభయ' మనే పేరుతో ప్రసిద్ధమైనది ఒక కథ ఉన్నది. ఆ కథ చెప్తుతాను. ఒక ఊరిలో ప్రజలందరూ స్తుతించే ఒక ఉత్తమబ్రాహ్మణుడు ఉండేవాడు. ప్రజలందరూ అతడి ఆత్మజ్ఞానాన్ని ప్రశంసించేవారు. అతడు ఒకప్పుడు ఏకాంతంగా కాలం గడుపుతూ భగవంతుడిని ఉపాసించాలని అభిలషించాడు. ఆ సమయంలో ఆయన భార్య నెమ్మదిగా అక్కడికి వచ్చి భక్తి, వినయం అతిశయించగా ఆయనకు నమస్కరించి 'స్వామీ! నాకు అధ్యాత్మజ్ఞానాన్ని దయతో బోధించి నన్ను తరింపజేయండి' అని ప్రార్థించింది. అప్పుడు ఆయన చిరునవ్వు నవ్వుతూ ఆమెను చూచి (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **'ఈ మాటకుఁ జారుముఖీ। నామది ముదమందెఁ గాన నాతికి నిదియే**
లా మేటితలంపను త్రో। పేమియు లే; దోపి వినుము హితవచనంబుల్. **6**

ప్రతిపదార్థం: చారుముఖీ!= ఓ అందమైన ముఖం కలిగిన నారీమణీ!; ఈ మాటకున్= నీ వాడిన ఈ మాటతో; నా మది= నా మనస్సు; ముదము+అందెన్+కాన= సంతోషపడింది కాబట్టి; నాతికిన్= స్త్రీకి; ఇది= ఇట్లా అడగటం; ఏలా?= ఎందుకు?; మేటి తలంపు= గొప్ప ఆలోచన; అను= అనేటటువంటి; త్రోపు+ఏమియున్+లేదు= నిషేధం ఏమీ లేదు; హిత వచనంబుల్= నేను చెప్పే మంచి మాటలు; ఓపి+వినుము= ఓపికతో వినుము.

తాత్పర్యం: 'ఓ వనితా! నీ మాటతో నా హృదయం సంతోషపడింది. స్త్రీ ఇంత పెద్ద ఆలోచన చేయటమా అనే నిషేధం ఏమీ లేదు. (అంటే నీవు అడగటానికి అర్హురాలవే అని అర్థం). కాబట్టి నేను చెప్పే మంచి మాటలు సావధానంగా వినుము.'

విశేషం : వేదభ్యాసం చేయటం స్త్రీకి తగినదా? కాదా? - అనే ధర్మశాస్త్రమీమాంస ఉన్నది. యజ్ఞం ఆచారకాండతో ముడిపడినది. ఆ యజ్ఞానికి కూడా స్త్రీ సహకారం ప్రధానమైనది. ధర్మపత్నితో కూడినవాడై యజ్ఞంచేయాలి. అట్లాగే వేదాంత చర్చ స్త్రీకి అనవసరమనే సాధారణభావమూ ప్రజలలో ఉన్నది. ఈ సందర్భాన్ని చూస్తే వేదాభ్యాసమూ, వేదాంత ప్రశ్న స్త్రీకి అనుచితాలు కావని స్పష్టంగా అర్థం చేసికొనవచ్చును. కాబట్టి స్త్రీకి వేదవిద్య నిషిద్ధమనే భావన చారిత్రకంగా మధ్యయుగాలలో పుట్టినది అని మనం అర్థం చేసికొనవచ్చును.

వ. నా యెఱింగిన భంగిఁ జెప్పెద' నని పలికి యయ్యతులవ్రతుం డా పతివ్రత కిట్లనియె. **7**

ప్రతిపదార్థం: నా+ఎఱింగిన= నాకు తెలిసిన; భంగిన్= విధంగా చెప్పెదన్= చెప్పుతాను; అని; పలికి= చెప్పి; ఆ+అతులవ్రతుండు= ఆ నిరుపమదీక్షగల బ్రాహ్మణుడు; ఆ పతివ్రతకున్= ఆ పతివ్రతతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'నాకు తెలిసిన రీతిలో చెప్పుతాను' అని ఆ దీక్షితుడైన బ్రాహ్మణుడు ఆ పతివ్రతతో ఇట్లా అన్నాడు.

సీ. 'వినను గానను జేయ వెరవైన యవి కర్మ। ములు; వానిఁ గర్మకర్తలు సమస్త
సిద్ధిప్రదము లని చెప్పుదు రజ్ఞాన। తిమిరాంధులై విను ధీరచిత్త!
జగమున లేదు నిష్కర్మత్వ మెందేనిఁ। గలిగె నేనియును మౌర్ఖ్యముగ దాని
నిందింతు రెక్కుడు నెల వది యాత్మ నేఁ। గందు బ్రహ్మంబు నిష్కలత నందు

తే. వెలుఁగు నగ్నితో సోముండు గలసి మిథున। ధర్మమం దెప్డు నడపి భూతములఁ దాల్చు
నజుఁడు మొదలుగ నక్షరోపాస్తియందుఁ। జేయుదురు శాంతి నింద్రియజిత్త్వ మొంది. **8**

ప్రతిపదార్థం: ధీరచిత్త!= ధీరత్వంతో కూడిన చిత్తం కలిగిన ఓ వనితా!; విననున్= వినటానికి; కాననున్= చూడటానికి; చేయన్= చేయటానికి; వెరవు+ఐన= వీలైన; అవి= పనులు ఏవి ఉన్నాయో అవి; కర్మములు= కర్మలు; కర్మకర్తలు= కర్మవాదులు; వానిన్= ఆ కర్మలను; అజ్ఞాన= అజ్ఞానమనే; తిమిర+అంధులు+ఐ= చీకటితో కన్ను గాననివారై; సమస్త సిద్ధి ప్రదములు+అని చెప్పుదురు= అన్ని సిద్ధులను ఇస్తాయని చెప్పుతారు; జగమునన్= ప్రపంచంలో; నిష్కర్మత్వము= కర్మలేనితనం; లేదు; ఎందేనిన్= ఎక్కడైనా; కలిగెను+ఏనియున్= ఉన్నాకూడా; మౌర్ఖ్యముగన్= మూర్ఖుడి లక్షణంతో; దానిన్= ఆ నిష్కర్మపరత్వాన్ని; నిందింతురు= నిరసిస్తారు; అది= ఆ నిష్కర్మపరత్వం; ఎక్కుడు+నెలవు= ఉన్నతమైన స్థితి (ఎందుకంటే); ఏను= నేను; ఆత్మన్=ఆత్మలో; బ్రహ్మంబున్= బ్రహ్మన్ని; కందున్= చూస్తాను (ఆ తత్త్వం); నిష్కలతన్+అందు= ఏ కళాలేని స్థితిలో ఉంటుంది (అది నిజంగా నిష్కర్మతోడి స్థితి); వెలుఁగన్= నిరంతరం ప్రకాశించే; అగ్నితో; సోముండు= చంద్రుడు; కలసి= కలసినవాడై; మిథునధర్మమందున్+ఎప్డున్+నడపి= సంగమధర్మంలో జగత్తును ఎప్పుడూ నడిపించి; భూతములన్+తాల్చున్= సర్వప్రాణులనూ జనింపచేస్తున్నాడు; అజుఁడు= బ్రహ్మ; మొదలుగన్= మొదలైన దేవతలందరూ; శాంతిన్= పరమశాంత చిత్తస్థితులై; ఇంద్రియ జిత్త్వము+ఒంది= ఇంద్రియజయాన్ని కలిగి, అక్షర+ఉపాస్తి+అందున్+చేయుదురు= అక్షర తత్త్వాన్ని ఉపాసించటమనే కర్మలో నిరంతరం మగ్నులుగా ఉంటారు.

తాత్పర్యం: 'ఓ ధీరస్వభావురాలా! వినుము! వినటానికి, చూడటానికి, చేయటానికి వీలైన పనులు ఏవేవి ఉన్నాయో అవన్నీ కర్మలు, కర్మవాదులు అజ్ఞానమనే చీకటిలో ఉన్నవారై ఆ కర్మలు సమస్తసిద్ధులను ప్రసాదిస్తాయని అంటారు.

అసలు ప్రపంచంలో నిష్కర్మత్వం అనే స్థితే లేదు. ఎక్కడైనా ఉన్నా అది మూర్ఖుడి ధర్మంగా అందరూ నిందిస్తారు. కాని, అట్లా ఏ క్రియా లేని స్థితి అన్నది పరమోన్నతమైనది. అది బ్రహ్మలక్షణం. నేను ఆత్మలో చూస్తాను. బ్రహ్మోపాసనచేస్తాను. ఆ బ్రహ్మతత్త్వం 'నిష్కళంకంగా కనిపిస్తుంది (అందుకే అది 'నిష్కర్మం'గా ఉండగలుగుతుందని అర్థం). ఇక తక్కిన జగత్తంతా క్రియాత్మకమే. అగ్నితో సోముడు కలసి సంగమధర్మంతో జగత్తును నడిపిస్తూ సకలప్రాణరాశినీ సృష్టిస్తున్నాడు. బ్రహ్మాది దేవతలు పరమశాంతిచిత్తులై ఇంద్రియవిజయం పొంది అక్షరతత్త్వోపాసనలో నిరంతరం మగ్నులై ఉంటారు.

విశేషం : లోకంలోని కర్మ మోహజనకమైనది. ఇంద్రియాలు చేసే పనులు అట్లాంటివే. అది సకామం (కామంతో కూడినది). యోగి అభ్యసించేది నిష్కర్మ. దానికి ఫలితం ఇంద్రియజయం. ఆ అనుభవం 'శాంత' స్థితి. అక్కడ ఏ రసాల అలజడులూ లేవు. అది బ్రహ్మ కర్మ, ఇక్కడ బ్రహ్మ శబ్దం చతుర్ముఖబ్రహ్మను సూచించేది కాదు. పరతత్త్వసూచకం. ఇది 'బ్రహ్మం.'

'అగ్నిషోమాత్మకం బీజం రామనామే ప్రతిష్ఠితమ్' అని వేదాంతులు రామశబ్దాన్ని నిర్వచిస్తారు. రకారం అగ్నిబీజమని, మకారం సోమబీజమని, స+ఉమ - అని విడదీస్తే ఉమతోకూడినవాడు 'ఈశ్వరుడు' అవుతాడు. అగ్ని శివపార్వతుల సమాగమాన్ని భంగంచేసి శివతేజస్సును గ్రహించగా కుమారుడు పుట్టాడు. ఈ కుమారుడు విశ్వకుమారుడు. (ప్రపంచంలో ప్రతి కుమారుడి పుట్టుకకూడా ఈ కథలోనే ఉన్నదని అగ్ని, సోముల కలయిక ప్రస్తావన నిరూపిస్తున్నది. సర్వప్రాణుల హృదయాలలో ఉన్నవాడు ఈశ్వరుడు (ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి - అని గీత). కనుక చంద్రాగ్నుల కలయికతో జగద్బీజం ఏర్పడుతున్నదని తాత్పర్యం. ఇదీ కర్మమే కాని ఇది మోహజయం కలిగిన నిర్వికారకర్మ. జగత్తును రక్షించటానికి వినియోగించిన నిష్కామకర్మ కాబట్టి కర్మ-అకర్మ - నిష్కర్మలను గుర్తించటంద్వారా మనిషి జ్ఞానవంతు డవుతాడని ఆ భర్త భార్యకు బోధిస్తున్నాడు.)

వ. అక్షరంబు తెఱం గెఱింగించెద. 9

ప్రతిపదార్థం: అక్షరంబు= అక్షరతత్త్వపు; తెఱంగు= లక్షణాన్ని; ఎఱింగించెదన్= తెలియజేస్తాను.

తాత్పర్యం: అక్షరతత్త్వ స్వభావాన్ని వివరిస్తాను.

విశేషం: పూర్వపద్యంలో బ్రహ్మాది దేవతలు అక్షరతత్త్వాన్ని ఉపాసిస్తా రన్నాడు కదా! ఆ 'అక్షర' స్వభావం ఏమిటో చెప్తున్నాడు. న+క్షరం - అంటే ఎప్పటికీ తరగనిది. క్షీణించనిది అని అర్థం. ప్రకృతిశక్తులన్నీ నశిస్తాయి. పురుషతత్త్వమైన ఆత్మపదార్థం ఒకటే ఎప్పుడూ స్థిరంగా ఉండేది. అది ఎట్లాగో నిరూపిస్తున్నాడు.

సీ. స్పర్శంబు రసము రూపంబును శబ్దంబు। గంధంబుఁ గాకున్కి కారణముగఁ
ద్వక్కున జిహ్వ నేత్రమున శ్రోత్రంబున। ఘ్రాణంబునను బరిగ్రహవిధాన
మాచరించుటకు లోనై యుండ దాతత్త్వ। మమలిన బుద్ధ్యవగమము దానిఁ
బ్రాపించుఁ బ్రాణాది పంచవాయువులును। విను దానివలన వర్తనముఁ బొందు

తే. నంద డిందుఁ బ్రాణంబు నపానమును స। మాననామకవ్యానమధ్యమున నడచు
మెలఁగుచుండుఁ బ్రాణాపానములకు నడిమి। దెస నుదానంబు శ్రుతి యిట్లు దేటపఱిచె. 10

ప్రతిపదార్థం: అ తత్త్వము= ఆ అక్షర పరబ్రహ్మతత్త్వం; స్పర్శంబు= స్పర్శ; రసము= రసం; రూపంబును= రూపం; శబ్దంబు= శబ్దం; గంధంబు= గంధం; కాక+ఉన్కి+కారణముగన్= కాకుండా ఉండటంవలన; త్వక్కునన్= చర్మంతో; జిహ్వన్= నాలుకతో;

నేత్రమునన్= కంటితో; శ్రోత్రంబునన్= చెవితో; ఘ్రాణంబునన్= ముక్కుతో; పరిగ్రహవిధానము+ఆచరించుటకున్= గ్రహించటానికి; లోను+ఐ+ఉండదు= వీలుకాదు; అమలిన= నిర్మలమైన; బుద్ధి+అవగమము= వివేకంతోనే తెలిసికొనదగింది (బుద్ధికి అందేది); దానిన్+ప్రాపించు= ఆ తత్త్వాన్ని పొందేటట్లు చేసేటటువంటి; ప్రాణాది= ప్రాణాది= ప్రాణ, అపానాదులైన; పంచవాయువులునున్= ఐదు వాయువులూ; దానివలనన్= అ అక్షరతత్త్వంవలననే; వర్తనమున్+పొందున్= ప్రవర్తిస్తున్నాయి; వినుు= బాగా శ్రద్ధగా వినుము. అందున్+అ= ఆ తత్త్వంలోనే (అవి); డిందున్= లీనమవుతాయి; ప్రాణంబున్+అపానమునున్= ప్రాణం, అపానం అనబడేవి; సమాన నామక= సమానమనే పేరుగలిగిన; వ్యానమధ్యమునన్= వ్యానం నడుమ; నడచున్= ప్రసరిస్తూ ఉంటుంది; ప్రాణ+అపానములకున్= ప్రాణాపానాలకు; నడిమి దెసన్= నడుమగా; ఉదానంబు= ఉదానం; మెలఁగుచుండున్= వ్యాపించి ఉంటుంది; ఇట్లు= ఈ విధంగా; శ్రుతి= వేదం; తేటపఱిచెన్= స్పష్టంగా చెప్పినది.

తాత్పర్యం: ఆ అక్షర పరబ్రహ్మతత్త్వం స్పర్శ, రస, రూప, శబ్ద, గంధాలు లేనిది కావటంచేత చర్మంతోకాని, నాలుకతోకాని, కంటితోకాని, చెవితోకాని, ముక్కుతోకాని గుర్తించటానికి సాధ్యం కాదు. అది కేవలం పవిత్రమైన బుద్ధివిశేషంచేత మాత్రమే తెలిసికొనబడుతుంది. ఆ తత్త్వాన్ని పొందించేటటువంటి ప్రాణాపానాది పంచవాయువులు కూడా ఆ అక్షరతత్త్వంవలననే ప్రభవిస్తున్నాయి. అందులోనే చివరికి లీన మవుతున్నాయి కూడా. ప్రాణాపానాలు సమానమని పేరు కలిగిన వ్యానం మధ్యంలో ఉండగా, ప్రాణాపానాలనడుమ ఉదానం ప్రసవిస్తూ ఉంటుంది - అని వేదం స్పష్టంగా ప్రతిపాదించి ఉన్నది.

విశేషం :

"హృది ప్రాణః గుదే-ఽపానః సమానో నాభిసంస్థితః,
ఉదానః కంఠదేశస్థః వ్యానః సర్వశరీరగః" అని చెప్పుతారు.

(హృదయంలో ప్రాణం, గుదస్థానంలో అపానం, నాభిలో సమానం, కంఠంలో ఉదానం ఉండగా, వ్యానం సర్వదేహంలోనూ వ్యాపించి ఉంటుంది.)

"నాగశ్చ కూర్మః కృకరో దేవదత్తో ధనంజయః,
వాగ్ద్వారే నాగ ఆఖ్యాతః కూర్మ ఉన్మీలనే స్మృతః.
కృకరాచ్చ క్షుతం జ్ఞేయం దేవదత్తా విజృంభణే,
న జహాతి మృతం వాపి సర్వవ్యాపీ ధనంజయః.''

(ఈ పంచప్రాణాలకు - నాగ, కూర్మ, కృకర, దేవత్త, ధనంజయాలని పేర్లు, నోటి ద్వారంలో నాగం, కంటి రెప్పలలో కూర్మం, తుమ్ములో కృకరం, ఆవులింతలో దేవదత్తం, మనిషి చనిపోయినా దేహమంతటా వ్యాపించి ధనంజయం - అనే ప్రాణాలు ఉంటాయి.)

క. నెలకొని ప్రాణపానం। బులఁ బురుషుఁడు సుప్తుఁ డైనఁ బొలఁతి! విలీనం
బులగు సమానవ్యానం। బులు యోగులు సంశయంబుఁ బొందరు దీనన్. 11

ప్రతిపదార్థం: పొలఁతి!= ఓ వనితా!; పురుషుఁడు= జీవుడు; ప్రాణ+అపానంబులన్= ప్రాణాపానాలలో; నెలకొని= ఉండి; సుప్తుఁడు+ఐనన్= నిద్రిస్తే; సమాన వ్యానంబులు= సమానం, వ్యానం అనే ప్రాణాలు; విలీనంబులు+అగున్= కలిసిపోతాయి; దీనన్= ఈ విషయంలో; యోగులు= యోగసాధకులు; సంశయంబున్+పొందరు= ఏ సందేహమూ పడరు.

తాత్పర్యం: ఓ వనితా! జీవుడు ప్రాణాపానాలలో ఉండి నిదురపోతే సమానవ్యానాలు కలిసిపోతాయి. యోగులు ఈ విషయంలో ఏ సందేహమూ పడరు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వినుతెలియంగ నుదానం। బున సుప్తుం డైనఁ బ్రాణము నపానంబున్
వనజనిభలోచనా! పురు। షుని విడువవు యోగిజనుల చూ పిట్లుండున్. 12

ప్రతిపదార్థం: వనజనిభలోచనా!= కమలసమాననయనా!; తెలియంగన్+విను= బాగా వినుము; ఉదానంబునన్= ఉదానంలో; సుప్తుండు+ఐనన్= నిద్రిస్తే; పురుషునిన్= పురుషుడిని; ప్రాణమున్+అపానంబున్= ప్రాణాపానాలు; విడువవు= వదలిపెట్టవు; యోగిజనుల= యోగులగుజనుల; చూపు= దృష్టి; ఇట్లు+ఉండున్= ఇట్లా ఉంటుంది.

తాత్పర్యం: పద్మలోచనా! బాగా వినుము, ఉదానంలో నిద్రిస్తే ప్రాణాపానాలు ఆ జీవుడిని వదలిపెట్టవు. యోగుల దృష్టి ఇట్లాంటిది.

విశేషం : పై రెండు పద్యాలలో వివరించిన వాయువుల సమ్మేళనవిషయం తరువాత వివరించబోయే 'అంతర్యాగవిషయం'గా చాలా ప్రధానం. యోగులు ప్రాణవాయువులను ఏయే విధంగా శిక్షణలో ఉంచుకొంటారో ఈ వర్ణనవలన తెలిసికొనవచ్చును.

అంతర్యాగప్రకారంబు నిరూపించి చెప్పుట (సం. 14-20-18)

వ. ఇవ్వాయువు లేనును మనంబును బుద్ధియుంగూడ నీ యేడును వైశ్వానరునకు జిహ్వలు; వైశ్వానరుం డనఁ బ్రాణుల దేహంబులం దగ్నిరూపంబున వెలుంగుచున్న యాత్ముండు; ఘ్రేయంబును భక్ష్యంబును దృశ్యంబును స్పృశ్యంబును శ్రావ్యంబును మంతవ్యంబును బోద్ధవ్యంబును నగు నీ సప్తసంఖ్య సమిధలు, ఘ్రాతయు, భక్షయితయు, ద్రష్టయు, స్పృష్టయు, శ్రోతయు, మంతయు, బోద్ధయు నయిన యీ యేడ్వురును వరుసన ఘ్రేయాదులయిన హవిస్సులేడింటిని వేల్చుబుత్విజు; లిదిసప్తహోతృవిధానప్రకారంబు వైశ్వానరు వదనంబులు పదియు దిగ్వాయుసూర్యచంద్రపృథివీపావకశక్ర విష్ణుప్రజాపతిమి త్రాత్మకంబులు; శబ్దస్పర్శరూపరసగంధ వక్తవ్యకర్తవ్యగంతవ్యవిసర్గానందంబులు హవిస్సు లీ పదింటినిం గ్రమంబున నాహుతులు సేయుహోతలు శ్రోత్ర త్వక్చక్షుర్జిహ్వాఘ్రాణవాక్పాణిపాదపాయూపస్థంబు లయిన దశేంద్రియంబు; లిత్తెఱంగు దశహోతృవిధి; యీ రెంటిని నెఱింగి యిం దేవిధంబున నేనియు జీవాత్ముం డుపద్రష్టగా నంతర్యాగంబు నడపు యోగి జనంబులు జననమరణవిముక్తులగుదురు. బహిర్యజ్ఞపరులు గమనాగమనభ్రమణంబులం బొందుచుండుదు' రని చెప్పి వెండియు. 13

ప్రతిపదార్థం: ఈ+వాయువులు+ఏనునున్= ఈ ఐదు వాయువులూ; మనంబునున్= మనస్సూ; బుద్ధియున్+కూడన్= బుద్ధీ కలిస్తే; ఈ+ఏడును= ఈ ఏడూ; వైశ్వానరునకున్= వైశ్వానరుడికి; జిహ్వలు= నాలుకలు; వైశ్వానరుండు+అనన్= వైశ్వానరుడు అనే పేరుతో; ప్రాణుల దేహములందున్= ప్రాణుల దేహాలలో; అగ్నిరూపంబునన్= అగ్నిరూపంలో; వెలుంగుచున్+ఉన్న= వెలుగుతున్న; ఆత్ముండు= ఆత్మ; ఘ్రేయంబునున్= వాసన చూడదగినది; భక్ష్యంబునున్= తినదగినది; దృశ్యంబునున్= చూడదగినది; స్పృశ్యంబునున్= స్పర్శించదగినది; శ్రావ్యంబునున్= వినదగినది; మంతవ్యంబునున్= ఆలోచింపదగినది; బోద్ధవ్యంబునున్= తెలిసికొనదగినది; అగు= అనేటటువంటి; ఈ సప్తసంఖ్య సమిధలున్= ఈ ఏడు సమిదలును; ఘ్రాతయున్= వాసన చూచేవాడూ. భక్షయితయున్= తినేవాడూ; ద్రష్టయున్= చూచేవాడూ; స్పృష్టయున్= తాకేవాడూ; శ్రోతయున్= వినేవాడూ మంతయున్= ఆలోచించేవాడూ; బోద్ధయున్= తెలిసికొనేవాడూ; అయిన+ఈ+ఏడ్వురును= అనే ఈ ఏడుగురూ; వరుసన్+అ= క్రమంగా; ఘ్రేయాదులు+ అయిన= వాసన

చూడదగినవి అయిన; హవిస్సులు+ఏడింటినిన్= ఏడు హవిస్సులను; వేల్చు= హోమంచేసే; ఋత్విజులు= ఋత్విక్కులు; ఇది= ఇట్లా చేయటం; సప్త హోతృ విధాన ప్రకారంబు= ఏడుగురు హోతలు హోమం చేసే విధానం; వైశ్వానరు వదనంబులు= వైశ్వానరుడి ముఖాలు; పదియున్= పది (ఏ వంటే); దిక్= దిక్కులు; వాయు= వాయువూ; సూర్య= సూర్యుడూ; చంద్ర= చంద్రుడూ; పృథివీ= భూమీ; పావక= అగ్నీ; శక్ర= ఇంద్రుడూ; విష్ణు= విష్ణువూ; ప్రజాపతి; మిత్ర+ఆత్మకంబులు= మిత్రుడు అనబడేవాడు; శబ్ద= శబ్దము; స్పర్శ= తాకటం; రూప= రూపమూ; రస= రసమూ; గంధ= గంధమూ; వక్తవ్య= మాటాడదగినదీ; కర్తవ్య= చేయదగినదీ; గంతవ్య= పోదగినదీ; విసర్గ= విసర్జించదగినదీ; ఆనందంబులు= ఆనందం - అనబడేవి; హవిస్సులు= హోమద్రవ్యాలు; ఈ పదింటిని, క్రమంబునన్= క్రమంగా; ఆహుతులు+చేయు= హోమం చేసే; హోతలు= ఋత్విక్కులు; శ్రోత్ర= చెవి; త్వక్= చర్మ; చక్షుస్= కన్నులు; జిహ్వ= నోరు; ఆఘ్రాణ= ముక్కు; వాక్= నాలుక; పాణి= చేతులు; పాద= కాళ్ళు; పాయు= గుదం; ఉపస్థంబులు= జననేంద్రియం అనబడే; దశ+ఇంద్రియంబులు= పది కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలు; ఈ+తెఱంగు= ఇట్లా హోమం చేయటం; దశహోతృవిధి= పదిమంది ఋత్విక్కులు హోమం చేసే విధానం అనబడుతుంది; ఈ రెంటినిన్+ఎఱింగి= ఈ రెండింటిని గుర్తించి; ఇందున్+ఏవిధంబునన్+ఏనియున్= ఇందులో ఏ విధంగానైనా; జీవాత్మన్= జీవాత్ముడిని; ఉపద్రష్టగాన్= ఉపాధ్యాయుడిగా; అంతర్+యాగంబు= శరీరంలోపల జరిపే యాగాన్ని; నడపు= నడిపే; యోగిజనంబులు= యోగులైనవారు; జనన మరణ= చావు పుట్టుకలనుండి; విముక్తులు+అగుదురు= విడుదల పొందుతారు; బహిస్+యజ్ఞపరులు= సాధారణంగా బయట జరిపే యజ్ఞం చేసేవారు; గమన+ఆగమన= చావుపుట్టుకలనే; భ్రమణంబులన్= చక్రభ్రమణం; పొందుచున్+ ఉండుదురు= పొందుతూ ఉంటారు; అని చెప్పి; వెండియున్= ఇంకా ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ప్రాణాపానాది పంచవాయువులు, మనస్సు, బుద్ధి - అనే ఏడూ వైశ్వానరుడికి జిహ్వలు. అందుకే అగ్నిదేవుడిని సప్తజిహ్వుడంటారు. వైశ్వానరుడు - అంటే ప్రాణుల దేహాలలో అన్ని రూపాలలో వెలుగుతున్న ఆత్మతత్త్వమే. ఇక శరీరంలోపల రెండు విధాలుగా 'హోమ' విధి జరుగుతుంది. దానిని వివరిస్తాను. మొదటిది సప్తహోతృవిధి. వాసన చూడదగినది, తినదగినది, చూడదగినది, తాకదగినది, వినదగినది, ఆలోచింపదగినది, తెలిసికొనదగినది - అనే ఈ ఏడు సమిధలను వాసన చూచేవాడు, తినేవాడు, చూచేవాడు, తాకేవాడు, వినేవాడు, ఆలోచించేవాడు, తెలిసికొనేవాడు అనే ఏడుగురు ఋత్విక్కులు వైశ్వానరాగ్నిలో హోమం చేస్తారు. ఇదే సప్తహోతృ విధానం. ఇక రెండవది దశహోతృవిధానం; ఇక్కడ వైశ్వానరుడి ముఖాలు పది ఉంటాయి. దిక్కు, వాయువు, సూర్యుడు, చంద్రుడు, భూమి, అగ్ని, ఇంద్రుడు, విష్ణువు, ప్రజాపతి, మిత్రుడు - అనబడేవి ఆ ముఖాలు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు, మాటాడదగిన, చేయదగిన, పోదగిన, విసర్జించదగిన, ఆనందించదగిన - అనే ఈ పదీ హోమద్రవ్యాలు. ఈ పదింటినీ చెవి, చర్మం, కళ్ళు, నోరు, ముక్కు (జ్ఞానేంద్రియాలు), నాలుక, చేతులు, కాళ్ళు, గుదం, జననేంద్రియం (కర్మేంద్రియాలు) అనే ఈ పది ఇంద్రియాలు హోమం చేస్తాయి. ఇది దశహోతృవిధానం. ఈ రెండు పద్ధతులను గుర్తించి ఎంత ప్రయత్నించి అయినా జీవాత్మను ఉపద్రష్టగా ఉంచుకొని ఈ అంతర్యాగాన్ని జరిపే యోగిజనులు జననమరణభ్రమణంనుండి విముక్తు లవుతారు. అట్లా కాకుండా సాధారణంగా జరిపే బాహ్యయజ్ఞాన్ని జరిపేవారు జననమరణ చక్రభ్రమణంలో తిరుగుతూ ఉంటారు.

విశేషం : చేసే ప్రతిపనీ 'యాగమే'. ఆత్మ సాక్షీభూతుడైన 'ఉపద్రష్ట'. అందుచేత అతడికి ఏ కర్మఫలమూ అంటదు. కానీ, అన్నీ అతడే చేయిస్తాడు. ఇంద్రియాలు తాము చేస్తున్న పనిని 'బ్రహ్మకర్మ'గా భావించి చేస్తే అది అంతర్యాగం. బంధమోక్షణహేతువు.

కేవలం పనిగా చేస్తే అది బంధహేతువు. ఇక వైశ్వానరుడనే అగ్నిని గురించి కొంత వివరించాలి. ఈ అంతర్యాగం చేయటానికి ఆత్మ 'చైతన్య' రూపంలో 'అగ్ని'గా నిరంతరం పనిచేస్తూ ఉంటుంది.

"అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః,
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్" అని గీత.

(ప్రాణుల దేహాలను ఆశ్రయించి నేను వైశ్వానరుడనే అగ్నిరూపంగా ప్రాణాపానాలతో కూడినవాడనై భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యాలనబడే నాలుగు విధాలైన ఆహారాలనూ పచనం చేస్తున్నాను).

క. వినుము ప్రణవాదికరూప । త్వనిరూఢిం బుట్టు వాక్కు దాని వెనుచనున్
మనము పురుషార్థబుద్ధిన్ । బనుపడి' యని చెప్పె సతికి బ్రాహ్మణుఁ డనఘా! 14

ప్రతిపదార్థం: వినుము= ఓ వనితా జాగ్రత్తగా వినుము; ప్రణవ+ఆదిక+రూపత్వ నిరూఢిన్= ఓం కారం మొదలైన మంత్ర రూపంగా; వాక్కు; పుట్టున్= పుట్టుతుంది; దానిన్= దానిని వెంబడించి; పురుషార్థబుద్ధిన్= పురుషార్థ సాధనకొరకని; పనుపడి= పూనికతో; మనము= మనస్సు; వెనుచనున్= వెనకనే వెళ్ళుతుంది; అని; అనఘా!= ఓ అర్జునా!; బ్రాహ్మణుండు= ఆ విప్రుడు; సతికిన్+చెప్పెన్= భార్యకు చెప్పాడు.

తాత్పర్యం: 'ఓంకారం' ఇత్యాదిగా ఉన్న మంత్రరూపంగా వాక్కు పుట్టుతుంది. దానిని అనుసరించి పురుషార్థసాధన నిమిత్తంగా మనస్సు పరుగిడుతుంది' అని ఆ విప్రుడు భార్యతో ఇట్లా చెప్పాడు.

క. విని యా విప్రునితో ని । ట్లను నయ్యెలనాగ 'మన మనఘ! ప్రేరేపం
గ నెగయు వాక్కు తదనువ । ర్తనము మనంబునకు నెవ్విధంబునఁ గలుగున్?' 15

ప్రతిపదార్థం: విని= భర్తమాటలు విని, ఆ విప్రునితోన్= ఆ బ్రాహ్మణుడితో; ఆ+ఎలనాగ= ఆ స్త్రీ; ఇట్లు+అనున్= ఇట్లా అన్నది; అనఘ!= పుణ్యాత్మా!; మనము= మనస్సు; ప్రేరేపంగన్= ప్రేరేపించగా; వాక్కు+ఎగయున్= వాక్కు పుట్టుతుంది (కదా!) అట్లాంటప్పుడు); తద్+అనువర్తనము= దానిని అనుసరించి ప్రవర్తించటం; మనంబునకున్= మనస్సునకు; ఏ విధంబునన్+కలుగున్?=ఏ విధంగా కలుగుతుంది?

తాత్పర్యం: ఆ మాటలు విని భర్తతో ఆ స్త్రీ ఇట్లా అన్నది. 'పుణ్యాత్మా! మనస్సు ప్రేరేపిస్తే కదా వాక్కు పుట్టుతుంది. అట్లాంటప్పుడు వాక్కును అనుసరించి మనస్సు ప్రవర్తించటం ఎట్లా సాధ్యం?'

విశేషం: ఇక్కడ బ్రాహ్మణవనిత అడుగుతున్న ప్రశ్న వేదమూలాన్ని కలిగిన జిజ్ఞాస. 'దేవీం వాచమజనయంత దేవాః' (దేవతలు దేవీవాక్కును సృష్టించారు) అని వేదమంత్రం (దేవం మనః - దేవత మనస్స్వరూపుడు).

'వాఙ్ మే మనసి ప్రతిష్ఠితా । మనో మే వాచి ప్రతిష్ఠితం' అని ఐతరేయ శాంతిపాఠం. వాక్కు మనస్సులో, మనస్సు వాక్కులో అవిభక్తంగా ఉన్నాయి. మరి ఈ రెండూ ఒకదానినుండి మరొకటి పుట్టటం, ఒకటి మరొకదానిని అనుసరించటం - అనే అంశాలు బాహ్యంగా విరుద్ధంగా కనిపిస్తాయి. దానికి ఆ విప్రుడు సమాధానం చెప్పాడు.

వ. అనవుడు నతండు 16

తాత్పర్యం: అని చెప్పగా ఆ బ్రాహ్మణుడు (తరవాతి పద్యంతో అన్వయం.)

చ. 'మనసు నుదానవాయువును మానిని! కూడి వెలార్చు వాక్కు నా
త్మునివలనన్ భవద్వచనమున్ జనతానుభవంబు చొప్ప యై
నను విను కార్యముం గుఱిచినం దగ వాగనువర్తనంబు సే
యన వలసెన్ మనంబునకు నమ్మెయి గల్గుట నట్లు సెప్పితిన్. 17

ప్రతిపదార్థం: మానిని!= ఓ వనితా!; మనసు; ఆత్మునివలనన్= ఆత్మ ప్రేరణతో; ఉదానవాయువునున్+కూడి= కంఠస్థానంలో ఉండే ఉదాన వాయువును కలిసికొని; వాక్కున్+వెలార్చున్= వాక్కును బహిర్గతం చేస్తుంది; భవత్+వచనమున్= నీవు అన్నమాట కూడా; జనతా= అనుభవంబు+చొప్పు+అ= జనులందరి అనుభవం ప్రకారంగానే ఉన్నది (అందరూ ఇట్లాగే భావిస్తారు); ఐననున్= ఐనా కూడా; విను(ము)= ఒక వైశిష్ట్యం ఉన్నది వినుము; కార్యమున్+గుఱిచినన్= ఒక కార్యాన్ని గురించి ప్రవర్తించవలసివచ్చినప్పుడు; మనంబునకున్= మనస్సునకు; తగన్= తగినట్టుగా; వాక్+అనువర్తనంబున్= వాక్కును అనుసరించటం; చేయన్+అ+వలసెన్= చేయవలసి వచ్చింది (వస్తున్నది); ఆ+మెయిన్+కల్గుటన్= అట్లా ఉండటంవలన; అట్లు+చెప్పితిన్= అట్లా చెప్పాను.

తాత్పర్యం: ఓ వనితా! ఆత్మప్రేరణతో మనస్సు ఉదానవాయువును కూడుకొని వాక్కును బహిర్గతం చేస్తుందని నీవు అన్నట్లే ప్రజలందరూ భావిస్తారు. అందులో దోషమేమీ లేదు. కాని ఒక ప్రత్యేకవ్యాపారం ఉన్నది వినుము. ఒక కార్యాన్ని గురించి ప్రవర్తించవలసి వచ్చినప్పుడు మాత్రం మనస్సు వాక్కుకు అనుగుణంగానే ప్రవర్తిస్తుంది. అందుచేత అట్లా చెప్పాను.

వ. అని పలికి మఱియు నమ్మహీసురోత్తముం డిట్లనియె. 18

ప్రతిపదార్థం: అని పలికి; మఱియున్; ఆ+మహీసుర+ఉత్తముండు= ఆ బ్రాహ్మణోత్తముడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి ఆ బ్రాహ్మణోత్తముడు ఇంకా ఇట్లా అన్నాడు.

క. మనసును వాక్కును మాలో। ననఘచరిత! యెక్కు డెవ్వ? రని యంభోజా
సను నడిగిన నతం డెక్కుడు। మన మనవుడు వాని యక్కమలభవుతోడన్. 19

ప్రతిపదార్థం: మనసునున్= మనస్సూ; వాక్కునున్= వాక్కూ; అనఘచరిత!= ఓ పుణ్య చరిత్రుడా! (చెప్పుమని); మాలోనన్= మా ఇద్దరిలో; ఎక్కుడు+ఎవ్వరు= ఎవరు అధికం (గొప్ప); అని; అంభోజాసనున్= కమలాసనుడైన బ్రహ్మదేవుడిని; అడిగినన్= అడుగగా; అతఁడు= ఆ బ్రహ్మదేవుడు; మనము= మనస్సు; ఎక్కుడు= గొప్ప; అనవుడున్= అని చెప్పగా; వాణి= సరస్వతి; ఆ+కమలభవుతోడన్= ఆ కమలగర్భుడైన బ్రహ్మతో

తాత్పర్యం: ఒకప్పుడు మనస్సు, వాక్కు బ్రహ్మదేవుడివద్దకు వెళ్ళి 'స్వామీ! మా ఇద్దరిలో ఎవరు గొప్ప? తేల్చి చెప్పండి' అని అడుగగా ఆయన 'మనస్సే గొప్పది' అని చెప్పాడు. అప్పుడు సరస్వతి ఆయనతో (తరవాతి వచనంతో అన్వయం)

వ. 'ఏను నీకుం గామదోహిని నయి యుండ న న్నెట్లు తక్కువగాఁ బలికి?' తనిన నతండు 'స్థావరంబును జంగమంబును నన నాకు రెండు మనస్సులు గల వందు స్థావరంబు నాయొద్దను జంగమంబు నీకడను

నిలుచు; భవద్గోచరత్వంబునం బరఁగు వర్ణంబు మంత్రంబు స్వరంబు జంగను మనస్సుగా నెగడు; దానికంటె నీ వెక్కుడు నీకంటె నెక్కుడు స్థావరమనస్సు గావున నిమ్మాట యాడంగలదానవు గా' వని నిర్దేశించె. 20

ప్రతిపదార్థం: ఏను= నేను; నీకున్; కామదోహినిన్+అయి= కోరిన కోర్కెలను పిదికేదిగా; ఉండన్= ఉండగా; నన్నున్+ఎట్లు= నన్ను ఎట్లా; తక్కువగాన్= తక్కువచేసి; పలికితి(వి)?= పలికావు?; అనినన్= అని సరస్వతి అడుగగా; అతండు= ఆ బ్రహ్మదేవుడు; నాకున్= నాకు; స్థావరంబును= స్థిరమైనదీ; జంగమంబును= కదిలేదీ; అనన్= అని పేర్లుగల; రెండు మనస్సులు+కలవు= రెండు మనస్సు లున్నాయి; అందున్= ఆ రెండింటిలో; స్థావరంబు= కదలనిది; నా+ఒద్దను= నా వద్దా; జంగమంబు= కదిలేది; నీ కడను= నీ వద్దా; నిల్చున్= ఉంటాయి; భవత్+గోచరత్వంబునన్= నీకు తెలిసి; పరఁగు= ఉచ్చరింపబడేటటువంటి; వర్ణంబు= వర్ణాలు; మంత్రంబు= మంత్రాలు; స్వరంబు= ఉదాత్తాది స్వరాలు; జంగమ మనస్సుగాన్= జంగమ మనస్సుగా; నెగడున్= ఉంటుంది; దానికంటెన్= ఆ జంగమమనస్సుకన్నా; నీవు+ఎక్కుడు= నీవు గొప్ప; నీకంటెన్; స్థావర మనస్సు= స్థిరమైన మనస్సు; ఎక్కుడు= అధికం; కావున= అందుచేత; ఈ+మాట= ఈ పలుకు; ఆడన్+కలదానవు+కావు= పలకటానికి తగినదానవు కావు (ఈ మాట అనరాదు); అని; నిర్దేశించెన్= ఉపదేశించాడు.

తాత్పర్యం: 'నేను నీకు అన్ని కోరికలను వర్షిస్తున్న దానిని కదా! నన్ను ఇట్లా తక్కువ చేసి మాటాడటం బాగున్నదా? అని సరస్వతి అడుగగా బ్రహ్మ ఇట్లా అన్నాడు. 'స్థిరమని, చరమని (కదిలేది) నాకు రెండు మనస్సులున్నాయి. వాటిలో స్థిరం నావద్దా, చరం నీవద్దా ఉంటాయి. నీ అనుగ్రహంతో పుట్టే వర్ణమంత్రస్వరాదు లన్నీ చరచిత్తంగా పర్యవసిస్తాయి. దానికన్నా నీవు గొప్పదానవు. నీకన్నా స్థిర చిత్తం గొప్పది. అందుచేత నీవు ఇట్లా మాటాడటం సమంజసంగా లేదు.' అని ఆయన ఉపదేశించాడు.

విశేషం : ఈ సందర్భంలో చెప్పబడ్డ స్థిర, చర చిత్త విషయం ఆధునిక మనస్తత్వశాస్త్రప్రకారంగా (విశ్వ, వైయక్తిక చైతన్యాలుగా) పరిగణించబడుతున్న చైతన్యభేదాలనే స్థిర, చర మనస్సులుగా భారతం ప్రతిపాదిస్తున్నది. విశ్వమనస్సు సర్వభావభాండాగారం. వర్ణమంత్రస్వరరూపమైన శబ్దం. దాని భావజగత్తు పరిమిత మైనది. అందుకే 'జంగమ' (కదిలేది) మని బ్రహ్మ చెప్తున్నాడు. దీనికి పరమైన వాగ్దేవి జంగమమనస్సుకంటె గొప్పది. కాని బ్రహ్మపదార్థం అపరిమితమైన విశ్వభావపర్యాప్తమైనది. అందుకే బ్రహ్మ ఇట్లా ఉపదేశించాడు.

క. విను మమ్మెయి నిర్దేశం । బున నవ్వాగ్దేవి మూర్ఛవోయినయ ట్లే
మిని బలుక కుండి పదపడి । వినయంబున నజుని శరణువేఁడె లతాంగీ!' 21

ప్రతిపదార్థం: లతాంగీ!= తీగవంటి దేహం కలిగిన ఓ వనితా!; వినుము; ఆ+మెయిన్= ఆ విధంగా (చేసిన); నిర్దేశంబునన్= ఉపదేశంతో; ఆ+వాగ్దేవి= ఆ సరస్వతి మూర్ఛ+పోయిన+అట్లు= మూర్ఛపోయిన విధంగా; ఏమినిన్= ఏమీ; పలుక+ఉండి= మాటాడకుండా ఉండిపోయిన; పదపడి= తరువాత; వినయంబునన్= వినయంతో; అజునిన్= బ్రహ్మను; శరణువేఁడెన్= శరణు కోరింది.

తాత్పర్యం: ఓ వనితా! ఆ విధంగా బ్రహ్మ ఉపదేశం చేయటంతో సరస్వతి మూర్ఛపోయినట్లుగా ఏమీ పలకకుండా ఉండిపోయి. కొంచెం సేపటికి బ్రహ్మదేవుడిని శరణుకోరింది.'

వ. అనిన బ్రాహ్మణి పతితో 'బ్రహ్మమాటకుం గొఱవొయిన వాణి యేమిటం దేఱె?' నని యడిగిన బ్రాహ్మణుం డిట్లనియె. 22

ప్రతిపదార్థం: అనినన్= అని బ్రాహ్మణుడు చెప్పగా; బ్రాహ్మణి= ఆ బ్రాహ్మణస్త్రీ; పతితోన్= తన భర్తతో; బ్రహ్మమాటకున్= బ్రహ్మమాటకు; కొఱ+పోయిన= చిన్నబోయిన; వాణి= సరస్వతి; ఏమిటన్= దేనిచేత; తేఱెను?+అని= తేరుకుంది?అని; అడిగినన్= అడుగగా; బ్రాహ్మణుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని బ్రాహ్మణుడు చెప్పగా ఆయన భార్య 'బ్రహ్మ మాటలతో చిన్నబోయిన సరస్వతి ఎట్లా సర్దుకొంది' అని అడుగగా బ్రాహ్మణుడు ఇట్లా చెప్పాడు.

క. 'ప్రాణాపానంబుల యెడ। వాణి నిలుచుఁ గాన ప్రాణవాయు వొదవి తత్
క్షీణత్వ ముడిపె నది గీ। ర్వాణజ్యేష్ఠప్రభావవాసిత యగుటన్. 23

ప్రతిపదార్థం: ప్రాణ+అపానంబుల+ఎడన్= ప్రాణాపానాల నాశ్రయించి; వాణి= సరస్వతి; నిలుచున్+కానన్= నిలుస్తుంది (ఉంటుంది) కాబట్టి; ప్రాణవాయువు+ఒదవి= ప్రాణవాయువు ప్రసరించి; తద్+క్షీణత్వము= దానియొక్క నశించటాన్ని (లేదా సరస్వతి క్షీణించటాన్ని); అది= ఆ ప్రాణవాయువు గీర్వాణ జ్యేష్ఠ= సురజ్యేష్ఠుడైన బ్రహ్మ యొక్క; ప్రభావ వాసిత+అగుటన్= ప్రభావంచేత మహనీయమైనది కావటంచేత (బ్రహ్మదేవుడు వాక్కును సృష్టించారు కాబట్టి, ఉడిపెన్= పోగొట్టింది)

తాత్పర్యం: 'వాణి ప్రాణాపానాలను ఆశ్రయించి పుట్టుతుంది కాబట్టి, వాణి క్షీణించగానే ఆమెలోని ప్రాణవాయువు గీర్వాణి' ప్రథముడైన బ్రహ్మయొక్క ప్రభావంవలన మహనీయమైనది కావటంచేత ఆ సరస్వతి పడుతున్న క్షోభను పోగొట్టగలిగింది.

వ. ఇట్టి వని వాఙ్మనఃప్రకారంబు లెఱుంగుట మోక్షంబునకు మూలం; బింకను వాణి మనస్సుల తెఱంగు సెప్పెద వినుము. 24

ప్రతిపదార్థం: వాక్+మనస్+ప్రకారంబులు= వాక్కుల, మనస్సుల పద్ధతులు; ఇట్టివి+అని= ఇట్లాంటివని; ఎఱుంగుట= తెలిసికొనటం; మోక్షంబునకున్+మూలంబు= మోక్షానికి ఆధారం; ఇంకను= ఇంకా; వాణీ= వాక్కు; మనస్సుల= మనస్సులు ప్రవర్తించే; తెఱంగు= రీతిని; చెప్పెదన్= చెప్పుతాను; వినుము.

తాత్పర్యం: వాక్కు, మనస్సులు ప్రవర్తించే రీతులు ఇవని గుర్తించటం మోక్షానికి మూలమవుతుంది. ఇంకా ఈ రెండూ ఎట్లా ఉంటాయో చెప్పుతాను వినుము.

తే. ప్రాణుఁ బొదువుట వాణి యపానుఁ జెంది। తాను దాన భూతాత్మ యై తనువు విడిచి
వ్యానచేష్టిత సర్వసంవ్యాప్తి నొంద। మనసు సుస్థితి నొందు సమాను నందు. 25

ప్రతిపదార్థం: ప్రాణున్= ప్రాణం అనే వాయువును; పొదువుటన్= ఆక్రమించుకొనటంవలన; వాణి= వాక్కు; అపానున్+చెంది= అపానుడనే ప్రాణాన్ని చెంది; తాను+తాను+అ= తానే స్వయంగా (తనకు తానే); భూతాత్మ+ఐ= భూతరూపాన్ని పొంది= తనువు+విడిచి= దేహాన్ని వదలిపెట్టి; వ్యాన+చేష్టితన్= వ్యానుడి క్రియవలన; సర్వసంవ్యాప్తిన్+ఒందన్= దేహమంతటా వ్యాపించగా; మనసు ప్రశాంతమై సుస్థితి పొందుతుంది.

తాత్పర్యం: ప్రాణుని పొందటంవలన వాణి అపానుడిని కూడా చేరుతుంది. తనకు తానే తన రూపాన్ని (శబ్దరూపాన్ని)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వదలిపెట్టి, భూతాలలో కలిసిపోయి, వ్యానుడి క్రియవలన దేహమంతటా వ్యాపిస్తుంది. సమానుడిలో ప్రవేశించినపుడు మనస్సు ప్రశాంతమై సుస్థితి పొందుతుంది.

వ. మనసు సుస్థితం బొందుట ముక్తికిం గారణ' మని చెప్పి వెండియు. 26

ప్రతిపదార్థం: మనసు; సుస్థితిన్+పొందుట= ప్రశాంతత్వాన్ని పొందటం; ముక్తికిన్= ముక్తికి; కారణము+అని= కారణమని; చెప్పి; వెండియున్= మళ్ళీ,

తాత్పర్యం: మనసు ప్రశాంతతను పొందటమే ముక్తికి కారణ' మని చెప్పి మళ్ళీ (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. 'ఘోషిణి నాఁగ నఘోషిణి యన రెండు। దెఱంగులు గలిగి వాగ్దేవి పరఁగు
నం దఘోషిణి గరీయసి యుత్తమరసంబు। గోవు చందంబునఁ గురియుచుండు
నవ్యయరూప దివ్యప్రభావోజ్జ్వల। బ్రహ్మవాదిని యిట్లు బ్రాహ్మివిధము
గనుట మహానందకర' మని చెప్పి య। వ్విప్రుండు మఱియు నవ్వెలఁదితోడ

తే. 'వినుము ఘ్రాణాదికము లైదు మనసు బుద్ధి। యొక యధిష్ఠానమున నుండియును నెఱుంగ
వబల! యొండొంటి విషయంబు నలమికొనఁగ'। ననిన 'వివరింపు మా తెఱం' గనియె నింతి 27

ప్రతిపదార్థం: ఘోషిణి+నాఁగన్= ఘోషిణి అని; అఘోషిణి అనన్= అఘోషిణి అని; రెండు తెఱఁగులు= రెండు విధాలు; కలిగి; వాగ్దేవి+ఎసఁగున్= వాగ్దేవి ప్రకాశిస్తుంది; అందున్= వాటిలో; అఘోషిణి; గరీయసి= గొప్పది; ఉత్తమరసంబున్= అత్యుత్తమ రసాన్ని; గోవు చందంబునన్= గోవువలె; కురియుచున్+ఉండున్= కురుస్తూ ఉంటుంది; అవ్యయ+రూప= ఆమె నశించనటువంటి రూపం కలిగినది; దివ్యప్రభావ+ఉజ్జ్వల= మహనీయశక్తితో ఉజ్జ్వలంగా ప్రకాశిస్తున్నది; బ్రహ్మవాదిని= బ్రహ్మపదానికి వాచకం; ఇట్లు= ఈ విధంగా; బ్రాహ్మి విధమున్+కనుట= సరస్వతీతత్త్వాన్ని తెలిసికొనటం; మహానందకరము= మహానందాన్ని ప్రసాదిస్తుంది; అని; చెప్పి; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; మఱియున్= ఇంకా; ఆ+వెలఁదితోడన్= ఆ స్త్రీతో; వినుము; ఘ్రాణ+ఆదికములు= ముక్కు మొదలైన; ఐదున్= ఐదు ఇంద్రియాలు; మనసు; బుద్ధి (ఈ ఏడూ); ఒక= ఒకే; అధిష్ఠానమునన్= ఆధారంలో; ఉండియునున్= ఉన్నా కూడా; అబల!= ఓ వనితా!; ఒండొంటి విషయంబున్= ఒకటి మరొక విషయాన్నిగురించి; అలమికొనఁగన్= వ్యాపించటానికి; ఎఱుంగవు= సమర్థాలు కావు; అనినన్= అనగా ఇంతి= ఆ స్త్రీ; ఆ తెఱంగు= ఆ విధం; వివరింపుము+అనియెన్= వివరంగా చెప్పుము అని కోరింది.

తాత్పర్యం: 'వాక్కు ఘోషిణి (శబ్దించేది), అఘోషిణి (శబ్దించనిది) అని రెండు విధాలుగా ఉంటుంది. అందు అఘోషిణి గొప్పది. తనంతట తాను వర్షించే గోవువలె అది అమృతాన్ని (ఉత్తమరసమంటే అదే) వర్షిస్తుంది. ఆ వాక్కు అవ్యయరూపమైనది. మహనీయశక్తితో ఉజ్జ్వలంగా ప్రకాశిస్తుంది. అది బ్రహ్మపదానికి వాచకం. ఇది బ్రాహ్మీతత్త్వం. దీనిని తెలిసికొంటే మహానందం సిద్ధిస్తుంది' అని చెప్పి, ఆ బ్రాహ్మణుడు అతడి భార్యతో ఇట్లా చెప్పాడు 'ముక్కు మొదలైన కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి అనే ఈ ఏడూ ఒకే జీవుడిని ఆశ్రయించి ఉన్నా ఒకదాని పనిని మరొకటి చేయటానికి సమర్థం కావు' అని భర్త చెప్పగా ఆ వనిత 'అది ఎట్లాగో వివరంగా చెప్పండి' అని అడిగింది.

విశేషం : వైదికవాఙ్మయంలో శబ్దించే వాక్కును 'వైఖరి' అని, శబ్దించని వాక్కును పరా, పశ్యంతి, మధ్యమ అని వేరు చేసి

చెప్పటం జరిగింది. మనుష్యులు మాటాడేది 'వైఖరి' అని; తక్కిన 'అఘోషిణి' వాక్కు 'గుహ'లో దాగి ఉంటుందని; దానిని ధీమంతులు మాత్రమే గుర్తించగలరని చెప్పారు.

"చత్వారి వాక్ పరిమితా పదావి । తావి విదుర్బ్రహ్మణో యే మనీషిణః
త్రీణి గుహా నిహితానేఙ్గయంతి । తురీయో వాచో మనుష్యా వదంతి"

ఇక 'అఘోషిణి' ఎట్లాంటిదో, అది 'గోవు' రూపం కలిగినది అంటే ఏమిటో కూడా చాలా ప్రధానమైనది. 'బ్రాహ్మీ తు భారతీ భాషా గీర్వాగ్వాణీ సరస్వతీ' అని ఏడు పేర్లు (సరస్వతి, వాణి, వాక్కు, గీః, భాషా, భారతీ, బ్రాహ్మీ)- వాక్కుకు పర్యాయపదాలున్నాయి. వీరు సప్తమాతృకాస్వరూపాలు. బ్రహ్మతత్త్వం ఏ వాక్కుచేత వ్యక్తీకరించబడుతుందో ఆ అవ్యక్త - అమృత నిష్యంది-వాక్కు పరా వాక్కు అనబడింది. అదే 'బ్రాహ్మీ'. స్వతంత్రమైనదీ, అతర్క్యమైనదీ అయిన సృజనాత్మకప్రతిభ దాని లక్షణం. అందుకే అది తన అంతస్తత్త్వాన్ని తనకు తానుగా మనీషులకు వ్యక్తం చేస్తుందని వేదం ప్రతిపాదించింది (జాయేవ పత్య ఉశతీ సువాసాః అని వైదికోపమానం - ధర్మపత్ని తన స్వస్వరూపాన్ని భర్తకు మాత్రమే చూపించినట్లు అని అర్థం.)

మునుపు 20వ పద్యంలో నేను నీకు 'కామదోహిని' గా ఉన్నాను కదా! అనే మాటకు అర్థమే 'అమృతాన్ని గోవు రూపంగా వర్షిస్తుంది' అని ఇక్కడ చెప్తున్నది కూడా. కామధేను వని, కల్పవృక్షమని, నందిని అనే పేర్లతో ఏయే వర్ణనలు కావ్యాలలో కనిపిస్తాయో అవన్నీ దివ్యవరప్రభావసమర్థాలైనవే. దివ్యవాక్కును అనుసరించి అర్థం ప్రవర్తిస్తుంది కాబట్టి (ఋషీణాం పునరాద్యానాం వాచ మర్థోఽను ధావతి - అని భవభూతి) తన ఉత్తరరామచరిత్ర నాటకంలో) పరావాక్కు అమృతరసనిష్యందిని.

కవులనే బాలకులకు సరస్వతీమాత అనే గోవు తన క్షీరాన్ని స్వయంగా కురిపించి, వారికి తన రసస్వరూపాన్ని ప్రసాదించి వారిని బలోపేతులుగా చేస్తుందని అభినవగుప్త పాదాచార్యులు 'లోచన' వ్యాఖ్యానంలో అంటారు.

శ్రీ శంకరులు కూడా 'తవ స్తన్యం మన్యే' అనే సౌందర్యలహరి శ్లోకంలో 'నీ స్తన్యం త్రాగటంవలననే కదా ద్రావిడశిశువైన నేను సంస్కృతంలో ఇంత గొప్ప కవిని అయ్యాను!' అని ఆ మహామాతృస్వరూపిణిని వర్ణించారు. 'సంగీతసాహిత్యాలు సరస్వతీ స్తనరూపాలని వర్ణించటంలోనూ ఈ రహస్యమే ఉన్నది. కనుక వాణి ఉపాసనీయురాలైన దేవతగా పురాణాలలో చెప్పబడినది.'

వ. అనుటయు నయ్యవనీదేవుం డయ్యువిద కిట్లనియె 28

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; ఆ+అవనీదేవుండు= ఆ బ్రాహ్మణుడు; ఆ+ఉవిదకున్= ఆ స్త్రీతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని ఆమె అడుగగా ఆ భూసురుడు ఆ స్త్రీతో ఇట్లా అన్నాడు.

సీ. 'గంధంబు ఘ్రాణంబ కాని తక్కిన యాఱు । నధిగమింపఁగ నోప, వధిగమించు
రసము జిహ్వయ యితరము లాపనికిఁ గావు; । రూపంబుఁ జక్షుస్స యోపు నెఱుఁగఁ
బెఱయని యెఱుఁగవు తెఱవ! సంస్పర్శంబుఁ । గాంచుఁ జర్మంబ తక్కటివి గానఁ
జాలవు; శబ్దంబుఁ జాలుఁ బట్టంగ శ్రో । త్రంబ; యన్యములు దత్కరణమునకు

తే. వెరవులేవు; సంశయిత సంవేదనంబు । మనసు కృత్యంబ యిక్కార్యమునకు నొండ్లు
సౌరవు; నిష్ఠ బుద్ధిన యగుఁ జొరఁగ నేర; । విత్తెఱంగున కపరంబు లెఱిఁగి కొనుము. 29

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: తెఱవ!= ఓ వనితా!; గంధంబున్= గంధాన్ని గుర్తించటానికి; ఘ్రాణంబు+అ= ముక్కు మాత్రమే; కాని; తక్కిన+ఆఱున్= ముందు చెప్పిన ఆరూ; అధిగమింపఁగన్+ఓపవు= ఆక్రమించటానికి సమర్థాలు కావు; రసమున్= రసాన్ని (రుచిని); జిహ్వ+అ= నాలుకే; అధిగమించున్= గుర్తిస్తుంది; ఇతరములు= ఇతరాలు; ఆ పనికిన్+కావు= ఆ పనిచేయజాలవు; రూపంబున్= రూపాన్ని; చక్షుస్సు+అ= కళ్ళు మాత్రమే; ఎఱుఁగన్+ఓపున్= గుర్తించగలుగుతాయి; పెఱ+అవి= తక్కిన అవయవాలు; ఎఱుఁగవు= గుర్తింపజాలవు; సంస్పర్శంబున్= స్పర్శలక్షణాన్ని; చర్మంబు+అ= చర్మం మాత్రమే; కాంచున్= కలిగి ఉంటుంది; తక్కటివి= తక్కిన అవయవాలు; కానన్+చాలవు= ఆ లక్షణాన్ని పొందలేవు; శబ్దంబున్= శబ్దాన్ని; శ్రోత్రంబు+అ= చెవి మాత్రమే; పట్టంగన్+చాలున్= వినగలుగుతుంది; అన్యములు= తక్కినవి; తద్+కరణమునకున్= ఆ పనిచేయటానికి; వెరవు లేవు= సమర్థాలు కావు (వెరవు= ఉపాయం, శక్తి); సంశయిత= సంశయించటం; సంవేదనంబు= తెలిసికొనటం; మనసు= మనస్సుయొక్క; కృత్యంబు+అ= పని మాత్రమే; ఈ+కార్యమునకున్= ఈ పనికి; ఒండ్లు= తక్కినవి; చొరవు= ప్రవేశింపవు; నిష్ఠ= శ్రద్ధతో కార్యనిర్వహణం చేయగల సంస్కారం; బుద్ధిన్+ఆ+అగున్= బుద్ధివలననే అవుతుంది; ఈ+తెఱంగునకున్× ఈ పనికి; అవసరంబులు= తక్కినవి; చొరఁగన్+నేరవు= ప్రవేశింపజాలవు; ఎఱిఁగికొనుము= తెలిసికొనుము.

తాత్పర్యం: వాసన పట్టటం ముక్కు మాత్రమే చేస్తుంది. రుచిని నాలుక మాత్రమే గ్రహిస్తుంది. రూపాన్ని కళ్ళు మాత్రమే చూస్తాయి. స్పర్శను చర్మం మాత్రమే గుర్తిస్తుంది. శబ్దాన్ని చెవి మాత్రమే వింటుంది. తక్కిన అవయవాలు కూడా వాటి వాటి పనులు తప్ప వేరే వాటిని చేయజాలవు. సంశయించటం, తెలిసికొనటం మనస్సు పనులు. బుద్ధిలో మాత్రమే నిష్ఠ ఉంటుంది. గుర్తించుము.

విశేషం : కర్మేంద్రియాలకంటె జ్ఞానేంద్రియాలు, వాటికంటె మనస్సు, అన్నిటికంటె బుద్ధి - వీటి కంటె ఆత్మ ఎట్లా ఉన్నత స్థాయిని కలిగినవో అర్థం చేసికొనటంద్వార బ్రహ్మతత్త్వాన్ని సులభంగా వ్యాఖ్యానించవచ్చును. అందుకే సర్వశాస్త్రవిదుడైన ఆ విప్రుడు ఇంద్రియాదుల పరిమితవ్యాపారనిరూపణం చేస్తున్నాడు. ఈ ఇంద్రియాలలో వాగింద్రియం (నాలుక) వాక్ వ్యాపారం (శబ్దించటం) మనిషిని జ్ఞానిగా మార్చగలిగిన ఉత్తమసాధనాలు కాబట్టి వాణీతత్త్వాన్ని గురించి ముందు ఉపన్యసించాడు. వాక్కు - మనస్సు 'తగాదా'ను బ్రహ్మ పరిష్కరించాడు. తక్కిన ఇంద్రియాలు కూడా 'మనస్సు'తో ఎట్లా వివాదపడుతుంటాయో తరువాత వివరిస్తున్నాడు.

ఇంద్రియ మనఃపరస్పరసంవాదప్రకారము (సం. 14-22-13)

వ. 'అని చెప్పి, మనస్సునకు నింద్రియంబులకుం దొల్లి గలిగిన సంవాదంబు సెప్పెద నాకర్ణింపు 'మింద్రియంబులు మనస్సుతో నేము నీవు నొక్క రూప' యనుటయు మనస్సు వాని కిట్లనియె. 30

ప్రతిపదార్థం: అని చెప్పి= అని ఇంద్రియాల పరిమితవ్యాపారపరత్వాన్ని వివరించినవాడై ఆ వనితతో; మనస్సునకున్= మనస్సునకూ; ఇంద్రియంబులకున్= ఇంద్రియాలకు; తొల్లి= మునుపు; కలిగిన= జరిగిన; సంవాదంబు= సంభాషణ (ఇక్కడ తగాదా); చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుము (అంటూ ఇట్లా చెప్పాడు); ఇంద్రియంబులు= ఇంద్రియాలు; మనస్సుతోన్; ఏమున్= మేమూ; నీవు; ఒక్కరూపు+అ= ఒకే విధమైన వాళ్ళమే; అనుటయున్= అనగా; మనస్సు; వానికిన్= ఇంద్రియాలతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: అని చెప్పి, ఆ విప్రుడు తన భార్యతో 'ఒకప్పుడు మనస్సుకు, ఇంద్రియాలకు పెద్ద వాగ్వాదం జరిగింది. ఆ విషయం చెప్పుతాను వినుము. అంటూ ఇట్లా మొదలు పెట్టాడు. 'మనస్సుతో ఇంద్రియాలు అన్నాయి - మేము నీవు ఒకే తీరువాళ్ళమే కదా!' అని. అపుడు మనస్సు ఇట్లా అన్నది.

విశేషం : ఇవి సాంకేతికమైన కథలు, వీటిద్వారా తత్త్వాన్ని సులభంగా బోధించటం వ్యాసమహర్షి ఆశయం.

చ. 'చన దిటులంట గం పెఱుఁగఁ జాలదు నాసిక, జిహ్వయుం జవుల్
గొన వెర వేదు, రూపు గనుఁగొంటకుఁ గన్ను వలంతిగాదు, సోఁ
కు నెఱుఁగు శక్తి చర్మమునకుం బ్రభవింపదు, శబ్దజాతము
న్వినఁ జెవి కల్ప మేనియును నేర్పొడఁగూడదు నేఁ దొఱంగినన్. 31

ప్రతిపదార్థం: ఇటులు+అంట= ఇట్లా అనటం; చవదు= తగదు; నేన్+తొఱంగినన్= నేను వదలిపెడితే (నన్ను నేను ఉపసంహరించుకొంటే); నాసిక= ముక్కు; కంపు+ఎఱుఁగన్+చాలదు= వాసన పట్టజాలదు; జిహ్వయున్= నాలుక; చవుల్+కొనన్+వెరవు+ఏదున్= రుచిపట్టే శక్తిని కోల్పోతుంది; రూపున్+కనుఁగొంటకున్= రూపాన్ని చూడటానికి; కన్ను+వలంతి+కాదు= కన్ను సమర్థం కాదు; సోఁకు= తాకును; ఎఱుఁగు శక్తి= తెలిసికొనే శక్తి; చర్మమునకున్+ప్రభవింపదు= చర్మానికి పుట్టదు; శబ్దజాతమున్= శబ్దజాలాన్ని; వినన్= వినటానికి; చెవి; కల్పము+ఏనియునున్= కల్పకాలం కాచుకొన్నా; నేర్పు+ఒడన్+కూడదు= శక్తిని సంపాదించుకొనజాలదు.

తాత్పర్యం: 'ఇట్లా అనటం సమంజసం కాదు. నేను లేకపోతే ముక్కు వాసన పట్టదు. నాలుక రుచులు లెక్కింపజాలదు. కన్ను దేనినీ చూడజాలదు. చర్మం గుర్తించదు. ఎన్ని ఏళ్ళు గడిచినా శబ్దాన్ని వినే శక్తి చెవికి ఉండదు.

విశేషం : అందుకే ముందటి పద్యంలో సంవేదనంబు (తెలిసికొనటం) మనస్సు చేసే పనిగా చెప్పాడు. చెవి ఇత్యాదులు చేస్తున్న పనులను మనసు సహాయంతోనే ఇంద్రియాలు చేస్తున్నాయి. లేకపోతే వాటి కా శక్తిలేదు.

వ. నిజంబుగా నేను దొఱంగితి నేని. 32

ప్రతిపదార్థం: నిజంబుగాన్= నిజానికి; నేను+తొఱంగితిన్+ఏనిన్= నేను నన్ను ఉపసంహరించుకొంటే.

తాత్పర్యం: నిజంగా నేను పక్కకు వెళ్ళితే - పనిచేయటం మానేస్తే. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. అప్రయోజనంబులై యుండు నాఱిన। నిప్పులట్లు శూన్యనిలయములును
బోలె మీ స్వరూపములు గాన మనలోన। నెక్కుడేన సూవె యింత నిజము.' 33

ప్రతిపదార్థం: ఆఱిన నిప్పులు+అట్లు= ఆరిపోయిన నిప్పులవలె; శూన్యనిలయములునున్+పోలెన్= ఎవరూ లేని ఇళ్ళవలె; మీ స్వరూపములు= మీ మీ రూపాలు; అప్రయోజనంబులు+ఐ+ఉండున్= ఏ ప్రయోజనమూ లేనివిగా ఉంటాయి; కానన్= కాబట్టి; మనలోనన్= మనందరిలో; ఏను+అ= నేనే; ఎక్కుడు= అధికుడిని; చూవె!= సుమా!; ఇంత= నేను చెప్పినదెల్ల, నిజము= సత్యం.

తాత్పర్యం: నేను లేని పక్షంలో మీ మీ రూపాలు ఆరిపోయిన నిప్పువలె, శూన్యగృహాలవలె ఏ ప్రయోజనమూ లేనివిగా పడి ఉంటాయి. అందుచేత మన అందరిలో నేనే గొప్పదానను. ఇది మాత్రం సత్యం."

వ. అనిన విని యింద్రియంబులు మనంబున కిట్లనియె. 34

తాత్పర్యం: అనగా విని ఇంద్రియాలు మనస్సుతో ఇట్లా అన్నాయి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం : మనసు అనుభవాలను కలిగిస్తున్నదన్నమాట నిజమే. కాని ఇంద్రియాలు అనుభవద్వారాలు. అవి లేకుండా మనసు మాత్రం ఏమి చేస్తుంది! అందుకే ఇంద్రియాలు ఇట్లా అన్నాయి.

సీ. **'ఇంతవ ట్టిట్టిద యిట్లైన యంతన। కలుగనేర్చునె యధికత్వ మేము**
వెలిగాఁగ? నీ వొక విషయంబు నేనియు। ననుభవించితయేని నధిక మగుట
గానంగ వచ్చు? మాలో నొకం డడఁగిన। ననుభవింపుము తదీయార్థ; మట్లుఁ
గాక ఘ్రాణంబున గంధంబ జిహ్వ ర। సంబ చక్షువున రూపంబ వినుము

ఆ. **చర్మశక్తిఁ జేసి సంస్పర్శ విషయంబ। శ్రోత్రయుక్తి శబ్దమాత్రకంబ**
కానియొంట నొంటిఁ గబళింపఁ జాల వె। ట్లధికతా నిరూఢి కాసవడితి? **35**

ప్రతిపదార్థం: ఇంత+పట్టు+ఇట్టిది+అ= ఇంతమాత్రం నిజమే; ఇట్లు+ఐన+అంతన= ఇంతమాత్రాన; అధికత్వము= గొప్పతనం; కలుగన్+నేర్చునె?= ఏర్పడుతుందా!; ఏము+వెలికాఁగన్= మేము లేకుండా; ఈవు= నీవు; ఒక విషయంబును ఏనియున్= ఒక విషయాన్నైనా; అనుభవించితి(వి)+అ+ఏనిన్= అనుభవించగలిగి ఉంటే; అధికము+అగుటన్+ గొప్పకావటాన్ని; కానంగన్+వచ్చున్= చూడవచ్చును; మాలోన్= మాలో; ఒకండు= ఒకడు; అడఁగినన్= అణగిపోయినపుడు; తదీయ+అర్థము= అతడి కోరికను; అనుభవింపుము= అనుభవించుము (చూద్దాము); అట్లు+కాక= అట్లా కాకుండా; ఘ్రాణంబునన్= ముక్కుద్వారా; గంధంబు+అ= గంధమే; జిహ్వన్= నాలుకతో; రసంబు+అ= రసమే; చక్షువునన్= కంటితో; రూపంబు+అ= రూపమే; వినుము= ఇంకా వినుము; చర్మశక్తిన్+చేసి= చర్మశక్తివలన; సంస్పర్శ విషయంబు+అ= బాగా తాకటమే; శ్రోత్రయుక్తిన్= చెవితోకూడి; శబ్దమాత్రకంబు+అ= శబ్దాన్ని మాత్రమే (వింటావు); కాని; ఒంటిన్= ఒకదానితో; ఒంటిన్= మరొకదానిని; కబళింపన్+చాలవు= ఆక్రమింపజాలవు; అధికతా నిరూఢికిన్= ఆధిక్యం పొందటానికి; ఎట్లు= ఏ విధంగా; ఆసపడితి(వి)?= ఎట్లా ఆశపడ్డావు?

తాత్పర్యం: 'నీవు చెప్పినది నిజమే! ఒప్పుకుందాము కాని ఇంత మాత్రాన నీకు గొప్పతనం ఏర్పడుతుందా? మేము లేకుండా నీవు ఒక విషయాన్ని అయినా అనుభవించగలిగి ఉంటే అప్పుడు నీ గొప్పతనాన్ని గుర్తించవచ్చును. మాలో ఒకడు లోపించినపుడు ఆ ఇంద్రియసుఖాన్ని నీవు అనుభవించుము (చూద్దాము). అట్లా నీవు చేయలేవు. ముక్కు ద్వారా గంధాన్ని మాత్రమే వాసన పట్టగలుగుతావు. నాలుకతో రసాన్నే చవిచూస్తావు. కంటితో రూపాన్ని మాత్రమే చూడగలవు. చర్మంతో స్పర్శను, చెవితో శబ్దాన్ని చేయగలవు. ఒకదానితో మరొకదానిని కబళించేశక్తి నీకు లేదు కదా! అందుచేత నీ గొప్ప ఏమిటి? ఎందుకంత ఆశ?

క. **మును మే మాలంబించిన। వెనుకఁ గదా నీకు ననుభవింప వశం? బో**
మనసా! నీ వెంగిలి కా। దనుమా యవ్విషయ మెక్కు డయ్యెడు మనలోన్. **36**

ప్రతిపదార్థం: ఓ మనసా!= మును= ముందుగా; మేము; ఆలంబించిన= పట్టుకొన్న (ఆక్రమించిన, అనుభవించిన); వెనుకన్= తరువాత; కదా; నీకున్+అనుభవింపన్= నీకు అనుభవించటానికి (శక్యమౌతుంది); ఆ+విషయమున్= ఆ విషయాన్ని; నీవు+ఎంగిలి కాదు+అనుమా= నీవు ఎంగిలికాదని చెప్పుము; ఎక్కుడు= అధిక్యం; మనలోన్= మనలో; అయ్యెడున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: ఓ మనసా! ముందుగా మేము అనుభవించాక కదా విషయసుఖాన్ని నీవు అనుభవించటం! అందుచేత నీవు అనుభవిస్తున్నది ఎంగిలి మాత్రమే. అట్లా కాదని చెప్పుము చూద్దాము. అప్పుడు నీదే అధిక్యం.

విశేషం : మనసు ఇంద్రియాల ద్వారా అనుభవిస్తున్న సుఖదుఃఖస్పర్శ తొలుత ఇంద్రియాలకే కదా తగిలేది! తరువాతే మనసు అనుభవిస్తుంది. ఇది ఇంద్రియాలు చేస్తున్న వాదం.

క. **నీ వడఁగిననుం బ్రాణముఁ। గావఁగ మాయందు బోధకం బగు ద్రవ్యం**
బావర్తింపఁగఁ జేయుట। గావించును నీకుఁ దెలివు గనికొను మిదియున్. **37**

ప్రతిపదార్థం: నీవు+అడఁగిననున్= నీవు నశించినా; ప్రాణమున్+కావఁగన్= ప్రాణాన్ని కాపాడటానికి; మా+అందున్= మాలో; బోధకంబు+అగు= జ్ఞానదాయకమైన; ద్రవ్యంబు= పదార్థం; నీకున్= నీకు; తెలివున్= జ్ఞానాన్ని; ఆవర్తింపఁగన్+చేయుటన్= మరల తిరిగివచ్చేటట్లు చేయటాన్ని; కావించును= చేస్తుంది; ఇదియున్= ఇదికూడా; కనికొనుము= తెలిసికొనుము.

తాత్పర్యం: నీవు ఇంకొకవిషయం తెలిసికొనుము. ఒక సమయంలో నీవు నశించినా మాలోని పదార్థమే మరలా నీలో జ్ఞానదాయకమైన శక్తిని మరలా కలిగించి నిన్ను బ్రతికిస్తుంది. (ప్రాణదాయకమైన చైతన్యశక్తి మాలోకూడా ఉన్నది. దీనిని మరచిపోవద్దు అని అర్థం).

సీ. **అట్లు గా దిట్లని యనుశాసనము సేయఁ। గడు నేర్చు శిష్యులకడకుఁ బోయి**
వినిపింపఁ దొడఁగి యవ్వినుతార్థములు వార। లుగ్గడింపఁగఁ గను నొజ్జవోలె
మముఁ గొని విషయోత్కరము నీవు భోగ్యంబు। గాఁ జేసికొందు నీ కలలు గన్న
యప్పుడు మా లేమి నవ్విషయంబు బొం। కైన వాకిలిలేని యాలయంబుఁ

ఆ. **జెందిమరలినట్లు సేడ్పాటు వొరయుదు। గాక సత్యభుక్తి గలదె నీకు?**
నింతపట్టు గాన్పు మేమును నీవును। గలసి పరఁగ భోగకలన గలుగు.' **38**

ప్రతిపదార్థం: అట్లు+కాదు= అట్లా కాదు; ఇట్లు+అని= ఇట్లా అని; అనుశాసనము+చేయన్= నిర్ణయం చేయటానికి; కడున్+నేర్చు = మిక్కిలి నేర్పరులైన; శిష్యులకడకున్+పోయి= శిష్యులవద్దకు వెళ్ళి; వినిపింపన్+తొడఁగి= ఉపదేశం ప్రారంభించి; ఆ+వినుత+అర్థములు= ఆ గొప్ప విషయాలను; వారలు= ఆ శిష్యులు; ఉగ్గడింపఁగన్= చెప్పుతుండగా; కను= చూస్తున్న; ఒజ్జ+పోలెన్= గురువువలె; మమున్+కొని= మమ్ములను ఆధారంగా గ్రహించి; నీవు; విషయ+ఉత్కరమున్= విషయసమూహాన్ని; భోగ్యంబుగాన్= అనుభవించదగినదిగా; చేసికొందు(వు)= చేసికొంటావు; నీ కలలు= నీవు కలలు; కన్న+అప్పుడు= కన్నప్పుడు; మా లేమిన్= మేము లేకపోతే; ఆ+విషయంబు= ఆ విషయానుభవం; బొంకు+ఐనన్= అబద్ధం కాగా; వాకిలిలేని= తలుపులేని; ఆలయంబున్+చెంది= ఇంటిలోనికి వెళ్ళి; మరలినట్లు= తిరిగివచ్చినట్లు; చేడ్పాటున్= కీడును (నిర్వ్యాపారాన్ని); పొరయుదు(వు)+కాక= పొందుతావు తప్ప; నీకున్= నీకు; సత్యభుక్తి= నిజంగా అనుభవించటం; కలదె?= ఉన్నదా?; ఇంత+పట్టున్+కాన్పు(ము)= ఇంతమాత్రం అర్థంచేసికొనుము; ఏమునున్= మేమూ; నీవునున్= నీవూ; కలసి+పరఁగన్= కలిసి పనిచేస్తే; భోగకలన= భోగానుభవం; కలుగున్= కలుగుతుంది.

తాత్పర్యం: అట్లా కాదు - ఇట్లా చేయాలి అని చెప్పటంకొరకు మిక్కిలి నేర్పరులైన శిష్యులవద్దకు వెళ్ళి ఉపదేశం ప్రారంభించి, చివరికి ఆ శిష్యులు ఆ గొప్ప విషయాలను చెప్పుతుండగా నివ్వెరపోయి చూచి వింటున్న గురువువలె ఉన్నది నీ పని, మమ్ములను ఆధారంగా గ్రహించి నీవు విషయసమూహాన్ని అనుభవించదగినదిగా చేసికొంటున్నావు. మేమే లేకుండాపోతే ఆ విషయానుభవం వట్టి 'బొంకు' మాత్రమే! తలుపులులేని ఇంటిలోనికి వెళ్ళి మరలివచ్చినట్లు

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నిష్ప్రయోజకంగా నీవు తయారవుతావు. అందుచేత నీకు నిజమైన అనుభవం ఎక్కడిది? ఇంతమాత్రం అర్థంచేసికొనుము. మేమూ నీవూ కలిస్తేనే 'భోగానుభవం' కలుగుతున్నది. అందుచేత నీ గొప్ప ఏమిటీ?' అని ఇంద్రియాల వాదం.'

విశేషం: అలం; ఉపమ మనస్సు లేక ఇంద్రియాలు, ఇంద్రియాలు లేక మనస్సు రెండూ అనుభవాన్ని పొందజాలవని భావం. నిజానికి మనస్సు ఇంద్రియముఖంగా అనుభవం పొందుతుండగా, ఇంద్రియాలు మనస్సుద్వారా విషయాభిరమణం పొందుతున్నాయి. అందుచేత రెండూ ప్రధానమే. మనస్సు ఇంద్రియాలను నియంత్రించగల సందర్భం ఉంటుందేమో కాని, ఎక్కువ ఇంద్రియాలు చెప్పినట్లు మనస్సు ప్రవర్తించటమూ ఉన్నది. ఇంద్రియాలలోని ప్రాణశక్తివలన మనస్సును మరలా ఉత్తేజితంచేసే శక్తి అవయవాలకున్నది.

వ. అని యివ్విధంబున మనంబును నింద్రియంబులును సంవాదంబు సేసె' నని యప్పురుషవరుం డా వర వర్ణినితో 'వేఱొక్కండు విను' మని యిట్లనియె. 39

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; ఈ విధంబునన్= ఈ రీతిగా; మనంబునున్= మనస్సూ; ఇంద్రియంబులునున్= ఇంద్రియాలూ; సంవాదంబు+చేసెను+అని= వాదోపవాదాలు జరిపాయని; ఆ+పురుషవరుండు= ఆ పురుషశ్రేష్ఠుడు; ఆ+వర+వర్ణినితోన్= ఆ శ్రేష్ఠమైన స్త్రీతో; వేఱు+ఒక్కండు= మరొక విషయం; వినుము+అని= వినుమని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి. 'ఈ రీతిగా మనస్సు ఇంద్రియాలు వాదోపవాదాలు చేశా' యని ఆ బ్రాహ్మణుడు తన భార్యతో చెప్పి 'ఇంకా మరొక విషయం ఉన్నది వినుము' అంటూ ఇట్లా అన్నాడు.

సీ. 'ప్రాణప్రభృతులగు పవను లంభోరుహ। గర్భుని నొక్కటఁ గానఁబోయి
'యెక్కుడు మాలోన నెవ్వరు?' నావుడు। నవ్విభుం 'డెవ్వార లడఁగ నడఁగు
దురు పెఱవార? లెవ్వరికిఁ బ్రవర్తన। మొందిన నెల్లవారును జరింతు
రధికు లందఱకును నట్టి వారలు మీరు। సనుఁ' డని పలికినఁ జనక నిలిచి

ఆ. ప్రాణుఁ డాది గాఁగ బవనులందఱుఁ దమ। వలన నవ్విధంబు గలుగఁ దెలుప
నాతఁ 'డే నెఱుంగనా? యది యట్టిద। వినుఁడు మీ విశేషవృత్తి భంగి'. 40

ప్రతిపదార్థం: ప్రాణ ప్రభృతులు+అగు= ప్రాణుడు, అపానుడు మొదలైన; పవనులు= వాయువులు; అంభోరుహగర్భునిన్= కమలగర్భుడైన బ్రహ్మను; ఒక్కటన్= అందరూ కలిసి; కానన్+పోయి= చూడబోయి; మాలోనన్= మా అందరిలోనూ; ఎక్కుడు= అధికుడు; ఎవ్వరు?= ఎవడు?; నావుడున్= అనగా; ఆ+విభుండు= ఆ స్వామి; ఏ+వారలు= ఎవరు; అడఁగన్= అణిగిపోతే; పెఱవారలు= ఇతరులు; అడఁగుదురు= అణిగిపోతారో; ఎవ్వరికిన్= ఎవరు; ప్రవర్తనము+ఒందినన్= పనిచేయటం మొదలు పెట్టితే; ఎల్లవారునున్+చరింతురు= అందరూ ప్రవర్తిస్తారో; అట్టివారలు= అట్లాంటివారు; అందఱకునున్= అందరిలోనూ; అధికులు= గొప్పవారు; మీరు= ఇక మీరు; చనుఁడు= బయలుదేరండి; అని; పలికినన్= చెప్పగా; చనక= తిరిగిపోకుండా; నలిచి= అక్కడే ఆగిపోయి; ప్రాణుఁడు+అది+కాఁగన్= ప్రాణుడు మొదలైన; పవనులు+అందఱున్= వాయువులందరూ; తమవలనన్= తమచేత; ఆ+విధంబు+కలుగన్+తెలుపన్= ఆ రీతిగా అవుతుందన్న విషయాన్ని; చెప్పగా; అతఁడు= ఆ బ్రహ్మ; ఏన్+ఎఱుంగనా?= నాకు తెలియదా?; అది+అట్టిది+అ= అది అట్లాంటిదే; మీ విశేషవృత్తి భంగిన్= మీ మీ ప్రత్యేక కార్యకలాపాన్ని; వినుఁడు= వినండి.

తాత్పర్యం: ఒకప్పుడు ప్రాణాపానాదులైన వాయువులు బ్రహ్మదేవుడి వద్దకు వెళ్ళి, 'మాలో ఎవరు గొప్పవాడో దయచేసి చెప్పండి' అని అడిగారు. బ్రహ్మ అన్నాడు: 'ఎవరు అణగిపోతే ఇతరులందరూ అణగిపోతారో, ఎవరు పనిచేయటం మొదలుపెట్టితే ఇతరులంతా తమతమ పనులు మొదలు పెట్టుతారో అట్లాంటివారు గొప్పవారు. ఇక మీరు మీ మీ దారులలో వెళ్ళండి' అని చెప్పగా ప్రాణుడు మొదలైనవారు అట్లాగే నిలబడి పోయారు. తిరిగిపోలేదు. ప్రతి ఒకడూ తమవలననే ఇతరులు ప్రవర్తిస్తున్నారని చెప్పాడు. అపుడు బ్రహ్మ 'అది నాకు తెలియదా! దాని విషయం అంతే. మీలో ప్రతి ఒక్కరూ ఒక విశిష్టవృత్తి కలిగినవారు. ఎట్లాగో చెప్పుతాను వినండి' అని ఇట్లా చెప్పటం మొదలు పెట్టాడు.

తే. **'ఎప్పు డెవ్వరివలన నే చొప్పు గలుగు। నపుడ వారెక్కుడగుదు రన్యోన్యమిత్ర**
భావమునఁ దాల్పుఁ డొండొరుఁ బవనులార!। పొరిఁ బరస్పరభావనాపరుల రగుఁడు. **41**

ప్రతిపదార్థం: ఎప్పుడు= ఏ సమయంలో; ఎవ్వరివలనన్= ఎవరివలన; ఏ చొప్పు కలుగున్= ఏ తీరున పని జరుగుతుందో; అపుడు+అ= అప్పుడే; వారు; ఎక్కుడు+అగుదురు= అధికులవుతారు; పవనులార!= ఓ వాయువులారా!; అన్యోన్య= పరస్పరం; మిత్రభావమునన్= స్నేహభావంతో; ఒండొరులన్= ఒకరినొకరు; తాల్పుఁడు= భరించండి (అనుసరించి ప్రవర్తించండి); పొరిన్= మిక్కిలిగా; పరస్పర= ఒకరి నొకరు; భావనాపరులరు+అగుఁడు= సంభావించుకొనేవారు కండి.

తాత్పర్యం: ఎప్పుడూ ఎవరివలన ఏ తీరుగా ఒక పని జరుగుతుందో అప్పుడు మాత్రమే వారు అధికులవుతారు. అట్లా అందరూ ఒక్కొక్క సమయాన గొప్పవారే అవుతారు. అందుచేత ఒకరి నొకరు స్నేహభావంతో అనుసరించాలి. ఒకరి నొకరు గౌరవించుకొనండి.

వ. **ఇత్తెఱంగున మీకు భద్రంబగుం బొం' దని పుచ్చె న ట్టుపదేశించిన బ్రహ్మవాక్యంబుల వాయువులు సమత నొందె'నని చెప్పి, 'వాయువిషయం బైనయది నారద దేవమత సంవాదంబు సెప్పెద నాకర్ణింపు' మని బ్రాహ్మణుండు బ్రాహ్మణీ కిట్లనియె.** **42**

ప్రతిపదార్థం: ఈ తెఱంగునన్= ఈ విధంగా ప్రవర్తిస్తే; మీకున్= మీకు; భద్రంబు+అగున్= క్షేమమవుతుంది; పొందు+అని= వెళ్ళండని; పుచ్చెన్= పంపించాడు; అట్లు+ఉపదేశించిన= ఆ విధంగా ఉపదేశించిన; బ్రహ్మవాక్యంబులన్= బ్రహ్మదేవుడి మాటలవలన; వాయువులు= పంచవాయువులూ; సమతన్+ఒందెను+అని= సమభావనను పొందాయని; చెప్పి; వాయు విషయంబు+ఐన+అది= వాయువిషయ సంబంధమైన; నారద= నారదుడికి; దేవమత= దేవమతుడికీ జరిగిన; సంవాదంబు= సంభాషణ; చెప్పెదన్= చెప్పుతాను; ఆకర్ణింపుము= వినుమని; బ్రాహ్మణుండు= ఆ విప్రుడు; బ్రాహ్మణికిన్= ఆ బ్రాహ్మణస్త్రీకి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా ప్రవర్తిస్తే మీకు క్షేమం కలుగుతుంది. వెళ్ళిరండి' అని బ్రహ్మ వారిని పంపించాడు. బ్రహ్మ వాక్యాలవలన పంచవాయువులూ సమతను పొందాయి. ఇంతేకాకుండా వాయుసంబంధమైన మరొక సంవాదం నారదుడికి, దేవమతుడికి నడుమ జరిగింది. దానిని చెప్పుతాను విను' మని ఆ విప్రుడు ఆ విప్రస్త్రీకి ఇట్లా చెప్పాడు.

విశేషం : 'సమత' అంటే సమభావనతో ప్రవర్తించటమని అర్థం. పంచవాయువులు ఒక సమరసభావనతో ప్రవర్తించటమే ఆరోగ్యం. ఇందులో ఏది ప్రకోపించినా దానిని 'రోగ'మని అంటారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **'దేవమతుఁ డను విప్రుఁడు దేవముని వ। రేణ్యుఁ డగు నారదుని నొక్క పుణ్యభూమిఁ**

గాంచి వినతుఁడై యాతని కరుణ వడసి। భక్తిరసము పొంగారఁ దత్ప్రాంతమునకు. **43**

ప్రతిపదార్థం: దేవమతుఁడు+అను= దేవమతుఁడనే పేరుగల; విప్రుఁడు= బ్రాహ్మణుడు; దేవముని వరేణ్యుఁడు+అగు= దేవర్షిశ్రేష్ఠుడైన; నారదునిన్= నారదుడిని; ఒక్కపుణ్యభూమిన్= ఒక పవిత్రమైన చోట; కాంచి= చూచి; వినతుఁడు+ఐ= నమస్కరించినవాడై; అతని కరుణ+పడసి= అతడి అనుగ్రహం పొంది; భక్తిరసము= భక్తి రసానుభవం; పొంగారన్= అతిశయించగా; తద్+ప్రాంతమునకున్= అతడి సమీపానికి (వెళ్ళి).

తాత్పర్యం: దేవమతుడనే పేరుగల బ్రాహ్మణుడు దేవర్షిశ్రేష్ఠుడైన నారదుడిని ఒక పవిత్రభూమిలో చూచి, వినయంతో నమస్కరించి, ఆయన అనుగ్రహం పొంది, భక్తి అతిశయించగా అతడి సమీపానికి (తరవాతిపద్యంతో అన్వయం.)

సీ. **అల్లన చన నాతఁ డాదరంబున 'నిందు। ర మ్ముండు' మనుచుఁ గరమునఁ జూపు**

నెడ సమాసీనుఁడై కడు వినయంబున। హస్తముల్ మొగిచి దయాసమగ్ర!

యెఱిఁగింపు పవనంబు లేనింటియందును। జాయమానంబగు జంతువునకుఁ

దొలితొలి యెద్ది దాఁదొడఁగు వర్తింపంగ?'। ననవుడు నారదుం డతనితోడ

తే. **'వాయు వెయ్యది గర్భసంవాసమునకుఁ। జొనుపు జీవునిఁ దజ్జంతుజననవేళఁ**

దొలుత దాని కనంతరకలిత మైన। మారుతంబు ప్రవర్తించు: మఱియు వినుము. **44**

ప్రతిపదార్థం: అల్లన= నెమ్మదిగా; చనన్= వెళ్ళగా; అతఁడు= నారదుడు; అదరంబునన్= ఆదరంతో; ఇందున్= ఇక్కడికి; రమ్ము= రా!; ఉండుము= కూర్చొనుము; అనుచున్= అంటూ; కరమునన్= చేతితో; చూపు+ఎడన్= చూపించిన చోట; సమాసీనుఁడు+ఐ= కూర్చున్నవాడై; కడు= మిక్కిలి; వినయంబునన్= వినయంతో; హస్తముల్ మొగిచి= చేతులు జోడించుకొని; దయాసమగ్ర!= సంపూర్ణ దయస్వరూపుడా!; పవనంబులు+ఏనింటి+అందును= ఐదు ప్రాణవాయువులలోనూ; జాయమానంబు+అగు= పుట్టేటటువంటి; జంతువునకున్= ప్రాణికి; తొలి తొలి= మును ముందుగా; ఎద్ది= ఏ వాయువు; తాన్+వర్తింపన్+తొడఁగున్= తాను ప్రవర్తించటం మొదలుపెట్టుతుంది?; ఎఱిఁగింపు(ము)= తెలపండి; అనవుడున్= అని కోరగా; నారదుండు; అతనితోడన్= ఆ దేవమతుడితో; వాయువు+ఏ+అది= ఏ వాయువైతే; గర్భసంవాసమునకున్= గర్భంలో ఉండటానికి; తొలుతన్= ముందు; జీవునిన్+చొనుపున్= జీవుడిని ప్రవేశపెడుతుందో; తద్+జంతు+జననవేళన్= ఆ జంతువు పుట్టే సమయంలో; దానికిన్= దానికి; అనంతర కలితము+ఐన= తరువాత ఉండేటటువంటి; మారుతంబు= వాయువు; ప్రవర్తించున్= పనిచేస్తుంది; మఱియున్= ఇంకా; వినుము.

తాత్పర్యం: అట్లా నెమ్మదిగా సమీపించగా నారదుడు ఆదరంతో 'ఇక్కడికి వచ్చి కూర్చొనుము' అని చేతితో ఒకచోటు చూపించాడు. దేవమతుడు ఆ చోట కూర్చున్నాడు. మిక్కిలి వినయంతో చేతులు జోడించి 'అయ్యా! మీరు కరుణా స్వరూపులు. ఐదు ప్రాణవాయువులలోనూ పుట్టే సమయంలో ప్రాణిలో మొట్టమొదట ఏ వాయువు పనిచేయటం మొదలు పెట్టుతుందో చెప్పండి' అని అడిగాడు. నారదుడు 'నాయనా! ఏ వాయువు ప్రాణిని గర్భసంవాసానికి ప్రేరేపిస్తుందో - ఆ జంతువు పుట్టే సమయంలో దాని తరువాత ఉన్న వాయువు పనిచేయటం మొదలుపెట్టుతుంది.

తే. **పురుషునందు సమానంబుఁ బొలఁతియందు। వ్యానమును జువ్వె పొడమించు వరుస ననఘ!**

శుక్లమునకు శోణితమునఁ జాలు గల్గు। నయ్యుగంబును విధి చెయ్ది నమరఁ బొంద. **45**

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పుణ్యాత్ముడా!; వరుసన్= వరుసలో; పురుషునందున్= మగవాడిలో; సమానంబున్= సమాన ప్రాణమూ; పొలతి అందున్= అడుదానిలో; వ్యానమునున్= వ్యానమనే ప్రాణమూ; పొడమించున్= పుట్టిస్తాయి; చుమ్మె!= సుమా!; శుక్లమునకున్= వీర్యానికి; శోణితమునన్= రజస్సులో; ఆ+యుగంబును= ఆ రెండూ (శుక్లశోణితాలు); విధిచెయ్విన్= దైవచేష్టవలన; అమరన్= తగినట్లు; పొందన్= కలువగా; చూలు+కల్గున్= గర్భం కలుగుతుంది.

తాత్పర్యం: సమానవాయువు పురుషుడిలో వీర్యాన్ని, వ్యానమనే వాయువు స్త్రీలో రజస్సును ప్రభవింపచేస్తాయి. శుక్లశోణితాల కలయిక గర్భంగా మారుతుంది. ఆ కలయిక దైవలీల.

క. విను సృష్టశోణితంబునఁ । బనుగొను శుక్లంబువలనఁ బ్రాణుఁడు దగ వ
ర్తన మొందుఁ బ్రాణశుక్లము । లనూనహేతువులుగా నపానుఁడు నడచున్. 46

ప్రతిపదార్థం: విను(ము)= ఇంకా వినుము; సృష్ట= పుట్టిన (సవ్యంగా స్రవించిన); శోణితంబునన్= రక్తంలో; పనుగొను= గట్టిపడేటటువంటి; శుక్లంబువలనన్= వీర్యంవలన; ప్రాణుఁడు= ప్రాణమనే వాయువు; తగన్= తగినట్లుగా; వర్తనము+ఒందున్= వ్యాపిస్తాడు; ప్రాణ శుక్లములు= ఇటు ప్రాణమూ,అటు వీర్యమూ; అనూన= గొప్ప; హేతువులుగాన్= కారణాలుగా; అపానుఁడు= అపానమనే మరొక వాయువు; నడచున్= వ్యాపిస్తాడు.

తాత్పర్యం: అప్పటి కప్పుడు నవ్యంగా పుట్టే రజస్సులో గట్టిపడ్డ వీర్యం కారణంగా అందులో ప్రాణుడు ప్రవేశిస్తాడు. ప్రాణుడు, వీర్యం - ఈ రెండూ కారణాలుగా అపానుడూ వ్యాపిస్తాడు.

విశేషం : ఏ వాయువు తరువాత ఏ వాయువు వ్యాపిస్తుంది? అనే ప్రశ్నకు సమాధానం ఇక్కడ ఉన్నది. గర్భధారణంలో ముందుగా పనిచేసేది ప్రాణం. అందుకే శుక్లశోణితాల కలయిక ముద్ద కట్టినపుడు అందులో ప్రాణశక్తి ప్రవేశిస్తున్నది. దానిని అనుసరించి అధోమార్గం కలిగిన అపానం వ్యాపిస్తుంది. అప్పుడు ఏమి జరుగుతుందో తరువాతి పద్యంలో వివరించాడు.

క. చనుఁ బ్రాణుఁ డధోగతి నూ । ర్ధ్వనిరూఢి నపానుఁ డివ్విధము గల యీ రెం
టను నగ్నిమయోదానం । బును వ్యానంబును సమానమును వర్తించున్. 47

ప్రతిపదార్థం: ప్రాణుఁడు= ప్రాణుడనేవాయువు; అధోగతిన్= క్రిందివైపు; చనున్= ప్రసరిస్తాడు; అపానుఁడు= అపానుడనే వాయువు; ఊర్ధ్వ విరూఢిన్= పై వైపు (చనున్); ఈ విధము+కల= ఈ రీతిగా ప్రసరించే; ఈ రెంటనున్= ఈ రెండింటిలోను; అగ్నిమయ= అగ్నిశక్తితో నిండిన ఉదానంబునున్= ఉదానమూ; వ్యానంబును; వ్యానమూ; సమానమునున్= సమానమూ; వర్తించున్= వ్యాపిస్తాయి.

తాత్పర్యం: అపుడు ప్రాణుడు అధోముఖంగానూ, అపానుడు ఊర్ధ్వముఖంగానూ ప్రసరిస్తారు. అపుడు ఈ రెండు వాయువులలో 'అగ్ని' శక్తితో నిండిన ఉదాన, వ్యాన, సమానులు ప్రసరిస్తారు. (ఇట్లా పిండం ప్రాణశక్తితో నిండుతుందని అర్థం).

ఆ. పావకుండు సర్వదేవాత్మకుండు ప్రా । ణంబునకు నపాననామమునకు
నంతరమున వెలుఁగు నా భవ్యమూర్తి యు । దానరూప మండ్రు తజ్జ్ఞ జనులు. 48

ప్రతిపదార్థం: తద్జ్ఞ+జనులు= ఆ ప్రాణాగ్నితత్త్వం తెలిసిన పండితులు; పావకుండు= అగ్ని; సర్వదేవ+ఆత్మకుండు= దేవతలందరిలోనూ వ్యాపించి ఉన్నవాడు (అందుకే దేవతలందరూ తేజోరూపులు); ప్రాణంబునకున్= ప్రాణానికి; అపాన నామమునకున్= అపానానికి; అంతరమునన్= నడుమ; వెలుఁగు= ప్రకాశించేటటువంటి; ఆ+భవ్యమూర్తి; ఉదానరూపము+అండ్రు= ఉదానరూపుడని అంటారు.

తాత్పర్యం: ఆ ప్రాణాగ్నితత్త్వం తెలిసిన పండితులు దేవతలందరిలోనూ వ్యాపించి ఉండేవాడూ, ప్రాణాపానాల నడుమ వెలిగే పుణ్యమూర్తీ అయిన అగ్నిని ఉనానరూపుడుగా గుర్తిస్తారు.

సీ. **విను మహోరాత్రంబులును శుభాశుభములు। సత్యానృతంబులు సదసదాహ్వ**
యములును నైన ద్వంద్వములు ప్రాణాపాన। ములకు నామాంతరములు; దదీయ
మధ్యవర్తిత నొప్పు మహనీయ వహ్ని; యుదానంబు దాని నిర్ద్వంద్వభావ
మాంతరయాగ విద్యాప్రవీణులు గండ్రు। పరమశాంతి యనంగ బ్రహ్మ మనఁగ

తే. **నరయ భేదంబు లే దన్న యట్టులుండు। నమ్మహావస్తువును నుదానాకృతియ య**
నంగఁ జెవియార విందుము నలినగర్భు। చేత' నని దివ్యముని యిట్లు సెప్పెఁ గరుణ. 49

ప్రతిపదార్థం: వినుము= ఇంకా ఈ ప్రాణతత్త్వం ఎట్లాంటిదో వినుము; అహోరాత్రంబులునున్= రాత్రింబవళ్ళు; శుభ+అశుభములున్= మేలు కీళ్ళు; సత్య+అనృతంబులున్= సత్యం, అసత్యం, సత్+అసత్+అహ్వాయములునున్+ఐన= సత్తు, అసత్తు అనే పేర్లు కలిగినటువంటి; ద్వంద్వములు= ద్వంద్వ భావాలు ఏవి ఉన్నాయో-అవి; ప్రాణ+అపానములకున్= ప్రాణపానాలకు; నామాంతరములు= మారుపేర్లు; తదీయ= వాటి; మధ్యవర్తితన్= నడుమ ఉండటం అనే లక్షణంతో; ఒప్పు అతిశయించేటటువంటి; మహనీయ= గొప్ప; వహ్ని= అగ్ని; ఉదానంబు= ఉదానం; దాని నిర్+ద్వంద్వ భావము= ఆ అగ్ని యొక్క, అద్వైతస్థితిని (అంటే అది ఒకవైపు అగ్ని, మరొకవైపు వాయువు, ఈరెండూ కలిసిన మహాతత్త్వం అది - అని అర్థం); ఆంతర+యాగవిద్యా ప్రవీణులు= ఆంతర్యాగవిద్యలో నిష్ణాతులైన వారు; కండ్రు= తెలిసికొంటారు; పరమశాంతి+అనంగన్= పరమశాంతి స్థితి అని; బ్రహ్మము+అనఁగన్= బ్రహ్మమనీ; అరయన్= అలోచించగా; భేదంబు+లేదు+అన్న+అట్టులు+ఉండు= భేదం లేదన్నట్లు కనిపించే; ఆ+మహావస్తువును= ఆ గొప్పతత్త్వాన్ని; ఉదాన+ఆకృతి+ఆ= ఉదానమే; అనంగన్= అని; నలినగర్భుచేతన్= బ్రహ్మదేవుడివలన; చెవి+అరన్+విందుము= చెవులారా విన్నాము; అని; దివ్యముని= నారదుడు; కరుణన్= దయతో; ఇట్లు+చెప్పెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ఇంకా ఈ ప్రాణతత్త్వం ఎట్లాంటిదో వినుము. రాత్రింబవళ్ళు, మేలు కీళ్ళు, సత్యాసత్యాలు, సదసత్తులు అనే ద్వంద్వాలు ప్రాణాపానాలకు మారుపేర్లే. వాటి నడుమ వర్తిల్లేటటువంటి అగ్ని ఉదానం. అగ్నితత్త్వాన్ని వాయుతత్త్వాన్ని రెండింటినీ కలిగినదాని అద్వైతస్థితిని అంతర్యాగవిద్యానిపుణులు మాత్రమే గుర్తించగలరు. పరమశాంతి అని, బ్రహ్మమని పిలువబడే ఆ తత్త్వంలో ఏ భేదపరిగణనా సాధ్యం కాదు. అదే ఉదానతత్త్వమని సాక్షాత్తు బ్రహ్మదేవుడు చెప్పగా మా చెవులారా విన్నాము' అని నారదమహర్షి అతడితో చెప్పాడు.

వ. **అని చెప్పి 'యింద్రియ మనః పవనంబుల భంగులు గనుంగొనుట యీ తత్త్వంబులకుఁ బరమంబైన తత్త్వంబు' గనుటకుఁ గతంబై యుండు' నని పలికి యద్ధరామరుం డా రామారత్నంబును సదయంబుగా నవలోకించి 'యుత్తమరహస్యంబు సెప్పెద నాకర్ణింపు' మని యిట్లనియె.** 50

ప్రతిపదార్థం: అని చెప్పి= అని చెప్పినవాడై; ఇంద్రియ= ఇంద్రియాల; మనస్= మనస్సుయొక్క; పవనంబుల= వాయువుల; భంగులు= రీతులు; కనుంగొనుట= కనుగొనటం; ఈ+తత్త్వంబులకున్= ఈ తత్త్వాలకు; పరమంబు+ఐన= అతీతమైన; తత్త్వంబున్+కనుటకున్= మహాతత్త్వాన్ని దర్శించటానికి; కతంబు+ఐ+ఉండున్+అని= మూలమై ఉంటుందని; పలికి; ఆ+ధరామరుండు= ఆ భూదేవుడు; ఆ+రామారత్నంబును= ఆ స్త్రీరత్నాన్ని; సదయంబుగాన్= దయతో; అవలోకించి= చూచి; ఉత్తమ రహస్యంబు+చెప్పెదన్= అత్యుత్తమ రహస్యం నీకు చెప్తాను; ఆకర్ణింపుము+అని= వినుమని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి, 'ఇంద్రియాలు, మనస్సు - ప్రాణం వీటిని గురించి తెలిసికొనటంద్వారా ఈ తత్త్వాలకు అతీతమైన మహాతత్త్వాన్ని (అంటే ఆత్మతత్త్వాన్ని) గుర్తించటానికి సాధ్యమవుతుం'దని ఆ బ్రాహ్మణుడు తన భార్యకు చెప్పి, ఆమెవైపు దయామృతవీక్షణాలతో చూచి, 'మరో రహస్యాన్ని నీకు చెప్తాను జాగ్రత్తగా విను' మని ఇట్లా ప్రారంభించాడు.

జీవాత్మస్వరూప నిరూపణప్రకారము (సం.14-25-3)

సీ. **'కరణంబు కర్మంబు కర్త యన్నేతద్వి। రాజితకారకత్రయముచేత**
నఖిలంబు సంవ్యాప్తమై యుండు ఘ్రాణాదు। లును మనంబును బుద్ధియును బ్రవరులు
కరణహేతువు లండ్రు గంధాది విషయ సం। తతియు మంతవ్యబోద్ధవ్యములును
గర్మహేతువు లగుఁ గంపుకొనఁగ నానఁ। గాన ముట్టఁగ వినఁగా దలంప

తే. **నిశ్చయము దగఁ జేయంగ నేర్పు లేడు। గలవు జీవాత్మునకు నవి కర్తృహేతు**
భూతములు వాన విషయానుభూతి నతఁడు। దొఱఁగు నిష్ఠలు మోక్షహేతువులు సుమ్ము. **51**

ప్రతిపదార్థం: కరణంబు= కరణం (సాధనం); కర్మ= ధాత్వర్థ ఫలాశ్రయం; (క్రియాఫలాన్ని అనుభవించేవాడు కర్మ); కర్త= ధాత్వర్థవ్యాపారాశ్రయం (క్రియావ్యాపారాన్ని చేసేవాడు కర్త); అన్+ఏతద్+విరాజిత= అనబడే ఈ ప్రసిద్ధమైన; కారక త్రయముచేతన్= మూడు కారకాలచేత; అఖిలంబున్= అంతా; సంవ్యాప్తము+ఐ+ఉండున్= బాగా వ్యాపించబడి ఉంటుంది. ఘ్రాణ+ఆదులునున్= ముక్కు మొదలైన ఐదు కర్మేంద్రియాలు; మనంబునన్= మనస్సు; బుద్ధియునున్= బుద్ధీ; కరణహేతువులు= కరణాలు (సాధనాలని); ప్రవరులు= శ్రేష్ఠులైన పండితులు; అండ్రు= అంటారు; గంధాది విషయ సంతతియున్= వాసన చూడటం మొదలైన విషయసమూహం; మంతవ్య, బోద్ధవ్యములునున్= ఆలోచించదగినది, తెలిసికొనదగినది; కర్మహేతువులు+అగున్= కర్మ హేతువు లవుతాయి; కంపు కొనఁగన్= వాసన చూడటానికి; ఆనన్= తినటానికీ; కానన్= చూడటానికి; ముట్టఁగన్= తాకటానికి; వినఁగన్= వినటానికి; తలంపన్= ఆలోచించటానికి; నిశ్చయంబు+తగన్+చేయంగన్= తగినట్టు నిర్ణయించటానికి; నేర్పులు= శక్తులు; ఏడు+కలవు= ఏడున్నాయి. జీవాత్మునకున్= జీవాత్ముడికి; అవి= ఈ ఏడు నేర్పులూ; కర్తృ హేతు భూతములు= కర్తృత్వాన్ని కలిగించే లక్షణాలు; వానన్= వాటిలోనే; అతఁడు= ఆ జీవాత్ముడు; విషయానుభూతిన్= విషయానుభవాన్ని; తొఱఁగున్= వదిలిపెట్టగలుగుతాడు; నిష్ఠలు= అతడు అవలంబించే నిష్ఠలు (నియమాలు, దీక్షలు); మోక్షహేతువులు; సుమ్ము!= సుమా!

తాత్పర్యం: 'కరణం, కర్మ, కర్త - ఈ మూడు కారకాలు, ప్రపంచమంతా ఈ మూడింటితోనే నిండి ఉన్నది. ముక్కుమొదలైన కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధికరణహేతువులు. వాసన చూడటం మొదలైన విషయసమూహం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆలోచించదగినది, తెలిసికొనదగినది - ఏవి ఉన్నాయో అవి కర్మహేతువులు. వాసన పట్టటం, తినటం, చూడటం, తాకటం, వినటం, ఆలోచించటం, నిర్ణయం చేయటం - అనే ఏడు పనులు జీవాత్ముడు చేయగలుగుతాడు. ఈ నేర్పులు కర్తృహేతువులు అవుతాయి. వీటితోనే ఆ జీవుడు విషయసుఖాలను తరిమికొట్టగలడు కూడా. తోడుగా అవలంబించే శ్రద్ధ, నియమనిష్ఠలు మోక్షాన్ని కలిగిస్తాయి.

వ. కరణకర్మకర్తృకారకాత్మకుండును జీవాత్ముండు భోక్త యగుట దక్కి వివిధవిషయమూర్తులగు హవిస్సుల నుదాసీనత్వస్రుగ్గతంబులు సేసి వేల్చు నిష్ఠ నాత్మస్వరూపం బగు ననలంబు ప్రజ్జ్వలితం బయి యవిద్యాధూమ రహితం బగుచుం బొలుచు; నది మోక్షప్రకారం బట్లు గాక భోక్త యగు' నేని నట్టిద బంధ ప్రకారం బని నిర్దేశించి 'ముక్తభావంబునకు మూలం బయిన యోగయజ్ఞంబునం దేను బ్రవృత్తుండనై యున్నవాఁడ; దానికి సర్వపరిత్యాగంబు దక్షిణ; దాన సకలాత్ముండగు నారాయణుండు ప్రీతుండై స్వీకరించు; నద్దశ పేరు మునులు ముక్తి యని చెప్పుదు' రని చెప్పి యన్విప్రుండు వెండియు. 52

ప్రతిపదార్థం: కరణ, కర్మ, కర్తృ కారక+ఆత్ముండు+అగు= కరణ, కర్మ, కర్తృ కారకత్రయాన్ని ఆత్మగా కలిగిన; జీవాత్ముండు= జీవుడు; భోక్త+అగుటన్+తక్కి= తాను కర్త అనే భావాన్ని వదలిపెట్టి; వివిధ విషయమూర్తులు+అగు= వివిధాలైన విషయసుఖాల స్వరూపం కలిగిన; హవిస్సులన్; ఉదాసీనత్వ= ఉదాసీన మనేటటువంటి; స్రుక్+గతంబులు+చేసి= (యజ్ఞంలో వాడే) కొయ్యగరిటెలో వేసి; వేల్చునిష్ఠన్= హోమం చేసే నిష్ఠవలన; ఆత్మస్వరూపంబు+అగు+అవలంబు= ఆత్మస్వరూపమైన అగ్ని; ప్రజ్జ్వలితంబు+అయి= బాగా మండి; అవిద్యారూప= అవిద్య (అజ్ఞానం అనే) పొగచేత; రహితంబు+అగుచున్= లేనిదై; పొలుచున్= ప్రకాశిస్తుంది; అది మోక్షప్రకారంబు= అట్లా చేయటం మోక్షం చేకూరే పద్ధతి; అట్లు+కాక+భోక్త+అగునేనిన్= అట్లాకాకుండా తానే తినేవాడు. అనుభవించేవాడు అయితే; అట్టిది+ఆ= అట్లాంటి విషయానుభవమే; బంధప్రకారంబు+అని= బంధం కలిగించే తీరు అని; నిర్దేశించి= బోధించి; ముక్తభావంబునకున్= వదలిపెట్టటం (ముక్తం) అనే భావానికి; మూలంబు+అయిన= హేతువైన; యోగ యజ్ఞంబు నందున్= యోగమనే యజ్ఞంలో; ఏను= నేను; ప్రవృత్తుండను+ఐ= పనిలో తలమునుకలుగా ఉన్నాను; దానికిన్+ సర్వపరిత్యాగంబు దక్షిణ= దానికి అన్నిటినీ వదలిపెట్టటమే దక్షిణ, దానన్= దానివలన; సకల+ఆత్ముండు+అగు= సకలలోకాలలోనూ ఆత్మమూలంగా వ్యాపించిన; నారాయణుండు= శ్రీమహావిష్ణువు; ప్రీతుండై= సంతోషించినవాడై; స్వీకరించున్= స్వీకరిస్తాడు; ఆ+దశపేరు= ఆ మహోత్తమస్థితి పేరు; మునులు= మహర్షులు; ముక్తి+అని చెప్పుదురు+అని= ముక్తి అని చెప్పుతారని; చెప్పి= చెప్పినవాడై; ఆ విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; వెండియున్= ఇంకా (ఇట్లా అన్నాడు.)

తాత్పర్యం: కరణ, కర్మ, కర్త అనే కారకత్రయాన్ని ఆత్మగా కలిగిన జీవుడు తాను కర్త ననే భావాన్ని (తాను అనుభవిస్తున్నాననే భావనను) వదలిపెట్టి, వివిధాలైన విషయసుఖాల స్వరూపం కలిగిన హవిస్సులను ఉదాసీనమనే 'స్రుక్కు' లో వేసి హోమం చేయటంలోని 'నిష్ఠ' చేత ఆత్మస్వరూపమైన అగ్ని బాగా మండి, 'అవిద్య' అనే పొగలేనిదై ప్రకాశిస్తుంది. ఇది మోక్షం అందుకొనే విధం. అట్లా కాకుండా 'భోక్త' నేనే అని భావించి చేస్తే (లేదా తానే అన్నిటినీ అనుభవిస్తే) ఆ విషయానుభవమే బంధకారక మవుతుంది' అని బోధించి, 'విముక్తి భావానికి మూలమైన యోగయజ్ఞంలో నేను తలమునకలుగా ఉన్నాను. దానికి అన్నిటినీ వదిలిపెట్టటమే దక్షిణ, దానివలన సకలంలోనూ వ్యాపించిన పరమాత్ముడైన నారాయణుడు సంతోషించి జీవుడిని గ్రహించే ఆ మహోత్తమ స్థితినే మోక్ష మని (ముక్తి అని) మునులు పిలుస్తారు' అని చెప్పినవాడై ఆ బ్రాహ్మణుడు ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. 'శాస్త యొక్కండ తచ్ఛాసనంబునన యేఁ। జరియింతు నొక్కండ గురుఁ డతండు
సెప్పిన యర్థంబు చిత్తంబులో నుంతు। శ్రోత యొక్కండ తద్జ్ఞాతబుద్ధి
నెగడుదు నొక్కండ వగవంగ విద్వేష్ట। వాని వ్రాల్చినదిక్క వ్రాలి యెదురుఁ
గడపుదు గడవంగఁ గారణమయ్యెడు। తెఱఁగు పెద్దలచేత నెఱిఁగినాఁడ

తే. వినుము దేవతలును మునులును బరమేష్ఠి। యొద్ద కరిగి 'మాకు నెద్ది హితమొ'
యనిన నా విధాత యక్షరోపాసన। మనియెఁ గాన దుర్గ మబల! కడతు. 53

ప్రతిపదార్థం: శాస్త= అనుశాసకుడు; ఒక్కండు+అ= ఒక్కడే ; తద్+శాసనంబునన్+అ= అతడి శాసనంతోనే; ఏన్+చరియింతున్= నేను చరిస్తాను; ఒక్కండ గురుఁడు= గురుడు ఒక్కడే; అతండు+చెప్పిన+అర్థంబు= అతడు చేసిన ఉపదేశాన్ని; చిత్తంబులోన్+ఉంతున్= మనస్సులో ఉంచుకొంటాను; శ్రోత+ఒక్కండు+అ= శ్రోత ఒకడే; తద్+జ్ఞాతబుద్ధిన్= గురువు చెప్పిన దానిని తెలిసికొనే నైపుణ్యంగల బుద్ధితో; నెగడుదున్+ఒక్కండన్= ఏకైకంగా ప్రవర్తిస్తాను; విద్వేష్ట= శత్రువు; వగవంగన్= బాధింపగా; వాని+వ్రాల్చిన దిక్కు+అ= వాడు ఏదిక్కులో వాల్చితే ఆ దిక్కులోనే; వ్రాలి= వాలి; ఎదరున్= ఆపదను; కడపుదున్= దాటుతాను; పెద్దలచేతన్= పెద్దలవలన; కడవంగన్= తరించటానికి; కారణము+అయ్యెడు+తెఱఁగున్= మూలమైన మార్గాన్ని; ఎఱిగినాఁడన్= తెలిసికొన్నాను; వినుము= ఇంకా ఒక ప్రధాన విషయం ఉన్నది వినుము; దేవతలునున్= మునులునున్; పరమేష్ఠి+ఒద్దకున్= బ్రహ్మవద్దకు; అరిగి= వెళ్ళి; మాకున్; ఎద్ది?= ఏ మార్గము?; హితమో= శ్రేయస్సో; అనినన్= అనగా; ఆ విధాత= ఆ బ్రహ్మ; అక్షర+ఉపాసనము+అని= అక్షరతత్త్వాన్ని ఉపాసించటమని; అనియెన్= అన్నాడు; అబల!= ఓ వనితా!; దుర్గము-కాన= దాటటానికి వీలులేని అరణ్యాన్ని; కడతున్= దాటగలను.

తాత్పర్యం: అనుశాసకుడు ఒకడే. అతడి అనుశాసనంతోనే నేను చరిస్తాను. గురుడు ఒక్కడే. అతడు చేసిన ఉపదేశాన్ని మనస్సులో ఉంచుకొంటాను. శ్రోత ఒకడే, గురూపదేశాన్ని తెలిసికొన్న బుద్ధితో ప్రవర్తిస్తాను. శత్రువు ఏ వైపు వ్రాల్చితే ఆ వైపు వ్రాలి, ఓర్పుతో ఆ ఆపదను దాటుతాను. తరించే మార్గం ఏదో దానిని పెద్దలవలన తెలిసికొన్నాను. అంతేకాదు. మరొక విషయం ఉన్నది వినుము. ఒకప్పుడు దేవతలు మునులు బ్రహ్మ దగ్గరకు వెళ్ళి, 'మాకు శ్రేయోమార్గం చెప్పండి' అని అడిగారు. వారికి ఆయన 'అక్షరోపాసన' మాత్రమే తగిన మార్గమని బోధించాడు. ఓ వనితా! నేను ఆ మార్గంలో వెళ్ళుతున్నాను కాబట్టి సంసారమనే దుర్గమారణ్యాన్ని తప్పకుండా దాటగలను.

విశేషం : 'దుర్గం' అంటే లోపలికి పోవటానికి, బయటికి రావటానికి కష్టమైన దని అర్థం. అది అరణ్యమే కానక్కరలేదు. తరువాతి వచనంలో ఈ అర్థం ఉన్నది.

వ. ఇంక నెక్కడ గడచెద! మున్న కడచితిఁ గ్రోధతిమిరంబును లోభవ్యాళంబును గామదస్యుదూషితంబును నగు దుర్గంబు గడచి యొక వనంబు ప్రవేశించితి 'ననిన విని 'యవ్వనిత యవ్వనం బెట్టి?' దని యడిగిన నమ్మహాద్విజుం డిట్లనియె. 54

ప్రతిపదార్థం: ఇంకన్+ఎక్కడన్+కడచెదన్!= ఇంకా ఎక్కడ దాటటం! (ఇంకా ఏమి దాటాలి? అని); మున్ను+అ+కడచితిన్= ముందే దాటాను; క్రోధ= కోపమనే; తిమిరంబునున్= చీకటిని; లోభ= లోభమనే; వ్యాళంబునున్= సర్పాన్ని; కామ= కోరికలనే దస్యు= దొంగలచేత; దూషితంబును= భయంకరంగా ఉన్న; దుర్గంబు+కడచి= కోటను దాటి; ఒకవనంబు= ఒక అడవిని;

ప్రవేశించితిన్= చేరాను; అనినన్= అనగా; విని; ఆ+వనిత= ఆ స్త్రీ; ఆ+వనంబు= అ అడవి; ఎట్టిది+అనినన్= ఎట్లాంటిదని అడుగగా; ఆ+మహాద్విజుండు= ఆ గొప్ప బ్రాహ్మణుడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇంకా నేను ఏం దాటాలి? ముందే అన్నిటిని అధిగమించాను. కోపమనే చీకటిని, లోభమనే మహా సర్పాన్ని తప్పించుకొని, కోరికలనే దొంగలతో నిండిన భయంకరమైన పాడువడిన కోటను దాటి, ఒక అడవిలోనికి ప్రవేశించాను' అని భర్త చెప్పగా ఆమె 'ఆ అడవి ఎట్లాంటి'దని అడిగింది. దానికి ఆ విప్రుడు ఇట్లా చెప్పాడు. క్రోధతిమిరము-క్రోధమనెడితిమిరము, లోభవ్యాళము-లోభమనే వ్యాళము, కామదస్యు-కామమనే దస్యు-రూపకాలంకారాలు

ఉ. అంతకుఁ బిన్నలున్ వెదక నంతకుఁ బెద్దలు లేవు దుఃఖ మ
త్యంతముఁ జేయ సౌఖ్య మెసలార నొనర్పఁగ నొం డొకంటి యం
దంతటి నేర్పు లేదు వెఱ పన్నది యేమియు నవ్వనంబు ని
శ్చింతతఁ జొచ్చియున్న నరుఁ జెందరు నిర్వృతి సెందు నుగ్మలీ! 55

ప్రతిపదార్థం: ఉగ్మలీ!= ఓ వనితా!; వెదకన్= వెదకగా; అంతకున్= అంతకంటె; పిన్నలున్= చిన్నవి; అంతకున్= అంతకంటె; పెద్దలున్= పెద్దవి; లేవు= అక్కడ కనిపించవు; దుఃఖము+అత్యంతమున్+చేయన్= మిక్కిలి దుఃఖాన్ని కలిగించటానికి కాని; సౌఖ్యము+ఎసలారన్= ఒనర్పఁగన్= సౌఖ్యం మిక్కిలి అధికంగా కలిగించటానికి కాని; ఒండు+ఒకంటి+అందున్= ఏ ఒక్కదానిలోనూ; అంతటి నేర్పు లేదు= అంతటి నైపుణ్యం లేదు; ఆ+వనంబున్= ఆ అడవిని; నిశ్చింతతన్= ఏ చింతా లేకుండా; చొచ్చి ఉన్న= ప్రవేశించి ఉన్న; నరున్= మనిషిని; వెఱపు+అన్నది= భయమన్నది; ఏమియున్+చెందదు= కొంచెంకూడా ఆక్రమించదు; (అతడు); నిర్వృతిన్= విముక్తిని; చెందున్= పొందుతాడు.

తాత్పర్యం: 'ఓ వనితా! ఆ అడవి చాలా చిత్రమైనది. అక్కడ చిన్నా పెద్దా అనే ఏ తారతమ్యమూ లేదు. మిక్కిలి దుఃఖం కలిగించేవి కాని, మిక్కిలి సుఖాన్ని కలిగించేవి కాని అక్కడ ఏ ఒక్క 'విషయ'మూ లేదు. ఏ చింతా లేకుండా అక్కడ ప్రవేశించిన మనిషికి 'భయం' కలుగనే కలుగదు. అట్లాంటి వాడు ముక్తినే పొందుతాడు.

విశేషం : సుఖదుఃఖకారులు 'విషయాలు'. అవి ఇంద్రియాలను చాలా నేర్పుగా లొంగదీసికొంటాయి. దానితో ఏర్పడేది 'చింత'. దానితో 'భయం'.ఇవేవీ అక్కడ లేవు. చిన్నా పెద్దా అంటే ద్వంద్వభావం, సుఖదుఃఖాలు అంటే కర్తృత్వభావన. ఈ రెండూ లేని మనిషి 'నిశ్చింత' గా ఉంటాడు. వాడు నిర్భయుడు. దానినే 'ధృతి' అంటారు. అందుచేత అట్లాంటి ధీరుడికి 'నిర్వృతి' సులభంగా ప్రాప్తిస్తుంది. అదే అక్షరతత్త్వం.

తే. కొన్నిటికిఁ బంచవర్ణముల్ గుసుమఫలము;। లందుఁ గొన్నిటి కేకవర్ణాంచితంబు
లవనిజములు కొన్నిటికి నవ్యక్తవర్ణ । కములు సౌరభ్యమాధుర్యసమధికములు. 56

ప్రతిపదార్థం: కుసుమఫలములందున్= పూవులు, పండ్లలో; కొన్నిటికిన్= కొన్నిటికి; పంచవర్ణముల్= ఐదు రంగులు; కొన్నిటికిన్= కొన్నిటికి; ఏకవర్ణ+అంచితంబులు= ఒకే వర్ణంతో కూడినవి; అవనిజములు= చెట్లు; కొన్నిటికిన్= కొన్నిటికి; అవ్యక్తవర్ణకములు= రంగు ఏమిటో తెలియటంలేదు (కాని అవి); సౌరభ్య= సువాసనకలిగిన పూలు; మాధుర్య= తీపు కలిగిన పండ్లు; సమధికములు= అత్యధికంగా కలిగి ఉన్నాయి.

తాత్పర్యం: ఆ అడవిలో చిత్రవిచిత్రాలైన పూలు, పండ్లు కనిపిస్తున్నాయి. కొన్నిటికి ఐదురంగులు, మరికొన్ని ఒకే రంగుతో ఉన్నాయి. కొన్ని చెట్లు ఏ రంగులో ఉన్నాయో గుర్తించటానికి అవకాశం లేదు. కాని, వాటి పూలు సువాసన

కలిగినవి: పండ్లు అతి మధురమైనవి.

విశేషం: ఈ అడవి వర్ణన సాంకేతికమైనది. పంచవర్ణాలు - పంచేంద్రియవ్యాపారజనిత సుఖానుభవాలకు సంకేతం. ఒకేవర్ణం-సమత్వభావసాధనకు సంకేతం. అవ్యక్తవర్ణం-నిర్గుణత్వసంకేతం. వాటి కున్న సౌరభం. మాధుర్యం అవ్యక్త అక్షరోపాసనలో లభించే బ్రహ్మానందానికి నిదర్శనం.

వ. అవ్విపినంబున. 57

ఆ+విపినంబునన్

తాత్పర్యం: ఆ అడవిలో- తరువాతి పద్యంతో అన్వయం.

క. వృక్షంబులకుం గలుగును। దీక్షాగుణములును నతిథితృప్తికృతియుఁ బ
ద్మాక్షీ! యతిథులు బ్రహ్మ స। దృక్షులు సౌఖ్యంబు నిట్టఁ దేలుదురు మునుల్. 58

ప్రతిపదార్థం: పద్మాక్షీ= కనులలోచనా!; వృక్షంబులకున్= చెట్లకు; దీక్షాగుణములునున్= దీక్షాలక్షణాలు; కలుగును= ఉంటాయి; అతిథి తృప్తి కృతియున్= అతిథులకు తృప్తి కలిగించటమూ; అతిథులు= వచ్చే అతిథులు; బ్రహ్మసదృక్షులు= బ్రహ్మ సదృశులు; మునులు= ఋషులు; సౌఖ్యంబు నిట్టన్+తేలుదురు= సంతోషంతో తేలుతుంటారు.

తాత్పర్యం: అక్కడ చెట్లు కూడా దీక్షలో ఉంటాయి. అతిథులను సంతృప్తి పరుస్తుంటాయి. అక్కడికి వచ్చే అతిథులు సాక్షాత్తు బ్రహ్మస్వరూపులు. ఆ ఋషులు ఆ వనంలో బ్రహ్మానందంతో మునిగి ఉంటారు.

ఆ. కెలఁకులకును మింటికిని మేర లివి యన। రాదు గాన యయ్యరణ్యభూమి
వెలుఁగు లొండ్లు సొరపు వినుము క్షేత్రజ్ఞుండు। రవి దదీయసేవ భవముఁ బాచు. 59

ప్రతిపదార్థం: కెలఁకులకును= దిక్కులకు; మింటికిని= ఆకాశానికి; ఇవి; మేరలు= సీమలు (సరిహద్దులు); అనరాదు= చెప్పలేము; కానన్= కాబట్టి; ఆ+అరణ్యభూమిన్= ఆ అడవిలో; వెలుఁగులు+ఒండ్లు= వేరే కాంతు లేవీ; చొరవు= దూరవు; వినుము= ఇంకా ఒక విచిత్రం వినుము; క్షేత్రజ్ఞుండు= యజమానుడు; రవి= సూర్యుడు; తదీయసేన= అతడి సేన; భవమున్+పాచున్= పుట్టుకను పోగొట్టుతుంది.

తాత్పర్యం: దిక్కులకు, ఆకాశానికి సరిహద్దులు చెప్పలేము కాబట్టి ఆ అడవిలో కూడా ఏ వేరే వెలుగులూ సోకవు. కాని, చిత్రం ఏమిటంటే - ఆ అడవికి యజమానుడు సూర్యుడు. అతడిని సేవిస్తే మరలా పుట్టుక అంటూ ఉండదు.

విశేషం : అది అనంతమైన సౌఖ్యసామ్రాజ్యం. అక్కడ మామూలు దీపపు కాంతులు కనిపించవు. క్షేత్ర యజమానుడు సూర్యుడు కాబట్టి అక్కడి కాంతులు ఎప్పుడూ క్షీణించవు.

క. మృగనయన! బ్రహ్మసంభవ। మగు జలము వహించుచుండు నందుల నదులన్
నగములు విను దానఁ దప। స్విగుణం బవ్యయపదంబుఁ జెందం గాంచున్. 60

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: మృగనయన!= లేడి కన్నులవంటి కన్నులు కలదానా!; విను; అందులన్= ఆ అడవిలో; నదులన్= నదులలో; బ్రహ్మసంభవము+అగు= బ్రహ్మపదంనుండి పుట్టిన; జలము= నీరు; వహించుచున్+ఉండున్= పారుతూ ఉంటుంది; నగములు=కొండలు; దానన్= అందువలన; తపస్విగణంబు= ఋషుల సమూహం; అవ్యయపదంబున్= మోక్షస్థానాన్ని; చెందన్+ కాంచున్= పొందగలుగుతుంది.

తాత్పర్యం: ఆ అడవిలోని నదులలో బ్రహ్మసంభవమైన జలం ప్రవహిస్తుంది. ఆ అడవిలోని కొండలు పరమపవిత్రాలు. అక్కడ తపస్సు చేసి, ఋషులు ముక్తిపదాన్ని పొందగలుగుతారు.

వ. అట్టి దవ్విపినంబు. 61

ప్రతిపదార్థం: ఆ అడవి అట్లాంటిది.

తాత్పర్యం: రవి క్షేత్రజ్ఞుడై. బ్రహ్మపదస్థానంనుండి పుట్టిన జలాలు స్రవించే నదులు, కొండలు ఉన్న ఆ చోటు స్వర్గం కంటె చాలా గొప్పది.

ఆ. మాననీయనియతి మహితతపోధన। వంతులైన యట్టివారు శాంతి
దాంతి నిస్పృహతలు దలకొన సుసమాహి। తాత్ములై వసింతు రందు సాధ్వి!' 62

ప్రతిపదార్థం: సాధ్వి!= ఉత్తమురాలా!; అందున్= అక్కడ; మాననీయ= పూజనీయమైన గొప్ప; నియతిన్= నిష్ఠతో; మహిత= ప్రభావం కలిగిన; తపోధనవంతులు+ఐన+అట్టివారు= తపోధనం కల యోగులు; శాంతి= శాంతస్థితి; దాంతి= ఇంద్రియనిగ్రహాదులతో ఏర్పడ్డ ఓర్పు; నిస్పృహతలు= వైరాగ్యభావం; తలకొనన్= కూడగా; సు+సమాహిత+ఆత్ములు+ఐ= చక్కగా సుస్థితిని పొందిన ఆత్మ కలవారై; వసింతురు= ఉంటారు.

తాత్పర్యం: ఆ అడవిలో మహానిష్ఠాపరులై, ఉత్తమతపోధనం కలిగిన యోగులు నివసిస్తారు. వారికి శాంతమైన మనః స్థితి, బ్రహ్మచర్యాది వ్రతనిష్ఠవలన ఏర్పడ్డ ఓర్పు, వైరాగ్యభావం ఉండి సంయమితాత్ములై 'సుస్థితి'ని పొంది అక్కడ ఆనందంతో ఉంటారు.

విశేషం: అంటే అట్లాంటి స్థితిని చేరుకొనటం కష్టం (దుర్+గమ= చేరటానికి దుష్కరమైనదని) కాబట్టి 'అడవి'గా ఇక్కడ వర్ణించాడని భావం.

వ. అని చెప్పి మఱియును. 63

తాత్పర్యం: అని చెప్పి ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. 'వినుము మూర్కొనఁ జవిగొన దర్శనస్పర్శ। నము లాచరింప వినంగ నెలయ
నేమి సంకల్పము నెడఁ జేర్ప నిష్టార్థ। ములను ననిష్టార్థములను గోరు
టయును నొల్లక త్రోచుటయును స్వభావవక్ర। త్యము లవి గనుఁగొంచు నబల! వానఁ
బొరయ నెట్లన్న మేల్ దొరకొనుఁ గోరక। యును బోదు కీడు ద్రోచినను దీని

తే. **నెఱిఁగి యేను స్వభావంబునెడఁ బయోజ। పత్రగతజలబిందువుభంగిఁ దాల్తు'**
నని యెఱింగించి బ్రాహ్మణుఁ డతివతోడ। మఱియు నిట్టను శాత్రవమథనకల్య! 64

ప్రతిపదార్థం: వినుము; మూర్కొనన్= వాసన చూడటానికి; చవిగొనన్= రుచి చూడటానికి; దర్శన స్పర్శనములు ఆచరింపన్= చూడటానికి; తాకటానికి; వినంగన్= వినటానికి; ఎలయన్= సిద్ధించేటట్లు; ఏమి సంకల్పంబున్= ఏ విధమైన సంకల్పాన్ని; ఎడన్= హృదయంలో; చేర్పన్= చేర్చగా; ఇష్ట+అర్థములనున్= నచ్చిన కోరికలను; అనిష్ట+అర్థములనున్= నచ్చనివాటిని; కోరుటయునున్= కోరుకొనటం; ఒల్లక త్రోచుటయునున్= వద్దని వదలిపెట్టటం; స్వభావకృత్యములు= సహజంగా జరిగే పనులు; అవి= వాటిని; కనుఁగొంచున్= పరిశీలిస్తూ; అబల!= ఓ వనితా!; వానన్= ఆ పనులలో; పొరయన్= ప్రవేశించను; ఎట్లు+అన్నన్= ఎట్లాగంటే; మేల్= మేలు; కోరకయును= కోరకుండానే; దొరకొనున్= లాభిస్తుంది; కీడు; త్రోచినను= త్రోసిపారవేసినా; పోదు= జరగకపోదు; దీనిన్+ఎఱిఁగి= దీనిని గుర్తించి; ఏను= నేను; స్వభావంబు+ఎడన్= స్వభావంలో; పయోజపత్ర= తామరాకు; గత= మీదనున్న; జలబిందువు భంగిన్= నీటిబొట్టువలె; తాల్తున్= ధరిస్తాను; అని; బ్రాహ్మణుఁడు= ఆ విప్రుడు; అతివతోడన్= ఆస్త్రీతో; ఎఱింగించి= చెప్పి; మఱియున్+ఇట్లనున్= మరి ఇంకా ఇట్లా చెప్పాడు; శాత్రవ= శత్రువులను; మథనకల్య!= బాధించటంలో నేర్పరి అయిన ఓ అర్జునా! (వినుము).

తాత్పర్యం: ఇంద్రియాలతో పనులు చేసేటప్పుడు - అంటే వాసన చూసేటప్పుడుకాని, రుచి ఎరిగేటప్పుడుకాని, చూచినప్పుడు కాని, తాకినప్పుడుకాని, విన్నప్పుడుకాని - హృదయంలో ఎట్లా సంకల్పిస్తే కోరిక సిద్ధించినా, సిద్ధించకపోయినా లభించిన వస్తువు నచ్చినా నచ్చకపోయినా, కోరుకొనటం, వద్దని వదలిపెట్టటం రెండూ ఉండవో అట్లా అత్యంత సహజంగా నిర్లిప్తంగా ఆ పనులు చేస్తూ నేను ఏ బంధాన్నీ పొందకుండా ఉంటాను. ఎందుకంటే జరగబోయే మేలు కోరకుండానే జరుగుతుంది. ఎంత వారించినా రాబోయే ఆపద ఆగదు. దీనిని గుర్తించి, తామరాకుమీద నీటి బొట్టువలె ఏ సంస్పర్శా లేకుండా నేను స్వభావరీత్యా 'నిర్మగ్నుడు' కావటానికి ప్రయత్నిస్తాను' అని చెప్పి ఆ విప్రుడు ఇంకా ఇట్లా చెప్పాడు. (ఓ అర్జునా! నీవు యుద్ధంలో లక్షలమంది శత్రువులను అవలీలగా చంపినవాడవు. ఈ సాధనకూడా మొదలుపెట్టుము అని అర్థం).

విశేషం : అలం: ఉపమ. శ్రీకృష్ణుడు 'విముక్తి' సాధించే సులభమార్గం చెప్తున్నాడు. బంధానికి కారణం 'సంకల్పమే'. దానివలననే ఇష్ట అనిష్ట భావనలు ఏర్పడుతాయి. ఈ బ్రాహ్మణుడు దానిని జయించటానికి (నిష్కామ' సంకల్పంతో పని ప్రారంభించటం మొదలుపెట్టాడు. దానితో ఏర్పడేది నేను 'కర్త'ను కానన్న వైరాగ్యభావన. దానితో కార్యసిద్ధి దైవం 'దైవం' మీద వదలి, తాను 'నిష్కర్ముడు' అవుతాడు. అదే మంచి చెడులు ఎట్లాగైనా జరుగుతాయన్న జ్ఞానం కలిగి ఉండటం, చివరకిది 'తామరాకుమీద నీటి బొట్లు. భగవద్గీతలో యోగి సమాజంలో ఉంటూ ఎట్లా బంధ విముక్తుడు అవుతాడంటే దేనిలోనూ అంటి - అంటకుండా ప్రవర్తించటంచేత.

'పద్మపత్ర మివాంభసా' అని గీతాకారుడి పోలిక, దీనినే స్వామి మరలా ఇక్కడ చెప్పాడు.

వ. **'ఒక్కయెడ నధ్వర్యునకు యతికిం గలిగిన సంవాదంబు సెప్పెద నాకర్ణింపు; మధ్వర్యుండు పశువుం బ్రోక్షించుచుండ యతి నిరీక్షించి 'యిది హింస గాదె?' యనిన నతండు. 65**

ప్రతిపదార్థం: ఒక్క+ఎడన్= ఒకచోట; అధ్వర్యునకున్= యాజ్ఞికుడికి; యతికిన్= సన్న్యాసికి; కలిగిన= జరిగిన; సంవాదంబు= సంభాషణ; చెప్పెదన్= చెప్తుతాను; ఆకర్ణింపుము= వినుము; అధ్వర్యుండు= ఆ యజ్ఞంచేసే వ్యక్తి; పశువున్= యజ్ఞంలో బలి

ఇచ్చే పశువును; ప్రోక్షించుచుండన్= మంత్రజలం చల్లి పవిత్రం చేస్తుండగా; యతి= సన్న్యాసి; నిరీక్షించి= పొంచి చూచి; ఇది= ఇట్లా చేయటం; హింస+కాదె?= హింసకాదా?; అనినన్= అనగా; అతండు= ఆ యాజ్ఞికుడు.

తాత్పర్యం: ఒక చోట ఒక యాజ్ఞికుడికి, యతికి జరిగిన సంవాదం చెప్తుతాను వినుము. ఒక యాజ్ఞికుడు బలిపశువును మంత్రజలం ప్రోక్షించి బలికి సిద్ధం చేస్తుండగా యతి పొంచి ఉండి, అక్కడకు వచ్చి 'ఇట్లా చేయటం హింస కాదా' అని అడిగాడు. అప్పుడు ఆ యాజి (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **'ఛాగ మిది యరయంగ నాశంబు బొంద। దూర్ధ్వలోకసుఖంబుల నొందుఁగాని**
శ్రుతుల వాక్యముల్ నీ కెక్క సూనృతంబు। లగున యేని నీ విట్లంట యనుచితంబు.' 66

ప్రతిపదార్థం: ఛాగము+ఇది= ఈ మేక; అరయంగన్= బాగా తెలిసికొంటే నాశంబున్+పొందదు= చావదు; ఊర్ధ్వలోక సుఖంబులన్= స్వర్గాద్యుత్తమ లోకాలను; ఒందున్+కాని= పొందుతుంది తప్ప; శ్రుతులవాక్యముల్= వేదవాక్యాలు; నీకున్+ఎక్కన్= నీ తలపులో (భావనలో); సూనృతంబులు+అగును+అ+ఏని= సత్యాలు అయితే; నీవు+ఇట్లు+అంట= నీవు ఇట్లా అనటం; అనుచితంబు= సముచితం కాదు.

తాత్పర్యం: 'అయ్యా! వేదవాక్యాలలో మీకు నమ్మకం ఉంటే ఇట్లా ఆనటం సముచితం కాదు. ఈ మేక చావదు. ఊర్ధ్వగతి పొందుతుంది.'

వ. **అని వెండియు నప్పశువు నుద్దేశించి.** 67

ప్రతిపదార్థం: అని; వెండియున్= ఇంకా; ఆ+పశువున్= ఆ మేకను; ఉద్దేశించి= దృష్టిలో పెట్టుకొని.

తాత్పర్యం: అని ఇంకా ఆ బలిపశువును దృష్టిలో ఉంచుకొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **'భూతములు నింద్రియంబులు। నాతతగుణ! యాత్మ యోనులందుఁ గలయఁ బిం**
డేతరుఁ డగు జీవుఁడు సౌ। ఖ్యాతిశయం బొందు నధ్వరాతిశయమునన్.' 68

ప్రతిపదార్థం: అతతగుణ!= ఉత్తమ గుణాలు కలిగిన ఓ యతీశ్వరుడా!; భూతములున్= పంచభూతాలూ; ఇంద్రియంబులున్= ఇంద్రియ పంచకమూ; ఆత్మయోనులందున్= తమ తమ జీవులు ప్రవేశించే దేహాలలో; కలయన్= ప్రవేశించగా; పిండ+ఇతరుఁ డు+ అగు= జీవుఁడు= పిండరూపం పొందనిజీవుడు; అధ్వర+అతిశయమునన్= యజ్ఞశక్తివలన; సౌఖ్య+అతిశయమున్+పొందున్= మిక్కిలి గొప్పదైన స్వర్గసౌఖ్యాన్ని పొందుతాడు.

తాత్పర్యం: 'యతీశ్వరా! పంచభూతాలు, పంచేంద్రియాలు ఆయా జీవులు ప్రవేశించే యోనులలో చేరి, జన్మను పొందుతాయి. యజ్ఞంలో బలి అయ్యే జీవుడు పిండరూపం పొందడు. యజ్ఞప్రభావంవలన మిక్కిలి గొప్పదైన స్వర్గ సుఖాన్ని పొందుతాడు.'

విశేషం : మామూలుగా చనిపోతే పిండరూపం తప్పకపొందుతాడు. యజ్ఞంలో మరణిస్తే అట్లా కాదు. ఆ జీవుడు చేసిన పుణ్యఫలాన్ని అనుభవిస్తాడు. అందుకే జీవితం కర్మప్రధానంగా ఉండాలి. ఆ కర్మ యజ్ఞకర్మ కావాలని 'యాగ' మతం. ఇదీ బంధహేతువే అని,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'జ్ఞానయాగం' ఒకటే ఉత్తమసాధనమని 'జ్ఞానమతం'. అదే 'అక్షరోపాస్తి'గా ముందు ప్రస్తావించినది. ఈ రెండింటిని వ్యాసమహర్షి ఎట్లా సమన్వయించాడో ఈ అధ్వర్యు - యతి సంవాదంలో అర్థంచేసికొనవచ్చును.

క. అని పలుకుటయును యతి యి । ట్లను 'ఛాగము పుణ్యగతికి నరిగెడుఁ బో యి
ప్పని నీ కెవ్విధము ప్రయో । జనంబు సిద్ధించుఁ? జెపుము సమ్యక్ఫణితిన్.' 69

ప్రతిపదార్థం: అని పలుకుటయును= అని 'యాజి' చెప్పగా; యతి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; ఛాగము= మేక;పుణ్య గతికిన్+అరిగెడున్+పో= పుణ్యలోకాలకు పోతుందే అనుకొందాం; ఈ+పనిన్= ఈ పశువిశసనం వలన; నీకున్+ఏ+విధము+ ప్రయోజనంబు= నీకు ఏమి లాభం; సిద్ధించున్?= ఒనగూడుతుంది?; సమ్యక్+ఫణితిన్= విశదంగా; చెపుము+అను= చెప్పుము.

తాత్పర్యం: అని యాజ్ఞికుడు చెప్పగా అపుడు యతి ఇట్లా అన్నాడు. 'నీ వన్నట్టు ఆ మేక స్వర్గానికి వెళ్ళుతుందనే అనుకొందాము. దానివలన నీకు ఒరిగే లాభం ఏమిటి? బాగా వివరించి చెప్పుము.'

వ. అనుటయు నధ్వర్యుం డతని కిట్లనియె. 70

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; అధర్వుండు= యాజి; అతనికిన్+ఇట్లు+అనియెన్= అతడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని యతి అనగా 'యాజి' అతడితో ఇట్లా అన్నాడు.

విశేషం : యజ్ఞఫలం ఏమిటి? అనేది ప్రశ్న. మేక స్వర్గానికి వెళ్ళితే 'యాజి'కి వచ్చిన లాభం ఏమిటన్నదీ ఆలోచించదగిన విషయమే. వేదప్రామాణ్యాన్ని బ్రాహ్మణుడు చెప్పుతున్నాడు.

క. 'అగమము పశువిధిం దగ । యాగ మొనర్చినఁ ద్రివిష్టపానేక మహా
భోగానుభూతి భవ్య స । మాగమ మగు ననుట బొంకె? యాగమవేదీ! 71

ప్రతిపదార్థం: ఆగమవేదీ!= ఓ యతీశ్వరా! నీవు వేదాలు తెలిసినవాడవు; ఆగమము= వేదం; పశువిధిన్= పశుబలి విధానంతో; తగన్= శాస్త్రోక్తంగా; యాగము+ఒనర్చినన్= యజ్ఞం చేస్తే; త్రివిష్టప= స్వర్గం మొదలైన; అనేక= చాలా; మహాభోగ+అనుభూతి+భవ్య+ సమాగమము+అగున్+అనుట= గొప్ప సుఖాల అనుభవం కలుగుతుంది అనటం; బొంకె?= తప్పా?

తాత్పర్యం: 'యతీశ్వరా! నీకు వేదాలు బాగా తెలుసు కదా! వేదాల ప్రకారం బలిపశువిధానంతో శాస్త్రోక్తంగా యాగం చేస్తే స్వర్గాది దివ్యసౌఖ్యాలు సిద్ధిస్తాయి. ఇది తప్పంటావా?'

చ. అనవుడు 'హింస పాప మని యాగమవాక్యములంద కాదె! యేఁ
గని యిటు లంటి' నన్న యతిఁ గన్గొని 'నీవు సమాధిఁ బ్రాణరో
ధనము మనోలయంబు సుకృతంబులుగా నొనరించి వెండి యో
గ నిరతిఁ బొందె; దత్తెఱఁగు గాదొకొ హింస? దలంచి చూడఁగన్.' 72

ప్రతిపదార్థం: అనవుడున్= అని యాజి చెప్పగా; యతి; హింస పాపము+అని= హింస మహాపాపమని; ఆగమ వాక్యములందున్+అ కాదె!= వేదవాక్యాలలోనే కదా!; ఏన్+కని= నేను చూచి; ఇటులు+అంటిన్= ఇట్లా అన్నాను; అన్నన్= అనగా; యతిన్+కన్గొని=

యతిని చూచి; సమాధిన్= సమాధిలో; ప్రాణరోధనమున్= వాయువును బంధించటం; మనస్+లయంబున్= మనసును లోపలికి తోయటం; సుకృతంబులుగాన్= మంచి పనులుగా; ఒనరించి= చేసి; వెండి= ఆ తరువాత; యోగనిరతిన్= యోగంలో స్థిరపడటాన్ని; పొందెదు= పొందుతున్నావు; ఆ+తెఱఁగు= ఆ పద్ధతి; తలంచి చూడఁగన్= బాగా విమర్శించి చూస్తే; హింస+కాదొకొ?= హింస కాదా మరి?

తాత్పర్యం: అని యాజి చెప్పగా యతీశ్వరుడు 'ఆ వేదవాక్యాలలోనే హింస మహాపాపమని నేను చూచే ఇట్లా అన్నాను' అన్నాడు. అపుడు యాజి ఆ యతితో అన్నాడు: 'నీవు సమాధిలో వాయువును బంధించి, మనస్సును లోపలికి ముంచి వాటిని చాలా పుణ్యకార్యాలుగా చేసి, ఆ తరువాత యోగంలో స్థిరపడుతున్నావు. బాగా విమర్శించి చూస్తే ఇందులో మాత్రం హింస లేదా మరి?' అని ప్రశ్నించాడు.

వ. అని పలికిన నయ్యధ్వర్యునకు నయ్యతిముఖ్యుం డిట్లనియె. 73

ప్రతిపదార్థం: అని పలికినన్= అని చెప్పగా; ఆ+అధ్వర్యునకున్= ఆ యాజితో; ఆ+యతిముఖ్యుండు= ఆ యతిశ్రేష్ఠుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని పలికిన ఆ యాజికి ఆ యతీశ్వరు డిట్లా అన్నాడు.

విశేషం : యజ్ఞఫలం ఏమిటి? అనేది ప్రశ్న, మేక స్వర్గానికి వెళ్ళితే 'యాజి'కి వచ్చిన లాభం ఏమిటన్నదీ ఆలోచించదగిన విషయమే. వేదప్రామాణ్యాన్ని బ్రాహ్మణుడు చెప్పుతున్నాడు.

చ. 'పరమతపంబు గాఢపరిపాకము నొందినఁ జిత్సుఖాత్మకా
క్షరమునఁ జిత్తభూతగుణజాలతనున్ క్షరమున్ వివేకితా
పరిణతిఁ; బాపి చూచి యనపాయసుఖస్థితి నూఁది పొల్లలం
బొరయక త్రోపు హింస యనుబుద్ధి విమూఢత గాక బోధమే? 74

ప్రతిపదార్థం: పరమతపంబు= గొప్ప తపస్సు; గాఢ= మిక్కుటమైన; పరిపాకమున్+ఒందినన్= పరిపక్వతను పొందగా; చిత్+సుఖ+ఆత్మక+అక్షరమునన్= జ్ఞానస్వరూపమైన సుఖాన్ని ఆత్మ కలిగిన అక్షరతత్త్వాన్ని అవలంబించి; చిత్తభూత= మనసునుండి పుట్టిన; గుణజాలతనున్= ప్రకృతి గుణాలతో కూడిన శరీరం కలవాడిని; క్షరమున్= నశించే లక్షణం కలిగిన క్షరతత్త్వాన్ని; వివేకితాపరిణతిన్= వివేకపరిణతిచేత; పాపి= నశింపజేసి; చూచి= ఆ అనంతమైన అద్వైతస్థితిని దర్శించి; న+అపాయ= ఎడబాటులేని; సుఖస్థితిన్+ఊఁది= సుఖస్థితిని పొంది; పొల్లలన్= వ్యర్థమైన వాటిలో; పొరయక= ప్రవేశించకుడా; త్రోపు= నిషేధించటం; హింస+అను బుద్ధి= హింస అనేటటువంటి ఆలోచన; విమూఢత+కాక= తెలివిలేనితనం తప్ప; బోధమే?= అది జ్ఞానమా?

తాత్పర్యం: 'గాఢంగా చేసిన తపస్సు పండగా జ్ఞానానందస్వరూపం కలిగిన అక్షరోపాసనచేత చిత్తజాతమైన ప్రకృతి గుణాలతో కూడిన ఈ శరీరాన్ని ఆశ్రయించిన క్షరతత్త్వాన్ని వివేకసమగ్రతద్వారా నశింపజేసి, నిరంతరమైన అద్వైతానంద స్థితిని దర్శించి, ఆ సుఖాన్ని పొంది, వ్యర్థమైన ఐహికసుఖాలలోనికి మనస్సు జారకుండా నియంత్రించటం 'హింస' అనటం వట్టి అజ్ఞానం తప్ప మరొక్కటి కాదు.'

చ. అనవుడు నాతఁ 'డార్యవచనామృత మానినవాఁడు కీడుమేల్
గనుఁగొనఁజాలు; నేను బశుకార్యమునప్పుడు మీ రనుగ్రహిం

చిన క్రియఁ జూడనేర్తుఁ జిదచిద్ద్వయమున్ విభజించి దాన హిం

సనము నొకింతయుం బొరయ జన్నము సేయుదు మేలు నొందుదున్.' 75

ప్రతిపదార్థం: అనవుడున్= అని యతి ప్రశ్నించగా; ఆతఁడు= ఆ యాజి; ఆర్య+వచనామృతము= పెద్దల మాటలనే అమృతాన్ని; ఆనినవాఁడు= తాగినవాడు; కీడుమేల్= చెడు మంచి; కనుఁగొనన్+చాలున్= గుర్తించగలుగుతాడు; నేను; పశుకార్యము+అప్పుడు= పశుబలి ఇస్తున్న సమయంలో; మీరు+అనుగ్రహించిన+క్రియన్= మీరు ఇంతసేపు బోధించిన పద్ధతిలో; చిత్+అచిత్= జ్ఞానాజ్ఞానాలను; ద్వయమున్= రెండింటినీ; విభజించి= వేరుచేసి; చూడనేర్తున్= యజ్ఞక్రియను దర్శించగలుగుతాను; దానన్= అందుచేత; హింసనమున్= హింసాపాపాన్ని; ఒక+ఇంతయున్= కొంచెంకూడా; పొరయన్= పొందను; జన్నము+చేయుదున్= యాగం చేస్తాను; మేలున్+ఒందుదున్= ఉత్తమగతిని పొందుతాను.

తాత్పర్యం: అని యతి ప్రశ్నించగా ఆ యాజి అన్నాడు: 'స్వామీ! పెద్దలమాటలు అనే అమృతాన్ని త్రాగినవాడు మంచిచెడులను గుర్తించగలుగుతాడు. నేను పశుసంప్రోక్షణచేసి బలి ఇచ్చే సమయంలోకూడా జ్ఞానాజ్ఞానాలను వేరుచేసి, మీరు ఇంతసేపూ ఏ అక్షర, క్షరతత్త్వాన్ని ఉపదేశించారో ఆ తత్త్వాన్ని దర్శించగలుగుతున్నాను. అందువలన నాకు ఏ హింస చేసిన పాపమూ అంటటంలేదు. నేను యజ్ఞం చేస్తాను; ఉత్తమగతిని పొందుతాను.' (ఇందులో దోషం ఏమిటి? ఇది జ్ఞానం ఎందుకు కాదు? అని యాజ్ఞికుడి మీమాంస). వచనామృతము-వచన మనెడి అమృతము - రూపకాలంకారం.

క. అనుటయు నతనికి యతి యి। ట్లనుఁ 'బశుయజ్ఞమున కంటె ననఘ! తపోయ

జ్ఞనిరూఢి మేలు గావున। వినిపింపఁ దలంచి యంటి వేయును నేలా?' 76

ప్రతిపదార్థం: అనుటయున్= అని యాజ్ఞికుడు చెప్పగా; అతనికిన్= అతడితో; యతి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అనఘ!= ఓ పుణ్యాత్మా!; పశుయజ్ఞమునకంటెన్= పశుయజ్ఞంకంటె; తపస్+యజ్ఞ నిరూఢి= తపోయజ్ఞంలో నిరతుడై ఉండటం; మేలు+కావునన్= మేలు కాబట్టి; వినిపింపన్+తలంచి= నీకు చెప్పుదామని భావించి; అంటిన్= ఆ విధంగా చెప్పాను; వేయునున్+ఏలా?= ఇంక ఎక్కువగా చెప్పటం ఎందుకు?

తాత్పర్యం: అని యాజ్ఞికుడు చెప్పగా యతి ఇట్లా అన్నాడు'పుణ్యాత్మా! పశుయజ్ఞంకంటె తపోయజ్ఞం మేలుగా భావించినందువలన నీతో అట్లా చెప్పాను. ఇక దీనిని గురించి అధికంగా చెప్పటం ఎందుకు?'

వ. అనవుడు నమ్మాటకు నయ్యధ్వర్యుం డొడంబడియె' నని చెప్పి యాభూసురపర్యుం డా భామినితో 'నీ యర్థంబున కొక్కయితిహాసంబు గల దాకర్ణింపుము. సహస్రబాహుండగు నర్జునుండు దుర్జయప్రతాపంబున నఖిల ద్వీపంబులు నేలి వ్రాలి తనకు నెదురు లేకున్న విజృంభించి పరశురాముం దొడరి యతనికి నత్యంతం బప్రియంబాచరించిన నతండు బహుశాఖోపశాఖాశోభితంబయిన పాదపంబు నుఱుముగా నఱికి పడవైచిన చందంబునం బరశుఖండితసర్వాంగునిం జేసె; నంత నిలువక తత్క్షణంబు రాజులు గూడికొని తదీయ తనయులుం దారు నా రాముని యసన్నిధి నతని జనకుం డగు జమదగ్నిం జంపినం బెంపారు కోపంబున నాటోపం బెసంగ నా జామదగ్న్యుండు రాజుల నెల్లం దరమిడి యిరువదియొక్కమాఱు పరశుధారపాలుచేసిన నతనికిఁ బితృదేవతలు సన్నిధి సేసి. 77

ప్రతిపదార్థం: అనవుడున్= అని యతీశ్వరుడు చెప్పగా; ఆ+మాటకున్= ఆ మాటకు; ఆ+అధ్వర్యుండు= ఆ యాజ్ఞికుడు; ఒడంబడియెన్+అని= అంగీకరించాడని; చెప్పి; ఆ భూసురవర్యుండు= ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు; ఆ భామినితోన్= ఆ స్త్రీతో; ఈ అర్థంబునకున్= ఈ విషయాన్ని వివరించేటటువంటి; ఒక్క+ఇతిహాసంబు+కలదు= ఒక కథ ఉంది; ఆకర్ణింపుము= వినుము; సహస్ర బాహుండు+అగు+అర్జునుండు= వేయి బాహువులుగల కార్తవీర్యార్జునుడు; దుర్జయ ప్రతాపంబునన్= జయించటానికి వీలులేని పరాక్రమంతో; అఖిల ద్వీపంబులున్+ఏలి= అన్ని ద్వీపాలూ పరిపాలించి; వ్రాలి= అతిశయించినవాడై; తనకున్+ ఎదురు లేకున్నన్= తనకు ఎక్కడా ఎదురులేకపోతే; విజృంభించి= పరాక్రమించి; పరశురామున్+తొడరి= పరశురాముడిని ఎదిరించి; అతనికిన్= అతడికి; అత్యంతంబు= మిక్కిలి; అప్రియంబు= కీడు; ఆచరించినన్= చేయగా; అతండు= ఆ పరశురాముడు; బహుశాఖా+ ఉపశాఖాశోభితంబు+అయిన= చాలా కొమ్మలతో రెమ్మలతో బాగా శోభిస్తున్న; పాదపంబున్= చెట్టును; నుఱుముగాన్= నుగ్గుగా; నఱికి పడవైచిన చందంబునన్= నరికివేసిన రీతిగా; పరశుఖండిత= పరశువు (గొడ్డలి) చేత నరకబడిన; సర్వాంగునిన్+ చేసెన్= అన్ని అంగాలు కలవాడివిగా చేశాడు; అంతన్+నిలువక= దానితో ఆగక; తద్+పక్షంబు రాజులు= ఆ కార్తవీర్యుడి పక్షాన చేరిన రాజులు; కూడికొని= ఒక్కటై; తదీయ తనయులున్= ఆ కార్యవీర్యుడి కుమారులు; తారున్= తామూ కలిసి; ఆ రాముని= ఆ పరశురాముడిని; అసన్నిధిన్= లేని సమయంలో; అతని జనకుండు+అగు= అతడి తండ్రి అయిన; జమదగ్నిన్= జమదగ్నిని; చంపినన్= చంపివేయగా; ఆ జామదగ్న్యుండు= ఆ పరశురాముడు; పెంపారు కోపంబునన్= అతిశయించిన కోపంతో; ఆటోపంబు+ఎసంగన్= విజృంభించిన; రాజులన్+ఏల్లన్= రాజుల నందరినీ; తరమిడి= వరుసపెట్టి; ఇరువది+ఒక్కమాఱు= ఇరవై ఒకసార్లు; పరశుధారపాలు+చేసిన= గొడ్డలి అంచుకు బలిచేసిన; అతనికిన్= అతడికి; పితృదేవతలు; సన్నిధి+చేసి= కనిపించి.

తాత్పర్యం: అని యతీశ్వరుడు చెప్పగా ఆ మాటకు ఆ యాజ్ఞికుడు అంగీకరించా'డని చెప్పి, ఆ బ్రాహ్మణుడు ఆ వనితతో 'ఈ విషయాన్ని వివరించే కథ ఒకటున్నది చెప్పుతాను; వినుము. వేయి చేతులున్న కార్తవీర్యార్జునుడు జయించటానికి వీలులేని పరాక్రమంతో అన్ని ద్వీపాలూ పాలించి, అతిశయించినవాడై తనకు ఎక్కడా ఎదురులేకపోగా విజృంభించినవాడై పరశురాముడిని ఎదిరించి, అతడికి చాలా కీడు చేశాడు. దానితో ఆ పరశురాముడు చాలా కొమ్మలతో రెమ్మలతో కూడుకొన్న నిండైన చెట్టును నుగ్గునుగ్గుగా నరికివేసినట్లు గొడ్డలితో ఆ కార్తవీర్యుడి అంగాంగాలూ ఖండించి చంపాడు. దానితో రెచ్చిపోయిన అతడి పక్షంలోని రాజులు, అతడి కుమారులు కలిసి పరశురాముడు దగ్గరలేని సమయంలో అతడి తండ్రి అయిన జమదగ్ని మహామునిని చంపివేశారు. అతిశయించిన కోపంతో మిక్కిలి విజృంభించినవాడై ఆ పరశురాముడు రాజుల నందరినీ వరుసపెట్టి ఇరవై ఒక్కసార్లు తన గొడ్డలి అంచుకు గురిచేశాడు. చివరికి అతడికి పితృదేవతలు ప్రత్యక్షమయ్యారు.

విశేషం : కార్తవీర్యుడు త్రిశూలంతో పరశురాముడిని కొట్టగా అతడు క్రిందపడిపోయాడు అని ఒక కథ ఉన్నది. దానినే ఈ వచనంలో అత్యంతమైన అప్రియంగా చెప్పుతున్నారు. బహుశాఖోపశాఖాశోభితంబైన పాదపంబు నుఱుముగా నఱికి పడవైచిన చందంబున- అలంకారం ఉపమ.

ఆ. **పరశురామ! నీవు బ్రాహ్మణుండవు నరే। శ్వరులఁ జంపనేల? వలవ దుడుగు**
మయ్య!' యనుడు నాతఁ 'డట్లనకుం డుఁ డీ। రేను రాజ పశు విధానమునను.' **78**

ప్రతిపదార్థం: పరశురామ!= ఓ పరశురామా!; నీవు; బ్రాహ్మణుండవు= బ్రాహ్మణుడవు; నర+ఈశ్వరులన్= రాజులను; చంపన్+ఏల?= చంపటం ఎందుకు?; వలవదు= కూడదు; ఉడుగుము+అయ్య!= ఆపివేయవయ్యా!; అనుడున్; అతఁడు= ఆ పరశురాముడు; ఈరు= మీరు; అట్లు+అనకుండుఁడు= అట్లా అనవద్దండి; ఏను= నేను; రాజ పశు విధానమునన్= రాజు లనే పశువులను యజ్ఞం చేయటంలో

తాత్పర్యం: పరశురామా! నీవు బ్రాహ్మణుడవు. రాజులను చంపటం ఎందుకు? ఈ పని తప్పు, మానివేయవయ్యా! అని వారు చెప్పగా పరశురాముడు 'మీరు అట్లా అనవద్దు. నేను ఈ రాజపశువులను యజ్ఞం చేసి తీరుతాను. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సారనియతిఁ బాటించి మ । హారోషాగ్ని పరితృప్త మగునట్టులుగా
వీరాధ్వరంబు సేసెద । వారింపక యరుగుఁ' డనిన వా రాతనితోన్. 79

ప్రతిపదార్థం: సారనియతిన్= గొప్ప నియమాన్ని; పాటించి= అవలంబించి; మహాదోష+అగ్ని పరితృప్తము+అగు+అట్టులుగాన్= గొప్ప రోషమనే అగ్నిచేత బాగా కాలిపోయేటట్లు; వీర+అధ్వరంబు+చేసెదన్= వీరోచితమైన యజ్ఞం చేస్తాను; వారింపక= నన్ను వారించకుండా; అరుగుఁడు+అనినన్= వెళ్ళిపొండి; అనగా; వారు; అతనితోన్= ఆ పరశురాముడితో,

తాత్పర్యం: గొప్ప నియమాన్ని పాటించి గొప్ప రోషమనే అగ్నిచేత ఆ రాజులను హోమంచేసి వీరోచితమైన యజ్ఞం చేస్తాను. నన్ను అడ్డుకోకుండా వెళ్ళిపొండి' అని పరశురాము డంటే అప్పుడు ఆ పితృదేవతలు. (తరువాతి పద్యంతో అన్వయం.-) దోషాగ్ని-దోషమనెడి అగ్ని-రూపకాలంకారం.

క. 'యజ్ఞంబులలోనఁ దపో । యజ్ఞం బుత్తమము; దాని నాదరణమునఁ
బ్రాజ్ఞోత్తమ! చేయుము స । ర్వజ్ఞుఁడు ప్రీతుఁ డగు శాంతరస మొప్పుఁ జుమీ!' 80

ప్రతిపదార్థం: ప్రాజ్ఞ+ఉత్తమ!= జ్ఞానులలో శ్రేష్ఠుడా!; యజ్ఞంబులలోనన్= యజ్ఞాలన్నింటిలోనూ; తపస్+యజ్ఞంబు= తపస్సు అనే యజ్ఞం; ఉత్తమము= శ్రేష్ఠమైనది; దానిన్= ఆ తపస్సును; ఆదరణమునన్= ఆదరంతో; చేయుము; సర్వజ్ఞుఁడు= ఈశ్వరుడు; ప్రీతుఁడు+అగున్= సంతోషిస్తాడు; శాంతరసము+ఒప్పున్+చుమీ!= నీవు శాంతస్థితిని పొందుతావు సుమా!

తాత్పర్యం: 'యజ్ఞాలలో కెల్లా తపస్సు చాలా శ్రేష్ఠమైనది. ఆ తపస్సును ఆదరంతో నిర్వహించుము. ఈశ్వరుడు నిన్ను కరుణిస్తాడు. నీకూ ప్రశాంతి లభిస్తుంది.'

వ. అని చెప్పి మఱియు నిట్లనిరి; 'తొల్లి యలర్కుం డను రాజు మనస్స్పృష్టంబు లగు నింద్రియంబులు గలిగి దివ్యాస్త్రంబులు ప్రయోగింపం జూచిన నవి నయ్యవనిపతితో నయ్యప్రియంబులం దారు సెడ మనియును రోషావేశంబునం బ్రయోగించిన నతండ చెడు ననియునుం బలికి 'యొపుదేని నీ తపోమయంబు లైన యస్త్రంబులు సంధింపు' మనిననతండు క్రోధంబుదక్కి యోగంబున శాంతి నొంది వానిం దద్రూపతపఃఫలాస్త్రసాధితంబులం జేసె; నీవునుం దపంబున నంతశ్శత్రుజయసౌఖ్యం బనుభవింపుము బాహ్యశత్రుజయంబు జయంబుగాఁ గొనకుము.' 81

ప్రతిపదార్థం: అని చెప్పి= అని బోధించి; మఱియున్+ఇట్లు+అనిరి= ఇంకా ఇట్లా చెప్పారు; తొల్లి= మునుపు; అలర్కుండు+అను= రాజు= అలర్కు డనే పేరుగల రాజు; మనస్+స్పృష్టంబులు+అగు= మనస్సుచేత అపవిత్రంచేయబడిన; ఇంద్రియంబులు+కలిగి= ఇంద్రియాలు కలిగినవాడై; దివ్య+అస్త్రంబులు= గొప్ప ఆయుధాలు; ప్రయోగింపన్+చూచినన్= ప్రయోగించాలని ప్రయత్నిస్తే; అవి= ఆ ఇంద్రియాలు; ఆ+అస్త్రంబులన్= ఆ అస్త్రాలతో; తారు= తాము; చెడము+అనియునున్= నశించమనీ;

రోష+అవేశంబునన్= రోషంతోడ; ప్రయోగించినన్= ప్రయోగిస్తే; అతండు+అ= అతడే; చెడున్+అనియున్= నశిస్తాడని; పలికి= చెప్పి; ఓపుదు(వు)+ఏని= సమర్థుడవైతే; నీ తపోమయంబులు+ఐన= నీవు తపస్సు చేసి సాధించిన; అస్త్రంబులు= అస్త్రాలను; సంధింపుము+అనినన్= అనుసంధించుమని అడుగగా; అతండు= ఆ అలర్కుడు; క్రోధంబు+తక్కి= కోపం విడిచిపెట్టి; యోగంబునన్= యోగంతో; శాంతిన్+ఒంది= ప్రశాంతిని పొంది; వానిన్= ఆ ఇంద్రియాలను; తద్+రూప= ఆయా ఇంద్రియాలకు తగిన; తపస్+ఫల+అస్త్ర= తపఃఫలరూపం కలిగిన అస్త్రాలచేత; సాధితంబులన్+చేసెన్= సాధింపబడ్డవిగా చేశాడు; నీవునున్= నీవుకూడా; తపంబునన్= తపస్సుతో; అంతన్+శత్రు జయ= లోపలి శత్రువులను జయించటంవలన పుట్టే సౌఖ్యంబు+ అనుభవింపుము= ఆత్మసంతోషాన్ని పొందు; బాహ్య శత్రుజయంబున్= బయటి శత్రువును జయించటం; జయంబుగాన్+ కొనకుము= జయంగా అనుకొనవద్దు.

తాత్పర్యం: అని బోధించి ఇంకా ఇట్లా చెప్పాడు 'మునుపు అలర్కుడు అనే రాజు మనస్సుచేత అపవిత్రం చేయబడిన ఇంద్రియాలు కలవాడై, వాటిని జయించటంకొరకు తన దగ్గరున్న గొప్ప గొప్ప ఆయుధాలు ప్రయోగించాడు. అప్పుడు ఆ ఇంద్రియాలు తాము ఆ ఆయుధాలచేత చావము అని, రోషంతో ప్రయోగిస్తే అతడే చస్తాడని చెప్పి, 'సమర్థుడవైతే తపస్సుచేసి సాధించిన అస్త్రాలు ఉంటే ప్రయోగించుము' అని ఉపదేశించాము' అని ఉపదేశించాయి. అప్పుడు ఆ అలర్కుడు కోపం విడిచిపెట్టి, యోగాభ్యాసంతో ప్రశాంతిని పొంది, ఆ ఇంద్రియాలకు అనుగుణమైన తపోమయదివ్యాస్త్రాలను ప్రయోగించి వాటిని అదుపులోనికి తెచ్చుకొన్నాడు. అట్లాగే నీవు కూడా తపస్సుతో లోపలిశత్రువులను జయించి ఆత్మసౌఖ్యం అనుభవించుము. బయటి శత్రువులను జయించటం విజయమని అనుకోవద్దు' అని చెప్పాడు.

క. **అని నిష్ఠించి పలుక న। వ్వినుతచరిత్రుండు శాంతివిభవంబున మా**
నిన మనసుతోడ ముని మా। ననపాత్రం బైన తపమునన మే లొందెన్.' **82**

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; నిష్ఠించి పలుకన్= నిర్ణయించి పలుకగా; ఆ+వినుత చరిత్రుండు= ఆ పుణ్యచరిత్రుడు; శాంతి విభవంబునన్= ప్రశాంతి వైభవంతో; ఊనిన= నిలిచిన; మనసుతోడన్= మనస్సుతో; ముని మానన పాత్రుంబు+ఐన= మునుల గౌరవానికి పాత్రమైన; తపమునన్+అ= తపస్సుతోనే; మేలు+ఒందెన్= ఉత్తమగతిని పొందాడు.

తాత్పర్యం: అని ఈ విధంగా నిర్ణయించి పలుకగా ఆ పుణ్యమూర్తి ప్రశాంతిని పొందాలన్న కోరికతో మునుల ప్రశంసకు పాత్రమైన తపస్సుచేతనే ఉత్తమగతిని పొందాడు.'

సీ. **అని చెప్పి బ్రాహ్మణుం డయ్యింతి కిట్లనుఁ। 'దొమ్మిది గుణములు కొమ్మ! కలవు**
స్తంభాభిమానహర్షంబులు సాత్త్విక। ములు; క్రోధసంరంభములును శోక
మును రాజసంబులు మోహతంద్రాస్వప్న। ములు తామసము లిట్లు గలుగు రిపులఁ
దునుమ నే యస్త్రంబు లనువగు వాన న। య్యంతర శత్రుచయంబు నెల్లఁ

తే. **దునిమి యేనింద్రియంబుల మనము నోర్చి। శాంతి నొంది శ్రేయస్సిద్ధి సాధనం బొ**
నర్చునది ముఖ్యవైరి నిర్ణయముఁ జేయు। నంబరీషగీతలు విను మంబుజాక్షి! **83**

ప్రతిపదార్థం: అని చెప్పి= అని చెప్పినవాడై; బ్రాహ్మణుఁడు= ఆ విప్రుడు; ఆ+ఇంతికిన్+ఇట్లు+అనున్= ఆ వనితతో ఇట్లా అన్నాడు; కొమ్మ!= ఓ వనితా!; తొమ్మిది గుణములు కలవు= తొమ్మిది గుణాలున్నాయి; స్తంభ= స్థిరత్వం; అభిమాన= ఆత్మగౌరవం; హర్షంబులు= సంతోషం; సాత్త్వికములు= సాత్త్వికాలు; క్రోధ= కోపం; సంరంభములునున్= ఉద్రేకం; శోకమునున్= దుఃఖం; రాజసంబులు= రాజసాలు; మోహ= భ్రాంతి; తంద్రా+స్వప్నములు= బడలిక; నిద్రపోవటం; తామసములు= తామస గుణాలు; ఇట్లు= ఈ విధంగా; కలుగు రిపులన్= ఉన్న శత్రువులను; తునుమన్= చంపటానికి; ఏ అస్త్రంబులు+అనువు+అగున్= ఏ అస్త్రాలు తగినవో; వానన్+అ= వాటితోనే; ఆ+అంతర శత్రు చయంబున్+ఎల్లన్= ఆ లోపలి శత్రుసమూహాన్ని అంతటినీ; తునిమి= చంపి; ఏను+ఇంద్రియంబులన్= పంచేంద్రియాలలో; మనమున్= మనస్సును; ఓర్చి= జయించి; శాంతిన్+ఒంది= శాంతిని పొంది; శ్రేయస్సిద్ధి సాధనంబు+ఒనర్చునది= శ్రేయస్సును సిద్ధించేటట్లు ప్రయత్నించాలి; అంబుజ+అక్షి!= పద్మలోచనా!; ముఖ్యవైరి నిర్ణయమున్+చేయు= ముఖ్యశత్రు నెవరో గుర్తించే; అంబరీషగీతలు= అంబరీష గీతలను; వినుము.

తాత్పర్యం: అని చెప్పినవాడై ఆ విప్రుడు తనభార్యతో ఇట్లా అన్నాడు. 'వనితా! తొమ్మిది గుణాలున్నాయి. వాటిలో స్థిరత్వం, ఆత్మగౌరవం, సంతోషం అనేవి సాత్త్వికాలు. కోపం, ఉద్రేకం, దుఃఖం అనేవి రాజసాలు. భ్రాంతి, బడలిక, నిద్ర అనేవి తామసాలు. ఇవే లోపల ఉన్న శత్రువులు. వీటిని జయించటానికి ఏ అస్త్రం తగినదో దానిని ప్రయోగించియే వీటిని జయించగలము. తరువాత ఐదు ఇంద్రియాలతోనూ మనస్సును జయించి, ప్రశాంతస్థితిని పొంది, మోక్షానికి ప్రయత్నంచేయాలి. ఈ మార్గంలో ముఖ్యశత్రువు ఎవరో నిర్ణయించటంలో పనికి వచ్చేటటువంటి అంబరీష గీతలున్నాయి. వాటిని గురించి చెప్పుతాను వినుము.

వ. అంబరీషుం డనురాజు రాజనీతిపరత్వంబునం బరమప్రభుత్వంబు నొంది యరాతుల నెల్ల విగతాసులం జేసి పూజ్యం బగు రాజ్యంబు పరిపాలించుచుండి యొక్కనాఁడు విద్వజ్జనంబులతో నిట్లనియె. 84

ప్రతిపదార్థం: అంబరీషుండు+అను రాజు= అంబరీషుడనే పేరుగల రాజు; రాజనీతి పరత్వంబునన్= రాజనీతిలో నిష్ఠ కలిగి; పరమ ప్రభుత్వంబున్+ఒంది= గొప్ప చక్రవర్తియై; అరాతులన్+ఎల్లన్= శత్రువులందరినీ; విగత+అసులన్+చేసి= పోయిన ప్రాణాలు గలవారిగా చేసి (చంపి); పూజ్యంబు+అగు= మహనీయమైన; రాజ్యంబున్= రాజ్యాన్ని; పరిపాలించుచున్+ఉండి= ఏలుతూ ఉండి; ఒక్కనాఁడు= ఒకరోజు; విద్వత్+జనంబులతోన్= ఆస్థానంలోని పండితులతో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అంబరీషుడనే రాజు గొప్పరాజనీతిపరుడు. మహాచక్రవర్తి, శత్రువులనందరినీ చంపి, రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండి. ఒకనాడు తన ఆస్థానంలోని పండితులతో ఇట్లా అన్నాడు.

తే. 'అరుల నెల్ల జయించియు నది జయంబు। గాఁ గొనక యున్నవాఁడ; నగ్గలపుఁ బగ జ
యింప కున్కిఁ దద్విజయవిహీనుఁ దృష్ణ। జనిజరామృత్యువశగ వర్తనునిఁ జేయు. 85

ప్రతిపదార్థం: అరులన్+ఎల్లన్= శత్రువులందరినీ; జయించియున్= జయించికూడా; అది= అట్లా జయించటం; జయంబుగాన్+కొనక+ఉన్నవాఁడన్= విజయంగా నేను గ్రహించకుండా ఉన్నాను (ఎందుకంటే); అగ్గలపున్= మిక్కిలి అయినటువంటి; పగన్+జయింపక+ఉన్కిన్= శత్రుత్వ భావనను జయించకపోవటంచేత; తద్+విజయ+విహీనున్= ఆ పగను జయించనివాడివి; తృష్ణ= దురాశ; జని= పుట్టుక; జరామృత్యువశగ వర్తనునిన్= ముసలితనం, చావులకు వశుడై మరల మరల తిరిగేవాడిగా; చేయున్= చేస్తుంది.

తాత్పర్యం: శత్రువులందరినీ జయించినా నాలోని పగ నశించలేదు. అందువలన నేను ఇంకా సంపూర్ణవిజయం పొందినవాడను కాను. పగను జయించనివాడిని దురాశ జన్మజరామృత్యువులకు వశుడై బాధపడేటట్లు చేస్తుంది.

క. అంతటి లోభము గెలువక। శాంతి గలదె?' యని తదీయశక్తి నడఁచి ని
శ్చింతత్వ మొంది యా భూ। కాంతుఁడు సామ్రాజ్యమున సుఖస్థితి వడసెన్. 86

ప్రతిపదార్థం: అంతటి= అట్లాంటి; లోభమున్= లోభాన్ని (దురాశను); గెలువక= జయించకుండా; శాంతి+కలదె?+అని= శాంతి లభిస్తుందా? అని; తదీయశక్తిన్+అడఁచి= ఆ లోభగుణాన్ని ఏ శక్తితో అణచిపెట్టెలో అట్లాచేసి; నిశ్చింతత్వము+ఒంది= నిశ్చింతను పొంది; ఆ భూకాంతుఁడు= ఆ రాజు; సామ్రాజ్యమునన్= రాజ్యపాలనలో; సుఖస్థితి= సుఖస్థితిని; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: అట్లాంటి లోభాన్ని గెలువకుండా శాంతి ఎక్కడిది?' అని నిర్ణయించుకొన్నవాడై విరాగభావంతో ఆ దురాశను జయించి, నిశ్చింతుడై ఆ రాజు పాలనలో సుఖశాంతులను పొందాడు.

విశేషం: 'యతి'

జనకునకు విప్రరూపధరుండైన యమునితో నైన సంవాదము (సం. 14-32-1)

వ. అని వెండియు నవ్విప్రుం డిట్లను. 'జనకచక్రవర్తికి నొక్క బ్రాహ్మణునకుం గలిగిన సంవాదంబు సెప్పెద నాకర్ణింపుము. జనకుండు తన కట్టెదుర బ్రాహ్మణుండు కొఱగామి సేసిన నతనితో 'నీవు నా విషయంబున వసియింప వలదు పొ' మ్మనిన నతండు. 87

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; వెండియున్= మరల; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; జనక చక్రవర్తికిన్= జనకుడికీ; ఒక్క బ్రాహ్మణునకున్= ఒక బ్రహ్మణుడికీ; కలిగిన= జరిగిన; సంవాదంబు= సంవాదం; చెప్పెదన్+ఆకర్ణింపుము= చెప్తుతాను వినుము; జనకుండు; తన కడు+ఎదురన్= తన ఎదుటే; బ్రాహ్మణుడు; కొఱగామి= వ్యర్థమైన పని; (తప్పు) చేసినన్= చేయగా; అతనితోన్= అతడితో; నీవు; నా; విషయంబునన్= దేశంలో; వసియింపన్ వలదు= ఉండవద్దు; పొమ్ము+అనినన్= పొమ్ము; అని అనగా; అతండు= ఆ బ్రాహ్మణుడు.

తాత్పర్యం: అని అంబరీషగీతలను చెప్పి, మరల ఆ బ్రాహ్మణుడు తన భార్యకు జనకమహారాజుకు విప్రుడి రూపంలో వచ్చిన బ్రాహ్మణుడికి నడుమ జరిగిన సంవాదాన్ని ఇట్లా చెప్పటం మొదలు పెట్టాడు. ఒకసారి జనకుడు తన కళ్ళ ఎదుటే ఒక బ్రాహ్మణుడు ఒక అనుచితమైన పనిని చేయగా అతడితో 'నీవు నా దేశంలో ఉండవద్దు. వెళ్ళిపొమ్ము' అని అన్నాడు. దానికి ఆ విప్రుడు ఇట్లా అన్నాడు.

విశేషం : విషయము= దేశము.

క. 'నీ విషయ మెంత వ? ట్టది। యే విని పరవిషయమునకు నేఁగెదఁ దెలియం
గా వినిపింపు' మనుడు నా। భూవల్లభుఁ డూరకుండెఁ బుణ్యచరిత్రా! 88

ప్రతిపదార్థం: పుణ్యచరిత్రా!= ఓ పుణ్యచరిత్ర కలిగిన వనితామణీ!; నీ విషయము= నీ దేశం; ఎంత+పట్టు?= ఎంతమేరకు?; అది+ఏన్+విని= దానిని చెప్పుము అది నేను తెలిసికొని; పరవిషయమునకున్= మరొక దేశానికి; ఏఁగెదన్= వెళ్లిపోతాను; తెలియంగాన్+వినిపింపుము+అనుడున్= బాగా స్పష్టంగా చెప్పుము అని అనగా; ఆ భూవల్లభుఁడు= ఆ రాజు; ఊరకుండెన్= మౌనంగా ఉండిపోయాడు.

తాత్పర్యం: 'ఓ పుణ్యచరిత్రా! నీ దేశం ఏ మేరకుందో స్పష్టంగా నాకు చెప్పుము. దానిని తెలిసికొని నేను మరో దేశానికి వెళ్ళిపోతాను' అని ఆ బ్రాహ్మణుడు అన్నాడు. దానికి ఏమీ బదులు చెప్పక జనకుడు మౌనంగా ఉండిపోయాడు.

ఆ. ఊరకుండి మూర్ఛ నూని యొక్కింత సే। పునకుఁ దేఱి యిట్టులనియె 'నాదు
తాత తండ్రి తరము ధరణి మద్వశ్యత। నుండ నాకు మమత యొలయ దందు. 89

ప్రతిపదార్థం: ఊరక+ఉండి= అట్లా మౌనంగా ఉండి; మూర్ఛన్+ఊని= మూర్ఛపోయి; ఒక్కింతసేపునకున్+తేఱి= కొంతసేపటికి తేరుకొని; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు; నాదు= నా యొక్క; తాత తండ్రి తరము= నా తాతతండ్రుల తరాలనుండి;

ధరణి= భూమి; మత్= నా; వశ్యతన్+ఉండన్= వశంలో ఉండగా; అందున్= ఆ భూమి విషయంలో; నాకున్; మమత= నాది అనే భావన; ఒలయదు= పుట్టదు.

తాత్పర్యం: అట్లా మౌనంగా ఉండి, మూర్ఛలో మునిగి కొంతసేపటికి తేరుకొని ఇట్లా అన్నాడు. 'అయ్యా! ఈ రాజ్యం మా తండ్రి తాతల కాలంనుండీ నా వశంలో ఉన్నదే. అందువలన ఇది నాది అనే భావన నాకు ఎప్పుడూ కలుగలేదు. (అంటే ఇది నా దేశమని ఎట్లా చెప్పను? అని అర్థం).

వ. మిథిల నెప్పుడు వసియించెద; నిప్పురంబును మదీయంబని యంగీకరింపం బడదు కావున నిది నా విషయంబున లేమింజేసి మున్ను నీతో నాడిన మాటలఁ బుట్టిన వగ పెంపున మూర్ఛ వచ్చె' ననిన విని యవ్విప్రుం డా భూవిభు నాననం బాలోకించి. 90

ప్రతిపదార్థం: మిథిలన్= మిథిలలో; ఎప్పుడున్= ఎప్పుడూ; వసియించెదన్= నివసిస్తాను; ఈ+పురంబునున్= ఈ నగరం కూడా; మదీయంబు+అని= నా దని; అంగీకరింపంబడదు= ఒప్పుకొనటానికి వీలులేదు; కావునన్+ఇది= కాబట్టి ఇది; నా విషయంబు+అనన్+లేమిన్+చేసి= నా రాజ్యం అని చెప్పటానికి వీలులేని కారణంవలన; మున్ను= మునుపు; నీతోన్+ఆడిన= నీతో అన్న; మాటన్= మాటవలన; పుట్టిన= కలిగిన; వగ పెంపునన్= దుఃఖాతిశయంతో (బాధతో); మూర్ఛ వచ్చెన్= మూర్ఛ వచ్చింది; అనినన్ విని= అని జనకుడు చెప్పగా విని; ఆ విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఆ భూ విభు+అననంబు+అలోకించి= ఆ రాజు ముఖం చూచి.

తాత్పర్యం: నేను మిథిలలో ఎప్పుడూ ఉంటాను. కాని, ఇది కూడా నా నగరమని చెప్పటం కుదరదు. అందువలన ఇది నా రాజ్యం అని చెప్పటానికి ఏదీ లేకపోవటంవలన ముందు నీతో అట్లా ఎందుకన్నానా? అనే బాధ అతిశయించి మూర్ఛపోయాను' అని జనకుడు చెప్పగా విని, ఆ బ్రాహ్మణుడు ఆ రాజు ముఖం చూచి ఇట్లా అన్నాడు.

క. 'నరనాయక! నీ యేలెడు। పురమున భూమిని మమత్వబుద్ధి గలుగ కి
ట్లిరవై యుండుటకుఁ గతం। బరయఁగ నెద్ది? వినిపింపు మది విశదముగన్.' 91

ప్రతిపదార్థం: నరనాయక!= ఓ రాజా!; నీ ఏలెడు పురమునన్= నీవు పరిపాలించే నగరం విషయంలోనూ; భూమినిన్= రాజ్య విషయంలోరూ, మమత్వబుద్ధి+కలుగక= నాది - అనే బుద్ధి ఏర్పడక; ఇట్లు+ఉండుటకున్= ఇట్లా అనాసక్తంగా ఉండటానికి; కతంబు= కారణం; అరయఁగన్= బాగా ఆలోచిస్తే; ఎద్ది?= ఏమిటి?; అది= దానిని; విశదముగన్= వివరంగా; వినిపింపుము= వినిపించుము.

తాత్పర్యం: రాజా! నీవు ఉంటున్న నగర మిది; నీవు పాలిస్తున్న రాజ్య మిది. ఈ రెంటి విషయంలోనూ 'నాది' అనే భావన నీకు లేకుండా నీవు ఏదో పరుల సొత్తును వాడుకొంటున్న భావనతో అనాసక్తుడివలె ఎట్లా ఉండగలుగుతున్నావు? ఆ రహస్యం ఏమిటో నాకు వివరంగా చెప్పుము' అన్నాడు.

వ. అనుటయు నజ్జనపతి యతని కిట్లనియె. 92

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; ఆ+జనపతి= ఆ రాజు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ఆ విప్రుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అనగా ఆ రాజు ఆ విప్రుడితో ఇట్లా అన్నాడు.

తే. **'అరయ నివి యెట్లుఁ జెడియెడు నవియకాన। వినుము మద్ధన మిది యని వీనిలోన**
నొకటి యందు నంగీకార మొలయ దెల్ల। విషయమును నా యదియ యను విధము గలదె?' **93**

ప్రతిపదార్థం: అరయన్= బాగా చూడగా; ఇవి+ఎట్లున్= ఇవి ఎట్లాగైనా; చెడియెడు+అవి+అ+కాన= చెడిపోయేవే కాబట్టి; వినుము; మత్+ధనము+ఇది+అని= ఇది నా సంపద అని; వీనిలోనన్= వీటిలో; ఒకటి+అందున్= ఒకదానిలోనూ; అంగీకారము= ఒప్పుదల; ఒలయదు= కలగలేదు; ఎల్ల విషయమును= అంతా; నా+అది+అ= నాదే; అను విధము= అనే పద్ధతి; కలదె?= ఉన్నదా?

తాత్పర్యం: 'అంతేకాదు, బాగా చూస్తే ఈ రాజ్యం, ధనం-ఇవన్నీ ఎప్పటికైనా నశిస్తాయి. కాబట్టి ఇది నా సంపద అని ఏ ఒక్క విషయంలోనూ నాకు అనిపించటం లేదు. అంతా నాదే అనే పద్ధతి - అంటూ ఒకటి ఉన్నదా?

వ. **ఎట్లంటేని ఘ్రాణాదులకు గోచరంబు లయినను గంధాదులు సెడంగలయవి గావున నాయవి యనకుండుటం**
జేసి భూమ్యాదిభూతంబులు నాచేత నిర్జితంబులై మద్వశగత్వంబు నొంది యుండు.' **94**

ప్రతిపదార్థం: ఎట్లు+అంటి(వి)+ఏని= ఎట్లాగంటే; ఘ్రాణ+ఆదులకున్= ముక్కు; మొదలైనవాటికి, గోచరంబులు+అయిననున్= తెలిసినా; గంధ+ఆదులు= వాసన మొదలైనవి; చెడన్+కలయవి+కావున= చెడిపోయే స్వభావం కలిగినవి కాబట్టి; నా+అవి= నావి; అనకుండుటన్+చేసి= అనకుండా ఉండటంవలన; భూమి+ఆది భూతంబులు= భూమి, ఆకాశం మొదలైన పంచభూతాలు; నాచేతన్; నిర్జితంబులు+ఐ= జయింపబడ్డవై; మత్+వశ గత్వంబున్= నేను చెప్పినట్టుగా ప్రవర్తించే ధర్మాన్ని; ఒంది+ఉండున్= కలిగి ఉంటున్నాయి.

తాత్పర్యం: ఎట్లాగంటే ముక్కు - మొదలైన ఇంద్రియాలకు తెలిసినా వాసన - మొదలైనవి నశించే స్వభావం కలిగినవి. కాబట్టి అవి నావి అని అనుకోకుండా ఉండటంవలన భూమ్యాదులైన పంచభూతాలూ నాచేత జయించబడి నేను చెప్పినట్లు ప్రవర్తిస్తున్నాయి.'

చ. **అనవుడు బ్రాహ్మణప్రవరుఁ డల్లన నవ్వుచు 'నిన్ను నారయ**
న్మనమున వేడ్క పుట్టి నరనాయక! వచ్చితి నేను ధర్ముఁడం
బనుపడు నివ్వివేకపరిపాకము గాఢనిరూఢభావ మొం
ది నిలుచుఁ గాత! నీ దగు మదిన్ సతతంబును శాంతికారియై. **95**

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; బ్రాహ్మణ ప్రవరుఁడు= బ్రాహ్మణశ్రేష్ఠుడు; అల్లనన్= నెమ్మదిగా; నవ్వుచున్= నవ్వుతూ; నరనాయక!= రాజా!; నిన్నున్= నిన్ను; అరయన్= పరీక్షించటానికి; వేడ్క+పుట్టి= కోరిక కలిగి; వచ్చితిన్= వచ్చాను; నేను; ధర్ముఁడున్= యమధర్మరాజును; పనుపడు+ఈ+వివేక+పరిపాకము= క్రమంగా వికసించే లక్షణం కలిగిన ఈ వివేకపరిపక్వత; నీది+అగు మదిన్= నీ మనస్సులో; సతతంబునున్= శాశ్వతంగా; శాంతికారి+ఐ= శాంతిదాయకమైన; గాఢనిరూఢభావము+ఒంది+నిలుచుఁ గాత!= గాఢమై స్థిరమై నిలుచునుగాక!

తాత్పర్యం: అని అనగా బ్రాహ్మణశ్రేష్ఠుడు నెమ్మదిగా నవ్వుతూ 'నాయనా! నిన్ను పరీక్షించాలనే కోరిక కలిగి ఇట్లా వచ్చాను. నేను యమధర్మరాజును. క్రమంగా వికసించే లక్షణం కలిగిన ఈ వివేకం పక్వమై నీ హృదయంలో శాశ్వతంగా శాంతిప్రదాయకమై, గాఢమై, స్థిరమై నిలుచునుగాక!' అని ఆశీర్వదించాడు.

వ. అని ధర్మదేవత జనకునకు వరం బిచ్చి యంతర్ధానంబు సేసె' నని చెప్పి యా ధరణీసురోత్తముం డయ్యుత్తమాగంగనతో 'హితోపదేశంబు సేసెద; నవహిత వయి యాకర్ణింపు' మని పలికి యిట్లను 'సంసారవర్తనంబు వదలవిడిచి యే నేకతంబ యున్నయెడ నీవు ప్రుచ్చిలి వచ్చి 'మదీయవైరాగ్యంబు మాన్పం దలంచి నాకు నధ్యాత్మబోధంబు గలుగంజేయు' మని యభ్యర్థించిన నీ తలం పెఱింగియు నెఱుంగని వాం డపోలె నధ్యాత్మ విద్యాబోధకప్రకారంబు లైన వాక్యంబులు సెప్పితి; నేనింక లోకంబులం గలసి చరించువాం డంగాను; నిక్కపు బ్రాహ్మణుండ నయితి; బ్రహ్మచారి నయితి; జీవన్ముక్తుండ నయితి; మిముబోంట్ల కొలఁదిగా నన్నుంజూచెద వది నా తెఱం గెఱుంగమి; యేను జగంబు సమస్తంబును వ్యాపించి యున్నవాఁడ; నా యున్న భంగికి నా బుద్ధి సకల పృథ్వీరాజ్యంబును నాకలోకాధి రాజ్యంబును సరిగావని తలంచు నా బుద్ధియ నాకు ధనంబు; దారువుల నగ్నియున్న చందంబున సర్వజంతువుల యందును నంతర్గతయై సిద్ధియున్నది; గురువాస గృహవాస వనవాస పరులగు బ్రాహ్మణులకెల్లను శ్రేయః ప్రాప్తికిం దెరువొక్కండ; యందఱును సరిత్తులు సాగరంబుఁ బ్రాపించిన తెఱంగునఁ బరతత్త్వంబు నొందుదురు; బుద్ధి నిమ్మార్గంబు నధిగమింప నగుఁగాని శరీరంబున వశంబుగాదు కర్మంబు లాద్యంతవంతంబులు శరీరంబు గర్మబంధనకరం బింత యెఱుంగుదుం గాన నా హృదయంబునం బరలోకభయంబులేదు నా చెప్పిన యధ్యాత్మ విద్యావిషయ వాక్యంబుల తాత్పర్యంబు చిత్తంబున నెలకొలిపి భావనానిరతవయి యుండుము; నన్న పోలెదు; వెఱవకు' మనినఁ బతికి సాష్టాంగదండ ప్రణామం బాచరించి కేలు మొగిచి. 96

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; ధర్మదేవత= యమధర్మరాజు; జనకునకున్= జనకమహారాజుకు; వరంబు+ఇచ్చి= వరం ఇచ్చి; అంతర్ధానంబు+చేసెన్= మాయమయ్యాడు; అని చెప్పి; ఆ ధరణీసుర+ఉత్తముండు= ఆ బ్రాహ్మణుడు; ఆ+ఉత్తమాంగనతోన్= ఆ ఉత్తమ స్త్రీతో; హితోపదేశంబు+చేసెదన్= నీకు హితోపదేశం చేస్తాను; అవహితవు+అయి= ఏకాగ్రచిత్తంతో; ఆకర్ణింపుము+అని పలికి= విను మని చెప్పి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; సంసారవర్తనంబు= సంసారంలో ప్రవర్తించటాన్ని; వదలవిడిచి= పూర్తిగా వదలివేసి; ఏను= నేను; ఏకతంబ= ఏకాంతంగా, ఉన్న+ఎడన్= ఉన్నపుడు; నీవు; ప్రుచ్చిలి వచ్చి= దొంగగా వచ్చి; మదీయ వైరాగ్యంబున్= నా వైరాగ్యాన్ని; మాన్పన్+తలంచి= పోగొట్టాలని ఆలోచించి; నాకున్= నాకు; అధ్యాత్మ బోధంబున్= వేదాంతాన్ని (ఆత్మజ్ఞానాన్ని); కలుగన్+చేయుము+అని= కలిగించుమని; అభ్యర్థించినన్= కోరితే; నీ తలంపు+ఎఱింగియున్= నీ ఆలోచన తెలిసినవాడినే అయినా; ఎఱుంగనివాఁడు+అ+పోలెన్= తెలియనివాడివలె; అధ్యాత్మ విద్యా బోధక ప్రకారంబులు+ఐన, వాక్యంబులు= వేదాంతవిద్యను నేర్పించే పద్ధతికి సంబంధించిన వాక్యాలను చెప్పితిన్= చెప్పాను; నేను; ఇంకన్= ఇక; లోకంబులన్+కలసి= లోక వ్యవహారాలలో కలిసి; చరించువాఁడన్+కాను= ప్రవర్తించేవాడను కాను; నిక్కపు బ్రహ్మణుండను+అయితిన్= నిజమైన బ్రాహ్మణుడను అయ్యాను; బ్రహ్మచారిని+అయితిని= బ్రహ్మచారి నయ్యాను; జీవన్ముక్తుండను+ఐతిన్= బ్రతికి ఉండగానే బంధాలనుండి విముక్తిని పొందాను; మిముబోంట్ల కొలఁదిగాన్= మీవంటి వారితో సమానంగా; నన్నున్+చూచెదవు= నన్ను చూస్తావు; అది; నా తెఱంగు+ఎఱుంగమి= నా విషయం తెలియకపోవటం; ఏను= నేను; జగంబు సమస్తంబును= ప్రపంచాన్ని అంతటినీ; వ్యాపించి ఉన్నవాఁడన్= నిండి ఉన్నాను; నా+ఉన్న భంగికిన్= నేనున్న స్థితికి; నా బుద్ధిన్= నా ఆలోచనలో; సకల పృథ్వీ రాజ్యంబునున్= ఈ భూమండల మంతా పాలించినా; నాకలోక+ అధి రాజ్యంబునున్= స్వర్గలోకాధిపత్యం చేసినా; సరి+కావని= సమానం కావని; తలంచు= తలచేటటువంటి; నా బుద్ధి+అ= నా బుద్ధే; నాకున్+ధనంబు= నాకు సంపద; దారువులన్= కొయ్యలలో; అగ్ని+ఉన్న చందంబునన్= అగ్ని ఉన్న విధంగా;

సర్వజంతువులయందునున్= అన్ని జంతువులలోనూ; అంతర్గత+ఐ= లోన వ్యాపించినదై; సిద్ధి+ఉన్నది= యోగరూపమైన భగవదంశ ఉన్నది; గురువాస= గురువు వద్ద వసించటం (బ్రహ్మచర్యం); గృహవాస= ఇంటిలో ఇల్లాలితో వసించటం (గృహస్థాశ్రమం); వనవాస పరులు+అగు= వనంలో వసించటం (వానప్రస్థం)- వీటిలో నిష్ఠ కలిగిన; బ్రాహ్మణులకున్+ఎల్లనున్= బ్రాహ్మణులందరికీ; శ్రేయస్+ప్రాప్తికిన్= మోక్షప్రాప్తికి; తెరువు+ఒక్కండు+అ= దారి ఒకటే; సరిత్తులు= నదులు; సాగరంబున్+ప్రాప్తించిన తెఱంగునన్= సముద్రాన్ని చేరుకొన్నట్లుగా; అందఱునున్= అందరూ; పరతత్త్వంబున్+ఒందుదురు= పరతత్త్వాన్ని (బ్రహ్మపదాన్ని) పొందుతారు; బుద్ధిన్= బుద్ధితో (వివేకంతో); ఈ మార్గంబున్= ఈ మార్గాన్ని; అధిగమింపన్+అగున్+కాని= దాటవచ్చును కాని; శరీరంబునన్= శరీరంతో; వశంబు కాదు= సాధ్యం కాదు; కర్మంబులు= పనులు; ఆద్యంతవంతంబులు= తొలి, చివరలు కలిగినవి; శరీరంబు= ఈ శరీరం; కర్మ బంధనకరంబు= కర్మబంధాన్ని కలిగిస్తుంది; ఇంత+ఎఱుంగుదున్+కాన= ఇది తెలుసును కాబట్టి; నా హృదయంబునన్= నా హృదయంలో; పరలోక భయంబు లేదు= పరలోకవిషయంగా ఏ భయమూ లేదు; నా+చెప్పిన= నేను చెప్పిన; అధ్యాత్మవిద్యా విషయ= వేదాంతవిద్యకు సంబంధించిన; వాక్యంబుల తాత్పర్యంబు= వాక్యాల అర్థాన్ని; చిత్తంబునన్+నెలకొలిపి= మనస్సులో పదిలపరుచుకొని; భావనా నిరతవు+అయి= భావనలో నిష్ఠకలిగినదానవై; ఉండుము; నన్నున్+అ= నన్నే; పోలెదు= నీవు పోలెదు= పోలుతావు (నావలె అవుతావు); వెఱవకుము+అనినన్= భయపడకు అని చెప్పగా; పతికిన్= ఆమె భర్తకు; సాష్టాంగ దండప్రణామంబు+ ఆచరించి= సాష్టాంగ నమస్కారంచేసి; కేలు మొగిచి= చేతులు జోడించి.

తాత్పర్యం: అని ఈ ప్రకారంగా ధర్ముడు జనకమహారాజునకు వరమిచ్చి మాయ మయ్యాడు' అని చెప్పి, ఆ బ్రాహ్మణుడు తన భార్యతో 'నీకు హితోపదేశం చేస్తాను. అవధానంతో వినుము' అని ఇట్లా అన్నాడు. 'నేను సంసారబంధాలను పూర్తిగా వదలివేసి ఇక్కడ ఏకాంతంగా ఉండగా నీవు దొంగగా వచ్చి నా వైరాగ్యాన్ని పోగొట్టాలని ఆలోచించి, పైకి ఆత్మజ్ఞానాన్ని బోధించుమని అడిగావు. నీ ఆలోచన నాకు తెలిసినా ఏమీ తెలియనివాడివలెనే నీకు వేదాంతవిద్యను బోధించే మహావాక్యాలను బోధించాను. చూడుము. ఇక నేను ఈ లోకవ్యవహారాలలో తలదూర్చను. నిజమైన బ్రాహ్మణుడను అయ్యాను, బ్రహ్మచారినయ్యాను. జీవన్ముక్తుడనయ్యాను. నన్ను కూడా మీవంటివారితో సమానంగానే చూస్తున్నావు. నా సాధన విషయం నీకు తెలియదు. నేను ప్రపంచమంతటా నిండి ఉన్నాను. నేనున్న స్థితికి, ఈ భూమండలాన్నంతా పాలించినా; స్వర్గలోకాన్ని ఏలినా సమానం కావు- అని నా ఆలోచన. ఈ తలపుగల నాబుద్ధే నాకు పరమసంపద. అన్ని కొయ్యలలోనూ అగ్ని అణగి ఉన్న విధంగా అన్ని జంతువులలోనూ యోగపరమైన భగవదంశ నిండి ఉన్నది. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ ఆశ్రమాలలో నిష్ఠ కలిగిన బ్రాహ్మణులందరికీ మోక్షప్రాప్తి మార్గం ఒకటే. నదు లన్నీ సాగరంలో కలిసిపోయినట్లు అందరూ బ్రహ్మపదాన్నే చేరుతారు. ఈ మార్గాన్ని వివేకంతో అధిగమించగలము కాని శరీరంతో కుదరదు. కర్మలు మొదలుచివరలు కలిగినవి. ఈ శరీరం కర్మబంధాన్ని కలిగిస్తుంది. నాకు ఇదంతా తెలుసును కాబట్టి నా హృదయంలో మృత్యువు తరువాత ఏమిటి? అనే భయం లేదు. నేను ఇంతవరకు చెప్పిన ఆధ్యాత్మికవాక్యాల అర్థాన్ని మనసులో పాదుకొల్పి 'భావనా' నిష్ఠురాలివై ఉండుము. నావలె నీవు కూడా సిద్ధి పొందుతావు. భయపడకుము' అని భర్త చెప్పగా ఆమె భర్తకు సాష్టాంగదండ నమస్కారం చేసి, చేతులు జోడించుకొని ఇట్లా అన్నది.

విశేషం : దారువుల నగ్నియున్నచందంబున, -సరిత్తులు సాగరంబుఁబ్రాపించిన తెఱంగున-అలంకారములు ఉపమలు.

సీ. **'నీవు సెప్పిన మహనీయవాక్యనికాయ। మతిగహనం బకృతాత్ములకును**
నర్థగ్రహణశక్తి యనఘ! కల్గునె కృతా। త్ములకైన? గ్రమ్మనఁ దెలియవచ్చి

యుండ దయ్యెఁబుకకు నుదయింపఁ బట్టైన । యట్టి యుపాయంబు నాదరమున
నాకుఁ బ్రసాదింపవే కరుణాకర!' నావుడు నాతఁ డన్నాతితోడ

ఆ. 'నరణి బ్రాహ్మణుండు గురుఁ డుత్తరారణి । దపము శ్రుతము నిర్మథన మొనర్చి
జ్ఞానవహ్ని పుట్టు మానిని! యని చెప్ప । వనిత యిట్టులనియె వల్లభునకు. 97

ప్రతిపదార్థం: నీవు చెప్పిన= నీవు ఇంతవరకు చెప్పిన; మహనీయ= గొప్ప; వాక్య నికాయము= వాక్య సముదాయం; అకృత+ఆత్ములకును= సాధనా రహితులకు; అతిగహనంబు= మిక్కిలి కష్టమైనది; అనఘ!= పుణ్యాత్మా!; కృతాత్ములకున్+ఐనన్= కొంత సాధనచేసినవారికైనా; అర్థగ్రహణశక్తి= ఆ వాక్యాల అర్థాన్ని గ్రహించే శక్తి; కల్గునే= కలుగుతుందా?; గ్రమ్మనన్= శీఘ్రంగా; తెలియన్+వచ్చి ఉండదు= అర్థం కాకపోవచ్చుకూడా; ఆ+ఎఱుకకున్= ఆ జ్ఞానం; ఉదయింపన్= పుట్టటానికి; పట్టు+ఐన+అట్టి= ఆధారమైనటువంటి; ఉపాయంబున్= ఉపాయాన్ని; ఆదరమునన్= ఆదరంతో; కరుణాకర!= కరుణామూర్తీ!; నాకున్+ప్రసాదింపవే!= నాకు ప్రసాదించు స్వామీ!; నావుడున్= అని ప్రార్థించగా; అతఁడు= ఆ బ్రాహ్మణుడు; ఆ నాతితోడన్= ఆ స్త్రీతో; బ్రాహ్మణుండు; అరణి= అరణివంటివాడు; గురుఁడు= గురువైనవాడు; ఉత్తర+అరణి= ఉత్తరారణివంటివాడు; తపమున్+శ్రుతమున్= తపస్సును, వేదాన్ని; నిర్మథనము+ఒనర్చన్= కలిసి ఒరిపిడి పెట్టగా; మానిని!= ఓ స్త్రీ; జ్ఞానవహ్ని= జ్ఞానమనే అగ్ని; పుట్టున్= పుట్టుతుంది; అని చెప్పన్= అని చెప్పగా; వనిత= ఆ స్త్రీ; వల్లభునకున్= మగనితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నది.

తాత్పర్యం: నీవు ఇంతవరకు చెప్పిన మహనీయవాక్యసముదాయాన్ని అర్థంచేసికొనటం సాధనలేని వారికి చాలా కష్టం. సాధన చేసినవారికైనా అర్థం త్వరగా గ్రహించటం అంత సులభం కాదు. ఒకసారి తెలిసినా, మరచిపోయే ప్రమాదం కూడా లేకపోలేదు. అట్లాంటి జ్ఞానం కలిగేటందుకు ఆధారమైన ఉపాయాన్ని నాకు బోధించి కృతార్థురాలిని చేయండి. మీరు కరుణగలవారు' అని భార్య ప్రార్థించగా ఆయన ఇట్లా అన్నాడు. 'బ్రాహ్మణుడు అరణి, గురువు ఉత్తరారణి. విప్రుడి తపస్సు, గురువుగారి వేదం - ఈ రెండు కొయ్యలనూ మథనం చేయగా పుట్టే జ్ఞానం ముక్తి సాధకం' అని అతడు చెప్పగా ఆమె భర్తతో ఇట్లా అన్నది.

విశేషం: యాగాగ్నిని రెండు అరణులచేత పుట్టిస్తారు. అరణులంటే ఒక విధమైన కర్రలు. వర్తులాకారమైన కర్రకు రంధ్రం పొడిచి గుండ్రని స్తంభాకారమైన మరి ఒక కర్రను అందులో దూర్చి కింద ఉన్న కర్ర (అధరారణి) ను కవ్వంవలె అతివేగంగా, బలంగా త్రిప్పినప్పుడు నిప్పు పుట్టుతుంది. ప్రత్తి అంటుకొన్నాక దానిని యాగంలో వాడుతారు. గురువు 'ఉత్తరారణి' అని కొందరు. 'దక్షిణారణి' అని కొందరు చెప్తుతారు. ఎట్లా చెప్పినా విద్య గురుశిష్యుల ముఖంగా ఉంటుం దని అర్థం. అరణి బ్రాహ్మణుండు; గురుఁడుత్తరారణి; జ్ఞానవహ్ని-రూపకాలంకారములు.

క. జనవినుతచరిత! బ్రాహ్మణుఁ । డనఁగా క్షేత్రజ్ఞుఁ డగుట యల్పము దోఁచెన్;
మనమున నతని నరణిగాఁ । గొను టవ్వస్తువు నెఱింగికొని పిదపఁ గదా!' 98

ప్రతిపదార్థం: జనవినుతచరిత!= ప్రజలు ప్రస్తుతించే చరిత ఉన్న ఓ విప్రోత్తమా!; బ్రాహ్మణుఁడు+అనఁగాన్= బ్రాహ్మణుడు అంటే; క్షేత్రజ్ఞుఁడు+అగుట= క్షేత్రజ్ఞుడు కావటం; అల్పము+తోఁచెన్= కొద్దిగా మాత్రమే తెలిసినది; మనమునన్= మనస్సుతో; అతనిన్= అతడిని; అరణిగాన్= అరణిగా; కొనుట= స్వీకరించటం; ఆ+వస్తువున్+ఎఱింగికొని= ఆ వస్తువును తెలిసికొని; పిదపన్+కదా!= తరువాత కదా!

తాత్పర్యం: 'స్వామీ! బ్రాహ్మణుడు అంటే క్షేత్రజ్ఞుడనే విషయం ఏమిటో పూర్తిగా బోధపడలేదు. అతడిని అరణిగా గుర్తించటానికి ముందు బ్రాహ్మణుడు అంటే ఎవరో తెలియాలి కదా! అని ఆమె అన్నది.

వ. అనిన నతం డిట్లనియె. 99

తాత్పర్యం: అనగా ఆ బ్రాహ్మణుడు ఇట్లా అన్నాడు.

ఆ. 'అతనిఁ దోఁపఁ జేయునట్టి సాధనము లేఁ। దింద్రియముల కందఁ; డేమి లక్ష
ణములు లేవు; నిర్గుణత్వనిరూఢుం డ। హంత లేమిఁ దోఁచుఁ గాంత! కనుము.' 100

ప్రతిపదార్థం: కాంత!= ఓ వనితా!; అతనిన్= ఆ బ్రాహ్మణుడిని; తోఁపన్+చేయునట్టి= గుర్తింపచేసేటటువంటి; సాధనము లేదు= ఏ సాధనమూ లేదు; ఇంద్రియములకున్+అందఁడు= ఏ అవయవాలచేతా అతడిని గుర్తించలేము; ఏమి లక్షణములు లేవు= ఇక ఏ లక్షణాలతోనూ అతడిని గుర్తుపట్టలేము; నిర్గుణత్వ నిరూఢుండు= నిర్గుణత్వమే అతడి స్వభావం; అహంత= అహంకారిత్వం; లేమిన్+తోఁచున్= లేకపోవటంచేత కొంత గుర్తించవచ్చును; కనుము= చూడుము.

తాత్పర్యం: 'ఓ కాంతా! అతడిని ప్రత్యేకంగా గుర్తించే ఏ సాధనమూ లేదు. ఏ అవయవాలచేతా అతడిని గుర్తించలేము. అతడికి ఏ లక్షణాలూ లేవు. నిర్గుణత్వమే అతడి ధర్మం. అహంకారం లేకపోవటం అనే లక్షణంచేత అతడిని కొంత గుర్తించవచ్చును. నీవు ప్రయత్నించుము.'

వ. అని నిర్దేశించుటయు క్షేత్రజ్ఞవిషయసంశయంబు వాసి యయ్యింతి శాంతి నొందె' నని గోవిందుండు సెప్పి గాండీవి 'యా బ్రాహ్మణుండును బ్రాహ్మణియు నిట్టి వారగుదురె! వారెచ్చటివారు? వారల నా కెఱింగింపవే' యని యడిగిన నద్దేవుం డతని యాననం బాలోకించి. 101

ప్రతిపదార్థం: అని ఈ విధంగా; నిర్దేశించుటయున్= నిర్దేశించగా; క్షేత్రజ్ఞ విషయ= క్షేత్రజ్ఞుడి విషయంగా; సంశయంబు= సందేహం; పాసి= పోగొట్టుకొని; ఆ+ఇంతి= ఆ స్త్రీ; శాంతిన్+ఒందెను+అని= శాంతిని పొందినదని; గోవిందుండు= కృష్ణుడు; చెప్పినన్= చెప్పగా; గాండీవి= అర్జునుడు; ఆ బ్రాహ్మణుండును= ఆ బ్రాహ్మణుడు; బ్రాహ్మణియున్= బ్రాహ్మణస్త్రీ; ఇట్టివారు+అగుదురె!= ఇంత గొప్పవారా!; వారు= వారిద్దరు; ఎచ్చటివారు?= ఎక్కడివారు? వారలన్= వారిని గురించి; నాకున్+ఎఱింగింపవే= దయచేసి తెలుపుము; అని; అడిగినన్= అడుగగా; ఆ+దేవుండు= కృష్ణుడు; అతని; ఆననంబు= ముఖం; ఆలోకించి= చూచి

తాత్పర్యం: ఈ విధంగా ఉపదేశం చేయగా క్షేత్రజ్ఞుడి విషయంగా సందేహం పోయి, ఆ స్త్రీ పరమశాంతిని పొందింది అని శ్రీకృష్ణుడు చెప్పగా అర్జునుడు 'ఆ దంపతులు ఇంత గొప్పవారా? వారు ఎక్కడివారు? వారిని గురించి నాకు తెలుపుము' అని అడుగగా శ్రీకృష్ణుడు అతడి ముఖంవైపు చూచి (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'నా మనమును బుద్ధియును గృ। పా మహితా! బ్రాహ్మణుండు బ్రాహ్మణియు హృషీ
కామేయమైన క్షేత్ర। జ్ఞానుల వస్తువును నేన యనియె నరేంద్రా!' 102

ప్రతిపదార్థం: కృపామహితా!= ఓ కృపాగుణంచే అధికుడా!; నా మనమునున్= నా మనస్సు; బుద్ధియునున్= బుద్ధీ; బ్రాహ్మణుండు; బ్రాహ్మణియు= బ్రాహ్మణస్త్రీ; హృషీక= ఇంద్రియాలచేత; అమేయము+ఐన= కొలవటానికి వీలులేని; క్షేత్రజ్ఞ= పరమాత్మ రూపమైన; అమల= నిర్మలమైన; వస్తువునున్= వస్తువుకూడా; నేను+అ= నేనే; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'కృపాగుణంచేత మహితుడవైన ఓ అర్జునా! నా మనస్సే బ్రాహ్మణుడు, బుద్ధి బ్రాహ్మణి, ఇంద్రియాలచేత కొలవటానికి వీలుకాని పరమాత్మస్వరూపమైన నిర్మలవస్తువును కూడా నేనే' అని కృష్ణుడన్నాడు.

గురుశిష్యసంవాదంబు గృష్ణుం డర్జునున కెఱింగించుట (సం. 14-35-2)

వ. అనిన విని యర్జునుం డచ్యుతునితో 'భవత్ప్రసాదంబున మదీయమతి యతి విశదయును సూక్ష్మగ్రాహిణియు నయి యున్నయది; పరమంబైన వేద్యంబగు బ్రహ్మంబు నెఱింగింపవే?' యనుటయు నా కృష్ణుండు 'గురుశిష్యసంవాదం బను నితిహాసంబు విను; మది నీ ప్రశ్నంబునకు నుత్తరం బయి యుండెడు; నిత్తెఱంగున మేధావి యగు నొక్క శిష్యుండు సంశితవ్రతుం డయిన గురు నడిగిన నగ్గురుండు బృహస్పతి భరద్వాజ భార్గవ గౌతమ కాశ్యప వసిష్ఠాత్రి విశ్వామిత్రప్రముఖులగు మునిజనంబు లాంగిరసుంబురస్కరించి కొనివిరించికడకుం జని తచ్చరణంబులకుం బ్రణమిల్లి 'హితం బెయ్యది? తత్ప్రాప్తి సుపథం బెట్టిది? వివరింపవే' యని విన్నవించిన నన్నలినాసనుండు గృపాధురీణంబైన చిత్తంబుతో నత్తపస్వి సత్తముల కెఱింగించిన తెఱంగు నీకుం జెప్పెద నవహితుండ వయి యాకర్ణింపు' మని పలికి యిట్లనియె. 103

ప్రతిపదార్థం: అనినన్ విని= అని కృష్ణుడు చెప్పగా విని; అర్జునుండు; అచ్యుతునితోన్= శ్రీకృష్ణుడితో; భవత్+ప్రసాదంబునన్= నీ అనుగ్రహం; మదీయ మతి= నా బుద్ధి; అతివిశదయునున్= అతి స్వచ్ఛమైనదీ; సూక్ష్మగ్రాహిణియున్= అతి సూక్ష్మాంశాలను గ్రహించేదీ; అయి+ఉన్న+అది= అయి ఉంటుంది; పరమంబు+ఐన= మిక్కిలి ఉత్కృష్టమైన; వేద్యంబు+అగు= తెలిసికొనదగిన; బ్రహ్మంబున్= బ్రహ్మపదార్థిన్ని; ఎఱింగింపవే= దయచేసి తెలుపుము; అనుటయున్= అని అడుగగా; ఆ+కృష్ణుడు= ఆ కృష్ణుడు; గురుశిష్య సవాదంబు+అను= గురుశిష్యసంవాద మనే; ఇతిహాసంబు వినుము= ఇతిహాసం ఉన్నది - వినుము; అది= ఆ కథ; నీ ప్రశ్నంబునకున్+ఉత్తరంబు+అయి+ఉండెడున్= నీ ప్రశ్నకు సమాధానమై ఉంటుంది; ఈ+తెఱంగునన్= ఇదే విధంగా; మేధావి+అగు+ఒక్క శిష్యుండు= తెలివైనవాడు అయిన ఒక శిష్యుడు; సంశిత వ్రతుండు+అయిన= నిర్ణయింపబడిన దీక్షకలిగిన; గురున్+అడిగినన్= గురువును అడుగగా; ఆ+గురుండు= ఆ గురువు; బృహస్పతి; భరద్వాజ; భార్గవ; గౌతమ; కాశ్యప; వసిష్ఠ; అత్రి; విశ్వామిత్ర; ప్రముఖులు+అగు= మొదలైన; మునిజనంబులు= మునులు; ఆంగిరసున్= ఆంగీరసుడిని; పురస్కరించుకొని= ముందుగా ఉంచుకొని; విరించికడకున్+చని= బ్రహ్మదేవుడి వద్దకు వెళ్ళి; తద్+చరణంబులకున్= అతడి పాదాలకు; ప్రణమిల్లి= నమస్కరించి; హితంబు+ఏ+అది?= శ్రేయస్సు ఏది?; తద్+ప్రాప్తికిన్= దానిని అందుకొనటానికి; సుపథంబు= మంచిమార్గం; ఎట్టిది?= ఎటువంటిది?; వివరింపవే= దయతో వివరించుము; అని; విన్నవించినన్= ప్రార్థించగా; ఆ+నలిన+ఆసనుండు= ఆ కమలగర్భుడు; కృపాధురీణంబు+ఐన= కృపాగుణంతో మహనీయమైన; చిత్తంబుతోన్= మనస్సుతో; ఆ+తపస్వి సత్తములకున్= ఆ ఋషిశ్రేష్ఠులకు; ఎఱింగించిన= తెలిసిన; తెఱంగు= విధం; నీకున్+చెప్పెదన్= నీకు చెప్పుతాను; అవహితుండవు+అయి= అవధానచిత్తంతో; ఆకర్ణింపుము= వినుము; అని పలికి= అని చెప్పి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని కృష్ణుడు చెప్పగా విని అర్జునుడు శ్రీకృష్ణుడితో 'స్వామీ! నీ ప్రసాదంతో నా బుద్ధి స్వచ్ఛమై సూక్ష్మగ్రాహిణిగా తయారైనది, ఉత్కృష్టమైన, జ్ఞానరూపమైన బ్రహ్మతత్త్వం ఏమిటో, ఎట్లా తెలిసికొనాలో దయతో

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

చెప్పుము' అని అడిగాడు. అందుకు కృష్ణుడు 'గురుశిష్యసంవాదం అని ఒక ఇతిహాసం ఉన్నది. ఆ కథ నీ ప్రశ్నకు సరైన సమాధానం. నీవు ఇప్పుడు అడిగినట్లే మేధావి అయిన శిష్యుడు దీక్షితు డైన ఒక గురువును అడిగాడట. అప్పుడు ఆ గురువు బృహస్పతి , భరద్వాజుడు, భార్గవుడు, గౌతముడు, కాశ్యపుడు, వసిష్ఠుడు, అత్రి, విశ్వామిత్రుడు మొదలైన మహర్షులు ఆంగిరోమహర్షిని ముందుంచుకొని బ్రహ్మదేవుడివద్దకు వెళ్ళి, అతడి పాదాలకు నమస్కారం చేసి 'బ్రహ్మదేవా! ఏది హితం? దానిని అందుకొనటానికి మార్గం ఏది? దయతో చెప్పుము' అని అడిగారు. అప్పుడు వారికి ఆ బ్రహ్మదేవుడు కృప నిండిన చిత్తంతో ఏమి చెప్పాడో దానినే నీకూ నేను చెప్పుతాను. ఏకాగ్రచిత్తంతో వినుము' అని ఇట్లా చెప్పాడు.

ఆ. ఆదరార్ద్రుఁ డగుచు నలరిన మోముల। కాంతి వింత గాఁగఁ గమలగర్భుఁ
డా తపస్విజనుల యాననంబులు గల। యంగఁ జూచి యిట్టులనియె వత్స! 104

ప్రతిపదార్థం: వత్స!= శిష్యా!; ఆదర+ఆర్ద్రుఁడు+అగుచున్= ఆదరంతో కరగిపోయినవాడై; అలరిన మోముల కాంతి= వికసించిన నాలుగు ముఖాల కాంతి; వింత+కాఁగన్= ఆశ్చర్యం కలిగించగా; కమలగర్భుఁడు= బ్రహ్మ; ఆ తపస్విజనుల= ఆ ఋషుల; ఆననంబులు= ముఖాలు; కలయంగన్+చూచి= తేరిపార చూచి; ఇట్టులు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: శిష్యా! ఆదరంతో కరిగిపోయినవాడై వికసించిన నాలుగు ముఖాల కాంతి ఆశ్చర్యం కలిగించగా బ్రహ్మదేవుడు ఆ ఋషుల ముఖాలను పరికించి చూచి ఇట్లా అన్నాడు.

తే. 'సత్త్వమునను భూతంబులు సంభవించు.। నంద వర్తించు, దానన యడఁగు; నిది గు
ణత్రయాత్మకసత్త్వచరిత్ర మమల। బుద్ధులార! సత్త్వంబు ప్రసిద్ధి వినుఁడు. 105

ప్రతిపదార్థం: అమల బుద్ధులార!= పవిత్ర బుద్ధికలిగిన ఓ ఋషులారా!; భూతంబులు= ప్రాణులన్నీ; సత్త్వముననున్= సత్వంలోనే; సంభవించున్= పుట్టుతాయి; అందున్+అ+వర్తించున్= అందులోనే ప్రవర్తిస్తాయి; దానన్+అ= అందులోనే; అడఁగున్= అణగిపోతాయి; ఇది; గుణత్రయాత్మక= గుణత్రయంతో కూడిన; సత్త్వచరిత్రము= సత్త్వచరిత్ర; సత్త్వంబు+ప్రసిద్ధిన్= సత్త్వప్రాధాన్యం; వినుఁడు= వినండి.

తాత్పర్యం: పవిత్ర బుద్ధులుగల ఓ ఋషులారా! ప్రాణులన్నీ సత్త్వంలోనే పుట్టుతాయి. అందులోనే ప్రవర్తించి, అందులోనే అణగిపోతాయి. మూడు గుణాలతో కూడిన సత్త్వచరిత్ర ఇదే. సత్త్వగుణ ప్రాధాన్యాన్ని గురించి చెప్పుతారు. బాగా వినండి.

విశేషం: మూలభారతంలో 'సత్యాద్భూతాని జాతాని స్థావరాణి చరాణి చ' (14-36-32) అని ఉండగా తిక్కనగారు సత్వమన్నారు. శాశ్వతంగా ఉన్నది కాబట్టీ సత్యమంటారు. మౌలికమైన ధర్మం కాబట్టి 'సత్త్వ' మంటారు. పారమార్థికంగా సత్య, సత్త్వాలమధ్య తేడా లేదు.

క. శ్రుతియనఁ దపమనఁగఁ బ్రజా। పతియన సత్త్వంబునకు సపర నామంబుల్
వ్రతులార సత్త్వమన న। వ్వితత మహిమమైన పరమవేద్యము సుండీ! 106

ప్రతిపదార్థం: శ్రుతి+అనన్= వేదమని; తపమనఁగన్= తపస్సు అని; ప్రజాపతి+అనన్= ప్రజాపతి అని; సత్త్వంబునకున్= సత్త్వానికి; అపరనామంబుల్= మారుపేర్లు; వ్రతులార!; దీక్షితులారా!; సత్త్వము+అనన్= సత్త్వమంటే; ఆ+వితత+మహిమము+ఐన=

ఆ విస్తరించిన; మహిమగల; పరమవేద్యము= గొప్పగా తెలిసికొనదగిన తత్త్వం; చుండీ!= సుమండీ!

తాత్పర్యం: వేదమని, తపమని, ప్రజాపతి అని సత్యానికి మారు పేర్లు. సత్త్వమంటే ఆ విస్తరించింది. గొప్పమహిమ కలిగినది. అయిన పరమవేద్యమైన తత్త్వం సుమండీ!

క. కావునఁ గామ క్రోధ స। మావేశము లెడల విడిచి యనవతరంబున్
సేవింతురు సత్త్వము దృఢ। భావాకలనమున యోగపరినిష్ఠాత్ముల్. 107

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; యోగపరినిష్ఠ+ఆత్ములు= యోగంలో మిక్కిలి నిష్ఠకలిగిన సాధకులు; కామక్రోధసమావేశములు= కామాన్ని, క్రోధాన్ని పొందటం; ఎడలవిడిచి= సంపూర్ణంగా వదలిపెట్టి; అనవరతంబున్= ఎల్లప్పుడూ; దృఢభావాకలనమునన్= దృఢమైన దీక్షాభావం కలిగినవారై; సత్త్వమున్= ఆ సత్త్వాన్ని; సేవింతురు= ఉపాసిస్తారు.

ప్రతిపదార్థం: కాబట్టి యోగ సాధనలో పరినిష్ఠ కలిగిన పుణ్యాత్ములు కామక్రోధాలను సంపూర్ణంగా వదలిపెట్టి దృఢమైన దీక్షభావం కలిగి ఎల్లప్పుడూ సత్త్వాన్ని ఉపాసిస్తారు.

వ. అది హితంబు తత్ప్రాప్తికి సుపథంబు సెప్పెద వినుండు. 108

తాత్పర్యం: అది శ్రేయస్సు. దానిని అందుకొనటానికి ఉత్తమమార్గం చెప్తాను వినండి.

క. చతురాశ్రమములును జరణ। చతుష్టయము గాఁగ వర్ణ సముదయ సంసే
వ్యత నొప్పెడు ధర్మము సుం। డతులంబు శివ ప్రదంబు నగు పథ మరయున్. 109

ప్రతిపదార్థం: చతురాశ్రమములును= నాలుగు ఆశ్రమాలు (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాస ఆశ్రమాలు); చరణ చతుష్టయము కాఁగన్= నాలుగు పాదాలు కాగా; వర్ణసముదయ సంసేవ్యతన్+ఒప్పెడు= నాలుగు వర్ణాలచేత; ఇతర వర్ణసముదాయాలచేత అనుసరించబడుతూ ప్రకాశించేటటువంటి; ధర్మము+చుండి= ధర్మమే సుమండీ!; అరయన్= బాగా చూడగా; శివప్రదంబున్+అగు పథము= శుభప్రదమైన మార్గం.

తాత్పర్యం: నాలుగు ఆశ్రమాలు నాలుగు పాదాలుగా, అన్ని వర్ణాలకు చెందినవారిచేతా అనుసరించబడుతున్న సనాతనధర్మం ఏది ఉన్నదో అదే పరీక్షించిచూడగా శుభప్రదమైన అత్యుత్తమ మార్గం. దీనిద్వారా శ్రేయోరూపమైన మోక్షసాధన సులభమని తాత్పర్యం.

వ. నాలుగాశ్రమంబులకు సామాన్యంబ యధ్యాత్మవిత్త్వంబు లేక పరతత్త్వంబు నొందరామి మారుతాదిత్యేంద్ర ప్రజాపతులకునులోనుగానిట్టిద యధ్యాత్మ దర్శనంబనం జతుర్వింశతి తత్త్వావలోకనంబు కావునఁ దత్త్వంబులు వివరించెద. 110

ప్రతిపదార్థం: నాలుగు+ఆశ్రమంబులకున్= బ్రహ్మచర్యాది నాలుగు ఆశ్రమాలలోని వారికీ; అధ్యాత్మ విత్త్వంబులేక= ఆత్మను గురించి తెలిసికొనకుండా; పరతత్త్వంబున్+ఒందన్+రామి= పరతత్త్వాన్ని పొందలేకపోవటం అన్నది; సామాన్యంబు+అ= సమానమే; మారుత= సప్తమరుత్తులకు; ఆదిత్య= ద్వాదశ ఆదిత్యులకు; ఇంద్ర= ఇంద్రుడికి; ప్రజాపతికిన్= బ్రహ్మకు; లోనుగాన్= మొదలైనవారికి కూడా; అధ్యాత్మ దర్శనంబు= అధ్యాత్మ దర్శనం; ఇట్టిది+అ= ఇట్లాంటిదే; అనన్= అనగా; చతుర్వింశతి= ఇరవై నాలుగు; తత్త్వ+అవలోకనంబు= తత్త్వాలను దర్శించటం; కావునన్= కాబట్టి; తత్త్వంబులు= ఆ తత్త్వాలను; వివరించెదన్= వివరిస్తాను.

తాత్పర్యం: బ్రహ్మచర్యాది నాలుగు ఆశ్రమాలలోని వారెవరైనా ఆత్మవిద్యా సాధకులు కాకుండా మోక్షప్రాప్తిని పొందలేరు అనే నియమం అందరికీ సమానమే. మరుత్తులైనా, ఆదిత్యులైనా, ఇంద్రుడైనా, చివరికి బ్రహ్మదేవుడైనా అధ్యాత్మ దర్శన మార్గం మాత్రం ఇదే. అనగా ఇరవైనాలుగు తత్త్వాలు ఏవి ఉన్నాయో వాటి తత్త్వాన్ని గురించిన దర్శనం కలిగి ఉండటమనే అర్థం. అందుచేత ఆ తత్త్వాలను వివరిస్తాను.

విశేషం: బ్రహ్మాది దేవతలుకూడా బ్రహ్మవిద్యా సాధనలో అవలంబించవలసిన క్రమం మానవులు అవలంబించే క్రమమే అని అర్థం. అందుకే భారతకథ త్రిలోకాలకు సంబంధించినదని అనటం. ఇంద్రాది పాత్రలు మానవ పాత్రలతో కలిసి ప్రవర్తించటం ఇత్యాదులు కనిపిస్తాయి.

తే. అంబరాది భూతములు శబ్దాది గుణము। లింద్రియము లిరుదెఱఁగు మునీంద్రులార!
మన మహంకార బుద్ధు లిట్లొనరి ప్రకృతి। గలయఁ దత్త్వ చతుర్వింశకత్వ మొందు 111

ప్రతిపదార్థం: ముని+ఇంద్రులార!= మునిశ్రేష్ఠులారా!; అంబర+ఆది భూతములు= ఆకాశం మొదలైన ఐదు భూతాలు-5; శబ్ద+ఆదిగుణములు= శబ్దాదులైన ఐదు గుణాలు-5; ఇంద్రియములు+ఇరుదెఱఁగు= జ్ఞానేంద్రియ కర్మేంద్రియ పంచకాలు-5+5; మనము= మనస్సు-1; అహంకారము-1; బుద్ధి-1; ఇట్లు+ఒనరి= ఈ విధంగా కూడి; ప్రకృతిన్+కలయన్= ప్రకృతితో కలిస్తే; తత్త్వచతుర్వింశకత్వము+ఒందున్= 24 తత్త్వాలని పేరు పొందుతాయి.

తాత్పర్యం: ఆకాశం మొదలైన ఐదు భూతాలు, శబ్దాదులైన ఐదు గుణాలు, జ్ఞానేంద్రియ కర్మేంద్రియ పంచకాలు, మనస్సు, అహంకారం, బుద్ధి - అనే ఈ తత్త్వాలు ప్రకృతితో కలిస్తే 24 తత్త్వాలుగా పిలువబడుతాయి.

క. వినుఁడు ప్రభవ విలయ జ్ఞా। న నిరూఢము గాఁగ వీని నైజ మఖిలముం
గనిన భవమోహ మొందఁడు । గనుఁ బరతత్త్వంబు నతఁడు గతకల్మషుఁడై. 112

ప్రతిపదార్థం: వినుఁడు= బాగా వినండి; ప్రభవ= పుట్టుక; విలయ= నశించటం అనే ఈ రెండు; జ్ఞాన నిరూఢము కాఁగన్= జ్ఞానాలతో స్థిరమైన బుద్ధితో; వీనినైజము+అఖిలమున్= ఈ ఇరవై నాలుగు తత్త్వాల అసలు రూపాన్ని; కనినన్= దర్శిస్తే; భవమోహము+ఒందరు= సంసార రూపమైన భ్రాంతిని పొందరు; అతఁడు= అట్లాంటి యోగి; గతకల్మషుఁడు+ఐ= పాపాలు పోయినవాడై; పరతత్త్వంబున్+కనున్= పరతత్త్వాన్ని చూడగలుగుతాడు.

తాత్పర్యం: జనన మరణాలకు సంబంధించిన ప్రజ్ఞానంతోడి స్థిరమైన బుద్ధితో ఈ 24 తత్త్వాల నైజాన్ని దర్శిస్తే సంసార బంధరూపమైన భ్రాంతి నశిస్తుంది. పవిత్రుడై ఆ యోగి పరతత్త్వదర్శనం చేయగలుగుతాడు.'

వ. అని నిర్దేశించి యద్దేవుండు వెండియు. 113

తాత్పర్యం: అని ఉపదేశించి బ్రహ్మదేవుడు ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'వ్యక్త మనిర్వాచ్యం బ। వ్యక్తము సుస్థిరము ధ్రువము వ్యాపిత్వధురా
యుక్తము కలిత గుణత్రయ। శక్తి నవద్వారపుర మసాధ్యము సుండీ! 114

ప్రతిపదార్థం: అనిర్వాచ్యంబు= మాటలకందనిది; అవ్యక్తము= వ్యక్తం కానిది; సుస్థిరము= మిక్కిలి స్థిరమైనది; ధ్రువము= శాశ్వతంగా ఉండేది; వ్యాపిత్వధురాయుక్తము= అన్ని దిశలా వ్యాపించిన బరువుకలిగింది; కలిత గుణత్రయశక్తి= మూడు గుణాల

శక్తులతో కూడింది; అయిన వ్యక్తము= వ్యక్తమైన; నవద్వారపురము= ఈ తొమ్మిది ద్వారాలు కలిగిన ఆ నగరం; అసాధ్యము= జయించటం చాలా కష్టం; చుండీ!= సుమండీ!

తాత్పర్యం: మాటల కందనిది, అవ్యక్తమైనది, స్థిరమైనది, శాశ్వతమైనది, అన్నివైపులా వ్యాపించిన శక్తి కలిగినదీ, త్రిగుణ శక్తులతో కూడింది అయిన ఈ వ్యక్తమైన తొమ్మిది ద్వారాల నగరం జయించటానికి చాలా కష్టతరమైనది.

విశేషం: నవరంధ్రాలు కలిగినది దేహం. అందుకే నగరంగా చెప్పటం. జయించటమంటే ఆత్మ దర్శనమని అర్థం. అది అవ్యక్తం. కాని దేహానికి ప్రాణశక్తి అదే. చిత్రమేమంటే ఈ దేహం వ్యక్తం. దానితత్త్వం మాత్రం అవ్యక్తం. అందుకే జయించటం అసాధ్యమనటం.

క. **తత్సాధనంబు దద్గత। చిత్సులభత్వ ప్రసిద్ధిఁ జేయుఁ ద్రిగుణ సం**
పత్సారవంత మది గుణ। జిత్సువ్రతు లైన వారిచే సాధ్య మగున్. **115**

ప్రతిపదార్థం: తద్+సాధనంబు= ఆ పురాన్ని సాధించటానికి మార్గం; తద్+గత= ఆ దేహంలోని; చిత్= జ్ఞానాన్ని; సులభత్వ ప్రసిద్ధిన్+చేయున్= సులభంగా పొందే విధానాన్ని అందిస్తుంది; అది; త్రిగుణ సంపద్+సారవంతము= సత్త్వరజస్తమో గుణసంపద యొక్క సారరూపమైనది; గుణ జిత్+సువ్రతులు+ఐన= వారిచేన్= త్రిగుణాలను జయించటమే దీక్షగా కలిగినవారిచేత; సాధ్యము+అగున్= సాధించబడుతుంది.

తాత్పర్యం: దేహంలోని సహజ యోగసిద్ధిని సులభంగా సాధించే పద్ధతిని ఆ మార్గం చూపిస్తుంది. త్రిగుణాల సారరూపమైనది అది. గుణాలను జయించటాన్ని దీక్షగా కలిగినవారే ఆ పని చేయగలరు. వారికే ఇంద్రియ జయం సాధ్యం. వారే దేహాన్ని తమ నియంత్రణలో ఉంచుకొనగలరు.

సీ. **సంయమివరులార! సత్త్వరజస్తమో। నామరూఢములు గుణంబు; లవియు**
నన్యోన్య మిథునత్వ మన్యోన్య సంశ్రయ। మన్యోన్య సంకలితాను వృత్త
భావ మన్యోన్యోప జీవనాచరణంబు। గలిగి దుర్బోధత్వ గాఢ భంగు
లైయుండుఁ; దమము నియమితమైన రజస్సుఁ। దన్నియమమున సత్త్వంబు నడచు;

తే. **సత్త్వ మడఁగినచోఁ దమశ్చరిత మెసఁగు। లోభశోక సమ్మోహ నిద్రాభయములు**
వికృతి దుర్మాన మౌఢ్య పాపకృతి కోప। శార్య మాత్సర్యములు తమస్సంభవములు. **116**

ప్రతిపదార్థం: సంయమివరులార!= ఋషిశ్రేష్ఠులారా!; సత్త్వరజస్తమో నామరూఢములు= సత్త్వం, రజస్సు, తమస్సు అనే పేర్లతో ప్రసిద్ధాలు, గుణంబులు= గుణాలు; అవియున్= అవి; అన్యోన్యమిథునత్వము= ఒకదానితో ఒకటి సంగమించటం; అన్యోన్యసంశ్రయము= ఒకటి మరొదానిని ఆశ్రయించటం; అన్యోన్య సంకలిత+అనువృత్తభావము= ఒకటి మరోదానిలో కలిసి అనుసరించి ప్రవర్తించటం; అన్యోన్య+ఉపజీవన+ఆచరణంబు కలిగి= ఒకదానిని ఆశ్రయించి మరోటి సహజీవనం చేయటం కలిగి; ఇట్లా ఉంటూ; దుర్బోధ గాఢ భంగులు+ఐ+ఉండున్= వాటి ప్రవృత్తిని గుర్తించటానికి వీలులేకుండా చాలా తీవ్రరీతిలో ప్రవర్తిస్తాయి; తమము= తమోగుణం; నియమితము+ఐనన్= నియమించబడితే; రజస్సున్= రజోగుణమూ; తద్+నియమమునన్= ఆ రజోగుణ నియమంచేత; సత్వంబు+నడచున్= సత్త్వగుణం ప్రవర్తిస్తాయి; సత్త్వము+అడఁగినచోన్= సత్త్వం అణగిపోతే; తమశ్చరితము+ఎసఁగున్= తమస్సు ప్రవర్తించటం మొదలు పెడుతుంది; లోభ= లోభం; శోక= శోకం; సమ్మోహ= సమ్మోహం; నిద్రాభయములు= నిద్ర, భయం; వికృతి= వికారాలు; దుర్మాన= దురభిమానం; మౌఢ్య= మంకుతనం; పాపకృతి= పాపాలుచేయటం; కోప= క్రోధం; శార్య= మోసం; మాత్సర్యములు= అసూయ మొదలైనవి; తమస్సంభవములు= తమోగుణంనుండి పుట్టుతాయి.

తాత్పర్యం: ఋషిశ్రేష్ఠులారా! సత్త్వం రజస్సు తమస్సు అనే పేర్లతో ఈ గుణాలు ప్రసిద్ధి పొందాయి. అవి ఒకదానితో ఒకటి సంగమించి పనిచేస్తాయి. ఒకటి మరోదానిని ఆశ్రయిస్తాయి. ఒకటి మరోదానిలో కలిసి అనుసరించి ప్రవర్తిస్తాయి. ఒకదాని ప్రవృత్తి మరోదానికి సహకారిగా ఉండటమూ కనిపిస్తుంది. కాని, వాటి ప్రవృత్తిని గుర్తించటం దుస్సాధం. అతి తీవ్ర రీతిలో ప్రవర్తిస్తాయి. తమోగుణం నియంత్రితమైతే రజోగుణమూ, దానిని బట్టి సత్త్వమూ ఉంటాయి. సత్త్వం అణగిపోతే తమస్సు బయటపడుతుంది. లోభం, శోకం, భ్రాంతి, నిద్ర, భయం, వికారం, దురభిమానం. మంకుతనం, పాపకార్యాలు చేయటం, క్రోధం, మోసం, అసూయ ఇట్లాంటివన్నీ తమస్సులో పుట్టే దుర్గుణాలే.

విశేషం: ఒకే మనిషి మంచిగా, చెడుగా, మెత్తగా, తీవ్రంగా, తెలివిగా, మూర్ఖంగా ప్రవర్తించటానికి కారణాలు ఈ మూడు గుణాల కలయికలోని తేడాలని అర్థం.

ఉ. పాములుఁ దేళ్ళునుం బసులుఁ బందులుఁ గుక్కలు మీలుఁ గోళ్ళులుం
జీమలుఁ గాకులుం గ్రిములు జింకలు నక్కలుఁ గొంకనక్కలు
న్దోమలు వ్రాఁకులుం బొదలు నోవులఁ బొందువారు మున్
తామసభాగు లట్ల మఱి తద్విధ జంతువు లెన్ని యన్నియున్. 117

ప్రతిపదార్థం: పాములున్= పాములు; తేళ్ళునున్= తేళ్ళూ; పసులున్= పశువులూ; పందులున్= పందులూ; కుక్కలున్= కుక్కలూ; మీలున్= చేపలూ; కోళ్ళులున్= కోళ్ళూ; చీమలున్= చీమలు; కాకులున్= కాకులూ; క్రిములున్= పురుగులూ; జింకలున్= జింకలూ; నక్కలున్= నక్కలూ; కొంక నక్కలున్= పిరికి నక్కలు; దోమలున్= దోమలూ; వ్రాఁకులున్= చెట్లు; పొదలున్= పొదలూ; నోవులన్= బాధలూ; పీడలన్= కష్టాలూ; పొందువారు= పడేవారు, మున్= ముందు; తామసభాగులు= తామస గుణభాగం ఉన్నవారు; మఱి= ఇంకా; తద్విధ జంతువులు+ఎన్ని+అన్నియున్= అట్లాంటి జంతువులు ఎన్ని ఉన్నాయో అన్నీ; అట్లు+అ= అట్లాగే.

తాత్పర్యం: పాములు, తేళ్ళూ, పశువులు, పందులు, కుక్కలు, చేపలు, కోళ్ళు, చీమలు, కాకులు, పురుగులు, జింకలు, నక్కలు, పిరికి నక్కలు, దోమలు, చెట్లు, పొదలు, బాధలు, కష్టాలు పొందేవారు అందరూ ముందుగా తామసగుణ భాగస్వాములే. అట్లాగే తక్కిన జంతువులు ఏవేవి ఉన్నాయో అవన్నీ తామసగుణంతో కూడినవే.

విశేషం: ఆహార నిద్రా భయమైథునాలు నరులకు, పశువులకు సమానం. ఒక జ్ఞానార్జనచేతనే మనిషి, జంతుప్రపంచంనుండి వేరుపడుతున్నాడు. అందుకే తామసగుణం నరులకు జంతువులకు, పక్షులకు క్రిమికీటకాలకు సమానమని ఈ పద్యం వివరిస్తోంది. ఈ గుణంనుండి మనిషి బయటపడగలడు.

క. ఇవి తామసంబు లని గుణ। నివహములోఁ గీడు వాప నేర్చునతఁడు త
ద్వివిధ వికృతి నిరసన హే। తువివేకము గలుగఁ గా నధోగతిఁ దలఁగున్. 118

ప్రతిపదార్థం: ఇవి తామసంబులు+అని= ఈ గుణాలు తామసాలని గుర్తించి; గుణనివహములోన్= తనకున్న గుణ సముదాయంలో; కీడు= కీడును; వాపన్= పోగొట్టుకొనటానికి; నేర్చున్+అతఁడు= సమర్థుడైనవాడు; తద్+వివిధ= దానికి చెందిన వివిధాలైన; వికృతి= వికారాలను; నిరసన= దూరంచేయటానికి తగిన; హేతు వివేకము కలుగన్= బుద్ధి వివేకం కలుగగా; అధోగతిన్= అధోగతి పొందటాన్ని; తలఁగున్= వారించగలుగుతాడు.

తాత్పర్యం: బాధలు, కష్టాలు పొందటం ఇత్యాదిగా ఉన్న గుణకర్మలు తామసాలని ఎవడు గుర్తించగలడో వాడు తన గుణ సముదాయం నుండి వీటిని దూరం చేయగలుగుతాడు. తద్వారా ఆ తామసికాలైన వికారాలను దూరం చేయగల హేతుబుద్ధి వివేకాలు కలిగి అధోగతి పొందకుండా బయట పడతాడు.

చ. **బలమును శౌర్యమున్ మదముఁ బ్రాభవమున్ సుఖదుఃఖ భాగితా**
కలనముఁ జెల్మి సేఁతయును గాంక్షయు నొల్లమియుం బ్రతానముం
గలహము నీర్ష్యయున్ బహువికల్పపు భాషలుఁ గామినీ జనం
బుల యెడ గాఢ రాగతయు బొంకును నుబ్బు రజఃప్రభూతముల్. **119**

ప్రతిపదార్థం: బలమునున్= బలమూ; శౌర్యమున్= పరాక్రమమూ; మదమున్= గర్వమూ; ప్రాభవమున్= వైభవమూ; సుఖదుఃఖ భాగితాకలనము= సుఖాన్ని, దుఃఖాన్ని పొందటం అనే గుణం; చెల్మి+చేఁతయును= స్నేహం చేయటం; కాంక్షయున్= కోరికా; ఒల్లమియున్= నచ్చకపోవటం (ఇష్టం లేకపోవటం); ప్రతానమున్= విరివిగా ఉండాలని కోరుకొనటం; కలహమున్= వ్యాజ్యం; ఈర్ష్యయును= అసూయయు; బహు వికల్పపు భాషలు= నానా వికారాలైన మాటలు (తిట్లు); కామినీజనంబుల+ఎడన్= స్త్రీల పట్ల; గాఢరాగతయున్= మిక్కిలి అనురాగమును; బొంకును= అబద్ధం చెప్పటమును; ఉబ్బున్= అసహనం (ఇవన్నీ); రజస్+ప్రభూతముల్= రజోగుణంలో పుట్టేవి.

తాత్పర్యం: బలం, పరాక్రమం, గర్వం, వైభవం, సుఖదుఃఖాలు పొందటం, స్నేహంచేయటం, కోరిక, కోరకపోవటం, విరివిగా ఉండాలన్న ఆశ, వ్యాజ్యం, అసూయ, తిట్లు, స్త్రీలపట్ల మిక్కిలి అనురాగం, అబద్ధం చెప్పటం, అసహనంగా ఉండటం ఇవన్నీ రజోగుణంలో పుట్టుతాయి.

చ. **అవి తొలుబామునం గలుగు నట్టి జనంబులు నీతు లిట్టి వి**
ట్టివి యవినీతు లన్మతి పటిష్ఠత గల్గ త్రివర్గ వర్తనం
బు వెరవు నొంది యర్థములఁ బొంపిరివోవుచుఁ గామ సౌఖ్యవై
భవములఁ గ్రాలుచున్ మనుజ భావ నిరూఢతఁ బొల్తు రెంతయున్ **120**

ప్రతిపదార్థం: అవి= పైన వివరించిన గుణాలు; తొలుబామునన్= పూర్వజన్మలో; కలుగునట్టి జనంబులు= కలిగిన మనుష్యులు; ఇట్టివి నీతులు= ఇవి నీతులు; ఇట్టివి+అవినీతులు= ఇవి అవినీతులు; అన్+మతి= అనే బుద్ధియొక్క; పటిష్ఠత+కల్గి= గట్టిదనం కలిగి; త్రివర్గ= మూడు పురుషార్థాల విషయంలో; వర్తనంబు= ప్రవర్తించేటటువంటి; వెరవున్= పద్ధతిని; ఒంది= పొంది; అర్థములన్= ధనసంపదలతో; పొంపిరి+పోవుచున్= అతిశయిస్తూ; కామ సౌఖ్య వైభవములన్= కోరికలను తీర్చుకొని సుఖవైభవాలతో; క్రాలుచున్= వైభవంతో ప్రకాశిస్తూ; ఎంతయున్= మిక్కిలిగా; మనుజభావ నిరూఢతన్= మానుష భావంలో స్థిరులై; పొల్తురు= ఉంటారు.

తాత్పర్యం: ఈ గుణాలు పూర్వజన్మం నుండీ సంక్రమించిన మనుష్యులు నీతి, అవినీతి అనే విచక్షణ కలిగిన పటిష్ఠమైన బుద్ధి కలిగి, ధర్మార్థకామాల విషయంలో ఎట్లా ప్రవర్తించాలో తెలిసి, మిక్కిలి ధనసంపదలతో కోరికలు తీర్చుకొని సుఖంతోను వైభవంతోనూ అతిశయిస్తూ ప్రకాశిస్తారు. జీవితమంతా 'మానుష' భావంతోనే స్థిరంగా కాలం గడిపేస్తారు.

క. రాజసగుణములకుం గల। నైజ మెఱుఁగు వారు తజ్జనక వైకృతముల్
ధీజితములు గావింపఁగ। నోజ గలిగి శుభదవృత్తి నొందుదు రెందున్. 121

ప్రతిపదార్థం: రాజస గుణములకున్+కల= రాజసగుణాల కున్న; నైజము= స్వభావం; ఎఱుఁగువారు= తెలిసికొనేవారు; తద్+జనక= దానిని కలిగించే; వైకృతముల్= వికారాలను; ధీ= బుద్ధిచేత; జితములు+కావింపఁగన్= జయించినవిగా చేయటానికి; ఓజ+కలిగి= శక్తి కలిగి; శుభదవృత్తిన్= మేలు కలిగించే ప్రవృత్తిని; ఎందున్+ఒందుదురు= ఎక్కడైనా పొందగలరు.

తాత్పర్యం: రాజసగుణాల తత్త్వం ఇది అని ఎవరు గుర్తిస్తారో వారు తమ వివేకంతో రాజసగుణ వికారాలను జయించగలుగుతారు. మంచి దారిని ఏనాడైనా పొందగలుగుతారు.

విశేషం: రాజసగుణానికి కొంత శిక్షణ కలిగితే సాత్త్విక ప్రభావంలో పడిపోతుంది. అశిక్షితమైతే తామసంలోకి దిగిపోతుంది. సత్త్వ తమస్సులే ఎవ్వరికీ పడని గుణభేదాలు. అందుకే 'గురు' సేవ ద్వారా గుణసంపదను నియంత్రించవచ్చునని పెద్ద లంటారు.

సీ. సంతోషము సుప్రకాశత్వంబుఁ బ్రియమును। నానందమును గరుణాభిరతియు
క్షమయును సత్యంబు శౌచంబు ధృతియు న। కార్పణ్యమును దితిక్షయు నహింస
యును నార్జవంబును ననసూయయును గ్రోధ। రాహిత్యమును నసంరంభతయును
సమత దాక్షిణ్యంబు శ్రద్ధధానతయు న। క్రూరభావంబు హ్రీగౌరవంబు

తే. సత్త్వజాతంబు లివి పూర్వజన్మ సంక। లితము లైనట్టివా రహంకృతి మమత్వ
మర్థతృష్ణ కామార్తి లే కతులబోధ। భరితులై యూర్ధ్వలోక వైభవము గంద్రు. 122

ప్రతిపదార్థం: సంతోషమున్= సంతోషంగా ఉండటం; సుప్రకాశత్వంబున్= బాగా కాంతిమంతంగా ఉండటం; ప్రియమునున్= ప్రేమగా ఉండటం; ఆనందమునున్= ఆనందమూ; కరుణా+అభిరతియున్= దయలో ఆసక్తి ఉండటం; క్షమయున్= క్షమాగుణం; సత్యంబు= సత్యపాలన; శౌచంబు= పవిత్రంగా ఉండటం; ధృతియున్= ధైర్యం; అకార్పణ్యమును= లోభగుణం లేకుండటం; తితిక్షయున్= ఓర్పు; అహింసయును= హింసచేయకుండా ఉండటం; ఆర్జవంబును= వంకరగా కాకుండా నేరుగా ప్రవర్తించటం; అనసూయయును= అసూయలేమి; క్రోధరాహిత్యమును= కోధం లేకుండటం; అసంరంభతయును= ఉద్రేకం లేకుండా ఉండటం; సమత= అన్నిటిలోనూ సమత్వభావన కలిగి ఉండటం; దాక్షిణ్యంబు= కనికరం; శ్రద్ధధానతయున్= నిష్ఠతోడి విశ్వాసం ఉండటం; అక్రూరభావంబున్= కఠినత్వం లేకుండటం; హ్రీ= సిగ్గు; గౌరవంబు= గురుభావం కలిగి ఉండటం; ఇవి= అనే ఈ గుణాలు; సత్త్వ జాతంబులు= సత్త్వంలో పుట్టుతాయి (ఈ గుణాలు); పూర్వజన్మ సంకలితములు+ఐనట్టివారు= ఈ గుణాలలో పూర్వజన్మ సిద్ధంగా కలవారు; అహంకృతి= అహంకారం; మమత్వము= మమకారం; అర్థతృష్ణ= ధనదాహం; కామ+అర్తి= కామంతో దుఃఖితుడుకావటం; లేక; అతుల= సాటిలేని; బోధ భరితులు+ఐ= జ్ఞానయుక్తులైన; ఊర్ధ్వలోక వైభవమున్+కంద్రు= ఉత్తమలోక వైభవాలను పొందుతారు.

తాత్పర్యం: సంతోషం, ప్రకాశం, ప్రేమ, ఆనందం, కరుణ, క్షమాగుణం, సత్యం, శుచిత్వం, ధైర్యం, లోభరాహిత్యం. ఓర్పు, అహింస, చక్కని నడవడి, అసూయ లేమి, కోపం లేకుండటం, ఉద్రిక్తుడు కాకపోవటం, సమత్వం, కనికరం, నిష్ఠతోడి విశ్వాసం, కాఠిన్యం లేకుండా ప్రవర్తించటం, లజ్జ, గౌరవం అనే ఈ గుణాలు సత్త్వంలో పుట్టుతాయి. ఈ గుణాలను పూర్వజన్మ సంక్రమితాలుగా ఎవరు కలిగి ఉంటారో వారు అహంకార మమకారాలు లేక అర్థ కామ దాహాలు లేక అసామాన్యజ్ఞాన సంపద కలిగి విముక్తిసాధనకు తగినవారుగా ఉంటారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. వినుఁ డా గుణంబు లన్నిటిఁ। గనికొని తత్త దనుషక్తి గలుగనివాఁ డ
ప్పనిచే భుజింపఁగాఁ బడఁ। దనఘాత్మకులార! ద్రింగు నతఁ డారాశిన్.' 123

ప్రతిపదార్థం: వినుఁడు= ఋషులారా వినండి; ఆ గుణంబులు+అన్నిటిన్= ఆ గుణాలన్నిటిని; కనికొని= తెలిసికొని; తత్తద్= వాటి వాటిలో; అనుషక్తి= మిక్కిలి కూడిక; కలుగనివాఁడు= లేనివాడు; ఆ+పనిచేన్= ఆ పనివలన; భుజింపఁగాఁ బడఁకు= తినబడడు; అనఘ+ఆత్మకులార!= పుణ్యాత్ములారా!; అతఁడు= ఆ పుణ్యాత్ముడు; ఆ రాశిన్= ఆ కర్మ సముదాయాన్ని; ద్రింగున్= తినేస్తాడు (అతిక్రమిస్తాడు= కర్మనుండి విముక్తుడవుతాడు).

తాత్పర్యం: ఋషులారా! వినండి. ఆ గుణాల తత్త్వాన్ని దర్శించి ఆయా పనులలో ఆసక్తుడు కానివాడు ఆ పనివలన బంధించబడడు. పుణ్యాత్ములారా! అతడే ఆ కర్మ సముదాయాన్ని నియంత్రణలో ఉంచుకొనగలడు.'

వ. అని చెప్పి యప్పరమేష్ఠి మఱియును. 124

తాత్పర్యం: అనిచెప్పి ఆ బ్రహ్మదేవుడు ఇంకా ఇట్లా అన్నాడు.

సీ. 'వేర్వేఱ యుండవు వినుఁడు! గుణంబు ల। న్యోన్య సంకలితంబు లగుచుఁ బరఁగు
సంగతత్త్వమునన సంసారయాత్రా ప్ర। వర్తనం బొనరించు; వానిలోన
నెయ్యది మిగులఁ దోఁపించెఁ దజ్జన్యంబు। లొలయుఁ బాయుటయు నొక్కొక్కమాటు
గలుగుఁ; దమం బెఱుఁగమి యధికం బైన। స్రోతస్సధోముఖ స్రుతి రజస్సు

ఆ. లెఱిఁగినపుడు మధ్యసరణి సత్త్వమువృద్ధిఁ। బొంద నూర్ధ్వవృత్తిఁ బొందు; వీని
మును ప్రకార భేదమున నెఱింగించితి;। నవియు దుస్తరంబు లనఘులార! 125

ప్రతిపదార్థం: అనఘులార!= పుణ్యాత్ములారా!; వినుఁడు= ఇంకా వినండి; గుణంబులు= ఈ త్రిగుణాలు; వేర్వేఱన్= వేరు వేరుగా; ఉండవు= ప్రవర్తించవు; అన్యోన్య= ఒకదానితో మరొకటి; సంకలితంబులు+అగుచున్= కలిసిపోయి; పరఁగున్= ఉంటాయి; సంగతత్త్వమునన్+అ= కలయికవలననే; సంసారయాత్రా ప్రవర్తనంబు+ఒనరించున్= సంసారయాత్ర జరిగిటట్లు చేస్తున్నది; వానిలోనన్= వాటిలో; ఏ+అది= ఏది; మిగులన్= అధికంగా; తోఁపించెన్= ప్రకటితమవుతుందో; తద్+జన్యంబులు= దానినుండి పుట్టిన ఇతరాలు; ఒలయున్= కలుగుతాయి; ఒక్కొక్కమాటు= ఒక్కొక్కసారి; పాయుటయున్= నశించటమూ; కలుగున్= ఉంటుంది; ఎఱుఁగమి= తెలియకపోవటం; అధికంబు+ఐ= అధికంకాగా పుట్టినటువంటి; స్రోతస్సు= ప్రవాహం; తమంబు= తమస్సు; అధోముఖస్రుతి= అధోముఖంగా ప్రవహించేది; రజస్సు(లు)= రజోగుణం (ఇవి రెండూ ఇట్లా ఉంటాయి); ఎఱిఁగినపుడు= జ్ఞానం ఉన్నప్పుడు; మధ్యసరణిన్+నడిమి ప్రవాహంగా; సత్త్వమువృద్ధిపొందన్= సత్త్వం వృద్ధికాగా; ఊర్ధ్వవృత్తిన్ పొందున్= ఊర్ధ్వముఖంగా ప్రవహిస్తుంది; వీనిన్= వీటిని; మును= ముందు; ప్రకారభేదమునన్= వాటి వాటి ప్రకారాలనుబట్టి; ఎఱింగించితిన్= చెప్పాను; అవియున్= అవికూడా; దుస్తరంబులు= దాటటానికి చాలా కష్టమైనవి.

తాత్పర్యం: 'పుణ్యాత్ములారా! ఈ గుణాలు వేరు వేరుగా ప్రవర్తించవు. ఒకదానితో మరొకటి కలిసి ఉంటాయి. వీటి కలయికే సంసార యాత్రను జరిపిస్తున్నాయి. వాటిలో ఏది అధికంగా ప్రకటితమయితే దాని నుండి తక్కినవి పుట్టటమో, లోపించటమో జరుగుతూ ఉంటుంది. అజ్ఞానం పూర్తిగా వ్యాపిస్తే తమం పుట్టుతుంది. అపుడు రజోగుణం మనిషిని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అధోగతికి ఈడుస్తుంది. సత్త్వం ఈ రెంటి నడుమా ఉంటూ పెరిగి ఊర్ధ్వమార్గాన్ని అవలంబిస్తుంది. మునుపే ఈ గుణాలు ఒకదానిలో ఒకటి కలిసి ఏయే విధాలుగా ప్రవర్తిస్తాయో చెప్పాను. వీటిని దాటి మనిషి బయటపడటం అసాధ్యమైన విషయం.

విశేషం: ముందు 114వ పద్యంనుండి ఇప్పటిదాకా గుణాల ప్రవృత్తినే వివరిస్తున్నాడు. 116లో వివరంగా ఈ గుణత్రయం ఎట్లా పనిచేస్తుందో వివరించాడు. దీనినే ఇక్కడ మరలా గుర్తు చేస్తున్నాడు.

క. స్రోత స్సన జీవగమన। హేతు వగు దశా విశేష; మీ గుణమునఁ దా
నీ తెరువు నొందు నని కనుఁ। డాతతమతులార! కరణ మగు నది త్రోవన్. 126

ప్రతిపదార్థం: అతతమతులార!= విశాలమైన బుద్ధులున్న ఓ ఋషులారా!; స్రోతస్సు+అనన్= ప్రవాహం అని ఇంతకుముందు చెప్పిన విషయం; జీవగమన హేతువు+అగు= జీవితం సాగటానికి కారణ భూతమైన; దశావిశేషము= ఒక దశ; ఈ గుణమునన్+తాను+ఈ తెరువున్+ఒందును= ఈ గుణాల ప్రభేదంచేత ఆయా మార్గాన్ని పడుతుంది; అది= ఆ ప్రవహమే; త్రోవన్= ఆ బాటలో; కరణము+అగున్= సాధన మవుతుంది.

తాత్పర్యం: స్రోతస్సు అంత జీవితం సాగడానికి కారణభూతమైన ఒకానొకదశ. ఈ గుణంతో తానీదారిని పొందుతానని విశాలబుద్ధులారా కనుక్కోండి. దీన్ని త్రోసివేయడమే చేయదగినపని.

విశేషం: జీవితగమనం ఒక నదీ ప్రవాహంవంటిదే. అందుకే 'స్రోతస్సు' అనటం. ఎవరెవరి గుణభేదాలనుబట్టి వాడువాడు తన తన జీవితగమన దశలను, దిశలను, మార్గాలను, సాధనాలను వెదుక్కొంటాడు. అన్నిటికీ గుణభేదమే ప్రధానం. ఒకడు సాత్త్వికుడు. భగవదనుగ్రహం పొందాలన్నది ధ్యేయంగా ఉంచుకొంటాడు. (దశ- భక్తినిమార్గంగా ఎంచుకొంటాడు (దిశ)- ఇదే వాడిజీవిత స్రోతస్సు, పూజనో, పురస్కారాన్నో కరణంగా ఎంచుకొంటాడు (సాధనం). ఇట్లాగే తక్కిన గుణాలవారు వారు చేసే పనులను వారే నియంత్రించుకొంటారు. కాని, ఈ త్రిగుణాలూ, బంధహేతువులే అవుతాయి.

వ. గుణత్రయంబునుం ద్రోచుట మేఁ; లది త్రోవువడునట్టి వితృష్ణత్వంబు లేకుండు నేని. 127

ప్రతిపదార్థం: గుణత్రయంబునున్= ఈ మూడు గుణాలను; త్రోచుట= విసర్జించటం; మేలు= ఉత్తమం; అది; త్రోవు+పడునట్టి= తొలగిపోయేటటువంటి; వితృష్ణత్వంబు= దాహం లేకుండటం; లేకుండును+ఏని= లేకుండా ఉంటే.

తాత్పర్యం: ఈ మూడు గుణాలూ విసర్జింపదగినవే. అవి తొలగిపోవాలంటే తృష్ణ (దురాశ) నశించాలి. అది నశించేమార్గం లేకపోతే-(తరువాతి పద్యంతో అన్వయం.)

క. సాత్త్వికులకు దివము రజో। మత్త్వ కలిత వర్తనులకు మధ్య భువన వా
సత్త్వముఁ దామసులకు నీ। చత్వ కరాధోజగంబు సంప్రాప్త మగున్. 128

ప్రతిపదార్థం: సాత్త్వికులకున్= సత్త్వగుణంతోడి జీవితం గడిపినవారికి; దివమున్= స్వర్గమూ; రజోమత్త్వ+కలిత+వర్తనులకున్= రజోగుణంతో కలిసిన ప్రవృత్తి కలవారికి; మధ్యభువన వాసత్వము= భూలోకవాసం; తామసులకున్= తమోగుణులకు; నీచత్వకర+అధోజగంబున్= నీచత్వాన్ని కలిగించే అధోజగత్తు; సంప్రాప్తము+అగున్= ప్రాప్తం అవుతాయి.

తాత్పర్యం: సాత్త్వికులు స్వర్గం, రజోగుణులు భూలోకం. తమోగుణులు నీచమైన నరకాన్ని పొందుతారు.

విశేషం: గుణకర్మలు జీవితం ఉన్నపుడు మాత్రమే కాకుండా మరణానంతర జీవితంలో ఫలరూపంలో ప్రవర్తిస్తాయని అర్థం.

క. ధర్మార్థ కామ గోచర। కర్మములకు సాత్త్వికాదిక ప్రకర వికా
రోర్ములు హేతువు లగు; ని। ష్కర్మత కేత దవధూతి గారణము సుఁడీ! 129

ప్రతిపదార్థం: ధర్మ+అర్థ+కామ= ధర్మం, అర్థం, కామం; గోచర= గోచరించే; కర్మములకున్= కర్మలకు; సాత్త్విక+ఆదిక ప్రకర= సాత్త్వికం మొదలైన గుణ సమూహరూపమైన; వికార+ఊర్ములు= వికారా లనబడే అలలు; హేతువులు+అగున్= కారణాలు; అవుతాయి; నిష్కర్మతకున్= నిష్కర్మతను సాధించాలంటే; ఏతద్= ఈ అలలను; అవధూతి= ఎగరకొట్టటం; కారణము= కారణం; చుఁడీ!= సుమండీ!

తాత్పర్యం: ధర్మార్థ కామాలు ప్రకటమయ్యే కర్మలకు కారణం సాత్త్విక రాజస తామసాది గుణ సమూహంలో పుట్టే వికారాలు అనబడే అలలే. నిష్కర్మతను సాధించాలంటే ఈ అలలను ఎగరకొట్టాలి. అనగా వికారాలను అతిశయించిన గుణసమతను తద్ద్వారా నిర్గుణతను సాధించాలని అర్థం.

క. క్రమమునఁ బ్రాణంబు నపా। నము సత్త్వంబును రజస్సు నాకుం జూడన్
యమివరులార! యుదానము। దమ మిట్టుల శ్రుతియు సువిదితంబుగఁ జెప్పున్. 130

ప్రతిపదార్థం: క్రమమునన్= క్రమపద్ధతిలో; ప్రాణంబు= ప్రాణవాయువు; సత్త్వంబును= సత్త్వం; అపానము= అపానవాయువు; రజస్సు= రజోగుణం; యమివరులార!= ఋషి శ్రేష్ఠులారా!; నాకున్+చూడన్= నాకు చూడగా; ఉదానము= ఉదానమే; తమము= తమోగుణం; శ్రుతియున్= వేదం; ఇట్టులన్= ఇదే విధంగా; సువిదితంబుగన్= స్పష్టంగా; చెప్పున్= చెప్పుతున్నది.

తాత్పర్యం: క్రమంగా ప్రాణమే సత్త్వం, అపానమే రజస్సు, తమమే ఉదానం, వేదమూ ఇట్లాగే చెప్పుతున్నది.

క. జపమును దానము యజ్ఞముఁ। దపమును గర్తృజన చిత్తదశలును సత్త్వా
ద్యుపహితము లగుట నడచుం। ద్రిపథంబుల సాత్త్వికపు గతియ మే లెందున్. 131

ప్రతిపదార్థం: జపమును= జపమూ; దానమున్= దానమూ; యజ్ఞమున్= యజ్ఞమూ; తపమునున్= తపస్సూ; కర్తృజన చిత్త దశలునున్= పనిచేసేవారి మనస్సులూ; సత్త్వ+ఆది+ఉపహితములు+అగుట= సత్త్వము మొదలైన త్రిగుణాలకింద అణగిఉండటం; త్రిపథంబులన్= మూడు దారులలోనూ; నడచున్= నడుస్తాయి; ఎందున్= ఎప్పుడైనా; సాత్త్వికపు గతియ= సాత్త్వికమైన గమనమే; మేలు= శ్రేష్ఠమైనది.

తాత్పర్యం: జపం, దానం, యజ్ఞం, తపస్సు చేసేవారి మనస్సులు సత్త్వాది గుణాలచేత ప్రేరణ పొందినపుడు అవి మూడు దారులలోనే నడుస్తాయి. కాని, ఈ దారులలో సాత్త్వికమే ఉత్తమమైనది.

క. వినుఁ డెక్కువ తక్కువ లే। క నయము నెనసిన గుణత్రయంబును జూరే
వినుతా వ్యక్తం బనఁగాఁ। జను తత్త్వము శివ మచలము శాశ్వత మరయున్. 132

ప్రతిపదార్థం: వినుఁడు= వినండి; ఎక్కువ; తక్కువ; లేక= లేకుండా; అనయమున్= ఎల్లప్పుడూ; ఎనసిన= కలిసిన; గుణత్రయంబును= గుణత్రయం; వినుత= గొప్పదైన; అవ్యక్తంబు+అనఁగాన్= అవ్యక్తం అని చనుతత్త్వము= పిలువబడే తత్త్వం; అరయన్= బాగా చూస్తే (అది); శివము= శుభప్రదం; అచలము= చలనం లేనిది; శాశ్వతము= శాశ్వతమైనది; చూరే= చూడరే (సుడీ!);

తాత్పర్యం: ఋషులారా! వినండి. ఎక్కువ తక్కువ లేక ఎల్లప్పుడూ కలిసిన గుణత్రయమే "అవ్యక్త" అని ప్రసిద్ధమైన మహాతత్త్వం. అది శుభప్రదం, చలనం లేనిది. శాశ్వత మైనది కూడా సుమండీ!

క. **సదసత్ప్రకార నిత్యం। బది; దాని తెఱం గెఱుంగు నాతఁడు విజ్ఞా**
నదళావధూత గుణుఁడై। యదీనగతిఁ బొందఁగను నిరామయపదమున్.' **133**

ప్రతిపదార్థం: అది= ఆ అవ్యక్తపదం; సత్+అసత్+ప్రకార నిత్యంబు= సత్తుకు అసత్తుకు అతీతమైన నిత్యతత్త్వం; దాని తెఱంగు= దాని పద్ధతి; ఎఱుంగు+అతఁడు= తెలిసినవాడు; విజ్ఞాన+దళ+అవధూత+గుణుఁడు+ఐ= విజ్ఞానమనే దళంచేత పరిశుభ్రంచేయబడిన; గుణాలు కలవాడై; అదీనగతిన్= ఏ ఆర్తిపాలూ కాకుండా; నిరామయ పదమున్= ఏ లోపమూ లేని మోక్షస్థానాన్ని; పొందన్+కనున్= పొందగలుగుతాడు.

తాత్పర్యం: ఆ అవ్యక్తపదం సత్తు, అసత్తులకు అతీతమైన నిత్యతత్త్వం. దాని తత్త్వం తెలిసినవాడు విజ్ఞానంచేత పవిత్రుడై గుణత్రయానికి అతీతుడై ఏ కొరతా లేని శాశ్వతమైన మోక్షస్థానాన్ని సులభంగా పొందగలుగుతాడు.

వ. **అని యుపదేశించి వివరించి వెండియు.** **134**

తాత్పర్యం: అని విరించి ఉపదేశంచేసి వివరించినవాడై మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం.)

మనోబుద్ధ్యహంకారాది తత్త్వప్రకారము (సం. 14-40-1)

సీ. **'అవ్యక్తమునను మహత్తత్త్వ ముదయించు। నది బుద్ధిమతి ధృతిఖ్యాతి సంవి**
దుపలబ్ధి నామంబు వొంది యెందును గని। విని చని కావించి విభుత నొప్పు;
దాన నహంకార తత్త్వంబునకుఁ గల్గుఁ; బ్రభవంబు; వినుఁడు! తద్భావితాత్మ
కంబై ప్రవర్తించుఁ గార్యనీతుల లోక। మఖిలంబు; వర్ణత్రయ ప్రజనితు

తే. **లధ్యయనమును వ్రతమును నధ్వరంబుఁ। దపము మొదలైన క్రియ; లందుఁ దగిలి నడచు**
టెల్లఁ దద్వ్యాప్తిఁ జేసియ తెల్ల మింత। జగము రంజిల్లు దాని తేజంబువలన. **135**

ప్రతిపదార్థం: వినుఁడు= ఋషులారా వినండి; అవ్యక్తమునను= అవ్యక్తంలో; మహత్+తత్త్వము+ఉదయించున్= మహత్తు అనే తత్త్వం పుడుతుంది; అది= ఆ మహత్తు; బుద్ధి, మతి, ధృతి, ఖ్యాతి, సంవిత్తు, ఉపలబ్ధి నామంబులు+ఒంది= అనే పేర్లు కలిగి; ఎందునున్= సర్వత్రా; కని= చూడటం; విని= వినటం; చని= వెళ్ళటం; కావించి= పనిచేయటం; విభుతన్= అధికారంతో; ఒప్పున్= ప్రకాశిస్తుంది; దానన్= దానినుండి; అహంకార తత్త్వంబునకున్= అహంకారమనబడే తత్త్వానికి; ప్రభవంబు= పుట్టుక; కల్గున్= కలుగుతుంది; తద్+భావిత+ఆత్మకంబు+ఐ= ఆ అహంకారభావం ఆత్మగా కలిగి (ఆ అహంకారంతోనే); లోకము

అఖిలంబున్= ఈలోకమంతా; కార్యనీతులన్= కర్మవిధులలో; ప్రవర్తించున్= ప్రవర్తిస్తుంది; తద్+వ్యాప్తిన్+చేసి+అ= ఆ అహంకార ప్రభావంవలననే; వర్ణత్రయ ప్రజనితులు= మూడు వర్ణాలలో పుట్టినవారూ; అధ్యయనమును= వేదాది అధ్యయనాన్ని; వ్రతమునున్= దీక్షను; అధ్వరంబున్= యాగాన్ని; తపము మొదలైన క్రియలందున్+తగిలి= తపస్సు మొదలైన పనులలో మగ్నులై; నడచుట ఎల్లన్= నడపటం అంతా; ఇంత+తెల్లము= ఇది స్పష్టం; దాని తేజంబువలనన్= దాని కాంతివలననే; జగము రంజిల్లున్= ప్రపంచం ప్రకాశిస్తున్నది.

తాత్పర్యం: ఋషులారా! వినండి! ఆ అవ్యక్తంలో మహత్తు పుట్టుతుంది. ఆ మహత్తునే బుద్ధి, మతి, ధృతి, సంవిత్తు, ఉపలబ్ధి అనే పేర్లతో పిలుస్తారు. సృష్టిలో జరిగే అన్ని పనులను చేసేది, చూసేది, వినేది, జరిపేది అదే. అందుకే అది సృష్టికి ప్రభువు. దానినుండి అహంకార తత్త్వం పుట్టుతుంది. ఈ లోకం కర్మరీతులలో ఇన్ని విధాలుగా ప్రవర్తించటానికి ఈ అహంకార భావనే మూలం. మూడువర్ణాలలో- బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులలో పుట్టినవారు చేసే అధ్యయన, వ్రత, యజ్ఞ తపస్సులన్నీ ఈ అహంకారంచేతనే అనటం స్పష్టం. ఈ లోకంలోని ఆకర్షణ అంతా ఈ అహంకారతత్త్వ మహిమే.

క. **వినుఁ డా తత్త్వంబున సం। జనితము లగు మేదినియును జలమును దేజ**
బును వాయువు నాకాశము। నన(గ మహాభూతములు నిరతిశయ మహిమన్. **136**

ప్రతిపదార్థం: వినుఁడు= ఈ అహంకార మనే తత్త్వం ఇంకా ఏం చేస్తుందో వినండి; ఆ తత్త్వంబునన్= ఆ అహంకారంలో; మేదినియును= భూమి; జలమును= నీరు; తేజంబును= అగ్ని; వాయువున్= గాలి; ఆకాశము; అనఁగన్= అని పేర్లు గల; మహాభూతములు= పంచ మహాభూతాలు; (దాని); నిరతిశయ= గొప్ప; మహిమన్= ప్రభావంచేత; సంజనితములు+అగున్= పుట్టుతున్నాయి.

తాత్పర్యం: ఈ అహంకారం అనే తత్త్వానికున్న అపారమైన ప్రభావంచేతనే పృథివ్యాపస్తే జోవాయు రాకాశా లనబడే పంచమహాభూతాలు పుట్టుతున్నాయి.

తే. **తద్గుణంబులు సూరె గంధంబు రసము। రూప సంస్పర్శ శబ్దముల్ రూఢ భంగిఁ**
బరఁగు నివ్విషయముల పాల్పడ్డ మనసు। గలుగు జంతువు మోహాంధకార మొందు. **137**

ప్రతిపదార్థం: తద్+గుణంబులు= ఆ మహాభూతాల గుణాలే; చూరె!= సుమండీ!; గంధంబు= వాసన (పృథ్వి); రసము= రసం; రూపం; సంస్పర్శ= తాకిడి; శబ్దముల్= శబ్దము; రూఢభంగిన్= ఆయాభూతాలనుండి పుట్టినవిగా; పరఁగున్= ప్రవర్తిస్తాయి; ఈ+విషయములన్= ఈగుణజన్యమైన సుఖాలలో; పాల్పడ్డ+మనసు+కలుగు+జంతువు= తగులుకొన్న మనసున్న ప్రాణి; మోహ+అంధకారము= మోహమనే చీకటిని; పొందున్= పొందుతుంది.

తాత్పర్యం: ఆ భూతాల గుణాలే గంధ, రస, రూప, స్పర్శ, శబ్దాలు అనబడేవి. ఈ గుణాలనుండి కలిగే విషయ (ఇంద్రియ) సుఖాలలో ఏ ప్రాణి మనస్సు తగులుకొంటుందో అది మోహం అనే చీకటిలో మునిగిపోతుంది.

విశేషం: జ్ఞానానికి వివేకం, అజ్ఞానానికి మోహం ప్రధాన ధర్మాలుగా గుర్తించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. దీన సకల జంతువులును। లీనము లగుచుండుఁ దమ యలీన స్మృతి ధై
ర్యానూనం బగు నిర్మల। మానసములఁ బొరయనీరు మహితార్యజనుల్. 138

ప్రతిపదార్థం: దీనన్= ఈ మోహాంధకారంలో; సకలజంతువులునున్= అన్ని ప్రాణులూ; లీనములు+అగుచున్+ఉండున్= పడిపోతూ ఉంటాయి; మహిత+ఆర్యజనుల్= గొప్పవారైన పుణ్యాత్ములు (జ్ఞానులు); తమ= తమవైన; అలీన= మునగని; స్మృతి+ధైర్య+ అనూనంబు+అగు= ఆత్మ స్మరణవలన, ధృతివలన కలిగిన స్థిరత్వంతో కూడుకొన్న; నిర్మల మానసములన్= నిర్మలమైన మనస్సులను; పొరయనీరు= ఈ మోహంలో పడనీయరు.

తాత్పర్యం: సాధారణంగా ప్రాణాలన్నీ ఈ మోహాంధకారంలో కూరుకొనిపోతాయి. బయటికి రాజాలవు. పుణ్యాత్ములైన జ్ఞానులు తమ నిస్సంగమైన మనస్సులతో ఆత్మ స్మృతివలన లభించిన ధైర్యంతో స్థిరంగా నిలిచి ఆ మోహంలో పడకుండా బయటపడతారు.

క. విషయంబులు నశ్వరములు। విష సన్నిభములు సమగ్ర వికృత జనకముల్
ధిషణాగుణముల నెల్లఁ గ। లుషములుగాఁ జేయు మోహలోభకరము లై. 139

ప్రతిపదార్థం: విషయంబులు= విషయసుఖాలు; నశ్వరములు= అశాశ్వతాలైనవి; విషసన్నిభములు= విషతుల్యాలు; సమగ్ర= మిక్కిలి; వికృత జనకముల్= వికారాలను కలిగిస్తాయి; మోహ లోభకరములు+ఐ= మోహాన్ని; లోభాన్ని పుట్టించి; దిషణాగుణములన్+ ఎల్లన్= బుద్ధికి సంబంధించిన మంచి ఆలోచనలను అన్నిటినీ; కలుషములుగాన్+చేయున్= పక్కదారి పట్టించి పాప సంకలితాలు చేస్తాయి.

తాత్పర్యం: విషయసుఖాలు అశాశ్వతాలు, విషతుల్యాలు, అన్ని వికారాలకు మూలమవుతాయి. మోహాన్ని లోభాన్ని కలిగిస్తాయి. సదాలోచనలను దురాలోచనలుగా మార్చి మనిషిని పాపంలో తోస్తాయి.

ఆ. మాంసశోణితాస్థిమయ శరీరంబులఁ। దారు గాఁగ లగ్గ తలఁచునట్టి
కృపణజనులు వీని కీడు గానఁగ లేక। చిక్కి చెడుదు; రింత నిక్కువంబు. 140

ప్రతిపదార్థం: మాంస= మాంసంతోనూ; శోణిత= రక్తంతోనూ; అస్థిమయ= ఎముకలతోనూ కూడిన; శరీరంబులన్= దేహాలను; తారు+కాఁగన్= తాము అని; లగ్గ తలఁచునట్టి= మిక్కిలిగా భావించే; కృపణ జనులు= దీన జనులు; వీని= ఈ అవయవాల; కీడు= అపాయం; కానఁగలేక= చూడలేక; చిక్కి= మోహబంధంలో చిక్కుకొని; చెడుదురు= పాడైపోతారు; ఇంత= ఇది; నిక్కువంబు= నిజం.

తాత్పర్యం: మాంస, రక్త, అస్థిమయమైన ఈ శరీరాలనే తా మనుకొనే నీచమానవులు ఈ అవయవాలవలన (ఇంద్రియ సుఖాలవలన) కలిగే మోహబంధాన్ని గుర్తించలేక, అందులోనే కూరుకుపోయి నశిస్తారు. ఇంతమాత్రం నిజం.

వ. పండితులు వీని చేతం జెడ' రని పలికి పద్మసంభవుండు వెండియు. 141

తాత్పర్యం: పండితులైనవారు ఈ ఇంద్రియ సుఖాలచేత చెడిపోరని చెప్పి బ్రహ్మదేవుడు మరలా (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: ఇక్కడ పండితులంటే జ్ఞానులని అర్థం. శాస్త్రజ్ఞానాన్ని 'పండ' అంటారు. అది కలిగినవాడు పండితుడు.

తే. **అంతరాత్మ యనంగఁ బ్రాణాది పంచ। కమును వాఙ్మనోబుద్ధులుఁగా నిరూఢి**
గలుగు నీ యష్టకంబు లోకమున కెల్లఁ। దా నుపాదాన కారణత్వము వహించు. 142

ప్రతిపదార్థం: అంతరాత్మ+అనంగన్= అంతరాత్మ అనే పేరుతో; ప్రాణాదిపంచకమునున్= పంచప్రాణాలు; వాక్+మనస్+బుద్ధులుగాన్= వాక్కు, మనస్సు, బుద్ధి అనే ఈ మూడు (5+3) పేర్లతో; నిరూఢి+కలుగు+ఈ+అష్టకంబు= ప్రసిద్ధిగల ఈ ఎనిమిది; లోకమునకెల్లన్= లోకానికంతా; తాను= ఈ అంతరాత్మ; ఉపాదాన కారణత్వము+వహించున్= సమవాయి కారణం అవుతుంది.

తాత్పర్యం: పంచప్రాణాలు, వాక్కు, మనస్సు, బుద్ధి అనే ఈ ఎనిమిది కలిసి 'అంతరాత్మ' అని పేరుపొంది ఈ లోకానికి ఉపాదానకారణం అవుతున్నది.

విశేషం: 'కుండ' తయారుచేయటానికి మన్ను ఉపాదాన కారణం అని తర్కశాస్త్రం వివరిస్తున్నది. ఈ లోకం ఏర్పడటానికి అట్లా ప్రాణాదులు కారణాలు అవుతున్నాయి. అందుకే 'ఆత్మ' ఉపాదాన కారణమని చెప్పుతున్నారు.

వ. **ఇవ్విధంబునం గనుంగొనుట బోధంబునకు నిదానంబు.** 143

తాత్పర్యం: ఈ విధంగా దర్శించటం జ్ఞానానికి మూలకారణమవుతుంది.

సీ. **వినుఁ డహంకార సంజనితంబు లగు చక్షు। రాదిక బుద్ధీంద్రియములుఁ బాద**
ముఖ్యకర్మేంద్రియములను మనంబునకు। నేకాదశేంద్రియానీక మీక
డింది సందడిఁ బడి కుందక యందేది। యింపేనిఁ దనవంక కీడ్వఁ జాలు
బుద్ధితత్త్వము గల్గు శుద్ధాత్మకుఁడు పర। తత్త్వంబు గనుటకుఁ దా వలంతి

తే. **యని యెఱింగించి మఱియు నిట్లను నజుండు। స్వేదముద్భేద మండ మన్వీనఁ బుట్టు**
నధమ మధ్యమోత్తమ దశలైన భూత। రాసు లత్యుత్తమములు జరాయుజములు. 144

ప్రతిపదార్థం: వినుఁడు= భూతరాసుల ఉత్పత్తి వినండి; అహంకార= మహత్తునుండి పుట్టిన అహంకారం నుండి; సంజనితంబులు+అగు= పుట్టిన; చక్షుస్+ఆదిక= కన్నులు మొదలైన; బుద్ధి+ఇంద్రియములున్= జ్ఞానేంద్రియాలు; పాదముఖ్య= పాదాలు మొదలైన; కర్మేంద్రియములను; మనంబును= మనస్సు; ఏకాదశ+ఇంద్రియ+అనీకము= అన్నవి పదకొండు ఇంద్రియాల సమూహం; కడింది సందడిన్= మిక్కిలి అయిన సందడిలో; పడి= పడిపోయిన; కుందక= దుఃఖించక; అందున్+ఏది= వాటిలో ఏది; ఇంపు+ఏనిన్= ఇష్టమైతే; తనవంకకున్= తన వైపునకు; ఈడ్వన్+చాలు= లాగ కలిగిన; బుద్ధితత్త్వము+కల్గు= బుద్ధి తత్త్వం కలిగిన; శుద్ధాత్మకుడు= పరిశుద్ధమైన ఆత్మ ద్రవ్యం ఉన్నవాడు; పరతత్త్వంబున్+కనుటకున్= పరతత్త్వాన్ని దర్శించటానికి; తాన్+వలంతి= తాను సమర్థుడు; అని; ఎఱింగించి= తెలిపి; అజుఁడు= బ్రహ్మ; మఱియున్+ఇట్లు+అనున్= ఇంకా ఇట్లా అన్నాడు; స్వేదము= చెమటనుండి; ఉద్భేదము= నేలను చీల్చుకొని బయటికి రావటం; అండము= గుడ్డునుండి; అన్+వీనన్= అనే ఈ మూడు రీతులలో; అధమ, మధ్యమ, ఉత్తమ దశలు+ఐన= అధమ, మధ్యమం ఉత్తమం అని చెప్పదగ్గ దశలు కలిగిన; భూతరాసులు= ప్రాణిసమూహాలు; పుట్టున్= జన్మిస్తాయి; జరాయుజములు= మావివలన జన్మించేవి; అతి+ఉత్తమములు= మిక్కిలి శ్రేష్ఠాలు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని తెలిపి బ్రహ్మ ఇంకా ఇట్లా అన్నాడు. స్వేదం నుండి నేలనుండి గ్రుడ్డునుండి అధమ మధ్యమ ఉత్తమదశలుగల జీవరాసులు పుట్టుతాయి. జరాయుజములు మిక్కిలి ఉత్తమమైనవి.

వ. భూత తారతమ్య జ్ఞానంబు మాననీయం బగుట నిట్లు సెప్పితి; నధ్యాత్మాదులం జెప్పెదఁ; దద్వేదిత్వంబు విద్యామూలంబై యుండు; నవధానంబుతో వినుండు. 145

ప్రతిపదార్థం: భూత= ప్రాణులలోని; తారతమ్యజ్ఞానంబు= ఎక్కువ తక్కువ తనాలను గురించిన తెలివిడి; మాననీయంబు+అగుటన్= ప్రశస్తమైనది కాబట్టి; ఇట్లు+చెప్పితిన్= ఇట్లా చెప్పాను; అధ్యాత్మాదులన్+చెప్పెదన్= ఆత్మను ఆశ్రయించినవాటిని గురించి చెప్పుతాను; తద్+వేదిత్వంబు= ఆత్మను గురించి తెలిసికొనటం; విద్యామూలంబు+ఐ+ఉండున్= విద్యద్వారా సాధ్యం; అవధానంబుతోన్ వినుండు= ఏకాగ్ర చిత్తంతో వినండి.

తాత్పర్యం: ప్రాణరాశిలోని ఉత్తమ మధ్యమాది భేదాలనుగురించి తెలియటం చాలా ముఖ్యం కాబట్టి ఇట్లా చెప్పాను. ఇక అధ్యాత్మ విషయాలను ప్రస్తావిస్తాను. దానిని గురించి తెలిసికొనటం విద్యద్వారా మాత్రమే సాధ్యం. జాగ్రత్తగా వినండి.

విశేషం: ప్రకృతిని గురించిన లౌకిక పరిజ్ఞానమంతా 'అవిద్య' అని, ఆత్మను గురించిన వేదోపనిషద్విద్య మాత్రమే 'విద్య' అని అది జ్ఞానరూపమని బంధ వినిర్ముక్తిహేతువని భారత సంప్రదాయం చెప్పుతున్నది.

క. అంబరమాది యనిల తే। జోంబుధరలు వరుసతోడ నగుఁ జూరె ద్వితీ
యంబుఁ దృతీయంబుఁ జతు। ర్థంబును బంచమము భూతతతి యట్లుండున్. 146

ప్రతిపదార్థం: అంబరము+అది= ఆకాశం మొదటిది; అనిల= వాయువు; తేజస్= అగ్ని; అంబు= నీరు; ధర+లు= భూమి (ఇవి); వరుసతోడన్= వరుసగా; ద్వితీయంబు= రెండవది; తృతీయంబు= మూడవది; చతుర్థంబును= నాలుగవది; పంచమమున్= ఐదవది; అగున్+చూరె= అవుతాయి సుమండీ!; భూతతతి= భూతరాశి; అట్లు+ఉండున్= అట్లా ఉంటుంది.

తాత్పర్యం: పంచభూతాల వరుస గురించి చెప్పుతున్నాడు. మొదటిది ఆకాశం, రెండవది వాయువు, మూడవది అగ్ని, నాలుగవది నీరు, ఐదవది భూమి. భూతరాశి ఇట్లా ఏర్పడింది.

విశేషం: ఆకాశాద్వాయుః, వాయోరగ్నిః, అగ్నేరాపః, ఆపః పృథివీ - అని ప్రాచీన సంప్రదాయంలో చెప్పారు.

వ. అధ్యాత్మాదులు భూతాధిష్ఠానంబులు గావున భూతంబుల ము న్నుపన్యసించితి. 147

ప్రతిపదార్థం: అధ్యాత్మాదులు భూతాలను ఆశ్రయించి ఉంటాయి. కాబట్టి భూతాలను గురించి ముందు చెప్పాను.

సీ. శ్రోత్ర మధ్యాత్మంబు సూరె శబ్దం బధి। భూతంబు దిశలు ప్రబుద్ధులార!
యధిదైవతము చర్మమధ్యాత్మ మందలి। సంస్పర్శ మధిభూత సంజ్ఞకంబు;
దానికి నధిదైవతంబు విద్యుత్తు; నే। త్రంబు దా నధ్యాత్మకంబు రూప
మధిభూత మాదిత్యుఁ డధిదైవతము జిహ్వ। యధ్యాత్మకము రస మారయంగ

తే. దాని యధిభూత ముడుపతి తదధిదైవ। తంబు ఘ్రాణ మధ్యాత్మంబు దలఁప గంధ
మంచితాధిభూతము దదీయాధిదైవ। తంబు మారుత మండ్రు విద్వజ్జనములు. 148

ప్రతిపదార్థం: శ్రోత్రము= చెవి; అధ్యాత్మంబు+చూరె= అధ్యాత్మం సుడీ!; ప్రబుద్ధులార!= ఓ జ్ఞానులారా!; అధిభూతంబు= అధిభూతం; దిశలు= దిక్కులు (అధిదైవతము); చర్మము; అధ్యాత్మము; అందలి= చర్మంలోని సంస్పర్శ= తాకుడు లక్షణం; అధిభూతసంజ్ఞకంబు= అధి భూతం; దానికి అధిదైవతంబు= అధి దైవతం; విద్యుత్తు= మెరుపు; నేత్రంబు+తాన్= కన్ను; అధ్యాత్మకంబు; రూపము; అధిభూతము= అధిదైవతము; ఆదిత్యుఁడు= సూర్యుడు, జిహ్వ= నోరు; అధ్యాత్మికము= దాని అధిభూతము+అరయంగన్+రసము= దాని అధిభూతం రసం; తద్+అధిదైవతంబు+ఉడుపతి= చంద్రుడు దానికి అధిదైవతం; ఘ్రాణము= ముక్కు; అధ్యాత్మంబు; తలఁపన్= ఆలోచించగా; గంధము+అంచిత+అధిభూతము= దాని అధిభూతమే గంధం; తదీయ+అధిదైవతంబు మారుతము= దాని అధిదైవతం వాయువు అని; విద్వజ్జనములు= పండితులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: ఓ జ్ఞానులారా! వినండి అధ్యాత్మ, అధిభూత, అదిదైవతాలని మూడు తీరులుగా భూతరాశి ప్రకృతితో సంబంధం కలిగి అధ్యాత్మ విద్యామూలంగా మారుతున్నది.

<u>అధ్యాత్మము</u>	<u>అధిభూతము</u>	<u>అధిదైవతము</u>
చెవి	శబ్దం	దిక్కు
చర్మం	స్పర్శ	విద్యుత్తు
కన్ను	రూపం	సూర్యుడు
నోరు	రసం	చంద్రుడు
ముక్కు	గంధం	వాయువు

'విద్య' అనగా ఈ జ్ఞానేంద్రియాలకు, పంచభూతాల గుణాలకు, అధిదైవతాలైన సూర్యచంద్రాదులు ఉన్నారని గుర్తించటమే. దైవత, భూత, ఆత్మ, సంజ్ఞలచేత తెలిసే విషయం ఏమిటంటే ప్రత్యవయవం పనిని నిర్దేశించి నడి పించే దైవశక్తి కలదని. దానినే 'ఆత్మ' జ్ఞానమంటాం.

వ. ఇది బుద్ధీంద్రియ ప్రపంచంబు. 149

తాత్పర్యం: ఇది జ్ఞానేంద్రియప్రపంచస్వరూపం.

సీ. పాదపాయూపస్థ పాణి వాగ్వర్గంబు। కర్మేంద్రియములు సత్కర్ములార!
యధ్యాత్మములు వాని కగు నధిభూతముల్। గంతవ్యమును విసర్గమును శుక్ర
మును గ్రమవృత్తిమై వినుఁడు కర్తవ్య వ। క్తవ్యంబులును నధిదైవతములు
బభ్రుమిత్ర ప్రజాపతి శక్రవహ్నులు। మఱి యహంకారంబు మనసు బుద్ధి

తే. పూజితాధ్యాత్మకము లధిభూత వృత్తి। వెలయు నభిమాన మంతవ్యములును నిశ్చ
యంబు నధిదైవతము రుద్రుఁ డమృత కరుఁడు। బ్రహ్మమిది వేద వాక్య నిర్ణయము తెఱఁగు. 150

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సత్కర్ములార!= పుణ్య కర్ములైన ఋషులారా!; వినుఁడు= వినండి; పాద; పాయు= గుదం; ఉపస్థ= జననావయం; పాణి= చేయి; వాక్కు= నాలుక; కర్మ+ఇంద్రియములు= కర్మేంద్రియాలు అధ్యాత్మములు; వానికిన్+అగు= వాటికి సంబంధించిన అధిభూతముల్= అధిభూతాలు; క్రమవృత్తిమైన్= క్రమంగా; గంతవ్యము= వెళ్ళదగింది; విసర్గమును= విసర్జనం; శుక్రమును= వీర్యం; కర్తవ్య= పనిచేయటం; వక్తవ్యంబులును= మాటాడదగినది; వీటి అధిదైవతములు; బభ్రు= బభ్రువు; మిత్ర= సూర్యుడు; ప్రజాపతి; శక్ర= ఇంద్రుడు; వహ్నులు= అగ్ని; మఱి= ఇంకా; అహంకారంబు= అహంకారం; మనస్సు= బుద్ధి (ఇవి); పూజిత+అధ్యాత్మకములు= మహనీయమైన అధ్యాత్మకాలు; అభిమాన= అభిమానం; మంతవ్యములు= ఆలోచించదగినవి; నిశ్చయంబు= తెలిసి నిర్ణయించగలిగినది; అధిభూతములు= అధి భూతాలు; రుద్రుఁడు= శివుడు; అమృతకరుఁడు= చంద్రుడు; బ్రహ్మము; అధిదైవతములు; ఇది వేదవాక్య నిర్ణయము తెఱఁగు= వేదవాక్యాలు నిర్ణయించిన విధానం.

తాత్పర్యం: పుణ్యకర్ములారా! వినండి. అధ్యాత్మకాలైన కర్మేంద్రియాలైన పాదాదులకు కూడా గంతవ్యాది అధిభూతాలూ, బభ్రుమిత్రాది అధిదైవతాలు ఉన్నాయి. అహంకారాదులకు కూడా ఇంతే.

	అధ్యాత్మము	అధిభూతము	అధిదైవతము
	వాక్కు	మాటాడటం	అగ్ని
కర్మేంద్రియాలు	పాణి	పనిచేయటం	శక్రుడు
	పాదం	వెళ్ళదగింది	బభ్రు
	పాయు	విసర్జనం	మిత్రుడు
	ఉపస్థ	శుక్రం	ప్రజాపతి
	అహంకారం	అభిమానం	రుద్రుడు
	మనస్సు	ఆలోచించటం	చంద్రుడు
	బుద్ధి	తెలిసికొనటం	బ్రహ్మం

కర్మేంద్రియాలు చేసే పనులకు మాత్రమే కాకుండా అహంకారాది అంతర వ్యాపారాలకు కూడా అధిదైవతాలు ఉన్నారని తెలిసికొనటం ద్వారా మనిషి కర్తృత్వభావనను ఎట్లా తొలగించుకొనవచ్చునో తరువాత వివరిస్తున్నారు.

ఆ. ఇట్లు తెలియ నెఱిఁగి యింద్రియంబుల నింద్రి। యార్థములను భూతసార్థమును దె
మల్చి చిట్లకుండ మనసున నొదిఁగించు। టనఘులార! భవనిరాసనంబు.' **151**

ప్రతిపదార్థం: అనఘులార!= పుణ్యాత్ములారా!; ఇట్లు= ఈ విధంగా; తెలియన్+ఎఱిఁగి= తెలిసికొని; ఇంద్రియంబులను= ఇంద్రియాలను; ఇంద్రియ+అర్థములను= ఇంద్రియ ప్రయోజనాలను; భూతసార్థమును= భూతసమూహాన్ని; తెమల్చి= పైకిలాగి; చిట్లకుండ= విడిపోకుండ; మనసునన్= మనస్సులో; ఒదిఁగించుట= దాచుట; భవవిరాసనంబు= పుట్టుకను జయించుట (మోక్షం పొందుట).

తాత్పర్యం: పుణ్యాత్ములారా! ఈ విధంగా జ్ఞానం పొంది ఇంద్రియాలను, వాటి విషయాలను, భూతసముదాయాన్నీ పైకితీసి, చెదరిపోకుండా మనస్సులో కుదుటపరచుకొనటమే పుట్టుకను లేకుండా చేసికొనే మోక్షమార్గం.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని నిర్దేశించి నీరజాసనుం డా సంయమివరులతో 'సూక్ష్మ భావత్వ సంపాదినియు శివయు నగు నివృత్తి తెఱం గెఱింగించెద' నను మాట మున్నాడి యిట్లనియె. 152

ప్రతిపదార్థం: అని నిర్దేశించి= అని ఉపదేశించి; నీరజాసనుండు= బ్రహ్మ; ఆ సంయమి వరులతోన్= ఆ ఋషి శ్రేష్ఠులతో; సూక్ష్మభావత్వ సంపాదినియున్= ఆత్మ రహస్య భావాన్ని సంపాదించేది; శివయున్+అగు= శుభప్రదము అయినటువంటి; నివృత్తి తెఱంగు= నివృత్తి పద్ధతిని; ఎఱింగించెదన్= చెప్తుతాను; అనుమాటన్= అని; మున్నాడి= ముందుగా చెప్పి; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని ఉపదేశించి బ్రహ్మదేవుడు ఆ ఋషులను చూచి 'ఆత్మరహస్య భావాన్ని సంపాదించటానికి శ్రేయోరూపమైన శుభాన్ని అందుకొనటానికి మూలమైన నివృత్తి పద్ధతిని బోధిస్తా' నని ఇట్లా చెప్పాడు.

సీ. 'కమఠంబు దన యంగకముల నెట్లట్లు। కామముల విద్వాంసుండు మరలఁ దివుచుఁ;
గామంబుల మరల్పఁగా నోపు ధీరుండు। విరజస్కుఁడై ముక్తి తెరువు గాంచు;
నింద్రియంబులు పదియింటిని గుదియించు। టెక్కుడు వెర వది యింధనముగ
నాత్మాగ్ని వెలుఁగు; భూతావలి నాత్మఁ గాం। చిన సూక్ష్మ తత్త్వ దర్శనము గలుగు;

తే. భూత పంచక జలధి రోగాతిశోక। సహిత భోగలవాంశ కాశ్రయము దీని
విభులు గాముండుఁ గ్రోధుండు; వీరి గెల్వ। వచ్చునప్పుడ యది గడవంగ వచ్చు. 153

ప్రతిపదార్థం: కమఠంబు= తాబేలు; తన అంగకములన్+ఎట్లు= తన అవయవాలను ఎట్లా (లోపలికి లాక్కుంటుందో); అట్లు= ఆ విధంగా; కామములన్= కోరికలను; విద్వాంసుండు= పండితుడు; మరలన్+తివుచున్= వెనక్కి తిప్పుకొంటాడు; కామంబులన్= కోరికలను; మరల్పఁగాన్+ఓవు+ధీరుండు= (కోరికలను) వెనక్కి తిప్పుకొనగలిగిన ధీరుడు; విరజస్కుఁడు+ఐ= రజోగుణం లేనివాడై; ముక్తి+తెరువున్+కాంచున్= ముక్తిమార్గాన్ని అందుకొనగలుగుతాడు; ఇంద్రియంబులు పదియింటిని= పది ఇంద్రియాలనూ; కుదియించుట= నియమంచటం; ఎక్కుడు+వెరవు= గొప్ప పద్ధతి; అది= ఆ ఇంద్రియ సముదాయమే; ఇంధనముగన్= సమిధలుగా; ఆత్మ+అగ్ని+వెలుఁగున్= ఆత్మ అనే అగ్ని ప్రకాశిస్తుంది; భూత+ఆవలిన్+ఆత్మన్+కాంచిన= ఆత్మలో భూతావళిని దర్శించటం ప్రారంభిస్తే; సూక్ష్మ తత్త్వదర్శనము కలుగున్= అతి సూక్ష్మమైన తత్త్వదర్శనం కలుగుతుంది; భూతపంచక జలధి= పంచభూతాలతో కూడిన ఈ దేహమనే సముద్రం; రోగ+అతి+శోక సహిత= అత్యధికమైన రోగాదులతో పుట్టిన దుఃఖంతో కూడి= భోగల వాంశక+ ఆశ్రయము= కొద్దిపాటి సుఖానికి ఆశ్రయం; దీని విభులు= దీని ప్రభువులు; కాముండున్, క్రోధుండున్= కామక్రోధాలు; వీరిన్+గెల్వవచ్చునప్పుడ= వీరిరువురినీ గెల్చినప్పుడే; అది= ఆ సముద్రాన్ని; కడవంగన్+వచ్చున్= దాటవచ్చును.

తాత్పర్యం: తాబేలు బయటపడ్డ తన అవయవాలను అనుకూల పరిస్థితి లేనప్పుడు ఎట్లా లోపలికి ముడుచు కొంటుందో అట్లాగే పండితుడు కామాలను వెనుకకు మరలిస్తాడు. కోరికలను ఎవడు అణచగలడో వాడే ధీరుడు. అతడు రజోగుణ వివర్జితుడై ముక్తి మార్గాన్ని దర్శించగలుగుతాడు. పది ఇంద్రియాలనూ నియంత్రించటం ఒక గొప్పపని. ఆ ఇంద్రియాలను సమిధలుగా గలిగి ఆత్మ అనే అగ్ని వెలుగుతూ ఉంటుంది. సమస్త ప్రాణులనూ తన ఆత్మలో దర్శింప గలిగిన వాడికి సూక్ష్మ తత్త్వ దర్శనం కలుగుతుంది. పంచభూతాలతో కూడిన ఈ శరీర సముద్రాన్ని దాటటం చాలా కష్టం. రోగాదులతో పుట్టే శోకం అధికంగానూ, ఇంద్రియాది సుఖాలవలన కలిగే సుఖం కొద్దిగానూ కలిగినది ఈ సంసారం. దీనికి కాముడు, క్రోధుడు ప్రభువులు. వీరిని గెలిచినపుడే ఈ సముద్రాన్ని దాటగలుగుతాం.

విశేషం: వ్యాస మూలంలో ఉన్న విషయాలు భిన్నంగా ఉన్న కారణంగా ఆ శ్లోకాన్ని చూద్దాం.

"రోగశోక సమావిష్టం । పంచ స్రోత సమావృతం,

పంచభూత సమాయుక్తం । నవద్వారం ద్విదైవతమ్" - అని వ్యాసుడి శ్లోకం.

(రోగశోకాలతో కూడినది. పంచ ప్రవాహాలతో కూడుకొన్నది. పంచభూతాలతో నిండినది. తొమ్మిది ద్వారాలు కలిగినది. ఇద్దరు దైవతాలు కలిగినది.)

నీలకంఠీయ వ్యాఖ్యానాన్నిబట్టి 'స్రోతస్సు' ప్రవాహం ఇంద్రియ పర్యాయవాచకమని తెలుస్తుంది (ఇంద్రియగోలకాని). ద్విదైవతమ్ అనగా జీవ పరమేశ్వరులని నీలకంఠీయం చెప్తుతున్నది. కాని, తిక్కనగారు నవద్వార విషయం వదలివేశారు. కామక్రోధులను ప్రభువులుగా చెప్పారు. పంచప్రవాహాలకు బదులు 'జలధి' అని తిక్కనగారు అన్నారు.

తాబేలు తన అంగాలను లోపలికి లాక్కుంటుందన్న పోలికను గీతాకారుడు ఉపయోగించాడు.

"యదా సంహరతే చాయం కూర్మోంగానీవ సర్వశః,

ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా!" (సాంఖ్యయోగం)

ఆ. మనసు మనసునంద మడఁచి, యాత్మని నాత్మ। యంద కాంచునట్టి యతఁడు సర్వ
విదుఁడు; సకల భూత వితతి యందును దనుఁ। గమచునుండు నిర్వికల్పకముగ. 154

ప్రతిపదార్థం: మనసున్= మనస్సును; మనసునందున్+అ= మనసులోనే; మడఁచి= దాచి; ఆత్మనిన్= ఆత్మను; ఆత్మయందున్+అ= ఆత్మలోనే; కాంచునట్టి అతఁడు= చూడగలిగిన యోగి; సర్వవిదుఁడు= అన్నీ తెలిసినవాడు; సకల భూతవితతి అందునున్= అన్ని ప్రాణిసముదాయాలలోనూ; నిర్వికల్పకముగన్= ఏ వికారమూ లేకుండా; తనున్= తన్ను తాను; కనుచున్+ఉండున్= చూస్తుంటాడు.

తాత్పర్యం: మనస్సును మనసులో అణచి, ఆత్మను ఆత్మలో చూసేటటువంటి యోగి సర్వవిదు డవుతాడు. అన్ని ప్రాణులలోనూ తననే చూచుకొనగలుగుతాడు. అతడు ఏ వికారాన్నీ పొందడు.

తే. ఆత్మతత్త్వమేకంబ దీపాంతరములఁ। గలుగఁ జేయు ప్రదీపంబు కరణి నావ
హించు రూపాంతరముల నయ్యెలమియును బు। ధుండు గనుఁగొని బ్రమయక నుండు నొకట. 155

ప్రతిపదార్థం: దీప+అంతరములన్= ఎన్నో దీపాలను; కలుగన్+చేయు= వెలిగించేటటువంటి; ప్రదీపంబు కరణిన్= దివ్వెవలె; ఆత్మతత్త్వము+ఏకంబ= ఒకే ఆత్మ తత్త్వం; రూపాంతరములన్= ఎన్నో రూపాలను; ఆవహించున్= పొందుతుంది; ఆ+ఎలమియును= ఆ వికాసాన్ని కూడా; బుధుండు= పండితుడు; కనుఁగొని= గుర్తించి; ఒకటన్= దేనిలోనూ; భ్రమయక= భ్రమించకుండా (భ్రాంతి చెందకుండా); ఉండున్= ఉంటాడు.

తాత్పర్యం: ఎన్నో దీపాలను వెలిగించే దివ్వెవలె ఆత్మ ఎన్నో రూపాలను పొందుతుంది. పండితుడు ఈ విధానాన్ని గుర్తించి ఏ విషయంలోనూ భ్రాంతిని పొందకుండా ఉంటాడు.

విశేషం: అలం; ఉపమ.

తే. **ఆ పరంజ్యోతి పేళ్ళు లర్యముఁడు వరుణుఁ। డనిలుఁ డగ్ని సోముఁడు విష్ణుఁ డజుఁడు శివుఁ డ**
నంగఁ బరఁగు శబ్దములు సన్మతులు దానిఁ। బ్రయతులయి భజియింతురు నియతులార!' **156**

ప్రతిపదార్థం: నియతులార!= దీక్షితులైన ఓ ఋషులారా!; ఆ పరంజ్యోతి పేళ్ళులు= ఆ పరంజ్యోతికి చాలా పేర్లున్నాయి; వరుణుడు; అనిలుడు; అగ్ని; సోముడు; విష్ణువు; అజుడు; శివుడు; అనంగన్+పరఁగు+శబ్దములు= అనే శబ్దాలు (ఆ తత్త్వాన్నే బోధిస్తాయి); సత్+మతులు= సద్బుద్ధి గలవారు; దానిన్= ఆ తత్త్వాన్ని; ప్రయతులు+అయి= ప్రయత్నం చేసినవారై (నిష్ఠకలిగిన); భజియింతురు= సేవిస్తారు.

తాత్పర్యం: ఓ ఋషులారా! వరుణుడని, అనిలుడని, అగ్ని అని, సోముడని, విష్ణువని, అజుడని, శివుడని ఆ పరంజ్యోతికి చాలాపేర్లు ఉన్నాయి. సద్బుద్ధిగల ధీరులు ఆ తత్త్వాన్ని నిష్ఠతో సేవిస్తారు.'

వ. **అని చెప్పి యచ్చతురాననుం డమ్మాననీయులతో మఱియు నిట్లను; ధర్మంబునకు నహింస లక్షణం 'బధర్మంబునకు హింసయు దేతలకుఁ బ్రకాశత్వంబును మనుష్యులకుఁ గర్మంబును నాకాశంబునకు శబ్దంబును వాయువునకు స్పర్శంబును జ్యోతిస్సునకు రూపంబును జలంబునకు రసంబును బృథివికి గంధంబును భారతికి సత్యంబును మనంబునకుఁ జింతయు బుద్ధికి వ్యవసాయంబును దదీయ మహత్తత్త్వస్వరూపంబునకు ధ్యానంబును నవ్యక్తంబునకు సాధుత్వంబును యోగంబునకుఁ బ్రవృత్తియును జ్ఞానంబునకు సన్న్యాసంబును లక్షణంబులు; లక్షణ జ్ఞానంబు పరతత్త్వపరిజ్ఞానంబునకు హేతుభూతంబు.** **157**

ప్రతిపదార్థం: అని చెప్పి; ఆ+చతురాననుండు= ఆ బ్రహ్మదేవుడు; ఆ మాననీయులతోన్= ఆ పూజ్యులైన ఋషులతో; మఱియున్+ఇట్లనున్= ఇంకా ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు పూజ్యులైన ఆ ఋషులతో పరతత్త్వజ్ఞానం కలగటానికి మూలమైన 'లక్షణ' జ్ఞానాన్ని గురించి చెప్పటం మొదలు పెట్టాడు. ఒక్కొక్కదానికి ఒక్కొక లక్షణం ఉన్నది. ఆ లక్షణాన్ని గుర్తిస్తే వీటికి అతీతమైన తత్త్వం ఎట్లా ఉంటుందో తెలుస్తుంది అంటూ ఆయా తత్త్వాల లక్షణాలు చెప్పారు. ఆ లక్షణాలను ఇట్లా పేర్కొనవచ్చును.

తత్త్వం	లక్షణం
ధర్మం	అహింస
అధర్మం	హింస
దేవతలు	ప్రకాశత్వం
మనుష్యులు	కర్మ
ఆకాశం	శబ్దం
వాయువు	స్పర్శ
జ్యోతిస్సు	రూపం

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

జలం	రసం
పృథ్వి	గంధం
భారతి	సత్యం
మనస్సు	చింత
బుద్ధి	వ్యవసాయం
మహత్తు	ధ్యానం
అవ్యక్తం	సాధుత్వం
యోగం	ప్రవృత్తి
జ్ఞానం	సన్న్యాసం

విశేషం: ఈ అంశాలను సులభంగా అర్థం చేసికొనటానికి ఒక పద్ధతి ఉన్నది. ధర్మాధర్మాలు అహింస - హింస అనే రూపంలో ఉంటాయి. దేవతలు మనుష్యులు ప్రకాశత్వ కర్మరూపాలలో ఉంటారు. ఆకాశాదులకు శబ్దాదులు లక్షణాలు. భారతి అంటేవాక్కు. దీనికి సత్యం లక్షణమనటం చాలా గొప్ప విషయం. మూలంలో ఇట్లా లేదు.

స్వరవ్యంజన సంస్కారా భారతీ శబ్దలక్షణా అని ఉన్నది. హల్లులతో కూడిన శబ్దమే సరస్వతీ రూపం. కాని అది 'సంస్కారం' పొంది ఉండాలి. నియమంచేత సంస్కారం ఏర్పడుతుంది. వ్యాకరణమే నియమం. దానివలన శబ్దం సాధువై సత్యప్రతిపాదక మవుతుంది. ఈ అర్థాన్ని స్ఫురింపజేస్తూ తిక్కనగారు 'సత్యం భారతికి లక్షణమ'ని అన్నారు. మనోబుద్ధులకు చింతా వ్యవసాయాలు కూడా ముందు చెప్పిన అంశాలే. వ్యవసాయాత్మికా బుద్ధిః- అని గీత.

ఇక్కడ మూలంలో కొంచెం మార్పుంది.

"లక్షణం మనసో ధ్యాన । మవ్యక్తం సాధులక్షణమ్,
ప్రవృత్తి లక్షణో యోగో । జ్ఞానం సన్న్యాసలక్షణమ్".

అని మూలం. తిక్కన మహత్తు ధ్యాన లక్షణమైనదని మార్చాడు. 'సమత్వం యోగ ఉచ్యతే' అని గీత, యోగానికి 'సమత్వం' లక్షణం అని సాధారణ నిర్వచనం ఉండగా ఇక్కడ ప్రవృత్తి అని చెప్పుతున్నాడు.

బహుశా ఇక్కడ తిక్కనగారు నిర్దేశిస్తున్నది కర్మను. యోగం కర్మ, జ్ఞాన రూపాలలో రెండు రకాలుగానూ ఉండవచ్చును. ఇంద్రియమనోబుద్ధుల ఏకీకరణం 'సమత్వం'. అది జ్ఞాన సమాధికి అవసరం. కర్మయోగానికి ధిషణద్వారా ఇంద్రియాలను కర్మలో ప్రవేశింపచేయటం. ఇక్కడ 'ప్రవృత్తి' అని ఉండాలి.

ఆ. జ్ఞాన పూర్వమైన సన్న్యాస కలనంబు । పరమగతి నొనర్చు భవ్యులార!
ద్వంద్వరహితుఁ డైన నతని జరామృత్యు ని । స్తరణ కరణ మైన ధర్మ మొందు. 158

ప్రతిపదార్థం: భవ్యులార!= పుణ్యులార!; జ్ఞానపూర్వము+ఐన= జ్ఞానపూర్వకమైన; సన్న్యాసకలనంబు= సన్న్యాస స్వీకారం; పరమగతిన్= ఉత్తమ గతిని; ఒనర్చున్= కలిగిస్తుంది; ద్వంద్వరహితుఁడు+ఐన= ద్వంద్వ భావనలు లేని; అతనిన్= ఆ సన్న్యాసిని; జరామృత్యు= ముసలితనం; మరణం అనే అపాయాలను; నిస్తరణ కరణము+ఐన= దాటటానికి సాధనమైన; ధర్మము+ఒందున్= ధర్మం పొందుతుంది.

తాత్పర్యం: పుణ్యులారా! జ్ఞాన పూర్వకమైన సన్న్యాసస్వీకారం పరబ్రహ్మ ప్రాప్తిని కలిగిస్తుంది. ద్వంద్వరహితుడైన అతడిని జరామృత్యువులు ఏమీ చేయజాలవు. ధర్మం అతడిని ఆశ్రయించి అన్నిటినీ దాటించగలుగుతుంది.

(అవ్యక్తనామ తత్త్వ నిరూపణ ప్రకారము (సం.14-43-34))

సీ. అవ్యక్త నామకం బగు తత్త్వ మరయ స । లింగంబు పురుషుఁ డలింగుఁ డతఁడు;
క్షేత్రంబు నెఱుఁగుట క్షేత్రజ్ఞుఁడనఁ జనుః । క్షేత్రంబు నాఁగఁ బ్రకృతియనంగ
నవ్యక్తమునకు నామాంతరములు; గుణ । ప్రభవ మాతత్త్వ మా ప్రభువు గుణము
లెఱుఁగవు చేతనా హీనముల్ గాన య । య్యంతరాత్ముఁడు దత్క్రియా ప్రపంచ

ఆ. మెఱుఁగు; నిట్టులగుట యెఱిఁగి గుణమ్ముల । విడిచి నిలిచి తత్త్వవేది యంత
రాత్మ వేశముననచల నిరామయా । వ్యయపదంబు నందు ననఘులార! 159

ప్రతిపదార్థం: అవ్యక్త నామకంబు+అగు= అవ్యక్తమనే పేరు కలిగిన; తత్త్వము+అరయన్= తత్త్వం బాగా ఆలోచిస్తే; సలింగంబు= లింగం కలిగింది; పురుషుఁడు= పురుషుడనబడేవాడు; అలింగుఁడు= లింగంలేనివాడు; అతఁడు= ఆ పురుషుడు; క్షేత్రంబున్+ఎఱుఁగుటన్= క్షేత్రాన్ని తెలిపినవాడు కావటంవలన; క్షేత్రజ్ఞుఁడు+అనన్+చనున్= క్షేత్రజ్ఞుడు అని పిలవబడతాడు; క్షేత్రంబునాఁగన్= క్షేత్రమని; ప్రకృతి+అనంగన్= ప్రకృతి అని; అవ్యక్తమునకున్= అవ్యక్తానికి; నామాంతరములు= మారు పేర్లు (ఉన్నాయి); ఆ తత్త్వము= ఆ అవ్యక్తం; గుణ ప్రభావము= గుణాలతో పుట్టింది (అందుకే సలింగమనటం); చేతనాహీనముల్= చైతన్యరహితాలైన జీవరాసులు; కానన్= కాబట్టి; ఆ ప్రభువు గుణములు+ఎఱుఁగవు= ఆ ప్రభువైన పురుషుడి గుణాలను తెలిసికొనజాలవు (అందువలననే పురుషుడిని నిర్లింగుడనటం); ఆ+అంతరాత్ముఁడు= ఆ పురుషుడైన అంతరాత్ముడు; తద్+క్రియా ప్రపంచము+ఎఱుఁగున్= సర్వప్రకృతిలోని లోకక్రియ ప్రపంచాన్ని తెలిసినవాడవుతాడు; ఇట్టులు+అగుటన్+ఎఱిగి= దీనిని గుర్తించి; ఆత్మవేది= ఆత్మవేత్త అయిన యోగీశ్వరుడు; గుణమ్ముల విడిచి+నిలిచి= గుణాలను వదలిపెట్టి స్థిరంగా నిలిచినవాడై (అచంచలుడై); అనఘులార!= ఓ పుణ్యాత్ములారా!; అంతరాత్మ+ఆవేశమునన్= ఆ అంతరాత్మ ఆవేశించటంచేతనే; అచల= స్థిరమైన; నిరామయ= రోగాదులవంటి ఏ లోపాలు లేని; అవ్యయ= ఎప్పటికీ తరగని; పదంబున్+అందున్= మోక్షపదాన్ని చేరుకొంటాడు.

తాత్పర్యం: పుణ్యాత్ములారా! బాగా అనుశీలిస్తే అవ్యక్తమనబడేది సలింగమైనది. పురుషుడు అలింగుడు. అవ్యక్తమైన అట్లాంటి క్షేత్రాన్ని తెలిసినవాడు కాబట్టి క్షేత్రజ్ఞుడని కూడా అతడిని పిలుస్తారు. అవ్యక్తానికే క్షేత్రమని, ప్రకృతి అని మారుపేర్లు ఉన్నాయి. అది గుణాలలో ప్రభవిస్తుంది. చైతన్యరహితాలైనవి ఆ ప్రభువు గుణాలను ఎఱుగజాలవు. కాని, ఆ పురుషుడైన అంతరాత్మకు ఈ ప్రకృతిలోని కార్యకలాపాలన్నీ తెలుసు. ఆత్మవేత్త అయిన యోగి ఈ రహస్యాన్ని గుర్తించి గుణాలను వదలిపెడతాడు. స్థిరత్వం పొందుతాడు. అపుడు అతడు అంతరాత్మచేత ఆక్రమించబడతాడు. దానితో ఏ లోపాలు లేని, ఎప్పటికీ తరగని, శాశ్వతమైన మోక్షస్థానాన్ని పొందుతాడు.'

విశేషం: లింగం అంటే కార్య కారణరూప సంబంధం అని అర్థం. అది కలిగింది 'లింగి'. ప్రకృతిలోని కార్యకలాపాలన్నీ కార్యకారణ సమావేశం వలన కలిగినవే. అందుకే అది 'లింగం' కలిగింది. పురుషుడు - ఆత్మ స్వరూపుడు కాబట్టి అతడిని గుర్తించగలిగిన సాధనం లేదు. అందుచేత 'అలింగుడు'.

వ. అని వెండియు. 160

తాత్పర్యం: అని మళ్ళీ (తరువాతి పద్యంతో అన్వయం.)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. **జ్యోతిస్సులందు వర్యుఁడు రవి, భూతంబు । లం దగ్ని వరుఁడు, విద్యలఁ బ్రధాన**
సావిత్రి, దేవతా సమితిఁ బ్రజాపతి । ఘనుఁడు, వేదముల ముఖ్యంబు ప్రణవ,
మనిల నిచయమ్మునఁ బ్రాణ మగ్ర్యము, ఛంద । ములకు గాయత్రి యగ్గలము, పశువు
లకు మేటి యజ, మఖిల చతుష్పదములకు । ధేనువు మిక్కిలి, మానవులకు

తే. **బ్రాహ్మణుండు వరిష్ఠుండు, పక్షులందు । శ్యేన మధికంబు, యజ్ఞవిధానముల హు**
తంబు పెద్ద, యుగముల గృతంబు మేలు । ధాతువర్గములోన నుత్తమము పసిఁడి. **161**

ప్రతిపదార్థం: జ్యోతిస్సులందున్= జ్యోతిష్మంతులలో; రవి= సూర్యుండు; వర్యుండు= శ్రేష్ఠుడు; భూతంబులందున్= పంచభూతాలలో; వరుఁడు= శ్రేష్ఠుడు; అగ్ని= అగ్నిదేవుడు; విద్యలన్= విద్యలలో; ప్రధాన= శ్రేష్ఠురాలు; సావిత్రి; దేవతాసమితిన్= దేవతల సమూహంలో; ప్రజాపతి= బ్రహ్మ; ఘనుఁడు= గొప్పవాడు; వేదములన్= వేదాలలో (మంత్రాలలో); ముఖ్యంబు= ముఖ్యమైనది; ప్రణవము= ఓంకారం; అనిల చయమ్మునన్= వాయు సమూహంలో; ప్రాణము= ప్రాణవాయువు; అగ్ర్యము= మొదటిది; ఛందములకున్= ఛందస్సులలో; అగ్గలము= శ్రేష్ఠం; గాయత్రి= గాయత్రీ ఛందస్సు; పశువులకున్= పశువులలో; మేటి= ఉత్తమమైనది; అజము= మేక; అఖిలచతుష్పదములకున్= నాలుగు కాళ్ళ జంతువులన్నిటిలోనూ; మిక్కిలి= గొప్పది; ధేనువు= ఆవు; మానవులకున్ వరిష్ఠుండు= మనుష్యులలో శ్రేష్ఠుడు; బ్రాహ్మణుఁడు= విప్రుడు; పక్షులందున్= పక్షులలో; అధికంబు= గొప్పది; శ్యేనము= డేగ; యజ్ఞవిధానములన్= యజ్ఞవిధులలో; పెద్ద= గొప్పది; హుతంబు= హవిస్సు; యుగములన్= యుగాలలో; కృతంబు+మేలు= కృతయుగం మేలు; ధాతువర్గములలోనన్= ధాతు సముదాయాలలో; ఉత్తమము= శ్రేష్ఠం; పసిఁడి= బంగారం.

తాత్పర్యం: జ్యోతిష్మంతులలో రవి, పంచభూతాలలో అగ్ని, విద్యలలో సావిత్రి, దేవతలలో ప్రజాపతి, మంత్రాలలో ఓంకారం, వాయువులలో ప్రాణవాయువు. ఛందస్సులలో గాయత్రి, పశువులలో మేక, చతుష్పాద జంతువులలో ఆవు, మనుష్యులలో బ్రాహ్మణుడు, పక్షులలో, డేగ, యజ్ఞ విధిలో హవిస్సు, యుగాలలో కృతయుగం, ధాతువులలో బంగారం గొప్పవి.

సీ. **యవ లోషధులలోన, నన్నంబు భక్ష్యభో । జ్యములందు, జలము పేయములలోన,**
నమలాచలము పర్వతములలోఁ బ్లక్షంబు । దరువులలోన, నూర్ధ్వంబు దిశల,
జాహ్నవి నదులందు, సాగరంబు సరస్సు । లందు, గృహస్థత్వ మాశ్రమముల
నెక్కుడారయ; నెక్కుడేను బ్రజాపతు । లంద; చింత్యాత్మకుండైనయట్టి

తే. **విష్ణుఁ డెక్కుడు నాకంటె; వినుఁడు తెలియ । నీశ్వరుఁడు దేవతావలికెల్ల నెక్కు;**
డతఁడు నా నే ననఁగ విష్ణుఁ డనఁగ వస్తు । వొకఁడ మూర్తి త్రయంబున నుల్లసిల్లు. **162**

ప్రతిపదార్థం: ఓషధులలోనన్= పండిన వెంటనే నశించే మొక్కలు ఓషధులు - వాటిలో; యవలు= యవలనబడే ధాన్యం; భక్ష్యభోజ్యంబులందున్= తినదగిన పదార్థాలలో; అన్నంబు= అన్నం; పేయములలోనన్= తాగదగినవాటిలో; జలము= నీరు; పర్వతములలోన్= పర్వతాలలో; అమరాచలము= దేవతల నివాసమైన మేరుపర్వతం; తరువులలోనన్= చెట్లలో; ప్లక్షంబు= జువ్వి; దిశలన్= దిక్కులలో; ఊర్ధ్వము= పై దిక్కు; నదులందున్= నదులలో; జాహ్నవి= గంగ; సరస్సులందున్= సరస్సులలో; సాగరంబు= సముద్రం; ఆశ్రమములన్= ఆశ్రమాలలో; గృహస్థత్వము= గార్హస్థ్యం; ఎక్కుడు= అధికం; ప్రజాపతులందున్= ప్రజాపతులలో;

ఆరయన్= బాగాచూస్తే; ఎక్కుడు+ఏను= నేనే అధికుడిని; నాకంటెన్= నాకన్నా; అచింత్య+ఆత్మకుఁడైన= తెలిసికొనటానికి వీలుకాని తత్త్వం కలిగిన; విష్ణుఁడు= విష్ణువు; ఎక్కుడు= అధికం; తెలియన్+వినుఁడు= ఇంకా ఒక విషయం వినండి, దేవతా+ఆవలికిన్+ఎల్లన్= దేవతా సముదాయానికి; ఈశ్వరుఁడు= శివుడు; ఎక్కుడు= అధికం; అతఁడునాన్= శివుడని; నేననఁ గన్= బ్రహ్మ అని (చెప్పుతున్నవారు బ్రహ్మే కదా!); విష్ణుఁడు+అనఁగన్= విష్ణువని; వస్తువు+ఒకఁడ= ఒకే తత్త్వం; మూర్తిత్రయంబునన్= ముగ్గురు మూర్తులలోనూ; ఉల్లసిల్లున్= ప్రకాశిస్తూ ఉంది.

తాత్పర్యం: ఓషధులలో యవలు, భోజ్యాలలో అన్నం, పానీయాలలో నీరు, పర్వతాలలో మేరువు, తరువులలో జువ్వి, దిక్కులలో ఊర్ధ్వం, నదులలో గంగ, సరస్సులలో సముద్రం, ఆశ్రమాలలో గార్హస్థ్యం అధికమైనవి. ప్రజాపతులలో నేను పెద్దని. నాకంటే ఆచింత్యమైన తత్త్వంకలిగిన విష్ణువుపెద్ద. దేవతలందరిలోనూ పెద్ద ఈశ్వరుడు (అందుకే మహాదేవుడంటారు) పేరుకు శివుడని, బ్రహ్మని, విష్ణువని అన్నా త్రిమూర్తులలోని వస్తువు మాత్రంఒకటే.

విశేషం: భారతీయ మతాలలో 'శైవం' చాలా ప్రాచీనమైనదిగా కనిపిస్తున్నది. పశుపతిగా, శివుడిగా, రుద్రుడిగా అర్చించబడిన 'ఈశ్వర' తత్త్వానికే 'మహాదేవు'డని పేరు. బ్రహ్మ ఇట్లా ఈశ్వరుడిని, ఈశ్వరుడివలె విష్ణువు. విష్ణువు శివుడిని వీరిరువురూ బ్రహ్మను స్తుతించటం అష్టాదశపురాణాలలో కనిపిస్తుంది. పరతత్త్వం సత్త్వరజస్తమో రూపాలైన ఈ త్రిమూర్తులుగా సృష్టి స్థితి లయాలను నిర్వహిస్తోందనే అర్థాన్ని తిక్కనగారు ఈ సందర్భంలో స్ఫురింపజేస్తున్నారు. వ్యాసమూలంలో ఈ భావన ఇంత స్పష్టంగా లేదు.

క. నెఱయఁ బ్రధాన పదార్థము। లెఱుఁగుట పరిబోధమూల మెఱుకల కెల్లన్
మెఱుఁగిడుట మమ్ము ముప్వుర। గుఱుకొని యొకఁడుగ నెఱింగికొనుట దలంపన్. 163

ప్రతిపదార్థం: నెఱయన్= సంపూర్ణంగా; ప్రధాన పదార్థములు= ఏఏ తత్త్వంలో ఏది ప్రధానమో; ఎఱుంగుట= తెలిసికొనటం; పరిబోధమూలము= బ్రహ్మజ్ఞానానికి హేతు వవుతుంది; మమ్మున్= మమ్ములన్; ముప్వురన్= ముగ్గురినీ; గఱుకొని= పూనుకొని; ఒకఁడుగన్= ఒకడుగా; ఎఱింగికొనుట= తెలిసికొనటం; తలంపన్= ఆలోచించగా; ఎఱుకలకున్+ఎల్లన్= జ్ఞానాలన్నిటికీ; మెఱుఁ గు+ఇడుట= వన్నె పెట్టటం (అన్నమాట).

తాత్పర్యం: ఇట్లా సంపూర్ణంగా ఏఏ తత్త్వాలలో ఏది ఏది ప్రధానమో తెలిసికొనటం బ్రహ్మజ్ఞాన సాధనకు హేతువవుతుంది. మమ్ములను ముగ్గురినీ పూనుకొని ఒకడుగా గుర్తించటం అంటే తత్త్వజ్ఞానాలకు వన్నె పెట్టటమనే అర్థం.

విశేషం: తిక్కనగారు ప్రతిపాదించిన 'హరిహరాద్వైతం అనే భావన పూర్వ మార్గాలకు వన్నె పెట్టటమనే ఆయన తాత్పర్యం. అందుకే త్రిమూర్తుల వెనుక ఒకే తత్త్వం ఉందని స్వతంత్రంగా ప్రతిపాదించాడు. ఇది వ్యాసహృదయానికి అనుగుణమే అయినా మూలశ్లోకాలలో ఎక్కడా ఈ భావన ఇంత స్పష్టంగా కనిపించదు. శివ, విష్ణు సహస్రనామాలను గమనిస్తే వ్యాసుడికి కూడా ఈ భావన ఇష్టమేనని చెప్పవచ్చు.

క. దివసము రాత్రియునుం బొరిఁ। బ్రవర్తనముఁ బొందుచుండు పగిదిని సుఖసం
భవ దుఃఖ జననములు జం। తువులకుఁ గలుగు; వలవ దుబ్బ దురపిల్లంగన్. 164

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: దివసము= పగలూ; రాత్రియునున్= రాత్రీ; పొరిన్= క్రమంగా; ప్రవర్తనమున్= కడవటం; పొందుచున్+ఉండు పగిదిన్= జరిగే విధంగా; సుఖ సంభవ= సుఖం కలగటం; దుఃఖ జననములు= దుఃఖం కలగటం అనేవి; జంతువులకున్= ప్రాణులకు; కలుగున్= కలుగుతూ ఉంటాయి (దానికి); ఉబ్బన్= సంతోషించటం; దురపిల్లంగన్= దుఃఖించటం; వలవదు= కూడదు.

తాత్పర్యం: పగలూ, రాత్రీ క్రమంగా ఎట్లాగైతే కలుగుతూ ఉంటాయో అట్లాగే ప్రాణులకు సుఖాలూ; దుఃఖాలు కూడా కలుగుతూ ఉంటాయి. దీనికి - అంటే సుఖాలు కలిగినప్పుడు పొంగిపోకూడదు. దుఃఖాలు కలిగితే క్రుంగిపోకూడదు.

తే. పొదలుఁ దఱుఁగుటకై, పొడ వొదవుఁ బడుట । కై, కడను జేరుఁ బాయుటకై, జనించుఁ
బొలియుటకునై, సుఖంబును బొందు దుఃఖ । మందుటకునై పదార్థము లఖిలములును. 165

ప్రతిపదార్థం: పదార్థములు+అఖిలములును= అన్ని పదార్థాలూ; తఱుఁగుటకై= నశించటానికై; పొదలున్= పెరుగుతాయి; పడుటకై= క్షీణించటానికి; పొడవు+ఒదవున్= పెరుగుతాయి; పాయుటకై= విడివడటానికి; కడను+చేరున్= ప్రక్కలకు చేరుతాయి; పొలియుటకునై= చావటానికి; జనించున్= పుట్టుతాయి; దుఃఖము+అందుటకునై= దుఃఖం పొందటానికై; సుఖంబును+పొందున్= సుఖాన్ని పొందుతాయి.

తాత్పర్యం: అన్ని పదార్థాలూ విరుద్ధమైన కార్యకారణ సంబంధాన్ని కలిగి ఉంటాయి. నశించటంకొరకే పెరుగుతాయి. బాగా వృద్ధి పొందటం క్షీణించటానికే. సమీపించటం విడిపోవటానికే, పుట్టటం చావటానికే. సుఖించటం దుఃఖించటానికే. (ఈ విరుద్ధ ఫలితాలను గుర్తించిన మహనీయులు సుఖాన్ని, దుఃఖాన్ని రెండింటినీ పొందరు. అంటే పెరుగుదలను చూచి సంతోషించరు. తరుగుదలను చూచి బాధపడరు. ఇట్లా రెండింటినీ సమంగా చూడటమే 'యోగం').

క. జ్ఞానము సవిశేషస్థితి; । దానికి నాశంబు లేదు, దానిఁ దెలియుటన్
మానాహంకృతి మమతలు । మానిన నిర్మలుఁడు మోక్షమార్గముఁ గాంచున్.' 166

ప్రతిపదార్థం: జ్ఞానము= జ్ఞానం; స+విశేష+స్థితి= ఒక ప్రత్యేకతతో కూడిన స్థితి కలిగింది (అది విశిష్టమైనది); దానికిన్+నాశంబు లేదు= దానికి నశించటమన్నదే లేదు; దానిన్+తెలియుటన్= దానిని తెలియటంవలన; మాన+అహంకృతి+మమతలు= అభిమానం, అహంకారం,మమతలను; మానిన+నిర్మలుఁడు= వదలిపెట్టిన నిర్మలమైన అంతఃకరణం కలిగినవాడు; మోక్షమార్గమున్+కాంచున్= మోక్షమార్గాన్ని పొందుతాడు.

తాత్పర్యం: జ్ఞానం విశిష్టమైనది. అది ఎన్నడూ నశించదు. దానిని తెలియటంవలన అభిమానం అహంకారం మమత తొలగి మానవుడు నిర్మలుడవుతాడు. అట్లాంటివాడే మోక్షమార్గాన్ని ఆవలంబించ గలుగుతాడు.'

విశేషం: శేషమంటే మిగిలేది. విశేషమంటే మిక్కిలిగా మిగిలేది. జ్ఞానం ఎంత నేర్పుకొన్నా ఇంకా మిగిలే ఉంటుంది. అందుకే అది 'అనంత'మనటం. ఎంత ఖర్చుపెట్టినా ధనంవలె అది కరిగిపోదు. ఇంకా పెరుగుతూనే ఉంటుంది.

'వ్యయా కృతే వర్ధత ఏవ విద్యా' (ఎంత వ్యయం చేసినా విద్య పెరుగుతూనే ఉంటుంది).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని వివరించి విరించి యా సమంచితాచారులతోడ 'నాశ్రమ ప్రకారంబు లెఱింగించెద' నని పలికి యిట్లని యుపన్యసించె. 167

ప్రతిపదార్థం: అని వివరించి= అని వివరించినవాడై; విరించి= బ్రహ్మ; ఆ+సమంచిత+ఆచారులతోడన్= ఆ ఉత్తమ ఆచారం కలిగిన ఋషులతో; ఆశ్రమప్రకారంబులు= ఆశ్రమాలలోని విధాలను; ఎఱింగించెదను+అని పలికి= తెలుపుతానని చెప్పి; ఇట్లు+అని+ఉపన్యసించెన్= ఇట్లా ఉపన్యసించటం మొదలు పెట్టాడు.

తాత్పర్యం: అని వివరించి ఆ ఋషులతో 'ఆశ్రమవిధాలను గురించి మీకు చెప్పుతా'నని ఇట్లా చెప్పటం మొదలు పెట్టాడు.

సీ. 'గురునకుఁ బ్రియహితకరుఁ డయి వేదాధ్య। యన మొనరించుచు నశన మమల
భిక్ష నొనర్చుచు బిల్వపలాశదం। డములలో నొకటి ధార్యముగఁ జేసి
స్నానశీలుఁడు బ్రహ్మచర్యపరుండును। నియమితేంద్రియుఁడును నిత్యశుచియు
యజ్ఞోపవీతియు నబహుభాషియు మేఖ। లాఢ్యుండు నై శయనాసన ప్ర

తే. చారవిధములు సముచితాచరితములుగ। సత్యధర్మ నిరూఢుఁడై శాంతి గలిగి
వేల్మి యిరుప్రొద్దు నడుపుచుఁ గల్మషంపుఁ। బనుల కెలయక వర్తించు బ్రహ్మచారి. 168

ప్రతిపదార్థం: గురునకున్= గురువుకు; ప్రియహితకరుఁడు+అయి= మిక్కిలి అనుకులుడై సేవిస్తూ; వేద+అధ్యయనము+ఒనరించుచున్= వేదాధ్యయనం చేస్తూ; అమలభిక్షన్= పవిత్రమైన భిక్షావృత్తితో; అశనము+ఒనర్చుచున్= ఆహారం గ్రహిస్తూ; బిల్వపలాశదండములలోన్= బిల్వం మోదుగ కొమ్మలలో; ఒకటిన్= ఒకదానిని; ధార్యముగన్+చేసి= ధరించి; స్నానశీలుఁడు= త్రిసంధ్యలలో స్నానంచేయటం అభ్యాసంగా కలిగి; బ్రహ్మచర్యపరుండును= బ్రహ్మచర్యనిష్ఠకలిగినవాడై; నియమితేంద్రియుఁడును= ఇంద్రియాలను నియమించినవాడై; నిత్యశుచియున్= నిత్యం పవిత్రుడుగా ఉంటూ; యజ్ఞోపవీతియున్= జందెం ధరించి; అబహుభాషియున్= అధికంగా మాటాడకుండా; మేఖలాఢ్యుండు= మొలత్రాడుతో ఒప్పినవాడై; శయన+అసన+ప్రచార విధములు= నిద్రించటం, కూర్చొనటం, తిరగటం మొదలైనవి; సముచిత+అచరితములుగన్= సముచితమైన పద్ధతిలో చేస్తూ; సత్యధర్మనిరూఢుఁడు+ఐ= సత్య, ధర్మ నిష్ఠకలిగినవాడై; శాంతి కలిగి= శాంత చిత్తవృత్తుడై; ఇరుప్రొద్దు= రెండు ప్రొద్దులూ; వేల్మి= అగ్నిహోత్రం; నడుపుచున్= చేస్తూ; కల్మషంపు+పేలకున్+ఎలయక= పాపకార్యాలకు పూనుకొనకుండా; బ్రహ్మచారి; వర్తించున్= ప్రవర్తిస్తాడు.

తాత్పర్యం: బ్రహ్మచర్యంలో ఉండేవాడు బ్రహ్మచారి, అతడు గురువును అత్యంతం కుమారుడివలె సేవిస్తూ వేదాధ్యయనం చేస్తాడు. పవిత్రంగా భిక్షమెత్తి తెచ్చిన ఆహారాన్ని స్వీకరిస్తాడు. బిల్వం మోదుగ కొమ్మలలో ఒకదానిని చేత ధరిస్తాడు. త్రిసంధ్యలలో స్నాంచేసి బ్రహ్మచర్యనిష్ఠకలిగి నియతేంద్రియుడై నిత్యం పవిత్రుడుగా ఉంటాడు. జందెం, మొలతాడు ధరించి అధికంగా మాటాడకుండా నిద్రించటం, కూర్చొనటం, తిరగటం మొదలైనది కూడా శాస్త్ర విధిని అతిక్రమించకుండా సముచితంగా చేస్తాడు. సత్య ధర్మాలను పాలిస్తూ శాంత ప్రవృత్తి కలవాడై రెండు ప్రొద్దులా అగ్నిహోత్రం నిర్వహిస్తూ పాపకార్యాలకు దూరంగా బ్రహ్మచారి వర్తిస్తాడు.

సీ. అర్హప్రకార సమావర్తనుం డయి। నిజదార నిరతుండు నిర్మల ప్ర
చారుండుఁ బంచయజ్ఞపరుండు నతిథి శి। ష్టాశియు శుక్ల వస్త్రాన్వితుండు

శక్త్యనుగుణదాన శాలియు నచపలేం। ద్రియుఁడును శుచియు మైత్త్రీపరుండు

స్వాధ్యాయశీలుండు సద్వ్రత నిష్ఠుండు। నై యాజనంబు నధ్యాపనంబు

ఆ. శక్యమైనఁ జల్పి, క్షమ గల్గి సత్ప్రతి। గ్రహ మొనర్చి, మిత్త్రు లహితు లనక

మాట కార్యమునను మధ్యస్థుఁడై గృహ। స్థుండు నడచు దురితదూరుఁ డగుచు. 169

ప్రతిపదార్థం: అర్హప్రకార= తగిన రీతిలో; సమావర్తనుండు+అయి= చక్కని నడవడి కలిగి (లౌకిక వ్యవహారాలలో అని అర్థం); నిజదార= తన భార్య విషయంలో; వితతుండు= అనురాగం కలవాడు; నిర్మల ప్రచారుండు= నిర్మలమైన ప్రవృత్తి కలవాడు; పంచయజ్ఞపరుండు= పంచయజ్ఞాలలో దీక్షకలవాడు; అతిథిశిష్ట+ఆశియున్= అతిథులు భోజనంచేయగా మిగిలినదానిని భుజించేవాడు; శుక్లవస్త్ర+అన్వితుండు= తెల్లటి బట్టలు ధరించేవాడు; శక్తి+అనుగుణ దానశీలియున్= శక్తికి అనుగుణంగా దానం చేసేవాడు; అచపల+ఇంద్రియుఁడును= ఇంద్రియ చపలత్వం లేనివాడు; శుచియున్= పవిత్రుడు; మైత్త్రీపరుండున్= స్నేహశీలి; స్వాధ్యాయ శీలుండు= వేదాధ్యయన పరుడు; సద్వ్రత నిష్ఠుఁడు= మంచి వ్రతదీక్ష కలవాడు; ఐ= అయి; యాజనంబు= యజ్ఞప్రక్రియ; అధ్యాపనంబు= వేదం శిష్యులచేత చదివించటం (వేదపాఠం చెప్పటం); శక్యమైనన్+చల్పి= సాధ్యమైతే చేస్తూ; క్షమకల్గి= ఓర్పు కలిగి; సత్ప్రతిగ్రహము+ఒనర్చి= మంచిదానాన్ని మాత్రం గ్రహిస్తూ; మిత్త్రులు+అహితులు+అనక= మిత్రులు శత్రువులని ఎంచకుండా; మాట కార్యమునను= వ్యవహారాలలో (నిర్ణయం చెప్పవలసివచ్చినపుడు); మధ్యస్థుఁడు+ఐ= పక్షపాతం వహించకుండా మధ్యస్థుడుగా వ్యవహరిస్తూ; దురితదూరుఁడు+అగుచున్= పాపకార్యాలకు దూరంగా ఉంటూ; గృహస్థుండు నడచున్= గృహస్థుడు నడుచుకొంటాడు.

తాత్పర్యం: గృహస్థుడు లోక వ్యవహారాలలో ధర్మాన్ని అనుసరించి సముచిత రీతిలో ప్రవర్తిస్తాడు. తన భార్యపై అనురాగం కలిగి జీవితం సాగిస్తాడు. నిర్మల ప్రవర్తన కలిగి ఉంటాడు. పంచయజ్ఞ నిష్ఠ కలిగి ఉంటాడు. అతిథి భుజించగా మిగిలిన దానినే తింటాడు. తెల్లబట్టలు ధరిస్తాడు. శక్తినిబట్టి దానం చేస్తాడు. ఇంద్రియ చాపల్యానికి దూరంగా ఉంటాడు. పవిత్రుడుగా జీవిస్తాడు. స్నేహశీలిగా ఉంటాడు. వేదాధ్యయనం చేస్తూ ఉత్తమ వ్రతాలలో నిష్ఠకలిగి ఉంటాడు. చేతనయిన పక్షంలో యాగం అధ్యాపనం కూడా చేస్తాడు. ఉత్తము లిచ్చే దానాన్ని మాత్రం గ్రహిస్తాడు. శత్రుమిత్రభావం లేకుండా వ్యవహార నిర్ణయాలలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తాడు. పాపకార్యాలకు దూరంగా ఉంటాడు.

సీ. గ్రామంబు దొలఁగి యరణ్యస్థలంబునఁ। బర్ణశాలా పరత నొంది

స్నానతంత్రము రెండు సంధ్యల నడపుచు। బ్రహ్మచర్యవ్రత భాసి యగుచుఁ

బూరిపంటలు ఫలంబులు మూలములు శాక। సముదయంబును నశనముగఁ గొనుచు

నజినంబు వల్కల మంబరంబుగఁ గొని। శయన కృత్యంబు భూస్థలి నొనర్చి

తే. యతిథులకు నెడ మిచ్చి యాహారములను। భక్తి నాత్మీయములలోనఁ బంచిపెట్టి

యధ్యయన హోమశీలుఁడై యన్ని యింద్రి। యముల గెలిచి వానప్రస్థుఁ డతిశయిల్లు. 170

ప్రతిపదార్థం: గ్రామంబు+తొలఁగి= గ్రామాన్ని వదలిపెట్టి; అరణ్యస్థలంబునన్= అరణ్యంలో; పర్ణశాలా+ఆవాస పరతన్+ఒంది= పర్ణశాలలో నివసిస్తూ, రెండు సంధ్యలన్= ఉదయసాయంకాలాలలో; స్నాన తంత్రము నడుపుచున్= స్నానం చేస్తూ; బ్రహ్మచర్య వ్రతభాసి+అగుచున్= బ్రహ్మచర్య వ్రతం పాటిస్తూ; పూరిపంటలు= వరి మొదలైన గడ్డి నిచ్చే పంటలను; ఫలంబులు= పండ్లు;

మూలములు= గడ్డలు; శాక సముదయంబును= ఆకుకూరలు మొదలైన వాటిని; ఆశనముగన్+కొనుచున్= ఆహారంగా తీసికొంటూ; అజినంబు= జంతుచర్మాన్ని; వల్కలము= నారచీరను; అంబరంబుగన్+కొని= వస్త్రంగా గ్రహించి; భూస్థలిన్= నేలమీద; శయనకృత్యంబున్= పండుకొనటాన్ని; ఒనర్చి= చేసి; అతిథులకున్+ఎడము+ఇచ్చి= అతిథులకు ఆశ్రయమిచ్చి; ఆహారములను= ఆహార పదార్థాలను; భక్తిన్+ఆత్మీయములలోనన్= భక్తిగా ఆత్మీయంగా (ప్రేమతో); పంచిపెట్టి= అందరికీ పంచి; అధ్యయన హోమశీలుఁడుఁ+ఐ= అధ్యయనం; అగ్నిహోత్రం-ఇవి చేస్తూ; అన్ని ఇంద్రియములన్+గెలిచి= అన్ని ఇంద్రియాలను గెల్చి; వానప్రస్థుఁడు= వానప్రస్థంలో ఉన్నవాడు; అతిశయిల్లున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: వానప్రస్థంలో ఉన్నవాడు గ్రామం వదలిపెట్టి అడవులలో ఉంటూ పర్ణశాలల్లో నివసిస్తుంటాడు. రెండు పూటలా స్నానం చేస్తూ బ్రహ్మచర్యం పాటిస్తాడు. తృణధాన్యాలు, పండ్లు, గడ్డలు, పూలు, కాయలు, ఆకులు ఆహారంగా తీసికొంటాడు. జంతువుల చర్మాన్నో నారచీరలనో వస్త్రంగా ధరిస్తాడు. నేలమీదనే పడుకొంటాడు. అతిథులకు చోటు కల్పించి ఆహారం భక్త్యనురాగాలతో అందరికీ పంచిపెట్టుతాడు. అధ్యయనం, అగ్నిహోత్రం చేస్తూ అన్ని ఇంద్రియాలనూ అదుపులో ఉంచుకొని వానప్రస్థుడు పవిత్రజీవనం గడపుతాడు.

క. ఈ మూఁ డాశ్రమములలో। నేమిట వర్తించువార లేనియు ముక్తిం
గామించినఁ జొరనగు వి। ద్యామూలాచార మైన యత్యాశ్రమమున్. 171

ప్రతిపదార్థం: ఈ మూఁడు+ఆశ్రమములలోన్= బ్రహ్మచర్య, గార్హస్థ్య; వానప్రస్థాశ్రమాలలో; ఏమిటన్ వర్తించువారు+ఏనియున్= ఎందులో ఉంటున్నవారైనా; ముక్తిన్+కామించినన్= మోక్షాన్ని కోరుకొంటే; విద్యామూల+ఆచారము+ఐన= జ్ఞానహేతువైన ఆచారం కలిగిన; యతి+ఆశ్రమమున్= యతి ఆశ్రమంలో (సన్న్యాసంలో); చొరన్+అగున్= ప్రవేశించవచ్చును.

తాత్పర్యం: పై మూడు ఆశ్రమాలలో ఎందులో ఉంటున్న వాడైనా ముక్తిని కోరుకొంటే జ్ఞాన హేతువులైన ఆచార విధులు కలిగిన యత్యాశ్రమంలో ప్రవేశించవచ్చును. అదే సన్న్యాసం.

సీ. సర్వభూత దయానుషంగంబు గలిగి య। తీత వస్తువులఁ జింతింప కెద న
నాగతంబులమీఁద నాస సేయక వర్త। మాన లబ్ధము లుపేక్షా నిరూఢిఁ
గూర్చు చంగంబులఁ గూర్మ మెట్లట్ల యిం। ద్రియముల లోనికిఁ దిగిచికొనుచు
సముచితకాల భిక్షా చర్య దొరకొన్న। యంతన నిజదేహ యాత్ర నడపి

తే. గ్రాస మాచ్ఛాదనంబు దక్కంగ నెవ్వఁ। డర్థి నెయ్యది యిచ్చిన నంద కేక
వార భోజ యగుచు నమస్కార సఖ్య। నుతి నిరాకృతి సహితుఁడై యతి వెలుంగు.' 172

ప్రతిపదార్థం: సర్వభూత= అన్ని ప్రాణులపట్ల; దయానుషంగంబు+కలిగి= దయ ప్రేమ కలిగి; అతీతవస్తువులన్= గతించిన వాటిని గురించి; ఎదన్= హృదయంలో; చింతింపక= బాధపడక; ఆగతంబులమీఁదన్= రాబోయే వాటిమీద; ఆస+చేయక= ఆశ పడకుండా; వర్తమాన లబ్ధములు+ఉపేక్షా+నిరూఢిన్= అప్పటికి లభించిన వాటిని ఉదాసీన పరత్వంతో; కూర్చుచున్= గ్రహిస్తూ; కూర్మము= తాబేలు; అంగంబులన్+ఎట్లు+అట్ల= అంగాలను ఎట్లాగో అట్లాగా; ఇంద్రియములన్ లోనికిన్+తిగిచికొనుచున్= ఇంద్రియాలను లోనికి లాగుకొంటూ; సముచితకాల= తగిన సమయంలో; భిక్షా చర్యన్= భిక్షాటనంతో; దొరకొన్న+అంతన= లభించినంత; నిజదేహయాత్ర+నడపి= తనదేహయాత్రను నడుపుతూ; గ్రాసము= ఆహారం; ఆచ్ఛాదనంబు= వస్త్రం; తక్కంగన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తప్ప; ఎవ్వరు= ఎవ్వరైనాసరే; ఎయ్యది+ఇచ్చినన్= ఏది ఇచ్చినాసరే; అందక= తీసికొనక; ఏకవారభోజి+అగుచున్= దినంలో ఒకసారి మాత్రమే భుజిస్తూ; నమస్కార= నమస్కరించటంకాని; సఖ్య= స్నేహంకాని; మతి= ప్రశంసించటం కాని (నీటిలో); నిరాకృతి సహితుండు+ఐ= నిరాకరించేబుద్ధి కలవాడై; యతి= సన్న్యాసి; వెలుంగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: అన్ని ప్రాణులపట్ల దయ ప్రేమ కలిగి, గతించినవాటిని గురించి చింతించక, రాబోయేవాటిని గురించి ఆశపడక, అప్పటికి లభించిన వాటిని ఉదాసీనంగా గ్రహిస్తూ తాబేలు తన అంగాలను లోనికి లాక్కున్న విధంగా తన ఇంద్రియాలను నియంత్రిస్తూ భిక్షతో లభించినంత గ్రహించి తన దేహాన్ని సంరక్షించుకొంటూ, అన్న వస్త్రాలు తప్ప తక్కినది ఎవరు ఏమి ఇచ్చినా పరిగ్రహించకుండా, రోజుకు ఒకసారిమాత్రమే భుజిస్తూ, నమస్కారంకాని, స్నేహంకాని, ప్రశంసకాని, పట్టించుకొనకుండా (నిరాకరిస్తూ) యతి (జ్ఞానమయమైన) జీవితం గడుపుతాడు.

క. అనసూయయు నక్రోధం । బును దమమును బ్రహ్మచర్యమును ఋజుభావం
బును సత్యంబు నపైశున । ము నహింసయుఁ జూరె యతికి ముఖ్య వ్రతముల్. 173

ప్రతిపదార్థం: అనసూయయున్= అసూయ లేకుండా ఉండటం; అక్రోధంబును= కోపంలేకుండా ఉండటం; దమమును= ఇంద్రియాలను నియంత్రించటం; బ్రహ్మచర్యమును= స్త్రీకి దూరంగా బ్రహ్మజ్ఞాన విషయంగా నిరంతరం సంచరించటం; ఋజుభావంబును= వేరుగా (డొంకతిరుగుడు వ్యవహారం కాకుండా) ప్రవర్తించే స్వభావం; సత్యంబున్= సత్యపాలన; అపైశునము= లోభగుణం లేకుండటం; అహింసయున్= హింసచేయకుండటం; యతికిన్= సన్న్యాసికి; ముఖ్యవ్రతముల్= ముఖ్యమైన దీక్షలు; చూరె= సుమండీ! (కదా!).

తాత్పర్యం: అసూయ, కోపం లేకుండా ఉండటం, ఇంద్రియాలను నియంత్రించుకొనటం; బ్రహ్మచర్యంలో సంచరించటం; ఋజుప్రవర్తన, సత్యపాలన, లోభగుణం లేకుండా ఉదారంగా ఉండటం, హింస చేయకుండటం, సన్న్యాసికి ముఖ్యమైన దీక్షలు.

విశేషం: 'యతి' అంటే 'నియతి' కలవాడని అర్థం. 'సమ్యక్'= బాగుగా; 'న్యాసము'= దాచి పెట్టటం అంటే భగవంతుడిలో సర్వాన్ని దాచిపెట్టినవాడని అర్థం. 'సర్వం బ్రహ్మమయం' అని ఎవడు అన్నిటిని త్యజిస్తాడో వాడు 'సన్న్యాసి'.

తే. వృక్షమూల నదీతీర విజన నిలయ । విపిన గిరిగుహా నిత్య వివిక్త దేవ
సదనవాసియై కౌటిల్య సాధ్య వస్తు । సంచయనము లుడిగి యతి సంచరించు. 174

ప్రతిపదార్థం: వృక్షమూల= చెట్టు మొదట; నదీతీర= నదీతీరంలో; విజననిలయ= జనాలు లేనిచోట; విపిన= అడవిలో; గిరిగుహా నిత్య వివిక్త= గిరిగుహలలో నిత్యం ఒంటరిగా; దేవసదన= దేవాలయాలలో; వాసి+ఐ= వాసంచేస్తూ; కౌటిల్య= వంకరమార్గాలతో; సాధ్య వస్తు సంచయనములు= సాధించదగ్గ వస్తుసముదాయాలను; ఉడిగి= వదలిపెట్టి; యతి= సన్న్యాసి; సంచరించున్= తిరుగుతాడు.

తాత్పర్యం: సన్న్యాసి ఏ చెట్టు మొదటో, నది ఒడ్డునో, మనుష్యులు లేని అడవులలోనో, కొండగుహలలోనో, నిత్యం ఒంటరిగా, ఏ ఆలయాలలోనో నివసిస్తాడు. దుర్మార్గంగా కుయుక్తులతో ఏ వస్తువులూ సంపాదించడు. ఇట్లా యతి సంచరిస్తూ ఉంటాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. తన మేలు ప్రకాశింపక । తనుఁ గనుఁగొనునట్టి జను లుదాసీనతమై
నునికికిఁ దగియెడు చందం । బున వర్తించుయతి సర్వముక్తత నొందున్. 175

ప్రతిపదార్థం: తన= తనయొక్క; మేలు= గొప్పతనం; ప్రకాశింపక= బయటపెట్టకుండా; తనున్+కనుఁగొనునట్టి జనులు= తనను చూచేటటువంటి జనాలు; ఉదాసీనతమైన్= ఉదాసీనంగా; ఉనికికిన్= ఉండటానికి; తగియెడు= తగిన; చందంబునన్= రీతిలో; వర్తించు యతి= ఉండే సన్న్యాసి; సర్వముక్తతన్= అన్నిటినుండీ విముక్తిని; ఒందున్= పొందుతాడు.

తాత్పర్యం: తన గొప్పతనం ఎవరికీ చాటకుండా; తనను చూస్తున్న వారుకూడా ఉపేక్షాభావంతో తనను పట్టించుకొనకుండా ఉండేటట్లుగా ఏ సన్న్యాసి వర్తిస్తాడో అతడు సర్వబంధ విముక్తుడౌతాడు.'

వ. అని యెఱిఁగించి మఱియును. 176

తాత్పర్యం: అని తెలిపి ఇంకా (తరవాతి పద్యంతో అన్వయం.)

సీ. సన్న్యాస మనఁ దపశ్చరణంబు పేరు త । పోజ్ఞాన యుక్తి ప్రబుద్ధు లైన
జనము లచింత్యం బజర మమృతంబు నా । వెలుఁగు తత్త్వము గంద్రు వీతతామ
సము నవధూత రాజసమునై శుద్ధ స । త్త్వాశ్రయం బగు హృదయంబు గలుగు
వారు తపోవృత్తివలన సుక్షేమ మా । ర్గంబున నడతు రేకత్వ శోభి

తే. మహిత నానాత్వ మనంగ సమస్త భూత । సముదయస్థమై యున్న తత్త్వము ప్రకాశ
మగుట నఖిలగతులఁ దోఁచు నవ్విధంబు । గలుగు బుధుఁడు నిర్ద్వంద్వుఁడై కాంచు ముక్తి. 177

ప్రతిపదార్థం: సన్న్యాసము+అనన్= సన్న్యాసమంటే; తపశ్చరణంబు పేరు= తపస్సుచేయటానికి పేరు; తపోజ్ఞాన+యుక్తి+ప్రబుద్ధులు+ఐన= తపస్సువలన పుట్టిన జ్ఞానంతో మేల్కొన్నవారైన; జనములు= యోగిజనులు; అచింత్యంబు= చింతించి (ఆలోచించి); తెలిసికొనటానికి వీలులేనిది; అజరము= ముసలితనం లేనిది; అమృతంబునాన్= చావులేనిదిగా; వెలుఁగు తత్త్వమున్= వెలిగేటటువంటి మహాతత్త్వాన్ని; కంద్రు= దర్శిస్తారు; వీత తామసమున్= తమోగుణం పోయినదీ; అవధూత రాజసమున్+ఐ= పోగొట్టబడిన రాజసం కలిగినదీ అయినటువంటి; శుద్ధసత్త్వ= పరిశుద్ధసత్త్వగుణానికి; ఆశ్రయంబు+అగు= ఆశ్రయమైన; హృదయంబు= హృదయం; ఉరుతపోవృత్తివలనన్= గొప్పతపశ్చర్యవలన; కలుగున్= కలుగుతుంది; సంక్షేమ మార్గంబునన్+నడతురు= క్షేమం కలిగించే భద్రమైన పద్ధతిలో నడుస్తారు; ఏకత్వశోభి= ఏకంగా ప్రకాశించే; మహిత నానాత్వము+అనఁగన్= గొప్పదైన అనేకత్వం అనబడి; సమస్తభూత సముదయస్థమై; ఉన్నతత్త్వము= సమస్త ప్రాణి సముదాయాలలోనూ ఉన్న ఆత్మ వస్తువు; ప్రకాశము+అగుటన్= ప్రకాశించగా; అఖిల గతులన్+తోఁచున్= అన్ని విధాలా కనిపిస్తుంది; ఆ విధంబు+కలుగు బుధుఁడు= ఆ విధంగా దర్శించగల పండితుడు (జ్ఞాని); నిర్ద్వంద్వుడు+ఐ= ద్వంద్వమోహం పోయినవాడై; ముక్తిన్+కాంచున్= ముక్తి పొందుతాడు.

తాత్పర్యం: సన్న్యాస మంటే తపస్సుచేయటమే. తపోజ్ఞానంచేత జాగరూక చిత్తం కలిగిన యోగులు చింతించి తెలిసికొనజాలనిదీ, ఎప్పటికీ నిత్యనూతనమైనదీ, చావు లేనిదీ అయిన ఆ మహాతత్త్వాన్ని చూస్తారు. తపోవృత్తివలన రజస్తమస్సులు లేని శుద్ధసత్త్వానికి ఆశ్రయమైన హృదయం ఏర్పడుతుంది. క్షేమమైన దారిలో పయనించటానికి అది

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మూలమవుతుంది. ఏకత్వం అనేకత్వం అనే రెండు లక్షణాలూ కలిగిన ఆ ఆత్మవస్తువు సకల ప్రాణి సముదాయాలలోనూ అన్ని రీతులలోనూ ప్రకాశించటం మొదలవుతుంది. అట్లాంటి జ్ఞాని ద్వంద్వమోహాలను అధిగమించి ముక్తిని పొందుతాడు.

వ. అవ్యక్త ప్రభవంబును బుద్ధి స్కంధంబును నహంకార విటపంబును మహా భూతోపశాఖంబును నింద్రియ కోటరంబును సంతతాశా పల్లవంబును శుభాశుభ ఫలంబును నై సంసార వృక్షం బొప్పుచుండు. 178

ప్రతిపదార్థం: అవ్యక్త ప్రభవంబును= తెలియని పుట్టుక కలిగింది (అవ్యక్తాన్నే వేరుగా, బీజంగా కలిగింది); బుద్ధి స్కంధంబును= బుద్ధినే కాండంగా కలిగింది; అహంకార విటపంబును= అహంకారాన్నే కొమ్మగా కలిగిందీ; మహాభూత+ఉపశాఖంబును= మహా భూతాలనే రెమ్మలుగా కలిగిందీ; ఇంద్రియకోటరంబును= ఇంద్రియాలనే తొర్రలుగా కలిగింది; సంతత= నిరంతరం; ఆశా పల్లవంబును= పుట్టే ఆశలనే చిగురులుగా కలిగింది; శుభ+అశుభ ఫలంబును+ఐ= శుభం అశుభం అనే పండ్లను కలిగిందై; సంసారవృక్షంబు= సంసారమనే చెట్టు; ఒప్పుచున్+ఉండున్= ప్రకాశిస్తూ ఉంటుంది.

తాత్పర్యం: అవ్యక్తమనే బీజాన్ని, బుద్ధి అనే కాండాన్ని, అహంకారమనే కొమ్మను, మహాభూతాలనే రెమ్మలను, ఇంద్రియాలనే తొర్రలను, నిరంతరం పుట్టే ఆశ లనే చిగుళ్ళను, మంచిచెడు లనే ఫలాలను కలిగినదై ఈ సంసారమనే చెట్టు ప్రకాశిస్తూ ఉంటుంది.

విశేషం: అలం: రూపకం.

క. జ్ఞానాసి నది నటికి యభి। మానాహంకార మతి నియతి యగు పురుషుం
డానందము ప్రస్ఫుటముగఁ। గానంగా నేర్చు విగతకల్మషులారా! 179

ప్రతిపదార్థం: విగతకల్మషులారా!= పోయిన పాపాలుగల ఋషులారా!; జ్ఞాన+అసిన్= జ్ఞానమనే కత్తితో; అది= ఆ చెట్టును; నటికి= నరికివేసి; అభిమాన+అహంకార మతి= అభిమానం, అహంకారం అనే లక్షణాలుకల మతి; నియతి+అగు= నియంత్రణలో ఉన్న; పురుషుండు= యోగిపురుషుడు; ఆనందము= ఆత్మానందాన్ని; ప్రస్ఫుటముగన్= స్పష్టంగా; కానంగాన్+నేర్చున్= దర్శించగలుగుతాడు.

తాత్పర్యం: జ్ఞానమనే కత్తితో ఆ చెట్టును నరికివేసి అభిమాన, అహంకారాలను ఎవరు నియంత్రించుకొంటారో ఆ యోగి నిస్సందేహంగా బ్రహ్మానందాన్ని పొందగలుగుతాడు.

విశేషం: అశ్వత్థ వృక్షంగా జగత్తును వర్ణించిన గీతాకారుడు 'అసంగశస్త్రేణ దృఢేన ఛిత్వా' అన్నాడు. ఈ లోకమనే మహావృక్షాన్ని 'నిస్సంగం' (అంటే ఎందులోనూ ప్రవేశించని మనస్సు) అనే శస్త్రంతో ఖండించాలని చెప్పాడు.

ఇక్కడ ఈ వృక్షానికి మూలం మొదలు ఫలం దాకా అన్నీ చెప్పబడ్డాయి. 'జ్ఞానం' అనే కత్తితో ఈ చెట్టును ఖండించవచ్చునట. అప్పుడు అభిమాన, అహంకారాలు నశిస్తాయి. అప్పుడు సాత్త్విక ప్రజ్ఞ ప్రవర్తించి 'ఆత్మ' దర్శనమిస్తుంది. ఆ ఆనందమే బ్రహ్మానందమని యోగులు పిలిచింది.

ఆ. నిమిషమైనఁ బరమ నియతి నాత్మని నాత్మ। యంద కనినఁ దెలివి నారఁ బడసి
బోధమహితమునులు పొందు నవ్యయగతిఁ। బొందఁ గంద్రు ప్రకృతి పొందు దొఱఁగి. 180

ప్రతిపదార్థం: నిమిషము+ఐనన్= ఒక నిమిషంపాటైనాసరే; పరమనియతిన్= మిక్కిలి నిష్ఠతో (యోగసాధనతో); ఆత్మునిన్+ ఆత్మ+అందున్+అ+కనినన్= ఆత్ముడిని ఆత్మలో చూస్తే; తెలివిన్+ఆరన్+పడసి= సమగ్రమైన జ్ఞానం పొంది; ప్రకృతిపొందు+తొఱఁగి= ప్రకృతితోడి అనుబంధాన్ని వదలి; బోధమహిత= జ్ఞానంచేత మహనీయులైన; మునులు+పొందు= మునులు పొందేటటువంటి; అవ్యయగతిన్= ముక్తిస్థానాన్ని; పొందన్+కంద్రు= పొందగలుగుతారు.

తాత్పర్యం: మిక్కిలి నిష్ఠతో యోగసాధన మూలంగా తనలోని జీవాత్మను తాను దర్శించగలిగితే, అది ఒక నిమిషంపాటు జరిగినా చాలు. ఈ లోకంతోడి విషయానుబంధాలనుండి ముక్తుడై జ్ఞానులైన మహర్షులు పొందే ఆ ముక్తిస్థానాన్ని పొందగలుగుతాడు.

ఆ. పరమనియతి యనఁగఁ బ్రాణసంయమనంబ;। యది క్రమాభివృద్ధి నలవరింపఁ
గాఁ బ్రసాద సిద్ధి గలిమి ధ్రువం; బవ్వి। శేషకలన మిష్టసిద్ధిఁ జేర్చు. 181

ప్రతిపదార్థం: పరమనియతి+అనఁగన్= పరమనియతి అనగా; ప్రాణసంయమనంబు= ప్రాణవాయువును నియంత్రించటమే (అంటే యోగసాధనే); అది= ఆ సాధన; క్రమాభివృద్ధిన్= క్రమంగా పెంచుకొంటూ; అలవరింపఁగాన్= సాధనచేయగా; ప్రసాదసిద్ధి+కలిమి= ప్రసార సిద్ధి కలగటం; ధ్రువంబు= సత్యం; ఆ+విశేషకలనము= ఆ ప్రసాద సిద్ధిరూపమైన వైశిష్ట్యం కలిగి ఉండటం; ఇష్టసిద్ధిన్+చేర్చున్= కోరిన దానిని ఇస్తుంది.

తాత్పర్యం: పరమనియతి అని ముందు చెప్పింది ప్రాణవాయు నిరోధరూపమైన యోగసాధననే, దానిని క్రమంగా పెంచుకొంటూ అభ్యసిస్తూ పోగా భగవత్ ప్రసాదరూపమైన సిద్ధి తప్పకుండా కలుగుతుంది. దానివలన ఇష్టార్థాలు సిద్ధిస్తాయి.

విశేషం: పద్యంలో ఎక్కడా భగవంతుడి పేరులేదు. కాని, ప్రసాద దాత పరమాత్మస్వరూపుడైన భగవంతుడే. యోగానికి ఆత్మదర్శనమే ప్రయోజనం కాబట్టి యోగసిద్ధికూడా దైవానుగ్రహంవలననే జరుగుతుందని మహర్షులంతా సెలవిచ్చారు. అందుకే యోగం, క్షేమం రెండూ నేనే వహిస్తాను అని భగవంతుడు అర్జునుడికి వరప్రసాదమిచ్చాడు.

క. అవ్యక్త తత్త్వ జాతము। భవ్యము సత్త్వంబు దురిత పంక హరంబై
యవ్యయ మమృత మనింద్రియ। భావ్యం బగు తత్త్వ మొందఁ బ్రాఁకగుఁ జుండీ! 182

ప్రతిపదార్థం: అవ్యక్త తత్త్వజాతము= అవ్యక్త తత్త్వానికి సంబంధించిన జ్ఞానం; భవ్యము= పుణ్యప్రదమైనది; సత్త్వంబు= సాత్త్వికమైనది; దురితపంకహరంబు+ఐ= దురితాలనే బురదను తొలిగించేదై; అవ్యయము= అనంతమైన; అమృతము= శాశ్వతమైన; న+ఇంద్రియ భావ్యంబగు తత్త్వము+ఒందన్= ఇంద్రియాలచేత భావింపజాలని తత్త్వాన్ని (ఆత్మతత్త్వాన్ని) పొందటానికి; ప్రాఁకు+అగున్= ఆధారమవుతుంది; చుండీ!= సుమండీ!

తాత్పర్యం: ఇంతవరకు చెప్పిన అవ్యక్త తత్త్వజ్ఞానం పుణ్యప్రదం. సాత్త్వికం, పాపహరం, అవ్యయమైన అనంతమైన ఇంద్రియాతీతమైన ఆత్మతత్త్వ దర్శనాన్ని చేయటానికి జ్ఞానం పాకుడు తీగవలె పనికి వస్తుంది. (అంటే ఇది దొరికితే దానిని చేరుకొనటం సులభమని అర్థం.)

వ. కావున. 183

తాత్పర్యం: అందుచేత (-తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **సత్త్వభావన కంటెఁ బ్రశస్తమైన। కృత్య మరయంగ లేదండ్రు నిత్యవస్తు**
సమ్యగధిగమ సిద్ధికి సంయమ ప్ర। సిద్ధు లాగమతంత్ర ప్రసిద్ధులార! 184

ప్రతిపదార్థం: సంయమ ప్రసిద్ధులు= ఋషిశ్రేష్ఠులు; నిత్యవస్తు సమ్యక్+అధి గమ+సిద్ధికిన్= నిత్యమైన ఆత్మవస్తువును సమగ్రంగా చేరుకొనటానికి; సత్త్వభావనకంటెన్= ఆ సత్త్వరూపమైన మహాతత్త్వాన్ని (ఆత్మను) భావించటంకన్నా; ప్రశస్తమైన కృత్యము= శ్రేష్ఠమైన కార్యం; అరయంగన్= బాగా చూడగా; లేదు+అండ్రు= లేదు అంటారు; ఆగమతంత్ర ప్రసిద్ధులార!= వేద తంత్రం తెలిసిన వారిలో శ్రేష్ఠులైన వారా! (ఇది మీకు చెప్పాలా? అని అర్థం).

తాత్పర్యం: మీరు వేదతంత్రం తెలిసినవారిలో శ్రేష్ఠులు, మీకు తెలియనిది ఏమున్నది? ఋషిశ్రేష్ఠులు నిత్యమైన ఆత్మ వస్తువును సమగ్రంగా చేరుకొనటానికి ఆ 'సత్త్వ' భావనకంటె శ్రేష్ఠమైన పని మరొకటి లేదు- అని నిశ్చయంగా చెప్పారు.

విశేషం: ముందు 106వ పద్యంలో 'సత్త్వ'మంటే 'పరమవేద్య' తత్త్వమని చెప్పారు. గమనించి ఇక్కడ అన్వయించుకొనాలి.

క. **వినుఁడీ! సత్త్వస్థుఁ బురుషుఁ। గనుఁగొనుఁ డనుమాన కలనఁ గాని మదిం ద**
క్కిన తెఱఁ గేమిట నైనం। గనుఁగొనియెద మనుట వెరవు గాకుండుఁ జుఁడీ! 185

ప్రతిపదార్థం: వినుఁడీ!= వినండి!; ఈ+సత్త్వస్థున్= ఈ సత్త్వస్థితిలో ఉండే; పురుషున్= మహాపురుష తత్త్వాన్ని (పరమాత్మను); కనుఁగొనుఁడు= దర్శించండి (ఇంతరకు చెప్పిన తపోయజ్ఞ యోగసాధనాది మార్గాల ద్వారా); అనుమానకలనన్+కాని= అనుమాన ప్రమాణంతోకాని; మదిన్= మదిలో; తక్కిన= ఇతరమైన; తెఱఁగు+ఏమిటన్+ఐనన్= ఏ పద్ధతిలోగాని; కనుఁగొనియెదము+అనుట= చూడగలుగుతాం అనటం; వెరవు+కాకుండున్= సాధ్యం కాదు; చుఁడీ!= సుమండీ!

తాత్పర్యం: ఈ 'సత్త్వ' నిష్ఠుడైన ఆ మహావేదవేద్యుడి తపోయజ్ఞయోగాది మార్గాలద్వారా 'సత్త్వ' భావనచేతనే సాధించాలి తప్ప అనుమాన ప్రమాణం కాని, ఏ ఇతర ఉపాయం కాని లేదు. అట్లా చూడగలుగుతామనుకొనటం అసాధ్యం సుమండీ!

విశేషం: న్యాయశాస్త్రంలో 'అనుమాన' ప్రమాణం చర్చించబడింది. ఇతరమైన ప్రత్యక్ష ఉపమానాది ప్రమాణాలూ ఉన్నాయి. 'ధూమాగ్ని న్యాయం' అనుమాన ప్రమాణానికి నిదర్శనం. ఎక్కడ పొగ ఉన్నదో అక్కడ అగ్ని ఉంటుందన్నది అనుమానం. భగవత్తత్త్వ వివేచన అట్లాంటిది కాదు. అది నిష్కారణమైన కారణం- కార్యం. కర్తలేని కర్మ, కర్మలేని క్రియ, అందుచేత 'సత్త్వ' మన్నారు. అంటే అట్లాగే ఉన్నదని అర్థం. దానిని 'భావించటం' అంటే 'తర్కించటం' కానేకాదు. ఉపాసించటమని అర్థం. అది ప్రాణ 'రూపం కాబట్టి 'ప్రాణ' నియంత్రణద్వారా చేస్తున్నాం. అందుచేత అనుమాన ప్రమాణంద్వారా సాధ్యం కాదనటం. దానికి 'ప్రత్యక్ష' నిరూపణ. 'అనుమానం' జరిపించటం సాధ్యంకాదు. అందుచేత మార్గాంతరం లేదనటం.

సీ. **ఇట్లగ టె ట్లనియెదరేని సత్యంబు। సంతోషమును నహింసయును ధృతియు**
క్షమయు నార్జవమును సన్న్యాసమును బరి। త్యాగంబు విజ్ఞానయోగ దశయు
సాత్త్వికంబులు గాన తత్త్వవిజ్ఞనములీ। యనుమానముఁ బురుషాధిగముఁ
బడయుట యెప్పెడు పదమండ్రు తత్త్వంబుఁ। బురుషుండు నొకఁ డను బుద్ధిఁ గొంద

తే. ఊర్వు లూఁదురు రట్లేలయగు సుదుంబ। రమున మశకమ్ము వారి మీనము వసించు
నట్లు సత్త్వంబునం దంతరాత్ముఁ డండుఁ। గాక యనియెడివారు పెక్కండ్రు గలరు.' 186

ప్రతిపదార్థం: ఇట్లు+అగుట= ఇట్లాకావటం; ఎట్లు+అనియెదరు+ఏని= ఎట్లాఅంటారా! (అయితే వినండి); సత్యంబున్= సత్యమూ; సంతోషమును= సంతోషమూ; అహింసయును= అహింసా; ధృతియున్= ధైర్యమూ; క్షమయున్= ఓర్పూ; అర్థవమును= ఋజుమార్గమూ; సన్న్యాసమును; పరిత్యాగంబున్= త్యాగబుద్ధీ; విజ్ఞానయోగదశయున్= విజ్ఞానయోగస్థితి; సాత్త్వికంబులు+కాన= సాత్త్వికాలు కాబట్టి; తత్త్వవిజ్ఞులు= తత్త్వవేత్తలు; అనుమానమునన్= అనుమానప్రమాణంతో; పురుషాధిగమమున్+పడయుట= పురుష తత్త్వాన్ని; తెలిసికొనటం; ఒప్పెడు+పదమండ్రు= తగిన పద్ధతి అంటారు; కొందఱు+ఆర్యులు= కొందరు విద్వాంసులు; తత్త్వంబున్= తత్త్వమూ; పురుషుఁడున్= పురుషుఁడు; ఒకఁడు+అనుబుద్ధిన్= ఒకడనే ఆలోచనతో; ఊఁదుదురు= నొక్కి చెప్పుతారు; అట్లు+ఏల+అగున్= అట్లా ఎందుకవుతుంది?; ఉదుంబరమునన్= మేడిపండులో; మశకమ్ము= పురుగూ; వారిన్= నీటిలో; మీనమున్= చేప; వసించునట్లు= బ్రతికేటట్లు; సత్త్వంబునందున్= సత్త్వంలోనే; అంతరాత్ముఁడు+ఉండుఁగాక= అంతరాత్మ ఉంటుంది పోండి!; అనియెడువారు= అనేవారూ; పెక్కండ్రు+కలరు= చాలా మంది ఉన్నారు.

తాత్పర్యం: ఇట్లా ఎందుకు అన్నానంటే సత్యం, సంతోషం, అహింస, ధృతి, క్షమ, ఋజుత్వం, సన్న్యాసం, త్యాగబుద్ధి, విజ్ఞానయుక్తి-ఇవన్నీ సాత్త్విక గుణాలు కాబట్టి ఇవి ఉన్నచోట 'పురుషతత్త్వం' ఉన్నట్లే కాబట్టి పురుషతత్త్వాన్ని గుర్తించటానికి ఈ అనుమాన ప్రమాణం చాలు అంటారు. కొందరు పురుషుడూ, తత్త్వమూ ఒకటే నంటారు. మరికొందరు అట్లాఎట్లా అవుతుంది! మేడిపండులో పురుగులు, నీటిలో చేప ఉన్నట్లే సత్త్వంలోనే అంతరాత్మ ఉంటాడు. ఇది నిశ్చయం - అని అనేవారూ ఉన్నారు.'

విశేషం: 'మశక'మంటే దోమ, మేడిచెట్టు నాశ్రయించి 'దోమ' లుంటాయన్నది ప్రసిద్ధం కాదు కాబట్టి 'మేడిపండు'ను గ్రహించి వివరించాను

మేడిపండులోని పురుగు, నీటిలోని చేప ఆధార ఆధేయ సంబంధం కలిగినవి. సాత్త్వికాదిగుణాలను ఆధారంగా పురుషతత్త్వాన్ని గుర్తించటం ఇట్లాంటిదే అని కొందరనవచ్చును. కొందరు ఆ 'పురుషుడే' తత్త్వసంకేత మనవచ్చును. కొందరు 'సత్త్వం' అని ఏ గుణాన్ని పిలుస్తామో అదే 'ఆత్మ' దర్శనానికి ఆధార మనవచ్చును. ఎట్లా అన్నా అర్థం ఒకటే. వాదమంతా ఆ రెంటి సంబంధాన్ని గుర్తించటంలోనే. తిక్కనగారు సత్త్వపురుష సంబంధాన్ని తరువాత వివరిస్తున్నారు. అక్కడ ఈ రెంటినడుమ అన్వయం ఎట్లా ఉన్నదో చూడవచ్చును.

వ. అనిన విని యమ్మును లమ్మహితాత్మునితో 'ధర్మంబు లనేక విధంబులు; వీనిలో నెవ్వం డెయ్యది యవలంబించె నదియ వాఁడు మేలను; నే మన్నింటి మీఁదనుం బరఁగిన బుద్ధులు గలిగి యనిశ్చయ దర్శనులమయి యుండుదు; మిది ప్రధానానుష్ఠేయంబని యుపదేశింపవలయు; సత్త్వపురుష సంబంధ ప్రకారంబును బ్రస్ఫుటంబుగా నెఱింగింపు' మనుటయు వారికి వారిజాసనుం డిట్లనియె. 187

ప్రతిపదార్థం: అనినన్+విని= అని బ్రహ్మ చెప్పగా విన్నవారై; ఆ+మునులు= ఆ ఋషులు; ఆ+మహిత+ఆత్మునితోన్= ఆ మహాత్ముడితో; ధర్మంబులు= ధర్మాలు; అనేక విధంబులు= అనేక రీతులు; వీనిలోన్= వీటిలో; ఎవ్వండు= ఎవడు; ఏ+అది=

ఏది; అవలంబించెన్= పాటిస్తాడో; వాఁడు; అది+అ= అదే; మేలు+అనున్= మేలు అంటాడు; ఏము= మేమైతే; అన్నింటిమీఁదనున్= అన్నిటిమీదా; పరఁగిన= వ్యాపించిన; బుద్ధులు+కలిగి= బుద్ధులున్నవారమై; అనిశ్చయ= స్పష్టంగా లేని; దర్శనులము+అయి= జ్ఞానం కలవారమై; ఉండుదుము= ఉన్నాం; ఇది= ఇట్లాంటిది; ప్రధాన+అనుష్ఠేయంబు+అని= ప్రధానంగా అనుష్ఠించదగినదని; ఉపదేశింపవలయున్= ఉపదేశించబడి; సత్త్వ, పురుష సంబంధ ప్రకారంబును= సత్త్వానికి పురుషుడికీ ఉన్న సంబంధాన్ని; ప్రస్ఫుటంబుగాన్= స్పష్టంగా; ఎఱింగింపుము= చెప్పండి; అనుటయున్= అని వారు కోరగా; వారికిన్= ఆ ఋషులకు; వారిజాసనుండు= బ్రహ్మ; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని ఋషులు అతడితో 'స్వామీ! ధర్మాలు అనేక రీతులలో ఉంటాయి. వీటిలో ఎవడు దేన్ని పాటిస్తే వాడు దానినే మేలంటాడు. మేము అన్నిటిమీదా ప్రసరించిన బుద్ధులు కలవారమై నిశ్చయజ్ఞానం లేకుండా ఉన్నాం. ముఖ్యంగా అనుష్ఠించదగిన పద్ధతి ఇది అని బోధించండి. సత్త్వానికి పురుషుడికీ సంబంధం ఏమిటో స్పష్టంగా తెలపండి' అని కోరగా బ్రహ్మ వారితో ఇట్లా అన్నాడు.

(సత్త్వం బవశ్యానుష్ఠేయంబుగా నిరూపించుట (సం.14-49-2))

సీ. **'సకల ధర్మములలో సర్వభూతాహింస। మేటి; యహింసా సమేతుఁ డైన**
వానికి నుత్తమ జ్ఞానోదయం బగు;। నది మోక్షమొనరించు ననఘులార!
కోరిక మెయిఁ గర్మకారి యయ్యెడు వాఁడు। పొందు గతాగతంబులు ఫలాభి
లాషంబు లేక నిర్దోషత మే లాచ। రించిన ముక్తి సిద్ధించు వినుఁడు!

తే. **విషయి పురుషుండు, సత్త్వంబు విషయ; మిట్లు। భోక్తృ భోజ్యత్వ సంబంధమునఁ బొసంగి**
యుండియును బద్మపత్త్రపయోలవంబు। కరణి నతఁడు తత్సంగంబుఁ బొరయకుండు. 188

ప్రతిపదార్థం: అనఘులార!= పుణ్యాత్ములారా! సకలధర్మములలోన్= అన్ని ధర్మాలలోనూ; సర్వభూత+అహింస= ఏ ప్రాణినీ హింసించకుండా ఉండటం; మేటి= గొప్పది; అహింసాసమేతుఁడు+ఐనవానికిన్= అహింసను పాటించేవాడికి; ఉత్తమజ్ఞాన+ఉదయంబు+అగున్= ఉత్తమజ్ఞానం కలుగుతుంది; అది= ఆ జ్ఞానం; మోక్షము+ఒనరించున్= మోక్షం ప్రసాదిస్తుంది; కోరికమెయిన్= కోరిక కలిగి (సకామమైన); కర్మకారి+అయ్యెడువాఁడు= కర్మమార్గ నిష్ఠుడయ్యేవాడు; గత+అగతంబులు+పొందున్= జన్మమరణాలను పొందుతాడు; ఫల+అభిలాషంబు లేక= ఫలితంలో కోరిక లేకుండా; నిర్దోషతన్= ఏ దోషాన్నీ చేయకుండా; మేలు+ఆచరించినన్= పుణ్యంచేస్తే; ముక్తి సిద్ధించున్= ముక్తి కలుగుతుంది; వినుఁడు= వినండి; పురుషుండు; విషయి= విషయానుభవం పొందేవాడు; సత్త్వంబు= సత్త్వం; విషయము= విషయం; ఇట్లు= ఈ విధంగా భోక్తృ= తినేవాడు; భోజ్య= తినబడేది అనే; సంబంధమునన్+ పొసంగి+ఉండియును= సంబంధంతోకూడి ఉన్నాకూడా; పద్మపత్ర+పయస్+లవంబు= తామరాకుమీద నీటిబొట్టు; కరణిన్= చందంగా; అతఁడు= ఆ పురుషుడు; తద్+సంగంబున్= ఆ సత్త్వంతో కూడికను; పొరయఁక+ఉండున్= పొందకుండా ఉంటాడు.

తాత్పర్యం: 'పుణ్యాత్ములారా! అన్ని ధర్మాలలోనూ అహింస గొప్పది. ఏ ప్రాణినీ హింసించనివాడికి ఉత్తమ జ్ఞానం కలుగుతుంది. అది మోక్షదాయిని అవుతుంది. కోరికతో పని చేసేవాడు నిరంతరం జననమరణ రూపమైన 'బంధం' లో చిక్కుకొనే ఉంటాడు. ఫలితం మీద ఆశలేకుండా, ఏ దోషాన్ని చేయకుండా పుణ్యం నిర్వహించిన వాడికి తప్పక ముక్తి లభిస్తుంది. పురుషుడు విషయి; సత్త్వం విషయం. భోక్తకు భోజ్యానికి నడుమ ఉన్న సంబంధం ఈ రెండింటినడమ

ఉన్నది. తామరాకుమీద నీటిబొట్టు చందాన పురుషుడు సత్త్వాన్ని అంటీ అంటకుండా ఉంటాడు. ఏ బంధాన్నీ పొందడు. పద్మపత్త్రపయోలవంబు కరణి-అలంకారం ఉపమ.

క. సత్త్వము ప్రదీప మా పర। తత్త్వముఁ గాంచుటకుఁ గాన తత్సాధనతా
తత్త్వము వదలక చిత్త సు। ఖత్వాకలిత మగు నెలవు గంద్రు కృతాత్ముల్. 189

ప్రతిపదార్థం: సత్త్వము; ఆ+పరతత్త్వమున్+కాంచుటకున్= ఆ పరతత్త్వాన్ని దర్శించటానికి; ప్రదీపము= దివ్వె వంటిది; కాన= కాబట్టి; తద్+సాధనతా+తత్త్వమున్= దాని కారణంగా గ్రహించి సాధించాలన్న ధ్యేయాన్ని వదలకుండా; చిత్త+సుఖత్వ+ఆకలితము+ అగు+నెలవున్= చిత్త సుఖాన్ని కలిగించేటటువంటి స్థిరమైన పదాన్ని; కృతాత్ముల్= పుణ్యాత్ములు (పరిణతాత్ములు); కంద్రు= పొందుతారు.

తాత్పర్యం: ఆ పరతత్త్వాన్ని దర్శించటానికి దివ్వెవంటిది సత్త్వం. అందుచేత సత్త్వాన్ని సాధనంగా గ్రహించి పరతత్త్వసాధన చేయాలన్న ధ్యేయంతో వదలకుండా ప్రయత్నించి ఆత్మవిద్యలో పరినిష్ఠులై యోగులు చిత్త సుఖంతో కూడుకొన్న స్థిరమైన 'ముక్తి' ధామాన్ని చేరుకొంటారు.

చ. అది సదుపాయ మెందును నుపాయసమగ్రత లేమి సేర్ప ద
భ్యుదయము దూరమార్గమునఁ బొందెడు భద్రము వాహనాఢ్యుఁడున్
నది నెఱి నుత్తరించి కనునందము నౌ సహితుండుఁ గాంచు నొ
ప్పిదము విసాధనుం డయిన బే లెటు లొందఁగ నేర్చుఁ జెప్పుఁడా! 190

ప్రతిపదార్థం: అది= ఆ సత్త్వాన్ని సాధనంగా గ్రహించటం; సత్+ఉపాయం= మంచి పద్ధతి; ఎందునున్= ఎప్పుడైనా; ఉపాయసమగ్రత లేమి= సమగ్రమైన ఉపాయం లేకపోవటం; అభ్యుదయమున్+చేర్పదు= ఫలసాధనవైపు మనిషిని నడిపించదు; వాహనాఢ్యుఁడున్= వాహనం కలిగినవాడు; దూరమార్గమునన్= దూరప్రయాణంలో; భద్రమున్+పొందెడున్= క్షేమం పొందుతాడు; నదిన్= నదిని; నెఱిన్+ఉత్తరించి= సులభంగా దాటి; కను+అందము= పొందే సంతోషం; నౌ+సహితుండు= నావ కలిగినవాడు; కాంచున్+ఒప్పిదము= పొందే తీరుగా; విసాధనుండు+అయిన= ఏ సాధనమూ లేని; బేల= అమాయకుడు; ఎటులు+ఒందఁగన్+నేర్చున్?= ఎట్లా పొందగలరు?; చెప్పుఁడా!= చెప్పండి.

తాత్పర్యం: ఆ సత్త్వాన్ని సాధనంగా గ్రహించటం ఉత్తమపద్ధతి. ఎవరికైనా ఉపాయం లేకుండా ఫలసాధన పొందగలగటం అసాధ్యం. వాహనం కలిగినవాడే దూరప్రయాణంలో క్షేమం పొందుతాడు. నావ కలిగినవాడు నదిని దాటి పొందే సుఖం ఏ సాధనమూ లేని బేల ఎట్లా పొందగలుగుతాడో మీరే చెప్పండి!

విశేషం: అలం: దృష్టాంతం, బ్రహ్మ చూపిస్తున్న రెండు పోలికలూ 'ప్రయాణం'తో సంబంధం కలిగినవే. ఈ ప్రయాణమే 'మహాప్రస్థానం'- చివర పొందే ఫలాన్ని 'అభ్యుదయం' అంటున్నాడు. 'భద్రము' అనబడేది శ్రేయస్సు. 'అందము' అనబడేది సచ్చిదానంద రూపమైన 'ముక్తిధామం' 'నావ' సత్త్వం, నావికుడు 'పురుషుడు'. నావ లేని పురుషుడు 'బేల'. వాడే సాధనం తెలియక ప్రయాణంచేయలేక ఏడుస్తూ కూర్చుంటాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. ఇట్టు లగుట యెఱిఁగి యెఱిఁగి యేనియును నె। ఱుంగకేని బలిమి ఱొచ్చు గడిగి
చేయుపని ఫలంబు సిద్ధింపకుండుట। కొలఁదిఁ బోక దుఃఖములును గలుగు. 191

ప్రతిపదార్థం: ఇట్టులు+అగుట= ఇట్లా సాధనం లేక కార్యసాధనం కుదరదని; ఎఱిఁగి= గుర్తించి; ఎఱిఁగి+ఏనియును= తెలిసినా; ఎఱుంగక+ఏని= తెలియకపోయినా; బలిమిన్= పూనికతో; ఱొచ్చు= మాలిన్యాన్ని; కడిగి= శుభ్రపరచి; చేయుపని= చేసేపని; ఫలంబు+సిద్ధింపకుండుట= ఫలసిద్ధి కాకపోవటం; కొలఁదిన్+పోకన్= తన సామర్థ్యాన్ని గుర్తిచకపోవటంచేత; (దానితో) దుఃఖ ములున్+కలుగున్= క్లేశాలు కూడా కలుగుతాయి.

తాత్పర్యం: ఇట్లా కావడం (సాధనం చాలా అవసరం కావడం) తెలుసుకొనికూడా తెలోసో తెలియకో (సాధనం లేకుండా) బలంగా మాలిన్యాన్ని కడిగి చేసే పని సిద్ధించకపోవడం మాత్రం చేతనే పోకుండా దుఃఖములు కూడా కలుగుతాయి.

క. స్థలపథమునఁ బోతమ్ము। స్థలమార్గమునందు వాహనము వినియోజ్యం
బులుగా నిమ్మెయి సాధన। కలన విభాగజ్ఞుఁ డైనఁ గడచు దురితముల్. 192

ప్రతిపదార్థం: స్థలపథమునన్= స్థలమార్గంలో; పోతమ్మున్= ఓడను; జలమార్గమునందున్= నీటిమార్గంలో; వాహనము= బండి; వి+నియోజ్యంబులుగాన్= వాడదగనివిగా; ఈ+మెయిన్= ఈ రీతిగా; సాధనకలన+విభాగజ్ఞుఁడు+ఐనన్= సాధన సంపత్తిని విభజించుకొనే వాడైతే; దురితముల్+కడచున్= పాపాలను అధిగమిస్తాడు.

తాత్పర్యం: స్థలమార్గంలో ఓడ, జలమార్గంలో బండి పనికిరాదని ఎవడు సాధన విభాగ పరిజ్ఞానం సాధిస్తాడో వాడు పాపాలను అధిగమించగలడు.

వ. అని చెప్పి. 193

తాత్పర్యం: అని చెప్పినవాడై- (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. తటినిఁ దగ నుత్తరించునంతకును బోత। మాదరించి తక్కొల్లనియట్లు పురుషు
దర్శనము సంభవించు నంతకును సత్త్వ। మూఁది పిదపఁ దత్సంబంధ ముడుగుఁ డనియె. 194

ప్రతిపదార్థం: తటినిన్= నదిని; తగన్= తగినట్లుగా; ఉత్తరించునంతకునున్= దాటేంతవరకూ; పోతము+ఆదరించి= ఓడను పట్టుకొని; తక్కు+ఒల్లని+అట్లు= ఆ మీదట వదలివేసినట్లు; పురుషు దర్శనము= పురుషుడి దర్శనం; సంభవించునంతకును= కలిగేదాకా; సత్త్వము+ఊఁది= సత్త్వాన్ని అవలంబించి; పిదపన్= తరువాత; తద్+ సంబంధము= ఆ సత్త్వ సంబంధాన్నికూడా; ఉడుగుఁడు+అనియెన్= వదలివేయండి అని అన్నాడు.

తాత్పర్యం: నదిని పూర్తిగా దాటేదాకా ఓడను ఆశ్రయిస్తాం. తరువాత దానిని విడిచిపెడతాం. అట్లాగే 'పురుషుడి దర్శనం అయ్యేంతవరకు 'సత్త్వం' అవలంబించి ఆ తరువాత దానితో కూడా సంబంధాన్ని విడిచిపెట్టండి.

విశేషం: అలం: ఉపమ. 'ఏరు దాటాక తెప్ప తగలెయ్యట' మని ఒక సామెత ఉంది. అదికాదు ఇది. 'సాధనం' కార్యసాఫల్యానికి ఉత్తమ 'కరణం' మాత్రమే. మార్గంలో 'అభ్యుదయం' ప్రధానం కాబట్టి 'సాధనాన్ని' ఎంత మేరకు ఎట్లా వాడుకోవాలో అట్లా

వాడుకొనటమే ముందుచెప్పిన 'ఉపాయం'. పురుషుడు - క్షేత్రజ్ఞుడు అతడి దర్శనమైన తరువాత 'క్షేత్ర' రూపమైన ప్రకృతితో ఎంత సాక్షీభూతమైన సంబంధం ఉంటుందో, సాధకుడు 'సత్త్వం' అనే గుణసంపదను కూడా వదలి నిస్సంగుడై, నిర్గుణుడు అవుతాడని తాత్పర్యం.

వ. ఇట్లుపదేశించి మఱియు నిట్లను నవ్యక్తంబు గుణంబు మహత్తత్త్వంబు మహత్తత్త్వగుణం బహంకారం బహంకారంబు గుణంబులు మహాభూతంబులు మహాభూతగుణంబులు శబ్దాదులం దాకాశంబునకు శబ్దంబు గుణంబు వాయువునకు శబ్దస్పర్శంబులు దేజస్సునకు శబ్దస్పర్శ రూపంబులు జలంబునకు శబ్దస్పర్శ రూపరసంబులు గుణంబులు పృథివికి శబ్దస్పర్శరూపరస గంధంబులు గుణంబులు; శబ్దంబు మృదు ఖరాది బహువిధ భేదంబులు గలిగియుండు స్పర్శంబు శీతోష్ణ ముఖ్య వివిధ ప్రకారంబులం బరఁగు రూపంబు శుక్ల కృష్ణ ప్రభృతి నానా విధంబులం జను రసంబు మధుర తిక్తాది ప్రచురభంగుల నడచు గంధంబు సురభి తీక్ష్ణ ప్రముఖానేక విధంబుల వర్తించు నిట్లు పెక్కు చందంబులం జెల్లు విషయముల తెఱం గెఱుంగుట వానిఁ దొఱంగుటకుం దోడ్పడం జాలు నని చెప్పి వెండియు. 195

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఉపదేశించి= బోధించి; మఱియున్+ఇట్లు+అనున్= ఇంకా ఇట్లా చెప్పాడు; అవ్యక్తంబు గుణంబు మహత్త్వంబు= అవ్యక్త గుణమే మహత్తత్త్వం; మహత్తత్త్వ గుణంబు+అహంకారంబు= మహత్తత్త్వ గుణం అహంకారం; అహంకార గుణంబులు మహాభూతంబులు= అహంకార గుణాలే మహాపంచభూతాలు;

ఆకాశమునకు-శబ్దం.
వాయువునకు-శబ్దం+స్పర్శం.
తేజస్సునకు-శబ్దం+స్పర్శం+రూపం.
జలమునకు-శబ్దం+స్పర్శ+రూపం+రసం.
పృథివికి-శబ్దం+స్పర్శ+రూపం+రసం+గంధం **గుణాలు**

శబ్దం= మృదువు. కఠినం (ఖర) అని అనేక భేదాలు కలిగినది;
స్పర్శం= శీత (చల్లని), ఉష్ణ (వేడి) మొదలైన తేడాలు కలిగినది;
రూపం= శుక్ల (తెల్లని), కృష్ణ (నల్లని) మొదలైన చాలా భేదాలున్నది;
రసం= మధురం (తీపు), తిక్తం (చేదు) మొదలైన విశేషరీతులలో ఉంటుంది;

గంధం= సురభి (సువాసన కలిగినది), తీక్ష్ణ (ఘాటైనది) మొదలైన తీరులున్నది; ఇట్లు= ఈ విధంగా; పెక్కు చందంబులన్= అనేక రీతులుగా; చెల్లు= ప్రవర్తించే; విషయంబుల తెఱంగు= విషయాల విధానం; ఎఱుంగుట= తెలిసికొనటం; వానిన్+తొఱంగుటకున్= వాటిని వదలిపెట్టటానికి; తోడ్పడన్+చాలును+అని చెప్పి= తోడ్పడగలదని చెప్పి; వెండియున్= ఇంకా ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా ఉపదేశించి ఋషులతో అవ్యక్తం నుండి మహత్తు, మహత్తునుండి అహంకారం, అహంకారంనుండి పంచభూతాలు గుణాత్మకాలుగా ఎట్లా ఏర్పడ్డాయో చెప్పి శబ్ద స్పర్శ రూప రస గంధాలు ఆకాశాదులలో ఒక్కొక్కటీ ఎట్లా పెరుగుతూ పోయి చివరికి పృథ్విలో ఈ ఐదుగుణాలు ఎట్లా సమన్వయించాయో చెప్పారు. శబ్దాదులలోని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సూక్ష్మభేదాలు చెప్పి, వీటినే 'విషయాలు' అంటారు. వీటి ప్రవృత్తిని తెలిసికొంటే వీటిని పోగొట్టుకొనటం సులభం అని కూడా చెప్పారు.

ఆ. భూమిముఖ చతుష్కమునకంటె దివి యహం। కారతత్త్వ మంతకంటె దాని
కంటె బుద్ధి బుద్ధికంటెఁ బ్రకృతి యొక్కు। డన్నిటికిని బురుషుఁ డధికుఁ డరయ. 196

ప్రతిపదార్థం: భూమిముఖ= భూమి మొదలైన; చతుష్కమునకంటెన్= నాలుగింటికంటె; దివి= ఆకాశం; అంతకంటెన్= దానికంటె; అహంకారతత్త్వము= అహంకారం; దానికంటెన్= దానికంటె; బుద్ధి; బుద్ధికంటెన్= బుద్ధికంటె; ప్రకృతి; ఎక్కుడు= అధికం; అన్నిటికిని= అన్నిటికంటె; అరయన్= చూడగా; పురుషుఁడు; అధికుఁడు= గొప్పవాడు.

తాత్పర్యం: భూమిమొదలైన నాలుగు భూతాలకంటె ఆకాశం, దానికంటె అహంకారం, దానికంటె బుద్ధి, బుద్ధికంటె ప్రకృతి, గొప్పవి కాగా, పురుషుడు వీటన్నిటికంటె చాలా గొప్పవాడు.

క. భూతముల తారతమ్యము। చేతోగతమైన యట్టి శిష్టజనము ప్ర
ద్యోతితుఁ డగు పురుషుఁ గని ని। రాతంకావ్యయ పదంబు ప్రాపింపఁ గనున్. 197

ప్రతిపదార్థం: భూతముల= ఈ విధంగా పంచభూతాల; తారతమ్యము= భేదాలను (తర తమ భేదాలను); చేతోగతము+ఐన+అట్టి= హృదయంలో నిలుపుకొన్నటువంటి; శిష్టజనము= ధీరులు; ప్రద్యోతితుఁడు+అగు= నిరంతరం ప్రకాశించే; పురుషున్+కని= పురుషుడిని దర్శించి; నిరాతంక+అవ్యయ పదంబు= ఏ అడ్డులేని అనంతమైన ముక్తి పదాన్ని; ప్రాపింపన్+కనున్= పొంద గలుగుతారు.

తాత్పర్యం: ఈ విధంగా పంచభూతాల తారతమ్యాన్ని హృదయంలో పదిలపరుచుకొన్న జ్ఞానులు (శిష్టులు) నిరంతరం ప్రకాశించే పురుషుడిని దర్శించి ఏ అడ్డులేక అనంతంగా నిలిచిన ముక్తిపదాన్ని పొందగలుగుతారు.

సీ. పంచభూతంబులఁ బరఁగింపఁ గుదియింపఁ। జాలు దక్షత వాని నేలు ప్రభుతఁ
దనరుమనంబు రథ్యముల సారథి యెట్టు। ల ట్లింద్రియముల నాఁగ నడప
నదియ వలంతి భూతాత్మకంబును బుద్ధి। సన్నాహమును మనస్సారథికము
నింద్రియాశ్వము నైన యాద్యరథంబున। నభిమతగతి నంతరాత్ముఁ డెందు

తే. నెలమి వర్తించు; నిట్లగు టెఱుఁగు బుధుఁడు। ఘోరసంసార మోహవాగురకు లోను
గాక నిర్గుణ పథమునఁ గ్రాలి కను ని। రామయము నవ్యయంబును నగు పదంబు.' 198

ప్రతిపదార్థం: పంచభూతంబులన్= పంచభూతాలను; పరఁగింపన్= ప్రకటింపజేయటానికి; కుదియింపన్= లోపలికి కుదించటానికి; చాలు సమర్థమైన; దక్షత= శక్తి; వానిన్+ఏలు= వాటిని పరిపాలించే; ప్రభుతన్= ప్రభుత్వ ధర్మంతో; తనరుమనంబు= ప్రకాశించే మనస్సు; రథ్యములన్= గుర్రాలను; సారథి; ఎట్టులు= ఎట్లాగో; అట్లు= ఆ విధంగా; ఇంద్రియములన్= ఇంద్రియాలను; ఆఁగన్= ఆపటానికి; నడపన్= నడపటానికి; అది+అ+వలంతి= అదే సామర్థ్యం కలిగింది; భూత+ఆత్మకంబును= భూతాలతో

కూడింది; బుద్ధి సన్నాహమును= బుద్ధి అనే ప్రయత్నం కలిగింది; భూత+ఆత్మకంబును= భూతాలతో కూడింది; బుద్ధి సన్నాహమును= బుద్ధి అనే ప్రయత్నం కలిగింది; మనస్సారథికము= మనస్సు అనే సారథి కలిగింది; ఇంద్రియ+అశ్వమున్+ఐన= ఇంద్రియాలనే గుఱ్ఱాలను కలిగిన; ఈడ్య= ప్రశస్తమైన; రథంబునన్= రథంలో; అభిమతగతిన్= తనకు నచ్చిన విధంగా (స్వతంత్రంగా); అంతరాత్ముఁడు= అంతరాత్మ; ఎందున్+ఎలమిన్= చక్కగా; వర్తించున్= ప్రవర్తిస్తాడు; ఇట్లు+అగుట+ఎఱుఁగు బుధుఁడు= ఇట్లా ఉంటుందని తెలిసిన పండితుడు; ఘోర సంసార= భయంకరమైన సంసార; మోహవాగురకున్= మోహమనే వలలో; లోను కాక= పడకుండా; నిర్గుణపథమునన్= నిర్గుణమార్గంలో; క్రాలి= పయనించి; నిరామయమున్= ఏ లోపమూ లేని; అవ్యయంబును+అగు= అనంతమైన; పదంబున్= ముక్తి స్థానాన్ని; కనున్= పొందుతాడు.

తాత్పర్యం: పంచభూతాలను ప్రకటింపజేయటానికి కుదించటానికి శక్తి కలిగి వాటిని పాలించేటటువంటి ప్రభువువలె ప్రకాశించే మనస్సు సారథి గుఱ్ఱాలను నియంత్రించినట్టు ఇంద్రియాలను నడపటానికి ఆపటానికి సమర్థమైనది. భూతమయమైనది. (ఆ రథాన్ని లోహంతో చేయలేదని అర్థం) బుద్ధిని ప్రయత్నంగా కలిగింది ఇంద్రియాలను గుఱ్ఱాలుగా కలిగింది. మనస్సు సారథిగా కలిగింది, అయిన ఈ దేహమనే ప్రశస్తమైన రథంలో కూర్చుండి అంతరాత్మ తనకు నచ్చిన విధంగా స్వతంత్రంగా చక్కగా తిరుగుతాడు. ఈ రహస్యాన్ని ఏ పండితుడు తెలిసికొంటాడో అతడు ఘోరమైన సంసారమనే వలలో చిక్కుకొనకుండా నిర్గుణమనే మార్గంలో పయనించి ఏ లోపమూ లేని అనంతమైన ముక్తిస్థానాన్ని పొందుతాడు.'

విశేషం: అలం: రూపకం, ఉపమ. మనస్సు సారథి, ఇంద్రియాలు గుఱ్ఱాలు, దేహమే రథం, అంతరాత్మ రథంలోని రథికుడు. ఇట్లా ముక్తి సాధనను ప్రయాణంగా చెప్పటంలోనూ 'మహాప్రస్థాన'మనే తాత్పర్యమున్నది.

వ. అని పలికి మఱియును. **199**

తాత్పర్యం: అని చెప్పి ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. శరనిధి తరఁగల భంగిం। బొరిఁబొరి నవ్యక్తమునన పుట్టు నడంగున్
సురనరధరణీరుహ ముఖ। చరాచరానేక భూతజాలము లెల్లన్. **200**

ప్రతిపదార్థం: శరనిధి= సముద్రంలోని; తరఁగల= అలల; భంగిన్= రీతిగా; పొరిన్+పొరిన్= మాటి మాటికీ; అవ్యక్తమునన్+అ= అవ్యక్తంలోనే; సుర= దేవతలు; నర= మనుష్యులు; ధరణీరుహ= చెట్లు; ముఖ= మొదలైన; చర= తిరిగేవి; అచర= కదలనివి అయిన; అనేక= వివిధాలైన; భూతజాలములు= ప్రాణి సమూహాలు; ఎల్లన్+అన్నీ; పుట్టున్= పుట్టుతాయి; అడంగున్= నశిస్తాయి.

తాత్పర్యం: సముద్రంలో అలలు ఎట్లా మాటి మాటికి పుట్టుతుంటాయో అట్లాగే దేవతలు, మనుష్యులు, వృక్షాలు మొదలైన చరాచర సమూహాలన్నీ అవ్యక్తంనుండి పుట్టుతూ అవ్యక్తంలోనే లీనమవుతూ ఉంటాయి.

విశేషం: **"అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత,**
అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా."

అని గీతాకారుడు అవ్యక్తంనుండే భూతాలు పుట్టుతాయని, అందులోనే లీనమవుతాయని స్పష్టంగా చెప్పాడు. అలం:ఉపమ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అవ్యక్తాదిక సకలము। నవ్యయుఁడగు పురుషుఁ డాశ్రయంబుగఁ బరఁగున్
సువ్యక్తంబుగ నిది గను। భవ్యులు వడయుదురు మోహ బంధ విముక్తిన్. 201

ప్రతిపదార్థం: అవ్యక్త+ఆదిక+సకలమున్= అవ్యక్తం మొదలైనవన్నీ; అవ్యయుఁడు+అగు పురుషుఁడు= అవ్యయుడైన పురుషుడు; ఆశ్రయంబుగన్= ఆశ్రయంగా; పరఁగున్= పుట్టుతాయి; సువ్యక్తంబుగన్= స్పష్టంగా; ఇది+కను+భవ్యులు= దీనిని గుర్తించే పుణ్యులు; మోహబంధ విముక్తిన్= మోహబంధంనుండి విముక్తిని; పడయుదురు= పొందుతారు.

తాత్పర్యం: ఈ అవ్యక్తాది ప్రపంచమంతా 'అవ్యయు'డైన ఆ మహాపురుషుడు ఆధారంగా పుట్టి పెరిగినదే. ఈ రహస్యాన్ని ఏ పుణ్యాత్ములు గుర్తిస్తారో వారు 'మోహ' బంధంనుండి విముక్తులవుతారు.

క. వినుఁ డక్కనుటకు మూలం। బనఘం బగు తపమ యగుట నతినిష్ఠఁ దపో
ధన సమ్యగ్విధ సముపా। ర్జనం బవశ్యంబు వలయు సన్మతులారా! 202

ప్రతిపదార్థం: సత్+మతులారా!= మంచి బుద్ధిగల ఋషులారా!; వినుఁడు= వినండి; ఆ+కనుటకున్= అట్లా దర్శించటానికి; అనఘంబు+అగు= (పాప స్పర్శ లేని) పుణ్యమైన; తపము+అ= తపస్సే; మూలంబు= మూలం; అగుటన్= కాబట్టి; అతినిష్ఠన్= మిక్కిలి శ్రద్ధతో; తపోధన= ఆ తపోధనాన్ని; సమ్యక్+విధ= అన్ని విధాలా; సముపార్జనంబు= సంపాదించటం; అవశ్యంబున్= తప్పక; వలయున్= కావాలి.

తాత్పర్యం: పుణ్యాత్ములారా! ఆ విధంగా దర్శించటానికి తపస్సే సాధనం. అందుచేత మిక్కిలి శ్రద్ధతో అన్ని విధాలా ప్రయత్నించి ఆ తపోధనాన్ని సంపాదించటం అవశ్యకర్తవ్యం. తపోధన-అన్నచోట రూపకాలంకారం.

సీ. భూరితపంబునఁ జూరె ప్రజాపతుల్। బహువిధ సృష్టి నిర్వహణ నిపుణు
లైరి; వన్యంబు లాహారంబులుగఁ దప। మాదరంబునఁ జేసి కాదె మునులు
కాలత్రయంబు లోక త్రితయంబును। గాంతురు; విద్యల గౌరవంబు
లొదవుఁ దపంబున; నొండు విధంబులఁ। బడయంగ రాని యెక్కుడు పదంబు

తే. లచ్చమైన తపంబున వచ్చుఁ బడయ;। బ్రహ్మవధ మద్యపానాది పాతకంబు
లెల్లఁ బాయుఁ దపఃకృతి; నిద్ధతపము। పేర్మి సర్వభూతంబులుఁ బ్రీతిఁ బొందు. 203

ప్రతిపదార్థం: ప్రజాపతుల్= ప్రజాపతులు; భూరితపంబునన్+చూరె= గొప్ప తపస్సుతోనే సుడీ!; బహువిధ సృష్టి నిర్వహణ నిపుణులు+ఐరి= నానావిధాలైన సృష్టులు చేయటంలో నేర్పరు లయ్యారు; మునులు= మహర్షులు; వన్యంబులు= శాకాలను (అడవిలో పుట్టేవి) ఆకులలములను; ఆహారంబులుగన్= ఆహారాలుగా; తపము= తపస్సును; ఆదరంబునన్= నిష్ఠతో; చేసికాదె= చేసే కదా!; కాలత్రయంబున్= మూడుకాలాలనూ; లోకత్రితయంబునున్= మూడులోకాలను; కాంతురు= చూడగలుగుతారు; తపంబునన్= తపస్సుతో; విద్యలన్= విద్యలలో; గౌరవంబులు= గురుత్వం; పటుత్వం మొదలైనవి; ఒదవున్= కలుగుతాయి; ఒండువిధంబులన్= మరే రీతిలోనూ; పడయంగరాని=

పొందజాలని; పదంబులు= ఉత్తమ గతులను; అచ్ఛమైన= స్వచ్ఛమైన; తపంబునన్= తపస్సుతో; పడయవచ్చున్= పొందవచ్చును; బ్రహ్మవధ= బ్రాహ్మణులను చంపటం; మద్యపాన+అది= మద్యంతాగటం; పాతకంబులు= పాపాలు; ఎల్లన్= అన్నీ; తపస్+కృతిన్= తపస్సు చేయటంవలన; పాయున్= నశిస్తాయి; ఇద్ధతపము పేర్మిన్= ప్రశస్తమైన తపస్సువలన; సర్వభూతంబులున్= అన్ని భూతాలూ; ప్రీతి పొందున్= సంతసిస్తాయి.

తాత్పర్యం: ప్రజాపతులు మహాతపస్సు చేసే ఈ వివిధాలైన సృష్టి కర్మలు చేయగలుగుతున్నారు. మహర్షులు ఆకులలములు తింటూ నిష్ఠతో తపస్సు చేసే ముల్లోకాలను, మూడు కాలాలను చూడగలుగుతున్నారు. తపస్సువలన విద్యలో గురుత్వ పటుత్వపు భావాలు పెరుగుతాయి. మరి ఏ ఇతర మార్గంలోనూ పొందలేని ఉత్తమ గతులను తపస్సుద్వారా పొందవచ్చును. బ్రాహ్మణవధ మద్యపానాది పాపాలను తపస్సు దూరం చేస్తుంది. తపస్సువలన భూతరాసులు తృప్తినందుతాయి.

క. మమతాహంకృతి రహిత త । పమునఁ బ్రజాపతి సమీప భవ్యపదము సం
యమి వొందు; నిందు సందే । హ మొకింతయు లేదు నిర్మలాత్మకులారా! 204

ప్రతిపదార్థం: నిర్మల+ఆత్మకులారా!= నిర్మలమైన మనస్సున్న ఓ ఋషులారా!; మమతా= మమకారం; అహంకృతి= అహంకారం; రహిత= లేని; తపమునన్= తపస్సులో; సంయమి= మునీశ్వరుడు; ప్రజాపతి; సమీపభవ్యపదమున్= సామీప్యంలో ఉండటం అనే గౌరవాన్ని; పొందున్= పొందుతాడు; ఇందున్= ఇందులో; సందేహము; ఒక+ఇంతయున్= కొంచెంకూడా; లేదు.

తాత్పర్యం: ఋషులారా! మమత, అహంకారం లేని తపస్సుతో మునీశ్వరుడు ప్రజాపతి 'సమీపం'లో ఉండే మహా పుణ్యగతిని పొందుతాడు. సందేహం లేదు.

విశేషం: సాయుజ్య, సారూప్య, సామీప్యాలని ముక్తిలో మూడు రకాలు. సాయుజ్యం కలిసిపోవటం, సారూప్యం - అభిన్నంకావటం, సామీప్యం దగ్గర ఉండటం, తపస్సువలన 'సామీప్యం' సిద్ధిస్తుందట.

క. మమతాహంకార విము । క్తముశుద్ధమునైన యచలిత ధ్యానముతో
సమవేతంబగు తపమున । యమి గను సకలోత్తరావ్యయ పదప్రాప్తిన్. 205

ప్రతిపదార్థం: మమతా= మమకారం; అహంకార= అహంకారం; విముక్త= లేని; శుద్ధమున్+ఐన= పవిత్రమైన; అచలిత= చలనంలేని; ధ్యానముతోన్= ధ్యానంతో; సమవేతంబు+అగు= కూడిన; తపమునన్= తపస్సుతో; యమి= ఋషి; సకల= అన్నిటికంటె; ఉత్తర= శ్రేష్ఠమైన; అవ్యయ పదప్రాప్తిన్= అనంతమైన ముక్తిపదాన్ని; కనున్= పొందుతాడు.

తాత్పర్యం: మమత, అహంకారం విసర్జించిన పవిత్రమైన అచంచలమైన ధ్యానంతో కూడిన తపస్సుతో ఋషి సర్వోత్తరమైన అనంతమైన ముక్తిధామాన్ని చేరుకొంటాడు.

వ. అని చెప్పి వెండియు. 206

తాత్పర్యం: అని చెప్పి ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తమము రజస్సుఁ దొఱఁగి స । త్త్వమునన రమియించి యగుణతత్త్వము గని స
త్త్వమును దిగవిడుచు వైరా । గ్యమహితుఁ డగు మునివరుం డకల్మషులారా! 207

ప్రతిపదార్థం: అకల్మషులారా!= పుణ్యాత్ములారా!; మునివరుండు= మునిశ్రేష్ఠుడు; తమమున్= తమస్సును; రజస్సున్= రజస్సును; తొఱఁగి= విడిచి; సత్త్వమునన్= సత్త్వగుణంలోనే; రమియించి= లీనమై; అగుణతత్త్వమున్= నిర్గుణ స్థితిని; కని= పొంది, సత్త్వమునున్= ఆ సత్త్వాన్నికూడా; దిగవిడుచున్= సంపూర్ణంగా వదలిపెట్టే; వైరాగ్యమహితుఁడు+అగున్= వైరాగ్యంచేత గొప్పవాడు అవుతాడు.

తాత్పర్యం: పుణ్యులారా! మునిశ్రేష్ఠుడు తమోరజస్సులను విడిచిపెట్టి సత్త్వంలో లీనమై చివరికి నిర్గుణస్థితి నంది ఆ సత్త్వాన్ని కూడా వదలివేసి గొప్ప వైరాగ్యవంతు డవుతాడు.

క. పరమం బనంగ వేదాం । తరహస్యాత్మత వెలుంగు తత్త్వము నిక్కం
బరయఁగ క్షేత్రజ్ఞుఁడ యను । పరిణతి గల యతఁడు సర్వపదవిదుఁడు సుఁడీ! 208

ప్రతిపదార్థం: పరమంబు+అనంగన్= శ్రేష్ఠమైనది అనబడేది; వేదాంత+రహస్య+ఆత్మతన్= ఉపనిషద్రహస్యరూపమై; వెలుంగు+తత్త్వము= ప్రకాశించే తత్త్వం; నిక్కంబు+అరయఁగన్= సత్యశోధన చేయగా; క్షేత్రజ్ఞుఁడు+అ+అను= క్షేత్రజ్ఞుడే అనేటటువంటి; పరిణతి= సంస్కారం; కల+అతఁడు= కలయోగి; సర్వపద విదుఁడు= అన్ని తత్త్వాలను తెలిసినవాడు; చుఁడీ!= సుమండీ!

తాత్పర్యం: వేదాంతశాస్త్రమంటే ఉపనిషత్తు, ఉపనిషత్తుల రహస్యం బ్రహ్మతత్త్వం. బ్రహ్మతత్త్వమే రహస్యంగా కలిగిన జ్ఞానరూపంగా వెలిగేటటువంటి 'ఆత్మ'నే పురుషుడని క్షేత్రజ్ఞుడని అంటారని ఎవడు గుర్తిస్తాడో వాడు అన్ని తత్త్వాలను తెలిసినవా డవుతాడు.

క. వృత్తి విశేషమునఁ జనిన । చిత్తము వెనుకఁ జని యందుఁ జేర్చి మనసు దా
నెత్తెఱఁగునకుం దివియమి । యుత్తమపు రహస్య మండ్రు యోగమున మునుల్. 209

ప్రతిపదార్థం: వృత్తి విశేషమునన్+చనిన= పనిలో భాగంగా బయలుదేరిన; చిత్తము+వెనుకన్+చని= బుద్ధివెంట వెళ్ళి; మనసున్+అందున్+చేర్చి= మనస్సును ఆ పనిలో ప్రవేశపెట్టి; తాన్= ఆత్మ రూపుడైన తాను; ఎత్తెఱఁగునకున్+తివియమి= ఏ వైపునకూ లాగబడకుండా ఉండటం; మునుల్= ఋషులు; యోగమునన్= యోగవిద్యలో; ఉత్తమపురహస్యము+అండ్రు= ఉత్తమ రహస్యమంటారు.

తాత్పర్యం: యోగవిద్యలో ఉత్తమ రహస్యం ఏదో చెప్పుతున్నాడు. బుద్ధి వ్యవసాయాత్మకం కాబట్టి ఏదో పని వెంటబడుతుంది. దానివెంటనే మనస్సును పంపించి, అందులోనే మనసు నుంచినా 'ఆత్మ' రూపుడైన జీవుడు ఏ కర్మవైపూ, ఇంద్రియాభిలాషవైపూ లాగబడకుండా 'సాక్షీభూతుడు'గా ఉండటమే మిక్కిలి గొప్ప విషయం. దీనిని యోగులు అభ్యసించి సాధించి 'నిర్మములు' అవుతారు.

క. వినుఁ డవ్యక్తాంతం బగు । పనియెల్ల నవిద్య నొలయు బంధము మమతం
బనుపడిన మృత్యు వమృతం । బనఁ జను; నది నిర్మమత్వ మారఁ గలిగినన్. 210

ప్రతిపదార్థం: వినుఁడు= వినండి; అవ్యక్తాంతంబు+అగు= అవ్యక్తంలో అంతమయ్యే; పనిఎల్లన్= అన్ని పనులూ; అవిద్యన్= అవిద్యకారణంగా; బంధమున్+ఒలయున్= బంధాలను పొందుతాయి; మమతన్+పనుపడిన= మమతలో కూరుకుపోతే; మృత్యువు; అది= ఆ కర్మచేయటం; నిర్మమత్వము= నిర్మమకారం; ఆరన్+కలిగినన్= పూర్తిగా కలిగితే; అమృతంబు+అనన్+చనున్= అమృతమని పిలువబడుతుంది.

తాత్పర్యం: అవ్యక్తంలో లీనమయ్యే ప్రతి పనీ 'అవిద్య' కారణంగా బంధహేతు వవుతుంది. మమతలో మునిగిన ఏ పని ఐనా మృత్యుహేతువే అవుతుంది. నిర్మమత్వం పూర్తిగా కలిగి చేసిన పని 'అమృత' మవుతుంది.

సీ. కర్మముల్ మేలండ్రు కర్మతత్పరులు బు । ద్ధాత్ములు విద్య వర్యత నుతింతు
రవి షోడశ వికార యగు మూర్తిఁ గల్పించు । నది నిత్యుఁ డగ్రాహ్యుఁ డన వెలుంగు
పురుషునిఁ దోఁపించు నరయంగఁ గర్మమ । యత్వంబు లేమి విద్యామయత్వ
మతనికి నైజమై యతిశయిల్లుట శ్రుతి । పాటు నిత్తెఱఁగు సుజ్ఞాన మే మ

తే. హాత్మునకుఁ గల్గియుండు నయ్యార్యవర్యుఁ । డఖిల సంకల్పములఁ బాచి యాత్మ నాత్మ
యంద కాంచి యనామయ మజర మమృత । మను పదమ్ముఁ బ్రాపించుఁ గృతాత్ములార! 211

ప్రతిపదార్థం: కృతాత్ములార!= ఆత్మవిద్యలో సాధన ఉన్న ఋషులారా!; కర్మతత్పరులు= కర్మలో తాత్పర్యమున్నవారు (కర్మఠులు); కర్మముల్ మేలు+అండ్రు= కర్మలు మేలంటారు; బుద్ధ+ఆత్ములు= మేలుకొన్న ఆత్మకలిగిన సంయములు; విద్య+వర్యతన్+నుతింతురు= జ్ఞానమే పరాకాష్ఠ అని దానిని ప్రస్తుతిస్తారు; అవి= ఆ కర్మలు; షోడశ+వికార+అగు+మూర్తిన్= పదహారు వికారాలున్న మూర్తిని కల్పిస్తాయి (కర్మలు పదహారు కాబట్టి వీటినే షోడశకర్మలు అంటారు); అది= ఆ జ్ఞానం; నిత్యుఁడు= నిత్యం ఉండేవాడు; అగ్రాహ్యుఁడు+అని= ఇంద్రియాదులచేత గ్రహించటానికి వీలుకాని వాడుగా; వెలుంగు= ప్రకాశించే; పురుషునిన్= పురుషుడిని; తోఁపించున్= దర్శింపచేస్తుంది; కర్మమయత్వంబులేమిన్= కర్మతో నిండినవాడు కాకపోవటంవలన; విద్యామయత్వము= జ్ఞానంతో నిండిన లక్షణం; అతనికిన్= ఆ పురుషుడికి; నైజము+ఐ= సహజధర్మమై; అతిశయిల్లుట= ప్రకాశించటం; శ్రుతి+చాటున్= శ్రుతి చాటి చెప్పింది; ఈ+తెఱంగు= ఈ విధమైన; సుజ్ఞానము= ఉత్తమజ్ఞానం; ఏ మహాత్మునకున్+కల్గి+ఉండున్= ఏ మహాత్ముడికి ఉంటుందో; ఆ+ఆర్యవర్యుఁడు= ఆ పూజ్యుడు; అఖిల సంకల్పములన్= అన్ని సంకల్పాలనూ; పాచి=వదలివేసి; ఆత్మన్+ఆత్మ+అంద+కాంచి= ఆత్మను ఆత్మలోనే చూచుకొని; అనామయము= ఏ లోపాలూ లేని; అజరము= ముసలితనం లేని; అమృతము; అను= అనబడే; పదమ్మున్= స్థానాన్ని; ప్రాపించున్= పొందుతాడు.

తాత్పర్యం: పుణ్యాత్ములారా! కర్మయోగులు కర్మ చాలా ముఖ్య మంటారు. జ్ఞానయోగులు జ్ఞానమే అన్నిటికీ పర్యవసాన మంటారు. కర్మలు పదహారు వికారాలతో కూడిన 'మూర్తి'ని సృష్టించగా, జ్ఞానంచేత నిత్యుడు, ఇంద్రియాతీతుడు (వికారరహితుడైన) అయిన కాంతిరూపుడైన పురుషుడిని ప్రకాశింపజేస్తుంది. బాగా శోధిస్తే కర్మ లేకపోవటం జ్ఞానమయుడు కావటం అన్నది ఆ పురుషుడి సహజ స్వభావమని వేదం ఏనాడో ఘోషించింది. ఈ విధమైన ఉత్తమజ్ఞానం ఏ మహాత్ముడికి ఉంటుందో అతడు అన్ని సంకల్పాలను వర్జించి ఆత్మను ఆత్మలో చూస్తూ అనామయమూ, అజరమూ, అమృతమూ అయిన 'ముక్తి' ధామాన్ని చేరుతాడు.

విశేషం: కామం సంకల్పరూపమైనది. సంకల్పమే వర్జించినపుడు కర్మ ఉండదు. అంటే కర్మానుబంధమూ ఉండదని అర్థం.

వ. అని యిట్లు కమలగర్భుండు. 212

తాత్పర్యం: అని ఈ విధంగా బ్రహ్మ బోధించి ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. జ్ఞాన పరినిష్ఠితాత్మకు। లైన విముక్తి పద నిర్ణయజ్ఞులచే స
మ్మానిత యగు గతి యిది క। ర్మానుగతి విరక్తజన సమంచితము సుఁడీ!' 213

ప్రతిపదార్థం: జ్ఞాన= జ్ఞానంలో; పరినిష్ఠిత= మిక్కిలి నిష్ఠకలిగిన; ఆత్మకులు+ఐన= ఆత్మలు కలిగిన; విముక్తిపద= మోక్షస్థాన; నిర్ణయజ్ఞులచేన్= నిర్ణయం తెలిపిన మహర్షులచేత; సమ్మానితము+అగుగతి+ఇది= మన్నింపబడిన మార్గం ఇది; కర్మానుగతి+విరక్తజన= కర్మానుగతిలో విరక్తిగల యోగి సమూహంచేత; సమంచితము= మన్నింపబడినది; చుఁడీ= సుమండీ!

తాత్పర్యం: ఇంతవరకు చెప్పిన జ్ఞానమార్గం మోక్షస్థాన నిర్ణయం తెలిపిన మహర్షులు అనుసరించింది. కర్మానుగతిలో విరక్తిపొందిన మహర్షులైన యోగులు మన్నించింది సుమా!'

వ. అని నిర్దేశించి వెండియు. 214

తాత్పర్యం: అని బోధించి మరలా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'కోరికలకుఁ జొరక యసం। గారూఢత గలిగి యెల్లయందును సమతం
గూరిన చిత్తంబులు గల। సారాత్మకు లీ పథమునఁ జనుటకు శక్తుల్. 215

ప్రతిపదార్థం: కోరికలకున్+చొరక= కోరికల జోలికి పోక; అసంగ+ఆరూఢతన్+కలిగి= నిస్సంగంలో స్థిరత్వం కలిగి; ఎల్ల అందును= అన్నిటిలోనూ; సమతన్+కూరిన= సమత్వం నిండిన; చిత్తంబులు+కల= మనసులు కలిగిన; సార+ఆత్మకులు= నిండైన ఆత్మకలవారు; ఈ పథమునన్= ఈ దారిలో; చనుటకున్+శక్తుల్= నడవటానికి సమర్థులు (అవుతారు.)

తాత్పర్యం: కోరికలలో ప్రవేశించకుండా నిస్సంగత్వంలో స్థిరత్వం కలిగి అన్నిటిలోనూ సమత్వం నిండిన మనస్సులు కలిగిన నిండైన ఆత్మ కలవారు మాత్రమే ఈ దారిలో నడవగలరు.

విశేషం: భగవంతుడు పూర్ణతత్త్వం కాబట్టి సాధకుడు కూడా 'పూర్ణ హృదయుడు' కావాలి. ఆత్మ దర్శనంలో అరకొరలు పనికిరాదు.

క. చెప్పితి సర్వంబును నీ। చొప్పున నడపుఁ; డెడ నొండు సొరనీకుఁడు; మీ
రొప్పెడు తెరు విది దీనం। దప్పదు పరమపదసిద్ధి ధార్మికులారా!' 216

ప్రతిపదార్థం: ధార్మికులారా!= ధర్మచింతనగల ఓ మహర్షులారా!; సర్వంబునున్= అన్ని విషయాలను; చెప్పితిన్= చెప్పాను; ఈ చొప్పునన్= ఈ విధంగా; నడపుఁడు= మీ కార్యకలాపాలు నడిపించండి; ఎడన్= ఎదలో; ఒండున్= మరిదేనినీ; చొరనీకుఁడు=

చొరబడనీయకండి; మీరు= మీరందరూ; ఒప్పెడు= అంగీకరించే; తెరువు+ఇది= మార్గమిది; పరమసిద్ధి= పరమపదప్రాప్తి; దీనన్= దీనితో; తప్పదు= తప్పకుండా కలుగుతుంది.

తాత్పర్యం: ధర్మమూర్తులారా! మీకు అన్ని విషయాలూ చెప్పాను. ఈ పద్ధతిలో మారు అన్ని కార్యాలనూ నిర్వహించండి. హృదయాలలో మరి దేనినీ ప్రవేశింపజేయకండి. మీరందరూ అంగీకరించే పద్ధతినే చెప్పాను. దీనితో తప్పకుండా పరమపదప్రాప్తి కలుగుతుంది.'

క. 'అని యిట్లు కమలగర్భుఁడు। మునులకుఁ దత్త్వోపదేశమును జేసిన వా
రనవద్య సమాధికులై। యనితర సులభ మగు సౌఖ్యమందిరి వత్సా!' 217

ప్రతిపదార్థం: అని+ఇట్లు= అని ఈ విధంగా; కమలగర్భుఁడు= బ్రహ్మ; మునులకున్= ఋషులకు; తత్త్వ+ ఉపదేశమునున్+చేసినన్= తత్త్వాన్ని ఉపదేశించగా; వారు= ఆ ఋషులు; అనవద్య+సమాధికులు+ఐ= గొప్ప సమాధిని కలవారై; అనితర సులభము+అగు= ఇతరులచేత సాధ్యం కాని; సౌఖ్యము+అందిరి= పరమసుఖాన్ని పొందారు; వత్సా!= శిష్యుడా! వినుము.

తాత్పర్యం: 'అని' ఈ విధంగా బ్రహ్మదేవుడు ఆ ఋషులకు తత్త్వోపదేశం చేశాడు. ఆ ఋషులకు సార్థకమైన సమాధి సిద్ధించి అనితర సులభమైన పరమపద సుఖాన్ని వాళ్ళు పొందారు. శిష్యా! ఈ కథను మనసులో ఉంచుకొనుము.'

వ. అని పలికి గురుం డా శిష్యునితోడ. 218

తాత్పర్యం: అని పలికి గురువు ఆ శిష్యుడితో (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'నీవును నివ్వాక్యంబులు। భావంబునఁ బాదుకొలిపి పరమ సమాధి
శ్రీ వాటింపుము; నిత్య వ। దావాప్తి ఫలించు నీ కనాయాసమునన్.' 219

ప్రతిపదార్థం: నీవును= నీవుకూడా; ఈ వాక్యంబులు= ఈ బ్రహ్మ వాక్కులను; భావంబునన్= మనసులో; పాదు కొలిపి= స్థిరంగా నిలుపుకొని; పరమ సమాధి శ్రీ+పాటింపుము= గొప్ప సమాధి సంపదను అవలంబించుము; నీకున్= నీకు; అనాయాసముగన్= ఏ శ్రమా లేకుండా; నిత్యపద+అవాప్తి= నిత్యమైన పరమపద ప్రాప్తి; ఫలించున్= కలుగుతుంది.

తాత్పర్యం: 'నాయనా! నీవుకూడా ఈ బ్రహ్మవాక్కులను మనసులో స్థిరంగా నిల్పుకొనుము. అత్యున్నత సమాధిని సాధించుము. దానితో ఏ శ్రమా లేకుండా నీకు పరమపదప్రాప్తి కలుగుతుంది.'

క. అని గురుఁడు ప్రబోధించిన। మనమునఁ దెలివొంది తత్సమంచితమార్గం
బున నడచి పొందె శిష్యుం। డనామయం బజర మమృత మనియెడి పదమున్. 220

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; గురుఁడు= గురువు; ప్రబోధించినన్= ఉపదేశించగా; శిష్యుండు; మనమునన్= మనస్సులో; తెలివి+ఒంది= జాగరూకుడై; తద్+సమంచిత+మార్గమునన్+నడచి= ఆ ఉత్తమ మార్గంలో ప్రవర్తించి; అనామయంబు= ఏ లోపాలూ లేని; అజరము= ముసలితనంలేని; అమృతము+అనియెడి+పదమున్= అమృతమనబడే స్థానాన్ని; పొందెన్= పొందాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: ఈ విధంగా గురుడు ఉపదేశించగా ఆ శిష్యుడు జాగరూకత పొంది ఆ ఉత్తమ మార్గంలో ప్రవర్తించి ఏ లోపాలూలేని నిత్యనూతనమైన అమరమైన ఆ పరమ ముక్తిధామాన్ని పొందాడు.

చ. అని వసుదేవసూనుఁడు సమాదరమేదుర చిత్తవృత్తిఁ జె
ప్పిన విని 'నారి యుల్లముల పెంపిటులుండునె వార లెవ్వరో
వినుటకు నాదు డెందమున వేడ్క జనించె; నెఱుంగఁ జెప్పవే
యనుటయుఁ బార్థుమోముఁ గృప నమ్మహితాత్ముఁడు సూచి నవ్వుచున్. 221

ప్రతిపదార్థం: వసుదేవసూనుఁడు= అని శ్రీకృష్ణుడు; సమాదర= ప్రీతి నిండిన; మేదుర= చక్కని; చిత్తవృత్తిన్= మనోభావంతో; చెప్పినన్= చెప్పగా; విని= విని; వారి+ఉల్లముల+పెంపు= వారి హృదయాల సౌభాగ్యం; ఇటులు+ఉండునె!= ఇంత గొప్పగా ఉంటుందా?; వారలు+ఎవ్వరో= వారు ఎవరో; వినుటకున్= వినాలని; నాదు డెందమునన్= నా హృదయంలో; వేడ్క జనించెన్= కోరిక పుట్టింది; చెప్పవే= దయచేసి చెప్పుము; అనుటయున్= అనగా; పార్థుమోము+అర్జునుడి ముఖం; ఆ+మహితాత్ముఁడు= ఆ మహాత్ముడు; కృపన్= కృపతో; చూచి; నవ్వుచున్= నవ్వుతూ (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ఈ విధంగా శ్రీకృష్ణుడు ఆదరంనిండిన హృదయంతో చక్కగా బోధించగా విని అంత గొప్పసంస్కారమున్న వారెవరో వినాలని మనసులో వేడుకగా ఉన్నది. వా రెవరో దయచేసి చెప్పుము' అని అర్జునుడు అడిగాడు. అప్పుడు శ్రీకృష్ణుడు దయతో అతడిని చూచి ఇట్లా అన్నాడు.

క. 'అనఘ! విను మే గురుఁడ, నా । మనంబు శిష్యుండు; విమలమానస! నీపైఁ
బనుపడు ప్రీతిం జెప్పితి । ననితర సులభాతి గుహ్యమగు నిప్పదమున్. 222

ప్రతిపదార్థం: అనఘ!= ఓ పుణ్యాత్మా! (అర్జునా); వినుము; ఏన్+గురుఁడన్= నేనే ఆ గురువును; నా మనంబు= నా మనసు; శిష్యుండు= శిష్యుడు; విమలమానస!= పవిత్రమైన మనసున్న ఓ అర్జునా!; నీపైన్= నీ మీద; పనుపడు= గాఢంగా నాటుకొన్న; ప్రీతిన్= ప్రేమతో; అనితర సులభ= ఇతరులకు సాధ్యంకాని; అతిగుహ్యము+అగు= అతిరహస్యమైన; ఈ పదమున్= ఈ మోక్ష పదప్రాప్తిని గురించి నీకు; చెప్పితిన్= చెప్పిను.

తాత్పర్యం: అర్జునా! నేనే ఆ గురువును. నా మనస్సే ఆ శిష్యుడు. నీపై నాటుకున్న ప్రేమతో ఇతరులకు సాధ్యంకాని అతి రహస్యమైన ఈ మోక్షపద ప్రాప్తిని గురించి నీకు చెప్పాను.

క. విమలము నచలము నగు చి । త్తము నాదెస నేక భక్తి తత్పరముగఁ జే
యుము; నిత్యము నీ యధ్యా । త్మము ననుసంధింపు పాసెదవు; దురితములన్. 223

ప్రతిపదార్థం: విమలమున్= నిర్మలమైనది; అచలమున్+అగు= స్థిరమైనది అయినటువంటి; చిత్తమున్= చిత్తాన్ని; నా దెసన్= నా వైపు; ఏకభక్తి తత్పరముగన్= అవ్యభిచారమైన భక్తి కలిగినవాడవై; చేయుము; నిత్యమున్= నిరంతరం; ఈ అధ్యాత్మమున్= ఈ బ్రహ్మతత్త్వాన్ని; అనుసంధింపుము= అనుసంధానం చేయుము (ధ్యానంచేయుము); దురితములన్= పాపాలను; పాసెదవు= పోగొట్టుకొంటావు.

తాత్పర్యం: నిర్మలమూ; స్థిరమూ అయిన నీ మనస్సును అవ్యభిచార భక్తి నిష్ఠ కలిగినదిగా నా వైపు చేర్చుము. అనునిత్యమూ ఈ బ్రహ్మతత్త్వాన్ని అనుసంధించుము. నీ పాపాలు నశిస్తాయి.

క. సమరము నప్పుడు నీకీ। యమృతపద ప్రాప్తి హేతువగు సమ్యగ్బో
ధము వివరించితి; నచలత। రమింపు మిందెపుడు శమధురాధుర్యుఁడవై.' 224

ప్రతిపదార్థం: సమరము+అప్పుడు= యుద్ధసమయంలో; నీకున్+ఈ+అమృతపదప్రాప్తి హేతువు+అగు= నీకు ఈ అమృతపదప్రాప్తికి హేతువైన; సమ్యక్+బోధమున్+వివరించితిన్= సమగ్రజ్ఞానాన్ని వివరించాను; అచలతన్= చాపల్యం వదిలి (స్థిరమనస్కుడవై); శమధురాధుర్యుడవు+ఐ= శమదమాది సాధన సంపత్తిని సాధించి; శమభారం వహించిన వాడవై; ఇందున్= ఈ తత్త్వ జిజ్ఞాసతో; ఎపుడున్ రమింపుము= ఎల్లప్పుడూ సంతోషాన్ని పొందుము.

తాత్పర్యం: యుద్ధసమయంలో ఈ అమృతపదప్రాప్తి హేతువైన సమగ్రజ్ఞానాన్ని బోధించాను. స్థిరమైన మనస్సుతో శమదమాదులు సాధించి ఈ తత్త్వజిజ్ఞాసలో ఆనందాన్ని నిరంతరంగా పొందుము.'

వ. అని యిట్లు కృష్ణుండు జిష్ణున కధ్యాత్మ విద్య వివరించె నని చెప్పినఁ 'బరమ గురుండును విశిష్ట శిష్యుండును నగు నప్పురుష వరులు మఱియు నెవ్విధంబునం బ్రవర్తించి రాకర్ణించు కౌతుకంబు నా మనంబున నెసకం బెసగెడు మునీంద్రా! యెఱింగింపవే' యని యడుగుటయు. 225

ప్రతిపదార్థం: అని; ఈ విధంగా; కృష్ణుండు; జిష్ణునకున్= అర్జునుడికి; అధ్యాత్మవిద్య= అధ్యాత్మవిద్యను; వివరించెను+అని= వివరించాడని; చెప్పినన్= చెప్పగా; పరమగురుండును= గురుశ్రేష్ఠుడూ; విశిష్ట శిష్యుండును= శిష్యశ్రేష్ఠుడూ; అగు= అయినటువంటి; ఆ+పురుషవరులు= ఆ పురుషశ్రేష్ఠులు; మఱియున్+ఏవిధంబునన్= ఇంకా ఏ విధంగా; ప్రవర్తించిరి= ప్రవర్తించారు; ఆకర్ణించు కౌతుకంబు= వినే కుతూహలం; నా మనంబునన్= నా మనసులో; ఎసకంబెసగెడున్= అతిశయిస్తున్నది; ముని+ఇంద్రా!= ఓ వైశంపాయన మునీంద్రా!; అని; అడుగుటయున్= జనమేజయ మహారాజు అడుగగా.

తాత్పర్యం: ఈ విధంగా శ్రీకృష్ణుడు అర్జునుడికి వేదాంత విద్య బోధించాడని చెప్పగా 'ఆ గురుశ్రేష్ఠుడూ ఆ విశిష్ట శిష్యుడూ అయిన నారాయణుడు, నరుడు ఆ తరువాత ఏం చేశారు? అది వినాలని నాకు కుతూహలం అతిశయిస్తున్నది' అని జనమేజయమహారాజు వైశంపాయనుడిని అడిగాడు.

అశ్వాసాంతము

చ. పరమ దయా విధేయ! పరిపాలిత వేదకలాప! పక్వ ని
ర్భరశమ! సూక్ష్మ తాతనువిభాసిత! పన్నగ తల్పభూషణా
దర భరితా! పవిత్రపద తామరస స్మరణా! వరావర
త్వరహిత! పద్మజాది సురవందిత! పశ్చిమ నాళనందితా! 226

ప్రతిపదార్థం: పరమదయావిధేయ!= భక్తుల విషయంలో కృపగలవాడు కాబట్టి వారికి విధేయుడైనవాడా!; పరిపాలిత వేదకలాప= రక్షింపబడిన వేద సముదాయం కలిగినవాడా!; పక్వనిర్భర శమ!= అభ్యాసాదులచేత పరిపక్వమైన లేదా వాస్తవ రూపాన్ని ధరించిన

శమ స్వరూపుడా!; సూక్ష్మతా తనువిభాసిత!= సూక్ష్మత్వం అనబడే శరీరంతో ప్రకాశించేవాడా!; పన్నగ తల్ప భూషణాదరభరితా!= ఆదిశేషుడిని తల్పంగానూ; (హరి) ఆభరణంగానూ (హర) గ్రహించటంలో ఆదరం నిండినవాడా!; పవిత్రపద తామరస స్మరణా!= పావనమైన పాదపద్మాల స్మరణం కలవాడా! పరాపరత్వ రహిత!= శ్రేష్ఠమని, అధమమని తేడాలు లేనివాడా! (పరాపరత్వ రహిత అని కూడా పాఠం - పరాపర భేదాలకు అతీతుడా! అని చెప్పాలి); పద్మజ+ఆది సురవందిత!= బ్రహ్మాది దైవతాలచేత నమస్కరించ బడేవాడా!; పశ్చిమనాళవందితా!= సుషుమ్నానాడిలో పుట్టే ఆనందస్వరూపం కలవాడా!

తాత్పర్యం: హరిహరనాథా! నీవు భక్తుల విషయంలో దయగలవాడివి కాబట్టి వారికి విధేయుడివి. వేదాలను పరిరక్షించినవాడివి. అభ్యాసాదులచేత పరిపక్వమైన సంపూర్ణశాంతి స్వరూపుడివి. సూక్ష్మత్వం అనబడే శరీరంతో ప్రకాశించేవాడివి. ఆదిశేషుడిని తల్పంగానూ, భూషణంగానూ గ్రహించటంలో ఆదరం కలవాడివి. పావనమైన పాదపద్మాల స్మరణం కలవాడివి, ఉత్తమాధమభేదాలు లేనివాడివి, బ్రహ్మాది దేవతలచేత నమస్కరించబడేవాడివి. సుషుమ్నానాడిలో పుట్టే ఆనందస్వరూపుడివి. అట్లాంటి నీకు నమస్కారం.

విశేషం: ఈ పద్యంలోని ప్రతి విశేషణమూ శ్రీకృష్ణుడు బోధించిన 'అనుగీత'కు వ్యాఖ్యాన ప్రాయంగా ఉన్నది. అధ్యాత్మవిద్యా రహస్య నిధిగా హరిహరనాథుడిని నిరూపించటం ఈ పద్యంలో ఉన్నది.

ఆత్మవిద్య పరమాత్మ కృపవలన సిద్ధించాల్సిందే. అందుకే ఆ పరతత్త్వాన్ని ఉపాసించాలని చివర్లో బ్రహ్మ సెలవిచ్చాడు. దీనికి కారణం శ్రీ యుక్తుడైన భగవంతు డొకడే యోగాన్నికూడా ప్రసాదిస్తాడు. కాబట్టి ఈ రహస్యమే భక్తుల పట్ల భగవంతుడు విధేయు డనటంలో ఉన్నది.

ప్రళయసమయంలో వేదాన్ని పరిరక్షిస్తూ వచ్చినవాడు భగవంతుడే. అంటే జ్ఞానం ఇన్నియుగాలపాటు స్వామివారి కృపవలననే మిగిలి యోగుల ముఖంగా ప్రకటించబడుతూ వచ్చిందని అర్థం. ఈ భావాన్నే జయదేవు డిట్లా కీర్తించాడు.

"ప్రళయపయోధిజలే ధృతవానసి వేదం । విహిత వహిత్ర చరిత్రమభేదం
కేశవ ధృతమీనశరీర । జయ జగదీశ హరే" (జయదేవుడి గీతగోవిందం)

'ఉపశాంతో యమాత్మా' అని వేదవాక్యం. దీనినిబట్టి భగవానుడు శాంతాభాసస్వరూపుడు కాదు - శాంతి స్వరూపుడే. దీనినే 'నిర్భర' పదంచేత తిక్కనగారు వ్యక్తీకరించారు. అందుకే 'పరమపదం' అని అనటం.

స్వామివారు సూక్ష్మ స్వరూపుడు. అణోరణీయాన్ - అని శ్రుతి. అణువులకు అణువు అని అర్థం. అంటే ఇంద్రియాలకు అందదని అర్థం.

"న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః
న విద్మో న విజానీయో యథై తదనుశిష్యాత్"

అని కేనోపనిషత్తు ఆ పరమతత్త్వం ఏ ఇంద్రియ ప్రమాణానికి లొంగనిదని వ్యాఖ్యానించింది.

హరిరూపంలో పన్నగం పానుపు. హరరూపంలో అభరణం. ఆదిశేషుడు సహస్ర ఫణులు కలిగినవాడు. ఈ సహస్రత్వం శబ్దానికున్న అనంతత్త్వానికి సంకేతం. అందుకే అది శివుడికి భూషణం. విష్ణువుకు తల్పం.

పరమేశ్వరుడి పాదపద్మాలు పవిత్రమైనవి. ఆ పదమే మోక్షపదం. అందుకే 'సామీప్య' ప్రస్తావన ఈ అశ్వాసంలో వచ్చింది.

వాక్కుకు, మనస్సుకు అతీతుడు కావటంవలన ద్వంద్వభావాలు అతడిలో లేవు. అందుకే 'పరాపరత్వ' రహితుడనటం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'నాడి' అంటే ప్రాణవాయువు ప్రసారణమార్గం. ముఖ్యమైన 101 నాడులలో ఇడ, పింగళ, సుషుమ్న అనే మూడు నాడులు ప్రధానమని యోగవిద్య చెప్పుతున్నది.

ఈ నాడులలో సుషుమ్న మిక్కిలి శ్రేష్ఠం. తామరతూడు దారంవలె సన్నదిగా ఉండి వెన్నుపాములోని 72 వేలనాడులమధ్య నుండి బ్రహ్మరంధ్రం దాకా విద్యుత్తేజంలో ప్రసరించేది సుషుమ్న. దీనిని 'బ్రహ్మనాడి' అని కూడా అంటారు. దీనిని ఎడమవైపు ఇడ. కుడివైపు పింగళ ప్రసరిస్తాయి. పశ్చిమనాళ నందితుడంటే 'ఇడా' నాడి చేత సంతోషించేవాడనే అర్థం రావాలి. కాని వ్యాఖ్యాతలు బ్రహ్మానందాన్ని అనుభవింపచేసేవాడి 'సుషుమ్న' అని అంటారు. (చూ. ఓరుగంటి నీలకంఠశాస్త్రి 'తిక్కయజ్వ హరిహరనాథ తత్త్వము' పు.359).

ఈ పద్యంలో 'అమృత' స్వరూపంగా 'అనామయంగా'. 'అవ్యయంగా' చెప్పబడ్డ ఆనందం యోగ సాధనలో లభించే ఆనందమే. ఇడా పింగళలు సవ్యాపసవ్యాలు కాగా హరిహరతత్త్వం 'సుషుమ్న' అనటమే సమంజసం.

క. వినుత చతుర్వర్ణక సం । జనక ముఖ భుజోరుపాద! సంవి దభేదా!

మునిహృత్కమల మరాళా! జనన మరణ హరణ చరణ సరసిజలీలా! 227

ప్రతిపదార్థం: వినుత= ప్రసిద్ధమైన; చతుర్వర్ణక= నాలుగు వర్ణాలకు; సంజనక= ఉత్పత్తిహేతువైన; ముఖ+భుజ+ఊరు+పాద!= ముఖం, భుజాలు, తొడలు, పాదాలు కలవాడా!; సంవిద్+అభేదా!= సంవిత్తు కన్నా భిన్నం కానివాడా!; మునిహృత్కమలమరాళా!= మునుల హృదయాలు అనే కమలాలలో సంచరించే హంస స్వరూపుడా!; జనన మరణ= పుట్టుక చావులనే రూపం కలిగిన సంసారాన్ని; హరణ= హరించే; చరణ సరసిజలీలా!= పాదపద్మాల విలాసం కలవాడా! నీకు నమస్కారం.

తాత్పర్యం: స్వామీ! ప్రశస్తమైన నాలుగు వర్ణాలకు మూలమైన ముఖాద్యవయవాలు కలిగినవాడివి నీవు. నీవు అఖండ చైతన్య స్వరూపుడివి. జ్ఞానుల హృదయ కమలాలలో సంచరించే హంస స్వరూపుడివి. జనన మరణ భయం లేకుండా చేసే పాదపద్మాలు కలవాడివి.

విశేషం: బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు విరాట్పురుషుడి ముఖ బాహు ఊరు పాదాలనుండి జనించారని పురుషసూక్తం (ఈ విషయం ముందటి ఆశ్వాసాలలో వివరించబడింది).

'సంవిత్తు' అని ఏ అఖండ చైతన్యం ఈ ఆశ్వాసంలో బోధించబడిందో అది హరిహర ప్రకాశమే అని ఈ స్తుతిని బట్టి అర్థం అవుతుంది.

'హంస' అనేమాట 'సోహం' అనేమాటను తిప్పిచూస్తే తెలుస్తుంది. 'అహం బ్రహ్మాస్మి' అనే బ్రహ్మజ్ఞానం ఉన్నవాడు హంస. యోగుల హృదయాలు ద్వంద్వ తిమిరం నశించి అవధూతాలైనవి. అందుకే తెల్లగా ఉంటాయని పురాణాల కల్పన. దానికి రూపకల్పనే ఈ 'హంస'.

ముక్తి 'పదం' చేరినవాడికి జననమరణ క్లేశం లేదు - అని ఈ ఆశ్వాసంలో ప్రతిపాదించిన తాత్పర్యాన్ని ఇక్కడ హరిహర స్వామికి విశేషణంగా తిక్కనగారు ప్రయోగించారు.

మాలిని.

పదనమదమరాళీ! భక్త సంపోషశాలీ!

విదళిత సురవైరీ! విశ్వలోకైకధారీ!

మదరహిత హితైషీ! మాన్యయోగ ప్రతోషీ!

సదవన పరచిత్తా! సర్వనిర్మాణ వేత్తా! 228

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: పదనమత్+అమరాళీ!= పాదాలకు వినయంగా నమస్కరిస్తున్న దేవతల సముదాయం కలవాడా!; భక్త సంపోషశాలీ!= భక్తులను బాగా పోషించేవాడా!; విదళితసురవైరీ!= రాక్షసులను చీల్చి చెండాడేవాడా!; విశ్వలోకైకధారీ!= సర్వలోకాలను ఒకడై భరించేవాడా!; మదరహితహితైషీ!= మదాది దుర్గుణాలు లేని వారి మంచిని కోరే వాడా!; మాన్యయోగ ప్రతోషీ!= ఉత్తమమైన యోగవిద్యచేత సంతోషించేవాడా!; సత్+అవన పరచిత్తా!= సత్పురుషులను కాపాడటంలో ఆసక్తమైన మనస్సు కలవాడా!; సర్వనిర్మాణవేత్తా! చరాచర జగత్తు నంతటినీ ఎట్లా నిర్మించాలో తెలిసినవాడా!.

తాత్పర్యం: స్వామీ! నీ పాదపద్మాలకు దేవతలు కూడా వినయంగా నమస్కరిస్తారు. నీవు భక్తులను నిరంతరం రక్షిస్తావు. పోషిస్తావు. రాక్షసులను వధించి దేవతలను కాపాడుతావు. సర్వలోకాన్ని నీవు ఒక్కడివే భరిస్తున్నావు. కామాది దుర్గుణాలు లేని వారి హితాన్ని వహిస్తావు. యోగవిద్య నీకు పరమ ప్రీతికరమైనది. నీవు సదా సత్పురుషులను కాపాడుతావు. నీవు సకల జగత్కల్పన క్రమం ఎరిగినవాడివి.

విశేషం: ఇంద్రాదులు కూడా ఎవరి పాదంబులను ఉపాసించి బ్రహ్మతత్త్వ పరిజ్ఞానంచేత పరిపూతులవుతారో ఆ 'పరమపద' మూర్తి హరిహరనాథుడు.

"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"

అని స్వామి ప్రతిజ్ఞ. కాబట్టి రాక్షససంహారం, భక్తసంపోషణ, లోకస్థితిపాలన, సద్గుణుల హితాన్ని కోరటం ఆయన ధర్మం.

"యోగ క్షేమం వహామ్యహమ్" అని కూడా ఆయనే సెలవిచ్చారు.

సర్గ నిర్మాణ విషయం ఈ పర్వంలో సమగ్రంగా వివేచింపబడింది. బ్రహ్మతత్త్వంనుండి పుట్టిన జగత్తు మరలా బ్రహ్మలో లీనం కావటమే ఆ నిర్మాణ రహస్యం. దానిని తెలిసినవాడు స్వామిమాత్రమే. అందుకే గీతను సెలవిచ్చిన స్వామి 'అనుగీత'ను సెలవిచ్చాడు.

భగవద్గీతలో 'కర్మ' యోగం ప్రధానంగా చేసి చెప్పి, ఈ అనుగీతలో ఉపనిషద్విద్య సారాంశాన్ని అంతా 'జ్ఞాన' యోగ సంస్థాపనకొరకు చేయటం ద్వారా కూడా తిక్కనగారు హరిహరాద్వైతాన్ని ప్రతిష్ఠించారు. ఇదే అత్యుత్తమ సాధక మార్గమని ఆయన సిద్ధాంతం.

గద్యము

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన
శ్రీమహాభారతంబున నశ్వమేధపర్వంబునందుఁ ద్వితీయాశ్వాసము

ప్రతిపదార్థం: ఇది= ఈ రచన; శ్రీమత్= మంగళకరుడైన; ఉభయకవిమిత్త్ర= కావ్యశాస్త్ర కవులిరువురికీ మిత్రుడైనవాడు, బుధ+ఆరాధన విరాజి= పండితులను (జ్ఞానులను) సేవించటం వలన కీర్తితో ప్రకాశించేవాడు; తిక్కన సోమయాజి= సోమయాజి అయిన తిక్కన చేత; ప్రణీతంబు+ఐన= రచించబడిన; శ్రీ మహాభారతంబునన్; అశ్వమేధ పర్వంబునందున్; ద్వితీయాశ్వాసము= రెండవ ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది ఉభయకవిమిత్త్రడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, జ్ఞానులచేత ఆరాధించబడి రాణించే వాడూ అయిన తిక్కన సోమయాజి శుభప్రదంగా రచించిన శ్రీ మహాభారతంలోని అశ్వమేధపర్వంలో రెండవ ఆశ్వాసం.

అశ్వమేధపర్వంలోని రెండవ ఆశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతము

అశ్వమేధపర్వము - తృతీయాశ్వాసము

శ్రీనగసుతాత్వ మహిత వి। ధానుత శశ్వల్లస ల్లతా వేష్టన హే

లా నిత్య శాద్వలతరు। త్వానుగుణ ఫలప్రదత్వ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: హరిహరనాథా!= ఓ హరిహరనాథ స్వామీ! శ్రీనగసుతాత్వ = లక్ష్మీభావమూ; పర్వత పుత్రిక అయిన పార్వతి భావమూ అనే; మహిత= గొప్ప; విధా= ప్రకారములచేత; నుత= పొగడబడిన; శశ్వత్= స్థిరమయిన; లసత్= ఒప్పుతున్న; లతా= తీగలయొక్క; ఆవేష్టన= అల్లుకొనటం అనే; హేలా= విలాసంచేత; నిత్య= ఎల్లప్పుడునూ, శాద్వల= పచ్చగా ఉన్న; తరుత్వ= వృక్షభావానికి; అనుగుణ= తగినట్లుగా; ఫల+ప్రదత్వ!= ఫలాలను ఇచ్చే స్వభావం కలవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! లక్ష్మీపార్వతులు అనే తీగలు నిన్ను నిత్యమూ మనోహరంగా అల్లుకొని ఉన్నాయి. అందువలననే నీవు ఎల్లప్పుడూ పచ్చగా ఉండే చెట్టుమాదిరిగా ప్రకాశిస్తున్నావు. పచ్చగా ఉన్న చెట్టే పండ్లు ఇస్తుంది. అదే విధంగా నీవు నిన్ను ఉపాసించేవారి కోరికలు ఫలింపజేస్తున్నావు.

విశేషం: లక్ష్మి నిత్యమూ విష్ణువు రొమ్మున ఉంటుంది. పార్వతి ఎల్లప్పుడూ శివుడికి అర్ధశరీరంగా ఉంటుంది. అందుచేత లక్ష్మీపార్వతులు అనే తీగలు స్థిరంగా విష్ణుపరమేశ్వర స్వరూపుడయిన హరిహరనాథు డనే వృక్షాన్ని చుట్టుకొని ఉన్నవని చెప్పటం సముచితంగా ఉన్నది.

లక్ష్మీపార్వతు లనే తీగలు ఎల్లప్పుడూ అల్లుకొని ఉండటంవలననే హరిహరనాథు డనే వృక్షం పచ్చగా ఉన్నది. భక్తులకు అభిమత ఫలాలను ప్రసాదింపగలుగుతున్నది. కాబట్టి హరిహరనాథుడి వరప్రదాయకత్వానికి వారిద్దరూ మూలకారణం అవుతున్నారు. లక్ష్మీపార్వతు లిద్దరూ ఒకే శక్తియొక్క రెండు రూపాలు. కవిబ్రహ్మ తిక్కనే విరాటపర్వం మొదట్లోనే '**శ్రీయన గౌరినాఁ బరఁగు చెల్వకు**' అని చెప్పాడు. శక్తి తోడ్పడినప్పుడే పరమాత్మ అయిన హరిహరనాథుడు పనులు చేయగలుగుతున్నాడు. అందువలననే శంకర భగవత్పాదులు సౌందర్యలహరి ప్రారంభ శ్లోకంలో **"శివ శ్శక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుం, నచే దేవం దేవో నఖలు కుశలః స్పన్దితు మపి"** అని వక్కాణించారు. శివుడు - పరమాత్మ - శక్తితో కూడుకొని ఉన్నప్పుడే ప్రపంచసృష్టి చేయగలుగుతున్నాడనీ, శక్తియుక్తుడు కాకపోతే ఆయన కదలటానికి కూడా శక్తిమంతుడు కాడనీ, శ్లోకార్థం. త్రిమూర్తులూ సైతము శక్తిని సేవించవలసినవారే అని ఆచార్యులవారు చెప్పారు.

లక్ష్మీపార్వతులయందు తీగలధర్మాన్నీ హరిహరనాథునిలో వృక్షభావాన్నీ ఆరోపించి, అభేదం చెప్పటంచేత ఈ పద్యంలో రూపకాలంకారం ఉన్నది.

తాను ద్వారక కరుగవలయు నని యర్జునునిఁ గృష్ణుఁ డడుగుట (సం.14-50-49)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె నట్లు ఫల్గును నఫల్గు విద్యా విశారదుం జేసి శౌరి యతనితోడ. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయనుడు; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; శౌరి= శ్రీకృష్ణుడు; అట్లు= ఆ విధంగా; ఫల్గునిన్= అర్జునుడిని; అఫల్గు= అమోఘమయిన; విద్యా= విద్యయందు; విశారదున్= నేర్పరినిగా; చేసి; అతనితోడన్= ఆ అర్జునుడితో.

తాత్పర్యం: వైశంపాయనుడు జనమేజయుడితో ఈ విధంగా అన్నాడు. శ్రీకృష్ణుడు ఆ విధంగా అర్జునుడిని అధ్యాత్మవిద్యా నిపుణుడిగా తీర్చిదిద్ది అతడితో. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అశ్వమేధపర్వ ప్రథమ ద్వితీయాశ్వాసాలలో శ్రీకృష్ణుడు ఎన్నో అధ్యాత్మ విద్యా విషయాలను అర్జునుడికి బోధించాడనే విషయం ఇక్కడ గుర్తుకు తెచ్చుకొనాలి.

క. **'నా చిత్తము వసుదేవునిఁ । జూచుట గోరియును, నీవు సుమనోవృత్తిం**
జూచి, యనుమతి యొనర్చుట । వేచినయది; నన్నుఁ బుచ్చవే ద్వారకకున్.' **3**

ప్రతిపదార్థం: నా= నాయొక్క; చిత్తము= మనస్సు; వసుదేవునిన్= తండ్రి అయిన వసుదేవుడిని; చూచుట; కోరియును= కోరినప్పటికీ; నీవు= అర్జునా! నీవు; సుమనస్= మంచిమనస్సుయొక్క; వృత్తిన్= స్థితితో (సుమనస్సు అంటే సంతోషం, సంతోషపూర్వకంగా అని కూడా అర్థం చెప్పవచ్చును); చూచి= ఆలోచించి; అనుమతి+ఒనర్చుట= అంగీకరించటం; వేచిన+అది= ఎదురుచూస్తున్నది; నన్నున్= నన్ను; ద్వారకకున్= ద్వారకకు; పుచ్చవే!= పంపుమా!

తాత్పర్యం: 'అర్జునా! మా తండ్రి వసుదేవుడిని చూడాలని నా మనస్సు ఆరాటపడుతున్నది. అయినప్పటికీ నీ అంగీకారంకొరకు ఎదురుచూస్తున్నాను. నీవు మంచి సెబ్బరలు విచారించి నన్ను సంతోషపూర్వకంగా ద్వారకకు పంపుము.'

విశేషం: నరనారాయణు లయిన కృష్ణార్జునుల ఆత్మీయతను ఈ పద్యం నిరూపిస్తున్నది.

చ. **అనవుడు నక్కిరీటి దగ నయ్యదువంశ వరేణ్యుతోడ ని**
ట్లను; 'నటు లేనిఁ బోవలయు హస్తిపురంబున; కిత్తెఱంగు సె
ప్పిన నిను ధర్మనందనుఁడు ప్రీతిగ నందుల కన్పిపుచ్చు; న
య్యనుమతి గల్గునట్లు దగ నాడెద నవ్విభుపాల నచ్యుతా!' **4**

ప్రతిపదార్థం: అనవుడున్= శ్రీకృష్ణు డా విధంగా పలికిన తరువాత; ఆ+కిరీటి= ఆ అర్జునుడు; ఆ+యదువంశ+వరేణ్యునితోడన్= ఆ యదువంశ ముఖ్యుడితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; అచ్యుతా!= శ్రీకృష్ణా!= అటులు+ఏనిన్= అట్లయితే; హస్తిపురంబునకున్= హస్తినాపురానికి; పోవలయున్= మనం ఈ ఇంద్రప్రస్థంనుండి వెళ్ళాలి; ఈ+తెఱంగు= ద్వారకకు వెళ్ళాలనుకొంటున్న నీ యీ తీరును గూర్చి; చెప్పినన్= చెప్పినట్లయితే; ధర్మనందనుఁడు= యముని కుమారుడు ధర్మరాజు; నినున్= నిన్ను; ప్రీతిగన్= సంతోషంగా; అందులకున్= ద్వారకకు; అన్పిపుచ్చున్= పంపిస్తాడు; ఆ+విభు= ఆ మహారాజుయొక్క; పాలన్= సమక్షంలో; ఆ+అనుమతి= నీవు వెళ్ళటానికి అంగీకారం; కల్గు+అట్లు= లభించేటట్లుగా; తగన్= తగిన విధంగా; ఆడెదన్= మాటాడుతాను.

తాత్పర్యం: శ్రీకృష్ణు డావిధంగా మాటాడిన తరువాత, అర్జునుడు అతడితో 'అట్లయితే మనం వెంటనే ఈ ఇంద్రప్రస్థంనుండి హస్తినాపురం వెళ్ళాలి. నీ ద్వారకాప్రయాణాన్ని గూర్చి చెప్పితే సంతోషంగా ధర్మరాజు నిన్ను పంపిస్తాడు. ఆ మహారాజు అంగీకరించేటట్లు నేను కూడా సమయోచితంగా మాటాడుతాను.'

వ. అనిన విని దామోదరుండు దారుకు రావించి, 'రథంబు పూన్పు' మని నియోగించెఁ; దదనంతరంబ ధనంజయుండు దమతోడం జనుదేరం దగుపరివారంబు సమకట్టం బడవాళ్ళం బనిచె; నొక్కింతసేపునకు దారుకుండునుం దే రాయితంబుసేసి తేరం, బడవాళ్ళునుం బరిజనంబుల సన్నద్ధులం గావించి సన్నిహితులంజేయ, నా కృష్ణార్జునులు ప్రయాణోచితాలంకారాలంకృతులై, రథంబెక్కి, కరినగరపథంబు గైకొని చను సమయంబున. 5

ప్రతిపదార్థం: అనినన్= అర్జునుడు పై విధంగా అనగా; విని; దామోదరుండు= శ్రీకృష్ణుడు; దారుకున్= దారుకుడనే పేరు కలిగిన తన సారథిని; రావించి= రప్పించి; రథంబును= రథమును; పూన్పుము= గుర్రాలు కట్టి సిద్ధం చేయుము; అని; నియోగించెన్= ఆజ్ఞాపించాడు; తదనంతరంబు+అ= ఆ వెంటనే; ధనంజయుండు= అర్జునుడు; తమతోడన్= తమతోపాటు; చనుదేరన్= రావటానికి; తగు= తగిన; పరివారంబున్= సేవకులను, బలగమును; సమకట్టన్= సిద్ధంచేయగా; పడవాళ్ళన్= సేనాపతులను; పనిచెన్= ఆజ్ఞాపించాడు; ఒక్కింతసేపునకున్= కొంతసేపటికి; దారుకుండునున్= దారుకుడునూ; తేరు= రథాన్ని; ఆయితంబు+చేసి= సిద్ధంచేసి; తేరన్= తీసికొనిరాగా; పడవాళ్ళునున్= సేనానాయకులు కూడా; పరిజనంబులన్= సేవకులను; సన్నద్ధులన్= సిద్ధమయిన వారినిగా; కావించి= చేసి; సన్నిహితులన్= దగ్గర ఉన్నవారినిగా; చేయన్= చేయగా - దగ్గరకు తీసికొనిరాగా; ఆ+కృష్ణార్జునులు= ఆ కృష్ణుడునూ, అర్జునుడునూ; ప్రయాణ= ప్రయాణానికి; ఉచిత= తగిన; అలంకార= హారాలు మొదలైన నగలను; అలంకృతులు+ఐ= అలంకరించుకొన్నవారై; రథంబు; ఎక్కి; కరినగరంబు= హస్తినాపురంయొక్క; పథంబు= మార్గం; కైకొని= పట్టి; చను= వెళ్ళే; సమయంబునన్= సమయంలో.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా అనగా విని, కృష్ణుడు దారుకుడిని రప్పించి, రథం సిద్ధంచేయుమని ఆజ్ఞాపించాడు. అర్జునుడు కూడా తమతోపాటు హస్తినాపురానికి రావటానికి తగిన బలగాన్ని సిద్ధంచేయండని సేనాపతులను ఆజ్ఞాపించాడు. కొంతసేపటికి దారుకుడు రథాన్ని సిద్ధంచేసి తీసికొని వచ్చాడు. సేనా నాయకులుకూడా సేవకులను సిద్ధంచేసి సముఖానికి తీసికొని వచ్చారు. తరువాత కృష్ణార్జునులు ప్రయాణానికి తగ్గట్టుగా అలంకరించుకొని రథం ఎక్కి హస్తినాపురం దారిపట్టి వెళ్ళేటప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. వినయ మారంగ గోవిందున కిట్లను। గాండీవి; 'దేవ! నీ కరుణఁ జేసి
కౌరవసైన్యసాగర ముత్తరింపంగఁ। గంటిమి; గురు భీష్మ కర్ణ ముఖ్య
దుర్జయవీరుల నిర్జించితిమి; నీవు। శాత్రవ యోధుల సమయఁ జేయ,
వెనుక నేము జయంబు గొనుచు వచ్చితిమి; తే। జంబును బేరు సౌఖ్యంబు నతుల

తే. మైన భవదీయ సుప్రసాదాతిశయము। కతనఁ బడసితి; మప్రతిహత మహాబ్ధి
రాజ్య సంపూజ్యుఁ డయ్యె ధర్మజుఁడు; సంశ్రి। తాభిరక్షణవ్రత నిరతాంతరంగ! 6

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: గాండీవి= అర్జునుడు; వినయము; ఆరంగన్= ఒప్పగా; గోవిందునకున్= శ్రీకృష్ణుడితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; దేవ!= పరమాత్మా!; సంశ్రిత= ఆశ్రయించినవారిని; అభిరక్షణ= పూర్తిగా రక్షించటం అనే; వ్రత= కార్యమందు; నిరత= ఆసక్తి కలిగిన; అంతరంగ!= హృదయం కలవాడా!; నీ= నీయొక్క; కరుణన్+చేసి= దయవలన; కౌరవ= కౌరవులయొక్క; సైన్య= సైన్యమనే; సాగరము= సముద్రాన్ని; ఉత్తరింపంగన్+కంటిమి= దాటగలిగాము; గురు= ఆచార్యుడయిన ద్రోణుడు; భీష్మ= భీష్ముడు; కర్ణ= కర్ణుడూ అనే; ముఖ్య= ప్రధానమయిన; దుర్జయ= జయించ శక్యంగాని; వీరులన్= వీరులను; నిర్జించితిమి= జయించాము; నీవు; శాత్రవ= శత్రువులైన; యోధులన్= వీరులను; సమయన్+చేయన్= నశింపచేయగా; వెనుకన్= ఆ తరువాతనే; ఏము= మేము; జయంబు= జయం; కొనుచున్+వచ్చితిమి= పొందగలిగాము; తేజంబును= ప్రభావాన్నీ; పేరు= కీర్తినీ; సౌఖ్యంబున్= సుఖాన్నీ; అతులము= సాటిలేనిది; ఐన= అయినట్టి; భవదీయ= నీయొక్క; సుప్రసాద= శోభను కలిగించే దయయొక్క; అతిశయము= అధిక్యం; కతనన్= వలన; పడసితిమి= పొందాము; ధర్మజుఁడు= ధర్మరాజు; అప్రతిహత= ఎదురులేని; మహత్= గొప్ప; ఆధిరాజ్య= సార్వభౌమత్వంవలన; సంపూజ్యుఁడు= మిక్కిలి పూజింపదగినవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: అర్జునుడు వినయపూర్వకంగా కృష్ణుడితో ఈ విధంగా అన్నాడు. 'పరమాత్మా! ఆశ్రితజన సంరక్షకా! నీ దయవలన మేము కౌరవసైన్య సముద్రాన్ని దాటగలిగాము. జయించటానికి అసాధ్యులయిన ద్రోణుడూ, భీష్ముడూ, కర్ణుడూ మొదలైన ప్రధాన వీరుల నందరినీ జయించాము. వాస్తవానికి నీవే శత్రువీరుల నందరినీ నశింపజేశావు. ఆ తరువాతనే మేము జయం పొందగలిగాము. నీ దయవలననే మేము తేజస్సునూ, కీర్తినీ, సుఖాన్నీ పొందాము. ధర్మరాజు సార్వభౌముడై అందరికీ పరమపూజ్యు డయ్యాడు.

విశేషం: కౌరవసైన్య సాగరము - కౌరవసైన్యం ఉపమేయం. సాగరం ఉపమానం. ఉపమానం అయిన సాగరంయొక్క ధర్మం ఉపమేయమయిన కౌరవసైన్యానికి ఆరోపించి, రెండింటికీ అభేదం కల్పించటం జరిగింది కాబట్టి రూపకాలంకారం.

క. నీ మహిమ వొగడఁ గొలఁదియె? । దామోదర! విశ్వసంవిధాతవు; భవదీ
యామల తేజమ యగ్ని । ష్టోమము; గాలాత్మకత్వ శోభివి కృష్ణా! 7

ప్రతిపదార్థం: దామోదర!= ఉదరమున తులసిమాల కలవాడా! లేదా బాల్యంలో యశోదకట్టిన త్రాడు ఉదరమున - నడుమున కలవాడా!; కృష్ణా!; నీ= నీయొక్క; మహిమన్= గొప్పతనాన్ని; పొగడన్= పొగడగా; కొలఁది+ఎ?= సాధ్యమా?; విశ్వ= ప్రపంచముయొక్క; సంవిధాతవు= మహా సృష్టికర్తవు; భవదీయ= నీయొక్క; అమల= స్వచ్ఛమయిన; తేజము+అ= ప్రకాశమే; అగ్నిష్టోమము= అగ్నుల సమూహం; కాల+ఆత్మకత్వ= కాల స్వరూపకత్వంతో; శోభివి= ప్రకాశించేవాడవు.

తాత్పర్యం: కృష్ణా! నీ గొప్పతనం పొగడటం సాధ్యంకాదు. నీవు విశ్వసృష్టికర్తవు. అగ్నులు నీ వెలుగులే! నీవు కాలస్వరూపుడవు.

విశేషం: అగ్నిష్టోమ మంటే అగ్నుల సమూహం. సంస్కృత భారతంలో ఈ ప్రకరణంలో **"త్వత్తేజస్సంభవో నిత్యం హుతాశో మధుసూదన"** అని ఉండటమే దీనికి కారణం.

క. భవదీయ శ్వసనము వా । యువు; నీ క్రోధముఁ బ్రసాద యోగంబును మృ
త్యువు లక్ష్మియు; నీ వలనన । యవుఁ బ్రీతియు మరణమును మహానందంబున్. 8

ప్రతిపదార్థం: భవదీయ= నీయొక్క; శ్వసనము= ఊపిరి; వాయువు= పంచభూతాలలో ఒకటయిన గాలి; నీ= నీయొక్క; క్రోధముఁ= ఇష్టార్థం ప్రాప్తించటానికి ఆటంకం కలిగినప్పుడు ఏర్పడే మానసిక వికారం, కోపం; ప్రసాద= దయయొక్క; యోగంబును= కలయికయే; మృత్యువు= మరణం; లక్ష్మియున్= సంపద; నీ వలనన్+అ= నీవలననే; ప్రీతియున్= సంతృప్తి; మరణమును= చావును; మహత్= గొప్ప; ఆనందంబున్= ఆనందమూ; అవున్= అగును.

తాత్పర్యం: నీ ఊపిరి వాయువు. నీ కోపం మృత్యువు. నీ అనుగ్రహం సంపద. నీ వలననే సంతృప్తీ, మరణమూ, ఆనందమూ కలుగుతున్నాయి.

విశేషం: "నీ క్రోధముఁ బ్రసాదయోగంబును మృత్యువు, లక్ష్మియు" అనేచోట క్రమంగా చెప్పిన వస్తువులకు క్రమంగా అన్వయం చెప్పటం జరిగింది. కాబట్టి యథాసంఖ్యాలంకారం. ఇదే క్రమాలంకారం.

క. స్థావర జంగమ మయ జగ। దావిర్భావ స్థితి క్రియా విలయంబుల్
నీవలనన యగుచుండును। భావాతీతుఁడవు; సర్వపతివి; ముకుందా!' 9

ప్రతిపదార్థం: ముకుందా!= కృష్ణా!; స్థావర= స్థిరంగా నిలిచే పదార్థాలయొక్క; జంగమ= సంచరించే ప్రాణులయొక్క; మయ= రూపమయిన; జగత్= ప్రపంచముయొక్క; ఆవిర్భావ= పుట్టుట; స్థితిక్రియా= ఉనికి; విలయంబు= వినాశమూ; నీవలనన్+అ= నీవలననే; అగుచున్+ఉండును= సంభవిస్తూ ఉంటాయి; భావ= ఊహకు; అతీతుఁడవు= అందనివాడవు; సర్వ= సమస్తమైన సృష్టికీ; పతివి= సంరక్షకుడవు.

తాత్పర్యం: ప్రాణుల అప్రాణుల రూపమయిన ఈ ప్రపంచం సృష్టిస్థితి లయాలు నీవలననే జరుగుతున్నాయి. నీవు ఊహకు కూడా అందేవాడవు కావు. నీవే సమస్తసృష్టికీ సంరక్షకుడవు.'

వ. అని వెండియు. 10

తాత్పర్యం: అని చెప్పి; ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం)

శ్రీకృష్ణార్జును లింద్రప్రస్థమున నుండి హస్తినాపురంబునకు వచ్చుట (సం.14-51-15)

క. 'నారద దేవల కౌశిక। పారాశర్యాది మునుల పలుకుల, భీష్మో
దారవచనముల నిను నఘ। దూరా! యే నెఱిఁగియుండుదును సకలముగన్. 11

ప్రతిపదార్థం: అఘ!= పాపమునకు; దూరా!= దూరంగా ఉన్నవాడా!; నారద= నారదుడు; దేవల= ధర్మశాస్త్రకర్త అయిన దేవలుడూ; కౌశిక= విశ్వామిత్రుడూ; పారాశర్య= పరాశరమహర్షి కుమారుడయిన వ్యాసుడూ; ఆది= మొదలయిన; మునుల= మునులయొక్క; పలుకులన్= మాటలచేతనూ; భీష్మ= భీష్ముడియొక్క; ఉదార= గొప్పవి అయిన; వచనములన్= మాటలవలననూ; ఏన్= నేను; నినున్= నిన్ను; స+కలము+కన్= సగుణబ్రహ్మ స్వరూపంగా; ఎఱింగి= తెలిసికొని; ఉండుదును= ఉంటిని.

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! నారదాది మహామునులూ, భీష్ముడూ చెప్పిన గొప్ప మాటలవలన నిన్ను సగుణబ్రహ్మ స్వరూపంగా తెలిసికొన్నాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. కావున. 12

తాత్పర్యం: కాబట్టి- (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నావలని కరుణ పెంపున। నీవు ప్రసాదించినట్టి నిరవద్యక వి
ద్యా విస్తారంబున దృఢ। తావిశదమతిన్ రమించెదం గ్రతుపురుషా!' 13

ప్రతిపదార్థం: క్రతుపురుషా!= విష్ణుమూర్తీ!; నావలనన్= నా యందలి; కరుణ= దయయొక్క; పెంపునన్= ఆధిక్యంచేత; నీవు; ప్రసాదించిన= అనుగ్రహించిన; అట్టి; నిరవద్యక= దోషంలేని, ప్రశస్తమయిన; విద్యా= అధ్యాత్మవిద్యయొక్క; విస్తారంబునన్= ఆధిక్యంవలన, వైశాల్యంవలన అని అర్థం; దృఢతా= జ్ఞానబలంతో కూడిన; విశద= శాంతమయిన; మతిన్= బుద్ధితో; రమింతున్= బ్రహ్మానంద మనుభవిస్తాను.

తాత్పర్యం: విష్ణుమూర్తీ! నాయందలి దయతో నీవు విపులంగా అనుగ్రహించిన అధ్యాత్మవిద్యవలన నా బుద్ధికి జ్ఞానబలమూ; శాంతీ సమకూరాయి. ఇందువలన నేను బ్రహ్మానంద మనుభవిస్తాను.'

వ. అని యిట్లు సభక్తికంబుగా సంభాషణంబు సేసిన, వాసుదేవుండును వితతాదరవాక్యంబుల నభినందించె; నప్పురుషవరు లట్లు సల్లాపంబులు సేయుచుం బోయి, తమరాకకు సమలంకృతంబైన సామజపురంబు ప్రవేశించి, ధృతరాష్ట్రు మందిరంబున కరిగి, యక్కురువృద్ధుని గాంధారినిం బ్రణామ వినయ విశేషంబులం బ్రీతులంజేసి, కుంతీసమారాధనం బాచరించి, విదుర ధౌమ్య యుయుత్సు సంజయుల దర్శనంబులు సముచిత ప్రకారంబుల నడపి, కౌంతేయాగ్రజు నత్యంత భక్తిపూర్వకంబుగా సమంచిత విధంబునం గాంచి, తదాలింగ నాద్యాదరణంబులు వడసి; రప్పద్మనాభుండు నాఁడు సవ్యసాచి సదనంబున నతని చేయు పూజావిధానంబుల మానసంబలర వసియించి, మఱునాఁడు మహనీయాస్థానమండపంబున నున్న యన్నరేంద్రు కడకు నుపేంద్రుం డయ్యింద్రసుతుండు తోడన చనం జని, సుఖగోష్ఠినుండె; నట్టియెడ నగ్గాండీవి యప్పాండవపూర్వజు నాననంబునఁ జూడ్కి నిలిపి, నిభృతుండై. 14

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; సభక్తికంబు+కాన్= భక్తితో కూడియుండేటట్లుగా; సంభాషణంబు+చేసినన్= మాటాడగా; వాసుదేవుండును= వసుదేవుడి కుమారుడును, కృష్ణుడును; వితత= విరివి అయిన; ఆదర= ప్రేమతోకూడిన; వాక్యంబులన్= మాటలచే; అభినందించెన్= పొగడాడు; ఆ+పురుషవరులు= ఆ మనుష్యులయందు శ్రేష్ఠులు; అట్లు= ఆ విధంగా; సల్లాపంబులు= పరస్పర సంభాషణలు; చేయుచున్= చేస్తూ; పోయి; తమ= తమయొక్క; రాకకున్= వచ్చుటకు; సమ్+అలంకృతంబు= చక్కగా అలంకరించబడినది; ఐన= అయిన; సామజపురంబు= హస్తినాపురం; ప్రవేశించి; ధృతరాష్ట్రు= ధృతరాష్ట్రుడియొక్క; మందిరంబునకున్= గృహానికి; అరిగి= వెళ్ళి; ఆ+కురువృద్ధునిన్= ఆ కురువంశంలో పెద్ద అయినవాడిని; గాంధారినిన్= గాంధారినీ; ప్రణామ= నమస్కారముయొక్క; వినయ= వినయముయొక్క; విశేషంబులన్= ఆధిక్యములతో; ప్రీతులన్= సంతోషించిన వారినిగా; చేసి; కుంతీ= కుంతీదేవియొక్క; సమారాధనంబు= సంతోషపెట్టటం; ఆచరించి= చేసి; విదుర= విదురుడియొక్క; ధౌమ్య= ధౌమ్యుడి యొక్క; యుయుత్సు= యుయుత్సుడియొక్క; సందర్శనంబులు= చూచుటలు; సముచిత= మిక్కిలి తగిన; ప్రకారంబులన్= విధాలుగా; నడపి= చేసి; కౌంతేయ= కుంతీకుమారులలో; అగ్రజున్= పెద్దవాడిని - ధర్మరాజును; అత్యంత= మిక్కిలి; భక్తి పూర్వకంబుగాన్= భక్తి కలిగేటట్లుగా; సమంచిత= మిక్కిలి పూజ్యమైన; విధంబునన్= విధంగా; కాంచి= చూచి;

తద్= ఆ ధర్మరాజుయొక్క; ఆలింగన= కౌగిలింత; ఆది= మొదలైన; ఆదరణంబులు= గౌరవములు; పడసిరి= పొందారు; ఆ+ పద్మనాభుండు= నాభియందు పద్మంకలవాడు, విష్ణుమూర్తి - కృష్ణుడు; నాఁడు= ఆ రోజు; సవ్యసాచి= అర్జునుడియొక్క; సదనంబునన్= గృహంలో; అతని చేయు= అతడు చేస్తున్న; పూజావిధానంబులన్= పూజాపద్ధతులచేత; మానసంబు= మనస్సు; అలరన్= సంతోషించగా; వసియించి= ఉండి; మఱునాఁడు= మరుసటిరోజున; మహనీయ= గొప్ప; ఆస్థానమండపంబునన్= కొలువు కూటంలో; ఉన్న; ఆ+నరేంద్ర!= ఆ రాజుయొక్క(ధర్మరాజు); కడకున్= దగ్గరకు; ఉపేంద్రుండు= శ్రీకృష్ణుడు; ఆ+ ఇంద్రసుతుండు= ఆ ఇంద్రుడి కొడుకు అర్జునుడు; తోడన్+అ= వెనువెంటే; చనన్= వెళ్ళగా; చని= వెళ్ళి; సుఖ= సుఖం కలిగించు; గోష్ఠిన్= సల్లాపంతో; ఉండెన్= ఉన్నాడు; అట్టి+ఎడన్= అట్టి సమయాన; ఆ+గాండీవి= ఆ గాండీవమనే విల్లు కలవాడు అర్జునుడు; ఆ+పాండవ= ఆ పాండవులయందు; పూర్వజ= ముందు పుట్టినవాడియొక్క, ధర్మరాజుయొక్క; ఆననంబునన్= ముఖమునందు; చూడ్కి= చూపు; నిలిపి= ఉంచి; నిభృతుండు+ఐ= వినయం కలవాడై.

తాత్పర్యం: ఈ విధంగా అర్జునుడు భక్తితో మాటాడిన మాటలకు కృష్ణుడు ప్రేమపూర్వకంగా అతడిని ప్రశంసించాడు. వారిద్దరూ పరస్పరం మాటాడుకొంటూ, ప్రయాణం సాగించి, హస్తినాపురం ప్రవేశించి ముందుగా ధృతరాష్ట్రుడి గృహానికి వెళ్ళారు. అక్కడ గాంధారీ ధృతరాష్ట్రులకు వినయపూర్వకంగా నమస్కరించి వారిని ఆనందింపజేశారు. తరువాత కుంతీదేవిని సంతోషింపజేశారు. పిదప విదురుడినీ, ధౌమ్యుడినీ, యుయుత్సుడినీ, సంజయుడినీ సందర్శించారు. భక్తిపూర్వకంగా ధర్మరాజును చూచారు. ధర్మరాజుకూడా వారిద్దరినీ కౌగిలించుకొని గౌరవించాడు. ఆ రోజు శ్రీకృష్ణుడు అర్జునుడి గృహంలో ఉండి, అతడు చేసే మర్యాదలకు ఎంతో సంతోషించాడు. మరునాడు అర్జునుడు వెంటరాగా కొలువుకూటంలో ఉన్న ధర్మరాజు దగ్గరకు వెళ్ళి సరససల్లాపం చేస్తూ ఉన్నాడు. అప్పుడు అర్జునుడు అన్న అయిన ధర్మరాజు ముఖం చూస్తూ వినయంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. **'కమలనాభుండు పెద్దయుఁ గాల మిచట । నున్నవాఁడు; దండ్రియును సహోదరాది**
సకల బంధులు నితని దర్శనము గోర । కుందురే; వారిఁ జూడ నీతండుఁ గోరె.' **15**

ప్రతిపదార్థం: కమలనాభుండు= నాభియందు పద్మం కలవాడు, శ్రీకృష్ణుడు; పెద్దయున్+కాలము= చాలాకాలం; ఇచటన్= ఈ హస్తినాపురంలో; ఉన్నవాఁడు= ఉన్నాడు; తండ్రియును= ఇతడి తండ్రి అయిన వసుదేవుడూ; సహోదర= సోదరులు; ఆది= మొదలయిన; సకల= సమస్తమైన; బంధులు= బంధువులు, చుట్టాలు; ఇతని= ఈ శ్రీకృష్ణుడియొక్క; దర్శనము= చూచుట; కోరక= కోరకుండా; ఉందురే?= ఉంటారా?; ఈతండున్= ఈ కృష్ణుడు కూడా; వారిన్= తండ్రినీ, సోదరులనూ, చుట్టపక్కాలనూ; చూడన్= చూచుట; కోరెన్= కోరాడు.

తాత్పర్యం: అగ్రజా! శ్రీకృష్ణుడు చాలాకాలం నుండీ హస్తినాపురంలో ఉన్నాడు. వసుదేవుడూ, సోదరులూ, చుట్టపక్కాలూ అందరూ ఇతడిని చూడాలని కోరుకుంటారు గదా! ఇతడు కూడా వారినందరినీ చూడాలనుకొంటున్నాడు.

క. **ద్వారకకు నిమ్మహాత్ముఁడు । మీ రనుమతిసేయఁ జని, యమేయగుణుల నా**
సీరిని వసుదేవుని గని । గౌరవ మెసఁగంగఁ దల్లిఁ గాంచి ముదమునన్. **16**

ప్రతిపదార్థం: మీరు; అనుమతి+చేయన్= సెలవిచ్చి పంపిస్తే; ఈ+మహాత్ముఁడు= ఈ గొప్ప జీవాత్మ కలవాడు - శ్రీకృష్ణుడు; ద్వారకకున్= ద్వారకకు; చని= వెళ్ళి; అమేయ= మితిలేని; గుణులన్= సద్గుణాలు కలవారిని; ఆ+సీరిని= ఆ నాగలిగలవాడిని, బలరాముడిని; వసుదేవునిన్= వసుదేవుడిని; కని= చూచి; గౌరవము; ఎసఁగంగన్= అతిశయించగా; తల్లిన్= తల్లి దేవకిని; కాంచి= చూచి; ముదమునన్= సంతోషంతో.

తాత్పర్యం: మీరు సమ్మతిస్తే ఈ పుణ్యాత్ముడు ద్వారకకు వెళ్ళి, అక్కడ బలరాముడిని, వసుదేవుడిని చూచి; దేవకిని సందర్శించి. (తరువాతి పద్యంతో అన్వయం)

క. తక్కటి సోదరుల, సుతుల, । నక్కునఁ బ్రియమారఁ జేర్చి, యప్పురజనులన్
మిక్కిలి మన్నన మక్కువ । నెక్కొనఁగా నాదరించి, నిలువక మగుడున్. 17

ప్రతిపదార్థం: తక్కటి= మిగిలిన; సోదరులన్= అన్నలనూ, తమ్ములనూ; సుతులన్= కుమారులనూ; ప్రియము= సంతోషం; ఆరన్= అతిశయించగా; అక్కునన్= రొమ్మునందు; చేర్చి; కౌగిలించికొని అని అర్థం; ఆ+పురజనులన్= ఆ ద్వారక ప్రజలను; మిక్కిలి; మన్నన= దయ; మక్కువ= ప్రేమ; నెక్కొనఁగాన్= అతిశయించగా; ఆదరించి= అనుగ్రహించి; నిలువక= ద్వారకలో ఎక్కువకాలం ఉండక; మగుడున్= తిరిగి వస్తాడు.

తాత్పర్యం: మిగిలిన సోదరులనూ, కుమారులనూ ప్రేమతో చూచి, ద్వారకా నివాసులను దయానురాగాలతో అనుగ్రహించి, శ్రీకృష్ణుడు ద్వారకలో ఎక్కువకాలం ఉండక తిరిగి హస్తినాపురం వస్తాడు.

సీ. దేవర యిప్పని దివ్యచిత్తంబునఁ । జూచి, మీ కెట్టులు చూడఁ బోలు
నట్టుల యుత్తరం బానతి యిత్తురు । గాక; నావుడు, నధిక ప్రియమున
మాతులుఁ గాంచి, యిమ్మాధవదేవుండు । మన మాఱుగాఁగ నమస్కృతులును
నాలింగనంబులు నాచరించి, హలాయు । ధుని దేవకీదేవిఁ గనిన యపుడు

తే. భక్తి మనకునై పూజించి, బంధుజనుల । నందఱను దత్తదౌచిత్య మభినుతముగ
నాదరించి, వారలకుశలానుయోగ । విధము నస్మత్కృతమ్ముగ విస్తరించి. 18

ప్రతిపదార్థం: దేవర!= ప్రభూ!; ఈ+పని= శ్రీకృష్ణుడిని అనుమతించటం; దివ్యచిత్తంబునన్= ఘనమయిన మీ మనస్సున; చూచి= ఆలోచించి; మీకున్= మీకు; ఎట్టులు= ఏ విధంగా; చూడన్= చేయగా; పోలున్= తగునో; అట్టులు+అ= అట్లే; ఉత్తరంబు= సమాధానం; ఆనతి+ఇత్తురు+కాక= సెలవియ్యవలయును; నావుడున్= అర్జును డీవిధంగా అన్న తరువాత; అధిక= మిక్కిలి; ప్రియమునన్= ప్రేమతో; ఈ+మాధవదేవుండు= ఈ భగవంతు డయిన కృష్ణుడు; మాతులున్= మేనమామను; వసుదేవుడిని; కాంచి= చూచి; మనమాఱు+కాఁగన్= మన బదులుగా; నమస్కృతులును= నమస్కారములును; ఆలింగనంబులున్= కౌగిలింతలును; ఆచరించి= చేసి; హల+ఆయుధున్= నాగలి ఆయుధంగా కలవాడిని బలరాముడిని; దేవకీదేవిన్= దేవకీదేవిని; కనిన+అపుడు= చూచినప్పుడు; భక్తిన్= భక్తితో; మనకున్+ఐ= మన నిమిత్తంగా; పూజించి; బంధుజనులన్= చుట్టపక్కాలను; అందఱను= అందరినీ; తత్+తత్+ఔచిత్యము= వారి వారికి తగ్గట్టుగా చూపు మర్యాద; అభినుతముగన్= పొగడబడినది కాగా; ఆదరించి= గౌరవించి; వారల= వారియొక్క; కుశల+అనుయోగ= కుశల ప్రశ్నలు వేసే; విధము= తీరు; అస్మద్+కృత మ్ముగన్= నాయొక్క సత్కారంగా లేదా నేను చేసినట్లుగా; విస్తరించి= సవిశేషంగా చెప్పి.

తాత్పర్యం: ప్రభూ! తాము చక్కగా ఆలోచించి, ఏ విధంగా చేయటం సమంజసంగా ఉంటుందో ఆ విధంగా సెలవియ్యండి' అని అర్జునుడు పలికాడు. తరువాత శ్రీకృష్ణుడు వసుదేవుడిని చూచి మనబదులుగా నమస్కారాలుచేసి కౌగిలించుకొనాలి. బలరాముడినీ, దేవకీదేవినీ మన నిమిత్తంగా పూజించాలి. చుట్టపక్కాల నందరినీ వారి వారికి తగ్గట్లుగా గౌరవించి వారి యోగక్షేమం తెలిసికొనటానికి నేను ప్రశ్నిస్తున్నట్లుగా వివరించాలి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. పరిజన యోగ క్షేమము। లరసి, పురజనమ్ములకుఁ బ్రియం బెసఁగఁగ వా
క్యరచనలుం గార్య సమా। చరణములు నొనర్చి, నడపి సఖి సత్కృతులున్. 19

ప్రతిపదార్థం: పరిజన= సేవకులయొక్క; యోగక్షేమములు= యోగమును, క్షేమమును (లేనిది సంపాదించటం యోగం; కలిగినది కాపాడుకొనటం క్షేమం. కుశలం అని ఇక్కడ అర్థం); అరసి= విచారించి; పురజనమ్ములకున్= ద్వారకా పౌరులకు; ప్రియంబు= సంతోషం; ఎసఁగఁగన్= అతిశయించగా; వాక్యరచనలున్= మాటలాడుటయు; కార్య= పనులయొక్క; సమాచరణములున్= చేయుటలును; ఒనర్చి= కావించి; సఖి= మిత్రులయొక్క; సత్కృతులున్= సత్కారములును; నడపి= చేసి.

తాత్పర్యం: సేవకుల యోగక్షేమాలు విచారించాలి. ద్వారకావాసులు సంతోషించేటట్లుగా మాటాడి ఆయా పనులు చేయాలి. మిత్రులను సత్కరించాలి.

తే. మఱియు వలయు కృత్యంబులుఁ దెఱఁగు పఱుప। వలసినన్ని దినంబులు నిలిచి, యశ్వ
మేధమునకు బాంధవజన మిత్త్ర భృత్య। వర్గ సహితుఁడై చనుదెంచువాఁడు గాక.' 20

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకనూ; వలయు కృత్యంబులున్= చేయదగిన పనులను; తెఱఁగు పఱుపన్= నెరవేర్చగా; వలసిన= ఆవశ్యకమైన; అన్ని దినంబులు= అన్ని రోజులు; నిలిచి= ద్వారకలో ఉండి; బాంధవజన= చుట్టపక్కాలయొక్క; మిత్త్ర= స్నేహితులయొక్క; భృత్య= సేవకులయొక్క; వర్గ= సమూహంతో; సహితుఁడు+ఐ= కూడినవాడై; అశ్వమేధమునకున్= మనం చేయబోయే అశ్వమేధానికి; చనుదెంచువాఁడు+కాక= వచ్చువాడు అగును గాక. (రావాలి అని అర్థం).

తాత్పర్యం: ఇంకా చెయ్యవలసిన పనులు నెరవేర్చటానికి పట్టినన్ని రోజులు ద్వారకలో ఉండి బంధుమిత్ర పరివార సమేతంగా అశ్వమేధయాగానికి వచ్చును గాక!'

క. అని ధర్మజుండు పలికిన। విని కృష్ణుఁడు సంతసిల్లి వినతుండై, గొం
తిని ద్రౌపదిఁ దగుమెయి వీ। డ్కొని తాను సుభద్రఁ దోడుకొనిపోవుటకున్. 21

ప్రతిపదార్థం: అని; ధర్మజుండు= ధర్మరాజు; పలికినన్= పలుకగా; కృష్ణుడు; విని; సంతసిల్లి= సంతోషించి; వినతుండు+ఐ= నమస్కరించినవాడై; గొంతిని= కుంతీదేవినీ; ద్రౌపదిన్= ద్రౌపదినీ; తగుమెయిన్= తగినవిధంగా; వీడ్కొని= పోయి వస్తానని చెప్పి వదలి; తాను; సుభద్రన్= సుభద్రను; తోడుకొని= వెంటబెట్టుకొని; పోవుటకున్= వెళ్ళటానికి.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు మాటాడగా శ్రీకృష్ణుడు సంతోషించి, అతడికి నమస్కరించాడు. తరువాత కుంతీదేవితో, ద్రౌపదితో వెళ్ళి వస్తానని చెప్పాడు. సుభద్రను తనతోపాటు తీసికొని వెళ్ళటానికి. (తరువాతి వచనంతో అన్వయం.)

వ. గొంతి యెంతయుం బ్రియంబున ననుజ్ఞ సేయుటయు, నర్జును ననుమతియుం గొని, 22

ప్రతిపదార్థం: గొంతి= కుంతీదేవి; ఎంతయున్= మిక్కిలి; ప్రియంబునన్= సంతోషంతో; అనుజ్ఞ+చేయుటయున్= సమ్మతించిన తరువాత; అర్జును= అర్జునుడియొక్క; అనుమతియున్= అంగీకారమును; కొని= పొంది.

తాత్పర్యం: కుంతీదేవి మహాసంతోషంతో సమ్మతించింది. తరువాత శ్రీకృష్ణుడు అర్జునుడి అంగీకారం కూడా పొందాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. వివిధ వాహనారూఢులై విభవ మెసఁగఁ। బాండవేయులుఁ దక్కిన బంధుజనులు
ననుప రాఁగ, సాత్యకి దోడ నరుగుదేరఁ। బురము వెడలి యొక్కెడ నిల్చి కరమునెమ్మి. 23

ప్రతిపదార్థం: పాండవేయులున్= పాండవులునూ; తక్కిన= మిగిలిన; బంధుజనులున్= చుట్టాలునూ; విభవము= హోదా, గొప్పతనం; ఎసఁగన్= అతిశయించగా; వివిధ= అనేక విధాలయిన; వాహన= వాహనాలను; ఆరూఢులు+ఐ= ఎక్కినవారై; అనుపన్= పంపగా; రాఁగన్= రాగా; సాత్యకి; తోడన్= వెంట; అరుగుదేరన్= రాగా, పురము= హస్తినాపురం నుండి, వెడలి= బయలుదేరి; ఒక్క+ఎడన్= ఒకచోట; నిల్చి= ఆగి; కరము= మిక్కిలి; నెమ్మిన్= ప్రీతితో.

తాత్పర్యం: పాండవులూ, మిగిలిన చుట్టాలూ, తమ హోదా వెల్లడయ్యేటట్లు రకరకాల వాహనాలు ఎక్కి కృష్ణుడిని సాగనంపటానికి వచ్చారు. ఆయన వెంట సాత్యకికూడా ఉన్నాడు. కృష్ణుడు హస్తినాపురంనుండి బయలుదేరి ఒకచోట ఆగి మహాప్రీతితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. సముచితభంగుల నందఱఁ। గ్రమమున వీడ్కొని, పథంబు గైకొని, తన చి
త్తము దృష్టియుఁ బాండవ మ। ధ్యముపై నొలయంగ నల్ల నరుగుచు నుండెన్. 24

ప్రతిపదార్థం: సముచిత= తగిన; భంగులన్= విధాలుగా; అందఱన్= అందరికీ; క్రమమునన్= వరుసగా; వీడ్కొని= సెలవిచ్చి పంపి; పథంబు= ద్వారకకు పోయేదారి; కైకొని= పట్టుకొని; తన= తనయొక్క; చిత్తము= మనస్సు; దృష్టియున్= చూపును; పాండవ= పాండవులందు; మధ్యము= అర్జునుడి; పైన్= మీద; ఒలయంగన్= వ్రాలగా; అల్లన్= మెల్లగా; అరుగుచున్+ఉండెన్= వెళ్ళుతున్నాడు.

తాత్పర్యం: కృష్ణుడు తగినట్లుగా అందరికీ సెలవిచ్చి పంపి ద్వారకకు పోయేదారిపట్టి మెల్లగా వెళ్ళుతున్నాడు. కాని, అతడి మనస్సూ, చూపూ అర్జునుడిమీదే నిలిచి ఉన్నాయి.

ఆ. అట్లు మరలి మరలి యర్జునుం జూచుచుఁ। జనఁగ, నతఁడు సూడ్కి సనినయంత
దవ్వుఁ జూచుచుండె నవ్విధంబున సితాం। బురుహ లోచనుండు వోవునపుడు. 25

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; మరలి మరలి= తిరిగి, తిరిగీ; అర్జునున్= అర్జునుడిని; చూచుచున్= చూస్తూ; చనఁగన్= వెళ్ళగా; అతఁడు= ఆ అర్జునుడు కూడా; అవ్విధంబునన్= అదే రీతిగా (కృష్ణుడు చూస్తున్నట్లే); సిత= తెల్లని; అంబురుహ= తామరలవంటి; లోచనుండు= కన్నులు గలవాడు - కృష్ణుడు; పోవు+అపుడు= వెళ్ళేటప్పుడు; చూడ్కి= చూపు; చనిన+అంత= సాగినంత; దవ్వున్= దూరాన్ని; చూచుచున్+ఉండెన్= చూస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అర్జునుడిని మాటిమాటికీ వెనుదిరిగి చూస్తూ వెళ్ళిపోయాడు. ఆ విధంగానే అర్జునుడు కూడా కనుచూపుమేరదాకా కృష్ణుడిని చూస్తూ ఉన్నాడు.

క. సరసన సాత్యకి రుచిరపు। టరదంబునఁ జనియె; వెనుక నలఁతిరథముపై
నరిగె సుభద్రయు; నిమ్మెయి। నరుగఁగ హరిమీఁద నింద్రుఁ డలరులు గురిసెన్. 26

ప్రతిపదార్థం: సాత్యకి; సరసన్+అ= ప్రక్కనే; రుచిరము= సుందరమయిన; అరదంబునన్= రథంమీద; చనియెన్= వెళ్ళాడు; వెనుకన్; అలఁతి= చిన్న; రథముపైన్= రథంమీద; సుభద్రయున్= సుభద్రయూ; అరిగెన్= వెళ్ళింది; ఈ+మెయిన్= ఈ విధంగా; అరుగఁగన్= వెళ్ళుతూ ఉండగా; ఇంద్రుఁడు; హరిమీఁదన్= శ్రీకృష్ణుడిమీద; అలరులు= పూలు; కురిసెన్= కురిపించాడు.

తాత్పర్యం: సాత్యకి శ్రీకృష్ణుడి ప్రక్కనే అందమయిన రథంమీద వెళ్ళాడు. సుభద్ర శ్రీకృష్ణుడి వెనక చిన్న రథంమీద వెళ్ళింది. ఈ విధంగా వెళ్ళుతుండగా దేవేంద్రుడు శ్రీకృష్ణుడిమీద పూలవాన కురిపించాడు.

క. పవనుం డనుకూలతమెయిఁ। బ్రవర్తితుం డయ్యె; నతి శుభప్రద భంగుల్
వివిధములు మఱియు ధరణీ। ధవ! తోఁచె నిమిత్తములు నితాంతస్ఫుటతన్. 27

ప్రతిపదార్థం: ధరణీధవ!= భూపతీ!, జనమేజయా!; పవనుండు= వాయువు; అనుకూలతమెయిన్= అనుకూలంగా ఉండేటట్లు; ప్రవర్తితుండు= వీస్తున్నవాడు; అయ్యెన్= అయ్యాడు; మఱియున్= మరియు; అతి= మిక్కిలి; శుభ= శుభాలను; ప్రద= ఇచ్చునట్టి; భంగుల్= తీరులుగలవీ; వివిధములు= అనేక విధములయినవీ; నిమిత్తములు= శకునాలు; నితాంత= మితిమీరిన; స్ఫుటతన్= స్పష్టతతో; తోఁచెన్= కనబడ్డాయి.

తాత్పర్యం: జనమేజయా! శ్రీకృష్ణుడు వెళ్ళేటప్పుడు గాలి అనుకూలంగా వీచింది. ఎడతెగకుండా శుభాలిచ్చే అనేక విధములైన శకునాలు తేటతెల్లంగా కనబడ్డాయి.

శ్రీకృష్ణుఁ డుదంకాశ్రమంబునకుఁ బోవుట (సం.14-52-7)

వ. అట్లు వోయి పోయి, మార్గంబు కెలనం జేరువ నున్న యుదంకాశ్రమంబు గని, యందుఁ జని, వినయం బొప్ప నమ్మునిం గని, యతని చేయు నతిథి సత్కారంబులం బ్రియంబంది, యతనిపాల నాసీనుండయి యుండ, నతం డప్పుండరీకాక్షున కిట్లనియె. 28

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; పోయి పోయి= వెళ్ళి వెళ్ళి; మార్గంబు= బాటకు; కెలనన్= ప్రక్కనే; చేరువన్= దగ్గరలో; ఉన్న; ఉదంక= ఉదంకుడియొక్క; ఆశ్రమంబు= ఆశ్రమాన్ని; కని= చూచి; అందున్= అక్కడికి; చని= వెళ్ళి; వినయంబు= అణకువ; ఒప్పన్= ఒప్పగా; ఆ+మునిన్= ఆ ఉదంక మునిని; కని= చూచి; అతని చేయు= అతడు (ఉదంకుడు) చేసిన; అతిథి= అతిథులయొక్క; సత్కారంబులన్= మర్యాదలచేత; ప్రియంబు= సంతోషం; అంది= పొంది; అతని= ఆ ఉదంకుడియొక్క; పాలన్= సమీపంలో; ఆసీనుండు= కూర్చున్నవాడు; అయి; ఉండన్= ఉండగా; అతండు= ఆ ఉదంకుడు; ఆ+పుండరీక= తెల్లతామరలవంటి; అక్షునకున్= కన్నులు గలవాడితో - శ్రీకృష్ణుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా కృష్ణుడు చాలాదూరం వెళ్ళి, దారి ప్రక్కనే దగ్గరగా ఉన్న ఉదంకుడి ఆశ్రమాన్ని చూచాడు. అక్కడికి వెళ్ళి ఉదంకుడిని సందర్శించి, ఆ మహర్షి చేసిన అతిథి మర్యాదలకు సంతోషించాడు. తరువాత తన దగ్గర కూర్చున్న శ్రీకృష్ణునితో ఉదంకుడు ఈ విధంగా అన్నాడు.

చ. 'భరతులపాలి కేఁగి, తగఁ బాండవ కౌరవ బంధుభావమున్
గరము దృఢంబు సేసితె? సుఖస్థితి రాజుల వారి వారి వి

స్ఫురిత మహాధిరాజ్యముల చొప్పుల నిల్పితె? పక్షపాతితా

దురితము లేని నీవు జనతోష విధాన విశారదుండవై.' 29

ప్రతిపదార్థం: పక్షపాతితా= పక్షపాతం అనే; దురితము= పాపం; లేని; నీవు; జన= జనులయొక్క; తోష= సంతోషాన్ని కలిగించే; విధాన= ఉపాయములందు; విశారదుండవు= నేర్పరివి; ఐ= అయి; భరతుల= భరత వంశీయులయొక్క; పాలికిన్= దగ్గరకు; ఏఁగి= వెళ్ళి; తగన్= ధర్మప్రకారంగా; పాండవ= పాండవులయొక్క; కౌరవ= కౌరవులయొక్క; బంధుభావమున్= చుట్టరికాన్ని; కరము= మిక్కిలి; దృఢంబు= గట్టిపడిన దానినిగా; చేసితి+ఎ?= చేశావా?; రాజులన్= రాజులను; సుఖ= సుఖముయొక్క; స్థితిన్= అవస్థతో; వారి వారి= వారి వారియొక్క; విస్ఫురిత= పెంపొందిన; మహత్= గొప్ప; అధిరాజ్యముల= రాజ్యాలయొక్క; చొప్పులన్= వంతులతో; నిల్పితి+ఎ?= నిలిపావా?

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! పక్షపాత పాపం అంటని నీవు సర్వప్రజలూ సంతోషించేటట్లుగా, భరత వంశీయుల దగ్గరకు వెళ్ళి, నేర్పరివై కౌరవపాండవుల బంధుత్వం బలపడేటట్లు చేశావా? రాజులను వారివారివంతులకు వచ్చిన రాజ్యాలలో సుఖంగా ఉండేటట్లు నిలిపావా?

వ. అని యిట్లెఱుంగనివాఁడయి యడిగెడు నట్లపోలె, నిందా గర్భంబుగాఁ బలికినం, బద్మనాభుండు దానును దాని నెఱుంగమి భావించి, యా భార్గవు నాననం బాలోకించి. 30

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; ఎఱుఁగనివాఁడు= తెలియనివాడు; అయి; అడిగెడు= అడుగుతున్న; అట్లు+అ+పోలెన్= ఆ విధంగానే; నిందా= నింద; గర్భంబు+కాన్= మాటలోపల ఉండేటట్లుగా; పలికినన్= పలుకగా; పద్మనాభుండు= శ్రీకృష్ణుడు; తానును= తాను కూడా; దానిన్= ఆ నిందను; ఎఱుంగమి= గ్రహించకుండటం; భావించి= నటించి; ఆ+భార్గవు= ఆ భృగువంశీయుడియొక్క, ఉదంకుడియొక్క; ఆననంబు= ముఖమును; ఆలోకించి= తేరిపార చూచి.

తాత్పర్యం: ఈ విధంగా ఉదంకుడు ఏమీ తెలియనివాడై అడుగుతున్నట్లుగా, మాటలలో వ్యంగ్యంగా నింద వ్యక్తమయ్యేటట్లు పలికాడు. దానికి తగ్గట్టుగానే కృష్ణుడు కూడా ఆ నిందను గ్రహించనట్లుగానే నటించి ఉదంకుడి ముఖం సూటిగా చూస్తూ.(తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'కర ముచితంబుగాఁ బలికి, గర్వపుమాట నదల్చి, భీతికిన్

దెరు వగునట్ల చెప్పి, గడుదీనత దోఁపఁగ నాడి, సంధి క

క్కురుపతిఁ దమ్ముప్రోవు మొగకొల్పఁగ జాలన; నాకు భీష్ముఁడు

న్గురుఁడును దోడు చెప్పిరి; మునుల్ బహుభంగుల నొత్తి రత్తఱిన్. 31

ప్రతిపదార్థం: కరము= మిక్కిలి; ఉచితంబు+కాన్= సమంజసంగా; పలికి; గర్వపుమాటన్= అహంకారంతో కూడిన మాటలతో; అదల్చి= గద్దించి; భీతికిన్= భయానికి; తెరువు= దారి; అగు+అట్లు+అ= అయ్యే విధంగానే; చెప్పి; కడున్= మిక్కిలి; దీనత= జాలి; తోఁపఁగన్= పుట్టేటట్లుగా; ఆడి= పలికి; సంధికిన్= సంధికి; ఆ+కురుపతిన్= ఆ కురురాజును - దుర్యోధనుడిని; తమ్మ= అతడి తమ్ములయొక్క; ప్రోవున్= సమూహాన్నీ; మొగకొల్పఁగన్= సుముఖులయ్యేటట్లు చేయగా; చాలన్+అ= సమర్థుడిని కాలేక పోయాను; భీష్ముండున్= భీష్ముడునూ; గురుఁడును= ద్రోణుడునూ; ఆ+తఱిన్= ఆ సమయంలో; నాకున్= నాకు; తోడు= సహాయంగా; చెప్పిరి= చెప్పారు; మునుల్= మునులు; బహు= అనేకములయిన; భంగులన్= విధాలుగా; ఒత్తిరి= బలవంతం చేశారు.

తాత్పర్యం: 'మహర్షీ' సంధి చెయ్యటానికి వెళ్ళి సమంజసంగా మాటాడాను. అహంకారంతో గద్దించాను. భయం కలిగేటట్లు బెదిరిస్తూ పలికాను. కాని, ఆ దుర్యోధనునీ, అతడి తమ్ములనూ సంధికి సుముఖులను చేయలేకపోయాను. అప్పుడు భీష్మద్రోణులు నాకు తోడుగా చెప్పారు. మునులు కూడా బలవంతం చేశారు.

వ. అతిలోభంబునం జేసి వంశధర్మంబు విడిచి, యెవ్విధంబులను సంధికిం జొరక, కురుకుమారులు పాండవులతో భండనంబొనర్చి, సబంధు పరిజనంబుగా మరణంబు నొంది, యుత్తమ లోకంబుల కరిగి; రిక్కడఁ బాండు నందన పంచకంబు ద్రిక్కఁ దక్కటి వారెల్ల నట్లపోయిరి; కాల నియతి గడవ నెవ్వరికిని శక్యం బగునే?' యనిన విని రోషకషాయితంబు లగు తారకంబు లుద్వృత్తంబులు సేయుచు నత్తపోధన సత్తముండు. 32

ప్రతిపదార్థం: అతి= మిక్కిలి; లోభంబునన్+చేసి= దురాశవలన; వంశ= వంశముయొక్క; ధర్మంబు= ఆచారం; విడిచి= వదలి; ఏ+విధంబులను= ఎన్ని విధాలకూడా; సంధికిన్= సంధికి; చొరక= అంగీకరించక; కురుకుమారులు= కౌరవులు; పాండవులతోన్= పాండవులతో; భండనంబు= యుద్ధం; ఒనర్చి= చేసి; సహ+బంధు+పరిజనంబు+కాన్= చుట్టాలతో, బలగంతోకూడా; మరణంబున్= చావును; ఒంది= పొంది; ఉత్తమ లోకంబులకున్= స్వర్గం మొదలైన లోకాలకు; అరిగిరి= వెళ్ళారు; ఇక్కడన్= ఈ పక్షాన; పాండునందన పంచకంబు= పాండవులయిదుగురు; త్రిక్కన్= తప్ప; తక్కటివారు= మిగిలినవారు; ఎల్లన్= అందరూ; అట్లు+అ= అట్లే, కౌరవులవలెనే; పోయిరి= వెళ్ళారు; కాల= కాలంయొక్క; నియతి= నియమాన్ని; కడపన్= జవదాటగా; ఎవ్వరికినిన్= ఎంతటివారికయిననూ; శక్యంబు+అగును+ఏ?= సాధ్యమగునా?; అనినన్= అని శ్రీకృష్ణుడనగా; విని; రోష= కోపంచేత; కషాయితంబులు= ఎర్రగా చేయబడినవి, ఎర్రనయినవి; అగు= అయిన; తారకంబులు= నల్లని కనుగ్రుడ్డులను; ఉద్వృత్తంబులు= పైకి ఉబ్బినవిగా; చేయుచున్= చేస్తూ; ఆ+తపోధన= ఆ తపస్సే ధనంగాగల ఋషులలో; సత్తముండు= మిక్కిలి శ్రేష్ఠుడు-ఉదంకుడు.

తాత్పర్యం: పేరాసవలన వంశాచారాన్ని వదలి, ఎన్ని విధాల కూడా సంధికి అంగీకరించకుండా, పాండవులతో యుద్ధంచేసి మరణించి, కౌరవులు బంధుపరివారసమేతంగా ఉత్తమలోకాలకు వెళ్ళారు. పాండవపక్షాన కూడా పాండవులయిదుగురు తప్ప మిగిలిన వారందరూ కౌరవులగతినే పొందారు. కాలనియమాన్ని ఎంతటివారయినా అతిక్రమింపలేరు. శ్రీకృష్ణుడీవిధంగా పలుకగా విన్న ఉదంకుడికి కోపం వచ్చింది. ఆ మహర్షి కళ్ళు చింత నిప్పులయ్యాయి. ఆ తరువాత ఋషీశ్వరుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. విశేషం సామాన్యంచేత సమర్థింపబడింది.

క. 'కౌరవ కులమును మిథ్యా। చారుఁడవై త్రుంచి తకట!; శక్తుఁడ వయ్యున్
నేరిమిమైఁ జేయవ పాం। దారఁగ; నిక్కిల్బిషమున కంతటికిఁ దగన్. 33

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; మిథ్యా= మోసంతో కూడిన; ఆచారుఁడవు= నడత కలవాడవు; ఐ= అయి; కౌరవకులమును= కౌరవవంశాన్ని; త్రుంచితి= నశింపజేశావు; శక్తుఁడవు= సమర్థుడవు; అయ్యున్= అయికూడా; నేరిమిమైన్= నేర్పుతో; పొందు= సంధి; ఆరఁగన్= చక్కగా; చేయవు+అ= చేయనే చేయవు; ఈ+కిల్బిషమునకున్= ఈ పాపానికి; అంతటికిన్= అంతకూ; తగన్= తగినట్లుగా.

తాత్పర్యం: అయ్యో! మోసంతో ప్రవర్తించి కౌరవవంశాన్ని నాశనంచేశావు. సమర్థుడవయికూడా నేర్పుతో సంధి చేయనే చేయలేదు. నీవు చేసిన ఈ పాపానికి తగినట్లుగా, (తరువాతి వచనంతో అన్వయం)

వ. ఘోరప్రకారంబగు శాపంబు నీకిచ్చెద' ననిన, నచ్యుతుం డా మునితో, 'నా మాటలు దేటపడ విని తగినయట్లు సేయుదుగాక' యని పలికి యిట్లనియె. 34

ప్రతిపదార్థం: నీకున్= నీకు; ఘోర= భయంకరమైన; ప్రకారంబు= లక్షణం కలది; అగు= అయిన; శాపంబు+ఇచ్చెదన్= శాపం పెట్టుతాను; అనినన్= అని ఉదంకుడు అనగా; అచ్యుతుండు= చ్యుతం (జారుట) లేనివాడు, స్వస్వరూపంనుండి వేరుపడనివాడు - సుస్థిరుడు- శ్రీకృష్ణుడు; ఆ+మునితోన్= ఆ మునితో; నా= నాయొక్క; మాటలు; తేటపడన్= స్పష్టంగా; విని ; తగిన+అట్లు= తగిన విధంగా; చేయుదు(వు)+కాక= చేయుము; అని; పలికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: నీకు భయంకరమయిన శాపం పెట్టుతా'నన్నాడు. ఆ మాటలు విని శ్రీకృష్ణుడు ఉదంకుడితో 'ముందు నా మాటలు తేటతెల్లంగా విని తరువాత నీకు తగినట్లు చేయుము' అని ఇంకా ఈ విధంగా అన్నాడు.

చ. 'కినియుట మాను; మేలె మునికిం గుపితత్వము? శాంతవృత్తి నా
యనునయ మాదరింపు; విను, మల్పతపంబులచేతఁ గోలుపో
దునె? మఱి యట్లుఁగాక యతిదుష్కరమైన తపంబు, సంచితం
బనఁదగు బ్రహ్మచర్యమును నాఱడివోవె కటా! శపించినన్.' 35

ప్రతిపదార్థం: కినియుట= కోపించటం; మాను= చాలించుము; మునికిన్= మునికి; కుపితత్వము= కోపం; మేలు+ఎ?= క్షేమకరమా?; శాంత= కలత లేని; వృత్తిన్= స్థితితో; నా= నాయొక్క; అనునయము= విన్నపం; ఆదరింపు= అంగీకరించుము; వినుము; అల్ప= తక్కువ అయిన; తపంబులచేతన్= తపస్సులచేత; కోలుపోదును+ఎ?= చెడిపోవుదునా?; మఱి= మరియు; అట్లున్+కాక= అంతే కాకుండ; అతి= మిక్కిలి; దుష్కరము= చేయుటకు సాధ్యంకానిది; ఐన= అయినటువంటి; తపంబున్= తపమూ; సంచితంబు= చెడకుండా నిలుపుకొన్నది; అనన్= అనుటకు; తగు= తగిన; బ్రహ్మచర్యమును= వేదపఠన నియమమూ లేదా బ్రహ్మచర్యాశ్రమమూ; శపించినన్= శపిస్తే; కటా!= అయ్యో!; ఆఱడి+పోవు+ఎ?= వ్యర్థం కావా?

తాత్పర్యం: 'మునీశ్వరా! కోపం చాలించుము. మునికి కోపం క్షేమకరం కాదు. శాంతుడవై నా విన్నపం అంగీకరించుము. అల్పతపస్సులవలన నే నేమీ చెడిపోను. అంతేకాకుండా ఒకమాట చెప్పుతాను వినుము. నీ మహా తపస్సు, సుస్థిరమైన బ్రహ్మచర్యమూ శపిస్తే వ్యర్థం కావా?' (నాకు వచ్చేకీడు లేదు గాని నీకు మాత్రం మహానష్టం కలుగుతుందని అర్థం).

వ. అనిన విని యుదంకుండు శ్రీవత్సాంకు నవలోకించి. 36

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ఉదంకుండు= ఉదంకుడు; శ్రీవత్స= శ్రీవత్స మనెడి; అంకున్= పుట్టుమచ్చగలవాడిని- శ్రీకృష్ణుడిని; అవలోకించి= చూచి.

తాత్పర్యం: శ్రీకృష్ణు డీవిధంగా అనగా విని ఉదంకుడు అతడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'అగుఁ గాక; నీవు సెప్పెడు। తగ వెయ్యది సెపుమ; వినియెదం; బోలిన నే
మగిడించెద శాపోన్ముఖ। బగు మన్మానసము' ననుడు నల్లన నగుచున్. 37

తాత్పర్యం: అగున్+కాక= అట్లే కానిమ్ము; నీవు; చెప్పెడు= చెప్పునట్టి; తగవు= న్యాయం; ఏ+అది= ఏదియో; చెపుము+అ= చెప్పుము; వినియెదన్= వింటాను; పోలినన్= నీవు చెప్పేది యుక్తంగా ఉన్నట్లయితే; నేన్= నేను; శాప= శాపమిచ్చుటకు; ఉన్ముఖము= సిద్ధమయినది; అగు= అయిన; మత్= నాయొక్క; మానసమున్= మనస్సును; మగిడించెదన్= త్రిప్పుతాను; అనుడున్= ఉదంకు డీ విధంగా పలికిన తరువాత; అల్లనన్= మెల్లగా, నెమ్మదిగా; నగుచున్= (శ్రీకృష్ణుడు) నవ్వుచూ.

తాత్పర్యం: 'అట్లే కానిమ్ము, నీవు చెప్పే న్యాయమేదో చెప్పుము. అది యుక్తంగా ఉంటే ఇప్పటికిప్పుడే నీకు శాపంపెట్టటానికి సిద్ధమయిన నా మనస్సును మరలిస్తా'నని ఉదంకు డన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు చిరునవ్వునవ్వి. (-తరువాతి పద్యంతో అన్వయం.)

చ. **'తమము రజస్సు సత్త్వము నుదంక! మదీయ వశప్రవర్త మా**
నములు; మరుద్వసు ప్రభృతి నాకిచయంబు మదుద్భవంబు; స
ర్వము నను నేన నిల్తు; సుఖవాసత నన్ దగఁ జెంది నిల్చు స
ర్వము; విను; మేన చూవె యపరంబు పరం బనఁగల్గు తత్త్వముల్. **38**

ప్రతిపదార్థం: ఉదంక!= ఉదంకా!; తమము= తపస్సు; రజస్సు= రజస్సు; సత్త్వము; మదీయ= నా యొక్క; వశ= వశంలో; ప్రవర్తమానములు= ఉంటున్నవి; మరుత్= మరుత్తులూ; వసు= వసువులూ; ప్రభృతి= మొదలయిన; నాకి= దేవతల; చయంబు= సమూహం; మత్= నావలన; ఉద్భవంబు= పుట్టింది; సర్వమునను= సమస్త సృష్టియందునూ; నేను+అ= నేనే; నిల్తున్= ఉన్నాను; సర్వము= సమస్త సృష్టియూ; సుఖ= సుఖంతోకూడిన; వాసతన్= ఉనికితో; నన్= నన్ను; తగన్= ఒప్పుగా; చెంది= పొంది; నిల్చున్= ఉంటుంది; అపరంబు= అచిత్తు, అజ్ఞానం, ప్రకృతి; చిత్తు= జ్ఞానం, పరమాత్మ; అనన్+కల్గు= అనదగిన; తత్త్వముల్= తత్త్వములు; నేను+అ= నేనే; చూవె!= సుమా!

తాత్పర్యం: ఉదంకా! సత్త్వరజస్తమస్సు లనే గుణత్రయమూ నాయందే ఉంటున్నది. మరుత్తులూ, వసువులూ మొదలైన దేవతలందరూ నా నుండే పుట్టారు. నేనే సృష్టియందంతటా వ్యాపించి ఉన్నాను. నాలోనే నిశ్చలంగా సృష్టి ఉన్నది. చిత్తూ అచిత్తూ అనే తత్త్వాలు రెండూ నేనే సుమా!

తే. **ప్రణవ ముఖవేదములుఁ జతుర్వర్ణములుఁ, జ। తుర్విధాశ్రమములును, దత్సర్వ కర్మ**
జాతములును, సమంచిత స్వర్గ మోక్ష। ములును మన్మయముల కాఁగఁ దెలిసికొనుము. **39**

ప్రతిపదార్థం: ప్రణవ= ఓంకారం; ముఖ= మొదటగల లేదా ప్రధానమయిన; వేదములున్= ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం అని వేదాలు నాలుగు; చతుర్+వర్ణములున్= నాలుగు వర్ణములును; (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్ణములు,) చతుర్+విధ+ఆశ్రమములును= నాలుగు విధాలయిన ఆశ్రమములు; (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సంన్యాసాశ్రమాలు,) తద్= ఆ నాలుగు వర్ణములకూ, నాలుగు ఆశ్రమాలకూ సంబంధించిన; సర్వ= సమస్తమైన; కర్మ= విధులయొక్క; జాతములును= సమూహములునూ; సమంచిత= ఘనమైన; స్వర్గమోక్షములును= స్వర్గమునూ; మత్+మయములు+అ= నా రూపములే; కాఁగన్= అగునట్లుగా; తెలిసికొనుము.

తాత్పర్యం: ఓంకారం ఆదినిగల నాలుగు వేదాలూ, నాలుగు వర్ణాలూ, నాలుగు ఆశ్రమాలూ వాటికి సంబంధించిన విధులూ, స్వర్గమూ, మోక్షమూ నా రూపాలే అని తెలిసికొనుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: స్వర్గమూ, మోక్షమూ ఒకటి కావు. యజ్ఞాలు చేసినవారూ, వీరమరణం పొందినవారూ, స్వర్గలోకంచేరి దేవభోగాలనుభవిస్తారు. ఆ భోగానుభవం వలన వారి వారి పుణ్యకర్మఫలం నశిస్తుంది. తిరిగి వారు భూలోకంలో జన్మిస్తారు. పుణ్యం క్షీణించి తిరిగి మానవలోకాన్ని ప్రవేశిస్తారని (క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి) భగవద్గీత (అధ్యా 9, శ్లో.21) చెప్తుతున్నది.

జననమరణాలనుండి విముక్తి మోక్షం. స్వర్గం పొందినవారికి పునర్జన్మముంటుంది. మోక్షం పొందినవారికి అది కలుగనే కలుగదు.

క. క్రతుపరులు నన్న తగ సం। స్తుతించి ఫల మందఁ గంద్రు; దోషయుతులు స
మ్మతిఁ బ్రాయశ్చిత్తంబులఁ। గృతాత్ము లగుదురు మదీయకీర్తన పరులై. 40

ప్రతిపదార్థం: క్రతు= యజ్ఞములయందు; పరులు= ఆసక్తిగలవారు; నన్నున్+అ= నన్నే; తగన్= విధుల కనుకూలంగా; సంస్తుతించి= మిక్కిలి కొనియాడి; ఫలము= ఫలితాన్ని; అందన్+కంద్రు= పొందగలుగుతారు; దోష= విధులను అతిక్రమించటంవలన కలిగిన పాపాలతో; యుతులు= కూడినవారు; సమ్మతిన్= శాస్త్ర సమ్మతితో; ప్రాయశ్చత్తంబులన్= పాపపరిహారంకొరకు చేసే కర్మలవలన; మదీయ= నాయొక్క; కీర్తన= స్తోత్రములయందు; పరులు+ఐ= ఆసక్తికలవారై; కృతాత్ములు= దోషంలేనివారు; అగుదురు= అవుతారు.

తాత్పర్యం: యజ్ఞపరాయణులు నన్ను స్తుతించి పుణ్యఫలాన్ని పొందుతారు. పాపులు కూడా ప్రాయశ్చిత్తకర్మలుచేసి నన్ను స్తుతించి దోష విముక్తులౌతారు.

క. మానసు మదగ్ర పుత్రుం। గా నెఱుఁగుము ధర్మునిని; జగద్రక్షకు నై
యే నభిమత కాలములను। మానిత జన్మముల నొంది మనుతుఁ దపస్వీ! 41

ప్రతిపదార్థం: తపస్వీ!= మునీశ్వరా!; మానసున్= మనస్సున పుట్టిన వాడిని; ధర్మునిని= యముడిని; మత్= నా యొక్క; అగ్రపుత్రున్+కాన్= పెద్దకొడుకుగా; ఎఱుంగుము= తెలిసికొనుము; ఏను= నేను; జగత్= లోకముయొక్క; రక్షకున్+ఐ= రక్షణముకొరకు; అభిమత= సమ్మతమయిన; కాలములను= సమయాలలో; మానిత= గౌరవించబడిన; జన్మములన్= పుట్టువులను; ఒంది= పొంది; మనుతున్= కాపాడుతాను.

తాత్పర్యం: తపస్వీ! మనస్సున జన్మించిన యముడు నా పెద్దకొడుకని తెలిసికొనుము. సమ్మతమయిన సమయాలలో నేను ఆయా అవతారాలనెత్తి లోకాన్ని కాపాడుతాను.

క. భవ వర్ధన విలయంబుల। నవలీలన వరుస బ్రహ్మయన, విష్ణుఁ డనన్
శివుఁ డన, నిర్వర్తింతును। భువనంబుల నేన చూవె భూరిమహిమలన్. 42

ప్రతిపదార్థం: నేను+అ= నేనే; భువనంబులన్= లోకాలలో; భూరి= గొప్పవి అయిన; మహిమలన్= మహిమలతో; అవలీలన్+అ= అనాయాసంగా; భవ= సృష్టించుట; వర్ధన= పెంచుట; విలయంబులన్= నాశమును; వరుసన్= క్రమంగా; బ్రహ్మ; అనన్= అనగా; విష్ణుఁడు= విష్ణువు; అనన్= అనగా; శివుఁడు; అనన్= అనగా; నిర్వర్తింతును= చేస్తాను; చూవె!= సుమా!

తాత్పర్యం: సర్వలోకాలలోనూ, మహామహిమలు కలిగిన నేనే బ్రహ్మగా సృష్టినీ, విష్ణువుగా స్థితినీ, శివుడుగా లయాన్నీ అనాయాసంగా చేస్తాను.

క. ధర్మంబు కలఁకఁ గాంచి, య। ధార్మికులం బొలియఁ జేసి, ధార్మికులను బే
రర్మిలి రక్షింతు నుచిత। కర్మాచరణముల నే జగద్ధితమునకై. 43

ప్రతిపదార్థం: నేన్= నేను; ధర్మంబు= ధర్మంయొక్క; కలఁకన్= సంక్షోభాన్ని; కాంచి= చూచి; జగత్= లోకంయొక్క; హితమునకున్+ఐ= మేలుకొరకు; ఉచిత= తగిన; కర్మ= పనులను; ఆచరణములన్= చేయటంచేత; అధార్మికులన్= అధర్మం ఆచరించేవారిని; పొలియన్+చేసి= నశింపజేసి; పేరు+అర్మిలిన్= గొప్ప ప్రేమతో; రక్షింతున్= రక్షిస్తాను.

తాత్పర్యం: ధర్మక్షోభ పుట్టినప్పుడు నేనే లోకోపకారకంగా తగిన పనులు చేస్తూ అధర్మాత్ములను నశింపజేస్తాను. ధర్మాత్ములను మహానురాగంతో రక్షిస్తాను.

విశేషం: భగవద్గీతలో శ్రీకృష్ణు డర్జునునకు చెప్పిన **"యదా యదా హి ధర్మస్య "పరిత్రాణాయ సాధూనామ్"** అనే శ్లోకాలను ఇక్కడ గుర్తుకు తెచ్చుకొనాలి.

వ. అట్టివాఁడ నయి యుండియు. నధర్మపరులగు ధార్తరాష్ట్రుల నత్యంత ధార్మికులగు ధర్మనందనాదులతోఁ గలుపుటకుం బలుదెఱంగులం బడితి; నది దివ్యజ్ఞాన దేదీప్యమానులగు పారాశర్యప్రభృతిమునివరుల చిత్తంబుల కెక్కె; నక్కౌరవులు దమదౌర్మాత్యంబున మాహాత్మ్యవంతులగు నా కౌంతేయులం దొడరి ధర్మసమరంబున సమసిరి; నా చేసినపని యిట్టిది; నన్ను నుదంక! నీ వింక నే మనియెద వను' మని పలికిన నతండు వినతుండగుచు నిట్లనియె. 44

ప్రతిపదార్థం: అట్టివాఁడను= అటువంటివాడను; అయి; ఉండియున్= ఉన్నప్పటికీ; అధర్మ= అధర్మమునందు; పరులు= ఆసక్తికలవారు; అగు= అయిన; ధార్తరాష్ట్రులన్= ధృతరాష్ట్రుడి కుమారులను, దుర్యోధనాదులను; అత్యంత= ఎల్లప్పుడునూ; ధార్మికులు= ధర్మం ఆచరించేవారు; అగు= అయిన; ధర్మనందన= ధర్మరాజు; ఆదులతోన్= మొదలగువారితో; కలుపుటకున్= ఏకం చేయటానికి; పలు+తెఱంగులన్= అనేక విధాలుగా; పడితిన్= ప్రయత్నించాను; అది= ఆ విధంగా నేను ప్రయత్నించటం; దివ్యజ్ఞాన= బ్రహ్మజ్ఞానంతో; దేదీప్యమానులు= ప్రకాశిస్తున్నవారు; అగు= అయిన; పారాశర్య= వ్యాసుడు; ప్రభృతి= మొదలైన; మునివరుల= మునీశ్వరులయొక్క; చిత్తంబులకున్= మనస్సులకు; ఎక్కెన్= ప్రీతి కలిగించింది; ఆ+కౌరవులు= ఆ దుర్యోధనాదులు; తమ= తమయొక్క; దౌర్మాత్యంబునన్= దుర్బుద్ధిభావంచేత; మాహాత్మ్యవంతులు= ఘనత కలవారు; అగు= అయిన; ఆ+కౌంతేయులన్= ఆ కుంతీకుమారులను, పాండవులను; తొడరి= ఎదిరించి; ధర్మసమరంబునన్= ధర్మయుద్ధంలో; సమసిరి= మరణించారు; నా చేసిన= నేను చేసిన; పని; ఇట్టిది= ఇటువంటిది; నన్నున్= నన్ను; ఉదంక!; నీవు; ఇంకన్= ఇంకా; ఏమి; అనియెదవు= అందువో; అనుము; అని; పలికినన్= పలుకగా; అతండు= ఆ ఉదంకుడు; వినతుండు= నమస్కరించినవాడు; అగుచున్= ఔతూ; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: దుష్టశిక్షణం, శిష్టరక్షణం చేయగలిగే వాడనయినప్పటికీ, కౌరవులు పాండవులతో కలిసి మెలిసి ఉండేటట్లు చేయటానికి నే నెంతో ప్రయత్నించాను. దీనిని బ్రహ్మజ్ఞాన సంపన్నులయిన వ్యాసాది మహర్షు లెంతో మెచ్చుకొన్నారు. ఆ కౌరవులు తమ దుర్బుద్ధులవలన, గొప్పవారయిన పాండవులతో తలపడి ధర్మయుద్ధంలో మరణించారు. నే నింత పనిచేశాను. ఇప్పుడు నీవు నన్ను ఏమంటావో అనుము' శ్రీకృష్ణు డీ విధంగా పలుకగా ఉదంకుడు అణకువతో అతడికి నమస్కరించి ఈ విధంగా అన్నాడు.

ఉ. 'ఇప్పుడు నీ మహామహిమ యేర్పడ, సమ్యగనుగ్రహంబునన్
జెప్పిన యీ సమంచిత విశేషము లెల్ల నెఱుంగుదున్; మదిం
గప్పిన యీ దురాగ్రహపు గర్వము ముంచికొనంగ నాకు మున్
చొప్పడియెన్; సుధాసదృశ సూక్తులఁ దేర్చితి వీవయచ్యుతా!" 45

ప్రతిపదార్థం: అచ్యుతా!= శ్రీకృష్ణా!; ఇప్పుడు; నీ= నీయొక్క; మహత్= గొప్ప; మహిమ; ఏర్పడన్= స్పష్టమయ్యేటట్లుగా; సమ్యక్= పరిపూర్ణమయిన; అనుగ్రహంబునన్= దయతో; చెప్పిన= నీవు చెప్పిన; ఈ సమంచిత= ఈ గొప్పవి అయిన; విశేషములు= విశిష్ట విషయాలు; ఎల్లన్= అన్నియూ; ఎఱుంగుదున్= ఇదివరకే తెలిసికొన్నాను; మున్= ఇంతకుముందు; మదిన్= మనస్సును; కప్పిన= ఆవరించిన; ఈ దురాగ్రహపు గర్వము= ఈ నీచకోపంతో కూడిన గర్వం; ముంచికొనంగన్= అతిశయించగా; చొప్పడియెన్= కలిగింది; ఈవు+అ= నీవే; సుధా= అమృతంతో; సదృశ= సమానమైన; సూక్తులన్= హితవాక్యాలతో; తేర్చితివి= సంతోషపెట్టావు, ప్రసన్నుడిని చేశావు.

తాత్పర్యం: 'ఇప్పుడు పరిపూర్ణమైన దయతో, నీ మహామహిమ వెల్లడయ్యేటట్లుగా నీవు చెప్పిన విశేషాలన్నీ నా కిదివరకే తెలుసు. కాని, ఇంతకుముందు నీచకోపంతో కూడిన గర్వం నా మనస్సును ముంచుకొనివచ్చినట్లుగా కప్పివేసింది. అమృతతుల్య మయిన వాక్కులతో నీవు నన్ను నిర్మలుడిని చేశావు.'

వ. అని వెండియు. 46

తాత్పర్యం: అని ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. 'అతులమైన నీ దయా మహిమకు నేను। బాత్ర మగుదు నేనిఁ బద్మనాభ!
యనుపమాన తావకాకృతిఁ జూపవే। నాకుఁ జూడ్కియును మనంబు నలర.' 47

ప్రతిపదార్థం: పద్మనాభ!= శ్రీకృష్ణా!; అతులము= సాటిలేనిది; అగు= అయిన; నీ= నీయొక్క; దయా= దయయొక్క; మహిమకున్= గొప్పతనానికి; ఏను= నేను; పాత్రము= అర్హుడను; అగుదున్+ఏనిన్= అయినవాడనయితే; చూడ్కియును= దృష్టులును; మనంబు= మనస్సునూ; అలరన్= ఆనందించగా; నాకున్= నాకు; అనుపమాన= సాటిలేని; తావక= నీయొక్క; ఆకృతిన్= రూపాన్ని; చూపవే!= చూపుమా!

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! నేను నీ మహానుగ్రహానికి అర్హుడనయిన పక్షంలో నా మనోనేత్రాలు ఆనందించేటట్లుగా నీ విశ్వరూపాన్ని చూపించుము.'

శ్రీకృష్ణుఁ డుదంకునకుఁ దన విశ్వరూపంబుఁ జూపుట (సం.14-54-4)

చ. అనుడు దయాళుఁడైన హరి యర్జును చూచిన దివ్యమూర్తిఁ జూ
పినఁ గని, సంప్రమోదమును భీతియు విస్మయముం బెనంగొనన్
మునిపతి పాణిపద్మములు మోడ్చి 'నమః పురుషోత్తమాయ తే'
యనుచు, వినీతి నమ్ర మగునంగము నివ్వెఱ నిశ్చలంబుగన్. 48

ప్రతిపదార్థం: అనుడున్= ఉదంకుడు ఈ విధంగా పలికిన తరువాత; దయాళుఁడు= దయ కలిగినవాడు; ఐన= అయిన, హరి= శ్రీకృష్ణుడు; అర్జును+చూచిన= అర్జునుడు దర్శించిన; దివ్యమూర్తిన్= విశ్వరూపాన్ని; చూపినన్= చూపగా; మునిపతి= మునీశ్వరుడు ఉదంకుడు; కని= చూచి; సంప్రమోదమును= మహానందమూ; భీతియున్= భయమూ; విస్మయమున్= ఆశ్చర్యమూ; పెనంగొనన్= ముప్పిరిగొనగా; పాణిపద్మములు= పద్మములవంటి చేతులు; మోడ్చి= జోడించి; పురుషోత్తమాయ= పురుషోత్తముడవైన; తే= నీ కొరకు; నమః= నమస్కారం; అనుచున్= అంటూ; వినీతి= వినయంచేత; నమ్రము= వంగినది; అగు= అయిన; అంగము= శరీరం; నివ్వెఱన్= పరిపూర్ణమయిన పారవశ్యంతో; నిశ్చలంబు= కదలనిది; కన్= కాగా.

తాత్పర్యం: ఉదంకుడు ఈ విధంగా పలికిన తరువాత దయామయుడైన శ్రీకృష్ణుడు అర్జునుడు చూచిన విశ్వరూపాన్ని చూపాడు. ఆ మునీశ్వరుడు భయానందాశ్చర్యాలు ముప్పిరిగొనగా చేతులు జోడించి 'పురుషోత్తముడవయిన నీకు నమస్కారం' అని అన్నాడు. వినయంచేత వంగిన ఉదంకుడి శరీరం పారవశ్యంవలన నిశ్చలమయింది.

వ. ఒక్కింత నిలిచి నిభృత స్వరంబున. 49

ప్రతిపదార్థం: ఒక్క+ఇంత= కొంచెం సేపు; నిలిచి= కదలకుండా ఉండి; నిభృత= నిశ్చలమైన, తొట్రుపడని; స్వరంబునన్= కంఠమాధుర్యంతో.

తాత్పర్యం: ఆ విధంగా ఉదంకుడు కొంచెంసేపు నిశ్చేష్టుడై ఉండి తొట్రుపడని గొంతుతో, (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'పుండరీకాక్ష! యీ పుడమి యంతయును భ। వత్పాద పంక్తి సంవ్యాప్త మయ్యె;
నంబరం బెల్లను నావృత మయ్యె నీ। మహిత సముజ్జ్వల మస్తకముల;
నంతరిక్షము దావకాద్భుత కుక్షిదే। శంబులచేత సంఛన్నమయ్యె;
భవదీయ మహనీయ బాహార్గళా నిచ। యాపిహితము లయ్యె నన్ని దిశలు

తే. బహుచరణముల, బహుశిరోభాగములను। బహుజఠరముల, బహు భుజాప్రకరములను
దేవ! యిట్లు సర్వంబును నీవ యై త। నర్చి; తిది నాదు కన్ను మనంబుఁ దనిపె.' 50

ప్రతిపదార్థం: పుండరీకాక్ష!= తెల్లతామరలవంటి కన్నులు కలవాడా!; దేవ!= పరమాత్మా!; ఈ పుడమి= ఈ భూమి; అంతయును= అంతయూ; భవత్= నీ యొక్క; పాద= పాదాలయొక్క; పంక్తి= వరుసలచేత; సంవ్యాప్తము= మిక్కిలి నిండినదిగా; అయ్యెన్; అంబరంబు= ఆకాశం; ఎల్లను= అంతయు; నీ= నీయొక్క; మహిత= గొప్పదీ; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశించేదీ అయిన; మస్తకములన్= తలలతో; అమృతము= కప్పబడింది; అయ్యెన్= అయింది; అంతరిక్షము= భూమ్యాకాశ మధ్యప్రదేశం; తావక= నీ యొక్క; అద్భుత= ఆశ్చర్యకరమైన; కుక్షి= ఉదరముల (పొట్టం) యొక్క; దేశంబులచేతన్= భాగాలచేత; సంఛన్నము= మిక్కిలి కప్పబడింది, మిక్కిలి నిండింది; అయ్యెన్= అయింది; అన్ని; దిశలు= దిక్కులు; భవదీయ= నీ యొక్క; మహనీయ= గొప్పవి అయిన; బాహా+అర్గళా= తలుపు గడియలవంటి భుజాలయొక్క; నిచయ= సమూహాలచేత; ఆపిహితములు= అంతటా కప్పబడినవి; అయ్యెన్= అయ్యాయి; బహు= అనేకములయిన; చరణములన్= పాదములతో; శిరస్+భాగములను= శిరః ప్రదేశాలతో; బహు= అనేకములైన; జఠరములన్= ఉదరములతో; బహు= అనేకాలైన; భుజా= భుజాలయొక్క; ప్రకరములను= సమూహాలతో; ఇట్లు= ఈ విధంగా; సర్వంబును= విశ్వమంతయును; నీవ= నీవే; ఐ= అయి; తనర్చితి= ఒప్పితివి; ఇది= నీ ఈ విశ్వరూపం; నాదు= నా యొక్క; కన్ను= చూపునూ; మనంబున్= మనస్సునూ; తనిపెన్= తృప్తిపరచింది.

తాత్పర్యం: పద్మనేత్రా! పరమాత్మా! భూమియందంతటా నీ పాదాలు నిండి ఉన్నాయి. ఆకాశాన్ని మహోజ్జ్వలమయిన నీ శిరస్సులు కప్పివేశాయి. భూమ్యాకాశ మధ్యప్రదేశాన్ని నీ ఉదరభాగాలు ఆక్రమించాయి. నీ మహాభుజాలు సర్వదిక్కుల యందునూ వ్యాపించాయి. అనేకములయిన పాదాలతో, శిరస్సులతో, ఉదరాలతో, భుజాలతో నీవే విశ్వమై ఒప్పినావు. నీ ఈ విశ్వరూపం నా కన్నులనూ, మనస్సునూ తృప్తిపరచింది.

వ. విశ్వరూపా! యీ రూపం బుపసంహరించి, నీదగు నెప్పటి యాకారంబు గైకొనవే' యనిన నప్పరమేశ్వరుండు 'వరంబు గోరు'మని యానతిచ్చిన, నమ్మహితాత్ముండు 'సంశ్రితార్తి హర! నీ మూర్తిఁ గంటి; నింతకంటె మిక్కిలి వరంబులును గలవే?' యనుటయు. 51

ప్రతిపదార్థం: విశ్వరూప!= అంతా వ్యాపించిన రూపం కలవాడా!; ఈ రూపంబు= ఈ రూపం; ఉపసంహరించి= విచారించి, మరలించి; నీది+అగు= నీదయిన; ఎప్పటి= ఎప్పుడూ ఉండే; ఆకారంబు= రూపాన్ని; కైకొనుము+ఏ= ధరింపవే; అనినన్= అనగా; ఆ+పరమేశ్వరుండు= ఆ పరమాత్మ శ్రీకృష్ణుడు; వరంబు= వరం; కోరుము; అని; ఆనతి+ఇచ్చినన్= సెలవియ్యగా; ఆ+ మహితాత్ముండు= ఆ మహాత్ముండు; సంశ్రిత= ఆశ్రయించిన వారియొక్క; ఆర్తి= దుఃఖమును; హర= నశింపజేసేవాడా!; నీ= నీయొక్క; మూర్తిన్= రూపాన్ని; కంటిన్= చూచాను; ఇంతకంటెన్= ఇంతకంటెకూడా; మిక్కిలి= గొప్పవైన; వరంబులును= వరాలుకూడా; కలవు+ఏ?= ఉన్నవా?; అనుటయున్= అనగా.

తాత్పర్యం: పరమాత్మా! ఈ రూపాన్ని మరలించి, నీ సహజరూపాన్ని ధరించుము' అని ఉదంకు డన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు 'వరం కోరుకొను'మని ఆ మహర్షిని ఆజ్ఞాపించాడు. ఈ మాటకు ఉదంకుడు 'ఆశ్రిత రక్షకా! 'నీ విశ్వరూపాన్ని దర్శించాను. ఇంతకంటె మహా వరాలంటూ వేరే ఉంటాయా?' అనగా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. ఆ దేవుఁ డతనితో 'నటు। గాదు; ననుం గనుట శుభము గావింపక పోఁ;
దేది ప్రియ మడుగు; మిత్తుఁ బ్ర। మోదంబుగ నీకు' ననిన ముని యిట్లనియెన్. 52

ప్రతిపదార్థం: ఆ దేవుఁడు= ఆ దేవుడు శ్రీకృష్ణుడు; అతనితోన్= అతడితో, ఉదంకుడితో; అటు+కాదు= అట్లా కాదు; ననున్= నన్ను; కనుట= దర్శించటం; శుభము; కావింపకపోదు= కలిగించకుండా ఉండదు; ఏది= నీకు ఏది; ప్రియము= ఇష్టమో; అడుగుము= దానిని అడుగుము; ప్రమోదంబుగన్= ఆనందంగా; నీకున్= నీకు; ఇత్తున్= ఇస్తాను; అనినన్= అనగా; ముని; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ఉదంకుడితో 'అట్లా గాదు. నన్ను దర్శించటం శుభదాయకం అనేమాట నిజమే అయినా నీకేది ఇష్టమో అడుగుము. మహానందంగా దానిని ఇస్తాను' అన్నాడు. అప్పుడు ఆ మునీశ్వరుడు ఈ విధంగా అన్నాడు.

వ. 'అవశ్యంబును నా కట్లు గావలయు నని యవధరించితేని దేవా! యిది మరుదేశం; బిచ్చట జలంబు దుర్లభంబు; నాకు జలసన్నిధి యెప్పుడుం గలుగఁ బ్రసాదింపుము.' 53

ప్రతిపదార్థం: అవశ్యంబును= తప్పకుండా; నాకున్= నాకు; అట్లు= ఆ విధంగా, నీవు చెప్పినట్లే; కావలయును= కాక తప్పదు; అని; అవధరించితి+ఏని= దయతో సెలవిచ్చినట్లయితే; దేవా!= పరమాత్మా!; ఇది; మరుదేశంబు= జలంలేని ప్రాంతం; ఇచ్చటన్= ఇక్కడ; జలంబు= నీరు; దుర్లభంబు= పొంద శక్యం కానిది; నాకున్= నాకు; జల= నీటియొక్క; సన్నిధి= సాక్షాత్కారం, చేరువ;

ఎప్పుడున్= ఎల్లప్పుడూ; కలుగన్= కలిగేటట్లుగా; ప్రసాదింపుము= అనుగ్రహించుము.

తాత్పర్యం: 'తప్పకుండా నీవు చెప్పినట్లే కావాలని అంటే, దేవా! ఇది నిర్జలప్రాంతం. ఇక్కడ నీరు దొరకదు. కాబట్టి ఎల్లప్పుడూ నాకు నీరు చేరువలో ఉండేటట్లు అనుగ్రహించుము.'

వ. అనుటయు, నంబుజనాభుఁడు । తన యెప్పటి లలితమూర్తి ధరియించి, మునీం
ద్రునితోడ నన్నుఁ దలఁపఁగ । ననఘా! దొరకొను జలంబు' లని పలికి తగన్. 54

ప్రతిపదార్థం: అనుటయున్= ఉదంకుడు ఆ విధంగా అనగా; అంబుజనాభుఁడు= పద్మం నాభియందు గలవాడు, శ్రీకృష్ణుడు; తన= తనయొక్క; ఎప్పటి= ఎప్పుడూ ఉండే; లలిత= మనోహరమైన; మూర్తిన్= రూపాన్ని; ధరియించి= ధరించి; మునీంద్రునితోడన్= మునిశ్రేష్ఠుడితో; అనఘా!= పాపం లేనివాడా!; నన్నున్= నన్ను; తలఁపఁగన్= స్మరించగా; జలంబులు= నీళ్ళు; దొరకొనున్= లభిస్తాయి; అని; పలికి; తగన్= ఆచారానుగుణంగా.

తాత్పర్యం: ఉదంకుడు ఆ విధంగా పలుకగా శ్రీకృష్ణుడు తన కెప్పుడూ ఉండే రూపాన్ని ధరించి, ఆ మునిశ్రేష్ఠుడితో 'నన్ను స్మరిస్తే నీళ్ళు లభిస్తాయి' అని చెప్పాడు. తరువాత ఆచారానుగుణంగా. (తరువాతి వచనంతో అన్వయం).

వ. వీడ్కొని చనియెం; బదంపడి యా భృగువంశవరుం డొక్కెడ మెలంగుచుండి, తృషితుండయి, హృషీకేశుం
దలంచిన. 55

ప్రతిపదార్థం: వీడ్కొని= పోయి వస్తానని చెప్పి వదలి; చనియెన్= వెళ్ళాడు; పదంపడి= తరువాత; ఆ+భృగు= ఆ భృగుమహర్షియొక్క; వంశ= వంశంలో; వరుండు= శ్రేష్ఠుడు; ఒక్క+ఎడన్= ఒకచోట; మెలంగుచున్= తిరుగుతూ; ఉండి; తృషితుండు= దప్పికగొన్నవాడు; అయి; హృషీకేశున్= ఇంద్రియాలకు నియామకు డయినవాడిని, శ్రీకృష్ణుడిని; తలంచినన్= స్మరించగా,

తాత్పర్యం: పోయివస్తానని చెప్పి శ్రీకృష్ణుడు వెళ్ళాడు. తరువాత భృగువంశశ్రేష్ఠుడైన ఉదంకుడు ఒకచోట తిరుగుతూ, దప్పికై శ్రీకృష్ణుడిని స్మరించగా. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. కుక్కలు చుట్టిరా నొక్కమాతంగుండు । బాణ బాణాసన పాణియును ది
గంబరుండును, మలినాంగుండు, నగువాఁడు । దోఁచె నచ్ఛజలంబు దొరఁగుచుండు
మేనితోఁ; నమ్ముని వానిఁ దప్పకచూడఁ; । వాఁ 'డోయుదంక! యివ్వారి దప్పి
వోఁ ద్రావు' మనుడు, నాభూసురాగ్రణి యొల్ల । నని పల్కెఁ; బల్కిన 'వినుము నీవు

ఆ. నీరువట్టు శ్రమముఁ గూరిన నీ మీఁది । కరుణ వచ్చినాఁడఁ, గాదు నాక
యర్థిఁ ద్రావు టొప్పు 'ననియె; నా చండాలు । నలుకమెయి నదల్చె నత్తపస్వి. 56

ప్రతిపదార్థం: ఒక్క= ఒకానొక; మాతంగుండు= హీనజాతివాడు, మాలవాడు; కుక్కలు; చుట్టి= చుట్టూ చేరి; రాన్= వస్తుండగా; బాణ= బాణాలు; బాణ+ఆసన= ధనుస్సు ఉన్న; పాణియును= చేతులుకలవాడును; దిగంబరుండును= దిక్కులే వస్త్రాలుగా గలవాడునూ (దిసమొలవాడు అని అర్థం); మలిన= మురికితో కూడిన; అంగుండును= అవయవములు కలవాడును; అగువాఁడు= అయినవాడు; అచ్ఛ= నిర్మలమయిన; జలంబు= నీరు; తొరఁగుచున్+ఉండు= కారుతున్న; మేనితోన్= శరీరంతో; తోఁచెన్= కనబడ్డాడు; ఆ+ముని= ఆ ఉదంకుడు; వానిన్= వాడిని; తప్పక= తదేకదృష్టితో; చూడన్= చూడగా; వాఁడు= ఆ మాలవాడు;

ఓ+ఉదంక!= ఓ ఉదంకా!; ఈ+వారిన్= ఈ నా శరీరంనుండి కారుతున్న నీటిని; డప్పి= దప్పిక; పోన్= తీరేటట్లుగా; త్రావుము= త్రాగుము; అనుడున్= అనగా; ఆ+భూసుర= ఆ బ్రాహ్మణులలో; అగ్రణి= శ్రేష్ఠుడు, ఉదంకుడు; ఒల్లన్= ఇచ్చగింపను, ఇష్టపడను; అని; పల్కెన్= పలికెను; పల్కినన్= పలుకగా; వినుము; నీవు; నీరువట్టు= దప్పిక; శ్రమమున్= బడలికనూ; కూరినన్= పొందగా; నీ మీఁదన్= నీ యందలి; కరుణన్= దయతో; వచ్చినాఁడన్= వచ్చితిని; కాదు= తగదు; నాక= అనక; అర్థిన్= ప్రీతితో; త్రావుట= త్రాగటం; ఒప్పున్= తగును; అనియెన్= అన్నాడు; ఆ+తపస్వి= ఆ ఋషి - ఉదంకుడు; ఆ+చండాలున్= ఆ మాలవాడిని; అలుకమెయిన్= కోపంతో; అదల్చెన్= గద్దించాడు.

తాత్పర్యం: ఇంతలో ఒక మాలవాడు కనిపించాడు. కుక్కలు అతడిచుట్టూ చేరి వస్తున్నవి. అతడిచేతులలో ధనుస్సూ, బాణాలూ ఉన్నాయి. వాడి మొలమీద బట్టలు లేవు. అవయవాలన్నీ మురికిపట్టి ఉన్నవి. అతడి శరీరంనుండి నిర్మలమయిన నీరు కారుతున్నది. ఉదంకుడు అతడిని తేరిపార చూచాడు. అప్పుడు అతడు 'ఓ ఉదంకా! నా శరీరం నుండి కారుతున్న ఈ నీటిని త్రాగుము' అన్నాడు. దానికి ఉదంకుడు ఇష్టపడలేదు. అంతట ఆ మాలవాడు 'నా మాట వినుము నీవు దప్పికతో ఆయాసపడటం తెలిసి, నీ మీది దయతో నేను వచ్చాను. కాదనకుండా నీవు త్రాగటం మంచిది' అని అన్నాడు. అప్పుడు ఉదంకుడు అతడిని గద్దించాడు.

వ. అదల్చిన, నతండు సారమేయంబులుం దాను నంతర్ధానంబు సేసె; నా సంయమి వెఱఁగుపడి, యొక్కింత విచారించి, యిక్కపట ప్రచారంబు కృష్ణసంపాదితంబు గావలయు; నని యూహించు సమయంబున, నయ్యెడకుం గృష్ణుం డరుగుదెంచుటయుం, గనుంగొని, యమ్మహాత్మునితోడ నమ్మునివరుండు. 57

ప్రతిపదార్థం: అదల్చినన్= గద్దించగా; అతండు= ఆ మాలవాడు; సారమేయంబులున్= కుక్కలునూ; తానున్= తానునూ; అంతర్ధానంబు+చేసెన్= అదృశ్యమయ్యాడు; ఆ సంయమి= ఆ ముని - ఉదంకుడు; వెఱఁగుపడి= ఆశ్చర్యపడి; ఒక్క+ఇంత= ఒకించుక విచారించి; ఈ+కపట= ఈ మోసంతోకూడిన; ప్రచారము= వ్యవహారం; కృష్ణ= కృష్ణుడిచేత; సంపాదితంబు= కలిగించబడింది; కావలయున్= అయి ఉండవచ్చును; అని; ఊహించు= ఊహిస్తున్న; సమయంబునన్= సమయాన; ఆ+ఎడకున్= ఆ చోటికి; ఆ+మహాత్మునితోడన్= ఘనుడయిన జీవాత్మ కలవాడితో, శ్రీకృష్ణుడితో; ఆ+మునివరుండు= ఆ మునీశ్వరుడు.

తాత్పర్యం: ఉదంకుడు గద్దించేటప్పటికి మాలవాడు కుక్కలతోపాటు అదృశ్యమయ్యాడు. అంతట ఉదంకుడు ఆశ్చర్యపడి 'ఈ కపట వ్యవహారమంతా శ్రీకృష్ణుడిపని అయి ఉండవచ్చును' అని ఊహిస్తున్న సమయంలో, శ్రీకృష్ణుడు అక్కడకు వచ్చాడు. అప్పుడు ఆ మహర్షి ఆ మహాత్ముడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'జలము నినుఁ దలఁపగా నిటు। గలుగునె; చండాలు నొడలఁ గాఱెడు నీరే

నలఘుగుణ! త్రావుదునె యే। కొలఁది శ్రమంబైన; వరము కుచ్చిత మయ్యెన్.' 58

ప్రతిపదార్థం: అలఘు= గొప్ప; గుణ= గుణాలు కలవాడా!, శ్రీకృష్ణా!; నినున్= నిన్ను; తలఁపఁగాన్= స్మరించగా; జలము= నీరు; ఇటు= ఈ ప్రకారంగా; కలుగును+ఎ?= లభిస్తుందా?; ఏ కొలఁది= ఎంతటి; శ్రమంబు= కష్టం; ఐనన్= అయినప్పటికీ; ఏన్= నేను; చండాలు= మాలవాడియొక్క; ఒడలన్= శరీరంనుండి; కాఱెడు= కారుతున్న; నీరు= నీటిని; త్రావుదును+ఎ?= త్రాగుతానా?; వరము= నీ విచ్చిన వరం; కుచ్చితము= తుచ్ఛము; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: 'మహాగుణా! నిన్ను స్మరిస్తే ఈ విధంగా నీరు లభిస్తుందా? ఎంతటి ముప్పు మూడినప్పటికీ నేను మాలవాడి దేహంనుండి కారుతున్న నీటిని త్రాగుతానా? నీవు తుచ్ఛమయిన వరం ఇచ్చావు.'

చ. **అనవుడుఁ గృష్ణుఁ డిట్టులను; 'నాఱడిఁబోయెఁ బ్రయత్న మెల్ల; నీ**
వనఘ! యెఱుంగవైతి; సమయం బొకఁ డిమ్మెయిఁ గల్గె; నేర్పడన్
వినుము; నిలింప వల్లభుని నీకయి వేఁడితి నే సుధారసం;
బనితరసాధ్యమైన శుభ మయ్యెడు భూతి దొలంగె నక్కటా! **59**

ప్రతిపదార్థం: అనవుడున్= ఉదంకుడు ఆ విధంగా అనగా; కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అన్నాడు; అనఘా!= పాపరహితుడా!; ఏర్పడన్= స్పష్టంగా; వినుము; అక్కటా!= అయ్యో!; ప్రయత్నము; ఎల్లన్= అంతయు; ఆఱడిన్+పోయెన్= వ్యర్థమయింది; నీవు; ఎఱుంగవు+ఐతివి= తెలిసికొనవయితివి; సమయంబు+ఒకఁడు= ఒక మంచి సమయం; ఈ+మెయిన్= ఈ విధంగా; కల్గెన్= తటస్థించింది; నేన్= నేను; నీకయి= నీకొరకు; నిలింప= దేవతలయొక్క; వల్లభునిన్= ప్రభువును, దేవేంద్రుడిని; సుధారసంబు= అమృతరసాన్ని; వేఁడితిన్= అర్థించాను; అనితర సాధ్యము= ఇతరులకు సాధింప శక్యంకానిది; ఐన= అయిన; శుభము; అయ్యెడు= కలిగే; భూతి= భాగ్యం; తొలంగెన్= తొలగిపోయింది.

తాత్పర్యం: ఉదంకుడి మాటలు విన్న శ్రీకృష్ణుడు నేను చెప్పేమాటలు స్పష్టంగా వినుము. అయ్యో! చేసిన ప్రయత్నమంతా వ్యర్థమయింది. మంచి సమయం తటస్థించిందన్న సంగతి నీకు తెలియదు. నేను నీకొరకు అమృతం ఇమ్మని దేవేంద్రుడిని అర్థించాను. ఎవ్వరూ పొందలేని శుభం కలిగే భాగ్యం తప్పిపోయింది కదా!

వ. **అది యెట్లంటేని.** **60**

తాత్పర్యం: అది ఎట్లా జరిగిందని అడుగుతావేమో? (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **ఏను సుధ యడుగుటయు, హరి। 'మానవునకు నేల యగు సమర్త్యత్వము? మే**
లైన తెఱఁ గొండు గోరుము;। దానిం దగ నిచ్చెదన్ ముదం బారంగన్.' **61**

ప్రతిపదార్థం: ఏను= నేను; సుధ= అమృతాన్ని; అడుగుటయున్= అడుగగా; హరి= ఇంద్రుడు; మానవునకున్= మానవుడికి; అమర్త్యత్వము= దేవత్వం; ఏల+అగున్= ఎట్లా కలుగుతుంది; మేలు= హితం కలిగించేది; ఐన= అయిన; తెఱఁగు= చేయదగ్గ దానిని; ఒండు= మరొక దానిని; కోరుము; దానిన్= నీవు కోరినదానిని; తగన్= సముచితంగా; ముదంబు= సంతోషం; ఆరంగన్= అతిశయించగా; ఇచ్చెదన్= ఇస్తాను.

తాత్పర్యం: నేను అమృతం అడుగగా ఇంద్రుడు 'మానవుడికి దివ్యత్వం ఎట్లా ప్రాప్తిస్తుంది? హితం కలిగించేదీ చేయదగిందీ అయిన మరొక దానిని కోరుము. దానిని మహానందంగా ప్రసాదిస్తాను.'

వ. **అనిన నయ్యనిమిషపతి యాననం బాలోకించి.** **62**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ+అనిమిషపతి= ఆ దేవతలయొక్క ప్రభువు ఇంద్రుడియొక్క; ఆననంబు= ముఖాన్ని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఇంద్రు డావిధంగా అనగా, నేను ఆ దేవపతి ముఖాన్ని సూటిగా చూచి.(తరువాతి పద్యంతో అన్వయం)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. 'నిను వేఁడుట మోఘముగాఁ। జనునే యె ట్లైన నాదు చనవు సెఱుప క
మ్మునిపతికి నమృతరస మి'। మ్మని ప్రార్థించిన మహాత్మ! యాతఁడు నాతోన్. 63

ప్రతిపదార్థం: నినున్= నిన్ను; వేఁడుట= అర్థించటం; మోఘము= నిష్ఫలం; కాన్= కావటం, చనును+ఏ= తగునా?; ఎట్లు+ఐనన్= ఏ విధంగానయినా; నాదు= నాయొక్క; చనవు= కోరిక; చెఱుపక= వ్యర్థం చేయక; ఆ+మునిపతికిన్= ఆ మునీశ్వరుడికి; అమృతరసము; ఇమ్ము= ప్రసాదించుము; అని; ప్రార్థించినన్= ప్రార్థించగా; మహాత్మ!= పుణ్యాత్మా!, ఉదంకా!; అతఁడు= ఇంద్రుడు; నాతోన్=నాతో.

తాత్పర్యం: 'నిను వేడటం వృథా కావటం తగునా? ఏ విధంగానైనా నా కోరిక వ్యర్థంచేయక ఆ మునీశ్వరుడికి అమృతరసాన్ని ప్రసాదించుము' అని ప్రార్థించగా ఇంద్రుడు నాతో. (తరువాతి వచనంతో అన్వయం.)

వ. సమయంబు చేసికొని వచ్చె; నత్తెఱం గాకర్ణింపు; మమ్మహిత సౌజన్య ధన్యుండు. 64

ప్రతిపదార్థం: సమయంబు= ఏర్పాటు; చేసికొని; వచ్చెన్= నీ కడకు వచ్చాడు; ఆ+తెఱంగు= ఆ విధం; ఆకర్ణింపుము= వినుము; ఆ+మహిత= ఆ గొప్ప; సౌజన్య= మంచితనంచేత; ధన్యుండు= పొగడదగినవాడు.

తాత్పర్యం: (ఇంద్రుడు నాతో) ఒక ఏర్పాటుచేసికొని నీ దగ్గరకు వచ్చాడు. వచ్చిన తీరు చెప్పుతాను వినుము. తరువాత మంచితనంవలన శ్లాఘించదగినవాడయిన అతడు. (తరువాతి పద్యంతో అన్వయం).

శా. 'మాతంగత్వము దాల్చి, యే నరిగి, సమ్మానించి, యాభార్గవుం
బ్రీతుం జేసెద; నట్టు లిచ్చిన సుధన్ హ్రీదూషిత స్వాంతుఁడై
యాతం డొల్లకయున్న నేమి? విను; నా కన్యాయ్యవృత్తంబు గా;
దీతంత్రంబున కీవ సాక్షి; యని తా నేతెంచె నిన్ గానఁగన్. 65

ప్రతిపదార్థం: ఏను= నేను; మాతంగత్వము= మాలవాడి ఆకారాన్ని ; తాల్చి= ధరించి; అరిగి= వెళ్ళి; ఆ భార్గవున్= ఆ భృగుసంతతివాడిని, ఉదంకుడిని; సమ్మానించి= గౌరవించి; ప్రీతున్= తృప్తిపొందినవాడినిగా; చేసెదన్= చేస్తాను; అట్టులు= ఆ విధంగా, సత్కారపూర్వకంగా; ఇచ్చిన= ఇచ్చినట్టి; సుధన్= అమృతాన్ని; హ్రీ= లజ్జచేత; దూషిత= భంగపరువబడిన; స్వాంతుఁడు+ఐ= మనస్సు కలవాడై; అతండు= ఆ ఉదంకుడు; ఒల్లక+ఉన్నన్= ఇష్టపడకుంటే; ఏమి; నాకున్= నాకు; అన్యాయ్య= న్యాయము గాని; వృత్తంబు= ప్రవర్తనం; కాదు; ఈ తంత్రంబునకున్= ఈ కల్పనకు; నీవు+అ= నీవే; సాక్షి= సాక్షివి; అని; తాను; నిన్= నిన్ను; కానఁగన్= చూడటానికి; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: 'నేను చండాలరూపం ధరించి వెళ్ళి సత్కారపూర్వకంగా ఆ ఉదంకుడిని తృప్తిపరుస్తాను. లజ్జతో నే నిచ్చిన అమృతాన్ని అతడు ఇష్టపడకపోతే నా కేమిటి? నాకు అధర్మం కానేకాదు. ఈ కల్పనకు నీవే సాక్షివి' అని ఇంద్రుడు నిన్ను చూడటానికి వచ్చాడు.

వ. నీవు ప్రత్యాఖ్యానంబు చేసిన, నతం డంతర్ధానంబు చేసెం; గానిమ్ము; దాని కేమి సేయవచ్చు? నా యిచ్చిన వరంబు బొంకుగాకుండ నీకు జలం బెప్పుడుం గలుగం జేసెద. 66

ప్రతిపదార్థం: నీవు; ప్రత్యాఖ్యానంబు= నిరాకరణం; చేసినన్= చేయగా; అతండు= ఇంద్రుడు; అంతర్ధానంబు చేసెన్= అదృశ్యమయినాడు; కానిమ్ము; దానికిన్= జరిగినదానికి; ఏమి; చేయవచ్చున్?= చేయగలం?; నా+ఇచ్చిన= నే నిచ్చిన; వరంబు= వరం; బొంకు= అసత్యమయినది; కాకుండన్= కాకుండేటట్లుగా; నీకున్= నీకు; జలంబు= నీరు; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; కలుగన్= దొరకేటట్లుగా; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: నీవు నిరాకరించేటప్పటికి, ఇంద్రుడు అదృశ్యమయ్యాడు. కాని, జరిగినదానికి మన మేం చేయగలం? నేను నీ కిచ్చిన వరం కల్ల కాకుండా నీళ్ళు ఏడాది పొడుగునా దొరికేటట్లు చేస్తాను.

చ. అనఘ! జలంబు నీవలసినప్పుడు మేఘము లీమరుస్థలం
బున నొసఁగున్; భవద్యశము వొంపిరివోవ నుదంక మేఘనా
మ నుత విహారముల్ గలిగి మాన్యత నెప్పుడు నియ్యెడం జరిం
చును జలదంబు; లింక నను సువ్రత! దూఱకు; పోయి వచ్చెదన్.' 67

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!; సువ్రత!= సదాచారం కలవాడా!; నీవలసినప్పుడు= నీవు ఇష్టపడినప్పుడే; మేఘములు; ఈ మరుస్థలంబుననన్= ఈ ఎడారిలో; జలంబు= నీరు; ఒసఁగున్= కురిపించును; జలదంబులు= మేఘాలు; భవత్= నీయొక్క; యశము= కీర్తి; పొంపిరి+పోవన్= పెంపొందగా; ఉదంకమేఘ= ఉదంకమేఘము అనే; నామ= పేరుతో; నుత= కొనియాడదగిన; విహారములు= వ్యాపించుటలు; కలిగి; మాన్యతన్= గౌరవయోగ్యంగా; ఎప్పుడున్= ఎల్లప్పుడును; ఈ+ఎడన్= ఇక్కడ; చరించును= తిరుగుతాయి; ఇంకన్= ఇంకా; ననున్= నన్ను; దూఱకు= నిందింపకుము; పోయి వచ్చెదన్= వెళ్ళి వస్తాను.

తాత్పర్యం: పుణ్యాత్మా! సదాచార సంపన్నా! ఈ నిర్జల ప్రదేశంలో నీకిష్టమయినప్పుడు మేఘాలు నీళ్ళు కురిపిస్తాయి. నీ కీర్తి పెంపొందేటట్లుగా వాటికి ఉదంకమేఘాలు అనే పేరు కలుగుతుంది. అవి ఇక్కడ చక్కగా వ్యాపించి సంచరిస్తాయి. నీ వింక నన్ను నిందింపకుము. వెళ్ళి వస్తాను.'

క. అనినం బ్రీతుం డయ్యెను। ముని; యంతర్ధాన కలనమునఁ గృష్ణుండుం
జనియె; నని చెప్పి మఱియును। జనమేజయ నృపతితోడ సంప్రీతి మెయిన్. 68

ప్రతిపదార్థం: అనినన్= కృష్ణుడు అనగా; ముని= ఉదంకుడు; ప్రీతుండు= సంతోషించినవాడు; అయ్యెను; కృష్ణుండున్= కృష్ణుడునూ; అంతర్ధాన= అదృశ్యముయొక్క; కలనమునన్= స్వీకరణంతో; చనియెన్= వెళ్ళాడు; అని; చెప్పి; మఱియును; జనమేజయ= జనమేజయుడు; నృపతితోడన్= రాజుతో; సంప్రీతిమెయిన్= మహాసంతోషంతో.

తాత్పర్యం: ఈ విధంగా కృష్ణుడు చెప్పగా ఉదంకుడు సంతోషించాడు. శ్రీకృష్ణుడు అదృశ్యమయ్యాడు. ఈ కథంతా జనమేజయునకు చెప్పి ఇంకా. (తరువాతి వచనంతో అన్వయం.)

వ. వైశంపాయనుం డిట్లనియె. 69

తాత్పర్యం: వైశంపాయనుడు ఈ విధంగా అన్నాడు.

ఆ. 'మనుజనాథ! యెప్పుడును మరుదేశంబు। నందు నియతవృత్తి, నద్భుతంబు
దలకొనంగ, నయ్యుదంక మేఘంబు లొ। క్కొక్క పుణ్యతిథుల నొలసి కురియు.' 70

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; ఆ+ఉదంకమేఘంబులు; మరుదేశంబునందున్= ఆ నిర్జల ప్రదేశంలో; నియత= నియమంతో కూడిన; వృత్తిన్= విధంగా; అద్భుతంబు= ఆశ్చర్యం; తలకొనంగన్= కలుగగా; ఒక్కొక్క= ఆయా; పుణ్య= పవిత్రమైన; తిథులన్= తిథులలో; ఒలసి= వ్యాపించి; కురియున్= వర్షిస్తాయి.

తాత్పర్యం: 'జనమేజయా! ఉదంకమేఘాలు ఆ నిర్జలప్రదేశంలో నియమం తప్పకుండా ఆశ్చర్యకరంగా ఆయా పుణ్యతిథులలో నీళ్ళు కురిపిస్తాయి.'

వ. అనిన విని జనమేజయుండు 'మునీంద్రా! యుపేంద్రుని శపించుటకు నుత్సహించిన యుదంకుం డేమి విధంబు తపంబున నమ్మహానుభావంబు నొందె? నెఱింగింపవే!' యనుడు నా విభునకు వైశంపాయనుం డిట్లనియె. 71

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; విని; జనమేజయుండు; మునీంద్రా!= మునులలో శ్రేష్ఠుడా!; ఉపేంద్రునిన్= శ్రీకృష్ణుడిని; శపించుటకున్= శపించటానికి; ఉత్సహించిన= పూనుకొనిన; ఉదంకుడు; ఏమి విధంబు= ఏ విధమైన; తపంబునన్= తపస్సుచేత; ఆ+మహత్+అనుభవంబున్= ఆ గొప్ప మహిమను; ఒందెన్= పొందాడు; ఎఱింగింపవే?= తెలియజేయుమా!; అనుడున్= అని అనగా; ఆ విభునకున్= ఆ రాజుతో; వైశంపాయనుండు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వైశంపాయనుడు ఆ విధంగా చెప్పగా జనమేజయుడు 'మునీశ్వరా! ఉదంకుడు శ్రీకృష్ణుడినే శపించటానికి పూనుకొన్నాడు కదా! అంతటి మహిమ అతడికి ఏ విధమయిన తపస్సువలన లభించినదో నాకు చెప్పుము' అని అడిగాడు. అంతట జనమేజయుడితో వైశంపాయనుడు ఈ విధంగా అన్నాడు.

జనమేజయునకు వైశంపాయనుఁ డుదంకుని చరిత్రంబు చెప్పుట (సం. 14-55-1)

సీ. అతనికి గురుభక్తి కతనఁ జొప్పడియె న। త్తెఱఁగు పెం; పది విను తెలియ; నతఁడు
తన గురుండైన గౌతమునకు శుశ్రూష। నియతిమైఁ జేయ సస్నేహ భక్తి
కంబుగఁ బెద్దయుఁ గాలంబు చనిన, నా। సంయమిపతి శిష్య సమితి కెల్ల
వివిధవరము లిచ్చి, వీడ్కొల్పి, పుచ్చి, యు। దంకుని దిక్కును దలఁప కుండె;

ఆ. అత్తపఃపరాత్ముఁ డతినిష్ఠఁ బరిచర్య। నడపు, చొక్కనాఁడు కడును వ్రేఁగు
గలుగునట్టి వంటకట్టియమో పట్టు। గుదియ మోచి తెచ్చెఁ గురువరేణ్య! 72

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశ శ్రేష్ఠుడా!, ఓ జనమేజయా!; తెలియన్= స్పష్టమగునట్లుగా; విను; అతనికిన్= ఆ ఉదంకుడికి; గురు= గురువునందలి; భక్తి; కతనన్= వలన; ఆ+తెఱఁగు= ఆ విధమైన; పెంపు= మహిమ; అది; చొప్పడియెన్= కలిగింది; అతఁడు= ఆ ఉదంకుడు; తన గురుండు+ఐన= తన గురువయిన; గౌతమునకున్= గౌతముడికి; శుశ్రూష= సేవ; నియతిమైన్= నియమంతో; సస్నేహ= అనురాగంతో కూడిన; భక్తికంబు+కన్= భక్తి కలిగేటట్లుగా; చేయన్= చేయగా; పెద్దయున్=

చాలా; కాలంబు= కాలం; చనినన్= కడవగా; ఆ సంయమి= ఆ ఋషులయొక్క; పతి= రాజు, గౌతముడు; శిష్య= శిష్యులయొక్క; సమితికిన్= సమూహానికి; ఎల్లన్= అంతటికి; వివిధ= అనేక విధాలైన; వరములు; ఇచ్చి; వీడ్కొల్పి= పోవ అనుమతించి; పుచ్చి= పంపి; ఉదంకుని= ఉదంకుడియొక్క; దిక్కు= వైపు; తలఁపక= విచారించక; ఉండెన్= ఉన్నాడు; ఆ+తపస్ = ఆ తపస్సునందు; పర= ఆసక్తి కలిగి; ఆత్ముఁడు= ఆత్మగలవాడు; అతి= మిక్కిలి; నిష్ఠన్= శ్రద్ధతో; పరిచర్య= సేవ; నడపుచున్= చేస్తూ; ఒక్కనాఁడు= ఒక రోజున; కడును= మిక్కిలి; వ్రేఁగు= బరువు; కలుగు+అట్టి= కలిగినదయిన; వంట కట్టియ= వంటకట్టెలయొక్క, మోపు; అఱ్ఱు= మెడ; కుదియన్= క్రుంగేటట్లుగా; మోచి; తెచ్చెన్= తెచ్చాడు.

తాత్పర్యం: జనమేజయా! గురుభక్తివలన ఉదంకుడికి అటువంటి మహిమ కలిగింది. అతడు చాలాకాలం నియమబద్ధంగా తన గురువైన గౌతముడికి సేవ చేశాడు. మునిపతి అయిన గౌతముడు శిష్యులందరికీ ఆయా వరాలిచ్చి పంపివేశాడు. కాని, ఉదంకుడిమాట తలపనే తలపలేదు. అయినప్పటికీ ఉదంకుడు మహానిష్ఠతో గురు శుశ్రూష చేస్తూనే ఉన్నాడు. ఒక రోజున అతడు మెడ దిగబడిపోయేటంత బరువు కలిగిన వంటకట్టెలమోపు తెచ్చాడు.

క. అటు మోచి తెచ్చి యం దొక । జట పెద్దయుఁ దగిలియుండ, సరభసముగ వై
చుటయు దెగి, మోపుతో ముం । దట నది పడియెను జరాసితచ్ఛవి మెఱయన్. 73

ప్రతిపదార్థం: అటు= ఆ విధంగా; మోచి; తెచ్చి; అందున్= ఆ వంటకట్టెల మోపులో; ఒక; జట= జడ; పెద్దయున్= మిక్కిలి; తగిలి= చిక్కుకొని; ఉండన్= ఉండగా; సరభసముగన్= వేగంగా; వైచుటయున్= కిందపడవేయగా; అది= ఆ జడ; తెగి; జరా= ముసలితనంచేత కలిగిన; సిత= తెల్లని; ఛవి= కాంతి; మెఱయన్= మెరుస్తూ ఉండగా; మోపుతోన్= మోపుతోపాటు; ముందటన్= అతడిముందు; పడియెను= పడింది.

తాత్పర్యం: ఆ విధంగా వంటకట్టెలమోపు తెచ్చి, ఉదంకుడు వేగంగా కింద పడవేశాడు. అయితే ఆ మోపులో అతనిజడ ఒకటి గట్టిగా చిక్కుకొని ఉన్నది. మోపు కిందపడవేసినప్పుడు అది తెగి అతడిముందు పడింది. ముసలితనం ముంచుకొని రావటంవలన ఆ జడలోని వెంట్రుకలు తెల్లబడిపోయి ఉన్నాయి.

సీ. దాన నన్నియతుండు దనవయఃపాకంబు । నెఱిఁగి, శోకంబున నేడ్వ, నమ్మ
హాముని యశ్రువు లంజలిఁ బట్టంగ । నిజపుత్త్రిఁ బనిచె; నన్నీరజాక్షి
రయమునఁ బట్టి కరంబులు వేఁడిమి । నెరిసిన విడిచిన, ధరయుఁ దలరె;
నమ్మునిని యా శిష్యు రమ్మని చేరంగఁ । బిలిచి, 'నీ వేటికి నలఁతఁ బొందె!'

ఆ. దనిన, నతఁడు 'శిష్యులందఱపైఁ గల । కరుణ మీకుఁ బెద్దకాల మేని
మునివరేణ్య! నావలన లేదు; దానికి । నుమ్మలింప కెట్టు లుండవచ్చు?' 74

ప్రతిపదార్థం: దానన్= వెంట్రుకలు తెల్లబడటంచేత; ఆ నియతుండు= ఆ నియమం కలవాడు; తన= తనయొక్క; వయస్= వయస్సుయొక్క; పాకంబున్= పరిణామం; ఎఱింగి= తెలిసికొని; శోకంబునన్= బాధతో; ఏడ్వన్= ఏడువగా; ఆ+మహత్+ముని= ఆ గొప్పవాడయిన గౌతమ ముని; అశ్రువులు= ఉదంకుడి కన్నీళ్ళు; అంజలిన్= దోసిటిలో; పట్టంగన్= పట్టటానికి; నిజ= తనయొక్క; పుత్త్రిన్= కుమార్తెను; పనిచెన్= పంపాడు; ఆ+నీరజాక్షి= ఆ తామరపూలవంటి కన్నులు గలది; రయమునన్= తొందరగా; పట్టి; కరంబులు= చేతులు; వేఁడిమిన్= కన్నీళ్ళవేడిచేత; ఎరిసినన్= కాలగా; విడిచినన్= వాటిని వదలటంచేత;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధరయున్= భూమికూడా; తలరెన్= క్షోభించింది; ఆ+ముని= ఆ గౌతముడు; ఆ శిష్యున్= ఆ శిష్యుడైన ఉదంకుడిని; రమ్ము; అని; చేరంగన్= సమీపించగా; పిలిచి; నీవు; ఏటికిన్= ఎందువలన; అలఁతన్= బాధను; పొందెదు= పొందుతున్నావు; అనినన్= అనగా; అతఁడు= ఆ ఉదంకుడు; మునివరేణ్య!= మునులలో శ్రేష్ఠుడా!; మీకున్= మీకు; శిష్యులు; అందఱపైన్= అందరిమీదా; కల= ఉన్న; కరుణ= దయ; పెద్దకాలము+ఏని= చాలాకాలం గడచినప్పటికినీ; నావలనన్= నా యందు; లేదు; దానికిన్= దయలేకుండటానికి; ఉమ్మలింపక= దుఃఖించక; ఎట్టులు= ఏ విధంగా; ఉండవచ్చున్?= ఉండగలను?

తాత్పర్యం: నియమశాలి అయిన ఉదంకుడు తెల్లబడి నిగనిగలాడుతున్న జడను చూచి వయస్సు గడచి పోయిందని గుర్తించి శోకించాడు. అప్పుడు గౌతముడు అతడి కన్నీటిని దోసిట్లో పట్టుకొనటానికి తన కూతురిని పంపాడు. ఆమె దోసిట్లో పట్టిన కన్నీళ్ళ వేడికి తనచేతులు కాలేటప్పటికి వాటిని భూమిమీద వదలింది. కన్నీళ్ళ వేడికి భూమికూడా క్షోభించింది. అప్పుడు గౌతముడు ఉదంకుడిని దగ్గరకు పిలిచి 'ఎందుకు ఏడుస్తున్నా?' వని ప్రశ్నించాడు. దానికి ఉదంకుడు 'మహర్షీ! ఎంతో కాలం గడచినప్పటికీ మీకు శిష్యులందరిమీదా ఉన్నదయ నా యందు కలగదాయె. దీని కెట్లా శోకించకుండా ఉండగలను?'

వ. అనుటయుఁ గృప చిగురొత్తు చిత్తంబుతోడ. 75

ప్రతిపదార్థం: అనుటయున్= అని ఉదంకుడు అనగా; కృప= దయ; చిగురొత్తు= పుట్టిన; చిత్తంబుతోడన్= మనస్సుతో.

తాత్పర్యం: అనిన ఉదంకుడి మాటలు వినగానే గౌతముడి మనస్సులో అతడిమీద దయ కలిగింది. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'ఎలప్రాయ మిచ్చితిని నీ। కలఘుమతీ! యిచ్చెదను మదాత్మజ, నుల్లం
బలరఁగఁ బెండిలి గ' మ్మని। పలికి, మఱియు నా తపస్విపతి యి ట్లనియెన్. 76

ప్రతిపదార్థం: అలఘు= గొప్ప; మతీ= మనస్సు కలవాడా!; నీకున్= నీకు; ఎలప్రాయము= యౌవనం; ఇచ్చితిని= ప్రసాదించాను; మత్= నా యొక్క; ఆత్మజను= కూతురిని; ఇచ్చెదను= నీకు అర్పిస్తాను; ఉల్లంబు= హృదయం; అలరఁగన్= ఆనందించగా; పెండిలి+కమ్ము= పెండ్లాడుము; అని; పలికి; మఱియున్= ఇంకా; ఆ తపస్విపతి= ఆ గౌతముడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'మహాత్మా! నీకు యౌవనాన్ని ప్రసాదించాను. నా కూతురిని కూడా సమర్పిస్తాను. హృదయానందంతో ఆమెను పెండ్లాడుము' అని ఆ ఋషీశ్వరుడు ఇంకా ఇట్లా అన్నాడు.

క. 'నీ తేజంబు సహింపఁగ। నీ తామరసాక్షి దక్క నెవ్వరికిఁ దప
స్స్ఫీతా! శక్యముగా; దిది। చేతోగతిఁ జూచి, తగవు సిద్ధించుటకై. 77

ప్రతిపదార్థం: తపస్= తపస్సుయొక్క; స్ఫీతా= అధిక్యం కలవాడా!; నీ= నీయొక్క; తేజంబు= తేజస్సు; సహింపఁగన్= ఓర్చుకొనగా; ఈ తామరస+అక్షి= ఈ తామరపూలవంటి కన్నులు కలది; తక్కన్= తప్ప; ఎవ్వరికిన్= ఇతరుల కెవ్వరికీ; శక్యము= సాధ్యం; కాదు; ఇది= నా కూతురుయొక్క ఈ శక్తిని; చేతస్+గతిన్= మనోజ్ఞానం చేత; చూచి= కనుగొని; తగవు= ధర్మం - అనగా ఇద్దరికినీ సమానలక్షణం కలగటం అనే ధర్మం; సిద్ధించుటకై= ప్రాప్తించటానికి.

తాత్పర్యం: మహాతపస్వీ! ఈమె తప్ప ఇతరులెవ్వరూ నీ తేజస్సును సహించలేరు. మీ ఇద్దరకూ సమానధర్మం కలిగేటట్లుగా. (తరువాతి వచనంతో అన్వయం.)

వ. ఇమ్ముద్దియకును. 78

తాత్పర్యం: ఈ స్త్రీకి కూడా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. తను వొండుగఁ జేసెద; నది । జననాంతర మెట్టు లట్ల సజ్జననుత! నీ
వనుమానము దక్కుము, యౌ । వనమును గైకొనుము, కన్య వరియింపు తగన్. 79

ప్రతిపదార్థం: సజ్జన= మంచివారిచేత; నుత=పొగడబడినవాడా!; తనువు= శరీరం; ఒండుగన్= మరియొకవిధంగా ఉండేటట్లుగా; చేసెదన్= చేస్తాను; అది= ఆ కొత్త శరీరం; జనన+అంతరము= మరియొక జన్మం; ఎట్టులు= ఎట్టిదో; అట్లు+అ= అట్టిదే; నీవు; అనుమానము= అనుమానాన్ని; తక్కుము= వదలుము; యౌవనమును= యౌవనాన్ని; కైకొనుము= స్వీకరించుము; కన్యన్= నా ఈ కూతురిని; తగన్= ధర్మయుక్తంగా; వరియింపు= పెండ్లిచేసికొనుము.

తాత్పర్యం: (ఈమెకు) నూతన శరీరం ప్రాప్తించేటట్లు చేస్తాను. ఆ శరీరప్రాప్తి పునర్జన్మం వంటిదే. నీ వే అనుమానం పెట్టుకొనవద్దు. యౌవనవంతుడవై నా కుమార్తెను పెండ్లాడుము.

వ. అధర్మంబు గాకుండు నట్లుగా వరంబిచ్చితి' నని యనుగ్రహించి, యక్కన్యకారత్నంబునకును. 80

ప్రతిపదార్థం: అధర్మంబు= అధర్మము; కాక+ఉండు+అట్లు+కాన్= కాకుండేటట్లుగా; వరంబు= వరాన్ని; ఇచ్చితిన్= ఇచ్చాను; అని; అనుగ్రహించి= దయచూపి; ఆ కన్యకారత్నంబునకున్= ఉత్తమురాలయిన ఆ కన్యకు కూడా.

తాత్పర్యం: ఇది అధర్మం కాకుండేటట్లుగా వర మిచ్చాను' అని గౌతముడు దయచూపి ఆ ఉత్తమకన్యకు కూడా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. తనులత యొండు చేసిన, నుదంకుఁడు యౌవనలక్ష్మిఁ దాల్చి య
వ్వనిత వివాహమయ్యె నృపవర్య! పదంపడి యమ్మునీంద్రుతో
'ననుఁ బనిగొండు మీరలు మనంబున నెద్ది దలంచి వేడ్క సే
సిన నది దెత్తు; మీకరుణఁ జేసియ కల్గెడు నాకు శక్తియున్.' 81

ప్రతిపదార్థం: నృపవర్య!= రాజోత్తమా!; తనులత= అందమయిన తీగవంటి దేహాన్ని; ఒండు= మరొకటి; చేసినన్= కలిగించగా; ఉదంకుఁడు= ఉదంకుడు; యౌవన లక్ష్మిన్= యౌవన సంపదను; తాల్చి= ధరించి; ఆ వనితన్= ఆ స్త్రీని; వివాహము+అయ్యెన్= పెండ్లాడాడు; పదంపడి= తరువాత; ఆ ముని+ఇంద్రుతోన్= ఆ మునిశ్రేష్ఠుడితో; ననున్= నన్ను; పనిగొండు= ఆజ్ఞాపించండి; మీరలు= మీరు; మనంబునన్= మనస్సులో; ఎద్ది= దేనిని; తలంచి= అనుకొని; వేడ్క+చేసినన్= ఆపేక్షిస్తారో; అద్ది= దానిని; తెత్తున్= తెస్తాను; మీ= మీయొక్క; కరుణన్+చేసి+అ= దయవలననే; నాకున్= నాకు; శక్తియున్= శక్తికూడా; కల్గెడున్= కలుగుతుంది.

తాత్పర్యం: అందమైన తీగవంటి శరీరాన్ని కలిగించాడు. రాజోత్తమా! ఉదంకుడు యౌవనం పొంది గురుపుత్రిని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వివాహం చేసికొన్నాడు. తరువాత అతడు గౌతముడితో 'మీరు న న్నాజ్ఞాపించండి. మీరు ఆపేక్షించిన దానిని తీసికొని వస్తాను. ఈ పని చేయటానికి కావలసిన శక్తి నాకు మీ దయవలననే సమకూరుతుంది.

క. అని విన్నపంబు సేసిన । విని దక్షిణఁ బ్రీతియగుట వే ఱొరులకుఁ గా

కనఘ! భవదీయ చరితం । బునఁ జూవే నాకు ననియె ముని మనుజేంద్రా! 82

ప్రతిపదార్థం: అని; విన్నపంబు+చేసినన్= మనవిచేయగా; ముని= గౌతముడు; విని; అనఘ!= పాపరహితుడా!; నాకున్= నాకు; దక్షిణన్= గురుదక్షిణచేత; ప్రీతి= సంతోషం; అగుట; వేఱు+ఒరులకున్+కాక= ఏ ఇతరులవలన కాక; భవదీయ= నీయొక్క; చరితంబునన్= నడవడివలననే; చూవే!= సుమా!; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా ఉదంకుడు విన్నవించుకొన్నాడు. అప్పుడు గౌతముడు 'పుణ్యాత్మా! ఇతరులవలన గాక; నీ నడవడిచేతనే నాకు దక్షిణవలన కలిగే సంతోషం లభిస్తుంది' అని అన్నాడు. నీ సత్ప్రవర్తనయే నాకు గురుదక్షిణ' అని అర్థం.

తే. అంత నిలువక మునిపత్ని కతఁడు భక్తి । నెఱఁగి తల్లి! మీ రానతియిండు, మీకు

వలయునట్టి పదార్థ మవశ్యమును స । మాహరింతు నే, ననుటయు నయ్యహల్య. 83

ప్రతిపదార్థం: అతఁడు= ఆ ఉదంకుడు; అంతన్= అంతటితో; నిలువక= ఆగకుండా; మునిపత్నికిన్= గౌతమముని భార్యకు; భక్తిన్= భక్తితో; ఎఱఁగి= నమస్కరించి; తల్లి!= అమ్మా!; మీరు; ఆనతి+ఇండు= సెలవియ్యండి; మీకున్= మీకు; వలయు+అట్టి= కావలసినటువంటి; పదార్థము= పదార్థాన్ని; అవశ్యమును= తప్పకుండా; నేను; సమాహరింతున్= తెస్తాను; అనుటయున్= అనిన తరువాత; ఆ+అహల్య= ఆ గౌతముడి భార్య అయిన అహల్య.

తాత్పర్యం: గురువు మాటలు విన్న తరువాత కూడా ఉదంకుడు ఊరుకొనలేదు. అతడు గురుపత్నికి భక్తితో నమస్కరించి 'అమ్మా! మీరయినా సెలవియ్యండి. మీకు కావలసిన పదార్థాన్ని నేను తప్పకుండా తీసికొని వస్తాను' అని అన్నాడు. అప్పుడు గౌతముడి భార్య అయిన అహల్య. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. 'వలవదు; లాఁతి వాఁడవె? భవద్గుణతోషిత గౌతమాంచి తో

క్తులు మది నూఁదు మన్నను నకుంఠిత చిత్తత నొత్తి పల్కె న

య్యలఘుతపస్వి యాసతి ప్రియంబున మిత్త్రసహాఖ్యు దేవికుం

డలములు దెమ్ము; నాకుఁ బ్రకటంబుగఁ బెంపు వహింపు తమ్ముఁడా! 84

ప్రతిపదార్థం: వలవదు= వద్దు; లాఁతి వాఁడవు+ఎ= నీవు పరాయివాడవా; భవత్= నీయొక్క; గుణ= సుగుణాలచేత; తోషిత= సంతోషించిన; గౌతమ= గౌతముడియొక్క; అంచిత= సమంజసాలయిన; ఉక్తులు= మాటలు; మదిన్= మనస్సులో; ఊఁదుము= నిలుపుము; అన్నను= ఈ విధంగా గురుపత్ని అనిన తరువాతకూడా; ఆ అలఘు= ఆ గొప్ప; తపస్వి= ముని; అకుంఠిత= అడ్డగింప సాధ్యంకాని; చిత్తతన్= సంకల్పంతో; ఒత్తి= బలవంతంచేసి; ప్రియంబునన్= ప్రీతితో; పల్కెన్= పలికాడు; ఆ సతి= ఆ ఉత్తమ స్త్రీ, అహల్య; తమ్ముఁడా!; మిత్త్రసహ= మిత్త్రసహుడను; ఆఖ్య= పేరుగలవాడియొక్క; దేవి= పట్టపురాణియొక్క; కుండలములు= చెవి పోగులు; నాకున్= నాకొరకు; తెమ్ము= తీసికొని రమ్ము!; ప్రకటంబుగన్= ప్రసిద్ధంగా; పెంపు వహింపు= ఘనత కెక్కుము.

తాత్పర్యం: (అహల్య) 'నాయనా! ఈ పని వద్దు, నీవు మాకు పరాయివాడవా? నీ సద్గుణాలకు సంతోషించిన గౌతములవారు చెప్పిన మాటలు మనస్సులో పెట్టుకొమ్ము' అని అన్నది. అయినప్పటికీ ఉదంకుడు స్థిరచిత్తుడై పట్టుపట్టాడు. అప్పు డామె ప్రీతితో 'తమ్ముడా! మిత్రసహుడి దేవేరి చెవిపోగులు నాకు తెచ్చి ఇమ్ము. లోకంలో ఘనత కెక్కుము.'

వ. **అని యిట్లు పనిచిన నాతండు ప్రీతుండయి యప్పనికిం జనియెఁ; బదంపడి గౌతముఁ 'డుదంకునిం బొడగాన; మెచట నున్నవాఁ? డని యహల్య నడిగిన నా భృగువంశవరుం డరిగిన తెఱంగెఱింగించిన, నద్దయాళుం డద్దేవి యాననం బాలోకించి.** **85**

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; పనిచినన్= ఆజ్ఞాపించగా; ఆతండు= ఆ ఉదంకుడు; ప్రీతుండు+అయి= సంతోషించినవాడై; ఆ పనికిన్= ఆ చెవిపోగులు తెచ్చేపనిమీద; చనియెన్= వెళ్ళాడు; పదంపడి= తరువాత; గౌతముఁడు; ఉదంకునిన్= ఉదంకుడిని; పొడగానము= చూడము; ఎచటన్= ఎక్కడ; ఉన్నవాఁడు= ఉన్నాడు; అని; అహల్యన్= భార్య అయిన అహల్యను; అడిగినన్= అడుగగా; ఆ భృగు= ఆ భృగుమహర్షియొక్క; వంశ= వంశంలో; వరుండు= శ్రేష్ఠుడు - ఉదంకుడు; అరిగిన= వెళ్ళిన; తెఱంగు= తీరు; ఎఱింగించినన్= తెలియజేయగా; ఆ దయాళుండు= ఆ కనికరం కలవాడు; ఆ దేవి= భార్య అగు అహల్యయొక్క; ఆననంబు= ముఖాన్ని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అని, ఈ విధంగా అహల్య ఆజ్ఞాపించగా ఉదంకుడు సంతోషించి ఆపనిమీద వెళ్ళిపోయాడు. తరువాత గౌతముడు 'ఉదంకుడిని ఎక్కడా చూడము. అతడు ఎక్కడకు వెళ్ళాడు' అని అహల్యను అడిగాడు. ఆమె ఉదంకుడు వెళ్ళిన పనిని గూర్చి చెప్పింది. అప్పుడు ఆ గౌతముడు భార్యముఖం చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **ఆ సౌదాస నరేంద్రుం। డాసుర చరితుండు; శాప మాతని నటు కాఁ**
జేసిన యది; మానుషమాం। సాసక్తుం డగు టెఱుంగఁ డమ్ముని యతనిన్. **86**

ప్రతిపదార్థం: ఆ సౌదాస= ఆ సౌదాసుడనే; నర+ఇంద్రుండు= రాజు; ఆ సుర= రాక్షస సంబంధమయిన; చరితుండు= నడవడి కలవాడు; శాపము; అతనిన్= ఆ రాజును; అటు= ఆ విధంగా; కాన్= అయ్యేటట్లు; చేసిన+అది= చేసినది; ఆ ముని= ఆ ఉదంకుడు; అతనిన్= ఆ సౌదాసుడిని; మానుష= మనుష్య సంబంధమయిన; మాంస= మాంసమందు; ఆసక్తుండు= ప్రీతిగలవాడు; అగుట= అయ్యుండటం; ఎఱుంగఁడు= తెలియడు.

తాత్పర్యం: ఆ సౌదాసుడు రాక్షసప్రవృత్తి గలవాడు. ఒకానొకశాపం అతడిని ఆ విధంగా చేసింది. అతడికి మనుష్యమాంసం చాలా ఇష్టమనే విషయం ఉదంకుడికి తెలియదు.

సీ. **అకట! యెట్లగునొక్కొ!' యనుపల్కు కృపదోఁపఁ। బలికిన, నమ్మగ్ధ భయము గొనుచు,**
'నెఱుఁగ నిట్లగుట, మునీశ్వర! నా మీఁది। దయ చిగురొత్త నాతనికిఁ గీడు
రా కుండునట్లుగాఁ జేకొని కావవే'। యనిన నా సంయమి 'యంత వెఱవ
నేల? యే నతనికి నెడరు రానీ' నని। తగ నూఱడించె; నుదంకుఁ డరిగి

ఆ మనుజ రక్తసిక్త తనువును, గోర మీ। సములు, వృత్తలోచనములు నైన

యుగ్రమూర్తితోడ నొక్క శూన్యాటవి। నెలమి నున్న యన్నరేంద్రుఁ గాంచె. 87

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; ఎట్లు= ఏ విధంగా; అగున్+ఒక్కో= జరుగుతుందో; అను= అనే; పల్కు= మాట; కృప= దయ; తోఁపన్= వెల్లడి అయ్యేటట్లు; పలికినన్= పలుకగా; ఆ+ముగ్ధ= ఆ పొరపాటు చేసిన స్త్రీ అహల్య; భయము గొనుచున్= భయపడుతూ; ముని+ఈశ్వర!= మునిశ్రేష్ఠా!; ఇట్లు= ఈ విధంగా; అగుట= సంభవించటం; ఎఱుఁగన్= తెలియను; నా మీఁదన్= నా యందు; దయ; చిగురొత్తన్= పుట్టగా; ఆతనికిన్= ఆ ఉదంకుడికి; కీడు; రాక= కలుగక; ఉండు+అట్లు+కాన్= ఉండేటట్లుగా; చేకొని= సంగ్రహించి; కావవే!= కాపాడుమా!; అనినన్= అనగా; ఆ+సంయమి= ఆ ఋషి; అంత= అంతగా; వెఱవన్= భయపడటం; ఏల?= ఎందుకు?; ఏను= నేను; అతనికిన్= ఆ ఉదంకుడికి; ఎడరు= ఆపద; రానీను= రానీయను; అని; తగన్= తగిన విధంగా; ఊఱడించెన్= ఓదార్చాడు; ఉదంకుడు; అరిగి= వెళ్ళి; ఒక్క= ఒకానొక; శూన్య= పాడువడిన; అటవిన్= అడవిలో; మనుజ= మనుష్యులయొక్క; రక్త= నెత్తురుచేత; సిక్త= తడిసిన; తనువును= శరీరాన్ని; కోరమీసములు= చివర సన్నగా ఉన్న పెద్దమీసాలు; వృత్త= గుండ్రని; లోచనములున్= కన్నులూ; ఐన= కలిగిన; ఉగ్ర= భయంకరమయిన; మూర్తితోడన్= ఆకారంతో; ఎలమిన్= ధైర్యంగా; ఉన్న; ఆ+నర+ఇంద్రున్= ఆ రాజును; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: అయ్యో! ఇంకేమి జరుగుతుందో అని గౌతముడు అన్నాడు. ఆ మాటలు విని అహల్య భయపడుతూ 'మునీంద్రా! ఇట్లా జరుగుతుందని నాకు తెలియదు. నా యందు దయకలిగి ఉదంకుడికి ఏ కీడూ కలుగకుండా రక్షించండి' అని అన్నది. అప్పుడు గౌతముడు 'ఎందుకు అంతభయం? అతడికి ఏ ఆపదా రానియ్యను' అని ఆమెను ఓదార్చాడు. ఉదంకుడు వెళ్ళీ వెళ్ళీ ఒక నిర్జనారణ్యంలో ధైర్యంగా ఉన్న సౌదాసుడిని చూచాడు. అతడి ఒళ్ళంతా మనుష్యుల రక్తంతో తడిసి ఉన్నది. కన్నులు గుండ్రంగా ఉన్నవి. అతడి మీసాలు పొడవై కొసదేలి ఉన్నాయి. అతడి ఆకారం భయంకరంగా ఉన్నది.

క. ముని యిట్లు నెమ్మిఁ గాంచినఁ। గని యతఁ 'డాఁకొనుటఁ జేసి గాసిలి యెచ్చోఁ

గను వాఁడనొ? తగు భక్ష్యం?। బనుచుండఁగ వచ్చితివి ప్రియంబుగ' ననుడున్. 88

ప్రతిపదార్థం: ముని= ఉదంకుడు; ఇట్లు= ఈ విధంగా; నెమ్మిన్= ధైర్యంతో; కాంచినన్= తనను చూడగా; అతఁడు= ఆ సౌదాసుడు; కని= చూచి; ఆఁకొనుటన్+చేసి= ఆకలిగొని ఉండటంచేత; గాసిలి= బాధపడి; ఎచ్చోన్= ఎక్కడ; తగు= తగిన; భక్ష్యంబు= తినుబండాన్ని; కనువాఁడను+ఒ= చూడగలుగుతానో అని; అనుచున్+ఉండఁగన్= అనుకొంటూ ఉండగా; ప్రియంబు+కన్= ప్రీతి కలిగేటట్లుగా; వచ్చితివి= వచ్చావు; అనుడున్= అనిన తరువాత.

తాత్పర్యం: ఉదంకుడు ధైర్యంగా తనను చూడటం సౌదాసుడు చూచాడు. అప్పుడు అతడు 'ఆకలితో బాధపడుతూ ఈ వేళ తినటానికి తిండి ఎక్కడ చూడగలుగుతానో? అని అనుకొంటున్నాను. సమయానికి సంతోషం కలిగేటట్లు నీవు వచ్చావు' అని అన్నాడు. ఆ విధంగా అనిన తరువాత.

వ. ఉదంకుం డతని కిట్లనియె. 89

ప్రతిపదార్థం: ఉదంకుడు; అతనికిన్= అతడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఉదంకుడు అతడితో ఇట్లా అన్నాడు.

క. 'గురుకార్యంబునకై భూ। వర! నిన్నుం గాన నేను వచ్చితి; గుర్వ
ర్థ రతులు హింస్యులు గా; రి। ట్లరయక యాడుదె యధర్మ మగు మాట నృపా! 90

ప్రతిపదార్థం: భూవర!= భూపతీ!; గురు= గురువుయొక్క; కార్యంబునకున్+ఐ= పనిమీద; నేను; నిన్నున్= నిన్ను; కానన్= చూడటానికి; వచ్చితిన్= వచ్చాను; నృపా!= రాజా!; గురు= గురువుయొక్క; అర్థ= ప్రయోజనమందు; రతులు= ఆసక్తికలవారు; హింస్యులు= చంపదగినవారు; కారు; ఇట్లు= ఈ విధంగా; అరయక= ఆలోచించక; అధర్మము= ధర్మం కానిది; అగు= అయిన; మాట; ఆడుదు+ఎ?= పలుకుతావా?

తాత్పర్యం: రాజా! గురువుగారి పనిమీద నిన్ను చూడటానికి వచ్చాను. గురువుల ప్రయోజనంపట్ల ఆసక్తిగలవారు చంపదగినవారు కానేకారు. ఈ విధంగా నీవు ఆలోచింపక అధర్మమయిన మాట పలుకుతావా?

వ. అనుటయు. 91

తాత్పర్యం: ఈ విధంగా ఉదంకుడు అనిన తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'దినమున మూఁడవ యామం। బున నపరార్ధంబు యోగ్యముగ నాహారం
బునకుం గల్పించిరి నా। కనిమిషు, లటు గాన మాన; నాఁకలి పుత్తున్.' 92

ప్రతిపదార్థం: అనిమిషులు= దేవతలు; దినమునన్= దినమునందు; మూఁడు+అవ= మూడో; యామంబునన్= జాములో; అపర= రెండో; అర్ధంబు= సగభాగం; నాకున్= నాకు; ఆహారంబునకున్= తిండికి; యోగ్యము+కన్= తగినదిగా; కల్పించిరి= నిర్ణయించారు; అటు+కాన= అందుచేత; మానన్= నిన్ను తినకుండా మానను; ఆఁకలి= నా ఆకలి; పుత్తున్= తీర్చుకొంటాను.

తాత్పర్యం: 'దేవతలు ప్రతిరోజూ మూడోజాములోని రెండోభాగంలో నేను తిండి తినటానికి తగినదిగా నిర్ణయించారు. కాబట్టి నిన్ను తినకుండా మానను. తిని నా ఆకలి తీర్చుకొంటాను.'

సీ. అని పల్కె సౌదాసుఁ; డమ్ముని 'యట్లేని। నధిప! మద్గురు కార్య మాచరించి,
వచ్చెద మగుడ నవశ్యంబు; నా మాట। నన్నృతంబు చొరదు; నీ వర్థికోటి
కిష్టపదార్థంబు లిత్తు; పాత్రమ యేను;। గురులకుఁ గాఁగ నా కోరు కోర్కి
నీవ తీర్తని కృత నిశ్చయత్వంబున। నరుగుదెంచిన వాఁడ' ననుడు నృపతి

ఆ. 'యట్లకాక; యేమి యర్థించి వచ్చితి; చెప్పు 'మనిన నతఁడు చిత్త మలర
'ననఘ! నీదు పత్ని యర్థిమై ధరియించు। కుండలంబు' లని యతండు సెప్పె. 93

ప్రతిపదార్థం: అని; సౌదాసుఁడు; పల్కెన్= అన్నాడు; ఆ+ముని= ఆ ఉదంకుడు; అధిప!= రాజా!; అట్లు+ఏని= అట్లయితే; మత్= నా యొక్క; గురు= గురువుయొక్క; కార్యంబు= పని; ఆచరించి= చేసి; అవశ్యంబు= తప్పక; మగుడన్= మరలా, తిరిగి;

వచ్చెదన్= వస్తాను; నా= నాయొక్క; మాటన్= మాటయందు; అనృతంబు= అసత్యం; చొరదు= కలుగదు; నీవు; అర్థి= యాచకులయొక్క; కోటికిన్= సమూహానికి; ఇష్ట= ప్రీతి పాత్రమయిన; పదార్థంబులు= పదార్థాలను; ఇత్తు= ఇస్తావు; ఏను= నేను; పాత్రము+అ= యోగ్యుడినే; గురులకున్= గురువులకు; కాఁగన్= ప్రయోజనం కలిగేటట్లుగా; నా కోరు= నేను కోరుతున్న; కోర్కి= కోరిక; నీవు+అ= నీవే; తీర్తు(వు)= నెరవేరుస్తావు; అని; కృత= చేయబడిన; నిశ్చయత్వంబునన్= నిశ్చయధర్మంతో, నిశ్చయంచేసికొని; అరుగుదెంచినవాఁడన్= వచ్చినవాడిని; అనుడున్= అని అనగా; నృపతి= రాజు సౌదాసుడు; అట్లు= అట్లే; కాక= అగునుగాక; ఏమి= దేనిని; అర్థించి= కోరి; వచ్చితి= వచ్చావు; చెప్పుము; అనినన్= అనగా; అతఁడు= ఆ ఉదంకుడు; చిత్తము= మనస్సు; అలరన్= సంతోషించగా; అనఘ!= పాపంలేనివాడా!; నీదుపత్ని= నీ భార్య; అర్థిమైన్= ప్రీతితో; ధరియించు= ధరించే; కుండలంబులు= చెవిపోగులు; అని; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: అని సౌదాసుడు అన్నాడు. అప్పుడు ఉదంకుడు 'రాజా! అట్లయితే నేను నా గురువుగారి పని తీర్చి తప్పకుండా తిరిగి వస్తాను. నా మాట కల్లగాదు. నీవు యాచకుల కిష్టమయిన పదార్థాలను దానంచేస్తావు. నేను యోగ్యుడినే! గురువుగారికి ప్రయోజనం కలిగేటట్లుగా నేను కోరే కోరికను నీవే తీరుస్తావని నిశ్చయించుకొని వచ్చాను' అని అన్నాడు. అంతట రాజు 'అట్లే అవుతుందిలే! నీవు దేనిని కోరి వచ్చావు?' అని అడిగాడు. ఆ మాటకు సంతోషించి ఉదంకుడు 'పుణ్యాత్మా! నీ భార్య పరమప్రీతితో ధరించే కుండలాలే కోరి వచ్చాను' అని చెప్పాడు.

వ. చెప్పిన విని యమ్మనుజవరుం 'డొరులధనం బిచ్చు వారలు గలరె? కుండలంబు లడుగ కొండెద్దేనియు నడుగు' మనుటయు, నాసంయమి 'నీవు నెపంబిడి త్రోవం గలవాఁడవు గావే నన్యవస్తువు లొల్ల' నని పలికిన, నా భూవల్లభుం డమ్మాట కియ్యకొని, 'యానాతి యున్న చోటికిం జను; మేఁ బుత్తెంచితి, నని చెప్పి, నీ వాంఛితం బెఱింగింపు' మని నియోగించిన, నమ్ముని 'యద్దేవి యెచ్చోట నున్న యది?' యని యడిగిన నప్పుడమిఱేఁ 'డల్లదె తన్నివాస ప్రదేశం' బని చూపినం బోయి. 94

ప్రతిపదార్థం: చెప్పినన్= ఉదంకుడు చెప్పగా; విని; ఆ+మనుజవరుండు= ఆ నరపతి సౌదాసుడు; ఒరుల= ఇతరులయొక్క; ధనంబు= డబ్బు; ఇచ్చువారలు= ఇచ్చేవారు; కలరు+ఎ?= ఉన్నారా?; కుండలంబులు; అడుగక= అడుగకుండా; ఒండు= మరియొకటి; ఎద్ది+ఏనియున్= ఏదైనా; అడుగుము; అనుటయున్= అనగా; ఆ+సంయమి= ఆ ముని ఉదంకుడు; నీవు; నెపంబు+ఇడి= వంకపెట్టి; త్రోవన్+కలవాఁడవు= త్రోసిపుచ్చగలవాడవు; కావు; ఏను= నేను; అన్య= ఇతరములయిన; వస్తువులు; ఒల్లన్= కోరను; అని; పలికినన్= పలుకగా; ఆ+భూవల్లభుండు= భూపతి సౌదాసుడు; ఆ+మాటకున్= ఆ మాటకు; ఇయ్యకొని= ఒప్పుకొని; ఆ+నాతి= ఆ స్త్రీ (సౌదాసుడి భార్య); ఉన్న; చోటికిన్= చోటికి; చనుము= వెళ్ళుము; ఏన్= నేను; పుత్తెంచితిన్= పంపితిని; అని; చెప్పి; నీ= నీ యొక్క; వాంఛితంబు= కోరిక; ఎఱింగింపుము= తెలియజేయుము; అని; నియోగించినన్= నియమించగా; ఆ+ముని= ఆ ముని; ఆ దేవి= ఆ పట్టపురాణి; ఏ+చోటన్= ఎక్కడ; ఉన్న+అది= ఉన్నది; అని; అడిగినన్= అడుగగా; ఆ+పుడమి= ఆ భూమియొక్క; ఱేఁడు= రాజు; అల్ల+అది+ఎ= ఆ కనబడుచున్నదే; తత్= ఆమెయొక్క; నివాస ప్రదేశంబు= నివసించే చోటు; అని; చూపినన్= చూపగా; పోయి.

తాత్పర్యం: ఉదంకుడు చెప్పినమాటలు విని సౌదాసుడు 'పరాయివారి సొమ్ము దానం చేసేవారు ఎక్కడయినా ఉన్నారా? కుండలాలు తప్ప ఇంకేమయినా అడుగుము' అని అన్నాడు. అప్పుడు ఉదంకుడు 'నీవు ఏదో వంకపెట్టి నా కోరికను త్రోసిపుచ్చే వాడవు కావు. నేను ఇతర వస్తువులకు ఇష్టపడను' అని చెప్పాడు. సౌదాసుడు ఉదంకుడి మాటలు ఒప్పుకొని 'నీవు నా ధర్మపత్ని ఉన్నచోటికి వెళ్ళుము. నేను పంపానని చెప్పి నీ కోరిక ఆమెకు తెలియజేయుము' అని నియోగించాడు.

అప్పుడు ఉదంకుడు 'అయితే ఆ దేవి ఎక్కడ ఉన్నది?' అని ప్రశ్నించాడు. దానికి సౌదాసుడు 'అదిగో ఆ కనబడేదే ఆమె నివసించే చోటు' అని చూపి చెప్పాడు. ఉదంకుడు సౌదాసుడు చూపిన చోటికి వెళ్లాడు.

సీ. అద్దేవిఁ గని యతఁ డట్ల చెప్పిన 'ముని। వల్లభ! నా కానవాలు దెమ్ము
నృపుపాల' ననియె నన్నెలఁత; యుదంకుండు। చనుదెంచి విభు నభిజ్ఞాన మడిగె;
నాతఁ 'డీగతి సేమ మగు నని నిష్ఠింప। రా; దిది వెలిగాఁగ లేదు వేఱ
గతియును ననుపలు కతివకు నా యిచ్చు। వర్ణితాభిజ్ఞాన నిర్ణయముగఁ

ఆ. జెప్పు; మనిన సంతసిల్లి యమ్మదయంతి। కడకు నరిగి, తత్ప్రకారమునన
పలుకుటయును, 'భర్తపనుపున నిచ్చెదఁ। గుండలములు నీకు గురుహితార్థి!' 95

ప్రతిపదార్థం: ఆ+దేవిన్= ఆ దేవేరిని; కని= చూచి; అతఁడు= ఆ ఉదంకుడు; అట్లు+ఆ= అట్లే (సౌదాసుడు చెప్పిన విధంగానే); చెప్పినన్= చెప్పగా; ఆ+నెలఁత= ఆ స్త్రీ, సౌదాసుడి భార్య; మునివల్లభ!= మునీంద్రా!; నృపుపాలన్= రాజు దగ్గరి నుండి; నాకున్= నాకు; ఆనవాలు= గుర్తు; తెమ్ము= తీసికొనిరమ్ము; అనియెన్= అన్నది; ఉదంకుండు=ఉదంకుడు; చనుదెంచి= తిరిగివచ్చి; విభున్= రాజును; అభిజ్ఞానము= గుర్తు; అడిగెన్= అడిగాడు; అతఁడు= ఆ సౌదాసుడు; ఈ గతిన్= ఈ విధంగా; సేమము= క్షేమం; అగును; అని; నిష్ఠింపరాదు= నిశ్చయించరాదు; ఇది= ఈ పద్ధతి; వెలి= బహిష్కరించినది, వదలినది; కాఁగన్= అయ్యేటట్లయితే; అభిజ్ఞాన= గుర్తుకు సంబంధించిన; నిర్ణయము+కన్= నిర్ణయంగా; చెప్పుము; అనినన్= అనగా; సంతసిల్లి= సంతోషించి; ఆ మదయంతి= ఆ సౌదాసుడి భార్య అయిన మదయంతియొక్క; కడకున్= దగ్గరకు; తిరిగి= వెళ్ళి; తద్= ఆ; ప్రకారమునన్+అ= విధంగానే, సౌదాసుడు చెప్పినట్లే; పలుకుటయును= పలుకగా; గురు= గురువుయొక్క; హిత= హితాన్ని; అర్థి= కోరేవాడా!; నీకున్= నీకు; భర్త= నా నాథుడియొక్క; పనుపునన్= ఆజ్ఞచేత; కుండలములు= కుండలాలు; ఇచ్చెదన్= ఇస్తాను.

తాత్పర్యం: ఉదంకుడు ఆ దేవేరిని చూచి సౌదాసుడు చెప్పినట్లే చెప్పాడు. అప్పుడామె 'మునీశ్వరా! రాజు దగ్గరినుండి ఒక గుర్తు తీసికొనిరమ్ము!' అని అడుగగా ఉదంకుడు తిరిగివచ్చి రాజును గుర్తు అడిగాడు. అంత రాజు 'ఈ విధంగానే క్షేమం కలుగుతుందని నిశ్చయించలేము. దీనిని వదలితే వేరే గతీ లేదు. ఈ మాటలే నేను స్పష్టంగా తెలియజేసే గుర్తు అని ఆమెతో చెప్పుము' అని అన్నాడు. ఉదంకుడు సౌదాసుడి భార్య అయిన మదయంతి దగ్గరకు తిరిగి వెళ్ళి అతడు చెప్పిన మాటలే చెప్పాడు. మదయంతి 'ఓ గురుహితాభిలాషీ! నీకు నా నాథుడి ఆజ్ఞవలన కుండలాలు ఇస్తాను.'

వ. అని యక్కొమ్మ యమ్మహితాత్మునితో మఱియును. 96

ప్రతిపదార్థం: అని; ఆ+కొమ్మ= ఆ స్త్రీ, మదయంతి; ఆ+మహిత= గౌరవించబడిన-గొప్పదైన; ఆత్మునితోన్= ఆత్మగలవాడితో; మఱియును= ఇంకనూ.

తాత్పర్యం: ఆ విధంగా చెప్పి మదయంతి ఆ మహాత్ముడితో ఇంకా. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. 'సురులు గంధర్వులు నురగులు నిక్కుండ । లములకుఁ బెక్కుపాయముల వేచి
తరుగుదు; రెంగిలి పొరసిన, నేమఱి । నీవు నిద్రించిన, నేల నిడిన,
నపహరింతురు; భక్తి నర్చించి యివిదాల్ప । నాఁకలి నీరువ ట్టగ్నిభయము
విషవికారము, భూతబేతాళ బాధలు । పొరయవు; వినుము, బాలురకు నైనఁ

ఆ. బెద్దవారి కైనఁ బెట్టిన నయ్యయి । కొలఁది నమరియుండుఁ; గురియుఁ బసిఁడి;
వీని నప్రమత్త వృత్తిమైఁ గొని చను । మయ్య! గురులు నిన్ను నభినుతింప.' 97

ప్రతిపదార్థం: సురులు= దేవతలు; గంధర్వులున్= గంధర్వులు; ఉరగులున్= నాగులు; ఈ కుండలములకున్= ఈ కుండలాలకొరకు; పెక్కు= ఎన్నెన్నో; ఉపాయములన్= ఉపాయాలతో; వేచి= ఎదురుచూస్తూ; తిరుగుదురు= తిరుగుతుంటారు; ఎంగిలి; పొరసినన్= తగిలినా; నీవు; ఏమఱి= పరాకుపడి; నిద్రించినన్= నిద్రించినా; నేలన్= నేలమీద; ఇడినన్= ఉంచినా; అపహరింతురు= దొంగిలిస్తారు; భక్తిన్= భక్తితో; అర్చించి= పూజించి; ఇవి= వీటిని; తాల్పన్= ధరించగా; ఆఁకలి= ఆకలి; నీరువట్టు= దప్పికా; అగ్నిభయము= అగ్నివలన భయమూ; విష= విషంవలన; వికారము= వ్యాధీ, మార్పూ; భూత= భూతాలయొక్క; బేతాళ= బేతాళాలయొక్క; బాధలు= పీడలు; పొరయవు= కలుగవు; వినుము; బాలురకున్+ఐనన్= బాలురకయినా; పెద్దవారికిన్+ఐనన్= పెద్దవారికయినా; పెట్టినన్= పెడితే; అయ్యయి= వారి వారి; కొలఁదిన్= కొలత ప్రకారం; అమరి+ఉండున్= సరిపోయి ఉంటాయి; పసిఁడిన్= బంగారాన్ని; కురియున్= కురిపిస్తాయి; గురులు= గురువులు; నిన్నున్= నిన్ను; అభినుతింపన్= మిక్కిలి కొనియాడగా; వీనిన్= వీటిని; అప్రమత్త= పరాకు లేని; వృత్తిన్= నడవడితో; కొని= తీసికొని; చనుము= వెళ్ళుము; అయ్య!= అయ్యా!.

తాత్పర్యం: 'అయ్యా! దేవతలూ, గంధర్వులూ, నాగులూ ఎన్నో ఉపాయాలు పన్నుతూ ఈ కుండలాలకొరకు ఎదురుచూస్తూ తిరుగుతుంటారు. ఎంగిలి అంటుకొన్నా, నీవు మైమరచి నిద్రించినా, నేలమీద పెట్టినా వారు దొంగిలిస్తారు. వీటిని భక్తితో పూజించి ధరించితే ఆకలీ, దప్పికా, అగ్ని భయమూ, విషంవలన వ్యాధీ, భూత బేతాళాల పీడలూ కలుగవు. పిల్లలు పెట్టుకొన్నా,పెద్దలుపెట్టుకొన్నా వారి వారి కొలతల ప్రకారం అతికించినట్లు సరిపోతాయి. పైగా ఇవి బంగారాన్ని కురిపిస్తాయి. గురువులు నిన్ను మెచ్చుకొనేటట్లుగా పరాకులేకుండా వీటిని తీసికొనివెళ్ళుము.'

ఉదంకుఁడు మదయంతివలనఁ గుండలంబులు పుచ్చికొనుట (సం. 14-57-3)

వ. అని చెప్పి యప్పరమ పతివ్రత భక్తి ప్రీతి వినయంబులు మనంబున నంకురింప, నక్కుండలంబు లొసంగినం, బ్రమోదం బెసంగ నాశీర్వాదంబు చేసి, యాసంయమివరుం డబ్భామచేత నా మంత్రితుండై, భూమీశ్వరు పాలికి, వికాస లసిత వదనారవిందుం డగుచు నేతెంచి, యక్కుండల లాభంబు ప్రకటించి, దీవించి, 'దేవా! నీ వలనం గృతార్థుండ నైతి' నని పలికి, 'నా కానవాలుగా నీవు చెప్పిన వాక్యం బత్యంత గూఢంబు; తదభిప్రాయంబు నెఱుంగ వలతుం; జెప్పం దగియుండు నేనిం జెప్పు' మని యడిగిన, నతం డతని తోడ. 98

ప్రతిపదార్థం: అని; చెప్పి; ఆ పరమ= ఆ గొప్ప; పతివ్రత; భక్తి= భక్తీ; ప్రీతి= సంతోషమూ; వినయంబు= వినయమూ; మనంబునన్= మనస్సులో; అంకురింపన్= మొలకెత్తగా; ఆ కుండలంబులు= ఆ కుండలాలను; ఒసంగినన్= ఇవ్వగా; ఆ సంయమి= ఆ

మునులలో; వరుండు= శ్రేష్ఠుడు; ప్రమోదంబు= మహానందం; ఎసంగన్= అతిశయించగా; ఆశీర్వాదంబుచేసి= దీవించి; ఆ భామచేతన్= ఆ స్త్రీచేత, మదయంతిచేత; ఆమంత్రితుండు+ఐ= వీడ్కోలుపొందినవాడయి; భూమీ+ఈశ్వరు= భూపతి అయిన సౌదాసుడియొక్క; పాలికిన్= దగ్గరకు; వికాస= సంతోషం చేత; లసిత= విలసిల్లిన; వదన+అరవిందుండు= ముఖపద్మం కలవాడు; అగుచున్= అవుతూ; ఏతెంచి= వచ్చి; ఆ కుండల= ఆ కుండలాలయొక్క; లాభంబు= ప్రాప్తి; ప్రకటించి= వెల్లడించి; దీవించి; దేవా!= ప్రభూ!; నీవలనన్= నీ వలన; కృత+అర్థుండన్= ధన్యుడిని; ఐతిన్= అయ్యాను; అని; పలికి; నాకున్= నాకు; ఆనవాలు+కాన్= గుర్తుగా; నీవు; చెప్పిన; వాక్యంబు= వాక్యం; అత్యంత= మిక్కిలి; గూఢంబు= రహస్యం; తత్= దానియొక్క; అభిప్రాయంబు= భావం; ఎఱుంగన్= తెలిసికొనగా; వలతున్= కోరుతున్నాను; చెప్పన్= తెలియజేయటానికి; తగి= తగినదిగా; ఉండున్+ఏనిన్= ఉండేటట్లయితే; చెప్పుము; అని; అడిగినన్= అడుగగా; అతండు= ఆ సౌదాసుడు; అతనితోడన్= ఆ ఉదంకుడితో.

తాత్పర్యం: ఆ విధంగా చెప్పి మహాపతివ్రత అయిన మదయంతి భక్తి సంతోష వినయపూర్వకంగా కుండలాలిచ్చింది. ఉదంకుడు పరమానందంతో వాటిని స్వీకరించి, ఆమెను దీవించి, వీడ్కోలుపొంది సౌదాసుడి దగ్గరకు వచ్చి, తనకు కుండలాలు లభించాయని చెప్పాడు. 'ప్రభూ! నీవలన నా కోరిక నెరవేరింది. అయితే నీవు నాకు గుర్తుగా చెప్పిన వాక్యభావం గూఢంగా ఉన్నది. ఆ భావం తెలిసికొనాలని కోరుకొంటున్నాను. అది చెప్పదగిందయితే చెప్పండి' అని అన్నాడు. అప్పుడు సౌదాసుడు అతడితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. **'బ్రాహ్మణజనముల రాజులు పూజింతు; ၊ రటుగాన నేను విప్రార్చనంబు**
సేయుదు; విప్రుని చేతన యిట్లైతి ၊ వెడదప్పునన; యొండు వెరవు నాకు
దురితంబు వాపంగ దొరకొన; దది కార ၊ ణముగ భూసుర పూజనంబు దుష్క
రము; దీన మేలు గందు మనంగ రా; దిది ၊ గాదన్న వేఱొండు గలదె మార్గ;

తే. **మని యభిజ్ఞానముగ మదయంతి కపుడు ၊ చెప్పి పుచ్చితి; నిట్లు విశిష్టరత్న**
మయ మహాకుండలము లిచ్చి మాన్తుఁ గీడు ၊ నీకతన; నను తలఁపున లోకవంద్య!' 99

ప్రతిపదార్థం: లోక= లోకంచేత; వంద్య!= కొనియాడదగినవాడా!; రాజులు; బ్రాహ్మణజనములన్= బ్రాహ్మణులను; పూజింతురు= పూజిస్తారు; అటు+కాన= అందుచేత; నేను; విప్ర= బ్రాహ్మణులయొక్క; అర్చనంబు= పూజను; చేయుదున్= చేస్తుండేవాడిని; వెడ= చిన్న; తప్పునన్+అ= తప్పువలననే; విప్రునిచేతన్+అ= బ్రాహ్మణుడిచేతనే; ఇట్లు= ఈ విధంగా; ఐతిన్= అయ్యాను; దురితంబు= పాపాన్ని; పాపంగన్= తొలగించుకొనగా; ఒండు= ఇతరమైన; వెరవు= ఉపాయం; దొరకొనదు= చేకూరదు; అది; వేరే ఉపాయం లేకపోవటం; కారణము+కన్= కారణంగా; భూసుర= బ్రాహ్మణులయొక్క; పూజనంబు= పూజ; దుష్కరము= చేయశక్యం కానిది; దీనన్= బ్రాహ్మణ పూజవలన; మేలు= మంచి; కందుము= పొందుతాము; అనంగన్+రాదు= అనటానికి వీలులేదు; ఇది= బ్రాహ్మణపూజ; కాదు= తగదు; అన్నన్= అంటే; వేఱు+ఒండు= మరియొక; మార్గము= దారి; కలదు+ఎ?= ఉన్నదా?; అని= అనుకొని; ఇట్లు= ఈ విధంగా; విశిష్ట= శ్రేష్ఠములైన; రత్న= రత్నాలతో; మయ= నిండిన; మహత్= గొప్ప; కుండలములు= చెవిపోగులు; ఇచ్చి= సమర్పించి; నీకతనన్= నీ వలన; కీడు; మాన్తున్= తొలగించుకొంటాను; అను= అనే; తలఁపునన్= అభిప్రాయంతో; అపుడు; అభిజ్ఞానముగన్= గుర్తుగా; మదయంతికిన్= మదయంతికి; చెప్పి; పుచ్చితిన్= పంపాను.

తాత్పర్యం: 'లోకస్తుత్యా! రాజులు బ్రాహ్మణులను పూజిస్తారు. అందుచేత నేనూ బ్రాహ్మణపూజ చేస్తుండేవాడిని; ఒక చిన్న తప్పుచేత బ్రాహ్మణుడివలన ఇట్లా అయ్యాను. నా పాపం పోగొట్టుకొనటానికి వేరే ఉపాయం లేదు. కాబట్టి బ్రాహ్మణపూజ చాలా కష్టం. దీనివలన మేలు కలుగుతుందని చెప్పటానికి వీలులేదు. అట్లని మేలు కలిగించే వేరే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

మార్గమూ లేదు. ఇదే గుర్తుగా మదయంతికి చెప్పాను. రత్నఖచిత కుండలాలను నీ కిచ్చి నీ వలన నాకు కలిగిన కీడును తొలగించుకొనవచ్చని నేను అభిప్రాయపడ్డాను.'

వ. అనియె నా భృగువంశ వరేణ్యుని పుణ్యసన్నిధింజేసి యా సౌదాస నరేంద్రునకు సంప్రాప్త సమాధాన నూతన సత్త్వంబు గలుగుట కతంబునం గార్యదర్శనంబును, గుండలదాన శ్రద్ధయు, శాంతవచనంబునుం గలిగెఁ; దదీయవచన శ్రవణానంతరంబ యుదంకుం డతనితో 'మిత్రత్వంబు సంభాషణమాత్ర సిద్ధంబగుట బోధవృద్ధులు చెప్పుదు 'రేను నీవలనం గృతార్థుండ నైతిఁ; బోవుచున్నవాఁడ; మగిడి వచ్చెద; నని పలికితి; 'బొంకువడకుండ వత్తు' ననినఁ జిత్తంబు కృపాయత్తంబగుచుండ నా భూపతి యత్తాపసోత్తము నాననం బాలోకించి. 100

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; ఆ భృగు= ఆ భృగుమహర్షియొక్క; వంశ= వంశంలోని; వరేణ్యుని= శ్రేష్ఠుడియొక్క, ఉదంకుడియొక్క; పుణ్య= పవిత్రమైన; సన్నిధిన్+చేసి= సమక్షంవలన; ఆ సౌదాస= ఆ సౌదాసుడనే; నరేంద్రునకున్= రాజునకు; సంప్రాప్త= చక్కగా పొందబడిన; సమాధాన= శాంతివలన కలిగిన; నూతన= కొత్తదయిన; సత్త్వంబు= తెలివి; కలుగుట= లభించటం; కతంబునన్= వలన; కార్య= పనియొక్క; దర్శనంబును= జ్ఞానమునూ; కుండల= కుండలాలను; దాన= ఇవ్వటంలో; శ్రద్ధయున్= తీవ్రమయిన కోరికయూ; శాంత= నెమ్మదితో కూడిన; వచనంబునున్= మాటయు; కలిగెన్= లభించాయి; తదీయ= ఆ సౌదాసుడియొక్క; వచన= మాటలను; శ్రవణ= వినుటయొక్క; అనంతరంబు+అ= తరువాతనే; ఉదంకుండు= ఉదంకుడు; అతనితోన్= ఆ సౌదాసుడితో; మిత్రత్వంబు= స్నేహం; సంభాషణ= సల్లాపం; మాత్ర= మాత్రాననే; సిద్ధంబు= పొందబడేది; అగుట= కావటం; బోధ= జ్ఞానంచేత; వృద్ధులు= వృద్ధులైనవారు; చెప్పుదురు= చెప్తుతారు; ఏను= నేను; నీవలనన్= నీ వలన; కృత+అర్థుండన్= కోరిక నెరవేరిన వాడిని; ఐతిన్= అయ్యాను; పోవుచున్నవాఁడన్= వెళ్ళిపోతున్నాను; మగిడి= తిరిగి; వచ్చెదన్= వస్తాను; అని; పలికితిన్= చెప్పాను; బొంకు+పడక+ఉండన్= అసత్యత్వాన్ని పొందకుండా; వత్తున్= తిరిగి వస్తాను; అనినన్= అనగా; చిత్తంబు= మనస్సు; కృపా= దయకు; ఆయత్తంబు= వశమైనది; అగుచున్+ఉండన్= అవుతుండగా; ఆ భూపతి= ఆ రాజు; ఆ తాపస= ఆ మునులలో; ఉత్తమ= ఉత్తముడియొక్క; ఆననంబు= ముఖాన్ని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అని సౌదాసుడు చెప్పాడు. భృగువంశంలో శ్రేష్ఠుడయిన ఆ ఉదంకుడి పవిత్ర సన్నిధానంచేత సౌదాసుడికి శాంతీ, దానివలన తెలివీ కలిగాయి. ఆ ఎరుకవలన ఏం చెయ్యాలో తెలిసింది. కుండలాలు దానం చేయాలనే శ్రద్ధ, నెమ్మదిగా మాటాడటం పుట్టుకొనివచ్చాయి. అతడిమాటలు విన్న ఉదంకుడు అతడితో 'సల్లాప మాత్రాననే స్నేహం సిద్ధిస్తుం'దని జ్ఞానవృద్ధులు ప్రవచిస్తారు. నీ వలన నా కోరిక నెరవేరింది. నేను పోతున్నాను. తిరిగివస్తానని నీతో చెప్పాను. అసత్యవాదిని కాకుండా మరలి వస్తాను అని అన్నాడు. ఆ మాటలు విన్న సౌదాసుడి మనస్సు దయతో నిండిపోయింది. అతడు మునీశ్వరుడయిన ఉదంకుడి ముఖంలోకి కన్నులు పెట్టి చూచి.(-తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. 'చంపెడు నట్టి నా కడకు సంయమివల్లభ! వత్తురయ్య? నీ
పెంపును నిక్కముం దెలిసెఁ; బ్రీతుఁడ నైతి; మదార్తి నీ తప
స్సంపదఁ జేసి పాపు' మని సమ్మతిఁ బల్కిన వీనులందుఁ బే
రిం పొలయం, బ్రసన్నత వహింపఁగఁ జిత్త ముదంకుఁ డిట్లనున్. 101

ప్రతిపదార్థం: సంయమి వల్లభ!= మునీశ్వరా!; చంపెడు+అట్టి= ప్రాణాలు తీసే; నా కడకున్= నా దగ్గరకు; వత్తురు+అయ్య!= ఎవరైనా వస్తారటయ్యా!; నీ= నీ యొక్క; పెంపును= గొప్పతనమూ; నిక్కము= సత్యమూ; తెలిసెన్= తెలిసినవి; ప్రీతుఁడన్= సంతోషించినవాడిని; ఐతిన్= అయ్యాను; నీ= నీ యొక్క; తపస్+సంపదన్+చేసి= తపస్సంపదవలన; మత్= నాయొక్క; ఆర్తిన్= దుఃఖాన్ని; పాపుము= పోగొట్టుము; అని; సమ్మతిన్= అభిలాషతో; పల్కినన్= పలుకగా; ఉదంకుఁడు; వీనులు+అందున్= చెవులలో; పేరు= ఎక్కువ అయిన; ఇంపు= ఆనందం; ఒలయన్= వ్యాపించగా; చిత్తము= మనస్సు; ప్రసన్నత= దయను; వహింపఁగన్= పొందగా; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: 'మునీశ్వరా! ప్రాణాలు తీసే నా దగ్గరకు ఎవరైనా వస్తారటయ్యా! నీ గొప్పతనమూ, సత్యమూ నాకు తెలిశాయి. సంతోషించాను. నీ తపస్సుచేత నా దుఃఖాన్ని తొలగించుము' అని సౌదాసుడు ఎంతో అపేక్షతో అన్నాడు. ఆ మాటలతో ఉదంకుడి చెవులకానందం కలిగింది. మనస్సు దయవలన ఆర్ద్రమయింది. అతడు సౌదాసుడితో ఈ విధంగా అన్నాడు.

ఉ. **'ఏమిటనైన నొప్పమి నరేంద్ర! సుచిత్తులఁ బొందె నేనియున్**
వే మరలున్; భవద్గుణమ వీతకళంకునిఁ జేసె నిన్ను; సాం
ద్రామలకీర్తి గౌతమ మహాముని చల్లని చిత్తవృత్తి నీ
పై మలఁగించెఁ గావలయుఁ బార్థివసత్తమ! పొందు మున్నతిన్. 102

ప్రతిపదార్థం: నరేంద్ర!= రాజా!; ఏమిటన్+ఐనన్= ఏ కారణంవలననైనా; ఒప్పమి= ఆపద, కీడు; సుచిత్తులన్= మంచి మనస్సు కలవారిని; పొందెన్+ఏనియున్= పొందినప్పటికీ; వే= శీఘ్రంగా; మరలున్= అది తొలగిపోతుంది; భవత్= నీ యొక్క; గుణము+అ= మంచిగుణమే; నిన్నున్= నిన్ను; వీత= తొలగిన; కళంకునిన్= పాపంగలవాడినిగా; చేసెన్= చేసింది; సాంద్ర= దట్టమయిన; అమల= నిర్మలమైన; కీర్తి= కీర్తి కలవాడైన; గౌతమ= గౌతముడనే; మహత్+ముని= గొప్ప మునియొక్క; చల్లని= శాంతిని కలిగించే; చిత్తవృత్తి= మనోవ్యాపారం; నీ పైన్= నీమీదికి; మలఁగించెన్= మరలించాడు; కావలయున్= కాబోలు; పార్థివ= రాజులలో; సత్తమ!= మిక్కిలి శ్రేష్ఠుడా!; ఉన్నతిన్= గొప్పతనాన్ని; పొందుము.

తాత్పర్యం: 'ఏ కారణంవలననైనా మంచి మనస్సుకలవారికి ఆపద కలిగినప్పటికీ అది వెంటనే తొలగిపోతుంది. నీ మంచిగుణమే నిన్ను పుణ్యాత్ముడిని చేసింది. మహాకీర్తి సంపన్ను డయిన గౌతమ ఋషీశ్వరుడు ఇప్పుడు నిన్ను చల్లని మనస్సుతో చూచాడు కాబోలు! నీవు నీ పూర్వోన్నత్యాన్ని పొందుము.'

క. **అని పలికి, మఱియుఁ బలుదీ। వన లిచ్చి యతండు గారవమున నతనిమేన్**
దన కరముల నివిరి, ప్రియం। బొనర్చె; నిర్దురితుఁ డైన యుర్వీపతియున్. 103

ప్రతిపదార్థం: అని; పలికి; మఱియున్= ఇంకా; పలు= అనేకములయిన; దీవనలు+ఇచ్చి= దీవనలిచ్చి; అతండు= ఆ ఉదంకుడు; గారవమునన్= ప్రేమతో; అతని= ఆ సౌదాసుడి; మేన్= శరీరాన్ని; తన= తనయొక్క; కరములన్= చేతులతో; నివిరి= నిమిరి; ప్రియంబు+ఒనర్చెన్= ప్రీతిని కలిగించాడు; నిర్+దురితుఁడు= పాపంలేనివాడు; ఐన= అయిన; ఉర్వీపతియున్= భూపతియూ-సౌదాసుడునూ.

తాత్పర్యం: ఉదంకుడు ఈ విధంగా పలికి, అంతటితో ఊరుకోనకుండా సౌదాసుడిని దీవనలతో ముంచెత్తాడు. ప్రేమపూర్వకంగా తన చేతులతో అతడి శరీరాన్ని నిమిరి ఆనందం కలిగించాడు. దీనివలన పుణ్యాత్ముడయిన సౌదాసుడు.(-తరువాతి వచనంతో అన్వయం.)

వ. **భక్తి వినయ సంభరితుం డయి, యప్పరమమునిం బ్రస్తుతించి, నమస్కరించి, యామంత్రణంబు చేసిన, నమ్మహాత్ముండు కుండలంబులు కృష్ణాజినంబునం బదిలంబుగా ముడిచికొని, గౌతమమాశ్రంబునకు రయంబునం బోయి పోయి, పక్వఫలంబులం బెఱిఁగిన బిల్వంబుం గని, యాఁకటి పెల్లునం దదీయ విటపంబున సకుండలం బగునయ్యజినంబు దగిల్చి, యమ్మహీరుహం బెక్కి ఫలంబులు గోసికొనుచుండె.104**

ప్రతిపదార్థం: భక్తి= భక్తితో; వినయ= వినయంతో; సంభరితుండు= మిక్కిలి నిండినవాడు; అయి; ఆ పరమ= సర్వశ్రేష్ఠుడగు; మునిన్= ఆ ఉదంకుడిని; ప్రస్తుతించి= మిక్కిలి కొనియాడి; నమస్కరించి; ఆమంత్రణంబు చేసినన్= వీడ్కొల్పగా; ఆ మహత్+ఆత్ముండు= ఆ గొప్ప ఆత్మగలవాడు - ఉదంకుడు; కుండలంబులు= కుండలాలను; కృష్ణ= నల్లని; అజినంబునన్= లేడితోలుతో; పదిలంబుగాన్= జాగ్రత్తగా; ముడిచికొని= కట్టుకొని, గౌతమ= గౌతమునియొక్క; ఆశ్రమంబునకున్= ఆశ్రమానికి; రయంబునన్= వేగంగా; పోయి పోయి= వెళ్ళి వెళ్ళి; పక్వ= పాకానికి వచ్చిన; ఫలంబులన్= పండ్లతో; పెరిఁగిన= పెరిగిన; బిల్వంబున్= బిల్వవృక్షాన్ని; కని= చూచి; ఆఁకలి+పెల్లునన్= ఎక్కువ ఆకలిచేత; తదీయ= ఆ; విటపంబునన్= ఆ చెట్టునందు; సకుండలంబు= కుండలాలతో కూడినది; అగు= అయిన; ఆ అజినంబు= ఆ లేడితోలును; తగిల్చి= తగిలించి; ఆ మహీరుహంబు= ఆ చెట్టు; ఎక్కి; ఫలంబులు= పండ్లు; కోసికొనుచుండెన్= కోసికొంటున్నాడు.

తాత్పర్యం: భక్తి వినయాలతో నిండినవాడై, ఆ మహర్షిని పొగడి, నమస్కరించి వీడ్కొలిపాడు. ఉదంకుడు కుండలాలను జాగ్రత్తగా లేడితోలులో మూటకట్టుకొని గౌతమాశ్రమానికి తొందరగా వెళ్ళాడు. దారిలో పండ్లతో నిండిన బిల్వవృక్షాన్ని చూచి, ఆకలి ఎక్కువ కావటంవలన, కుండలాలున్న లేడితోలును చెట్టుకు తగిలించి, దానినెక్కి పండ్లు కోసికొంటున్నాడు.

సీ. **గాలి నవ్విటప మాలోల మగుడుఁ దగు। లెడలి, యయ్యజినంబు పుడమిఁ బడినఁ**
గని, యొక్కనాగంబు గ్రక్కునఁ జనుదెంచి। వెసఁ బుచ్చికొని కడు వేగ పఱవఁ
గాంచి యుదంకుండు గ్రమ్మన దిగదాఁటి। వెనుకొనునంతకు గనపపుట్టఁ
జొచ్చె నయ్యురగ, మా సువ్రత పరుఁడు దీ। వ్రముఖ కాష్ఠము గొని త్రవ్వఁదొడఁగె;

తే. **దాని సైరింపఁ జాలక ధరణి తలరె;। విప్రుఁడై వచ్చి గీర్వాణవిభుఁడు గొయ్య**
కోలఁ ద్రవ్విన మాత్రఁ బాతాళయాన। మేల సిద్ధింపనేర్చు మునీంద్ర! వినుము. 105

ప్రతిపదార్థం: గాలిన్= గాలిచేత; ఆ విటపము= ఆ కొమ్మ; ఆలోలము= అంతటా ఊగింది; అగుడున్= అయిన తరువాత; తగులు= కట్టు; ఎడలి= సడలి; ఆ అజినంబు= ఆ లేడితోలు; పుడమిన్= నేలమీద; పడినన్= పడగా; ఒక్కనాగంబు= ఒక పాము; కని= చూచి; గ్రక్కునన్= తొందరగా; చనుదెంచి= వచ్చి; వెసన్= శీఘ్రంగా; పుచ్చికొని= తీసికొని; కడున్= మిక్కిలి; వేగ= వేగంగా; పఱవన్= పారిపోగా; ఉదంకుండు; కాంచి= చూచి; క్రమ్మనన్= శీఘ్రంగా; దిగదాఁటి= కిందికి దూకి; వెనుకొను+అంతకున్= వెంబడించేటప్పటికి; ఆ ఉరగము= ఆ పాము; గనపపుట్టన్= పెద్ద పుట్టలో; చొచ్చెన్= ప్రవేశించింది; ఆ సువ్రత= ఆ సదాచారములందు; పరుఁడు= ఆసక్తికలవాడు, ఉదంకుడు; తీవ్ర= వాడి అయిన; ముఖ= మొనగలిగిన; కాష్ఠము=

కర్రను; కొని= తీసికొని; త్రవ్వన్= పుట్ట త్రవ్వటానికి; తొడఁగెన్= పూనుకొన్నాడు; దానిన్= ఆ తవ్వటాన్ని; సైరింపన్= ఓర్చుకొనగా; చాలక= సమర్థం కాక; ధరణి= భూమి; తలరెన్= కంపించింది; గీర్వాణ= దేవతలకు; విభుఁడు= ప్రభువు, ఇంద్రుడు; విప్రుఁడై= బ్రాహ్మణుడై; వచ్చి; కొయ్యకోలన్= ములుగర్రతో; త్రవ్వినమాత్రన్= త్రవ్వినంతమాత్రాన; మునీంద్రా!= మునీశ్వరా!; పాతాళయానము= పాతాళలోక ప్రయాణం; ఏల?= ఎట్లా?; సిద్ధింప నేర్చున్= ప్రాప్తిస్తుంది; వినుము.

తాత్పర్యం: గాలికి ఆ చెట్టు ఊగేటప్పటికి, కట్టు సడలి, లేడితోలు నేలమీద పడింది. అది చూచి ఒకపాము వచ్చి, ఆ కుండలాలు తీసికొని వేగంగా పారిపోయింది. ఇదంతా చూచిన ఉదంకుడు వెంటనే క్రిందకుదూకి పామును వెంబడించాడు. అది ఒక పెద్దపుట్టలో దూరింది. అప్పుడు అతడు వాడిమొన ఉన్న కర్రతో పుట్టను త్రవ్వటం మొదలు పెట్టాడు. త్రవ్వటం సహించలేక భూమి కంపించింది. ఆ సమయంలో ఇంద్రుడు బ్రాహ్మణరూపంతో వచ్చి 'మునీశ్వరా! ములుగర్రతో తవ్వినంతమాత్రాన పాతాళలోకానికి ప్రయాణం చెయ్యటం సాధ్యమవుతుందా?'

వ. పాతాళభువనం బిచ్చటికి సహస్రయోజనంబుల నున్నది; కుండలంబులు గొనిపోయిన భుజంగం బైరావతా
పత్యం' బనిన విని యమ్మునిశిష్యుండు. 106

ప్రతిపదార్థం: పాతాళభువనంబు= పాతాళలోకం; ఇచ్చటికిన్= ఇక్కడికి; సహస్ర= వేయి; యోజనంబులన్= ఆమడలదూరంలో; ఉన్నది; కుండలంబులు= కుండలాలు; కొనిపోయిన= దొంగిలించిన; భుజగంబు= పాము; ఐరావత= ఐరావతుడియొక్క; అపత్యంబు= సంతానం (కొడుకు); అనినన్= అనగా; విని; ఆ ముని= ఆ గొప్ప మునియొక్క; శిష్యుండు= ఉదంకుడు.

తాత్పర్యం: పాతాళలోకం ఇక్కడికి వేయి ఆమడల దూరంలో ఉన్నది. కుండలాలు దొంగిలించిన పాము ఐరావతుడి కుమారుడు' అని చెప్పగా విని ఉదంకుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'పాతాళంబున నున్నను। వే తెత్తుం గుండలములు; విను; మప్పని నా
చేతం గాకున్న నసు। వ్రాతము విడువఁబడు; నిది ధ్రువం' బని పలికెన్. 107

ప్రతిపదార్థం: కుండలములు= కుండలాలు; పాతాళంబునన్= పాతాళలోకంలో; ఉన్నను= ఉన్నప్పటికీ; వే= వెంటనే; తెత్తున్= తీసికొని వస్తాను; వినుము; ఆ పని; నా చేతన్= నా వలన; కాక+ఉన్నన్= కాకపోతే; అసు= ప్రాణాలయొక్క; వ్రాతము= సమూహం; విడువఁబడున్= వదలివేస్తాను; ఇది; ధ్రువంబు= నిశ్చయం; అని; పలికెన్= పలికాడు.

తాత్పర్యం: 'కుండలాలు పాతాళలోకంలో ఉన్నప్పటికీ నేను వాటిని వెంటనే తీసికొని వస్తాను. ఆ పని నా చేత కాకపోతే పంచప్రాణాలూ విడిచివేస్తాను. ఇది నా నిశ్చయం' అని పలికాడు.

చ. పలికిన నత్తపస్విదృఢభావ మెఱింగి సురేంద్రుఁ డొండు ప
ల్కుల పని నిల్పి, కాష్ఠమునకుం గులిశంబునఁ గల్గువాఁడియున్
బలువును నిచ్చి వజ్ర చనె బాంధవ మేర్పడఁ జెప్పి; భీతిమై
నిల దెరు విచ్చె; నమ్మునియు నేడ్తెఱఁ జొచ్చె భుజంగలోకమున్. 108

ప్రతిపదార్థం: పలికినన్= ఈ విధంగా ఉదంకుడు పలుకగా; సుర+ఇంద్రుఁడు= దేవతల రాజయిన ఇంద్రుడు; ఆ తపస్వి= ఆ ఋషియొక్క; దృఢ= సుస్థిరమయిన; భావము= అభిప్రాయం; ఎఱింగి= తెలిసికొని; ఒండుపల్కులు= ఎదురు మాటాడే; పని; నిల్పి= విరమించి; కాష్ఠమునకున్= కర్రకు; కులిశంబునన్= వజ్రాయుధమునందు; కల్గు= ఉండే; వాఁడియున్= పదునునూ; బలువును= గట్టితనాన్ని; ఇచ్చి= కలిగించి; వజ్రి= ఇంద్రుడు; బాంధవము= తన చుట్టరికాన్ని; ఏర్పడన్= స్పష్టంగా; చెప్పి= వివరించి; చనెన్= వెళ్లాడు; ఇల= భూమి; భీతిమైన్= భయంతో; తెరువు+ఇచ్చెన్= దారి ఇచ్చింది; ఆ మునియున్= ఆ ఉదంకుడును; ఏడ్తెఱన్= విజృంభణంతో; భుజంగలోకమున్= నాగలోకమును; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: ఆ విధంగా ఉదంకుడు పలికేటప్పటికి దేవేంద్రుడికి ఆ మునీశ్వరుడి పట్టుదల తెలిసింది. ఇక అతడు ఎదురు మాటలు మాట్లాడే పనికి స్వస్తిచెప్పి ఉదంకుడి చేతిలో ఉన్న కర్రకు వజ్రాయుధానికుండే వాడినీ, గట్టితనాన్నీ కలిగించాడు. తన చుట్టరికాన్ని ప్రస్తావించి వెళ్ళిపోయాడు. భయంవలన భూమికూడా దారి ఇచ్చింది. వెంటనే ఉదంకుడు నాగలోకంలో ప్రవేశించాడు.

వ. **చొచ్చి యనేక ప్రకార ప్రాకార పరిరక్షితంబును, బహురత్న దీప్తిజాల దేదీప్యమానంబును నైన యమ్మహనీయ లోకం బాలోకించి, దశయోజనాయామంబునుం బంచయోజన విస్తారంబును నగు తద్ద్వారంబు గని యతండు కుండలాహరణంబు దుర్లభం బను తలంపున డిల్లపడియె; నయ్యెడ నరుణ వదనంబును నసితాంగంబును సితవాలంబునునై వెలుంగు తురంగం బతని కిట్లనియె.** 109

ప్రతిపదార్థం: చొచ్చి= ప్రవేశించి; అనేక ప్రకార= అనేక విధాలైన; ప్రాకార= చుట్టు గోడలచేత; పరిరక్షితంబును= చక్కగా రక్షింపబడిందీ; బహు= అనేకాలైన; రత్న= రత్నాలయొక్క; దీప్తి= కాంతులయొక్క; జాల= సమూహంచేత; దేదీప్యమానంబునున్= మిక్కిలి ప్రకాశించేదీ; ఐన= అయిన; ఆ మహనీయ= ఆ గొప్పదైన; లోకంబు= లోకాన్ని; ఆలోకించి= చూచి; దశయోజన= పది ఆమడల; ఆయామంబునున్= పొడవునూ; పంచయోజన= ఐదు ఆమడల; విస్తారంబునున్= వెడల్పునూ; అగు= కలిగినదయిన; తద్= ఆ నాగలోకంయొక్క; ద్వారంబు= ద్వారాన్ని; కని= చూచి; అతండు= ఆ ఉదంకుడు; కుండల= కుండలాలయొక్క; ఆహరణంబు= కొనిరావటం; దుర్లభంబు= శక్యంగానిది; అను= అనే; తలంపునన్= అభిప్రాయంతో; డిల్ల పడియెన్= అధైర్యపడ్డాడు; ఆ+ఎడన్ = ఆ సమయాన; అరుణ= ఎర్రని; వదనంబును= ముఖమూ; అసిత= నల్లని; అంగంబును= శరీరమూ; సిత= తెల్లని; వాలంబును= తోకయూ; ఐ= కలదై; వెలుంగు= ప్రకాశిస్తున్న; తురంగంబు= గుర్రం; అతనికిన్= ఆ ఉదంకుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: ప్రవేశించి ఉదంకుడు ఎన్నో రకాలయిన చుట్టుగోడలచేత రక్షింపబడేదీ, నానావిధ రత్నకాంతులచేత మిక్కిలి ప్రకాశిస్తున్నదీ అయిన ఆ మహాలోకాన్ని చూచాడు. దాని ద్వారం పొడవు పది ఆమడలు, వెడల్పు అయిదు ఆమడలు. ఆ ద్వారాన్ని చూచి అతడు కుండలాలు తీసికొని రావటం అసాధ్యమని తలంచి అధైర్యపడ్డాడు. ఇంతలో ఒక గుర్రం అతడి కంటబడింది. దాని ముఖం ఎర్రగా ఉన్నది. శరీరం నల్లగా ఉన్నది. తోక తెల్లగా ఉన్నది. అది ఉదంకుడితో ఇట్లా అన్నది.

ఉ. **'ఆతత మైన నాదగు నపానము నూఁదు; మొకింతయున్ జుగు**
ప్సాతురవృత్తి నీదుహృదయంబునఁ జొన్పకు; లోకవంద్యుఁ డ

గ్గౌతము నాశ్రమంబున నఖండితభక్తి నుపాస్తి చేసి, నన్

బ్రీతునిఁ జేసినాఁడవు; వరిష్ఠతపోధన! యట్లు గావునన్. 110

ప్రతిపదార్థం: వరిష్ఠ= మిక్కిలి శ్రేష్ఠమైన; తపస్= తపస్సే; ధన= ధనంగాకలవాడా!; ఆతతము= వెడల్పుగా ఉన్నది; ఐన= అయిన; నాదగు= నా దయిన; అపానము= గుదస్థానం; ఊఁదుము= ఊదుము; ఒక+ఇంతయున్= ఏ కొంచెం కూడా?; నీ= నీయొక్క; హృదయంబునన్= హృదయంలో; జుగుప్సా= రోతవలన కలిగే; ఆతుర= బాధకలదయిన; వృతిన్= అవస్థను; చొన్పకు(ము)= కలిగించుకొనకుము; లోక= లోకంచేత; వంద్యుఁడు= కొనియాడదగినవాడు; ఆ గౌతము= ఆ గౌతముడియొక్క; ఆశ్రమంబునన్= ఆశ్రమంలో; అఖండిత= ఎడతెగని; భక్తిన్= భక్తితో; ఉపాస్తి= సేవ; చేసి; నన్= నన్ను; ప్రీతునిన్= సంతోషించిన వాడిని; చేసినవాడవు= చేశావు; అట్లు+కావునన్= అందుచేత.

తాత్పర్యం: మహోత్తమ తపోధనా! వెడల్పుగా ఉన్న నా గుదస్థానాన్ని ఊదుము. నీ హృదయంలో రోతవలన బాధపడకుము. లోకస్తుత్యు డయిన గౌతముడి ఆశ్రమంలో నన్ను సేవించి సంతోషింపజేశావు. అందుచేత. (తరువాతి వచనంతో అన్వయం).

వ. **నీకుం బొడసూపి, యైరావత సుతుం డపహరించిన సమంచిత కుండలంబులు మగుడం జేరెడు నుపాయం బుపదేశించితి; ననిన నుదంకుం 'డేను నిన్ను నెఱుంగ; నుపాసించుట యెట్లు గలిగెఁ? దెలుపు' మనుడు నయ్యశ్వం బతనితోడ 'భవద్గురునకు గురుండం; బావకుండ; నీవు శుచివయి సభక్తికంబుగా నిత్యంబును నన్ను నియతిం బూజించి; తత్తెఱం గెఱుంగవే' యని పలికినం బ్రీతినొంది యతండు తదీయోపదిష్ట ప్రకారం బాచరించిన.** 111

ప్రతిపదార్థం: నీకున్= నీకు; పొడసూపి= సాక్షాత్కరించి; ఐరావత= ఐరావతుడియొక్క; సుతుండు= కుమారుడు; అపహరించిన= దొంగిలించిన; సమంచిత= మిక్కిలి అందమైన; కుండలంబులు= కుండలాలు; మగుడన్= మరలా; చేరెడు= పొందే; ఉపాయంబు= ఉపాయాన్ని; ఉపదేశించితిన్= బోధించాను; అనినన్= అనగా; ఉదంకుండు= ఉదంకుడు; ఏను= నేను; నిన్నున్= నిన్ను; ఎఱుంగను= ఎరుగను; ఉపాసించుట= సేవించటం; ఎట్లు= ఏ విధంగా; కలిగెన్= సంభవించింది; తెలుపుము= తెలియజేయుము; అనుడున్= అని అనగా; ఆ అశ్వంబు= ఆ గుర్రం; అతనితోడన్= ఆ ఉదంకుడితో; భవత్= నీ యొక్క; గురునకున్= గురువునకు, గౌతముడికి; గురుండన్= గురువును; పావకుండన్= అగ్నిని; నీవు; శుచివి= పరిశుద్ధుడవు; అయి; స+భక్తికంబు+కాన్= భక్తితో కూడినట్లుగా; నిత్యంబును= ఎల్లప్పుడూ; నన్నున్= నన్ను; నియతిన్= నియమంతో; పూజించితి(వి)= పూజించావు; ఆ తెఱంగు= ఆ విషయం; ఎఱుంగవు+ఏ?= గుర్తు చేసికొనలేవా?; అని; పలికినన్= చెప్పగా; ప్రీతిన్= సంతోషాన్ని; ఒంది= పొంది; అతండు= ఆ ఉదంకుడు; తదీయ= ఆ గుర్రానిదైన; ఉపదిష్ట= ఉపదేశించబడిన; ప్రకారంబు= విధంగా; ఆచరించినన్= చేయగా.

తాత్పర్యం: నీకు కనబడి, ఐరావతుడి కుమారుడు దొంగిలించిన కుండలాలు, నీకు తిరిగి చేరే ఉపాయం ఉపదేశించాను. ఆ మాటలు విన్న ఉదంకుడు 'నేను నిన్ను ఎరుగను. నిన్ను సేవించటం ఏ విధంగా సంభవిస్తుంది' అని అన్నాడు. అప్పుడు ఆ గుర్రం అతడితో 'నేను నీ గురువునకు గురువును. అగ్నిని. నీవు పరిశుద్ధుడవై, భక్తితో నిత్యమూ నన్ను పూజించావు. ఆ విషయం నీవు గుర్తుకు తెచ్చుకొనలేదా?' అని అన్నది. అంతట ఆ ఉదంకుడు గుర్రం ఉపదేశించిన విధంగా చేయగా. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **ఘోటకోత్తమ రోమకూపంబులం దెల్ల । నొక్కట ఘనధూమ ముద్గమించి,**
కవిసి, పాతాళ లోకంబంతయును గప్పి । వాసుకి ప్రభృతి నివాస భూము
లుపరుద్ధ భావంబు నొందె; నైరావతా । వాసంబు హాహారవంబు తోడ
నాకులంబయ్యె; న ట్లతిదారుణంబైన । పెనుఁబొగ నెంతయు భీతి నొంది

ఆ. **యమ్మునీంద్రు కడకు నహివరుల్ రయమున । వచ్చి, భక్తి నర్చలిచ్చి, వినతు**
లై తదీయ కార్య మడిగి యెఱింగి, వే । తెచ్చి కుండలంబు లిచ్చి రధిప! **112**

ప్రతిపదార్థం: అధిప!= రాజా!, జనమేజయా!; ఘోటక+ఉత్తమ= ఆ శ్రేష్ఠమైన గుఱ్ఱం యొక్క; రోమకూపంబులు+అందున్= చర్మరంధ్రాలందు; ఎల్లన్= అన్నిటా; ఒక్కటన్= ఒక్కసారిగా; ఘన= గొప్ప; ధూమము= పొగ; ఉద్గమించి= పుట్టి; కవిసి= వ్యాపించి; పాతాళలోకంబు= పాతాళలోకం; అంతయును= అంతటా; కప్పెన్= కప్పింది; వాసుకి; ప్రభృతి= మొదలైనవారియొక్క; నివాసభూములు= మందిర ప్రదేశాలు; ఉపరుద్ధభావంబు= పీడావస్థను; ఒందెన్= పొందాయి; ఐరావత= ఐరావతుడియొక్క; ఆవాసంబు= గృహం; హాహా= హాహా అనే; రవంబులతోడన్= ఆక్రందన ధ్వనులతో; ఆకులంబు= క్షోభించింది; అయ్యెన్= అయింది; అట్లు= ఆ విధంగా; అతి= మిక్కిలి; దారుణంబు= దుస్సహం; ఐన= అయిన; పెను+పొగన్= గొప్ప పొగచేత; ఎంతయున్= మిక్కిలి; భీతిన్= భయమును; ఒంది= పొంది; అహివరుల్= నాగరాజులు; ఆ ముని+ఇంద్రు+కడకున్= ఆ మునీశ్వరుడి దగ్గరకు; రయమునన్= వేగంగా; వచ్చి; భక్తిన్= భక్తితో; అర్చలు+ఇచ్చి= పూజించి; వినతులు+ఐ= వినమ్రులయి; తదీయ= ఉదకుండిదైన; కార్యము= వచ్చినపని; అడిగి; ఎఱింగి= తెలిసికొని; వే= శీఘ్రంగా; కుండలంబులు= కుండలాలు; తెచ్చి; ఇచ్చిరి= ఇచ్చారు.

తాత్పర్యం: ఆ ఉత్తమాశ్వం రోమరంధ్రాలనన్నిటా ఒక్కసారిగా పొగపుట్టి పాతాళలోకమంతటా క్రమ్ముకొన్నది. వాసుకి మొదలైనవారి మందిరాలు పీడావస్థ పాలయ్యాయి. ఐరావతుడి గృహం ఆక్రందన ధ్వనులతో కలత చెందింది. ఈ విధంగా దుస్సహమయిన ఆ మహాధూమంవలన భయపడి నాగరాజులు ఉదంకుడి దగ్గరకు త్వరగా వచ్చి, భక్తితో పూజించి వినమ్రులయి, అతడు వచ్చినపని తెలిసికొని వెంటనే కుండలాలు తెచ్చిచ్చారు.

ఉదంకుండు కుండలంబు లిచ్చి యహల్యను సంతోషపఱచుట (సం.14-37-53)

చ. **అతఁడును వారిఁ బోఁబనిచి, యగ్నికి భక్తిఁ బ్రదక్షిణంబు చే**
సి, తగ నమస్కరించి, విలసిల్లఁగఁదేజము, ప్రీత చిత్తుఁడై
యతలము నిర్గమించి రయ మారఁగ వచ్చి యహల్యఁ గాంచి 'తె
చ్చితి నివె కుండలంబు' లని చే నిడి, భూస్థలిఁ జాఁగి మ్రొక్కినన్. **113**

ప్రతిపదార్థం: అతఁడును= ఆ ఉదంకుడును; వారిన్= నాగులను; పోన్= వెళ్ళగా; పనిచి= ఆజ్ఞాపించి; భక్తిన్= భక్తితో; అగ్నికిన్= అగ్నికి; ప్రదక్షిణంబు చేసి= ప్రదక్షిణంచేసి; తగన్= తగినట్లుగా; నమస్కరించి; తేజము= శరీరకాంతి; విలసిల్లఁగన్= ప్రకాశించగా; ప్రీతి= తృప్తి పొందిన; చిత్తుఁడు+ఐ= మనస్సు కలవాడై; అతలము= పాతాళలోకం; నిర్గమించి= వెడలి; రయము= వేగం; ఆరఁగన్= అతిశయించగా; వచ్చి; అహల్యన్= అహల్యను; కాంచి= దర్శించి; ఇవి+ఎ= ఇవిగో; కుండలంబులు= కుండలాలు; తెచ్చితిన్= తెచ్చాను; అని; చేన్= ఆమెచేతిలో; ఇడి= పెట్టి; భూస్థలిన్= భూమిమీద; చాఁగి= సాష్టాంగపడి; మ్రొక్కినన్= నమస్కరించగా.

తాత్పర్యం: ఉదంకుడు నాగులను వెళ్ళనంపి, అగ్నికి భక్తితో ప్రదక్షిణంచేసి నమస్కరించాడు. అతడి శరీరకాంతి ప్రకాశిస్తున్నది. మహానందంతో అతడు పాతాళలోకంనుండి బయలుదేరి, త్వరత్వరగా గౌతమాశ్రమానికి వచ్చాడు. గురుపత్ని అయిన అహల్యను దర్శించి 'ఇవిగో! కుండలాలు తెచ్చా'నని వాటిని ఆమె చేతిలో పెట్టి ఆమెకు సాష్టాంగ నమస్కారం చేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ఆయమయు గౌతముండు నత్యాదరమునఁ। గౌఁగిలించుచు దీవించి గారవింప

నతఁడు నమ్మునిపతికిని నయ్యమకును। బెక్కుమాఱులు భక్తిమై మ్రొక్కి నిలిచి. 114

ప్రతిపదార్థం: ఆ+అమయున్= ఆ అహల్యయు; గౌతముండున్= గౌతముడునూ; అతి= మిక్కిలి; ఆదరమునన్= ప్రేమతో; కౌఁగిలించుచున్= కౌగిలిస్తూ; దీవించి; గారవింపన్= లాలింపగా; అతఁడున్= ఆ ఉదంకుడునూ; ఆ+మునిపతికిన్= ఆ మునీశ్వరుడికి, గౌతముడికి; ఆ+అమకును= ఆమెకూ, అహల్యకూ; పెక్కుమాఱులు= చాలాసార్లు; భక్తిమైన్= భక్తితో; మ్రొక్కి= సాష్టాంగ నమస్కారం చేసి; నిలిచి= నిలబడి.

తాత్పర్యం: అహల్య, గౌతముడూ మహానురాగంతో ఉదంకుడిని కౌగిలించుకొని దీవించి, లాలించారు. అతడు కూడా ఆ దంపతులకు చాలాసార్లు సాష్టాంగ నమస్కారాలు చేసి నిలబడి. (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'మీకరుణఁ గాక తగుమెయి। నీ కుండలములు పరిగ్రహించుట నడుమన్

వైకృతి యొలసినఁ దలఁగుట। నా కొలఁదియె?' యనియె వినయనమ్రుం డగుచున్. 115

ప్రతిపదార్థం: వినయ= వినయంచేత; నమ్రుండు= వంగినవాడు; అగుచున్= అవుతూ; తగు= అనుగుణమయిన; మెయిన్= విధంగా; ఈ కుండలములు= ఈ కుండలాలు; పరిగ్రహించుట= స్వీకరించటం; నడుమన్= మధ్యలో; వైకృతి= కష్టస్థితి; ఒలసినన్= కలుగగా; తలఁగుట= తొలగించుకొనటం; మీ= మీయొక్క; కరుణన్= అనుగ్రహంవలన; కాక= తప్ప; నా= నా యొక్క; కొలఁది+ఎ= తరమా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'మీ కోర్కెకు తగినట్లుగా ఈ కుండలాలను స్వీకరించటం, మధ్యలో కష్టం కలుగగా దానిని నివారించటం ఇవన్నీ మీ దయవలన తప్ప నా శక్తి సామర్థ్యాలవలన మాత్రం జరిగినవి కావు' అని వినయంతో అన్నాడు.

వ. అనిన విని వార లత్యంత సంతుష్టాంతరంగులై; రగ్గౌతముం డతని కిట్లనియె. 116

ప్రతిపదార్థం: అనినన్= అని ఉదంకుడు పలుకగా; విని; వారలు= ఆ దంపతులు; అత్యంత= మిక్కిలి; సంతుష్ట= సంతృప్తి పొందిన; అంతరంగులు= మనస్సులు కలవారు; ఐరి= అయ్యారు; ఆ గౌతముండు; అతనికిన్= అతడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఉదంకుడు ఈ విధంగా పలుకగా ఆ దంపతులు పరమ సంతృప్తి పొందారు. అప్పుడు గౌతముడు అతడితో ఈ విధంగా అన్నాడు.

ఉ. 'నీ చరితంబు చిత్రమహనీయము; మిత్ర సహక్షితీశ్వరున్

నీచతఁ బాప, నాగ మపనీతము చేసిన కుండలద్వయం

బాచతురత్వ మా బలిమి యాదృఢ నిశ్చయ మట్టు లొప్ప ధ
ర్మోచిత లీలఁ దేర నొరుఁ డోపునె! యేను నిజంబ పల్కితిన్.' 117

ప్రతిపదార్థం: నీ= నీయొక్క; చరితంబు= శీలం; చిత్ర= ఆశ్చర్యకరమూ; మహనీయము= గొప్పదీ; మిత్రసహ= మిత్రసహుడనే; క్షితి+ఈశ్వరున్= రాజును; నీచతన్= హీనస్థితినుండి; పాపన్= దూరంచేయగా; నాగము= పాము; అపనీతము చేసిన= అపహరించిన; కుండల ద్వయంబు= కుండలాల జంట; ఆ చతురత్వము= నేర్పు; ఆ బలిమి= ఆ బలం; ఆ దృఢ= గట్టిదయిన; నిశ్చయము; అట్టులు= ఆ విధంగా; ఒప్పన్= ప్రకాశించగా; ధర్మ= ధర్మానికి; ఉచిత= తగిన; లీలన్= ప్రకారంగా; తేరన్= తీసికొనిరాగా; ఒరుఁడు= ఇంకొకడు; ఓపును+ఎ?= సమర్థుడగునా?; ఏను= నేను; నిజంబు+అ= నిజమే; పల్కితిన్= పలికాను.

తాత్పర్యం: 'నీ స్వభావం ఆశ్చర్యం కలిగించేదీ, గొప్పదీ. మిత్రసహుడి హీనస్థితిని తొలగించటానికి గానీ, పాము దొంగిలించిన కుండలాలజంటను నేర్పుతో బలంతో పట్టుదలతో తిరిగి తీసికొని రావటానికి గానీ, ఇంకొకడు సమర్థుడు కానేకాడు. నేను అతిశయోక్తులు గాక, నిజం చెప్పాను.'

వ. **అనియె; నయ్యుదంకుం డట్లు తన మహాతపంబు బలిమిం బరాక్రమించి, యనన్య సులభంబులగు కుండలంబు లాహరించి, గురుజన మనోరథసిద్ధి గావించె; నా భృగువంశ మహత్తరు మహానుభావం బిట్టి' దనిన విని జనమేజయుం 'డమ్మహాత్మునకు వరం బొసంగి చనిన వాసుదేవు ననంతర వృత్తాంతంబు మునిసత్తమా! యెఱింగింపవే' యని యడిగి, నవ్విభునకు వైశంపాయనుం డిట్లనియె.** 118

ప్రతిపదార్థం: అనియెన్= గౌతముడు ఈ విధంగా అన్నాడు; ఆ+ఉదంకుండు= ఆ ఉదంకుడు; అట్లు= ఆ విధంగా; తన= తనయొక్క; మహత్= గొప్పదయిన; తపంబు= తపస్సుయొక్క; బలిమిన్= బలంచేత; పరాక్రమించి= పరాక్రమం చూపి; న+అన్య+సులభంబులు= ఇతరులకు తేలికగా లభించనివి; అగు= అయిన; కుండలంబులు= కుండలాలు; ఆహరించి= తీసికొనివచ్చి; గురుజన= గురువులయొక్క; మనోరథ= కోరికయొక్క; సిద్ధి= ఈడేరుటను; కావించెన్= చేశాడు; ఆ భృగు= ఆ భృగుమహర్షియొక్క; వంశ= వంశంలోని; మహత్తరు= ముఖ్యుడియొక్క; మహత్= గొప్ప; అనుభావంబు= మహిమ; ఇట్టిది= ఇటువంటిది; అనినన్= అని చెప్పగా; విని; జనమేజయుండు= జనమేజయుడు; ముని= మునులలో; సత్తమా!= శ్రేష్ఠుడా!; ఆ మహత్+ఆత్మునకున్= ఆ గొప్ప మనస్సు కలవాడికి; వరంబు= వరము; ఒసంగి= ఇచ్చి; చనిన= వెళ్ళిన; వాసుదేవు= వసుదేవుడి కుమారుడయిన శ్రీకృష్ణుడియొక్క; అనంతర= తరువాతి; వృత్తాంతంబు= కథ; ఎఱింగింపుము+ఏ= తెలియజేయుమా; అని; అడిగినన్= అడుగగా; వైశంపాయనుండు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: గౌతముడు ఈ విధంగా అన్నాడు. ఈ ఉదంకుడి ఉపాఖ్యానం చెప్పి వైశంపాయనుడు జనమేజయుడితో 'ఆ విధంగా ఉదంకుడు తన తపోబలంచేత పరాక్రమించి, ఇతరులకు తేలికగా లభించని కుండలాలు తీసికొనివచ్చి గురువుల కోరిక నెరవేర్చాడు. ఆ భృగువంశోత్తముడి మహిమ ఇటువంటిది' అని అన్నాడు. అప్పుడు జనమేజయుడు 'మునిశ్రేష్ఠా! మహాత్ముడయిన ఉదంకుడికి వరమిచ్చి శ్రీకృష్ణుడు వెళ్ళిపోయాడు కదా! తరువాత ఆ భగవంతుడు ఏం చేశాడో ఆ కథ నాకు తెలియజేయుమా!' అని అడుగగా వైశంపాయనుడు ఈ విధంగా చెప్పాడు.

సీ. **ఆ భార్గవోత్తము నట్లు వీడ్కొని కృష్ణుఁ । డరిగి యలంకృత మైన నిజపు**
రము సొచ్చునప్పుడు రైవత కాచల । యాత్రామహోత్సవ మఖిలజనులుఁ
గొనియాడుచుండి, యగ్గోవిందు సందర్శ । నంబున నుత్సవోన్మత్త భావ
మిమ్మడియై ప్రమోదమ్మునం దేలి; ర । ద్దేవదేవుఁడు వసుదేవుఁ గాంచి

తే. దేవకీదేవి బలభద్రదేవుఁ దక్కఁ । గలుగు వృద్ధ బాంధవులను గని వినీతిఁ
దత్తదుచిత మనోజ్ఞవిధాసమంచి । తాచరణములు నడపెఁ బ్రియం బెలర్ప. 119

ప్రతిపదార్థం: కృష్ణుఁడు; ఆ భార్గవ= ఆ భృగుమహర్షి సంతతివారిలో; ఉత్తమున్= ఉత్తముడైన ఉదంకుడిని; అట్లు= ఆ విధంగా; వీడ్కొని= అనుమతిపొంది విడిచిపోయి; అలంకృతము= అలంకరించబడింది; ఐన= అయిన; నిజ= తనయొక్క; పురము= పట్టణమును, ద్వారకను; చొచ్చు+అప్పుడు= ప్రవేశించే సమయమున; అఖిల= సమస్తమైన; జనులున్= ప్రజలును; రైవతక= రైవతకమనే; అచల= పర్వతమునకు సంబంధించిన; యాత్రా= జాతర అనే; మహత్= గొప్ప; ఉత్సవము= పండువును; కొనియాడుచున్= పొగడుతూ; ఉండి; ఆ గోవిందు= కృష్ణుడియొక్క; సందర్శనంబునన్= దర్శనంచేత; ఉత్సవ= ఉత్సవంవలన కలిగిన; ఉన్మత్త భావము= వెర్రితనం; ఇమ్మడి+ఐ= రెట్టింపై; ప్రమోదమ్మునన్= మహానందంతో; తేలిరి= ఉప్పొంగిరి; ఆ దేవదేవుఁడు= ఆ దేవాధిదేవుడు కృష్ణుడు; వసుదేవున్= వసుదేవుడిని; కాంచి= దర్శించి; దేవకీ దేవిన్= దేవకీదేవినీ; బలభద్రదేవున్= బలరాముడినీ; తక్కన్+కలుగు= మిగిలిన; బాంధవులను= చుట్టాలనూ; కని= చూచి; వినీతిన్= వినయంతో; తద్+తద్= వారి వారికి; ఉచిత= తగిన; మనోజ్ఞ= మనస్సును ఆనందింపజేసే; విధా= విధానాలతో కూడిన; సమంచిత= మిక్కిలి పూజితమైన; ఆచరణములు= మర్యాదలు; ప్రియంబు= ప్రీతి; ఎలర్పన్= అతిశయించగా; నడపెన్= చేశాడు.

తాత్పర్యం: భృగువంశోత్తముడైన ఉదంకుడిని ఆ విధంగా శ్రీకృష్ణుడు వీడ్కొని తన రాకకు అలంకరించిన ద్వారకాపురం ప్రవేశించాడు. రైవతకపర్వతం జాతరకొరకై అప్పటికే సాగుతున్న ద్వారకావాసులందరూ శ్రీకృష్ణ సందర్శనం వలన వెర్రెత్తినట్లు మహానందంతో ఉప్పొంగిపోయారు. అప్పుడు శ్రీకృష్ణుడు దేవకీ వసుదేవులనూ, బలరాముడినీ మిగలిన చుట్టాలనూ చూచి, వారి వారికి తగినట్లుగా ఆనందకరమైన మర్యాదలు చేశాడు.

వ. వారలందఱకు ధర్మనందను చెప్పిన చొప్పునఁ బ్రణామాది యోగ్యోపచారంబు లాచరించె; ననుజ తనూజామాత్య భృత్యులు దన్నుం గనినం బ్రీతి వాత్సల్య సంభావనా బహుమానంబులు మెఱయ నాదరించె; సాత్యకి సుభద్రలం దగు తెఱంగులం దగిన వారలం గానిపించె; నట్లు సకలజన ప్రమోదాపాది యైన దామోదరు నత్యంత సమీపాసనుం జేసికొని వసుదేవుడు 'భారతరణప్రకారంబు యాతాయాత జనంబులచేత వింటిం, బ్రస్ఫుటంబుగా వినవలతుం జెప్పవే' యని యడిగిన నచ్యుతుం డతని కిట్లనియె. 120

ప్రతిపదార్థం: వారలు+అందఱకున్= వారందరికీ; ధర్మనందను= ధర్మనందనుడు; చెప్పిన; చొప్పునన్= విధంగా; ప్రణామ= నమస్కారం; ఆది= మొదలైన; యోగ్య= తగిన; ఉపచారంబులు= సేవా గౌరవాలు; ఆచరించెన్= చేశాడు; అనుజ= తమ్ముళ్ళూ; తనూజ= కుమారులూ; అమాత్య= మంత్రులూ; భృత్యులు= సేవకులూ; తన్నున్= తన్ను; కనినన్= దర్శింపగా; ప్రీతి= సంతోషం; వాత్సల్యము= మమత; సంభావన= ప్రేమ; బహుమానంబు= గౌరవం; మెఱయన్= వెల్లడికాగా; ఆదరించెన్= ఆదరించాడు; సాత్యకిన్= సాత్యకినీ; సుభద్రన్= సుభద్రనూ; తగు= తగిన; తెఱంగులన్= విధములుగా; తగినవారలన్= యోగ్యులయినవారిని; కానిపించెన్= దర్శింపజేశాడు; అట్లు= ఆ విధంగా; సకలజన= సమస్త జనులకూ; ప్రమోద= మహానందాన్ని; ఆపాది= కలిగించేవాడు; ఐన= అయిన; దామోదరున్= శ్రీకృష్ణుడిని; అత్యంత= మిక్కిలి; సమీప= దగ్గరగా; ఆసీనున్= కూర్చున్న వాడినిగా; చేసికొని; భారతరణ= భారతయుద్ధంయొక్క; ప్రకారంబు= విధానం; యాత+ఆయాత= పోతూ వస్తూఉండే; జనంబులచేతన్= జనులచేత; వింటిన్= అరగొరగా విన్నాను; ప్రస్ఫుటంబుగాన్= మిక్కిలి తేటతెల్లంగా; వినన్+వలతున్= వినగోరుతాను; చెప్పవే= చెప్పుమా; అని; అడిగినన్= అడుగగా; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; అతనికిన్= ఆ వసుదేవుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వారందరికీ ధర్మరాజు చెప్పిన రీతిగా శ్రీకృష్ణుడు నమస్కరించటం మొదలయిన విధులన్నీ నడిపాడు. తమ్ముళ్ళూ, కొడుకులూ, మంత్రులూ, సేవకులూ తనను దర్శించటానికి రాగా వారిని సంతోషంతో, మమకారంతో, ప్రేమతో, గౌరవంతో ఆదరించాడు. సాత్యకినీ, సుభద్రనూ చూడటానికి తగినవారిని పంపించాడు. ఆ విధంగా అందరికీ ఆనందాన్ని కలిగించే శ్రీకృష్ణుడిని దగ్గర కూర్చుండబెట్టుకొని వసుదేవుడు 'నాయనా! పోతూ వస్తూ ఉండే వారివలన భారతయుద్ధాన్ని గూర్చి అరగొరగా విన్నాను. నీవు సంపూర్ణంగా చెప్పితే వినాలని ఉన్నది. నాకు తేటతెల్లంగా చెప్పు' మని అడిగాడు. అంతట శ్రీకృష్ణుడు వసుదేవుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'అది యతివిస్తారము; పె । క్కు దినంబులు చెప్పఁ బట్టుఁ; గొంత దగం జె
ప్పెద నేఁ బ్రధాన పురుష స । ముదయ సమర విధము లఘుతరోక్తులఁ దెలియన్. 121

ప్రతిపదార్థం: అది= భారతయుద్ధ కథ; అతి= మిక్కిలి; విస్తారము= పెద్దది; చెప్పన్= దానిని చెప్పగా; పెక్కు= చాలా; దినంబులు= రోజులు; పట్టున్= గడుస్తాయి; ఏన్= నేను; తెలియన్= అర్థమయ్యేటట్లుగా; ప్రధాన= ముఖ్యులయిన; పురుష= వీరులయొక్క; సముదయ= సమూహంయొక్క; సమర= యుద్ధంయొక్క; విధము= తీరు; కొంత; లఘుతర= కొలది అయిన; ఉక్తులన్= మాటలలో; తగన్= తగినట్లుగా; చెప్పెదన్= చెప్పుతాను.

తాత్పర్యం: భారతయుద్ధ కథ చాలా పెద్దది. దానినంతా చెప్పటానికి చాలా రోజులు పట్టుతాయి. అందువలన ముఖ్యులయిన వీరులు యుద్ధాలు చేసిన తీరు కొంత నీకు కొద్ది మాటలలో అర్థమయ్యేటట్లుగా చెప్పుతాను.

సీ. కౌరవసైన్యమేకాదశాక్షౌహిణీ । కలితంబు; దానికిఁ గట్టె వీర
పట్టంబు భీష్ముఁ; డా ప్రభువున కెదురొడ్డి । రెలమిమైఁ బాండుపుత్త్రులు శిఖండి;
నక్కడ సప్త సంఖ్యాక్షౌహిణీక మ । నీక; మిమ్మాడ్కిఁ బన్నిన బలద్వ
యంబును ఖేచరు లచ్చెరువడఁ బోరెఁ; । గాండీవి దోడ్పడఁగా శిఖండి

తే. యన్నదీనందనునిఁ బదియవు దినంబు । నందుఁ గూలిచె; నుత్తరాయణము వచ్చు
నంతకును మృతి పొందక యాతఁ డుండె । నధిప! శరతల్పమున! గడు నద్భుతముగ. 122

ప్రతిపదార్థం: అధిప!= రాజా! వసుదేవా!; కౌరవ= కౌరవులయొక్క; సైన్యము; ఏకాదశ= పదకొండు; అక్షౌహిణీ= అక్షౌహిణులతో; కలితంబు= కూడినట్టిది; భీష్ముఁడు= భీష్ముడు; దానికిన్= ఆ పదకొండు అక్షౌహిణుల సైన్యానికి; వీరపట్టంబు= ఆధిపత్యమును సూచించే వీరవేషమును; కట్టెన్= ధరించాడు; ఆ ప్రభువునకున్= ఆ సైన్యాధిపతి భీష్ముడికి; పాండుపుత్త్రులు= పాండురాజు కుమారులు, పాండవులు; ఎలమిమైన్= ఉత్సాహంతో; శిఖండిన్= శిఖండిని; ఎదురొడ్డిరి= ఎదురుగా నిలిపారు; అక్కడన్= పాండవపక్షమున; అనీకము= సైన్యం; సప్తసంఖ్యా= ఏడు సంఖ్యగల; అక్షౌహిణీకము= అక్షౌహిణులు కలది; ఈ+మాడ్కిన్= ఈ విధంగా; పన్నిన= మోహరించిన; బలద్వయంబును= సేనాద్వితయం; ఖేచరులు= దేవతలు; అచ్చెరువు+పడన్= ఆశ్చర్యం పొందేటట్లుగా; పోరెన్= యుద్ధం చేసింది; శిఖండి; గాండీవి= అర్జునుడు; తోడ్పడన్+కాన్= సహాయంచేయగా; పది+అవు= పదవ; దినంబు+అందున్= రోజున; ఆ నదీ= ఆ గంగానదియొక్క; నందనునిన్= కుమారుడిని, భీష్ముడిని; కూలిచెన్= పడగొట్టాడు; అతండు= ఆ భీష్ముడు; ఉత్తరాయణము వచ్చు+అంతకును= ఉత్తరాయణ పర్వకాలం వచ్చేవరకూ; మృతిపొందక= మరణించక; కడున్= మిక్కిలి; అద్భుతముగన్= ఆశ్చర్యకరంగా; శరతల్పమునన్= బాణాల పాన్పుమీద; ఉండెన్= ఉన్నాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: వసుదేవా! కౌరవసైన్యం పదకొండు అక్షౌహిణులు. భీష్ముడు దానికి సేనాధిపతి. పాండవులు అతని కెదురుగా శిఖండిని నిలిపారు. పాండవ సైన్యం ఏడు అక్షౌహిణులు. ఈ రెండు సైన్యాలూ హోరాహోరిగా పోరాడాయి. ఆ పోరాటాన్ని చూచి దేవతలు సైతము ఆశ్చర్యపడ్డారు. అర్జునుడు తోడు రాగా శిఖండి యుద్ధం మొదలయిన పదవ రోజున భీష్ముడిని పడగొట్టాడు. ఆ మహాత్ముడు ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేవరకూ, మరణించకుండా అంపపానుపుమీద ఉన్నాడు.

విశేషం: అక్షౌహిణి= 21,870 రథములు, 21,870 ఏనుగులు, 65,610 గుఱ్ఱాలు, 1,09,350 పదాతులు కలిగిన సేన, ఉత్తరాయణము-సూర్యుడు ఉత్తరపు వైపుగా సంచరించే ఆరునెలలకాలం. మకరసంక్రాంతినుండి కర్కటసంక్రాంతివరకుగల కాలం. మార్గశిరమాసం సమాప్తి అయిన తరువాత ఉత్తరాయణం ప్రారంభమవుతుంది.

క. గురుఁ డైదు దివసములు ని । ర్భరసమర మొనర్చె; నతనిఁ బరిమార్పఁగ నా
వెరవున నర్జును ప్రాపున । దొరఁకొనియె హుతాగ్నిభవుఁడు ద్రుపదసుతుండున్. 123

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణుడు; ఐదు= అయిదు; దివసములు= రోజులు; నిర్భర= తీవ్రమయిన; సమరము= యుద్ధం; ఒనర్చెన్= చేశాడు; హుత+అగ్ని= యజ్ఞాగ్నినుండి; భవుడు= పుట్టినవాడైన; ద్రుపద= ద్రుపదుడియొక్క; సుతుండున్= కుమారుడు-ధృష్టద్యుమ్నుడు; నా= నాయొక్క; వెరవునన్= ఉపాయంతో; అర్జును= అర్జునుడియొక్క; ప్రాపునన్= అండతో; అతనిన్= ద్రోణాచార్యుడిని; పరిమార్పఁగన్= చంపగా; దొరఁకొనియెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు ఐదురోజులు తీవ్రయుద్ధం చేశాడు. యజ్ఞాగ్నినుండి పుట్టినవాడూ, ద్రుపదుడి కొడుకూ అయిన ధృష్టద్యుమ్నుడూ నా ఉపాయంవలన అర్జునుడి అండవలనా ఆ ఆచార్యుడిని చంపగలిగాడు.

క. గందున రాధాతనయుఁడు । రెండు దినంబులు పెనంగి గ్రీష్మ సమయ సూ
ర్యుండుంబోలె వెలింగెడు । గాండివధరు శరకరోష్మఁ గ్రాఁగె నరేంద్రా! 124

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= రాజా!, వసుదేవా!; గండునన్= పరాక్రమంతో; రాధా= రాధయొక్క; తనయుఁడు= కొడుకు-కర్ణుడు; రెండు; దినంబులు= రోజులు; పెనంగి= యుద్ధంచేసి; గ్రీష్మసమయ= వేసవి నాటి; సూర్యుండున్+పోలెన్= సూర్యుడివలె; వెలింగెడు= ప్రకాశించే; గాండివ= గాండీవమును; ధరు= ధరించే అర్జునుడియొక్క; శర= బాణాలనెడి; కర= కిరణాలయొక్క; ఊష్మన్= వేడిచేత; క్రాఁగెన్= కాలిపోయాడు.

తాత్పర్యం: కర్ణుడు రెండు రోజులు యుద్ధంచేసి; నడివేసవి సూర్యుడివలె వెలిగే అర్జునుడి బాణకిరణాలవలన దగ్ధమయ్యాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, రూపకం

చ. విను, మఱునాఁడు శల్యుఁ డతివిక్రమతన్ సమరం బొనర్చి య
ద్దినము సగంబు సెల్లఁగ యుధిష్ఠిరుచేఁ దెగుడున్, బలంబు గై
కొని యనిసేయఁగా శకునిఁ గూల్చె వడిన్ సహదేవుఁ; డంతతో
మనమునఁ జేవ దక్కి తనమానము డిగ్గఁగఁద్రావి హీనుఁడై. 125

ప్రతిపదార్థం: విను; మఱునాఁడు= ద్రోణుడు చనిపోయిన మరునాడు; శల్యుఁడు; అతి= మిక్కిలి; విక్రమతన్= పరాక్రమంతో; సమరంబు= యుద్ధం; ఒనర్చి= చేసి; ఆ దినము= ఆ రోజు; సగంబు= సగం; చెల్లఁగన్= కడవగా; యుధిష్ఠిరుచేన్= ధర్మరాజువలన; తెగుడున్= చచ్చిన తరువాత; శకుని; బలంబు= సైన్యాన్ని; కైకొని= తీసికొని; అని= యుద్ధం; చేయఁగాన్= చేయగా; సహదేవుఁడు; వడిన్= వేగంగా; కూల్చెన్= చంపాడు; అంతతోన్= అంతటితో; మనమునన్= మనస్సులో; చేవ= స్థైర్యాన్ని; తక్కి= కోల్పోయి; తన; మానము= ఆత్మాభిమానం, పౌరుషం; డిగ్గఁగన్+త్రావి= విడిచి; హీనుఁడు+ఐ= అల్పుడై.

తాత్పర్యం: ద్రోణుడు మరణించిన మరునాడు శల్యుడు మహాపరాక్రమవంతుడై యుద్ధం చేశాడు. కాని, ఆ రోజు ఒకపూట గడిచిన తరువాత ధర్మరాజుచేతిలో చనిపోయాడు. అప్పుడు శకుని సైన్యంతో వచ్చి యుద్ధం చేశాడు. వెంటనే సహదేవుడు అతడిని చంపాడు. అంతటితో చేసేది ఏమీలేక నిబ్బరం కోల్పోయి ఆత్మాభిమానం విడిచి అల్పుడై.(తరువాతి వచనంతో అన్వయం).

వ. దుర్యోధనుండు తనతమ్ముల భీమసేనుండు సంగ్రామంబునం దెగటార్చియుండ, భంగంబున కోర్చి పలపలని మూఁక విడిచి, గద చేతంగొని, పాదచారియయి, యొక్కండును బాఱి, యొక్కమడువు సొచ్చి, నీళ్ళు పాషాణమయముగా మంత్రించుకొని, డాఁగి యుండెఁ; బాండవు లెఱింగి పోయి పొదివికొని మర్మభేదంబు లగు దూషణభాషణంబుల నొప్పించిన. 126

ప్రతిపదార్థం: దుర్యోధనుండు; తన; తమ్ములన్= తమ్ముళ్ళను; భీమసేనుండు= భీముడు; సంగ్రామంబునన్= యుద్ధంలో; తెగటార్చి= చిత్రవధచేసి; ఉండన్= ఉండగా; భంగంబునకున్= వినాశనానికి; ఓర్చి= సహించి; పలపలనిమూఁకన్= పలచనయిన సైన్యాన్ని; విడిచి; గద; చేతన్+కొని= చేపట్టి; పాదచారి+ఐ= కాలినడకను వెళ్ళినవాడై; ఒక్కండును= ఒక్కడే; పాఱి= పారిపోయిన; ఒక్కమడువు= ఒక పెద్ద చెరువులో; చొచ్చి= ప్రవేశించి; నీళ్ళు; పాషాణమయము= శిలారూపం; కాన్= అగునట్లుగా; మంత్రించికొని= మంత్రోచ్చారణం చేసికొని; డాఁగి= దాగికొని; ఉండెన్= ఉన్నాడు; పాండవులు; ఎఱింగి= ఈ గుట్టు తెలిసికొని; పోయి; పొదివికొని= చుట్టూచేరి; మర్మ= ఆయువు పట్లను; భేదంబులు= బ్రద్దలు చేసేవి, బాణాలవంటివి; అగు= అయిన; దూషణ= నిందలతో కూడిన; భాషణంబులన్= మాటలచేత; నొప్పించినన్= బాధపెట్టగా.

తాత్పర్యం: దుర్యోధనుడు తన తమ్ముళ్ళనందరినీ భీముడు యుద్ధంలో మట్టుపెట్టినప్పటికీ, వారి వినాశనాన్ని దిగమ్రింగాడు. తరువాత క్షీణించి పలచనయిన సైన్యాన్ని వదలి, గదను చేపట్టి, కాలి నడకను పోయినవాడై, ఒక్కడే పెద్దచెరువులో ప్రవేశించాడు. మంత్రం జపించి నీళ్ళు శిలారూపం పొందేటట్లు చేశాడు. ఈ గుట్టు తెలిసికొన్న పాండవులు చెరువు చుట్టూ చేరి అతడిని జీవస్థానాలను బ్రద్దలుచేసే నిందావాక్యాలు పలికి బాధపెట్టగా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. అతఁడు మడువు వెడలి యనిలనందనుతోడఁ। దగఁ బెనంగి, తద్గదావినిహతిఁ
దొడలు విఱిగి కూలి విడిచెఁ బ్రాణంబు; లి। బ్భంగి జయము గొనిరి పాండుసుతులు. 127

ప్రతిపదార్థం: అతఁడు= ఆ దుర్యోధనుడు; మడువు= చెరువునుండి; వెడలి= బయటికి వచ్చి; అనిల= వాయువుయొక్క; నందనుతోడన్= కుమారుడితో - భీముడితో; తగన్= వీరోచితంగా; పెనంగి= పోరాడి; తద్= ఆ భీముడియొక్క; గదా= గదయొక్క; వినిహతిన్= విశేషమైన దెబ్బచేత; తొడలు; విఱిగి= విరిగి; కూలి= పడిపోయి; ప్రాణంబులు= ప్రాణాలు; విడిచెన్= వదిలాడు; పాండు= పాండురాజుయొక్క; సుతులు= కుమారులు; ఈ+భంగిన్= ఈ విధంగా; జయము+కొనిరి= జయం పొందారు.

తాత్పర్యం: దుర్యోధనుడు చెరువునుండి బయటికి వచ్చి, భీముడితో వీరోచితంగా పోరాడాడు. చివరకు భీముడి గదాఘాతంవలన తొడలు విరిగి కూలిపోయి ప్రాణాలు విడిచాడు. ఈ విధంగా పాండవులు జయం పొందారు.

క. గురుసుతుఁడు పాండుతనయ శి। బిర మా రే యడరి పొదివి భీషణవృత్తిన్
బొరిగొనియెం గరిఘోటక। నరనిచయము నెల్ల; నే మనం గల దధిపా! 128

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!, వసుదేవా!; గురు= ద్రోణాచార్యుడియొక్క; సుతుఁడు= కొడుకు - అశ్వత్థామ; ఆ రే= ఆ రాత్రి; అడరి= చెలరేగి; పాండు తనయ= పాండవుల యొక్క; శిబిరము= దండు విడిసినచోటు; పొదివి= ఆక్రమించి; భీషణ= దారుణమైన; వృత్తిన్= వ్యాపారంతో; కరి= ఏనుగులయొక్క; ఘోటక= గుర్రాలయొక్క; నర= సైనికులయొక్క; నిచయమున్= సమూహాన్ని; ఎల్లన్= అంతటినీ; పొరిగొనియెన్= సంహరించాడు; అనన్= చెప్పగా; ఏమి= ఇంకా ఏమి; కలదు?= మిగిలి ఉన్నది?

తాత్పర్యం: వసుదేవా! ఆ రాత్రి అశ్వత్థామ విజృంభించి, పాండవశిబిరం ప్రవేశించి ఏనుగుల, గుర్రాల, సైనికుల సమూహాన్ని ఒక్క పురుగు మిగులకుండా ఊచకోత కోశాడు. ఇంకా చెప్పటానికి ఏమున్నది?

వ. ఆ రాత్రి యేనును బాండుసుతులు నచ్చట లేమి నంతపుట్టె; నిట్లు పదునెనిమిది దివసంబులు చెల్లిన సంగ్రామంబున నే మార్వురము సాత్యకియును దక్క మా దిక్కున సమస్తజనంబులు నస్తమించిరి; కౌరవుల దెస నశ్వత్థామ కృప కృతవర్మలు ముివ్వురు బ్రదికిరి; యుయుత్సుండు మున్న పాండవుల నాశ్రయించుటం జేసి చావునకుం దప్పె; నిది భారతరణ ప్రకారంబు.' 129

ప్రతిపదార్థం: ఆ రాత్రి; ఏనును= నేనూ; పాండుసుతులు= పాండురాజు కొడుకులు; పాండవులూ; అచ్చటన్= అక్కడ; లేమిన్= లేకపోవుటచే; అంత= ఆ ఘోరకార్యం; పుట్టెన్= సంభవించింది; ఇట్లు= ఈ విధంగా; పదునెనిమిది దివసంబులు= పద్దెనిమిది రోజులు; చెల్లిన= నడిచిన; సంగ్రామంబునన్= యుద్ధంలో; ఏము= మేము; ఆర్వురము= ఆరుగురము; సాత్యకియును= సాత్యకీ; తక్కన్= తప్ప; మా దిక్కునన్= మా వైపున; సమస్త జనంబులును= అందరునూ; అస్తమించిరి= మరణించారు; కౌరవుల= కౌరవులయొక్క; దెసన్= వైపున; అశ్వత్థామయున్= అశ్వత్థామ; కృపుఁడున్; కృతవర్మయున్= కృతవర్మ; ముువ్వురు= ముగ్గురు; బ్రదికిరి= బ్రతికారు; యుయుత్సుండు; మున్ను+అ= పూర్వమే; పాండవులన్= పాండవులను; ఆశ్రయించుటన్+చేసి= ఆశ్రయించటంవలన; చావునకున్= మరణానికి; తప్పెన్= తప్పించుకొన్నాడు; ఇది; భారతరణ= భారతయుద్ధంయొక్క; ప్రకారంబు= విధం.

తాత్పర్యం: ఆ రాత్రి నేనూ పాండవులూ అక్కడ లేకపోవటంవలన ఆ ఘోరకార్యం జరిగింది. ఈ విధంగా పద్దెనిమిది రోజులు నడిచిన యుద్ధంలో మేము ఆరుగురమూ (శ్రీకృష్ణుడు+పంచపాండవులు) సాత్యకీ తప్ప మిగిలిన మా వైపు వారందరూ మరణించారు. కౌరవపక్షంలో అశ్వత్థామా, కృపుడూ, కృతవర్మా బ్రదికారు. యుయుత్సుడు ముందే పాండవుల పంచకు చేరటంవలన చావు తప్పించుకొన్నాడు. ఇదీ భారతయుద్ధం జరిగినతీరు.'

క. అని చెప్పెఁ గాని యభిమ। న్యుని చా వేర్పడఁగఁ జెప్ప నొల్లఁడ వసుదే
వునకు వగ మిగులుటకు నె। మ్మనమునఁ దా నోర్వకునికి మాధవుఁ డధిపా! 130

ప్రతిపదార్థం: అని; మాధవుఁడు= శ్రీకృష్ణుడు; చెప్పెన్= చెప్పాడు; కాని; వసుదేవునకున్= వసుదేవుడికి; వగ= దుఃఖం; మిగులుటకున్=

ఎక్కువ కావటానికి; తాన్= తాను; నెఱ+మనమునన్= నిండు మనస్సుతో; ఓర్వక= సహించక; ఉనికిన్= ఉండటంచేత; అభిమన్యుని= అభిమన్యుడియొక్క; చావు= మరణం; ఏర్పడఁగన్= స్పష్టంగా; చెప్పన్= చెప్పగా; ఒల్లఁడు+అ= ఇష్టపడనే ఇష్టపడ డాయెను.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు భారతయుద్ధం జరిగినవిధమంతా చెప్పాడు. కాని వసుదేవుడికి దుఃఖం ఎక్కువకావటం తాను ఓర్చుకొనలేడు కాబట్టి అభిమన్యుడి చావును గూర్చి అతడికి చెప్పటానికి ఇష్టపడనేలేదు.

వ. దాని నెఱింగి సుభద్ర గద్గదస్వరంబున గోవిందునితోడ 'నీ యల్లుం డభిమన్యుండు దెగుట మీ తండ్రికిం జెవులా రం జెప్పుమన్నా!' యని వసుదేవుండు వినం బలుకుచుం బుడమింబడిన వసుదేవాది యాదవజనంబులు మనంబులం గదిరిన క్రొత్త నెవ్వగలం బలవించినం, బద్మనాభుండు వారల నెల్ల నూరార్చి వారణపురంబున సుభద్రయు నుత్తరయు నభిమన్యునిదెస నెత్తిన శోకంబున నాకులత్వంబు నొందిన చందంబును, గొంతితగు మాటల వారిం దేర్చిన తెఱంగును, నెఱింగించి, పాండవు లేవురును వేర్వేఱ యభిమన్యునకై మణికాంచన గవాది వస్తువులు విప్రప్రకరంబుల కొసంగుటయు, మఱియుఁ దటాక కరణాది ధర్మంబు లాచరించుటయుం, జెప్పి, మఱియు 'దురంబునం దెరలక మరలక యాసౌభద్రుండు రౌద్రమూర్తియై దుర్యోధన ద్రోణ కృపద్రౌణి కృతవర్మ కర్ణాది వీరవ్రాతంబుఁ గలంచి యనేక నృపలోకంబును జములోకంబున కనిచి యనిమిషులు పొగడ నుత్తమలోకంబున కరిగి సుఖియై యున్నవాఁడు; వానికి వగవనేల?' యనియుం బలికి యిట్లుపశాంతి గావించి. 131

ప్రతిపదార్థం: దానిన్= అభిమన్యుడి చావును గూర్చి చెప్పకుండుటను; ఎఱింగి= తెలిసికొని; సుభద్ర; గద్గద= దుఃఖంవలన తడబడే; స్వరంబునన్= గొంతుతో; గోవిందునితోడన్= శ్రీకృష్ణుడితో; నీ= నీయొక్క; అల్లుండు= మేనల్లుడు అగు; అభిమన్యుండు; తెగుట= మరణించటం; మీ= మీయొక్క; తండ్రికిన్= తండ్రి వసుదేవుడికి; చెవులు+ఆరన్= చెవులకెక్కునట్లుగా; చెప్పుము; అన్నా!; అని; వినన్= వినగా; పలుకుచున్= పలుకుతూ; పుడమిన్= భూమిమీద; పడినన్= కూలిపోగా; వసుదేవ= వసుదేవుడు; ఆది= మొదలైన; యాదవ జనంబులు= యాదవులందరూ; మనంబులన్= మనస్సులలో; కదిరిన= క్రమ్మిన; క్రొత్త= క్రొత్తగా పుట్టినవైన; నెఱ+వగలన్= పరిపూర్ణ దుఃఖములతో; పలవించినన్= ఆక్రోశింపగా; పద్మనాభుండు= శ్రీకృష్ణుడు; వారలన్= వారిని; ఎల్లన్= అందరనూ; ఊరార్చి= ఓదార్చి; వారణపురంబునన్= హస్తినాపురంలో; సుభద్రయున్= సుభద్రయూ; ఉత్తరయున్= ఉత్తరయూ; అభిమన్యుని+దెసన్= అభిమన్యుడిని గూర్చి; ఎత్తిన= ఉప్పొంగిన; శోకంబునన్= శోకంచేత; ఆకులత్వంబు= క్షోభను; ఒందిన= పొందిన; చందంబును= విధమునూ; గొంతి= కుంతి; తగు= తగిన; మాటలన్= మాటలతో; వారిని; తేర్చిన= ఓదార్చిన; తెఱంగును= విధమునూ; ఎఱింగించి= తెలియజేసి; పాండవులు; ఏవురును= ఐదుగురునూ; వేఱు+వేఱ= విడి విడిగా; అభిమన్యునకై= అభిమన్యుడి తృప్తికై; మణి= మణులు; కాంచన= బంగారము; గో= గోవులు; ఆది= మొదలైన; వస్తువులు; విప్ర= బ్రాహ్మణులయొక్క; ప్రకరంబులకున్= సమూహాలకు; ఒసంగుటయున్= దానం చేయుటయు; మఱియున్= ఇంకా; తటాక కరణ= చెరువులు త్రవ్వించటం; అది= మొదలైన; ధర్మంబులు= ధర్మాలు; ఆచరించుటయున్= చేయుటయూ; చెప్పి; మఱియున్= ఇంకా; దురంబునన్= యుద్ధంలో; తెరలక= తొలగక; మరలక= వెనుకంజవేయక; ఆ సౌభద్రుండు= ఆ సుభద్రా కుమారుడు, అభిమన్యుడు; రౌద్రమూర్తి+ఐ= రౌద్రము మూర్తీభవించినవాడై; దుర్యోధన= దుర్యోధనుడు; ద్రోణ= ద్రోణుడు; కృప= కృపుడూ; ద్రౌణి= ద్రోణుడి కుమారుడు, అశ్వత్థామ; కృతవర్మ; కర్ణ= కర్ణుడు; ఆది= మొదలైన; వీర= వీరులయొక్క; వ్రాతంబున్= సమూహాన్ని; కలంచి= కలతపెట్టి; అనేక= అనేకులైన; నృప= రాజులయొక్క; లోకంబును= సమూహాన్ని; జము= యముడియొక్క; లోకంబునకున్= లోకానికి; అనిచి= పంపి; అనిమిషులు= దేవతలు; ఎగడన్= పొగడగా; ఉత్తమ లోకంబునకున్=

ఉత్తమలోకానికి; అరిగి= వెళ్ళి; సుఖి+ఐ= సుఖంతో కూడినవాడై; ఉన్నవాఁడు= ఉన్నాడు; వానికిన్= వాడికొరకు; వగవన్= దుఃఖించగా; ఏల?= ఎందుకు?; అనియున్= అనియూ; పలికి; ఇట్లు= ఈ విధంగా; ఉపశాంతి= మనశ్శాంతిని; కావించి= కలిగించి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అభిమన్యుడి వధనుగూర్చి చెప్పకపోవటం గ్రహించిన సుభద్ర 'అన్నా! నీ మేనల్లుడైన అభిమన్యుడు మరణించటం మీ తండ్రి వసుదేవుడికి చెవుల కెక్కేటట్లు చెప్పు'మని వసుదేవుడు వినేటట్లుగా పలికింది. అప్పుడు వసుదేవుడు మొదలైన యాదవులు కొత్తగా పుట్టిన దుఃఖంతో ఆక్రోశించారు. శ్రీకృష్ణుడు వారినందరినీ ఓదార్చి, హస్తినాపురంలో ఉత్తరా సుభద్రలు అభిమన్యుడిని గూర్చి మహాదుఃఖంతో క్షోభిస్తే కుంతీదేవి వారిని ఓదార్చటం, పాండవులు విడివిడిగా అభిమన్యుడి తృప్తికై మణులూ, బంగారం, గోవులూ మొదలైన వస్తువులను బ్రాహ్మణులకు దానం చేయటం, ఇంతేకాకుండా తటాక నిర్మాణం మొదలైన ధర్మకార్యాలు చేయటం వారికి వివరించాడు. ఇంకనూ వారితో 'అభిమన్యుడు రౌద్రం మూర్తీభవించినట్లుగా దుర్యోధన ద్రోణాది మహావీరులందరినీ చెల్లాచెదరుచేసి కలత పెట్టాడు. నానాదేశ రాజులను యమలోకానికి పంపాడు. దేవతలు పొగడుతుండగా ఉత్తమలోకానికి వెళ్లి సుఖంగా ఉన్నాడు. వాని కొరకు శోకించటం ఎందుకు?' అని పలికి వారి మనస్సులు కుదుటపరిచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. బంధులోకమునకుఁ బరమ ప్రియంబైన। యుచిత వర్తనమున నుండెఁ గృష్ణుఁ;'
దని సవిస్తరంబు లగు వాక్యములఁ బ్రీతి। చిగురులొత్త నిట్లు చెప్పి మఱియు. 132

ప్రతిపదార్థం: కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; బంధు= చుట్టాలయొక్క; లోకమునకున్= సమూహానికి; పరమ= మిక్కిలి; ప్రియంబు+ఐన= ఇష్టమైన; ఉచిత= తగిన; వర్తనమునన్= నడవడితో; ఉండెన్= ఉన్నాడు; అని; సహ+విస్తరంబులు= విపుల శబ్దజాలంతో కూడినవి; అగు= అయిన; వాక్యములన్= వాక్యాలతో; ప్రీతి= ఆనందం; చిగురులొత్తన్= పుట్టగా; ఇట్లు= ఈ విధంగా; చెప్పి; మఱియున్= ఇంకనూ.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు చుట్టాలకందరికీ మిక్కిలి ఇష్టమయిన రీతిగా నడుచుకొంటూ ఉన్నాడు. ఈ విధంగా సవిస్తరంగా సంతోషం కలిగేటట్లు చెప్పి ఇంకనూ. (తరువాతి వచనంతో అన్వయం).

వ. కరిపురంబునం బుట్టిన విశేషంబులు వినుమని పలికి వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 133

ప్రతిపదార్థం: కరిపురంబునన్= హస్తినాపురంలో; పుట్టిన= కలిగిన; విశేషంబులు= విశేషాలు; వినుము; అని; పలికి; వైశంపాయనుడు; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: హస్తినాపురంలో పుట్టిన విశేషాలు వినుమంటూ వైశంపాయనుడు జనమేజయుడితో ఈ విధంగా అన్నాడు.

వ్యాసుఁడు పాండవుల నశ్వమేధయాగోన్ముఖులఁ జేయుట (సం.14-61-8)

సీ. చుఱచుఱఁ దనచెవుల్ సూఁడిన యట్లుగ। నభిమన్యు సంస్తుతి యైన వాక్య
యము ప్రసంగాధీనమై బంధుజనులందుఁ। బొడముటయును, ధృతి యెడలి తలరి
యుత్తర విలపింప, నత్తన్వియలమట। గనుఁగొని, పాండునందనులు వనటఁ
గూరిన, నచటికిఁ గారుణ్యమూర్తి వే। దవ్యాసుఁ డేతెంచి తగినమాట

తే. **లాడి, వారలవగ మాన్పి, యశ్వమేధ। విషయవిధులు ప్రసంగించి వేగ తొడఁగుఁ**
దని నియోగించి, వా రెల్ల నట్లకాక। యనిన నాతఁ డంతర్హితుం డయ్యె నధిప! 134

ప్రతిపదార్థం: అధిప!= రాజా! జనమేజయా!; బంధుజనులు+అందున్= చుట్టాల నడుమ; ప్రసంగ= ప్రస్తావమునకు; అధీనము+ఐ= వశమై; అభిమన్యు= అభిమన్యుడి; సంస్తుతి= ప్రశంస; ఐన= అయిన; వాక్= మాటలయొక్క; చయము= సమూహం; చుఱచుఱన్= చుర చురా; తన= తనయొక్క; చెవుల్= చెవులు; చూఁడిన= కాల్చిన; అట్లు+కన్= అట్లుగా; పొడముటయును= పుట్టిన పిదప; ధృతి= ధైర్యం; ఎడలి= క్షీణించి; తలరి= కంపించి; ఉత్తర; విలపింపన్= దుఃఖించగా; ఆ తన్వి= ఆ స్త్రీయొక్క; అలమట= దుఃఖం; కనుఁగొని= చూచి; పాండు= పాండురాజుయొక్క; నందనులు= కుమారులు; వనటన్= శోకంలో; కూరినన్= మునుగగా; అచటికిన్= అక్కడకు; కారుణ్యమూర్తి= దయాస్వరూపుడు; వేదవ్యాసుఁడు= వ్యాసమహర్షి; ఏతెంచి= వచ్చి; తగిన; మాటలు; ఆడి= పలికి; వారల= పాండవుల; వగ= దుఃఖం; మాన్చి= పోగొట్టి; అశ్వమేధ= అశ్వమేధంయొక్క; విషయ= ప్రధానకార్యము నందలి; విధులు= పద్ధతులు; ప్రసంగించి= వివరించి; వేగ= త్వరగా; తొడఁగుఁడు= పూనుకొనండి; అని; నియోగించి= ఆజ్ఞాపించి; వారు= పాండవులు; ఎల్లన్= అందరూ; అట్లు+అ= అట్లే; కాక= అగునుగాక; అనినన్= అనగా; అతఁడు= ఆ మహర్షి; అంతర్హితుండు= అదృశ్యుడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: జనమేజయా! చుట్టాలందరూ మాటల వెంబడి అభిమన్యుడిని పెక్కుమాటలలో పొగడేటప్పటికి ఎంతో బాధకలిగి ఉత్తర శోకించింది. ఆమె దుఃఖపడటం చూచి పాండవులు దుఃఖంలో మునిగిపోయారు. అప్పుడు దయామయుడైన వ్యాసమహర్షి వచ్చి తగిన మాటలు చెప్పి వారిని ఓదార్చాడు. ఆ సందర్భంగా అశ్వమేధయాగ సంస్కారాలను వివరించి 'మీరు వెంటనే దానిని చేయటానికి పూనుకొనం'డని వారిని ఆజ్ఞాపించి అదృశ్యుడయ్యాడు.

క. **అన విని జనమేజయుఁ 'డ। మ్ముని యిట్లు హితోపదేశముం జేసినఁ బాం**
డు నృపాగ్రతనయుఁ డెమ్మెయి। ననఘ! తొడఁగె నశ్వమేధ యాగంబునకున్?' 135

ప్రతిపదార్థం: అనన్= అనగా; విని; జనమేజయుఁడు; అనఘ!= పాపంలేనివాడు!; ఆ ముని= ఆ వ్యాసమహర్షి; ఇట్లు= ఈ విధంగా; హిత= మేలు కలిగించే; ఉపదేశమున్= ప్రబోధం; చేసినన్= చేయగా; పాండునృప= పాండురాజుయొక్క; అగ్రతనయుఁడు= పెద్దకొడుకు -ధర్మరాజు; ఏ+మెయిన్= ఏ విధంగా; అశ్వమేధయాగంబునకున్= అశ్వమేధ యజ్ఞానికి; తొడఁగన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: వైశంపాయనుడి మాటలు విని జనమేజయుడు 'పుణ్యాత్మా! వ్యాసమహర్షి ఈ విధంగా హితం కలిగించే ఉపదేశం చేయగా; ధర్మరాజు అశ్వమేధయాగం చేయటానికి ఏ విధంగా పూనుకొన్నాడు?'

క. **అని యడిగిన వైశంపా। యనుఁ డాతని కిట్టు లనియె; నప్పుడు కుంతీ**
తనయాగ్రజుండు తమ్ములఁ। గనుఁగొని యుత్సాహలక్ష్మి కనుఁగవ నొప్పన్. 136

ప్రతిపదార్థం: అని; అడిగినన్= అడుగగా; వైశంపాయనుఁడు; ఆతనికిన్= జనమేజయుడితో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అప్పుడు= వ్యాసమహర్షి వెళ్ళిన తరువాత; కుంతీ= కుంతియొక్క; తనయ= కొడుకులలో; అగ్రజుండు= పెద్దవాడు; కను+కవన్= రెండు కళ్ళల్లో; ఉత్సాహ= ఉత్సాహంవలన కలిగిన; లక్ష్మి= శోభ; ఒప్పన్= ఒప్పగా; తమ్ములన్= తమ్ముళ్ళను; కనుఁగొని= చూచి.

తాత్పర్యం: అని అడుగగా వైశంపాయనుడు అతడితో ఈ విధంగా అన్నాడు. వ్యాసమహర్షి వెళ్ళిన తరువాత ధర్మరాజు కళ్ళల్లో ఉత్సాహ శోభ ఒప్పగా తన తమ్ముళ్ళను చూచి.(తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'వ్యాసమహాముని వత్సలత్వంబున। నానతి యిచ్చిన మాననీయ
వాక్యంబు వింటిరె? వసుధ యిత్తఱి వసు। హీనయై యున్నది; దానఁ జేసి
భూదేవ నిహిత ధనాదాన మావశ్య। కంబయ్యె; దాని శక్యత్వమును హి
మాచల యాత్రా సమాచరణ ప్రకా। రమును విచారణీయములు గావె?

ఆ. యనుడుఁబవన తనయుఁ డతనితో నీశ్వరుఁ। బరమ నియతిఁ గొలిచి, కరుణ వడసి
ప్రమథగణము నెల్ల భక్తిఁ బూజించి, య। త్తలమునందు భూతబలు లొనర్చి. 137

ప్రతిపదార్థం: వ్యాసమహాముని= వ్యాసమహర్షి; వత్సలత్వంబునన్= మమకారంతో; ఆనతి+ఇచ్చిన= సెలవిచ్చిన; మాననీయ= మన్నింపదగిన; వాక్యంబు= మాట; వింటిరి+ఎ= విన్నారు కదా!; ఈ+తఱిన్= ఈ సమయాన; వసుధ= భూమి, సామ్రాజ్యం; వసు= ధనంచేత; హీన+ఐ= తక్కువదియై; ఉన్నది; దానన్+చేసి= అందువలన; భూదేవ= బ్రాహ్మణులచేత; నిహిత= ఉంచబడిన; ధన= ధనంయొక్క; ఆదానము= తీసికొనిరావటం; అవశ్యకంబు= తప్పనిసరి; అయ్యెన్= అయినది; దాని= ఆ ధనం తీసికొనివచ్చే పనియొక్క; శక్యత్వమును= సాధ్యతనూ; హిమ+అచల= హిమవత్పర్వతమును గూర్చి; యాత్రా= యాత్రను; సమాచరణ= లెస్సగా చేయునట్టి; ప్రకారమును= విధానమునూ; విచారణీయములు= ఆలోచింపదగినవి; కావు+ఎ!= అగును కదా!; అనుడున్= అనిన తరువాత; పవన= వాయువుయొక్క; తనయుఁడు= కుమారుడు-భీముడు; అతనితోన్= ధర్మరాజుతో; ఈశ్వరున్= శివుడిని; పరమ= మిక్కిలి; నియతిన్= నియమంతో; కొలిచి= పూజించి; కరుణ= దయ; పడసి= పొంది; ప్రమథ= ప్రమథులయొక్క; గణమున్= సమూహమును; ఎల్లన్= అంతటినీ; భక్తిన్= భక్తితో; పూజించి; ఆ+తలము+అందున్= ఆ ప్రదేశంలో; భూత= భూతముల కొరకు; బలులు; ఒనర్చి= చేసి.

తాత్పర్యం: 'వ్యాసమహర్షి మమకారంతో చెప్పినమాట విన్నారు కదా! ఈనాడు భూమండలంలో ధనంలేదు. అందుచేత బ్రాహ్మణులు దాచిపెట్టిన ధనాన్ని తీసికొనిరావటం తప్పనిసరి అవుతున్నది. అయితే ఆ పని సాధ్యాసాధ్యాలనూ హిమాలయ యాత్రా విధానమూ ఆలోచించవలసి ఉన్నది' అని అన్నాడు. అప్పుడు భీముడు ధర్మరాజుతో 'పరమ శివుడిని నియమబద్ధంగా పూజించి ఆయన అనుగ్రహం పొంది ప్రమథగణాలను సేవించి అక్కడ భూతబలులు చేసి, (తరువాతి పద్యంతో అన్వయం).

క. తెత్తము గాక నరేంద్ర! మ। రుత్తకలితమైన దానరూపము సుమహో
దాత్త స్థితి నున్న కనక;। మిత్తఱి నిలదెసఁ దలంప నేటికి మనకున్. 138

ప్రతిపదార్థం: నరేంద్ర!= రాజా!; మరుత్త= మరుత్తుడిచేత; కలితము= కల్పించబడింది; ఐన= అయిన; దాన= దానంయొక్క; రూపము= రూపం కలది; సు= మంచి; మహత్= గొప్ప; ఉదాత్త= ఒప్పిదమైన; స్థితిన్= స్థితితో; ఉన్న; కనకము= బంగారం; తెత్తము+కాక= తీసికొని వస్తాము; ఈ+తఱిన్= ఈ సమయాన; మనకున్= మనకు; ఇల= భూమియొక్క; దెసన్= దురవస్థను; తలంపన్= విచారించగా; ఏటికిన్?= ఎందులకు?

తాత్పర్యం: రాజా! మరుత్తుడు దానంచేసిందీ, ఈనాటికీ చెక్కు చెదరకుండా ఉన్నదీ అయిన బంగారాన్ని తీసికొని వద్దాము. రాజ్యదురవస్థను గూర్చి మనం విచారించటం దేనికి?

విశేషం: మరుత్తుడు షోడశమహారాజులలో ఒకడు. ఆ రాజు సంవర్తుడిని ఉపద్రష్టగా చేసికొని, హిమవత్పర్వత పార్శ్వప్రదేశంలో యజ్ఞంచేసి, బ్రాహ్మణులకు సువర్ణరాసులూ, కనక పాత్రలూ దక్షిణగా ఇచ్చాడు. బ్రాహ్మణులు త్రవ్వితండాలుగా ఉన్న ఆ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బంగారాన్ని తీసికొని వెళ్ళగలిగినంత స్వీకరించి మిగిలినదానిని అక్కడ నిధిగా నిలిపి 'ఇది కాలాంతరంలో చూచినవారికే చెందుతుం'దని కట్టడి చేశారు. ఆ బంగారాన్నే తీసికొనివద్దామని భీముడు ధర్మరాజుతో అంటున్నాడు.

వ. అప్పనికి సముచిత సైన్య సమేతంబుగా దేవర విజయంచేయవలయు' ననిన నర్జునుండును గవలును నట్ల పలికిరి; దానికి ధర్మనందనుండు ప్రియంబంది, కృతనిశ్చయుండయి, ధృతరాష్ట్రు కడకుం జని, యశ్వమేధ యాగోపక్రమోత్సవ శ్రవణంబునం బుత్త్రులం దలంచి శోకసంతాప సమాక్రాంతుండయి యున్న యన్నరపతి చరణంబుల కెఱంగి, వేదవ్యాసు వచనంబులు గాంధారియు వినుచుండ నతనికిం జెప్పి, యతనిచేత నయ్యజ్ఞాచరణంబునకు ననుజ్ఞ వడసి యయ్యిరువురను దండ ప్రణామపూర్వకంబుగా వీడ్కొని, గొంతిపాలికిం బోయి, సంతోష వికచవదనయయి యున్న యద్దేవి యధ్వర విధానంబునకు ననుమతి సేయం దదీయ పాదంబులకుం బ్రణమిల్లి, తదామంత్రితుండై యాస్థానమండపంబునకు నరుగుదెంచి, యుయుత్సు రావించి కార్యంబు తెఱంగెఱింగించి నీవు నగర రక్షకై నిలువుమని నెయ్యంబలర విదుర సమేతంబుగా నిలిపి, బలంబుల సంఘటింపం బడవాళ్ళం బనిచి, నియతుండయి. సురపితృ పూజనంబులు దీర్చి, మహేంద్రార్చనం బొనర్చి మహితావధానుండై. 139

ప్రతిపదార్థం: ఆ+పనికిన్= బంగారం తీసికొని వచ్చే పనికి; దేవర= ఏలినవారు; సముచిత= తగినంత; సైన్య= సైన్యంతో; సమేతంబు+కాన్= కూడియుండేటట్లుగా; విజయంచేయవలయున్= వెళ్ళవలయును; అనినన్= అనగా; అర్జునుండును= అర్జునుడూ; కవలునున్= నకుల సహదేవులునూ; అట్లు+అ= ఆ విధంగానే; పలికిరి= అన్నారు; దానికిన్= సోదరులు చెప్పిన మాటకు; ధర్మ= యముడియొక్క; నందనుండు= కుమారుడు; ప్రియంబు+అంది= సంతోషించి; కృతనిశ్చయుండు+ఐ= నిశ్చయించుకొన్నవాడై; ధృతరాష్ట్రు= ధృతరాష్ట్రుడియొక్క; కడకున్= దగ్గరకు; చని= వెళ్ళి; అశ్వమేధయాగ= అశ్వమేధయాగంయొక్క; ఉపక్రమ= ప్రారంభమనెడు; ఉత్సవ= వేడుకయొక్క; శ్రవణంబునన్= వినుటవలన; పుత్త్రులన్= కుమారులను; తలంచి= స్మరించి; శోక= శోకంవలన కలిగిన; సంతాప= సంతాపంచేత; సమాక్రాంతుండు+ఐ= ఆక్రమించబడినవాడై; ఉన్న; ఆ నరపతి= ఆ రాజుయొక్క; చరణంబులకున్= పాదాలకు; ఎఱంగి= మ్రొక్కి; వేదవ్యాసు= వేదవ్యాసుడియొక్క; వచనంబులు= మాటలు; గాంధారియున్= గాంధారికూడా; వినుచున్+ఉండన్= వింటూ ఉండగా; అతనికిన్= ధృతరాష్ట్రుడికి; చెప్పి; అతనిచేతన్= అతడిచేత; ఆ యజ్ఞ= ఆ యజ్ఞంయొక్క; ఆచరణంబునకున్= చేయటానికి; అనుజ్ఞ= అనుమతి; పడసి= పొంది; ఆ ఇరువురను= ఆ ఇద్దరినీ, గాంధారీ ధృతరాష్ట్రులను; దండప్రణామ= సాష్టాంగ నమస్కారం; పూర్వకంబు+కాన్= మొదటిది కాగా; వీడ్కొని= పోయి వస్తానని వదలి; గొంతి= కుంతీదేవియొక్క; పాలికిన్= దగ్గరకు; పోయి= వెళ్ళి; సంతోష= సంతోషంచేత; వికచ= వికసించిన; వదన= ముఖం కలది; అయి; ఉన్న; ఆ దేవి= ఆ దేవేరి; అధ్వర= యజ్ఞంయొక్క; విధానంబునకున్= చేయటానికి; అనుమతి+ చేయన్= అంగీకరించగా, అనుజ్ఞ ఇవ్వగా; తదీయ= ఆమెవి అయిన; పాదంబులకున్= కాళ్ళకు; ప్రణమిల్లి= నమస్కరించి; తద్= ఆమెచేత; ఆమంత్రితుండు+ఐ= వీడ్కొల్పబడినవాడై; ఆస్థాన మండపంబునకున్= ఆస్థాన మండపానికి; అరుగుదెంచి= వచ్చి; యుయుత్సున్= యుయుత్సుడిని (ధృతరాష్ట్రుడికి వైశ్య స్త్రీ యందు పుట్టినవాడు); రావించి= రప్పించి; కార్యంబు= పనియొక్క; తెఱంగు= తీరు; ఎఱింగించి= తెలియజేసి; నీవు; నగర= పట్టణముయొక్క; రక్షకై= రక్షణకొరకు; నిలువుము= ఆగుము; అని; నెయ్యంబు= ప్రేమ; అలరన్= కలుగగా; విదుర= విదురుడితో; సమేతంబు+కాన్= కూడియుండునట్లుగా; నిలిపి= ఉంచి; బలంబులన్= సేవలను; సంఘటింపన్= సిద్ధంచేయుగా; పడవాళ్ళన్= సేనాపతులను; పనిచి= ఆజ్ఞాపించి; నియతుండు+ఐ= వ్రతనిష్ఠ కలవాడై; సుర= దేవతలయొక్క; పితృ= మరణించిన పూర్వులయొక్క; పూజనంబులు= పూజించుటలు; తీర్చి= నిర్వహించి; మహేంద్ర= ఇంద్రుడియొక్క; అర్చనంబు= పూజను; ఒనర్చి= చేసి; మహిత= గొప్ప; అవధానుండు+ఐ= శ్రద్ధగలవాడై.

తాత్పర్యం: ఆ బంగారం తీసికొనివచ్చే పనికి తగిన సైన్యంతో ప్రభువులు వెళ్ళవలయును అని అన్నాడు. అర్జునుడూ, నకుల సహదేవులూ ఆ విధంగానే అన్నారు. వారి మాటలకు సంతోషించి ధర్మరాజు అశ్వమేధయాగం చేయాలని నిశ్చయించుకొన్నాడు. తరువాత ధృతరాష్ట్రుడి దగ్గరకు వెళ్ళాడు. అశ్వమేధయాగం ప్రారంభం అవుతుందనేమాట చెవినిబడేటప్పటికి, ఆ మహారాజు కొడుకులను తలచుకొని విలపించాడు. ధర్మరాజు అతడికి పాదాభివందనం చేసి గాంధారి వింటుండగా వ్యాసమహర్షి పలికిన మాటలు చెప్పి, అశ్వమేధయాగం చేయటానికి అనుమతిపొందాడు. తరువాత ధర్మరాజు తల్లి అయిన కుంతిదగ్గరకు వెళ్ళాడు. ఆమె ఎంతో సంతోషించి యాగం నిర్వహించటానికి అనుమతించింది. అత డామె కాళ్ళకు మ్రొక్కి సెలవు తీసికొని, ఆస్థానమండపానికి వచ్చి, యుయుత్సుడిని రప్పించి చేయవలసిన పని తెలియజేసి, 'నీవు నగరాన్ని రక్షించటానికి ఆగుమని చెప్పి అతడికి విదురుడిని తోడుగా నిలిపాడు. తగిన సైన్యం సమకూర్చటానికి సేనాపతులను ఆజ్ఞాపించాడు. తరువాత నిష్ఠతో ఇంద్రుడిని, దేవతలనూ, పితృదేవతలనూ పూజించి గొప్ప శ్రద్ధకలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం).

క. నానావిధ బహుళాంచిత । దానము లొనరించి యర్చితం బగు నగ్నిన్
దాని యధికారి ధౌమ్యుం । దాను బ్రదక్షిణ విధాయితం గొలిచి తగన్. 140

ప్రతిపదార్థం: నానావిధ= అనేక విధములైన; బహుళ= అధికమైన; అంచిత= ఒప్పుచున్న; దానములు; ఒనరించి= చేసి; అర్చితంబు= ఆరాధించబడినది; అగు= అయిన; అగ్నిన్= అగ్నినీ; దాని= ఆ అగ్నియొక్క; అధికారిన్= అధికారంకలవాడిని; ధౌమ్యున్= ధౌమ్యుడిని; తాను; ప్రదక్షిణ= ప్రదక్షిణమనే; విధాయితన్= విధానంతో; తగన్= శాస్త్రోక్తంగా; కొలిచి= ఉపాసించి.

తాత్పర్యం: రకరకాలయిన దానాలు అధికంగా చేసి అగ్నిని పూజించి, దానికీ, దాని యజమానుడయిన ధౌమ్యుడికీ ప్రదక్షిణం గావించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సిత లేపన సితభూషణ । సితమాల్య సితాంబరములఁ జెన్నుగ సమలం
కృతుఁడై సితాతపత్ర । ప్రతతి మెఱయఁ బూర్ణచంద్రు పగిది వెలుఁగుచున్. 141

ప్రతిపదార్థం: సిత= తెల్లని; లేపన= మైపూతలచేతను; సిత= తెల్లని; భూషణ= నగలచేతను; సిత= తెల్లని; మాల్య= పూలదండలచేతను; సిత= తెల్లని; అంబరములన్= వస్త్రాలచేతను; సమలంకృతుఁడు+ఐ= మిక్కిలి అలంకరించుకొన్నవాడై; సిత= తెల్లని; ఆతపత్ర= గొడుగులయొక్క; ప్రతతి= సమూహం; మెఱయన్= మెరుస్తుండగా; పూర్ణచంద్రు పగిదిన్= నిండు చంద్రుడివలె; వెలుఁగుచున్= ప్రకాశిస్తూ.

తాత్పర్యం: తెల్లని మైపూతలూ, నగలూ, పూలదండలూ, బట్టలూ అలంకరించుకొని, కట్టుకొని తెల్లని గొడుగులగుంపు మెరుస్తుండగా పున్నమినాటి చంద్రుడివలె ప్రకాశిస్తూ, (తరువాతి వచనంతో అన్వయం).

ప్రతిపదార్థం: అలం: ఉపమ.

వ. షోడశ శ్వేతాశ్వ వ్యూఢ రథారూఢుండై. 142

ప్రతిపదార్థం: షోడశ= పదహారు; శ్వేత= తెల్లని; అశ్వ= గుర్రములు; వ్యూఢ= పన్నిన; రథ= రథమును; ఆరూఢుండు+ఐ= ఎక్కినవాడై.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: పదహారు తెల్లని గుర్రాలు కట్టిన రథం ఎక్కినవాడై. (తరువాతి పద్యంతో అన్వయం)

క. భూదైవత దత్తాశీ। ర్వాదంబులుఁ బుణ్యగానరవములు; రోదో
మేదుర మంగళ తూర్యని। నాదంబులుఁ జెలంగ, బుధజనస్తుతు లెసఁగన్. 143

ప్రతిపదార్థం: భూదైవత= బ్రాహ్మణులచేత; దత్త= ఇయ్యబడిన; ఆశీర్వాదంబులున్, దీవనల సవ్వడియునూ; పుణ్య= పుణ్యం కలిగించే; గాన= సంగీతంయొక్క; రవములున్= ధ్వనులునూ; రోదన్= భూమ్యాకాశ మధ్య ప్రదేశమందంతటా; మేదుర= దట్టమైన; మంగళ= శుభం కలిగించే; తూర్య= వాద్యాలయొక్క; నినాదంబులున్= ధ్వనులునూ; చెలంగన్= అతిశయించగా; బుధజన= విద్వాంసులయొక్క; స్తుతులు= స్తోత్రాలు; ఎసఁగన్= ఒప్పగా.

తాత్పర్యం: బ్రాహ్మణుల దీవనల సవ్వడీ, పవిత్ర సంగీతధ్వనులూ, మంగళవాద్య ఘోషలూ అతిశయించగా విద్వాంసుల స్తోత్రములు ఒప్పగా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. వెడలెడు నమ్మహీవిభుని వేడ్క యెఱింగి, వృకోదరుండుఁ గ
వ్వడియును బిన్నతమ్ములును వైభవ మొప్ప నలంకరించి యె
క్కుడు మెఱయం, బ్రధాన భట ఘోటక దంతి రథ ప్రతానముల్
డడిగలుఁ గుంచెలుం గొడుగు తండములున్ విలసిల్ల వచ్చినన్. 144

ప్రతిపదార్థం: వెడలెడు= బయలుదేరే; ఆ మహీవిభుని= ఆ రాజుయొక్క; వేడ్క= అభిలాష; ఎఱింగి= తెలిసికొని; వృకోదరుండున్= భీముడూ; కవ్వడియును= అర్జునుడునూ; పిన్నతమ్ములును= చిన్న తమ్ముళ్ళునూ - నకుల సహదేవులునూ; వైభవము= సంపద; ఒప్పన్= ఒప్పగా; అలంకరించి= అలంకరించుకొని; ప్రధాన= ముఖ్యమైన; భట= సైనికులయొక్క; ఘోటక= గుర్రాలయొక్క; దంతి= ఏనుగులయొక్క; రథ= రథాలయొక్క; ప్రతానముల్= సమూహాలూ; ఎక్కుడు= ఎక్కువగా; మెఱయన్= ప్రకాశించగా; డడిగలున్= డాళ్ళు; కుంచెలున్= చామరాలూ; గొడుగు= గొడుగులయొక్క; తండములున్= గుంపులు; విలసిల్లన్= ఒప్పగా; వచ్చినన్= రాగా.

తాత్పర్యం: ఈ విధంగా బయలుదేరిన ధర్మరాజు కోరిక తెలిసికొని, భీమార్జున నకుల సహదేవులు తమ తమ విభవం కొలది సింగారించుకొని, చతురంగబలాలూ; డాళ్ళూ, చామరాలూ, గొడుగులూ ఒప్పుచుండ, రాగా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. కని యా నృపుఁ డలఁతి నగవు। నినుపారెడు చూడ్కి వారి నెమ్మొగములపైఁ
దనుపారుచుఁ బొలయం, జనఁ। జన రాజులు గూడుకొనిరి సైన్యంబులతోన్. 145

ప్రతిపదార్థం: కని= తమ్ముళ్ళను చూచి; ఆ నృపుఁడు= ఆ రాజు, ధర్మరాజు; అలఁతి నగవు= చిరునవ్వు; నినుపారెడు= నిండిన; చూడ్కి= చూపు; వారి= వారియొక్క; నెఱి= అందమైన; మొగములపైన్= ముఖాలమీద; తనుపారుచున్= చల్లనిదగుచూ; పొలయన్= వ్యాపించగా; చనన్+చనన్= వెళ్ళగా వెళ్ళగా; రాజులు; సైన్యంబులతోన్= సేనలతో; కూడుకొనిరి= కలిసికొన్నారు.

తాత్పర్యం: ధర్మరాజు వచ్చిన తమ్ముళ్ళను చూచి, చిరునవ్వుతో కూడిన చల్లని చూపు వారి ముఖాల మీద ప్రసరింపజేస్తూ ప్రయాణం చేస్తుండగా, రాజులు తమ సేనలతో కూడినవారై వచ్చి కలిశారు.

వ. ఇవ్విధంబున నరిగి యక్కురువంశవరుఁడు సముచిత ప్రయాణంబుల గిరి సరిదరణ్యంబులు గడచి, హిమశైలంబు సేరి, ధౌమ్యాది పురోహితులఁ బురస్కరించికొని, తదీయ తలం బధిష్ఠించి, యొక్క యుచిత ప్రదేశంబున విడిసె; నట్టియెడ. 146

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; అరిగి= వెళ్ళి; ఆ కురువంశ= ఆ కురువంశంయొక్క; వరుండు= పతి, ధర్మరాజు; సముచిత= తగిన; ప్రయాణంబులన్= ప్రయాణాలతో; గిరి= కొండలూ; సరిత్= నదులూ; అరణ్యంబులు= అడవులూ; కడచి= దాటి; హిమశైలంబు= హిమవత్పర్వతం; చేరి; ధౌమ్య= ధౌమ్యుడూ; ఆది= మొదలైన; పురోహితులన్= పురోహితులను; పురస్కరించికొని= ముందుంచుకొని; తదీయ= ఆ హిమాలయంయొక్క; తలంబు= సమప్రదేశంబును; అధిష్ఠించి= ఎక్కి ఆశ్రయించి; ఒక్క= ఒకానొక; ఉచిత= తగిన; ప్రదేశంబునన్= చోటున; విడిసెన్= విడిది చేశారు; అట్టి+ఎడన్= ఆ సమయమున.

తాత్పర్యం: ఈ విధంగా కురుపతి అయిన ఆ ధర్మరాజు ప్రయాణాలు చేసి, కొండలూ, నదులూ, అడవులూ, దాటి హిమవత్పర్వతం చేరాడు. ధౌమ్యుడూ మొదలయిన పురోహితులను ముందుంచుకొని ఆ పర్వతసమప్రదేశాన్ని ఆశ్రయించి, ఒక చోట విడిది చేశాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ్యాసుఁడు హిమవత్పర్వతంబున నున్న పాండవులకడకు వచ్చుట (సం.14-64-1)

శా. బాలార్కద్యుతి పుంజ పింజర జటాభారంబుఁ బ్రావృడ్ఘన
శ్రీలీలం బ్రహసించునంగమును, రోచిస్స్ఫార దండంబు ను
న్మీలన్నీల మృగాజినాంబరము నై, నిర్వాణదాన క్రియా
శీలుం డైన పరాశరాత్మజుఁడు విచ్చేసెం గృపాలోలుఁడై. 147

ప్రతిపదార్థం: బాల+అర్క= ఉదయిస్తున్న సూర్యుడియొక్క; ద్యుతి= కాంతులయొక్క; పుంజ= సమూహంయొక్క; పింజర= బంగారువన్నె కలిగిన; జటా= జడలయొక్క; భారంబు= బరువునూ; ప్రావృట్= వర్షాకాలంలోని; ఘన= మేఘంయొక్క; శ్రీ= రంగు యొక్క; లీలన్= తీరును; ప్రహసించు= నవ్వు, తిరస్కరించే; అంగమును= శరీరమును; రోచిస్= కాంతిచేత; స్ఫార= పెద్దది అగు; దండంబున్= కర్రయూ (మునులు ధరించునది); ఉన్మీలత్= ప్రకాశిస్తున్న; నీల= నల్లని; మృగ+అజిన= లేడితోలు అనే; అంబరమున్= వస్త్రమును; ఐ= కలవాడై; నిర్వాణ= మోక్షముయొక్క; దాన క్రియా= దానం చేయటమే; శీలుండు+ఐ= శీలంగా కలవాడైన; పరాశర= పరాశరమహర్షియొక్క; ఆత్మజుఁడు= కుమారుడు - వ్యాసుడు; కృపాలోలుఁడు= దయాపరుడు; ఐ= అయి; విచ్చేసెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఉదయిస్తున్న సూర్యుడి కాంతులతో కూడిన జడలగుంపు, వర్షాకాలమందలి మబ్బువన్నెగల శరీరమూ కాంతిమంతమైన దండమూ, లేడితోలు అనే వస్త్రం కలవాడూ, మోక్షప్రదాతా, దయాసంపన్నుడూ అయిన వ్యాసుడు వచ్చాడు.

వ. ఇట్లు సన్నిహితుండయిన వేదవ్యాస మునీశ్వరునిఁ బాండవులు పరమభక్తిం బ్రణామ పూర్వకంబుగాఁ బూజించి, 'కర్తవ్యం బెయ్యది! యానతిం' డనిన, నమ్మాననీయుం 'డెల్లి మీరెల్లవారును త్ర్యంబకపూజలు చెల్లింపవలయు; నేఁటిరాత్రి నియతులై దర్భసంస్తరణంబుల శయనించునది' యని నియోగించిన. 148

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సన్నిహితుండు= ప్రత్యక్షమైనవాడు; అయిన; వేదవ్యాస= వేదవ్యాసుడనే; ముని+ఈశ్వరునిన్= మునీంద్రుడిని; పాండవులు; పరమ= మిక్కిలి; భక్తిన్= భక్తితో; ప్రణామపూర్వకంబు+కాన్= నమస్కారపూర్వకంగా; పూజించి;

కర్తవ్యంబు= చేయదగినది; ఏ+అది= ఏది; ఆనతి+ఇండు= సెలవు ఇవ్వండి; అనినన్= అడుగగా; ఆ మాననీయుండు= ఆ గౌరవార్హుడు; ఎల్లి= రేపు; మీరు; ఎల్లవారును= అందరూ; త్ర్యంబక= ముక్కంటియొక్క; పూజలు; చెల్లింపవలయున్= చేయవలయును; నేఁటి= ఈ రోజు; రాత్రి; నియతులు+ఐ= నియమం కలవారై; దర్భ= దర్భలతో ఏర్పరచిన; సంస్తరణంబులన్= పడకలమీద; శయనించునది= పడుకొనండి; అని; నియోగించినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఈ విధంగా ప్రత్యక్షమైన వ్యాసమహర్షిని భక్తితో పూజించి పాండవులు మేము చేయవలసిన పని ఏమి?' అని అడిగారు. అంత ఆ మునీంద్రుడు రేపు మీరు శివపూజలు చేయాలి. ఈ రాత్రి నియమనిష్ఠలతో దర్భపడకలమీద పడుకొనండి' అని ఆజ్ఞాపించాడు.

ఆ. రమ్యమైన చప్పరంబుల దర్భసం। స్తరణములను, యాగ సదనమునఁ బ్ర
భాసమానములగు పంచాగ్నులును బోలె। నమ్మహాత్ము లుండి రధిపముఖ్య! 149

ప్రతిపదార్థం: అధిప!= రాజులలో; ముఖ్య!= అగ్రగణ్యా!, జనమేజయా!; యాగ= యజ్ఞముయొక్క; సదనమునన్= గృహంలో; ప్రభాసమానములు= మిక్కిలి ప్రకాశించేవి; అగు= అయిన; పంచ+అగ్నులును+పోలెన్= ఐదు అగ్నులవలె; ఆ+మహాత్ములు= ఆ గొప్ప మనస్సు కలవారు; రమ్యము= అందమయినవి; ఐన= అయిన; చప్పరంబులన్= పర్ణశాలలలో; దర్భ= దర్భలతో చేసిన; సంస్తరణములన్= పడకలమీద; ఉండిరి= శయనించారు.

తాత్పర్యం: యజ్ఞగృహంలో మిక్కిలి ప్రకాశించే పంచాగ్నులవలె పాండవులు అందమైన పర్ణశాలలలో దర్భపడకలమీద శయనించారు.

విశేషం: అలం: ఉపమ. పంచాగ్నులు= ఆహవనీయము, గార్హపత్యము, దక్షిణాగ్ని, సభ్యము అపసధ్యము అను ఐదు అగ్నులు.

వ. అట్లుండి యవనీసురాశీర్వాదంబుల నాదరించుచు నారేయి గడపి, కల్యం బగుటయుం గాలోచిత కరణీయంబులు నిర్వర్తించి, సర్వక్రియా కలాప నిర్వహణ ధుర్యుండగు పారాశర్యుండు వనుప ధౌమ్యప్రముఖ పురోహిత సహాయ మహనీయ సమాచారులగు పాండవేయులు పరమస్థండిలంబునం బార్వతీపతి నావహించి, యుత్కృష్టంబులును బహుళంబులు నగు। గంధపుష్ప ధూప దీపంబులం బూజించి, సమంచిత మనోహారి భూరి పాయసాది భవ్యద్రవ్య భార మహోదారంబగు నైవేద్యంబు సమర్పించి, వేఱువేఱ ప్రధాన ప్రమథులకుఁ దద్గణంబులకు నర్చలిచ్చి, కుబేర మాణిభద్ర ప్రభృతి భూతయక్షజనంబులను సభక్తికావాహన కలితులం గావించి, పూజనంబు లాచరించి. 150

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; ఉండి; అవనీసుర= బ్రాహ్మణులయొక్క; ఆశీర్వాదంబులన్= దీవనలను; ఆదరించుచున్= స్వీకరిస్తూ; ఆ రేయి= ఆ రాత్రి; కడపి= వెళ్ళబుచ్చి; కల్యంబు= వేకువ; అగుటయున్= అయిన తరువాత; కాల= ఆ సమయమునకు; ఉచిత= తగిన; కరణీయంబులు= చేయదగిన పనులను; నిర్వర్తించి= చేసి; సర్వ= సమస్తమైన; క్రియా= ధర్మకార్యాలయొక్క; కలాప= సమూహముయొక్క; నిర్వహణ= చేయటం అనే; ధుర్యుండు= భారం వహించినవాడు; అగు= అయిన; పారాశర్యుండున్= పరాశరుడి కుమారుడు, వ్యాసుడు; పనుపన్= పంపగా; ధౌమ్య= ధౌమ్యుడు; ప్రముఖ= ముఖ్యులైన; పురోహిత= పురోహితులయొక్క; సహాయ= తోడ్పాటు చేత; మహనీయ= గొప్ప; సమాచారులు= చక్కగా చేయించుట కలవారు; అగు= అయిన; పాండవేయులు= పాండవులు; పరమ= ఉత్కృష్టమైన; స్థండిలంబునన్= దర్భలచేత సంస్కరించిన చోటునందు; పార్వతీపతిన్= శివుడిని; ఆవహించి=

మంత్రపూర్వకంగా ప్రవేశపెట్టి; ఉత్కృష్టంబులును= మంచివీ; బహుళంబులును= అనేకములును; అగు= అయిన; గంధ= గంధంచేత; పుష్ప= పూలచేత; ధూప= సువాసనగల పొగలచేత; దీపంబులన్= దీపాలచేత; పూజించి; సమంచిత= మిక్కిలి ఒప్పుచున్న; మనోహారి= మనస్సునకు ఇంపైన; భూరి= అధికమైన; పాయస= పాయసం; ఆది= మొదలైన; భవ్య= యోగ్యమైన; ద్రవ్య= పదార్థాలయొక్క; భార= భారములచేత; మహత్= మిక్కిలి; ఉదారంబు= గొప్పది; అగు= అయిన; నైవేద్యంబు= నైవేద్యం; సమర్పించి; వేఱు+వేఱు+అ= విడివిడిగానే; ప్రధాన= ముఖ్యులయిన; ప్రమథులకున్= ప్రమథులకు; తద్= వారియొక్క; గణంబులకున్= అనుచరుల సమూహానికి; అర్చలు+ఇచ్చి= పూజలు చేసి; కుబేర= కుబేరుడు; మాణిభద్ర= మాణిభద్రుడు; ప్రభృతి= మొదలైన; భూత= భూతముల; యక్ష= యక్షుల; జనంబులను= సమూహాలను; సభక్తిక= భక్తితో కూడిన; ఆవాహన= ఆహ్వానంతో, మంత్రపూర్వకంగా పిలుచుటతో; కలితులన్= కూడినవారినిగా; కావించి= చేసి; పూజనంబులు= పూజించుటలు; ఆచరించి= చేసి.

తాత్పర్యం: ఆ విధంగా ఉండి పాండవులు బ్రాహ్మణులదీవనలు పొంది, ఆ రాత్రి వెళ్ళబుచ్చారు. వేకువజామున కాలకృత్యాలు తీర్చుకొని, ధర్మకర్మ నిర్వహణదక్షుడైన వ్యాసుడి అనుజ్ఞతో ధౌమ్యుడు మొదలైన పురోహితుల తోడ్పాటుతో దర్భలతో సంస్కరించినచోట శివుడిని నిలిపి, ధూప దీప గంధ పుష్పాలతో పూజించి, పాయసం మొదలైన మహానైవేద్యాలను ఆ దేవుడికి అర్పించారు. తరువాత ముఖ్యప్రమథులనూ, వారి అనుచరులనూ, కుబేరుడు మాణిభద్రుడూ మొదలైన భూతాలనూ, యక్షులనూ మంత్రపూర్వకంగా ఆహ్వానించి పూజించారు.

క. రక్షాకర మంత్ర కలన। దక్షాత్మకు లైనయట్టి ధౌమ్య ముఖోదా
త్త క్షోణీసురులు బెరయ। నక్షయపుణ్యుఁ డగు కౌరవాధిపుఁ డెలమిన్. 151

ప్రతిపదార్థం: రక్షా= రక్షణను; కర= కలిగించే; మంత్ర= మంత్రములయొక్క; కలన= జ్ఞానంవలన; దక్ష= నేర్పుగలిగిన; ఆత్ములు= ఆత్మలు కలవారు; ఐన+అట్టి= అయినటువంటి; ధౌమ్య= ధౌమ్యుడు; ముఖ= మొదలైన; ఉదాత్త= గొప్ప; క్షోణీసురులు= బ్రాహ్మణులు; బెరయన్= చుట్టి ఉండగా; అక్షయ= క్షీణించని; పుణ్యుఁడు= పుణ్యం కలవాడు; అగు= అయిన; కౌరవ= కౌరవ వంశీయుడైన; అధిపుఁడు= రాజు, ధర్మరాజు; ఎలమిన్= ఉత్సాహంతో.

తాత్పర్యం: రక్షణ కలిగించే మంత్రాల జ్ఞానంవలన సమర్థులయిన ధౌమ్యాది పురోహితులు, చుట్టూ చేరి ఉండగా మహాపుణ్యాత్ముడైన ధర్మరాజు ఉత్సాహంతో, (తరువాతి పద్యంతో అన్వయం).

క. అనుజులుఁ దానుఁ బరాశర। తనయ పురస్సరముగా నిధాన స్థలికిం
జని, యరుణ గంధ కుసుమము। లను మాంసాపూపములను లాజములఁ దగన్. 152

ప్రతిపదార్థం: అనుజులున్= తమ్ముళ్ళునూ; తానున్= తానునూ; పరాశర= పరాశర మహర్షియొక్క; తనయ= కుమారుడైన వ్యాసుడు; పురస్సరము+కాన్= ముందుండేటట్లుగా; నిధాన= నిధులున్న; స్థలికిన్= చోటికి; చని= వెళ్ళి; అరుణ= ఎర్రని; గంధ= గంధంతో; కుసుమములను= పూలతో; మాంస= మాంసంతో; అపూపములను= అప్పాలతో; లాజములన్= పేలాలతో; తగన్= శాస్త్రోక్తంగా.

తాత్పర్యం: తానూ తమ్ముళ్ళూ వ్యాసుడు ముందు నడుస్తుండగా నిధులున్న చోటికి వెళ్ళి, ఎర్రని గంధ పుష్పాలతో, మాంసంతో, అప్పాలతో, పేలాలతో, శాస్త్రోక్తంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆ. భూతతృప్తిఁ జేసి భూరి బలాఢ్యులఁ। బరిజనములఁ ద్రవ్వఁ బనుచుటయును
నతి కుతూహలమున నార్చి వారలు ద్రవ్వి। రన్నిధానదేశ మధిపముఖ్య! 153

ప్రతిపదార్థం: అధిప!= రాజులలో; ముఖ్య= అగ్రగణ్యుడయిన వాడా!; భూత= భూతములయొక్క; తృప్తిన్= తృప్తిని; చేసి; భూరి= గొప్ప; బల= బలంచేత; ఆఢ్యులన్= సంపన్నులను; పరిజనములన్= సేవకులను; త్రవ్వన్= నిధులు త్రవ్వగా; పనుచుటయును= ఆజ్ఞాపించగా; వారలు= ఆ సేవకులు; అతి= మిక్కిలి; కుతూహలమునన్= సంతోషంతో; ఆర్చి= అరచి; ఆ నిధాన= ఆ నిధులున్న; దేశము= చోటును; త్రవ్విరి= త్రవ్వారు.

తాత్పర్యం: జనమేజయా! భూతములకు తృప్తిచేసి, మహాబల సంపన్నులైన సేవకులతో నిధులున్నచోటు త్రవ్వండని ఆజ్ఞాపించాడు. ఆ సేవకులు ఉత్సాహం ఉరకలు వేస్తుండగా అరుస్తూ ఆ చోటును త్రవ్వారు.

క. త్రవ్వినఁ బ్రభలెల్ల దెసల। నివ్వటిలఁగ వెలుంగుచుండె నిధి; యనిలజుఁడుం
గవ్వడియుఁ గవలు నలరఁగ। నవ్వసుధాధిపుఁడు దాని కర్చన లిచ్చెన్. 154

ప్రతిపదార్థం: త్రవ్వినన్= త్రవ్వగా; ప్రభలు= కాంతులు; ఎల్లన్+దెసలన్= దిక్కులన్నిటా; నివ్వటిలఁగన్= వ్యాపించగా; నిధి; వెలుఁగుచున్+ఉండెన్= ప్రకాశిస్తూ ఉన్నది; ఆ+వసుధా= ఆ భూమియొక్క; అధిపుఁడు= అధిపతి; అనిలజుఁడున్= వాయువునకు జనించినవాడునూ, భీముడునూ; కవ+వడి+ఉన్= అర్జునుడునూ; కవలున్= నకుల సహదేవులునూ; అలరఁగన్= సంతోషించగా; దానికిన్= ఆ నిధికి; అర్చనలు+ఇచ్చెన్= పూజలు చేశాడు.

తాత్పర్యం: త్రవ్వేటప్పటికి అన్ని దిక్కులందునూ వెలుగులు విరజిమ్ముతూ నిధి ప్రకాశిస్తూ ఉన్నది. అప్పుడు భీమార్జున నకుల సహదేవులు ఉబ్బిపోతుండగా ధర్మరాజు దానికి పూజలు చేశాడు.

వ. అట్లు వివిధ విద్యానిధి యగు వేదవ్యాసుండు సన్నిధిచేసి, యప్పెన్నిధి సాధించిన, నా ధర్మనందనుం డా పరాశర నందను పాదంబులకు దండప్రణామంబు చేసి, కేలు మొగిడ్చి ఫాలతలంబునం గదియించి, వినయావనతుండై యున్న నన్నరేంద్రు నమ్మునీంద్రుండాలింగ నాశీర్వాదంబుల నాదరించి, యామంత్రణంబు సేసి యంతర్హితుం డయ్యెఁ; నమ్మానవనాథుండు, 155

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; వివిధ= అనేక విధాలైన; విద్యా= విద్యలయొక్క; నిధి= గని; అగు= అయిన; వేదవ్యాసుండు; సన్నిధి+చేసి= ప్రత్యక్షమై; ఆ+పెను+నిధిన్= ఆ గొప్పనిధిని; సాధించినన్= సాధించగా; ఆ ధర్మనందనుండు= ఆ యముడి కుమారుడైన ధర్మరాజు; ఆ పరాశరనందను= ఆ పరాశరుడి కుమారుడైన వ్యాసుడియొక్క; పాదంబులకున్= కాళ్ళకు; దండప్రణామంబు= సాష్టాంగ నమస్కారం; చేసి; కేలు మొగిడ్చి= చేతులు జోడించి; ఫాలతలంబునన్= నుదుటను; కదియించి= చేర్చి; వినయ= వినయంచేత; అవనతుండు+ఐ= వంగినవాడై; ఉన్నన్= నిలవగా; ఆ నర+ఇంద్రున్= ఆ రాజును; ఆ ముని+ఇంద్రుండు= ఆ మునిశ్రేష్ఠుడు; ఆలింగన= కౌగిలింతచేతనూ; ఆశీర్వాదంబులన్= దీవనలచేతనూ; ఆదరించి= గౌరవించి; ఆమంత్రణంబు+చేసి= వీడ్కొని; అంతర్హితుండు= అదృశ్యుడు; అయ్యెన్= అయ్యాడు; ఆ మానవనాథుండు= ఆ నరపతి-ధర్మరాజు.

తాత్పర్యం: ఆ విధంగా అనేక విద్యాఖని అయిన వ్యాసుడు ప్రత్యక్షమై ఒక మహానిధిని సాధించాడు. అపుడు ధర్మరాజు ఆ మహర్షికి సాష్టాంగనమస్కారం చేసి, చేతులు జోడించి నుదుట చేర్చి వినయం ప్రకటించాడు. అంతట ఆ మహర్షి

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధర్మరాజును కౌగిలించుకొని, దీవనలు కురియించి, సెలవిచ్చి అదృశ్యుడయ్యాడు. అప్పుడు ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. శకట ఖరోష్ట్ర ఘోటక కుంజరంబు ల। నేక సహస్రంబు లెలమి సంఘ
టించి, భారంబు లెత్తించి భారవహత్వ। దక్షజనుల్ పెక్కులక్ష లర్థిఁ
గదిసి యే నే నని కడఁగి మోపఁగ యాగ। నిలయంబు కలపయుఁ గలశములును
నలఁకులు గాఁగులు నాదిగాఁగల భాండ। ములును బీఠములు శయ్యలును ఱోళ్ళు

తే. రోఁకళులుఁ జట్టువంబులు స్రుక్సువాజ్య। పాత్ర దండకమండలు దాత్రములును
లోనుగాఁ గల వస్తువుల్ శుద్ధి హేమ। మయము లొక్కట నడపించె మనుజనాథ! 156

ప్రతిపదార్థం: మనుజనాథ!= నరపతీ!, జనమేజయా!; శకట= బండ్లు; ఖర= గాడిదలు; ఉష్ట్ర= ఒంటెలు; ఘోటక= గుఱ్ఱాలు; కుంజరంబులు= ఏనుగులు; అనేక సహస్రంబులు= వేలకు వేలు; సంఘటించి= సమకూర్చి; భారంబులు= బరువులు; ఎత్తించి; భారవహత్వ= బరువులు మోచుటయందు; దక్ష= సమర్థులయిన; జనుల్= జనులు; పెక్కు లక్షలు= లక్షలకొలది మంది; అర్థిన్= ప్రీతితో; కదిసి= సమీపించి; ఏను= నేను; ఏను= నేను; అని కడఁగి= అని పూనుకొని; మోపఁగన్= మోయగా; యాగనిలయంబు= యజ్ఞశాలయొక్క; కలపయున్= కలపయూ; కలశములును= కుండలు; అలఁకులు= అలుకు కుండలూ; కాఁగులు= కాగులూ; ఆదిగాన్+కల= మొదలైన; భాండములును= పాత్రలునూ; పీఠములు= పీటలూ; శయ్యలును= మంచములును; ఱోళ్ళు; రోఁకళులు= రోకళ్ళూ; చట్టువంబులు= తెడ్లు; స్రుక్= చంద్రకొయ్యచే నిర్మించబడి మఱ్ఱియాకువలె ఉండి భుజమంత పరిమాణంగల యజ్ఞ పాత్రలూ; స్రువ= స్రుక్కువంటిదేయై చేతియంతటి పరిమాణంగల పాత్రలూ; ఆజ్యపాత్ర= నేతికుండలూ; దండ= మునులు ధరించే కర్రలూ; కమండలు= కమండలాలూ; దాత్రములును= కొడవళ్ళూ; లోను+కాన్= మొదలుగా; కలుగు= కలిగిన; వస్తువుల్= వస్తువులు; శుద్ధ= పరిశుద్ధమైన; హేమ= బంగారంతో; మయములు= నిర్మింపబడినవి; ఒక్కటన్= ఒక్కసారిగా; నడపించెన్= సాగిపోనిచ్చాడు.

తాత్పర్యం: జనమేజయా! వేలకొలది బళ్ళనూ, గాడిదలనూ, ఒంటెలనూ, గుఱ్ఱాలనూ, ఏనుగులనూ ఉత్సాహంతో సమకూర్చి బరువులెత్తించాడు. బరువులు మోయటంలో మొనగాళ్ళైన అనేక లక్షలమంది నేనూ నేనూ అంటూ పూనుకొని మోయగా యాగశాలలో కలపా, బంగారంతో చేసిన కలశాలూ, అలుకు కుండలూ, కాగులూ మొదలైన పాత్రలు, పీటలూ, మంచాలూ, రోళ్ళూ, రోకళ్ళూ, నేతి గిన్నెలూ, దండాలూ, కమండలాలూ, కొడవళ్ళూ మొదలైన వస్తువులన్నీ శుద్ధబంగారంతో చేయించి ఒక్కసారిగా నడిపించినాడు.

చ. మఱియును సన్నిధిం గల సమంచిత కాంచనరాశి బండులం
బెఱికల మోపులం గొలఁది వెట్టఁగఁ బెక్కగు బారువుల్, జనుల్
వెఱఁగుపడంగ ఖేచరులు వెక్కస మందఁగ, శత్రుకోటికిన్
వెఱ పొనరించువార్త పృథివిం బరఁగన్ నడపించె భూవరా! 157

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; మఱియున్= ఇంకనూ; సన్నిధిన్= దగ్గర; కల= ఉన్న; సమంచిత= మిక్కిలి మేలైన; కాంచన= బంగారంయొక్క; రాశిన్= గుట్టను; కొలఁది+పెట్టఁగన్= లెక్కించటానికి; పెక్కు+అగు= మించిపోయిన; బారువుల్= ఇరవై మణుగుల తూకం గలవాటిని; జనులు= ప్రజలు; వెఱఁగుపడంగన్= ఆశ్చర్యపడగా; ఖేచరుల్= దేవతలు; వెక్కసము+అందఁగన్= ఆశ్చర్యం పొందగా; శత్రు= శత్రువులయొక్క; కోటికిన్= సమూహానికి; వెఱవు= భయం; ఒనరించు= కలిగించే; వార్త; పృథివిన్= భూమియంతటా; పరఁగన్= వ్యాపించగా; బండులన్= బళ్ళలోనూ; పెఱికెలన్= జంతువుల వీపుమీద రెండు ప్రక్కలా వ్రేలాడే సంచులలోనూ; మోపులన్= మూటలలోనూ; నడిపించెన్= తీసికొని వెళ్ళేటట్లు చేశాడు.

తాత్పర్యం: రాజా! ఇంకా తనకు దగ్గర ఉన్న బంగారపు గుట్టలోనుండి లెక్కించటానికి శక్యంకాని బారువుల కొలది బంగారాన్ని బళ్ళలోనూ, పెరికలలోనూ, మూటలలోనూ తీసికొని వెళ్ళేటట్లు చేశాడు. దీనిని చూచి ప్రజలూ, దేవతలూ ఆశ్చర్యపడ్డారు. శత్రువులు భయపడ్డారు.

ఆ. ఏరునేల కొలఁది నెడనెడ విడియుచుఁ। బోవవలసి యుండె భూరి భార
వహుల డప్పి యెఱుఁగువాఁడగు నా ధర్మ। నందనునకు ధరణినాథవర్య! 158

ప్రతిపదార్థం: ధరణినాథ= రాజులలో; వర్య!= శ్రేష్ఠుడా!; భూరి= పెద్ద; భార= బరువులను; వహుల= మోసేవారి యొక్క; డప్పి= ఆయాసం; ఎఱుఁగువాఁడు= తెలిసినవాడు; అగు= అయిన; ఆ ధర్మనందనునకున్= ఆ ధర్మరాజునకు; ఏరు నేల= రెండుకోసుల దూరం; కొలఁదిన్= లెక్క చొప్పున; ఎడన్+ఎడన్= అక్కడక్కడా; విడిది చేయుచున్= మజిలీ చేస్తూ; పోవవలసి= వెళ్ళవలసి; ఉండెను= ఉన్నది.

తాత్పర్యం: రాజేంద్రా! పెద్ద పెద్ద బరువులు మోసేవారికి బడలికా, దప్పికా కలుగుతాయి. ఈ విషయం తెలిసిన ధర్మరాజు ప్రతి రెండు కోసులకూ అక్కడక్కడా మజిలీ చేస్తూ వెళ్ళవలసి వచ్చింది.

వ. అంత నక్కడఁ గృష్ణుండు. 159

ప్రతిపదార్థం: అంతన్= ఆ సమయాన; అక్కడన్= ద్వారకలో; కృష్ణుండు= శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: అక్కడ ద్వారకలో శ్రీకృష్ణుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ద్వారకానగరమునకుఁ దన్నుఁ బుచ్చు। నపుడు ధర్మజుఁ డశ్వమేధాధ్వరంబు
సమయ మగుట ప్రతీక్షించి సకల బంధు। యుక్తముగ రమ్మనిన మధురోక్తి యూఁది. 160

ప్రతిపదార్థం: ధర్మజుఁడు= ధర్మరాజు; ద్వారకానగరమునకున్= ద్వారకాపట్టణానికి; తన్నున్= తనను; పుచ్చు+అపుడు= సాగనంపేటప్పుడు; అశ్వమేధ+అధ్వరంబు= అశ్వమేధయాగంయొక్క; సమయము= సమయం; అగుట= కావటం; ప్రతీక్షించి= ఎదురుచూచి; సకల= సమస్తమైన; బంధు= చుట్టాలతో; యుక్తము+కన్= కూడికొని ఉండేటట్లుగా; రమ్ము= రా; అనిన= చెప్పిన; మధుర= ఇంపైన; ఉక్తి= మాట; ఊఁది= విశ్వసించి.

తాత్పర్యం: ధర్మరాజు ద్వారకకు తనను పంపేటప్పుడు తనతో 'అశ్వమేధయాగ సమయంకొరకు ఎదురుచూస్తూ చుట్టపక్కాలందరితో కలిసిరమ్ము!' అని చెప్పిన మాటను విశ్వసించి.(తరువాతి వచనంతో అన్వయం.)

శ్రీకృష్ణుండు సకలబంధు సహితుండై కరినగరంబునకు వచ్చుట (సం.14-65-1)

వ. అరసికొనియుండి యప్పాండవాగ్రజుండు యాగంబున కుద్యోగంబు చేయుట చారులు చెప్ప నాకర్ణించి, కుతూహ లోన్నిద్రుండై, బలభద్ర సాత్యకి కృతవర్మ ప్రద్యుమ్న చారు (ఢే) దేష్ణ సాంబాది యాదవ సమేతంబుగా వసుదేవదేవకీ సమనుజ్ఞాతుండై, సుభద్రం దొడ్కొని కరినగరంబున కరుగుదెంచిన, ధృతరాష్ట్రుండును గాంధారియు గొంతియుం బనుప నుత్సుకుండై యుయుత్సుండు విదురుం బురస్కరించికొని యప్పాంచజన్యధరు నెదుర్కొని, పరమ భక్తిం దోడ్కొని వచ్చిన. 161

ప్రతిపదార్థం: అరసికొని= నిరీక్షిస్తూ; ఉండి; ఆ పాండవ= ఆ పాండవులయందు; అగ్రజుండు= పెద్దవాడు, ధర్మరాజు; యాగంబునకున్= అశ్వమేధయాగానికి; ఉద్యోగంబు చేయుట= ప్రయత్నించటం; చారులు= గూఢచారులు; చెప్పన్= చెప్పగా; ఆకర్ణించి= విని; కుతూహల= సంతోషంచేత; ఉన్నిద్రుండు= ప్రకాశించేవాడు; ఐ= అయి; బలభద్ర= బలరాముడు; సాత్యకి; కృతవర్మ; ప్రద్యుమ్న= ప్రద్యుమ్నుడు; చారు (ఢే)దేష్ణ= చారు (ఢే) దేష్ణుడు; సాంబ= సాంబుడు; ఆది= మొదలైన; యాదవ= యాదవులతో; సమేతంబు+కాన్= కూడికొనియుండేటట్లుగా; వసుదేవ= వసుదేవుడిచేత; దేవకీ= దేవకిచేత; సమ్+అనుజ్ఞాతుండు+ఐ= బాగుగా అనుమతి ఇవ్వబడినవాడై; సుభద్రన్= సుభద్రను; తోడ్కొని= వెంటబెట్టుకొని; కరినగరంబునకున్= హస్తినాపురానికి; అరుగుదెంచినన్= రాగా; ధృతరాష్ట్రుండును; గాంధారియున్= గాంధారియును; గొంతియున్= కుంతియు; పనుపన్= పంపగా; ఉత్సుకుండు= ఉత్సాహం కలవాడై; యుయుత్సుండు; విదురున్= విదురుడిని; పురస్కరించికొని= ముందుంచుకొని; ఆ పాంచజన్య= పాంచజన్యమనే శంఖాన్ని; ధరున్= ధరించినవాడిని, కృష్ణుడిని; ఎదుర్కొని= ఎదురుగా పోయి; పరమ= మిక్కిలి; భక్తిన్= భక్తితో; తోడ్కొని= తీసికొని; వచ్చినన్= రాగా.

తాత్పర్యం: అశ్వమేధయాగసమయం కొరకు నిరీక్షిస్తూ ధర్మరాజు దానిని చేయటానికి ప్రయత్నిస్తున్నాడని గూఢచారులు చెప్పినమాట విని కృష్ణుడు ఎంతో సంతోషించాడు. వెంటనే బలరాముడు, సాత్యకి మొదలైన యాదవులతో సుభద్రను వెంటబెట్టుకొని హస్తినాపురానికి వచ్చాడు. అతడిరాక విన్న గాంధారీ ధృతరాష్ట్రులూ, కుంతీ, అతడిని తీసికొని రావటానికి యుయుత్సుడిని పంపారు. అతడు ఉత్సాహంతో విదురుడు ముందు నడుస్తుండగా ఎదురుగా వెళ్ళి శ్రీకృష్ణుడిని మహాభక్తితో తీసికొని రాగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. మున్ను ధృతరాష్ట్రుకడకు నా వెన్నుఁ డేఁగి। యతని గాంధారిఁ బ్రణతి పూర్వాతి మధుర
వాక్యములఁ బ్రీతి నొందించి వచ్చి, గొంతిఁ। గాంచి ప్రణమిల్ల నద్దేవి గౌఁగిలించి. 162

ప్రతిపదార్థం: ఆ వెన్నుఁడు= ఆ విష్ణువు, కృష్ణుడు; మున్ను= ముందు; ధృతరాష్ట్రు= ధృతరాష్ట్రుడియొక్క; కడకున్= దగ్గరకు; ఏఁగి= వెళ్ళి; అతనిన్= అతడినీ; గాంధారిన్= గాంధారినీ; ప్రణతిపూర్వ= నమస్కారపూర్వకమైన; అతి= మిక్కిలి; మధుర= ఇంపైన; వాక్యములన్= మాటలతో; ప్రీతిన్+ఒందించి= సంతోషింపజేసి; వచ్చి; గొంతిన్= కుంతిని; కాంచి= చూచి; ప్రణమిల్లన్= నమస్కరించగా; ఆ+దేవి= ఆ దేవేరి; కౌఁగిలించి= కౌగిలించుకొని.

తాత్పర్యం: కృష్ణుడు ముందుగా ధృతరాష్ట్రుడి దగ్గరకు వెళ్ళి, అతడినీ, గాంధారినీ నమస్కారపూర్వకంగా ఇంపైన మాటలతో సంతోషింపజేశాడు. తరువాత కుంతిని చూచి ఆమెకు నమస్కరించాడు. ఆమె అతడిని కౌగిలించుకొని. (తరువాతి వచనంతో అన్వయం).

వ. పెక్కుభంగుల దీవించె; బలదేవాదులుం దగిన తెఱంగున నప్పాండురాజ మహిషిం గని; రక్కులపాలికా తిలకంబు పులకంబులం బెరిఁగిన మేనితో మాననీయచరిత్రుం డగు నద్దేవకీపుత్త్రు సంభావించి. 163

ప్రతిపదార్థం: పెక్కు= అనేకములైన; భంగులన్= విధాలుగా; దీవించెన్= దీవించింది; బలదేవ= బలరాముడు; ఆదులున్= మొదలగువారును; తగిన; తెఱంగునన్= విధంగా; ఆ+పాండురాజు= ఆ పాండురాజుయొక్క; మహిషిన్= పట్టపురాణిని; కనిరి= దర్శించారు; ఆ+కులపాలికా= ఆ ఉత్తమ కులశీలములు కలిగిన స్త్రీలలో; తిలకంబు= శ్రేష్ఠురాలు; పులకంబులన్= గగుర్పాటులతో; పెరిఁగిన= పొంగిన; మేనితోన్= శరీరంతో; మాననీయ= గౌరవించదగిన; చరిత్రుండు= నడవడి కలవాడు; అగు= అయిన; ఆ+దేవకీ= ఆ దేవకియొక్క; పుత్త్రున్= కుమారుడిని, కృష్ణుడిని; సంభావించి= గౌరవించి.

తాత్పర్యం: (కుంతి) అనేక విధాలుగా దీవించింది. బలరాముడు మొదలైనవారుకూడా తగినరీతిగా ఆమెను దర్శించారు. కులస్త్రీ రత్నమైన కుంతీదేవి గగుర్పాటులతో శరీరం ఉప్పొంగగా పూజ్య చరిత్రుడైన శ్రీకృష్ణుడిని గౌరవించి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ప్రమద మెసఁగ విదురుఁ బనిచి, సముచిత మగు నర్చనంబు సంకర్షణ పూ
ర్వము గాఁగ నడపి యదు నిక। రము నర్చలు సంభృతాదరంబున నడపెన్. 164

ప్రతిపదార్థం: ప్రమదము= సంతోషం; ఎసఁగన్= అతిశయించగా; విదురున్= విదురుడిని; పనిచి= పంపి; సముచితము+అగు= మిక్కిలి తగినదైన; అర్చనంబు= పూజ; సంకర్షణ= బలరాముడితో; పూర్వము= మొదలు; కాఁగన్= అగునట్లుగా; నడపి= జరిపించి; సంభృత= పరిపూర్ణమైన; ఆదరంబునన్= ఆదరంతో; యదు= యాదవులయొక్క; నికరము= సమూహం యొక్క; అర్చలు= పూజలు; నడపెన్= జరిపించాడు.

తాత్పర్యం: మహా సంతోషంతో విదురుడిని పంపి, బలరాముడితో మొదలుపెట్టి తగిన విధంగా పూజలు జరిపించింది. అట్లే మిగిలిన యాదవులకు కూడా ఆదరం అతిశయించగా సత్కారాలు జరిపించింది.

వ. సుభద్ర తన్నుం గనినం బరమప్రియంబున గారవించి, యభ్యంతర మందిరంబునకుం బుచ్చెఁ; బద్మనాభ ప్రభృతులగు నా బంధుజనంబు నెల్లను నగరుచేరువ శోభిల్లుమందిరంబుల విడియింప యుయుత్సునియోగించె; నట్లయ్యందఱు నభినందితులై యున్న సమయంబున. 165

ప్రతిపదార్థం: సుభద్ర; తన్నున్= తనను; కనినన్= దర్శింపగా; పరమ= మిక్కిలి; ప్రియంబునన్= ప్రేమతో; గారవించి= ఆదరించి, లాలించి; అభ్యంతర= లోపలి; మందిరంబునకున్= ఇంటికి, అంతఃపురమునకు; పుచ్చెన్= పంపారు; పద్మనాభ= శ్రీకృష్ణుడు; ప్రభృతులు= మొదలైనవారు; అగు= అయిన; ఆ+బంధుజనంబున్= చుట్టాల సమూహాన్ని; ఎల్లను= అంతటినీ; నగరు= అంతఃపురం; చేరువన్= దగ్గర; శోభిల్లు= ఒప్పుచున్న; మందిరంబులన్= భవనాలలో; విడియింపన్= దిగునట్లు చేయగా; యుయుత్సున్= యుయుత్సుడిని; నియోగించెన్= ఆజ్ఞాపించింది; అట్లు= ఆ విధంగా; ఆ+అందఱున్= ఆ అందరూ; అభినందితులు= సంతోషపెట్టబడినవారు; ఐ= అయి; ఉన్న; సమయంబునన్= సమయంలో

తాత్పర్యం: సుభద్ర తనను చూడటానికి రాగా, కుంతి ఆమెను ఆదరించి అంతఃపురానికి పంపింది. శ్రీకృష్ణుడు మొదలైన చుట్టాలను, అంతఃపురానికి దగ్గరగా ఉన్న భవనాలలో బసచేయించటానికి యుయుత్సుడిని ఆజ్ఞాపించింది. ఈ విధంగా యాదవులందరూ సంతోషపెట్టబడినవారై ఉన్న సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం)

ఉ. ఉత్తర పుణ్యగర్భముననుండి భవజ్జనకుండు పూరువం
శోత్తరుఁ డాది రాజగుణయోగి పరిక్షితుఁ డుద్భవించినన్
జిత్త మెలర్పఁ బుత్త్రుఁడని చెప్పిరి వెల్పలివారి కింటిలో
నత్తఱి నున్న వృద్ధ సతు; లార్చె జనం బఖిలంబు నుబ్బునన్. 166

ప్రతిపదార్థం: ఉత్తర= ఉత్తరయొక్క; పుణ్య= పవిత్రమైన; గర్భమునన్+ఉండి= గర్భంనుండి; భవత్= మీయొక్క తండ్రి; పూరువంశ= పూరుడియొక్క కులమందు; ఉత్తరుఁడు= శ్రేష్ఠుడు; ఆదిరాజ= పూర్వ మహారాజులయొక్క; గుణ= సద్గుణాలయొక్క; యోగి= కూడిక కలవాడు; పరిక్షితుఁడు; ఉద్భవించినన్= పుట్టగా; ఇంటిలోన్= పురిటింటిలో; ఆ+తఱిన్= ఆ సమయాన; ఉన్న; వృద్ధ సతులు= ముదుసలులగు ఉత్తమ స్త్రీలు; చిత్తము= మనస్సు; ఎలర్పన్= సంతోషించగా; వెల్పలివారికిన్= బయట ఉన్నవారికి; పుత్త్రుడు= కొడుకు; అని; చెప్పిరి= చెప్పారు; జనంబు= జనసమూహం; అఖిలంబున్= అంతా; ఉబ్బునన్= సంతోషంతో; ఆర్చెన్= కేకలు పెట్టింది.

తాత్పర్యం: పూరువంశంలో శ్రేష్ఠుడూ, పూర్వమహారాజులవలె సకల సద్గుణ సంపన్నుడూ, మీ తండ్రీ అయిన పరిక్షితుడు ఉత్తరకు జన్మించాడు. వెంటనే పురిటింట్లో అప్పుడున్న వృద్ధాంగనలు కొడుకు పుట్టాడని బయటఉన్న జనానికి చెప్పారు. ఆ జనమంతా సంతోషంతో కేకలుపెట్టింది.

క. బాలుఁడు మృతజాతుం డని। యాలోనన యేడ్పు బెరయ, నలమట నచ్చో
నాలలన లుగ్గడించినఁ। దేలిరి శోకమున జనులు ధీరవిచారా! 167

ప్రతిపదార్థం: ధీర= గంభీరమైన; విచారా!= ఆలోచనలు కలవాడా!; ఆ+లోనన్+అ= అంతలోనే; బాలుఁడు= బాలుడు; మృతజాతుఁడు= చనిపోయి పుట్టినవాడు; అని; ఏడ్పు= ఏడ్పులూ; బెరయన్= రేగగా; అచ్చోన్= అక్కడనే; అలమటన్= దుఃఖంతో; ఆ= మొదట శుభవార్త చెప్పిన; లలనలు= స్త్రీలు; ఉగ్గడించినన్= ప్రకటించగా; జనులు; శోకమునన్= దుఃఖంలో; తేలిరి.

తాత్పర్యం: జనమేజయా! అంతలోనే చచ్చిన బిడ్డడు పుట్టాడంటూ ఏడ్పులు రేగాయి. మొదట శుభవార్త చెప్పిన ఆ వృద్ధ స్త్రీలు దుఃఖంతో అశుభవార్త ప్రకటించేటప్పటికి జనులందరూ దుఃఖంలో మునిగిపోయారు.

వ. అత్తఱి రోదనధ్వనులు గలయం జెలంగిన విషాద వేదనాయత్తం బయిన చిత్తాంగంబుతో శౌరి సాత్యకి యనుగమనంబు సేయ, సత్వరంబుగా గొంతి యున్నెడకుం జనుదెంచె; నప్పు డా కుంతిభోజనందనయు ద్రౌపదియు సుభద్రయు నార్తనాదంబు లెసంగం దనకడకు రయంబునరా నెదుర నయ్యదువీరుండు గాంచి, శోకసమాకుల మానసుం డయ్యె; నప్పాండురాజపత్ని పురుషోత్తముతో డగ్గుత్తిక నెలుంగు దవుల నిట్లనియె. 168

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= ఆ సమయమున; రోదనధ్వనులు= దుఃఖధ్వనులు; కలయన్= అంతటనూ; చెలంగినన్= వ్యాపించగా; విషాద= దుఃఖంవలన కలిగిన; వేదనా= బాధకు; ఆయత్తంబు+ఐన= వశమైన; చిత్త+అంగంబు+తోన్= మనస్సుతో, శరీరంతో; శౌరి= కృష్ణుడు; సాత్యకి; అనుగమనంబు= వెంట రావటం; చేయన్= చేయగా; సత్వరంబు+కాన్= త్వరగా; గొంతి= కుంతి; ఉన్న= ఉండిన; ఎడకున్= చోటికి; చనుదెంచెన్= వచ్చాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ కుంతిభోజ= ఆ కుంతిభోజుడియొక్క; నందనయున్= కూతురునూ; కుంతియూ; ద్రౌపదియున్; సుభద్రయున్; ఆర్తనాదంబులు= శోకధ్వనులు; ఎసంగన్= అధికం

కాగా; తనకడకున్= తన దగ్గరకు; రయంబునన్= వేగంగా; రాన్= రాగా; ఎదురన్= ఎదుట; ఆ+యదు= ఆ యదువంశమునందు; వీరుండు= వీరుడు; కాంచి= చూచి; శోక= శోకంచేత; సమాకుల= మిక్కిలి కలతచెందిన; మానసుండు= మనస్సు కలవాడు; అయ్యెన్= అయ్యాడు; ఆ+పాండురాజు= ఆ పాండురాజుయొక్క; పత్ని= భార్య-కుంతి; పురుషోత్తముతోన్= శ్రీకృష్ణుడితో; డగ్గుత్తికన్= దుఃఖంవలన కలిగిన కంపమునందు; ఎలుంగు= గొంతు; తగులన్= చిక్కుకొనగా; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: ఆ సమయంలో ఏడ్పులు పెడబొబ్బలు అంతటా వ్యాపించాయి. వాటిని విన్న శ్రీకృష్ణుడి మనస్సూ, శరీరమూ బాధకు లోనయ్యాయి. సాత్యకి వెంటనడచి వస్తుండగా అతడు కుంతి ఉన్నచోటికి వెళ్ళాడు. అప్పుడు కుంతీ, ద్రౌపదీ, సుభద్రా పెద్దపెట్టున ఏడుస్తూ దగ్గరకు రాగా, ఎదుట ఉన్నవారిని చూచిన అతడి మనస్సు దుఃఖంచేత ఎంతో కలత చెందింది. అంత కుంతి అతడితో ఈ విధంగా పలికింది.

పరిక్షిత్ప్రాణదానంబునకై కుంతీసుభద్రలు కృష్ణుఁ బ్రార్థించుట (సం.14-65-25)

క. 'గతి నీవె నాకు, మత్సం । తతికిని; నీ యల్లుఁగుఱ్ఱతనయుఁడు పుట్టెన్
మృతుఁడై క్రూరుండగు గరు । సుతుని యిషీకాస్త్ర వహ్నిఁ జూఁడిన కతనన్. 169

ప్రతిపదార్థం: నాకున్= నాకూ; మత్= నా యొక్క; సంతతికిని= సంతానానికీ; నీవు+ఎ= నీవే; గతి= దిక్కు; క్రూరుండు= కఠినుడు; అగు= అయిన; గురు= ద్రోణాచార్యుడియొక్క; సుతుని= కొడుకు, అశ్వత్థామయొక్క; ఇషీక+అస్త్ర= మంత్రపూర్వకంగా, బ్రహ్మాస్త్రాన్ని ప్రవేశపెట్టిన రెల్లుకాడనుండి పుట్టిన; వహ్నిన్= అగ్నిచేత; చూఁడిన= మాడిన; కతనన్= కారణంగా; నీ= నీయొక్క; అల్లు+కుఱ్ఱ= ముద్దుల మేనల్లుడియొక్క; తనయుఁడు= కొడుకు; మృతుఁడు= చనిపోయినవాడు; ఐ= అయి; పుట్టెన్= పుట్టాడు.

తాత్పర్యం: 'నాకూ నా సంతానానికీ నీవే దిక్కు. కఠినాత్ముడైన అశ్వత్థామ ప్రయోగించిన ఇషీకాస్త్రంనుండి పుట్టిన అగ్నిచేత మాడి, నీ ముద్దుల మేనల్లుడి కొడుకు చచ్చిపోయి జన్మించాడు.

విశేషం: ఇషీక+అస్త్రము= ఇషీకాస్త్రము. ఇషీకం అంటే రెల్లు. అశ్వత్థామ సౌప్తికవధ చేశాడు. ద్రౌపదిమాటమీద భీముడు అతడిమీదికి వెళ్ళాడు. వెంటనే కృష్ణార్జునులుకూడా వెళ్ళారు. తన కెటూ చావు మూడిందనుకొని, అశ్వత్థామ ఒక రెల్లుపుల్ల తీసికొని దానిలో మంత్రపూర్వకంగా బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రవేశపెట్టి ప్రయోగించాడు. ప్రయోగించేటప్పుడు లోకం అపాండవం కావాలని పలికాడు. అర్జునుడుకూడా బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడు. లోకం భయాకులమైనది. వ్యాసుడు అశ్వత్థామ రోషాన్ని నివారించి, అతడి ప్రతిజ్ఞ వమ్ము అయ్యేటట్లు చేయాలని ప్రయత్నించాడు. కాని, అశ్వత్థామ ఆ మహర్షిమాటలు వినలేదు. తన అస్త్రం పాండవుల ప్రేమకు యోగ్యులయిన స్త్రీల గర్భాలకు హానిచేసి శాంతి పొందుతుందని అన్నాడు. అప్పుడు అభిమన్యుడిభార్య ఉత్తర గర్భవతియై ఉన్నది. ఆమె బిడ్డను తప్పక రక్షిస్తానని కృష్ణుడు ప్రతిజ్ఞ చేశాడు. (ఈ కథంతా సౌప్తికపర్వ ద్వితీయాశ్వాస ప్రారంభంలో ఉన్నది).

సీ. దేవకీపుత్త్ర! సంజీవితుఁ జేయవే । యబ్బాలు; నద్దారుణాస్త్ర సంప్ర
యోగంబు నపుడు కృపాగరిష్ఠుండ వై । చేసితి ప్రతిన 'గాచెద నవశ్య
మును నుత్తరాగర్భజనితు నే' నని; బాలు । బ్రదుకుతోడిద నాదు బ్రదుకు; ద్రుపద
తనయా సుభద్రలు, ధర్మజుం డనుజు, లా । శిశువు సంజీవితుఁ జేయకున్న

ఆ. బ్రదుక; రన్వయమున కుదక పిండ ప్రదా। నంబు లెడలు; మత్స్యనందనయును
నూఱడింపఁ బడియె నొకనాఁడు నీ చేత;। దాని యార్తి కరుణఁ దలుఁగవయ్య! 170

ప్రతిపదార్థం: దేవకీ= దేవకియొక్క; పుత్ర!= కుమారా!, కృష్ణా!; ఆ బాలున్= ఆ బాలుడిని; సంజీవితున్= తిరిగి బ్రదికిన వాడినిగా; చేయవే!= చేయుమా!; ఆ దారుణ= ఆ భయంకరమైన; అస్త్ర= అస్త్రంయొక్క; సంప్రయోగంబు+అపుడు= ప్రయోగించిన సమయంలో; కృపా= దయచేత; గరిష్ఠుండవు= అధికుడవు; ఐ= అయి; నేను; అవశ్యమును= తప్పక; ఉత్తరా= ఉత్తరయొక్క; గర్భ= కడుపున; జనితున్= పుట్టినవాడిని; కాచెదన్= కాపాడుతాను; అని; ప్రతిన చేసితి(వి)= ప్రతిజ్ఞ చేశావు; నా+బ్రదుకు= నా బ్రదుకు; బాలు= బాలుడియొక్క; బ్రదుకుతోడిది+అ= బ్రదుకుతోనే ముడిపడి ఉన్నది; ద్రుపదతనయ= ద్రుపదుడి కూతురు, ద్రౌపది; సుభద్ర; ధర్మజుండు= ధర్మరాజు; అనుజులు= అతడి తమ్ముళ్ళు; ఆ+శిశువున్= ఆ నెత్తురు కందును; సంజీవితున్= తిరిగి బ్రదికిన వాడినిగా; చేయక+ఉన్నన్= చేయకుంటే; బ్రదుకరు; అన్వయమునన్= వంశంలో; ఉదక= నీటియొక్క; పిండ= శ్రాద్ధసమయాలలో పిండములయొక్క; ప్రదానంబులు= ఇచ్చుటలు; ఎడలున్= తొలగిపోతాయి; ఒకనాఁడు= ఒకప్పుడు; మత్స్య= మత్స్యులరాజయిన విరాటుడియొక్క; నందనయును= కూతురునూ; నీ చేతన్= నీ చేత; ఊఱడింపఁబడియెన్= ఓదార్చబడింది; దాని= ఆమెయొక్క; ఆర్తిన్= దుఃఖమును; కరుణన్= దయతో; తలుఁగుము+అయ్య!= పోగొట్టవయ్యా!

తాత్పర్యం: కృష్ణా! ఆ బాలుడిని నీవు తిరిగి బ్రదికించుము. భయంకరమైన బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించినపుడు 'నేను తప్పకుండా ఉత్తర కడుపున పుట్టిన బిడ్డను కాపాడుతా'నని ప్రతిజ్ఞ చేశావు. బాలుడు బ్రదికితే నేను బ్రదుకుతాను. అతడు తిరిగి బ్రదుకకపోతే, ద్రౌపదీ, సుభద్రా, పాండవులూ బ్రదుకనే బ్రదుకరు. దానితో వంశంలో నీళ్ళు వదలటానికీ, పిండాలు పెట్టటానికీ ఎవ్వరూ ఉండరు. ఒకప్పుడు నీవు ఉత్తరను కూడా ఓదార్చావు. దయామయుడవై ఆమె గర్భశోకాన్ని తొలగించవయ్యా!

వ. దేవా! నీ విక్కులంబు గలిగించినవాఁడ; వింకను నీవ వీని బ్రదికింపవే' యని పల్కుచుం బుడమిఁబడిన గొంతి నగ్గోవిందుం డనునయ వచనంబుల నూరార్చి యెత్తె; నట్టియెడ సుభద్ర యమ్మహాత్మునితో నిట్లనియె.171

ప్రతిపదార్థం: దేవా!; నీవు; ఈ కులంబు= ఈ కులాన్ని; కలిగించినవాఁడవు= నిలిపినవాడవు; ఇంకను= కాబట్టి, ఇంకా; నీవు+అ= నీవే; వీనిన్= ఈ శిశువును; బ్రదికింపవే= బ్రదికించుమా; అని; పల్కుచున్= పలుకుతూ; పుడమిన్= భూమిమీద; పడిన= కూలిన; గొంతిన్= కుంతిని; ఆ+గోవిందుండు= ఆ కృష్ణుడు; అనునయ= ఓదార్పు కలిగించే; వచనంబులన్= మాటలతో; ఊరార్చి= ఉపశమం కలిగించి; ఎత్తెన్= లేవదీశాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; సుభద్ర; ఆ+మహా+ఆత్మునితోన్= ఆ గొప్ప ఆత్మకలవాడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= పలికింది.

తాత్పర్యం: దేవా! ఈ భరతవంశాన్ని నిలిపినవాడవు నీవే. కాబట్టి నీవే ఈ శిశువును కూడా బ్రదికించుము' అని పలుకుతూ కుంతి నేలమీద కూలిపోయింది. అప్పుడు కృష్ణుడు ఆమెను ఉపశమనం కలిగే మాటలతో ఓదార్చి.

క. 'గురుసుతుఁడు భీమునకు నై। పర మాస్త్రం బెత్తె; దాని ఫల మందంగా
నరుఁడును దత్పత్నియుఁ గాం। చిరి తుది; నీకు నేమి చెప్పుదుఁ బ్రభువా! 172

ప్రతిపదార్థం: ప్రభువా!= ప్రభూ!; గురు= ద్రోణాచార్యుడియొక్క; సుతుఁడు= కొడుకు-అశ్వత్థామ; భీమునకున్+ఐ= భీముడిని ఉద్దేశించి; పరమ= బ్రహ్మశిరమనే; అస్త్రంబు= అస్త్రాన్ని; ఎత్తెన్= ప్రయోగించాడు; తుదిన్= చివరకు; నరుఁడును= అర్జునుడునూ;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తత్= అతడియొక్క; పత్నియున్= భార్యయూ; దాని= ఆ అస్త్రప్రయోగంయొక్క; ఫలము= ఫలితాన్ని; అందంగాన్= పొందేటట్లుగా; కాంచిరి= దుర్గతి పాలయిరి; నేను; నీకున్= నీకు; ఏమి; చెప్పుదున్= చెప్పుతాను.

తాత్పర్యం: 'అశ్వత్థామ భీముడిమీద బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడు. కాని చివరకు అర్జునుడూ, అతడి భార్యనయిన నేనూ దాని ఫలితాన్ని పొందే దుర్గతి పాలయ్యాము. నీ కింకా ఏమి చెప్పగలను ప్రభూ!

క. నీ మఱఁది యా కొడుకుపైఁ । బ్రేమం బెప్పుడును బెంపఁ బ్రేలెడి; మనుమం
డీమెయి వమ్మయి పోయిన । నేమి యగునొ యెఱుఁగ; నీవ యెఱుఁగుదు దీనిన్. 173

ప్రతిపదార్థం: నీ= నీయొక్క; మఱఁది= బావమరది అర్జునుడు; ఆ= ఆ మరణించిన; కొడుకుపైన్= కొడుకుమీద, అభిమన్యుడిమీద; ప్రేమంబు= ప్రేమ; ఎప్పుడును=ఎల్లకాలమూ; పెంపన్= అతిశయించగా; ప్రేలెడిన్= సంతాపం చెందుతున్నాడు; మనుమండు= మనుమడు; ఈమెయిన్= ఈ విధంగా; వమ్ము+అయి= నాశమై; పోయినన్= పోగా; ఏమి; అగును+ఒ= అగునో; ఎఱుఁగన్= ఎరుగను; దీనిన్= దీనిని; నీవు+అ= నీవే; ఎఱుఁగుదు= తెలిసి ఉంటావు.

తాత్పర్యం: నీ బావమరది చనిపోయిన కన్నకొడుకు మీది తీపి రోజు రోజుకూ పెరుగుతూ ఉంటే తపించిపోతున్నాడు. మనుమడు కూడా ఈ విధంగా నాశనమైపోతే ఆయన ఏమైపోతాడో ఎరుగను. ఇది నీకే తెలియును.

సీ. ధర్మజుం డెమ్మెయి ధరియించు నెవ్వగ? । పవన నందనుఁడును గవలు నేమి
వెరవున నుపశమింతురు? దీని విను. దేవ! । యస్త్రప్రయోగంబు నపుడు నీవు
గురుసుతు నదలించి కుత్సిత! నిన్ను మో । ఘాస్త్రునిఁ జేసెద నంటి; దాన
నూఱడియుండుదు ముజ్జ్వల తేజ! నీ । మహితానుభావత మాకు నెల్లఁ

ఆ. దెలిసి యుండుఁ గాన యలుకము; సత్య ద । యాశ్రితాభిరక్ష లనఘ! నీకు
నైజములు; శిరః ప్రణతి నేను వేఁడెదఁ । గరుణ నిక్కులంబుఁ గాచికొనుము. 174

ప్రతిపదార్థం: ధర్మజుండు= ధర్మరాజు; ఏ+మెయిన్= ఏ విధంగా; నెఱ+వగ= పరిపూర్ణ దుఃఖం; ధరియించున్?= భరిస్తాడు?; పవన= వాయువుయొక్క; నందనుఁడును= కుమారుడైన భీముడు; కవలు= నకుల సహదేవులు; ఏమి= ఏ; వెరవునన్= ఉపాయంచేత; ఉపశమింతురు?= శాంతిస్తారు; దేవా!; దీనిన్= ఈ మాటను; విను= వినుము; అస్త్రప్రయోగంబు+అపుడు= బ్రహ్మ శిరోనామకాస్త్రమును ప్రయోగించినపుడు; నీవు; గురుసుతున్= ద్రోణాచార్య పుత్రుడిని, అశ్వత్థామను; అదలించి= బెదరించి; కుత్సిత= నీచుడా; నిన్నున్= నిన్ను; మోఘ= వ్యర్థమైన; అస్త్రునిన్= అస్త్రం కలవాడినిగా; చేసెదన్= చేస్తాను; అంటి(వి)= అన్నవాడవు; దానన్= ఆ నీమాటచేత; ఊఱడి= శాంతిపొంది; ఉండుదుము= ఉంటాము; ఉజ్జ్వల= ప్రకాశిస్తున్న; తేజ= శక్తి కలవాడా!; నీ= నీయొక్క; మహిత= గొప్ప; అనుభావత= మహిమ; మాకున్+ఎల్లన్= మా కందరికీ; తెలిసి= విదితమై; ఉండున్= ఉన్నది; కాన; అలుకము= భయపడము; అనఘ!= పాపరహితుడా!; సత్య= సత్యమూ; దయా= దయ; ఆశ్రిత= ఆశ్రయించిన వారియొక్క; అభిరక్ష= సంరక్షణం; నీకున్= నీకు; నైజములు= సహజములు; నేను; శిరస్+ప్రణతిన్= తలవంచి నమస్కరించి; వేఁడెదన్= ప్రార్థిస్తున్నదానను; కరుణన్= దయతో; ఈ+కులంబు= ఈ పాండవుల వంశాన్ని; కాచికొనుము= కాపాడుకొనుము.

తాత్పర్యం: ధర్మరాజు ఈ మహాదుఃఖాన్ని ఏ విధంగా భరిస్తాడు? భీమ నకుల సహదేవులు ఏ ఉపాయంచేత చిత్తస్వాస్థ్యాన్ని పొందుతారు? దేవా? ఈ మాట వినుము. అశ్వత్థామ బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించినపుడు నీవు అతడిని

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

బెదరించి 'నీచుడా! నీ అస్త్రాన్ని పనికిరాకుండా చేస్తాను' అని అన్నావు. ఆ మాటలవలన మా గుండెలు కుదుటబడ్డాయి. నీ మహిమ మాకు తేటతెల్లం కాబట్టి మేము భయపడము. సత్యమూ, దయా, ఆశ్రిత రక్షణమూ నీకు సహజగుణాలు. తలవంచి నమస్కరించి నిన్ను వేడుకొంటున్నాను. దయతో ఈ పాండవుల కులాన్ని కాపాడు కొనుము.

తే. **ఏ విధంబునఁ గోలుపోనీవు నీవు। పాండవుల; నీదు సన్నిధిఁ బాపకర్మ**
శీలుఁడైన యశ్వత్థామ గోలుపుచ్చె;। వాని నే మనఁ గలదు దుర్వారతేజ!' 175

ప్రతిపదార్థం: దుర్వార= నివారించశక్యంగాని; తేజ= ప్రతాపం, ప్రాభవం కలవాడా!; ఏవిధంబునన్= ఏ విధంగానూ; నీవు; పాండవులన్= పాండవులను; కోలుపోనీవు= భంగపడనియ్యవు; నీ+సన్నిధిన్= నీ దగ్గరనే; పాపకర్మ= పాపకార్యాలు చేయటమే; శీలుఁడు= స్వభావంగా కలవాడు; ఐన= అయిన; అశ్వత్థామ; కోలుపుచ్చెన్= భంగపడజేశాడు; వానిన్= వాడిని; అనన్= నిందించటానికి; ఏమి; కలదు= ఉన్నది.

తాత్పర్యం: దుర్వార ప్రతాపశాలీ! ఏ విధంగానూ నీవు పాండవులను భంగపడనియ్యవు. కాని నీ కన్నులయెదుటనే అశ్వత్థామ పాండవులను భంగపడజేశాడు. వాడిని నిందించటానికి ఇంకా ఏమున్నది?'

వ. **అని వెండియు.** 176

తాత్పర్యం: అని ఇంకనూ. (ఇట్లా అన్నది).

చ. **'భువనము లొక్కపెట్టఁ మృతిపొందిన జీవము లావహింపనే**
ర్తు; వలచినట్టులైన గుణరూఢుఁడు మేనమఱంది పౌత్త్రుఁ జా
వ విడుతె? వంత పెంపున నవారణ నీ యెదురం బ్రలాపముల్
వివిధము లే మొనర్చితిమి వెఱ్ఱులమై యిటు భక్తవత్సలా!' 177

ప్రతిపదార్థం: భక్త= భక్తులయందు; వత్సలా!= మమత కలవాడా!; భువనములు= లోకాలు (సర్వలోకాలలోనివారు అని అర్థం); ఒక్కపెట్టన్= ఒక్కసారిగా; మృతిపొందినన్= మరణించిననూ; జీవములు= ప్రాణాలు; ఆవహింపన్= కలిగించటానికి; నేర్తు(వు)= సమర్థుడవగుదువు; వలచిన= ఇష్టపడిన; అట్టులు+ఐనన్= అట్లయితే; గుణ= సద్గుణాలచేత; రూఢుఁడు= ప్రసిద్ధికెక్కినవాడు; మేనమఱంది= మేనత్తకొడుకు యొక్క, అర్జునుడియొక్క; పౌత్త్రున్= మనుమడిని; చావన్= మరణించగా; విడుతు(వు)+ఎ?= వదలుదువా?; వంత= దుఃఖంయొక్క; పెంపునన్= అతిశయంచేత; అవారణన్= అడ్డులేకుండా; నీ= నీయొక్క; ఎదురన్= ఎదుట; వెఱ్ఱులము= వివేకం లేనివారము; ఐ= అయి; ఏము= మేము; వివిధములు= అనేక విధాలైన; ప్రలాపముల్= అర్థం లేని మాటలు; ఒనర్చితిమి= పలికితిమి.

తాత్పర్యం: 'భక్తవత్సలా! సర్వలోకాలలోనివారు ఒక్కసారిగా మరణించినప్పటికీ వారి కందరికీ తిరిగి ప్రాణాలు పోయటానికి సమర్థుడవు. నీ కిష్టమైతే మేనత్తకొడుకయిన అర్జునుడి మనుమడు చావగా వదలిపెట్టుదువా? దుఃఖం ముంచెత్తటంవలన మేము అవివేకులమై నీ ఎదుట అనేక విధాలుగా అర్థంలేని మాటలు అడ్డులేకుండా పలికితిమి.'

తే. **అనినఁ గృపయును శోకంబు నగ్గలింప। వనజనాభుండు జను లర్థి వినఁగఁ 'బిన్న**
వాని బ్రదికింతు; వగవంగ వలవ' దనియె। నెలుఁగు జలదస్వనమ్ము న ట్లెసక మెసఁగ. 178

ప్రతిపదార్థం: అనినన్= సుభద్ర ఈ విధంగా పలుకగా; కృపయును= దయయూ; శోకంబున్= దుఃఖమునూ; అగ్గలింపన్= ఎక్కువ కాగా; వనజనాభుండు= పద్మం నాభియందు కలవాడు, విష్ణువు, కృష్ణుడు; ఎలుఁగు= కంఠస్వరం; జలద= మేఘంయొక్క; స్వనమ్ము+అట్లు= గర్జవలె; ఎసకమెసఁగన్= ఒప్పగా; జనులు= అక్కడ ఉన్నవారందరూ; అర్థిన్= ఆసక్తితో; వినఁగన్= వినగా; పిన్నవానిన్= పసిబిడ్డను; బ్రదికింతున్= బ్రదికేటట్లు చేస్తాను; వగవంగన్+వలవదు= విచారించవద్దు.

తాత్పర్యం: సుభద్ర ఈ విధంగా పలికేటప్పటికి శ్రీకృష్ణుడికి దయా, దుఃఖమూ ఎక్కువయ్యాయి. అతడు కంఠస్వరం మేఘగర్జవలె ఒప్పగా అందరూ సంతోషంతో వింటుండగా ' ఈ పసికందును బ్రదికిస్తాను. మీరు విచారించకండి' అని అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. **ఎల్లవారును బ్రమోదంబు నొంద నట్లు పలికి, సూతికాగృహంబునకుం గుంతీ ప్రభృతులు తోడ రా నతండు వోవునప్పు, డది ధవళకుసుమ సితసర్షప లాజ పూర్ణకుంభ ప్రముఖ మంగళవస్తువులను, బ్రజ్వలితపావక ప్రదీప్త శస్త్ర పిచుమంద పల్లవాది భూత (భయ) పరిహారక పదార్థంబులను, జతుర వృద్ధాంగనా చికిత్సక దక్షపరిచారికా ముఖ్యహితకారి పరివారజన ప్రవర్తనంబులను బరిశోభితంబయి యుండె; నమ్మందిరం బా గోవిందుండు ప్రవేశించె; నట్టియెడ నంతకమున్న.** **179**

ప్రతిపదార్థం: ఎల్లవారును= అందరునూ; ప్రమోదంబు= సంతోషం; ఒందన్= పొందగా; అట్లు= ఆ విధంగా; పలికి; సూతికా గృహంబునకున్= పురిటింటికి; కుంతీ; ప్రభృతులు= మొదలగువారు; తోడన్= వెంట; రాన్= రాగా; అతండు= కృష్ణుడు; పోవు+అప్పుడు= వెళ్ళేసమయంలో; అది= ఆ పురిటిల్లు; ధవళ= తెల్లని; కుసుమ= పూలు; సిత= తెల్లని; సర్షప= ఆవాలు; లాజ= పేలాలు; పూర్ణకుంభ= పూర్ణకుంభమూ; ప్రముఖ= ముఖ్యమైన; మంగళ= శుభం కలిగించే వస్తువులతో; ప్రజ్వలిత= బాగుగా మండజేసిన; పావక= అగ్ని; ప్రదీప్త= మిక్కిలి మెరుగుపెట్టబడిన; శస్త్ర= కత్తి మొదలగు ఆయుధములూ; పిచుమంద పల్లవ= వేప చిగుళ్ళూ; ఆది= మొదలైన; భూత= భూతములవలన కలుగు; (భయ)= భయమును; పరిహారక= తొలగించునవైన; పదార్థంబులను= పదార్థాలతో; చతుర= నేర్పరులైన; వృద్ధ+అంగనా= ముదుసలి స్త్రీలయొక్క; చికిత్సక= రోగ ప్రతిక్రియ చేయువారిలో; దక్ష= సమర్థతగల; పరిచారికా= పనికత్తెలయొక్క; ముఖ్య= ముఖ్యమైన; హిత= మేలును; కారి= కలిగించే; పరివార+జన= దాసీజనంయొక్క; ప్రవర్తనంబులను= చుట్టు చుట్టుకొని యుండుటలతోడను; శోభితంబు= ఒప్పునది; అయి; ఉండెన్; ఆ= అట్టి; మందిరంబు= పురిటిల్లు; ఆ+గోవిందుఁడు= ఆ కృష్ణుడు; ప్రవేశించెన్= ప్రవేశించాడు; అట్టి+ఎడన్= ఆ సమయాన; అంతకమున్ను+అ= అంతకుముందే.

తాత్పర్యం: అందరూ విని ఆనందించేటట్లు ఆ విధంగా పలికి శ్రీకృష్ణుడు కుంతి మొదలైనవారు అనుసరించగా పురిటింటికి వెళ్ళాడు. అందు తెల్లని పూలూ, ఆవాలూ, పేలాలూ, పూర్ణకుంభం మొదలైన మంగళవస్తువులు చేర్చారు. భూతభయం పోగొట్టటానికి అగ్నులు గనగన మండేటట్లు చేశారు. పదనుగల ఆయుధాలనూ, వేప చిగుళ్ళనూ ఉంచారు. అన్నిటా నేర్పరులైన ముదుసలి స్త్రీలతో వైద్యం చేయటంలో సామర్థ్యంగల పనికత్తెలతో మేలు కలిగించే దాసీజనంతో ఆ ఇల్లు కిటకిటలాడుతున్నది. ఈ విధంగా ఒప్పుతున్న ఆ పురిటింటిలో శ్రీకృష్ణుడు ప్రవేశించాడు. ఆ సమయంలో అంతకుముందే. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. కడచి ద్రౌపది చని యడలునఁ బడియున్న । మాత్స్యనందనతోడ 'మాధవుండు
చనుదెంచె వీఁడె; సవినయంబుగాఁ గను' । మనవుడు నుత్థిత యై వికీర్ణ
వేణీభరంబుతో వినతి యొనర్చి 'భ । క్తార్తి వాపుట నీకు నతిదృఢ వ్ర
తంబు కదే! దేవ! దయ వెలయంగ నీ । శిశువు సంజీవితుఁ జేయవయ్య!

తే. నీవు గూర్తేని మేనల్లునికిఁ దదీయ । పుత్త్రు ద్రోణుని పుత్త్రుండు పాలియఁజేయు
వాఁడె? పతిహీన యగుపాపవతికిఁ బుత్త్ర । హీనతయును బాటిల్లిన నెట్లు బ్రదుకు? **180**

ప్రతిపదార్థం: ద్రౌపది; కడచి చని= బయలుదేరిన వారందరికంటె ముందు వెళ్ళి; అడలునన్ పడి+ఉన్న= సొమ్మసిల్లి ఉన్న; మాత్స్య= విరాటుడియొక్క; నందనతోడన్= కూతురు ఉత్తరతో; మాధవుండు= కృష్ణుడు; వీఁడు+ఎ= వీడే; చనుదెంచెన్= వచ్చాడు; సహ+వినయంబు+కాన్= వినయంతో; కనుము= చూడుము; అనవుడున్= అనిన తరువాత; ఉత్థిత+ఐ= లేచినదై; వికీర్ణ= చెదరిన; వేణీభరంబుతోన్= వెంట్రుకల సమూహంతో; వినతి= ప్రార్థన; ఒనర్చి= చేసి; దేవ!= దేవా!; భక్త= భక్తులయొక్క; ఆర్తి= దుఃఖాన్ని; పాపుట= తొలగించటం; నీకున్= నీకు; అతి= మిక్కిలి; దృఢ= గట్టిపట్టుదలగల; వ్రతంబు= ప్రతిజ్ఞ; కద+ఏ!= కదా!; దయ; వెలయంగన్= వెల్లడికాగా; ఈ శిశువున్= ఈ శిశువును; సంజీవితున్= తిరిగి బ్రదికిన వాడినిగా; చేయుము+అయ్య!= చేయవయ్యా!; నీవు; మేనల్లునికిన్= మేనల్లుడియందు, అభిమన్యునియందు; కూర్తు+ఏని= ప్రేమ కలవాడవైతే; తదీయ= అతడియొక్క; పుత్త్రున్= కుమారుడిని; ద్రోణుని= ద్రోణుడియొక్క; పుత్త్రుండు= కొడుకు, అశ్వత్థామ; పాలియన్+చేయు= చంపెడి; వాఁడు+ఎ?= వాడా?; పతిహీన= భర్తలేనిది; అగు= అయిన; పాపవతికిన్= పాపాత్మురాలికి; పుత్త్ర= కుమారుడియొక్క; హీనతయును= లేకపోవటం; పాటిల్లినన్= సంభవిస్తే; ఎట్లు= ఏ విధంగా; బ్రదుకున్= బ్రదుకుతుంది?

తాత్పర్యం: అందరిని దాటుకొనిపోయి ద్రౌపది శోకంతో సొమ్మసిల్లిపడియున్న ఉత్తరతో ఇదుగో కృష్ణుడు వచ్చినాడు. వినయంతో చూడు అనగా లేచి చెదరిన వెంట్రుకల సమూహంతో ప్రార్థనచేసి దేవా! భక్తుల దుఃఖం తొలగించడం నీకు మిక్కిలి గట్టి వ్రతం కదా! దయ ప్రకాశించగా ఈ శిశువును తిరిగి బ్రతికించవయ్యా? నేను నీమేనల్లుడు ఇప్పుడైనట్లైతే ఆయన కొడుకును ద్రోణుడి కొడుకు (అశ్వత్థామ) చంపగలిగేవాడా! భర్తలేని పాపాత్మురాలికి పుత్రుడు కూడా లేకపోవడం సంభవిస్తే ఎట్లా బ్రతుకుతుంది?

ఉ. నందను చావు నిక్కమయినం జనుటప్పుడు కల్గు దేవకీ
నందన! యెల్ల భంగి నరనందను పాలికి; నాజి కేచి పో
వం దనతోడి పెంపునకు వారక యిచ్చిన బాస దప్పె; నిం
కం దనుఁ గన్న దెప్పు నొడికాఁడని కొంకెదఁ గాని యచ్యుతా! **181**

ప్రతిపదార్థం: దేవకీ= దేవకియొక్క; నందన!= కుమారా!; అచ్యుతా!= నాశంలేనివాడా!, కృష్ణా!; ఆజికిన్= యుద్ధానికి; ఏచి= ఉత్సహించి; పోవన్= వెళ్ళగా; తనతోడి పెంపునకున్= తనతోపాటు నశించుటకు, సహగమనమునకు; ఇచ్చిన= చేసిన; బాస= వాగ్దానం; వారక= తప్పక, పూర్తిగా; తప్పెన్= భంగమయ్యెను; ఇంకన్= ఇక ఇప్పుడు; తనున్= తనను; కన్నన్= చూచినచో; దెప్పు= ఎత్తిపొడుపుమాటలాడే; ఒడికాఁడు= సమయజ్ఞుడు, పట్టుదలకలవాడు; అని; కొంకెదన్+కాని= సంకోచిస్తున్నదాననుగాని; నందను= కుమారుడియొక్క; చావు= మరణం; నిక్కము= నిజం; అయినన్= అయితే, కొడుకుచావు తప్పదని ముందుగా

తెలిస్తే; ఎల్లభంగిన్= అన్నివిధాలా; నర= అర్జునుడియొక్క, నందను= కొడుకుయొక్క; అభిమన్యుడియొక్క; పాలికిన్= దగ్గరకు; అప్పుడు+అ= అప్పుడే (ఆయన మరణించినప్పుడే); చనుట= వెళ్ళటం; కల్గున్= సంభవించేది.

తాత్పర్యం: కృష్ణా! అభిమన్యుడు యుద్ధంలో మరణిస్తే తప్పక ఆయనతోపాటు సహగమనం చేస్తానని మాట ఇచ్చాను. పూర్తిగా ఆడినమాట తప్పాను. ఇప్పుడు చనిపోయి దగ్గరకు వెళ్ళితే ఆయన ఎత్తిపొడుపు మాటలు మాటాడుతాడని సంకోచిస్తున్నాను. ఆయన చాలా పట్టుదల కలవాడు. నా కొడుకు తప్పక చనిపోతాడని ముందుగా తెలిసినట్లయితే అభిమన్యుడు మరణించినప్పుడే సహగమనం చేసి ఆయన దగ్గరకు వెళ్ళి ఉండేదానిని. వాగ్దానభంగం చేసిన దుర్గతి నాకు తప్పేది.

తే. **పద్మనాభుండు వచ్చిన బాలుఁ జంకఁ। బెట్టుకొని పోయి మ్రొక్కింతుఁ బ్రీతియెసఁగ**
నని తలంచుచు నుండితి; నమ్మనో ర। థంబు విఫలంబుగాఁ జేసె ద్రౌణి పేర్చి.' **182**

ప్రతిపదార్థం: పద్మనాభుండు= కృష్ణుడు; వచ్చినన్= వస్తే; బాలున్= బాలుడిని; చంకన్= చంకయందు; పెట్టుకొని; పోయి; ప్రీతి= సంతోషం; ఎసఁగన్= అతిశయించగా; మ్రొక్కింతున్= నమస్కరింపజేస్తాను; అని; తలంచుచున్+ఉండితిన్= ఆశపెట్టుకొని ఉన్న దానను; ద్రౌణి= ద్రోణుడి కొడుకు - అశ్వత్థామ; పేర్చి= చెలరేగి; ఆ మనోరథంబు= ఆ కోరిక; విఫలంబు= నెరవేరనిది; కాన్= అయ్యేటట్లు; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు వచ్చినప్పుడు కొడుకును చంకకెత్తుకొనిపోయి వాడిచేత మ్రొక్కిస్తానని గంపెడాశపెట్టుకొన్నాను. కాని, అశ్వత్థామ చెలరేగి నా కోరిక నెరవేరకుండా చేశాడు.'

వ. **అని యంత నిలువని వలవంత పెంపున బాలశవంబు నెత్తికొని యంకతలంబున నిడికొని, తదాననం బాలోకించి.** **183**

ప్రతిపదార్థం: అని; అంతన్= వెంటనే; నిలువని= ఆగని; వలవంత= బాధయొక్క; పెంపునన్= వృద్ధితో; బాల= బాలుడియొక్క; శవంబున్= పీనుగును; ఎత్తికొని= చేతులతో ఎత్తి; అంకతలంబునన్= ఒడిలో; ఇడికొని= పెట్టుకొని; తద్= ఆ శిశువుయొక్క; ఆననంబు= ముఖం; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అని వెంటనే అత్యంత దుఃఖంతో బిడ్డ శవాన్ని ఒడిలోపెట్టుకొని అతడి ముఖాన్ని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. **'తాత లోకగురుఁడు దామోదరుఁడు వచ్చి। యుండ లేచి మ్రొక్క వుజ్జ్వలాంగ!**
ధర్మవేది యైన తండ్రికిఁ బుట్టి య। ధర్మపరుఁడ వగుట తగునె నీకు. **184**

ప్రతిపదార్థం: ఉజ్జ్వల= ప్రకాశించునట్టి; అంగ= శరీరము కలవాడా!; తాత= తాతగారు (వరుసకు); లోక= లోకములయొక్క; గురుఁడు= తండ్రి; దామోదరుఁడు= శ్రీకృష్ణుడు; వచ్చి+ఉండన్= వచ్చియుండగా; లేచి; మ్రొక్కవు= నమస్కరింపవు; ధర్మవేది= ధర్మములు తెలిసినవాడు; అయిన; తండ్రికిన్= తండ్రికి; పుట్టి; అధర్మ= అధర్మమునందు; పరుఁడవు= ఆసక్తిగలవాడవు; అగుట; నీకున్= నీకు; తగును+ఎ?= తగునా?

తాత్పర్యం: లోకములకు తండ్రీ, తాతగారూ అయిన శ్రీకృష్ణుడు వచ్చి ఉండగా లేచి నమస్కరించకున్నావు. ధర్మవేత్త అయిన తండ్రికి పుట్టి. అధర్మం పాటించటం నీకు తగునా? (పెద్దలకు లేచి మ్రొక్కకుండటం అధర్మం).

క. కనువిచ్చి గొంతిఁ జూడుము. । ననుఁ జూడుము, ద్రుపద నృపతనయఁ జూడుము; నీ
జనకుని తల్లి సుభద్రం । దనయా! చూడు తల యెత్తి దరహాసముతోన్.' 185

ప్రతిపదార్థం: తనయా!= కుమారా!; కనువిచ్చి= కన్నులు తెరచి; తల+ఎత్తి= తలయెత్తి; దరహాసముతోన్= చిరునవ్వుతో; గొంతిన్= కుంతిని; చూడుము; ననున్= నన్ను; చూడుము; ద్రుపద= ద్రుపదుడనే; నృప= రాజుయొక్క; తనయన్= కూతురును; చూడుము; నీ= నీయొక్క; జనకుని= తండ్రియొక్క; తల్లిన్= తల్లిని; సుభద్రన్= సుభద్రను; చూడు= చూడుము.

తాత్పర్యం: కుమారా! కళ్ళు తెరచి, తలయెత్తి చిరునవ్వులు చిందిస్తూ కుంతిని చూడుము. నన్ను చూడుము. ద్రౌపదిని చూడుము. మీ నాయనమ్మ సుభద్రను చూడుము.'

చ. అని పలవించి యా సరసిజానన మూర్ఛ మునింగి నేలవ్రా
లినఁ గరుణంబు పెంపున విలీనతఁ బొందు మనంబులున్ సబా
ష్పనయన యుగ్మకంబులును, బాడఱు మోములు నైన కౌరవాం
గనల యలంతఁ గాంచిన వగల్ మిగులుం బగవారి కేనియున్. 186

ప్రతిపదార్థం: అని; పలవించి= ఏడ్చి; ఆ సరసిజ= పద్మమువంటి; ఆనన= ముఖం కలది-ఉత్తర; మూర్ఛన్= మూర్ఛలో; మునింగి= మునిగి; నేలన్= నేలమీద; వ్రాలినన్= పడిపోగా; కరుణంబు= దయయొక్క; పెంపునన్= ఆధిక్యంచేత; విలీనతన్= కరగిపోవుటను; పొందు= పొందిన; మనంబులున్= మనస్సులూ; స+బాష్ప= కన్నీటితో కూడిన; నయన= కన్నులయొక్క; యుగ్మకంబులును= జంటలూ; పాడఱు= కళదప్పిన; మోములున్= ముఖాలూ; ఐన= కలవారయిన; కౌరవ+అంగనల= కురువంశ స్త్రీలయొక్క; అలంతన్= ముఖాన్ని; కాంచినన్= చూస్తే; పగవారికిన్+ఏనియున్= శత్రువులకైనా; వగల్= దుఃఖాలు; మిగులున్= పొంగిపొరలుతాయి.

తాత్పర్యం: ఈ విధంగా ఉత్తర ఏడ్చి ఏడ్చి మూర్ఛపడి నేలమీద కూలిపోయింది. ఆమెను చూచి కౌరవస్త్రీల మనస్సులు జాలిచేత కరగిపోయాయి. వారి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వారి ముఖాలు కళదప్పాయి. వారి దుఃఖం చూచిన పగవారికైనా ఏడ్పు పొంగిపొరలుతుంది.

వ. ఒక్కింత సేపునకుం దెలివొంది విరాటనందన ధరాతలంబునం బడియున్న భంగిన ఫాలతలంబునం గేలు మొగిచి గోపాలదేవునకు మ్రొక్కుచు వెక్కుచు శరణు శర ణని పలికిన, నప్పరమకృపాపరుం డోడ కోడకు మను చుఁ బ్రాదప్రక్షాళనోపస్పర్శనంబు లాచరించి, అశ్వత్థామ ప్రయుక్తంబును బ్రహ్మశిరోనామకంబును నగునమ్మహాస్త్రం బుపసంహరించి, యబ్బాలశవంబు శయ్యాతలంబునం బెట్టంబనిచి, దరోల్లసితులయిన యెల్లవారలం గలయం గనుంగొని. 187

ప్రతిపదార్థం: ఒక్క+ఇంత సేపునకున్= కొంతసేపటికి; తెలివి+ఒంది= స్మృతి పొంది; విరాట= విరాటుడియొక్క; నందన= కూతురు ఉత్తర; ధరాతలంబునన్= నేలమీద; పడి+ఉన్న= పడి యున్న; భంగిన్+అ= విధంగానే; ఫాలతలంబునన్= నుదుటియందు;

కేలు మొగిచి= చేతులు జోడించి; గోపాలదేవునకున్= శ్రీకృష్ణుడికి; మ్రొక్కుచున్= నమస్కరిస్తూ; వెక్కుచున్= వెక్కి వెక్కి ఏడ్చుచూ; శరణు శరణు= రక్షకుఁడవు అగుము; అని; పలికినన్= పలుకగా; ఆ పరమ= అత్యధికమైన; కృపా= దయయందు; పరుండు= ఆసక్తికలవాడు; ఓడకుము+ఓడకుము= భయపడకుము, భయపడకుము; అనుచున్= అంటూ; పాద= కాళ్ళయొక్క; ప్రక్షాళనము= కడగటం; ఉపస్పర్శనంబు= (మూడుసార్లు నీళ్ళు త్రాగటం) - ఆచమనం; ఆచరించి= చేసి; అశ్వత్థామ= అశ్వత్థామచేత; ప్రయుక్తంబును= ప్రయోగించబడినదియూ; బ్రహ్మశిరస్= బ్రహ్మశిరమనే; నామకంబును= పేరుగలదియూ; అగు= అయిన; ఆ మహత్= ఆ గొప్ప; అస్త్రంబు; ఉపసంహరించి= నివారించి, అణచి; ఆ బాల= ఆ బాలుడియొక్క; శవంబున్= శవాన్ని; శయ్యాతలంబునన్= మంచంమీద; పెట్టన్= ఉంచగా; పనిచి= ఆజ్ఞాపించి; దర= కొంచెం; ఉల్లసితులు= సంతోషించినవారు; అయిన; ఎల్లవారలన్= అందరినీ; కలయన్= బాగుగా; కనుంగొని= చూచి.

తాత్పర్యం: కొంచెంసేపటికి ఉత్తర మూర్ఛనుండి తేరుకొన్నది. ముందు నేలమీద ఉన్నట్లే ఉండి, నుదుటిమీద చేతులు చేర్చి జోడించి శ్రీకృష్ణునికి నమస్కరిస్తూ, వెక్కి వెక్కి ఏడుస్తూ 'రక్షించు రక్షించు' మని అన్నది. అప్పుడు దయామయుడైన శ్రీకృష్ణుడు 'భయపడకు భయపడకు' మని అభయమిచ్చి, కాళ్ళు కడుగుకొని నీరు ఆచమనం చేసి, అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని అణచి వేశాడు. ఆ శిశువు శవాన్ని మంచంమీద ఉంచండని ఆజ్ఞాపించాడు. తరువాత చిరునగవుతో కొంచెం సంతోషించిన అక్కడి వారినందరినీ పూర్తిగా చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

కృష్ణుఁడు మృతజాతుండైన పరిక్షితు లబ్ధజీవితుం జేయుట (సం.14-68-18)

తే. 'మీఁద బొం కగుమాట యే మీరు వినఁగ। నాడ; నిబ్బాలు బ్రదికింతుఁ; జూడుఁ డఖిల
జనులు నిప్పుడ; తేలుండు సంతసమున; దీని విని పాండవులు ప్రీతి నూనువారు.' 188

ప్రతిపదార్థం: ఏన్= నేను; మీఁదన్= తరువాత; బొంకు+అగు= కల్ల అయ్యే; మాట= మాటను; మీరు; వినఁగన్= వినగా; ఆడన్= చెప్పను; ఈ+బాలున్= ఈ బాలుడిని; బ్రతికింతున్= బ్రదికిస్తాను; అఖిల= సమస్తమైన; జనులును= జనులూ; ఇప్పుడు+అ= ఇప్పుడే; చూడుఁడు= చూడండి; సంతసమునన్= సంతోషంలో; తేలుండు= ఓలలాడండి; పాండవులు; దీనిన్= బాలుడు తిరిగి బ్రదికాడనే వార్తను; ప్రీతిన్= సంతోషమును; ఊనువారు= పొందేవారు (ఔతారు).

తాత్పర్యం: 'తరువాత బూటకమయ్యేమాటను నేను మీతో చెప్పను. మీరందరూ ఇప్పుడే చూడండి. బాలుడిని బ్రదికిస్తాను. మీరు సంతోషం పొందండి. పాండవులు కూడా ఇది విని సంతోషిస్తారు.'

వ. అని ప్రతిజ్ఞ సేసి యిట్లనియె. 189

ప్రతిపదార్థం: అని; ప్రతిజ్ఞ+చేసి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని ప్రతిజ్ఞచేసి శ్రీకృష్ణుడు ఇంకా ఇట్లా అన్నాడు.

తే. 'పగఱయెడ నైన నే బొంకు పలుక నేని,। సమరముఖమున నెన్నఁడుఁ జలితవృత్తిఁ
బిఱిఁది కడుగిడ నేని, యిప్పిన్నవాని। యంగమున జీవ మీ ప్రొద్ద యావహిల్లు. 190

ప్రతిపదార్థం: నేన్= నేను; పగఱయెడన్= శత్రువుల విషయంలో; ఐనన్= అయినా; బొంకు= అసత్యం; పలుకన్+ఏని= పలుకనిచో; సమర ముఖమునన్= యుద్ధ ప్రారంభమున; ఏ+నాఁడున్= ఏనాడూ; చలిత= చంచలమైన; వృత్తిన్= స్వభావంతో; పిఱిఁదికిన్=

వెనుకకు; అడుగిడన్+ఏని= అడుగుపెట్టనిచో; ఈ+పిన్నవాని= ఈ శిశువుయొక్క; అంగమునన్= శరీరమునందు; ఈ+ప్రొద్దు+అ= ఈ వేళనే; జీవము= ప్రాణం; ఆవహిల్లున్= కలుగును గాక!

తాత్పర్యం: నేను శత్రువుల విషయంలోనైనా అసత్యం పలకని వాడనైతే, యుద్ధపు మొనల్లో ఎపుడూ మనసు చెదరి వెనుకంజ వేయనివాడనైతే ఈ బాలుడి శరీరానికి ఈ రోజే ప్రాణం కలుగుతుంది.

వ. **ధరణీసుర కులము నెడం। గర మెక్కుడు ప్రియము నాకుఁ గలదేని, సధ**
ర్మరతుఁడన యేని, నియ్యు। త్తరాసుతుఁడు లబ్ధజీవితత్వము నొందున్. **191**

ప్రతిపదార్థం: నాకున్= నాకు; ధరణీసుర= బ్రాహ్మణులయొక్క; కులము+ఎడన్= జాతిపట్ల; కరము= మిక్కిలి; ఎక్కుడు= ఎక్కువ అయిన; ప్రియము= ప్రేమ; కలదు+ఏనిన్= ఉన్నట్లయితే; సహ+ధర్మ+రతుఁడన్+అ= ధర్మాసక్తితో కూడినవాడను; ఏనిన్= అయితే; ఈ ఉత్తరా= ఈ ఉత్తరయొక్క; సుతుఁడు= కొడుకు; లబ్ధ= ప్రాప్తించిన; జీవితత్వమున్= జీవించిన వాని ధర్మాన్ని; ఒందున్= పొందునుగాక!

తాత్పర్యం: బ్రాహ్మణజాతిపట్ల నాకు అత్యధిక ప్రేమ ఉన్నట్లయితే; నేను ధర్మాసక్తిగలవాడనైతే ఈ ఉత్తర కొడుకు జీవిస్తాడు గాక!

క. **నరునియెడ నామనంబున। విరోధ మెన్నఁడును నేమి విధమున నైనం**
బొరయమి నిజమేనియు సు। స్థిరముగ నిబ్బాలుమేన జీవము సెందున్. **192**

ప్రతిపదార్థం: నా= నాయొక్క; మనంబునన్= మనస్సులో; నరుని+ఎడన్= అర్జునుడియందు; ఎన్నఁడును= ఏనాడునూ; ఏమి విధమునన్= ఏ విధంగా; ఐనన్= అయిననూ; విరోధము= పగ; పొరయమి= పొందకుండటం; నిజము+ఏనియున్= నిజమైతే; సుస్థిరముగన్+శాశ్వతంగా; ఈ+బాలు= ఈపిల్లవాడియొక్క; మేనన్= శరీరమునందు; జీవము= ప్రాణం; చెందున్= చేరునుగాక!

తాత్పర్యం: నేను ఏనాడూ, ఏ విధంగానూ మనసా అర్జునుడిపట్ల వైరం పొందకుండటం నిజమైతే, శాశ్వతంగా ఈ శిశువు శరీరంలో ప్రాణం చేరును గాక!

క. **నిక్కపు ధర్మువు నన యే। నక్కంసాదుల వధించు టారసి, చూడన్**
నిక్కువమై యార్యజనుల। కెక్కిన యేని నసువర్గ మీ శిశువు గనున్. **193**

ప్రతిపదార్థం: ఏన్= నేను; నిక్కము= అసందిగ్ధమైన; ధర్మువునన్+అ= ధర్మంచేతనే; ఆ కంస= ఆ కంసుడు; ఆదులన్= మొదలగు వారిని; వధించుట= చంపటం; ఆరసి= పరీక్షించి; చూడన్= చూడగా; నిక్కువము+ఐ= నిజమై; ఆర్యజనులకున్= కర్మనిష్ఠులకు; ఎక్కెన్+అ+ఏనిన్= సమ్మతమైనట్లయితే; ఈ+శిశువు= ఈ పసిబిడ్డ; అసు= ప్రాణములయొక్క; వర్గమున్= సమూహమును, పంచప్రాణాలను; కనున్= పొందునుగాక!

తాత్పర్యం: అసందిగ్ధమైన ధర్మాన్ని ఆశ్రయించి నేను కంసుడు మొదలగువారిని సంహరిస్తే, నేను చేసిన పని ధర్మబద్ధం కావటం నిజమై, కర్మనిష్ఠులకు సమ్మతమైనట్లయితే ఈ శిశువు పంచప్రాణాలను తిరిగి పొందునుగాక!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **మహిత సత్యంబుఁ బరమధర్మంబు గాఢ। నిర్మల బ్రహ్మచర్యంబు నిత్య సుప్ర**
తిష్ఠితంబులై నాయందుఁ దేజరిల్లు। నేని నిబ్బాలునకు జీవ మిపుడ వచ్చు.' 194

ప్రతిపదార్థం: మహిత= గొప్ప; సత్యంబున్= సత్యమూ; పరమ= ఉత్కృష్టమైన; ధర్మంబున్= ధర్మమూ; గాఢ= అస్ఖలితమైన; నిర్మల= కళంకంలేని; బ్రహ్మచర్యంబున్= బ్రహ్మచర్యమూ; నా+అందున్= నాయందు; నిత్య= ఎల్లప్పుడూ; సుప్రతిష్ఠితంబులు= చక్కగా నిలుపబడినవి; ఐ= అయి; తేజరిల్లున్+ఏనిన్= ప్రకాశించేటట్లయితే; ఇపుడు+అ= ఇప్పుడే; ఈ+బాలునకున్= ఈ మగబిడ్డకు; జీవము= ప్రాణం; వచ్చున్= వచ్చును గాక!

తాత్పర్యం: మహాసత్యమూ, ఉత్కృష్ట ధర్మమూ, అస్ఖలిత బ్రహ్మచర్యమూ నా యందు చక్కగా నెలకొన్నవై ప్రకాశిస్తున్నట్లయితే, ఈ మగబిడ్డకు ఇప్పుడే ప్రాణం వచ్చును గాక!

వ. **అని యిట్లప్పురుషోత్తముండు పలికిన. 195**

ప్రతిపదార్థం: అని; ఇట్లు= ఈ విధంగా; ఆ+పురుషోత్తముండు= కృష్ణుడు; పలికినన్= పలుకగా.

తాత్పర్యం: ఈ విధంగా కృష్ణుడు పలుకగా. (-తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. **బాలుని మేనికిఁ బ్రాణముల్ వచ్చిన। నల్లన కదలెఁ దదంగకములు;**
మఱి కనువిచ్చె; నత్తెఱఁగు తెల్లంబుగాఁ। గని గొంతి మొదలైన కౌరవాంగ
నలు మనంబులు నిండి, యలువులఁ బాఱెడు। నానందపూరంబు లనఁగఁ బొల్చు
హర్ష బాష్పములు రోమాంచ కంచుకిత దే। హంబులు నై యలరార, నఖిల

తే. **జన సమూహమ్ములును సంతసమునఁ దేలి। గగనమున దివ్యవాణి యక్కమలనాభుఁ**
బొగడె; మీ తండ్రి యున్న యప్పుణ్య గృహము। కరము శోభిల్లె నప్పుడు కౌరవేంద్ర! 196

ప్రతిపదార్థం: కౌరవ= కౌరవులలో; ఇంద్ర!= శ్రేష్ఠుడా!; బాలుని= బాలుడియొక్క; మేనికిన్= శరీరానికి; ప్రాణముల్= ప్రాణాలు; వచ్చినన్= రాగా; అల్లన్+అ= మెల్లగా; తద్= ఆ శిశువుయొక్క; అంగకములు= చిన్న అవయవాలు; కదలెన్= కదలాడినవి; మఱి= పిదప; కను విచ్చెన్= కళ్ళు తెరచాడు; గొంతి= కుంతి; మొదలైన; కౌరవ+అంగనలు= కౌరవ స్త్రీలు; ఆ+తెఱఁగు= ఆ తీరు; తెల్లంబు+కాన్= స్పష్టంగా; కని= చూచి; ఆనందపూరంబులు= ఆనంద జల సమూహం; మనంబులు= మనస్సులు; నిండి; అలువులన్= పరీవాహములనుండి; పాఱెడు= ప్రవహిస్తున్నవి; అనఁగన్= అని ఊహింపగా; పొల్చు= ఒప్పుచున్న; హర్ష= సంతోషంవలన కలిగిన; బాష్పములు= కన్నీళ్ళు; రోమాంచ= గగుర్పాటులనే; కంచుకిత= కవచం తాల్చిన; దేహంబులు= శరీరాలు; ఐ= కలవాడై; అలరారన్= సంతోషించగా; అఖిల= సమస్తమైన; జన= జనులయొక్క; సమూహమ్ములను= సమూహాలూ; సంతసమునన్= సంతోషంతో; తేలన్= ఓలలాడగా; గగనమునన్= ఆకాశమున; దివ్యవాణి= ఆకాశవాణి; ఆ+కమలనాభున్= ఆ కృష్ణుడిని; పొగడెన్= పొగిడింది; మీ= మీయొక్క; తండ్రి; ఉన్న; ఆ+పుణ్యగృహము= ఆ పవిత్రగృహం; అప్పుడు= ఆ సమయంలో; కరము= మిక్కిలి; శోభిల్లెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: బాలుడికి ప్రాణాలు వచ్చేటప్పటికి అతడి చిన్న చిన్న అవయవాలు కదిలాయి. అతడు కళ్ళు తెరిచాడు. ఆ తీరు కనులార చూచిన కుంతి మొదలైన కౌరవస్త్రీలు పరమానందం పొందారు. ఆనంద ప్రవాహంతో వారి మనస్సులనే చెరువులు నిండాయి. అక్కడ నిండి కళ్ళు అనే జలనిర్గమనమార్గాల ద్వారా ప్రవహించాయా అనేటట్లు వారు ఆనందాశ్రువులు రాల్చారు. వారి శరీరాలు గగుర్పాటులతో నిండాయి. నానాజాతుల ప్రజలూ సంతోషించారు. ఆకాశవాణి శ్రీకృష్ణుడిని స్తుతించింది. మీ తండ్రి ఉన్న, పవిత్రమైన ఆ పురిటిల్లు వెలుగులు విరజిమ్మింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

ఉ. **ఉత్తర బిడ్డ నెత్తికొని యొయ్యన మో మలరంగ వచ్చి య**
త్యుత్తమతేజుఁ డైన పురుషోత్తము నంఘ్రుల పొంత భూస్థలిం
జిత్త మెలర్పఁగాఁ దనదు చెన్నగు ఫాలము సేర్చినన్ ముదా
యత్తమనస్కుఁడై యతఁడు సాదరభాషల గారవించుచున్. **197**

ప్రతిపదార్థం: ఉత్తర; బిడ్డన్= బిడ్డను; ఎత్తికొని= ఎత్తుకొని; మోము= ముఖం; అలరంగన్= కళకళలాడగా; చిత్తము= మనస్సు; ఎలర్పఁగాన్= సంతోషింపగా; ఒయ్యన్+అ= మెల్లగా; వచ్చి; అతి+ఉత్తమ= మిక్కిలి ఉత్తమమైన; తేజుఁడు= తేజస్సు కలవాడు; ఐన= అయిన; పురుషోత్తము= శ్రీకృష్ణుడియొక్క; అంఘ్రుల= పాదములయొక్క; పొంతన్= సమీపమున; భూస్థలిన్= నేలమీద; తన= తనయొక్క; చెన్ను+అగు= అందమైన; ఫాలము= నుదురు; చేర్చినన్= చేర్పగా; అతఁడు= శ్రీకృష్ణుడు; ముత్= సంతోషమునకు; ఆయత్త= వశమైన; మనస్కుఁడు+ఐ= మనస్సు కలవాడై; స+ఆదర= అనురాగంతో కూడిన; భాషలన్= మాటలతో; గారవించుచున్= లాలిస్తూ.

తాత్పర్యం: బిడ్డ బ్రదికేటప్పటికి ముఖం కళకళలాడగా, మనస్సు సంతోషమయం కాగా ఉత్తర బిడ్డను ఎత్తుకొని వేగంగా వచ్చి శ్రీకృష్ణుడి కాళ్ళ దగ్గర వ్రాలి నేలమీద నుదురు మోపింది. శ్రీకృష్ణుడు ఆమెను అనురాగవాక్యాలతో లాలిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. **వినుత బహురత్న విస్ఫుర। దనేక భూషణ నికాయ మబ్బాలున కి**
చ్చినఁ దక్కటి యదువీరులు। జననాయక! యొసఁగి రక్కజంబుగఁ దొడవుల్. **198**

ప్రతిపదార్థం: జననాయక!= రాజా!; వినుత= కొనియాడబడిన, ప్రశస్తమైన; బహు= అనేకములైన; రత్న= రత్నాలతో; విస్ఫురత్= ప్రకాశిస్తున్న; అనేక= అనేకాలైన; భూషణ= నగలయొక్క; నికాయము= సమూహం; ఆ+బాలునకున్= ఆ బాలుడికి; ఇచ్చినన్= ఇవ్వగా; తక్కటి యదువీరులు= మిగిలిన యాదవ వీరులు; అక్కజంబు+కన్= ఆశ్చర్యకరంగా; తొడవుల్= నగలు; ఒసఁగిరి= ఇచ్చారు.

తాత్పర్యం: రాజా! ప్రశస్త రత్నాలతో ప్రకాశిస్తున్న వివిధాలంకారాలను ఆ బాలుడికి ఇచ్చారు. మిగిలిన యాదవులు కూడా ఆశ్చర్యం కలిగించే విధంగా నగలు పెట్టారు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అప్పుడు. 199

తాత్పర్యం: ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ఆత్మకులము పరిక్షీణమైన జనన। మొందెఁగాన యియ్యభిమన్యు నందనునకు
నర్థమగుఁ బరిక్షిన్నామ మనియెఁ గృష్ణుఁ। డఖిల జనములు వినఁ బౌరవాధినాథ! 200

ప్రతిపదార్థం: పౌరవ+అధినాథ= పురువంశీయుడవైన ప్రభూ!; కృష్ణుఁడు= కృష్ణుడు; అఖిల= సమస్తమైన; జనములు= జనులు; వినన్= వినగా; ఆత్మ= తనయొక్క; కులము= కులం; పరిక్షీణము= నశించినది; ఐనన్= కాగా; జననము+ఒందెన్= జన్మించాడు; కాన; ఈ+అభిమన్యు= ఈ అభిమన్యుడియొక్క; నందనునకున్= కుమారుడికి; పరిక్షిత్= పరిక్షిత్తు; అను= అనెడి; నామము= పేరు; అర్థము= తగింది; అగున్= ఔతుంది; అనియెన్= ప్రకటించాడు.

తాత్పర్యం: జనమేజయా! జనులందరూ వింటుండగా కృష్ణుడు 'తన వంశమంతా నశించిపోయినప్పుడు జన్మించాడు కాబట్టి ఈ అభిమన్యుడి కుమారుడికి పరిక్షిత్తు అనే పేరు సముచితంగా ఉంటుంది' అని ప్రకటించాడు.

వ. అట్లు పుండరీకాక్షుండు పాండవ సంతానంబు గలిగించె; న ట్లప్పరమపురుషుచేతం బ్రత్యుజ్జీవితుం డైన భవజ్జనకుం డేకమాసవయస్కుండగు కొలంది నొకపుణ్య దివసంబున. 201

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; పుండరీక= తెల్లతామరలవంటి; అక్షుండు= కన్నులు కలవాడు, శ్రీకృష్ణుడు; పాండవ= పాండవులయొక్క; సంతానంబు= సంతతిని; కలిగించెన్= నిలిపాడు; అట్లు= ఆ విధంగా; ఆ+పరమపురుషు చేతన్= ఆ పరమాత్ముడిచేత; ప్రతి+ఉత్+జీవితుండు+ఐన= తిరిగి బ్రదికినవాడైన; భవత్= మీయొక్క; జనకుండు= తండ్రి; ఏకమాస= ఒకనెల; వయస్కుండు= వయస్సు కలవాడు; అగు కొలందిన్= అగునప్పటికి; ఒక= ఒకానొక; పుణ్య= పావనమైన; దివసంబునన్= దినమునందు.

తాత్పర్యం: ఆ విధంగా శ్రీకృష్ణుడు పాండవ సంతతిని నిలిపాడు. ఆ పరమాత్ముడిచేత తిరిగి జీవించిన మీ తండ్రి ఒక నెల వయస్సు కలవాడయ్యేటప్పటకి ఒక మంచి రోజున. (-తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. ధర్మసుతుండును దమ్ములు నమ్మహా। కనక మ ట్లెత్తించికొని, యుదాత్త
వైభవ మెసఁగంగ వచ్చినఁ, గృష్ణవి। యుక్తులై విదుర యుయుత్సు లర్థిఁ
గస్తూరి నీళ్ళుల కలయంపులను, గప్పు। రంపు మ్రుగ్గుల, బహురత్న తోర
ణములఁ దోరపు ముత్తియముల నొనర్చిన। ప్రాలంబమాలికా పంక్తులను, బ

తే. సిండి పూర్ణ కుంభములను, విశిష్ట మరక। తప్రకరమయ కదళికాస్తంభములను
గరము దోరంబుఁ జిత్రరేఖంబుఁ గా న। లంకరించిరి పురముఁ గులప్రదీప! 202

ప్రతిపదార్థం: కుల ప్రదీప!= కులానికి దీపంవంటివాడా! ధర్మసుతుండును= ధర్మరాజూ; తమ్ములున్= తమ్ముళ్ళూ; అట్లు= ఆ విధంగా; ఆ+మహాకనకంబున్= ఆ పెద్దమొత్తంగా ఉన్న బంగారాన్ని; ఎత్తించికొని; ఉదాత్త= గొప్ప; వైభవము; ఎసఁగంగన్=

అతిశయించగా; వచ్చినన్= రాగా; కృష్ణ= కృష్ణుడిచేత; నియుక్తులు+ఐ= నియోగించబడినవారై; విదురయుయుత్సులు= విదురుడునూ, యుయుత్సుడునూ; అర్థిన్= ప్రీతితో; కస్తూరి= కస్తూరి కలసిన; నీళ్ళుల= నీళ్ళయొక్క; కలయంపులను= కళ్ళాపులతో; కప్పురము+ముగ్గులన్= కర్పూరపు ముగ్గులతో; బహు= అనేకములైన; రత్న= రత్నాలయొక్క; తోరణములన్= తోరణాలతో; తోరము= పెద్దవైన; ముత్తియములన్= ముత్యాలతో; ఒనర్చిన= చేసిన; ప్రాలంబ= వ్రేలాడుతున్న; మాలికా= దండలయొక్క; పంక్తులను= వరుసలతో; పసిండి= బంగారు; పూర్ణ కుంభములను= పూర్ణకుంభాలతో; విశిష్ట= ఉత్తమమైన; మరకత= మరకత మణులయొక్క; ప్రకర= సమూహంతో; మయ= కూడిన; కదళికాస్తంభములను= అరటి స్తంభాలతో; కరము= మిక్కిలి; తోరంబున్= నిండినదీ; చిత్ర= ఆశ్చర్యకరమైన; రేఖంబున్= అందం కలదీ; కాన్= అగునట్లుగా; పురమున్= హస్తినాపురమును; అలంకరించిరి= అలంకరించారు.

తాత్పర్యం: ధర్మరాజూ, అతడి తమ్ములూ సువర్ణరాసులతో హస్తినాపురానికి విచ్చేశారు. అప్పుడు కృష్ణుడు పట్టణం అలంకరించటానికి విదురుడినీ, యుయుత్సుడినీ నియోగించాడు. వారి ఆజ్ఞ ననుసరించి కస్తూరినీళ్ళతో కళ్ళాపులు చల్లి, ముత్యాలముగ్గులు పెట్టారు. రత్నాల తోరణాలు కట్టారు. పెద్ద ముత్యాలు గ్రుచ్చిన దండలు వరుసగా వ్రేలాడదీశారు. స్వర్ణ పూర్ణ కుంభాలు నిలిపారు. మరకతమణిమయమైన అరటిస్తంభాలు పాతారు. ఈ అలంకారాలతో నిండి, హస్తినాపురం చిత్ర విచిత్ర సౌందర్యం కలిగినదయింది.

వ. సకలజనంబులుం గయిసేసి కలయం బొలయ నపు డప్పురంబు చంద్రోదయ ఘూర్ణమానంబయిన యర్ణ వంబు ననుకరించె; నయ్యచ్యుతుండును బలదేవ సాత్యకి ప్రద్యుమ్న ప్రముఖులు ప్రమోదంబునం బొంపిరి పోవుచుంబెంపారునలంకారంబుల నభినవోదార చారుత్వంబు వహించి యెదురు చనిపాండవులం గని; రయ్యిరుదెఱంగుల వారలు సౌహార్దంబును సౌముఖ్యంబును సౌజన్యంబును నత్యంతంబును మెఱయ నర్హంబులగు నాచారంబులు నడపి; రట్లు కృష్ణ సమేతులై మీ తాతలు హర్షోల్లాస భావమానులగుచు నా సమగ్ర కాంచన సంచయంబుఁ బురస్కరించుకొని పురప్రవేశం బాచరించి. 203

ప్రతిపదార్థం: సకల= సమస్తమైన; జనంబులున్= జనులునూ; కయిసేసి= అలంకరించుకొని; కలయన్= అంతటా; పొలయన్= సంచరించగా; అపుడు= ఆ సమయాన; ఆ+పురంబు= ఆ పట్టణం; చంద్ర= చంద్రుడియొక్క; ఉదయ= ఉదయంచేత; ఘూర్ణమానంబు= ఘోషపెట్టుతున్నది; అయిన; అర్ణవంబున్= సముద్రమును; అనుకరించెన్= పోలింది; ఆ+అచ్యుతుండును= ఆ కృష్ణుడును; బలదేవ= బలరాముడు; సాత్యకి; ప్రద్యుమ్న= ప్రద్యుమ్నుడు మొదలైన; ప్రముఖులు= ముఖ్యులు; ప్రమోదంబునన్= సంతోషంతో; పొంపిరి పోవుచున్= సంతోషిస్తూ; పెంపారు= అధికమైన; అలంకారంబులన్= అలంకరణాలతో; అభినవ= క్రొత్తదైన; ఉదార= గొప్పదైన; చారుత్వంబు= అందం; వహించి= తాల్చి; ఎదురు చని= ఎదురు వెళ్ళి; పాండవులన్= పాండవులను; కనిరి= చూచి కలిసికొన్నారు.; ఆ+ఇరు+తెఱంగుల= ఆ రెండు వైపుల ఉన్న; వారలు= వారు; సౌహార్దంబును= మైత్రియూ; సౌముఖ్యంబును= ప్రసన్నతయూ; సౌజన్యంబును= ప్రేమయూ; అత్యంతంబును= మిక్కిలి; మెఱయన్= వెల్లడికాగా; అర్హంబులు= తగినవి; అగు= అయిన; ఆచారంబులు= విధులు; నడపిరి= నిర్వహించారు; అట్లు= ఆ విధంగా; మీ తాతలు; కృష్ణ= కృష్ణుడితో; సమేతులు+ఐ= కూడుకొన్నవారై; హర్ష= సంతోషంచేత; ఉల్లాస= ఉత్సాహంచేత; భాసమానులు= ప్రకాశిస్తున్నవారు; అగుచున్= అవుతూ; ఆ+సమగ్ర= ఆ సమస్తమైన; కాంచన= బంగారంయొక్క; సంచయంబున్= రాశిని; పురస్కరించుకొని= ముందుపెట్టుకొని; పుర= పట్టణంయొక్క; ప్రవేశంబు= ప్రవేశం; ఆచరించి= చేసి.

తాత్పర్యం: ప్రజలందరూ అలంకరించుకొని అంతటా సంచరిస్తుండగా పట్టణం చంద్రోదయంచేత కల్లోలపడుచున్న సముద్రాన్ని పోలింది. అప్పుడు కృష్ణుడూ బలరాముడూ మొదలైన ముఖ్యులూ సంతోషిస్తూ నానా విధాలంకారాలతో సరికొత్త సొగసును పొందినవారయ్యారు. వారందరూ పాండవులకు ఎదురు వెళ్ళి కలిసికొన్నారు. అప్పుడు రెండువైపులవారూ మైత్రి ప్రసన్నతా ప్రేమా వెల్లడి అయ్యేటట్లుగా సముచిత విధులు నిర్వహించారు. మీ తాతలు హర్షోత్సాహాలతో ఆ సమస్త సువర్ణరాశిని ముందుంచుకొని పురప్రవేశం చేశారు.

విశేషం: అలం: ఉపమ.

క. తొలుత ధృతరాష్ట్ర గాంధా। రులఁ గని, మఱి గొంతిఁ గాంచి, ప్రోన్మీలచ్చ
క్షులుఁ బ్రమద సంభరిత చి। త్తులు నయిన యుయుత్సునిన్ విదురునిన్ బ్రీతిన్. 204

ప్రతిపదార్థం: తొలుతన్= మొదట; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్రుడినీ; గాంధారిన్= గాంధారినీ; మఱి= తరువాత; గొంతిన్= కుంతినీ; కాంచి= దర్శించి; ప్ర+ఉన్మీలత్= మిక్కిలి వికసించుచున్న; చక్షులున్= కన్నులు గలవారూ; ప్రమద= సంతోషంచేత; సంభరిత= నిండిన; చిత్తులున్= మనస్సులు కలవారూ; అయిన; యుయుత్సునిన్= యుయుత్సుడినీ; విదురునిన్= విదురుడినీ; ప్రీతిన్= ప్రేమతో, సంతోషంతో.

తాత్పర్యం: ధర్మరాజాదులు మొదట గాంధారీ ధృతరాష్ట్రులనూ, తరువాత కుంతినీ దర్శించారు. తమను చూడటంవలన ఆనందంతో వికసించిన కన్నులూ, నిండిన మనస్సులూ కలవారైన యుయుత్సుడినీ, విదురుడినీ ప్రేమతో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. కానిపించికొని సంభావించి సంభృతాహ్లాదు లగుచుం గృష్ణాది యాదవ లోకంబునుం దారు నొకరమ్య మండపంబున నుండి; రట్టియెడ. 205

ప్రతిపదార్థం: కానిపించికొని= దర్శింపజేసికొని, రప్పించుకొని; సంభావించి= గౌరవించి; సంభృత= పరిపూర్ణమైన; ఆహ్లాదులు= ఆనందం కలవారు; అగుచున్= అవుతూ; కృష్ణ= కృష్ణుడు; ఆది= మొదలైన; యాదవ= యాదవులయొక్క; లోకంబునున్= సమూహమునూ; తారున్= తామునూ; ఒక= ఒకానొక; రమ్య= అందమైన; మండపంబునన్= మండపంలో; ఉండిరి= కొలువు చేశారు; అట్టి+ఎడన్= ఆ వేళ.

తాత్పర్యం: తమ దగ్గరకు రప్పించుకొని గౌరవించి, పరమానందం పొందుతూ, కృష్ణుడు మొదలైన యాదవులతోపాటు ఒకానొక సుందరమండపంలో కొలువుచేశారు. ఆ వేళ. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ్యాసుఁడు కృష్ణ సహితులై యున్న పాండవుల యొద్దకు వచ్చుట (సం.14-70-8)

సీ. తగువారిఁ గాంచి యత్యద్భుతం బగుభవ। జ్జనకుతెఱంగు విస్తార మొప్పఁ
జెప్పిన, వార లచ్చెరువాటు సంతసం। బును నెమ్మనంబులఁ బెనఁగొనంగఁ
బద్మనాభు ననేక భంగుల వినుతించి,। 'యిట్టివి వింతలే? యెల్లనాఁడు
నిట్టులకాక మాయెడ నీదు కరుణ పెం'। పని యభినందించి, రట్లు గలిసి

తే. నెమ్మిఁ దారును గృష్ణుండు సమ్మదమున । నుచిత వర్తన కలితులై యుండఁ గొన్ని
దివసములకు సంప్రీతి నేతెంచి బోధ । భాసితుం డైన సత్యవతీసుతుండు. 206

ప్రతిపదార్థం: తగు= శక్తిమంతులగు; వారిన్= వారిని, పాండవులను; కాంచి= చూచి; అతి+అద్భుతంబు= మిక్కిలి ఆశ్చర్యకరమైనది; అగు= అయిన; భవత్= మీయొక్క; జనకు= తండ్రియొక్క; తెఱంగు= జన్మవృత్తాంతమును; విస్తారము= విస్తృతి, సమగ్రముగా ఉండటం; ఒప్పన్= ఒప్పగా; చెప్పినన్= చెప్పగా; వారలు= పాండవులు; అచ్చెరువాటు= ఆశ్చర్యం; సంతసంబును= సంతోషమూ; నెమ్మనంబులన్= మనస్సులందంతటా; పెనఁగొనంగన్= ఆదరింపగా; పద్మనాభున్= శ్రీకృష్ణుడిని; అనేక భంగులన్= అనేక విధాలుగా; వినుతించి= పొగడి; ఇట్టి+అవి= ఇటువంటివి; వింతలు+ఏ?= అపూర్వాలా?; ఎల్లనాఁడు= ఎల్లప్పుడు; నీదు+కరుణ= నీ కరుణయొక్క; పెంపు= అతిశయము; మా+ఎడన్= మాయందు; ఇట్టులు+అ= ఇట్లే; కాక= తప్ప; అని; అభినందించిరి= పొగిడారు; అట్లు= ఆ విధంగా; తారును= తామూ; కృష్ణుండున్= కృష్ణుడూ; నెమ్మిన్= నిశ్చింతగా; కలిసి కూడి; సమ్మదమునన్= సంతోషంతో; ఉచిత= తగిన; వర్తన= నడవడితో; కలితులు+ఐ= కూడినవారై; ఉండన్= ఉండగా; కొన్ని; దివసములకున్= రోజులకు; సంప్రీతిన్= మహానందంతో; బోధ= జ్ఞానంచేత; భాసితుండు= ప్రకాశించేవాడు; ఐన= అయిన; సత్యవతీ= సత్యవతియొక్క; సుతుండు= కొడుకు - వ్యాసుడు; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: పాండవులకు ఆశ్చర్యకరమైన పరిక్షిత్తు జన్మ వృత్తాంతాన్ని విపులంగా చెప్పారు. వారికి ఆశ్చర్యమూ, సంతోషమూ కలిగాయి. వారు శ్రీకృష్ణుడిని అనేక విధాలుగా స్తుతించి 'నీవు చేసిన ఈ పనులు క్రొత్తలు గావు. ఎప్పుడూ నీ దయ మాయందు ఈ విధంగానే ప్రసరించింది' అని ప్రశంసించారు. వారందరూ నిశ్చింతగా ఉండి తమ తమ విధులు నిర్వహిస్తూ ఉండగా కొన్నాళ్ళకు జ్ఞాన తేజో విరాజితుడైన వ్యాసుడు వచ్చాడు.

క. ఏతెంచిన గోవింద స । మేతంబుగ నెదురుకొని మహిత పూజా సం
ప్రీతునిఁ గావించి, యతని । మీ తాతలు గొలిచియుండి, మృదు వచనములన్. 207

ప్రతిపదార్థం: ఏతెంచినన్= రాగా; మీ తాతలు; గోవింద= శ్రీకృష్ణుడితో; సమేతంబుగన్= కూడియుండునట్లుగా; కూడా; అతనిన్= వ్యాసుడిని; ఎదురుకొని= ఎదురుగా వెళ్ళి కలిసి; మహిత= గొప్ప; పూజా= పూజలచేత; సంప్రీతునిన్= సంతోషించిన వాడినిగా; కావించి= చేసి; కొలిచి+ఉండి= సేవిస్తూ ఉండి; మృదు= మెత్తనయిన; వచనములన్= మాటలతో.

తాత్పర్యం: అప్పుడు మీ తాతలు శ్రీకృష్ణుడితో కూడా ఎదురుగా వెళ్ళి, ఆయనను పూజలచేత సంతోషింపజేసి తీసికొని వచ్చి పరిచర్యలు చేస్తూ, మెత్తని మాటలతో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. సముచితగోష్ఠినడపి; రప్పాడండవాగ్రజుండు మునిజనాగ్రణితో 'భవత్ప్రసాదంబునం బడసిన యమ్మహా ధనంబు మహనీయంబుగా నశ్వమేధయాగంబునం దుపయోగంబు నొందింపఁ గోరెద; ననుజ్ఞ యీవే!' యనిన సంతసిల్లి యాసంయమివరుం డిట్లనియె. 208

ప్రతిపదార్థం: సముచిత= తగిన; గోష్ఠి= సల్లాపం; నడపిరి= చేశారు; ఆ+పాండవ అగ్రజుండు= ఆ పాండవులలో పెద్దవాడు, ధర్మరాజు; మునిజన= మునులయందు; అగ్రణితోన్= శ్రేష్ఠుడితో, వ్యాసుడితో; భవత్= నీయొక్క; ప్రసాదంబునన్= అనుగ్రహంతో; పడసిన= పొందిన; ఆ+మహత్= ఆ గొప్ప; ధనంబు= ధనం; మహనీయంబు+కాన్= గొప్పగా; అశ్వమేధయాగంబునందున్= అశ్వమేధయాగంలో; ఉపయోగంబు= వినియోగం; ఒందింపన్= పొందించగా; కోరుదున్= కోరెదను; అనుజ్ఞ= అనుమతి; ఇమ్ము+ఏ=

ఇయ్యవే; అనినన్= అనగా; సంతసిల్లి= సంతోషించి; ఆ సంయమివరుండు= ఆ మునులలో శ్రేష్ఠుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: సముచిత సల్లాపం చేశారు. అంత ధర్మరాజు వ్యాసుడితో 'మీ దయవలన పొందిన ఆ మహాధనాన్ని అశ్వమేధయాగంలో గొప్పగా వినియోగించాలని కోరుతున్నాను అనుమతించండి' అని అన్నాడు. ఈ మాటలకు సంతోషించి ఆ మునీశ్వరుడు ఈ విధంగా అన్నాడు.

ఆ. 'తురగమేధ మఖిల దుష్కృతహరము, నీ। వది సమగ్ర దక్షిణాన్వితముగఁ
జేసి నిర్మలత్వ భాసమానుండ వై। వెలయు, మమృతకిరణకులవరేణ్య!' 209

ప్రతిపదార్థం: అమృతకిరణ= చంద్రుడియొక్క; కుల= వంశమునందు; వరేణ్య!= శ్రేష్ఠుడా!; తురగమేధము= అశ్వమేధం; అఖిల= సమస్తమైన; దుష్కృత= పాపాలను; హరము= నశింపజేసేది; నీవు; అది= దానిని; సమగ్ర= సమస్తమైన; దక్షిణ= దక్షిణలతో; అన్వితము+కన్= కూడి ఉండేదిగా; చేసి; నిర్మలత్వ= పరిశుద్ధితో; భాసమానుండవు= ప్రకాశిస్తున్నవాడవు; ఐ; వెలయుము= ప్రసిద్ధికెక్కుము.

తాత్పర్యం: 'చంద్రవంశశ్రేష్ఠా! అశ్వమేధం సమస్త పాపాలనూ నశింపజేస్తుంది. దానిని నానావిధ దక్షిణలతో కూడి ఉండేదిగా చేసి; పరిశుద్ధుడవై ప్రకాశిస్తూ ప్రసిద్ధి కెక్కుము.'

చ. అనవుడుఁ బ్రీతి నొంది యతఁ డచ్యుతుఁ గన్గొని 'భవ్య మైన యి
ప్పని తగ నిట్లు చేయు మని పన్పుము; తల్లియుఁ దండ్రియున్ గురుం
డును సచివుండు నిష్టసఖుఁడుం గరుణాకర! నీవ మాకు; నీ
యనుపమ ముఖ్యవృత్తి జగ మంతటికిన్ గతి; వేయు నేటికిన్?' 210

ప్రతిపదార్థం: అనవుడున్= వ్యాసుడు ఈ విధంగా పలుకగా; అతఁడు= ధర్మరాజు; ప్రీతిన్= సంతోషాన్ని; ఒంది= పొంది; అచ్యుతున్= శ్రీకృష్ణుడిని; కన్గొని= చూచి; కరుణా= దయకు; ఆకర!= నిలయమైనవాడా!; భవ్యము= శుభకరము; అయిన; ఈ పని= ఈ పని, అశ్వమేధయాగం; తగన్= శాస్త్రోక్తంగా; ఇట్లు= ఈ విధంగా; చేయుము; అని; పన్పుము= ఆజ్ఞాపించుము; మాకున్= మాకు; తల్లియున్= తల్లి అయినా; తండ్రియున్= తండ్రి అయినా; గురుండును= గురువు అయినా; సచివుండు= మంత్రి అయినా; ఇష్టసఖుఁడున్= ప్రియ మిత్రుడయినా; నీవు+అ= నీవే; నీ= నీయొక్క; అనుపమ= సాటిలేని; ముఖ్య= ప్రధానమైన; వృత్తి= ఆలోచన; జగము+అంతటికిన్= లోకాని కంతటికీ; గతి= రక్ష; వేయున్= వేయి మాటలు; ఏటికిన్?= ఎందులకు?

తాత్పర్యం: వ్యాసుడు ఈ విధంగా పలుకగా ధర్మరాజు సంతోషించి శ్రీకృష్ణుడిని చూచి 'దయానిధీ! శుభప్రదమైన ఈ అశ్వమేధయాగాన్ని శాస్త్రోక్తంగా చేయుమని ఆజ్ఞాపించుము. మాకు తల్లయినా, తండ్రయినా, గురువయినా, ప్రియమిత్రుడయినా నీవే! సాటిలేనిదీ, ప్రధానమయినదీ అయిన నీ ఆలోచనయే లోకానికంతటికీ రక్ష. వేయి మాట లెందుకు?'

వ. అనిన విని యంబుజనాభుం డతని కిట్లనియె. 211

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; అంబుజనాభుండు= పద్మము నాభియందు కలవాడు, కృష్ణుడు; అతనికిన్= ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఈ విధంగా పలుకగా విని, కృష్ణుడు అతడితో ఈ రీతిగా అన్నాడు.

ఉ. 'వ్యాసులు పంచినట్ల నియమాఢ్యతఁ జేయుద మశ్వమేధముం;
జేసి కృతార్థతం బొరసి చిత్తము నెవ్వగ యెల్లఁ బాచికొ;
మ్మాసుకృతంబు ధర్మనిచయ ప్రవరం బని యేన చెప్పి కా
దే సుగుణాభిరామ! నిను దీనికిఁ జొన్పితి మున్ దృఢంబుగన్. 212

ప్రతిపదార్థం: సుగుణ= మంచిగుణాలచేత; అభిరామ!= మనోహరుడవైనవాడా!; వ్యాసులు= వ్యాసులవారు; పంచిన+అట్లు+అ= ఆజ్ఞాపించినట్లే; నియమ= నియమాలయొక్క; ఆఢ్యతన్= సంపన్నతచేత; అశ్వమేధమున్= అశ్వమేధమును; చేయుదము= చేద్దాము; చేసి= కావించి; కృతార్థతన్= ధన్యతను; పొరసి= పొంది; చిత్తము= మనస్సు యొక్క; నెవ్వగ= పరిపూర్ణసంతాపాన్ని; ఎల్లన్= అంతటినీ; పాచికొమ్ము= పోగొట్టుకొనుము; ఆ= అశ్వమేధయాగం చేయటంచేత కలిగిన; సుకృతమ్ము= పుణ్యం; ధర్మ= ధర్మాలయొక్క; నిచయ= సమూహమందు; ప్రవరంబు= శ్రేష్ఠం; అని; ఏను+అ= నేనే; మున్= పూర్వం; దృఢంబుగన్= గట్టిగా; చెప్పి; కాదు+ఏ!= కదా!; నినున్= నిన్ను; దీనికిన్= యాగం చేయటానికి; చొన్పితిన్= పురికొల్పాను.

తాత్పర్యం: 'వ్యాసులవారు ఆజ్ఞాపించినట్లుగా; నియమసంపన్నులమై అశ్వమేధయాగం చేద్దాము. 'నీవు దానిని చేసి ధన్యుడవై నీ మనస్తాపా న్నంతటినీ పోగొట్టుకొనుము. అశ్వమేధయాగం చేయటంవలన కలిగే పుణ్యం సర్వ ధర్మాలకంటె శ్రేష్ఠం' అని పూర్వం నీకు గట్టిగా చెప్పినది నేనే కదా! ఆ పనికి నిన్ను నేనే పురికొల్పాను.

చ. అనుమతి యింక వేఱ పడయం దలఁ పేటికిఁ గౌరవేంద్ర! న
న్ననుపుము, వాజిమేధకరణంబున కేపని చేయువాఁడ? నీ
యనుజులు నల్వు రే నొకఁడ నధ్వరకార్యము లెల్ల నీదు నె
మ్మనమున కెక్కఁ జేయుదుము; మాన్యచరిత్ర! తొడంగు మర్థితోన్.' 213

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కౌరవులయందు శ్రేష్ఠుడా!; మాన్య= గౌరవించదగిన; చరిత్ర!= నడవడి కలవాడా!; ఇంకన్= ఇంకా; వేఱు+అ= వేరే; అనుమతి పడయన్= నా అనుమతి పొందగా; తలఁపు= ఆలోచన; ఏటికిన్?= ఎందులకు?; నన్= నన్ను; పనుపుము= ఆజ్ఞాపించుము; వాజిమేధ!= అశ్వమేధంయొక్క; కరణంబునకున్= చేయటానికి; ఏ పనిన్= ఏ పని; చేయువాఁడన్= చేయవలసినవాడను; నీ= నీయొక్క; అనుజులు= తమ్ముళ్ళు; నల్వురు= నలుగురు; ఏన్= నేను; ఒకఁడన్= ఒక్కడనూ, అధ్వర= యజ్ఞంయొక్క; కార్యములు= పనులు; ఎల్లన్= అన్నిటినీ; నీదు+నెమ్మనమునకున్= నీ మనస్సునకు; ఎక్కన్= తృప్తికలిగేటట్లుగా; చేయుదుము= చేస్తాము; అర్థితోన్= ప్రీతితో; తొడంగుము= పూనుకొనుము.

తాత్పర్యం: కౌరవశ్రేష్ఠా! మానవీయ వర్తనా! నేనే అశ్వమేధయాగం చేయటానికి నిన్ను పురికొల్పాను. కావున నీవు నా అనుమతి పొందాలని ఆలోచించటం దేనికి? నీవే నన్ను ఆజ్ఞాపించుము. అశ్వమేధయాగ నిర్వహణంలో నే నేపని చేయవలయును? నీ తమ్ముళ్ళు నలుగురూ, నే నొక్కడినీ కలిసి యాగకార్యాలన్నీ నీ మనస్సునకు తృప్తి కలిగేటట్లు చేస్తాము. నీవు ప్రీతితో యజ్ఞానికి పూనుకొనుము.'

సీ. అన విని, సమ్మోద మారిన చిత్తంబు। తో నభినందించి, యా నరేంద్ర
వరుఁడు పారాశర్యువలను గనుంగొని। 'దీక్షకు నయ్యెడు దినము మీరు
చూచి యా సంస్కార మాచరింపుఁడు దయ'। ననవుడు నమ్ముని యాజ్ఞవల్క్యుఁ
బేర్కొని, పైలునిఁ బ్రీతి నెఱింగించి,। వారును నేనును వసుమతీశ!

ఆ. నడపవలయు పనులు నడపు వారము; చైత్ర। మాస కలిత పౌర్ణమాసి నిప్పు;
దరయఁ బనుపు మేధ్య మగుతురంగముఁ దద్జ్ఞు। లైన యట్టి జనుల; నంచితాత్మ! 214

ప్రతిపదార్థం: ఆ నరేంద్ర= ఆ రాజులకు; వరుఁడు= రాజు - రాజాధిరాజు, ధర్మరాజు; అనన్= కృష్ణుడు పలుకగా; విని; సమ్మోదము= సంతోషం; ఆరిన= నిండిన; చిత్తంబుతోన్= మనస్సుతో; అభినందించి= అతడిని ప్రశంసించి; పారాశర్యు= పరాశరుడి కుమారుడైన వ్యాసుడి; వలను= వైపు; కనుంగొని= చూచి; మీరు; దయన్= దయతో; దీక్షకున్= యజ్ఞదీక్షకు; అయ్యెడు= యుక్తమైన; దినము; చూచి= నిశ్చయించి; ఆ= యజ్ఞదీక్షకు సంబంధించిన; సంస్కారము= వేదోక్త కర్మమును; ఆచరింపుఁడు= చేయుడు; అనవుడున్= అనిన తరువాత; ఆ ముని= ఆ వ్యాసుడు; యాజ్ఞవల్క్యున్= యాజ్ఞవల్క్యుడిని; పేర్కొని= ప్రస్తావించి; ప్రీతిన్= సంతోషంతో; పైలునిన్= పైలుడిని; ఎఱింగించి= తెలియజేసి, చెప్పి; వసుమతీ+ఈశ!= రాజా!; వారును= వారూ; నేనును= నేనూ; నడపన్+వలయు= చేయవలసిన; పనులు; నడపువారము= చేస్తాము; ఇప్పుడు= ఈ సమయం; చైత్రమాస= చైత్రమాసంతో; కలిత= కూడిన; పౌర్ణమాసిన్= పూర్ణిమనాడు; అంచిత= గొప్పదైన; ఆత్మ!= ఆత్మకలవాడా!; మేధ్యము= పవిత్ర యజ్ఞమునకు తగినది; అగు= అయిన; తురంగమున్= గుఱ్ఱమును; అరయన్= వెదకగా; తద్+జ్ఞులు= దాని లక్షణములు తెలిసినవారు; ఐన+అట్టి= అయినటువంటి; జనులన్= జనులను; పనుపుము= పంపుము.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు విని ధర్మరాజు మహానందంతో అతడిని ప్రశంసించాడు. తరువాత వ్యాసుడిని చూచి 'యజ్ఞదీక్షకు యుక్తమైన రోజును నిశ్చయించి మీరు ఆ సంస్కారమును నిర్వహించండి' అని అడిగాడు. అపుడామహర్షి యాజ్ఞవల్క్యుడినీ, పైలుడినీ ప్రస్తావించి 'రాజా! వారూ, నేనూ, చేయవలసిన పనులన్నీ చేస్తాము. ఇది చైత్రమాసం. ఈ రోజు పూర్ణిమ. యజ్ఞానికి పనికివచ్చే గుఱ్ఱాన్ని వెదకుటకు అశ్వశాస్త్రజ్ఞులను పంపించుము.'

క. వేదోక్త విధి సహిత భ। వ్యాదరమున విడువఁ బడిన యయ్యశ్వం బీ
మేదినిఁ గలయం దిరుగును। నీ దగు నిర్మలయశంబు నెఱయ మెఱయఁగన్ 215

ప్రతిపదార్థం: వేద+ఉక్త= వేదాలలో చెప్పబడిన; విధి= విధులతో కూడిన; భవ్య= శుభప్రదమైన; ఆదరమునన్= దీక్షతో; ఆదరంతో; విడువఁబడిన= వదలబడిన; ఆ+అశ్వంబు= ఆ గుఱ్ఱం; నీది+అగు= నీదైన; నిర్మల= స్వచ్ఛమైన; యశంబు= కీర్తి; నెఱయన్= వ్యాపించగా; మెఱయన్= ప్రకాశించగా; ఈ మేదినిన్= ఈ భూమియందు; కలయన్= అంతటా; తిరుగును= తిరుగుతుంది.

తాత్పర్యం: నీవు శుభప్రదమైన దీక్షతో, వేదోక్త కర్మములు ఆచరించి విడిచిన ఆ గుఱ్ఱం నీ కీర్తి వ్యాపించి ప్రకాశించే విధంగా భూమండలం అంతటా సంచరిస్తుంది.

వ. సర్వ సంభారంబులును సమకట్టింపుము; స్రుక్ సువాది క్రతు సాధనంబులు గ్రొత్తలుగాఁ గనకంబునం గావింపం బనుపు' మని చెప్పిన నప్పుడమిఱేఁడు. 216

ప్రతిపదార్థం: సర్వ= సమస్తమైన; సంభారంబులును= సామగ్రినీ; సమకట్టింపుము= సిద్ధంచేయించుము; స్రుక్= యజ్ఞ ద్రవ్యాలను వేల్చటానికి చంద్ర కొయ్యతో చేసినదీ, మఱ్ఱియాకుమాదిరిగా ఉండేదీ, భుజమంత కొలత కలిగిన యజ్ఞపాత్రము; సువ= స్రుక్కువంటిదే అయి చేతియంత కొలతగల యజ్ఞపాత్ర; ఆది= మొదలైన; క్రతు= యజ్ఞంయొక్క; సాధనంబులు= పనిముట్లు; క్రొత్తలు+కాన్= క్రొత్తగా ఉండేటట్లు (ఇదివరకు వాడినవి కావు); కనకంబునన్= బంగారంతో; కావింపన్= చేయగా; పనుపుము= ఆజ్ఞాపింపుము; అని; చెప్పినన్= చెప్పగా; ఆ+పుడమిఱేఁడు= ఆ భూపతి, ధర్మరాజు.

తాత్పర్యం: 'సమస్త సామగ్రినీ సిద్ధం చేయించుము. స్రుక్కు, సువమూ మొదలైన పనిముట్టులను కొత్తగా బంగారంతో చేయించుము' అని చెప్పగా ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తురగ పరీక్షావిదులగు । పురుషులఁ బిలిపించి, 'యశ్వపుంగవుఁ గని తెం;
డరయుఁడు మనకొదమలలో । నిరుపమ లక్షణముఁ గీర్తనీయంబును గాన్. 217

ప్రతిపదార్థం: తురగ= గుర్రాలయొక్క; పరీక్షా= పరీక్షించటం; విదులు= తెలిసినవారు; అగు= అయిన; పురుషులన్= అశ్వశాస్త్ర పండితులను; పిలిపించి; అశ్వ= గుర్రాలయందు; పుంగవున్= శ్రేష్ఠమైన దానిని; తెండు= తీసికొనిరండి; మన= మనయొక్క; కొదమలలోన్= బలం కలిగిన (గుర్రపు) పిల్లలలో; నిరుపమ= సాటిలేని; లక్షణమున్= లక్షణాలు గలదీ; కీర్తనీయంబును= ప్రశంసించదగిందీ; కాన్= అయినట్లుగా; అరయుఁడు= ఎన్నిక చేయుడు.

తాత్పర్యం: గుర్రాల పరీక్షలో ఆరితేరిన అశ్వశాస్త్రజ్ఞులను పిలిపించి 'మనకున్న గుర్రాలలో ఉత్తమ లక్షణాలు కలదీ, ప్రశస్తమైనదీ అయిన శ్రేష్ఠాశ్వాన్ని ఎన్నికచేసి తీసికొని రండి.'

వ. అని పలికి కర్మాధికారులం గలయం గనుంగొని యజ్ఞంబునకు వలయునట్టి భాండ ప్రముఖంబులయిన సాధనంబులును, స్రుక్స్రువాద్యుపకరణంబులును సువర్ణమయంబులుగా వేగంబ చేయింపవలయు' నని నియోగించిన, నట్ల కాక యని చని వారును బదంపడి. 218

ప్రతిపదార్థం: అని పలికి; కర్మాధికారులన్= కార్మికులపైనుండే అధికారులను, తలమానుసులను; కలయన్= బాగుగా; కనుంగొని= చూచి; యజ్ఞంబునకున్= యజ్ఞానికి; వలయు+అట్టి= కావలసిన; భాండ= కుండలు; ప్రముఖంబులు= మొదలైనవి; అయిన; సాధనంబులును= పనిముట్లునూ; స్రుక్= స్రుక్కూ; స్రువ= స్రువమూ; ఆది= మొదలైన; ఉపకరణంబులును= పరికరాలునూ; సువర్ణమయంబులుగాన్= బంగారు రూపం కలిగినవిగా; వేగంబు+అ= అతి త్వరగా; చేయింపవలయున్= చేయించవలె; అని; నియోగించినన్= నియోగించగా; అట్లు+అ+కాక= అట్లే అగునుగాక; అని; చని= వెళ్ళి; వారును= వారందరూ; పదంపడి= తరువాత.

తాత్పర్యం: అని అశ్వశాస్త్రజ్ఞులకు చెప్పి, తరువాత కార్మికుల పెత్తనదారులను రప్పించి 'యజ్ఞానికి కావలసిన భాండం మొదలైన పనిముట్టులనూ, స్రుక్కూ మొదలైన పరికరాలనూ బంగారంతో సత్వరంగా చేయించవలె' నని నియోగించాడు. వారు ఏలినవారు చెప్పినట్లే అగునుగాక అని వెళ్ళి కొంతకాలం గడచిన తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తురగంబును సంభారో । త్కరమును గొనివచ్చి చూప ధర్మజుఁడు పరా
శరసుతునకు వాని వినయ । పరత సమర్పించెఁ గురున్నపాలవరేణ్యా! 219

ప్రతిపదార్థం: కురునృపాల వరేణ్యా!= కురువంశ రాజులలో శ్రేష్ఠుడా!; తురగంబును= గుర్రాన్నీ; సంభార= సామగ్రియొక్క; ఉత్కరమును= సమూహాన్నీ; కొని వచ్చి= తీసికొని వచ్చి; చూపన్= చూపగా; ధర్మజుఁడు= ధర్మరాజు; వానిన్= వాటిని; వినయపరతన్= వినయాసక్తితో; పరాశర= పరాశరమహర్షియొక్క; సుతునకున్= కుమారుడైన వ్యాసుడికి; సమర్పించెన్= సమర్పించాడు.

తాత్పర్యం: నియుక్తులైనవారు గుర్రాన్నీ, సాధన సామగ్రినీ తెచ్చి చూపగా, ధర్మరాజు వాటిని వినయంతో వ్యాసుడికి సమర్పించాడు.

క. **ముని యశ్వముఁ జూచి కరం। బనురాగముఁ బొంది 'మేధ్య మగు నిది; దీనిన్**
వినుత విధానమున విడుత'। మనవుడు నతఁ డతనితోడ నాదర మలరన్. **220**

ప్రతిపదార్థం: ముని= వ్యాసుడు; అశ్వమున్= గుర్రాన్ని; చూచి; కరంబు= మిక్కిలి; అనురాగమున్= సంతోషం; పొంది; ఇది= ఈ గుర్రం; మేధ్యము= పవిత్ర యజ్ఞానికి తగినది; అగున్= అవుతుంది; దీనిన్= దీనిని; వినుత= కొనియాడబడిన; విధానమునన్= శాస్త్రోక్త విధంగా; విడుతము= వదలిపెట్టుదాము; అనవుడున్= అనగా; అతఁడు= ధర్మరాజు; ఆదరము= గౌరవం; అలరన్= ఒప్పగా; అతనితోడన్= వ్యాసుడితో.

తాత్పర్యం: వ్యాసుడు గుర్రాన్ని చూచి, మిక్కిలి సంతోషించి 'ఇది యజ్ఞానికి తగినట్టిది. దీనిని శాస్త్రోక్తంగా వదలుదాము' అని అన్నాడు. అప్పుడు ధర్మరాజు ఆ మహర్షితో గౌరవ మొప్పగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **'దీని రక్షింప నర్హుండు మాననీయ। బోధ! యెవ్వండు? నీదు సద్బుద్ధి నరసి**
యిట్టివాఁడని యానతి యిమ్ము నాకు'। ననిన నమ్మునినాథుఁ డయ్యధిపుతోడ. **221**

ప్రతిపదార్థం: మాననీయ= గౌరవించదగిన; బోధ= జ్ఞానం కలవాడా!; ఎవ్వండు= ఎవ్వడు; దీనిన్= ఈ గుర్రాన్ని; రక్షింపన్= రక్షించగా; అర్హుండు= తగినవాడు; నీదు= నీ యొక్క; సత్= ఉత్తమమైన; బుద్ధిన్= వివేకంతో; అరసి= పరిశీలించి; ఇట్టివాఁడు= ఇటువంటివాడు; అని; నాకున్= నాకు; ఆనతి+ఇమ్ము= ఆదేశించుము; అనినన్= అనగా; ఆ+మునినాథుఁడు= ఆ మునిరాజు; ఆ+అధిపుతోడన్= ఆ రాజుతో.

తాత్పర్యం: పూజ్యజ్ఞానమయా! 'ఈ గుర్రాన్ని రక్షించటానికి ఎవడు తగినవాడు? నీవు వివేకబలంతో విచారించి ఫలానవాడని నాకు చెప్పుము' అని అనగా, ఆ మహర్షి ధర్మరాజుతో. (తరువాతి పద్యంతో అన్వయం)

క. **'దివ్యాస్త్ర విదుఁడు, ధిషణా। భవ్యుఁడు, శౌర్యోత్తరుండు పార్థుఁడు దగు న**
శ్వవ్యాపన క్రియకు' నితఁ। డవ్యాహతి నాచరించు నక్కార్యంబున్. **222**

ప్రతిపదార్థం: దివ్య= దేవతా సంబంధమైన; అస్త్ర= అస్త్రములు; విదుఁడు= తెలిసినవాడు; ధిషణా= బుద్ధిచేత; భవ్యుఁడు= యోగ్యుడు; శౌర్య= శౌర్యంచేత; ఉత్తరుండు= శ్రేష్ఠుడు; పార్థుఁడు= అర్జునుడు; అశ్వ= గుర్రంయొక్క; వ్యాపన= ఆచ్ఛాదించటం, రక్షించటం అనే; క్రియకున్= పనికి; తగున్= తగినవాడు; ఇతఁడు= ఈ అర్జునుడు; అవ్యాహతిన్= అవరోధం లేకుండా; ఆ+కార్యంబున్= అశ్వరక్ష అనే పనిని; ఆచరించున్= చేస్తాడు.

తాత్పర్యం: 'దివ్యాస్త్రవేత్త, బుద్ధిబలయోగ్యుడు, పరాక్రమశ్రేష్ఠుడు అయిన అర్జునుడు అశ్వాన్ని రక్షించటానికి తగినవాడు (లేక అశ్వసంచార కార్యానికి తగినవాడు.) ఇతడు ఏ ఆటంకం లేకుండా అశ్వరక్షణం చేస్తాడు.

వ. భీమసేనుండును నకులుండును మన రాష్ట్రంబు రక్షించువారు; భవదీయ కుటుంబ కార్యంబులు సహదేవుండు నడపువాఁ' డని నిర్దేశించిన. 223

ప్రతిపదార్థం: భీమసేనుండును= భీముడూ; నకులుండును= నకులుడూ; మనరాష్ట్రంబున్= మనదేశాన్ని; రక్షించువారు= రక్షిస్తారు; భవదీయ= మీ యొక్క; కుటుంబ= కుటుంబంయొక్క; కార్యంబులు= పనులు; సహదేవుఁడు; నడపువాఁడు= చేస్తాడు; అని; నిర్దేశించినన్= నిర్ణయపూర్వకంగా చెప్పగా.

తాత్పర్యం: 'భీముడూ, నకులుడూ దేశాన్ని రక్షిస్తుంటారు. సహదేవుడు మీ ఇంటి పనులు చేస్తుంటాడు' అని నిర్ణయించి చెప్పగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ధర్మజుం డర్జును యజ్ఞాశ్వరక్షణంబునకు నియోగించుట (సం.14-71-22)

సీ. అమ్మహీవల్లభుఁ డర్జునుఁ బిలిచి 'య। ధ్వరయుక్త మయిన యిత్తురగరత్న
మనఘ! సంరక్షణీయంబు నీ; కొరులకు। నిప్పని శక్యంబె? యెల్లభంగి
నిక్కార్యమునకు నీ వేఁగంగవలయు; నీ। యంచితాశ్వము చరియించుచుండ
నెడనెడ రాజుల కేనశ్వమేధ దీ। క్షితుఁడనై యుండుట సెప్పు; ముచిత

తే. కరణనియతి నిరోధంబు గాకయుండ। నడపు' మని చెప్పి, భీముని నకులు రాష్ట్ర
గోపనమునకు, సహదేవుఁ గులకుటుంబ। సమితిరక్షకుఁ బనిచె నుత్సాహ మెసఁగ. 224

ప్రతిపదార్థం: ఆ+మహీ= భూమియొక్క; వల్లభుఁడు= పతి, రాజు, ధర్మరాజు; అర్జునున్= అర్జునుడిని; పిలిచి; అనఘ!= పాపరహితుడా!; నీకున్= నీకు; అధ్వర= యజ్ఞమునకు; యుక్తము= యోగ్యము; అయిన; ఈ+తురగరత్నము= ఈ ఉత్తమాశ్వం; సంరక్షణీయంబు= జాగ్రత్తగా రక్షించదగింది; ఈ+పని= ఈ పనిని, అశ్వరక్షణం; ఒరులకున్= ఇతరులకు; శక్యంబు+ఎ= సాధ్యమా?; నీవు; ఎల్లభంగిన్= సర్వసన్నాహంతో; ఈ+కార్యమునకున్= ఈ పనికి; ఏఁగంగవలయున్= వెళ్ళవలయును; ఈ+అంచిత= పూజింపబడిన; అశ్వము= గుర్రం; చరియించుచున్+ఉండన్= సంచరిస్తుండగా; ఎడన్+ఎడన్= అప్పుడప్పుడు; రాజులకున్= రాజులకు; ఏను= నేను; అశ్వమేధ= అశ్వమేధయాగంయొక్క; దీక్షితుఁడను= దీక్షవహించినవాడను; ఐ= అయి; ఉండుట= ఉండటం; చెప్పుము; ఉచిత= తగిన; కరణ= పనులు చేయుటయొక్క; నియతిన్= నియమంతో; నిరోధంబు= ఆటంకం; కాక+ఉండన్= కలుగకుండ; నడపుము= నడిపించుము; అని; చెప్పి; ఉత్సాహము; ఎసఁగన్= అతిశయించగా; భీమునిన్= భీముడిని; నకులున్= నకులుడిని; రాష్ట్ర= దేశముయొక్క; గోపనమునకున్= రక్షణమునకు; సహదేవున్= సహదేవుడిని; కుల= తన కులమునందలి; కుటుంబ= కుటుంబాలయొక్క; సమితి= సమూహంయొక్క; రక్షకున్= రక్షణకు; పనిచెన్= నియోగించాడు.

తాత్పర్యం: ధర్మరాజు అర్జునుడిని పిలిచి 'అనఘా! యజ్ఞయోగ్యమైన ఈ గుర్రం నీకు రక్షించదగినది. ఇతరులకు ఈ పని సాధ్యంకాదు. నీవు సర్వసన్నద్ధుడవై ఈ పనిమీద వెళ్ళుము. పూజించిన గుర్రం సంచరిస్తుండగా నీవు అప్పుడప్పుడు రాజులతో 'నేను అశ్వమేధ యాగదీక్ష వహించా' నని చెప్పుము. నియమపూర్వకంగా తగిన పనులు చేస్తూ, ఏ ఆటంకం లేకుండా ఈ గుర్రాన్ని నడిపించుము' అని చెప్పాడు. భీముడినీ, నకులుడినీ దేశసంరక్షణకు నియమించాడు. సహదేవుడిని తన కులంలోని సర్వకుటుంబాల వారిని రక్షించటానికి నియోగించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. మఱియునుంగల యలంతి పనుల కర్హజనంబుల నియోగించి, గాంధారీ ధృతరాష్ట్రుల యనుమతి వడసి, కుంతీసమనుజ్ఞాతుం డయి, ద్రౌపది నియ్యకొలిపి, యశ్వమేధ మఖంబున కున్ముఖుం డయ్యె' నని యిట్లు ధర్మపుత్రు పుణ్యచరిత్రంబు చెప్పిన, 'నప్పరమధార్మికుండు సకలలోక మనోజ్ఞం బగు యజ్ఞం బెవ్విధంబున నిర్వహించె? వినువేడ్క నా చిత్తంబునం జిగురొత్తెడుఁ జెప్పవే' యనుటయు. 225

ప్రతిపదార్థం: మఱియునున్= ఇంకనూ; కల= ఉన్న, మిగిలిన; అలంతి= చిన్న చిన్న; పనులకున్= పనులకు; అర్హజనంబులన్= తగిన వారిని; నియోగించి= ఆజ్ఞాపించి, నియమించి; గాంధారీధృతరాష్ట్రుల= గాంధారీ ధృతరాష్ట్రులయొక్క; అనుమతి= అనుజ్ఞ; వడసి= పొంది; కుంతీ= కుంతిచేత; సమ్+అనుజ్ఞాతుండు+ఐ= అనుజ్ఞ ఇయ్యబడినవాడై; ద్రౌపదిన్= ద్రౌపదిని; ఇయ్యకొలిపి= ఒప్పించి; అశ్వమేధ= అశ్వమేధమనే; మఖంబునకున్= యజ్ఞమునకు; ఉన్ముఖుండు= సిద్ధమైనవాడు; అయ్యెను= అయ్యాడు; అని; ఇట్లు= ఈ విధంగా; ధర్మపుత్ర= యముడి కుమారుడైన ధర్మరాజుయొక్క; పుణ్య= పవిత్రమైన; చరిత్రంబు= చరిత్ర; చెప్పినన్= చెప్పగా; ఆ+పరమ= ఆ ఉత్తముడైన; ధార్మికుండు= ధర్మమునందు చరించువాడు. ధర్మరాజు; సకల= సమస్తమైన; లోక= లోకములకు; మనోజ్ఞంబు= మనోహరము; అగు= అయిన; యజ్ఞంబు= యజ్ఞమును; ఏ+విధంబునన్= ఏ విధంగా; నిర్వహించెన్= చేశాడు; విను= వినవలయునను; వేడ్క= కుతూహలం; నా= నాయొక్క; చిత్తంబున్= మనస్సులో; చిగురొత్తెడున్= అతిశయిస్తున్నది; చెప్పవే= చెప్పుమా; అనుటయున్= అని అనగా.

తాత్పర్యం: ధర్మరాజు ఇంకా మిగిలిన చిన్న చిన్న పనులకు తగినవారిని నియమించాడు. కుంతీ గాంధారీ ధృతరాష్ట్రుల అనుజ్ఞ పొందాడు. ద్రౌపదిని ఒప్పించాడు. తరువాత అశ్వమేధయాగం చేయటానికి సిద్ధపడ్డాడు' అని వైశంపాయనుడు ధర్మరాజు పవిత్రచరిత్రను చెప్పాడు. అప్పుడు జనమేజయుడు 'ధార్మికశ్రేష్ఠుడైన ధర్మరాజు సమస్త లోకాలకూ మనోహరమైన యజ్ఞం ఏ విధంగా చేశాడు? వినాలని నా చిత్తం ఉవ్విళ్ళూరుతున్నది. చెప్పుమా!' అని అడుగగా. (తరువాతి ఆశ్వాసంతో అన్వయం).

ఆశ్వాసాంతము

ఉ. మాన మదాదిదోష పరిమార్జన నిర్మల చిత్త భక్త స
న్మానసలోల! వీత పరిమాణ విభూతి విశాల! శాంతతా
హీన విదూర! విశ్వహితహేల విచార! నిరామయావ్యయ
స్థానక సిద్ధిమంగళ విధాయక! వేద సభైకనాయకా! 226

ప్రతిపదార్థం: మాన= అహంకారం; మద= పొగరు; ఆది= మొదలైన; దోష= దోషాలను; పరిమార్జన= తుడిచివేయటంచేత; నిర్మల= స్వచ్ఛమైన; చిత్త= మనస్సులు కలిగిన; భక్త= భక్తులయొక్క; సత్= మంచివైన; మానస= మనస్సులందు; లోల= నివసించే ఆసక్తికలవాడా!; వీత= తొలగిన; పరిమాణ= మితిచేత కలిగిన; విభూతి= విస్తృతిచే; విశాల!= విశాలమైనవాడా!; శాంతతా= శాంతస్వభావంచేత; హీన= హీనులయినవారికి; విదూర= మిక్కిలి దూరంగా ఉండేవాడా!; విశ్వ= ప్రపంచానికి; హిత= మేలు కలిగించటం అనే; హేల= విలాసంతో కూడిన; విచార!= ఆలోచనం కలవాడా!; నిర్+ఆమయ= బాధలేనిది; అవ్యయ= శాశ్వతమైనది అగు; స్థానక= ప్రశస్తస్థానముయొక్క బాధలేని శాశ్వతమైన స్థానం మోక్షం; సిద్ధి= ప్రాప్తించటం అనే; మంగళ= శుభమును; విధాయక= కలుగజేసేవాడా!; వేద= వేదాల; సభా= చర్చలు జరిగే; సదస్సుయొక్క; ఏక= ప్రధానమైన; నాయకా!= అధ్యక్షా!, నడిపించేవాడా!.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అరిషడ్వర్గమును జయించిన భక్తుల నిష్కళంక చిత్తాలలో నివసించే కోరిక కలవాడా! పరిమితిలేని విస్తృతిచే విశాలమైనవాడా! శాంతస్వభావం లేనివారికి దూరంగా ఉండేవాడా! మోక్షమును ప్రసాదించేవాడా! వేద సభాధ్యక్షా! వేదాలచేత ప్రధానంగా ప్రతిపాదించబడేవాడా!

క. అనపేక్షిత ఫలతా శో। భన మహనీయ క్రియా విపాకాత్మక రూ
ప! నితాంత ధూత సంశ్రిత। జనపాపా! పరమ మిత్త్ర! సత్యాలాపా! 227

ప్రతిపదార్థం: అనపేక్షిత= కోరబడని; ఫలతా= ఫలం కలిగి ఉండటంచేత; శోభన= ప్రకాశించేది; మహనీయ= గొప్పది ఐన; క్రియా= కర్మముయొక్క; విపాక+ఆత్మక= పరిణామంవలన ప్రాప్తించే చిత్తశుద్ధియొక్క; రూప!= రూపమైనవాడా!; నితాంత= ఎడతెగకుండా; ధూత= ఎగురగొట్టబడిన; సంశ్రితజన= ఆశ్రయించినవారియొక్క; పాపా!= పాపాలు కలవాడా!; పరమ= ఉత్తమమైన; మిత్త్ర= మిత్రుడా!; సత్య= సత్యస్వరూపాలైన; ఆలాపా!= వాక్కులు కలవాడా!

తాత్పర్యం: నిష్కామంగా ఆచరించే కర్మలవలన ప్రాప్తించే చిత్తశుద్ధియే రూపంగా కలవాడా! ఎల్లప్పుడూ ఆశ్రయించినవారి పాపాలను హరించేవాడా! ఉత్తమమిత్రుడా! సత్యమును బోధించే పలుకులు కలవాడా!

మాలిని

తరుణ జరఠ భావ ద్రావణోదారమూర్తీ!
హరణ కరణ నిర్మూలానతాభ్యంతరార్తీ!
మరణ జనన దుఃఖోన్మాద హృత్పుణ్యకీర్తీ!
చరణ కమల పూజాశాలి చిత్తానువర్తీ! 228

ప్రతిపదార్థం: తరుణ= యౌవనం; జరఠభావ= ముసలితనం అనే అవస్థలను; ద్రావణ= పోగొట్టుకొన్న; ఉదార= గొప్ప; మూర్తీ!= శరీరం కలవాడా!; హరణ= (పాపాలను) హరించటం అనే; కరణ= పనిని చేయటం చేత; నిర్మూల= మొదలు చెడిన; ఆనత= వినతులైన భక్తులయొక్క; అభ్యంతర= లోపలిదైన; ఆర్తీ!= బాధలు కలవాడా!; మరణ= చావు; జనన= పుట్టువు అనే; దుఃఖ= దుఃఖాలవలన కలిగిన; ఉన్మాద= వెర్రిని; హృత్= హరించుటచేత పుట్టిన; పుణ్య= పవిత్రమైన; కీర్తీ!= కీర్తి కలవాడా!; చరణ కమల= (నీ) పాదపద్మాలయొక్క; పూజా= పూజచేత; శాలి= ప్రకాశించే భక్తులయొక్క; చిత్త= మనస్సును; అనువర్తీ!= అనుసరించి ప్రవర్తించేవాడా!

తాత్పర్యం: యౌవనంగానీ, వార్ధకం గానీ లేని శరీరంకలవాడా! పాపాలను నిర్మూలించి, భక్తుల అంతరబాధలు తొలగించేవాడా! చావు పుట్టువులవలన కలిగే దుఃఖానికి ఫలమైన మతిభ్రమణాన్ని సంసార దుఃఖాలవలన కలిగే వెర్రిని హరించే కీర్తి కలవాడా! నీ పాద పద్మాలను ఆరాధించే భక్తుల ఇచ్చవచ్చినట్లు నడుచుకొనేవాడా!

గద్యము:

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీమహాభారతంబున నశ్వమేధ పర్వంబునందుఁ తృతీయాశ్వాసము

ప్రతిపదార్థం: ఇది= ఈ రచన; శ్రీమత్= విద్యాసంపత్తి కలిగిన; ఉభయ= రెండు భాషలయొక్క, సంస్కృతాంధ్రములయొక్క; కవి= కవులయొక్క; మిత్ర= మిత్రుడును; కొమ్మన= కొమ్మన అనే; అమాత్య= మంత్రియొక్క; పుత్ర= పుత్రుడును; బుధ= విద్వాంసులయొక్క; ఆరాధన= పూజచేత; విరాజి= ప్రకాశించేవాడును; తిక్కన సోమయాజి= యజ్ఞంచేసినవాడైన తిక్కనచేత; ప్రణీతంబు+ఐన= రచించబడినదైన; శ్రీ= గౌరవించదగిన; మహాభారతంబునన్= మహాభారతంలో; అశ్వమేధ= అశ్వమేధమనే యాగం వస్తువుగా గల; పర్వంబు+అందున్= పర్వంలో; తృతీయ= మూడవదైన; ఆశ్వాసము= ఆశ్వాసం.

తాత్పర్యం: ఇది విద్యాసంపత్తి కలిగినవాడును, సంస్కృతాంధ్ర కవుల మిత్రుడును, కొమ్మన మంత్రి కుమారుడును, విద్వాంసుల ఆరాధనంచేత ప్రకాశించేవాడును, యజ్ఞం చేసినవాడును అయిన తిక్కన రచించిన పూజ్యమహాభారతమందలి అశ్వమేధపర్వంలో తృతీయాశ్వాసం.

అశ్వమేధపర్వంలోని మూడవఆశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

అశ్వమేధపర్వము - చతుర్థాశ్వాసము

శ్రీవిద్యాశాంతి కృతి। ప్రావీణ్య నిరూఢి గణ్య పాద సతత సం

సేవన తత్పర హృత్కమ। లావాస కృత ప్రమోద! హరిహరనాథా! **1**

ప్రతిపదార్థం: హరిహరనాథా!= ఓ హరిహరనాథా! శ్రీవిద్యా= ఉపనిషద్విద్యయొక్క, ఆత్మవిద్యయొక్క, మోక్షవిద్యయొక్క; శాంతి= శాంతి అనే కర్మమును; కృతి= చేయటంలో; ప్రావీణ్యా= నేర్పుచేత కలిగిన; నిరూఢి= ప్రసిద్ధిచేత; గణ్యా= లెక్కించదగిన; పాద= పాదాలయొక్క; సతత= ఎల్లప్పుడును; సంసేవన= మిక్కిలి సేవించుటయందు; తత్పర= ఆసక్తి కలిగిన భక్తులయొక్క; హృద్+కమల= హృదయ పద్మములందు; ఆవాస= నివసించటంచేత, కృత= కలుగజేయబడిన; ప్రమోద!= ఆనందం కలవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! మోక్ష విద్యాసమాప్తి తరువాత గురుశిష్యులు చేసే శాంతికర్మం నిర్విఘ్నంగా కొనసాగటానికి మూలమైన నీ పాదాలను ఎల్లప్పుడూ సేవించే భక్తుల హృదయాలలో నివసిస్తూ వారికి ఆనందాన్ని కలుగజేసేవాడా!

విశేషం: హరిహరనాథుడి పాదసేవవలన మోక్షవిద్యను ఆమూలాగ్రంగా సంపాదింపవచ్చును. ఆ పాదసేవవలననే శాంతి నిరాటంకంగా ప్రాప్తిస్తుంది. అట్టి పాదసేవ చేసేవారి హృదయాలలో హరిహరనాథుడు నిత్యం నివసిస్తూ వారికి ఆనందం కలుగజేస్తాడు. ఆయన ఆనందస్వరూపుడు. 'ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్' (ఆనందమే బ్రహ్మగా తెలిసికొనెను) అని శ్రుతి చెప్పుతున్నది. కావున ఆనందస్వరూపుడైన భగవంతుడు తన భక్తులకు ఆనందం కలిగించే సమర్థుడౌతున్నాడు.

ధర్మజుం డశ్వమేధదీక్షం బూని హయంబుం బుడమిఁ దిరుగ విడుచుట (సం.14-72-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; న ట్లశ్వమేధయాగోద్యోగప్రద్యోతితుం డయిన పాండవాగ్రజు దీక్షకు నర్హం బయిన దినంబు సంప్రాప్తం బగుటయు, మౌహూర్తిక దత్త శుభ ముహూర్తంబునం గృష్ణద్వైపాయనాదులైన ఋత్విజులు వేద విహిత విధాన మహితంబుగ నక్కురు క్షితిపతి దీక్షితుం జేసి; రవ్వసుంధరా వల్లభుండు సంవీతక్షౌమకృష్ణాజినుండును దండపాణియు నయి ఋత్విగ్గణంబులు బలియం బరమ సంయమి పరివృత ప్రజాపతి ప్రఖ్యుండును గనత్కాంచనాభరణభూషితుండు నయి బహుళ ప్రభలు నిగుడ సందీప్త పావక సన్నిభుండును నగుచు వెలింగెఁ; దత్తుల్యాకల్పనంబున ఋత్విగ్గన సమాజంబునుం దేజరిల్లె; నా వేదవ్యాస మహామునిచేత శాస్త్రోక్త ప్రకారంబున ముక్తంబయి హయోత్తమంబు వెడలె; నప్పుడు.2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా; వైశంపాయనుండు= వైశంపాయనుడు; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అట్లు= ఆ విధంగా; అశ్వమేధ= అశ్వమేధమనే; యాగ= యాగముయొక్క; ఉద్యోగ= ప్రయత్నంచేత; ప్రద్యోతితుండు+అగు= ప్రకాశిస్తున్నవాడైన; పాండవ= పాండవులయొక్క; అగ్రజు= అన్నయొక్క, ధర్మరాజుయొక్క;

దీక్షకున్= దీక్షకు; అర్హంబు= తగినది; అయిన; దినంబు= రోజు; సంప్రాప్తంబు= ప్రాప్తించింది, వచ్చింది; అగుటయున్= కాగా; మౌహూర్తిక= ముహూర్తాలు తెలిసినవారిచేత; దత్త= ఇయ్యబడిన, నిర్ణయించబడిన; శుభ= మంగళకరమైన; ముహూర్తంబునన్= ముహూర్తమందు; కృష్ణద్వైపాయన= వ్యాసుడు; ఆదులు= మొదలగువారు; ఐన= అయిన; ఋత్విజులు= దక్షిణ పుచ్చుకొని యజ్ఞంచేయించేవారు; వేద= వేదాలచేత; విహిత= విధించబడిన; విధాన= పద్ధతులచేత; మహితంబుగన్= గౌరవించబడినదగునట్లుగా, ఆ+కురు= ఆ కురువంశీయుడైన; క్షితిపతిన్= రాజును; దీక్షితున్= దీక్షవహించిన వాడినిగా; చేసిరి= చేశారు; ఆ+వసుంధరా= ఆ భూమియొక్క; వల్లభుండు= భర్త - ధర్మరాజు; సంవీత= ధరించబడిన; క్షౌమ= పట్టుబట్టయు; కృష్ణ+అజినుండును= నల్లలేడితోలు కలవాడును; దండపాణియున్= యజ్ఞదండము చేతియందు కలవాడును; అయి; ఋత్విక్+జనంబులు= అనేకులు ఋత్విజులు; బలియన్= చుట్టి ఉండగా; పరమ సంయమి= బ్రహ్మర్షులచేత; పరివృత= చుట్టబడిన; ప్రజాపతి= బ్రహ్మతో; ప్రఖ్యుండును= సమానుండును; కవత్= ప్రకాశిస్తున్న; కాంచన+ఆభరణ= బంగారు నగలచేత; భూషితుండును= అలంకరించబడినవాడును; అయి; బహుళ= అత్యధికమైన; ప్రభలు= కాంతులు; నిగుడన్= వ్యాపించగా; సందీప్త= మిక్కిలి వెలుగుతున్న; పావక= అగ్నితో; సన్నిభుండును= సమానుడును; అగుచున్= అవుతూ; వెలింగెన్= వెలిగాడు; తద్= ఆ ధర్మజుడియొక్క; తుల్య= వేషభాషలతో సమానమైన; ఆకల్పనంబునన్= అలంకారాలచేత; ఋత్విక్+జన= ఋత్విజులయొక్క; సమాజంబునున్= సంఘంకూడా; తేజరిల్లెన్= వెలిగింది; ఆ+వేదవ్యాస= ఆ వేదవ్యాసుడనే; మహత్+మునిచేతన్= మహర్షిచేత; శాస్త్ర= శాస్త్రమునందు; ఉక్త= చెప్పబడిన; ప్రకారంబునన్= విధంగా; ముక్తంబు+అయి= విడువబడినదై; హయ+ఉత్తమంబు= ఆ మంచి గుర్రం; వెడలెన్= బయలుదేరింది; అప్పుడు= ఆ సమయంలో,

తాత్పర్యం: హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయుడితో ఈ విధంగా అన్నాడు. అశ్వమేధయాగం చేయాలని ప్రయత్నిస్తున్న ధర్మరాజు దీక్షవహించవలసినరోజు వచ్చింది. దైవజ్ఞులు నిర్ణయించిన శుభ ముహూర్తంలో వ్యాసుడు మొదలైన ఋత్విజులు వేదవిధుల ననుసరించి ధర్మరాజును యజ్ఞదీక్షితుడిగా చేశారు. ధర్మరాజు పట్టుబట్టా, నల్లయిఱ్ఱితోలూ ధరించాడు. యజ్ఞదండాన్ని చేపట్టాడు. ఋత్విజులు చుట్టూ చేరిన ఆ మహారాజు బ్రహ్మర్షులు చుట్టిన బ్రహ్మవలె ప్రకాశించాడు. తళ తళా మెరుస్తున్న బంగారు నగలు పెట్టుకొన్న ఆ ప్రభువు గన గనా మండుచున్న అగ్నివిధంగా వెలుగొందాడు. ఋత్విజులు కూడా ధర్మజుడి వేషభూషలతో సమానమైన అలంకారాలతో ప్రకాశించారు. తరువాత వేదవ్యాసుడు శాస్త్రోక్తంగా వదలిపెట్టగా ఆ ఉత్తమాశ్వం బయలుదేరింది.

విశేషం: ఇక్కడ అశ్వమేధయాగాన్ని గూర్చి కొంత వివరించాలి. గుర్రాన్ని బలిపశువుగా చేసి సార్వభౌముడు చేసే యజ్ఞ విశేషం అశ్వమేధం. దీనిని చైత్రమాసంలో పూర్ణిమనాడు ఆరంభించాలి. అందువలననే వ్యాసుడు మూడో ఆశ్వాసంలో 'చైత్రమాస కలిత పౌర్ణమాసి' (పద్య 214) అని ధర్మరాజుతో అన్నాడు.

యజ్ఞం ఆరంభమయ్యే మొదటి సంవత్సరంలో చైత్రపూర్ణిమనాడు సార్వభౌముడు సాంగ్రహణం అనే ఒక యజ్ఞాన్ని జరిపించి, మరునాడు బ్రహ్మౌదనం మొదలైన కర్మలు చేసి గుర్రాన్ని వదలాలి. ఆ యజ్ఞాశ్వం స్వేచ్ఛగా తిరుగుతుంటే రాజపుత్రులు మొదలైనవారు దానిని వెంబడించాలి. వదలిన సంవత్సరంలో పదకొండు నెలలు గడచిన తరువాత అశ్వాన్ని తోలుకొనివచ్చి రావిచెట్ల తోపులో బంధించాలి.

పండ్రెండో నెలలో యజ్ఞ సామగ్రిని సంపాదించి ఫాల్గునమాసంలో అమావాస్యనాడు సార్వభౌముడు ఋత్విజులతో కూడి యజ్ఞశాలలో ప్రవేశించాలి. రెండోసంవత్సరం మొదటి పాడ్యమి మొదలు అశ్వమేధయాగం ఆరంభించి, ఏడు రోజులు హోమం చేసి పూర్ణాహుతి చేయాలి. గుర్రాన్ని రథకారుడి గృహంలో బంధించి బ్రహ్మ మొదలైన ఋత్విజులు నలుగురూ 'ఇహ ధృతి స్వాహా' ఇత్యాది మంత్రాలు చెప్పి హోమం చేస్తారు.

తరువాత సోమలతకు కొన్ని క్రియలు జరిపి సోమపానం చేస్తారు.

సీ. **విప్వచ్చుఁ డాగమవిధివంతముగ ధర్మ। నందను నామంత్రణంబు వడసి,**
గాండీవపాణియై, కవదొనల్ ధరియించి, । తేజోవిశేషంబు రాజితముగ
నయ్యశ్వరత్నంబు ననుసరింపఁగఁ బ్రజ। బాలురు వృద్ధులు భామినులును
లోనుగాఁ బఱతెంచి, లోలత నతని నా। హయమును గనుఁగొను నప్పు డగ్గ

తే. **లంపు సందడి నూష్మజనింప, నాజ। నంబు లవ్వీరునకు దీవనలఁ బొగడ్త**
లను బ్రమోద మొనర్చిరి; వనధిరవము। ననుకరించె నయ్యులివు నృపాగ్రగణ్య! 3

ప్రతిపదార్థం: నృప= రాజులలో; అగ్రగణ్య!= మొదట లెక్కింపదగినవాడా! జనమేజయా!; విప్వచ్చుఁడు= అర్జునుడు; ఆగమ= వేదములయొక్క; విధివంతముగన్= విధుల ప్రకారంగా; ధర్మ= యముడియొక్క; నందను= కుమారుడైన ధర్మరాజుయొక్క; ఆమంత్రణంబు= వీడ్కోలు; పడసి= పొంది; గాండీవ= గాండీవమనే విల్లు ఉన్న; పాణి+ఐ= చేయికలవాడై; కవదొనల్= రెండు అమ్ముల పొదులను; ధరియించి; తేజస్+విశేషంబు= తేజస్సుయొక్క అతిశయం; రాజితముగన్= ప్రకాశిస్తున్నది కాగా; ఆ+ అశ్వరత్నంబున్= ఆ ఉత్తమాశ్వాన్ని; అనుసరింపఁగన్= వెంటరాగా; బాలురు; వృద్ధులు= ముసలివారు; భామినులును= స్త్రీలునూ; లోనుగాన్= మొదలుగా; ప్రజ= ప్రజలు; పఱతెంచి= వేగంగా వచ్చి; లోలతన్= ఆసక్తితో; అతనిన్= అర్జునుడినీ; హయమును= గుర్రాన్నీ; కనుఁగొను+అప్పుడు= చూచేటప్పుడు; అగ్గలము= అత్యధికమైన; సందడిన్= సమ్మర్దంచేత; ఊష్మ= వేడిమి; జనింపన్= పుట్టగా; ఆ జనంబులు= ఆ ప్రజలు; ఆ+వీరునకున్= వీరుడైన ఆ అర్జునుడికి; దీవనలన్= దీవనలచేతనూ; పొగడ్తలను= ప్రశంసలచేతనూ; ప్రమోదము= సంతోషము; ఒనర్చిరి= కలిగించారు; ఆ+ఉలివు= ఆ ఆశీర్వాదాల, ప్రశంసల ధ్వని; వనధి= సముద్రంయొక్క; రవమున్= ఘోషము; అనుకరించెన్= పోలెను.

తాత్పర్యం: రాజాగ్రగణ్యా! జనమేజయా! అర్జునుడు వేదోక్తంగా ధర్మరాజు వీడ్కోలు పొంది గాండీవాన్ని చేతబట్టి, అమ్ములపొదులజంటను ధరించి, వెలుగులు వెల్లువ కట్టుతుండగా గుర్రాన్ని అనుసరించాడు. అప్పుడు ఆబాలగోపాలమూ అతడినీ, గుర్రాన్నీ ఆసక్తితో చూచేటప్పుడు జనసమ్మర్దంవలన వేడిపుట్టింది. ఆ ప్రజలు ఆశీర్వాదాలు చేసి, ప్రశంసించి అర్జునుడికి సంతోషం కలిగించారు. వారి మాటల సవ్వడి సముద్రఘోషను పోలింది.

విశేషం: అలం: ఉపమ.

వ. **ఇవ్విధంబునం జను నా కవ్వడితోడ యజ్ఞకర్మకుశలుండైన యాజ్ఞవల్క్య శిష్యుం డర్హవిధానంబుల కయి మాననీయ విప్రజన సహితంబుగాఁ జనియె; నప్పరమ తురంగంబు ధరణిం బ్రదక్షిణ రూపంబునం దిరిగి, యుత్తరాభిముఖంబై యల్లనల్లన యరుగుచుండ, నర్జునుం డనుసరించి పాలన పరుండగుచుం బ్రవర్తింపం ద్రిగర్తదేశంబునందు.** 4

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; చను= గుర్రాన్ని అనుసరించే; ఆ+కవ్వడితోడన్= ఆ అర్జునుడితో; యజ్ఞ= యజ్ఞంయొక్క; కర్మ= విధులయందు; కుశలుండు= నేర్పరి; ఐన= అయిన; యాజ్ఞవల్క్య= యాజ్ఞవల్క్యుడియొక్క; శిష్యుండు; అర్హ= తగిన, మార్గంలో చేయదగిన; విధానంబులకున్+అయి= పవిత్ర కర్మముల నిమిత్తం; మాననీయ= ఆదరింపదగిన; విప్రజన= బ్రాహ్మణులతో; సహితంబు+కాన్= కూడిఉండేటట్లుగా; చనియెన్= వెళ్ళాడు; ఆ+పరమ= ఆ శ్రేష్ఠమైన; తురంగంబు=

గుఱ్ఱం; ధరణిన్= భూమియందు; ప్రదక్షిణ= కుడివైపునుండి తిరిగి వచ్చే; రూపంబునన్= ప్రకారంగా; తిరిగి; ఉత్తర= ఉత్తర దిక్కునకు; అభిముఖంబు+ఐ= ఎదురుముఖం కలిగినదై, ఉత్తరదిక్కువైపుగా; అల్లన్+అల్లన్+అ= మెల్ల మెల్లగా; అరుగుచున్+ఉండన్= వెళ్ళుతూ ఉండగా; అర్జునుండు; అనుసరించి= వెంబడించి; పాలన= రక్షించటంలో; పరుండు= శ్రద్ధకలవాడు; అగుచున్= ఔతూ; ప్రవర్తింపన్= నడచుకొంటుండగా; త్రిగర్తదేశంబు+అందున్= త్రిగర్తదేశంలో.

తాత్పర్యం: యజ్ఞకర్మ నిపుణుడైన యాజ్ఞవల్క్యశిష్యుడు మార్గమధ్యంలో తగిన పనుల నిమిత్తం బ్రాహ్మణులతో కూడి అర్జునుడి వెంట వెళ్ళాడు. ఆ యజ్ఞాశ్వం భూమిమీద ప్రదక్షిణం చేసే విధంగా సంచరించి, ఉత్తర దిక్కు వైపునకు మెల్లమెల్లగా వెళ్ళుతున్నది. అర్జునుడు దానిని అనుసరిస్తూ రక్షించటానికి ఎంతో ఆసక్తి చూపుతూ నడుచుకొంటున్నాడు. గుఱ్ఱం త్రిగర్తదేశంలో ప్రవేశించింది. (తరువాతి పద్యంతో అన్వయం)

అర్జునుతోఁ ద్రిగర్తదేశాధిపతులు యుద్ధము చేయుట (సం.14-73-1)

సీ. **ఉద్ధతులై త్రిగర్తోర్వరాపతి పుత్త్ర। పౌత్త్రు లయ్యశ్వంబుఁ బట్టువారు**
గాఁ బూని తేరులు గడురయంబునఁ దోలి। కొని యడ్డముగ వచ్చు కోలుతలకు
నలుగక, నరుఁ డన్నయానతిఁ దలఁచి యా। రాజ కుమార వర్గంబుతోడ
'ధర్మజు నశ్వమేధంబున కపకార। మాచరించుట పాప; మదియుఁ గాక

తే. **యేము మీరును బాంధవ మెసక మెసఁగ। నడచు టొప్పదె; పగ యే?' లనంగ వారు**
సూర్యవర్మ నామకుఁ డగు శూరతమ కు। మారుఁ డగ్రణి గాఁగ నుదారలీల. 5

ప్రతిపదార్థం: త్రిగర్త+ఉర్వరా= త్రిగర్తదేశంయొక్క; పతి= రాజుయొక్క; పుత్త్ర= కుమారులు; పౌత్త్రులు= మనుమలు; ఉద్ధతులు+ఐ= గర్వం కలవారై; ఆ+అశ్వంబున్= ఆ గుఱ్ఱాన్ని; పట్టువారు= బంధించేవారు; కాన్= అయ్యేటట్లుగా; పూని= పూనుకొని; కడున్= మిక్కిలి; రయంబునన్= వేగంగా; తేరులు= రథాలు; తోలికొని= తీసికొని; అడ్డముగన్= అడ్డంగా; వచ్చు= వచ్చునట్టి; కోలుతలకున్= హెచ్చరికకూ, సన్నాహానికీ; అలుగక= కోపించక; నరుఁడు= అర్జునుడు; అన్న= అన్నగారైన ధర్మరాజుయొక్క; ఆనతిన్= ఆజ్ఞను; తలఁచి= స్మరించి; ఆ+రాజకుమార= ఆ రాజకుమారులయొక్క; వర్గంబుతోడన్= సమూహంతో; ధర్మజ= ధర్మరాజుయొక్క; అశ్వమేధంబునకున్= అశ్వమేధయాగానికి; అపకారము= కీడు; ఆచరించుట= చేయటం; పాపము; అదియున్+కాక= అంతేకాకుండా; ఏము= మేమూ; మీరును= మీరూ; బాంధవము= చుట్టరికం; ఎసక మెసఁగన్= అతిశయించగా; నడచుట= ప్రవర్తించటం; ఒప్పదు+ఎ= తగదా; పగ= వైరం; ఏల?= ఎందులకు?; అనంగన్= అనగా; వారు; సూర్యవర్మ; నామకుఁడు= పేరుగలవాడు; అగు= అయిన; శూరతమ= వీరశ్రేష్ఠుడైన; కుమారుఁడు= రాజపుత్రుడు; అగ్రణి= సేనాపతి; కాఁగన్= కాగా; ఉదార= అధికమైన; లీలన్= వీర విలాసంతో.

తాత్పర్యం: అప్పుడు త్రిగర్త దేశాధిపతి కుమారులూ, మనుమలూ కన్నూ మిన్నూ కానకుండా గుఱ్ఱాన్ని బంధించటానికి వేగంగా రథాలు నడుపుతూ, ఎచ్చరికలు చేస్తూ వచ్చారు. వారి పరవళ్ళు చూచి కూడా అర్జునుడు అన్నగారి ఆజ్ఞను గుర్తుచేసికొని వారిని కోపించలేదు. పైగా వారితో 'మీరు ధర్మరాజు అశ్వమేధయాగానికి కీడు తలపెట్టటం పాపం. అదీ కాక మీరూ మేమూ పొత్తు కలిగి నడచుకొనటం తగినపని కదా! మనకు వైరం దేనికి?' అన్నాడు. కాని, ఆ రాజకుమారులు శూరశ్రేష్ఠుడైన సూర్యవర్మ అనే రాజకుమారుడిని సేనాపతిగా చేసికొని వీరవిలాసంతో, (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **కవిసిన వారితో మఱియుఁ గవ్వడి యిట్టు లనున్ 'దయాధురా**
ప్రవణుఁ డజాతశత్రుఁడు తురంగమ రక్షకు నంపునప్టు భూ
పవితతియెల్లనుం దెగియె భారతయుద్ధమునందు; బాలురం
దివిరి వధింపఁ గాదు; కృపఁ దిన్నఁదనం బెసఁగం జరింపుమీ! 6

ప్రతిపదార్థం: కవిసిన= ఎదుర్కొనిన; వారితోన్= ఆ రాజకుమారులతో; మఱియున్= ఇంకనూ; కవ్వడి= అర్జునుడు; ఇట్టులు= ఇట్లు; అనున్= అన్నాడు; దయా= దయ అనెడు; ధురా= బరువునందు; ప్రవణుఁడు= ఆసక్తిగలవాడు (దయా పరిపూర్ణుడని అర్థం); అజాతశత్రుఁడు= తనకు విరోధులు లేనివాడు, తానుగా ఎవ్వరియందునూ శత్రుత్వం వహించనివాడు, ధర్మరాజు; తురంగమ= గుఱ్ఱంయొక్క; రక్షకున్= రక్షకు; అంపు+అప్డు= పంపేటప్పుడు; భారతయుద్ధమునందున్ = భారతయుద్ధంలో; భూప= రాజులయొక్క; వితతి= సమూహం; ఎల్లనున్= అంతయూ; తెగియెన్= నశించింది; తివిరి= ప్రయత్నించి; పూని; బాలురన్= బాలురను, యుద్ధంలో నశించిన ఆ రాజుల కొడుకులను; వధింపన్= చంపగా; కాదు= తగదు; కృపన్= దయతో; తిన్న+తనంబు= మంచితనం; ఎసఁగన్= ఒప్పగా; చరింపుము+ఈ= నడుచుకొనుమా.

తాత్పర్యం: ఎదుర్కొనిన ఆ రాజకుమారులతో అర్జునుడు ఇంకా ఈ విధంగా అన్నాడు 'దయామయుడైన ధర్మరాజు అశ్వ సంరక్షణానికి నన్ను పంపేటప్పుడు 'భారతయుద్ధంలో రాజులందరూ నశించారు. నీవు తొందరపడి వారి కొడుకులను చంపబోకుము. దయతో మంచితనం ఉట్టిపడేటట్లు నడుచుకొనుము.'

చ. **అవినయవృత్తి నశ్వమున కడ్డము వచ్చిర యేని నీవు బాం**
ధవము దలిర్పఁ బల్కి, యని దప్పఁగ ద్రోవుము; కిన్క మాను; మ
న్నవచనవృత్తి నాదగుమనంబున నెక్కొని యున్కిఁ జేసి యా
హవమున కొల్ల నయ్యెదఁ బ్రియంబులు గా వొకొ! మీకుఁ బ్రాణముల్? 7

ప్రతిపదార్థం: అవినయ= వినయంలేని; వృత్తిన్= ప్రవర్తనతో; అశ్వమునకున్= గుఱ్ఱానికి; అడ్డము వచ్చిరి+అ= అడ్డం వచ్చినవారే; ఏని= అయినప్పటికీ; నీవు; బాంధవము= చుట్టరికం; తలిర్పన్= వెల్లడి అయ్యేటట్లుగా; పల్కి= మాటలాడి; అని= యుద్ధం; తప్పఁగన్= తప్పిపోయేటట్లుగా; త్రోవుము= నిరాకరించుము; కిన్క= క్రోధం; మానుము= వదలుము; అన్న= అనిన ధర్మరాజుయొక్క; వచన= మాటలయొక్క; వృత్తిన్= తాత్పర్యం; నా+అది+అగు= నాదైన; మనంబునన్= మనస్సులో; నెక్కొని= గట్టిగా నిలిచి; ఉన్కిన్+చేసి= ఉండటంవలన; ఆహవమునకున్= పోరునకు; ఒల్లన్+అయ్యెదన్= ఒప్పుకొననివాడనయ్యాను; మీకున్= మీకు; ప్రాణముల్= ప్రాణాలు; ప్రియంబులు= ప్రేమించేవి; కావు+ఒకొ?= కావా ఏమి?

తాత్పర్యం: వినయం చూపకుండా గుఱ్ఱానికి అడ్డుపడినప్పటికీ, నీవు చుట్టరికం వెల్లడయ్యేటట్లు మాటలాడి యుద్ధం తప్పిపోయే విధంగా నిరాకరింపుము. క్రోధం వదలిపెట్టుము' అని చెప్పిన వాక్యార్థం నా మనస్సులో గట్టిగా నిలవటంచేత నేను పోరాటానికి ఒప్పుకొననివాడనయ్యాను. మీకు ప్రాణాలమీద తీపి లేదా ఏమి?

చ. **వలవదు పొం' డనంగ నిలువంబడ కేపున సూర్యవర్మ య**
బ్బలియుని మీఁదఁ గ్రూరశరపంక్తి నిగిడ్చినఁ, ద్రుంచెఁ జిప్పయ

మ్ముల నది, యెఱ్ఱనవ్వు తనమోమునుతమ్మికి లేఁతయెండయై

చెలువము చెన్ను వింతలుగఁ జేయఁగ నా విజయుండు భూవరా! 8

ప్రతిపదార్థం: వలవదు= పోరు వద్దు; పొండు= వెళ్ళిపోండి; అనంగన్= అనగా; సూర్యవర్మ; నిలువంబడక= అంతటితో ఆగక; ఏపునన్= మిడిసిపాటుతో; ఆ+బలియునిమీఁదన్= శక్తిమంతుడిమీద, ఆ అర్జునుడిమీద; క్రూర= భయంకరమైన; శర= బాణాలయొక్క; పంక్తిన్= వరుసను; నిగిడ్చినన్= ప్రయోగించగా; భూవరా!= రాజా!; ఆ విజయుండు= ఆ అర్జునుడు; ఎఱ్ఱనవ్వు= క్రోధంవలన కలిగిన నవ్వు; తన= తనయొక్క; మోము= ముఖం; అను= అనెడి; తమ్మికిన్= పద్మమునకు; లేఁత+ఎండ+ఐ= లేత ఎండై; చెలువము= సౌందర్యంయొక్క; చెన్ను= విలాసం; వింతలు+కన్= ఆశ్చర్యకరంగా; చేయఁగన్= చేయగా; చిప్ప= చిప్పవంటి మొనలుగల; అమ్ములన్= బాణాలతో, అర్ధచంద్ర బాణాలతో; అది= సూర్యవర్మ ప్రయోగించిన బాణముల పరంపరను; త్రుంచెన్= ఖండించాడు.

తాత్పర్యం: పోరువద్దు. వెళ్ళిపొండి' అని అనగా సూర్యవర్మ అంతటితో ఆగకుండా పొగరుతో అర్జునుడిమీద పుంఖానుపుంఖంగా బాణాలు ప్రయోగించాడు. జనమేజయా! అప్పుడు అర్జునుడు క్రోధంవలన కలిగిన నవ్వు తన ముఖపద్మానికి లేత ఎండవలె దాని అందాన్ని ఆశ్చర్యకరంగా చేయగా, సూర్యవర్మ ప్రయోగించిన బాణ పరంపరను, అర్ధచంద్రబాణాలతో ముక్కలు ముక్కలుగా చేశాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. **అట్టియెడ.** 9

తాత్పర్యం: ఆ సమయంలో

తే. **సూర్యవర్మని తమ్ముండు శూరవరుఁడు। కేతువర్మ గాండీవిపై శాతబాణ**

వృష్టిఁ గురియుచు నుద్ధురవేగ మొప్ప। నన్నఁ గడచి బె ట్టడరిన నన్నరుండు. 10

ప్రతిపదార్థం: సూర్యవర్మని= సూర్యవర్మయొక్క; తమ్ముండు; శూర= శూరులయందు; వరుఁడు= శ్రేష్ఠుడు; కేతువర్మ; గాండీవిపైన్= అర్జునుడిమీద; శాత= వాడి అయిన; బాణ= బాణాలనెడు; వృష్టిన్= వానను; కురియుచున్= కురిపిస్తూ; ఉద్ధుర= దృఢమైన; వేగము= వేగం; ఒప్పన్= ఒప్పగా; అన్నన్= అన్నను; కడచి= మించి, దాటి; బెట్టు= దిట్టతనంతో; అడరినన్= విజృంభించగా; ఆ+నరుండు= ఆ అర్జునుడు.

తాత్పర్యం: సూర్యవర్మ తమ్ముడూ, వీరశ్రేష్ఠుడూ అయిన కేతువర్మ అర్జునుడిమీద నిశిత బాణవర్షం కురిపిస్తూ మహావేగంతో అన్నను మించి ముందుకు వచ్చి దిట్టతనంతో చెలరేగగా ఆ అర్జునుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. **అతని నొదుంగ నేయుటయు, నాతని తమ్ముఁడు చండ విక్రమో**

ద్ధతి ధృతవర్మ నాముఁ డతిదారుణ సాయకపంక్తి సత్వరా

తతగతిఁ బర్వఁ జేయుచుఁ బృథాసుతుఁ దాఁకిన మెచ్చు వచ్చి య

య్యతిరథవర్యుఁ డప్పుడు తదంగము లేయఁగ నొల్లకుండుటన్. 11

ప్రతిపదార్థం: అతనిన్= కేతువర్మను; ఒదుంగన్= తొలగిపోవగా, యుద్ధరంగంనుండి వెళ్ళేటట్లుగా; ఏయుటయున్= బాణప్రయోగం చేయగా; ఆతని= కేతువర్మయొక్క; తమ్ముఁడు; ధృతవర్మ= ధృతవర్మ అనే; నాముఁడు= పేరుగలవాడు; చండ= తీవ్రమైన; విక్రమ= పరాక్రమంయొక్క; ఉద్ధతిన్= గర్వంతో; అతి= మిక్కిలి; దారుణ= ఘోరమైన; సాయక= బాణాలయొక్క; పంక్తిన్= వరుసను; సహ+త్వరా= వేగంతో కూడిన; ఆతత= విస్తృతమైన; గతిన్= ప్రకారంగా; పర్వన్+చేయుచున్= వ్యాపింపజేస్తూ; పృథా= కుంతియొక్క; సుతున్= కుమారుడు అర్జునుడిని; తాఁకినన్= ఎదుర్కొనగా; అప్పుడు= ఆ సమయంలో; ఆ+అతిరథ= ఆ అతిరథులలో; వర్యుఁడు= శ్రేష్ఠుడు; మెచ్చు= మెప్పు; వచ్చి= పుట్టి; తద్= ధృతవర్మయొక్క; అంగములు= అవయవములు; ఏయఁగన్= గురిగా బాణాలు ప్రయోగింపగా; ఒల్లక= ఇష్టపడక; ఉండుటన్= ఉండటంచేత.

తాత్పర్యం: కేతువర్మ రణరంగంనుండి తొలగిపోయేటట్లుగా బాణాలు ప్రయోగించాడు. అంత కేతువర్మ తమ్ముడు ధృతవర్మ మహాపరాక్రమ గర్వంతో తీవ్రవేగంగా బాణాలు అఖండంగా వేస్తూ అర్జునుడిని ఎదుర్కొన్నాడు. అర్జునుడు అతడి యుద్ధనైపుణ్యాన్ని మెచ్చి అతడి శరీరావయవాలు గురిగా బాణాలు వదలటానికి మనస్కరించకుండా ఉన్నాడు.

చ. **శరములు ద్రుంప, నాతఁడు వెసన్ బలునారసముల్ నిగిడ్చె న**
న్నరుపయి; నా బలిష్ఠుఁడు మనంబునఁ గొండొక యల్క పుట్టి య
న్నరవరసూతి పేరురమునం బదితూపులు గ్రుచ్చె; దానికిం
దెరలక యక్కుమారుఁడును దీవ్రశరంబులఁ జేయి నొంచినన్. **12**

ప్రతిపదార్థం: శరములు= బాణాలు మాత్రం; త్రుంపన్= ఖండింపగా; అతఁడు= ఆ ధృతవర్మ; వెసన్= శీఘ్రంగా; ఆ+నరుపయిన్= ఆ అర్జునుడిమీద; పలు= అనేకములైన; నారసముల్= బాణాలను; నిగిడ్చెన్= ప్రయోగించాడు; ఆ బలిష్ఠుఁడు= బలవంతుడైన ఆ అర్జునుడు; మనంబునన్= మనస్సునందు; కొండొక= కొంచెం; అల్క= కోపం; పుట్టి= పుట్టగా; ఆ నరవర= ఆ రాజుయొక్క; సూతి= బిడ్డయొక్క; పేరు= విశాలమైన; ఉరమునన్= రొమ్ముమీద; పది తూపులు= పదిబాణాలు; గ్రుచ్చెన్= నాటాడు; దానికిన్= ఆ బాణప్రయోగానికి; తెరలక= వెనుకంజవేయక; ఆ కుమారుఁడును= ఆ రాజపుత్రుడునూ; తీవ్ర= వాడి అయిన; శరంబులన్= బాణాలతో; చేయి= చేతిని; నొంచినన్= కొట్టి బాధించగా.

తాత్పర్యం: అర్జునుడు ధృతవర్మ వేసిన బాణాలనుమాత్రం ఖండించాడు. అతడు వేగంగా అర్జునుడిమీద అనేక బాణాలు ప్రయోగించాడు. దీనితో అర్జునుడికి కొంచెం కోపం వచ్చింది. అతడు ఆ రాచబిడ్డ రొమ్ముమీద పది బాణాలు నాటుకొనేటట్లు చేశాడు. రాజపుత్రుడైన ధృతవర్మకూడా వాడితూపులతో అర్జునుడి చేతిని కొట్టి బాధించాడు.

ఆ. **ముష్టి సడలి చోద్యముగను గాండివ మిలఁ। బడిన నా త్రిగర్తబలము దెసలు**
చెలఁగ నార్చె; నందుఁ జేయంగఁగల యోధు। లక్కుమారవర్యు నవులఁ ద్రోచి. **13**

ప్రతిపదార్థం: ముష్టి= పిడికిలి పట్టు; సడలి= తప్పి; చోద్యముగను= ఆశ్చర్యకరంగా; గాండివము= గాండీవం; ఇలన్= భూమిమీద; పడినన్= పడగా; ఆ త్రిగర్త= ఆ దేశానికి చెందిన; బలము= సైన్యం; దెసలు= దిక్కులు; చెలఁగన్= మార్మోగగా; ఆర్చెన్= పెద్దగా అరచారు; అందున్= ఆ సైన్యంలో; చేయంగన్+కల= సమర్థులైన; యోధులు= వీరులు; ఆ కుమార= ఆ రాజపుత్రులలో; వర్యున్= శ్రేష్ఠుడిని; అవులన్= అవతలకు; త్రోచి= నెట్టి వైచి.

తాత్పర్యం: అర్జునుడి పిడికిలి పట్టుతప్పి గాండీవం భూమిమీద పడింది. దానిని చూచిన త్రిగర్త సైన్యం దిక్కులు మార్మోగేటట్లుగా పెద్దగా అరచింది. ఆ సైన్యంలో సమర్థులైన వీరులు కొందరు ధృతవర్మను అవతలికి నెట్టివైచి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **'ఇంద్రధనువు చందంబున నెసక మెసఁగు। గాండివము పాటు గంటిరే; చండవిక్ర**
మాభిరాముండు గాండీవి యన్న పలుకు। లకు మహోగ్రత సూప నొల్లండు గాక. **14**

ప్రతిపదార్థం: ఇంద్ర= ఇంద్రుడియొక్క; ధనువు= ధనుస్సు; చందంబునన్= వలె; ఎసకమెసఁగు= ఒప్పు అతిశయించే; గాండివము= గాండీవంయొక్క; పాటు= పతనం, దుర్గతి; కంటిరి+ఏ= చూచారా; గాండీవి= అర్జునుడు; చండ= తీవ్రమైన; విక్రమ= పరాక్రమంచేత; అభిరాముండు= మనోహరుడు; అన్న= అన్న అయిన ధర్మరాజుయొక్క; పలుకులకున్= మాటలవలన; మహత్= గొప్ప; ఉగ్రత= క్రోధము, భయంకరత్వం; చూపన్= చూపగా; ఒల్లండు+కాక= ఇష్టపడడుగాని.

తాత్పర్యం: 'ఇంద్రధనుస్సువలె అతిశయించే గాండీవ పతనం చూచారా! అర్జునుడు తీవ్ర పరాక్రమంవలన లోకానికి మనోహరుడైనవాడు అన్న ధర్మరాజు పలికిన మాటకు కట్టువడి మాటకు తన వాడినీ వేడినీ చూపటానికి ఇష్టపడటం లేదు కాని. (తరువాతి పద్యంతో అన్వయం)

ఉ. **నిక్కపుఁ గిన్క వచ్చిన ననిన్ నొసలం గనుచూపు, వింటి పా**
టక్కట! రిత్తవోవునె? నృపాత్మజులం దెగటార్చు నీతఁ డిం
దొక్కఁడుఁ ద్రిక్కకుండ; మన యొప్పమి చూడఁగనేల? మున్న పే
రుక్కునఁ దాఁకు టొప్పు' నని యొక్కట నర్జును నాక్రమించినన్. **15**

ప్రతిపదార్థం: నిక్కము= నిజమైన; కిన్క= కోపం; వచ్చినన్= పుట్టితే; ఈతఁడు= ఈ అర్జునుడు; నొసలన్= నుదుటియందు; కను= కంటిని; చూపున్= చూపును; వింటి= విల్లుయొక్క, గాండీవంయొక్క; పాటు= పతనం; రిత్త+పోవును+ఎ?= వ్యర్థమగునా!; ఇందున్= ఈ పక్షమున; ఒక్కఁడున్= ఒకడు కూడా; త్రిక్కక+ఉండన్= మిగలకుండా; నృప= రాజుయొక్క; ఆత్మజులన్= కుమారులను; తెగటార్చున్= చంపును; మనము= మనం; ఒప్పమి= కీడు, వినాశం; చూడఁగన్+ఏల?= చూడటం దేనికి? మున్ను+అ= ముందుగానే; పేరు+ఉక్కునన్= మహాశక్తితో; తాఁకుట= ఎదుర్కొనటం; ఒప్పున్= తగును; అని; ఒక్కటన్= ఒక్కసారిగా; అర్జునున్= అర్జునుడిని; ఆక్రమించినన్= చుట్టుముట్టగా, ఎదుర్కొనగా.

తాత్పర్యం: అర్జునుడికి నిజంగా కోపంవస్తే నొసటియందు మూడోకన్ను చూపిస్తాడు. గాండీవం భూమిమీద పడటం ఊరికేపోదు. మన పక్షంలోని రాజకుమారులను ఒక్కడు కూడా మిగలకుండా ఇతడు సంహరిస్తాడు. మనం ఆ వినాశాన్ని మన కనులార చూడటం దేనికి? ముందుగానే మనం మన బలమంతా చూపి అతడిని ఎదుర్కొనటం మంచిది' అని అర్జునుడిని ఒక్కసారిగా ఎదుర్కొనగా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. **అటమున్న గాండివం బు। త్కటరయమున నెత్తి కోపదహనుం డత్యు**
ద్భటమూర్తిఁ దాల్చెనన మి। క్కుటమై కడగంటి కెంపు గొమరారంగన్. **16**

ప్రతిపదార్థం: అటమున్ను+అ= అంతకుముందే; ఉత్కట= అధికమైన; రయమునన్= వేగంతో; గాండివంబు= గాండీవాన్ని; ఎత్తి= పైకెత్తి; కోపదహనుండు= కోపాగ్ని; అతి= మిక్కిలి; ఉద్భట= భయంకరమైన; మూర్తిన్= రూపాన్ని; తాల్చెన్= ధరించాడు; అనన్= అనగా; మిక్కుటము+ఐ= అధికమై; కడ+కన్ను+కెంపు= కనుగొలుకుల ఎరుపు; కొమరారంగన్= సొంపారగా.

తాత్పర్యం: అంతకుముందే భూమిమీద పడిన గాండీవాన్ని మహావేగంగా పైకి తీసికొని కోపాగ్ని భయంకరాకారం ధరించిందా? అనేటట్లుగా కడగన్నులలో ఎరుపు సొంపారగా. (తరువాతి వచనంతో అన్వయం)

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. ఆ బీభత్సుండు 17

తాత్పర్యం: ఆ అర్జునుడు (తరువాతి పద్యంతో అన్వయం)

క. పిడుగులు వడిఁ బె క్కొక్కటఁ । బడియెడు ననఁ దొరఁగఁ జేసెఁ బటు విశిఖము ల
ప్పుడు మేదిని దోఁపద చె । ప్పెడు కొలఁదియె రథికవరుల పీనుఁగు పెంటల్. 18

ప్రతిపదార్థం: పిడుగులు; పెక్కు= అనేకములు; వడిన్= వేగంగా; ఒక్కటన్= ఒక్కమారుగా; పడియెడున్= పడుతున్నాయో; అనన్= అనగా; పటు= వాడియైన; విశిఖములు= బాణాలు; తొరఁగన్+చేసెన్= విడిచాడు; అప్పుడు= ఆ సమయంలో; మేదిని= భూమి; తోఁపదు+అ= కనబడనే లేదు; రథిక= రథ యజమానులలో; వరుల= శ్రేష్ఠులైన వారియొక్క; పీనుఁగు పెంటల్= శవాల కుప్పలు; చెప్పెడు= ఇన్నీ అన్నీ అని చెప్పేటటువంటి; కొలఁది+ఎ= స్థితియా, విధమా.

తాత్పర్యం: ఎన్నో పిడుగులు ఒక్కసారిగా పడుతున్నాయనేటట్లుగా వాడి బాణాలు ప్రయోగించాడు. అవి అంతటా పడటంవలన భూమి కనబడనేలేదు. ఇక రథికశ్రేష్ఠుల పీనుగుల ప్రోగులు ఇన్నీ అన్నీ చెప్పే స్థితి కూడా లేదు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

శా. ఆ యుగ్రోద్ధతి చూచి పెల్కుటి త్రిగర్తానీకముల్ నల్గడం
బాయం బాఱెఁ; దదాప్తు 'లేము దగ నీపం పోపి సద్భక్తిమైఁ
జేయంగాఁ బనిగొమ్ము; పేర్మిగ మముం జేకొమ్ము సమ్యగ్దయా
శ్రీయుక్తా!' యనినన్ ధనంజయుఁడు గాచెన్ వారినెల్లం గృపన్. 19

ప్రతిపదార్థం: త్రిగర్త= త్రిగర్త దేశంయొక్క; అనీకముల్= సేనలు; ఆ+ఉగ్ర= ఆ భయంకరమైన; ఉద్ధతి= విజృంభణం; చూచి; పెల్కుటి= భయపడి; నలు+కడన్= నాలుగు దిక్కులయందు; పాయన్= చెల్లాచెదరయ్యేటట్లుగా; పాఱెన్= పారిపోయారు; తద్= ఆ పారిపోయిన సేనలయొక్క; ఆప్తులు= మిత్రులు? ముఖ్యులు?; సమ్యక్= పరిపూర్ణమైన; దయా= దయ అనెడి; శ్రీ= లక్ష్మితో; యుక్తా!= కూడినవాడా!= ఏము= మేము; నీ= నీయొక్క; పంపు= ఆజ్ఞ; ఓపి= అప్రమత్తతతో ఉండి; సత్+భక్తి+మైన్= ఉత్తమ భక్తితో; తగన్= అనుకూలంగా; చేయంగాన్= చేయగా; పనిగొమ్ము= నియోగించుము; మమున్= మమ్ము; పేర్మిగన్= ప్రేమగా; చేకొమ్ము= ఆదరించుము; అనినన్= అనగా; ధనంజయుఁడు= అర్జునుడు; కృపన్= దయతో; వారిన్+ఎల్లన్= వారినందరినీ; కాచెన్= కాపాడాడు.

తాత్పర్యం: అర్జునుడు భయంకర విజృంభణాన్ని చూచి భయపడి త్రిగర్త సేనలు చెల్లాచెదరై నాలుగు దిక్కులకు పారిపోయాయి. ఆ సేనలలోని ముఖ్యులు పరిపూర్ణ దయాసంపన్నా! మేము మీ ఆజ్ఞను పరాకులేకుండా సద్భక్తితో అనుకూలంగా చేసేటట్లుగా నియోగించుము. ప్రేమతో మమ్ము ఆదరించుము' అని అన్నారు. అర్జునుడు వారినందరిని దయతో కాపాడాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. **అట్లు వెనుకొనక నిలిచి, యెలుంగెత్తి, వారలతో 'మీ రిట్లు ప్రాణంబులు గాచికొనుండు; నా పంచిన పనిసేయం బుద్ధి గలిగి సుఖులరై యుండుం' డని పలికి యయ్యశ్వంబు ననుసరించె; నది క్రమగతిం బ్రాగ్జ్యోతిష పురపరిసరంబునకుం బోయిన, దాని తెఱం గాకర్ణించి.** **20**

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; వెనుకొనక= వెంబడించక; నిలిచి= ఉన్నచోటనే ఉండి; ఎలుంగు+ఎత్తి= గొంతెత్తి; వారలతోన్= వారితో; మీరు; ఇట్లు= ఈ విధంగా; ప్రాణంబులు= ప్రాణాలు; కాచికొనుండు= కాపాడుకొనండి; నా పంచిన= నేను ఆజ్ఞాపించిన; పని; చేయన్= చేయగా; పూని= తలపెట్టి; బుద్ధి= వివేకం; కలిగి; సుఖులరు+ఐ= సుఖం కలిగినవారై; ఉండుఁడు= బ్రతకండి; అని; పలికి= చెప్పి; ఆ అశ్వంబున్= ఆ గుర్రాన్ని; అనుసరించెన్= వెంబడించాడు; అది= ఆ గుర్రం; క్రమ= సక్రమమైన; గతిన్= గమనంతో; ప్రాగ్జ్యోతిష= ప్రాగ్జ్యోతిషమనే; పుర= పట్టణంయొక్క; పరిసరంబునకున్= సమీప ప్రదేశానికి; పోయినన్= వెళ్ళగా; దాని= ఆ గుర్రంయొక్క; తెఱంగు= వృత్తాంతం; ఆకర్ణించి= విని.

తాత్పర్యం: ఆ విధంగా అర్జునుడు ఆ సేనలను వెంబడించకుండా ఉండి వారితో 'మీరు ఈ విధంగా ప్రాణాలు కాపాడుకొనండి. నేను ఆజ్ఞాపించిన పని చేస్తూ బుద్ధికలిగి సుఖంగా ఉండండి' అని చెప్పి ఆ యజ్ఞాశ్వాన్ని వెంబడించాడు. అది సక్రమంగా నడుస్తూ ప్రాగ్జ్యోతిషపురం దగ్గరకు వచ్చింది. దాని సమాచారం విని. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **భగదత్తతనయుండు బాహుగర్వంబున । బాల్యసిద్ధం బగు లౌల్యమునను**
బురి నిర్గమించి యత్తురగంబు వెలిపించి । కొని పోవఁ గాంచి యర్జునుఁడు గాండి
వము సజ్యముగఁ జేసి వాలమ్ము లొక్కట । నక్కుమారునిమీఁదఁ బెక్కు గురియ
నవ్వజ్రదత్తుండు నొవ్వు దన్కిన దాని । నచ్చట దిగఁ ద్రావి చొచ్చెఁ బురము

తే. **సత్వరంబుగ నటు సొచ్చి సామజంబుఁ । బన్నఁగాఁ బంచి వెస నెక్కి బలముఁ జలము**
వీఁకయును నొప్ప నన్నరుఁ దాఁకి శాత । ఘన శరంబులు పరఁగించెఁ గౌరవేంద్ర! **21**

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కౌరవులలో శ్రేష్ఠుడా!, జనమేజయా!; భగదత్త= భగదత్తుడియొక్క; తనయుండు= కొడుకు వజ్రదత్తుడు; బాహు= భుజబలంవలన కలిగిన; గర్వంబునన్= గర్వంతో; బాల్య= కుర్రతనంవలన; సిద్ధంబు= కలిగినది; అగు= అయిన; లౌల్యమునను= చాపల్యంతో; పురిన్= పట్టణం నుండి; నిర్గమించి= వెలువడి; ఆ తురగంబున్= ఆ యజ్ఞాశ్వమును; వెలిపించి= రక్షణ వలయమునుండి బయటికి రప్పించి; కొనిపోవన్= తీసికొనిపోగా; అర్జునుఁడు; కాంచి= చూచి; గాండివము= గాండీవాన్ని; సజ్యముగన్= ఎక్కు పెట్టినదిగా; చేసి; ఒక్కటన్= ఒక్కసారిగా; వాలు+అమ్ములు= వాడియైన బాణాలు; పెక్కు= అనేకములు; ఆ కుమారునిమీఁదన్= ఆ రాజపుత్రుడిమీద; కురియన్= కురిపించగా; ఆ వజ్రదత్తుండు= ఆ వజ్రదత్తుడు; నొవ్వు= బాధ; తన్కినన్= ఎక్కువకాగా; దానిన్= ఆ యజ్ఞాశ్వమును; అచ్చటన్= అక్కడ; దిగఁద్రావి= విడిచి; పురము= పట్టణం; చొచ్చెన్= ప్రవేశించాడు; అటు= ఆ విధంగా; చొచ్చి= ప్రవేశించి, సామజంబున్= ఏనుగును; సత్వరంబుగన్= వేగంగా; పన్నఁగాన్= సిద్ధం చేయగా; పంచి= ఆజ్ఞాపించి; వెసన్= తొందరగా; ఎక్కి; బలమున్= బలమూ; చలమున్= పట్టుదల; వీఁకయును= పరాక్రమమునూ, ఉత్సాహమునూ; ఒప్పన్= ఒప్పగా; ఆ నరున్= ఆ అర్జునుడిని; తాఁకి= ఎదుర్కొని; శాత= వాడి అయిన; ఘన= గొప్పవి అయిన; శరంబులు= బాణాలు; పరఁగించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: జనమేజయా! భగదత్తుడి కుమారుడు వజ్రదత్తుడు భుజబలగర్వంవలన, బాల్యచాపల్యంవలన నగరంనుండి వెలువడి ఆ గుర్రాన్ని సైనిక వలయం నుండి బయటికి రప్పించి తీసికొనిపోయాడు. అది చూచి అర్జునుడు గాండీవం

ఎక్కుపెట్టి ఒక్కసారిగా వజ్రదత్తుడిమీద వాడి బాణాలు ఎన్నో ప్రయోగించాడు. వాటివలన బాధ ఎక్కువై, ఆ రాజకుమారుడు గుర్రాన్ని వదలి పట్టణం ప్రవేశించాడు. వెంటనే ఏనుగును యుద్ధానికి సన్నద్ధం చేయండని ఆజ్ఞాపించాడు. తొందరగా ఏనుగు నెక్కి వచ్చి బలమూ, పట్టుదలా, పరాక్రమమూ ఒప్పుతుండగా అర్జునుడిని ఎదుర్కొని అతడిమీద గొప్ప గొప్ప వాడిబాణాలు ప్రయోగించాడు.

క. **నడుమన వానిం బార్థుఁడు। పొడిగా నేయంగఁ గనలి భూపకుమారుం**
డడరించెఁ దోమరంబులు। గడుఁ బె క్కవి మిడుత కదుపు గతిఁ గవియంగన్. **22**

ప్రతిపదార్థం: పార్థుఁడు= అర్జునుడు; వానిన్= ఆ బాణాలను; నడుమన్+అ= మధ్యలోనే; పొడి+కాన్= పొడి అయ్యేటట్లుగా; ఏయంగన్= బాణాలు వేయగా; భూప= రాజుయొక్క, భగదత్తుడియొక్క; కుమారుండు= కొడుకు; కనలి= కోపించి; తోమరంబులు= చిల్లకోలలు, చెవివంటి వంకర మొనలుగల బాణాలు; పెక్కు= అనేకములు; కడున్= మిక్కిలి; అడరించిన్= ప్రయోగించాడు; అవి= వజ్రదత్తుడి బాణాలు; మిడుత= మిడుతలయొక్క; కదుపు= గుంపు; గతిన్= వలె; కవియన్+కన్= క్రమ్మగా.

తాత్పర్యం: అర్జునుడు మధ్యలోనే వజ్రదత్తుడి బాణాలు పొడి పొడి చేశాడు. అప్పుడు ఆ రాజపుత్రుడు క్రోధం వహించి ఎన్నో చిల్లకోలలు ప్రయోగించాడు. అవి మిడుతలదండువలె అర్జునుడిని పొదివినవి.

విశేషం: అలం: ఉపమ.

ఆ. **అనల శిఖలు వోని యమ్ములగమి వాని। రూపుమాపి యన్నరుండు వాఁడి**
లేని దొడ్డ తూఁపు లేనింటిఁ దొడి రాచ। కొడుకు నేసెఁ దూలి పుడమిఁ గూల. **23**

ప్రతిపదార్థం: ఆ నరుండు= ఆ అర్జునుడు; అనల= అగ్నియొక్క; శిఖలు+పోని= జ్వాలలవంటి; అమ్ముల= బాణాలయొక్క; గమిన్= సమూహంతో; వానిన్= ఆ చిల్లకోలలను; రూపుమాపి= రూపం లేకుండా చేసి, నాశంచేసి; వాఁడి= వాడి; లేని; దొడ్డ= పెద్దవైన; తూఁపులు= బాణాలు; ఏనింటిన్= అయిదింటిని; తొడి= తొడిగి; తూలి= ఒక ప్రక్కకు వ్రాలి; పుడమిన్= నేలమీద; కూలన్= పడగా; రాచకొడుకున్= రాజపుత్రుడైన వజ్రదత్తునిమీద; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడు అగ్నిజ్వాలలవంటి బాణాలతో వజ్రదత్తుడి బాణాలను అడ పొడ కానరాకుండా చేశాడు. వాడిలేని పెద్ద బాణాలను ఐదింటిని ప్రయోగించి రాజపుత్రుడైన వజ్రదత్తుడు తూలి నేలమీద పడేటట్లు చేశాడు.

క. **కూలియు నీడంబోవక। బాలుఁడు రయమార దంతిపైకిం జని దో**
ర్లీల మెఱయ నరుఁ బటు శర। జాలంబులఁ బొదివె గగనచరు లగ్గింపన్. **24**

ప్రతిపదార్థం: బాలుఁడు= వజ్రదత్తుడు; కూలియున్= నేలమీద పడినప్పటికీ; ఈడన్+పోవక= వెనుదీయక; రయము+ఆరన్= వేగం అతిశయిల్లగా; దంతిపైకిన్= ఏనుగు మీదికి; చని= వెళ్ళి; దోస్+లీల= భుజబల విలాసం; మెఱయన్= ప్రకాశించగా; గగన చరులు= దేవతలు; అగ్గింపన్= పొగడగా; పటు= శక్తిమంతాలైన; శర= బాణాలయొక్క; జాలంబులన్= సమూహాలతో; పొదివెన్= కప్పాడు.

తాత్పర్యం: నేలమీద పడినప్పటికీ వజ్రదత్తుడు వెనుకంజవేయక మహావేగంతో ఏనుగు నెక్కి, భుజబలవిలాసం వెల్లడి కాగా, దేవతలు స్తుతించేటట్లు అర్జునుడిని బలమైన బాణాలతో కప్పివేశాడు.

చ. అతఁడును దీవ్రబాణముల నా భగదత్త తనూజు దంతి నా
వృతముగఁ జేసె; నట్లు పృథివీవర నందన! యేమి చెప్పుదున్;
శతమఖ పుత్త్రుతోడ దివసత్రయ ముగ్రరణం బొనర్చె; న
ద్భుత మెసఁగం జతుర్థదినముం దెగునంతకుఁ బోరె ధీరతన్. 25

ప్రతిపదార్థం: పృథివీవర= భూపతియొక్క; నందన!= కుమారా! జనమేజయా!; అతఁడును= ఆ అర్జునుడునూ; తీవ్ర= వాడిఅయిన; బాణములన్= బాణాలతో; ఆ భగదత్త= ఆ భగదత్తుడియొక్క; తనూజ= కుమారుడియొక్క (వజ్రదత్తుడి); దంతిన్= ఏనుగును; ఆవృతముగన్+చేసెన్= కప్పబడినదానినిగా చేశాడు; ఏమి= ఏమని; చెప్పుదున్= చెప్పుతాను; అట్లు= ఆ విధంగా; శతమఖ= ఇంద్రుడియొక్క; పుత్త్రుతోడన్= కొడుకైన అర్జునుడితో; దివసత్రయము= మూడు రోజులు; ఉగ్ర= భయంకరమైన; రణంబు= యుద్ధం; ఒనర్చెన్= చేశాడు; అద్భుతము= ఆశ్చర్యం; ఎసఁగన్= అతిశయించగా; చతుర్థదినమున్= నాలుగవ రోజుకూడా; తెగు+అంతకున్= ముగిసేవరకు; ధీరతన్= ధైర్యంతో; పోరెన్= పోరాడాడు.

తాత్పర్యం: జనమేజయా! అర్జునుడు వాడిబాణాలతో వజ్రదత్తుడి ఏనుగును కప్పివేశాడు. ఇక చెప్పటానికి ఏమున్నది? అతడు అర్జునుడితో మూడు రోజులు భయంకర యుద్ధం చేశాడు. ఆశ్చర్యకరంగా నాలుగవ రోజు ముగిసేవరకు పోరాడాడు.

వ. తెగియెడు సమయంబున. 26

ప్రతిపదార్థం: తెగియెడు= ముగిసే; సమయంబునన్= సమయంలో.

తాత్పర్యం: నాలుగవరోజు ముగిసేటప్పటికి, (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. అక్కుమారుఁ డేచి 'యర్జున! యర్జున! యేను గలుగ నీకు నెందుఁ బోవ
వచ్చు? వృద్ధుఁడైనవాఁడు గావునఁ దండ్రి। సమసె; నట్లు నన్ను సమతె బేల!' 27

ప్రతిపదార్థం: ఆ కుమారుఁడు= ఆ రాజకుమారుడు; ఏచి= చెలరేగి; అర్జున! అర్జున!; ఏను= నేను; కలుగన్= ఎదుటపడిన; నీకున్= నీకు; ఎందున్= ఎక్కడకు; పోవన్= పోవగా; వచ్చున్?= సాధ్యమగును!; తండ్రి= మా తండ్రి అగు భగదత్తుడు; వృద్ధుఁడు= ముదుసలి; ఐనవాఁడు= అయినాడు; కావునన్= కావున; సమసెన్= నీ చేతిలో మరణించాడు (చూడు, ద్రోణపర్వం,ప్రథమాశ్వాసం); బేల!= పిరికిపందా!; అట్లు= ఆ విధంగా; నన్నున్= నన్ను; సమతు+ఎ?= చంపుతావా?

తాత్పర్యం: భగదత్తుడి కుమారుడూ, యువకుడూ అయిన వజ్రదత్తుడు చెలరేగి 'అర్జునా! అర్జునా! నీవు నా కంటబడిన తరువాత ఇం కెక్కడికి వెళ్ళగలవు? మా తండ్రి ముసలివాడు కావున నీ చేతిలో మరణించాడు. ఆ విధంగా నన్ను చంపగలవా?'

విశేషం: ఈ పద్యంలో 'సమతె' అనే క్రియ ఉన్నది. ఇది విశిష్ట క్రియ. శబ్దరత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటువు దీనిని నిరూపించలేదు. దీనిని రెండు రకాలుగా సాధింపవచ్చును.

సమయుధాతువు ప్రేరణార్థక రూపం 'సమచు' అని భావించి (పాయు ప్రేరణార్థక రూపము పాచు అయినది కదా) దాని నుండి సమతువు - సమతు - సమతె అను రూపాలను క్రమంగా నిష్పాదించవచ్చును. కాని, 'సమచు' ప్రేరణార్థక ధాతువు ప్రాచీనకవి ప్రయోగాలలో కనబడదు. తిక్కనయే దీనిని ప్రయోగించాడని అనుకోవాలి.

కిట్టెలుదొర రచించిన కర్ణాట భాషా నిఘంటువులలో సమసు, సమయసు మున్నగు ధాతురూపాలున్నాయి. సమయిసు ధాతువు తెలుగులోని సమయించు ధాతువు వంటిదే. కావున సమసు ధాతువు వంటి సమచు ధాతువు తెలుగులో ఒక కాలంలో ఉండి ఉండవచ్చును. కిట్టెలు దొరగారు 'సమయిసు= సమసు= To destroy' అని వ్రాశారు. పెద్దలు ఇందలి ఔగాములు నిర్ణయింతురు గాక!

వ. అని యదల్చి. **28**

తాత్పర్యం: అని అర్జునుడిని గద్దించి.

క. పెను సెలయేఱులు వాఱఁగఁ। దనరు గిరియుఁ బోలె బహుమదంబులు దొరఁగం
గనుపట్టు కుంజరము సిం। హనిభుం డగు పార్థుమీఁద నడరం జేసెన్. **29**

ప్రతిపదార్థం: పెను= పెద్ద; సెలయేఱులు= సెలయేళ్ళు; పాఱఁగన్= పైనుండి క్రిందికి ప్రవహిస్తుండగా; తనరు= ఒప్పెడి; గిరియున్+ పోలెన్= కొండవలె; బహు= అధికమైన; మదంబులు= మదజలాలు; తొరఁగన్= కారుచుండగా; కనుపట్టు= కనిపించే; కుంజరమున్= ఏనుగును; సింహ= సింహంతో; నిభుండు= సమానుడు; అగు= అయిన; పార్థుమీఁదన్= అర్జునుడిమీద; అడరన్+చేసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: బహుళంగా మదజలాలు ప్రవహించటంవలన పెద్ద పెద్ద సెలయేళ్ళతో కూడిన కొండవలె ఉన్న ఏనుగును, సింహ సమానుడైన అర్జునుడిమీదకు వజ్రదత్తుడు తోలాడు.

విశేషం: అలం: ఉపమ. అర్జునుడు సింహంతో సమానుడు. అటువంటివాడి మీదికి వజ్రదత్తుడు ఏనుగును తోలాడు. గజసింహాల వైరం ప్రసిద్ధం. సింహంవంటి అర్జునుడు తనమీదకు వచ్చిన ఏనుగును తప్పక సంహరిస్తాడని కవిబ్రహ్మ ముందుగా సూచించాడు.

క. అది పూత్కారము చేసిన। నొదవిన కర శీకరముల నుర్వీవర! యం
బుదముక్త సలిల ధారలు। పొదివిన గిరివోలె నింద్రపుత్త్రుం డొప్పెన్. **30**

ప్రతిపదార్థం: ఉర్వీవర!= భూపతీ! జనమేజయా!; అది= ఏనుగు; పూత్కారము చేసినన్= ఊదగా; ఒదవిన= పుట్టిన; కర= తొండముయొక్క; శీకరములన్= నీటి తుంపురులచేత; అంబుద= మేఘంచేత; ముక్త= విడువబడిన; సలిల= ఏటియొక్క; ధారలు; పొదివిన= క్రమ్మిన; గిరి+పోలెన్= కొండవలె; ఇంద్ర= ఇంద్రుడియొక్క; పుత్త్రుండు= కుమారుడు అర్జునుడు; ఒప్పెన్= ఒప్పాడు.

తాత్పర్యం: జనమేజయా! ఆ ఏనుగు ఊదినప్పుడు తొండంనుండి పుట్టిన నీటి తుంపురులతో నిండిన అర్జునుడు మేఘం వదలిన జలధారలు క్రమ్మిన కొండవలె ఒప్పాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ.

చ. కరి యిటు లేపునం గవియఁగా భగదత్తసుతుండు దీప్త ని
ష్ఠుర శరపంక్తి నాహవపటుత్వము సూపిన నల్పకోప సుం
దరుఁ డగుచున్ నరుండు శతధారనిభం బగు నారసంబు భీ
కరగతి నేయఁ గూలె నది కౌరవనాయక! పర్వతాకృతిన్. 31

ప్రతిపదార్థం: కౌరవ నాయక!= కౌరవులలో శ్రేష్ఠుడా!; కరి= ఏనుగు; ఇటులు= ఈ విధంగా; ఏపునన్= సంరంభంతో; కవియఁగాన్= పై కురుకగా; భగదత్త= భగదత్తుడియొక్క; సుతుండు= కుమారుడు (వజ్రదత్తుడు); దీప్త= మండుతున్న; నిష్ఠుర= కఠినాలైన; శర= బాణాలయొక్క; పంక్తిన్= వరుసతో; ఆహవ= యుద్ధంయొక్క; పటుత్వము= దిట్టతనం; చూపినన్= ప్రదర్శించగా; అల్ప= తక్కువ అయిన; కోప= కోపంచేత; సుందరుఁడు= అందగాడు; అగుచున్= అవుతూ; నరుండు= అర్జునుడు; శతధార= వజ్రాయుధంతో; నిభంబు= సమానం; అగు= అయిన; నారసంబున్= బాణాన్ని; భీకర= భయం కలిగించే; గతిన్= విధంగా; ఏయన్= ప్రయోగించగా; అది; పర్వత+ఆకృతిన్= పర్వతంవలె; కూలెన్= కూలిపోయినది.

తాత్పర్యం: జనమేజయా! ఈ విధంగా ఏనుగు అర్జునుడిపైకి ఉరకగా వెంటనే వజ్రదత్తుడు మండుచున్న బాణపరంపర ప్రయోగించి తన యుద్ధపాటవాన్ని చూపాడు. ఇదంతా చూస్తున్న అర్జునుడికి చిరుకోపం వచ్చింది. అది అతడికి అందాన్ని తెచ్చింది. అతడు వజ్రాయుధంతో సమానమైన బాణాన్ని భీకరంగా ప్రయోగించేటప్పటికి ఏనుగు పర్వతంవలె కూలిపోయినది.

విశేషం: అలం: ఉపమ.

క. కూలిన నేలకు వచ్చిన। బాలుం గని నాకలోకపతిసుతుఁడు దయా
లోలుండై మార్దవ హృ। ద్యాలాపము లొప్ప నిట్టు లను నాతనితోన్. 32

ప్రతిపదార్థం: కూలినన్= ఏనుగు కూలిపోగా; నేలకున్ వచ్చిన= నేలపై పడిపోయిన; బాలున్= వజ్రదత్తుడిని; కని= చూచి; నాకలోక= స్వర్గలోకంయొక్క; పతి= నాథుడైన ఇంద్రుడియొక్క; సుతుఁడు= కుమారుడు అర్జునుడు; దయా= దయచేత; లోలుండు= చలించినవాడు; ఐ= అయిన; మార్దవ= మెత్తదనంతో కూడిన; హృద్య= మనోహరమైన; ఆలాపములు= మాటలు; ఒప్పన్= ఒప్పగా; అతనితోన్= ఆ వజ్రదత్తుడితో; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అన్నాడు.

వ. 'ధర్మతనయుం డశ్వమేధ దీక్షితుండయి యిత్తురంగంబుపజ్జ నన్నుం బుత్తెంచునప్పుడు. 33

ప్రతిపదార్థం: ధర్మ= యముడియొక్క; తనయుండు= కుమారుడు ధర్మరాజు; అశ్వమేధ= అశ్వమేధయాగంలో; దీక్షితుండు= దీక్షవహించినవాడు; అయి; ఈ తురంగంబు= ఈ గుర్రంయొక్క; పజ్జన్= వెనుక; నన్నున్= నన్ను; పుత్తెంచు+అప్పుడు= పంపేటప్పుడు.

తాత్పర్యం: 'ధర్మరాజు అశ్వమేధయాగ దీక్ష వహించి నన్ను ఈ గుర్రం వెంట పంపేటప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'చంపకుమీ! రాజుల; నను । కంపాతిశయంబు మెఱయఁగా నడపుము; నీ
పెం పను కుసుమమునకు నా । పం పొనరించుటయ సౌరభముగ నెఱుఁగుమీ!' 34

ప్రతిపదార్థం: రాజులన్= రాజులను; చంపకుము+ఈ= చంపకుమా!; అనుకంపా= దయయొక్క; అతిశయంబు= ఆధిక్యం; మెఱయఁగాన్= ప్రకాశించగా; నడపుము= గుర్రాన్ని నడిపింపుము; నీ= నీయొక్క; పెంపు= గొప్పతనం అనే; కుసుమమునకున్= పువ్వునకు; నా= నాయొక్క; పంపు= ఆజ్ఞ; ఒనరించుట+అ= నిర్వర్తించటమే; సౌరభము+కన్= వాసనగా; ఎఱుఁగుము+ఈ!= తెలిసికొనుమా!

తాత్పర్యం: 'రాజులను చంపవలదు. దయామయుడవై గుర్రాన్ని నడిపించుము. నా ఆజ్ఞను పరిపాలించటమే నీ గొప్పతనం అనే పువ్వునకు వాసన.'

విశేషం: అలం: రూపకం. పూవునకూ తావికీ అవినాభావ సంబంధం ఉంటుంది. ధర్మజుడి ఆజ్ఞ ప్రకారం నడచుకొనటానికీ, అర్జునుడి గొప్పతనానికీ ఆ సంబంధమే ఉంటుంది. ధర్మరాజు చెప్పిన రీతిగా నడచుకొనటమే అర్జునుడి గొప్పతనానికి మూలకందం.

క. అనియెం గావున నీపైఁ । గినుక వొడమ; దలుక విడువు; గీతయశుం డా
జనపతి యాగంబునకుం । జనుదేరఁగ వలయు బంధుజనముల్ నీవున్. 35

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; కావునన్= కావున; నీపైన్= నీ మీద; కినుక= కోపం; పొడమదు= పుట్టదు; అలుక= (నీవునూ) కోపాన్ని; విడువు= వదలుము; గీత= గానం చేయబడిన; యశుండు= కీర్తికలవాడు; ఆ జనపతి= ఆ రాజుయొక్క; యాగంబునకున్= ఆ యజ్ఞానికి; నీవున్= నీవునూ; బంధుజనముల్= నీ చుట్టాలునూ; చనుదేరఁగన్‌వలయున్= తప్పక రావలెను.

తాత్పర్యం: అని అన్నాడు. కాబట్టి నాకు నీ మీద కోపం లేదు. నీవూ కోపాన్ని త్యజించుము. అందరూ గానం చేసే కీర్తి పొందిన ఆ మహారాజు యజ్ఞానికి నీవూ నీ చుట్టపక్కాలూ తప్పక రావాలి.

ఆ. అధిపతనయ! నిన్ను నామంత్రితునిఁ జేసి । పోవుచున్నవాఁడ; నీవు హస్తి
పురికి భావి చైత్రమునఁ బున్నమకు ముద । మొదవ నరుగుదెంచు టొప్పుఁజేయు.' 36

ప్రతిపదార్థం: అధిప తనయ!= రాజకుమారా!; నిన్నున్= నిన్ను; ఆమంత్రితునిన్= ఆహ్వానించబడినవాడినిగా; చేసి= చేసి (నిన్ను పిల్చి అని అర్థం); పోవుచున్+ఉన్నవాఁడన్= వెళ్ళుతున్నాను; నీవు; ముదము= సంతోషం; ఒదవన్= కలుగగా; భావి= రాబోయే; చైత్రమునన్= చైత్రమాసంలో; పున్నమకున్= పూర్ణిమనాటికి; హస్తినాపురికిన్= హస్తినాపురానికి; అరుగుదెంచుట= రావటం; ఒప్పుచేయున్= ఆనందాన్ని కలిగిస్తుంది.

తాత్పర్యం: రాజకుమారా! నిన్ను ఆహ్వానించి నేను వెళ్ళుతున్నాను. నీవు రాబోయే చైత్రమాసంలో పూర్ణిమనాటికి నిర్విచారంగా హస్తినాపురానికి రమ్ము! నీ రాక మా కానందాన్ని కలిగిస్తుంది.'

క. అనిన నతఁ డట్ల కా కని । వినతుం డగుటయును, బ్రీతి విజయుం డభినం
దన మాచరించి యశ్వము । వెనుకఁ జనియెఁ బూరుకులపవిత్రచరిత్రా! 37

ప్రతిపదార్థం: పూరు= పూరుడియొక్క; కుల= కులానికి; పవిత్ర= శుద్ధి కలిగించే; చరిత్ర!= నడవడి కలవాడా! జనమేజయా!; అనినన్= అర్జునుడు ఆ విధంగా అనగా; అతఁడు= వజ్రదత్తుడు; అట్ల కాక= అట్లే అగును గాక! సరే; అని; వినతుండు= నమస్కరించినవాడు; అగుటయును= కాగా; విజయుండు= అర్జునుడు; ప్రీతిన్= సంతోషంతో; అభినందనము= ప్రశంస; ఆచరించి= చేసి; అశ్వము= గుర్రంయొక్క; వెనుకన్= వెంట; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా అనగా వజ్రదత్తుడు సరే అని అతడికి నమస్కరించాడు. అతడు సంతోషించి రాజకుమారుడిని ప్రశంసించి గుర్రంవెంట వెళ్ళాడు.

అర్జునుఁడు సింధుదేశాధీశులతోఁడ యుద్ధంబు చేయుట (సం. 14-76-1)

వ. **అది సింధుదేశవర్తి యగుటయు, భారత రణ హతులైన సైంధవ యోధుల పుత్త్రపౌత్త్రులు, పూర్వవైరంబు వాటించి యాటోపంబున ననేక సహస్ర సంఖ్యల రథికులు రాజనందనులు గూడుకొని క్రీడిపై నడచి; రట్టియెడ.** **38**

ప్రతిపదార్థం: అది; సింధుదేశ= సింధుదేశంలో; వర్తి= ఉన్నది; అగుటయున్= కాగా; భారత రణ= భారతయుద్ధంలో; హతులు+ఐన= చంపబడినవారైన; సైంధవ= సింధుదేశీయులగు; యోధుల= వీరులయొక్క; పుత్త్రులు= కొడుకులూ; పౌత్త్రులు= మనుమలూ; పూర్వ= మునుపటి; వైరంబు= పగ; పాటించి= పరిగణించి, తలచుకొని; ఆటోపంబునన్= సంరంభంతో; అనేక= పెక్కు; సహస్ర సంఖ్యల= వేలమంది; రథికులు= రథాలమీద ఉండి యుద్ధం చేసేవారు; రాజనందనులు= రాజకుమారులును; కూడుకొని= కలిసి; క్రీడిపైన్= అర్జునుడిమీద; నడచిరి= దండెత్తారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: యజ్ఞాశ్వం సింధుదేశంలో సంచరిస్తున్నది. అప్పుడు భారతయుద్ధంలో పాండవులచేతిలో చావు మూడిన సింధుదేశ వీరుల కుమారులూ, మనుమలూ పూర్వవైరాన్ని తలచుకొన్నారు. సంరంభంతో పెక్కు వేలమంది రథికులూ, 'రాజకుమారులూ ఏకమై అర్జునుడిమీద దండెత్తారు.'

సీ. **అరుణాంబుదంబులు పరఁగి పెన్నెత్తురుఁ। గండలుఁ గురిసె; మార్తాండ బింబ**
మసితారుణచ్ఛాయ మయ్యె; నుల్కాతతు। లెల్ల దిక్కులఁ బెల్లు డుల్లె; నశ్వ
సహితంబుగా సవ్యసాచిఁ జుట్టును ముట్టి। యతనిపై నయ్యోధవితతి యొక్క
పెట్ట శస్త్రాస్త్రముల్ బెట్టుగాఁ గురిసిన। నప్పాండవుఁడు పెనుడప్పి సోలె;

తే. **నేమి చెప్పుదు నీకు; నుద్దామ విక్ర। మాభిరాముండు నాఁ జను నక్కిరీటి**
కరము గరము బెం డగుటయు గాండివంబు। వడియెఁ బుడమిపైఁ గురునరపతివరేణ్య! **39**

ప్రతిపదార్థం: కురు నరపతి= కురురాజులలో; వరేణ్య!= శ్రేష్ఠుడా!; అరుణ= ఎర్రని; అంబుదంబులు= మేఘాలు; పరఁగి= వ్యాపించి; పెన్+నెత్తురున్= గొప్ప నెత్తురూ; కండలున్= కండలూ; కురిసెన్= వర్షించాయి; మార్తాండ= సూర్యుడియొక్క; బింబము; అసిత= నల్లని; అరుణ= ఎర్రని; ఛాయము= కాంతులు కలది; అయ్యెన్= అయినది (ధూమ్రవర్ణకాంతి కలది అయ్యెనని అర్థం); ఎల్లన్+దిక్కులన్= అన్ని దిక్కులయందునూ; ఉల్కా= ఉల్కలయొక్క; తతులు= గుంపులు; పెల్లు= మిక్కిలి ఎక్కువగా; డుల్లెన్= రాలాయి; ఆ యోధ= ఆ సింధుదేశ వీరులయొక్క; వితతి= సమూహం; అశ్వ= గుర్రంతో; సహితంబు+కాన్=

కూడిఉండేటట్లుగా; సవ్యసాచిన్= అర్జునుడిని; చుట్టును ముట్టి= చుట్టుముట్టి; అతనిపైన్= అతడిమీద; ఒక్కపెట్టన్= ఒక్కసారిగా; ఏకధాటిగా; శస్త్ర+అస్త్రములా= శస్త్రాలు, అస్త్రాలూ; బెట్టుగాన్= మిక్కిలి; కురిసినన్= వర్షించగా; ఆ పాండవుఁడు= ఆ అర్జునుడు; పెనుడప్పిన్= ఎక్కువ ఆయాసంతో; సోలెన్= ఒరిగిపోయాడు; నీకున్= నీకు; ఏమి= ఏమని; చెప్పుదున్= చెప్పుతాను; ఉద్దామ= భయంకరమైన; విక్రమ= పరాక్రమ గుణంచేత; అభిరాముండు= మనోహరుడు; నాన్= అనగా; చను= ఒప్పే; ఆ కిరీటి= ఆ అర్జునుడియొక్క; కరము= చేయి; కరము= మిక్కిలి; బెండు= సత్తువలేనిది; అగుటయున్=కాగా; గాండివంబు= గాండీవం; పుడమిపైన్= భూమిమీద; పడియెన్= జారిపడింది.

తాత్పర్యం: జనమేజయా! ఎర్రని మొయిళ్ళు ఆకాశమంతటా వ్యాపించి కుండపోతగా నెత్తురూ కండలూ కురిశాయి. సూర్యబింబం ధూమ్రకాంతులు కలదైనది. దిక్కులం దంతటా ఉల్కలు రాలాయి. సింధుదేశ సైనికులు యజ్ఞాశ్వాన్నీ, అర్జునుడినీ చుట్టుముట్టారు. అర్జునుడిమీద అందరూ ఒక్కసారిగా శస్త్రాస్త్రాలు కురిపించారు. అంతట అర్జునుడు ఎక్కువ బడలికతో వాలిపోయాడు. నీకు ఏమని చెప్పేది? భయంకర పరాక్రమగుణంవలన సర్వలోకాభిరాముడని ప్రసిద్ధికెక్కిన అర్జునుడి చేయి సత్తువ కోల్పోయింది. అందువలన గాండీవం అతడి చేతినుండి జారి భూమిమీద పడిపోయింది.

చ. అనిమిషులున్ మునీశ్వరులు నప్పుడు శోకమునన్ మునింగి య
ర్జునజయ కాంక్షులై నియతి శుద్ధి వహించి సవీర్య మంత్రసా
ధనపరులైరి; తెప్పిఁటి యతండు ధనుర్ధరుఁడున్ సముల్లస
త్తను విభవోజ్జ్వలుండు సముదగ్రమనస్కుఁడు నయ్యె భూవరా! 40

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; అనిమిషులున్= దేవతలూ; ముని+ఈశ్వరులున్= మహర్షులూ; అప్పుడు= ఆ సమయంలో; శోకమునన్= దుఃఖంలో; మునింగి= మునిగి; అర్జున= అర్జునుడియొక్క; జయ= జయమును; కాంక్షులు+ఐ= కోరుతున్నవారై; నియతి= శాస్త్ర నియమ పూర్వకంగా; శుద్ధి= పవిత్రత; వహించి= కలిగి; సహ+వీర్య= బలంతో కూడిన, బలాన్ని ప్రసాదించే; మంత్ర= మంత్రాలయొక్క; సాధన= ఉపాయములను, సాధించుటయందు; పరులు= ఆసక్తికలవారు; ఐరి= అయ్యారు; అతండు= అర్జునుడు; తెప్పిఁటి= తేరి, ఆయాసం లేనివాడై; ధనుస్= వింటిని; ధరుఁడున్= ధరించినవాడునూ; సమ్+ఉలసత్= మిక్కిలి ప్రకాశిస్తున్న; తను= శరీరంయొక్క; విభవ= శక్తిచేత; ఉజ్జ్వలుండున్= పెంపొందేవాడును; సముదగ్ర= మిక్కిలి దార్ఢ్యం కలిగిన; మనస్కుఁడున్= మనస్సుకలవాడునూ; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: అర్జునుడి దౌర్బల్యాన్ని చూచి దేవతలూ మహర్షులూ దుఃఖంలో మునిగిపోయారు. వారు అతడి విజయం కోరి నియమ పూర్వకంగా బలాన్ని ప్రసాదించే మంత్రాలను జపించారు. దానివలన అర్జునుడు తేరుకొని మనోదార్ఢ్యం కలవాడూ దేహశక్తి సంపద కలవాడూ అయి మరలా విల్లు చేపట్టాడు.

వ. ఇట్లు తెలివొంది విజృంభించి. 41

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తెలివి= సహజస్వస్థతను, జ్ఞానం; ఒంది= పొంది; విజృంభించి= చెలరేగి.

తాత్పర్యం: ఈ విధంగా యథాపూర్వ స్థితిని పొంది చెలరేగి. (తరువాతి పద్యంతో అన్వయం)

శా. నారాచ ప్రముఖాస్త్రజాల పటువిన్యాసంబు తీవ్ర త్వరా
ఘోరంబై విలసిల్లఁ జేయ సమరక్షోణీతలం బంతయున్

వైరివ్రాత శవావృతం బగుడు గీర్వాణుల్ మునుల్ సిద్ధు ల
వీరుం బ్రస్తుతి సేయుచుం బొదలి రుద్వేలప్రమోదంబునన్. 42

ప్రతిపదార్థం: నారాచ= ఇనుపబాణం; ప్రముఖ= మొదలైన; అస్త్ర= బాణ విశేషాలయొక్క; జాల= సమూహంయొక్క; పటు= శక్తిమంతమైన; విన్యాసంబు= ప్రయోగవిధానం; తీవ్ర= తీవ్రమైన; త్వరా= వేగంచేత; ఘోరంబు+ఐ= భయంకరమై; విల్లసిల్లన్= ఒప్పునట్లు; చేయన్= చేయగా; సమర= యుద్ధంయొక్క; క్షోణీతలంబు= భూమి; అంతయున్= అంతా; వైరి= శత్రువులయొక్క; వ్రాత= సమూహంయొక్క; శవ= పీనుగులచేత; ఆవృతంబు= కప్పబడినది; అగుడున్= కాగా; గీర్వాణుల్= దేవతలూ; మునుల్= మునులూ; సిద్ధులు= సిద్ధులూ; ఆ వీరున్= ఆ వీరుడిని; ప్రస్తుతిచేయుచున్= ప్రశంసిస్తూ; ఉద్వేల= మిక్కుటమైన; ప్రమోదంబునన్= సంతోషంతో; పొదలిరి= ఒప్పారారు.

తాత్పర్యం: అర్జునుడు నారాచం మొదలైన రకరకాల బాణాలను శత్రువులమీద మహావేగంతో భయంకరంగా ప్రయోగించాడు.యుద్ధభూమి అంతా శత్రువుల పీనుగులతో నిండిపోయింది. అది చూచి దేవతలూ, మునులూ, సిద్ధులూ ఆ వీరుడిని స్తుతిస్తూ ఆనందించారు.

వ. హతశేషంబైన యా సింధు రాజకుమార సైన్యంబుదైన్యంబునొంది నలుదిక్కుల విచ్చియు నొచ్చియు వివ్వచ్చుండు రణధరణిం బొలిచి నిలుచుటఁ జూచి మాత్సర్యధుర్యంబై మగుడం బోరికిం బూని యడరిన నప్పురందర నందనుం డందలి రథికముఖ్యులతోడం దమయన్న చెప్పిన వాక్యంబు లుపన్యసించి 'మీరేలజాలిం బడియెదరు, ప్రాణంబులు మీ కింత చేఁ దయ్యెనే' యని పలికినను నిలువక పైపయి వా రురవణించిన. 43

ప్రతిపదార్థం: హత= చావగా; శేషంబు= మిగిలినది; ఐన= అయిన; ఆ సింధురాజకుమార= ఆ సింధుదేశ రాజకుమారులయొక్క; సైన్యంబు= సైన్యం; దైన్యంబున్= దురవస్థను; ఒంది= పొంది; నలుదిక్కులన్= నాలుగు దిక్కులందును; విచ్చియున్= విడిపోయియూ, చెల్లచెదరై; నొచ్చియున్= బాధపడియూ; వివ్వచ్చుండు= అర్జునుడు; రణధరణిన్= యుద్ధభూమియందు; పొలిచి= ప్రకాశించి; నిలుచుటన్= నిలిచి ఉండుట; చూచి; మాత్సర్య= కోప (భారం); ధుర్యంబు+ఐ= వహించినదై; మగుడన్= మరల; పోరికిన్= యుద్ధానికి; పూని= యత్నించి; అడరినన్= విజృంభించగా; ఆ పురందర= ఆ ఇంద్రుడియొక్క; నందనుండు= కుమారుడు; అందలి= సింధుదేశ సైన్యంలోని; రథిక= రథంమీద నిలిచి యుద్ధం చేసేవారిలో; ముఖ్యులతోడన్= ముఖ్యులతో; తమ+అన్న= తమ అన్న అగు ధర్మరాజు; చెప్పిన; వాక్యంబులు= మాటలు; ఉపన్యసించి= చెప్పి; మీరు; ఏల?= ఎందుకు?; జాలిన్= దుఃఖాన్ని; పడియెదరు= పొందుతారు; ప్రాణంబులు= ప్రాణాలు; మీకున్= మీకు; ఇంత= మిక్కిలి; చేఁదు= ఇష్టంకానివి; అయ్యెను+ఏ?= అయినవా?; అని; పలికినను= పలికినప్పటికీ; నిలువక= ఆగక; పైపయిన్= మీద మీదకు; వారు; ఉరవణించినన్= వేగిరపడగా.

తాత్పర్యం: చచ్చినవారు చావగా మిగిలిన సింధురాజపుత్ర సైన్యవీరులు దురవస్థపాలై నాలుగు దిక్కులా చెల్లాచెదరయ్యారు. అర్జునుడు మాత్రం యుద్ధభూమిలో గట్టిగా నిలిచి ప్రకాశిస్తున్నాడు. అతడిని చూచి సింధుదేశ సైన్యం క్రోధం వహించి తిరిగి యుద్ధం చేయటానికి పూనుకొని విజృంభించింది. అప్పుడు అర్జునుడు ఆ సైన్యంలో ముఖ్యులయిన రథికులకు ధర్మరాజు చెప్పిన మాటలు చెప్పి 'మీ రెందుకు దుఃఖం కొనితెచ్చుకొంటారు? మీకు మీ ప్రాణాలంటే గిట్టవా?' అని అన్నాడు. అయినా వారు ఆగకుండా మీద మీదకు వచ్చి పడగా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. నవ్వుచు నానా శరముల। నవ్వీరులఁ బొలియఁ జేయ, నంతయు విని తా
నెవ్వగతో దుశ్శల యా। కవ్వడిఁ బౌత్త్రాన్వితముగఁ గానఁగ వచ్చెన్. 44

ప్రతిపదార్థం: నవ్వుచున్= నవ్వుతూ; నానా= అనేక విధాలైన; శరములన్= బాణాలతో; ఆ= సింధుదేశ సైన్యంలోని; వీరులన్= వీరులను; పొలియన్+చేయన్= చంపగా; దుశ్శల; తాన్= తాను; అంతయున్= జరిగినదంతా; విని; నెఱ+వగతోన్= మహాదుఃఖంతో; పౌత్త్ర= మనుమలతో; అన్వితముగన్= కూడి ఉండేటట్లుగా; ఆ కవ్వడిన్= అ అర్జునుడిని; కానఁగన్= చూడగా; వచ్చెన్= వచ్చింది.

తాత్పర్యం: అర్జునుడు నవ్వుతూ అనేక విధాలైన బాణాలతో ఆ సింధుసైన్యంలోని వీరులను సంహరించాడు. దుశ్శల జరిగినదంతా విని, మహాదుఃఖంతో మనుమలతోపాటు అర్జునుడిని చూడటానికి వచ్చింది.

విశేషం: దుశ్శల గాంధారీ ధృతరాష్ట్రుల కూతురు. సైంధవుడి భార్య. దుశ్శల అనే రూపం కూడా గ్రంథాలలో కనబడుతుంది.

సీ. వచ్చి కన్నీరులు వదనంబుపై వెల్లి। గొన రోదనంబు చేసిన నతండు
దయ నిల నిడియెఁ గోదండ మప్పడఁతుక। పౌత్త్రునిఁ జూపి 'యిబ్బాలుఁ గావు
మితఁడు మీ యల్లుని సుతుఁ; డన్న నప్పార్థుఁ। డిప్పుడు నా యల్లుఁ డెచట నున్న
వాఁ?' డని యడిగిన వనిత వెక్కుచు 'నతం। డాత్మీయ జనకుఁ డుగ్రాహవమున

తే. ననఘ! నీచేతఁ దెగుట దా విని నితాంత। శోకమగ్నుఁడై యుండి నీ రాక బిట్టు
వినుట బెగ్గిలి ప్రాణముల్ విడిచె 'ననుచు। నెలుఁగు గడలుకొనంగఁ బెల్లేడ్చె నధిప! 45

ప్రతిపదార్థం: అధిప!= రాజా! జనమేజయా!; వచ్చి= దుశ్శల ఆ విధంగా వచ్చి; కన్నీళులు= కన్నీరు; వదనంబుపైన్= ముఖంమీద; వెల్లిగొనన్= కాలువలు కట్టగా; రోదనంబు చేసినన్= దుఃఖించగా; అతండు= అర్జునుడు; దయన్= దయతో; కోదండంబు= విల్లు; ఇలన్= నేలమీద; ఇడియెన్= ఉంచాడు; ఆ పడఁతుక= ఆ స్త్రీ - దుశ్శల; పౌత్త్రునిన్= మనుమడిని; చూపి; ఈ బాలున్= ఈ బాలుడిని; కావుము= కాపాడుము; ఇతఁడు= ఈ బాలుడు; మీ= మీయొక్క; అల్లుని= మేనల్లుడి; సుతుఁడు= కొడుకు; అన్నన్= అనగా; ఆ పార్థుఁడు= ఆ అర్జునుడు; ఇప్పుడు; నా= నాయొక్క; అల్లుఁడు= మేనల్లుడు; ఎచటన్= ఎక్కడ; ఉన్నవాఁడు?= ఉన్నాడు?; అని; అడిగినన్= అడుగగా; వనిత= స్త్రీ - దుశ్శల; వెక్కుచున్= వెక్కి వెక్కి ఏడుస్తూ; అనఘ!= పాపరహితుడా!; అతండు= నీ మేనల్లుడు; తాన్= తాను; ఆత్మీయ= తనయొక్క; జనకుఁడు= తండ్రి - సైంధవుడు; ఉగ్ర= భయంకరమైన; ఆహవమునన్= యుద్ధంలో; నీచేతన్= నీచేత; తెగుట= చనిపోవటం; విని; నితాంత= ఎడతెగని; శోక= శోకమునందు; మగ్నుఁడు+ఐ= మునిగినవాడై; ఉండి; నీ= నీయొక్క; రాక= వచ్చుట; బిట్టు= హఠాత్తుగా; వినుటన్= వినటంచేత; బెగ్గిలి= భయపడి; ప్రాణముల్= ప్రాణాలు; విడిచెన్= వదిలాడు; అనుచున్= అంటూ; ఎలుఁగు= కంఠస్వరం; కడలుకొనంగన్= అతిశయించగా, గొంతెత్తి పెద్దగా; పెల్లు= ఎక్కువగా; ఏడ్చెన్= ఏడ్చింది.

తాత్పర్యం: జనమేజయా! దుశ్శల వచ్చి కన్నీరు ముఖంమీద కాలువలు కట్టగా ఏడ్చింది. అంత అర్జునుడు జాలిపుట్టి వింటిని నేలమీద పెట్టాడు. ఆమె అర్జునుడికి మనుమడిని చూపి 'ఈ బాలుడిని కాపాడుము. ఇతడు నీ మేనల్లుడి కొడుకు' అని అన్నది. అర్జునుడు 'నా మేనల్లుడు ఇప్పు డెక్కడ ఉన్నాడు?' అని అడిగాడు. దుశ్శల వెక్కి వెక్కి ఏడుస్తూ

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

'పుణ్యాత్మా! భయంకర సంగ్రామంలో తన తండ్రి నీ చేతిలో చనిపోయాడని విని నీ మేనల్లుడు ఎడతెగని వగపులో మునిగిపోయాడు. ఇప్పుడు హఠాత్తుగా నీవు వచ్చావన్న మాట విని ప్రాణాలు విడిచాడు' అని చెప్పి గొంతెత్తి పెద్దగా ఏడ్చింది.

వ. అప్పుడు శోకాక్రాంతుం డయి గాండీవి వదనంబు వాంచియుండ నయ్యుగ్మలి యతని నుద్దేశించి. 46

ప్రతిపదార్థం: అప్పుడు; శోక= శోకంచేత; ఆక్రాంతుండు+అయి= ఆక్రమింపబడినవాడై; గాండీవి= అర్జునుడు; వదనంబు= ముఖం; వాంచి= వంచుకొని; ఉండన్= ఉండగా; ఆ ఉగ్మలి= ఆ స్త్రీ (దుశ్శల); అతనిన్= ఆ అర్జునుడిని; ఉద్దేశించి= గురిగా చేసి; అర్జునుడితో.

తాత్పర్యం: దుశ్శల మాటలకు అర్జునుడు విచారించి ముఖం వంచుకొన్నాడు. అప్పు డామె అతడితో. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'ధార్తరాష్ట్రుల కీడు దలఁపక సైంధవు। కొఱగాము లెల్లను మఱచి తండ్రి
లేని యీ శిశువుపై మానితంబైన నీ। యక్కటికంపుఁ జూ పడరఁ జేయు
మాశ్రితవత్సల!' యనుచు నబ్బాలునిఁ। జరణానతునిఁ జేసి 'శరణు! శరణు!
కృప నన్ను రక్షింపు కీర్తియుఁ ధర్మంబుఁ। జేకొను' మనవుడుఁ జిత్త మడల

తే. 'రాచకొల మిది గాల్పనే క్రౌర్యమూల'। మని తలంచుచు నాతఁ డయ్యతివతోడ
'నధమవృత్తి సుయోధనుఁ డంతకంటె। నేముఁ గొఱగాము. మాచేత నింతపుట్టె.' 47

ప్రతిపదార్థం: ఆశ్రిత= ఆశ్రయించినవారియందు; వత్సల!= దయ కలవాడా!; ధార్తరాష్ట్రుల= ధృతరాష్ట్రుడి కుమారులయొక్క, దుర్యోధనాదులయొక్క; కీడు= అపకారం; తలఁపక= మనసులో పెట్టుకొనకుండా; సైంధవు= సైంధవుడియొక్క; కొఱగాములు= దుష్కార్యములు; ఎల్లను= అన్నిటినీ; మఱచి= మరచిపోయి; తండ్రి లేని; ఈ శివువుపైన్= ఈ శిశువుమీద; మానితంబు= గౌరవించబడినది, పేరుపొందినది; ఐన= అయిన; నీ= నీయొక్క; అక్కటికము= దయతో కూడిన; చూపు; అడరన్+చేయుము= ప్రసరింపజేయుము; అనుచున్= అంటూ; ఆ బాలునిన్= ఆ బాలుడిని; చరణ= పాదాలకు; ఆనతున్= నమస్కరించినవాడినిగా; చేసి; శరణు= నమస్కారం; శరణు= అండగా ఉండుము; కృపన్= దయతో; నన్నున్= నన్ను; రక్షింపు= రక్షించుము; కీర్తియున్= కీర్తియూ; ధర్మంబున్= పుణ్యమూ; చేకొనుము= పొందుము; అనవుడున్= అని అనగా; చిత్తము= మనస్సు; అడలన్= తపింపగా; క్రౌర్య= క్రూరత్వానికి; మూలము= ఆధారం; ఇది= ఈ; రాచకొలము= రాజవంశం; కాల్పను+ఏ?= తగులబెట్టుటకా?; అని; తలంచుచున్= భావిస్తూ; అతఁడు= అర్జునుడు; ఆ అతివతోడన్= ఆ స్త్రీతో, సోదరితో; సుయోధనుండు= దుర్యోధనుడు; అధమ= నీచమైన; వృత్తి= నడవడి కలవాడు; ఏము= మేము; అంతకంటెన్= వారికంటె; కొఱగాము= తక్కువ వారం గాము; మాచేతన్= మావలన; ఇంత= ఈ మహా వినాశం; పుట్టెన్= సంభవించింది.

తాత్పర్యం: 'ఆశ్రితవత్సలా! దుర్యోధనాదులు మీకు చేసిన అపకారం మనసులో పెట్టుకొనకుము. నా భర్త సైంధవుడు చేసిన పాడు పనులన్నీ మరచిపొమ్ము. తండ్రిలేని ఈ బిడ్డపై జగద్విఖ్యాతమైన నీ దయ చూపుము' అని ఆ బాలుడిచేత అర్జునుడి కాళ్ళకు మ్రొక్కించింది. 'నీకు నమస్కారం. మాకు ప్రాపు నీవే. దయతో నన్ను రక్షించుము. కీర్తీ, పుణ్యమూ కట్టుకొనుము' అని ఆమె అన్నది. ఆమె ఈ మాటలు పలుకగా అర్జునుడి మనస్సు తపించింది. అతడు 'క్రూరత్వానికి

మూలకందమైన ఈ రాజవంశం తగులబెట్టటానికా?' అని అనుకొని దుశ్శలతో 'దుర్యోధనుడు నీచమైన నడవడి కలవాడే. కాని మేము అతనికంటె తక్కువ వారము గాము. మా వలననే ఈ ఘోరవినాశం సంభవించింది.'

క. అను పలుకు పలికి, బహుసాం। త్వనముల నూరార్చి, యాసుదతి మస్తకముం
దన యక్కునఁ జేర్చి 'యబల! చనుము వగపు దక్కి' యని ప్రసాద భరితుఁడై. 48

ప్రతిపదార్థం: అను పలుకు పలికి= అనునట్టి మాటలు, మాటాడి; బహు= వివిధములైన; సాంత్వనములన్= ఆదరంతో కూడిన మాటలచేత; ఊరార్చి= ఓదార్చి; ఆ సుదతి= ఆ స్త్రీయొక్క; మస్తకమున్= తలను; తన= తనయొక్క; అక్కునన్= రొమ్మున; చేర్చి; అబల!= దుశ్శలా!; వగపు= విచారం; తక్కి= వీడి; చనుము= వెళ్ళుము; అని; ప్రసాద= దయతో; భరితుఁడు+ఐ= నిండినవాడై.

తాత్పర్యం: అని పలికి ఆమెను సాదరవచనాలతో ఓదార్చి, ఆమె శిరస్సును రొమ్మున చేర్చి దయామయుడై 'దుశ్శలా! దిగులు వదలి వెళ్ళుము' అని. (తరువాతి వచనంతో అన్వయం)

వ. వీడ్కొలిపిన దుశ్శల దనమనుమనిం దమబలంబులంగొని ప్రియంబునం జనియె; నయ్యనిమిషపతి సుతుండును గ్రతువిషయంబులై వలయుననుష్ఠానంబులు విధివంతంబులుగాఁ జలుపుచుఁ దురంగంబు వెనుకం దా నామృగానుసారియయిన పినాకపాణియుం బోలెఁ బోవుచుండ, నదియును నఖిల దేశంబుల సుఖసంచారంబునఁ బ్రవర్తిల్లుచుఁ, గ్రమంబున మణిపూర పురంబు నుపాంతంబున కరిగిన, నన్నగరంబు పతి యైన బభ్రువాహనుండు నిజజనకుం డయిన యర్జును రాక యాకర్ణించి. 49

ప్రతిపదార్థం: వీడ్కొలిపినన్= వీడ్కొలుపగా; దుశ్శల; తన= తనయొక్క; మనుమనిన్= మనుమడినీ; తమ= తమయొక్క; బలంబులన్= సైన్యాలను; కొని= వెంటబెట్టుకొని; ప్రియంబునన్= సంతోషంతో; చనియెన్= వెళ్ళింది, ఆ అనిమిష= ఆ దేవతలయొక్క; పతి= నాథుడియొక్క; సుతుండును= కుమారుడునూ, అర్జునుడునూ; క్రతు= యజ్ఞము యొక్క; విషయంబులు= అంశాలు; ఐ= అయి; వలయు= అవశ్యకాలైన; అనుష్ఠానంబులు= కర్తవ్యాలు; విధివంతంబులు= శాస్త్రానికి అర్హములు; కాన్= అయ్యేటట్లు; చలుపుచున్= చేస్తూ; తురంగంబు= గుర్రంయొక్క; వెనుకన్= వెనుక; తాను; ఆ మృగ= ఆ యజ్ఞ మృగాన్ని; అనుసారి= అనుసరించేవాడు; అయిన; పినాకపాణియున్+పోలెన్= పినాకమనే విల్లు చేతియందు కలవాడైన శివుడివలె; పోవుచున్+ఉండన్= వెళ్ళుతుండగా; అదియును= ఆ యజ్ఞాశ్వం కూడా; అఖిల= సమస్తమైన; దేశంబులన్= దేశములయందు; సుఖ= సుఖము కలిగించే; సంచారంబునన్= గమనంతో; ప్రవర్తిల్లుచున్= తిరుగుతూ; క్రమంబునన్= క్రమ క్రమంగా; మణిపూర= మణిపూరమనే; పుర= పట్టణంయొక్క; ఉపాంతంబునకున్= సమీప ప్రదేశానికి; అరిగినన్= వెళ్ళగా; ఆ నగరంబు= ఆ పట్టణంయొక్క; పతి= ప్రభువు; ఐన= అయిన; బభ్రువాహనుండు; నిజ= తనయొక్క; జనకుండు= తండ్రి; అయిన; అర్జును= అర్జునుడియొక్క; రాక= ఆగమనాన్ని గూర్చి; ఆకర్ణించి= విని.

తాత్పర్యం: వీడ్కొలుపగా దుశ్శల తన మనుమడినీ, సైన్యాలను వెంటబెట్టుకొని సంతోషంగా వెళ్ళిపోయింది. అర్జునుడూ యజ్ఞాంశాలై తప్పక చేయదగిన పనులన్నిటినీ శాస్త్రోక్తంగా చేస్తూ యజ్ఞమృగాన్ని వెంటాడే శివుడివలె ఆ యజ్ఞాశ్వం వెనుక వెళ్ళుతున్నాడు. అది అన్ని దేశాలలో హాయిగా తిరుగుతూ తిరుగుతూ క్రమంగా మణిపూరమనే పట్టణం దగ్గరకు చేరింది. ఆ నగరాధిపతి అయిన బభ్రువాహనుడు తన తండ్రి అయిన అర్జునుడి ఆగమనం గూర్చి విని. (తరువాతి పద్యంతో అన్వయం)

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: అలం: ఉపమ. ఆ మృగానుసారి అయిన పినాకపాణియుం బోలె..దేవతలు పరమేశ్వరుడి మహిమను గుర్తించక, యజ్ఞం చేస్తూ ఆ దేవుడికి యజ్ఞభాగం కల్పింపరయిరి. ఈ కారణంవలన కోపం పొందిన శివుడు విల్లు చేపట్టి దేవతలు యజ్ఞం చేస్తున్న చోటికి వచ్చాడు. రౌద్రాస్త్రంతో యజ్ఞమును గొట్టాడు. అంతట యజ్ఞం మృగరూపమును ధరించి పారిపోయింది. పరమేశ్వరుడు దానిని వెంబడించాడు. అది తప్పించుకొని పరువెత్తి మింట వెలుగొందింది. ఈ కథ శాంతిపర్వంలోని పంచమాశ్వాసంలో ఉన్నది. సంస్కృత భారతమున శాంతిపర్వంలో 283వ అధ్యాయంలో ఉన్నది. కాళిదాసుడి అభిజ్ఞాన శాకుంతలంలో ప్రథమాంక ప్రారంభంలో మృగమును వెంటాడే దుష్యంతుడిని చూచి సారథి 'మృగానుసారిణం సాక్షాత్ పశ్యామీవ పినాకినమ్' అని అంటాడు. రఘువంశము (సర్గ 11. శ్లో. 44)లో 'విద్రుత క్రతుమృగానుసారిణం యేన బాణ మసృజత్ వృషధ్వజః'' అని ఉన్నది.

ఆ. వినయ మెసఁగ నార్యజనసమేతంబుగా। నరుగుదెంచి, యతని చరణములకుఁ
బ్రీతి నెఱఁగ, నక్కిరీటి యన్నరపతి। నాదరింప కుండె మేదినీశ! 50

ప్రతిపదార్థం: మేదినీ= భూమియొక్క; ఈశ!= నాథుడా! రాజా!, జనమేజయా!; ఆర్యజన= పెద్దలతో; సమేతంబు+కాన్= కూడిఉండేటట్లుగా; అరుగుదెంచి= వచ్చి; వినయము= అణకువ; ఎసఁగన్= ఒప్పగా; అతని= అర్జునుడియొక్క; చరణములకున్= కాళ్ళకు; ప్రీతిన్= ఆనంద పూర్వకమైన భక్తితో; ఎఱఁగన్= మ్రొక్కగా; ఆ కిరీటి= ఆ అర్జునుడు; ఆ నరపతిన్= ఆ రాజును, బభ్రువాహనుడిని; ఆదరింపక= మన్నించక; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: జనమేజయా! పెద్దలతో కూడివచ్చి సవినయంగా అర్జునుడి కాళ్ళకు ఆనందపూర్వకమైన భక్తితో మ్రొక్కాడు. కాని, అర్జునుడు ఆ బభ్రువాహనుడిని ఆదరించలేదు.

వ. అట్లుండి తన యనాదరణంబునకుం గారణం బెఱుంగక సవిచారుండై యూరకున్న యక్కుమారునితో
ధనంజయుం డిట్లనియె. 51

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా, బభ్రువాహనుడిని ఆదరించక; ఉండి; తన= తనయొక్క; అనాదరణంబునకున్= ఆదరించకుండ ఉండటానికి; కారణంబు= కారణం; ఎఱుంగక= తెలియక; సహ+విచారుండు+ఐ= మనస్తాపముతో కూడినవాడై; ఊరక+ఉన్న= కిమ్మనకుండా ఉన్న; ఆ కుమారునితోన్= ఆ కొడుకుతో; ధనంజయుండు= అర్జునుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్=అన్నాడు.

తాత్పర్యం: ఆదరించకుండా ఉండి, తన తిరస్కారానికి కారణం తెలియక మనస్తాపం పొంది మిన్నకున్న కుమారుడితో అర్జునుడు ఈ విధంగా అన్నాడు.

ఉ. 'యాగ విముక్తమై చనుహయంబున కడ్డము వచ్చి పట్టి కా
కీగతి మెత్తఁబాటు దగునే? నృపధర్మవిహీనతన్ రణో
ద్యోగము లేక తక్కి భయ ముల్లముఁ జేరఁగ నిచ్చు రాజు రా
జే? గుణహీన! పో' మ్మనిన నేమియుఁ బల్కకతండు గ్రమ్మఱన్. 52

ప్రతిపదార్థం: గుణ= పౌరుషగుణంచేత; హీన= హీనుడైనవాడా!; యాగ= యజ్ఞమునందు; విముక్తము= విడువబడినది; ఐ; చను= సంచరిస్తున్న; హయంబునకున్= గుర్రానికి; అడ్డము వచ్చి= అడ్డుపడి; పట్టి= బంధించి; కాక= తప్ప; ఈ గతిన్= ఈ విధంగా; మెత్తఁబాటు= మెత్తగా ఉండటం; తగును+ఏ?= తగునా?; నృప= రాజుయొక్క; ధర్మ= ధర్మంచేత; విహీనతన్=

హీనత్వంతో; రణ= యుద్ధంయొక్క; ఉద్యోగము= ప్రయత్నం; లేక; తక్కి= వదలి; భయము= భయం; ఉల్లమున్= మనస్సును; చేరఁగన్+ఇచ్చు= చేరేటట్లు చేసికొనే; రాజు; రాజు+ఏ= రాజేనా?; పొమ్ము= పోరా; అనినన్= అనగా; అతండు= బభ్రువాహనుడు; ఏమియున్= చిన్న మెత్తుమాటకూడా; పల్కక= అనక; క్రమ్మఱన్= మరలా తిరిగి.

తాత్పర్యం: 'పౌరుషగుణహీనా! యజ్ఞంలో వదలిన గుర్రం తిరిగేటప్పుడు అడ్డుపడి దానిని బంధించాలి కాని ఈ విధంగా చేతకానితనంతో మెత్తగా ఉండటం తగునా? రాజధర్మానికి తిలోదకా లిచ్చి యుద్ధ ప్రయత్న మన్నమాటే లేకుండా భయపడుతూ ఉండే రాజూ ఒక రాజేనా? పోరా!' అని అనగా బభ్రువాహనుడు చిన్నమాట కూడా మాటాడకుండా మరల. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **అరిగి పట్టణవీథి నల్లన చనుచుండ । నర్జునుం డతనితో నాడినట్టి**
తెఱఁగెల్లఁ దన దగు దివ్యబోధంబునఁ । గని భుజంగోత్తమతనయ సదయ
వృత్తిఁ బాతాళంబు వెలువడి యన్నరా । ధిపుని పాలికిఁ జనుదెంచి ' యేను
మీ తల్లి నాగేంద్రు సూతి నులూపి నా । పేరు; హితంబు చెప్పెడు మనీష

తే. **నరుగుదెంచితి వినుము! మీయయ్య పనుపు । దలకొనుము; రాజులకు నర్హధర్మమైన**
యని యొనర్పుము; దనతోడఁ బెనఁగు టధిక । సమ్మదము సేయు నక్కురుసత్తమునకు. **53**

ప్రతిపదార్థం: అరిగి= వెళ్ళి; పట్టణ వీథిన్= పట్టణంయొక్క, రాజమార్గంలో; అల్లన్+అ= మెల్లగా; చనుచున్+ఉండన్= వెళ్ళుతుండగా; అర్జునుండు; అతనితోన్= బభ్రువాహనుడితో; ఆడిన+అట్టి= పలికినట్టి; తెఱఁగు+ఎల్లన్= విధమంతయూ; తనది+అగు= తనదైన; దివ్యబోధంబునన్= దివ్యజ్ఞానంచేత; కని= తెలిసికొని; భుజంగ= సర్పాలలో; ఉత్తమ= ఉత్తముడియొక్క; తనయ= కూతురు; సహ+దయా= దయతో కూడిన; వృత్తిన్= నడవడితో; పాతాళంబు= పాతాళ లోకంనుండి; వెలువడి= బయటికివచ్చి; ఆ+నర+అధిపుని= ఆ రాజు బభ్రువాహనుడియొక్క; పాలికిన్= దగ్గరకు; చనుదెంచి= వచ్చి; ఏను= నేను; మీ తల్లిన్= మీ తల్లిని; నాగ+ఇంద్ర= నాగరాజుయొక్క; సూతిన్= బిడ్డను; నా పేరు; ఉలూపి; హితంబు= మేలు కలిగించే మాటను; చెప్పెడు= చెప్పే; మనీషన్= బుద్ధితో; అరుగుదెంచితిన్= వచ్చాను; వినుము; మీ= మీయొక్క; అయ్య= తండ్రియొక్క; పనుపున్= ఆజ్ఞను; తలకొనుము= తలదాల్చుము; రాజులకున్= రాజులకు; అర్హ= తగినదగు; ధర్మము; ఐన= అయిన; అని= యుద్ధం; ఒనర్పుము= చేయుము; ఆ కురు= ఆ కురువంశమందలి; సత్తమునకున్= శ్రేష్ఠుడికి; తనతోడన్= తనతో; పెనఁగుట= యుద్ధం చేయటం; అధిక= మిక్కిలి; సమ్మదము= ఆనందం; చేయున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: తండ్రి దగ్గరకు వెళ్ళి రాజమార్గంలో మెల్లగా పోతున్నాడు. అర్జునుడు బభ్రువాహనుడితో పలికిన తీరంతా నాగేంద్ర తనయ తన దివ్య జ్ఞానంవలన తెలిసికొన్నది. వెంటనే పాతాళ లోకంనుండి వచ్చి, బభ్రువాహనుడి దగ్గరకు వెళ్ళి 'నాయనా! నేను మీ తల్లిని. నాగరాజు పుత్రిని. నా పేరు ఉలూపి. నీకు మేలు కలిగించేమాట చెప్పవలెననే బుద్ధితో వచ్చాను. నా మాట వినుము. మీ తండ్రి ఆనతి శిరసావహించుము. రాజోచితధర్మమైన యుద్ధం చేయుము. కురువంశ శ్రేష్ఠుడైన మీ తండ్రికి తనతో పోరాడటం మహానందం కలిగిస్తుంది.

క. **అనిన సభక్తికముగ న । వ్వనితకుఁ బ్రణమిల్లి 'యాహవము జనకునితోఁ**
జనునె యొనర్పఁగ' నని య । ప్పనికిఁ జొరక వచ్చితిని శుభప్రదమూర్తీ! **54**

ప్రతిపదార్థం: శుభ= శుభాలను; ప్రద= ఇచ్చునట్టి; మూర్తీ!= ఆకారం కలదానా!; అనినన్= అని పలుకగా; ఆ వనితకున్= ఆ స్త్రీకి, తల్లికి; సభక్తికముగన్= భక్తియుతంగా; ప్రణమిల్లి= నమస్కరించి; జనకునితోన్= తండ్రితో; ఆహవము= యుద్ధం; ఒనర్పఁగన్= చేయగా; చనును+ఎ?= తగునా?; అని= అని తలచి; ఆ పనికిన్= ఆ పనికి, యుద్ధమునకు; చొరక= పూనుకొనక; వచ్చితిని= వచ్చాను.

తాత్పర్యం: అని పలుకగా బభ్రువాహనుడు భక్తిపూర్వకంగా తల్లికి మ్రొక్కినాడు. అతడు ఆమెతో 'కల్యాణమూర్తీ! తండ్రితో కయ్యం చేయటం తగనిపని అని తలచి తిరిగి వచ్చాను.

క. **నీ వింత దెలిపి పలికెద; వావిభుఁడును మున్ను నన్ను ననుమతుఁ జేసెం;**

గావునఁ దల్లీ! మీకుం । గావించెద నిద్దఱకు నఖండ ప్రియమున్.' **55**

ప్రతిపదార్థం: తల్లీ!; నీవు; ఇంత= ఇంతగా; తెలిపి= వివరించి; పలికెదవు= చెప్పావు; ఆ విభుఁడును= ఆ ప్రభువునూ; మున్ను= ముందే; నన్నున్= నన్ను; అనుమతున్= అనుమతిపొందిన వాడినిగా; చేసెన్= చేశాడు; కావునన్= కావున; మీకున్= మీకు; ఇద్దఱకున్= ఇద్దరికీ; అఖండ= ఎడతెగని; ప్రియమున్= సంతోషమును; కావించెదన్= కలిగిస్తాను.

తాత్పర్యం: తల్లీ! నీవు ఇంతగా వివరించి చెప్పావు. తండ్రికూడా ఇంతకుముందే నన్ను అనుమతించాడు. కాబట్టి యుద్ధం చేసి ఇద్దరకూ అఖండానందాన్ని కలిగిస్తాను.'

బభ్రువాహనుం డర్జునునితో యుద్ధంబు చేయుట **(సం. 14-78-14)**

చ. **అని నిజమందిరంబునకు నయ్యెలనాఁగఁ దగంగఁ బుచ్చి య**

మ్మనుజవరుండు సాధన సమంచితమైన రథం బుదాత్త రే

ఖ నెఱయ నెక్కి యర్హపరికల్పిత భూషణ లేపనాంబరం

బును సమరోత్సవోద్ధత విభూతియునై తనమే నెలర్పఁగన్. **56**

ప్రతిపదార్థం: అని; నిజ= తనయొక్క; మందిరంబునకున్= భవనానికి; ఆ ఎలనాఁగన్= ఆ స్త్రీని, తల్లిని; తగంగన్= రాజమాతకు తగినట్లుగా; పుచ్చి= పంపి; ఆ మనుజవరుండు= ఆ మానవపతి, బభ్రువాహనుడు; సాధన= ఆయుధాలు మొదలైన సాధనాలతో; సమంచితము= మిక్కిలి ఒప్పుచున్నది; ఐన= అయిన; రథంబు= రథాన్ని; ఉదాత్త= మనోజ్ఞమైన; రేఖ= రీతి, తీరు; నెఱయన్= ప్రకాశించగా; ఎక్కి; తనమేను= తన శరీరం; అర్హ= యుద్ధానికి తగినట్లుగా; పరికల్పిత= ఏర్పాటు చేసికొనిన; భూషణ= అలంకారాలు; లేపన= పూతలు, గంధాదులు; అంబరంబును= వస్త్రాన్ని; సమర= యుద్ధమనెడు; ఉత్సవ= ఉత్సవముయొక్క; ఉద్ధత= అతిశయించిన; విభూతియున్= శక్తియును; ఐ= కలది అయి; ఎలర్పఁగన్= శోభిల్లగా.

తాత్పర్యం: ఆ విధంగా పలికి బభ్రువాహనుడు తల్లిని రాజలాంఛనాలతో తన మేడకు పంపాడు. సాధన సంపత్తి కలిగిన రథాన్ని రాజసం అతిశయించగా ఎక్కాడు. సమయానికి తగిన విధంగా నగలు పెట్టుకొన్నాడు. గంధాదులు అలదుకొన్నాడు. వస్త్రాలు ధరించాడు. ఈ అలంకారాలతో యుద్ధక్రీడకు కావలసిన శక్తితో అతడి శరీరం శోభిల్లుతుండగా. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. **ఎక్కి హంసకేతు వేడ్తెఱఁ గ్రాలంగ । నరిగి యశ్వమునకు నడ్డపడఁగఁ**

జూచి మెచ్చి సవ్యసాచి మార్కొనుటయుఁ । గురిసె నతఁడు నిశితశరచయంబు. **57**

ప్రతిపదార్థం: ఎక్కి= రథమెక్కి; హంస= హంస చిహ్నంతో కూడిన; కేతువు= జెండా; ఏడ్తెఱన్= తేజస్సుతో; క్రాలంగన్= ప్రకాశించగా; అరిగి= వెళ్ళి; అశ్వమునకున్= గుర్రానికి; అడ్డపడఁగన్= అడ్డపడగా; సవ్యసాచి= అర్జునుడు; చూచి; మెచ్చి= మెచ్చుకొని; మార్కొనుటయున్= ఎదుర్కొనగా; అతఁడు= బభ్రువాహనుడు; నిశిత= వాడియైన; శర= బాణాలయొక్క; చయంబు= గుంపును; కురిసెన్= వర్షించాడు.

తాత్పర్యం: మహాతేజస్సుతో ప్రకాశిస్తున్న హంసధ్వజం కట్టిన రథమెక్కి వెళ్ళి బభ్రువాహనుడు గుర్రానికి అడ్డపడ్డాడు. అతడిని చూచి మెచ్చుకొని అర్జునుడు ఎదుర్కొన్నాడు. అప్పుడు బభ్రువాహనుడు అతడిమీద వాడి బాణాల సమూహం వర్షించాడు.

శా. **వానిం దా నవలీలమైఁ దునిమి దుర్వారోద్యముం డద్రిభి**
త్సూనుం డొక్కట నాత్మసూను నొడలం దూపుల్ నిగిడ్చెం బదా;
ఆ నిశ్శంకుఁడు బాహుసారమద మేపారంగ నవ్వీరుపై
వే నారాచము లైదు నాలుగులు పృథ్వీనాథ। నాటించినన్. **58**

ప్రతిపదార్థం: పృథ్వీనాథ!= భూపతీ, జనమేజయా!; దుర్వార= నివారించ శక్యంకాని; ఉద్యముండు= యుద్ధ ప్రయత్నం కలవాడు; అద్రి= కొండలను; భిత్= భేదించినవాడియొక్క, ఇంద్రుడియొక్క; సూనుండు= కుమారుడు, అర్జునుడు; వానిన్= బభ్రువాహనుడు ప్రయోగించిన బాణాలను; తాన్= తాను; అవలీలమైన్= సునాయాసంగా; తునిమి= ఖండించి; ఒక్కటన్= ఒక్కసారిగా; ఆత్మ= తనయొక్క; సూను= కుమారుడియొక్క; ఒడలన్= శరీరమునందు; పది+ఆఱు= పదహారు; తూపుల్= బాణాలను; నిగిడ్చెన్= పడజేశాడు; ఆ నిశ్శంకుఁడు= ఆ జంకులేనివాడు, బభ్రువాహనుడు; బాహు= భుజములయొక్క; సార= బలంచేత కలిగిన; మదము= గర్వం; ఏపారంగన్= ప్రకాశించగా; ఆ వీరుపైన్= ఆ వీరుడిమీద, అర్జునుడిమీద; వే= వేగంగా; ఐదు నాలుగులు= ఇరువది; నారాచములు= బాణాలు; నాటించినన్= నాటుకొనేటట్లు చేయగా.

తాత్పర్యం: దుర్వార ప్రయత్నం కలవాడూ, ఇంద్రుడి కుమారుడూ అయిన అర్జునుడు బభ్రువాహనుడు ప్రయోగించిన వాడి అమ్ములను సునాయాసంగా ఖండించాడు. ఖండించటమే కాక తన కొడుకు శరీరంమీద పడేటట్లు పదహారు బాణాలు ప్రయోగించాడు. అయితే బభ్రువాహను డేమీ జంకలేదు. భుజబలగర్వం వెల్లడయ్యేటట్లుగా అర్జునుడి శరీరంమీద ఇరవై బాణాలు నాటుకొనేటట్లు చేయగా. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. **మదిఁ గొనియాడి యారిపువిమర్దనుఁ డంచసిడంబు ద్రుంచి యే**
పొదవఁగ మేను నొంప; నచలోద్ధతి నాతని జత్రు వేసె బె
ట్టిద మగునారసంబునఁ గడింది మగం డగు బభ్రువాహనుం;
డది వడిపేర్మి శోణితజలార్ద్రత నొందక యుచ్చిపోయినన్. **59**

ప్రతిపదార్థం: ఆ రిపు= ఆ శత్రువులను; విమర్దనుఁడు= సంహరించేవాడు; మదిన్= మనస్సులో; కొనియాడి= కుమారుడిని మెచ్చుకొని; అంచసిడంబు= హంసధ్వజం; త్రుంచి= నరికి; ఏపు= ఉత్సాహం; ఒదవఁగన్= కలుగగా; మేను= బభ్రువాహనుడి శరీరమును; నొంపన్= బాధించగా; కడింది మగండు= మహావీరుడు; అగు; బభ్రువాహనుండు; అచల= చలింపనిదైన, స్థిరమైన;

ఉద్ధతిన్= దిట్టతనంతో; బెట్టిదము= వాడి అయినది; అగు= అయిన; నారసంబునన్= బాణంతో; అతని= అర్జునుడియొక్క; జత్రువు= రొమ్ము ఎముకలు భుజశిరస్సులను కలియు స్థానము, భుజసంధి; ఏసెన్= కొట్టాడు; అది= బభ్రువాహనుడు ఏసిన బాణము; వడి= వేగంయొక్క; పేర్మిన్= అతిశయంచేత; శోణితజల= నెత్తురుచేత; ఆర్ద్రతన్= తడియటం, అంటుకొనటం; ఒందక= పొందక; ఉచ్చిపోయినన్= గ్రుచ్చుకొనకుండ దూసికొనిపోగా.

తాత్పర్యం: అర్జునుడు కుమారుడి బాణప్రయోగ చాతుర్యాన్ని పొగడి ముందు అతడి హంసధ్వజాన్ని ఖండించి, తరువాత శరీరాన్ని బాణాల చేత పీడించాడు. కాని, మహావీరుడు బభ్రువాహనుడు ఏ మాత్రమూ చలించకుండా ఒక వాడి బాణంతో అర్జునుడి భుజసంధిని కొట్టాడు. మహావేగంతో బాణం దూసికొనిపోవటంచేత దానికి నెత్తురు అంటుకొనకపోగా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. **అమ్మేటిమగఁడు తన చా। ప మ్మూఁతగ నిల్చి సోలి పదపడి తెలి వు**
ల్లమ్మున నొలసిన నౌరా। యిమ్మడి యని పొగడెఁ గొడుకు నెంతయుఁ బ్రీతిన్. **60**

ప్రతిపదార్థం: ఆ మేటి మగఁడు= ఆ మహాశూరుడు; తన= తనయొక్క; చాపమ్ము= విల్లు; ఊఁతగన్= ఆలంబంగా; నిల్చి; సోలి= వివశత్వమునొంది; పదపడి= తరువాత; తెలివు= జ్ఞానం; ఉల్లమ్మునన్= హృదయమునందు; ఒలయన్= కలుగగా; ఔరా; ఇమ్మడి= సాటిఅయినవాడు, సరిసమానుడు; అని; ఎంతయున్= మిక్కిలి; ప్రీతిన్= ఆనందంతో; కొడుకున్= కొడుకును; పొగడెన్= పొగడాడు.

తాత్పర్యం: శూరశ్రేష్ఠుడైన అర్జునుడు తన విల్లు ఆలంబంగా నిలబడ్డాడు. కాని, శరీరం అతడి వశంలో లేదు. తరువాత కొంతసేపటికి హృదయంలో జ్ఞానం జనించి అతడు యథాస్థితిని పొందాడు. 'ఔరా! నాకు సాటి అయినవాడు' అని మహానందంతో కొడుకును పొగడాడు.

తే. **పొగడి 'యేఁ దీవ్ర శరములు నిగుడఁ జేయు। నుద్ధతికి మంచిబంటవై యోర్వవలయుఁ**
జుమ్ము రా' యని పలికి వాలమ్ము లధిక। రయము మెఱయంగఁ బరఁగించె రాజముఖ్య! **61**

ప్రతిపదార్థం: రాజముఖ్య!= రాజాగ్రణీ, జనమేజయా!; పొగడి= ఆ విధంగా కొడుకును పొగడి; ఏన్= నేను; తీవ్రశరములు= వాడి బాణాలు; నిగుడన్+చేయు= ప్రయోగించే; ఉద్ధతికిన్= సంరంభానికి; మంచి= గొప్ప; బంటవు= యోధుడవు; ఐ; ఓర్వన్‌వలయున్= ఓర్చుకొనవలయును; చుమ్ము!= సుమా!; రా= రారా!; అని; పలికి; వాలమ్ములు= తీక్ష్ణ బాణాలను; అధిక= మిక్కిలి; రయము= వేగం; మెఱయంగన్= వెల్లడికాగా; పరఁగించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: జనమేజయా! ఆ విధంగా కొడుకును పొగడి అర్జునుడు 'నేను వాడి బాణాలు ఏసే ఊపునకు మహాయోధుడవై ఓర్చుకొనాలి సుమా! రారా!' అని వడివడిగా వాడి అలుగులు ప్రయోగించాడు.

ఆ. **మొనసి వాని నతఁడు ముత్తునియలు గాఁగఁ। జేయ మత్సరంబు చిత్తవృత్తిఁ**
దనికి సత్వరముగఁ దద్గాత్రమున నించె। నరుఁడు పెక్కు మెఱుఁగు నారసములు. **62**

ప్రతిపదార్థం: అతఁడు= ఆ బభ్రువాహనుడు; మొనసి= గట్టిగా పూనుకొని; వానిన్= అర్జునుడు ప్రయోగించిన బాణాలను; మూడు+తునియలు= మూడు ముక్కలు; కాఁగన్= అయ్యేటట్లుగా; చేయన్= చేయగా; మత్సరంబు= అసూయ; చిత్తవృత్తిన్= చిత్తస్థితియందు; తనికి= ఎక్కువ అయి; నరుఁడు= అర్జునుడు; పెక్కు= అనేకములైన; మెఱుఁగు= వాడిఅయిన; నారసములు= బాణాలు; సత్వరముగన్= వేగముగా; తద్= ఆ బభ్రువాహనుడియొక్క; గాత్రమునన్= శరీరమునందు; నించెన్= ప్రయోగించాడు (నిండేటట్లు చేశాడు.)

తాత్పర్యం: బభ్రువాహనుడు గట్టి పూనికతో అర్జునుడు ప్రయోగించిన బాణాలలో ఒక్కొక్కటీ మూడు ముక్కలయ్యేటట్లు చేశాడు. దీనితో అర్జునుడి మనస్సులో అసూయ అంకురించింది. అతడు వేగంగా బభ్రువాహనుడి ఒంటినిండా వాడి బాణాలు వేశాడు.

ఉ. **దానికి నీడఁ బోవక యుదగ్ర పరాక్రమ మొప్ప వజ్ర కీ**
లానిభతన్ మెఱుంగుల విలాసము నింగి వెలుంగ నుద్భటుం
డై నిగిడించెఁ బార్థు హృదయస్థలి నారస మస్త్ర శస్త్ర వి
ద్యానిపుణత్వశాలి యగు నన్నరపాలసుతుండు భూవరా! 63

ప్రతిపదార్థం: భూవరా!= రాజా!; అస్త్ర= అస్త్రాలయొక్క; శస్త్ర= శస్త్రాలయొక్క; విద్యా= విద్యలయందలి; నిపుణత్వ= నైపుణ్యంచేత; శాలి= ప్రకాశించేవాడు; అగు= అయిన; ఆ నరపాల= ఆ రాజుయొక్క; సుతుండు= కొడుకు; దానికిన్= ఒంటినిండా బాణాలు వేయటానికి; ఈడఁబోవక= వెనుదీయక; ఉదగ్ర= భయంకరమైన; పరాక్రమము= శౌర్యం; ఒప్పన్= ఒప్పగా; వజ్ర= వజ్రాయుధంనుండి పుట్టిన; కీలా= జ్వాలలతో; నిభతన్= సమానంగా; మెఱుంగుల= కాంతులయొక్క; విలాసము= తళుకు; నింగిన్= ఆకాశంలో; వెలుంగన్= వెలుగగా; ఉద్భటుండు+ఐ= భయంకరుడై; పార్థు= అర్జునుడియొక్క; హృదయస్థలిన్= హృదయస్థానంలో; నారసము= బాణము; నిగిడించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: ఒంటినిండా బాణాలు వేసినప్పటికి బభ్రువాహనుడు వెనుకంజ వేయలేదు. అస్త్ర శస్త్ర విద్యా నిపుణుడైన ఆ రాజపుత్రుడు భయంకర పరాక్రమం ఒప్పగా వజ్రాయుధాగ్ని జ్వాలలవంటి కాంతులతో ఆకాశాన్ని ప్రకాశింపజేస్తున్న ఒక బాణాన్ని సూటిగా అర్జునుడి హృదయంలో గ్రుచ్చుకొనేటట్లు ప్రయోగించాడు.

అర్జునుఁడు బభ్రువాహనుని శరంబుచేతఁ బుడమిం ద్రెళ్ళుట (సం. 14-78-35)

క. **వడి నది వీఁపున వెడలినఁ। బడియెఁ బుడమి నర్జునుండు; పదపడి త్రెళ్ళెం**
గొడుకును ము న్నతఁ డేసిన। బెడిదపుటేటుల యలంతఁ బృథ్వీనాథా! 64

ప్రతిపదార్థం: పృథ్వీనాథా!= రాజా!, జనమేజయా!; అది= బభ్రువాహనుడి బాణము; వడిన్= వేగంగా; వీఁపునన్= వీపునుండి; వెడలినన్= దూసికొనిపోగా; అర్జునుండు= అర్జునుడు; పుడమిన్= నేలమీద; పడియెన్= పడ్డాడు; పదపడి= తరువాత; మున్ను= ఇంతకుముందు; అతఁడు= అర్జునుడు; ఏసిన= ప్రయోగించిన బాణాలయొక్క; బెడిదము= గట్టివైన; ఏటుల= దెబ్బలయొక్క; అలంతన్= బాధచేత; కొడుకును= అతడి కొడుకైన బభ్రువాహనుడుకూడా; త్రెళ్ళెన్= నేల కూలాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: జనమేజయా! బభ్రువాహనుడి బాణం అర్జునుడి హృదయంలో నిలువక అతడి వీపునుండి దూసికొనిపోయింది. అతడు భూమిమీద పడిపోయాడు. తరువాత అర్జునుడి బాణాల దెబ్బలవలన పుట్టిన బాధచేత అతడి కొడుకు బభ్రువాహనుడు కూడా నేలకూలాడు.

వ. అట్లు తనపతియును సుతుండును భండనంబునం బడుట విని శోకాక్రాంత యగుచుఁ జిత్రాంగద యులూపి (చి) యుం దోడన చనుదేర నచ్చటికి వచ్చె; నట్లు వచ్చి యచ్చెలువ యయ్యిరువురం గనుంగొని యుల్లంబు జల్లనఁ దల్లడిల్ల మూర్ఛమునింగి మేదినిం బడి, కొంత వడికిం దెలిసి యులూపి నాలోకించి. 65

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; తన పతియును= తన భర్తయూ; సుతుండును= కుమారుడునూ; భండనంబునన్= యుద్ధంలో; పడుట= నేలకూలటం; విని; శోక= శోకంచేత; ఆక్రాంత= ఆక్రమించబడినది; అగుచున్= అవుతూ; చిత్రాంగద; ఉలూపి (చి)యున్= ఉలూపియు; తోడన్+అ= వెనువెంట; చనుదేరన్= రాగా; అచ్చటికిన్= అక్కడకు - యుద్ధభూమికి; వచ్చెన్= వచ్చింది; అట్లువచ్చి; ఆ+చెలువ= ఆ స్త్రీ; చిత్రాంగద; ఆ+ఇరువురన్= ఆ ఇద్దరినీ (భర్తను, కుమారుడినీ); కనుంగొని= చూచి; ఉల్లంబు= హృదయం; జల్లనన్= జల్లుమని; తల్లడిల్లన్= భయపడగా, దుఃఖపడగా; మూర్ఛన్= మూర్ఛలో; మునింగి= మునిగి; మేదినిన్= భూమిమీద; పడి; కొంతవడికిన్= కొంతసేపటికి; తెలిసి= తేరుకొని; ఉలూపిన్= ఉలూపిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: తన భర్తా, కుమారుడూ యుద్ధంలో నేలగూలారని విన్న చిత్రాంగద దుఃఖంలో మునిగిపోయింది. వెనువెంటనే ఉలూపి కూడా రాగా, ఆమె యుద్ధభూమికి వచ్చి, మగనినీ కొడుకునూ చూచింది. గుండె జల్లుమనగా మూర్ఛచెంది నేలమీద పడి కొంతసేపటికి తేరుకొని ఉలూపిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'నీ కతంబునఁ బతి నాకుమారునిచేత। ననిఁ బడియున్నవాఁ డతివ! కంటె;
నీవు పతివ్రత గావె; ధర్మజ్ఞవు। గాని దానవె; యేమి కారణమున
నిది కార్యముగఁ జెప్పి తీపిన్నవానికిఁ। గొడుకు దిక్కున నాకు నడలు లేదు;
వరుఁజూచి పొక్కెద; వామాక్షి! నీ దెసఁ దప్పు సేసినను నీతనిఁ గృపార్ద్ర

తే. చిత్తవై యెల్లభంగి సంజీవితుఁడుగఁ। జేయవమ్మ; యక్కట! నాథు నేయఁ బనిచి
చావు చూచియు వగవవు; సాహసమున। కొలఁది లేదు; ని న్నేమందుఁ గులపవిత్ర!' 66

ప్రతిపదార్థం: అతివ!= కాంతా!; నీకతంబునన్= నీవు కారణంగా; నా= నాయొక్క; కుమారునిచేతన్= కుమారుడివలన; పతి= భర్త; అనిన్= యుద్ధమునందు; పడి= కూలిపోయి; ఉన్నవాఁడు= ఉన్నాడు; కంటి(వి)+ఎ?= చూచితివా?; నీవు; పతివ్రత= పతివ్రతవు; కావు+ఎ= కావా?; ధర్మజ్ఞవు= ధర్మం తెలిసినదానవు; కానిదానవు+ఎ?= కానిదానవా?; ఏమి= ఏ; కారణమునన్= కారణంచేత; ఈ పిన్నవానికిన్= ఈ చిన్నవాడికి; ఇది; కార్యము+కన్= చేయదగినదిగా; చెప్పితి(వి)= చెప్పావు; కొడుకు= కొడుకుయొక్క; దిక్కునన్= విషయమున; నాకున్= నాకు; అడలు= దుఃఖం; లేదు; వామ= అందమైన; అక్షి!= కన్నులు కలదానా; వరున్= భర్తను; చూచి; పొక్కెదన్= పరితపింతును; నీ దెసన్= నీ యెడ; తప్పు; చేసినను= చేసినప్పటికిని; ఈతనిన్= భర్తను; కృపా= దయచేత; ఆర్ద్ర= కరగిన; చిత్తవు+ఐ= మనస్సుకలదానవై; ఎల్లభంగిన్= అన్ని విధాలా, నీ శక్తు లన్నీ ఉపయోగించి; సంజీవితుఁడు+కన్= తిరిగి బ్రదికిన వాడినిగా; చేయుము+అమ్మ!= చేయుమమ్మ!; అక్కట!= అయ్యో!; నాథున్= భర్తను; ఏయన్= బాణాలతో కొట్టగా; పనిచి= ఆజ్ఞాపించి; చావు= అతడి చావు; చూచియున్= కనులార చూచికూడా; వగవవు= విచారించవు; సాహసము+కొలఁది= సాహసంయొక్క మితి; లేదు; కుల= కులమును; పవిత్ర= పావనము చేయుదానా!; నిన్నున్= నిన్ను; ఏమి= ఏమని; అందున్?= అనగలను?

తాత్పర్యం: ఉలూపీ! నీ మూలాన నా కుమారుడివలన భర్త యుద్ధభూమిలో పడిపోయాడు. చూచావా! నీవు పతివ్రతవు కావా? ధర్మం తెలిసినదానవు కావా? ఏ కారణంచేత తండ్రితో యుద్ధంచేసి పడగొట్టుమని ఈ చిన్నవాడికి చెప్పావు. నా కొడుకును గూర్చి నాకు ఏ చింతా లేదు. భర్తను చూచి మాత్రమే పరితపిస్తున్నాను. ఒకవేళ భర్త నీ విషయంలో తప్పు చేశాడే అనుకో! అయినప్పటికీ నీవు దయార్ద్రమైన అంతరంగంతో నీ శక్తులన్నీ ఉపయోగించి భర్తను పునర్జీవితుడిగా చేయవమ్మా! అయ్యో! భర్తను బాణాలతో కొట్టుమని ఆజ్ఞాపించి, అతడు చనిపోగా ఏ మాత్రమూ విచారించకుండా ఉన్నావు. నీ సాహసానికి మితి లేనట్లున్నది. కులపావనీ! నిన్ను ఏమనగలను?'

వ. అని పలికి పార్థుం జేరంబోయి. 67

ప్రతిపదార్థం: అని; పలికి= ఉలూపితో పలికి; పార్థున్= అర్జునుడిని; చేరన్= సమీపించగా; పోయి= సమీపించి.

తాత్పర్యం: అని ఉలూపితో పలికి అర్జునుడిని సమీపించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. 'మహిత కీర్తిలోల! మత్ప్రాణవల్లభ! । యన్యజనుల ప్రాణ మరసి కావఁ
జాలునట్టి నీకు నేల ప్రాణంబుల । నిట్లు వదలి పోవనిచ్చియుండ. 68

ప్రతిపదార్థం: మహిత= గౌరవించబడిన; కీర్తి= కీర్తియందు; లోల!= ఆసక్తి కలవాడా!; మత్+ప్రాణ= నా ప్రాణాలయొక్క; వల్లభ!= నాథుడవైనవాడా!; అన్యజనుల= ఇతరులయొక్క; ప్రాణము; అరసి= పోషించి; కావన్= కాపాడటానికి; చాలు+అట్టి= సమర్థుడవైనట్టి; నీకున్= నీకు; ఇట్లు= ఈ విధంగా; ప్రాణంబులన్= ప్రాణాలను; వదలి= నిన్ను వదలి; పోవన్+ఇచ్చి= పోయేటట్లు చేసి; ఉండన్= ఉండగా; ఏల?= ఎందుకు?

తాత్పర్యం: ఉదాత్త కీర్తి పరాయణా! ప్రాణేశ్వరా! నీవు ఇతరుల ప్రాణాలు కాపాడగల సమర్థుడవు. నీ ప్రాణాలు నీవు కాపాడుకొనలేక పోయా వేల?

సీ. 'నాథ! నీ వెప్పుడు నన్ను మన్నింతువు; । కనువిచ్చి చూడక యునికి దగునె;
హయమున కెవ్వరు నడ్డంబు రాకుండ । నాఁగితి వగ్రజు నధ్వరంబు
వమ్మయిపోకుండ; లె మ్మితుర్రంగంబు । వెనుకొన వలవదే యనఘ! నీకు'
నని యార్తిఁ బలవించి యహిపుత్త్రి దెసఁ జూచి । 'సుతుఁ డెట్టులుండినఁ బతికి నిమ్ము

తే. జీవ; మాండ్రురఁ బెక్కండ్రఁ జేసికొనుట । పురుషులకుఁ దప్పె; భార్య లిత్తెరువునందు
నడవరే; యోర్చి నీదుమనమున నింత । యెఱిఁగి కలిగింపు వరు; వేయు నేల తల్లి!' 69

ప్రతిపదార్థం: నాథ!= నాథా!; నీవు; ఎప్పుడున్= ఎప్పుడునూ; నన్నున్= నన్ను; మన్నింతువు= గౌరవిస్తావు; కనువిచ్చి= కన్నులు తెరచి; చూడక; ఉనికి= ఉండటం; తగును+ఎ?= తగునా?; అగ్రజు= అన్నగారియొక్క; అధ్వరంబు= యజ్ఞం; వమ్ము+అయి= భంగమై; పోక+ఉండన్= పోకుండా; ఎవ్వరున్= ఎవరునూ; హయమునకున్= గుర్రానికి; అడ్డంబురాక+ఉండన్= అడ్డుపడకుండా; ఆఁగితివి= ఆపితివి; లెమ్ము= లే!; అనఘ!= పాపంలేనివాడా!; నీకున్= నీకు; ఈ తురంగంబున్= ఈ గుర్రాన్ని; వెనుకొనన్= వెంటాడగా; వలవదు+ఏ?= వలదా?; అని; ఆర్తిన్= దుఃఖంతో; పలవించి= మొరపెట్టి; అహి= సర్పముయొక్క; పుత్త్రి=

కూతురుయొక్క; దెసన్= వైపు; చూచి; సుతుఁడు= కుమారుడు; ఎట్టులు= ఏ విధంగా; ఉండినన్= ఉన్నప్పటికిని; పతికిన్= భర్తకు; జీవము= ప్రాణం; ఇమ్ము= పోయుము; పురుషులకున్= మగవారికి; పెక్కంద్రన్= పలువురను; ఆంఁడురన్= స్త్రీలను; చేసికొనుట= పెండ్లియాడటం; తప్పు+ఎ?= దోషమా?; భార్యలు= భార్యలు కూడా; ఈ తెరువు+అందున్= మార్గంలో; నడవరు+ఏ= నడవరు కదా?; తల్లి!= తల్లీ!; నీదు మనమునన్= నీ మనస్సులో; ఓర్చి= సహించి; ఇంత= దీనినంతయును; ఎఱిఁగి= ఆలోచించి, తెలిసికొని; వరున్= భర్తను; కలిగింపు= బ్రతికించుము; వేయున్= వేయి మాటలు; ఏల= ఎందుకు?

తాత్పర్యం: 'నాథా! నీవు నన్నెప్పుడూ గౌరవిస్తుంటావు. అటువంటివాడవు కన్నులు తెరచి నన్ను చూడకుండటం తగునా? అన్నగారి యజ్ఞానికి భంగం కలుగకుండా ఎవ్వరూ గుఱ్ఱానికి అడ్డుపడకుండా ఆపావు కదా! పుణ్యాత్మా! లే లెమ్ము. నీవు గుఱ్ఱాన్ని వెంటాడవలదా?' అని చిత్రాంగద శోకించింది. తరువాత ఆమె ఉలూపివైపు చూచి 'కుమారుడు ఏమైనప్పటికీ భర్తను బ్రదికించుము. పలువురు స్త్రీలను వివాహమాడటం మగవారికి తప్పుకాదు కదా! భార్యలు ఈ దారి త్రొక్కరుకదా! (పలువురు భర్తలను కలిగియుండరని అర్థం). కాబట్టి మనసులో ఓర్పు వహించి దీనినంతా ఆలోచించి తల్లీ! భర్తను బ్రదికించుము. ఇంకా వేయిమాట లెందులకు?'

వ. అని యంత నిలువక. 70

ప్రతిపదార్థం: అని; అంతన్= అంతటితో; నిలువక= ఆగకుండా.

తాత్పర్యం: అని అంతటితో అగక. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. 'కొడుకు చేతఁ జచ్చి పడియున్న యిక్కురు। కులవరేణ్యుఁ గరుణ గూరి నీవు
బ్రదుకఁ జేయకున్నఁ బ్రాయోపవేశన। మాచరింతు నహికులాగ్రగణ్య!' 71

ప్రతిపదార్థం: అహికుల= నాగకులమునందు; అగ్రగణ్యా= మొదట లెక్కింపదగినదానా!; కొడుకుచేతన్= కొడుకువలన; చచ్చి; పడి+ఉన్న= యుద్ధభూమిలో పడియున్న; ఈ కురుకుల= ఈ కురుకులంలో; వరేణ్యున్= శ్రేష్ఠుడిని; కరుణ= దయ; కూరి= కలిగి; నీవు; బ్రదుకన్+చేయక= బ్రదికించక; ఉన్నన్= ఉంటే; ప్రాయ= మరణించుటకై; స్వకర్మత్యాగ పూర్వకంగా ఉపవాసం చేయటంతో; ఉపవేశనము= కూర్చుండటం; ఆచరింతున్= చేస్తాను.

తాత్పర్యం: 'నాగకులాగ్రగణ్యా! కొడుకుచేతిలో చచ్చి పడియున్న ఈ కురుకులశ్రేష్ఠుడిని నీవు బ్రతికించకపోతే నేను ప్రాయోపవేశం చేస్తాను.

వ. అనిపలికి పతిచరణంబులు శిరంబు సోఁకం బ్రణమిల్లి, యాసీనయై యూరకుండె; నట్టియెడ బభ్రువాహ నుండు దెప్పిఱి లేచి యప్పొలంతిం జూచి. 72

ప్రతిపదార్థం: అని; పలికి; పతి= భర్తయొక్క; చరణంబులు= పాదాలు; శిరంబు= తలను; సోఁకన్= తాకేటట్లుగా; ప్రణమిల్లి= నమస్కరించి; ఆసీన+ఐ= కూర్చున్నదై; ఊరక+ఉండెన్= మిన్నక ఉండిపోయింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; బభ్రువాహనుండు; తెప్పిఱి= తేరుకొని; లేచి; ఆ పొలంతిన్= ఆ స్త్రీని, తల్లిని; చూచి.

తాత్పర్యం: అని చిత్రాంగద పలికి మగని కాళ్ళకు తల తగిలేటట్లుగా నమస్కరించి, కూర్చుండి మాటాడకుండా ఉన్నది. ఆ సమయంలో బభ్రువాహనుడు తేరుకొని లేచి తల్లిని చూచి.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఉ. 'ఇంచుకయేనియున్ వనట నెన్నఁడుఁ బొందని తల్లి నేఁడు నా
మంచితనంబునన్ బలుకు మాలిన నాథుని నుగ్రశత్రులన్
మంచు నినుండు వోలెఁ బరిమార్చు మహాబలుఁ జూచి యిట్లు దుః
ఖించుచు నుండఁ జూచితి; సకిల్బిషచిత్తున కింత పెద్దయే? 73

ప్రతిపదార్థం: ఎన్నఁడున్= ఏ నాడునూ; ఇంచుక+ఏనియున్= కొంచెంకూడా; వనట= దుఃఖమును; పొందని; తల్లి; నేఁడు; నా= నాయొక్క; మంచితనంబునన్= గొప్పతనంచేత (పరాక్రమాతిశయంచేత అని భావం); పలుకు= మాట; మాలిన= లేని, మాటపలుకూ లేని (మూర్ఛపోయిన అని అర్థం); నాథునిన్= భర్తను; ఉగ్ర= భయంకరులైన; శత్రులన్= శత్రువులను; మంచున్= మంచును; ఇనుండు+పోలెన్= సూర్యుడివలె; పరిమార్చు= రూపుమాపే; మహాబలున్= గొప్పబలం కలవాడిని; చూచి; ఇట్లు= ఈ విధంగా; దుఃఖించుచున్= దుఃఖిస్తూ; ఉండన్= ఉండగా; చూచితిన్= చూచాను; సహ+కిల్బిష= పాపంతో కూడిన; చిత్తునకున్= మనస్సు కలవాడికి; ఇంత= ఇది; పెద్ద+ఏ?= మహాపాపమా?

తాత్పర్యం: 'మా అమ్మ ఏనాడూ దుఃఖం ఎటువంటిదో ఎరుగదు. నా పరాక్రమాతిశయంచేత మాటా పలుకూ లేని భర్తను, మంచును సూర్యుడివలె భయంకరులైన శత్రువులను రూపుమాపే బలిష్ఠుడిని చూచి ఈనాడు ఆమె దుఃఖిస్తున్నది. నేను ఆమె శోకస్థితిని కనులారా చూచాను. తండ్రిని పడగొట్టిన పాపాత్ముడికి తల్లిని దుఃఖం పాలు చేయటం మహాపాపం కానే కాదు గదా!

విశేషం: అలం: ఉపమ, అర్థాంతరన్యాసం.

క. గాదిలి తనయుఁడ నగు నేఁ। గా దన కిక్కురుకులాగ్రగణ్యుని నిమ్మై
మేదినిఁ గూల్చితి మణికిర। ణోదాత్తంబైన మకుట ముర్విం బొందన్.' 74

ప్రతిపదార్థం: గాదిలి= ప్రియమైన; తనయుఁడన్= కుమారుడను; అగు= అయిన; నేన్= నేను; కాదు= తగదు; అనక= అని తలంచక; ఈ కురుకుల= ఈ కురువంశంలో; అగ్రగణ్యునిన్= ముందు లెక్కించదగిన వాడిని; ఈ+మైన్= ఈ విధంగా; మణి= పొదిగిన మణులయొక్క; కిరణ= కాంతులచేత; ఉదాత్తంబు+ఐన= సుందరమైన; మకుటము= కిరీటం; ఉర్విన్= భూమిని; పొందన్= కూడగా; మేదినిన్= నేలమీద; కూల్చితిన్= కూలేటట్లు చేశాను.

తాత్పర్యం: ప్రియ పుత్రుడనయిన నేను ఇది తగదు అని భావించకుండా మణికిరణ మనోజ్ఞమైన కిరీటం నేలమీద పడేటట్లుగా ఈ కురువంశ శ్రేష్ఠుడిని కూల్చాను.'

వ. అని విలాపంబు చేసి వివ్వచ్చుతోడం గూడ యజ్ఞతురంగానుసారులై వచ్చిన యాజ్ఞవల్క్య శిష్యప్రభృతి బ్రాహ్మణ జనంబులు నయనపథప్రాప్తు లగుటయు. 75

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: అని; విలాపంబుచేసి= దుఃఖించి; వివ్వచ్చుతోడన్= అర్జునుడితో; కూడన్= కూడా; యజ్ఞతురంగ= యజ్ఞాశ్వమును; అనుసారులు+ఐ= అనుసరిస్తున్నవారై; వచ్చిన; యాజ్ఞవల్క్య= యాజ్ఞవల్క్యుడియొక్క; శిష్య= శిష్యుడు; ప్రభృతి= మొదలైన; బ్రాహ్మణజనంబులు= బ్రాహ్మణులు; నయనపథ= కంటిచూపు ఒలయువారిని; ప్రాప్తులు= పొందినవారు; అగుటయున్= కాగా; (కన్నులకు కనబడగా అని అర్థం)

తాత్పర్యం: అని బభ్రువాహనుడు విలపించాడు. ఇంతలో అర్జునుడితోపాటు యజ్ఞాశ్వాన్ని అనుసరిస్తున్న యాజ్ఞవల్క్య శిష్యుడు మొదలగు బ్రాహ్మణులు అతడికి కనపడ్డారు.

సీ. **'అధ్వర హయ విషయంబుగా వీ రేమి। పనిచేయు వారొక్కో? పార్థుఁ డిట్లు**
పడియున్నవాఁడని పలవించి జనకుని। నిట్లు చేసిన పాపుఁ డెవ్విధమున
నాచరించునొకో? ప్రాయశ్చిత్త మని పల్కి। పండ్రెండు వర్షముల్ భైక్షవృత్తి
నిమ్మహాత్మని కపాలమ్మున నడపంగ। వలయుఁగా కొం డెద్ది గలుగ నేర్చు?'

ఆ. **నని యులూపి దిక్కు గనుఁగొని 'నీవు ప। న్పంగఁ దండ్రి నిట్లు భండనమున**
విగత జీవితుఁడుగఁ దెగఁ జేసితిని నింక। నెలమిఁ బొందు భరతకులపవిత్ర!' 76

ప్రతిపదార్థం: అధ్వర= యజ్ఞంయొక్క; హయ= గుర్రంయొక్క; విషయంబు+కాన్= పనిగా; వీరు= ఈ బ్రాహ్మణులు; ఏమి పని?= ఏ పని?; చేయువారు+ఒక్కో= చేయువారో; పార్థుఁడు= అర్జునుడు; ఇట్లు= ఈ విధంగా; పడి; ఉన్నవాఁడు= ఉన్నాడు; అని; పలవించి= శోకించి; జనకునిన్= తండ్రిని; ఇట్లు= ఈ విధంగా; చేసిన= పడగొట్టిన; పాపుఁడు= పాపి; ఏ+విధమునన్= ఏ విధంగా; ప్రాయశ్చిత్తము= పాపాన్ని పోగొట్టేపని; ఆచరించున్+ఒకో= చేయునో; అని; పల్కి= పలికి; పండ్రెండు= పన్నెండు; వర్షముల్= ఏండ్లు; ఈ మహత్+ఆత్ముని= ఈ గొప్ప ఆత్మగల వాడియొక్క; కపాలమ్మునన్= తల పుఱ్ఱెయందు; భైక్షవృత్తిన్= భిక్షాన్నమును భుజించే వ్యాపారం; నడపంగన్ వలయున్+కాక= చేయవలయునే తప్ప; ఒండు= మరొక విధానం; ఎద్ది= ఏదియూ; కలుగనేర్చున్= కలుగుతుంది; అని; ఉలూపి దిక్కున్= ఉలూపివైపు; కనుఁగొని= చూచి; నీవు; పన్పంగన్= ఆజ్ఞాపించగా; భండనమునన్= యుద్ధంలో; ఇట్లు= ఈ విధంగా; తండ్రిన్= తండ్రిని; విగత= పోయిన; జీవితుఁడుగన్= జీవిత కాలం కలవాడినిగా, జీవితం ముగిసేటట్లుగా; తెగన్+చేసితిని= చంపితిని; భరతకుల= భరతుడి వంశముయొక్క; పవిత్ర= శుద్ధిని కలిగించుదానా!, పాపాదులను పోగొట్టేదానా; ఎలమిన్= ఆనందపారవశ్యమును; ఇంకన్= ఇక; పొందు= పొందుము.

తాత్పర్యం: 'యజ్ఞాశ్వానికి సంబంధించిన ప్రధాన కార్యాలలో ఏ విధిని నిర్వహించటానికి ఈ బ్రాహ్మణులు వచ్చారో! అర్జునుడు ఈ విధంగా యుద్ధభూమిలో పడి ఉన్నాడు కదా!' అని బభ్రువాహనుడు శోకించాడు. 'తండ్రిని ఈ విధంగా పడగొట్టిన పాపి ప్రాయశ్చిత్తం ఏ విధంగా చేసికొనునో!' అని అన్నాడు. పన్నెండేళ్ళు మహాత్ముడైన అర్జునుడి కపాలంలో భిక్షాన్నం భుజించవలయునే తప్ప మరియొక విధమైన ప్రాయశ్చిత్తం కనబడదు' అని పలికాడు. అతడు ఉలూపివైపు చూచి 'నీవు ఆజ్ఞాపించగా యుద్ధంలో ఈ విధంగా తండ్రిని అకాలమరణం పాలుచేశాను. భరతకుల పరిశుద్ధి కారిణీ! ఇక నీవు ఆనందపారవశ్యం పొందుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని వెండియు. **77**

తాత్పర్యం: అని ఇంకనూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'జనకునిఁ దెగటార్చిన పా। పునకుం బ్రాణంబు తోడి పొత్తు మనంగా
మనమునఁ దాలిమి గలుగునె?। చనుఁగాక యతండు చనిన సద్గతిక తగన్.' **78**

ప్రతిపదార్థం: జనకునిన్= తండ్రిని; తెగటార్చిన= చంపిన; పాపునకున్= పాపికి; ప్రాణంబుతోడన్+పొత్తు= ప్రాణముల సంబంధం; మనంగాన్= ఉండగా; మనమునన్= మనస్సులో; తాలిమి= శాంతి; కలుగును+ఎ?= పుట్టునా? (పుట్టదని భావం); అతండు= తండ్రి; చనిన= వెళ్ళిన; సత్+గతికిన్+అ= ఉత్తమలోకానికే; తగన్= సదాచారానికి తగినట్లుగా; చనున్+కాక= వెళ్ళును గాక!

తాత్పర్యం: 'తండ్రిని చంపిన పాపికి ప్రాణాలున్నంత వరకూ మనశ్శాంతి కలుగదు. తండ్రి వెళ్ళిన ఉత్తమలోకానికే కొడుకు కూడా ధర్మానికి తగ్గట్లుగా వెళ్ళాలి.'

వ. అని యుగ్గడించి స్థావరంబులు జంగమంబులు నగు భూతంబులు విన, భుజంగపుత్త్రియు నాకర్ణింపఁ; జెప్పి 'వ్రతంబు నిష్ఠం బూనెద; మా తండ్రి లే కునికి నిజంబగు నేనిఁ బ్రాయోపవేశంబ యుత్తమ కృత్యంబు; వీరవధంబు పాపం; బంతకంటెను రాజవధం బెక్కు; డంతకంటెఁ గడు నగ్గలంబు ధార్మికవధంబు; జనక వధ పాతకం బింత యని కొలంది యిడరా; దిట్లుండ వీరుండును రాజును ధార్మికుండును జనకుండును నైన యిమ్మహితాత్ముని వధియించిన మహాపాతకుని కేతద్వ్రతానుష్ఠానంబు దక్క నొండుమెయి నిష్కృతి గల్గునే; దీని నడపెద'? నని పలికి యప్పరమనియతుం డుపస్పర్శనం బాచరించి పలుకు లుడిగి కూర్చుండె; నప్పుడు. **79**

ప్రతిపదార్థం: అని; ఉగ్గడించి= వక్కాణించి; స్థావరంబులు= కదలనివి, అచేతనములు; జంగమంబులున్= కదిలేవి, చేతనములు; అగు= అయిన; భూతంబులు= పదార్థాలు; వినన్= వినగా; భుజంగ= సర్పముయొక్క; పుత్త్రియున్= కుమార్తెయు; ఆకర్ణింపన్= వినగా; చెప్పి; వ్రతంబు= సదాచారంయొక్క; నిష్ఠన్= శ్రద్ధను; పూనెదన్= పూనుతాను; మా తండ్రి= అర్జునుడు; లేక+ఉనికి= లేకుండటం, మరణించటం; నిజంబు+అగు+ఏనిన్= నిజమయితే; ప్రాయోపవేశంబు+అ= మరణార్థం ఉపవసించి కూర్చుండటం; ఉత్తమ= మంచిదైన; కృత్యంబు= పని, వీర= వీరుడియొక్క; వధంబు= చంపటం; పాపంబు= పాపం; అంతకంటెను= వీరవధకంటె; రాజ= రాజుయొక్క; వధంబు= చంపుట; ఎక్కుడు= మహాపాపము; అంతకంటెన్= రాజ వధకంటె; ధార్మిక= ధర్మమునందు చరించువాడియొక్క; వధంబు= వధ; కడున్= మిక్కిలి; అగ్గలంబు= అధికం; మహత్తరపాపం; జనక= తండ్రియొక్క; వధ= చంపుటవలన కలుగు; పాతకంబు= పాపం; ఇంత= ఈ పరిమాణం కలది; అని; కొలంది= మితి; ఇడరాదు= పెట్టటం శక్యం కాదు; ఇట్లు= వాస్తవము ఈ విధంగా; ఉండన్= ఉండగా; వీరుండును= వీరుడునూ; రాజును; ధార్మికుండును= ధర్మమునందు చరించేవాడునూ; జనకుండును= తండ్రియూ; ఐన= అయిన; ఈ మహిత= పూజించబడిన; ఆత్మునిన్= ఆత్మకలవాడిని; వధియించిన= చంపిన; మహత్= గొప్ప; పాతకునికిన్= పాపికి; ఏతద్= ఈ; వ్రత= ప్రాయోపవేశ వ్రతముయొక్క; అనుష్ఠానంబు= ఆచరణమే; తక్కన్= తప్ప; ఒండు= మరియొక, ఇతరమైన; మెయిన్= విధంగా; నిష్కృతి= పాపవిముక్తి; కలుగున్+ఏ?= కలుగునా?; దీనిన్= ప్రాయోపవేశాన్ని; నడపెదన్= ఆచరిస్తాను. అని; పలికి; ఆ పరమ= ఆ అధికమైన; నియతుండు= నియమం కలవాడు; ఉపస్పర్శనంబు= ఆచమనం (మూడుసార్లు నీరు లోపలికి పుచ్చుకొనటం); ఆచరించి= చేసి; పలుకులు= మాటలు; ఉడిగి= మాని; కూర్చుండెన్= కూర్చున్నాడు; అప్పుడు= ఆ సమయంలో.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని అక్కడ ఉన్నవారు వింటూ ఉండగా బభ్రువాహనుడు వక్కాణించాడు. అంతేకాక సృష్టియందలి సర్వచేతనాచేతనములూ నాగకన్య అయిన ఉలూపీ వింటూ ఉండగా పలికాడు. మరియు 'నేను సదాచార శ్రద్ధ పాటిస్తాను. మాతండ్రి మరణించటం నిజమయితే ప్రాయోపవేశమే నాకు చేయదగిన మంచిపని. వీరవధ పాపం. అంతకంటె రాజవధ మహాపాపం. దానికంటె ధార్మికవధ మహత్తర పాపం. ఇక జనకవధ ఇంతటిదని మితిపెట్టలేము. సత్యమిట్టిది కాబట్టి వీరుడూ, రాజూ, ధార్మికుడూ, తండ్రీ అయిన మహాత్ముడిని చంపిన మహాపాపికి ప్రాయోపవేశం చేయటంవలన తప్ప అన్యవిధంగా పాపవిముక్తి లేదు. కాబట్టి ప్రాయోపవేశమే చేస్తాను' అని చెప్పి, ఆ పరమ నియమబద్ధుడు ఆచమనంచేసి మౌనియై కూర్చున్నాడు. అప్పుడు.

ఉలూపి(చి) సంజీవనమణిచేత నర్జును బ్రదికించుట (సం. 14-81-1)

ఆ. **అట్లు తెంపు చేసి యాసీను లైన యా। తల్లిఁ, గొడుకు, నవనిఁ ద్రెళ్ళియున్న**
విజయుఁ జూచి పాఁపవెలఁది సంజీవన। మణిఁ దలంచెఁ గురుసమాజముఖ్య! **80**

ప్రతిపదార్థం: కురుసమాజ= కురురాజ సమూహంలో; ముఖ్య!= శ్రేష్ఠుడా!; అట్లు= ఆ విధంగా; తెంపుచేసి= సాహసించి; ఆసీనులు+ఐన= కూర్చున్నవారైన; ఆ తల్లిన్= ఆ తల్లినీ, చిత్రాంగదనూ; కొడుకున్= కొడుకునూ; అవనిన్= భూమిమీద; త్రెళ్ళి+ఉన్న= పడి ఉన్న; విజయున్= అర్జునుడినీ; చూచి; పాఁపవెలఁది= నాగకాంత ఉలూపి; సంజీవన= తిరిగిబ్రదికించే; మణిన్= మణిని; తలంచెన్= స్మరించింది.

తాత్పర్యం: కురురాజశ్రేష్ఠా! ఉలూపి ఆ విధంగా సాహసించి కూర్చున్న చిత్రాంగదనూ, బభ్రువాహనుడినీ, యుద్ధభూమిలో పడి ఉన్న అర్జునుడినీ చూచి తిరిగి బ్రదికించే సంజీవన మణిని స్మరించింది.

వ. **తలంచినం భుజంగమంబులకుఁ బరాయణంబైన యమ్మణి యమ్మహాభాగ హస్తతలంబునకు వచ్చిన నా భామిని భభ్రువాహను నాననం బాలోకించి.** **81**

ప్రతిపదార్థం: తలంచినన్= స్మరించగా; భుజంగమంబులకున్= సర్పాలకు; పరాయణంబు+ఐన= ప్రియమైనదైన; ఆ+మణి; ఆ మహాభాగ= మహాపవిత్రయొక్క; హస్తతలంబునకున్= అరచేతికి; వచ్చినన్= రాగా; ఆ భామిని= ఆ స్త్రీ - ఉలూపి; బభ్రువాహను= బభ్రువాహనుడియొక్క; ఆననంబు(న్)= ముఖమును; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: స్మరించిన వెంటనే నాగజాతివారికి ప్రియమైన ఆ సంజీవనమణి ఉలూపి అరచేతిలో నిలిచింది. అప్పుడు ఆమె బభ్రువాహనుడి ముఖం చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. **విజయుండు చచ్చునే వేదురులార! యిం। ద్రునిచేత నైన; నీతనికి నొక్క**
ప్రియము సేయంగఁ గోరియును నీ కొలఁది యా। రయు బుద్ధి నీతండు రణ మొనర్పఁ
దలఁచిన నివ్వీరుతలఁపు సిద్ధింపంగఁ। జేయుటకును నింత సేయవలసె
నాకుఁ; గావున మోహనంబగు మాయా ప్ర। యోగంబు నడపితి నుజ్జ్వలాత్మ!

తే. **నరుఁడు నారాయణుఁడు; మహత్తరము సువ్వె। యితని తేజ; మెవ్వరికిని నెట్లు దాని**
నార్పవచ్చు; మీ వగ పెల్లఁ దీర్ప నిపుడ। యుత్థితుం డగు నీ కౌరవోత్తముండు. **82**

ప్రతిపదార్థం: వేఁదురులార!= వెర్రులార!; ఇంద్రునిచేతన్= ఇంద్రుడిచేతను; ఐనన్= అయినను; విజయుండు= అనేక విజయాలు పొందినవాడు అర్జునుడు; చచ్చున్+ఏ?= చనిపోవునా?; ఉజ్జ్వల= ప్రకాశిస్తున్న; ఆత్మ= ఆత్మకలవాడా!, బభ్రువాహనా!; ఈతనికిన్= అర్జునుడికి; ఒక్క= ఒక; ప్రియము= మేలు; చేయన్= చేయగా; కోరియును= కోరియూ; నీ= నీయొక్క; కొలఁది= శక్తి; ఆరయు= పరీక్షించే; బుద్ధిన్= తలంపుతో; ఈతండు= ఈ అర్జునుడు; రణము= యుద్ధం; ఒనర్పన్= చేయగా; తలఁచినన్= నిశ్చయించగా; ఈ వీరు= ఈ వీరుడియొక్క; తలఁపు= కోరిక; సిద్ధింపంగన్= నెరవేర్పగా; చేయుటకును= చేయటానికీ; నాకున్= నాకు; ఇంత= ఈ పెద్దపని; చేయవలసెన్= చేయవలసి వచ్చింది; కావునన్= కావున; మోహనంబు= మూర్ఛ కలిగించేది; అగు= అయిన; మాయా= మాయయొక్క; ప్రయోగంబు= ప్రయోగం; నడపితిన్= చేశాను; నరుఁడు= అర్జునుడు; నారాయణుఁడు; ఇతని= ఇతడియొక్క; తేజము= తేజస్సు; మహత్తరము= చాలా గొప్పది; చుమ్మీ= సుమా!; దానికిన్= ఆ తేజస్సును; ఎవ్వరికినిన్= ఎటువంటి వారికైనను; ఎట్లు= ఏ విధంగా; ఆర్పన్= రూపుమాపగా; వచ్చున్?= సాధ్యమౌతుంది?; ఈ కౌరవ= ఈ కౌరవులలో; ఉత్తముండు= శ్రేష్ఠుడు; మీ= మీయొక్క; వగపు= విచారం; ఎల్లన్= అంతయూ; తీర్పన్= పోగొట్టగా; ఇపుడు+అ=ఇప్పుడే; ఉత్థితుండు= లేచినవాడు; అగున్= అవుతాడు.

తాత్పర్యం: వెర్రులారా! ఇంద్రుడిచేతనైనా అర్జునుడు చనిపోతాడా! నేను ఇతడికి గొప్ప మేలు చేయాలని కోరాను. అదీగాక నీ శక్తి పరీక్షించాలనే తలంపుతో నీతో యుద్ధం చేయ నిశ్చయించిన ఇతడి కోర్కె నెరవేర్ప నిర్ణయించాను. ఈ రెండు హేతువుల వలన మూర్ఛపోయేటట్లుగా మాయా ప్రయోగం చేశాను. అర్జునుడు నారాయణుడే. ఇతడి తేజస్సు చాలా గొప్పది. దానిని ఏ విధంగానైనా నశింపజేయటం ఎవ్వరికీ సాధ్యంకాదు. మీ విచారం తొలగించటానికి ఈ కౌరవశ్రేష్ఠుడు ఇప్పుడే లేస్తాడు.

వ. 'మాయా ప్రయోగంబ; వేఱొండుగాదు; నీకు మీతండ్రితోడ భండనంబు సేయ బుద్ధి పుట్టించితి; ఇంతమాత్ర' యని తత్ప్రదేశంబున నున్న యెల్లజనంబులు నుల్లంబుల నానందంబు నొందఁ బలికి, యమ్మణిపూరపురపతి కరతలంబున నమ్మణి యిడి, 'దీని నిమ్మహాత్ముని హృదయదేశంబు మోపు', మనవుడు నతం డట్ల చేయుట యుం. బార్థుండు ప్రత్యుజ్జీవితుండై. 83

ప్రతిపదార్థం: మాయా= మాయయొక్క; ప్రయోగంబు+అ= ప్రయోగమే; వేఱు+ఒండు= మరియొకటి; కాదు; మీ తండ్రితోడన్= మీ తండ్రితో; భండనంబు= యుద్ధం; చేయన్= చేయగా; నీకున్= నీకు; బుద్ధి= ఆలోచన; పుట్టించితిన్= కలిగేటట్లు చేశాను; ఇంతమాత్ర= ఇంతే; అని; తద్= ఆ; ప్రదేశంబునన్= చోటున; ఉన్న; ఎల్లన్+జనంబులున్= జనులందరూ; ఉల్లంబులన్= హృదయాలలో; ఆనందంబున్= ఆనందమును; ఒందన్= పొందగా; పలికి; ఆ మణిపూర= ఆ మణిపూరమనే; పుర= పట్టణంయొక్క; పతి= నాథుడియొక్క; కరతలంబునన్= అరచేతియందు; ఆ మణి= ఆ సంజీవనమణి; ఇడి= ఉంచి; దీనిన్= ఈ మణిని; ఈ మహత్+ఆత్ముని= పెద్దమనస్సుకలవాడియొక్క; హృదయదేశంబు= హృదయస్థానాన్ని; మోపుము= ఆనించుము; అనవుడున్= అనిన తరువాత; అతండు= బభ్రువాహనుడు; అట్లు+అ= అట్లే, ఉలూపి చెప్పిన విధంగానే; చేయుటయున్= చేసిన పిదప; పార్థుండు= అర్జునుడు; ప్రతి+ఉజ్జీవితుండు+ఐ= తిరిగి బ్రదికినవాడై.

తాత్పర్యం: 'ఇది మాయా ప్రయోగమే కాని మరియొకటి కాదు' అని ఉలూపి అన్నది. ఆ మాటలు విని అక్కడివారందరూ ఆనందించారు. అప్పు డామె ఆ మణిని బభ్రువాహనుడి అరచేతిలో ఉంచి దీనిని మహాత్ముడైన అర్జునుడి హృదయస్థానాన 'పెట్టు' మని పలికింది. బభ్రువాహనుడు ఆమె చెప్పినట్లే చేసిన వెంటనే అర్జునుడు తిరిగి బ్రతికాడు.

తే. **లేచి కూర్చుండి కలయంగఁ జూచి యెఱ్ఱ। సెరల కాంతియు దంతరుచియును బెరయ**
నతి మనోహరముగఁ దనసుతునితోడ। 'మనుజనాయక! కుశలమే?' యనుడు నతఁడు. **84**

ప్రతిపదార్థం: లేచి= అర్జునుడు లేచి; కూర్చుండి; కలయంగన్= అంతటా, నలువైపులా; చూచి; అతి= మిక్కిలి; మనోహరముగన్= అందంగా; ఎఱ్ఱ= కంటియందలి ఎఱ్ఱని; సెరల= గీరల; కాంతియున్= కాంతియూ; దంత= పండ్లయొక్క తెల్లని; రుచియును= కాంతియూ; బెరయన్= కూడగా; తన= తనయొక్క; సుతునితోడన్= కొడుకుతో; మనుజనాయక!= రాజా!; కుశలము+ఏ?= సేమమే కదా?; అనుడున్= అని అనగా; అతఁడు= ఆ బభ్రువాహనుడు.

తాత్పర్యం: అర్జునుడు లేచి కూర్చుండి నాలుగు దిక్కులా చూచాడు. అతడి కన్నులలోని ఎఱ్ఱగీరల కాంతీ, తెల్లని పండ్లకాంతీ చాలా అందంగా కలిసిపోయినవి. అప్పుడు అతడు తన కొడుకును 'రాజా! సేమమే కదా!' అని ప్రశ్నించాడు. పిదప బభ్రువాహనుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **వినయ మారంగ నాతని చరణంబుల। కెఱఁగి 'భవత్పుణ్య వీక్షణమున**
నఖిలంబుఁ గుశలంబ' యనిన 'నిజ్జనముల। మొగములయందెల్ల వగపు దోఁచి
యచ్చెరువాటును హర్షంబుఁ గదిరెడు;। నిది యేమి చెప్పవే యెఱుఁగు దేని;
నాచెప్పినట్ల రణంబున కేతెంచి। తీవు; చిత్రాంగద యేల వచ్చె?

ఆ. **నిచ్చటికి నులూపి(చి) యేమిటి కిపుడు చ। న్తెంచె?' ననుడు భక్తి నిర్భరముగ**
నతఁడు సాఁగి మ్రొక్కి హస్తముల్ మొగిచి య। య్యహి తనూజఁ జూపి యతనితోడ. **85**

ప్రతిపదార్థం: వినయము; ఆరంగన్= నిండగా; అతని= అర్జునుడియొక్క; చరణంబులకున్= కాళ్ళకు; ఎఱఁగి; భవత్= మీయొక్క; పుణ్య= పవిత్రమైన; వీక్షణమునన్= చూపుచేత; అఖిలంబున్= సమస్తమునూ; కుశలంబు+అ= సేమమే; అనినన్= అనగా; ఈ జనముల= ఈ జనులయొక్క; మొగముల+అందున్= ముఖాలలో; ఎల్లన్= అంతటా; వగపు= విచారం; తోఁచి= కనబడి; అచ్చెరువాటును= ఆశ్చర్యమూ; హర్షంబు= సంతోషమూ; కదిరెడున్= కలుగుతున్నవి; ఎఱుఁగుదు+ఏని= తెలిసినవాడవైతే; ఇది; ఏమి= ఏమిటో; చెప్పవే= చెప్పుమా; ఈవు; నా+చెప్పిన+అట్ల= నేను చెప్పిన విధంగానే; రణంబునకున్= యుద్ధానికి; ఏతెంచితి= వచ్చావు; చిత్రాంగద; ఏల= ఎందువలన; వచ్చెన్= వచ్చింది. ఇచ్చటికిన్= ఇక్కడకు; ఉలూపి(చి)= ఉలూపి; ఇపుడు; ఏమిటికిన్= దేనికి; చన్+తెంచెన్= వచ్చింది; అనుడున్= అనగా; భక్తి= భక్తిచేత; నిర్భరము+కన్= నిండి ఉండేటట్లుగా; అతఁడు= బభ్రువాహనుడు; చాఁగి= సాష్టాంగపడి, మ్రొక్కి; హస్తముల్= చేతులు; మొగిచి= మోడ్చి; ఆ అహి= ఆ నాగరాజుయొక్క; తనూజన్= పుత్రికను; చూపి; అతనితోడన్= అర్జునుడితో.

తాత్పర్యం: పరిపూర్ణ వినయంతో అర్జునుడి కాళ్ళకు మ్రొక్కి 'మీ పావన కటాక్ష వీక్షణం చేత అందరూ సేమమే' అని అన్నాడు. తరువాత అర్జునుడు 'నాకు వీరి ముఖాలలో విచారం గోచరించి ఆశ్చర్యమూ సంతోషమూ కలుగుతున్నవి. వీరి విచారానికి కారణం నీకు తెలిస్తే నాకు చెప్పుము. నీవు నేను చెప్పిన విధంగానే యుద్ధం చేయటానికి వచ్చావు. మరి ఇక్కడకు చిత్రాంగద ఎందుకు వచ్చింది? ఉలూపి ఇప్పుడు దేనికి వచ్చింది?' అని అడిగాడు. అంతట బభ్రువాహనుడు సాష్టాంగ నమస్కారం చేసి, లేచి చేతులు మొగిడ్చి నాగకన్య అయిన ఉలూపిని చూపి అర్జునుడితో. (తరువాతి వచనంతో అన్వయం).

వ. 'అంతయు నిమ్మహానుభావ నడుగుం' డనిన, గాండీవి యా యింతివదనం బాలోకించి 'కురువంశ నిస్తారకా! నీ రాకకుం గారణంబేమి?; ' యిమ్మణిపూర పురనాథుని దెస నావలన భవదీయ చిత్తంబు ప్రసన్నంబయి యున్న యదియె?; యిన్నరపతియును నేనును జిత్రాంగదయును నీకేమియు నపరాధంబు సేయము గదా' యనుటయు. 86

ప్రతిపదార్థం: అంతయున్= వృత్తాంతమంతయూ; ఈ మహానుభావన్= మహిమగలదానిని; అడుగుండు= అడుగుడు; అనినన్= అనగా; గాండీవి= అర్జునుడు; ఆ ఇంతి= ఆ స్త్రీయొక్క; వదనంబు= ముఖమును; ఆలోకించి= చూచి; కురువంశ= కురువంశమును; నిస్తారకా!= ఉద్ధరించుదానా!; నీ= నీయొక్క; రాకకున్= వచ్చుటకు; కారణంబు= కారణం; ఏమి?= ఏది?; ఈ మణిపూరపుర= ఈ మణిపూర పురముయొక్క; నాథునిదెసన్= నాథుడియెడ; నా వలనన్= నా యెడల; భవదీయ= నీ యొక్క; చిత్తంబు= మనస్సు; ప్రసన్నంబు+ఐ= తృప్తి పొందినదై, దయగలదై; ఉన్న+అది+ఎ?= ఉన్నదా?; ఈ నరపతియును= ఈ రాజునూ; నేనును= నేనూ; చిత్రాంగదయున్= చిత్రాంగదయూ; నీకున్= నీ యెడ; ఏమియున్= ఏమియూ; అపరాధంబు= తప్పు; చేయము+కదా= చేసి ఉండము కదా; అనుటయున్= అని అన్నతరువాత. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: 'వృత్తాంతమంతా ఈ మహానుభావను అడుగుము' అని అన్నాడు. అప్పుడు అర్జునుడు ఉలూపిని తేరిపారజూచి 'కురుకులోద్ధారకా! నీ రాకకు కారణ మేది? బభ్రువాహనుడియెడలా, నా యెడలా నీ మనస్సు తృప్తి వహించి ఉన్నదా? ఇతడు గానీ, నేనుగానీ, చిత్రాంగద గానీ నీ యెడ తప్పుచేశామా? అని అన్నాడు.

ఉలూపి(చి) యర్జునునితో వసువుల కోపప్రసాదంబుల నెఱింగించుట (సం. 14-82-5)

సీ. అల్లన నవ్వుచు నయ్యింతి యతనితో। 'నాథ! నీయం దొకనాఁడు నెగ్గు
గలదె?; నా పుత్త్రుని వలనఁ గీ డెక్కడి। యది?; వినీతాత్మ చిత్రాంగదయును;
గినియక విను; మేను వినతోత్తమాంగ నై। చెప్పెద; నీ సుతుచేత నీకు
నావహిల్లె నశుభ; మాహవంబున నీవు। గంగాతనూజు శిఖండి నెపము

తే. గాఁగ దెగటార్చి; తది పాతకంబు; దాని। కనఘ! నిష్కృతి సేయక తనువు విడిచి
తేని నరకవాసమునకుఁ బోనువలయుఁ;। గాన నిష్కృతిసేసితిఁ గడఁగి వచ్చి. 87

ప్రతిపదార్థం: ఆ ఇంతి= ఆ స్త్రీ ఉలూపి; అల్లన్+అ= మెల్లగా; నవ్వుచున్= నవ్వుతూ; అతనితోన్= అర్జునుడితో; నాథ!= నాథా!; నీయందున్= నీయెడ; ఒకనాఁడున్= ఏనాడైనను; ఎగ్గు= తప్పు; కలదు+ఎ= ఉన్నదా; నా= నాయొక్క; పుత్త్రుని వలనన్= కుమారుడివలన, బభ్రువాహనుడివలన; కీడు= తప్పు; ఎక్కడి+అది?= ఎక్కడ ఉన్నది?; చిత్రాంగదయును= చిత్రాంగద కూడా; వినీత= నాగరకతను పొందిన, సుశిక్షితమైన; ఆత్మ= మనస్సు కలది; కినియక= కోపగించక; వినుము; ఏను= నేను; వినత= ముందునకు వాలిన; ఉత్తమాంగన్= తల కలదానను (వినయంతో తలవాల్చిన దానను అని అర్థం); ఐ; చెప్పెదన్= చెప్పుతాను; నీకున్= నీకు; నీ= నీయొక్క; సుతుచేతన్= కుమారుడివలన; అశుభము; ఆవహిల్లెన్= కలిగింది; నీవు; ఆహవంబునన్= యుద్ధంలో; శిఖండి; నెపము= మిష; కాఁగన్= కాగా; గంగా= గంగానదియొక్క; తనూజున్= కుమారుడిని, భీష్ముడిని; తెగటార్చితి(వి)= చంపితివి; అది= భీష్మవధ; పాతకంబు= మహాపాపం; అనఘ!= పాపరహితా! పుణ్యాత్మా; దానికిన్= ఆ మహాపాపానికి; నిష్కృతి= ప్రాయశ్చిత్తం; చేయక; తనువు విడిచితి (వి)+ఏనిన్= శరీరమును వదలితే, మరణిస్తే; నరక= నరకంయొక్క; వాసమునకున్= నివసించటానికి; పోను+వలయున్= పోవలయును; కాన; కడఁగి=పూనుకొని; వచ్చి; నిష్కృతి= ప్రాయశ్చిత్తం - ప్రతిక్రియ; చేసితిన్= చేశాను.

తాత్పర్యం: మెల్లగా నవ్వుతూ ఉలూపి అర్జునుడితో 'ప్రాణేశ్వరా! ఏనాడూ నీవు తప్పుచేయలేదు. నా కుమారుడివలన తప్పు ఎక్కడ? ఇక చిత్రాంగద అంటావా సుశిక్షితమైన మనస్సు కలదే. కోపగించకుండా వినుము. వినయంతో తలవాల్చి నమస్కరించి చెప్తుతాను. నీ కుమారుడివలన నీకు అశుభం కలిగింది. నీవు యుద్ధంలో శిఖండి మిషగా భీష్మడిని పడగొట్టావు. అది మహాపాపం. ఆ పాపానికి ప్రాయశ్చిత్తం చేసికొనకుండా నీవు మరణిస్తే నరకానికి వెళ్ళవలసి ఉంటుంది. అందువలన నేను పూనుకొని వచ్చి నీకు పాపవిముక్తి చేశాను.

విశేషం: 'ఏని నరకవాసమునకుఁ బోవ వలయు'- ఈ ఎత్తుగీతి మూడవ పాదములో యతి దప్పింది. వావిళ్ళవారు, రామా అండ్ కో వారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ప్రకటించిన భారత ప్రతులయందును ఈ పాఠమే కనబడుతున్నది. 'పోవవలయు' అనేచోట 'పోను వలయు' అని ఉండటం ఒప్పు.

వ. అది యెట్లంటేని నాకర్ణింపు; మే నొక్కనాఁడు సఖీసమేతంబుగా సురనదీస్నానంబునకు వచ్చియుండ, వసువు లక్కడకేతెంచి యింతనంత నొక్కరేవునం దోఁచి కృత స్నానులై నిజరూపంబున సన్నిహితయైన గంగాదేవితోడ 'గాండీవధరుండు శిఖండిం బురస్కరించుకొని, గాంగేయుం డేయకుండం బరమ సాయకంబుల నతనిం గూల్చె; నట్లు కుత్సితజయార్జనం బొనర్చిన యయ్యర్జును నేము శాపసంతాపితుం జేయుదు' మని చెప్పిన నప్పరమానుభావయు దాని కొడంబడిన పలుకు పలికె; నంతయు విని తత్క్షణంబ. 88

ప్రతిపదార్థం: అది; ఎట్లు; అంటి(వి)+ఏని= అని అనినచో; ఆకర్ణింపుము= వినుము; ఏను= నేను; ఒక్కనాఁడు= ఒక రోజు; సఖీ= చెలికత్తెలతో; సమేతంబు+కాన్= కూడిఉండేటట్టుగా; సురనదీ= గంగానదియొక్క; స్నానంబునకున్= స్నానానికి; వచ్చి+ఉండన్= వచ్చి ఉండగా; వసువులు; అక్కడకున్= అక్కడకు; ఏతెంచి= వచ్చి; ఇంతన్+అంతన్= సమీపాన; ఒక్కరేవునన్= ఒకానొక రేవులో; తోఁచి= కనబడి; కృతస్నానులు+ఐ= స్నానం చేసినవారై; నిజ= తనయొక్క; రూపంబునన్= రూపంతో, స్వస్వరూపంతో; సన్నిహిత+ఐ= దగ్గరకు వచ్చినదైన; గంగాదేవితోడన్= గంగాదేవితో; గాండీవ= గాండీవమును; ధరుండు= ధరించినవాడు అర్జునుడు; శిఖండిన్= శిఖండిని; పురస్కరించుకొని= ముందుంచుకొని; గాంగేయుండు= గంగానది కుమారుడు భీష్ముడు; ఏయక= బాణాలు ప్రయోగించక; ఉండన్= ఉండగా; పరమ= శ్రేష్ఠములైన; సాయకంబులన్= బాణాలతో; అతనిన్= అతడిని; కూల్చెన్= పడగొట్టాడు; అట్లు= ఆ విధంగా; కుత్సిత= నీచమైన; జయ= జయంయొక్క; ఆర్జనంబు= సంపాదనము; ఒనర్చిన= చేసిన; ఆ+అర్జునున్= ఆ అర్జునుడిని; ఏము= మేము; శాప= శాపంచేత; సంతాపితున్= మిక్కిలి తపింపజేయబడిన వాడినిగా; చేయుదుము= చేస్తాము; అని; చెప్పినన్= చెప్పగా; ఆ పరమ= ఆ అధికమైన; అనుభావయున్= మహిమ కలదియు, గంగాదేవియు; దానికిన్= వసువుల నిర్ణయానికి; ఒడంబడిన= ఒప్పుకొనిన; పలుకు= మాట; పలికెన్= పలికింది; అంతయున్= దీనినంతయూ; విని; తద్+క్షణంబు+అ= ఆ క్షణముననే.

తాత్పర్యం: అది యెట్లని నీవంటే నేను చెప్తుతాను వినుము. నేను ఒక నాడు చెలికత్తెలతో కూడి స్నానం చేయటానికి గంగానదికి వెళ్ళాను. ఇంతలో వసువులు కూడా వచ్చి మాకు దగ్గరగా ఉన్న రేవులో స్నానం చేశారు. వారు స్వస్వరూపంతో వచ్చిన గంగాదేవితో 'అర్జునుడు శిఖండిని ముందుంచుకొని భీష్మడిని ఎదుర్కొన్నాడు. భీష్ముడు తన నియమం ప్రకారం బాణాలు ప్రయోగించలేదు. ఈ సందు చూచికొని అర్జునుడు ఉత్తమ బాణాలతో పడగొట్టాడు. ఈ విధంగా నీచ విజయం సంపాదించిన అర్జునుడిని మేము శాపంతో మాడ్చి వేస్తాము' అని అన్నారు. గంగాదేవి కూడా వారి నిర్ణయాన్ని ఆమోదించింది. దీనినంతా వినిన నేను వెంటనే. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. అరిగి యేఁ దండ్రికి నత్తెఱంగంతయు। నెఱిఁగించుటయు, నతం డెసక మెసఁగ
భయమున రయమునఁ బఱతెంచి వసువులఁ। బెక్కు విధంబులఁ బ్రియము పుట్టఁ
దెలిచి ప్రార్థించిన నలుక వో విడిచి వా। రతనితో 'విను సమయం బొకండు
చేసెద; మనిలోన వాసవిఁ దత్సూనుఁ। డగు బభ్రువాహనుం డస్త్రవితతిఁ

ఆ. బఱపి గూల్చె నేనిఁ బాయు నక్కిల్బిష;। మనిన మగిడి వచ్చి యా భుజంగ
నాథుఁ డెల్లఁ జెప్పె నాకు; నిప్పని దగ। నిట్లు దీర్చితిని సమిద్ధతేజ! 89

ప్రతిపదార్థం: ఏన్= నేను; అరిగి= వెళ్ళి; తండ్రికిన్= మా తండ్రికి; ఆ తెఱంగు= ఆ వృత్తాంతం; అంతయున్= అంతయూ; ఎఱిఁగించుటయున్= తెలిపిన తరువాత; అతండు= మా తండ్రి; ఎసకము= తత్తరపాటు; ఎసఁగన్= ఎక్కువ కాగా; భయమునన్= భయంతో; రయమునన్= వేగంతో; పఱతెంచి= పరుగున వచ్చి; పెక్కువిధంబులన్= అనేక విధాలుగా; ప్రియము= ప్రీతి; పుట్టన్= పుట్టగా; వసువులన్= వసువులను; తెలిచి= పొగడి; ప్రార్థించినన్= ప్రార్థించగా; వారు= వసువులు; అలుక= కోపం; పోవిడిచి= పూర్తిగా వదలి; అతనితోన్= మా తండ్రితో; విను= వినుము; సమయంబు= నియమం; ఒకండు= ఒకటి; చేసెదము; అనిలోనన్= యుద్ధంలో; వాసవిన్= అర్జునుడిని; తద్= అతడియొక్క; సూనుఁడు= కుమారుడు; అగు= అయిన; బభ్రువాహనుండు; అస్త్ర= అస్త్రాలయొక్క; వితతిన్= సమూహంచేత; పఱపి= బాధించి; కూల్చెన్+ఏనిన్= పడగొట్టితే; ఆ కిల్బిషము= ఆ పాపం; పాయున్= వదలును; అనినన్= అని అనగా; మగిడి= తిరిగి; వచ్చి; ఆ భుజంగ= సర్పములయొక్క; నాథుఁడు= రాజు; నాకున్= నాకు; ఎల్లన్= అంతయు; చెప్పెన్= చెప్పాడు; సమిద్ధ= ప్రజ్వలింపచేయబడిన; తేజ!= తేజస్సు కలవాడా!; ఈ పని= వసువులు చెప్పిన పని; ఇట్లు= ఈ విధంగా; తీర్చితిని= నెరవేర్చాను.

తాత్పర్యం: వెళ్ళి ఆ వృత్తాంతమంతా మా తండ్రికి చెప్పాను. ఆయనకు తత్తరపాటు హెచ్చింది. మా తండ్రి భయపడి సత్వరంగా పరుగున వచ్చి వసువులను స్తుతించి ప్రార్థించాడు. వారికి ఆనందం కలిగింది. కోపం వీడి వసువులు మా తండ్రితో 'ఒక నియమం పెట్టాము. వినుము, అర్జునుడి కుమారుడైన బభ్రువాహనుడు యుద్ధంలో అనేకాస్త్రాలచేత బాధించి అతడిని పడగొట్టాలి. అప్పుడు గాని అతడికి పాపవిముక్తి కలుగదు' అని చెప్పారు. ఆ నాగనాథుడు తిరిగివచ్చి జరిగినదంతా నాకు చెప్పాడు. మహాతేజస్వీ! వసువులు చెప్పిన పనిని ఈ విధంగా నెరవేర్చాను.

వ. తీర్చిన తెఱంగు నెఱింగించెద' నని పలికి బభ్రువాహను నుపలక్షించి 'యిక్కుమారుండు నీతో సమరంబు చేయనొల్లక నమస్కరించి మరలి మందిరంబునకుం బోవు చున్కి బుద్ధింగని సమయకార్యంబునకు నిది యవసరం బని యూహించి రయంబున నితనికడకు వచ్చి 'రణంబు మీ తండ్రికిఁ బ్రియంబును ధర్మంబు' నని చెప్పి యితనిం బోరికిం బురికొల్పి యివ్వీరునియందు వసువులు చెప్పిన విధంబు గలుగునట్లుగా విక్రమ విశేషం బావహించితి.' 90

ప్రతిపదార్థం: తీర్చిన= నెరవేర్చిన; తెఱంగు= తీరు; ఎఱింగించెదన్= తెలుపుతాను; అని; పలికి; బభ్రువాహనున్= బభ్రువాహనుడిని; ఉపలక్షించి= ఉద్దేశించి; ఈ కుమారుండు= ఈ రాజపుత్రుడు; నీతోన్= నీతో; సమరంబు= యుద్ధం; చేయన్= చేయగా, ఒల్లక= ఇష్టపడక; నమస్కరించి= మ్రొక్కి; మరలి= వెనుదిరిగి; మందిరంబునకున్= తన సౌధానికి; పోవుచున్+ఉన్కి= పోవుచుండటం; బుద్ధిన్= దివ్యజ్ఞానంతో; కని= తెలిసికొని; సమయ= వసువులు పెట్టిన నియమముయొక్క; కార్యంబునకున్= పనికి; ఇది;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అవసరంబు= సమయం; అని; ఊహించి; రయంబునన్= వేగంగా; ఇతని కడకున్= ఇతడి దగ్గరకు; వచ్చి; రణంబు= యుద్ధం; మీ తండ్రికిన్= మీ తండ్రికి; ప్రియంబును= ఇష్టమయినది; ధర్మంబును= ధర్మమును; అని; చెప్పి; ఇతనిన్= ఇతడిని; పోరికిన్= యుద్ధానికి; పురికొల్పి= ప్రోత్సహించి; ఈ వీరుని యందున్= ఈ వీరుడియందు; వసువులు; చెప్పిన; విధంబు= విధం; కలుగు+అట్లు+కాన్= జరిగేటట్లుగా; విక్రమ విశేషంబు= పరాక్రమాతిశయం; ఆవహించితిన్= కలిగించాను.

తాత్పర్యం: నేను ఏ విధంగా ఆ పని నెరవేర్చానో చెప్తుతాను' అని పలికి బభ్రువాహనుడిని ఉద్దేశించి 'ఈ రాచకొడుకు నీతో యుద్ధం చేయటానికి ఇష్టపడక ఒక నమస్కారం పెట్టి తిరిగి తన సౌధానికి వెళ్ళాడు కదా! దివ్యజ్ఞానంచేత ఇతడు తిరిగి వెళ్ళటం నేను తెలిసికొని వసువులు పెట్టిన నియమానికి తగినపని చేయటానికి ఇదే సమయమని ఊహించి ఇతడి దగ్గరకు వచ్చాను. వచ్చి 'యుద్ధం మీ తండ్రికి ఇష్టం. అది ఆయనకు ధర్మం' అని ఇతడిని యుద్ధానికి రెచ్చగొట్టాను. అంతేకాక వసువులు చెప్పిన రీతిగా సిద్ధించటానికి ఇతడిలో పరాక్రమాతిశయాన్ని కలిగించాను.'

క. అనినఁ బ్రియమంది 'దేవీ! యనఘుం బగు నీ చరిత్ర మస్మత్కుల వ
ర్ధన కారి యగుట యెప్పుడుఁ। గనినది గాదె!' యని పలికె గాండీవి నృపా! 91

ప్రతిపదార్థం: నృపా!= రాజా! జనమేజయా!; అనినన్= అని ఉలూపి ఆ విధంగా అనగా; గాండీవి= అర్జునుడు; ప్రియము= ప్రీతి; అంది= పొంది; దేవీ!; అనఘంబు= పాపరహితం; అగు= అయిన; నీ= నీయొక్క; చరిత్ర= నడవడి; అస్మద్= మాయొక్క; కుల= కులంయొక్క; వర్ధన= పెంపును; కారి= చేసేది; అగుట; ఎప్పుడున్= ఎల్లప్పుడు; కనిన+అది= తెలిసిందే; కాదు+ఎ!= కదా!; అని; పలికెన్= పలికాడు.

తాత్పర్యం: జనమేజయా! ఆ విధంగా చెప్పిన ఉలూపి మాటలు విని అర్జునుడు ఆనందించాడు. అతడు 'దేవీ! నీ పుణ్యచరిత్రం ఎల్లప్పుడూ మా వంశానికి పెంపు కలిగించటం తెలిసిందే కదా!' అని అన్నాడు.

ఆ. పలికి సాదరముగ బభ్రువాహనుఁ జూచి। మానితాగమిష్యమాణ చైత్ర
మాస పౌర్ణమాసి మహితాశ్వమేధ కా। లంబు; దాని దెసఁ దలంపు గలిగి. 92

ప్రతిపదార్థం: సహస+ఆదరము+కన్= గౌరవ పూర్వకంగా; పలికి; బభ్రువాహనున్= బభ్రువాహనుడిని; చూచి= ఉద్దేశించి; మానిత= పూజించబడిన, పవిత్రమైన; ఆగమిష్యమాణ= రానున్న; చైత్రమాస= చైత్రమాసంయొక్క; పౌర్ణమాసి= పూర్ణిమ; మహిత= పూజించబడినదగు, పుణ్యప్రదమైన; అశ్వమేధ= అశ్వమేధంయొక్క; కాలంబు= సమయం; దానిదెసన్= దానియెడ; తలంపు కలిగి= మనస్సు పెట్టి; (దానిని గుర్తుపెట్టుకొని అని అర్థం).

తాత్పర్యం: ఆ విధంగా సగౌరవంగా ఉలూపితో పలికి అర్జునుడు బభ్రువాహనుడిని చూచి 'రానున్న పవిత్రచైత్రమాస పూర్ణిమే పుణ్యప్రదమైన అశ్వమేధ సమయం. దానిని గుర్తుపెట్టుకొని. (తరువాతి పద్యంతో అన్వయం)

క. నీవును దల్లులు బంధు జ। నావళియుం బరిజనములు హస్తినగరికిన్
రావలయు; ధర్మజుని సం। భావనముం బడయు టొసఁగుఁ బరమ శుభంబున్.' 93

ప్రతిపదార్థం: నీవును= నీవూ; తల్లులు= మీ తల్లులునూ; బంధుజన= బంధువులయొక్క; ఆవళియున్= సమూహమునూ;

పరిజనములు= సేవకులునూ; హస్తినగరికిన్= హస్తినాపురానికి; రావలయున్= రావాలి; ధర్మజుని= ధర్మరాజుయొక్క; సంభావనమున్= మన్నన; పడయుట= పొందుట; పరమ= ఉత్తమమైన; శుభంబున్= శుభమును; ఒసంగున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: నీవూ, మీ తల్లులూ, బంధువులూ, సేవకులూ హస్తినాపురానికి తప్పకరావాలి. ధర్మజుడి మన్నన మీకు ఉత్తమ శుభాలను కలిగిస్తుంది.

చ. **అనవుడు ' నట్ల చేసెద నుదాత్త చరిత్ర! పురంబు చొచ్చి యి**
వ్వనితలు నీవు నా వలని వత్సలతం గొనియాడు చియ్యెడన్
మన మలరంగ నిల్చి, జనమాన్యునిఁగా ననుఁజేసి ప్రీతి నే
ననుపఁగ వచ్చి చేయు మనుయానము యజ్ఞతురంగ రక్షకై. **94**

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; ఉదాత్త= గొప్ప; చరిత్ర= నడవడి, స్వభావం కలవాడా!; అట్లు+అ= అట్లే; చేసెదన్= చేస్తాను; ఈ+వనితలు= ఈ స్త్రీలు, ఈ తల్లులందరు; నీవు; పురంబు= పట్టణం; చొచ్చి= ప్రవేశించి; నావలనన్= నా యందలి; వత్సలతన్= పుత్రప్రేమతో; కొనియాడుచున్= ఆదరిస్తూ; ఈ+ఎడన్= ఇక్కడ; మనము= మనస్సు; అలరంగన్= సంతోషించగా; నిల్చి= ఉండి; ననున్= నన్ను; జన= ప్రజలచేత; మాన్యునిన్+కాన్= గౌరవించతగినవాడినిగా; చేసి; ప్రీతిన్= సంతోషంతో; నేను; అనుపఁగన్= వీడ్కొల్పగా; వచ్చి; యజ్ఞతురంగ= యజ్ఞాశ్వంయొక్క; రక్షకై= రక్షణకొరకు; అనుయానము= అనుసరించి వెళ్ళటం; వెంబడించటం; చేయుము.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా పలుకగా 'ఉదాత్త ప్రకృతి కలవాడా! నీవు చెప్పినట్లే చేస్తాను. ఈ తల్లు లిద్దరూ, నీవూ పట్టణం ప్రవేశించండి. నాపై ప్రేమతో నన్ను ఆదరిస్తూ ఇక్కడ కొన్నాళ్ళపాటు ఉండి, ప్రజలు పూజించతగినవాడినిగా చేయండి. సంతోషించి, నేను వీడ్కొల్పగా యజ్ఞాశ్వాన్ని రక్షించటానికి వెంట వెళ్ళండి.

వ. **అనుచుం బ్రణతుండై బభ్రువాహనుండు ప్రార్థించినం, బార్థుండప్పార్థివుతో ' నేను దీక్షితుండనగుట యెఱుం గవే; నాకుం బురప్రవేశంబు చేయం జనదు; పోయి వచ్చెద; మీరును సుఖులరయి యుండుం 'డనిన 'నట్లకాక' యని యతం డుచిత ప్రకారంబునం బూజించి యామంత్రణంబు చేయ నబ్భామలచేత ననుజ్ఞాతుండై యమ్మ హాత్ముండు యజ్ఞాశ్వంబు ననుసరించె; నదియు నిజేచ్ఛ నఖిల దేశంబులం బ్రవర్తిల్లె; నట్టియెడ.** **95**

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; ప్రణతుండు+ఐ= నమస్కరించినవాడై; బభ్రువాహనుండు; ప్రార్థించినన్= ప్రార్థించగా; పార్థుండు= అర్జునుడు; ఆ పార్థివుతోన్= ఆ రాజుతో; నేను; దీక్షితుండను+అగుట= దీక్షపూనినవాడను కావటం, ఎఱుంగవు+ఏ?= తెలిసికొనవా?; నాకున్= నాకు; పుర= పట్టణంయొక్క; ప్రవేశంబు= ప్రవేశం; చేయన్= చేయగా; చనదు= తగదు; పోయి వచ్చెదన్= వెళ్ళుతున్నాను; మీరును; సుఖులరు+ఐ= సుఖంకలవారై; ఉండుండు= ఉండండి; అనినన్= అనగా; అట్లు+అ= అట్లే; కాక= అగును గాక; అని; అతండు= బభ్రువాహనుడు; ఉచిత= తగిన; ప్రకారంబునన్= విధంగా; పూజించి; ఆమంత్రణంబు చేయన్= వీడ్కొల్పగా; ఆ భామలచేతన్= ఆ స్త్రీలచేత, భార్యలచేత; అనుజ్ఞాతుండు+ఐ= అనుమతించబడినవాడై; ఆ+మహత్+ఆత్ముండు= ఆ గొప్ప మనస్సు కలవాడు; యజ్ఞ= యజ్ఞంయొక్క; అశ్వంబున్= గుర్రమును; అనుసరించెన్= వెంబడించాడు; అదియున్= ఆ గుర్రమునూ; నిజ= తనయొక్క; ఇచ్ఛన్= ఇష్టంవచ్చినట్లు; అఖిల= సమస్తమైన; దేశంబులన్= దేశాలలో; ప్రవర్తిల్లెన్= సంచరించింది.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అంటూ బభ్రువాహనుడు నమస్కార పూర్వకంగా ప్రార్థించాడు. అర్జునుడు ఆ రాజుతో 'నేను దీక్ష వహించానని నీకు తెలుసు కదా! కావున నాకు పట్టణంలో ప్రవేశించటం తగదు. నేను వెళ్ళుతున్నాను. మీరు సుఖంగా ఉండండి' అని అన్నాడు. అంత బభ్రువాహనుడు సరే అని సముచితంగా పూజించి అర్జునుడిని వీడ్కొల్పాడు. అతడు భార్యల అనుమతి పొంది యజ్ఞాశ్వాన్ని వెంబడించాడు. అది సమస్త దేశాలలో ఇచ్ఛ వచ్చినట్లు సంచరించింది. ఆ సమయంలో.

క. రాజగృహపురము కడ న। వ్వాజి యరుగు టెఱిఁగి, యాహవమునకుఁ బిలిచెన్
రాజ త్కీర్తి ధనుం డగు। నా జిష్ణుని మేఘసంధి యను రా జధిపా! 96

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; ఆ వాజి= ఆ గుర్రం; రాజగృహ= రాజగృహమనే; పురము కడన్= పట్టణం దగ్గర; అరుగుట= చేరటం; ఎఱిఁగి= తెలిసి; మేఘసంధి; అను= అనే; రాజు; రాజత్= ప్రకాశిస్తున్న; కీర్తి= కీర్తియే; ధనుండు= ధనంగా కలవాడు; అగు= అయిన; ఆ జిష్ణునిన్= ఆ జయశీలుడిని, అర్జునుడిని; ఆహవమునకున్= యుద్ధానికి; పిలిచెన్= ఆహ్వానించాడు.

తాత్పర్యం: జనమేజయా! గుర్రం రాజగృహం చేరింది. ఇది తెలిసి మేఘసంధి-మహాకీర్తి సంపన్నుడూ, జయశీలుడూ అయిన అర్జునుడిని యుద్ధానికి ఆహ్వానించాడు.

వ. అట్టు లప్పురంబు పతి యగు జరాసంధ పౌత్త్రుండు బాల్యంబునం దన్ను నెదిరి నెఱుంగమిం గవ్వడిం గయ్యం బునకుం బిలిచి పుచ్చి తోడన కల్పిత రథారూఢుండై వెడలి యవ్వాసవికి నడ్డపడి. 97

ప్రతిపదార్థం: అట్టులు= ఆ విధంగా; ఆ పురంబు= ఆ రాజగృహ నగరంయొక్క; పతి= అధిపతి; అగు= అయిన; జరాసంధ= జరాసంధుడియొక్క; పౌత్త్రుండు= మనుమడు; బాల్యంబునన్= పిల్లతనంచేత; తన్నున్= తనను; ఎదిరిన్= శత్రువునూ; ఎఱుంగమిన్= ఎరుగకుండటంచేత; కవ్వడిన్= అర్జునుడిని; కయ్యంబునకున్= యుద్ధానికి; పిలిచి పుచ్చి= ఆహ్వానించి; తోడన్+అ= వెంటనే; కల్పిత= సిద్ధంచేయబడిన; రథ= రథమును; ఆరూఢుండు+ఐ= ఎక్కినవాడై; వెడలి= వెళ్ళి; ఆ+వాసవికిన్= ఆ ఇంద్రుడి కుమారుడు అర్జునుడికి; అడ్డపడి= అడ్డం వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: రాజగృహ నగరాధిపతీ, జరాసంధుడి మనుమడూ అయిన మేఘసంధి పిల్లతనంచేత స్వపర తారతమ్యం తెలియక అర్జునుడిని యుద్ధానికి ఆహ్వానించి వెంటనే సర్వసన్నద్ధమైన రథమెక్కి వెళ్ళి అతడికి అడ్డుపడి. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'వనితలలోపలఁ జనియెడు చాడ్పున। నివ్వాజిఁ గొని యించుకేని శంక
లేక పోయెదవు; పోనీక యేఁ బట్టెద। దీనిఁ; గయ్యము చేసెదేనిఁ జేయు;
మనుడు నవ్వుచు నతం డమ్మగధేశుతో। 'విఘ్నకర్తల నేను వెరవుతోడ
మాన్పింతు; వినుము; నామనమునఁ గిన్కలేఁ। దది యెట్టులనిన మదగ్రజుండు

తే. సామమునన కర్జము నీవు చక్కఁ బెట్టి। కొందు గాని యెవ్వరియెడఁ గ్రూరవృత్తి
వలవ దని నాకుఁ జెప్పినవాఁడుఁ గాన। యట్లు చేయుదు; నీ యిష్ట మాచరింపు.' 98

ప్రతిపదార్థం: వనితలలోపలన్= ఆడువారి మధ్య; చనియెడు= సంచరిస్తున్న; చాడ్పునన్= విధంగా; ఈ వాజిన్= ఈ గుఱ్ఱాన్ని; కొని= వెంబడించి; ఇంచుక+ఏనిన్= కొంచెంకూడ; శంక= జంకు; లేక; పోయెదవు= పోతున్నవాడవు; పోన్+ఈక= నిన్ను పోనీకుండా; ఏన్= నేను; దీనిన్= ఈ గుఱ్ఱాన్ని; పట్టెదన్= బంధిస్తాను; కయ్యము= యుద్ధం; చేసెదు+ఏనిన్= చేయదలచుకొంటే; చేయుము; అనుడున్= అని అనగా; అతండు= అర్జునుడు; నవ్వుచున్= నవ్వుతూ; ఆ+మగధ+ఈశుతోన్= ఆ మగధరాజుతో; నేను; విఘ్న= చెరుపు; కర్తలన్= చేసేవారిని; వెరవుతోడన్= ఉపాయంతో; మాన్పింతున్= విరమింప జేస్తాను; వినుము; నా= నాయొక్క; మనమునన్= మనస్సులో; కిన్క= కోపం; లేదు; అది= కోపంలేకపోవటం; ఎట్టులు= ఎట్లు పొసగును; అనినన్= అని అంటే; మత్= నా యొక్క; అగ్రజుండు= అన్న; సామమునన్+అ= సంప్రదింపులచేతనే; నీవు; కర్జము= పని; చక్కన్+పెట్టికొందు(వు)= నిర్వహించుకొంటావు; కాని; ఎవ్వరి+ఎడన్= ఎవ్వరి పట్లనూ; క్రూర= కఠినమైన; వృత్తి= పద్ధతి; వలవదు= వద్దు; అని; నాకున్= నాకు; చెప్పినవాఁడు= చెప్పాడు; కాన= కావున; అట్లు= ఆ విధంగా, మా అన్న చెప్పినట్లుగా; చేయుదున్= చేస్తాను; నీ= నీయొక్క; ఇష్టము= సమ్మతం; ఆచరింపు= చేయుము.

తాత్పర్యం: 'ఆడువారి నడుమ సంచరిస్తున్నట్లుగా (అర్జునాదులు ఆడువారని వ్యంగ్యం) ఈ గుఱ్ఱాన్ని జంకుకొంకులు లేకుండా నీవు వెంబడిస్తున్నావు. నిన్ను పోనీకుండా దీనిని బంధిస్తాను. యుద్ధం చేయాలనుకొంటే చేయుము' అని మేఘసంధి అన్నాడు. అర్జునుడు ఆ మాటలకు నవ్వుతూ అతడితో 'అడ్డపడినవారిని ఉపాయంతో నివర్తిస్తాను. ఒకమాట చెప్తుతాను వినుము. నా మనస్సులో కోపం లేదు. అదేమిటి? అని అనుమానింపవచ్చు. మా అన్న ధర్మరాజు 'నీవు నచ్చజెప్పి నీ పని నెరవేర్చుకొనుముగాని ఎవ్వరిపట్లా కఠినపద్ధతి పాటింపకుము' అని చెప్పాడు. కావున నేను మా అన్న చెప్పినట్లే చేస్తాను. నీ కిష్టమైనది నీవు చేసికొనుము.

అర్జునుఁడు జరాసంధ పౌత్రునితో యుద్ధంబు చేసి యోడించుట (సం. 14-83-1)

చ. **అనవుడు నేమియుం బలుక కా నృపపుత్త్రుఁడు నిర్జరేంద్ర పు**
త్త్రునిపయి నుజ్జ్వలంబులగు తూపుగముల్ పరఁగింప వాని నె
ల్ల నతఁడు శాతభల్లతతులం దునుమాడియు నొల్లఁడయ్యెఁ ద
త్తను వొక బాణమేనియును దాఁకఁగఁజేయ నరేశ్వరోత్తమా! 99

ప్రతిపదార్థం: నర+ఈశ్వర+ఉత్తమా!= రాజులలో ఉత్తముడా!; అనవుడున్= అని అనగా; ఆ+నృపపుత్త్రుఁడు= ఆ రాజకుమారుడు; ఏమియున్= ఏమియూ, ఒక్కమాటకూడా; పలుకక= మాటాడక; నిర్జర= దేవతలయొక్క; ఇంద్ర= ప్రభువుయొక్క, దేవేంద్రుడియొక్క; పుత్త్రునిపయిన్= కుమారుడిమీద; ఉజ్జ్వలంబులు= ప్రకాశిస్తున్నవి; అగు= అయిన; తూపు= బాణాలయొక్క; గముల్= సమూహాలు; పరఁగింపన్= ప్రయోగించగా; అతఁడు= అర్జునుడు; వానిన్+ఎల్లన్= వాటినన్నిటినీ; శాత= వాడి అయిన; భల్ల= బాణాలయొక్క; తతులన్= సమూహాలతో; తునుమాడియున్= ముక్కలు చేసియూ; తద్= ఆ మేఘసంధియొక్క; తనువు= శరీరమును; ఒక; బాణము+ఏనియును= బాణంకూడా; తాఁకఁగన్= తగిలేట్లుగా; చేయన్= చేయగా; ఒల్లఁడు+అయ్యెన్= ఇష్టపడలేదు.

తాత్పర్యం: జనమేజయా! అర్జునుడు ఈ విధంగా పలుకగా రాజకుమారుడు మేఘసంధి ఒక్కమాటకూడా మాటాడక అర్జునుడిమీద ధగధగమండే బాణాలను ప్రయోగించాడు. అర్జునుడు వాటినన్నిటినీ వాడి బాణాలతో ముక్కలుముక్కలు చేశాడే తప్ప; ఒక్క బాణం కూడా మేఘసంధి శరీరాన్ని తాకేటట్లు చేయటానికి ఇష్టపడలేదు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అగ్గాండీవి కృప యేమని చెప్పుదు? 100

ప్రతిపదార్థం: ఆ+గాండీవి= అర్జునుడియొక్క; కృప= దయ; ఏమి= ఎటువంటిది; అని; చెప్పుదున్= చెప్పగలను.

తాత్పర్యం: ఆ అర్జునుడి దయ ఎటువంటిదని చెప్పగలను? (ఇది వైశంపాయనుడి మాట).

క. తనమీఁద మగధుఁ డేయఁగ। జననాయక! రథ్యములను సారథి నైనన్

గొనకొని నొప్పింపక య। ల్లవ శరనికరంబుపైఁ గలయ నిగిడించెన్. 101

ప్రతిపదార్థం: జననాయక!= రాజా! జనమేజయా!; తనమీఁదన్= తనమీద; మగధుఁడు= మగధరాజు మేఘసంధి; ఏయఁగన్= బాణాలు ప్రయోగించగా; రథ్యములను(ఐనన్)= గుర్రాలను గానీ; సారథిన్+ఐనన్= సారథినిగానీ; గొనకొని= పూని; నొప్పింపక= బాధపెట్టక; అల్లన్+అ= మెల్లగా; శర= బాణాలయొక్క; నికరంబు= సమూహం; పైన్= మీద; కలయన్= పడగా, కప్పగా; నిగిడించెన్= వేశాడు.

తాత్పర్యం: జనమేజయా! మగధపతి అయిన మేఘసంధి తనమీద బాణాలు వేయగా అర్జునుడు అతడి గుర్రాలనుగానీ, సారథిని గానీ, బాధించక మెల్లగా అతడి శరీరాన్ని కప్పేటట్లు బాణాలు ప్రయోగించాడు.

క. అది బలహీనతగాఁ గొని। మద మేపారంగ నక్కుమారుఁడు లీలం

గదిసి బలునారసంబులు। తదంగమునఁ గ్రుచ్చె; నతఁడు దాన నలిగియున్. 102

ప్రతిపదార్థం: అది= అర్జునుడు ఆ విధంగా వేయటాన్ని; బలహీనత+కాన్= బలంలేకపోవటంగా, చేతకాని తనంగా; కొని= భావించి; ఆ+కుమారుఁడు= ఆ మగధరాజకుమారుడు; మదము= గర్వం; ఏపారంగన్= అతిశయించగా; లీలన్= విలాసంగా; కదిసి= ఢీకొని; బలు= గట్టివైన; నారసంబులు= బాణాలు; తద్+అంగమునన్= ఆ అర్జునుడియొక్క శరీరాన; గ్రుచ్చెన్= నాటాడు; అతఁడు= అర్జునుడు; దానన్= దానివలన, నాటటంవలన; నలిగియున్= బాధపడియూ.

తాత్పర్యం: అర్జునుడు ఎవ్వరినీ నొప్పించకుండా బాణాలు వేయటం అతడి చేతకానితనంగా మేఘసంధి భావించాడు. ఆ రాజకుమారుడు పొగరు తలకెక్కి విలాసంగా అర్జునుడిని చేరి అతడి శరీరంలో గట్టి బాణాలు నాటాడు. నాటటంవలన బాధపడి కూడా అర్జునుడు.

వ. ఆ సహదేవు పుత్త్రు గాత్రంబు దాఁక కుండునట్లుగా శరంబులు నిగిడించి. 103

ప్రతిపదార్థం: ఆ+సహదేవు= ఆ జరాసంధుడి కుమారుడైన సహదేవుడియొక్క; పుత్త్రు= కొడుకుయొక్క; గాత్రంబు= శరీరం; తాఁకక= తాకక; ఉండు+అట్లు+కాన్= ఉండేటట్లుగా; శరంబులు= బాణాలు; నిగిడించి= వేసి. (ప్రయోగించి)

తాత్పర్యం: సహదేవుడి కుమారుడైన మేఘసంధి శరీరాన్ని తాకకుండా ఉండేటట్లుగా బాణాలు వేసి.(తరువాతి పద్యంతో అన్వయం)

ఉ. సారథిఁ గూల్చి యశ్వములఁ జంపి రథంబుఁ బగిల్చి కేతువుం

జీరి శరాసనంబుఁ బొడిసేసిన నమ్మగధుండు ధీరతో

దారగతిన్ సముజ్జ్వల గదా భ్రమణంబున బాహు వొప్ప న

వీ్వరవరేణ్యుపైఁ గవిసె విక్రమ మాకృతి దాల్చి పొల్చె నాన్. 104

ప్రతిపదార్థం: సారథిన్= సారథిని; కూల్చి= పడగొట్టి; అశ్వములన్= గుర్రాలను; చంపి; రథంబున్= రథాన్ని; పగిల్చి= బద్దలుచేసి; కేతువున్= జెండాను; చీరి= త్రుంచి; శర+ఆసనంబున్= వింటిని; పొడి+చేసినన్= పిండి పిండి చేయగా; ఆ+మగధుండు= ఆ మగధపతి; ధీరతా= దిట్టతనంతో కూడిన; ఉదార= గొప్ప; గతిన్= గమనంతో; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశించే; గదా= గదయొక్క; భ్రమణంబునన్= తిరుగుడుచేత; బాహువు= భుజము; ఒప్పన్= ఒప్పగా; విక్రమము= పరాక్రమం; ఆకృతి= ఆకారం; తాల్చి= ధరించి; పొల్చెన్= ప్రకాశించింది; నాన్= అనగా; ఆ+వీర= ఆ వీరుల అందు; నరేణ్యుపైన్=శ్రేష్ఠుడిమీద; కవిసెన్= ఉరికాడు.

తాత్పర్యం: అర్జునుడు సారథిని పడగొట్టాడు. గుర్రాలను చంపాడు. రథాన్ని బద్దలు చేశాడు. వింటిని పొడి పొడి గావించాడు. అప్పుడు మేఘసంధి పరాక్రమం మూర్తీభవించి ప్రకాశిస్తున్నదా అని అనేటట్లు ధీరగంభీర గమనంతో చేతితో ఉజ్జ్వలమైన గదను త్రిప్పుతూ అర్జునుడి మీదికి ఉరికాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. అట్లు గవియుటయు. 105

తాత్పర్యం: ఆ విధంగా ఉరుకగా. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. అప్పుడును మత్సరంబున కతఁడు భాజ। నంబు గాకుండెఁ; గాన యన్నరుఁడు వెడఁద

వాతియమ్ముల గద పలు వ్రయ్యలై మ। హీతలంబునఁ దొరఁగంగ నేసె నధిప! 106

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అప్పుడును= అప్పుడుకూడా; అతఁడు= అర్జునుడు; మత్సరంబునకున్= క్రోధానికి; భాజనంబు= స్థానం; కాక+ఉండెన్= కాకుండా ఉన్నాడు; కాన= కావున; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; వెడఁద= విశాలమైన; వాయి= మొనగలిగిన; అమ్ములన్= బాణాలతో; గద; పలు= పెక్కు; వ్రయ్యలు+ఐ= ముక్కలై; మహీతలంబునన్= భూమిమీద; తొరఁగంగన్= పడగా; ఏసెన్= కొట్టాడు. (వాయి=నోరు. వాతి-ఔపవిభక్తిక రూపం)

తాత్పర్యం: జనమేజయా! అప్పుడుకూడా అర్జునుడు క్రోధం పొందలేదు. అందువలననే అతడు వెడల్పు మొనలు గలిగిన బాణాలతో గద ముక్కలు ముక్కలై భూమిమీద పడేటట్లు కొట్టాడు.

వ. అ ట్లేసిన. 107

తాత్పర్యం: ఆ విధంగా కొట్టగా (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. నివ్వెఱపడిన యాన్నృపనందనునితోడ। నయ్యుతిబలుఁడు "మా యన్న యొకని

ప్రాణంబులకును దప్పకు మయ్య!' యని యాన। తిచ్చిన కతన నే నేయకున్న

నీ వింతవడి పోర నిలువఁ జాలితి; విను;। మది యట్టులుండె; రాజార్హమైన

ధర్మంబు వాటించి తాఁకితి నన్నుఁ నిం। తియ చాలు; నింక శాంతియ నరేంద్ర!

తే. తగిన యది యని పల్కెఁ నతండు 'నిజము। నట్ల కా' కని యూహించి యమ్మహాత్ము
పాద పరిసరమున భక్తిఁ బ్రణతుఁ డైన। గ్రుచ్చి కౌఁగిటఁ జేర్చి యక్కురువిభుండు. 108

ప్రతిపదార్థం: నివ్వెఱపడిన= మిక్కిలి భయపడిన; ఆ+నృప= ఆ రాజుయొక్క; నందనునితోడన్= కుమారుడితో; ఆ+అతి= ఆ అధికమైన; బలుఁడు= బలంకలవాడు, అర్జునుడు; మా+అన్న= మా అన్న ధర్మరాజు; ఒకని= ఎవ్వరి యొక్క; ప్రాణంబులకును= ప్రాణాలకు; తప్పకుము= హానిచేయకుము; అయ్య!; అని; ఆనతి+ఇచ్చిన= ఆజ్ఞాపించిన; కతనన్= కారణంచేత; నేను; ఏయక= బాణప్రయోగం చేసి కొట్టక; ఉన్నన్= ఉండగా; నీవు; ఇంతవడి= ఇంతసేపు; పోరన్= యుద్ధంలో; నిలువన్= నిలువగా; చాలితి(వి) సమర్థుడవైతివి; వినుము; అది= ఆ మాట; అట్టులు= ఆ విధంగా; ఉండెన్= ఉండనిమ్ము (ఆ మాట అట్లుండనిమ్ము అని అర్థం. ఇది చక్కని తెనుగు నుడికారం); రాజ= రాజునకు; అర్హము+ఐన= తగినదైన; ధర్మంబు= ధర్మాన్ని; పాటించి= ఆదరించి, పరిశీలించి; నన్నున్= నన్ను; తాఁకితి(వి)= ఎదుర్కొన్నావు; ఇంతి+అ= ఇంతమాత్రం; చాలున్= చాలు; నర+ఇంద్ర!= రాజా!; ఇంకన్= ఇక; శాంతి+అ= శాంతియే; తగిన+అది= తగింది; అని; పల్కెన్= పలికాడు; అతండు= మేఘసంధి; నిజమును= నిజమే; అట్లు+అ= అట్లే; కాక= అగును గాక; అని; ఊహించి= నిశ్చయించి, దృఢబుద్ధి చేసికొని; ఆ+మహత్+ఆత్ము= పెద్దమనసు కలవాడియొక్క, అర్జునుడియొక్క; పాద= పాదములయొక్క; పరిసరమునన్= సమీపంలో; భక్తిన్= భక్తితో; ప్రణతుఁడు+ఐనన్= నమస్కరించినవాడు కాగా; ఆ+కురువిభుఁడు= ఆ కురువంశ శ్రేష్ఠుడు; గ్రుచ్చి= లేవనెత్తి; కౌఁగిటన్= కౌగిటిలో; చేర్చి= నిలిపి (కౌగిలించి అని అర్థం).

తాత్పర్యం: గద ముక్కలు ముక్కలుగా భూమిమీద పడగా మేఘసంధి భయపడ్డాడు. మహాబలవంతుడైన అర్జునుడు అతడితో 'మా అన్న ధర్మరాజు ఎవ్వడి ప్రాణాలకూ హానిచేయవద్దు అని నన్ను ఆజ్ఞాపించాడు. అందువలన నేను నిన్ను బాణాలతో కొట్టలేదు. కాబట్టే నీవు నాతో ఇంతసేపు పోరాడుతూ యుద్ధభూమిలో నిలువగలిగావు. సరే దానినట్లా ఉంచుము. రాజధర్మాన్ని ఆదరించి నీవు నన్ను ఎదుర్కొన్నావు. ఇంత మాత్రం చాలు. ఇక కావలసింది శాంతి' అని అన్నాడు. మేఘసంధి 'అర్జునుడు చెప్పిన మాట నిజం. ఆయన చెప్పినట్లే అగుగాక' అని మనసులో నిశ్చయించి అర్జునుడి పాదాలకు భక్తితో ప్రణామం చేశాడు. కురువంశ శ్రేష్ఠుడైన అర్జునుడు మేఘసంధిని లేవనెత్తి కౌగిలించుకొని. (తరువాతి వచనంతో అన్వయం)

వ. 'వచ్చు చైత్రమాసంబునం బున్నమనాఁడు పాండవాగ్రజు నశ్వమేధంబు ననుసంధించుట కై బంధులు నీవును రావలయు' ననిన నవ్వసుమతీపతి 'యట్ల చేసెద' నని యత్యంత వినయంబున నవ్విజయుం బ్రియపూర్వ కంబుగాఁ బూజించి యామంత్రితుం జేసిన నాతండు ప్రీతుండయి యభినందించి యమ్మగధపతిం బురం బునకుఁబోవం బనిచి యశ్వరత్నంబు ననుసరించె; నదియును వంగపుండ్ర మ్లేచ్ఛదేశంబులం జరియింప నయ్యైరాజులు చెనకినం దేజోధనుండగు నాధనంజయుండు జయించుచుఁ జన నత్తురంగంబు. 109

ప్రతిపదార్థం: వచ్చు= రాబోవు; చైత్ర= చైత్రమనే; మాసంబునన్= నెలలో; పున్నమనాఁడు= పున్నమిరోజున; పాండవ+అగ్రజు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజుయొక్క; అశ్వమేధంబున్= అశ్వమేధమును; అనుసంధించుటకై= చూచుటకై; బంధువులు= చుట్టాలు; నీవును; రావలయును= రావలెను; అనినన్= అనగా; ఆ+వసుమతీ= ఆ భూమియొక్క; పతి= నాథుడు, మేఘసంధి; అట్లు+అ= ఆ విధంగానే; చేసెదన్= చేస్తాను; అని; అత్యంత= మిక్కిలి; వినయంబునన్= వినయంతో; ఆ+విజయున్= ఆ అర్జునుడిని; ప్రియపూర్వకంబుగాన్= సంతోషపూర్వకంగా; పూజించి; ఆమంత్రితున్= వీడ్కొలుపబడినవాడినిగా; చేసినన్= చేయగా;

ఆతండు= అర్జునుడు; ప్రీతుండు+ఐ= సంతోషించినవాడై; అభినందించి= మెచ్చుకొని; ఆ+మగధపతిన్= ఆ మగధనాథుడిని; పురంబునకున్= పట్టణానికి; పోవన్= వెళ్ళగా; పనిచి= ఆజ్ఞాపించి; అశ్వరత్నంబున్= శ్రేష్ఠమైన గుర్రమును; అనుసరించెన్= వెంబడించాడు; అదియును= ఆ యజ్ఞాశ్వమును; వంగ= వంగము; పుండ్ర= పుండ్రము; మ్లేచ్ఛ= మ్లేచ్ఛము అనెడి; దేశంబులన్= దేశాలలో; చరియింపన్= తిరుగగా; ఆ+అయి= ఆయా; రాజులు; చెనకినన్= ఎదుర్కొనగా; తేజస్= పరాక్రమాదులవలన కలిగిన తేజస్సు; ధనుండు+అగు= ధనంగా కలవాడైన; ఆ+ధనంజయుండు= ఆ అర్జునుడు; జయించుచున్= జయిస్తూ; చనన్= వెళ్ళగా; ఆ+తురంగంబు= ఆ గుర్రం.

తాత్పర్యం: 'రాబోయే చైత్రమాసంలో పున్నమరోజున ధర్మరాజు అశ్వమేధయాగాన్ని చూడటానికి నీవూ మీ చుట్టాలూ రావాలి' అని అర్జునుడు చెప్పగా మేఘసంధి సరే అన్నాడు. అతడు అర్జునుడిని వినయంతో పూజించి వీడ్కొలిపాడు. అర్జునుడు చాలా సంతోషించి మెచ్చుకొని మేఘసంధిని పట్టణానికి వెళ్ళుము అని ఆజ్ఞాపించి, యజ్ఞాశ్వాన్ని వెంబడించాడు. అది వంగపుండ్ర మ్లేచ్ఛ దేశాలలో తిరిగేటప్పుడు ఆయా రాజులు ఎదుర్కొన్నారు. తేజస్వి అయిన అర్జునుడు వారినందరినీ జయించాడు. తరువాత ఆ గుర్రం. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **చేదిదేశంబు సొచ్చిన శిశుపాలుని। తనయుండు శరభుండు తనదు శక్తి**
పురము వెల్వడి యుద్ధపూర్వకంబుగఁ జేరి। యమ్మహావీరున కర్చ లిచ్చెఁ;
నతని వీడ్కొల్పి యయ్యతుల తేజుఁడు ఘోట। కము వెన్కఁ జనుచుఁ డేంకణ కిరాత
ముఖ దేశ నృపతులు ముట్టినఁ దగ గెల్పు। గొనుచుఁ గ్రమంబునఁ గోసలులను

ఆ. **గాశులను జయించెఁ; గ్రమ్మఱ యత్తురం। గము దశార్ణదేశగామి య య్యెఁ**
జిష్ణుఁ డనుసరింపఁ జిత్రాంగదుం డని। చేసి యోడి పూజ చేసె నధిప! **110**

ప్రతిపదార్థం: అధిప!= రాజా! జనమేజయా!; చేదిదేశంబు= చేదిదేశము; చొచ్చినన్= ప్రవేశించగా; శిశుపాలుని= శిశుపాలుడియొక్క; తనయుండు= కుమారుడు; శరభుండు= శరభుడనేవాడు; తనదు= తనయొక్క; శక్తిపురము= రాజధాని అయిన శక్తిపురంనుండి; వెల్వడి= బయటికి వచ్చి; యుద్ధపూర్వకంబుగన్= ముందు యుద్ధం చేయగా; చేరి= ఆశ్రయించి; ఆ+మహత్= ఆ గొప్ప; వీరునకున్= వీరుడికి; అర్చలు+ఇచ్చెన్= పూజలు చేశాడు; అతనిన్= శరభుడిని; వీడ్కొల్పి= నగరానికి పోవననుమతించి; ఆ+అతుల= ఆ సాటిలేని; తేజుఁడు= తేజస్సు కలవాడు; ఘోటకము= గుర్రంయొక్క; వెన్కన్= వెంట; చనుచున్= వెళ్ళుతూ; టేంకణ= టేంకణము; కిరాత= కిరాతము; ముఖ= మొదలైన; దేశ= దేశములయొక్క; నృపతులు= రాజులు; ముట్టినన్= ఎదుర్కొనగా; గెల్పు= విజయం; కొనుచున్= పొందుతూ; కోసలులను= కోసలదేశవాసులను; కాశులను= కాశదేశమువారిని; జయించెన్= జయించాడు; క్రమ్మఱన్= మరల; ఆ+తురంగము= ఆ గుర్రం; దశార్ణదేశ= దశార్ణదేశమును గూర్చి; గామి= వెళ్లినది; అయ్యెన్= అయింది; జిష్ణుఁడు= జయశీలుడైన అర్జునుడు; అనుసరింపన్= వెంబడించగా; చిత్రాంగదుండు= చిత్రాంగదుడు; అని= యుద్ధం; చేసి; ఓడి= ఓడిపోయి; పూజచేసెన్= పూజించాడు.

తాత్పర్యం: జనమేజయా! చేదిదేశం ప్రవేశించగా శిశుపాలుడి కుమారుడు శరభుడు తన రాజధాని అయిన శక్తిపురంనుండి బయటికివచ్చి మొదట యుద్ధంచేసి తరువాత అర్జునుడిని ఆశ్రయించి, అతడికి పూజలు చేశాడు. అర్జునుడు అతడిని వీడ్కొలిపి, గుర్రాన్ని అనుసరిస్తూ టేంకణాధిపతి కిరాతరాజు మొదలైన భూపతులు ఎదుర్కొనగా వారిపై విజయం సాధించాడు. క్రమంగా కోసలదేశీయులనూ కాశదేశవాసులనూ జయించాడు. అర్జునుడు వెంబడిస్తుండగా యజ్ఞాశ్వం దశార్ణదేశానికి వెళ్ళింది. ఆ దేశాధిపతి చిత్రాంగదుడు అర్జునుడితో పోరాడి ఓడిపోయి అతడిని పూజించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. ఇట్లు దశార్ణపతి పార్థునిం బూజించి యాతని యాదరణంబు వడసి పోయెఁ; బదంపడి తురంగంబు నిషాదాధీశ దేశంబునకుం జనిన నేకలవ్యనందనుఁడు పాకశాసననందను మీఁద నైషాద సేనాసమేతుండై తోఁ తెంచిన. 111

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దశార్ణ= దశార్ణదేశంయొక్క; పతి= రాజు; పార్థునిన్= అర్జునుడిని; పూజించి; ఆతని= అర్జునుడియొక్క; ఆదరణంబు= ఆదరమును; పడసి= పొంది; పోయెన్= వెళ్ళాడు; పదంపడి= తరువాత; తురంగంబు= గుఱ్ఱం; నిషాద= నిషాదులయొక్క; అధి+ఈశ= ప్రభువుయొక్క; దేశంబునకున్= దేశానికి; చనినన్= వెళ్ళగా; ఏకలవ్య= ఏకలవ్యుడియొక్క; నందనుండు= కుమారుడు; పాకశాసను= ఇంద్రుడియొక్క; నందను మీఁదన్= కుమారుడి మీదకు; నైషాద= నిషాదదేశానికి సంబంధించిన; సేనా= సేనతో; సమేతుండు+ఐ= కూడినవాడై; తోఁతెంచినన్= రాగా.

తాత్పర్యం: ఈ విధంగా దశార్ణపతి అర్జునుడిని పూజించి అతడి ఆదరం పొంది వెళ్ళిపోయాడు. తరువాత యజ్ఞాశ్వం నిషాదరాజు దేశానికి వెళ్ళింది. ఆ దేశప్రభువు ఏకలవ్యుడి కుమారుడు. అతడు నిషాదదేశసైన్యంతో అర్జునుడిమీద దండెత్తగా. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. అతని బలంబుఁ గ్రూర విశిఖార్చుల నేర్చిన బాహుసార గ
ర్వితుఁ డగు నన్నిషాదపతి వీఁక నెదుర్కొనినం గిరీటి యా
తత పటుబాణ దీధితులఁ దన్మద సంతమసం బడంచె; వాఁ
డతి వినయంబునన్ వినతుఁడై తగ నర్చితుఁ జేసె నాతనిన్. 112

ప్రతిపదార్థం: అతని= ఏకలవ్యుడియొక్క; బలంబున్= సైన్యమును; క్రూర= భయంకరమైన; విశిఖ= బాణాలనుండి పుట్టిన; అర్చులన్= మంటలచేత; ఏర్చినన్= దహించగా; బాహు= భుజములయొక్క; సార= బలంచేత; గర్వితుఁడు= గర్వించినవాడు; అగు= అయిన; ఆ నిషాద= ఆ నిషాదులయొక్క; పతి= రాజు; వీఁకన్= పరాక్రమంతో; ఎదుర్కొనినన్= ఎదుర్కొనగా; కిరీటి= అర్జునుడు; ఆతత= విస్తారమైన; పటు= గట్టివైన; బాణ= బాణాలయొక్క; దీధితులన్= కాంతులచేత; తద్= ఆ ఏకలవ్య కుమారుడియొక్క; మద= గర్వమనెడి; సంతమసంబు= అంధకారమును; అడంచెన్= నశింపజేశాడు; వాఁడు= ఏకలవ్యుడి కుమారుడు; అతి= మిక్కిలి; వినయంబునన్= అణకువతో; వినతుఁడు+ఐ= నమస్కరించినవాడై; తగన్= తగినట్లుగా; ఆతనిన్= అర్జునుడిని; అర్చితున్= పూజించబడిన వాడినిగా; చేసెన్= చేశాడు (పూజించాడని అర్థం.)

తాత్పర్యం: అర్జునుడు నిషాదరాజసైన్యాన్ని బాణాగ్ని జ్వాలలచేత దహించాడు. భుజబలగర్వితుడైన ఏకలవ్యుడి కుమారుడు ఎదుర్కొనగా అతడి గర్వాంధకారాన్ని తీవ్ర బాణకాంతులచేత నశింపజేశాడు. అప్పుడు నిషాదపతి లొంగిపోయి నమస్కార పూర్వకంగా అర్జునుడిని పూజించాడు.

వ. అ ట్లేకలవ్యనందనుం దనవశంబు చేసికొని ధనంజయుండు హయంబు ననుగమించె; నది మరలి మఱియును దక్షిణాభిముఖంబయి చని తిరుగఁ బౌండ్రాంధ్ర ద్రవిళ కేరళ కర్ణాట దేశాధీశుల ననాయాసంబున వశగతులం గావించికొనియెఁ; గ్రమంబున సౌరాష్ట్రంబు సొచ్చి గోకర్ణ సమీపంబునం బ్రవర్తించి పదంపడి.113

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; ఏకలవ్య= ఏకలవ్యుడియొక్క; నందనున్= కుమారుడిని; తనవశంబు= స్వాధీనం; చేసికొని; ధనంజయుండు= అర్జునుడు; హయంబున్= గుఱ్ఱాన్ని; అనుగమించెన్= అనుసరించాడు; అది= ఆ గుఱ్ఱం; మరలి= తిరిగి;

మఱియును= ఇంకను; దక్షిణ= దక్షిణ దిక్కునకు; అభిముఖంబు= ఎదురుగా ముఖం కలది (దక్షిణదిక్కు, వైపునకు పోవునది అని అర్థం) అయి; చని= వెళ్ళి; తిరుగన్= తిరుగగా; పౌండ్ర= పౌండ్రము; ఆంధ్ర= ఆంధ్రము; ద్రవిళ= ద్రావిడము; కేరళ కర్ణాట= కేరళ, కర్ణాటము అనెడి; దేశ= దేశాలయొక్క; అధి+ఈశులన్= రాజులను; న+ఆయాసంబునన్= శ్రమలేకుండా; వశగతులన్= వశమైనవారినిగా; కావించి కొనియెన్= చేసికొన్నాడు; క్రమంబునన్= క్రమంగా; సౌరాష్ట్రము; చొచ్చి= ప్రవేశించి; గోకర్ణ= గోకర్ణంయొక్క; సమీపంబునన్= దగ్గర; ప్రవర్తించి= నడచి; పదంపడి= తరువాత. (న+ఆయాసంబునన్-అన్+ఆయాసంబునన్= అనాయాసంబునన్)

తాత్పర్యం: ఆ విధంగా ఏకలవ్యుడి కుమారుడిని వశపరచుకొని అర్జునుడు గుర్రాన్ని అనుసరించాడు. అది అక్కడక్కడా సంచరించి దక్షిణాపథం చేరింది. అర్జునుడు పౌండ్ర, ఆంధ్ర, ద్రావిడ, కేరళ, కర్ణాట భూపతులను స్వాధీనం చేసికొని గుర్రం వెంట సౌరాష్ట్రదేశంలో ప్రవేశించి, గోకర్ణం చేరి. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. **ద్వారకానగరంబు చేరువ ఘోటక। మరుగంగఁ బ్రీతులై యదుకుమారు**
లాలపుటాలంబు ననువున నయ్యింద్ర। నందనుఁ గని పూజనం బొనర్ప
నభినందనము చేసె నవ్వీరుఁ; డపరాబ్ధి। తీరదేశంబులఁ దిరిగి పంచ
నదముపైఁ జని మావు నరనాథ! గాంధార। దేశంబు చొచ్చి వర్తింప శకుని

తే. **నందనుఁడు బాల్యకలిత దుర్నయము పేర్మిఁ। దనదు సేనలఁ గూర్చి యుద్దామగతిఁ గి**
రీటిఁ దాఁకిన నతఁడు వారించి పాండ। వాగ్రజుని యాజ్ఞ దెలుపంగ నంతఁ బోక. **114**

ప్రతిపదార్థం: నరనాథ!= రాజా! జనమేజయా!; ద్వారకా= ద్వారక అనే; నగరంబు= పట్టణంయొక్క; చేరువ= దగ్గరకు; ఘోటకము= గుర్రం; అరుగంగన్= వెళ్ళగా; యదుకుమారులు= యాదవులు; ప్రీతులు+ఐ= సంతోషించినవారై; ఆలము= యుద్ధంయొక్క; ఆలంబు= ఉపేక్షయొక్క; అనువునన్= విధంగా (యుద్ధం ఉపేక్షించిన ప్రకారంగా, యుద్ధంచేయక అని అర్థం); ఆ+ఇంద్రనందనున్= ఆ ఇంద్రుడి కుమారుడైన అర్జునుడిని; కని= దర్శించి; పూజనంబు= పూజ; ఒనర్పన్= చేయగా; ఆ+వీరుఁడు= ఆ వీరుడు; అభినందనము చేసెన్= ప్రశంసించాడు; మావు= గుర్రం; అపర+అబ్ధి= పశ్చిమ సముద్రంయొక్క; తీర= ఒడ్డుననున్న; దేశంబులన్= దేశములందు; తిరిగి; పంచనదము= ఐదు నదులయొక్క; పైన్= మీదుగా, పాంచాల దేశము మీదుగా; చని= వెళ్ళి; గాంధార= గాంధారమనే; దేశంబు= దేశం; చొచ్చి= ప్రవేశించి; వర్తింపన్= నడపగా; శకుని= శకునియొక్క; నందనుఁడు= కుమారుడు; బాల్య= పిల్లతనంచేత; కలిత= పొందబడిన; దుర్నయము= చెడ్డనడవడియొక్క; పేర్మిన్= అతిశయంచేత, పెంపుచేత; తనదు= తనయొక్క; సేనలన్= సేనలను; కూర్చి= ప్రోగుచేసి; ఉద్దామ= భయంకరమైన; గతిన్= విధంగా; కిరీటిన్= అర్జునుడిని; తాఁకినన్= ఎదుర్కొనగా; అతఁడు= అర్జునుడు; వారించి= నివారించి; పాండవ+అగ్రజుని= ధర్మరాజుయొక్క; ఆజ్ఞ= ఆదేశం; తెలుపంగన్= తెలియజేయగా; అంతన్= (శకుని కుమారుడు) అంతటితో; పోక= వెనుదిరిగి వెళ్ళక.

తాత్పర్యం: గుర్రం ద్వారక దగ్గరకు వెళ్ళింది. దానిని చూచి యాదవులు యుద్ధం చేయకుండా అర్జునుడిని పూజించారు. అతడు కూడా వారిని ప్రశంసించాడు. తరువాత యజ్ఞాశ్వం పశ్చిమసముద్ర తీరాన ఉన్న దేశాలలో తిరిగి, పాంచాల దేశంమీదుగా వెళ్ళి గాంధారదేశం ప్రవేశించింది. శకుని కుమారుడు ఆ దేశానికి రాజు. అతడు పిల్లతనంవలన కలిగిన దుష్ప్రవర్తనంచేత మిడిసిపడుతూ తన సేనలను ప్రోగుచేసికొని భయంకరంగా అర్జునుడిని ఎదుర్కొన్నాడు. అర్జునుడు తొందరపడకుండా ముందు ధర్మజుడి ఆదేశం శకుని కుమారుడికి తెలియజేశాడు. కాని, అతడు అంతటితో వెనుదిరిగి పోక. (తరువాతి పద్యంతో అన్వయం)

క. పొదివినఁ గనుఁగవ వెడ కెం। పొదవఁగఁ జతురంగముల శరోత్కరములఁ దాఁ

బొదివె విజయుఁ; డవి వడియుం। జెదరియు సన్నంబు లైనఁ జిత్తములోనన్. 115

ప్రతిపదార్థం: పొదివినన్= ఎదుర్కొనగా; విజయుఁడు= అర్జునుడు; తాన్= తాను; కను+కవన్= కన్నుల జంటయందు; వెడ= కొంచెం; కెంపు= క్రోధంవలన కలిగిన ఎరుపు; ఒదవఁగన్= పుట్టగా; శర= బాణాలయొక్క; ఉత్కరములన్= సమూహాలచేత; చతుస్+అంగములన్= నాలుగు భాగాలనూ (రథాలనూ; ఏనుగులనూ, గుర్రాలనూ; సైనికులనూ;) పొదివెన్= కప్పాడు; అవి; పడియున్= కూలిపోయియూ; చెదరియున్= చెల్లా చెదరయియూ; సన్నంబులు= తరిగిపోయినవి; ఐనన్= కాగా; చిత్తములోనన్= మనస్సులో.

తాత్పర్యం: శకుని కుమారుడు ఎదుర్కొనగా అర్జునుడికి రోషం కలిగింది. అతడి రెండు కన్నులలో కొంచెం ఎరుపు పుట్టింది. అతడు పుంఖానుపుంఖంగా బాణాలు ప్రయోగించి గాంధారదేశ చతురంగబలాలను కప్పివేశాడు. అవి యుద్ధభూమిలో కూలిపోయాయి. చెల్లాచెదరయ్యాయి. గాంధారసైన్యం తరిగిపోయింది. అపుడు తన మనస్సులో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: (సన్నంబువై-ఇది వెలుగు 'సన్నలు' కాదు. సద్ ధాతువు యొక్క క్తాంత రూపము. సీదతి-సీదతః-సీదన్తి:)

ఉ. మత్సర మెక్కఁగా సుబలు మన్మఁడు దుర్దమలీలఁ గిట్టి బీ

భత్సునిపై నిశాత శరపంక్తి నిగుడ్పఁ దదీయ బాహు సం

పత్సముదీర్ణతం దనదు భావమునం గొనియాడి యెంతయున్

వత్సలుఁ డైన యన్నరుఁడు వానికి నిట్లనుఁ గౌరవోత్తమా! 116

ప్రతిపదార్థం: కౌరవ+ఉత్తమా!= కౌరవులలో ఉత్తముడా! జనమేజయా!; మత్సరము= క్రోధం; ఎక్కఁగాన్= పెరుగగా; సుబలు= సుబలుడియొక్క; మన్మఁడు= మనుమడు (సుబలుడు శకుని తండ్రి); దుర్దమ= అణపరాని; లీలన్= విధంగా; కిట్టి= సమీపించి; బీభత్సునిపైన్= అర్జునుడిమీద; నిశాత= వాడిఅయిన; శర= బాణాలయొక్క; పంక్తిన్= వరుసను; నిగుడ్పన్= ప్రయోగించగా; తదీయ= శకుని కుమారుడియొక్క; బాహు= భుజబలంయొక్క; సంపద్= సంపదయొక్క; సముదీర్ణతన్= ఆధిక్యాన్ని; తనదు= తనయొక్క; భావమునన్= మనస్సులో; కొనియాడి= పొగడి; ఎంతయున్= మిక్కిలి; వత్సలుఁడు+ఐన= చిన్నవారి పట్ల ప్రేమ కలవాడైన; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; వానికిన్= అతడితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: జనమేజయా! రోషం ఎక్కువ కాగా, శకుని పుత్రుడు విజృంభిస్తూ సమీపించి, బాణపరంపరను అర్జునుడిమీద ప్రయోగించాడు. అర్జునుడు అతడి బాహుబల సంపదను మనస్సులో పొగడి, వాత్సల్యంతో అతడితో ఇట్లా అన్నాడు.

క. 'రాజులఁ జంపకు మని మా। రా జానతి యిచ్చె; నుద్ధురత నే నని న

య్యోజ విడిచినట్లైనఁ బ। రాజితుఁగా నన్ను నద్ధరాపతి దలఁచున్. 117

ప్రతిపదార్థం: రాజులన్= రాజులను; చంపకుము; అని; మా రాజు= మా ప్రభువు ధర్మరాజు; ఆనతి+ఇచ్చెన్= ఆజ్ఞాపించాడు; నేను; ఉద్ధురతన్= స్వతంత్రతతో; అనిన్= యుద్ధంలో; ఆ+ఓజన్= ఆ ధర్మాన్ని; విడిచిన+అట్లు+ఐనన్= విడిచినట్లయితే; ఆ+ధరాపతి= ఆ భూపతి, ధర్మరాజు; నన్నున్= నన్ను; పరాజితున్+కాన్= పరాజయం పొందిన వాడినిగా; తలఁచున్= నిర్ణయిస్తాడు.

తాత్పర్యం: 'ధర్మరాజు రాజులను చంపవద్దని న న్నాజ్ఞాపించాడు. నేను స్వతంత్రించి ఆ ధర్మాన్ని వదలితే ఆ ప్రభువు నన్ను పరాజయం పొందినవాడినిగానే నిర్ణయిస్తాడు.

అర్జునుఁడు గాంధారదేశాధీశుతో యుద్ధంబు చేసి జయించుట (సం. 14-85-9)

ఉ. కావున నేఁ గడంగ విను; కయ్యము నీ కిది యేల తమ్ముఁడా!
నా వినియున్ వడిన్ శకునినందనుఁ డయ్యమరేంద్ర నందనుం
దా విశిఖంబులం బొదివె; దానికి నవ్వుచు వాని శీర్షకం
బావిజయుండు బల్వెడఁదయమ్మున నేలఁ బడంగ నేసినన్. 118

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నేన్= నేను; కడంగన్= యుద్ధం చేయటానికి పూనుకొనను; విను= వినుము; తమ్ముఁడా!= తమ్ముడా!; నీకున్= నీకు; కయ్యము= యుద్ధం; ఇది; ఏల!= ఎందుకు?; నాన్= అనగా; వినియున్= వినికూడా; శకుని= శకునియొక్క; నందనుఁడు= కుమారుడు; తాన్= తాను; వడిన్= వేగంగా; ఆ+అమర= ఆ దేవతలయొక్క; ఇంద్ర= ప్రభువుయొక్క, దేవేంద్రుడియొక్క; నందనున్= కుమారుడిని - అర్జునుడిని; విశిఖంబులన్= బాణాలతో; పొదివెన్= కప్పాడు; దానికిన్= ఆ బాణప్రయోగానికి; నవ్వుచున్= నవ్వుతూ; వాని= శకుని కుమారుడి యొక్క; శీర్షకంబు= శిరస్త్రాణం; నేలన్= భూమిమీద; పడంగన్= పడగా; ఆ+విజయుండు= ఆ అర్జునుడు; బల్= గట్టి; వెడఁద= వెడల్పయిన మొనగల; అమ్మునన్= బాణంతో; ఏసినన్= కొట్టగా.

తాత్పర్యం: కాబట్టి నేను పోరునకు పూనుకొనను. తమ్ముడా! వినుము. యుద్ధ మిది నీకెందుకు?' అని అన్నాడు. ఆ మాటలు వినినప్పటికీ శకుని కుమారుడు అర్జునుడిని బాణాలతో కప్పివేశాడు. దానికి నవ్వుతూ అర్జునుడు వెడల్పు మొనగల గట్టి బాణాలతో అతడి శిరస్త్రాణం నేలమీద పడేటట్లుగా కొట్టగా. (తరువాతి వచనంతో అన్వయం)

వ. అచ్చిత్రము చూచి యచ్చోటం గలయట్టి. 119

ప్రతిపదార్థం: ఆ+చిత్రము= ఆ ఆశ్చర్యకరమైన కార్యం; చూచి; ఆ+చోటన్= ఆ యుద్ధభూమిలో; కల+అట్టి= ఉన్న.

తాత్పర్యం: ఆ ఆశ్చర్యకరమైన పని చూచి అక్కడ ఉన్న. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఎల్లజనులు నివ్వీరుం। డొల్లఁడుగా కుత్తమాంగ ముర్వి నిటుల వే
డొల్లఁగ నేయఁడె వలసినఁ;। జెల్లంబో! యితని కరుణ చెలు విట్లున్నే!' 120

ప్రతిపదార్థం: ఎల్లన్+జనులు= జనులందరూ; ఈ+వీరుండు= ఈ వీరుడు; ఒల్లఁడు+కాక= ఇష్టపడడు కాని; వలసినన్= చేయదలిస్తే; వే= శీఘ్రంగా; ఉత్తమ+అంగము= తల; ఉర్విన్= భూమిమీద; ఇటులు+అ= ఇట్లే, శిరస్త్రాణంవలెనే; డొల్లఁగన్= తెగిపడేటట్లుగా; ఏయఁడు+ఎ?= బాణాలతో కొట్టడా? (కొట్టునని అర్థం); చెల్లంబో= ఇది ప్రశంసను తెలిపేమాట; ఇతని= ఇతడియొక్క; కరుణ= దయయొక్క; చెలువు= విధం; ఇట్లు= ఈ విధంగా; ఉండును+ఏ?= ఉంటుందా?

తాత్పర్యం: జనులందరూ 'ఈ మహావీరుడు ఇష్టపడడు గాని చేయాలని అనుకొంటే శీఘ్రంగా ఈ శకుని కుమారుడి తల శిరస్త్రాణంవలెనే నేలమీద తెగిపడేటట్లుగా కొట్టడా? బళీ! ఇతడి దయాస్వరూపం ఇట్లా ఉంటుందా?'

వ. అనుచు నక్కుమారుం జేరి, యతనితేరు మరల్చికొని పోవం బోవ. 121

ప్రతిపదార్థం: అనుచున్= అంటూ; ఆ+కుమారున్= ఆ శకుని కుమారుడిని; చేరి= సమీపించి; అతని= అతడియొక్క; తేరు= రథాన్ని; మరల్చికొని= వెనుకకు త్రిప్పుకొని; పోవన్+పోవన్= వెళ్ళగా వెళ్ళగా.

తాత్పర్యం: అంటూ శకుని కుమారుడిని సమీపించి అతడి రథాన్ని వెనుకకు (తరువాతి పద్యంతో అన్వయం)

తే. దురభిమానము పేర్మి నన్నరవరుండు। మరలి నరుమీఁద నడవ, మున్ తెరలి చనిన

బలము గ్రమ్మఱి, యయ్యింద్రుపట్టిఁ జుట్టు। బలసి శస్త్రాస్త్రచయములు పరఁగఁజేయ. 122

ప్రతిపదార్థం: దురభిమానము= దుర్గర్వంయొక్క; పేర్మిన్= ఆధిక్యంచేత; ఆ+నరవరుండు= ఆ నరనాథుడు - రాజు; మరలి= తిరిగి వచ్చి; నరుమీఁదన్= అర్జునుడిమీద; నడవన్= ఉరుకగా; మున్= అంతకుముందు; తెరలి= రణరంగంనుండి తొలగి; చనిన= పారిపోయిన; బలము= సైన్యం; క్రమ్మఱి= మరలివచ్చి; ఆ+ఇంద్రు= ఆ ఇంద్రుడియొక్క; పట్టిన్= కుమారుడిని - అర్జునుడిని; చుట్టున్= చుట్టునూ, నాలుగువైపులా; బలసి= ఆవరించి; శస్త్ర+అస్త్ర= శస్త్రాస్త్రాలయొక్క; చయములు= సమూహాలు; పరఁగన్+చేయన్= ప్రయోగించగా.

తాత్పర్యం: శకుని కుమారుడు దుర్గర్వాతిశయంచేత తిరిగి వచ్చి అర్జునుడిమీద ఉరికాడు. ఇది చూచి అంతకుముందు రణరంగం నుండి తొలగి పారిపోయిన సైన్యం మరలివచ్చి అర్జునుడిని నాలుగువైపులా ఆవరించి బహుళంగా శస్త్రాలూ అస్త్రాలూ ప్రయోగించగా. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. అవి నిశితాస్త్ర పంక్తిఁ దునుమాడి రయం బెసఁగంగఁ గప్పె నా

హవతల మంతయుం దలర నప్పటువిక్రమశాలి; యమ్మహో

గ్ర విహరణంబునం గలఁగి కన్కనిఁ బాఱె బలంబు; లక్కుమా

రవరునిఁ గాచికొంటకు ధరావరుమంత్రులు వాని తల్లియున్. 123

ప్రతిపదార్థం: ఆ+పటు= ఆ నేర్పుతో కూడిన; విక్రమ= పరాక్రమంతో; శాలి= ప్రకాశించేవాడు; అవి= గాంధారసైన్యం ప్రయోగించిన బాణాలను; నిశిత= వాడి అయిన; అస్త్ర= అస్త్రాలయొక్క; పంక్తిన్= వరుసచేత; తునుమాడి= ఖండించి; రయంబు= వేగం; ఎసఁగంగన్= ఒప్పగా; ఆహవతలము= యుద్ధభూమి; అంతయున్= అంతయూ; తలరన్= క్షోభించగా, కంపించగా; కప్పెన్= కప్పాడు; ఆ= అర్జునుడియొక్క; మహత్= గొప్ప; ఉగ్ర= భయంకరమైన; విహరణంబునన్= విహారంచేత; బలంబులు= సైన్యాలు; కలఁగి= క్షోభించి; కన్కనిన్= సంభ్రమంతో; పాఱెన్= పారిపోయాయి; ధరావరు= రాజుయొక్క; మంత్రులు= మంత్రులునూ; వాని= అతడియొక్క; తల్లియున్= తల్లియూ; ఆ+కుమార వరునిన్= ఆ రాజకుమార శ్రేష్ఠుడిని; కాచికొంటకున్= రక్షించుకొనటానికి.

తాత్పర్యం: మహాపరాక్రమశాలి అర్జునుడు తీక్ష్ణ బాణపరంపరతో గాంధారసైన్యం ప్రయోగించిన బాణాలను ఖండించి యుద్ధభూమి అంతా క్షోభించగా కప్పివేశాడు. అతడి భయంకర వీరవిహారాన్ని చూచి సైన్యాలు భయంతో పారిపోయాయి. శకుని కుమారుడిని మంత్రులూ, తల్లీ రక్షించుకొనటానికి. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అర్ఘ్యంబుగొని రయంబున శరణు శర ణనుచు వచ్చిన నవ్విప్పచ్చుండును నవ్వెలంది నభినందించి మంత్రులకు

మాననీయ వచనంబులం బ్రియం బొనర్చి యబ్బాలునితో సాంత్వనస్వరంబున నిట్లనియె. 124

ప్రతిపదార్థం: అర్ఘ్యంబు= పూజాద్రవ్యాలు; కొని= తీసికొని; రయంబునన్= వేగంగా; శరణు= నమస్కారం; శరణు= రక్షకుడవు; అనుచున్= అంటూ; వచ్చినన్= రాగా; ఆ+విప్వచ్చుండును= ఆ అర్జునుడును; ఆ+వెలందిన్= ఆ సాధ్విని; అభినందించి= ప్రశంసించి; మంత్రులకున్= మంత్రులకు; మాననీయ= గౌరవించదగిన; వచనంబులన్= మాటలతో; ప్రియంబు= సంతోషం; ఒనర్చి= కలిగించి; ఆ+బాలునితోన్= ఆ బాలుడితో, శకుని కుమారుడితో; సాంత్వన= ఓదార్చే, మృదువైన; స్వరంబునన్= గొంతుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: పూజాద్రవ్యాలు తీసికొని వేగంగా 'నమస్కారం రక్షకుడవు' అంటూ రాగా అర్జునుడు ఆ సాధ్విని ప్రశంసించి, మన్నించదగిన మాటలతో మంత్రులకు సంతోషం కలిగించి మృదుస్వరంతో శకుని కుమారుడితో ఈ విధంగా అన్నాడు.

ఉ. **'నీ విట వన్ని నాపయి ననింద్యపరాక్రమ! రాక చూచి మ**
ద్భావము ఖేద మొందుటయు 'ధర్మజుపం పిది రాజకోటి నే
నే విధినైనఁ జంప' నని యెల్లజనంబు వినంగఁ జెప్పనే!
కావున నీ బలంబులన కాని నినుం దెగటార్ప కుండితిన్. **125**

ప్రతిపదార్థం: అనింద్య= దూషించతగని, ఉత్తమమైన; పరాక్రమ= పరాక్రమం కలవాడా!; నీవు; ఇట= ఇక్కడ; పన్ని= యుద్ధానికి సిద్ధపడి; నాపయిన్= నా మీదకు; రాక= రావటం; చూచి; మత్= నా యొక్క; భావము= మనస్సు; ఖేదము= సంతాపం; ఒందుటయున్= పొందగా; ఇది; ధర్మజు= ధర్మరాజుయొక్క; పంపు= ఆజ్ఞ; నేను; ఏ విధిన్= ఏ విధంగా; ఐనన్= అయిననూ; రాజ= రాజులయొక్క; కోటిన్= సమూహాన్ని; చంపన్= చంపను; అని; ఎల్లన్= సమస్తమైన; జనంబు= జనం; వినంగన్= వినగా; చెప్పన్+ఏ?= చెప్పలేదా?; కావునన్= కాబట్టే; నీ= నీయొక్క; బలంబులన్+అ= సైన్యాలనే; కాని; నిన్= నిన్ను; తెగటార్పక= చంపక; ఉండితిన్= ఉన్నాను.

తాత్పర్యం: ఉత్తమ పరాక్రమా! ఇక్కడ నీవు యుద్ధానికి సిద్ధపడి నా మీదకు రావటం చూచి నా మనస్సు బాధపడింది. 'ఇది ధర్మరాజు ఆజ్ఞ. నేను ఏ విధంగానూ రాజులను చంపను' అని అందరూ వింటుండగా చెప్పలేదా? కాబట్టే నీ సైన్యాలను తప్ప నిన్ను చంపకుండా ఉన్నాను.

వ. **విశేషించి గాంధారీ ధృతరాష్ట్రులం దలంచి నాకు నీ దెస నిట్లు గావలసి యుండె.** **126**

ప్రతిపదార్థం: విశేషించి= పైపెచ్చు; గాంధారీ ధృతరాష్ట్రులన్= గాంధారినీ, ధృతరాష్ట్రుడినీ; తలంచి= స్మరించి; నాకున్= నాకు; నీ దెసన్= నీయెడ; ఇట్లు= ఈ విధంగా; కాన్= అగుట; వలసి= తప్పనిసరియై; ఉండెన్= ఉన్నది.

తాత్పర్యం: పైపెచ్చు గాంధారినీ, ధృతరాష్ట్రుడినీ స్మరించి నాకు నీ పట్ల ఈ విధంగా నడుచుకొనటం తప్పనిసరి అయింది.

ఆ. **అట్టులగుటఁజేసి యవనీశనందన! యింత ప్రొద్దుఁ బోరి; తింక శాంతిఁ**
బొందు టొప్పు; ధర్మపుత్రునితోడ పొం౹ దొప్పదయ్యు! నీకు నుదితశౌర్య!' **127**

ప్రతిపదార్థం: అవనీశ నందన!= రాజకుమారా!; ఉదిత= ప్రసిద్ధమైన; శౌర్య!= పరాక్రమము కలవాడా!; అట్టులు= ఆ విధం; అగుటన్= అగుటవలన; ఇంత; ప్రొద్దున్= కాలమునూ; పోరితి(వి)= పోరాడితివి; ఇంకన్= ఇక; శాంతిన్= శాంతిని; పొందుట= పొందటం; ఒప్పున్= తగును; నీకున్= నీకు; ధర్మపుత్రునితోడన్= ధర్మరాజుతో; పొందు= పొత్తు; ఒప్పదు+అయ్య!= తగదా? (తగునని అర్థం).

తాత్పర్యం: రాజకుమారా! విఖ్యాత విక్రమా! ఆ విధంగా నేను నడుచుకొనటంవలన నీవు ఇంతకాలం నాతో పోరాడావు. ఇంక శాంతి పొందటం మంచిది. నీకు ధర్మరాజుతోపొత్తు తగదటయ్యా!'

వ. **అని చెప్పి యాగామి యయిన చైత్రంబున పున్నమ నాఁ డన్నరేంద్రచంద్రు నశ్వమేధ యాగంబున కనురాగం బెసఁగ రమ్మీ! యనియునుం బలికి, యప్పాండవ మధ్యముండు మేధ్యాశ్వంబు ననుసరింప నది కరిపురంబు దిక్కుమొగంబయి యరుగం జొచ్చె; నట్టియెడ నతండు వివిధ దేశంబులం దిరిగిన తెఱం గెల్లనుం జారులచేత విని యజాతశత్రుం డప్పురుహూతపుత్త్రుం డశ్వరక్షణం బట్లు ధర్మప్రకారంబున నిర్వహించుటకుం బ్రీతి వహించె; నద్దివసంబు.** **128**

ప్రతిపదార్థం: అని; చెప్పి; ఆగామి= రానున్నది; అయిన; చైత్రంబున= చైత్రమాసంయొక్క; పున్నమనాఁడు= పున్నమరోజున; ఆ+నరేంద్ర= ఆరాజులలో; చంద్రు= శ్రేష్ఠుడియొక్క; అశ్వమేధయాగంబునకున్= అశ్వమేధ యజ్ఞానికి; అనురాగంబు= ప్రేమ; ఎసఁగన్= అతిశయించగా; రమ్ము+ఈ!= రమ్మా!; అనియునున్= అనికూడా; పలికి= చెప్పి; ఆ+పాండవ= ఆ పాండవులయందు; మధ్యముండు= నడిమివాడు - అర్జునుడు; మేధ్య= పవిత్రమైన; అశ్వంబున్= గుర్రాన్ని; అనుసరింపన్= వెంబడించగా; అది= ఆ గుర్రం; కరిపురంబు= హస్తినాపురంయొక్క; దిక్కు= వైపునకు; మొగంబు= ముఖం; అయి= కలదియై; అరుగన్+చొచ్చెన్= వెళ్ళటానికి మొదలు పెట్టింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; అతండు= అర్జునుడు; వివిధ= వివిధాలైన; ఆయా; దేశంబులన్= దేశాలయందు; తిరిగిన; తెఱంగు= విధం; ఎల్లనున్= అంతయూ; చారులచేతన్= గూఢచారులవలన; విని; అజాతశత్రుండు= తనకు శత్రువులు లేనివాడు - ధర్మరాజు; ఆ+పురుహూత= ఆ ఇంద్రుడియొక్క; పుత్త్రుండు= కుమారుడు - అర్జునుడు; అశ్వ= గుర్రంయొక్క; రక్షణంబు= సంరక్షణం; అట్లు= ఆ విధంగా; ధర్మ= ధర్మంయొక్క; ప్రకారంబునన్= ప్రకారంగా; నిర్వహించుటకున్= చేసినందుకు; ప్రీతి వహించెన్= సంతోషించాడు; ఆ+దివసంబు= ఆ రోజు.

తాత్పర్యం: అని చెప్పి 'రాబోయే చైత్రమాస పూర్ణిమనాడు రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు అశ్వమేధయాగానికి ప్రేమతో నీవు రమ్మా!' అని పలికాడు. తరువాత అర్జునుడు పవిత్రమైన యజ్ఞాశ్వాన్ని అనుసరిస్తుండగా అది హస్తినాపురంవైపు వెళ్ళటం మొదలు పెట్టింది. తన తమ్ముడు ఆయా దేశాలలో తిరిగిన తీరంతా గూఢచారులవలన ధర్మరాజు విని అతడు ధర్మప్రకారంగా అశ్వసంరక్షణం చేసినందుకు పరమానందం పొందాడు. ఆ రోజు. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. **మాఘమాస పౌర్ణమాసి యై యుండె; నా। ధర్మనందనుండు పేర్మి వెలయ**
నెలమి మిగులఁ బెద్దకొలువున నుండి త। మ్ముల సగౌరవముగఁ బిలువఁ బనిచి. **129**

ప్రతిపదార్థం: మాఘమాస= మాఘమాసము నందలి; పౌర్ణమాసి= పూర్ణిమ; ఐ= అయి; ఉండెన్= ఉన్నది; ఆ+ధర్మనందనుండు= ఆ యముడి కుమారుడు ధర్మరాజు; పేర్మి= వైభవం; వెలయన్= ప్రకాశించగా; ఎలమి= సంతోషం; మిగులన్= ఎక్కువకాగా;

పెద్దకొలువునన్= నిండు కొలువున; ఉండి; తమ్ములన్= తమ్ములను; సహ+గౌరవము+కన్= గౌరవంతో కూడి ఉండేటట్లుగా; పిలువన్= పిలువగా; పనిచి= పంపి.

తాత్పర్యం: (ఆ రోజు) మాఘమాసంలోని పూర్ణిమ. ధర్మరాజు వైభవోపేతంగా సంతోషాతిశయంతో నిండు కొలువై ఉండి తమ్ములను సగౌరంగా పిలువనంపి. (తరువాతి వచనంతో అన్వయం)

వ. అనిల నందను నాననం బాలోకించి. 130

ప్రతిపదార్థం: అనిల= వాయువుయొక్క; నందను= కుమారుడైన భీముడియొక్క; ఆననంబు= ముఖం; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: భీముడిని చూచి.

క. 'నీ తమ్ముఁడు తురగముఁ గొని। యేతెంచుట వింటిఁ; జైత్ర మింకఁ దడవు లే
దీతఱి మునులను నృపసం। ఘాతంబును బిలువఁ బంపఁగా వలయుఁ దగన్. 131

ప్రతిపదార్థం: నీ= నీయొక్క; తమ్ముఁడు= తమ్ముడు; తురగమున్= యజ్ఞాశ్వమును; కొని= తీసికొని, ఏతెంచుట= రావటం; వింటిన్= విన్నాను; చైత్రము= చైత్రమాసం; ఇంకన్= ఇంక; తడవులేదు= ఆలస్యం లేనిది (సమీపిస్తున్నదని అర్థం); ఈతఱిన్= ఈ సమయంలో; మునులను; నృప= రాజులయొక్క; సంఘాతంబును= సమూహాన్ని; తగన్= తగినట్లుగా; పిలువన్= ఆహ్వానించగా; పంపఁగాన్+వలయున్= రాజపురుషులను పంపాలి.

తాత్పర్యం: 'నీ తమ్ముడు అర్జునుడు గుఱ్ఱంతోపాటు వస్తున్నాడని విన్నాను. చైత్రమాసం సమీపిస్తున్నది. ఈ సమయంలో మునులనూ, రాజసమూహమునూ సముచితంగా ఆహ్వానించటానికి రాజపురుషులను పంపాలి.

వ. యాగశాలయు శిల్పి జనులం గొని కల్పింపుము; తగువారలకు విడియం దగియెడు వివిధ గృహంబుల నొనరింపు'మని పనిచిన నతండు. 132

ప్రతిపదార్థం: శిల్పిజనులన్= ఆయా పనులు చేసే శిల్పులను; కొని= రప్పించి; యాగశాలయున్= యజ్ఞగృహాన్ని; కల్పింపుము= నిర్మించుము; తగువారలకున్= అర్హులైనవారికి; విడియన్= విడిదిచేయుగా; తగియెడు= తగిన; వివిధ= పలురకాలైన; గృహంబులన్= ఇండ్లను; ఒనరింపుము= కట్టించుము; అని; పనిచినన్= ఆజ్ఞాపించగా; అతండు= భీముడు.

తాత్పర్యం: వివిధ శిల్పులను రప్పించి యజ్ఞ గృహాన్ని నిర్మించుము. అర్హులైనవారు విడిదిచేయటానికి తగిన పలురకాల ఇండ్లను కట్టించుము' అని ఆజ్ఞాపించగా భీముడు. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. యజ్ఞవాటమును జనాధిపులకు ముని। వ్రాతములకు విడియ వలయునట్టి
మందిరములుఁ గనక మణిమయంబులుగా నొ। నర్చెఁ దద్జ్ఞ మగు జనంబు వొగడ. 133

ప్రతిపదార్థం: యజ్ఞ= యజ్ఞంయొక్క; వాటమును= శాలయును; జన+అధిపులకున్= జనపతులకు, రాజులకు; ముని= మునులయొక్క; వ్రాతములకున్= సమూహాలకు; విడియ వలయు= విడిదిచేయదగిన; అట్టి= అటువంటి; మందిరములున్= గృహాలను; తద్జ్ఞము= వాస్తుశాస్త్రం తెలిసిన; అగు= అయిన; జనంబు= ప్రజ; పొగడన్= ప్రశంసించగా; కనక= బంగారంయొక్క; మణి= మణులయొక్క; మయంబులు= వికారాలు కలవి; కాన్= అయ్యేటట్లుగా; ఒనర్చెన్= నిర్మించాడు.

తాత్పర్యం: భీముడు యజ్ఞశాలను రాజులు; మునులు విడిది చేయదగిన గృహాలను స్వర్ణమయాలుగా మణిమయాలుగా నిర్మించాడు. వాస్తుశాస్త్రం తెలిసినవారు వాటిని చూచి మెచ్చుకొన్నారు.

క. ధరణీసురులను బనిచెను। ధర నెందును దిరిగి మునుల ధాత్రీశుల న
ధ్వరమునకుఁ బిలువుఁ డని య। మ్మరుత్సుతుఁడు; వారుఁ జని సమంచిత భక్తిన్. 134

ప్రతిపదార్థం: ఆ+మరుత్+సుతుఁడు= ఆ వాయు కుమారుడు భీముడు; ధరన్= భూమండలంలో; ఎందున్= అన్నిచోట్లా; తిరిగి; మునులన్= మునులను; ధాత్రీ+ఈశులను= భూపతులను, రాజులను; అధ్వరమునకున్= యజ్ఞానికి; పిలువుఁడు= ఆహ్వానించండి; అని; ధరణీసురులను= బ్రాహ్మణులను; పనిచెను= పంపాడు; వారున్= ఆ బ్రాహ్మణులును; చని= వెళ్ళి; సమ్+అంచిత= మిక్కిలి ఒప్పుచున్న; భక్తిన్= భక్తితో.

తాత్పర్యం: భూమియం దంతటా తిరిగి మునులనూ, రాజులనూ యజ్ఞమునకు ఆహ్వానించండని భీముడు బ్రాహ్మణులను పంపాడు. ఆ బ్రాహ్మణులూ సద్భక్తిపూర్వకంగా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. పిలిచిన రాజులున్ మునులుఁ బ్రీతి యెలర్ప బలోత్కరంబు శి
ష్యులుఁ దమతోడ రా మనము లువ్విళు లూరఁగ యజ్ఞవర్తనం
బులుఁ గనుఁగొంటకై సకల భూవలయంబునఁ గల్గునట్టి వా
రలు సనుదెంచినం గురుధరాపతి చిత్తము వేడ్క నూనఁగన్. 135

ప్రతిపదార్థం: పిలిచినన్= పిలువగా; సకల= సమస్తమైన; భూవలయంబునన్= భూమండలంలో; కల్గు+అట్టి= ఉన్నట్టి; వారలు= వారు; రాజులున్= రాజులూ; మునులున్= మునులూ; ప్రీతి= సంతోషం; ఎలర్పన్= అతిశయించగా; బల= సైన్యంయొక్క; ఉత్కరంబు= సమూహం; శిష్యులన్= శిష్యులూ; తమతోడన్= తమతోపాటు; రాన్= రాగా; యజ్ఞ= యజ్ఞంయొక్క; వర్తనంబులు= నడచుపద్ధతులు; కనుఁగొంటకై= చూచుటకై; మనములు= మనస్సులు; ఉవ్విళులూరఁగన్= తహతహపడుతుండగా; చనుదెంచినన్= రాగా; కురుధరాపతి= కురురాజు, ధర్మరాజు; చిత్తము= మనస్సు; వేడ్కన్+ఊనఁగన్= సంతోషం పొందగా.

తాత్పర్యం: (బ్రాహ్మణులు) ఆహ్వానించగా భూమండలంలో అంతటా ఉన్న రాజులూ, మునులూ ఆనందం అతిశయించగా వచ్చారు. రాజులు తమసైన్యాలతో వచ్చారు. మునులు తమ శిష్యులతో వచ్చారు. యజ్ఞం జరిగే పద్ధతులు చూడటానికి వారి మనస్సులు తహతహపడుతుండగా అప్పుడు ధర్మరాజు మనస్సులో సంతోషించి. (తరువాతి పద్యంతో అన్వయం)

క. ఎదురుకొని వీడుఁ బట్లకు। ముద మారఁగఁ దాన యనిచి మొక్కలములు నిం
పొదవించునట్టివియుఁ గాఁ। బదార్థములు ప్రజదలమునుఁ బాటించి తగన్. 136

ప్రతిపదార్థం: తాను+అ= తానే; ఎదురుకొని= ఎదురువెళ్ళి; ముదము= సంతోషం; ఆరఁగన్= కలుగగా; వీడు+పట్లకున్= విడిది ఇండ్లకు; అనిచి= పంపి; మొక్కలములు= ఉత్సాహ వచనములు; పదార్థములు= ఉపయోగించే వస్తువులు మొదలగునవి; ఇంపు= ప్రీతిని; ఒదవించు= పుట్టించే; అట్టి+అవియున్= అటువంటివి; కాన్= కాగా; తగన్= సముచితంగా; ప్రజ= జనులయొక్క; తలమునున్= హెచ్చుతగ్గులను, అంతస్తులను; పాటించి= పరిశీలించి.

తాత్పర్యం: వచ్చినవారు సంతోషించగా తానే ఎదురువెళ్ళి తీసికొనివచ్చి వారి వారి విడిది ఇళ్ళకు పంపాడు. వారికి ప్రీతి కలిగేటట్లు ఉత్సాహ వచనాలు పలికాడు. కావలసిన పదార్థాలు సమకూర్చాడు. ఈ పనులన్నీ వచ్చినవారి అంతస్తులను బట్టి హోదాలనుబట్టి ధర్మరాజు నిర్వర్తించాడు.

క. భోజన శయనాసనములు । రాజిల్లెడు నట్లుగాఁగ రాజుల కెల్లం
దేజోధనుఁ డా ధర్మత । నూజుం డిడఁ బనుచు జనవినుతసుచరిత్రా! 137

ప్రతిపదార్థం: జన= జనులచేత; వినుత= కొనియాడబడిన; సుచరిత్రా!= మంచి నడవడి కలవాడా!; తేజస్= సద్గుణాలవలన కలిగే తేజస్సు; ధనుఁడు= ధనముగా కలవాడు; ఆ+ధర్మతనూజుండు= ఆ యముడి కుమారుడు ధర్మరాజు; భోజన= భోజనాలూ; శయన= శయ్యలూ, మంచములూ, పాన్పులూ; ఆసనములు= కూర్చుండటకు కుర్చీలు, పీటలూ; రాజిల్లెడు+అట్లు+కాఁగన్= ప్రకాశించేటట్లుగా; రాజులకున్+ఎల్లన్= రాజులకందరకూ; ఇడన్= సమకూర్పగా; పనుచున్= పంపుతాడు.

తాత్పర్యం: జనమేజయా! తేజస్వంతుడైన ధర్మరాజు రాజులందరికీ కావలసిన భోజనాలూ, శయ్యలూ, ఆసనాలూ సమృద్ధిగా సమకూరేటట్లు పంపేవాడు. ఇవి కూడా వారి వారి హోదాలకు తగినట్లు పంపేవాడని గ్రహించాలి.

చ. మునులకు నెల్లఁ గందములు మూలములున్ ఫలకోట్లునుం బ్రియం
బొనరఁగఁ దాన పోయి మధురోక్తులతోడ సమర్పణంబు సే
యు; నిటుల సంవిధానము లనూనములై విలసిల్లఁజేయు; న
య్యనిమిషనాథవైభవుఁ డహంకృతి వర్జన సంస్తుతంబుగన్. 138

ప్రతిపదార్థం: ఆ+అనిమిషనాథ= దేవతలయొక్క ప్రభువు దేవేంద్రుడియొక్క; వైభవుఁడు= వైభవం కలవాడు; అహంకృతి= అహంకారంయొక్క; వర్జన= విడుచుటచేత; సంస్తుతంబు+కన్= మిక్కిలి కొనియాడబడేటట్లుగా; మునులన్+ఎల్లన్= మునుల కందరకూ; కందములున్= దుంపలూ; మూలములున్= వేరులూ; ఫలకోట్లునున్= ఫలముల సమూహమునూ; ప్రియంబు= ప్రీతి; ఒనరఁగన్= కలుగగా; తాన్+అ= తానే; పోయి; మధుర= తియ్యనైన; ఉక్తులతోడన్= మాటలతో; సమర్పణంబు+చేయున్= సమర్పిస్తాడు; ఇటులు+అ= ఇట్లే; సంవిధానములు= ఏర్పాట్లు; న+ఊనములు= తక్కువగానివి, పరిపూర్ణమైనవి; ఐ= అయి; విలసిల్లన్= ఒప్పగా; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: దేవేంద్ర వైభవం కలిగిన ధర్మరాజు అహంకారాన్ని వదలి, వినయంతో తానే పోయి తియ్యనైన పలుకులు పలుకుతూ మునుల కందరకూ దుంపలూ, వేరులూ, పలురకాల పండ్లూ సమర్పించేవాడు. ఈ విధంగా ఏర్పాటులన్నీ పరిపూర్ణంగా ఉండేటట్లు చేసేవాడు.

తే. యజ్ఞవాటంబుఁ దక్కటి యాలయములు, । లలితభంగి రమ్యములు, సలక్షణములు
గా నొనర్చిన శిల్పి నికాయమునకుఁ । బసదనం బిచ్చె సంతసం బెసక మెసఁగ. 139

ప్రతిపదార్థం: యజ్ఞవాటంబున్= యజ్ఞశాలనూ; తక్కటి= ఇతరములైన; ఆలయములున్= మందిరములనూ; లలిత= కోరబడిన; భంగిన్= విధంగా; రమ్యములు= అందమైనవి; సహ+లక్షణములు= వాస్తుశాస్త్రం చెప్పిన లక్షణాలతో కూడినవి; కాన్= అయ్యేటట్లుగా; ఒనర్చిన= నిర్మించిన; శిల్పి= శిల్పులయొక్క; నికాయమునకున్= సమూహానికి; సంతసంబు= సంతోషం; ఎసకము+ఎసఁగన్= అతిశయించగా; పసదనంబు= బహుమానం; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: కోరిన విధంగా, అందంగా, శాస్త్రోక్తంగా యజ్ఞశాలనూ, ఇతర మందిరాలనూ నిర్మించిన శిల్పి బృందానికి మహానందం కలిగేటట్లుగా ధర్మరాజు బహుమానా లిచ్చాడు.

సీ. **పాండవాగ్రజుఁ డట్లు పవననందనుఁ బంచి। యజ్ఞశాలా కరణాదు లైన**
కృత్యముల్ నడపుటఁ గృష్ణుండు గనుఁగొని। కడుఁ బ్రీతిఁ బొందె; నాగత నృపాలు
రచ్చెరువొంది; రయ్యమృతాంశు వంశ ని। స్తారకుం డర్థిమైఁ దేరఁ బనుప
ననవద్య పశువుల నఖిలజాతులవానిఁ। గొనివచ్చి రత్యంత కుశల పరిజ

ఆ. **నంబు; లన్న పర్వతంబులు నాజ్య వా। హినులుఁ గల్గి విప్రజనపరంప**
రలు భుజించు పేర్మి యొలసి యాగారంభ। సమయ మద్భుత ప్రజనక మయ్యె. **140**

ప్రతిపదార్థం: పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడు ధర్మరాజు; అట్లు= ఆ విధంగా; పవన నందనున్= వాయు కుమారుడైన భీముడిని; పంచి= ఆజ్ఞాపించి; యజ్ఞశాల= యజ్ఞశాలయొక్క; కరణ= నిర్మాణం; ఆదులు+ఐన= మొదలగునవైన; కృత్యముల్= పనులు; నడపుటన్= చేయుట; కృష్ణుండు; కనుఁగొని;= చూచి; కడున్= మిక్కిలి; ప్రీతిన్= సంతోషమును; పొందెన్= పొందాడు; ఆగత= వచ్చిన; నృపాలురు= రాజులు; అచ్చెరువు= ఆశ్చర్యం; ఒందిరి= పొందారు; ఆ+అమృతాంశు= ఆ చంద్రుడియొక్క; వంశ= వంశంయొక్క; నిస్తారకుండు= ఉద్ధరించేవాడు; అర్థిమైన్= ప్రీతితో; తేరన్= తీసికొనిరాగా; పనుపన్= ఆజ్ఞాపించగా; అత్యంత= మిక్కిలి; కుశల= నేర్పు కలిగిన; పరిజనంబులు= సేవలకు; న+అవద్య= దోషంలేని, తప్పుడు సుళ్ళు మొదలగునవి లేని; పశువులన్= జంతువులను; అఖిల= సమస్తమైన; జాతుల వానిన్= తెగలవారిని; కొని= తీసికొని; వచ్చిరి= వచ్చారు; అన్న పర్వతంబులున్= కొండలవంటి అన్నపురాసులు; ఆజ్యవాహినులున్= నేతుల నదులు; కల్గి= ఒనగూడి; విప్రజన= బ్రాహ్మణులయొక్క; పరంపరలు= ఎడతెగని సమూహాలు; భుజించు= భోజనం చేసే; పేర్మి= పెంపు; ఒలసి= కలిగి; యాగ= యజ్ఞంయొక్క; ఆరంభ సమయము= ప్రారంభ కాలం; అద్భుత= ఆశ్చర్యమును; ప్రజనకము= మిక్కిలి కలిగించేది; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా భీముడిని ఆజ్ఞాపించి యజ్ఞశాలా నిర్మాణం మొదలైన పనులు చేయించటం చూచి శ్రీకృష్ణుడు మహాసంతోషం పొందాడు. వచ్చిన రాజులూ ఆశ్చర్యపడ్డారు. చంద్రవంశోద్ధారకుడైన ధర్మరాజు నేర్పరులైన సేవకులను దోషరహితమైన వివిధజాతుల జంతువులను తీసికొనిరావలెనని పంపాడు. వారు అటువంటి వాటిని చూచి తీసికొనివచ్చారు. అన్నరాసులు కొండలవలె లేచాయి. నేయి నదులవలె ప్రవహించింది. బ్రాహ్మణులు ఎడతెగకుండా భోజనాలు చేశారు. ఈ పెంపువలన యాగ ప్రారంభోత్సవం ఆశ్చర్యదాయకమైనది.

క. **విను లక్ష భూసురులు గుడి। చిన నొకమరి మ్రోయుభేరి సెలఁగుచునుండున్**
జననాయక! యెప్పుడు; నే। మని చెప్పుదు నశ్వమేధయజ్ఞవిభూతిన్. **141**

ప్రతిపదార్థం: జననాయక!= రాజా!; విను= వినుము; లక్ష భూసురులు= లక్షమంది బ్రాహ్మణులు; కుడిచినన్= భోజనంచేయగా; ఒకమరి= ఒకసారి; మ్రోయు= మ్రోగెడి; భేరి; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; చెలఁగుచున్+ఉండున్= మ్రోగుతూ ఉంటుంది; అశ్వమేధ= అశ్వమేధమను; యజ్ఞ= యజ్ఞంయొక్క; విభూతిన్= వైభవమును; ఏమి+అని= ఎటువంటిదని; చెప్పుదున్= వర్ణించగలను?

తాత్పర్యం: జనమేజయా! వినుము. లక్షమంది బ్రాహ్మణులు భుజిస్తే ఒకసారి మ్రోగే భేరి ఎడతెగకుండా మ్రోగుచూ ఉన్నది. ఆ అశ్వమేధ యాగ వైభవాన్ని గూర్చి ఏమని ఎంతని వర్ణించేది?

చ. **శరధిపరీత భూమిఁ గలసర్వజనంబును దోఁచె; నమ్మహా**
ధ్వరమున భూపతుల్ మకుట పంక్తులు భూషణరాజిఁ జక్కఁగాఁ
బొరిఁబొరిఁ ద్రోచి కొంచు మదిఁ బొంపిరి వోయెడు వేడుకం బనుల్
వెరవులు లావులున్ మెఱయ వేయు విధంబులఁ జేయు టొప్పఁగన్. **142**

ప్రతిపదార్థం: శరధి= సముద్రాలచేత; పరీత= చుట్టబడిన; భూమిన్= భూమండలంలో; కల= ఉన్న; సర్వ= సమస్తమైన; జనంబును= జనమూ; తోఁచెన్= వచ్చారు; ఆ+మహత్+అధ్వరమునన్= ఆ గొప్ప యజ్ఞంలో; భూపతుల్= రాజులు; మకుట= కిరీటములయొక్క; పంక్తులు= సమూహాలు; భూషణ= నగలయొక్క; రాజిన్= సమూహాన్ని; చక్కఁగాన్= మొదట ఉన్నట్లు అందంగా; పొరిన్+పొరిన్= మాటి మాటికీ; త్రోచికొంచున్= సర్దుకొంటూ; మదిన్= మనస్సులో; పొంపిరి+పోయెడు= అతిశయిస్తున్న; వేడుకన్= కుతూహలంతో; వెరవులు= ఉపాయాలూ; లావులున్= శక్తులూ; మెఱయన్= వెల్లడి కాగా; పనుల్= పనులు; వేయు+విధంబులన్= వేలకొలది తీరులుగా; చేయుట= చేయటం; ఒప్పఁగన్= ఒప్పగా.

తాత్పర్యం: నాలుగు సముద్రాలూ చుట్టిన భూమండలంలోని జనమంతా వచ్చింది. ఆ యజ్ఞంలో రాజులు నేను చేస్తాను నేను చేస్తాను అని ముందుకు వచ్చి తమ తమ శక్తియుక్తులు వెల్లడయ్యేటట్లుగా ఎన్నో విధాలుగా పనులు చేసేవారు. ఆ ఒత్తిడికి వారి కిరీటాలూ, నగలూ తొలగిపోయేవి. వారు వాటిని మాటి మాటికీ చక్కగా సర్దుకొనేవారు.(తరువాతి పద్యంతో అన్వయం)

సీ. **కలయంగ రాజులఁ గనుఁగొని ధర్మనం। దనుఁడు భీమునిఁ బిల్చి మనుజపతుల**
కెల్లను వే పూజ లిమ్మన్న నమ్మరు। త్తనయుండు దగఁ దన తమ్ముదోయి
నెలమిఁ గూర్చికొని మహీశుల సబహుమా। నంబునఁ బూజించె; నలిననాభుఁ
డప్పుడ సీరి సాత్యకి ముఖ యాదవ। సహితంబుగాఁగఁ బ్రసన్నవదన

తే. **కమల మొప్పంగఁ బాండవాగ్రజుని కడకు। వచ్చుడును, బ్రియ మలర నవ్వసుమతీశుఁ**
డా బలుండును నతఁడును నాదిగా స। మస్త యాదవులకు నధికార్ల లిచ్చె. **143**

ప్రతిపదార్థం: ధర్మనందనుఁడు= యముడి కుమారుడు ధర్మరాజు; రాజులన్= రాజులను; కలయంగన్= పూర్తిగా; కనుఁగొని= చూచి; భీమునిన్= భీముడిని; పిల్చి= పిలిచి; మనుజపతులకున్+ఎల్లన్= రాజులకందరకూ; వే= శీఘ్రంగా; పూజలు+ఇమ్ము=పూజలు చేయుము; అన్నన్= అని చెప్పగా; ఆ+మరుత్+తనయుండు= ఆ వాయు కుమారుడు భీముడు; తన= తనయొక్క; తమ్ముదోయిన్= తమ్ముల జంటను, నకుల సహదేవులను; కూర్చికొని= కలుపుకొని; తగన్= తగినట్లుగా; ఎలమిన్= ఆనందంతో; మహీ+ఈశులన్= రాజులను; సహ+బహుమానంబునన్= బహుమాన పురస్సరంగా; పూజించెన్= పూజించాడు; అప్పుడు+అ= ఆ సమయముననే; నలిన నాభుఁడు= పద్మం నాభియందు గలవాడు - కృష్ణుడు; సీరి= బలరాముడు; సాత్యకి; ముఖ= మొదలైన; యాదవ= యాద వులతో; సహితంబు+కాఁగన్= కూడియుండినట్లుగా; ప్రసన్న= తృప్తిచేత నిర్మలమైన; వదనకమలము= ముఖపద్మం; ఒప్పంగన్= వెలుగొందగా; పాండవ+అగ్రజుని= ధర్మరాజుయొక్క; కడకున్= దగ్గరకు; వచ్చుడును= రాగా; ఆ+వసుమతీ+ ఈశుఁడు= ఆ

రాజు; ప్రియము= సంతోషం; అలరన్= కలుగగా; ఆ+బలుండును= బలరాముడును; అతఁడును= కృష్ణుడును; ఆది+కాన్= మొదలుగా; సమస్త= సమస్తమైన; యాదవులకున్= యాదవులకూ; అధిక+అర్చలు+ఇచ్చెన్= మిక్కిలి పూజలు చేశాడు.

తాత్పర్యం: ఆ విధంగా పనులు చేస్తున్న రాజులను ధర్మరాజు పూర్తిగా చూచాడు. ఆ ప్రభువు భీముడిని పిలిచి 'శీఘ్రంగా రాజులను అందరినీ పూజించుము' అని చెప్పాడు. అతడు నకుల సహదేవులను కలుపుకొని ఆనందంతో వారి వారికి తగినట్లుగా రాజులను అందరినీ బహుమాన పురస్సరంగా పూజించాడు. అప్పుడే ప్రసన్నముఖుడైన శ్రీకృష్ణుడు సాత్యకి బలరామాది యాదవులతో కూడి వచ్చాడు. ధర్మరాజు ఆనందించి బలరాముడు, శ్రీకృష్ణుడు మొదలైన యాదవుల నందరినీ అత్యధికంగా పూజించాడు.

వ. నారాయణుండు నరునిం బ్రసంగించి పాడవాగ్రజు మొగంబు గనుంగొని 'ద్వారవతినుండి యాప్తుండును విచక్షణుండును నగు వాఁ డొక్కరుండు వచ్చె; వివ్వచ్చుం డప్పురంబు పరిసరంబునఁ బోవం జూచితి ననియె; వివిధ సంగరంబులం దదంగంబు కృశంబై యున్నయది యనియుం జెప్పెఁ నప్పార్థుండు చేరువకు నరుగు దెంచెం; గాలోచిత క్రియా కలాపంబునకుం దొడంగు'; మనవుడు నప్పుడమిఱేఁ డప్పురుషోత్తముని తోడ 144

ప్రతిపదార్థం: నారాయణుండు= శ్రీకృష్ణుడు; నరునిన్= అర్జునుడిని; ప్రసంగించి= ప్రస్తావించి; పాండవ+అగ్రజు= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజుయొక్క; మొగంబు= ముఖమును; కనుంగొని= చూచి; ద్వారవతినుండి= ద్వారకనుండి; ఆప్తుండును= ముఖ్యుడూ, కావలసినవాడూ; విచక్షణుండునున్= వివేకశాలి; అగు= అయిన; వాఁడు= వాడు; ఒక్కరుండు= ఒకడు; వచ్చెన్= వచ్చాడు; వివ్వచ్చుండు= అర్జునుడు; ఆ+పురంబు= ఆ పట్టణముయొక్క; పరిసరంబునన్= సమీప ప్రదేశంలో; పోవన్= వెళ్ళుతుండగా; చూచితిన్= చూచాను; అనియెన్= అన్నాడు; వివిధ= అనేకవిధాలైన; సంగరంబులన్= యుద్ధాలలో; తద్+అంగంబు= అతడియొక్క శరీరము; కృశంబు+ఐ= చిక్కినదై; ఉన్న+అది= ఉన్నది; అనియున్= అనికూడా; చెప్పెన్= చెప్పాడు; ఆ+పార్థుండు= ఆ అర్జునుడు; చేరువకున్= దగ్గరకు; అరుగు+తెంచెన్= వచ్చాడు; కాల= సమయానికి; ఉచిత= తగిన; క్రియా= పనులయొక్క; కలాపంబునకున్= సమూహానికి; తొడంగుము= పూనుకొనుము. అనవుడున్= అని అనగా; ఆ+పుడమిఱేఁడు= ఆ భూపతి ధర్మరాజు; ఆ+పురుషోత్తమునితోడన్= శ్రీకృష్ణుడితో.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అర్జునుడి ప్రస్తావన తెచ్చి 'ద్వారకనుండి కావలసినవాడూ, వివేకీ అయినవాడు ఒకడు వచ్చాడు. అర్జునుడు ఆ పట్టణ సమీపంలో వెళ్ళుతుండగా చూచానని వాడు చెప్పాడు. యుద్ధాలవలన అర్జునుడి శరీరం చిక్కిపోయిందని కూడా చెప్పాడు. విజయుడు దగ్గరకు వచ్చాడు. కాబట్టి ఈ సమయాన చేయదగిన పనులన్నీ చేయటానికి పూనుకొను' మని ధర్మరాజుతో చెప్పాడు. అప్పుడు ఆ రాజు కృష్ణుడితో.(తరువాతి పద్యంతో అన్వయం).

క. 'నీ పంపునఁ బోవుట ను। ద్దీపిత బల శౌర్య ధైర్య తేజోయుతుఁడై
యా పార్థుఁడు యోగక్షే। మోపేతుం డయ్యెఁ నడపు ముచితంపుఁ బనుల్.' 145

ప్రతిపదార్థం: ఆ+పార్థుఁడు= ఆ అర్జునుడు; నీ= నీయొక్క; పంపునన్= ఆజ్ఞచేత; పోవుటన్= వెళ్ళుటవలన; ఉద్దీపిత= ప్రకాశింపజేయబడిన; బల= బలంచేత; శౌర్య= పరాక్రమంచేత; ధైర్య= ధైర్యంచేత కలిగిన; తేజస్= తేజస్సుతో; యుతుఁడు+ఐ= కూడినవాడై; యోగ= అపూర్వ వస్తులాభంతో; క్షేమ= ప్రాప్త వస్తు సంరక్షణంతో; ఉపేతుఁడు= కూడినవాడు; అయ్యెన్= అయ్యాడు; ఉచితము+న్+పనుల్= చేయదగిన పనులను; నడపుము= చేయుము.

తాత్పర్యం: 'అర్జునుడు నీ ఆజ్ఞానుసారం వెళ్ళాడు. అందువలన అతడు బల శౌర్య ధైర్య తేజస్వంతుడు అయ్యాడు. యోగ క్షేమం కలవాడయ్యాడు. నీవే చేయదగిన పనులన్నీ చేయించుము.'

కృష్ణుఁడు ధర్మజునితో నర్జును సందేశంబు చెప్పుట (సం. 14-88-13)

వ. అనిన నవ్వారిజనాభుండు 'ద్వారకనుండి వచ్చినవాఁ డగ్గాండీవి తనతోడం జెప్పె నని చెప్పిన మాటల తెఱంగా కర్ణింపుము. 146

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; ఆ+వారిజ నాభుండు= పద్మము నాభియందు కలవాడు-కృష్ణుడు; ద్వారకనుండి= ద్వారక నుండి; వచ్చినవాఁడు= వచ్చినవాడు; ఆ+గాండీవి= అర్జునుడు; తనతోడన్= తనతో; చెప్పెన్= చెప్పాడు; అని; చెప్పిన= చెప్పగా; మాటల= మాటలయొక్క; తెఱంగు= తీరు; ఆకర్ణింపుము= వినుము.

తాత్పర్యం: అని ధర్మరాజు అనగా శ్రీకృష్ణుడు అతడితో 'ద్వారకనుండి వచ్చినవాడు, 'అర్జునుడు తనతో చెప్పినా' డంటూ చెప్పిన మాటలు నీకు తెలిపెదను వినుము.

ఆ. నాదు విన్నపముగ నరనాథునకు విన్న। వింపు; రాజులెల్ల వేడ్కతోడ
జన్నమునకు వచ్చుచున్నారు; మున్నెట్టి। వార లైనఁ బూజ వలయు ననుము. 147

ప్రతిపదార్థం: నాదు= నాయొక్క; విన్నపముగన్= మనవిగా; నరనాథునకున్= రాజుగారితో; విన్నవింపు= విజ్ఞప్తిచేయుము; రాజులు+ఎల్లన్= రాజులందరూ; వేడ్కతోడన్= కుతూహలంతో; జన్నమునకున్= యజ్ఞమునకు; వచ్చుచున్+ఉన్నారు= వస్తున్నారు; మున్ను= ఇంతకుముందు; ఎట్టివారలు= ఎటువంటివారు; ఐనన్= అయినప్పటికీ; పూజ= పూజించటం, వలయున్= యుక్తమౌతుంది, విధి ఔతుంది; అనుము= అని చెప్పుము.

తాత్పర్యం: 'నా మనవిగా ప్రభువునకు విజ్ఞప్తి చేయుము. రాజులందరూ కుతూహలంతో యజ్ఞానికి వస్తున్నారు. వారు పూర్వం ఎటువంటివారైనప్పటికీ (పగ పూనిన వారయినప్పటికీ అని అర్థం) వారిని పూజించటం మన విధి అని చెప్పుము.

వ. విశేషించి మదీయ పుత్త్రుండు. 148

ప్రతిపదార్థం: విశేషించి= అతిశయించి; మదీయ= నా యొక్క; పుత్త్రుండు= కుమారుడు.

తాత్పర్యం: విశేషంగా నా కుమారుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. మణిపూర పురాధీశుఁడు। గుణ గణ విభ్రాజితుండు గురుహితుఁడు విచ
క్షణపరుఁడు బభ్రువాహనుఁ। డణుమాత్రముఁ గీడులేని యట్టిం డెందున్. 149

ప్రతిపదార్థం: మణిపూర= మణిపూరం; పుర= పట్టణంయొక్క; అధి+ఈశుఁడు= అధిపతి; గుణ= సద్గుణములయొక్క; గణ= సమూహాలచేత; విభ్రాజితుండు= ప్రకాశించేవాడు; గురు= గొప్ప; హితుఁడు= మేలు చేసేవాడు; విచక్షణ= మంచిచెడ్డలను ఎరుగుటలో; పరుఁడు= ఆసక్తికలవాడు; ఎందున్= దేనియందునూ; అణుమాత్రమున్= అణువంతకూడా; కీడు= దోషం; లేని; అట్టిండు= అట్టివాడు అయిన; బభ్రువాహనుఁడు.

తాత్పర్యం: మణిపూర పురమునకు అధిపతీ, సకల సద్గుణాలచేత ప్రకాశించేవాడూ, గొప్పమేలు చేసేవాడూ, వివేకశాలీ, దేనియందునూ అణువంత కూడా దోషం లేనట్టివాడూ అయిన బభ్రువాహనుడు.

క. మీ చరణ సరసిజంబులు। చూచుటకై రాక తనకు సువ్రతముగ మున్
వేచి యునికి వచ్చుఁ; గృపా। గోచరమగు చేఁతకుం దగును మీ; కనుమీ! 150

ప్రతిపదార్థం: మీ= మీయొక్క; చరణ సరసిజంబులు= పాదపద్మాలు; చూచుటకై= దర్శించటానికి; రాక= రావటం; తనకున్= తనకు; సువ్రతముగన్= ఉత్తమ విధిగా; మున్= పూర్వం నుండియు; వేచి= ఎదురుచూస్తూ; ఉనికిన్= ఉండటంచేత; వచ్చున్= వస్తాడు; మీకున్= మీకు; కృపా= దయకు; గోచరము= వశమైనది; అగు= అయిన; చేఁతకున్= మన్నన చేయుటకు; తగును; అనుము+ఈ!= అని చెప్పుమా!

తాత్పర్యం: మీ పాదపద్మాలు దర్శించటానికి రావటమే తనకు ఉత్తమ విధి అని నమ్మి ఎన్నాళ్ళనుండో వేచి ఉన్నాడు. కాబట్టి వస్తాడు. అతడు దయాయుక్తమైన మీ మన్ననకు తగినవాడు అని చెప్పుము.'

వ. అని చెప్పె ననిన విని యవ్వాక్యంబు లభినందించి ధర్మనందనుండు గోవిందునితోడ. 151

ప్రతిపదార్థం: అని; చెప్పెన్= ద్వారకనుండి వచ్చినవాడితో అర్జునుడు చెప్పాడు; అనినన్= అనగా; విని; ఆ+వాక్యంబులు= ఆ మాటలను; అభినందించి= పొగడి, మెచ్చి; ధర్మనందనుండు= ధర్మరాజు; గోవిందునితోడన్= కృష్ణుడితో.

తాత్పర్యం: అని అర్జునుడు చెప్పినాడని అనగా విని ఆ మాటలను మెచ్చుకొని ధర్మరాజు కృష్ణుడితో. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'ఏ వింటి విజయుఁ డనేక యుద్ధంబుల। నలజడి పడుట; య ట్లతఁడు నాఁడు
నక్కట! ద్రోణభీష్మాదులతోడి యె। క్కుడుఁ బోర నిడుమలఁ బడియెఁ; నేఁడు
నిత్తెఱంగునఁ బడియెడు; నాకుఁగా నిన్ని। పాటులు వడునె యప్పరమ సౌఖ్య
యోగ్యదేహుండు; ని న్నొక్కటి నడిగెద;। నతని మేను సులక్షణాన్వితంబు;

తే. నా మదికి నెక్క నీవు గన్వఱపి కన్న। యట్టికీడు తదీయంబులైన యవయ
వముల నెందేనిఁ గలిగెనే? యమితదుఃఖ। భాగి యగుటకు మూలమై పద్మనాభ! 152

ప్రతిపదార్థం: పద్మనాభ!= శ్రీకృష్ణా!; విజయుఁడు= అర్జునుడు; అనేక యుద్ధంబులన్= అనేక యుద్ధాలయందు; అలజడి+పడుట= కష్టపడటం; ఏన్= నేను; వింటిన్= విన్నాను; అక్కట!= అయ్యో!; నాఁడు= ఆనాడు; అట్లు= ఆ విధంగా; అతఁడు= అర్జునుడు; ద్రోణ= ద్రోణుడు; భీష్మ= భీష్ముడు; ఆదులతోడన్= మొదలైనవారితోడ; ఎక్కుడు(న్+పోరన్= మహాసంగ్రామంలో; ఇడుమలన్= కష్టాలను; పడియెన్= పొందాడు; నేఁడున్= ఈనాడు కూడా; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; పడియెడున్= శ్రమిస్తున్నాడు; నాకున్+కాన్= నా కొరకు; ఆ+పరమ= ఆ ఉత్తమోత్తమమైన; సౌఖ్య= సుఖములకు; యోగ్య= తగిన; దేహుండు= శరీరం కలవాడు; ఇన్ని; పాటులు= కష్టాలు; పడను+ఎ?= పొందునా?; నిన్నున్= నిన్ను; ఒక్కటిన్= ఒకమాట; అడిగెదన్= అడుగుతాను; అతని= అర్జునుడి యొక్క; మేను= శరీరం; సు= మంచివైన; లక్షణ= లక్షణాలతో; అన్వితంబు= కూడినదని; నా= నాయొక్క; మదికిన్= మనస్సునకు; ఎక్కన్= బోధపడేటట్లుగా నీవు; కను+పఱపి= దృష్టిసారించి; కన్న+అట్టి= తెలిసికొనినట్టి; కీడు= దోషం; అమిత= మితిలేని; దుఃఖ= దుఃఖాలు; భాగి= పొందినవాడు; అగుటకున్= అగుటకు; మూలము+ఐ= ఆదికారణమై; తదీయంబులు+ఐన= అతడివి అయిన; అవయవములన్= అవయవాలలో; ఎందున్+ఏనిన్= దేనియందైనా; కలిగెన్+ఏ?=ఉన్నదా?

తాత్పర్యం: అర్జునుడు అనేక యుద్ధాలలో క్లేశపడటం నేను విన్నాను. ఆనాడు ఆ విధంగా భీష్ముడు ద్రోణుడు మొదలైన వీరులతో చేసిన భయంకర యుద్ధంలో కష్టాలు పొందాడు. ఈనాడు ఈ విధంగా క్లేశాల పాలౌతున్నాడు. ఉత్కృష్ట సౌఖ్యాలకు యోగ్యమైన శరీరం కలిగిన అర్జునుడు ఈ విధంగా నాకొరకే పడరాని పాట్లు పడుతున్నాడు కదా! నేను నిన్ను ఒకమాట అడుగుతాను. అతడి శరీరం ఉత్తమ లక్షణాలతో కూడినట్టిది. ఈ విధంగా అతడు మితిలేని దుఃఖాలను అనుభవించటానికి హేతువైన దోషం అతడి అవయవాలలో దేనియందైనా ఉన్నదా? నీవు సూక్ష్మంగా చూపు పెట్టి కనుగొన్న దేదైనా ఉంటే నాకు స్పష్టంగా తెలియజేయుము.

క. తెలుపఁదగు నేనిఁ గరుణం। దెలుపుము నా; కనుడు వాసుదేవుఁడు 'నీకుం
దెలుపుటయుఁ గృత్యమే; విను;। తెలిపెదఁ గలమాత్ర వసుమతీవరముఖ్యా! 153

ప్రతిపదార్థం: నాకున్= నాకు; తెలుపన్+తగున్+ఏనిన్= తెలియజేయదగినదైనచో; కరుణన్= దయతో; తెలుపుము= తెలియజేయుము; అనుడున్= అని అనగా; వాసుదేవుఁడు= శ్రీకృష్ణుడు; వసుమతీ+వర= భూపతులలో, రాజులలో; ముఖ్యా!= అగ్రణీ!; నీకున్= నీకు; తెలుపుటయున్= తెలియజేయటం కూడా; కృత్యము+ఏ= చేయదగిన పనియే; విను= వినుము; కలమాత్రన్= యథార్థాన్ని; తెలిపెదన్= తెలియజేస్తాను.

తాత్పర్యం: నాకు తెలియజేయదగిన దైతే దయతో చెప్పుము' అని అనగా శ్రీకృష్ణుడు 'రాజాగ్రణీ! నీకు తెలియజేయటం నా విధి. యథార్థం చెప్తుతాను వినుము.'

తే. సర్వగాత్రంబులందును సవ్యసాచి। కధిక శుభలక్షణంబుల యతిశయిల్లుఁ;
దనువు మాత్రకు నించుక ధరణినాథ। యెక్కుడై యుండుఁ జిఱుదొడ; లిదియ కొఱఁత. 154

ప్రతిపదార్థం: ధరణినాథ!= రాజా!; సవ్యసాచికిన్= అర్జునుడికి; సర్వ= సమస్తమైన; గాత్రంబుల+అందున్= అవయవాలలోనూ; అధిక= మిక్కిలి; శుభ= శుభం కలిగించే; లక్షణంబులు+అ= లక్షణాలే; అతిశయిల్లున్= ఒప్పారుతాయి; తనువు= శరీరంయొక్క; మాత్రకున్= పరిమాణానికి; ఇంచుక= కొంచెం; ఎక్కుడు+ఐ= పెద్దవియై; చిఱుదొడలు= పిక్కలు; ఉండున్= ఉంటాయి; ఇది+అ= ఇదే; కొఱఁత= లోపం.

తాత్పర్యం: రాజా! అర్జునుడి సర్వావయవాలూ శుభలక్షణ సంపన్నములై ఉన్నవి. కాని పిక్కలు అతడి ఒడ్డు పొడవులను మించి ఉన్నవి. ఇదొక్కటే లోపం.

క. అలజళ్ళు దీనివలనం। కలిగెడునో కాని తక్కు గలుగ దరిష్టం
బలఘుశుభలక్షణాన్విత। విలసిత తనుఁ డైన గాండివికి నియ్యెడలన్.' 155

ప్రతిపదార్థం: దీనివలనన్= పిక్కలు శరీర పరిమాణానికి మించి ఉండటంవలన; న+లఘు= అధికమైన; శుభ= శుభములను; కలిగించే; లక్షణ= లక్షణాలతో; అన్విత= కూడి ఉండటంచేత; విలసిత= ప్రకాశించునట్టి; తనుఁడు+ఐన= శరీరం కలవాడైన; గాండివికిన్= అర్జునుడికి; ఈ+ఎడలన్= ఈ సమయములందు; అలజళ్ళు= కష్టాలు; కలిగెడున్+ఓ= కలుగుతున్నవేమో; కాని; తక్కు= ఇతరమైన; అరిష్టంబు= కీడు; కలుగదు.

తాత్పర్యం: ఈ లోపంవలన అధిక శుభ లక్షణాలతో కూడి ప్రకాశించే శరీరం కలిగిన అర్జునుడికి ఇప్పుడు కష్టాలు కలుగుతున్నవేమో కాని, ఇంక ఏ అరిష్టమూ సంభవించదు.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అట్లున్నరూపు చెప్పిన వెన్నుని వచనంబులు విని యవ్వసుంధరా వల్లభుం డతని యాననం బాలోకించి 'యది యట్లుకాక' యని పలికె; నప్పుడు పాంచాలి పద్మనాభుం బ్రీతి స్ఫీతంబగు చూడ్కినాలోకించిన నాలోకనాథుం డది యర్జున విషయంబైన ప్రీణనంబు తెఱం గగుట యెఱింగికొనియె; నట్టియెడ భీమాదులును యాదవ కుమారులును నక్కిరీటి గుణంబు లగ్గించుచు. నా ప్రొద్దున కదియ గోష్ఠిగ సల్లాపంబు సేయుచుండ నగ్గాండీవి పాలనుండి కాలరి చనుదెంచి. 156

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; ఉన్నరూపు= సత్యం; చెప్పినన్= చెప్పగా; ఆ+వసుంధరా= భూమియొక్క; వల్లభుండు= నాథుడు, ధర్మరాజు; వెన్నుని= శ్రీకృష్ణుడియొక్క; వచనంబులు= మాటలు; విని; అతని= అతడియొక్క; ఆననంబు= ముఖమును; ఆలోకించి= చూచి; అది= నీవు చెప్పిన విషయం; అట్లు కాక= సరియే, సమంజసమే; అని; పలికెను= పలికాడు; అప్పుడు= ఆ సమయంలో; పాంచాలి= ద్రౌపది; పద్మనాభున్= శ్రీకృష్ణుడిని; ప్రీతి= ఆనందం; స్ఫీతంబు= వ్యాపించింది; అగు= అయిన; చూడ్కిన్= చూపుతో; ఆలోకించినన్= చూడగా; ఆ+లోక= లోకాలయొక్క; నాథుండు= ప్రభువు; అది= ఆ చూపు; అర్జున= అర్జునుడియొక్క; విషయంబు= సంబంధం కలది; ఐన= అయిన; ప్రీణనంబు= సంతృప్తియొక్క; తెఱంగు= విధం; అగుట; ఎఱింగికొనియెన్= తెలిసికొన్నాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; భీమ= భీముడు; ఆదులును= మొదలైనవారును; యాదవ= యదువంశీయులైన; కుమారులును= యువకులును; ఆ+కిరీటి= అర్జునుడియొక్క; గుణంబులు= సద్గుణాలు; అగ్గించుచున్= కొనియాడుతూ; ఆ ప్రొద్దునకున్= ఆ నాటికి; అది+అ= అదే, అర్జున ప్రశంసయే; గోష్ఠిగన్= సభగా; సల్లాపంబు= పరస్పర సంభాషణం; చేయుచున్+ ఉండన్= చేస్తూ ఉండగా; ఆ+గాండీవి= అర్జునుడియొక్క; పాలన్+ఉండి= దగ్గరనుండి; కాలరి= దూత, వార్తాహరుడు; చను+తెంచి= వచ్చి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ఆ విధంగా యథార్థం చెప్పగా ధర్మరాజు విని అతడి ముఖం చూచి అది సరే అని అన్నాడు. ఆ సమయాన ద్రౌపది ఆనందమయమైన చూపుతో చూచింది. ఆ చూపు అర్జున సంబంధమైన సంతృప్తి తీరును సూచిస్తున్నదని లోకేశ్వరుడైన శ్రీకృష్ణుడు గ్రహించాడు. అప్పుడు భీముడు మొదలగువారునూ, యాదవ యువకులునూ, అర్జునుడి గుణగణాలను కొనియాడుతున్నారు. అర్జున స్తుతియే ఆనాటికి తాము చేసే గోష్ఠి అని వారు భావించి పరస్పర సంభాషణం సాగిస్తుండగా విజయుడి దగ్గరనుండి ఒక దూత వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. పాండవాగ్రజునకుఁ బ్రణతి యొనర్చి 'వి। వ్వచ్చుఁ డిప్పురి సేరవచ్చె; నెల్లి
వచ్చు మీ శ్రీపాదవనజంబులకు మ్రొక్క'। ననవుడు హర్షాశ్రు లడరఁ బులకి
తాంగుఁడై వానికి నన్నరేంద్రుఁడు పస। దన మాభరణవస్త్ర కనకములు స
మగ్రంబుగా నిచ్చె; నందఱు నానంద। రసమునఁ దేలి యా రాత్రి పార్థుఁ

ఆ. జూచు వేడ్క నూనుచును వేగు టెప్పుడో। యనుచు నుండ నుదయ మయ్యె నినుఁడు;
క్రీడి సమయ విహిత కృత్యముల్ సలిపి, హ। యంబు మున్న గాఁగ నరుగుదెంచె. 157

ప్రతిపదార్థం: పాండవ+అగ్రజునకున్= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజునకు; ప్రణతి+ఒనర్చి= నమస్కారం చేసి; వివ్వచ్చుఁడు= అర్జునుడు; ఈ+పురి= ఈ నగరం; చేరవచ్చెన్= సమీపించాడు; ఎల్లి= రేపు; మీ= మీయొక్క; శ్రీ= శుభములు కలిగించు; పాదవనజంబులకున్= పాదపద్మాలకు; మ్రొక్కన్= నమస్కరించగా; వచ్చున్= వస్తాడు; అనవుడున్= అని అనగా;

ఆ+నరేంద్రుఁడు= ఆ రాజు, ధర్మరాజు; హర్ష+అశ్రులు= ఆనందబాష్పాలు; అడరన్= అలముకొనగా; పులకిత= గగుర్పొడిచిన; అంగుఁడు+ఐ= శరీరం కలవాడై; వానికిన్= ఆ దూతకు; పసదనము= బహుమానంగా; ఆభరణములు= నగలు; వస్త్రములు= బట్టలు; కనకములు= బంగారు నాణెములు; సమగ్రంబు+కాన్= పరిపూర్ణంగా; ఇచ్చెన్= ఇచ్చాడు; అందఱున్= అందరునూ; ఆనంద= ఆనందమనెడు; రసమునన్= అమృతమునందు; తేలి= ఓలలాడి; ఆ+రాత్రి; పార్థున్= అర్జునుడిని; చూచు= చూడవలయుననే; వేడ్క= తహతహపాటు; ఊనుచును= పొందుతూ; వేగుట= తెల్లవారుట; ఎప్పుడు+ఓ= ఎప్పుడో; అనుచున్= అనుకొంటూ; ఉండన్= ఉండగా; ఇనుఁడు= సూర్యుడు; ఉదయము+అయ్యెన్= ఉదయించాడు; క్రీడి= అర్జునుడు; సమయ= ఉదయకాలానికి; విహిత= ధర్మశాస్త్రం విధించిన; కృత్యముల్= పనులు; చలిపి= చేసి; హయంబు= గుఱ్ఱం; మున్ను= ముందు; కాఁగన్= అయ్యేటట్లుగా; అరుగు+తెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: దూత ధర్మరాజునకు నమస్కరించి 'అర్జునుడు ఈ నగరం సమీపించాడు. రేపు మీ పాదాభివందనం చేయవస్తాడు' అని చెప్పాడు. ఆ మాటలు విన్న ధర్మరాజు ఆనందబాష్పాలు రాల్చాడు. అతడి శరీరంపై గగుర్పాటులు పొడమినవి. ఆ మహారాజు దూతకు బహుమానంగా నగలూ, బట్టలూ, బంగారు నాణెములూ ఇచ్చాడు. అందరూ ఆనందామృతమున ఓలలాడారు. అర్జునుడిని చూడవలెననే తహతహపాటుతో తెల్లవారుటెప్పుడో అని వారనుకొంటూ ఉండగనే సూర్యుడు ఉదయించాడు. అర్జునుడు కాలకృత్యాలన్నీ తీర్చికొని, యజ్ఞాశ్వాన్ని వెంబడిస్తూ పట్టణానికి వచ్చాడు.

వ. అప్పడు. 158

తాత్పర్యం: ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం)

అర్జునుఁడు యజ్ఞాశ్వంబుతోడ హస్తిపురంబునకు వచ్చుట (సం.14-89-16)

క. విను మింద్ర తురగ సమ ఖే। లనమున నవ్వాజి జనములకు నెల్లను లో

చనపర్వమయ్యెఁ; వారి వ। దనముల సంతోష మధురతర భాషణముల్. 159

ప్రతిపదార్థం: వినుము= జనమేజయా! వినుము; ఆ+వాజి= ఆ గుఱ్ఱం; ఇంద్ర= ఇంద్రుడియొక్క; తురగ= గుఱ్ఱంతో; సమ= సమానమైన; ఖేలనమునన్= క్రీడా విలాసంతో; జనములకున్+ఎల్లను= పౌరులందరికీ; లోచన పర్వము= కన్నుల పండువు; అయ్యెన్= అయింది; వారి= వారియొక్క; వదనములన్= నోళ్లవెంట; సంతోష= సంతోషంచేత; మధురతర= మిక్కిలి మనోహరమైన, తియ్యని; భాషణముల్= పలికెడి మాటలు.

తాత్పర్యం: జనమేజయా! వినుము. ఆ యజ్ఞాశ్వం ఉచ్చైశ్శ్రవము యొక్క క్రీడా విలాసంచేత పౌరులకందరకూ కన్నుల పండువు చేసింది. సంతోషంచేత వారు పలికే తియ్యని నోటి మాటలు. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. కలయంగ నిట్లని చెలఁగె; 'నిగ్గాండీవి। దక్క నిమ్మాడ్కి నొండొక్కరునకు

నశ్వంబు తనయిచ్చ నఖిలదేశములకు। నరుగంగ ధరణీశు లచట నచట

బలములతో వచ్చి బలసి తదీయ రో। ధం బాచరింపఁ దృణంబు గాఁగఁ

గొని లీలమై గెల్వు గొనుచోట్ల నుగ్రత। వాటింప కగ్రజు పలుక యెట్టి

తే. దశల నైనను బాటించి, తా నొకండ। ననుతలం పెప్డు నుల్లంబునందు లేక

తనువు గవుసెనఁ బెట్టి పుచ్చిన విధమున। నరుగుదేవచ్చునే? యిది యక్కజంబు! 160

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: కలయంగగన్= అంతటనూ; ఇట్లు+అని= ఈ ప్రకారంగా; చెలఁగెన్= మ్రోసింది; అశ్వంబు= గుర్రం; తన+ఇచ్చన్= స్వేచ్ఛగా; అఖిల దేశములకున్= సమస్త దేశాలకు; అరుగంగన్= వెళ్ళగా; ధరణీ+ఈశులు= భూపతులు, రాజులు; అచటన్+అచటన్= అక్కడక్కడ; బలములతోన్= సైన్యాలతో; వచ్చి; బలసి= చుట్టుముట్టి; తదీయ= ఆ గుర్రంయొక్క; రోధంబు= అడ్డగించటం, ఆపుట; ఆచరింపన్= చేయగా; తృణంబు+కాఁగన్= గడ్డిపరకగా; కొని= భావించి; లీలమైన్= అనాయాసంగా; గెల్పు= విజయం; కొను= పొందే; చోట్లన్= సమయాలలో; ఉగ్రత= క్రోధం; పాటింపక= ప్రకటించక; అగ్రజు= అన్నగారియొక్క; పలుకు+అ= ఆజ్ఞా వాక్యమునే; ఎట్టి= ఎటువంటి; దశలన్= అవస్థలలో; ఐనను= ఐనా; పాటించి= ఆదరించి, లెక్కచేసి; తాను; ఒకండన్= ఒక్కడను, అసహాయుడను; అను= అనెడి; తలంపు= ఆలోచన, అభిప్రాయం; ఎప్డున్= ఏనాడునూ; ఉల్లంబు+అందున్= హృదయంలో; లేక; తనువు= శరీరం; గవుసెనన్= గలీబులో; పెట్టి= ఉంచి; పుచ్చిన= బయటికి తీసిన; విధమునన్= విధంగా (గలీబులో ఉంచి కొన్నాళ్ళ తరువాత బయటికి తీసిన వీణ, విల్లు మొదలైనవి చెక్కు చెదరక ఉంటాయో, అట్లే అర్జునుడు ఎవరెవరితో ఎన్ని యుద్ధాలు చేసినను, ఎన్ని కష్టాలు అనుభవించినను, అతడి శరీరం చెక్కు చెదరలేదని భావం); ఈ+గాండీవి= అర్జునుడు; తక్కన్= తప్ప; ఈ+మాడ్కిన్= ఈ విధంగా; ఒండు+ఒక్కరునకున్= మరియొకడికి; అరుగు+తేన్= రాగా; వచ్చును+ఏ?= శక్యమగునా?; ఇది= అర్జునుడు ఇట్లు వచ్చుట; అక్కజంబు= ఆశ్చర్యకరం.

తాత్పర్యం: అంతటా ఈ ప్రకారంగా మ్రోసింది. 'ఈ యజ్ఞాశ్వం స్వేచ్ఛగా సమస్త దేశాలలోనూ తిరిగింది. అక్కడక్కడా రాజులు సైన్యాలతో వచ్చి చుట్టుముట్టి దీనిని ఆపారు. కాని, అర్జునుడు వారిని గడ్డిపరక వలె పరిగణించాడు. వారిని ఓడించి విజయం పొందినప్పుడూ సైతం ఇతడు క్రోధం చూపలేదు. అన్నగారు చెప్పినమాట ప్రకారం నడచుకొన్నాడు. నేను అసహాయుడిని అని ఏనాడూ ఇతడు మనసులో అనుకొనలేదు. ఈ అర్జునుడు తప్ప ఈ విధంగా మరొకడికి ఒడలు అలవకుండా చెక్కు చెదరకుండా రావటం శక్యమా? ఇది ఎంతో వింతగా ఉన్నది.

క. **సగరాదులఁ జెప్ప వినమె! మగఁటిమియును బలము ని ట్లమానుష భంగిన్**
నెగడునె? యింకను బుట్టరు। జగతిని గాండీవితోడ సరి వచ్చు మగల్. **161**

ప్రతిపదార్థం: సగర= సగరుడు; ఆదులన్= మొదలైనవారిని; చెప్పన్= వర్ణించగా, పొగడగా; వినము+ఎ?= మనం వినలేదా?; ఇట్లు= ఈ విధంగా; మగఁటిమియును= పౌరుషమూ, పరాక్రమమూ; బలమున్= బలమూ; అమానుష= మానవాతీతమైన; భంగిన్= విధంగా; నెగడును+ఎ?= సంభవించునా?; జగతిని= లోకంలో; గాండీవితోడన్= అర్జునుడితో; సరివచ్చు= సాటివచ్చు; మగల్= వీరులు; ఇంకను= ఇకముందు; పుట్టరు.

తాత్పర్యం: సగరుడు మొదలైన వారిని పొగడటం మనం విన్నాము కదా! ఈ విధంగా మానవాతీతమైన బలపరాక్రమాలు ఎవరికైనా కలిగినవా? అర్జునుడితో సాటిరాగల వీరులు ఈ ప్రపంచంలో ఇకముందు పుట్టరు.

క. **మానుషము దైవమును సరి। నే నే నని కార్యసిద్ధి నెలయింపఁగ ని**
త్యానందుఁ డయ్యె ధర్మజుఁ;। డీ నిర్మల భాగ్యమహిమ యేరికిఁ గలదే? **162**

ప్రతిపదార్థం: మానుషమున్= మనుష్య ప్రయత్నం, పరాక్రమం; దైవమును; సరిన్= సమానంగా; ఏన్= నేను; ఏన్= నేను; అని; కార్య= పనులయొక్క; సిద్ధి= నెరవేరటం; ఎలయింపఁగన్= కలిగించగా; ధర్మజుఁడు= ధర్మరాజు; నిత్య= అఖండమైన; ఆనందుఁ డు= ఆనందం కలవాడు; అయ్యెన్= అయ్యాడు; ఈ నిర్మల= స్వచ్ఛమైన; భాగ్య= అదృష్టంయొక్క; మహిమ= గొప్పతనం; ఏరికిన్= ఎవరికైనను; కలదు+ఏ?= ఉన్నదా?

తాత్పర్యం: మానవ ప్రయత్నమూ, దైవబలమూ ఒకదానితో ఒకటి పోటీపడి కార్యసాఫల్యం కలిగిస్తుండగా ధర్మరాజు అఖండానందం అనుభవిస్తున్నాడు. ఇటువంటి గొప్ప ఇంకెవరికైనా ఉన్నదా?' (ధర్మరాజు నిత్యమూ తన ధర్మాన్ని గుర్తించి విధులు నిర్వహిస్తున్నాడనీ దైవము ఎల్లప్పుడూ అతడికి తోడ్పడుతూ అతడు చేసే పనులు జయప్రదముల య్యేటట్లు చేస్తున్నదని తాత్పర్యం).

క. వినుమట్లు చెలంగఁగ ఘూ। ర్ణన మొందిన యర్ణవం బనఁగఁ బొంగారెన్
జన నికురుంబం; బాపెం। పనఘా! చూడ వినఁ బడయ మఖిల జగములన్. 163

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!, జనమేజయా!; విను= వినుము; అట్లు= ఆ విధంగా; చెలంగఁగన్= మ్రోయగా; జన= పౌరులయొక్క; నికురుంబంబు= సమూహం; ఘూర్ణనము= ఘోష, తిరుగుడు; ఒందిన= పొందిన; అర్ణవంబు= సముద్రం; అనఁ గన్= అనగా; పొంగారెన్= ఉప్పొంగెను; ఆ= అటువంటి; పెంపు= వైభవం; అఖిల= సమస్తమైన; జగములన్= లోకాలలో; చూడన్+పడయము= చూడజాలము; వినన్+పడయము= వినజాలము, చూడలేదు, వినలేదు అని అర్థం.

తాత్పర్యం: పుణ్యాత్మా! ఆ విధంగా మాటలు మ్రోయుచుండగా, పౌరసమూహం ఘోషించే సముద్రమో అన్నట్లు ఉప్పొంగింది. ముల్లోకాలలో అటువంటి వైభవాన్ని మనం చూడలేదు. వినలేదు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. మఱియును. 164

తాత్పర్యం: ఇంకనూ- (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. నృపు లోహటింప జంత్రపుమీను నేసి చే। కొనియెఁ బాంచాలుని కూఁతు నితఁడె!
సురసేనతోఁ బురందరుఁ గెల్చి భుజగర్వ। మేపార ఖాండవం బేర్చె నితఁడె!
యెక్కటి బవరాన నీశాను మెప్పించి। పాశుపతాస్త్రంబుఁ బడసె నితఁడె!
యొంటిమై భీష్మాది యోధుల కురుపతి। ధృతిఁ బాపి గోవులఁ దెచ్చె నితఁడె!

తే. ప్రతిన సేసి విషమ సమరమునఁ బ్రొద్దు। గ్రుంకనీ కాఁగి సైంధవుఁ గూల్చె నితఁడె!
యనుచు సందడిగాఁ గ్రమ్మి యఱ్ఱులెత్తి। చూచె జనలోక మాసవ్యసాచిఁ బ్రీతి. 165

ప్రతిపదార్థం: ఇతఁడు+ఎ= ఇతడే; నృపులు= రాజులు; ఓహటింపన్= అవమానం పొందగా; జంత్రపుమీను= యంత్రమునందలి చేపను; ఏసి= పడగొట్టగా; పాంచాలుని= ద్రుపదుడియొక్క; కూఁతున్= పుత్రికను; చేకొనియెన్= పెండ్లాడాడు; ఇతఁడు+ఎ= ఇతడే; భుజగర్వము= భుజబల గర్వం; ఏపారన్= అతిశయించగా; పురందరున్= దేవేంద్రుడిని; సురసేనతోన్= దేవసైన్యంతోపాటు; గెల్చి= జయించి; ఖాండవంబు= ఖాండవవనమును; ఏర్చెన్= కాల్చాడు; ఇతఁడు+ఎ= ఇతడే; ఎక్కటి బవరానన్= ద్వంద్వ యుద్ధంలో; ఈశానున్= శివుడిని; మెప్పించి; పాశుపత= పాశుపతమనే; అస్త్రంబున్= అస్త్రాన్ని; పడసెన్= పొందాడు; ఇతఁడు+ఎ= ఇతడే; ఒంటిమైన్= ఒంటరిగా; భీష్మ= భీష్ముడు; ఆది= మొదలైన; యోధుల= వీరులయొక్క; కురుపతి= కురు రాజయిన దుర్యోధనుడియొక్క; ధృతిన్= ధైర్యమును; పాపి= పోగొట్టి; గోవులన్= ఆవులను; తెచ్చెన్= తిరిగి తీసికొని వచ్చాడు;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఇతఁడు+ఎ= ఇతడే; ప్రతిన+చేసి= ప్రతిజ్ఞచేసి; విషమ= కష్టస్థితికి చేరిన, భయంకరమైన; సమరమునన్= యుద్ధంలో; ప్రొద్దున్= సూర్యుడిని; క్రుంకన్+ఈక= అస్తమించనీయక; సైంధవున్= సైంధవుడిని; కూల్చెన్= చంపాడు; అనుచున్= అంటూ; సందడి+కాన్= సమ్మర్దంగా, ఒత్తిడిగా; క్రమ్మి= ఆవరించి; అఱ్ఱులు= మెడలు; ఎత్తి; జన= పౌరులయొక్క; లోకము= సమూహం; ఆ+సవ్యసాచిన్= అర్జునుడిని; ప్రీతిన్= ఆనందంతో; చూచెన్= చూచింది.

తాత్పర్యం: 'ఇతడే రాజులకు తలవంపులయ్యేటట్లుగా యంత్రమత్స్యాన్ని పడగొట్టి ద్రౌపదిని పెళ్ళిచేసికొన్నాడు. ససైన్యంగా దేవేంద్రుడిని జయించి ఖాండవదహనం గావించాడు. శివుడితో ద్వంద్వయుద్ధం చేసి అతడిని మెప్పించి పాశుపతాస్త్రాన్ని సంపాదించాడు. అసహాయుడై భీష్ముడు మొదలైన మహావీరులను దుర్యోధనుడిని ధైర్యహీనులను గావించి గోవులను తీసికొని వచ్చాడు. ప్రతిజ్ఞచేసి భయంకర సంగ్రామంలో ప్రొద్దుక్రుంకకముందే సైంధవుడిని సంహరించాడు' అంటూ పౌరజన సమూహం ఒత్తిడిగా చుట్టూ గుమిగూడి మెడలెత్తి ఆ అర్జునుడిని ఆనందంతో చూచింది.

క. ఆ వాక్యము లెల్ల వినుచు। భావ మలర నర్జునుండు భాసురమగు న
మ్మా వగ్రేసరముగ య। జ్ఞావాసంబునకు వచ్చె నంచితలీలన్. 166

ప్రతిపదార్థం: అర్జునుండు; భావము= మనస్సు; అలరన్= సంతోషించగా; ఆ వాక్యములు= ఆ మాటలు; ఎల్లన్= అన్నియూ; వినుచున్= వింటూ; భాసురము= ప్రకాశించేది; అగు= అయిన; ఆ+మావు= ఆ గుఱ్ఱం; అగ్రేసరము+కన్= ముందు నడచేది కాగా; అంచిత= గౌరవించబడిన, ఒప్పుతున్న; లీలన్= నడకల సొగసుతో; యజ్ఞ= యజ్ఞంయొక్క; ఆవాసంబునకున్= శాలకు; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: పౌరజనుల మాటలు వింటున్న అర్జునుడి మనస్సు సంతోషించింది. అతడు నడకల సొగసుతో గుఱ్ఱం ముందు నడుస్తుండగా యజ్ఞశాలకు వచ్చాడు.

వ. అట్టియెడ ధర్మనందనుండు భీమాదులును గృష్ణుండును బలదేవ ప్రభృతులును ధృతరాష్ట్రుం బురస్కరించుకొనుచు నప్పార్థు నెదుర్కొని; రతండు వారలనెల్ల సముచితాచార సంప్రీతులం గావించి గాంధారినిఁగుంతినిం గాంచి యీఁతకాఁడు తీరంబు గనిన చందంబుఁ బొంది, యందఱునభినందించుచుం బొదివికొనియుండ నొక్కరమ్యప్రదేశంబున నుండె; నా సమయంబున. 167

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయమున; ధర్మనందనుండున్= ధర్మరాజునూ; భీమ+ఆదులును= భీముడు మొదలైనవారునూ; కృష్ణుండును= కృష్ణుడునూ; బలదేవ= బలరాముడు; ప్రభృతులును= మొదలైనవారునూ; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్రుడిని; పురస్కరించుకొనుచున్= ముందుంచుకొంటూ; ఆ+పార్థున్= ఆ అర్జునుడిని; ఎదుర్కొనిరి= ఎదురుగా వెళ్ళి కలిశారు; అతఁడు= అర్జునుడు; వారలన్= వారిని; ఎల్లన్= అందరను; సముచిత= మిక్కిలి తగిన; ఆచార= నమస్కారం చేయటం మొదలైన సదాచారములచేత; సంప్రీతులన్= మహానందము పొందినవారినిగా; కావించి= చేసి; గాంధారినిన్= గాంధారినీ; కుంతినిన్= కుంతినీ; కాంచి= చూచి; ఈఁతకాఁడు= ఈతకొట్టేవాడు; తీరంబు= ఒడ్డును; కనిన= చూచిన; చందంబున్= విధమును; పొంది; అందఱున్= అందరును; అభినందించుచున్= పొగడుతూ; పొదివికొని= చుట్టును చేరి; ఉండన్= ఉండగా; ఒక్క= ఒకానొక; రమ్య= అందమైన; ప్రదేశంబునన్= చోటును; ఉండెన్= ఉన్నాడు; ఆ+సమయంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అప్పుడు ధర్మరాజు, భీమాదులూ, బలరామకృష్ణ ప్రభృతులూ అర్జునుడికి ఎదురుగా వెళ్ళి అతడిని కలిసికొన్నారు. అతడు వారినందరినీ సమయానికి తగిన సదాచారాలతో సంతోషింపజేశాడు. తరువాత గాంధారినీ, కుంతినీ చూచాడు. చివరకు అర్జునుడు ఒడ్డు చేరిన ఈతగాడైనాడు. అందరూ తన చుట్టూ చేరి పొగడ్తలతో ముంచితేలుస్తుండగా అతడు ఒక సుందర స్థానంలో ఉన్నాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: అలం: ఉపమ.

సీ. **బభ్రువాహనుఁడు వైభవ మొప్పఁ జిత్రాంగ। దయు నులూపి(చి)యుఁ బ్రమదంబుతోడఁ**
దోడ రా ధర్మపుత్త్రుని మందిరమునకు। నరుగుదెంచుటయు, నక్కురువరేణ్యుఁ
డును దమ్ములును గృష్ణుఁడును బలభద్రాది। యాదవులును బ్రీతులై తదీయ
సందర్శనము నర్హసత్కార చరితార్థ। ముగఁ జేసి; రతఁడును దగిన విధుల

తే. **నందఱకుఁ బ్రియ మొనరించి యాంబికేయు। నతని భార్యను గని నమస్కృతు లొనర్చి,**
గొంతిఁ గాంచి యాయమయడుగులకు నెఱఁగి। పలుదెఱఁగు దీవనలును గౌఁగిలియుఁ బడసి. **168**

ప్రతిపదార్థం: బభ్రువాహనుఁడు; వైభవము= దొరతనం; ఒప్పన్= ఒప్పగా; చిత్రాంగదయున్= చిత్రాంగదయు; ఉలూపి(పి)యున్= ఉలూపియూ; ప్రమదంబుతోడన్= సంతోషంతో; తోడన్+రాన్= వెంటరాగా; ధర్మపుత్త్రుని= ధర్మరాజుయొక్క; మందిరమునకున్= గృహానికి; అరుగుదెంచుటయును= రాగా; ఆ+కురు= ఆ కురువంశంలో; వరేణ్యుఁడును= శ్రేష్ఠుడును; తమ్ములును= భీముడు మొదలైవారును; కృష్ణుఁడును= కృష్ణుడును; బలభద్ర= బలరాముడు; ఆది= మొదలైన; యాదవులును; ప్రీతులు+ఐ= ఆనందించినవారై; తదీయ= ఆ బభ్రువాహనుడియొక్క; సందర్శనము= సందర్శించటం; అర్హ= తగిన; సత్కార= సన్మానాలచేత; చరితార్థము+కన్= సఫలమైన దానినిగా; చేసిరి= చేశారు; అతఁడును= ఆ బభ్రువాహనుడును; తగిన= సమయోచితమైన; విధులన్= కర్తవ్యములచేత; అందఱకున్= అందరకు; ప్రియము= ప్రీతి; ఒనరించి= కలిగించి; ఆంబికేయున్= అంబిక కుమారుడైన ధృతరాష్ట్రుడిని; అతని= అతడియొక్క; భార్యను= పెండ్లమును, గాంధారిని; కని= దర్శించి; నమస్కృతులు= నమస్కారాలు; ఒనర్చి= చేసి; గొంతిన్= కుంతిని; కాంచి= దర్శించి; ఆ+అమ= ఆమెయొక్క; అడుగులకున్= పాదాలకు; ఎఱఁగి= నమస్కరించి; పలు+తెఱఁగు= అనేక విధాలైన; దీవనలును= దీవెనలూ; కౌఁగిలియున్= కౌగిలింతయు; పడసి= పొంది.

తాత్పర్యం: బభ్రువాహనుడు దొరతనం ప్రకాశిస్తుండగా ఉలూపి చిత్రాంగదలతో కూడి ధర్మరాజు గృహానికి వచ్చాడు. ధర్మరాజూ అతడి తమ్ములూ బలరామ కృష్ణాది యాదవులూ ఆనందించారు. అతడిరాక సఫలమయ్యేటట్లుగా అతడిని సన్మానించారు. బభ్రువాహనుడు కూడా అందరికీ కర్తవ్య నిష్ఠతో ప్రీతి కలిగించి గాంధారీ ధృతరాష్ట్రులను దర్శించి నమస్కారాలు చేశాడు. కుంతిని చూచి పాదాభివందనం గావించాడు. ఆమె అతడిని దీవించి కౌగిలించుకొన్నది.

వ. **ధర్మపుత్త్రుం గొలిచి కూర్చుండ నతని కతండును ననుజులును వేర్వేఱ సర్వరత్న రాజీవిరాజితంబు లగు భూషణంబులును బరమాంబరంబులును నొసంగిరి; సీరపాణి శౌరి ప్రభృతులు ప్రభూతాభరణంబులను భాసుర వాసోవిశేషంబులను నతని నర్చించి; రయ్యవసరంబున.** **169**

ప్రతిపదార్థం: ధర్మపుత్త్రున్= ధర్మరాజును; కొలిచి= పూజించి, సేవించి; కూర్చుండన్= కూర్చుండగా; అతనికిన్= బభ్రువాహనుడికి; అతండును= ధర్మరాజును; అనుజులును= అతడి తమ్ములును; వేఱు+వేఱన్= వేరువేరుగా; సర్వరత్న= సమస్త రత్నాలయొక్క;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాజీ= వరుసలతో; విరాజితంబులు= ప్రకాశిస్తున్నట్టివి; అగు= అయిన; భూషణంబులును= నగలును; పరమ= ఉత్తమమైన; అంబరంబులును= వస్త్రాలను; ఒసంగిరి= ఇచ్చారు; సీరపాణి= నాగలి చేతియందు కలవాడు బలరాముడు; శౌరి= శ్రీకృష్ణుడు; ప్రభృతులు= మొదలగువారు; ప్రభూత= మిక్కిలి ఎక్కువైన; ఆభరణంబులను= నగలచేతను; భాసుర= ప్రకాశిస్తున్న, దివ్యమైన; వాసస్= వస్త్రాలయొక్క; విశేషంబులను= ఆధిక్యములచేతను; అతనిన్= బభ్రువాహనుడిని; అర్చించిరి= గౌరవించారు; ఆ+అవసరంబునన్= ఆ సమయాన.

తాత్పర్యం: బభ్రువాహనుడు ధర్మరాజును సేవించి కూర్చున్నాడు. ధర్మరాజూ, అతడి తమ్ములూ అతడికి నవరత్న ఖచితములైన నగలూ, శ్రేష్ఠమైన వస్త్రాలూ ఇచ్చారు. బలరాముడూ, కృష్ణుడూ మొదలగువారు అతడికి పలు నగలూ, తళతళలాడే బట్టలు పెక్కులు పెట్టారు. ఆ సమయాన. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **చిత్రాంగదయు నాగపుత్త్రియుఁ దొలితొలి। గాంధారిఁ గని గొంతిఁ గాంచి రెలమి;**
దీవించి గాఢసంభావనఁ గౌఁగిటఁ। జేర్చి యద్దేవి రత్నార్చు లెసఁగు
తొడవుల నర్పించె; ద్రోవదియును సుభ। ద్రయు వారు త మ్ముచిత ప్రకార
మునఁ గన్న నమ్మెయి వినుత పూజనముల। నతుల సమ్మోదము నావహించి

ఆ. **యోగ్యపీఠములను నునిచి, తత్సల్లాప। సౌఖ్యమొంది; రట్లు సకలవర్త**
నముల నశ్వమేధ సముపక్రమం బుదా। త్తాభిరామమయ్యె నధిపముఖ్య! 170

ప్రతిపదార్థం: అధిపముఖ్య!= రాజులలో మొదటివాడా!, రాజాగ్రణీ; చిత్రాంగదయున్= చిత్రాంగదయూ; నాగపుత్త్రియున్= నాగకుమారి అయిన ఉలూపియూ; తొలి తొలి= మొట్టమొదట; ఎలమిన్= ప్రీతితో; గాంధారిని; కని= దర్శించి; గొంతిన్= కుంతిని; కాంచిరి= దర్శించారు; ఆ+దేవి= ఆ రాజుపత్ని; దీవించి; గాఢ= అత్యధికమైన; సంభావనన్= మన్ననతో; కౌఁగిటన్= కౌగిలియందు; చేర్చి; రత్న= రత్నాలయొక్క; అర్చులు= కాంతులు; ఎసఁగు= అతిశయించే; తొడవులన్= నగలను; అర్పించెన్= ఇచ్చింది; ద్రోపదియును= ద్రౌపదియు; సుభద్రయున్= సుభద్రయు; వారు= ఉలూపీ చిత్రాంగదలు; తమ్మున్= తమ్ము; ఉచిత= తగిన; ప్రకారమునన్= విధంగా; కన్నన్= దర్శించగా; ఆ+మెయిన్= ఆ విధంగానే; (తమను దర్శించిన విధమునకు సమానంగా అని అర్థం); వినుత= కొనియాడబడిన; పూజనములన్= పూజలను; ఆవహించి= కలిగించి; యోగ్య= తగిన; పీఠములన్= ఆసనములయందు; ఉనిచి= కూర్చుండబెట్టి; తద్= ఆ ఇద్దరియొక్క; సల్లాప= మధుర సంభాషణములవలన కలుగు; సౌఖ్యము= సుఖం: ఒందిరి= పొందారు; అట్లు= ఆ విధంగా; సకల= అన్ని; వర్తనములన్= నడవడులచేత; అశ్వమేధ= అశ్వమేధంయొక్క; సముపక్రమంబు= ఆరంభం; ఉదాత్త= గొప్పదీ; అభిరామము= మనోజ్ఞమూ; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: రాజాగ్రణీ! ఉలూపీ చిత్రాంగదలు మొట్టమొదట గాంధారినీ, తరువాత కుంతినీ దర్శించారు. కుంతీదేవి వారిని గొప్ప మన్ననతో దీవించి కౌగిలించుకొన్నది. రత్నకాంతిమయమైన నగలు పెట్టింది. పిదప ఉలూపీ చిత్రాంగదలు ద్రౌపదినీ, సుభద్రను సముచిత రీతిగా దర్శించారు. ద్రౌపదీ సుభద్రలు వారు దర్శించిన తీరునకు తుల్యంగా వారిని చక్కగా గౌరవించి, ఆనందింపజేసి తగిన ఆసనములమీద కూర్చుండబెట్టారు. వారితో సంభాషించి సంతోషించారు. ఈ విధంగా అశ్వమేధ ప్రారంభం అన్ని నడవళ్ళచేత ఉన్నతమూ, మనోజ్ఞమూ అయింది.

వ. **పదంపడి యర్వదివసంబు సంప్రాప్తం బగుటయు,సాత్యవతేయమునిపతి కురుపతిపాలికిం జనుదెంచి'నేఁడు యజనంబునకుం దొడంగుము; యాజ్ఞికులు శుభముహూర్తం బాసన్నంబయ్యె ననుచున్నవారు; నీ మఖంబు**

మహనీయంబు; నీవు మహాధనవంతుండవైతి; దక్షిణలు ముమ్మడుంగులుగా నిడి మూఁడు మఖంబుల ఫలంబు నొందు; మశ్వమేధావభృథంబు పరమపావనంబు; సమస్తదురిత పరిహరణ నిపుణంబు; నీకు భారత రణకృత జ్ఞాతివధంబు పాతకంబను మెరమెర మనంబునం గలిగియుండు; నట్టివి యెల్లను దీన నిస్తుషంబులగు, సమస్త శుభంబులు నావహిల్లు' నని యాజ్ఞాపనంబు సేయుటయుఁ బ్రాజ్ఞపరుండైన యా భూవరుండు. 171

ప్రతిపదార్థం: పదంపడి= తరువాత; అర్హ= యోగ్యమైన; దివసంబు= రోజు; సంప్రాప్తంబు= ప్రాప్తించింది, వచ్చింది; అగుటయున్= అయిన తరువాత; సాత్యవతేయమునిపతి= వ్యాసమునీశ్వరుడు, సత్యవతి కుమారుడూ అయిన వ్యాసుడు; కురుపతి= కురురాజు (ధర్మరాజు); పాలికిన్= దగ్గరకు; చనుదెంచి= వచ్చి; నేఁడు= ఈ రోజు; యజనంబునకున్= యజ్ఞంచేయటానికి; తొడంగుము= పూనుకొనుము, మొదలు పెట్టుము; యాజ్ఞికులు= యజ్ఞం చేయించేవారు, ఋత్విక్కులు; శుభ= శుభములు కలిగించే; ముహూర్తంబు= ముహూర్తం; ఆసన్నంబు= దగ్గరపడింది; అయ్యెన్= అయినది; అనుచున్+ఉన్నవారు= అంటున్నారు; నీ= నీ యొక్క; మఖంబు= యజ్ఞం; మహనీయంబు= గొప్పది; నీవు; మహత్= గొప్ప; ధనవంతుండవు= ధనం కలవాడవు; ఐతి(వి)= అయ్యావు; దక్షిణలు; ముమ్మడుంగులు= మూడురెట్లు; కాన్= అయ్యేటట్లుగా; ఇడి= ఇచ్చి; మూఁడు= మూడు; మఖంబుల= యజ్ఞములయొక్క; ఫలంబున్= ఫలితమును; ఒందుము= పొందుము; అశ్వమేధ= అశ్వమేధమనే; అవభృథంబు= యజ్ఞం చివర-దొరలిన దోషములు తొలగించుకొనుటకు చేసే స్నానం; పరమ= మిక్కిలి; పావనంబు= పవిత్రమైనది; సమస్త= సమస్తమైన; దురిత= పాపాలను; పరిహరణ= తొలగించుటయందు; నిపుణంబు= సమర్థం, నీకున్= నీకు; భారతరణ= భారతయుద్ధంలో; కృత= చేయబడిన; జ్ఞాతి= దాయాదులయొక్క; వధంబు= సంహారము; పాతకంబు= పాపము; అను; మెరమెర= దుఃఖము; మనంబునన్= మనస్సులో; కలిగి= పుట్టి; ఉండున్= ఉన్నది; అట్టి+అవి= అటువంటివి; ఎల్లను= అన్నియు; దీనన్= యజ్ఞాంత స్నానంవలన; నిస్తుషంబులు= విడువబడినవి, నిర్మలములు; అగున్= అవుతాయి; సమస్త= సమస్తమైన; శుభంబులు= శుభాలు; ఆవహిల్లున్= కలుగుతాయి; అని; ఆజ్ఞాపనంబు= ఆదేశం; చేయుటయున్= చేసిన తరువాత; ప్రాజ్ఞ= పండితులయందు; పరుండు= ఆసక్తికలవాడు; ఐన= అయిన; ఆ+భూవరుండు= ఆ రాజు - ధర్మరాజు.

తాత్పర్యం: తరువాత యజ్ఞయోగ్యమైన రోజు వచ్చింది. అప్పుడు వ్యాసుడు వచ్చి ధర్మరాజుతో 'నీవు ఈ రోజు యజ్ఞం చేయటానికి పూనుకొనుము. ఋత్విక్కులు శుభముహూర్తం సమీపించిందని అంటున్నారు. నీ యజ్ఞం చాలా గొప్పది. నీవు మహాధనవంతుడవు అయ్యావు. దక్షిణలు ఈవలసినదానికంటె మూడురెట్లు ఎక్కువగా ఇచ్చి మూడు యజ్ఞాలు చేసినంత ఫలాన్ని పొందుము. అశ్వమేధ యజ్ఞం చివర దోషపరిహారార్థం చేసే స్నానం మిక్కిలి పవిత్రమైనట్టిది. అది సమస్త పాపాలను తొలగింపజాలినట్టిది. భారతయుద్ధంలో దాయాదులను సంహరించటం పాపం అనే వ్యథ నీకు మనస్సులో పుట్టింది. అటువంటివన్నీ యజ్ఞాంత స్నానంవలన తొలగి నీ మనస్సు నిర్మలమవుతుంది; సమస్త శుభాలు కలుగుతాయి' అని చెప్పాడు. జ్ఞానులపట్ల ఆసక్తి కలిగిన ఆ ధర్మరాజు. (తరువాతి పద్యంతో అన్వయం).

ధర్మరా జశ్వమేధ యాగంబు సుప్రయోగంబుగాఁ జేయుట (సం.14-90-17)

క. ప్రయతుండై హయమేధ। క్రియా కలాపంబునకుఁ బ్రకీర్త్యముగాఁ జొ
చ్చి యుదాత్తభంగి జనమే। జయ భూవర! నడపె గాఢసంప్రీతిమెయిన్. 172

ప్రతిపదార్థం: జనమేజయ భూవర!= జనమేజయ భూనాథా!; ప్రయతుండు+ఐ= దీక్షాసంస్కారమును పొందినవాడై, ఆత్మనిగ్రహం కలవాడై; ప్రకీర్త్యము= మిక్కిలి కొనియాడదగినది; కాన్= అయ్యేటట్లుగా; హయమేధ= అశ్వమేధ యజ్ఞంయొక్క;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క్రియాకలాపంబునకున్= కర్మకాండమునకు; చొచ్చి= పూనుకొని; ఉదాత్త= గొప్పదైన; భంగిన్= విధంగా; గాఢ= అధికమైన; సంప్రీతిమెయిన్= ఆనందంతో; నడపెన్= నిర్వర్తించాడు.

తాత్పర్యం: జనమేజయా! దీక్షవహించి మిక్కిలి కొనియాడదగినట్లుగా అశ్వమేధయాగ కర్మకాండమునకు పూనుకొని చాలా గొప్పగా మహానందంతో నిర్వర్తించాడు.

క. క్రమయుక్తము యుక్తముఁ గా। నమరగురుప్రతిములైన యాజ్ఞికులు క్రియా
సముదయము నడపఁగా స్థలి। తము లే కపహుతము సొరక తత్క్రతు వొప్పెన్. 173

ప్రతిపదార్థం: క్రమ= దేని తరువాత ఏది చేయవలయునో ఆ యజ్ఞకర్మ క్రమంతో; యుక్తమున్= కూడినట్టిది; యుక్తమున్= యోగ్యమైనది; కాన్= అయ్యేటట్లుగా; క్రియా= యజ్ఞకార్యములయొక్క; సముదయమున్= సమూహమును; అమర గురు= దేవతల గురువైన బృహస్పతితో; ప్రతిములు+ఐన= సమానులైన; యాజ్ఞికులు= ఋత్విక్కులు; నడపఁగాన్= చేయగా; స్థలితము= మంత్రపఠనమున జారుపాటు; లేక; అపహుతము= క్రమపద్ధతి వదలి వేల్పుట; చొరక= తటస్థించక; తద్+క్రతువు= ఆ యజ్ఞం; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: బృహస్పతితో సమానులైన ఋత్విజులు శాస్త్రక్రమంగా శాస్త్రోచితంగా యజ్ఞకార్యకలాపాన్ని నడిపారు. అందువలన మంత్రపఠనదోషాలు లేకుండా క్రమపద్ధతి వదలి హోమద్రవ్యాలు వేల్చటం సంభవించకుండా ఆ యజ్ఞం ప్రకాశించింది.

చ. అవహితులై ప్రవర్గ్యము బుధాభినుతంబుగఁ జేసి ఋత్విజుల్
సవనము లుక్తమార్గము ప్రశంసకు నెక్కనయించి వేద వా
క్యవిహిత వృత్తిమై నభినవాభ్యుదయం బొనరించి రర్థి మా
ధవుఁ గొనియాటలం దమ కృతంబులకున్ మెఱుఁ గిడ్డయట్లుగన్. 174

ప్రతిపదార్థం: ఋత్విజుల్= యజ్ఞం చేయించేవారు; మాధవున్= పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీకృష్ణుడిని; కొనియాటలన్= పలుసార్లు స్తుతించటంచేత; తమ= తమయొక్క; కృతంబులకున్= పనులకు; మెఱుఁగు+ఇడ్డ= వన్నె పెట్టిన; అట్లు= విధం; కన్= కాగా; అవహితులు+ఐ= ఏమరుపాటు లేనివారై, అవధానం కలవారై; ప్రవర్గ్యము= యజ్ఞమునకు మొదట చేసే యాగ విశేషం; బుధ= పండితులచేత; అభినుతంబు+కన్= కొనియాడబడినట్లుగా; చేసి; ఉక్త= వేదాలచేత చెప్పబడిన; మార్గము= పద్ధతిగా; సవనములు= మంత్రపూతముగా సోమరసం పిండటం (దీనినే అభిషవం అంటారు); సవనము అనే యాగవిశేషం చేయటం; ప్రశంసకున్+ఎక్కన్= పొగడ్తపొందగా; నయించి= నడపి; అర్థిన్= ప్రీతితో; వేద= వేదాలయొక్క; వాక్య= మంత్ర వాక్యాలచేత; విహిత= అనుశాసించబడిన; వృత్తిమైన్= విధానంతో; అభినవ= నూతనమైన; అభ్యుదయంబు= శ్రేయస్సును, అభీష్టప్రాప్తిని; ఒనరించిరి= చేశారు.

తాత్పర్యం: ఋత్విజులు సావధానులయి ప్రవర్గ్యమనే యజ్ఞాంగాన్ని పండితులు ప్రశంసించేటట్లుగా చేశారు. మంత్రపూతంగా సోమరసం పిండారు. సవనకర్మం ఆచరించారు. వేదశాసనం తప్పక ఆయా కార్యాలు ఒనరించి నూతన శ్రేయస్సులు ప్రాప్తించేట్లు చేశారు. వారు పరబ్రహ్మస్వరూపుడైన శ్రీకృష్ణుడిని స్తుతించటంచేత తాము చేసే యజ్ఞకార్యాలకు వన్నె తెచ్చినవారయ్యారు.

వ. అట్టియెడ. 175

తాత్పర్యం: ఆ సమయాన. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. వివిధ భోజ్యపదార్థ విభవంబు వలనను। సంతృప్తిఁ బొందక చను నరుండు
ధనధాన్యవస్త్రసంతతిలబ్ధి దారిద్ర్య। మపనయింపక యేఁగునట్టివాఁడు
గోరి యెయ్యదియైన గారవ మెసఁగంగఁ। బడయక రిత్త వోయెడు మనుష్యుఁ
డెద్ది యేనియు దుఃఖ మెలసినఁ జనుదెంచి। యది నిస్తరింపక యరుగునతఁడు

తే. మందునకు వెదకినను లేఁ డంద మొంద। నరసి కుడువుఁడు కట్టుఁ డిచ్ఛానురూప
వస్తువులు గైకొనుఁడు దురవస్థ తెలిపి ' పాపికొనుఁ డని భీముండు పలుకుచుండ. 176

ప్రతిపదార్థం: భీముండు; అందము+ఒందన్= తగిన రీతిగా; అరసి= పరీక్షించి; కుడువుఁడు= భుజింపుడు; కట్టుఁడు= ధరించండి; ఇచ్ఛా= కోరికకు; అనురూప= అనుగుణమైన, కోరిన కోర్కెకు తగినట్లుగా; వస్తువులు; కైకొనుఁడు= స్వీకరించండి; దుర్+అవస్థ= హీనస్థితి; తెలిపి= తెలియజేసి; పాపికొనుఁడు= పోగొట్టుకొనండి; అని; పలుకుచుండన్= చెప్పుచుండగా; వివిధ= అనేక విధాలైన; భోజ్య= భుజించదగిన; పదార్థ= పదార్థాలయొక్క; విభవంబువలనను= సమృద్ధివలన; సంతృప్తిన్= మిక్కిలి తృప్తిని; పొందక; చను= వెళ్ళేడి; నరుండు= మానవుడు; ధన= ధనముయొక్క; ధాన్య= ధాన్యాలయొక్క; వస్త్ర= వస్త్రాలయొక్క; సంతతి= సమూహముయొక్క; లబ్ధిన్= ప్రాప్తిచేత; దారిద్ర్యము= పేదరికమును; అపనయింపక= పోగొట్టుకొనక; ఏఁగు+అట్టి= వెళ్ళునట్టి; వాఁడు= మనుజుడు; ఏ+అది= ఏది; ఐనన్= అయినను; కోరి; గారవము= గౌరవం; ఎసఁగంగన్= అతిశయించగా; పడయక= పొందక; రిత్త= ఉత్తచేతులతో; పోయెడు= పోవునట్టి; మనుష్యుండు; ఎద్ది= ఏది; ఏనియున్= అయినను; దుఃఖము; ఎలసినన్= కలుగగా; చనుదెంచి= వచ్చి; అది= దానిని; నిస్తరింపక= దాటకుండ, పోగొట్టుకొనకుండ; అరుగు= వెళ్ళేడి; అతఁడు= మనిషి; మందునకు వెదకినను= బొత్తిగా, ఒక్కడు కూడా; లేఁడు= లేడు.

తాత్పర్యం: భీముడు యజ్ఞానికి వచ్చినవారిని ఉద్దేశించి 'చూచీ చూచీ తినండి, ధరించండి, కోరిన వస్తువులు తీసికొనండి. దుఃస్థితిని తెలిపి తొలగించుకొనండి' అని చెప్పుతూ ఉండేవాడు. అందువలన బహువిధ పదార్థ సమృద్ధివలన తృప్తి పడకుండా వెళ్ళేవాడూ, ధనధాన్య వస్త్రాలను పుష్కలంగా పొంది పేదరికాన్ని తొలగించుకొననివాడూ, గౌరవ పురస్సరంగా కోరినదానిని పొందకుండా వట్టిచేతులతో పోయేవాడూ, ఏదైనా దుఃఖం సంభవిస్తే దానిని తెలిపి పోగొట్టుకొనకుండా వెళ్ళిపోయేవాడూ ఒక్కడు కూడా లేడు.

ఉ. ఆయతులాధ్వరంబున వ్రతాభిరతత్వము లేనివాఁ డుపా
ధ్యాయుఁడు గానివాఁడు నిగమాంగకషట్కము లేనివాఁడు లేఁ
డేయెడఁ జూచినన్ సభ నరేశ్వర! యట్టి సదస్యు లమ్మరు
న్నాయకు కొల్వు దివ్యమునినాథులు దక్కఁగఁ గల్గ రెచ్చటన్. 177

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= రాజా!; ఆ+అతుల= ఆ సాటిలేని; అధ్వరంబునన్= యజ్ఞమునందు; ఏ+ఎడన్= ఎక్కడనైన; చూచినన్= పరిశీలించినా; సభన్= సదస్సులో; వ్రత= ఆచారానుష్ఠానమందు; అభిరతత్వము= అధికమైన ఆసక్తి; లేనివాఁడు=

లేనట్టివాడు; ఉపాధ్యాయుఁడు= ఉపద్రష్ట - యజ్ఞనిర్వహణలో గుణదోషములను కనిపెట్టి చూచేవాడు; కానివాఁడు= కానట్టివాడు; నిగమ= వేదాలయొక్క; అంగకషట్కము= ఆరు అంగాలు; లేనివాఁడు= తెలియనట్టివాడు; లేఁడు= లేడు; అట్టి= అటువంటి; సదస్యులు= యజ్ఞంలో సాహాయ్యం చేసే ఋత్విజులు, యజ్ఞమున హెచ్చుతగ్గులు అనే దోషాలను తొలగించే విధానమును చూస్తూ ఉండెడి ఋత్విక్కులు; ఆ+మరుత్= ఆ దేవతలయొక్క; నాయకు= ప్రభువు దేవేంద్రుడియొక్క; కొల్వు= కొలువునందలి; దివ్యమునినాథులు= దేవర్షులు; తక్కఁగన్= తప్ప; ఎచ్చటన్= ఇంకెచ్చటను; కల్గరు= కనబడరు.

తాత్పర్యం: జనమేజయా! ఆ అసమాన యజ్ఞసదస్సులో ఎక్కడ చూచినా వ్రతానుష్ఠానంలో ఆసక్తి లేనివాడూ, ఉపద్రష్ఠ గానివాడూ, వేదాంగవేత్తగానివాడూ లేడు. అటువంటి సదస్యులు దేవేంద్రుడి కొలువులోని దివ్యర్షులలో తప్ప మరెక్కడా కనబడరు.

విశేషం: నిగమాంగక షట్కము= ఆరు వేదాంగాలు. అవి శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం.

శిక్ష	= వర్ణోచ్చారణ పద్ధతి తెలిపే శాస్త్రం
వ్యాకరణం	= శబ్దనిష్పత్తిని నిరూపించే శాస్త్రం.
ఛందస్సు	= గణ, యతి, ప్రాస, పద్య లక్షణాలను బోధించే శాస్త్రం.
నిరుక్తం	= వేదపదముల వ్యుత్పత్త్యర్థమును వివరించే శాస్త్రం.
జ్యోతిషం	= సూర్యాది గ్రహ సంచారమును తెలియజేసే శాస్త్రం.
కల్పము	= వైదిక విధానాలను తెలిపే గ్రంథం.

వ. అట్లుంగాక. 178

తాత్పర్యం: ఆ విధంగా కాక. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. కనుఁగొను కౌతుకంబునఁ గూడి చనుదెంచి। దివ్యమునీంద్రు లతిప్రియమున
నభినందనము సేయ నఖిల గంధర్వులు। నానందనము లగు గానములను
నప్సరః స్త్రీలు హృద్యము లైన నృత్య వి। శేషంబులను నుల్లసిల్లుచుండ
సిద్ధ విప్రజనంబు సేసలు చల్లుచు। బహువిధాశీర్వాద పరతఁ బరఁగ

తే. నాద్యులై పేరు గలుగు పదార్వు రవని। వరుల యాగంబులకు సరివచ్చు మిగులుఁ
గాని యిది వజ్రపడ దనఁగా వెలుంగు। ధర్మతనయుని యశ్వమేధము నరేంద్ర! 179

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= రాజా!; దివ్యముని+ఇంద్రులు= దేవర్షులు; కనుఁగొను= చూచెడి; కౌతుకంబునన్= వేడుకతో; కూడి= కలసికట్టుగా; చనుదెంచి= వచ్చి; అతి= మిక్కిలి; ప్రియమునన్= ఆనందంతో; అభినందనము+చేయన్= ప్రశంసించగా; అఖిల= సమస్తమైన; గంధర్వులున్= గంధర్వులు; ఆనందనములు= ఆనందింపజేసేవి; అగు= అయిన; గానములను= సంగీతాలతో; అప్సరస్+స్త్రీలు= అప్సరసలు; హృద్యములు= మనోహరములు; ఐన= అయిన; నృత్యవిశేషంబులను= వివిధ నృత్యాలతో; ఉల్లసిల్లుచున్= సంతోషిస్తూ; ఉండన్= ఉండగా; సిద్ధ= అతీంద్రియ దర్శనంగల; విప్రజనంబు= బ్రాహ్మణులు; సేసలు= అక్షతలు;

చల్లుచున్= చల్లుతూ; బహువిధ= అనేక విధాలైన; ఆశీర్వాద= దీవనయందలి; పరతన్= ఆసక్తితో; పరఁగన్= ఒప్పగా; ఆద్యులు= మొదటివారు, పూర్వకాలంవారు; ఐ= అయి; పేరు+కలుగు= ప్రసిద్ధికెక్కిన; పది+ఆర్వురు= పదహారుగురు; అవనివరుల= రాజులయొక్క; యాగంబులకున్= యజ్ఞాలకు; సరివచ్చున్= సాటిఅగును; మిగులున్= మించిపోతుంది; కాని; ఇది= ఈ ధర్మరాజు యజ్ఞం; వ్రాపడదు= తక్కువ కాదు; అనఁగాన్= అనగా; ధర్మతనయుని= ధర్మరాజుయొక్క; అశ్వమేధము= అశ్వమేధయజ్ఞం; వెలుంగున్= శోభిల్లింది.

తాత్పర్యం: జనమేజయా! దేవర్షులు యజ్ఞం చూచే వేడుకతో కలిసికట్టుగా ఆనందదాయకాలైన గానాలు చేశారు. అప్సరసలు అనేక విధాలైన మనోహర నృత్యాలు ప్రదర్శించారు. బ్రహ్మవేత్తలైన బ్రాహ్మణులు అక్షతలు చల్లుతూ పెక్కు దీవనలు ఇచ్చారు. 'ప్రాచీన కాలంలో ప్రసిద్ధులైన షోడశ మహారాజులు గావించిన యజ్ఞాలతో ఇది సాటి అవుతుందనటం ఎందుకు; మించిపోతుంది గాని ఏ మాత్రమూ వాటికి తక్కువ కాదు' అనేటట్లుగా ధర్మరాజు అశ్వమేధం ఒప్పారింది.

వ. పసిఁడి యిట్టికలం జతుశ్చిత్యంబు నష్టాదశకరాత్మకంబును గరుడాకృతియునుగా యజనం బొనర్చి మహనీయంబై యొప్పుచుండు యూపక్రియా సమయంబున ఖాదిరంబు లాఱును, బైల్వంబు లాఱును బాలాశంబు లాఱును, దేవదారుమయంబులు రెండును, శ్లేష్మాతకతరు కల్పితం బొకండును గా నిరువదియొక్క యూపంబులు దక్కును శోభనార్థంబుగా ననేక కాంచన యూపసంచయంబును శాస్త్రోక్త ప్రకారంబున యాజకులు నిలిపి వానియందు. 180

ప్రతిపదార్థం: పసిఁడి= బంగారు వికారములైన; ఇట్టికలన్= ఇటుకలతో; చతుస్+చిత్యంబును= నాలుగు వరుసలుగా పేర్చినదియు; అష్టాదశ= పదునెనిమిది; కర= మూరల (మూర= 18 అంగుళములు); ఆత్మకంబును= రూపం కలదియు; గరుడ= గ్రద్దయొక్క; ఆకృతియును= ఆకారం కలదియును; కాన్= అగునట్లుగా; యజనంబు= యజ్ఞవేదిని; ఒనర్చి= నిర్మించి; మహనీయంబు= గొప్పది; ఐ= అయి; ఒప్పుచున్+ఉండు= ఒప్పారుతుండే; యూప= యజ్ఞమున జంతువులను కట్టుటకు పాతే కొయ్యలను ఎత్తుట అనే; క్రియా సమయంబునన్= పనులు చేయదగిన సమయమున; ఖాదిరంబులు= చంద్రకొయ్యలతో చేసినవి; ఆఱును= ఆరును; బైల్వంబులు= మారేడుతో చేసినవి; ఆఱును= ఆరును; పాలాశంబులు= మోదుగు కఱ్ఱలతో చేసినవి; ఆఱును= ఆరును; దేవదారుమయంబులు= దేవదారు రూపములైనవి; రెండును; శ్లేష్మాతక+తరు= విరివిచెట్టుతో; కల్పితంబు= చేసింది; ఒకండును= ఒకటియు; కాన్= అయ్యేటట్లుగా; ఇరువది+ఒక్క= ఇరువదియొక్కటి; యూపంబులు= యజ్ఞస్తంభాలయొక్క; సంచయంబును= సమూహమును; శాస్త్ర= శాస్త్రమునందు; ఉక్త= చెప్పబడిన; ప్రకారంబునన్= విధంగా; యాజకులు= యజ్ఞం చేయించేవారు; నిలిపి; వాని+అందున్= ఆ స్తంభాలయందు.

తాత్పర్యం: ఋత్విజులు బంగారు ఇటుకలతో యజ్ఞవేదిని నిర్మించారు. దానియందు ఇటుకలు నాలుగు వరుసలుగా పేర్చారు. దాని కొలత పదమూడు మూరలు. అది గ్రద్ద ఆకారాన ఉన్నది. ఋత్విక్కులు ప్రధానమైన యూపప్రతిష్ఠ గావించారు. యూపములమొత్తం ఇరవైయొక్కటి. వాటిలో చంద్రకొయ్యలతో చేసినవి ఆరు, మారేడుతో చేసినవి ఆరు, మోదుగు కఱ్ఱలతో చేసినవి ఆరు, దేవదారుదుంగలతో చేసినవి రెండు, విరివిచెట్టుతో చేసినది ఒకటి. ఈ ఇరవైయొక్క యూపాలనుగాక అలంకారార్థం అనేక సువర్ణయూపాలను కూడా శాస్త్రప్రకారంగా నిలిపారు. వాటియందు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. నలుగాలివానిఁ బక్షుల, । జలచరముల, విధియుతముగ సంయోజింపం

బొలిచెం బశువులు మున్నూ । అలఘు యశోమహిత! యమ్మహాయజ్ఞమునన్. 181

ప్రతిపదార్థం: అలఘు= అధికమైన; యశస్= కీర్తిచేత; మహిత!= పూజించబడినవాడా! జనమేజయా!; నలుగాలివానిన్= నాలుగు కాళ్ళుకల వాటిని, చతుష్పాత్తులను; పక్షులన్= పక్షులను; జలచరములన్= నీటియందు తిరిగే వాటిని (చేపలు, తాబేళ్ళు మొదలైనవి); విధియుతముగన్= శాస్త్రప్రకారంగా; సంయోజింపన్= కూర్పగా, బంధించగా; ఆ+మహత్= ఆ గొప్ప; యజ్ఞమునన్= యజ్ఞమున; పశువులు= ప్రాణులు; మున్నూఱు= మూడువందలు; పొలిచెన్= ఒప్పారాయి.

తాత్పర్యం: జనమేజయా! మహాయశశ్శాలీ! యాజకులు యూపాలకు నాలుగు కాళ్ళు కలిగిన జంతువులనూ, పక్షులనూ, మత్స్యాదులనూ కట్టారు. ఆ యజ్ఞంలో ఆ విధంగా బంధించిన ప్రాణులసంఖ్య మూడు వందలు.

క. వరయూప సుయోజిత మగు । తురంగమము చుట్టుఁ బశుతతుల నిల్పిన సుం

దర భావము దక్ష మఖ । స్ఫురణం బిట్టిదని చూపుపోలిక మెఱసెన్. 182

ప్రతిపదార్థం: వర= శ్రేష్ఠమైన; యూప= యజ్ఞస్తంభమునందు; సుయోజితము= చక్కగా కట్టినది; అగు= అయిన; తురంగమము= గుఱ్ఱంయొక్క; చుట్టున్= చుట్టునూ, నలువైపులా; పశు= ప్రాణులయొక్క; తతులన్= గుంపులను; నిల్పిన= చేర్చిన; సుందరభావము= సౌందర్యం; దక్ష= దక్షుడియొక్క; మఖ= యజ్ఞంయొక్క; స్ఫురణంబు= ప్రకాశం; ఇట్టిది= ఇటువంటిది; అని; చూపు= కనబడజేసే; పోలికన్= సామ్యంతో; మెఱసెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: యజ్ఞాశ్వాన్ని ఉత్తమ యూపానికి కట్టారు. దానిచుట్టూ పశుసమూహాన్ని నిలిపారు. ఆ నిలిపిన సొగసు ధర్మజుడి అశ్వమేధయాగం దక్షప్రజాపతి యాగమువంటిదే అని చాటుతున్నది. (ఈ అశ్వమేధయాగం దక్షుడి యజ్ఞమువంటిదని భావం).

విశేషం: అలం: ఉపమ.

తే. ఆగమోక్తంబు దర్శనీయంబు నైన । యా సుతంత్రంబు నొనరించు యాజకోత్త

మావలికిఁ దా నలంకారమై పరాశ । రాత్మజుని శిష్యకోటి యొప్పారె నధిప! 183

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఆగమ= వేదాలచేత; ఉక్తంబు= చెప్పబడింది; దర్శనీయంబున్= చూడదగినదియూ; ఐన= అయిన; ఆ; సు= శోభాయుతమైన; తంత్రంబున్= యజ్ఞకర్మకాండమును; ఒనరించు= నిర్వర్తిస్తున్న; యాజక+ఉత్తమ= యాజక శ్రేష్ఠులయొక్క; ఆవలికిన్= బృందానికి; అలంకారము+ఐ= అలంకారమై; పరాశర= పరాశర మహర్షియొక్క; ఆత్మజుని= కుమారుడి-వ్యాసుడియొక్క; శిష్య= శిష్యులయొక్క; కోటి= సమూహం; ఒప్పారెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: వేదాలు ప్రతిపాదించినదీ, చూడదగినదీ అయిన ఆ అశ్వమేధ కర్మకాండం గావించే ఋత్విజాల బృందానికి వేదవ్యాసుడి శిష్య సమూహం వన్నె పెట్టేదిగా ప్రకాశించింది.

ధర్మరాజు వ్యాసునకు యజ్ఞదక్షిణగాఁ దనరాజ్యం బంతయు నిచ్చుట (సం.14-91-1)

వ. సర్వపశు శ్రవణంబు లాచరించి ఋత్విగ్జనంబు లశ్వాలంభ సమయంబున యాజ్ఞసేని సన్నిహితం జేసి యశ్వంబు నవయవంబుల మాంసంబులయ్యై దేవతలకు నాహుతు లిడునప్పు డమ్మహాదేవి నిజహస్తంబునం జేయం దగియెడు హుతంబులు చేయించిరి; తదనంతరం బయ్యశ్వవపాహోమంబునం బరఁగుగంధం బాఘ్రాణించి ధర్మనందనుండు తమ్ములుందానును బరమానందంబునం బొందె; శేషించిన యశ్వావయవంబు లర్హప్రకారంబున యాజకులు వేల్చి; రిట్లు సాత్యవతేయుండు యుధిష్ఠిరు నశ్వమేధం బఖిలలోక హితంబుగా నిర్వహించి యాతని గుఱించి యుదాత్తనాదం బెసంగ నాశీర్వాదంబుసేసె; సమస్తదేవమునులును దీవనలిచ్చి; రప్పుడు కౌరవవంశపావనుం డగు భూవరుండు. 184

ప్రతిపదార్థం: సర్వ= సమస్తమైన; పశు= ప్రాణులయొక్క; శ్రవణంబులు= వండుటలు; ఆచరించి= చేసి; ఋత్విక్+జనంబు= యజ్ఞం చేయించేవారు, ఋత్విజులు; అశ్వ= గుఱ్ఱంయొక్క; ఆలంభ= చంపటం చేసే; సమయంబునన్= వేళయందు; యాజ్ఞసేనిన్= ద్రౌపదిని; సన్నిహితన్= దగ్గర ఉండేదానినిగా; చేసి; అశ్వంబు= గుఱ్ఱంయొక్క; అవయవంబులు= ఆయా అవయవాలయొక్క; మాంసంబులు= మాంసాలు; ఆ+ఆ= ఆయా; దేవతలకున్= దేవతలకు; ఆహుతులు+ఇడు= అగ్నియందు మంత్రపూర్వకంగా వేల్చునట్టి; అప్పుడు= ఆ సమయంలో; ఆ+మహాదేవి= ఆ పట్టపురాణి; నిజ= తనయొక్క; హస్తంబునన్= చేతిమీదుగా; చేయన్+తగియెడు= చేయదగిన; హుతంబులు= ఆహుతులు; చేయించిరి= చేయించారు; తద్+అనంతరంబు= ఆ తరువాత; ఆ+అశ్వ= ఆ గుఱ్ఱంయొక్క; వపా= కడుపులో బొడ్డుక్రిందనుండే ఉల్లిపొరవంటి క్రొవ్వును వేల్చి చేసెడి; హోమంబునన్= యజ్ఞమునందు; పరఁగు= వ్యాపించునట్టి; గంధంబు= వాసనను; ఆఘ్రాణించి= పీల్చి; ధర్మనందనుండు= ధర్మరాజు; తానునున్= తానునూ; తమ్ములున్= తమ్ములునూ; పరమ= అధికమైన; ఆనందబునన్+పొందెన్= ఆనందించారు; శేషించిన= మిగిలిన; అశ్వ= గుఱ్ఱంయొక్క; అవయవంబులు= అవయవాలను; అర్హ= తగిన; ప్రకారంబునన్= విధంగా; యాజకులు= ఋత్విజులు; వేల్చిరి= హోమం చేశారు; ఇట్లు= ఈ విధంగా; సాత్యవతేయుండు= సత్యవతీ కుమారుడు - వ్యాసుడు; యుధిష్ఠిరు= ధర్మరాజుయొక్క; అశ్వమేధంబు= అశ్వమేధయాగం; అఖిల= సమస్తమైన; లోక= లోకాలకు; హితంబు= మేలు కలిగించునది; కాన్= అగునట్లుగా; నిర్వహించి= చేసి; అతనిన్= అతడిని; గుఱించి= ఉద్దేశించి; ఉదాత్త= ఉదాత్తము అనే స్వరభేదంయొక్క (ఉచ్చైరుదాత్తః అని పాణిని); నాదంబు= ధ్వని; ఎసంగన్= ప్రకాశించగా; ఆశీర్వాదంబు+చేసెన్= దీవించాడు; సమస్త= సమస్తమైన; దేవమునులును= దేవర్షులును; దీవనలు+ఇచ్చిరి= దీవించారు; అప్పుడు= ఆ సమయంలో; కౌరవవంశ= కౌరవవంశమును; పావనుండు= పవిత్రం చేసేవాడు; అగు= అయిన; భూవరుండు= రాజు, ధర్మరాజు.

తాత్పర్యం: ఋత్విజులు సర్వజంతువులనూ చంపి వండారు. యజ్ఞాశ్వాన్ని కూడ చంపేటప్పుడు పట్టపురాణి అయిన ద్రౌపదిని దానికి దగ్గరగా ఉండేటట్లు చేశారు. అశ్వమాంసాలను ఆయా దేవతలకు వేల్చే సమయంలో ఆమెచేతకూడా తనచేతిమీదుగా చేయదగిన హోమాలు చేయించారు. తరువాత గుఱ్ఱం వసను వేల్చేవేళ వ్యాపించిన వాసనను పీల్చి ధర్మరాజు తమ్ములతోపాటు ఆనందించాడు. మిగిలిన అశ్వావయవాలను కూడా ఋత్విజులు శాస్త్రవిధులను అనుసరించి వేల్చారు. వేదవ్యాసుడు సకలలోకాలకూ శ్రేయస్సు సమకూరేటట్లు ధర్మరాజు అశ్వమేధయాగాన్ని నిర్వహించి, ఉదాత్తస్వరంతో ఆ యజమానుడిని దీవించాడు. దేవర్షులందరునూ ధర్మరాజును ఆశీర్వదించారు. కౌరవవంశమును పవిత్రం చేసే ఆ చక్రవర్తి. (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తే. **అలఘుభక్తి సదస్యుల కెలమి యెసక । మెసఁగఁ గోటివేల్ నిష్కము లిచ్చి తనదు**
వసుధ యంతయు నొసఁగె దివ్య ప్రబోధ । ఘనత నొప్పు వేదవ్యాస మునివరునకు. **185**

ప్రతిపదార్థం: అలఘు= గొప్పది ఐన; భక్తిన్= భక్తితో; సదస్యులకున్= ఋత్విజులకు; ఎలమి= ఆనందం; ఎసకము+ఎసఁగన్= అతిశయించగా; కోటివేల్= కోటి వేల; నిష్కముల్= టంకములు; ఇచ్చి= దక్షిణగా ఇచ్చి; దివ్య ప్రబోధ= దివ్యజ్ఞానంచేత, బ్రహ్మజ్ఞానంచేత కలిగిన; ఘనతన్= గొప్పతనంతో; ఒప్పు= ప్రకాశించే; వేదవ్యాస= వేదవ్యాసుడనే; మునివరునకున్= మహర్షికి; తనదు= తనయొక్క; వసుధ= భూమండల సామ్రాజ్యం; అంతయున్= అంతయూ; ఒసఁగెన్= సమర్పించాడు.

తాత్పర్యం: ధర్మరాజు సదస్యులకు మహానందం కలుగగా వేయికోట్ల టంకాలు దక్షిణలుగా ఇచ్చాడు. బ్రహ్మజ్ఞాన మహత్త్వంతో ప్రకాశించే వేదవ్యాస మహర్షికి తన భూమండల సామ్రాజ్యమంతా సమర్పించాడు.

క. **విను ఋత్విగాధ్యుఁడగు న । మ్మునిపతి యట్లు కురువంశముఖ్యుఁ డొసఁగ మే**
దిని సంప్రమోదమునఁ గై । కొని యిట్లను నా నరేంద్రకుంజరుతోడన్. **186**

ప్రతిపదార్థం: విను= జనమేజయా! వినుము; అట్లు= ఆ విధంగా; కురువంశ= కురువంశమునందు; ముఖ్యుఁడు= అగ్రణి, ధర్మరాజు; ఒసఁగన్= సమర్పించగా; ఋత్విక్+ఆధ్యుఁడు= ఋత్విక్కులలో ప్రధాన నిర్వాహకుడు; అగు= అయిన; ఆ+మునిపతి= ఆ మునీశ్వరుడు వ్యాసుడు; సంప్రమోదమునన్= మహానందంతో; మేదినిన్= భూమిని; కైకొని= స్వీకరించి; ఆ+నరేంద్ర= రాజులలో; కుంజరుతోడన్= శ్రేష్ఠుడితో, ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా కురువంశాగ్రణి అయిన ధర్మరాజు సమర్పించగా ఋత్వికులలో ప్రధాన నిర్వాహకుడైన వ్యాసుడు భూమిని స్వీకరించాడు. రాజశ్రేష్ఠుడైన ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు.

ఆ. **'జగతి ఋత్విగర్థముగ నిచ్చి; తేము వి । ప్రస్వభావకలనఁ బసిఁడిఁ గొనఁగఁ**
గోరెదము; కరంబు గారవంబున బ్రాహ్మ । ణాభిలషితదాయి వగుట మేలు' **187**

ప్రతిపదార్థం: ఋత్విక్+అర్థముగన్= ఋత్విక్కుల ధనంగా, ఋత్విక్కుల కొరకు; జగతి= భూమిని; ఇచ్చితి(వి)= సమర్పించావు; ఏము= మేము; విప్ర= బ్రాహ్మణులయొక్క; స్వభావ= ప్రకృతియొక్క; కలనన్= కలుగుటచేత; పసిఁడిన్= బంగారమును; కొనఁగన్= స్వీకరించగా; కోరెదము= కోరుతాము; కరంబు= మిక్కిలి; గారవమునన్= గౌరవంతో; బ్రాహ్మణ= బ్రాహ్మణులచేత; అభిలషిత= కోరబడినదానిని; దాయిని= ఇచ్చేవాడవు; అగుట; మేలు= శ్రేయస్కరం.

తాత్పర్యం: 'నీవు ఋత్విక్కులకు భూమి నిచ్చావు. బ్రాహ్మణ ప్రకృతి కలిగిన మేము బంగారాన్ని కోరుతాము. కాబట్టి గౌరవభావంతో బ్రాహ్మణులు కోరినదానిని ఇవ్వటం శ్రేయస్కరం.'

వ. **అని వెండియు.** **188**

తాత్పర్యం: అని ఇంకా (తరువాతి పద్యంతో అన్వయం)

క. **'ఇలకు వెలగా హిరణ్యం । బలఘుమతీ! మాకు నొసఁగు' మనుటయు ధరణీ**
శులు వినఁగా నప్పారవ । కులపతి యా వేదరక్షకున కి ట్లనియెన్. **189**

ప్రతిపదార్థం: అలఘుమతీ!= మహామతీ!; ఇలకున్= భూమికి; వెల= ఖరీదు; కాన్= అయ్యేటట్లుగా; మాకున్= మాకు; హిరణ్యంబు= బంగారం; ఒసఁగుము= ఇమ్ము; అనుటయున్= అని అనగా; ఆ+పౌరవకుల= ఆ పౌరవకులం యొక్క; పతి= రాజు; ధరణీశులు= రాజులు; వినఁగాన్= వినుచుండగా; ఆ+వేద= ఆ వేదాలయొక్క; రక్షకునకున్= సంరక్షకుడితో-వ్యాసుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'మహామతీ! భూమియొక్క వెలగా మాకు బంగారాన్ని ఇమ్ము' అని అనగా పౌరవకులజుడైన ధర్మరాజు రాజులందరూ వింటుండగా వేదసంరక్షకుడైన వ్యాసుడితో ఈ విధంగా అన్నాడు.

ఆ. 'అశ్వమేధమునకు నార్యులు దక్షిణ । ధరణి యండ్రు; గాన నరునిచేత
విజిత యైన ధరణి ప్రజనిత ప్రీతిమై । ఋత్విగర్చనముగ నిచ్చినాఁడ.' 190

ప్రతిపదార్థం: ఆర్యులు= పెద్దలు; అశ్వమేధమునకున్= అశ్వమేధ యాగానికి; ధరణి= భూమి; దక్షిణ= దక్షిణ అని; అండ్రు= అంటారు; కాన= కావున; నరునిచేతన్= అర్జునుడిచేత; విజిత= జయించబడినది; ఐన= అయిన; ధరణి= భూమిని; ప్రజనిత= మిక్కిలి ఎక్కువగా కలిగిన; ప్రీతిమైన్= ఆనందంతో; ఋత్విక్= ఋత్విక్కులయొక్క; అర్చనము+కన్= ఆరాధనంగా; ఇచ్చినాఁడన్= సమర్పించాను.

తాత్పర్యం: 'పెద్దలు అశ్వమేధయాగానికి దక్షిణ అని అంటారు. కావున అర్జునుడు జయించిన భూమినెల్లా మహానందంతో ఋత్విక్కుల యారాధనమయ్యేటట్లుగా ఇచ్చాను.'

వ. అని మఱియును. 191

తాత్పర్యం: అని, ఇంకనూ (తరువాతి పద్యంతో అన్వయం)

చ. 'వనమున కేఁగి యందు సుఖవాసత నుండఁగలాఁడఁ గాక యే
ననఘవిచార! బ్రహ్మధన మక్కట! గొందునె?' యన్నఁ బ్రీతిమై
ననుజులు యాజ్ఞసేనియును 'నట్టిద యా పని యొండు చెప్పకుం'
డనుటయు హర్షబాష్పపులకాంకురముల్ ధరియించి రందఱున్. 192

ప్రతిపదార్థం: అనఘ= పాపరహితమైన; విచార!= ఆలోచనము కలవాడా!; ఏన్= నేను; వనమునకున్= అడవికి; ఏఁగి= వెళ్ళి; అందున్= అక్కడ; సుఖ= సుఖంతో కూడిన; వాసతన్= వసించువాడి ధర్మంతో (సుఖంగా నివసిస్తూ అని అర్థం); ఉండన్+కలాఁడన్= ఉండగలవాడను; కాక= కాని; అక్కట!= అయ్యో!; బ్రహ్మధనము= బ్రాహ్మణుల సొత్తును; కొందును+ఎ?= తిరిగి తీసికొందునా?; అన్నన్= అనగా; ప్రీతిమైన్= సంతోషంతో; అనుజులున్= తమ్ములును; యాజ్ఞసేనియును= ద్రౌపదియు; ఆ+పని= ఆ పని; అట్టి+అది+అ= అటువంటిదే ('అరణ్యవాసము చేయుదును. బ్రహ్మస్వము ముట్టను' అని మీరు నిర్ణయించిన పని నిర్ణయించినట్లే జరుగవలయునని అర్థం); ఒండు= మరియొకమాట; చెప్పకుండు= చెప్పకండి; అనుటయున్= అని అనగా; అందఱున్= అక్కడ ఉన్నవారందరూ; హర్ష= సంతోషంవలన కలిగిన; పులక+అంకురముల్= గగుర్పాటు మొలకలు; ధరించిరి= పొందారు.

తాత్పర్యం: 'పుణ్యవిచార! నేను అడవికి వెళ్ళి అక్కడ సుఖంగా నివసించగలవాడనే కాని బ్రహ్మస్వమును తిరిగి తీసికొంటానా?' అని ధర్మరాజు అన్నాడు. అతడి తమ్ములూ, ద్రౌపదీ 'మీరు నిర్ణయించిన పని నిర్ణయించినట్లే జరగాలి.

మరొకమాట చెప్పవద్దు' అని అన్నారు. అక్కడ ఉన్నవారందరూ ఈ మాటలు విని ఆనందరోమాంచములు అనుభవించారు.

వ. అప్పుడు. 193

తాత్పర్యం: ఆ సమయాన (తరువాతి పద్యంతో అన్వయం)

తే. దివ్యవాణి కీర్తించెఁ గౌరవ్యవరుని; । నఖిల జనములుఁ బ్రస్తుతిముఖరు లైరి;
తానుఁ బొగడి వేదవ్యాసుఁ డానరేంద్ర। చంద్రునకు నిట్టులను విప్రచయము వినఁగ. 194

ప్రతిపదార్థం: దివ్యవాణి= ఆకాశవాణి; కౌరవ్య= కౌరవులలో; వరునిన్= శ్రేష్ఠుడిని; కీర్తించెన్= పొగడింది; అఖిల= సమస్తమైన; జనములు= జనులు; ప్రస్తుతి= ప్రశంసావాక్యములను; ముఖరులు= అధికంగా పలికేవారు; ఐరి= అయ్యారు; వేద వ్యాసుండు= వేదవిభజం కావించిన వ్యాసుడు; తానున్= తానుకూడా; పొగడి; ఆ+నరేంద్ర చంద్రునకున్= ఆ రాజశ్రేష్ఠుడితో; విప్ర= బ్రాహ్మణులయొక్క; చయము= సమూహం; వినఁగన్= వినగా; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అన్నాడు.

తాత్పర్యం: ఆ కౌరవశ్రేష్ఠుడిని ఆకాశవాణి ప్రశంసించింది. సమస్త జనులూ అతడిని మిక్కిలి పొగడారు. వ్యాసుడు కూడా స్తుతించి బ్రాహ్మణబృందం వింటుండగా ఆ రాజశ్రేష్ఠుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'ఏ మమ్మెద మనినఁ బృథివి । యో మనుజాధీశ! కొనుట యొప్పెడు తెరు; విం
దేమియును నెగ్గు లే; దీ । భూమిసురుల కోర్కి దీర్చి పుచ్చుము ప్రీతిన్.' 195

ప్రతిపదార్థం: ఓ మనుజ+అధి+ఈశ!= ఓ మానవులయొక్క అధిపతీ!; ఏము= మేము; అమ్మెదము= అమ్ముతాము; అనినన్= అనగా; పృథివి= భూమిని; కొనుట= ధనమిచ్చి కొనటం; ఒప్పెడు= సమంజసమైన; తెరువు= మార్గం, పద్ధతి; ఇందున్= ఈ పద్ధతియందు; ఏమియును= ఏమియూ; ఎగ్గు= దోషం; లేదు; ప్రీతిన్= సంతోషంతో; ఈ భూమిసురుల= ఈ బ్రాహ్మణులయొక్క; కోర్కి= కోరికను; తీర్చి= నెరవేర్చి; పుచ్చుము= పంపుము.

తాత్పర్యం: 'ఓ మానవాధిపతీ! మేము అమ్ముతాము అన్నప్పుడు నీవు భూమిని ధనమిచ్చి కొనటం సమంజసమైన పద్ధతే అవుతుంది. దీనిలో తప్పు ఏమీ లేదు. ఈ బ్రాహ్మణుల కోరిక నెరవేర్చి సంతోషంగా పంపుము.'

క. అని పలికినఁ గృష్ణుం 'డి। మ్మునినాయకు పనుపు సేయుము నరేశ్వర! నీ'
వని చెప్పిన నొడఁబడి తన। యనుజులతో నట్లకాక యని యతఁ డర్థిన్. 196

ప్రతిపదార్థం: అని= అని; పలికినన్= పలుకగా; కృష్ణుండు= కృష్ణుడు; నర+ఈశ్వర!= రాజా!; నీవు; ఈ+మునినాయకు= ఈ మునీశ్వరుడియొక్క; పనుపు+చేయుము= ఆజ్ఞాపించినపని చేయుము; అని; చెప్పినన్= చెప్పగా; ఒడఁబడి= ఒప్పుకొని; తన= తనయొక్క; అనుజులతోన్= తమ్ములతో; అట్లు+అ= అట్లే; కాక= చేయుదునుగాక; అని; అతఁడు= ధర్మరాజు; అర్థిన్=ప్రీతితో.

తాత్పర్యం: అని వేదవ్యాసుడు పలుకగా, కృష్ణుడు 'రాజా! నీవు ఈ మహర్షి ఆజ్ఞాపించినపని చేయుము' అని అన్నాడు. ఆ మాటకు ఒప్పుకొని ధర్మరాజు తమ్ములతో 'అట్లే చేయుదుముగాక!' అని సంతోషంతో. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. కోటి కోటులు మాడలు కుప్పవోసి। ధరణి వెల యని చెప్పి యప్పరమసంయ
మాధిపతికి సమర్పించె; నతఁడు ఋత్వి। గావలికిఁ బంచిపెట్టె నయ్యతులధనము. 197

ప్రతిపదార్థం: కోటి కోటులు= కోటి కోట్లు; మాడలు= టంకములు; కుప్ప+పోసి= రాశిపోసి; ధరణి= భూమియొక్క; వెల= ఖరీదు; అని; చెప్పి; ఆ+పరమసంయమ= ఆ మహర్షులయొక్క; అధిపతికిన్= ప్రభువుకు, వ్యాసుడికి; సమర్పించెన్= ఇచ్చాడు; అతఁడు= వ్యాసుడు; ఆ+అతుల= సాటిలేని; ధనము; ఋత్విక్= ఋత్విజులయొక్క; ఆవలికిన్= సమూహానికి; పంచిపెట్టెన్= పంచిపెట్టాడు.

తాత్పర్యం: కోటికోట్లు టంకాలు కుప్పపోసి 'ఇదే భూమి వెల' అని చెప్పి ఆ మహర్షి నాయకుడికి సమర్పించాడు. వేదవ్యాసుడు ఆ అసమాన ధనరాశిని ఋత్విజుల బృందానికి పంచిపెట్టాడు.

వ. మఱియును. 198

తాత్పర్యం: ఇంకనూ. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: 'యతి'

తే. అతుల కనకమయములైన యజ్ఞవాట। వేదికా యూప తోరణ వివిధ భాండ
దండ శయ్యాసనాదులఁ ధరణినాథుఁ। డొసఁగె విప్రచయంబుల కుల్ల మలర. 199

ప్రతిపదార్థం: ధరణినాథుఁడు= రాజు, ధర్మరాజు; అతుల= సాటిలేని; కనకమయములు= బంగారు రూపములు; ఐన= అయిన; యజ్ఞవాట= యజ్ఞశాల; వేదికా= వేది; యూప= యజ్ఞస్తంభాలు; తోరణ= వెలుపలి గుమ్మాలు; వివిధ= పలురకాలైన; భాండ= కుండలు, పాత్రలు; దండ= కర్రలు; శయ్యా= సెజ్జలు; ఆసన= పీఠాలు; ఆదులన్= మొదలైనవాటిని; ఉల్లము= హృదయం; అలరన్= ఆనందించగా; విప్ర= బ్రాహ్మణులయొక్క; చయంబులకున్= సమూహాలకు; ఒసఁగెన్= సమర్పించాడు.

తాత్పర్యం: ధర్మరాజు బంగారంతో చేసిన యజ్ఞశాల భాగాలూ, యజ్ఞవేదీ, యూపాలూ, బహిర్ద్వారాలూ, వివిధ పాత్రలూ, దండములూ, సెజ్జలూ, పీటలూ హృదయానందం కలుగగా బ్రాహ్మణ బృందాలకు సమర్పించాడు.

తే. అట్లు విప్రుల కిచ్చి యనంతరంబ। రాజులకు, వైశ్యులకు, శూద్రరాజి కన్య
జాతులకు మ్లేచ్ఛులకును బ్రభూతధనము। ద్రవ్వి తండంబు లిచ్చె నా ధరణివిభుఁడు. 200

ప్రతిపదార్థం: ఆ+ధరణి విభుఁడు= ఆ రాజు ధర్మరాజు; అట్లు= ఆ విధంగా; విప్రులకున్= బ్రాహ్మణులకు; ఇచ్చి= సమర్పించి; అనంతరంబు+అ= తరువాతనే; రాజులకున్= క్షత్రియులకు; వైశ్యులకున్= వైశ్యులకు; శూద్ర= శూద్రులయొక్క; రాజికిన్= సమూహానికి; అన్య= ఇతరమైన; జాతులకున్= జాతులకు; మ్లేచ్ఛులకున్= విదేశీయులకు; ప్రభూత= అత్యధికమైన; ధనము; త్రవ్వితండంబులు= లెక్కకు మిక్కిలిగా; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా బ్రాహ్మణులకు సమర్పించిన తరువాతనే క్షత్రియులకూ, వైశ్యులకూ, శూద్రులకూ, ఇతర జాతులవారికీ, విదేశీయులకూ కోకొల్లలుగా అపారధనాన్ని ఇచ్చాడు.

క. ఇమ్మెయి సకలజనులు హే। మమ్మునఁ బరితృప్తులై యమంద మ్మగు మో
దమ్మునఁ దేలుచు నిజవా। సమ్ములకుం జని రజాతశత్రుఁ బొగడుచున్. 201

ప్రతిపదార్థం: సకల= సమస్తమైన; జనులు= ప్రజలు; ఈ+మెయిన్= ఈ విధంగా; హేమమ్మునన్= బంగారంచేత; పరితృప్తులు= మిక్కిలి తృప్తిపొందినవారు; ఐ= అయి; అమందమ్ము= అధికమైనది; అగు= అయిన; మోదమ్మునన్= సంతోషంతో; తేలుచున్= ఉప్పొంగుతూ; అజాతశత్రున్= ధర్మరాజును; పొగడుచున్= పొగడుతూ; నిజ= తమయొక్క; వాసమ్ములకున్= నివాసస్థానాలకు; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: సమస్త జనులూ ఈ విధంగా సువర్ణదానంచేత మిక్కిలి సంతృప్తి చెందారు. వారు ఆనందంతో పొంగుతూ ధర్మరాజును ప్రశంసిస్తూ తమ తమ నివాసాలకు వెళ్ళారు.

క. రెండవ మరుత్తుఁడై య। ప్పాండవముఖ్యుండు చేయు పరమ వితరణం
బొండొకయెడఁ గల్గునె యె। న్నండును జూడ విన సజ్జనస్తుతచరితా! 202

ప్రతిపదార్థం: సజ్జన= సజ్జనులచేత; స్తుత= కొనియాడబడిన; చరితా!= నడవడి కలవాడా!; రెండవ; మరుత్తుఁడు= మరుత్తుడనే రాజు; ఐ= అయి; ఆ+పాండవ= ఆ పాండవులయందు; ముఖ్యుండు= మొట్టమొదటివాడు; చేయు= చేసిన; పరమ= సర్వోత్తమమైన; వితరణంబు= దానం; ఒండు+ఒక= మరొక; ఎడన్= చోట; ఎన్నండును= ఏనాడును; చూడన్= చూడగా; వినన్= వినగా; కల్గును+ఎ?= శక్యమగునా?

తాత్పర్యం: జనమేజయా! మరుత్తుడితో సమాను డయిన ఆ ధర్మరాజు చేసిన సర్వోత్తమదానం మరొకచోట ఏనాడూ చూచినదీ కాదు విన్నదీ కాదు. (చూడబోము, వినబోము అని అర్థం)

క. తనయంశ మైన కనకము। విను కుంతీదేవి కిచ్చె వేదవ్యాసుం;
డనఘా! యది యంతయు న। వ్వినుతచరిత ధర్మకృతుల వినియోగించెన్. 203

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; విను= వినుము; వేదవ్యాసుండు= వేదవ్యాసుడు; తన= తనయొక్క; అంశము= భాగం; ఐన= అయిన; కనకమున్= బంగారమును; కుంతీదేవికిన్= కుంతికి; ఇచ్చెన్= ఇచ్చాడు; ఆ+వినుత= కొనియాడబడిన; చరిత= నడవడి కల కుంతి; అది= దానిని; అంతయున్= ఎల్లనూ; ధర్మకృతులన్= ధర్మకార్యాలందు; వినియోగించెన్= ఉపయోగించింది.

తాత్పర్యం: పుణ్యాత్మా! వేదవ్యాసుడు తన భాగమైన బంగారాన్ని కుంతీదేవికి ఇచ్చాడు. ఆ సాధ్వి దాని నెల్ల ధర్మకార్యాలకు ఉపయోగించింది.

తే. సకల బాంధవ భూపతి సంయుతముగ। నా నరేశ్వరుఁ డవభృథస్నాన పూత
గాత్రుఁడై చిత్తగత సర్వ కల్మషములఁ। బాసి నిర్జితస్వర్గత్వభాసి యయ్యె. 204

ప్రతిపదార్థం: ఆ+నర+ఈశ్వరుండు= ఆ రాజు ధర్మరాజు; సకల= సమస్తమైన; బాంధవ= చుట్టాలతో; భూపతి= రాజులతో; సంయుతము+కన్= కూడి ఉండేటట్లుగా; అవభృథ= యజ్ఞమునందు దొరలిన దోషాల ఫలమును నివారించటానికై చేసే; స్నాన= స్నానంచేత; పూత= పవిత్రమైన; గాత్రుండు+ఐ= శరీరం కలవాడై; చిత్త= మనస్సును; గత= పొందిన; సర్వ= సమస్తమైన;

కల్మషములన్= పాపములను, దోషములను; పాసి= పోగొట్టుకొని; నిర్జిత= జయించబడిన; స్వర్గత్వ= స్వర్గాన్ని పొందినవాడి ధర్మంచేత; (పుణ్యాత్ములకు గాని స్వర్గం లభించదు. అట్టి వారి ధర్మమును జయించినవాడు మహాపుణ్యాత్ముడు ఔతాడు. ధర్మరాజు అట్టివాడయ్యెనని అర్థం); భాసి= ప్రకాశిస్తున్నవాడు; అయ్యెన్= అయ్యాడు.

తాత్పర్యం: ధర్మరాజు చుట్టాలతో రాజులతో కూడి యజ్ఞాంతస్నానం చేశాడు. దీనివలన అతడి శరీరం పవిత్రమయింది. మనస్సునందలి సర్వదోషాలూ వదలిపోయాయి. అతడు చివరకు మహాపుణ్యంతోప్రకాశించేవాడయ్యాడు.

వ. అట్లొప్పి యప్పుడమిఱేఁడు పరాశరనందను చరణారవిందంబులు దన వెడంద నొసలు సోఁకఁ జాఁగి మ్రొక్కి యక్కులపతిం బెక్కుభంగులంబ్రస్తుతించి యామంత్రితుం జేసిన నా మునిశ్రేష్ఠుండు శిష్యసంఘ సహితంబుగా నంతర్ధానంబు సేసె; నట్టియెడ. 205

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; ఒప్పి= ప్రకాశించి; ఆ+పుడమిఱేఁడు= ఆ భూపతి - ధర్మరాజు; పరాశర= పరాశర మహర్షి; నందను= కుమారుడు, వ్యాసుడియొక్క; చరణ+అరవిందంబులు= పాదపద్మాలు; తన= తనయొక్క; వెడంద= విశాలమైన; నొసలు; సోఁకన్= తాకగా; చాఁగి= సాష్టాంగపడి; మ్రొక్కి; ఆ+కులపతిన్= ఆ కులపతిని; పెక్కు= పలు; భంగులన్= విధాలుగా; ప్రస్తుతించి= ప్రశంసించి; ఆమంత్రితున్= వీడ్కొలుపబడిన వాడినిగా; చేసినన్= చేయగా; ఆ+మునిశ్రేష్ఠుండు= ఆ వ్యాసుడు; శిష్య= శిష్యులయొక్క; సంఘ= సమూహంతో; సహితంబు+కాన్= కూడి ఉండేటట్లుగా; అంతర్ధానంబు+చేసెన్= అదృశ్యుడయ్యాడు; అట్టి+ఎడన్= ఆ సమయాన.

తాత్పర్యం: ఆ విధంగా ప్రకాశించి ధర్మరాజు వ్యాసుడి పాదాలు తన నొసటిని తాకేటట్లుగా సాష్టాంగ నమస్కారం చేసి ఆ కులపతిని అనేకవిధాలుగా ప్రస్తుతించాడు. తరువాత ఆ మహర్షి శిష్యులతోపాటు అదృశ్యుడయ్యాడు.

విశేషం: కులపతి= పదివేల శిష్యులను అన్నదానాదులచేత పోషించి, అధ్యయనం చేయించే బ్రహ్మర్షి.

శ్లో॥ మునీనాం దశసాహస్రం । యోఽన్న దానాది పోషణాత్

అధ్యాపయతి విప్రర్షి । రసౌ కులపతిః స్మృతః॥

ధర్మజుఁడు యజ్ఞంబునకు వచ్చిన రాజుల నెల్ల సత్కరించి పంపుట (సం. 14-91-30)

క. అనుజులు నఖిల నృపాలురుఁ । దనుఁ బరివేష్టింప నొప్పెఁ దారలలోనం
బెనుపొందు చంద్రుగతి న । మ్మనుజాధీశ్వరుఁడు కురుకుమారప్రవరా! 206

ప్రతిపదార్థం: కురుకుమార= కురురాజకుమారులలో; ప్రవరా= శ్రేష్ఠుడా!; అనుజులున్= తమ్ములును; అఖిల= సమస్తమైన; నృపాలురున్= రాజులును; తనున్= తనను; పరివేష్టింపన్= చుట్టిఉండగా; ఆ+మను= ఆ మానవులయొక్క; అధి+ఈశ్వరుఁడు= ప్రభువు, ధర్మరాజు; తారలలోనన్= నక్షత్రాలలో; పెనుపొందు= అతిశయించే; చంద్రు= చంద్రుడియొక్క; గతిన్= విధంగా; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: కురుకుమార శ్రేష్ఠా! తమ్ములూ, సమస్త రాజులూ చుట్టూచేరి ధర్మరాజు నక్షత్రాలలో చంద్రుడివలె ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. **క్రతువుఁ జూడ నేతెంచిన రాజవరుల। కందఱకు మణిభూషణ హస్తి వాజి**
వారకాంతాచయముల నవ్వసుమతీశుఁ। డొసఁగె ధనదుని కైవడి నెసక మెసఁగ. **207**

ప్రతిపదార్థం: ఆ+వసుమతీ= ఆ భూమియొక్క; ఈశుఁడు= నాథుడు, ధర్మరాజు; క్రతువున్= యజ్ఞాన్ని; చూడన్= చూడటానికి; ఏతెంచిన= వచ్చిన; రాజవరులకున్= రాజశ్రేష్ఠులకు; అందఱకున్= అందరకు; ధనదుని= కుబేరుడియొక్క; కైవడిన్= విధంగా; ఎసక మెసఁగన్= అతిశయం వర్ధిల్లగా; మణిభూషణ= మణులు పొదిగిన నగల; హస్తి= ఏనుగుల; వాజి= గుర్రాల; వారకాంతా= వేశ్యల; చయములన్= సమూహాలను; ఒసఁగెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: ధర్మరాజు కుబేరుడివలె అతిశయిస్తూ యజ్ఞం చూడవచ్చిన రాజులకందరకూ మణులు పొదిగిన నగలూ, ఏనుగులూ, గుర్రాలూ, వేశ్యా బృందమునూ అత్యధికంగా ఇచ్చాడు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. **బభ్రువాహనునకుఁ బరమ విశేషంబు। మెఱయ గారవించి మేలివస్తు**
కోటు లొసఁగి ప్రీతిఁ గూరిన మనముతో। నతనిఁ దత్పురమున కరుగఁ బనిచె. **208**

ప్రతిపదార్థం: ప్రీతిన్= సంతోషమును; కూరిన= పొందిన; మనముతోన్= మనస్సుతో; బభ్రువాహనునకున్= బభ్రువాహనుడికి; పరమ= మిక్కిలి; విశేషంబు= ఘనత; మెఱయన్= వెల్లడి కాగా; గారవించి= గౌరవించి; మేలి= శ్రేష్ఠమైన; వస్తు= వస్తువులయొక్క; కోటులు= సమూహాలు; ఒసఁగి= ఇచ్చి; అతనిన్= అతడిని; తద్= అతడియొక్క; పురంబునకున్= పట్టణానికి, రాజధానికి; అరుగన్= వెళ్ళగా; పనిచెన్= అనుమతించాడు, ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: ధర్మరాజు ప్రీతిపొందిన మనస్సుతో మహాఘనత వెల్లడయ్యేటట్లుగా గౌరవించి, బభ్రువాహనుడికి శ్రేష్ఠమైన వస్తుసముదాయా లిచ్చి, స్వరాజధానికి వెళ్ళటానికి అతడిని అనుమతించాడు.

క. **చిత్రాంగదయు నులూపి(చి)యు। వృత్రారి తనూజుపాల విభవమహితలై**
గోత్రావర! నిలువఁగ న। ద్ధాత్రీశుఁడు చనియె సమ్మదం బెలరారన్. **209**

ప్రతిపదార్థం: గోత్రా= భూమియొక్క; వర!= నాథుడా! రాజా!; చిత్రాంగదయున్= చిత్రాంగదయూ; ఉలూపి(చి)యున్= ఉలూపియూ; విభవ= ఉన్నతస్థితితో; మహితలు+ఐ= గౌరవించబడినవారై; వృత్ర= వృత్రుడికి; అరి= శత్రువైన, ఇంద్రుడియొక్క; తనూజ= కుమారుడు అర్జునుడియొక్క; పాలన్= దగ్గర; నిలువఁగన్= ఉండగా; ఆ+ధాత్రీ+ఈశుఁడు= ఆ రాజు, బభ్రువాహనుడు; సమ్మదంబు= సంతోషం; ఎలరారన్= అతిశయించగా; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: రాజా! ఉలూపీ చిత్రాంగదలు సముచితమైన హోదాను, గౌరవాన్ని పొంది అర్జునుడి దగ్గరనే ఉండగా బభ్రువాహనుడు సంతోషం అతిశయించగా తన నగరానికి వెళ్ళాడు.

తే. **మున్న చనుదెంచి ప్రీతిమై నున్న యట్టి। దుశ్శలకుఁ బెంపుఁ గలుగఁ దత్పుత్త్ర పుత్త్రు**
సింధుదేశంబునకు నభిషిక్తుఁ జేసె। దోహలమున నజాతశత్రుఁడు నరేంద్ర! **210**

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= రాజా!; అజాతశత్రుండు= ధర్మరాజు; దోహలమునన్= ఉత్సాహంతో; మున్ను+అ= ముందే; చనుదెంచి= వచ్చి; ప్రీతిమైన్= ఆనందంతో; ఉన్న+అట్టి= ఉన్నటువంటి; దుశ్శలకున్= దుశ్శలకు; పెంపున్= గొప్పతనమును; కలుగన్= కలుగగా; తద్= ఆమెయొక్క; పుత్ర= కుమారుడియొక్క; పుత్త్రున్= కుమారుడిని, దుశ్శల పౌత్రుడిని (మనుమడిని అని అర్థం); సింధుదేశంబునకున్= సింధుదేశానికి; అభిషిక్తున్= పట్టాభిషిక్తుడిని; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: రాజా! ముందుగానే వచ్చి ఆనందంగా కాలం గడపుతున్న దుశ్శలకు ఉన్నత స్థితి ప్రాప్తించగా ధర్మరాజు ఉత్సాహంతో ఆమె మనుమడిని సింధుదేశానికి పట్టాభిషిక్తుడిని చేశాడు.

క. తమ తమ దేశంబుల భూ। రమణుల నెల్లను విభక్తరాజ్యులు గా నె
య్యము నెఱయ నిలిపెఁ బాండు। క్ష్మారమణు పెద్దకొడుకు గౌరవముఖ్యా! 211

ప్రతిపదార్థం: కౌరవముఖ్యా!= కౌరవులలో అగ్రణీ!; పాండు= పాండువు అనే; క్ష్మారమణు= భూపతియొక్క, పాండురాజుయొక్క; పెద్దకొడుకు= మొదటివాడు ధర్మరాజు; నెయ్యము= ప్రేమ; నెఱయన్= పూర్ణముగా; తమతమ; దేశంబులన్= దేశాలలో; భూరమణులన్= రాజులను; విభక్త= విభజించబడిన; రాజ్యులు= రాజ్యాలు కలవారు; కాన్= అయ్యేటట్లు; నిలిపెన్= ప్రతిష్ఠించాడు.

తాత్పర్యం: పాండురాజు పెద్దకొడుకయిన ధర్మరాజు పరిపూర్ణ ప్రేమతో వారి వారి దేశాలలో ఎవరికి దక్కవలసిన రాజ్యాలను వారికి విభజించి ఇచ్చి రాజులనందరినీ సింహాసనాలమీద నిలిపాడు. ధర్మరాజు రాజులనందరినీ జయించిన వాడు. అయినప్పటికీ ఎవరిరాజ్యాలను వారికి తిరిగి ఇచ్చాడు. ఇది అతడి ఔదార్యానికి తార్కాణం.

వ. ఇత్తెఱంగున నెల్లరాజుల యుల్లంబులు ప్రమదంబునం బొందంజేసి వీడుకొలిపి, కృష్ణునకు నత్యుత్తమ వస్తు విస్తార మహోదారంబగు నుపహారం బిచ్చి దేవోపచారంబుల నారాధించి కృతార్థత్వంబు నొంది య ప్పార్థివోత్తముండు బలభద్రునకు భక్తియుక్తంబును వివిధ రత్నవిరాజితంబును నగు పూజా విశేషంబునం బరమసంతోషం బావహించి, సాత్యకి ప్రభృతి యాదవలోకంబున కతిలోకంబులగు నానావిధ పదార్థంబు లొసంగి, యయ్యం దఱుం దనచేత నుచిత ప్రకారంబుల నామంత్రితులై ద్వారకానగరంబున కరుగం, దాను మఱియు ననేక దేశాగతులైన జనంబుల నన్నపానంబులం గనక వస్త్రాది దానంబుల ననురక్తులం గావించి, మహా రావంబుల దిశలు పిక్కటిల్లం జెలంగు మంగళ తూర్యంబులు మొరయం బుణ్యపాఠకరవం బులు నానంద గానంబులు వినుచు మందిరంబునకుఁ జనుదెంచె నని చెప్పిన వైశంపాయనునకు జనమేజయుం డిట్లనియె. 212

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఎల్లన్+రాజుల= రాజులందరియొక్క; ఉల్లంబులు= హృదయాలు; ప్రమదంబునన్= ఆనందాన్ని; పొందన్= పొందగా; చేసి; వీడుకొలిపి= పోవ ననుమతించి; కృష్ణునకున్= కృష్ణుడికి; అతి= మిక్కిలి; ఉత్తమ= మంచివి అయిన; వస్తు= వస్తువులయొక్క; విస్తార= విరివిచేత; మహత్= పవిత్రమైనది; ఉదారంబు= ఘనమైనది; అగు= అయిన; ఉపహారంబు= కానుక; ఇచ్చి; దేవ= దేవుడియొక్క; ఉపచారంబులన్= సేవలచేత; ఆరాధించి= పూజించి; కృతార్థత్వంబున్= ధన్యతను; ఒంది= పొంది; ఆ+పార్థివ= ఆ రాజులలో; ఉత్తముండు= శ్రేష్ఠుడు; బలభద్రునకున్= బలరాముడికి; భక్తి= భక్తితో; యుక్తంబును= కూడినదియు; వివిధ= పలురకాలైన; రత్న= రత్నాలచేత; విరాజితంబును= ప్రకాశించేదియు; అగు= అయిన;

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

పూజావిశేషంబునన్= ఘనమైన పూజతో; పరమ= అధికమైన; సంతోషంబు= సంతోషం; ఆవహించి= కలిగించి; సాత్యకి; ప్రభృతి= మొదలైన; యాదవ= యాదవులయొక్క; లోకంబునకున్= సమూహానికి; అతిలోకంబులు= లోకాతీతాలు, లోకమునతిక్రమించినవి; అగు= అయిన; నానావిధ= అనేక విధాలైన; పదార్థంబులు= వస్తువులు; ఒసంగి= ఇచ్చి; ఆ+అందఱున్= ఆ అందరును; తనచేతన్= తనచేత; ఉచిత= తగిన; ప్రకారంబులన్= విధాలుగా; ఆమంత్రితులు= వీడ్కోలుపబడినవారు; ఐ= అయి; ద్వారకానగరంబునకున్= ద్వారకా నగరానికి; అరుగన్= వెళ్ళగా; తాను= ధర్మరాజు; మఱియున్= మరియు; అనేక= అనేకములైన; దేశ= దేశాలనుండి; ఆగతులు= వచ్చినవారు; ఐన= అయిన; జనంబులన్= జనాలను; అన్నములన్= అన్నాలచేత; పానములన్= పానీయాలచేత; కనక= బంగారము, బంగారు నాణెములు; వస్త్ర= వస్త్రాలు; ఆది= మొదలైన వాటియొక్క; దానంబులన్= దానాలచేత; అనురక్తులన్= తృప్తిపొందిన వారినిగా; కావించి= చేసి; మహత్= గొప్ప; రావంబులన్= ధ్వనులచేత; దిశలు= దిక్కులు; పిక్కటిల్లన్= నిండగా; చెలంగు= ధ్వనించుచున్న; మంగళతూర్యంబులు= మంగళవాద్యాలు; మొరయన్= మ్రోగగా; పుణ్య= మనోహరమైన; పాఠక= స్తోత్రపాఠకులయొక్క; రవంబులు= నాదాలు; ఆనంద= ఆనందంతో చేసే; గానంబులు= గానాలు; వినుచున్= వింటూ; మందిరంబునకున్= నిలయానికి; చనుదెంచెన్= వచ్చాడు; అని; చెప్పినన్= చెప్పగా; వైశంపాయనునకున్= వైశంపాయనుడితో; జనమేజయుండు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు రాజులనందరినీ సంతోషపెట్టి వీడ్కొలిపాడు. కృష్ణుడికి ఉత్తమోత్తమ వస్తువులతో కూడిన గొప్ప కానుకలిచ్చి అతడిని దేవుడివలె పూజించాడు. భక్తితో బలరాముడిని పూజించి అతడికి రత్నాలు సమర్పించి సంతోషం కలిగించాడు. సాత్యకి మొదలైన యాదవులకందరికీ లోకాతీతాలైన వస్తువులు సమర్పించాడు. తగినరీతిగా వీడ్కోలుపగా వారందరూ ద్వారకానగరానికి వెళ్ళిపోయారు. అనేక దేశాలనుండి వచ్చిన జనులను అన్నపానీయాలచేత సువర్ణ వస్త్ర దానాదులచేత సంతృప్తిపరిచాడు. మంగళవాద్య ధ్వనులు దిక్కులందంతటా నిండగా స్తోత్రపాఠాలూ ఆనందగానాలూ వింటూ స్వగృహానికి వచ్చాడు. ఈ విధంగా వైశంపాయనుడు అశ్వమేధయాగ వృత్తాంతం వినిపించిన తరువాత జనమేజయుడు అతడితో ఇట్లా అన్నాడు.

ఆ. 'అనఘ! మత్పితామహుని యశ్వమేధ యా। గంబు సమయమునఁ గరంబు విస్మ
యంబుఁ జేయఁ జాలునట్టిది యే మేనిఁ। గలిగెనేని వినఁగ వలతుఁ జెపుమ!' 213

ప్రతిపదార్థం: అనఘ!= పాపంలేనివాడా!; మత్= మాయొక్క; పితామహుని= తాతగారియొక్క; అశ్వమేధయాగంబు= అశ్వమేధయాగంయొక్క; సమయమునన్= సమయంలో; కరంబు= మిక్కిలి; విస్మయంబున్= ఆశ్చర్యం; చేయన్+చాలు= పుట్టించగలిగిన; అట్టి+అది= అటువంటి సంఘటన; ఏమి+ఏనిన్= కలిగితే; వినఁగన్+వలతున్= దానిని వినగోరుతాను; చెపుము+అ= చెప్పుము.

తాత్పర్యం: 'పుణ్యమూర్తీ! మా తాతగారు అశ్వమేధయాగం చేసేటప్పుడు అత్యాశ్చర్యకరమైన సంఘటన ఏదైనా సంభవించి ఉంటే దానిని వినగోరుతాను చెప్పుము.'

వ. అని యడిగిన యమ్మహీనాయకునకు వైశంపాయనుం డిట్లనియె. 214

ప్రతిపదార్థం: అని; అడిగిన, =అడిగినట్టి; ఆ+మహీ= ఆ భూమియొక్క; నాయకునకున్= నాథుడికి, రాజునకు; వైశంపాయనుండు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని అడిగిన ఆ రాజుతో వైశంపాయనుడు ఈ విధంగా అన్నాడు.

క. అమ్మెయిఁ బ్రభూతధనలా । భమ్మున భూమిఁ గలయట్టి బ్రాహ్మణు లెల్లన్
సమ్మద మొందఁగ హయమే । ధ మ్ముజ్జ్వలభంగి నొప్పెఁ దత్సమయమునన్. 215

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆ విధంగా; ప్రభూత= అత్యధికమైన; ధన= ధనంయొక్క; లాభమ్మునన్= లాభంచేత; భూమిన్= భూమియందు; కల+అట్టి= ఉన్నటువంటి; బ్రాహ్మణులు; ఎల్లన్= అందరును; సమ్మదము= సంతోషం; ఒందఁగన్= పొందగా; హయమేధమ్ము= అశ్వమేధం; ఉజ్జ్వల= ప్రకాశిస్తున్న; భంగిన్= విధంగా (అసామాన్యంగా అని అర్థం); ఒప్పెన్= ఒప్పారింది; తద్= ఆ; సమయమునన్= వేళయందు.

తాత్పర్యం: ఆ విధంగా భూమండలంలోని బ్రాహ్మణులందరూ అత్యధిక ధనప్రాప్తివలన ఆనందించగా అశ్వమేధయాగం లోకాతీతంగా నడచింది. ఆ వేళ. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. అఖిల జనములు నచ్చెరువంద ధర్మ । నందనుని మానసమున నానంద మొలయ
నతనిపై మకరంద ధారాభిశోభి । కుసుమవర్షంబు పెల్లుగఁ గురిసె నధిప! 216

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అఖిల= సమస్తమైన; జనములున్= జనులు; అచ్చెరువు= ఆశ్చర్యం; అందన్= పొందగా; ధర్మ= యముడియొక్క; నందనుని= కుమారుడు ధర్మరాజుయొక్క; మానసమునన్= మనస్సులో; ఆనందము; ఒలయన్= వ్యాపించగా; అతనిపైన్= అతడిమీద; మకరంద= తేనె; ధారా= జాలుచేత; అభిశోభి= శోభిల్లుతున్న; కుసుమ వర్షంబు= పూలవాన; పెల్లుగన్= ఎక్కువగా; కురిసెన్= కురిసింది.

తాత్పర్యం: రాజా! సమస్తజనులూ ఆశ్చర్యపడగా ధర్మరాజు మనస్సు ఆనందించగా అతడిమీద తేనె సోనలు జాలువారే పూలవాన కురిసింది.

వ. అట్టియెడ. 217

తాత్పర్యం: ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం)

సక్తుప్రస్థచరిత్రంబు నకులంబు బ్రాహ్మణులకుం జెప్పుట (సం. 14-92-5)

సీ. ఒక్కబిలంబుననుండి వెల్వడి యొక్క । నకులంబు విప్రజనంబు నడుమ
నిలిచి 'సక్తుప్రస్థు నలఘు ధర్మంబు నే । మియుఁ బోల దీ యశ్వమేధ' మనిన
నవ్విప్రు లతివిస్మయంబంది యమ్ముంగిఁ । గనుఁగొని 'మంత్రవర్తనముఁ దంత్ర
గమనికయును వివిధములైన దాన వి । ధులు బహుళ త్యాగములును లోక

తే. సంస్తుతము లయ్యెఁ; భక్తియు శ్రద్ధయును బ్రి । యంబు వినయంబు సురముని హర్ష మావ
హిల్లఁ జేసె; నీ వేమిట నిమ్మహాధ్వ । రంబుఁ గీ డంటి; చెప్పుమ! ప్రస్ఫుటముగ!' 218

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఒక్క= ఒకానొక; నకులంబు= ముంగిస; ఒక్క= ఒక; బిలంబునన్+ఉండి= కన్నంనుండి; వెల్వడి= బయటికి వచ్చి; విప్రజనంబు= బ్రాహ్మణులయొక్క; నడుమన్= మధ్య; నిలిచి; ఈ+అశ్వమేధము; ఏమియున్= ఏ మాత్రం; సక్తుప్రస్థ= సక్తుప్రస్థుడియొక్క; అలఘు= తక్కువకాని, గొప్ప; ధర్మంబున్= ధర్మమును; పోలదు; అనినన్= అనగా; ఆ+విప్రులు= ఆ బ్రాహ్మణులు; అతి= మిక్కిలి; విస్మయంబు= ఆశ్చర్యం; అంది= పొంది; ఆ+ముంగిసన్= ఆ ముంగిసను; కనుఁగొని= సూటిగా చూచి; మంత్ర= మంత్ర పఠనంయొక్క; వర్తనమున్= పద్ధతియు; తంత్ర= కర్మకాండంయొక్క; గమనికయును= విధానమును; వివిధములు= రకరకాలు; ఐన= అయిన; దాన= దానాలయొక్క; విధులు= కార్యాలు; బహుళ= అనేకములైన; త్యాగములును= త్యాగాలూ; లోక= లోకాలచేత; సంస్తుతములు= మిక్కిలి పొగడబడినవి; అయ్యెన్= అయినవి; భక్తియున్= భక్తియు; శ్రద్ధయును= శ్రద్ధయు; ప్రియంబున్= ప్రేమయూ; వినయంబున్= వినయమూ; సుర= దేవతలయొక్క; ముని= మునులయొక్క; హర్షము= సంతోషం; ఆవహిల్లన్+చేసెన్= కలిగించాయి; నీవు; ఏమిటన్= ఏ కారణంచేత; ఈ+మహత్= ఈ గొప్ప; అధ్వర్యంబున్= యజ్ఞమును; కీడు= తక్కువది; అంటి(వి)= అన్నావు; ప్రస్ఫుటముగన్= విస్పష్టంగా; చెప్పుము+అ!= చెప్పుమా!

తాత్పర్యం: ఒకానొక ముంగిస ఒక కన్నం నుండి బయటికివచ్చి బ్రాహ్మణులమధ్య ఉండి ' ఈ అశ్వమేధయాగం వీసమంత కూడా సక్తుప్రస్థుడి మహాధర్మాన్ని పోలదు' అని అన్నది. ఈ మాటలు విని బ్రాహ్మణులు ఆశ్చర్యపడ్డారు. వారు దానిని సూటిగా చూస్తూ 'ఈ యజ్ఞంలో మంత్రపఠనం, కర్మకాండ నిర్వహణం, వివిధ దానకార్యాలు, అనేక త్యాగాలు లోకాలచేత ప్రశంసించబడ్డాయి. ధర్మరాజు చూపిన భక్తిశ్రద్ధలు, అనురాగం, వినయం; దేవతలకూ, మునులకూ హర్షం కలిగించాయి. నీవు ఏ కారణంవలన ఈ మహాయజ్ఞాన్ని లొచ్చు అని అన్నావు. మాకు అర్థమయ్యేటట్లు చెప్పుము' అని అన్నారు.

వ. అనుటయు నన్నకులంబు వారల కిట్లనియె. **219**

ప్రతిపదార్థం: అనుటయున్= అని అనగా; ఆ+నకులంబు= ఆ ముంగిస; వారలకున్= వారితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: బ్రాహ్మణులమాటలు విని ఆ ముంగిస వారితో ఈ విధంగా అన్నది.

సీ. 'వినుఁడు ధర్మక్షేత్ర మన రూఢమైన కు। రుక్షేత్రమునయందు రోషకామ
విరహితుం డొక మహాద్విజుఁ డుంఛవృత్తిమై। నుండు; భార్యయుఁ దనయుండు నతని
„ ¤ß‡ Ç ‹ ¬ìK Ç ƒ ì=O| ° < ùOk = l i ê` Ç~@°“□° ` „Ç{ Å" ³□°OQ®
°<ß_È| °□°„ Θ@□x ß‡ Ç # ` Ç@` Çq H□O| °Qê # < Œ$+^ Ë+¬

` Í =¶=, ?e# # ` Ç Hê, ð~¡" ð # ~¡ l * è Hù# °@^ î~@=°~ò K ³□°Á ÇO_È
^¥~¡ # □°= ô~¡–[x ` $ ^ ¥# ¼ °□æ" íŽ Hùx = ` Çê~ŒHe n Ž ä½O_È 220

ప్రతిపదార్థం: వినుఁడు= వినండి; ధర్మక్షేత్రము= పుణ్యభూమి; అనన్= అనగా; రూఢము+ఐన= పేరుపొందినదైన; కురుక్షేత్రమున+అందున్= కురుక్షేత్రంలో; రోష= రోషం; కామ= కోరిక; విరహితుండు= లేనివాడు; ఒక= ఒకానొక; మహాద్విజుఁడు= గొప్ప బ్రాహ్మణుడు; ఉంఛవృత్తిమైన్= ఉంఛవృత్తితో, (ఉంఛము జీవికగా కలిగి; పొలాలు మున్నగువాటితో రాలిన గింజలను

ఏరుకొని తినటం ఉంఛవృత్తి); ఉండున్= బ్రతుకుతుండేవాడు; భార్యయున్= భార్యయూ; తనయుండున్= కుమారుడూ; అతని= కొడుకుయొక్క; పత్నియున్= భార్యయూ-కోడలు అని అర్థం; సహచర భావంబున్= సాహచర్యమును; ఒంది= పొంది, తోడుగా ఉండి; వర్తింతురు= నడచుకొందురు; అట్టులు= ఆ విధంగా; తపస్= తపస్సు అనెడి; శ్రీ= సంపద; వెలుంగగన్= ప్రకాశించగా; ఉన్న= ఉండిన; ఎడన్= వేళయందు; పులుపంటలు= గడ్డికాడలవలె ఉండే మొక్కలనుండి పండిన పంటలు, వరి గోధుమలు మొదలైనవి; అన్నియున్= అన్నియూ; అత్యంత= మిక్కిలి; వికలంబు= నశించినవి; కాన్= అయ్యేటట్లుగా; అనావృష్టి= వర్షం లేకుండటం అనే; దోషము= బాధ; ఆవహిల్లినన్= కలుగగా; అతనికిన్= సక్తుప్రస్థునకు; ఆహారము= తిండి; ఒనరన్+చేసికొనుట= సమకూర్చుకొనటం; దుర్ఘటము= అసాధ్యమైనది; అయి; చెల్లుచున్+ఉండన్= కొనసాగుతుండగా; తారు= వారు; నలువురున్= నలుగురును; చని= వెళ్ళి; తృణధాన్యము= విత్తకుండ గడ్డివంటి మొక్కలనుండి పుట్టు ధాన్యం, నివ్వరి మొదలైనవి; అల్పము= కొంచెం; ఏఱికొని= ఏరుకొని; వత్తురు= వస్తారు; ఆఁకలి= దానిచేత ఆకలి; తీఱక+ఉండున్= పోలేదు.

తాత్పర్యం: బ్రాహ్మణులారా! వినండి. పుణ్యభూమిగా ప్రసిద్ధికెక్కిన కురుక్షేత్రంలో ఒక గొప్ప బ్రాహ్మణు డున్నాడు. అతడు కోపతాపాలు లేనివాడు. కోరికలు లేనివాడు. పొలాలలో రాలిన గింజలు ఏరికొని తినేవాడు. అతడికి భార్యా కొడుకూ కోడలూ తోడుగా ఉంటారు. తపస్సే అతడికి సంపద. ఇట్లా ఉండగా ఒకసారి వానలు కురవలేదు. వరి గోధుమపంటలన్నీ బుగ్గి అయిపోయాయి. అతడికి తిండి దొరకటమే అసాధ్యమైనది. అతడూ, అతడి ఇల్లాలూ, కొడుకూ, కోడలూ నలుగురూ వెళ్ళి నివ్వరిధాన్యం ఏ కొంచెమో ఏరుకొని వస్తారు. దానివలన వారి ఆకలి తీరటం లేదు.

వ. అట్టియెడ నొక్కనాఁ డయ్యందఱును రేపు దొడంగి పడమటి జామునకు వెదకి తెచ్చిన పూరి కొలుచు ప్రస్థమాత్రంబు సక్తు వయ్యెం; గర్తవ్యానుష్ఠానంబులు నడపి యనంతరంబ యాకుంచెఁడు పేలపిండియుఁ జెఱిమానెండుగా నలువురును సమంబుగాఁ బంచికొని యుపయోగించువారై యున్న సమయంబున. 221

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయాన; ఒక్కనాఁడు= ఒకరోజు; ఆ+అందఱును= ఆ నలుగురునూ; రేపు= ఉదయం; తొడంగి= మొదలుకొని; పడమటి జామునకున్= ప్రొద్దు పడమటికి వ్రాలిన వేళదాక; వెదకి= వెతికి; తెచ్చిన; పూరికొలుచు= తృణధాన్యం, నివ్వరివడ్లు మొదలైనవి; ప్రస్థమాత్రంబు= నాలుగు మానికల కొలది (నాలుగు మానికల కొలత పాత్రకు, ప్రస్థము అని పేరు. దీనిని తెలుగులో కుంచము అంటారు); సక్తువు= పేలపిండి; అయ్యెన్= అయింది; కర్తవ్య= శాస్త్రోక్త కర్మముల యొక్క; అనుష్ఠానంబులు= చేయుటలు; నడపి; అనంతరంబు+అ= తరువాతనే; ఆ+కుంచెఁడు= ఆ నాలుగు మానికల; పేలపిండియున్= పేలపిండియు; చెఱి= ఒక్కొక్కరికి; మానెండు= మానిక కొలది; కాన్= వచ్చేటట్లుగా; నలువురును= నలుగురును; సమంబు+కాన్= సమానంగా; పంచికొని; ఉపయోగించువారు= ఉపయోగించుకొనటానికి సిద్ధంగా ఉన్నవారు; ఐ= అయి; ఉన్న సమయంబునన్= ఉన్నప్పుడు.

తాత్పర్యం: ఒకనాడు వారు నలుగురూ ఉదయంనుండి ప్రొద్దు పడమటికి వ్రాలేదాకా తృణధాన్యం వెదకి తెచ్చారు. అది నాలుగు మానికల పేలపిండి అయింది. ప్రతిదినమూ చేసే శాస్త్రోక్త కర్మములనన్నిటినీ చేసిన తరువాత వారు నలుగురూ ఆ కుంచెడు పేలపిండిని తలకొకమానెడు సమానంగా పంచుకొని ఉపయోగించుకొనటానికి సిద్ధంగా ఉన్నప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

యముఁడు సక్తుప్రస్థునికడ కతిథియై వచ్చుట (సం.14-93-11)

తే. **అతిథి యొక్కధరామరుం డరుగుదెంచెఁ; గని ప్రియంబున వా రెదుర్కొని సభక్తి**
కముగఁ బర్ణశాలాభ్యంతరమున కతనిఁ దోడికొనిపోయి యాసనస్థునిగఁ జేసి. 222

ప్రతిపదార్థం: అతిథి= భోజన సమయానికి వచ్చినవాడైన, బాటసారి అయిన; ఒక్క= ఒకానొక; ధరా+అమరుండు= భూమియందు దేవత, బ్రాహ్మణుడు; అరుగుదెంచెన్= వచ్చారు; వారు= ఆ నలువురు; కని= చూచి; ప్రియంబునన్= సంతోషంతో; ఎదుర్కొని= ఎదురుగా వెళ్ళి; సభక్తికముగన్= భక్తితో కూడి ఉండేటట్లుగా; అతనిన్= అతడిని; పర్ణశాలా= పర్ణశాలయొక్క; అభ్యంతరమునకున్= లోపలికి; తోడికొనిపోయి= తీసికొనిపోయి; ఆసనస్థునిగన్= పీఠమున ఉన్నవాడినిగా; చేసి= చేసి.

తాత్పర్యం: బాటసారి అయిన ఒక బ్రాహ్మణుడు ఆ సమయానికి వచ్చాడు. వారు నలుగురూ చూచి సంతోషంతో అతడికి ఎదురుగా వెళ్ళి అతడిని పర్ణశాలలోనికి తీసికొనిపోయి పీటమీద కూర్చుండబెట్టి. (తరువాతి పద్యంతో అన్వయం)

చ. **అడుగులు గడ్గి ప్రీతి యెసలారఁగఁ దద్దయు నెమ్మిఁ బల్కి; ర**
ప్పుడు మది పల్లవింప మునిపుంగవుఁ డాతని కాత్మభాగ మె
క్కు డగు వినీతిఁ జూపి 'బుధకుంజర! నిర్దురితార్జనంబునం
బడసిన యట్టి సక్తువు; కృపారతి నాఁకలి దీనఁ దీర్పవే!' 223

ప్రతిపదార్థం: అడుగులు= పాదాలు; కడ్గి= కడిగి; ప్రీతి= సంతోషం; ఎసలారఁగన్= అతిశయించగా; తద్దయున్= మిక్కిలి; నెమ్మిన్= ప్రీతితో; పల్కిరి= మాటాడారు; అప్పుడు= ఆ సమయంలో; మునిపుంగవుఁడు= మునిశ్రేష్ఠుడు; ఎక్కుడు= అధికమైన; వినీతిన్= వినయంతో; ఆత్మభాగము= తనవంతుగా వచ్చిన పేలపిండిని; చూపి= చూపించి; మది= అతిథియొక్క, మనస్సు; పల్లవింపన్= రక్తి పొందగా, సంతోషించగా; బుధకుంజర!= బ్రాహ్మణశ్రేష్ఠా!, పండితశ్రేష్ఠా; నిర్+దురిత= పాపంలేని; ఆర్జనంబునన్= సంపాదనంలో; పడసిన+అట్టి= పొందినటువంటి; సక్తువు= పేలపిండి; కృపా= దయయందలి; రతిన్= ఆసక్తితో; దీనన్= ఈ పేలపిండితో; ఆఁకలి= ఆకలి; తీర్పుము+ఏ!= తీర్చుకొనుమూ!

తాత్పర్యం: ఆ నలుగురూ బాటసారి కాళ్ళు కడిగి పరమ ప్రీతితో కుశల సంభాషణం నడిపారు. అప్పుడు మునిశ్రేష్ఠుడు తనవంతుకు వచ్చిన పేలపిండిని వినయంతో చూపి 'బ్రాహ్మణ శ్రేష్ఠా! ఈ పేలపిండి పాపంచేసి సంపాదించినది కాదు. దీనితో ఆకలి తీర్చికొనుము.

విశేషం: (తీర్పవే-తీర్పుము+ఏ= ఏదాదు లనుప్రయుక్తంబులగునపుడు మజ్జునకు వుజీరుజీ యగు. బా. వ్యాక్రి.34)

వ. **అని సమర్పణంబు చేసిన నమ్మహీసురోత్తముం డాసక్తు వుపయోగించె; దాన నతండు తృప్తిం బొందకునికి యమ్ముని గనుంగొని 'యేమిట నితండు తృప్తుం డగు? నెట్లు చేయుదు నొకో' యను విచారంబు వొడమి డోలాయమాన మానసుం డయ్యెం; దదీయభార్య తదింగితం బూహించి యతనితోడ.** 224

ప్రతిపదార్థం: అని; సమర్పణంబు చేసినన్= సమర్పించగా; ఆ+మహీసుర= ఆ బ్రాహ్మణులయందు; ఉత్తముండు= శ్రేష్ఠుడు; ఆ సక్తువు= ఆ పేలపిండిని; ఉపయోగించెన్= తిన్నాడు; దానన్= తనవంతు పేలపిండిచేత; అతండు= ఆ బ్రాహ్మణుడు; తృప్తిన్= తృప్తిని; పొందక; ఉనికి= ఉండటం; ఆ ముని; కనుంగొని= చూచి; ఏమిటన్= దేనిచేత; ఇతండు= ఇతడు; తృప్తుండు=

తృప్తిపొందినవాడు; అగున్= ఔతాడు; ఎట్లు= ఏ విధంగా; చేయుదున్+ఒకో?= తృప్తిపరతును? (ఒకో ఇచ్చట ప్రశార్థకము); అను= అనే; విచారంబు= ఎటూ తోచని స్థితి; పొడమి= కలిగి; డోలాయమాన= ఆందోళనపడుతున్న; మానసుండు= మనస్సు కలవాడు; అయ్యెన్= అయినాడు; తదీయ= అతడియొక్క; భార్య; తద్= అతడియొక్క; ఇంగితంబు= మనస్సులోని అభిప్రాయం; ఊహించి= ఊహించి తెలిసికొని; అతనితోడన్= అతడితో.

తాత్పర్యం: ఆ ముని ఈ విధంగా అని తనవంతు పేలపిండిని సమర్పించాడు. ఆ బ్రాహ్మణుడు ఆ పిండిని తిన్నాడు. కాని, అతడికి తృప్తి కలుగలేదు. దీనిని గమనించి ఆ ముని 'దేనివలన ఇతడు సంతృప్తుడౌతాడు ఏ విధంగా ఇతడికి తృప్తి కలిగించాలి?' అని దిక్కు తోచని స్థితివలన మనస్సులో ఆందోళన పడ్డాడు. అప్పుడు అతడి భార్య అతడి మనస్సులోని అభిప్రాయం తెలిసికొని. (తరువాతి పద్యంతో అన్వయం)

క. **'నాపాలి సక్తు విచ్చెద; । నీ పురుషునిఁ దృప్తుఁ జేయు మీ!' వనిన నతం**
డా పొలఁతి డప్పియును సం । దీపిత జఠరాగ్నియైన తెఱఁగును గనుచున్. **225**

ప్రతిపదార్థం: నా పాలి సక్తువు= నా భాగం పేలపిండిని; ఇచ్చెదన్= సమర్పిస్తాను; ఈవు= నీవు; ఈ పురుషుని= ఈ బ్రాహ్మణుడిని; తృప్తున్= తృప్తి కలవాడినిగా; చేయుము; అనినన్= అనగా; అతండు= ఆ ముని; ఆ పొలఁతి= ఆ స్త్రీ, భార్య; డప్పియును= ఆయాసమునూ; సందీపిత= మిక్కిలి, మండుచున్న; జఠర+అగ్ని= ఆకలిచిచ్చు; ఐన= కలదైన; తెఱఁగును= స్థితియూ; కనుచున్= కనులారా చూస్తూ.

తాత్పర్యం: 'నా వంతు పేలపిండి సమర్పిస్తాను. మీ రీ బ్రాహ్మణుడిని తృప్తిపరచండి' అని అన్నది. అప్పుడు ఆ ముని తన భార్య ఆయాసమూ, ఆకలిచిచ్చునూ కనులారా చూస్తూ. (తరువాతి వచనంతో అన్వయం)

వ. **ఇట్లనియె.** **226**

ప్రతిపదార్థం: (ఇట్లు+అనియెన్)

తాత్పర్యం: ఈ విధంగా అన్నాడు.

క. **'మృగములుఁ బక్షులు లోనుగఁ । దగు నాహారములు దెచ్చి తమ ప్రియలకు నిం**
పుగ నిచ్చు; నాకుఁ గొనఁగాఁ । దగునె భవద్భోజ్య మైన ద్రవ్యము సాధ్వీ! **227**

ప్రతిపదార్థం: సాధ్వీ!= ఉత్తమాంగనా!; మృగములున్= జంతువులూ; పక్షులున్= పక్షులూ; లోనుగన్= మొదలైనవి కూడా; తగు= తగిన; ఆహారములు; తెచ్చి= వెదకి తెచ్చి; తమ= తమయొక్క; ప్రియలకున్= భార్యలకు; ఇంపుగన్= ప్రీతి కలుగగా; ఇచ్చున్= పెట్టుతాయి; భవత్= నీచేత; భోజ్యము= భుజింపదగినది; ఐన= అయిన; ద్రవ్యము= పదార్థం; నాకున్= నాకు; కొనఁగాన్= పుచ్చుకొనగా; తగును+ఎ?= తగునా?

తాత్పర్యం: 'ఉత్తమాంగనా! నోరు లేని జంతువులూ పక్షులూ వెదకి తెచ్చిన తిండి ప్రేమతో తమ భార్యలకు పెట్టుతున్నాయి. అటువంటప్పుడు నీవు భుజించదగిన పదార్థాన్ని నేను తీసికొనటం తగునా?

వ. **స్త్రీ సంతోషించు తెఱం । గాస పడని మనసు గలుగునట్టి యధముఁ డి**
చ్చో సడిఁ గనుఁ జని యచ్చో । గాసింబడు జముని భటులు గాఱియ వెట్టన్'. **228**

ప్రతిపదార్థం: స్త్రీ; సంతోషించు= సంతోషించే; తెఱంగు= తీరును; ఆసపడని= కోరని; మనసు; కలుగు+అట్టి= కలిగినట్టి; అధముఁడు= నీచుడు; ఇచ్చోన్= ఈ లోకంలో; సడిన్= అపకీర్తిని; కనున్= పొందుతాడు; చని= మరణించి; అచ్చోన్= ఆ లోకంలో, నరకలోకంలో; జముని= యముడియొక్క; భటులు; కాఱియ+పెట్టన్= హింసించగా; గాసిన్+పడున్= బాధపొందుతాడు.

తాత్పర్యం: తన భార్య సంతోషించేతీరు కోరని నీచుడు ఈ లోకంలో అప్రతిష్ఠ పాలవుతాడు. నరకలోకంలో యమభటులు హింసిస్తుంటే బాధపడతాడు.'

వ. అనిన విని యవ్వనిత యతని వదనంబునం జూడ్కి నిలిపి. 229

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; విని; ఆ+వనిత= ఆ స్త్రీ - మునిభార్య; అతని= మునియొక్క; వదనంబునన్= ముఖమునందు; చూడ్కి= చూపు; నిలిపి= పెట్టి.

తాత్పర్యం: ఆ మాటలు విని మునిపత్ని అతడి ముఖాన్ని సూటిగా చూచి. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. 'పతియ చుట్టంబుఁ బక్కంబుఁ బతియ చెలియుఁ। బతియ తల్లియుఁ దండ్రియుఁ బతియ గురువుఁ
బతియ దైవంబుఁ గావున నతనిపని యొ। నర్చుటయఁ జూవె ధర్మంబు నాతి కరయ. 230

ప్రతిపదార్థం: అరయన్= పరిశీలించగా; నాతికిన్= స్త్రీకి; పతి+అ= భర్తయే; చుట్టంబున్= చుట్టమూ; పక్కంబున్= తోడూ; పతి+అ= మగడే; చెలియున్= మిత్రుడూ; పతి+అ= నాథుడూ; తల్లియున్= తల్లియూ; తండ్రియున్= తండ్రియూ; పతి+అ= భర్తయే; గురువున్= గురువు; పతి+అ= నాథుడే; దైవంబు= దేవుడు; కావునన్= కావున; అతని= భర్తయొక్క; పని; ఒనర్చుట+అ= చేయుటే; ధర్మంబు= ధర్మం; చూవె!= సుమా!.

తాత్పర్యం: 'స్త్రీకి చుట్టమైనా, తోడైనా, మిత్రుడైనా, తల్లి అయినా, తండ్రిఅయినా, గురువు అయినా, దేవుడైనా, భర్తయే. కాబట్టి ఆమెకు మగనిపని చేయటం ధర్మం.

విశేషం: ఈ పద్యం యథాతథంగా నిర్వచనోత్తర రామాయణంలో (ఆ. 9. పద్య 29) ఉన్నది.

వ. అట్లుంగాక. 231

తాత్పర్యం: అదియును గాక (తరువాతి పద్యంతో అన్వయం).

క. మానితగుణ! నీ వాఁకలి। తో నుండఁగ నేటిపాలు; దోషం బిది; యి
ట్లే నాహారము గొందునె?;। యీ నిర్మలమతికి దీని ని మ్ముచిత విధిన్.' 232

ప్రతిపదార్థం: మానిత= గౌరవించబడిన; గుణ= సుగుణాలు కలవాడా!; నీవు; ఆఁకలితోన్= ఆకలితో; ఉండఁగన్= బాధపడుతుండగా; ఏటి పాలు?= భాగ మేమిటి?; ఇది= ఈ భాగమును అనుభవించటం; దోషంబు= పాపం; ఇట్లు= ఈ విధంగా, నీవు ఆకలితో బాధపడుచుండగా ఈ విధంగా భాగము తీసికొని; ఏను= నేను; ఆహారము= తిండి; కొందును+ఎ?; దీనిన్= నా వంతు పేలపిండిని; ఉచిత విధిన్= తగిన ధర్మం ప్రకారం; ఈ నిర్మల= ఈ మచ్చలేని; మతికిన్= మనస్సు కలవాడికి; ఇమ్ము= అర్పించుము.

తాత్పర్యం: సద్గుణ సంపన్నా! నీవు ఆకలితో మలమలమాడుతుండగా నాకు భాగమేమిటి? భాగాన్ని తీసికొనటం పాపం కదా? ఈ విధంగా నేను తిండి తింటానా? నావంతు పేలపిండిని ధర్మప్రకారం మచ్చలేని మనస్సు కలిగిన ఆ బ్రాహ్మణుడికి అర్పించుము.'

చ. **అని తనసక్తు విచ్చినఁ బ్రియమ్మున నమ్ముని యమ్మహాద్విజుం**
గనుఁగొని 'డప్పి వో దిదియుఁ గైకొను' మన్న నతండు ప్రీతి నె
క్కొన భుజియించి వెండియును గూరఁడ తృప్తిఁ; దదంతరంగముం
గనుఁగొని యత్తపస్విపతి గ్రమ్మఱ నెమ్మదిఁ జింత నొందినన్. **233**

ప్రతిపదార్థం: అని; తన; సక్తువు= పేలపిండి; ఇచ్చినన్= అర్పించగా; ప్రియమ్మునన్= సంతోషంతో; ఆ+ముని= ఆ ముని; ఆ+మహా= గొప్ప; ద్విజున్= బ్రాహ్మణుడిని; కనుఁగొని= చూచి; డప్పి= ఆకలివలన కలిగిన బడలిక; పోదు= పోలేదు; ఇదియున్= ఈ పేలపిండి కూడా; కైకొనుము= స్వీకరించుము; అన్నన్= అనగా; అతండు= ఆ అతిథి; ప్రీతి= ఆనందం; నెక్కొనన్= కలుగగా; భుజియించి= తిని; వెండియును= మరియునూ; తృప్తిన్= తృప్తిని; కూరఁడు+అ= పొందనే పొందడాయెను; ఆ+తపస్వి= ఆ మునియొక్క; పతి= నాథుడు, మునిరాజు; తద్= ఆ అతిథియొక్క; అంతరంగమున్= మనస్సును; కనుఁగొని= గ్రహించి; క్రమ్మఱన్= మరల; నెమ్మదిన్= మనస్సులో; చింతన్= విచారాన్ని; ఒందినన్= పొందగా.

తాత్పర్యం: అని మునిపత్ని తనవంతు పేలపిండి ఇచ్చింది. అప్పుడు ముని ఆ బ్రాహ్మణుడిని చూచి 'మీ ఆకలి తీరనట్లున్నది. దీనిని కూడా స్వీకరించండి' అని అన్నాడు. ఆ అతిథి దానిని తిని కూడా తృప్తిని పొందనే పొందలేదు. మునినాథుడు అతడి మనస్సును గ్రహించి మరలా విచారం పొందగా. (తరువాతి వచనంతో అన్వయం)

వ. **తదీయ తనయుండు తద్దశావిశేషం బెఱింగి.** **234**

ప్రతిపదార్థం: తదీయ= ఆ మునియొక్క; తనయుండు= కుమారుడు; తద్= ఆ; దశావిశేషంబు= అధికమైన దుఃఖస్థితిని; ఎఱింగి= గ్రహించి.

తాత్పర్యం: ఆ మునీశ్వరుడి కుమారుడు తండ్రి శోచనీయస్థితిని గ్రహించి. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. **తనపాలి సక్తువుఁ దండ్రికిఁ జూపి 'యీ। యతిథిఁ దృప్తునిఁ జేయు మనఘ! దీనఁ;**
దనయుండు దండ్రి చిత్తమున నెక్కొనిన కృ। త్యం బాచరించుట యర్థధర్మ;
మన విని యమ్మహాముని 'యెంత ప్రాయంబు। చనినను విను జనకునకు సుతుఁడు
బాలుండ; యాఁకలి బాలుర కగ్గల;। మట్లు గావున నిది యనుచితంబు';

తే. **నావుడును 'దాన పుత్త్రుఁ డనంగ విందు;। నన్నుఁ గాచుట యరయంగ నిన్నుఁ గాచి**
కొనుట; యిప్పిండి యమ్మహాత్మునకు నిచ్చి। కావవే! నన్నుఁ; గారుణ్యభావితాత్మ!' **235**

ప్రతిపదార్థం: తన= తనయొక్క; పాలు= భాగమైన; సక్తువున్= పేలపిండిని; తండ్రికిన్= తండ్రికి; చూపి; అనఘ!= పాపరహితుడా!; దీనన్= ఈ పేలపిండితో; అతిథిన్= అతిథిని; తృప్తున్= తృప్తిగలవాడినిగా; చేయుము; తనయుండు= కుమారుడు; తండ్రి=

తం(డియొక్క; చిత్తమున్= మనస్సులో; నెక్కొనిన= గట్టిగా ఉండిన; కృత్యంబు= పని; ఆచరించుట= చేయటం; అర్హ= తగిన; ధర్మము; అనన్= అనగా; విని; ఆ+మహా= గొప్ప; ముని; విను= వినుము; ఎంత; (ప్రాయంబు= వయస్సు; చనినను= కడచినను; జనకునకున్= తం(డికి; సుతుఁడు= కుమారుడు; బాలుండు+అ= బాలుడే; బాలురకున్= బాలకులకు; ఆఁకలి= ఆకలి; అగ్గలము= ఎక్కువ; అట్లు+కావునన్= ఆ కారణంచేత; ఇది= నీ పిండితో అతిథిని తృప్తిపరచుట; అనుచితంబు= తగినది; నావుడును= అని అనగా; తాను+అ= తానే, తం(డియే; పు(త్తుఁడు= కుమారుడు; అనంగన్= చెప్పగా; విందున్= వింటాను; నన్నున్= నన్ను; కాచుట= కాపాడటం; అరయంగన్= పరిశీలించగా; నిన్నున్= నిన్ను; కాచికొనుట= అధర్మంవలన కాపాడుకొనటం; ఈ పిండి= ఈ పేలపిండి; ఈ మహా= గొప్ప; ఆత్మునికిన్= మనస్సు కలవాడికి; ఇచ్చి; కారుణ్యా= దయచేత; భావిత= పొందబడిన; ఆత్మా= ఆత్మకలవాడా?; నన్నున్= నన్ను; కావవే!= కాపాడుమా!

తాత్పర్యం: మునికుమారుడు తన పేలపిండిని తం(డికి చూపి 'పుణ్యపురుషా! ఈ పిండిచేత అతిథిని తృప్తిపరచుము. తం(డి చేయదలచిన పనిని చేయటం కుమారుడి ధర్మం' అని అన్నాడు. అప్పుడు ముని కొడుకుతో 'కుమారుడు ఎంత పెద్దవాడయినా అతడు తం(డికి బాలుడుగానే కనబడతాడు. బాలురకు ఆకలి ఎక్కువ. కావున నీ పేలపిండి తీసికొనటం తగనిపని' అని పలికాడు. అప్పుడు మునికుమారుడు 'తం(డియే కుమారుడు అని వేదం చెప్పుతున్నది కదా! ఆలోచించగా నన్ను కాపాడటం నిన్ను కాపాడుకొనటమే. దయాంతరంగా! ఈ పిండి ఈ మహాత్ముడికి ఇచ్చి నన్ను కాపాడుము'.

విశేషం: తాన పు(త్తుఁ డనంగ విందు - తం(డియే కుమారుడు, తం(డియే కుమారుడుగా జన్మిస్తాడని వేదం చెప్పుతున్నది. ఆదిపర్వంలో (ఆశ్వా. 4-85) శకుంతల దుష్యంతుడితో 'పురుషుండు భార్యయందుఁ (బవేశించి గర్భమునఁ బు(త్తుండై తాన యుద్భవిల్లుఁ గాన "నజ్గాదజ్గాత్సంభవసి" యనునది యాదిగాఁగల వేదవచనంబుల యందును జనకుండును బు(త్తుండును నను భేదంబు లేదు' అని చెప్పును.

సంస్కృతభారతంలో ఈ సందర్భాన

"వేదేష్వపి వదన్తీమం మ(న్త్రవాదం ద్విజాతయః।
జాతకర్మణి పు(త్రాణాం తవాపి విదితం తథా ॥

"అజ్గాదజ్గా త్సంభవసి హృదయా దభిజాయసే।
ఆత్మా వై పు(త్రనామాసి స జీవ శరదః శతమ్॥

"పోషోహి త్వదధీనో మే సంతాన మపి చాక్షయమ్।
తస్మాత్ త్వం జీవ మే వత్స సుసుఖీ శరదాం శతమ్"

అనే శ్లోకాలు గలవు. వీటిని శకుంతలయే చెప్పినది. (భండార్కర్ ఓరియంటల్ ఇన్స్టిట్యూట్ మహాభారత (ప్రతి. అధ్యా 68. శ్లో. 61.62.63).

'(బాహ్మణులు పు(త్రుల జాతకర్మములందు వేదములందలి మం(త్రసమూహమును ఇట్లు పఠింతురు. నీకు నవి చక్కఁగాఁ దెలిసినట్టివే. అవి ఏవనగా? - నా యొక్కొక్కయంగమునుండి నీవు జనించియున్నావు. నా హృదయము నుండియు నెక్కుడు గాఁగలిగి యున్నావు. పు(త్రుఁ డను పేరు గల నేనేయై నీ వున్నావు. అట్టి నీవు నూఱేండ్లు జీవించి యుండుము. నా పోషణము నీ వలననే కలుగవలసి యున్నది. నా సంతానమును నీ వలననే మాయకుండవలసి యున్నది. కాబట్టి నా పు(త్రా! అట్టి నీవు నూరేండ్లు సుఖముగా జీవించి యుండుమా!' (దేవరాజ సుధీమణి (ప్రణీతము; ఆదిపర్వము ద్వితీయభాగము. పుటలు 524-525 ఆర్. వెంకటేశ్వర్ అండ్ కంపెనీవారి (ప్రతి. 1926).

వ. అనినం గొడుకు మాటలకు నమ్మహితాత్ముండు ప్రీతాత్ముండై యాసక్తు వాయతిథి కిచ్చినం బుచ్చికొని యతం డుపయోగించె; దానను నాఁకలి వోని తెఱంగు దోఁ చిన నయ్యంచిత వ్రతునిడెందంబు గుందు నొందినం గోడలు తదాకార ప్రకారంబు గని తనయంశంబైన పిండి మామముందటికిం దెచ్చి. 236

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; కొడుకు= కొడుకుయొక్క; మాటలకున్= మాటలకు; ఆ+మహిత= గౌరవించబడిన,గొప్పది అయిన; ఆత్ముండు= ఆత్మకలవాడు; ప్రీత= సంతోషించిన; ఆత్ముండు+ఐ= ఆత్మకలవాడై; ఆ సక్తువు= ఆ పేలపిండిని; ఆ అతిథికిన్= ఆ అతిథికి; ఇచ్చినన్= అర్పించగా; పుచ్చికొని= స్వీకరించి; అతండు= అతడు; ఉపయోగించెన్= తిన్నాడు; దానను= దానిచేత కూడా; ఆఁకలి= ఆకలి; పోని= తీరని; తెఱంగు= వాలకం; తోఁచినన్= కనబడగా; ఆ+అంచిత= గౌరవించబడిన; వ్రతుని= సదాచారం కలిగినవాడియొక్క; డెందంబు= హృదయం; కుందున్= విచారం; ఒందినన్= పొందగా; కోడలు; తద్= ఆ మునీశ్వరుడియొక్క; ఆకార= హృదయభావాలను సూచించే ముఖ వికారముయొక్క; ప్రకారంబు= విధం; కని= చూచి; తన= తనయొక్క; అంశంబు= భాగం; ఐన= అయిన; పిండి= పిండిని; మామ= మామయొక్క; ముందటికిన్= ముందుకు; తెచ్చి= పెట్టి.

తాత్పర్యం: ఈ విధంగా అనిన కొడుకు మాటలకు ఆ మహాత్ముడు సంతోషించి అతడి పేలపిండిని అతిథికి సమర్పించాడు. అతిథి దానిని తిన్నాడు కాని, అతడి ఆకలి తీరలేదు. ఇది చూచి మునీశ్వరుడు హృదయతాపం పొందాడు. ఆ తాపాన్ని సూచించే అతడి ముఖాకృతిని కోడలు చూచింది. ఆమె తన వంతు పిండిని మామగారిముందు పెట్టి. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'ఇదియును నతిథికి నిం' డన్న 'నక్కట! యాఁకటఁ దలరి నీ యంగకములు
శిథిలంబు లైనవి; చేర్పడి యున్నది। చిత్తంబు; దీనిఁ బుచ్చికొని నిన్ను
డప్పితో నుండంగ నెప్పాటఁ జూడఁగ। లాఁడ నే' ననుడు నాలలన 'మీరు
మద్గురు గురులరు; మహిత శుశ్రూషకుఁ। గాదె ప్రాణములు నంగములుఁ గలిమి;

తే. విహిత మిటు సేఁత నా; కనువృత్తి శీలఁ। గాఁగఁ జేయుండు నన్ను మీ కరుణ యలర'
ననిన సంయమివరుఁ డియ్యకొని యతనికి। నచ్చెలువపాలి సక్తువు నర్థి నిచ్చె. 237

ప్రతిపదార్థం: ఇదియును= దీనినికూడా; అతిథికిన్= అతిథికి; ఇండు= సమర్పించుడు; అన్నన్= అనగా; అక్కట!= అయ్యో!; నీ= నీయొక్క; అంగకములు= సుకుమారమైన అవయవములు; ఆఁకటన్= ఆకలిచేత; తలరి= సత్తువ కోల్పోయి; శిథిలంబులు= సడలినివి; ఐనవి= అయినవి; చిత్తంబు= మనస్సు; చేర్పడి= కలతపొంది; ఉన్నది; దీనిన్= ఈ పేలపిండిని; పుచ్చికొని= తీసికొని; డప్పితోన్= బడలికతో; ఉండంగన్= బాధపడుతుండగా; నేన్= నేను; ఏ+పాటన్= ఏ విధంగా; నిన్నున్= నిన్ను; చూడన్+కలాఁడన్= చూడగలవాడను; అనుడున్= అని అనగా; ఆ లలన= ఆ స్త్రీ, కోడలు; మీరు; మత్= నా యొక్క; గురు= గురువునకు; గురులరు= గురువులు; ప్రాణములున్= ప్రాణాలను; అంగములున్= అవయవాలను; కలిమి= కలిగియుండుట; మహిత= గౌరవించబడినవారియొక్క, పూజ్యులయొక్క; శుశ్రూషకున్= ఉపచారముకొరకు; కాదు+ఎ!= కదా!; నాకున్= నాకు; ఇటు= ఇట్లు; చేఁత= చేయటం; విహితము= ఆజ్ఞ, శాసనం, విధి; మీ= మీయొక్క; కరుణ= దయ; అలరన్= ఒప్పగా; నన్నున్= నన్ను; అనువృత్తి= పెద్దలను అనుసరించటమే; శీలన్= శీలంగలదానను; కాఁగన్= అయ్యేటట్లుగా; చేయుండు= చేయుడు; అనినన్= అనగా; సంయమి= మునులలో; నరుఁడు= పతి; ఇయ్యకొని= ఒప్పుకొని; అర్థిన్= ప్రీతితో; అతనికిన్= అతిథికి; ఆ+చెలువ= ఆ స్త్రీయొక్క, కోడలియొక్క; పాలు= భాగమైన; సక్తువున్= పేలపిండిని; ఇచ్చెన్= సమర్పించాడు.

తాత్పర్యం: 'దీనిని కూడా అతిథికి సమర్పించుడు' అని కోడలు అన్నది. ఆ మాటలు విని ఋషీశ్వరుడు 'అయ్యో! ఆకలిచేత నీ అవయవాలు సత్తువలేక సడలిపోయాయి. నీ మనస్సు వ్యాకులత చెందింది. ఈ పేలపిండిని తీసికొని, నీవు అలసి సొలసి ఉండగా నేను ఏ విధంగా చూడగలను?' అని అన్నాడు. అప్పుడు కోడలు 'మీరు నా గురువునకే గురువులు, ప్రాణాలు గానీ, అవయవాలు గానీ మహాత్ముల సేవకే అంకితాలు కదా! ఈ పేలపిండి ఇవ్వటం నా విధి. మీరు దయతో నేను పెద్దలను అనుసరించే స్వభావం కలదానని నిరూపించుడు' అని పలికింది. ఆ మునిపతి ఆ మాటలకు ఒప్పుకొని కోడలివంతుకు వచ్చిన పేలపిండిని ప్రీతితో అతిథికి సమర్పించాడు.

విశేషం: మీరు మద్గురు గురులరు= కోడలికి భర్త గురువు. ఆ గురువు తండ్రి అయిన మునీశ్వరుడును గురువే. గురువు అనగా తండ్రి అని అర్థం. కావున మామ అగు ముని కోడలికి గురువుయొక్క గురువు ఔతున్నాడు.

ఉ. **ఇచ్చినఁ బ్రీతిఁ బుచ్చికొని యింపెసలార భుజించి తృప్తిమై**
నచ్చుపడంగ మెచ్చున ముఖాంబురుహం బలరంగ నిట్లనుం
బొచ్చెము లేక యయ్యతిథి 'భూరిగుణోత్తర! నిన్నుఁ జూడఁగా
వచ్చితి; నేను ధర్ముఁడ; భవద్వ్రతశీలతఁ జూచి మెచ్చితిన్. **238**

ప్రతిపదార్థం: ఇచ్చినన్= సమర్పించగా; ఆ+అతిథి= ఆ అతిథి; ప్రీతిన్= సంతోషంతో; పుచ్చికొని= తీసికొని; ఇంపు= వేడుక; ఎసలారన్= అతిశయించగా; భుజించి= తిని; తృప్తి; మైన్= శరీరమునందు; అచ్చుపడంగన్= గోచరించగా; ముఖ+అంబురుహంబు= పద్మంవంటి ముఖం; మెచ్చునన్= మెప్పుతో; అలరంగన్= వికసించగా; పొచ్చెము= కొరత; లేక; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; భూరి= అత్యధికమైన; గుణ= సద్గుణములచేత; ఉత్తర!= శ్రేష్ఠుడా!; నిన్నున్= నిన్ను; చూడఁగాన్= చూచుటకై; వచ్చితిన్= వచ్చాను; నేను; ధర్ముఁడన్= యముడను; భవత్= నీ యొక్క; వ్రత= సదాచారాలను పాటించే; శీలతన్= శీలంగలవాడి ధర్మమును, శీలమును; చూచి; మెచ్చితిన్= మెచ్చాను.

తాత్పర్యం: మునిపతి సమర్పించగా అతిథి సంతోషంతో పేలపిండిని తీసికొని వేడుకతో తిన్నాడు. అతడి శరీరమునందు తృప్తీ, ముఖంలో మెప్పూ కనబడ్డాయి. అతడు మునీశ్వరుడితో 'సద్గుణశ్రేష్ఠా! నిన్ను చూడటానికి వచ్చాను. నేను యముడిని, నీ సదాచార ప్రకృతిని చూచి మెచ్చుకొన్నాను' అని హృదయపూర్వకంగా అన్నాడు.

క. **భక్తియు వినయము శ్రద్ధా । యుక్తియునుం దాల్మితోడి యొప్పును గరుణా**
సక్తియు నతిథులయెడ నను । రక్తియు నీయంద సుస్థిరత్వముఁ బొందెన్. **239**

ప్రతిపదార్థం: భక్తియున్= భక్తియూ; వినయమున్= వినయమూ; శ్రద్ధా= శ్రద్ధతో; యుక్తియునున్= కూడికయూ; తాల్మితోడన్= ఓర్పుతో కూడిన; ఒప్పును= మర్యాదయూ; కరుణా= దయయందలి; ఆసక్తియున్= ఆసక్తియూ; అతిథుల+ఎడన్= అతిథులపట్ల; అనురక్తియున్= ప్రేమయూ; నీ+అందున్+అ= నీయందే; సుస్థిరత్వమున్= గట్టి నిలుకడను; పొందెన్= పొందాయి.

తాత్పర్యం: భక్తీ, వినయమూ, శ్రద్ధా, ఓర్పుతో కూడిన మర్యాదా, దయా, అతిథులయందలి ప్రేమా నీ యందే నిలుకడగా ఉన్నవి.

క. నీ దానంబున విస్మితు। లై దైవత యక్ష సిద్ధు లభివర్ణన మ
త్యాదరమునఁ జేసెద రిదె!। రోదసి సమ్మర్దముగ నరుగుదెంచి తగన్'. 240

ప్రతిపదార్థం: నీ= నీయొక్క; దానంబునన్= దానంచేత; విస్మితులు+ఐ= ఆశ్చర్యపడినవారై; దైవత= దేవతలూ; యక్ష= యక్షులు; సిద్ధులు; రోదసిన్= ఆకాశంలో; సమ్మర్దముగన్= ఒత్తిడి అయ్యేటట్లుగా; అరుగుదెంచి= వచ్చి; తగన్= తగినట్లుగా; అతి= మిక్కిలి; ఆదరమునన్= ఆదరంతో; అభివర్ణనము చేసెదరు= మిక్కిలి వర్ణిస్తున్నారు; ఇది+ఎ= ఇదిగో; చూడుము.

తాత్పర్యం: దేవతలూ, యక్షులూ, సిద్ధులూ, నీ దానం చూచి ఆశ్చర్యపడి ఆకాశంలో గుంపులుగట్టి మహానురాగంతో నిన్ను వర్ణిస్తున్నారు. ఇదిగో చూడుము.

క. అని చూపి పల్కునవసర। మునఁ బర్జన్యుండు గురిసెఁ బుష్పాసారం;
బనవద్య హృద్యనాదం। బున మ్రోసెను దేవదుందుభులు గగనమునన్. 241

ప్రతిపదార్థం: అని; చూపి= చూపించి; పల్కు+అవసరమునన్= మాటాడుతున్న సమయాన; పర్జన్యుండు= దేవేంద్రుడు; పుష్ప= పూలయొక్క; ఆసారంబు= జడివాన; కురిసెన్= కురిపించాడు; గగనమునన్= ఆకాశంలో; దేవదుందుభులు= దేవతల భేరులు; అనవద్య= నిర్దోషమైన; హృద్య= మనోహరమైన; నాదంబునన్= ధ్వనితో; మ్రోసెను= మ్రోగాయి.

తాత్పర్యం: అని యముడు చూపేటప్పుడు దేవేంద్రుడు పూలజడివాన కురిపించాడు. లయబద్ధంగా మనోహరంగా దేవదుందుభులు మ్రోగాయి.

వ. అప్పు డయ్యతిథి వెండియు. 242

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయమున; ఆ+అతిథి= ఆ యముడు; వెండియున్= ఇంకనూ.

తాత్పర్యం: ఆ సమయంలో ఆ అతిథి మరల (ఇట్లా అన్నాడు).

యముఁడు సక్తుప్రస్థుని బ్రహ్మలోకంబునకుఁ బో నియోగించుట (సం. 14-93-60)

క. 'నినుఁ జూచువేడ్కనేడ్వురు। మునుల మనంబుల సమగ్రముగఁ గదిరెడు; స
జ్జన కీర్తనీయ! దివికిం। జనుదెమ్ము ప్రియాసుతస్నుషాసహితముగన్. 243

ప్రతిపదార్థం: సజ్జన= సజ్జనులచేత; కీర్తనీయ!= కీర్తించదగినవాడా!; ఏడ్వురు= ఏడుగురు; మునుల= మునులయొక్క; మనంబులన్= మనస్సులందు; సమగ్రముగన్= సంపూర్ణంగా; నినున్= నిన్ను; చూచు= చూడవలెననే; వేడ్క= కుతూహలం; కదిరెడున్= వ్యాపిస్తున్నది; ప్రియా= భార్య; సుత= కుమారుడు; స్నుషా= కోడలు; సహితముగన్= కూడికొని యుండునట్లుగా; దివికిన్= స్వర్గానికి; చనుదెమ్ము= రమ్ము.

తాత్పర్యం: సజ్జనస్తుత్యా! సప్తర్షుల మనస్సులు నిన్ను చూడాలని ఉవ్విళ్ళూరుతున్నాయి. నీవు నీ భార్యతో, కొడుకుతో, కోడలితో కూడి స్వర్గానికి రమ్ము.

తే. క్షుధ హరించుఁ బ్రజ్ఞాపరిశోభనతలఁ; దృష్ణ గుందించుఁ గృప; నీవు దెలిసి వాని
ననఘ! నిర్జించి తాలు బిడ్డనక; యతిథి। పూజనం బిట్లు నడపిన పుణ్యమునకు. 244

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; క్షుధ= ఆకలి; ప్రజ్ఞను= బుద్ధినీ; పరిశోభనతలన్= తేజస్సునూ; హరించున్= నశింపజేయును; తృష్ణ= ఆశ; కృపన్= దయను; కుందించున్= నశింపజేయును; నీవు; తెలిసి= తెలిసికూడా; ఆలు= భార్య; బిడ్డ+అనక= బిడ్డ అని కూడ చూడకుండా; వానిన్= ఆ ఆకలినీ, ఆశనూ; నిర్జించితి= జయించావు; ఇట్లు= ఈ విధంగా; అతిథి= అతిథియొక్క; పూజనంబు= పూజ; నడపిన= చేసిన; పుణ్యమునకున్= పుణ్యంచేత.

తాత్పర్యం: పుణ్యాత్మా! ఆకలి బుద్ధినీ తేజస్సునూ మట్టుపెట్టుతుంది. ఆశ దయను నాశం జేస్తుంది. ఈ లోకతత్త్వం తెలిసి తెలిసీ భార్య అనీ బిడ్డఅనీ చూడకుండా ఆకలినీ ఆశనూ జయించావు. ఈ విధంగా అతిథిపూజ చేసిన పుణ్యంచేత. (తరువాతి పద్యంతో అన్వయం).

క. తగు ప్రియమున సకుటుంబం। బుగఁ దన సభ కీవు రాక బుద్ధిం గని బ్ర
హ్మ గడున్ వేడ్క విమానం। బు గురువ్రత శీల! శీఘ్రమునఁ బుత్తెంచున్. 245

ప్రతిపదార్థం: గురు= గొప్ప; వ్రత= నియమాలను పాటించటమే; శీల= శీలంగా కలవాడా!; బ్రహ్మ; తగు= నీ పట్ల చూపదగిన; ప్రియమునన్= అనుగ్రహంతో; నీవు; సహ+కుటుంబంబుగన్= కుటుంబంతో కూడి ఉండేటట్లుగా; తన= తనయొక్క; సభకున్= సభకు; రాక= రావటం; బుద్ధిన్= బుద్ధియందు; కని= ఆలోచించి, నిర్ణయించి; కడున్= మిక్కిలి; వేడ్కన్= కుతూహలంతో, సంతోషంతో; విమానంబు= విమానమును; శీఘ్రమునన్= తొందరగా; పుత్తెంచున్= పంపుతాడు.

తాత్పర్యం: మహానియమశీలా! నీ యందలి అనుగ్రహంతో బ్రహ్మ నీవు కుటుంబంతో కూడా తన సభకు రావాలని నిర్ణయించాడు. ఆ సృష్టికర్త పరమానందంతో నీ కొరకు తొందరలోనే విమానం పంపుతాడు.

చ. వినుము ప్రభూతదానములు విశ్రుతయజ్ఞములున్ సధర్మతా
వినుతికి నెక్కఁజాలవు; వివేకనిధీ! పరిశుద్ధ శోభితా
ర్జనమునఁ దెచ్చికొన్నది వరం బగుఁ బాత్రము నర్హకాలముం
గని లఘువస్తువేని నొసఁగం గను టుజ్జ్వలధర్మ మారయన్.' 246

ప్రతిపదార్థం: వివేక= మంచిచెడ్డలు తెలిసికొనే బుద్ధికి; నిధీ!= గని అయినవాడా!; వినుము; ఆరయన్= పరిశీలించగా; ప్రభూత= అధికమైన; దానములున్= దానాలూ; విశ్రుత= ప్రసిద్ధికెక్కిన; యజ్ఞములున్= యజ్ఞములూ; సహ+ధర్మతా= ధర్మంతో కూడిన; వినుతికిన్= ప్రశంసకు; ఎక్కన్+చాలవు= తగినవి కావు; పరిశుద్ధ= పవిత్రంగా ఉండటంచేత, పాపరహితత్వంచేత; శోభిత= అలంకరింపబడిన, ప్రకాశించే; ఆర్జనమునన్= సంపాదనంచేత; తెచ్చికొన్నది= కూడబెట్టింది; వరంబు= శ్రేష్ఠం; అగున్= అగును; పాత్రమున్= యోగ్యుడైనవాడిని; అర్హ= యుక్తమైన; కాలమున్= సమయాన్ని; కని= పరిశీలించి; లఘు= చిన్నదైన; వస్తువు; ఏనిన్= అయిననూ; ఒసఁగన్+కనుట= దానము చేయగలుగుట; ఉజ్జ్వల= ప్రకాశిస్తున్న, ప్రకటితమైన; ధర్మం.

తాత్పర్యం: వివేకనిధీ! వినుము. అనేక దానాలూ, ప్రఖ్యాత యజ్ఞాలూ, ధర్మబద్ధమైన ప్రశంసకు తగినవి కావు. సన్మార్గంలో సంపాదించి కూడబెట్టిందే శ్రేష్ఠం. యోగ్యుడైనవాడికి తగిన సమయంలో అల్పవస్తువైనా దానం చేయగలగటం ఉత్తమ ధర్మం'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. అని పలుకుచు దివ్యంబగు। తన యాకారంబు సూపె ధర్ముండు; కన
త్కనక మణిమయ విమానము। వినువీథిం దోఁచె మునులు విస్మయ మందన్. 247

ప్రతిపదార్థం: అని; పలుకుచున్= పలుకుతూ; ధర్ముండు= యముడు; దివ్యము= దేవతా సంబంధమైనది; అగు= అయిన; తన= తనయొక్క; ఆకారంబు= రూపం; చూపెన్= చూపాడు; మునులు; విస్మయము= ఆశ్చర్యము; అందన్= పొందగా; వినువీథిన్= ఆకాశమార్గంలో; కనత్= ప్రకాశిస్తున్న; కనక= బంగారంయొక్క; మణి= మణులయొక్క; మయ= వికారమైన; విమానము; తోఁచెన్= కనబడింది.

తాత్పర్యం: అని పలుకుతూ యముడు తన దేవరూపాన్ని చూపాడు. ఇంతలో ఆకాశాన సువర్ణమణి నిర్మితమైన విమానం కనబడింది. దానిని చూచి మునులు ఆశ్చర్యపడ్డారు.

వ. అప్పుడు సక్తుప్రస్థుండు పరమప్రీతిం దానును దనవారును ధర్మదేవతకు దండప్రణామంబు చేసి నిలిచిన. 248

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; సక్తుప్రస్థుండు= సక్తుప్రస్థుడు; పరమప్రీతిన్= మహానందంతో; తానును= తానూ; తనవారును= తన వారూ; ధర్మదేవతకున్= యముడికి; దండప్రణామంబు= సాష్టాంగ నమస్కారం; చేసి; నిలిచినన్= నిలబడగా.

తాత్పర్యం: అప్పుడు సక్తుప్రస్థుడూ, అతడి భార్యా, కొడుకూ, కోడలూ యముడికి సాష్టాంగ నమస్కారం చేసి నిలబడగా.

తే. ధర్మదేవత యతనితో 'ధర్మనిరత!। కంటె! బ్రహ్మ పుత్తెంచిన ఘనవిమాన'
మనఁగ నది భూమి కవతరించినఁ బ్రమోద। మెసఁగ నా ధర్ముఁ డాతని కిట్టు లనియె. 249

ప్రతిపదార్థం: ధర్మదేవత= యముడు; అతనితోన్= సక్తుప్రస్థుడితో; ధర్మ= ధర్మమునందు; నిరత!= మిక్కిలి ఆసక్తి కలవాడా!; బ్రహ్మ; పుత్తెంచిన= పంపిన; ఘన= గొప్పదైన; విమానము= విమానమును; కంటి+ఎ?= చూచితివా?; అనఁగన్= అనగా; అది= ఆ విమానం; భూమికిన్= భూమిమీదకు; అవతరించినన్= దిగగా; ప్రమోదము= సంతోషం; ఎసఁగన్= అతిశయించగా; ఆ+ధర్ముండు= ఆ యముడు; అతనికిన్= సక్తుప్రస్థుడితో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: యముడు సక్తుప్రస్థుడితో 'ధర్మపరాయణా! బ్రహ్మ పంపిన విమానాన్ని చూచావా!' అని అంటూ ఉండగనే విమానం భూమిమీదకు దిగింది. ఆనందంతో యముడు సక్తుప్రస్థుడితో ఈ విధంగా అన్నాడు.

క. 'వేడుక నాలుం గొడుకును। గోడలు నీవును బ్రభూతగుణ! యెక్కుము సం
క్రీడమెయి నివ్విమానము;। నీడితగతి బ్రహ్మసభకు నేఁగఁగ వలయున్'. 250

ప్రతిపదార్థం: ప్రభూత= అధికమైన; గుణ!= సద్గుణాలు కలవాడా!; వేడుకన్= ఆనందంతో; ఆలున్= నీ భార్యయూ; కొడుకును= నీ కొడుకూ; కోడలున్= నీ కోడలూ; ఈవును= నీవూ; సంక్రీడమెయిన్= హాయిగా; ఈ+విమానము= ఈ విమానం; ఎక్కుము; ఈడిత= పొగడబడిన; గతిన్= గమనంతో, బ్రహ్మ= బ్రహ్మయొక్క; సభకున్= సభకు; ఏఁగఁగన్+వలయున్= వెళ్ళ వలయును.

తాత్పర్యం: 'సద్గుణాతిశయా! నీవూ, నీ భార్యా, కొడుకూ, కోడలూ వేడుకతో హాయిగా ఈ విమానం ఎక్కండి. ప్రశస్తగతితో బ్రహ్మసభకు వెళ్ళాలి.'

క. అనవుడు సక్తుప్రస్థుఁడు। తనవారును దాను నెక్కి ధర్ముం డనుపం
జనియె; నది యంతయును నేఁ। గనుఁగొనుచు బిలంబు వెడలఁగా నామేనన్. 251

ప్రతిపదార్థం: అనవుడున్= అని అనగా; సక్తుప్రస్థుఁడు; తనవారును= తన వారు; తానును= తానూ; ఎక్కి= విమానం ఎక్కి; ధర్ముండు= యముడు; అనుపన్= సాగనంపగా; చనియెన్= వెళ్ళాడు; నేన్= నేను; అది+అంతయును= దానినంతటినీ; కనుఁ గొనుచున్= చూస్తూ; బిలంబు= కన్నమునుండి; వెడలఁగాన్= బయటికి రాగా; నా= నాయొక్క; మేనన్= శరీరమునందు.

తాత్పర్యం: అని అనగా సక్తుప్రస్థుడు తనవారితోపాటు విమానం ఎక్కి యముడు సాగనంపగా వెళ్ళిపోయాడు. జరిగిన దానినంతా నేను చూస్తున్నాను. కన్నంనుండి వెలుపలికి రాగా నా శరీరం మీద. (తరువాతి వచనంతో అన్వయం).

సక్తుప్రస్థుఁడు సకుటుంబముగా బ్రహ్మలోకంబునకుఁ బోవుట (సం. 14-93-83)

వ. ఆ సక్తువు గంధంబును నతిథి పాద్యజల క్లేదంబునుం బొలసి సక్తుప్రస్థ కృతంబైన పరమధర్మంబు మహిమం జేసి మదీయ మస్తకంబును నొక్కపార్శ్వంబునుం గనకమయంబులయ్యెఁ; నాఁడు దొడంగి యేను దానవిధి స్థలంబులకును బుణ్యాశ్రమ భూములకును వివిధాధ్వర ప్రదేశంబులకుం జనుచుండుదుఁ; దక్కటి ప్రక్కపసిండి యగు నను తలంపున నెన్ని చోట్లకుఁ బోయిననుం గాకుండు. లోకోత్తర చరితుం డజాతశత్రుం డశ్వమేధంబు సేయుచున్న వాఁ; డయ్యెడ నా కోర్కి సిద్ధించునని పెద్దయు నాసతో నరుగుదెంచితి; నించుక విశేషంబునుం గాన; వినుం; డది కారణంబుగా నయ్యుంఛవృత్తి విప్రుని ధర్మంబు (నకు) నీ యజ్ఞంబు వోలదంటి' నని పలికి యన్నకులంబు దా నెక్కడఁ బోవుటయు నెఱుంగకుండం బోయెఁ; 'పాండుకులపవిత్ర! యమ్ముఖంబునం గలిగిన యాశ్చర్యంబు తెఱం గెఱింగించితి; ననిన విని జనమేజయుండు. 252

ప్రతిపదార్థం: ఆ సక్తువు= ఆ పేలపిండియొక్క; గంధంబును= సువాసనయూ; అతిథి= అతిథియొక్క; పాద్య= పాదాలు కడుగుటకు ఉపయోగించే; జల= నీటియొక్క; క్లేదంబునున్= తడియును; పొలసి= వ్యాపించి, అంటుకొని; సక్తుప్రస్థ= సక్తు ప్రస్థుడిచేత; కృతంబు= చేయబడినది; ఐన= అయిన; పరమ= ఉత్తమమైన; ధర్మంబు= ధర్మంయొక్క; మహిమంబునన్+చేసి= మహిమవలన; మదీయ= నాయొక్క; మస్తకంబును= తలయూ; ఒక్క= ఒక; పార్శ్వంబునున్= ప్రక్కయూ; కనకమయంబులు= బంగారు వికారాలు; అయ్యెన్= అయ్యాయి; నాఁడు= ఆ రోజు; తొడంగి= మొదలుకొని; ఏను= నేను; దాన విధి= దాన కార్యాలు జరుగుతున్న; స్థలంబులకును= చోటులకు; పుణ్య= పవిత్రాలైన; ఆశ్రమ= మునుల ఆశ్రమాలయొక్క; భూములకును= ప్రదేశాలకు; వివిధ= అనేక విధాలైన; అధ్వర= యజ్ఞాలు జరుగుతున్న; ప్రదేశంబులకును= తావులకు; చనుచున్= వెళ్ళుతూ; ఉండుదున్= ఉంటాను; తక్కు= మిగిలిన, రెండవదైన; ప్రక్క= వైపు; పసిండి= బంగారం కలది; అగు+న్= ఔతుంది; అను= అనెడి; తలంపునన్= అభిప్రాయంతో; ఎన్నిచోట్లకున్= ఎన్నోచోట్లకు; పోయిననున్= పోయినప్పటికినీ; కాక= రెండవప్రక్క బంగారం కాకుండా; ఉండున్= ఉన్నది; లోకోత్తర= లోకమునందు శ్రేష్ఠమైన; చరితుండు= నడవడి కలవాడు; అజాతశత్రుండు= ధర్మరాజు; అశ్వమేధంబు= అశ్వమేధం; చేయుచున్నవాఁడు= చేస్తున్నాడు; ఆ+ఎడన్= అక్కడ; నా= నాయొక్క; కోర్కి= కోరిక; సిద్ధించున్= నెరవేరుతుంది; అని; పెద్దయున్= మిక్కిలి; ఆసతోన్= ఆశతో; అరుగుదెంచితిన్= వచ్చాను; ఇంచుక= కొంచెం కూడా; విశేషంబునున్= ఆధిక్యమును; కానన్= చూడను; వినుండు= వినండి; అది; కారణంబుగాన్= కారణంగా; ఆ+ఉంఛవృత్తి= పొలం మొదలైనచోట్ల రాలిన గింజలను ఏరుకొని తిని బ్రదుకుతున్న; విప్రుని= బ్రాహ్మణుడియొక్క; ధర్మంబు(నకున్)= ధర్మానికి; ఈ యజ్ఞంబు= ఈ యజ్ఞం; పోలదు= సాటికాదు; అంటిన్= అన్నాను; అని; పలికి= చెప్పి; ఆ నకులంబు= ఆ ముంగిస; తాన్=

తాను; ఎక్కడన్= ఎక్కడకు; పోవుటయున్= పోవాలో; ఎఱుంగక+ఉండన్= తెలియకుండా; పోయెన్= పోయింది; పాండు= పాండురాజుయొక్క; కుల= కులమునందు; పవిత్ర!= పవిత్రుడైనవాడా!; ఆ మఖంబునన్= ఆ యజ్ఞమునందు; కలిగిన= సంభవించిన; ఆశ్చర్యంబు= ఆశ్చర్యకరమైనదానియొక్క; తెఱంగు= సమాచారాన్ని; ఎఱింగించితిన్= తెలియజేశాను; అనినన్= అనగా; విని; జనమేజయుండు.

తాత్పర్యం: ఆ పేలపిండి సువాసన వ్యాపించి అతిథి కాళ్ళు కడిగిన నీటి తడి అంటుకొని సక్తుప్రస్థుడు చేసిన ధర్మము మహిమవలన నా తలా శరీరం ఒకవైపు బంగారం అయినవి. ఆనాటినుండి నేను దానకార్యాలు జరిగేచోట్లకూ పవిత్రములైన మున్యాశ్రమాలకూ, వివిధ యజ్ఞాలు చేసే ప్రదేశాలకూ వెళ్ళుతూ ఉన్నాను. రెండోవైపు బంగారం అవుతుందేమో అనే అభిప్రాయంతో ఎన్నో చోట్లకు వెళ్ళినప్పటికీ కానే కాలేదు. 'లోకంలో శ్రేష్ఠమైన నడవడిగల ధర్మరాజు అశ్వమేధయాగం చేస్తున్నాడు. అక్కడ నా కోరిక నెరవేరుతుందేమో అనే ఆశతో ఇక్కడకు వచ్చాను కాని, నాకేమీ విశేషం కనబడలేదు. అందుచేత పొలాలు మొదలైన చోట్ల రాలిన గింజలను ఏరుకొని తిని బ్రదుకుతున్న ఆ బ్రాహ్మణుడి ధర్మంతో ఈ యజ్ఞం సాటికాదు అని అన్నాను. ఈ విధంగా పలికి ఆ ముంగిస తాను ఎక్కడకు వెళ్ళేది ఎవ్వరికీ తెలియకుండా వెళ్ళిపోయింది. పాండురాజ కులపావనా! ఆ యజ్ఞంలో సంభవించిన ఆశ్చర్యకరమైన విషయం నీకు తెలియజేశాను అని వైశంపాయనుడు అనగా విని జనమేజయుడు.

సీ. **'జన్నంబునందు రాజన్యులుఁ దపమున । మునిజనంబులు శాంతి ననఘ! విప్రు**
లాసక్తు లగుదు; రట్లగుటఁ గాదే పల్వు । రవనీశ్వరులు దొల్లి యాగకృతుల
నతులకీర్తులను సద్గతులను బడసిరి; । ధర్మనందనుఁ డత్యుదాత్త భంగిఁ
దొంటి భూనాథులకంటె సత్యమునను । శౌచమునను భక్తి శ్రద్ధ నీగి

తే. **నతిశయిల్లె; వేదవ్యాసుఁ డాది గాఁగఁ । గలుగు నార్యజనుల చిత్తములకు నెక్క**
నమరవల్లభు చంద మందముగఁ జేసె । నశ్వమేధంబు మెచ్చుల కాకరముగ.' **253**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడా!, పుణ్యాత్మా!; రాజన్యులు= క్షత్రియవంశీయులు, రాజులు; జన్నంబు+అందున్= యజ్ఞంలో; మునిజనంబులు= మునులు; తపమునన్= తపస్సునందు; విప్రులు= బ్రాహ్మణులు; శాంతిన్= అంతరింద్రియ నిగ్రహంలో; ఆసక్తులు= ఆసక్తి కలవారు; అగుదురు= అవుతారు; అట్లు= ఆ విధంగా; అగుటన్= ఆసక్తి కలిగిఉండటంవలననే; కాదు+ఏ!= కదా!; తొల్లి= పూర్వం; పల్వురు= అనేకులు; అవనీ+ఈశ్వరులు= భూపతులు, రాజులు; యాగ= యజ్ఞములయొక్క; కృతులన్= చేయుటచేత; అతుల= సాటిలేని; కీర్తులను; సత్+గతులను= ఉత్తమ లోకాలను; పడసిరి= పొందారు; ధర్మ= యముడియొక్క; నందనుఁడు= కుమారుడు; అతి= మిక్కిలి; ఉదాత్త= గొప్పదైన; భంగిన్= విధంగా; తొంటి= పూర్వకాలమునందలి; భూనాథులకంటెన్= రాజుల కంటె; సత్యమునను= సత్యముచేత; శౌచమునను= అంతరంగ శుద్ధిచేత; భక్తిన్= భక్తిచేత; శ్రద్ధన్= శ్రద్ధచేత; ఈగిన్= దానంచేత; అతిశయిల్లెన్= అధికుడయ్యాడు; వేదవ్యాసుఁడు; ఆది+కాఁగన్= మొదలుగా; ఆర్యజనుల= పూజ్యులయొక్క, కర్మనిష్ఠులయొక్క; చిత్తములకున్= మనస్సులకు; ఎక్కన్= ఆనందం కలిగించగా; అమర= దేవతలయొక్క; వల్లభు= ప్రభువుయొక్క, దేవేంద్రుడియొక్క; చందము= లక్షణం, విధము; అందముగన్= ఒప్పగా; మెచ్చులకున్= మెప్పులకు; ఆకరముగన్= నిలయంగా; అశ్వమేధంబు= అశ్వమేధము; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: పుణ్యాత్మా! రాజులు యుద్ధంలో ప్రీతిగలవారు. మునులు తపస్సునందు ఆసక్తికలవారు. బ్రాహ్మణులు అంతరింద్రియ నిగ్రహంలో శ్రద్ధకలవారు. అందువలననే కదా పూర్వకాలంలో రాజులు అనేకులు యాగాలు చేసి అనుపమ కీర్తులనూ ఉత్తమలోకాలనూ పొందారు. ధర్మరాజు సత్యంవలన అంతరంగ శుద్ధివలన భక్తిశ్రద్ధవలన, దానక్రియలవలన పూర్వరాజుల కంటె అధికుడయ్యాడు. వేదవ్యాసాది కర్మనిష్ఠులు సంతోషించగా అందరూ మెచ్చుకొనేటట్లుగా దేవేంద్రుడు యాగాలు చేసిన రీతిగా అశ్వమేధం చేశాడు.

వ. అట్టి పరమధర్మంబా నకులంబుచేత గర్హితం బగుటకుం గారణంబేమి? యని యడిగిన వైశంపాయనుండు ధర్మపుత్త్రు నధ్వరంబు నీ చెప్పిన యట్టిద యైనను నొక్కటి చెప్పెద; నవహితుండవగు; మన్నకులంబు హింసాత్మకంబైన పశు యజ్ఞంబుకంటె నహింసా మహితంబైన తపోయజ్ఞం బధికంబని చెప్పినయదియయ్యె; రిత్త చెప్పుటగాక తనశిరంబును శరీరార్ధంబును సువర్ణమయంబు లైన కతంబునుం బలికెం; । గాన దానివచనంబులు ద్రోపువడ; వేత ద్విషయం బైనది యొక్క యితిహాసంబు గల; దది యాకర్ణింపు' మని యమ్మనుజనాథున కిట్లనియె. 254

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; పరమ= ఉత్తమమైన; ధర్మంబు= ధర్మం; ఆ+నకులంబుచేతన్= ఆ ముంగిసచేత; గర్హితంబు= నిందించబడింది; అగుటకున్= అగుటకు; కారణంబు= కారణం; ఏమి; అని; అడిగినన్= అడుగగా; వైశంపాయనుండు; ఆ ధర్మపుత్త్రు= ఆ ధర్మరాజుయొక్క; అధ్వరంబు= యజ్ఞం; నీ చెప్పిన= నీవు చెప్పిన; అట్టిది+అ= అటువంటిదే; ఐనను= అయినప్పటికిని; ఒక్కటి= ఒకమాట; చెప్పెదన్= చెప్పుతాను; అవహితుండవు= అవధానం కలవాడవు, ఏమరుపాటు లేనివాడవు; అగుము; ఆ+నకులంబు= ఆ ముంగిస; హింసా+ఆత్మకంబు= హింసాస్వరూపమై; పశు= పశువధతో కూడిన; యజ్ఞంబు కంటెన్= యజ్ఞంకంటె; అహింసా= అహింసచేత; మహితంబు= గౌరవించబడినది, గొప్పది; ఐన= అయిన; తపస్+మయ= తపోరూపమైన; యజ్ఞంబు= యజ్ఞము; అధికంబు= ఎక్కువది; అని; చెప్పిన+అది= చెప్పినట్టిది; అయ్యెన్= అయింది; రిత్త= కారణంలేకుండా, వ్యర్థంగా; చెప్పుట= చెప్పటం; కాక= కాకుండా; తన= తనయొక్క; శిరంబును= తలయూ; శరీర= శరీరంయొక్క; అర్ధంబును= సగభాగాన్ని; సువర్ణమయంబులు= బంగారు వికారములు; ఐన= అయిన; కతంబునున్= కారణమునూ; పలికెన్= చెప్పింది; కాన= కావున; దాని= ఆ ముంగిసయొక్క; వచనంబులు= మాటలు; త్రోపువడవు= త్రోసి వేయదగినవి కావు; ఏతద్= ఈ; విషయంబు= అంశానికి సంబంధించినది; ఐన+అది= అయినట్టిది; ఒక్క= ఒక; ఇతిహాసంబు= జరిగిన కథ; కలదు= ఉన్నది; అది= దానిని; ఆకర్ణింపుము= వినుము; అని; ఆ+మనుజనాథునకున్= మానవపతితో, రాజుతో, జనమేజయుడితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆ ఉత్తమధర్మాన్ని ముంగిస ఆక్షేపించటానికి కారణమేమి? అని జనమేజయుడు అడిగాడు. వైశం పాయనుడు ఆ రాజుతో 'ధర్మనందనుని ఆ యజ్ఞం నీవు వర్ణించినటువంటిదే. కాని, ఒకమాట చెప్పుతాను సావధానంగా వినుము. ఆ ముంగిస పశుహింసారూపమైన యజ్ఞంకంటె అహింసారూపమైన యజ్ఞం గొప్పదని చెప్పింది. అది కారణం వివరించకుండా చెప్పలేదు. తన తల, శరీరంలోని సగభాగమూ బంగారం కావటానికి కారణం చెప్పింది కాబట్టి దాని మాటలు త్రోసివేయదగినవి కావు. దీనికి సంబంధించిన ఒక కథ ఉన్నది వినుము' అని ఈ విధంగా చెప్పాడు.

సీ. 'అమరాధిపతి దొల్లి యాగంబు సేయంగఁ। దొడఁగ మహాముని స్తోమములును

సురసంఘములుఁ గూడి కురుముఖ్య! ఋత్విగ్గ। ణముల నేర్పఱిచి సోం పమర వేదిఁ

గల్పించి తగ నగ్నికార్యంబు నడపంగ । నర్హులు పశు నిచయంబుఁ దేర

నమ్మునుల్ గనుఁగొని యధిక దయా ర్ద్రంబు । లగు చిత్తములతోడ నమ్మహేంద్రు

ఆ. నాననంబు చూచి 'యక్కట! హింస ధ । ర్మంబు గాదు; కృతయుగంబు సొచ్చె;

ననఘ! వత్సరత్రయము ప్రాంతగిలిన బీ । జంబు లిపుడు యజన సాధనములు. 255

ప్రతిపదార్థం: కురు= కురువంశంలో; ముఖ్య= అగ్రగణీ!; అమర= దేవతలయొక్క; అధిపతి= ప్రభువు, ఇంద్రుడు; తొల్లి= పూర్వం; యాగంబు= యజ్ఞం; చేయంగన్= చేయగా; తొడఁగన్= పూనుకొనగా; మహత్= గొప్ప; ముని= మునులయొక్క; స్తోమములును= సమూహాలును; సుర= దేవతలయొక్క; సంఘములున్= సమూహాలును; కూడి; ఋత్విక్= యజ్ఞం చేయించువారియొక్క; గణములన్= సమూహాలను; ఏర్పఱిచి= నియమించి; సొంపు= అందం; అమరన్= కలుగగా; వేదిన్= యజ్ఞవేదిని; కల్పించి= నిర్మించి; తగన్= శాస్త్రోక్తంగా; అగ్నికార్యంబు= హోమం; నడపంగన్= చేయించగా; అర్హులు= యోగ్యులైన వారు; పశు= జంతువులయొక్క; నిచయంబున్= సమూహమును; తేరన్= తీసికొనిరాగా; ఆ+మునుల్= ఆ మునులు; కనుఁ గొని= చూచి; అధిక= మిక్కిలి; దయా= దయచేత; ఆర్ద్రంబులు= కరగినవి; అగు= అయిన; చిత్తములతోడన్= మనస్సులతో; ఆ మహేంద్రు= దేవేంద్రుడియొక్క; ఆననంబు= ముఖం; చూచి; అక్కట!= అయ్యో!; హింస; ధర్మంబు= ధర్మం; కాదు; కృతయుగంబు= ధర్మం నాలుగు పాదాలతో నడచునట్టి కృతయుగం; చొచ్చెన్= ప్రవేశించింది; అనఘ!= పుణ్యాత్మా!; ఇపుడు= ఇప్పుడు; వత్సరత్రయము= మూడేళ్ళు; ప్రాఁతగిలిన= ప్రాతవడిన; బీజములు= విత్తనాలు; యజన= యజ్ఞముయొక్క; సాధనములు= ద్రవ్యములు, పదార్థములు.

తాత్పర్యం: కురువంశాగ్రణీ! పూర్వం దేవేంద్రుడు యజ్ఞం చేయటానికి పూనుకొన్నాడు. అప్పుడు మునులూ, దేవతలూ కూడి ముందు ఋత్విక్కులను నియమించారు. సుందరమైన యజ్ఞవేదిని నిర్మించారు. శాస్త్రోక్తంగా హోమం చేయటానికి తగినవారు వెళ్ళి జంతువులను కొని తెచ్చారు. వాటిని చూచి మునుల మనస్సులు కరగినవి. వారు ఇంద్రుడి ముఖాన్ని సూటిగా చూచి 'అయ్యో! పుణ్యాత్మా! హింస ధర్మం కాదు. కృతయుగం ప్రవేశించింది. కావున ఇపుడు మూడేళ్ళు నిలువ ఉన్న విత్తనాలే యజ్ఞద్రవ్యాలు.

క. వేదోదిత ప్రకారం । బాదర మెసఁగఁగ నడపు; మది యుత్తమ ధ

ర్మోదయము సేయు నీకు; ద । యాదృష్టిం జూడు పశుగణార్తి మహాత్మా! 256

ప్రతిపదార్థం: మహా+ఆత్మా= గొప్ప మనస్సు కలవాడా!; ఆదరము= ప్రేమ; ఎసఁగంగన్= అతిశయించగా; వేద= వేదాలచేత; ఉదిత= చెప్పబడిన; ప్రకారంబు= విధానం; నడపుము= ప్రవర్తిల్లజేయుము; అది; నీకున్= నీకు; ఉత్తమ= ఉత్తమమైన; ధర్మ= ధర్మంయొక్క; ఉదయము= వృద్ధిని; చేయున్= చేస్తుంది; దయా= దయతో కూడిన; దృష్టిన్= చూపుతో; పశు= జంతువులయొక్క; గణ= సమూహంయొక్క; ఆర్తిన్= దుఃఖాన్ని; చూడుము.

తాత్పర్యం: మహాత్మా! వేదోక్త ప్రకారంగా ప్రేమతో హోమం చేయుము. అది నీకు ధర్మాభివృద్ధిని చేకూరుస్తుంది. కరుణా కటాక్ష వీక్షణాలతో జంతువుల దుఃఖాన్ని చూడుము.

ఆ. అనిన వారిమాట లాదరింపక యుండె । వాసవుండు; దాన వాదు పుట్టె

నమ్మునీశ్వరులకు నతనికి; సురసంఘ । మతనిఁ గూడ వాద మతిశయిల్లె. 257

ప్రతిపదార్థం: అనినన్= అనగా; వాసవుండు= ఇంద్రుడు; వారి= మునులయొక్క; మాటలు; ఆదరింపక= లక్ష్యపెట్టక; ఉండెన్= ఉన్నాడు; దానన్= దానిచేత, ఆ నిరాదరణంచేత; ఆ ముని+ఈశ్వరులకున్= ఆ ముని శ్రేష్ఠులకు; అతనికిన్= ఇంద్రుడికి; వాదు= వివాదం; పుట్టెన్= కలిగింది; సుర= దేవతలయొక్క; సంఘము= సమూహం; అతనిన్= ఇంద్రుడిని; కూడన్= కలియగా; వాదము= వివాదం; అతిశయిల్లెన్= పెరిగింది.

తాత్పర్యం: ఇంద్రుడు మునిపతులమాటలు లెక్కచేయలేదు. దానివలన వారికీ ఇంద్రుడికీ వివాదం కలిగింది. దేవతలు ఇంద్రుడి కొమ్ము కాచారు. అందువలన వివాదం ఇంకా ఎక్కువ అయింది.

వ. అట్టియెడం గర్మకాండ విదుండగు నుపరిచరవసువు సన్నిహితుం డగుటయు, నయ్యిరుదెఱంగులవారును నారాజన్యుని సాక్షిగాఁ గోరిన నతండు పక్షపాతంబునఁ బశువిశసనంబు కర్తవ్యం బని పలికి యధః పాతంబు ప్రాపించెం; గావున హింసారహితంబయిన యజనంబు పూజనీయంబగుటకు సంశయింప వలవ; దట్లుం గాక. 258

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; కర్మకాండ= వేదమునందలి యజ్ఞ సంబంధమైన భాగం; విదుండు= తెలిపినవాడు; అగుఅయిన; ఉపరిచరవసువు; సన్నిహితుండు= సమీపించినవాడు; అగుటయున్= కాగా; ఆ+ఇరు+తెఱంగుల+వారును= ఆ రెండు పక్షాలవారూ; ఆ రాజన్యుని= ఆ రాజును; సాక్షి+కాన్= నిర్ణయించేవాడినిగా; కోరినన్= కోరగా; అతండు= అతడు; దేవతా= దేవతలయొక్క; పక్షపాతంబునన్= పక్షమునందలి అభిమానంచేత; పశు= జంతువులయొక్క; విశసనంబు= సంహారం; కర్తవ్యంబు= చేయదగింది; అని; పలికి; అథస్+పాతంబు= అధోగతి; ప్రాపించెన్= పొందాడు; కావునన్= కావున; హింసా= హింస; రహితంబు= లేనిది; అయిన; యజనంబు= యజ్ఞం; పూజనీయంబు= పూజించదగింది; అగుటకున్= అగుటకు; సంశయించవలవదు= అనుమానించవలదు; అట్లున్+కాక= అంతే కాకుండా.

తాత్పర్యం: ఆ సమయాన వేదంలో యజ్ఞసంబంధమైన భాగం తెలిసిన ఉపరిచర వసువు అక్కడకు వచ్చాడు. అప్పుడు ఆ రెండు పక్షాలవారూ ఆ రాజును నిర్ణయించుమని కోరారు. అతడు దేవతా పక్షమునందలి అభిమానంచేత జంతువధ చేయదగినదే అని చెప్పాడు. అందువలన అతడికి అధోగతి కలిగింది. కాబట్టి హింస లేని యజ్ఞం మన్నించదగింది. ఇందులో అనుమానించవలసిన దేమీ లేదు. అంతే కాకుండా. (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. ఉంఛవృత్తియైన యుర్వీసురోత్తముం। డట్లు ప్రాణరక్షకై ఘటించి
స్వజనములును దాను భుజియింపనుండి యా। సక్తు నతిథి కిచ్చెఁ; జనదె పొగడ.' 259

ప్రతిపదార్థం: ఉంఛవృత్తి= క్షేత్రాదులలో రాలిన గింజలను ఏరుకొని తినటమే జీవికగా కలిగినవాడు; ఐన= అయిన; ఉర్వీసుర= బ్రాహ్మణులయందు; ఉత్తముండు= ఉత్తముడు; అట్లు= ఆ విధంగా; ప్రాణ= ప్రాణాలయొక్క; రక్షకై= రక్షణకై; ఘటించి= కూర్చుకొని; స్వజనములును= తన వారును; తాను; భుజియింపన్= తినగా; ఉండి= సిద్ధంగా ఉండి; ఆ సక్తున్= పేలపిండిని; అతిథికిన్= అతిథికి; ఇచ్చెన్= సమర్పించాడు; పొగడన్= పొగడగా; చనదు+ఎ?= తగదా?

తాత్పర్యం: ఉంఛవృత్తి అయిన బ్రాహ్మణోత్తముడు ప్రాణరక్షణార్థం సమకూర్చుకొని తానూ తనవారూ తినటానికి సిద్ధంగా ఉన్న ఆ పేలపిండిని అతిథికి సమర్పించాడు. ఇది పొగడదగదా? పొగడదగినదే అని అర్థం.'

వ. అనిన విని జనమేజయుం 'డిది యట్టిద; మునీంద్రా! నీ వచనంబుల కొడంబడితి; ధర్మమార్గగతంబైన ద్రవ్యం బింత భవ్యంబు గదే; యవ్వస్తువు దానంబునకుం బ్రధానం బగుట యింకనుం బ్రస్ఫుటంబుగాఁ బ్రకీర్తింపు' మనవుడు నా సంయమి యవ్వాసవ పౌత్త్ర పౌత్త్రు నాలోకించి యిట్లనియె. 260

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; జనమేజయుండు; ఇది= మీరు చెప్పిన సక్తుప్రస్థుడి త్యాగం; అట్టిది+అ= పొగడదగినదే; ముని+ఇంద్రా!= మునిశ్రేష్ఠా!; నీ= నీయొక్క; వచనంబులకున్= మాటలకు; ఒడంబడితిన్= ఒప్పుకొంటున్నాను; ధర్మమార్గ= ధర్మమార్గంచేత; గతంబు= ప్రాప్తించింది; ఐన= అయిన; ద్రవ్యంబు= పదార్థము; ఇంత= ఇంతగా; భవ్యంబు= శుకరం; కద+ఏ!= కదా!; ఆ+వస్తువు= ఆ వస్తువు; దానంబునకున్= దానానికి; ప్రధానంబు= ప్రశస్తం; అగుట; ఇంకను= మరియును; ప్రస్ఫుటంబు+కాన్= విస్పష్టంగా; ప్రకీర్తింపుము= వివరింపుము; అనవుడున్= అని అనగా; ఆ+సంయమి= ఆ ముని వైశంపాయనుడు; ఆ+వాసవ= ఆ ఇంద్రుడియొక్క; పౌత్త్ర= పుత్రుడి కుమారుడియొక్క (మనుమడు); పౌత్త్రున్= పుత్త్రుడి కుమారుడిని, మనుమడిని, జనమేజయుడిని; ఆలోకించి= చూచి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వైశంపాయనుడు చెప్పిన మాటలు విని జనమేజయుడు 'మునీంద్రా! సక్తుప్రస్థుడి త్యాగం కొనియాడదగినదే. మీ మాటలకు ఒప్పుకొంటాను. ధర్మమార్గంచేత ప్రాప్తించిన పదార్థం శుభకరం కదా! ఆ వస్తువు దానానికి ప్రశస్తం కావటం ఇంకా విస్పష్టంగా వివరించుము' అని అన్నాడు. ఆ తరువాత వైశంపాయనుడు జనమేజయుడితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: అవ్వాసవ పౌత్త్ర పౌత్త్రున్-ఇంద్రుడి పుత్త్రుడు అర్జునుడు. అర్జునుడి పుత్త్రుడు అభిమన్యుడు కావున ఇంద్రుడికి అభిమన్యుడు పౌత్త్రుడు. అభిమన్యుడి పుత్త్రుడు పరీక్షిత్తు. పరీక్షిత్తు పుత్త్రుడు జనమేజయుడు. కావున జనమేజయుడు అభిమన్యుడికి పౌత్త్రుడు. ఇంద్రుడికి పౌత్త్రుడి పౌత్త్రుడు.

అగస్త్య మహాముని ద్వాదశ వార్షిక యజ్ఞ ప్రభావము (సం.14-95-4)

సీ. 'ఇవ్విషయంబున నెందుఁ బ్రసిద్ధతం। బరఁగెడు నట్టిది ధరణినాథ!
వినుతేతిహాసంబు వినుము చెప్పెద; నగ। స్త్యుండు పండ్రెండేండ్లు సువ్రతాభి
రతిఁ జేయు మహితాధ్వరమునకు దివ్యాను। భావంబు గలయట్టి పరమమునులు
వేడ్క ఋత్విజులయి వెలయ నిజప్రౌఢి। నఖిల తంత్రంబులు నాచరింప;

తే. నా సమయమున వర్షింపఁ డయ్యె నింద్రుఁ। డోషధులు వికలత్వంబు నొందె; దానిఁ
జూచి యత్తపోధను 'లగస్త్యునకు నన్న। దానవిధు లెట్లు చెల్లునో తగు విధమున. 261

ప్రతిపదార్థం: ధరణినాథ!= భూనాథా!, రాజా!; ఈ విషయంబునన్= ఈ విషయంలో; ఎందున్= అంతటా; ప్రసిద్ధతన్= ప్రఖ్యాతితో; పరఁగెడు= ఒప్పెడు; అట్టి+అది= అటువంటిది; వినుత= కొనియాడబడిన; ఇతిహాసంబు= జరిగిన కథ; వినుము; చెప్పెదన్= చెప్పుతాను; అగస్త్యుండు; సువ్రత= ఉత్తమ నియమమునందలి; అభిరతిన్= ఆసక్తితో; పండ్రెండు; ఏండ్లు= ఏళ్లు; చేయు= చేసే; మహిత= పూజించబడిన, గొప్పదైన; అధ్వరమునకున్= యజ్ఞానికి; దివ్య= దేవతాసంబంధమైన; అనుభావంబు= మహిమ; కల+అట్టి= కలిగినట్టి; పరమమునులు= మహర్షులు; వేడ్కన్= సంతోషంతో; ఋత్విజులు= యజ్ఞం చేయించేవారు; అయి;

వెలయన్= పొగడ్త కెక్కగా; నిజ= తమయొక్క; ప్రౌఢిన్= కార్యసామర్థ్యంతో; అఖిల= సమస్తమైన; తంత్రంబులు= ఏర్పాటులు; ఆచరింపన్= చేయగా; ఇంద్రుఁడు= ఇంద్రుడు; ఆ సమయమునన్= అప్పుడు; వర్షింపఁడు+అయ్యెన్= వానలు కురిపించని వాడాయెను; ఓషధులు= ఫలించిన వెంటనే నశించే వరి మొదలైనవి; వికలత్వంబున్= వినాశాన్ని; ఒందెన్= పొందాయి; ఆ+తపస్+ధనులు= ఆ తపస్సే ధనంగా కలవారు; దానిన్= ఆ దుస్స్థితిని; చూచి; అగస్త్యునకున్= అగస్త్యుడికి; అన్నదాన= అన్న దానంయొక్క; విధులు= కర్తవ్యాలు; అగు= తగిన; విధమునన్= విధంగా; ఎట్లు= ఏ రీతిగా; చెల్లును+ఒ?= సాధ్యమగునో?

తాత్పర్యం: రాజా! ఈ విషయంలో లోకంలో ప్రసిద్ధికెక్కిన ఒక కథ నీకు చెప్తుతాను వినుము. అగస్త్యుడు నియమనిష్ఠలతో పన్నెండేళ్ళు ఒక గొప్ప యజ్ఞం చేయటానికి నిశ్చయించాడు. దివ్య మహిమ గల మహర్షులు ఆ యజ్ఞానికి ఋత్విజులై సమర్థంగా అన్ని ఏర్పాట్లు చేశారు. కాని, అప్పుడు ఇంద్రుడు వర్షాలు కురిపించలేదు. వరి మొదలైనవన్నీ చెడిపోయాయి. ఆ దుస్స్థితిని చూచి ఆ మహర్షులు 'శాస్త్రోక్తంగా అన్నదానాన్ని అగస్త్యుడు ఎట్లా చేస్తాడో?

వ. ఇతండు ద్వాదశవార్షికం బైన దీక్షా విశేషంబు నొందినవాఁడు; ధర్మమార్గాగతం బయిన ద్రవ్యంబు దక్కనొండు
వినియోగింపండు; వానయుం గురియ; దని ముచ్చిరి తమలోఁ బలుకు పలుకులు ప్రతాపదీపితుం డగు
నక్కుంభసంభవుం డాలించి వారలతో నిట్లనియె. 262

ప్రతిపదార్థం: ఇతండు= ఈ మహాత్ముడు; ద్వాదశ వార్షికంబు= పన్నెండేళ్ళకు సంబంధించినది; ఐన= అయిన; దీక్షావిశేషంబున్= మహాయజ్ఞ దీక్షను; ఒందినవాఁడు= పూనినవాడు; ధర్మమార్గ= ధర్మమార్గంచేత; ఆగతంబు= వచ్చింది, ప్రాప్తించింది; అయిన; ద్రవ్యంబు= పదార్థం; తక్కన్= తప్ప; ఒండు= మరియొకటి; వినియోగింపండు= ఉపయోగించడు; వానయున్= వానకూడా; కురియదు= కురియలేదు; అని; ముచ్చిరి= విచారించి; తమలోన్= వారిలోవారు; పలుకు= అనుకొనుచున్న; పలుకులు= మాటలు; ప్రతాప= శక్తిచేత; దీపితుండు= ప్రకాశింపజేయబడినవాడు; అగు= అయిన; ఆ కుంభ= ఆ కుండయందు; సంభవుండు= పుట్టినవాడు - అగస్త్యుడు; ఆలించి= ఆలకించి; వారలతోన్= వారితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ మహాత్ముడు పన్నెండేళ్ళ యజ్ఞదీక్ష వహించాడు. ధర్మమార్గంచేత ప్రాప్తించిన పదార్థాన్ని తప్ప మరొక దానిని ఉపయోగించడు. వానలూ పడటంలేదు' అని విచారించారు. వారు తమలో తాము అనుకొనే మాటలు శక్తిశాలి అయిన అగస్త్యుడు విని వారితో ఈ విధంగా అన్నాడు.

ఉ. 'న్యాయము గల్గి యధ్వరమునందు విఘాతము పుట్టకుండఁ దాఁ
దోయదకోటిఁ బన్చి హరి తుష్టిగ వృష్టి యొనర్పకున్న నే
నా యమరేంద్రతం గొని మహాద్భుత వృత్తి జగంబుఁ బ్రోచెదన్;
మీయెదఁ జింత దక్కుఁడు సమిద్ధతపఃపరులార! నా దెసన్. 263

ప్రతిపదార్థం: సమిద్ధ= అప్రతిహతమైన; తపస్= తపస్సునందు; పరులు+ఆర!= ఆసక్తి కలిగిన మునులార!; హరి= ఇంద్రుడు; తాన్= తాను; న్యాయము= ధర్మం; కల్గి= కలిగి; అధ్వరము+అందున్= యజ్ఞమునందు; విఘాతము= విఘ్నం; పుట్టక+ఉండన్= కలుగకుండ; తోయద= మేఘాలయొక్క; కోటిన్= సమూహాన్ని; పన్చి= పంపించి; తుష్టి+కన్= తృప్తిగా; వృష్టి+ఒనర్పక= వాన కురిపించక; ఉన్నన్= ఉంటే; నేను; అమరేంద్రతన్= ఆ దేవేంద్రత్వమును; కొని= స్వీకరించి; మహా+అద్భుత= ఆశ్చర్యం కలిగించే; వృత్తిన్= వ్యాపారంతో; జగంబున్= లోకాన్ని; ప్రోచెదన్= కాపాడుతాను; నాదెసన్= నా విషయంలో; మీ= మీయొక్క; ఎదన్= హృదయాలలో; (ఇట ఎద జాత్యేకవచనము;) చింతన్= విచారమును; తక్కుఁడు= వదలండి.

తాత్పర్యం: 'అప్రతిహత తపఃపరులారా! దేవేంద్రుడు ధర్మబుద్ధిఅయి యజ్ఞానికి విఘ్నం కలుగకుండా మేఘాలను పంపి నెలకు మూడు వానలు నిండుగా కురిపిస్తాడా సరేసరి. లేదా నేనే ఆ దేవేంద్రత్వాన్ని స్వీకరించి లోకాన్ని కాపాడుతాను. మీరు నా విషయంలో నిర్విచారంగా ఉండండి.

క. కాదేనిఁ ద్రిజగముల బహు। ళోదార ద్రవ్యకోటు లున్న యునికి మీ
పాదముల పరిసరమునకుఁ। దే దొరఁకొను; నశ్రమమునఁ దెచ్చెద వానిన్. 264

ప్రతిపదార్థం: కాదు+ఏనిన్= అట్లా కాకపోతే; త్రిజగములన్= మూడు లోకాలలో; బహుళ= అధికమైన; ఉదార= గొప్పదైన; ద్రవ్య= పదార్థాలయొక్క; కోటులు= సమూహాలును; ఉన్న+ఉనికిన్= ఉన్నవి ఉన్నట్లే; మీ= మీయొక్క; పాదములపరిసరమునకున్= కాళ్ళదగ్గరకు; తేన్= తీసికొనగా; దొరఁకొనున్= లభిస్తుంది; వానిన్= వాటిని; అశ్రమమునన్= సునాయాసంగా; తెచ్చెదన్= తెస్తాను.

తాత్పర్యం: ఆ విధంగా కాకపోతే మూడు లోకాలలో యజ్ఞద్రవ్యాలు కోటానకోట్లు ఉన్నవి కదా! వాటిని ఉన్నవి ఉన్నట్లే మీ కాళ్ళదగ్గర సునాయాసంగా తెచ్చి పడవేస్తాను.

తే. అంత చేయంగవలయునే యన్న ననఘు। లార! యుత్తర కురుభూము లారఁ బండి
యున్నయవి; యాగ కాలోచితాన్నమునకు। వలయు ధాన్యముల్ తలఁపున వచ్చు నిందు.' 265

ప్రతిపదార్థం: అంత= అంతపెద్దపని; చేయంగన్+వలయున్+ఏ= చేయవలయునా; అన్నన్= అని మీరు అంటే; అనఘులు+ఆర!= పుణ్యాత్ములారా!; ఉత్తర కురు భూములు= ఉత్తర కురుదేశంలోని భూములు; ఆరన్= పరిపూర్ణంగా; పండి; ఉన్న+అవి= ఉన్నవి; యాగకాల= యజ్ఞసమయానికి; ఉచిత= తగిన; అన్నమునకున్= అన్నం కొరకు; వలయు= కావలసిన; ధాన్యముల్= ధాన్యాలు; తలఁపునన్= తలచిన వెంటనే; ఇందున్= ఇక్కడకు; వచ్చున్= చేరుతాయి.

తాత్పర్యం: పుణ్యాత్ములారా! అంతపెద్దపని చేయాలా? అని మీరు అన్నట్లయితే ఉత్తర కురుభూములలో పంటలు చక్కగా పండాయి. యాగకాలంలో అన్నప్రదానం చేయటానికి కావలసిన ధాన్యాలు తలచినవెంటనే ఇక్కడకు చేరుతాయి.'

వ. అని పలికి వెండియు. 266

తాత్పర్యం: అని చెప్పి ఇంకా (ఇట్లా అన్నాడు.)

క. 'ఆ జాలియేల? నిర్మల। బీజహవిస్తంత్ర మేను బ్రీతి నొనర్పం
గా జగతి వఱపునం జెడు। నే? జన్నము విఘ్నపడునె? యేటికి వగవన్.' 267

ప్రతిపదార్థం: ఆ జాలి= ఆ విచారం, బాధ; ఏల?= ఎందుకు?; ఏను= నేను; నిర్మల= స్వచ్ఛమైన; బీజ= బీజాలు అను; హవిస్= హోమద్రవ్యాలతో కూడిన; తంత్రము= హోమం; ప్రీతిన్= సంతోషంతో; ఒనర్పఁగాన్= చేయగా; జగతి= లోకం; వఱపునన్= అనావృష్టిచేత; చెడున్+ఏ?= చెడునా?; జన్నము= యజ్ఞం; విఘ్నపడును+ఎ= విఘ్నం కలది అగునా?; వగవన్= విచారించగా; ఏటికిన్?= ఎందుకు?

తాత్పర్యం: 'ఆ బాధ ఎందుకు? నేను సంతోషంగా మంచి విత్తనాలతో యజ్ఞంచేస్తే లోకం అనావృష్టిచే చెడుతుందా? యజ్ఞానికి ఆటంకం కలుగుతుందా? విచారించనేల?'

సీ. **అన విని 'నీవు ధర్మాగతి సంసిద్ధ। వస్తుదాయిని; నిరవద్య తపము**
వ్యయముగా నీ కేల వాసవుపై కిన్క? నఖిల జగద్ధన మాహరించి
కొననేల? యుత్తర కురుభూములందలి। ధాన్యంబు లేల? సన్మాన్యబీజ
హుతములందు ఫలేచ్ఛ యోజింప నేల? మా। కై యిన్ని దెఱఁగులయందుఁ బాఱె

తే. **నీదు చిత్తంబు; దీని వినిశ్చయముగఁ। జేసి సుఖి వగు; మేము మా చేసినట్టి**
సుకృతములఁ దెచ్చికొందుము సులభములుగ। వలయు నాహారములు; లోకవందనీయ!' **268**

ప్రతిపదార్థం: లోక= లోకాలచేత; వందనీయ= నమస్కరించదగినవాడా!; అనన్= అనగా; విని; నీవు; ధర్మ+ఆగతి= ధర్మ ప్రాప్తిచేత; సంసిద్ధ= ఆమోదించబడిన; వస్తు= వస్తువులను; దాయిని= ఇచ్చేవాడవు; నీకున్= నీకు; వాసవుపైన్= ఇంద్రుడిమీద; కిన్కన్= కోపంచేత; నిరవద్య= దోషంలేని; తపము; వ్యయము+కాన్= వ్యయంకావటం; ఏల?= ఎందుకు?; అఖిల= సమస్తమైన; జగత్= లోకాలయొక్క; ధనము= ధనమును; ఆహరించికొనన్= తీసికొనగా; ఏల?= ఎందుకు?; ఉత్తర కురుభూములు+ అందున్+అలి= ఉత్తర కురుభూములలోని; ధాన్యంబులు= ధాన్యాలు; ఏల?= ఎందుకు?; సత్= సజ్జనులచేత; మాన్య= గౌరవించదగిన; బీజ= బీజాలు; హుతములు+అందున్= హోమద్రవ్యాలలో; ఫల= ఫలమునందలి; ఇచ్ఛన్= కోరికను గూర్చి; యోజింపన్+ఏల?= ఆలోచించటం ఎందుకు?; మాకున్+ఐ= మా కొరకు; ఇన్ని; తెఱఁగుల+అందున్= దారులందు; నీదు చిత్తంబు= నీ మనస్సు; పాఱెన్= పోయింది; దీనిన్= ఈ యజ్ఞాన్ని; వినిశ్చయము+కన్= నిశ్చయించినట్లు తప్పక; చేసి; సుఖివి= సుఖం కలవాడవు; అగుము; ఏము= మేము; చేసిన; అట్టి; సుకృతములన్= పుణ్యాలచేత; వలయు= కావలసిన; ఆహారములు; సులభములుగన్= సులభంగా; తెచ్చికొందుము= తెచ్చికొంటాము.

తాత్పర్యం: అగస్త్యుడు ఈ విధంగా అనగా విని మునులు 'లోకనందనీయా! నీవు ధర్మబద్ధంగా ప్రాప్తించిన వస్తువులు ఇచ్చేవాడవు. ఇంద్రుడిమీద కోపంచేత నీ నిష్కళంకమైన తపస్సు వ్యయం కావటం దేనికి? లోకాలన్నిటిలో ఉన్న ధనం తీసికొనటం ఎందుకు? ఉత్తర కురుభూములలోని ధాన్యాలెందుకు? మంచి విత్తనాలతో ఫలం కోరి యజ్ఞం చేయటం ఎందుకు? మా కొరకు నీ మనస్సు ఇన్ని దారులు త్రొక్కింది. ఈ యజ్ఞాన్ని అనుకొన్నట్లు చేసి సుఖంగా ఉండుము. మేము చేసిన పుణ్యాలవలన మాకు కావలసిన ఆహార పదార్థాలను మేము తెచ్చుకొంటాము.'

మ. **అని సల్లాపము సేయుచుండఁగ ననేకాంభోదజాలంబులన్**
బనిచెం బెల్లుగ వర్షముల్ గురియఁగాఁ బర్జన్యుఁ డా ప్రొద్ద; తా
నును నాచార్యుఁ బురస్కరించికొని నన్నుం గావవే యంచు న
మ్మునిశార్దూలునిఁ గానవచ్చె వినయంబున్ భక్తియుం దోఁపఁగన్. **269**

ప్రతిపదార్థం: అని; సల్లాపము= సంభాషణం; చేయుచున్= చేస్తూ; ఉండఁగన్= ఉండగా; ఆ ప్రొద్దు+అ= అప్పటికప్పుడే; పర్జన్యుఁడు= ఇంద్రుడు; అనేక= పెక్కులైన; అంభోద= మేఘాలయొక్క; జాలంబులన్= గుంపులను; పెల్లు+కన్= ఎక్కువగా; వర్షముల్= వర్షాలు; కురియఁగాన్= కురియగా; పనిచెన్= పంపాడు; తానును= తానుకూడా; ఆచార్యున్= గురువును, బృహస్పతిని; పురస్కరించికొని= ముందుంచుకొని; వినయంబున్= వినయమూ; భక్తియున్= భక్తియూ; తోఁపఁగన్= వెల్లడి కాగా; నన్నున్= నన్ను; కావవే= రక్షింపవే; అంచున్= అంటూ; ఆ ముని శార్దూలునిన్= ఆ మునులలో శ్రేష్ఠుడిని; కానన్= దర్శించగా; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: అని మునులు మాటాడుతుండగా ఆ సమయంలోనే ఇంద్రుడు జోరున వానలు కురియటానికి మేఘాలను పంపాడు. అంతే కాకుండా తన గురువును బృహస్పతిని ముందుంచుకొని వినయమూ భక్తీ వెల్లడి ఔతుండగా తాను కూడా అగస్త్యుడిని దర్శించటానికి వచ్చాడు.

ఉ. వచ్చిన గారవించి, యనవద్యపు టర్చన లిచ్చి సంయముల్
మెచ్చఁగ శాంతసద్వచనలీలఁ బ్రమోద మొనర్చి యాతనిం
బుచ్చె సురేజ్యయుక్తముగఁ బోఁడిగఁ గ్రమ్మఱ వేల్పువీటి కా
సచ్చరితుండు; లోకమును సంతస మందె; వెలింగె జన్నమున్. 270

ప్రతిపదార్థం: ఆ+సత్= ఆ ఉత్తమమైన; చరితుండు= నడవడిగలవాడు, అగస్త్యుడు; వచ్చినన్= ఇంద్రుడు రాగా; గారవించి= గౌరవించి; అనవద్యము= దోషం దొరలని; అర్చనలు+ఇచ్చి= పూజలు చేసి; సంయముల్= మునులు; మెచ్చఁగన్= మెచ్చుకొనగా; శాంత= నెమ్మదితో కూడిన; సత్+వచన= మంచిమాటలయొక్క; లీలన్= సొగసుతో; ప్రమోదము= సంతోషం; ఒనర్చి= కలిగించి; పోఁడిగన్= తగిన విధంగా; క్రమ్మఱన్= మరల; అతనిన్= ఆ ఇంద్రుడిని; సుర= దేవతలయొక్క; ఇజ్య= గురువుతో, బృహస్పతితో; యుక్తముగన్= కూడి ఉండేటట్లుగా; వేల్పు= దేవతలయొక్క; వీటికిన్= పట్టణానికి, అమరావతికి; పుచ్చెన్= పంపాడు; లోకమును= లోకంకూడా; సంతసము+అందెన్= సంతోషించింది; జన్నమున్= యజ్ఞమూ; వెలింగెన్= శోభిల్లింది.

తాత్పర్యం: ఇంద్రుడు రాగా అగస్త్యుడు గౌరవించి, శాస్త్రోక్తంగా పూజించి నెమ్మదితో మంచిమాటలు చెప్పి అలరించి, అతడిని బృహస్పతితోపాటు మరలా అమరావతికి తగినవిధంగా పంపాడు. ఇది చూచి మునులు మెచ్చుకొన్నారు. లోకమూ సంతోషించింది. యజ్ఞమూ శోభిల్లింది.

తే. క్రతు సమాప్తి సమయమున నతఁడు వినయ। భరితుఁడై యోగ్యభంగి నప్పరమ మునుల
కర్చ లిచ్చి యామంత్రణ మాచరింప। వారుఁ బ్రీతి నేఁగిరి నిజావాసములకు. 271

ప్రతిపదార్థం: అతండు= అగస్త్యుడు; క్రతు= యజ్ఞంయొక్క; సమాప్తి= ముగింపుయొక్క; సమయమునన్= కాలంలో; వినయ= వినయంచేత; భరితుఁడు+ఐ= నిండినవాడై; ఆ పరమ మునులకున్= ఆ మహర్షులకు; యోగ్య= తగిన; భంగిన్= విధంగా; అర్చలు+ఇచ్చి= పూజలుచేసి; ఆమంత్రణము= వీడ్కోలు; ఆచరింపన్= చేయగా; వారున్= వారూ; ప్రీతిన్= ఆనందంతో; నిజ= తమయొక్క; ఆవాసములకున్= నివాసాలకు; ఏఁగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: యజ్ఞం ముగిసినప్పుడు అగస్త్యుడు వినయపరిపూర్ణుడై ఆ మహర్షులకు తగినవిధంగా పూజలుచేసి వీడ్కొలుపగా వారు తమ తమ నివాసాలకు వెళ్ళారు.

జమదగ్ని మహాముని పితృదేవతల శాపంబున నకులం బై పుట్టిన కథ (సం.14-96-1)

వ. ఇవ్విధంబున హింసారహితంబుగా మహిత యాగంబు సుప్రయోగంబు చేసి యగస్త్యుండు పరమ ప్రశస్తి నుజ్జ్వలుఁ డయి వెలింగెం; గావున ధర్మమార్గాగత ద్రవ్యకృతంబై తపోమయం బగు యజ్ఞంబు ప్రాజ్ఞజన మనోజ్ఞంబై వెలయు' నని చెప్పిన విని జనమేజయుం డిట్లనియె. 272

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; హింసా= హింస; రహితంబు+కాన్= లేనట్లుగా; మహిత యాగంబు= గొప్ప యజ్ఞం; సుప్రయోగంబు= సదనుష్ఠానం కలదిగా; చేసి; అగస్త్యుండు; పరమ= మిక్కిలి; ప్రశస్తిన్= పొగడ్తతో; ఉజ్జ్వలుండు= పెంపొందేవాడు; అయి; వెలింగెన్= ప్రకాశించాడు; కావునన్= కాబట్టి; ధర్మమార్గ= ధర్మమార్గంచేత; ఆగత= ప్రాప్తించిన; ద్రవ్య= పదార్థాలచేత; కృతంబు+ఐ= చేయబడినదై; తపస్+మయంబు= తపోరూపం; అగు= అయిన; యజ్ఞంబు= యజ్ఞం; ప్రాజ్ఞజన= విద్వాంసులకు; మనోజ్ఞంబు+ఐ= మనోహరమై; వెలయున్= ప్రసిద్ధికెక్కుతుంది; అని; చెప్పినన్= చెప్పగా; విని; జనమేజయుండు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా హింస లేకుండా సదనుష్ఠానం కలదిగా మహాయజ్ఞం చేసి మిక్కిలి పొగడ్తలు పొంది అగస్త్యుడు ప్రకాశించాడు. ధర్మమార్గాన ప్రాప్తించిన ద్రవ్యాలతో చేసే తపోరూపయజ్ఞం విద్వాంసులకు మనోహరమై ప్రసిద్ధి కెక్కుతుంది' అని వైశంపాయనుడు చెప్పగా విని, జనమేజయుడు ఈ విధంగా పలికాడు.

తే. **'అనఘ! నకులరూపంబున నట్లు దోఁచి। బ్రాహ్మణులతోడ మానవ భాషణముల**
నెవ్వఁడేనియు నొక్క యహీన బోధ। ఘనుఁడు సల్లాప మొనరించె నని తలంచి. **273**

ప్రతిపదార్థం: అనఘ!= పుణ్యాత్మా!; ఎవ్వఁడు+ఏనియున్= ఎవ్వడో; ఒక్క= ఒకానొక; అహీన= హీనంకాని, అత్యధికమైన; బోధ= జ్ఞానంచేత; ఘనుఁడు= గొప్పవాడు; అట్లు= ఆవిధంగా; నకుల= ముంగిస; రూపంబునన్= రూపంతో; తోఁచి= కనబడి; బ్రాహ్మణులతోడన్= బ్రాహ్మణులతో; మానవ= మనుష్యులయొక్క; భాషణములన్= మాటలతో; సల్లాపము= సంభాషణం; ఒనరించెన్= చేశాడు; అని; తలంచి= ఊహించి.

తాత్పర్యం: పుణ్యాత్మా! ఎవ్వడో ఒక మహాజ్ఞాని ఆ విధంగా ముంగిసరూపంతో సాక్షాత్కరించి బ్రాహ్మణులతో మనుష్యవాక్కులతో మాటాడి యుండవచ్చునని యూహించి. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. **ఆతఁ డెవ్వఁడో? యని నిన్ను నడుగఁ జూచి। వెండియును బ్రస్తుతోక్తుల విందు మను మ**
నంబుతో నూరకుండితి; నాకు నతనిఁ। జెప్పఁ దగు నేని బోధనశీల! చెపుమ!' **274**

ప్రతిపదార్థం: బోధన= బోధించుటయే; శీల!= శీలంగా కలవాడా!; అతఁడు= ఆ మహాజ్ఞాని; ఎవ్వఁడు+ఓ= ఎవ్వడో; అని; నిన్నున్= నిన్ను; అడుగన్= అడుగగా; చూచి= తలచియూ; వెండియును= మరియును; ప్రస్తుత= ముందు సందర్భమునుబట్టి వచ్చిన; ఉక్తులన్= మాటలను; విందుము= విందాము; అను; మనంబుతోన్= మనస్సుతో; ఊరక+ఉండితిన్= ఊరకున్నాడు; అతనిన్= అతడిని గూర్చి; చెప్పన్+తగున్+ఏనిన్= చెప్పదగినచో; నాకున్= నాకు; చెపుము+అ!= చెప్పుమా!

తాత్పర్యం: బోధనశీలా! అత డెవ్వడో నిన్ను అడగాలని అనుకొన్నప్పటికీ ముందు సందర్భమునను సరించి వచ్చినమాటలు వినవలెననే మనస్సుతో నేను ఊరకున్నాను. అతడిని గూర్చి చెప్పటానికి వీలుంటే నాకు చెప్పండి.

క. **అనుటయు వైశంపాయనుఁ। 'డనూన పుణ్య ప్రదీప్తుఁ డగు నీ కెందున్**
వినఁ దగని యదియుఁ గలదే! వినిపించెద ముంగి విధము విను తెలియంగన్. **275**

ప్రతిపదార్థం: అనుటయున్= అనగా; వైశంపాయనుఁడు; న+ఊన= తక్కువకాని,అధికమైన; పుణ్య= పుణ్యంచేత; ప్రదీప్తుఁడు= ప్రకాశింపజేయబడినవాడవు; అగు= అయిన; నీకున్= నీకు; ఎందున్= ఏ విషయంలోనైనా; వినన్= వినగా; తగని= తగని;

అదియున్= అదికూడా; కలదు+ఏ?= ఉన్నదా?; ముంగి= ముంగిసయొక్క; విధము= వృత్తాంతం; తెలియంగన్= తెలిసేటట్లుగా; వినిపించెదన్= వినిపిస్తాను; విను= వినుము.

తాత్పర్యం: అనగా వైశంపాయనుడు 'నీవు మహాపుణ్యంచేత ప్రకాశిస్తున్నావు. ఏ విషయమైనా నీకు తెలియకూడనిదంటూ ఒకటి ఉన్నదా! నీకు తెలిసేటట్లుగా ముంగిస వృత్తాంతం వినిపిస్తాను వినుము.

సీ. జమదగ్ని పితృకార్య సంకల్ప మత్యంత । నియతాత్ముడై చేసె; నిష్ఠ యొప్పఁ
జారు నూతన కలశంబున హోమ ధే । నువుఁ దాన పిదికి గారవముతోడ
నిమ్మైనయెడఁ బదిలమ్ముగా డించిన । నతని చిత్తము తెఱం గరయు బుద్ధి
సాకారవృత్తిఁ గ్రోధాధిదైవము వచ్చి । ప్రామాదికం బను భంగి దోఁపఁ

ఆ. గుండతోడిపాలు గూల్చినఁ గినియక । యూరకుండె నా సముజ్జ్వలాత్ముఁ;
డప్పు డాత్మ మెచ్చి యద్దైవ మతనికి । నిట్టు లనియెఁ గురుమహీశవర్య! 276

ప్రతిపదార్థం: కురు= కురువంశీయులైన; మహి+ఈశ= రాజులలో; వర్య!= శ్రేష్ఠుడా!; జమదగ్ని; అత్యంత= మిక్కిలి; నియత= నిగ్రహించబడిన; ఆత్ముండు+ఐ= మనస్సు కలవాడై; పితృకార్య= శ్రాద్ధం చేయవలయుననే; సంకల్పంబు= ఆలోచన; చేసెన్= చేశారు; నిష్ఠ= శ్రద్ధ; ఒప్పన్= ఒప్పగా; తాన్+అ= తానే; చారు= అందమైన; నూతన= క్రొత్తది అయిన; కలశంబునన్= కుండలో; హోమ= యజ్ఞానికి ఉపయోగించు; ధేనువున్= ఆవును; పిదికి; గారవముతోడన్= ప్రేమతో; ఇమ్ము+ఐన= అనుకూలమైన; ఎడన్= చోటునందు; పదిలమ్ము+కాన్= జాగరూకతతో; డించినన్= చేర్పగా, ఉంచగా; అతని= అతడియొక్క; చిత్తము= మనస్సు; తెఱంగు= తీరు; అరయు= పరీక్షించే; బుద్ధిన్= తలపుతో; సాకార= ఆకారంతో కూడిన; వృత్తిన్= వ్యాపారంతో; క్రోధ= క్రోధమునకు; అధిదైవము= అధిష్ఠానం. (క్రోధభూతము అని అర్థం); వచ్చి; ప్రామాదికంబు= పొరపాటున జరిగింది; అగు= అయిన; భంగి= విధం; తోఁపన్= చూపట్టగా; కుండతోడన్+పాలున్= కుండతోపాటు పాలను, పాలకుండను; కూల్చినన్= పడద్రోయగా; ఆ సముజ్జ్వల= ఆ పాపరహితమైన; ఆత్ముఁడు= ఆత్మకలవాడు, జమదగ్ని; కినియక= కోపించక; ఊరకుండెన్= ఊరకున్నాడు; ఆ దైవము= ఆ క్రోధభూతం; అప్పుడు; ఆత్మన్= మనస్సులో; మెచ్చి= మెచ్చుకొని; అతనికిన్= జమదగ్నితో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నారు.

తాత్పర్యం: జమదగ్ని నిగ్రహచిత్తుడై శ్రాద్ధం చేయ సంకల్పించాడు. నిష్ఠతో అందమైన క్రొత్త కుండలో హోమధేనువు పాలు పిండి అనుకూల ప్రదేశంలో దానిని జాగరూకతతో ఉంచాడు. అతడి మనస్సు పరీక్షించాలని క్రోధభూతం నిశ్చయించింది. అది ఆకారం ధరించి వచ్చి చూచినవారు పొరపాటున జరిగిందని అనుకొనేటట్లుగా పాలకుండను పడద్రోసింది. పుణ్యాత్ముడైన జమదగ్ని చూచికూడా కోపించలేదు. అప్పుడు ఆ భూతం మనస్సులో మెచ్చుకొని అతడితో ఇట్లా అన్నది.

క. భృగువులు క్రోధను లనఁగా । జగతిఁ బరఁగు వాద; మది మృషాపరికలితం
బగుట దెలిసె; నోడితి నీ;। కగణిత మగు నీ తపమున కలికెద ననఘా! 277

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్మా!; భృగువులు= భృగుమహర్షి సంతతివారు; క్రోధనులు= క్రోధస్వభావులు; అనఁగాన్= అనగా; వాదము= వదంతి; జగతిన్= లోకంలో; పరఁగున్= వ్యాపించి ఉన్నది; అది= ఆ వదంతి; మృషా= అసత్యంతో, పరికలితంబు=

కూడింది; అగుట; తెలిసెన్= తెలిసింది; నీకున్= నీకు; ఓడితిని= ఓడిపోయాను; అగణితము= ఇంతా అంతా అని లెక్కించబడనిది; అగు= అయిన; నీ= నీ యొక్క; తపమునకున్= తపస్సునకు; అలికెదన్= భయపడతాను.

తాత్పర్యం: 'పుణ్యాత్మా! భృగు సంతతివారికి ముక్కుమీద కోపం ఉంటుందనే వదంతి లోకంలో వ్యాపించి ఉన్నది. అది అసత్య మని నేడు తెలిసింది. నీకు ఓడిపోయాను మితీమేరా లేని నీ తపస్సుకు నేను భయపడతాను.'

వ. అని వెండియు. 278

తాత్పర్యం: అని ఇంకా ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'నా దెసఁ బ్రసన్నుఁడవు గ; । మ్మాదరమునఁ జూడు; సైఁపు మపరాధము; వి
ద్యాదయిత!' యనిన నమ్ముని । యా దైవముఁ జూచి శాంతి యలవడ నెమ్మిన్. 279

ప్రతిపదార్థం: విద్యాదయిత!= విద్యానాథా!; నా దెసన్= నా యెడ; ప్రసన్నుఁడవు= దయగలవాడవు అగుము; ఆదరమునన్= ప్రేమతో; చూడుము; అపరాధము= తప్పు; సైఁపుము= సహింపుము; అనినన్= అనగా; ఆ ముని= ఆ జమదగ్ని; ఆ దైవమున్= ఆ దయ్యమును, భూతమును; శాంతి; అలవడన్= అబ్బగా; నెమ్మిన్= ప్రేమతో; చూచి.

తాత్పర్యం: 'విద్యానాథా! నా యందు దయ చూపుము. నన్ను ప్రేమతో చూడుము. నా తప్పు సహింపుము' అనగా జమదగ్ని శాంతమూర్తి అయి ఆ భూతాన్ని ప్రేమతో చూచి.

వ. నా యెడ నిప్పుడు. 280

తాత్పర్యం: నా విషయం ఇప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. నీ వేమి తప్పు సేసితి? । త్రోవుము శంకాభయంబు తొలఁగఁగ; సంక
ల్పావిలతకు నలుగుట పితృ । దేవతలకుఁ గలుగుఁ; బొమ్ము దిగ్గన' ననుడున్. 281

ప్రతిపదార్థం: నీవు; ఏమి తప్పు= ఏ తప్పు; చేసితి?(వి)= చేశావు?; శంకా= అనుమానంవలన కలిగిన; భయంబు= భయం; తొలఁగఁగన్= తొలగిపోగా; త్రోవుము= త్రోసివేయుము; సంకల్ప= శ్రాద్ధం చేయవలయునను నా సంకల్పముయొక్క; ఆవిలతకున్= నష్టానికి, భగ్నమునకు; పితృదేవతలకున్= పితృదేవతలకు; అలుగుట= కోపించటం; కలుగున్= సంభవిస్తుంది; దిగ్గనన్= శీఘ్రంగా; పొమ్ము= వెళ్ళిపొమ్ము; అనుడున్= అనగా.

తాత్పర్యం: 'నీవు నా యెడ ఏ తప్పు చేశావు? అనుమానంవలన చేశాననే నీ కేమయినా భయం కలిగితే దానిని త్రోసి వేయుము. శ్రాద్ధ సంకల్పము భగ్నమవటంచేత పితృదేవతలు నన్ను కోపిస్తారు. నీవు శీఘ్రంగా వెళ్ళిరమ్ము' అనగా.(తరువాతి వచనంతో అన్వయం)

వ. భీతి నా భూతం బంతర్ధానంబు చేసెం; దదనంతరంబ యాజమదగ్నిం బితృదేవతలు కోపించి పొడసూపి యతనితో 'నీవు శ్రాద్ధంబునకు సంకల్పించి యుండి తద్వైకల్యంబు పుట్టిన నూరకుండి' తని పలికి 'ముంగి వయి పుట్టు' మని శపించిన నతండు వారలకు దండప్రణామంబు చేసి 'తపస్వికి నలుగం దగదని యపరాధంబు గనియునుం గ్రోధాధిదైవంబునకు నలుగనైతి. 282

ప్రతిపదార్థం: భీతిన్= భయంతో; ఆ భూతంబు= ఆ భూతం; అంతర్ధానంబు చేసెన్= అదృశ్యమయింది; తద్= ఆ; అనంతరంబు+అ= తరువాత; ఆ జమదగ్నిన్= ఆ జమదగ్నిని; పితృదేవతలు; కోపించి= కోపగించుకొని; పొడసూపి= సాక్షాత్కరించి; అతనితోన్= అతడితో; నీవు; శ్రాద్ధంబునకున్= శ్రాద్ధానికి; సంకల్పించి+ఉండి= నిశ్చయించి ఉండి; తద్= దానియొక్క; వైకల్యంబు= లోపం; పుట్టినన్= పుట్టగా; ఊరకుండితి (వి)= ఊరకున్నావు; అని; పలికి; ముంగివి= ముంగిసవు; అయి; పుట్టుము; అని; శపించినన్= శపించగా; అతండు= అతడు, జమదగ్ని; వారలకున్= పితృదేవతలకు; దండప్రణామంబు= తప్పు; కనియునున్= చూచికూడా; క్రోధ= క్రోధమును; అధిదైవంబునకున్= అధిష్ఠించి ఉండే దేవతకు; అలుగన్+ఐతిన్= కోపింపనయ్యాను.

తాత్పర్యం: ఆ భూతం భయంతో అదృశ్యమైనది. తరువాత పితృదేవతలు జమదగ్నిపై కోపంపూని సాక్షాత్కరించి అతడితో 'నీవు శ్రాద్ధం చేయాలని తలంచి దానికి లోపం కలిగినా ఊరకున్నావు' అని అన్నారు. 'ముంగిసవయి పుట్టుము' అని శపించారు. అప్పుడు వారికి జమదగ్ని సాష్టాంగ నమస్కారం చేసి 'తపస్సు చేసేవారికి కోపగించటం తగదని తలచి తప్పు కనబడుతున్నప్పటికి క్రోధభూతాన్ని కోపించ లేదు.

ఆ. తప్పు సైఁచి నన్ను దయఁ జూచి శాపమో। క్షము ననుగ్రహింపుఁ డమితతేజు
లార!' యని వినీతిలంపటుం డగుచుఁ బ్రా। ర్థించుటయును వారు తెలివి నొంది. 283

ప్రతిపదార్థం: అమిత= మితిలేని; తేజులార!= తేజస్సు కల దేవతలారా!; తప్పు; సైఁచి= సహించి; నన్నున్= నన్ను; దయన్= దయతో; చూచి; శాప= శాపంవలన; మోక్షమున్= విముక్తిని; అనుగ్రహింపుఁడు= ప్రసాదించండి; అని; వినీతి= వినయంతో; లంపటుండు= అత్యాసక్తి కలవాడు; అగుచున్= ఔతూ; ప్రార్థించుటయున్= ప్రార్థించగా; వారు= ఆ పితృదేవతలు; తెలివిన్= ప్రసన్నతను; ఒంది= పొంది.

తాత్పర్యం: అమిత తేజస్వులారా! నా తప్పు సహించి నన్ను దయతో చూచి శాపవిముక్తిని ప్రసాదించండి' అని వినయ సంపన్నుడయి ప్రార్థించాడు. అంతట పితృదేవతలు ప్రసన్నులై. (తరువాతి వచనంతో అన్వయం)

వ. 'విదగ్ధ విప్రసమూహం బొడంబడునట్టి యుచిత వాక్యంబుల నీ వెన్నఁడేని మహాధర్మంబు కీడని యాడితి నాఁడు నీకు శాపమోక్షం బగు' నని నిర్దేశించి; రన్నకులంబును సక్తుప్రస్థుని కతంబునం దగిన మాటల నా తెఱంగున సదస్యులతో ధర్మనందను నశ్వమేధంబు నధిక్షేపించి విగత శాపత్వానందంబు నొంది యంతర్హితంబయ్యె' నని యిట్లు జనమేజయునకు వైశంపాయనుండు పాండవాగ్రజు నశ్వమేధంబు విధంబు విస్తార ప్రస్తవనీయంబుగా వివరించుటయు. 284

ప్రతిపదార్థం: విదగ్ధ= పండితులైన; విప్ర= బ్రాహ్మణులయొక్క; సమూహంబు= సమూహం; ఒడంబడు+అట్టి= ఒప్పుకొనునట్టి; ఉచిత= తగిన; వాక్యంబులన్= మాటలచేత; నీవు; ఎన్నఁడు+ఏనిన్= ఏనాడైనా; మహత్= గొప్పది ఐన; ధర్మంబు= ధర్మం; కీడు= తక్కువది; అని; ఆడితి(వి)= పలికి నిరూపిస్తావో; నాఁడు= ఆ నాడు; నీకున్= నీకు; శాప= శాపంవలన; మోక్షంబు= విముక్తి; అగును= అవుతుంది; అని; నిర్దేశించిరి= నిర్ణయించి చెప్పారు; ఆ నకులంబును= ఆ ముంగిసకూడా; సక్తుప్రస్థుని= సక్తుప్రస్థుడియొక్క కతంబునన్= కారణంచేత; తగిన; మాటలన్= మాటలచేత; ఆ తెఱంగునన్= ఆ విధంగా; సదస్యులతోన్= ఋత్విజులతో; ధర్మనందను= ధర్మరాజుయొక్క; అశ్వమేధంబున్= అశ్వమేధమును; అధిక్షేపించి= ఆక్షేపించి; విగత= తొలగిపోయిన; శాపత్వ= శాపావస్థచేత కలిగిన; ఆనందంబున్= ఆనందమును; ఒంది= పొంది; అంతర్హితంబు+అయ్యెన్= అదృశ్యమయింది; అని; ఇట్లు= ఈ విధంగా; జనమేజయునకున్= జనమేజయుడికి; వైశంపాయనుండు; పాండవ+అగ్రజు= పాండవులలో పెద్దవాడు

ధర్మరాజు; అశ్వమేధంబు= అశ్వమేధం; విధంబు= వృత్తాంతం; విస్తారంబుగాన్= సవిశేషంగా; ప్రస్తవనీయంబుగాన్= మిక్కిలి కొనియాడదగినట్లుగా; వివరించుటయున్= విపులంగా చెప్పగా.

తాత్పర్యం: 'ఏనాడు నీవు పండితులైన బ్రాహ్మణులు ఒప్పుకొనేటట్లుగా మహాధర్మమును అధమధర్మంగా నిరూపిస్తావో ఆనాడే నీకు శాపవిముక్తి అవుతుంది' అని నిర్ణయించి చెప్పారు. ఆ ముంగిస ఆ విధంగా సదస్యులతో సక్తుప్రస్థుడి కథ చెప్పి తగిన మాటలతో ధర్మరాజు అశ్వమేధయాగాన్ని ఆక్షేపించి శాపవిముక్తి గాంచి ఆనందిస్తూ అదృశ్యమైనది' అని ఈ విధంగా వైశంపాయనుడు జనమేజయుడికి ధర్మరాజాశ్వమేధ వృత్తాంతాన్ని సవిశేషంగా పొగడదగినట్లుగా చెప్పగా. (తరువాతి ఆశ్రమవాసపర్వ ప్రథమాశ్వాస ప్రారంభముతో అన్వయం).

శా. **భక్తి స్మేర మునీంద్ర చిత్తకమల ప్రస్ఫీత సౌరభ్య సం**
యుక్తారూఢ తర ప్రకాశ తనురూపోల్లాస! రాగాది ని
ర్ముక్తై కాంతి జనైకతా రసిక! చిన్ముద్రాసదోన్నిద్ర! ధీ
శక్తిస్వైర విహారదూరలసితా! సద్భావనోన్మీలితా! **285**

ప్రతిపదార్థం: భక్తి= భక్తి అనే ప్రకాశించే; స్మేర= వికసించిన; మునీంద్ర= మునీశ్వరులయొక్క; చిత్త= మనస్సులు అనే; కమల= పద్మములయొక్క; ప్రస్ఫీత= మిక్కిలి విస్తారమైన; సౌరభ్య= జ్ఞానం అనే పరిమళంతో; సంయుక్త= కూడియున్న; ఆరూఢతర= మిక్కిలి ప్రసిద్ధమైన; ప్రకాశ= ప్రకాశమైన; తనురూప= దేహరూపంతో; ఉల్లాస= వెలిగేవాడా!; రాగ= రాగం; ఆది= మొదలైన అంతశ్శత్రువులనుండి; నిర్ముక్త= విడుదల పొందిన; ఏకాంతిజన= ఏకాగ్ర చిత్తులతోడ; ఏకతా= ఐక్యంతో; రసికా= ఆనందించేవాడా!; చిత్+ముద్రా= చిన్ముద్రయందు (చూపుడువ్రేలు, బొటనవ్రేలు కలయుట చిన్ముద్ర. అది జీవాత్మ పరమాత్మ భేదం లేనివారు అని చెప్పటానికి గుర్తు); సదా= ఎల్లప్పుడునూ; ఉన్నిద్ర= మేల్కొని ఉండేవాడా!; ధీశక్తి= బుద్ధి శక్తియొక్క; స్వైర విహార= స్వేచ్ఛా విహారానికి; దూర= దూరంగా; లసితా!= క్రీడించేవాడా!; సత్= ఉత్తమమైన; భావనా= సంస్కార విశేషంచేత; ఉన్మీలితా!= గోచరించేవాడా!

తాత్పర్యం: భక్తి ప్రకాశంచేత వికసించిన మునీశ్వరుల చిత్త పద్మాల జ్ఞాన పరిమళంచేత కూడిన తేజోమయ శరీర రూపంచేత వెలిగేవాడా! రాగద్వేషాదులనుండి విముక్తి గాంచిన ఏకాగ్రచిత్తులతో ఏకమై ఆనందించేవాడా! చిన్ముద్రయందు ఎల్లప్పుడూ జాగరూకుడవై యుండేవాడా! స్వేచ్ఛావిహారం చేసే బుద్ధికి దూరంగా ఉండేవాడా! ఉత్తమమైన సంస్కార విశేషంచేత గోచరించేవాడా!

క. **అజరామర పదకర పద। భజనా! సంసార జలధి పారీణస్తో**
తృజనా! స్వమూర్తి వైదిక। యజనా! పాశ్చాత్యనాడి కార్ద్రవ్యజనా! **286**

ప్రతిపదార్థం: అజరా= వార్ధక్యం; అమర= మృత్యువులేని; పద= స్థానమును, మోక్షమును; కర= కలిగించే; పదభజనా!= పాదసేవ కలవాడా! (హరిహరనాథుడి పాదభక్తి మోక్షాన్ని ప్రసాదించేదని అర్థం); సంసార= సంసారమనే; జలధి= సముద్రమును; పారీణ= దాటునట్టి; స్తోతృజనా!= సంస్తుతిచేసే జనులు కలవాడా!; స్వమూర్తి= ఆత్మరూపమైన; వైదిక= వేదములచేత విధించబడిన; యజనా!= యజ్ఞాలు కలవాడా!; పాశ్చాత్యనాడికా= సుషుమ్న అనెడి నాడియే; ఆర్ద్ర= చల్లనైన; వ్యజనా!= వీవనగా కలవాడా!

తాత్పర్యం: జరామృత్యువులు అంటని మోక్షమును ప్రసాదించే పాదారాధనం కలవాడా! సంసార సాగరమును తరించిన వారే వందిమాగధులుగా కలవాడా! వేదాలు కర్తవ్యాలుగా విధించేయజ్ఞాల స్వరూపమైనవాడా!; సుషుమ్న అనే నాడియే చల్లని వీవనగా కలవాడా!

మాలిని:

> **త్రియుగ కమల వీథీ దీప్త సంచార లీలా!**
> **నియమిత పవనాత్మాగ్ని ప్రభాస్నిగ్ధ సంగా!**
> **స్మయ వికచ మహాబ్జ స్వైర మాధ్వీక ధారో**
> **దయమయ మధురాత్మా! దర్శితానందవర్త్మా ! 287**

ప్రతిపదార్థం: త్రియుగ= మూడు జంటలు అయిన (ఆరు); కమల= పద్మాల; వీథీ= వీథియందు; దీప్త= ప్రకాశిస్తున్న; సంచార= గమనంయొక్క; లీలా!= విలాసం కలవాడా!; నియమిత= నియమించబడిన; పవన= వాయువుచేత (ప్రాణాయామముచేత అని అర్థం); ఆత్మ+అగ్ని= జీవజ్యోతియొక్క; ప్రభా= కాంతితో; స్నిగ్ధ= స్థిరమైన; సంగా!= సమావేశం కలవాడా!; స్మయ= ఆశ్చర్యకరంగా; వికచ= వికసించిన; మహా= గొప్పది అయిన; అబ్జ= కమలమునందు; స్వైర= స్వేచ్ఛగా స్రవించే; మాధ్వీక ధార!= అమృతధారయొక్క; ఉదయమయ= ప్రాదుర్భావ రూపమైన; మధుర= మధురమైన; ఆత్మ= ఆత్మ కలవాడా!; దర్శిత= యోగాదులచేత చూపబడిన; ఆనందవర్త్మా!= ఆనందమార్గం కలవాడా!

తాత్పర్యం: షట్కమల వీథిలో సంచరించే విలాసం కలవాడా! ప్రాణాయామంచేత ప్రాప్తించే సుస్థిర జీవాత్మ సాంగత్యం కలవాడా! అద్భుతంగా వికసించిన సహస్రారకమలంనుండి స్రవించే అమృతధారయే స్వరూపంగా కలవాడా! యోగాదులు నిరూపించిన ఆనందమార్గం కలవాడా!

విశేషం: పాశ్చాత్య నాడికా. (286) త్రియుగకమలవీథి. (287) ఈ రెండు పద్యాలలో తిక్కన మహాదార్శనికుడు కావున కుండలినీ యోగమును గూర్చి చెప్పాడు. సంగ్రహంగా ఈ యోగమును గూర్చి ఇట్లా చెప్పవచ్చును.

బ్రహ్మాండమంతా దివ్యశక్తితో నిండిఉన్నది. ఆ శక్తియే పిండాండం (శరీరం) నందు కూడా కలదు. శరీరంలోని ఈ శక్తిని అనుభవమునకు తెచ్చికొని మానవుడు మోక్షం పొందవచ్చునని యోగదర్శనం వెల్లడిస్తున్నది. ఆగమములు ప్రకటిస్తున్నవి. ఈ ఆగమములకే తంత్రము లని పేరు. ఈ తంత్రములు సాధనలో ఉపాయాలను బోధిస్తాయి. వేదములు కర్మం ఉపాసనం జ్ఞానం అనే వాటి రూపాలను బోధిస్తాయి. ఇక తంత్రములో వాటి సాధనోపాయాలను వెల్లడిస్తాయి. వాటిలో కుండలినీయోగం ఒకటి. కుండలిని అనేదే శక్తికి పేరు. ఇదియే ప్రాణశక్తి, చైతన్యం.

శరీరంలో ప్రధానాలైన నాడీ స్థానాలు ఏడున్నాయి. వీటిని శాస్త్రం చక్రములనీ, పద్మములనీ పేర్కొంటున్నది. మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరం, అనాహతం, విశుద్ధం, ఆజ్ఞ అనే ఆరు చక్రాలూ లేక కమలాలూ శరీరంలో ఉన్నవి. వీటినే తిక్కన 'త్రియుగ కమల' (3X2) అని పేర్కొన్నాడు.

మూలాధార కమలమునకు స్థానం గుదము (ముడ్డి). స్వాధిష్ఠానం లింగమున, మణిపూరం నాభియందు, అనాహతం హృదయమున, విశుద్ధం కంఠమున, ఆజ్ఞ కనుబొమల నడుమ ఉంటాయి.

శరీరమునందు ఒక ముఖ్యమైన నాడి ఉన్నది. ఇది శరీరానికి వెనుక ఉన్న బ్రహ్మదండం అనే వెన్నెముక నడుమగా మూలాధారం నుండి బ్రహ్మరంధ్రం వరకూ వ్యాపించి ఉంటుంది. దీనికి సుషుమ్న అని పేరు. దీనినే వైష్ణవి బ్రహ్మనాడి అని అంటారు. తిక్కన దీనిని పశ్చిమ నాడి (శల్య, ఆశ్వా1. పద్య. 404), పాశ్చాత్యనాడి ఒక (చూడు. 285 పద్య.) అని అన్నాడు. ఇది తామరతూడు దారంవలె ఉంటుంది.

మూలాధారంలో పాము చుట్టచుట్టుకొని నిద్రించి ఉన్నట్లు కుండలినీ శక్తి ఉంటుంది. సాధకుడు ప్రాణాయామం మొదలగు వాటిచేత కుండలినీ శక్తిని మేల్కొల్పి ఆరు కమలాలను క్రమంగా భేదించి సుషుమ్న ద్వారాన సహస్రారానికి చేరుస్తాడు. సహస్రారమందు చంద్రమండలం కురిసే అమృతమును గ్రోలి బ్రహ్మానంద మనుభవిస్తాడు. అతడికి అపూర్వశక్తులు కలుగుతాయి.

ఈ సాధన క్రమమును తిక్కన ఆశ్వాసాంత పద్యాలలో వర్ణించాడు. షట్కమలములను ఛేదించి క్రమంగా సాధకుడు కుండలిని అనే ప్రాణశక్తి సహస్రారానికి చేర్చును కదా! ఈ క్రమమును తిక్కన నిచ్చెన ఎక్కుటతో పోల్చి 'భరిత వికస నాంతః పద్మ నిశ్రేణికా సంచరణ' అని వర్ణించాడు. (శల్య. ఆశ్వా. 2. పద్య. 422)

సహస్రారకమలంలో పరమేశ్వరుడు ఉంటాడని తంత్రములు చెప్పుతున్నాయి. యోగి ప్రాణశక్తిని ఆ పరమేశ్వరుడితో చేరుస్తాడని గ్రహించాలి. జీవశక్తి పరమేశ్వర సంయోగమునే తిక్కన 'నియమిత పవనాత్మాగ్ని ప్రభా స్నిగ్ధసంగా' అని అన్నాడు. సహస్రారకమలములో చంద్రమండలమునుండి స్రవించే అమృతము పరమేశ్వరుడి రూపమే. కావున పరమేశ్వరుడు అమృతధారా స్వరూపుడు. దీనినే తిక్కన 'స్మయవికచ మహాబ్జ' అనే సమాసంలో పేర్కొన్నాడు.

మూలధారంలో ఉన్న చైతన్యశక్తి షట్చక్రములను ఛేదించి సహస్రారం చేరటానికి సుషుమ్నానాడియే ద్వారం లేక మార్గం కావున హరిహరనాథుడిని 'పశ్చిమనాడీ సరణ' (శల్య అశ్వా1. పద్య 404) 'పాశ్చాత్యనాడి కార్ద్ర వ్యజనా' (చూడు. 286) అని తిక్కన వర్ణించాడు. చైతన్య శక్తి మూలాధారంనుండి సహస్రారానికి పోవటానికి ప్రాణాయమం మున్నగునవి సాధనములు. యోగులు వాయువు బంధించి ప్రాణాయామాదులు చేస్తారు. వాయువునకు సంబంధించింది కావటంచేత తిక్కన సుషుమ్నా నాడిని హరిహరనాథుడికి చల్లని విసనకర్రవలె (ఆర్ద్రవ్యజనా!) వర్ణించాడు.

మూలాధారంనుండి పరావాక్కు బయలుదేరుతుందని శాబ్దికులంటారు. దీనిని తెలిసికొన్న తిక్కన 'లలిత చతుర్దళాఢ్య కమల' (ద్రోణ. ఆశ్వా. 2. ప. 381) అనే సమాసంలో హరిహరనాథుడిని 'నాలుగు దళాలతో ఒప్పారుతున్న వాక్సౌరభ ప్రసారంలో ఉన్నవాడా!' అని సంబోధించాడు.

సాధకుడు కుండలినీశక్తిని మేల్కొల్పి సహస్రారానికి చేరుస్తాడనీ అచట ఉన్న చంద్రమండలం నుండి జాలువారే అమృతమును గ్రోలి ఆనందించుననీ చెప్పితిమి కదా! ఈ విషయాన్నే తిక్కన 'క్రమోద్యన్మరుదుపగమలీలా మథ్యమానేందు భిక్షాక్షర దమృత వికారోత్సారణానంద రూపా' అని హరిహరనాథుడిని స్తుతించాడు. (శల్య.ఆశ్వా2. పద్య. 422). క్రమముగా పైకి లేస్తున్న ప్రాణమును పొందటంచేత చంద్రబింబంనుండి స్రవించే అమృతరూపమున పైకెగసే ఆనంద స్వరూపా' అని దీని అర్థం.

గద్యము:

ఇది శ్రీమదుభయ కవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీమహాభారతంబున నశ్వమేధ పర్వంబునందు సర్వంబును చతుర్థాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఈ రచన; శ్రీమత్= ప్రసిద్ధికెక్కిన; ఉభయ కవి= సంస్కృతాంధ్ర భాషాకవుల; మిత్త్ర= మిత్రుడును; కొమ్మన= కొమ్మన అనే; అమాత్య= మంత్రియొక్క; పుత్త్ర= కుమారుడును; బుధ= విద్వాంసులయొక్క; ఆరాధన= పూజచేత;

విరాజి= ప్రకాశించేవాడును అయిన; తిక్కన సోమయాజి= సోమయాజి అయిన తిక్కనచేత; ప్రణీతంబు+ఐన= రచించబడినదైన; శ్రీమహాభారతంబునన్= శ్రీమహాభారతంలో; అశ్వమేధపర్వంబు+అందున్= అశ్వమేధపర్వంలో; సర్వంబును= సమస్తమును; చతుర్థ= నాలుగవ; ఆశ్వాసము= ఆశ్వాసం.

తాత్పర్యం: కీర్తికలవాడూ, సంస్కృతాంధ్రభాషా కవిమిత్రుడూ, కొమ్మనమంత్రి కుమారుడూ బుధపూజనంచేత ప్రకాశించేవాడూ అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలో అశ్వమేధపర్వములో సర్వమూ చతుర్థాశ్వాసం ముగిసింది.

అశ్వమేధపర్వంలోని చతుర్థాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతంలో అశ్వమేధపర్వం ముగిసింది.

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆశ్రమవాసపర్వము: ప్రథమాశ్వాసము

శ్రీసాదనపదపద్మో, పాసనవిద్యా! శమైకపరతానిత్యా

భ్యాసజనహృద్య! వేద, వ్యాస వచోవిభవవేద్య, హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= సంపదలకు; సాదన= నివాసమైన; పద పద్మ= తామరపూలవంటి పాదాలను; ఉపాసన= సేవించటం అనే; విద్యా!= విద్య కలవాడా!; శమ= శాంతిలో; ఏకపరతా= ప్రధాన మైన తాత్పర్యంతో; నిత్య= ఎల్లవేళలా; అభ్యాస= అలవాటుగా కలిగిన; జన= జనానికి; హృద్య!= మనోహరమైనవాడా!; వేదవ్యాస= వేదాలను వేరు చేసిన (వ్యాస) మహర్షియొక్క; వచస్= వాక్యాల; విభవ= మహిమచేత; వేద్య!= తెలియదగినవాడా; హరిహరనాథా!= విష్ణు - పరమేశ్వర స్వరూపుడా! (వినుము).

తాత్పర్యం: నీపాద పద్మాలను సేవించుకొనేవారికి సంపద లిచ్చేవాడా! ఎప్పుడూ శాంతంగా ఉండే వారి హృదయాలలో నిలిచేవాడా! వ్యాసమహర్షి బ్రహ్మసూత్ర, పురాణాది వాక్యాలవలన తెలియదగినవాడా! హరిహర స్వరూపా!. (తదుపరి వృత్తాంతం వినుము.)

విశేషం: పదసేవతో సిరు లివ్వటం అనే మొదటి అంశంలో హరి లక్షణమూ, శాంతపరుల హృదయంలో ఉండడం అనే రెండో అంశంలో హరలక్షణమూ, వ్యాసవాక్యాలలో తెలియబడటం అనే మూడో అంశంలో హరిహర ఉభయలక్షణమూ కనబడతాయి. శ్రీ అంటే మోక్షం కూడా. అదీ ఒక కామితమే.

యుధిష్ఠిరాదులును గాంధారీధృతరాష్ట్రులును నొండొరులయెడల నడచికొనిన ప్రవర్తనము: (సం.15-1-1)

వ. దేవా! జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె; నట్లు పితృపితామహక్రమప్రాప్తం బయిన సామ్రాజ్యంబు జగత్పూజ్యప్రకారంబునం గైకొని మహాధ్వరప్రముఖధర్మకార్యధుర్యులును సముపాసితార్యులును దయావిధేయులు నగు - పాండవేయులు ధృతరాష్ట్రువలన నెవ్విధంబు వారై నడచిరి? హతపుత్రమిత్రామాత్యుండును గతైశ్వర్యుండును నగు నా రాజును యశోమహితయగు గాంధారియు నెట్టిభంగి వర్తించి? రత్తెఱంగు నా కెఱింగింపుము. 2

ప్రతిపదార్థం: దేవా= హరిహరనాథా!; జనమేజయుండు= జనమేజయమహారాజు; వైశంపాయనునకున్= వైశంపాయనమునితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు (అట్లులోగడ చెప్పినవిధంగా); పితృ= తండ్రి; పితామహ= తాతల; క్రమ= వరుసలో; ప్రాప్తంబు అయిన= లభించిన; సామ్రాజ్యంబు= సార్వభౌమత్వాన్ని; జగత్= ప్రజలచేత; పూజ్య= గౌరవించదగిన; ప్రకారంబునన్= పద్ధతిలో; కైకొని= స్వీకరించి; మహా అధ్వర= గొప్ప యజ్ఞాలు; ప్రముఖ= మొదలైన; ధర్మ= వేదవిహితాలు అయిన; కార్య= క్రియలను నిర్వహించటంలో; ధుర్యులును= నేర్పరులూ; సమ్ ఉపాసిత= చక్కగా సేవించబడిన; ఆర్యులును= పెద్దలు కలవారూ; దయా విధేయులును= దయకు లోబడినవారూ; అగు= అయిన; పాండవేయులు= పాండురాజు కొడుకులు; ధృతరాష్ట్రువలనన్= ధృతరాష్ట్రుడి విషయంలో; ఏ+విధంబు వారు అయి= ఎటువంటి ప్రవర్తనం కలిగి; నడచిరి?= వ్యవహరించారు?; హత= చంపబడ్డ;

పుత్ర= దుర్యోధనాదు లైన కొడుకులూ; మిత్ర= కౌరవపక్షాన నిల్చి యుద్ధంచేసిన రాజ స్నేహితులూ; అమాత్యుండును= మంత్రులూ కలవాడునూ; గత+ఐశ్వర్యుండును= ప్రాభవం కోల్పోయిన వాడునూ; అగు= అయిన; ఆరాజును= ఆధృతరాష్ట్రుడూ; యశస్ మహిత= కీర్తిచేత గొప్పది; అగు= అయిన; గాంధారియున్= ధృతరాష్ట్రుడిభార్యా; ఎట్టిభంగిన్= ఏవిధంగా; వర్తించిరి= వ్యవహరించారు; ఆ+తెఱంగు= ఆవిధం; నాకున్= నాకు (జనమేజయుడికి); ఎఱింగింపుము= తెలుపవలసింది.

తాత్పర్యం: హరిహరదేవా! జనమేజయుడు వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు. గొప్పగొప్పయజ్ఞాలు మొదలైన వేదకర్మలను ఆచరించేవాళ్ళూ, పెద్దలను గౌరవించేవాళ్ళూ, కరుణా స్వభావులూ అయిన పాండవులు తాతల, తండ్రుల క్రమంలో తమకు లభించిన ప్రభుత్వాన్ని సర్వజనామోదకరంగా స్వీకరించిన తర్వాత ధృతరాష్ట్రుడి విషయంలో ఎట్లా నడుచుకున్నారు? కొడుకులనూ, హితులనూ, మంత్రులనూ, తనవారందరినీ, సార్వభౌమత్వాన్నీ పోగొట్టుకొన్న ధృతరాష్ట్రుడూ, మంచిపేరున్న గాంధారీ (పాండవులతో) ఎట్లా వ్యవహరించారు? ఆ సంగతి తెలియజెప్పవలసింది.

విశేషం: ఇందులో విశేషణాలన్నీ సాభిప్రాయాలు. పాండవులకు రాజ్యం హక్కుగా వచ్చిందే కాని బలవంతంగా లాక్కున్నది కాదు. దాయాదులను చంపి కాజేశారనీ, అది హేయమనీ ప్రజలు కూడా అనుకోలేదు. కాబట్టి యీవిషయంలో ధృతరాష్ట్రుడు పాండవులపై ద్వేషం పెట్టుకొనగూడదని ఉద్దేశం. ఆర్యులను సేవించే లక్షణం ఉన్నది. పైగా దయా విధేయులు గూడా కాబట్టి గాంధారీధృతరాష్ట్రులునూ పెద్దతల్లితండ్రులునూ పుత్రశోకంలో ఉంటారు. కాబట్టి సానుభూతితో గూడ పాండవులు తప్పక గౌరవించేఉంటారు. గతంలో తమ కష్టాలకు ధృతరాష్ట్రుడూ కొంత కారణం అని అతనిపై పాండవులకు కోపం ఉండదు - అని తన వంశంలో ఆర్యులైన పాండవులను గూర్చి జనమేజయుడి నమ్మకం. ఇంక హతపుత్రమిత్రామాత్యుడైన ధృతరాష్ట్రుడికే దానికి హేతువైన పాండవులమీద కోపం ఉండక తప్పదు. 'పవనాత్మజుండు సన్నిహితుఁ డైన యప్పు డజ్జనవిభుండు తన తనూజులఁ దలఁచి సంతాప మందు' (16వ.) తుండడం గమనిస్తాం (ఇట్లాగే 31స.) కాబట్టి, ధృతరాష్ట్రుడు పాండవులతో మనసు కలిసిఉండటం జరగదు. యశోమహిత అనటంలో గాంధారిమీద కొంత సదభిప్రాయం. మహాధ్వరకార్యధుర్యులు మొదలైన విశేషణాలు పాండవులకు సామ్రాజ్యం గైకొన్న తర్వాతే కాదు ముందూ అన్వయిస్తాయి.

సీ. **అనవుడు నమ్ముని యమ్మహీపతికి ని। ట్లనుఁ, బాండునందను లాంబికేయు**
నెడ భక్తివినయంబు లెసఁగంగ వర్తింతు। రతని యోగక్షేమ మరసి యెపుడుఁ
దత్సమీపంబునఁ దగ నిల్చి తమకు నె। య్యది యైన నెఱిఁగించునట్లు గాఁగ
నుందురు విదుర యుయుత్సు సంజయులు దా। రును నిత్యమును వచ్చి వినతిఁ జేసి

తే. **కొలిచి కూర్చుండి యా నృపు నలఘుకార్య। విధము లేర్పడ నడిగి యవ్విభుని చెప్పి**
నట్లు చేయుదు రతఁడును నాదరంబు। గాఢవత్సలత్వంబును గలిగియుండు. **3**

ప్రతిపదార్థం: అనవుడున్= (జనమేజయుడు పైవిధంగా) అనగా; ఆ+ముని= ఆ వైశంపాయన మహర్షి; ఆ+మహీపతికిన్= ఆ జనమేజయ భూపాలుడితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; పాండునందనులు= పాండురాజుకొడుకులు, ఆంబికేయు+ఎడన్= ఆ ధృతరాష్ట్రుడి విషయంలో; భక్తి వినయంబులు= సేవాభావమూ, అణకువా; ఎసఁగంగన్= ఎక్కువగా; వర్తింతురు= నడచుకొనేవారు; అతని= ఆ ధృతరాష్ట్రుడియొక్క; యోగక్షేమము= ఉన్నతస్థితీ, అది పదిలంగా ఉండేటట్లూ; అరసి= చూస్తూ; ఎపుడున్= అన్ని వేళల్లోనూ; తద్+సమీపంబునన్= ఆ ధృతరాష్ట్రుడి దగ్గరే; తగన్= తగువిధంగా (అతడి ఇచ్ఛకు భంగంకల్గకుండా); నిల్చి= ఉండి; ఏ+అది ఐనన్= ఎటువంటి పని అయినా; తమకున్= తమతో; ఎఱిఁగించునట్టుగాన్=

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తెలియజేసేటట్లుగా; ఉందురు= ఉండేవారు; విదుర యుయుత్సు, సంజయులు= విదురుడూ, యుయుత్సుడూ, సంజయుడూ; తారును= తా మై (స్వయంగా= పిలవ నవసరం లేకుండానే); నిత్యమును= ఎల్లప్పుడూ (ప్రతిరోజూ); వచ్చి= ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చి; వినతిన్= నమస్కారం; చేసి= చేసి; కొలిచి= సేవించి; కూర్చుండి= ఆసీనులై; ఆనృపు= ఆ ధృత (ధర్మ) రాష్ట్రుడి యొక్క; అలఘుకార్యవిధములు= ఉత్తమాలైన పనులూ; ఏర్పడన్= స్పష్టంగా; అడిగి; ఆ+విభుని= ఆరాజు; చెప్పిన+అట్లు= పేర్కొన్నవిధంగా; చేయుదురు= చేస్తుండేవారు; అతఁడును= ఆ ధృతరాష్ట్రుడు కూడా; ఆదరంబు= (పాండవాదులపై) అభిమానమూ; గాఢ= దృఢమైన; వత్సలత్వంబును= వాత్సల్యాన్నీ; కలిగి ఉండున్= కలిగి వ్యవహరించేవాడు.

తాత్పర్యం: జనమేజయుడు అడిగినదానికి సమాధానంగా వైశంపాయనుడు ఇట్లా చెప్పుతున్నాడు: పాండవులు ధృతరాష్ట్రుడిని వినయంగా సేవించేవాళ్ళు. అతడికి మేలు కలిగేటట్లుగా, ఔన్నత్యానికి భంగం రాకుండా నడుచుకొనేవారు ఏ సమయంలో అయినా ఎటువంటి పని అయినా తమకు ఆజ్ఞాపించటానికి వీలుగా ఎప్పుడూ అతడిసమీపంలో, అతడికి ఇబ్బంది కలగనివిధంగా ఉండేవాళ్ళు. విదురుడూ, యుయుత్సుడూ, సంజయుడూ ప్రత్యేకంగా పిలిపించవలసిన అవసరం లేకుండా రోజూ స్వయంగా వచ్చి ధృతరాష్ట్రుడిని సేవించేవాళ్ళు. ఏం కావాలో అడిగి చిన్నా పెద్దా పను లన్నీ చేసిపెట్టేవాళ్ళు. ధృతరాష్ట్రుడు కూడా పాండవాదు లందరిమీదా ప్రేమతో, వాత్సల్యంతో ఉండేవాడు.

విశేషం: జనమేజయుడు గతైశ్వర్యు డన్నా పాండవాదులు యోగక్షేమాలకు లోటు లేకుండా కింకరభావంతో సేవించటంవలనా, ధృతరాష్ట్రుడు 'నృపుడే' క్రమంగా చూస్తే ఆంబికేయుడికి పాండునందనులమీద ఆదరం, విదురాదులమీద గాఢవాత్సల్యం ఉన్నాయనాలి. యుయుత్సుడు స్వయానా (వైశ్యస్త్రీ వలన) కొడు కయితే విదుర సంజయులు మొదటినుండి తన్నాశ్రయించి ఉన్నవాళ్ళు కాబట్టి వాత్సల్యంలో గాఢత సహజమే. పాండునందనులమీద కొంతభేదభావం అంతరాలనుండి అపుడప్పుడూ బయటపడుతుంటుంది.

ఉ. **కౌరవనాథ! కుంతియును గౌరవ మొప్పఁగ వచ్చి కొల్చు గాం**
ధారి నతిప్రయత్నమున ద్రౌపది తాను సుభద్రయున్ ముదం
బారఁగ నిత్యముం గొలుతు రక్కురువంశమహత్తరన్ మహో
దారము లైన వస్తువు లుదాత్తత నిత్తురు వార లందఱున్. **4**

ప్రతిపదార్థం: కౌరవనాథ!= జనమేజయమహారాజా!; కుంతియును= కుంతీదేవి; కూడా వచ్చి= తానుగా వచ్చి; గాంధారిన్= ధృతరాష్ట్రుడి భార్యను; గౌరవము= గురువు అనే దృష్టి (పెద్దరికం); ఒప్పఁగన్= మెరిసే విధంగా; కొల్చున్= సేవించేది; అతిప్రయత్నమునన్= మిక్కిలిపూనికతో; ద్రౌపది, తానున్= ఆ ద్రౌపదీ; ముదంబు ఆరఁగన్= సంతోషం నిండగా; సుభద్రయున్= సుభద్రా; నిత్యమున్= ప్రతిరోజూ; ఆ+కురువంశమహత్తరన్= కురువంశంలో పెద్ద దయిన ఆ గాంధారిని; కొల్తురు= సేవించేవారు; వారలు+అందఱున్కుంతీ, ద్రౌపదీ, సుభద్రలు ముగ్గురూ; ఉదాత్తతన్= త్యాగబుద్ధితో; మహా+ఉదారములు+అయిన= గొప్ప విలువైన; వస్తువులు= కానుకలు; ఇత్తురు= గాంధారికి ఇస్తుండేవారు.

తాత్పర్యం: జనమేజయా? కుంతికూడ గౌరవము మెరిసే విధంగా వచ్చి గాంధారిని కొలిచేది. మిక్కిలి పూనికతో తానూ సుభద్రాకూడ సంతోషం నిండగా ఆ గాంధారిని నిత్యమూ కొలిచేవారు. వారందరూ గొప్ప విలువైన కానుకలను గాంధారికి గౌరవంతో ఇచ్చేవారు.

విశేషం: కుంతీ, ద్రౌపదీ, సుభద్రలను ప్రముఖంగా ప్రస్తావించడం విశేషం. ఈ ముగ్గురూ కురుక్షేత్రంలో తమ కొడుకులను పోగొట్టుకున్నవాళ్ళే. కుంతికి కర్ణుడూ ప్రియసుతుడే కదా! ద్రౌపదీ సుభద్రల పిల్లలు కౌరవుల మూలంగా వంచనతో మరణించినవారే అయినా వా ర దంతా మర్చిపోయారు. అందుకే ధృతరాష్ట్రుడిని గురించి భీముడు పలికే పరుషవచనాలు ద్రౌపది క్కూడా తెలియకుండా జాగ్రత్తపడడం జరిగింది. కుంతి 'గౌరవ మొప్పఁగ కొల్చి' అప్పగారిని గురువు చేసికొని శిష్యురాలివలె శాసించబడేది 'గౌరవ మొప్పఁగ వచ్చి' - రావడంలోనే రాజమాతగా గౌరవం. కుంతిలోనూ పట్టమహిషి గావటమే కాకుండా గాంధారీ పుత్ర వినాశానికి ప్రధానకారణ మైనదీ గాబట్టి తననూ ద్రౌపదినీ చూస్తూనే గాంధారికి విపరీతభావం కలగవచ్చు. తనకూ భర్తలకూ కూడా మంచితనాన్ని సంపాదించటంలో ద్రౌపది 'అతిప్రయత్నంతో' గాంధారిని కొలువవలసివచ్చింది. ప్రియసుతుడు అభిమన్యుడిని పోగొట్టుకొన్నా కృష్ణుడి చెల్లెలు సుభద్ర - సంతోషంగానే గాంధారిని సేవించింది. (తర్వాత ఈమె మనుమలే రాజ్యం చేశారు.) 'నిత్యముం గొలుచు నక్కురు' - అనే ముద్రితప్రతులపాఠం "తీసికొంటే" చెప్పనివాఁడును, సత్యముచెప్పనివాఁడును ఘోర నరకపంకమున పడున్ - అనేవిధంగా అన్వయం.

క. చిత్రాంగదయు నులూపియు। ధాత్రీశ్వర! వత్తు రెపుడు ద్రౌపదితోడన్
గాత్రములు భూరి వినయా। మాత్రములుగ సుబలసుతఁ బ్రమదమునఁ గొలువన్. 5

ప్రతిపదార్థం: ధాత్రీశ్వర!= ఓ రాజా! (జనమేజయా!); గాత్రములు= శరీరాలు; భూరి వినయ ఆమాత్రములు గన్= మిక్కిలి అణకువతో నిండినవి కాగా; చిత్రాంగదయున్= చిత్రాంగదా; ఉలూపియున్= ఉలూపీ; ప్రమదంబునన్= సంతోషంతో; సుబలసుతన్= గాంధారిని; కొలువన్= సేవించటానికి; ద్రౌపదితోడన్= ద్రౌపదితో కలిసి; ఎపుడున్= అన్నివేళలా; వత్తురు= వస్తుంటారు.

తాత్పర్యం: జనమేజయా! అర్జునుడి భార్యలైన చిత్రాంగదా, నాగకన్య ఉలూపీ అణకువతోనూ, సంతోషంతోనూ ద్రౌపదితో కలిసి వచ్చి నిత్యమూ గాంధారిని సేవిస్తుండేవాళ్ళు.

విశేషం: చిత్రాంగద అప్సరస. ఉలూపి నాగకన్య. అన్యలోక స్త్రీలు చిన్నవాళ్ళు కాబట్టి అక్కగారితో కలిసి వెళ్ళటం స్వభావానికి అనుగుణం. పైగా ఈ ముగ్గురూ అర్జునుని తీర్థయాత్రలో వలచి సతులయినవారు కావడం సాన్నిహిత్యానికి మరో కారణం. ఈ ముగ్గురి ప్రస్తావనతో ముల్లోకపు స్త్రీల సేవవలన గాంధారికి ప్రాభవం. పాండవస్త్రీలు గూడా గాంధారిని సేవించేవారే, అందులో విశేషం లేదని.

క. ఆ తల్లికిఁ దండ్రికి సం। ప్రీతి యలరఁ గుడువఁ గట్టఁ నుదాత్త
స్ఫీతంబు లైన వస్తు। వ్రాతంబుల నిచ్చు ధర్మరా జనుదినమున్. 6

ప్రతిపదార్థం: ధర్మరాజు= ధర్మతనయుడు; అనుదినమున్= ప్రతిరోజూ; ఆ తల్లికిన్= పెదతల్లి అయిన గాంధారికీ; తండ్రికిన్= పెద్ద తండ్రి అయిన ధృతరాష్ట్రుడికీ; సంప్రీతి= ఇష్టం; అలరన్= అతిశయించేటట్లుగా; కుడువన్= తినడానికీ; కట్టన్= ధరించడానికీ; పెట్టన్= అలంకరించుకొనటానికీ; ఉదాత్త స్ఫీతంబులు ఐన= రాజులకు తగినవీ, సమృద్ధము లైనవీ అయిన; వస్తు వ్రాతంబులన్= వస్తువుల సమూహాలను; ఇచ్చున్= ఇస్తుండేవాడు.

తాత్పర్యం: గాంధారీ ధృతరాష్ట్రులు సంతృప్తిపడే విధంగా తినటానికీ, కట్టుకొనటానికీ, పెట్టుకొనటానికీ, రాజులకు అర్హమైన భక్ష్యభోజ్యాలు, శయన, మాల్య అనులేపనాలు మొదలైన వివిధ వస్తువులు, వస్త్రాలు, ఆభరణాలు సమృద్ధిగా ధర్మరాజు వారికి ప్రతిరోజూ అందజేసేవాడు.

విశేషం: సంప్రీతి అలరుట పుచ్చుకొన్న గాంధారీ ధృతరాష్ట్రులకే కాకుండా ఇచ్చే ధర్మరాజులోనూ అన్వయిస్తుంది. తల్లి, తండ్రి అనే భావం వలన ఇచ్చేవాడికీ, పుచ్చుకొనే వాళ్ళకూ సంప్రీతి. పెట్టన్ అనేది గాంధారీ ధృతరాష్ట్రులు తాము అనుభవించటానికి మాత్రమే కాక తమ కిష్టమైన వాళ్ళకు పెట్టుకొనటానికి కూడా సరిపోయేంత సమృద్ధిగా వస్తువ్రాతం ధర్మరాజు ఇస్తున్నా డని తెలుపుతున్నది. అనుదినమూ ఇవ్వటంలో అత్యంత శ్రద్ధ. అప్రమత్తత.

తే. **గుళ్ళుఁ జెఱువులుఁ గట్టించుఁ, గోరి యూళ్ళు । లగ్రహారముల్ గావించు నాంబికేయుఁ**
డధిప! ధర్మతనూజుఁ డత్యంత హర్ష । చిత్తవృత్తి యై యనుమతి సేయుచుండ. **7**

ప్రతిపదార్థం: అధిప!= ఓరాజా!; ధర్మ తనూజుఁడు= ధర్మరాజు; అత్యంత= మిక్కిలి; హర్ష= సంతోషం నిండిన; చిత్త= మనస్సుయొక్క; వృత్తి+ఐ= వర్తనం కలవాడై; అనుమతి= అంగీకారం; చేయుచుండన్= తెలుపుతూ ఉండగా; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; కోరి= తన ఇచ్ఛానుసారంగా; (అడిగి); గుళ్ళున్= దేవాలయాలూ; చెఱువులున్= తటాకాలూ; కట్టించున్= నిర్మింపజేసేవాడు; ఊళ్ళులు= గ్రామాలు; అగ్రహారముల్= బ్రాహ్మణ నివాసస్థలాలూ; కావించున్= ఏర్పాటు చేయించేవాడు.

తాత్పర్యం: జనమేజయా! ధర్మరాజు సంతోషంగా ఆమోదించగా ధృతరాష్ట్రుడు గుళ్ళూ, చెరువులూ ఏర్పరిచేవాడు. ఊళ్ళూ, అగ్రహారాలూ కల్పించేవాడు.

విశేషం: ధర్మరాజు గూడా కింకరభావంతో ధృతరాష్ట్రుడిని సేవిస్తూ 'నీవు' రాజవుగాక నీ కేను రాజనే' అంటాడు. (34.స.) అయినా 'ఏ కార్యమైన నెవ్వఁ డేనియుఁ జేయఁ దొడఁగు నప్పుడు పుడమివేనిచే ననుజ్ఞాతుండై కాని తొడంగఁ గారు' (27స.) అంటాడు ధృతరాష్ట్రుడు. అందుకే రాజానుమతి ధర్మమని తప్ప ధృతరాష్ట్రుడి ఇచ్ఛకు అవరోధం లేదు. ఇక్కడ వాక్య రచనా విధానంలో ధర్మరాజు అనుమతికి అంతగా ప్రాముఖ్యం కనబడకపోవడం అందుకే. గుళ్ళూ, చెరువులూ, ఊళ్ళూ, అగ్రహారాలు ధృతరాష్ట్రుడేర్పరచటం మరణించిన తనవారికి పుణ్యగతులు సాధించటానికే. అయినా 'హర్షచిత్తవృత్తితో అనుమతించటం ధర్మరాజుసౌశీల్యం. అగ్రహారాలు బ్రాహ్మణులకు మాత్రమే ఇచ్చేవి; సాధారణంగా బ్రాహ్మణులే నివసించే ప్రదేశాలు. వీటిని వంశపారంపర్యంగా అనుభవించవచ్చును. రాజు మారినా ఇవి పోవు. పన్నులు వసూలు చేసికొనే అధికారం మాత్రం ఉండదు. ఊళ్ళు దీనికి వ్యతిరిక్తాలు అంటే పన్నులు వసూలు చేసికొనవచ్చును. రాజు మారితే ఇవీ పోతాయి.

క. **జనవర! ధర్మజుఁ గొలువం । జనుదెంచిన యట్టి వివిధ జనపతు లెల్లన్**
మును ధృతరాష్ట్రునిఁ గొలుతురు । విను మా కొడుకు మది పల్లవించున్ దానన్. **8**

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; వినుము= వినవలసింది; ధర్మజున్= సమ్రాట్టు అయిన ధర్మరాజును; కొలువన్= సేవించటానికి; చనుదెంచిన అట్టి= వచ్చిన; వివిధ జనపతులు= వేర్వేరు దేశాల రాజులు; ఎల్లన్= అందరూ; మును= ధర్మరాజుకంటె ముందుగా; ధృతరాష్ట్రునిన్= ధృతరాష్ట్రుడిని; కొలుతురు= సేవించేవారు; దానన్= సామంతుల ఆ చర్యవలన; ఆ కొడుకుమది= ధర్మరాజు మనస్సు; పల్లవించున్= సంతోషించేది.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! వినుము. సార్వభౌముడైన ధర్మరాజును సేవించటానికి వచ్చిన సామంత రాజు లందరూ ధర్మరాజునుకంటె ముందుగా ధృతరాష్ట్రుడిని సేవించేవారు. అందుకు ధర్మరాజు సంతోషించేవాడు.

విశేషం: తన కంటె ధృతరాష్ట్రుడికే ప్రాభవం అధికంగా ఉండడం ధర్మజుడికి సంతోషం. తన కొడుకులే మరణించగా పాండవులకు రాజ్యాధిపత్యం గల్గటంవలన కలిగే మనఃఖేదం ధృతరాష్ట్రుడికి ఈ చర్యవలన ఉపశమిస్తుంది. (9స.) సామంతులు ముందుగా

అతడిని కొలవటానికి కారణం అతడు ధృతరాష్ట్రుడు కావటం. ఆ తండ్రిని ముందుగా మన్నించడం వలన ధర్మజుడు తన ఆధిపత్యానికి భంగం కలిగిందని అనుకొనకపోగా సంతోషించటం. 'ఆ కొడుకు' కావటం వలన పైగా వారు 'ధర్మజుఁ గొలువం జనుదెంచినవారు.' వారి ఆంతర్యం ధర్మరాజుకు తెలుసు.

క. సూనులు లేమిం గలిగెడు। దీనత్వము దోఁపకుండఁ దేజస్సౌఖ్యా
నూనులుగఁ జేయు ధర్మజుఁ। డా నరపతి నతనిదేవి నతులిత భక్తిన్. 9

ప్రతిపదార్థం: ధర్మజుఁడు= ధర్మరాజు; అతులిత భక్తిన్= సాటిలేని సేవాభావంతో; ఆ నరపతిన్= ఆ ధృతరాష్ట్రుడినీ; అతనిదేవిన్= ఆయన భార్య, గాంధారినీ; సూనులు= కొడుకులు; లేమిన్= (యుద్ధంలో మరణించడం చేత) లేకపోవడం వలన; కలిగెడు= సంభవించే; దీనత్వము= దుఃఖం; తోఁపకుండన్= తలపులోకి రాకుండా; తేజస్+సౌఖ్య+అనూనులుగన్= ప్రాభవమూ, సుఖమూ తక్కువ కాకుండెడివారుగా; చేయున్= చేసేవాడు.

తాత్పర్యం: కొడుకులు లేకపోవటం వలన కలిగే బాధ మనసులోకి రాకుండా ప్రభుత్వానికీ, సుఖానికీ లోటు రాకుండా, గాంధారీ ధృతరాష్ట్రులను చూచుకొనేవాడు ధర్మరాజు.

సీ. వంశవృద్ధులు పుత్త్రవర్గ వియుక్తులై। యున్నవా రేమిట నుమ్మలింతు
రో యను పుయిలోట నా యుధిష్ఠిరుఁడు ద। మ్ములకును దగునమాత్యులకు నిష్ట
భృత్యులకును మీరు ప్రీతియు భక్తియు। నాంబికేయునిదెస నతిశయిల్ల
నారాజు పంచినయట్ల చేసి చరింపుఁ। డతని నారాధించు టస్మదీయ

ఆ. చిత్తమునకుఁ బ్రియము సేయుట యతనికి। మనసు గాని యట్టిపని యొనర్చు
టగ్గలంపు దుఃఖ మావహించుట యని। యనుదినంబుఁ జెప్పు మనుజనాథ! 10

ప్రతిపదార్థం: మనుజనాథ= రాజా! (జనమేజయా!); వంశవృద్ధులు= కురువంశంలో పెద్దవాళ్ళు; పుత్త్ర వర్గ వియుక్తులు= పెక్కురైన కొడుకులు దూరమైనవారు; అయి ఉన్నవారు= (జీవిస్తూ) ఉన్నారు; ఏమిటన్= ఏ విషయంలో; ఉమ్మలింతురో= బాధ పడతారో; అను పుయిలోటన్= అనే సంకోచంతో; ఆ యుధిష్ఠిరుఁడు= ఆ ధర్మరాజు; తమ్ములకును= భీముడు మొదలైన తమ్ముళ్ళతోనూ; తగు అమాత్యులకున్= అర్హు లైన మంత్రులతోనూ; ఇష్ట భృత్యులకును= ప్రియమైన సేవకులతోనూ; అనుదినంబున్= ప్రతిరోజూ- (ఇట్లా చెప్తాడు); మీరు= మీరు అందరు; ఆంబికేయుని దెసన్= ధృతరాష్ట్రుడి మీద; ప్రీతియున్= ఇష్టమూ; భక్తియున్= సేవాదృష్టీ; అతిశయిల్లన్= అధికం కాగా; ఆరాజు= ధృతరాష్ట్రుడు; పంచిన+అట్ల= ఆజ్ఞాపించినవిధంగానే; చేసి= ఆయాపనులు చేసి; చరింపుఁడు= నడచుకొనండి; అతనిన్= ధృతరాష్ట్రుడిని; ఆరాధించుట= సేవించటం; అస్మదీయ చిత్తమునకున్= నా మనస్సుకు; ప్రియము= ఇష్టం; చేయుట= కల్గించటమే; అతనికిన్= ధృతరాష్ట్రుడికి; మనసు కాని అట్టిపని= ఇష్టం లేనిపని; ఒనర్చుట= చేయటం; అగ్గలంపు దుఃఖము= (నా మనస్సుకు) మిక్కిలి విచారం; ఆవహించుట= కల్గించటమే; అని= అనేవిధంగా; చెప్పున్= చెప్పుతుంటాడు.

తాత్పర్యం: రాజా! గాంధారీ, ధృతరాష్ట్రులు కురువంశంలో పెద్దవాళ్ళు. కొడుకులను పోగొట్టుకొని బ్రతుకుతున్నారు. ఎందుకైనా బాధ పడతారేమో అనే సంకోచంతో ధర్మరాజు, తమ్ములు, మంత్రులు, సేవకులతో ప్రతిరోజూ ఇట్లా చెప్పుతుంటాడు. మీరు ధృతరాష్ట్రుడు ఏ విధంగా ఆజ్ఞాపిస్తే ఆ విధంగా చేస్తూ ఆయన చెప్పిన ప్రకారం నడుచుకొనండి. అతడిని సేవిస్తేనే నా మనసూ సంతోషిస్తుంది. ధృతరాష్ట్రుడికి ఇష్టం లేని పని చేయటం అంటే నన్ను బాధ పెట్టటమే.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: యుద్ధంలో చాలామంది పోగా మిగిలినవాళ్ళలో గాంధారీ ధృతరాష్ట్రులు 'వంశవృద్ధులు'. వార్ధకంలో కొడుకులతోడు ఉండవలసిన సమయంలో పుత్రవియోగం. పైగా పుత్ర 'వర్గ' వియోగం. కొడుకులు చాలామంది ఉన్నా ఒక్కడూ మిగలకుండా పోవటం. (యుయుత్సుడు క్షత్రియుడు కాదు కాబట్టి, సూనులు లేమి ఐయున్నవారు. వార్ధకం, బహుపుత్ర వియోగంతో 'బ్రతికి ఉండటం' బాధ. దీనివల్ల 'పుత్ర వియోగబాధ' అనుక్షణమూ ఉంటుంది. ఇవి వారిని సేవించవలసిన అవసరమూ, ఔచిత్యమూ సూచిస్తున్నాయి. అందుకే ధర్మరాజు వారి సేవావిషయంలో 'అనుదినంబు' జాగ్రత్తలు మళ్ళీ మళ్ళీ చెప్పటం.

క. విను మెల్లవారు నతని వ। చనములు మది నూఁది యట్ల చరియింప మరు
త్తనయుండును నమ్మెయి వ। ర్తనము నడపుచుండు మనసు తద్దయు నెరియన్. 11

ప్రతిపదార్థం: వినుము= జనమేజయ రాజా! వినుము. ఎల్లవారున్= అందరూ కూడా; అతని వచనములు= ఆ ధర్మరాజు మాటలు; మదిన్= మనసులో; ఊఁది= ఉంచుకొని (స్థిరపరచుకొని); అట్లు+అ= ధర్మరాజు చెప్పిన ప్రకారంగానే; చరియింపన్= నడుచుకుంటూ ఉండగా; మరుత్ తనయుండును= వాయుపుత్రుడు-భీముడు కూడా; మనసు= హృదయం; తద్దయున్= అధికంగా; ఎరియన్= బాధపడుతున్నా; ఆ+మెయిన్= ధర్మజుడు చెప్పినవిధంగా; వర్తనము= నడవడికను; నడపుచున్ ఉండున్= సాగిస్తూ ఉండేవాడు.

తాత్పర్యం: జనమేజయా! అట్లా ధర్మరాజు చెప్పిన మాటలు మనసులో ఉంచుకొని అందరూ, తమ్ములు, అమాత్యులు, భృత్యులూ, ఆ ప్రకారంగా ధృతరాష్ట్రుడిని కొలిచేవారు. భీముడు కూడా మనసులో బాధపడుతూనే అన్నగారి మాటలను అనుసరించి నడిచేవాడు.

విశేషం: భీముడు అన్నపై గౌరవం వలన ఇష్టం లేకున్నా ఎంత (నడపు-ప్రేరణ క్రియ) బలవంతంగా ఆచరించేవాడో తెలుస్తుంది. ఎరియు ధాతువుకు మండటం అనే అర్థమూ ఉన్నది. అనిష్టుల సేవ చేయవలసివచ్చినందుకు బాధా వారిపై కోపమూను.

క. ద్యూతంబున దుర్యోధను। చేతం దమ పడిన పాటు చిత్తంబున క
త్యాతురతఁ జేయుచుండుట। నాతఁడు ధృతరాష్ట్రుఁ జూచి యలుగు మనమునన్. 12

ప్రతిపదార్థం: ద్యూతంబునన్= జూదంలో; దుర్యోధనుచేతన్= దుర్యోధనుడు కారణంగా; తమ పడిన పాటు= తాము (పాండవులు) అనుభవించిన కష్టాలు; చిత్తంబునకున్= తన మనస్సుకు; అతి+ఆతురతన్= మిక్కిలి పీడను; చేయుచున్+ఉండుటన్= కలిగిస్తూ ఉండటం వలన; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్రుడిని; చూచి అతఁడు= ఆ భీముడు; మనమునన్= మనసులో; అలుగున్= కోపగించుకొనేవాడు.

తాత్పర్యం: దుర్యోధనుడివలన ఆనాడు జూదం మూలాన తాము అనుభవించిన కష్టాలు రాజ్యం పోవటం, భార్యకు సభలో అవమానం, అరణ్యావాసం మొదలైనవన్నీ భీముడి మనస్సును పీడిస్తుండేవి. అందువలన ధృతరాష్ట్రుడిని చూస్తేనే భీముడు మండిపడేవాడు.

విశేషం: పాండవులందరూ కష్టాలుపడ్డా ఆ స్మృతులు ఇంకా భీముడిని బాధిస్తున్నాయి. మిగిలిన నలుగురి కంటె భిన్నంగా భీముడి విషయంలోనే ఈ ప్రస్తావన. చూచి - మనసులో ఆ బాధ ఎపుడూ ఉన్నా ధృతరాష్ట్రుడిని చూసిన సమయంలో మాత్రం కోపం వచ్చేది. తమ కష్టాలకు హేతువైనవాడిని, అసలు రాజైన అన్నగారికంటె అధికంగా పూజించాల్సిరావటం కోపకారణం. మిగిలిన పాండవులు సర్దుకొన్నా స్వభావాన్ని బట్టి భీముడి కది కష్టం.

తే. శ్రాద్ధ దివసంబులందుఁ బుత్త్రవ్రజమున। కాంబికేయుండు గో కనకాది దాన
కీర్త్యముగఁ బారలౌకిక క్రియలు సేయు। నట్లుగా సంఘటించు ధర్మాత్మజుండు. 13

ప్రతిపదార్థం: ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; శ్రాద్ధ దివసంబులందున్= శ్రాద్ధ కర్మలను ఆచరించే మరణ తిథులలో; పుత్త్రవ్రజమునకున్= దుర్యోధనుడు మొదలయిన కొడుకుల సముదాయానికి; పారలౌకిక క్రియలు= పుణ్యలోకాదులు కలగటం కొరకు చేసే కర్మలను; గో= ఆవులు; కనక= బంగారం; ఆది= మొదలైన; దాన= దానాలచేత; కీర్త్యముగన్= బ్రాహ్మణాదిజనం ప్రశంసించే విధంగా; చేయునట్లుగాన్= నిర్వహించేటట్లుగ; ధర్మాత్మజుండు= ధర్మరాజు; సంఘటించున్= ఏర్పాటు చేసేవాడు.

తాత్పర్యం: 'ఆంబికేయుండు చేయునట్లుగా ధర్మాత్మజుండు సంఘటించు' అనడంలో ధృతరాష్ట్రుడికంటె ధర్మరాజులో ఎక్కువపూనిక వ్యక్తం అవుతున్నది. 'ధర్మాత్మజుండు' కాబట్టి ఇటువంటి క్రియలలో శ్రద్ధ అధికం. అపకారులకు కూడ పుణ్యలోకాలు సాధించే ఉపకారబుద్ధి విశేషం. అభిమన్యు ప్రభృతిస్వజనవిషయం ప్రత్యేకంగా చెప్పనే అక్కరలేదు.

సీ. అతులభోగంబును నంచితత్యాగంబుఁ। దొల్లింటియట్టుల చెల్లఁజేయు
ధృతరాష్ట్రునకు ధర్మసుతుఁడు గాంధారికిఁ। బూర్వప్రకార సంపూజ్యదాన
నిరతిఁజెల్లించు; నక్కురువృద్ధుఁ డిమ్మెయిఁ। బాండుపుత్త్రులు దన్నుఁ బరమభక్తి
శిష్యవర్తనమున సేవింపఁ దానును। గురునట్ల వాత్సల్యపరత నెపుడు

తే. వారలకు శ్రీయు నాయువు వైరిజయము। మానసమున నాశాసించు మానవేంద్ర!
యతని తొంటివర్తనముఁ దత్సుతుని కీడు। నాత్మఁ దలఁపఁ డెన్నండు ధర్మాత్మజుండు! 14

ప్రతిపదార్థం: మానవ+ఇంద్ర!= జనమేజయ మహారాజా!; ధర్మసుతుఁడు= ధర్మరాజు; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రుడికి; తొల్లింటి అట్టులు+అ= అతడి కొడుకులు బ్రతికివున్నపుడు సార్వభౌముడుగా ఉన్నప్పటివలెనే; అతులభోగంబునున్= సాటిలేనిసుఖాలూ; అంచిత త్యాగంబున్= పూజింపదగిన దానమూ; చెల్లన్ చేయున్= సాగేటట్లుగా చేసేవాడు; గాంధారికిన్= గాంధారికి కూడా; పూర్వ= మునుపటి (కొడుకులు జీవించి ఉన్నప్పటి); ప్రకార= విధంగానే; సంపూజ్య= పూజించదగిన; దాన= దానముయొక్క; నిరతిన్= ఆసక్తిని; చెల్లించున్= చెల్లేటట్లు చేసేవాడు; పాండుపుత్త్రులు= ధర్మజుడు మొదలుగా పాండురాజు కొడుకులు అందరూ; ఇమ్మెయిన్= ఈవిధంగా; పరమభక్తిన్= శ్రేష్ఠమైన ఆరాధనా భావంతో; శిష్య వర్తనమునన్= శాసించబడే నడవడితో (శిష్యులవలె); తన్నున్= తనను; సేవింపన్= సేవిస్తూ వుండగా; ఆ+కురువృద్ధుఁడు= కురువంశంలో పెద్దవాడైన ఆ ధృతరాష్ట్రుడు; తానును= తను కూడా; గురు+అట్లు+అ= పాండవులకు గురువువలెనే; వాత్సల్య పరతన్= పిన్నలయందుండేటటువంటి స్నేహభావం, ప్రధానంగా; వారలకున్= ఆ పాండవులకు; శ్రీయున్= రాజ్యాది సంపదలూ; ఆయువున్= అధిక జీవితకాలాన్నీ; వైరిజయమున్= శత్రువులను జయించే సామర్థ్యమూ కలగాలని; మానసమునన్= తన మనస్సులో; ఎపుడున్= నిరంతరమూ; ఆశాసించున్= దీవించేవాడు; ధర్మాత్మజుండు= ధర్మరాజు; అతని= ఆ ధృతరాష్ట్రుడియొక్క; తొంటివర్తనమున్= పూర్వపు (దుర్యోధనాదులు జీవించిఉన్నప్పటి) నడవడికనూ; తద్ సుతుని కీడు= అతని కొడుకు దుర్యోధనుడు తమకు చేసిన అపకారమూ; ఎన్నండున్= ఏ సమయంలోనూ; ఆత్మన్= మనసులో (కూడా); తలఁపఁడు= స్మరింపడు.

తాత్పర్యం: జనమేజయా! పుత్రులు జీవించిఉన్నప్పటివలెనే ధృతరాష్ట్రుడికి సార్వభౌముడివలె సంపదలు అనుభవించటమూ, యథేష్టంగా దానం చేయటమూ సాగనిచ్చాడు ధర్మరాజు. అట్లాగే గాంధారికి కూడా

వ్రతాదులసందర్భాలలో బ్రాహ్మణాదులకు దానం చేయటం వగైరా యథాపూర్వం సాగనిచ్చాడు. ధర్మరాజే కాదు ఇట్లా పాండవులందరూ శిష్యులవలె ఏకాగ్రతతో తనను సేవిస్తూ ఉండడంవలన ధృతరాష్ట్రుడు కూడా పాండవులను శిష్యవాత్సల్యంతో చూచేవాడు. పాండవులకు ఇంకా సంపదలూ, ఆయుస్సూ, శత్రుజయమూ కలగాలని మనస్సులో ఆశీర్వదిస్తుండేవాడు. ధర్మరాజు కూడా ధృతరాష్ట్రుడి పూర్వ ప్రవర్తననూ అతడి కొడుకు దుర్యోధనుడు తమకు చేసిన అపకారాన్నీ మనసులోనికి రానిచ్చేవాడు కాదు.

విశేషం: గురుశబ్దానికి- ఉన్న వంశంలో పెద్దా, తండ్రీ, మొదలైన అర్థాలు ఇక్కడ అన్వయిస్తాయి. ధృతరాష్ట్రుడినుండి దీన్ని సాధించటంలో పాండవుల శిష్యవర్తనంలో పరమభక్తి ఉత్కర్షే కారణం తప్ప ధృతరాష్ట్రుడిస్వభావం కాదు. శ్రీ, ఆయుస్సు, వైరిజయం అనేవాటిలో క్రమం ఉన్నది. తన భోగత్యాగాలకు గూడా, పాండవులకు - శ్రీ, అని తనకు దూరం కాకుండా ఉండాలంటే పాండవులకు శత్రుజయమూ క్రమంగా అవసరం. ధృతరాష్ట్రుడి ఆశీస్సు ఉభయతారకం.

క. వినుమతని తెఱఁగెఱిఁగి పరి। జనములలో నాంబికేయు చరితము దుర్యో
ధను కొఱగామియు నెవ్వా। రును వాక్రువ్వంగ వెఱతురు కురుప్రవరా! 15

ప్రతిపదార్థం: కురుప్రవరా!= కురువంశంలో శ్రేష్ఠుడ వైన జనమేజయా!; వినుము= వినవలసినది; అతని= ఆ ధర్మరాజుయొక్క; తెఱఁగు= విధం; (మనస్సు) ఎఱిఁగి= తెలిసి; పరిజనములలోన్= పరివారంలో (చుట్టూ ఉండే జనంలో); ఏ+వారును= ఏ ఒక్కడు కూడా; ఆంబికేయు= ధృతరాష్ట్రుడియొక్క; చరితము= పూర్వప్రవర్తనం గురించీ; దుర్యోధను= దుర్యోధనుడి యొక్క; కొఱ+కామియున్= (పనికిమాలినతనమూ) దుష్టమైన పని - కీడునూ; వాక్రువ్వంగన్= పలకటానికే; వెఱతురు= భయపడేవారు.

తాత్పర్యం: ఓ జనమేజయా! విను ధర్మరాజుతత్త్వం తెలిసిన అతని చుట్టు జనంలో ఎవరూ కూడా ధృతరాష్ట్రుడి పూర్వ వర్తనమూ, దుర్యోధనుడు చేసిన అకార్యమూ ఉచ్చరించడానికే భయపడేవారు.

విశేషం: పరిజనములతో - అనే పూర్వ ముద్రితపాఠం సరికాదు. పరిజనంతో ఈ విషయాలెట్లా చెప్పుతారు? రాజు మనస్సు తెలిసికొని దానికి అనుగుణంగా రాజపరిజనం వ్యవహరిస్తుంది. అందుకే ధర్మరాజు మనసులో అతడి తొంటివర్తనమూ, తత్సుతుడి కీడూ - లే వనే విషయం గ్రహించారు - 'తెఱఁ గెఱిఁగి' చాల జాగ్రత్తగా పరిశీలించి తత్త్వం తెలిసికొన్నారు. అందుకే ఆంబికేయు చరితము, (అతని తొంటివర్తనము) దుర్యోధనుకొఱగామి (తత్సుతునికీడు) గురించి ఉచ్చరించడానికి భయపడేవారు.

సీ. రాజ్యాధిపత్య సంపూజ్యత్వమున ధృత। రాష్ట్ర పాండుసుతాంతరంబు గాన
రొకలులు జానపదోత్కరమునఁ బౌర। వర్గంబునందును వసుమతీశ!
యమ్మెయి నడపెడు నప్పాండవాగ్రజు। వలన నిజాత్మజువలని కంటె
నక్కురురాజు ప్రియం బందు; న ట్లున్న। యక్కాలమునఁ। బవనాత్మజుండు

తే. సన్నిహితుఁ డైనయప్పు డజ్జనవిభుండు। తన తనూజులఁ దలఁచి సంతాప మందు;
నతనిఁ గనుఁగొని యబ్భీముఁ డతనిసుతులు। తమ్ముఁ బఱిచిన పాటులు దలఁచి యలుగు. 16

ప్రతిపదార్థం: వసుమతీశ!= ఓ జనమేజయ భూపాలా!; జానపద ఉత్కరమునన్= గ్రామాలలో ఉండే జనాల సమూహంలోనూ; పౌర వర్గంబునందును= పట్టణాలలో ఉండే జనసముదాయంలోనూ; ఒకళులు(న్)= ఒక్కరు గూడా; రాజ్య ఆధిపత్య= రాజ్యము యొక్క దొరతనంతో; సంపూజ్యత్వమునన్= గౌరవింపబడేలక్షణంలో; ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రుడికీ; పాండుసుత= పాండవులకూ; అంతరంబు= భేదం; కానరు= కనలేకపోయారు; ఆ+మెయిన్= ఆవిధంగా తన (ధృతరాష్ట్రుడి)తో ఏకాభిప్రాయంగా; నడపెడు= పరిపాలనం సాగిస్తున్న; ఆ+పాండవ+అగ్రజువలనన్= పాండు కుమారులలో జ్యేష్ఠుడైన ఆ ధర్మరాజు వలన; ఆ+కురురాజు= ఆ ధృతరాష్ట్రుడు; నిజ+ఆత్మజువలనికంటెన్= తన పెద్దకొడుకైన దుర్యోధనుడి కంటె కూడా, ప్రియంబు= సంతోషాన్ని; అందును= పొందేవాడు; అట్లు+ఉన్న= ఆవిధంగా జరుగుతూ ఉన్న; ఆ+కాలంబునన్= ఆ రోజులలో; ఆ+జనవిభుండు= ఆ ధృతరాష్ట్రుడు; పవన+ఆత్మజుండు= వాయుపుత్రుడైన భీముడు; సన్నిహితుఁడు= దగ్గర ఉన్నవాడుగా; ఐన+అప్పుడు= అయిన సమయంలో; తన తనూజులన్= దుర్యోధన దుశ్శాసనాదు లైన తన కొడుకులను; తలఁచి= స్మరించి; సంతాపము= మిక్కిలిబాధ; అందున్= పొందేవాడు; ఆ+భీముఁడు= ఆ సమయంలో భీముడు కూడా; అతనిన్= ఆ ధృతరాష్ట్రుడిని; కనుఁగొని= చూచి; అతని సుతులు= ధృతరాష్ట్రుడి కొడుకు లైన దుర్యోధనాదులు; తమ్మున్= తమను (పాండవులను); పఱిచిన పాటులు= పెట్టిన కష్టాలు; తలఁచి= స్మరించి; అలుగున్= ధృతరాష్ట్రుడిపై కోపగించేవాడు.

తాత్పర్యం: జనమేజయా! ఆ రాజ్యంలో ప్రభుత్వం నడిపే విషయంలో ధృతరాష్ట్రుడికీ, పాండవులకూ భేదం అనేది, అటు గ్రామవాసులు గాని, (ఇటు) పట్టణవాసులు గానీ చూడలేదు. ధర్మరాజు ఆ విధంగా తనను గౌరవిస్తుండటంవలన ధృతరాష్ట్రుడికి తన సొంత కొడుకుల కంటె కూడా ధర్మరాజుపైనే ఇష్టం కలిగేది. అయితే భీముడు తన దగ్గరకు వచ్చినపుడు మాత్రం కొడుకులను తలచుకొని బాధ పడేవాడు. భీముడు కూడా ధృతరాష్ట్రుడిని చూస్తే అతనికొడుకులు తమకు కల్గించిన కష్టాలను తలచుకొని ధృతరాష్ట్రుడిపై కోపించేవాడు.

విశేషం: తన పెద్దకొడుకైనా దుర్యోధనుడితో వచ్చే అభిప్రాయభేదం ధర్మరాజుతో కలగకపోవడంవలన ధృతరాష్ట్రుడికి ధర్మరాజు కన్న కొడుకుకంటె ప్రీతిపాత్ర మయ్యాడు. అక్కడ కొడుకుమాట తాను వినవలసివచ్చేది. ఇక్కడ తనమాటే ధర్మరాజు వింటున్నాడు. ధృతరాష్ట్రుడికి భీముడిని చూస్తే పుత్రులు గుర్తుకు రావటానికి కారణం దుర్యోధన దుశ్శాసనుల చావు భీముడివలన సంభవించడమే. భీముడిని చంపా లని స్వయంగా తానూ విఫలుడైనాడు కూడా. భీముడికీ ధృతరాష్ట్రుడిని చూస్తే గతం గుర్తుకు వస్తుంది. ఈ రెండింటిలో ముందు ధృతరాష్ట్రుడి విషయం ప్రస్తావించటం గమనించాలి. తనను చూచినపుడు ధృతరాష్ట్రుడిలో కలిగే మార్పువలన అటువంటి 'అతని' చూచినపుడు భీముడికీ గతం తలపునకు వస్తుంది.

తే. **హృదయముల నొండొరులదెస నిట్టివార। లయ్యు నతఁడు నతండు నన్యోన్యభాష**
ణములయప్పుడు మృదుల విన్యాస మొప్ప। నాడుదురు చుట్టములు మెచ్చునట్లు గాఁగ. **17**

ప్రతిపదార్థం: అతఁడున్= ఆ ధృతరాష్ట్రుడూ; అతఁడున్= ఆ భీముడూ; ఒండొరులదెసన్= పరస్పరం, ఒకళ్ళ విషయంలో ఇంకొకళ్ళు; హృదయములన్= తమ తమ మనస్సులలో; ఇట్టివారు= పూర్వం చెప్పినవిధంగా ద్వేషం కోపం కలిగినవారు; అయ్యున్= అయినప్పటికీ; అన్యోన్యభాషణముల+అప్పుడు= పరస్పరం మాట్లాడుకొనేటప్పుడు మాత్రం; చుట్టములు= బంధువులు; మెచ్చునట్లు+కాఁగన్= పొగడే విధంగా; మృదుల విన్యాసము= తెచ్చుకోలు మెత్తదనం; ఒప్పన్= ప్రకాశించేవిధంగా; ఆడుదురు= సంభాషిస్తుంటారు.

తాత్పర్యం: ఇంతకు ముందు (16 పద్యంలో) చెప్పినట్లుగా ధృతరాష్ట్రుడూ, భీముడూ మనస్సులో ఒకళ్ళమీద ఒకళ్ళు ద్వేషమూ, కోపమూ కలిగి ఉన్నప్పటికీ పరస్పరం మాటాడుకొనేటప్పుడు మాత్రం బంధువులందరూ మెచ్చుకొనే విధంగా మాటలలో మెత్తదనం తెచ్చిపెట్టుకొనేవారు.

విశేషం: భీముడు అన్నగారిఆజ్ఞలను పాలించటానికి అయితే ధృతరాష్ట్రుడు తన పెద్దరికాన్ని కాపాడుకొనటానికి అయినా 'అతఁడు నతఁడు అనే పదద్వయం వాళ్ళు కలివిడిగా లేక ఎవరికి వారుగా వేరుగా ఉండిపోవటాన్ని వ్యక్తం చేస్తున్నది. 'విన్యాసం' శబ్దం మృదుత్వం తెచ్చిపెట్టుకొన్నది, కృతకమే, కాని హృద్గతం కాదని తెలుపుతున్నది.

వ. ధృతరాష్ట్రుం డేకతంబ యున్నయెడ వృకోదరుం డతనికి నింత నంత నుండి గాంధారి వినుచుండ. 18

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; ఏకతంబు+అ= ఒంటరిగా; ఉన్న+ఎడన్= ఉన్న సమయంలో; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఇంతన్, అంతన్ ఉండి= ఇక్కడ అక్కడగా నిలిచి; గాంధారి= ధృతరాష్ట్రుడిభార్య; వినుచున్+ఉండన్= వినేటట్లుగా; వృకోదరుండు= భీముడు. (ఇట్లా అంటాడు. తర్వాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఒంటరిగా ఉన్నపుడు అతడికి కొంచెం సమీపంగా ఉండి గాంధారి కూడా వినేటట్లుగా భీముడు ఇట్లా అంటాడు.

సీ. 'అంధుని కొడుకులయం దొకరునిఁ దప్పి । పోనీక త్రుంచితి భూరిశక్తి
దర్పితం బైన మద్బాహుపంజరము సొ । చ్చిన రిపురాజన్య సింహములకు
వెడలంగ వచ్చునే? వెంగలు లై వారు । కయ్యంబు సేసిరి గాక నన్ను
నెఱిఁగినఁ దొడరుదు రెట్టులు? దుర్యోధనాదుల ననిఁ దెగటార్చినట్టి

తే. నాదు దోర్దండములఁ జందనం బలంది । కుసుమదామముల్ సుట్టి మ్రొక్కుదు మహోప
కారు లరయంగ దైవముల్ గావె?' యనుఁ ద । దీయ మర్మంబు లెల్ల భేదిల్ల నధిప! 19

ప్రతిపదార్థం: అధిప!= ఓ జనమేజయరాజా!; తదీయమర్మంబులు= ఆ గాంధారీ ధృతరాష్ట్రుల, జీవస్థానాలు; ఎల్లన్= అన్నీ; భేదిల్లన్= చీలేటట్లుగా; అనున్= భీముడు ఇట్లా అన్నాడు; అంధుని కొడుకులయందున్= గ్రుడ్డిరాజు ధృతరాష్ట్రుడి కొడుకులలో; ఒకరునిన్= ఒక్కడిని కూడా; తప్పిపోన్+ఈక= తప్పించుకు పోకుండ, మిగల్చకుండా; భూరి శక్తిన్= గొప్ప పరాక్రమంతో; త్రుంచితిన్= చంపి వేశాను; దర్పితంబు+ఐన= మదించిన; మత్ బాహుపంజరము= నా భుజములు (వలయం) అనే బోనులోనికి; చొచ్చిన= ప్రవేశించిన; రిపు, రాజన్య సింహములకున్= శత్రువులైన రాజులు అనే సింహాలకు; వెడలంగన్= బయటపడడానికి; వచ్చునే?= సాధ్యమా?; వారు= ఆ కౌరవులు; వెంగలులు+ఐ= తెలివితక్కువవారు అయి; కయ్యంబు= (మాతో) యుద్ధం; చేసిరి= చేశారు; కాక= (వెంగలులు) కాకపోతే; నన్నున్= నన్ను; ఎఱిఁగినన్= భూరిశక్తిమంతుడుగా తెలిసికొంటే; ఎట్టులు= ఏవిధంగా; తొడరుదురు?= ఎదిరిస్తారు? (యుద్ధానికి పూనుకుంటారు?); అనిన్= యుద్ధంలో; దుర్యోధనాదులన్= దుర్యోధనుడు మొదలైనవారిని; తెగటార్చిన+అట్టి= చంపివేసినటువంటి; నాదు దోర్దండమున్= దుడ్డు కర్రలవంటి నా భుజాలకు; చందనంబు= మంచి గంధాన్ని; అలఁది= పూసి; కుసుమదామముల్= పూలమాలలు; చుట్టి= అలంకరించి; మ్రొక్కుదున్= నమస్కరిస్తాను; అరయంగన్= పరిశీలిస్తే; మహోపకారులు= ఇంత గొప్పమేలు చేసినవారు; దైవముల్= దేవతలె; కావె!= కదా!

తాత్పర్యం: జనమేజయరాజా! ఆ గాంధారీ ధృతరాష్ట్రుల ప్రాణస్థానాలు చీలిపోయేటట్లుగా భీముడు ఇట్లా అంటాడు; 'గుడ్డివాడి కొడుకులలో ఒక్కడు కూడా మిగలకుండా అందరినీ చంపేశాను. నా బాహువలయం అనే బోనులోకి ప్రవేశించిన ఏ రాజసింహమైనా ఎట్లా బయటపడగలదు? మూర్ఖులు కాబట్టి ఆ కౌరవులు మాతో యుద్ధానికి వచ్చారు

కాని, నా పరాక్రమం తెలిస్తే ఎదిరించేవారే కాదు. ఆ యుద్ధంలో దుర్యోధనప్రభృతు లందరినీ కూల్చిన యీ నా భుజాలకు చందనం పూసి, పూలమాలలు చుట్టి నమస్కరిస్తాను. నిజానికి ఇంత గొప్ప ఉపకారం చేసింది దేవతలే కదా!'

విశేషం: ధృతరాష్ట్రుడు అంధుడే అయినా దుర్యోధనాదుల మాటలను గుడ్డిగా నమ్మి ఇంతకు తెచ్చుకొన్నాడు కాబట్టి ఇక్కడ సాభిప్రాయం. 'అంధుని కొడుకులు' కావడం చేతనే దుర్యోధనాదులు కూడా అంధులై అవివేకులై ప్రాణాలమీదకు తెచ్చుకొన్నారు. 'భూరిశక్తి' అన్నపుడు భూరి అనేది తన పరాక్రమంలో గొప్పదనాన్ని చెప్తుండగా, 'త్రుంచితి' అనేది కౌరవులను 'అవలీలగా' చంపటం తెలుపుతుంది. చొచ్చిన - భూతార్థకం, ప్రవేశించడం జరిగిపోయాక - వెడలంగన్ ఆ తర్వాత కోరుకొన్నా తప్పుకోవటం అనేది మాత్రం వాళ్ళ చేతులలో లేదు. రోట్లో తల దూర్చాక చేసేదేం లేదు. త్రుంచితిన్ - అనే ఉత్తమపురుషైకవచనక్రియ, అట్లాగే 'నన్ను నెఱిఁగిన దుర్యోధనాదుల తెగటార్చినట్టి నాదు దోర్దండములు' మొదలైన మాటలో అస్మదర్థం - భీముడి వికత్థనత్వానికీ, ధృతరాష్ట్రుడిపై కోపతీవ్రతకీ నిదర్శనాలు. అంధుని మొదలుగా ఇందులో మాటలన్నీ గాంధారీ ధృతరాష్ట్రులకు మర్మభేదకాలే. మద్బాహుపంజరము చొచ్చిన - వెడలంగవచ్చునే' అనేది ధృతరాష్ట్రుడు తన బాహు పంజరంలో చంపుదామనుకున్నా తాను (భీముడు) వెడలివచ్చిన విషయాన్ని స్మరింపజేస్తూ తన సామర్థ్యంలో ధృతరాష్ట్రుడి అసమర్థతను (వెంగలితనం) ఎత్తి చూపుతుంది. ఈ మహోపకారం దేవతలు చేసిందే అనడం ఈ అంశాన్ని ప్రధానంగా ఉద్దేశించి ఉండవచ్చును. భీముడు బ్రతికి బయటపడ్డ దందువలననే కదా! చివర్లో ఆఖరిఘట్టమూ భీముడికి గుర్తు వచ్చింది.

వ. **దీని ధర్మనందనుండును ధనంజయుండునుం గుంతియు ద్రౌపదియు నెఱుంగరు; కవ లొక్కొక్క మాఱిమ్మాటలు విని సంతసిల్లుదురు; ధర్మనందను తెఱం గెఱుంగుటంజేసి పుయిలోడి తా రేమియు నాడరు; ధృతరాష్ట్రగాంధారులుం గాలపర్యాయంబు గని డెందంబులు గంద నూరకుండుదు; రట్టిభంగిఁ బంచదశవత్స రంబులు చనియె నంత నొక్కనాఁ డయ్యంధనృపతి బంధుజనంబులం గూర్చి ధర్మనందను రావించి; యతండు వినుచుండ గద్గదకంఠుం డగుచు వారలతోడ.** **20**

ప్రతిపదార్థం: దీనిన్= భీముడు ధృతరాష్ట్రగాంధారులు నొచ్చుకొనేటట్లుగా మాటాడటం; ధర్మనందనుండును= ధర్మరాజూ; ధనంజయుండునున్= అర్జునుడూ; కుంతియున్= కుంతీ; ద్రౌపదియున్= ద్రౌపదీ; ఎఱుంగరు= తెలియరు; ఈ+మాటలు= భీముడి ఈ పలుకులు; ఒక్కొక్కమారు= అపుడప్పుడూ; విని= ఆలకించి; కవలు= నకులసహదేవులు; సంతసిల్లుదురు= సంతోషించేవారు; తారు= తాము మాత్రం; ధర్మనందను= ధర్మరాజుయొక్క; తెఱంగు= (మనస్సు) విధం; ఎఱుంగుటన్ చేసి= తెలిసినందువలన; పుయిలోడి= సంకోచంతో; ఏమియున్= ఏమీ; ఆడరు= మాటాడరు; ధృతరాష్ట్రగాంధారులున్= ధృతరాష్ట్రుడూ, గాంధారీ; (ఆ మాటలు విని) కాల పర్యాయంబు= సమయం తారుమారవటం; కని= తెలిసి; డెందంబులు= మనసులు; కందన్= కలత చెందగా; ఊరకుండుదురు= మిన్నకుండేవారు; అట్టిభంగిన్= ఆవిధంగా; పంచదశవత్సరంబులు= పదిహేను ఏండ్లు; చనియెన్= గడిచాయి; అంతన్= పనిహేనోయేడు పూర్తయినతర్వాత; ఒక్కనాఁడు= ఒకానొకరోజు; ఆ+అంధనృపతి= ఆ (గుడ్డిరాజు) ధృతరాష్ట్రుడు; బంధుజనబులన్= చుట్టాలను; కూర్చి= సమావేశపరిచి; ధర్మనందనున్= ధర్మరాజును; రావించి= పిలిపించి; అతండు= ఆ ధర్మరాజు; వినుచున్+ఉండన్= వింటుండగా; వారలతోడన్= బంధువులతో; గద్గదకంఠుండు= డగ్గుత్తిక కలవాడు; అగుచున్= అవుతూ-(ఇట్లా అంటున్నాడని తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: భీముడు పలికేమాటలు ధర్మరాజుకూ, అర్జునుడికీ, కుంతికీ, ద్రౌపదికీ తెలియవు. నకుల సహదేవులు మాత్రం అప్పుడప్పుడూ ఆ మాటలు విన్నా, ధర్మరాజుపట్ల ఉన్న భయం వలన వారు మారు పల్కరు. గాంధారీ

ధృతరాష్ట్రులు కాలవైపరీత్యాన్ని గమనించి మనసులలో బాధపడుతూ మిన్నకుండేవారు. అట్లా పదిహేనేళ్ళు గడిచాయి. ఆ తరువాత ఒకనాడు ధృతరాష్ట్రుడు బంధువులనందరినీ సమావేశపరిచి, ధర్మజుడిని పిలిచి అతడు వింటూఉండగా, బొంగురుపోయిన గొంతుతో వారందరితో ఇట్లా అన్నాడు.

విశేషం: ధర్మరాజు అర్జునుడు, కుంతితోపాటు, ద్రౌపది కూడా గతంలో కౌరవులవలన కలిగిన కష్టాలను మరిచిపోయి గాంధారీ ధృతరాష్ట్రులపై గౌరవంతో వ్యవహరిస్తున్నారు. అందుకే వా ళ్ళెవరూ వినకుండానే భీముడు పై విధంగా మాటాడేవాడు. కవలు ఆమోదించేవాళ్ళు కావటం చేతనే ఒక్కొక్కమారైనా భీముడి మాటలు వినగలిగారు. ధర్మనందను తెలంగు భీముడికీ తెలిసినా పిన్నలు కావడంచేత నకులసహదేవులు ఏమైనా అనడానికి సంకోచించేవారు. స్వభావం వలననూ, ధర్మరాజుకు వెంటనే జన్మించినవాడు కావడంవలననూ భీముడు నిస్సంకోచంగా అనదలచుకొన్నమాట లనేవాడు. పరోక్షంగా నైనా ధృతరాష్ట్రుడికి కొడుకులు బతికున్నప్పటి వలె నడపటానికి ప్రయత్నించినవాడు ధర్మరాజు (14పద్యం) తేడా లే దనిపించటానికి ధర్మరాజు ప్రయత్నించినా భీముడివలన గాంధారీధృతరాష్ట్రులకు 'కాలపర్యయ' భావన రాక తప్పలేదు. అయినా 15 సంవత్సరాలు ఊరకుండటంలో వార్ధకాదులతోపాటు ధర్మరాజునడవడీ, 'చుట్టములు మెచ్చునట్లు' ఉండాలనే అభిప్రాయం కారణం. ఇపుడొకసారి తన జీవితాన్నంతా గుర్తుచేసుకొనడమూ, నగరం విడిచిపోవటం, (ఆశ్రమవాసం) అనే నిర్ణయం ప్రకటించబోతూండటం, వలన కంఠంలో గాద్గద్యం.

ధర్మరాజును రప్పించి అతడు వింటూఉండగా బంధువులకు చెపుతున్నాడు. ధర్మరాజుతో ముఖాముఖిగా చెప్పటానికి కాకుండా, తన ఆంతర్యం, యథార్థంగా పరోక్షంగా వ్యక్తం చేసినట్లుగా గూడ. గతంలో తాను పొరపాట్లు చేశానని చెపుతున్నాడు మరి.

ధృతరాష్ట్రుఁడు ధర్మజునితోఁ దన మనోరథంబుఁ దెలుపుట (సం.15-5-1)

సీ. **నాకతంబునఁ జేసి యా కౌరవులకు నా। శంబు వాటిలుట దెల్లంబు మీకు**
జడుఁ గ్రూరు నతిలోభి జ్ఞాతి జనద్రోహ। కరు రాజుఁ జేసితిఁ గురుధరిత్రి
కచ్యుతు చెప్పిన యమలవాక్యంబులు। విననేరనైతి నా తనయువలని
ఘనతరస్నేహంబునను మొగమోటను। దగియెడుమాటలఁ దఱిమి యొత్తి

తే. **యాడకుండితి; భీష్ముండు నస్త్రగురుఁడు। విదురుఁడును సంజయుండును వే విధముల**
నాకుఁజెప్పిరి; గాంధారి నన్నుఁదూఱి। చెప్పె: న మ్మాట లేఁ బెడచెవుల నిడితి. **21**

ప్రతిపదార్థం: నా కతంబునన్+చేసి= నా కారణంగా; ఆ కౌరవులకున్= నా పుత్రులు మొద లైన కురువంశీయులకు; నాశంబు= చేటు; పాటిలుట= సంభవించటం; మీకున్= (నా బంధువు లైన) మీ అందరికీ; తెల్లంబు= బాగా తెలిసిందే; కురుధరిత్రికిన్= కురువు అనేపేరు గల్గిన ఈ రాజ్యానికి; జడున్= (ఒకానొక) బుద్ధిహీనుడూ; క్రూరున్= దుష్ట బుద్ధీ; అతిలోభిన్= మిక్కిలిగా పరద్రవ్యాభిలాష ఉన్నవాడూ; జ్ఞాతిజనద్రోహకరున్= దాయాదులకు కీడు చేసేవాడూ అయిన దుర్యోధనుడిని; రాజున్= పాలకుడుగా; చేసితిన్= ఏర్పరిచాను; అచ్యుతు= శ్రీకృష్ణుడు; చెప్పిన= బోధించిన; అమలవాక్యంబులు= దోషం లేని (అర్థవంతములైన) మాటలు; వినన్, నేరన్, ఐతిని= ఆలకించకపోయాను; నాతనయు వలని= దుర్యోధనుని యెడ ఉన్న; ఘనతర= మిక్కిలి అధికమైన; స్నేహంబునను= ప్రేమవలనను; మొగమోటను= సంకోచంతోనూ; తఱిమి= తనమాట వినేంతవరకూ విడువకుండా; ఒత్తి= ఒత్తిడి చేసి (బలవంతంగా); తగియెడు మాటలన్= ఉచితమైన పలుకులను; ఆడక+ఉండితిన్= చెప్పలేదు; నాకున్= నాకు;

భీష్ముండున్= పితామహుడైన భీష్ముడూ; అస్త్ర గురుఁడు (ను)= పిల్లల కస్త్రవిద్య నేర్పిన ద్రోణుడూ; విదురుఁడును= విదురుడూ; సంజయుండును= సంజయుడూ, వేవిధములన్= అనేక విధాలుగా; చెప్పిరి= (కర్తవ్యం, ఉచితం) చెప్పారు; గాంధారి= నా భార్య గాంధారీ; నన్నున్= నన్ను; దూఱి= నిందిస్తూ, దృఢంగా; చెప్పెన్= మంచి ఏదో (కర్తవ్యం) గట్టిగా చెప్పింది; ఏన్= నేను; ఆ+మాటలు= వారందరి పలుకులూ; పెడచెవులన్+ఇడితిన్= నిరాదరణంతో వినిపించుకొనలేదు.

తాత్పర్యం: నా కారణంగానే కౌరవులు నాశనమైనారని మీకు బాగా తెలుసు. బుద్ధి లేనివాడూ, దుర్మార్గుడూ, ఇతరుల ద్రవ్యంపై అధికమైన అభిలాష ఉన్నవాడూ, దాయాదులకు కీడు చేసేవాడూ అయిన దుర్యోధనుడిని ఈ కురురాజ్యానికి రాజును చేశాను. కృష్ణుడు చెప్పినా వినలేదు, కొడుకుమీది వల్లమాలిన ప్రేమవలన వారికి మంచిని ముఖంమీద గట్టిగా చెప్పలేకపోయాను. భీష్ముడూ, ద్రోణుడూ, విదురుడూ, సంజయుడూ చెప్పినా, గాంధారి మరీ నొక్కిచెప్పినా ఆ మాట లేవీ నేను వినిపించుకొనలేదు.

విశేషం: 'నా కతంబున అని గతాని కంతా తానే కారణం కావడం అనే అంశంతోటే ప్రారంభించటం ధృతరాష్ట్రుడి ఆత్మ పరిశీలనకు అర్థం. కౌరవనాశనం అనే సారాంశం చిన్న వాక్యంలో సంగ్రహంగా ముందు ప్రతిపాదించి ఆ తర్వాత అందుకు కారణాలు క్రమంగా వివరిస్తున్నాడు. అందులో ముఖ్యమైనది దుర్యోధనుడిని రాజు చేయటమే, 'రాజుఁ జేసితి' అనటంలో అది పొరపాటు అనీ, అందువలన ధర్మరాజును చేసి వుండాల్సిందనీ వ్యక్తం అవుతుంది. 'యచ్చాహం పాండు పుత్రేషు గుణవత్సు మహాత్మసు, న దత్తవాన్ శ్రియం దీప్తాం పితృపైతామహీ మిమామ్'. తెలుగులో ధృతరాష్ట్రుడి మాటలు వాచ్యంగా తననోటిమీదుగా ఇప్పటికీ అనలేకపోయాడు. దుర్యోధనుడిలోని గుణహీనతను ప్రతిపాదిస్తూ పాండవులు గుణవంతు లనీ, (రాజ్యం వారి కివ్వవలసిందనీ) వ్యంగ్యంగా అంగీకరిస్తున్నాడు. 'రాజుఁ జేసితి కురుధరిత్రికి' అన్నపుడు కురుధరిత్రి అనేమాట పితృపైతామహీయం కాబట్టి రాజ్యం పితృపితామహక్రమప్రాప్తం' (అనే అంశం అందరికీ తెలిసిన సామాన్య విషయంగా) అని ఈ మాట మొదటే(2వ) చెప్పటం అయింది. 'రాజుఁ జేసితి 'గురుధరిత్రి' కన్నపుడు రాజుఁజేసితిఁ గురుధరిత్రికి అన్నప్పుడు గు' వర్ణాన్ని ఎట్లా స్వీకరించడం? అల్పబుద్ధి అయిన దుర్యోధనుడిని రాజు చేయగూడదు. కొంత కొడుకున కిచ్చి, కొంత భాగాని కైనా పాండవులను రాజులను చేసి ఉంటే ఇంత అనర్థం, కౌరవనాశనం ఆగిఉండేది అని భావం. ఇక్కడ దుర్యోధనుడి గుణహీనతనూ, అల్పత్వాన్నీ ప్రతిపాదించే విశేషణాలు అర్థవంతాలు - జడుడు. మందబుద్ధి. మంచిచెడులు స్వయంగా తెలియలేడు. పాండవులను ద్వేషించటంద్వారా ప్రజలకు వారిపై అభిమానం ఇనుమడింపజేశాడు. క్రూరుడు - ద్రౌపదిని పరాభవించడం వగైరా విషయాలలో క్రూరత్వం. సున్నితంగా చెప్పిన తన (ధృతరాష్ట్రుడి) మాటలు వినిపించుకొనక తనను బాధించటం వలననూ పాండవుల రాజ్యం ఆశించటంలో అయిదూళ్ళయినా ఇవ్వననటంలో అతిలోభం. ఈ లక్షణాలు లేని ధర్మరాజును రాజు చేయవలసింది. జ్ఞాతిద్రోహకరున్ అనడంలో ఇతరులకు ద్రోహకారి కాదు. ప్రజలను బాగానే చూచాడు (99 పద్యం). దాయాదిశత్రుత్వం సామాన్యమే అనే అభిప్రాయం ఉండవచ్చును. 'అచ్యుతు మాటలలో చ్యుతి= పొల్లు లేదు. 'వధ్యతా సా ధ్వయం పాప సామాత్య ఇతి దుర్మతిః' అని దుర్యోధనుడిని అతడి సహచరులనీ చంపుమనే చెప్పాడు కృష్ణుడు మూలంలో. తండ్రికి ఈ మాటలు ఏ సమయంలోనైనా బాధాకరాలే. ఆ మాట లేదో ధృతరాష్ట్రుడిక్కడ చెప్పలేదు. 'నీ పుత్త్రుఁ డవినీతుఁడగుట యెఱిఁగి యెఱిఁగి వానివశంబున నేల పోయె దీవు పాండవులకు నేమి యిచ్చి తేని నడ్డపడ నెవ్వరికి వచ్చు నధిప' (ఉద్యో 3,386) అంటాడు. ఇంతకుముందు కృష్ణుడు కురుధరిత్రి మొత్తానికి దుర్యోధనుడిని రాజు చేశాననే కదా ధృతరాష్ట్ర డిక్కడ బాధ పడుతున్నది. కృష్ణు డన్నట్లు కొంతైనా పాండవుల కిచ్చి ఉన్న ట్లయితే అచ్యుతుమాటలు అమలములుగా ఆ రోజే గ్రహించి విని ఉన్నట్లయితే తన వంశానికి 'చ్యుతి' లేకుండా ఉండేది. (పాండవపక్షపాతంతో అంటున్నాడని ఆ రోజు కృష్ణుడి మాటలు నిష్కల్మషాలుగా గుర్తించలేక పోయాడు - 'అమలవాక్యంబు లని' ఇప్పుడు తలచుకొంటున్నాడు అనుభవంలోకి వచ్చాక తెలిసింది. పుత్రుడివశంలో ఆ మార్గంలో పోవద్దన్నాడు కృష్ణుడు 'నా తనయువలని ఘనతరస్నేహంబునను అనేది పూర్వంలోకి 'అన్వయిస్తుంది'.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

అచ్యుతు చెప్పిన అమల వాక్యంబులు విననేరనైతి నా తనయువలని ఘనతరస్నేహంబున. అందువలననే పుత్ర వశవర్తి అయినాడు. దుర్యోధనుడి కిష్టం లేకుండా పాండవులకు రాజ్యం ఇవ్వలేకపోయాడు. అట్లా అని దుర్యోధనుడిని ఇష్టపఱచనూ లేకపోయాడు. అదే చెప్పుతున్నాడు. స్నేహమునను మొగమోటను తగుమాటలు చెప్పలేకపోయాను కొడుక్కి అని. మొగమోటకు కారణం పుత్రస్నేహం. కొడుకు ఏం బాధపడతాడో అని అతడి కిష్టం లేని మాటలు చెప్పలేకపోయాడు. 'తఱిమి యొత్తి ఆడకుండితి' తగియెడు మాటలు, వెంటబడి, బలవంతంగా చెప్పాలి దుర్యోధనుడికి, మంచిమాటలు మామూలుగా మనసు కెక్కకపోవడం దుర్యోధనుడి స్వభావం అన్నమాట తనమాటలు కొడుకు వినలేదు; భీష్మాదులు చెప్పినమాటలు తాను పెడచెవినిపెట్టాడు, కారణాలు వేరుగా ఉన్నా తండ్రికొడుకులకు మంచి వినిపించుకొకపోవడం అనే లక్షణం సమానం. అయితే తనమాటలు వినలే దని కొడుకుపై తప్పుమోపకుండా, వినేటట్లుగా నేనే చెప్పలేకపోయానన్నాడు. తగిన మాటలు చెప్పినా - తఱిమి, ఒత్తి చెప్పలేదు అపుడపుడూ అనడమే తప్ప తనమాట వినేదాకా వెంటబడి చెప్పలేదు. చెప్పినపుడు వినితీరవలసినంత దృఢంగానూ చెప్పలేదు. దుర్యోధనుడి ముఖంలో కనిపించే అనిష్టభావం చూడలేక, అతడికి సమ్మతం కాని తగుమాటలు చెప్పటంలో ధృతరాష్ట్రుడికి మొగమోటమి ఘనతరస్నేహం అన్నప్పటి తరప్ప్రత్యయం పాండవులకంటె, కృష్ణాదులు చెప్పినమాటలలో హితం కంటె అధిక స్నేహాన్ని వ్యక్తం చేస్తుంది. భీష్మాదుల ప్రస్తావనలో, పెద్దలూ, పిన్నలూ, అందరూ చివరికి పతివ్రత ఐనభార్యా కూడా నిందించి మరీ చెప్పినా వినకపోవడం తప్పయిందనుకొంటున్నాడు 'అస్త్రగురుడు' కావడంవలన కౌరవపాండవుల శస్త్రాస్త్ర సామర్థ్యం ద్రోణుడికి తెలుసు. యుద్ధం వస్తే తనకొడుకులకు నాశం తప్పదని అస్త్రగురుడిమాటలతో నైనా గ్రహించవలసింది. 'నన్ను దూఱి' గాంధారి ధృతరాష్ట్రుడిలో దూరిపోయి= ప్రవేశించి అంటే నిరంతరము చెప్పింది. విననేరనైతిని, ఆడకుండితివంటి భూతార్థకాలు - అంతా అయిపోయింది. ఇపుడు బాధపడి ప్రయోజనం ఏముంది అనేభావం వ్యక్తం చేస్తున్నాయి 'పెడ చెవిని ఇడితి' అనే మాటలు తేలిపోతూ, ఆ మాటలు, ఆదరించకపోవటాన్ని ధ్వనింపచేస్తున్నాయి.

వ. ఇత్తెఱం గంతరంగంబున శల్యం బై యున్నయది, యని చెప్పి వెండియు. 22

ప్రతిపదార్థం: ఈ+తెఱంగు= పైవిధంగా ఎవరు చెప్పినా వినకుండా కొడుకులను, (హితులు మొ॥) పోగొట్టుకోవడం; అంతరంగంబునన్= మనస్సులో (గుచ్చుకొని బాధించే); శల్యంబు ఐ= బాణం, అయి; ఉన్నది= నిలిచి ఉన్నది; అని చెప్పి= అని పలికి; వెండియున్= తిరిగి ఇట్లా అంటున్నాడు.

తాత్పర్యం: ఈ విధం నా మనస్సులో ములుకై బాధపెట్టుతున్నది అని చెప్పి మరలా ఇట్లా అన్నాడు.

క. సుతులు సమరమునఁ దిరుగక। మృతు లై సద్గతికిఁ జనిన మేలిమి యస్మ
న్మతిఁ దలఁచి వరక్షత్త్ర చ। రిత మని యప్పనికి వగవఁ బ్రీతియ కలుగున్. 23

ప్రతిపదార్థం: సుతులు= కొడుకులు; సమరమునన్= యుద్ధంలో; తిరుగక= పారిపోయి తిరిగిరాకుండా; మృతులు+ఐ= చనిపోయి; సద్గతికిన్= ఉత్తమస్థితికి; చనిన మేలిమి= చేరుకున్న గొప్పతనాన్ని; అస్మద్+మతిన్= నామనస్సులో; తలఁచి= స్మరించి;- (అది), వరక్షత్త్రచరితము= శ్రేష్ఠమైన క్షత్రియుడికి తగిన లక్షణం; అని= అనుకొని; ఆ+పనికిన్=యుద్ధంలో వారి మరణానికి; వగవన్= బాధపడను; ప్రీతి+అయ= ఇంకా (ఆ పని వలన), సంతోషమే; కలుగున్= కలుగుతున్నది.

తాత్పర్యం: యుద్ధం కోరిన కొడుకులు క్రమంగా అపజయం కలుగుతున్నా పారిపోయి వెనుకకు రాకుండా అందరూ మరణించి ఊర్ధ్వలోకాలకు చేరుకొన్నారు. అది క్షత్రియులకు తగినదే కాబట్టి అందుకు నేను విచారించను. ఇంకా సంతోషమే పొందుతున్నాను.

వ. అని పలికి పాండవాగ్రజుఁ జేరం బిలిచి, యతనితోడ. 24

ప్రతిపదార్థం: అని పలికి= బంధువులతో పైవిధంగా చెప్పి; పాండవ+అగ్రజున్= పాండురాజు సుతులలో పెద్దవాడైన ధర్మరాజును; చేరన్= దగ్గరకు; పిలిచి= రమ్మని; అతని తోడన్= ధర్మరాజుతో (ఇట్లా అంటున్నాడు - తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: బంధువులతో ఈ విధంగా పలికి, ధర్మరాజును దగ్గరకి పిలిచి అతడితో ఇట్లా అంటున్నాడు.

సీ. నీ వరయంగ సుఖావాప్తిఁ గొఱఁత లే। కుండితిఁ జనవును నుజ్జ్వలంపుఁ
దేజంబుఁ గలిగి వర్తించితి దానంబు లంచితములుగఁ బె క్కాచరింపఁ
గంటి శ్రాద్ధంబులు గాంధారిసుతులకుఁ। బలుమాఱుఁ జేసితిఁ; బరమధర్మ
శీల పాంచాలికిఁ జెట్ట చేసి రగణ్య। పుణ్యుండ వగు నీదు భూరిలక్ష్మి

తే. నపహరించి రద్దుర్యోధనాదు లట్టి; కష్టచరితులఁ బాడిమైఁ గయ్యమునన
నిహతులుగఁ జేసి తక్కురునికర మూర్ధ్వ; భువనగతిఁ గాంచి సుఖ మందె భూపవర్య! 25

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజులలో శ్రేష్ఠుడా!; నీవు= నీవు (ధర్మరాజు); అరయంగన్= పరిశీలింపగా; సుఖ+అవాప్తిన్= రాజ్యం మొదలైన సుఖాలు పొందటం చేత; కొఱఁత లేక= ఏలోటూ లేకుండా; ఉండితిన్= ఉన్నాను; చనవును= ప్రేమా; ఉజ్జ్వలంపు= మిక్కుటమైన; తేజంబున్= ప్రకాశమూ; కలిగి= కలిగిఉండి; వర్తించితిన్= నడుచుకొన్నాను. (అందువలననే నేను) దానంబులు= దానాలు; పెక్కు= చాలా; అంచితంబుగన్= ప్రశస్తంగా; ఆచరింపన్+కంటిన్= చేయగలిగాను; గాంధారిసుతులకున్= దుర్యోధ నాదులకు; శ్రాద్ధంబులు= శ్రాద్ధాలు; పలుమాఱున్= అనేక పర్యాయాలు; చేసితిన్= చేశాను; దుర్యోధనాదులు= దుర్యోధనుడు మొదలైన కొడుకులు; పరమ ధర్మశీల= ఉత్తమమైన న్యాయపు నడవడి గలిగిన; పాంచాలికిన్= ద్రౌపదికి; చెట్ట= కీడు; చేసిరి= చేశారు; అగణ్య= లెక్కింపరాని; పుణ్యుండవు= ధర్మములు గలిగినవాడవు; అగు= అయిన; నీదు భూరిలక్ష్మిన్= నీ గొప్ప సంపదను; దుర్యోధన+ఆదులు= దుర్యోధనుడు మున్నగువారు; అపహరించిరి= కాజేశారు; అట్టి= అటువంటి; కష్టచరితులన్= దుర్మార్గపు నడత గలిగిన దుర్యోధనాదులను; కయ్యమునన్+అ= యుద్ధంలోనే; పాడిమైన్= న్యాయంగా; నిహతులుగన్= చంపబడినవారినిగా; చేసితి(వి)= చేశావు (చంపావు); ఆ+కురునికరము= యుద్ధంలో నీవు చంపిన ఆ కౌరవ వీరు లందరూ; ఊర్ధ్వ భువన గతిన్= ఉత్తమలోకాలలో, ఉనికిని; కాంచి= పొంది; సుఖము= సుఖాన్ని; అందెన్= పొందారు.

తాత్పర్యం: 'రాజశ్రేష్ఠుడా! ధర్మరాజా! నీవు ఏలోటూ లేకుండా చూస్తూ ఉండగా సుఖంగా ఉన్నాను. అభిమానాన్నీ, ఇతర జనాలపై ప్రభావాన్నీ, (అధికారమూ) చూపుతూ వ్యవహరించాను. నీవలన గొప్పదానాలు చేయగలిగాను. మా పుత్రులకు శ్రాద్ధక్రియలు పలుసార్లు మేలుగా చేయగలిగాను. ఉత్తమురాలైన పాంచాలిని పరాభవించి, నీ సంపదలు కాజేసిన దుర్యోధనాదులను న్యాయంగా యుద్ధంలోనే చంపావు. వాళ్లందరూ ఉత్తమలోకాలలో సుఖంగా ఉన్నారు.

క. కావున నేమియుఁ జేయం। గా వలవదు వారికయి యకారణ కరుణా
శ్రీవిలసితుఁ డగునీతో। నా విధముం జెప్పవలసె నరవరముఖ్యా! 26

ప్రతిపదార్థం: నరవరముఖ్యా!= రాజ శ్రేష్ఠా! (ధర్మరాజా!); కావునన్= అందుచేత; వారికయి= పుత్రులకొరకు; ఏమియున్= ఇంక ఏ విధమైన పనులూ; చేయంగాన్= చేయటం; వలవదు= అవసరం లేదు; అకారణ= హేతువు (ప్రయోజనం మొ॥) లేకుండానే;

కరుణాశ్రీ= దయాసంపదతో; విలసితుఁడు+అగు= ప్రకాశిస్తూ ఉన్న; నీతోన్= నీతో; నా విధమున్= నన్ను గురించి; చెప్పవలసెన్= చెప్పవలసి ఉన్నది.

తాత్పర్యం: రాజా! దుర్యోధనాదులకొరకు దాన శ్రాద్ధాదికార్యాలు అనేకం చేశాను. కాబట్టి ఇక వారికొరకు కొత్తగా చేయవలసిం దేమీ లేదు. సహజంగా దయ గలిగిన నీతో ఇపుడు నావిషయమే చెప్పుకోవలసి ఉన్నది.

విశేషం: 'అకారణ కరుణాశ్రీవిలసితుఁడు' అనే విశేషణం సాభిప్రాయం. ధృతరాష్ట్రుడిపై చూపుతున్న అభిమానాన్నీ దుర్యోధనాదులకు పుణ్యలోక ప్రాప్తి దానాదు లేర్పరచటాన్నీ సూచిస్తూనే తర్వాత తాను కోరబోయే అంశం కూడా తప్పక నెరవేర్చాలి అని ధృతరాష్ట్రుడి అభిప్రాయం.

సీ. **ఏ కార్యమైనను నెవ్వఁడేనియుఁ జేయఁ। దొడఁగునప్పుడు విను పుడమితేని**
చే ననుజ్ఞాతుఁ డై కాని తొడంగఁ గా। దట్లు గావున వార్ధకాభిలీఢ
మైన మదీయకాయమునకు సంస్కార। మాచరింపఁగఁ దప మాచరించు
పనికి భూపాల! నీయనుమతి వడయంగ। వలసి చెప్పెద రాజవంశజునకు

ఆ. **సమరమరణ మొండె, విమలతపమునకుఁ। జొచ్చి యందు నిలిచి చచ్చు టొండె**
వలయు; నస్మదీయకులముఖ్యు లిట్టుల। నడపి రనుపు నన్ను నడవి కనఘ! **27**

ప్రతిపదార్థం: భూపాల!= ఓ, (ధర్మ) రాజా!; విను= నా విధం వినవలసింది; ఎవ్వఁడు+ఏనియున్= ఎంతటివాడు అయినప్పటికీ; ఏకార్యము+ఐనను= ఎంతటి పని అయినా గాని; చేయన్= చేయడానికి; తొడఁగు+అప్పుడు= ప్రారంభించేటప్పుడు; పుడమితేనిచేన్= భూపాలకుడి చేత; అనుజ్ఞాతుఁడు+అయి= అనుమతించబడినవాడు అయితేనే; కాని= తప్ప; తొడంగన్= ప్రారంభించడం; కాదు= కూడదు; అట్లు కావునన్= పద్ధతి అది కాబట్టి; వార్ధక+అభిలీఢము= ముసలితనం చేత ఆక్రమింపబడింది; ఐన= అయినటువంటి; మదీయ కాయమునకున్= నా శరీరానికి; సంస్కారము= శోధనం; ఆచరింపఁగన్= చేయటానికి; తపము= తపస్సు; ఆచరించుపనికిన్= చేయవలసిన కార్యానికి; నీ+అనుమతి= నీ అంగీకారం; పడయంగన్+వలసి= పొందవలసి ఉండటం వల్ల; చెప్పెదన్= అనుమతిమ్మని అడుగుతున్నాను; రాజవంశజునకున్= క్షత్రియుడికి; సమర మరణము+ఒండెన్= యుద్ధంలో మరణించడమో, లేదా; విమల తపమునకున్= శ్రేష్ఠమైన తపస్సునకు; చొచ్చి= పూనుకొని; అందున్= ఆ తపస్సులోనే; నిలిచి= స్థిరపడి; చచ్చుట ఒండెన్= మరణించటమో; వలయున్= అవసరం; అస్మదీయ-కుల-ముఖ్యులు= నా వంశంలో పే రున్నవాళ్ళంతా; ఇట్టులన్= ఈ విధంగానే; నడపిరి= ఆచరించారు; అనఘ!= పాప మెరుగని వాడా-ధర్మరాజా! అందువలన; నన్నున్= నన్ను; అడవికిన్= అరణ్యానికి; అనుపు= (అనుమతించి) పంపవలసింది.

తాత్పర్యం: (ధర్మ)రాజా! ముందుగా రాజునుండి అనుమతి తీసికొనకుండా, ఆ రాజ్యంలో వా డెవడైనా, ఎటువంటి పనైనా ప్రారంభించకూడదు. ఇపుడు ముసలితనం నా శరీరాన్ని మింగేస్తున్నది. ఈ శరీరాన్ని శుద్ధి చేయాలంటే తపస్సు చేయాలి. అందుకు నీవు అనుమతించాలి. క్షత్రియుడైన వాడు యుద్ధంలోనైనా మరణించాలి. లేదా తపస్సుతోనైనా శరీరాన్ని విడిచిపెట్టాలి. (వ్యాసుడూ ఇదే మాట చెప్తాడు 48 పద్యం). ముఖ్యమైనవా ళ్ళందరూ ఈ పద్ధతినే అనుసరించారు. కాబట్టి తపస్సు చేసుకోవడం కోసం నన్ను అడవులకు పంపుము.

క. **రాజు గురుఁ డెల్లవారికి;। రాజోత్తమ! గురునియాజ్ఞ రంజిల్లఁగఁ బే**
రోజం జేసిన కృత్యము। సూ జగములు రెంటియందు శోభన మిచ్చున్. **28**

ప్రతిపదార్థం: రాజ+ఉత్తమ!= రాజులలో శ్రేష్ఠుడా!; (ధర్మరాజా!); ఎల్లవారికిన్= రాజ్యంలోని పిన్నలు పెద్దలు అందరికీ; రాజు= పాలకుడు; గురుఁడు= గురువు; గురుని+ఆజ్ఞ= గురువుయొక్క శాసనం; రంజిల్లఁగన్= ఒప్పుతూ ఉండగా; పేరు+ఓజన్= మిక్కిలిగా అదే క్రమంలో; చేసిన కృత్యము+చూ= చేసినటువంటి పనే సుమా; జగములు= లోకాలు; రెంటియందున్= రెండింటిలోనూ; (ఇహపరాలలో) శోభనము= ప్రకాశం, కీర్తిని; ఇచ్చున్= కలుగజేస్తుంది.

తాత్పర్యం: రాజా! రాజ్యంలో వా రందరికీ రాజే పూజ్యుడు. అటువంటి రాజు అనే గురువు యొక్క ఆజ్ఞతో చేసినపని మాత్రమే ఇహపరసుఖా లందిస్తుంది.

తే. **ఏను గాంధారియును దపోమాననీయ। మునుల చేరువ వల్కలములు ధరించి**
కందమూల ఫలముల నాఁకలి హరించి। నిన్ను దీవించుచుండెద మన్న నతఁడు. **29**

ప్రతిపదార్థం: ఏనున్= నేనూ (ధృతరాష్ట్రుడు); గాంధారియును= గాంధారీ; తపస్= తపస్సుచేత; మాననీయ= గౌరవించదగిన; మునుల= మునుల యొక్క; చేరువన్= సమీపంలో; వల్కలములు= నారవస్త్రాలు; ధరించి= కట్టుకొని; కంద-మూల-ఫలములన్= దుంపలు, వేళ్లూ, పండ్లతో; ఆఁకలిన్= ఆకలిని; హరించి= పోగొట్టి; నిన్నున్= నిన్ను (ధర్మరాజును); దీవించుచున్+ఉండెదము= మేలు కలగాలని ఆశీర్వదిస్తూ ఉంటాము; అన్నన్= అని ధృతరాష్ట్రుడు అనగానే; అతఁడు= ఆ ధర్మరాజు- ఇట్లా అంటున్నాడు; (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: నేనూ గాంధారీ నారబట్టలు కట్టుకొని అడవులకు పోయి, అక్కడ మహర్షులను సేవిస్తూ, దుంపలూ, వేళ్ళూ, పండ్లూ తింటూ ఆకలి దీర్చుకొంటూ (సుఖంగా ఉండాలని) నిన్ను ఆశీర్వదిస్తూ ఉంటాము' అని ధృతరాష్ట్రుడనగా అతడితో ధర్మరాజు ఇట్లా అంటున్నాడు.

విశేషం: 'నిన్ను దీవిస్తూ వుంటాం' అనటంలో నగరంలో లేకపోయినా ఎక్కడ ఉన్నా, ఎలా (మునివృత్తితో) ఉన్నా (ధర్మరాజు) శ్రేయస్సు కోరుతూ ఉంటాము కాబట్టి మేం అడవులకు పోవటానికి అనుమతించవచ్చని అభిప్రాయం.

క. **ధరణీరాజ్యము నాకును। నరవర! సౌఖ్యంబుఁ జేయునా! నీ విమ్మై**
దురపిల్లి దుష్కరం బగు। నరణ్యవాసమున కేఁగినట్టిది యైనన్. **30**

ప్రతిపదార్థం: నరవర= రాజా; నీవు= నీవు (ధృతరాష్ట్రుడు); ఈ+మైన్= ఈ విధంగా; దురపిల్లి= దుఃఖించి; దుష్కరంబు+అగు= ఆచరణానికి సాధ్యం కాని; అరణ్యవాసమునకున్= అడవులలో నివసించటానికి; ఏఁగిన+అట్టిది+అ= వెళ్ళినట్లు; ఐనన్= అయితే; ధరణీ రాజ్యము= (నీవు లేని) ఈ భూమి పాలనం; నాకున్= నాకు మాత్రం; సౌఖ్యంబున్= సుఖాన్ని; చేయునా!= కలిగిస్తుందా?

తాత్పర్యం: మహాత్మా! నీవు ఈ విధంగా బాధపడి కఠోరమైన అరణ్యాలలో ఉండటానికి వెళ్లితే ఈ రాజ్యం నాకు మాత్రం సుఖ మిస్తుందా?

విశేషం: నీవు అడవులకు వెళ్ళితే అనటంలో నీవు లేకుంటే ఈ ప్రభుత్వం గూడా నా కక్కరలేదు. ఈ రాజ్యం కంటె నీవే ఎక్కువ అని ధర్మరాజు భావం. రాజ్యము సౌఖ్యము చేయునే - ధర్మరాజే రాజయినా పెద్దవాడుగా ధృతరాష్ట్రుడు నడిపించిన ప్రకారం పోవటంలో పాలనం బరువు ధర్మజుడికి తక్కువ. అపుడు పరిపాలనం సుఖం పెద్ద దిక్కుగా (ధృతరాష్ట్రుడు) లేకపోతే తానై అన్నిటికీ బాధ్యత తీసికొనవలసివస్తే అపుడు ప్రభుత్వంవలన సుఖం ఉండదు.

ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో మాటాడుతూ మొదటగా అన్నది నీ వరయంగ సుఖావాప్తి కొఱంత లేకుండితి - భూపవర్య! (25పద్యం). దానికి సమాధానంగా ధర్మరాజు ధరణీరాజ్యంబు నాకును సౌఖ్యంబుఁ జేయునా అన్నాడు. రాజ్యం సుఖం కాదు గాబట్టి దాని కొరకు దుర్యోధనాదులను చంపా వనరాదని తాత్పర్యం. 'దురపిల్లి'- ఆశ్రమవాస ధర్మనిర్వహణకుగాను అరణ్యవాసం పోతే అంటే ఇట్లా పాండవులు రాజ్యం వలన సుఖపడుతున్నారని భావించే వీలుంది. ఏడుస్తూ ధృతరాష్ట్రుడు పోతే నాకు సుఖం లేదు. మనస్ఫూర్తిగా నిజంగా ఆశ్రమవాసం ధృతరాష్ట్రుడు కోరటం లేదని ఆంతర్యం ధర్మరాజుకు అర్థం అయింది.

ధర్మరాజాదులు సుఖపడుతున్నారనీ, బాధపడుతూ పాండవుల సుఖం చూస్తూ వాళ్ళ దగ్గర ఉండలేకపోవటంవలననే ధృతరాష్ట్రుడు అడవులకు వెళ్ళిపోదామనుకొంటున్నాడన్నమాట. ఇమ్మై- అనేమాట ధృతరాష్ట్రుడు బాధపడుతున్న కారణాలనేకంగా నిర్దేశిస్తూ - అది ఉచితం కాదని ధ్వనింపజేస్తుంది. సౌఖ్యంబు చేయునా, ఇమ్మై దురపిల్లి- అంటే - ధరణీ రాజ్యం వలన నేను సుఖపడుతున్నానని బాధపడి - ఆకారణంగా - మా సుఖం చూడలేని కారణంగా అడవులకు పోతానంటున్నావు. 'దుష్కర' మైనా అరణ్యవాసం కోరుకొనటం వలన పాండవుల రాజ్యసుఖానికి ధృతరాష్ట్రుడు ఎంతో మిక్కుటంగా విచారిస్తున్నాడని ధర్మరాజు భావంగా గోచరిస్తుంది. ఇటువంటి తక్కువస్థాయి ఆలోచనలు గలిగినవాడుగా గుర్తిస్తూ నరవర అని సంబోధించడంలో విపరీతార్థవివక్ష ఉంది.

తే. **గూఢబుద్ధి వై నమ్మించి కురువరేణ్య ! । యే నెఱుంగక యుండంగ నిట్లు శోక**
వనధిఁ దేలుచు నుండి తివ్వనట గంటి । నింక రాజ్యంబు నా కెట్టు లించుఁ జెపుమ. **31**

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశంలో శ్రేష్ఠుడా!; గూఢ బుద్ధిని+ఐ= అసలైన ఆలోచనలను రహస్యంగా దాచుకొని; నమ్మించి= బాధలు మరచినట్లుగా, నేను (ధర్మరాజు) నమ్మేటట్లుగా నడుచుకొని; ఏను= నేను, (ధర్మరాజు); ఎఱుంగక+ ఉండంగన్= తెలిసికొనలేకపోగా; ఇట్లు= ఈ విధంగా; శోకవనధిన్= దుఃఖం అనే సముద్రంలో; తేలుచున్+ఉండితి(తి)= తేలిపోతూ ఉన్నావు; ఈ+వనట= (అందువలన), ఈ విధమైన బాధ; కంటిన్= నేనూ పొందాను; ఇంకన్= ఈ బాధ వలన; నాకున్= నాకు; రాజ్యంబు= ప్రభుత్వం; ఎట్టులు= ఏ విధంగా; ఇంచున్?= ఇష్ట మవుతుంది?; చెపుమ= నీ వే చెప్పుము.

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠా! బుద్ధిని దాచుకొని నమ్మించి నాకు తెలియకుండా ఈ విధంగా శోకసముద్రంలో తేలుతూ ఉండినావు. ఈ (దాచుకొన్న) నీ బాధను ఇప్పుడు చూచినాను. ఇంక రాజ్యము నాకెట్లా ఇష్టమవుతోందో చెప్పుము.

విశేషం: 25గీతం, 26 పద్యాలలో ధృతరాష్ట్రుడి మాటలలోని ఆంతర్యానికి సమాధానం ధర్మరాజు ఈ పద్యం.

ఉ. **తల్లియుఁ దండ్రియున్ గురుఁడు దైవము నా కరయంగ నీవ భూ**
వల్లభ! నీవు కానన నివాసము గోరి చనంగ నెట్టు లే
నుల్లము వట్టి హస్తిపురి నుండఁగ నేర్తు? యుయుత్సుఁ బెంపు శో
భిల్లఁగ రాజుఁ జేయు; నినుఁ బ్రీతి యెలర్పఁగఁ గొల్చి వచ్చెదన్. **32**

ప్రతిపదార్థం: భూవల్లభ!= ఓ రాజా! (ధృతరాష్ట్రా!); అరయంగన్= పరిశీలించి చూస్తే; నాకున్= నాకు; తల్లియున్= తల్లీ; తండ్రియున్= తండ్రీ; గురుఁడున్= గురువూ; దైవమున్= దైవమూ; నీవు+అ= నీవే; నీవు= అటువంటి నీవు; కానన నివాసము= అడవులలో నివసించటాన్ని; కోరి= స్వయంగా అభిలషించి; చనంగన్= వెళ్ళిపోతే; ఏన్= నేను; ఉల్లము= మనసును; పట్టి= నిగ్రహించుకొని; హస్తిపురిన్= హస్తినగరంలో; ఉండఁగన్= ఉండటానికి; ఎటులు= ఏ విధంగా; నేర్తున్= ఓర్చుకొనగలను; పెంపు= గౌరవం; శోభిల్లఁగన్= అతిశయించేవిధంగా; యుయుత్సున్= నీ కొడుకైన యుయుత్సుణ్ణి; రాజున్= ఈ రాజ్యానికి పాలకుడిగా;

చేయు(ము)= చేయవలసింది; ప్రీతి= ఇష్టం; ఎలర్పఁగన్= అధికం కాగా; నినున్= నిన్ను; కొల్చి= సేవిస్తూ; వచ్చెదన్= నీతో అరణ్యవాసానికి నేనూ వస్తాను.

తాత్పర్యం: ఓ రాజా! పరిశీలించి చూస్తే నాకు తల్లీ, తండ్రీ, గురువూ, దైవం అన్నీ నీవే. నా సర్వస్వం అయిన నీవు బుద్ధిపూర్వకంగా అరణ్యవాసానికి వెళ్ళితే మనసు చిక్కబట్టుకుని నే నీ రాజధానిలో ఎట్లా ఉండగలను. నీ కొడుకైన యుయుత్సుడిని ఈ రాజ్యానికి రాజును చేయుము. నేను సంతోషంగా నిన్ను సేవిస్తూ నీతోపాటు అరణ్యాలకు వస్తాను.

విశేషం: రాజైన ధర్మరాజు ధృతరాష్ట్రుడిని అడవులకు అనుసరించగోరుతున్నాడు. కాబట్టి తాను హస్తిపురిలో లేకుంటే రాజ్యం అరాజకం అవుతుంది. అట్లా కాకూడదు కాబట్టి ముందుగా వేరే రాజుని ఏర్పరిచే విషయం ప్రస్తావించటం రాజనీతిజ్ఞత. అయితే యుయుత్సుడిని రాజు చేయు మనడం విశేషం. తన కొడుకులను చంపి ధర్మరాజు రాజయ్యాడని ధృతరాష్ట్రుడు బాధపడుతున్నట్లుగా అతని మాటలలో గూఢంగా ఉన్న అంశం ధర్మరాజు గ్రహించాడు. కాబట్టే ధృతరాష్ట్రుడికి కొడుకైన యుయుత్సుడిని రాజు చేయు మంటున్నాడు. తన సొంత కొడుకే రాజు అయితే ధృతరాష్ట్రుడికి కొంత బాధ తగ్గుతుంది. పాండవులు పరాయి వాళ్ళనుకొంటున్నాడు ధృతరాష్ట్రుడు. పెంపు శోభిల్లఁగ - యుయుత్సుడిని రాజు చేస్తే యుయుత్సుడికే కాక ధృతరాష్ట్రుడు తనకు (తన కొడుకు రాజైనందు వలన) పెంపు శోభిల్లుతుందని భావిస్తాడు. ధర్మరాజు రాజవటం వలన తన పెంపు పోయినట్లు భావిస్తున్నాడన్నమాట. వైశ్య స్త్రీ వలన పుట్టినా రాజును చేస్తే యుయుత్సుడికి (లేని) పెంపు శోభిల్లుతుంది. మేం రాజ్యం సంపాదించుకొన్నాం. నీవు ఇవ్వలేదు కాబట్టి యుయుత్సుడు అట్లా సంపాదించలేడు. నీవే అతడిని రాజును చేయాలి అని ధృతరాష్ట్రుడి కొడుకు అసామర్థ్యం సూచన. రాజ్యార్హత లేనివాడు కావటం వలననూ, ఇలాగే ప్రీతి యెలర్పఁగ - నీకు (ధృతరాష్ట్రుడికి) సంతోషం కలిగేటట్లుగా నీకు సేవచేస్తూ అడవులకు వస్తానని ధర్మరాజు భావం. యుయుత్సుడిని రాజును చేసిన తర్వాత కూడా అరణ్యవాసం చేయాలని నీవనుకుంటే (అప్పటికీ పాండవులు రాజధానిలో సుఖపడతా రేమో నసే బాధ ఉండి 'అహం వనం గమిష్యామి, భవా న్రాజ్యం ప్రశాస్త్విదమ్' నేనే అడవులకు పోతే నీవు రాజ్యం చేసుకోమనడం ధృతరాష్ట్రుడి దోషం మరీ ఎక్కువ చేస్తుంది. అందుకే తిక్కన ధృతరాష్ట్రుడితో అరణ్యానికి వస్తా ననిపించాడు. ఇక్కడ కూడా అప్పుడు నేనూ అడవులకు వస్తా నంటాడు ధర్మరాజు.

క. అతఁ డౌరసుండు నీ కీ। క్షితి కొడయుఁడు దుర్యశంబుచేఁ గుందుట భూ
పతివర! కని కని మీ రి। ట్లతి మాత్రము చేయఁదగునె యక్కట నాకున్? **33**

ప్రతిపదార్థం: భూపతివర!= రాజులలో శ్రేష్ఠుడ వైన ధృతరాష్ట్రా!; అతఁడు= ఆ యుయుత్సుడు; నీకున్= నీకు; ఔరసుండు= ధర్మపత్నియందు పుట్టినవాడు; ఈక్షితికిన్= ఈ కురురాజ్యానికి; ఒడయుఁడు= యజమానుడు; దుర్యశంబుచేన్= (కౌరవులను) చంపటం అనే అపకీర్తి చేత; కుందుట= నేను బాధపడుతూ ఉండడం; కని కని= బాగా చూచి కూడా; అక్కట= అయ్యో; నాకున్= నాకు; మీరు= మీరు (గాంధారీ ధృతరాష్ట్రులు); ఇట్లు= ఈ విధంగా; అతిమాత్రము= (ఆ దుఃఖాన్ని) ఇంకా అధికం; చేయన్+తగునె?= చేయటం ఒప్పుతుందా?

తాత్పర్యం: రాజులలో శ్రేష్ఠుడా! ఆ యుయుత్సుడు నీకు ధర్మపత్ని యందు పుట్టినవాడే కాబట్టి ఈ కౌరవరాజ్యానికి అతడే రాజు. ఇప్పటికీ బంధువినాశాదులవలన అపకీర్తితో, విచారిస్తుండటం కళ్లారా చూచి కూడా ఇంకా నాదుఃఖాన్ని అధికం చేయటం సమంజసమేనా?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

సీ. నీవు రాజవు గాక నీ కేను రాజనే? । గురుని మహారాజుఁ గురువరేణ్యు

నిటు చేయు మని పంప నే నొడయండనే? । దుర్యోధనాదుల దుష్కృతములు

నా మదిలో నిల్ప, నేమును వారును । విధిమోహమున నైన విరస భావ

మావహిల్లినఁ బుట్టె నంతలు పనులు; గాం । ధారియు గొంతియు గారవమున

ఆ. నాకు నొక్కరూప; మీకుఁ గాననవాస । మెల్ల భంగిఁ గలుగు నేని యేనుఁ

దగిలి తోన వత్తుఁ దగుమాటగా నాటఁ గాదు నాదుహృదయగతియు నిట్ల. 34

ప్రతిపదార్థం: రాజవు= ఈ రాజ్యానికీ, నాకూ రాజువి; నీవు= నీవే; కాక= అంతే కాని; నీకున్= నీకు; ఏను= నేను; రాజనే?= రాజునా?; గురునిన్= గురువు; మహారాజున్= చక్రవర్తిని; కురువరేణ్యున్= కురువంశంలో శ్రేష్ఠుడూ అయిన నిన్ను; ఇటు= ఈ విధంగా; చేయుము= చేయవలసింది; అని= అనే తీరుగా; పంపన్= ఆజ్ఞ చేయటానికి; నేను= నేను; ఒడయండనే?= ఏలికనా?; దుర్యోధనాదుల= దుర్యోధనుడు మొదలైన వారి (నీ కొడుకుల); దుష్కృతములు= చెడు పనులు; నా మదిలోన్= నా మనస్సులో, నిల్పన్= ఉంచుకోలేదు (మరిచాను); ఏమును= మేమూ (పాండవులు); వారును= దుర్యోధనాదులూ; విధిమోహమునన్= బ్రహ్మదేవుడు కల్పించిన అజ్ఞానం వలన; ఐన= పుట్టిన; విరసభావము= ద్వేషం; ఆవహిల్లినన్= ఆవరించటంవలన; అంతలు పనులు= అటువంటి దుష్కృతములు; పుట్టెన్= సంభవించాయి; నాకున్= నాకు; గారవమునన్= ఆదరం విషయంలో; గాంధారియున్= గాంధారీ; గొంతియున్= కుంతీదేవీ; ఒక్కరూపు+అ= ఒకటే; మీకున్= అటువంటి మీ యిద్దరికి; ఎల్ల భంగిన్= అన్ని విధాలుగానూ; కానన వాసము= అడవులలో ఉండడం; కలుగున్+ఏని= సంభవించే పక్షంలో; ఏనున్= నేను కూడా; తగిలి= వెన్నంటి; తోన్+అ= మీతో కలిసే; వత్తున్= అడవులకు వస్తాను; తగు మాటగాన్= మీ మాటలకుబదులుగా, ఆటన్+కాదు= పలుకుటకాదు; నాదు హృదయగతియున్= నా మనసులో ఉన్నది కూడా; ఇట్లు+అ= ఇంతే.

తాత్పర్యం: నువ్వే (నాకూ, అందరికీ) రాజువి కాని నీకు నేను రాజును కాదు. గురువువీ, మహారాజువీ, వంశశ్రేష్ఠుడివీ అయిన నిన్ను ఇట్లా చేయు మని ఆజ్ఞాపించటానికి నేను అధికారిని కాదు. నీ కొడుకులు చేసిన కీడు పనులు నేను మనసులో పెట్టుకొనలేదు (మరిచేపోయాను). విధి వలన అజ్ఞానంతో ద్వేషం ఏర్పడి అటువంటి కీడు పనులు జరిగాయి. నాకు గాంధారీ, కుంతీ ఇద్దరూ ఒకటే. సమానంగా గౌరవిస్తాను. అటువంటి గాంధారీ, నీవూ ఏ విధంగా నైనా అడవికి పోవడం తప్పకపోతే వెన్నంటి నేనూ మీతోపాటే వస్తాను. ఇది నిజం. సమయానికి తగినట్లు మాటాడటం కాదు. నా మనసులో ఉన్న మాట అదే.

విశేషం: ధృతరాష్ట్రుడు తనతో చెప్పిన మాట లన్నింటికీ సంగ్రహంగా ఇక్కడ ధర్మరాజు సమాధానం చెప్పాడు.

క. పలికెద నే సత్యము నా । కిల ప్రీతిం జేయ దధిప! యీ వి ట్లయినం

గులము కలఁక దైవకృతం । బలఘుమతీ! విడువు శోక మరయుము నన్నున్. 35

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; నేన్= నేను; సత్యము= యథార్థం; పలికెదన్= చెపుతున్నాను; ఈవు= నీవు; ఇట్లు+అయినన్= ఇట్లాగు అయితే; నాకున్= నాకు; ఇల= రాజ్యం; ప్రీతిన్= సంతోషాన్ని; చేయదు= కలిగించదు; అలఘుమతీ!= దొడ్డబుద్ధి కలవాడా; కులము కలఁక= మన వంశంలో ఏర్పడ్డ కలత; దైవకృతంబు= దేవుడు కల్పించిందే; శోకము= పుత్రవియోగాదులవలన పుట్టిన దుఃఖాన్ని; విడువు= విడిచిపెట్టుము; నన్నున్= నన్ను; అరయుము= కాపాడుము.

తాత్పర్యం: రాజా! నిజం చెపుతున్నాను. నీవు ఈ విధంగా శోకిస్తూ అరణ్యాలకు పోతే (నీవు లేని) యీ రాజ్యం వలన నాకు సుఖం లేదు. ఇంక మనకులంలో ఏర్పడ్డ కలతలు దైవం వలన కలిగినవే. దొడ్డబుద్ధి గలవాడా!. ఇక దుఃఖాన్ని విడిచిపెట్టుము, నన్ను ఉద్ధరించుము.

విశేషం: మొత్తం తన సమాధానం సారాన్ని ఇక్కడ ధర్మరాజు సంగ్రహంగా చెప్పుతున్నాడు. ఇక్కడినుండి ధర్మరాజు మాటలు సూటిగా అంతరార్థం ఇంకొక విధంగా లేకుండా తోస్తుంది. ఇదే సత్య మన్నమాట.

తే. నీకు శుశ్రూష యొనరించి నృపవరేణ్య! చిత్తతాపంబు మానంగఁ జేసికొందు
నని తలంచు నన్ విడువంగ నగునె? యవన। తుండ నై నిన్ను వేఁడెదఁ దొఱఁగు వగలు. 36

ప్రతిపదార్థం: నృపవరేణ్య!= రాజులలో శ్రేష్ఠుడా!; నీకున్= నీకు; శుశ్రూష= (చెప్పిన పనులు చేస్తూ) సేవ; ఒనరించి= చేసి; ఆ విధంగా; చిత్త - తాపంబు= మనసులో చింతను; మానంగన్= అణగి పోయేటట్లుగా; చేసికొందున్= చేసుకుంటాను; అని= అనే విధంగా; తలంచు= ఆలోచించే; నన్= నన్ను; విడువంగన్= విడిచిపెట్టటం (అరణ్యాలకు వెళ్ళటం); అగునె?= ఉచితమా?; అవనతుండను= వినమ్రుడిని; ఐ= అయి (వంగి); నిన్నున్= నిన్ను; వేఁడెదన్= ప్రార్థిస్తున్నాను; వగలు= బాధలు; తొఱఁగు(ము)= విడిచిపెట్టుము:

తాత్పర్యం: రాజులలో శ్రేష్ఠుడి వైన ధృతరాష్ట్రుడా! నీకు సేవ చేసికొంటూ నా బాధలు మరచిపోవా లనుకొనే నన్ను విడిచి అరణ్యాలకు వెళ్ళకుము. ప్రాధేయపడుతున్నాను. నీ శోకాన్ని విడిచిపెట్టుము.

విశేషం: ధర్మరాజు ప్రాధేయపడడంలో ధృతరాష్ట్రుడి శోకం ధర్మరాజును చాలా బాధపెట్టినట్లు చెప్పుతుంది. ధృతరాష్ట్రుడిని తృప్తి పరచలేకపోవడంతో 15 సంవత్సరాలుగా తాను పడ్డ శ్రమంతా వృథా అయినపుడు ఈ విధంగా బాధపడటం సహజమే.

క. అనుచు నతని చరణంబులు। తన ఫాలతలంబు చేర్చె ధర్మతనయుఁడా
తని గ్రుచ్చి యెత్తి కౌఁగిట। నెనయంగాఁ జేర్చి యాతఁ డిట్లను నధిపా! 37

ప్రతిపదార్థం: అధిపా!= జనమేజయరాజా!; అనుచున్= పైవిధంగా అంటూనే; ధర్మతనయుఁడు= ధర్మరాజు; తన, ఫాలతలంబు= తన నుదుటి ప్రదేశాన్ని, శిరస్సును; అతని చరణంబులు= ధృతరాష్ట్రుడి పాదాలను; చేర్చెన్= చేరేటట్లు చేశాడు; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; ఆతనిన్= పాదాభివందనం చేస్తున్న ధర్మరాజును; గ్రుచ్చి= గట్టిగా పట్టుకొని; ఎత్తి= పైకి లేపి; కౌఁగిటన్= తన బాహువుల మధ్య; ఎనయంగాన్= కుదురుగా; చేర్చి= చేర్చుకొని; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటున్నాడు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! 'నీ సేవ చేస్తూ నా విచారం పోగొట్టుకొంటా' నని మొదలుగా ఆ మాటలు అంటూనే ధర్మరాజు ధృతరాష్ట్రుడి పాదాలపై తన శిరస్సు ఉంచి ప్రణామం చేశాడు. ధృతరాష్ట్రుడు ఆ ధర్మరాజును పట్టుకొని లేపి కౌగిలిలో చేర్చుకొని ఇలా అంటున్నాడు.

తే. నీవు శుశ్రూష చిరకాలనియతిఁ జేసి। తేను వృద్ధుండ నైతి; నా కింకఁ దపము
వలవదయ్య? రాజును బాలివాఁడ యెవ్వ। రేమి చేసిన ఫలములయెడ నృపాల!' 38

ప్రతిపదార్థం: నృపాల!= (ధర్మ) రాజా!; నీవు= నీవు; చిరకాల నియతిన్= చాలాకాలం నియమంగా; శుశ్రూష= సేవ; చేసితి(వి)= (నాకు) చేశావు; ఏను= నేను; వృద్ధుండన్= ముసలివాడిని; ఐతిన్= అయ్యాను; ఇంకను= ఈ వార్ధక్యంలో; నాకున్= నాకు; తపము= తపస్సు చేసికొనటం; వలవదు+అయ్య?= వద్దా?; ఎవ్వరు= రాజ్యంలో ప్రజలలో ఎవరైనా; ఏమి= ఏపని; చేసినన్= చేసినా; ఫలముల - ఎడన్= దానికి కలిగే ఫలితం విషయంలో; రాజును= రాజు కూడా; పాలివాఁడు+అ= భాగస్థుడే.

తాత్పర్యం: రాజా! నీవు చాలాకాలంగా నియమంగా నాకు శుశ్రూష చేస్తూనే వున్నావు. ఇపుడు నేను పెద్దవాణ్ణయిపోయాను. ఈ వార్ధక్యంలో నైనా తపసు చేసికొనవద్దా? ప్రజలు చేసిన ప్రతిపనికి కలిగే ఫలంలో రాజుకు కూడా భాగం ఉంటుంది.'

వ. అని పలికి విదుర కృప సంజయుల నుద్దేశించి తనకు ముఖశోషయుం దనుగ్లానియుం గలిమి నుగ్గడించి, నాలుక తొట్రుపడ వారలతో మీర లనునయవచనంబుల నజాతశత్రుం దెలి వొందం జేయుం' డని చెప్పి డప్పి యెక్కుడు గదిరిన గాంధారి తనువున మేను సేర్చి మూర్ఛిల్లుటయు నార్తి నొంది యక్కుంతీనంద నాగ్రజుం డిట్లని పలవించె. 39

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికి= చెప్పి; విదుర - కృప - సంజయులన్= విదురుడినీ, కృపాచార్యుడినీ, సంజయుడినీ; ఉద్దేశించి= లక్ష్యం చేసికొని - వాళ్లతో; తనకున్= తనకు (ధృతరాష్ట్రుడికి); ముఖశోషయున్= నోరు ఎండిపోవటమూ, (నాలుక తడి ఆరటం), తను గ్లానియున్= (ఎక్కువ మాటాడటం వలన) శరీరం బలహీనమై పోవటమూ; కలిమి= ఉన్నవిషయాన్ని; ఉగ్గడించి= చెప్పి; నాలుక= నాలుక; తొట్రుపడన్= తడబడుతుండగా; వారలతోన్= ఆ విదురుడు మొదలైన వారితో-మీరలు= మీరు; అనునయవచనంబులన్= ఊరడింపు మాటలతో; అజాతశత్రున్= శత్రువులు లేనివాడిని - ధర్మరాజును; తెలివి+ఒందన్= తెలివి పొందేవిధంగా; చేయుండు= చేయండి; అని= అనే విధంగా; చెప్పి= పలికి; డప్పి= దాహం; ఎక్కుడు= అధికంగా; కదిరినన్= కలుగగా; గాంధారి తనువునన్= గాంధారి శరీరంపై; మేను= తన శరీరాన్ని, చేర్చి= ఉంచి; మూర్ఛిల్లుటయున్= సొమ్మసిల్లిపోగా; ఆ+కుంతీ నందన+అగ్రజుండు= కుంతి కొడుకులలో పెద్ద అయిన ధర్మరాజు; ఆర్తిన్= దుఃఖం; ఒంది= పొంది; ఇట్లు+అని= ఈ విధంగా; పలవించెన్= దుఃఖించాడు.

తాత్పర్యం: ధర్మరాజుతో పైవిధంగా పలికిన ధృతరాష్ట్రుడు విదుర, కృప, సంజయులతో 'నాకు నాలుక తడి ఆరిపోతున్నది. శ్రమవలన శరీరం దుర్బల మవుతున్నది' అని, నాలుక తడబడుతుండగా 'ఇక మీరే ధర్మరాజుకు ఊరటపు మాటలు చెప్పి విచారం పోగొట్టండి' అని చెప్పి దాహం ఎక్కువ కావటంతో గాంధారి శరీరాన్ని ఆసరా చేసికొని స్పృహ తప్పిపోయాడు. ధర్మరాజు అది చూచి దుఃఖంతో ఇట్లా అన్నాడు.

విశేషం: విదురాదులు జ్ఞానులు, మాట నేర్పరులూ, పాండవులపై అభిమానం కలవారూ కాబట్టి వాళ్ళు జాగ్రత్తగా ధర్మరాజుకు అమోదయోగ్యంగా మాటాడగలరు. తనకంటె వాళ్ళ మాటలు ధర్మరాజు ఆప్తవాక్యంగా స్వీకరించనూ గలడు. కాబట్టి ధర్మరాజును సాంత్వనపరిచే బాధ్యత వారి కప్పగించాడు. ఉభయులకూ కావలసినవారు కాబట్టి తన అభిప్రాయాన్ని ధర్మరాజుకు నచ్చేటట్లుగా చెప్పుతారని. ధర్మరాజును అజాత శత్రువుగా పేర్కొనడంలో ధర్మరాజుకు తమపై శత్రుభావం ఉండదని మెచ్చుకోలూ, స్నేహంగా తమ అరణ్యవాసానికి అంగీకరించాలని సూచన. తనకు ముఖశోష, తనుగ్లానీ ఉన్నవన్నాడు. దానివలన నాలుక తొట్రుపాటూ, చివరికి మూర్ఛా కలిగాయి. కార్యకారణభావం కుదిరింది. మూర్ఛాస్థితి రావడం ముందుగా గుర్తించటం వలన గాంధారిని ఆశ్రయించాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. కరి దశసహస్ర బలవి। స్ఫురితుఁ డగు విచిత్రవీర్యపుత్త్రుఁ డొక తలో

దరి నూఁత గొనియె; విధి యె। వ్వరి హీనులఁ జేయఁ డకట వక్రుం డైనన్! 40

ప్రతిపదార్థం: కరి= ఏనుగులు; దశసహస్ర= పదివేలయొక్క; బల= శక్తిచే; విస్ఫురితుఁడు= వెలిగేవాడు; అగు= అయిన; విచిత్ర వీర్య పుత్త్రుఁడు= విచిత్రవీర్యుడి కొడుకు ధృతరాష్ట్రుడు; ఒక తలోదరిన్= ఒకానొకస్త్రీని; ఊఁత గొనియెన్= ఆధారం చేసికొని ఉన్నాడు; అకట!= అయ్యో!; విధి= బ్రహ్మ; వక్రుండు= వంకర; ఐనన్= అయితే; ఎవ్వరిన్= ఎంతటివారిని; హీనులన్= అల్పులుగా; చేయఁడు?

తాత్పర్యం: పదివేల యేనుగుల బలం కలిగిన ధృతరాష్ట్రుడు ఈనాడు ఒక అబలను ఆధారం చేసికొనవలసి వచ్చింది. బ్రహ్మ సరిగా చూడకపోతే ఎంతటి గొప్ప వాళ్ళనైనా మిక్కిలి హీనస్థితికి తెస్తాడు.

విశేషం: అలం; అర్థాంతరన్యాసం. (సామాన్యంచేత విశేషం సమర్థింపబడుతుంది.)

చ. 'అనిలజు మేని చంద మగు నాయసరూపము చూర్ణితంబు చే

సిన బలమాననీయుఁ డొక చేడియ నక్కట; యాశ్రయించె; నే

మనఁగల దవ్విధాతృ' నని యాతని కీడును మానసంబునం

జొనుపమి లావు పేరుకొని శోకము ధర్మజుఁ డొందె భూవరా! 41

ప్రతిపదార్థం: అనిలజు= వాయుపుత్రుడి; మేని చందము= శరీరము వంటిది; అగు= అయిన; ఆయసరూపము= ఉక్కు విగ్రహాన్ని; చూర్ణితంబు= పొడి అయ్యేటట్లుగా; చేసిన= చేసినట్టి; బల-మాననీయుఁడు= శక్తిచే ప్రశంసించ దగిన ధృతరాష్ట్రుడు; అక్కట= అయ్యో; ఒక చేడియన్= ఒకానొక ఆడదాన్ని; ఆశ్రయించెన్= అండగా చేసుకున్నాడు; ఆ+విధాతృన్= (అంతటి బలవంతుడి కీ గతి కల్గించిన) ఆ బ్రహ్మనుగూర్చి; ఏమి+అనన్+కలదు?= ఏమనవచ్చు?; అని= అని పలికి; భూవరా!= ఓ జనమేజయ మహారాజా!; అతని కీడును= ధృతరాష్ట్రుడు చేసిన అపకారాన్ని; తన మానసంబునన్= తన మనస్సులో; చొనుపమి= పెట్టుకోకపోవడంచేత; ధర్మజుఁడు= ధర్మరాజు; లావు= ధృతరాష్ట్రుడి బలాన్ని; పేరుకొని= ప్రశంసిస్తూ; శోకము= దుఃఖాన్ని; ఒందెన్= పొందాడు.

తాత్పర్యం: 'భీముడి రూపంలో ఉన్న ఉక్కు విగ్రహాన్ని పొడిగా చేసిన బలవంతుడైన ధృతరాష్ట్రుడు ఇపుడు ఒక ఆడదానిని ఆధారం చేసికొనవలసివచ్చింది. అంతటి బలవంతుడి కింతటి హీనస్థితిని తెచ్చిన విధాతను ఏ మనగలం?' అంటూ జనమేజయా ! ధృతరాష్ట్రుడు చేసిన అపకారాన్ని మనసులో పెట్టుకొనకపోవటం వలన అతడి బలాన్ని తలచుకొని ధర్మరాజు అతడి ప్రస్తుతస్థితికి దుఃఖపడ్డాడు.

సీ. అప్పుడు గాంధారి యల్లన ధర్మజు। తోడ 'మీతండ్రి యతుల తపంబు

తోడి సంతతచింతఁ గూడు దొఱంగి తా। నుండుటఁ గూర్చుండ నోప కునికి

నిట్లయ్యె' ననవుడు నెవ్వని కతమున। నిమ్మహాత్మున కిట్టి యెడరు పుట్టె

నట్టి నా మనువు నే మనఁ గల?' దంచు నా। తఁడు శీతజలము హస్తమునఁ బుచ్చి

ఆ. కొని యతని మోమునందు నక్కున విదిర్చు। సమయమున విదురుండును సంజయుండు
నఖిలభరతభార్యలు నేడ్చి రవ్విభుండు। నివిరెఁ జలికేల నా నృపు నవయవములు. 42

ప్రతిపదార్థం: అప్పుడు= ధర్మరాజు దుఃఖిస్తున్న సమయంలో; గాంధారి= ధృతరాష్ట్రుడి భార్య; ధర్మజుతోడన్= ధర్మరాజుతో; అల్లనన్= మెల్లగా; (ఇట్లా అంటున్నది); మీ తండ్రి= ధృతరాష్ట్రుడు; అతుల తపంబుతోడి= సాటిలేని తపస్సుతో కూడిన; సంతత చింతన్= నిరంతరమైన ఆలోచనతో; తాను= తానుగా; కూడు= భోజనం; తొఱంగి= విడిచి; ఉండుటన్= (రోజులు గడుపుతూ) ఉండటం వలన; కూర్చుండన్= కూర్చోవడానికి; ఓపక= శక్తి చాలని; ఉనికిన్= స్థితిలో; ఇట్లు= ఈ విధంగా మూర్ఛిల్లినవాడు; అయ్యెన్= అయినాడు; అనవుడున్= అని గాంధారి చెప్పగా; అతఁడు= ఆ ధర్మరాజు; ఎవ్వని కతమునన్= ఎవరు కారణంగా; ఈ+మహాత్మునకున్= ఈ పెద్దవాడికి, (ధృతరాష్ట్రుడికి); ఇట్టి+ఎడరు= ఇటువంటి కష్టం; పుట్టెన్= కలిగిందో; అట్టి= (ధృతరాష్ట్రుడి ఈ కష్టానికి కారణమైన) అటువంటి; నా మనువున్= నా బ్రతుకు గూర్చి; ఏమి అనన్ కలదు?= చెప్పేది ఏముంది; అంచున్= అంటూ; హస్తమునన్= తన చేత్తో; శీతజలమున్= చల్లటి నీళ్ళను; పుచ్చికొని= తీసికొని; అతని= ఆ ధృతరాష్ట్రుడి; మోమునందున్= ముఖంపైన; అక్కునన్= గుండెలపైన; విదిర్చు సమయంబునన్= (విదిలించే) చల్లేటప్పుడు; విదురుండును= విదురుడూ; సంజయుండున్= సంజయుడూ; అఖిల భరత భార్యలు= ఆ భరతవంశజులందరి భార్యలూ; ఏడ్చిరి= విలపించారు; ఆ+విభుండు= ఆ ధర్మరాజు; ఆ నృపు అవయవములు= ధృతరాష్ట్రుడి శరీర భాగాలను; చలికేలన్= చల్లని నీళ్లచేతితో; నివిరెన్= నిమిరాడు.

తాత్పర్యం: అప్పుడు మెల్లగా గాంధారి ధర్మరాజుతో ఇట్లా అన్నది; 'మీ పెదతండ్రి గాఢ తపస్సును గురించి ఎల్లప్పుడూ ఆలోచిస్తూ తిండితినటం మానేసి ఉండటం వలన కూర్చుండలేకపోతున్నారు. అందులన ఇట్లా అయింది: ఆ మాటలు విని ధర్మరాజు 'ఈ మహాత్ముడికి నావలననే ఈ ఇబ్బంది కలిగిం'దని విచారించి చల్లని నీటిని చేతితో తీసికొని ధృతరాష్ట్రుడి ముఖంమీదా, గుండెలమీదా చిలకరించాడు. ఆ సమయంలో విదురుడూ, సంజయూడూ, భరతవంశపురాణులు కంటతడి పెట్టారు. ధర్మరాజు చల్లని చేతితో ఆ వృద్ధనృపతి శరీరాన్ని మెల్లగా నిమిరాడు.

క. నివురంగఁ దెలిసి యతనిం। గవుఁగిటిలోఁ జేర్చి మస్తకము మూర్కొను కౌ
రవవృద్ధు నతఁడు నా శ్లే। ష విశేషంబున నొనర్చె సంప్రీతునిఁగన్. 43

ప్రతిపదార్థం: నివురంగన్= ధర్మరాజు చల్లని చేతులతో ఒళ్ళంతా నిమరడం వలన; తెలిసి= ధృతరాష్ట్రుడికి తెలివి రాగా; (మూర్ఛనుంచి తేరుకొనగా); అతనిన్= ఆ ధర్మరాజును; కవుఁగిటిలోన్= తన కౌగిటిలో; చేర్చి= ఉంచి; మస్తకమున్= ధర్మరాజు తలను; మూర్కొను= ఆఘ్రాణిస్తున్న; కౌరవవృద్ధున్= కౌరవవంశంలో పెద్ద అయిన ధృతరాష్ట్రుడిని; అతఁడు= ఆ ధర్మరాజు; ఆశ్లేషవిశేషంబునన్= అతిశయించిన (దృఢమైన) కౌగిలితో; సంప్రీతునిఁగన్= సంతోషించినవాడిగా; ఒనర్చెన్= చేశాడు.

తాత్పర్యం: ఆ విధంగా ధర్మరాజు చల్లటినీళ్ళు ముఖం మీద గుండెలమీద చల్లి, ఆ చల్లటి చేతులతో ఒళ్ళంతా నిమరటంతో ధృతరాష్ట్రుడు మూర్ఛనుంచి తేరుకొని, ధర్మరాజును కౌగిలించుకొని అతడి శిరస్సు నాఘ్రాణించాడు. అపుడు ధర్మరాజు కూడా దృఢమైన కౌగిలితో ధృతరాష్ట్రుడిని సంతోషపెట్టాడు.

వ. అట్లు తెలివొంది ధృతరాష్ట్రుండు ధర్మరాజుతో 'నా కెట్లునుం దపంబునకయి కాననంబునకుం బోవ వలయు' ననిన నజ్జనపతి, 'నీ వారగింపు; మప్పని మఱి చెప్పెద' నని త్రోపు మాటగాఁ బలికిన నయ్యాంబికేయుండు

'పెక్కుమాట లాడ శక్తి లేదు; న న్నింక నలజడిఁ బెట్టకుము; తపశ్చరణంబునకు నీ యాజ్ఞ వడసి కాని కుడువ' ననియె; నయ్యవసరంబున సాత్యవతేయుండు కృపావిధేయుండై యచటికి వచ్చి సకలజనంబుల వినతులు గైకొని దీవన లిచ్చి యా ధర్మతనయు నాననం బాలోకించి. 44

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; అట్లు= ఆ విధంగా ధర్మరాజుపరిచర్యలవలన; తెలివి= జ్ఞానాన్ని; ఒంది= పొంది; ధర్మరాజుతోన్= ధర్మరాజుతో; (ఇట్లా అన్నాడు)? నాకున్= నాకు, ఎట్లునున్= ఏ విధంగా నయినా; తపంబునకయి= తపస్సు చేసికొనే నిమిత్తం; కాననంబునకున్= అరణ్యానికి; పోవ(న్) వలయున్= తప్పకుండా వెళ్ళవలసిందే; అనినన్= అనగా; ఆ+జనపతి= ఆ (ధర్మ) రాజు; నీవు= నీవు (ధృతరాష్ట్రుడు); ఆరగింపుము= భోజనం చేయవలసింది; ఆ+పని= మీరు అరణ్యాలకు వెళ్ళే పనిని గురించి; మఱి= తరువాత; చెప్పెదన్= చెప్తాను; అని= అంటూ; (త్రోపు) మాటగాన్= అవతలకు త్రోయదగిన అతనిమాటను తోసిపుచ్చేవిధంగా; ధృతరాష్ట్రుడి మాట ప్రక్కకు నెట్టి; పలికినన్= ధర్మరాజు పలుకగా; ఆ+ఆంబికేయుండు= ఆ ధృతరాష్ట్రుడు; పెక్కు మాటలు ఆడన్= ఎక్కువగా మాటాడడానికి; శక్తి= సత్తువ; లేదు= నాకు లేదు; ఇంకన్= ఇంకా; నన్నున్= నన్ను; అలజడిన్= కలవరం; పెట్టకు= పెట్టవద్దు; తపస్+చరణంబునకున్= తపస్సు ఆచరించుకొనటానికి; నీ+ఆజ్ఞ= నీ మాట; పడసి= పొంది; కాని= తప్ప; కుడువన్= భోజనం చేయను; అనియెన్= అన్నాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; సాత్యవతేయుండు= సత్యవతి కొడుకు అయిన వ్యాసమహర్షి; కృపావిధేయుండు+ఐ= దయకు లోబడినవాడై (దయతో); అచటికిన్= ధృతరాష్ట్రాదుల వద్దకు; వచ్చి= వచ్చి; సకల-జనంబుల-వినతులు= అక్కడ వున్నవారి అందరిచేతా ప్రణామాలు; కైకొని= గ్రహించి; దీవనలు= వారికి ఆశీస్సులు; ఇచ్చి= కలుగజేసి; ఆ+ధర్మతనయు-ఆననంబు= ఆ ధర్మరాజు ముఖాన్ని; ఆలోకించి= చూచి (ఇట్లా అన్నాడు) అని (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఆ విధంగా ధర్మరాజు పరిచర్యలతో మూర్ఛ తేరుకొన్న ధృతరాష్ట్రుడు 'ఎలాగైనా సరే తపస్సు చేసుకొనటానికి నేను అడవికి పోవలసిందే' నన్నాడు. అపుడు ధర్మరాజు ముందు భోజనం చేయండి. ఆ విషయం తర్వాత చూద్దా' మని ధృతరాష్ట్రుడి మాటలను త్రోసి పుచ్చాడు. అపుడు 'ధృతరాష్ట్రుడు నేను ఎక్కువ మాటాడలేను. నన్ను ఇబ్బంది పెట్టకుము. (అరణ్యగమనానికి) తపస్సు చేసుకొనటానికి నీవు సెలవిచ్చే వరకు భోజనం చేయను' అన్నాడు. అటువంటి సమయంలో అక్కడికి వ్యాసమహర్షి వచ్చాడు. అక్కడ ఉన్న జనమంతా ఆయనకు వినమ్రంగా నమస్కరించారు. వ్యాసుడు వారిని దీవించాడు. ధర్మరాజు ముఖం చూసి అతడితో ఇట్లా అన్నాడు.

వ్యాసుఁడు ధృతరాష్ట్రు వనవాసంబున కనుజ్ఞ యిచ్చుట (సం.15-8-1)

సీ. **'ఆంబికేయుఁడు చెప్పినట్టుల చేయుము। వృద్ధుఁడు నాత్మజ విరహితుండు**
నైన యీతఁడు తప మాచరింపఁగఁ గోర। కున్నె? గాంధారి శోకోపశమము
తాలిమి నొదవి యుందాఁకఁ బ్రవర్తించె;। నింక నియ్యమకును నిదియ తలఁపుఁ
గావున నీకు నీ కార్యంబు చెప్పంగ। వచ్చితి; వీరిఁ బోనిచ్చు టొప్పు

తే. **ననఘ! పూర్వ రాజన్యులు చనినయట్టి। సౌమ్యపథమున నీ రాజు చనుట మేలు**
గాన నీతని కానన గమనమునకు। ని మ్మనుజ్ఞ విచారంబు లెల్లఁ దక్కి. 45

ప్రతిపదార్థం: అనఘ!= పాపం ఎరుగని వాడా! ధర్మరాజా!; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; చెప్పిన+అట్టులు+అ= చెప్పిన ప్రకారంగానే; చేయుము= చేయవలసింది; వృద్ధుఁడు= పెద్దతనం వచ్చినవాడూ; ఆత్మజ-విరహితుండు= కొడుకులను పోగొట్టుకున్నవాడూ; ఐన ఈతఁడు= అయినటువంటి ధృతరాష్ట్రుడు; తపము= తపస్సు; ఆచరింపఁగన్= చేసుకొనాలని; కోరక+ ఉన్నె?= కోరుకోకుండా ఉంటాడా!; గాంధారి= గాంధారి కూడా; శోక+ఉపశమము= దుఃఖం యొక్క ఉపశమనాన్ని; తాలిమిన్= ఓర్పుతో; ఒదవి= పొంది; ఇందాఁకన్= ఇంతవరకూ; ప్రవర్తించెన్= నడుచుకొన్నది; ఇంకన్= ఇక పైన; ఈ+అమకునున్= ఈవిడకు (గాంధారికి) కూడా; తలఁపు= ఆలోచన; ఇది+అ= ఇదే (తపస్సు చేసికొనాలనే); కావునన్= అందుచేత; ఈకార్యంబు= ఈ పని (ఈమాట); నీకున్= నీతో; చెప్పంగన్= చెప్పటానికి; వచ్చితిన్= (నీవద్దకు) వచ్చాను; వీరిన్= ఈ గాంధారీ ధృతరాష్ట్రులను; పోన్+ఇచ్చుట= పోనివ్వటం; ఒప్పును= (నీకూ తగును) మంచిది; ఈ రాజు= ఈ ధృతరాష్ట్రుడు; పూర్వరాజన్యులు= (మనవంశంలోనూ) పూర్వులైన రాజశ్రేష్ఠులు; చనిన= వెళ్ళిన; అట్టి= అటువంటి; సౌమ్యపథమునన్= తిన్ననైన (గంతవ్యమగు), మంచిమార్గంలో; చనుట= వెళ్ళటం; మేలు= మంచిది; కానన్= అందుచేత; ఎల్లన్= సమస్తములైనటువంటి; విచారములు= బాధలూ, (ఆలోచనలు); తక్కి= విడిచిపెట్టి; ఈతని - కానన - గమనమునకున్= ఈ ధృతరాష్ట్రుడు, అడవులకు వెళ్లడానికి; అనుజ్ఞన్= అనుమతిని; ఇమ్ము= ఇవ్వవలసినది.

తాత్పర్యం: పాపరహితుడా! ధృతరాష్ట్రుడు కోరినట్లు చేయుము; పెద్దతనం వచ్చింది. పైగా పిల్లలు దూరమైనవాడు తపస్సు కోరుకొనటం తప్పదు. గాంధారి కూడా ఓర్పుతో ఇన్నాళ్ళూ దుఃఖం అణచుకొన్నది. ఇపుడు ఆమె కూడా భర్తతో తపస్సు చేసుకొనటమే కోరుతున్నది. అందువలన నీ కొక మాట చెప్పుదామని నేనిక్కడికి వచ్చాను. వీళ్ళను అడవులకు పోనివ్వటం మంచిది. పూర్వపు రాజులవలె చివర్లో, వీళ్ళూ అడవులకు వెళ్ళి ఉత్తమగతులను పొందటమే శ్రేయం. ఇంక నీవు ఏ విచారమూ పెట్టుకొనకుండా వీళ్ళకు అరణ్యాలకు వెళ్ళటానికి అనుమతి ఇమ్ము.

విశేషం: అనఘ అనే సంబోధన అనుమతి నీయకపోవటం అనే అఘం చేయవద్దని తెలుపుతుంది. యుద్ధంలో చావటమో, తపస్సుతో చావటమో అవసరమన్న ధృతరాష్ట్రుడి మాటలని (27) కొంత అనువదిస్తున్నాయి. ఇక్కడి పూర్వరాజన్యులు చనిన యట్టి సౌమ్య (సౌఖ్య అనే ముద్రిత పాఠంకంటె సౌమ్యపాఠం సందర్భోచితం) పథమున నీ రాజు చనుట మేలు అనే వ్యాసవచనాలు అన్నాడు. ధర్మరాజుకు కూడా పుత్రశోకంతో పురంలోనే అన్నపానాలు లేక కళ్ళ ఎదుట మరణించాడనటం కంటే తపశ్చర్యవలన అరణ్యాలలో (పరోక్షంగా) ప్రాణాలు విడిచాడనే పేరు ధృతరాష్ట్రుడికే కాక ధర్మరాజుకూ మేలే. 'కానన్' అందుకు - ఆ కారణంగా అనుజ్ఞ ఇమ్మంటున్నాడు వ్యాసుడు. ధృతరాష్ట్రుడక్కడ అస్మదీయకుల ముఖ్యులు, (27) అంటే వ్యాసుడిక్కడ 'పూర్వరాజన్యులు' అని సామాన్యం చేశాడు. తెలుగులో ఉన్న 'మన' (నీవూ - నేనూ) అనే అర్థం ఇచ్చే శబ్దం సంస్కృతంలోనే చెప్పవలసి వస్తే అస్మదర్థకాన్ని తొలగించి 'పూర్వ రాజన్యులు' అని సామాన్యంగా చెప్తే అది మన శబ్దార్థాన్ని తెలుపుతుంది. ధృతరాష్ట్రుడు ప్రయోగించిన అస్మచ్ఛబ్దంతో అర్థం సంకోచించుకుపోతే అది తొలగించిన వ్యాసవచనం సముచితంగా ఉభయార్థ సాధకం అయింది. పద్యంలో చివరిమాట 'విచారంబు లెల్లఁ దక్కి' 'ధర్మతనయు నాననం బాలోకించి' (44) మాటాడుతున్న వ్యాసుడికి ఇన్ని చెప్పి ముగించాడు. అపుడే (విచారం విడిచినపుడే) తన మాటలతో సారం ధర్మరాజు తెలిసికొనగలుగుతాడు.

క. నీ వినయము భక్తియు, సం। భావనమును వీరి వగలఁ బాపఁగ శుశ్రూ
షావశవర్తిత నడచితి। భూవర! చిరకాల మింకఁ బోనిమ్ము తగన్. 46

ప్రతిపదార్థం: భూవర!= (ధర్మ) రాజా!; నీ, వినయము(న్)= నీయొక్క, అణకువా; భక్తియు(న్)= నీ సేవా తత్పరతా; సంభావనమును= నీవు చూపే గౌరవమూ; వీరి= గాంధారీ ధృతరాష్ట్రుల యొక్క; వగలన్= బాధలను; పాపఁగన్= పోగొట్టగా,

(పోగొట్టునట్లుగా); చిరకాలము= చాలాకాలం; శుశ్రూషా - వశ - వర్తితన్= వీరు చెప్పిన ప్రకారంగా నడుచుకునే స్థితికి లోబడి ఉంటూ; నడచితి(వి)= వ్యవహరించావు; ఇంకన్= ఇక పైన; తగన్= సముచితంగా; పోన్+ఇమ్ము= వీళ్ళని, అడవికి పోనిమ్ము.

తాత్పర్యం: ధర్మరాజా! నీ అణకువా, భక్తీ, గౌరవమూ వీరికి అన్ని బాధల్ని పోగొట్టింది. చాలా కాలం నుండి ఈవిధంగా వీరికి శుశ్రూష చేస్తూ ఉన్నావు. ఇక వీళ్ళను అడవులకు పోనిమ్ము.

చ. అన విని యాకురుప్రవరుఁ డమ్మునివల్లభుమోముఁ జూచి యి
ట్లను - మహితాత్మ! మాకు గురుఁ డన్నను ధర్మవిధోపదేష్ట య
న్నను బరదైవ మన్నను మనః ప్రియకార్యకలాపకర్త య
న్నను విను నీవ; నీదువచనంబున కడ్డము పల్కువాఁడనే?' 47

ప్రతిపదార్థం: అనన్= వ్యాసమహర్షి ఆ విధంగా పలుకగా; విని= ఆలకించి; ఆ కురుప్రవరుఁడు= కురువంశంలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజు; ఆ+ముని వల్లభు= మునిశ్రేష్ఠుడైన ఆ వ్యాసుడి; మోమున్= ముఖాన్ని; చూచి= చూచి; ఇట్లు= ఈ ప్రకారంగా; అనున్= అంటున్నాడు; మహిత+ఆత్మ= గొప్ప మనసు కలిగిన వాడా; విను= వినవలసింది; మాకున్= మా అందరికీ; గురుఁడు+అన్నను= గురువు అయినా; ధర్మ-విధా-ఉపదేష్ట అన్నను= ధర్మముయొక్క తీరును బోధించేవాడు అయినా; పరదైవము+అన్నను= సర్వోత్కృష్టమైన దేవుడు అయినా; మనస్= మనస్సుకు; ప్రియ= ఇష్టమైన (ఇష్టం కలిగించే); కార్య= పనులయొక్క; కలాప= సమూహానికి; కర్త= చేసేవాడు; అన్నను= అయినా; నీవు+అ= నీ వొక్కడివే; నీదు - వచనంబునకున్= అటువంటి నీమాటలకు; అడ్డము= వ్యతిరేకంగా; పల్కువాఁడను+ఏ= చెప్పేటంతటి వాడను కాను.

తాత్పర్యం: వ్యాసమహర్షి ఆ విధంగా అనగా ధర్మరాజు వ్యాసుడి ముఖం చూస్తూ ఇట్లా అన్నాడు. 'మహానుభావా! మాకు గురు వైనా; ధర్మం చెప్పేవాడవైనా, దేవుడివైనా, మా మనసులు సంతోషించే పనులు చేసేవాడివైనా నీవే. అటువంటి నీ మాటలకు భిన్నంగా నేను ఏమీ అనగలిగినవాడిని కాదు.

ఆ. అనిన నమ్మహాత్ముఁ డను 'రాజులకు రణ। మరణ మొండె దృఢ సమాధిఁ దనువు
విడుచు టొండెఁ గాక వృద్ధులై రోగ త। ల్పమునఁ జావు మేలె భరతముఖ్య!' 48

ప్రతిపదార్థం: అనినన్= ధర్మరాజు ఆ విధంగా అనగా; ఆ+మహాత్ముఁడు= మహానుభావుడైన వ్యాసుడు; అనున్= ధర్మరాజుతో ఇట్లా అన్నాడు; భరతముఖ్య!= భరతవంశంలో ప్రధానుడివైన ధర్మరాజా!; రాజులకున్= క్షత్రియులకు; రణ మరణము= యుద్ధంలో తనువు చాలించటం, ఒండెన్+కాని; (లేదా) దృఢ సమాధిన్= నిశ్చలమైన తపస్సు (ఏకాగ్ర ధ్యానం)తో; తనువున్= శరీరాన్ని; విడుచుట= వదలిపెట్టటం, ఒండెన్= కాని; కాక= అంతే తప్ప; వృద్ధులు+ఐ= పెద్దవారు అయిన తర్వాత; రోగతల్పమునన్= వ్యాధులతో మంచాన; చావు= మరణించటం; మేలు+ఎ?= మంచిదా?.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అనగా అతడితో వ్యాసుడు ఇట్లా అన్నాడు. 'భరతకులంలో ప్రధానుడివైన ధర్మరాజా! రాజు అయినవాడికి యుద్ధంలో సంభవించే చావో, కాకపోతే నిశ్చలమైన ధ్యానంతో కలిగే మరణమో మేలు. అంతే కాని ముసలితనం వచ్చాక రోగాలతో మంచానపడి చావటం మేలా?

వ. అనిన విని ధర్మతనయుం డొండు పలుక వెఱచి యిట్లనియె. 49

ప్రతిపదార్థం: అనినన్= అని వ్యాసుడు అనగా; ధర్మతనయుండు= ధర్మరాజు; విని= ఆలించి; ఒండు= దానికి భిన్నంగా; పలుకన్= మాటాడటానికి; వెఱచి= భయపడి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వ్యాసుడట్లా అనగా విని ధర్మరాజు ఇంకొకమాట మాటాడడానికి భయపడి ఇట్లా అన్నాడు.

క. అనఘా! యిక్కురుముఖ్యున। కనుజ్ఞ యే నిచ్చితిని మహత్తర మగు మీ
యనుమతియుఁ బడసెఁ జనుఁ గా। క నిజేచ్ఛను నాకు విఘ్నకరణముఁ దగునే?' 50

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; ఏన్= నేను; ఈ+కురుముఖ్యునకున్= కురువంశంలో ప్రధానుడైన ఈ ధృతరాష్ట్రుడికి; అనుజ్ఞన్= అడవులకు వెళ్లేందుకు అనుమతిని; ఇచ్చితిని= ఇచ్చేశాను; మహత్తరము= అంతకంటె గొప్పది; అగు= ఐన; మీ అనుమతియున్= తమయొక్క అంగీకారం కూడా; పడసెన్= (ఈ ధృతరాష్ట్రుడు) పొంది ఉన్నాడు; నిజ ఇచ్ఛను= తన ఇష్టప్రకారంగానే; చనున్ కాక= అడవులకు వెళ్ళుతాడు. నాకున్= నాకు; విఘ్నకరణమున్= అడ్డు పెట్టటం; తగునే?= తగదు కదా!

తాత్పర్యం: పాపరహితుడైన వ్యాసమహర్షీ! ఈ ధృతరాష్ట్రుడి అరణ్య గమనానికి అనుజ్ఞ ఇచ్చాను. అంతకంటె మహిమ గలిగిన మీ అనుమతి కూడా వీరికి లభించింది. కాబట్టి ఇక తన ఇష్ట ప్రకారంగానే అడవులకు వెళ్ళవచ్చును. నేను అడ్డంపడటం తగదు కదా!

విశేషం: ధర్మరాజుది 'అనుజ్ఞ' - ధృతరాష్ట్రుడు స్వయంగా కోరుకొన్నదానికి అడ్డుచెప్పకుండా ఉండటమే. (స్వయం ప్రవృత్తస్య అన్యస్య ప్రవృత్తి విఘాతాకరణేన ప్రవర్తనారూ పానుమతిః అనుజ్ఞ యేని - ఇచ్చితిన్ - అనుజ్ఞ మాత్రమే అయితే ఇచ్చేశాను. ఆజ్ఞలాంటి వైతే ఇచ్చే అధికారం లేదు - ఇవ్వనని తాత్పర్యం. ధర్మరాజు అనుజ్ఞ లాంఛనం. వ్యాసానుమతి మహిమాన్వితం మహత్తరం. తరప్ప్రత్యయంతో వ్యాసానుమతి ఆధిక్య సూచన, రాజానుమతి తర్వాత కులవృద్ధుగా వ్యాసుడి అనుమతి మరోవిధంగానూ మహత్తే 'నిజేచ్ఛను చనుఁ గాక, నాకు విఘ్నకరణముఁ దగునే' అనేది తెలుగునుడికారానికి సంస్కృతీకరణం.

సీ. అనుటయుఁ బ్రియ మంది యమ్మహామౌని యమ్మ। హీశ్వరుతోఁ 'బాండుఁ డీ నృపాలు
గద్దియ నిడికొని క్రతువులు సేయించి। యవిరళభోగానుభవము నడపి
యీతని వారలఁ బ్రీతి నీక్షించి తా। శిష్యుండ పోలె సంసేవనంబు
భక్తిమై నొనరించెఁ; బదపడి నీవును। దిగ్విజయాదులఁ దేజమితని

తే. నొందునట్లుగఁ జేసితి వొకటఁ; బిదప। దాన పదుమూఁడు వర్షముల్ ధరణి యేలె;
నీవు శుశ్రూష యిత్తఱి నియతి నడపి। తితని మది లేదు కలఁక యొక్కింత యేని. 51

ప్రతిపదార్థం: అనుటయున్= ధర్మరాజు అట్లా అనగానే; ఆ+మహామౌని= ఆ వ్యాసమహర్షి; ప్రియము+అంది= సంతోషించి; ఆ+మహీశ్వరుతోన్= ఆ (ధర్మ) రాజుతో, - ఇట్లా అన్నాడు; ఈ నృపాలున్= ఈ రాజును (ధృతరాష్ట్రుడిని); గద్దియన్= సింహాసనంపై; ఇడికొని= కూర్చుండబెట్టి; పాండుఁడు= మీ తండ్రి పాండు మహారాజు; క్రతువులు= యజ్ఞాలు; చేయించి=

ధృతరాష్ట్రుడి చేత చేయించి; అవిరళ - భోగ - అనుభవము= ఎడతెరపి లేని (నిరతరాయంగా) సుఖాలను పొందే స్థితిని; నడపి= (ధృతరాష్ట్రుడికి) ఏర్పాటు చేసి; ఈతని వారలన్= ధృతరాష్ట్రుడి మనుష్యులను; ప్రీతిన్= ప్రేమగా; ఈక్షించి= చూస్తూ; తాన్= తాను; శిష్యుండు+అ+పోలెన్= శిష్యుడే అన్నట్లుగా; భక్తిమైన్= భక్తితో; సంసేవనంబు= ఈ ధృతరాష్ట్రుడికి సేవలను; ఒనరించెన్= చేశాడు; పదపడి= తర్వాత; నీవును= నీవు కూడా; ఒకటన్= ఏకాగ్రతతో; దిగ్విజయ+ఆదులన్= రాజ్యం విస్తరింపజేయటం మొదలైన వాటివలన; ఇతనిన్= ఈ ధృతరాష్ట్రుడిని; తేజము= కీర్తి; (ప్రతాపం) ఒందునట్లుగన్= ప్రాపించే విధంగా; చేసితివి= చేశావు; పిదపన్= ఆ తరువాత; తాను+అ= తానే, స్వయంగా; పదుమూడు వర్షముల్= (పాండవులు వనవాసం చేసిన) పదమూడు సంవత్సరాలు; ధరణి= ఈ రాజ్యాన్ని; ఏలెన్= పాలించాడు; ఇత్తఱిన్= భారత యుద్ధానంతరం; శుశ్రూష= సేవ; నడపితి(వి)= చేశావు; ఇతని మదిన్= ఈ ధృతరాష్ట్రుడి మనసులో; కలఁక= విచారం; ఒక్క+ఇంత+ఏని= ఏ కొంచెం కూడా; లేదు= లేదు.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అనగానే వ్యాసుడు సంతోషించి ధర్మజుడితో ఇట్లా అన్నాడు. 'మీ తండ్రి పాండురాజు ఈ ధృతరాష్ట్రుడిని సింహాసనం మీద కూర్చోబెట్టి ఇతడి చేత ఎన్నో యజ్ఞాలు చేయించాడు, నిరంతరంగా సుఖాలు అనుభవింపజేశాడు. ఇతడి బంధువులను గూడా ప్రేమగా చూశాడు. గురువుకు శిష్యుడివలె ధృతరాష్ట్రుడిని పాండురాజు భక్తితో సేవించాడు. మీ తండ్రి తర్వాత నీవు గూడా దిగ్విజయంతో రాజ్యాన్ని విస్తరింపజేసి ధృతరాష్ట్రుడి కీర్తినీ, ప్రతాపాన్నీ పెంపొందించావు. తర్వాత (మీరు) అరణ్యవాసం చేసిన పదుమూడేండ్లు (దుర్యోధనుడు రాజైనపుడు) తనే ఈ రాజ్యాన్ని పాలించాడు. భారతయుద్ధం అయి రాజయ్యాక నీవు ఎంతో నియమంగా ఇతడికి శుశ్రూష చేశావు. ఈ ధృతరాష్ట్రుడికి మనసులో గూడా కొంచెమైనా కలత లేదు.

విశేషం: ధృతరాష్ట్రుడి వనవాసానికి 'అనుజ్ఞ ఇచ్చితివి' అని ధర్మరాజనటం వలన వ్యాసుడు ప్రియ మందాడు. తాను వచ్చిన పని అయినట్లే. ధర్మరాజు చేత ఆ మాట అనిపించటంలో వ్యాసుడు చాల శ్రమించాడన్నమాట. ఇది ధర్మజుడికి ధృతరాష్ట్రుడిపై గల అభిమానాధిక్యాన్ని సూచిస్తుంది. 'మహత్తర మగుమీయనుమతియుఁ బడసె' అని తనను గౌరవించటంతో, ధర్మరాజు ధర్మశీలానికి 'ప్రియము' తర్వాత వీడు కొలువు మాటల వలె చెప్పినా అందులోనూ ధర్మరాజును అనునయించటం ఉన్నది. అన్నిరకాలుగా సుఖాలు అనుభవించాడు గాబట్టి ధృతరాష్ట్రుడికి 'మదిన్ కలఁక ఒక్కింత యేని లేదు.' మాటలలో చెప్పకపోయినా మనసులో లేదని అర్థం. మదిన్ ఏని= మనసులో కూడా ఏ మాత్రమూ బాధ లేదు. 'ఇతని మది లేదు' - అనటంలో 'ఇతని' శబ్దం నీకు మనసులో కలఁక ఉన్నది (ధృతరాష్ట్రుడు దుఃఖిస్తున్నాడని) కాని ధృతరాష్ట్రుడికి మాత్రం ఏమీ లేదు అందుచేత నువ్వేమీ బాధపడకు అని సూచన. నీవును దిగ్విజయాదుల - తేజ మితని నొందునట్లుగఁ జేసితి' అనటంలో ధర్మరాజు కూడా తన తండ్రి పాండురాజువలెనే తన శక్తిని ధృతరాష్ట్రుడి సౌఖ్యానికి ఉపయోగించాడని అర్థం. ధర్మరాజు రాజసూయం చేసేకాలంలో దుర్యోధనుడూ రాజే అయినా ధృతరాష్ట్రుడు తేజ మొందేటట్లుగా చెల్లిందని వ్యక్తం అవుతుంది. పరోక్షంగా రాజుగా పరిపాలనం చేస్తూ రాజులైన పాండు, తత్కుమారులచేత సేవ లందుకొంటూ తన జీవితకాలమంతా సుఖంగా గడిపాడని సారాంశం.

క. **కేవలతపః క్రియా సం సేవన తాత్పర్య మిపుడు చిత్తంబునయం**
దావేశించినయది యీ। భూవరునకు నితని ననిచిపుచ్చు మడవికిన్।' **52**

ప్రతిపదార్థం: ఈ భూవరునకున్= ఈరాజు (ధృతరాష్ట్రుడి)కి; ఇపుడు= ప్రస్తుతం; చిత్తంబున+అందున్= మనసులో; కేవల= అచ్చంగా (ఇంకోభావం లేకుండా); తపస్+క్రియా= తపస్సు అనే పనిని; సంసేవన= ఆచరించడంలో; తాత్పర్యము= తత్త్వము, ఏకాగ్రత; ఆవేశించినయది= నిండివున్నది, కాబట్టి; ఇతనిన్= ధృతరాష్ట్రుడిని; అడవికిన్= అరణ్యానికి; అనిచి పుచ్చుము= అనుమతించి పంపవలసింది.

తాత్పర్యం: (ధర్మరాజు!) ఈ ధృతరాష్ట్రుడి కిపుడు, అచ్చంగా తపస్సు చేసుకొనటం అనే దొక్కటే మన సంతా+నిండిపోయింది. అందుచేత ఇతడిని అనుమతించి (అడవులకు) పంపవలసింది.'

ఆ. **అనిన ధర్మ తనయుఁ 'డట్టుల కా కని'। పలికెఁ దత్క్షణంబ పరమయోగి**
వంద్యుఁ డయిన సత్యవతి కొడు కాత్మత। పోవనమున కరిగె భూపవర్య! 53

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజులలో శ్రేష్ఠుడా! (జనమేజయా!); అనివన్= వ్యాసు డట్లా అనగా; ధర్మతనయుఁడు= ధర్మరాజు; అట్టులు+అ; కాక= అట్లే అగును గాక; అని= అని; పలికెన్= అన్నాడు; పరమయోగి వంద్యుఁడు అయిన= ఉత్తములైన యోగులచేన నమస్కరించదగిన; సత్యవతి కొడుకు= సత్యవతికి జన్మించినవాడైన వ్యాసమహర్షి; తత్క్షణంబు+అ= ఆ క్షణంలోనే; ఆత్మ తపోవనమునకున్= తాను, తపసు చేసుకొనే స్థలానికి; అరిగెన్= వెళ్లాడు.

తాత్పర్యం: జనమేజయా! ధృతరాష్ట్రుడిని అడవి కనుమతించి పంపు మని వ్యాసుడు చెప్పగా ధర్మరాజు అట్లాగే కానిమ్మన్నాడు. మహాయోగులచేత స్తుతించబడే ఆ వ్యాసుడు ఆ క్షణంలోనే తన తపోవనానికి వెళ్ళాడు.

సీ. **తదనంతరమ ధర్మతనయుండు ధృతరాష్ట్రు। తోడ నీ కెట్టుల సూడఁ బోలె**
విదురుండుఁ గృపుఁడు నెయ్యది కృత మని విని। శ్చయ మొనరించిరి సంజయుని యు
యుత్సుని మనముల నొలసిన కర్తవ్య। మెద్ది దానిన చేయు టెంత యేని
నాకుఁ బ్రియంబు భూనాథ యానతుఁడ నై। వేఁడెద నొకటి నీ విశదబుద్ధి

ఆ. **నేమి సేయఁదలఁచి తేని నీ వక్కట। యారగించి చేయు మయ్య!' యనుడు**
నరిగె నా నృపాలుఁ డభ్యంతరావాస। మునకుఁ దోన సుబలతనయ సనఁగ 54

ప్రతిపదార్థం: తద్+అనంతరము+అ= వ్యాసుడు వెళ్ళిపోయిన వెంటనే; ధర్మతనయుండు= ధర్మరాజు; ధృతరాష్ట్రుతోడన్= ధృతరాష్ట్రుడితో, (ఇట్లా అన్నాడు); భూనాథ!= రాజా!; నీకున్= నీకు; చూడన్= ఆలోచనలో; ఎట్టులు= ఏవిధం; పోలెన్= తగినదని తోచిందో; విదురుండున్= విదురుడూ; కృపుఁడున్= కృపాచార్యుడూ; ఏ+అది= ఏది; కృతము= (చేయవలసిన) కార్యం; అని= అనేవిధంగా; వినిశ్చయము= దృఢమైన నిర్ణయం; ఒనరించిరి= చేశారో; సంజయుని= సంజయుడి యొక్కయు; యుయుత్సుని= యుయుత్సుడియొక్కయు; మనములన్= మనసులలో; ఒలసిన= ఉన్న (తోచిన); కర్తవ్యము= చేయవలసినపని; ఎద్ది= ఏదో; దానిన్+అ= దానినే; చేయుట= నీవు చేయటం; నాకున్= నాకు; ఎంత+ఏని= ఎంతైనా; (చాలా) ప్రియంబు= ఇష్టం; ఆనతుఁడను+ఐ= వినమ్రంగా; ఒకటి= ఒక విషయం మాత్రం; వేఁడెదన్= నిన్ను ప్రార్థిస్తున్నాను; అక్కట!= అయ్యో!; నీ విశదబుద్ధిన్= నిష్కల్మషమైన నీ మనసులో; ఏమి= ఏపని; చేయన్ తలఁచితి(వి)+ఏని= చేయదలచుకున్నప్పటికీ; నీవు= నీవు; ఆరగించి= (ముందుగా) ఆహారం తీసికొని; చేయుము+అయ్య= ఆ తర్వాతనే నీవు చేయదలచుకున్న దేదో చేయవలసింది; అనుడున్= అని ధర్మరాజు పలుకగా; ఆ నృపాలుఁడు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; తోన్+అ= తనతో కలిసి; సుబలతనయ= సుబలుడి కూతురైన గాంధారి; చనఁగన్= వెళ్ళగా; అభ్యంతర+ఆవాసమునకున్= లోపలి మందిరంలోనికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: వ్యాసుడు వెళ్ళిపోయాక ధర్మరాజు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'రాజా! నీకు మంచిది అనిపించింది ఏదో, విదురుడూ, కృపాచార్యుడూ ఏం చేయాలని నిర్ణయించారో, సంజయుడూ, యుయుత్సుడూ ఏం చేద్దామనుకుంటున్నారో నీవు ఆ పని చేయటం నాకు కూడా ఇష్టం. అయితే శిరసు వంచి నేను ఒకటే వేడుకొంటున్నాను.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నీవు మనసులో ఏం చేయాలనుకొన్నప్పటికీ ముందుగా భోజనం చేసి, తర్వాత ఆ పనిచేయుము. ధర్మరాజు అట్లా అనగానే ధృతరాష్ట్రుడు భార్య (గాంధారి) వెంటరాగా అభ్యంతర మందిరంలోకి వెళ్ళాడు.

వ. ఇట్లు కురువృద్ధుండు వృద్ధసామజంబు చందంబునం జనునప్పుడు విదురుండును, యుయుత్సుండును గృపాచార్యుండును, సంజయుండును వెనుకన చని; రజ్జనపతి దివసకృత్యంబు లాచరించి భూమిసురులం బూజించి యాహారతంత్రంబు నిర్వర్తించె; గాంధారియుఁ గుంతీ ప్రముఖ భరత భార్య లనునయింప భోజనవిధి యొనర్చెం; దదనంతరంబ విదురాదులుం బాండవేయులును వనితా జనంబులుం గృతాహారులయి యా వైచిత్ర్యవీర్యుం బరివేష్టించియుండఁ, బాండవాగ్రజు నిప్పాండునృపాగ్రజుం డేకాంతస్థానంబునకుం దోడ్కొనిపోయి యతని తోడ 'సప్తాంగం బయిన రాజ్యంబు పూజ్యం బగుధర్మంబుతో నెనయ నడపుట దుష్కరంబు గావున నా యెఱిఁగినంత బోధించెద నాకర్ణింపు' మని పలికి యిట్లనియె. 55

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కురువృద్ధుండు= కురువంశంలో పెద్ద అయిన ధృతరాష్ట్రుడు; వృద్ధసామజంబు= ముసలి యేనుగు; చందంబునన్= విధంగా; చను+అప్పుడు= అభ్యంతరమందిరానికి వెళ్ళేటప్పుడు; విదురుండును= విదురుడూ (తమ్ముడు); యుయుత్సుండును= యుయుత్సుడూ (కొడుకూ); కృపాచార్యుండును= కృపుడూ; సంజయుండును= సంజయుడూ; వెనుకన్+అ= వెనుకగానే; చనిరి= (ధృతరాష్ట్రుడిని అనుసరించి) వెళ్ళారు; ఆ+జనపతి= ఆ ధృతరాష్ట్ర మహారాజు; దివస కృత్యంబులు= ఆ రోజు పగలు చేయవలసిన సంధ్యాది కార్యాలను; ఆచరించి= చేసి; భూమిసురులన్= బ్రాహ్మణులను; పూజించి= అర్చించి, దానాదులతో సత్కరించి; ఆహారతంత్రంబు= భోజనవిధానం; నిర్వర్తించెన్= పూర్తిచేశాడు; గాంధారియున్= గాంధారి కూడా; కుంతీ ప్రముఖభరత భార్యలు= కుంతీదేవి మొదలైన భరతవంశస్త్రీలు; అనునయింపన్= (బతిమలాడగా, ప్రార్థించగా); భోజనవిధి= భోజనం చేసే పని; ఒనర్చెన్= పూర్తిచేసింది; తద్+అనంతరంబు+అ= ఆ తర్వాత; విదుర+ఆదులన్= విదురుడూ, యుయుత్సుడూ, కృపుడూ, మొదలైన వారున్నూ; పాండవేయులును= పాండవులూ; వనితాజనంబులున్= ఆడవాళ్ళూ; కృత ఆహారులు+అయి= భోజనం చేసి; ఆ+వైచిత్ర్యవీర్యున్= విచిత్రవీర్యుడి కొడుకైన ఆ ధృతరాష్ట్రుడిని; పరివేష్టించి ఉండన్= చుట్టుకొని ఉండగా; పాండవ+అగ్రజున్= పాండుకుమారులలో పెద్దవాడైన ధర్మరాజును; ఆ+పాండునృప+అగ్రజుండు= పాండురాజు అన్నఅయిన ధృతరాష్ట్రుడు; ఏకాంతస్థానంబునకున్= ఒంటిచోటికి; తోడ్కొనిపోయి= వెంటబెట్టుకొనిపోయి; అతనితోడన్= ధర్మరాజుతో-ఇట్లా అన్నాడు; సప్త+అంగంబు అయిన= (స్వామి, అమాత్య, సుహృత్, కోశ, రాష్ట్ర, దుర్గ, బలము అనే (ప్రకృతి-8) ఏడు అంగాలు కలిగిన; రాజ్యంబు= రాజ్యాన్ని; పూజ్యంబు అగు= పూజించదగిన; ధర్మంబుతోన్= శాస్త్రాదులలో చెప్పబడినమార్గంతో; ఎనయన్= కూర్చి; నడపుట= సాగించటం; దుష్కరంబు= చాల కష్టం; కావునన్= అందుచేత; నా+ ఎఱిఁగిన+అంత= నాకు తెలిసిన మేరకు; బోధించెదన్= రాజ్య పరిపాలనా పద్ధతిని గురించి తెలుపుతాను; ఆకర్ణింపుము= చెవి ఒగ్గి (శ్రద్ధగా) విను; అని= అని పలికి; ఇట్లు+అనియెన్= ఆ రాజ్యాంగం గురించి ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ఆ విధంగా ధృతరాష్ట్రుడు ముసలి యేనుగువలె అభ్యంతర మందిరానికి భార్యతో కలసి వెళ్ళుతున్నపుడు, అతడిని వెన్నంటి, విదురుడూ, యుయుత్సుడూ, కృపుడూ, సంజయుడూ వెళ్ళారు. ధృతరాష్ట్రుడా తర్వాత ఆరోజు చేయవలసిన పగటి పనులన్నీ చేసి బ్రాహ్మణులను అర్చించి, భోజనం చేశాడు. గాంధారి కూడా కుంతి మొదలైన స్త్రీలు బతిమిలాడగా భోజనం చేసింది. ఆ తర్వాత విదురుడు, యుయుత్సుడు మొదలైనవారూ, పాండవులూ, ఆడవాళ్ళూ భోజనం చేశారు. భోజనాలు అయినతర్వాత అందరూ ధృతరాష్ట్రుడి చుట్టూచేరారు. అప్పుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజును వెంట బెట్టుకుని ఏకాంతస్థానానికి తీసికొనివెళ్ళి ఇట్లా అన్నాడు. 'ఏడు అంగాలు కలిగిన రాజ్యాన్ని ధర్మబద్ధంగా

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

నడపటం చాల కష్టం. ఈ పరిపాలనావిధానం నాకు తెలిసినంతవరకు చెప్తాను. జాగ్రత్తగా వినుము' అని రాజ్యపాలనా విధానం గురించి రాజనీతి ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

ధృతరాష్ట్రుఁడు ధర్మజునకు రాజనీతి విశేషంబులు చెప్పుట (సం.15-9-7)

సీ. **'నీవు నిచ్చలును విద్యావృద్ధజనములఁ। దగ నుపాసింపు, మర్థముల వారిఁ**
బ్రీతులఁ జేయుము; నీతులు వా రుప। దేశింప వాని నూఁదినమనంబు
గలిగి నిర్వర్తింపు; కార్యంబు నింద్రియం। బుల రాజ్యతంత్రంబుఁ బోలె నరసి
రక్షింపు; మప్పిండు రక్షితం బైన శు। భంబులం గావించు; భావశుద్ధి

ఆ. **ధామములును బితృపితామహక్రమసమా। గతులు విశదమతులుఁ గాఁగవలయు**
సచివు; లతివిదగ్ధ చారులఁ బనుపుము। పరుల యాప్తజనుల భంగు లరయ. **56**

ప్రతిపదార్థం: నీవు= నీవు (ధర్మరాజు); నిచ్చలును= ఎల్లప్పుడూ; విద్యా వృద్ధ, జనములన్= విద్యచేత పెద్దలైనవారిని; తగన్= అర్హమైనవిధంగా; ఉపాసింపుము= సేవించు; అర్థములన్= వారు కోరిన ధనవస్తు ప్రభృతులతో; వారిన్= ఆ విద్యావృద్ధులను; ప్రీతులన్; చేయుము= ఆనందింపజేయుము; వారు= ఆ విధంగా నీ సమ్మానం చేత సంతుష్టులైనవారు; నీతులు= రాజాదులు ప్రవర్తించవలసిన విధానాన్ని - హితాన్ని; ఉపదేశింపన్= నీకు బోధించగా; వానిన్= ఆ నీతులను; ఊఁదిన మనంబు= ఆశ్రయించిన మనస్సు; కలిగి= పొంది (విద్యావృద్ధులు ఉపదేశించిన హితం-కర్తవ్యం బుద్ధితో స్థిరపరుచుకొని, తు - చ. తప్పకుండా) కార్యంబున్= చేయవలసిన పనిని; నిర్వర్తింపు= నడిపించుము (చేయవలసింది); ఇంద్రియంబులన్= జ్ఞాన, కర్మ, ఇంద్రియాలు అన్నింటినీ; రాజ్యతంత్రంబున్ పోలెన్= రాజ్యతంత్రంవలె; అరసి= జాగ్రత్తగా; రక్షింపుము= కాపాడుకొమ్ము; రక్షితంబు+ఐనన్= నిగ్రహంతో రక్షించుకొంటే; ఆ+పిండు= ఆ (రక్షించబడ్డ) ఇంద్రియ సమూహం, రాజ్యాంగాలూ; శుభంబులన్= అనేకాలైనా మేళ్ళు; కావించున్ (నీకు) కలుగ జేస్తుంది; సచివులు= మంత్రులు, (పాలనాయంత్రాంగంలో ఉన్నతోద్యోగులు); భావశుద్ధి ధామమును= మనసుశుచికి నిలయమైనవారూ, (కపటం లేని, పవిత్రమైన, మనసు కలవారు); పితృపితామహక్రమ సమాగతులు(న్)= తండ్రి, తాతలవరుసలో క్రమంగా సచివులుగా, వచ్చినవారూ; విశదమతులున్= శాంతమయిన మనసు కలవారూ; కాఁగన్ వలయు(న్)= కావాలి; పరుల= ఇతరుల యొక్క (ఇతరదేశపురాజుల); ఆప్తజనుల= తన వారియొక్క; భంగులు= నడవడికలు; అరయన్= తెలిసికొనటానికి; అతి విదగ్ధ చారులన్= మిక్కిలి నేర్పు గలిగిన వేగులను; పనుపుము= నియోగించుము (పంపించు).

తాత్పర్యం: ధర్మరాజా! 1. పాండిత్యంలో పెద్దలైనవారిని, నిరంతరమూ సేవించే వారిని తగు విధంగా సమ్మానించుము. దానివలన సంతోషించిన వాళ్ళు నీకు ఉపదేశించిన హితాన్ని మనసు కెక్కించుకొని ఆ ప్రకారం నీ పనులు (రాజ్యపాలనం) నిర్వహిస్తూ రాజ్యాంగం వలెనే ఇంద్రియాలను జాగ్రత్తగా అదుపులో ఉంచుకొని కాపాడుకొమ్ము. అట్లా రక్షింపబడ్డ ఇంద్రియాలు (రాజ్యాంగము) నీకు మేలు చేస్తాయి. 2. ఇంక తర్వాత మంత్రుల విషయానికి వస్తే- తండ్రితాతల కాలం నుండి క్రమంగా వస్తున్నవారినీ, శుచులూ, ఇంద్రియనిగ్రహం ఉన్న వాళ్ళనీ మాత్రమే మంత్రులుగా చేసికొమ్ము. 3. శత్రువుల, ఆప్తుల, నడవడికలు తెలిసికొనటానికి మంచినేర్పు గలిగిన చారులను ఏర్పాటుచేయుము.

విశేషం: అలం: ఉపమ. ఇంద్రియాలకూ రాజ్య తంత్రానికీ పోలిక. రెండింటినీ సమానంగా అదుపులో ఉంచుకొనాలి (1-61-62). రాజ్యాంగాలు ఏడూ మానవ శరీరాంగాలతో పోల్చబడ్డాయి. మంత్రులు - కన్నులు, మిత్రులు - చెవులు, దుర్గం - చేతులు,

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

రాష్ట్రం - పాదాలు సైన్యం - మనస్సు ఇంక రాజు - శిరస్సు. ఇట్లా రాజ్యతంత్రం అమాత్యాది అంగాలన్నీ రాజు అధీనంలో ఉండాలి. అదే విధంగా నేత్రాదులైన ఇంద్రియా లన్నీ తన అధీనంలో ఉంచుకొని వాటిని జాగ్రత్తగా నడిపిస్తే అధీనమైన రాజ్యాంగంవలన రాజుకు పరిపాలనం సుఖంగా సాగినట్లు, నిగ్రహించబడిన ఇంద్రియాలవలన మేలు గలుగుతుంది. ఇట్లా అనడంలో ఇంద్రియాలు స్వాధీనం కాకపోవటంవలననే, తానూ, దుర్యోధనాదులూ అశుభం పొందవలసివచ్చిందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. మూలంలో 'ఇంద్రియాణి చ సర్వాణి వాజివ త్పరిపాలయ, హితాయ చ భవిష్యన్తి రక్షితం ద్రవిణం యథా (9-13) సారథి గుర్రాలను తన అదుపులో ఉంచుకొన్నట్లుగా ఇంద్రియాలను నీవు అదుపులో ఉంచుకుంటే అవి దాచుకొన్న డబ్బువలె మేలు చేస్తాయంటుంది. రాజ్యతంత్రంతో పోలిక తెలుగులో విశేషం.

క. పురరక్షణము దృఢంబుగ । నరవర! చేయంగవలయు నమ్మఁగలుగు స
త్పురుషుల నిడఁ దగుఁ గుడుపు ని । దుర మొదలగులోని పనుల తొడరువు లరయన్. 57

ప్రతిపదార్థం: నరవర= రాజా!; పురరక్షణము= రాజధానిని శత్రువులనుండి కాపాడుకొనే పని; దృఢంబుగన్= గట్టిగా, (లోటు పాట్లు లేకుండా); చేయంగన్ వలయున్= చేయాలి; కుడుపు= భోజనం; నిదుర= నిద్ర; మొదలు+అగు= మొదలు అయినటువంటి; లోని పనుల= ఆంతరంగికాలైన పనులకు సంబంధించిన; తొడరువులు= ప్రయత్నాలను; అరయన్= చూసుకొనటానికి; నమ్మన్+ కలుగు= నమ్మదగిన; సత్ పురుషులన్= కులశీలాదులచేత ఉత్తములైన వారిని; ఇడన్ తగున్= ఏర్పరచాలి.

తాత్పర్యం: ధర్మరాజా! రాజధానిని రక్షించే ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలి. భోజనం, నిద్ర మొదలైనటువంటి ఆంతరంగికకార్యాలను చూచుకొనటానికి నమ్మదగిన మంచి మనుష్యులను ఏర్పాటు చేసికొనాలి.

విశేషం: 'లోని పనులు' అనే తెలుగు అర్థవంతం, విహారమూ, మాల్యాది అలంకారమూ, మొదలైనవి లోని పనులు.

సీ. ఆప్త వృద్ధులఁ బెట్టు మంగనాజనులసం । రక్షకు నెల్లకార్యముల మంత్రి
జనములతోడ విచారించి చేయంగ । వలయును; గుప్త నివాస మొండె
మాడువు మీఁ దొండె మాటు లేని యరణ్య । తల మొండె మంత్ర విధానమునకు
నర్హముల్ గేవల మైనట్టి మంత్రంబు । గోపనం బొందినఁ గురువరేణ్య!

ఆ. యఖిల కర్మములు ఫలావాప్తి నొప్పుఁ బం । గ్వంధజడులు బధిరు లైన నీ ర
హస్య భాషణములయప్పుడు చేరువ । నునికి యొప్ప దార్యవినుతచరిత! 58

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశంలో శ్రేష్ఠుడా! (ధర్మరాజా)! అంగనా జనుల సంరక్షకున్= అంతఃపురస్త్రీలను కాపాడటానికి; ఆప్తవృద్ధులన్= నమ్మదగిన, (బంధువులైన) ముసలివారిని; పెట్టుము= నియోగించుము; ఎల్లకార్యములన్= రాజుగా నీవు చేయవలసిన పనులన్నీ; మంత్రి జనముల తోడన్= మంత్రులతో; విచారించి= ఆలోచన చేసి; చేయంగన్ వలయును= చేయాలి; మంత్రవిధానమునకున్= ఆలోచనకు; గుప్తనివాసము+ఒండెన్= రహస్యంగా ఉండే ఇల్లు (నాలుదిక్కులూ జాగ్రత్తగా రక్షించబడుతున్న మంత్రగృహం) గానీ; మాడువు మీఁదు+ఒండెన్= (నాలుగు దిక్కులూ తెరపిగా ఉండే) మేడ పై భాగంగానీ; మాటు లేని= (పొదలు చెట్లు మొదలైనవాటిచేత) మరుగు కాని, (చుట్టు ప్రక్కలు తెఱపిగా ఉన్న); అరణ్య తలము+ఒండెన్= అడవి గాని; అర్హముల్= తగినచోట్లు; కేవలము= ఐనట్టి (ఆ విధంగా ఆలోచన చేసి నిశ్చయింపబడిన) ప్రధానమైనటువంటి; మంత్రంబు= ఆలోచన; గోపనంబు+ఒందినన్= రహస్యంగా ఉంచబడితే; అఖిలకర్మములు= అన్ని పనులూ; ఫల+అవాప్తిన్=

ఉద్దేశించిన ప్రయోజనాన్ని పొంది; ఒప్పున్= ప్రకాశిస్తాయి; ఆర్యవినుత చరిత!= పెద్దలు ప్రశంసించే నడవడి కలిగినవాడా! (ధర్మరాజా); పంగు, అంధ, జడులు (ఐనన్)= కుంటివారైనా, గుడ్డివారైనా, తెలివితక్కువవారైనా (బుద్ధిహీనులైనా); బధిరులు+ఐనన్= చెవిటివారైనా సరే; నీ రహస్య భాషణముల+అప్పుడు= నీవు చేసే రహస్యపు సంభాషణల, ఆలోచనల సమయంలో; చేరువన్= నీ సమీపంలో; ఉనికి= ఉండటం; ఒప్పదు= మంచిది కాదు.

తాత్పర్యం: కురువంశంలో శ్రేష్ఠుడి వైన ధర్మరాజా! ఇక ఆడవాళ్ళ రక్షణకు ఆత్మీయు లైన ముసలివారిని నియమించుము. ఏ పని అయినా మంత్రులతో ఆలోచించి మాత్రమే చేయాలి. ఆ ఆలోచనం చేయటానికి రహస్యమందిరం గానీ, మేడ మీద బయలు ప్రదేశం గాని, మరుగులేనటువంటి అడవి ప్రదేశం గానీ తగిన ప్రదేశాలు. ఇట్లా మంత్రులతో విచారణ చేసి చివరకు నిశ్చయించిన అంశం మాత్రం రహస్యంగా ఉంచాలి. రాజ నిర్ణయం గోప్యంగా ఉంటేనే అనుకొన్న ఫలితాన్నిస్తుంది. మంత్రులు చారులు మొదలైన వారితో రహస్యాలు మాటాడేటప్పుడు కుంటివారైనా, గుడ్డివారైనా, తెలివితక్కువవారైనా చివరకు చెవిటివారైనా సరే ఎవరినీ దగ్గరకు రానీయకుము.

క. **విను మంత్ర భేదనమున వ। చ్చిన కీడున కనఘ! శాంతి సేయు టరిది గా**
వున మంత్రులతో మంత్రా। వన నియమం బూఁది చెప్పవలయుం జుమ్మా! 59

ప్రతిపదార్థం: అనఘ!= పాప రహితుడా! (ధర్మరాజా)! విను= వినవలసింది; మంత్ర భేదనమునన్= రహస్యంగా ఉండవలసిన ఆలోచన (రాజు నిర్ణయం) బయటపడితే; వచ్చిన కీడునకున్= కలిగే అపకారానికి; శాంతి+చేయుట= ప్రతీకారం చేయటం, తొలగించటం; అరిది= ఏ విధంగానూ శక్యం కాదు; కావునన్= అందుచేత; మంత్రులతోన్= నీతో ఆలోచన చేసిన మంత్రులతో; మంత్ర+అవన, నియమంబు= ఆ ఆలోచనను రక్షించవలసిన కట్టుబాటును; ఊఁది= నొక్కి (గట్టిగా); చెప్పవలయున్+చుమ్మా!= (నీవు) చెప్పాలి సుమా!

తాత్పర్యం: అనఘుడా! రాజు చేసిన నిర్ణయాలు, ఆలోచనలు బయటకు పొక్కితే గలిగే నష్టం నివారించటం ఎవ్వరివలనా కాదు. అందుచేత మంత్రాన్ని గోప్యంగా ఉంచటం అనేది నియమంగా నీ మంత్రులకు నొక్కి చెప్పుము.

సీ. **వ్యవహారములు శుచు లైన విద్వాంసులఁ। దోడుగఁ గొని తీర్పు; దుష్టజనుల**
దండించునెడ వారి తప్పుల కొలఁదులు। మదిఁ దూఁచి చూచి తన్మాత్రదండ
మాచరింపుము; విను మాయవ్యయములు సం। క్షేపరూపంబున రేపకడలు
దానికి మును దేవతాపూజనము భూసు। రార్చనమును జేయు మమలబుద్ధి!

తే. **ప్రొద్దు పొలంగ నెక్కినప్పుడు సమర్థ। భోజన క్రియ నిర్వహింపుము సుశీల**
మాన్య! తదనంతరమ గంధమాల్యభూష। ణాంబరములు నిజేచ్ఛమై ననుభవింపు. 60

ప్రతిపదార్థం: శుచులు= విష్కళంకులు, (నీతిమంతులు); ఐన= అయినటువంటి; విద్వాంసులన్= పండితులను; తోడుగన్= సహాయంగా; కొని= స్వీకరించి, వ్యవహారములు= (అప్పు పుచ్చుకోవటం మొదలైనవాటిలో 18 విధాలైన) తగవులు; తీర్పు(ము)= పరిష్కరించుము; దుష్టజనుల(నె)= తప్పు కలిగిన వారిని; దండించు+ఎడన్= శిక్షించేటప్పుడు; మదిన్= నీ మనస్సులో; వారి తప్పుల కొలఁదులు= వారు చేసిన తప్పులయొక్క పరిమాణం (ఎంతటి తప్పో); తూఁచి= గణించి (తూకం వేసి); చూచి= దాన్ని

జాగ్రత్తగా పరిశీలించి; తద్ - మాత్ర దండము= ఆ తప్పుయొక్క పరిమాణానికి తగినంత శిక్ష మాత్రమే; ఆచరింపుము= విధించుము; అమలబుద్ధి!= కల్మషం లేని బుద్ధి కలవాడా! ధర్మరాజా!; వినుము= వినవలసింది; రేపకడలు= ప్రాతః కాలాలలో; సంక్షేపరూపంబునన్= సంగ్రహంగా; ఆయవ్యయములు= ఆదాయమూ, ఖర్చు (చూచుకొమ్ము); దానికిన్= ఆయవ్యయాలు చూడటానికి; ప్రాతఃకాలానికి; మును= ముందుగా; దేవతా పూజనము(న్)= ఇష్టదైవాలను అర్చించటమూ; భూసుర+అర్చనమును= బ్రాహ్మణులను పూజించటమూ; చేయుము= చేయవలసింది; చాలంగన్= మిక్కిలిగా; ప్రొద్దు= సూర్యుడు; - ఎక్కినపుడు= పైకి వచ్చినపుడు (బాగా పొద్దెక్కింతర్వాత); సమ్ అర్హ భోజనక్రియ= రాజుల కుచితమైనటువంటి భోజనకార్యాన్ని; నిర్వహింపుము= చేయవలసింది; సుశీల మాన్య!= మంచి స్వభావం చేత గౌరవించదగిన వాడా! ధర్మరాజా!; తద్+అనంతరము+అ= ఆ తర్వాతనే; నిజ+ఇచ్ఛమైన్= స్వేచ్ఛగా (నీ ఇష్టం వచ్చినట్లుగా); గంధ, మాల్య, భూషణ, అంబరములు= చందనాది గంధాలూ, పూలూ, ఆభరణాలూ, వస్త్రాలూ మొదలైన సౌఖ్యాలను; అనుభవింపు(ము)= పొందవలసింది.

తాత్పర్యం: శుచులూ, శాస్త్రజ్ఞులూ అయిన వారి సహాయంతో తగవులు పరిష్కరించుము. తప్పు చేసిన వారిని శిక్షించేటప్పుడు వారు చేసిన తప్పు ఎంతటిదో జాగ్రత్తగా లెక్కించి దానికి తగినంతటి శిక్ష మాత్రమే విధించుము. ఉదయం వేళలలో జమాఖర్చులు సంగ్రహంగా చూచుకోవాలి. అంతకు ముందే తెల్లవారటానికి పూర్వమే దేవతార్చనమూ, బ్రాహ్మణార్చనమూ చేయాలి. బాగా పొద్దెక్కినతర్వాత భోజనం చేయాలి. ఆ తర్వాతనే అలంకారాలు మొదలైన సుఖాలను పొందాలి.

క. కొలు విమ్ము మాపుకడ యో। ధుల కెల్లను; సంధ్య వడ్డ దూతలనుం జా
రుల సంభావింపుము; రా। త్రులఁ గాంతాభోగతత్పరుఁడ వగుము నృపా! 61

ప్రతిపదార్థం: నృపా!= (ధర్మ) రాజా!; యోధులకున్+ఎల్లను= యుద్ధం చేసే వారికి, (వీరభటులకు) అందరికీ; మాపుకడన్= సాయం సమయంలో; కొలువు+ఇమ్ము= కలుసుకొమ్ము; సంధ్య-వడ్డన్= సంజ పడిన తర్వాత; దూతలనున్= దూతలనూ; చారుల(న్)= వేగులనూ; సంభావింపుము= (గౌరవించుము) కలుసుకొమ్ము; రాత్రులన్= రాత్రివేళలలో; కాంతా, భోగతత్పరుఁ డవు, అగుము= స్త్రీలతో సుఖాన్ని పొందుము.

తాత్పర్యం: ధర్మరాజా! సాయం సమయంలో వీరులకు నిన్ను సేవించే అవకాశం ఇమ్ము. సంజ పడినతర్వాత దూతలనూ, వేగుల వాళ్ళనీ కలిసికొమ్ము. స్త్రీ సుఖాన్ని రాత్రి సమయంలో పొందుము.

తే. ఏమి క్రొత్తగఁ బుట్టిన నించు కేని। నలసుఁడవు గాక దాని నీ వరసి తీర్పు;
మిది దెఱంగుగ నే ప్రొద్దు నింతవట్టు। నర్హములు కౌరవక్షితిపాగ్రగణ్య! 62

ప్రతిపదార్థం: కౌరవ, +క్షితిప+అగ్రగణ్యా= కురువంశపురాజులలో మొదట లెక్కించదగినవాడా, (శ్రేష్ఠుడా), (ధర్మరాజు)!; క్రొత్తగన్= వింతగా; ఏమి పుట్టినన్= ఏమి జరిగినప్పటికీ; ఇంచుక+ఏనిన్= కొంచెం కూడా; అలసుఁడవు= సోమరివి; కాక= కాకుండా; దానిన్= ఆ అంశాన్ని; నీవు= నీవు (స్వయంగా); అరసి= విచారించి; తీర్పుము= పరిష్కరించుము; ఇది+తెఱంగుగన్= ఈ విధంగా; ఇంతవట్టు= ఈ చెప్పిన, పనులన్నీ; ఏ ప్రొద్దున్= నిత్యమూ; అర్హములు= చేయదగినవి.

తాత్పర్యం: కౌరవ రాజులలో శ్రేష్ఠుడా! ఎంతటి దైనా వింత సంఘటన ఏర్పడితే బద్ధకించక ఏ సమయంలో నైనా సరే వెంటనే దానిని గురించి విచారణ చేసి పరిష్కారం చేయుము. ఈ విధంగా ఆయావేళలలో ఆయా పనులు ప్రతిరోజూ తప్పకుండా ఆచరిస్తూ ఉండుము.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. న్యాయంబుతోడ వివిధో। పాయంబుల నర్థముల నుపార్జింపుము భూ
నాయక రాజ్య విఘాతము। సేయు జనుల నెఱిఁగి చంపఁ జెఱుపన వలయున్. 63

ప్రతిపదార్థం: భూనాయక!= (ధర్మ) రాజా!; అర్థములన్= అనేకవిధాలైన సంపదలను; వివిధ ఉపాయంబులన్= రకరకాల మార్గాలలో; న్యాయంబుతోడన్= ధర్మమార్గంలో; ఉపార్జింపుము= సంపాదించుము; రాజ్యవిఘాతము= ప్రభుత్వానికి అడ్డంకులు చేసే; జనులన్= కలిగించే వారిని; ఎఱిఁగి= తెలిసికొని; చంపన్= చంపటమో, చెఱుపన్+అ= చెడగొట్టటమో; తప్పక వలయున్= అవసరం.

తాత్పర్యం: రాజా! పలువిధాలైన మార్గాలలో సంపదలను న్యాయంగా సంపాదించుము. ప్రభుత్వానికి అంతరాయం కలిగించే వారిని కనుగొని వారిని చంపివేయటమో లేదా వారి ప్రయత్నాలను నిర్మూలించటమో, తప్పనిసరిగా చేయాలి.

క. పనులయెడ మేలు గాంచిన। మనుగడ యగ్గలము చేసి మన్నింపుము రా
జనయజ్ఞ! భృత్యకోటిం। గొనియాడుము సేఁతపేరు క్రుచ్చి కొలువునన్. 64

ప్రతిపదార్థం: రాజనయజ్ఞ!= రాజధర్మం(నీతి) తెలిసినవాడా! (ధర్మరాజా)!; పనుల+ఎడన్= రాజకార్యాలలో; మేలు= నేర్పును; కాంచినన్= చూస్తే (చూపించిన అటువంటి భృత్యుల); మనుగడ= జీవనం; అగ్గలము చేసి= ఉన్నతంగా ఏర్పాటు చేసి; మన్నింపుము= వారిని గౌరవించుము; కొలువునన్= సభలో; చేఁత= భృత్యులు నేర్పుగా చేసిన ఆ పనిని; పేరు= వారి పేరూ; క్రుచ్చి= పేర్కొని; భృత్యకోటిన్= ఆసేవకులను; కొనియాడుము= ప్రశంసించుము.

తాత్పర్యం: రాజనీతిజ్ఞుడి వైన ధర్మరాజా! రాజకార్యాలలో తమనేర్పును ప్రదర్శించిన భృత్యకోటికి, వారి బ్రతుకు ఉన్నతంగా నడిచేటట్లుగా వారిని సత్కరించుము. వారు చేసిన పనులూ, వారిపేరూ సభలో ప్రత్యేకంగా ప్రస్తావించి ప్రశంసించుము.

క. నీ వలనను భక్తిస్నే। హావేశము గలిగి శూరుఁడై యలజడికిం
దా విసువని సత్కులజుం। గావింపుము సైన్యవిభునిగాఁ గురుముఖ్యా! 65

ప్రతిపదార్థం: కురుముఖ్యా!= కురువంశంలో ప్రధానుడా! (ధర్మరాజా!); నీవలనను= నీపై; భక్తి, స్నేహ, ఆవేశము= సేవాభావమూ, ప్రేమా, ఆధిక్యం; కలిగి= ఉండి; శూరుఁడు+ఐ= పరాక్రమవంతుడై; తాన్= తాను (స్వయంగా); అలజడికిన్= ఆపద (కష్టం)లో; విసువని= నిర్వేదం (విరక్తి) పొందని, (వాడు ఐన); సత్ కులజున్= ఉత్తమవంశంలో పుట్టినవాడిని; సైన్యవిభునిన్ కాన్= సైన్యానికి నాయకుడిగా; కావింపుము= నియమించుము.

తాత్పర్యం: కౌరవశ్రేష్ఠుడా, ధర్మరాజా! నీమీద భక్తీ, ప్రేమా, అధికంగా ఉండి పరాక్రమవంతుడై, కష్టం వచ్చినా నిలబడ గలిగిన, ఉన్నతవంశంలో పుట్టినవాడిని సేనాపతిగా చేసికొమ్ము.

సీ. ఆత్మరంధ్రము లించు కైనను నొరులకు। నెఱుఁగ రాకుండఁగ మఱువు సేయు
మన్య రంధ్రంబుల నారసి కనుము; శ। త్రుల కడ బుద్ధియు బలుపుఁ గలుగు
వారల నెఱిఁగి భూవర! యొక్కమై నీగి। మన్నన నెఱపి తన్మానసములు
నీ యెడ నార్ద్రంబులై యుండఁ జేయుము। చేరువనృపులకు వైరబంధ

ఆ. మెట్లు గలుగు దాని నేమఱకుండుము । వారి యవుల నున్నవారు మిత్రు
లగుదు రెల్ల భంగి నధిప! యుదాసీను । లట సమీపవర్తు లైన విభులు. 66

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; ఆత్మరంధ్రములు= నీలోపాలను (తప్పులను); ఒరులకున్= ఇతరులకు; ఇంచుక+ఐనను= కొంచెమైనా; ఎఱుఁగన్ రాక ఉండఁగన్= తెలియటానికి అవకాశం ఈయకుండా; మఱుఁవు చేయుము= రహస్యంగా ఉంచుము; అన్యరంధ్రంబులన్= ఇతరుల తప్పులను; అరసి= నిశితంగా పరిశీలించి; కనుము= గ్రహించుము; శత్రువులకడన్= శత్రువుల వద్ద; బుద్ధియున్= వివేకమూ; బలుపున్= శక్తి; కలుగువారలన్= ఉన్న వ్యక్తులనే; ఎఱిఁగి= తెలిసికొని; ఒక్కమైన్= అధికంగా; ఈఁగి= దానమూ; మన్నన= గౌరవమూ (సాయం); నెఱపి= చూపి; తద్+మానసములు= వారి మనస్సులు; నీ+ఎడన్= నీ మీద; ఆర్ద్రంబులు+ఐ= అనుకూల్యం కలిగి; ఉండన్ చేయుము= ఉండేటట్లు చేసికొమ్ము; అధిప!= ఓ రాజా!; చేరువన్నృపులకున్= నీకు దగ్గరి రాజులకు; వైరబంధము= శత్రుత్వం; ఎట్లు= ఏవిధంగా నైనా; కలుగున్= కలుగుతుందో; దానిన్= ఆ అంశాన్ని; ఏమఱక ఉండుము= ఏమరుపాటు లేకుండా (అప్రమత్తంగా) ఉండుము; వారి+అవులన్= వారికి తరువాతగా; ఉన్నవారు= ఉన్నరాజులు; ఎల్లభంగిన్= అన్ని విధాలుగానూ; మిత్రులు అగుదురు= నీకు స్నేహితులు అవుతారు; అటన్= వారికి; సమీపవర్తులు+ఐన= చేరువలో ఉన్న; విభులు= రాజులు; ఉదాసీనులు= నీ విషయంలో తటస్థులు, అని గ్రహించుము.

తాత్పర్యం: రాజా! నీ తప్పులు కొంచెం కూడా ఇతరులకు తెలియకుండా దాచిపెట్టుము. ఇతరుల దోషాలు మాత్రం జాగ్రత్తగా తెలిసికొమ్ము. శత్రువులవద్ద ఉన్నవాళ్ళలో బుద్ధిమంతులూ, శక్తిమంతులూ అయిన వ్యక్తులను దానాదులతో సత్కరించి, వాళ్ళ మనసులు నీ వైపు తిప్పుకొమ్ము. నీరాజ్యానికి సమీపంలో ఉండే రాజులకు నీతో వైరం కలుగుతుంది. కాబట్టి ఆ విషయంలో జాగ్రత్తగా అప్రమత్తుడివై ఉండుము. వారికి తర్వాత రాజ్యం పాలించుకొనే వాళ్లు నీకు మిత్రులవుతారు. ఆ తర్వాత ఉండే రాజ్యపాలకులు నీవిషయంలో ఉదాసీనంగా ఉంటారని గ్రహించుము.

క. వీరుల సప్తాంగంబులు । నారసికొని యునికి కార్య మవనీశ! సదృ
క్సారబలుఁ డైన నృపుతో । గారవమున సంధి సేయఁగావలయుఁ దగన్. 67

ప్రతిపదార్థం: అవనీ+ఈశ!= రాజా!; వీరులన్= (పైన చెప్పిన) పొరుగురాజులను; సప్త+అంగంబులు= రాజ్యానికి సంబంధించిన (స్వామి) అమాత్యాది అంగములు ఏడింటినీ; ఆరసికొని= మెలకువతో గ్రహిస్తూ; ఉనికి= ఉండటం; కార్యము= (రాజుకు) కర్తవ్యం; సదృక్ సార బలుఁడు= తనతో సాటి వచ్చేటంతటి గట్టి పరాక్రమం కలిగినవాడు; ఐన= అయినటువంటి; నృపుతోన్= పొరుగురాజుతో; తగన్= తగువిధంగా; గారవమునన్= మన్ననతో; సంధి= శాంతి; ఒడంబడిక; చేయఁగాన్ వలయున్= చేసికొనాలి.

తాత్పర్యం: రాజా! శత్రువులూ, మిత్రులూ, ఉదాసీనులూ అని మూడు విధాలుగా ఉన్న పొరుగురాజులనూ, (శాంతి 6,107) (స్వామి) అమాత్య, జానపద, దుర్గ, బలాదిరూపమైన రాజ్యం సప్తాంగాలనూ, రాజు అప్రమత్తంగా గమనిస్తూ ఉండాలి. తనతో సమానమైన బలం కలిగిన రాజుతో తగువిధంగా అతడిని గౌరవించి సంధి చేసికొనాలి.

తే. దైవమానుష బలములు దఱిఁగి యుండు । నెవ్వనికి నెప్పు డప్పుడ యెసక మెసఁగ
వైర మతనితోఁ బాటింపవలయుఁ జెఱుచు । టప్పనము గొను టర్థత్వ మరసి నడపు. 68

ప్రతిపదార్థం: ఎవ్వనికిన్ = ఏ (శత్రు) రాజుకు; ఎప్పుడు= ఏ సమయంలో; దైవమానుషబలములు= దైవబలమూ, మానుషబలమూ, అతడి స్వబలమూ; తఱిఁగి+ఉండున్= తక్కువగా ఉంటాయో; అతనితోన్= ఆ రాజుతో; అప్పుడు+అ= ఆ సమయంలోనే,

వెంటనే; ఎసకము= పెంపు; ఎసఁగన్= ఒప్పుతుండగా; వైరము= శత్రుత్వాన్ని; పాటింపన్‌వలయున్= ఆచరించాలి; అర్హత్వము= అతడి అర్హతను; అరసి= గమనించి; చెఱుచుట= నాశనం చేయటమో; లేదా; అప్పనము= కానుకలు (కప్పం); కొనుట= స్వీకరించటమో; నడపు(ము)= చేయవలసింది.

తాత్పర్యం: ఎవడికి, తన బలమూ, దైవబలమూ, రెండూ ఏ సమయంలో తక్కువగా ఉంటాయో వాడితోనే ఆ సమయంలోనే శత్రుత్వాన్ని అనుసరించాలి. ఔచిత్యాన్ని బట్టి ఆ శత్రురాజును నిర్మూలించడమో లేకుంటే సామంతుడుగా ఉంచి కప్పం పుచ్చుకొనటమో చేయాలి.

క. నడపునఁ గోల్పుచ్చఁగ నగు। నెడయు విడిసి యుండి చెఱుచు నిక్కయు నీ వే
ర్పడఁ గనుఁగొని యం దర్హము। నడపుము; నిజసైన్య రక్షణము వలయుఁ జుమీ! 69

ప్రతిపదార్థం: నడపునన్= సైన్యాన్ని నడిపించటం ద్వారా; కోల్ పుచ్చఁగన్= చెడగొట్టటానికి (నిర్మూలించడానికి); అగు+ఎడయున్= వీలైన స్థానమూ; విడిది+ఉండి= సైన్యం విడిది చేసికొని; చెఱుచు+ఇక్కయున్= శత్రువును నశింపజేసే స్థానమూ; ఏర్పడన్= స్పష్టంగా; నీవు= నీవు (స్వయంగా); కనుఁగొని= తెలిసికొని, అందున్= ఆ రెండింటిలో; అర్హము= ఉచితమైన పనిని; నడపుము= చేయవలసింది; నిజ సైన్య రక్షణము= స్వసైన్యం నాశనం కాకుండా కాపాడుకొనటం; వలయున్+చుమీ= అవసరం సుమా!

తాత్పర్యం: సైన్యాన్ని నడిపి (దండెత్తి), శత్రువును నిర్మూలించాలో, లేకపోతే సైన్యాన్ని విడిది చేసి రాజ్యం చుట్టూ నిలిపి రాజ్యాన్ని దిగ్బంధం చేసి శత్రువులను నిర్మూలించాలో - ఈ రెండింటిలో ఏ మార్గం తగినదో నీవే ఆలోచించి అది అనుసరించుము. నీ సైన్యాన్ని తప్పకుండా రక్షించుకొనాలి సుమా!

విశేషం: విదేశీ రాజనీతిలో షడ్గుణాలలో 'యానం' అనేది సంధి - ఆసనం - విగ్రహం - యానం - అనీ ఇదొక క్రమంలో నిరూపితం. శత్రు నిర్మూలనం అవసరంకాని సమయంలో సైన్యప్రయోగం అవసరమైతేనే చేయాలని సారాంశం.

క. ప్రెగడల మనసులు విరసము। లగుగతి నడచు రిపురాజ్య మరసి విభిన్నం
బుగఁ జేసి కలఁచి పైకొని। జగతీవర! కొనఁగవలయు సౌకర్యమునన్. 70

ప్రతిపదార్థం: జగతీవర!= (ధర్మ) రాజా!; ప్రెగడల= అమాత్యుల యొక్క; మనసులు= హృదయాలు; విరసములు= ఇష్టం లేనివి (ప్రతికూలములు); అగుగతిన్= అయ్యే విధంగా; నడచు= సాగుతున్న; రిపురాజ్యము= శత్రురాజ్యాన్ని; అరసి= కనుగొని; విభిన్నంబుగన్+చేసి= చెదరగొట్టి; కలఁచి= క్షోభింపజేసి; పైకొని= దండెత్తి; సౌకర్యమునన్= తేలికగా; కొనఁగన్‌వలయున్= స్వీకరించాలి.

తాత్పర్యం: రాజా! మంత్రులు రాజుకు ప్రతికూలంగా ఉండి, సాగుతున్న శత్రురాజ్యాన్ని, చెదరగొట్టి (విడదీసి) వ్యాకులపెట్టి, ఆ తర్వాత ఒక్కసారిగా మీదబడి (దండెత్తి) (ఆ రాజ్యాన్ని) తేలికగా సాధించాలి.

ఆ. బలము లెసఁగ దైవబలమును గలిగి లో। గుట్టు చేటు లేనియట్టి నృపతి
వలన మత్సరంబు వల; దాశ్రయంబు చం। దంబు పొందు వడయఁ దగు నృపాల! 71

ప్రతిపదార్థం: నృపాల!= (ధర్మ) రాజా!; బలము= (రథగజాదిగా) సైనికబలం; ఎసఁగన్= ఎక్కువగా ఉండగా; దైవబలమును= అదృష్టశక్తి కూడా; కలిగి= ఉండి; లో గుట్టు= ఆంతరంగికాలైన రహస్యాలకు; చేటు= కీడు (వెల్లడి కావటం); లేని+ అట్టినృపతి వలనన్= లేనటువంటి రాజు విషయంలో; మత్సరంబు= విరోధం; వలదు= వద్దు; ఆశ్రయంబు చందంబు= అటువంటి వాడిని ఆశ్రయించే మార్గమే; (లేదా) పొందు= స్నేహమో (సంధి); పడయన్+తగున్= అనుసరించటం ఉచితం.

తాత్పర్యం: మానుష బలం ఉండీ, దానికి తోడు దైవబలం కూడా ఉండి స్వీయ రహస్యాలు వెల్లడి కాకుండా మరుగు చేయగలిగిన రాజుతో విరోధం పనికిరాదు. అతడిని అనుసరించి ఉండటమో, లేదా, సంధి (స్నేహం) చేసికొనటమో యుక్తం.

ధృతరాష్ట్రుఁడు ధర్మరాజునకు శత్రురాజుల జయించు తెఱంగు చెప్పుట (సం.15-12-6)

ఆ. కుడువ నిచ్చు తఱియుఁ గురువర! కక్కించు। నవసరంబు నెఱిఁగి యరినృపాలు
నీవు ధీరవృత్తి నిడుఁ ద్రాటఁ బోనిమ్ము। క్రమ్ము కపిల యనఁగ గ్రమ్మి చెఱపు? 72

ప్రతిపదార్థం: కురువర!= కురువంశంలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; నీవు= నీవు; అరినృపాలున్= శత్రురాజును; కుడువన్+ఇచ్చు; తఱియున్= తిన నివ్వదగిన సమయమూ; కక్కించు+అవసరంబున్= తిన్న దాన్ని కక్కించవలసిన సమయమూ; ఎఱిఁగి= గ్రహించి; కపిల అనఁగన్= పుల్లావు వలె; (శత్రురాజును) నిడుఁద్రాటన్= పొడుగైన తాడుతో; కట్టిపోన్+ఇమ్ము= విడిచిపెట్టుము; క్రమ్ము= (ఆక్రమించుము)లో బఱుచుకొమ్ము; క్రమ్మి= ఆక్రమించుకొన్నపుడు; చెఱపు= రాపిడి పెట్టుము.

తాత్పర్యం: కురుశ్రేష్ఠుడా! తిన నివ్వదగిన సమయం ఏదో, కక్కించవలసిన సమయం ఏదో గ్రహించి శత్రురాజును పుల్లావు వలె పొడుగాటి త్రాడుతో స్వేచ్ఛగా విడిచిపెట్టుము. లోబరుచుకొమ్ము, లోబరుచుకొన్నపుడు ఆ శత్రురాజువలన లాభాలు జాగ్రత్తగా పిండుకొమ్ము.

విశేషం: అలం: ఉపమ. 'కపిల' తో ఉపమానం. ఆవు కట్టుత్రాడు చేతిలో ఉంచుకొనాలి. అపు డా తాడు ఎంత నిడుపైనా దాన్ని విడిచిపెట్టడం కట్టివేయడం అనేది తన ఇచ్ఛ ననుసరించి ఉంటుంది. త్రాడు ఎంత నిడుపైనా, కుడవనివ్వదగినంత దాకానే విడిచిపెట్టడం కాబట్టి దాని ఇచ్ఛ కట్టుఁత్రాడు పట్టుకున్నవాడి స్వేచ్ఛకు లోబడే ఉంటుంది. శత్రురాజు (నిడుత్రాటి బంధనంలో) తనకు లోబడి ఉన్నంత కాలం తన రాజ్యాన్ని అనుభవింపనీయవచ్చును. 'కక్కించు అవసరం' క్రొత్తగా తినడం కాదు. అంతకు ముందు తినిఉన్నది కూడా లాక్కోవడం. అవసరమైతే అదీ చేయాలి. 'చెఱపు' అనే ముద్రితపాఠం కంటె 'చెఱుము' అనే వ్రాతప్రతుల పాఠంలో ఔచిత్యం కనబడుతున్నది. 'చెఱపు అంటే నశింప జేయడం. అరినృపాలుడు కాబట్టి కక్కించవలసిన అవసరం వస్తే వాడిని కమ్ముకొని శత్రువును నిర్మూలించుము అని అర్థంలో చెఱవు అనే పాఠం అన్వయిస్తుంది. కాని శత్రురాజుకు 'కపిల' తో పోలిక. ('నిడుఁద్రాట' బంధించి ఉంచాలి గదా) కాబట్టి 'కపిల'ను చెఱచడం సరికాదు. 'కక్కించు నవరసంబు' అన్నపుడు కూడా కపిల పరంగా పాలు పిదుకుకోవటమే. శత్రురాజు సైన్యాది బలాలను స్వాధీనపరచుకొనటం. (ఇది శత్రురాజుకు చెఱుపే) రాజును చంపే పని లేదు. ఇది ఎంతదూరం యథేచ్ఛగా వెళ్ళి మేయదగినంత మేయనిస్తే, అవసరమైనపుడు దాని నుండి ఫలితాన్ని (పాలు), అధికంగా పిండుకొనవచ్చును. అట్లా పిండుకొనాలంటే 'చెఱుము' అంటే గంగడోలు వగైరా అవయవాలు రుద్ది (చెఱుము= ఊచు) పరవశింప జేసి ప్రయోజనాన్ని పొందాలి అనే అర్థం సాధించడంలో 'చెఱవు' అనే ముద్రిత పాఠంకంటె కూడా 'చెఱుము' అనే వ్రాతప్రతులలోని పాఠమే అర్థవంతంగా ఉంటుంది. కపిల అంటే పసుపు నిండిన తెలుపు - బంగారు రంగులో ఉన్న ఆవు 'కపిల వైశిష్ట్యం కూడా ప్రయోజనంలోనే దానికి చెరుపు చేయటం అభీష్టం కాదు కదా.

సీ. **ఉత్సాహ శక్తియు నుర్వీశ మంత్రశ। క్తియుఁ బ్రభుశక్తియుఁ గెలనివాని**
కిని నీకు నిట్టివి యని తారతమ్యముల్। వెరవునఁ బరికించి వేర మెత్త।
వలయుట నెఱిగల్గి పలుకక యుండంగఁ। దగుట యూహించు టుత్తమ విధంబు ;
మూలబలంబును మొత్తాలవారును। మిత్త్రబలంబును శత్రుబలముఁ

ఆ. **గాననంబు బలముఁగ్గై జీతగాండ్రును। నైనయట్టిబలము లాఱు నరసి**
యుచితకాల దేశ యుక్తంబులుగఁ బన్ని। కొనఁగ వలయు వాని కొలఁదు లెఱిఁగి. **73**

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ!= రాజా!; కెలనివానికిన్= నీ పొరుగు (శత్రు) రాజుకూ; నీకున్= నీకూ; ఉత్సాహశక్తియున్= ఉత్సాహమనే శక్తి; మంత్రశక్తియున్= (ఆలోచన) మంత్ర శక్తీ; ప్రభు, శక్తియున్= ప్రభు (అధికారం) శక్తి; ఇట్టివి అని= ఈ ప్రకారంగా ఉన్నాయి అని; తారతమ్యముల్= తక్కువ ఎక్కువలు; వెరవునన్= ఉపాయంతో; పరికించి= పరిశీలించిన తర్వాతే; వేరము= విరోధం; ఎత్తవలయుట= అనుసరించాల్సి రావటమూ; నెఱి, కల్గి= పౌరుషం కలిగి కూడా; పలుకక+ఉండంగన్+తగుట= మాటాడకుండా ఊరుకోవటమూ; ఊహించుట= (ఏది ఉచితమో ఆలోచించి) నిర్ణయించుకొనటం; ఉత్తమవిధంబు= శ్రేష్ఠమైన పద్ధతి; మూలబలంబును= 1. ప్రధాన సేనా, మొత్తాలవారునూ= 2. శ్రేణీబలమూ మిత్త్రబలంబును= 3.స్నేహితులైన రాజులవలన లభించే సైన్యమూ; శత్రుబలమున్= 4. శత్రువుల నుండి లభించిన సైన్యమూ; కాననంబు బలమున్= 5. కిరాతులు మొదలైన అడవి వీరుల సైన్యమూ; కై జీత గాండ్రును= 6. తాత్కాలిక ప్రయోజనం కొరకు భృతితో నియమించబడిన సైన్యమూ; ఐన అట్టి బలములు ఆఱున్= అయినటువంటి ఆరు విధాలైన సైన్యాలను; అరసి= గమనించి; వాని కొలఁదులు= ఆ ఆరు విధాలైన సైన్యాల పరిమాణాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; ఉచిత కాల దేశ యుక్తంబులుగన్= ఆయాకాలాలకూ, ప్రాంతాలకూ, తగిన విధంగా ఉండేటట్లుగా; పన్ని కొనఁగన్‌వలయున్= సిద్ధం చేసికొని ఉంచుకొనాలి.

తాత్పర్యం: రాజా! నీకూ నీ పొరుగు (శత్రు) రాజుకూ ఉత్సాహ మంత్ర, ప్రభుశక్తులలోని తక్కువయెక్కువలు జాగ్రత్తగా తెలిసికొని, దండెత్తాలనుకొన్నపుడు మూలశ్రేణి, మిత్ర, శత్రు, కానన, భృత్యశ్రేణులు - అనే షడ్బలాలనూ, పరిశీలించి దేశ, కాలాలకు తగిన విధంగా వ్యూహం ఏర్పాటు చేసికొనాలి.

విశేషం: యుద్ధానికి తలపడే ముందు రాజు శక్తి త్రయాన్ని అంచనా వేసికొనాలి. ఉద్యమించే శక్తి, పనిలో పూనుకోవాలనే కోర్కె ఉత్సాహశక్తి, సఫలమయ్యే విధంగా ఆలోచన చేయగలిగిఉండటం మంత్రశక్తి; తన ఆలోచనలను; ప్రయత్నాన్ని అమలు చేయగలిగిన అధికారం - ప్రభుశక్తి; కోశ సైన్యాలు ప్రభుశక్తికి చెందుతాయి. కెలనివాని శక్తి తెలిసికొనటం కష్టం కాబట్టి 'వెరవున' - ఉపాయంతో, ఎట్లాగో మార్గం చేసికొని ఎదుటివారి బలం గ్రహించాలి. తనకంటె పొరుగువాడికే శక్తి అధికం అయితే మాటాడకుండా ఊరుకొనటమే ఉత్తమం. తర్వాత ఆరు విధాలైన బలాలను సంసిద్ధం చేసికొని యుద్ధానికి దిగాలి. 'మౌల్య భృత్య సుహృచ్ఛ్రేణీ ద్విష దాటవికం బలమ్' రఘు- (4.26 మల్లినాథవ్యాఖ్య) సైన్యానికి కోశం మూలం, మూల బలం అంటే ధనబలం (నీలకంఠీయ) అర్థం. మూల బలం -(మౌల్యం) ప్రధానసేన= వంశపారంపర్యంగా రాజసేవలో కొనసాగివస్తున్న సైన్యం - మూలబలం, మొత్తాలరు అంటే శ్రేణీబలం. కొంతమందిని కూర్చుకొని సైనికులవలె తీర్చి వారికి ఒకడు నాయకత్వం వహిస్తుంటాడు. ఇట్లా కొంతమంది సైనికుల సమూహాలకు నాయకులైన వారిద్వారా ఉపయోగించే బలం శ్రేణీ బలం. వారే మొత్తాలవారు. మిత్రబలం - స్నేహితులైన రాజులు తనకు సహకారంగా పంపే సైన్యం (68.వ.) (సుహృద్బలం). శత్రుబలం. యుద్ధంలో తన చేతిలో ఓడిపోయి సామంతులై ఉన్నరాజులు విధిగా పంపటంవల్ల వచ్చే సైన్యం. అవకాశం దొరికితే ఎదురు తిరిగేవాళ్ళు గాబట్టి వీళ్ళు సామంతులై కప్పాలు కడుతున్నా శత్రువులే, (ద్విషద్బలం) కిరాతాది సైన్యం ఆటవికబలం; కైజీతగాండ్రు భృత్యబలం; జీతం (కూలి) ఇచ్చి తాత్కాలికంగా పెట్టుకొన్న సైన్యం. ఈ ఆరు విధాలైన బలగాలను 'వాని కొలఁదులు ఎరిఁగి దేశ - కాల ఉచితంగా ఉపయోగించాలి'. తనకున్న

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆయా బలగాల పరిమాణం, శత్రువుకున్న బలాల పరిమాణం - తెలిసికొని - యుద్ధం జరిగే ప్రదేశాన్నీ కాలాన్నీ అనుసరించి షడ్బలాలలో దేన్ని ఏ పరిమాణంలో ఎట్లా వాడుకొనాలో జాగ్రత్తగా (ఎరిగి) గ్రహించి చేయాలి.

తే. సంపదల నాపదల నొక్క చంద మగుట । వికృతి నొందుట యా బలవితతులందుఁ
గాంచి యెల్లప్పుడును హితకారి యైన । బలము నెక్కుడుగాఁ బ్రోవు భరతముఖ్య! 74

ప్రతిపదార్థం: ఒందుట= పొందటమూ; కాంచి= పరిశీలించి; హితకారి ఐన= ప్రభువులకు మేలు కూర్చగలిగిన; బలమున్= బలాన్ని; ఎల్లప్పుడును= అన్నివేళలా; ఎక్కుడుగాన్= అధికంగా; ప్రోవుము= (కాపాడుతూఉండు) వృద్ధి చేసుకొమ్ము.

తాత్పర్యం: భరతవంశంలో శ్రేష్ఠుడా, ధర్మరాజా! మూలబలం, మిత్రబలం మొదలుగా ఆరువిధాలైన బలాలలోనూ కష్ట సుఖాలలో ఒకే విధంగా నిలబడగలిగినదేదో, నిలబడలేనిదేదో గ్రహించి రాజుకు మేలు చేసే బలగాన్ని ఎప్పుడూ అధికంగా పోషించుము.

క. పరుల గెలిచి నిర్భయముగ । ధరణిఁ బ్రజం గాచువెరవు ధర్మపథమునం
బరిపాలించిన వెలయుం । గురువర! కృపపెంపు వదలకుము ప్రజలయెడన్. 75

ప్రతిపదార్థం: కురువర!= కురువంశంలో శ్రేష్ఠుడివైన ధర్మరాజా!; పరులన్= శత్రువులను; గెలిచి= ఓడించి; ధరణిన్ ప్రజన్= (ఆశత్రు రాజ్యంలోని) ప్రజలను; నిర్భయముగన్= భయం లేకుండే విధంగా; కాచు వెరవు= రక్షించే ఉపాయం; ధర్మపథమునన్= ధర్మమార్గంలో; పరిపాలించినన్= ప్రజా సంరక్షణం చేస్తే; వెలయున్= ప్రశస్త మవుతుంది; ప్రజల+ఎడన్= ప్రజలమీద; కృప పెంపు= అధికమైన దయను; వదలకుము= విడిచిపెట్టకు.

తాత్పర్యం: కురుశ్రేష్ఠుడా! శత్రురాజులను ఓడించి ఆ రాజ్యాన్ని వశం చేసికొన్న తర్వాత, ఆ శత్రురాజ్యంలోని ప్రజలు, నీ గురించి భయపడకుండేటట్లుగా నీవు రక్షించే విధం, ధర్మబద్ధంగా ప్రజా సంరక్షణం చేయటం వలన ఇంకా కీర్తించబడుతుంది. నీ ప్రజలమీద ఎప్పుడూ మిక్కిలి దయతో ఉండాలి.

క. వినికి గలిగి రక్షించుచు । ననువున దయతోడిపాడి నాయతు లెల్లం
గొనుచుఁ దగ నేలి పొగడొం । దినరాజున కుర్వి కామధేనువ కాదే! 76

ప్రతిపదార్థం: వినికి కలిగి= రాజ ధర్మాది వివిధ శాస్త్రాలను విని (తెలిసికొని); రక్షించుచున్= ప్రజలను కాపాడుతూ; అనువునన్= ఉపాయంతో; దయతోడి పాడిన్= దయ గలిగిన నీతితో; ఆయతులు= రాబడులు; ఎల్లన్= అన్నీ; కొనుచున్= సమకూర్చుకొంటూ; తగన్= తగువిధంగా; ఏలి= రాజ్యాన్ని పాలించి; పొగడు= ప్రశంసలను; ఒందిన రాజునకున్= పొందేటటువంటి రాజుకు; ఉర్వి= ఈ రాజ్యం; కామధేనువు+అ= కామధేనువే; కాదే!= కదా!

తాత్పర్యం: వివిధ శాస్త్రాలు గ్రహించి, ప్రజలను, జాగ్రత్తగా కాపాడుతూ, ఉపాయంతోనూ, దయ గలిగిన పద్ధతిలోనూ, రాబడులను కూర్చుకొంటూ ధర్మబద్ధంగా భూమిని పరిపాలించే రాజుకు ఆ రాజ్యమే కామధేను వవుతుంది.

విశేషం: అలం: రూపకం.

సీ. **ధర్మమార్గంబున ధరణిఁ బాలించిన। నైహిక సుఖములు నగ్గలంపుఁ**
బొగడును బరలోక భూరి సౌఖ్యములును। సిద్ధించు; విపుల దక్షిణలు పెట్టి
యశ్వమేధ ప్రముఖాధ్వరంబులు పెక్కు। లాచరించుట కంటె నధిక మండ్రు
మేదినీ ప్రజల నత్యాదరంబును గరు। ణాతిశయంబు మధ్యస్థతయును

తే. **గలిగి బిడ్డల నరసిన కరణి గాఢ। రక్షణం బొనరించుట రాజవర్య!**
వినుము తమ్ముల నీఁగి మన్ననల ననుది। నంబుఁ గొనియాడు మానందనంబు గాఁగ. **77**

ప్రతిపదార్థం: రాజవర్య!= రాజులలో శ్రేష్ఠుడా! (ధర్మరాజా!); వినుము= వినవలసింది; ధరణిన్= ఈ భూమిని; ధర్మ మార్గంబునన్= ధర్మంతో కూడిన (ధర్మబద్ధమైన) పద్ధతిలో; పాలించినన్= రక్షిస్తే; ఐహిక సుఖములున్= ఈ లోకానికి, సంబంధించిన సుఖాలూ; అగ్గలంపు పొగడును= అధికమైన ప్రశంసలూ; పరలోక భూరి సౌఖ్యములును= స్వర్గలోకంలో మిక్కుటమైన సుఖాలూ; సిద్ధించున్= లభిస్తాయి; విపుల= విస్తారంగా; దక్షిణలు పెట్టి= దక్షిణలు ఇచ్చి; మేదినీ ప్రజలన్= రాజ్యంలోని ప్రజలను; అతి+ఆదరంబును= మిక్కుటమైన వాత్సల్యమూ; కరుణా+అతిశయంబు(న్)= మిక్కుటమైన దయా; మధ్యస్థతయును= నిష్పక్షపాతబుద్ధీ; కలిగి= ఉండి; బిడ్డలన్= కన్న బిడ్డలను; అరసిన కరణిన్= చూసుకునే విధంగా; గాఢ-రక్షణంబు= దృఢమైన రక్షణం; ఒనరించుట= చేయటం; అశ్వమేధ, ప్రముఖ+అధ్వరంబులు= అశ్వమేధం మొదలైన యాగాలు; పెక్కులు= అనేకంగా; ఆచరించుట కంటెన్= చేయటం కంటె; అధికము= ఎక్కువ; అండ్రు= అంటారు; తమ్ములన్= నీ సోదరులను; ఆనందనంబు కాఁగన్= సంతోషం కలిగేటట్లుగా; ఈఁగి- మన్ననలన్= దానమూ, సమ్మానాలతో; అనుదినంబున్= ప్రతీరోజూ; కొనియాడుము= ప్రశంస చేస్తూ ఉండుము.

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడా! రాజ్యాన్ని ధర్మమార్గంలో పరిపాలిస్తే ఈ లోకంలో సుఖాలు మాత్రమే కాకుండా, పదుగురి చేత పొగడ్తలూ, ఊర్ధ్వ లోకంలోనూ గొప్ప సుఖాలూ కలుగుతాయి. ప్రజలను ప్రేమతో, దయతో, నిష్పక్షపాతంగా, కన్నబిడ్డలవలె, గట్టిగా కాపాడటం - గొప్ప దక్షిణలు ఇచ్చి అశ్వమేధం మొదలైన అనేక యజ్ఞాలు చేసిన దానికంటె కూడా ఎక్కువ అని అంటుంటారు. ఓ రాజా! వినుము. నీ తమ్ముళ్ళను, వాళ్ళు సంతోషించేటట్లు దానమూ, సమ్మానమూ చేస్తూ ప్రతిరోజూ ప్రశంసిస్తూ ఉండుము.

చ. **నరవర! రాజనీతుల జనస్తుతుఁడైన నదీ తనూజుఁడున్**
హరియుఁ బరాశరాత్మజుఁడు నాదిగఁ గల్గిన పెద్ద లెల్ల నీ
కరయఁగఁ బెక్కు సెప్పిరి; మదాత్మయు నీదెసఁ బ్రీతి పెద్దయుం
బొరయుట నేనుఁ గొన్ని యిటు పోలిన భంగి నెఱుంగఁ జెప్పితిన్. **78**

ప్రతిపదార్థం: నరవర!= ఓ రాజా!; అరయఁగన్= పరిశీలించి చూస్తే; జనస్తుతుఁడు+ఐన= ప్రజలచేత పొగడబడేవాడు అయిన; నదీ తనూజుఁడున్= గంగాపుత్రుడు, భీష్ముడూ; హరియున్= శ్రీకృష్ణుడూ; పరాశర+ఆత్మజుఁడున్= పరాశరమహర్షి కొడుకైన వ్యాసుడు; ఆదిగన్, కల్గిన పెద్దలు= మొదలయిన పెద్దవారు; ఎల్లన్= అందరూ; నీకున్= నీకు; రాజనీతులు= రాజధర్మాలు; పెక్కు= చాలా (వివరంగా); చెప్పిరి= చెప్పి ఉన్నారు; మత్ ఆత్మయున్= నా మనసు కూడా; నీదెసన్= నీ మీదే; పెద్దయున్= మిక్కుటంగా; ప్రీతి= వాత్సల్యం; పొరయుటన్= పొంది ఉండటం చేత; నేనున్= నేను కూడా; ఇటు= ఈ విధంగా; కొన్ని= కొద్దిగా రాజనీతులును; పోలిన భంగిన్= సాధ్యమైన (చేతనైన) విధంగా; ఎఱుంగన్, చెప్పితిన్= (నీకు) తెలియజెప్పాను.

తాత్పర్యం: నరశ్రేష్ఠుడా! ఇంతకు మునుపే భీష్ముడూ, కృష్ణుడూ, వ్యాసుడూ మొదలైన పెద్దలు నీకు రాజనీతులు విస్తారంగా చెప్పారు. అయినా, నీ మీద ఉండే వాత్సల్యం వలన నేను కూడా ఏదో నాకు తెలిసినంత మేర కొద్దిగా రాజధర్మాలు చెప్పాను.

క. నిత్యవిధి సద్వివేకము। సత్యవ్రతశీల! ధర్మసారజ్ఞ! భవ
న్మత్యాకలితమ యైనను। నిత్యంబును వృద్ధసేవ నిష్ఠఁ జలుపుమీ!' 79

ప్రతిపదార్థం: సత్యవ్రతశీల!= సత్యమందే తాత్పర్యం ఉన్న నడవడి కలవాడా; ధర్మసారజ్ఞ!= ధర్మం యొక్క సారాన్ని (తత్త్వాన్ని) తెలిసినవాడా! ధర్మరాజా!; నిత్యవిధి(న్)= ఎల్లప్పుడూ, ఆచరించడంలో; సత్+వివేకము= శ్రేష్ఠమైన రాజనీతి జ్ఞానం; భవత్+మతి+ఆకలితము+అ= నీ బుద్ధిలో ఉన్నదే; ఐనను= అయినప్పటికీ; నిత్యంబును= ఎప్పుడూ; నిష్ఠన్= శ్రద్ధతో; వృద్ధసేవ(న్)= పెద్దలను సేవించటం; చలుపుమీ!= చేయుమా!

తాత్పర్యం: సత్యవ్రతం కల ప్రవర్తన కలవాడా! ధర్మసూక్ష్మం ఎరిగినవాడా! ధర్మరాజా! ఎల్లప్పుడూ ఆచరిస్తుండటం వలన రాజనీతిజ్ఞానం నీకు బుద్ధిస్థమే. అయినా నిత్యము శ్రద్ధతో పెద్దలను సేవించుము.'

సీ. అన విని ధర్మజుం డంబికా పుత్రుతో। 'నాపగాసుతుఁడు లేఁ' డబ్జనాభుఁ
డాత్మపురంబున కరిగె; వాత్సల్యత। నీవు దక్కఁగ నాకు హితము సెప్ప
నొడయఁ డెవ్వఁడు? భవదుపదిష్ట పథమున। నిష్ఠమై నడచెద; నెమ్మనమున
నీవు ప్రీతిని బొందు నృపముఖ్య!' నావుడు। నాతఁడు సంతసమంది యతని

ఆ. 'నధిప! విశ్రమింపు మధికశ్రమంబు నా। తనువునందుఁ జెందె' నని తగంగఁ
బోవఁ జెప్పి; బాంధవావళి కభిముఖుఁ। డయి నిజాలయముల కరుగఁ బనిచి. 80

ప్రతిపదార్థం: అనన్= ధృతరాష్ట్రు డీ విధంగా రాజనీతులను చెప్పగా; విని= గ్రహించి; ధర్మజుండు= ధర్మరాజు; అంబికా పుత్రుతోన్= అంబిక కొడుకైన ధృతరాష్ట్రుడితో (ఇట్లా అన్నాడు); నృపముఖ్య= రాజులలో ప్రధానుడా; ఆపగా సుతుఁడు= గంగాపుత్రుడైన భీష్ముడు; లేఁడు= ప్రస్తుతం లేడు (మరణించాడు); అబ్జనాభుఁడు= కృష్ణుడు; ఆత్మపురంబునకున్= తన నగరానికి (ద్వారకకు); అరిగెన్= వెళ్ళాడు కాబట్టి; నాకున్= నాకు; వాత్సల్యతన్= ప్రేమగా; హితము= మంచిని, (కర్తవ్యాన్ని); చెప్పన్= తెలియజెప్పడానికి; నీవు= నీవు (ధృతరాష్ట్రుడు); తక్కఁగన్= తప్ప; ఒడయఁడు= నాథుడు; ఎవ్వఁడు?= ఎవరున్నారు?; భవత్+ఉపదిష్ట, పథమునన్= నీవు ఉపదేశించిన మార్గంలోనే; నిష్ఠమైన్= శ్రద్ధగా (ఏకాగ్రతతో) నడచెదన్= నడచుకొంటాను; నీవు= నీవు; నెమ్మనమునన్= (నీ) నిండు మనస్సులో (మనసునిండా); ప్రీతిని= సంతోషం; పొందు= పొందవలసింది; నావుడున్= అని ధర్మరాజు పలుకగా; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; సంతసము= సంతోషాన్ని; అంది= పొంది; అతనిన్= ఆ ధర్మరాజుతో (ఇట్లా అన్నాడు); అధిప!= (ధర్మ) రాజా!; విశ్రమింపుము= నీ విక విశ్రాంతి తీసికొమ్ము; నా తనువునందున్= నా శరీరంలో; అధిక శ్రమంబు= మిక్కిలి అలసట; చెందెన్= కలిగింది; అని= అని చెప్పి; తగంగన్= తగు విధంగా; పోవన్+చెప్పి= ధర్మరాజునకు వీడుకోలు పలికి; బాంధవ+ఆవళికిన్= తన బంధు సమూహానికి; అభిముఖుఁడు+అయి= ఎదురుగా ఉండి, బంధువులవైపు తిరిగి, వాళ్ళతో వాళ్ళని; నిజ+ఆలయములకున్= తమ తమ ఇండ్లకు; అరుగన్= వెళ్ళటానికి; పనిచి= నియోగించి; (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు చెప్పిన రాజనీతులు విన్న తర్వాత ధర్మరాజు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: రాజశ్రేష్ఠుడా! ఇపుడు భీష్ముడు అసలు లేడు. కృష్ణుడు ద్వారకకు వెళ్ళాడు. ప్రేమతో హితం చెప్పగలిగిన పెద్దవాడివి నీవు తప్ప నాకు ఇంకెవ రున్నారు? నీవు ఉపదేశించిన మార్గంలో శ్రద్ధగా నడుస్తాను. మనసు నిండుగా సంతోషించుము.' ధర్మరాజు పలికిన ఈ మాటలు విని ధృతరాష్ట్రుడు సంతోషించాడు. 'ధర్మరాజా! ఇక విశ్రాంతి తీసికొమ్ము. నాకు కూడా ఒళ్ళంతా బాగా అలసిపోయింది' అని ధర్మరాజును మంచి మాటలతో వీడుకొలిపాడు. బంధువులను వాళ్ళ ఇళ్ళకు పంపించాడు ధృతరాష్ట్రుడు.

వ. తాను నభ్యంతర గృహంబున కరిగి సుఖాసీనుం డైయున్న నమ్మానవనాథుతో గాంధారి 'దేవా! వనంబున కెపుడు విచ్చేయువాఁడ?' వని యడిగిన, నా భూవల్లభుం డద్దేవి కిట్లనియె. 81

ప్రతిపదార్థం: తానున్= తాను కూడా; అభ్యంతర గృహంబునకున్= లోపలి మందిరానికి; అరిగి= వెళ్ళి; సుఖ ఆసీనుండు, ఐ= సుఖంగా కూర్చున్న వాడై; ఉన్నన్= ఉండగా; ఆ+మానవ నాథుతోన్= ఆ (ధృతరాష్ట్ర) రాజుతో; గాంధారి= భార్య ఐన గాంధారి - (ఇట్లా అన్నది); దేవా= రాజా!; వనంబునకున్= అరణ్యానికి; ఎపుడు= ఎప్పుడు; విచ్చేయువాఁడవు= వస్తావు; అని అడిగినన్= అని ప్రశ్నించగా; ఆ భూవల్లభుండు= ఆ (ధృతరాష్ట్ర) రాజు; అ+దేవికిన్= ఆ పట్టపురాణితో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజునూ, ఇతర బంధువులనూ అందరినీ పంపి వేసిన తరువాత ధృతరాష్ట్రుడు కూడా తన మందిరానికి వెళ్ళి సుఖంగా ఆసీనుడయ్యాడు. అపుడు గాంధారి, 'రాజా! అరణ్యానికి ఎప్పుడు వెళ్ళుతావు?' అని అడిగింది. భార్యతో ధృతరాష్ట్రుడిట్లా అన్నాడు.

క. మా తండ్రి పరాశరసుతు । చేతం బడసితి ననుజ్ఞ; శీలపరత్వో
పేతుఁ డగు ధర్మతనయుఁడు । ప్రీతి నొడంబడియె బంధుబృందయుతముగన్. 82

ప్రతిపదార్థం: మా తండ్రి= మా తండ్రి; పరాశర సుతు చేతన్= వ్యాసమహర్షి చేత; అనుజ్ఞన్= అనుమతిని; పడసితిన్= పొందాను; శీలపరత్వ+ఉపేతుఁడు= నడవడియొక్క ఉత్తమధర్మంతో కూడినవాడు (మంచి నడవడి గలవాడు); అగు= అయిన; ధర్మ తనయుఁడు= ధర్మరాజు; బంధు బృంద యుతముగన్= చుట్టాలందరితో కలిసి; ప్రీతిన్= ఇష్టపూర్వకంగా; ఒడంబడియెన్= అంగీకరించాడు.

తాత్పర్యం: 'మా కన్నతండ్రి వ్యాసమహర్షి నుండి ఆశ్రమవాసానికి అనుమతి పొందాను. నేను అరణ్యాలకు వెళ్ళటానికి ఉత్తమశీలుడైన ధర్మరాజు కూడా బంధువులతో సహా అంగీకరించాడు.

ఆ. ఇంకఁ దడయ నేల? యింతి! వే వెడలుద । మట్లు కల్లజూద మాడి పాప
భాగు లైన నీదు పట్టుల సుగతికి । ననుచువాఁడఁ దపము నతిశయమున. 83

ప్రతిపదార్థం: ఇంతి!= ఓ వనితా!; ఇంకన్= ఇంకా; తడయన్= ఆలసించటం; ఏల?= ఎందుకు?; వే= త్వరగా; వెడలుదము= అడవికి బయలుదేరుదాం; అట్లు= ఆ విధంగా; కల్ల జూదము= అబద్ధపు (మోసపు) జూదం; ఆడి= ఆడి; పాపభాగులు= పాపాన్ని పొందిన వారు; ఐన= అయినటువంటి; నీదు పట్టులన్= నీకొడుకులను; తపము+అతి శయమునన్= (నా) తపస్సు మేలిమి చేత; సుగతికిన్= మంచి ఊర్ధ్వలోక స్థితులకు; అనుచువాఁడన్= పంపుతాను.

తాత్పర్యం: వనితా! ఇంకా ఆలస్యం ఎందుకు? వెంటనే అడవులకు బయలుదేరుదాం. అబద్ధపు జూదమాడి పాపాన్ని పొందిన నీ కొడుకులను, అడవులలో గొప్ప తపస్సు చేసి మంచిలోకాలకు పంపుతాను.

విశేషం: కారణాలు ముందుగా గాంధారిచేత కూడా అనిపించింది మూలం. ప్రశ్న మాత్రం గాంధారిది. ధృతరాష్ట్రుడే సమాధానంలో కారణం చెప్పడం తెలుగులో మార్పు. 'పాపభాగులైన' అనే సందర్భంలో 'నీదుపట్టులు' నీ (గాంధారి) కొడుకులు - అనటం గమనించదగింది. గొప్ప పనులు చేసినపుడు నా పుత్రులనీ, తప్పుడు పనులు చేసినపుడు నీ కొడుకు లనీ భార్యాభర్తలు వ్యవహరించడం సహజం. ఆ స్వభావానికి ఇది అనుగుణం. వార్ధకదశలో ఆశ్రమవాసం చేయడం కులోచితం. కాని ధృతరాష్ట్రుడి అసలు ఆంతర్యం ఇక్కడ బయటికివచ్చింది. దుర్మార్గాల వలన పాపులైన కొడుకులకు మరణానంతరం దుర్గతులే కలిగి ఉంటాయని ధృతరాష్ట్రుడి నిశ్చయం. పైకి ఊర్ధ్వగతులు పొందా రంటున్నా (25), తపస్సు చేసి కొడుకులకు సుగతులు సాధించడం కోసం అడవులకు వెళ్ళటం అని ఇక్కడ చెప్పుతున్నాడు. 'నీదుపట్టు' లన్నా కొడుకుల మీది ప్రేమ నిది నిరూపిస్తుంది. మూలంలో ఈ అంశం ఇపుడు కానరాదు.

ధృతరాష్ట్రుండు వనవాసంబునకుం బురజనులచే ననుజ్ఞ గొనుట (సం.15-13-8)

వ. అని పలికి యమ్మగువదిక్కు మొగం బయి ' వారికి సుగతి గల్గునట్లుగా నిప్పుడును గొన్ని పుణ్యక్రియ లజాతశత్రుననుమతితో నాచరించి పోదము గాక!' యని నిశ్చయించి తనకుఁ దపోవనగమనంబునకై పౌరులయనుజ్ఞ గొనవలయు నని పాండవాగ్రజునకుం జెప్పం బనిచిన నతండు దగుపురజనంబుల నెల్లను బడి చేసి వెలార్చికొనుచు నఖిలబంధుమిత్త్రులునుం దానును వచ్చి ధృతరాష్ట్ర మందిర ద్వారపురోభాగం బున నిలిచె; నయ్యాంబికేయుండు గాంధారియుం దోడ రా వెడలి వారి సన్నిధికిం జని, బ్రాహ్మణ క్షత్త్రియ వైశ్య శూద్ర సంకులం బైయున్న యన్నగర జన ప్రకరంబు నుద్దేశించి. 84

ప్రతిపదార్థం: అని పలికి= ఈ విధంగా చెప్పి; ఆ+మగువదిక్కు= ఆ గాంధారివైపుగా; మొగంబు అయి= ముఖం తిప్పి; వారికిన్ = కొడుకులకు; సుగతి= ఉత్తమ లోకస్థితి; కల్గునట్లు గాన్= సిద్ధించే విధంగా; ఇప్పుడును= ఇప్పుడు కూడా; అజాత శత్రు= ధర్మరాజు యొక్క; అనుమతితోన్= అంగీకారంతో; కొన్ని పుణ్యక్రియలు= శ్రాద్ధ దానాది కర్మలు కొన్ని; ఆచరించి= చేసి; పోదము, కాక= (తర్వాత) అడవికి వెళ్దాం; అని= అనే విధంగా; నిశ్చయించి= నిర్ణయం చేసికొని; పాండవ+అగ్రజునకున్= పాండు కుమారులలో మొదటివాడైన ధర్మరాజుతో; తనకున్= ధృతరాష్ట్రుడికి; తపోవనగమనంబునకున్+అయి= తపస్సు చేసికొనడానికి, అరణ్యాలకు వెళ్ళటం కొరకు; పౌరుల అనుజ్ఞ= ప్రజలయొక్క అనుమతి; కొనవలయున్= పొందవలసి ఉన్నది; అని= అని; చెప్పన్+పనిచినన్= నివేదింపగా; అతండు= ఆ ధర్మరాజు; తగు పురజనులన్= అర్హులైన నగర వాసులను; ఎల్లను= అందరినీ; పడిచేసి= ఆజ్ఞపెట్టి; వెలార్చికొనుచున్= పంపుతూ; అఖిలబంధు మిత్రులున్= చుట్టాలూ; స్నేహితులూ అందరూ; తానును= స్వయంగానూ (ధర్మరాజూ); వచ్చి= వచ్చి; ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రుడియొక్క; మందిర-ద్వార-పురస్+భాగంబునన్= భవనంయొక్క వాకిటిముందు; నిలిచెన్= నిలువబడ్డాడు; ఆ+ఆంబికేయుండు= అంబికా పుత్రుడైన ఆ ధృతరాష్ట్రుడు; గాంధారియున్= గాంధారి కూడా; తోడన్ రాన్= వెంట రాగా; వెడలి= బయలుదేరి; వారి సన్నిధికిన్= వాకిట ఉన్న పౌర, బంధు మిత్రాదుల వద్దకు; చని= వెళ్ళి; బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, సంకులంబు+ఐన= బ్రాహ్మణులతోనూ, క్షత్రియులతోనూ, వైశ్యులతోనూ, శూద్రులతోనూ నిండిన; ఆ+నగర జనప్రకరంబు= ఆ నగరంలో ఉండే ప్రజలయొక్క సమూహాన్ని; ఉద్దేశించి= లక్ష్యం చేసికొని (వారితో) ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: తర్వాత గాంధారివైపు తిరిగి 'కొడుకులకు ఊర్ధ్వలోకాలు కలిగేటట్లుగా ఇపుడు కూడా ధర్మరాజు అంగీకారంతో, శ్రాద్ధాది పుణ్యకర్మలు కొన్ని చేసి తర్వాత అడవులకు పోదాం' అని నిర్ణయించాడు ధృతరాష్ట్రుడు. తపస్సుకై అరణ్యాలకు పోవటానికి పౌరుల అనుమతి తీసికొనా లని ధర్మరాజుకు కబురంపాడు. వెంటనే ధర్మరాజు రాజధానిలో ఉన్న ప్రజలలో అర్హులైన వారికి ఆజ్ఞ చేసి రప్పించాడు, బంధువులనూ, స్నేహితులనూ అందర్నీ తీసికొని తానూ వెళ్ళాడు. అందరూ కలిసి ధృతరాష్ట్రుడి ముందరి వాకిటి ముందు నిలిచారు. అపుడు గాంధారి వెంట రాగా ధృతరాష్ట్రుడు వారి వద్దకు వచ్చి, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులతో నిండి ఉన్న ఆ నగర ప్రజలతో ఇట్లా అన్నాడు.

సీ. **'కౌరవ కోటియు మీరుఁ బెద్దయుఁ గాల। మనఁగి పెనంగి యన్యోన్య సంభృ**
తాధిక స్నేహుల రై ప్రవర్తించితి। రనఘవర్తనులార! వినుఁడు నాదు
పలుకు; వృద్ధునకుఁ దపశ్చరణంబున। కై వనంబున కేఁగు టర్హ కర్మ;
ముచిత కృత్యంబుల యోజ మీ రెఱిఁగిన - యదియ కా మదిముదమార మీర

ఆ. **లెల్ల నా కనుజ్ఞ యిచ్చి కాననకుఁ బుచ్చుఁ। డనుడు సర్వజనులు నశ్రు పిహిత**
దృష్టు లగుచు గద్గదిక నెలుం గెడలఁగ। నార్తి దోఁప నేడ్చి రధిపముఖ్య! **85**

ప్రతిపదార్థం: అనఘవర్తనులార!= పాపం లేని నడవడి కలిగిన జనులారా!; కౌరవకోటియున్= కురువంశీయుల సమూహమూ; మీరున్= మీరూ; పెద్దయున్+కాలము= చాలా కాలంగా; అనఁగి-పెనంగి= కలిసి మెలసి; అన్యోన్య-సంభృత+అధిక+స్నేహులరు+ఐ= ఒకరి మీద ఒకరికి నిండిన అధికమైన ఆదరం కలిగినవారై; ప్రవర్తించితిరి= వ్యవహరించారు; నాదు పలుకు= (ఇపుడు) నా మాట; వినుఁడు= వినండి; వృద్ధునకున్= వయసు మీరినవాడికి; తపస్+చరణంబునకున్+ఐ= తపస్సు ఆచరించటం కొరకు; వనంబునకున్= అరణ్యాలకు; ఏఁగుట= వెళ్ళడం; అర్హవిధము; తగిన పద్ధతి; ఉచిత కృత్యంబుల ఓజ= తగిన పనుల క్రమం; మీరు= మీ రందరు; ఎఱిఁగిన+అది+అకా= తెలిసినదే కదా; మీరలు= మీరు; ఎల్లన్= అందరూ; మదిన్= మనస్సులో; ముదము+ఆరన్= సంతోషం నిండగా; నాకున్= నాకు; అనుజ్ఞ= అనుమతిని; ఇచ్చి= ఇచ్చి; కాననకున్= అరణ్యానికి; పుచ్చుఁడు= పంపండి; అనుడున్= ధృతరాష్ట్రుడు అట్లా అనగానే; అధిపముఖ్య!= ఓ జనమేజయ మహారాజా!; సర్వజనులు= అక్కడ ఉన్నవారు అందరూ; అశ్రు పిహిత దృష్టులు= కన్నీటి చేత కప్పబడిన చూపు కలిగినవారు; అగుచున్= అవుతూ; గద్గదికన్= డగ్గుత్తికచేత; ఎలుంగు= కంఠస్వరం; ఎడలఁగన్= క్షీణించగా; ఆర్తి= దుఃఖం; తోఁపన్= వ్యక్తం కాగా; ఏడ్చిరి= విలపించారు.

తాత్పర్యం: 'పుణ్యాత్ములారా! కౌరవులూ, మీరూ చాలా కాలంగా పరస్పరం దృఢ స్నేహంతో కలిసి మెలిసి ఉన్నారు. ఇపుడు నా మాట వినండి. వయసు మీరిన వాడికి తపస్సు చేసికొనే నిమిత్తం అడవులకు పోవటం అనేది తగిన పద్ధతి. యుక్తమైన పనుల క్రమం (ఎప్పుడు ఏ పని చేయాలో) మీకు తెలిసిందే కదా! అందుచేత మీ రందరూ సంతోషంగా అనుమతించి నన్ను అడవికి పంపండి. (అన్నాడు ధృతరాష్ట్రుడు). జనమేజయ మహారాజా! ధృతరాష్ట్రుడు అట్లా అనగానే అక్కడ ఉన్న వారంతా కళ్ళలో నీళ్ళు నిండిపోగా చూపు సరిగా లేనివారై, డగ్గుత్తిక వలన కంఠస్వరం క్షీణించి దుఃఖంతో విలపించారు. (అన్నాడు వైశంపాయనుడు).

వ. **విని ధృతరాష్ట్రుఁడు వారి కిట్లనియె.** **86**

ప్రతిపదార్థం: విని= వారి ఏడుపులు ఆలకించి; వారికిన్= వారితో; ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: బంధుజనాదుల ఏడుపులు విని ధృతరాష్ట్రుడు వాళ్ళతో ఇట్లా అన్నాడు.

సీ. **'ప్రజ ముద మొందంగఁ బాలించెఁ బుడమి శం। తనుఁ; డనంతరము శాంతనవు చేత**
రక్షితుఁ డగుచు మీరలు ప్రీతిఁ బొదల వి। చిత్రవీర్యుండు నిద్ధాత్రి యేలెఁ।
బదపడి పాండు నృపాలుండు మీరు హ। ర్షింపంగ భూమి రక్షించెఁ బిదప
ధర్మనందనుని చందము మీ యెఱింగిన। యది; సత్యధర్మాత్ముఁడైన యితని

తే. **ననుసరింపక యన్యాయ మాచరించి। దుర్ణయంబున నిల యేలి త్రుంచెఁ గులము**
నుర్విఁ గల భూపతులను దుర్యోధనుండు;। వాని దుశ్చేష్టలకు మూల మేన కాదె! **87**

ప్రతిపదార్థం: శంతనుఁడు= (భీష్ముడి తండ్రి) శంతన మహారాజు; ప్రజ= జనం; ముదము= సంతోషం; ఒందఁగన్= పొందే విధంగా; పుడమిన్= ఈ భూమిని; పాలించెన్= పాలించాడు; అనంతరము= శంతనుడి తర్వాత; శాంతనవు చేతన్= శంతనుడి కొడుకైన భీష్ముడి చేత; రక్షితుఁడు= కాపాడబడినవాడు; అగుచున్= అవుతూ; మీరలు= మీరు(ప్రజలు); ప్రీతిన్= సంతోషంతో; పొదలన్= వర్ధిల్లగా; విచిత్రవీర్యుండున్= విచిత్రవీర్యుడు కూడా; ఈ+ధాత్రిన్= ఈ భూమిని; ఏలెన్= పాలించాడు; పదపడి= ఆ తర్వాత; మీరు= మీరు (ప్రజలు); హర్షింపంగన్= సంతోషించే విధంగా; పాండు నృపాలుండు; భూమిన్= ఈ భూమిని; రక్షించెన్= కాపాడాడు; పిదపన్= ఆ తర్వాత (రాజవడం మొ॥); ధర్మనందనుని చందము= ధర్మరాజు సంగతి; మీ ఎఱింగిన+అది= మీకు తెలిసిందే; సత్య ధర్మాత్ముఁడు= యథార్థమైన ధర్మరూపుడు; ఐన= అయినటువంటి; ఇతనిన్= ఈ ధర్మరాజును; అనుసరింపక= అతడివలె ఆచరించకుండా; అన్యాయము= అధర్మం; ఆచరించి= చేసి; దుర్ణయంబునన్= అనుచితమార్గంలో; ఇల= ఈ భూమిని; ఏలి= పాలించి; దుర్యోధనుండు= దుర్యోధనుడు; కులమున్= కౌరవవంశాన్నీ; ఉర్విన్= ఈ భూమిపై; కల= ఉన్న; భూపతులన్= రాజులను; ఎల్లన్= అందరినీ; త్రుంచెన్= నాశనం చేశాడు; వాని= ఆ దుర్యోధనుడియొక్క; దుశ్చేష్టలకున్= దుర్మార్గాలకు; మూలము= ప్రధాన కారణం; ఏను+అ= నేనే; కాదె!= కదా!

తాత్పర్యం: (పౌరులారా!) ఈ రాజ్యాన్ని శంతను మహారాజు ప్రజారంజకంగా పరిపాలించాడు. తర్వాత అతడి కొడుకు భీష్ముడు కాపాడుతూ ఉండగా విచిత్రవీర్యుడు రాజ్యం చేశాడు. ఆ తర్వాత పాండురాజు ఈ రాజ్యాన్ని రక్షించాడు. అటు పిదప ధర్మరాజు రాజు కావటం అతడి పాలనం అంతా మీకు తెలిసిందే. ధర్మహృదయుడైన ఈతడిని అనుసరించకుండా అన్యాయంగా అవినీతితో రాజ్యాన్ని పాలించిన దుర్యోధనుడు కురువంశాన్నీ మిత్రులైన రాజులనూ నాశనం చేశాడు. నిజానికి దానికి కారణం నేనే.

వ. **అది మీ మనంబులం బెట్టక.** **88**

ప్రతిపదార్థం: అది= దుర్యోధనుడి దుర్మార్గాలకు తానే (ధృతరాష్ట్రుడే) మూలం అనే విషయం; మీ మనంబులన్= మీ హృదయాలలో; పెట్టక= ప్రవేశింపనీయకుండా.

తాత్పర్యం: దీనిని మీ మనసులలో పెట్టుకొనకుండా (తరువాతి పద్యంతో అన్వయం)

క. **మహి లెస్సఁగ రక్షించిన। మహిత గుణుల యన్న కొడుకు మనుమం డని నా**
కు హితంబు గోరి కరుణా। సహితుల రై యిం డనుజ్ఞ సద్వ్రతమునకున్. **89**

ప్రతిపదార్థం: మహిన్= ఈ భూమిని; లెస్సగన్= మంచిగా; రక్షించిన= పాలించినట్టి; మహిత గుణుల= గొప్ప గుణవంతు లైన; పాండు - విచిత్ర వీర్య - శంతనులకు; అన్న= అగ్రజుడూ; కొడుకు= పుత్రుడూ; మనుమండు= పౌత్రుడూ; అని= అనే అభిప్రాయంతో (నైనా); హితంబు= మేలు; కోరి= కోరుకొని; కరుణా-సహితులరు-ఐ= దయగలవారై; సత్+వ్రతమునకున్= తపశ్చరణం అనే మంచిపనికై; నాకున్= నాకు; అనుజ్ఞ= అనుమతి; ఇండు= ఇవ్వండి.

తాత్పర్యం: (పౌరులారా)! ఈ రాజ్యాన్ని చక్కగా పాలించిన గుణవంతులైన పాండురాజుకి అన్ననీ, విచిత్రవీర్యుడికి కొడుకుననీ, భీష్మశంతనులకు మనుమడిననీ మనసులో ఉంచుకొని (అయినా) నాకు మేలు కోరుతూ నా తపశ్చరణానికి దయతో అనుమతించండి.

విశేషం: దుర్యోధనుడి దుశ్చేష్టలకు మూలం కావడం చేత తనమీద ప్రజలకు కోపం ఉండాలి. ఒకవేళ అది మనసులో పెట్టుకొనకపోయినా ధృతరాష్ట్రుడిని అభిమానించాల్సిన గుణ విశేషం అతడిలో లేదు. అందుకే నన్ను చూసి కాకపోయినా ప్రజలు కీర్తించే, పాండురాజు, విచిత్రవీర్యుడు - (భీష్ముడు శంతనుడు - అనే పెద్దవారితో ఉన్న బంధుత్వాన్ని అనుసరించి అయినా తనకు మేలు కోరుకొమ్మని, ధృతరాష్ట్రుడి తాత్పర్యం.)

వ. అని యప్పు డజ్జనంబులమనంబుల లేకున్నను దన కీ ళ్లుగ్గడించి యరణ్యగమనానుజ్ఞాకరణంబునకుఁ బ్రార్థించి యవ్విభుండు వెండియు. **90**

ప్రతిపదార్థం: అని= అట్లా పలికి; అప్పుడు= ఆ సమయంలో; ఆ+జనంబుల= అక్కడ ఉన్న పౌరుల; మనంబులన్= మనస్సులలో; లేకున్నను= లేకపోయినప్పటికీ; తన కీళ్ళు= తాను చేసిన తప్పిదాలు; ఉగ్గడించి= చెప్పి; అరణ్య గమన అనుజ్ఞా కరణంబునకున్= అడవులకు వెళ్ళడానికి అనుమతి చేయటం కొరకు; ప్రార్థించి= వేడుకొని; ఆ+విభుండు= ఆ ధృతరాష్ట్రుడు; వెండియున్=మరలా,

తాత్పర్యం: (జనమేజయ మహారాజా!) ఆ పౌరులమనసులలో అపుడు లేకపోయినా ధృతరాష్ట్రుడు తాను లోగడ చేసిన తప్పిదాలను చెప్పి, అడవులకు వెళ్ళటానికి అనుమతిమ్మని వాళ్ళను ప్రార్థిస్తూ ఆ రాజు (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. వృద్ధ కృపణ పుత్త్ర విరహిత గాంధారి। యీ నెలంతఁ జూచి యైన మీర
లకట! కాననమున కరుగుట మే లని। మా కనుజ్ఞ యిండు మాన్యులార!' **91**

ప్రతిపదార్థం: మాన్యులార!= గౌరవించదగినవారలార!; గాంధారి= ఈ గాంధారి; వృద్ధ= వయసుచేత పెద్దది; కృపణ= తపః ప్రభృతి కర్మలచేత కృశించినదీ; పుత్త్రవిరహిత= కొడుకులను పోగొట్టుకొన్నది; అకట!= అయ్యో!; ఈ నెలంతన్= ఇటువంటి స్థితిలో ఉన్న ఆడదాన్ని, చూసి ఐన; కాననమునకున్= అడవికి; అరుగుట= వెళ్ళటం; మేలు+అని= మంచిదని; మీరలు= మీరందరు; మాకున్= మాకు; అనుజ్ఞ ఇండు= అనుమతి ఇవ్వండి.

తాత్పర్యం: పూజ్యు (లైన పౌరు) లారా! గాంధారి వృద్ధురాలు. వ్రతాదులవలన కృశించింది. కొడుకులను పోగొట్టుకొన్నది. అటువంటి గాంధారిని చూచి ఐనా మేము అడవులకు వెళ్ళటమే మంచిదని గ్రహించి అందుకు మాకు అనుమతి ఇవ్వండి.'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

వ. అని పలికి పాండవాగ్రజుం జూపి. 92

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలికి= మాటాడి; పాండవ+అగ్రజున్= ధర్మరాజును; చూపి= చూపించి.

తాత్పర్యం: ఆ విధంగా చెప్పి ధృతరాష్ట్రుడు పౌరులకు ధర్మరాజును చూపిస్తూ (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. తమ్ముల నడుమ నీతండు దిక్పాలక। మధ్య భాసితుఁ డైన మఘవుఁ బోలి
మహనీయ విభవ సమగ్రత వెలిఁగెడు। నేమిట నేమఱ కెపుడు మీర
లీతనిఁ బొదివి సంప్రీతిగ వర్తింపుఁ। డయ్య! యిల్లడ యిమ్మహానుభావు
నిడితి మీకడ; మిమ్ము నెల్ల భంగులఁ దన। పరిపాలనంబునఁ బరమసుఖులఁ

ఆ. గా నొనర్చువాఁడు గా నప్పగించిన। వాఁడ నేను మీకు వేఁడి దాఁకు
నట్లుగాఁ జరింప నస్మత్కులీనుల।కధిక దుఃఖకారి నైతిఁ గాని. 93

ప్రతిపదార్థం: ఈతండు= ఈ ధర్మరాజు; తమ్ముల నడుమన్= భీముడు మొదలైన నలుగురు తమ్ముళ్ళ మధ్య; దిక్పాలక మధ్య భాసితుఁడు= దిక్పాలకులైన దేవతలకు నడుమ ప్రకాశించేవాడు; ఐన= అయినటువంటి; మఘవున్= దేవేంద్రుడిని; పోలి= వలె; మహనీయ విభవ సమగ్రతన్= గొప్పదీ, లోటు లేనిదీ అయిన వైభవంతో; వెలిఁగెడున్= వెలుగుతున్నాడు; మీరలు= మీరు; ఏమిటన్= ఏవిషయంలోనూ; ఏమఱక= (మరువు లేకుండా) అప్రమత్తతతో; ఎపుడు(న్)= నిత్యమూ; ఈతనిన్= ఈ ధర్మరాజును; పొదివి= దగ్గరకు తీసికొని, (జాగ్రత్తగా); సంప్రీతిగన్= ఇష్టంగా; వర్తింపుఁడయ్య= నడుచుకొనండి; ఈ+మహానుభావున్= గొప్పవాడైన ఈ ధర్మరాజును; మీకడన్= మీవద్ద; ఇల్లడ= న్యాసంగా; ఇడితిన్= ఉంచాను; తనపరిపాలనంబునన్= తన యొక్కరాజ్యరక్షణ విధానంచేత; ఎల్ల భంగులన్= అన్ని విధాలుగానూ; మిమ్మున్= ప్రజలను; పరమసుఖులన్= మిక్కిలి సుఖపడేవారలు; కాన్= అయ్యేటట్లుగా; ఒనర్చువాఁడు కాన్= చేసేవాడిగా; అప్పగించిన వాఁడన్= ఒప్పజెప్పుతున్నాను; నేను= నేను; అస్మత్కులీనులకున్= నా వంశంవారికి; అధిక దుఃఖకారిన్= మిక్కిలి కష్టం కల్గించినవాడిని; ఐతిన్= అయ్యాను; కాని= అంతేతప్ప; మీకున్= ప్రజలకు; వేఁడి= కష్టం; తాఁకునట్లుగాన్= తగిలేవిధంగా; చరింపన్= నడవను; అధిక దుఃఖకారిన్= మిక్కిలి కష్టం కలిగించినవాడిని; ఐతిన్= అయ్యాను; కాని= అంతే తప్ప; మీకున్= ప్రజలకు; వేఁడి= కష్టం, (నొప్పి); తాఁకునట్లు కాన్= తగిలేవిధంగా; నేను= నేను (ధృతరాష్ట్రుడు); చరింపన్= నడవను.

తాత్పర్యం: ఈ ధర్మరాజు తమ్ములనడుమ దిక్పాలకుల మధ్య దేవేంద్రుడివలె వైభవంగా వెలిగిపోతున్నాడు. ఏ విషయంలోనూ ఏమరుపాటు లేకుండా, మీరు ఈతడిని పొదుపుకొని ఇష్టంగా నడుచుకొండి. మీవద్ద న్యాసంగా నేను ఈ ధర్మరాజును ఉంచుతున్నాను. తన పరిపాలనా విధానం చేత అన్ని విధాలుగా మిమ్మల్ని సుఖపెడతాడనే ఇతడిని మీకు రాజుగా అప్పగిస్తున్నాను. నా వాళ్ళకు కష్టం కలిగించాను కానీ, మీకు కష్టం కలిగే పని నేను ఎప్పుడూ చేయను.

క. అరయ నెన్నం డైనను। మీరలు నా కెగ్గు గాఁగ మెలఁగుట లే; దో
పౌరవరులార! నన్నున్। గారవమున ననుపరయ్య కాననమునకున్!' 94

ప్రతిపదార్థం: ఓ పౌరవరులార!= ఓ పురజనోత్తములారా!; ఆరయన్= పరిశీలించి చూడగా; మీరలు= మీరు; ఎన్నండు, ఐనను= ఏ నాడు కూడా; నాకున్= నాకు; ఎగ్గు= కీడు; కాఁగన్= కలిగేటట్లుగా; మెలఁగుట= వ్యవహరించటం; లేదు= జరగ లేదు; నన్నున్= అటువంటి నన్ను; గారవమునన్= ప్రేమతో; కాననమునకున్= అడవికి; అనుపరయ్య= పంపండి.

తాత్పర్యం: ఓ పౌరశ్రేష్ఠులారా! ఏనాడూ నాకు అపకారం కలిగే విధంగా మీరు ప్రవర్తించలేదు. ఇపుడు గూడా అదేవిధంగా ఆదరంతో నన్ను అడవికి పంపించండి.'

వ. అనినం బౌరజనంబు లేడ్పులు మ్రింగికొని యొండొరులం జూచుచు నూరకున్న నమ్మహీశ్వరుండు మఱియును. 95

ప్రతిపదార్థం: అనినన్= అని (ధృతరాష్ట్రుడు) పల్కగా; పౌరజనంబులు= ఆ పురజనులు; ఏడ్పులు= ఏడుపులను; మ్రింగికొని= అణచుకొంటూ; ఒండొరులన్= ఒక ళ్ళొకళ్ళని - పరస్పరం; చూచుచున్= చూస్తూ; ఊరకున్నన్= మాటాడకుండా ఉండగా; ఆ +మహీ+ఈశ్వరుండు= ఆ ధృతరాష్ట్రుడు; మఱియును= మరలా - (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు పై విధంగా చెప్పగా ఆ పురజనులు ఏడుపులు దిగమ్రింగుకొంటూ పరస్పరం ఒకళ్ళ నొకళ్ళు చూచుకొంటూ ఏమీ మాటాడకుండా ఊరకున్నారు. అప్పుడు ధృతరాష్ట్రుడే మళ్ళీ (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'సాధుచరిత్రయు శాంతయు నైన యి। గ్గాంధారియును నేను గాఢ వినయ
మార మీ తెలి విట్లు గోరుచు నున్నార। మఖిల ధర్మాభిజ్ఞుఁ డగు పరాశ
రాత్మజుండును ధార్మికాగ్రణి పాండవా। గ్రజుఁడును నాకు నరణ్య గమన
మునకు నిచ్చి రనుజ్ఞ; మోడ్పుఁ గే లౌదలఁ। గదియించి మిమ్ము వేఁడెదఁ గృపాఢ్యు

తే. లార! యనుమతి సేయుఁడు మీరు' ననుడు। వార లుత్తరీయంబులు వదన వినిహి
తములుగాఁ జేసికొని రోదనము రవంబు। లెసఁగఁ జేసిరి విను ధరణీశవర్య! 96

ప్రతిపదార్థం: సాధు చరిత్రయున్= గుణవంతమైన శీలం కలిగింది; శాంతయున్= నిర్వికారయూ; ఐన= అయినటువంటి; ఈ+గాంధారియును= గాంధారీ; నేను(న్)= నేనూ; వినయము+ఆరన్= మిక్కిలి అణకువతో; ఇట్లు= ఈ విధంగా; మీ తెలివి= మీ యొక్క అంగీకారాన్ని; కోరుచున్+ఉన్నారము= కోరుకొంటున్నాము; అఖిల+ధర్మ+అభిజ్ఞుఁడు= సమస్తములైన ధర్మములను చక్కగా తెలిసినవాడు; అగు= అయిన; పరాశర+ఆత్మజుండును= పరాశరమహర్షి కొడుకైన వ్యాసుడూ; ధార్మిక+అగ్రణి= ధర్మబద్ధమైన వర్తనం గల వారిలో ప్రథముడు అయిన; పాండవ+అగ్రజుండును= ధర్మరాజు కూడా; అరణ్య గమనమునకున్= అడవులకు వెళ్ళటానికి; నాకున్= నాకు; అనుజ్ఞ= అనుమతిని; ఇచ్చిరి= ఇచ్చారు; మోడ్పుఁగేలు= అంజలించిన చేతులు; ఔదలన్= శిరస్సుపై; కదియించి= గట్టిగా కూర్చి; మిమ్మున్= మిమ్మల్ని; వేఁడెదన్= ప్రార్థిస్తున్నాను; కృపా+ఆఢ్యులార!= అత్యధికమైన దయ గలిగిన వారలారా!; మీరును= మీరు కూడా; అనుమతి+చేయుఁడు= మా వన గమనానికి అనుజ్ఞ ఇవ్వండి; అనుడున్= అని ధృతరాష్ట్రుడు పల్కగా; ధరణీ+ఈశవర్య!= రాజ శ్రేష్ఠుడివైన జనమేజయమహారాజా!; విను= వినవలసింది; వారలు= ఆ పౌరులు; ఉత్తరీయములు= పై వస్త్రాలను; వదన వినిహితములు= ముఖం మీద ఉండేవి; కాన్= అయ్యేటట్లుగా; చేసికొని= చేసికొని; రవంబులు= (ఏడుపు) ధ్వనులు; ఎసఁగన్= మిక్కుటం కాగా; రోదనము చేసిరి= ఏడ్చారు.

తాత్పర్యం: సద్వర్తనం కలిగిందీ, ప్రశాంత చిత్తురాలూ, అయిన ఈ గాంధారీ నేనూ అరణ్య గమనానికి మీ అనుమతిని వినయంగా అర్థిస్తున్నాం. సమస్త ధర్మాలు తెలిసిన వ్యాసమహర్షి, ధర్మరాజూ మాకు అనుమతి ఇచ్చారు. రెండు చేతులు మోడ్చి శిరస్సుపై ఉంచి మిమ్మల్ని వేడుకొంటున్నాను దయావంతులైన నా పౌరులారా! మీరు కూడా మాకు అనుమతి ఇవ్వండి'. ఓ జనమేజయ మహారాజా! ధృతరాష్ట్రుడు అట్లా అనగానే అక్కడి పౌరులందరూ ఉత్తరీయాలు ముఖాలమీద కప్పుకొని, బిగ్గరగా ఏడ్చారు.

వ. అట్లేడ్చి యుడిగి తమయంతవట్టునుం గూడికొని కార్య వచనంబు లార్యచరితుండును జతురాలాప కల్యుం డును నగు శంబు వను విప్రోత్తమునకుం జెప్పి యిత్తెఱంగున ధృతరాష్ట్రునితో నాడుమని నియోగించిన నాతం డారాజు నగ్రభాగంబునఁ జేరి సవినయంబుగా ని ట్లనియె. 97

ప్రతిపదార్థం: అట్లు= ఆవిధంగా; ఏడ్చి= (కొంతసేపు) రోదించి; ఉడిగి= ఏడుపులు మానుకొని; తమ అంతవట్టునున్= తమలో తాముగా అందరూ; కూడికొని= కలిసి నిశ్చయించుకొని; కార్యవచనంబులు= అవసరమైన మాటలు; ఆర్య చరితుండును= ఉత్తమవర్తనం కలవాడూ; చతుర+ఆలాప+కల్యుండును= నిపుణము లైన మాటలలో సమర్థుడూ; అగు= అయినటువంటి; శంబువు+అను= శంబువు అనే పేరు గలిగిన; విప్ర+ఉత్తమునకున్= బ్రాహ్మణ శ్రేష్ఠుడికి; చెప్పి= వినిపించి; ఈ+తెఱంగునన్= ఈ (తాము చెప్పిన) విధంగా; ధృతరాష్ట్రునితోన్= ధృతరాష్ట్రుడికి; ఆడుము= చెప్పు; అని; నియోగించినన్= ఆ పౌరులు ఏర్పరచగా; ఆతండు= ఆ శంబువు; ఆ రాజు+అగ్రభాగంబునన్= ఆ ధృతరాష్ట్రుడికి ఎదురుగా; చేరి= నిలిచి; సవినయంబుగాన్= అణకువతో; ఇట్లు= ఈప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి మాటలకు పెద్దగా ఏడవటం ప్రారంభించిన పౌరులు కాసేపు అట్లా ఏడ్చిన తర్వాత ఏడుపు మానుకొని అందరూ కలిసి మాటాడుకొని, శంబువు అనే మాట నేర్పరికి ధృతరాష్ట్రుడితో ఈ విధంగా చెప్పుమని (కొన్ని మాటలు చెప్పి) ఏర్పాటు చేశారు. అపుడు ఆ శంబువు ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి ఎదురుగా ఉండి ఇట్లా చెప్పనారంభించాడు.

విశేషం: సాంబాఖ్యో బహ్వృచో - అని యీ బ్రాహ్మడి పేరు సాంబుడు అని ఒక మూలం, శాకల్యుడని తెనుగుభారతం ప్రత్యంతరాల్లో ఉన్నదట!. తిక్కన కాధారమైన మూలం నేటిదానికి కొంత భిన్నంగా ఉన్నదని ఇట్లాంటి సందర్భాలను బట్టి గుర్తించవచ్చును.

ధృతరాష్ట్రునితో శంబు వను విప్రుఁడు పౌరజన సమ్మతి చెప్పుట (సం. 15-15-10)

సీ. 'భరతవంశోత్తమ। పౌరజనంబులు తమ మాటలుగ భవత్సన్నిధాన
మున న న్నుపన్యాస మొనరింపఁ బంచిన। యట్టిభాషణము లేకాగ్రబుద్ధి
నవధరింపుము! మీ మహాన్వయంబున మహీ। విభులయం దొప్పమి వెదకి యైనఁ
గానము మము మీరు గన్నట్టి ప్రజల నె। ట్లట్ల రక్షించితి రాదరమున

తే. వినుము! దుర్యోధనుండు చేసిన యనర్థ। మొక్కటియు లేదు; నినుఁ ద్రిలోకోత్తరుండు
సత్యవతి కొడు కే మని సమ్మతించి। పంచె దానిన చేయుము పరమనియతి. 98

ప్రతిపదార్థం: భరతవంశ+ఉత్తమ!= భరతవంశంలో గొప్ప వాడివైన ధృతరాష్ట్ర మహారాజా!; భవత్ సన్నిధానమునన్= నీ సన్నిధిలో; తమమాటలుగన్= తమ సొంతమాటలుగా; ఉపన్యాసము ఒనరింపన్= తెలియజేయడానికి (ఉంచడానికి); నన్నున్= నన్ను; పౌరజనులు= ఈ పుర ప్రజలు; పంచిన+అట్టి= నియోగించినటువంటి; భాషణములు= మాటలు; ఏకాగ్రబుద్ధిన్= అవధానమతితో; అవధరింపుము= విను; మీ మహా+అన్వయంబునన్= మీ ఉత్తమవంశంలో; మహీవిభులయందున్= (పుట్టిన) రాజులలో; వెదకి+ఐనన్= వెదికి చూచినప్పటికీ; ఒప్పమి= తగనిది. (అనుచితం); కానము= చూడలేము; మీరు= భరతవంశపురాజులు; కన్న అట్టి ప్రజలన్= కన్న కొడుకులను; ఎట్లు= ఏవిధంగానో; అట్లు= ఆవిధంగా; మమున్= ఈ పౌరులను; ఆదరమునన్= వాత్సల్యంతో; రక్షించితిరి= పాలించారు; వినుము= ధృతరాష్ట్ర మహారాజా విను; దుర్యోధనుండు= నీకొడుకైన దుర్యోధనుడు; చేసిన= మాకు చేసిన; అనర్థము= తగనిపని; ఒక్కటియున్= ఒక్కటి కూడా; లేదు= లేదు; త్రిలోక+ఉత్తరుండు= మూడులోకములను, దాటిన మేలిమి కలవాడైన; సత్యవతి కొడుకు= వ్యాసమహర్షి; సమ్మతించి= అంగీకరించి; నినున్= నిన్ను; ఏమి+అని= ఏవిధంగా చేయుమని; పంచెన్= నియమించాడో; పరమ నియతిన్= దృఢమైన నియమంతో; దానిన్+అ= అదే; చేయుము= ఆచరించవలసింది.

తాత్పర్యం: భరతవంశంలో శ్రేష్ఠుడివైన ధృతరాష్ట్ర మహారాజా! ఈ పౌరులంతా కలిసి తమ మాటలుగా నీకు చెప్పుమని నన్ను నియమించిన మాటలను జాగ్రత్తగా విను. మీవంశంలో పుట్టిన రాజులలో వెదకినప్పటికి ఎక్కడా తగనిది అంటూ కనబడదు. మీరు కన్న కొడుకుల వలె, మమ్మల్ని (ప్రజలని) ప్రేమగా పాలించారు. నిజానికి దుర్యోధనుడైనా ప్రజలకు చేసిన అకృత్యమంటూ ఏమీ లేదు. ఇంక లోకోత్తరుడైన వ్యాసమహర్షి నిన్ను ఏం చేయు మని చెప్పాడో ఆ పని తప్పకుండా చేయవలసింది.

క. **అడ లెడఁబడఁగా మమ్మును। విడిచితి గురు వైన శోక వేదన యే మిం**
కుడిపికొనునప్పటికిఁ దో। డ్పడు నీదగు సద్గుణములు బంధులు వోలెన్. **99**

ప్రతిపదార్థం: అడలు= శోకం; ఎడఁబడఁగాన్= మనస్సుల పొందగా; మమ్మును= ఈ పౌరులను; విడిచితి(వి)= విడిచి వెళ్ళుతున్నావు; ఏము= మేము, ఇంకన్= ఇక పైని; గురువు= అధికం; ఐన= అయినటువంటి; శోకవేదన= దుఃఖంవలని ఏడుపును; ఉడిపి కొను+అప్పటికిన్= పోగొట్టుకొనడానికి; నీదు+అగు సద్గుణములు= నీకు సంబంధించిన గొప్ప లక్షణాలు; బంధులు పోలెన్= చుట్టాల వలె; తోడ్పడున్= మాకు సహకరిస్తాయి.

తాత్పర్యం: మాకు దుఃఖం అతిశయించేటట్లుగా నీవు మమ్మల్ని విడిచి వెళుతున్నావు. మేమీ దుఃఖం పోగొట్టుకొనే స్థితికి నీ గుణాలే మాకు బంధువులవలె తోడు నిలుస్తాయి. నీ గుణాలు తలచుకొంటూ నీ వియోగ దుఃఖం మరిచిపోతామని భావం.

విశేషం: ఈ పద్యం ప్రాచీన ప్రతులలో లేదు. మూలాన్ని బట్టి ముద్రాపకులు తర్వాత స్వీకరించి ఉంటారు. ఉండి ఉంటుందని ఊహించటానికి, లేదని మానటానికి ఇంకా పరిశీలనం చేయాలి. తిక్కన తర్వాతి వాళ్ళెవరైనా కలిపారా? ఇది లేకుంటే (98,100) వరస బాగుంది. 'అడిఁబడు' అనేది కొత్త శబ్దం. (ఇది శ,ర,లో గాని, సూ, ని,లోగాని కానరాదు. అడలు= శోకం, ఎడన్= హృదయంలో, పడఁగాన్= పొందగా - అని భావించవచ్చునేమో)

ఆ. **ధాత్రి శంతనుఁడు విచిత్రవీర్యుఁడుఁ బాండు। రాజు నెట్టు లట్ల రాజరాజు**
ప్రజకు సంతసముగఁ బాలించె; నీయందు। నతనియందుఁ గలదె యధిప! యెగ్గు? **100**

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; శంతనుఁడు(న్)= శంతనుడూ; విచిత్ర వీర్యుఁడున్= విచిత్రవీర్యుడూ; పాండురాజున్= పాండురాజూ; ఎట్టులు= ఏవిధంగా (పాలించారో); అట్లు+అ= ఆవిధంగానే; రాజరాజు= దుర్యోధనుడు కూడా; ప్రజకున్= మాకు; సంతసముగన్= ఆనందం కలిగే విధంగా; ధాత్రిన్= ఈ రాజ్యాన్ని; పాలించెన్= పరిపాలించాడు; నీయందున్= నీవిషయంలో గానీ; అతని యందున్= ఆ దుర్యోధనుడి విషయంలో కానీ; ఎగ్గు= తప్పు; కలదె?= ఉన్నదా? (లేదు).

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! మీ తాత శంతనుడూ, తండ్రి విచిత్రవీర్యుడూ, సోదరుడు పాండురాజూ ఎట్లాగో దుర్యోధనుడు కూడా అట్లాగే ఈ రాజ్యాన్ని ప్రజారంజకంగా పాలించాడు. నీలో గానీ, దుర్యోధనుడిలో గానీ తప్పు ఏమీ లేదు.

వ. భీష్మద్రోణ కృపద్రౌణి కర్ణ కృతవర్మ, శల్యు, లొక్క దిక్కును, భీమార్జుననకుల సహదేవ ద్రుపద విరాట సాత్యకు లొక్కదెసయు నై విధిప్రేరణంబునం బోరిరి; వారివలన నఖిల క్షత్త్రియసంక్షయం బావహిల్లె నది యొక్క దుర్యోధను చేతన యయ్యెనె? యట్లుం గాక రణంబు రాజుల కుత్తమ ధర్మంబ కాదె! యందుల మరణంబును సుగతికరణకల్యంబు; నీ సుతుండు సహాయులుం దానునుం బుణ్యలోకసౌఖ్యంబునంబొందియున్నవాఁడు; ధర్మాచరణశాలి వగు నీకును సుగతిప్రాప్తి సులభంబ యగు; నిట మీఁదటికి మా భాగ్యంబునం జేసి పరమ కృపాభరితు లైన పాండవులు మాకు రక్షకులుగాఁ బడసితి; మాకర్ణింపుము. 101

ప్రతిపదార్థం: భీష్మ- శల్యులు= భీష్ముడూ, ద్రోణుడూ, కృపాచార్యుడూ, ద్రోణుడి కొడుకయిన అశ్వత్థామా, కర్ణుడూ, కృతవర్మా, శల్యుడూ; ఒక్కదిక్కును= ఒక (కౌరవుల) పక్షంగానూ; భీమ.....సాత్యకులు= భీముడూ, అర్జునుడూ, నకులుడూ, సమదేవుడూ, ద్రుపదమహారాజూ, విరాటరాజూ, సాత్యకీ; ఒక్కదెసయును= ఇంకొక (పాండవుల) పక్షంగానూ; ఐ= ఏర్పడి; విధిప్రేరణంబునన్= విధి ప్రేరేపించగా; పోరిరి= యుద్ధం చేశారు; వారివలనన్= వారి అందరి (యుద్ధం) కారణంగా; అఖిల క్షత్త్రియ సంక్షయంబు= సమస్తమైన (బంధు - తదితర) క్షత్త్రియలోకానికీ, వినాశనం; ఆవహిల్లెన్= కలిగింది; అది= ఆ విధమైన క్షత్త్రియకుల నాశం; ఒక్క దుర్యోధను చేతన్+అ= దుర్యోధనుడు ఒక్కడి వలన మాత్రమే; అయ్యెన్+ఎ= సంభవించిందా?; అట్లును+కాక= అంత మాత్రమే కాకుండా; రాజులకున్= భూపాలకులకు; రణంబు= యుద్ధం; ఉత్తమధర్మంబు+అ= శ్రేష్ఠమైన ధర్మమే; కాదె= కదా; అందులన్= ఆ యుద్ధంలో; మరణంబును= చావు కూడా; సుగతి కరణ కల్యంబు= ఉత్తమ లోకస్థితిని కలిగించే సాధనమే; నీ సుతుండు= నీ కొడుకైన దుర్యోధనుడు; సహాయులన్= తన పక్షంలో యుద్ధం చేసినవారితో కలిసి; తానునున్= స్వయంగా తనుకూడా; పుణ్యలోక సౌఖ్యంబునన్= ఉత్తమలోకాలలో సుఖాలను; పొంది ఉన్నవాఁడు= అనుభవిస్తున్నాడు; ధర్మ+ఆచరణ శాలివి= ధర్మాన్ని అనుష్ఠించడంలో సమర్థుడివి; అగు= అయినటువంటి; నీకును= నీకు (ధృతరాష్ట్రుడికి) కూడా; సుగతి ప్రాప్తి= ఉత్తమలోకాలను (పొందటం) కల్గడం; సులభంబు+అ= తేలికే; అగును= అవుతుంది; ఇటన్= ఇంక; మీఁదటికిన్= పైన (మీ తరువాత); మా భాగ్యంబునన్, చేసి= మా అదృష్టవశాన; పరమ+కృపా+భరితులు= మిక్కిలి దయతో నిండినవారు; ఐన= అయినటువంటి; పాండవులు= పాండురాజు కుమారులు; మాకున్= మాకు, (ఈ రాజ్య ప్రజలకు); రక్షకులు కాన్= కాపాడేవారుగా; పడసితిమి= పొందాము; ఆకర్ణింపుము= ఆ పై మా వినతి వినవలసింది.

తాత్పర్యం: భీష్ముడూ, ద్రోణుడూ, కృపాచార్యుడూ, అశ్వత్థామా, కృతవర్మా, శల్యుడూ, ఒక (దుర్యోధనుడి) వైపూ, భీముడూ, అర్జునుడూ, నకులుడూ, సహదేవుడూ, ద్రుపదుడూ, విరటుడూ, మరో (ధర్మరాజు) వైపూ అయి విధి ప్రేరేపించడం మూలంగా యుద్ధం చేశారు. అందువలననే క్షత్రియు లంతా నశించిపోవటం జరిగింది. ఇదంతా దుర్యోధను

డొక్కడే చేశాడా? అదీ కాక రాజులకు యుద్ధం అనేది ఉత్తమ కర్తవ్యమైన ధర్మం గదా! ఆ యుద్ధంలో మరణం కూడా ఉత్తమలోకాలు సాధించి పెట్టేదే. నీకొడుకు (దుర్యోధనుడు) తనకు సహాయంగా తన పక్షంలో యుద్ధం చేసిన వారితో కలిసి తనుగూడా ఇపుడు పుణ్యలోక సౌఖ్యాలను అనుభవిస్తున్నాడు. ఎప్పుడూ ధర్మమే ఆచరించే స్వభావం కలిగిన నీకు కూడా ఉత్తమ లోకాలు సులువుగానే లభిస్తాయి. ఇంక ఆ తర్వాత - మా అదృష్టవశాన దయ నిండిన పాండవులను మాకు (రాజ్యానికి) రక్షకులుగా పొందాము. ఆ పైన వినుము.

తే. స్వర్గ మైనను బాలింపఁ జాలువారు। వారలకు భూమిపాలన విధి యనంగ
నెంతపని? వీరి చేతికి నిచ్చి తిపుడు। మమ్ము నెల్ల విధంబుల మనిచి తధిప! 102

ప్రతిపదార్థం: అధిప!= (ధృతరాష్ట్ర) రాజా!; స్వర్గము= దేవతల రాజ్యం; ఐనను= అయినప్పటికీ; పాలింపన్= రక్షించటానికి; చాలువారు= (ఈ పాండవులు) సమర్థులు; వీరలకున్= అటువంటి ఈ పాండవులకు; భూమి పాలన విధి= ఈ భూలోకాన్ని పాలించటం; అనంగన్= అనగా; ఎంత పని?= ఎంతటి కార్యము?; ఇపుడు= ఇప్పుడు; మమ్మున్= మమ్మల్ని (ఈ ప్రజలను); వీరి చేతికిన్= ఈ పాండవుల చేతికి; ఇచ్చితి(వి)= అప్పగించావు; ఎల్లవిధంబులన్= (ఈ పాండవులను మాకు రక్షకులుగా చేయటం ద్వారా మమ్మల్ని) అన్ని రకాలుగానూ; మనిచితి(వి)= బ్రతికించావు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! దేవలోకాన్నైనా పాలించే సామర్థ్యం ఉన్న పాండవులకు ఈ భూమిని పరిపాలించటం ఎంత పని? ఈ రాజ్యాన్ని పాండవులచేతి కప్పగించి, అన్ని విధాలుగా మమ్మల్ని బ్రతికించావు.

విశేషం: (స్వర్గమైనను.....యనంగ నెంతపని?...... అలంకారం కావ్యార్థాపత్తి.)

సీ. ధర్మపుత్త్రుఁడు దీర్ఘదర్శి, మహోదాత్త। సచివుండు, బంధు రక్షణ పరుండు,
రిపు నెడ నైనను గృప పెద్ద, భావసం। శుద్ధియుఁ బ్రతిభయు సువ్రతంబు
నితనికి వెన్నతో నిడినవి। యొరులను దనయట్ల కాఁ జూచుఁ దమ్ము లెల్ల
సన్నుతి కెక్కిన సకలగుణముల ని। మ్మహితాత్ముచందాన మమ్ముఁ బ్రోచు

తే. మాత్రయే దేవవిషయసమంచితాగ్ర। హార సజ్జన మాన్యంబు లైన గ్రామ
ములు దగంగ రక్షింతురు వెలయఁ దారు। నిత్తు రూళ్ళులు దేవమహీసురులకు. 103

ప్రతిపదార్థం: ధర్మపుత్త్రుఁడు= యమ తనయుడైన ధర్మరాజు; దీర్ఘదర్శి= దూరపు చూపు కలవాడు; మహా-ఉదాత్త-సచివుండు= మిక్కిలి అధికులయిన అమాత్యులు కలవాడు; బంధు-రక్షణపరుండు= చుట్టాలను పాలించేవాడు; రిపు-ఎడన్= శత్రువుపైన; ఐనను= కూడా; కృప= దయ; పెద్ద= అధికంగా, గలవాడు; భావ సంశుద్ధియున్= నిర్మలమైన ఆలోచనలు; ప్రతిభయున్= క్రొంగ్రొత్త ఆలోచనలతోడి బుద్ధి విశేషమూ; సువ్రతంబు= మంచినడవడికా; ఇతనికిన్= ఈ ధర్మరాజుకు; వెన్నతోన్= పిన్న నాటినుండి వెన్న (ఆహారం)తో; ఇడినవి= ఇచ్చినవి; ఒరులన్= ఇతరులను (సర్వభూతాలను); తన+అట్లు+అ= తనవలెనే; కాన్= అయ్యేవిధంగా; చూచున్= చూచుకొంటాడు; తమ్ములు= ఇతనికి సహోదరులు అయిన భీముడు మొదలైనవారు; ఎల్లన్= అందరూ; సన్నుతికిన్= శ్రేష్ఠమయిన పొగడ్తలకు; ఎక్కిన= స్థానమైన; సకల గుణములన్= సమస్తమైన మంచి లక్షణాలతో; ఈ+ మహిత+ఆత్ము= గొప్ప మనసు గలిగిన ఈ ధర్మరాజుయొక్క; చందానన్= విధంగానే; మమ్మున్= మమ్మల్ని, (ప్రజలను);

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రోచు-మాత్ర-ఏ= రక్షించడం మాత్రమే కాదు సుమా; దేవ విషయ= దేవతల (దేవ-ఆలయాలు నిర్వాహాదిదైవ- ఉపభోగం నిమిత్తంగా); సముచిత= ఒప్పుతున్న (ఇవ్వబడిఉన్న); అగ్రహార= అగ్రహారాలూ; సజ్జన= శ్రేష్ఠ (బ్రాహ్మణు)ల యొక్క; మాన్యంబులు= (గౌరవంగా ఇవ్వబడిన) మాన్యాలూ; ఐన= అయినటువంటి; గ్రామములు= ఊళ్ళు; తగంగన్= సముచితంగా; రక్షింతురు= కాపాడుతారు; తారున్= స్వయంగా తాము (పాండవులు) కూడా; వెలయన్= ప్రసిద్ధిగా; దేవ మహీసురులకున్= దేవతలకూ, బ్రాహ్మణులకూ; ఊళ్ళులు= గ్రామాలను; ఇత్తురు= ఇస్తారు.

తాత్పర్యం: ధర్మరాజు చాలా ముందుచూపు ఉన్నవాడు. గొప్ప మంత్రులు గలవాడు. చుట్టాలను పాలించే స్వభావం గలవాడు. శత్రువులపై గూడా దయ ఎక్కువగా గలవాడు. నిష్కల్మషమైన ఆలోచనలూ, సమయస్ఫూర్తితో గూడిన బుద్ధి వైభవమూ, మంచి నడవడిక ధర్మరాజుకు చిన్నప్పటినుంచీ అలవడ్డాయి. ఇతరు లందరినీ తనవలెనే చూస్తాడు. ఇతడి తమ్ముళ్ళు గూడా ప్రశంసించబడే మంచి లక్షణాలతో ఈ ధర్మరాజు వంటివారే. ఈ పాండవులును మమ్మల్ని (ప్రజలను) రక్షించటం మాత్రమే కాదు, దేవతల కొరకు అగ్రహారాలుగానూ, బ్రాహ్మణులకు మాన్యాలుగానూ పూర్వరాజులు ఇచ్చిన ఊళ్ళను కాపాడుతారు. అంతే కాకుండా దేవతలకూ, బ్రాహ్మణులకూ తాము స్వయంగా కూడా చాలా ఊళ్ళు ఇస్తారు.

క. మృదువులకుఁ జాల మృదువులు; । విదితయశా! వినుము పాండవేయులు కడు బె
ట్టిదులు బెడిదంపు వారికి । మదలోభిత్వములు లేవు మందున కైనన్. 104

ప్రతిపదార్థం: విదిత యశా!= ప్రసిద్ధమైన కీర్తి కల ఓ ధృతరాష్ట్ర మహారాజా!; వినుము= మా మనవి వినవలసింది; పాండవేయులు= పాండురాజు కొడుకులు; మృదువులకున్= సాధువులైన వారి విషయంలో; చాలన్= తగినంత (అధికంగా); మృదువులు= సాధు జనులు; బెడిదంపు వారికిన్= క్రూరుల విషయంలో; కడున్= మిక్కిలి; బెట్టిదులు= కఠినులు; మద లోభిత్వములు= గర్వమూ, పిసినిగొట్టుతనమూ; మందునకున్+ఐనన్= మందుకు కూడా; లేవు= (పాండవులందు) లేవు.

తాత్పర్యం: ప్రసిద్ధ మైన కీర్తి కలిగిన ధృతరాష్ట్ర మహారాజా! వినుము. పాండవులు మంచివారి విషయంలో చాలా మంచివారు. దుర్మార్గుల విషయంలో చాలా కఠినులు. ఆ పాండవులలో అహంకారం గానీ, లోభం కాని మందుకు కూడా (స్వల్పంగా నైనా) లేవు.

క. శూరులు, శాంత స్వాంతులు, । పౌరజన ప్రకర జానపదచయ నిత్యా
పార ప్రమదాపాదన । పారగు లతుల గురుభక్తి పరతంత్రాత్ముల్. 105

ప్రతిపదార్థం: శూరులు= పాండవులు శౌర్యం కలిగినవారు; శాంత-స్వాంతులు= (అయినా) ప్రశాంతమైన మనసులు కలవాళ్ళు; పౌరజన-ప్రకర= నగరవాసుల సమూహానికీ; జానపద చయ= పల్లెలలో నివసించే జనుల సమూహానికీ; అపార= మితిమీరిన; ప్రమద= సంతోషాన్ని; ఆపాదన= కల్పించటంలో; పారగులు= సర్వమూ తెలిసిన వాళ్ళు; అతుల= సాటిలేని; గురు= పెద్దల యందలి; భక్తి= సేవాభావానికి; పరతంత్ర= అధీనమైన; ఆత్ముల్= మనసులు కలిగినవారు.

తాత్పర్యం: పరాక్రమవంతులూ, నిర్వికారమైన మనస్సు కలిగిన వారూ అయిన పాండవులు పట్టణవాసులకూ, పల్లెలలో ఉండే ప్రజలకూ; నిరంతరమూ మిక్కిలి సంతోషం గలిగిస్తారు. పెద్దలమీద అత్యధికమైన భక్తి గలవారు.

తే. గొంతి దేవికిఁ గోడండ్రకును మనములఁ। గరుణ యగ్గల మై యుండు ధరణినాథ!
పౌరులందును జనపద ప్రజల యెడను। నాడుదురు మేలు తమ కగ్గ మైన యపుడు. 106

ప్రతిపదార్థం: ధరణినాథ!= (ధృతరాష్ట్ర) రాజా!; గొంతిదేవికిన్= కుంతికీ; కోడండ్రకును= ఆ కుంతీదేవికి కోడళ్ళైన ద్రౌపది, ఉలూచి, సుభద్రా మొదలైన వారికీ; మనములన్= మనస్సులలో; పౌరులందును= పుర (పట్టణ) ప్రజలపైనా; జనపద ప్రజల ఎడను= పల్లె ప్రజల విషయంలోనూ; కరుణ= దయ; అగ్గలము+ఐ= అధికంగా; ఉండున్= ఉంటుంది; తమకున్= వారికి; అగ్గము+ఐన+అపుడు= కనబడిన సమయంలో (ప్రజలకు); మేలు= మంచి; ఆడుదురు= చెపుతారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! కుంతీదేవికీ, ఆమె కోడళ్ళకూ పట్టణ ప్రజలమీదా, పల్లె జనుల మీదా దయ చాలా ఎక్కువ, వాళ్ళు ఆ ప్రజలు తమకు గోచరించినపుడు మేలు మాటలు చెపుతారు.

వ. వీర లెప్పుడు మము నీవు గారవించు। టెఱిఁగి మన్నింతు రమలినహృదయ! కలఁక
దక్కి ధర్మజుపై రాజ్యతంత్రభార । మిడి మనంబున నూఱడి యిచ్చ సలుపు.' 107

ప్రతిపదార్థం: అమలిన హృదయ!= స్వచ్ఛమైన మనసు కలిగిన వాడా! (ధృతరాష్ట్రా); నీవు= నీవు; మమ్మున్= మమ్మల్ని (ప్రజలను); ఎప్పుడు(న్)= నిరంతరమూ; గారవించుట= ఆదరించటం; ఎఱిఁగి= గ్రహించి; వీరలు= ఈ పాండవులు, వారికి సంబంధిన స్త్రీలూ; మన్నింతురు= మమ్మల్ని గౌరవిస్తారు; కలఁక= (నీవు) విచారాన్ని; తక్కి= విడిచిపెట్టి; రాజ్య తంత్ర భారము= ఈ రాజ్యాన్ని పాలించవలసిన బాధ్యతను; ధర్మజుపైన్= ధర్మరాజు మీద; ఇడి= ఉంచి; మనంబునన్= నీ మనస్సులో; ఊఱడి= ఊరట పొంది; ఇచ్చ= నీ ఇష్టం వచ్చిన పని, (నీ కిష్టమైన వనగమనం); చలుపు= చేయవలసినది.

తాత్పర్యం: నిర్మలమైన మనసు కలిగిన ధృతరాష్ట్ర మహారాజా! మమ్మల్ని నీవెప్పుడూ ఆదరించటం తెలిసిన ఈ పాండవులూ వారి స్త్రీలూ మమ్మల్ని గౌరవిస్తారు. విచారం విడిచిపెట్టు. సామ్రాజ్యం నిర్వహించవలసిన బరువు ధర్మజుడిపైన ఉంచుము. మనసు నిశ్చింత చేసికొమ్ము. నీకు తోచిన విధంగా (వనగమనం) చేయుము'.

వ. అని చెప్పె ని ట్ల విప్రముఖంబునఁ బౌరులభాషణంబులు విని ధృతరాష్ట్రుండు ప్రీతుం డయి సముచిత ప్రకారంబుల నజ్జనంబులం గ్రమంబున వీడుకొలిపి, కౌంతేయాది బంధువులను మిత్రులను నిజనివాసంబులకుం బోవం బనిచి, గాంధారీ సమేతుం డై యభ్యంతరమందిరంబున కరిగి యద్దినశేషంబును రాత్రియుం దగు వర్తనంబులఁ గడపి, మఱునాఁడు విదురుని రావించి 'మృతు లయిన బాంధవుల కెల్లను సవిశేషశ్రాద్ధంబులు చేయు తలంపు పుట్టి కొన్ని దివసంబులు పయనంబు మానితి; మానిత మాననీయ చరిత్రుం డగు ధర్మపుత్త్రుపాలికిం బోయి నీ విక్కార్యంబు సంఘటింపు' మని పనిచిన నతం 'డట్ల చేసెద' నని యనుజసహితుం డై యున్న యన్నరేంద్రునిం గాంచి. 108

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; చెప్పెన్(న్)= శంబువు పౌరుల అభిప్రాయాన్ని ధృతరాష్ట్రుడికి చెప్పాడు; ఇట్లు= ఈ విధంగా; ఆ+విప్రముఖంబునన్= ఆ బ్రాహ్మణుడైన శంబువు నోట; పౌరుల భాషణంబులు= అక్కడి పురజనులమాటలను; విని= ఆలకించి; ధృతరాష్ట్రుండు; ప్రీతుండు+అయి= సంతోషించినవాడై; సముచిత ప్రకారంబులన్= తగినవిధంగా; (ఎవరి

కెటువంటి పద్ధతి ఉచితమో ఆ విధంగా) ఆ+జనంబులన్= ఆ పౌరులను; క్రమంబునన్= వరుసగా అందరినీ; వీడు కొలిపి= పంపి; కౌంతేయ ఆదిబంధువులను= పాండవులు మొదలైన చుట్టాలనూ; మిత్రులనూ= స్నేహితులనూ; నిజ నివాసంబులకున్= తమతమ ఇళ్ళకు; పోవన్ పనిచి= వెళ్ళుండని పంపి; గాంధారీ సమేతుండు+ఐ= గాంధారితో కూడినవాడై; అభ్యంతర మందిరంబునకున్= తమ లోపలి ఇంటికి; అరిగి= వెళ్ళి; ఆ+దినశేషంబును= మిగిలి ఉన్న ఆరోజు పగటిసమయాన్ని; కడపి= దాటించి; మఱునాఁడు= తరువాతిరోజు; విదురునిన్= సోదరుడైన విదురుడిని; రావించి= పిలిపించి; (అతనితో ఇలా అంటున్నాడు) మృతులు+అయిన= మరణించినట్టి; బాంధవులకున్= చుట్టాలకు; ఎల్లను= అందరికీ; సవిశేష శ్రాద్ధంబులు= విశేషమైన శ్రాద్ధక్రియలు; చేయుతలంపు= చేయాలనే ఆలోచన; పుట్టి= ఏర్పడి; పయనంబు= అరణ్యాలకు చేయవలసిన ప్రయాణం; కొన్ని దివసంబులు= కొన్ని రోజులు; మానితి(న్)= మానుకొన్నాను; మానిత= గౌరవించబడేవారిచేత; మాననీయ= గౌరవించదగిన; చరిత్రుండు= నడవడిక కలిగినవాడు; అగు= అయినటువంటి; ధర్మపుత్త్రుపాలికిన్= ధర్మరాజువద్దకు; నీవు= నీవు (విదురుడు); పోయి= వెళ్ళి; ఈ+కార్యంబు= తాను మృతబాంధవులకు చేయ తలపెట్టిన శ్రాద్ధలకు అనుమతీ-ఏర్పాట్లు-అనే పని; సంఘటింపువము= సాధించవలసింది; అని= అని చెప్పి; పనిచినన్= నియోగించగా; అతండు= ఆ విదురుడు; అట్లు+అ= ఆ (ధృతరాష్ట్రుడు చెప్పిన) విధంగానే; చేసెదన్= చేస్తాను; అని= అనిచెప్పి; అనుజసహితుండు ఐ+ఉన్న= భీముడు మొదలైన తమ్ములతో కూడి ఉన్న; ఆ+నరేంద్రునిన్= ఆ (ధర్మ) రాజును; కాంచి= చూచి (ఎదురుగ ధర్మరాజుతో ఇట్లా అంటున్నాడు).

తాత్పర్యం: పౌరుల అభిప్రాయాన్ని ఆ బ్రాహ్మణుడి (శంబువు) నోట ఆ విధంగా విన్న ధృతరాష్ట్రుడు చాలా సంతోషించాడు. ఈ పౌరజనులకు ఎవరిస్థాయికి తగిన విధంగా వారికి ఆ ప్రకారంగా క్రమంగా వీడుకోళ్ళు చెప్పి ఇళ్ళకు పంపించాడు. తను గూడా గాంధారితో కలిసి లోపలి మందిరానికి వెళ్ళాడు. ఆరోజు ఇంకా మిగిలిఉన్న పగలు, ఆ రోజు రాత్రీ గడిపి, మర్నాడు విదురుడిని పిలిపించి అతడితో ఇట్లా అన్నాడు. మరణించిన బంధువులందరికి సవిశేషంగా శ్రాద్ధాలు పెట్టాలనే సంకల్పం కలిగింది. అందువలన అరణ్యగమనం కొన్నాళ్ళు మానుకొంటున్నాను. నీవిపుడు ఆ ధర్మరాజు దగ్గరికి పోయి ఈ పని ఏర్పాటు చేయుము. అనగానే విదురుడు సరే అని వెళ్ళాడు. అక్కడ తమ్ముళ్ళతో కలిసిఉన్న ధర్మరాజును చూచి అతడితో విదురుడు ఇట్లా అన్నాడు.

సీ. **'మీ తండ్రి సురనదీసూతి బాహ్లికులకు। సోమదత్తునకుఁ, దత్సూనునకును,**
దుర్యోధనాదిసుతులకును; దక్కును। గలుగు బంధులకు నుత్కర్ష మెసఁగ
శ్రాద్ధముల్ సేయు విచారంబు దోఁచిన। మసలెఁ గార్తికపౌర్ణమాసి దాఁక
వనమున కరుగ కప్పని నీకుఁ బోలిన। యట్టులు గావింపు' మనిన నాతఁ

తే. **డెంతయును వేడ్క నమ్మాట కియ్యకొనియె;। నర్జునుండును బ్రీతుఁ డై యర్వ్వ మనియె;**
భీముఁ డపుడు కమర్చిన మోముతోడ। విదురు వదనంబు సూచుచుఁ బెదవు లదర **109**

ప్రతిపదార్థం: మీ తండ్రి= (మీకు తండ్రి అయిన) ధృతరాష్ట్రుడు; సురనదీసూతి, బాహ్లికు= బాహ్లికుడికీ; సోమదత్తునకున్= (బాహ్లికుడి కొడుకు అయిన) సోమదత్తుడికీ; తద్ సూనునకునున్= ఆ సోమదత్తుడి కొడుకయిన భూరిశ్రవసుడికీ; దుర్యోధన+ఆది, సుతులకున్= దుర్యోధనుడు మొదలైన కొడుకులకూ; తక్కును కలుగు= ఇంకా మిగిలిఉన్న; బంధులకున్= యుద్ధంలో మరణించిన బంధువులకూ; ఉత్కర్షము= ఆధిక్యం; ఎసఁగన్= అతిశయించే విధంగా; శ్రాద్ధముల్= ఉత్తమ లోకాలు కలుగజేసే (శ్రాద్ధ) కర్మలను; చేయు విచారంబు= చేయాలనే ఆలోచన; తోఁచినన్= కలగటం వలన; వనమునకున్= అడవులకు; అరుగన్=

వెళ్లకుండా; కార్తిక పౌర్ణమాసి దాఁకన్= కార్తికమాస పూర్ణిమ వరకూ; మసలెన్= ప్రయాణం చేయకుండా ఆగాడు; నీకున్= నీకు; పోలిన+అట్టులు= తగిన విధంగా; కావింపుము= చేయవలసింది; అనినన్= అని విదురుడు పల్కగా; అతఁడు= ఆ ధర్మరాజు; ఎంతయున్= చాలా; వేడ్కన్= ఆనందంతో; ఆ+మాటలన్= విదురుడి మాటలకు; ఇయ్యకొనియెన్= అంగీకరించాడు; అర్జునుండును= అర్జునుడు కూడా; ప్రీతుఁడు+ఐ= ఆనందించినవాడై; అర్హము= (ధృతరాష్ట్రుడు చేయదలచినపని) తగినది; అనియెన్= అన్నాడు; అపుడు= ఆ సమయంలో; భీముఁడు= భీమసేనుడు; కమర్చిన మోము తోడన్= మండిపడుతున్న ముఖంతో; విదురువదనంబు= విదురుడి ముఖాన్ని; చూచుచున్= చూస్తూ; పెదవులు= పెదవులు; అదరన్= అదురుతుండగా (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: '(ధర్మరాజా!) మీ తండ్రి ధృతరాష్ట్రుడు, భీష్ముడికీ, బాహ్లిక, సోమదత్త, భూరిశ్రవులకూ; దుర్యోధనుడు మొదలైన కొడుకులకూ; ఇంకా యుద్ధంలో మరణించిన మిగిలిన బంధువులకూ, సవిశేషంగా, శ్రాద్ధ కర్మలు చేయాలనే ఆలోచన కలగటంవలన కార్తిక పూర్ణిమవరకూ అరణ్యాలకు వెళ్ళకుండా ఆగాడు. ఇంక నీవు తగువిధంగా చేయవలసింది' అన్నాడు విదురుడు ధర్మరాజుతో. ధర్మరాజు ఆ మాటలకు సంతోషంగా అంగీకరించాడు. అర్జునుడు కూడా అది తగిన పని అన్నాడు. భీముడు మాత్రం కోపంతో ఎర్రబడిన ముఖంతో విదురుడి ముఖంలోకి చూస్తూ పెదవులు అదురుతుండగా ఏదో అనబోయాడు.

వ. ఏమేనిం బలుకం జూచినన్ బీభత్సుండు మెలుపున నతని వారించి యల్లన యిట్లనియె. 110

ప్రతిపదార్థం: ఏమి+ఏనిన్= ఏదో; పలుకన్+చూచినన్= మాట్లాడబోతుండగా; బీభత్సుండు= అర్జునుడు; మెలుపునన్= చాకచక్యంతో; అతనిన్= ఆ భీముడిని; వారించి= (మాటాడకుండా) ఆపి; అల్లన= మెల్లగా; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: (భీముడు కోపంతో విదురుడితో ఏదో) అనబోతూ ఉండగా అర్జునుడు నేర్పుగా భీముడిని మాటాడకుండా నివారించి మెల్లగా ఇట్లా అన్నాడు.

సీ. 'రాజు వృద్ధుఁడు ధృతరాష్ట్రుండు భీష్మము। ఖ్య జ్ఞాతులకు శ్రాద్ధకర్మ మాచ
రింపఁ దలంచి యర్థించె; భవజ్జిత। ధనధాన్యములు నీవు దాని కియ్య
కొనమి యశంబునకును ధర్మమునకు వి। ధ్వంసంబు సేయదే? ధర్మతనయు
తలఁచినపని విఘ్నితము సేయఁదగునయ్య? । మనకు నయ్యంబికాతనయుఁ దొల్లి

ఆ. వేఁడికొండు మతఁడు వేఁడెడుఁ గానకు। నేఁగుచుండి మనల నిప్పు డింత
సూడవలదె? యొండులాడక యప్పని। సలుపు టొప్పు బాహుశాలి! నీకు. 111

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; రాజు= మనకు పాలకుడు; వృద్ధుఁడు= పైగా (వయసు మళ్ళిన) పెద్దవాడు; భీష్మ- ముఖ్య జ్ఞాతులకున్= భీష్ముడు మొదలైన దాయాదులకు; శ్రాద్ధకర్మము= సుగతులు కలగటం కొరకు శ్రాద్ధక్రియలు; ఆచరింపన్= చేయాలని; తలంచి= అనుకొని; భవత్-జిత-ధనధాన్యములు= నీవు ఇతరరాజులను జయించి తెచ్చిన సంపదలు; అర్థించెన్= కోరుతున్నాడు; దానికిన్= ధృతరాష్ట్రుడి ఆ కోరికను; నీవు= నీవు; ఇయ్యకొనమి= ఒప్పుకొనకపోవటం; యశంబునకును= కీర్తికి; ధర్మమునకున్= ధర్మానికీ; విధ్వంసంబు= వినాశనం; చేయదే?= కలిగింపదా?; ధర్మతనయు= ధర్మరాజు; తలఁచిన పని= ఉద్దేశించిన పని; విఘ్నితము చేయన్= అడ్డగించటం; మనకున్= (అతడి తమ్ములమైన) మనకు; తగునయ్య?= ఉచితమా?;

తొల్లి= పూర్వం; ఆ+అంబికాతనయున్= ఆ ధృతరాష్ట్రుడిని; వేఁడికొందుము= మనమే అర్థించేవాళ్ళం; అతఁడు= అటువంటి ధృతరాష్ట్రుడు; ఇప్పుడు= ఈనాడు; మనలన్= మనలను; కానకున్= అరణ్యానికి; ఏఁగుచున్+ఉండి= వెళ్ళుతూ; వేఁడెడున్= అర్థిస్తున్నాడు; ఇంత= ఈ మాత్రం ధృతరాష్ట్రుడి చిన్న పని; చూడన్వలదె?= మనం చేసిపెట్ట నవసరం లేదా?; బాహుశాలి!= మిక్కిలి భుజబలం కలిగిన భీమా!; ఒండులు= విరుద్ధమైనమాటలు; ఆడక= చెప్పక; ఆ+పని= ఆ ధృతరాష్ట్రుడి కార్యం; చలుపుట= చేయటం; నీకున్= నీకు; ఒప్పున్= తగును.

తాత్పర్యం: 'ధృతరాష్ట్రుడు మనరాజు. పైగా పెద్దవాడు. భీష్మాదు లైన దాయాదులకు శ్రాద్ధక్రియలు చేయుటకొరకు నీవు రాజులను జయించి సంపాదించిన ధనధాన్యాలు అడుగుతున్నాడు. నీవు దానికి ఒప్పుకోకపోవటం (మన) కీర్తిని, ధర్మాన్ని నాశనం చేస్తుంది. ధర్మరాజు చేయదలచుకొన్న పనిని మనం అడ్డగింపవచ్చునా? పూర్వం మనమే ధృతరాష్ట్రుడిని అర్థించేవాళ్ళం. అటువంటి ధృతరాష్ట్రుడు ఇప్పుడు, అదీ అడవులకు పోతూ, మనలను అర్థిస్తున్నాడు. ఆ పని మనం చేసి పెట్టవద్దా? మరొక మాట చెప్పకుండా నీవు ధృతరాష్ట్రుడి పని చేయటం ఉచితం' (అన్నాడు భీముడితో అర్జునుడు).

క. అని చెప్పఁగ జెవిఁ దాటిచి। విని ధర్మతనూజుఁ డంత విజయునిఁ బొగడెన్
మనమున నమ్మాటల క। య్యనిలతనయుఁ డిట్టు లనియె నన్నరుతోడన్. 112

ప్రతిపదార్థం: అని= పై ప్రకారంగా; చెప్పఁగన్= అర్జునుడు భీముడితో పల్కగా; అంతన్= అపుడు; ధర్మతనూజుఁడు= ధర్మరాజు; చెవిన్= తన చెవిని; తాటిచి= ఆ వైపు కూర్చి; విని= ఆలకించి; మనమునన్= తనమనస్సులోనే; విజయునిన్= అర్జునుడిని; పొగడెన్= ప్రశంసించాడు; ఆ+మాటలకున్= అర్జునుడన్న మాటలకు; ఆ+అనిలతనయుఁడు= వాయుపుత్రుడైన ఆ భీముడు; ఆ+నరుతోడన్= ఆ అర్జునుడితో; ఇట్టులు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా భీముడితో చెప్పినమాటలను అటువైపు చెవిపెట్టి ధర్మరాజు విన్నాడు. చాల సంతోషించి, అర్జునుడిని మనసులోనే ప్రశంసించాడు. అర్జునుడి మాటలకు అతడితో భీముడు ఇట్లా అన్నాడు.

భీముఁ డర్జునునితో ధృతరాష్ట్ర నుద్యోగంబునకుఁ బ్రతికూలించి చెప్పుట (సం.15-17-15)

క. 'ముసు చేసినయవి చాలవె?। విను గాంగేయాది బంధువితతికిఁ దగ నిం
కను శ్రాద్ధంబులు వలసిన। మనము దగమె చేయ దుష్టమతి యతఁ డేలా? 113

ప్రతిపదార్థం: మును= (ధృతరాష్ట్రుడు) ఇంతకు మునుపు; చేసిన+అవి= ఆచరించిన శ్రాద్ధాదికర్మలు; చాలవె?= సరిపోవా?; విను= (అర్జునా) వినవలసింది; గాంగేయ+ఆది బంధు వితతికిన్= భీష్ముడు మొదలైన బంధువుల సమూహానికి; ఇంకను= ఇంకా; తగన్= తగు విధంగా; శ్రాద్ధంబులు= శ్రాద్ధక్రియలు; వలసినన్= చేయవలసి వస్తే; చేయన్= చేయడానికి; మనము= మనం (పాండవులము); తగమె?= అర్హులం కాదా?; దుష్టమతి= దుర్బుద్ధి అయిన; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; ఏలా?= ఎందుకు (ఆచరించాలి)?

తాత్పర్యం: 'అర్జునా! ధృతరాష్ట్రుడు ఇంతవరకూ చేసిన శ్రాద్ధాలు సరిపోలేదా? భీష్మాదు లైన బంధువుల మూకకు ఇంకా చేయవలసివస్తే అందుకు మనం పనికి రామా? దుష్టబుద్ధి అయిన ధృతరాష్ట్రుడే ఎందుకు చేయాలి?

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. మఱచితె యాతఁడు మనలం। బఱచిన బన్నములు భీష్మ బాహ్లిక ముఖు ల

తతి నెటఁ బోయిరి? వారల। నెఱుఁగమె మన? మట్టి బంధు లేటికి మనకున్? 114

ప్రతిపదార్థం: అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; మనలన్= పాండవులను; పఱచిన బన్నములు= చేసిన అవమానాలు; మఱచితి(వి)+ఎ= మర్చిపొయ్యావా?; భీష్మ-బాహ్లిక-ముఖులు= భీష్ముడూ, బాహ్లికుడూ, మొదలైన ఆ బంధువులు; ఆ+తతిన్= మనలను అవమానించే టప్పుడు; ఎటన్+పోయిరి?= ఎక్కడికి వెళ్ళారు? వారలన్= ఆ భీష్మాదులను; మనము= మనం; (నీవూ,నేనూ); ఎఱుఁగమె?= తెలిసిన వాళ్లం కదా?; అట్టిబంధులు= అటువంటి చుట్టాలు; మనకున్= మనకు; ఏటికిన్?= ఎందుకు?

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రుడు మనకు చేసిన పరాభవాలు మరచిపోయావా? ఆ సమయంలో భీష్ముడూ బాహ్లికుడూ మొదలైన ఈ బంధువులు ఏమైనారు? వాళ్లసంగతి మనకు తెలియదా? అటువంటి బంధువులు మన కెందుకు? (వాళ్ళకు శ్రాద్ధక్రియలు చేయ నవసరం లేదు). కాబట్టి ధృతరాష్ట్రుడికోరిక, అంగీకరించ నక్కర్లేదు.

వ. వారి విషయం బైన మేలునకు మాఱాడుట యెగ్గు గా; దాకర్ణింపుము. 115

ప్రతిపదార్థం: వారి విషయంబు= భీష్మ ముఖ్యులైన జ్ఞాతులకు సంబంధించినది; ఐన= అయినటువంటి; మేలునకున్= ప్రయోజనానికి; మాఱు+ఆడుట= విరుద్ధంగా మాటాడటం; ఎగ్గు= తప్పు; కాదు= కాదు; ఆకర్ణింపుము= (అర్జునా! ఇంకొక మాట) విను.

తాత్పర్యం: భీష్మాదులను మనం బంధువులుగా గ్రహించనే అవసరం లేదు కాబట్టి వారికి సంబంధించిన మేలు (ఊర్ధ్వలోకాలు కలగడం) కొరకు విరుద్ధంగా మాటాడితే తప్పేమీ లేదు. ఇంకొక మాట వినుము.

తే. కర్ణునకుఁ జేయవలసిన గారవమున। గొంతి యింకను శ్రాద్ధ మత్యంతవిభవ

ముల్లసిల్లంగఁ జేయుఁగా కుచిత నిరతి। యావిధమునకు మాఱాట సూవె యెగ్గు.' 116

ప్రతిపదార్థం: కర్ణునకున్= కర్ణుడికి; చేయవలసిన= ఆచరించవలసిన; గారవమునన్= వాత్సల్యంతో; ఉచిత-నిరతిన్= తగినంతటి ఆసక్తి (శ్రద్ధ)తో; ఇంకను= ఇంకా, పూర్వంకంటె అధికంగా; అత్యంత-విభవము= మిక్కిలి వైభవం; ఉల్లసిల్లంగన్= ప్రకాశించేటట్లుగా; శ్రాద్ధము= శ్రాద్ధకర్మను; గొంతి= కుంతీదేవి; చేయున్+కాక= చేస్తుంది; ఆ విధమునకున్= కర్ణుడికీ, కుంతి-శ్రాద్ధం చేసే విషయానికి మాత్రమే; మాఱు+ఆట= విరుద్ధంగా పలకటం; ఎగ్గు= తప్పు; చూవె= సుమా.

తాత్పర్యం: ఊర్ధ్వ దైహిక క్రియలు కర్ణుడికి చేయాలనుకొంటే, పుత్రవాత్సల్యంతో, శ్రద్ధగా అపూర్వమైన వైభవంతో కుంతీదేవి చేయవచ్చు. దానికి ఎదురు మాటాడటం తప్పు.

వ. అని పలికి వెండియు. 117

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; పలికి= (అర్జునుడితో, భీముడు) చెప్పి; వెండియున్= మళ్ళీ ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అట్లా చెప్పి భీముడు అర్జునుడితో మళ్ళీ ఇలా అన్నాడు.

సీ. 'పాంచాలి నవమానపఱిచిన తెఱఁగును। నయ్యింతి వెనుక రా నడవిఁ గలయ
ధర్మజుచన్న చందంబును మది గీఱి। యుండక మఱ పెట్టు లొలసె నీకు
నాంబికేయుఁడు తండ్రి యగుట నాఁ డెటఁబోయె। భీష్ముండు మొదలగు పెద్దవారి
బాంధవం బేమయ్యెఁ బార్థ! యీవిదురుఁ డె। ఱుంగఁడే వారల భంగి?' యనిన

ఆ. ధర్మజుండు భీముఁ దగువచనముల న। దల్చె నరుఁడు మఱియుఁ దగఁడె పూజ
కాంబికేయుఁ? డిట్టు లనకుము మనకు న। గ్రజుని పనుపు సేఁత వ్రతము గాదె!' 118

ప్రతిపదార్థం: పార్థ!= అర్జునా!; పాంచాలిన్= (పాంచాలరాజు కూతురైన) ద్రౌపదిని; అవమాన పఱిచిన తెఱఁగును= పరాభవించిన విధమూ; ఆ+ఇంతి= ఆద్రౌపది; వెనుకన్= వెన్నంటి; రాన్= రాగా (అనుసరింపగా); అడవిన్= అడవులలో; కలయన్= చుట్టి; ధర్మజు-చన్న చందంబును= ధర్మరాజు తిరిగిన విధమూ; మదిన్= మనసులో; గీఱి+ఉండక= నాటుకొని నిలువకుండా; నీకున్= నీకు (అర్జునుడికి); మఱపు= మర్చిపోవటం; ఎట్టులు= ఏ విధంగా; ఒలసెన్= సంభవించింది; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; తండ్రి= మనకు (పెద్ద) తండ్రి; అగుట= కావటం, నాఁడు= ద్రౌపదిని, (మనలను) పరాభవించినరోజు; ఎటన్= ఎక్కడికి; పోయెన్?= పోయింది?; భీష్ముండు= భీష్ముడూ; మొదలు-అగువారి-బాంధవంబు= మొదలైన వాళ్ళకు మనతో ఉన్న చుట్టరికం; ఏమి-అయ్యెన్?= ఆ రోజు ఏమయిపోయింది?; వారల భంగి= ఆ ధృతరాష్ట్రుడు భీష్ముడు మొదలైనవారి విధానం; ఈ విదురుఁడు= (ధృతరాష్ట్రుడి మాట మోసుకొనివచ్చిన) ఈ విదురుడు; ఎఱుంగఁడే?= తెలిసిన వాడు కాదా?; అనినన్= అని (భీముడు) పల్కగా; భీమున్= భీముడిని; ధర్మజుండు= ధర్మరాజు; తగు వచనములన్= తగిన మాటలతో; అదల్చెన్= వారించాడు; నరుఁడు= అర్జునుడు; మఱియున్= ఇంకా (ఇట్లా అంటున్నాడు); ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; పూజకున్= (మనం) గౌరవించడానికి; తగఁడె?= అర్హుడా కాదా?; ఇట్టులు= ఈ విధంగా, (భీష్మ ధృతరాష్ట్రాదులను నిందిస్తూ); అనకుము= మాటాడకు; అగ్రజుని పనుపు= అన్నగారి ఆజ్ఞ; చేఁత= ఆచరించటం; మనకున్= అతడికి తమ్ముళ్లమైన మనకు అందరికీ; వ్రతము= నియమం; కాదె!= కదా!.

తాత్పర్యం: 'అర్జునా! ఆ రోజు ద్రౌపదిని సభలో పరాభవించిన విధమూ, ఆ ద్రౌపది వెన్నంటి రాగా ధర్మరాజు అడవుల వెంట తిరగటమూ, మనసులో నాటుకొనకుండా మర్చిపోవటం నీకు ఎట్లా సంభవించింది? ద్రౌపదిని అవమానించిన ఆ రోజు ఈ ధృతరాష్ట్రుడు తండ్రి కాడా? అపుడు భీష్మాదుల బాంధవ్యం ఎక్కడికి పోయింది? వాళ్ళ సంగతి ఈ విదురుడికి తెలియదా?' అని అంటూంటే ధర్మరాజు భీముడిని తగు మాటలతో వారించాడు. అర్జునుడింకా భీముడితో ఇట్లా అన్నాడు. ధృతరాష్ట్రుడు గౌరవానికి అర్హుడు కాడా? ఈ విధంగా మాటాడకుము. అన్నగారి ఆజ్ఞ నిర్వహించటం మనకు నియమం గదా!'

క. అని భీము నదిమి విదురునిఁ। గనుఁగొని మా తండ్రి పుణ్య కర్మము లెమ్మైఁ
దన బంధులకై చేయఁగ। మనంబునం దలఁచె నా సమంచితభంగిన్. 119

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; భీమున్= భీముడిని; అదిమి= మాటాడకుండా చేసి, (అదిమిపట్టి); విదురునిన్= విదురుడిని; కనుఁగొని= చూచి ఇట్లా అన్నాడు; మా తండ్రి= ధృతరాష్ట్రుడు; తన బంధులకున్= తన చుట్టాలకొరకుగా; పుణ్య కర్మములు= శ్రాద్ధ క్రియలు; ఏ+మైన్= ఏ విధంగా; చేయఁగన్= చేయటానికి; మనంబునన్= తన మనస్సులో; తలంచెన్= అనుకొన్నాడో; ఆ సమంచిత భంగిన్= ఆ గొప్ప తీరుగా (చేయవచ్చును). (తరువాతి పద్యంతో అన్వయం).

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: అని చెప్పి భీముడిని బలవంతంగా మాటాడకుండా చేసి అర్జునుడు విదురుడిని చూచి ఇట్లా అన్నాడు. 'మా తండ్రిగారైన ధృతరాష్ట్రుడు తన బంధువుల కొరకు శ్రాద్ధాది పుణ్యకర్మలు ఏ విధంగా చేయాలని మనసులో అనుకొన్నాడో ఆ విధంగా, ఘనంగా చేయవచ్చును.

క. **నా యింటి ధనము గైకొని। చేయఁగలాఁ డమ్మహీశు చిత్తము సంతో**
షాయత్తంబుగ వేగమ। పోయి యనఘ! చెప్పు మవ్విభుఁడు ప్రియ మందన్. **120**

ప్రతిపదార్థం: నా+ఇంటి ధనము= (నా ఇంట ఉన్న= నేను సంపాదించిన) నా ధనం; కైకొని= స్వీకరించి; ఆ+మహీ+ఈశు చిత్తము= ఆ ధృతరాష్ట్రుడి మనస్సు; సంతోష+ఆయత్తంబుగన్= (ఆనందానికి అధీనం కాగా) ఆనందంతో నిండిపోగా; చేయఁగలాఁడు= చేస్తాడు; అనఘ!= పుణ్యాత్ముడా! (విదురా); ఆ+విభుఁడు= ఆ ధృతరాష్ట్రుడు; ప్రియము-అందన్= సంతోషించేటట్లుగా; వేగము+అ= త్వరగా; పోయి= ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి; చెప్పుము= ఈ విషయం చెప్పవలసింది.

తాత్పర్యం: నా సంపదను గ్రహించి తన మనసు సంతోషించే విధంగా (తన బంధువులకు పుణ్యకర్మలు ఘనంగా) ధృతరాష్ట్రుడు చేస్తాడు. పుణ్యాత్ముడా! (విదురా!) ఆ ధృతరాష్ట్రుడికి ఆనందం కలిగించే ఈ విషయాన్ని తొందరగా వెళ్ళి చెప్పవలసింది' (అన్నాడు అర్జునుడు).

చ. **అన విని మెచ్చి ధర్మసుతుఁ డర్జునునిం గొనియాడి యాదరం**
బున విదురుం గనుంగొని 'ప్రభూత విధానములన్ నిజేచ్ఛ నా
ధనమును నర్జునార్థమును దాఁ గొని శ్రాద్ధము లాచరించు నాఁ
డనఘ! కురూద్వహుం డిది మదాత్మకు నిం పని విన్నవింపుమీ!' **121**

ప్రతిపదార్థం: అనన్-అని (అర్జునుడు) చెప్పగా; ధర్మసుతుఁడు= ధర్మరాజు; విని= ఆలకించి; అర్జునున్= అర్జునుడిని; మెచ్చి= మెచ్చుకొని; ఆదరంబునన్= వాత్సల్యంతో; కొనియాడి= ప్రశంసించి; విదురున్= విదురుడిని; కనుంగొని= చూచి (ఇట్లా అన్నాడు); అనఘ!= పాపరహితుడా!; కురు+ఉద్వహుండు= కురువంశాన్ని ఉద్ధరించేవాడైన-ధృతరాష్ట్రుడు; తా(న్)= తాను (స్వయంగా); నా ధనమును= నా సంపదనూ; అర్జున+అర్థమును= అర్జునుడి సంపదను; కొని= స్వీకరించి; శ్రాద్ధములు= భీష్మాదులకొరకు శ్రాద్ధకర్మలు; ప్రభూత విధానములన్= శ్రేష్ఠమయిన పద్ధతులలో- ఘనంగా; నిజ+ఇచ్ఛన్= తన ఇష్టానుసారంగా; ఆచరించువాఁడు= చేస్తాడు; ఇది= ఇట్లా చేయటం; మత్+ఆత్మకున్= నా అంతరంగానికి; ఇంపు= ఇష్టం; అని= అని; విన్నవింపుమీ= ఆ ధృతరాష్ట్రుడికి (నా మాటగా) వినయంగా చెప్పుము.

తాత్పర్యం: అర్జునుడి మాటలు విని ధర్మరాజు చాలా సంతోషించాడు. వాత్సల్యంతో అర్జునుడిని ప్రశంసించాడు. విదురుడిని చూచి - 'పుణ్యాత్ముడా! కురువంశాన్ని ఉద్ధరించే దృతరాష్ట్రుడు నా సంపదలూ, అర్జునుడి సంపదలూ తీసికొని తన ఇష్టప్రకారం ఘనంగా శ్రాద్ధకర్మలు చేస్తాడు. ఇట్లా చేయటమే నా మనసుకు ఇష్టం అని నీవు ధృతరాష్ట్రుడితో విన్నవించుము' (అన్నాడు).

వ. **అని చెప్పి మఱియు ని ట్లనియె.** **122**

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; చెప్పి= విదురుడితో పలికి; మఱియున్= మళ్ళీ; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= (ధర్మరాజు) అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ ధర్మరాజు విదురుడితో ఇట్లా అన్నాడు.

క. 'వనవాసాయాసంబుల। ననయంబును నలఁగి దాని నాత్మ నిడి మరు
త్తనయుండు పెక్కులాడెఁ ద। గని మాటల; దీన రాజుఁ గనలకు మనుమీ! 123

ప్రతిపదార్థం: మరుత్+తనయుండు= (వాయుపుత్రుడు) భీముడు; వనవాస-ఆయసంబులన్= అరణ్యవాసంలో కలిగిన శ్రమ వలన; అనయంబును= మిక్కిలిగా; నలఁగి= బాధపడి; దానిన్= ఆ బాధను; ఆత్మన్= మనసులో; ఇడి= ఉంచుకొని; తగని మాటలన్= అనుచితమైన మాటలు; పెక్కులు= చాలా; ఆడెన్= అన్నాడు; రాజున్= ధృతరాష్ట్రుడిని; దీనన్= ఈ అంశంలో; కనలకుము= కోపించవద్దు; అనుము+ఈ= అని చెప్పుము.

తాత్పర్యం: అరణ్యవాసంలో చాలా శ్రమపడ్డవాడు కాబట్టి భీముడు ఆ బాధలు మనసులో పెట్టుకొని అనుచితమైన మాటలు ఏవో చాలా అన్నాడు. అందుకు, ధృతరాష్ట్రుడితో కోపగించుకొనవద్దని చెప్పుము. (అని ధర్మరాజు విదురుడితో అన్నాడు).

క. ఇతఁ డేమి యన్న నే మగు? ధృతరాష్ట్రుఁడు మాకుఁ బరమదేవత; విను స
మ్మతిఁ దత్ప్రసాదముం బడ। సితి మేమును దత్కృతాభిషిక్తుల మనఘా! 124

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ భీముడు; ఏమి+అన్నన్= ఏ విధంగా మాటాడితే మాత్రం; ఏమి-అగున్?= ఏమవుతుంది?; ధృతరాష్ట్రుడు= ధృతరాష్ట్రుడు; మాకున్= పాండవులకు; పరమ దేవత= ఉత్కృష్టమైన దేవుడు; అనఘా!= పాపం లేనివాడా! (విదురా!); విను= వినవలసింది; సమ్మతిన్= నిండు మనస్సుతో; తద్-ప్రసాదమున్= ఆ ధృతరాష్ట్రుడియొక్క అనుగ్రహాన్ని; పడసితిమి= పొందాము; ఏమును= మేం; తద్+కృత+అభిషిక్తులము= ఆ ధృతరాష్ట్రుడి చేత ఈ రాజ్యానికి అభిషేకించబడినవాళ్ళం.

తాత్పర్యం: (విదురా!) ఈ భీము డేమంటే మాత్రం ఏమవుతుంది? ధృతరాష్ట్రుడే మాకు ఉత్తమ దైవం. హృదయపూర్వకంగా ఆయన అనుగ్రహాన్ని మేము పొందాము. ఆయనే ఈ రాజ్యానికి మమ్మల్ని అభిషేకించాడు'.

వ. అని పలికి యప్పుడమిఱేఁడు వికచవదనుం డగుచు. 125

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలికి= చెప్పి; ఆ+పుడమిఱేఁడు= ఆ (ధర్మ)రాజు; వికచవదనుండు= వికసించిన ముఖం కలిగినవాడు; అనుచున్= అవుతూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఆ విధంగా చెప్పిన తరువాత ధర్మరాజు ముఖవికాసంతో.

క. మా తండ్రి నిష్ట విధములఁ। బైతృక విధు లాచరింపఁ బంపుము రథ్య
వ్రాత కనక గో రథములన్। జేతి కొదవ నర్జునుండు చేర్చుచు వచ్చున్. 126

ప్రతిపదార్థం: మా తండ్రిన్= ధృతరాష్ట్రుడిని; పైతృక విధులు= భీష్మాది పితృదేవతలకు శ్రాద్ధకర్మలు; ఇష్ట విధములన్= తనకు నచ్చిన తీరుగా; ఆచరింపన్= చేయటానికి; పంపుము= సిద్ధం చేయుము; అర్జునుండు= అర్జునుడు; చేతికి+ఒదవన్= చేతికి అందేటట్లు; రథ్యవ్రాత, కనక, గో, రథములన్= గుర్రాల సమూహము, బంగారమూ, ఆవులూ, రథాలూ; చేర్చుచున్= ఏర్పాటు చేస్తూ; వచ్చున్= వస్తాడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: భీష్మాదులైన పితృదేవతలకు శ్రాద్ధకర్మలు తనకు నచ్చినట్లుగా నిర్వహించేటట్లు ధృతరాష్ట్రుడిని సిద్ధం చేయుము. అర్జునుడు ఉత్సాహంగా పెక్కు గుర్రాలూ, బంగారమూ, ఆవులూ, రథాలూ ఏర్పాటు చేస్తాడు.

క. గ్రామములు దేవతలకును। భూమిసురులకును గురు ప్రభువు ని మ్మను మీ
పో మసలితి చెపు మాతని। కీ మాటలు వలయు పనుల కీవు మెలఁగుమీ! 127

ప్రతిపదార్థం: గురు ప్రభువున్= గురువైన (కురునాథుడైన) ఆ ధృతరాష్ట్ర మహారాజును; దేవతలకును= దేవతలకూ; భూమిసురులకును= బ్రాహ్మణులకూ; గ్రామములు= ఊళ్ళు; ఇమ్ము+అనుము+ఈ= దానంగా ఇవ్వమని చెప్పు; పోన్= ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళడానికి; మసలితి(వి)= ఇప్పటికే ఆలస్యం చేశావు; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఈ మాటలు= (మేము)-నేను (అర్జునుడూ) చెప్పుమన్న మాటలు; చెపుము= నువ్వు చెప్పవలసింది; వలయు పనులకున్= అతడికి అవసరమైన పనులకు; ఈవు= నీవు (విదురుడు); మెలఁగుము+ఈ= నడుచుకొమ్ము (ఆయనకు అవసరమైన పనులు నీవు దగ్గరుండి చూస్తూ వుండుము).

తాత్పర్యం: మాకు తండ్రీ, పాలకుడూ అయిన ధృతరాష్ట్రుడిని దేవతలకూ బ్రాహ్మణులకు ఊళ్ళు ఇమ్మని చెప్పుము. నీవు ధృతరాష్ట్రుడి వద్దకు తిరిగి వెళ్ళటానికి, ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. నేను చెప్పిన మాటలు అతడికి చెప్పుము. అవసరమైన పనులు నీవు చూస్తూ ఉండుము.

క. అనినఁ బ్రియ మంది విదురుఁడు। చని యానృపుతో నజాతశత్రు కడకు నీ
పనిచిన పనికిం బోయితి। వినిపించితిఁ దెఱఁ గతండు విని మోదమునన్. 128

ప్రతిపదార్థం: అనినన్= ధర్మరాజు ఆ విధంగా చెప్పగా; విదురుఁడు= విదురుడు; ప్రియము+అంది= సంతోషించి; చని= ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి; ఆ నృపుతోన్= ఆ (ధృతరాష్ట్ర) రాజుతో, - (ఇట్లా అన్నాడు). అజాతశత్రు కడకున్= ధర్మరాజు వద్దకు; నీ-పనిచినపనికిన్= నీవు పంపిన పనికొరకు; పోయితిన్= వెళ్ళాను; తెఱఁగు= నీవు చెప్పిన విధం; వినిపించితిన్= (ధర్మరాజుకు) చెప్పాను; అతండు= ఆ ధర్మరాజు; విని (నీ ఉద్దేశాన్ని)= నేను చెప్పినదాన్ని గ్రహించి; మోదమునన్= ఆనందంతో - (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ధర్మరాజు మాటలకు విదురుడు చాలా సంతోషించాడు. వెంటనే ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళాడు. ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'నీవు పంపిన పనికొరకు ధర్మరాజు వద్దకు వెళ్ళాను. విషయం చెప్పాను. అతడు సంతోషించాడు.

క. నరువలను సూచె నతఁడుం। బరమ ప్రియ భరితుఁ డయ్యెఁ బార్థివవర! య
య్యిరువురుఁ బ్రాణంబులు డాఁ। పరు నీకును ధనము దాఁచు పని కలిగెడినే? 129

ప్రతిపదార్థం: నరు వలను= (ధర్మరాజు) అర్జునుడి (దిక్కు) వైపు; చూచెన్= చూచాడు; అతఁడున్= అర్జునుడు కూడా; పరమ ప్రియ భరితుఁడు= అత్యధిక సంతోషంతో నిండినవాడు; అయ్యెన్= అయినాడు; పార్థివవర!= ఓ ధృతరాష్ట్ర రాజా!; ఆ+ఇరువురు= ఆ ఇద్దరు, (ధర్మరాజూ, అర్జునుడూ); నీకును= నీకోసం; ప్రాణంబులు(ను)= తమ ప్రాణాలు సైతం; డాఁపరు= దాచుకునే వారు కాదు; ఇంక, ధనము= సంపద; దాఁచుపని= ఇవ్వకుండా దాచి పెట్టుకొనటం అనేది; కలిగెడిన్+ఏ?= సంభవిస్తుందా?

తాత్పర్యం: నీ కోరిక విని సంతోషించిన ధర్మరాజు అర్జునుడివైపు చూచాడు. అర్జునుడు ఇంకా ఎంతో సంతోషించాడు. ఓ రాజా! ఆ ధర్మరాజూ, అర్జునుడూ ఇద్దరూ నీ కొరకు తమ ప్రాణాలు సైతం దాచుకొనరు. ఇక సంపద దాచుకొనటం అనేది సంభవమా?

విశేషం: (అ-య్యిరువురు.....పని కలిగెడునే?....అలంకారం= కావ్యార్థాపత్తి...కైముత్యే నార్థసంసిద్ధిః కావ్యార్థాపత్తి రిష్యతే! (సజితస్త్వన్ముఖేనేందుః కా వార్తా సరసీరుహామ్)

క. **చేయుము విచ్చలవిడి గాం। గేయ ప్రముఖులు నిరస్త కిల్బిషు లై మో**
దాయత్త చిత్తులుగ భూ। నాయక! శ్రాద్ధములు జగమునం బొగ డెసఁగన్. **130**

ప్రతిపదార్థం: భూ-నాయక!= రాజా!; గాంగేయ ప్రముఖులు= భీష్ముడు మొదలైనవారు; నిరస్త-కిల్బిషులు+ఐ= తొలగిపోయిన పాపాలు కలవారై; మోద+ఆయత్త-చిత్తులు గన్= సంతోషంతో నిండిన మనసు కలవారు అయ్యే విధంగా; జగమునన్= లోకంలో; పొగడు= ప్రశంస; ఎసఁగన్= పెరిగే విధంగా; శ్రాద్ధములు= పరలోక క్రియలు; విచ్చలవిడిన్= యథేచ్ఛగా; చేయుము= ఆచరించుము.

తాత్పర్యం: రాజా! భీష్ముడు మొదలైన వాళ్ళందరూ తమ తమ పాపాలు పోగొట్టుకొని, మనసు నిండా సంతోషించే విధంగానూ, లోకంలో (నీకు) మంచిపేరు వచ్చే విధంగానూ, నీ ఇష్టం వచ్చిన విధంగా వాళ్ళకు శ్రాద్ధకర్మలు చేయుము.

చ. **కనకము మేలి రత్నములు గ్రామములన్ హయగోవ్రజంబులుం**
దనియఁగ నిమ్ము సర్వవసుధాసుర కోటులకున్ నిజేచ్ఛ నీ
తనయులు పుణ్యలోక సుఖధామము లై విలసిల్లునట్లుగా'
ననుటయు నాంబికేయుహృదయంబున మోదమెలర్చె భూవరా! **131**

ప్రతిపదార్థం: నీ తనయులు= నీ కొడుకులైన దుర్యోధనాదులు; పుణ్యలోక సుఖ ధామములు+ఐ= పుణ్యకర్మలు ఉండే మంచి లోకాలలోని సుఖాలకు నిలయాలు, అయి; విలసిల్లు+అట్లు కాన్= ప్రకాశించే తీరుగా; సర్వ వసుధా సురకోటులకున్= సమస్తమైన బ్రాహ్మణుల సమూహాలకు; తనియన్= తృప్తిగా; కనకము= బంగారూ; మేలి రత్నములు= మంచి విలు వైన రత్నాలూ; గ్రామములున్= ఊళ్ళూ; హయ, గో, వ్రజంబులున్= గుర్రాలు, ఆవుల మందలూ; నిజ+ఇచ్ఛన్= నీ యిష్టం వచ్చినట్లుగా; ఇమ్ము= దానం చేయుము; భూవరా!= (ఓ జనమేజయమహా) రాజా!; అనుటయున్= విదురుడు అట్లా అనగానే; ఆంబికేయు హృదయంబునన్= ధృతరాష్ట్రుడి మనస్సులో; మోదము= సంతోషం; ఎలర్చెన్= అతిశయించింది.

తాత్పర్యం: నీ కొడుకులు - దుర్యోధనాదులు పుణ్యలోక సుఖాలకు నివాసాలు అయ్యే విధంగా, సమస్తమైన బ్రాహ్మణ సమాజానికీ, వాళ్ళు తృప్తిపడేంతగా, నీ ఇష్టం వచ్చినట్లుగా, బంగారమూ, మంచి రత్నాలూ, ఊళ్ళూ గుర్రాల, ఆవుల మందలూ, దానం చేయుము. 'ఓ జనమేజయ మహారాజా! విదురు డిట్లా అనటంతోటే ధృతరాష్ట్రుడికి మనసులో సంతోషం అధికమైనది.

చ. **పదపడి భీమమాట లోకభంగి నెఱుంగఁగఁ జెప్పి, 'వాఁడు దు**
ర్మదుఁ, డవి పాటి గావు కురురాజ మహత్తర! పెట్టకుండు నీ

హృదయమునందు వాని నని యేర్పడ ధర్మజు పార్థువాక్యముల్
విదురుఁడు సెప్పె సంతసము వెల్లిగొనంగ ననేకభంగులన్. 132

ప్రతిపదార్థం: పదపడి= అనంతరం; భీము మాటలు= ధృతరాష్ట్రుడి కోర్కె విషయమై భీముడు అన్న మాటలను; ఒక భంగిన్= ఒక విధంగా; ఎఱుంగఁగన్= (ధృతరాష్ట్రుడికి) తెలిసేటట్లుగా; చెప్పి= పలికి; కురురాజ మహత్తర!= కురువంశపు రాజులలో మేలైన (ధృతరాష్ట్ర) రాజా!; వాఁడు= ఆ భీమసేనుడు; దుర్మదుఁడు= (చెడు) గర్వం కలవాడు; అని= (మదంతో) ఆ (భీముడు) పలికిన మాటలు; పాటి కావు= లెక్క చేయదగినవి కావు; వానిన్= ఆ మాటలను; నీ హృదయమునందున్= నీ మనస్సులో; పెట్టక+ఉండు(ము)= పెట్టుకొనకుము; అని= అనే ప్రకారంగా; సంతసంబు= (ధృతరాష్ట్రుడికి) సంతోషం; అనేక భంగులన్= బహువిధాలుగా - (మిక్కుటంగా); వెల్లి; కొనంగన్= ప్రవాహం కాగా; విదురుఁడు= విదురుడు; ధర్మజు, పార్థు, వాక్యముల్= ధర్మరాజూ, అర్జునుడూ చెప్పిన మాటలను; ఏర్పడన్= వివరంగా; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: తరువాత ఆ సందర్భంలో భీముడన్న మాటలు గూడా విదురుడు ఒక విధంగా ధృతరాష్ట్రుడికి తెలియజేశాడు. 'కురు రాజా! ఆ భీముడు దురహంకారి. అహంకారంతో అతడు అన్న మాటలు లెక్క చేయదగినవి కావు. నీవు వాటిని మనసులో పెట్టుకొనవద్దు' అని ధృతరాష్ట్రుడికి ఆనందం పొంగి ప్రవహించే విధంగా ధర్మరాజూ, అర్జునుడూ చెప్పిన మాటలను విదురుడు ధృతరాష్ట్రుడికి వివరంగా చెప్పాడు (అని వైశంపాయనుడు జనమేజయుడితో చెప్పాడు.)

ఆ. **అట్లు సంతసిల్లి యధిప కార్తిక పౌర్ణ। మాసి నవ్విభుండు మహిత భూమి**
దేవకోటి నెల్ల రావించి యంచిత। శ్రద్ధఁ జేయఁ దొడఁగె శ్రాద్ధవిభులు. 133

ప్రతిపదార్థం: అధిప!= (ఓ జనమేజయ) రాజా!; అట్లు= ఆ ప్రకారంగా; ఆ+విభుండు= ఆ (ధృతరాష్ట్ర) రాజు; సంతసిల్లి= ఆనందించి; కార్తిక పౌర్ణమాసిన్= కార్తికమాసంలో పూర్ణిమనాడు; మహిత భూమి దేవ కోటిన్= శ్రేష్ఠులైన బ్రాహ్మణుల సమూహాన్ని; ఎల్లన్= అంతటినీ; రావించి= రప్పించి; అంచిత శ్రద్ధన్= మిక్కిలి ఆసక్తితో; శ్రాద్ధ విధులు= పితృదేవతలకు శ్రాద్ధ కర్మలను; చేయన్+తొడఁగెన్= చేయటం మొదలుపెట్టాడు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ఆ ప్రకారంగా, ధర్మరాజార్జునుల అభిప్రాయాన్ని విదురుడి మాటలలో విని ధృతరాష్ట్రుడు చాలా సంతోషించాడు. కార్తికమాసంలో పూర్ణిమనాడు మంచి బ్రాహ్మణులను అందర్నీ పిలిపించి, భీష్మాదుల నుద్దేశించి మిక్కిలి ఏకాగ్రతతో, శ్రాద్ధకర్మలు చేయ నారంభించాడు.

సీ. **కనకాది వస్తువుల్ గడువేడ్క ధర్మనం। దనుఁడు పుత్తేర నుదాత్త భంగి**
బాహ్లికునకు, గంగపట్టికి, సోమద। త్తునకుఁ దదీయపుత్త్రునకుఁ దొలుత
నంచిత శ్రాద్ధంబు లాచరించె సుయోధ। నాది కుమారుల కందఱకును
బేర్వేర క్రియలు నీప్సిత విధంబులఁ దగ। నొనరించె సింధురాజునకుఁ దక్కుఁ

ఆ. **గలుగు బంధులకును వలయు రాజులకును। ద్రోణునకును బుద్ధిఁ దోఁచినట్టి**
యిష్టజనములకు నహీన భవ్యప్రకా। రములఁ బారలౌకికము లొనర్చి. 134

ప్రతిపదార్థం: ధర్మనందనుఁడు= ధర్మరాజు; కడున్= మిక్కిలి; వేడ్కన్= ఉత్సాహంతో; కనక+ఆది వస్తువుల్= బంగారం మొదలైన అవసర వస్తువులను; పుత్తేరన్= పంపించగా; ఉదాత్త భంగిన్= మంచిమార్గంలో ధృతరాష్ట్రుడు; తొలుతన్= మొదట; బాహ్లికునకున్= బాహ్లికుడికీ; గంగపట్టికిన్= గంగ కొడుకైన భీష్ముడికీ; సోమదత్తునకున్= సోమదత్తుడికీ; తదీయ పుత్త్రునకున్= సోమదత్తుడి కొడుకైన భూరిశ్రవసుడికీ; అంచిత శ్రాద్ధంబులు= తగిన (గొప్ప) విధంగా శ్రాద్ధ కర్మలను; ఆచరించెన్= చేశాడు; సుయోధన+ఆది కుమారులకున్= దుర్యోధనుడు మొదలైన కొడుకులు; అందఱకును= అందరికీ; పేర్వేర!= పేరు పేరునా; ఈ పితృవిధంబులన్= తన ఇష్టం వచ్చినట్లుగా; తగన్= తగినట్లుగా; క్రియలు= శ్రాద్ధకర్మలు; ఒనరించెన్= చేశాడు; సింధురాజునకున్= సింధుదేశపు రాజైన (అల్లుడు) సైంధవుడికీ; తక్కు కలుగు బంధులకును= మిగిలిన తన ఇతర బంధువులకూ; వలయు రాజులకును= అవసరమైన మిత్ర రాజులకూ; ద్రోణునకును= ద్రోణాచార్యుడికీ; బుద్ధిన్= తన మనస్సుకు; తోఁచిన అట్టి ఇష్ట జనములకున్= స్ఫురించిన తనకు ఇష్టమైన వాళ్ళకు; అహీన భవ్య ప్రకారములన్= తక్కువ కాని, తగిన (మన) పద్ధతులలో; పార లౌకికములు= ఊర్ధ్వలోకాలు కలిగించేటటువంటి (శ్రాద్ధ) కర్మలను; ఒనర్చి= చేసి.

తాత్పర్యం: ధర్మరాజు ఎంతో ఉత్సాహంగా, బంగారం, రత్నాలు, ఆవులు మొదలైన వస్తువులు పంపించాడు. ధృతరాష్ట్రుడు వాటితో, గొప్పగా-బాహ్లికుడికీ, సోమదత్తుడికీ, భూరిశ్రవసుడికీ, శ్రేష్ఠమైన విధంగా శ్రాద్ధకర్మలు చేశాడు. తన కొడుకులు అందరికి పేరు పేరునా, ఇష్టానుసారం తగు విధంగా శ్రాద్ధకర్మలు చేశాడు. తర్వాత అల్లుడైన సైంధవుడికీ, ఇంకా మిగిలి ఉన్న బంధువులకూ, అవసరం అనిపించిన మిత్రులైన రాజులకూ, ద్రోణుడికీ, ఇంకా మనసుకు తోచిన, తన కిష్టమైన వారికీ, లోటు లేనివిధంగా ఉత్తమలోకాలు కలిగించే శ్రాద్ధక్రియలను చేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. **అతులితరత్న కాంచన గవాశ్వ విభూషణ వస్త్రకన్యకా**
క్షితిముఖ వస్తుదానములు గీర్తన కెక్కఁగ నవ్విభుండు సు
వ్రతుఁ డయి చేసెఁ బంచదశవాసరముల్ నిజదానలౌల్య మ
ప్రతిహత వృత్తిఁ జెల్ల విని పాండుసుతాగ్రణి ప్రీతిఁ బొందఁగన్. **135**

ప్రతిపదార్థం: ఆ+విభుండు= ఆ ధృతరాష్ట్రుడు; సువ్రతుఁడు+అయి= మిక్కిలి దీక్ష కలిగినవాడై; నిజ దాన లౌల్యము= దానం చేయాలనే తన అత్యధికమైన వాంఛ; అప్రతిహత వృత్తిన్= అడ్డులేని విధంగా; చెల్లన్= సాగుతుండగా; పాండుసుత+అగ్రణి= పాండురాజు కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజు; విని= అది (ధృతరాష్ట్రుడు స్వేచ్ఛగా చేస్తున్న దానాది విషయాలు) తెలిసికొని; ప్రీతిన్= ఆనందాన్ని; పొందఁగన్= పొందుతుండగా; కీర్తనకున్= అందరి ప్రశంసకు; ఎక్కఁగన్= పొందే విధంగా; పంచదశవాసరముల్= పదిహేను రోజుల పాటు; అతులిత-రత్న-కాంచన-గో-అశ్వ-విభూషణ-వస్త్ర-కన్యకా-క్షితి-ముఖ-వస్తు-దానములు= సాటి లేనటువంటి రత్నాలూ, బంగారమూ, ఆవులూ, గుర్రాలూ, ఆభరణాలు, వస్త్రాలూ, కన్యలూ, నేలా, మొదలైన వస్తువుల దానం; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రుడు శ్రాద్ధ కర్మాచరణంలో మిక్కుటమైన దీక్ష కలిగినవాడై దానం చేయాలనే తన కోరిక అడ్డు లేని విధంగా సాగుతుంటే, అది తెలిసి ధర్మరాజు ఆనందిస్తుండగా, అందరూ ప్రశంసించే విధంగా, పదిహేను రోజులపాటు సాటిలేని రత్నాలూ, బంగారమూ, ఆవులూ, గుర్రాలూ, అలంకారాలూ, వస్త్రాలూ, కన్నెలూ, ఊళ్ళూ, మొదలైన అనేక వస్తువులను దానం చేశాడు.

ఆ. భూమి దాన విధులు భూవర యొక మాత్ర। నంబికాతనూజుఁ డాచరింప
నంతఁ బోక యూళు లగ్రజన్ములకు నీ నతనిఁ బనిచెఁ బాండవాగ్రజుండు. 136

ప్రతిపదార్థం: భూవర!= ఓ జనమేజయ మహారాజా!; అంబికా తనూజుఁడు= అంబిక కొడుకైన ధృతరాష్ట్రుడు; అగ్రజన్ములకున్= బ్రాహ్మణులకు; భూమిదానవిధులు= నేలను దానం చేసే పనులు; ఒక మాత్రన్= కొంతగా; ఆచరింపన్= చేయగా; పాండవ+అగ్రజుండు= (పాండురాజు కొడుకులలో పెద్దవాడైన) ధర్మరాజు; అంతన్+పోక= అంతటితో ఆగకుండా; ఊళులు= గ్రామాలు; ఈన్= ఇంకా దానం చేయటానికి; అతనిన్= ఆ ధృతరాష్ట్రుడిని; పనిచెన్= ప్రోత్సహించాడు.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! ధృతరాష్ట్రుడు బ్రాహ్మణులకు భూదానం కొంత చేస్తే, ధర్మరాజు అంతటితో ఆగకుండా, ఇంకా ఊళ్లకు ఊళ్ళు ఆ ధృతరాష్ట్రుడిచేత దానం చేయించాడు.

ధృతరాష్ట్రుఁడు గాంధారీసహితుండై వనంబునకుఁ బోవుట (సం.15-20-1)

వ. పనిచినం బ్రియంబు పెంపున హృదయంబు పల్లవింప నా భూవల్లభుం డనేకగ్రామంబు లగ్రహారంబులు గావించి గాంధారరాజు మొద లయిన నిజ బంధువులకు బహుళ దక్షిణలుగాఁ బార లౌకిక క్రియలు చేసెనిట్లు ధృతరా ష్ట్రుండు; భారత రణంబున మరణంబు నొందిన బంధు లోకంబునకుం బుణ్యలోక సౌఖ్యాతిశయ పదంబు లగు పరమ శ్రాద్ధంబులు నిర్వర్తించి కృతకృత్యుం డై సర్వ కృత్యంబులుం జలిపి పాడ్యమి నాఁడు। రేపకడ ఋత్విక్సమేతుం డై యిష్టి నడపి । పాండవులను దక్కటి బంధువులను మిత్రులను రావించి వనవాసంబునకు సంకల్పంబు చేసి, సకల భృత్యజనంబులకు నర్థధనంబు లిచ్చి, గాంధారీ సమన్వితుం డై వల్కలాజినంబులు ధరియించి, యక్షత గంధ పుష్పంబుల గృహంబుఁ, బూజించి సర్వపదార్థంబులుం బరిత్యజించి యద్దేవియుఁ గదిసి నడవ యాజకు లగ్నులు నుపకరణంబులును ధరియించి ముందటం జేరువ నరుగ నగరు వెడలె, నట్టియెడ నేతెంచి. 137

ప్రతిపదార్థం: పనిచినన్= ధర్మరాజు ఇంకా ఊళ్ళు దానం చేయుమని చెప్పగా; ఆ భూవల్లభుండు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; ప్రియంబు పెంపునన్= ఆనందంయొక్క ఆధిక్యంతో; హృదయంబు= మనస్సు; పల్లవింపన్= చిగురించగా; అనేక గ్రామంబులు= చాలా ఊళ్లను; అగ్రహారంబులు= బ్రాహ్మణులకు దానంగా; కావించి= ఇచ్చి; గాంధార రాజు= గాంధార దేశపు రాజు (భార్య గాంధారికి తండ్రి సుబలుడు) మొదలు అయిన; నిజ-బంధువులకున్= మొదలుగా కలిగిన తన చుట్టాలకు; బహుళ దక్షిణలుగాన్= అనేకం (అధికమూ) అయిన దక్షిణలతో; పార లౌకిక క్రియలు= ఉత్తమ లోకాలు కలుగజేసే పనులు (శ్రాద్ధకర్మలు); చేసెన్= నిర్వహించాడు; ఇట్లు= ఈ విధంగా; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; భారత-రణంబునన్= మహాభారత యుద్ధంలో; మరణంబున్-ఒందిన= (చావును పొందిన) మరణించిన; బంధులోకంబునకున్= బంధువుల సముదాయానికి; పుణ్య-లోక-సౌఖ్య అతిశయ-పదంబులు= ఉత్తమ లోకాలకు సంబంధించిన, సుఖం యొక్క ఆధిక్యానికి, ఆశ్రయాలు; అగు= అయినటువంటి; పరమ-శ్రాద్ధంబులు= ఉత్కృష్టములైన శ్రాద్ధకర్మలు; నిర్వర్తించి= ఆచరించి; కృత-కృత్యుండు+అయి= చేయదలచిన (వారందరికి) శ్రాద్ధకర్మలు చేసినవాడై; సర్వకృత్యంబులున్= సమస్త కార్యాలూ; చలిపి= (కార్తిక పూర్ణిమ నుండి 15 రోజులలో పూర్తిగా) చేసి; పాడ్యమి నాఁడు= ఆ మరుసటి రోజు (మార్గశీర్ష? శుద్ధ) పాడ్యమి రోజున; రేపకడ= ప్రాతఃకాలంలోనే; ఋత్విక్+సమేతుండు+ఐ= ఋత్విక్కులతో కూడినవాడై; ఇష్టి= అరణ్యయాత్రకొరకు; ఉదవసీయం అనే యజ్ఞం; నడపి= జరిపి; పాండవులను= పాండురాజు కొడుకులనూ (ధర్మరాజాదులనూ); తక్కటి-బంధువులను= ఇంకా ఇతర బంధువులనూ; మిత్రులను= స్నేహితులనూ; రావించి= రప్పించి; వనవాసంబునకున్= అరణ్యాల (కు వెళ్ళి) అందు నివసించటానికి; సంకల్పంబు చేసి= తన ఉద్దేశాన్ని చెప్పి;

సకల-భృత్య-జనంబులకున్= సమస్తమైన సేవకులకూ; అర్హ ధనంబులు= వారి వారి స్థాయికి తగినంతగా సంపదలను; ఇచ్చి= ఇచ్చి; గాంధారీ-సమన్వితుండు+ఐ= భార్య గాంధారితో కూడినవాడై; వల్కల+అజినంబులు= నారబట్ట, జింకచర్మాలూ; ధరియించి= కట్టుకొని; గృహంబున్= తన మందిరాన్ని, (విడిచేముందు); అక్షత-గంధ-పుష్పంబులన్= అక్షతలతోనూ, గంధంతోనూ, పూలతోనూ; పూజించి= అర్చించి; సర్వ పదార్థంబులున్= అన్ని విధములైన (గృహసంబంధి) వస్తువులనూ; పరిత్యజించి= విడిచిపెట్టి; ఆ+దేవియున్= భార్య; (గాంధారి); కదిసి-నడవన్= వెన్నంటి నడచి వస్తూండగా; ముందటన్= ఎదుట; చేరువన్= సమీపంలో; యాజకులు= యజ్ఞం చేసేవారు; అగ్నులు= అగ్నులనూ; ఉపకరణంబులును= సమిధలు మొదలైన ఇతర సాధనాలూ; ధరియించి= పుచ్చుకొని; అరుగన్= నడుస్తుండగా; (ధృతరాష్ట్రుడు) నగరు= తన అభ్యంతరమందిరాన్ని; వెడలెన్= దాటాడు; అట్టి-ఎడన్= ఆ సమయంలో; ఏతెంచి= అక్కడికి వచ్చి, (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ధర్మరాజు ఇంకా అధికంగా బ్రాహ్మణులకు గ్రామాలు దానం చేయుమని ధృతరాష్ట్రుడిని ప్రోత్సహించగా ధృతరాష్ట్రుడు అందుకు మనసులో చాలా సంతోషించాడు. అనేకాలైన గ్రామాలను బ్రాహ్మణులకు దానంగా అగ్రహారాలుగా ఇచ్చాడు. గాంధారరాజు మొదలైన చుట్టాలకు అధిక దక్షిణలతో శ్రాద్ధకర్మలు చేశాడు. ఈ విధంగా ధృతరాష్ట్రుడు భారతయుద్ధంలో మరణించిన తన బంధువులందరికీ ఉత్తమలోకాల సౌఖ్యం కలుగజేసే శ్రాద్ధ కర్మలు చేసి తన కోర్కె నెరవేర్చుకొన్నాడు. (అరణ్యగమనానికి వీలుగా) మిగిలిన అన్ని పనులూ పూర్తిచేసికొని మర్నాడు అంటే మార్గశీర్ష శుద్ధ పాడ్యమి నాడు ఉదయాననే ఋత్విక్కులను కూర్చుకొని, గృహం విడిచిపోవడానికి-ఉదవసీయం అనే యజ్ఞం చేశాడు. పాండవులనూ, మిగిలిన బంధువులనూ, తన స్నేహితులనూ అందరినీ పిలిపించాడు. అరణ్యాలకు బయలుదేరుతున్న విషయం చెప్పాడు. సేవకులకు అందరికీ వారి వారి స్థాయికి తగిన విధంగా ధనమిచ్చి గౌరవించాడు. గాంధారితో కలిసి, నారచీరలూ, జింకచర్మాలూ ధరించి, అక్షతలూ, గంధమూ, పుష్పాలతో ఇంటిని పూజించాడు. అందుకు సంబంధించిన వస్తువులన్నిటినీ విడిచిపెట్టాడు. భార్య వెన్నంటి నడుస్తుండగా, యాజకులు, అగ్నులు, సమిధలు మొదలైన సాధనాలను తీసికొని తనకు ముందుగా సమీపంలో వెళ్లుతుండగా వారి వెనుకే బయలుదేరి మందిరం దాటి వచ్చాడు. ఆ సమయంలో అక్కడికి-కుంతీ ప్రభృతులు వచ్చారు.

విశేషం: కార్తిక పూర్ణిమనాడు శ్రాద్ధకర్మ లారంభించాడు ధృతరాష్ట్రుడు. దానాదులతో 15 రోజులు (135పద్యం) ఆ పనులు చేశాడు. మర్నాడు పాడ్యమి అంటే మార్గ శీర్ష శుద్ధ ప్రతిపత్తు నాడు అరణ్యానికి బయలుదేరాడన్నమాట. ధృతరాష్ట్రుడు గృహాన్ని వీడు కొలిపిన సన్నివేశాన్ని ఒక క్రమంలో ప్రత్యక్షంగా ప్రదర్శించటం ఇక్కడి రచనలో విశేషం.

క. **గొంతి మొద లైన కౌరవ। కాంతా జను లెల్ల నెవ్వగలఁ బొగులుచుఁ బ**
క్ష్మాంతంబుల బాష్పసలిల। సంతానము లురలఁ దోన చనుదేరంగన్ **138**

ప్రతిపదార్థం: గొంతి= కుంతీదేవి; మొదలు+ఐన= మొదలైన; కౌరవ-కాంతా-జనులు= కురువంశపు స్త్రీలు; ఎల్లన్= అందరూ; నెవ్వగలన్= సంపూర్ణమైన విచారంతో; పొగులుచున్= దుఃఖిస్తూ; పక్ష్మ+అంతంబులన్= కనురెప్పల కొనలనుండి; బాష్ప-సలిల-సంతానములు= కన్నీటి బిందువుల సమూహాలు; ఉరలన్= దొర్లిపడుతుండగా; తోన్+అ= ఆ ధృతరాష్ట్రుడి వెంట; చనుదేరంగన్= వస్తూ ఉండగా- (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: కుంతి మొదలైన కురువంశపు స్త్రీలు అందరూ, మిక్కిలి దుఃఖంతో కుమిలిపోతూ కనురెప్పల చివరల నుండి కన్నీటి చుక్కలు రాలి పడుతుండగా వెంట వస్తూ ఉంటే-

వ. అజ్జనపతి చనుచుండె. 139

ప్రతిపదార్థం: ఆ+జనపతి= ఆ ధృతరాష్ట్రుడు; చనుచున్+ఉండె(న్)= పోతూ ఉన్నాడు.

తాత్పర్యం: (కుంతీప్రభృతి స్త్రీ లందరూ విచారిస్తూ వెంట వస్తూ ఉండగా) ఆ ధృతరాష్ట్రుడు (అరణ్యాభిముఖంగా) ముందుకు వెళ్ళుతూ ఉన్నాడు.

తే. పాండవాగ్రజుఁ డక్కురుభర్తవలను। శోకదీనుఁడై తప్పక చూచి యేడ్చి
'హా మహారాజ ముఖ్య! యెం దరిగె?' దనుచు। నొడలు కంపింపఁ జదికిలఁ బడియె నధిప! 140

ప్రతిపదార్థం: అధిప!= ఓ జనమేజయ మహారాజా!; పాండవ+అగ్రజుఁడు= (పాండురాజు కొడుకులలో పెద్దవాడైన) ధర్మరాజు; ఆ+కురు భర్తవలను= ఆ (కురువంశపురాజు) ధృతరాష్ట్రుడి వైపు; శోక-దీనుఁడు+ఐ= విచారం వలన జాలికొలిపే వాడు అయి; తప్పక= అదే పనిగా (దీర్ఘంగా); చూచి= చూచి; ఏడ్చి= రోదించి; హా-మహారాజ ముఖ్య!= అయ్యో! మహారాజులలో ప్రధానుడా? (ధృతరాష్ట్రుడా); ఎందున్= ఎక్కడికి; అరిగెదు= వెళ్తున్నావు; అనుచున్= అంటూ; ఒడలు= తన శరీరం; కంపింపన్= వణకుతుండగా; చదికిలఁ బడియెన్= కూలబడిపోయాడు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ఆ విధంగా నగరు విడిచివెళ్ళిపోతున్న ధృతరాష్ట్రుడిని, ధర్మరాజు రెప్పవేయకుండా, దుఃఖంతో జాలిగొలుపుతూ చూచి, 'ఏడ్చి అయ్యో మహారాజా!' ఎక్కడికి వెళ్ళుతావు అంటూ ఒళ్ళు వణకిపోతూ ఉండగా కూలబడిపోయాడు.(అని వైశంపాయనుడు జనమేజయుడితో అన్నాడు)

క. నరుఁ డనునయించె వెస న। న్నరపతి నెత్తుచును దా ననయమున్ వనటం
బురపురఁ బొక్కెం గురు భూ। వర! యద్దెస తెఱఁగు రాదు వాక్రువ్వంగన్. 141

ప్రతిపదార్థం: కురు-భూ-వర= (కురువంశపు రాజులలో శ్రేష్ఠుడా!) (జనమేజయ) రాజా!; నరుఁడు= అర్జునుడు; వెసన్= త్వరగా, వెంటనే; ఆ+నరపతిన్= ఆ ధర్మరాజును; ఎత్తుచును= లేవదీస్తూ; అనునయించెన్= ఓదార్చాడు; తాన్= తాను గూడా; అనయమున్= మిక్కిలిగా; వనటన్= దుఃఖంచేత; పురపురన్-పొక్కెన్= అధికంగా కుమిలిపోయాడు; ఆ+దెస-తెఱఁగు= ఆ సన్నివేశం విధం; వాక్రువ్వంగన్= మాటలతో చెప్పటానికి; రాదు= సాధ్యం కాదు.

తాత్పర్యం: జనమేజయా! (దుఃఖాతిశయంచేత ధర్మరాజు నేలమీద చతికిలబడిపోవటంతో) అర్జునుడు వెంటనే సత్వరంగా ఆ ధర్మరాజును లేవదీసి ఓదార్చాడు. తాను కూడా దుఃఖంతో కుమిలిపోయాడు. వారిద్దరి దురవస్థ తీరు మాటలతో చెప్పడం సాధ్యం కాదు.

వ. భీమసేన నకుల సహదేవులును గృప యుయుత్సు సంజయులును ధౌమ్యాది ధరణీ సురులును శోక వ్యాకులత్వంబు నొందిరి; గొంతి యడలుచు గాంధారి కరంబు నిజస్కంధంబున నిడికొని నడవ నంధనృపతి గాంధారీ స్కంధ భాగ కలిత బాహుం డై పోవుచుండె నప్పుడు పాంచాలియు సుభద్రయుఁజిత్రాంగదయు నులూపియు, సపుత్ర యగు నుత్తరయు మఱియుం గల యట్టి మగువలుం గురరీనిచయ నాదంబుల చందంబు దోఁప నాక్రందనంబు సేసి రయ్యవస్థ జూడంబునాఁడు పాండవులు పురంబు వెలువడునప్పటి దశం బోలియుండె నట్లు ధృతరా ష్ట్రుకానన గమనంబు నిశ్చితం బగుటయు నాబాల వృద్ధంబుగాఁ బురజనంబు గనుంగొనం జనుదెంచిన. 142

ప్రతిపదార్థం: భీమసేన-నకుల-సహదేవులును= భీముడూ, నకులుడూ, సహదేవుడూ; కృపయుయుత్సు-సంజయులును= కృపాచార్యుడూ, యుయుత్సుడూ (ధృతరాష్ట్రుడి కొడుకు), సంజయుడూ; ధౌమ్య+ఆది-ధరణీసురులును= ధౌమ్యుడు మొదలయిన బ్రాహ్మణులూ; శోక-వ్యాకులత్వంబున్= దుఃఖం చేత కలతను; ఒందిరి= పొందారు; గొంతి= కుంతీదేవి; అడలుచున్= దుఃఖిస్తూ; గాంధారి-కరంబు= గాంధారి చేతిని; నిజ-స్కంధంబునన్= తన భుజం మీద; ఇడికొని= ఉంచుకుని; నడవన్= నడుస్తుంటే; అంధ-నృపతి= ఆ గ్రుడ్డిరాజు, (ధృతరాష్ట్రుడు); గాంధారీ-స్కంధ-భాగ-కలిత-బాహుండు+ఐ= భార్య గాంధారియొక్క భుజ దేశం మీద (ఉంచిన తన చేయి కలవాడై) చేయు ఇచ్చి; పోవుచున్-ఉండెన్= పోతున్నాడు; అప్పుడు= ఆ సమయంలో; పాంచాలియున్= పాంచాల దేశపు రాజు (ద్రుపదుడి) కూతురు ద్రౌపదీ; సుభద్రయున్= సుభద్రా; చిత్రాంగదయున్= చిత్రాంగదా; ఉలూపియున్= ఉలూపీ; సపుత్ర= కొడుకుతో కలిసి (వచ్చి) ఉన్నది; అగు= అయిన; ఉత్తరయున్= (అభిమన్యుడి భార్య) ఉత్తరా; మఱియున్= ఇంకా; కల-అట్టి మగువలున్= మిగిలిన స్త్రీలూ; కురరీ-నిచయ-నాదంబుల-చందంబు= గొఱ్ఱె గుంపుల అరుపుల తీరు; తోఁపన్= స్ఫురించగా; ఆక్రందనంబు-చేసిరి= పెద్దగా ఏడ్చారు; ఆ+అవస్థ= ఆ స్థితి; జూదంబునాఁడు= ధర్మరాజు దుర్యోధనాదులతో జూదమాడిన రోజు; పాండవులు= పాండురాకుమారులు; పురంబున్= రాజధానిని; వెలువడిన-అప్పటి దశన్= విడిచి వెళ్ళేటప్పటి స్థితితో; పోలి-ఉండెన్= సమానమై ఉన్నది; అట్లు= ఆ విధంగా; ధృతరాష్ట్ర-కానన-గమనంబు= ధృతరాష్ట్రుడు అడవులకు వెళ్ళటం; నిశ్చితంబు= రూఢి; అగుటయున్= కాగా; పురజనంబు= ఆ నగరంలోని ప్రజలు; ఆబాలవృద్ధంబుగాన్= పిల్లలు మొదలుకొని వృద్ధులవరకూ అందరూ; కనుంగొనన్= ఆ ధృతరాష్ట్రుడిని చూడడానికి; చనుదెంచినన్= రాగా.

తాత్పర్యం: భీమనకుల సహదేవులూ, కృపుడూ, యుయుత్సుడూ, సంజయుడూ ఇంకా ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణులూ, దుఃఖంతో క్షోభించారు. కుంతి శోకిస్తూ గాంధారిచేతిని తన భుజంపై ఉంచుకొని నడుస్తున్నది. ధృతరాష్ట్రుడు గాంధారి భుజంపై చెయ్యివేసి పోతున్నాడు. అపుడు ద్రౌపదీ, అర్జునుడి భార్యలైన సుభద్రా, చిత్రాంగదా, ఉలూచీ, తనకొడుకును తీసికొని అభిమన్యుడి భార్య ఉత్తరా, ఇంకా అక్కడ ఉండే స్త్రీ జనం అంతా గొర్రెలమందల అరపులను స్ఫురింపజేస్తూ పెద్దగా ఏడ్చారు. వారి ఆ అవస్థ జూదం ఆడిన ఆ రోజు పాండవులు నగరు విడిచి వెళ్ళే సమయంలో వలె ఉన్నది. ఆ విధంగా ధృతరాష్ట్రుడు అరణ్యానికి పోవటం రూఢి కావడంతో పౌరుల పిల్లలు, పెద్దలూ అంతా ఆ ధృతరాష్ట్రుడిని చూడటానికి వచ్చారు.

వ. **వచ్చి రెండ కన్ను వాన కన్నును నెఱుం। గనిపురంధ్రు లెల్లఁ గరము వంతఁ**
దలరు నంతరంగములతోడ నక్కురు। వృద్ధుఁ జూడ నార్తి వికలగతుల. **143**

ప్రతిపదార్థం: ఎండకన్నును= ఎండ (ముఖమూ) పొడనూ; వాన కన్నును= వర్షపు (ముఖమూ) తీరునూ; ఎఱుంగని-పురంధ్రులు= ఎప్పుడూ తెలియని (చూడని), కుటుంబినులు (ఇల్లాళ్ళు); ఎల్లన్= అందరూ; ఆ+కురువృద్ధున్= కురువంశంలో పెద్ద అయిన ఆ ధృతరాష్ట్రుడిని; చూడన్= చూడడానికీ; కరము= మిక్కిలి; వంతన్= బాధతో; తలరు-అంతరంగముల తోడన్= చెదరిపోయిన మనస్సులతో; ఆర్తిన్= వ్యథవలన; వికల-గతులన్= వికలమైన (తడబడే) నడకలతో; వచ్చిరి= వచ్చారు.

తాత్పర్యం: ఎండా వానల పొడ తెలియని (ఎప్పుడు ఇల్లు విడిచి బయటకు రాని) ఇల్లాళ్ళు అంతా ఆ వృద్ధుడైన ఆ ధృతరాష్ట్రుడిని చూడటానికి దుఃఖంతో చెదరిన మనస్సులతోనూ, వ్యథ వలన తడబడుతున్న నడకలతోనూ బయటకు వచ్చారు.

విశేషం: 'ఎండకన్ను - వానకన్ను - నెఱుంగని' అనేది తెలుగు జాతీయం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

క. నేలను హర్మ్యంబులపై। నోలి నిలిచి చూచు మానవోత్కరముల శో
కాలాప విలాపంబులు। నేలకు మింటికిని నడుమ నిండి చెలంగెన్ 144

ప్రతిపదార్థం: నేలను= నేలమీదా; హర్మ్యంబులపైన్= ఎత్తైన మేడలమీదా; ఓలిన్= వరుసగా; నిలిచి= నిలువబడి; చూచు= (ధృతరాష్ట్రుడిని), చూస్తున్న; మానవ+ఉత్కరముల - శోక+ఆలాప-విలాసంబులు= మనుష్యుల సమూహాలు, దుఃఖంతో అనే మాటలూ, ఏడుపులూ; నేలకును= భూమికీ; మింటికిని= ఆకాశానికీ; నడుమన్= మధ్య ప్రాంతం అంతా; నిండి= వ్యాపించి; చెలంగెన్= అతిశయించాయి, ధ్వనించాయి.

తాత్పర్యం: అడవులకు వెళ్ళుతున్న ధృతరాష్ట్రుడిని చూడటానికి ఇండ్లలోనుండి బయటకు వచ్చిన జనం నేలమీదా, ఎత్తైన మేడలమీదా, క్రింది నుండి పైదాకా బారులు తీరి నిలబడి చూస్తూ ఉన్న మనుష్యుల గుంపులు దుఃఖంతో అనుకునే మాటలూ, ఏడుపులూ నేలకూ నింగికీ మధ్యభాగం అంతా నిండి విజృంభించాయి.

వ. ధృతరాష్ట్రుండుఁ బురద్వారంబు నిర్గమించుచుండి సకల పౌరజనంబుల నిలువం బనిచె; విదురుం డక్కురు వృద్ధునితోడ వనంబున కరుగుటకు దృఢనిశ్చయుం డై పలికె; సంజయుండు నవ్విధంబు వాఁ డయ్యెఁ; గృపాచార్యుండును యుయుత్సుఁడు నత్తెఱంగుమాట లాడిన నాంబికేయుండు వారిని వారించి ధర్మనందనున కప్పగించి నిలిపి, కోడండ్ర నెల్లను సముచిత వచనంబుల మరల నియమించిన, వార లా వైచిత్రవీర్యునకు గాంధారికిం బ్రణమిల్లి బాష్పంబులు వదనంబున వెల్లిగొనుచుండ వీడ్కొనియును బాండురాజమహిషిం జూచి కొని వెనుకం జనుచుండి; రా సమయంబున నజాతశత్రుం డాగొంతి కి ట్లనియె. 145

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడు కూడా; పురద్వారంబు= హస్తినగరం సరిహద్దు ద్వారాన్ని; నిర్గమించుచున్+ఉండి= దాటిపోతూ; సకలపౌరజనంబులన్= తనను వెన్నంటి వస్తున్న నగరవాసుల నందరినీ; నిలువన్= (ఆ పైన ముందుకు రాకుండా) ఆగిపొమ్మని; పనిచెన్= నియోగించాడు; విదురుండు= విదురుడు; ఆ+కురు వృద్ధునితోడన్= కురువంశంలో పెద్ద అయిన ఆ ధృతరాష్ట్రుడితో; వనంబునకున్= అరణ్యానికి; అరుగుటకున్= వెళ్ళటానికి; దృఢనిశ్చయుండు+ఐ= గట్టిగా, నిర్ణయించుకొన్న వాడై; పలికెన్= తన నిశ్చయాన్ని చెప్పాడు; సంజయుండును= సంజయుడు కూడా; ఆ+విధంబు వాఁడు+అయ్యెన్= అదేవిధంగా చేశాడు (వనగమనానికి దృఢంగా నిశ్చయించుకొని ఆ నిర్ణయాన్ని ధృతరాష్ట్రుడికి చెప్పాడు); కృపాచార్యుండును= కృపుడూ; యుయుత్సుఁడున్= యుయుత్సుడూ; ఆ+తెఱంగుమాటలు= ఆ విధమైన మాటలే (ధృతరాష్ట్రుడితో అడవులకు తామూ వస్తామని); ఆడినన్= చెప్పగా; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; వారినిన్= ఆ కృప యుయుత్సులను; వారించి= నివారించి; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; అప్పగించి= వారిని ఒప్పజెప్పి; నిలిపి= నగరంలోనే ఉండేటట్లు చేసి; కోడండ్రన్= ద్రౌపదీ, సుభద్రా మొదలైన కోడళ్ళను; ఎల్లన్= అందరినీ; సముచిత వచనంబులన్= తగుమాటలతో; మరలన్= తిరిగి ఇళ్లకు వెళ్ళడానికి; నియమించినన్= నియోగించగా; వారలు= ద్రౌపది మొదలైన ఆ కోడళ్ళు; ఆ వైచిత్ర వీర్యునకున్= ఆ ధృతరాష్ట్రుడికీ; గాంధారికిన్= గాంధారికీ; ప్రణమిల్లి= పాదాభివందనం చేసి; వదనంబునన్= ముఖంమీద; బాష్పంబులు= కన్నీటి బిందువులు; వెల్లిగొనుచుండన్= ప్రవహిస్తుండగా; వీడ్కొనియును= ధృతరాష్ట్రుడికి వీడ్కోలు (వెళ్ళి వస్తాం అని) చెప్పి గూడా; పాండురాజు మహిషిన్= పాండురాజు భార్య (తమ అత్త) అయిన కుంతిని; చూచికొని= దృష్టిలో ఉంచుకొని; వెనుకన్= వారి (ఆమె) వెనకే; చనుచుండిరి= అనుసరించి పోతూ ఉన్నారు; ఆ సమయంబునన్= అప్పుడు; అజాతశత్రుండు= ధర్మరాజు; ఆ గొంతికిన్= తల్లి అయిన కుంతితో; ఇట్లు= ఈప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు హస్తినగరద్వారం దాటిపోతూ తనవెంట వస్తూ ఉన్న పౌరులందరినీ అక్కడే ఆగిపొమ్మన్నాడు. విదురుడు ధృతరాష్ట్రుడితో అడవులకు పోవటానికి తిరుగులేని నిశ్చయం చేసికొని అదే విన్నవించాడు. సంజయుడూ అట్లాగే చేశాడు. కృపుడూ, యుయుత్సుడూ కూడా తనతో అడవులకు వస్తామంటే ధృతరాష్ట్రుడు వారిని నివారించాడు. వాళ్ళను ధర్మరాజు కప్పగించి నగరంలోనే ఉండుమన్నాడు. ద్రౌపది మొదలైన (పాండురాజు) కోడళ్ళను గూడా తగుమాటలతో తిరిగి ఇండ్లకు వెళ్ళండని చెప్పాడు. వాళ్లు ఆ ధృతరాష్ట్రుడికీ, గాంధారికీ ప్రణామం చేసి కన్నీళ్ళు ముఖమంతా నిండి ప్రవహిస్తుండగా, ధృతరాష్ట్రుడికి వీడ్కోలు చెప్పారు. అయినా తమ అత్తగారు ధృతరాష్ట్రుడిని అనుసరించి వెళ్ళుతూ ఉండడం చూచి తాము కూడా (కుంతికి) వెనకే ముందుకు వెళ్ళసాగారు. అప్పుడు ధర్మరాజు కుంతితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఊరి పొలిమేర వరకు సాగనంపడం ధర్మం గాబట్టి తనవెంట వస్తున్నవారిని పురద్వారం వరకు రానిచ్చిన ధృతరాష్ట్రుడు అక్కడినుండి వెనక్కు వెళ్ళుమన్నాడు. 'కురువృద్ధుఁడు' అన్నప్పటి వృద్ధశబ్దం విదురుడు ఆయనను సేవార్థం (179) అనుసరించాలనే నిశ్చయంలో 'ధృఢ' త్వానికి హేతువుగా వ్యక్తం చేస్తుంది. ఈ దార్ఢ్యం వలన ధృతరాష్ట్రుడు మారుమాటాడక ఒప్పుకొన్నాడు. కృప యుయుత్సుల అత్తెఱంగు మాటలాడారు మనసేమిటో, విదుర సంజయులలోని దృఢ నిశ్చయస్థితి లేకపోవడంవలన ధృతరాష్ట్రుడు 'వారిని వారించి' ఆపగలిగాడు తేలికగా, ఇంతవరకు తన ననుసరించి ఉన్నారు. గాబట్టి ఇకపై వారి బాగోగులు చూడటం కొరకు 'ధర్మనందనున కప్పగించాడు వాళ్ళను. తర్వాత కోడళ్ళను వెనక్కి వెళ్ళండన్నాడు. వీళ్ళను గూడ ఇక్కడ ప్రస్తావించటం తిక్కన జాగరూకతకు నిదర్శనం. మరలిపొమ్మంటే వాళ్ళు చివరిసారి అన్నట్లుగా గాంధారీ ధృతరాష్ట్రులకు పాదాభివందనం చేశారు. వెళ్ళి వస్తామని వీడ్కోలూ చెప్పారు. అయినా అత్తగారు ముందుకు వెడుతుంటే తాము తిరిగిపోవటం సరి గాదు కాబట్టి 'పాండురాజ మహిషి' చూచికొని' ఆమె అభిప్రాయంకొరకు ఎదురుచూస్తూ ఆమెనే చూస్తూ వెన్నంటి ముందుకే పోతున్నారు. ద్రౌపదీ ప్రభృతులింటికి పోవాలి. కుంతి నిర్ణయం తేలితే కాని అది కుదరదు. ఆ సంగతి గ్రహించిన ధర్మరాజు కుంతితో అదే మాటాడుతున్నాడు. కార్యకారణభావంతో క్రమంగా సన్నివేశాన్ని చిత్రీకరించటం ఇక్కడి విశేషం.

క. **'మా యయ్య కాననమునకుఁ । బోయెడు; నే నితనితోడఁ బోయెద శుశ్రూ**
షాయత్తుఁడ నై యుండెద । నీ యువిదలఁ గొనుచు మగిడి యేఁగుము తల్లీ!' **146**

ప్రతిపదార్థం: మా+అయ్య= మాకు తండ్రి (పూజనీయుడు) అయిన ధృతరాష్ట్రుడు; కాననమునకున్= అడవికి; పోయెడున్= పోతున్నాడు; నేను= నేను; ఇతని తోడన్= ఈ ధృతరాష్ట్రుడితో కూడి; పోయెదన్= అడవికి పోతాను; శుశ్రూషా+ఆయత్తుఁడను+ఐ= ఆయన సేవకు వశపడి; ఉండెదన్= అడవులలోనే ఉంటాను; తల్లీ= అమ్మా!; ఈ+ఉవిదలన్= ద్రౌపదీ ప్రభృతులైన కోడళ్ళను (ఇతర స్త్రీలను); కొనుచున్= తీసికొని; మగిడి= తిరిగి; ఏఁగుము= అంతఃపురానికి వెళ్ళుము.

తాత్పర్యం: 'అమ్మా! ఈ ధృతరాష్ట్రుడు అడవికి వెళ్ళుతున్నాడు. నేనూ ఇతడితో వెళ్ళుతున్నాను. ఆయనకు సేవ చేసికొంటూ అక్కడే ఉంటాను. నీవు నీ కోడళ్ళను తీసికొని ఇంటికి తిరిగివెళ్ళుము.'

చ. **అనుటయు గొంతి యక్కురుకులాగ్రణి కి ట్లను 'నీవు తోడఁ గా**
ననమున కేఁగుదెంచుట జనస్తవనీయచరిత్రుఁ డివ్విభుం
డనుమతి చేయునే? యుడుగు మా పని; యియ్యమ యత్త నాకు, నీ
మనుజవిభుండు మామ; గరిమంబుగ వీరలఁ గొల్చి పోయెదన్. **147**

ప్రతిపదార్థం: అనుటయున్= (ధర్మరాజు ఆ విధంగా) అనగానే; గొంతి= కుంతీదేవి; ఆ+కురుకుల+అగ్రణికిన్= కురువంశంలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నది; జన స్తవనీయ చరిత్రుఁడు= జనాలచేత స్తుతించబడే నడవడి కలిగిన వాడు అయిన; ఈ+విభుండు= ఈ ధృతరాష్ట్రుడు; నీవు= నీవు; తోడన్= తనతో; కాననమునకున్= అడవికి; ఏఁగుదెంచుట= రావటం, అనుమతి - చేయునే= అంగీకరిస్తారా?; ఆ పని= ధృతరాష్ట్రుడితో అడవికి వెళ్ళే పని; ఉడుగుము= మానుకొమ్ము; నాకున్= నాకు; ఈ+అమ= ఈమె (గాంధారి); అత్త= అత్త; ఈ+మనుజవిభుండు= ఈ ధృతరాష్ట్ర మహారాజు; మామ= మామ; వీరలన్= (అత్తమామలైన) గాంధారీ ధృతరాష్ట్రులను; గరిమంబుగన్= గౌరవంతో; కొల్చి= సేవిస్తూ; పోయెదన్= వీళ్ళతో అడవులకు వెళ్ళుతాను.

తాత్పర్యం: ఆ మాటలు విని కుంతి ధర్మరాజుతో ఇట్లా అన్నది. 'నీవు తనతో కలసి అడవులకు రావటానికి ధృతరాష్ట్రుడు అంగీకరిస్తాడా? కాబట్టి ఆ పని మానుకొమ్ము నాకు గాంధారీదేవి అత్త. ధృతరాష్ట్ర మహారాజు మామ. వీరిని సగౌరవంగా సేవిస్తూ నేను అడవులకు పోతాను.

తే. **ఇతని కియ్యమకును విను మేన చువ్వె। వలఁతి శుశ్రూష సేయంగ వత్స! మీర**
లాపనికి నేర్తురే? వీర లడవి కరుగ। నింట నుండఁగ నా మన మియ్యకొనునె? **148**

ప్రతిపదార్థం: వత్స!= నాయనా!; వినుము= వినుము; ఇతనికిన్= ఈ ధృతరాష్ట్రుడికీ; ఈ+అమకును= ఈమె (గాంధారి) కీ; శుశ్రూష= సేవ; చేయంగన్= చేయటానికి; ఏను+అ= నేను మాత్రమే; వలఁతిన్= సమర్థను; చువ్వె= సుమా; ఆ పనికిన్= వీరిని సేవించడానికి; మీరు; నేర్తురే?= సమర్థులా?; వీరలు= ఈ గాంధారీ ధృతరాష్ట్రులు; అడవికిన్= అరణ్యానికి; అరుగన్= వెళ్ళితే; ఇంటన్= ఇంట్లో; ఉండఁగన్= ఉండడానికి; నా మనము= నా మనసు; ఇయ్యకొనునే?= ఒప్పుకొంటుందా?

తాత్పర్యం: నాయనా! వినుము, గాంధారీ ధృతరాష్ట్రులకు సేవచేయటానికి నేను మాత్రమే సమర్థురాలిని. మీకు ఈ సేవలు చేయటం సాధ్యపడదు. గాంధారీ ధృతరాష్ట్రులు అడవికి పోగా ఇంట్లో ఉండటానికి నాకు మనసొప్పదు.'

వ. **అనిన నా ధర్మపుత్త్రుండును దమ్ములు నుచిత వచనంబుల వేఁడికొనిన నద్దేవి యగ్రతనయుం గనుంగొని.** **149**

ప్రతిపదార్థం: అనినన్= అని కుంతి పలుకగా; ఆ ధర్మపుత్త్రుండును= ఆ ధర్మరాజు; తమ్ములును= ఆ ధర్మరాజు తమ్ముళ్ళు భీమాదులూ; ఉచిత వచనంబులన్= తగినమాటలతో; వేఁడికొనినన్= కుంతిని (ఆగిపొమ్మని) ప్రార్థించగా; ఆ+దేవి= ఆ కుంతి; అగ్రతనయున్= పెద్దకొడుకును; కనుంగొని= చూచి; (ఇట్లా అన్నది).

తాత్పర్యం: అని కుంతీదేవి పలుకగా ధర్మరాజు అతడి తమ్ములూ కలిసి తగిన మాటలతో ఆమెను ఆగిపొమ్మని వేడుకొనగా, ఆమె ధర్మరాజుతో (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **'వీరలయెడఁ గొడుకా! యప। చారంబులు పలుకుదునె? విచారము విడు; మే**
నే రూపంబున నిలువన। గారవమున నిది వ్రతంబుగాఁ గైకొంటిన్.' **150**

ప్రతిపదార్థం: కొడుకా!= పుత్రుడా!; వీరల+ఎడన్= ఈ గాంధారీ ధృతరాష్ట్రుల విషయంలో; అపచారంబులు= అకార్యములైన మాటలు; పలుకుదును+ఎ?= చెప్పేదా?; విచారము= చింతను; విడుము= విడిచిపెట్టు; ఏన్= నేను; ఏ రూపంబునన్= ఏ విధంగానూ; నిలువన్+అ= (వీళ్ళతో వెళ్ళకుండా), ఆగనే ఆగను; ఇది= వీళ్ళతో వెళ్ళటం; వ్రతంబు కాన్= తప్పక ఆచరించవలసిన పనిగా; గారవమునన్= వీళ్ళ మీద ప్రేమతో; కైకొంటిన్= స్వీకరించాను.

తాత్పర్యం: 'పుత్రా! విచారించకుము. ఈ గాంధారీ ధృతరాష్ట్రుల విషయంలో నేను అపచారపు మాటలు అంటానా? ఏ విధంగానూ నేను ఆగను. వీళ్ళమీద ప్రేమతో వీళ్ళతో వెళ్ళి వీళ్ళను సేవించటమే వ్రతంగా పెట్టుకొన్నాను.'

వ. అని పలికి నిజస్కంధంబున నున్న గాంధారి కరంబుఁ గరంబు నయంబునం బాపి, యతని దిక్కు మొగం బై. 151

ప్రతిపదార్థం: అని పలికి= ఆ విధంగా అని; నిజ-స్కంధంబునన్= తన భుజమ్మీద; ఉన్న= ఉన్నటువంటి; గాంధారికరంబున్= గాంధారి చేతిని; కరంబు= మిక్కిలి; నయంబునన్= మృదువుగా; పాపి= తొలగించి; అతని దిక్కు= ఆ ధర్మరాజువైపు; మొగంబు+ఐ= (ముఖ ముంచి) చూస్తూ- (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అని చెప్పి కుంతి తనభుజం మీద ఉన్న గాంధారి చేతిని మృదువుగా తొలగించి ధర్మరాజును చూస్తూ, (ఇట్లా అన్నది)

క. 'నీ వేమియు ననకుము సహ। దేవుని నేమఱక యరయు; దినకరసుతునిన్
భావమునఁ దలఁపు; మే నా। దేవసముని పుట్టు వడఁచితిం గపటమునన్. 152

ప్రతిపదార్థం: నీవు= నీవు; ఏమియున్= ఇంక ఏమీ; అనకుము= మాటాడకు; సహదేవునిన్= సహదేవుడిని; ఏమఱక= అప్రమత్తంగా; అరయు(ము)= జాగ్రత్తగా చూచుకొమ్ము; భావమునన్= నీ మనసులో; దినకరసుతునిన్= (సూర్యతనయుడైన) కర్ణుడిని; తలఁపుము= స్మరిస్తూ ఉండు; ఏను= నేను; ఆ దేవసముని-పుట్టువు= దైవంతో సమానమైన ఆ కర్ణుడి పుట్టుకను; కపటమునన్= మోసంతో; అడఁచితిన్= దాచి పెట్టాను.

తాత్పర్యం: నేను ధృతరాష్ట్రుడితో అడవులకు వెళ్ళవలసిందే. ఇంక నీవేమీ ఎదురు మాటాడకుము. సహదేవుడిని ఏమరుపాటు లేకుండా జాగ్రత్తగా చూచుకొమ్ము. కర్ణుడిని మనసులో స్మరిస్తూ ఉండుము. దేవుడివంటి ఆ కర్ణుడు నాకు జన్మించిన సంగతి వంచనతో మరుగుపరచాను.

క. అది పాపము దానికి నా। మది నెప్పుడు వగతు విమలమానస! యక్కీ
డు దొలంగునట్లుగా స। త్పదార్థ దానములు చేయు తాత్పర్యమునన్. 153

ప్రతిపదార్థం: విమల మానస!= స్వచ్ఛమైన మనసు కలవాడా, ధర్మరాజా!; అది= కర్ణుడి పుట్టువు మరుగుపరచటం; పాపము= పాపకర్మ; దానికిన్= అందుకు; ఎప్పుడున్= నిరంతరమూ; నా మదిన్= నా మనసులో; వగతున్= దుఃఖిస్తుంటాను; ఆ+కీడు= దానివలన కలిగిన అపచారం (కూడా); తొలగించునట్లుగాన్= తొలగిపోయే విధంగా; తాత్పర్యమునన్= తదేక బుద్ధితో; సత్-పదార్థ-దానములు= శ్రేష్ఠములైన వస్తువులను దానంగా; చేయు(ము)= ఇమ్ము.

తాత్పర్యం: ఆ కర్ణుడి జననాన్ని గురించి తెలియకుండా చేయటం పాపం. అందుకు నా మనసులో ఎప్పుడూ బాధపడుతూనే ఉంటాను. నిర్మల హృదయుడివైన ధర్మరాజా! ఆ పాపం (కూడా) తొలగిపోయేటట్లుగా నీవు గొప్ప గొప్ప వస్తువులు దానాలు చేయుము.

ఆ. అవ్విధమునఁ గర్ణుఁ డాఱడిఁ బోయిన। నాదు మానసంబు పోదు నూఱు
పఱియ లై తలంప బలుఱాతఁ జేసిన। వారు గాఁగ వలయు వంశవర్య! 154

ప్రతిపదార్థం: వంశవర్య!= కురువంశంలో శ్రేష్ఠుడా! (ధర్మరాజా!); కర్ణుడు= పెద్దకొడుకైన కర్ణుఁడు; ఆ+విధమునన్= ఆ తీరుగా; ఆఱడిన్ పోయినన్= మరణించగా; నాదు మానసంబు= నా హృదయం; నూఱుపఱియలు= వందముక్కలుగా; ఐపోదు= ఐపోలేదు; తలంపన్= ఆలోచించగా; బలుఱాతన్= (నా హృదయాన్ని) దృఢమైన రాతితో; చేసినవారు= తయారు చేసినవారు; కాఁగవలయున్= అయి ఉండవచ్చును.

తాత్పర్యం: కులంలో శ్రేష్ఠుడివైన ధర్మరాజా! కర్ణు డావిధంగా మరణించటం, తెలిసి కూడా నా మనసు నూరు ముక్కలైపోలేదు. చూడగా ఈ మనసును ఎంతో బలమైన రాతితో తయారుచేసి ఉంటారు.

క. 'నీవును దమ్ములు భక్తి భ। రావేశముతోడఁ దలఁపుఁ డమ్మహితాత్మున్;
ద్రోవది నెప్పుడు దృఢ సం। భావన మన్నింపు మయ్య పౌరవముఖ్యా! 155

ప్రతిపదార్థం: పౌరవ-ముఖ్యా!= పురువంశ్యులలో శ్రేష్ఠుడా!, ధర్మరాజా!; నీవును= నీవూ; తమ్ములు(న్)= నీ తమ్ముళ్ళూ; భక్తి-భర+ఆవేశముతోడన్= భక్తితో నిండిన పూనికతో; ఆ+మహిత+ఆత్మున్= మహానుభావుడైన ఆ కర్ణుడిని; తలఁపుఁడు= స్మరిస్తూ ఉండండి; ద్రోవదిన్= ద్రౌపదిని; ఎప్పుడు(న్)= నిరంతరమూ; దృఢ - సంభావనన్= పటిష్ఠమైన గౌరవంతో; మన్నింపుము+అయ్య= ఆదరించండి.

తాత్పర్యం: పౌరవ శ్రేష్ఠుడా! నీవూ, నీ తమ్ముళ్ళూ, మహాత్ముడైన ఆ కర్ణుడిని భక్తితో స్మరిస్తూ ఉండండి. ద్రౌపదిని సగౌరవంగా ఎప్పుడూ ఆదరించండి.

విశేషం: కర్ణుడు బ్రతికి, ఉన్నన్నినాళ్ళూ అగ్రజుడుగా తెలియక ఆదరించలేకపోయారు పాండవులు. అందుకే ఇప్పుడు ఎలాగూ మరణించాడు కాబట్టి గతకాలపు వైరం మనసులో ఉంచుకోకుండా భక్తిభావంతో తలచుకొమ్మంటుంది కుంతి. అవమానమూ, వనవాసము వగైరా కష్టాలు అనేకం మిగిలిన సుభద్రాదుల కంటె అనుభవించి ఉన్నది కాబట్టి అయిదుగురికీ భార్యగా ఉండేది కావటం వలన ద్రౌపది విషయంలో సంభావనతో కూడిన ఆదరం చూపాలని ప్రత్యేకంగా చెప్పడంతో కుంతి ఆంతర్యం అది. అందుకే ఇక్కడ 'ఎప్పుడున్' అని విశేషంగా చెప్పటం కూడా.

క. భీమార్జున నకుల మనః। కామంబులు సఫలతా ప్రకాశంబులు గా
భూమీశ! యరసి యొనరుపు। మేమిట నేమఱకు ధర్మ మిల యరయు నెడన్. 156

ప్రతిపదార్థం: భూమి+ఈశ!= రాజా!; భీమ+అర్జున-నకుల-మనస్+కామంబులు= భీముడూ, అర్జునుడూ, నకులుడూ మనసులో వాంఛించిన వాటిని; అరసి= తెలుసుకొని; సఫలతా-ప్రకాశంబులు-కాన్= ఫలవంతములై ఒప్పే విధంగా; ఒనరుపుము= చేయుము; ఇల= రాజ్యం; అరయు+ఎడన్= పాలించే విషయంలో; ఏమిటన్= ఏ అంశంలోనూ; ధర్మము= ధర్మం; ఏమఱకు(ము)= ఉపేక్షించకుము.

తాత్పర్యం: రాజా! భీముడూ, అర్జునుడూ, నకులుడూ ఏమి కావాలని మనసులో అనుకొంటున్నారో తెలిసికొని ఆ వాటిని నెరవేర్చుము. రాజ్య పాలనంలో ఎప్పుడూ, ధర్మాన్ని ఉపేక్షించకుము.

వ. అని పలికి నానిశ్చయంబు శిథిలంబు గాదు। మీరు మరలుండని పలికినఁ బాండవాగ్రజుండు విషాదం బంది యూరకుండె; భీమాదులు డెందంబులు గొందలం బంద నశ్రు లొలుకం దలలు వాంచి; రిట్ల మ్మొత్తంబుగ మనంబు గుదిపడుచు మందం బై చెల్ల ధృతరాష్ట్రుండు గొండొకయెడగలుగం జనియె; నా ధర్మతనయుండు తల్లియాననం; బాలోకించి. 157

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలికి= చెప్పి; నా నిశ్చయంబు= నేను చేసికొన్న నిర్ణయం; శిథిలంబు= సడలేది; కాదు= కాదు; మీరు= మీరు అందరూ; మరలుండు= తిరిగి ఇండ్లకు వెళ్ళండి; అని= అని; పలికినన్= కుంతీదేవి చెప్పగా; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; విషాదంబు= బాధను; అంది= పొంది; ఊరక+ఉండెన్= మాటాడకుండా ఊరుకొన్నాడు; భీమ+ఆదులు= భీముడు మొదలైనవారు; డెందంబులు= మనసులు; కొందలంబు= కలత; అందన్= చెందగా; అశ్రులు= కన్నీళ్ళు; ఒలుకన్= ఉబికి జారి పడుతుండగా; తలలు-వాంచిరి= తలవంచుకొన్నారు; ఇట్లు= ఈ విధంగా; ఆ+మొత్తంబుగన్= సంపూర్ణంగా అందరికీ; మనంబు= మనసు; గుదివడుచున్= చేష్టలు దక్కి (చైతన్యం పోయి); మందంబు-ఐ= బరువై; చెల్లన్= ఉండగా; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; కొండొక= కొంచెం; ఎడ= దూరం; కలుగన్= కలిగేటట్లుగా; చనియెన్= వెళ్ళాడు; ఆ ధర్మతనయుండు= ఆ ధర్మరాజు; తల్లి-ఆననంబు= కుంతి ముఖం; ఆలోకించి= చూచి-ఇట్లా అంటున్నాడు.

తాత్పర్యం: అని చెప్పి కుంతి 'ఇక నా నిర్ణయం సడలేది కాదు. మీరు తిరిగి యిండ్లకు వెళ్ళండి అన్నది. అపుడు ధర్మరాజు విచారంతో మాటాడకుండా ఊరుకున్నాడు. భీముడు మొదలైనవారు మనసులు కలతపడి కన్నీళ్లు ఉబికి జారుతుండగా తలలు వంచుకొని నిలుచున్నారు. ఈ విధంగా అక్కడ అంతా మనసులు జడత్వంతో, బరువెక్కిపోయి ఉండగా ధృతరాష్ట్రుడు వాళ్ళకు కొంచెం దూరంగా వెళ్ళాడు. అపుడు ధర్మరాజు తల్లితో ఇట్లా అన్నాడు.

ధర్మరాజు కుంతిని వనంబునకుఁ బోవలదని ప్రార్థించుట. (సం.15-22-19)

సీ. ఇది యేమి సేయంగ నెత్తి కొం టిమ్మాట। యాడకు; మేను ని న్నడవి కేఁగఁ
బనుతునే? మముఁ దొల్లి పనిచి పనుల్ గొను। భంగిన సామ్రాజ్య భార నిర్వ
హణము తెఱంగులు నప్పటి కప్పటి। కి ట్లని యానతి యిచ్చి నడపఁ
బంపక యున్న నొప్పమి రాదె మాకు? ము। న్నీవును గృష్ణుండు నేవిధమున

తే. నడిపితిరి కార్య మెఱుఁగవే యడలు వెల్లి। మమ్ముఁ బాంచాలి నిటు ముంచి యమ్మ! యడవి
నెట్టు లుండెద?' వనఁగ నయ్యింతి బాష్ప। పూర్ణనయన యై యూరక పోవుచుండె. 158

ప్రతిపదార్థం: అమ్మ!= తల్లీ!; ఇది= ఈ విధంగా; ఏమి+చేయంగన్= ఏం చేయాలని; ఎత్తికొంటి?(వి)= పూనుకొన్నావు?; ఈ+మాట= అడవులకు వెళ్ళుతాను అనేమాట; ఆడకుము= మళ్ళీ అనకు; నిన్నున్= (తల్లివై సంరక్షించే) నిన్ను; అడవికిన్= అరణ్యానికి; ఏఁగన్= వెళ్ళటానికి; ఏను= నేను; పనుతును+ఏ?= పంపగలనా?; తొల్లి= ఇంతకుపూర్వం; మమున్= నీ కొడుకులను (కోడళ్ళనూ); పనిచి= ఆజ్ఞాపించి; పనుల్= పనులు; కొనుభంగిన్+అ= చేయించుకొన్న విధంగానే; ఇపుడు గూడా-సామ్రాజ్య-భార-నిర్వహణము-తెఱంగులు= ఈ విశాలమైన ఈ రాజ్యంయొక్క బరువు మోపే మార్గాలు - (పరిపాలనం తీరు); అప్పటికిన్+అప్పటికిన్= ఎప్పటికప్పుడు; ఇట్లు+అని= ఈ విధం (ఇట్లా చేయుమని) అని; ఆనతి+ఇచ్చి= ఆజ్ఞలు చేసి; నడపన్= పంపక; ఉన్నన్= మమ్మల్ని, నడిపించేవిధంగా చేయకపోతే; మాకున్= మాకు; రాజ్యపాలనంలో, ఒప్పమి= పొరపాటు; రాదె=

కలుగదా?; మున్ను= ఇంతకు పూర్వం; ఈవును= నీవూ; కృష్ణుండున్= కృష్ణుడూ; ఏ విధమునన్= ఏ తీరుగా; కార్యము జరగవలసిన దానిని; నడిపితిరి= జరిపించారో; ఎఱుఁగవే?= తెలియదా!; మమ్మున్= నీ కొడుకులైన మమ్మల్నీ; పాంచాలిన్= ద్రౌపదినీ (కోడళ్ళను); అడలు-చెల్లిన్= శోక ప్రవాహంలో; ముంచి= మునిగేటట్లు చేసి; అడవిన్= నీవు అడవిలో; ఎట్టులు= ఏ విధంగా; ఉండెదవు?= ఉండగలవు?; అనఁగన్= అని ధర్మరాజు పల్కగా; ఆ+ఇంతి= ఆ కుంతి; బాష్ప-పూర్ణ-నయన+ఐ= కన్నీరు నిండిన కనులు కలిగినదై; ఊరక= సమాధానం చెప్పకుండా; పోవుచున్+ఉండెన్= ముందుకు వెళ్ళిపోతూ ఉన్నది.

తాత్పర్యం: 'అమ్మా! నీవు చేయదలచుకొన్న ఈ పని ఏమిటి?-ఇట్లా (అడవికి వెళ్ళుతానని) మాటాడకుము. నేను నిన్ను అడవులకు పంపుతానా? లోగడ మమ్మల్ని ఆజ్ఞాపించి మా చేత పనులు చేయించిన విధంగానే ఇప్పుడు కూడా నీవు దగ్గరుండి ఎప్పటికప్పుడు సమయోచితంగా ఇట్లా చేయండి అని శాసించి ఈ సామ్రాజ్యాన్ని పరిపాలించే విధానం చెప్పి మమ్మల్ని నడిపించకపోతే మాకు ప్రమాదం సంభవించదా? పూర్వం నీవూ, కృష్ణుడూ ఏ విధంగా వ్యవహారాలు నడిపించారో మరచిపోయావా? మమ్మల్ని, ద్రౌపదినీ (కోడళ్ళనూ) దుఃఖ ప్రవాహంలో ముంచి నీవు, అడవులలో ఎట్లా ఉండగలవు?' అని ధర్మరాజు అంటుంటే కుంతి ఏమీ సమాధానం చెప్పకుండానే నీళ్ళు నిండిన కళ్ళతో ముందుకు సాగిపోతున్నది.

విశేషం: (అడలువెల్లి-అడలు అనే వెల్లి-రూపకం)

ఉ. **అయ్యమలాత్మతోడఁ బవనాత్మజుఁడి ట్లను 'ధర్మపుత్త్రు నీ**
వెయ్యది యుక్త హేతువుగ నిమ్మెయిఁ బాసెదు? నీదు పన్పునం
గయ్యము సేసి భూపతినికాయములం బరిమార్చెఁ దల్లి! నీ
కియ్యన లక్ష్మి నూఁది చరియింపక యిప్పుడు వాయఁ బాడియే? **159**

ప్రతిపదార్థం: పవన+ఆత్మజుఁడు= (వాయుపుత్రుడైన) భీముడు; ఆ+అమల+ఆత్మతోడన్= నిర్మలమైన మనసు గలిగిన కుంతితో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనున్= అన్నాడు; తల్లి!= అమ్మా!; నీవు= నీవు (కుంతి); ధర్మపుత్త్రున్= ధర్మరాజును; ఏ+అది= ఏది; యుక్తహేతువుగన్= తగిన కారణంగా; ఈ+మెయిన్= ఈవిధంగా; పాసెదు= విడిచి వెళుతున్నావు?; నీదు పన్పునన్= నీవు ఆజ్ఞాపించిన విధంగా; కయ్యము-చేసి= కౌరవులతో యుద్ధం చేసి; భూపతి నికాయములన్= రాజుల సమూహాలను; పరిమార్చెన్= చంపాడు, అలా చేయటం; లక్ష్మిన్= (రాజ్యాది) సంపదల్ని; నీకున్+ఇయ్యన్+అ= నీకు ఇవ్వటం కొరకే, అటువంటి లక్ష్మిని; ఊఁది= గ్రహించి; చరియింపక= సుఖింపక; ఇప్పుడు= (సంపదలు కలిగి సుఖించే వీలు ఏర్పడిన) ఈ సమయంలో; పాయన్= ఈ రాజ్యాన్ని విడిచిపెట్టటం; పాడియే?= (నీకు) న్యాయమేనా?

తాత్పర్యం: అప్పుడు భీముడు కుంతితో ఇట్లా అన్నాడు. 'అమ్మా, నీవు ఇట్లా ధర్మరాజును విడిచి వెళ్ళటానికి తగిన కారణం ఏమైనా ఉన్నదా? ధర్మరాజు నీవు చెప్పిన ప్రకారం కౌరవులతో యుద్ధం చేసి రాజులందరినీ సంహరించి ఆ(రాజ్య) సంపద నీకు ఇవ్వటం కొరకే అట్లా శ్రమించి రాజ్యం సంపాదించగా సుఖించవలసిన ఈ సమయంలో రాజ్యం విడిచి నీవు అరణ్యాలకు వెళ్ళటం న్యాయమేనా?

క. **మనమునఁ దోఁచిన దానము । లనుదినమును జేయుచును సమాశ్రిత జనులం**
బెనుచుచు బంధులఁ బ్రోచుచు । జననుతచరితమునఁ బరఁగు సౌజన్యనిధీ! **160**

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ప్రతిపదార్థం: సౌజన్యనిధీ!= మంచితనానికి గని వంటిదానా! (కుంతీ!); అనుదినమును= ప్రతిరోజూ; మనమునన్= నీ మనసులో; తోయిన= అనిపించిన; దానములు= దానాలను; చేయుచును= జనాలంతా పొగడే విధంగా ప్రతిరోజూ నీకు తోచిన దానాలు చేస్తూ; సమ్-ఆశ్రిత-జనులన్= నిన్ను ఆశ్రయించిన వారిని; పెనుచుచున్= కాపాడుకొంటూ; జన-నుత-చరితమునన్= మనుష్యులచేత ప్రశంసించబడేటటువంటి నడవడితో; పరఁగుము= ఒప్పుము.

తాత్పర్యం: మంచితనానికి నిధివంటిదానా! జనాలంతా పొగడే విధంగా, ప్రతిరోజూ నీకు తోచిన దానాలు చేస్తూ, నిన్ను ఆశ్రయించిన వారిని పోషిస్తూ చుట్టాలను సాకుతూ. ఇక్కడే ఉండుము.

క. వనమున మాద్రీపుత్రులు । వెనుఁబడుటకుఁ దలరి తట్లు విక్రమమునకున్
గొనకొల్పి తిట్లు వీరల । ననూన దుఃఖముల ముంచి యరుగం దగునే?' 161

ప్రతిపదార్థం: మాద్రీపుత్రులు= (మాద్రి కొడుకులు) నకుల సహదేవులు; వనమునన్= అడవులలో; వెనుఁబడుటకున్= కష్టపడినందుకు; అట్లు= ఆ విధంగా, (ఎంతో); తలరితి(వి)= నీవు దుఃఖించావు; విక్రమమునకున్= (పిల్లలు సుఖపడటం కొరకు రాజ్యం సంపాదించుకొనాలని) పరాక్రమం ప్రదర్శించేందుకు; గొన కొల్పితి(వి)= పురికొలిపావు; వీరలన్= అటువంటి ఈ నకుల సహదేవుల్ని; ఇట్లు= ఈవిధంగా; అనూన(న+ఊన) దుఃఖములన్= అధికమైన బాధలలో; ముంచి= మునిగేటట్లు చేసి; అరుగన్= అడవులకు వెళ్ళటం; తగునే?= ఉచితమా?

తాత్పర్యం: నకుల సహదేవులు వనవాసంలో కష్టపడుతున్నారని ఆనాడు ఆ విధంగా కుమిలిపోయావు. రాజ్య సుఖాల కొరకు యుద్ధానికీ, పరాక్రమం ప్రదర్శించడానికీ ప్రేరేపించావు. మరి ఈ రోజు వీళ్ళను ఈ విధంగా బాధలలో ముంచి నీవు అడవులకు వెళ్ళటం తగునా?'

వ. అనియె, నట్టియెడ. 162

ప్రతిపదార్థం: అనియెన్= భీముడు ఆ ప్రకారంగా అన్నాడు: అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: (పై విధంగా) అన్నాడు భీముడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. ద్రోవదియు సుభద్రయు శో । కావేశం బడర మోము లశ్రులఁ దోఁగం
గా వెక్కి వెక్కి యేడ్చిరి, భూవర! పాండుక్షితీశ పుత్రులు నేడ్వన్! 163

ప్రతిపదార్థం: భూ-వర!= ఓ జనమేజయ మహారాజా!; పాండు-క్షితి+ఈశ-పుత్రులున్= పాండురాజు కుమారులు కూడా; ఏడ్వన్= ఏడుస్తూ ఉండగా; ద్రోవదియున్= ద్రౌపదీ; సుభద్రయున్= సుభద్రా; శోక+ఆవేశంబు= దుఃఖంయొక్క వ్యాప్తి; అడరన్= అతిశయించగా; మోములు= ముఖాలు; అశ్రులన్= కన్నీళ్ళతో; తోఁగంగాన్= తడిసి (మునిగి) పోగా; వెక్కి, వెక్కి= వెక్కిళ్ళతో; ఏడ్చిరి= శోకించారు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ద్రౌపదీ, సుభద్రా మనసులో దుఃఖం ప్రవేశించి వ్యాపించగా, ముఖాలు కన్నీళ్ళలో మునిగిపోతూ ఉంటే, వెక్కి వెక్కి ఏడ్చారు. పాండవులు కూడా ఏడ్వసాగారు.

విశేషం: కొడుకులూ కోడళ్ళూ దుఃఖిస్తున్నారు. ఏడ్చేవాళ్ళను చూస్తే దుఃఖం అతిశయించి చూచేవాళ్ళు కూడా ఏడ్వటం సహజం. పాండు కుమారు లేడుస్తుంటే ద్రౌపది సుభద్రలు వెక్కి వెక్కి ఏడ్చారు. స్త్రీ రోదనం గూర్చి ముందుగా వర్ణించి పాండు 'రాజకుమారుల'

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఏడ్పు చివరలో చెప్పటం రచనా విధానంలో విశేషం. స్త్రీలు కాబట్టి 'వెక్కి వెక్కి' ఏడ్చిరి. రాకుమారులు 'ఏడ్వన్'.....మామూలుగా కుంతి ముందూ, వీళ్ళంతా వెనకా పోతూనే ఉన్నారు.

క. పరిజనములు కన్నీర్కులు । దొరఁగఁగ నడ లొంది వారితోడం జని రి
ప్పరుసునఁ దనదుతనూజులు మరలమికిం బాండురాజమహిషి మఱుఁగుచున్. 164

ప్రతిపదార్థం: పరిజనులు= భృత్యులు; అడలు= దుఃఖం; ఒంది= పొంది; కన్నీళ్ళులు= కన్నీళ్ళు; తొరఁగఁగన్= జారుతుండగా; వారితోడన్= పాండవుల (వారి స్త్రీల వెంట); చనిరి= ముందుకు వెళ్ళారు; ఈ+పరుసునన్= ఈ విధంగా; తనదు తనూజులు= తన కొడుకులు; మరలమికిన్= తిరిగి వెళ్ళనందుకు; పాండు-రాజ-మహిషి= పాండురాజు భార్య; మఱుఁగుచున్= విచారిస్తూ;

తాత్పర్యం: వారి సేవకులు కూడా దుఃఖంతో కన్నీరు కారుస్తూ పాండవుల వెంట, ముందుకు వెళ్ళారు. కొడుకులు తిరిగి వెళ్ళకుండా తననే అనుసరిస్తున్నందుకు కుంతి దుఃఖపడుతూ.(తరువాతి వచనంతో అన్వయం)

వ. 'తెగ నాడకున్నఁ బోవ' రని కన్నీరు దుడిచికొని వారలం గలయం గనుంగొని, వారలు వినుచుండం దత్పరి జనంబుల తోడ. 165

ప్రతిపదార్థం: తెగన్+ఆడక+ఉన్నన్= కఠినంగా మాటాడకపోతే; పోవరు= (కొడుకులు) తిరిగి వెళ్ళరు; అని= అనుకొని; కన్నీరు-తుడిచికొని= తన కంటి నీరు తొలగించుకొని; వారలన్= తన కొడుకులను; కలయన్-కనుంగొని= పరిశీలనగా (దీర్ఘంగా) చూచి; వారలు= కొడుకులు; వినుచున్+ఉండన్= వింటుండగా; తద్-పరిజనంబుల తోడన్= వారి వెంట వస్తున్న భృత్యులతో; (ఇట్లా అన్నది).

తాత్పర్యం: ఖండితంగా, కటువుగా మాటాడకపోతే ఇక వీళ్ళు వెనుకకు పోరు అనుకొని కుంతి తన కన్నీరు తుడుచుకొని, ఒక్కసారి పాండవులందరినీ చూచి వాళ్ళు వింటూ ఉండగా వారి వెంట ఉన్న భృత్యులతో ఇట్లా అన్నది.

సీ. 'దుర్ద్యూతమునఁ దారు దూలపోవుటయును । నా సభ యపకీర్తి యగు తెఱంగు
పాటిల్లుటయుఁ, బెక్కుభంగుల నడవుల । నిడుమలఁ బడుటయు నే సహింపఁ
జాలక కార్యంబు చర్చించి సంధిమై । నొవ్వని వా రెల్ల నవ్వఁ దలలు
వంచి కౌరవులలో వర్తింప నే? లని । హరితోడ నాడితి; నవ్విధమున

ఆ. మాననీయు ధర్మసూను నాగాయుత । బలుని భీము శత్రుభంజనైక
శీలుఁ బార్థు శౌర్యలోలురఁ గవల దై । న్యంబు నొందఁ జూచు టర్హమగునె?' 166

ప్రతిపదార్థం: తారు= తమరు-పాండవులు; దుర్ ద్యూతమునన్= మోసపు జూదంలో; తూలపోవుటయున్= చిన్న బోవటమూ; ఆ సభన్= ఆ విధమైన సభలో; అపకీర్తి= పాడుపేరు; అగు తెఱంగు= కలిగే పని; పాటిల్లుటయున్= సంభవించటమూ; అడవులన్= తరువాత, అడవులలో; పెక్కు-భంగులన్= అనేక విధాలుగా; ఇడుమలన్-పడుటయున్= కష్టాలు అనుభవించటమూ; సహింపన్-చాలక= ఓర్చుకొనలేక; నేను= నేను (కుంతి); కార్యంబు= తర్వాత జరగవలసిన పనిని గురించి; చర్చించి= ఆలోచనలు చేసి; సంధిమైన్= కౌరవులతో సంధి చేసికొనటం వలన; ఒవ్వనివారు= పాండవులంటే పడనివారు (శత్రువులు); ఎల్లన్= అందరూ; నవ్వన్=

అపహాస్యం చేసే విధంగా; తలలు వంచి= (కౌరవులకు) తల ఒగ్గి; కౌరవులలోన్= దుర్యోధనాదులతో; వర్తింపన్= కలిసి ఉండటం; ఏల?= ఎందుకు; అని= ఎందుకు; అని= అనుకొని; హరితోడన్= కృష్ణుడితో; ఆ+విధమునన్= ఆ ప్రకారంగా; ఆడితిన్= మాటాడాను; మాననీయున్= గౌరవింపదగినట్టి; ధర్మసూనున్= ధర్మరాజునూ; నాగ+అయుత-బలునిన్= పదివేల యేనుగుల బలం కలిగిన; భీమునిన్= భీముడినీ; శత్రు-భంజన-ఏక-శీలున్= విరోధులను రూపు మాపడమే ప్రధానం ఐన చరిత్ర కలిగిన; పార్థున్= అర్జునుడినీ; శౌర్య-లోలురన్= పరాక్రమవంతులైన; కవలన్= నకుల సహదేవులనూ; దైన్యంబున్= (దరిద్రంవంటి) దురవస్థను; ఒందన్= పొందగా; చూచుట= చూస్తూ ఉండటం; అర్హము-అగును+ఏ?= (నాకు) తగిన దేనా?

తాత్పర్యం: ఆ రోజు దుర్మార్గపు జూదంలో తమరు చిన్నబోవడమూ, ఆ సభలో దుష్కీర్తి కలిగించే పని, (ద్రౌపదీ పరాభవం) జరగటమూ (ఉద్యో4-19) ఆ తరువాత అడవులలో అనేక విధాలుగా కష్టాలపాలు కావడమూ (ఉద్యో3-183) చూచి, నేను ఓర్చుకొనలేకపోయాను. ఏం చేయాలి అని కర్తవ్యాన్ని గురించి అనేక విధాలుగా ఆలోచనలు చేశాను. కౌరవులతో సంధి చేసికొని, పాండవులంటే గిట్టని వాళ్ళు అందరూ ఎగతాళి చేసేవిధంగా తల ఒగ్గి కౌరవులతో కలిసి ఉండటం ఎందుకు? అని కృష్ణుడితో ఆ రోజు ఆ విధంగా చెప్పాను. పూజించదగిన ధర్మరాజూ, పదివేల యేనుగుల బలం కలిగిన భీముడూ, శత్రువులను నిర్మూలించటమే ప్రధానమైన పనిగా కలిగిన అర్జునుడూ, పరాక్రమవంతులైన నకుల సహదేవులూ, వీళ్ళందరూ ఎందుకూ కొరగాని వారివలె దురవస్థలపాలు కావటాన్ని చూస్తూ ఉండడం నాకు తగునా?'

వ. అని ధర్మతనయు వదనంబు వీక్షించి, పాంచాలిం జూపి. 167

ప్రతిపదార్థం: అని= అని పలికి; ధర్మతనయు-వదనంబు= ధర్మరాజు ముఖం; వీక్షించి= చూచి; పాంచాలిన్= ద్రౌపదిని; చూపి= చూపించి. (ఇట్లా అన్నది).

తాత్పర్యం: అని చెప్పి కుంతి ధర్మరాజు ముఖం చూచి, అతడికి ద్రౌపదిని చూపిస్తూ (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'గౌరవంబున సుకుమారత్వమున నొప్పు। నిప్పొల్తిఁ దలవట్టి యీడ్చి తెచ్చి
సభలోన నట్లు దుశ్శాసనుం డవమాన। పెట్టంగ నచ్చటి పెద్ద లెల్లఁ
బలుకక యుండ నబ్బన్నంబునకు నోర్వ। వలసె మీ కప్పటి కలఘుతేజ!
నీ తేజ మట్టులు నీ అయి పోయినఁ। బాండునికులము చెప్పంగఁ జూప

తే. లేకపోదె యబ్భంగిఁ బల్కితి ముకుందు। తోడ నేను మీ రెమ్మెయి రూఢి కెక్కి
వెలుఁగఁ గోరుట కతమునఁ దలఁచి; దాని। ననిలసుతుఁ డెత్తిపెట్టె; నే మనఁగఁ గలదు?' 168

ప్రతిపదార్థం: అలఘుతేజ!= గొప్ప పరాక్రమం కలిగినవాడా! ధర్మరాజా!; గౌరవంబునన్= గౌరవింపదగిన లక్షణంతోనూ; సుకుమారత్వమునన్= కష్టాన్ని తట్టుకొనలేని మెత్తదనంతోనూ; ఒప్పు= ఒప్పుతున్న; ఈ+పొల్తిన్= ఈ కాంతను (ద్రౌపదిని); తల+పట్టి= జుట్టు పట్టుకొని; ఈడ్చి= లాక్కుంటూ; తెచ్చి= తీసికొనివచ్చి; సభలోనన్= (పదుగురు ఉండే) కొలువులో; దుశ్శాసనుండు= దుశ్శాసనుడు; అట్లు= ఆ విధంగా; అవమాన పెట్టంగన్= అవమానం చేస్తుంటే; అచ్చటి పెద్దలు= ఆ సభలో ఉన్న వృద్ధులు; ఎల్లన్= అందరూ కూడా; పలుకక-ఉండన్= ఏమీ(అది తప్పని) మాటాడక ఊరుకొనగా; ఆ+బన్నంబునకున్=

ఆ కష్టపాటుకు; మీకున్= మీకు (పాండవులకు); అప్పటికిన్= ఆ సమయంలో; ఓర్వన్-వలసెన్= సహించవలసివచ్చింది; నీ తేజము= నీ తేజస్సు; అట్టులు= ఆ విధంగా, (ధర్మబద్ధత వలన); నీఱు-అయిపోయినన్= బూడిద (వ్యర్థం) అయిపోగా; పాండునికులము= పాండురాజు వంశం; చెప్పంగన్= చెప్పుకొనటానికీ; చూపన్= చూపించటానికి; లేక= లేకుండా; పోదె= పోదా; మీరు= మీరు, పాండవులు; ఏ+మెయిన్= ఏ విధంగా నైనా; రూఢికిన్= ప్రసిద్ధికి; ఎక్కి= వచ్చి; వెలుఁగన్= ప్రకాశించాలని; కోరుట కతమునన్= కోరినందువలననే; నేను= నేను (కుంతి); తలఁచి= ఆలోచించి; ముకుందు తోడన్= కృష్ణుడితో; ఆ+భంగిన్= ఆ విధంగా; పల్కితిన్= అన్నాను; దానిన్= దానిని, కృష్ణుడితో ఆ విధంగా మాటాడటాన్ని; అనిలసుతుఁడు= భీముడు; ఎత్తిపెట్టెన్= ఎత్తి చూపెట్టాడు; ఏమి-అనఁగన్-కలదు?= ఇంక నేను ఏమని చెప్పేది?

తాత్పర్యం: 'పరాక్రమవంతుడా! ధర్మరాజా! పూజించదగిన లక్షణమూ, సౌకుమార్యమూ కలిగి ఉన్న ఈమె (ద్రౌపది)ని జుట్టు పట్టుకొని ఈడ్చుకొంటూ తీసికొని వచ్చి సభలో (పదుగురి సమక్షంలో) దుశ్శాసను డా విధంగా అవమానం చేస్తుంటే, ఆ సభలో ఉన్న వృద్ధులంతా ఏమీ మాటాడకుండా చూస్తూ ఉంటే అటువంటి కష్టాలను చూస్తూ మీకు అప్పటికి ఊరుకొనవలసి వచ్చింది. నాడు మీ తేజస్సు ఆ విధంగా బూడిదయిపోతుంటే పాండురాజు వంశమే ఇక భూమి మీద చెప్పటానికి, చూపటానికి లేకుండా నశించిపోవడమేనా? అనీ ఏ విధంగా నైనా మీరు మళ్ళీ ప్రసిద్ధులై పేరు పొందాలనీ అనుకొనటం వలన ఆలోచించి నేను కృష్ణుడితో ఆ రోజు ఆ విధంగా చెప్పాను. భీముడు దాన్ని ఎత్తి చూపిస్తున్నాడు. ఇంక నేను మాటాడేదేమున్నది?'

వ. అనిన విని ధర్మసుతుండును భీముండును సిగ్గు వడి; రిట్లు పలికి గొంతి యిమ్మాటకు భీము చిత్తం బె ట్లగునో యనుతలంపున ధర్మసుతున కతనిం జూపి. 169

ప్రతిపదార్థం: అనినన్= కుంతి పై విధంగా పల్కగా; విని= ఆలకించి; ధర్మసుతుండును= ధర్మరాజు; భీముండును= భీముడూ; సిగ్గు+పడిరి= (తగని మాటలు అన్నందుకు) సిగ్గుపడ్డారు; ఇట్లు= ఈ ప్రకారంగా; పలికి= అని; గొంతి= కుంతీదేవి; ఈమాటకున్= తానన్నమాటకు; భీముచిత్తంబు= భీముడి మనస్సు; ఎట్లు+అగునో?= ఏమవుతుందో?; అను తలంపునన్= అనే ఉద్దేశంతో; అతనిన్= ఆ భీముడిని; చూపి= చూపించి; ధర్మసుతునకున్= ధర్మరాజుతో (ఇట్లా అన్నది).

తాత్పర్యం: కుంతి అన్న మాటలు విని ధర్మరాజూ, భీముడూ పొరపాటు మాటాడినందుకు సిగ్గుపడ్డారు. తాను అన్న మాటలకు భీముడు మనసులో బాధపడుతున్నాడేమో అనుకొని కుంతి భీముడిని చూపిస్తూ (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: కుంతి మాటలు విని ధర్మరాజు, భీముడు సిగ్గుపడ్డారు. అంటే వీళ్ళన్న మాట పొరపాటన్నమాట. అందులో భీముడి పొరపాటును కుంతి వాచ్యంగానే చెప్పింది. మొత్తంమీద 'నీవు ఆజ్ఞాపించటం వలన యుద్ధం చేయవలసి వచ్చింది అని కుంతిమీద నెపంపెట్టినందుకు (మీ సౌఖ్యం, వంశగౌరవం నిల్పటం కొరకే చేశాను తప్ప ఇందులో నా స్వార్థం ఏం లేదని చెప్పిన కుంతి మాటలకు) ధర్మజ భీములు సిగ్గుపడ్డారు. సిగ్గుపడ్డారంటే తాము పొరపాటుగా మాటాడామని గ్రహించారన్నమాట (157ప.) అయితే భీముడిని గురించి వాచ్యంగా అన్నది కాబట్టి, అతడి స్వభావాన్ని బట్టి గూడా భీముడు బాధపడతాడేమో నని కుంతి మళ్ళీ ఇట్లా అంటున్నది. తల్లిగా ఎపుడూ భీముడిని గురించి ధర్మరాజుతోనే మాటాడుతున్నది. ఇట్లా మనసు పరిశీలించి నడుచుకొనటం తిక్కన పాత్రలలో ప్రత్యేకత.

ఉ. 'నామది నొండు లేదు; విను నవ్వితి నీతనితోడ; నీదు ల
క్ష్మీ మహిమన్ మనం బలరఁ జేసితి నుత్తమదానముల్; జన
స్తోమ నుతంబుగా నడపఁజూచితి జన్నము గన్నులార; నిం
కేమి కొఱంత నా; కుడుగ; నెట్లును బోదు నరణ్యవృత్తికిన్. 170

ప్రతిపదార్థం: విను(ము)= ధర్మరాజా-వినుము; నామదిన్= నా మనసులో; ఒండు= వేరే ఉద్దేశం ఏమీ; లేదు= లేదు; ఈతని తోడన్= ఈ భీముడి విషయంలో; నవ్వితిన్= నవ్వుతూ అన్నమాటలే సుమా; నీదు-లక్ష్మీ-మహిమన్= నీ సంపదల పెంపుతో; మనంబు= (నా నీ మనస్సు); అలరన్= తృప్తిపడే విధంగా; ఉత్తమ దానముల్= గొప్ప గొప్ప దానాలు; చేసితిన్= చేశాను; జన-స్తోమ-నుతంబుగాన్= జన సమూహాలు పొగడేవిధంగా; జన్నము= యజ్ఞం (అశ్వమేధయాగం); నడపన్= నీవు నిర్వహించగా; కన్నులారన్= కంటినిండా; చూచితిన్= చూచాను; ఎట్లును= ఏ విధంగా చూచినా; ఉడుగన్= అరణ్యాలకు వెళ్ళకుండా ఆగను; నాకున్= నాకు; ఇంకన్= ఇంకా; కొఱంత= లోటు; ఏమి= ఏమి ఉన్నది; అరణ్య వృత్తికిన్= అడవులలో ఉండడానికి; పోదున్= పోతాను.

తాత్పర్యం: 'కొడుకా! విను, నా మనసులో వేరే ఉద్దేశం ఏమీ లేదు. ఊరకే భీముడితో నవ్వులాటగా అన్నాను. నీ సంపదలతో మనసు తృప్తి తీరా ఎన్నో గొప్ప గొప్ప దానాలు చేశాను. నీవు అశ్వమేధయాగం చేస్తుంటే కళ్లారా చూచాను. ఇక నాకు కొఱత ఏమున్నది? అడవులకు వెళ్ళకుండా ఉండను. (నా జీవితానికి ఏ కొఱతా లేదు.) అడవులలో ఉండడానికే వెళ్ళుతాను.

విశేషం: నా మనసులో వేరే ఉద్దేశం లేదు. అంటే ధర్మరాజు భీముడు అన్న మాటలను గురించి వాళ్ళపై కోపం లేదని భావం. ఏదో నవ్వుతూ అన్నాను. అంటే తానన్న మాటలను గట్టిగా పట్టించుకుని బాధపడవద్దని భావం. ఇటువంటి మాటలకు భీముడు మెత్తబడటం అతడి స్వభావానికి సహజం. తల్లిగా కుంతికి తెలుసు. పిల్లలతత్త్వం. భీముడు ఆ తర్వాత లక్ష్మి నూఁది భరియింపక యిప్పుడు వాయఁబాడియే'. 'మనము తోఁచిన దానములు' రోజూ చేసికొంటూ ఇక్కడే ఉండుమన్నాడు. అందుకు సమాధానంగా కుంతి నీదులక్ష్మీ మహిమన్ మనం బలర నుత్తమదానముల్ చేసితి నన్నది. భీముడన్న మాటలనే ఉపయోగించడంలో దానికి సమాధానంగానే అంటున్నట్లు సూచన. ఎన్నో దానాలు మనసు తీరా చేశాను అనటం వలన పాండవలక్ష్మిని ఉపయోగించుకొనటమూ సత్కార్యాలు చేయటమూ రెండూ జరిగాయి కాబట్టి బాధపడనక్కరలేదని ఆంతర్యం- నడపఁ జూచితి' అనే కాక 'జన స్తోమనుతంబుగా నుత్తమదానముల్ చేసితి' అనీ అన్వయం. తను చేసిన దానాలు జనబాహుళ్యం ప్రశంసించారు. అంటే అధికంగా అధికులకు దానాలు చేసినట్లు తాత్పర్యం. మా చేత యుద్ధం చేయించావని వాళ్ళంటే ఎందుకోసం చేయించానో ఆ లక్ష్యం నెర వేరింది అని కుంతి ఇక్కడా వ్యంగ్యంగా సమాధానం చెప్తున్నది. ఇన్నీ సాధించిన తర్వాత ఇంకా ఏ కోర్కె ఉన్నదని? నగరంలో ఉండిపోవటానికి? అందుచే అడవులకు ప్రయాణం ఆపుకోవలసిన కారణం ఏమీ లేదు. అడవులకు వెళ్ళడం (పాడియే- అని భీముడి ప్రశ్న) న్యాయమే అని కుంతి సమాధానం. కాబట్టి 'అరణ్య వృత్తికిన్ పోదు' అని ఫలితాంశంగా తన నిర్ణయం మళ్ళీ చెప్పింది. ఇక్కడ అన్వయంలో కొంచెం మార్పుతో-ఈ నిర్ణయం కొంచెం కటువుగా కూడా వ్యక్తం అవుతుంది. 'ఇంకేమి కొఱంత నాకు'- నాకు లోటేముంది? ఉడుగన్= ఎట్లును అడవులకు పోవడం ఏ విధంగా కూడా మానుకోను. ఎట్లును బోదు నరణ్య వృత్తికిన్. ఏ విధంగానైనా మీరెన్ని చెప్పినా అడవులకు వెళ్ళి తీరుతాను- అని మార్దవం పనిచేయకపోతే ఇట్లా కఠినంగా అన్వయించాలి.

తే. రాజ్య ఫలము కామింపఁ బుత్త్రా! సమగ్ర। తపమునకు ఫల మైన యుత్తమ గతి ప్ర
సిద్ధి గోరుదు నది గల్గఁ జేత కిట్టి। తోడు మఱి నాకుఁ గలుగునే? దురితదూర! 171

ప్రతిపదార్థం: పుత్త్రా!= కొడుకా! (ధర్మరాజా), రాజ్యఫలము= రాజ్యం వలన కలిగే సుఖాలను; కామింపన్= నేను కోరను; సమగ్ర-తపమునకు(న్)= సంపూర్ణమైన తపస్సుకు; ఫలము= ప్రయోజనం; ఐన= అయినటువంటి; ఉత్తమగతి= శ్రేష్ఠమయిన లోకాలను; ప్రసిద్ధి= చక్కగా లభించటాన్ని; కోరుదున్= కోరుకొంటాను; దురితదూర!= పాపాలకు దూరంగా ఉండేవాడా!; అది= అటువంటి, ఉత్తమగతి; కల్గన్-చేఁతకున్= కలిగేటట్లు చేయటానికి, (సంపాదించుకోవటానికి); ఇట్టి తోడు= ఇటువంటి (గాంధారీ ధృతరాష్ట్రుల) సాయం; నాకున్= నాకు; మఱి= వేరొక సమయంలో; కలుగునే?= దొరుకుతుందా?

తాత్పర్యం: కొడుకా! నేను రాజ్య సుఖాలను కోరను. నిండైన తపస్సుకు ఫలితం ఐన ఉత్తమ లోకాలను పొందటమే నా కోరిక. పుణ్యాత్ముడా ధర్మరాజా! (తపస్సుతో సాధించుకొనవలసిన) అటువంటి ఉత్తమగతిని సంపాదించుకొనటానికి ఈ ధృతరాష్ట్రుడివంటి తోడు మళ్ళీ యింకొకసారి నాకు లభిస్తుందా?

క. కురు రాజునకును దేవికిఁ। బరిచర్య లొనర్చుచుం దపంబునఁ గృశతం
బొరయు తనువుతోఁ గడపెదఁ। గరము నియతి నింకఁ గలుగు కాలము వత్సా! 172

ప్రతిపదార్థం: వత్సా!= నాయనా!; ఇంకన్= ఇకపైన; కలుగుకాలము= వచ్చే రోజులన్నీ; కురు రాజునకును= ధృతరాష్ట్రుడికీ; దేవికి(న్)= అతడి భార్య గాంధారికీ; పరిచర్యలు= సేవలు; ఒనర్చుచున్= చేస్తూ; తపంబునన్= తపస్సుతో; కృశతన్= క్షీణతను; పొరయు= పొందే; తనువుతోన్= శరీరంతో; కరము= మిక్కిలి; నియతిన్= నియమంగా; కడపెద(న్)= గడుపుతాను.

తాత్పర్యం: నాయనా! ఇంక పై కాలమంతా, గాంధారీ ధృతరాష్ట్రులకు సేవ చేస్తూ, తపస్సుతో శరీరాన్ని కృశింపజేసికొంటూ నియమంగా గడిపేస్తాను.

వ. మీరు మరలుం' డనియె; నట్టియెడ నప్పాండురాజమహిషి, తమతోడ వనవాసంబునకై వచ్చుటకుం గడంగుటయు, దాని కొడంబడక పాండవులు దగు పలుకులం బ్రార్థించుటయు నెఱుంగుం గావున ధృతరాష్ట్రుండు 'ధర్మతనయుం డెట్లు సెప్పెనట్లు సేయు' మని విదురసంజయులచేత నద్దేవికిఁ జెప్పి పుత్తెంచిన వార లేతెంచి యబ్భంగి చెప్పినను వదలక వారి పలుకు లాయమ వారించి దృఢనిశ్చయంబునఁ గొడుకులఁ గోడండ్రను దక్కటి బంధుజనులకు సర్వభరత భార్యలను బరిజనంబులను గలయం గనుంగొని 'యి ట్లేల వచ్చెదరు? నిలువుండు; సుఖుల రై యుండుం' డనుటయు. 173

ప్రతిపదార్థం: మీరు= మీరు (పాండవులు); మరలుండు= తిరిగి నగరుకు వెళ్ళండి; అనియెన్= అన్నది (కుంతి); అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ+పాండురాజు-మహిషి= ఆ పాండురాజుగారి పట్టపుదేవి (కుంతి); వనవాసంబునకై= అడవులలో ఉండిపోవటం కొరకు; తమతోడన్= తమతో (గాంధారీ ధృతరాష్ట్రులతో) కలిసి; వచ్చుటకున్= (అడవులకు) రావడానికి; కడంగుటయున్= పూనుకొనటమూ; పాండవులు= పాండురాజు కొడుకులు; దానికిన్= కుంతి అడవులకు వెళ్ళటానికి; ఒడంబడక= అంగీకరించకుండా; తగు పలుకులన్= తగిన మాటలతో; ప్రార్థించుటయున్= (వద్దని) వేడుకొనటమూ; ఎఱుంగున్= తెలుసు; కావునన్= కాబట్టి; ధర్మతనయుండు= ధర్మరాజు; ఎట్లు= ఏ ప్రకారంగా; చెప్పెన్= చెప్పాడో; అట్లు= ఆ ప్రకారంగా; చేయుము= చేయవలసింది అని అనే విధంగా; ఆ+దేవికిన్= ఆ కుంతీదేవికి; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; విదుర-సంజయులచేతన్= విదురుడితోనూ, సంజయుడితోనూ; చెప్పి= పై విధంగా పలికి; పుత్తెంచినన్= కుంతి వద్దకు పంపగా; వారలు= ఆ విదుర సంజయులు; ఏతెంచి= కుంతి వద్దకు వచ్చి; ఆ+భంగి= ధృతరాష్ట్రుడు చెప్పుమన్నమాటలు; చెప్పినను= కుంతికి చెప్పినప్పటికీ; ఆ+అమ= ఆ కుంతి;

వదలక= అడవులకు (ధృతరాష్ట్రుడితో వెళ్ళాలనే) తన నిశ్చయం విడిచి పెట్టకుండా; వారి పలుకులు= విదుర సంజయుల మాటలు; వారించి= నిరోధించి; దృఢ-నిశ్చయంబునన్= మారని గట్టి నిర్ణయంతో; (అడవులకు వెళ్ళాలని); కొడుకులన్= పాండవులనూ; కోడండ్రను= కోడళ్ళనూ; తక్కటి-బంధుజనులను= మిగిలిన బంధువులనూ; సర్వ-భరత-భార్యలను= భరతవంశపు రాజుల స్త్రీలు అందరినీ; పరిజనంబులను= భృత్యులనూ; కలయన్= ఒక్కసారి పరికించి; కనుంగొని= చూచి; ఏల= ఎందుకు; ఇట్లు= ఈ విధంగా; వచ్చెదరు?= నన్ను వెన్నంటి వస్తున్నారు?; నిలువుండు= ఇంక ఆగిపొండి; సుఖులరు+ఐ= సుఖాన్ని పొందినవారై; ఉండుండు= (నగరులో) ఉండండి; అనుటయు(న్)= అని కుంతి పల్కగానే.

తాత్పర్యం: 'ఇక మీరు తిరిగి (ఇళ్ళకు) వెళ్ళండి' అన్నది కుంతి. కుంతి తమతో అరణ్యాలకు రావటానికి పూనుకొనటమూ, అందుకు ఆమె కొడుకులు అంగీకరించకుండా ఆమెను వారించటమూ తెలిసినవాడు కాబట్టి ధృతరాష్ట్రుడు ఆ సమయంలో, విదురుడినీ, సంజయుడినీ పిలిచి, 'కుంతికి ధర్మరాజు ఏ విధంగా చేయుమంటే ఆ విధంగా చేయు' మని కబురు పంపాడు. వాళ్ళిద్దరూ వచ్చి ధృతరాష్ట్రుడి సందేశాన్ని కుంతికి చెప్పారు. అయినా కుంతి పట్టు విడవకుండా విదుర సంజయుల మాటలకు అడ్డం వచ్చి గట్టి నిర్ణయంతో కొడుకులనూ, కోడళ్ళనూ, మిగిలిన చుట్టాలనూ, భరతవంశ స్త్రీలనూ, సేవకులనూ-అందరినీ ఒక్కసారి పరికించి చూచి 'ఎందు కిట్లా వెంట వస్తారు? ఇంక ఆగండి. (ఇళ్ళకు వెళ్ళి) సుఖంగా ఉండండి' అన్నది. అప్పుడు.

విశేషం: మూలంలో గాంధారీ ధృతరాష్ట్రులు ధర్మరాజాదుల మాటలన్నీ వింటూ ఇక్కడే ఉన్నారు కాని తెలుగులో తిక్కన గాంధారీ ధృతరాష్ట్రులు - కుంతీ పాండవులకు కొంచెం దూరంగా వెళ్ళి అక్కడ ఆగారు. దుఃఖిస్తున్న కుంతికీ - తత్పుత్రులకూ ఏకాంతం కలిగించటం వారి మాటలకు తాను అడ్డంగా ఉండటం తగదని ధృరాష్ట్రుడు అనుకొని దూరంగా వెళ్ళాడన్నమాట. అట్లానే 'విషాదం బంది ఊరకున్న ధర్మరాజు, ధృతరాష్ట్రుడు 'కొండొక యెడగలుగం జనిన తర్వాత తల్లితో మాట్లాడాడు(157). ఏకారణంగా నైనా కుంతి దుర్యోధనాదుల వలన పాండవులకు కలిగిన కీళ్ళు (166,168) ప్రస్తావించింది. ఇంకా ఆ రోజు సభలో పెద్దలు ఎవరూ నోరుమెదపలేదన్నమాట ధృతరాష్ట్రుడికీ తగిలేదే. (ఉద్యో.3,198) ధృతరాష్ట్రుడు ప్రక్కన ఉంటే కుంతి కూడా ఇట్లా మాట్లాడటం కుదురుతుందా? ఏ ఉద్దేశంతో అన్నప్పటికీ ఆ మాటలు యథార్థాలే కదా! అందుకే తిక్కన ధృతరాష్ట్రుడిని ఆ సన్నివేశం నుండి తప్పించాడు. కాబట్టి యిక్కడి మాటలలో మూలానికీ తెలుగుకీ తేడా వస్తుంది. గాంధారీ ధృతరాష్ట్రు లిక్కడ లేరు కాబట్టి వారు ధర్మరాజు చెప్పినట్లు చెయ్యుమని స్వయంగా కుంతితో (మూలంలోవలె) అనే వీలు లేదు. విదుర సంజయుల చేత కబురు చేసినట్లు తెలుగులో కల్పనం, ధృడనిశ్చయం చేసికొన్న కుంతి ధృతరాష్ట్రుడి మాటను అతడి ముఖమ్మీద కాదనటంకంటె కబురు తెచ్చిన విదుర సంజయులతో కా దనడంలో 'వారి పలుకులు వారించటం లో సౌకర్యమూ లభించింది. కుంతి నిర్ణయం అంగీకరించి (సరే అడవులకు పొమ్మని) అందరూ వెళ్ళిపోయాక గాంధారీ ధృతరాష్ట్రులు కుంతిని వారించినట్లు మూలం. తెలుగులోని మార్పు ఉచితం.

క. హృదయములు దలర నందఱు౯ । బ్రదక్షిణము గాఁగ నేడ్పుఁ గ్రందుటెలుఁగు లె
ల్ల దెసలఁ జెలఁగఁ దిరిగి త । త్పదంబులకు నెఱఁగి వంతఁ దనువులు దూలన్. 174

ప్రతిపదార్థం: అందఱున్= అప్పుడు (పాండవాదులు) అందరూ కూడా; హృదయములు= మనసులు; తలరన్= చెదరిపోగా; ఏడ్పు (న్) క్రందు+ఎలుఁగు= ఒక్కసారిగా రేగిన ఏడుపుల గొంతులు, (ధ్వనులు); ఎల్ల, దెసలన్= అన్ని దిక్కులలోనూ; చెలఁగన్= రేగుతుండగా; ప్రదక్షిణము కాఁగన్= ఆ కుంతీదేవికి, ప్రదక్షిణంగా; తిరిగి= తిరిగి వచ్చి; తద్-పదంబులకున్= ఆ కుంతి పాదాలకు; ఎఱఁగి= (సాష్టాంగంగా) నమస్కరించి; వంతన్= దుఃఖంవలన; తనువులు= ఒళ్ళు (శరీరాలు); తూలన్= తూలిపోతూ ఉండగా.-(తరువాతి వచనంతో అన్వయం.)

తాత్పర్యం: అపుడు పాండవులు వారి భార్యలు మొదలుగా అక్కడ ఉన్నవాళ్లంతా కుంతి నిశ్చయానికి, మనసులు చెదరిపోవటంతో, ఒక్కసారిగా ఏడ్చారు. ఆ ఏడుపు ధ్వనులు నాల్గుదిక్కులా నిండిపోయాయి. అట్లా ఏడుస్తూ కుంతికి ప్రదక్షిణం చేసి పాదాభివందనం చేశారు. బాధవలన శరీరం తూలిపోతుండగా అక్కడే నిలబడిపోయారు.

విశేషం: పాండవులతోపాటు అందరూ కుంతికి ప్రదక్షిణం చేసి నమస్కరించడం తెలుగులో విశేషం. మనసులలో దుఃఖం, కంఠంలో నుండి ఏడుపుగా వ్యక్తమై ఈ రెంటిచేత కలిగిన నిస్సత్తువవలన ఒళ్ళు తూలిపోయింది. అంటే వాళ్ళకు ఒళ్ళంతా దుఃఖం నిండిపోయింది. ప్రదక్షిణాదులన్నీ ఏడూస్తూనే చేయడం అప్పటి మనఃస్థితికి దర్పణం.

వ. నిలిచి రందుఁ బాండవు లేవురుం బాండురాజ మహిషి ననుప మఱియుం జని యాయమను ధృతరాష్ట్ర గాంధారులను గలిపి 'వారల నిరువుర నుద్దేశించి' మీరు వనంబునకుం బోయి తానును లేకున్న మా కెట్లు కాలంబు గడపవచ్చు ననుతలంపునం దన్ను నెంత ప్రార్థించినను గొంతి నిలుచుట కొడంబడ దయ్యెఁ; నీ సాధ్వికి బుద్ధి సెప్పికొనుచుం బరిచర్యసేయించు కొం' డని యప్పగించి, యారాజునకు నద్దేవికిం గుంతికిం బ్రదక్షిణంబు సేసి దండ ప్రణామంబు లాచరించిన, దీవించి వా రామంత్రణంబు సేయ నా ధర్మపుత్త్రాదు లశ్రుప్లావితంబు లగువదనంబులతోడ మరలి వనితాజనంబులం దోడ్కొని. 175

ప్రతిపదార్థం: నిలిచిరి= (అందరూ) నిలబడిపోయారు; అందున్= వాళ్ళలో; పాండవులు= పాండురాజు కుమారులు; ఏవురున్= అయిదుగురూ; పాండురాజ మహిషిన్= పాండురాజు పట్టపుదేవి కుంతిని; అనుపన్= పంపటానికి; మఱియున్= మరికొంత ముందుకు; చని= వెళ్ళి; ఆ+అమను= ఆమెను (కుంతిని); ధృతరాష్ట్ర గాంధారులను= కొంచెం దూరంగా ఉన్న గాంధారీ ధృతరాష్ట్రులతో; కలిపి= చేర్చి; వారలన్-ఇరువురన్= ఆ ఇద్దరినీ (గాంధారీ ధృతరాష్ట్రులను); ఉద్దేశించి= గురించి; మీరు= మీ రిద్దరూ; వనంబునకున్= అడవికి; పోయి= వెళ్ళి; తానును= కుంతి కూడా; లేకున్నన్= మాకు తోడుగా లేకపోతే; మాకున్= మా అందరికీ; కాలంబు= ముందరిరోజులు; ఎట్లు= ఏ విధంగా; కడపన్= వెళ్ళదీయటం; వచ్చున్= సాధ్యమవుతుంది; అనుతలంపునన్= అన్న ఉద్దేశంతో; తన్నున్= కుంతిని; ఎంత= ఎంతగా; ప్రార్థించినను= వేడుకొన్నప్పటికీ; గొంతి= కుంతి; నిలుచుటకున్= ఆగటానికి; ఒడంబడదు అయ్యెన్= అంగీకరించలేదు; ఈ సాధ్వికిన్= పతివ్రత అయిన ఆమెకు; బుద్ధి-చెప్పికొనుచున్= సదుపదేశాలు చేస్తూ; పరిచర్య= సేవ; చేయించుకొండు= మీరు చేయించుకొనండి; అని= అని చెప్పి; అప్పగించి= కుంతిని గాంధారీ ధృతరాష్ట్రులకు ఒప్పజెప్పి; ఆ రాజునకున్= (ఆ) ధృతరాష్ట్రుడికీ; ఆ+దేవికిన్= గాంధారికీ; కుంతికిన్= తల్లికీ; ప్రదక్షిణంబు - చేసి= ప్రదక్షిణగా తిరిగి; దండ ప్రణామంబులు= సాష్టాంగ నమస్కారాలు; ఆచరించినన్= చేయగా; వారు= గాంధారీ, ధృతరాష్ట్రులూ, కుంతీ; దీవించి= పాండవులను ఆశీర్వదించి; ఆమంత్రణంబు - చేయన్= వీడు కొల్పగా; ఆ ధర్మపుత్త్ర-ఆదులు= ధర్మరాజు మొదలైన వారు (పాండవులు); అశ్రు ప్లావితంబులు= కన్నీళ్ళతో తడిసినవి; అగు= అయినటువంటి; వదనంబుల తోడన్= ముఖాలతో; మరలి= వెనక్కు తిరిగి; వనితా జనంబులన్= అక్కడ ఆగిఉన్న అంతఃపురకాంతలను; తోడ్కొని= తీసికొని.

తాత్పర్యం: కుంతి నిశ్చయానికి విచారిస్తూ అందరూ ఆమెకు పాదాభివందనం చేసి ఆగిపోయారు. వారిలో పాండవులు మాత్రం కుంతీదేవికి వీడ్కోలు ఇచ్చి పంపటానికి మరికొంత ముందుకు వెళ్లారు. కుంతిని గాంధారీ ధృతరాష్ట్రులు ఉన్నచోటికి తీసికొనిపోయి వాళ్ళతో 'మీరు ఇద్దరూ అడవికి వెళ్ళుతున్నారు. ఈ కుంతి కూడా మిమ్మల్ని అనుసరించివస్తే

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ఆమె కూడా లేకుండా మేం కాలం గడిపేదెట్లాగని ఆమెను వెళ్లవద్దని మేము ఎంతగా ప్రార్థించినా వినటం లేదు. ఈ పతివ్రతకు మీరే మంచి మాటలు చెప్పుతూ ఆమెచేత సేవలు చేయించుకొనండి' అని కుంతిని గాంధారీ ధృతరాష్ట్రులకు అప్పగించారు. ధృతరాష్ట్రుడికీ, గాంధారికీ, కుంతికీ ప్రదక్షిణం చేసి సాష్టాంగంగా ప్రణామం చేశారు. వాళ్ళు కూడా పాండవులను దీవించి వీడ్కోలు చెప్పారు. అపుడు ధర్మరాజాదులు కన్నీళ్ళతో తడిసిన ముఖాలతో, వెనుకకు తిరిగి వచ్చి అక్కడే ఉన్న అంతఃపుర స్త్రీలను కలుపుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఈ వీడ్కోలు సన్నివేశం మూలంలో ఇట్లా లేదు. రాచ మర్యాదలు ప్రత్యక్షంగా చూసిన తిక్కన సహజంగా చిత్రించటం ఇందులో విశేషం. గాంధారీ ధృతరాష్ట్రులను తిక్కన దూరంగా పంపించాడు. కాబట్టి అడవులకు వెళ్లవలసిన కుంతిని ముందుకు తీసుకొని వెళ్ళి వాళ్ళతో కలిపాడు. కుంతి 'ఇట్టి తోడు మఱి నాకు కలుగునే' అన్నది (171) కాబట్టి కుంతికి వాళ్ళు తోడుగా, కుంతిని వాళ్ళ కప్పగించారు. పెద్దదిక్కయిన మీరూ లేకా, ఆమె కూడా లేకపోతే ఎట్లాగని నగరంలో ఉండుమని వేడుకున్నాం అన్నాడు ధర్మరాజు. ఆంతర్యం అదే అయినా, అక్కడ అనుకొన్న మాటలు ధృతరాష్ట్రుడు వినదగ్గవి కావు కాబట్టి తమ మాటల సారం ప్రకటించాడు. 'ఎంత ప్రార్థించినను నిలుచుట కొడంబడదయ్యె'- అనటం అందువలన మా తల్లిని మీ కప్పగించవలసి వచ్చిందని భావం. ఇట్లా అనటం వలన గాంధారీ ధృతరాష్ట్రులు మళ్ళీ ప్రత్యేకంగా అడవులకు రావద్దని చెప్పనవసరం లేకుండా పోయింది.

తే. **పొగులుచును నల్ల నల్లన పురికి నరిగి। రదియు నుమ్మలికంబు ప్రోవైన యట్లు**
చూడఁ గూడక యుండంగఁ జొచ్చి రాత్మ। మందిరము లందఱును బుధమాన్యచరిత! **176**

ప్రతిపదార్థం: పొగులుచును= దుఃఖంతో కుమిలిపోతూ; అల్లన+అల్లన= అతికష్టంగా, (మిక్కిలి మెల్లగా); పురికిన్= హస్తినకు; అరిగిరి= వెళ్లారు; బుధ-మాన్య-చరిత!= విజ్ఞులచే, గౌరవింపబడే నడవడి కలవాడా - జనమేజయ మహారాజా!; అదియున్= ఆ హస్తి నగరం కూడా (అప్పుడు); ఉమ్మలికంబు= విచారం; ప్రోవు - ఐన - అట్లు= కుప్పగా ఒకేచోటకు చేరిన తీరుగా; చూడన్-కూడక= చూడలేని విధంగా; ఉండంగన్= ఉండగా; అందరును= పాండవాదులందరూ; ఆత్మమందిరములు= తమ తమ నివాసాలు; చొచ్చిరి= ప్రవేశించారు.

తాత్పర్యం: (కుంతీ ప్రభృతులు వీడ్కోలివ్వగా వెనుకకు మళ్ళిన పాండవులు అంతఃపుర స్త్రీలను కలుపుకొని) దుఃఖంతో కుమిలిపోతూ, మెల్లగా అతికష్టం మీద హస్తి నగరానికి తిరిగివచ్చారు. ఆ నగరం మొత్తం విచారం అంతా ఒక్కచోట పోగుగా కూడిందా అన్నట్లుగా చూడలేనట్లుగా ఉన్నది. గౌరవించే నడత కలిగిన ఓ జనమేజయ మహారాజా! పాండవులూ వారి కాంతలూ తమతమ ఇండ్లలో ప్రవేశించారు. (అని వైశంపాయనుడు జనమేజయుడితో అన్నాడు.)

విశేషం: ('అదియు నుమ్మలికంబు ప్రోవైన యట్లు-అలంకారం ఉత్ప్రేక్ష')

వ. **అట్లు పుర ప్రవేశంబు చేసి ధర్మనందనుండును దమ్ములుం దగిన వర్తనంబుల నుండి; రట నక్కురువృద్ధుండు నిశ్చింతుం డై గాంధారియుఁ గుంతియు విదుర సంజయులు నగ్నిహోత్రంబునకు వలయు ఋత్విగ్జనంబులతోడ నరుగుదేర నలయక భాగీరథీ తీరంబునకుం బోయి, యొక్క యోగ్య ప్రదేశంబున విడిసెఁ; దదనంతరంబ యతండు.** **177**

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారంగా; పురప్రవేశంబు చేసి= తిరిగి హస్తినగరానికి వచ్చి; ధర్మనందనుండును= ధర్మరాజూ; తమ్ములున్= అతడి తమ్ముళ్ళు భీమాదులూ, తగిన వర్తనంబులన్= యోగ్యమైన నడవడులతో; ఉండిరి= ఉన్నారు; అటన్= ఇంక అక్కడ; ఆ+కురువృద్ధుండు= ఆ ధృతరాష్ట్రుడు; నిశ్చింతుండు-ఐ= చింతలు (ఇతరాలోచనలు) ఏమీ లేకుండా; అగ్నిహోత్రం బునకున్= నిత్యమూ అగ్నికార్యానికి; వలయు= అవసరమైన; ఋత్విగ్జనంబులతోడన్= ఋత్విక్కులతో కలిసి; గాంధారియున్= గాంధారీ; కుంతియున్= కుంతీ; విదుర సంజయులున్= విదురుడూ, సంజయుడూ; అరుగుదేరన్= రాగా; అలయక= శ్రమ తెలియకుండా; భాగీరథీ, తీరంబునకున్= గంగానది ఒడ్డుకు; పోయి= చేరుకొని; ఒక్క-యోగ్య-ప్రదేశంబునన్= ఉండడానికి తగిన ఒకానొకచోట; విడిసెన్= విడిది ఏర్పరచుకొన్నాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; అతండు= ఆ ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: ఆ విధంగా నగరానికి తిరిగి వెళ్ళిన ధర్మరాజూ, అతడి తమ్ముళ్ళూ తమకు యోగ్యమైన నడవడికతో ఉన్నారు. ఇంక పాండవులు విడిచిన తర్వాత అక్కడ నిత్యమూ, అగ్నికార్యానికి అవసరమైన ఋత్విక్కులను తీసికొని గాంధారీ, కుంతీ, విదురుడూ, సంజయుడూ తనతో రాగా, ధృతరాష్ట్రుడు నిశ్చింతగా, అలుపు తెలియకుండా గంగానది ఒడ్డుకు చేరుకొన్నాడు. అక్కడ నివాసానికి తగిన ఒకానొక స్థలంలో వచ్చిన బలగంతో ఆ నాటికి బస ఏర్పాటు చేసికొన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **స్నానాదిక విహితాను। ష్ఠానంబులు నడపి శ్రుతి విశారద భూదే**
వానీక ప్రణయనమున। మానిత రుచి వెలుఁగుచున్న మహితాగ్నులకున్ **178**

ప్రతిపదార్థం: స్నాన+ఆదిక-విహిత-అనుష్ఠానంబులు= స్నానం మొదలైన (ధర్మ శాస్త్రములందు ఆచరింపవలసినవిగా) విధించబడినటువంటి పనులు ఆచరించటం; నడపి= జరిపి; శ్రుతి-విశారద-భూదేవ+అనీక-ప్రణయనమునన్= వేదపారంగతులైన బ్రాహ్మణుల సమూహంచేత తీసికొనిరాబడటం వలన; మానిత-రుచిన్= పూజ్యమైన గొప్ప కాంతితో; వెలుఁగుచున్+ఉన్న= ప్రకాశిస్తూ ఉన్నటువంటి; మహిత-అగ్నులకున్= పూజ్యా (ప్రభావ వంతా) లైన అగ్నులకు.

తాత్పర్యం: గంగానదీ తీరంలో బలగాన్ని విడిది చేసిన తరువాత ధృతరాష్ట్రుడు స్నానమూ మొదలైన శాస్త్ర విహిత కర్మలను ఆచరించి, వేద పారగులైన బ్రాహ్మణులు తయారుచేయటం వలన (గొప్పకాంతితో) ప్రకాశిస్తున్న పూజించదగిన అగ్నులకు- (అర్చనలు చేశాడు)

తే. **అర్చ లిచ్చి హోమంబు సమంచితముగఁ। జలిపి యెల్లవారలకు భోజనము సంఘ**
టించి యాహారవిధి యాచరించి విదుర। సంజయుల యొనర్చిన దర్భశయ్య నుండె. **179**

ప్రతిపదార్థం: అర్చలు-ఇచ్చి= పూజలు చేసి; సమంచితంబుగన్= (తగిన విధంగా) విధ్యుక్తంగా; హోమంబు చలిపి= సమిధాదులను ఆ అగ్నిలో ప్రయోగించి, (హుతం చేసి) (వైశ్వదేవంచేసి); ఎల్ల వారలకున్= తనతో (అడవికి) వచ్చిన వాళ్ళందరికీ; భోజనము= తిండి; సంఘటించి= కూర్చి; ఆహారవిధి= తాను కూడ, భోజనం పని; ఆచరించి= పూర్తి చేసి; విదుర సంజయుల= విదురుడూ, సంజయుడూ; ఒనర్చిన= సిద్ధం చేసిన; దర్భశయ్యన్= దర్భలతో ఉన్న పడకమీద; ఉండెన్= కూర్చున్నాడు.

తాత్పర్యం: ఆ అగ్నికి అర్చనలు చేసి, విధిమంతంగా హోమం చేసి, తనతో వచ్చిన అందరికి భోజనాలు ఏర్పాటు చేసి, తానూ భోంచేసి, విదురుడూ సంజయుడూ సిద్ధం చేసిన దర్భల పడకమీద విశ్రాంతిగా కూర్చున్నాడు ధృతరాష్ట్రుడు.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

ధృతరాష్ట్రుఁడు శతయూప రాజర్షి యాశ్రమంబున వసియించుట (సం.15-25-9)

వ. ఆ శయ్యకు ననతిదూరంబునం గల్పితం బైన తల్పంబున గాంధారియుం దదనంతర సన్నిహితశయనంబున గొంతియు నింత నంత విదుర సంజయులును జుట్లం దమకుఁ జూడం బోలిన చోటుల యాజకజనంబును విశ్రమించి; రట్లద్ది న శేషంబు సనిన సాయంతన కృత్యంబులు సలిపి; రయ్యామిని యచ్చటఁ గడపి సూర్యోదయ సమయంబునం గాలోచిత కరణీయంబులు నిర్వర్తించి యాంబికేయుండు తన వారును దానును గంగానది యుత్తరించి చని కురుక్షేత్రంబుఁ బ్రవేశించి యొక్క పుణ్యాశ్రమంబు నుపాంతంబునం దరుచ్ఛాయాశీతలంబైన సికతాతలంబున నాసీనుం డయ్యెఁ; నట్లక్కురురాజు నిజాశ్రమప్రదేశంబునకు వచ్చుట శతయూప నామధేయుండును గేకయవంశ వర్యుండును దపోధుర్యుండును నైన రాజర్షిసత్తముండు విని యయ్యెడకు వచ్చి. 180

ప్రతిపదార్థం: ఆ శయ్యకున్= ధృతరాష్ట్రుడు విశ్రమించిన శయ్యకు; అనతిదూరంబునన్= కొంచెం ఎడంగా; కల్పితంబు-ఐన= ఏర్పాటు చేయబడిన; తల్పంబునన్= శయ్యమీద; గొంతియున్= కుంతీదేవి; ఇంతన్-అంతన్= కొంచెం దూరంగా; విదుర సంజయులును= విదురుడూ, సంజయుడూ; చుట్లన్= వారందరికీ చుట్టూ; తమకున్= ఎవరికి వారికి; చూడన్= ధృతరాష్ట్రుడు కనబడటానికి; పోలిన చోటులన్= తగిన స్థానాలలో; యాజక జనంబును= ఋత్విక్కులూ; విశ్రమించిరి= విశ్రాంతి తీసికొన్నారు; అట్లు= ఆ ప్రకారంగా; ఆ+దిన= శేషంబు= వాళ్ళు అడవికి వచ్చిన నాటి పగలులో మిగిలిన భాగం; చనినన్= గడచిపోగా; (సాయంత్రం) సాయంతన-కృత్యంబులు= సాయంకాలంలో జరపవలసిన సంధ్యావందనాదులైన పనులను; చలిపిరి= ఆచరించారు; ఆ+యామిని= ఆరోజు రాత్రి; అచ్చటన్= భాగీరథీతీరంలోనే; కడపి= గడపి; సూర్య+ఉదయ-సమయంబునన్= సూర్యుడు ఉదయించే సమయంలో; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; కాల+ఉచిత, కరణీయంబులు= సూర్యోదయకాలంలో ఆచరించవలసిన కార్యాలు; నిర్వర్తించి= పూర్తి చేసి; తనవారును= గాంధారీ ప్రభృతులు (తనతో వచ్చినవారూ); తానును= తానూ; గంగానది= గంగానదిని; ఉత్తరించి= దాటి; చని= (అవతలి ఒడ్డుకు) వెళ్ళి; కురుక్షేత్రంబున్= కురుక్షేత్ర స్థలాన్ని; ప్రవేశించి= చేరుకొని; ఒక్క-పుణ్య-ఆశ్రమంబు-ఉపాంతంబునన్= ఒకానొక పవిత్రమైన మునులు నివసించే చోటికి దగ్గరలో; తరు-ఛాయా- శీతలంబు+ ఐన= చెట్లనీడ వలన చల్లగా ఉన్న; సికతా- తలంబునన్= ఇసుక తిన్నెమీద; ఆసీనుండు+అయ్యెన్= (తనవారందరితో గూడ) కూర్చున్నాడు; శతయూప-నామధేయుండును= శతయూపుడు అనేపేరు గలవాడూ; కేకయ-వంశ-వర్యుండును= 'కేకయ' వంశంలో శ్రేష్ఠుడూ; తపస్-ధుర్యుండును= గొప్ప తపస్వీ; ఐన= అయినటువంటి; రాజ-ఋషి-సత్తముండు= గొప్ప రాజర్షి; అట్లు= ఆప్రకారంగా (గాంధారీ ప్రభృతులలో వనవాసార్థం); ఆ+కురురాజు= ఆ ధృతరాష్ట్రుడు; నిజ-ఆశ్రమ-ప్రదేశంబునకున్= తన నివాస ప్రాంతానికి; వచ్చుట= రావటం; విని= తెలిసికొని; ఆ+ఎడకున్= ఆ ధృతరాష్ట్రాదులు విడిసిన చోటికి; వచ్చి= వచ్చి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు విశ్రమించిన శయ్యకు కొంచెం ఎడంగా ఏర్పరచిన పక్కమీద గాంధారీ, దానికి దగ్గరలో శయ్యమీద కుంతీ, అక్కడికి కొంచెం ప్రక్కగా విదురుడూ, సంజయుడూ, ధృతరాష్ట్రుడూ తమకు కనబడేవిధంగా వీలయిన స్థలాలలో వారికి చుట్టూ ఋత్విక్కులూ, విశ్రాంతి తీసికొన్నారు. ఆ విధంగా ఆ రోజు పగలు గడిచింది. సాయంకాలం కావటంతో అందరూ సంధ్యాదికృత్యాలు జరిపారు. ఆ రాత్రి భాగీరథీ తీరంలో అక్కడే గడిపారు. సూర్యోదయం కాగానే ఆ సమయంలో చేయవలసిన హోమాది విధులన్నీ పూర్తి చేశారు. తరువాత ధృతరాష్ట్రుడు తనతో అడవికి వచ్చినవారూ తానూ కలిపి, గంగానదిని దాటి ఆవలిఒడ్డుకు చేరుకొని, కురుక్షేత్రంలో ప్రవేశించి,

అక్కడ ఒక పవిత్రమైన ముని ఆశ్రమానికి దగ్గరలో చెట్టు నీడవలన చల్లగా ఉన్న ఇసుకదిబ్బమీద కూర్చున్నారు. కేకయవంశంలో శ్రేష్ఠుడూ, గొప్ప తపస్వీ అయిన శతయూపుడు అనే రాజర్షి ధృతరాష్ట్రుడు వనవాసార్థం గాంధారీ ప్రభృతులతో వచ్చి తన ఆశ్రమానికి సమీపంలో ఉన్నాడని తెలిసికొని ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చాడు.

క. కని గారవంబునం దో। డ్కొని చని యర్ఘ్యాది విధు లకుంఠితవినయం
బున నడపిన నయ్యాశ్రమ। మున నతఁడు వసింపఁగోరె భూపవరేణ్యా! 181

ప్రతిపదార్థం: భూప-వరేణ్యా!= జనమేజయ మహారాజా!; కని= ధృతరాష్ట్రుడిని (అతడితో వచ్చినవారినీ) చూచి; గారవంబునన్= అభిమానంతో; తోడ్కొని= (శతయూపుడు) తనతో తీసికొని; చని= ఆశ్రయానికి వెళ్ళి; అకుంఠిత-వినయంబునన్= మిక్కిలి అణకువతో; అర్ఘ్య-ఆది-విధులు= పూజ్యమైన జలం ఇవ్వటం మొదలైన పనులు; నడపినన్= జరపగా; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; ఆ+ఆశ్రమమునన్= ఆ శతయూపుడి ఆశ్రమంలో; వసింపన్= ఉండాలని; కోరెన్= కోరుకొన్నాడు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా!; ఆ విధంగా ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చిన శతయూపుడు ధృతరాష్ట్రుడిని (ఇతరులనూ) చూచి, సగౌరవంగా తనతో ఆశ్రమానికి తీసికొని వెళ్ళి గొప్పవినయంతో, అర్ఘ్యం మొదలైన సత్కారాలు చేశాడు. ధృతరాష్ట్రుడు ఆ ఆశ్రమంలోనే ఉండాలని కోరుకొన్నాడు.

క. కోరిన విదురాదులు నా। కౌరవపతితలఁపు మేలుగాఁ గొని తగ న
చ్చేరువను బర్ణశాలలు। వే రచియించి రుచితంపు విధమున నధిపా! 182

ప్రతిపదార్థం: అధిపా!= జనమేజయమహారాజా!; కోరిన= ధృతరాష్ట్రుడు శతయూపుడి ఆశ్రమంలో నివసించాలనుకొంటున్నట్లుగా చెప్పగా; ఆ కౌరవపతి-తలఁపు= ఆ ధృతరాష్ట్రుడి ఆలోచనను; మేలుగాన్= మేలైనదిగా; కొని= గ్రహించి; విదుర-ఆదులు= విదురుడు మొదలైన వారు; తగన్= తగినంతగా; ఆ+చేరువను= అక్కడికి దగ్గరలోనే; ఉచితంపు విధమునన్= అర్హమైన తీరులోనే; వే= వేగంగా; పర్ణశాలలు= ఆకుటిళ్ళు; రచియించిరి= నిర్మించారు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! ధృతరాష్ట్రుడు శతయూపుడి ఆశ్రమంలోనే నివసించాలని కోరగా అతడి అభిప్రాయం మంచిదే అని గ్రహించిన విదురుడు మొదలైనవారు అక్కడికి తగినంత దగ్గరలోనే ప్రక్కనే తగిన విధంగా పర్ణశాలలు త్వరగా నిర్మించారు.

వ. అం దక్కురువిభుండు దానును గాంధారియుఁ జీరాజిన వసనులును సువ్రతపరులు నగుచుఁ గుంతీ విదుర సంజయులతో వసియించి తపం బాచరింప యాజకులు నిజకృత్యంబు నడపుచుండి రిట్లు నియమ నిష్ఠలతిశ యిల్ల నాభూవల్లభుం డచ్చటి మును ల చ్చేరువ నతి తీవ్రతపశ్చరణంబున నిజాంగంబు నిర్మాంసత్వంబునం జర్మాస్థులు గదియునట్టి కార్శ్యంబు దనకు నొప్పుగా వర్తి ల్లె నని యిట్లు ధృతరాష్ట్ర వృత్తాంతంబు చెప్పిన విని యవ్విచిత్రవీర్య నందనుండు పదంపడి యెట్టివాఁ డయ్యె? మునీంద్రా! యెఱింగింపు' మనుటయు. 183

ప్రతిపదార్థం: అందున్= ఆ పర్ణశాలలో; గాంధారియున్= గాంధారీ; ఆ+కురువిభుండు= ఆ ధృతరాష్ట్రుడు; తానును= తానూ; చీర+అజినవసనులును= నారచీరలు, మృగచర్మాలూ వస్త్రాలుగా ధరించి; సువ్రత పరులున్= శ్రేష్ఠములైన వేదోక్త విధుల ఆచరణలో దీక్ష కలిగి; కుంతీ-విదుర-సంజయులతోన్= కుంతీ, విదురుడూ; సంజయుడూ-వీళ్ళతో కలిసి; వసియించి= నివసిస్తూ; తపంబు=

తపస్సు; ఆచరింపన్= చేస్తుండగా; యాజకులు= ఋత్విక్కులు; నిజకృత్యంబులు= అగ్నికార్యాదులైన తమ పనులను; నడపుచుండిరి= నిర్వహిస్తున్నారు; ఇట్లు= ఈ ప్రకారంగా; ఆ భూవల్లభుండు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; నియమ-నిష్ఠలు= ఉపవాసాది నియమాలూ, వానిలో శ్రద్ధా; అతిశయిల్లన్= పెంపొందగా; అచ్చటి మునులు= ఆ ప్రాంతంలో ఉండే తాపసులు; (అచ్చెరువు-అందన్= ధృతరాష్ట్రుడి తపోవ్రతానికి ఆశ్చర్యపడుతుండగా), ఆ+చేరువన్= అచ్చట; అతి-తీవ్ర-తపస్+చరణంబునన్= మిక్కిలి కఠినమైన తపస్సును ఆచరించటం వలన; నిర్-మాంసత్వంబునన్= శరీరంలోని మాంసం నశించిపోగా; నిజ+అంగంబు= అతడి (ధృతరాష్ట్రుడి) శరీరం; చర్మ+అస్థులు= చర్మమూ, ఎముకలూ; కదియు-అట్టి-కార్శ్యంబు= అతుక్కుపోయేంతగా కృశించిపోవటం; తనకున్= ధృతరాష్ట్రుడికి; ఒప్పు-కాన్= తేజస్సు, కాగా; వర్తిల్లెన్= ఉన్నాడు; అని= అనేవిధంగా; ఇట్లు= ఈ ప్రకారంగా; ధృతరాష్ట్ర వృత్తాంతంబు= ధృతరాష్ట్రుడియొక్క (వనగమన) వృత్తాంతాన్ని; చెప్పినన్ విని= చెప్పగావిని; ముని+ఇంద్రా= మహర్షీ!; పదంపడి= ఆ తర్వాత; ఆ+విచిత్ర వీర్యనందనుండు= ఆ (విచిత్రవీర్యుడి కొడుకు) ధృతరాష్ట్రుడు; ఎట్టివాఁడు-అయ్యెను= ఏమైనాడు (ఎట్లా ఉన్నాడు); ఎఱిఁగింపుము= తెలియజెప్పవలసింది; అనుటయున్= అని అడగ్గా (వైశంపాయను డిట్లా చెపుతున్నాడని పై-ఆశ్వాసంలోనికి అన్వయం).

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు, గాంధారీ, నారచీరలూ, మృగచర్మాలూ ధరించి ఉత్తమ నియమాలనుసరిస్తున్నారు. కుంతీ, విదుర సంజయులతో కలిసి విదురాదులు నిర్మించిన పర్ణశాలలో ఉంటూ గాంధారీ ధృతరాష్ట్రులు తపస్సు చేసికొంటున్నారు. ఋత్విక్కులు తమ తమ పనులు చేస్తున్నారు. ఈ విధంగా ధృతరాష్ట్రుడు అక్కడి మునులంతా ఆశ్చర్యపడే విధంగా, తీవ్రమైన తపస్సు చేస్తూ, శరీరంలో మాంసం లేకుండా పోవటంతో చర్మం ఎముకలకు అతుక్కుపోయేంతగా కృశించాడు. ఆ విధంగా కృశించిన శరీరం కూడా తనకు తేజస్సు కలిగిస్తుండగా ధృతరాష్ట్రుడు శతయూపుడి ఆశ్రమంలో తీవ్రమైన తపస్సు చేసుకొంటూ ఉన్నాడు అని వైశంపాయనుడు చెప్పగా విని జనమేజయుడు 'మునీంద్రా! ఆ తర్వాత ధృతరాష్ట్రుడు ఏమైనాడు (ఏం చేశాడు) అతని వృత్తాంతం ఏమిటి నాకు తెలియ జెప్పవలసింది' అని అడిగాడు. అపుడు వైశంపాయనుడు ఇట్లా అన్నాడు (తరువాత ఆశ్వాసంతో అన్వయం).

ఆశ్వాసాంతము

శా. **ఆశాపాశ విమోచనోపకరణ వ్యాకోచహృద్ధామ! సం**
క్లేశో త్పారక దివ్యనామ! వర దృగ్లీలాప్త నిస్సీమ ల
క్ష్మీ శుంభ త్సురలోక చక్రపరశుచ్ఛిన్నా సురానీక! వి
ద్యాశోభా స్ఫురణాకృతీ! శమదమానంతర్య భాస్వీకృతీ! **184**

ప్రతిపదార్థం: ఆశా= కోరికలు అనే; పాశ= కట్టుత్రాళ్ళను; విమోచన= విడిపించుకోవడం అనే; ఉపకరణ= సాధనం చేత; వ్యాకోచ= వికాసం పొందినటువంటి; హృద్= (భక్తులయొక్క) హృదయాలే; ధామ= నివాసంగా కలిగినవాడా; సంక్లేశ= గొప్ప కష్టాలను; ఉత్పాదక= పారదోలేటటువంటి; దివ్య= మహిమ కలిగిన; నామ!= నామము(లు) గలవాడా!; వర= శ్రేష్ఠమైన; దృక్= చూపుల (యొక్క); లీలా= విలాసం చేత; ఆప్త= పొందబడిన; నిస్సీమ= మేర లేని; లక్ష్మీ= సంపదలతో; శుంభత్= ప్రకాశిస్తున్న; సురలోక= దేవతాసమూహం కలవాడా; చక్ర= సుదర్శనం అనే చక్రాయుధంతోనూ; పరశు= గండ్రగొడ్డలితోనూ; ఛిన్న= నరికివేయబడిన; అసుర= రాక్షసుల; అనీక= సమూహం కలవాడా; విద్యా= జ్ఞానం అనే; శోభా= తేజస్సు చేత; స్ఫురణ= తెలియబడే; ఆకృతీ!= ఆకారం కలవాడా!; శమ= మనస్సును నిగ్రహించటమూ; దమ= కన్నులు మొదలైన బాహ్యేంద్రియాలను నిగ్రహించటమూ; సాధించిన; అనంతర్య= వెంటనే; భా= కాంతితో; స్వీకృతీ!= స్వీకరించేవాడా!

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

తాత్పర్యం: కోరిక లనే పాశాలను వదలించుకొనడంద్వారా విస్తరించిన (భక్తుల) హృదయాలలో నివసించేవాడా! భక్తుల కష్టాలు ఎంతటివైనా తొలగించే మహిమాన్వితమైన నామాలు, (పేర్లు) గలవాడా! మేలైన చూపుల లీలలచేత పొందబడిన మేరలేని సంపదలతో శోభించే దేవలోకం కలవాడా! చక్రంతోనూ, పరశువుతోనూ రాక్షసులను నరికినవాడా!, జ్ఞానం అనే కాంతితో స్ఫురించే ఆకారం కలవాడా! (జ్ఞానం చేత గోచరించేవాడా!) శాంతీ దాంతీ కలిగిన వెంటనే (ఆ భక్తులను నీ) తేజస్స్వరూపంలోకి స్వీకరించేవాడా!-ఓ హరిహరనాథా!

విశేషం: మనస్సు కోరికలు అనే కట్టుత్రాళ్లతో బంధింపబడి ఉన్నప్పుడు కుంచించుకుపోయి ఉంటుంది. ఆ బంధాలు కోరికలు తెంచుకుంటే హృదయం విశాలమవుతుంది. అటువంటి కోరికలు లేనిచోట, కోరికలు లేకపోవడం వలన సర్వసృష్టిని ఆత్మసమంగా ఆదరించగలిగిన విశాలమైన హృదయంలోనే హరిహరనాథుడు నివాసం చేస్తాడు. (2) హరిహరనాథుడి నామం పైకి ఉచ్చరించినా లేదా మనసులో అనుకొన్నా ఎంతో గొప్ప కష్టాలు కూడా తొలగిపోతాయి. దానికి కారణం హరిహరనామంలోని దివ్యత్వం, మహిమ. జ్ఞానులు తదర్థం భావిస్తే సామాన్యులు కేవలం నామస్మరణమాత్రంచేతనే కష్టాలు పోగొట్టుకుంటారు. జ్ఞానులకు కష్టాలలోను కష్టభావన ఉండదు. సామాన్యులే కష్టాలలోనే వాటి నిష్పత్తి కోసమే దేవుడిని తలచుకునేది. తావన్మాత్రం చేతనే. స్మరించిన వారి కోర్కెల కనుగుణంగా ఆ నామం - వారి కష్టాలను ఎంతటివైనా తొలగించి వేస్తుంది. ఇది నామ మహిమ (3) కటాక్షంచేతనే దేవతలకు అపారమైన సంపదలు కలుగుతున్నాయి. దేవతలపై ఉన్న ఈ కటాక్షం వలననే 'అసురానీకం చక్రపరశుచ్ఛిన్నం కాగా దేవతలు నిస్సీమ -లక్ష్మీ శుంభత్తులవుతున్నారు. చక్ర-పరశు-ఛిన్న-అసురానీక అన్నపుడు, క్రమంగా చక్ర ఛిన్నాసురుడు-సుదర్శన చక్రాయుధంతో రాక్షసులను చంపేవాడు. హరి, పరశుచ్ఛిన్నాసురానీకుడు. పరశువుచేత రాక్షసులను చంపేవాడు. హరుడు 'భూతేశః ఖండపరశుః (అమరం) ఖండ పరశువు గదా శివుడు. సుధన్వా ఖండ పరశుః. విష్ణువు సహస్రనామాలలో ఖండపరశు వొకటి. హరిహరుడు చక్ర పరశు చ్ఛిన్నాసురుడు. (4) విద్యాశోభా స్ఫురణాకృతీ- జ్ఞాన (విద్య) జ్యోతి (శోభా) యే- స్ఫురించే- తోచే ఆకారంగా కలిగినవాడు. హరిహరస్వరూపం భావిస్తే అది జ్ఞానజ్యోతిగానే స్ఫురిస్తుంది. జ్ఞాన(విద్యా), జ్యోతీ(శోభ), స్ఫూర్తీ(స్ఫురణ). ఆకారంగా కలవాడని కూడా. (5) శమమూ (అంతరింద్రియ మనో-నిగ్రహము), దమమూ (బాహ్యేంద్రియ నిగ్రహమూ) సాధించిన వెంటనే తనయొక్క తేజస్స్వరూపంలోకి స్వీకరించేవాడు. తానుగా, తనలో కలుపుకొనేవాడు. శాంతిదాంతులు సాధించినవారు హరిహరుడి తేజఃస్వరూపంలో కలిసిపోతారు.

క. **ముని హృదయ నిలయ పాదా! వినత జనావన వినోద! విద్యా విద్యా**
ఘన చింతాంతిక దూరల। సన! పీత స్పీత సామజత్వగ్వసనా! **185**

ప్రతిపదార్థం: ముని= జ్ఞానులయొక్క; హృదయ= మనసులే; నిలయ= నివాసమైన; పాదా!= పాదాలు కలవాడా!; వినత= ఆశ్రయించిన; జన= జనాలను; అవన= కాపాడటం; వినోద= వేడుక అయినవాడా!; విద్యా= జ్ఞానంయొక్క; అవిద్యా= అజ్ఞానం యొక్క; ఘన= మిక్కిలి; చింతా= విచారణం చేత; అంతిక= సమీపంలోనూ; దూర= దూరంగానూ; లసన!= ప్రకాశించేవాడా!; పీత(వసన)= పసుపుపచ్చని, (పట్టు పుట్టము); స్పీత= మందమైన; సామజ= ఏనుగుయొక్క; త్వక్= చర్మమూ; వసనా!= వస్త్రముగా గలవాడా!.

తాత్పర్యం: జ్ఞానులయొక్క హృదయాలే నివాసంగా కలిగిన పాదాలు కలవాడా! ఆశ్రయించిన వారిని రక్షించటమే వేడుక అయినవాడా! జ్ఞానులకు దగ్గరగానూ, అజ్ఞానులకు దూరంగానూ ఉండేవాడా! పట్టుపుట్టమూ, ఏనుగుతోలూ, వస్త్రాలుగా ధరించినవాడా!- హరిహరనాథా!.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

విశేషం: హరిహరనాథుడి పాదాలు ఎప్పుడూ జ్ఞానుల హృదయంలోనే ఉంటాయి. జ్ఞానులు సదా ధ్యానంతో హరిహరనాథుడి పాదాలు తమ తమ మనస్సులో దర్శిస్తూ ఉంటారు. ఇక సామాన్యులు ఆపదాది సమయాలలో తన్నివృత్తికొరకు రక్షణకొరకు ఆశ్రయిస్తే వాళ్ళని వినోదంగా కాపాడుతుంటాడు హరిహరనాథుడు. అజ్ఞానం చేత తాత్కాలిక సౌఖ్యాలను కోరటం వలన అవే గొప్పవి అనుకొనటం. అట్టి వారిని చూస్తూ వారి కోరికలు తీర్చటం హరిహరనాథుడికి వినోదం. జ్ఞానులు ఎప్పుడూ తలచుకొనటం వలన వారి హృదయాలలో- అత్యంతం సన్నిహితుడై ఉంటాడు. విద్యా ఘనులకు అంతిక లసనుడు. జ్ఞానంవలన ఘనులైన వారికి సమీపస్థుడు. అవిద్యా చింతకు- దూరుడు. అజ్ఞానం చేత 'చింత'లపా లైన వారికి దూరంగా చింతలు తీర్చినా భిన్నంగా భాసిస్తూ దూరంగా ఉంటాడు హరిహరనాథుడు. పీతాంబరమూ, సామజత్వక్కు వసనంగా కలిగి ఉండటంలో యథాక్రమంగా (పీతాంబరుడు) హరి (గజ చర్మూడు) హర స్వరూపం స్ఫురిస్తుంది. పీతాంబరం పట్టుపుట్టం కోమలమైతే సామజత్వక్కు, స్ఫీతం-మందం. కఠినం,పరస్పర భిన్న లక్షణాలు ఏకీభవించినతత్త్వం హరిహరనాథుడిది.

మాలిని,

> **అపరిమిత విభూతీ! యప్రమత్తానుయాతీ!**
> **లపన నిభృతవేదా! లక్షణ స్వైరనాదా!**
> **జపపర వరదాయీ! సర్వవిద్యా విధాయీ!**
> **విపుల కృప కటాక్షా! విశ్వసంహ్లాదదక్షా!** **186**

ప్రతిపదార్థం: అపరిమిత-విభూతీ!= మేర లేని ఐశ్వర్యం కలవాడా!; అప్రమత్త+అనుయాతీ!= ప్రమాదాన్ని పొందని వారే, నీవెంట వచ్చేవాళ్ళుగా కలవాడా!; లపన= మాటలలో; నిభృత= స్థిరపడ్డ, (నిండిన); వేదా!= వేదాలు గలవాడా!; లక్షణ= లక్షణం (శబ్దాదిశాస్త్రం)గా ఏర్పడిన; స్వైర= స్వేచ్ఛగా వెలువడ్డ; నాదా!= ధ్వనులు కలవాడా!; జప= జపం చేసికొనటంలో; పర= ఏకాగ్రత కలవారికి; ఫలదాయీ!= గొప్ప ఫలితాన్ని ఇచ్చేవాడా; సర్వ= సమస్తమైన; విద్యా= విద్యలనూ; విధాయీ!= ఏర్పాటు చేసేవాడా!; విపుల= విస్తార మైన; కృప= దయ గలిగినట్టిదైన; కటాక్షా!= కడగంటి చూపు కలవాడా!; విశ్వ= సమస్తసృష్టినీ; సంహ్లాద= సంతోషపెట్టటంలో; దక్షా!= నైపుణ్యం గలవాడా!

తాత్పర్యం: కొలది లేని ఐశ్వర్యం కలవాడా! ఏకాగ్రత ఉన్న (భక్త) జనం చేత అనుసరించబడేవాడా! మాటలే వేదాలు అయినవాడా! స్వేచ్ఛగా (నీవు) చేసిన ధ్వనులే ఆయా లక్షణాలుగా ఏర్పడటం కలవాడా! ధ్యానశీలురైన వారికి తగిన ఫలితాన్ని అందజేసేవాడా! సమస్తమయిన విద్యలను కలుగజేసేవాడా! విస్తృతమైన దయ కలిగిన కొనచూపులవాడా! ఈ సమస్తమైన సృష్టిని సంతోషపెట్టటంలో నైపుణ్యం కలవాడా! ఓ హరిహరనాథా!.

విశేషం: అపరిమిత 'విభూతి'- విభూతి అంటే సంపద అని హరి రూపంలోనూ, భస్మమని హర రూపంలోనూ అర్థం. ఐక్యం హరిహరత్వం అప్రమత్త-అనుయాతి. అనుయాతి, వెంటబడి వచ్చేవాడు. ప్రమత్తులైతే అజ్ఞానం వలన సంసారంలో పడిపోతారు. జ్ఞానులు హరిహరనాథుడి వెంటబడిపోతారు. హరిహరుడి మాటలలో వేదాలు స్థిరపడ్డాయి. ఆ మాటలే వేదాలు. అతడు స్వైరంగా చేసిన ధ్వనులే లక్షణాలు, శాస్త్రాలు, పరమేశ్వరుడి ఢక్కానాదమే ఆఇఉణ్ మొదలైన రూపాలలో మాహేశ్వర సూత్రా లయి పాణినీయ శబ్ద లక్షణానికి మూలాలయ్యాయి. పరమేశ్వరుడే వేలాది విద్యలకు ప్రవర్తకుడు (చూ, తిక్కయజ్వ హరిహరనాథతత్త్వము పుట.383) (అలంకారం అంత్యానుప్రాసం).

గద్యము:

ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బైన శ్రీమహాభారతంబున నాశ్రమవాసపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

తాత్పర్యం: ఇది మహితాత్ముడు సంస్కృతాంధ్ర కవులకు మిత్రుడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, పండితులను ఆరాధించటం చేత ప్రకాశించేవాడూ, (విద్వాంసులు తనను సేవించటం చేత విరాజిల్లేవాడు) అయిన తిక్కన సోమయాజి చేత రచించబడిన శ్రీమహాభారతంలో ఆశ్రమవాసపర్వంలోని మొదటి ఆశ్వాసం.

ఆశ్రమవాసపర్వంలోని ప్రథమాశ్వాసం సమాప్తం.

www.mohanpublications.com www.granthanidhi.blogspot.in

www.mohanpublications.com

మోహన్ పబ్లికేషన్స్‌లో లభించు

పుస్తకముల పట్టిక

(Book List)

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద, మంత్రశాస్త్రాది
అనేక విషయాలు తెలుసుకోండి...

ఫేస్‌బుక్ **మోహన్ పబ్లికేషన్స్** పేజ్ లైక్ చేయండి.

Like us to follow :

MOHAN PUBLICATIONS

Rajamahendravaram

0883 - 246 2565
903 246 2565

Mohan PUBLICATIONS

మోహన్ పబ్లికేషన్స్

అజంతా హోటల్ ఎదుట, కోటగుమ్మం, రాజమహేంద్రవరం - 533101.

WWW.MOHANPUBLICATIONS.COM

మావద్ద లభించు గ్రంథములు

1. వ్రతకథలు - పూజలు

1.	శ్రీ వినాయక వ్రతం	వెల రూ.10-00
2.	శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం	30-00
3.	శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్మ్యంతో)	10-00
4.	సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం	30-00
5.	వరలక్ష్మీ వ్రతం	10-00
6.	కేదారేశ్వర వ్రతం	10-00
7.	త్రినాధ వ్రతం(కలర్)	10-00
8.	త్రినాధవ్రతం(సాదా)	5-00
9.	క్షీరాబ్ధి వ్రతం	12-00
10.	మంగళ గౌరీవ్రతం	10-00
11.	వైభవలక్ష్మీ వ్రతం ఫోటో యంత్రంతో	25-00
12.	శ్రీలక్ష్మీ కుబేర వ్రతం (ఫోటో యంత్రంతో)	25-00
13.	కనకమహాలక్ష్మీ వ్రతం (కామేశ్వరీపాటతో)	25-00
14.	సంతోషీమాతా వ్రతం	25-00
15.	ఏడు శనివారాల వ్రతం	25-00
16.	సత్యనారాయణవ్రతం	25-00
17.	శ్రీ సువర్చలాహనుమద్దీక్ష	30-00
18.	శివదీక్ష	10-00
19.	కాత్యాయనీ వ్రతం	20-00
20.	సౌభాగ్య గౌరీవ్రతం	20-00
21.	తిరుప్పావై (ధనుర్మాసవ్రతం)	36-00
22.	స్త్రీల వ్రతకథలు	36-00
23.	స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి (నేదునూరిగంగాధరరావుగారి)	54-00
24.	పెళ్ళి పాటలు - స్త్రీలపాటలు (కామేశ్వరిపాటతో)	36-00
25.	సర్వదేవతా పూజావిధానం	25-00
26.	ఆరువ్రతాలు	30-00
27.	రాహుకాలంలోదుర్గాదేవీపూజా	10-00

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

28.	తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు	10-00
29.	శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్	36-00
30.	శ్రీచక్ర పూజావిధానం(పెద్దది)	36-00
31.	లక్ష్మీ - గౌరీ నిత్యపూజ	10-00
32.	శ్రీ సరస్వతీ నిత్యపూజ	10-00
33.	శ్రీ దుర్గానిత్యపూజ	10-00
34.	కాలభైరవ నిత్యపూజ	10-00
35.	శివపూజ	10-00
36.	వీరభద్ర పూజ	10-00
37.	ఆంజనేయ నిత్యపూజ	10-00
38.	నాగేంద్ర స్వామి పూజ	10-00
39.	సుబ్రహ్మణ్య నిత్యపూజ	10-00
40.	రామదేవుని కథ	10-00
41.	శివదేవుని కథ	10-00
42.	లక్ష్మీనరసింహపూజ	10-00
43.	వేంకటేశ్వరపూజ	10-00
44.	బ్రహ్మంగారి నిత్యపూజ	10-00
45.	సూర్య నిత్యపూజ	10-00
46.	నవగ్రహ నిత్యపూజ	10-00
47.	రుక్మిణీ కల్యాణం	25-00
48.	ఉమామహేశ్వర వ్రతం	36-00
49.	శ్రీ కామేశ్వరీ వ్రతం	36-00
50.	16 సోమవారముల వ్రతము	25-00
51.	పార్వతీకల్యాణం	25-00
52.	సహస్రకమలవర్తి వ్రతము	25-00
53.	పంచముఖ ఆంజనేయ పూజావిధానము	36-00
54.	అష్టనాగపూజ	36-00
55.	పూజలు ఎందుకుచేయాలి ?	36-00
56.	ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి?	36-00
57.	ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి?	36-00
58.	ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి?	36-00
59.	ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ?	36-00
60.	హనుమద్ వ్రతం	36-00
61.	పంచాయతన పూజ	63-00
62.	28 వ్రతములు	120-00

63.	కలశపూజలు (9ఒకేసారి)	150-00
64.	కలశపూజలు (విడివిడిగా) (ప్రింటులో)	....
65.	హ్రీంకార మహాయజ్ఞం (ప్రింటులో)	....
66.	గోమాత	40-00

2. స్తోత్రాలు-సుప్రభాతములు సహస్రనామములు

1.	శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం	45-00
2.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,,	50-00
3.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,,	50-00
4.	స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు(పత్రికసైజ్)	99-00
5.	లలితావిష్ణు (కేస్ బైండ్) 1/8 డెమ్మీ	63-00
6.	స్థూలాక్షరీ లలితావిష్ణు (క్రౌన్‌సైజు)కేస్‌బైండ్	108-00
7.	సర్వదేవతా స్తోత్రమంజరి	120-00
8.	సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63)	24-00
9.	విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్)	25-00
10.	లలితా సహస్రనామ స్తోత్రమ్ (క్రౌన్)	36-00
11.	లలితా సహస్రనామములు	24-00
12.	లక్ష్మీ సహస్రనామములు	24-00
13.	దుర్గా సహస్రనామములు	24-00
14.	ఆంజనేయ సహస్రనామములు	24-00
15.	శివ సహస్రనామములు	24-00
16.	విష్ణు సహస్రనామములు	24-00
17.	గణపతి సహస్రనామములు	24-00
18.	సుబ్రహ్మణ్య సహస్రనామములు	24-00
19.	గాయత్రి సహస్రనామములు	24-00
20.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు	24-00
21.	శ్రీరామా సహస్రనామములు	24-00
22.	సరస్వతి సహస్రనామములు	24-00
23.	సూర్యసహస్రనామములు & ఆదిత్యహృదయం	24-00
24.	శ్రీవేంకటేశ్వరసహస్రనామములు	24-00
25.	మణిద్వీపవర్ణన (పెద్దది)	24-00
26.	సంధ్యావందనం	24-00
27.	మంత్రపుష్పమ్	....
28.	త్రిభాషా హనుమాన్‌చాలీసా	15-00
29.	హనుమాన్ చాలీసా	10-00

30.	మణిద్వీపవర్ణన (పాకెట్)	10-00
31.	ఆరు చాలీసాలు	10-00
32.	శివారాధన (శివస్తోత్రాలు)	10-00
33.	వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్)	10-00
34.	ఆరుదండకాలు	5-00
35.	వేంకటేశ్వర గోవిందనామములు	5-00
36.	అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్	10-00
37.	దేవీఖడ్గమాలాస్తోత్రమ్ (మహిషాసురమర్దనీస్తోత్రంతో)	10-00
38.	సుందరకాండ (పాకెట్)	10-00
39.	భగవద్గీత మూలం	27-00
40.	రామరక్షాస్తోత్రమ్	15-00
41.	స్తోత్ర రత్నావళి	36-00
42.	పురాణపండ లలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్(మినీ)	10-00
43.	పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్(మినీ)	10-00
44.	పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్	10-00
45.	పురాణపండ ఆదిత్య హృదయం	10-00
46.	మంత్రపుష్పం (మినీ)	10-00
47.	శివానందలహరి-సౌందర్యలహరి	36-00
48.	కుజదోషం	10-00
49.	కాలసర్ప దోషం	10-00
50.	మీ అప్పులు తీరాలా?	10-00
51.	దృష్టిదోషాలు నివారణ	10-00
52.	పంచసూక్తములు	10-00
53.	సంధ్యావందనం	10-00
54.	రుద్రనమకమ్-చమకమ్	10-00
55.	గాయత్రీమంత్రాలు	10-00
56.	హయగ్రీవ స్తోత్రమాల	10-00
57.	దక్షిణామూర్తి స్తోత్రమాల	10-00
58.	ద్వాదశ జ్యోతిర్లింగాలు - పంచారామాలతో	10-00
59.	శ్రీసూక్తం పురుష సూక్తం	10-00
60.	నవగ్రహస్తోత్రమాల	36-00
61.	మహాన్యాసమ్	36-00
62.	సుందరకాండ గానామృతం	36-00
63.	గోమాతపూజావిధానము	10-00
64.	ఆనందసిద్ధి - 1 శ్రీదేవీ స్తోత్రమాల	108-00

65.	ఆనందసిద్ధి - 2 ఏ సమస్యకు ఏ స్తోత్రమ్ పారాయణచేయాలి	108-00
66.	ఆనందసిద్ధి-3 మానసదేవీ స్తోత్రమాల	108-00
67.	శ్రీ కాలభైరవ రక్షా కవచమ్	63-00
68.	అర్చన	40-00
69.	నిత్యదేవతార్చన	40-00
70.	సర్వదేవతా స్తోత్ర నిధి	99-00
71.	శ్రీచక్ర నవవరణార్చన	63-00
72.	చండీ సప్తశతి పారాయణ క్రమం	99-00
73.	శ్రీదేవి స్తోత్ర రత్నావళి 32 దేవి స్తోత్రాలకు తాత్పర్యంతో	99-00
74.	వనదుర్గా మంత్రానుష్ఠాన క్రమమ్	63-00
75.	శ్రీ కాలభైరవ వ్రతము	63-00

3. శ్రీ సాయి దత్త గ్రంథములు

1.	శ్రీ సాయిబాబా సచ్చరిత్ర	120-00
2.	సంపూర్ణ శ్రీ గురు చరిత్ర	120-00
3.	శ్రీ సాయిఆరాధన-షిర్డివైభవం	120-00
4.	శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్)	63-00
5.	శ్రీ గురుచరిత్ర (క్రౌన్)	63-00
6.	నవనాధ చరిత్ర	99-00
7.	శ్రీసాయిచరిత్ర (భైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	63-00
8.	శ్రీగురుచరిత్ర (భైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	63-00
9.	సత్యదత్తవ్రతం దత్తాత్రేయపూజాకల్పం,సహస్రంతో	30-00
10.	అనఘాదేవీ వ్రతం	30-00
11.	భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు	30-00
12.	శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో)	25-00
13.	శ్రీ సాయిభజనమాల	20-00
14.	శ్రీ సాయి భజన్స్	20-00
15.	శ్రీ సాయిభక్తి గీతాలు	20-00
16.	శిరిడిహారతులు (భావంతో)	20-00
17.	"శ్రీసాయి"కోటి	27-00
18.	"శ్రీసాయిరామ్"కోటి	20-00
19.	శ్రీ సాయినాథ స్తోత్రమంజరి	10-00
20.	శ్రీ సాయివేయినామాలు	8-00
21.	శ్రీ సాయి హారతులు (పాకెట్)	15-00
22.	శ్రీ సాయి స్తవనమంజరి	10-00
23.	హిందీ శ్రీ సాయి హారతులు	15-00

24. శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం	63-00
25. ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు	15-00
26. షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం	99-00
27. సాయిసత్యవ్రతం	30-00
28. సాయి అనుగ్రహమ్	120-00
29. నవగురువారాల వ్రతకల్పము	15-00
30. శ్రీదత్తలీలామృతము	99-00
31. హృదయంలో సాయి	15-00
32. శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్ఛరిత్ర)	120-00
33. గజాననమహరాజ్ చరిత్ర	99-00

4. జ్యోతిషాలు

1. 'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ)	72-00
2. గ్రహభూమి పంచాంగము (గార్గేయ)	108.00
3. ఆనందసిద్ధి పంచాంగం (వై.వి.శాస్త్రి)	63.00
4. ములుగు వారి రాశిఫలితాలు (12రాశులువారికి)	50.00
5. ములుగు వారి రాశిఫలితాలు విడివిడిగాఒక్కొక్కటి	12.00
6. కాలచక్రంజ్యోతిషక్యాలండర్	25.00
7. గ్రహబలం క్యాలండర్ (శ్రీనివాసగార్గేయ-భక్తిటివి)	25.00
8. శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్	25.00
9. సాదా క్యాలండర్	5.00
10. పాకెట్ క్యాలండర్	15.00
11. తాజకనీలకంఠీయమ్	100-00
12. కేరళ జ్యోతిష రహస్యాలు	180-00
13. జ్యోతిష బ్రహ్మ రహస్యాలు	180-00
14. మానసాగరి జాతకపద్ధతి	180-00
15. వరాహమిహిర జాతకపద్ధతి	180-00
16. వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు	99-00
17. సింపుల్ రెమిడీస్	180-00
18. శంభు హోరప్రకాశిక	250-00
19. పూర్వ పరాశరి	100-00
20. పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం	200-00
21. ప్రశ్న సింధు	99-00
22. నక్షత్ర విశేష ఫలితాలు	63-00
23. సూర్యసిద్ధాంతపంచాంగగణితంచేయడంఎలా?	180-00
24. దృక్సిద్ధాంతపంచాంగగణితం చేయడంఎలా?	180-00

25.	ఆయుర్దాయ నిర్ణయం	63-00
26.	జాతక గణిత ప్రవేశిక	63-00
27.	జ్యోతిషమర్మబోధిని	63-00
28.	జ్యోతిష ప్రశ్నోత్తరమాల	63-00
29.	ముహూర్తం నిర్ణయించడంఎలా?	63-00
30.	జాతక మకరందం	63-00
31.	జ్యోతిష సరస్వతి	63-00
32.	మీజననకాల విశేషాలు	63-00
33.	ముహూర్త విజ్ఞాన భాస్కరం	63-00
34.	జ్యోతిష స్వయంబోధిని	63-00
35.	శుభముహూర్త శిరోమణి	63-00
36.	నక్షత్ర ఫలమంజరి	36-00
37.	పంచాంగం చూసే విధానం	36-00
38.	సర్వార్థ జ్యోతిషం	36-00
39.	ప్రాథమిక జ్యోతిషం	36-00
40.	నవరత్నములు శుభయోగములు	36-00
41.	శుభశకునాలు	30-00
42.	హస్తరేఖాఫలితాలు	36-00
43.	సంఖ్యల్లో భవిష్యత్	36-00
44.	ముహూర్త దీపిక	99-00
45.	పుట్టుమచ్చలు ఫలితాలు	30-00
46.	కలలు ఫలితాలు	30-00
47.	జాతక చక్రం వేయడం ఎలా?	36-00
48.	మానసాగరి (ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చాశ్రీనివాసరావు	250-00
49.	జ్యోతిషశాస్త్ర చిట్కాలు	120-00
50.	గుప్తా శతాబ్ది పంచాంగం (1940-2050)	999-00
51.	ప్రశ్నచండేశ్వరమ్	63-00
52.	ద్వాదశభావ ఫలచంద్రిక	250-00
53.	జ్యోతిష శతయోగరత్నావళి (నూరుయోగాలఫలితాలు)	120-00
54.	అంగసాముద్రికం	36-00
55.	హస్త సాముద్రికం	63-00
56.	లాల్ కితాబ్	99-00
57.	శకునశాస్త్రం	63-00
58.	ఆధునికప్రశ్నశాస్త్రం	120-00
59.	పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం	180-00

60.	అష్టకవర్గు (కొండపల్లి)	63-00
61.	బృహత్‌జాతకం (ప్రాచీనప్రతికిపునర్ముద్రణ)	250-00
62.	లగ్నరత్నాకరం	63-00
63.	షట్పంచాశిక	120-00
64.	40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి	270-00
65.	40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి	180-00
66.	40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం	180-00
67.	40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు	270-00
68.	40 రోజుల్లో వైద్యజ్యోతిషం నేర్చుకోండి	250-00
69.	మీ పుట్టినతేదీ అద్భుతరహస్యాలు (సాయిగణపతిరెడ్డి)	270-00
70.	కె.పి.జ్యోతిషం (పరిచయం)	63-00
71.	ముహూర్తచింతామణి	99-00
72.	సూర్యచంద్ర గ్రహణములు	63-00
73.	ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప)	180-00
74.	అదృష్టరెమెడీస్	144-00
75.	గ్రహసంచార ఫలనిర్ణయదీపిక	63-00
76.	జ్యోతిష రెమిడీస్	300-00
77.	జాతకమార్తాండం పాతప్రతికి యథాతథం (కొండపల్లి)	250-00
78.	జ్యోతిషవిద్యాప్రకాశిక పాతప్రతికి యథాతథం (కొండపల్లి)	250-00
79.	నాడీజ్యోతిషం	63-00
80.	నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	63-00
81.	లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	63-00
82.	గౌతమసంహిత	63-00
83.	హోరరత్నమాల	63-00
84.	జాతకఫల మణిమంజరి	200-00
85.	పుష్కర పంచాంగం (2013-14నుండి 2024-25)	560-00
86.	దశాభుక్తిఫల నిర్ణయం	250-00
87.	వింత జోష్యములు	63-00
88.	షోడశవర్గులు	200-00
89.	రవిగ్రహ సమస్త ప్రభావములు	99-00
90.	చంద్ర గ్రహ సమస్త ప్రభావములు	99-00
91.	కుజ గ్రహ సమస్త ప్రభావములు	99-00
92.	బుధ గ్రహ సమస్త ప్రభావములు	99-00
93.	గురు గ్రహ సమస్త ప్రభావములు	99-00
94.	శుక్ర గ్రహ సమస్త ప్రభావములు	99-00

95. శని గ్రహ సమస్త ప్రభావములు	99-00
96. రాహు & కేతు గ్రహముల సమస్త ప్రభావములు	99-00
97. ఆధునిక గ్రహములు-ఉపగ్రహములు సమస్త ప్రభావములు	99-00
98. ముహూర్తమార్తాండం	63-00
99. లఘుజాతకం	63-00
100. జాతకాలంకారము	63-00
101. మేషలగ్న ఫలితములు	99-00
102. వృషభ లగ్న ఫలితములు	99-00
103. మిధున లగ్న ఫలితములు	99-00
104. కర్కాటక లగ్న ఫలితములు	99-00
105. సింహలగ్న ఫలితములు	99-00
106. కన్యలగ్న ఫలితములు	99-00
107. తుల లగ్న ఫలితములు	99-00
108. వృశ్చిక లగ్న ఫలితములు	99-00
109. ధనుస్సు లగ్న ఫలితములు	99-00
110. మకర లగ్న ఫలితములు	99-00
111. కుంభ లగ్న ఫలితములు	99-00
112. మీన లగ్న ఫలితములు	99-00
113. నారద సంహిత	200-00
114. పంచాంగపీఠికలేఖకాగణితం	250-00
115. తారాబలం - చంద్రబలం (వేరే కొండప్ప)	99-00
116. సులభలగ్న సాధన (చిత్రాలగురుమూర్తిగుప్తా)	200-00
117. రాహు కేతువుల యోగము	99-00
118. ఛాయాగ్రహములు	99-00
119. జ్యోతిషవిజ్ఞాన దీపిక	63-00

బి.వి.రామన్ గారి గ్రంథములు

120. జ్యోతిష విద్యారంభం	50-00
121 గ్రహభావ బలములు	50-00
122. కాలచక్రదశ	50-00
123. అనుభవ ప్రశ్నాజ్యోతిషం	50-00
124. జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు	50-00
125. పురోగామి జాతకం	50-00
126. భావార్థరత్నాకరం	75-00
127. భారతీయజ్యోతిష సర్వస్వం	75-00
128. అష్టకవర్గ పద్ధతిః	75-00

129.	జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు	75-00
130.	ప్రశ్నతంత్ర	75-00
131.	ముహూర్తం	75-00
132.	విశిష్ట జాతకములు	125-00
133.	భారతీయఫలితజ్యోతిషం	125-00
134.	300 ముఖ్యమైన యోగములు	125-00
135.	జాతకంపరిశీలించడంఎలా ?	300-00

రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి
శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు

136.	బృహత్పరాశరహోరాశాస్త్రము-1	200-00
137.	బృహత్పరాశరహోరాశాస్త్రము-2	200-00
138.	బృహత్పరాశరహోరాశాస్త్రము-3	200-00
139.	బృహత్పరాశరహోరాశాస్త్రము-4	200-00
140.	భావార్థరత్నాకరము	100-00
141.	ముహూర్త చింతామణి	100-00
142.	ముహుర్త చింతామణి-పార్టు2	200-00
143.	స్వప్న శాస్త్రము	36-00
144.	శతయోగమంజరి	50-00
145.	వ్రతనిర్ణయకల్పవల్లి	250-00
146.	దైవజ్ఞవల్లభం	75-00
147.	వసంతరాజశకునమ్ (బృహత్శకునశాస్త్రం)	250-00
148.	వాస్తుశాస్త్రవివేకము-1	100-00
149.	వాస్తుశాస్త్రవివేకము-2	200-00
150.	వాస్తుశాస్త్రవివేకము-3	100-00
151.	వాస్తుశాస్త్రవివేకము-4	200-00
152.	అనుభవసులభవాస్తు - 1	50-00
153.	అనుభవసులభవాస్తు - 2	100-00
154.	పంచాంగ వివేకము	99-00
155.	వశిష్ఠ సంహిత	360-00
156.	పంచపక్షి శాస్త్రం (కేస్‌బైండ్)	200-00

5. వాస్తులు

1.	40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకొనండి	180-00
2.	వాస్తుశాస్త్ర రహస్యములు	200-00
3.	వాస్తునుబట్టి మీ ఇల్లు	63-00
4.	మీరూ మీ వాస్తు	63-00

5.	గృహవాస్తు చిట్కాలు	63-00
6.	వాస్తు పూజ	63-00
7.	వాస్తు సూత్రములు	63-00
8.	వాస్తుశాస్త్ర రహస్యాలు	63-00
9.	గృహవాస్తు వర్గులు	99-00
10.	విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు	63-00
11.	విశ్వకర్మ వాస్తుశాస్త్రరీత్యా మీఇండ్లఆయములు	99-00
12.	విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాలగురుమూర్తిగుప్తా)	180-00
13.	ఆధునిక గృహవాస్తు	99-00
14.	శుభవాస్తు	270-00
15.	వాస్తుయంత్ర రత్నావళి	120-00
16.	వాస్తుశాస్త్రం	120-00
17.	హౌస్ ప్లాన్స్	63-00
18.	గృహనిర్మాణ వాస్తు	63-00
19.	వాస్తు రెమెడీస్	63-00
20.	గృహవాస్తు దర్పణం	63-00
21.	జ్యోతిష-గృహవాస్తుచంద్రిక	200-00
22.	వాస్తురత్నాకరం (కొండపల్లి)	63-00
23.	వాస్తుశిరోమణి ,,	120-00
24.	వాస్తుసంగ్రహమ్ ,,	63-00
25.	పంచవాస్తు పారిజాతం ,,	120-00
26.	వాస్తుడిండిమమ్ ,,	63-00
27.	వాస్తుదుందిభి ,,	120-00
28.	విశ్వకర్మవాస్తుప్రకాశిక (కేస్‌బైండ్)	250-00
29.	కృష్ణవాస్తుశాస్త్రము	63-00
30.	జలవాస్తు,శల్యవాస్తు (దంతూరిపండరీనాథ్)	99-00
31.	మయవాస్తు (గోరసవీరభద్రాచార్య)	120-00
32.	వాస్తు జ్యోతి	63-00
33.	మన ఇల్లు-మనవాస్తు	99-00
34.	వాస్తవ వాస్తుపూజావిధానము	108-00
35.	వాస్తు దర్పణం	120-00

6. మంత్రశాస్త్రాలు

1.	మంత్రసాధన	63-00
2.	తంత్రజాలం	63-00
3.	మంత్రశక్తి	63-00

4.	దత్తాత్రేయ తంత్రవిద్య	63-00
5.	దత్తాత్రేయ మూలికాతంత్రమ్	63-00
6.	తాంత్రిక పంచాంగం	63-00
7.	యక్షిణీ తంత్రం	63-00
8.	మంత్రానుష్ఠాన చంద్రిక	63-00
9.	సర్వదేవతా మంత్రకవచములు	63-00
10.	మంత్రాక్షరాలరహస్యం (బీజాక్షరనిఘంటువు)	63-00
11.	సర్వదేవతా మంత్రరత్నావళి	63-00
12.	సదాచార దీపిక	63-00
13.	యోగినీ-వామకేశ్వరతంత్రం	63-00
14.	ప్రపంచసారతంత్రం	63-00
15.	బదనిక తంత్రమ్	63-00
16.	ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్	63-00
17.	గుప్త సాధన తంత్రం	63-00
18.	గంధర్వ తంత్రమ్	63-00
19.	సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి)	63-00
20.	యంత్ర మంత్ర తంత్ర	63-00
21.	పాశుపత తంత్రం	99-00
22.	పంచదశ మహాఖడ్గ తంత్రం	99-00
23.	రుద్రాష్టాధ్యాయః	99-00
24.	మంత్రసిద్ధి	120-00
25.	పరశురామతంత్రమ్	108-00
26.	శ్రీలలితావిలోమ పంచదశీ	108-00
27.	శ్రీ గురు తంత్రం	108-00
28.	గాయత్రీ తంత్రమ్	108-00
29.	మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు	150-00
30.	శ్రీ దుర్గ తంత్రమ్	200-00
31.	మహామృత్యుంజయఅమృతపాశుపతమ్	200-00
32.	సర్ప (నాగ)తంత్రం	250-00
33.	హవన తంత్రం	250-00
34.	షోడశనిత్యతంత్రం	250-00
35.	శాక్తేయతంత్రం	250-00
36.	రుద్రయామళతంత్రం	250-00
37.	లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్	250-00
38.	హిరణ్యశూలినీ తంత్రమ్	250-00

39.	మాయాప్రత్యంగిరా తంత్రమ్	250-00
40.	శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్	250-00
41.	స్వర్ణాకర్షణభైరవతంత్రం	250-00
42.	కాశీవిశాలాక్షి తంత్రం	250-00
43.	శాంతితంత్రమ్	250-00
44.	యంత్రసిద్ధి	360-00
45.	శ్రీ లక్ష్మీతంత్రమ్	360-00
46.	మంత్రమహోదధి (స్త్రీదేవతాఃకల్పమ్)	360-00
47.	మంత్రమహోదధి (పురుషదేవతాఃకల్పమ్)	360-00
48.	మంత్రశాస్త్రం (గ్రంథము)	360-00
49.	ప్రత్యంగిరాకృత్యాతంత్రం	360-00
50.	కామధేనువు తంత్రం	360-00
51.	శూలినీదుర్గాతంత్రం	360-00
52.	శ్రీవిద్య రహస్యం	290-00
53.	కులార్ణవ తంత్రమ్	150-00
54.	ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం (ఒరిజనల్)	390-00
55.	సిద్ధమూలిక రహస్యం (మంత్ర,యంత్రసహితం)	63-00

7. గ్రంథాలు - ఆరాధనలు

1.	భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం	54-00
2.	భగవద్గీత (వచనం)	99-00
3.	భగవద్గీత శ్లోకతాత్పర్యం-కేసుబైండింగ్	72-00
2.	గణేశ ఆరాధన 1	99-00
3.	గణేశోపాసన 2	99-00
4.	నవగ్రహవైభవం	99-00
5.	నవగ్రహ రెమెడీస్	99-00
6.	నవగ్రహ వేదం	99-00
7.	శనిగ్రహారాధన	99-00
8.	ఆదిత్యారాధన	99-00
9.	సుబ్రహ్మణ్యారాధన	99-00
10.	శ్రీ శివ ఆరాధన	99-00
11.	లక్ష్మీ ఆరాధన	99-00
12.	హనుమదారాధన	99-00
13.	లలితారాధన	99-00
14.	శ్రీ చక్రారాధన	99-00
15.	గాయత్రీ ఆరాధన	99-00

16.	వీరభద్రారాధన	99-00
17.	కుజగ్రహారాధన	99-00
18.	భైరవారాధన	99-00
19.	దైవారాధన	99-00
20.	గీతారాధన (భగవద్గీత శ్లోకతాత్పర్యసహిత)	99-00
21.	శ్రీవేంకటేశ్వరాధన	99-00
22.	హయగ్రీవారాధన	99-00
23.	లక్ష్మీనరసింహారాధన	99-00
24.	శ్రీ బాలాత్రిపురసుందరీ స్తోత్ర కదంబం	99-00
25.	దేవీ లీలామృతం	99-00
26.	పురాణపండ సుందరకాండ వచనం	99-00
27.	పురాణపండ రామాయణం	99-00
28.	పురాణపండ భారతం	99-00
29.	పురాణపండ భాగవతం	99-00
30.	(సూరి) వాల్మీకి రామాయణం	99-00
31.	కాలసర్ప యోగం	99-00
32.	నిత్య జీవితములో రుద్రాక్షలు	99-00
33.	నిత్య జీవితములో నవరత్నాలు	99-00
34.	వేదసూక్తములు	99-00
35.	వేమన పద్యసారామృతం	99-00
36.	పండగలు పర్వదినాలు	99-00
37.	సూక్తిరత్నాలు	99-00
38.	హనుమచ్చరిత్ర	99-00
39.	నవగ్రహ దర్శనమ్	99-00
40.	నిత్యజీవితంలో నవగ్రహాలు	99-00
41.	సాలగ్రామములు	99-00
42.	గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ	99-00
43.	శనిగ్రహరెమిడీస్	99-00
44.	జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని	99-00
45.	వివాహజ్యోతిషమంజరి-మ్యారేజ్‌మ్యాచింగ్‌గైడ్ (సాయిగణపతిరెడ్డి)	99-00
46.	మీపుట్టినతేదీనిబట్టి మీజీవితరహస్యాలు (న్యూమరాలజీ లైఫ్‌గైడ్) ,,	99-00
47.	మీఅదృష్టానికి (పేరు) నేమ్‌కరక్షన్ ,,	99-00
48.	న్యూమరాలజీ రెమిడీస్	99-00
49.	మూకపంచశతీ	99-00
50.	శ్రీరామకర్ణామృతం	99-00

51.	రహస్యకుక్కుటశాస్త్రం	300-00
52.	ఉపాసన విధానం	99-00
53.	పంచమవేదం మహాభారతం	99-00
54.	దేవుళ్ళు డాట్ కామ్	99-00
55.	గణపతిభాష్యం	99-00
56.	యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి	99-00
57.	నవయోగులు	99-00
58.	ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు	99-00
59.	సకలదేవతాఅష్టోత్తరాలు(పెద్దది)-(180అష్టోత్తరశతనామావళులతో)	99-00
60.	సకలదేవతా అష్టోత్తరశతనామావళులు (కేస్‌బైండింగ్)	216-00
61.	సకలదేవతా సహస్రనామములు	99-00
62.	ఆధ్యాత్మిక సూక్తి నిధి	99-00
63.	బ్రాహ్మణులు గోత్రాలు,ప్రవరలు	99-00
64.	సర్వదేవతాస్వరూపుడు శ్రీ వేంకటేశ్వరుడు	99-00
65.	శ్రీ లక్ష్మీసన్నిధి	99-00
66.	శ్రీలక్ష్మీగణపతి హోమకల్పం	99-00
67.	మార్షల్‌ఆర్ట్స్ (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి)	99-00
68.	మ్యాజిక్‌గైడ్	99-00
69.	చదరంగం	99-00
70.	పంచముఖ హనుమత్ వైభవం	63-00
71.	గరుడపురాణం	40-00
72.	మాఘపురాణం	36-00
73.	శివపురాణం	36-00
74.	వైశాఖపురాణం	36-00
75.	కార్తీక పురాణం	36-00
76.	కార్తీక పురాణం (చిన్నది)	25-00
77.	సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ	63-00
78.	పెద్దబాలశిక్ష	50-00
79.	గాయత్రీ మహిమ	36-00
80.	వృక్షదేవతలు	63-00
81.	యాజుష స్మార్త సంస్కార చంద్రిక	200-00
82.	సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్	150-00
83.	చతుర్వేదములు	120-00
84.	నవగ్రహారాధన	120-00
85.	తాళపత్ర సమాహార గోపురం	120-00
86.	మనుధర్మ శాస్త్రం (వచనంలో...) (కేస్‌బైండు)	250-00

87.	మానవధర్మములు		120-00
88.	వేదమంత్ర సంహిత		120-00
89.	సహస్రలింగార్చన		120-00
90.	శ్రీ శివగీత		120-00
91.	ద్వాదశఉపనిషత్తులు		120-00
92.	పురాణపండవారి సౌందర్యలహరి	(క్రేస్‌బైండ్)	250-00
	(శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో)	సాదా	120-00
93.	బృహత్ శివ స్తోత్ర రత్నాకరము		200-00
94.	బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము		200-00
95.	బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము		200-00
96.	కేదారనాథ్ బదరీనాథ్ యాత్రాగైడు		63-00
97.	దక్షిణావృత శంఖములు		63-00
98.	108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని		36-00
99.	ధర్మసింధువు(కేస్‌బైండింగ్)		270-00
100.	భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని		99-00
101.	చిలుకూరి బాలాజీచరిత్ర		36-00
102.	భగవత్‌స్తుతి		63-00
103.	సూర్యోపాసన		36-00
104.	కాశీఖండం		250-00
105.	దేవీభాగవతం		360-00
106.	శ్రీ ఆంజనేయం		216-00
107.	ధర్మసందేహాలు		216-00
108.	ఆధ్యాత్మిక దైవిక వస్తువులు		250-00
109.	రామాయణం		600-00
110.	పోతన భాగవతం		900-00
111.	శివమంత్రములు		63-00

8. వైద్య గ్రంథాలు

1.	ఆహారం ఆరోగ్యం	36-00
2.	మూలికావైద్య చిట్కాలు	36-00
3.	ఆయుర్వేద వైద్య చిట్కాలు	30-00
4.	గృహవైద్య రహస్యాలు	36-00
5.	గృహవైద్యసారం	36-00
6.	హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స)	63-00
7.	ప్రకృతివైద్యం	36-00
8.	ఆహారం-వైద్యం	99-00

9.	సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం	99-00
10.	ఆయుర్వేదమ్	36-00
11.	ఆయుర్వేద మూలికావైద్యదీపిక	99-00
12.	దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు (వాడకం - ఉపయోగాలు)	99-00
13.	ఏకమూలికావైద్యం	99-00
14.	అష్టాంగ హృదయం (4భాగాలు)	1200-00
15.	రహస్యసిద్ధయోగవైద్యసారమ్	99-00
16.	ప్రాథమిక హోమియోవైద్యం	99-00
17.	ఒబెసిటి	99-00
18.	హెల్త్‌గైడ్	99-00
19.	ఆయుర్వేదం-జీవనవేదం	99-00
20.	ఫుడ్‌థెరపి	63-00
21.	న్యాచురల్‌థెరపి	99-00
22.	సంపూర్ణఆరోగ్యానికి 20ని॥	63-00
23.	కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే...	99-00
24.	యోగామంత్ర	63-00
25.	యోగా మండే టు సండే	63-00
26.	హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే	99-00
27.	హెల్త్‌ఫైల్	108-00
28.	వస్తుగుణపాఠం	250-00
29.	రసాయన వాజీకరణ తంత్రం	150-00
30.	వస్తుగుణ మకరందం	400-00
31.	నాటువైద్యం -(కేస్‌బైండ్)	360-00
32.	నాటువైద్యం (చిన్నది)	99-00
33.	ప్రాణాయామము-యోగ	63-00

9. అయ్యప్ప - భవానీ రకాలు

1.	శ్రీ అయ్యప్ప లీలామృతం	30-00
2.	శ్రీ అయ్యప్ప భజనపాటలు	63-00
3.	శ్రీ అయ్యప్ప పూజాకల్పం	20-00
4.	శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు	20-00
5.	హారతిగైకొనుమా	40-00
6.	శ్రీ అయ్యప్ప దీక్ష F	10-00
7.	శ్రీ అయ్యప్ప భజనమాల F	10-00
8.	శ్రీ అయ్యప్ప నిత్యపూజ P	10-00

9.	శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P	10-00
10.	భవానీదీక్ష (శ్రీ భవానీ లీలామృతం)	36-00
11.	దేవీలీలామృతం	99-00
12.	శ్రీ దేవీ పూజాకల్పం	20-00
13.	దేవీ భక్తిగీతాలు	20-00
14.	భవానీదీక్ష P	10-00
15.	దేవీ భక్తిమాల F	10-00
16.	శ్రీ అయ్యప్ప భజనావళి	120-00
17.	అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో)	24-00

10. భజనలు - కీర్తనలు

1.	అన్నమయ్య కీర్తనలు	20-00
2.	శ్రీరామదాసు కీర్తనలు	20-00
3.	సర్వదేవతా మంగళహారతులు	20-00
4.	వసుంధర మంగళ హారతులు	25-00
5.	సౌభాగ్య దేవతా మంగళహారతులు	36-00
6.	సర్వదేవతా భజనలు	36-00
7.	చిట్టి పొట్టి పాటలు	10-00
8.	జాతీయ గీతాలు	10-00
9.	దేశభక్తి గీతాలు	36-00
10.	పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు	36-00
11.	గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు,కోలాటపాటలు	36-00
12.	అన్నమయ్య సంకీర్తనలు	99-00
13.	పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు	36-00
14.	భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్)	36-00
15.	సర్వదేవతాభక్తిమణిమాల	36-00
16.	బతుకమ్మ ఉయ్యాల పాటలు	36-00
17.	అన్నమయ్య సంకీర్తనానిధి(1000కీర్తనలు)	270-00

11. హిట్స్ సాంగ్స్

1.	ఘంటసాల భక్తిగీతాలు-భగవద్గీత	36-00
2.	ఎస్.పి.బాలు భక్తిగీతాలు	36-00
3.	ఘంటసాల సుమధురగీతాలు	99-00
4.	పి. సుశీల సుమధురగీతాలు	99-00

5.	ఎస్.పి. బాలు సుమధురగీతాలు	99-00
6.	ఎస్.జానకి సుమధురగీతాలు	99-00
7.	వేటూరి సుందరరామమూర్తిహిట్స్	99-00
8.	సర్వదేవతా సినీభక్తిగీతాలు	99-00

12. స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

1.	శ్రీకాంతామణి వంటలు (వెజ్)	63-00
2.	శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్)	63-00
3.	శాకాహార వంటలు	30-00
4.	మాంసాహారవంటలు	30-00
5.	చిట్టిచిట్కాలు	30-00
6.	అందానికి చిట్కాలు	30-00
7.	పిల్లల పేర్లు (పెద్దది)	30-00
8.	పిల్లల పేర్లు (చిన్నది)	10-00
9.	లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శారీబోర్డర్స్	36-00
10.	లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్	36-00
11.	చిన్నారులకు చిరుతిళ్ళు	30-00
12.	పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు	30-00
13.	పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు	30-00
14.	వేపుళ్ళు-ఇగుర్లు	30-00
15.	బ్రేక్‌ఫాస్ట్ వంటలు	30-00
16.	పండుగలలో చేసుకొనే పిండివంటలు	30-00
17.	మైక్రోవోవెన్ వంటలు	99-00
18.	సర్వదేవతాభక్తిమాల	36-00
19.	పిల్లలపేర్లు (బాబు)	36-00
20.	పిల్లలపేర్లు (పాప)	36-00
21.	మోడ్రన్ మెహంది (గోరింటాకు డిజైన్స్)	36-00
22.	మోడ్రన్ పిల్లలపేర్లు	99-00
23.	నోరూరించే నాన్‌వెజ్‌వంటలు	99-00
24.	మోడ్రన్ టైలరింగ్ (లేడీస్ & జంట్స్)	99-00

వివిధ రకాలు

ఎందరోమహానుభావులు	270-00
యోగాసనాలు	36-00
సూర్యనమస్కారములు	36-00
పొడుపు కథలు (చిన్నవి)	10-00

హిందీ-తెలుగు-స్వబోధిని	20-00
ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని	20-00
జనరల్ నాలెడ్జ్	20-00
నూరు ఎక్కాలు	10-00
1-100 టేబుల్ బుక్	10-00
1-100 టేబుల్‌బుక్ (క్రౌన్‌సైజు)	4-50
శ్రీరామకోటి	27-00
శ్రీశివకోటి	27-00
మేజిక్	30-00
అంకెలతో గారడీ	30-00
హృదయస్పందన (కవితలు)	30-00
వాత్స్యయన కామసూత్రాలు	36-00
ఎ.పి.టూరిస్ట్ గైడు	36-00
ఇంద్రజాల రహస్యాలు	30-00
మహేంద్రజాల రహస్యాలు	30-00
శరీరభాష (బాడీ లాంగ్వేజ్)	99-00
క్రియాయోగం	36-00
ఆనందంగా జీవిద్దాం	99-00
హరిశ్చంద్ర నాటకం	50-00
వాత్సాయనకామసూత్రాలు	99-00
పంచసాయకం	99-00
రతిరహస్యాలు	99-00
అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్)	99-00
శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్)	99-00
గాయత్రీవిజ్ఞాన్	99-00
చింతామణి (నాటకం)	50-00
బాలనాగమ్మ	50-00
కాళహస్తి స్త్రీల వ్రతకథలు	36-00
కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి)	50-00
కాళహస్తి గోవింద నామాల భగవద్గీత	36-00
కాళహస్తి గృహవాస్తు చింతామణి	99-00
కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు)	63-00
రామరాయవాస్తుశాస్త్రం(ముద్రగడరామారావు)	90-00
ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా	10-00
ఎం.ఎస్.ఆర్.సుందరకాండ	80-00
బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల)	125-00
శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం	40-00

కాశీరామేశ్వర మజిలీ కథలు	63-00
శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం)	600-00
ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము-ఫలితజాతక సూత్రములు	595-00

ముదుండి విశ్వనాథరాజుగారి గ్రంథములు

విశ్వకర్మ ప్రకాశము		80-00
ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన	,,	250-00
నారద సంహిత	,,	150-00
వాస్తురాజవల్లభము-మూలానువాదము	,,	60-00
మయమతము - వచనము	,,	80-00
బృహత్సంహిత - వచనము	,,	160-00
వాస్తువిజ్ఞానజ్యోతి		......
పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య)		....
విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు	,,	....
వాస్తు విజ్ఞాన చంద్రిక	,,	....
మహాదశా పారిజాతం	,,	....
వాస్తు నారాయణీయం	,,	120-00
యోగావళీఖండం	,,	120-00
ముహూర్తసింధువు		150-00
సర్వార్థచంద్రిక (4భాగాలు)		1208-00
మీరే న్యూమరాలజిస్ట్ (దావూద్)		370-00
నిర్ణయసింధు (2భాగాలు)		590-00
సాయి...	,,	45-00
శ్రీ దుర్గానందలహరి	,,	200-00
ఆరతిసాయిబాబా	,,	11-00
ప్రతిష్ఠకల్పః(సాగి నరసింహమూర్తి)		500-00
తాజుద్దీన్‌బాబా సచ్చరిత్ర		100-00

సుమారు 100 సం॥రాలునాటి ప్రాచీన ప్రతులు తిరిగి
ఈ క్రింది గ్రంథములు ప్రచురించబడినవి.

శ్రీరామ మంత్రానుష్ఠానము	300-00
శ్రీరామనవరాత్రోత్సవకల్పః	300-00
సీతారామ కథా సుధ అయోధ్యకాండ	200-00
సీతారామ కథా సుధ బాలకాండ	150-00
అరణ్యకాండ	100-00
శ్రాద్ధము ఎందుకు పెట్టాలి ? షోడశ సంస్కారములు	200-00
స్మార్త కాపర్ది కారికలు	200-00
నపుంసక సంజీవనము, వైద్య శిరోమణి	200-00
విషవైద్య చింతామణి	200-00

హేమాద్రి సూరిణా ప్రాయశ్చిత్తాధ్యాయః	300-00
సర్వమూలికా గుణరత్నాకరం	300-00
ఆపస్తంబీయ ధర్మసూత్రాలు	300-00
సర్వశాంతి దర్పణం - అపర ప్రయోగ దర్పణం	200-00
గణకరంజని	200-00
సంతాన దీపిక	200-00
తిథినిర్ణయ కాణ్డః	250-00
ముహూర్త దర్పణం	200-00
జ్యోతిష శాస్త్ర రత్నము (శ్రీపతిజాతక పద్ధతి)	250-00
లఘుతాచకము	200-00
శ్రీ వైఖనస పైతృమేదిక ప్రయోగః	300-00
స్మృతి రత్నాకరము (ధర్మశాస్త్రం)	400-00
జాతకామృతతసారం	300-00
జాతక బోధిని	300-00
సంగీత విద్యాదర్పణం	300-00
సంగీత సర్వార్థసారసంగ్రహం	300-00
ముహూర్త మార్తాండం(టీకతాత్పర్యం)	450-00
జాతకరహస్యం	200-00
రాజమార్తాండం	200-00
ఆయుర్దాయదీపిక	200-00
వైద్యామృతం	200-00
అనుపానమంజరీ	200-00
నవగ్రహశాంతి విధానం-ఉదకశాంతి విధిః	200-00
చికిత్సరత్నము	200-00
స్వరచింతామణి	200-00
ద్వాదశలోహ భస్మవిధానం	200-00
దైవజ్ఞయశో విభూషణం	200-00
అనుపాన రత్నకరము	200-00
కాలామృతము	250-00
దైవజ్ఞకర్ణామృతము	300-00
రసేంద్ర చింతామణి	300-00
రసరత్న సముచ్చయం	300-00
వస్తుగుణరత్నాకరము	300-00
హోరానుభవదర్పణము	360-00
విశ్వకర్మ ప్రకాశిక వాస్తుశాస్త్రము	250-00
స్త్రీజన కల్పవల్లి	450-00
సంగీత సర్వార్థ సంగ్రహం	300-00
సంగీత సుధాసంగ్రహము	250-00
అర్క ప్రకాశము	200-00
సంగీత మార్తాండము	200-00
సంగీత ప్రథమబోధిని	200-00

వైద్యకల్పతరువు	200-00
రసప్రదీపిక	250-00
గణకానందము	250-00
శ్రీ లలితాసహస్రనామావళిః-వివరణాత్మక భావంతో	200-00
నవచండీ వేదోక్త శ్రీ దేవీ పూజాకల్పం	200-00
శ్రీ గాయత్రీ అనుష్ఠాన తత్త్వప్రకాశిక	360-00
సంగీతమార్తాండము	250-00
సారావళి	360-00
భేషజకల్పము	200-00
గురుశిష్య ఆయుర్వేద వైద్యచింతామణి	360-00
జాతకమణి	200-00
సర్వశకున ప్రకాశిక	200-00
యాజుష ప్రయోగ చంద్రిక	250-00
శిక్షావల్లీ-ఆనందవల్లీ-భృగువల్లీ	300-00
వసంతరాజ శకునము	250-00
తొట్టి వైద్యం	450-00
జ్యోతిష సిద్ధాంత సంగ్రహము (పంచాంగ గణితం)	300-00
సహస్ర యోగప్రకాశిక	300-00
శ్రీవిద్యారహస్యం	290-00
మహర్షుల చరిత్ర 1,3 300+300	
వేంకట సోమయాజీయం అను ధర్మశాస్త్రకాండము	250-00
శ్రీఆంజనేయం	216-00
రాశితుల్యవత్సర ఫలితం	200-00
నాడి జ్యోతిష విశ్లేషణ	400-00
రహస్యకుక్కుటశస్త్రం	300-00
స్త్రీ ధర్మరత్న బాండాగారము	200-00
శైవోత్సవరత్నాకరం	300-00
యాజుషప్రయోగ చిన్తామణి	300-00
సుస్వర ఋగ్వేద ప్రయోగదర్శిని	300-00
ఆయుర్వేద వైద్య సంగ్రహం	300-00
వశిష్ఠ సంహిత	360-00
హోమియోపతి గృహవైద్యం	200-00
వ్రతచూడామణి	300-00
వైశ్యధర్మప్రకాశిక	300-00
ఆలయ నిత్యార్చన పద్ధతి	200-00
స్మృతిముక్తాఫలం	300-00
ఆపస్థంబయల్లాజీయమ్	300-00
జ్యోతిషశాస్త్రసంగ్రహము	200-00
కర్మవిపాకాఖ్యయం	360-00
ముహుర్త రత్నావళి	250-00
సుదివిలోచనం	300-00
ఉత్తర కాలామృతం	200-00
సర్వవిషయ సర్వస్వసంగ్రహం	200-00

అరుదైన పాత పంచాంగములు, వ్రతకథలు,
పురాణములు,ఆరాధన గ్రంథములు,
సుప్రభాతములు,మహాత్మ్యములు, సహస్రనామములు,
పూజావిధానములు, స్తోత్రాలు, ప్రామాణిక గ్రంథములు,
కథలు, జ్యోతిష, వాస్తు, వైద్య, మంత్రశాస్త్రాది ఆధ్యాత్మిక
గ్రంథములకు

మోహన్ పబ్లికేషన్స్

ఆధ్యాత్మిక గ్రంథనిలయం

కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,
రాజమహేంద్రవరం.

www.mohanpublications.com

From : ☎ : 0883-246 25 65

MOHAN PUBLICATIONS

Fort Gate, Opp : Ajanta Hotel
Rajahmundry-533 101 (a.p.)

mohan
PUBLICATIONS
ఆధ్యాత్మిక గ్రంథనిలయం

ఉచిత Pdf బుక్స్ కై : - www.granthanidhi.blogspot.in

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద,
మంత్రశాస్త్రాది అనేక విషయాలు
తెలుసుకోండి... ఫేస్‌బుక్
MOHAN PUBLICATIONS
పేజ్ లైక్ చేయండి.

grantha nidhi
THE TREASURE OF PAGES
FIRSTEVER TELUGU FREE E-BOOKS
DOWNLOADING WEB PORTAL
www.granthanidhi.com

Kinige.com
మా ఇ–బుక్స్ కినిగె ద్వారా కొనుగోలు
చేసుకొన వచ్చును.

dailyhunt
మా ఇ–బుక్స్ డైలీహంట్ ద్వారా
అత్యధిక డిస్కౌంట్ ఆఫర్‌లో లభించును.